ఈనాడు

విజయవాడ 12-6-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 303

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

FIITJEE Students celebrate 26 years of glorious legacy by achieving Stupendous Results in

JEE Advanced 2018



129th Hymn (Nasadiya Suktam) of the 10th book (Mandalam) of Rig Veda, deals with the origin of the universe and creation !

नासदासीन्नो सदासीत्तदानीं नासीद्रजो नो व्योमा परो यत् ।
किमावरीवः कुह कस्य शर्मन्नम्भः किमासीद्गहनं गभीरम् ॥
न मृत्युरासीदमृतं न तर्हि न रात्र्या अह्न आसीत्प्रकेतः।
आनीदवातं स्वधया तदेकं तस्माद्धान्यन्न परः किञ्चनास ॥

Neither existence nor non-existence was there, Neither matter nor space around. What covered it, where it was and who protected ? Why that plasma, all pervading, deep and profound ?

Neither death nor immortality was there, And there was neither day nor night. But for that breathless one breathing on its own, There was nothing else, surely nothing.

We can logically conclude that the Vedic Shlokas & Science are compatible. Truth & Perfect knowledge are eternal. We are descendants of Great Saints & Spiritual Scientists. नास्ति सत्यसमो धर्मः॥

This may be Kaliyug, people may indulge in lies, deceit, & cheating but FIITJEE will always follow the Eternal Path of TRUTH, wisdom & high morals to solve modern world problems with Education as a medium. Witness significant expansion of FIITJEE through New Centres, Schools, & Technology in the near future.

स्वयमेवात्मनात्मानं वेत्थ त्वं पुरुषोत्तम ।
भूतभावन भूतेश देवदेव जगत्पते ॥

ई (Shakti) + शव (dead body) = शिव

The power that makes a dead body alive is Shiv.

For FIITJEE, recognition of ई (Shakti) is Putri Empowerment*.

*All Girl students will be getting 25% concession in tuition fee.

26 years of Extraordinariness - Innovation, Ethics, Commitment & Hard Work

2 in Top 5, 6 in Top 20, 15 in Top 50 and 32 in Top 100 All India Ranks from Long Term Classroom / Integrated School Programs

FIITJEE Students in **Top 50 AIR** from Long Term Classroom / Integrated School Programs

All India Rank **3**
Delhi State Topper

Kalash Gupta
Four Year Classroom Program (IX - XII)
FIITJEE Delhi (South) Centre

KVPY Fellow 2016-17 | Qualified Indian National Physics Olympiad (INPhO) 2018 | Qualified RMO (Stage-1) 2016 | NTSE Scholar 2015-16 | JSTSE Scholar 2015 | Qualified National Standard Examination (2017-18) in Astronomy, Chemistry & Physics

All India Rank **5**
IIT Madras Zone Topper

Mavuri Siva Krishna Manohar
PINNACLE - Two Year Integrated Program
FIITJEE Vijayawada Centre

Kishore Vaigyanik Protsahan Yojana (KVPY) Fellow 2016-17

AIR	Name	Program	Centre
13	Soumaya Goyal	Intensive Contact Program	under Vadodara Centre
17	Shubham Gupta	Intensive Contact Program	at Jaipur Centre
18	Shivam Goel	Two Year Classroom Program	at Delhi (South) Centre
19	Shalabh Gupta	Four Year Classroom Program + UDAYA - One Year Classroom Program	at Delhi (Dwarka) Centre
22	Vipul Agarwal	Intensive Contact Program	at Jaipur Centre
25	Anuj Srivastava	PINNACLE - Two Year Integrated School Program	at Pune Centre
29	Parth Laturia	Intensive Contact Program	under Delhi (Punjabi Bagh) Centre
32	Shreya Pathak	Four Year Classroom Program	at Delhi (East) Centre
33	Arjun Shashank Kashettiwar	PINNACLE - Two Year Integrated School Program switched from Three Year Classroom Program	at Pune Centre
35	Ayush Garg	Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program	at Faridabad Centre
43	Adway Girish	PINNACLE - Two Year Integrated School Program switched from Four Year Classroom Program	at Bangalore Centre
44	Pratyush Agarwal	Two Year Classroom Program	at Delhi (Punjabi Bagh) Centre
48	Nimay Gupta	Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program	at Bhilai Centre

All our Results are from General Category only.

FIITJEE Students in **Top 10 AIR** from Test Series / Rankers Study Material Programs

AIR - 6
Meenal Parakh
Rankers Study Material + All India Test Series
at Delhi (South) Centre

AIR - 9
Lay Jain
All India Test Series
at Delhi (South) Centre

From all Programs, 41 FIITJEE Students in Top 100 and 76 FIITJEE Students in Top 200 All India Ranks

FIITJEE - THE PREMIER INSTITUTE FOR IIT-JEE and More...

To see our Results from Vijayawada Centre and more details... please turn over

JEE Advanced 2018 Results – FIITJEE Vijayawada Centre

FIITJEE Vijayawada Centre delivers Historical Results as one of its Students

TOPS IIT Madras Zone

A Story of Inspiration for all others

All India Rank

5

IIT Madras Zone Topper

Mavuri Siva Krishna Manohar

PINNACLE - Two Year Integrated Program

FIITJEE Vijayawada Centre

Manohar, aspiring to be an IITian, comes from a humble background as his father works as a tailor in a small village of Andhra. That's when FIITJEE recognised Manohar's talent and provided an opportunity to join **FIITJEE's PINNACLE - Two Year Integrated Program.** Over the course of the two years, his talent was nurtured that proved to be life changing for him. It was **FIITJEE's Healthy Classroom Environment, unrivalled academic inputs** and **the apt guidance of our faculty** that empowered Manohar to deliver such an **extraordinary performance** in **JEE Advanced 2018.**

HI FRIENDS,

Myself, M.S.K. Manohar, a student of PINNACLE, 2 year CLASSROOM PROGRAMME at FIITJEE VIJAYAWADA which played a crucial role in my success of JEE 2018 by making me realise my potential and providing me extraordinary system with care in each & every aspect. It has created professional competitive environment by emphasiz-ing to imbibe fundamental concepts of all three subjects P, C, M and helped in sharpening my analytical skills along with parallel thinking process which made me capable of creatively resolving complex & tricky problems in mere application of basic concepts for quantum jump in my performance.

Our FIITJEE STUDY MATERIAL is very effective & CBT type of AITS is very useful. Apart from these, at FIITJEE VIJAYAWADA I got many first of its kind customised preparation strategies and schedules at right time like "PROTON SHEETS", "EXPONENT SHEETS", "GOLDEN BRIDGE SHEETS", "ULTIMATE-61 SHEETS" along with "ADVANCED ACCELERATOR TESTS" & many exclusive special drives to get clarity in the nuances of subjects. Apart from these, perfectly planned "40 DAYS POWERPLAY SCHEDULE" after JEE MAIN which covered different kinds of patterns & levels of 6 hrs JEE MOCK TESTS, both OFFLINE & ONLINE MODE which made my real JEE EXAM very comfortable and easier.

I totally thank FIITJEE VIJAYAWADA for its complete support & guidance to make me achieve and perform to my maximum potential in JEE 2018.

I WISH "ALL THE BEST" TO THE STUDENTS OF FIITJEE VIJAYAWADA & WISH THEM GREAT SUCCESS IN COMING YEARS.

M.S.K. Manohar

Other Top Performing Students from FIITJEE Vijayawada Centre

AIR - 479

Otturu Tharun Siddhartha
PINNACLE - Two Year Integrated Program

AIR - 755

Battina Abhigna
One Year Classroom Program + PINNACLE - Two Year Integrated Program

AIR - 1035

Dharmana Jaswanth
PINNACLE - Two Year Integrated Program

AIR - 1073

Goparaju Khushal
PINNACLE - Two Year Integrated Program

AIR - 1130

Motati S Chandra Reddy
One Year Classroom Program + PINNACLE - Two Year Integrated Program

AIR - 1233

Dasari Monisha
PINNACLE - Two Year Integrated Program

AIR - 1263

Karedla Roshini
PINNACLE - Two Year Integrated Program

AIR - 1443

Gude Sarath
PINNACLE - Two Year Integrated Program

AIR - 1560

Marapally Sai Anuraag
PINNACLE - Two Year Integrated Program

AIR - 1583

M Kesav Chandra
PINNACLE - Two Year Integrated Program

AIR - 2270

Purli Yashwanth
One Year Classroom Program + PINNACLE - Two Year Integrated Program

AIR - 2398

Sreenadhuni Kishan Rao
PINNACLE - Two Year Integrated Program

AIR - 2654

Sama Sai Karthik
PINNACLE - Two Year Integrated Program

AIR - 2708

Ganji V Surendar Reddy
PINNACLE - Two Year Integrated Program

AIR - 2712

Panindra Reddy Vajrala
PINNACLE - Two Year Integrated Program

AIR - 2942

Mohan Krishna Nimma
PINNACLE - Two Year Integrated Program

AIR - 3024

Suryapogu Akshay Raj
One Year Classroom Program + PINNACLE - Two Year Integrated Program

AIR - 3186

Vivek Sadineni
PINNACLE - Two Year Integrated Program

AIR - 3471

Peravali S Kumar Reddy
PINNACLE - Two Year Integrated Program

AIR - 3565

Vangapandu Padmapriya
PINNACLE - Two Year Integrated Program

AIR - 3771

Nitin Gopala Krishna
PINNACLE - Two Year Integrated Program

AIR - 3782

Nandipati Sai Bhuvanesh
PINNACLE - Two Year Integrated Program

59 Students from FIITJEE Vijayawada Centre have secured a Rank in the Common Rank List of **JEE Advanced 2018.**

(All our Results are from General Category only)

JEE Advanced 2018 Results – FIITJEE Nationwide Centres

41 FIITJEE Students in Top 100 All India Ranks

S.No.	Name	A.I.R.	FIITJEE Program	FIITJEE Centre
1	Kalash Gupta	3	4 Yr CRP	Delhi (South)
2	MSK Manohar	5	PINNACLE	Vijayawada
3	Meenal Parakh	6	RSM + AITS	Delhi (South)
4	Lay Jain	9	AITS	Delhi (South)
5	Soumaya Goyal	13	ICP	Vadodara
6	Shubham Gupta	17	ICP	Jaipur
7	Shivam Goel	18	2 Yr CRP	Delhi (South)
8	Shalabh Gupta	19	4 Yr CRP + UOY	Delhi (Dwarka)
9	Karan Agarwalla	21	RSM	Delhi (South)
10	Vipul Agarwal	22	ICP	Jaipur
11	Anuj Srivastava	25	PINNACLE	Pune
12	Parth Laturia	29	ICP	Delhi (Punjabi Bagh)
13	Bhaskar Gupta	30	AITS	Delhi (South)
14	Shreya Pathak	32	4 Yr CRP	Delhi (East)
15	Arjun Shashank K	33	PINNACLE	Pune
16	Ayush Garg	35	4 Yr CRP + UTY	Faridabad
17	Adway Girish	43	4 Yr CRP	Bangalore
18	Pratyush Agarwal	44	2 Yr CRP	Delhi (Punjabi Bagh)
19	Mohammad Ali Rehan	47	GMP+RTPF	Delhi (South)
20	Nimay Gupta	48	4 Yr CRP	Bhilai /Raipur
21	P Girinath	51	SUPREME	Chennai
22	R Raghu Raman	56	4 Yr CRP	Chennai
23	Pulkit Agrawal	58	AITS	Jaipur
24	Aayush Agarwal	60	ICP	Ranchi
25	Siddhant Choudhary	61	RSM	Delhi (South)
26	Sekshank Achyutuni	62	PINNACLE	Hyderabad
27	Siddharth Grover	63	4 Yr CRP + UTY	Delhi (Rohini)
28	Aniswar Srivatsa Krishnan	67	PINNACLE	Chennai
29	Hardik Agarwal	69	3 Yr CRP	Jaipur
30	Shrey Bansal	72	AITS	Delhi (South)
31	Piyush Gupta	73	2 Yr CRP	Gwalior
32	C Shriram Chandran	74	PINNACLE	Chennai
33	Simarpreet Singh Saluja	75	4 Yr CRP+UTY+LG	Delhi (Punjabi Bagh)
34	Galav Kapoor	76	2 Yr CRP	Faridabad
35	Missula Meghana	80	PINNACLE	Vadodara
36	Sarthak Behera	82	4 Yr CRP	Bhubaneswar
37	Andrews George Varghese	91	SUPREME	Chennai
38	Debajyoti Kar	92	4 Yr CRP	Kolkata
39	Shreyans J Nagori	93	RSM	Vadodara
40	Pushpendra Singh Rana	95	3 Yr CRP	Gwalior
41	Harish Yadav	99	3 Yr CRP	Jaipur

(All our Results are from General Category only)

Legends (FIITJEE Program) : 2 Yr CRP (Two Year Classroom Program); **PINNACLE** (PINNACLE - Two Year Integrated School Program); **3 Yr CRP** (Three Year Classroom Program) ; **4 Yr CRP** (Four Year Classroom Program) ; **SUPREME** (SUPREME - Four Year Integrated School Program) ; **UOY** (UDAYA-One Year Classroom Program) ; **UTY** (UDAYA-Two Year Classroom Program); **LG** (LITTLE GENIE - One Year Foundation Program) ; **ICP** (Intensive Contact Program) ; **RSM** (Rankers Study Material) ; **AITS** (All India Test Series) ; **GMP+RTPF** (Grand Masters Package + Rankers Test Papers File)

From Long Term Classroom / Integrated School Programs

State Toppers	City Toppers
8*	15*

From all Programs

in Top 200 AIR	in Top 500 AIR	in Top 1000 AIR
76*	161*	322*

Total 8794 Students qualified JEE Advanced 2018 from General Category, out of which ...

1948* are FIITJEE Students from Long Term Classroom / Integrated School Programs

2251* are FIITJEE Students from all Programs

* Still Counting. The compilation of Results is still under process.

For detailed results and learning from Toppers, please visit **www.iitjeetoppers.com**

We thank our Students & their Parents for Bringing Glory to us !

Where winning is a habit !

FIITJEE

FORUM FOR IIT-JEE

National Admissions Office : FIITJEE House, 29-A, Kalu Sarai, Sarvapriya Vihar, New Delhi-110 016

Vijayawada Centre : D. No. 38-8-45 (Pass Port Office Building), Opp. All India Radio Station, M.G. Road Ph.: 8885549700, 8885549711, 8885549811, 0866-6669100, 6669200

Toll Free No. 1800114242 Web: www.fiitjee.com www.facebook.com/fiitjeeindia123 www.twitter.com/fiitjee www.youtube.com/fiitjeeltd

FIITJEE - THE PREMIER INSTITUTE FOR IIT-JEE and More...

Attention XII Pass

Students with the zeal to Excel in **JEE 2019!**

Scan Your Flaws and get the Remedy to Succeed

XtraRAY

EDGE TEST

24th June 2018

Who should appear ?

- Those who were not able to realise their dream in JEE 2018 and wish to succeed in JEE 2019.
- Those who have appeared in FIITJEE Talent Reward Exam (3rd June 2018) but were not able to qualify it and wish to capitalize on this opportunity to excel in JEE 2019.

For more details, visit **www.xret.fiitjee.com**

Why FIITJEE ?

1. **Hostel** – You will get Good Food, Environment Conducive for Studies, Academic Support at hostel - Faculty goes for academic care including doubt clearing.
2. **Overall Contact Hours** – Generally contact hours are 450 hrs (One Year Extended Program) but time is not a constraint if the batch requires that.
3. We hold classes in **reasonable size batches** so that you don't feel lost. We never hold classes in batches of 100 or 200. Large classes are the reasons why students are unable to master concepts & feel stressed and develop dependency & take extreme steps.
4. You get a **doubt clearing cell**, and **Library facility** with presence of faculty for guided studies.
5. **Unparalleled FIITJEE All India Internal Test Series with exacting JEE Main & Advanced Environment** – We are the pioneers of AITS, Test Analysis and Rank Prediction – We can almost always predict your potential JEE Rank.

Financial Assistance Eligibility Tests

17th June 2018 - for Students of Class IX, XI & XII Pass

1st July 2018 - for Students of Class XI & XII Pass

For more details visit **http://admissiontest.fiitjee.com**

The advertisement has been released by FIITJEE Limited headquartered at New Delhi. These tests are not Admission Tests to our Colleges or Schools and Admissions are done on 'First Come First Serve Basis' as per Andhra Pradesh Board norms.

Not able to join FIITJEE's Classroom / Integrated Programs ?

Have the FIITJEE Edge by joining Test Series / Study Material Programs

For more details visit **www.fiitjee-distancelearning.com**

ఈనాడు

విజయవాడ 12-6-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 303

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



నేడే భేటీ

సింగపూర్ ప్రధాని లీ తెప్పించిన కేక్‌ను కట్ చేస్తున్న ట్రంప్

సమయం

ఉదయం 9 గంటలకు (భారత కాలమానం ప్రకారం ఉదయం 6.30 గంటలకు)

వేదిక

కేపెల్లా హోటల్, సింగపూర్

ఏం జరగనుంది

తొలుత ట్రంప్, కిమ్ ఏకాంతంగా మాట్లాడుకుంటారు. ఆ తర్వాత ప్రతినిధి బృందాల స్థాయిలో సమాలోచనలు జరుపుతారు.

ఫలితం ఏం ఉండొచ్చు

ట్రంప్-కిమ్ భేటీ తర్వాత ఉ.కొరియాకు భద్రతపరమైన హామీతో పాటు ఆర్థిక సాయాన్ని కూడా అమెరికా అందించే అవకాశముంది. కొరియా యుద్ధానికి సాంకేతికంగా ముగింపు పలుకుతూ శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకూ ఎక్కువ అవకాశాలున్నాయి.

- చరిత్రాత్మక సమావేశానికి సర్వం సిద్ధం
- కీలక చర్చలు జరపనున్న ట్రంప్-కిమ్

సోమవారం సింగపూర్‌లో అభివాదం చేస్తున్న కిమ్

భద్రతకు పూచీ మాది

ఉ.కొరియాకు అమెరికా భరోసా

- అణ్వాయుధాలు వీడితే అండగా ఉంటామని హామీ 2లో
- ఇదో సదవకాశం: అమెరికా విదేశాంగ మంత్రి పాంపియో

మైలురాయి..

‘డయాఫ్రమ్‌వాల్ అంటే భూగర్భంలో నిర్మించేది. 95మీటర్ల లోతులో నిర్మించారు. దీని వెడల్పు 1.5మీటర్లు. నదిలో 1396.60మీటర్ల పొడవున కట్టారు. రెండే సీజన్లలో 414 పనిదినాల్లోనే పూర్తిచేశారు.

ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నాం. దీన్ని చేపట్టడం నా అదృష్టం. ప్రాజెక్టును పూర్తిచేసుకుని కరవు రహిత రాష్ట్రంగా తయారుచేసుకుంటాం. 2019 జూన్ నాటికి గ్రావిటీ ద్వారా నీళ్లు ఇస్తాం.

ఇంత కష్టపడి ప్రాజెక్టు నిర్మిస్తోంటే.. వైకాపా నాయకులు విషం చిమ్మారు. ప్రాజెక్టు పూర్తయితే ప్రజల జీవితాల్లో వెలుగు వస్తుంది. అది వారికిష్టం లేదు. ఏదేమైనా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి తీరతా.’

- పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్‌వాల్ విజయవంతంగా పూర్తి చేశాం
- 2019 జూన్ నాటికి గ్రావిటీ ద్వారా నీళ్లిస్తాం
- వాల్ పైలాన్ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి వెల్లడి

ఈనాడు డిజిటల్ – ఏలూరు, పోలవరం – న్యూస్‌టుడే

జాతికి జీవనాడైన పోలవరం ప్రాజెక్టుకు డయాఫ్రమ్‌వాల్ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తిచేసి, కీలక మైలురాయిని అధిగమించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ప్రాజెక్టు వద్ద పైలాన్ ఆవిష్కరించారు. అంతకుముందు యాగశాల ప్రారంభించి పూజలు చేశారు. అనంతరం డయాఫ్రమ్‌వాల్‌ను పరిశీలించారు. బావర్, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో మాట్లాడారు. నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత స్పిల్ ఛానల్ వద్ద 13 జిల్లాల నుంచి వచ్చిన రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

‘ప్రపంచంలోని అన్ని భూగర్భ ప్రాజెక్టు పనులను బావర్ సంస్థ చేసింది. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో భాగంగా బెంటోనైట్ మిశ్రమంతో కలిపి ప్లాస్టిక్ కాంక్రీటు వేశారు. . దీంతో నాణ్యత పదింతలు పెరిగింది. చుక్క నీరు కూడా కిందకు ఇంకదు. ఎల్ అండ్‌టీ సంస్థతో కలిపి ఈ ప్రతిష్ఠాత్మక పని పూర్తిచేశారు. ఇంజినీర్లు, మంత్రి కలిపి పట్టుదలతో దీన్ని కొలిక్కి తెచ్చారు. అందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. 63సార్లు వర్చువల్ తనిఖీలు చేశాను. 25సార్లు ప్రత్యక్షంగా పరిశీలించాను. ఇది అధికారులకు స్ఫూర్తినిచ్చింది. మధ్యలో అనేక ఇబ్బందులు వచ్చాయి. కేంద్రం కూడా అప్పుడప్పుడు సరిగా స్పందించలేదు. ఇవన్నీ తట్టుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూశాం. తెలంగాణ నుంచి ఏడు (మిగతా 2లో)

డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం పూర్తయిన సందర్భంగా పైలాన్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేస్తున్న సీఎం చంద్రబాబు

ఒక్క రోజులో కాంక్రీటు రికార్డు!

ఒక్కరోజులో కాళేశ్వరం ప్రాజెక్టులో 7,250 ఘనపు(క్యూబిక్) మీటర్ల కాంక్రీటు పని చేస్తే ఇక్కడ 11,153 ఘనపు మీటర్ల మేర చేశాం. తద్వారా దేశంలో మొదటి స్థానంలో నిలిచాం. గంట వర్షం పడింది. లేదంటే ఇంకా ఎక్కువ పని చేసేవాళ్లం. ప్రపంచంలోనే కాంక్రీటు నాణ్యతలో ఇదే మొదటిది. పని పరంగా రెండోది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయిన త్రీగార్జెస్‌లో 13వేల ఘనపు మీటర్ల కాంక్రీటు పనిచేశారు. 2,3 నెలల్లో 13 వేల ఘనపుమీటర్ల కాంక్రీటు పనిచేసి రికార్డు సృష్టించబోతున్నాం.

భాజపా, తెదేపా పోటాపోటీ ధర్నాలు

- విజయవాడలో ఉద్రిక్తత 5లో
- భారీగా పోలీసుల మోహరింపు

రూ.వంద కోట్ల అక్రమార్జన జప్తు

- ప్రత్యేక న్యాయస్థానాల చట్టం కింద తొలి కేసు
- సర్వే ఇన్‌స్పెక్టర్‌పై బిగుసుకుంటున్న ఉచ్చు 6లో

వాజ్‌పేయీకి ఎయిమ్స్‌లో చికిత్స

- మాజీ ప్రధానికి ఛాతీ, మూత్రపిండాల సమస్య
- అత్యవసర విభాగంలో వైద్యసేవలు 11లో

నైపుణ్యాభివృద్ధిరస్తు!

- రాజధానిలో ప్రపంచస్థాయి శిక్షణా కేంద్రం
- సింగపూర్ భాగస్వామ్యంతో ‘మెష్’!
- ప్రాథమికంగా ఆరు కోర్సుల్లో శిక్షణ
- నెలలో ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశం
- కార్యాచరణ సిద్ధం

ఈనాడు – అమరావతి

రాజధాని అమరావతిలో సింగపూర్ సహకారంతో ప్రపంచస్థాయి నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్), ఔత్సాహిక పారిశ్రామిక అభివృద్ధి (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్) కేంద్రాన్ని నెలకొల్పనున్నారు. దీన్ని మల్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్కిల్ హబ్(మెష్)గా వ్యవహరిస్తారు. అమరావతిలో పదెకరాల్లో దీన్ని ఏర్పాటుచేస్తారు. సింగపూర్‌కు చెందిన స్కిల్స్ ఎస్‌జీ వెంచర్స్ (ఎస్ఎస్‌జీవీ), మన దేశానికి చెందిన సింక్రోసెర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్ (ఎస్‌జీఎస్‌పీ) సంస్థలు సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) పర్యవేక్షిస్తుంది. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణనివ్వడం, యువత స్వయంఉపాధికి పారిశ్రామిక అభివృద్ధిలో శిక్షణనివ్వడం, శిక్షకులకు శిక్షణ (ట్రైయినింగ్ ఆఫ్ ది ట్రైయినర్స్) వంటి కార్యక్రమాలు ఇక్కడ (మిగతా 2లో)

జేఈఈ సీట్లు పెరిగాయ్

- దేశవ్యాప్తంగా పెరిగినవి 3,157 సీట్లు 6లో
- సూపర్‌న్యూమరరీ సీట్లు 1,473
- ఐఐటీ తిరుపతిలో పెరిగిన 60 సీట్లు
- ఎన్ఐటీల్లో సూపర్‌న్యూమరరీ సీట్లు 24
- వివరాలు వెల్లడించిన జోసా

ఇదీ సంగతి!

లావాదేవీలకు బ్యాంకులో డబ్బు లేదు. పైగా మోసగాళ్లకు అప్పులిచ్చామని గొడవ! మనమూ ఇంగ్లాండును రాజకీయ ఆశ్రయం కోరుదాం సార్!

20 కోట్ల అక్రమార్జన

- ఏసీబీ వలలో శ్రీకాకుళం మున్సిపల్ డీఈఈ
- రాష్ట్రంలో ఏకకాలంలో 10 చోట్ల దాడులు

విశాఖపట్నం – న్యూస్‌టుడే

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గొట్టుముక్కల శ్రీనివాసరాజు(52) సోమవారం శ్రీకాకుళం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. సుమారు రూ.20కోట్లకు పైగా మార్కెట్ విలువ కలిగిన ఆస్తులను గుర్తించారు. ఈ సందర్భంగా నగదు, ఇతర సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇరవై ఏడున్నర సంవత్సరాల పాటు ఆయన మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లోనే విధులు

నిర్వర్తించారు. విశాఖలోని సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో సొంత నివాసం ఉంది. అనిశా డీఎస్పీ రాజేంద్ర ఆధ్వర్యంలో శ్రీకాకుళం అనిశా అధికారులు సోమవారం ఉదయమే విశాఖ కేంద్రంగా దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం, రాజమండ్రి, భీమవరం, పాలకొల్లుతో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. పురపాలక శాఖలో 1988 మేలో వర్క్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయన 2000లో ఎ.ఇ.గా పదోన్నతి పొందారు. గత సంవత్సరమే డి.ఇ.ఇ.గా పదోన్నతి పొంది శ్రీకాకుళంలో విధులు నిర్వర్తిస్తున్నారు. దాడుల్లో పట్టుబడ్డ ఆయన ఆస్తుల పుస్తక విలువ రూ.1.64కోట్లుగా తేలింది. ఈ దాడులకు సంబంధించిన అన్ని వివరాలను అనిశా డీఎస్పీ రాజేంద్ర వెల్లడించారు.

కూడబెట్టిన ఆస్తుల వివరాలివే....

★ విశాఖపట్నంలోని సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని ఆర్ఆర్ రెసిడెన్సీలో 1085 చ.అ. విస్తీర్ణంలో ఫ్లాట్.

★ పశ్చిమగోదావరి జిల్లా కొవ్వలిలో 6.82 ఎకరాల వ్యవసాయ భూమి.

★ ఆయన భార్య రాజేశ్వరి (మిగతా 2లో)

అనిశా దాడుల్లో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం

20 కోట్ల అక్రమార్జన

(మొదటి పేజీ తరువాయి)

పేరు మీద విశాఖపట్నం అడవివరంలో సర్వే నెంబర్ 275/30-ఎలో 183.88 గజాల స్థలం, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం నర్సింహపురంలో సర్వే నెంబర్ 75/2లో 697.44 చదరపు గజాలు, భీమవరం మండలం పెద అమిరాంలో487/1, 487/2ఎ, 487/2బీలో 697.44 చదరపు గజాలు, కొవ్వలిలో 7.20 ఎకరాల భూమి.

- ఆయన కుమార్తె మౌనికాదేవి పేరు మీద భీమవరం మండలం నర్సింహపురంలో సర్వే నెంబర్ 75/2లో 498.82 చదరపు గజాలు.
- ఆయన తల్లి జి. స్వరాజమ్మ పేరు మీద కొవ్వలిలో 417/1, 418/1 సర్వేనెంబర్లలో 3.19 ఎకరాల భూమి.
- తండ్రి జి. కృష్ణంరాజు పేరు మీద పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు మండలం కొవ్వలిలో 417/2, 418/2, 449/2 సర్వేనెంబర్లలో 2.69 ఎకరాల భూమి
- కొవ్వలిలో తన మామ వి.నారాయణ పేరు మీద 416/52, 416/3, 417-1, 418 సర్వే నెంబర్లలో 4.71 ఎకరాల భూమి, 416/1 సర్వే నెంబరులో 2.49 ఎకరాల భూమి. పాటు అత్త వి. వరలక్ష్మి పేరు మీద 887/1,/2లో 3.60 ఎకరాల భూమి.
- వీటితో పాటు ఇంట్లో 12.27 లక్షల నగదు, బ్యాంక్ ఖాతాలో రూ.5 వేలు, 6లక్షల 84వేల 100 రూపాయిల విలువ చేసే 423.300 గ్రాముల బంగారం, రూ.14,300 విలువ చేసే 548 గ్రాముల వెండి ఆభరణాలు, రెండు మోటారు సైకిళ్లు, 8.09 లక్షల గృహ అలంకరణ వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. విశాఖలోని అక్కయ్యపాలెం, డాబాగార్డెన్‌లోని రెండు వేర్వేరు బ్యాంకుల్లో లాకర్లు కలిగి ఉన్నట్లు అనిశా అధికారులు నిర్ధరించారు.

భద్రతకు పూచీ మాది

సింగపూర్: పూర్తిస్థాయిలో అణు నిరాయుధీకరణకు ఉత్తర కొరియా అంగీకరిస్తే ఆ దేశానికి అసమాన రీతిలో భద్రతపరమైన హామీ ఇస్తామని అమెరికా ముందుకొచ్చింది. అయితే ఈ నిరాయుధీకరణ- 'పూర్తిస్థాయిలో, పరిశీలనకు వీలుగా, మళ్లీ వెనక్కి మళ్లిపోని రీతిలో' ఉండాల్సిందేనని స్పష్టంచేసింది. దానిని మాత్రమే తాము అంగీకరిస్తామని తేల్చిచెప్పింది. అణ్వాయుధాలను విడిచిపెట్టే విషయంలో ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం నాడిక్కడ చర్చలు జరపనున్న నేపథ్యంలో సోమవారం ఉభయపక్షాలూ విస్తృతంగా సమాలోచనలు జరిపాయి. ఆమోదయోగ్య పరిష్కారం దిశగా మంచి పురోగతి సాధించాయి. విభేదాలను రూపుమాపేందుకు ఇరు దేశాల దౌత్య వర్గాలూ తెరవెనుక సుదీర్ఘంగా చర్చించుకున్నాయి. కిమ్‌తో భేటీ అత్యంత ఆసక్తికరంగా ఉంటుందనీ, చక్కని ఫలితాన్ని సాధించగలుగుతాననీ ట్రంప్ ఇప్పటికే ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో విలేకరులతో మాట్లాడుతూ- సన్నాహక చర్చలు శీఘ్రగతిన పురోగమిస్తున్నాయనీ, తమ అంచనా కంటే ముందుగానే ఒక తార్కికమైన ముగింపును సాధించే అవకాశాలున్నాయనీ చెప్పారు.

...అంతవరకు కొనసాగనున్న ఆంక్షలు

'ఉ.కొరియా చేత అణ్వాయుధాలను త్యజింపజేయడానికి గతానికి భిన్నమైన రీతిలో ప్రత్యేకమైన హామీలను ఇచ్చేందుకు అమెరికా సంసిద్ధత వ్యక్తం చేసింది. అణ్వాయుధాలను వదిలిపెట్టినంతమాత్రాన వారికి ఎలాంటి నష్టం జరగదనీ, ఏమాత్రం ఇబ్బందుల్లేకుండా సౌఖ్యంగా ఉండవచ్చనీ తగిన నమ్మకాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. నిరాయుధీకరణ జరిగేవరకు ఉ.కొరియాపై ఆంక్షలు మాత్రం కొనసాగుతాయి. దౌత్యం సరైన దిశలో కదలకపోతే ఆంక్షలు పెరుగుతాయి కూడా. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాల ప్రస్థానాన్ని మార్చేందుకు కిమ్‌కు అరుదైన అవకాశం లభించిందని ట్రంప్ భావిస్తున్నారు. దేశానికి శాంతి, సుసంపన్నతలు అందించేందుకు ఉ.కొరియాకు ఇదో సదవకాశం. ఇద్దరు నేతలూ కలిసి కూర్చొని, ముఖాముఖి చర్చించుకోవడం వల్ల రెండు దేశాల ప్రజలకే కాకుండా యావత్ ప్రపంచానికీ మేలు కలిగిస్తుంది' అని పాంపియో వివరించారు.

ఉ.కొరియాకు అమెరికా భరోసా

అంగరక్షకుల పటిష్ఠ భద్రత నడుమ సోమవారం సింగపూర్‌లోని మెర్లిన్ పార్క్‌ను సందర్శిస్తున్న ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్

గతంలో అమెరికాను వంచించారు

'ఉత్తర కొరియా గతంలో అమెరికాను వంచించింది. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధాన్ని, సామూహిక జనహనన ఆయుధాల వినాశనాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేయగల నిపుణులు ఇప్పుడు ట్రంప్ సర్కారులో ఉన్నారు. అందువల్ల ఉ.కొరియా ఇలాంటి విషయాల్లో ఎంతవరకు కట్టుబడి ఉందో తెలుసుకోవచ్చు. కిమ్‌తో సమావేశానికి ట్రంప్ పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నారు' అని పాంపియో చెప్పారు. భేటీలో భాగంగా తొలుత ట్రంప్, కిమ్ ఏకాంతంగా మాట్లాడుకుంటారనీ, ఆ తర్వాత ప్రతినిధి బృందాల స్థాయిలో సమాలోచనలు జరుపుతారనీ అమెరికా జాతీయ భద్రత మండలి అధికార ప్రతినిధి తెలిపారు. ట్రంప్-కిమ్ భేటీ తర్వాత ఉ.కొరియాకు భద్రతపరమైన హామీతో పాటు ఆర్థిక సాయాన్ని కూడా అమెరికా అందించే అవకాశముంది. కొరియా యుద్ధానికి సాంకేతికంగా ముగింపు పలుకుతూ శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకూ ఎక్కువ అవకాశాలున్నాయి. గతంలో ఉభయ కొరియాల మధ్య 'యుద్ధ విరామ సంధి' కుదిరిందే గానీ యుద్ధం ముగిసినట్లు ప్రకటన వెలువడలేదు. అమెరికా-ఉ.కొరియా చర్చల్లో భాగంగా ఇరు దేశాలకూ ఆసక్తి ఉన్న అనేక అంశాలు ప్రస్తావనకు రానున్నాయని కొరియా కేంద్రీయ వార్తా సంస్థ (కేసీఎన్ఏ) తెలిపింది. శాంతి పరిరక్షణకు శాశ్వత యంత్రాంగం ఏర్పాటు దిశగానూ అడుగులు పడనున్నాయని వివరించింది. సింగపూర్‌కు వచ్చిన ట్రంప్, కిమ్‌లు విడివిడిగా దేశ ప్రధాని లీ సీన్ లూంగ్‌తో భేటీ అయ్యారు. తమ సమావేశానికి ఆతిథ్యమిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

భారీ కేక్‌తో ట్రంప్ పుట్టినరోజు ముందస్తు వేడుక

సింగపూర్ అధ్యక్ష భవనం 'ఇస్తానా'లో ట్రంప్, లూంగ్ సమావేశమైనప్పుడు లూంగ్ ఆయన్ని ఆశ్చర్యంలో ముంచెత్తే రీతిలో పెద్ద కేక్‌ను రప్పించారు. అమెరికా అధ్యక్షుడి 72వ పుట్టినరోజు సందర్భంగా మధ్యాహ్న విందులో ఆయన చేత ఈ కేక్ కోయించారు. తాజా పండ్లతో అలంకరించిన ప్రత్యేక కేకు వద్ద ట్రంప్ చిరునవ్వులు చిందిస్తున్న చిత్రాన్ని సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్ ట్విటర్లో పంచుకున్నారు. ట్రంప్ పుట్టినరోజును కాస్త ముందుగానే (అసలైన తేదీ జూన్ 14) తాము నిర్వహించామని చెప్పారు.

ఈ భేటీలో... మంగళవారం నాటి సమావేశ సన్నాహకాలతో పాటు అమెరికా వాణిజ్య ఆంక్షల వరకు అనేక అంశాలు చర్చకు వచ్చాయి. సోమవారం ట్రంప్ పాల్గొన్న ఏకైక కార్యక్రమం ఇదే. సింగపూర్‌లో ఉండడం గొప్పగా ఉందంటూ ఆయన ట్వీట్ చేశారు. 'సింగపూర్ ఇచ్చిన ఆతిథ్యాన్ని, స్నేహ బంధాన్ని మరిచిపోలేను. దానికి నా ప్రత్యేక ధన్యవాదాలు. మంగళవారం జరగబోయే ఆసక్తికరమైన సమావేశానికి అన్నీ చక్కగా జరుగుతున్నాయ'ని చెప్పారు. సన్నాహక చర్చలు ఫలప్రదం కావడంతో ట్రంప్ ఒకరోజు ముందుగా, అంటే మంగళవారం సాయంత్రమే అమెరికాకు తిరుగు ప్రయాణం కానున్నారు.

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో సెల్ఫీ దిగుతున్న సింగపూర్ మంత్రి వివియన్ బాలకృష్ణన్

పర్యాటక ప్రాంతాలను సందర్శించిన కిమ్

సాధారణంగా బయట పెద్దగా తిరగని కిమ్ సోమవారం మాత్రం సింగపూర్‌లో పర్యాటక ప్రసిద్ధ ప్రాంతాలను సందర్శించి, ఆస్వాదించారు. సింగపూర్ వాటర్‌ఫ్రంట్‌ను, సముద్రతీరం పక్కనున్న ఉద్యానవనాలను తిలకించారు. గాజు అద్దాలతో కూడిన అతిపెద్ద హరిత పందిరిని, ప్రపంచంలో పొడవైన (ఇన్‌డోర్) జలపాతాన్ని వీక్షించారు. ట్రంప్, కిమ్ భేటీ ఫలితాలపై ఉ.కొరియా ప్రసార మాధ్యమాలు ఆశాభావంతో ఉన్నాయి. ఇదో చరిత్రాత్మక సమావేశమని అధికారిక మాధ్యమాలు పేర్కొన్నాయి. సోమవారం కొరియా పత్రికలు ఈ అంశానికి విశేష ప్రాధాన్యమిచ్చాయి. ఎక్కువమంది కొరియా వాసులు వీక్షించే వీలున్న ఏకైక అధికారిక టీవీ ఛానెల్‌లోనూ ఈ వార్తకు పెద్దపీట వేశారు.

ఏర్పాట్లలో భారత సంతతి మంత్రులు

ఇద్దరు నేతల భేటీ ఏర్పాట్లలో భారత సంతతికి చెందిన సింగపూర్ మంత్రులు- వివియన్ బాలకృష్ణన్, కె.షణ్ముగం కీలక పాత్ర పోషిస్తున్నారు. వాషింగ్టన్, ప్యాంగ్‌యాంగ్, బీజింగ్‌లకు బాలకృష్ణన్ ముందుగానే వెళ్లొచ్చారు. భద్రతపరంగా ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసే బాధ్యతను న్యాయ, హోంశాఖ మంత్రి షణ్ముగం చేపట్టారు. రెండువారాల్లోనే ఏర్పాట్లన్నీ పూర్తయ్యేలా చూశారు.

సింగపూర్ విందులో పలావ్, కోడి కూర

- విదేశీ విలేకరుల కోసం పసందైన వంటకాలు
- 3 వేల మంది పాత్రికేయుల రాక

సింగపూర్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అగ్రనేత కిమ్ జోంగ్ ఉన్ మధ్య మంగళవారం జరగనున్న కీలకమైన భేటీ వార్తల్ని ప్రపంచానికి అందించడానికి వివిధ దేశాల నుంచి తరలివచ్చిన 3 వేల మంది విలేకరుల కోసం పసందైన విందు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీరు మూడు రోజులకు పైగా సింగపూర్‌లో ఉంటారు. భారతీయ వంటకాలైన పలావ్, కోడి కూర, కోడి కుర్మా, పప్పు, చేపల కూర, అప్పడం వంటివి కూడా వీరికి వడ్డించే పదార్థాల జాబితాలో చోటు చేసుకున్నాయి. మొత్తం 45 రకాల వంటకాలను సిద్ధం చేయిస్తున్నారు. ఇద్దరు అగ్రనేతల మధ్య మంగళవారం ఉదయం 9 గంటలకు కేపెల్లా హోటల్లో చర్చలు ప్రారంభం కానున్నాయి. భారత్‌తో పాటు సింగపూర్, మలేసియా, వియత్నాం, థాయ్‌లాండ్, కొరియా, జపాన్, చైనా, ఫ్రాన్స్, అమెరికా, ఇటలీ, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, మధ్యప్రాచ్య దేశాలు.. ఇలా 15 భిన్న ప్రాంతాల రుచుల్ని పరిచయం చేయనున్నారు. ముఖ్యంగా సింగపూర్‌లో ప్రసిద్ధ వంటకాలైన లక్సా, చికెన్ రైస్ వంటివి వేడివేడిగా వడ్డిస్తారు. ముఖ్యమైన వార్తలను అందించే హడావుడిలో ఉండే విలేకరులు షడ్రసోపేతమైన భోజనాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దాదాపు 7వేల భోజనాల కోసం 7 టన్నులకు పైగా వంటకాలను ఛాంగి విమానాశ్రయంలోని వంటశాలలో సిద్ధం చేయనున్నారు. ఈ బృందంలో భారతీయ పాకశాస్త్ర నిపుణుడైన అమిత్ వర్మ కూడా ఉన్నారు.

అందరూ మమ్మల్ని దోచుకుంటున్నారు

- ట్రంప్ ఆరోపణ
- భారత్ లక్ష్యంగా విమర్శలు

వాషింగ్టన్: భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. తమ దేశానికి చెందిన కొన్ని వస్తువులపై 100 శాతం సుంకం విధిస్తోందంటూ నిందించారు. మరి కొన్ని అగ్రదేశాలు కూడా భారీగా పన్నులు విధిస్తూ అమెరికాను దోచుకుంటున్నాయని ఆరోపించారు. అలాంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు తెంచుకుంటామని హెచ్చరించారు. కెనడాలోని క్విబెక్ సిటీలో జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న అనంతరం విలేకర్ల సమావేశంలో శనివారం ట్రంప్ ఈ మేరకు పలు అంశాలపై మాట్లాడారు. "పిగ్గీబ్యాంకులా మమ్మల్ని అందరూ దోచుకుంటున్నారు. జీ-7 దేశాలు మాత్రమే కాదు. భారత్ వంటి దేశాల్లో మా దేశానికి చెందిన కొన్ని వస్తువులపై సుంకాలు 100 శాతం ఉన్నాయి. మేం మాత్రం వారి వస్తువులపై పన్నులేవీ విధించడం లేదు. ఇది సరైన విధానం కాదు. చాలా దేశాలతో చర్చలు జరుపుతున్నాం. ఈ పద్ధతి మారుతుంది. లేదంటే అధిక సుంకాలు విధిస్తున్న దేశాలతో వాణిజ్య సంబంధాలు తెంచుకుంటాం"అని ట్రంప్ పేర్కొన్నారు. హార్లే-డేవిడ్సన్ మోటారుసైకిళ్లపై అధిక దిగుమతి సుంకం విధిస్తున్నారంటూ భారత్‌పై ట్రంప్ గతంలోనూ విమర్శలు గుప్పించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే భారత్ నుంచి అమెరికాకు వచ్చే వేలాది ద్విచక్రవాహనాలపై దిగుమతి సుంకం పెంచుతామని అప్పట్లో హెచ్చరించారు.

తాత్కాలిక ఉద్యోగుల వేతనాల పెంపు

ఈనాడు, అమరావతి: తాత్కాలిక ఉద్యోగులకు 2015 పీఆర్‌సీని వర్తింపజేయాలని ఆ అంశంపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. సచివాలయంలో సోమవారం మంత్రులు యనమల, కాలవ శ్రీనివాసులు తదితరులు సమావేశమయ్యారు. 1993 నవంబరు 25కు ముందు నియామకం పొంది వివిధ శాఖల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు సంబంధించిన డిమాండుపై చర్చించారు. అనంతరం మంత్రి కాలవ విలేకరులతో మాట్లాడుతూ తాత్కాలిక ఉద్యోగులకు కూడా 2015 పీఆర్‌సీ ప్రయోజనాలను వర్తింపజేయాలని ఉపసంఘం ప్రభుత్వానికి సిఫారసు చేయనుందని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల 5వేల మందికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

గ్రామ సేవకులకు రూ.10,500

ఈనాడు డిజిటల్, అమరావతి: గ్రామ సేవకుల (విలేజీ రెవెన్యూ అసిస్టెంట్స్) గౌరవ వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం నెలకు అందచేస్తున్న రూ.6వేల నుంచి రూ.10,500కు పెంచుతూ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఈ పెంపు అమల్లోనికి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల మంది వీఆర్‌ఏలకు లబ్ధి చేకూరనున్నట్లు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, కార్యదర్శి బాలకాశి తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు వద్ద హోమశాలలో పూజల అనంతరం పూర్ణాహుతి సమర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబును సన్మానిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థల ప్రతినిధులు, సిబ్బంది. చిత్రంలో మంత్రి ఉమా తదితరులు

మైలురాయి..

(మొదటి పేజీ తరువాయి)

మండలాలు మనకివ్వకపోతే ప్రమాణ స్వీకారం చేయనని ఆ రోజు చెప్పాను. అవి కలిపాకే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రూ.14వేల కోట్లు ఖర్చుచేశాం. మొత్తం ప్రాజెక్టుకు రూ.57వేల కోట్లు అవసరం. ఇందులో రూ.5వేల కోట్లు విద్యుత్ ప్రాజెక్టుకి అవుతుంది. 52వేల కోట్లలో ఇప్పటికే 14వేల కోట్లు వెచ్చించామంటే.. ఇంకా రూ.38వేలకోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. అందులో రూ.27వేల కోట్ల నుంచి 28వేల కోట్ల వరకూ భూసేకరణ, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీకే అవుతుంది. ఇప్పటివరకు ప్రాజెక్టు పనులు 55.12శాతం అయ్యాయి. ప్రాజెక్టు పూర్తయితే 7.20లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 40లక్షల ఎకరాలకు స్థిరీకరణ వస్తుంది. గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార, పెన్నా నదులు అనుసంధానించనున్నాం. మీ ఆశీస్సులతో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు నీటిఎద్దడి లేకుండా చేయాలన్నది నా ధ్యేయం.

ప్రాజెక్టులో 55.12 శాతం పనులు పూర్తి

హెడ్‌వర్క్స్ పనులు 38.2శాతం, మొత్తం ప్రాజెక్టు పనులు 55.12శాతం పూర్తయ్యాయి. కుడికాలువ 89.శాతం, ఎడమ ప్రధానకాలువ పనులు 65.01 శాతం జరిగాయి. స్పిల్‌వే పనులు వేగం పుంజుకున్నాయి. త్వరలో అన్ని రికార్డులూ అధిగమించబోతున్నాం. కాంక్రీటు పనులకు ట్రాన్స్‌ట్రాయ్ పూర్తిగా సహకరిస్తోంది. వారినీ అభినందించాలి. ప్రాజెక్టుకు 1,67,213 ఎకరాలు అవసరం కాగా 1,10,330 ఎకరాలు సేకరించాం. ఇంకా 55,650 ఎకరాలు సేకరించాల్సి ఉంది. దీనికి 6,373కోట్లు అవసరం కాగా 5653కోట్లు ఖర్చు పెట్టాం. రూ.21వేల కోట్లు ఇవ్వాల్సి ఉంది. లక్ష కుటుంబాలకు పునరావాసం కల్పిస్తున్నాం.'

డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని 414 రోజుల్లోనే పూర్తి చేసినందుకు బావర్, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు, 24గంటల్లోనే 11,158 ఘనపు మీటర్ల కాంక్రీటు పనులు చేసిన నవయుగ ప్రతినిధులను అభినందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సన్మానించారు. అనంతరం వారంతా ముఖ్యమంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమా, పితాని సత్యనారాయణ, ఎంపీ తోట సీతారామలక్ష్మి, జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, సీఈ కె.శ్రీధర్, ఎస్ఈ వీఎస్.రమేశ్‌బాబు, పోలవరం శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు, ఉభయ గోదావరి జిల్లాల కలెక్టర్లు కె.భాస్కర్, కార్తికేయ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

సోమవారం పోలవరం ప్రాజెక్టు పైలాన్ ఆవిష్కరణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో 'పోలవరం-ఆంధ్రుల జీవనాడి' టీషర్ట్‌ను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

పోలవరంలో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం

- మంత్రి నారా లోకేష్ ట్వీట్

ఈనాడు డిజిటల్, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఒకే రోజు 11,153 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి జాతీయ రికార్డు సాధించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ ఘనత సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నీటిపారుదల శాఖ అధికారులకు సోమవారం ట్విట్టర్ వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. 'పోలవరాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు. దేశంలో 16 జాతీయ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉంటే కేవలం 5 ప్రాజెక్టుల పనులు మాత్రమే జరుగుతున్నాయి. అందులో ఒక్క పోలవరం పనులు మాత్రమే వేగంగా జరుగుతున్నాయి. పోలవరంలో ఇంత పెద్ద ఎత్తున పనులు జరుగుతుంటే ప్రాజెక్టును అడ్డుకోవడానికి విపక్షాలు అసత్యాలు ప్రచారం చేయడం దారుణం' అని ట్వీట్ చేశారు.

కశ్మీరు లోయలో రాళ్లురువ్వే కార్యకలాపాలకు పాల్పడే వారిని కచ్చితంగా తూటాలతోనే కొట్టాలంటూ భాజపా రాజ్యసభ సభ్యుడు డి.పి.వాట్స్ అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్ మన దేశంతో ప్రచ్ఛన్న యుద్ధాన్ని మొదలుపెట్టింది. ప్రతి రోజూ మన సైన్యంపై జమ్ము-కశ్మీరులో దాడులు జరుగుతున్నాయి అని ఆయన అన్నారు.

నైపుణ్యాభివృద్ధిరస్తు!

(మొదటి పేజీ తరువాయి)

ఉంటాయి. నైపుణ్యాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. ఇంజినీరింగ్ వంటి అండర్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల చివరి సంవత్సరాల్లో ఉన్న విద్యార్థులకు ఎంపవరింగ్ నెక్స్ట్ జనరేషన్ అప్లైడ్ బిజినెస్ లీడర్‌షిప్ అండ్ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ ప్రోగ్రాం (ఎనాబుల్) పేరుతో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని నిర్వహించనున్నారు.

వడివడిగా అడుగులు

ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌ల అధ్యక్షతన ఇటీవల జరిగిన సంయుక్త అమలు పర్యవేక్షణ కమిటీ (జేఐఎస్‌సీ) సమావేశంలో దీనిపై చర్చించారు. శాశ్వత నిర్మాణాలతో 'మెష్'ను ఏర్పాటు చేయడానికి కొంత సమయం పడుతుందని, నెల వ్యవధిలో కొన్ని కోర్సులతోనైనా శిక్షణ ప్రారంభించాలని ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈఓ కోగంటి సాంబశివరావును ముఖ్యమంత్రి ఆ సమావేశంలో ఆదేశించారు. అదే రోజు సింగపూర్ ప్రతినిధులతో ఏపీఎస్ఎస్‌డీసీ కార్యాలయంలో సమావేశమై తక్షణం ప్రారంభించేందుకు ఆరు కోర్సులనూ అధికారులు గుర్తించారు. 'సింగపూర్ సింక్రోస్కిల్స్' పేరుతో భాగస్వామ్య కంపెనీ ఏర్పాటుకు ఎస్ఎస్‌జీవీ, ఎస్‌జీఎస్‌పీ సంస్థలు ప్రతిపాదించాయి.

10 ప్రధాన విభాగాలు..!

తొలి దశలో లక్ష చ.అడుగుల్లో 'మెష్' ఏర్పాటవుతుంది. తర్వాత దీన్ని ఐదు లక్షల చ.అడుగులకు విస్తరించాలన్నది ప్రతిపాదన. ఏటా పది వేల మందికి శిక్షణనిచ్చేలా తీర్చిదిద్దనున్నారు. రూ.50 కోట్లు వ్యయమవుతుందని ప్రాథమిక అంచనా. దీనిలో పది ప్రధాన విభాగాలు ఏర్పాటుచేస్తారు. వాటిని 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'గా వ్యవహరిస్తారు. బ్యూటీ అండ్ వెల్‌నెస్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, రీటెయిల్, టెక్స్‌టైల్, ఐటీ అండ్ ఐటీఈఎస్, ఆతిథ్యం-పర్యాటకం, వ్యవసాయం-అనుబంధ రంగాలు, రవాణా(లాజిస్టిక్స్), బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఆహారశుద్ధి రంగాలకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రతి ప్రధాన విభాగంలోను వేర్వేరు కోర్సులుంటాయి. మెష్‌లో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ), ఏపీఎస్ఎస్‌డీసీల పాత్ర ఎంతనే విషయంలో స్పష్టత రావలసి ఉంది. రాజధానికి భూములిచ్చిన రైతుల కుటుంబాల్లోని యువతతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఏ ప్రాంతంవారికైనా ఇక్కడ శిక్షణనిస్తారు.

ప్రాథమికంగా ఏపీఎస్ఎస్‌డీసీ సహకారం

అద్దె భవనంలో నెలలో నైపుణ్య శిక్షణ ప్రారంభించనున్నారు. గుర్తించిన కోర్సులకు సంబంధించి ఏ సింగపూర్ సంస్థతో భాగస్వామ్యం ఉండాలో కూడా నిర్ణయించారు. లారీ క్రేన్ మెటీరియల్ హ్యాండ్లింగ్, ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్, వధువుల ఫ్యాషన్- ఫొటోగ్రాఫిక్ మేకప్ ఆర్టిస్టులు, టెక్స్‌టైల్ ఫ్యాషన్ డిజైనర్, చెఫ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- మెషీన్ లెర్నింగ్ కోర్సుల్లో మొదట శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి ఆర్థిక సహకారాన్ని ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి అందిస్తామని కోగంటి సాంబశివరావు తెలిపారు. డిగ్రీ, పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సింగపూర్ విశ్వవిద్యాలయాల్లో ఫినిషింగ్ కోర్సులుంటాయని, అదే తరహాలో 'మెష్'లో ఎనాబుల్ కార్యక్రమం ప్రవేశపెడతామని వివరించారు. కోర్సు అయ్యాక ఉద్యోగాలకు ఎలా దరఖాస్తు చేయాలనే అంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసంపై రోజుకు రెండు గంటల చొప్పున మొత్తం వంద గంటల శిక్షణ ఉంటుందని అన్నారు.

గ్రహం అనుగ్రహం

12-6-2018 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
త్రయోదశి: ఉ. 5-47 తదుపరి చతుర్దశి
రా. 3-58 తదుపరి అమావాస్య
కృత్తిక నక్షత్రం: సా. 6-27 తదుపరి రోహిణి
అమృత ఘడియలు: సా. 4-08 నుంచి 5-40 వరకు
వర్జ్యం: ఉ. 6-51 నుంచి 8-23 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-05 నుంచి 10-54 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-29; సూర్యాస్తమయం: సా.6-30
మాస శివరాత్రి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	39.2	26.0
నెల్లూరు	38.0	24.0
గుంటూరు	37.1	27.5
ఒంగోలు	37.0	29.1
కడప	37.0	28.0
శ్రీకాకుళం	37.0	26.0
విశాఖపట్నం	36.6	26.4
విజయవాడ	34.6	29.0
నరసాపురం	34.5	28.7
కర్నూలు	34.5	25.2
అనంతపురం	34.3	26.1
రాజమహేంద్రవరం	34.0	27.0
తాడేపల్లిగూడెం	32.0	27.5
హైదరాబాద్	31.8	23.6

VISION IAS
ప్రత్యేకించి ఢిల్లీ ఫాకల్టీతో
సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ & ఇంటర్వ్యూ 2019
Admissions Open
Limited Seats
Anthropology by Mrs. Sosin
టీఎస్‌పీఎస్‌సీ/ఏపీపీఎస్‌సీ
గ్రూప్ I, II
Admissions Open Limited Seats
అశోక్‌నగర్, హైదరాబాద్.
9000104133, 9515487979

Civils/Groups శిక్షణలో అత్యుత్తమ శిక్షణ సంస్థగా గుర్తింపు పొందిన రంగరాయ ఆధ్వర్యంలో
EXCELLENT PRE-TRAINING for
INTER + IAS, IPS, IFS... DEGREE + IAS, IPS, IFS...
CIVILS/GROUP - I&II, Prelims & Mains
అడ్మిషన్ల కొరకు సంప్రదించండి
హైదరాబాద్ | అమరావతి | రాజమండ్రి
9676413716 | 9492755270 | 8096951705
సపరేట్ హాస్టల్ & ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కలదు
KALYANI ADS
UBR's RANGARAYA IAS ACADEMY

సిఫార్సుల్ని పునఃసమీక్షించాలనడం మహా పాపమేమీ కాదు

• కేంద్రమంత్రి రవిశంకర్‌ప్రసాద్ వ్యాఖ్య

దిల్లీ: న్యాయమూర్తుల నియామకం కోసం సుప్రీంకోర్టు కొలీజియం పంపిన సిఫార్సుల్లో కొన్నింటిని పునఃసమీక్షించాలని కోరడం ద్వారా కార్యనిర్వాహక వ్యవస్థ 'మహా పాపాని'కేమీ ఒడిగట్టడం లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాల కల్పనలో పురోగతిని రిమోట్ సెన్సింగ్ సాంకేతికతతో సమీక్షించడానికి ఉద్దేశించిన న్యాయ మంత్రిత్వశాఖ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లను సోమవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. పునఃసమీక్షను కోరుతూ కొలీజియం సిఫార్సుల్ని సుప్రీంకోర్టుకు పంపించడానికి ప్రభుత్వానికి హక్కు ఉందన్నారు. అంతమాత్రాన తామేదో మహా పాపానికి ఒడిగట్టినట్లు చెప్పడం సరికాదన్నారు. 'మాకు రాజ్యాంగపరమైన పాత్ర ఉంది. మా అభిప్రాయాలను గౌరవప్రదంగా, సౌమ్యంగా చెప్పడాన్ని మేం కొనసాగించాలి. ఎలాగూ కొలీజియమే తుది నిర్ణయం తీసుకుంటుంది' అని చెప్పారు. న్యాయ మంత్రిత్వ శాఖ అంటే కొలీజియం సిఫార్సులను ఒక చోట నుంచి ఒక చోటకు చేర్చడానికి పరిమితమయ్యే పోస్టాఫీసు కాదనీ, సున్నితంగానైనా ఈ విషయాన్ని తాను చెప్పదలచుకున్నాననీ స్పష్టంచేశారు.

రికార్డుస్థాయిలో నియామకాలు: న్యాయ నియామకాల్లో కార్యనిర్వాహక వ్యవస్థకి పైచేయి కల్పించే జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)ని సుప్రీంకోర్టు కొట్టివేస్తే ప్రభుత్వం ఆ తీర్పును గౌరవించిందని రవిశంకర్ గుర్తుచేశారు. ఎన్‌జేఏసీపై జరిగిన సమరంలో 2014, 2015 సంవత్సరాలు గడిచిపోయి, నియామకాలు నిలిచిపోయాయన్నారు. 1989 నుంచి ఏటా సగటున 79-82 మంది న్యాయమూర్తుల్ని నియమిస్తుంటే 2016లో 126 మందిని నియమించామనీ, ఈ ఏడాది ఆ రికార్డునూ తిరగరాస్తామనీ చెప్పారు. దిగువస్థాయి న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకం కోసం యూపీఎస్సీ ద్వారా జాతీయ స్థాయి పరీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందనీ, దానివల్ల ప్రతిభావంతులైన యువ న్యాయవాదులు వ్యవస్థలో భాగం పంచుకోగలుగుతారనీ చెప్పారు.

కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా వివేక్‌యాదవ్

ఈనాడు, అమరావతి: కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా వివేక్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పర్యావరణం, అడవులు, సైన్స్, సాంకేతికశాఖ ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము ఉత్తర్వులిచ్చారు.

B.Sc. AGRICULTURE
Ag. B.Sc in I.C.A.R Recognised Colleges in MAHARASTRA with low packages 7.5 lakhs to 14 lakhs
MCAER ONLINE APPLICATION STARTS
www.mcaer.org
9676063967, 9399992802

TOP MEDICAL EDUCATION CONSULTANTS IN A.P/TS
MBBS
ABROAD & INDIA ONLY (GUIDANCE)
APEX CONSULTANTS
208, Arunodaya Apts., St,. No.15, H.Nagar, Hyd.29.
9542895450, 9603487805
9391347248, 9640872456

ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ ప్రయివేటు నిపుణులకు అవకాశం

కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్

దిల్లీ: ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ ప్రయివేటు రంగ నిపుణులకు అవకాశం కల్పిస్తామని కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ చెప్పారు. ఎకాయెకి ప్రవేశాల పథకం కింద ప్రస్తుతం ప్రయివేటు రంగ నిపుణులను కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శులుగా నియమిస్తుండగా, ఆ విధానాన్ని ప్రభుత్వ రంగ విద్యాసంస్థలకూ వర్తింపజేస్తామని తెలిపారు. నాణ్యత పెంపుదల, పారదర్శకత, పనుల్లో వేగవంతం కోసమే నూతన విధానాన్ని తీసుకొచ్చామని, దీన్ని రాజకీయం చేయకూడదని అన్నారు. సోమవారం ఇక్కడ విద్యావ్యవస్థలు- పరిశ్రమల అనుసంధానంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యారంగం- పరిశ్రమల మధ్య అనుసంధానం మరింతగా పెరిగేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి నూతన పాఠ్యాంశాలను అమలు చేస్తామని తెలిపారు. కొద్ది రోజుల్లోనే పాలిటెక్నిక్ కోర్సుల కొత్త పాఠ్యాంశాలను విడుదల చేస్తామని అన్నారు. ప్రయివేటు, ప్రభుత్వ రంగ విద్యా సంస్థల మధ్య తేడా క్రమేణా తొలగిపోతుందని అన్నారు. ఈ సంస్థల మధ్య భేదభావం తొలగింపుపై తాను రాష్ట్రపతి, ప్రధానమంత్రితో మాట్లాడానని చెప్పారు. దీనిపై ఉన్నత స్థాయిలో పరిశీలన జరుగుతోందని అన్నారు. దీనిని ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా గుర్తించిందని తెలిపారు.

మహిళా స్వయం సహాయక బృందాలే ప్రగతికి అసలైన వారధులు

మంత్రి నరేంద్రసింగ్ తోమర్

దిల్లీ: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక బృందాలే(ఎస్‌హెచ్‌జీలు)అభివృద్ధికి అసలు సిసలైన వారధులని కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ ప్రశంసించారు. దేశవ్యాప్తంగా అద్భుతమైన పనితీరును కనబరచిన స్వయం సహాయ బృందాలకు గ్రామీణాభివృద్ధి మంత్రి అయిన తోమర్ జాతీయ అవార్డులను అందచేశారు. 'దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం' కింద 34 మహిళా బృందాలకు ఆయన అవార్డులు ప్రదానం చేశారు. స్వయం సహాయక బృందాల మహిళలంతా కూడా ప్రగతికి వారథులు. ఈ ఆడపడుచులంతా కూడా వారివారి కుటుంబాలు, ఇళ్లను చక్కదిద్దుకోవడమే కాదు..సంబంధిత గ్రామాల ఆర్థిక ప్రగతిసాధనలో కూడా కీలక పాత్ర పోషించారని మంత్రి తోమర్ శ్లాఘించారు.

21న విశాఖలో రాష్ట్రస్థాయి యోగా దినోత్సవం

ముఖ్య అతిథిగా హాజరవనున్న సీఎం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న రాష్ట్ర స్థాయి వేడుకలను విశాఖ వేదికగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సోమవారం వెల్లడించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. ఆరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు 3వేల మంది యోగా సాధకులతో బీచ్‌రోడ్డులో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని, విద్యాశాఖ అధికారులు వివిధ పాఠశాలల నుంచి పిల్లలను తీసుకురావాలన్నారు.

ఈనాడు

సౌహార్దానికి... ఆర్థిక ప్రగతికి!

చైనా సాగరతీర నగరం షింగ్‌డావ్ వేదికగా రెండు రోజుల షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) వార్షిక శిఖరాగ్ర సదస్సు- ఉగ్రవాదాన్ని, తీవ్రవాదాన్ని, విభజనవాదాన్ని సమూలంగా ప్రపంచంలో త్రివిధ దుష్టశక్తులుగా అభివర్ణించింది. అక్కడి నుంచి ఒకడుగు ముందుకువేసి, వచ్చే మూడేళ్లలో విశేష ప్రభావాన్వితమయ్యేలా- ఉగ్రవాద ముఠాలన్నింటికీ వ్యతిరేకంగా అంతర్జాతీయ ఐక్య సంఘటన (ఫ్రంట్) నెలకొనాలని, అది ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో కొనసాగాలని ముక్తకంఠంతో తీర్మానించింది. చైనా, రష్యా, భారత్ సహా 'అష్టదేశాల కూటమి' విస్తృత సంప్రతింపుల దరిమిలా వండి వార్చిన 17 పుటల సంయుక్త తీర్మాన పాఠంలోని ప్రధానాంశమిది. ఉగ్రవాద భావజాల వ్యాప్తికి కారణభూతమవుతున్న స్థితిగతుల్ని చక్కదిద్దుతామంటున్న తీర్మానానికి సై అన్న తక్కిన దేశాల్లో పాకిస్థాన్ సైతం జతపడటం- షాంఘై తీర్మాన కార్యాచరణ ఏ తీరుగా ఉండనుందోనన్న శంకలను సహజంగానే రేకెత్తిస్తోంది! ప్రతిష్ఠాత్మక సదస్సులో తొలిసారి పూర్తిస్థాయి సభ్యత్వహోదాలో పాలుపంచుకొన్న ప్రధాని నరేంద్ర మోదీ భారతవాణిని అనుపమంగా వినిపించారు. స్వీయ అజెండాకు అనుగుణంగా 'ఒన్ బెల్ట్-ఒన్ రోడ్' ప్రాజెక్టుకు పాక్‌తోపాటు రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్‌ల మద్దతు రాబట్టడంలో కృతకృత్యమైన చైనాకు భారత్ ఏకైక ధిక్కార స్వరం మింగుడుపడేది కాదు. అన్ని దేశాలూ పరస్పరం సార్వభౌమాధికారాన్ని ప్రాదేశిక సమగ్రతను కీలక ప్రాధాన్యాంశాలను ఆందోళనల్ని గుర్తించి గౌరవించుకోవాలంటూ ఏడాది క్రితం చైనా అధ్యక్షులు షీ జిన్‌పింగ్ పంచశీల స్ఫూర్తిని వల్లెవేయడం తెలిసిందే. ఇప్పుడు షాంఘై సహకార సంస్థ వార్షిక శిఖరాగ్రంలో తక్కిన సభ్య దేశాలు ఉమ్మడిగా బలపరిచినదాన్ని తోసిపుచ్చడం ద్వారా మోదీ అదే అస్త్రాన్ని లాఘవంగా ప్రయోగించారు. పొరుగుదేశాల సార్వభౌమత్వాన్ని ప్రాదేశిక సమగ్రతను గౌరవించే సుస్థిర అనుసంధాన ప్రాజెక్టులనే తాము స్వాగతిస్తామనడం ద్వారా- చైనా 'మానస పుత్రిక' భిన్నమైనదని ఆయన తెగేసి చెప్పడం, దౌత్యప్రజ్ఞకు రుజువు.

చైనా, రష్యా, కిర్గిజిస్థాన్, కజకిస్థాన్, తజికిస్థాన్ వ్యవస్థాపక సభ్యదేశాలుగా 1996లో రూపుదిద్దుకొన్న 'షాంఘై ఫైవ్' తరవాత అయిదేళ్లకు షాంఘై సహకార సంస్థ పేరిట నెలకొన్న కూటమికి మాతృక. 2001లో ఉజ్బెకిస్థాన్ చేరిక దరిమిలా మరో నాలుగేళ్లకు అందులో ఇండియా, పాకిస్థాన్, ఇరాన్, మంగోలియాలకు పరిశీలక హోదా లభించింది. భారత్, పాక్‌లకు క్రియాశీల సభ్యత్వం ప్రతిపాదించేదే లేదని గతంలో చైనా, రష్యా పదేపదే స్పష్టీకరించినా- అసంభవమనుకున్నది గత ఏడాది నిజమై సభ్యత్వ కూర్పులో గుణాత్మక మార్పును కళ్లకు కట్టింది. భారత్‌కు ఎస్‌సీఓలో చోటుపెట్టేందుకు సమ్మతించడం ద్వారా వ్యూహాత్మకంగా రష్యా వెన్నుతట్టగా చైనా పంతం నెరవేరేదే కాదని తాజా సదస్సు ప్రస్ఫుటీకరిస్తోంది. ఆగ్నేయాసియా, మధ్యాసియా, గల్ఫ్ ప్రాంతం, ఆఫ్రికా, ఐరోపాలను భూ, సముద్ర మార్గాల్లో అనుసంధానించే బృహత్ పథకానికి చైనా అయిదేళ్లుగా ప్రణాళికలు అల్లుతోంది. యాభై లక్షల కోట్ల రూపాయలకు పైగా భారీ వ్యయమయ్యే మౌలిక సదుపాయాల నిర్మాణం నిమిత్తం ఆయా దేశాలకు వడ్డీకి రుణాలిచ్చి, దేశీయ ఉక్కు ఉత్పాదనలకు ఎనలేని గిరాకీ పెంచుకోవాలని బీజింగ్ తహతహలాడుతోంది. అందులో భాగంగా పాక్ గ్వాదర్ నౌకాశ్రయం నుంచి అరేబియా సముద్రం మీదుగా ఐరోపా, గల్ఫ్, ఆఫ్రికాలకు ఎగుమతులు ఇబ్బడిముబ్బడి అవుతాయని తద్వారా తనకిక తిరుగు ఉండదని చైనా తలపోస్తోంది. పౌరుల భద్రత (ఎస్), ఆర్థికాభివృద్ధి (ఈ), ప్రాంతీయ అనుసంధానం (సీ), ఐక్యత (యూ), సార్వభౌమాధికారాన్ని ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం (ఆర్), పర్యావరణ పరిరక్షణ (ఈ)లకు పెద్దపీట వేయాలంటూ ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'సెక్యూర్' సూత్రానికి ఏపాటి మన్నన దక్కుతుందో చూడాలి!

వుహాన్ అనధికారిక భేటీ దరిమిలా ఆరువారాలకే చోటుచేసుకున్న షింగ్‌డావ్ శిఖరాగ్రాన్ని ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు ఉపయోగించుకోవడంలో భారత్ చాలావరకు కృతకృత్యమైందనే చెప్పాలి. డోక్లాం తరహా వివాదాలు తలెత్తకుండా ఇరు దేశాల సైన్యాలకు 'వ్యూహాత్మక మార్గదర్శనం' చేయాలన్న నిర్ణయాన్ని వెన్నంటి- ఔషధాలు సేద్య ఉత్పత్తులకు సంబంధించి కుదిరిన అవగాహన చైనాతో భారత్ వాణిజ్యలోటును తెగ్గోయనుందంటున్నారు. ఇంధన, సహజ వనరుల రంగాల్లో ఎస్‌సీఓ సహజ బలిమి భారత్‌కు ప్రయోజనదాయకం కానుందని రెండేళ్ల క్రితం తాష్కెంట్ సదస్సు సందర్భంగా వ్యాఖ్యానించిన మోదీ- కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, మంగోలియా అధ్యక్షులతో ద్వైపాక్షిక చర్చల ద్వారా సానుకూల వాతావరణ సృష్టికి యత్నించారు. షవ్‌కత్ మిర్జియోయెవ్‌తో భేటీ రూపేణా ఉజ్బెకిస్థాన్‌తో ఇండియా సంబంధాల మెరుగుదల ప్రక్రియ ప్రారంభమైనట్లయింది. ఈ వరసలో పాక్ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్‌తో మోదీ కరచాలనం ఆసక్తి రేకెత్తించిన మాట వాస్తవం. 'ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వం' అవాంఛనీయమంటున్న చైనా, రష్యా- భారత్, పాకిస్థాన్ నడుమ విభేదాల పరిహరణకు షాంఘై సహకార సంస్థ వేదిక కాగలదనటం అతిశయోక్తే. తెరవెనక ఉగ్ర అజెండాను కొనసాగిస్తున్న పైకి సౌహార్దం ఒలకబోసినంతనే సంఘర్షణలు సమసిపోయి అమాంతం సామరస్యం నెలకొనగలదన్నది వట్టి భ్రమ. భౌగోళిక అనుసంధానంతోపాటు సాంస్కృతిక, వాణిజ్య సంబంధ బాంధవ్యాలూ తేటపడాలి. సుమారు వందకోట్ల యువతకు, 40 శాతం ప్రపంచ జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తూ పసిఫిక్ నుంచి ఐరోపా వరకు, ఆర్కిటిక్ నుంచి హిందూ మహాసముద్రం దాకా పరిధి విస్తరించిన ఎస్‌సీఓ కార్యాచరణా దీటుగా పదును తేలాలి. సభ్యదేశాల మధ్య సుహృద్భావం వెల్లివిరిసినప్పుడే, విస్తృత ఆర్థికాభివృద్ధి సాకారమయ్యేది!

సంజయ్ పులిపాక

వివేకం వికసించుగాక...

నేడు ట్రంప్-కిమ్ శిఖరాగ్ర సమావేశం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌లు నేడు సింగపూర్‌లో సమావేశం కానున్నారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో ఇద్దరు నాయకులు వేసుకునే దుస్తులు మొదలుకొని, సమావేశం పర్యవసానాలు ఎలా ఉంటాయనే దాని వరకు అంతర్జాతీయ సమాచార సాధనాలు సమీక్షలు, శల్య పరీక్షల పరంపరను వెలువరించాయి. ఇటీవలివరకు ట్రంప్, కిమ్‌లు ఒకరిపై ఒకరు దూషణభాషణలకు లంకించుకునేవారు. ఒకరి మీద ఒకరు అణ్వస్త్రాలు కురిపిస్తామని బెదిరించుకునేవారు. అంతలోనే వాతావరణం చల్లబడి, ఇద్దరూ చర్చలకు కూర్చుంటారని ఎవరూ ఊహించలేదు. అందుకే ప్రపంచమంతా సింగపూర్ భేటీ వైపు ఆసక్తిగా చూస్తోంది. ఈ భేటీ సాకారమయ్యే ముందు, కథ అనేక మలుపులు తిరిగింది. ఉత్తర కొరియా అధినేత కిమ్‌తో సమావేశం కానున్నానని ట్రంప్ మే 10న ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరచారు. తరవాత మే 24న కిమ్‌తో భేటీని రద్దు చేసుకుంటున్నానని ప్రకటించి ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతపరచారు. 'మీ అణ్వస్త్ర పాటవం గురించి అదేపనిగా గొప్పలు చెప్పుకొంటున్నారు. కానీ, మావద్ద అత్యంత శక్తిమంతమైన, అపారమైన అణ్వస్త్ర బలం ఉందని మరచిపోకండి. వాటిని మీ మీద ప్రయోగించాల్సిన అవసరం రాకూడదని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని కిమ్‌ను ఉద్దేశించి ట్రంప్ హెచ్చరించారు. అటు తరవాత వారంరోజుల పాటు ముమ్మరంగా మంతనాలు జరిగాక, ట్రంప్-కిమ్ సింగపూర్ సమావేశం అనుకున్నట్లే జరుగుతుందని ప్రకటన వెలువడింది. ట్రంప్ ఎప్పుడు ఏ పని చేస్తారో ఎవరికీ అంతు చిక్కదని మరొక్కసారి నిరూపితమైంది.

చితికిపోయిన ఉత్తర కొరియా

అమెరికా, సోవియెట్ కూటముల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగిన కాలంలో రష్యా, చైనాల అండతో కిమ్ ఇల్ సంగ్ ఉత్తర కొరియాను ఉక్కు పిడికిలితో పాలించారు. కానీ, సోవియెట్ యూనియన్ పతనంతో అక్కడి నుంచి సంగ్ ప్రభుత్వానికి ఆర్థిక సహాయం ఆగిపోయింది. అసలే అధ్వాన్న ఆర్థిక స్థితితో సతమతమవుతున్న ఉత్తర కొరియాపై మూలిగే నక్క మీద తాటి పండు చందంగా 1994-98 మధ్య తీవ్రమైన కరవు వచ్చిపడింది. అంత ఆర్థిక సంక్షోభంలోనూ ఆ దేశంలో రాజకీయ నాయకత్వం మారలేదు. సోవియెట్ పతనం తరవాత ప్రపంచంలో పలు కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోయినా, ఉత్తర కొరియాలో మాత్రం సంగ్ నిరంకుశ ఎత్తుగడలతో తన ఆధిపత్యం నిలబెట్టుకున్నారు. సంగ్ తరవాత ఆయన కుమారుడు కింగ్ జోంగ్ ఇల్ చేతికి, ఆపై ఆయన కుమారుడు కిమ్ జోంగ్ ఉన్ (ప్రస్తుత అధినాయకుడు) చేతికి పాలనాధికారం సంక్రమించింది. కిమ్ కుటుంబ పాలనలో ఉత్తర కొరియా అంతకంతకూ చితికిపోయింది.

మరోవైపు దక్షిణ కొరియా మార్కెట్ ఆర్థిక వ్యవస్థను చేపట్టి అద్భుత ప్రగతి సాధించింది. సామ్‌సంగ్, హ్యుందాయ్, ఎల్‌జీ వంటి బహుళజాతి సంస్థలకు అది పురిటి గడ్డ. దక్షిణ కొరియా సాధించిన ప్రగతి తమ నాయకత్వానికి వెక్కిరింతగా నిలుస్తోందని, దీన్ని చూసి ప్రజలు విదేశీ శక్తుల మద్దతుతో తమపై తిరగబడతారేమోనని ఉత్తర కొరియా పాలకులు భయపడసాగారు. ఈ ప్రమాదాన్ని నిలువరించడానికి వారు అణ్వస్త్ర తయారీని చేపట్టారు. తమ చేతిలో అణ్వస్త్రాలుంటే ఇతర దేశాలు జోక్యం చేసుకోవడానికి వెనకంజ వేస్తాయని వారి అంచనా. 2006లో ఉత్తర కొరియా జరిపిన అణ్వస్త్ర పరీక్ష దక్షిణ కొరియా, జపాన్‌లకు పీడకలగా మారింది. జపాన్ గగన తలం మీదుగా ఉత్తర కొరియా జరిపే క్షిపణి పరీక్షలను టోక్యో కవ్వింపు చర్యలుగా పరిగణిస్తోంది. దక్షిణ కొరియాలో అమెరికన్ సేనలతోపాటు అనేక వ్యాపార సంస్థలూ ఉండటంతో వాషింగ్టన్ కూడా ఉత్తర కొరియా చర్యలను తీవ్రంగా పరిగణిస్తోంది. అందుకే జపాన్, దక్షిణ కొరియాలకు తన క్షిపణులతో రక్షణ ఛత్రం కల్పించింది. ఇంతలో ఉత్తర కొరియా ఆర్థిక స్థితి దారుణంగా తయారుకావడంతో అది ఎప్పుడు కుప్పకూలుతుందోనని చైనా, రష్యాలకు ఆందోళన పట్టుకుంది. దీంతో ఉత్తర కొరియాతో అణ్వస్త్రాలను త్యజింపజేయడానికి 2003లో రష్యా, చైనా, అమెరికా, జపాన్, ఉభయ కొరియాలు కలిసి చర్చలు జరిపాయి. కానీ, సయోధ్య కుదరాలంటే మొదట అమెరికా సేనలు దక్షిణ కొరియా నుంచి వెళ్లిపోవాలని చైనా, రష్యాలు షరతు పెట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో అసలు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర కొరియా అధినేత కిమ్‌తో మాట్లాడటానికి అంగీకరించడమే గొప్ప ముందడుగని ఒప్పుకోకతప్పదు. దీనికి బదులుగా ఉత్తర కొరియా అణ్వస్త్ర పరీక్షా స్థలాన్ని మూసివేసింది. అయినా రెండు దేశాల్లో పరస్పరం అనుమానాలు కొనసాగుతున్నాయి. 2003లో లిబియా అధినేత కర్నల్ గఢాఫీ అమెరికా మాటలు విని అణ్వస్త్రాలు, రసాయన ఆయుధాల తయారీకి స్వస్తి చెప్పారు. అప్పట్లో లిబియా అణు కార్యక్రమానికి పాక్ భౌతిక శాస్త్రవేత్త ఏక్యూ ఖాన్ చేయూత ఇచ్చినట్లు వెల్లడైంది. మొత్తం మీద అణు కార్యక్రమాన్ని విరమించినందుకు బదులుగా పాశ్చాత్య దేశాల నుంచి ఆర్థిక సహాయం లభించి, తన నాయకత్వ స్థానం పదిలంగా ఉంటుందని లిబియా నేత గఢాఫీ ఆశపడ్డారు. కానీ, అమెరికా కూటమి ఆయన్ను నట్టేట ముంచింది. 2011లో లిబియా ప్రతిపక్షాలకు మద్దతుగా రంగంలోకి దిగి గఢాఫీ దారుణ వధకు తోడ్పడింది. తనకు కూడా అదే గతి పట్టకూడదని కిమ్ తన జాగ్రత్తలో తానుంటున్నారు. రేపటి చర్చల్లో కిమ్, అణ్వస్త్ర పరిత్యాగం తన ప్రభుత్వాన్ని కూలదోయడానికి దారితీయబోదనే హామీ ఇవ్వాల్సిందిగా ట్రంప్ వద్ద పట్టుపట్టే అవకాశం ఉంది. ఇక ట్రంప్, ఉత్తర కొరియా అణు కేంద్రాలపై అంతర్జాతీయ తనిఖీకి అంగీకరించాలని కిమ్‌ను కోరవచ్చు. ఉత్తర కొరియా క్రమక్రమంగా అణు నిరాయుధీకరణ జరపాలని యోచిస్తోంది. కానీ, ఈ పని వేగంగా సత్వరం జరగాలన్నది అమెరికా కోరిక. ఇందుకు ప్రతిగా ఉత్తర కొరియాపై ఆంక్షలు ఎత్తివేసి ఆర్థికాభివృద్ధి ప్యాకేజీ అందిస్తామని ట్రంప్ ప్రతిపాదించే అవకాశముంది. దక్షిణ కొరియా నుంచి అమెరికా తన సేనలను ఉపసంహరించాలని ఉత్తర కొరియా డిమాండ్ చేస్తున్నా, సింగపూర్ చర్చల్లో అందుకు అంగీకారం కుదరదనే చెప్పాలి. కిమ్ ప్రభుత్వం అణ్వస్త్ర పరిత్యాగానికి కట్టుబడి ఉన్నట్లు నిరూపించుకుని బాధ్యతగా వ్యవహరిస్తే అమెరికా సేనల విరమణ గురించి చర్చించడానికి సిద్ధపడతామని అమెరికన్ వర్గాలు చెప్పాయి. ఒకవేళ దక్షిణ కొరియా నుంచి అమెరికా తన సైనికులను ఉపసంహరింపజేసినా, వారిని పొరుగునే ఉన్న జపాన్‌కు తరలించవచ్చు. కొరియా ద్వీపకల్పానికి సమీపంలో కొత్త స్థావరాలు నిర్మించినా అడ్డుకునేవారు ఉండరు.

పొరుగు దేశాల ఉత్కంఠ

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

ప్రస్తుతం చైనా గట్టు మీద ఉండి ట్రంప్-కిమ్ చర్చలను జాగ్రత్తగా గమనిస్తోంది. ఉభయ కొరియాల విలీనం చైనాకు అభ్యంతరకరం కాదు. ఐక్య కొరియా పాశ్చాత్య ప్రజాస్వామ్య నమూనాను చేపట్టి ఉత్తరోత్రా తనకు పక్కలో బల్లెంలా తయారుకాకుండా చూసుకోవాలని మాత్రం అనుకొంటోంది. కిమ్ అణ్వస్త్రాలతోపాటు దూరశ్రేణి క్షిపణి తయారీనీ నిలిపేయాలని జపాన్ కోరుకొంటోంది. దీనికి ప్రతిగా ఉత్తర కొరియాకు ఆర్థిక సాయం చేయడానికి సై అంటోంది.

సంఘర్షణ పూర్వాపరాలు

1953నాటి సంధి ఒప్పంద దృశ్యం

ఇప్పుడైతే కొరియా ఉత్తర, దక్షిణాలుగా విడిపోయింది కానీ, అంతకుముందు సమైక్య దేశంగా ఉండేది. 1910లో కొరియాను ఆక్రమించిన జపాన్ రెండో ప్రపంచ యుద్ధం ముగిసేవరకూ ఆ దేశాన్ని తన ఏలుబడిలోనే అట్టిపెట్టుకుంది. జపాన్ ఆక్రమణ కాలంలో కొరియా జాతీయవాదులు రెండు వర్గాలుగా విడిపోయి జపానీయులపై పోరాడేవారు. ఒక వర్గం చైనా, రష్యాలలో శిక్షణ పొంది కొరియాలో కమ్యూనిస్టు పాలన నెలకొల్పడానికి పోరాడింది. పాశ్చాత్య దేశాల్లో శిక్షణ పొందిన రెండోవర్గం ఉదారవాద ప్రజాస్వామ్య పాలన కోసం ఉద్యమించేది. రెండో ప్రపంచ యుద్ధంతోపాటే కొరియాపై జపాన్ ఆధిపత్యం ముగిసింది. యుద్ధం తరవాత జర్మనీ తూర్పు, పశ్చిమ జర్మనీలుగా విడిపోగా, కొరియా ఉత్తర దక్షిణాలుగా వేరుపడింది. ఉత్తర కొరియా రష్యా పరిధిలోకి వెళ్లగా, దక్షిణ కొరియాకు అమెరికా అండగా నిలిచింది. ఉభయ కొరియాలను ఏకం చేద్దామని ఉత్తర కొరియా ప్రథమ నాయకుడు కిమ్ ఇల్ సంగ్ 1950లో దక్షిణ కొరియాపై దాడి ప్రారంభించారు. కిమ్ సేనలు ఆరంభంలో విజయాలు సాధించినా అమెరికా తిరుగుదాడితో అవి వెనకంజ వేయాల్సి వచ్చింది. అప్పుడు చైనా సైన్యం ఉత్తర కొరియాకు మద్దతుగా యుద్ధంలో జోక్యం చేసుకుంది. మూడేళ్లపాటు సాగిన ఈ యుద్ధంలో 627మంది భారతీయ సైనికులు వైద్య సేవలు అందించారు. చివరకు 1953 జులై 27న సంధి కుదిరి, రెండు కొరియాల మధ్య నిస్సైనికీకరణ మండలాన్ని ఏర్పరచడానికి ఒప్పందం కుదిరింది. అయినా ముందుజాగ్రత్తగా ఇప్పటికీ 25 వేలమంది అమెరికన్ సైనికులు దక్షిణ కొరియాకు రక్షగా నిలిచి ఉన్నారు.

ప్రపంచశాంతి కోసం...

సింగపూర్‌లో అమెరికా, ఉత్తర కొరియాలు ఏ ఒప్పందం కుదుర్చుకున్నా దాన్ని పటిష్ఠంగా అమలు చేయడానికి సంస్థాగత ఏర్పాట్లు చేయాలి. సింగపూర్ చర్చలు ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు రాజకీయంగా ప్రయోజనకరమే. తన తండ్రి, తాత చేయలేని పనిని తాను సాధించి చూపానని చెప్పుకొనే అవకాశం ఆయనకు లభిస్తుంది. చర్చలు సఫలమైతే ఉత్తర కొరియాపై అంతర్జాతీయ ఆంక్షలు తొలగి ప్రధాన స్రవంతిలోకి వచ్చి ఆర్థికంగా పురోగమించగలుగుతుంది. అది కిమ్‌కు ఘన విజయం కానుంది. ఇక డొనాల్డ్ ట్రంప్ విదేశాంగ విధానానికి సంబంధించి ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన ముఖ్యమైన హామీలను నిలబెట్టుకున్నానని అమెరికన్ ప్రజలకు చెప్పుకోగలుగుతారు. తన ఎన్నికల హామీల ప్రకారం విశాల పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం నుంచి, పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి ట్రంప్ తప్పుకొన్నారు. ఉత్తర కొరియాతో సంప్రతింపులు జరుపుతానన్న హామీని ఇప్పుడు నిలబెట్టుకొంటున్నారు. సింగపూర్ చర్చలు సఫలమైతే అది ట్రంప్ ఖాతాలో గణనీయ విజయం అవుతుంది. ఆయన చేతల మనిషి అని నిరూపణ అవుతుంది.

సింగపూర్ చర్చల కోసం తాను ముందస్తు కసరత్తు ఏమీ చేయలేదని ట్రంప్ చెప్పుకొన్నా, అది నిజం కాదని గమనించాలి. ప్రస్తుత అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపేయో ఇంతకుముందు గూఢచారి సంస్థ సీఐఏ అధిపతిగా పనిచేశారు. ఆ హోదాలో రహస్యంగా ఉత్తర కొరియా వెళ్ళి చర్చలకు రంగం సిద్ధం చేశారు. ట్రంప్ ఇటీవలి కాలంలో రెండుమూడుసార్లు జపాన్ ప్రధాని షింజో అబేతో సమావేశమై ఉత్తర కొరియాపై చర్చించి ఉన్నారు. ఇక కిమ్ జోంగ్ ఉన్ చరిత్రలో మొట్టమొదటిసారి నిస్సైనికీకరణ మండలాన్ని దాటి దక్షిణ కొరియాకు వెళ్లి చర్చలు జరిపిన తొలి నేతగా నిలిచారు. ఈ భేటీల్ని సింగపూర్ చర్చలకు సన్నాహాలని భావించాలి. మరి అవి సఫలమవుతాయా అనే సందేహం అందరి మదిలో మెదలుతోంది. మియన్మార్ దీర్ఘకాలం సైనిక నియంతృత్వంలో మగ్గి, అమెరికా ఆర్థిక ఆంక్షలకు గురైనప్పుడు ఒక అమెరికా అధ్యక్షుడు ఆ దేశాన్ని సందర్శిస్తారని ఎవరూ అనుకోలేదు. కానీ, బరాక్ ఒబామా 2012లో మియన్మార్‌ను సందర్శించి చరిత్ర సృష్టించారు. కాబట్టి దౌత్య సంబంధాల్లో ఎప్పుడు ఏమైనా జరగవచ్చు. ట్రంప్-కిమ్ చర్చలు రెండు దేశాల మధ్య సంబంధాలు గణనీయంగా మెరుగుపడటానికి దారితీసే అవకాశాలు పుష్కలంగానే ఉన్నాయి.

(రచయిత– దిల్లీలోని 'ఐసీఆర్ఐఈఆర్'లో సీనియర్ సలహాదారు)

పేదరికమే శాపం

ప్రపంచ బాలల జనాభాలో పదిహేడు శాతం బాలకార్మికులేనని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదిక వెల్లడిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 26.5 కోట్ల మంది బాల కార్మికులున్నారని అది స్పష్టీకరించింది. బాలలతో పనిచేయించడాన్ని యునిసెఫ్ వంటి పలు అంతర్జాతీయ సంస్థలు దోపిడీగానే పరిగణిస్తున్నాయి. పరిశ్రమలు, గనులు, తవ్వకాలు, వ్యవసాయం, తల్లిదండ్రుల వ్యాపారాల్లో పాలుపంచుకోవడం వంటి చిన్న పనుల్లో బాలలు నలిగిపోతున్నారు. పర్యాటకులకు గైడ్‌లుగా, దుకాణాలు, హోటళ్లు, బూట్లు పాలిష్ చేయడం, సరకులు మోయడం వంటి పనుల్లో మగ్గిపోతున్నారు. వారికి చెల్లించే వేతనాలూ నామమాత్రంగా ఉంటున్నాయి. పేదరికం ఉన్నంతవరకు బాల కార్మికులు మగ్గిపోతూనే ఉంటారనేది నిష్ఠుర సత్యం. అంతర్జాతీయంగా బాలకార్మికుల సంఖ్య అంతకంతకూ విస్తరించడానికి పేదరికమే ప్రధాన కారణం.

నాగరికతకు మచ్చ

అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంటి పనులు, పాఠశాల సంబంధ పనులు మినహా బాలలను ఇతరేతర పనుల్లోకి తీసుకోవడానికి అనుమతి లేదు. దేశాన్ని బట్టి, పనిని బట్టి కనీస వయసు మారుతోంది. 1973నాటి ఐఎల్‌ఓ ఒప్పందం మేరకు కనీస వయోపరిమితిని 14-16 సంవత్సరాలుగా అనేక దేశాలు నిర్ధారించాయి. అమెరికాలోని బాలకార్మిక చట్టాల ప్రకారం కనీస వయసు 16 ఏళ్లు. నేటికీ కొన్ని పేద దేశాలు బాల కార్మిక వ్యవస్థను అనుమతించడమో, ఉపేక్షించడమో చేస్తున్నాయి. అమెరికా సహా దాదాపు అన్ని ప్రపంచ దేశాలూ 1990వ దశకంలో బాలల హక్కుల ఒప్పందం(సీఆర్‌సీ)పై సంతకం చేశాయి. అయితే, బాల కార్మిక వ్యవస్థ అక్రమమని అందులో ఎక్కడా ప్రతిపాదించకపోవడం అతిపెద్ద లోపం. పేద కుటుంబాలు తమ మనుగడ కోసం బాలల కష్టంపై ఆధారపడాల్సి రావడం విషాదం. కుటుంబాలకు స్వల్పకాల ఆదాయంతో పాటు, వాటి దీర్ఘకాల ప్రయోజనాలకు సంబంధించిన సవాళ్లను పరిష్కరిస్తేనే బాలకార్మిక వ్యవస్థను నిరోధించగలం. బాలల ప్రయోజనాలను కాపాడలేకపోతే మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లే!

అభివృద్ధి చెందిన దేశాల్లో బాల కార్మికుల సంఖ్య క్రమేణా తగ్గుముఖం పట్టింది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అంతర్జాతీయ కార్యక్రమాన్ని (ఐపీఈసీ) 1992లో ఐఎల్‌ఓ ప్రారంభించింది. బాల కార్మిక వ్యవస్థపై పోరాటంలో దేశాల సామర్థ్యాన్ని పటిష్ఠపరచి, సమస్య పరిష్కారానికి ఐఎల్‌ఓ కృషి సాగిస్తోంది. ప్రస్తుతం 88 దేశాల్లో ఐపీఈసీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సాంకేతిక సహకార ప్రాజెక్టులపై 2008లో దీని వార్షిక వ్యయం 6.1 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఐపీఈసీ పరిధి, భాగస్వాముల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఉద్యోగ, కార్మిక సంఘాలు, పలు అంతర్జాతీయ, ప్రభుత్వ ప్రైవేటు, వ్యాపార, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు, ప్రసార మాధ్యమాలు, విశ్వవిద్యాలయాలు, మత సంస్థలు ఇందులో చేరుతున్నాయి. ఐపీఈసీ ద్వారా బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడమే ఐఎల్‌ఓ ప్రధాన అజెండాగా మార్చుకుంది.

ప్రపంచ బాల కార్మిక నిరోధక దినం నేడు

దేశంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అనేక చట్టాలు తీసుకొచ్చారు. వాటి అమలు వేగం మరింత పెరగాలి. పాలకుల అలసత్వం కారణంగానే భారత్‌లో పరిస్థితి దారుణంగా ఉందన్న చేదు నిజాన్ని అనేక అధ్యయనాలు చాటుతున్నాయి. ప్రైవేట్ రంగంలో బాలకార్మికుల శ్రమదోపిడి వార్షిక విలువ రూ.25 వేలకోట్ల మేర ఉందని వివిధ స్వచ్ఛంద సంస్థలు తమ అధ్యయనాల్లో వెల్లడించాయి. నిర్బంధ ఉచితవిద్య పేరిట చట్టాలు, పిల్లలతో పనులు చేయించడాన్ని నిషేధించే శాసనాలు వచ్చినా ప్రయోజనం పెద్దగా లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. బడి ఈడు పిల్లలతో పనులు చేయిస్తే కనీసం మూడేళ్ల కఠిన కారాగారశిక్ష తప్పదని కేంద్రం రెండేళ్ల క్రితమే గట్టిగా హెచ్చరించింది. 18 ఏళ్లలోపువారిని పనుల్లో పెట్టరాదని నిర్దేశించింది. కానీ, ప్రమాదకర పనుల జాబితాను 83 నుంచి 31కి తగ్గించడం ఆందోళన కలిగిస్తోంది. బాలకార్మిక సమస్య తీవ్రతను గుర్తించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకొంటున్నాయి. దేశంలోని అని జిల్లాల్లో బాలల సంక్షేమ సమితులు (సీడబ్ల్యూసీ) పనిచేస్తున్నాయి. పోషణ, రక్షణ అవసరమైన బాలలకు తగిన న్యాయం చేయడం వీటి ప్రధాన విధి. తక్షణ రక్షణ కోసం ప్రభుత్వ, ప్రభుత్వేతర గృహాలకు (బాలల హోం) పంపించాలి. కార్మిక శాఖతో మాట్లాడి అపరాధ రుసుము యజమాని చెల్లించేలా చూడాలి. వెట్టిచాకిరి కేసుల్లో బాధిత బాలలకు 'రక్షణ పత్రం' అందేలా చేయాలి.

సమగ్ర ప్రణాళిక అవసరం

హోమ్‌లలో ఉన్న బాలల వ్యక్తిగత రక్షణ, ప్రణాళికను తయారు చేసి అమలు చేయాలి. కుటుంబ వివరాలు లభించకపోతే, జిల్లా బాలల సంరక్షణ సమితి (డీసీపీయూ) ద్వారా స్పాన్సర్‌షిప్, ఫోస్టర్ కేర్ అవకాశాలను పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవాలి. ఇతర అవకాశాలు ఏమీ లేనప్పుడు మాత్రమే బాధితులను వసతి గృహాలకు పంపించాలి. స్థానిక సంస్థల సహకారంతో కనీసం రెండేళ్లపాటు బాలల పునరేకీకరణను, ప్రతి మూడు నెలలకోసారి పురోగతిని పరిశీలించాలి. న్యాయ విభాగం నిబంధనల ప్రకారం అన్ని పోలీసు స్టేషన్లలో బాలల కోసం ప్రత్యేక సంక్షేమ విభాగాలు ఉండాలి. కేసుల విచారణకు విస్తృతస్థాయిలో న్యాయమండళ్లు ఏర్పాటు కావాలి. బాధిత బాలల కుటుంబ సభ్యులకు సంక్షేమ సమితుల ద్వారా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలి. ఆపరేషన్ ముస్కాన్ పేరిట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ ప్రక్రియను తరచూ కొనసాగించాలి. చట్టనిబంధనలతోపాటు సామాజిక దృక్పథంలోనూ మార్పులు తీసుకొస్తేనే బాలల ప్రపంచం కాంతులీనుతుంది. అప్పుడే ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినం అర్థవంతమవుతుంది!

– నల్లాని రాజేశ్వరి

స్వయంసిద్ధ

జన్మతోనే ఎవరూ పరిపూర్ణులు కారు. మొలకలెత్తగానే పంట సిద్ధం కాదు. పసివాడు మహాయోధుడు కాలేడు. చిరు కత్తితో యుద్ధం చెయ్యలేరు. అవతార పురుషులైనా ప్రపంచ నియమాలు పాటించక తప్పదు. గురు శుశ్రూష ద్వారానే విద్యలు నేర్వాల్సి ఉంటుంది.

ఉదయ సూర్యుడు బాల్యావస్థలో బంగారు కాంతులీనుతూ దర్శనీయంగా ఉంటాడు. మధ్యాహ్న సూర్యుడు దుర్నిరీక్ష్యంగా ప్రచండంగా ఉంటాడు. మనిషి జీవితమూ అంతే. బాల్యదేహం ఎదుగుతూ బలమైన యౌవనంలోకి అడుగు పెడుతుంది. మరి బుద్ధి సంగతేమిటి?

దేహం కేవలం ఉపాధి. బుద్ధి ద్వారానే దేహక్రియలు జరుగుతుంటాయి. బుద్ధి ద్వారానే సిద్ధి. కాబట్టి, మనోనిగ్రహం ద్వారా బుద్ధిని సన్మార్గంలో సంచరించేలా చేయాలి. అప్పుడది సద్బుద్ధి అవుతుంది. వ్యతిరేకంగా వ్యవహరిస్తే దుర్బుద్ధి అవుతుంది.

మనిషి జీవితాన్ని గమ్యానికి చేర్చినా, అగాధంలోకి పడదోసినా బుద్ధి అనే అశ్వమే కారణం. కాబట్టి, మనిషి బుద్ధిని సన్మార్గంలో ఉంచుకోవాలి. లక్ష్యాన్ని ముందుగానే నిర్ణయించుకోవాలి. గమ్యం లేని ప్రయాణం వ్యర్థం. లక్ష్యం లేని జీవితమూ అంతే.

మొక్క జీవం పోసుకుని నిలబడేదాకా నీరు పోయాలి. అటు తరవాత అదే నేల నలుమూలలకూ వేళ్లు చొప్పించి నీళ్లు వెతుక్కుంటుంది. దాహం తీర్చుకుని బలంగా ఎదుగుతుంది. చెట్టవుతుంది. వృక్షం, మహావృక్షంగా మారుతుంది. దీన్నే 'స్వయంసిద్ధ' అంటారు.

మనిషి కూడా ఇలాగే స్వయంసిద్ధుడు కావాలి. అతడు ఏ రంగంలో ఉన్నా సరే, స్వయంకృషి ద్వారానే ప్రజ్ఞను పెంచుకోవాలి. ప్రతి అడుగులో ఇతరుల తోడ్పాటుకు పాకులాడకూడదు.

అవయవ లోపాలు ఉన్నవారు కూడా సంకల్ప బలంతో అద్భుతాలు చేస్తున్నారు. అన్నీ బాగున్నా సోమరితనంతో జీవితాలను అర్థరహితం చేసుకునేవారి పట్ల ఎవరికి సానుభూతి ఉంటుంది? నడవగల వారికి చేతిసాయం అవసరం లేదు. నడవాలనుకోనివారికి సాయం చేసినా వ్యర్థమే.

విద్యలన్నీ ప్రాథమిక పరికరాలే.

స్వయం ప్రజ్ఞ, కృషి, పట్టుదలతో అసాధ్యాలను సుసాధ్యం చేసుకోవచ్చు. 'అ, ఆ'లతో ఆరంభమయ్యే విద్యకు తృష్ణ తోడైతే ఎన్ని సోపానాలైనా ఎక్కగలదు.

ఉత్తమ విద్యార్థికి, సాధారణ విద్యార్థికి మధ్య కేవలం కృషే తేడా. సాధారణ విద్యార్థి అయినా కృషి, పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. మేధావి అయినా సోమరితనం ఆవహిస్తే వైఫల్యాలు చవిచూడక తప్పదు. అందుకే గీత 'కృషితో నాస్తి దుర్భిక్షం' అంటుంది.

అంతర్యామి

మనిషి సంకల్పబలంతో తన శక్తిని ఎన్నోరెట్లు పెంచుకోగలడు. అది ఆంజనేయుడు తన దేహాన్ని నూరు యోజనాల ఎత్తుకు పెంచటం లాంటిది. ఇతరులు సాహసించని సాగర లంఘనం వంటిది. సంజీవనీ పర్వతాన్ని పెకలించుకురావడం లాంటిది.

మన బలాన్ని బుద్ధితో పోల్చి చూసుకుంటే ఇవన్నీ అసాధ్యాలుగా, అభూత కల్పనలుగా అనిపిస్తాయి. హేతువాదాలు, తర్క వితర్కాలన్నీ ఇలాంటివే.

మనకు తెలియనివి ఎన్నో అద్భుతాలుంటాయి. మనం చూడనివి మరెన్నో విశేషాలు ఉంటాయి. అవన్నీ అబద్ధాలు అనుకోవడం పొరపాటు.

మనం ప్రయత్నించినా ఫలితాలు దక్కవని ముందుగానే విరమించుకోవడం కంటే పలాయనవాదం మరోటి ఉండదు. ఎవరూ ఎవర్నీ గొప్పవారిని చేయలేరు. కసరత్తు ఒకరు చేస్తే కండ వేరొకరికి రాదు. అన్నం ఒకరు తింటే వేరొకరి ఆకలి తీరదు.

స్వయంకృషిని నమ్ముకున్నవారికే కార్యసిద్ధి కలుగుతుంది. అలాంటివారే స్వయంసిద్ధత్వాన్ని సాధించినవారవుతారు. ఏ రంగానికైనా ఇదే మూల సూత్రం!

– కె.విజయలక్ష్మి

ఫ్లాట్ కొనుగోలుదారు చేతికి మరో అస్త్రం

- బిల్డర్ దివాళా ప్రకటిస్తే పరిహారం కోరే హక్కు
- తాజా చట్ట సవరణకు రాష్ట్రపతి ఆమోదం
- మరో నెలలో తదుపరి ఆదేశాలకు అవకాశం

ఈనాడు – అమరావతి

కేంద్రం చేసిన దివాళా చట్ట సవరణలను తాజాగా రాష్ట్రపతి ఆమోదించడంతో ఫ్లాట్ల కొనుగోలుదారులకు కొత్త హక్కు సంక్రమించింది. అపార్ట్‌మెంట్ నిర్మాణం తలపెట్టి ఫ్లాట్లు అమ్మిన బిల్డర్ నిర్మాణం మధ్యలోనే తన వల్ల కాదని చేతులెత్తేసి న్యాయపరంగా దివాళా పిటిషన్ దాఖలు చేస్తే కొనుగోలుదారులు మారు మాట్లాడడానికి ఉండేది కాదు. బిల్డర్ దయతలచి ఏమైనా ఇస్తే తీసుకోవడం మినహా హక్కుగా అడిగి తీసుకోడానికి లేదు. ఇప్పుడు తాజా చట్ట సవరణ ప్రకారం బిల్డర్ దివాళా పిటిషన్ దాఖలు చేస్తే నష్టపోయిన కొనుగోలుదారులు కూడా పరిహారం కోరే వీలుంది. ఇప్పటిదాకా రుణాలిచ్చే బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు మాత్రమే బకాయిల వసూళ్ల కోసం దివాళా ప్రక్రియ ప్రారంభించాలని కోర్టుల్లో, సంబంధిత అథారిటీల్లో దరఖాస్తు చేసుకునే పరిస్థితి ఉంది. ఇప్పుడు కొనుగోలుదారులు కూడా నష్టపోయినట్లుగా నిర్ధారించుకున్నాక వారు కూడా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల మాదిరిగానే దరఖాస్తు చేసుకొని న్యాయం పొందొచ్చు. ఈ విధానంతో వ్యాపారి ఆస్తుల నుంచి కొనుగోలుదారులకూ వాటా లభిస్తుంది. తాజా చట్ట సవరణలో రుణదాతల కమిటీ(కమిటీ ఆఫ్ క్రెడిటార్స్)లో ఫ్లాట్ కొనుగోలుదారులను కూడా చేర్చారు. మరో నెల రోజుల్లో తదుపరి ఆదేశాలు రావొచ్చని అధికారులు భావిస్తున్నారు. కొనుగోలుదారులకు భరోసా కల్పిస్తూ ఇప్పటికే స్థిరాస్తి వ్యాపార నియంత్రణ చట్టం (రెరా) అమలులోకి వచ్చింది. వ్యాపారంలో పారదర్శకత, కొనుగోలుదారుల హక్కులకు భంగం కలగకుండా ఈ చట్టంలో అనేక అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపార నియంత్రణ సంస్థను ఏర్పాటుచేసి వ్యాపారులు చేపట్టే కొత్త ప్రాజెక్టుల వివరాలు రెరాలో నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పుడు దివాళా చట్ట సవరణతో ఇంకాస్త భరోసా వస్తుంది.

రాష్ట్రంలో ఏటా 5 వేల అపార్ట్‌మెంట్లు

రాష్ట్రంలో ఏటా 5 వేల అపార్ట్‌మెంట్లు, మరో 1500 వ్యక్తిగత ఇళ్లను వ్యాపారులు నిర్మిస్తున్నారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణంతో ఏటా లక్ష ఫ్లాట్లు అందుబాటులోకి వస్తున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలులో అత్యధికంగా స్థిరాస్తి వ్యాపారం జరుగుతోంది. వివిధ కారణాలతో కొన్ని చోట్ల ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయకపోవడం, ఇంకొన్ని అసంపూర్తిగా నిలిచిపోవడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. ప్రత్యేకించి ఇలాంటి సమస్యలతో విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో గత పదేళ్లలో 500కిపైగా కేసులు పోలీస్ స్టేషన్లలో, న్యాయస్థానాల్లో నమోదయ్యాయి. వీటిలో 280 పరిష్కారమయితే, మరో 128 కేసులు విచారణ దశలో ఉన్నాయి. ఇంకో 92 కేసులు రాజకీయ, ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. కారణం ఏదైనా అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బ్యాంకుల్లో అప్పులు చేసి ఫ్లాట్ చేతికి రాకపోవడంతో వడ్డీ, అసలు తడిసి మోపెడై ఆర్థికంగా దెబ్బతింటున్న కుటుంబాలు అనేకం. ముఖ్యంగా వివాదాస్పద భూముల్లో, ప్రభుత్వ స్థలాల్లో చేసే నిర్మాణాల్లో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. విశాఖపట్నంలో ఇలాంటి కేసులు ఏటా నాలుగైదు నమోదవుతుంటాయి. ఇప్పుడు విజయవాడ, గుంటూరులోనూ ఇలాంటి బెడద మొదలైంది.

చట్ట సవరణలను ఆహ్వానిస్తున్నాం..

పారదర్శకంగా వ్యాపారం చేసే వారంతా ఇలాంటి చట్ట సవరణలు ఆహ్వానిస్తుంటారు. క్రెడాయి తరపున మేము కూడా స్వాగతిస్తున్నాం. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రెరాకు పూర్తిగా సహకరిస్తున్నాం. వ్యాపారంలో నిజాయితీ, నిబద్ధత అవసరం. తమ సభ్యులందరికీ ఇదే విషయాన్ని చెబుతుంటాం. కొనుగోలుదారులు ఎవరో ఒకరిద్దరి వద్ద నష్టపోయినపుడు ఈ విధంగా సొంతంగా దివాళా పిటిషన్ వేసే అవకాశం కల్పించడం మంచి పరిణామమే.

– ఎ.శివారెడ్డి, క్రెడాయి, రాష్ట్ర అధ్యక్షుడు

దక్షిణాది న్యాయాధికారుల సంఘ ప్రతినిధిగా వరప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల న్యాయాధికారుల సంఘం ప్రతినిధిగా రంగారెడ్డి జిల్లా 14వ అదనపు జిల్లా జడ్జి వి.వరప్రసాద్ ఎంపికయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడుల న్యాయాధికారుల సంఘం ప్రతినిధిగా ఆయన పేరును అఖిల భారత న్యాయాధికారుల సంఘ ప్రతినిధులు ప్రతిపాదించగా అన్ని సంఘాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈనెల 9న హైదరాబాద్‌లో అఖిల భారత న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో దక్షిణాది రాష్ట్ర న్యాయాధికారుల సంఘ కార్యవర్గాలు సమావేశమైన విషయం విదితమే. ఈ సమావేశానికి తెలంగాణ మాజీ న్యాయాధికారుల సంఘం సభ్యులు హాజరై తమ సమస్యలను నివేదించారు. కొత్త పెన్షన్ విధానం న్యాయాధికారులకు వర్తింపజేయరాదని సంఘం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిసింది. న్యాయాధికారుల వేతన సవరణలు, మౌలిక సదుపాయాలు, సర్వీసు నిబంధనలు, తదితర అంశాలపై అన్ని రాష్ట్రాల న్యాయాధికారుల సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ జరిపి నివేదికను రూపొందించి అఖిల భారత 2వ జ్యుడిషియల్ వేతన కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పి.వెంకటరామారెడ్డికి సమర్పించాలని నిర్ణయించింది. సమావేశంలో ఏపీ న్యాయాధికారుల సంఘం అధ్యక్షులు గంటా శ్రీనివాసులు, తెలంగాణ న్యాయాధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల సమీపంలో మద్యం దుకాణాలకు అనుమతివ్వొద్దు

- హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని జాతీయ రహదారులకు 500 మీటర్ల లోపు దూరంలో మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతించరాదని పేర్కొంటూ సోమవారం హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. కృష్ణాజిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన కొలుసు గోకుల్ పోతురాజు ఈ వాజ్యాన్ని దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వక్రభాష్యం చెబుతూ అధికారులు మద్యం దుకాణాలు అనుమతిస్తున్నారని ఆరోపించారు. ఏపీ అబ్కారీశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, కృష్ణా జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీ రాష్ట్ర మద్యం డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

జగన్‌తో దోస్తీ కడుతూ అవినీతి గురించి మాటలా?

కన్నాపై మండిపడ్డ కళా వెంకట్రావు

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రజాధనం దోచుకున్న జగన్‌తో జత కట్టేందుకు ప్రయత్నిస్తున్న భాజపా నేతలు అవినీతి గురించి ఎలా మాట్లాడతారని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, విద్యుత్తు శాఖ మంత్రి కళావెంకట్రావు ప్రశ్నించారు. తెదేపాతో విడిపోయిన తర్వాత అవినీతి గురించి మాట్లాడుతున్న నేతలకు విడిపోక ముందు ఆ విషయం తెలియదా అంటూ మండిపడ్డారు. ఆ పార్టీ నేతలు రాష్ట్రంలో జగన్‌కు ప్రయోజనం చేకూర్చేందుకే పనిచేస్తున్నారన్నారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. భాజపా రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణపై మండిపడ్డారు. జాతీయ పార్టీ తరుపున రాష్ట్రంలో అధ్యక్షులుగా ఉంటూ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో భాజపా ఎవరి సహకారంతో రాష్ట్రంలో సీట్లు గెలుచుకుందో గుర్తుంచుకుని మాట్లాడాలన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతామంటారా?: ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు చేసే ప్రజాసేవలో లోపాలుంటే ఎవరినైనా ప్రశ్నించే హక్కు ప్రజలకుందన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెడతాం..గవర్నర్‌ను కలుస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు లెక్కలుతో సహా వివరిస్తున్నారన్నారు. ఆయన చెప్పేవన్నీ వాస్తవాలేనన్నారు. కేంద్రం ప్రత్యేక హోదా ఇస్తానని మాట తప్పినందుకు నిరసనగా అమిత్‌షాను అలిపిరిలో కొంతమంది అడ్డుకునే ప్రయత్నం చేశారే తప్ప అది ఎవరో ప్రేరేపించిన ఘటన కాదన్నారు. దాన్ని వేరేవిధంగా చిత్రీకరించడం తగదన్నారు.

భాజపా, తెదేపా పోటాపోటీ ధర్నాలు

- విజయవాడలో ఉద్రిక్తత
- భారీగా పోలీసుల మోహరింపు

విజయవాడ, న్యూస్‌టుడే: విజయవాడ అలంకార్ కూడలి ధర్నాచౌక్‌లో సోమవారం భాజపా, తెదేపా చేపట్టిన పోటాపోటీ ధర్నాలు ఉద్రిక్తతకు దారి తీశాయి. ప్రధాని మోదీపై తెదేపా నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ భాజపా ధర్నా నిర్వహించింది. వీరి ధర్నా ముగిసే సమయంలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తెదేపా కార్యకర్తలతో ధర్నా చౌక్‌కు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రెండు పార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ నినాదాలు చేశారు. వెంటనే పోలీసులు భారీగా చేరుకొని తెదేపా కార్యకర్తలను నిలువరించారు. భాజపా నేతలు వెళ్లిపోగానే తెదేపా శ్రేణులు అక్కడే ధర్నా చేశాయి.



ధర్నాలో ప్రసంగిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ.. చిత్రంలో పురందేశ్వరి, గోకరాజు గంగరాజు, మాణిక్యాలరావు, విష్ణుకుమారరాజు తదితరులు

విజయవాడలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, తెదేపా శ్రేణులు

ముఖ్యమంత్రిని నమ్మి భాజపా మోసపోయింది..: కన్నా లక్ష్మీనారాయణ

ముఖ్యమంత్రి చంద్రబాబును విశ్వసించి భాజపా మోసపోయిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. ధర్నా శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. తెదేపా పాలనలో నియంతృత్వ ధోరణి పెరిగిందన్నారు. భాజపా కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. పసుపు జెండా కింద పోలీసుశాఖ పని చేస్తోందని దుయ్యబట్టారు. నాలుగేళ్లు చంద్రబాబుతో నడవాల్సి రావడం తమ కర్మగా అభివర్ణించారు. అమిత్‌షాను హత్య చేయాలనే ఉద్దేశంతోనే అలిపిరిలో దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. స్పీకర్ కోడెల శివప్రసాద్ కూడా సంస్కారం లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మరుగుదొడ్ల నిర్మాణంలోనూ తెదేపా నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. జనసేన, వైకాపాలతో భాజపాకు సంబంధం అంటగట్టి చంద్రబాబు బయటపడాలని చూస్తున్నారని ఆరోపించారు. భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుకమాఫియా రాజ్యమేలుతోందని అన్నారు. పట్టిసీమ, పోలవరం నిర్మాణాల్లో అవినీతిపై సీబీఐ విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పురందేశ్వరి, ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే మాణిక్యాలరావు, ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి నుంచి మోసమే: ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు కొత్తగా రైల్వే జోన్ కేటాయిస్తామని కేంద్రం మొదటినుంచి మోసం చేస్తూ వస్తోందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న ఆరోపించారు. రాజధానికి నిధుల కేటాయింపులోనూ వంచించారని అన్నారు. తెలుగువారిని మోసం చేసిన భాజపాను రాష్ట్రంలో భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 85 శాతం నిధులు కేటాయించామంటున్న భాజపా నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు.

పడమటి కనుమలలో వెళ్లే రైళ్లు రద్దు

- విరిగిపడిన కొండచరియలు

హాసన్, న్యూస్‌టుడే: నైరుతి రుతుపవనాల ప్రభావంతో కర్ణాటకలోని పడమటి కనుమల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల వల్ల బెంగళూరు- మంగళూరు మార్గంలోని యడకుమరి స్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున పలు చోట్ల కొండ చరియలు విరిగిపడినట్లు అధికారులు వెల్లడించారు. ఫలితంగా సోమవారం ఉదయం యశవంతపుర నుంచి బయలుదేరిన కార్వార ఎక్స్‌ప్రెస్‌ను హాసన్ వరకు మాత్రమే పరిమితం చేశారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. వేగంగా రైలు మార్గాన్ని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

దక్షిణ కన్నడ, ఉడుపి, కొడగు జిల్లాలను నైరుతి రుతుపవనాలు ముంచెత్తుతున్నాయి. అనేక ప్రాంతాల్లో విద్యాలయాలకు సోమవారం సెలవు ప్రకటించారు. కుమారధార నదీ భారీ ప్రవాహంతో ప్రముఖ కుక్కె సుబ్రహ్మణ్య క్షేత్రంతో ఇతర ప్రాంతాలకు ఉన్న పలు మార్గాలు జల దిగ్బంధంలో చిక్కాయి.

పట్టణ పేదల ఇళ్లకు రూ.వెయ్యి కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: పట్టణ పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై), ఎన్టీఆర్ నగర్ పేరుతో నిర్మిస్తున్న ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.వెయ్యి కోట్లు విడుదల చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పట్టణ ప్రాంతాల్లో 6.81 లక్షల ఇళ్లు నిర్మించాలని నిర్ణయించాయి. వీటిలో ఇప్పటికే 5.5 లక్షల ఇళ్ల పనులు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణ విలువలో రాష్ట్ర ప్రభుత్వం తరపున విస్తీర్ణం ఆధారంగా కనిష్ఠంగా రూ.2.25 లక్షలు, గరిష్ఠంగా రూ.2.56 లక్షలు కేటాయించాలని నిర్ణయించారు.

'టెట్ పీఈటీ అభ్యర్థులు ధ్రువీకరణపత్రాలు అప్‌లోడ్ చేయాలి'

ఈనాడు డిజిటల్, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) వ్యాయామ విద్యకు సంబంధించి గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో ఇన్సెంటివ్ మార్కుల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులు తప్పనిసరిగా క్రీడల్లో వారు సాధించిన ప్రతిభా పత్రాలను అప్‌లోడ్ చేయాలని టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. టెట్ వెబ్‌సైట్‌లో బుధవారం నుంచి ఈ నెల 20 వరకు అప్‌లోడ్‌కు అవకాశం కల్పించామన్నారు. ఇన్సెంటివ్ మార్కుల కోసం 5,216 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సుబ్బారెడ్డి వివరించారు.

తేమ పేరుతో ధాన్యం ధర తగ్గిస్తే సహించం

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు అమరావతి: తేమశాతం ఎక్కువగా ఉందన్న కారణంతో ధాన్యం ధర చెల్లింపుల్లో కోత పెడితే సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను హెచ్చరించారు. యంత్రాలతో కోత కోయడం వల్ల ధాన్యంలో 17శాతం కంటే తేమశాతం ఎక్కువగా ఉండడం సహజం, అందువల్ల ధర తగ్గించి రైతుకు నష్టం చేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. ధాన్యం రైతుల దైన్యంపై సోమవారం 'ఈనాడు'లో వచ్చిన ప్రత్యేకకథనం నేపథ్యంలో ముఖ్యమంత్రి సోమవారం వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలపై చర్చించారు. రైతులకు అవసరమైన అన్నిరకాల ఇన్‌పుట్స్‌ను అందజేయాలని సూచించారు. రాబోయే నెల రోజుల పాటు వాతావరణం ఎలా ఉంటుందన్న సమాచారాన్ని రైతులకు ఇవ్వాలని, తెగుళ్లపై ముందస్తుగానే అంచనా వేయాలని పేర్కొన్నారు. ఇస్రో, ఆర్టీజీ సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ ఏడాది ఎంత ఉత్పాదకత పెరుగుతుందో ప్రయోగాత్మకంగా చూడాలని చెప్పారు.

చిన్నారులకు త్వరలో ఆరోగ్య కార్డులు

వర్షాలకు అంటువ్యాధుల ప్రబలకుండా పురపాలక, పంచాయతీరాజ్, వైద్యఆరోగ్య శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాల సురక్ష యోజనను విజయవంతం చేయాలన్నారు. త్వరలో చిన్నారులకు ఆరోగ్య కార్డులను అందజేస్తామని ప్రకటించారు.

వచ్చే నెల నుంచి రాయితీపై 2కేజీల కందిపప్పు: మంత్రి పుల్లారావు

వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల్లో ప్రతీ తెలుపురంగు కార్డుపై రాయితీపై 2కేజీల చొప్పున కంది పప్పును పంపిణీ చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆ శాఖ అధికారులకు సూచించారు. చంద్రన్న గ్రామీణ మాల్స్‌లో ప్రజలు ఎక్కువగా వినియోగించే సరకులు, వస్తువులను అందుబాటులో ఉంచాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించి... మరిన్ని మాల్స్‌ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. సోమవారం ఆయన పౌరసరఫరాల శాఖ కమిషనర్ రాజశేఖర్, డైరెక్టర్ రవిబాబు, పౌరసరఫరాల సంస్థ ఎండీ సూర్యకుమారి, ఇతర అధికారులతో సచివాలయంలో సమీక్షించారు. వేలిముద్రలు పడని కారణంగా రేషన్ తీసుకోలేకపోతున్న బాధితుల సమస్యను పరిష్కరించి, సరకులను అందించాలని చెప్పారు. తమ కుటుంబసభ్యులను నామినీలుగా నియమించాలన్న రేషన్ డీలర్ల విజ్ఞప్తిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు.

తోళ్ల పరిశ్రమాభివృద్ధి సంస్థకు రూ.12 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: తోళ్ల పరిశ్రమాభివృద్ధి సంస్థ(ఎల్ఐడీసీ)కు రూ.12 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. సంస్థ తరపున తోళ్ల పరిశ్రమల అభివృద్ధి కోసం ఏటా రూ.40 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. ఇందులో భాగంగా 2018-19 బడ్జెట్‌లో మొదటి త్రైమాసికానికి సంబంధించి రూ.12 కోట్లు విడుదలచేసింది.

సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

జులై 17న దిల్లీలో మరో సింహగర్జన: కృష్ణ మాదిగ

ఎన్జీవోస్‌కాలనీ(వరంగల్), న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట పరిరక్షణకు జులై 17న దిల్లీలో మరో సింహగర్జన నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సోమవారం హన్మకొండలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా మినహా భారతదేశంలో అన్ని పార్టీల రాజకీయ నాయకులతో కలిసి తమ చట్టాన్ని పరిరక్షించేందుకు గర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. దళితుల రక్షణకు ఏర్పాటైన చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే, దేశంలో 30శాతం జనాభా ఉన్నవారి ఒక్క ఓటు కూడా భాజపా పొందలేదని హెచ్చరించారు.

బ్రాహ్మణ మిత్రల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాల ఫలాలు అర్హులైన పేదలకు పారదర్శకంగా అందించే ఉద్దేశంతో మండల స్థాయిలో 'బ్రాహ్మణ మిత్ర'లను ఏర్పాటు చేస్తున్నామని సంస్థ ఛైర్మన్ వి.ఆనందసూర్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సేవా దృక్పథం కలిగి, ఆసక్తి ఉన్న 30 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు బ్రాహ్మణులు మిత్రలుగా పని చేసేందుకు ఈ నెల 25లోగా www.andhrabrahmin.ap.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారందరికీ గౌరవ పారితోషికం చెల్లిస్తామని ఆనందసూర్య వివరించారు.

అడిగిందే తడవుగా ఆన్‌లైన్ సేవలు!

- ఏపీఐఐసీ అనుమతులకు సాంకేతిక అనుసంధానం

ఈనాడు, అమరావతి: ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్‌ల)లో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఆన్‌లైన్ సేవలన్నీ అందుబాటులోకి వచ్చాయి. ఏపీఐఐసీ కార్యాలయాలకు వెళ్లకుండానే సంస్థ వెబ్‌సైట్‌లోంచి రాష్టవ్యాప్త ఆర్థిక మండళ్లలో ఖాళీ స్థలాల(ప్లాట్ల) వివరాలు, విస్తీర్ణం, కొత్త సెజ్‌లు, వీటిలో స్థలాల ధరలు తెలుసుకోవచ్చు. ఎంచుకున్న స్థలాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఏపీఐఐసీ నుంచి సమాచారం రాగానే చెల్లింపులూచేసెయ్యొచ్చు. రిజిస్ట్రేషన్ మినహా నిర్మించే భవనాలకు అనుమతులూ ఆన్‌లైన్‌లోనే పొందే వెసులుబాటు కల్పిస్తున్నారు. రాష్ట్ర పారిశ్రామిక రంగ అభివృద్ధిలో ఏపీఐఐసీ క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. భూములు సేకరించి, పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చేసి పెట్టుబడుదారులకు కేటాయిస్తోంది. 2014 నుంచి ఇప్పటివరకు 13 జిల్లాల్లో 1,681 పరిశ్రమల ఏర్పాటుకు 13,510 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఇందులో గత ఏడాదే అత్యధికంగా 3,526 ఎకరాల్లో 1,067 యూనిట్లు నెలకొల్పేలా రిజిస్ట్రేషన్లు చేశారు.

★ పరిశ్రమలు నెలకొల్పాలనుకునే వారు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో ఎక్కడున్నా స్థలాల కోసం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(ఏపీఐఐసీ) వెబ్‌సైట్ (www.apiic.in)లో నుంచి జీఐఎస్ విధానంలో వివిధ సెజ్‌లలో ఖాళీస్థలాల వివరాలు తెలుసుకోవచ్చు. ఏపీఐఐసీ రాష్ట్రవ్యాప్తంగా 32,700 ఎకరాలను పారిశ్రామిక అవసరాలకోసం సిద్ధం చేసింది.

★ జీఐఎస్ విధానంలో ఎంపిక చేసుకున్న స్థలాల కోసం ఆన్‌లైన్‌లోనే ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకోవచ్చు. అధికారులు పరిశీలించి స్థలాన్ని కేటాయించాక.. ఏపీఐఐసీ బ్యాంకు ఖాతాకు డబ్బు జమచేశాక ఆన్‌లైన్‌లో కేటాయింపు లేఖను జారీచేస్తారు.

★ స్థలాల కేటాయింపు పూర్తయ్యాక పరిశ్రమల ఏర్పాటుకు సంబంధిత శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి, నిర్దేశిత గడువు లోగా తదుపరి అనుమతులిచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

★ పరిశ్రమల ఏర్పాటులో భాగంగా వివిధ నిర్మాణాలకు అనుమతులు (బిల్డింగ్ ప్లాన్లు) ఆన్‌లైన్‌లోనే పొందొచ్చు. వీటి కోసం ఇప్పటివరకు పారిశ్రామిక ప్రాంత స్థానిక సంస్థ(ఐలా) కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తుతోపాటు ప్లాన్లు పెట్టాల్సివచ్చేది. ఆన్‌లైన్‌లోనే అనుమతులిచ్చే విధానాన్ని ఐలా పరిధిలోనూ అమలుచేసేందుకు ఇటీవలే ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

యూజీడీ పనులకు నిధుల వ్యయంపై తాజా మార్గదర్శకాలు...

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 157 మేజర్ పంచాయతీల్లో భూగర్భ మురుగు నీటి పారుదల (యూజీడీ) పనుల కోసం నిధుల ఖర్చుపై ప్రభుత్వం సోమవారం తాజా మార్గదర్శకాలు జారీ చేసింది. రూ.595 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనుల నిర్వహణకు మొదట ఆదేశాలు వెలువడ్డాయి. ఉపాధి హామీ పథక 'మెటీరియల్ కాంపోనెంట్' నుంచి 70 శాతం నిధులు, 14వ ఆర్థిక సంఘ నిధుల నుంచి మరో 10 శాతం, మిగతా 20 శాతం పంచాయతీరాజ్ కమిషనర్ ఖాతాలోగల ఉపాధి పథక బదలాయింపు నిధుల నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 50 కిలోమీటర్ల చొప్పున చేపట్టిన యూజీడీ పనుల్లో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకొని నిధుల సమీకరణపై నిబంధనలు సడలిస్తూ మళ్లీ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ ప్రకారం ఇక 70 శాతం నిధులు ఉపాధి పథకంలోని 'మెటీరియల్ కాంపోనెంట్' ఖాతాలో, మరో 30 శాతం ఇతర ప్రభుత్వశాఖలకు పంచాయతీరాజ్ కమిషనర్ బదలాయించే ఉపాధి నిధుల/గ్రామ పంచాయతీల/ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ (ఎస్‌బీఎం) నుంచి ఖర్చు చేయనున్నారు.



పెరిగిన జేఈఈ సీట్లు

- దేశవ్యాప్తంగా పెరిగినవి 3,157 సీట్లు
- ఐఐటీ తిరుపతిలో పెరిగిన 60 సీట్లు

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలు, కేంద్ర ఆర్థిక సహకారంతో నడిచే సాంకేతిక విద్యా సంస్థ (జీఎఫ్ఐటీ)ల్లో సీట్ల సంఖ్య ఈ ఏడాది భారీగా పెరిగింది. గతేడాదితో పోల్చితే 3,157సీట్లు పెరిగాయి. 2017లో 36,268 సీట్లు ఉండగా ఇవి 39,425కు చేరాయి. ఐఐటీల్లో మహిళలకు సూపర్‌న్యూమరరీ కోటా కింద అదనంగా 800 పెరగడంతో సీట్ల సంఖ్య 12,079కి చేరింది. గతేడాది అన్ని ఐఐటీల్లో కలిపి 10,988 మాత్రమే ఉన్నాయి. సీట్ల వివరాలను సంయుక్త సీట్ల కేటాయింపు అథారిటీ (జోసా) వెల్లడించింది. గతేడాది 97 విద్యాసంస్థల్లో ప్రవేశాలు జరగగా.. ఈసారి 102కు చేరాయి. గతేడాది 31ఎన్ఐటీల్లో 17,868 సీట్లుండగా, ఈసారి సూపర్‌న్యూమరరీ 653తో కలిపి మొత్తం 18,620కి చేరాయి. ట్రిపుల్ఐటీల్లో గతేడాది 3,433 సీట్లు ఉండగా ఈ ఏడాది 24 సంస్థల్లో 4,023 సీట్లకు పెరిగాయి. జీఎఫ్ఐటీలు గతేడాది 20 ఉండగా ఈసారి 24కు పెరిగాయి. వీటిల్లో గతేడాది 3,979సీట్లు ఉండగా, ఈ ఏడాది సూపర్‌న్యూమరరీ సీట్లు 20తో కలిపి 4,703కు చేరాయి.

జాతీయస్థాయిలో (2018-19) సీట్ల వివరాలు..

విద్యాసంస్థలు	జనరల్	ఎస్సీ	ఎస్టీ	ఓబీసీ	మొత్తం
ఐఐటీ	6,127	1,821	905	3,226	12,079
ఎన్ఐటీ	9,264	2,762	1,736	4,858	18,620
ట్రిపుల్ఐటీ	2,015	609	310	1,089	4,023
జీఎఫ్ఐటీ	2,878	658	391	776	4,703

(ఆయా విభాగాల్లో దివ్యాంగులు, మహిళ సూపర్‌న్యూమరరీ సీట్లు కలిపి)

తెలుగు రాష్ట్రాల్లో ఐఐటీ హైదరాబాద్‌లో సూపర్‌న్యూమరరీ తొమ్మిది సీట్లు పెరగగా, ఐఐటీ తిరుపతిలో 60సీట్లు పెరిగాయి. గతేడాది ఐఐటీ తిరుపతిలో 120 సీట్లు ఉండగా 180కు చేరాయి. ఎన్ఐటీ వరంగల్‌లో సూపర్‌న్యూమరరీ సీట్లు 17, తాడేపల్లిగూడెంలో సూపర్‌న్యూమరరీ 7 సీట్లు పెరిగాయి. ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ, కర్నూలులో గతేడాదిలాగే సీట్లున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో సంస్థలు - సీట్లు (2018-19)

విద్యాసంస్థ	జనరల్	ఎస్సీ	ఎస్టీ	ఓబీసీ	మొత్తం
ఐఐటీ హైదరాబాద్	149	44	22	79	294
ఐఐటీ తిరుపతి	91	27	14	48	180
ఎన్ఐటీ వరంగల్	412	122	62	221	817
ఎన్ఐటీ తాడేపల్లిగూడెం	246	73	37	131	487
ట్రిపుల్ఐటీ శ్రీసిటీ	136	41	20	73	270
ట్రిపుల్ఐటీ కర్నూలు	61	18	9	32	120
స్కూల్ఆఫ్‌ప్లానింగ్, అర్కిటెక్చర్, విజయవాడ	53	16	8	28	105
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	11	3	1	6	21

(ఆయా విభాగాల్లో దివ్యాంగులు, మహిళ సూపర్‌న్యూమరరీ కలిపి)

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- అందని పాఠ్యపుస్తకాలు
- ఏకరూప దుస్తులపై అలసత్వం
- దస్త్రాల్లోనే సైకిళ్ల సరఫరా

ఈనాడు - అమరావతి

మొత్తం పాఠశాలలు	61,701
ప్రభుత్వపరంగా	46,662
ప్రైవేటు	14,436
మదర్సాలు	603
మొత్తం విద్యార్థులు	69,75,526
ప్రభుత్వ పాఠశాలల్లో	39,48,845

రాష్ట్రవ్యాప్తంగా నేటి (మంగళవారం) నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నా... పాఠ్యపుస్తకాలు, ఏకరూపదుస్తులు, సైకిళ్లు పూర్తి స్థాయిలో పంపిణీ కావడం లేదు. నిర్ణీత సమయానికి అవి విద్యార్థులకు అందకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి రూ.24,185 కోట్లు కేటాయిస్తున్నా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. విద్యాశాఖ సకాలంలో నిర్ణయాలు తీసుకోకపోవడంతో ఈ జాప్యం అనివార్యమవుతోంది.

చేరినవి 67 లక్షల పాఠ్యపుస్తకాలే: పాఠ్యపుస్తకాల ముద్రణకు ప్రతి ఏడాది అక్టోబరులో చర్యలు ప్రారంభించాలి. ప్రభుత్వం రూ.90కోట్లు వరకు వ్యయం చేస్తోంది. అయినా... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 39,48,845 విద్యార్థులకు 2.07కోట్ల పుస్తకాలు అందించాల్సి ఉండగా ఇంతవరకు 67లక్షలు మాత్రమే సరఫరా అయ్యాయి. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటివరకు 1.47లక్షల పుస్తకాల ముద్రణ పూర్తయింది. వాటిని సరఫరా చేయాల్సి ఉంది. మరో 60లక్షల ముద్రణను ఇప్పుడు ప్రారంభించారు. ఈ ఏడాది కొత్తగా భాష(లాంగ్వేజ్) పుస్తకాలు మినహా మిగతా వాటిని క్యూఆర్‌కోడ్ విధానంలో ముద్రిస్తున్నారు.

40 శాతం లోపే ఏకరూపం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులకు కేంద్ర ప్రభుత్వం ఈసారి నిధులను పెంచింది. గతంలో రెండు జతలకు కలిపి రూ.400 ఇవ్వగా ఈసారి రూ.600కు పెరిగింది. సర్వశిక్షా అభియాన్ మాత్రం పాత ధర రూ.400 చొప్పున ఆప్కోకు దుస్తుల సరఫరాను అప్పగించింది. కేంద్రం అదనంగా ఇచ్చిన రూ.200ను ఏ విధంగా వినియోగించాలనే దానిపై ఇంతవరకు నిర్ణయమే తీసుకోలేదు. విద్యార్థులకు అదనంగా మరో జత ఇవ్వడమా లేదా ఇతరత్రా ఉపయోగపడే వస్తువులు అందించడమా అనే దానిపైనే చర్చలు సాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 30లక్షలు మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 40శాతంలోపే సరఫరా చేశారు.

టెండర్ల దశలోనే సైకిళ్లు

బాలికల ప్రవేశాలు, హాజరు పెంచేందుకు ప్రభుత్వం బడికొస్తా పథకం కింద సైకిళ్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఇంతవరకు టెండర్ల ప్రక్రియే పూర్తి కాలేదు. దాంతో ఇవి అందేటప్పటికి ఆగస్టు దాటుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతేడాది కేవలం 9వ తరగతి విద్యార్థినులకు మాత్రమే సైకిళ్లు ఇవ్వగా ఈసారి 8,9 తరగతులకు ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,80,782 మందికి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో సైకిల్‌కు రూ.3,680 ధర నిర్ణయించి రూ.140 కోట్లు కేటాయించి ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

రూ.వంద కోట్ల అక్రమార్జన జప్తు

- ప్రత్యేక న్యాయస్థానాల చట్టం కింద తొలి కేసు
- సర్వే ఇన్‌స్పెక్టర్ లక్ష్మీగణేశ్వరరావుపై బిగుసుకుంటున్న ఉచ్చు
- అనిశా డీజీ ఆర్.పి.ఠాకూర్ వెల్లడి

ఆర్.పి.ఠాకూర్

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ చరిత్రలో మొదటిసారి ఒక కేసు దర్యాప్తును ఆరు నెలల్లో ముగించి ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇందులోభాగంగానే ప్రత్యేక న్యాయస్థానాల చట్టం-2016 ప్రకారం విజయనగరం జిల్లాకు చెందిన సర్వే ఇన్‌స్పెక్టర్ గేదెల లక్ష్మీగణేశ్వరరావుకు చెందిన రూ.8 కోట్ల (మార్కెట్ విలువ రూ.100 కోట్లకుపైగా) విలువైన ఆస్తులను జప్తు చేయనున్నామని రాష్ట్ర అనిశా డీజీ ఆర్.పి.ఠాకూర్ వెల్లడించారు. సోమవారం విశాఖపట్నంలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ చట్టం ప్రకారం ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో పట్టుబడ్డ అధికారులకు సంబంధించిన స్థిరాస్తులను తన అధీనంలోకి తీసుకుంటుందని, కేసులు తేలే వరకు అవన్నీ ప్రభుత్వం నిర్వహణలోనే ఉంటాయని వివరించారు. వాటిని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి వినియోగించుకుంటుందని తెలిపారు. అవినీతి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా ఇతర కోర్టులకు వెళ్లే అధికారం కూడా ఉండదన్నారు. ఆయా ఆస్తుల నిర్వహణ లాభదాయకం కాకపోతే వాటిని విక్రయించే హక్కు కూడా ప్రభుత్వానికి ఉంటుందని చెప్పారు. దేశంలో బిహార్, ఒడిశాల్లో మాత్రమే ఇలాంటి కఠిన చట్టాలున్నాయని తెలిపారు. రెండుసార్లు అనిశాకు దొరకడంతో పాటు లక్ష్మీగణేశ్వరరావుపై 11 సివిల్, కొన్ని క్రిమినల్ కేసులు ఉన్నాయని, విధి నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలకు నాలుగుసార్లు సస్పెండయ్యారని వెల్లడించారు. సమాంతరంగా రిజిస్టర్లను నిర్వహించడం, ఫోర్జరీలు చేయడం, దస్త్రాలను తారుమారు చేయడం, ప్రభుత్వ దస్త్రాల్లోని వివరాలను మార్చేయడం, తప్పుడు పత్రాలను, దస్తావేజులను పుట్టించడం తదితర ఎన్నో ఆరోపణలు, కేసులు ఉన్నాయని వివరించారు. బినామీ పేర్లతో సుమారు 400 ఎకరాలను కొనుగోలు చేశారని, ప్రభుత్వ భూములకు పత్రాలను సృష్టించారని చెప్పారు. అనిశా దాడులకు ప్రయత్నించగా ఆయన ఇంట్లోని కుక్కలను అధికారులపైకి ఉసిగొల్పి వారిని భయభ్రాంతులకు గురి చేశారని గుర్తు చేశారు. 1982లో సర్వేశాఖలో ఉద్యోగిగా ప్రవేశించి అంతులేని అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అనిశా అధికారులు దాడుల్లో ఏడు స్థలాలు, 12 ఫ్లాట్లు, రూ.87 లక్షల రుణాలను ఇవ్వడం తదితర ఎన్నో ఆస్తులను గుర్తించారని, ఆయా ఆస్తులన్నింటినీ ప్రత్యేక కోర్టులో పెట్టి స్వాధీనం చేసుకోబోతున్నామని వివరించారు. అనిశా కేసుల్లో కింది న్యాయస్థానాల్లో 67శాతం శిక్షలు పడుతున్నాయని గుర్తు చేశారు. ఒకవేళ నిందితులను నిర్దోషిగా న్యాయస్థానాలు తేలిస్తే వారి ఆస్తులను తిరిగి అప్పగిస్తామని, వాటిపై వచ్చిన ఆదాయానికి ఐదు శాతం వడ్డీని కూడా కలిపి తిరిగి ఇవ్వనున్నామని వివరించారు. విశాఖ అనిశా డీఎస్పీ రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘క్లాట్-2018’ని తిరిగి నిర్వహించాల్సిన అవసరం లేనేలేదు!

తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

దిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ న్యాయ కళాశాలల్లో చేరేందుకు ఉద్దేశించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష ‘క్లాట్-2018’ను తిరిగి నిర్వహించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు సోమవారం తేల్చి చెప్పింది. తిరిగి పరీక్ష నిర్వహణకు ఆదేశించడానికి నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేయడానికి కూడా జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది.

వాస్తవానికి మే నెల 13వ తేదీన జరిగిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష సందర్భంగా కొన్ని సాంకేతిక లోపాలు తలెత్తి...అభ్యర్థుల సమయం ఎంతో వృథా అయిపోయిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ వ్యవహారం సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ....కొచ్చిన్‌లో ‘నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్’ (ఎన్‌యుఎఎల్‌ఎస్) ఏర్పాటు చేసిన సమస్యల పరిష్కార సంఘం(జీఆర్‌సీ)కి ఈ నెల 15వ తేదీ దాకా వ్యవధినిచ్చింది. ఈ లోగా... సాంకేతిక లోపాల కారణంగా పరీక్షలో విలువైన సమయాన్ని కోల్పోయిన విద్యార్థులకు సముచిత న్యాయం జరిగేలా చూడాలని కోరింది. వృథా అయిన సమయానికి పరిహారంగా చేపట్టాల్సిన చర్యల ఫార్ములాను వర్తింపచేయాలని కోరింది.

దళితులను అవమానించడం.. ఎస్సీ ఎస్టీ చట్టం పరిరక్షణా?

తెదేపాపై ధ్వజమెత్తిన వైకాపా ఎమ్మెల్యే సురేష్

ఈనాడు అమరావతి: ‘దళితుడిగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు..దళితులు మురికిగా ఉంటారంటూ మంత్రి ఆదినారాయణరెడ్డి..మీరు చదువుకోరంటూ ఎస్సీ విద్యార్థిని బహిరంగంగా తెదేపా నేత, ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య తిడతారు..ఇలా ఎస్సీలను ఘోరంగా అవమానిస్తూనే..తిరిగి అదే తెదేపాకు చెందిన ప్రజా ప్రతినిధులు ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పరిరక్షించాలంటూ రాష్ట్రపతిని కలుస్తారు.. ఇదేం చోద్యం’ అని వైకాపా ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. పై సంఘటనలను రాష్ట్రపతి ప్రశ్నించి ఉంటే ఏం సమాధానం చెప్పేవారని ఆయన నిలదీశారు. ఎస్సీలను అవమానించినందుకు చట్టప్రకారం ముఖ్యమంత్రి, మంత్రి, ఆర్టీసీ ఛైర్మన్‌పై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

అతిరాస కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్

సమావేశంలో మాట్లాడుతున్న వై.ఎస్. జగన్

- వైకాపా అధినేత జగన్ హామీ

కొవ్వూరు పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే: అతిరాస కులస్థుల పురోభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వైకాపా అధినేత వై.ఎస్.జగన్మోహనరెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్ర పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరు మండలంలో సోమవారం కొనసాగింది. గౌరిపల్లి శివారు నుంచి పశివేదల, నందమూరు మీదుగా కొవ్వూరు పట్టణంలోకి యాత్ర ప్రవేశించింది. సంకల్ప యాత్ర 186 రోజుల్లో 2300 కిలోమీటర్లు పూర్తికావడంతో నందమూరు కూడలిలో జగన్‌కు స్వాగతిస్తూ రంగవల్లులు తీర్చిదిద్ది అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కూడలిలో వైకాపా స్థూపాన్ని ఆవిష్కరించి మొక్కను నాటారు. అతిరాస కులస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో జగన్ మాట్లాడారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి పాలనలో అతిరాస కులస్థులు బీసీలుగా గుర్తింపు పొందారన్నారు. వైకాపా అధికారంలోకి వస్తే చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యం ఇస్తానన్నారు. తాను ముఖ్యమంత్రినైతే అతిరాసులకు శాసనసభ, శాసన మండలిలో అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అతిరాస సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇళ్ల భాస్కరరావు మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి వల్లే తమకు గుర్తింపు వచ్చిందన్నారు. యాత్ర సందర్భంగా పలువురు జగన్‌కు వినతి పత్రాలు ఇచ్చి తమ సమస్యలను విన్నవించారు.

‘ఎస్సీఎస్టీ’ చట్టం బలహీనపడుతోంది

- తక్షణమే జోక్యం చేసుకోవాలి
- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఏపీ ఎస్సీఎస్టీ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: ఎస్సీఎస్టీ వేధింపుల నిరోధక చట్టం బలహీనపడుతోందని, తక్షణమే జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎస్సీఎస్టీ ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దళితులు ఆందోళన చెందుతున్నారని, ఈ తీర్పుని సమీక్షించాలని కేంద్రం వేసిన కేసులో రాష్ట్రం కూడా ఇంప్లీడ్ అయిందని వివరించారు. ఈ మేరకు మూడు పేజీల వినతిపత్రాన్ని వారు అందజేశారు. ప్రైవేటురంగంలో ఉపాధి లభించడం లేదని, ఉద్యోగాలు ఇవ్వడానికి సంస్థలు నిరాకరిస్తున్నాయని చెప్పారు. చాలా గ్రామాల్లో రెండు గ్లాసుల వ్యవస్థ కొనసాగుతోందన్నారు. విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురవుతున్నా నిందితులకు శిక్ష పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల్లో చాలావరకూ విచారణ చేయకపోవడం వల్లే నిందితులు తప్పించుకుంటున్నారన్నారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ రాజ్యాంగపరంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి హామీ ఇచ్చారని చెప్పారు. ప్రధాని మోదీ ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండు చేశారు. కేసుల మాఫీకి భాజపాతో కుమ్మక్కైన ప్రతిపక్షనేత జగన్ సుప్రీంకోర్టు తీర్పుపై మాట్లాడడం లేదన్నారు. మంత్రి జవహర్ మాట్లాడుతూ దళితుల ఆహార అలవాట్లు, ఆచార వ్యవహారాలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ రవీంద్రబాబు మాట్లాడుతూ అఖిల భారత జ్యుడిషియరీ సర్వీస్ అమలు చేయాలని... అప్పుడే దళితులకు న్యాయవ్యవస్థలో చోటు దక్కుతుందన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండు చేశారు. బృందంలోని ఇతర సభ్యులు కూడా మాట్లాడారు. ఏపీ మంత్రి నక్కా ఆనందబాబు నేతృత్వంలో మంత్రి కేఎస్ జవహర్, ఎంపీ రవీంద్రబాబు, మాజీ మంత్రులు పీతల సుజాత, రావెల కిశోర్‌బాబు, ఎస్సీఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ, ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య, ఏపీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ గూడూరి ఎరిక్షన్‌బాబు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వంగలపూడి అనిత, గిడ్డి ఈశ్వరి, ఉప్పులేటి కల్పన, వంతల రాజేశ్వరి, యామినీ బాల, గొల్లపల్లి సూర్యారావు, తెనాలి శ్రావణ్‌కుమార్, పి.డేవిడ్‌రాజు, జయరాములు, ఈరన్న, పలువురు అధికారులతో కూడిన బృందం సభ్యులు సమావేశమయ్యారు.

దిల్లీలో రాష్ట్రపతికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ మంత్రులు నక్కా ఆనందబాబు, జవహర్. చిత్రంలో వర్ల రామయ్య తదితరులు

మనసులో లేనిది మాటలతో వస్తుందా?

- బీసీలకు జగన్ చేసేదేమీ లేదు: యనమల
- వైకాపా, జనసేన అండ చూసుకునే భాజపా దొంగ ధీమా అని వ్యాఖ్య

ఈనాడు అమరావతి: వెనుకబడిన వర్గాలకు వైకాపా గతంలో చేసిందేమీ లేదని, భవిష్యత్తులో చేయబోయేదీ ఉండదని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. బీసీలతో వైకాపా ఆత్మీయ సమావేశం విడ్డూరంగా ఉందన్నారు. బీసీలపై వైకాపా అధ్యక్షుడు జగన్‌కి మనసులో లేని ఆత్మీయత మాటలతో రాదన్నారు. జగన్ తండ్రి వై.ఎస్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ‘ఆదరణ’ పథకం తీసేశారని, బీసీల సంక్షేమానికి నిధులివ్వలేదని, బీసీ సమాఖ్యలను నిర్వీర్యం చేశారని, రాజకీయంగా పూర్తిగా అణచివేశారని యనమల సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. “మా నాలుగేళ్ల పాలనలో బీసీలకు రూ.36 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. తక్కువ నిధులు కేటాయించినట్లు జగన్ చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలు. తెదేపా విధానాల వల్లే వారికి రాజ్యాధికారం దక్కింది. బీసీలను తెదేపాకి దూరం చేయాలని వైకాపా చేస్తున్న కుట్రలు ఫలించవు” అని ఆయన ధ్వజమెత్తారు. భాజపాపైనా ఆయన విరుచుకుపడ్డారు. “తెదేపాతో పొత్తు ఉన్నప్పుడే భాజపాకి రాష్ట్రంలో రెండు ఎంపీ స్థానాలు, నాలుగు అసెంబ్లీ సీట్లు వచ్చాయి. వారికొచ్చిన ఓట్ల శాతం సింగిల్ డిజిట్ దాటలేదు. తెదేపాతో కలిసున్నప్పుడే ఇలా ఉంటే విడిగా పోటీ చేస్తే ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. వాళ్లకు ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు కావాలంటే వైకాపాతోనో, జనసేనతోనో రహస్య ఒప్పందం చేసుకోవలసిందే. వారి అండ చూసుకునే భాజపా దొంగ ధీమాతో ఉంది. ఎన్నికలు సమీపిస్తే వారి రహస్యబంధాలు బయటపడతాయి” అని యనమల ధ్వజమెత్తారు.

బీసీలు మోసపోవడానికి సిద్ధంగా లేరు

- వైకాపాలోని ఆరుగురు ఎంపీలు ఏ సామాజిక వర్గం వారు?
- జగన్‌ను ప్రశ్నించిన మంత్రి కాలువ శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: పాదయాత్ర తర్వాత బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తానని, రాజమండ్రి ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయిస్తానని, తెదేపా పాలనలో బీసీలకు అన్యాయం జరుగుతోందని వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మంత్రి కాలువ శ్రీనివాసులు విమర్శించారు. వైఎస్ పాలన అంతా బీసీ వ్యతిరేక పాలనే అని, ఎన్టీఆర్ తెదేపా పార్టీ ఏర్పాటు వల్లే బీసీల ఎదుగుదల సాధ్యమైందని అన్నారు. జగన్ మాటలు నమ్మి మోసపోయేందుకు బీసీలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం మంత్రి మాట్లాడుతూ.. ‘వైఎస్ హయాంలో 63 కీలక స్థానాలు ఒకే సామాజిక వర్గం చేతిలో ఉండేవి. తెదేపాకు బీసీలు అండగా ఉండేవారని వారి అణచివేతకు పూనుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూడా చెల్లించక బీసీలు విద్యాసంస్థల్లో చేరలేని పరిస్థితి కల్పించారు. 2008లో బీసీల సమాఖ్యలు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. వైకాపా ఎంపీలుగా ఉన్న ఆరుగురు ఏ సామాజిక వర్గం వారు? అనంతపురం ఎంపీ స్థానం బీసీలకు ఇస్తానని చెప్పిన జగన్ ఏ సామాజిక వర్గానికి ఇచ్చారు? పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఎవరికి ఇచ్చారు, ఒకే ఒక్క రాజ్యసభ స్థానం విజయసాయిరెడ్డికి ఇవ్వలేదా?’ అని ప్రశ్నించారు. ప్రస్తుతం 8 మంది బీసీ మంత్రులుగా ఉన్నారని.. దేవేందర్‌గౌడ్, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, ఎర్రన్నాయుడు వంటి వారు ఆ రోజుల్లోనే కీలక పదవులు నిర్వహిస్తూ రాజకీయంగా ఎంతో ఎదిగారని అన్నారు.

సముద్రంలో మునిగి ఇద్దరు మహిళల మృతి

కాకినాడ (సర్పవరంజంక్షన్), న్యూస్‌టుడే: అలల తాకిడికి సముద్రంలో మునిగి ఇద్దరు మహిళలు మృతి చెందగా మరొక మహిళ ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ గ్రామీణంలోని ఎన్టీఆర్ బీచ్ వద్ద సోమవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోట మండలం జి.మేడపాడు మెట్టమీద ప్రాంతానికి చెందిన మేడిశెట్టి కృష్ణవేణి(24), జంప సంగీత(28), ఉగ్గిన దుర్గాదేవి(28) పిల్లలతో కలిసి ఎన్టీఆర్ బీచ్‌కు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆటోలో వచ్చారు. పాఠశాలలకు సెలవులు ముగియడంతో తమ పిల్లలతో కలిసి కొంతసేపు సంతోషంగా గడుపుదామని వారు ఇక్కడికి వచ్చారు. సాయంత్రం 4.30 గంటలకు ఈ ముగ్గురూ సముద్రస్నానానికి దిగారు. ఉద్ధృతంగా వచ్చిన అలల తాకిడికి నీట మునిగి కృష్ణవేణి, సంగీత మృతి చెందారు. దుర్గాదేవి నీటిలో కొట్టుకుపోతుండగా స్థానికులు రక్షించి కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

విమానాల రాకపోకలపై నిషేధం 3 గంటలే

- దిగొచ్చిన నౌకాదళ అధికారులు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ విమానాశ్రయంలో విమానాల రాకపోకలపై ప్రతిరోజూ ఐదుగంటలు, రాత్రివేళల్లో వారానికి నాలుగుగంటల నిషేధ సమయాలను విధించిన నౌకాదళ అధికారులు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. రోజుకు కేవలం 3గంటలపాటు అది కూడా సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే నిషేధం వర్తించేలా తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఆ మేరకు తూర్పునౌకాదళం సోమవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. నౌకాదళ అవసరాలు కూడా గణనీయంగా పెరిగాయని ప్రస్తుతం సగటున ప్రతి రోజూ 90 నుంచి 100 వరకు రక్షణ విమానాల కదలికలు ఉంటున్నాయని పేర్కొన్నారు. విశాఖ విమానాశ్రయానికి ఒక దిశలో మాత్రమే రన్‌వే ఉన్న ప్రత్యేక పరిస్థితి కూడా ఎక్కడా లేదన్నారు. గోవా, పుణెల్లో కూడా విమానాశ్రయాల్ని రక్షణ అవసరాలకు, పౌర అవసరాలకు కూడా వినియోగించుకుంటున్నట్లు గుర్తుచేశారు. అక్కడ ప్రత్యేకించి కొన్ని సమయాల్ని రక్షణ అవసరాలకు కేటాయించినట్లు తెలిపారు. విశాఖలో కూడా కొన్ని వేళల్ని నౌకాదళానికి వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. మధ్యాహ్నం సమయాన్ని, రాత్రి సమయాన్ని తీసేయాలని గతంలో జరిగిన చర్చల సమయంలో అవి కోరాయని తెలిపారు. విశాఖలోని విమాన ప్రయాణికుల సంఘాలు, ఇతర సంఘాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు మధ్యాహ్న నిషేధ సమయాల్ని, రాత్రి నిషేధ సమయాల్ని పూర్తిగా తొలగించినట్లు వెల్లడించారు. వారానికి ఐదురోజులపాటు, అది కూడా రోజుకు 3గంటలపాటే (ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు) నిషేధం వర్తిస్తుందన్నారు. ఆ సమయాల్లో వచ్చే విమానాలసంఖ్య రోజుకు 6నుంచి 8వరకే ఉన్నాయన్నారు.

ఉదయం వేళలే కీలకం..: విమాన ప్రయాణాల్లో ఉదయం వేళలే కీలకమని, నౌకాదళం మధ్యాహ్న వేళల్లో నిషేధం విధిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని ఆంధ్రప్రదేశ్ విమాన ప్రయాణికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఎస్.వర్మ, విశాఖ అభివృద్ధి మండలి వ్యవస్థాపకుడు ఒ.నరేశ్‌కుమార్ వివరించారు. తాము విశాఖలో విమానాల్ని ఉపయోగించుకునే పలు రంగాల ప్రతినిధులతో సోమవారం సమావేశం ఏర్పాటుచేస్తే అందరూ మధ్యాహ్నం వేళల్లో నిషేధం ఉంటే అభ్యంతరం ఉండదని చెప్పారన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులను బలపరచాలి: సీపీఎం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులను బలపరచాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తెనాలిలో నిర్మించిన ప్రజాసంఘాల కార్యాలయాన్ని (పరుచూరి నాగేశ్వరరావు భవన్) ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి నెలకొందని పేర్కొన్నారు. ఈ పాపంలో భాజపాతో నాలుగేళ్లు అంటకాగిన తెదేపాకు భాగం ఉందని చెప్పారు. వైకాపా రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి భాజపా పట్ల మెతక ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. తొలినుంచీ వామపక్షాలు ప్రత్యేక హోదా కోరాయన్నారు. వామపక్షాలు రూపొందించే రాజకీయ ప్రత్యామ్నాయానికి భావసారూప్యం ఉన్న పార్టీలు కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు డి.రమాదేవి, పి.రామారావు, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ శాఖ. ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
టెండరు కోరుతూ ప్రకటన (ఎన్ఐటి) (ఆన్‌లైన్ ద్వారా)

Roc.No.MG/08/WH/MRKT/TTD/TPT/2018 తేది: 11-06-2018.

“తి.తి.దే.ల మార్కెటింగ్ గోడౌన్లు, అలిపిరి దగ్గర, తిరుపతి నుంచి తిరుమల మరియు తిరుపతిలోని వివిధ తి.తి.దే.ల సంస్థల వద్దకు లోడింగ్ మరియు అన్‌లోడింగ్ సేవలను రెండేళ్ళ కాలపరిమితి వరకు అనగా 2018-2020 వరకు చేయుటకు” డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు (వేర్ హౌసింగ్) మార్కెటింగ్ శాఖ, తి.తి.దే., తిరుపతి వారిచే ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు నోటీసు మరియు టెండరు వివరాలకు వెబ్‌సైట్ https://www.tirumala.org లేదా https://tender.apeprocurement.gov.in పై లాగ్ అవ్వండి. కరెంట్ టెండర్లు ఎ.పి.పై క్లిక్ చేయండి మరియు “మోర్” ఎంపికచేయండి మరియు “తిరుమల తిరుపతి దేవస్థానములు - మార్కెటింగ్” ఎంపికచేయండి. ఇతర వివరాలకై సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు 0877-2264456, 2264079 & ఫ్యాక్స్ నెం. 0877- 2264554
షెడ్యూల్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు ముగింపు తేది: 11-06-2018 నుండి 18-06-2018 మ. 12.00 గం.లు.
టెక్నికల్‌బిడ్ తెరిచే తేది: 18-06-2018 నాటి మ. 2.00 గం.లకు
ఇ.ఎం.డి. రూ. 3,96,000/- (రూపాయలు మూడు లక్షల తొంభైఆరువేలు మాత్రమే)

Roc.No.PR4/1090/Adv.No.101/PRO/2018, Dated: 11.06.2018. కార్యనిర్వహణాధికారి

భారత్ డైనమిక్స్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ)
రక్షణ మంత్రిత్వ శాఖ
గచ్చిబౌలి, హైదరాబాద్-500032.

Ref: BDL/BG/EA/OH/2018 తేది: 12-06-2018

బహిరంగ టెండరు ప్రకటన

ఆఫీసర్స్ హాస్టల్ & రష్యన్ క్వార్టర్స్‌ను నడుపుటకు అదే తరహా పనిలో కనీసం ఏడు సంవత్సరాల అనుభవాన్ని కలిగియున్న పేరొందిన క్యాటరింగ్ సర్వీస్ & గెస్ట్ హౌస్ మెయింటెనెన్స్ కాంట్రాక్టర్లను సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు సమీపాన గల BDL, భానూరు యూనిట్‌వారు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల పార్టీలు ఏదేని జాతీయ బ్యాంక్ నుండి BDL, భానూరు పేరిట తీసిన రూ.1000/- (వాపసు రావు) డి.డి.ని దాఖలు చేసి **14-06-2018 నుండి 09-07-2018 వరకు** అన్ని పనిదినాలలో **ఉ.10.00 గం. నుండి సా. 4.00 గం. వరకు** అసిస్టెంట్ మేనేజర్ (EA) నుండి వివరాలతో కూడిన టెండరు ఫారాలను పొందవచ్చును. టెండరు దాఖలుకు చివరి తేది **13-07-2018.**

డిప్యూటీ జనరల్ మేనేజర్ (P&EA)
కాంటాక్ట్ ఫోన్ నెం.: 040-23469689

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada-520 002 (A.P)

E Procurement Tender Notice

The APCRDA invites the following bids and which can be downloaded on AP e-procurement portal as per the scheduled dates stated below.

1). NIT.22/PROC/CRDA-13021 (33)/54/2018-DEE24-USI-APCRDA Dated : 08.06.2018 " Engaging of Technical persons (Civil/ Electrical) in Infra-II APCRDA for Supervison of works in Zone-10 LPS Layout area in the Villages of Inavolu (P), Krishnayapalem (P), Kuragallu (P), Mandadam (P) and Nowluru (P) for a period of one year " - ECV-Rs. 24,69,225/-. **Download start** Dt:12.06.2018, **Submission Dt:** 28.06.2018 AN. 15.00 Hrs.

2). NIT.23/PROC/CRDA-14022 (102)/4/2018- HO1-LSENV-APCRDA Dated : 08.06.2018 " Development of the fountain structure for the Dandelion fountains, cascades and for landscape development on the wide median at Tadepalli police sub-control near Vaaradhi on NH-16"- Estimate cost- Rs. 35,00,000/- **Download start** Dt.12.06.2018, **Submission Dt.** 22.06.2018 AN. 15.00Hrs.

For further details please refer to www.apeprocurement.gov.in or www.crda.ap.gov.in.

Sd/- Commissioner, APCRDA

ఆంధ్రప్రదేశ్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
(రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
రిజి.ఆఫీస్: 5-77/27, H.S.దర్గా, చిత్రపురి కాలనీ, హైదరాబాద్- 500 104.
H.O.: మహేంద్ర ఎన్‌క్లేవ్, NRI బ్లాక్-C, 3వ అంతస్తు, ఫ్లాట్ నెం.8, తాడేపల్లి, గుంటూరు-522 501. ఇ-మెయిల్: gmlidcap2016@gmail.com

టెండరు ప్రకటన

No. LIDCAP/Admn./Advt/Leasing/2017 తేది: 7.6.2018

LIDCAP ద్వారా వివిధ ప్రభుత్వ మరియు ప్రభుత్వ యాజమాన్య సంస్థలకు ఫుట్‌వేర్, లెదర్‌గూడ్స్ మరియు అనుబంధ ఉపకరణాల సరఫరాకు 3 సంవత్సరాల వ్యవధికి LIDCAPతో ఎంపానెల్‌మెంట్ కొరకు సంబంధిత ట్యాక్స్ రిటర్న్స్ ప్రకారం కనీసం రూ. 1.00 కోటి రూపాయల టర్నోవర్ కలిగి అన్ని రకాల ఫుట్‌వేర్ మరియు లెదర్ గూడ్స్ మరియు అనుబంధ ఉపకరణాల తయారీ లేదా సరఫరాలో గతానుభవం గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రఖ్యాత తయారీదారులు/సరఫరాదారుల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లను జనరల్ మేనేజర్ (9949050399) O/o LIDCAP లిమిటెడ్, శ్రీ మహేంద్ర ఎన్‌క్లేవ్, NRI బ్లాక్-C, 4వ అంతస్తు, ఫ్లాట్ నెం.8, తాడేపల్లి, గుంటూరు జిల్లా నుండి ఏదేని జాతీయము చేయబడిన బ్యాంక్ నుండి రూ. 500/-లు DD రూపంలో LIDCAP Ltd. తరఫున చెల్లించి పొందవచ్చును. టెండరు డాక్యుమెంట్ సరఫరా కొరకు దరఖాస్తు స్వీకరణకు చివరి తేది: 19.6.2018 సా.గం. 5.00 వరకు. స్థానికులకు ఉపాధి కల్పన చూపించే అనుభవం గల స్థానిక తయారీదారులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. టెండరు డాక్యుమెంట్‌ను www.lidcap.net నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును మరియు సదరు డాక్యుమెంట్‌ను పైన పేర్కొన్న విధంగా DDతో మరియు సంబంధిత ఎన్‌క్లోజర్‌తోపాటు విధిగా సంతకం చేసి సమర్పించవలెను. పూర్తిచేసిన టెండరు డాక్యుమెంట్ దాఖలు చేయుటకు చివరి తేది: 22.6.2018

DIPR No. 158PP/CL/Advt/1/1/2018-19 సం/- వి.సి. & మేనేజింగ్ డైరెక్టర్

చిచ్చు ఆరుతుందా?

- ఉ.కొరియా- అమెరికా మధ్య సుదీర్ఘ ఉద్రిక్తతలకు తెరపడుతుందా!
- నేటి ట్రంప్- కిమ్ భేటీపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి
- ఫలితంపై ఉత్తర కొరియన్ల ఆశాభావం

'లిటిల్ రాకెట్ మ్యాన్. సొంత దేశస్థుల్నే నాశనం చేస్తాడు'

- కొన్ని నెలల కిందట కిమ్‌ను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్య ఇది.

'అతనో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి'

- ట్రంప్‌ను ఉద్దేశించి కిమ్ చేసిన ఘాటు విమర్శ ఇది

..నిన్నామొన్నటి దాకా వారిద్దరూ ఇలా ఒకరిపై ఒకరు కత్తులు దూసిన వ్యక్తులు. 'అణు యుద్ధం' హెచ్చరికలు చేసుకున్న నేతలు. వారిద్దరూ ఇప్పుడు సింగపూర్ వేదికగా శిఖరాగ్ర చర్చలకు సిద్ధమయ్యారు. విపరీత మనస్తత్వులుగా పేరుగాంచిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఒకచోట చేరి ఏం మాట్లాడుకోబోతున్నారు? ఈ భేటీ ప్రపంచాన్ని సురక్షిత ప్రదేశంలో ఉంచుతుందా? ఈ చర్చల వల్ల ఉత్తర కొరియన్ల జీవితాల్లో ఎలాంటి మార్పులు వస్తాయి? ఉద్రిక్తతలు సడలి- రెండు దేశాల మధ్య బంధం బలపడుతుందా? అనేవి ఇప్పుడు ప్రపంచం ముందున్న కీలక ప్రశ్నలు.

చర్చలకు ఉ.కొరియా ఎందుకు అంగీకరించింది?

అమెరికాతో చర్చలకు అంగీకరించడానికి ఉత్తర కొరియాకు పలు కారణాలున్నాయి.

1. **అణు సామర్థ్యం సముపార్జన:**
ఉత్తర కొరియా ఇప్పటికే పూర్తిస్థాయి అణ్వాయుధ, క్షిపణి సామర్థ్యాన్ని సముపార్జించిందనే వార్తలు వస్తున్నాయి. అమెరికాలోని ఏ నగరాన్ని అయినా తాకే సామర్థ్యమున్న అణుక్షిపణుల్ని తయారుచేశామని కొరియా ప్రకటిస్తోంది. ఈ దశలో అణ్వస్త్ర కార్యక్రమాన్ని నిలిపేయాలంటూ ఒత్తిడి వచ్చినా.. అందుకు అంగీకరించడానికి సిద్ధపడే చర్చలకు ఉత్తరకొరియా ముందుకువచ్చింది. చర్చల్లో బేరసారాలకు తమ అణుసామర్థ్యం ఉపకరిస్తుందని నమ్ముతోంది.

2. **ఆర్థిక ఆంక్షల ఒత్తిడి ప్రభావం:**
అనేక ఏళ్లుగా ఆంక్షల్లో మగ్గుతున్న ఉత్తరకొరియాలో ప్రజల జీవన పరిస్థితి దుర్భరంగా ఉంది. తిండికి నోచుకోని వారు కోకొల్లలు. ఈ బాధను ప్రజలు ఎల్లకాలం భరిస్తూ పోతారని కొరియా పాలకులు అనుకోవడం లేదు. ఆర్థిక అంక్షల ఛత్రం నుంచి బయటపడాలంటే ప్రపంచంతో మమేకం కావడం ఒక్కటే మార్గమని కిమ్ భావిస్తున్నారు. ఆ మేరకు దేశ ప్రజల నుంచి ఒత్తిడి కూడా వస్తోంది.

3. **ఫలించిన ద.కొరియా దౌత్యం:**
ఉత్తర కొరియా, అమెరికా చర్చల్ని ప్రోత్సహించడంలో దక్షిణ కొరియా కీలక పాత్ర పోషించింది. ట్రంప్‌తో కిమ్ భేటీకి దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ రంగం సిద్ధంచేసి ఆ మేరకు దౌత్యం నడిపారు. వాటి ఫలితమే సింగపూర్ భేటీ.

కొరియన్లు ఏమనుకుంటున్నారు?

కిమ్ జోంగ్ ఉన్ దాదాపు దేవుడి స్థాయి హోదాను అనుభవిస్తున్న ఉత్తర కొరియాలో ప్రజలు ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడే సాహసం చేయలేరు. అయితే తాము దుర్భర దారిద్ర్యం నుంచి బయటపడాలంటే అణ్వాస్త్రాల కన్నా కూడా అన్న వస్త్రాలే ముఖ్యమనేది మెజారిటీ కొరియన్ల అభిప్రాయం. ట్రంప్‌తో చర్చల ద్వారానైనా ఆర్థిక ఆంక్షలు తొలగిపోయి తమమ జీవితాలు మెరుగుపడతాయని వారు ఆశిస్తున్నారు.

ఉ.కొరియాలో దుర్భర దారిద్ర్యం

దేశ జనాభా- 2.5 కోట్లు
ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న వారు- 1.8 కోట్లు
ఆకలిలో అలమటిస్తున్న బాలలు- 60 వేలు
సరైన రోడ్లు లేని ప్రాంతం- 97%
కార్లు ఉన్న వారు- 1 శాతం
ఫోన్లు ఉన్న వారు- 20%
జైళ్లలో మగ్గుతున్న వారు-1.20 లక్షలు
మీడియా స్వేచ్ఛ- లేదు
సగటు ఆయుర్దాయం- 70 ఏళ్లు
(అంకెలకు ఆధారం సీఐఏ గణాంకాలు)



కొరియా- అమెరికా మధ్య వివాదం ఎక్కడ మొదలైంది?

వెయ్యేళ్లకు పైగా ఒకే దేశంగా ఉన్న కొరియా.. ఎందుకు ఉత్తర, దక్షిణంగా విడిపోయింది? వాటి మధ్య శత్రుత్వం ఎందుకు పెరిగింది? ఎక్కడో ఉన్న అమెరికాకు ఇందులో పాత్ర ఏమిటి? అనేవి ఆసక్తికర ప్రశ్నలు.

1904లో మూలాలు..

పశ్చిమ దేశాలు, సోవియట్ యూనియన్ నడుమ ప్రచ్ఛన్న యుద్ధమే కొరియా కొంప ముంచింది. కొరియా ద్వీపకల్పంపై నియంత్రణ కోసం 1904 నుంచి రష్యా, జపాన్ మధ్య పోరు సాగింది. 1910లో జపాన్ విజయం సాధించింది. తన కీలుబొమ్మ అయిన సన్‌జోంగ్ చక్రవర్తితో పెత్తనం సాగించింది. 1926లో ఆయన మరణించే నాటికి కొరియాపై జపాన్ పూర్తి పట్టు సాధించింది. హిరోషిమా, నాగసాకి మీద అణు బాంబు దాడి తర్వాత 1945లో రెండో ప్రపంచ యుద్ధం ముగిసిపోవడంతో జపాన్ సామ్రాజ్యం అంతమైంది. ఆ దశలో కొరియా ద్వీపకల్పంపై నియంత్రణ కోసం అమెరికా, సోవియట్ దళాలు పోటీ పడ్డాయి. 38వ సమాంతర రేఖ సరిహద్దుగా ఉత్తర, దక్షిణ భాగాలుగా కొరియాను విభజించాయి. రేఖకు దక్షిణంగా ఉన్న భూభాగం అమెరికా నియంత్రణలోకి వెళ్లింది. రేఖకు ఉత్తరంగా ఉన్న ప్రాంతంపై రష్యా పట్టు సాధించింది. అవే ఉత్తర, దక్షిణ కొరియాలయ్యాయి. అమెరికా ఆక్రమణలో ఉన్న దక్షిణ భూభాగంలో 1948లో ఐరాస పర్యవేక్షణలో ఎన్నికలు జరిగి, ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడింది. ఉత్తర భాగంలో కిమ్ ఇల్ సంగ్ నేతృత్వంలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రష్యా ఏర్పాటు చేసింది.

కొరియా యుద్ధం కొరివి

1950లో ఉత్తర కొరియా ఆకస్మికంగా దక్షిణ కొరియాపై విరుచుకుపడింది. దాదాపుగా ఆ దేశాన్ని ఆక్రమించింది. ఆ సమయంలో ఐరాస మద్దతుతో 'పోలీసు చర్య' సాగింది. ఐరాస పక్షాన పోరాడిన భద్రతా దళాల్లో ఎక్కువ శాతం మంది అమెరికన్ సైనికులే. వీరు ఉత్తర కొరియా సైనికుల ఆక్రమణను అడ్డుకున్నారు. ఉత్తర కొరియా తరపున చైనా సైనికులు పోరాడారు. 1953 వరకూ భీకర పోరు సాగింది. అదే ఏడాది జులైలో ఇరు పక్షాల నడుమ సంధి కుదిరే నాటికి 25 లక్షల మంది బలయ్యారు. ఒప్పందం నాటి నుంచి రెండు దేశాల మధ్య సమస్య పరిష్కారం కాలేదు. ఉప్పూనిప్పుగానే ఉన్నాయి. ఉత్తరాన కమ్యూనిజం, వెనుకబాటుతనం; దక్షిణాన ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగుతున్నాయి. ఉత్తర కొరియాలో కిమ్ వంశ పాలన సాగుతోంది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నంతో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినప్పటికీ కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు కొనసాగాయి. ఉత్తర కొరియా ఒకవైపు.. అమెరికా, దాని మిత్రపక్షం దక్షిణ కొరియా మరోవైపు నిలిచాయి. దక్షిణ కొరియాలో దాదాపు 25 వేల మంది సైనికులను అమెరికా మోహరించింది. సోవియట్ పతనానంతరం ఉత్తర కొరియా.. చైనాకు మరింత చేరువైంది.

కిమ్ జోంగ్ ఇల్ హయాంలో మరింత పతనం

1994లో కిమ్ ఇల్ సంగ్ మరణం తర్వాత.. పగ్గాలు కిమ్ జోంగ్ ఇల్‌కు దక్కాయి. ఆయన హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ బాగా క్షీణించింది. వరుస ఆంక్షలతో కుదేలైంది. అణ్వస్త్రాలు, దీర్ఘశ్రేణి క్షిపణులను సమకూర్చుకోవడంపై కిమ్ జోంగ్ ఇల్ దృష్టిపెట్టారు. 2006 అక్టోబర్ 9న తొలి అణు పరీక్షను నిర్వహించారు. 2011లో ఆయన మరణం తర్వాత కుమారుడు కిమ్ జోంగ్ ఉన్ పాలనా బాధ్యతలు చేపట్టారు. కిమ్ జోంగ్ ఉన్ తండ్రి కంటే దూకుడుగా అణ్వస్త్ర కార్యక్రమం కొనసాగించారు.

ప్రతిగా పలు విడతల్లో కఠిన ఆంక్షలను అమెరికా ఆధ్వర్యంలో అంతర్జాతీయ సమాజం విధించింది. మధ్యలో పలుమార్లు చైనా, రష్యాల ప్రమేయంతో అమెరికా సాగించిన చర్చలు విఫలమయ్యాయి.

2017లో తీవ్ర ఉద్రిక్తతలు..

గత రెండేళ్లలో ఉత్తర కొరియా వరుసగా అణు, క్షిపణి పరీక్షలు నిర్వహించింది. 2017లో ఏకంగా 17 పూర్తిస్థాయి క్షిపణి పరీక్షలు జరిపింది. అమెరికాను తాకే సామర్థ్యమున్న 13 వేల కిలోమీటర్ల స్థాయి ఖండాంతర క్షిపణులూ ఇందులో ఉన్నాయి. గత సెప్టెంబర్‌లో ఆరో అణు పరీక్షకు దిగింది. ఆ దేశ చరిత్రలో అదే అతిపెద్ద విస్ఫోటం. దీన్ని హైడ్రోజన్ బాంబుగా ఉత్తర కొరియా పేర్కొంది. అణు దాడుల హెచ్చరికలతో అమెరికా-కొరియాల మధ్య వాతావరణం ఉద్రిక్త స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో ప్రపంచం ఒక్కసారిగా అణు యుద్ధం ముంగిట్లోకి జారిపోయింది. అమెరికా.. హవాయ్‌లోని తన పౌరులను అణు దాడిని ఎదుర్కోవడంపై సిద్ధం చేసింది.

శాంతివైపు అడుగులు

ఈ ఉద్రిక్త వాతావరణం 2018 ఆరంభం నుంచే ఒక్కసారిగా మారిపోయింది. కొత్త సంవత్సరాది ప్రసంగంలో కిమ్.. దౌత్య మంత్రాన్ని పఠించారు. దక్షిణ కొరియాతో మెరుగైన సంబంధాలు, చర్చలను కోరుకుంటున్నట్లు ప్రకటించారు.

ఈ ఏడాది జనవరి 9న ఉత్తర, దక్షిణ కొరియాల అధికారులు.. సరిహద్దుల్లోని ఒక గ్రామంలో సమావేశమయ్యారు. దక్షిణ కొరియాలో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌కు తమ క్రీడాకారులు, ప్రతినిధులను పంపాలని ఉత్తర కొరియా నిర్ణయించింది. ఫిబ్రవరిలో జరిగిన ఈ క్రీడలకు కిమ్ సోదరి హాజరయ్యారు. రెండు దేశాల నడుమ శిఖరాగ్ర సదస్సు నిర్వహించాలన్న తన సోదరుడి కోరికను దక్షిణ కొరియా అధ్యక్షుడికి తెలియజేశారు. దక్షిణ కొరియా దూత ఒకరు మార్చి నెలలో వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. కిమ్‌తో భేటీకి రావాలని ఆహ్వానించారు. దీనికి ట్రంప్ అంగీకరించారు. తమ అణు, క్షిపణి పరీక్షలను నిలిపివేస్తున్నట్లు ఏప్రిల్ నెలలో ఉత్తర కొరియా ప్రకటించింది.

మంచు కరిగింది ఇలా...

ఈ ఏడాది ఏప్రిల్ 27న కిమ్.. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో సమావేశమయ్యారు. కొరియా యుద్ధం తర్వాత దక్షిణ కొరియాలోకి ప్రవేశించిన మొదటి ఉత్తర కొరియా పాలకుడిగా కిమ్ జోంగ్ ఉన్ గుర్తింపు పొందారు. అణ్వస్త్ర రహిత కొరియా, శాశ్వత శాంతి తమ లక్ష్యాలని ఇద్దరు నేతలు పేర్కొన్నారు. సింగపూర్‌లో జూన్ 12న తాను కిమ్‌తో భేటీ అవుతానని ట్రంప్ ప్రకటించారు. ఈ దశలో మళ్లీ రెండు పక్షాల మధ్య అపోహలు ఏర్పడి చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏకపక్ష అణు నిరాయుధీకరణకు అంగీకరించబోమని ఉత్తరకొరియా స్పష్టంచేయగా... చర్చల్ని రద్దుచేసుకుంటున్నట్లు ట్రంప్ కూడా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో సైతం తన అణు పరీక్షల స్థలిని ఉత్తర కొరియా నాశనం చేసింది. ఆ తర్వాత అత్యున్నత స్థాయి సమావేశాలు, రహస్య దౌత్యాలతో పరిస్థితి చక్కబడంది. చర్చలకు మార్గం సుగమమయింది.

శిఖరాగ్ర చర్చల ద్వారా ఇది జరగొచ్చు...

1. ఉత్తర కొరియా అణు కార్యక్రమ నియంత్రణకు సంబంధించి రెండు దేశాలూ ఒక సుదీర్ఘ ప్రక్రియపై అవగాహనకు రావొచ్చు. కొన్ని రాయితీలు ఇస్తే తప్ప- అణు కార్యక్రమాన్ని తక్షణం వదులుకోవడానికి కొరియా సిద్ధంగా లేదు. ఉత్తరకొరియా సంపూర్ణ అణు నిరాయుధీకరణ చేస్తే తప్ప అడుగులు ముందుకుపడవని అమెరికా స్పష్టంగా చెబుతోంది. ఈ రెండూ భిన్న వాదనలు. ఈ విపరీత అభిప్రాయ బేధాలు ఒక కొలిక్కి రావాలంటే రెండు వైపుల నుంచీ బలమైన ప్రయత్నాలు జరగాల్సి ఉంది.
2. నిర్దిష్ట ఫలితాల్లేకుండా- ఈ భేటీ ఒక టీవీ స్టంట్ లాగా సాగితే.. దానివల్ల జరిగే విపరీత ప్రచారంతో కిమ్‌కే ప్రయోజనం ఎక్కువ. ఉత్తర కొరియా అణు కార్యక్రమాన్ని నియంత్రించాలన్న అమెరికా లక్ష్యం ఏ కోశానా నెరవేరదు.
3. చర్చలు విఫలమైతే.. రెండు దేశాల మధ్య మళ్లీ మాటల యుద్ధం మొదలవుతుంది. 2017 నాటి పరిస్థితి పునరావృతమై.. ఉ.కొరియా మళ్లీ అణు పరీక్షలకు వెళ్లొచ్చు. అప్పుడు మళ్లీ రెండు దేశాలూ కయ్యానికి కాలు దువ్వొచ్చు.
4. చర్చలు విఫలమయ్యే పక్షంలో- దౌత్య చర్చల వల్ల లాభం లేదని అమెరికా భావిస్తే.. ఉ.కొరియాను అణు నిరాయుధీకరణ చేయడానికి అమెరికా బల ప్రయోగం చేయొచ్చు. అది అణు యుద్ధానికి దారి తీసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

మరింత ముందుకు భారత్-చైనా సంబంధాలు

బీజింగ్: భారత్-చైనా సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఉభయ దేశాల అగ్రనేతలు నిర్ణయించారు. ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌ల మధ్య గతంలో వుహాన్ నగరంలో జరిగిన చర్చల కారణంగా సంబంధాల్లో ఓ అడుగు ముందుకు పడగా, ప్రస్తుతం చింగ్‌డావ్‌లో జరిగిన భేటీ కారణంగా మరికొంత పురోగతి కనిపించింది. ఈ వేగాన్ని కొనసాగించాలని ఇరు దేశాల నేతలు నిర్ణయించారని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గెంగ్ షువాంగ్ సోమవారం ఇక్కడ తెలిపారు. వుహాన్‌లో జరిగిన అనధికారిక సమావేశం ద్వారా చాలా మేలు కలిగిందంటూ వారు సంతృప్తి చెందారని చెప్పారు. 'వుహాన్ ఏకాభిప్రాయాల'ను అమలు చేయాలని నిర్ణయించారని అన్నారు. ముంబయిలో బ్యాంక్ ఆఫ్ చైనా శాఖ ఏర్పాటు చేసేందుకు భారత్ అంగీకరించడం; బ్రహ్మపుత్ర నది వరదల సమాచారం ఇవ్వడం, బియ్యం దిగుమతులకు చైనా సమ్మతించడం ఈ భేటీ సాధించిన విజయాలని వివరించారు. షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ) సమావేశాల్లో నూతన కార్యాచరణ ప్రణాళికకు, 17 పత్రాలకు, ఆరు సహకార పత్రాలకు ఆమోదం లభించిందని చెప్పారు. ఈ సందర్భంగా కుదిరిన ఏకాభిప్రాయాలను సభ్య దేశాలతో కలిసి అమలు చేస్తామని తెలిపారు.

హాకింగ్ గౌరవార్థం బ్రిటన్‌లో ఫెలోషిప్‌లు

లండన్: ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ గౌరవార్థం 10 పరిశోధక ఫెలోషిప్‌లు ప్రారంభిస్తున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. తమ దేశ విద్యాసంస్థల్లో గణితం, భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన పీహెచ్‌డీ విద్యార్థులకు ఈ ఫెలోషిప్‌లను రానున్న ఐదేళ్లపాటు అందజేస్తామని వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 14న హాకింగ్(76) కన్నుమూసిన సంగతి తెలిసిందే.

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి.. 13 మంది మృతి

కాబూల్: ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా ఐఎస్ తీవ్రవాది జరిపిన ఆత్మాహుతి దాడిలో 13 మంది దుర్మరణం చెందారు. మరో 31 మంది గాయపడ్డారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లో పలు మంత్రిత్వశాఖలు ఉన్న భవనాల ప్రధాన ద్వారం వద్ద సోమవారం ఈ దాడి జరిగిందని అధికారులు వెల్లడించారు.

మానసరోవర్ యాత్ర ప్రారంభం

దిల్లీ: కైలాష్ మానసరోవర్ యాత్ర-2018కు తొలి బృందం సోమవారం బైలుదేరింది. విదేశాంగ వ్యవహారాల శాఖ సహాయమంత్రి వీకే.సింగ్ ఈ యాత్రను సోమవారం ప్రారంభించారు. ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా యాత్ర సజావుగా సాగాలన్న ఆకాంక్షను ఆయన ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. సోమవారం బయలుదేరిన అరవైమంది యాత్రికుల తొలి బృందం లిపులే మార్గం (ఉత్తరాఖండ్) మీదుగా మానసరోవర్ చేరుకుంటుంది.

పెట్రోలు, డీజిల్ ధరల తగ్గుముఖం

దిల్లీ: పెట్రోలు, డీజిల్‌ల ధరలు వరుసగా 13వ రోజైన సోమవారం కూడా తగ్గాయి. నాలుగు ప్రధాన మెట్రో నగరాల్లో పెట్రోలుపై 19-21 పైసలు, డీజిల్‌పై 15-16 పైసలు మేర ధరలు తగ్గాయి. లీటరు పెట్రోలు, డీజిల్ ధరలు చెన్నైలో రూ.79.48, రూ.71.73గా ఉన్నాయి.

అంతా సినిమా కథలా ఉంది: శివసేన

ముంబయి: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మావోయిస్టుల నుంచి ముప్పు ఉందన్న వార్తలను శివసేన కొట్టి పారేసింది. మోదీని హత్య చేసేందుకు మావోయిస్టుల కుట్ర అంటున్న లేఖ వ్యవహారం పూర్తి 'హాస్యాస్పదంగా' ఉన్నట్లు పేర్కొంది. హారర్ సినిమా కథలా ఉందని తన పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో పేర్కొంది.

నెలలోపు ఉద్యాన వర్సిటీ ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి చేయండి

ఈనాడు, హైదరాబాద్: ఉద్యాన విశ్వవిద్యాలయాల మధ్య ఉద్యోగుల తుది కేటాయింపు ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలని తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు.. ఆయా వర్సిటీలను హైకోర్టు ఆదేశించింది. ఉద్యోగులను విభజించకుండా ఇంట్లో కూర్చొబెట్టి జీతాలివ్వడం ఏమిటని ప్రశ్నించింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఉమాదేవితో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఆదేశాలు జారీచేసింది.

6 నెలల్లో ప్రతిపక్షాలు ఏకం

- దేశాన్ని ప్రజలే నడిపిస్తారు.. ఆ ముగ్గురు కాదు
- మోదీ, అమిత్ షా, భగవత్‌లపై రాహుల్ విమర్శలు

సోమవారం దిల్లీలో పార్టీ ఓబీసీ విభాగం నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

ఈనాడు, దిల్లీ: భాజపా-ఆర్ఎస్ఎస్ నేతల చేతుల్లో దేశం బానిసలా మారిందని.. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రతిపక్షాలన్నీ 6 నెలల్లో ఏకమవుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సోమవారం పేర్కొన్నారు. ప్రధాని మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షా, ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్‌లనుద్దేశించి ఆయన విమర్శలు చేశారు. "భారత్‌ను ప్రజలే నడిపిస్తారు తప్ప.. ఆ ముగ్గురు కాదన్న విషయం త్వరలోనే వారికి అర్థమవుతుంది. భారత్ బలమేమిటో వారు చూస్తారు." అని పేర్కొన్నారు. దిల్లీలోని తాల్కతోరా మైదానంలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం నిర్వహించిన సదస్సులో రాహుల్ గాంధీ ప్రసంగించారు. 70 ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీ ఓబీసీలకు వెన్నుదన్నుగా నిలిచిందని.. వారికి ఎప్పటికీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల వారిని అసెంబ్లీ, లోక్‌సభ, రాజ్యసభల్లోకి తీసుకొస్తామన్నారు. భారత్‌లో నైపుణ్యాలకు కొరత ఉందని ప్రధాని చెబుతున్నది వాస్తవం కాదని, ఓబీసీల్లో నైపుణ్యాలు పుష్కలంగా ఉన్నా.. అవకాశాలు దక్కడం లేదన్నారు. ఎంపీలు సహా భాజపాలో ఎవరినీ మాట్లాడనివ్వకుండా చేశారని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టించుకోని మోదీ ప్రభుత్వం కొద్దిమంది పారిశ్రామికవేత్తలకు మాత్రం రూ. 2.5 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ధ్వజమెత్తారు. ప్రధాని ప్రచారం కోసం రూ. వేల కోట్లు ఖర్చుచేసే సంపన్నులకు మాత్రమే భాజపా అండగా ఉంటుందని విమర్శించారు. అలాంటివారి కోసమే ప్రధాని ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ. 10 లక్షల కోట్లకు చేరాయని.. అవి రైతులు, చిన్నతరహా వ్యాపారులకు ఎందుకు అందుబాటులో ఉండవని ప్రశ్నించారు.

బీఎస్పీతో పొత్తుకు సీట్ల త్యాగం

- భాజపా ఓటమే మా ధ్యేయం: అఖిలేశ్

లఖ్‌నవూ: అవసరమైతే వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ కోసం కొన్ని సీట్లను వదులుకుంటామనీ, భాజపాను గద్దె దించడమే తమ ధ్యేయమని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ వెల్లడించారు. బీఎస్పీతో తమ అనుబంధం 2019 ఎన్నికల్లోనూ కొనసాగుతుందన్నారు. తమకు తగినన్ని స్థానాలను కేటాయిస్తే, 2019లో భాజపా వ్యతిరేక కూటమితో కలిసి పనిచేయడానికి అభ్యంతరం లేదని బీఎస్పీ అధినాయకురాలు మాయావతి వెల్లడించారు. ఈ క్రమంలోనే సీట్ల త్యాగానికి సిద్ధమంటూ అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అఖిలేశ్ సోమవారం మైన్‌పూర్‌లో మాట్లాడుతూ- "ఎస్పీ, బీఎస్పీల కలయిక భాజపాకు కునుకులేకుండా చేస్తోంది. రెండు పార్టీలూ కలిసి పోటీచేస్తే.. తాము అధికారం కోల్పోవాల్సి వస్తుందన్న గుబులు భాజపా నేతలకు పట్టుకుంది. బీఎస్పీకి మా కార్యకర్తలు ఎలా తోడుగా నిలుస్తారో త్వరలోనే చూస్తారు" అని పేర్కొన్నారు.

ఎన్డీఏలో అసంతృప్తి లేదు: నీతీశ్‌కుమార్

పట్నా: ఎన్డీఏలో విభేదాలేమీ లేవనీ, ఎన్నికలు వచ్చినప్పుడు భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు గురించి నిర్ణయం జరుగుతుందని బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధ్యక్షుడు నీతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. 40 లోక్‌సభ స్థానాలున్న బిహార్‌లో 25 సీట్ల కోసం జేడీ(యూ) పట్టుబడుతోందన్న వార్తల నేపథ్యంలో- సోమవారం ఆయన స్పందించారు. బిహార్‌లో ఎన్డీఏ సారథ్య బాధ్యతలను నీతీశ్‌కే అప్పగించాలనీ; 25 సీట్లలో తామూ, 15 సీట్లలో భాజపా పోటీ చేయడం ఆనవాయితీ అని పలువురు జేడీ(యూ) నేతలు ఇటీవల వ్యాఖ్యానించారు. భాజపా నేతలు దీనికి గట్టిగానే బదులిచ్చారు. ఎన్డీఏకు జాతీయస్థాయిలో మోదీ సారథిగా ఉన్నారంటూ తిప్పికొట్టారు. జేడీ(యూ) వ్యాఖ్యలపై మరో ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన ఆర్ఎల్ఎస్‌పీ కూడా ఘాటుగా స్పందించింది. తమ నాయకుడు, కేంద్రమంత్రి ఉపేంద్ర కుష్వాహ నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్తామంటూ పేర్కొంది. కుష్వాహ గతంలో నీతీశ్‌తో విభేదించి, ఆర్ఎల్ఎస్‌పీని స్థాపించారు. ఇటీవల ఎన్డీఏ ముఖ్యనేతల భేటీకి ఆయన హాజరు కాలేదు. ఆదివారం కుష్వాహ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు నీతీశ్, సుశీల్‌మోదీలు హాజరుకాలేదు. లోక్‌జనశక్తి పార్టీ నుంచీ ఎవరూ రాలేదు. దీంతో బిహార్‌లో ఎన్డీఏ పక్షాల నడుమ పొరపొచ్చాలు తలెత్తినట్లు ప్రచారం జరుగుతోంది.

లాలూకు జన్మదిన శుభాకాంక్షలు: ఆర్జేడీ సారథి లాలూప్రసాద్ యాదవ్ 71వ పుట్టిన రోజును పురస్కరించుకుని బిహారు ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్‌తో సహా పలువురు నేతలు ఆయనకు సోమవారం శుభాకాంక్షలు అందచేశారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, సీనియర్‌నేతలు అశోక్ గెహ్లోత్, జేడీ(యు) అధ్యక్షుడు శరద్‌యాదవ్, ఎన్సీపీ నాయకుడు ప్రఫుల్ పటేల్, కేంద్రమంత్రి ఉపేంద్ర కుష్వాహ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. లాలూ భార్య రబ్రీదేవి, ఆయన కుటుంబసభ్యులంతా కలిసి 71 పౌండ్ల కేక్‌ను కట్ చేశారు. జైలుశిక్ష అనుభవిస్తూ.. బెయిలుపై ఉన్న లాలూ మాత్రం హాజరుకాలేదు. ఝార్ఖండ్ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయన ఈ తరహా కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు.

ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్యం అసాధ్యం

- భాజపా అధ్యక్షుడు అమిత్ షా
- 'కాంగ్రెస్ ముక్త భారత్'కు వివరణ

రాయ్‌పుర్: ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్యం సాధ్యం కాదని భాజపా అధ్యక్షుడు అమిత్ షా పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ముక్త భారత్' అంటే.. ఆ పార్టీ సంస్కృతి లేని దేశమంటూ వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ దేశాన్ని కుంచింపజేస్తోందని విమర్శించారు. తాను రాహుల్‌గాంధీపై చేసిన కొన్ని విమర్శలను వ్యక్తిగతంగా తీసుకోవద్దని.. ఆయన వేసిన కొన్ని ప్రశ్నలకు సమాధానం మాత్రమే ఇచ్చినట్లు వివరించారు. కాంగ్రెస్‌ను బతికించుకోవడం రాహుల్‌గాంధీ బాధ్యత అని.. తనది కాదని పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లో 2రోజుల పర్యటన ముగింపు సందర్భంగా అంబికాపుర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. ప్రతిపక్షాన్ని దేశంలో లేకుండా చేయాలని భాజపా భావిస్తోందా? అన్న ప్రశ్నకు ఆయన వివరణ ఇచ్చారు. భాజపా మంచి చేస్తుండటం వల్లే ప్రజల మద్దతు పొందుతోందన్నారు. అన్నివర్గాల ప్రజల ప్రయోజనాల కోసం కేంద్రం పనిచేస్తుంటే.. మధ్యతరగతి ప్రజలు భాజపాకు దూరమవుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని ఓ ప్రశ్నకు జవాబిచ్చారు. మధ్యతరగతి ప్రజల సహకారంతోనే తమ పార్టీ 14 రాష్ట్రాల్లో విజయం సాధించిందని గుర్తుచేశారు.

రేపు మంత్రులందరితో మోదీ సమావేశం

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం తన మంత్రివర్గ సహచరులందరితో సమావేశం కానున్నారు. పార్లమెంటు హౌస్‌లో జరగనున్న ఈ సమావేశంలో కీలక పథకాల ప్రగతిని సమీక్షించనున్నారు. ఏడు నెలల విరామం అనంతరం ఈ సమావేశం జరగబోతోంది. ఇటీవల ఎన్నికల్లో పరాభవం ఎదురయిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. రైతుల దుస్థితి, పంటలకు మద్దతు ధర కల్పనపై చర్చించనున్నారు. ప్రధాన మంత్రి జన్ ఔషధి యోజన, ఆయుష్మాన్ భవ, ఫసల్ బీమా, ఉజ్వల్, ముద్ర యోజన, అంకురాలుకు నిధులు సమకూర్చడంవంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి.

మావోయిస్టుల కుట్ర లేఖలో నిజమెంత?

- కాంగ్రెస్ నేత చిదంబరం ప్రశ్న

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని హత్య చేయడానికి మావోయిస్టులు చేసిన కుట్రకు సంబంధించి పోలీసులు స్వాధీనం చేసుకున్న లేఖ యథార్థమైనదేనా అని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి. చిదంబరం సోమవారం ప్రశ్నించారు.'ప్రస్తుతం ఇది అధికారిక పత్రమయిప్పటికీ వాస్తవాల ధ్రువీకరణ జరగలేదు. ఇలాంటి లేఖలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అనుకుంటున్నాను. అలాంటి లేఖలు వస్తునే ఉంటాయ'ని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఉన్న నాలుగు టైర్లలో మూడింటికి పంక్చర్లు పడ్డాయని చిదంబరం వ్యాఖ్యానించారు. "గత నాలుగేళ్లుగా ఎగుమతులు తిరోగమనంలో ఉన్నాయి. ప్రయివేటు పెట్టుబడులు పూర్తిగా స్తంభించక పోయినా స్తబ్ధత నెలకొంది. గత మూడేళ్లుగా స్థిర పెట్టుబడి కల్పన 28.5 శాతానికి పరిమితమయింది. ప్రయివేటు వినియోగం గత కొన్ని నెలల కిందటి వరకు బాగా తగ్గింది. ప్రభుత్వ వ్యయం ఒక్కటే అధికంగా కనిపిస్తోంది. కరెంటు అకౌంట్‌లో లోటు, ద్రవ్యలోటు కారణంగా దీనికీ పరిమితులు ఉన్నాయ"ని వివరించారు. జీఎస్టీ అమలు సక్రమంగా లేక, నోట్ల రద్దు దుష్ఫలితాలు ఇప్పటికే అనుభవంలోకి వచ్చాయని తెలిపారు.

ప్రధానికి మరింత పటిష్ఠ భద్రత

దిల్లీ: ప్రధాని మోదీకి కల్పిస్తున్న భద్రతను మరింత పటిష్ఠం చేయనున్నారు. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన దిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. వివిధ భద్రతాసంస్థల నుంచి వివరాలు సేకరించి, ప్రధాని రక్షణకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని హోంమంత్రి ఆదేశించారు. సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, హోంశాఖ కార్యదర్శి పాల్గొన్నారు.

14న భిలాయి కొత్త ఉక్కు కర్మాగారం ప్రారంభం

ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయిలో ఆధునికీకరించిన ఉక్కు కర్మాగారాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం (14న) జాతికి అంకితం చేయనున్నారు. స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) ఉక్కు కర్మాగారాల్లో ఇదే అతిపెద్దది. మోదీ ప్రారంభిస్తున్న సెయిల్ కర్మాగారాల్లో ఇది మూడోది. దీని విస్తరణ, ఆధునికీకరణకు రూ.70,000 కోట్లను సెయిల్ వెచ్చించింది. దీంతో ఇక్కడ రైలు పట్టాల ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 8 లక్షల టన్నుల నుంచి.. 20 లక్షల టన్నులకు పెరగనుంది. వినియోగదారులు నేరుగా ఉపయోగించే వస్తువుల కోసం మరో 31.53 లక్షల ఉక్కునూ ఇది ఉత్పత్తి చేయనుంది.

సెన్సెక్స్ ▲ 40　**35483**

నిఫ్టీ ▲ 19　**10787**

డోజోన్స్ 25385 ▲ 69 | నాస్‌డాక్ 7670 ▲ 25 | రూపాయి 67.42 ▲ 08 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 76.61 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఈనాడు బిజినెస్

ఘనం (+)

నిఫ్టీ	11న	మార్పు %
BHARTI AIRTEL	388.80	2.98
BAJAJ FINANCE	2250.30	2.90
ULTRATECH CEM	3790.10	2.02
GRASIM	1049.10	1.99
ZEE ENTERTAINMENT	567.15	1.76
SUN PHA	535.70	1.41
BPCL	414.40	1.11

గ్రహణం (-)

నిఫ్టీ	11న	మార్పు %
TATA STEEL	588.65	-1.97
UPL	699.30	-1.91
HCL TECH	911.60	-1.84
POWER GRID CORP.	195.70	-1.11
INDIAN OIL CORP	173.10	-1.09
COAL INDIA	287.90	-0.69
ICICI BANK	286.40	-0.64

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	63.06	71.47	బహ్రెయిన్ దీనార్	166.69	199.10
పౌండ్ స్టెర్లింగ్	84.54	95.67	కువైట్ దీనార్	185.22	230.14
యూరో	74.34	84.18	ఒమన్ రియాల్	163.19	186.50
జపనీస్ యెన్/100	57.19	65.58	సౌదీ రియాల్	16.68	19.64
ఆస్ట్రేలియా డాలరు	47.83	54.21	యూఏఈ దిర్హమ్	17.07	19.82
సింగపూర్ డాలరు	46.25	54.76	మలేషియా రింగిట్	15.11	18.76
థాయ్ బాత్/100	193.70	229.31	చైనీస్ యువాన్	7.47	12.38



నేటి మార్కెట్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ల భేటీ నేడు మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. నిఫ్టీ 10750- 10920 పాయింట్ల మధ్య కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్, ఐరోపా కేంద్ర బ్యాంక్ పరపతి సమావేశాల నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి వ్యవహరించొచ్చు. ట్రంప్- కిమ్ భేటీ నుంచి సానుకూల వార్తలొస్తే అంతర్జాతీయ మార్కెట్లు రాణించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సారి అమెరికా ఫెడ్ పావు శాతం మేర వడ్డీ రేట్లు పెంచొచ్చని అంటున్నారు. మొండి బకాయిల సమస్యను వేగంగా పరిష్కరిస్తామని ఆర్థిక మంత్రి పీయూశ్ గోయెల్ వెల్లడించిన నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్ల జోరు కొనసాగొచ్చు. అంతర్జాతీయ ముడి చమురు ధరల క్షీణతతో చమురు మార్కెటింగ్ కంపెనీలు, వాహన సంస్థల షేర్లు వెలుగులోకి రావొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. మార్కెట్లు లాభపడితే.. ఈ రంగ షేర్లలో షార్ట్ కవరింగ్ చోటుచేసుకోవచ్చని భావిస్తున్నారు. ఔషధ, ఎఫ్‌ఎమ్‌సీజీ, ఐటీ షేర్లు సైతం నిఫ్టీకి దన్నుగా నిలిచే అవకాశం ఉంది. నేడు మార్కెట్లు ముగిసిన అనంతరం పారిశ్రామికోత్పత్తి, రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడనున్నాయి.

ఆరంభ జోరుకు కళ్లెం

- సూచీలకు స్వల్ప లాభాలు
- ట్రంప్- కిమ్ భేటీపై దృష్టి

సూచీల ఆరంభ జోరుకు కళ్లెం పడింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో, ట్రేడింగ్ చివరిలో అమ్మకాలు అధికమై, లాభాలను పోగొట్టుకున్నాయి. బ్యాంకింగ్, ఐటీ షేర్లలో మదుపర్లు లాభాలు స్వీకరించారు. జీ-7 సదస్సు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ల భేటీ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. పారిశ్రామికోత్పత్తి, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలపై దృష్టి పెట్టారు. నేటి నుంచి అమెరికా ఫెడ్ పరపతి సమావేశాలు ప్రారంభం కానుండటం ఇందుకు తోడైంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,472.59 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 35,704.84 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే చివరి గంటన్నర ట్రేడింగ్‌లో మదుపర్లు అప్రమత్తత పాటించడంతో ఆరంభ లాభాలను కోల్పోయింది. చివరకు 39.80 పాయింట్ల లాభంతో 35,483.47 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 19.30 పాయింట్లు పెరిగి 10,786.95 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,800 పాయింట్ల స్థాయిని అధిగమించింది.

అలెంబిక్ ఫార్మా అదుర్స్: మానసిక ఒత్తిడి చికిత్సలో వినియోగించే బుప్రోపియన్ హైడ్రోక్లోరైడ్ మాత్రలకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం లభించడంతో అలెంబిక్ ఫార్మా షేర్లు దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 19.99 శాతం పెరిగిన షేరు.. చివరకు 19.87 శాతం లాభంతో రూ.521.25 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,629.39 కోట్లు పెరిగి రూ.9,826.39 కోట్లకు చేరింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 లాభాలతో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్ 3.19%, సన్‌ఫార్మా 1.29%, డాక్టర్ రెడ్డీస్ 0.90%, మారుతీ సుజుకీ 0.84%, ఇండస్ఇండ్ బ్యాంక్ 0.76%, యాక్సిస్ బ్యాంక్ 0.68% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా స్టీల్ (1.79%), పవర్‌గ్రిడ్ (1.21%), కోల్ ఇండియా (0.72%), హీరో మోటోకార్ప్ (0.60%)లు మాత్రం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం 1.56 శాతం లాభపడింది. మన్నికైన వినిమయ వస్తువులు, ఆరోగ్య సంరక్షణ, టెక్, ఎఫ్‌ఎమ్‌సీజీ, ఐటీ, యంత్ర పరికరాల షేర్లు అదే బాటలో నడిచాయి. స్థిరాస్తి, లోహ, చమురు- గ్యాస్ షేర్లు మాత్రం డీలాపడ్డాయి.

డీమార్ట్ @ లక్ష కోట్లు

డి-మార్ట్ విక్రయశాలలను నిర్వహించే అవెన్యూ సూపర్‌మార్ట్ మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లను అధిగమించింది. సోమవారం బీఎస్ఈలో షేరు ఒకానొకదశలో రూ.1619.95 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. ఇంట్రాడే గరిష్ఠం ప్రకారం అవెన్యూ సూపర్‌మార్ట్ మార్కెట్ విలువ మొట్టమొదటి సారిగా రూ.లక్ష కోట్లను దాటింది. అయితే చివరకు 0.05 శాతం లాభంతో రూ.1593.80 వద్ద ముగిసింది. ఇదిలా ఉంటే, డీమార్ట్ 17వ వార్షికోత్సవం సందర్భంగా రూ.2500 విలువైన వోచర్ ఉచితంగా ఇస్తోందని వాట్సాప్‌లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని సంస్థ ప్రకటించింది.

72 నిరర్థక ఆస్తుల వేలం: ఆంధ్రాబ్యాంక్

ఈనాడు, హైదరాబాద్: నిరర్థక ఆస్తులను విక్రయించడానికి ఆస్తుల పునర్వ్యవస్థీకరణ కంపెనీల (అసెట్ రికనస్ట్రక్షన్ కంపెనీలు-ఏఆర్‌సీ) నుంచి ఆంధ్రా బ్యాంకు ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 72 ఖాతాలకు చెందిన దాదాపు రూ.1,860.06 నిరర్థక ఆస్తుల విక్రయానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆంధ్రా బ్యాంకు వెల్లడించింది. ఆసక్తి వ్యక్తీకరణ, నాన్ డిస్‌క్లోజర్ ఒప్పందం పత్రాలు సమర్పించడానికి జూన్ 7 చివరి తేదీ. ఇ-బిడ్డింగ్ జూన్ 25న జరుగుతుంది. హెచ్-1 బిడ్డర్లతో 26న చర్చలు జరుపుతారు.

స్టెర్లింగ్ బయోటెక్‌పై కేసు స్వీకరణ

ముంబయి: స్టెర్లింగ్ బయోటెక్ మొండి బకాయిలకు సంబంధించి ఆంధ్రా బ్యాంకు దాఖలు చేసిన దివాలా పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) బెంచ్ స్వీకరించింది. అహ్మదాబాద్‌కు చెందిన స్టెర్లింగ్ గ్రూప్‌నకు ఆంధ్రా బ్యాంకు ఆధ్వర్యంలోని బ్యాంకుల కన్సార్షియం రూ.5,000 కోట్లకు పైగా రుణాలు ఇచ్చాయి. స్టెర్లింగ్ గ్రూప్ కంపెనీల్లో మనీ లాండరింగ్, నిధుల మళ్లింపు జరిగిందని, రుణాలు నిరర్థక ఆస్తులుగా మారాయని డిసెంబరులో రిజర్వ్ బ్యాంకుకు ఆంధ్రా బ్యాంకు ఫిర్యాదు చేసింది. స్టెర్లింగ్ గ్రూప్‌లో జరిగిన అవకతవకలను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు పరిశోధిస్తున్నాయి.

మేలో ఇంధన గిరాకీ పెరిగింది

- ఏప్రిల్‌తో పోలిస్తే తక్కువే
- పెరిగిన ధరలే కారణం

దిల్లీ: ఏడాది క్రితంతో పోలిస్తే, గత మే నెలలో ఇంధన గిరాకీ 3.8 శాతం పెరిగింది. 2017 మే నెలలో 18.1 మిలియన్ టన్నుల వినియోగం జరగ్గా.. ఈ ఏడాది మేలో అది 18.71 మిలియన్ టన్నుల వినియోగం నమోదైనట్లు చమురు మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏప్రిల్ 2018లో గిరాకీ 4.4 శాతం పెరగ్గా, మేలో 3.8 శాతానికే పరిమితమైంది. ఏప్రిల్‌లో పెట్రోలు 9.2%; డీజిల్ 2.6% చొప్పున విక్రయాల్లో వృద్ధి లభించింది.. కానీ, మేలో పెట్రోలు విక్రయాలు 2 శాతం మాత్రమే పెరిగి 2.45 మిలియన్ టన్నులకు చేరగా.. డీజిల్ వినియోగం పెద్దగా మార్పు లేకుండా 7.54 మిలియన్ టన్నులకే పరిమితం అయింది. కర్ణాటక ఎన్నికలకు ముందు పెట్రో ధరలను మార్చకుండా, మే 14 నుంచి పెంచుతూ పోవడం వల్లే తక్కువ వృద్ధి నమోదైంది. మే 14 నుంచి 15 రోజుల వ్యవధిలో పెట్రోలు లీటరు ధర రూ.3.8; డీజిల్ రూ.3.38 మేర పెరిగాయి. మే నెలాఖరు నుంచి ధరలు తగ్గడం మొదలు పెట్టడంతో ప్రస్తుతం గరిష్ఠ స్థాయిల నుంచి అవి కిందికి దిగివచ్చాయి.

మార్కెట్ కబుర్లు

- సంస్థాగత మదుపర్ల ఫిర్యాదు మేరకు పరిపాలనా నిబంధనల ఉల్లంఘన వ్యవహారంపై చందాకొచ్చర్, ఆమె కుటుంబ సభ్యులను అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్) వివరణ కోరిందంటూ వచ్చిన వార్తలను **ఐసీఐసీఐ బ్యాంక్** ఖండించింది. అలాంటి సమాచారమేదీ తమకు రాలేదని ఎక్స్ఛేంజీలకు బ్యాంకు స్పష్టం చేసింది.
- దివాలా ప్రక్రియను ఎదుర్కొంటున్న **రుచి సోయా**ను కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూపు, పతంజలిలు సవరించిన బిడ్‌లు దాఖలు చేసినట్లు తెలుస్తోంది.
- **జీనియస్ కన్సల్టెంట్స్, వారోక్ ఇంజినీరింగ్**ల తొలి పబ్లిక్ ఆఫర్‌కు సెబీ అనుమతులు లభించాయి. పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ.170 కోట్ల తాజా షేర్లను, ప్రమోటర్ రాజేంద్ర ప్రసాద్‌కు చెందిన 10 లక్షల షేర్లను జీనియస్ కన్సల్టెంట్స్ జారీ చేయనుంది.
- దేశీయ విపణిలో వివిధ వ్యాపార విభాగాల నుంచి రూ.2,210 కోట్ల విలువైన ఆర్డర్లను **ఎల్‌అండ్‌టీ** చేజిక్కించుకుంది.
- రుణ సంక్షోభంలో చిక్కుకున్న ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్‌లో యాజమాన్య నియంత్రణ వాటాను **వేదాంతా** దక్కించుకుంది.
- మహారాష్ట్రలో 150 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ నుంచి **టాటా పవర్**కు ఆర్డరు లభించింది.
- గత ఆర్థిక సంవత్సరం, నాలుగో త్రైమాసిక ఫలితాలను తమ డైరెక్టర్ల బోర్డు ఆమోదించలేదని **ఫోర్టిస్ హెల్త్‌కేర్** తెలిపింది.
- ఉక్కు వైర్ల తయారీ సంస్థ **ఉషా మార్టిన్** తమ ఉక్కు వ్యాపారాన్ని విక్రయించే యోచనలో ఉంది. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేసి, ప్రతిపాదనలు విశ్లేషించాల్సిందిగా కోరింది.

ఆర్థిక గణాంకాలకు కొత్త ఆధార సంవత్సరం!

2017-18గా మార్చనున్న ప్రభుత్వం

దిల్లీ: స్థూల ఆర్థిక గణాంకాలకు ఆధార సంవత్సరాన్ని ప్రభుత్వం మార్పు చేయనుంది. ప్రస్తుతం 2011-12ను ఆధార సంవత్సరంగా పరిగణిస్తూ, ఆర్థిక గణాంకాలను విడుదల చేస్తుండగా.. ఇప్పుడు ఆధార సంవత్సరాన్ని 2017-18గా మార్చాలని కేంద్ర గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. కొత్త ఆధార సంవత్సరాన్ని అమల్లోకి తెచ్చేందుకు ఇతర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతోంది. చివరిసారి 2015లో ఆధార సంవత్సరాన్ని ప్రభుత్వం మార్చింది. అంతకుముందు 2004-05ను ఆర్థిక సంవత్సరంగా తీసుకునేవారు. 2015లో ఆధార సంవత్సరం మార్పు అనంతరం, జీడీపీలో అనూహ్య వృద్ధి నమోదుకావడం వివాదాస్పదం అయ్యింది. పాత ఆధార సంవత్సరం ప్రకారం 2013-14లో జీడీపీ వృద్ధి 4.7 శాతంగా ఉండగా.. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రకారం 6.9 శాతంగా నమోదైంది. అంతేకాకుండా కొత్త సిరీస్‌లో పాత సంవత్సరాల గణాంకాలను విడుదల చేయకపోవడంపై మంత్రిత్వ శాఖపైనా విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై స్పష్టతనిస్తూ సంప్రదింపుల అనంతరం పాత సంవత్సరాల గణాంకాలు విడుదల చేస్తున్నామని తెలిపింది. ఇందుకు వివిధ ప్రత్యామ్నాయాలనూ అన్వేషిస్తునామని పేర్కొంది.

20 ఏళ్లలో 80 లక్షల వాహనాలు

భారత్‌లో హ్యుందాయ్ మోటార్ తయారీ

దిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) అరుదైన ఘనత సాధించింది. భారత్‌లో ఉత్పత్తి ప్రారంభించాక గత 20 ఏళ్లలో 80 లక్షల వాహనాలను ఉత్పత్తి చేసినట్లు కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. 2021 కల్లా కోటి వాహనాల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపింది. భారతీయ విపణిలో 53,00,967 వాహనాలు విక్రయించగా, 27,03,581 వాహనాలను విదేశాలకు ఎగుమతి చేసింది. 'తక్కువ సమయంలో ఇలాంటి అరుదైన ఘనత సాధించిన కంపెనీ హ్యుందాయ్ ఒక్కటే. 19 ఏళ్ల 6 నెలల కాలంలోనే ఈ మైలురాయిని అధిగమించగలిగామ'ని హెచ్‌ఎంఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వైకే కూ తెలిపారు. 1998లో భారత్‌లో వాహనాల ఉత్పత్తి ప్రారంభించిన హెచ్‌ఎంఐఎల్ 2006 నాటికి 10 లక్షల మార్కును దాటింది. 2012 నాటికి 40 లక్షల మార్కు, తాజాగా 80 లక్షల మార్కును అధిగమించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 5,36,241 యూనిట్లను దేశీయంగా విక్రయించగలిగింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 5.2 శాతం ఎక్కువ.

'మౌలిక' రుణాలకు రూ.500 కోట్లతో ప్రత్యేక నిధి!

జులైలో ప్రారంభించే అవకాశం

ముంబయి: మౌలిక వసతులకు పెట్టుబడుల కోసం రూ.500 కోట్లతో రుణ పరిమితి పెంపు నిధిని వచ్చే నెలలో ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 2016-17 బడ్జెట్‌లోనే ఈ నిధి గురించి ప్రస్తావించారు. బీమా, పింఛను ఫండ్‌ల నుంచి మౌలికంపై పెట్టుబడులు ప్రోత్సహించేందుకు ఈ నిధి ఉపయోగపడుతుందని ఆర్థిక శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. 'మౌలిక రంగంలోని కంపెనీలు జారీ చేసే బాండ్లపై రుణ రేటింగ్ పెంచేందుకు ఈ నిధి తోడ్పడుతుంది' అని ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి (మౌలిక, విధాన, ఆర్థిక) కుమార్ వినయ్ ప్రతాప్ తెలిపారు. ప్రారంభ కార్పస్ నిధి రూ.500 కోట్లను ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ సమకూర్చి, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థను నిర్వహిస్తుందన్నారు.

నేడు పార్లమెంటరీ కమిటీ ముందుకు ఆర్‌బీఐ గవర్నర్!

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ నేడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఎదుట హాజరయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ నాయకుడు వీరప్ప మొయిలీ నేతృత్వంలోని ఆర్థిక కమిటీ, పలు అంశాలపై ఉర్జిత్ పటేల్‌ను ప్రశ్నించనుంది. పెద్ద నోట్ల రద్దు తరవాత ఆర్‌బీఐకి తిరిగొచ్చిన మొత్తం ఎంత? పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో చోటు చేసుకున్న మోసం, ఆర్‌బీఐ తీసుకున్న చర్యలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండి బాకీలు పేరుకుపోవడం, వాటిని తగ్గించేందుకు కార్యాచరణపై ఆయన్ను స్టాండింగ్ కమిటీ ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ కమిటీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు ఉన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బేస్ రేటు పెంపు

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రుణ రేట్లను పెంచాక, దాదాపు అన్ని బ్యాంకులు నిధుల వ్యయం ఆధారిత రుణ రేట్ల(ఎమ్‌సీఎల్‌ఆర్)ను పెంచుతూ వస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా గత వారమే వివిధ కాలవ్యవధులు కలిగిన రుణాలపై ఎమ్‌సీఎల్‌ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు పెంచింది. తాజాగా బేస్ రేటును కూడా 10 బేసిస్ పాయింట్లు పెంచింది. సోమవారం నుంచి బేస్ రేటు 8.95 శాతానికి చేరినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ వెబ్‌సైట్‌లో సమాచారం ఉంచింది.

త్వరలో మెగా ఫుడ్ ప్రాజెక్ట్

డ్యూక్స్ ఎండీ రవీందర్ అగర్వాల్

హైదరాబాద్ (బంజారాహిల్స్), న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మక ఆసియా అండ్ జీసీసీ 2017-18 అవార్డును రవి ఫుడ్స్‌కు చెందిన డ్యూక్స్ దక్కించుకుందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రవీందర్ అగర్వాల్ తెలిపారు. గతేడాది సంస్థ టర్నోవర్ రూ.1,500 కోట్లు అని, 2020 నాటికి రూ.3,000 కోట్లు సాధించాలన్నదే లక్ష్యమన్నారు. 5 లక్షల విక్రయశాలల్లో తమ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, ఈ సంఖ్యను రెట్టింపునకు పెంచుతామన్నారు. కొత్తూరులో త్వరలో రూ.250 కోట్లతో మెగా ఫుడ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 2017-18లో రూ.400 కోట్ల ఎగుమతులు సాధించామన్నారు. ప్రపంచంలోని మేటి 100 బ్రాండ్లలో ఉత్తమంగా నిలిచినందుకు తమకు ఆసియా అండ్ జీసీసీ 2017-18 అవార్డు దక్కిందన్నారు. బిస్కెట్ విపణిలో తమకు దాదాపు 80 శాతం వాటా ఉందన్నారు.

పబ్లిక్ ఇష్యూకు దొడ్ల డెయిరీ!

- ఒకటి, రెండు నెలల్లో ప్రతిపాదన సమర్పణ
- ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల నియామకం

ఈనాడు, హైదరాబాద్: పాలు, పాల ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతున్నందున విస్తరణ కార్యకలాపాలపై డెయిరీ కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణకు వివిధ మార్గాలు పరిశీలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన దొడ్ల డెయిరీ పబ్లిక్ ఇష్యూకు వచ్చే సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు నెలల్లో పబ్లిక్ ఇష్యూకు సంబంధించిన విషయ వివరణ పత్రాన్ని సెబీకి సమర్పించవచ్చు. ఇప్పటికే కంపెనీలో వాటా ఉన్న మదుపర్లు పబ్లిక్ ఇష్యూ ద్వారా తమ వాటాలో కొంత భాగాన్ని విక్రయించడంతో పాటు కొత్త షేర్లను జారీ చేసే అవకాశం ఉంది. ఇష్యూ అనంతరం సమకూరే నిధులతో విదేశీ మార్కెట్లలోకి విస్తరించాలని, సామర్థ్యాలను పెంచుకోవాలని కంపెనీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పబ్లిక్ ఇష్యూ పనులను చక్కబెట్టడానికి కంపెనీ ఇప్పటికే రెండు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులను నియమించినట్లు చెబుతున్నారు. దీనిపై కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా ప్రస్తుతానికి పబ్లిక్ ఇష్యూ అంశంపై ఎటువంటి వ్యాఖ్యానం చేయబోమని పేర్కొన్నారు.

దొడ్ల డెయిరీలో ప్రస్తుతం అమెరికా పీఈ ఫండ్ టీపీజీ గ్రోత్ నిర్వహిస్తున్న రైజ్ ఫండ్‌కు దాదాపు 25 శాతం వాటా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో కొంత భాగాన్ని రైజ్ ఫండ్ విక్రయించవచ్చు. పబ్లిక్ ఇష్యూ ద్వారా దాదాపు రూ.500 కోట్ల వరకు సమీకరించాలన్నది కంపెనీ ఉద్దేశంగా కనిపిస్తోంది. దొడ్ల డెయిరీలో వాటాను ఏడాది క్రితం అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రొటెర్రా ఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్స్ నుంచి దాదాపు 5 కోట్ల డాలర్లకు రైజ్ ఫండ్ సొంతం చేసుకుందని సమాచారం. 2012లో దొడ్ల డెయిరీలో వాటాను ప్రొటెర్రా దాదాపు రూ.110 కోట్లకు కొనుగోలు చేసింది. విడి కొనుగోళ్ల నుంచి, ప్యాకెట్లలో లభించే డెయిరీ పాలను కొనుగోలు చేయడానికి వినియోగదారులు బాగా అలవాటు పడుతున్నారు. దేశంలో మధ్య తరగతి వర్గాల ఆదాయం పెరగడంతో విలువ చేర్చిన పాల ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతోంది. 2014లో దేశంలో పాల గిరాకీ 13.8 కోట్ల టన్నులు ఉండగా.. 2022 నాటికి 20 కోట్ల టన్నులకు చేరుతుందని అంచనా. దేశీయ డెయిరీ వ్యాపారంలో వృద్ధి, వ్యాపార అవకాశాలను దృష్టిలో పెట్టుకుని డెయిరీ కంపెనీల్లో ప్రైవేట్ ఈక్విటీ కంపెనీలు, వెంచర్ కేపిటలిస్టులు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. డెయిరీ వ్యాపారంలో పెట్టుబడులకు ఆకర్షణీయమైన ప్రతిఫలాలు రాగలవని అంచనా వేస్తున్నారు.

FOR HEALTHIER LIFE ® DODLA DAIRY

ఆఫ్రికా దేశాలపై దృష్టి..

దొడ్ల డెయిరీ ఆఫ్రికా దేశాలపై దృష్టి కేంద్రీకరించాలని భావిస్తోంది. ఆఫ్రికాతోపాటు ఐరోపా మార్కెట్లలో కూడా కొనుగోళ్ల ద్వారా విస్తరించాలని యోచిస్తున్నట్లు గతంలో కంపెనీ యాజమాన్య వర్గాలు తెలిపాయి. 1998లో కార్యకలాపాలు ప్రారంభించిన దొడ్ల డెయిరీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా నాలుగు రాష్ట్రాల్లో పాల సేకరణ, ప్రాసెసింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. కంపెనీకి 11 ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 2016-17లో కంపెనీ టర్నోవరు రూ.1,182 కోట్ల నుంచి రూ.1,412 కోట్లకు చేరింది.

11న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	377	వరంగల్	379
చిల్లరగా(ఒక గుడ్డు)	4.35	విశాఖపట్నం	377
బెంగళూరు	420	చెన్నై	452
12వ తేదీకి...		చిత్తూరు	445
విజయవాడ/గోదావరి	370	నమక్కల్	435

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 382.30 (380.50) 2030226
ASIAN PAINTS 1283.30 (1278.85) 373098
AXIS BANK LT 539.95 (537.40) 4095873
BAJAJ AUTO L 2881.10 (2874.05) 413241
BAJAJ FINANC 2250.30 (2186.85) 2059581
BAJAJ FINSER 6068.95 (6025.50) 148193
BHARTI AIRTE 388.80 (377.55) 5444048
BHARTI INFRA 300.00 (298.40) 2123262
BPCL 414.40 (409.85) 6333917
CIPLA 560.80 (559.65) 3113604
COAL INDIA L 287.90 (289.90) 1745576
DR. REDDYS 2083.20 (2062.90) 1612295
EICHER MOTOR 29677.00 (29513.00) 15911
GAIL 343.55 (342.40) 2337447
GRASIM IND 1049.10 (1028.60) 416553
HCL TECH 911.60 (928.70) 2052597
HDFC 1839.45 (1840.45) 1561062
HDFC BANK 2042.30 (2049.35) 1772797
HERO MOTOCOR 3612.30 (3635.15) 249101
HINDALCO IND 244.70 (242.15) 5187556
HINDUSTAN UN 1601.40 (1595.60) 905198
HPCL 314.45 (311.30) 3490709
ICICI BANK 286.40 (288.25) 16876061
INDIABULLS H 1202.55 (1203.90) 757292
INDIAN OIL 173.10 (175.00) 9812557
INDUSINDBANK 1904.80 (1888.70) 794575
INFOSYS LTD 1262.40 (1260.05) 2585645
ITC 269.25 (267.90) 8572974
KOTAK MAHIND 1323.35 (1318.35) 1311222
LARSEN & TOU 1343.25 (1343.95) 1417401
LUPIN 809.50 (810.05) 3448600
M&M 916.85 (911.65) 1747134
MARUTI SUZIK 9022.65 (8932.45) 337828
NTPC LTD 161.75 (161.45) 4032079
ONGC 173.30 (173.70) 3192749
POWER GRID C 195.70 (197.90) 11063276
RELIANCE IND 982.65 (984.35) 6866053
SBI 274.00 (273.00) 18219428
SUN PHARMA 535.70 (528.25) 16452353
TATA CONSULT 1749.70 (1747.10) 2179378
TATA MOTORS 309.75 (309.95) 14650133
TATA STEEL L 588.65 (600.50) 5151101
TECH MAHINDR 714.20 (706.95) 4023019
TITAN IND 903.35 (896.00) 2032601
ULTRATECH 3790.10 (3715.15) 283522
UPL LIMITED 699.30 (712.90) 1105632
VEDANTA LIMI 246.10 (246.30) 17253950
WIPRO 264.40 (264.00) 2077925
YES BANK LTD 335.70 (337.65) 11980621
ZEE ENTERTAI 567.15 (557.35) 2142949

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1249.35 (1248.95) 36180
ACC 1320.20 (1315.10) 356878
ADITYA BIRLA 139.35 (140.80) 2403142
AMBUJA CEMEN 206.05 (206.00) 4756149
ASHOK LEYLAN 142.20 (145.00) 12524659
AUROBIND PHA 576.45 (572.35) 2705361
AVENUE SUPER 1594.40 (1593.55) 846296
BANK OFBAROD 133.70 (132.25) 13389907
BEL 118.95 (118.55) 2063887
BHEL 77.45 (77.55) 5338391
BOSCH LTD 18216.65 (18450.25) 15036
BRITANNIA 5910.45 (5917.65) 69237
CADILA HEALT 368.45 (364.35) 1284875
COLGATE PALM 1229.85 (1229.95) 209607
CONTAINER 1314.40 (1362.70) 295659
CUMMINS INDI 680.95 (690.90) 151465
DABUR INDIA 386.20 (382.35) 2111468
DLF LIMITED 202.45 (205.80) 4066622
EMAMI LIMITE 1070.15 (1066.20) 97263
GENERAL INS 737.20 (728.15) 37148
GODREJ CONSU 1139.45 (1168.55) 328359
HAVELLS INDI 558.70 (552.90) 1912057
HINDUSTAN ZI 302.05 (296.05) 1951398
IDEA CELLULR 63.75 (64.15) 12188544
INTERGLOBE A 1188.40 (1186.30) 476126
JSW STEEL LT 340.95 (343.25) 1886702
L&TFIN.HOLD 167.75 (168.70) 1753564
LIC HOUS.FIN 498.75 (496.95) 1599411
MARICO LIMIT 349.65 (343.65) 2464534
MCDOWELL 3377.95 (3355.00) 235763
MOTHERSON 310.05 (310.05) 2359331
MRF 76407.60 (75929.00) 3015
NHPC LTD 26.60 (26.55) 8761693
NMDC LTD 116.05 (118.10) 2952653
OIL INDIA 219.30 (220.55) 347036
ORACLE FIN S 3950.65 (3849.45) 50626
P&G HYG&HEAL 9473.85 (9401.55) 2825
PETRONET LNG 220.25 (225.80) 2506272
PIDILITE IND 1057.90 (1070.35) 1137368
PIRAMAL ENTE 2414.50 (2408.20) 200515
PNB 91.60 (90.45) 37150478
POWER FIN CO 84.50 (82.40) 12453087
RURAL ELEC C 115.85 (114.90) 4172669
SAIL 86.60 (83.85) 23476694
SBI LIFE INS 712.50 (692.35) 872476
SHREE CEMENT 16731.70 (16224.40) 26218
SHRIRAM TRAN 1462.50 (1446.05) 506878
SIEMENS 1033.15 (1009.70) 152751
SUN TV LTD 918.10 (921.15) 721519

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.30 (6.27) 155
AISHWARYA TE 4 (3.94) 2419
ALPHAGEO 658.05 (659.75) 3296
AMAR RAJA BA 773.15 (785.65) 13051
ANDHRA BANK 36.80 (37.20) 227403
ANDHRA CEMEN 9.75 (9.53) 3720
ANDHRA PAPER 324.90 (320.95) 1316
ANDHRA PETRO 47.15 (46.50) 31777
ANDHRA SUGAR 353.35 (352.30) 1736
ANJANI PORTL 182 (170) 417
ASTRA MICROW 100.05 (97.90) 65568
AUROBINDO PH 575.80 (571.95) 111115
AVANTEL SOFT 412.10 (404.30) 6357
AVANTI FEEDS 1903.05 (1825.60) 130103
AVON ORG 10 (9.96) 908
BALAJI AMIN 613.60 (594.50) 1196
BARTRONICS 11.05 (11.11) 7953
BHAGIRA CHEM 273.45 (273.45) 529
BHAGYA NAG 42.65 (41.65) 2233
BN RATHI SEC 42.50 (41.90) 140
BRILLIANT SE 3.91 (4.11) 87918
CIL SECURI 22.65 (23.50) 5164
COMBAT DRUGS 24 (22.95) 3721
CONT COFFEE 284.65 (283.95) 3267
COROMAN FERT 459.25 (450.80) 4196
CUBEX TUB 17.90 (18.80) 629
CYBERMATE 2.13 (2.05) 17636
CYIENT LIMIT 741.80 (727.20) 23869
DECCAN CEMEN 432.60 (431.50) 85
DIVI'S LAB 1024.65 (1051.25) 15479
DIVYA GRANIT 83 (79.95) 1
DR REDDY 2081.45 (2062.90) 828468
FOUR SOFT 61 (64.90) 3085
GATI CORPN 93.35 (90.60) 113260
GAYATRI PROJ 177 (180.95) 3813
GMR INFRASTR 16.25 (16.35) 1344914
GOLDST INFRA 168.15 (160.15) 424
GOLDSTONE EN 15.63 (15.27) 13047
GRANULES (I) 79.80 (78.80) 310327
GSS AMERICA 86.90 (87.80) 17229
GVK POWER 12.26 (11.83) 1051419
HBL NIFE POW 36.20 (35.80) 35767
HERITAGE FOO 701.80 (687.70) 543
HIL LTD 1966.30 (2015.60) 1283
HIND FLUROCA 12.47 (11.34) 642
IDL INDUSTRS 414.80 (400.85) 56
IKF SOFT 0.50 (0.49) 116949
ILFS ENGINEE 30 (30.05) 6196
INCAP 64.15 (64.15) 275
INNAREDY COM 1.87 (1.96) 2053
IVRCL INFRAS 1.31 (1.37) 3665779
JEEVAN SCIEN 33.15 (33.70) 3715
KAKATIYA CEM 262.40 (254.85) 8992
KALLAM SPG 27.90 (27.85) 24180
KAVERI SEED 524.05 (526.20) 22304
KCP LTD 107.35 (110.20) 11555
KERNEX MICRO 26.30 (27.55) 11682
KNR CONSTRUC 277.35 (282.15) 6516
KREBS BIO 137.65 (144.85) 1425
LANCO INDUS 300.10 (298.05) 4996
LANCO INFRAT 0.86 (0.86) 296019
LASER DOT 7.51 (7.90) 50
LAURUS LABS 502.25 (482.40) 14115
LOKESH MACH 66.15 (67.15) 12363
MADHUCON PRO 13.80 (13.80) 21187
MEGA SOFT 9.93 (10.11) 7500
MIC ELECTRON 4.06 (3.89) 46410
MOLD-TEK.TEC 41.25 (42) 1070
MOLDTK PLA 306.50 (302) 5639
MSR INDIA LT 31.30 (30) 4212
NAGARJAGRICH 27.90 (28.60) 10577
NATCO PHARMA 786.60 (786.75) 42646
NAVA BH VENT 135.65 (137.60) 36168
NCC 112.65 (110.55) 524093
NCL IND 185.20 (185.50) 3536
NEHA INTER 5.89 (5.90) 14696
NETTLINX 59.10 (58.90) 34048
NEULAND LAB 698.20 (688.60) 8843
NILE 584 (582.70) 2348
NORTHGATE TE 0.60 (0.63) 26110
OIL COUNTRY 20.45 (20.40) 1922
PANKAJ POLY 6.21 (6.53) 650
PANYAM CEMEN 25.35 (26.95) 24718
PENNER IND 55.55 (52.60) 53800
PHYTOCHEM I 53.70 (53.30) 1930
PIONEER DIST 282.10 (283.65) 13753
PITTI LAMIN 89.55 (88.45) 5259
POKARNA 160.50 (169.45) 1347
PRAJAY ENGS 11.59 (10.92) 25460
PREMIER EXPL 281.20 (278.05) 385
PRISM CEMENT 111.70 (109.35) 25325
PRUDENTL PHA 3.28 (3.46) 823529
RAASI REFRAC 3.10 (3.12) 80
RAIN INDUSTR 227.70 (232.95) 333585
RAJ PACKAGIN 29.85 (28.40) 101
RAJVIR INDUS 36.25 (34.75) 5
RAM INFORMAT 40 (41.70) 2971
REG.CERAMIC 4.05 (3.89) 101
SAGAR CEM 857.50 (818.80) 5476
SAMKRG PIST 241.05 (245) 3384
SAMPRE NUTRI 47.50 (48.25) 5793
SATVAH. ISPA 15.15 (14.30) 23152
SMS PHARMA 68.55 (65.90) 823
SOUTH BIO TE 1.47 (1.52) 1201
SPHERE GLOBA 25.90 (27.90) 9517
SREE RAYAL A 37.95 (37.35) 104975
SRI KPR INDU 27 (26.25) 2259
SRINIVASA SH 39.50 (42.50) 705
SS ORGANICS 5.60 (5.60) 2000
STARCHIK SP 27.55 (26.25) 360
STEEL EXCHAN 24.80 (24.25) 65409
SUJANA METAL 0.86 (0.88) 4000
SUJANA TOWER 2.80 (2.74) 4321
SUJANA UNIVE 0.51 (0.51) 15024
SURANA TELE 4.50 (4.63) 3122
SURYALAKSH.C 55.65 (56.95) 1730
SURYALATA SP 134.45 (128.30) 24
SUVEN PHARMA 226.35 (214.30) 285928
TAJ GVK HOTE 230.80 (211.40) 47081
TANLA 32.05 (30.55) 15014
TERA SOFTWAR 40.25 (39) 555
TRANS BIOTEK 2.07 (2.04) 7775
TRENDY KNIT 0.19 (0.19) 700
VBC FERRO 37.75 (39.70) 2200
VICEROY HOTE 8.41 (8.01) 49548
VIJAY TEXTIL 58.50 (56.05) 16655
VIMTA LABS 218.85 (218) 1812
VISAKA IND 640.50 (638.95) 3652
VISTA PHARMA 37.25 (38.35) 4703
VIVIMED LABS 58.85 (60.85) 84126
YBRANT DIGIT 4.46 (4.25) 129531
ZENOTECH LAB 40.65 (36.80) 29881
ZENTECH 86 (87.20) 5709

CA

భారీ మొత్తం రుణాలకు ముసాయిదా నిబంధనలు

ముంబయి: భారీమొత్తం రుణాలు తీసుకునే వారిలో క్రమశిక్షణ పెంచడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసింది. బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి నిర్వహణ మూలధన సదుపాయాన్ని పొందే పెద్ద రుణ గ్రహీతలకు ఇవి వర్తిస్తాయి. ఈ మార్గదర్శకాల ప్రకారం.. రూ.150 కోట్లు, ఆ పైన నిర్వహణ మూలధన పరిమితి ఉన్నవారికి 40 శాతం రుణం(లోన్ కాంపొనెంట్) తీసుకోవచ్చు. మిగిలిన మొత్తాన్ని క్యాష్ క్రెడిట్ రూపంలో పొందవచ్చు. ఈ నిబంధన అక్టోబరు 1, 2018 నుంచి అమల్లోకి తీసురావాలని భావిస్తున్నారు. ఏప్రిల్ 1, 2019 నుంచి ఈ లోన్ కాంపొనెంట్‌ను 60 శాతానికి సవరిస్తామని ఆర్‌బీఐ ముసాయిదా పేర్కొంది. ఈ ముసాయిదాపై జూన్ 26 వరకు బ్యాంకులు, ఇతరుల స్పందనలను ఆర్‌బీఐ ఆహ్వానిస్తోంది. సాధారణంగా బ్యాంకులు క్యాష్ క్రెడిట్/ఓవర్ డ్రాఫ్ట్, వర్కింగ్ క్యాపిటల్ డిమాండ్ లోన్, బ్యాంక్ గ్యారెంటీ, లెటర్ ఆఫ్ క్రెడిట్, ఫాక్టరింగ్ రూపంలో నిర్వహణ మూలధన రుణాలను ఇస్తుంటాయి. ఎక్కువగా క్యాష్ క్రెడిట్(సీసీ)ను ఉపయోగిస్తుంటారు.

పౌర సేవా కేంద్రాల్లో బ్యాంకు సేవలు!

ఆర్థిక మంత్రి పియూశ్ గోయెల్ ప్రతిపాదన

ముంబయి: దేశ వ్యాప్తంగా ఉన్న 2.9 లక్షల పౌర సేవా కేంద్రాల్లో (సీఎస్‌సీలు) బ్యాంకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి పియూశ్ గోయెల్ ప్రతిపాదించారు. '2.9 లక్షల కేంద్రాల్లో బ్యాంకు కౌంటర్లను ప్రారంభించే సవాలుకు మీరు సిద్ధంగా ఉంటే నా కల నెరవేరుతుంది. అవసరమైతే మీకు ఉచిత విద్యుత్ అందించడానికి చిన్న పాటి సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి పునరుత్పాదక, విద్యుత్ మంత్రిత్వ శాఖ సహకారం తీసుకుంటాం' అని గోయెల్ అన్నారు. రైలు టికెట్ల బుకింగ్ నిమిత్తం ఐఆర్‌సీటీసీ, సీఎస్‌సీ ఇ-గవర్నెన్స్‌లు ఒప్పందంపై సంతకాలు చేసే కార్యక్రమంలో సోమవారమిక్కడ ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే సీఎస్‌సీల వద్ద ఉచిత వైఫై సేవలు అందిస్తున్నట్లు రైల్వే మంత్రి కూడా అయిన గోయెల్ గుర్తు చేశారు. 'సీఎస్‌సీలతో ప్రధాన బ్యాంకింగ్ సేవలనూ అనుసంధానం చేయవచ్చు. ఇందువల్ల ప్రతి గ్రామీణుడికీ తన గృహం సమీపంలో ఒక బ్యాంకు ఉన్నట్లు అవుతుందన్నారు. 8,000 రైల్వే స్టేషన్లలోనూ సీఎస్‌సీలు ప్రారంభించాలని నేను ప్రతిపాదిస్తున్నా. వీటిద్వారా టెలీ మెడిసిన్, విద్యతో పాటు ఇతరత్రా సేవలూ అందుతాయి. రూ.1-1.25కు రుతు రుమాళ్లు(శానిటరీ ప్యాడ్స్) అందించే అవకాశాన్నీ సీఎస్‌సీలు పరిశీలించాల'ని ఆయన అన్నారు. సీఎస్‌సీలకు అన్ని అవకాశాలను కల్పిస్తామని, వాటిని అందిపుచ్చుకోవడానికి ముందుకు రావాలని ఐటీ మంత్రి రవి శంకర్ ప్రసాద్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో లిథియమ్ అయాన్ బ్యాటరీల తయారీ ఏప్రిల్ నుంచి

మూడు దశల్లో రూ. 799 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: లిథియమ్ అయాన్ బ్యాటరీల ఉత్పత్తి దేశీయంగా 2019 ఏప్రిల్ నాటికి ప్రారంభమవుతుందని ఇండియన్ సెల్యులార్ అసోసియేషన్ (ఐసీఏ) చెబుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో మునోత్ ఇండస్ట్రీస్ మూడు దశల్లో రూ.799 కోట్లతో తొలి లిథియమ్ అయాన్ బ్యాటరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు తొలి దశ నుంచి ఏప్రిల్ 2019 నాటికి ఉత్పత్తి ప్రారంభమవుతుందని పేర్కొంది. ఈ ప్రాజెక్టు ద్వారా 1700 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐసీఏ వెల్లడించింది. రూ.165 కోట్లతో ప్రాజెక్టు తొలి దశలో రోజుకు 2,00,000 ఏహెచ్ (ఆంపియర్ అవర్) ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించేలా సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. మూడు దశలు పూర్తయితే రోజుకు 10 లక్షల ఏహెచ్ ఉత్పత్తి సామర్థ్యం ఈ ప్లాంటు సొంతమవుతుంది. ప్రస్తుతం లిథియమ్ అయాన్ సెల్స్‌ను దిగుమతి చేసుకొని భారత్‌లో బ్యాటరీ ప్యాక్‌లను అసెంబుల్ చేస్తున్నారు. ఇప్పటివరకూ భారత్‌లో లిథియమ్ అయాన్ సెల్స్ తయారీకి ప్లాంటు లేదు. మునోత్ ఇండస్ట్రీస్ ఒక్కటే ఇప్పుడు ఈ రంగంలో ఉంది. ఇదిలా ఉంటే దేశంలో 20 బ్యాటరీ ప్యాక్ అసెంబ్లింగ్ యూనిట్లు ఇప్పటికే ఉన్నాయి.

కియా విద్యుత్ కార్లొస్తాయ్

- హైబ్రిడ్ విభాగంలోకీ అడుగు
- 2021 కల్లా ఉత్పత్తి
- మూడేళ్లలో మూడు మోడళ్లు
- గడువు కన్నా 10 శాతం ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్లాంటు పనులు

కియా మోటార్స్ ఇండియా సీఈఓ, ఎండీ కూక్ హ్యున్ షిమ్

దిల్లీ

దక్షిణ కొరియాకు చెందిన కార్ల తయారీ కంపెనీ కియా, 2021 కల్లా భారత్‌లో విద్యుత్, హైబ్రిడ్ కార్లు ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో ఏర్పాటు చేస్తున్న ప్లాంటు నుంచే వీటినీ ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్లాంటు నుంచి పెట్రో కార్లను వచ్చే ఏడాది సంస్థ విడుదల చేయనుంది. వచ్చే మూడేళ్లలో మూడు మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావాలని కియా మోటార్స్ కార్పొరేషన్ పూర్తి స్థాయి అనుబంధ సంస్థ కియా మోటార్స్ ఇండియా భావిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది వాహన ప్రదర్శనలో చూపించిన ఎస్‌యూవీ, ఎస్‌పీ కాన్సెప్ట్ కార్లను ముందుగా ఆవిష్కరిస్తారు. మా అనంతపురం ప్లాంటులో విద్యుత్, హైబ్రిడ్ కార్లు ఉత్పత్తి చేయాలని భావిస్తున్నామ'ని కియా మోటార్స్ ఇండియా సీఈఓ, ఎండీ కూక్ హ్యున్ షిమ్ పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. కంపెనీ ఈ ప్లాంటుపై 1.1 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.7100 కోట్లు) పెట్టుబడులు పెట్టనుంది. ఏటా 3 లక్షల కార్లను తయారు చేయగల సామర్థ్యం ఈ ప్లాంటుకు ఉంటుంది. ఒక్కసారి పూర్తి స్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే 3,000 మందికి ఉపాధి లభిస్తుంది.

'మా బ్రాండ్‌ను పర్యావరణ హిత కార్ల తయారీ కంపెనీగా నిలబెట్టాలని మేం భావిస్తున్నాం. ఈ మార్కెట్లో దిగ్గజ సంస్థగా ఉండాలనుకుంటున్నాం. కాబట్టి 2021 కల్లా పూర్తి స్థాయి విద్యుత్ కారు తీసుకువస్తామ'ని షిమ్ పేర్కొన్నారు. అయితే ప్రతిపాదిత విద్యుత్ కారు గురించిన వివరాలను ఆయన వివరించలేదు. ఈ ఏడాది జరిగిన వాహన ప్రదర్శనలోనూ 2019-21 మధ్య భారత్ కోసమే ప్రత్యేకంగా ఒక కాంపాక్ట్ విద్యుత్ కారును తయారు చేస్తామని కియా మోటార్స్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, సీఈఓ హంకూ పార్క్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా 2025 కల్లా 16 విద్యుత్ కార్లను ప్రవేశపెట్టాలని ఆ కంపెనీ అనుకుంటోంది. 'ఇప్పటికే ఐరోపా, అమెరికా మార్కెట్లలో విద్యుత్ కార్ల(ఈవీ)ను విక్రయిస్తున్నాం. కాబట్టి కొత్తగా సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుకోవాల్సిన అవసరం లేదు. భారత్ విషయంలో అందుకే ధీమా ఉన్నామ'ని షిమ్ చెప్పుకొచ్చారు.

అనంతపురం జిల్లాలో నిర్మితమవుతున్న కియా ప్లాంట్

ఆయన ఇంకా ఏమన్నారంటే..

- ప్రస్తుతం ఈవీ (విద్యుత్తు వాహనా)లకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో దేశంలో ఇబ్బందులు ఉన్నాయి. వీటికి 2021 కల్లా పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నాం.
- మూడేళ్లలో మూడు మోడళ్లను ప్రారంభిస్తాం. ఈ విషయంలో భారత్‌లో మార్కెట్ సర్వే చేస్తున్నాం. అంతర్జాతీయంగా చేపట్టనున్న 16 బ్రాండ్లలో భారత్‌కు ఏ మూడు అయితే బాగుంటుందని పరిశీలిస్తున్నాం.
- అంతర్జాతీయంగా ఎస్‌యూవీ, ఎమ్‌పీవీల విభాగంలో కియాకు మంచి పట్టుంది. ఈ వాహనాలకు భారత్‌లో భారీ గిరాకీ ఉంది. అందుకే మా ప్రాధాన్యత ఎస్‌యూవీలకే. అయినప్పటికీ మా పోర్ట్‌ఫోలియోలో హ్యాచ్‌బ్యాక్, కాంపాక్ట్ కార్లు కూడా ఉంటాయి.
- ప్రస్తుతం సరైన డీలర్‌షిప్ భాగస్వామ్యాలను ఎంపిక చేసుకునే ప్రక్రియలో ఉన్నాం. భారత్ మొత్తం నెట్‌వర్క్‌ను నెలకొల్పుతాం.
- హ్యుందాయ్ ఇండియాతో భాగస్వామ్యం ఉన్నా విక్రయాలు, సేవల నెట్‌వర్క్ విషయంలో స్వతంత్రంగానే ఉంటాం. స్థానిక సరఫరాదార్లు కూడా వేర్వేరుగానే ఉంటారు. అయితే దక్షిణ కొరియా సరఫరాదార్లు ఇద్దరికీ ఒకేలా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే 120 మంది సరఫరాదార్లతో కియా ఇండియా చర్చలు జరపడం ప్రారంభించింది.
- హ్యుందాయ్‌తో మా ప్లాంటును పంచుకునే అవకాశం లేదు. మా కియా వాహనాలకు భారత్‌లో గిరాకీ కనిపిస్తోంది.
- ఈ ఏడాది అక్టోబరు నుంచి 3000 మంది సిబ్బంది నియామక ప్రక్రియను మొదలుపెడతాం. 2020 కల్లా పూర్తి చేస్తాం. ప్లాంటులో మూడు షిఫ్ట్‌లకు సరిపడా ఉద్యోగులను తీసుకుంటాం.
- అనంతపురం ప్లాంటు 65 శాతం పూర్తయింది. సాధారణ గడువు కంటే 10 శాతం ముందే ఉన్నాం. మిగిలిన సమయాన్ని కాంపాక్ట్ ఎస్‌యూవీ నమూనా ఉత్పత్తికి ఉపయోగిస్తాం.

టెక్ ఉద్యోగాల్లో హైదరాబాద్ నెం.4

అగ్రస్థానంలో బెంగళూరు

దిల్లీ: టెక్నాలజీ రంగంలో అత్యధిక ఉద్యోగావకాశాలున్న నగరంగా బెంగళూరు అగ్రస్థానంలో ఉంది. తరవాత స్థానంలో దిల్లీ-ఎన్‌సీఆర్, పుణె నగరాలు ఉన్నాయని జాబ్‌పోర్టల్ ఇండీడ్ నివేదిక వెల్లడించింది. అందులోని మిగతా వివరాలు..

- సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరు నగరం టెక్నాలజీ రంగంలో 22 శాతం ఉద్యోగావకాశాల్ని సృష్టిస్తోంది. దిల్లీ-ఎన్‌సీఆర్ 11 శాతం, పుణె 10 శాతంతో తరవాత స్థానాల్లో నిలిచాయి.
- హైదరాబాద్ 9 శాతంతో నాలుగో స్థానంలో ఉంది. దీని తరవాత ముంబయి 8 శాతం, చెన్నై 7 శాతం, మొహాలి 4 శాతం, అహ్మదాబాద్ 3 శాతం ఉద్యోగాల్ని సృష్టిస్తున్నాయి.
- ఉద్యోగాన్వేషణలో ఉండే 20-29 ఏళ్ల మధ్య యువకులు అత్యధిక శాతం మంది టెక్నాలజీ రంగంలోనే కొలువు తెచ్చుకోవాలని ఆసక్తి చూపుతున్నారు. ఈ వయసు వారినే సంస్థలు కూడా ఎక్కువగా నియమించుకొంటున్నాయి. విచిత్రమేమిటంటే 55 ఏళ్లు నిండిన వారు కూడా ఈ రంగంలోనే ఉద్యోగాలు చేసేందుకు అమితాసక్తి చూపిస్తున్నారు. 40-49 ఏళ్ల మధ్య ఉన్నవారు మాత్రం టెక్నాలజీ రంగం వైపు అడుగులు వేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు.

రూపాయి బలోపేతానికి ఎన్‌ఆర్‌ఐ బాండ్లు!

- రూ.2 లక్షల కోట్ల సమీకరణకు ఆర్‌బీఐ చర్యలు
- బ్యాంక్ ఆఫ్ అమెరికా నివేదిక

దిల్లీ: ఎన్‌ఆర్‌ఐ బాండ్ల ద్వారా 30- 35 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.2- 2.25 లక్షల కోట్లు) సమీకరించడానికి రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) సన్నాహాలు చేయొచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ నివేదిక అంచనా వేసింది. చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత మదుపర్ల పెట్టుబడుల తగ్గిన నేపథ్యంలో రూపాయి కోలుకోవడం కోసం ఆర్‌బీఐ ఈ నిధుల సమీకరణ చేపట్టొచ్చని పేర్కొంది. ఎంఎస్‌సీఐ వంటి అంతర్జాతీయ ఎక్స్ఛేంజీల్లో చైనా సంస్థలు నమోదు కావడం వల్ల భారత్‌లో విదేశీ మదుపర్ల పెట్టుబడులపై ప్రభావం పడిందని తెలిపింది. చైనా సంస్థల నమోదు వల్ల 2019కు 100 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.6.5 లక్షల కోట్లు) చైనా మార్కెట్‌కు తరలిపోవచ్చని నివేదిక అంచనా వేసింది. వచ్చే ఏడాది భారత్‌లో సాధారణ ఎన్నికలు జరగనుండటం, షేర్లు అధిక విలువలకు చేరడంతో ఎఫ్‌పీఐ పెట్టుబడులు నెమ్మదించే అవకాశం ఉందని వెల్లడించింది. అంతర్జాతీయ చమురు ధరలు 70 డాలర్ల వద్దే ఉంటే ఆర్‌బీఐ ఎన్‌ఆర్‌ఐ బాండ్లను జారీ చేయొచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా అభిప్రాయపడింది. ఈ ఏడాది ముడిచమురు సగటు ధర అధికంగా ఉండడంతో 2016-17లో 0.7 శాతం ఉన్న కరెంటు ఖాతా లోటు.. 2.4 శాతానికి పెరగొచ్చని అంచనా వేసింది.

పెట్రోలు రూ.50కే వస్తుంది!

జీఎస్‌టీ

ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెట్రోలియం ధరలపై విస్తృత చర్చ నడుస్తోంది. పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంపై ప్రతిపక్షాల నుంచే కాదు సామాన్యుల నుంచీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదనే చెప్పొచ్చు. పన్నులు అధికంగా ఉండటమే ఇందుకు కారణం. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి తేవడమే ఈ సమస్యకు పరిష్కారమని కొందరు సూచిస్తున్నారు. మరి సామాన్య ప్రజానీకానికి ప్రయోజనం చేకూర్చే ఈ ప్రతిపాదనపై కేంద్రం ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోతోంది? రాష్ట్రాలు అడ్డుపడుతున్నాయా? ఈ విషయంలో జీఎస్‌టీ మండలి పాత్ర ఏంటి? తెలుసుకుందాం.

సతీష్ సరాఫ్,
చార్టర్డ్ అకౌంటెంట్

ఒక వస్తువుకు సంబంధించి పన్నుపై పన్ను కట్టే భారాన్ని తప్పించే ఉద్దేశంతో కేంద్రం వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానాన్ని తీసుకొచ్చింది. దాదాపు అన్ని వస్తువులు, సేవలు ఈ కొత్త పన్ను పరిధిలోకి వచ్చాయి. అయితే రాష్ట్రాలకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే మద్యంతో పాటు పెట్రోలియం ఉత్పత్తులను ఇందులో చేర్చలేదు. వీటిని కూడా జీఎస్‌టీ పరిధిలోకి తేవాలనే డిమాండు వినిపిస్తున్నప్పటికీ.. ఆ దిశగా కేంద్రం అడుగులు వేయలేకపోతుంది. ఎందుకంటే ఈ ఉత్పత్తులను జీఎస్‌టీలో చేర్చాలా? వద్దా? అనే సిఫారసును జీఎస్‌టీ మండలి చేయాల్సి ఉంటుంది. జీఎస్‌టీ మండలిలో మెజార్టీ సభ్యుల ఆమోదంతోనే ఏ ప్రతిపాదనైనా ముందుకు కదులుతుంది.

నిబంధన ఇది..

కేంద్ర వస్తువులు, సేవల పన్ను (సీజీఎస్‌టీ) చట్టం-2017, రాష్ట్ర వస్తువులు, సేవల పన్ను (ఎస్‌జీఎస్‌టీ) చట్టం- 2017లోని సెక్షన్ 9(2) ప్రకారం పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించిన నిబంధన ఇలా ఉంది.

'జీఎస్‌టీ మండలి సిఫారసు మేరకు ప్రభుత్వం నోటిపై చేసిన తేదీ నుంచి ముడి పెట్రోలియం ఉత్పత్తులు, హైస్పీడ్ డీజిల్, మోటార్ స్పిరిట్, సహజ వాయువు, విమాన ఇంధన సరఫరాకు కేంద్ర/ రాష్ట్ర పన్ను వర్తిస్తుంది'.

పై నిబంధన ప్రకారం పెట్రోలియం ఉత్పత్తులను ఎప్పుడు జీఎస్‌టీ పరిధిలోకి తేవాలన్నది కేంద్రం నోటిపై చేస్తుంది. అంతకంటే ముందు జీఎస్‌టీ మండలి ఈ విషయాన్ని కేంద్రానికి సిఫారసు చేయాల్సి ఉంటుంది.

అసాధ్యం కాదేమో..

ఏదేని ప్రతిపాదనకు ఆమోదం లభించాలంటే జీఎస్‌టీ మండలిలో నాలుగింట మూడొంతుల (75%) ఓట్లు అవసరం. జీఎస్‌టీ మండలిలో కేంద్ర ప్రభుత్వానికి మూడింట ఒకవంతు (33%), ఓట్లు ఉన్నాయి. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి తేవాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించాలంటే మరో 42 శాతం ఓట్లు ఉంటే సరిపోతుంది. 42 శాతం ఓట్లు అంటే 19 శాతం రాష్ట్రాలు అంగీకారం తెలిపితే చాలు. ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్‌డీఏకు ఇదేమీ అంత అసాధ్యమైన పని కాదు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం లేదు కదా అని దీనిపై మనం కోర్టును ఆశ్రయించినా ప్రయోజనం ఉండదు. ఎందుకంటే పై నిబంధనను ఉటంకిస్తూ ఈ అంశంపై కోర్టులు జోక్యం చేసుకోబోవని ఇప్పటికే మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. అంటే జీఎస్‌టీకి సంబంధించి ఏ ప్రతిపాదనపైనైనా జీఎస్‌టీ మండలిదే అంతిమ నిర్ణయమన్నమాట.

ప్రపంచంలో మనం ఎక్కడ?

ప్రస్తుతం మన కంటే చిన్న దేశాలు, బలహీన దేశాల్లోనూ పెట్రోలు ధరలు తక్కువగా ఉన్నాయి. మనకు పొరుగుదేశాలైన పాకిస్థాన్, ఇండోనేసియా, మలేసియాల ఆర్థిక వ్యవస్థలు మనకంటే బలహీనమైనప్పటికీ, అక్కడ పెట్రోలు ధరలు తక్కువగా ఉండటం గమనించదగిన విషయం. ఇక చమురు ఉత్పత్తి దేశాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకే పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి తెస్తే పెట్రోలు ధర విషయంలో అమెరికా లాంటి దేశాలతో పోటీపడటమే కాకుండా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ అవతరిస్తుంది.

ప్రపంచంలోని ఆయా దేశాల్లో పెట్రోలు ధర (మే చివరివారం)

(రూ.లలో)

కువైట్	23.64	దక్షిణాఫ్రికా	79.68	హాంకాంగ్	144.23
ఇరాన్	24.49	జపాన్	89.31	ఐస్‌లాండ్	144.52
సౌదీ అరేబియా	37.00	జింబాబ్వే	94.57	**పొరుగుదేశాలతో పోలిస్తే..**	
మలేసియా	37.72	దక్షిణ కొరియా	100.56	భారత్	80.22
ఇరాక్	42.97	స్పెయిన్	106.16	పాకిస్థాన్	51.64
యూఏఈ	43.90	స్విట్జర్లాండ్	110.98	శ్రీలంక	63.77
బర్మా	44.05	సింగపూర్	111.62	నేపాల్	68.74
ఇండోనేసియా	44.66	జర్మనీ	115.46	బంగ్లాదేశ్	71.69
అఫ్గానిస్థాన్	46.54	బ్రిటన్	116.34	చైనా	80.90
అమెరికా	57.56	ఫ్రాన్స్	125.25		
ఆస్ట్రేలియా	74.29	ఇటలీ	128.77		

ముగింపు

ఎల్‌పీజీ, కిరోసిన్‌ను ఇప్పటికే జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చారు. జీఎస్‌టీ మండలి తదుపరి సమావేశంలో సీఎన్‌జీని కూడా చేర్చే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. అయితే ఒక్క సీఎన్‌జీనే కాకుండా ఇతర పెట్రోలియం ఉత్పత్తులను కూడా జీఎస్‌టీ పరిధిలోకి తేవాల్సిన అవసరం ఉంది. అలా చేయడం వల్ల పన్నుపై పన్ను కట్టే భారం తప్పుతుండటంతో పెట్రోలియం ధరలు తగ్గుతాయి. సరకు రవాణా ఖర్చులు తగ్గడానికి ఈ పరిణామం దోహదం చేస్తుంది. దీంతో వస్తువుల ధరలు కూడా దిగివస్తాయి.

ఎంత కలిసొస్తుంది?

ప్రస్తుతం పెట్రోలియం ఉత్పత్తులపై సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్రాల వ్యాట్ పన్నులు విధిస్తున్నారు. ఇప్పుడు ఈ ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి తెస్తే ఒక్కటే పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు పెట్రోలుపై 28%, డీజిల్‌పై 18% చొప్పున జీఎస్‌టీని నిర్ణయించారని అనుకుంటే వినియోగదారులకు ఎంత మేర ప్రయోజనం కలిసొస్తుందో కింది రెండు పట్టికలో చూద్దాం.

పెట్రోలు (రూ.లలో)

దిల్లీలో లీటరుపై	సెంట్రల్ ఎక్సైజ్, వ్యాట్	జీఎస్‌టీ 28%	ధర ఎంత తగ్గుతుందంటే
చమురు కంపెనీల మార్జినుతో కలిపి మూలధర	37.19	37.19	లేదు
డీలరు మార్జిను	3.62	3.62	లేదు
పన్నులు	35.76	11.43	24.33
విక్రయ ధర	**76.57**	**52.24**	**24.33**

డీజిల్ (రూ.లలో)

దిల్లీలో లీటరుపై	సెంట్రల్ ఎక్సైజ్, వ్యాట్	జీఎస్‌టీ 18%	ధర ఎంత తగ్గుతుందంటే
చమురు కంపెనీల మార్జినుతో కలిపి మూలధర	39.99	39.99	లేదు
డీలరు మార్జిను	2.52	2.52	లేదు
పన్నులు	25.31	7.65	17.66
విక్రయ ధర	**67.82**	**50.16**	**17.66**

(ఆధారం: www.ppac.org.in)

పై పట్టిక ప్రకారం పెట్రోలుపై 28%, డీజిల్‌పై 18% జీఎస్‌టీని అనుకుంటే లీటరు పెట్రోలు ధర రూ.24.33, డీజిల్ ధర రూ.17.66 చొప్పున తగ్గుతుంది. అలాగే జీఎస్‌టీకి అదనంగా పరిహార సుంకం 10% విధించినా కూడా ఈ రెండు ఉత్పత్తుల ధరలు వరుసగా రూ.20.25, రూ.13.41 మేర తగ్గుతాయి. పెట్రోలు, డీజిల్ రెండూ ఇంచుమించు రూ.50కి దిగివస్తాయి. అంతేకాదు ప్రస్తుతంతో పోలిస్తే ఒక వాహన ఇంధన వ్యయ భారం కిలోమీటరుకు 50 పైసలు నుంచి రూ.5 వరకు తగ్గుతుంది. అయితే వాహన పరిమాణం, ఉపయోగించే ఇంధన రకంపై ఇది ఆధారపడి ఉంటుంది.

మీ సందేహాలు పంపండి

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా

eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

ఛాంపియన్

ఫిఫా ప్రపంచకప్ మరో 2 రోజుల్లో

కప్పు సాంబా జట్టుదేనా!

బ్రెజిల్	స్పెయిన్	జర్మనీ	అర్జెంటీనా	ఫ్రాన్స్	కొలంబియా	పెరూ
21%	10%	8%	8%	6%	5%	5%

ఫుట్‌బాల్ ప్రపంచకప్ అనగానే అందరి కళ్లూ బ్రెజిల్ మీదే ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యధికమంది అభిమానించే జట్లలో అదొకటి. ప్రతిసారీ ఫేవరెట్లలో ఒకటిగా కూడా నిలుస్తుంటుంది. గత పర్యాయం సొంతగడ్డపై జరిగిన ప్రపంచకప్‌లోనూ ఆ జట్టును ఫేవరెట్లలో ఒకటిగా భావించారు. కానీ ఆ టోర్నీలో ఆ జట్టు అంచనాల్ని అందుకోలేకపోయింది. కష్టం మీద సెమీస్ చేరి.. అక్కడ చిత్తుగా ఓడి ఇంటిముఖం పట్టింది. ఐతే ఈసారి బ్రెజిల్ జట్టులో చాలా మార్పు కనిపిస్తోంది. ఆల్‌రౌండ్ నైపుణ్యంతో హాట్ ఫేవరెట్ సీట్లో వచ్చి కూర్చుంది. విశ్లేషకుల్లో ఎక్కువమంది ఆ జట్టుకే ఓటేస్తున్నారు. వివిధ సర్వేల్లో సైతం ఫేవరెట్‌గా బ్రెజిల్ పేరే వినిపిస్తుండటం విశేషం. గ్రేస్ నోట్ సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం అత్యధికంగా ప్రపంచకప్ గెలిచే అవకాశాలున్నది బ్రెజిల్‌కే అని తేలింది. వందలో బ్రెజిల్ అవకాశాలు 21 శాతంగా ఉన్నాయి. 10 శాతంతో స్పెయిన్ రెండో స్థానంలో నిలిచింది. జర్మనీ (8 శాతం), అర్జెంటీనా (8 శాతం), ఫ్రాన్స్ (6 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పది లక్షల మంది అభిప్రాయాలు సేకరించి, పలు అంశాలపై అధ్యయనం జరిపి ఈ ఫలితాన్ని ప్రకటించారు. ఎప్పట్లాగే ఐరోపా, దక్షిణా అమెరికా జట్లదే ప్రపంచకప్‌లో ఆధిపత్యమని.. అవి కాకుండా మెక్సికో ఒక్కటి మాత్రమే మిగతా ఖండాల నుంచి రెండో రౌండుకు చేరగలదని ఈ అధ్యయనంలో తేలింది. మరోవైపు గోల్డ్‌మన్ శాక్స్ సంస్థ నిర్వహించిన సర్వేలోనూ బ్రెజిలే విజేత అని తేలింది. డేటా మైనింగ్, మిషన్ లెర్నింగ్ సాంకేతికతలపై పనిచేసే ఈ సంస్థ ప్రత్యేకంగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఐతే గత ప్రపంచకప్‌లోనూ బ్రెజిలే విజేతగా నిలుస్తుందని ఈ సంస్థ చెప్పగా జర్మనీ కప్‌ను ఎగరేసుకుపోయింది. ఈసారి జర్మనీ కన్నా ఫ్రాన్స్ మెరుగైన ప్రదర్శన చేసే అవకాశముందని ఈ సంస్థ చెబుతోంది. మరోవైపు స్విస్ బ్యాంక్ యూబీఎస్ చేపట్టిన సర్వేలో జర్మనీ విజేతగా నిలుస్తుందని తేలింది. ఫైనల్లో బ్రెజిల్, జర్మనీ తలపడతాయని యూబీఎస్ పేర్కొంది.

విశ్వసంబరం తన్నుకొస్తోంది. కిక్కుల పండగకోసం ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఆత్రంగా, ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఒక్కరా ఇద్దరా! ఓ రొనాల్డో.. ఓ మెస్సి.. ఓ నెయ్‌మార్.. ఇలా ఎందరో తారలు ఒక్క వేదికలో తళుక్కుమనబోతున్నారంటే.. నిరీక్షణ ప్రతి క్షణమూ భారమే. ఈ లోగో ఎవరి అంచనాలు వారివి. ఎవరి విశ్లేషణలు వారివి. ఎవరి అభిమానం వాళ్లది. మరి ఫుట్‌బాల్ పండితులేమంటున్నారు ? ఫేవరెట్లెవరు ? ఐదుసార్లు విజేత బ్రెజిల్.. డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ.. మాజీ విజేతలు స్పెయిన్, అర్జెంటీనాలు ఈసారీ కప్పు వేటలో ముందున్నాయన్నది దాదాపు ఏకాభిప్రాయం. రండి ఈ జట్లను పరిస్థితేంటో ఓ సారి చూద్దాం!

ఎవరి కాలికి చిక్కేనో?

మెస్సి

రేసులో వీళ్లూ...

ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న బెల్జియం మంచి ఫామ్‌తో రష్యా చేరుకుంది. ఎప్పటిలా కేవలం డార్క్‌హార్స్ కాదు. ట్రోఫీ పైనే గురిపెట్టింది. సమతూకంగా ఉన్న బెల్జియంతో అగ్ర జట్లకు నిజంగా పెను సవాల్ ఎదురుకానుంది. మాజీ విజేత ఫ్రాన్స్ కూడా ఫెవరెటే. పోర్చుగల్, ఇంగ్లాండ్ కూడా బలంగానే ఉన్నాయి.

బ్రెజిల్

గత ప్రపంచకప్‌లో సొంతగడ్డపై బ్రెజిల్ టైటిల్ గెలవడం ఖాయమని అనుకున్నారంతా! కానీ కానీ సెమీస్‌లో జర్మనీ చేతిలో 1-7తో దారుణంగా ఓడిపోయి ఘోర అవమానాన్ని మూటగట్టుకుంది. కానీ పూర్తి ప్రక్షాళన చెందిన ఆ జట్టు, కోచ్ టైట్ ఆధ్వర్యంలో ఈసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. గత ప్రపంచకప్ తర్వాత కేవలం నాలుగు మ్యాచ్‌లో ఓడిపోయిన బ్రెజిల్ ఎంతో విశ్వాసంతో ఉంది. టైట్ 21 మ్యాచ్‌లకు గాను 17 మ్యాచ్‌ల్లో సాంబా జట్టును విజయపథంలో నడిపించాడు. కీలక డిఫెండర్ అల్వెస్ గాయంతో దూరం కావడం పెద్ద దెబ్బే అయినా.. సూపర్‌స్టార్ నెయ్‌మార్ ఇటీవల స్నేహపూర్వక మ్యాచ్‌ల్లో ఫిట్‌నెస్ నిరూపించుకోవడం ఉత్సాహన్నిచ్చే విషయం. మంచి ఫామ్‌లో ఉన్న అతడు క్రొయేషియా, ఆస్ట్రియాపై గోల్స్‌తో బ్రెజిల్‌కు విజయాలను అందించాడు. నెయ్‌మార్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. కానీ అదే సమయంలో మరో యువ కెరటం గాబ్రియెల్ జీసస్ అందరినీ ఆకర్షిస్తున్నాడు. బ్రెజిల్ ఎటాకింగ్‌ను తట్టుకోవడం ఎంత కష్టమో.. డిఫెన్స్‌ను ఛేదించడమూ అంతే కష్టం.

ప్రపంచకప్‌లో...	
టాప్-3	: 9
ఫైనల్స్	: 7
టైటిళ్లు	: 5
స్టార్:	నెయ్‌మార్

బ్రెజిల్ వచ్చేసింది

ఈ సారి ఎలాగైనా ప్రపంచకప్ నెగ్గాలనే పట్టుదలతో ఉన్న బ్రెజిల్ జట్టు రష్యాలో అడుగుపెట్టింది. సోమవారం ఉదయం ఈ సాంబా జట్టు రష్యా చేరుకుంది. టోర్నీ ముగిసేంతవరకూ ఈ జట్టు సోచిలోని రిసార్ట్స్‌లో ఉండనుంది. గాయం నుంచి కోలుకొని తిరిగి మంచి ఫామ్‌లో కనిపిస్తున్న నెయ్‌మార్‌పైనే ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. బ్రెజిల్ తన తొలి మ్యాచ్‌లో ఆదివారం స్విట్జర్లాండ్‌తో పోటీ పడనుంది.

అర్జెంటీనా

ప్రపంచకప్‌కు అర్జెంటీనా అర్హత సాధించిందంటే అదృష్టమే. క్వాలిఫికేషన్‌లో తడబడ్డ ఈ జట్టు అతికష్టంగా ముందంజ వేసింది. గతవారం సొంతగడ్డపై ఇజ్రాయెల్‌తో స్నేహపూర్వక మ్యాచ్ రద్దు కావడం ఈ జట్టుకు అత్యవసరమైన ప్రాక్టీస్‌ను దూరం చేసింది. అయినా రెండుసార్లు ఛాంపియన్ అయిన అర్జెంటీనాను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. బ్రెజిల్, జర్మనీ అంతగా బలంగా కాకపోయినా మెరుగైన జట్టుతో అర్జెంటీనా కూడా ఫేవరెట్లలో ఒకటిగా ఉంది. లియోనల్ మెస్సి వంటి స్టార్ ఈ జట్టుకు ఉన్నాడు. ఐతే కోచ్ సంపోలి నేతృత్వంలోని ఆ జట్టు ఎక్కువగా మెస్సిపైనే ఆధారపడుతుందన్నది కొందరు విమర్శలకు మాట. ఐతే అలా అనడం అన్యాయమే. మిడ్‌ఫీల్డర్ సెల్సో, ఎటాకింగ్‌లో గొంజాలో హిగెయిన్, సెర్గియో అగ్వెరో, దిబావాల, ఏంజెల్ డిమారియా వంటి వారితో అర్జెంటీనా పటిష్టంగానే ఉంది. ఐతే గత రన్నరప్ అయిన అర్జెంటీనాకు క్వార్టర్‌ఫైనల్లో స్పెయిన్ ఎదురయ్యే అవకాశముంది. మరి ఈ సవాల్‌ను ఎలా అధిగమిస్తుందన్నదానిపై ఈ జట్టు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

ప్రపంచకప్‌లో...	
టాప్-3	: 5
ఫైనల్స్	: 5
టైటిళ్లు	: 2
స్టార్:	మెస్సి

యోయోలో షమి విఫలం

అఫ్గాన్‌తో ఏకైక టెస్టుకు సైని

దిల్లీ: టీమ్‌ఇండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమి అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టుకు దూరమయ్యాడు. గురువారం ఈ మ్యాచ్ ఆరంభం కాబోతున్న నేపథ్యంలో భారత జట్టు సభ్యులకు బెంగళూరులో నిర్వహించిన యో-యో ఫిట్‌నెస్ టెస్టులో షమి విఫలమయ్యాడు. దీంతో సెలక్టర్లు అతడి స్థానంలో దిల్లీ యువ ఫాస్ట్‌బౌలర్ నవ్‌దీప్ సైనిని ఎంచుకున్నారు. అతను భారత టెస్టు జట్టులోకి ఎంపిక కావడం ఇదే తొలిసారి. గత రెండు రంజీ సీజన్లలో సైని చక్కటి ప్రదర్శన చేశాడు. ప్రస్తుతం దేశంలో అత్యంత వేగవంతమైన బౌలర్లలో అతనొకడు. 28 ఏళ్ల షమి కొన్నేళ్ల ముందు నుంచే ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నాడు. అతను యోయో పరీక్షలో విఫలం కావడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ 23 ఏళ్ల కేరళ వికెట్ కీపర్ బ్యాట్సమన్ సంజు శాంసన్ కూడా ఈ పరీక్ష నెగ్గలేకపోవడమే చర్చనీయాంశమవుతోంది. ఇటీవలే ఐపీఎల్‌లో రాణించి, ఇంగ్లాండ్‌కు వెళ్లే భారత్-ఎ జట్టులో చోటు సంపాదించాడు సంజు. యోయో పరీక్షలో కనీస అర్హత మార్కు 16.1ను అందుకోలేకపోవడంతో అతడిని భారత్-ఎ జట్టు నుంచి బీసీసీఐ తప్పించింది. సంజు స్థానంలో మరో యువ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. టీమ్‌ఇండియాకు ఆడగల సత్తా ఉన్న సంజు.. ఇప్పటికే రెండు మూడు సార్లు క్రమశిక్షణ రాహిత్యంతో వార్తల్లో నిలిచాడు. ఇప్పుడు యోయో పరీక్షలో విఫలం కావడం అతడి కెరీర్‌పై సందేహాలు రేకెత్తిస్తోంది.

జర్మనీ

ప్రపంచకప్‌లో...	
టాప్-3	: 12
ఫైనల్స్	: 8
టైటిళ్లు	: 4
స్టార్:	ఓజిల్

ఈ డిఫెండింగ్ ఛాంపియన్ అత్యంత బలీయమైన శక్తిగా ప్రపంచకప్‌లో అడుగుపెడుతోంది. పెద్ద టోర్నీల్లో గొప్పగా రాణించే జట్టుగా జర్మనీకి పేరుంది. అందుకేనేమో ఇటీవల స్నేహపూర్వక మ్యాచ్‌ల్లో ఆ జట్టు పెద్దగా రాణించకపోయినా ఎవరూ పెద్దగా పట్టించుకోవట్లేదు. శుక్రవారం చివరి సన్నాహక మ్యాచ్‌లో సౌదీ అరేబియాపై 2-1తో కష్టంగా గెలవడానికి ముందు ఐదు మ్యాచ్‌ల్లో ఆ జట్టుకు విజయం అందలేదు. తొలి ప్రాధాన్య గోల్‌కీపర్ మాన్యుయెల్ న్యూర్ గాయం కారణంగా గత సెప్టెంబరు నుంచి ఆడింది చాలా తక్కువ. కానీ అతడు మంచి ఫిట్‌నెస్‌తోనే ఉన్నాడని జర్మనీ చెబుతోంది. గత నాలుగు ప్రపంచకప్పుల్లో జర్మనీ కనీసం సెమీఫైనల్‌కు చేరింది. ఓజిల్, ముల్లెర్, క్రూస్ వంటి స్టార్ ఆటగాళ్లున్న ఆ జట్టును ఈసారి రష్యాలోనూ ఆ దశకు దూసుకుపోకుండా ఆపడం కష్టమే. స్నేహపూర్వక మ్యాచ్‌ల్లో ఫలితాల గురించి కోచ్ జోకిమ్ లు ను అడిగితే.. "స్నేహపూర్వక మ్యాచ్‌ల ప్రధాన ఉద్దేశం ఫలితాలు కాదు" అని చెప్పాడు. ఈ ప్రపంచకప్‌లో జర్మనీలేని ఫేవరెట్ల జాబితాను ఊహించలేం.

స్పెయిన్

గత ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగినప్పటికీ గ్రూప్ దశలోనే నిష్క్రమించిన స్పెయిన్ ఈసారి సత్తా నిరూపించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఫేవరెట్లలో ఒకటనడంలో సందేహం లేదు. గత ప్రపంచకప్, యూరో పరాభవాల నుంచి తేరుకున్న ఆ జట్టు కోచ్ జులెన్ లోపెటెగి ఆధ్వర్యంలో గత రెండేళ్లలో ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు. క్వాలిఫికేషన్‌లో 9 విజయాలు, ఒక డ్రాతో గ్రూప్-జిలో అగ్రస్థానంతో ప్రపంచకప్‌కు టికెట్ సంపాదించింది. ఏకంగా 36 గోల్స్ కొట్టింది. మైత్రీ మ్యాచ్‌ల్లో బెల్జియం, ఫ్రాన్స్, అర్జెంటీనా వంటి బలమైన జట్లను ఓడించి జోరు మీదుంది. ఆదివారం టునీషియాపై 1-0 విజయంతో సన్నాహాన్ని ముగించింది. చాలా మంది అనుభవజ్ఞులు, కుర్రాళ్లతో సమతూకంగా ఉంది. రామోస్, ఇనియెస్టా, సెర్గియో, ఇస్కో వంటి మేటి ఆటగాళ్లతో స్పెయిన్ భీకరంగా కనిపిస్తోంది. చిరుతల్లా కదిలే ఆటగాళ్లతో నిండిన మిడ్‌ఫీల్డే స్పెయిన్‌కు పెద్ద బలం.

ప్రపంచకప్‌లో...	
టాప్-3	: 1
ఫైనల్స్	: 1
టైటిళ్లు	: 1
స్టార్:	ఇనియెస్టా

ఫిఫా ప్రపంచకప్‌లో మనోళ్లు

దిల్లీ: ఫిఫా ప్రపంచకప్‌లో భారత్ ప్రాతినిధ్యం ఉండబోతుంది. అదేంటి మన జట్టు ప్రపంచకప్‌కు అర్హత సాధించలేదు కదా అనుకుంటున్నారా! అది నిజమే. అయితే రష్యాలో జరగనున్న ప్రపంచకప్‌లో పదేళ్ల రిషి తేజ్ (కర్ణాటక), పదకొండేళ్ల నతనియా జాన్ (తమిళనాడు) కనిపించనున్నారు. మ్యాచ్ ఆరంభానికి ముందు అధికారిక బంతిని వీళ్లు మైదానంలోకి తీసుకురానున్నారు. బెల్జియం, పనామా మధ్య మ్యాచ్‌కు ఒకరు, బ్రెజిల్.. కోస్టారికా మ్యాచ్‌కు మరొకరు బంతిని పట్టుకొని మైదానంలోకి అడుగుపెట్టనున్నారు. ఫిఫా ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా మొత్తం 64 మంది పాఠశాల విద్యార్థులను ఎంపిక చేస్తే మన దేశం నుంచి వీళ్లిద్దరూ ఆ జాబితాలో చోటు దక్కించుకున్నారు. భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి ట్రయల్స్ నిర్వహించి వీరిని ఎంపిక చేశాడు. "పిల్లల్లో ఇలాంటి నైపుణ్యాలు చూడడం చాలా ఆనందంగా ఉంది. ఈ అవకాశాన్ని కల్పించినందుకు ధన్యవాదాలు" అని ఛెత్రి తెలిపాడు.

చైనాలోని దొంగ్వాన్ నగరంలో ఫిఫా ఫుట్‌బాల్ ట్రోఫీ నమూనాలకు మెరుగులు దిద్దుతున్న ఓ కార్మికురాలు. ఈ ట్రోఫీలు రష్యా సహా ఇతర దేశాలకు ఎగుమతి కానున్నాయి.

ప్రపంచకప్ బంతి పాకిస్థాన్‌దే

ఫిఫా ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ ర్యాంకు 198. ఆ జట్టు ప్రపంచకప్ గురించి ఎంతమాత్రం ఆలోచించే పరిస్థితి లేదు. కానీ రష్యాలో జరగబోయే ఫిఫా మెగా టోర్నీలో పాక్ భాగస్వామ్యం కీలకంగా ఉండబోతోంది. ఈ టోర్నీకి బంతుల్ని అందిస్తున్నది ఆ దేశమే కావడం విశేషం. ఈసారి ప్రపంచకప్‌లో వినియోగించనున్న టెల్‌స్టార్-18 బంతుల తయారీ పూర్తిగా పాకిస్థాన్‌లోని సియోల్‌కోట్‌లోనే జరగడం విశేషం. ఈ నగరం క్రీడా ఉత్పత్తుల తయారీకి పెట్టింది పేరు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు ఇక్కడి నుంచే క్రీడా ఉత్పత్తుల్ని ఎగుమతి చేస్తారు. ఫుట్‌బాల్స్ తయారీలోనూ ఈ నగరానికి మంచి పేరుంది. గత పర్యాయం బ్రెజిల్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్‌లో వినియోగించిన బ్రజూకా బంతుల్ని కూడా ఈ నగరమే తయారు చేసింది.

అప్పారావుపేటకెళ్తే నూనె శాతం పెరిగింది

18.55 శాతంగా వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పండిస్తున్న ఆయిల్‌పామ్‌లో నూనె శాతం 18.55గా తేలింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లా అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించి పరిశీలించగా ఇది వెల్లడైంది. పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలో ఇప్పటిదాకా 16.4శాతం నూనె మాత్రమే వస్తోంది. ఆయిల్‌పామ్ ధరల నిర్ధరణకు దీన్నే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే ఇక్కడ నూనె తీయడంలో తేడాలున్నాయని రైతులు గతం నుంచి ఆరోపిస్తున్నారు. కాలం చెల్లిన యంత్రాలతోపాటు కొందరు అధికారుల అక్రమాలు కూడా ఇందుకు కారణమని పేర్కొంటున్నారు. వీటన్నిటి మూలంగా తెలంగాణ రైతుల ఆయిల్‌పామ్‌తో పోలిస్తే ఇక్కడ నూనెలో 2శాతం తగ్గుతోందని వివరిస్తున్నారు. దీనివల్ల టన్నుకు రూ.1,100 పైగా నష్టపోతున్నామని గత నెలలో రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసినప్పుడు వివరించారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఆయిల్‌పామ్ గెలలను తెలంగాణలోని ఫ్యాక్టరీకి తీసుకెళ్లి నూనె తీయించాలని కోరారు. సీఎం ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల సమక్షంలో 1000 టన్నుల ఆయిల్‌పామ్ గెలలను ఖమ్మం జిల్లా అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించి మర పట్టించగా 18.55 శాతం నూనె వచ్చింది.

తూతూ మంత్రంగా భూముల విలువలు సవరణ

- చివర్లో హడావుడి.. లోపిస్తున్న శాస్త్రీయత
- ఈసారైనా ప్రత్యేక దృష్టిపెట్టాలి
- సంబంధిత వర్గాల సూచనలు

ఈనాడు – అమరావతి

నల్లధనం లావాదేవీల నిరోధానికి, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చేందుకు వీలుగా భూముల విలువల సవరణ విధానంపై తగిన కసరత్తు జరగడంలేదు. ప్రతి ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి సవరించిన కొత్త భూముల విలువలు అమల్లోకి వస్తున్నాయి. వీటి ఖరారుకు తగినంత సమయం ఉండకపోతుండడంతో శాస్త్రీయత లోపిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

పట్టణాలు, నగరాలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో మార్కెట్ విలువల ఖరారు కమిటీకి జిల్లా సంయుక్త కలెక్టర్, గ్రామీణ ప్రాంతాల్లోనైతే రెవెన్యూ డివిజనల్ అధికారి నేతృత్వం వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి కొత్త భూముల విలువలపై సమీక్ష జరిపి... తగిన నిర్ణయాలు తీసుకోవల్సి ఉంది. 2016లోనైతే చివరిరోజు చెప్పి మరసటిరోజు నుంచి భూముల విలువలను సవరించారు. 2017లో పదిరోజుల ముందు ఈ కసరత్తు మొక్కుబడిగా జరిగింది. 2018లో ఎలా చేయబోతున్నారన్న దానిపై ఇంకా నిర్ణయం జరగలేదు. కానీ భూముల విలువల పెంపునకు వీలుగానే ప్రభుత్వ చర్యలు ఉండొచ్చని సంబంధిత వర్గాల ద్వారా తెలియవచ్చింది.

భూముల విలువల సవరణ హడావుడిగా జరిగిపోతున్నందున అసమానతలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో కొత్తగా విమానాశ్రయాలు, పరిశ్రమలు, విద్యా సంస్థల రాక, రహదారుల నిర్మాణ పనులవల్ల ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. అయితే చుట్టుపక్కల గ్రామాల్లో ఎంత అయితే భూముల విలువలు ఉన్నాయో... అదేవిధంగా ప్రాజెక్టులు ఉన్న, రానున్న ప్రాంతాల్లో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతాల్లోని భూముల విలువల కంటే కొత్తగా ప్రాజెక్టులు వచ్చిన, రాబోతున్న ప్రాంతాల్లో భూముల విలువల ఖరారుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సంబంధిత వర్గాలు సూచిస్తున్నాయి. ఎందుకంటే..... చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో ఎకరా భూమి రెండు లక్షల రూపాయలు ఉంది. సవరణ సమయంలో దీనిని 2.20 లక్షల రూపాయలుగా మార్కెట్ విలువను ఖరారు చేయొచ్చు. అదే జియో ఫ్యాక్టరీ దగ్గర లక్ష రూపాయల మార్కెట్ విలువ ఉంటే దానిని అక్కడున్న పరిస్థితులనుబట్టి పెంచితే ప్రభుత్వ ఖజానాకు లాభం వస్తుంది. నల్లధన లావాదేవీలు తగ్గుతాయి.

ఈ క్రమంలో... వంద శాతం కంటే ఎక్కువగా భూముల విలువను పెంచకూడదన్న నిబంధన ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ ఖజానాకు గండికొడుతోంది. సీఆర్‌డీఏ పరిధిలో ఇదే జరుగుతోంది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మారుస్తున్నారు. ఈ ప్రక్రియలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫలానా సర్వే నెంబరులో మార్కెట్ విలువ ఎంతుందో తెలుసుకొని దానికి అనుగుణంగా ఆర్డీఓ కార్యాలయంలో అధికారికంగా చెల్లింపులు జరుగుతున్నాయి. వ్యవసాయ భూములు... వ్యవసాయేతర భూములుగా మారి, ప్లాట్లుగా భారీగా విక్రయాలు జరుగుతున్నా ప్రభుత్వానికి ఇసుమంత ప్రయోజనం కనిపించడం లేదు. ఆదాయ పన్ను శాఖకు చెల్లింపులు జరగడంలేదు.

చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి నాయుడుపేట వరకు జాతీయ రహదారి విస్తరణ (4 లైన్ల) పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా కడప, కర్నూలు, ఇతర జిల్లాల్లో కూడా రహదారుల విస్తరణ పనులు సాగుతున్నాయి. ఈ విస్తరణ జరిగే రహదారుల వెంబడి ఉండే సర్వే నెంబర్లను రెవెన్యూ అధికారుల నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పొందితే దానికి తగ్గట్లు మార్కెట్ విలువలను సవరించే అవకాశం ఉంటుంది. ప్రస్తుత విధానంలో ఇది జరగడంలేదు. దీనికి తగిన సమయం లేకపోవడం కారణమని చెబుతున్నారు. ప్రస్తుత విధానంపై పునస్సమీక్ష జరిపి.. తగిన నిర్ణయాలు తీసుకోవాలని సంబంధిత వర్గాలు సూచిస్తున్నాయి.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీపై వివాదాస్పద ట్వీట్లు చేసిన జేఎన్‌యూ విద్యార్థుల సంఘం నాయకురాలు షెహ్లా రషీద్ షోరాపై భాజపా యువ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఆరోపణలన్నీ అవాస్తవాలని, కుట్రపూరితమని, ఆధారరహితమని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు జనతా యువమోర్చా ప్రతినిధులు సోమవారం పార్లమెంటువీధి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వాజ్‌పేయీకి ఎయిమ్స్‌లో చికిత్స

- మాజీ ప్రధానికి ఛాతి, మూత్రపిండాల సమస్య
- అత్యవసర విభాగంలో వైద్యసేవలు
- ప్రధాని సహా ప్రముఖుల పరామర్శ



ఈనాడు, దిల్లీ: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ(93)ని సోమవారం అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)కు తరలించారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన వైద్య, ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆయనను ఆసుపత్రిలో చేర్పించినట్లు భాజపా ఓ ప్రకటనలో తెలిపింది. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా పర్యవేక్షణలో వైద్యబృందం ఆయనకు సేవలందిస్తోంది. ఛాతి ఇన్ఫెక్షన్, మూత్రపిండ సమస్యలతో ఆయనను తీసుకొచ్చారని.. రక్తశుద్ధి (డయాలసిస్)తో పాటు అత్యవసర విభాగం (ఐసీయూ)లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కాగా ప్రధాని మోదీ సోమవారం సాయంత్రం ఎయిమ్స్‌కు వెళ్లి పరామర్శించారు. 50 నిముషాలు అక్కడే ఉండి వాజ్‌పేయీ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. భాజపా అధ్యక్షుడు అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా తదితరులు కూడా ఎయిమ్స్‌కు వెళ్లి పరామర్శించారు.

1998-2004 మధ్య ప్రధానిగా పనిచేసిన వాజ్‌పేయీ అనంతరం ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో క్రమేపీ ప్రజాజీవితానికి దూరమయ్యారు. గత కొన్నేళ్లుగా ఆయన ప్రాణాధార వ్యవస్థ (లైఫ్ సపోర్ట్ సిస్టమ్)తో తన ఇంటివద్దే చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ఎయిమ్స్‌కు తరలించడంపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు చెలరేగుతున్నాయి. 2009 నుంచీ ఆయన అచేతన స్థితిలోనే ఉన్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే 2015లో వాజ్‌పేయీకి భారతరత్న పురస్కారాన్ని కూడా ఆయన ఇంటివద్దే అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అందజేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్న డాక్టర్ రణ్‌దీప్ గులేరియా వాజ్‌పేయీకి 30 ఏళ్లుగా వ్యక్తిగత వైద్యుడు. ఆయనే ఇంటికివెళ్లి చికిత్స అందిస్తున్నారు. వైద్యచికిత్సలకు సంబంధించి ఇంటివద్దే అన్ని ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో వాజ్‌పేయీని సోమవారం ఎయిమ్స్‌కు ఎందుకు తరలించాల్సి వచ్చిందని ఆయన ఆరోగ్య పరిస్థితి బాగా తెలిసిన ఓ వ్యక్తి సందేహం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రముఖులంతా ఆసుపత్రికి వచ్చి పరామర్శిస్తుండగా.. అత్యంత ముఖ్యమైన వారిని మాత్రమే వాజ్‌పేయీ చికిత్స పొందుతున్న గదిలోకి అనుమతిస్తున్నారు.

ఆరోగ్య పరిస్థితిపై సీఎం చంద్రబాబు ఆరా

ఈనాడు డిజిటల్, అమరావతి: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం రాత్రి ఆరా తీశారు. దిల్లీలోని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. వాజ్‌పేయీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

'ఆసుపత్రుల నిర్వహణ చట్టంతో తీరని అన్యాయం'

విజయవాడ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐ.ఎం.ఎ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయశేఖర్ విమర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన ఆసుపత్రుల నిర్వహణ చట్టంతో ఆసుపత్రులు, వైద్యులకే కాకుండా ప్రజలకు కూడా తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సోమవారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రుల నిర్వహణ చట్టంతో ఆరోగ్యరంగం కేంద్రం పరిధిలోకి వెళ్తుందన్నారు. అందువల్ల దీన్ని ఆమోదించవద్దని డిమాండ్ చేస్తూ.. ఏప్రిల్ 5న దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సిజేరియన్ శస్త్రచికిత్సలను ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆమోదించిన తరువాతే ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయాలన్న నిబంధనను పునరాలోచించాలని కోరారు. ఇలాంటి అత్యవసర సందర్భాల్లో ప్రభుత్వాసుపత్రుల చుట్టూ తిరిగితే తల్లి, బిడ్డ ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. వైద్యులు పి.గంగాధర్‌రావు, పి.ఫణిధర్, పి.అనిల్‌కుమార్, వి.రాంప్రసాద్, ఐ.ఎం.ఎ. నగర అధ్యక్షుడు బోస్ తదితరులున్నారు.

బ్రిటన్‌లో నీరవ్ మోదీ మకాం

రాజకీయ ఆశ్రయం కోసం ప్రయత్నాలు!

లండన్: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)ను రూ.13 వేల కోట్లకు పైగా మోసగించి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ బ్రిటన్‌లో మకాం వేసినట్లు స్పష్టమైంది. ఆ దేశ అధికారవర్గాలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. మరోవైపు, బ్రిటన్‌లో రాజకీయ ఆశ్రయం కోసం నీరవ్ ప్రయత్నిస్తున్నట్లు ప్రముఖ వార్తాసంస్థ ఒకటి సోమవారం తమ కథనంలో వెల్లడించింది. బ్రిటన్ తీవ్రవాద నిరోధకశాఖ సహాయమంత్రి బరోనెస్ విలియమ్స్‌తో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిరెణ్ రిజిజు దిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. ఇతర దేశాల్లో నేరాలు చేసి వచ్చినవారికి సురక్షిత స్థావరంగా బ్రిటన్ మారకూడదని సమావేశంలో రిజిజు అభిలషించారు. నీరవ్ మోదీ, మద్యం వ్యాపార దిగ్గజం విజయ్ మాల్యాలతోపాటు ఇతర నిందితులను భారత్‌కు తిరిగి పంపించడంలో పూర్తి సహకారమందిస్తామని ఈ భేటీలో విలియమ్స్ భరోసా ఇచ్చారు.

నీరవ్, చోక్సీలపై రెడ్‌కార్నర్ తాఖీదులు కోరిన సీబీఐ: నీరవ్ మోదీతోపాటు పీఎన్‌బీ కుంభకోణంలో కీలక నిందితుడిగా ఉన్న మోహుల్ చోక్సీ(నీరవ్ మేనమామ)పై రెడ్‌కార్నర్ తాఖీదులు జారీ చేయాల్సిందిగా కోరుతూ ఇంటర్‌పోల్‌కు సీబీఐ లేఖ రాసింది.

ఆర్టీసీ కార్మికులకు రూ.120కోట్లు

సవరించిన వేతన బకాయిల్లో 20 శాతం విడుదల

ఈనాడు, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికులకు 2013 సవరించిన వేతన బకాయిల్లో మొదటి విడతగా 20శాతం విడుదలైంది. రాష్ట్రంలోని 51 వేల మంది కార్మికులకు రూ.120కోట్లను ఆర్టీసీ ఎండీ ఎస్‌వీ సురేంద్రబాబు మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని సోమవారమే ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిల విడుదలపై నేషనల్ మజ్దూర్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది.

'18 సంవత్సరాల లోపు పిల్లలు దత్తతకు అవకాశం'

ఈనాడు అమరావతి: అప్పుడే పుట్టిన శిశువు నుంచి 18 సంవత్సరాల వయసులోపు వరకు పిల్లలకు దత్తత ఇవ్వనున్నట్లు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ అరుణ్‌కుమార్ ప్రకటించారు. ఇప్పటివరకూ బాలసదన్‌లలో ఉన్న పిల్లల్లో 5ఏళ్ల లోపువారిని మాత్రమే దత్తతనిచ్చే పరిస్థితి ఉండేదన్నారు. దీంతో ఆపైన వయస్సున్న పిల్లలు సదన్‌లలోనే ఉండిపోవాల్సి వచ్చేదన్నారు. ఈ నేపథ్యంలో 18ఏళ్ల వరకు బాలలను దత్తతనిచ్చేందుకు కేంద్రం అనుమతించిందన్నారు. సోమవారం గుంటూరులోని ఆ శాఖ కమిషనరేట్‌లో దత్తత స్వీకరణ, పిల్లల సంరక్షణపై గుంటూరు, కృష్ణా, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాల అధికారులు, బాలల సంక్షేమ సమితులు, ఎన్జీవోలతో నిర్వహించిన సమావేశంలో అరుణ్‌కుమార్ మాట్లాడారు.

ముగిసిన కర్ణాటక-ఆంధ్ర సరిహద్దు సర్వే

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దులను తేల్చేందుకు గత నెల 30న చేపట్టిన సర్వే జూన్ ఏడో తేదీతో ముగిసింది. పుష్కరకాలంగా ఉన్న వివాదం ప్రస్తుత సర్వేతో పరిష్కారమయ్యేనా? అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. డెహ్రాడూన్‌లోని సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ పవన్‌కుమార్, కర్ణాటక, ఏపీ ఉన్నతాధికారుల నేతృత్వంలో సిబ్బంది ఈ సర్వే నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓబుళాపురం, సిద్దాపురం, మలపనగుడి, కర్ణాటకలోని తుమిటి, విఠలాపురం, బెళగల్లు, హొన్నళ్లి, హలకుంది గ్రామాల సరిహద్దుల ఆధారంగా 26 రాక్‌పాయింట్లను ఎంపిక చేసి వాటికి జీపీఎస్ యంత్రాలను అమర్చి హద్దులను గుర్తించారు. గ్రామాల రెవెన్యూ పాయింట్ల ఆధారంగా సర్వే చేశారు.

రక్త నిధులకు 'రక్త కేంద్రాలు'గా పేరు మార్పు

దిల్లీ: "బ్లడ్ బ్యాంకు (రక్త నిధి)"లకు రక్త కేంద్రాలు (బ్లడ్ సెంటర్స్)గా పేరు మార్చాలని కేంద్రం భావిస్తోంది. అంతేకాదు వీటికి సంబంధించిన విధివిధానాలను క్రమబద్ధీకరించేందుకు వరుస ప్రతిపాదనలను సిద్ధంచేసింది. ఔషధాలపై సాంకేతికపరమైన సూచనల మండలి (డీటీఏబీ) వీటిపై ఇప్పటికే ఆమోదముద్ర వేసింది. వీటిలోని వివరాల ప్రకారం.. ★ రక్తం దానం చేయడానికి కనీస వయసు 18ఏళ్లు. గరిష్ఠ వయసు 65ఏళ్లు. ★ ప్రసవం అయిన మహిళలు ఏడాది వరకూ రక్త దానం చేయడానికి వీల్లేదు. అదే గర్భస్రావం అయినవారికి అయితే ఈ వ్యవధి ఆరు నెలలు. పిల్లలకు పాలిచ్చేటప్పుడు, రుతుక్రమ సమయంలో రక్తం దానం చేయకూడదు. ★ పెద్ద శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు 12 నెలల వరకూ రక్తం దానం చేయకూడదు. ★ మలేరియా నుంచి కోలుకున్నవారు మూడు నెలల వరకూ రక్తం దానం చేయకూడదు. డెంగీ, గన్యాల విషయంలో ఈ వ్యవధి ఆరు నెలలు.

అభివృద్ధి అంటే హైదరాబాద్, చెన్నై కాదు

- బ్రాండిక్స్ నుంచి స్ఫూర్తిని తీసుకెళ్తున్నా
- రైతుల సంక్షేమానికి ప్రతి టిక్కెట్‌లో రూపాయి: విశాల్

విశాల్‌తో కరచాలనం చేస్తున్న బ్రాండిక్స్ మహిళా కార్మికులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రజలకు సేవలు అందివ్వడమే నిజమైన రాజకీయమని.. ఇది ఎప్పటి నుంచో చేస్తున్నానని సినీ హీరో విశాల్ అన్నారు. విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలోని(సెజ్) బ్రాండిక్స్ అపెరల్ సిటీని విశాల్ సోమవారం సందర్శించారు. ఏ గ్రామానికి, ప్రాంతానికి వెళ్లినా అక్కడ నుంచి ఒక జ్ఞాపకాన్ని, అనుభూతిని తీసుకెళ్తానని... బ్రాండిక్స్ నుంచి మాత్రం మొదటిసారిగా ఒక స్ఫూర్తిని పట్టుకెళ్తున్నానని విశాల్ అన్నారు. 18 వేల మంది మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న కంపెనీని సందర్శించడం జీవితంలో మర్చిపోలేనన్నారు. అభివృద్ధి అంటే హైదరాబాద్, చెన్నై కాదనే విషయం ఇక్కడకు రావడం వల్లనే తెలిసిందన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో మాదిరిగా మహిళలు సెంట్రల్ ఏసీలో చకచకా పనిచేయడం నచ్చిందని చెప్పారు. ఏడో తరగతి చదువుకున్న మహిళలకూ మంచి ఉద్యోగాలు అందిస్తున్నారన్నారు. బ్రాండిక్స్ లాంటి సంస్థలు ప్రతి రాష్ట్రంలోనూ ఉండాలని అభిప్రాయపడ్డారు. అన్నీ ఇస్తున్న రైతుల జీవితాలు ఆనందంగా లేవని విచారం వ్యక్తం చేశారు. అందుకే తన తాజా చిత్రం అభిమన్యుడుకు వసూలైన ప్రతి టిక్కెట్ నుంచి రూపాయి రైతులకు కేటాయించడం ద్వారా వారికి ఎంతో కొంత సహాయం అందివ్వడానికి ముందుకొచ్చానని విశాల్ తెలిపారు. మిగిలిన వారు కూడా ఇలా ముందుకొస్తే రైతులకు చాలావరకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి వివరాలు సేకరించి ఈ నిధులు కేటాయిస్తానని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు తనను హీరోగా ఆదరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సినీహీరో అయి ఉండి కూడా పిలిచిన వెంటనే విశాల్ తన సొంత ఖర్చులతో కంపెనీకి రావడం గొప్ప విషయమని బ్రాండిక్స్ సంస్థ ప్రతినిధి ఆగస్వామి దొరైస్వామి అన్నారు. మహిళా ఉద్యోగుల్లో విశాల్ ఉత్సాహాన్ని నింపారని తెలిపారు.

లొంగిపోయే ప్రసక్తే లేదు: డా. కఫీల్‌ఖాన్

గోరఖ్‌పూర్: తమ కుటుంబాన్ని అంతమొందించేందుకు ప్రయత్నించినా తాను లొంగే ప్రసక్తి మాత్రం లేదని... 'బీఆర్‌డీ వైద్య కళాశాలలో 63 మంది చిన్నారుల మృతి' కేసులో నిందితునిగా ఉన్న వైద్యుడు డా.కఫీల్‌ఖాన్ స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి హుమయూన్‌పూర్‌లో అతని సోదరుడు కసీఫ్ జమీల్‌పై ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నివాసానికి 500 మీటర్ల దూరంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది! దీనిపై కఫీల్‌ఖాన్ సోమవారమిక్కడ మాట్లాడుతూ- "మా సోదరుడి శరీరం నుంచి బుల్లెట్లను బయటకు తీశారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో ఉన్నారు. మమ్మల్ని మట్టుబెట్టడానికి ప్రయత్నిస్తారని ఎప్పట్నుంచో చెబుతున్నా. బీఆర్‌డీ వైద్యకళాశాల కేసు వెనకున్న పెద్దవాళ్ల నుంచి మాకు తీవ్ర ముప్పుంది" అని అన్నారు. కాల్పుల ఘటనపై కేసు నమోదు చేసినట్లు గోరఖ్‌పూర్ సీనియర్ ఎస్పీ షాలభ్ మాథుర్ వెల్లడించారు.

తప్పుడు తూకాలపై అధికారులు కన్నెర్ర..

తూనిక రాళ్లు వేసి కాటాలో లోపాలను పరిశీలిస్తున్న అధికారులు

విజయవాడ, న్యూస్‌టుడే: విజయవాడ నగరంలో తప్పుడు తూకాలతో వినియోగదారులను మోసగిస్తున్న వ్యాపారులపై తూనికలు, కొలతల శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో 4 బృందాలు తనిఖీలు నిర్వహించి నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారులపై 45 కేసులు నమోదు చేశారు. తూనికలు కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్లు స్వామి, కృష్ణచైతన్య, వెంకటరావుల నేతృత్వంలో 23 మంది అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఒక బ్యాంకులో బంగారం తనఖా పెట్టుకునేందుకు వినియోగించే ఎలక్ట్రానిక్ కాటాకు సీలు లేకపోవటంతో కేసు నమోదు చేశారు. స్టీల్ దుకాణంలో బిల్లు ప్రకారం 1,194 కిలోల బరువు ఉండాల్సిన ఇనుమును తిరిగి కాటా వేయగా 1,147 కిలోలు మాత్రమే తూగింది. దీంతో వినియోగదారుకు సుమారు రూ.2500 నష్టం వాటిల్లిందని అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి తెలిపారు.

సువర్ణావకాశం సద్వినియోగం చేసుకోండి

వేర్పాటు వాదులకు మెహబూబా ముఫ్తీ విజ్ఞప్తి

శ్రీనగర్: కేంద్రం చేసిన చర్చల ప్రతిపాదన ఓ సువర్ణావకాశమనీ.... పదేపదే ఇలాంటి పరిస్థితి రాదు... అందుకే, ఈ అవకాశాన్ని వదులుకోకుండా... సద్వినియోగం చేసుకోవాలంటూ వేర్పాటువాదులను జమ్ము-కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కోరారు. ఇది ఒకరకంగా కశ్మీరు సమస్య పరిష్కారం దిశగా రాజకీయ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లేనని ఆమె సోమవారం నాడిక్కడ అభిప్రాయపడ్డారు. ఇది రాజకీయ సమస్య మాత్రమే అని ప్రతిఒక్కరూ విశ్వసిస్తున్నారనీ... దీనిని సైన్యంతో పరిష్కరించడం కుదరదనీ ఆమె ఉద్ఘాటించారు. రాజకీయ ప్రక్రియను ముందుకు తీసుకు వెళ్లేందుకు ఎక్కడో ఓ యత్నం జరుగుతున్నదన్నది తన అభిప్రాయమన్నారు.

కోత పెట్టారు.. కుట్లు వేస్తారా?

- కోతపడిన 11 వేల వైద్య సీట్లకు అనుమతుల పునరుద్ధరణపై ఉత్కంఠ
- సమీపిస్తున్న కౌన్సెలింగ్ తేదీలు

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా ఏకంగా 11 వేలకు పైగా వైద్య సీట్లకు కోత పడడం, అనుమతుల పునరుద్ధరణకు భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) నిరాకరించడం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను హతాశులను చేసింది. ఇందులో మన రాష్ట్రానికి సంబంధించి 800 సీట్లు (అన్నీ ప్రైవేటు కళాశాలలవే) ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో సీట్ల భర్తీకి ఈ నెల 25 నుంచి కౌన్సెలింగ్ జరగనుంది. కోత పడిన సీట్ల భర్తీకి ఈలోపు తిరిగి ఆమోదం లభిస్తుందో? లేదో? అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

గతంలో ఇలాగే నిరాకరించి..

గత రెండు సంవత్సరాల్లోనూ పలు సీట్ల భర్తీకి వైద్య మండలి అనుమతి నిరాకరించడం, తొలివిడత కౌన్సెలింగ్ తరువాత ఆమోదం తెలపడం తెలిసిందే. ప్రస్తుతం ఒక్క ఉత్తర్ ప్రదేశ్‌లోనే 3,300 సీట్లకు కోతపడినట్లు సమాచారం. అనుమతుల పునరుద్ధరణకు యూపీతో పాటు పలు ఇతర రాష్ట్రాల నుంచి కేంద్రంపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు పెరిగినట్లు తెలుస్తోంది. పలు విద్యా సంస్థల యాజమాన్యాలు న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

రాష్ట్రంలో 25 నుంచి కౌన్సెలింగ్..

- ★ ఎంసీఐ మార్గదర్శకాలు అనుసరించి జాతీయ స్థాయిలో 15% సీట్లు పోగా మిగిలిన 85% ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి తొలివిడత కౌన్సెలింగ్ ఈ నెల 25 నుంచి జులై 5 మధ్య జరగనుంది.
- ★ మలివిడత కౌన్సెలింగ్ జులై 15 నుంచి 26 వరకు జరుగుతుంది.
- ★ ప్రత్యక్ష విధానంలో సీట్ల భర్తీ ఆగస్టు 4 నుంచి 8 వరకు నిర్వహించనున్నారు.

జాతీయస్థాయిలో 4,500 సీట్లకు రాష్ట్రం నుంచి అర్హులు..

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి. ఇందులో 15% (283) సీట్లను జాతీయ స్థాయిలో భర్తీచేయబోతున్నారు. దీనివల్ల రాష్ట్ర విద్యార్థులు జాతీయ స్థాయిలో 4,500 సీట్లకు పోటీపడి అర్హత సాధించడానికి వీలు ఏర్పడింది. వీటి భర్తీకి తొలివిడత కౌన్సెలింగ్ ఈ నెల 12 నుంచి 24 మధ్య జరగనుంది. ద్వితీయ కౌన్సెలింగ్ జులై 6 నుంచి 12 వరకూ జరగనుంది.

కేంద్రం పరిధిలోనే: "కోతపడిన సీట్ల భర్తీకి ఎంసీఐ నుంచి అనుమతుల పునరుద్ధరణ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది. వైద్యుల అవసరాల దృష్ట్యా పునఃపరిశీలన చేయడానికి అవకాశాలు ఉండవచ్చు" అని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ సీవీరావు తెలిపారు.

ఉద్యోగ అవకాశాలు

Job Opportunities

Interested Candidates can apply for the following residential vacancies in VIRRD Trust Hospital, Thimmapuram, Dwaraka Tirumala

Orthopaedic Surgeons (MS/Diploma)
Physiotherapists (MPT/ BPT)
Anaesthesia Technicians (Diploma)
Lab Technician (Diploma)
Radiographer
Anaesthesiologists (MD/ Diploma)
Hospital Administrator
Staff Nurses (B.Sc Nursing)
Pharmacist
Receptionist

The Interested applicants must send bio-data & relevant Certificates to the Chairman,
VIRRD Trust Hospital, Thimmapuram,
Dwaraka Tirumala- 534 426, West Godavari Dist, and A.P.

TENVIC TO ENSURE VICTORY

స్పోర్ట్స్ కోచ్‌ల నియామకం

అథ్లెటిక్స్ -100 ఖాళీలు

ఇతర ఖాళీలు

టేబుల్ టెన్నిస్, క్రికెట్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, జూడో, హాకీ, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, తైక్వాండో, రైఫిల్ షూటింగ్, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఆర్చరీ, కబడ్డీ, ఫుట్‌బాల్, ఖో ఖో, సెపక్‌తక్రా మరియు వాలీబాల్

ఉద్యోగ ప్రదేశం: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలు.

అభ్యర్థి తెలుగు మరియు ఇంగ్లీషు మాట్లాడగలిగి ఉండవలెను

అర్హత:
Bped/ Mped/NIS సర్టిఫికెట్/ NIS డిప్లొమా, ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్లు

దరఖాస్తు చేయుటకు ఫోన్ చేయండి 8123002014
మీ రెజ్యూమెను careers@tenvicsports.com కు మెయిల్ చేయండి.

NRI Academy of Sciences

NRI Medical College & General Hospital
Chinakakani, Mangalagiri (M), Guntur (Dt), AP.
Phone : 08645-236401, 402, 403, 405
Email: cao.nrias@gmail.com; Visit: www.nrias.net

NRI Medical College & General and Super speciality Hospital is one of the premier institutions of Medical Education and Health Care in the state of Andhra Pradesh. It requires well experienced, dynamic & result oriented

NURSING SUPERINTENDENT

The candidate must possess B.Sc/M.Sc (Nursing) with 8 to 10 years experience. Candidates having good exposure in NABH regulations are preferred.

STAFF NURSES

The candidates must posses GNM / B.Sc (Nursing) with exp. / Freshers can also apply.

Interested candidates may walk-in for an interview on Dt. 20-6-2018 or submit their resumes within 10 days to the Chief Administrative Officer **by courier or email** at the above address. Salary is not a constraint for the deserving candidates. No TA/DA will be paid.

NCL Industries Ltd., Hyderabad, a listed company engaged in the manufacture of Cement and Cement Bonded Particle Boards, is seeking applications for the following positions for its **TRANSPORT** Division:

Position	Location	Qualifications	Experience
DGM / GM (Transport Division)	Huzur Nagar (Near Kodada – Suryapet District)	MBA / M.Com	Minimum 15 Years' experience in managing fleet operations of not less than 500 vehicles. Should possess experience in complete cycle of transport operations.
Senior Manager (Finance & Accounts)		CA Inter / M. Com / MBA (Finance)	Minimum 8 Years' experience in managing Finance & Accounting function, out of which he should have spent 5 years in logistics/transport industry
Assistant Manager (Finance & Accounts)		M.Com / MBA (Finance)	Minimum 6 Years' experience in managing Finance & Accounting function, out of which he should have spent 3 years in logistics/transport industry
Assistant Manager (Workshop)		Diploma in Automobile Engineering	Minimum 6 Years' experience in managing a large size workshop of heavy duty fleet – Tippers / Trucks
Executive (Finance & Accounts)	Huzur Nagar & Kondapalli (Near Vijayawada)	M.Com / MBA (Finance)	Minimum 3 Years' experience in managing Finance & Accounting function, preferably in logistics/transport industry
Executive (Fleet Operations)		Graduate	Minimum 3 Years' experience in managing field transport operations in logistics / transport industry

Interested candidates who meet the above criteria and interested in the specified location, may send their resumes to **careers@nclind.com** or send to NCL Industries Limited, 4th Floor, Vaishnavi's Cynosure, Near Gachibowli Flyover, Gachibowli, Hyderabad, within 10 days of this advertisement.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్

వెబ్‌సైట్ :www.ibps.in
సందేహాలు / ఫిర్యాదులు ఉన్న పక్షంలో
http://cgrs.ibps.in/ ని చూడండి

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (RRBs) లో ఆఫీసర్లు (స్కేల్-I, II & III) మరియు ఆఫీసు అసిస్టెంట్ల (మల్టిపర్పస్) యొక్క నియామకం కొరకు ఉమ్మడి నియామక ప్రక్రియ- CRP RRBs VII

గ్రూప్ 'ఎ' - ఆఫీసర్లు (స్కేల్-I, II & III) మరియు గ్రూప్ 'బి' ఆఫీసు అసిస్టెంట్ (మల్టిపర్పస్) యొక్క నియామకం కొరకు RRBs నిమిత్తం తదుపరి నియామక ప్రక్రియ (CRP RRBs VII) కై ఆన్‌లైన్ పరీక్ష ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (IBPS)చే ఆగస్టు మరియు అక్టోబరు 2018 మధ్య తాత్కాలికంగా నిర్వహించబడును. ఇదే ప్రక్రియ క్రింద గ్రూప్ 'ఎ' - ఆఫీసర్లు (స్కేల్-I, II & III) నియామకం కొరకు ఇంటర్వ్యూలు తాత్కాలికంగా 2018 నవంబరు నెలలో తగిన ప్రాధికారి కన్సల్టేషన్‌తో NABARD మరియు IBPS సహాయంతో నోడల్ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులచే సమన్వయపరచబడతాయి.

CRP RRBs VII కొరకు దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు IBPSచే జారీచేయబడిన వివరమైన ప్రకటనలో తెలిపిన విధంగా నిర్ణీత తేదీన కనీస అర్హత నియమావళిని నెరవేర్చేలా చూసుకోవలెను.

అంశం	తాత్కాలిక తేదీలు
దరఖాస్తు యొక్క ఎడిట్/ మాడిఫికేషన్ సహా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మరియు దరఖాస్తు ఫీజు / ఇంటిమేషన్ చార్జీల చెల్లింపు	8-6-2018 నుండి 2-7-2018
ఆఫీసర్ స్కేల్-I కొరకు ప్రి-ఎగ్జామ్ ట్రైనింగ్ నిర్వహణ	30-7-2018 నుండి 4-8-2018 వరకు
ఆఫీస్ అసిస్టెంట్ కొరకు ప్రి-ఎగ్జామ్ ట్రైనింగ్ నిర్వహణ	6-8-2018 నుండి 11-8-2018 వరకు.
ఆన్‌లైన్ పరీక్ష- ప్రిలిమినరీ	ఆఫీసర్ స్కేల్ -I- 11-8-2018, 12-8-2018 మరియు 18-8-2018 (అవసరమైతే) ఆఫీసు అసిస్టెంట్- 19-8-2018, 25-8-208 & 1-9-2018
ఆన్‌లైన్ పరీక్ష - ప్రిలిమినరీ ఫలితం	ఆఫీసర్ - స్కేల్-I - సెప్టెంబరు 2018 ఆఫీసు అసిస్టెంట్ - సెప్టెంబరు 2018
ఆన్‌లైన్ పరీక్ష - మెయిన్/ సింగిల్	ఆఫీసర్లు (I, II & III) -30-9-2018 ఆఫీసు అసిస్టెంట్- 7-10-2018

వివరాలు మరియు తాజా అంశాల కొరకు అధికారిక IBPS వెబ్‌సైట్ www.ibps.inను క్రమం తప్పకుండా చూడవల్సిందిగా అభ్యర్థులకు విజ్ఞప్తి.

ఆన్‌లైన్‌లో రిజిస్టరు చేసుకునే ముందు వివరమైన ప్రకటనను చదవవల్సిందిగా మరియు అందులో తెలిపిన సూచనలను పాటించవల్సిందిగా అభ్యర్థులకు విజ్ఞప్తి.

ముంబాయి. డైరెక్టర్
తేదీ: 6-6-2018 (IBPS)

క్రమశిక్షణ తప్పితే వేటు తప్పదు

- కడప జిల్లా నేతలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం

ఈనాడు – అమరావతి

క్రమశిక్షణ తప్పితే వేటు తప్పదని పార్టీ నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. "మీకు పదవులిచ్చాను. ఎంతో కష్టపడి జిల్లాకు నీళ్లిచ్చాను. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాను. అవన్నీ సానుకూలంగా మలుచుకుని పార్టీని బలోపేతం చేయాల్సింది పోయి మీలో మీరు కొట్టుకుంటారా? ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లు మాట్లాడతారా? పత్రికలకు ఎక్కుతారా? పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తారా? ఇక మీదట ఇలాంటివి సహించను. మీ గొడవల వల్ల పార్టీ మునిగే పరిస్థితి వస్తే ఎవర్ని వదులుకోవడానికైనా సిద్ధం. కఠిన చర్యలకు వెనుకాడను..." అని కడప జిల్లా తెదేపా నేతలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో నాయకుల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరిన నేపథ్యంలో సోమవారం ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాలులో కడప పార్లమెంటరీ నియోజకవర్గ నాయకులతో సీఎం ఐదున్నర గంటలపాటు సమావేశమయ్యారు. ఇన్‌ఛార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా మంత్రి ఆదినారాయణరెడ్డి, ఎంపీ సీఎం రమేష్, జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిలతో మాట్లాడారు. "మీలో ఒకరు మంత్రి, ఒకరు ఎంపీ, మరొకరు జిల్లా అధ్యక్షుడు. మీరంతా పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిందిపోయి, ఇలా రోడ్డెక్కుతారా?" అని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అందరూ సమష్టిగా పని చేసి బీటెక్ రవిని గెలిపించారని... ఆ స్ఫూర్తి ఇప్పుడేమైందని ఆయన పార్టీ నాయకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శాసనసభా నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితుల్ని సమీక్షించారు. ప్రొద్దుటూరు, కమలాపురం, బద్వేలుపై మంగళవారం సమీక్షించనున్నారు. ఆదినారాయణరెడ్డి, సీఎం రమేష్, వరదరాజులరెడ్డి మధ్య విభేదాలు... జమ్మలమడుగులో రామసుబ్బారెడ్డికి, ఆదినారాయణరెడ్డికి మధ్య ఉన్న గొడవలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. కడప జిల్లాలో పది శాసనసభ, రెండు ఎంపీ సీట్లలో గెలిచి తీరాలని పార్టీ నాయకులకు ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పతనం మొదలైందని సీఎం వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఇష్టానుసారం చేస్తే భాజపాకి పట్టిన గతే పడుతుందన్నారు. ఈ సమావేశం అనంతరం జిల్లా నాయకులు విలేకరులతో మాట్లాడారు. తామంతా కలసికట్టుగా పనిచేస్తామని ముఖ్యమంత్రికి మాట ఇచ్చినట్టు చెప్పారు. "జిల్లా నేతల మధ్య అపార్థాలున్నా... మాదంతా ఒకే కుటుంబం. పార్టీలోని సమస్యల్ని పరిష్కరించుకుంటాం. మేమంతా కలిశాం. ఇక వైకాపాకి నిద్ర పట్టదు..." అని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో పదికి పది శాసనసభ స్థానాల్లో గెలిస్తేనే చంద్రబాబు కల నిజమవుతుందని, దానికి కృషి చేస్తామని ఆదినారాయణరెడ్డి తెలిపారు. కడప స్టీల్‌ప్లాంట్ కోసం నిరాహారదీక్ష చేయాలని నిర్ణయించామని, జిల్లా నేతలతో మాట్లాడి తేదీ ఖరారు చేస్తామని సీఎం రమేష్ తెలిపారు. మరోసారి ఇలా జరగడానికి వీల్లేదని, పత్రికలకు ఎక్కవద్దని ముఖ్యమంత్రి హెచ్చరించినట్టు జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పరిణామాలు బాధ కలిగించాయని, పార్టీ నాయకులు బహిరంగంగా విమర్శలు చేసుకోవడం ఇదే మొదటిసారని రామసుబ్బారెడ్డి తెలిపారు.

అధికారులుగా ప్రయివేటు నిపుణులు సబబే
నీతీశ్ కుమార్ సమర్థన

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శులుగా ప్రయివేటు రంగ నిపుణులను నియమించాలన్న నిర్ణయాన్ని నిర్ణయాన్ని బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ స్వాగతించారు. దేశంలో ఐఏఎస్, ఐపీఎస్‌ల కొరత ఉన్నందునే ఇలాంటి ప్రయోగం చేయాల్సి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సివిల్ సర్వీసు ఉద్యోగాలను తగ్గించడం వల్లనే అధికారులకు కొరత ఏర్పడిందని చెప్పారు.

ఇది మోదీ పరిపాలన వైఫల్యం: మాయావతి: ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. బీఎస్‌పీ నాయకురాలు మాయావతి లఖ్‌నవూలో మాట్లాడుతూ విధాన నిర్ణయాల్లో పెట్టుబడిదారుల ప్రభావాన్ని పెంచేందుకే ఇలాంటి నిర్ణయం తీసుకొందని ఆరోపించారు. ఇది పరిపాలనలో మోదీ ప్రభుత్వ వైఫల్యం కిందికి వస్తుందని పేర్కొన్నారు. యూపీఎస్సీ అనుమతి లేకుండా ఇలాంటి నియామకాలు జరపడం వ్యవస్థను కించపరచడమేనని అన్నారు. 'అంకితభావంగల అధికారుల' కోసమే ఈ ఏర్పాటు చేశారని ఆర్జేడీ నేత మనోజ్ ఝా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేత పి.చిదంబరం మాట్లాడుతూ ప్రతిభావంతులను రెండుమూడేళ్ల కాలానికి కార్యదర్శులుగా నియమించే సంప్రదాయం ఉందని, అయితే సంయుక్త కార్యదర్శులుగా నియమించడంపై పలు సందేహాలు ఉన్నాయని అన్నారు.

'బడి పిలుస్తోంది' విజయవంతం చేయండి: మంత్రి గంటా

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సోమవారం నుంచి నిర్వహిస్తున్న 'బడి పిలుస్తోంది-విద్యా వారోత్సవాలు' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ నెల 20 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ఫొటోలు ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను ప్రదర్శించాలని, విద్యా సంకల్పం-ప్రతిజ్ఞ చేయాలని కోరారు.

ఉద్యోగాల మదింపులో మరింత పారదర్శకత
సాంకేతిక సంఘాన్ని నియమించిన కేంద్రం

దిల్లీ: ఉద్యోగాల గణనను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు... మాజీ ముఖ్య గణాంకాధికారి టీసీఏ అనంత్ నేతృత్వాన కేంద్రం సాంకేతిక సంఘాన్ని నియమించింది. కేంద్ర కార్మికశాఖ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించింది. "ఉద్యోగ అంచనాల రూపకల్పన ప్రక్రియల పట్ల నిరుద్యోగులు, సామాన్యులకు అవగాహన కలిగించాలని కార్మికశాఖ భావించింది. వీలైనంత త్వరగా నివేదికను సమర్పించాలని అనంత్ కమిటీని కోరింది" అని అధికార వర్గాలు తెలిపాయి. వార్షిక ఉద్యోగ-నిరుద్యోగ సర్వే (ఈయూఎస్); త్రైమాసిక ఉద్యోగ సర్వే (క్యూఈఎస్)లను కార్మికశాఖ నిర్వహిస్తూ వచ్చింది. అయితే, వీటి స్థానంలో 'కాలానుగుణ కార్మికశక్తి సర్వే (పీఎల్ఎఫ్ఎస్)'ను చేపట్టాలని అరవింద్ పనగడియా నేతృత్వంలోని కార్యదళం ప్రతిపాదించగా... కేంద్ర గణాంక, కార్యక్రమ అమలుశాఖ దీన్ని చేపట్టింది. ఈ క్రమంలో పారదర్శకత నిమిత్తం సాంకేతిక సంఘాన్ని కేంద్రం నియమించింది.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాలు నేడు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు మంగళవారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మంత్రి గంటా శ్రీనివాసరావు ఫలితాలు విడుదల చేయనున్నారు. ఫలితాలను www.eenadu.net వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

15లోగా పంచాయతీ తుది ఓటర్ల జాబితాలు
విడుదలకు సిద్ధమవుతున్న యంత్రాంగం

ఈనాడు, అమరావతి: ఎన్నికల సంఘం ఆదేశాలపై ఈ నెల 15లోగా పంచాయతీల వారీగా తుది ఓటర్ల జాబితాల విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాల వారీగా ఇటీవల సమీక్ష నిర్వహించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులు గడువులోగా జాబితాలు విడుదల చేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. తాజా సమాచారం ప్రకారం రాష్ట్రంలోని 12,896 పంచాయతీల ఓటర్ల తుది జాబితాలు సిద్ధమైనట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. సర్పంచిల, వార్డు సభ్యుల పదవీ కాలం ఆగస్టు 15తో ముగియనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తదుపరి ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటికే ముందస్తు కసరత్తు ప్రారంభించింది. సంఘం ఆదేశాల ప్రకారం గత నెల 15లోగా పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు ప్రకటించాలి. పలు జిల్లాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది ఇతరత్రా బాధ్యతల్లో ఉన్నందున గడువు కావాలన్న ప్రభుత్వ విజ్ఞప్తిపై ఈ నెల 15 వరకు ఎన్నికల సంఘం గడువు పొడిగించిన సంగతి తెలిసిందే. మరోసారి గడువు ఇచ్చే అవకాశం లేనందున అన్ని పంచాయతీల్లోనూ ఓటర్ల జాబితాలు సిద్ధం చేసిన అధికారులు వీటి విడుదలకు సిద్ధమయ్యారు. నిబంధనల ప్రకారం మరో నెల రోజుల్లో సర్పంచి, వార్డులకు జనాభా, కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేయాలి.

మత్తుకు బానిసైన విద్యార్థినిపై అఘాయిత్యం
ఏడుగురి అరెస్టు... మరో 8 మంది కోసం గాలింపు

తిరువళ్లూరు, న్యూస్‌టుడే: తిరువళ్లూరులో ఓ విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన ఏడుగురు యువకులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. స్థానికురాలైన 10వ తరగతి విద్యార్థిని ఏడాది కాలంగా కొందరు యువకులతో స్నేహం చేస్తోందని, ఈ క్రమంలో మత్తు పదార్థాలకు బానిసైందని తెలిపారు. ఆమె బలహీనతను ఆసరాగా చేసుకున్న ఆ యువకులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారన్నారు. బడికి వెళ్లకుండా మగపిల్లలతో ఎందుకు తిరుగుతున్నావని రెండు రోజుల క్రితం తల్లిదండ్రులు మందలించడంతో..ఆగ్రహంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నించింది. ఇదే విషయాన్ని ఆమె తండ్రి ఎస్పీ శిబి చక్రవర్తికి ఫిర్యాదు చేసినట్లు మహిళా పోలీసు అధికారి ఒకరు తెలిపారు. బాలికకు మద్యం, గంజాయి తాగించి 15 మంది అత్యాచారం చేసినట్లు తేలిందన్నారు. బాధితురాలు ఇచ్చిన వివరాలతో తిరువళ్లూరు, తలంకాంజేరి, కాకలూరు ప్రాంతాలకు చెందిన ఏడుగురు యువకులను సోమవారం అరెస్టు చేసినట్లు అధికారి తెలిపారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నామన్నారు.

కంప్యూటర్లు.. తుక్కు కింద వేలమా?

- మరమ్మతుల విషయం పట్టని అధికారులు
- 'ఈ-వ్యర్థాలు'గా అమ్మకాలకు సన్నద్ధం
- విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయంపై విమర్శలు

ఈనాడు – గుంటూరు

గుంటూరు జిల్లాలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించిన కంప్యూటర్లు

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం కల్పించాలనే సదుద్దేశం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. రూ.కోట్లు ఖర్చు పెట్టి కంప్యూటర్లను పాఠశాలలకు అందజేసిన ప్రభుత్వాలు..అవసరమైన బోధకులను నియమించకపోవటం, మరమ్మతులకు గురైన వాటిని అలానే వదిలేయటంతో ప్రస్తుతం అవి మూలనపడ్డాయి. ఏళ్లుగా వీటి మరమ్మతులు, పునరుద్ధరణ గురించి పట్టించుకోని విద్యాశాఖ అధికారులు..ఇప్పుడు ఆ పరికరాలను ఈ-వ్యర్థాలుగా చూపించి కిలోల లెక్కన వేలంలో అమ్మేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ప్రస్తుతం పాఠశాలల్లో పనిచేయని కంప్యూటర్లు మొత్తాన్ని జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించి రేపో, మాపో విక్రయించాలని చూస్తున్నారు. ఈ నిర్ణయంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 6,300 పాఠశాలలకు రెండు దశల్లో ప్రముఖ కంపెనీలకు చెందిన సాధారణ కంప్యూటర్లు, ఎల్ఈడీ కంప్యూటర్లు.. సగటున ఒక్కో పాఠశాలకు 5 నుంచి 20 వరకు అందజేశారు. వాటిల్లో మూడు వేలకు పైగా పాఠశాలలు ఏపీలో ఉంటాయని అంచనా. సరఫరా చేసిన కంప్యూటర్లలో ఎల్ఈడీలు మాత్రమే ఒకటీ అర పనిచేస్తున్నాయని మిగిలినవి ఏమీ పనిచేయటం లేదని ప్రధానోపాధ్యాయుల నుంచి ధ్రువీకరించుకుని విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్నాళ్ల నుంచి కంప్యూటర్లు మూలనపడి ఉంటే పట్టించుకోని విద్యాశాఖ ప్రస్తుతం వాటిని విక్రయించటానికి మాత్రం హడావుడి చేయటంపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏపీటీఎస్ సంస్థతో గానీ ఇంకేదైనా సంస్థతో ఈ కంప్యూటర్ల స్థితి ఏమిటని అధ్యయనం చేయించి వాటి విక్రయాలకు పూనుకుంటే బాగుండేదని వారు అభిప్రాయపడుతున్నారు. తుక్కుగా విక్రయించే కన్నా, బాగుచేసుకొని వినియోగించుకుంటామని మందుకొచ్చే విద్యార్థులకు ఇచ్చినా ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. కంప్యూటర్లతోపాటు ఇన్వర్టర్లు, బ్యాటరీలు, సీపీయూలు, ప్రింటర్లు, జనరేటర్లు సైతం విక్రయించటానికి చర్యలు తీసుకుంటున్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

ఆయిల్‌పామ్‌లో అక్రమాలు

- రైతులను ముంచేస్తున్న 'పెదవేగి'
- నూనె శాతాన్ని తక్కువ చూపుతున్న పరిశ్రమ
- టెండరు లేకుండానే గింజల అమ్మకం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

ఈనాడు, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి ఆయిల్‌పామ్ పరిశ్రమ రైతుల పొట్టగొడుతోంది. పరిశ్రమ నుంచి పెద్దఎత్తున నట్స్(ఆయిల్ పామ్ గింజలు) ఇష్టానుసారం అమ్మేసుకుంటున్నా పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదు. ప్రైవేటు వ్యాపారులతో కుమ్మక్కవుతున్న అధికారులు రైతులను మోసం చేస్తున్నారు. రహస్య విచారణ పేరుతో మమ అన్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల్లో సాగయ్యే ఆయిల్‌పామ్‌కు ధరల నిర్ణయంలో పెదవేగి పరిశ్రమలో నూనెశాతం, ఇతర ఉత్పత్తులనే ప్రామాణికంగా తీసుకుంటారు. 12 నెలల సగటు ఆధారంగా ఏడాదికి ధర నిర్ణయిస్తారు. అయితే 2014 నుంచి ఇక్కడ నూనెశాతం తగ్గిపోతోంది. తెలంగాణలోని అశ్వారావుపేట కొత్త ఫ్యాక్టరీలో నూనెశాతం 18.46 వస్తుంటే.. ఇక్కడ మాత్రం 16.40 శాతం మాత్రమే లభిస్తోంది. దీనివల్ల టన్నుకు ధరలో రూ.1,200 తేడా వస్తోంది.

తూతూ మంత్రంగా విచారణ?: ఆయిల్‌పామ్ గింజలు టన్ను రూ.30వేల నుంచి రూ.40వేల మధ్య ఉంటాయి. టెండర్ ఆధారంగా వీటిని విక్రయించాలి. ఇలా కొన్ని.. అనధికారికంగా మరికొన్ని తరలిస్తున్నారు. ఇటీవల ఈ విషయం బయట పడింది. ఆధారాలతో సహా బయటకు రావడంతో విచారణకు ఆదేశించినట్లు సమాచారం. కొన్నివర్గాల నుంచి ఒత్తిళ్ల నేపథ్యంలో దీన్ని తూతూమంత్రంగా ముగించే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతా రహస్యం అంటూ గుట్టుగా వ్యవహరిస్తున్నారు.

- రైతులు ఫ్యాక్టరీకి తెచ్చే గెలలను గేటు వద్దనే నిలిపేసి పక్వానికి రాలేదంటూ కొన్నింటిని పక్కన పడేస్తున్నారు. ఇదే పేరుతో బాగున్నవాటినీ కొన్నింటిని తొలగిస్తున్నారు. అంతా బాగున్న గెలలనే ఫ్యాక్టరీ లోపలకు తీసుకెళ్తున్నా నూనెశాతం ఎందుకు తగ్గిపోతోందన్న రైతుల ప్రశ్నకు, అలాగే పక్కన పెట్టిన గెలలన్నీ ఎటు పోతున్నాయనే దానికి సమాధానం లేదు.
- ఖాళీ లేదంటూ రైతులు తెచ్చిన గెలలను పక్కన పడేస్తున్నారు. ఇలా ఎండకు వదిలేస్తూ.. కావాలనే కుళ్లబెడుతుంటే.. ఇలా చేస్తే నూనెశాతం ఎలా వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.
- ఆయిల్‌ఫెడ్‌కు పూర్తిస్థాయి ఎండీ అందుబాటులో లేకపోవడంతో పరిశ్రమలో ఏం జరుగుతుందో పట్టించుకునే వారే కరవయ్యారు. కొందరు అధికారులు ఏళ్లతరబడి అక్కడే పనిచేస్తుండటం, పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా తయారైంది.
- ప్రభుత్వం పరిశ్రమలో చోటు చేసుకుంటున్న అక్రమ వ్యవహారాలపై పూర్తిస్థాయి విచారణ చేయించడంతోపాటు.. ప్రక్షాళన చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని రైతులు గుర్తు చేస్తున్నారు.

ఏటీఎల్‌కు ఎంపికైన 82 గురుకుల విద్యాసంస్థలు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని 64 సాంఘిక, 18 గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు అటల్ టింకరింగ్ ప్రయోగశాలల(ఏటీఎల్) పథకానికి ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా మూడు వేల ప్రభుత్వ విద్యాసంస్థల్ని ఈ పథకం కింద నీతి ఆయోగ్ ఎంపిక చేసింది. ఈ పథకానికి ఎంపికైన ఒక్కో విద్యాసంస్థకు ఐదేళ్ల కాలానికి రూ.50 లక్షల నిధులు అందుతాయి. వీటి ద్వారా ఆయా పాఠశాలలలో ప్రయోగశాలల ఏర్పాటు, ప్రయోగాత్మక విద్య అందించడం వంటి కార్యక్రమాలు అమలు చేస్తారు. వివిధ అంశాలను బోధించేందుకు దిల్లీ నుంచి ప్రత్యేకంగా ఉపాధ్యాయులను పంపుతారు. రాష్ట్రం నుంచి 64 గురుకులాలు ఎంపికవడం పట్ల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి కల్నల్ రాములు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఉత్తరకోస్తాలో భారీవర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: కోస్తాంధ్ర తీరవ్యాప్తంగా మంగళవారం సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఇన్‌కాయిస్ హెచ్చరికల ప్రకారం సముద్ర అలలు 3.5 మీటర్ల నుంచి 4.3 మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడే అవకాశం ఉందని వివరించింది. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. బంగ్లాదేశ్ సమీపంలో వాయుగుండం తీరం దాటి, బలహీనపడుతూ వచ్చినట్లు వివరించింది. మంగళవారం ఉత్తరకోస్తాలో పలుచోట్ల భారీవర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు వెల్లడించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

వానా వానా హాయప్పా!



ఎండ వేడి బెడద లేదు. ఉక్కపోత చిక్కులేదు. ఉదయం లేస్తూనే శరీరాన్ని చల్లగా తాకే గాలి. చిటపట చినుకుల సందడి. నింగికీ నేలకూ ఉయ్యాలలేసే వానధార. అవును.. వర్షకాలం వస్తూనే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వెంటబెట్టుకు వస్తుంది. ఎటుచూసినా పచ్చటి ప్రకృతి సోయగంతో పలకరిస్తుంది. అయితే ఇంతటి సంతోషాన్ని పంచే వర్షకాలం కొన్ని ఆరోగ్య సమస్యలనూ మోసుకొస్తుంది. జలుబు, తుమ్ములు, ముక్కు కారటం సరేసరి. ఆహారం, నీరు కలుషితం కావటం వల్ల పట్టుకునే విరేచనాలు, వాంతులు, టైఫాయిడ్ జ్వరం.. దోమకాటుతో విరుచుకుపడే మలేరియా.. ఇలా ఎన్నెన్నో జబ్బులు చుట్టుముడుతుంటాయి. మరి వీటి నుంచి కాపాడుకోవటమెలా? ఇందుకు హోమియో చక్కటి పరిష్కారం చూపిస్తుంది. సహజ వైద్య విధానంతో సరళ పరిష్కారాలను అందిస్తుంది.

జలుబు, దగ్గు, ఆస్థమా వంటి సమస్యలు ఒకటే అయినా వాటి లక్షణాలు, తీవ్రత అందరిలో ఒకేలా ఉండవు. అందుకే హోమియో విధానం ఆయా వ్యక్తుల పరిస్థితి, రోగ లక్షణాలను బట్టి రకరకాల మందులను సూచిస్తుంది. రోగ లక్షణాలు తగ్గుముఖం పట్టేలా చేసే మందులతో పాటు అవి మళ్లీ మళ్లీ తిరగబెట్టకుండా, దీర్ఘకాల (క్రానిక్) సమస్యలుగా మారకుండా చూడటానికి శరీర తత్వాన్ని బట్టి (కాన్‌స్టిట్యూషనల్) వాడుకోవాల్సిన ఔషధాలకూ ప్రాధాన్యం ఇస్తుంది.

డా॥ పావులూరి కృష్ణచౌదరి
హోమియో ఫిజీషియన్
హైదరాబాద్

మన ఆరోగ్యాన్ని చాలా అంశాలు ప్రభావితం చేస్తాయి. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది రుతువుల గురించి. ఆయా కాలాల్లో తలెత్తే వాతావరణ మార్పులు.. ఎండ, చలి, వానల వంటివి మన శరీరంపై గణనీయమైన ప్రభావాన్నే చూపిస్తాయి. కొందరిలో ఇవి సమస్యాత్మకంగానూ పరిణమిస్తాయి. ఈ వర్షకాలంలో వానలో తడవటం, తేమ గాలి ప్రభావం వల్ల కొందరికి కొన్ని సమస్యలు ఆరంభం కావొచ్చు. కొందరికి అప్పటికే ఉన్న బాధలు ఎక్కువ కావొచ్చు కూడా. వానకాలంలో చాలామంది తరచుగా జలుబు బారినపడుతుండటం తెలిసిందే. దీంతో తుమ్ములు, దగ్గు, ముక్కు కారటం వంటివి తెగ వేధిస్తుంటాయి. అందుకేనేమో పడిశం పది రోగాల పెట్టు అంటుంటారు. ఇక కీళ్ల సమస్యలతో బాధపడేవారికైతే వానకాలంలో వాపులు, నొప్పులు మరింత ఎక్కువవుతుంటాయి కూడా. ఇలా కాలనుగుణంగా ఎదురయ్యే సమస్యలకు మూల హేతువు మన వ్యాధి నిరోధక వ్యవస్థ గాడి తప్పటం. ఇందుకు ఆయా కాలాల్లో వచ్చే మార్పులు దోహదం చేస్తుండటం.

ఒంట్లో కీలక 'కేబినెట్'!

మన శరీరంలో, మనసులో తలెత్తే అస్తవ్యస్తాలే అన్ని వ్యాధులకు మూలం. దీనికి కారణం అంతర్గత, బాహ్య అంశాల ప్రేరేపణే. ఈ అంశాల కారణంగా వ్యక్తిలో తలెత్తే స్పందనలే రోగ లక్షణాల రూపంలో బయటపడుతుంటాయి. అందుకే హోమియో వైద్య విధానం బహిర్, అంతర కారణాలు రెంటినీ పరిగణనలోకి తీసుకుంటుంది. గాలి, నీరు, తేమ, సూక్ష్మక్రిముల వంటి పరిసరాల ప్రభావాలన్నీ బాహ్య కారణాలు. శరీర తత్వం, మనస్తత్వం, వయసు వంటివన్నీ ఆంతరంగిక కారణాలు. మనలో మానసిక (సైకో), నాడీ (న్యూరో), గ్రంథి (ఎండోక్రైన్), వ్యాధి నిరోధక (ఇమ్యూనిటీ) వ్యవస్థలు చాలా ముఖ్యమైనవి. మన దేహాన్ని ఒక దేశమని అనుకున్నట్టయితే దాన్ని పరిపాలించే కీలకమైన 'కేబినెట్' సభ్యులు ఇవేనన్నమాట! ఈ అంతర్గత వ్యవస్థలు ప్రతి వ్యక్తిలో వేర్వేరుగా ఉంటాయి. మనిషి వ్యక్తిత్వానికి ఇవే ఆధారం. వీటిల్లో వ్యాధి నిరోధక వ్యవస్థ ఇంకా ముఖ్యం. దీన్నే ప్రాణమనీ చెప్పుకోవచ్చు. ఆయా కాలాల్లో వచ్చే సమస్యల విషయంలో కచ్చితమైన సూత్రమంటూ ఏదీ లేదు. ఉదాహరణకు- వానలో అందరూ తడవొచ్చు గానీ కొందరికే జలుబు, తుమ్ముల వంటివి పట్టుకుంటుంటాయి. దీనికి కారణం వ్యాధి నిరోధక వ్యవస్థ పనితీరే మూలం. ఇది దెబ్బతింటే రకరకాల జబ్బులు తేలికగా దాడిచేస్తాయి. అదేపనిగా బాహ్య కారణాలు దాడిచేస్తుంటే అంతర్గత కీలక వ్యవస్థలు బలహీనపడి రకరకాల సమస్యలకు దారితీస్తుంది. ఈ వ్యవస్థలను తిరిగి బలోపేతం చేస్తే వ్యాధులు, బాధలన్నీ కుదురుకుంటాయి.

> మనిషి వ్యక్తిత్వానికి అంతర్గత వ్యవస్థలే ఆధారం. వీటిల్లో వ్యాధి నిరోధక వ్యవస్థ ఇంకా ముఖ్యం. దీన్నే ప్రాణమనీ చెప్పుకోవచ్చు.

వ్యక్తి.. వ్యాధి.. ఔషధం!

వ్యాధిని నిరోధించటానికి గానీ నివారించటానికి గానీ జీవశక్తిని ఉత్తేజపరచటం చాలా అవసరం. హోమియో వైద్య విధానం చేసే పని ఇదే. లక్షణాల కంటే కూడా శరీర తత్వం, వ్యక్తిత్వానికి ప్రాధాన్యమిస్తూ.. వ్యాధి సమూలంగా నయమయ్యేలా చేస్తుంది.

నిజానికి బయటకు కనిపించే రోగ లక్షణాలన్నీ కూడా పరిసరాల ప్రభావం ఒత్తిడిని తట్టుకునేందుకు మన ఆంతరంగిక వ్యవస్థ చేసుకునే ఏర్పాట్లే అనుకోవచ్చు. శరీరం వ్యక్తం చేసే ఈ లక్షణాలను బట్టి మనం రకరకాల వ్యాధుల పేర్లతో పిలుచుకుంటున్నాం. ఇవి అందరిలో ఒకేలా ఉండాలనేమీ లేదు. ఒకే రకం బాహ్య పరిస్థితుల్లో ఉండేవారిలో కూడా.. ఆంతరంగిక పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి స్పందనలు కూడా వేరుగా ఉంటాయి. వర్షం, తేమ, తేమతో కూడిన గాలి అన్నవి బాహ్య పరిస్థితులు. దీనికి వ్యక్తి స్పందనల తీరును బట్టి మందులను ఎంపిక చేసి శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాల్సి ఉంటుంది. హోమియో చికిత్సలో ఇది చాలా కీలకమైన అంశం. మందుల ఎంపికలో వ్యాధి లక్షణాలు మాత్రమే కాకుండా వ్యక్తి స్వభావం, తత్వం తెలిసి ఉండటం కూడా చాలా అవసరం. అప్పుడే దానికి తగ్గ సమర్థవంతమైన మందును ఎంపిక చేసుకోవటానికి వీలవుతుంది. కాల ప్రభావం ఒక్కొక్కరిలో ఒకోలా ఉంటుంది. ఉదాహరణకు ఉబ్బసం ఒకటే అయినా కొందరికి అర్ధరాత్రి సమయంలో ఉద్ధృతంగా ఉంటుంటే.. మరికొందరికి తెల్లవారుజామున ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఒక్క బాధను బట్టే మందు ఇవ్వటం హోమియో పద్ధతి కాదు. రోగ లక్షణాలు, రోగి శరీర తత్వాన్ని బట్టి మందును ఎంచుకోవాల్సి ఉంటుంది.

ఇదీ వానకాలం కిట్

● **రస్టాక్స్:** వర్షకాలంలో ప్రధానంగా చెప్పుకోదగిన ఔషధమిది. వానలు కురిసే ముందు ముఖ్యంగా.. తుపాన్లు వచ్చే ముందు తలెత్తే బాధలకిది మంచి మందు. జలుబు, కీళ్లవాతం, కాళ్లు చేతులు బిగుసుకుపోవటం, జ్వరం.. ముఖ్యంగా టైఫాయిడ్ జ్వరం వంటి సమస్యలతో బాధపడేవారికి బాగా ఉపయోగపడుతుంది. సాధారణంగా విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు సుఖంగా, హాయిగా ఉండాలి. కానీ కొందరికి విశ్రాంతిగా ఉన్నప్పుడు నొప్పులు, బాధలు పెరుగుతుంటాయి. వీరికి అటూ ఇటూ కదులుతూ మెదులుతూ ఉంటేనే ఉపశమనంగా అనిపిస్తుంటుంది. నిద్రలేవటంతోనే కండరాలు, కీళ్లు బిగపట్టుకొని పోయి ఉంటాయి. ఇలాంటివారికి రస్టాక్స్ మేలు చేస్తుంది. పగటి పూట కన్నా రాత్రి పూట బాధలు ఎక్కువవుతుంటే దీన్ని వాడుకోవచ్చు. అర్ధరాత్రి దాటాక పొట్టలో నొప్పి, నీళ్ల విరేచనాలతో బాధపడే పిల్లలకు, అస్థిమితంగా ఉండేవారికిది మంచి ఉపశమనం కలగజేస్తుంది. వానలో తల తడిచిన తర్వాత పట్టుకునే జలుబు, దగ్గు, తుమ్ముల వంటి బాధలకు బాగా ఉపయోగపడుతుంది. ఏవైనా బరువు పనులు, శారీరక శ్రమ చేయటం వల్ల బాధలు ఎక్కువవవుతుంటే దీన్ని తప్పకుండా గుర్తుంచుకోవాలి.

● **ఆర్సెనికం ఆల్బ్:** వర్షకాలంలో జలుబు, దగ్గులకు గురయ్యేవారికిది దివ్యమైన ఔషధం. ఆహారం కలుషితం (ఫుడ్ పాయిజనింగ్) కావటం వల్ల పట్టుకునే విరేచనాలు, వాంతులను తగ్గించటానికి బాగా ఉపయోగపడుతుంది. వాంతులు, విరేచనాలు ఒకే సమయంలో అవుతున్నవారికి, కలరా బాధితులకు ఆర్సెనికం ఆల్బ్ ప్రత్యేకమైన ఔషధం. ఇది నిస్త్రాణ తగ్గటానికీ తోడ్పడుతుంది. వర్షకాలంలో తరచుగా కనబడే జలుబు, దగ్గు, న్యుమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులను సమర్థంగా తగ్గిస్తుంది. ఆస్థమా బాధితులకు.. ముఖ్యంగా అర్ధరాత్రి పన్నెండు నుంచి ఒంటి గంట సమయంలో ఆయాసానికి గురయ్యేవారికి మంచి ఉపశమనం కలిగిస్తుంది.

> **వానకాల సమస్యల బాధలను తగ్గించే ఔషధాలివి. వీటిని ఆయా లక్షణాలను బట్టి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మందులను 30 పొటెన్సీలో ప్రతి నాలుగు గంటలకు ఒకసారి లక్షణాలు తగ్గేంతవరకు వేసుకోవచ్చు.**

● **డల్కమారా:** ఒకరకంగా దీన్ని వర్షకాల టీకా అనుకోవచ్చు. ఎందుకంటే ఇది ఈ కాలంలో తలెత్తే శ్వాసకోశ సమస్యలను తగ్గించుకోవటానికే కాదు.. అవి రాకుండా చూసుకోవటానికీ ఉపయోగపడుతుంది. తేమ, చెమ్మతో కూడిన వాతావరణంలో.. సముద్రతీర ప్రాంతాల్లో నివసించేవారిలో శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా కనబడుతుంటాయి. వర్షకాలంలో ఇలాంటి సమస్యలకు గురయ్యేవారికి డల్కమారా మంచి ఔషధం. ఎండ కాస్తూ.. కాస్తూ.. ఉన్నట్టుండి వాతావరణం చల్లబడిపోవటం మూలంగా తలెత్తే సమస్యలకిది బాగా ఉపయోగపడుతుంది. జలుబు, దగ్గు, కఫం పడటం వంటి సమస్యలు తగ్గుముఖం పట్టటానికి తోడ్పడుతుంది. కఫంలో రక్తం పడుతున్నా దీన్ని గుర్తుంచుకోవాలి. ముక్కులు బిగుసుకుపోవటం, గొంతునొప్పి తగ్గటానికి బాగా ఉపయోగపడుతుంది. చర్మవ్యాధులతో బాధపడేవారు ఈ కాలంలో ఆ సమస్య తగ్గిపోయి.. కొత్తగా శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నట్టు గమనిస్తే దీన్ని వాడుకోవటం ఉత్తమం. జలుబు చేసినపుడు దగ్గు, తుమ్ములతో పాటు చర్మం మీద దద్దు (అర్టికేరియా) కూడా ఉన్నట్టు గమనిస్తే డల్కమారా తీసుకోవచ్చు. వేసవికాలం పోయిన తర్వాత తొలకరిలో పట్టుకునే నీళ్ల విరేచనాలకూ ఇది ముఖ్యమైన ఔషధమే. మలం ఆకుపచ్చగా ఉంటున్నా, పల్చగా నీళ్లలాగా విరేచనం అవుతున్నా దీన్ని వాడుకోవటం మంచిది.

● **నేట్రం సల్ఫ్:** తేమ, చల్లటి వాతావరణంలో పట్టుకునే ఉబ్బసం, నీళ్ల విరేచనాలు తగ్గటానికిది బాగా ఉపయోగపడుతుంది. ప్రత్యేకించి తెల్లవారుజామున 4-5 గంటల సమయంలో ఆయాసం ఎక్కువయ్యేవారికి దీంతో మంచి ఉపశమనం లభిస్తుంది. పిల్లల్లో ఆస్థమాకు నేట్రం సల్ఫ్ దివ్యంగా పనిచేస్తుంది. పిల్లికూతలు, శ్లేష్మం ఎక్కువగా ఉండేవాళ్లు దీన్ని వాడుకోవచ్చు. ఛాతీలో నొప్పి.. ముఖ్యంగా ఎడమవైపున నొప్పి వచ్చేవారికి ఉపయోగపడుతుంది.

● **నేట్రంమూర్:** మలేరియా జ్వరానికి విశిష్టమైన ఔషధమిది. మలేరియా జ్వరంతో శుష్కించి, పాలిపోయి నీరసంగా ఉన్న రోగులు దీన్ని వాడితే త్వరగా కోలుకుంటారు. జ్వరం పది, పదకొండు గంటలకు మొదలయ్యేవారు దీన్ని వాడుకోవచ్చు. బద్ధలవుతున్నట్టుగా తలనొప్పి, చలి, జ్వరం గలవారికి ఇదెంతో మేలు చేస్తుంది. కొందరికి మలేరియా చలితో మొదలై వాంతులకు దారితీస్తుంటుంది. ఇలాంటివారికిది బాగా ఉపయోగపడుతుంది.

దీర్ఘకాల మందులు

> **శరీర తత్వాన్ని (కాన్‌స్టిట్యూషనల్) బట్టి తీసుకోవాల్సిన ఔషధాలు ఇవి. వాతావరణం మారినప్పుడల్లా తలెత్తే సమస్యలు మళ్లీ మళ్లీ తిరగబెట్టకుండా ఉండటానికివి తోడ్పడతాయి. వీటిని వ్యాధి లక్షణాలు తగాక- 30 పొటెన్సీలో వారానికి ఒకసారి చొప్పున 4-6 వారాలు వాడుకోవాలి.**

● **లేకిసిస్:** శరీరంలో ఎడమవైపు సమస్యలతో బాధపడుతున్నట్టయితే దీని గురించి ఆలోచించాలి. వీరిలో సమస్యలు ఎడమవైపు మొదలై.. కుడివైపునకు వ్యాపిస్తుంటాయి. వీరికి నిద్ర పెద్ద శత్రువు. నిద్ర పట్టిన తర్వాత సమస్యలు ఉద్ధృతమవుతాయి. ఆయా బాధలతో నిద్రలోంచి లేస్తుంటారు కూడా. కొందరు శ్వాస ఆగిపోయి, ఉలిక్కి పడి లేస్తుంటారు (స్లీప్ అప్నియా). వీరికి అసూయ ఎక్కువ. అనుమాన రోగులు. నిష్కారణంగా అనుమానిస్తుంటారు. వాగుడు కాయలు కూడా. అతిగా మాట్లాడుతుంటారు. మాటిమాటికీ తలనొప్పి, గొంతు సమస్యలతో బాధపడుతుంటారు. రక్తస్రావమైతే కండలు కండలుగా అవుతుంటుంది. మహిళల్లో నెలసరి దగ్గరపడుతున్నకొద్దీ సమస్యలు ఎక్కువవుతుంటాయి. రుతుస్రావం మొదలవ్వగానే తగ్గిపోతుంటాయి.

● **సల్ఫర్:** రుతువులు మారినప్పుడల్లా బాధలకు గురయ్యేవారికిది ముఖ్యమైన ఔషధం. ఉదయం 11 గంటల సమయంలో సమస్యలు ఎక్కువయ్యేవారికిది ఎంతో మేలు చేస్తుంది. ఈ సమయంలో జలుబు, దగ్గు వంటివి ఎక్కువవుతుంటే దీన్ని తీసుకోవచ్చు. ఉదయం పూట విరేచనాలు అవుతూ.. మధ్యాహ్నమయ్యాక తగ్గిపోతుండేవారికీ బాగా ఉపయోగపడుతుంది. పరిశుభ్రతను అంతగా పట్టించుకోనివారు, తేమ వాతావరణంలో బాధలు ఎక్కువయ్యేవారు దీన్ని తీసుకోవటం మంచిది. మలబద్ధకం, ఆసనంలో మంట, మొలల వంటి సమస్యలు గలవారికి.. తీపి, మద్యం బాగా ఇష్టపడేవారికి.. తెలివితేటలు కలిగి ఎక్కువగా గర్వపడేవారికి ఇది ఆలోచించదగిన మందు.

● **సైలీషియా:** ఇది సిగ్గు, బిడియం, పిరికితనం, మొండితనం ఎక్కువగా ఉండే స్వభావం గలవారికి ఉపయోగపడే ఔషధం. అరిచేతులకు, అరికాళ్లకు చెమటలు ఎక్కువగా పోసేవారు.. మేజోళ్ల చెమటలో నాని దుర్వాసన వస్తుండేవారు దీని గురించి ఆలోచించాలి. పని అవుతుందో కాదో, రైలు అందుతుందో లేదో అని ప్రతిదానికీ ఆదుర్దా పడే స్వభావం గలవారికి సైలీషియా బాగా ఉపయోగపడుతుంది. పరీక్షలంటే భయపడిపోయే పిల్లలకు, కుడివైపున పార్శ్వనొప్పితో బాధపడేవారికిది మంచి ఔషధం. విసర్జన సమయంలో మలం ఆసనం దాకా వచ్చి వెనక్కి మళ్లుతున్నా.. శరీరం మీద సూదులు గుచ్చుకున్నట్టుగా బాధలు వేధిస్తున్నా దీని గురించి ఆలోచించాలి. టీకాలు ఇచ్చిన తర్వాత వచ్చే బాధలన్నింటికీ సైలీషియా బాగా పనిచేస్తుంది. దుమ్ము ధూళిలో పనిచేయటం వల్ల వచ్చే శ్వాసకోశ సమస్యలు తగ్గటానికీ ఉపయోగపడుతుంది. తలలో చెమటలు పట్టేవారికిది గుర్తుంచుకోదగిన ఔషధం. కాళ్లు చేతులు సన్నగా ఉండి.. పొట్ట ముందుకు పొడుచుకు వచ్చే రికెట్స్‌తో బాధపడేవారికీ మేలు చేస్తుంది.

పేగులపై ఉప్పు పిడుగు!

ఉప్పు ఉరిమి పేగుల మీద పడటమంటే ఇదే! వంటకాల రుచి పెంచే ఉప్పు మనకు మేలు చేసే పేగుల్లోని బ్యాక్టీరియాకు పిడుగుపాటుగా పరిణమిస్తోంది మరి. ఉప్పు అధికంగా తినటానికీ అధిక రక్తపోటుకూ సంబంధం ఉండటం తెలిసిందే. అంతేకాదు, దీంతో మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి స్వీయ రోగనిరోధక సమస్యలూ త్వరగా ముదురుతుంటాయి. పేగుల్లో ల్యాక్టోబాసిలస్ అనే మంచి బ్యాక్టీరియాకు ఉప్పు ప్రమాదకరంగా పరిణమిస్తుండటమే దీనికి కారణం కావొచ్చని

శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. పెరుగు, మజ్జిగ వంటి పులిసిన పదార్థాల్లో ఉండే ల్యాక్టోబాసిలస్ బ్యాక్టీరియా మనకు ఎంతో మేలు చేస్తుంది. ఇది మందులను తట్టుకునే బ్యాక్టీరియా వృద్ధిని అడ్డుకోవటంలోనూ, ల్యూపస్ బాధితుల్లో కిడ్నీలో వాపు తగ్గటంలోనూ పాలు పంచుకుంటుంది. అయితే ఉప్పు ఎక్కువగా తినటం మూలంగా పేగుల్లో ల్యాక్టోబాసిలస్ బ్యాక్టీరియా మరణిస్తున్నట్టు తాజాగా బయటపడటం గమనార్హం. కేవలం 2 వారాల్లోనే ఈ బ్యాక్టీరియా తుడిచిపెట్టుకుపోతుండటం విశేషం. అంతేనా? టిహెచ్17 అనే వాపు కారక రోగనిరోధక కణాల పనితీరునూ ఉప్పు ప్రేరేపితం చేస్తోంది. ఫలితంగా అధిక రక్తపోటు, మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి సమస్యలకు ఊతమిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. కాబట్టి ఉప్పు వాడకాన్ని తగ్గించటంపై దృష్టి పెట్టటం మంచిదని సూచిస్తున్నారు.

మీ సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా

సమస్య – సలహా
సుఖీభవ
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
email:
sukhi@eenadu.in

ఎవిస్ హాస్పిటల్స్ (హైదరాబాద్)లో గర్భసంచిలో గడ్డలు (యుటిరిస్ ఫైబ్రాయిడ్స్)కు అత్యుత్తమ చికిత్స లభిస్తుంది ఎందుకంటే...

1 యుటిరిస్ ఫైబ్రాయిడ్స్ ఎంబోలైజేషన్ అనే నూతన చికిత్స వల్ల ఫైబ్రాయిడ్స్ పూర్తిగా కృశించిపోతాయి.

2 గర్భసంచిలో కణితలుంటే ప్రతిసారీ హిస్ట్రెక్టమీ చేయాలనేది ఒక అపోహ. అటువంటి చికిత్సలకు ఎవిస్ హాస్పిటల్‌కు వచ్చి స్వస్తి చెప్పండి.

3 యుటిరిస్ ఫైబ్రాయిడ్స్ ఎంబోలైజేషన్ చికిత్సలో మోచేతిలో 1 మిల్లీమీటర్ రంధ్రం ద్వారా కేథటర్ పంపించి ఫైబ్రాయిడ్స్‌ను పూర్తిగా కృశింప చేయడం జరుగుతుంది. ఈ చికిత్సలో ఎటువంటి కుట్లు, కోతలు, రక్తస్రావం ఉండదు.

4 ఫైబ్రాయిడ్స్ ఎంబోలైజేషన్ చేసిన పేషెంట్లు వెంటనే పనులు చేసుకోవచ్చు. మరుసటి రోజు నుంచి యధావిధిగా పూర్తిస్థాయిలో పనులకు హాజరు కావచ్చు.

5 ప్రపంచ వ్యాపంగా 2 వేలకు పైగా యుటిరిస్ ఫైబ్రాయిడ్ ఎంబోలైజేషన్ సర్జరీలు చేసిన అనుభవం డాక్టర్ రాజా. వి.కొప్పాల సొంతం.

ఎవిస్ హాస్పిటల్స్ వాస్క్యులర్ సెంటర్
చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రక్కన, జూబ్లీహిల్స్ రోడ్ నెం.1, హైదరాబాద్.
ఫోన్: 99518 44999
www.avisvascularcentre.com
Email: rajradio@gmail.com

సమస్య - సలహా

నోటితో అడగడు.. చేయిపట్టి తీసుకెళ్తాడు!

ప్రశ్న: మా మనవడికి నాలుగేళ్లు. ఏదైనా కావాలంటే నోటితో అడగడు. తిండి తినాలన్నా, నీళ్లు కావాలన్నా, బాత్రూమ్‌కు వెళ్లాలన్నా తల్లిదండ్రుల చేయి పట్టుకొని అక్కడి వరకూ తీసుకెళ్లి చూపిస్తాడు. కోపంతో ఉన్నప్పుడు పళ్లు కొరుకుతుంటాడు. ఇదేమైనా సమస్యా? దీనికి చికిత్స ఉందా?

– సంజీవరావు
(ఈమెయిల్ ద్వారా)

జవాబు: చెప్పిన వివరాలను బట్టి చూస్తే మీ మనవడికి 'ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్' ఉన్నట్టు అర్థమవుతోంది. ఇది ఎదుగుదల సమస్య. పిల్లల ఎదుగుదల క్రమంలో ఐదేళ్ల లోపు వయసు చాలా కీలకం. నడవటం దగ్గర్నుంచి.. మాట్లాడటం, తమకు అవసరమైనవి అడగటం (వర్బల్) వంటివి ఈ వయసులోనే అలవడతాయి. అలాగే చుట్టుపక్కల పరిసరాలను గుర్తించటం, తమ ఇష్టాయిష్టాలను చేతలతో వ్యక్తం చేయటం (నాన్‌వర్బల్) వంటివన్నీ అబ్బుతాయి. కానీ ఆటిజమ్ పిల్లల్లో ఇవి కొరవడతాయి. వీరు శారీరకంగా బాగానే ఎదుగుతారు గానీ నలుగురితో కలవటంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. సాధారణంగా మనం ఎవరైనా ఏదైనా అడిగితే దానికి తిరిగి సమాధానం ఇస్తుంటాం. లేదూ.. మనం ఏదైనా అడిగినప్పుడు ఎదుటివాళ్లు చెప్పే విషయాన్ని అర్థం చేసుకుంటాం. ఆటిజమ్ పిల్లల్లో ఇలాంటి నైపుణ్యం తక్కువ. వీరికి తమకేం కావాలో తెలుస్తుంటుంది. ఏది? ఎందుకు? అనే జ్ఞానమూ ఉంటుంది. తమకు ఆకలి వేస్తోందని, తినాలని తెలుస్తుంటుంది. అయితే తాము చెప్పిన విషయాన్ని ఎదుటి వ్యక్తులు అర్థం చేసుకుంటారని గానీ తమ అవసరాలు తీరుస్తారని గానీ తెలియదు. అలాగే ఎవరైనా ఏదైనా అడిగితే దానికి సమాధానం ఇవ్వటం తెలియక సతమతమవుతుంటారు. దీన్ని ఎంత త్వరగా గుర్తించి చికిత్స చేస్తే అంత ఫలితం కనబడుతుంది. ఐదేళ్లలోపే చికిత్స ఆరంభిస్తే మెదడులోని నాడీ కణాల మధ్య అస్తవ్యస్తమైన అనుసంధానాలు తిరిగి కుదురుకునే అవకాశముంది. అందువల్ల మీ మనవడిని వెంటనే సైక్రియాటిస్టుకు చూపించటం మంచిది. ఇతరత్రా నాడీ సమస్యలేమైనా ఉన్నాయేమో చూసి సమస్యను నిర్ధరిస్తారు. చైల్డ్ ఆటిజమ్ రేటింగ్ స్కేల్ (సీఏఆర్ఎస్) ఆధారంగా తీవ్రతను అంచనా వేస్తారు. సమస్య ఒక మాదిరిగా ఉంటే కౌన్సెలింగ్‌తో మంచి ఫలితం కనబడుతుంది. ఇందులో ఎదుటివాళ్లను, చుట్టుపక్కల పరిసరాలను అర్థం చేసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించేలా శిక్షణ ఇస్తారు. ఇతర పిల్లలతో కలిసి ఆడుకునేలా చేయటం, వారితో మాట్లాడేలా చేయటం, నలుగురిలో ఉన్నప్పుడు మెలిగే పద్ధతులను నేర్పించటం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. అలాగే వీరికి స్పీచ్ థెరపీ కూడా మేలు చేస్తుంది. పిల్లలు మాట్లాడితే ఎలా ప్రవర్తించాలి? మాట్లాడకపోతే ఎలా ప్రవర్తించాలి? అనేవి తల్లిదండ్రులకు నేర్పిస్తారు. అవసరమైతే పిల్లలు తమ పనులు తాము చేసుకునేలా శిక్షణ (ఆక్యుపేషనల్ థెరపీ) కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఆటిజమ్ పిల్లల్లో కొందరు అదేపనిగా అరవటం, గెంతులేయటం చేస్తుంటారు. అలాంటివేమైనా ఉంటే ప్రవర్తన చికిత్సతో (బిహేవియర్ థెరపీ) సరిదిద్దొచ్చు. ఈ చికిత్సలతో బడికి వెళ్లే సమయానికి నలుగురితో కలిసి మెలిసి ఉండటానికి అవసరమైన నైపుణ్యం పిల్లలకు అబ్బుతుంది. నాడీకణాల మధ్య అనుసంధానాలు అస్తవ్యస్తమైతే ఐదేళ్ల తర్వాత అవి కుదరుకోవటానికి చాలా సమయం పడుతుంది. కాబట్టి వీలైనంత త్వరగా చికిత్స ఇప్పించటం మంచిది. ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏంటంటే- ఆటిజమ్‌ను ఎదిగే వయసులోనే సరిదిద్దటం అవసరం. లేకపోతే మున్ముందు చదువులో వెనకబడటం, నలుగురితో సరిగా మాట్లాడలేకపోవటం, కలవలేకపోవటం వంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

–డా॥ ఎం.గౌరీదేవి
చైల్డ్ సైక్రియాటిస్ట్

ఈనాడు సినిమా

రకుల్‌ప్రీత్ సింగ్

దర్శకులకే వదిలిపెట్టా

మనకు ఏం వస్తుందో అదే చేయాలని... మనకు ఏది నప్పుతుందో అదే ప్రయత్నించాలనే మాటలు చిత్ర పరిశ్రమలో బాగా వినిపిస్తుంటాయి. కథానాయిక రకుల్‌ప్రీత్ సింగ్ మాత్రం అలాంటి మాటల్ని తానెప్పుడూ పట్టించుకోలేదని చెబుతోంది. "వచ్చిందే చేస్తానంటూ కూర్చుంటే ఎలా ఎదుగుతాం? కొత్త విషయాలు ఎలా నేర్చుకొంటాం? నేనైతే ఏదైనా చేయగలననే ఓ నమ్మకంతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టా. ఒక తెల్లకాగితంలాగా కెమెరా ముందుకొచ్చా. నాకు ఎలాంటి పాత్రలు నప్పుతాయనేది దర్శకులకే వదిలిపెట్టా. వాళ్లు సృష్టించిన పాత్రల్లో వాళ్ల ఆలోచనలకి తగ్గట్టుగా ఒదిగిపోయా. ఆ ప్రయత్నం మంచి ఫలితాల్నే ఇచ్చింది. అన్ని విషయాలూ మనకే తెలుసనుకొంటే పొరపాటు. దర్శకుల కంటే బాగా ఆలోచించేవాళ్లు ఎవరుంటారు? అందుకే కథ, కాంబినేషన్ల విషయంలో సంతృప్తి లభించగానే మరో విషయం గురించి ఆలోచించలేద"ని చెప్పుకొచ్చింది రకుల్‌ప్రీత్ సింగ్. ప్రస్తుతం హిందీ, తమిళ భాషల్లో నటిస్తూ బిజీగా గడుపుతోంది.

'విశ్వరూపం 2'కు సమస్యలొస్తే... రాజకీయ నేతగా ఎదుర్కొంటా!

పూజాకుమార్, కమల్‌హాసన్, ఆండ్రియా

కమల్‌హాసన్ స్వీయ దర్శకత్వంలో నటించిన చిత్రం 'విశ్వరూపం 2'. విశ్వరూపం చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందింది. ఇందులో కమల్‌తో పాటు పూజాకుమార్, ఆండ్రియా, శేఖర్‌కపూర్ తదితరులు నటించారు. జిబ్రాన్ సంగీతం సమకూర్చారు. కమల్ నిర్మాణంలోని రాజ్‌కమల్ ఫిలిమ్స్, ఆస్కార్ ఫిలిమ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల సందర్భంగా కమల్‌హాసన్ చెన్నైలో పాత్రికేయులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "'విశ్వరూపం 2' ట్రైలర్ ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నా. సినిమా ఆలస్యానికి రాజ్‌కమల్ సంస్థ కారణం కాదు. దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా సినిమా విడుదలవుతోంది. హాలీవుడ్ చిత్రానికి దీటుగా విడుదల చేస్తాం. రాజకీయంగా కాకుండా వేరొక దారినుంచే 'విశ్వరూపం' చిత్రానికి సమస్యలు వచ్చాయి. ఈసారి సమస్యలు రావనే అనుకుంటున్నా. ఒకవేళ వచ్చినా.. వాటిని ఎదుర్కొనేందుకు ఓ రాజకీయ నేతగా సంసిద్ధమయ్యా. ఇది తొలిభాగం కొనసాగింపు మాత్రమే కాకుండా, తొలిభాగానికి ముందు కథ కూడా ఇందులో ఉంటుంది. అహ్మద్ కాశ్మీరి ఎలా తయారయ్యాడనే విషయాన్ని ఇందులో ప్రస్తావించాం" అన్నారు. సమావేశంలో నటుడు నాజర్, సంగీత దర్శకుడు జిబ్రాన్ కూడా పాల్గొన్నారు. తెలుగు ట్రైలర్‌ని ఎన్టీఆర్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. హిందీలో ఆమిర్‌ఖాన్, తమిళంలో శ్రుతి హాసన్ విడుదల చేశారు.

– న్యూస్‌టుడే, చెన్నై

చిరు చేతుల మీదుగా

కల్యాణ్‌దేవ్

చిరంజీవి అల్లుడు కల్యాణ్‌దేవ్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'విజేత'. రాకేష్ శశి దర్శకుడు. మాళవిక నాయర్ కథానాయిక. వారాహి చలన చిత్రం సంస్థ నిర్మిస్తోంది. మంగళవారం టీజర్ విడుదల చేస్తారు. ఈనెల 24న హైదరాబాద్‌లో పాటల్ని విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరవుతారు. "చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జులై మొదటి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు దర్శక నిర్మాతలు.


కిరణ్ ముప్పవరపు, జయేంద్ర, ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, మహేష్ కోనేరు

అభిమానుల చప్పట్లే ముఖ్యం

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'నా నువ్వే'. తమన్నా నాయిక. జయేంద్ర దర్శకత్వం వహించారు. కిరణ్ ముప్పవరపు, విజయ్ కుమార్ వట్టికూటి, మహేష్ కోనేరు నిర్మాతలు. ఈనెల 14న విడుదల కానుంది. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ మాట్లాడుతూ "కల్యాణ్‌రామ్ అన్నని చూస్తుంటే మూడేళ్ల క్రితం నేను పడిన టెన్షన్ గుర్తొస్తోంది. 'నాన్నకు ప్రేమతో' విడుదల సమయంతో నేనూ ఇంతే ఒత్తిడితో ఉన్నా. ఒకే తరహా పాత్రలు చేసుకుంటూ వెళ్లిపోతే.. నటులకు, అభిమానులకూ సంతృప్తి ఉండదు. 'బాగా నటించాడ్రా..' అని అభిమానులు అనుకోవాలి. వాళ్ల కరతాళ ధ్వనులే ముఖ్యం. కొత్త పాత్రలు చేస్తున్నప్పుడు ఇలాంటి ఒత్తిడి సర్వసాధారణం. ప్రేక్షకులకు చాలా పెద్ద హృదయం ఉంది. నిజాయతీతో కష్టపడితే.. ఆ కష్టాన్ని గుర్తించి పెద్దపీట వేయడం వాళ్లకు కొత్త కాదు. ఆ కోవకి చెందిన చిత్రాల్లో 'నా నువ్వే' చేరుతుంది. కల్యాణ్ అన్న మాటల్లో ఈ సినిమాపై నమ్మకం కనిపిస్తోంది. అన్నయ్య పడిన కష్టానికి తప్పకుండా మంచి ఫలితం వస్తుంది. నటుల్ని కొత్తగా చూపించడానికి దర్శకుడికి చాలా దమ్ము కావాలి. అలాంటి సాహసం చేశారు జయేంద్ర. మా అన్నయ్యపై నమ్మకంతో ఇది వరకెప్పుడూ చూడని పాత్రలో తీర్చిదిద్దారు. సంగీత దర్శకుడు శరత్‌గారి గురించి చాలా విన్నా. తన సంగీతంతో ఈ సినిమాకి మూలస్థంభంగా నిలిచారు. పీసీ శ్రీరామ్ ఈ చిత్రాన్ని చక్కగా మలిచారు. కల్యాణ్ అన్న చిత్రాల్లో ఇది మైలు రాయిగా మిగలాలి. ప్రయోగాలు విజయవంతం అయితే మరిన్ని కొత్త ప్రయత్నాలు జరుగుతాయి. అలాంటి ఉత్సాహం ఈ సినిమాతో అన్నయ్యకు దక్కాల"న్నారు. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "ఈ పాటలు రోజూ వింటున్నా. నా కెరీర్‌లోని మంచి ఆల్బమ్స్‌లో ఇదొకటి. జయేంద్రగారు ఈ కథ చెప్పినప్పుడు.. 'ఈ పాత్రకు నేను ఎలా సరిపోతానని అనుకున్నారు' అని అడిగాను. ఎందుకంటే నేను కమర్షియల్ సినిమాలే చేశాను. ఇలాంటి పూర్తి స్థాయి ప్రేమకథ నేను చేయలేదు. 'మీరు చేస్తే.. ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది' అన్నారు. అందుకే ఈ సినిమా ఒప్పుకున్నా. పీసీ శ్రీరామ్ లాంటివాళ్లతో పనిచేయడం ఓ గౌరవం. మా నిర్మాతలు ఖర్చుకి వెనుకంజ వేయలేదు. చాలా యేళ్ల నుంచి కొత్తగా ఏదో చేద్దామన్న ప్రయత్నంతో ఉన్నా. అభిమానులు నన్ను ఆదరిస్తున్నారు. 'నా నువ్వే'లాంటి చిత్రాన్నీ ప్రేక్షకులు అక్కున చేర్చుకుంటారని నమ్మకం ఉంది. 'నాన్నకు ప్రేమతో'లో తారక్ తన గెటప్‌లో చాలా మార్పు చూపించాడు. తను ఇచ్చిన స్ఫూర్తితోనే నా లుక్ కూడా మార్చాను" అన్నారు. సంగీత దర్శకుడు శరత్ మాట్లాడుతూ "జయేంద్ర నిజాయతీ పరుడు. ఆయన నా నుంచి మంచి బాణీల్ని రాబట్టార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "లాస్ ఏంజెల్స్‌లో నిర్మాతలు ఈ కథ ఓకే చేశారు. కల్యాణ్‌గారికి విన్న వెంటనే నచ్చింది. నాపై ఆయన నమ్మకం ఉంచారు. ఇప్పటి వరకూ యాక్షన్ సినిమలే చేశారు కల్యాణ్. తొలిసారి రొమాంటిక్ సినిమా చేస్తున్నారు. కల్యాణ్ ఎంత రొమాంటిక్ కథానాయకుడో ఈ సినిమాతో తెలుస్తుంది. తమన్నా తన పాత్రని చక్కగా నిర్వర్తించింది. పాటలు ఇప్పటికే శ్రోతలకు నచ్చాయి. ఇది కేవలం ప్రేమకథ కాదు. చాలా విషయాలున్నాయి" అన్నారు. నిర్మాతల్లో ఒకరైన మహేష్ కోనేరు మాట్లాడుతూ "ఇదే నా తొలి చిత్రం. ఓ కొత్త కల్యాణ్‌రామ్ కనిపిస్తారు. మాస్ కథానాయకుడిగా మార్క్ తెచ్చుకున్న కల్యాణ్‌రామ్.. ఈ సినిమాతో క్లాస్ ప్రేక్షకులకు మరింత దగ్గరవుతా"న్నారు. ఈ కార్యక్రమంలో అనంత శ్రీరాం, విజయ్ చిల్లా, పీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విరాట్ కొండూరు, సిమ్రత్ కౌర్

ప్రేమంటే ప్రాణమే!

విరాట్ కొండూరు, సిమ్రత్ కౌర్ జంటగా నటించిన చిత్రం 'పరిచయం'. లక్ష్మీకాంత్ చెన్నా దర్శకత్వం వహించారు. రియాజ్ నిర్మాత. శేఖర్ చంద్ర స్వరకర్త. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో 'అటు ఇటు అని ఏమైందో మనసా...' అంటూ సాగే పాటకి సంబంధించిన వీడియోని విడుదల చేశారు. దర్శకులు హరీష్‌శంకర్, సుధీర్‌వర్మ, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హరీష్ శంకర్ మాట్లాడుతూ "లక్ష్మీకాంత్ చెన్నా వైవిధ్యమైన చిత్రాలు తీస్తారు. మంచి తెలుగు పేరుతో ఈ చిత్రం చేశారు. టీజర్‌తో పాటు విడుదల చేసిన పాట, నాయకానాయికల జోడీ బాగుంది" అన్నారు. "లక్ష్మీకాంత్ చెన్నా దగ్గర మూడు చిత్రాలకి పనిచేశా. నేను నేర్చుకొన్నదంతా ఆయన దగ్గరే. ఈ సినిమాని చాలా బాగా తీశార"న్నారు సుధీర్ వర్మ. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమంటే ఏమిటని ప్రశ్న వేసుకొని ఈ కథ రాయడం ప్రారంభించా. ప్రేమపైన ఒకొక్కరు ఒక్కో అభిప్రాయం చెప్పారు. నాకు తెలిసి ప్రేమంటే ప్రాణం. ప్రాణాన్ని కూడా లెక్కచేయకుండా ఎవరికైనా ఏదైనా చేయగలిగితే అదే ప్రేమ. అలా ప్రాణాన్ని మించి ప్రేమించుకొన్న ఒక జంట కథనే మా చిత్రంలో చూపించబోతున్నాం. రెండు మనసుల మధ్య ప్రేమ పుట్టాలన్నా, అనుబంధం ఏర్పడాలన్నా పరిచయం ఉండాలి. ఎవరి పరిచయం ఎవరి జీవితాల్ని ఎలా మలుపు తిప్పిందనేదే ఈ చిత్ర కథాంశం. ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపొందించాం" అన్నారు. "మంచి ప్రేమకథలో నటించాం. నటులుగా మా కలని నెరవేర్చిన చిత్రమిది" అన్నారు నాయకానాయికలు. ఈ కార్యక్రమంలో నటుడు పృథ్వీ, ఛాయాగ్రాహకుడు నరేష్ రానా, కళా దర్శకుడు రాజ్‌కుమార్ గిబ్సన్‌తో పాటు బేబి అసిన్, మాస్టర్ అయాన్, సురేష్ వర్మ, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడు భరత్

బొద్దుగా కనిపిస్తూ... ముద్దైన మాటలతో బాల నటుడిగా సందడి చేశాడు భరత్. 'పోకిరి', 'రెడీ', 'రగడ', 'కింగ్' తదితర చిత్రాల్లో మాస్టర్ భరత్ పండించిన నవ్వులు ప్రేక్షకులకి ఎప్పటికీ గుర్తుండిపోతాయి. కొంతకాలంగా తెరపై కనిపించని భరత్ గుర్తుపట్టలేని విధంగా మారిపోయాడు. ఇదివరకు బాలనటుడిగా సందడి చేసిన ఆయన 'ఏబీసీడీ'తో క్యారెక్టర్ నటుడిగా మారబోతున్నాడు. అల్లు శిరీష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఏబీసీడీ'. మలయాళంలో విజయవంతమైన 'ఏబీసీడీ'కి రీమేక్‌గా సంజీవ్ తెరకెక్కిస్తున్నారు. మధుర శ్రీధర్, యష్ రంగినేని నిర్మాతలు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న 'ఏబీసీడీ'లో భరత్ నాకు స్నేహితుడిగా పూర్తి స్థాయి పాత్ర పోషిస్తున్నాడని కథానాయకుడు అల్లు శిరీష్ సోమవారం ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.

అమ్మోరు తల్లి మహిమ

రసజ్ఞ

రసజ్ఞ, శ్రీరాజ్ గౌడ్, పూజ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'అమ్మో అమ్మోరు'. టి.రాము దర్శకుడు. బిఎన్ రెడ్డి నిర్మాత. అర్జున్ సంగీతం అందించారు. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. "దేవుడికీ దుష్టశక్తికీ మధ్య జరిగే పోరాటం ఈ చిత్రం. అమ్మోరు తల్లి మహిమల్ని చూపిస్తున్నాం. సంగీతానికీ ప్రాధాన్యం ఉంది. అమ్మోరుగా రసజ్ఞ నటన మెప్పిస్తుంది. చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే విడుదల చేస్తామ"న్నారు దర్శక నిర్మాతలు. ఈ కార్యక్రమంలో రామసత్యనారాయణ, సాయి వెంకట్, హరిబాబు, అళహరి తదితరులు పాల్గొన్నారు.

గీతోపదేశం

ఒక చిన్ని నవ్వే నవ్వి
యుద్ధాలెన్నో ఆపొచ్చు
ఒక చిన్ని నవ్వే నవ్వి
బంధాలెన్నో కలపొచ్చు
చిరునవ్వుల దీపం వెలిగించు
నీ బాధల చీకటి తొలగించు
చిరునవ్వుల బాణం సంధించు
శత్రువులే ఉండరు గమనించు

గీతం: ఒక చిన్ని నవ్వే నవ్వి...
చిత్రం: అశోక్, రచన: చంద్రబోస్

– పంపినవారు: ముద్రగడ రామనాథ్, కొవ్వూరు

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

అతడెవరో తెలుసా?

దుల్కర్ సల్మాన్, నేహాశర్మ

దుల్కర్ సల్మాన్, నేహా శర్మ, ధన్సిక ప్రధాన పాత్రలు పోషించిన అనువాద చిత్రం 'అతడే'. బెజోయ్ నంబియార్ దర్శకుడు. వెంకటేష్ గాజుల నిర్మాత. హైదరాబాద్‌లో పాటలు విడుదలయ్యాయి. తొలిసీడీని రాజ్ కందుకూరి ఆవిష్కరించారు. గౌతమ్ కశ్యప్ అందుకున్నారు. "నాలుగు కథల సమాహారం ఈ చిత్రం. 'మహానటి'తో ఆకట్టుకున్న దుల్కర్ సల్మాన్ మరోసారి వైవిధ్యభరితమైన పాత్రలో కనిపిస్తారు. ఆయన పాత్రలో నాలుగు కోణాలుంటాయి. భాస్కరభట్ల, పూర్ణచారి మంచి సాహిత్యం అందించారు. త్వరలోనే విడుదల చేస్తామ"న్నారు నిర్మాత. సంగీతం: గోవింద్ మేనన్, ప్రశాంత్ పిళ్లై

దమ్మున్నోడు

అంచల్ సింగ్ , సంతానం

సంతానం, అంచల్ సింగ్ జంటగా తెరకెక్కిన తమిళ చిత్రం 'దిల్లుడు దుడ్డు' తెలుగులో 'దమ్ముంటే సొమ్మేరా' పేరుతో విడుదలవుతోంది. రాంబాల దర్శకత్వం వహించిన సినిమా ఇది. ఈ నెల 22న శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు నిర్మాత నటరాజ్. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. నిర్మాణ సంస్థ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ "తమిళంలో ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ తెన్నాండాల్ ఫిలింస్ రూపొందించిన చిత్రమిది. సినిమా కథకు తగ్గట్టుగానే తెలుగులో పేరు పెట్టాం. దమ్మున్నోడిగా సంతానం చేసే సందడి తెలుగు ప్రేక్షకుల్ని తప్పక మెప్పిస్తుంద"న్నారు. సీనియర్ పాత్రికేయుడు పసుపులేటి రామారావు మాట్లాడుతూ "తెలుగు ప్రేక్షకులకు బాగా చేరువైన నటుడు సంతానం. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నా" అన్నారు.

అమ్మ కోరుకున్నట్లుగానే జరిగింది..!

ఇషాన్ ఖత్తర్, జాన్వీ కపూర్

అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా ఆమె కుమార్తె జాన్వీ కపూర్ 'ధడక్'తో కథానాయికగా పరిచయమవుతున్న సంగతి తెలిసిందే. ఘనవిజయం సాధించిన మరాఠీ చిత్రం 'సైరత్'కు ఇది రీమేక్. జాన్వీకి జోడీగా షాహిద్ కపూర్ సోదరుడు ఇషాన్ ఖత్తర్ నటిస్తున్నాడు. కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శశాంక్ ఖైతాన్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో మాధుర్, పార్వతి అనే టీనేజీ ప్రేమికులుగా నాయకానాయికలు అలరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాన్వీ, కొన్ని నెలల కిందటే లోకాన్ని విడిచివెళ్లిన తన తల్లి శ్రీదేవితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురైంది. "'సైరత్'ను ఇంట్లో అమ్మతో కలసి చూశాను. అలాంటి చిత్రంతోనే నేను కథానాయికగా పరిచయం కావాలన్న కోరికను ఆమె బయటపెట్టింది. ఆ తర్వాత కరణ్ జోహార్ ఫోన్ చేసి ఈ చిత్రం గురించి చెప్పారు. అలా ఇందులో భాగమయ్యాన"ని చెప్పింది జాన్వీ. శ్రీదేవి మీకు నటన విషయంలో ఏమైనా సలహాలు ఇచ్చారా అన్న ప్రశ్నకు జాన్వీ స్పందిస్తూ "ఈరోజు అమ్మ లేని లోటు తెలుస్తోంది. 'కష్టపడి పనిచేయ్. ప్రతి భావాన్ని సొంతం చేసుకుని పలికించ'మని తను చెప్పింది. ఆ సలహా నాకు ఎంతో ఉపయోగపడింద"ని చెప్పుకొచ్చింది. ఈ కార్యక్రమానికి శ్రీదేవి భర్త బోనీ కపూర్, సోదరి ఖుషి, బాబాయి అనిల్ కపూర్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు వచ్చి జాన్వీకి శుభాకాంక్షలు తెలిపారు. 'ధడక్' జులై 20న విడుదలవుతోంది.

పావని

మిస్టర్ పాటలొచ్చాయ్

హోమానంద్, పావని జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ హోమానంద్'. జైరామ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. తీర్థం ఫిల్మ్ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. భోలేషావలి స్వరకర్త. సోమవారం హైదరాబాద్‌లో పాటల విడుదల వేడుక జరిగింది. తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని విడుదల చేశారు. నిర్మాత మల్కాపురం శివకుమార్ తొలి సీడీని ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "హారర్, కామెడీ అంశాల మేళవింపుతో రూపొందించిన చిత్రమిది" అన్నారు. "నా గత చిత్రాలతో పోలిస్తే ఇందులో పాటలు చాలా బాగా కుదిరాయి" అన్నారు సంగీత దర్శకుడు. "ట్రైలర్, పాటలు బాగున్నాయి. కొత్తవాళ్లు నటించిన ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందుతుందని ఆశిస్తున్నాం" అన్నారు అతిథులు. ఈ కార్యక్రమంలో రాజా వన్నెంరెడ్డి, మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

వెంటాడి మరీ... పోలీసులకు పట్టించి!

మహిళలపై దాడుల సంఖ్య అధికమవుతున్న నేపథ్యంలో ఓ యువతి తనపై దాడికి దిగిన యువకుడిని వెంటాడి మరీ పట్టుకుని, పోలీసులకు అప్పగించింది. ఈ సంఘటన బెంగళూరులో జరిగింది. ఆమె పేరు లలిత (పేరు మార్చాం). వయసు పాతికేళ్లు. అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తోంది. నాలుగురోజుల క్రితం ఎప్పటిలానే పని పూర్తయ్యాక ఇంటికి తిరిగి వచ్చింది. ఆమెకు రోజూ సాయంత్రం నడక అలవాటు. ఎప్పటిలానే ఈ సంఘటన జరిగిన రోజు కూడా వాకింగ్‌కి వెళ్లింది. అలా నడుస్తోన్న లలితను ఓ యువకుడు వెంబడించడం మొదలుపెట్టాడు. ఆమెకేం జరుగుతోందో తెలిసేలోపే కిందపడేసి, అత్యాచారం చేయాలనుకున్నాడు. అంతే! లలిత తనకేం జరుగుతోందో గ్రహించింది. తిరగబడేందుకు ప్రయత్నించింది. ఓవైపు ప్రతిఘటిస్తూనే గట్టిగా అరిచింది. అతడిని కొట్టే ప్రయత్నం చేసింది. అతను అక్కడినుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తే వదలకుండా పట్టుకునే ప్రయత్నం చేసింది. తప్పించుకుని పారిపోతుంటే వెంటపడి మరీ పట్టుకుంది. దారిలో మరొకతను సాయం చేయడంతో ఇద్దరూ కలిసి అతన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నిందితుడిని 354 సెక్షన్ కింద పోలీసులు అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపారు. ఇలా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా స్పందిస్తేనే మనం సురక్షితంగా ఉండగలమని నిరూపించింది.

చురుకుదనానికి చిట్కాలివి

ఒక్కోసారి ఏం చేసినా విసుగ్గా అనిపిస్తుంది. ఏ పనీ ఎంతకీ ముందుకు కదలదు. దీనికి కారణం ఒత్తిడే కావొచ్చు. దాన్ని అదుపులో ఉంచుకోవాలంటే ముందు మన జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. అవెలాంటివంటే...

■ మెదడు చురుగ్గా, ప్రశాంతంగా ఉండాలంటే ఒత్తిడిగా ఉన్నప్పుడు ఓ పావుగంటైనా సరే! ఒంటరిగా కూర్చోవాలి. చక్కని ఆలోచనలు వస్తాయట. ఆ సందర్భంలోనే కాదు...రోజూ ఓ అరగంట సమయాన్ని ధ్యానం కోసం కేటాయించి చూడండి. మీతో మీరు మాట్లాడుకోండి. మానసికంగా దృఢంగా ఉండగలుగుతారు. పనిలో చురుగ్గానూ ఉంటారు.

■ ఆలస్యంగా నిద్రలేవడం, హడావుడిగా వంటింట్లోకి పరుగులు తీయడం మనలో చాలామందికి అలవాటే. దీనివల్ల మెదడూ, శరీరం యాంత్రికంగా పనిచేయడానికి అలవాటు పడిపోతాయి. అందుకే మీరు మీ పని మొదలుపెట్టడానికి కనీసం గంట ముందైనా నిద్రలేవండి. చిన్నచిన్న స్ట్రెచింగ్ వ్యాయామాలు, నడక, జాగింగ్, యోగా వంటివేవైనాసరే కాసేపైనా చేయాలి. ఇవి మెదడునీ, శరీరాన్ని సమన్వయం చేస్తాయి. అలాగే గ్రీన్ టీ అలవాటు చేసుకుంటే ఒత్తిడి దరిచేరదు. శరీరం ఉత్సాహంగా ఉంటుంది.

■ శరీరం చురుగ్గా పనిచేయాలన్నా, మెదడు సరిగ్గా ఆలోచించాలన్నా కూడా అవసరమైన శక్తి ఆహారం ద్వారా అందాలి. ముందు అల్పాహారం ఎట్టిపరిస్థితుల్లోనూ మానేయకూడదు. గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అంటే ఎక్కువ మొత్తంలో పీచు, సమపాళ్లలో కొవ్వు, మాంసకృత్తులు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం ఆకుకూరలూ, కూరగాయలూ, చేపలూ, పాలూ, పెరుగూ, పప్పుధాన్యాలు వంటివాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరమైన పోషకాలను శరీరానికి అందిస్తాయి. మానసిక శారీరక ఆరోగ్యానికి కారణం అవుతాయి. రాత్రిపూట తినే ఆహారం తేలికగా, స్వల్పంగా ఉండేలా చూసుకుంటే నిద్రలేమి బాధించదు. ఈ జాగ్రత్తలూ మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచుతాయి.

కాలేజ్ కార్నర్

కాలేజీ స్టైలుకి సై!

జడేమో తెల్ల రిబ్బను వద్దు మ్యాచింగ్ రబ్బర్ బ్యాండ్ పెట్టుకోమంటుంది. కాళ్లేమో ఆ నలుపు రంగు షూలు వేసుకోవడం ఇక నా వల్ల కాదు! కాస్త డ్రెస్సుకు తగ్గట్లుగా చెప్పులు మార్చమంటాయ్. చెవులేమో దిద్దులు కాదు... హ్యాంగింగ్‌లూ, జుంకీలే అందమని గుసగుసలు చెబుతాయ్. ముఖమేమో ఇప్పటికైనా సౌందర్యచికిత్సలు చేసుకోమని చెబుతుంది.

ఆహా... ఒకటా రెండా... స్కూలు నుంచి బయటకు వచ్చి కాలేజీలో అడుగుబెట్టడమంటేనే బోలెడు మార్పులు. స్కూలు రోజుల్లో ఎన్ని దుస్తులున్నా అవి పుట్టినరోజులూ, పండగలకు కొనుక్కున్న ఆడంబరమైన డ్రెస్సులే. రోజూవారికి పనికొచ్చేది ఒక్కటుండదు. ఇప్పుడు ఉన్నట్టుండి కాలేజీకెళ్లాలంటే ఏడాదికి సరిపడేట్టు అల్మారా సిద్ధంచేసుకోవడం అంటే అసాధ్యమే. ఎన్ని షాపింగులు చేసినా ఓ నెల గడవగానే మళ్లీ అల్మారా ఖాళీగానే కనిపిస్తుంది. అందుకే కొన్ని మెలకువలు తెలుసుకుని దుస్తులూ, యాక్సెసరీలూ, మిగతా వస్తువులు కొనడం మొదలుపెట్టండి. కొన్నాళ్లు ఏ ఇబ్బందీ లేకుండా స్టైలుస్టైలుగా కాలేజీకెళ్లిపోవచ్చు.

ఏదయినా అదిరిపోయేలా!

కాస్త ఎక్కువగా ఆలోచించాల్సింది బాటమ్స్ ఎంచుకునేటప్పుడే. మొదట్లో కుర్తా, పైజామా, దుపట్టా కలిపి వచ్చే సల్వార్‌సెట్‌ల జోలికి వెళ్లకపోవడమే మేలు. వీటికి పెట్టే డబ్బులోనే రెండు మూడు జతల దుస్తుల్ని సిద్ధం చేసుకోవచ్చు.

■ ముందు బాటమ్‌ల దగ్గరకి వద్దాం. లెగ్గింగ్‌లూ, జెగ్గింగ్‌లూ, డెనిమ్‌లూ, పలాజో, స్కర్ట్... ఇలా అన్నీ బాటమ్‌ల కిందికి వచ్చేవే. వీటిని ఎంచుకునేటప్పుడు ముఖ్యంగా నలుపు రంగు వాటికే మొగ్గుచూపుతాం. అయితే వీటన్నింటినీ ఒకే రంగులో లేకుండా చూసుకోండి. ఉదాహరణకు జెగ్గింగ్ నలుపు రంగులో ఎంచుకుంటే డెనిమ్ ముదురు లేదంటే లేత నీలం, పలాజో క్రీం లేదంటే తెలుపు రంగులో అదీ కాదంటే డిజైనులో, స్కర్టు షిమ్మర్ తరహాల్లో ఎంచుకోవాలి. ఇక ఒక నలుపు రంగు లెగ్గింగ్ దగ్గరుంచుకుంటే అది దాదాపు అన్నింటిమీదకు నప్పుతుంది. వీలైతే లెగ్గింగ్‌లలో రెండు మూడు రంగులు సిద్ధం చేసుకుంటే ఇంకా మంచిది. ముందు వీటిని ఎంచుకున్నాకే కుర్తీలూ, కుర్తాలు, ఇతర టాప్‌ల గురించి ఆలోచించాలి. వీలైతే కలంకారీ, ఇకత్ డిజైనులో ఓ జాకెట్ దగ్గరుంచుకోండి. ఈ అయిదు బాటమ్‌లు, అయిదు టాప్‌లు, ఒక జాకెట్... అన్నింటినీ రకరకాలుగా మేళవించి ఓ పదిరోజులు వేసుకోవచ్చు.

■ కాస్త ట్రెండీగా కనిపించాలనుకుంటే మాత్రం దుపట్టాలకు బదులు మంచి రంగులూ, ప్రింట్లలో ఉండే స్కార్ఫ్‌లకే ఓటేయొచ్చు. వీటి ధర కూడా తక్కువగానే ఉంటుంది కాబట్టి అన్నింటికీ నప్పే ఓ మూడు రకాల స్కార్ఫ్‌లు దగ్గర పెట్టుకోవాలి. వీటిని కూడా ఏదో మెడలో వేసుకున్నట్లు కాకుండా యాక్సెసరీలా మార్చేసుకోవచ్చు. ఒకసారి యూట్యూబులో స్కార్ఫ్ ఎలా వేసుకోవచ్చో కొట్టి చూడండి. బోలెడన్ని ఆలోచనలు తడతాయి. ముఖ్యంగా పైనుంచి కింద వరకు డ్రెస్ మీద ఎలాంటి డిజైన్లు లేకపోతే ఆ లోటు స్కార్ఫ్ ద్వారా తీరుతుంది. ఆ తరువాత ల్యాబ్‌లకు అవసరమయ్యే ఫార్మల్స్ గురించి ఆలోచించాలి. వారంతో కనీసం ఒక్కసారైన ల్యాబ్‌కు సంబంధించిన తరగతులుంటాయి. అందుకే దానికి పక్కాగా ఉపయోగపడే కాటన్ చూడీదార్ లేదంటే కాటన్ సల్వార్ సూట్ ఒకటి దగ్గరుంచుకోండి చాలు.

యాక్సెసరీలు మార్చేద్దాం

కాలేజీకి వెళ్తున్నప్పుడు ఏమేం అవసరమవుతాయి... చెవులకు కమ్మలూ, చేతికొక వాచీ లేదంటే బ్రాస్‌లెట్, చెప్పులూ, ఒక సన్నని గొలుసూ, బ్యాగు! వీటి ధరలు కాస్త ఎక్కువగానే ఉంటాయి కాబట్టి ఒక్కసారే పదేసి కొనేయలేం. అయితే ఇప్పుడు ఆన్‌లైన్‌లో 'ఛేంజెబుల్' ఫ్యాషన్‌దే హవా. అంటే చెవులకు పెట్టుకునే డ్రాప్స్, స్టడ్స్ మొదలు పెండెంట్ల వరకూ మార్చుకోవచ్చు. కావాలనుకుంటే వాటిలోని రాళ్లను కూడా మనకు నచ్చినట్లుగా మ్యాచ్ అయ్యేలా మార్చుకోవచ్చు. అంటే ఒక్క జత జుంకీలు లేదంటే ఒక పెండెంట్ కొంటే దాంతో పాటే నాలుగైదు రకాల, రంగుల రాళ్లు కూడా వస్తాయి కాబట్టి వాటిని ఎంచుకుంటే మేలు. చిన్న చిన్న దిద్దులు మొదలుకుని గాజులూ, బ్రాస్‌లెట్లూ, వడ్డాణాలూ, వాచీలూ, చివరికి చెప్పుల్లోనూ ఈ వెసులుబాటు ఉంటోంది. వీటి ధర కూడా తక్కువే. తరువాత

■ హ్యాండ్‌బ్యాగ్ గురించి ఆలోచిద్దాం. ఇది ఎంచుకునేటప్పుడు ట్రెండీగా ఉండటంతో పాటూ మన అవసరాన్నీ తీర్చాలి. మరీ చిన్నది కాకుండా కనీసం అయిదు పుస్తకాలూ, ఒక నీళ్లసీసా, ఫోనూ పట్టేట్లుండాలి. ఇవన్నీ పట్టాలంటే బ్యాగు చతురస్రం లేదంటే దీర్ఘచతురస్రాకారంలో ఉంటేనే మేలు. వీలైనంత వరకూ గుండ్రని, ఎలాంటి ఆకారంలేని ఎగుడు దిగుడు బ్యాగుల జోలికి పోవద్దు. వాటిలో వస్తువులు పొందిగ్గా సర్దుకోలేం. బ్యాక్‌ప్యాక్‌లు మేలు.

చెప్పులు: ఇవి ఎరుపూ, తెలుపు, ఆకుపచ్చ... ఇలాంటి ఫంకీ రంగుల్లో అస్సలు వద్దు. అన్ని దుస్తులకు నప్పవు. బదులుగా నలుపూ, బ్రౌన్, మెటాలిక్ రంగులు బాగుంటాయి. ల్యాబ్‌కి వేసుకునే షూలు కూడా కేవలం వాటికే పరిమితం అనుకోకుండా మిగతా కుర్తీలకు నప్పే బాలెరినా లేదంటే స్నీకర్స్ ఎంచుకోవచ్చు. వీటిని కుర్తాలూ, జీన్స్ మీదకి వేసుకున్నా చక్కగా నప్పేస్తాయి. అయితే దుస్తుల్ని బట్టి చెప్పులు ఎంచుకోవడం ఈ రోజుల్లో మామూలే కాబట్టి... ఎత్తుమడమలూ, ఫ్లాట్స్, శాండిల్స్... అన్ని ప్రతిమోడల్ ఉండేలా చూసుకుంటే మంచిది. సందర్భాన్ని బట్టి ఎంచుకోవచ్చు.

పొదుపు చేశారు... సాధించారు

వీళ్లంతా ఒకప్పుడు నిరుపేద మహిళలు. పేదరికంలోనే మగ్గిపోకుండా తమకంటూ ఓ భరోసా వెతుక్కున్నారు. మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. వీళ్ల శ్రమ వృథా పోలేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ గ్రామీణ జీవనోపాధుల విభాగం ప్రకటించిన దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన అవార్డులే అవి. ఇంతకీ వీళ్లెవరంటే...

అనంతపురం బుక్కరాయసముద్రం మండలం, వడియంపేటకు చెందిన మహాలక్ష్మి ఎస్‌హెచ్‌జీ బృందం ఇందులో ఒకటి. ఇక, కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం నన్నూర్‌కు చెందిన యారాబ్ స్వయంసహాయక సంఘం సభ్యులు ఉన్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం అలకనారాయణపురం గ్రామానికి చెందిన శ్రీమహాలక్ష్మి ఎంపీఎస్ కూడా అవార్డు అందుకుంది. వరంగల్ రూరల్ గీసుకొండ మండలం ఎలుకుర్తికి చెందిన ముదిరాజ్ మహిళా పొదుపు సంఘం, కామారెడ్డి మండలం దేవునిపల్లికి చెందిన శ్రీలక్ష్మి ఎస్‌హెచ్‌జీ ఈ అవార్డులకు ఎంపికయ్యాయి.

'పన్నెండు మంది సభ్యులతో నెలకు రూ.30తో పొదుపు సంఘం ప్రారంభించాం. అవసరాలు దృష్టిలో ఉంచుకొని పొదుపు పెంచుతూ వచ్చాం. ప్రతి కుటుంబం ఏదో ఒక వ్యాపారంలో స్థిరపడింది. బ్యాంకు రుణం రూ. 23 లక్షలు వచ్చాయి. సంఘం ఏర్పాటుతో ఆర్థిక సమస్యలు దూరమయ్యాయి. పదహారేళ్లుగా మేం పొదుపు, చేస్తున్నాం. రుణాల చెల్లింపులోనూ వాయిదాలు లేవు...' అంటుంది యారాబ్ సహకార సంఘం సభ్యురాలు నూర్జహాన్.

'ఇరవై మందితో పందొమ్మిదేళ్ల క్రితం ప్రారంభమైంది మా శ్రీలక్ష్మి మహిళ పొదుపు సంఘం. నెలకి ముప్పై రూపాయల చొప్పున పొదుపు చేసి.. ప్రస్తుతం మూడొందల రూపాయలు దాచుకునే స్థాయికి చేరుకున్నాం. కిరాణా దుకాణాలు పెట్టుకున్నాం. మేకల పెంపకం చేపటాం. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో మేమే ఇంటికి యజమానులం అయ్యాం. కుటుంబంలోనే కాదు సమాజంలోనూ మాకు మంచి గౌరవం దక్కింది. ఇప్పుడు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉంది' అంటోంది కీలక సభ్యులరాలైన లక్ష్మీ నరసమ్మ.

'మహాలక్ష్మి స్వయం సహాయక సంఘం తరపున అవార్డును అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. చినుకు చినుకు వరదైనట్టు.. కొద్దికొద్దిగా దాచుకుని పెద్దమొత్తంలో పొదుపు చేశాం. కనీసం రోజుకు రెండు రూపాయల కూలీ వచ్చే రోజుల్లోనే ఓ పెద్దమనిషి సలహాతో పొదుపు ప్రారంభించాం. వారానికి ఐదు రూపాయలు కూడబెట్టే పరిస్థితి లేకపోయినా నెలకి ముప్పై రూపాయలు పొదుపు చేశాం. ఇప్పుడు మా పిల్లల్ని బాగా చదివిస్తున్నాం. అప్పుల ఊసే లేదు' అంటోంది నాగరత్నం.

'ముదిరాజ్ స్వయం సహాయక సంఘం నుంచి నేను అవార్డు అందుకున్నా. 1999లో రోజుకి రూపాయి చొప్పు పొదుపు ప్రారంభించాం. ప్రస్తుతం ఒక్కొక్కరం ఇరవై వేలకుపైనే పొదుపు చేస్తున్నాం. చిన్న చిన్న అవసరాల కోసం తొలుత రుణం తీసుకొనేవాళ్లం. మా సంఘంలో ఒంటరి మహిళలు ఎక్కువ. వారంతా నిలదొక్కుకోవడానికి సంఘం ఎంతో ఉపయోగపడింది. సమష్టిగా పొదుపు చేయడం, సకాలంలో రుణాల చెల్లింపు వల్లే మాకు ఈ అవార్డు వచ్చింది' అని చెబుతుంది ఇందులో కీలకసభ్యురాలైన లలిత.

'మాది శ్రీమహాలక్ష్మి పొదుపు సంఘం. మాకు బ్యాంకుల గురించి అవగాహన లేదు. దాంతో పోస్టాఫీసులో పొదుపు ఖాతా తెరిచాం. కూలీ కూడా దొరకని సమయంలో రోజుకి రూపాయి చొప్పున నెలకి ముప్పై రూపాయలు దాచేవాళ్లం. ఆ సమయంలో అదే మాకు కష్టమైంది. జాతీయ గ్రాంటు ఆరువేల రూపాయలు రావడంతో అందరం కలిసి బ్యాంకు ఖాతా ప్రారంభించి పొదుపు పెంచుకుంటూ వచ్చాం. అలా వారి పేదరికాన్ని తరిమికొట్టాం. జీవితాన్ని బాగు చేసుకున్నాం..' అంటోంది రామలక్ష్మి బృందం.

– సూర్యప్రకాశ్, ఈనాడు దిల్లీ

నజరానా

వాడిన టీ బ్యాగులను కాసేపు ఆరబెట్టి అందులోని టీపొడిని తీసి ముఖానికి రాసుకోవాలి. ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. చర్మానికి తేమ అంది తాజాగా మారుతుంది.

బంగారం వెండి

11న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,940	32,000	31,750	31,700
ఆర్నమెంట్	29,800	29,900	29,450	29,400
వెండి (కిలో)	41,700	41,500	41,900	41,900

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,650	31,750	31,910	32,020
ఆర్నమెంట్	29,340	29,380	29,520	29,700
వెండి (కిలో)	41,700	41,400	40,500	41,600

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,800	31,880	-------	-------
ఆర్నమెంట్	29,570	29,650	2,952	2,970 గ్రా
వెండి (కిలో)	41,900	40,900	43.70	43.70 గ్రా

రోగికి శస్త్రచికిత్స చేయాలంటే మత్తుమందు వైద్యుడు ఎంత ముఖ్యమో.. ఆ మత్తుమందు ఇవ్వడానికి సర్వం సిద్ధం చేసే సాంకేతిక నిపుణుడు కూడా అంతే అవసరం. ఇన్‌ఫెక్షన్లు రాకుండా శస్త్రచికిత్స గదిని శుభ్రంగా ఉంచాలన్నా సహాయకులు కావాల్సిందే. వాళ్లే పారామెడికల్ సిబ్బంది. పారామెడికల్ కోర్సులు చేయడం ద్వారా వీళ్లు ఆ నైపుణ్యాలను పొందుతారు. డాక్టర్లకు అడుగడుగునా అండగా ఉంటూ పేషెంట్లకు సకాలంలో వైద్యసేవలు అందిస్తారు. అందుకే పారామెడికల్ నిపుణులకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఈ రంగంలో ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా కొత్త కోర్సులు వస్తున్నాయి. ఎప్పటికీ తరగని ఉద్యోగావకాశాలను అభ్యర్థులకు అందిస్తున్నాయి.

పారా కోర్సులు.. చాలా కొలువులు

వైద్యవృత్తిలో సాంకేతిక నిపుణుల పాత్ర గతంలో కంటే ఇప్పుడు మరింత ప్రధానమైంది. రెండు దశాబ్దాల కిందటితో పోలిస్తే వైద్యవృత్తికి సంబంధించిన సాంకేతిక నిపుణుల కోర్సులు ఇటీవలి కాలంలో కొత్తవి పుట్టుకొచ్చాయి. ఒక్కో వైద్యనిపుణుడికి తన విభాగానికి సంబంధించిన సాంకేతిక నిపుణుడి సహకారం ఇప్పుడు అవసరమవుతోంది. ఈ సాంకేతిక నైపుణ్యాన్ని అందించే కోర్సులే 'పారామెడికల్ కోర్సులు'.

దాదాపు 22 రకాల పారామెడికల్ డిప్లొమా కోర్సులు ఇటీవలి కాలంలో అందుబాటులోకి వచ్చాయి. ఇందులో డిగ్రీ కోర్సులూ, పీజీ డిప్లొమా కోర్సులూ ఉన్నాయి. పారామెడికల్ కోర్సుల్లో ఏ స్థాయి విద్యనభ్యసించినా.. వృత్తిలో కొనసాగాలంటే మాత్రం తప్పనిసరిగా రాష్ట్ర పారామెడికల్ బోర్డులో తమ సమాచారాన్ని నమోదు చేసుకోవాల్సిందే.

2006లో ఉమ్మడి రాష్ట్రంలోనే పారామెడికల్ బోర్డు అనేది ప్రత్యేకంగా ఏర్పాటు కాగా.. దానికి కొనసాగింపుగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక పారామెడికల్ బోర్డులు ఏర్పడ్డాయి.

బీఎస్సీ పారామెడికల్ కోర్సుల ప్రవేశాలను మాత్రం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. పరీక్షలు కూడా వారే నిర్వహిస్తారు. డిగ్రీ పూర్తయిన అనంతరం ధ్రువపత్రాల నమోదు ప్రక్రియను మాత్రం పారామెడికల్ బోర్డులోనే చేయించాల్సి ఉంటుంది. అయితే డిప్లొమాలో ఉన్నన్ని భిన్నమైన పారామెడికల్ కోర్సులు.. డిగ్రీలో లేవు.

అర్హత ఏమిటి?: ఈ కోర్సులన్నీ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో రెండింటిలోనూ ఉన్నాయి. తెలంగాణలోని 9 ప్రభుత్వ కళాశాలల్లో 13 రకాల పారామెడికల్ డిప్లొమా కోర్సులతో మొత్తం 591 సీట్లుండగా.. 250 ప్రైవేటు కళాశాలల్లో 22 రకాల పారామెడికల్ కోర్సులతో మొత్తం 33456 డిప్లొమా సీట్లున్నాయి. అయితే ప్రైవేటులో సీట్లు భారీగానే ఉన్నా వాస్తవానికి నాలుగో వంతు సీట్లు కూడా భర్తీ కావడం లేదు. 2016-17లో కేవలం 7 వేల మంది పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో పరీక్షలు రాయగా.. 2017-18లో ఆ సంఖ్య స్వల్పంగా పెరిగి 8700 మంది తుది పరీక్షకు హాజరయ్యారు.

ప్రస్తుతం ప్రభుత్వ రంగంలోనూ పారామెడికల్ ఉద్యోగాల ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ దఫా 2018-19లో తుది పరీక్షలు రాసేవారి సంఖ్య 10 వేలు దాటొచ్చని పారామెడికల్ బోర్డు అంచనా వేస్తోంది.

2012-13కు ముందు ఈ కోర్సుల ప్రవేశానికి అర్హత పదో తరగతి మాత్రమే ఉండేది. కానీ ఆ తర్వాత నుంచి దీనికి కనీస అర్హత ఇంటర్మీడియట్‌గా నిర్ణయించారు. రెండు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లోనూ ఇప్పుడు ప్రవేశం కల్పిస్తున్నారు. ఒక మోస్తరు ఆర్థిక స్థోమత ఉన్నవారు డిగ్రీ పారామెడికల్ కోర్సుల్లో చేరుతుండగా.. పూర్తిగా నిరుపేద విద్యార్థులు, ఆర్థికంగా రుసుములు చెల్లించలేని విద్యార్థులు మాత్రమే డిప్లొమా పారామెడికల్ కోర్సుల్లో చేరుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. గతంలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు మాత్రమే పారామెడికల్ కోర్సులు చదవడానికి అర్హత ఉండేది. కానీ ఆ తర్వాత కాలంలో ఆర్ట్స్ విద్యార్థులకూ అవకాశాలు కల్పించారు. డిప్లొమా ఇన్ రేడియోథెరపీ టెక్నీషియన్ కోర్సుకు మాత్రం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులే అర్హులు.

ఆంధ్రప్రదేశ్‌లో...

ఆంధ్రప్రదేశ్‌లోని 8 ప్రభుత్వ పారా మెడికల్ కళాశాలల్లో 14 రకాల పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో 864 సీట్లున్నాయి. కోర్సులవారీగా చూస్తే...

కోర్సు	సీట్లు
మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ	210
మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ	80
ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు	50
డయాలసిస్ టెక్నాలజీ	20
రెస్పిరేటరీ థెరపీ	25
మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ	10
పర్‌ఫ్యూజన్ టెక్నాలజీ	30
రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్ కోర్సు	49
డార్క్‌రూమ్ అసిస్టెంట్ కోర్సు	33
కార్డియాలజీ టెక్నీషియన్ కోర్సు	40
క్యాథ్‌ల్యాబ్ టెక్నాలజీ	16
ఈసీజీ	51
అనెస్తీషియా టెక్నీషియన్ కోర్సు	240
ఆడియోమెట్రీ టెక్నీషియన్ కోర్సు	10

205 ప్రైవేటు పారా మెడికల్ కళాశాలల్లో 7755 సీట్లు ఉన్నాయి.(ఇవి 2017-18 వివరాలు).
http://dme.ap.nic.in, www.appmb.org.in

ప్రవేశాలెప్పుడు?

◗ జూన్‌లో జిల్లాలవారీగా ప్రవేశ ప్రకటనలు వెలువరిస్తారు. ◗ జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రవేశాలు నిర్వహిస్తారు. ◗ ఇంటర్మీడియట్‌లోని మార్కుల ప్రాతిపదికనే ప్రవేశ ప్రక్రియ కొనసాగుతుంది. ◗ ఎంపికైన అభ్యర్థుల జాబితాను పారామెడికల్ బోర్డుకు పంపిస్తారు. ◗ ఆ జాబితాను బోర్డు ధ్రువీకరించిన అనంతరమే ఈ-పాస్ విధానంలో రుసుములు చెల్లిస్తారు. ◗ సెప్టెంబరులో విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది.

రుసుములెలా?: ఈ వృత్తి విద్య కోర్సుల్లో చదివేది అత్యధికులు నిరుపేద విద్యార్థులే కావడంతో.. వీరికి ప్రభుత్వమే రుసుమును ఆన్‌లైన్ విధానంలో చెల్లిస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివినా.. ప్రైవేటులోనూ కన్వీనర్ కోటాలో చదివినా.. మొత్తం రుసుమును సర్కారే భరిస్తోంది. వీరికి ఏడాదికి రూ.6 వేలు ప్రభుత్వ కళాశాలల్లో, రూ.13 వేలు ప్రైవేటు కళాశాలల్లో రుసుము ఉంటుంది. వీరికి రెండేళ్లకోసారి వార్షిక పరీక్షలను నిర్వహిస్తుంటారు. ఆ పరీక్ష రుసుము రూ.1500 కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రైవేటు కళాశాలల్లో యాజమాన్య కోటా కింద ఏడాదికి రూ.40 వేల రుసుమును నిర్ణయించారు. కానీ ఆ సీట్లలో చేరికలు బహు స్వల్పం.

మెరుగైన అవకాశాలు: ఇంజినీరింగ్ చదివినా కూడా ఉద్యోగావకాశాలు తక్కువగా ఉన్నాయేమో గానీ.. పారామెడికల్ కోర్సుల్లో డిప్లొమా కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు మాత్రం సమాజంలో మెరుగైన అవకాశాలే లభిస్తున్నాయి. ఉదాహరణకు ల్యాబ్‌టెక్నీషియన్ చేసిన అభ్యర్థి ప్రభుత్వ రంగంలోనే ఉద్యోగం చేయాలనేం లేదు. ప్రైవేటులోనూ బోలెడన్ని అవకాశాలున్నాయి. ఏ ప్రైవేటు ఆసుపత్రులోనైనా, ఏ ప్రయోగశాలలోనైనా ల్యాబ్ టెక్నీషియన్‌గా చేరిపోవచ్చు. ఇక్కడ వీరికి డిమాండ్ ఎక్కువ. నెలకు కనీసం రూ.20 వేల వేతనంతో చేరిపోతున్నారు.

అలాగే అనెస్తీషియా, పర్‌ఫ్యూజన్ మెడిసిన్, కార్డియాలజీ, ఇమేజింగ్ టెక్నాలజీ తదితర విభాగాల్లో సాంకేతిక నిపుణులకు విదేశాల్లోనూ ఎక్కువ గిరాకీ ఉంది. మన దగ్గర పారామెడికల్ కోర్సుల్లో డిప్లొమా చేసిన అనేకమందికి విదేశాల్లో ఇక్కడి కంటే ఐదింతలు అధికంగా వేతనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం 'కంటి వెలుగు' పేరిట పెద్ద ఎత్తున నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించనున్న నేపథ్యంలో.. ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు, ఆప్టోమెట్రిక్ టెక్నీషియన్లకు ఆదరణ పెరగనుంది.

తెలంగాణ కాలేజీలు, కోర్సులు

తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అందుబాటులో ఉన్న పారామెడికల్ డిప్లొమా కోర్సులివి..

◗ తెలంగాణలో మొత్తం ప్రైవేటు పారామెడికల్ కళాశాలలు 250 ◗ మొత్తం సీట్లు 33456 ◗ ప్రభుత్వ రంగంలో 9 వైద్యకళాశాలలు.. మొత్తం సీట్లు 591 ◗ కాకతీయ వైద్యకళాశాల ◗ ఉస్మానియా వైద్యకళాశాల ◗ ప్రభుత్వ ప్రసూతి దవాఖానా పేట్లబురుజు◗ ఛాతీ ఆసుపత్రి ◗ ఉస్మానియా విశ్వవిద్యాలయ మహిళా కళాశాల ◗ గాంధీ వైద్యకళాశాల ◗ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ◗ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి ◗ సరోజినీదేవి కంటి ఆసుపత్రి.

కోర్సులు: ▮ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ ▮ ఆప్టోమెట్రీ టెక్నీషియన్ ▮ హాస్పిటల్ ఫుడ్‌సర్వీస్ మేనేజ్‌మెంట్ ▮ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ▮ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ▮ ఆడియోమెట్రీ ▮ రేడియోథెరపీ ▮ పర్‌ఫ్యూజన్ ▮ డయాలసిస్ ▮ మెడికల్ ఇమేజింగ్ ▮ రెస్పిరేటరీ థెరపీ ▮ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ ▮ హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్ థెరపీ ▮ డెంటల్ ▮ డెంటల్ హైజీనిస్ట్ ▮ మైక్రోసర్జరీ ▮ అనెస్తీషియా ▮ క్యాథ్‌ల్యాబ్ ▮ రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్ ▮ డార్క్‌రూమ్ అసిస్టెంట్ ▮ ఈసీజీ ▮ కార్డియాలజీ

ఈ ఏడాది నుంచే సీట్ల పెంపు

ఈసారి ప్రవేశ ప్రకటన జారీ చేసేటప్పుడు పారామెడికల్ కోర్సులకు సంబంధించి విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించాం. ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో 591 డిప్లొమా సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ నిజానికి సీట్ల సంఖ్యను పెద్దసంఖ్యలో పెంచుకోవడానికి అవసరమైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలున్నాయి. అందుకే ప్రభుత్వ వైద్యంలో అదనంగా 958 పారామెడికల్ డిప్లొమా సీట్లను పెంచే ప్రతిపాదనను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేశాం. త్వరలోనే దీనిపై సానుకూల నిర్ణయం రానుంది.

ఈ విద్యా సంవత్సరం నుంచే పెంచిన సీట్లను ప్రవేశ ప్రక్రియలో పొందుపరుస్తాం. ప్రస్తుతం రెండేళ్లకోసారి వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. వీటిని ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఆధునిక వైద్యంలో వస్తున్న మార్పులకనుగుణంగా పాఠ్యాంశాల్లోనూ మార్పులు తీసుకురానున్నాం. విదేశాలకు వెళ్లేముందు పారామెడికల్ బోర్డులో మంచి ప్రవర్తనకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుంది. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యత ప్రమాణాలు పరిరక్షించడంపైనా దృష్టిపెట్టాం. ప్రయోగశాలలు, బోధన అర్హులతో నిర్వహిస్తున్నారా? లేదా? అనేది పరిశీలిస్తాం. లోటు ఉన్నవారిపై చర్యలు తీసుకుంటాం.

టి.గోపాలరెడ్డి, తెలంగాణ పారామెడికల్ బోర్డు కార్యదర్శి

తెలంగాణ ప్రభుత్వ వైద్యకళాశాలల్లో పెంచనున్న పారామెడికల్ కోర్సుల సీట్ల వివరాలు

కోర్సు	ప్రస్తుత సీట్లు	పెంచనున్న సీట్లు	మొత్తం సీట్లు
మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్	195	80	275
ఆప్టోమెట్రీ టెక్నీషియన్	17	13	30
ఆప్తాల్మిక్ అసిస్టెంట్	32	58	90
రేడియోథెరపీ టెక్నీషియన్	10	20	30
డయాలసిస్ టెక్నీషియన్	20	30	50
మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్	45	70	115
మెడికల్ స్టెరిలైజేషన్ టెక్నీషియన్	20	10	30
అనెస్తీషియా టెక్నీషియన్	110	70	180
రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్	28	10	38

వెబ్‌సైట్: www.tspmb.telangana.gov.in

ఇప్పటికే నేత్ర వైద్యంలో సాంకేతిక శిక్షణ పూర్తిచేసుకున్న సుమారు 700 మంది నిపుణులను కంటి వెలుగులో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు.

తెలంగాణ ప్రభుత్వ కళాశాలల్లో కొత్తగా ప్రారంభించనున్న డెంటల్ హైజీనిస్ట్, ఎమర్జన్సీ పారామెడిక్ టెక్నీషియన్ తదితర పారామెడికల్ కోర్సులు, కళాశాలల వివరాలను www.eenadupratibha.net లోచూడవచ్చు.

- అయితరాజు రంగారావు, ఈనాడు, హైదరాబాద్

ఎథికల్ హ్యాకింగ్ చదవాలంటే?

›› మా అబ్బాయి బీటెక్ (సీఎస్ఈ) రెండో సంవత్సరం చదువుతున్నాడు. తనకు ఎథికల్ హ్యాకింగ్‌పై ఆసక్తి. అందించే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వివరాలను అందించండి. ***- రవిప్రసాద్ ఆత్కూరి***

జ: హానికర హ్యాకర్లు చేయదలచుకునే దుశ్చర్యలను ముందుగా పసిగట్టి, కంప్యూటర్ సమాచార వ్యవస్థల బలహీనతలను, దుర్బలాలను గుర్తించే చర్యను చట్టపరంగా సాగించడమే ఎథికల్ హ్యాకింగ్ ఉద్దేశం. కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన/ చేస్తున్నవారికి ఈ కోర్సు ఎంతగానో దోహదపడుతుంది. మన తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రైవేటు సంస్థలు ఎథికల్ హ్యాకింగ్‌లో శిక్షణ ఇస్తున్నాయి. ముఖ్యంగా ఈసీ కౌన్సిల్ వారు అందిస్తున్న సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకింగ్ కోర్సు ప్రముఖమైంది. 125 ఆబ్జెక్టివ్ ప్రశ్నల పరీక్షను నాలుగు గంటల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు www.eccouncil.org ను సందర్శించవచ్చు. ఇంకా బీటెక్ రెండో సంవత్సరమే కాబట్టి, చదువు పూర్తయ్యేలోపు ఈ కోర్సును చేసి, ఏదైనా సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తే మంచిది. ప్రస్తుతానికి ఈ కోర్సు ప్రభుత్వ సంస్థల్లో అందుబాటులో లేదు.

బిజినెస్ అకౌంటింగ్ & టాక్సేషన్

›› బిజినెస్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ కోర్సులను అందిస్తున్న సంస్థలు, వాటి ఫీజు వివరాలను తెలియజేయగలరు.

- శ్రీజేష్ నాయర్

జ: మీరు ఏం చదివారో తెలియజేయలేదు. బిజినెస్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ కోర్సులను చదవాలనుకునేవారు డిగ్రీ స్థాయిలో బీకాం (అకౌంటింగ్ అండ్ టాక్సేషన్), బీకాం (జనరల్) కోర్సులను ఎంచుకోవచ్చు. డిగ్రీతోపాటు చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) లేదా సీఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ) కోర్సులను చదివితే ఈ రంగంలో అవకాశాలు ఎక్కువ. డిగ్రీ పూర్తిచేసినవారు సీఎంఏ-యూఎస్ కోర్సును ఎంచుకుని బిజినెస్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ రంగంలో స్థిరపడొచ్చు. సాధారణంగా ప్రతి డిగ్రీ కళాశాలలో బీకాం కోర్సు అందుబాటులో ఉంటుంది. సీఏ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వారు, సీఎంఏ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) వారు అందిస్తున్నారు.

- ప్రొ. బి. రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎయిమ్స్, న్యూదిల్లీలో 150 టీచింగ్ పోస్టులు

సంస్థ: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), న్యూదిల్లీ **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్
ఖాళీలు: 150 **అర్హత:** ఎంబీబీఎస్, పీజీ, డాక్టొరేట్ డిగ్రీ, అనుభవం.
వయసు: 50 సంవత్సరాలకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.500 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 09.07.2018 **హార్డ్ కాపీలను పంపడానికి చివరి తేది:** 24.07.2018
వెబ్‌సైట్: www.aiimsexams.org

ఓఎన్‌జీసీలో మెడికల్ ఆఫీసర్లు

సంస్థ: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) లిమిటెడ్, రాజమహేంద్రవరం. **పోస్టు:** మెడికల్ ఆఫీసర్ (కాంట్రాక్టు) **ఖాళీలు:** 29 **అర్హత:** ఎంబీబీఎస్‌తోపాటు సంబంధిత స్పెషాలిటీలో 3 నెలల సర్టిఫికెట్ కోర్సు. ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్
చివరి తేది: 18.06.2018
వెబ్‌సైట్: www.ongcindia.com

సీఐఈటీ - ఎన్‌సీఈఆర్‌టీ

సంస్థ: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (సీఐఈటీ), ఎన్‌సీఈఆర్‌టీ, న్యూదిల్లీ.
పోస్టులు: కంటెంట్ డెవలపర్, సిస్టమ్ అనలిస్ట్, ఐసీటీ కన్సల్టెంట్ తదితరాలు.
ఖాళీలు: 30
అర్హత: ఇంటర్, బ్యాచిలర్/ మాస్టర్స్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం. **ఎంపిక:** స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఈ-మెయిల్.
చివరి తేది: 24.06.2018.
ఈ-మెయిల్: pmd.ciet@gmail.com
వెబ్‌సైట్: http://www.ciet.nic.in/

ముంబయి పోర్టు ట్రస్టులో ఖాళీలు

పోస్టులు: అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అకౌంట్ ఆఫీసర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.
ఖాళీలు: 26
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ, కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
చివరి తేది: 07.07.2018.
వెబ్‌సైట్: http://mumbaiport.gov.in/

ప్రవేశాలు

సీడ్యాక్, హైదరాబాద్‌లో డిప్లొమా కోర్సు

సంస్థ: సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్), హైదరాబాద్
కోర్సు: డిప్లొమా ఇన్ మోడర్న్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఎసన్షియల్స్ (డీఎంఎస్‌డీఈ). **కాలవ్యవధి:** 5 నెలలు **సీట్లసంఖ్య:** 60 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్/ నాలుగేళ్ల బీఎస్సీ ఇంజినీరింగ్/ ఏఎంఐఈ/ ఇంజినీరింగ్ సైన్సెస్‌లో పీజీ/ ఎంసీఏ ఉత్తీర్ణత. **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్
చివరి తేది: 11.07.2018 **వెబ్‌సైట్:** https://cdac.in/

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం ప్రోగ్రామ్

సంస్థ: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్), హైదరాబాద్. **కోర్సు:** మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఎం). **కాలవ్యవధి:** 2 సంవత్సరాలు + 6 నెలలు ఇంటర్న్‌షిప్. **సీట్ల సంఖ్య:** 20 **అర్హత:** మెడికల్/ నాన్ మెడికల్ కోర్సుల్లో ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. **వయసు:** 20-30 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, వైవా ఆధారంగా. **పరీక్ష తేది:** 16.07.2018 **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.1100.
చివరి తేది: 30.06.2018 **వెబ్‌సైట్:** https://nims.edu.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఎన్‌సీడీఐఆర్, బెంగళూరు

సంస్థ: ఐసీఎంఆర్-నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫర్మేటిక్స్ అండ్ రిసెర్చ్ (ఎన్‌సీడీఐఆర్), బెంగళూరు. **పోస్టులు:** సైంటిస్ట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తదితర కాంట్రాక్టు పోస్టులు. **ఖాళీలు:** 20 **అర్హత, వయసు:** ఎన్‌సీడీఐఆర్ నిబంధనల ప్రకారం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ద్వారా. **నియామక పరీక్షల తేదీలు:** 2018 జూన్ 26-28 **వేదిక:** ఎన్‌సీడీఐఆర్, బెంగళూరు. **వెబ్‌సైట్:** www.ncdirindia.org

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

ఈనాడు

విజయవాడ 1-6-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 292

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కైరానా (ఉత్తర్‌ప్రదేశ్ - లోక్‌సభ) ఆధిక్యం 44,618	పాల్ఘర్ (మహారాష్ట్ర - లోక్‌సభ) ఆధిక్యం 29,572	భండారా - గోండియా (మహారాష్ట్ర - లోక్‌సభ) ఆధిక్యం 48,097	నాగాలాండ్ (నాగాలాండ్ - లోక్‌సభ) ఆధిక్యం 1.73 లక్షలు
ఆర్ఎల్‌డీ తబస్సుమ్ విజయం	భాజపా గావిట్ రాజేంద్ర ధేద్య విజయం	ఎన్సీపీ కె.ఎం.యశ్వంతరావ్ విజయం	ఎన్డీపీపీ టొఖేహో విజయం
భాజపా ఓటమి	శివసేన ఓటమి	భాజపా ఓటమి	ఎన్‌పీఎఫ్ ఓటమి

10 అసెంబ్లీ స్థానాల్లో గెలిచిన పార్టీలు

- నూర్పూర్ (ఉత్తర్ ప్రదేశ్) – ఎస్పీ
- థరాలీ (ఉత్తరాఖండ్) –భాజపా
- జోకిహట్ (బిహార్) – ఆర్జేడీ
- అమ్పటి (మేఘాలయ)– కాంగ్రెస్
- మహేస్థల (పశ్చిమ బెంగాల్)– తృణమూల్
- సిలీ (ఝార్ఖండ్)– జేఎంఎం
- గోమియా (ఝార్ఖండ్)– జేఎంఎం
- చెంగన్నూర్ (కేరళ)– సీపీఎం
- పల్సకడేగావ్ (మహారాష్ట్ర)– కాంగ్రెస్
- షాకోట్ (పంజాబ్) – కాంగ్రెస్

విపక్షాలకు కైరానా.. భాజపాకు హైరానా

యూపీలో ప్రతిష్ఠాత్మక స్థానాన్ని కోల్పోయిన కమల దళం

- ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి చేదు ఫలితాలు
- 14 స్థానాల్లో భాజపా కూటమికి దక్కింది మూడే
- 11 చోట్ల విపక్షాల విజయకేతనం
- సిట్టింగ్ నియోజకవర్గాలు మూడింటిలో కమలం ఓటమి

దిల్లీ, లఖ్‌నవూ, ముంబయి, పట్నా

అధికార భాజపాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉప ఎన్నికల్లో విపక్షాల ఐక్యత ముందు మట్టికరించింది. దేశ వ్యాప్తంగా 11 రాష్ట్రాల్లో 14 స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో 11 చోట్ల పరాజయం పాలయింది. ముఖ్యంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని కైరానా లోక్‌సభలో ఘోర పరాభవాన్ని మూటకట్టుకుంది. గత నెల 28న ఉప ఎన్నికలు నిర్వహించగా గురువారం ఫలితాలను ప్రకటించారు. మూడు చోట్ల మాత్రమే భాజపా కూటమి విజయం సాధించింది. 2019లో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అంతకు ముందు జరిగే ప్రతి ఉప ఎన్నికా రాజకీయంగా

కీలకమయిన నేపథ్యంలో తాజా ఫలితాలు.. కమలదళానికి మింగుడుపడని అంశమే. భాజపాయేతర పక్షాల ఐక్యతను బలోపేతం చేయాలని కాంగ్రెస్ సహా విపక్షాలు గట్టి పట్టుదలతో ఉన్న నేపథ్యంలో ఈ ఫలితాలు వాటిల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. నాలుగేళ్ల మోదీ ప్రభుత్వ పాలనకు, విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన

(మిగతా 2లో)

నిరుద్యోగ భృతి రూ.1000

- 10 లక్షల మందికి ప్రయోజనం
- డిగ్రీ, డిప్లొమా అర్హత
- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు
- యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- పాత విక్రయ దస్తావేజులకు స్టాంపు డ్యూటీ లేకుండానే రిజిస్ట్రేషన్
- సబ్ రిజిస్ట్రార్ ద్వారానే ఆటోమ్యుటేషన్
- రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 10 లక్షల మంది నిరుద్యోగులకు నెలకు వేయి చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. డిగ్రీ, డిప్లొమా చదివిన వారికి ఈ భృతి అందించాలని నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు ఆటోమ్యుటేషన్ విధానం అమలుకు, చిన్న, సన్నకారు రైతుల పాత విక్రయ దస్తావేజులను స్టాంపు డ్యూటీ లేకుండానే రిజిస్ట్రేషన్ చేసేందుకు గురువారం అమరావతిలోని సచివాలయంలో

(మిగతా 2లో)

ఎక్స్ఛేంజ్ ఆఫర్

TANISHQ లో

పొందండి

1 కేరట్ అదనంగా*
బంగారు ఆభరణాల కొనుగోలుపై

2 కేరట్‌లు అదనంగా*
డైమండ్ ఆభరణాల కొనుగోలుపై

ఆఫర్ పరిమిత కాలం వరకే!

*షరతులు వర్తిస్తాయి • పై ఆఫర్ జ్యూవెలరి కొనుగోలుపై మాత్రమే వర్తిస్తుంది • బంగారు నాణేలు, లూజు రాళ్ళు మరియు వెండి కొనుగోలుపై ఆఫర్ చెల్లదు • 14 కేరట్‌లు మరియు అంతకుమించిన స్వచ్ఛత గల బంగారు ఆభరణాలు మాత్రమే ఎక్స్ఛేంజ్‌కి స్వీకరించబడతాయి • ఈ ఆఫర్‌ని మరొక ఆఫర్ దేనితోనూ కలపకూడదు
• Shop now at www.titan.co.in/tanishq

విజయవాడ – ఎమ్.జి. రోడ్, ఫోన్: 0866-6665002/ 9948212618; **గుంటూర్** – బ్రాడీపేట్, ఫోన్: 0863-2222663/ 8885532888; **ఒంగోలు** – గాయత్రి ఆలయం పక్కన, లాయర్‌పేట, మంగమూర్, రోడ్ ఫోన్: 08592-284097. **ఇంకా ఇక్కడ: విశాఖపట్టణం • రాజమండ్రి • తిరుపతి • కర్నూల్ • అనంతపురం.**

For store location information visit tanishq.co.in/stores • కాల్ చేయండి: 1800 258 2598

మీ ఆలోచన మీ పిల్లల కోసమే అయితే....

ఈ ప్రకటన మీ కోసమే

2018లో సీనియర్ ఇంటర్ M.P.Cలో స్టేట్ ర్యాంక్ 986/1000 P. Mahalakshmi H.T. No.: 1825218953

2018లో సీనియర్ ఇంటర్ Bi.P.Cలో స్టేట్ ర్యాంక్ 986/1000 V.Y. Chandra Sai Gupta H.T. No.: 1825229570

- AP EAMCET ఇంజనీరింగ్‌లో 156 మందికి ర్యాంకులు
- AP EAMCET Agricultural / Pharmacy / Veternaryలో 44 మందికి ర్యాంకులు

IIT - JEE MAIN & ADVANCED, NEET, BITSAT, NDA, EAMCET, AIPVT, AIIMS, JIPMER, COMEDK, ICAR.

Coaching by... Super Senior Lecturers

గమనిక : 2018 ఏపి స్టేట్ 10వ తరగతిలో 10/10. 9.8/10, 9.7/10 & 9.0 నుండి 9.5/10 వచ్చిన విద్యార్థులకు వరుసగా... రెండు సంవత్సరములకు ఒక లక్ష, 70వేలు, 50వేలు, 20వేలు ఫీజులలో రాయితీ మరియు CBSE - Xలో, ICSE - Xలో, అత్యధిక మార్కులు వచ్చినవారికి ఫీజులలో వేరే రాయితీ కలదు.

ముఖ్య గమనిక : తల్లిదండ్రుల విజ్ఞప్తిమేరకు 10వ తరగతిలో 7.5 నుండి 8.9 గ్రేడు సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా 4 సెక్షన్లు ఏర్పాటు చేయడమైనది. వీరికి ఫీజు సంవత్సరానికి రూ. 90,000/-లు మాత్రమే

శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజి
Affiliated to B.I.E., Andhrapradesh M.P.C & Bi.P.C only

"నేటి కాలానికి అనుగుణంగా విద్యార్థులకు అత్యాధునిక విద్యనందిస్తే"
ప్రతిభ పరిమళిస్తుంది - విజ్ఞానం వికసిస్తుంది

గత 44 సంవత్సరముల నుండి నిర్విరామంగా, అంకితభావంతో, మేనేజ్ మెంట్ క్యాంపస్‌లోనే ఉంటూ, స్వీయ పర్యవేక్షణలో... అపార అనుభవము, అర్హత, సమర్థత, అంకితభావము కలిగిన ఉపాధ్యాయుల సహకారముతో... ఎక్కడా బ్రాంచీలు లేకుండా 80 ఎకరముల విస్తీర్ణంలో - సువిశాలమైన బిల్డింగులతో, 20 ఎకరముల ఆటస్థలములో, వివిధరకాల Games, Sports, Cultural Activities, NCCలో Army, Navy & Airwingలలో శిక్షణతో విద్యార్థుల మీద ఏవిధమైన ఒత్తిడి లేకుండా, Physics, Chemistry, Botany, Zoology, Computer Labsతో మరియు Libraryతో మంచి చదువు, క్రమశిక్షణ, ఆరోగ్యము, మంచి అభివృద్ధిని ఆకాంక్షిస్తూ... మన రాష్ట్రము నుండే కాక భారతదేశములోని 23 రాష్ట్రముల నుండి వచ్చి విద్యను అభ్యసించుచున్న - ఒక గ్రామీణ విశ్వవిద్యాలయం - ఏకైక విద్యాసంస్థ - శ్రీ విశ్వశాంతి, ఉయ్యూరు.

IIT & Medical Foundation Programe for... 6th to 10th Class STATE & CBSE

Integrated FACE Programme (Foundation for Any Competitive Exam)

10th State Board Examలో 80 మందికి 10/10 100% PASS 319/319

శ్రీ విశ్వశాంతి రెసిడెన్షియల్ హైస్కూల్
Recognized by Govt. of Andhra Pradesh LKG to 10th State Syllabus

స్కూల్ స్థాయినుండి కాలేజీస్థాయివరకూ... అత్యుత్తమ విద్యనందిస్తూ...
అద్భుత విజయాలను సాధింపజేస్తుంది విశ్వశాంతి

2018 +2 PCM & PCB CBSE HIGHEST SCORES

2018 + 2 P.C.B లో Highest Marks 467/500 ARYAN GUPTA H.T. No.: 4645287

2018 + 2 P.C.B లో Highest Marks 467/500 SHAINY SRAVANTHI H.T. No.: 4645231

- Mathsలో... 90 నుండి 99 వరకు మార్కులు సాధించినవారు - 234 మంది
- Physicsలో... 90 నుండి 99 వరకు మార్కులు సాధించినవారు - 154 మంది
- Chemistryలో... 90 నుండి 99 వరకు మార్కులు సాధించినవారు - 139 మంది
- Physical Educationలో... 90 నుండి 99 వరకు మార్కులు సాధించినవారు - 110 మంది

100% PASS 316/316

2018 X CBSE HIGHEST SCORES

479 478 476 476 475 474
473 472 471 471 470

100% PASS 352/352

విశ్వశాంతి CBSE సీనియర్ సెకండరీ రెసిడెన్షియల్ స్కూల్
Affiliated to CBSE, Delhi. LKG to X & +1, +2

JEE MAIN 2018, PAPER 2 - B.Arch RANKERS

RUNAV S KARADE, SHUBHAM KUMAR, DHAWAL YUVARAJ, S LOHITH KUMAR, M DONISHA, KSHITEEJ CHOURAGADE, J RENUKA PRASANNA, BHAGYASREE Y BANDE, ADITYA SUMAN, ANSS VENU VINITH, P SUBHASISH RAI, V ANANTH, A. VAISHNAVI, V SAI KIRAN, SK MD SAZID

2018 JEE Mainలో... 64 మందికి ర్యాంకులు

SRI VISWASANTHI EDUCATIONAL INSTITUTIONS ESTD : 1975. VUYYURU

శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థలు
ఉయ్యూరు (విజయవాడ దగ్గర) కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.
Cell : 994 898 4444, 913 331 8502, 924 745 6148, 991 277 5666.
Web Site : www.sriviswasanthischools.in Email Id : director.sriviswasanthi@gmail.com

AP State Boardలో LKG నుండి 10వ తరగతి వరకు... Jr. Inter M.P.C & Bi.P.Cలలో...
CBSEలో LKG నుండి X & +1 (PCM & PCB)లలో... అడ్మిషన్లు జరుగుచున్నవి

నిరుద్యోగ భృతి రూ.1000

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోద ముద్ర వేసింది. సమావేశ వివరాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి నారా లోకేష్, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర విలేకరులకు వివరించారు.

గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అర్హులు

- దారిద్ర్యరేఖకు దిగువన ఉండి తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నవారు.
- డిగ్రీ, డిప్లొమా చదివినవారు.
- 22 - 35 ఏళ్ల మధ్య వయసువారు.

విధివిధానాలు

- ఒక కుటుంబంలో ఎంత మంది అర్హులున్నా అందరికీ చెల్లింపు.
- నెలకు రూ.వేయి చొప్పున చెల్లింపు.
- నిరుద్యోగ భృతితోపాటు యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ.
- బయోమెట్రిక్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాకే నగదు.
- ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించి దరఖాస్తుల ఆహ్వానం.
- దరఖాస్తు సమయంలోనే నిరుద్యోగులకు ఆసక్తి ఉన్న నైపుణ్య విభాగాల ఎంపిక.
- ప్రజా సాధికార సర్వే ప్రకారం ఉన్న 10 లక్షల మంది కంటే ఎక్కువ మంది ఉంటే వారికీ చెల్లింపు.

తక్కువని అభిప్రాయం వస్తే పెంపు?

నిరుద్యోగ భృతి చెల్లింపుపై యువత నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాత నెలకు రూ.1000 తక్కువగా ఉన్నట్లు అభిప్రాయాలు వ్యక్తమైతే రూ.1500కు పెంచే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఆటో మ్యుటేషన్‌కు ఆమోదం

ఆటో మ్యుటేషన్ అమలు కోసం పట్టాదారు పాస్‌పుస్తకాల చట్టం - 1971కు సవరణ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ వివరాలను మంత్రి కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. కొత్త విధానం ప్రకారం.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయాల వివరాలను అప్పటికప్పుడు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తారు. వీటిని తహశీల్దారు కార్యాలయంలో 30 రోజులపాటు పరిశీలనకు ఉంచుతారు. అభ్యంతరాలు రాకుంటే దానంతటదే మ్యుటేషన్ అయిపోతుంది. ప్రస్తుత విధానంలో పొలం రిజిస్ట్రేషన్ జరిగిన అనంతరం రెవెన్యూ అధికారుల ద్వారా పాస్ పుస్తకాల్లో నమోదు చేయించుకోవాల్సి వస్తోంది.

స్టాంపు డ్యూటీ లేకుండానే...

- వివిధ కారణాలవల్ల భూముల క్రయవిక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్ చేయించుకోని (సాదా బైనామా) చిన్న, సన్నకారు రైతుల దస్తావేజులను స్టాంపు డ్యూటీ లేకుండానే రిజిస్ట్రేషన్ చేసేందుకు మంత్రివర్గం అనుమతించింది.
- 2014 జూన్ 2వ తేదీకి (రాష్ట్ర విభజన) ముందు జరిగిన లావాదేవీలకే స్టాంపు డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో ఐదెకరాల్లోపు వ్యవసాయ భూములకే ఇది వర్తిస్తుంది.
- ప్రకటన వెలువడిన తేదీ నుంచి 45 రోజులపాటు స్టాంపు డ్యూటీ లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకువీలు కల్పిస్తారు.
- గ్రామ, మండల స్థాయిలో సమగ్ర విచారణ జరిపి సహేతుకం అని తేల్చిన లావాదేవీలకే అనుమతి ఉంటుంది.

కలెక్టర్లకు అధికారం

ప్రభుత్వం, అభ్యంతరం లేని భూములు, వాటర్ బాడీ భూములను అనుమతించిన అధీకృత లేఔట్లలో (భూమి ధర ఎక్కువైతే రూ.50 లక్షల విలువ ఉండే ప్రదేశాలు) అప్రోచ్ రోడ్లు, కల్వర్టులు, అటువంటి తరహా నిర్మాణాల కోసం 0.50 సెంట్ల వరకూ కేటాయించే అధికారం కలెక్టర్లకు ఇస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

మరికొన్ని నిర్ణయాలు

- మెడికల్ ప్రాక్టీషనరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే నోటిఫికేషన్ వెలువడిన తేదీ నాటికి తప్పనిసరిగా ఏదైనా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏడాదిపాటు సీనియర్ రెసిడెంట్‌గా పనిచేసిన అనుభవం ఉండాలన్న ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ యాక్టు-1968కు సవరణ.
- కోస్తాంధ్ర తీరంలో నిర్మించిన పైపులైన్ల ద్వారా పెట్రో సహా వివిధ ఉత్పత్తుల సరఫరాపై పైపులైన్ ఛార్జీల వసూలు. ఈ ఛార్జీల నుంచి విశాఖపట్నం పోర్టు ట్రస్టు, మడ అడవులు, గుర్తింపు పొందిన అభయారణ్య ప్రాంతాల్లో ఉన్న పైపులైన్లకు మినహాయింపు. తీరం వెంబడి మత్స్య ప్రాజెక్టులకు మినహాయింపు.
- ఆంధ్రప్రదేశ్ కోల్డ్ చైన్ ప్రమోషన్ లిమిటెడ్ పేరుతో కోల్డ్ చైన్ కార్పొరేషన్ ఏర్పాటు. దీనిద్వారా శీతల గిడ్డంగుల ఏర్పాటు, అభివృద్ధికి చర్యలు.
- పోలవరం ప్రాజెక్టు ప్రధాన పనుల ప్రత్యేక నిధి రూ.160 కోట్ల నుంచి రూ.170 కోట్లకు పెంపు.
- అగ్రిగోల్డ్ బాధితుల్లో పేదలు ఉన్నందున.. వారందరికీ సత్వర న్యాయం చేసేందుకు దిల్లీ నుంచి నిపుణులను ప్రభుత్వం తరపున తీసుకొచ్చి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు.
- లబ్ధిదారులనే నేరుగా ఆయా రాష్ట్రాలకు తీసుకెళ్లి వారికి నచ్చిన పాడి పశువులను కొనుగోలు చేయడానికి అవకాశం.
- సీఆర్‌డీఏ పరిధిలో ఎన్టీఆర్ మ్యూజియం ఏర్పాటు కోసం రెండు ప్రాంతాల పరిశీలన. అందులో ఒక దానిని ఎంపిక చేశాక త్వరితగతిన పనులు.
- వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు ప్రకటిస్తున్న కేంద్రం వాటిని కొనుగోలు చేసేందుకు రాష్ట్రానికి ఎలాంటి సహకారం అందించకపోవడాన్ని మంత్రివర్గ సమావేశం ఖండించింది. ఈ విషయంలో కేంద్రంపై గట్టి ఒత్తిడి తేవాలని నిర్ణయం తీసుకుంది.

పవన్ కల్యాణ్ వాస్తవాలు తెలుసుకోవాలి

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలపై మంత్రి లోకేష్ స్పందించారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయొద్దని, ఆరోపణలు చేసేవారు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. తాము వేసిన రోడ్లపై నడుస్తూ రోడ్లు వేయలేదని ఆరోపిస్తున్నారనే తాను అన్నానని తెలిపారు. ఫైబర్‌గ్రిడ్ కాంట్రాక్టును హెరిటేజ్ ఉద్యోగి హరిప్రసాద్‌కు కట్టబెట్టామని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఆయన హెరిటేజ్ ఉద్యోగి కాదని, ఫైబర్‌గ్రిడ్ సలహాదారు మాత్రమేనని వెల్లడించారు. తాము గత కొన్నేళ్లుగా ఆస్తులను ప్రకటిస్తున్నామని, ఆరోపణలు చేసేవారు వారి ఆస్తులను ప్రకటిస్తే బాగుంటుందని చెప్పారు.

ఏడాదికి రూ.1200 కోట్ల వ్యయం

ప్రజాసాధికార సర్వే ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగ యువత 10 లక్షల వరకు ఉన్నారని, నిరుద్యోగ భృతి చెల్లింపునకు సంబంధించి యువత నుంచి అభిప్రాయాలను సేకరించనున్నామని మంత్రి లోకేష్ తెలిపారు. ఏడాదికి దీనికి రూ.1200 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, ఎక్కడా విఫలం లేకుండా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. దేశంలో 10 రాష్ట్రాల్లో ఈ పథకాన్ని ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారని, ఉత్తరప్రదేశ్‌లో 6 నెలల్లోనే నిలిపివేశారని వెల్లడించారు. యువత నుంచి అభిప్రాయాల సేకరణ, పథకం అమలు తేదీలపై వచ్చే కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నామని చెప్పారు.

వివిధ రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతి ఇలా..

- వివరాలను పరిశీలించిన రాష్ట్ర మంత్రివర్గం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ భృతి అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకునే ముందు ఇతర రాష్ట్రాలు ఈ పథకాన్ని ఎలా అమలు చేస్తున్నాయి? నెలకు ఎంత భృతి అందజేస్తున్నాయనే వివరాలను పరిశీలించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఆ వివరాలివి.

రాష్ట్రం	ఏ విద్యార్హత కలిగిన వారికి	అందిస్తున్న నిరుద్యోగ భృతి (నెలకు...రూ.ల్లో)
హరియాణా	ఇంటర్-పీజీ విద్యార్హత కలిగినవారికి	900-3000
పశ్చిమబెంగాల్	ఏడో తరగతి, ఆ పైన చదివిన వారికి	1500
కేరళ	ఎస్సీ, ఎస్టీలైతే పదో తరగతి విద్యార్హత, ఇతరులు పదో తరగతి, ఆపైన చదవాలి	120
రాజస్థాన్	డిగ్రీ విద్యార్హత	500 (దివ్యాంగులకు 600)
తమిళనాడు	పదో తరగతి- డిగ్రీ కలిగిన వారికి	200-600 (పదో తరగతి అనుత్తీర్ణులకూ ఇస్తున్నారు)
హిమాచల్‌ప్రదేశ్	ఇంటర్మీడియట్ చదివిన వారికి	1000
ఉత్తరాఖండ్	ఇంటర్-పీజీ విద్యార్హత కలిగిన వారికి	500-1000
పంజాబ్	పదోతరగతి ఆ పైన చదివిన వారికి	150-200
బిహార్	పదోతరగతి-ఇంటర్ విద్యార్హత కలిగినవారికి	200

అనిశాకు చిక్కిన డీఎస్పీ, కానిస్టేబుల్

ఏసీబీకి పట్టుపడిన డీఎస్పీ పి.నారాయణరావు (కుర్చీలో యూనిఫాంలో ఉన్న వ్యక్తి), కానిస్టేబుల్ రమేష్ (పక్కన నిల్చొన్న బ్లూ చొక్కా వ్యక్తి)

రాజమహేంద్రవరం నేర వార్తలు, న్యూస్‌టుడే: సివిల్ తగాదాకు సంబంధించి నమోదైన కేసులో అనుకూలంగా నివేదిక ఇచ్చేందుకు రూ.55 వేలు డిమాండ్ చేసిన రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా దక్షిణ మండల డీఎస్పీ పి.నారాయణరావు, కానిస్టేబుల్ బి.రమేష్ అవినీతి నిరోధకశాఖకు చిక్కారు. గతంలో ధవళేశ్వరంలో ఉండి ప్రస్తుతం ఖమ్మంలో ఉంటున్న తాళ్లూరి కీర్తిప్రియకు చెందిన ఇంటిని కొనుగోలు చేసేందుకు తాటికొండ విల్సన్ కుమార్ ఒప్పందం కుదుర్చుకున్నారు. మొదట చెప్పిన ధర కంటే అదనంగా ఇవ్వాలని ఆమె కోరడం, అందుకు విల్సన్ కుమార్ అంగీకరించకపోవడంతో ఇరువురి మధ్య న్యాయస్థానంలో సివిల్ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో విల్సన్ కుమార్ తన సంతకం ఫోర్జరీ చేసి అగ్రిమెంటు తయారు చేశారని ఆరోపిస్తూ కీర్తిప్రియ అర్బన్ జిల్లా ఎస్పీ రాజకుమారిని కలిసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై ధవళేశ్వరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు అధికారిగా డీఎస్పీ పి.నారాయణరావు ఉన్నారు. కేసు రాజీ చేసుకోని పక్షంలో జైలుకు పంపుతామని డీఎస్పీ బెదిరించడంతో తాను రాజీ పడి ఒప్పందం కన్నా రూ.7లక్షలు అదనంగా చెల్లించి కీర్తిప్రియ నుంచి ఇంటిని కొనుగోలు చేశానని విల్సన్ కుమార్ తెలిపారు. కేసును ముగిస్తూ నివేదిక ఇవ్వాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని డీఎస్పీ నారాయణరావు, కానిస్టేబుల్ బి.రమేష్ తనను బెదిరించారని చెప్పారు. చివరకు రూ.50వేలు డీఎస్పీకి, మరో రూ.5వేలు కానిస్టేబుల్‌కు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నానని తెలిపారు. మరోవైపు తనతో సంభాషించిన ఫోన్‌కాల్స్ రికార్డులను ఏసీబీకి విల్సన్ అందించారు. రూ.55వేలు తీసుకుని గురువారం రాత్రి డీఎస్పీ కార్యాలయానికి వచ్చి డీఎస్పీ నారాయణరావుతో మాట్లాడారు. అనంతరం డబ్బులు ఇవ్వబోగా కానిస్టేబుల్‌కు ఇవ్వాలని సూచించడంతో ఆ మొత్తాన్ని అతడికి ఇచ్చారు. బయటే ఉన్న అనిశా అధికారులు రంగ ప్రవేశం చేసి కానిస్టేబుల్‌ను, డీఎస్పీని అదుపులోకి తీసుకున్నారు. రూ.55 వేల మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసులో విల్సన్ కుమార్‌కు అనుకూలంగా వ్యవహరించనందున తనపై కక్ష గట్టి ఉద్దేశపూర్వకంగా ఇరికించారని డీఎస్పీ పేర్కొంటున్నారు.

రక్షణ శాఖలో అవినీతి అధికారులపై చర్యలు!

ప్రధానిని కోరిన రాహుల్ గాంధీ

దిల్లీ: భారత రక్షణశాఖ అధికారులకు కోట్ల రూపాయల మేర ముడుపులు చెల్లించిన వ్యవహారంపై ఉక్రెయిన్ ప్రభుత్వం దర్యాప్తు జరుపుతున్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సదరు అవినీతి అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరారు. "ఏఎన్-32 విమానాలకు విడిభాగాలను సరఫరా చేసే ఒప్పందానికి సంబంధించి.. మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, ఇండియా (MODI) అధికారులు కోట్ల రూపాయల మేర ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మోదీ గారు.. మిమ్మల్ని మీరు కాపలాదారుగా అభివర్ణించుకున్నారు. అందువల్ల అవినీతి 'MODI' అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నా" అని ట్విటర్‌లో పేర్కొన్నారు.

భారత్‌లోని ఏఎన్-32 సైనిక రవాణా విమానాలకు విడిభాగాలను సరఫరాలో రూ.17.55 కోట్ల మేర ముడుపులు చెల్లించారని, దీనిపై ఉక్రెయిన్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని సదరు మీడియా కథనం పేర్కొంది. భారత రక్షణ అధికారుల పాత్ర కూడా ఇందులో ఉండొచ్చని అక్కడి అవినీతి నిరోధక శాఖ అధికారులు అనుమానిస్తున్నారు.

చరవాణుల్లోకి చొరబడుతున్న కొత్త వైరస్‌లు

- వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల సమాచారం చోరీకి గురయ్యే ముప్పు

దిల్లీ: చరవాణులు, కంప్యూటర్లలోకి రెండు కొత్త వైరస్‌లు చొరబడుతున్నట్లు భారత అత్యవసర కంప్యూటర్ సేవల ప్రతిస్పందన దళం(సెర్ట్-ఇన్) వెల్లడించింది. వీటితో బ్యాంకింగ్ వివరాలతోపాటు వ్యక్తిగత సమాచారమూ తస్కరణకు గురయ్యే ముప్పుందని హెచ్చరించింది. ఈ వైరస్‌ల పేర్లను 'పాండా బ్యాంకర్', 'వర్చువల్ గర్ల్‌ఫ్రెండ్'గా పేర్కొంది. వీటిలో రెండోది అత్యంత ప్రమాదకరమని, ట్విటర్ ఖాతాల సాయంతో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లలోకి ఇది చొరబడుతోందని వెల్లడించింది. 'వర్చువల్ గర్ల్‌ఫ్రెండ్ వైరస్ ఇప్పటికే ట్విటర్ గుండా స్మార్ట్‌ఫోన్లలోకి ప్రవేశించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇది అప్లికేషన్ రూపంలో స్మార్ట్‌ఫోన్‌లోకి వస్తోంది. దీన్ని అన్‌ఇన్‌స్టాల్ చేస్తేఐకాన్ మాత్రమే పోతుంది. బ్యాగ్రౌండ్‌లో ఇది పనిచేస్తూ సమాచారాన్ని తస్కరిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా ఎస్ఎంఎస్‌లు, యాప్‌లలోని వివరాలను ఇది చోరీచేస్తుంది. దీంతో ఖాతాల్లోని నగదూ ఖాళీ అయ్యే ముప్పుంది'అని సెర్ట్-ఇన్ తెలిపింది.

సైబర్ నేరాలకు కేంద్రంగా ఝార్ఖండ్: సైబర్ నేరాలకు ఝార్ఖండ్‌లోని జామ్‌తారా ప్రాంతం కేంద్రంగా మారుతున్నట్లు కేంద్ర హోం శాఖ కార్యదర్శి రాజీవ్ గాబా తెలిపారు. దిల్లీలోని అంతర్జాల భద్రతపై ఏర్పాటైన సదస్సులో గురువారం ఆయన మాట్లాడారు. దేశంలోని సగానికిపైగా సైబర్ నేరాలు ఇక్కడి నుంచే జరుగుతున్నట్లు చెప్పారు.

విపక్షాలకు కైరానా.. భాజపాకు హైరానా

గురువారం కైరానాలో విజయ సంకేతం చూపుతున్న ఆర్‌ఎల్డీ అభ్యర్థి తబస్సుమ్ హసన్

(మొదటి పేజీ తరువాయి)

తీర్పు అని అభివర్ణించాయి.

వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలకు, పునరేకీకరణలకు నాందిగా భావిస్తున్న ఈ ఉప ఎన్నికలను అటు అధికార భాజపా, ఇటు విపక్షాలు ఎంతో కీలకంగా భావించాయి. సర్వశక్తులూ ఒడ్డాయి. నాలుగు లోక్‌సభ స్థానాలు- కైరానా(ఉత్తర్‌ప్రదేశ్), భండారా-గోండియా, పాల్ఘర్(మహారాష్ట్ర), నాగాలాండ్‌లో ఉపఎన్నికలు జరగగా భాజపా సిట్టింగ్ స్థానమైన పాల్ఘర్‌లో పరువు కాపాడుకుంది. ఇక్కడ భాజపా మిత్రపక్షం శివసేనే ప్రత్యర్థిగా నిలిచింది. విపక్షం గట్టిపోటీ ఇవ్వలేకపోయింది. భాజపాకు చెందిన రాజేంద్ర గావిట్... శివసేన అభ్యర్థి శ్రీనివాస్ వనగాపై విజయం సాధించారు. ఇక్కడ ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని శివసేన అధిపతి ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. మరో రెండు సిట్టింగ్ స్థానాలు కైరానా, భండారా-గోండియాను కోల్పోవడం భాజపాకు గట్టి దెబ్బే. ముఖ్యంగా కైరానా ఓటమి కమలదళం జీర్ణించుకోలేని అంశం. ఇక్కడ విపక్షాలన్నీ కలిపి భాజపాకు వ్యతిరేకంగా ఆర్‌ఎల్‌డీ నుంచి తబస్సుమ్ హసన్‌ను బరిలో నిలిపాయి. విపక్షాల ఐక్యతను చాటుతూ ఆమె తిరుగులేని ఆధిక్యంతో గెలవడంతో కమలదళం పరువు పోయింది. నాగాలాండ్‌లో భాజపా మిత్రపక్షమైన నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) గెలిచింది.

లోక్‌సభ ఫలితాలు భాజపా కూటమి, విపక్షాలకు చెరిసమానంగా వచ్చినా పది శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం కమలదళం చావు దెబ్బ తింది. ఒక్క ఉత్తరాఖండ్‌లో మాత్రమే గెల్చింది. మేఘాలయ, పంజాబ్‌లో ఉప ఎన్నికలు నిర్వహించిన ఒక్కో స్థానంలో కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేయగా, ఝార్ఖండ్‌లో రెండు స్థానాల్లో జేఎంఎం, కేరళలో సీపీఎం, ఉత్తర్‌ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బిహార్‌లో ఆర్జేడీ, పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఒక్కోస్థానంలో గెలిచాయి. బిహార్‌లోని జోకీహట్‌లో ఆర్జేడీ అభ్యర్థి షా నవాజ్ ఆలం.. జేడీయూ అభ్యర్థి ముర్షీద్ ఆలంపై 41వేల ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. జేడీయూ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది.

కర్ణాటకలోని ఆర్ఆర్ నగర్‌కు ఇటీవల ఎన్నికలు నిర్వహించలేకపోవడంతో మిగిలిన ఉప ఎన్నికలతో పాటు నిర్వహించారు. ఆ స్థానంలోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగరవేసింది. 2013 ఎన్నికల్లోనూ ఈ స్థానం కాంగ్రెస్‌దే. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నూర్‌పుర్.. భాజపా సిట్టింగ్ స్థానంకాగా దాన్ని మళ్లీ కైవసం చేసుకోలేకపోయింది. ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థి అవనిసింగ్‌పై సమాజ్‌వాదీ పార్టీకి చెందిన నయీముల్ హసన్ గెలుపొందారు. పంజాబ్‌లోని షాకోట్.. భాజపా మిత్రపక్షమైన అకాలీదళ్ సిట్టింగ్ స్థానం కాగా దాన్నీ మిత్రపక్షాలు కాపాడుకోలేకపోయాయి. మరోవైపు కేరళలో సీపీఎం, ఝార్ఖండ్‌లో జేఎంఎం, పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ తమ సిట్టింగ్ స్థానాలను మళ్లీ గెల్చుకొన్నాయి. మహారాష్ట్రలో పాలస్-కడేగావ్ స్థానంలో ఇతర పార్టీలేమీ అభ్యర్థులను నిలపకపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24పరగణాల జిల్లా కేంద్రంలో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల ఆనందం

గ్రహం అనుగ్రహం

1-6-2018 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
తదియ: రా.11-31 తదుపరి చవితి
పూర్వాషాఢ నక్షత్రం: పూర్తి
అమృత ఘడియలు: రా. 1-45 నుంచి 3-31 వరకు
వర్జ్యం: మ. 3-09 నుంచి 4-55 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-05 నుంచి 8-56 వరకు
తిరిగి మ. 12-24 నుంచి 1-16 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-29; సూర్యాస్తమయం: సా.6-27

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	45.0	32.0
కడప	44.0	30.0
గుంటూరు	42.8	29.5
నెల్లూరు	42.0	30.0
తిరుపతి	41.7	29.3
కర్నూలు	41.5	29.3
ఒంగోలు	41.1	30.2
విజయవాడ	40.6	30.0
రాజమహేంద్రవరం	40.5	28.0
హైదరాబాద్	40.1	28.1
అనంతపురం	38.6	28.8
రామగుండం	38.4	28.2
తాడేపల్లిగూడెం	38.0	29.5
శ్రీకాకుళం	38.0	29.0
విశాఖపట్నం	36.6	29.6
నరసాపురం	36.2	29.6

కర్ణాటక మంత్రివర్గంపై నేడు ప్రకటన: కుమారస్వామి

బెంగళూరు: కర్ణాటక మంత్రివర్గ కూర్పు, శాఖల కేటాయింపు వివరాలు శుక్రవారం వెల్లడయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి కుమారస్వామి వెల్లడించారు. పలు ధపాల చర్చల అనంతరం తమ పార్టీ (జేడీ-ఎస్), కాంగ్రెస్ ఏకాభిప్రాయానికి వచ్చాయని గురువారం ఇక్కడ తెలిపారు. తాను, జేడీఎస్ అధినేత దేవెగౌడ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ లు మరోసారి కూర్చొని దిల్లీలో పరిణామాలపై చర్చిస్తామని, బహుశా శుక్రవారమే మంత్రివర్గం, సమన్వయ కమిటీపై ప్రకటన వెలువడుతుందని చెప్పారు. కీలక శాఖల కేటాయింపుపై ఇరుపక్షాల్లో విభేదాలేమీ లేవని అన్నారు. మరోవైపు జేడీ(ఎస్)కు ఆర్థిక శాఖ, కాంగ్రెస్‌కు హోంమంత్రిత్వ శాఖలు ఖరారైనట్టు దిల్లీలో ఇరుపార్టీలకు చెందిన నాయకులు కొందరు చెబుతున్నారు.

గిడ్డంగి లోపలి నుంచి మిర్చి బస్తాలను బయటకు తెస్తున్న సిబ్బంది

శీతల గిడ్డంగిలో అగ్ని ప్రమాదం

- 30 వేల మిర్చి బస్తాలు దగ్ధం?

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చి యార్డు సమీపంలోని వీజీటీ శీతల గిడ్డంగిలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. గిడ్డంగిలోని రెండు బ్లాకుల్లో దాదాపు 30వేల మిర్చి బస్తాలు కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. గిడ్డంగిలోని ఎ, బి బ్లాకుల్లో మొత్తం రూ.2.5 కోట్ల విలువైన 80 వేల మిర్చి బస్తాలు ఉన్నట్లు యాజమాన్యం వెల్లడించింది. ప్రమాదం కారణంగా రూ.75లక్షల మేర నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సిబ్బంది విషయాన్ని గుర్తించి అధికారులు సమాచారం అందించారు. ప్రకృతి వైపరీత్యాల నివారణ సంస్థ సిబ్బంది వెంటనే వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సాయంత్రానికి ఎ-బ్లాకులో మంటలు కొంతమేర అదుపులోకి వచ్చాయి. కాలకుండా మిగిలిన గిడ్డంగి బయటకు తెచ్చారు.

ఇదీ సంగతి!



మా పార్టీలన్నీ కలిసి రెండు పార్లమెంటు సీట్లను గెలిచాయి. మిఠాయి తిను.

ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతున్న రైతులు

ఇన్నిసార్లు రావడం బాగోలేదు

- రాజధాని అభివృద్ధికి నిధులివ్వండి
- ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో రైతులు

తుళ్ళూరు, న్యూస్‌టుడే: ఎవరో కొద్ది మంది వేసే అడ్డపుల్లలతో ఇన్నిసార్లు వచ్చి పరిశీలించడం బాగోలేదని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు అమరావతి ప్రాంత రైతులు స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణానికి నిధులను త్వరితగతిన మంజూరు చేస్తే రాజధానితో పాటుగా భూములిచ్చిన తాము అభివృద్ధి పథంలో పయనిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో రాజధానిలో బాగానే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. రాజధాని గ్రామాల్లో గురువారం 9 మందితో కూడిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటించింది. వెంకటపాలెం, మందడం, రాయపూడి, తుళ్ళూరు గ్రామాల్లో ప్రతినిధులు పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. తుళ్ళూరు సీఆర్‌డీఏ యూనిట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధి అన్న డిజార్డ్ మాట్లాడారు. ఏదేని ప్రాజెక్టుకు సంబంధించి ప్రపంచ బ్యాంకు సహాయం చేయాలంటే వివిధ అంశాలతో కూడిన పర్యటనలు తరచూ చేయాల్సి ఉంటుందని చెప్పారు. బహుశా ఇది చివరి పర్యటన కావచ్చేమోనని తెలిపారు. మందడం గ్రామంలో పేదలకు నిర్మిస్తున్న గృహ నిర్మాణ సముదాయాన్ని, రాయపూడిలో రోడ్డు నిర్మాణంలో గృహాలు కోల్పోయిన వారికి కేటాయించిన స్థలాల్లో నిర్మిస్తున్న గృహాలను, తుళ్ళూరులోని వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ కేంద్రాన్ని పరిశీలించారు.

అమరావతి పనుల్లో వేగమేదీ?

- ఐదు నిమిషాల వీడియో కూడా తయారు చేయలేకపోతే ఎలా?
- సీఆర్‌డీఏ అధికారులపై చంద్రబాబు అసంతృప్తి

ఈనాడు – అమరావతి

గురువారం సచివాలయంలో సీఆర్డీఏ కార్యకలాపాలపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. హాజరైన పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: ఎంతో గర్వపడేలా పోలవరం ప్రాజెక్టు పనులను 55 శాతం పూర్తి చేయగలిగామని, అదే అమరావతి విషయంలో ఆ స్థాయిలో పనులు వేగంగా జరగడం లేదని సీఆర్‌డీఏ అధికారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజధానిలో జరుగుతున్న పనులను మహానాడు వేదికగా.. చూపించేందుకు ఐదు నిమిషాల వీడియోను తయారు చేయాలని సూచిస్తే దానినీ జనాలకు అర్థమయ్యేలా రూపొందించలేకపోవడమేంటని ప్రశ్నించారు. అమరావతిలో ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు నార్మన్ ఫోస్టర్స్ సంస్థ రూపొందించిన ప్రతిపాదనలను ముందే పరిశీలించి, వాటిలో మార్పులు, చేర్పులను సూచించేలా తన దగ్గరకు రాకుండా నేరుగా తనతోపాటే దానిని చూస్తే ఎలా అని నిలదీశారు. వెలగపూడి సచివాలయంలో గురువారం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ సమావేశం జరిగింది. పేరుకు పదుల సంఖ్యలో సలహాదారులను పెట్టుకుని కోట్ల రూపాయలు చెల్లిస్తున్నా పనులను ఎందుకు పరుగెత్తించలేకపోతున్నారని ఈ సందర్భంగా అధికారులను ప్రశ్నించారు. సీడ్ యాక్సెస్ రహదారి ప్రాంతంలో ఒక చోట దుమ్ము లేచి ఆ దారిన వెళ్లే వారికి ఇబ్బందిగా ఉందని చెప్పారు. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు. వర్షాకాలం రానున్నందున నిర్మాణ పనులు అనుకున్నట్లుగా సాగవని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు.

6న అమరావతి బాండ్లు

రాజధాని నిర్మాణానికి నిధుల సేకరణ కోసం ప్రత్యేకంగా ప్రవేశపెడుతున్న రూ.2వేల కోట్ల విలువైన అమరావతి బాండ్లను జూన్ 6న విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తయినందున ఆర్‌బీఐ విధాన ప్రకటన తర్వాత వీటిని జారీ చేయాలని తీర్మానించారు.

6 నెలల్లో త్రీడీ డిజైన్లు

అమరావతి త్రీడీ సిటీ డిజైన్లను 6 నెలల్లో పూర్తి చేయాలని చంద్రబాబు డస్సాల్ట్ సిస్టమ్ సంస్థ ప్రతినిధులను కోరారు. తొలుత వారు ఈ డిజైన్లపై సీఎంకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నగర ప్రణాళికలు, ప్రకృతి వైపరీత్యాలు, భూ ప్రకంపనలకు సంబంధించి సూచనలు అందజేయడంలో ఈ త్రీడీ డిజైన్లు కీలకమవుతాయని, నిర్మాణాలను ఎప్పటికప్పుడు వాస్తవ సమయంలో ప్రత్యక్షంగా పర్యవేక్షించడానికి ఉపకరిస్తాయని వారు చెప్పారు. భూగర్భ పైపు లైన్లు మొదలు భవంతుల మధ్య గాలి, వెలుతురు వరకూ త్రీడీ సాంకేతిక సాయంతో అంచనా వేయొచ్చని వివరించారు.

10 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గించేందుకు..

రాజధాని ప్రాంతంలో ఎండలు, ఉష్ణోగ్రతల తీవ్రతపై అధ్యయనం చేసిన నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధులు... ఆ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. గత మూడు రోజుల్లో విజయవాడలో నమోదైన వాస్తవ ఉష్ణోగ్రత కంటే ప్రజలకు అనిపించే (ఫీలయ్యే) ఉష్ణోగ్రత అధికంగా ఉందని, దాదాపు 60 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత ఉన్నట్లు అనిపించిందని తెలిపారు. రాజధానిలో పది డిగ్రీల సెంటిగ్రేడ్ మేర ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

- అన్న క్యాంటీన్ల నిర్మాణ ఆకృతులను పరిశీలించిన ముఖ్యమంత్రి అవసరమైన నిధుల కోసం ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అన్న క్యాంటీన్లకు నిధులు సమకూర్చుకోవచ్చని చెప్పారు.
- ప్రీ ఫ్యాబ్రికేటెడ్ సామగ్రితో రాజధానిలో మూడు నక్షత్రాల హోటల్ నిర్మాణం చేపట్టేందుకు ఫార్చ్యూన్ మురళీ యాజమాన్యం ముందుకొచ్చిందని సీఆర్‌డీఏ అధికారులు వివరించారు.

సీబీఎస్‌ఈ విద్యార్థులకు ప్రశంస

ఈనాడు, అమరావతి: సీబీఎస్‌ఈ పదో తరగతి గణితం పరీక్షా ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దేశం మొత్తం మీద గణితంలో ఏపీ విద్యార్థులు ప్రతిభ చూపడంతోపాటు ఓవరాల్ ప్రతిభలో రెండో స్థానంలో నిలిచారు. దీంతో గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఏపీ విద్యార్థులకు ప్రశంసలు దక్కాయి. తెలుగు విద్యార్థులు మరోసారి విజయకేతనం ఎగురవేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు మెచ్చుకున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన అగ్రిగోల్డ్ బాధితులు

ఈనాడు, అమరావతి: వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ప్రతినిధులు కలిశారు. 13 జిల్లాల నుంచి ఒక్కొక్కరి చొప్పున ఎంపిక చేసుకుని న్యాయస్థానానికి హాజరై సమస్యలను వివరంగా చెప్పాలని వారికి ముఖ్యమంత్రి సూచించారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు ఆరోగ్యకార్డులు!

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఉద్యోగులకు ఆరోగ్యకార్డుల మంజూరుకు మార్గం సుగమమైంది. ఇప్పటివరకు ట్రెజరీ ద్వారా వేతనాలు అందుకునే ఉద్యోగులకు మాత్రమే ఆరోగ్యకార్డులు మంజూరు చేస్తున్నారు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ విధానంలో బ్యాంకు ఖాతాల ద్వారా వేతనాలు అందుకుంటున్న ఏపీవీవీపీ ఉద్యోగులకు.. ప్రీమియం చెల్లింపులో ఇబ్బందుల పేరుతో ఆరోగ్యకార్డులు మంజూరు కాలేదు. వైద్య విధాన పరిషత్ కింద 3,800 మంది శాశ్వత ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి న్యాయం చేయాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించాయి. ఈ నేపథ్యంలో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం వారికి ఆరోగ్యకార్డుల మంజూరుకు అంగీకరించింది. ఆయా ఉద్యోగులు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వెబ్‌పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఏపీవీవీపీ కమిషనర్ కార్యాలయం ఆదేశాలు జారీచేసింది. వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, సురేష్‌కుమార్‌లు గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు.

మోదీ పాలనకు చెంపపెట్టు: యనమల

ఈనాడు, అమరావతి: ప్రధాని మోదీ నాలుగేళ్ల ప్రజా వ్యతిరేక విధానాలకు ఉప ఎన్నికల ఫలితాలు చెంపపెట్టని ఏపీ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. గత రెండు ఉప ఎన్నికల్లో దెబ్బతిన్నట్లే మరోసారి భాజపా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'దిల్లీ- ముంబయి కారిడార్‌లో ధొలేరా నగరానికి ఎంతిచ్చారు? ఏపీ వీసీఐసీకి, బీసీఐసీకీ ఎంతిచ్చారు? ఇది రాష్ట్రాలపట్ల వివక్ష కాదా?' అని ప్రశ్నించారు. 'ఒకవైపు జగన్మోహన్‌రెడ్డితో లాలూచీ, మరోవైపు పవన్ కల్యాణ్ ద్వారా తెదేపాపై విమర్శలు చేయించడం, ఇంకోవైపు కన్నాతో ఏదో ఒక లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రి అవుతాడని చెప్పించడం, మరోవైపు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావుతో పుస్తకాలు రాయించడం, రమణ దీక్షతులతో ఆరోపణలు చేయించడం వంటివి చూస్తుంటే ఎవరో చెప్పినట్లుగా 'ఆపరేషన్ గరుడ' ప్రచారం నిజమేనేమో అనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు.

200 మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు!

- ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక విధానం ప్రకటించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: శాసనసభ నియోజకవర్గానికో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక (ఎంఎస్‌ఎంఈ) పార్కు ఏర్పాటుచేయాలన్న లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం గురువారం ఎం-పార్క్స్ 2018-23 పేరుతో ప్రత్యేక విధానాన్ని ప్రకటించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో 175 ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటుచేయాలని లోగడే సర్కారు నిర్ణయించింది. తాజా విధివిధానాల ప్రకారం ఏటా 40 పార్కుల చొప్పున 2022 నాటికి 175, 2023కి 200 పార్కులు ఏర్పాటుచేస్తారు. 30 వేల మందితో రూ.45 వేల కోట్ల పెట్టుబడులు పెట్టించి మూడు లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది ప్రణాళిక. కార్యక్రమానికి ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ నోడల్‌సంస్థగా వ్యవహరించనుంది. ఒక్కో పార్కు 25 ఎకరాలకు మించకుండా ఏర్పాటుచేస్తారు. ఏపీఐఐసీ కార్యనిర్వాహక ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ఎంఎస్‌ఎంఈపై ఇప్పటికే ప్రభుత్వం 2015-20 సంవత్సరాల కోసం ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తోంది.

ఏపీఐఐసీ ఆధ్వర్యంలోనే ఎంఎస్‌ఎంఈ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు భూములు, స్థలాలు కేటాయిస్తున్నారు. ఇప్పుడు కూడా ఏపీఐఐసీతోపాటు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ పార్కుల కోసం ప్రభుత్వం అనుమతులిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలోనూ అమలు చేయనున్నారు. పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఏపీఐఐసీ, ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం 50 శాతం రాయితీనిస్తుంది. దీనికి ఎకరాకు రూ.10 లక్షల చొప్పున పరిమితి విధించారు. ఔత్సాహికులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అందుబాటు ధరల్లో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రాయితీని ఒకేసారి కాకుండా వివిధ దశల్లో పార్కుల నిర్వాహకులకు ఇస్తారు. పార్కుల్లో పెట్టుబడులపై రెండు శాతం మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తుంది. భూవినియోగ మార్పిడి ఖర్చులపైనా వంద శాతం రాయితీనిస్తుంది. పార్కుల అభివృద్ధికి ఏపీఐఐసీకి ప్రభుత్వం 50 శాతం నిధులు సాధారణ బడ్జెట్ నుంచి మరో 50 శాతం వివిధ వర్గాల సంక్షేమ సంస్థలు, ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నుంచి కేటాయించనుంది.

గన్నవరం రైతులకు భూమి కేటాయించాలి

- తక్షణమే అభివృద్ధి చేసింది ఇవ్వండి
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

ఈనాడు, అమరావతి: గన్నవరం విమానాశ్రయ విస్తరణ కోసం భూములిచ్చిన రైతులకు రాజధాని అమరావతిలో అభివృద్ధి చేసిన భూమినిచ్చే ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంవో అధికారులు సతీష్‌చంద్ర, రాజమౌళిలను ఆదేశించారు. రైతులకు రాజధాని తరహాలోనే ప్యాకేజీని అమలు చేయడంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులకు రాజధాని తరహా ప్యాకేజీ అమలుకాకపోవడంతో వారు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. వారిని వెంట పెట్టుకుని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గురువారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిసేందుకు వెళ్లారు. అప్పటికే సీఎం తన వాహనశ్రేణిలో బయల్దేరడంతో దాని వెంట ఎమ్మెల్యే పరుగెత్తారు. ఆయన్ను చూసి కాన్వాయ్‌ను ఆపిన చంద్రబాబు సమస్యను అడిగి తెలుసుకున్నారు. రైతులతోనూ మాట్లాడారు. వారి సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.

పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మంజూరుచేసిన 2,54,736 పింఛన్ల పంపిణీని నవనిర్మాణ దీక్ష, మహా సంకల్పం సభనాటికంతా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి సామాజిక భద్రతా పింఛన్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగా 33,722 మంది మత్స్యకారులకు మంజూరైన పింఛన్లకు సంబంధించిన మార్గదర్శకాలను తక్షణమే విడుదల చేయాలన్నారు. తాజాగా మంజూరుచేసిన వాటితో పింఛను లబ్ధిదారుల సంఖ్య 50,14,799 మార్కుకు చేరుకుందన్నారు. ఇంత పెద్దఎత్తున సామాజిక భద్రతా పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని అన్నారు.

మోదీని గట్టి దెబ్బే కొట్టారు..

- ప్రజల విశ్వాసం కోల్పోతున్న భాజపా ప్రభుత్వం
- ఎన్డీయేలో శివసేన, జేడీయూ ఉండే అవకాశాలు తక్కువే
- అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు రూ.250కోట్లతో కార్పస్‌ఫండ్
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉపఎన్నికల ఫలితాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ

ఈనాడు – అమరావతి



'ఉపఎన్నికల ఫలితాలు భాజపాకు బలమైన గుణపాఠం. ఓటర్లు మోదీని గట్టి దెబ్బే కొట్టారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గురువారం మంత్రివర్గ సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించారు. సీఎంతోపాటు మంత్రులు ఉపఎన్నికల ఫలితాలపై వారి అభిప్రాయాలు తెలిపారు. చర్చలో చంద్రబాబు జోక్యం చేసుకుంటూ.. 'భారత ఓటర్లు తెలివైనవారు.. ఎక్కువ మాటలు చెప్పి పనిచేయకపోతే ఇలాగే సమాధానమిస్తారు' అని స్పష్టం చేశారు. మనం కూడా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పనులు సత్వరమే పూర్తి చేసి ఫలితాలు రాబట్టడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఎన్డీయేలో వాళ్లూ ఉండరు..

శివసేన, జేడీయూ కూడా ఎన్డీయేలో ఉండే అవకాశాలు తక్కువేనని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. త్వరలోనే మిగిలిన వారంతా బయటకు వస్తారన్నారు. ఎన్డీయే నుంచి మనం బయటకు వచ్చాకే దేశవ్యాప్తంగా అందరికీ మోదీని విమర్శించే ధైర్యం వచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రులకూ సీఎం చురకలు వేశారు. ఇప్పుడు మీరు చేసేది ఎంత మాత్రం సరిపోదని స్పష్టం చేశారు. శాఖలపై ఇకనుంచైనా దృష్టి పెట్టాలన్నారు. 'ఏదైనా అంశాలపై మిమ్మల్ని మందలిస్తే వెంటనే ప్రజల్లోకి వెళ్తోంది. దీనివల్ల ప్రజల్లో మీకే గౌరవం తగ్గుతుందని' సీఎం హెచ్చరించారు.

మీకు చేతకాకపోతే చెప్పండి.. నేనే వాదిస్తా

అగ్రిగోల్డ్ విషయంలో న్యాయశాఖ పనితీరుపై సీఎం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. మిగిలిన రాష్ట్రాలు పట్టించుకోకున్నా మనమే చొరవ తీసుకుంటున్నామని గుర్తు చేశారు. అయినా ఎక్కడో లోపం ఉందని అధికారులపై అసంతృప్తి వెలిబుచ్చారు. న్యాయస్థానం నుంచి స్పష్టత వచ్చే రీతిలో వాదనలు విన్పించలేకపోతున్నారని అన్నారు. అవసరమైతే దిల్లీ నుంచి న్యాయనిపుణులను పిలిపించుకోవాలని సూచించారు. తాను కూడా అడ్వొకేట్ జనరల్‌తో మాట్లాడతానన్నారు. 'మీకు చేతకాకపోతే చెప్పండి.. నేనే హైకోర్టుకు వచ్చి వాదిస్తా' అని స్పష్టం చేశారు. 'బాబ్లీ ప్రాజెక్టు విషయంలో అరెస్టై కోర్టుకు వెళ్లినపుడు న్యాయమూర్తి మీరెవరినైనా న్యాయవాదిని పెట్టుకుంటారా? అని ప్రశ్నించగా మా రాష్ట్ర సరిహద్దులో పోరాడుతుంటే అరెస్టు చేశారు.. మేమే వాదించుకుంటామని చెప్పా. మాకేమీ కొత్త కాదు' అని చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. సమస్యను త్వరితంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు రూ.250కోట్ల కార్పస్‌ఫండ్‌తో ప్రత్యేక వాహకసంస్థ ఏర్పాటుచేసి దశలవారీ చెల్లింపులు చేయాలని యోచిస్తున్నామన్నారు. అత్యవసర ఇబ్బందులున్న వారికి తొలివిడతలో చెల్లింపులు చేద్దామన్నారు. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి మోసాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

నిరుద్యోగ భృతి విధివిధానాలపై కొద్దిసేపు చర్చించారు. ఎన్నాళ్లివ్వాలనే అంశంపై మంత్రులు తమ అభిప్రాయాలు చెప్పారు. అయిదేళ్లివ్వాలా? ఉద్యోగం వచ్చేదాకా ఇవ్వాలా? అనే చర్చ నడిచింది. ఉద్యోగం వచ్చిందో లేదో తెలుసుకునేదెలా? అనే ప్రశ్నలూ వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగమైతే వెంటనే తెలుసుకోవచ్చు.. ప్రైవేటులో అయితే ఎలా? అని కొందరు సందేహం వెలిబుచ్చారు. కూర్చోబెట్టి ఇచ్చామని కాకుండా, సమాజానికి ఏదైనా చేసేలా కార్యక్రమాలు చేయిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా వ్యక్తమైంది.

రాష్ట్రంలో భూ కేటాయింపుల వివరాలు ఈనాడు.నెట్‌లో ఉన్నాయి

పోలవరంలో వచ్చే సీజన్‌కు 80శాతం పనులు

పోలవరంలో ప్రస్తుతం 54శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. వచ్చే సీజన్‌కు 80శాతం పూర్తి చేస్తామన్నారు. కేంద్రం నుంచి మరో రూ.రెండు వేల కోట్ల వరకు రావాలని వివరించారు. ఆగస్టు 15 నాటికి డయాఫ్రంవాల్ పూర్తవుతుందన్నారు. అప్పటికి పోలవరం పర్యటనకు రావాలని సీఎంను కోరారు. పనుల తీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో పాడి పశువుల కొనుగోలుపైనా చర్చించారు. ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులు, నిబంధనలు సవరించాల్సిన అవసరాన్ని మంత్రులు వివరించారు. తెలుగేతర రాష్ట్రాలతోపాటు హరియాణకు లబ్ధిదారులనే తీసుకెళ్లి కొనుగోలు చేయించడానికి సీఎం అంగీకరించారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై ఎంపీలతో కలిసి దిల్లీలో ఒత్తిడి తేవాలని సూచించారు. ఎన్టీఆర్ మ్యూజియం ఏర్పాటుపైనా చర్చించారు.

ఉపాధి పనులపై కేంద్ర అధికారుల పరిశీలన

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా) కింద రాష్ట్రంలో చేపట్టిన పనులను గత మూడు రోజులుగా విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో పరిశీలించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అధికారుల బృందం గురువారం విజయవాడలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సంచాలకులు రంజిత్‌భాషతో భేటీ అయ్యింది. రెండు జిల్లాల్లో చేపట్టిన పనుల పరిశీలనలో గుర్తించిన విషయాలపై ఆయనతో కేంద్ర అధికారులు చర్చించారు. చక్కని ప్రణాళికతో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర అధికారులు అనిల్ కట్టా, ప్రియ సాధ్వి ప్రశంసించారు.

ప్రత్యేక హోదా కోసం ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ కృష్ణాజిల్లా ఆగిరిపల్లి మండల తహసీల్దారు కార్యాలయం వద్ద ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిన బెజవాడ శ్రీనివాసరావు(51) చికిత్స పొందుతూ కన్నుమూశారు. మే 23న ఆయన వెంటతెచ్చుకున్న పురుగుల మందు తాగడంతో.. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు గురువారం ఉదయం ప్రాణాలు కోల్పోయారు. ఆగిరిపల్లి మండలం శోభనాపురానికి చెందిన శ్రీనివాసరావుకు భార్య శివపార్వతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు డిగ్రీ పూర్తిచేశాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు అధికారులకు పదోన్నతుల ప్రక్రియ.. ఎంపిక కమిటీ నియామకానికి ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పోలీసు సర్వీసు అధికారులకు ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియలో భాగంగా 2015 సంవత్సరానికి సంబంధించి అర్హుల ఎంపిక జాబితాను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్.అనూరాధ, డీజీపీ ఎం.మాలకొండయ్యలు ఎంపిక కమిటీలో మన రాష్ట్రం నుంచి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీకి యూపీఎస్సీ ఛైర్మన్ లేదా సభ్యుడు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సంయుక్త కార్యదర్శి హోదాకు తగ్గని ఇద్దరు అధికారులను కేంద్రం తరఫున కమిటీలో నియమిస్తారు.

క్లాట్-2018లో ముగ్గురు మిత్రుల జయభేరి

తొలి 3 ర్యాంకులు వారికే

జయపుర: 'అఖిల భారత న్యాయ ప్రవేశ పరీక్ష' (క్లాట్)-2018లో జయపురకు చెందిన ముగ్గురు మిత్రులు తొలి మూడు స్థానాలు దక్కించుకుని జయభేరి మోగించారు. ఈ ఫలితాలను గురువారం ప్రకటించారు. ఒకే సంస్థలో శిక్షణ పొందిన అమన్‌గార్గ్ (159 మార్కులు), దేవాన్ష్ కౌశిక్ (157.5), అన్‌మోల్ గుప్తా (157.5) వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు దక్కించుకున్నారు. ముగ్గురం పాఠ్యాంశాలను పంచుకుంటూ కలిసి సన్నద్ధమయ్యామనీ, ఇదే స్ఫూర్తితో బెంగళూరులోని 'భారత జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం'లో కలిసి చేరాలనుకుంటున్నామనీ దేవాన్ష్ ఒక వార్తా సంస్థకు తెలిపాడు. దేశంలోని 19 ప్రతిష్ఠాత్మక న్యాయవిద్య కళాశాలల్లో ప్రవేశాలకు వీలుగా క్లాట్ ఫలితాలను వెల్లడించడానికి సుప్రీంకోర్టు అనుమతించిన ఒక రోజులోనే ఫలితాలు విడుదలయ్యాయి. దాదాపు 54 వేల మంది ఈ పరీక్షను రాశారు.

ఏపీకి చాలా నిధులు ఇచ్చాం

- తెలుగు రాష్ట్రాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తాం
- కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై భారతీయ జనతాపార్టీ పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తుందని కేంద్ర ఐటీ, న్యాయశాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టంచేశారు. కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చాలా నిధులను ఇచ్చిందన్నారు. అవకాశవాద పొత్తులతో ఏర్పడే కూటములకు స్థిరత్వం ఉండదని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన మూడో కూటమితో తమకు ఎలాంటి సంబంధమూలేదన్నారు. ఆ కూటమి వెనుక తాములేమని వివరించారు. ఉప ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ.. అవి ఎప్పుడూ స్థానిక అంశాల ఆధారంగానే సాగుతాయని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రధాని మోదీ నేతృత్వంలో భాజపాకు పట్టంకడుతారని ధీమా వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లో 'పరివర్తన దిశగా భారతదేశం' అనే అంశంపై 48 నెలల్లో ఎన్డీఏ పరిపాలనలో చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. అనంతరం పత్రికల సంపాదకులతో రవిశంకర్‌ప్రసాద్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమాల్లో కేంద్రమంత్రి మాట్లాడుతూ..గత నాలుగేళ్ల ఎన్డీఏ పాలనలో భారతదేశం పూర్తిగా అభివృద్ధి చెందిందని తాను చెప్పడంలేదని.. అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పగలనని అన్నారు. హైకోర్టు విభజనపై స్పందిస్తూ దీనిపై రిట్‌పిటిషన్‌లు విచారణలో ఉన్నాయన్నారు. హైకోర్టుకు పూర్తిస్థాయిలో భవనాలు ఇచ్చే వరకు ఆగాలని ఏపీ సీఎం కోరారని తెలిపారు. భవనాలు ఇస్తే ధ్రువీకరించడం (నోటిఫై) వరకే తమ శాఖ పని అని వెల్లడించారు.

మూడున్నరేళ్లకు చేదెక్కామా?: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కేంద్రం చేయాల్సిందంతా చేస్తుందని రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు అంటే అభిమానం ఉందన్నారు. మూడున్నరేళ్లపాటు బాగానే ఉండి హఠాత్తుగా మేము చేదెక్కామా? అని ప్రశ్నించారు. చంద్రబాబు, ఆయన కుమారుడిపై కేసులు పెట్టేందుకు దస్త్రాలు సిద్ధం చేయటం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పెట్రో ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేదని కేంద్రమంత్రి తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా పెట్రోలియం ధరలు ఆధారపడి ఉన్నాయన్నారు.

ఈనాడు

కుంగుబాటుకు సరైన మందు

ఒక వ్యక్తి ఆత్మహత్య- ఆ కుటుంబానికే కాదు, పరిచయస్తులందరికీ పెద్ద కుదుపు. తీవ్ర నిరాశానిస్పృహల్లో కూరుకుపోయి జీవనయానాన్ని అర్ధాంతరంగా ముగించే యత్నంలో ఎదురయ్యే వైఫల్యం, మరింత దుర్భర వేదనా హేతువు. ఆత్మహత్యాయత్నాన్ని నేరాల జాబితా నుంచి తొలగించి, మానసిక అనారోగ్యం పాలబడిన వ్యక్తులకు మెరుగైన చికిత్స అందించడానికి ఉద్దేశించిన చరిత్రాత్మక శాసనాన్ని కేంద్ర స్వాస్థ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజాగా నోటిఫై చేసింది. తనను తాను అంతమొందించుకునే విపరీత చర్యకు సిద్ధపడిన ఎవరైనా ఆ యత్నంలో కృతకృత్యులు కానప్పుడు భారతీయ శిక్షాస్మృతిలోని 309 సెక్షన్ కింద ఏడాది పాటు జైలులోకి నెట్టే విడ్డూరం దేశంలో దశాబ్దాల తరబడి కొనసాగింది. పాత(క) ఒరవడికి గండి కొట్టే క్రమంలో మానసిక ఆరోగ్య పరిరక్షణ బిల్లు 2016 ఆగస్టులో రాజ్యసభ, నిరుడు మార్చిలో లోక్‌సభల ఆమోదముద్ర పొందింది. కెన్యా, టాంజానియా, బంగ్లాదేశ్, బ్రునై, యూఏఈ ప్రభృత దేశాలు ఇప్పటికీ ఆత్మహత్యాయత్నాన్ని నేరంగా పరిగణిస్తున్నాయి. ఆ జాబితా లోంచి భారత్‌ను వెలికిలాగిన చట్టం- కుంగుబాటుతో బాధపడే వ్యక్తులకు మానవీయ చికిత్స సమకూరాలని నిర్దేశిస్తోంది. ఎటువంటి విచక్షణకూ తావివ్వకుండా అన్ని ప్రాంతాలవారికీ ఉచితంగా నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు అందించాల్సిన బాధ్యతను ప్రజా ప్రభుత్వాలకు దఖలుపరచిన చట్టం- పిల్లలకు కరెంట్ షాక్ చికిత్సను నిషేధిస్తోంది. విశ్వవ్యాప్తంగా ప్రతి 40 సెకన్లకు ఒక ఆత్మహత్య చోటుచేసుకుంటున్నట్లు అంచనా. జీవితాన్ని అర్ధాంతరంగా ముగించాలనే అహేతుక యోచనల్ని ప్రేరేపించేంతటి కుంగుబాటు అయిదున్నర కోట్లమందికి పైగా భారతీయుల్లో నెలకొన్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక మదింపు వేసింది. మరో మూడుకోట్ల 80 లక్షల మందిని తీవ్ర ఒత్తిళ్లు పట్టి కుదిపేస్తున్నాయనీ అది విశ్లేషించింది. ఈ దశలో మానసిక వ్యాధిగ్రస్తుల హక్కులు, ప్రయోజనాల్ని సంరక్షించే కీలక శాసన నిర్మాణం దేశారోగ్య రంగాన గొప్ప ముందడుగుగా సంభావించదగింది.

'నా మెదడే నా శత్రువు'- వృత్తిపర, వ్యక్తిగత ఒత్తిళ్లు తట్టుకోలేక అపార్ట్‌మెంట్ అయిదో అంతస్తు నుంచి దూకి, ఇటీవల ఆత్మహత్య చేసుకునే ముందు బుల్లితెర యాంకర్ రాధిక రాసిన లేఖలోని వాక్యమిది. అవధులెరుగని అటువంటి భావోద్విగ్నతే మానసిక అస్వస్థతకు రుజువు. ప్రవర్తనపై నియంత్రణ, నిర్ణయ పటిమ, స్వయం ఆలోచన కోల్పోవడమే మానసిక అనారోగ్యం. మనోరుగ్మతకు లోనైనవారిని పిచ్చివాళ్లుగా జమకట్టి, రోగం కుదిర్చే పేరిట అమానుషంగా వేధించే పెడధోరణులు ఊడలు దిగిన దేశం మనది. తట్టుకోలేని మానసిక వేదన ఉపశమించే దారి కానరాక, సకాలంలో సరైన చికిత్సకు నోచని అభాగ్యులెందరో చావే శరణ్యమనుకునేలా దుస్థితిగతులు ముప్పిరిగొంటున్నాయి. విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు, భగ్నప్రేమికులు, రోగగ్రస్తులు... ఎప్పటికప్పుడు ఈ జాబితా విస్తరిస్తోంది. దేశంలో ప్రతి పౌరుడికీ హుందాగా, గౌరవప్రదంగా మనుగడ సాగించే హక్కు ఉందంటున్న కొత్త చట్టం- ఎట్టి పరిస్థితుల్లోనూ మానసిక అస్వస్థుల్ని గొలుసులతో కట్టేయకూడదని, ఒంటరిగా నిర్బంధించరాదని కరాఖండీగా చెబుతోంది. వాస్తవానికి ఐపీసీ సెక్షన్ 309పై వేటు వేయాలని, చావడానికి విఫలయత్నం చేసి కుములుతున్న వాళ్లపై నేరం మోపి శిక్షించడం అహేతుకమని న్యాయసంఘం (లా కమిషన్) ఏనాడో 1971లోనే సూచించింది. ఆత్మహత్యకు యత్నించినవాళ్లు నేరగాళ్లు కాదు- బాధితులు. వారికి తగిన వైద్యం, సైకియాట్రిక్ సేవలు లభించి తీరాలన్న న్యాయసంఘం సిఫార్సులకు ఎట్టకేలకు ఇన్నేళ్లకిప్పుడు మోక్షం దక్కింది. బలవన్మరణానికి సిద్ధపడిన వ్యక్తి తీవ్ర ఒత్తిడికి గురైన యథార్థాన్ని గుర్తెరగాలంటున్న నూతన చట్ట నిబంధనలు మానవతా స్ఫూర్తికి ఎత్తుపీట వేస్తున్నాయి.

దేశదేశాల్లో 30 కోట్లమందికి పైగా కుంగుబాటు సమస్యను ఎదుర్కొంటున్నారన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన లెక్క. పది దక్షిణాసియా దేశాల్లో అత్యధిక బలవన్మరణాల రేటు కలిగిన భారత్ ఆత్మహత్యల పద్దులో గంటకొక విద్యార్థి పేరు చేరుతోంది. 2014-16 మధ్య దేశంలో 26,476 మంది విద్యార్థులు కడతేరిపోగా, ఒక్క 2016లోనే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 644 మంది చేతులారా ఉసురు తీసుకున్నారు. అటువంటివారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోకుండా నిర్ణాయక పాత్ర పోషించాల్సిన మానసిక వైద్యుల సంఖ్య దేశంలో ఆరువేల లోపేనని, అత్యధికులు నగరాలకే పరిమితమయ్యారన్న గణాంకాలు క్షేత్రస్థాయి సవాళ్లను కళ్లకు కడుతున్నాయి. వేగం ఆధునిక జీవన వేదంగా చలామణీ అవుతూ, ఉమ్మడి కుటుంబ సంస్కృతి ఛిద్రమవుతోంది. ఇటువంటప్పుడు- ప్రతి వ్యక్తీ స్వీయ ఆరోగ్యం దెబ్బతింటే తన బాగోగులు ఎవరు చూడాలో, చికిత్స ఎలా జరగాలో ముందుగానే నిర్దేశించగల వెసులుబాటును చట్టం కల్పిస్తున్నా... అన్ని వేళలా అందరికీ అది ఒనగూడుతుందన్న ధీమా ఎక్కడుంది? మనోవ్యాధికి సరైన మందన్నది కేవలం ప్రభుత్వాల వల్లనే సాధ్యమయ్యేది కాదు. అయిదు నెలల క్రితం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చెప్పినట్లు- భారత్‌లో మానసిక అస్వస్థుల సంఖ్య జపాన్ జనాభా కన్నా ఎక్కువ! ప్రాంతాల వారీగా మానసిక ఆరోగ్య పరిరక్షణకు గొడుగు పట్టడంలో స్వచ్ఛంద సంస్థలూ కూడి రావాలి. అంతకన్నా ముఖ్యంగా- 'నీకు నేనున్నాను' అనే భరోసా బాధితుల్లో నెలకొల్పేలా కుటుంబసభ్యుల్ని జాగృతపరచే అవగాహన కార్యక్రమాలు, నిపుణుల తోడ్పాటు ప్రణాళికాబద్ధంగా పట్టాలకు ఎక్కాలి!

ఎస్.అనంత్

ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషం సామాజిక మాధ్యమాల ద్వారా కోట్లాది కిలోబైట్ల సమాచారం రవాణా అవుతోంది. ప్రతి చిన్న అవసరానికీ సాంకేతిక విజ్ఞానం మీద ఆధారపడక తప్పని రోజులివి. మనం రోజూ ఇచ్చిపుచ్చుకొనే సమాచారం ఎంత భద్రంగా ఉంటోందన్నది ఇప్పుడు అతిపెద్ద చర్చనీయాంశంగా మారింది. సామాజిక మాధ్యమాలు, లెక్కకు మిక్కిలి కొత్త 'అప్లికేషన్లు' వరదలా వచ్చిపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి భయాను మానాలు లేకుండా సమాచారం ఇచ్చిపుచ్చుకొనే వాతావరణం ఉందా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ నేపథ్యంలోనే ఐరోపా సమాఖ్య అత్యంత కఠినమైన సమాచార భద్రత నిబంధనల (జీడీపీఆర్)ను తెరమీదకు తీసుకువచ్చింది. ఐరోపాతో పోలిస్తే సైబర్ భద్రత ప్రమాణాలపరంగా భారత్ పరిస్థితి దిగనాసిగా ఉంది. వినియోగదారుల సమాచారానికి

మయ్యే సరళమైన పద్ధతిలో 'తల్లిదండ్రుల అంగీకార పత్రాలు' ఉండాలన్న కీలక నిబంధననూ తీసుకువచ్చారు. ప్రజలనుంచి వ్యక్తిగత సమాచారం సేకరించే కంపెనీలన్నీ సమాచార భద్రత అధికారుల(డీపీఓ)ను తప్పనిసరిగా నియమించుకోవాల్సి ఉంటుంది. దాంతో ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో వ్యక్తుల సమాచారంతో ముడివడిన సంస్థలన్నీ డీపీఓలను ఏర్పాటు చేసుకొనక తప్పదు. ఈ నిబంధనలు కేవలం ఐరోపాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలకు మాత్రమే కాదు- ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉన్నా ఐరోపా సమాఖ్యలోని ప్రజలకు సేవలు అందించే ప్రతి సంస్థకు వర్తిస్తాయి.

ఐరోపా సమాఖ్య నిబంధనలు భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ఈయూ మార్గదర్శకాల మేరకు విధానాల్లో మార్పు చేర్పులు చేసుకోవడం భారతీయ సంస్థలకు అంత సులభం కాదు. ఫ్రాన్స్‌లోని 50 శాతం సంస్థలు మాత్రమే నూతన సమాచార భద్రత నిబంధనల మేరకు పనిచేయడానికి సన్నద్ధంగా ఉన్నట్లు ఇటీవలి అధ్యయనాల్లో వెల్లడైంది. అమెరికా కంపెనీల్లో 33 శాతం, దక్షిణాఫ్రికాలో 35శాతం, భారత్‌లో 13శాతం సంస్థలు మాత్రమే కొత్త

సంక్షోభంలో సమాచార భద్రత!



తగిన భద్రత కల్పించాలన్న స్పృహ కూడా మన దేశంలో మొగ్గ తొడగలేదు. వినియోగదారుల సమాచారాన్ని పరిరక్షించే క్రమంలో భారత్‌లో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్, ఇతర ఉపకరణాలు ఆధునిక అవసరాలకు ఏమాత్రం తగిన స్థాయిలో లేవు. అంతర్జాల వినియోగం అంతకంతకు పెరిగిపోతోంది. 1995లో అంతర్జాల వినియోగదారుల సంఖ్య 1.6 కోట్లు (ప్రపంచ జనాభాలో 0.4శాతం); 2017 చివరి నాటికి ఆ సంఖ్య 415 కోట్లకు చేరింది (ప్రపంచ జనాభాలో 54.4శాతం). ప్రపంచవ్యాప్తంగా సుమారు వంద కోట్లమంది ప్రతి రోజూ 'వాట్సాప్' ఉపయోగిస్తున్నారు. ఈ మాధ్యమం ద్వారా రోజూ 450 కోట్ల ఫొటోలు, వంద కోట్ల వీడియోలు, 5500 కోట్ల సందేశాలు అటు ఇటు రవాణా అవుతున్నాయి. 'గూగుల్'లో సమాచారం కోసం ప్రతి సెకనుకు 40 వేలమంది వెదుకుతున్నారు. ఆ రకంగా రోజుకు 3500 కోట్ల సార్లు సమాచారం కోసం 'గూగుల్' తలుపు తడుతున్నారు. 'ఫేస్‌బుక్'ను ప్రతి నెలా 200 కోట్లమంది క్రమం తప్పకుండా ఉపయోగిస్తున్నారు. ప్రపంచంలో సందేశాలను ఇచ్చిపుచ్చుకొనే తొమ్మిది ప్రముఖ అప్లికేషన్లను 580 కోట్లమంది వినియోగిస్తున్నారు. వీటితోపాటు వివిధ దేశాల్లో అనేక రకాల 'యాప్'లతోపాటు వివిధ గేమ్‌లనూ వినియోగిస్తున్న వారి సంఖ్య భారీగా ఉంది.

వివరాలన్నీ బహిరంగం

కోట్ల సంఖ్యలో అంతర్జాల వినియోగదారులు 'ఆన్‌లైన్'లో చేసే ప్రతి పనికి సంబంధించిన సమాచారమూ డిజిటల్ రూపంలో నమోదవుతోంది. మనం 'ఆన్‌లైన్'లో ఏం చూస్తున్నామన్నదానికి సంబంధించిన ప్రతి వివరమూ ప్రపంచవ్యాప్తంగా అనేక కంపెనీలకు, ప్రభుత్వాలకు క్షణాల్లో తెలిసిపోతోంది. ఏ వెబ్ పేజీని ఎన్నిసార్లు తెరుస్తున్నాం, ఎంత సేపు చూస్తున్నాం, 'ఆన్‌లైన్'లో ఏం కొనుగోలు చేస్తున్నాం, ఎవరితో మాట్లాడుతున్నాం వంటి వివరాలన్నీ అవసరమైనవారికి క్షణాల్లో చేరిపోతున్నాయి. వ్యక్తుల ఇష్టాయిష్టాలు, కొనుగోళ్ల తీరు, స్నేహితుల వంటి వివరాలన్నింటితో ప్రతి ఒక్కరి గురించిన స్పష్టమైన చిత్రం కంపెనీలకు ఎప్పటికప్పుడు చేరిపోతోంది. ఆ ప్రాతిపదికల ఆధారంగా ఏ ఉత్పత్తులను ఎవరికి విక్రయించవచ్చు అన్న అంచనాకు కంపెనీలు వస్తున్నాయి. అమ్మకాలు, కొనుగోళ్ల ప్రక్రియలో లక్షిత వినియోగదారులను చేరుకునేందుకు అక్కరకొచ్చే సమాచారమంతా కంపెనీల చేతిలోకి వెళ్ళిపోతోంది. వ్యక్తుల సమాచార గోప్యతతో ముడివడిన ఈ వ్యవహారం మరోవంక జాతి భద్రతకూ సవాలు విసురుతోంది. బ్యాంకు సర్వర్లు, ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన సర్వర్లు, విద్యుత్ గ్రిడ్లు, రోజూ వాడే టెలిఫోన్లు 'హ్యాకర్ల' పాలబడితే జాతి జీవనమే స్తంభించిపోతుంది.

అంతర్జాలం సర్వవ్యాపి! దేశాలమధ్య ఎల్లలు అంతకంతకూ కుదించుకుపోతున్నాయి. ఏవో కొన్ని దేశాలు మాత్రమే అంతర్జాల సేవలు అందించే బడా సంస్థలను నియంత్రించే కఠినమైన చట్టాలను అమలుపరుస్తున్నాయి. ఐరోపా సమాఖ్య (ఈయూ) సైతం సమాచార భద్రతపై గట్టిగా దృష్టిపెడుతోంది. కఠి

'ఈయూ'స్ఫూర్తిగా దిద్దు'బాట' పట్టాలి

నమైన నిబంధనలతో ముందుకొస్తోంది. భారత్‌లోనూ బ్యాంకింగ్ సమాచారాన్ని పకడ్బందీగా కాపాడుకోవాలన్న స్పృహ పెరుగుతోంది. భారత పౌరులు జరిపే లావాదేవీల సమాచారాన్నంతా ఒక చోట భద్రపరచాలని ఆర్‌బీఐ ఇటీవల మార్గదర్శకాలు జారీచేసింది. ఆరు నెలల్లోగా అన్ని కంపెనీలనూ ఆర్‌బీఐ మార్గదర్శకాల పరిధిలోకి తీసుకురావలసి ఉంటుంది. ఆర్థిక చెల్లింపుల రంగంలోకి దేశంలో ప్రైవేటు కంపెనీలు పెద్దయెత్తున అడుగుపెడుతున్నాయి. డిజిటల్ రూపంలో లక్షల కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ దశలో ఆర్‌బీఐ పరిధిని విస్తరిస్తూ నిర్ణయం తీసుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. పౌరుల వ్యక్తిగత సమాచారం, గుర్తింపు సంఖ్య, ప్రాంతం, వ్యక్తులనుంచి సేకరించే మరే ఇతర రకమైన వివరాలనూ కంపెనీలు మరెవరితోనూ పంచుకోకుండా ఈయూ కఠిన నిబంధనలు తీసుకువచ్చింది. ఆ రకంగా వ్యక్తుల గోప్యతను ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ బయటపెట్టే వివరాలన్నీ ఈయూ చట్టం పరిధిలోకి వచ్చి చేరాయి. తమ వివరాలు వెల్లడించడం, కంపెనీలకు చెప్పిన వివరాల్లో అవసరానుగుణంగా మార్పుచేర్పులు చేయడం, ఇచ్చిన సమాచారాన్ని వద్దు అనుకుంటే మొత్తంగా తొలగించాలని కోరడం వంటి హక్కులన్నీ ఈయూ చట్టం ప్రకారం పౌరులకే దఖలుపడ్డాయి. పౌరులనుంచి సేకరించిన సమాచారాన్ని ఎవరితో పంచుకుంటున్నారో, దాన్ని ఎంత కాలం తమ వద్ద అట్టిపెట్టుకుంటారో, సమాచార భద్రతకు ఎలాంటి చర్యలు, విధానాలు అవలంబిస్తున్నారన్న వివరాలను ఆయా కంపెనీలు ఎప్పటికప్పుడు సంబంధితులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఒకవేళ కంపెనీలు తమ సమాచారాన్ని దుర్వినియోగపరుస్తున్నాయని భావించిన పక్షంలో పౌరులు వెన్వెంటనే ప్రభుత్వ నియంత్రణ సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. అంతర్జాల వినియోగదారులనుంచి విచ్చలవిడిగా సమాచారం సేకరించి, వివిధ ప్రకటన సంస్థలకు ఆ వివరాలను విక్రయించే కంపెనీల ఆగడాలకు ఈయూ నిబంధనలు ముకుతాడు వేస్తున్నాయి. పదహారేళ్లలోపు పిల్లలకు అంతర్జాల సేవలు అందించేందుకు తల్లిదండ్రుల అనుమతిని తప్పనిసరిగా మార్చారు. గంభీరమైన, సంక్లిష్టమైన పదజాలాలను వాడకుండా అందరికీ సులభంగా అర్థ



మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయి. నిబంధనలను ఉల్లంఘించే కంపెనీలకు వాటి ప్రపంచ వార్షిక లావాదేవీల్లో నాలుగు శాతంగానీ లేదా 20 మిలియన్ యూరోలు (సుమారు రూ.120 కోట్లు)గానీ- ఆ రెండింటిలో ఏది ఎక్కువైతే ఆ మేరకు ఈయూ జరిమానా విధిస్తుంది. భారతీయ కంపెనీలు ఆ స్థాయి జరిమానా చెల్లించే పరిస్థితుల్లో లేవు.

సవాళ్లను ఎదుర్కొనే సంసిద్ధత

నూతన మార్గదర్శకాల మేరకు ఐరోపాలో కార్యకలాపాలు నిర్వహించేందుకు కంపెనీల వద్ద తగినంతమంది నిపుణులు లేరు. ఈయూ 'జీడీపీఆర్' ప్రకారం పనిచేసేందుకు ప్రపంచవ్యాప్తంగా 75వేలమంది సమాచార భద్రత అధికారులు అవసరమవుతారని అంచనా. భారతీయ కంపెనీలు 1200 మంది సమాచార భద్రత నిపుణులను కొత్తగా నియమించుకోవాల్సి ఉంటుంది. తమ పౌరుల సమాచార భద్రత కోసం ఐరోపా సమాజం చేపడుతున్న చర్యలనుంచి భారత్ నేర్చుకోవాల్సింది చాలా ఉంది. భారత్‌లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు విచ్చలవిడిగా పౌరులనుంచి సమాచారం సేకరిస్తూ, ఇష్టానుసారం నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. దేశ పౌరుల సమాచారానికి భద్రత లేని వాతావరణం నెలకొంది. తమ వివరాలు పక్కదారి పట్టాయని ఫిర్యాదు చేసినా పట్టించుకునే యంత్రాంగం కానరావడం లేదు. వినియోగదారులను కాపాడాల్సిన కొన్ని చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉండటం మరీ విడ్డూరం! ఆధార్ చట్టంలోని 47వ నిబంధనే ఇందుకు నిదర్శనం. దాని ప్రకారం ఆధార్ దుర్వినియోగానికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే పౌరులు నేరుగా కోర్టుకు వెళ్ళడానికి కుదరదు. దుర్వినియోగంపై వారు తొలుత 'యూఐడీఏఐ'ని సంప్రదించాల్సి ఉంటుంది. ఆ తరవాత ఫిర్యాదుదారుల తరఫున ఆ సంస్థ సమస్యను కోర్టు దృష్టికి తీసుకువెళుతుంది. సహజ న్యాయ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమైన పద్ధతి ఇది. పౌరుల సమాచార భద్రతపై భారత ప్రభుత్వం తక్షణం దిద్దుబాటు చర్యలతో ముందుకు రావాల్సి ఉంది. ఈయూ నిబంధనలే అందుకు స్ఫూర్తి కావాలి.

మేలిమి విత్తనాలే మూలం

ఏ దేశానికైనా ప్రజల అవసరాలకు సరిపడా తిండి గింజలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, ఇతర నిత్యావసరాలు తేలిగ్గా సమకూరే పరిస్థితి ఉండాలి. వీటి కోసం విదేశాలపై ఆధారపడితే ఇబ్బందులు తప్పవు. ఈ ఉత్పత్తులే నాగరిక ప్రపంచానికి కీలక అవసరాలు. వీటికి మూలం విత్తనం. జనాభా పెరిగి అవసరాలు అధికమయ్యేకొద్దీ దిగుబడి, నాణ్యతను పెంచే విత్తనాలకు గిరాకీ పెరుగుతుంది. చీడపీడలకు లొంగకుండా, నాణ్యమైన అధిక దిగుబడి ఇచ్చే విత్తనాల కోసం ప్రపంచం ఎదురు చూస్తుంటోంది. వీటిని సృష్టించడం ఒక ఎత్తయితే, రైతులకు తక్కువ ధరలకు అందించడం మరొకెత్తు. అందువల్లే విత్తన తయారీ, సరఫరా సంస్థలు ప్రతి దేశానికీ అవసరం. పర్యావరణ మార్పులతో చీడపీడలను తట్టుకోగల శక్తి కోసం ఒకే పంటలో వైవిధ్య భరితమైన రకాల సృష్టి జరుగుతుంది. అన్ని రంగాల్లో మాదిరిగా విత్తన రంగంలో సైతం పోటీ నెలకొంది. విత్తనాల్లోనూ మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడినందువల్ల కొత్త రకాల వేట నిత్యం సాగుతోంది.

వ్యవసాయ రంగంలో పరిణతికి ఆయా దేశాల విత్తనాభివృద్ధి సైతం కొలమానం అవుతుంది. ఆ విధంగా విత్తన ప్రపంచంలో ముందున్న దేశాల్లో అమెరికా, ఫ్రాన్స్, చైనా, బ్రెజిల్ తరవాత స్థానం భారత్‌దే. ఈ అయిదు దేశాలే ప్రపంచ విత్తన పరిశ్రమలో మూడింట రెండొంతులు ఆక్రమించాయి. ఇతర దేశాల పరిస్థితులను పక్కనపెడితే, మన దేశ వాతావరణం- ప్రపంచంలోని పంటలన్నింటినీ ఏదో ఒక కాలంలో పండించే వీలుండటంతో వివిధ రకాల విత్తనాల ఉత్పత్తి, సరఫరాలో అభివృద్ధి చెందిన దేశాల సరసన మనమూ ఉన్నాం. గత నాలుగేళ్లలో 19 శాతం విత్తనాభివృద్ధి గల దేశంగా మనగలుగుతున్నాం. దీనికి భారత ప్రభుత్వం 1988-89లో నిర్ధారించిన కొత్త విత్తన విధానమే కారణం. దీని ద్వారా ప్రపంచంలో ఏ మూలనుంచైనా మంచి విత్తనం, ఎదుగుదలకు అనువైన రకాలను తెచ్చుకొని అభివృద్ధిపరచుకొనే సౌకర్యం లభించింది. ఇది ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు, బహుళజాతి సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు ప్రోత్సాహాన్నిచ్చింది. దీంతో విత్తనాభివృద్ధి, సరఫరాలపై శ్రద్ధ పెరిగింది.

వాస్తవంగా 1966నాటి విత్తన చట్టం భారత విత్తనాభివృద్ధికి తొలిమెట్టు. ఈ చట్టం ద్వారానే కేంద్ర విత్తన సంస్థ, రాష్ట్రాల్లో విత్తనాభివృద్ధి సంస్థలు ఏర్పాటయ్యాయి. ప్రతి రాష్ట్రంలో విత్తన పరీక్షా కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

దిగుబడి పెంచే రకాలే శరణ్యం

ప్రపంచ బ్యాంకు సహాయంతో రూపొందించిన జాతీయ విత్తన పథకం వల్ల 1975-'85 మధ్యకాలంలో దేశం గణనీయ అభివృద్ధి సాధించింది. విత్తన ధ్రువీకరణ సంస్థ 'సీడ్ కంట్రోల్ ఆర్డర్' రూపొందించింది. దీనిలో ప్రధానంగా 'మేధోసంపత్తి హక్కులకు భద్రత' (ఇంటలెక్చ్యువల్ ప్రాపర్టీ ప్రొటెక్షన్) చెప్పుకోదగిన మలుపు. ఈ చట్టం ద్వారా కొత్త విత్తనదారులకు తాము రూపొందించిన విత్తనాలపై ఆధిపత్యం సమకూరింది. దీంతో చాలా సంకర రకాలు, వంగడాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో ప్రవేశించాయి. విత్తనాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే వాటిని వాడి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించే ఏర్పాటు ఉంది. కొత్త రకం విత్తనంపై నమ్మకం కలగడానికి ఇది దోహదపడింది.

విత్తనాలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి బ్రీడర్, ఫౌండేషన్, సర్టిఫైడ్ విత్తనాలుగా వినియోగంలోకి వచ్చాయి. మన దేశంలో 2005-06లో 6,823 టన్నుల బ్రీడర్ విత్తనాలు, 74,800 టన్నుల ఫౌండేషన్ విత్తనాలు, 1,40,500 టన్నుల సర్టిఫైడ్ విత్తనాలు వినియోగించారు. 2015-16 నాటికి 9,036 టన్నుల బ్రీడర్ విత్తనాలు, 1,49,542 టన్నుల ఫౌండేషన్ విత్తనాలు, 34,35,248 టన్నుల సర్టిఫైడ్ విత్తనాలు దేశవ్యాప్తంగా వినియోగించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశంలో విత్తన ధ్రువీకరణ సంస్థలున్నాయి. మన దేశంలో 22 రాష్ట్రాల్లో ఈ సంస్థలు పనిచేస్తున్నాయి. ఇవి దేశ అవసరాలతో పాటు ఎగుమతి, దిగుమతులకు ఉద్దేశించిన విత్తనాలను సైతం ధ్రువీకరించాల్సి ఉంటుంది. అందువల్ల ఈ సంస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు నమ్మకమైన విత్తనాలు లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

గ్రామంలో ఒకరిద్దరు రైతులు వ్యవసాయ పరిశోధన స్థానాల నుంచి విత్తనాలు తెచ్చుకొని కొద్ది విస్తీర్ణంలో పండించిన పంటను సహచర రైతులు పరిశీలిస్తుంటారు. వాటి తెగుళ్ల నిరోధకత, గింజ నాణ్యత, దిగుబడి గమనించి సంతృప్తి చెందితే- వారు రైతుల నుంచి కొనుగోలు చేస్తుంటారు. విత్తన కంపెనీల డీలర్లు గొప్పగా చెప్పే మాటలను విశ్వసించడం తగ్గిపోతుంది. విత్తనంలో జన్యు స్వచ్ఛత ఎక్కువగా ఉండే స్వపరాగ సంపర్కం జరిగే పంటల కంటే, పరపరాగ సంపర్కం జరిగే పంటల్లో ఎక్కువ జాగ్రత్తలు అవసరం. విత్తనంలో స్వచ్ఛత లోపిస్తే దిగుబడి తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇది వ్యవసాయ ప్రగతికి నిరోధకంగా మారే ప్రమాదం ఉంది. అందువల్ల వ్యవసాయ ఉద్యాన శాఖ విత్తనోత్పత్తిపై శ్రద్ధ కనబరచాలి. అదే సమయంలో రైతులకు తగిన సలహాలు ఇవ్వగలిగితే చక్కటి వ్యవసాయ విస్తరణ సాకారమవుతుంది.

ధ్రువీకరణ పద్ధతి మారాలి

పంట ఏదైనా, ఆ పంట విత్తనాలు జన్యుపరంగా, వినియోగపరంగా కల్తీ లేకుండా తగినంత మొలక శాతం ఉండాలి. పంట విత్తనాల్లో కలుపు విత్తనాలు, బూజుతెగుళ్ళ కలయిక ఉండరాదు. విత్తన ధ్రువీకరణ సంస్థలు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని, స్థాయిగల విత్తనాలనే నిర్ధారిస్తాయి. సొంత విత్తనం, ప్రభుత్వం ధ్రువీకరించిన విత్తనాలనే రైతులు ఎక్కువగా ఆదరిస్తున్నారు. అయినా ధ్రువీకరణ సంస్థలు తగినంత శ్రద్ధ పెట్టడం లేదనే అభిప్రాయం రైతుల్లో ఉంది. ధ్రువీకరణ మరింత జవాబుదారీగా ఉంటే దిగుబడిలో సగం సమస్యలు తీరిపోతాయి.

- డాక్టర్ మొవ్వ రామారావు

ఈనాడు లేఖలు

సత్ప్రవర్తనకు మేలిమి సాధనం

ప్రస్తుత తరంలో తల్లిదండ్రుల అతి గారాబం వల్ల పిల్లలు దురలవాట్ల బారినపడుతున్నారు. మొబైల్ గేమ్స్, సామాజిక మాధ్యమాలు, టీవీలు, యూట్యూబు, క్రికెట్ తదతర ఆటలకు బానిసలవుతున్నారు. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు వయసు తగిన పుస్తకాలను అందజేస్తూ వారిలో పఠనాసక్తిని పెంచాలి. ఆడంబరాలకు ఖర్చు చేసే బదులు పిల్లలకు పుస్తకాలు కొనివ్వాలి. వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి. ప్రస్తుత తరం పిల్లల్లో ఎదుగుదల లోపాల వల్ల ఎదురవుతున్న సామాజిక సమస్యలను నిరంతరం ప్రసార సాధనాల్లో చూస్తున్నాం. దీనికి విరుగుడు పిల్లల్లో సత్ప్రవర్తన పెంచడమే. అందుకు అనువైన సాధనం పుస్తకాలే. ఈ విషయాన్ని ఇళ్లలో తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు వారికి తెలియజెప్పాలి!

- ఎస్.శ్రీనివాసరాజు, వనస్థలిపురం, హైదరాబాద్

సన్నగిల్లిన నమ్మకం

కేంద్రంలో భాజపా నేతృత్వంలోని ప్రభుత్వ పాలనపై 'రేటింగ్' ఇవ్వాలని ప్రధాని మోదీ దేశ ప్రజలను కోరారు. అయితే తాము చేసిన వాగ్దానాలు ఏమిటి, వాటిని ఎంతవరకు నెరవేర్చామన్న విషయాలను ప్రధానే దేశ ప్రజలకు వివరించడం సబబుగా ఉంటుంది. నోట్ల రద్దు, వస్తు సేవా పన్ను విధానాల వల్ల ప్రజలకు ముఖ్యంగా మధ్యతరగతి వారికి మేలుకన్నా కీడే జరిగింది. వంటగ్యాస్, పెట్రోలు, డీజిలు ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరిచారు. బ్యాంకింగ్ వ్యవస్థపట్ల నాలుగేళ్ల క్రితం ఉన్న నమ్మకం ఇప్పుడు లేదు. అవినీతి ఆరోపణలతో న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నవారిని చేరదీస్తున్న తీరు- ప్రధాని మాటలకూ చేతలకూ పొంతనలేని వైనాన్నే చాటుతోంది. మొత్తంగా నాలుగేళ్ల పాలనపట్ల ప్రజలు సంతృప్తితో లేరు.

- గరిమెళ్ళ రామకృష్ణ, ఏలూరు, పశ్చిమగోదావరిజిల్లా

అయిదు ప్రశ్నలు

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ మానవుడికి వివేకాన్ని, విచక్షణా జ్ఞానాన్ని ప్రసాదించాడు. తాత్కాలిక సిరిసంపదల వ్యామోహంలో మునిగిన మనిషి తాను సర్వస్వతంత్రుడనని, ఎవరి అక్కర లేనివాడనని మితిమీరి ప్రవర్తిస్తున్నాడు. తనకు ఇంతటి తెలివితేటలు ఎలా కలిగాయన్నది గుర్తించక దైవాన్ని విస్మరించి మనిషి కృతఘ్నుడవుతున్నాడు.

ప్రపంచంలో ఉత్తమ కార్యాలు, దుష్కార్యాలను చేసిన ఉభయులూ మరణించిన తరవాత కలిసేది మట్టిలోనే. ముంచుకు వస్తున్న ప్రళయదినాన తీవ్రమైన అగ్నిగుండాల్లో కొందరు చిక్కుకుంటారు. పూర్తి తీవ్రతతో భూమి కదలబారినప్పుడు మానవులు చెల్లాచెదురై దీపపు పురుగుల మాదిరిగా మారిపోతారని పవిత్ర ఖురాన్ గ్రంథం హెచ్చరిస్తోంది. యావత్ జీవితంలో చేసిన పనులే మనిషికి అదృష్ట సౌభాగ్యాల సోపానాలవుతాయి.

ప్రళయ దినాన ప్రతి మనిషికీ అయిదు ప్రశ్నలు ఎదురవుతాయని మహాప్రవక్త మొహమ్మద్ (స.అ.వ.) ప్రబోధించారు. 'జీవితం ఏ పనుల్లో గడచింది, యౌవన శక్తిసామర్థ్యాలు ఏ పనుల్లో వినియోగమయ్యాయి, ధనం ఎక్కడి నుంచి ఎలా సంపాదించావు, ఎక్కడ ఏ మార్గంలో ఖర్చు చేశావు, జ్ఞానాన్ని ఎంతవరకు ఆచరణలో పెట్టావు?'- ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలిగేలా పారదర్శకంగా జీవితాలను మలచుకోవడం అల్లాహ్ విశ్వాసుల ఉత్తమ లక్షణం.

బతికినంత కాలం ఎలా బతకాలన్నది పెద్ద ప్రశ్న. నీవు ప్రపంచంలో పరదేశిలా లేదా బాటసారిలా జీవించు. సత్కార్యాలు చేసి సత్ఫలాలు సమకూర్చుకో. జీవితకాలంలో మృత్యుకాలం కోసం సదాచరణలను సమాయత్తపరచుకో అని ప్రవక్త (స.అ.వ.) బోధించారు.

'మేము కౌసర్‌ను ప్రసాదించాం. నీవు నీ ప్రభువు కొరకే నమాజుచెయ్యి. ఖుర్బానీ ఇవ్వు. నీకు శత్రువులే ఉండరు' (అల్ కౌసర్) అని ఘనమైన రాత్రివేళ అవతరించిన పవిత్ర ఖురాన్ గ్రంథం ప్రజలకు స్పష్టమైన ధర్మ బోధ చేసింది. అల్లాహ్ అద్వితీయుడు, నిరాపేక్షాపరుడు, ఎవరి ఆధారం, అక్కర లేనివాడు. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానం కాదు. అల్లాహ్‌కు సరిసమానులెవ్వరూ లేరు (అల్ఇఖ్లాస్) అని గ్రంథం వివరించింది. ఆ అల్లాహ్ ఆరాధనతో పునీతులై

అంతర్వాణి

పుణ్యాలు ప్రోది చేసుకోవాలి. పవిత్ర రమదాన్ మాసంలో అల్లాహ్ ప్రసన్నతకై ఉపవాసాలు ఉండటమే కాక అనాథలను అక్కున చేర్చుకోవాలి. బీదవారింట పండుగ పరిమళాలు వ్యాపింపజేయాలి. దివ్యాంగులకు రెట్టింపు సేవ చేయాలి. క్షమాపణ అడగాల్సి వచ్చేలా ఏ పరుషవాక్కునూ పలుకరాదు. నోరుజారి ఆపై పశ్చాత్తాపం చెందడం విశ్వాసుల లక్షణం కాదు.

తనకు కలిగిన దానిపట్ల, స్వీయ శక్తిసామర్థ్యాలపై మనిషి తృప్తి చెందాలి. ధర్మబద్ధంగా జీవించాలి. దైవ సంతోషానికి కారణమయ్యే ప్రతిదీ సత్కార్యం. అల్లాహ్ పవిత్రతను కొనియాడటం దినచర్యలో భాగం కావాలి. అల్లాహ్ మానవుడికిచ్చిన ప్రాతినిధ్యానికి అంతరార్థం- ఏ విధమైన ఆచరణ ప్రదర్శిస్తారో చూడాలని! విశ్వసించిన వారికీ లోకం చెరసాల వంటిది, అవిశ్వాసులకు స్వర్గం లాంటిదని ప్రవక్త స.అ.వ. వ్యాఖ్యానించేవారు. నిత్యమేది, సత్యమేది... వాటిమధ్య భేదమేదో తెలుసుకున్న మనిషి సంపూర్ణ జ్ఞానిగా అల్లాహ్ ముందు తీర్పు రోజున నిలుస్తాడు. ప్రశాంతంగా ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చి ప్రసన్నత పొందగలడు. అజ్ఞానంతో సమయం వృథా చేసుకొన్న మనిషి- 'అయ్యో... నా జీవితంలో ముందుగా కొంత సామగ్రిని ఏర్పాటు చేసుకొని ఉంటే ఎంత బాగుండే'దని విచారించినా లాభం లేదు.

రోగపీడితులను, బాధాతప్త హృదయాలను చూసి జాలిపడితే సరిపోదు- వారిని పరామర్శించి, పలుకరించినా అది దైవకార్యమవుతుంది. మానవత్వం మంటకలుస్తున్న ఈ రోజుల్లో దైవప్రసన్నత కోసం చేసే కార్యక్రమాలు మొక్కుబడిగా ముగుస్తున్నాయి. పాపాలు సమసిపోయేలా, అల్లాహ్ మన్నింపు కోరే అర్హత పొందేలా బాధ్యతాయుతంగా విశ్వాసం ప్రకటిస్తూ మరణానంతరం స్వర్గప్రాప్తి కలిగేలా మనుగడ సాగించాలి. అందుకు అవసరమైన ధైర్యాన్ని, దృఢ నిశ్చయాన్ని అల్లాహ్ అనుగ్రహించాలని పవిత్ర రమదాన్ మాసంలో ప్రార్థిద్దాం.

- షేక్ బషీరున్నీసా బేగం

నాలుగు రోజుల్లో రాష్ట్రానికి రుతుపవనాలు

- దక్షిణాదిలో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే
- ఏయూ వాతావరణ విభాగం ఆచార్యుడు భానుకుమార్

విశాఖపట్నం - న్యూస్‌టుడే

కేరళను తాకిన రుతుపవనాలు మన రాష్ట్రానికి చేరడానికి మరో మూడు, నాలుగు రోజులు పట్టవచ్చని వాతావరణ నిపుణులు ఆంధ్రా యూనివర్సిటీ వాతావరణ, సముద్రవిజ్ఞానం విభాగం ఆచార్యుడు ఒఎస్ఆర్‌యు భానుకుమార్ తెలిపారు. ఏయూలో గురువారం ఆచార్య భానుకుమార్ విలేకరులతో మాట్లాడుతూ సహజంగా కేరళలో రుతుపవనాలు మొదలైన వారం రోజులకు ఏపీకి చేరుతాయన్నారు. దేశవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించడానికి సుమారు 45 రోజులు పడుతుందన్నారు. ద్రోణులు, అల్పపీడన ప్రభావం ఉన్నప్పుడు రుతుపవనాల కదలిక వేగవంతమై మరింత తొందరగా దేశమంతా విస్తరిస్తాయన్నారు. దేశ సాధారణ వర్షపాతం 89.3 సెంటీ మీటర్లు కాగా ఈ ఏడాది కూడా సాధారణ వర్షపాతం నమోదవుతుందని తెలిపారు. దక్షిణ భారత దేశంలో సాధారణం కంటే కొంత తక్కువ వర్షపాతం నమోదు కావచ్చునన్నారు.

అధిక ఉక్కపోత, చెమటలు..: ఎండ వేడిమికి దక్షిణార్ధగోళం, పసిఫిక్ మహా సముద్రం నుంచి వీస్తున్న తేమ గాలులు తోడై తీరం వెంట ఉక్కపోత అధికమైందని ఆచార్య భానుకుమార్ తెలిపారు. సాధారణంగా ఉండే ఉష్ణోగ్రత కంటే తేమ గాలుల కారణంగా ఏడెనిమిది డిగ్రీలు అధికంగా నమోదు అవుతుందన్నారు. 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటే తేమ గాలుల వల్ల హీట్ ఇండెక్స్ సుమారు 41 డిగ్రీల నుంచి 42 డిగ్రీలు ఉంటుందన్నారు. శ్రీకాకుళం నుంచి తడ వరకు తీర ప్రాంతంలో ఇదే తరహా ఉష్ణోగ్రతలు ఉన్నాయన్నారు. ఈ తీవ్రత వల్ల అధిక ఉక్కపోత, చెమటలు, జిడ్డుతో తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. రుతుపవనాల సమయంలో ఇలాంటి వాతావరణం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. రుతుపవనాలు చేరుకొని వర్షాలు కురిసే వరకు ఇదే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉండబోదన్నారు.

గుంటూరు జిల్లాలో పిడుగుపాటుకు ఏడుగురు మృతి

ఈనాడు, గుంటూరు: గుంటూరు జిల్లాలో గురువారం ఎండ తీవ్రతఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రాగా పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులు, పిడుగులతో జల్లులుపడ్డాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏడుగురు మరణించారు. నరసరావుపేట మండలం పమిడిమర్రు-కొండకావూరు మధ్య పిడుగుపడి అనంత పెద్దబ్బాయి(36) మృతిచెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఇదే మండలం దొండపాడు నివాసి చిన్నపరెడ్డి శివారెడ్డి(60), ఫిరంగిపురం మండలం ఎర్రగుంట్లపాడు వాసి శివాలశెట్టి ప్రసాద్(57), ముప్పాళ్ల మండలం నార్నెపాడు కౌలురైతు బొల్లయ్య(27), క్రోసూరు మండలం తాళ్లూరులో కుంభా కోటేశ్వరమ్మ(60), సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో కోపూరి అశోక్(30), విజయపురిసౌత్‌లో డి.అంజయ్య(35) పిడుగుపాటుకు మృత్యువాతపడ్డారు. వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు 11 పశువులు, 20 గొర్రెలు కూడా ప్రాణాలు విడిచాయి. ఈదురుగాలులకు నరసరావుపేట డివిజన్లోని పలు మండలాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సత్తెనపల్లి మండలం ఎన్నాదేవి వద్ద గుంటూరు-హైదరాబాద్ రహదారిపై రెండు భారీ వృక్షాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఉత్తర కోస్తాలో నేడు, రేపు ఉరుములతో వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో పలుచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయని వాతావరణశాఖ తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, వాతావరణంలో తేమ కారణంగా క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడుతున్నాయని, ఈ కారణంగా ఉత్తర కోస్తాలో శుక్ర, శనివారాల్లో పలుచోట్ల ఉరుములతో వర్షాలకు అవకాశం ఉందని వివరించింది. రాయలసీమలోనూ అక్కడక్కడా ఈ ప్రభావం ఉంటుందని తెలిపింది.

ఐదు ఎద్దుల మృతి

వేలేరుపాడు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా వేలేరుపాడు మండలం మల్లారం గ్రామంలో పిడుగుపాటుకు ఐదు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కరక సాయిబు, సోడే ముత్యాలు, మడకం సీతమ్మ, కంగాల నాగేశ్వరరావు, సోడే కన్నయ్యకు చెందిన ఐదు ఎద్దులు గురువారం సాయంత్రం మామిడిచెట్టు కింద ఉన్నాయి. ఆ సమయంలో పిడుగుపడటంతో అవి మృతి చెందాయి.

పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దులు

మృతిచెందిన వీర్రాజు, సుబ్బలక్ష్మి

కేబుల్ తీగే యమపాశం

- విద్యుదాఘాతానికి గురై వదినా, మరిది దుర్మరణం

కాకినాడ క్రైం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై వదిన, మరిది మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం కాకినాడలో చోటుచేసుకుంది. నగరంలో మధ్యాహ్నం ఈదురు గాలితో కూడిన వర్షం పడటంతో చాగంటి సుబ్బలక్ష్మి ఉంటున్న ఇంటి పైకప్పు వద్దనున్న కేబుల్ తీగ... విద్యుత్తు తీగను తాకింది. దీంతో చిన్నపాటి మంటలు చెలరేగాయి. వాటిని అదుపు చేసేందుకు దిగువ అంతస్తులో ఉంటున్న సుబ్బలక్ష్మి మరిది వీర్రాజు ప్రయత్నించారు. కేబుల్ తీగను చేత్తో వేరు చేసేందుకు ప్రయత్నించడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. మరిది నిస్సహాయంగా పడి ఉండటాన్ని చూసిన వదిన సుబ్బలక్ష్మి అతన్ని సమీపించబోయారు. కేబుల్ తీగను చేత్తో తొలగించే క్రమంలో ఆమె కూడా విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.

సొమ్ము అందుకున్నాక వారి సర్టిఫికెట్లు తిరిగిచ్చేయండి

- ఎన్టీఆర్ వైద్య వర్సిటీ, కళాశాలలకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: పీజీ వైద్య విద్య చదివేందుకు ఎయిమ్స్‌లో ప్రవేశం పొందేందుకు అనువుగా ఇద్దరు వైద్య విద్యార్థులకు 'ఒరిజినల్ సర్టిఫికెట్లు' తిరిగి ఇచ్చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. పీజీలో ఓసారి ప్రవేశం పొంది సీటు వదులుకున్నందుకు ప్రభుత్వ జీవో.67 ప్రకారం వారు రూ.3లక్షలు చెల్లించాకనే ఆ పత్రాలు అప్పగించాలని స్పష్టంచేసింది. పిటిషనర్లు ఎయిమ్స్‌లో సీటు పొందే వీలున్నందున మూడేళ్లలో ప్రవేశపరీక్ష మళ్లీ రాసే అవకాశం లేదని అభిప్రాయపడింది. జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ షమీమ్ అక్తర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. రాజస్థాన్‌లోని జోథ్‌పూర్ ఎయిమ్స్, దిల్లీ ఎయిమ్స్‌లో పిజీ వైద్య విద్యలో ప్రవేశం పొందేందుకు.. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న తమ సర్టిఫికెట్లను తిరిగిచ్చేలా ఆదేశించాలంటూ కృష్ణాజిల్లా గుడ్లవల్లేరుకు చెందిన డి.శివసుమంత్, గుంటూరుకు చెందిన పి.మాధురి హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిని విచారించిన ధర్మాసనం.. పైవిధంగా ఆదేశాలు జారీచేసింది.

బార్ కౌన్సిళ్ల బరిలో ఖరారైన అభ్యర్థులు

- తెలంగాణలో 86.. ఏపీలో 107 మంది

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల (న్యాయవాదుల మండళ్ల) ఎన్నికల్లో పాల్గొనేవారి లెక్క తేలింది. గురువారంతో నామినేషన్లు, ఉపసంహరణల గడువు ముగిసింది. తెలంగాణ నుంచి 87 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరు ఉపసంహరించుకోవడంతో బరిలో 86 మంది మిగిలారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీకి 109 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఇద్దరు ఉపసంహరించుకోవడంతో 107 మంది బరిలో ఉన్నారు. రెండు రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు జూన్ 29న వేర్వేరుగా ఎన్నికలు జరగనున్నాయి. జులై 11న ఏపీలో, జులై 23న తెలంగాణలో కౌంటింగ్ జరగనుంది. ఒక్కో రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు 25 మంది చొప్పున సభ్యుల ఎన్నిక జరుగుతుంది. పాలకమండలి అయిదేళ్లు ఉంటుంది. ప్రచారం మొత్తం సామాజిక మాధ్యమాలను వేదికగా తీసుకుని కొనసాగిస్తున్నారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారీగా వ్యయం చేయడానికిసిద్ధమైనట్లు తెలుస్తోంది.

EDUCATION

★ Ag.B.Sc, ICAR, UGC, Low Fee, Job Support, B.Tech - Robotics/ BHMS Ph: 8686645434, 8801223935.

★ B.Sc. Agriculture Eli: BiPC/ MPC UGC Recog. Eli: For Govt./Pvt. Jobs Cont: Green Fields, Vijayawada. ✆ 9133340149/ 6309493450

మునేశ్వరరావు ఇంట్లో దొరికిన నగలు, నగదు

అనిశాకు చిక్కిన గోదాము బాధ్యుడు

- రూ.15 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

ఈనాడు డిజిటల్, ఏలూరు: పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం పౌర సరఫరాల సంస్థ మండల స్థాయి గ్రేడ్-2 స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న దొడ్డిగర్ల మునేశ్వరరావు అవినీతి నిరోధకశాఖకు చిక్కాడు. ఆయన వద్ద రూ.15 కోట్ల ఆస్తి బయటపడింది. ఏసీబీ అధికారులు గురువారం మునేశ్వరరావు ఇంట్లో సోదాలు జరిపారు. ఆయన నివాసముండే ఏలూరు విద్యానగర్‌లో, ఆయన పనిచేసే జంగారెడ్డిగూడెం పౌర సరఫరాలశాఖ కార్యాలయం, గతంలో పని చేసిన గోపాలపురం కార్యాలయంలో ఏకకాలంలో సోదాలు జరిపారు. రెండంతస్తుల భవనం, నిర్మాణంలో ఉన్న నాలుగంతస్తుల భవనం, తాళ్లపూడి మండలం వేగేశ్వరంలో 7 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.7 లక్షల నగదు, 400 గ్రాముల బంగారం మునేశ్వరరావుకు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వీటి విలువ రూ.1.29 కోట్లు ఉంటుందని గుర్తించారు. బయట మార్కెట్లో రూ.15 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మునేశ్వరరావు గతంలో ప్రకాశం జిల్లాలో పని చేశారు. అక్కడ అనేక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. సోదాల అనంతరం డీఎస్పీ గోపాలకృష్ణ వివరాలు వెల్లడించారు. మునేశ్వరరావు అక్రమాస్తులు కలిగి ఉన్నాడనే ప్రాథమిక సమాచారంతో ఈ దాడులు చేసినట్లు తెలిపారు. ఇంకా బ్యాంకుల్లో బంగారం తనఖా పెట్టి రుణం పొందినట్లు తెలిసిందని వివరించారు.

గ్రామాల్లో స్తంభించిన తపాలా సేవలు

- పదో రోజుకు చేరిన గ్రామీణ్ డాక్ సేవక్‌ల సమ్మె
- ఆందోళనలు కొనసాగిస్తున్న 17 వేల మంది
- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరాహారదీక్షలు

ఈనాడు - అమరావతి

గ్రామాల్లో తపాలా సేవలు స్తంభించిపోయాయి. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండు చేస్తూ గ్రామీణ్ డాక్ సేవక్ ఐకాస పదిరోజులుగా సమ్మె చేస్తుండటంతో ఉత్తరాలు, కార్డుల బట్వాడా, ఇతర తపాలా సేవలు నిలిచిపోయాయి. దేశవ్యాప్తంగా దాదాపు రెండు లక్షల మంది, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 17 వేల మంది గ్రామీణ్ డాక్ సేవక్‌లు మే22 నుంచి ఈ సమ్మె కొనసాగిస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 7 వేల తపాలా కార్యాలయాలపై ప్రభావం పడింది. గ్రామీణ ప్రాంతాల్లోని తపాలా కార్యాలయాల నుంచి ఉత్తరాలు, ఏటీఎం కార్డులు, హాల్ టిక్కెట్ల బట్వాడా, ఉపాధి హామీ కూలీ డబ్బులు చెల్లింపు, ఇతరత్రా నగదు లావాదేవీలు ఆగిపోయాయి. సమ్మె కారణంగా కార్యాలయాల్లో ఉత్తరాలు, పత్రాలు భారీగా పేరుకుపోయాయి.

సమ్మె ఎందుకంటే!: తపాలా శాఖలో గ్రామీణ డాక్ సేవక్‌లను అదనపు విధుల (ఎక్స్‌ట్రా డ్యూటీ) ఉద్యోగులుగా పిలుస్తారు. రెగ్యులర్ ఉద్యోగుల కంటే వీరు రెట్టింపు సంఖ్యలో ఉన్నారు. ఎక్స్‌ట్రా డ్యూటీ ఉద్యోగుల వేతనాల సవరణకు 2015 నవంబరులో కమలేష్ చంద్ర కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. గ్రామీణ డాక్ సేవక్‌లకు కనీసం రూ.10 వేలు, గరిష్ఠంగా రూ.35 వేలు వేతనం ఇవ్వాలని సిఫార్సు చేస్తూ ఈ కమిటీ 2016 నవంబరులో నివేదిక అందించింది. వీటిని ఇప్పటికీ అమలు చేయకపోవడంతో వివిధ డాక్ సేవక్ సంఘాలు ఐకాసగా ఏర్పడి ఆందోళన బాట పట్టారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలుచేసే వరకూ సమ్మెను విరమించేది లేదని గ్రామీణ డాక్ సేవక్ ఐకాస ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు రఘుబాబు "ఈనాడు"కు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

సేవలు నిలిచిపోవడంతో ఓ పోస్టాఫీసులో పేరుకుపోయిన పత్రాలు

అమెరికాలోని కెంటకీ రాష్ట్ర కేబినెట్ కార్యదర్శి టెర్రీగిల్‌తో మంత్రి గంటా శ్రీనివాసరావు

ఏపీ విద్యార్థులకు రుసుముల్లో రాయితీ ఇవ్వండి

కెంటకీ రాష్ట్ర కేబినెట్ కార్యదర్శిని కోరిన మంత్రి గంటా

ఈనాడు, అమరావతి: అమెరికాలో అధికారిక పర్యటనలో ఉన్న రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అమెరికాలోని కెంటకీ రాష్ట్ర కేబినెట్ కార్యదర్శి టెర్రీ గిల్‌తో భేటీ అయ్యారు. ఆ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఏపీ విద్యార్థులకు రుసుముల రాయితీ అంశంపై చర్చించారు. పరిశోధన, విద్యార్థులు, ఆచార్యుల పరస్పర మార్పు ఒప్పందాలు చేసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు గంటా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యార్థులకు రుసుముల రాయితీ అంశానికి సంబంధించి ప్రభుత్వపరంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని టెర్రీగిల్ చెప్పినట్లు పేర్కొన్నారు. అనంతరం లూయిస్ విల్లీ వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ నీలి బెందపూడితోనూ మంత్రి గంటా భేటీ అయ్యారు. మంత్రితోపాటు ఉన్నత విద్యా మండలి సలహాదారు డాక్టర్ ఈదరవెంకట్, ఉత్తర అమెరికాలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం ఉన్నారు.

ఉత్తరాంధ్రపై ముఖ్యమంత్రి శీతకన్ను

- అన్యాయం కొనసాగితే మరోసారి కళింగాంధ్ర ఉద్యమం
- గిరిజనులకు మౌలిక వసతులూ లేవు
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు

ఈనాడు - విజయనగరం

'ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటుతో పాటు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వ పెద్దలు మరోసారి హైదరాబాద్‌లో చేసిన తప్పే చేస్తున్నారు. సాగునీరు, నిధులు, నియామకాల నేపథ్యంలోనే తెలంగాణ ఉద్యమం నడిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తున్నారు. పరిశ్రమలు లేవు. కాలుష్యం వెదజల్లేవే ఇక్కడ పెట్టడానికి చూస్తున్నారు. ప్రభుత్వం ఇలాగే అమరావతి- విజయవాడ- గుంటూరుల్లో మాత్రమే అభివృద్ధి చేస్తూపోతే మరోసారి కళింగాంధ్ర ఉద్యమం వస్తుంది. రాష్ట్రంలోని రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలు మూడు ముక్కలుగా విడిపోయే ప్రమాదముంది' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. విజయనగరం జిల్లాలో జనసేన పోరాట యాత్రలో భాగంగా ఆయన గురువారం కురుపాం, పార్వతీపురం, బొబ్బిలి సభలలో మాట్లాడారు. తెదేపాతో సహా రాజకీయ పార్టీలన్నింటికీ గిరిజనుల ఓట్లు కావాలే తప్ప వారి సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. విద్య, వైద్యం, తాగు, సాగునీరులాంటి మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. వసతుల లేమి వల్లే ప్రజలు ఆంత్రాక్స్, కలరాలాంటి వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అడవిబిడ్డలను ఎప్పటికీ యాచించే స్థితిలో ఉంచాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని విమర్శించారు. ప్రభుత్వానికి పోలవరంపై ఉన్న శ్రద్ధ ఉత్తరాంధ్రలో సాగునీటి పథకాలపై లేదంటూ విమర్శలు గుప్పించారు. గిరిజన శాఖను గిరిజనేతరులకు కేటాయించారని, అందుకే శాఖలో ఎవరికీ గిరిజనుల సమస్యలపై అవగాహన లేదని అన్నారు. గిరిజనులకు ఎక్కడికక్కడ రోడ్లేస్తున్నామంటూ మంత్రి లోకేష్ చెబుతున్నారని, నేటికీ రహదారులు లేక 60, 70 కిలోమీటర్ల దూరం కాలినడక దిక్కయ్యే ప్రాంతాలున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రిని గ్రామాల్లో రహదారులు నిర్మించాలని కోరితే తాము వేసిన రోడ్లపై మీరు నడుస్తున్నారు కదాని తిరిగి ప్రశ్నిస్తున్నారని అన్నారు. అవి హెరిటేజ్ సొమ్ముతో వేసిన రోడ్లుకావని, ప్రజాడబ్బుతో వేస్తున్నవని గుర్తు చేశారు. ఫైబర్‌గ్రిడ్‌కు కోసం రూ.500 కోట్లు కట్టబెట్టారని, చిరుద్యోగుల సమస్యలు పరిష్కరించలేరా? అని ప్రశ్నించారు.

పార్వతీపురం సభలో అభిమానులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న పవన్

ఉత్తరాంధ్రలో సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం

శ్రీకాకుళంలో ఉద్దానం సమస్య ఎలాంటిదో బలిజపేట మండలం పెదపెంకిలో బోదకాలు వ్యాధి అలాంటిదని పవన్‌కల్యాణ్ అన్నారు. స్థానికంగానే ఫైలేరియా సంస్థను ఏర్పాటుచేసి కారణాలను అన్వేషించాలని సూచించారు. దీనిపై స్థానిక శాసనసభ్యులు, ఎంపీ వారి స్వలాభంలోనే ఉన్నారని ధ్వజమెత్తారు. ప్రకృతి అందాలకు నిలయమైన ఉత్తరాంధ్రలో చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేసి స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో ప్రతీ జిల్లాలోనూ చాలా నియోజకవర్గాల్లో ఒకటి, రెండు కుటుంబాలకే అధికారం ఉంటోందని పేర్కొన్నారు. వారిద్దరు తప్పు చేస్తే నిలదీసేందుకు ప్రత్యామ్నాయంగా మరో పార్టీ ఉండాలని, అందుకే జనసేన వచ్చిందని వివరించారు. తాము చేయగలిగేదే ఎన్నికల ప్రణాళికలో పెడతామని స్పష్టం చేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Roc.No.TTD-34022/1/2018

http://www.tirumala.org https://tender.apeprocurement.gov.in

ఫోన్ నెం. 0877-2264079, 2264356

Roc.No.PR4/1088/Adv.No.81/PRO/2018, Dated: 31.05.2018. - కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్
శ్రీకృష్ణా ఎన్‌క్లేవ్, అన్నపూర్ణనగర్, గుంటూరు, గుంటూరు జిల్లా.
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

టెండరు నోటీసు నెం. ROC No. 15026/5/2017/PS SEC APMDP తేది: 30.5.2018

బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు సమయము	31.5.2018 ఉ.గం. 11.00
బిడ్ డౌన్‌లోడు ముగింపు తేది మరియు సమయము	5.6.2018 సా.గం. 5.00 వరకు
బిడ్ దాఖలుకు ముగింపు తేది	6.6.2018 మ.గం. 2.00 వరకు
సాంకేతిక బిడ్ తెరచు తేది మరియు సమయము	బిడ్ డాక్యుమెంటును చూడండి

ఈ-టెండరు వెబ్‌సైట్ : http://tender.apeprocurement.gov.in.
ps.apmdp@cdma.gov.in
DIPR No. 129PP/CL/Advt/1/1/2018-19 సం/- డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్

ధోలేరాకు నిధులివ్వడం నిజం

- భాజపా పాలిత రాష్ట్రాల్లోని 8 నగరాలకు ఇస్తున్నారు
- విశాఖ- చెన్నై కారిడార్‌కు ఒక్క రూపాయీ విదల్చని కేంద్రం: కుటుంబరావు

ఈనాడు, అమరావతి: ధోలేరా పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతానికి కేంద్రం నిధులివ్వడం లేదని భాజపా నేత జీవీఎల్ నరసింహారావు అబద్ధాలు చెబుతున్నారని ఏపీ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు విమర్శించారు. 'డిల్లీ- ముంబయి పారిశ్రామిక కారిడార్‌లో 8 నగరాలను అభివృద్ధి చేస్తున్నారు. ఏ నగరాన్ని అభివృద్ధి చేయాలి? ఎన్ని నిధులు కేటాయించాలన్న అంశాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వమే నిర్ణయించింది. ఈ నగరాలు భాజపా పరిపాలనలో ఉన్నవే. వీటికి కేంద్రం ట్రస్టు రూపేణా రూ.17వేల కోట్లు ఇచ్చింది. ప్రత్యేక పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసి, రాష్ట్రాలు భూమిస్తే చాలని కేంద్రం నిధులిస్తోంది. డిల్లీ- ముంబయి కారిడార్ అథారిటీకి మరో రూ.36వేల కోట్ల రుణం ఇచ్చేందుకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటోంది. కానీ రూ.3వేల కోట్లకే పరిమితమైనట్లు కేంద్రం చెబుతోంది. విశాఖపట్నం- చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు నిధులు ఇవ్వడం లేదు. చెన్నై-బెంగళూరు కారిడార్‌లో కృష్ణపట్నంను అభివృద్ధి చేస్తామని భాజపా నేతలు అంటున్నారు. కానీ ఇప్పటి వరకూ ఒక్క రూపాయీ ఇవ్వలేదు' అని పేర్కొన్నారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాజధాని అమరావతికి సింగపూర్ సంస్థ మాస్టర్ ప్లాన్, డిజైన్లు ఎందుకు? భారత్‌లో ఆర్కిటెక్చర్లు లేరా? అని భాజపావారు అంటున్నారు. కానీ ధోలేరా ప్రాజెక్టు డిజైన్లను సింగపూర్‌కు చెందిన సంస్థతోనే చేయిస్తున్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ ప్రాజెక్టు డిజైన్‌ను బుర్జ్ కలీఫాను నిర్మించిన విదేశీ సంస్థకే అప్పగించారు' అని పేర్కొన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన వినియోగ ధ్రువీకరణ పత్రాలపై (యూసీ) నీతి అయోగ్‌గానీ, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖగానీ ప్రశ్నించడం లేదు. అమిత్ షా, జీవీఎల్ నరసింహారావు, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఎందుకు మాట్లాడుతున్నారు' అని ప్రశ్నించారు. త్వరలో జరగనున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో భాజపా ఓటమి పాలైతే నరేంద్ర మోదీని ప్రధాన మంత్రి పదవి నుంచి తొలగిస్తారని, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ప్రధానిని చేసే అవకాశం ఉందని, ఇవి తన వ్యక్తిగత వ్యాఖ్యలని కుటుంబరావు తెలిపారు.

వృద్ధ ప్రయాణికుడి మృతి

విశాఖలో అత్యవసరంగా దిగిన ఇండిగో విమానం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్లే ఇండిగో విమానాన్ని గురువారం విశాఖ విమానాశ్రయంలో అత్యవసరంగా దించారు. విమానంలో బెంగళూరు వెళుతున్న వృద్ధుడు సుబుధిసన్యాసి మార్గమధ్యలో మృతి చెందారు. దీంతో ఉదయం 8 గంటల సమయంలో విమానాన్ని విశాఖలో దించి.. మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అనంతరం విమానం బయలుదేరింది.

విదేశీ పర్యాటకానికి ఏపీ, టర్కీ పరస్పర సహకారం!

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ పర్యాటకాభివృద్ధి కోసం ఏపీ, టర్కీ పరస్పరం సహకారం అందించుకోవాలని రాష్ట్రం, టర్కీ ప్రభుత్వాలు సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. ముఖ్యమంత్రిని కలిసిన తర్వాత టర్కీ కాన్సుల్ జనరల్ డాక్టర్ అద్నన్ అల్తయ్ ఆల్తీనార్స్ గురువారం సచివాలయంలో పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియలతో భేటీ అయ్యారు. టర్కీ నుంచి పర్యాటకులు ఏపీకి వచ్చేందుకు వీలుగా ఆకర్షణీయమైన ప్యాకేజీలను ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నామని మంత్రికి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
శ్రీయుత ప.గో॥జిల్లా కలెక్టరు, ఏలూరు వారి ఉత్తర్వులు
ఆర్.ఓ.నెం. E-932569/2017/31 Dt. 29-05-2018 ఆమోదించబడినది

ఫారం నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, షెడ్యూల్-1 ననుసరించి)

రూఢీ ప్రకటన

రూఢీ ప్రకటన

షెడ్యూలు

మండలం: కొవ్వూరు — గ్రామం: దొమ్మేరు

క్రమ సంఖ్య	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం యు.సెం.లలో	భూసేకరణ క్రింద విస్తీర్ణం యు.సెం.లలో	భూమి స్వభావం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు మరియు ఇతరములు వివరములు
1	594-2B2	0.12	0.12	స.పుంజ	[illegible]	594-1B Highway	594-4	594-2C3	594-1C	[illegible]
2	594-2C3	0.18	0.18	స.పుంజ	[illegible]	594-1B Highway	594-5	594-6C	594-2B2	–
3	594-4	0.64	0.64	స.పుంజ	[illegible]	594-2B2	596	594-5	594-3	[illegible]
4	594-5	0.98	0.98	స.పుంజ	[illegible]	594-2C3	596	594-6C	594-4	[illegible]
	మొత్తం	1.92	1.92							

సం/- భాస్కర్ కాటంనేని, జిల్లా కలెక్టర్, పశ్చిమగోదావరి, ఏలూరు

బెంగళూరులో విజయోత్సవాల్లో రాజరాజేశ్వరి నగర స్థానంలో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి మునిరత్న

పట్నాలో ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్జేడీ కార్యకర్తలు

నూర్పుర్ అసెంబ్లీ స్థానంలో గెలుపొందిన ఎస్పీ అభ్యర్థి నయీం ఉల్ హసన్

కలిశారు.. కుమ్మేశారు

- యూపీలోని కైరానాలో విపక్షాల ఉమ్మడి విజయం
- నెగ్గిన ఆర్ఎల్డీ అభ్యర్థి... పారని భాజపా పాచిక
- 16వ లోక్‌సభలో యూపీ నుంచి ముస్లిం ప్రాతినిధ్యం

ఈనాడు - దిల్లీ

ఒక్కోసారి ఎలాంటి పనీ చేయకపోవడం కూడా ఒక పనే అవుతుంది. బయటకు మౌనంగా ఉన్నట్లు కనిపిస్తూనే చెప్పాల్సింది చెప్పవచ్చు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కైరానా నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితాలు దీనికి తార్కాణం. అక్కడ విపక్షాలన్నీ వ్యూహాత్మకంగా ఒక్కటయ్యాయి. భాజపా అభ్యర్థిని ఇంటిదారి పట్టించాయి. దేశవ్యాప్తంగా నాలుగు లోక్‌సభ, 10 శాసనసభ స్థానాలకు మే 28న జరిగిన ఉప ఎన్నికల్లో ఎక్కువ మంది దృష్టిని ఆకట్టుకున్న నియోజకవర్గం- పశ్చిమ యూపీలోని కైరానా. గురువారం వెల్లడైన ఫలితాల్లో అక్కడి నుంచి రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) అభ్యర్థి తబస్సుమ్ హసన్ 44,600 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారంటే దాని వెనుక విపక్షాల ఉమ్మడి వ్యూహం ఉంది. ఇక్కడ భాజపా వ్యతిరేక పార్టీలన్నీ తమ సిద్ధాంతాలను, బలాబలాలను పక్కనపెట్టి ఒక్కతాటిపైకి వచ్చాయి. 'మతతత్వ భాజపా అభ్యర్థి'ని ప్రత్యర్థిగా చూపిస్తూ మిగిలిన పక్షాలన్నీ చేతులు కలిపాయి. ఆర్ఎల్డీ గుర్తుపై, బీఎస్పీ-కాంగ్రెస్‌ల మద్దతుతో తబస్సుమ్ బరిలో దిగారు. కైరానా ఎంపీగా ఉన్న భాజపా నేత హుకుంసింగ్ కన్నుమూయడంతో ఆయన కుమార్తె మృగాంక సింగ్‌ను ఉప ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా నిలిపారు. సానుభూతి పవనాలతో గానీ, ఈ ఎన్నికలను హిందూ-ముస్లింల మధ్య పోరుగా చిత్రీకరించాలన్న వ్యూహంతోగానీ గట్టెక్కవచ్చని కమలనాథులు భావించినా బోర్లా పడక తప్పలేదు. ఇక్కడ నెగ్గడం ద్వారా 16వ లోక్‌సభలో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి తొలి ముస్లిం ఎంపీగా ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని ఆమె పొందినట్లయింది. యూపీలో 20% మంది ముస్లింలే అయినా 2014 ఎన్నికల్లో ఆ వర్గం నుంచి ఒక్క అభ్యర్థి కూడా ఎన్నిక కాలేదు.

కొన్ని చేయకుండానే కొల్లగొట్టారు...

- సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ గానీ, ఆ పార్టీలో ముస్లిం ప్రముఖుడైన ఆజంఖాన్ గానీ కైరానాకు ఒక్కసారీ రాలేదు. 2013లో చోటు చేసుకున్న ముజఫర్‌నగర్ అల్లర్ల తర్వాత జాట్లు, ముస్లింలలో ఎస్పీపై ఆగ్రహం ఉందనే భావన దానికి కారణం.
- జాట్ల బలం ఉన్న ప్రాంతాల్లో తబస్సుమ్ ఒక్కసారైనా ప్రచారం చేయలేదు. జాట్లు, ముస్లింలు ఎస్పీపై కోపంతో ఉన్నారనే ఉద్దేశంతో... అఖిలేశ్ సూచన మేరకు తబస్సుమ్ ఎస్పీని వీడి ఆర్ఎల్డీ టికెట్‌పై పోటీ చేశారు. ముస్లింలపై ఆమె సానుకూల ప్రభావం చూపించారు.
- కైరానాలో విపక్ష శిబిరం తమ అభ్యర్థి పేరైనా ప్రచారం చేయలేదు. కేవలం ఆర్ఎల్డీ చిహ్నమైన చేతిపంపును మాత్రం ప్రచారంలో వాడుకున్నారు. గోడపత్రికల్లోనూ అభ్యర్థి చిత్రం లేకుండా జాగ్రత్త పడ్డారు.
- ఆర్ఎల్డీ అగ్రనేత అజిత్‌సింగ్, ఆయన తనయుడు జయంత్ చౌదరి ఒక్కసారైనా ముస్లింల ప్రాబల్య ప్రాంతంలో ఓట్లు అడగలేదు. భాజపాకి పూంఛ్ (తోక) అయ్యే బదులు, ఆర్ఎల్డీకి మూంఛ్ (మీసం)గా ఉండడం మంచిదంటూ అజిత్‌సింగ్ నినదించారు.
- బీఎస్పీ కార్యకర్తలు దళితుల ప్రాబల్య ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. బీఎస్పీ మద్దతు ఉన్న అభ్యర్థి ఆర్ఎల్డీ టికెట్‌పై పోటీ చేస్తున్నారని ఎక్కడా చెప్పలేదు. దీనికి కారణం... ఆర్ఎల్డీని దళిత వ్యతిరేకిగా భావిస్తుండడమే. అభ్యర్థి ముస్లిం అని మాత్రమే బీఎస్పీ చెబుతూ వచ్చింది. పెద్ద శ్రమ లేకుండా దళిత ఓట్లు తబస్సుమ్‌కు లభించాయి.
- గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఉప ఎన్నికల్లో ధరావతుల్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఈసారి తమ సొంత అభ్యర్థిని కైరానాలో నిలబెట్టకూడదని నిర్ణయించింది.

..ఇలా ఇన్ని 'వ్యతిరేక' నిర్ణయాలు కలిసి విపక్షాలకు అనుకూల విజయం సాధించిపెట్టాయి..!

లఖ్‌నవూలో బోసిపోయిన భాజపా రాష్ట్ర కార్యాలయం

సామాజిక సమీకరణలో భాజపా వైఫల్యం

కైరానాలో ఉన్న 16 లక్షల జనాభాలో ముస్లింలు దాదాపు 5.5 లక్షలు. దళితులు 2.5 లక్షలు, జాట్లు 1.5 లక్షలు, గుజ్జర్లు 1.4 లక్షలు ఉన్నారు. అగ్రవర్ణాలు 3.5 లక్షలు కాగా 'జాట్లు మినహా ఇతర ఓబీసీ'లు 1.6 లక్షలున్నారు. రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ తీసుకురావాలన్న భాజపా సర్కారు యోచన కూడా కైరానాపై వ్యతిరేక ప్రభావం చూపించింది. జాట్లు, యాదవులు, జాతవ్‌లు వంటి బలమైన వర్గాలే అన్ని ప్రయోజనాలూ పొందకుండా చూడడానికి వర్గీకరణను ఎంచుకున్నారు. దళితుల్లో కొన్ని వర్గాలు, ఓబీసీలో జాట్లుకాకుండా ఇతర వర్గాలు అక్కడక్కడ చెదిరిపోయినట్లు ఉండడంతో భాజపా పెద్దగా ప్రయోజనం పొందలేకపోయింది. పైపెచ్చు- ఉప వర్గీకరణతో తాము నష్టపోతామని భావించిన జాట్లు, జాతవ్‌లు భాజపాపై కోపంతో వ్యవహరించారు. ఇవన్నీ కలిసి భాజపాను దెబ్బతీశాయి.

బీఎస్పీ నుంచి ఎస్పీ మీదుగా ఆర్ఎల్డీకి..!

తబస్సుమ్ నిజానికి 2009లో బీఎస్పీ ఎంపీగా నెగ్గారు. తర్వాత సమాజ్‌వాదీ పార్టీలో చేరారు. చివరకు ఆర్ఎల్డీ అభ్యర్థిగా ఈసారి నెగ్గారు. కైరానా నుంచి శాసనసభకు, లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన ఆమె భర్త మున్నావర్ హసన్ 2008లో కారు ప్రమాదంలో కన్నుమూశారు. 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ ప్రభావమేమీ ఉండదనీ, విజయం విపక్షాల కూటమినే వరిస్తుందని చెప్పడానికి తన గెలుపే నిదర్శనమనీ తబస్సుమ్ చెప్పారు.

చక్రం తిప్పిన యువనేత జయంత్

కైరానా ఫలితం ఆర్ఎల్డీకి రాజకీయంగా ఎంతో కీలకమైనది. దివంగత మాజీ ప్రధాని చరణ్‌సింగ్ మనవడైన జయంత్ చౌదరి (పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు) ఇక్కడ ఒంటిచేతిపై అవిశ్రాంతంగా ప్రచారాన్ని నడిపించారు. చావో రేవో అన్నట్లుగా పోరాడారు. జాట్లు, ముస్లింల ఓట్లను ఒకే చోటకు చేర్చడంలో కృతకృత్యులయ్యారు. కొండలా పేరుకుపోయిన చెరకు రైతుల బకాయిలు కూడా కైరానాలో భాజపా ఓటమికి ప్రధాన కారణమయ్యాయి. మతపరమైన ఏకీకరణ పేరుతో చెరకు రైతుల ఆర్థిక ఇబ్బందుల్ని భాజపా విస్మరిస్తోందని బలంగా చెప్పగలిగారు.

ఆదిత్యనాథ్ వెలుగు మసకబారింది!

ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో భాజపా చతికిల పడడంతో ఇప్పుడు అందరి దృష్టి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై పడింది. హిందూ ఓట్లను ఏకమొత్తంగా భాజపావైపు ఆకర్షించడానికి ఆయన తురుపుముక్కగా ఉపయోగపడతారని భాజపా భావించినా ఉప ఎన్నికల్లో వరుస ఓటములు ఎదురుకావడంతో ఆ పార్టీ అంచనా తప్పని రుజువవుతోంది. 2017లో రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా అనూహ్యంగా గోరఖ్‌పుర్ మఠాధిపతి, ఎంపీ యోగి ఆదిత్యనాథ్ పేరును భాజపా అధిష్ఠానం ఎంపిక చేసింది. అప్పట్లో ఆయన ఎంపిక అందర్నీ ఆశ్చర్యపర్చింది. 2019 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఆయన్ను ముఖ్యమంత్రిగా ఎంపిక చేశారన్నది స్పష్టం. శాసనసభ ఎన్నికల్లో హిందూ ఓట్ల ఏకీకరణతో ఘన విజయం సాధించినందున అదే ఏకీకరణను లోక్‌సభ ఎన్నికల వరకూ కొనసాగించడానికి యోగి ఆదిత్యనాథ్ ఉపయోగపడగలరని పార్టీ భావించింది. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో గోరఖ్‌పుర్ ఎంపీ స్థానానికి రాజీనామా చేశారు. గోరఖ్‌పుర్ ఆదిత్యనాథ్‌కు కంచుకోట లాంటిది. అక్కడి నుంచి ఆయన వరుసగా ఐదుసార్లు విజయం సాధించారు. అలాంటి చోట ఈ ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా పరాజయాన్ని మూటగట్టుకుంది. అంతేకాదు.. ఉప ముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్య ఖాళీ చేసిన ఫుల్పుర్ లోక్‌సభ స్థానంలోనూ ఓటమి తప్పలేదు. రెండు స్థానాల్లోనూ బహుజన్‌సమాజ్ పార్టీ మద్దతుతో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్‌సమాజ్ పార్టీల ఐక్యత ముందు యోగి ఆదిత్యనాథ్ హిందూ ఓట్ల ఏకీకరణ పాచిక పారలేదు. బహుజన్‌సమాజ్ పార్టీ ఓట్లు సమాజ్‌వాదీకి పడతాయని తాము ఊహించలేదని అప్పట్లో ఆదిత్యనాథ్ వర్గం పేర్కొంది. ఆ రెండు పార్టీల కూటమి ప్రభావాన్ని అర్థం చేసుకోలేకపోయామని, ఎంతో

అవసరమయిన సూక్ష్మస్థాయి నిర్వహణ (మైక్రోమేనేజ్‌మెంట్) చేపట్టలేకపోయామని ఆదిత్యనాథ్ అప్పట్లో చెప్పారు. ఇప్పుడు విపక్షాల ఐక్యతపై అవగాహన ఉన్నందున ప్రతివ్యూహంతో నెగ్గగలమని కైరానా లోక్‌సభ స్థానానికి, నూర్‌పుర్ శాసనసభ స్థానానికి ఉప ఎన్నికలు ప్రకటించాక ఆదిత్యనాథ్ వర్గం ధీమా వ్యక్తం చేసింది. ఈ రెండు స్థానాల్లోనూ ఇప్పుడు ఓటమి తప్పలేదు. కైరానా ఉప ఎన్నికలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆదిత్యనాథ్.. ప్రచారం మొదలుకొని, బూత్‌స్థాయి నిర్వహణ వరకు అన్నీ తానే అయి వ్యవహరించినా ఘోర పరాజయం తప్పలేదు. మతపరంగా ఈ నియోజకవర్గం ఎంతో సున్నితమయినది. హిందూ ఓట్ల ఏకీకరణ కోసం ఎన్నికల ప్రచారంలో ఆదిత్యనాథ్ హిందువులను రెచ్చగొట్టేలా ప్రసంగించారు కూడా. ముజఫర్‌నగర్ మతకల్లోలాలను ప్రస్తావించారు. ఆ అల్లర్లలో కేసులు ఎదుర్కొంటున్న జాట్ యువతపై కేసుల ఉపసంహరణకు ఆదిత్యనాథ్ వర్గం హామీ ఇచ్చింది. అయినా ఆయన మంత్రం పారలేదు. పైగా విపక్షాలవైపు ముస్లిం ఓట్లతో పాటు కులాలవారీగా భారీగా ఓట్ల ఏకీకరణ జరిగినట్లు స్పష్టమవుతోంది. ఇక్కడ జాట్ల ఓట్లు ఎక్కువ. ముస్లింలతో వైరమూ ఉంది. అయినా జాట్లు, ముస్లింలు, దళితుల ఓట్ల ఏకీకరణను విపక్షాలు సాధించగలిగాయి.

– ఈనాడు ప్రత్యేక విభాగం

అన్ని పార్టీలు విలువైన పాఠాలు నేర్వాలి

- కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు: రాహుల్‌గాంధీ
- మోదీ పాలనపై ప్రజలు విసిగిపోయారన్న ప్రమోద్‌తివారి

దిల్లీ, లఖ్‌నవూ, భోపాల్, జల్పాయ్‌గురి: విజయాలు, వైఫల్యాల నుంచి అన్నిపార్టీలు విలువైన గుణపాఠాలు నేర్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ విజయానికి అహరహం శ్రమించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు నాలుగేళ్ల నరేంద్ర మోదీ పాలనపై విసిగిపోయిన ప్రజలు ఇచ్చిన తీర్పుగా కాంగ్రెస్ అభివర్ణించింది. అబద్ధాలకోరు, మోసాల భాజపా పాలన పతనం ప్రారంభమైందని ఏఐసీసీ ప్రతినిధి ప్రమోద్ తివారి పేర్కొన్నారు.

భాజపా నిష్క్రమణ, కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్షాల విజయం ఖాయమైపోయిందన్నారు. గతనాలుగేళ్లగా పేదలు, రైతన్నలను మోదీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. లాంగ్ జంప్ చేసేముందు రెండు అడుగులు వెనక్కు వేస్తామని, 2019 ఎన్నికలకు ముందు ప్రస్తుత ఫలితాలు భాజపాకు అలాంటివేనని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సమర్థించుకున్నారు. ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడటం వల్లే ఉత్తర్‌ప్రదేశ్‌లో అసూయాద్వేషాలతో మనగడ సాగిస్తున్న భాజపాను నిలువరించగలిగామని రాష్ట్రీయ లోక్‌దళ్ నాయకుడు జయంత్‌చౌదరి పేర్కొన్నారు. భాజపాకు దేశవ్యాప్తంగా ఎదురుగాలి వీస్తోందని పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్ అన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజల వైఖరి ఎలా ఉండబోతోందో స్పష్టమైపోయిందన్నారు. లౌకిక ప్రజాస్వామ్యశక్తుల విజయంగా సీపీఐ నాయకుడు డి.రాజా అభివర్ణించారు.

విభజన రాజకీయాల ఓటమి..

"నూర్‌పుర్, కైరానా ఓటర్లకు కృతజ్ఞతలు. దళితులు, పేదలు, రైతన్నలదే ఈ విజయం. విభజన రాజకీయాలకు పాల్పడున్న భాజపాకు ప్రజలు సరైన బుద్ధి చెప్పారు. బీఎస్పీ, ఆర్ఎల్డీ, పీస్ పార్టీ, ఆప్ కార్యకర్తలు కలసికట్టుగా విజయానికి కృషి చేశారు. మా కూటమి విజయం దేశానికే ఓ సందేశమిచ్చింది. 2019 లోక్‌సభ ఎన్నికలు ఎదుర్కోవడానికి, మహాకూటమి ఏర్పాటుకు ఈ ఎన్నికలు మార్గం సుగమం చేశాయి."

- అఖిలేష్‌యాదవ్, ఎస్పీ అధినేత

హ్యాట్రిక్ ఓటమి

- యూపీలో జరిగిన మూడు ఉపఎన్నికల్లో వరుసగా వైఫల్యం
- కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ ఉమ్మడిగా పోటీ చేస్తే భాజపాకు కష్టమే
- ప్రతిపక్షాల్లో ఐక్యత లేకపోవడం వల్లే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి
- మూడు పార్టీలు కలిస్తే ఆరు నుంచి 11 శాతం ఓట్ల ఆధిక్యత
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాషాయపార్టీకి ఎదురీత తప్పనట్లే

ఉత్తర్‌ప్రదేశ్‌లో భాజపా ప్రభ కొడిగడుతోంది. 2014 లోక్‌సభ ఎన్నికల తరువాత ఓటముల్లో 'హ్యాట్రిక్' కొట్టింది. మూడుసార్లు జరిగిన ఉపఎన్నికల్లో వరుసగా ఓటమి పాలైంది. తాజాగా నూర్‌పుర్ అసెంబ్లీ స్థానంలోనూ ఓటమి పాలవడం గమనార్హం. నవంబరు 2017లో జరిగిన స్థానికసంస్థల ఎన్నికలను మినహాయిస్తే, భాజపా హవా 15 నెలల్లోనే దారుణంగా తగ్గడం కాషాయంపార్టీశ్రేణుల్లో ఆందోళనకు కారణమవుతోంది. కేంద్రాన ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్ర పోషించే ఉత్తర్‌ప్రదేశ్‌లో పట్టు కోల్పోతే, అధికారంలోకి రావడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ ఉమ్మడిగా ఎన్నికలరంగంలోకి దిగితే సానుకూల ఫలితాలు వస్తాయని మరోసారి రుజువైంది. 2014లో లోక్‌సభ ఎన్నికల తరువాత జరిగిన అన్ని ఉపఎన్నికల్లోనూ భాజపా ఓటమి పాలవడం గమనార్హం. 2014లో మైన్‌పురీ, 2018లో గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్; తాజాగా కైరానా లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు అపజయం పాలయ్యారు.

కేంద్రాన ప్రభుత్వం ఏర్పాటులో 'యూపీ'దే అగ్రతాంబూలం

1984లో కేవలం రెండు లోక్‌సభ సీట్లు సాధించిన భాజపా.. అయోధ్యలో రామమందిర నిర్మాణం కడతామనే హామీతో దేశవ్యాప్తంగా విశేష ఆదరణ సంపాదించింది. 1996లో 161 స్థానాలు సాధించి పెద్దపార్టీగా అవతరించింది. ఇందులో 51 సీట్లు ఉత్తర్‌ప్రదేశ్ నుంచే గెలవడం విశేషం. మిత్రపక్షాలతో కలసి వాజ్‌పేయి ప్రధానిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. పూర్తి మెజార్టీ లేకపోవడంతో 13 రోజులకే కేంద్రప్రభుత్వం కుప్పకూలింది. 1998 ఎన్నికల్లో భాజపా నేతృత్వాన ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో భాజపాకు 182 సీట్లు వచ్చాయి. ఇందులో 58 సీట్లు ఒక్క యూపీ నుంచే గెలుపొందడంతో అధికారంలోకి రావడానికి మార్గం సుగమమైంది. కాంగ్రెస్ 141 స్థానాల్లో గెలుపొందినా, యూపీలో ఒక్కసీటు కూడా గెలుపొందక పోవడంతో ఆ పార్టీ అధికారానికి దూరమైందని చెప్పవచ్చు. 1999లో జరిగిన ఎన్నికల్లో 29 స్థానాలకే భాజపా పరిమితమైంది. అయినా ఇతర రాష్ట్రాల్లో బలం పుంజుకోవడంతో 182 స్థానాల్లో గెలుపొంది, అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించడంతో వాజ్‌పేయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు. 1999-2000 మధ్య ఉత్తరాఖండ్ విడిపోవడంతో యూపీలో లోక్‌సభ స్థానాల సంఖ్య 80కు పరిమితమైంది. 2004లో భాజపా పది స్థానాల్లో మాత్రమే గెలవగలిగింది. ఫలితంగా కేంద్రంలో అధికారానికి దగ్గర కాలేకపోయింది. 2009లో జరిగిన ఎన్నికల్లో భాజపా యూపీలో పుంజుకోలేదు. యూపీలో పది స్థానాలకే పరిమితమైంది. మొత్తానికి 116 సీట్లు గెలిచింది. 206 సీట్లతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించడంతో యూపీఏ సంకీర్ణం కేంద్రాన రెండోసారి కొలువుతీరింది. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భాజపా రికార్డుస్థాయి విజయం సాధించింది. ఏకంగా 71 స్థానాలు గెలుచుకుంది. మిత్రపక్షంగా పోటీచేసిన అప్నాదళ్‌కు మరో సీట్లు దక్కడంతో పూర్తిస్థాయి మెజార్టీతో కేంద్రాన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది.

ప్రజల అసంతృప్తికి బద్దలైన భాజపా కంచుకోట

గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానానికి 2018లో జరిగిన ఉపఎన్నికలో బీఎస్పీ మద్దతుతో పోటీలో నిలిచిన ఎస్పీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ నిషాద్ 21,961 ఓట్ల మెజార్టీతో ఉపేంద్ర దత్త శుక్లా(భాజపా)పై గెలుపొందారు. 2014 ఎన్నికల్లో యోగి ఆదిత్యనాథ్ ఇదే స్థానం నుంచి 1,42,309 ఓట్ల మెజారీ సాధించడం విశేషం. యోగి మెజార్టీ, నిషాద్‌ల ఆధిక్యాన్ని కలుపుకుంటే 164,270 మంది భాజపాకు వ్యతిరేకంగా ఓటు వేసినట్లు భావించవచ్చు.

ఎస్పీ, బీఎస్పీ కలయిక వల్లే ఉప ముఖ్యమంత్రి ఖాళీస్థానంలో ఓటమి

ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానానికి 2018లో జరిగిన ఉపఎన్నికలో గెలుపొందిన ఎస్పీ అభ్యర్థి నాగేంద్రప్రతాప్‌సింహ్ పటేల్‌కు 3,42,922 ఓట్లు వచ్చాయి. కౌశలేంద్రసింహ్ పటేల్(భాజపా)కు 2,83,462 ఓట్లు పోలయ్యాయి. ఎస్పీ అభ్యర్థికి బీఎస్పీ మద్దతు ఉండటం వల్ల 59,460 ఓట్ల మెజార్టీ సాధ్యమైంది. అంతకుముందు 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భాజపా తరపున పోటీపడిన కేశవ్‌ప్రసాద్ మౌర్య(ప్రస్తుతం ఈయన యూపీ ఉపముఖ్యమంత్రి)కు 5,03,564 ఓట్లు రాగా, విడివిడిగా పోటీ చేసిన ఎస్పీ అభ్యర్థి ధరమ్‌రాజ్‌సింగ్ పటేల్‌కు 1,95,256 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి కపిల్‌ముని కర్వారియా 1,63,710 ఓట్లు రావడం గమనార్హం. అంటే 2014తో పోలిస్తే 2018లో భాజపా అభ్యర్థికి ఏకంగా 2,20,102 ఓట్లు తక్కువగా వచ్చాయన్న మాట. మరోవైపు 2017 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు 39.7 శాతం, బీఎస్పీకి 22.2, ఎస్పీకి 22, కాంగ్రెస్‌కు 6.2శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రధాన ప్రతిపక్షాలకు మొత్తం 50.4 శాతం పోలయ్యాయి.

లఖ్‌నవూలో సమాజ్‌వాదీ పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తల నృత్యాలు

లోక్‌సభ ఎన్నికల్లో భాజపా వ్యతిరేక కూటమికి ఆరు శాతం ఎక్కువ ఓట్లు

2014 లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో భాజపా 71, అప్నాదళ్ 2, ఎస్పీ 5, కాంగ్రెస్ రెండు గెలుచుకున్నాయి. బీఎస్పీ ఖాతా తెరవలేకపోయింది. కాకపోతే 19.60 శాతం ఓట్లు సాధించడం గమనార్హం. భాజపాకు 42.30 శాతం, ఎస్పీకి 22.20, కాంగ్రెస్‌కు 7.5, అప్నాదళ్‌కు ఒక్కశాతం ఓట్లు పడ్డాయి. అంటే భాజపా+అప్నాదళ్ కూటమి 43.3 శాతం కంటే ఆరుశాతం ఎక్కువగా కాంగ్రెస్ కూటమికి 49.3 శాతం ఓట్లు సాధించడం విశేషం. అంటే 2019లో భాజపా కూటమికి వ్యతిరేకంగా కలసికట్టుగా పోరాడితే, ప్రస్తుత ప్రతిపక్షాలు ఉత్తర్‌ప్రదేశ్‌లో అత్యధిక స్థానాల్లో పాగా వేయడం ఖాయంగా కనిపిస్తోంది.

ఫలితమివ్వని దోస్తీ

- బిహార్‌లో ప్రభావం చూపలేకపోతున్న భాజపా- జేడీయూ జట్టు
- 'జోకీహాట్' ఫలితంతో మరోసారి రుజువు

జేడీయూ అధినేత నీతీష్‌కుమార్ తిరిగి తమ గూటికి చేరితే.. బిహార్‌లో ఇక తిరుగుండదని భావించింది భాజపా. అందుకే ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీనే వ్యతిరేకించి ఎన్డీయేను వదిలి వెళ్లిన ఆయన్ను.. మళ్లీ తమవైపు ఆకర్షించింది. మహాకూటమిని వీడి తమ జట్టులో చేరేలా చేసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో తామే చక్రం తిప్పొచ్చని.. క్రితం సారి కన్నా ఎక్కువ సీట్లే సాధించొచ్చని లెక్కలు వేసుకుంది. అయితే భాజపా ఆశించినట్లుగా బిహార్‌లో ప్రయాణం నల్లేరుపై నడక కాదని ఉపఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతిపక్షాలు ఏకమైతే.. ఉత్తర్‌ప్రదేశ్‌లోలాగే ఇక్కడా ఇక్కట్లు తప్పవని రుజువు చేస్తున్నాయి. ఆర్జేడీతో తెగదెంపులు చేసుకొని ఎన్డీయేకు జేడీయూ దగ్గరైన తర్వాత.. బిహార్‌లో ఓ లోక్‌సభ స్థానం, మూడు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. వీటిలో మూడు చోట్లా జేడీయూ, భాజపా అభ్యర్థులకు ఓటములు తప్పలేదు. తాజాగా జోకీహాట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో జేడీయూ సర్వశక్తులు ఒడ్డినా.. విజయం సాధించలేకపోయింది. ఈ స్థానాన్ని ముఖ్యమంత్రి నీతీష్‌కుమార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని.. దాదాపు సగం మంత్రివర్గాన్ని రంగంలోకి దింపినా ఫలితం దక్కలేదు. ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ జైలుపాలైన ఈ సమయంలోనూ.. ఆ పార్టీపై జేడీయూ, భాజపా పైచేయి సాధించలేకపోయాయి. భాజపాతో దోస్తీ కట్టడంతో.. జేడీయూకు పెద్ద సంఖ్యలో ముస్లింలు దూరమయ్యారు. ముస్లింల సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న జోకీహాట్‌లో.. ఈ ప్రభావం కొట్టొచ్చినట్లు కనిపించింది. జేడీయూ అభ్యర్థి ముర్షీద్.. సామూహిక అత్యాచారం, విగ్రహ చోరీ వంటి కేసుల్లో నిందితుడిగా ఉండటం కూడా ప్రభావం చూపించింది. మరోవైపు ఆర్జేడీకి ముస్లింలు, యాదవులు మద్దతుగా నిలుస్తున్నారు. అంతకుముందు అరారియా లోక్‌సభ, జెహనాబాద్ అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల్లోనూ ఆ పార్టీకి ఈ పరిణామమే కలిసి వచ్చింది.

ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత భాజపాకు అత్యంత కీలకమైన రాష్ట్రం బిహార్. నీతీష్ జట్టు వీడినా.. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 40 స్థానాలకు గానూ 31 సీట్లను ఎన్డీయేనే సొంతం చేసుకుంది. ఆ మరుసటి ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ, కాంగ్రెస్, జేడీయూలు మహాకూటమిగా ఏర్పడి ఎన్డీయేను ఢీకొట్టాయి. అసెంబ్లీలో మహాకూటమి 178 స్థానాలు దక్కించుకోగా.. ఎన్డీయే 58 సీట్లకే పరిమితమైంది. నీతీష్ ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. అనంతరం లాలూ కుటుంబం అవినీతి కేసుల్లో చిక్కుకోవడం, ఉపముఖ్యమంత్రి పదవి వదులుకునేందుకు లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ నిరాకరించడంతో.. జేడీయూ, ఆర్జేడీల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇదే సమయంలో నీతీష్‌ను ఆకర్షించిన భాజపా.. మహాకూటమిని వీడేలా చేసింది. తమ మద్దతుతో ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసింది.

గురువారం అరారియాలో విజయోత్సవాల్లో పాల్గొన్న జోకిహాట్ అసెంబ్లీ స్థానంలో గెలుపొందిన ఆర్జేడీ అభ్యర్థి షానవాజ్ ఆలం

అయితే మహాకూటమిని దాదాపు విచ్ఛిన్నం చేసినా. . భాజపా పరిస్థితేమీ మెరుగుపడలేదు. నీతీష్‌తో పాటు ఎల్‌జేపీ అధినేత రాం విలాస్ పాసవాన్ కూడా ఎన్డీయేలోనే ఉన్నా.. చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఇదే పరిస్థితి సార్వత్రిక ఎన్నికల్లోనూ పునరావృతమైతే.. ఆ పార్టీ అధికారం చేపట్టే అవకాశాలకు గండిపడొచ్చు. –ఈనాడు ప్రత్యేక విభాగం

కర్ణాటకలో కాంగ్రెస్‌కు మరో స్థానం

ఈనాడు, బెంగళూరు: బెంగళూరులోని రాజరాజేశ్వరినగర విధానసభ స్థానానికి మే 28న జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మునిరత్న విజయం సాధించారు. దీంతో విధానసభలో కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య 79కి పెరిగింది. గురువారం జరిగిన ఓట్ల లెక్కింపులో మునిరత్నకు 1,08,064 ఓట్లు లభించగా, సమీప ప్రత్యర్థి, భాజపాకు చెందిన తులసి మునిరాజ గౌడకు 82,572 ఓట్లు పడ్డాయి. జేడీఎస్ అభ్యర్థి రామచంద్ర మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఆయనకు 60,360 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలోని ఒక ఇంట్లో పది వేల ఓటరు గుర్తింపు కార్డులు లభించిన నేపథ్యంలో మే 12న జరగాల్సిన ఎన్నిక 28కి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512

వాహన సురక్ష

దీర్ఘకాలిక బీమా మంచిదేనా?

కార్లు, ద్విచక్రవాహనాలకు మూడు, ఐదేళ్లపాటు బీమా ఉండాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని ఈమధ్య పత్రికల్లో చదివాను. ఈ వార్తలు నిజమేనా? దీర్ఘకాలిక బీమాతో లాభమా? నష్టమా?

- శ్రీనివాసరావు, తెనాలి

ప్రస్తుతానికి అలాంటి నియమం ఏదీ లేదు. అయితే భవిష్యత్తులో దీనిని చట్టంగా రూపొందించడం గురించి చర్చలు జరుగుతున్నాయి. మూడేళ్ల దీర్ఘకాలిక బీమా ద్విచక్రవాహనదారులకు ఇప్పటికే అందుబాటులో ఉంది. దీర్ఘకాలిక బీమాతో చాలా ప్రయోజనాలు ఉంటాయి. మొదటిది ప్రతి సంవత్సరం పాలసీని పునరుద్ధరించాల్సిన పనిలేదు. ఇది మీ మోటార్ బీమా పాలసీ పునరుద్ధరణలో ఆలస్యం కావడం లేదా మర్చిపోవడం వల్ల ఇబ్బంది పడకుండా కాపాడుతుంది. రెండోది ఏడాది బీమా ప్రీమియం కన్నా దీర్ఘకాలిక బీమా ప్రీమియం తక్కువగా ఉంటుంది. చివరగా దీర్ఘకాలిక బీమాతో మీరు పాలసీ కాల పరిమితిలోపు ఒక నిర్దిష్ట మొత్తం వరకు క్లెయిం చేసుకున్నా నో క్లెయిం బోనస్ కోల్పోరు. తేలికగా చెప్పాలంటే ఒక సంవత్సరం పాలసీలో ఒక క్లెయిమ్ దాఖలు చేస్తే నో క్లెయిమ్ బోనస్ కోల్పోతారు. మూడేళ్లలో మూడు క్లెయిమ్‌లు దాఖలు చేస్తే ఎన్‌సీబీ కోల్పోతారు. కానీ మూడేళ్లలో మూడు క్లెయిమ్‌ల సంభావ్యత ఏడాదిలో ఒక క్లెయిమ్ కంటే తక్కువగా ఉంటుంది. ఇది దీర్ఘకాల బీమా పాలసీని ప్రామాణిక ఒక సంవత్సరం పాలసీ కన్నా మెరుగ్గా మారుస్తుంది.

– సజ్జా ప్రవీణ్‌చౌదరి, మోటార్ ఇన్సూరెన్స్ హెడ్: పాలసీబజార్

మీరు డ్రైవరా... మంచి డ్రైవరా?

ఈ మధ్య సిద్దిపేట దగ్గర జరిగిన ప్రమాదంలో పదమూడుమంది చనిపోయారు. బస్సు డ్రైవర్ వైఖరి (యాటిట్యూడ్) సరిగా లేక జరిగిన దారుణమది. కరీంనగర్ దగ్గర మరో ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. లారీ డ్రైవరు అజాగ్రత్తకు ఫలితమది. ఇంకా వాహనాల నిర్వహణ సరిగా లేక.. నిబంధనలు పాటించక.. నిత్యం ఎక్కడో ఒకచోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అందుకే చేతికి స్టీరింగ్.. బైక్ యాక్సిలేటర్ అందగానే అంతా మంచి చోదకులు అయిపోరు. అలా కావాలంటే అసలింతకు ఏం చేయాలో నాలుగు మాటల్లో.

అరవై మైళ్ల వేగంతో బైక్‌ని పరుగులు పెట్టిస్తే గొప్ప బైకర్ అనిపించుకోం...
స్టీరింగ్ గిరగిరా తిప్పేయగానే పేద్ద డ్రైవర్ అయిపోం...
బండి నడపడం కాదు.. బాగా నడపడం రావాలి...
కారుకి యజమానవడం కాదు.. మంచి డ్రైవరు అనిపించుకోవాలి... అందుకేం చేయాలి?
నిబంధనలు తెలుసుకోవడంలో నిత్యవిద్యార్థిలా మారాలి...
డ్రైవింగ్‌లో రాముడు మంచి బాలుడిలా ఉండాలి...
వాహన నిర్వహణలో నౌకరులా సేవ చేయాలి...
వాహనంతో రోడ్డెక్కగానే బుద్ధుడిలా శాంతస్వభావం చూపించాలి...
చీటిమాటికి గొడవ పడటం మాని ముమ్మాటికీ మంచి చోదకుడిగా ఉంటానని మాటిచ్చుకోవాలి...
అప్పుడే మనకూ, రోడ్డుపై నడిచేవారికీ రక్షణ.

1 ఆ క్షణం చాలు...

బండి కొని ఏళ్లు గడిచినా కొందరికి వాహనం సరిగా నడపడం రాదు. డ్రైవింగ్‌లో కనీస పరిజ్ఞానముండదు. తరచూ ప్రమాదాలకు గురవుతుంటారు. వాళ్లేం చేయాలి?

- బైక్, కారు లేదా ట్రక్ ఎక్కేముందే టైర్లలో గాలి ఒత్తిడి, కూలంట్‌లు, ఇంజిన్ ఆయిల్ పరిశీలించాలి. హెడ్‌లైట్లు, పక్క సిగ్నల్ లైట్లు, రేర్ వ్యూ మిర్రర్ సరిగ్గా ఉందో లేదో చూసుకున్న తర్వాతే సీట్లో కూర్చోవాలి.
- ప్రయాణ సన్నద్ధానికి ఓ పద్ధతుంది. కారు స్టీరింగ్‌ని గడియారంలోని తొమ్మిది, మూడు అంకెల్ని చూపించేలా పట్టుకోవాలంటారు నిపుణులు. బైక్‌పై కూర్చునేటప్పుడు ముందుకు వంగిపోయినట్టో, కిందికి వాలిపోయినట్టో కాకుండా నిటారుగా ఉండాలి. అప్పుడే బాగా పట్టుంటుంది.
- మూల మలుపులు, బ్లైండ్‌స్పాట్‌లు కనిపించేలా వాహనాల పక్క అద్దాలను సరి చేసుకోవడం తప్పనిసరి. పార్కింగ్ చేసినపుడు తప్పకుండా హ్యాండ్‌బ్రేక్ ఉపయోగించాలి. వెనక్కి వస్తుంటే పార్కింగ్ సెన్సర్లు ఉపయోగించాలి.
- ప్రతి ప్రయాణానికి పక్కా ప్రణాళిక ఉండాలి. మన గమ్యం చేరడానికి ఎంత సమయం పడుతుంది? ఏ దారిలో వెళ్లాలి? ట్రాఫిక్ ఎక్కువగా ఉంటే పరిస్థితి ఏంటి? ఇవన్నీ ముందే ఆలోచించుకోవాలి. అప్పుడే హడావిడి, గాబరా ఉండదు. అవి లేకపోతే ప్రమాదాల బారినపడం.
- ప్రమాదాల్లో అత్యధికం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు జరుగుతున్నాయి. ఈ సమయంలో నిద్రమత్తు ముంచేస్తూ ఉంటుంది. అప్పుడు ప్రయాణాన్ని ఆపేసి ఓ కునుకు తీయాలి. లేదా ప్రత్యామ్నాయ డ్రైవరును చూసుకోవాలి.
- కొందరు డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ చూస్తారు. సందేశాలు పంపుతారు. ఒక్క క్షణమే కదా అనుకుంటారు. కానీ ఎదుటివారి ప్రాణాలు తీయడానికి, మన ప్రాణాలు పోవడానికి ఆ ఒక్క క్షణం చాలు. అంత అర్జెంట్ అయితే వాహనాన్ని పక్కన ఆపి ఆ పని చేసుకోవచ్చు. డ్రైవింగ్‌లో ఏదైనా తినడం, మ్యూజిక్ వినడం, ఇతరులతో మాట్లాడ్డం కూడా ఏకాగ్రతను దెబ్బతీస్తాయి.

2 నిబంధనలు తెలుసుకో

రవాణాశాఖ, పోలీసుశాఖలు వాహన చోదకులకు కొన్ని నిబంధనలు విధిస్తాయి. అవి మనని వేధించడానికి కాదు.. మన భద్రతకోసమేనని గుర్తించాలి. ఇంకేం పాటించాలంటే...

- డ్రైవింగ్ ధ్రువీకరణ, రిజిస్ట్రేషన్ పత్రం, బీమా, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం, కాలుష్యం రశీదు.. ఇవి లేకుండా వాహనంతో బయటికి రావొద్దు. డ్రైవింగ్‌లో ఉన్నపుడు మద్యం తీసుకోవడం, మత్తు పదార్థాలు వాడటం నిషిద్ధం.
- మనదేశంలో ఎడమవైపే వాహనం నడపాలి. నారింజ రంగు సిగ్నల్ పడినప్పుడు వేగం తగ్గించాలి, ఎరుపురంగు పడితే పూర్తిగా ఆపాలి. యూటర్న్ తీసుకునేటప్పుడు పదిసెకన్ల ముందే ఇండికేటర్ వేయాలి. రోడ్డుపై జీబ్రా లైన్లు, ఇతర గీతలు.. ఇలాంటి వాటిపై కనీస అవగాహన ఉండాలి.
- జాతీయ రహదారుల్లో వేగ సూచికలు పాటించాలి. కూడళ్లు, ప్రమాదకర మలుపులు, ఇతర వివరాలు గమనించాలి. వెనక్కి, పక్కలకు వెళ్తున్నప్పుడు తప్పకుండా పార్కింగ్, సైడ్ ఇండికేటర్లు వేయాలి. అవసరం అయితే తప్ప హారన్ కొట్టొద్దు.
- సిగ్నళ్లు వేయకుండా వరుసలు మారొద్దు. వెనకాముందు ట్రాఫిక్ ఎలా ఉందో గమనించాలి. పది సెకన్లు లేదా ముప్పై మీటర్ల ముందే సిగ్నళ్లు వేయాలి. జిగ్‌జాగ్ డ్రైవింగ్ హానికరం. బైక్‌లు అదుపు తప్పుతాయి.
- రోడ్డుపై ఉన్నపుడు బాధ్యతాయుతంగా ఉండాలి. దురదృష్టవశాత్తు మనవల్ల ఏదైనా ప్రమాదం జరిగితే తప్పించుకోవడానికి అక్కణ్నుంచి జారుకోవద్దు. చట్టపరంగా ఇది సమ్మతం కూడా కాదు. బాధితుడికి సాయం అందించాలి.
- అంబులెన్స్‌లాంటి వాహనాలకు తప్పనిసరిగా దారి ఇవ్వాలి. కుడివైపు నుంచే ఓవర్‌టేక్ చేయాలి. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నపుడు, ఎదురు రోడ్డు సరిగా కనిపించనపుడు ఆ ప్రయత్నం మానాలి. ముందు వాహనంలోని డ్రైవరు సిగ్నల్ ఇచ్చినపుడే ముందుకెళ్లాలి.

3 నిర్వహణా ముఖ్యమే

మనం నడిపే వాహనం మంచి స్థితిలో ఉంటే సగం ప్రమాదాల బారినుంచి తప్పించుకున్నట్టే. మరి సరైన నిర్వహణకు ఏం చేయాలి?

- వాహనం టైర్లలో గాలి ఒత్తిడి చెక్ చేయడం ఒక అలవాటుగా మార్చుకోవాలి. ప్రెషర్ ఎక్కువైనా, తక్కువైనా ప్రమాదమే. వీలుంటే టైర్లలో వేడిని తగ్గించే నైట్రోజన్ గాలి నింపాలి.
- ఇంజిన్ ఆయిల్, కూలంట్‌లు, ఎయిర్ ఫిల్టర్లు, స్పార్క్‌ప్లగ్‌లు మార్చడానికి ఒక నిర్ణీత సమయమంటూ ఉంటుంది. చక్రాల అమరిక సరి చేయించాలి. వీటిని వాయిదా వేస్తుంటే అవి వాహన ఆయుఃప్రమాణంపై పెను ప్రభావం చూపిస్తాయి.
- వాహనం చాలారోజులు వాడకుండా ఉంటే బ్యాటరీ టెర్మినళ్లను తొలగించాలి. తుప్పు పట్టకుండా వాటిని తరచూ శుభ్రం చేస్తుండాలి. ముప్పై వేల కిలోమీటర్లకు ఓసారి బ్రేక్‌ప్యాడ్‌లు మార్చడం తప్పనిసరి.
- వాహనాన్ని నీడలోనే పార్క్ చేయాలి. కనీసం ఎండ తగలకుండా ఏదైనా కప్పి ఉంచాలి. మోటార్‌సైకిల్‌కి అయితే చైన్, బ్యాటరీ, కూలంట్‌లు... పరిశీలించాలి.
- బ్రేకులు ఫెయిలైతే వాహనమే కాదు జీవితమే మన చేతుల్లో ఉండదు. అంత ముఖ్యమైన ఈ వ్యవస్థలోని భాగాలు బ్రేక్ లైనింగ్‌లు, రోటార్లు, డ్రమ్‌లు.. తరచూ పరిశీలిస్తుండాలి. ఏమాత్రం చెడిపోయినా వెంటనే మార్చాలి. బ్రేక్ ఫ్లూయిడ్‌లు కాలానుగుణంగా మార్చుతుండాలి.

4 వైఖరి మారాలి

అత్యధిక ప్రమాదాలకు డ్రైవర్ల తప్పిదాలే కారణం అంటున్నాయి గణాంకాలు. మొండి మనస్తత్వం, అహం, నేనే నెగ్గాలనే వైఖరితోనే ఈ సమస్య. మనం మారితే జనం అంతా సురక్షితమే.

- ముందు వెళ్తున్న వాహనాలను ఎలాగైనా ఓవర్‌టేక్ చేయాలనుకోవడం. వెనక వచ్చేవాళ్లకు సైడ్ ఇవ్వకపోవడం. చిన్న వాహనం మన పెద్ద కారుని అధిగమించడం ఏంటని ఉడుక్కోవడం.. ఇలాంటి ఆలోచనలతో ప్రాణాలకే ప్రమాదం.
- కొందరు చిన్న విషయానికే రోడ్డుపై గొడవకు దిగుతారు. అదేపనిగా అరుస్తారు. ఇలా చేయడం మనకే కాదు.. ఇతర వాహనదారులకూ తీవ్ర అసౌకర్యం. అందరికీ గౌరవం ఇస్తే ఈ సమస్యే ఉండదు.
- డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకే ఆస్కారం ఉండదంటారు నిపుణులు. అంటే ఎదుటివాళ్లు ఎన్ని తప్పులు చేసినా మన్నిస్తూ సర్దుకుపోవడం. ర్యాష్ డ్రైవింగ్ చేసేవారు, తాగుబోతులు వాహనాలను అడ్డదిడ్డంగా నడిపేస్తూ ఉంటారు. వాళ్లతో పోటీపడకుండా దారిస్తూ తప్పుకుపోవాలి.
- బాధ్యతాయుతమైన డ్రైవర్ 'ఈరోజు నావల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదు' అని మనసులో గట్టిగా అనుకుంటాడు. స్టీరింగ్ అందుకుంటున్నప్పుడే భార్యాపిల్లలు, కుటుంబాన్ని గుర్తు చేసుకుంటాడు.
- కోపం, సంతోషం, బాధలాంటి తీవ్రమైన భావోద్వేగాల్లో ఉన్నపుడు, ఎవరితో అయినా గొడవపడ్డప్పుడు ప్రశాంతత చెదురుతుంది. డ్రైవింగ్‌పై మనసు లగ్నం చేయలేం. అలాంటి సమయాల్లో కాసేపు సంయమనం పాటించాలి. డ్రైవింగ్‌ని ఆపేయాలి.
- ఎదరుగానో, పక్కనుంచో ఏ వాహనం రాదనే ధీమాతో కాకుండా.. ఏదైనా వస్తుందేమోననే జాగ్రత్త, అప్రమత్తతో నడపడం ప్రధానం. మనం రోడ్డుపై వెళ్లడం మాత్రమే కాదు.. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఇతరుల ప్రాణాలూ పోయే ప్రమాదముంది.

మనమే మారాలి..

ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినా, కఠిన శిక్షలు అమలు చేస్తున్నా వాహన యజమానుల వైఖరిలో మార్పు వచ్చినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయి. పోలీసులు ప్రశ్నిస్తారని, చలాన్లు రాస్తారని కాదు.. శిరస్త్రాణం ధరించడం, నిబంధనలు పాటించడం మన రక్షణ కోసమే అనే విషయం మరవొద్దు. ద్విచక్రవాహనం వెనకసీట్లో కూర్చున్నవారూ హెల్మెట్ పెట్టుకోవడం, కారు వెనకసీట్లో ఉన్నవారూ సీటుబెల్టు ధరించడం.. నిబంధనల్లో ఉండవు. ఇవన్నీ మనకు మనమే పాటించాలి. ఇది జరగాలంటే ప్రతి డ్రైవరుకీ మంచి యాటిట్యూడ్ బిహేవియర్ ఉండాలి. విదేశాల్లో డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానం కఠినంగా ఉంటుంది. ముందు వ్యక్తిత్వం పరీక్షిస్తారు. మనస్తత్వం విశ్లేషిస్తారు. నిబంధనలపై అవగాహన కల్పిస్తారు. తర్వాత పరీక్షలు నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధిస్తేనే లైసెన్స్ జారీ చేస్తారు. కానీ ప్రస్తుతం మన దగ్గర ఉన్న విధానంతో ఎవరైనా తేలిగ్గా లైసెన్స్ పొందగలుగుతున్నారు. ప్రమాదాలకు బీజం పడేది ఇక్కడే. ఎవరైనా ఒక్కసారి లైసెన్స్ పొందితే మళ్లీ 45 ఏళ్ల దాకా వాళ్ల గురించి ఆలోచించరు. వాళ్లు ఫిట్‌గా ఉన్నారా? మానసిక్‌స్థితి ఏంటి అని గమనించరు. కొత్తగా రాబోతున్న రవాణా, రోడ్డు భద్రత బిల్లు ఈ లోపాలను సవరించబోతోంది. ఇందులో కఠినమైన నిబంధనలు చేర్చారు. మనం వాహనం ఎక్కగానే కళ్లు రోడ్డుమీద.. చేతులు స్టీరింగ్‌పై.. మనసు డ్రైవింగ్‌పై ఉన్నప్పుడే మంచి డ్రైవరు అనిపించుకుంటాం.

- కె.వినోద్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ రోడ్ సేఫ్టీ

విడుదల

200సీసీ పోటీకి సై

ఎన్నాళ్ల నుంచో ఊరిస్తున్న హీరో ఎక్స్‌ట్రీమ్ 200ఆర్ అందుబాటులోకి వచ్చేసింది. ఫీచర్లేంటి? వేటితో పోటీ పడబోతోందీ.. ఆ వివరాలు.



డిజైన్: ఈ బైక్ డిజైన్ ఎక్స్‌ట్రీమ్ స్పోర్ట్స్ 150సీసీని పోలి ఉంది. తోడేలు చూపుల్లా హెడ్‌ల్యాంప్‌లు, వాటికి అదనంగా ఎల్ఈడీ పైలెట్‌ల్యాంప్‌లు కూల్‌గా ఉన్నాయి. మెరుపుల పెయింట్ దానిపై బాడీ గ్రాఫిక్‌లు.. యువతను ఆకట్టుకునేలా ఉన్నాయి. సంప్రదాయం, ఆధునికత కలబోతలా అనలాగ్, డిజిటర్ మీటర్లున్నాయి. ఈ సెగ్మెంట్ బండ్లతో పోలిస్తే ఛాసిస్ బరువు ఐదారు కేజీలు తేలిక. పైగా దృఢంగా ఉంది కూడా.

ఫీచర్లు: ముందు చక్రానికి సింగిల్ ఛానెల్ ఏబీఎస్, వెనక 220 ఎంఎం డిస్క్‌బ్రేక్ ఉంది. టైరు పరిమాణం 130/70 మిమీటర్లు. వేరేవాటితో పోలిస్తే వెడల్పు ఎక్కువ. దీంతో తడి ఉపరితలం రహదారుపై కూడా వేగంగా వెళ్తున్నా నియంత్రణలో ఉంటుంది. వీల్‌బేస్ తక్కువగా 1338ఎంఎంగా ఉండటంతో నగర రోడ్లు, ఎలాంటి ట్రాఫిక్‌లో అయినా తేలికగా నడపొచ్చు. గ్రౌండ్ క్లియరెన్స్ 165మిమీటర్లు. పెద్ద పెద్ద స్పీడ్ బ్రేకర్లలో కూడా ఇబ్బంది లేకుండా దూసుకెళ్లొచ్చు.

మైలేజీ: గ్లామర్, స్ప్లెండర్, ప్యాషన్‌లాగే 35 నుంచి 40కిమీలు/లీటరుకి.

పోటీదారులు: టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200, బజాజ్ పల్సర్ 200 ఎన్ఎస్. పవర్ విషయానికొస్తే దీని సామర్థ్యం తక్కువే. ఆర్‌టీఆర్ 200 21 బీహెచ్‌పీ, పల్సర్ 200 ఎన్ఎస్ 23.5 బీహెచ్‌పీలైతే ఎక్స్‌ట్రీమ్ పవర్ 18.4 బీహెచ్‌పీ మాత్రమే. ఇది మైనస్ పాయింట్.

ధర: ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

- డీనో, డీనోస్ వాల్ట్

రూ.47లక్షల బైక్.. ధోనీ గ్యారేజీలో

క్రికెటర్ ధోనీ బైక్ ప్రియుడన్న సంగతి అందరికీ తెలిసిందే. అతగాడి గ్యారేజీలోకి మరో కత్తిలాంటి ద్విచక్రవాహనం కాన్‌ఫెడరేట్ ఎక్స్132 హెల్‌క్యాట్ చేరింది. ఇది అలాంటిలాంటి మోటార్‌సైకిల్ కాదు. ఆ ప్రత్యేకతలు ఏంటంటే...

- రెండో ప్రపంచయుద్ధంలో అసమాన పోరాటం చేసిన ఎఫ్6ఎఫ్ హెల్‌క్యాట్ ఫైటర్ జెట్ విమానం జ్ఞాపకార్థం కాన్‌ఫెడరేట్ కంపెనీ ఈ ఎక్స్132 హెల్‌క్యాట్ బైక్ తయారు చేసింది.
- దీనికి విమానం తయారీకి ఉపయోగించే అత్యుత్తమ టైటానియం, కార్బన్ ఫైబర్‌తో బాడీని మలిచారు. ఇది అత్యంత దృఢంగా ఉండటమే కాదు.. తేలికగానూ ఉంటుంది. మొత్తమ్మీద దీని బరువు 227కేజీలు. 2.2లీటర్ల వీ-ట్విన్ ఇంజిన్‌తో పని చేస్తుంది.
- ఇప్పటిదాకా ప్రపంచం మొత్తమ్మీద ఇవి 150 బైక్‌లు మాత్రమే తయారు చేశారు. అన్నీ అమ్ముడయ్యాయి. ఈ బైక్‌కి యజమాని అయిన ఏకైక ఈశాన్య ఆసియన్ ధోనీ మాత్రమే.
- టామ్ క్రూయిజ్, డేవిడ్ బెక్‌హాం, బ్రాడ్ పిట్‌లాంటి అతికొద్దిమంది అంతర్జాతీయ స్టార్ల దగ్గర మాత్రమే ఈ కాన్‌ఫెడరేట్ హెల్‌క్యాట్ ఎక్స్132 ఉంది. ఇండియాలో దీన్ని సొంతం చేసుకున్న ఒకే ఒక్కడు ధోనీ.
- యమహా ఆర్ఎక్స్‌జడ్, టీవీఎస్ అపాచీ, కావాసాకీ జడ్ఎక్స్14ఆర్ నింజా, హార్లీ డేవిడ్‌సన్ ఫ్యాట్‌బోయ్, డుకాటీ 1098లాంటి ఖరీదైన బైక్‌లతోపాటు మొత్తం 22 బైక్‌లు ఎంఎస్‌డీ గ్యారేజీలో కొలువుదీరాయి.

ఈనాడు సినిమా

చిరంజీవి

చిరు... యుద్ధానికి సిద్ధం

వెండితెరపై యుద్ధ సన్నివేశాలు ప్రేక్షకుల్ని సమ్మోహనపరుస్తున్నాయి. హాలీవుడ్‌ని సైతం మరిపించేలా తెలుగులోనూ ఇలాంటి ఘట్టాల్ని ఆవిష్కరిస్తున్నారు దర్శకులు. 'బాహుబలి', 'రుద్రమదేవి', 'ఘాజీ'లలో మైమరపించే యుద్ధ సన్నివేశాల్ని చూశాం. 'సైరా నరసింహారెడ్డి' లోనూ ఈ తరహా రోమాంచిత ఘట్టాలున్నాయట. చిరంజీవి నటిస్తున్న 151వ చిత్రమిది. సురేందర్ రెడ్డి దర్శకుడు. అమితాబ్ బచ్చన్, నయనతార, సుదీప్ కీలక పాత్రధారులు. ఈ నెల 7 నుంచి హైదరాబాద్‌లో మరో కీలకమైన షెడ్యూలు మొదలుకానుంది. ఈసారి భారీ యుద్ధ సన్నివేశాల్ని తెరకెక్కించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం హైదరాబాద్ శివార్లలో ప్రత్యేకమైన సెట్‌ని తీర్చిదిద్దుతున్నారు. ప్రముఖ హాలీవుడ్ నిపుణులు ఈ పోరాట ఘట్టానికి సహాయ సహకారాలు అందిస్తారని తెలుస్తోంది. 2019 వేసవికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు.

రాంగోపాల్ వర్మ, నాగార్జున, మైరా శరీన్

'ఆఫీసర్' సౌండ్ అదిరిపోతుంది

నాగార్జున కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఆఫీసర్'. రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించారు. మైరా శరీన్ కథానాయిక. శుక్రవారం విడుదల అవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ "వర్మతో నా ప్రయాణం 'శివ' నుంచి మొదలైంది. ఏడాదిన్నర కిందట వర్మ ఈ కథ వినిపించాడు. కథ బాగుంది కానీ ఎలా తీస్తాడో అనిపించింది. తనని కొన్ని రోజులు పరీక్షించా. మార్పు గమనించిన తరవాతే ఈ సినిమా ఒప్పుకున్నా. సినిమా చూశాక తను నిజాయతీగా పనిచేశాడనిపించింది. ఎడిటింగ్, సౌండ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ లాంటి విషయాల్లో తనకు బాగా నైపుణ్యం ఉంది. ఈ సినిమాలో అవన్నీ కనిపిస్తాయి. మరీ ముఖ్యంగా సౌండ్ అదిరిపోతుంది. ప్రేక్షకుల గుండెల వరకూ వెళుతుంది. మేమెంత నిజాయతీగా పని చేసినా చివరికి అది ప్రేక్షకులకి నచ్చితేనే మాకు తృప్తి" అన్నారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "సినిమాను నేను సీరియస్‌గానే తీస్తాను. నాగ్, నేనూ కలసి చేసిన కొత్త ప్రయత్నమిది. 'శివ'లో కాలేజీ అంశాలు ఎక్కువగా ఉంటాయి. 'ఆఫీసర్' పోలీస్, క్రిమినల్స్‌తో ముడిపడిన కథ. 'శివ' తర్వాత నాగార్జునలోని హీరోయిజం ఈ సినిమాలో బాగా కనిపిస్తుంది. నూటికి నూరు శాతం ప్రేక్షకులకి కొత్త అనుభవం కలుగుతుంద"న్నారు. మైరా శరీన్ మాట్లాడుతూ "మామూలు కథానాయిక పాత్ర కాదు. ఆద్యంతం నా పాత్ర సీరియస్‌గా ఉంటుంది. కథానాయకుడితో కలిసి ప్రయాణం చేసే ఆఫీసర్‌గా కనిపిస్తా" అంది.

ఆ మాత్రం దానికేనా..?

కాజల్

"డబ్బులు పోతే తిరిగి సంపాదించుకోగలం.. కానీ అనుబంధాలు అలా కాదు. ఒక్కసారి కోల్పోతే.. మళ్లీ సాధించుకోవడం కష్టం" అంటోంది కాజల్. "నేను చాలా ఎమోషనల్. నాకు అనుబంధాల విలువ తెలుసు. కుటుంబం, అందులోని ఆప్యాయతలు నాకు చిన్నప్పుడే అర్థమయ్యాయి. వాళ్ల కోసం ఏమైనా చేస్తాను. అవసరమైతే నా కెరీర్ కూడా వదులుకోవడానికి సిద్ధమే" అంటోంది. నవతరం ఆలోచనలు, అనుబంధాలకు వాళ్లిచ్చే విలువ గురించి తాను స్పందించింది. "ఈతరం అన్ని విషయాల్లోనూ చాలా స్పీడుగా ఉంది. వాళ్లకు స్నేహం, కుటుంబ బంధాల విలువ తెలుసు. కాకపోతే చిన్న చిన్న విషయాలకే మనుషుల్ని దూరం చేసుకుంటున్నారు. ఆ కారణాలు తెలిస్తే.. 'ఈ మాత్రం దానికే ఇంత చేయాలా?' అనిపిస్తుంది. అయితే.. మళ్లీ అంతే వేగంగా పరిచయాలు పెంచుకోగలరు. చేతిలో ఉన్న డబ్బు కంటే, స్థితి కంటే, భావోద్వేగాలకు విలువ ఇవ్వండి. అప్పుడు ప్రతీ బంధం గొప్పగా కనిపిస్తుంది" అంది కాజల్.

వెండితెర సమ్మోహనభరితం

కృష్ణ, సుధీర్‌బాబు, ఇంద్రగంటి మోహనకృష్ణ, శివలెంక కృష్ణప్రసాద్

సుధీర్‌బాబు, అదితీరావు హైదరీ జంటగా నటించిన చిత్రం 'సమ్మోహనం' ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకుడు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. ఈనెల 15న విడుదల కాబోతోంది. కృష్ణ పుట్టినరోజు సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో 'సమ్మోహనం' ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ "టైటిల్ చాలా బాగుంది. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన 'ఆదిత్య 369' చాలా గొప్ప సినిమా. సుధీర్ ఈ సినిమాలో చాలా అందంగా కనిపిస్తున్నాడు. ఇంద్రగంటి నుంచి వచ్చిన సినిమాలన్నీ చక్కని విజయాన్ని సొంతం చేసుకున్నాయి. 'సమ్మోహనం' అంతకుమించిన విజయాన్ని అందుకోవాల"న్నారు. "పరిశ్రమలోని అందరూ కృష్ణగారి అభిమానులే. ఆయన పుట్టినరోజున.. ఆయన చేతుల మీదుగా ప్రచార చిత్రం విడుదల చేయడం ఆనందంగా ఉంద"న్నారు నిర్మాత. "రొమాన్స్, వినోదం మిళితమైన చిత్రమిది. అర్థవంతమైన పాత్రలుంటాయి. ఉత్కంఠభరితంగా సాగుతుంది. ప్రతిభావంతులైన నటీనటులు కలిస్తే వెండితెర సమ్మోహనభరితంగా ఉంటుందని చెప్పడానికి ఈ చిత్రం ఓ ఉదాహరణ" అన్నారు మోహనకృష్ణ.

అవసరాలకు మనిషి సృష్టించి రూపాయి
చుట్టూ తిరుగుతున్నాడమ్మా
రూపాయి కొరకు ఏ పాపానికైతేనేమి
ఒడిగట్టినదిగో చూడమ్మా
కోటి విద్యలు కూటి కోసమన్నది పోయి
కోట్లకు పరిగెత్తి కోరికలు చెలరేగి
మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు

గీతోపదేశం

గీతం: మాయమైపోతున్నాడమ్మా...
చిత్రం: ఎర్ర సముద్రం
రచన: అందెశ్రీ
- పంపినవారు: బి.ప్రకాష్ రావు, బళ్లారి

సంగీతాన్ని ప్రేమిస్తాడు... పంచిస్తాడు

కె. ఎస్. రామారావు, కరుణాకరన్

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'తేజ్ ఐ లవ్ యూ'. అనుపమ పరమేశ్వరన్ నాయిక. కె.ఎస్. రామారావు నిర్మాత. కరుణాకరన్ దర్శకుడు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో కె.ఎస్. రామారావు మాట్లాడుతూ "ఈ ప్రేమకథలో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలూ ఉన్నాయి. గోపీ సుందర్ స్వరాలు ఆకట్టుకుంటాయి. శనివారం క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో సరదాగా సాగే ఓ కార్యక్రమంలో ఒక పాటను విడుదల చేస్తాం. ఈ నెల 9న ఆడియో వేడుకను నిర్వహిస్తాం. మా సంస్థకిది 45వ చిత్రమవుతుంది. ఈ నెలాఖరుకి సినిమాని విడుదల చేసే సన్నాహాలు చేస్తున్నామ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "క్రియేటివ్ కమర్షియల్స్‌లో నాకిది రెండో సినిమా. దర్శకుడిగా పదవ చిత్రం. 'తొలిప్రేమ'లానే ఈ సినిమా ప్రేక్షకులకి నచ్చుతుంది. ఈ ప్రేమకథను సంగీతభరితంగా తెరకెక్కించా. సంగీతాన్ని ప్రేమిస్తూ దాన్ని పదిమందికీ పంచే పాత్రలో సాయిధరమ్ తేజ్ కనిపిస్తార"న్నారు.

చారిత్రక పాత్రలు చేయాలి

అమైర దస్తుర్

"అందం, అభినయం..ఇలా రెండు రూపాల్లోనూ ప్రేక్షకుల్ని మెప్పించే పాత్రలను ఎంచుకోవాలనుకుంటున్నా" అంటోంది అమైర దస్తుర్. శుక్రవారం విడుదలకానున్న 'రాజుగాడు'లో నాయికగా నటించింది. సంజానారెడ్డి దరకత్వం వహించారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో అమైర విలేకర్లతో మాట్లాడుతూ "ఈ సినిమా ప్రథమార్థంలో నా పాత్రలో గ్లామర్ మేళవించారు. ద్వితీయార్థంలో అభినయానికి ఆస్కారం ఉంది. సినిమా ప్రేక్షకులకి నవ్వుల్ని పంచేలానే నడుస్తుంది. రాజ్ తరుణ్ సహకారం, సంజన సలహాలతో కామెడీని పండించగలిగాను. తెలుగులో నా తొలి చిత్రం మంజుల దర్శకత్వం వహించిన 'మనసుకు నచ్చింది'. నా రెండు సినిమాలకూ మహిళలే దర్శకత్వం వహించడం ఆనందంగా ఉంది. హిందీలో ఓ సినిమా చేస్తున్నా. అదీ దర్శకురాలి సినిమానే. అవకాశాలు రావాలేగానీ మహిళలూ పురుషులకి తీసిపోరని నిరూపించుకోగలరు. 'పద్మావతి', 'జోధా అక్బర్' తరహా చారిత్రక చిత్రాల్లో చేయాలని ఉంది. ప్రస్తుతం ఓ తమిళ చిత్రంతో పాటు ప్రకాష్ కోవెలమూడి దర్శకత్వంలో ఓ హిందీ చిత్రం, 'ప్రస్థానం' హిందీ రీమేక్‌లోనూ అవకాశం వచ్చింద"ని అంది.

హృతిక్‌తో దిశ



'బాఘీ 2' విజయంతో దిశ దశే మారిపోయింది. ఈ మధ్యే సల్మాన్‌ఖాన్ 'భారత్'లో నటించే ఛాన్స్ కొట్టేసింది. ఈ సంతోషంలో ఉండగానే మరో స్టార్ హీరోతో ఆడిపాడే అవకాశం దక్కించుకొందని సమాచారం. హృతిక్ రోషన్ కథానాయకుడిగా రోహిత్ ధావన్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతుంది. ఇందులో దిశ పేరు దాదాపుగా ఖరారైందట. "రోహిత్ స్క్రిప్టు పనుల్లో ఉన్నారు. దిశాను సంప్రదించడం ఆమె అంగీకరించడం అంతా నిజమే. త్వరలోనే అధికారికంగా ఆ వివరాలు వెల్లడించే అవకాశాలున్నాయి"అని రోహిత్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. హృతిక్ ప్రస్తుతం 'సూపర్ 30' చిత్రీకరణలో ఉన్నాడు. ఇది పూర్తయ్యాకా యశ్‌రాజ్ ఫిలిమ్స్‌లో టైగర్ ష్రాఫ్‌తో కలిసి ఓ సినిమా చేయనున్నాడు. అది అయ్యాకా రోహిత్ సినిమా చేసే అవకాశాలున్నాయి.

పదేళ్ల తర్వాత జంటగా?


సంజయ్‌దత్

'ప్రస్థానం' తెలుగులో మంచి విజయం సాధించిన చిత్రం. ఇప్పుడు ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేస్తున్నారు. దీనికి కూడా దేవా కట్టానే దర్శకుడు. అందులోని ఓ ప్రధాన పాత్రలో సంజయ్ దత్ నటిస్తున్నారు. ఆయనకు భార్యగా మనీషా కోయిరాలా నటిస్తున్నారట. 'యల్‌గార్'లో తొలిసారి కలిసి నటించిన ఈ జోడీ తర్వాత పలు చిత్రాల్లో నటించి భారీ విజయాలు అందుకొన్నారు. మళ్లీ పదేళ్లకు 'ప్రస్థానం'లో నటిస్తున్నారు. సంజయ్‌దత్ ప్రొడక్షన్స్ నిర్మించనున్న ఈ చిత్రం జూన్ 1 నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది.

మనీషా కోయిరాలా

కరీనా పెళ్లిలో స్నేహితురాళ్ల సందడే సందడి!

ప్రముఖ బాలీవుడ్ కథానాయికలు కరీనా కపూర్, సోనమ్ కపూర్‌లతో పాటు స్వర భాస్కర్, శిఖా తల్సానియా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వీరె ది వెడ్డింగ్'. శశాంక ఘోష్ తెరకెక్కించారు. సోనమ్ సోదరి రియా కపూర్ తండ్రి అనిల్ కపూర్‌తో కలసి నిర్మించారు. నలుగురు ప్రాణ స్నేహితురాళ్ల మధ్య జరిగే కథతో ఈ చిత్రం తెరకెక్కింది. ట్రైలర్‌తో పాటు ప్రచార చిత్రాలతో ఆసక్తి రేకెత్తించడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోన్న నేపథ్యంలో ఈ చిత్ర విశేషాలివీ.

'వీరె ది వెడ్డింగ్'

స్నేహితుల చుట్టూ తిరిగే కథాంశాలతో ఇప్పటికే ఎన్నో చిత్రాలొచ్చాయి. అయితే స్నేహితురాళ్ల జీవితాల నేపథ్యంలో వచ్చిన చిత్రాలు అరుదనే చెప్పాలి. అందుకే 'వీరె ది వెడ్డింగ్' మొదలైనప్పట్నుంచే ప్రేక్షకుల దృష్టినాకర్షించింది. దానికి తోడు కరీనా కపూర్, సోనమ్ కపూర్ లాంటి ప్రముఖ కథానాయికలు కలసి నటిస్తున్న చిత్రం కావడంతో ఆసక్తి మరింత పెరిగింది. ట్రైలర్‌లో కరీనా, సోనమ్ కాస్త బోల్డ్ సంభాషణలు పలకడం చర్చనీయాంశమైంది. మరి ఈ చిత్రం ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి. కరీనా, సోనమ్ కలసి నటించిన తొలి చిత్రమిది. తనయుడు తైమూర్ పుట్టిన తర్వాత కరీనా నటించిన తొలి చిత్రమిదే.

కథేంటి:

కాళింది(కరీనా), అవ్ని(సోనమ్), సాక్షి(స్వర భాస్కర్), మీరా(శిఖా) బాల్య స్నేహితురాళ్లు. పదేళ్ల తర్వాత వారు కలుసుకుంటారు. కాళింది వివాహానికి మిగతా ముగ్గురు హాజరవుతారు. ఆ వేడుకలో తమ జీవితాల్లోని సరదా క్షణాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపేస్తారు. కానీ ఆ ఆనందం మాటునే నలుగురి జీవితాల్లోనూ గూడుకట్టుకున్న దుఃఖం ఉందని అర్థమవుతుంది. ఒకరేమో పెళ్లి కోసం ఇంటి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. మరొకరేమో విడాకులు తీసుకునే ఆలోచనలో ఉంది. ఇంకొకరేమో పెళ్లి చేసుకోబోతూ కూడా అది సరైన నిర్ణయమా కాదా అన్న సందిగ్ధంలో ఉంది. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. అసలు ఓ అమ్మాయి నుంచి సమాజం ఏం ఆశిస్తోంది? దాని కోసం ఎలాంటి ఆంక్షలు పెడుతోంది? కుటుంబ గౌరవం, పెళ్లి, సమాజంలో పరువు ప్రతిష్ఠలు లాంటి చట్రాల్లో చిక్కి స్త్రీల ఆత్మాభిమానం ఎలా ఉక్కిరిబిక్కిరవుతోంది? లాంటి విషయాలను చర్చించేలా ఈ చిత్రం తెరకెక్కింది.

విడుదలకు సిద్ధం

పలాజోలకు సరిజోడీ

ఫ్యాషన్ ఫ్యాషన్

కాలేజీలకైనా.. కార్యాలయాలకైనా.. ట్రెండీగా ఉండే కుర్తీలే ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ముఖ్యంగా పలాజోల మీద వేసుకోవాలంటే... కాస్త ప్రత్యేకంగా ఉండాల్సిందే. అలాంటిదే ఈ వస్త్రశ్రేణి. పలాజోలకు సరిజోడైన ఈ కుర్తీలు ధరిస్తే కళగా మెరిసిపోవడమే కాదు ఆధునికతా ఉట్టిపడటం ఖాయం.

బ్లాక్ ప్రింట్‌తో ఆధునికంగా తీర్చిదిద్దిన కుర్తీకి అద్దాల హంగులు.

అధిక పనితనంతో అందంగా మలచిన పొడవాటి కుర్తీకి సొగసు తెచ్చే సిల్కు దుపట్టా.

ఆప్లిక్, అద్దాలతో రూపొందిన ఒంటె మోటిఫ్‌లూ.. ఎంబ్రాయిడరీ పనితీరు ఈ కుర్తీకి ప్రత్యేకం!

మంగళగిరి పలాజోకు నప్పే కాటన్ టస్సర్ కుర్తా!

నగలు, దుస్తులు:
KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
సైఫాబాద్: 040–23231147/ 23423440
జూబ్లీహిల్స్–040–23540862,
కూకట్‌పల్లి: 040–23152323
విజయవాడ: 0866–2496464
తిరుపతి: 0877–2238820
వైజాగ్: 0891–2577905

మొక్కలు పెంచే ముందు

మొక్కలను పెంచాలనుకోవడం మాత్రమే కాదు...వాటిపై కాస్త శ్రద్ధ పెట్టగలిగితే అవి ఆరోగ్యంగా, అందంగా ఎదుగుతాయి. అందుకోసం ఈ జాగ్రత్తలు ఉపయోగపడతాయి.

- మొక్కల్ని కుండీల్లో పెంచడం సులభం అనుకునేవారి సంఖ్య పెరిగింది. నీళ్లు పోసినప్పుడు మట్టి చెల్లా చెదురు అయిపోకుండా అడుగున ఒక ప్లేటు తప్పనిసరిగా ఉంచాలి. లేదంటే నీళ్లు బయటికి కారిపోయి ఆ ప్రదేశం అంతా బురదగా మారుతుంది.
- మొక్క తీరుని బట్టి దానికి రోజుకి ఎన్నిసార్లు నీరు అందించాలి, ఏ మోతాదులో పోషకాలు వేయాలి అనే విషయం కూడా తెలిసుండాలి.
- కనీసం పదిహేను రోజులకోసారైనా మొక్కపై భాగంలో ఉండే మట్టిని పదునైన వస్తువుతో గుల్లగా చేయాలి. దీనివల్ల మొక్క వేళ్ల నుంచి గాలినీ, దాన్నుంచి పోషకాలనూ సులభంగా గ్రహించగలుగుతుంది. తేమ ఎక్కువగా అవసరమయ్యే మొక్కలకు మట్టిలో పోషకాలతో పాటు కోకోపీట్ కూడా కలపడం తప్పనిసరి.
- పూలు పూశాక అలానే వదిలేయకుండా ప్రూనింగ్ చేసుకోవడం తప్పనిసరి. అలానే ఎండిపోయిన కొమ్మల్నీ, ఆకుల్నీ కూడా కత్తిరించుకుంటే కొత్త చిగురు వస్తుంది. వచ్చేదంతా వర్షాకాలం. ఓ పదిహేను రోజులాగి మొక్కల్ని చక్కగా ప్రూన్ చేసుకుంటే తొలకరి వర్షాలకు చిగురొచ్చి ఆరోగ్యంగా ఎదుగుతుంది.

జీవక్రియల జోరుకు నిద్ర

నిత్యం ఉత్సాహంగా ఉండే మీకు అనుకోకుండా నిస్సత్తువుగా అనిపిస్తోందా.. కాలేజీకి లేదా కార్యాలయానికి వెళ్లాలంటే ఆసక్తి తగ్గిపోయిందా. రోజంతా నిద్రపోవాలనిపిస్తోందా, అయితే మీ శరీరంలో జీవక్రియల వేగం తగ్గుతున్నట్లే అంటున్నారు వైద్యనిపుణులు. ఎటువంటి అలవాట్లు చేసుకుంటే జీవక్రియల వేగాన్ని పెంచుకోవచ్చో చూద్దాం.

- సమయాభావం లేదా అధిక బరువు నియంత్రణలో భాగంగానో రోజంతా ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరంలో జీవక్రియల రేటు సరిగ్గా ఉండదు. అందుకే వేళకు తినాలి. పోషకాహారం తీసుకుంటే బరువు పెరుగుతామనే భయం ఉండదు. తినడానికి సమయం లేకపోయినా కూడా, తేలికగా జీర్ణమై, అధిక శక్తినిచ్చే ఆహారాన్ని ఎంపిక చేసుకుని అప్పుడప్పుడూ తినడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. లేదంటే శక్తి తగ్గిపోయి, ఏ పనిచేయాలన్నా నిస్సత్తువ కలుగుతుంది.
- పని ఒత్తిడి వల్ల నిద్రలేమి లేదా నిద్రపోవడానికి కూడా సమయం సరిపోని పక్షంలో కూడా ఈ సమస్య ఎదురవుతుంది. అందుకే ఎన్ని పనులున్నా సరే... వేళకు నిద్రపోయేలా చూసుకోవాలి. అదీ కనీసం ఏడెనిమిది గంటలు నిద్రపోవాలి.
- జీవక్రియల రేటు చురుగ్గా ఉండాలంటే శరీరానికి నీరు కూడా అవసరమే. రోజంతా అప్పుడప్పుడూ వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగాలి. అలాగే పండ్ల రసాలు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు కూడా శరీరానికి అవసరమే.

ఈ నలుపు సమస్యా?

డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

- పెదవులపై అడుగున ఉన్న చర్మం నల్లగా, బరకగా మారింది. అదేవిధంగా అక్కడి చర్మం మంట పుడుతోంది. ఈ సమస్య వారం ఉండి తరువాత తగ్గిపోతుంది. అయితే ఈసారి పెదవుల చుట్టూ మాత్రమే కాకుండా ముక్కుకు ఇరువైపులా కూడా వచ్చింది. ఇప్పుడు ముఖమంతా వస్తుందేమోనని భయంగా ఉంది. ఇదేమైనా సమస్యా? **- ఓ సోదరి**
- ఇదేమీ పెద్ద సమస్య కాదు. కొందరికి ఈ సమస్య శాశ్వతంగా ఉంటుంది. మరికొందరికి అప్పుడప్పుడూ వచ్చి పోతుంటుంది. మీ సమస్య అదే. కొన్నిసార్లు నలుపే కాకుండా నీలం రంగులోకీ మారుతుంది. ఇదో రకమైన డెర్మటైటిస్. వాపూ, ఎటోపిక్, కాంటాక్ట్ డెర్మటైటిస్ వల్లా వస్తుంది. అలానే వంశపారంపర్యంగా, లిప్‌బామ్, క్రీములూ, మేకప్ పడకపోవడం, పెదాలను కొరుక్కోవడం, నాలుకతో తడిచేసుకున్నా, ఎండలోకి వెళ్లినా కావచ్చు. అలాగే టెట్రాసైక్లిన్, యాంటీడిప్రసెంటు వాడినా ఈ సమస్య ఎదురవుతుంది. శరీరంలో మైక్రోన్యూట్రియంట్లు లోపించినప్పుడు, విషవ్యర్థాలు చేరినప్పుడు, టీ, కాఫీలు ఎక్కువగా తీసుకోవడం, టూత్‌పేస్టులు పడకపోవడం, హార్మోన్ల అసమతుల్యతా, బరువు పెరగడం, నెలసరిలో ఇబ్బందిలున్నప్పుడు.. ఇలా పలు కారణాల వల్ల ఈ సమస్య బాధిస్తుంది. కాబట్టి మీరు ముందు కారణాలు తెలుసుకోవడం మంచిది. దానికి తగినట్టు వైద్యులు మందులు సూచిస్తారు.

పోషకాహారం తీసుకోవాలి. నిద్రకు, తినడానికి వేళలు పాటించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఎండకు వెళ్లినప్పుడు సన్‌స్క్రీన్ రాసుకోవడం, గొడుగు వాడటం చేయాలి. అలానే వైద్యులు ఎజలాయిక్, కోజిక్ యాసిడ్, విటమిన్ సి ఉన్న క్రీములు ఇస్తారు. యాంటీఆక్సిడెంట్లు లభించే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి. అప్పటికీ తగ్గకపోతే కెమికల్ పీల్ చేయించుకోవాలి. అలానే ఈ సమస్య వచ్చినప్పుడు బంగాళాదుంపల్ని కోసి నల్లగా ఉన్నచోట మృదువుగా పదినిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. లేదంటే రసం వాడినా సరిపోతుంది. మాయిశ్చరైజర్, లేదా ఇతర క్రీము రాసుకుంటే మృదువుగా రాయాలి తప్ప గట్టిగా రుద్దకూడదు. అలానే చెంచా చొప్పున బీట్‌రూట్‌రసం, తేనె, పాల పొడి కలిపి పూతలా వేసుకోవాలి. పావుగంటయ్యాక చల్లటి నీళ్లతో కడిగేసుకుంటే చర్మానికి సాంత్వన కలుగుతుంది. వీటితోపాటు తాజాకాయగూరలూ, పండ్లు తినడానికి ప్రాధాన్యమివ్వాలి.

– మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

3న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	32,000	31,910	32,050	32,000
ఆర్నమెంట్	29,900	29,850	29,750	29,750
వెండి (కిలో)	40,830	40,500	41,000	41,000
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,950	31,950	32,040	31,987
ఆర్నమెంట్	29,600	29,600	29,690	29,620
వెండి (కిలో)	41,000	40,800	40,800	40,600
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,840	31,960	-------	-------
ఆర్నమెంట్	29,620	29,720	2,969	2,962 గ్రా
వెండి (కిలో)	40,900	40,000	43.20	42.80 గ్రా

వేట మొదలైందా...

కాలేజీ చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగ వేట మొదలవుతుంది. ఉద్యోగం అనగానే మొదట గుర్తొచ్చేది మన రెజ్యూమె. దాన్ని తయారు చేసుకునే విషయంలో కొన్ని మెలకువలు పాటించి చూడండి.



- మనతో పాటే కాలేజీ పూర్తి చేసుకున్న వారందరి రెజ్యూమె దాదాపు ఒకే రకంగా ఉంటుంది. కానీ మనకంటూ ప్రత్యేకత ఉండాలంటే వీలైనంత వరకు సీనియర్లూ, అంతర్జాలంలో ఉన్న రెజ్యూమెలను ఎట్టి పరిస్థితుల్లో అనుకరించకూడదు. తప్పో, ఒప్పో మన సొంత వాక్యాల్లోనే సిద్ధం చేసుకోడానికి ప్రయత్నించాలి.
- ముందుగా మన లక్ష్యం, మార్కుల వివరాలూ, మనకున్న అలవాట్లూ, విజయాలు... ఇలా వరుసగా రాస్తుంటాం. కానీ అందరికన్నా ప్రత్యేకంగా ఉన్న ప్రతిభ ముందుగా ప్రస్తావిస్తే మేలు. ఉదాహరణకు మీరు చదువులో వెనకబడి ఉండొచ్చు. కానీ ఆటలూ, ప్రాజెక్టుల్లో సాధించిన విజయాలుంటే వాటిని ముందు ప్రస్తావించండి.
- బలాలూ, బలహీనతలూ చెప్పాల్సి ఉంటుంది. అయితే వీలైనంత వరకూ ఎవరూ గుర్తించలేని మనలోని లోపాల్లో కొన్నింటినీ చెప్పడం మంచిది. ఉదాహరణకు మాట్లాడేటప్పుడు తడబడటం మీలో ఉన్న లోపం అనుకోండి. అది ఎలాగో మీరు ముఖాముఖికి వెళ్లినప్పుడు తెలిసిపోతుంది కాబట్టి అది మీ బలహీనతగా ప్రస్తావించండి.

నజరానా

డీహైడ్రేషన్ సమస్య ఎక్కువగా ఉన్నప్పుడు చిన్న దాల్చిన చెక్క ముక్కను బుగ్గన పెట్టుకుని చూడండి. ఫలితం ఉంటుంది.

రోజుకూలీ నుంచి టీచర్‌గా...

నా కథ

జరీనాకు అది పదిహేనేళ్ల నాటి కల. నేడు నెరవేరుతోంది. కూలీ నుంచి టీచర్‌గా ఈ రోజే జీవితం మొదలుపెడుతోంది. మొరటు పనులకు రాటుదేలిన చేతులు.. విద్యార్థుల తలరాతను రాయడానికి సిద్ధమయ్యాయి. నిర్మల్ జిల్లాలోని ముథోల్ గురుకుల పాఠశాలలో తెలుగు టీచర్‌గా విధుల్లోకి చేరనున్న ఆమె నిజమైన విజేత. జీవితంతో పోరాడింది. కష్టాలూ, ఆర్థిక సమస్యలపై గెలుపు బావుటా ఎగురవేసింది. అవేంటో ఆమె చెబితేనే బాగుంటుంది.

రోజులానే ఆరోజూ కూలి పనులకు వెళ్లొచ్చా. సాయంత్రం వచ్చేసరికి గుమ్మం ముందు ఉత్తరం పడి ఉంది. అలసటగా ఉండి పక్కన పెట్టా. కాసేపయ్యాక చూస్తే టీచర్ ఉద్యోగం వచ్చినట్టు సమాచారం ఉంది. నమ్మలేకపోయా. ఒక్క క్షణం ఏడుపు ఆగలేదు. ఆయన ఇంటికి రాగానే చూపించా. అది చూశాక 'ఉత్తరమే కదా! అపాయింట్‌మెంట్ లెటర్ కాదుగా.. తొందరపడి ఎవరికీ చెప్పకు' అన్నారు. అంతే ఆనందం నీరుగారినట్టైంది. మర్నాడు మామూలుగానే కూలి పనులకు వెళ్లా. పొలంలో మిరపకాయలు తెంచుతున్నాననే గానీ ఆలోచనలు ఉద్యోగం మీదే. గబుక్కున్న ఎవరికైనా నోరు జారి ఉత్తరం మాట చెబుతానేమోనని భయపడుతుండేదాన్ని. ఎందుకంటే నేను కూలి పనులు చేసుకుంటూ దూరవిద్యలో చదువుకున్నా. ఎంతోమంది 'ఆడదానికి చదువు ఎందుకు' అన్నారు. మరికొందరు హేళన చేశారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. దాదాపు పదిహేనేళ్లు యుద్ధమే చేశా. నాకే ఎందుకిలా అని నాతోనే గొడవపడేదాన్ని. లక్ష్యం ఒకవైపు.. ఆర్థిక సమస్యలు మరొక వైపు. ఉక్కిరి బిక్కిరి అయ్యా.

మాది ఖమ్మం జిల్లా తల్లాడ దగ్గర నారాయణపురం. నాన్న బియ్యం మిల్లులో కూలీ. అమ్మ గృహిణి. ముగ్గురు ఆడపిల్లల్లో నేను పెద్దదాన్ని. నాన్నకొచ్చే మూడు వేల రూపాయలతో ఇల్లు బొటాబొటీగా గడిచేది. అలాంటి పరిస్థితుల్లోనూ అతి కష్టం మీద ప్రభుత్వ పాఠశాలకు పంపారు. మేం ముగ్గురం ఆడపిల్లలం కావడం వల్ల నాన్నని చాలామంది చులకనగా చూసేవారు. 'ఎందుకు బడికి పంపడం దండగా' అనేవారు. అయినా కష్టం మీద పదో తరగతి వరకూ చదివించారు. ఆ తరువాత అమ్మ పట్టుదల మీద పెళ్లి చేశారు. నా వెనక ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారనేది అమ్మ భయం. మావారిది వైరా దగ్గర సిరిపురం. అప్పటికి ఆయనకి ఇంకా ఉద్యోగం లేదు. పదోతరగతి పూర్తి చేశాడు. మా ఆడపడుచుకి పెళ్లైంది. బడికి వెళ్లే ఇద్దరు మరుదులు ఉన్నారు. దాంతో నేను పనులకు వెళ్లక తప్పలేదు. పెద్ద కోడలిగా బాధ్యతలు మీదపడ్డాయి. మావారితో కలిసి కూలికి వెళ్లడం మొదలుపెట్టా. కుటుంబానికి అండగా నిలబడ్డా. మరుదుల్ని బడికి పంపా.

మూడేళ్లకి చదువు: నేను కూలి పనులకు వెళ్లినా గానీ... టీచర్ ఉద్యోగం మీదే మనసు ఉండేది. దాంతో పెళ్లైన మూడేళ్లకి దూరవిద్య ద్వారా డిగ్రీ చదవాలనుకున్నా. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఫీజు కట్టా. ఇంతలో గర్భం రావడంతో పరీక్షలు రాయలేకపోయా. పాప పుట్టాక తనని చూసుకుంటూ మరుసటి ఏడాది క్లాస్‌లకు వెళ్లకుండానే బీఏ మొదటి సంవత్సరం పరీక్షలు రాశా. ఆ తరువాత కూలి పనులు చేసుకుంటూనే ప్రతి ఆదివారం ఖమ్మంలో తరగతులకు వెళ్లి వచ్చేదాన్ని. రాత్రిపూట నోట్స్‌లు రాసుకుని.. చదువుకునేదాన్ని. మోడల్ పేపర్లు తెచ్చుకునే పరీక్షలకు సిద్ధమయ్యేదాన్ని. మరో వైపు పాపా, అత్తమామల బాధ్యతలూ, ఇంటిపనులు. ఇలా ఒంటరిగా కష్టపడుతుంటే చుట్టుపక్కల చాలామంది 'నువ్వు ఇప్పుడు చదువుకుని ఏం చేస్తావ్.. ఎందుకు నీకీ పనులు' అంటూ ఎగతాళి చేసేవారు. మావారూ, అత్తమామల వద్దకు వెళ్లి 'జరీనా కూలి పనులకు వెళ్లకుండా చదువుకుంటానంటే మీరెందుకు ప్రోత్సహిస్తున్నారు' అని వాళ్లలో ప్రతికూల ఆలోచనలు పెంచే ప్రయత్నం చేసేవారు. అయినా మావారు నన్ను అర్థం చేసుకున్నాడు. 'ఎవరు ఏమన్నా వదిలేయ్ టీచర్ అయ్యేవరకూ' అంటూ వెన్నంటి ఉండేవాడు.

పీజీ చేశా: ఇంతలో తనకి హోంగార్డుగా ఉద్యోగం వచ్చింది. కాస్త కుటుంబానికి ఆర్థిక భరోసా దొరికింది. అయినా సరే కూలి పనులు చేయక తప్పలేదు. అలా మంచి మార్కులతో బీఏ పూర్తి చేశా. ఆ తరువాత బీఈడీ ప్రవేశ పరీక్ష రాశా. మంచి ర్యాంకు వచ్చింది. ఇంతలో మా మరుదుల చదువూ, పెళ్లిళ్లూ అయిపోయాయి. వాళ్లూ వేరు కుటుంబాలు పెట్టుకున్నాక మాకు కాస్త భారం తగ్గింది. మాకూ రెండోసారి బాబు పుట్టాడు. సమస్యలున్నా మావారు బీఈడీకి కాలేజీకి వెళ్లమని ప్రోత్సహించారు. ఏడాది పాటు నేను పనులకు వెళ్లకుండా కాలేజీకి వెళ్లా. చాలా ఇబ్బందులు పడ్డాం. ఆ తరవాత టెట్ ప్రవేశ పరీక్ష రాశా. కానీ రాలేదు. రెండోసారి కూడా అంతే. అలాగని కూలి పనులు ఆపలేదు. చదువుకోవడం మానలేదు. ఇంట్లో చదువుకుంటూ పరీక్షలకు వెళ్లా. ఆ సమయంలో ఎంతో మానసిక వ్యథ అనుభవించేదాన్ని. మధ్యలో కొన్నాళ్లు డీఎస్సీ పడలేదు. నిరాశను దూరం చేసుకోవడానికి 2015లో దూరవిద్యలో ఎం.ఎ. రాయడానికి ఫీజు కట్టా. రెండేళ్లు కష్టపడి తెలుగులో పీజీ పూర్తి చేశా. అయితే ఈ ఏడాది మొదట్లో టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్) పోస్టులు పడటంతో ప్రిలిమ్స్ రాసి.. మెయిన్స్‌కి ఎంపికయ్యా. దీనికీ శిక్షణ తీసుకోలేదు. అలా కౌన్సెలింగ్, ముఖాముఖి తరువాత ఆ ఉత్తరం చేతికందింది. అప్పటి వరకూ ఇంత జరిగింది. ఇలా గతం గుర్తొచ్చి నిద్ర పట్టేది కాదు. చివరికి వారం రోజుల తరవాత అపాయింట్‌మెంట్ లెటర్ వచ్చింది. అలా ఖమ్మం జిల్లా నుంచి నా ప్రయాణం నిర్మల్ జిల్లాకు చేరుకుంది. ప్రపంచం విస్తరించింది. కొత్త అనుబంధాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడు ఒకటే బాధ. పిల్లల్ని వదిలేసి వచ్చానని. అయితే అన్నింటికంటే గొప్పగా అనిపించింది ఏంటంటే.. నన్ను హేళన చేసిన వాళ్లే మా ఇంటికి వచ్చి పొగుడుతుంటే మాత్రం గర్వంగా ఉంది. బడికి వచ్చాక నేను కొత్తగా పుట్టినట్టు అనిపించింది.

ఊరూరా సెలయేళ్లు. ఓచోట ముందుకు ఉరికే నదీనదాలు. మరోచోట వెనక్కి మళ్లిన సాగర జలాలు. ఈ వాగుల్లోకి వంగి చూస్తూ పొంగిపోయే కొబ్బరి చెట్లు.. ఇదీ కేరళ సౌందర్యం. ఎన్నెన్నో అందాలు తురుముకున్న పడమటి కనుమలు.. తొలకరి జల్లుల్లో మరింత సౌందర్యాన్ని సంతరించుకుంటాయి. రుతురాగాల వేళ.. కమ్ముకొచ్చే కారుమబ్బులు.. అమాంతంగా కురిసే వానజల్లులు.. వెల్లివిరిసే హరివిల్లులతో మలయాళసీమ మరింత మనోహరంగా దర్శనమిస్తుంది. ఆ సహజ సౌందర్యాన్ని ఆస్వాదించాలనుకుంటున్నారా.. కేరళలోని ఈ ప్రాంతాలకు వెళ్లిరండి మరి.

పడమటి కనుమల్లో.. తొలకరి జల్లుల్లో..



వానలో.. నావలో.. అలెప్పీ

నీటిపై తేలియాడుతున్నట్టుండే అలప్పుజా(అలెప్పీ)కు 'తూర్పు వెనీస్' అన్న పేరుంది. అలెప్పీలో అడుగడుగునా కాలువలే. వాటిలో తేలికపాటి తెప్పలతో మొదలుపెడితే.. రాజభవనాన్ని మరిపించే హౌస్‌బోట్ల వరకు రకరకాలు కనిపిస్తాయి. కాలువ గట్లు ఆకుపచ్చ తివాచీ పరచినట్టు పచ్చగా ఉంటాయి. కొబ్బరిచెట్ల ఆకులు ఈ కాల్వలకు గొడుగు పడుతుంటాయి. సహజ సౌందర్యంతో కనువిందు చేసే అలెప్పీలో సకుటుంబ సమేతంగా హౌస్‌బోట్‌లో విహరిస్తే అంతకన్నా ఆనందం ఏముంటుంది. ఇక్కడి వెంబనాడ్ సరస్సు సౌందర్యం గురించి ఎంత చెప్పిన తక్కువే. ఈ సరస్సులో పతిరమన్నాల్ ద్వీపంలో విహరించకుండా పర్యాటకులు తిరుగు ప్రయాణమవ్వరు. కాలువలు, సరస్సులే కాదు.. బీచ్‌లతో కూడా అలరిస్తుంది అలెప్పీ!

చూడాల్సినవి

అలెప్పీ బీచ్
కృష్ణపురం బీచ్
అలెప్పీ లైట్‌హౌస్
ముళ్లక్కల్ దేవీ ఆలయం
అంబలపుజా దేవాలయం

ఎలా వెళ్లాలి?

- విజయవాడ, విశాఖపట్టణం నుంచి అలెప్పీకి నేరుగా రైళ్లు అందుబాటులో ఉన్నాయి.
- సికింద్రాబాద్ నుంచి ఎర్నాకులం వరకు రైళ్లో వెళ్లి.. అక్కడి నుంచి బస్సులో అలెప్పీ (58 కి.మీ) చేరుకోవచ్చు.
- అలెప్పీ సమీపంలో కొచ్చి విమానాశ్రయం ఉంది. హైదరాబాద్ నుంచి కొచ్చీకి నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి. విజయవాడ, విశాఖల నుంచి సింగిల్‌స్టాప్ సర్వీసులు ఉన్నాయి.

హరిత భరితం వయనాడ్

వయనాడ్ జిల్లా వానల రాకతో కడిగిన ముత్యంలా మెరిసిపోతూ దర్శనమిస్తుంది. కాబిని, పనమరామ్ నదుల మధ్య ఉన్న వయనాడ్‌లో సారవంతమైన నేలలు ఎక్కువ. ఈ జిల్లా సముద్రమట్టానికి 700 నుంచి 2100 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. అటవీ విస్తీర్ణం ఎక్కువే. వయనాడ్ జిల్లా పరిపాలనా కేంద్రం కల్పెట్టా. ఆదివాసీలు ఎక్కువగా ఉంటారిక్కడ. కాఫీ, టీ తోటలు కనిపిస్తాయి. సుగంధ ద్రవ్యాలు విశేషంగా పండిస్తారు. కొండలు, లోయలు, మైదానప్రాంతాలు, కాలువలు.. ఇలా ఈ ప్రాంతమంతా హరిత భరితమే.

ఎలావెళ్లాలి?

- వయనాడ్‌కు సమీపంలో ఉన్న రైల్వేస్టేషన్ కొజికోడ్ (85 కి.మీ). హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి కొజికోడ్‌కు రైళ్లు (వీక్లీ) అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి నుంచి కల్పెట్టాకు బస్సులు, ట్యాక్సీలో వెళ్లొచ్చు.
- ఎర్నాకులం, త్రిశూర్, కొచ్చి, తిరువనంతపురం నుంచి కూడా వయనాడ్ జిల్లా కేంద్రానికి బస్సులు, ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి.
- హైదరాబాద్, బెంగళూరు నుంచి వయనాడ్‌కు ట్రావెల్ బస్సులు కూడా నడుస్తున్నాయి.

వయల్ (వరి పంటలు), నాడ్ (ప్రాంతం) వరి అధికంగా పండే ప్రాంతం కావడంతో దీనిని వయల్‌నాడ్ అంటారు. అదే వయనాడ్‌గా స్థిరపడింది

చూడాల్సినవి

వయనాడ్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రం
కురువా ద్వీపం, కాబిని నది
బాణాసుర సాగర్
మీన్‌ముట్టి జలపాతం
లక్కిడీ వ్యూపాయింట్
నీలిమల వ్యూ పాయింట్, చెంబ్రా పీక్



తనువెల్లా హరివిల్లు తెన్మల

నగరాల రణగొణ ధ్వనులకు దూరంగా.. కీచురాళ్ల ఇచ్చికాలకు దగ్గరగా.. ఉన్న మనోహరమైన సీమ తెన్మల. కొల్లం నగరానికి 66 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మనదేశంలో తొలి పర్యావరణ యాత్రా కేంద్రంగా గుర్తింపు పొందిన పర్యాటక ప్రదేశమిది. తెన్మల అంటే తేనె గుట్ట అని అర్థం. ఒకప్పుడు ఇక్కడి చెట్టు, పుట్ట, గుట్ట తేనెపట్టులతో అలరిస్తూ ఉండేది. ఇప్పుడన్ని తేనెటీగలు లేవనుకోండి. కానీ, ఇక్కడి వనంలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, చెట్లు దండిగా ఉన్నాయి. తొలకరి పలకరింపుతో తెన్మల తనువెల్లా హరివిల్లు విరబూస్తుంది. ప్రకృతి ఆరాధకులు తప్పకుండా సందర్శించాల్సిన ప్రదేశం ఇది. సాహస యాత్రికుల కోసం ట్రెక్కింగ్, రాక్‌క్లైంబింగ్ వంటి ఆటలూ అందుబాటులో ఉన్నాయి. భారీ వృక్షాల మధ్య నుంచి నేలకు పాతిక అడుగుల ఎత్తులో నిర్మించిన ప్రత్యేక మార్గంపై నడక మధురమైన అనుభూతినిస్తుంది.

ఎలా వెళ్లాలి?

- కొల్లం నుంచి తెన్మలకు 66 కి.మీ దూరం. తిరువనంతపురం 72 కి.మీ. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి కొల్లం, తిరువనంతపురానికి రైళ్లు అందుబాటులో ఉన్నాయి. అక్కడి నుంచి బస్సులోగానీ, ట్యాక్సీలో గానీ తెన్మల చేరుకోవచ్చు.
- హైదరాబాద్ నుంచి తిరువనంతపురానికి నాన్‌స్టాప్ విమానసర్వీసులు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ, వైజాగ్ నుంచి కనెక్టింగ్ సర్వీసులు ఉన్నాయి.

చూడాల్సినవి

లీజర్ జోన్
నక్షత్రవనం
తెన్మెల డ్యామ్
బటర్‌ఫ్లై సఫారీ
వేలాడే వంతెన
షెండుర్ని వన్యప్రాణి సంరక్షణ కేంద్రం
పాండవుల గుహ

సంద్రమంత సంతోషం కోవలం

కోవలం అంటే 'కొబ్బరిచెట్ల వనం' అని అర్థం. కేరళ అనగానే నారికేళ వృక్షాలే కళ్లముందు కదలాడుతాయి. కోవలంలో మరింత ఎక్కువగా కనిపిస్తాయి. కేరళ రాజధాని త్రివేంద్రం నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ పర్యాటక కేంద్రం సముద్ర తీరాలకు పెట్టింది పేరు. ఒకప్పుడు చేపలవేటకు ప్రసిద్ధిగా ఉన్న ఈ ప్రాంతం 1970 నుంచి పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. హిప్పీలు తమ కార్యకలాపాలకు దీనిని అడ్డాగా మలుచుకోవడంతో ట్రావెలోకంలో కోవలం పేరు వినిపించడం మొదలైంది. కేరళలోని సుందర ప్రదేశాలకు దీటుగా ఇప్పుడు పర్యాటకులను అలరిస్తోంది. ఏడాది పొడవునా కోవలంలో పర్యాటకుల రద్దీ కనిపిస్తుంది. రుతుపవనాల వేళ తీరం వెంబడి చల్లటి గాలులు వీస్తుంటాయి. ఆకాశంలో నల్లని మబ్బులు బారులు తీస్తాయి. చిరుజల్లులు మొదలయ్యాక మనసులో సంతోషం సంద్రమంత ఉప్పొంగుతుంది.

- కోవలం బీచ్ సాహస క్రీడలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. కోవలం సర్ఫింగ్ క్లబ్ నిర్వాహకులు యాత్రికులకు సర్ఫింగ్ శిక్షణ కూడా ఇస్తుంటారు.

ఎలావెళ్లాలి?

- ముందుగా తిరువనంతపురం చేరుకోవాలి. అక్కడి నుంచి సులభంగా కోవలం వెళ్లొచ్చు.



చూడాల్సినవి

లైట్‌హౌస్ బీచ్
హవా బీచ్
సముద్ర బీచ్
కోవలం చేపల మార్కెట్
వెల్లయానీ సరస్సు
తిరువనంతపురం

లోకల్ టూర్

6869 ఊడల మర్రి



"నాటేది ఒక్క మొక్క.. వేసేను నూరు కొమ్మ.. కొమ్మ కొమ్మ విరగబూసే వేలాదిగా.." రేపటి తరానికి పచ్చదనం పంచాలనుకున్న ఓ పెద్దాయన పాడుకున్న పాట ఇది. ఎలా పుట్టిందో.. ఎప్పుడు చిగురించిందో స్పష్టత లేదు. ఈ మర్రిమాను మాత్రం వందలాది కొమ్మలతో విస్తరించింది. వేల ఊడలతో... ఎనిమిదిన్నర ఎకరాల్లో నీడనిస్తోంది. ఆ మహామాను ఎక్కడుందంటే...

ఎక్కడికి వెళ్లినా.. పచ్చని చెట్టు కనిపిస్తే... దాని నీడలో కాసేపు సేదతీరి ప్రయాణ బడలికను తీర్చుకుంటాం. ఓ చెట్టును చూసేందుకు ప్రయాణం కడితే.. అది తిమ్మమ్మ మర్రిమాను యాత్ర అవుతుంది. అనంతపురం జిల్లా ఎన్పీకుంట మండలం గూటిబైలులో ఉందీ భారీ వృక్షం. వయసు 660 ఏళ్లకు పైమాటే. 1989లో ప్రపంచంలోనే అతిపెద్ద మర్రిమానుగా గిన్నిస్ రికార్డు సాధించింది. తాజా సర్వేలో 6,869 ఊడలతో ఎనిమిదిన్నర ఎకరాల్లో విస్తరించి ఉందని తేలింది. మర్రిమాను కిందికి వెళ్తే.. ఏదో అరణ్యంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. అడుగడుగునా ఓ ఊడ కనిపిస్తుంది. దేనికదే ఇదే చెట్టు మొదలేమో అనిపిస్తుంది. ఆకాశమంత హరిత పందిరి, భూమంతా ఆక్రమించిన వటవృక్షాన్ని చూసిన ఆశ్చర్యంలో గంటలు నిముషాల్లా గడిచిపోతాయి.

కదిరి సమీపంలో..

తిమ్మమ్మ వటవృక్షం కదిరికి 27కి.మీల దూరంలో ఉంది. కదిరి నుంచి బస్సులు, ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. కడప నుంచి రాయచోటి, ఎన్పీకుంట మీదుగా కూడా అక్కడికి చేరుకోవచ్చు. చిత్తూరు జిల్లా వాసులు కొక్కంటిక్రాస్ మీదుగా వస్తుంటారు. కదిరి నారసింహుడిని దర్శించుకున్న భక్తులు చాలామంది పనిలో పనిగా మర్రిమాను సందర్శనకు తరలి వస్తారు.

మర్రి చుట్టూ ప్రదక్షిణ

1990 నుంచి తిమ్మమ్మ మర్రిమాను సంరక్షణ బాధ్యతలను అటవీశాఖ చేపట్టింది. ప్రజల సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. చెట్టు ఊడలు పాడవకుండా తగు జాగ్రత్తలు చేపట్టారు. అంతేకాదు మర్రిమాను విస్తరించిన 8.5 ఎకరాల చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. యాత్రికులు నడిచేందుకు కాలిబాట నిర్మించారు. మర్రిమాను పరిసరాల్లో పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం కూడా ఉంది. వన్యప్రాణుల షెడ్డు నిర్మించి పావురాలు, నెమళ్లు, కుందేళ్లను సాకుతున్నారు. యాత్రికుల బస కోసం పర్యాటక శాఖ అతిథి గృహాన్ని కూడా నిర్మించింది.

తిమ్మమ్మ శక్తితోనే..

తిమ్మమ్మ మర్రిమానుకు ఆ పేరు రావడం వెనుక ఓ కథ ప్రచారంలో ఉంది. తిమ్మమాంబ బుక్కపట్నానికి చెందిన వెంకటాచార్యులు, మంగమాంబల కుమార్తె. గూటిబైలుకు చెందిన బాలవీరయ్యతో 1335 ప్రాంతంలో ఆమె వివాహం అయింది. ఈ దంపతులకు ఇద్దరు బిడ్డలు పుట్టి చనిపోయారు. కొంతకాలానికి బాలవీరయ్య కుష్ఠువ్యాధితో మరణించాడు. దీంతో తిమ్మమాంబ సతీసహగమనం చేసింది. భర్త కోసం పేర్చిన చితిలో దూకడానికి ఆమె ఏర్పాటు చేసుకున్న పందిరి గుంజ (కర్ర) కొంతకాలానికి చిగురించిదట. అదే మహావృక్షంగా ఎదిగిందని చెబుతారు. నీరు పుట్టని కరవు సీమలో ఈ మర్రిమాను ఇంతలా విస్తరించడానికి తిమ్మమ్మ పతిభక్తి, శక్తే కారణమని స్థానికుల విశ్వాసం. తిమ్మమ్మను వనదేవతగా ఆరాధిస్తున్నారు. సంతానం లేని దంపతులు తిమ్మమ్మ మర్రిమానుకు ముడుపు కడితే పిల్లలు కలుగుతారని విశ్వసిస్తారు. తిమ్మమాంబ జననం, వివాహం, సతీసహగమనం సోమవారమే జరిగాయంటారు. అందుకే ఏటా మే నెల చివరి సోమవారం తిమ్మమాంబకు మర్రిమాను పరిసర గ్రామాల ప్రజలు బోనాలు సమర్పిస్తారు.

- **చలపతి బోనాల**, న్యూస్‌టుడే, కదిరి **ఫొటోలు:** వెంకట సుబ్బయ్య

సులువుగా చారిత్రక నెలవుకు..

అజంతా చిత్ర సౌందర్యాన్ని చూడాలనుకుంటున్నారా! ఎల్లోరా శిల్ప లావణ్యాన్ని ఆస్వాదించాలని ఉందా! వెంటనే మీ చరవాణిని చేతుల్లోకి తీసుకోండి. యాత్రా.కామ్‌గానీ, బుక్‌మైషో యాప్‌గానీ ఓపెన్ చేయండి. మీరు కోరుకున్న తేదీలో ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోండి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'డిజిటల్ ఇండియా'లో ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా సేవలూ వచ్చి చేరాయి. చారిత్రక కట్టడాలు, ప్రదేశాలు, ప్రదర్శనశాలలను పర్యాటకులకు మరింత చేరువ చేయాలని ఆర్కియాలజీ విభాగం నిర్ణయించింది. తాజ్‌మహల్, అజంతా-ఎల్లోరా గుహలు, కుతుబ్‌మినార్, కోణార్క్ సూర్యదేవాలయం లాంటి 141 ప్రదేశాల ప్రవేశ టికెట్‌లను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చింది. యాత్రా.కామ్, బుక్‌మైషో ద్వారా టికెట్లు విక్రయిస్తోంది. అదనపు రుసుము లేకుండా ఈ సేవలను అందిస్తోంది.

ఎక్కడైనా మార్చుకోవచ్చు

రైల్ way

టికెట్ కన్‌ఫర్మ్ అయ్యాక.. రైలు ఎక్కాల్సిన స్టేషన్‌ను మార్చుకోవడం ఎలా?

బోర్డింగ్ స్టేషన్ మార్చుకునే సదుపాయం రైల్వే కల్పిస్తోంది. ఏదైనా రైల్వే స్టేషన్‌కు వెళ్లి.. టికెట్ చూపించి స్టేషన్ మార్చుకోవచ్చు. ఆన్‌లైన్ రిజర్వేషన్ కౌంటర్‌లోనూ మార్చుకోవచ్చు. అయితే రైలు బయల్దేరడానికి 24 గంటల ముందు ఈ పని చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు మీరు సికింద్రాబాద్ నుంచి దిల్లీకి టికెట్ బుక్ చేసుకున్నారు. అనుకోకుండా కాజీపేట్ జంక్షన్‌లో రైలు ఎక్కాల్సి వచ్చిందనుకోండి.. ఏదైనా స్టేషన్‌లో టికెట్ చూపించి బోర్డింగ్ స్టేషన్‌ను కాజీపేట్‌గా మార్చుకోవాలి. అంతేకాదు.. మీరు కాజీపేట్‌లో ఎక్కినంత మాత్రాన.. సికింద్రాబాద్ నుంచి కాజీపేటకున్న టికెట్ ధర మీకు తిరిగి చెల్లించరు. మరో విషయం ఒక్కసారి బోర్డింగ్ స్టేషన్ మార్చాక ఎట్టి పరిస్థితుల్లోనూ మారిన స్టేషన్‌లోనే రైలు ఎక్కాల్సి ఉంటుంది. మళ్లీ ప్రణాళిక మారిందని మొదట అనుకున్న స్టేషన్‌లో రైలు ఎక్కితే.. అక్కడి నుంచి మీరు మార్చుకున్న స్టేషన్‌కు టికెట్ ధర ఎంతో ఆ మొత్తాన్ని పెనాల్టీతో వసూలు చేస్తారు.

ట్రిప్‌కో టిప్

రద్దీగా ఉండే ప్రాంతాల్లో విహరిస్తున్నప్పుడు హ్యాండ్‌బ్యాగ్‌లో అసలు పర్స్ ఉంచి.. చేతిలో ఓ డమ్మీ పర్స్ పట్టుకోవాలి. అందులో నాలుగు అట్టముక్కలు, చిత్తుకాగితాలు ఉంచితే సరిపోతుంది. దొంగల దృష్టి మరల్చే ప్రయత్నమిది. అంతేకాదు డబ్బంతా ఒకేచోట కాకుండా నాలుగైదు చోట్ల భద్రపరుచుకోవడం మంచిది.

తిరుమలలో దళారుల దందా

- బ్రేక్ దర్శనం టిక్కెట్లు రూ.30 వేలకు విక్రయం
- తెలంగాణ ఎమ్మెల్యే సిఫారసు లేఖపై జారీ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో దళారుల దందా మరోసారి బయటపడింది. వీఐపీ బ్రేక్ దర్శనానికి సంబంధించిన ఐదు టిక్కెట్లను రూ.30 వేలకు విక్రయించిన వైనాన్ని తితిదే విజిలెన్స్ రట్టు చేసింది. చిత్తూరు జిల్లా పుత్తూరుకు చెందిన వెంకయ్య తిరుపతి నుంచి తిరుమలకు కుటుంబసభ్యులతో ఓ ట్రావెల్స్ కారులో బుధవారం బయలుదేరారు. మార్గమధ్యంలో కారు డ్రైవర్ కిరణ్.. తాను వీఐపీ బ్రేక్‌దర్శనం ఎల్-1 శ్రేణి టిక్కెట్లు ఇప్పిస్తానని, ఒక్కో టిక్కెట్టుకు రూ.ఆరు వేలు ఖర్చవుతుందని ఒప్పందం చేసుకున్నారు. జాఫర్ అనే వ్యక్తి ప్రమేయంతో తెలంగాణకు చెందిన ఓ మాజీ మంత్రి, ప్రస్తుత మహిళా ఎమ్మెల్యే సిఫారసు లేఖపై జేఈవో కార్యాలయం ఎల్-3 శ్రేణి టిక్కెట్లను జారీ చేసింది. ఆ సమయంలోనే ఈ వ్యవహారం విజిలెన్స్ దృష్టికి వచ్చింది. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనానికి వెళ్లే సమయంలో క్యూలైన్‌లో ఈ భక్తులను పరిశీలించగా అక్రమం బయటపడింది. దీనిపై తితిదే విజిలెన్స్ అధికారులు తిరుపతి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్తు ఉద్యోగులకు 25% ఫిట్‌మెంట్

- ప్రభుత్వంపై ఏటా రూ.860కోట్ల భారం
- మంత్రి కిమిడి కళావెంకట్రావు వెల్లడి

ఈనాడు - అమరావతి

విద్యుత్తు శాఖ ఉద్యోగులకు వేతన సవరణలో భాగంగా 25శాతం ఫిట్‌మెంట్ ఇవ్వనున్నట్లు విద్యుత్తు శాఖ మంత్రి కిమిడి కళావెంకట్రావు తెలిపారు. గురువారం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడ్డాక వేతన సవరణ చేయడం ఇది రెండోసారని, దీని వల్ల పింఛన్‌దారులు, ఉద్యోగులు కలిపి 58,036 మందికి లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఈ ఫిట్‌మెంట్ ఇవ్వడం వల్ల ఏడాదికి రూ.860 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని, విద్యుత్తు ఛార్జీలు పెంచనప్పటికీ ఉద్యోగుల సంక్షేమం, శ్రేయస్సు దృష్ట్యా ఆర్థికంగా భారమైనా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వేతన సవరణ వర్తించే వారిలో 31,543 మంది ఉద్యోగులు, 26,493 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. ఉద్యోగుల్లో 51ఏళ్ల పైబడిన వారికి 3 ఇంక్రిమెంట్లు, 51ఏళ్ల లోపు వారికి రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వనున్నామని చెప్పారు. గ్రామీణ విద్యుత్తు సహకార సంఘాల్లో (ఆర్‌ఈసీఎస్) పని చేస్తూ మృతి చెందిన 32 మంది కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని తెలిపారు. రాష్ట్రంలో రెండో దశ విద్యుత్తు సంస్కరణలు అమలు చేసేందుకు ఉద్యోగులు సంసిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్తు ఉద్యోగ ఐక్య కార్యచరణ కమిటీ ఛైర్మన్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విభజన తర్వాత రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పీఆర్సీ అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 6,000 జూనియర్ లైన్‌మెన్లు, వెయ్యి సబ్ ఇంజినీర్లు, 500 ఏఈలు, 15వందల జేఈఈల ఖాళీలను భర్తీ చేయాలని సీఎం చంద్రబాబును కోరగా చర్యలు తీసుకోమని మంత్రికి చెప్పారని వెల్లడించారు. పొరుగుసేవల కింద పని చేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి మరోసారి చర్చలకు సీఎం అంగీకరించారని తెలిపారు.

★ ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థులు ఓటమి చెందడంపై మంత్రి కళావెంకట్రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిమానాన్ని చూరగొనాలని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే వ్యతిరేక ఫలితాలే వస్తాయని వెల్లడించారు. ఇందుకు ప్రధాని మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాలు అతీతులు కారని ఆయన వ్యాఖ్యానించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ స్వల్పకాలిక కోర్సులు

ఈనాడు అమరావతి: హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో ఉపాధి ఆధారిత శిక్షణ కోర్సులను ఎస్ఐహెచ్ఎంసీటీ(స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీ అప్లయిడ్ న్యూట్రిషన్)లో అందుబాటులోకి తీసుకురావాలని ఆ సంస్థ పాలకమండలి తీర్మానించింది. సంస్థ ఛైర్మన్, రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైంది. ఇప్పటికే అందిస్తున్న డిగ్రీ కోర్సులతోపాటు ఆర్నెళ్లు, సంవత్సరం కాలవ్యవధితో డిప్లమా కోర్సులను ప్రవేశపెట్టాలని అభిప్రాయపడింది.

గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట: మంత్రి జవహర్

ఈనాడు, అమరావతి: గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రాష్ట్రంలో కొత్తగా పది ఎక్సైజ్ తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి జవహర్ తెలిపారు. గురువారం సచివాలయంలో మాట్లాడారు విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో అదనంగా ఈ తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సారా రహిత గ్రామాల రూపకల్పనలో భాగంగా ఇప్పటికే 9జిల్లాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించామని, తాజాగా మరో 4జిల్లాల్లోనూ ప్రారంభించామని చెప్పారు.

డబ్ల్యూహెచ్‌వో వెల్లడి

దిల్లీ: పొగరాయుళ్ల సంఖ్యలో భారత్ రెండో స్థానంలో ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తెలిపింది. మన దేశంలో 10.6 కోట్ల మంది పొగ తాగుతున్నట్లు వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా అయితే ఈ సంఖ్య 110 కోట్లకుపైనే ఉన్నట్లు పేర్కొంది. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవ నేపథ్యంలో.. ట్రెండ్స్ ఇన్ ప్రివెలెన్స్ ఆఫ్ టొబాకో స్మోకింగ్ 2000-2025 పేరిట సంస్థ గురువారం ఓ నివేదిక విడుదలచేసింది. ప్రపంచ వ్యాప్తంగా 15ఏళ్లకుపైబడిన వ్యక్తుల ధూమపాన అలవాట్లను విశ్లేషించింది. దీనిలోని వివరాల ప్రకారం..

- ఎక్కువ మంది పొగరాయుళ్లతో చైనా మొదటి స్థానంలో ఉంది.
- 7.4 కోట్ల మందితో ఇండోనేసియా మూడో స్థానంలో ఉంది.
- ప్రపంచ వ్యాప్తంగా ‘‘పొగరహిత పొగాకు’’ వినియోగిస్తున్న వారి సంఖ్య 36.7 కోట్లు (23.7 కోట్ల మంది పురుషులు, 12.9 కోట్ల మంది మహిళలు). వీరిలో 20 కోట్ల మంది భారత్‌లోనే వున్నారు.

- ప్రాంతాల వారీగా చూస్తే పొగ రహిత పొగాకు వినియోగంలో 30.1 కోట్ల మంది (82 శాతం)తో ఆగ్నేయాసియా మొదటి స్థానంలో ఉంది.
- 2000తో పోలిస్తే ప్రస్తుతం పొగాకు వినియోగం తగ్గింది. 2000లో మొత్తం జనాభాలో 27 శాతంగావున్న ఈ సంఖ్య.. 2016 నాటికి 20 శాతానికి తగ్గింది. అయితే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లోని ఆరోగ్య గమ్యాలను చేరుకోవాలంటే ఈ పురోగతి సరిపోదు.

ఏటా ప్రపంచ వ్యాప్తంగా 70 లక్షల మందిని పొగాకు బలితీసుకుంటోంది.

ఏపీ పోలీసులకు పురస్కారాల పంట

- డీజీపీ మాలకొండయ్యకు స్పెషల్ జ్యూరీ అవార్డు
- ఏపీ నుంచి మొత్తం ఏడు సాంకేతిక ఆవిష్కరణలు ఎంపిక

కేంద్ర మంత్రి విజయ్‌గోయల్, ఫిక్కీ ప్రతినిధుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న డీజీపీ ఎం.మాలకొండయ్య, చిత్తూరు, ప్రకాశం జిల్లాల ఎస్పీలు రాజశేఖర్‌బాబు, సత్య ఏసు బాబు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగం రూపొందించి అమలు చేస్తున్న పలు సాంకేతిక ఆవిష్కరణలకు ఫిక్కీ పురస్కారాలు వరించాయి. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్), రెడ్ శాండిల్ ఎక్యూజ్డ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ (ఆర్ఏఐఎస్), ఈ-వెరిఫై, ప్యాపిలోన్, అఫెండర్స్ సర్వైలెన్స్ సిస్టమ్, ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (పిన్స్)లకు ఇవి దక్కాయి. వీటితో పాటు స్మార్ట్ ఇన్నోవేటివ్ పోలీస్ స్పెషల్ జ్యూరీ పురస్కారమూ లభించింది. దిల్లీలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి విజయ్‌గోయల్, ఫిక్కీ ప్రతినిధులు చేతుల మీదుగా డీజీపీ ఎం.మాలకొండయ్య, చిత్తూరు, ప్రకాశం జిల్లాల ఎస్పీలు ఎస్‌వి.రాజశేఖర్‌బాబు, బి.సత్య ఏసుబాబులు అవార్డులను అందుకున్నారు. దేశంలోని పోలీసు విభాగాల్లో అమలవుతున్న అత్యుత్తమ సాంకేతిక ఆవిష్కరణలను ఎంపిక చేసి..ఏటా వాటికి ఫిక్కీ పురస్కారాలను అందజేస్తుంటుంది. ఈ ఏడాది దేశంలోని వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాల నుంచి 211 సాంకేతిక ఆవిష్కరణలు తుది పోటీలో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 14 ఆవిష్కరణలు పంపించగా..ఆరు ఎంపికయ్యాయి. వీటిల్లో ఎల్‌హెచ్ఎంఎస్, ఆర్ఏఐఎస్‌లు చిత్తూరు జిల్లా ఎస్పీ ఎస్.వి.రాజశేఖర్‌బాబు, ఈ-వెరిఫై ప్రకాశం జిల్లా ఎస్పీ బి.సత్య ఏసుబాబు ఆలోచనల మేరకు రూపుదిద్దుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం రూపొందించిన సరికొత్త వేలిముద్రల వ్యవస్థే ప్యాపిలోన్. పోలీసు స్టేషన్‌లలో సంవత్సరాలు తరబడి పేరుకుపోయిన వాహనాలను చట్టానికి లోబడి సంబంధిత యజమానులకు అప్పగించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన వ్యవస్థే పిన్స్. ఇది శిక్షణ విభాగం ఐజీ సంజయ్ ఆలోచనల్లో నుంచి ఉద్భవించింది.

పీసీసీఎఫ్‌గా మహ్మద్ ఇలియాస్ రిజ్వీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్(అటవీదళాల అధిపతి)గా డా.మహ్మద్ ఇలియాస్ రిజ్వీ నియమితులయ్యారు. ఆయన 1985 బ్యాచికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి. ఇప్పటివరకూ పీసీసీఎఫ్‌గా పనిచేసిన పి.మల్లికార్జునరావు గురువారం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రిజ్వీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పించన్ల విభాగం పీసీసీఎఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఇకపై అటవీ దళాల అధిపతిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.



ఉత్తమ ర్యాంకర్లు.. ఎంసెట్ కౌన్సెలింగ్‌పై నిరాసక్తి!

- వందలోపు ర్యాంకుల్లో ప్రాసెసింగ్ రుసుము చెల్లించింది ముగ్గురే

ఈనాడు, అమరావతి: ఏపీఎంసెట్-2018(ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్‌కు ఉత్తమ ర్యాంకులు సాధించినవారు దూరంగా ఉన్నారు. దీంతో పెద్ద ర్యాంకులు సాధించిన వారికి మంచి ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు లభించే పరిస్థితి నెలకొంది. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ర్యాంకులు లభించి, నిట్, ఐఐటీల్లో సీట్లు వస్తాయని భావించిన వారిలో చాలామంది ఈ కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. దీంతోపాటు డీమ్డ్ ప్రైవేటు వర్సిటీల్లో ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. రుసుములు చెల్లించగలిగే స్థోమత ఉన్నవారిలో చాలామంది వీటిల్లో ప్రవేశాలు పొందారు. వంద ర్యాంకుల లోపులో ముగ్గురు మాత్రమే ప్రాసెసింగ్ రుసుము చెల్లించగా.. 1001-1500 వరకు ర్యాంకుల్లో 167మంది మాత్రమే ప్రవేశాల కోసం ముందుకొచ్చారు. ఐచ్ఛికాలు సమర్పించినవారిలోనూ అత్యధికంగా కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్‌కే ప్రాధాన్యమిచ్చారు. రెండో ఆప్షన్‌గా ఎక్కువ మంది ఈసీఈని ఎంచుకున్నారు. తర్వాత ప్రాధాన్యం మెకానికల్, సివిల్, ఈఈఈ బ్రాంచిలకు ఇచ్చారు.

ఇదీ పరిస్థితి..!

- ధ్రువీకరణ పత్రాల పరిశీలన తర్వాత అర్హులైన విద్యార్థులు: 1,11,546
- ఆప్షన్ల కోసం పాస్‌వర్డ్ సృష్టించుకోని వారు: 70,273
- ఇప్పటివరకు ఆప్షన్ల నమోదు సంఖ్య: 7,46,419
- అత్యధికంగా ఒక విద్యార్థి ఇచ్చిన ఆప్షన్లు: 422

సీట్లు ఇలా..

- రాష్ట్రంలో 285 ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా ఇంజినీరింగ్ సీట్లు: 93,467
- ఫార్మసీ కన్వీనర్ సీట్లు: 6,541
- 23 విశ్వవిద్యాలయాల కళాశాలల్లో ఇంజినీరింగ్ సీట్లు: 4,834
- ఏడు వర్సిటీ ఫార్మసీ కళాశాలల్లో సీట్లు: 196

ప్రాసెసింగ్ రుసుము చెల్లించిన విద్యార్థుల వివరాలు ర్యాంకుల వారీగా..

ర్యాంకులు	ప్రాసెసింగ్ రుసుము చెల్లించిన అభ్యర్థులు
1-100	3
101-200	7
201-300	8
301-400	15
401-500	14
501-1000	128
1001-1500	167

బ్రాంచిల వారీగా విద్యార్థుల ఆప్షన్లు..

బ్రాంచి	తొలి ప్రాధాన్యం ఇచ్చినవారు	రెండో ప్రాధాన్యం ఇచ్చినవారు
సీఎస్ఈ	14,076	10,018
ఈసీఈ	8,215	11,089
ఎంఈసీ	2,209	2,141
సివిల్	1,493	1,430
ఈఈఈ	1,267	2,054

ఆదరణ-2 పథకానికి రూ.750కోట్లు: అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ఆదరణ-2 పథకాన్ని ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఆదరణలో భాగంగా 2.50లక్షల మంది లబ్ధిదారులకు సహాయం అందించేలా రూ.750కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. 65 బీసీ గురుకుల పాఠశాలలు ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ఈబీసీలకు గురుకుల పాఠశాలలు, ప్రతి జిల్లాలో వెయ్యిమంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు.

వెంకటగిరి రాజకుటుంబీకుడు గోపాలకృష్ణ యాచేంద్ర కన్నుమూత

వెంకటగిరి, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా వెంకటగిరి రాజ కుటుంబీకుడు వెలుగోటి గోపాలకృష్ణ యాచేంద్ర(89) గురువారం చెన్నైలో మృతి చెందారు. 1929లో జన్మించిన ఆయన వెంకటగిరి పెద్ద రాజా వీవీవీఆర్‌కే యాచేంద్ర సోదరుడు. 1964, 73లలో వెంకటగిరి సమితి అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1978లో రెడ్డి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. తనకు సంక్రమించిన స్థానిక లంగర్‌ఖాన్ తోటలోని గవర్నర్ బంగ్లాను ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రానికి అందజేశారు. ఆయన ఆంధ్రా క్రికెట్ రంజీ జట్టు కెప్టెన్‌గానూ వ్యవహరించారు.

రోగి కుటుంబ సభ్యులతో రాజునాయుడు, సుందరాచారి

విద్యార్థిని వింత ప్రవర్తన

- క్లూవర్ బ్యూసి సిండ్రోమ్‌గా గుర్తింపు
- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: చలాకీగా ఉండే 14ఏళ్ల విద్యార్థిని కొన్ని నెలలుగా వింతగా ప్రవర్తిస్తుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. చదివింది గుర్తుండేది కాదని, మార్కులు తక్కువగా వస్తున్నాయని బాధపడేది. స్థిరత్వం లేక పాఠశాలకు వెళ్లడంలేదు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఆరోగ్యం మెరుగుపడలేదు. గుంటూరు సర్వజనాసుపత్రి న్యూరాలజీ వైద్యులు అండగా నిలిచారు. రోగి ప్రస్తుతం కోలుకుంది. కుటుంబ సభ్యులు గురువారం సూపరింటెండెంట్ రాజునాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఇదో అరుదైన వ్యాధి...: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీప గ్రామానికి చెందిన జీవరత్నం, శ్యామల దంపతుల కుమార్తె రాజశ్రీ(14) ఎంతో చురుగ్గా, చలాకీగా ఉండేది. తర్వాత జ్ఞాపకశక్తి కోల్పోయి, వింత ప్రవర్తనతో సతమతమవుతుండగా.. గత ఏప్రిల్‌లో సర్వజనాసుపత్రి న్యూరాలజీ విభాగానికి తీసుకొచ్చారు. దీన్ని సవాల్‌గా తీసుకున్నాం. వ్యాధిని క్లూవర్ బ్యూసి సిండ్రోమ్‌గా గుర్తించాం. మెదడులోని కణాల మీద ఉండే ప్రొటీన్స్‌పై ప్రతికూల కణాలు దాడిచేస్తున్నట్లు తెలుసుకున్నాం. అవసరమైన చికిత్స ప్రారంభించగా రోగి కోలుకుందని న్యూరాలజీ విభాగాధిపతి ఆచార్య సుందరాచారి వివరించారు.

24 నుంచి శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఈ నెల 24 నుంచి 3 రోజుల పాటు జ్యేష్ఠాభిషేకం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. జూన్ మాసంలో విశేష ఉత్సవాల వివరాలను గురువారం ప్రకటించింది. జూన్ 10న మతత్రయ ఏకాదశి, 15న శ్రీబుద్ధ జయంతి, 23న స్మార్త ఏకాదశి, 25న శ్రీనాథమునుల వర్ష తిరునక్షత్రం, 28న ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

బీచ్ రిసార్టు కోసం 20 ఎకరాల బదలాయింపు

ఈనాడు అమరావతి: శ్రీకాకుళం జిల్లాలోని కళింగపట్నం బీచ్‌లో విలాసవంతమైన (లగ్జరీ) బీచ్ రిసార్టును ఏర్పాటు చేసేందుకు 20ఎకరాల భూమిని మహీంద్ర హాలిడేస్, రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ (ఎంహెచ్‌ఆర్ఐఎల్)కు బదలాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. జిల్లా కలెక్టర్ ప్రతిపాదించే మార్కెట్ ధర ప్రకారం కేటాయించాలని గురువారం పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

ఆరు క్రీడా అకాడమీలకు నిధులు మంజూరు

విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు, తూర్పుగోదావరి, కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఆరు క్రీడా అకాడమీల్లో శిక్షణ పొందుతున్న బృంద క్రీడల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి రూ.16071 చొప్పున మంజూరు చేసింది.

ఓఎన్జీసీ ఉన్నతాధికారులపై సీబీఐ కేసు

- టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారంటూ అభియోగం
- దేశవ్యాప్తంగా 15 చోట్ల సోదాలు

ఈనాడు, విశాఖపట్నం: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న ఓఎన్జీసీకి సంబంధించి గ్యాస్ డీహైడ్రేషన్ యూనిట్ల(జీడీయూ) కోసం ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా నిర్వహించిన టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయంటూ 13 మంది ఉన్నతాధికారులపై సీబీఐ కేసులు నమోదు చేసింది. ఓఎన్జీసీ విజిలెన్స్ సీజీఎం ఎస్.సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు విశాఖ సీబీఐ ఎస్పీ ఎస్.బి.శంకర్ గురువారం తెలిపారు. విశ్రాంత డీజీఎం (ప్రొడక్షన్) అరూప్‌రతన్‌దాస్, ప్రస్తుత డీజీఎం(ప్రొడక్షన్) డి.వి.ఎస్.ఎస్.ఎ.శర్మ సహా మొత్తం ఏడుగురు విశ్రాంత ఉన్నతాధికారులు, ఆరుగురు ప్రస్తుత ఉన్నతాధికారులపై కేసు నమోదు చేసింది. వీరంతా కూడా డీజీఎం, జీఎం, డైరెక్టర్, మేనేజర్ స్థాయి అధికారులే. సంస్థ నిబంధనల ప్రకారం 3 బిడ్‌ల ద్వారా కొటేషన్లు తెప్పించి టెండరు ఖరారు చేయాల్సి ఉండగా.. వీరు దీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనే ఒక్క కంపెనీకి మాత్రమే అవకాశం ఇచ్చి టెండరును దానికే దక్కేలా చేశారన్నది సీబీఐ అభియోగం. దీంతో దీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఛైర్మన్ పారస్ సావియా, ఎండీ రూపేష్ సావియా పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లుగా ఎస్పీ తెలిపారు. వీరంతా కలిసి కుట్రపూరితంగా పన్నాగం పన్నడంవల్ల ఓఎన్జీసీకి రూ.80 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వివరించారు. ఈ అక్రమంతోపాటు వీరంతా మరిన్ని అభియోగాల్ని ఎదుర్కొంటున్నారు. 2014లో తూర్పుగోదావరి జిల్లా నగరం గ్రామంలో గెయిల్ పైపులైను నుంచి నిప్పులు రావడం వల్ల కేజీ బేసిన్‌లో వ్యవస్థ దెబ్బతిందని, దీనివల్ల రోజుకు రూ.3 కోట్ల వరకు ఓఎన్జీసీకి నష్టం వాటిల్లిందని ఆ సంస్థ విజిలెన్స్ డీజీఎం తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థాపరంగా మరిన్ని అక్రమాల్లో వీరంతా భాగంగా ఉన్నట్లు వివరించారు. దర్యాప్తులో భాగంగా సీబీఐ రాజమహేంద్రవరం, హైదరాబాద్, కోల్‌కతా, సిబ్‌సాగర్, భువనేశ్వర్ లాంటి 15 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా పలు విలువైన పత్రాల్ని స్వాధీనం చేసుకున్నామని సీబీఐ ఎస్పీ వెల్లడించారు. విచారణ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, పీఎస్‌యూ, జాతీయబ్యాంకులు, ప్రభుత్వ బీమా కంపెనీలకు సంబంధించి లంచాలు, ఇతర అవినీతి మీద ఎలాంటి ఫిర్యాదులైనా తమ టోల్‌ఫ్రీ నెంబరు 180042500100 కు ఫోన్ చేసి చెప్పొచ్చని వివరించారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరిస్తాం

- మంత్రి నక్కా ఆనందబాబు హామీ

గుంటూరువారితోట, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని రాష్ట్ర మంత్రి నక్కా ఆనందబాబు హామీనిచ్చారు. అగ్రిగోల్డ్ వినియోగదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరు మార్కెట్‌కూడలిలోని ఓపెన్ ఆడిటోరియం నుంచి అగ్రిగోల్డ్ బాధితులు గురువారం ఆత్మఘోష పాదయాత్రకు బయలుదేరుతుండగా మంత్రి నక్కా ఆనందబాబు వేదిక వద్దకు వచ్చి నేతలతో మాట్లాడారు. నేతలకు నిమ్మరసం ఇచ్చి పాదయాత్రను విరమింపజేశారు. ఏళ్లు గడిచినా లక్షలాది బాధితుల సమస్యకు పరిష్కారం చూపకపోవడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. బాధితుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

అగ్రిగోల్డ్ ఉద్యమ నేతలకు నిమ్మరసం ఇస్తున్న మంత్రి ఆనందబాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఎర్రచందనం తరలింపు ముఠా అరెస్టు

నెల్లూరు, న్యూస్‌టుడే: ఎర్రచందనం వాహనాలను తరలించే ముఠాను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి అత్యాధునిక విదేశీ తుపాకులను స్వాధీనం జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ వెల్లడించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఆరుగురు అంతరాష్ట్ర స్మగ్లర్లతోపాటు ఇద్దరు పాత నిందితులను అదుపులోకి తీసుకున్నారు. 3 వాహనాలు, 35 ఎర్రచందనం దుంగలు, 8 సెల్‌ఫోన్లు, బంగారం, నాలుగు రైఫిళ్లు, ఒక పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరంతా ఎర్రచందనం తరలించే వాహనాలకు ఎస్కార్ట్‌గా పనిచేస్తారు. టన్నుకు రూ.1.50 లక్షలు చొప్పున చెల్లిస్తే వీరే దగ్గరుండి రాష్ట్ర సరిహద్దులు దాటవేయిస్తారు. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా అత్తూరు తాలుకా సెంబేరి గ్రామానికి చెందిన రాజేంద్రన్ బాలాజీ, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు గ్రామీణం హోస్కోట శివనాపుర గ్రామానికి చెందిన వెంకటరాజు, రవి, మంజునాథ్, శివాపురం రవి నవీన్, రామప్ప గజేంద్రలను అదుపులోకి తీసుకున్నారు.

కాంగ్రెస్ నేతల ఇళ్లపై సీబీఐ దాడులు

- ఆ సమాచారం ముందే తెలుసన్న ఎంపీ సురేశ్
- ‘లీకువీరులు’ను తేల్చేందుకు శాఖాపరమైన విచారణకు సీబీఐ ఆదేశం

బెంగళూరు, న్యూస్‌టుడే: కర్ణాటక ఇంధన శాఖ మాజీ మంత్రి డి.కె.శివకుమార్, ఆయన సోదరుడు, లోక్‌సభ సభ్యుడు డి.కె.సురేశ్‌ల వ్యాపార భాగస్వాముల నివాసాలు, కార్యాలయాలపై సీబీఐ అధికారులు గురువారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. తమను లక్ష్యంగా చేసుకుని సీబీఐ, ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు చేస్తున్నారని, వాటిని ఎదుర్కొనే సామర్థ్యం తమకు ఉందంటూ గురువారం ఉదయమే డి.కె.సురేశ్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. సీబీఐ అధికారులు ఎవరెవరి నివాసాలు, కార్యాలయాలపై దాడులు చేస్తున్నారో తమ వద్ద సమాచారం ఉందంటూ ముందుగానే బాంబు పేల్చారు. శివకుమార్ సోదరుల నివాసాలు మినహా అయిదు చోట్ల అధికారులు దాడులు జరిపారు. సురేశ్ వ్యాఖ్యల నేపథ్యంలో తమలోనే ‘లీకువీరులు’ ఉన్నారని సీబీఐ గుర్తించింది. దీనిపై శాఖాపరమైన విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు.

బెంగళూరులోని డి.కె.శివకుమార్ సోదరుల ఇళ్ల వద్ద గుమిగూడిన వారి అనుచరులు

దాడులకు ముందు డి.కె.శివకుమార్ కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులను వేర్వేరుగా విచారణ జరిపారు. గతంలో రామనగరలోని కార్పొరేషన్ బ్యాంకులో పెద్ద మొత్తంలో పాతనోట్లను మార్చుకున్నట్లు అధికారులు గుర్తించారు. 11 మంది నివాసాలు, వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించారు. వీరిలో రామనగర శాఖ కార్పొరేషన్ బ్యాంకు మేనేజరు కూడా ఉన్నారు.

తామెవరికీ భయపడం..: తమను లక్ష్యంగా చేసుకుని ఆదాయ పన్ను, ఈడీ, సీబీఐ అధికారులను కేంద్ర ప్రభుత్వం ఉసిగొల్పుతోందని శివకుమార్ సోదరులు ఆరోపించారు. సదాశివనగరలోని తమ నివాసంలో గురువారం ఉదయం ఏడున్నరకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తాము కేంద్ర ప్రభుత్వం, మోదీ, అమిత్ షాల బెదిరింపులకు భయపడబోమన్నారు. శివకుమార్, సురేశ్‌ల నివాసాల వెలుపల వందల సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు చేరటంతో సోదాలు సాధ్యం కాలేదని అధికారులు తెలిపారు.

★ శివకుమార్ సోదరులు, వారి భాగస్వాములను లక్ష్యంగా చేసుకుని అధికారులు దాడులు చేయటాన్ని ఒక్కలిగర సంఘం ఖండించింది.

ఉద్యోగ అవకాశాలు

AI GLOBAL INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY
Markapur, Prakasam (Dist), A.P
WALK - IN - INTERVIEW
Interested and eligible candidates may walk In Interview & Demo for faculty: CSE, ECE, EEE, CIVIL, MECHANICAL, H&S (Maths, Physics, Chemistry, English), MBA.
Eligibility: SSC to P.G - 1st Class
Non-Teaching: Lab Assistants: (CSE, EEE, ECE, CIVIL, MECH), Librarian, DTP Operators, Accountants, Warden, Security, Attenders, Sweepers.
Date: 11-06-2018 (Monday) at 10:00 AM to 5:00 PM
Venue: S.V. Engineers Academy, 6th Line, Brindavan Gardens, Guntur
Forward Your resume to: globalrecruitment852@gmail.com
Contact No: 9160016421/9052829099/9246790349.
PRINCIPAL

LINGAYAS
INSTITUTE OF MANAGEMENT AND TECHNOLOGY
Nuzvid Road, VIJAYAWADA-521 212.
Wanted Professors, Assoc. / Asst. Prof.
in Maths, Physics, Chemistry, CSE, Civil, ECE, EEE and Mech Departments
• Qualification and salary as per norms
Walk-in-for discussions on June 2nd & 3rd 2018, 9 A.M to 6 P.M.
City Office : Sai Odessey, Opp: Executive Club, NH-5, VIJAYAWADA - 10, e-mail : principal.limat@gmail.com.
Mobile: 96426 08882 & 3, 0866 - 2540767.

VISHWA BHARATHI COLLEGE OF PHARMACEUTICAL SCIENCES
NRT Road, Perecherla, GUNTUR - 522 009.
ISO 9001 : 2008 Certified (Sponsored by Bharathi Educational Society)
(Approved by AICTE & Govt. of A.P, Affiliated to J N T U K)
WANTED FACULTY

DEPARTMENT	POST
Pharmaceutics, Pharma. Analysis, Pharmacy Practice, Pharmacology, Pharmaceutical Chemistry, Pharm. D	Professor, Assoc. Professor, Asst. Professor
Exam Section: Computer operators, Lab Technicians	Experienced candidates in Examcell with MCA, B.Tech, B.Sc Computers, Qualification (D.Pharm, DMLT, BSc

Preferable with Ph.D, Experience Candidates, salaries as per AICTE Norms. Interesting candidates can send resumes by email: vbcops@yahoo.com on or before 14-06-2018.
Few Management Seats are available in B.Pharmacy, M.Pharmacy and Pharm.D interesting candidates can approach to College.
Interview will be conduct on 15-06-2018 at College campus.
Secretary & Correspondent
Smt. O.SAKUNTHALA, M.A, 9440434169,944093229

NOVA GROUP OF INSTITUTIONS
(Approved by AICTE & Affiliated to JNTUH/JNTUK, AKNU, KRU & ANGRAU)
•Ibrahimpatnam •Eluru •Jangareddygudem •Nuzvid •Hyderabad
Website : www.nova.ac.in, Email : hr@nova.edu.in
WALK IN INTERVIEW on 2nd & 3rd June, 2018 (9:30 AM to 6:00 PM)
VENUE : #54-15-14, Nova Complex, Opp. Vinayaka Theatre, Beside Musaddilal Jewellers, Bharathi Nagar, Vijayawada
PRINCIPALS, DIRECTORS, PROFESSORS, ASSOC. PROF & ASST. PROFESSORS IN MINING, CIVIL, MECH, CSE, ECE, EEE, AGRICULTURE (M.Sc. or M.Tech) HORTICULTURE, MBA, PHARMACY, PHARM.D, MATHS, PHYSICS, CHEMISTRY, ENGLISH, B.Ed, M.Ed & B.P.Ed
Non Teaching Positions: (MBA Preferable) A.Os, Secretaries, P.As, Data Entry Operators, Wardens (Male / Female), Hardware Engineers, Accountants, System Administrators, Security, Plumber, Electrician, Gardeners & Drivers.
Qualification & Experience: As per AICTE Norms (Retired persons below 70 years may also apply)
Salary: As per AICTE Norms and above for deserving candidates.
Special Package for Retired Persons
Note: Candidates should come with Original certificates along with Bio-Data, Aadhar Card, PAN Card and 2 Photo Copies of all Certificates.

భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పుంజుకుంది. జనవరి- మార్చిలోనే కాదు.. పూర్తి ఆర్థిక సంవత్సరం (2017-18)లోనూ అంచనాలకు మించి రాణించింది. జనవరి- మార్చిలో జీడీపీ వృద్ధి గత ఏడు త్రైమాసికాల్లో కంటే అధికంగా నమోదైంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంలో తయారీ, నిర్మాణ, సేవా రంగాలు ప్రధాన పాత్ర పోషించాయి. అయితే 2016-17తో పోలిస్తే 2017-18లో వృద్ధి రేటు తగ్గడం గమనార్హం. పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో మొదటి త్రైమాసికంలో వృద్ధి మూడేళ్ల కనిష్ఠానికి పడిపోవడం, జీఎస్‌టీ అమలు లాంటి అంశాలు వృద్ధి నెమ్మదించేందుకు కారణమయ్యాయి.



'ప్రతి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. ఇప్పుడు జనవరి- మార్చిలో 7.7 శాతంగా నమోదైంది. ఆర్థిక వ్యవస్థ సరైన మార్గంలో వెళుతోందనే విషయం ఈ గణాంకాల ద్వారా మనకు అర్థమవుతోంది. భవిష్యత్‌లో మరింత వృద్ధి సాధిస్తామనే సంకేతాలను కూడా ఇవి ఇస్తున్నాయి'

- పియూష్ గోయెల్, ఆర్థిక మంత్రి

చలో చలో..

ప్రగతి పథంలో భారత ఆర్థిక వ్యవస్థ

- అంచనాలకు మించి రాణింపు
- 2017-18లో జీడీపీ వృద్ధి 6.7 శాతం
- జనవరి- మార్చిలో 7.7 శాతానికి
- గత ఏడు త్రైమాసికాల్లో అత్యధికమిదే
- తయారీ, సేవా రంగాల అమోఘ పనితీరే కారణం

దిల్లీ

దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందన్న సంకేతాలనిస్తూ జనవరి- మార్చిలో భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 7.7 శాతంగా నమోదైంది. గత ఏడు త్రైమాసికాల్లో అత్యధిక వృద్ధి రేటు ఇదే. ఏడాదిక్రితం ఇదే త్రైమాసికంలో భారత్ 6.1 శాతం వృద్ధి రేటును సాధించగా.. అంతకుముందు త్రైమాసికంలో (అక్టోబరు- డిసెంబరు) జీడీపీ వృద్ధి 7.2 శాతంగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2017-18) వృద్ధి 6.7 శాతంగా నమోదైంది. 2016-17లో భారత్ సాధించిన 7.1 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువ.

2017-18లో భారత వృద్ధి

ఏప్రిల్- జూన్	- 5.6%
జులై- సెప్టెంబరు	- 6.3%
అక్టోబరు- డిసెంబరు	- 7%
జనవరి- మార్చి	- 7.7%
పూర్తి ఆర్థిక సంవత్సరం	- 6.7%

ఎవరి లెక్కలు.. ఎంతెంత..

జనవరి- మార్చి త్రైమాసికానికి, 2017-18 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర గణక కార్యాలయం విడుదల చేసిన ఈ వృద్ధి గణాంకాలు అంచనాలకు మించి ఉండటం గమనార్హం. 2017-18లో వృద్ధి రేటు 6.6 శాతం నమోదు కావొచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. అటు ఆర్‌బీఐ కూడా 6.6 శాతం నమోదు కావొచ్చని లెక్కగట్టింది. రేటింగ్ సంస్థలు, ఇతరత్రా సంస్థలు కూడా 6.3- 6.6 శాతం మధ్యలో అంచనా వేశాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటే 2016-17తో పోలిస్తే వృద్ధి నెమ్మదించినప్పటికీ, అంచనాలకు మించి ఆర్థిక వ్యవస్థ రాణించడం సంతోషాన్ని కలిగించే పరిణామమే. మరోవైపు జనవరి- మార్చి త్రైమాసికానికి వివిధ సంస్థలు 6.9- 7.7% వృద్ధి రేటును అంచనా వేశాయి. ఈ సమయంలో కూడా ఆర్థిక ప్రగతి ఊహించని విధంగా నమోదైందని భావించవచ్చు.

2017-18 అంచనాలు

ప్రభుత్వం	- 6.6%
ఆర్‌బీఐ	- 6.6%
ఇతరత్రా సంస్థలు	- 6.3- 6.6%

2018-19కు మార్పుల్లేవ్..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2018-19) భారత్ మరింత ముందుకు వెళుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇంతకుముందు అంచనా వేసినట్లుగానే 7.5 శాతం వృద్ధి రేటును సాధిస్తామని పేర్కొంది. 2017-18 నాలుగో త్రైమాసికంలో 7.7 శాతం జీడీపీ వృద్ధిని గమనిస్తే.. భవిష్యత్‌లో మరింత వృద్ధిని సాధించే దిశగా ఆర్థిక వ్యవస్థ వెళుతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అధిక చమురు ధరలను దృష్టిలో ఉంచుకొని 2018-19 వృద్ధి అంచనాలను ప్రభుత్వం తగ్గించే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలపై స్పష్టతనిస్తూ 7.5 శాతం వృద్ధి అంచనాను ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ గార్గ్ వెల్లడించారు.

2018-19 వృద్ధి అంచనా

7.5%

అనుకున్నంతే ద్రవ్యలోటు

2017-18 ఆర్థికసంవత్సరానికి ద్రవ్యలోటు జీడీపీలో 3.53 శాతంగా నమోదైంది. ప్రభుత్వ సవరించిన అంచనాలకు తగ్గట్లుగానే ద్రవ్యలోటు నమోదుకావడం గమనార్హం. ఈ ఫిబ్రవరిలో కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ 2017-18 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును 3.2 శాతం నుంచి 3.5 శాతానికి ప్రభుత్వం సవరించిన సంగతి తెలిసిందే. విలువ ప్రకారం చూస్తే ద్రవ్యలోటు రూ.5.91 లక్షల కోట్లు. బడ్జెట్ అంచనాల్లో ఇది 99.5 శాతం. కంట్రోలరు జనరల్ ఆఫ్ అకౌంట్స్ ఈ గణాంకాలను విడుదల చేసింది. ఈ గణాంకాల ప్రకారం 2017-18కు రెవెన్యూ లోటు జీడీపీలో 2.65 శాతంగా నమోదైంది. విలువ రూ.4.43 లక్షల కోట్లు (బడ్జెట్ అంచనాలో 101%). ప్రభుత్వ మొత్తం వ్యయాలు రూ.21,42,667 కోట్లు కాగా.. ప్రణాళిక వ్యయంలో ఈ విలువ 96.7 శాతం.

2017-18 ద్రవ్యలోటు

జీడీపీలో	3.5%
విలువ	రూ.5.91 లక్షల కోట్లు
బడ్జెట్ అంచనాలో 99.5%	

తలసరి ఆదాయం పెరిగింది కొంచెమే

2017-18లో భారత తలసరి ఆదాయం 8.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,12,835కు చేరింది. 2016-17లో ఇది రూ.1,03,870గా ఉంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2015-16) నమోదైన రూ.94,130 కోట్లతో పోలిస్తే 2016-17లో తలసరి ఆదాయం 10.3 శాతం పెరిగింది. పై గణాంకాలు ప్రస్తుత ధరల వద్ద లెక్కించినవి. వాస్తవ రూపేణా 2011-12 స్థిర ధరల ప్రకారం చూస్తే 2017-18లో తలసరి ఆదాయం 5.4 శాతం పెరిగి రూ.86,668గా నమోదైంది. 2016-17లో ఇది రూ.82,229. ఇక స్థూల జాతీయాదాయం 2016-17లో రూ.150.77 లక్షల కోట్లు ఉండగా.. 2017-18లో 10 శాతం పెరిగి రూ.165.87 లక్షల కోట్లకు చేరింది.

తలసరి ఆదాయం

2017-18	- రూ.1,12,835
2016-17	- రూ.1,03,870
వృద్ధి	- 8.6%

చైనాపై మనదే పైచేయి..

జనవరి- మార్చిలో వృద్ధి రేటు పరంగా చైనాపై భారత్‌దే పైచేయి. చైనా 6.8 శాతం వృద్ధి సాధిస్తే.. భారత్ 7.7 శాతం వృద్ధి రేటును నమోదుచేసింది. తద్వారా ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ మళ్లీ కిరీటాన్ని సొంతం చేసుకుంది.

జీవీఏ 7.6%: జనవరి- మార్చిలో స్థూల విలువ జోడింపు (జీవీఏ) 7.6 శాతంగా నమోదైంది. 2016-17లో ఇది 6 శాతం వద్ద ఉంది. వాణిజ్యం, హోటళ్లు, కమ్యూనికేషన్, ప్రసార సేవల రంగాలు దేశ వృద్ధిలో కీలక పాత్ర పోషించాయి.

జనవరి- మార్చిలో వృద్ధి

చైనా	- 6.7%
భారత్	- 7.7%

వృద్ధికి తోడ్పడిన రంగాలివే

వ్యవసాయం	- 4.5%
తయారీ	- 9.1%
నిర్మాణం	- 11.5%

ముగిసిన సమ్మె

- నేటి నుంచి యథావిధిగా బ్యాంకుల కార్యకలాపాలు
- నగదు పరిస్థితి గాడిన పడేందుకు కొంత సమయం

ఈనాడు - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో రెండు రోజుల బ్యాంకు సమ్మె ముగిసింది. సమ్మె కారణంగా నగదు, చెక్కులు, ఏటీఎం లావాదేవీలు కలిపి దాదాపు రూ.20,000 కోట్ల వరకు నిలిచిపోయాయి. బ్యాంకుల్లో పనిచేస్తున్న సిబ్బందికి న్యాయబద్ధమైన వేతన పెంపు కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా గురువారం రోజూ బ్యాంకులు మూతపడ్డాయి. రెండో రోజు సికింద్రాబాద్ ఎస్‌బీఐ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సమావేశంలో యూఎఫ్‌బీయూ మాజీ కన్వీనర్ ఎం.వి.మురళి హాజరయ్యారు. ఏటీఎంలో నగదు నిండుకోవడంతో... తెరిచినవీ బోసిపోయి కనిపించాయి. నగదు డిపాజిట్ మిషన్లు వినియోగించుకునే వారికి సర్వర్ సమస్యలు ఎదురయ్యాయి. బుధ, గురువారాల్లో బ్యాంకులు మూతపడటంతో వ్యాపార లావాదేవీలపై ప్రభావం పడింది. శుక్రవారం ఉదయం నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఏటీఎంలు యథావిధిగా పనిచేస్తాయని యూఎఫ్‌బీయూ కన్వీనర్ వీవీఎస్‌ఆర్ శర్మ, ఎన్‌సీబీఈ కార్యదర్శి ఎన్.రాధాకృష్ణన్, ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం ఉప ప్రధాన కార్యదర్శి నరేందర్‌రావు తెలిపారు. సమ్మె తరువాత బ్యాంకులు తెరవనుండటంతో సిబ్బందిపై తీవ్ర పని ఒత్తిడి ఎదురయ్యే అవకాశాలున్నాయి. శుక్రవారం ఒకటో తేదీ, పైగా వేతనాలు, పింఛన్ల కోసం భారీగా ప్రజలు వస్తారు. ఆసరా పింఛన్లు, ప్రైవేటు ఉద్యోగుల జీతాలు, తెలంగాణ రైతు బంధు చెక్కులు విడిపించేందుకు ప్రజలు వరుస కట్టనున్నారు. ఉద్యోగులు వేతనాల కోసం నగదును ఒకేసారిగా ఉపసంహరిస్తే తాత్కాలికంగా నగదు సమస్యలు వస్తాయని అంచనా వేస్తున్నారు. అయితే ఆ మేరకు నిల్వలు ఉన్నట్లు బ్యాంకర్లు పేర్కొంటున్నారు.

ఏటీఎంల్లోనూ నగదు లేకపోవడం, పాఠశాలల్లో ఫీజుల చెల్లింపు, పుస్తకాల కొనుగోలు కోసం నగదు ఉపసంహరణకు ప్రజలు భారీసంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశామని బ్యాంకర్లు చెబుతున్నారు. ఉదయం 10 గంటలకు క్యాష్‌చెస్ట్‌ల నుంచి నగదును తీసుకుని ఏటీఎంల్లో సర్దుబాటు చేస్తే, మధ్యాహ్నానికి తిరిగి పనిచేస్తాయని అంచనా. పూర్తిస్థాయి కార్యకలాపాలు గాడినపడేందుకు రెండు రోజుల సమయం పట్టవచ్చని ఉద్యోగ సంఘాలు అంటున్నాయి.

దేశవ్యాప్తంగా 80 లక్షల చెక్కులు ఎక్కడివక్కడే

దేశవ్యాప్తంగా 10 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు నిర్వహించిన రెండో రోజు సమ్మెతో గురువారం బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోయాయి. డిపాజిట్లు, ఎఫ్‌డీ రెన్యూవల్స్, ప్రభుత్వ ఖజానా, మనీ మార్కెట్ కార్యకలాపాలు జరగలేదు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఏటీఎమ్‌లు ఖాళీగా కనిపించాయి. నేటి నుంచి బ్యాంకు కార్యకలాపాలు యథావిధిగా జరగనున్నాయి. కాగా, సమ్మె కారణంగా వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు, పాత తరం ప్రైవేటు బ్యాంకులు, విదేశీ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో 80 లక్షల చెక్కులకు మోక్షం లభించలేదు. ముంబయి, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, జయపుర, పట్నా, లఖ్‌నవూ, నాగపూర్, జమ్ము, గువహటి, జెమ్‌షెడ్‌పూర్, ఆగ్రా, అంబాలా, త్రివేండ్రమ్‌లలో బ్యాంకు ఉద్యోగులు ఉత్సాహంగా సమ్మెలో పాల్గొన్నారని యూనియన్లు పేర్కొన్నాయి. కొత్త తరం ప్రైవేటు బ్యాంకులైన ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు మాత్రం యథావిధిగా పనిచేశాయి.

దిగుమతి సుంకాల మినహాయింపు ఎత్తివేత

- ఈయూ, కెనడా, మెక్సికోలపై అమెరికా కీలక నిర్ణయం
- ప్రతీకార చర్యలుంటాయన్న దేశాలు
- నష్టాల్లో యూఎస్ స్టాక్ మార్కెట్లు

వాషింగ్టన్: యూరోపియన్ యూనియన్(ఈయూ), కెనడా, అమెరికాల నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాల మినహాయింపును ఎత్తివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. జూన్ 1 నుంచి ఈ చర్య అమల్లోకి వస్తుందని అమెరికా వాణిజ్య మంత్రి విల్బర్ రాస్ పేర్కొన్నారు. అయితే దీనిపై ప్రతీకార చర్యలు ఉంటాయని ఈయూ, కెనడా, మెక్సికోలు హెచ్చరించడం గమనార్హం. ఈ నేపథ్యంలో అమెరికా మార్కెట్లు నష్టాలను నమోదు చేశాయి.

ఉక్కుపై 25 శాతం; అల్యూమినియంపై 15% చొప్పున దిగుమతి సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మార్చిలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఒక నెలరోజుల పాటు కెనడా, మెక్సికో, ఈయూలకు తాత్కాలికంగా అందుకు మినహాయింపునిస్తున్నట్లు ఏప్రిల్ 30న ప్రకటించారు. ఈ వ్యవధిలో చర్చలకు వీలుంటుందని వారు భావించారు. అయితే యూరోపియన్ యూనియన్, కెనడా, మెక్సికోలతో అనుకున్న విధంగా చర్చల్లో ప్రగతి కనిపించలేదని రాస్ గురువారం పేర్కొన్నారు. 'కెనడా, మెక్సికోలతో ఒక వైపు; యూరోపియన్ కమిషన్‌తో మరో వైపు చర్చలు కొనసాగించాలనే భావిస్తున్నాం. అదే సమయంలో ఇతరత్రా అంశాలనూ పరిష్కరించాల్సి ఉంద'ని రాస్ అన్నారు.

చైనా పరిశ్రమను లక్ష్యంగా చేసుకుని ఉక్కుపై 25%; అల్యూమినియంపై 15% చొప్పున దిగుమతి సుంకాన్ని విధించిన సంగతి తెలిసిందే. అయితే కొత్త సుంకం విధానం వల్ల అమెరికాతో స్నేహంగా ఉండే దేశాలపైనా ప్రభావం పడనుంది. అయితే రాస్ మాత్రం ఆ అభిప్రాయాలను కొట్టిపారేశారు. వాణిజ్యానికి 'ఇదో చెడ్డ రోజు' అని అమెరికా చర్యను ఈయూ అభివర్ణించింది. అమెరికా కఠిన సుంకాలపై అతి త్వరలోనే ప్రతిచర్యలుంటాయని ఈ సందర్భంగా హెచ్చరించింది. మరో పక్క, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్‌లకు నిరవధిక మినహాయింపునిస్తూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉక్కు సుంకాల నుంచి దక్షిణ కొరియాకు శాశ్వత మినహాయింపునిచ్చింది.

రోజుకు 8 'ఆధార్' దరఖాస్తులే!

- బ్యాంక్ శాఖలకు భారం తగ్గించిన యూఐడీఏఐ
- జులై 1 నుంచి అమలు

దిల్లీ: ఆధార్ కేంద్రాలున్న బ్యాంకు శాఖల్లో ఇప్పటివరకు రోజుకు కనీసం 16 మందికి కొత్తగా ఆధార్ నమోదు లేదా పాత వివరాల్లో సవరణలు చేస్తున్నారు. జులై 1 నుంచి రోజుకు కనీసం 8 ఆధార్ ప్రక్రియలు పూర్తి చేస్తే సరిపోతుందని యూఐడీఏఐ (యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆదేశాలు జారీ చేసింది. జులై నెలకు కొత్త లక్ష్యాలను పూర్తి చేసిన బ్యాంకులపై, ఆ నెలకు సంబంధించి ఆర్థిక చర్యలు కూడా తీసుకోరని తెలిపింది. ఒకవేళ కనీస లక్ష్యాలను నెరవేర్చలేకపోతే, సంబంధిత బ్యాంక్ శాఖలు ఆర్థిక చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆధార్ నమోదు లక్ష్యాలను పూర్తిచేసేందుకు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను బ్యాంకులు వెల్లడించడం వల్లే, ఈ నిర్ణయం తీసుకున్నారు.

బ్యాంకులు తమ మొత్తం శాఖల్లో 10వ వంతులో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆదేశం. ప్రతి శాఖలోనూ రోజుకు 16 ఆధార్ ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉంది. ఈ లక్ష్యాలను సవరిస్తూ, 3 విడతలలో పూర్తి చేయవచ్చని పేర్కొంటూ యూఐడీఏఐ ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రకారం.. జులై 1 నుంచి రోజుకు కనీసం 8 ఆధార్ దరఖాస్తులను పూర్తి చేయాల్సి ఉంటుంది. అక్టోబరు 1 నుంచి రోజుకు కనీసం 12 దరఖాస్తులు, 2019 జనవరి 1 నుంచి రోజుకు 16 దరఖాస్తులు పూర్తిచేయాల్సి ఉంది. వీటిని ఎలా పూర్తి చేశారనేది క్రమ వాయిదాల పద్ధతిలో పరిశీలిస్తారు.

ఏప్రిల్‌లో పుంజుకున్న మౌలికం

దిల్లీ: ఎనిమిది కీలక రంగాలు రాణించాయి. ఏప్రిల్‌లో ఈ రంగాల వృద్ధి 4.7 శాతంగా నమోదైంది. గతేడాది ఏప్రిల్‌లో మౌలిక రంగాల వృద్ధి 2.6 శాతంగా ఉంది. బొగ్గు, సిమెంట్, సహజ వాయువు ఉత్పత్తులు భారీగా పుంజుకోవడం ఇందుకు నేపథ్యం. బొగ్గు, ముడిచమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఉక్కు, విద్యుత్, ఎరువులు, సిమెంట్.. ఈ ఎనిమిదింటిని కీలక రంగాలుగా పరిగణిస్తారు. ఈ రంగాల పనితీరు పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)పై ప్రభావం చూపుతాయి. ఎందుకంటే సూచీలో వీటి వాటా 41 శాతం వరకు ఉంది. గత ఆర్థిక సంవత్సరం (2017-18) ఏప్రిల్-మార్చిలో మౌలిక రంగాల వృద్ధి 4.2 శాతంగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నమోదైన 4.8 శాతంతో పోలిస్తే తక్కువే. వాణిజ్య, పరిశ్రమల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. సిమెంట్, బొగ్గు, సహజ వాయువుల రంగాలు ఏప్రిల్‌లో వరుసగా 16.6%, 16%, 7.4% చొప్పున వృద్ధి నమోదు చేసుకున్నాయి. ఏప్రిల్‌లో ఎరువుల ఉత్పత్తి 4.6 శాతానికి, విద్యుదుత్పత్తి 2.2 శాతానికి పరిమితమయ్యాయి. గతేడాది ఏప్రిల్‌లో మాత్రం ఇవి 6.2 శాతం, 5.5 శాతం చొప్పున పెరగడం గమనార్హం.

గడువు పెంచినా ఒక్క బిడ్డూ రాలేదు!

ఎయిరిండియా వాటా విక్రయంపై నీలినీడలు

దిల్లీ

అప్పుల ఊబిలో చిక్కుకున్న ఎయిరిండియాలో పెట్టుబడుల్ని ఉపసంహరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. ఆ సంస్థలో ప్రతిపాదిత వ్యూహాత్మక వాటా విక్రయానికి ప్రభుత్వం విధించిన గడువు తేదీ (మే 31వ తేదీ) ముగిసే సమయానికి ఒక్క బిడ్డూ దాఖలు కాలేదు. 'ఎయిరిండియాలో వాటా కొనుగోలుకు ఏ సంస్థ కూడా బిడ్ దాఖలు చేయలేదు. ఇప్పుడు ఏం చేయాలన్నది తరవాత నిర్ణయిస్తామ'ని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఓ ట్వీట్‌లో తెలిపింది. ఇదిలా ఉంటే ఎయిరిండియాలో 76 శాతం వాటా విక్రయించి నిర్వహణ బాధ్యతల్ని ప్రైవేటు సంస్థకు అప్పగించాలని ప్రభుత్వం ప్రతిపాదన తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. బిడ్‌లు దాఖలు చేసేందుకు మే 14 గడువు తేదీగా నిర్ణయించడంతోపాటు అర్హత సాధించిన సంస్థల వివరాల్ని మే 28న ప్రకటిస్తామని తొలుత పేర్కొంది. అయితే ఎవరూ ఆసక్తి కనబరచకపోవడంతో మే 31 వరకు గడువు పొడిగించి, అర్హత సాధించిన సంస్థల వివరాలు జూన్ 15న ప్రకటిస్తామని తెలిపింది. విచిత్రమేమిటంటే గడువు తేదీని పొడిగించినా ఒక్క బిడ్ కూడా దాఖలు కాలేదు.

100% విక్రయించాలి: కాపా

వ్యూహాత్మక పెట్టుబడి ఉపసంహరణలో విఫలం కావడంతో ఎయిరిండియాను సమగ్రంగా పునర్‌వ్యవస్థీకరించాలని సెంటర్ ఫర్ ఏషియా పసిఫిక్ ఏవియేషన్ (కాపా) ప్రభుత్వాన్ని కోరింది. సిడ్నీకి చెందిన విమానయాన థింక్-ట్యాంక్ అయిన కాపా ఉద్దేశం ప్రకారం, బిడ్‌ల దశలోనే ఎయిరిండియా వాటా విక్రయంలో ప్రభుత్వం విఫలమైనందువల్ల పూర్తిస్థాయిలో సంస్థను ప్రైవేటుపరం చేస్తే సరిపోతుందని తెలిపింది. ఇందుకోసం సంస్థను సమగ్రంగా పునర్‌వ్యవస్థీకరించి తక్కువ క్లిష్టమైన నిబంధనలతో 100 శాతం వాటా విక్రయించాలని ఓ ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉంటే ఎయిరిండియాలో వాటా విక్రయానికి సంబంధించి పౌర విమానయాన కార్యదర్శి చౌబే మాట్లాడుతూ 'ఎయిరిండియాలో ప్రభుత్వ వాటాను పూర్తిగా వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఆర్థిక మంత్రి నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేకమైన వ్యవస్థ ఎయిరిండియా పెట్టుబడి ఉపసంహరణ భవితవ్యంపై నిర్ణయం తీసుకుంటుంది. మంచి భాగస్వామ్యం కోసం మేము ఎదురుచూస్తున్నాం. వాటా విక్రయాన్ని మరోసారి పునఃపరిశీలిస్తామ'ని తెలిపారు.

ఇది మా విజయం: సంఘాలు

'ఎయిరిండియాలో వ్యూహాత్మక వాటా విక్రయానికి సంబంధించి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందింది. ఇది మా విజయం' అని ఎయిరిండియా సంఘాలు పేర్కొంటున్నాయి. వివిధ సంఘాలు ఉమ్మడి ఫోరంగా ఏర్పడి ఎయిరిండియాలో వాటా విక్రయాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయి. ఎయిరిండియాను ప్రైవేటుపరం చేస్తే భారీగా ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుందని ఆందోళనలు చేశాయి. ఇప్పుడు వాటా కొనుగోలుకు ఏ ఒక్కరూ బిడ్ వేసేందుకు ముందుకు రాకపోవడంతో దీన్ని ఆ సంఘాలు సాధించిన విజయంగా అభివర్ణిస్తున్నాయి.

సెన్సెక్స్ ▲ 416
35322

నిఫ్టీ ▲ 122
10736

డోజోన్స్ 24429 ▼ 238

నాస్‌డాక్ 7456 ▼ 06

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 67.41 ▲ 02 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 77.57 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+) నిఫ్టీ	31న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	31న	మార్పు%
ADANI P&S	392.15	4.74	SUN PHARMA	480.35	-2.87
HDFC BANK	2139.45	4.45	TATA MOTORS	282.50	-2.22
INDUSIND BANK	1955.45	3.75	HINDALCO INDU	234.20	-1.64
TECH MAHINDRA	712.35	3.65	HERO MOTOCORP	3544.90	-1.57
M&M	922.95	2.78	TITAN COMPANY	900.10	-1.48
COAL INDIA	296.25	2.49	DR. REDDYS LAB	1936.60	-1.28
KOTAK MAHINDRA	1334.60	2.41	LUPIN	770.35	-1.14

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.30	71.08	బహ్రెయిన్ దీనార్	166.01	190.24
పౌండ్ స్టెర్లింగ్	81.57	94.59	కువైట్ దీనార్	184.20	229.30
యూరో	71.52	82.94	ఒమన్ రియాల్	162.57	185.99
జపనీస్ యెన్/100	56.38	65.38	సౌదీ రియాల్	16.30	19.32
ఆస్ట్రేలియా డాలరు	46.32	53.59	యూఏఈ దిర్హమ్	16.69	19.51
సింగపూర్ డాలరు	45.80	54.24	మలేషియా రింగిట్	15.09	18.56
థాయ్ బాత్/100	191.51	229.04	చైనీస్ యువాన్	7.44	12.06

గురువారం నిఫ్టీ కదలికలు



జంట షేర్లు నడిపించాయ్

కదం తొక్కిన హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

- 35000 ఎగువకు సెన్సెక్స్
- 10700 పైకి నిఫ్టీ
- కలిసొచ్చిన షార్ట్ కవరింగ్
- దూసుకెళ్లిన బ్యాంక్ నిఫ్టీ



మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిశాయి. జీడీపీ గణాంకాలు ఆశావహంగా ఉంటాయన్న అంచనాలతో మదుపర్లు కొనుగోళ్ల మోత మోగించారు. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీలు కీలక స్థాయిలను అధిగమించాయి. మార్చి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు కలిసొచ్చాయి. ఇటలీ రాజకీయ సంక్షోభం ఆందోళనలు తగ్గడం, ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి. బ్యాంకింగ్, ఆర్థిక, ఇంధన షేర్లు రాణించాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా ప్రైవేట్ బ్యాంక్‌లు కదం తొక్కడంతో బ్యాంక్ నిఫ్టీ చెలరేగింది. ఇంట్రాడేలో 27,164.55 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరిన సూచీ.. చివరకు 628.40 పాయింట్ల లాభంతో 26,956.20 దగ్గర స్థిరపడింది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,083.81 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 35,416.03 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 416.27 పాయింట్ల లాభంతో 35,322.28 వద్ద ముగిసింది. ఏప్రిల్ 5 తర్వాత ఒక రోజులో సూచీకి వచ్చిన అత్యధిక లాభం ఇదే కావడం విశేషం. ఇక నిఫ్టీ సైతం 121.80 పాయింట్లు పెరిగి 10,736.15 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,620.40- 10,763.80 పాయింట్ల మధ్య కదలాడింది.

ఆర్‌కాం హవా: అనుబంధ సంస్థలు రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ టెలికాంలపై దివాలా ప్రక్రియ కొనసాగకుండా ఎన్‌సీఎల్ఏటీ స్టే విధించడంతో రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కాం) షేరు దూసుకెళ్లింది. ఇంట్రాడేలో 19.14 శాతం లాభపడిన షేరు.. చివరకు 6.86 శాతం పెరిగి రూ. 18.70 వద్ద ముగిసింది.

- గత 17 త్రైమాసికాల్లోనే అత్యధిక లాభాన్ని ప్రకటించడంతో ఓఎన్‌జీసీ షేరు రాణించింది. ఇంట్రాడే 3.50 శాతం పెరిగిన షేరు.. చివరకు 1.95 శాతం లాభంతో రూ.177.35 దగ్గర స్థిరపడింది.
- మరోవైపు మన్‌పసంద్ బెవరేజెస్ షేరు పతనం కొనసాగింది. ఆడిటింగ్ సంస్థ వైదొలగడంతో ఈ నెల 22 నుంచి ఇప్పటి వరకు షేరు 49.87 శాతం కుప్పకూలింది. గురువారం షేరు 9.99 శాతం నష్టంతో రూ.223.50 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభాలతో ముగిశాయి. అదానీ పోర్ట్స్ 4.70%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 4.36%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3.14%, ఎం అండ్ ఎం 3.12%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.68%, హిందుస్థాన్ యునిలీవర్ 2.03%, హెచ్‌డీఎఫ్‌సీ 1.99%, కోల్ ఇండియా 1.99%, ఓఎన్‌జీసీ 1.95%, ఇన్ఫోసిస్ 1.47%, ఏషియన్ పెయింట్స్ 1.06% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. సన్‌ఫార్మా (2.95%), టాటా మోటార్స్ (2.09%), హీరో మోటోకార్ప్ (1.65%), మారుతీ (0.81%)లు డీలాపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో బ్యాంకింగ్ 1.91 శాతం లాభపడింది. చమురు- గ్యాస్, ఐటీ, పీఎస్‌యూ, ఎఫ్‌ఎమ్‌సీజీ, టెక్ షేర్లు అదే బాటలో నడిచాయి. మన్నికైన వినిమయ వస్తువులు, స్థిరాస్తి, ఆరోగ్య సంరక్షణ షేర్లు మాత్రం డీలాపడ్డాయి.

కొనుగోళ్లకు కొన్ని కారణాలవే..

షార్ట్ కవరింగ్: మే డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో మదుపర్లు పొజిషన్లను షార్ట్ కవరింగ్ చేశారు. దీంతో ట్రేడింగ్ ఆఖర్లో సూచీలు ఒక్కసారిగా దూసుకెళ్లాయి.

జంట హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు: సూచీల లాభాల్లో అధిక శాతం వాటా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లదే కావడం విశేషం. విదేశీ మదుపర్ల వాటా పెంచుకోవడానికి నేటి నుంచి అవకాశం ఇవ్వనున్నట్లు వార్తలతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు రూ.2,150 వద్ద జీవనకాల గరిష్ఠానికి చేరింది. చివరకు 4.36 శాతం లాభంతో రూ.2136.15 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ షేరు 1.99 శాతం పెరిగి రూ. 1828.50 దగ్గర స్థిరపడింది.

సానుకూల అంతర్జాతీయ సంకేతాలు: ఇటలీలో రాజకీయ పరిస్థితులు చల్లబడటం, చైనా ఆర్థిక గణాంకాలు అంచనాలు మించడంతో ఆసియా మార్కెట్లు రాణించాయి. ఐరోపా మార్కెట్లు సైతం మెరుగ్గా ప్రారంభం కావడం సెంటిమెంట్‌ను బలపరిచింది.

వర్షపాతం, జీడీపీ: ఈ ఏడాది వర్షపాతం సాధారణంగా ఉండొచ్చన్న అంచనాలకు.. నాలుగో త్రైమాసిక జీడీపీ గణాంకాలు తోడు కావడంతో మదుపర్ల కొనుగోళ్లు వెల్లువెత్తాయి.

నేటి మార్కెట్

సమీక్ష

నేడు సూచీలు లాభాల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఇందుకు దన్నుగా నిలవొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. శుక్రవారం నుంచి ఈ బ్యాంక్ షేర్ల కొనుగోళ్లకు విదేశీ సంస్థాగత మదుపర్లకు మళ్లీ అవకాశమివ్వడమే ఇందుకు కారణం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో విదేశీ మదుపర్లు 1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.6700 కోట్లు)కు పైగా విలువైన షేర్లు కొనుగోలు చేయొచ్చని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరుకు రూ.2245 వద్ద నిరోధం ఎదురుకావొచ్చని, అయితే పరిణామం గణనీయంగా పెరగొచ్చని సాంకేతిక విశ్లేషకులు భావిస్తున్నారు. గురువారం మార్కెట్లు ముగిసిన అనంతరం వెలువడిన నాలుగో త్రైమాసిక, 2017-18 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ గణాంకాలు సూచీలపై ప్రభావం చూపొచ్చు. అంతర్జాతీయ మార్కెట్లు, మే వాహన విక్రయ గణాంకాల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. నేడు నిఫ్టీ 10650- 10800 శ్రేణిలో కదలాడే అవకాశం ఉంది. ఈ ఏడాది ముగిసే వరకు చమురు ఉత్పత్తిపై ఒపెక్ దేశాలు ఆంక్షలు కొనసాగించొచ్చన్న వార్తలతో ముడిచమురు ధరలపై మదుపర్లు ఓ కన్నేయొచ్చు.

ఐడియా టవర్లు అమ్మేసింది

రూ.4,000 కోట్లకు కొనుక్కున్న ఏటీసీ

దిల్లీ: ఐడియా సెల్యూలార్ టవర్ల అమ్మకాన్ని పూర్తి చేసింది. దాదాపు 9,900 టవర్లను అమెరికన్ టవర్ కార్పొరేషన్‌కు (ఏటీసీ) చెందిన భారత శాఖకు విక్రయించింది. లావాదేవీ విలువ రూ.4,000 కోట్లు. 'ఐడియా పూర్తి స్థాయి అనుబంధ సంస్థ ఐసీఐఎస్ఎల్‌లో మొత్తం వాటాను ఏటీసీ టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు విక్రయించడం ద్వారా దేశవ్యాప్త టవర్ల వ్యాపార విక్రయ ప్రక్రియను పూర్తి చేశామ'ని ఐడియా ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే వొడాఫోన్ ఇండియాకు చెందిన టవర్లను కూడా రూ.3,850 కోట్లకు ఏటీసీ కొనుగోలు చేసింది. ఈ లావాదేవీ కింద అమెరికా సంస్థ చేతికి సుమారు 10,200 టవర్లు వచ్చాయి. ఇప్పుడు ఈ రెండు లావాదేవీల అనంతరం టవర్ల సంఖ్య విషయంలో బీఎస్ఎన్ఎల్‌ను ఏటీసీ వెనక్కి నెట్టింది. తద్వారా దేశంలో అత్యధిక టవర్లు కలిగి ఉన్న సంస్థగా స్థానం పొందింది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు 66,000 మొబైల్ టవర్లు ఉండగా.. ఏటీసీ టవర్ల సంఖ్య సుమారు 78,000కు చేరింది.

హైదరాబాద్ కంపెనీలకు 'ధొలేరా' ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: దిల్లీ-ముంబయి పారిశ్రామిక క్యారిడార్‌లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు 80 కిలోమీటర్ల దూరంలో అభివృద్ధి చేస్తున్న ధొలేరా పారిశ్రామిక సిటీలో పరిశ్రమలు ప్రారంభించాల్సిందిగా తెలుగు రాష్ట్రాలకు చెందిన పరిశ్రమలను ధొలేరా ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (డీఐసీడీఎల్) ఆహ్వానిస్తోంది. పెట్టుబడులకు వివిధ సిటీల్లో నిర్వహిస్తున్న రోడ్‌షోలలో భాగంగా హైదరాబాద్‌లో రోడ్ షోను నిర్వహించామని, దాదాపు 50 కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని డీఐసీడీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ జై ప్రకాశ్ శివహరే తెలిపారు. అన్ని రంగాల్లోని కంపెనీలను ఇక్కడ యూనిట్లను ఏర్పాటు చేయమని ఆహ్వానిస్తున్నామని, అయితే.. రక్షణ, ఏరోస్పేస్, భారీ పరిశ్రమల రంగాలకు చెందిన యూనిట్ల ఏర్పాటుపై దృష్టి కేంద్రీకరిస్తున్నామని వివరించారు. హైదరాబాద్ రక్షణ, ఏరోస్పేస్ రంగ కంపెనీలకు కేంద్రంగా ఉన్నందున ఇక్కడి కంపెనీలు ధొలేరా పారిశ్రామిక సిటీలో యూనిట్లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపే వీలుందన్నారు. దిల్లీ-ముంబయి పారిశ్రామిక క్యారిడార్‌లో మొత్తం ఎనిమిది పారిశ్రామిక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో ధొలేరా పారిశ్రామిక సిటీ ఒకటి. దిల్లీ, ముంబయి ఇండస్ట్రియల్ క్యారిడార్ డెవలప్‌మెంట్ కంపెనీ (డీఎంఐసీడీసీ) ద్వారా డీఐసీడీఎల్‌లో కేంద్ర ప్రభుత్వం 49 శాతం వాటాను కలిగి ఉంది. ఇప్పటి వరకూ రూ.1,293 కోట్ల పెట్టుబడులు పెట్టింది.

31న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	361	వరంగల్	363
చిల్లరగా (ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	366
బెంగళూరు	408	చెన్నై	435
1వ తేదీకి...		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	360	నమక్కల్	420

రారాజు ఐఓసీ

- పీఎస్‌యూల్లో అత్యధిక లాభం కంపెనీదే
- వరుసగా రెండో ఏడాదీ..

దిల్లీ: ఇంధన రిటైలర్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) వరుసగా రెండో ఏడాదీ అత్యధిక లాభాన్ని నమోదు చేసిన ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)గా రికార్డు సాధించింది. భారత్‌లో అత్యధిక లాభదాయకమైన సంస్థగా గత రెండేళ్ల వరకు ఓఎన్‌జీసీ ఉండేది. దాన్ని ఐఓసీ అధిగమించింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి 12 శాతం వృద్ధితో రూ.19,106 కోట్ల నుంచి రూ.21,346 కోట్లకు ఐఓసీ నికర లాభం పెరిగింది. ఓఎన్‌జీసీ విషయానికొస్తే, 11.4 శాతం వృద్ధితో నికర లాభం రూ.19,945 కోట్లకు చేరింది. ఇక మిగతా కంపెనీల లాభాల గురించి ప్రస్తావిస్తే..

- ముఖేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ భారత్‌లో అత్యధిక లాభదాయకత ఉన్న కంపెనీగా వరుసగా మూడో ఏడాదీ నిలిచింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థ ఏకంగా రూ. 36,075 కోట్ల నికర లాభం ఆర్జించడం విశేషం.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ తరవాత రెండో స్థానంలో సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతిదారు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిలిచింది. ఈ సంస్థ రూ.25,880 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.
- భారత్‌లో అత్యంత లాభదాయకమైన కంపెనీగా ఓఎన్‌జీసీ కొన్నేళ్లపాటు కొనసాగింది. అయితే ఈ కీర్తి కిరీటాన్ని మూడేళ్ల కిందట ప్రైవేటు సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్‌లకు అందించింది. ఇంకా చెప్పాలంటే, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌లు సంయుక్తంగా ఆర్జించిన లాభాల కంటే ఓఎన్‌జీసీ లాభమే ఎక్కువగా ఉండేది. అలాంటిది ఇప్పుడు ఒక్క ఐఓసీ లాభం కంటే ఓఎన్‌జీసీ వెనక పడింది.
- 2017-18 ఆర్థిక సంవత్సరానికి హెచ్‌పీసీఎల్ లాభం రూ.6,357 కోట్లు. బీపీసీఎల్ లాభం రూ.7,919 కోట్లు.

చమురు శుద్ధి, మార్కెటింగ్ కంపెనీల నిరంతర లాభదాయకతను దృష్టిలో ఉంచుకొని ఓఎన్‌జీసీ వాటికి సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇటీవల కోరింది. అయితే ఓఎన్‌జీసీ అధికారి ఒకరు దీనిపై స్పందిస్తూ 'ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థల లాభాల్ని ఒక్కసారి చూడండి, వాటికి సబ్సిడీ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఓఎన్‌జీసీ ప్రతి యేటా రూ.30,000-35,000 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. సబ్సిడీలు ఇస్తూ పోతే కంపెనీ నిలకడగా కార్యకలాపాలు చేసుకొనే పరిస్థితి ఉండద'ని తెలిపారు.

ఎల్ఈడీ టీవీ తెరల తయారీకి సైకవర్త్‌తో సైక్వాడ్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ఎల్ఈడీ టీవీలకు సంబంధించిన తెరల అసెంబ్లింగ్ కోసం హైదరాబాద్‌కు చెందిన సైక్వాడ్ ఎలక్ట్రానిక్స్, చైనా సంస్థ సైకవర్త్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. నగర శివారులో సంస్థకు ఉన్న తయారీ కేంద్రంలోనే కొత్త ఎల్ఈడీ టీవీ ప్యానెళ్లను కూడా ఉత్పత్తి చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 2 లక్షల ప్యానెళ్లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 2019-2020నాటికి ఈ సంఖ్య 3.5లక్షలకు చేరుకుంటుందని సంస్థ పేర్కొంది. రోజుకు ఒక్కో షిఫ్ట్‌లో 2వేల వరకూ ప్యానెళ్లను తయారు చేసే సామర్థ్యం ఉన్న ఈ కేంద్రంలో 14-55 అంగుళాల తెరలను తయారు చేస్తామని తెలిపింది. స్థానికంగా తయారు చేయడం ద్వారా 15శాతం వరకూ దిగుమతి సుంకం తగ్గుతుందనీ, దీనివల్ల ధరల పోటీలో ముందుండేందుకు వీలవుతుందని పేర్కొంది. తయారీ యూనిట్ ప్రారంభం సందర్భంగా సైకవర్త్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ డేనియల్ సాంగ్ మాట్లాడుతూ స్థానిక తయారీ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని, తమకున్న అనుభవాన్ని ఉపయోగించి అత్యాధునిక ఎల్ఈడీ ప్యానెళ్లను తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ ఓఈఎం బ్రాండ్ టీవీలకు వీటిని ఉపయోగించుకుంటామని తెలిపారు. భారత్‌లో తమ ఉనికిని విస్తరించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఒప్పందం తర్వాత కొత్తగా 200 ఉద్యోగులను సైక్వాడ్ నియమించుకోనుంది. దీంతో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 2000లకు చేరుతుంది. సైక్వాడ్ సీఈఓ రవీందర్ సింగ్ సోయిన్ మాట్లాడుతూ.. టెలివిజన్ మార్కెట్లో ఉన్న అవకాశాలను అందుకునేందుకు ఈ వ్యూహాత్మక ఒప్పందం దోహదం చేస్తుందన్నారు.

గాయత్రీ ప్రాజెక్ట్స్ లాభంలో 157% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: గాయత్రీ ప్రాజెక్ట్స్ 2018, మార్చితో ముగిసిన మూడు నెలలకు స్టాండ్ అలోన్ ప్రాతిపదికన రూ.72.75 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.28.3 కోట్లతో పోలిస్తే 157 శాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. ఇదే కాలానికి మొత్తం ఆదాయం రూ.833.33 కోట్ల నుంచి రూ.928.98 కోట్లకు చేరింది. మొత్తం ఏడాదికి ఆదాయం రూ.2,921.23 కోట్లు ఉండగా.. నికర లాభం రూ.188.09 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాదిలో ఆదాయం రూ.2145.93 కోట్లు, నికర లాభం రూ.70.42 కోట్ల మేరకు ఉన్నట్లు కంపెనీ తెలిపింది.

తగ్గిన జీఎంఆర్ ఇన్‌ఫ్రా లాభం

- త్రైమాసికానికి రూ.5 కోట్లు
- ఆదాయం రూ.2,234 కోట్లు
- శంషాబాద్ విమానాశ్రయం లాభం రూ.603 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఏకీకృత ప్రాతిపదికన 2018, మార్చితో ముగిసిన త్రైమాసికానికి జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.4.87 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.78.77 కోట్లుంది. సమీక్ష త్రైమాసికానికి ఆదాయం కూడా రూ.2,902.51 కోట్ల నుంచి రూ.2,234.88 కోట్లకు తగ్గింది. మొత్తం ఏడాదికి రూ.9,274.25 కోట్ల ఆదాయంపై రూ.1,114.59 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఏడాదిలో ఆదాయం రూ.10,039.10 కోట్లు ఉండగా.. నష్టం రూ.347.46 కోట్లుగా నమోదైంది. 2017-18కి విమానాశ్రయాల రంగంలో ప్రయాణికుల రద్దీ 15 శాతం పెరిగిందని కంపెనీ వెల్లడించింది. చివరి త్రైమాసికంలో గోవాలోని విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొంది. సమీక్ష త్రైమాసికానికి విమానాశ్రయాల విభాగం నుంచి రూ.1,215 కోట్ల ఆదాయం లభించింది. విద్యుత్ రంగ వాటా రూ.453 కోట్ల మేరకు ఉంది.

హైదరాబాద్ విమానాశ్రయం..

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గత ఆర్థిక సంవత్సరానికి ప్రయాణికుల రద్దీ 20 శాతం పెరిగింది. చివరి త్రైమాసికానికి ఇది 25 శాతం ఉంది. మొత్తం ఏడాదికి శంషాబాద్ విమానాశ్రయం ఆదాయం రూ. 13 శాతం పెరిగి రూ.1,105 కోట్ల నుంచి రూ.1,249 కోట్లకు చేరింది. ఈ విమానాశ్రయం ద్వారా లభించిన లాభం కూడా రూ.434 కోట్ల నుంచి రూ.603 కోట్లకు చేరిందని జీఎంఆర్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. దిల్లీ విమానాశ్రయంలో మొత్తం ఏడాదికి 14 శాతం, చివరి త్రైమాసికానికి 15 శాతం చొప్పున ప్రయాణికులు పెరిగారు. 2017-18కి నాన్ ఏరో రెవెన్యూ వాటా రూ.1,528 కోట్ల నుంచి రూ.1,800 కోట్లకు చేరింది.

ఐసీఏఐ హైదరాబాద్ ఛైర్మన్ చంద్రశేఖర్

ఈనాడు, హైదరాబాద్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) హైదరాబాద్ చాప్టర్ మేనేజింగ్ కమిటీ ఛైర్మన్‌గా చంద్ర శేఖర్ రాజనాల ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్‌గా మునిశేఖర్ దారపునేని, కార్యదర్శిగా కళ్యాణి పెమ్మరాజు, కోశాధికారిగా చంద్ర శేఖర రెడ్డి పొనుగోటి ఎన్నికైనట్లు ఐసీఏఐ హైదరాబాద్ చాప్టర్ వెల్లడించింది. మేనేజింగ్ కమిటీ సభ్యుల్లో కె.వి.ఎస్.లావణ్య, ఎం. వెంకటేశ్వర్లు, వి. సుధారాణి ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT &	392.15 (374.40) 11133305
ASIAN PAINTS	1304.65 (1293.85) 1400776
AXIS BANK LT	545.90 (541.65) 15652651
BAJAJ AUTO L	2750.30 (2762.90) 447005
BAJAJ FINANC	2109.90 (2118.65) 1323397
BAJAJ FINSER	6042.25 (5958.85) 264768
BHARTI AIRTE	373.60 (375.80) 10796716
BHARTI INFRA	298.65 (301.15) 11366237
BPCL	403.95 (400.25) 8807443
CIPLA	524.80 (525.60) 3539206
COAL INDIA L	296.25 (289.05) 11797649
DR. REDDYS	1936.60 (1961.80) 1860178
EICHER MOTOR	30780.65 (30136.30) 91548
GAIL	350.90 (343.05) 11187995
GRASIM IND	1039.80 (1041.50) 1436944
HCL TECH	910.35 (907.35) 2809322
HDFC	1833.00 (1790.80) 5622276
HDFC BANK	2139.45 (2048.35) 9909798
HERO MOTOCOR	3544.90 (3601.45) 707484
HINDALCO IND	234.20 (238.10) 8948198
HINDUSTAN UN	1611.45 (1585.80) 3315162
HPCL	311.85 (306.85) 9642777
ICICI BANK	285.80 (284.90) 23698686
INDIABULLS H	1242.70 (1229.75) 5749164
INDIAN OIL	174.10 (170.80) 32872156
INDUSINDBANK	1955.45 (1884.85) 3896725
INFOSYS LTD	1231.80 (1211.70) 9860170
ITC	271.65 (271.90) 13212672
KOTAK MAHIND	1334.60 (1303.25) 6684898
LARSEN & TOU	1370.40 (1365.65) 2930988
LUPIN	770.35 (779.20) 1994980
M&M	922.95 (897.95) 9417129
MARUTI SUZIK	8537.20 (8588.20) 679959
NTPC LTD	167.55 (165.30) 24527412
ONGC	177.90 (174.00) 23822373
POWER GRID C	209.45 (209.50) 154323307
RELIANCE IND	921.35 (916.10) 16951801
SBI	269.55 (267.15) 31935892
SUN PHARMA	480.35 (494.55) 18790216
TATA CONSULT	1741.05 (3514.10) 5049371
TATA MOTORS	282.50 (288.90) 28771987
TATA STEEL L	575.65 (577.90) 6652510
TECH MAHINDR	712.35 (687.25) 7789699
TITAN IND	900.10 (913.60) 4903734
ULTRATECH	3744.90 (3706.65) 733987
UPL LIMITED	707.60 (704.70) 3805358
VEDANTA LIMI	248.30 (251.10) 29327091
WIPRO	261.90 (260.85) 5148537
YES BANK LTD	346.20 (343.15) 17910411
ZEE ENTERTAI	556.05 (557.45) 5696521

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB	1231.85 (1239.45) 41589
ACC	1354.60 (1309.40) 3873328
ADITYA BIRLA	146.70 (147.50) 988712
AMBUJA CEMEN	205.40 (206.20) 6571778
ASHOK LEYLAN	148.05 (149.40) 15790863
AUROBIND PHA	556.30 (565.65) 4280622
AVENUE SUPER	1572.15 (1565.95) 14993077
BANK OFBAROD	136.85 (138.45) 13116608
BEL	114.40 (119.45) 9041820
BHEL	83.65 (83.00) 16494380
BOSCH LTD	18367.50 (18551.15) 32745
BRITANNIA	5923.95 (5789.85) 310385
CADILA HEALT	361.30 (367.50) 3116812
COLGATE PALM	1259.70 (1250.50) 820342
CONTAINER	1379.05 (1374.60) 3216694
CUMMINS INDI	701.35 (708.05) 616972
DABUR INDIA	383.30 (381.90) 3223114
DLF LIMITED	209.90 (207.85) 7797171
EMAMI LIMITE	1046.00 (1049.80) 34216
GENERAL INS	724.55 (747.25) 162447
GODREJ CONSU	1139.15 (1133.45) 1519120
HAVELLS INDI	544.15 (558.15) 1521311
HINDUSTAN ZI	296.35 (294.85) 3784771
ICICI PRU LI	422.50 (420.85) 1376030
IDEA CELLULR	61.50 (61.85) 23784601
INTERGLOBE A	1219.25 (1239.05) 11016274
JSW STEEL LT	331.90 (332.55) 6771065
L&TFIN.HOLD	169.85 (172.80) 2378095
LIC HOUS.FIN	475.15 (476.25) 3476577
MARICO LIMIT	321.85 (318.50) 2225475
MCDOWELL	3343.60 (3386.65) 437615
MOTHERSON	310.15 (312.25) 3966415
MRF	75734.05 (77087.60) 4232
NHPC LTD	26.50 (26.60) 5556220
NMDC LTD	117.45 (119.75) 1684572
OIL INDIA	215.85 (216.75) 1314254
ORACLE FIN S	3942.90 (3763.80) 107980
P&G HYG&HEAL	9301.50 (9246.60) 869
PETRONET LNG	219.65 (218.00) 8700031
PIDILITE IND	1157.60 (1187.80) 13140065
PIRAMAL ENTE	2371.45 (2353.95) 428181
PNB	83.65 (86.10) 17359606
POWER FIN CO	80.55 (79.25) 57225598
RURAL ELEC C	118.15 (118.05) 10379303
SAIL	75.95 (77.80) 26942353
SBI LIFE INS	689.80 (694.30) 205322
SHREE CEMENT	16880.60 (16857.55) 39874
SHRIRAM TRAN	1454.30 (1486.95) 935300
SIEMENS	1045.40 (1040.85) 333346
SUN TV LTD	917.60 (936.25) 891362

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN	6.60 (6.60) 400
AISHWARYA TE	4.50 (4.51) 3951
ALPHAGEO	722.60 (740.05) 1611
AMAR RAJA BA	795.55 (788.05) 14016
ANDHRA BANK	36.35 (36.50) 208249
ANDHRA CEMEN	9.86 (10.16) 4668
ANDHRA PAPER	330.10 (332.35) 2708
ANDHRA PETRO	48.90 (51.55) 117275
ANDHRA SUGAR	385.75 (389.60) 7791
ASTRA MICROW	103.10 (108.40) 160312
AUROBINDO PH	556.50 (565.80) 137653
AVANTEL SOFT	423.05 (426.50) 11446
AVANTI FEEDS	1627.25 (1742.45) 79683
BALAJI AMIN	599.55 (610.80) 1919
BARTRONICS	11.45 (11.75) 24274
BHAGIRA CHEM	277.25 (282) 295
BHAGYA NAG	43 (43.75) 3507
BN RATHI SEC	42.40 (41.95) 1004
BRILLIANT SE	5.55 (5.80) 51264
CAMBRIDGE TE	59 (58.40) 1580
CIL SECURI	24.45 (23.65) 3324
CONT COFFEE	301.45 (306.75) 5161
COROMAN FERT	453 (458.50) 4403
CUBEX TUB	19.05 (19.60) 1600
CYBERMATE	2.45 (2.65) 135094
CYIENT LIMIT	733.80 (763.10) 17697
DECCAN CEMEN	472.55 (468.55) 253
DIVI'S LAB	1051.45 (1051.65) 19601
DIVYA GRANIT	80.10 (83.60) 1710
DR REDDY	1946.80 (1962.40) 26600
FOUR SOFT	73.80 (78.60) 2962
GATI CORPN	97.30 (98.80) 110145
GAYATRI PROJ	188.45 (190.05) 22741
GMR INFRASTR	18.15 (18.25) 1368566
GOLDST INFRA	158.55 (159.75) 4736
GOLDSTONE EN	13.83 (12.58) 14362
GRANULES (I)	78.65 (79.70) 232166
GSS AMERICA	93.60 (98.50) 1404
GVK POWER	12.94 (13.19) 508812
HBL NIFE POW	39.15 (39.90) 51232
HERITAGE FOO	719.85 (700.45) 3893
HIL LTD	2162.75 (2135) 641
HIND FLUROCA	13.95 (13.35) 1090
IDL INDUSTRS	453.80 (469.25) 2525
IKF SOFT	0.53 (0.53) 53201
ILFS ENGINEE	29.75 (31.15) 6792
INCAP	77.55 (81.60) 211
INNAREDY COM	2.02 (2.12) 4770
IVRCL INFRAS	1.68 (1.76) 934841
JEEVAN SCIEN	34.35 (36.10) 4454
KAKATIYA CEM	261.85 (255.35) 3194
KALLAM SPG	28.50 (29.05) 12798
KAVERI SEED	535.80 (539.65) 21068
KCP LTD	119.70 (118.40) 9045
KERNEX MICRO	35.30 (34) 2900
KNR CONSTRUC	297.95 (291.15) 196936
KREBS BIO	150.95 (152.90) 238
LANCO INDUS	315.60 (310.15) 4106
LANCO INFRAT	0.94 (0.90) 43816
LAURUS LABS	468.50 (460) 3512
LOKESH MACH	72.15 (71.55) 31456
MADHUCON PRO	15.45 (15.95) 25145
MEGA SOFT	10.29 (10.06) 18525
MIC ELECTRON	4.05 (3.96) 30535
MOLD-TEK.TEC	41 (42.05) 2
MOLDTK PLA	329.65 (321.10) 2649
MSR INDIA LT	38.90 (41) 4814
NAGARJAGRICH	31.20 (32.80) 21950
NAGARJAGRITE	6.30 (6.30) 724
NATCO PHARMA	804.10 (797.05) 9089
NAVA BH VENT	143.40 (154.10) 1039977
NCC	120.10 (121.20) 457111
NCL IND	201 (209.75) 297110
NEHA INTER	5.71 (5.88) 24827
NETTLINX	56.80 (56.85) 12566
NEULAND LAB	712.70 (708.90) 852
NIHAR INFO	13.10 (13) 6000
NILE	637.55 (639) 1618
NORTHGATE TE	0.60 (0.60) 17880
OIL COUNTRY	21.70 (22.10) 2588
PANKAJ POLY	8 (7.70) 2
PANYAM CEMEN	33.85 (35.30) 16808
PENNER IND	55.35 (55.80) 20124
PHYTOCHEM I	53.80 (57.55) 5721
PIONEER DIST	285 (299.95) 15943
PITTI LAMIN	90.30 (90) 5923
POKARNA	173 (173.55) 2225
PRAJAY ENGS	10.30 (9.37) 37081
PREMIER EXPL	308 (313.10) 702
PRISM CEMENT	114.90 (117.50) 20799
PRUDENTL PHA	3.49 (3.75) 128927
RAIN INDUSTR	234.70 (240.15) 376114
RAJ PACKAGIN	29.85 (30) 35
RAM INFORMAT	41 (42.10) 724
REG.CERAMIC	4.30 (4.14) 1
SAGAR CEM	927.35 (930.15) 573
SAMKRG PIST	258.85 (254.60) 1558
SAMPRE NUTRI	56.90 (57.85) 3953
SATVAH. ISPA	16.45 (16.15) 946
SMS PHARMA	67.05 (67.45) 1398
SOUTH BIO TE	1.83 (1.92) 1305
SPHERE GLOBA	27 (28.95) 46841
SREE RAYAL A	39.75 (40.30) 52459
SRI KPR INDU	25.30 (24.10) 100
SRINIVASA SH	41.40 (46.95) 8183
STARCHIK SP	24.30 (23.15) 920
STEEL EXCHAN	25.50 (25.60) 9965
SUJANA METAL	0.90 (0.88) 4100
SUJANA TOWER	2.27 (2.17) 2551
SUJANA UNIVE	0.53 (0.52) 20540
SURANA TELE	4.83 (4.79) 2600
SURYALAKSH.C	57.35 (58.25) 175
SURYALATA SP	128.25 (131.35) 2677
SURYAVA SPIN	6.65 (6.37) 26
SUVEN PHARMA	190.40 (196.85) 31560
TAJ GVK HOTE	220.15 (227.80) 20202
TANLA	30.70 (30.85) 23119
TERA SOFTWAR	42.30 (42.60) 1900
TRANS BIOTEK	2.14 (2.15) 1923
TRENDY KNIT	0.19 (0.19) 6502
VAMSHI RUBB	48.60 (48.30) 75
VBC FERRO	38.20 (39.55) 805
VICEROY HOTE	10.25 (10.11) 73437
VIJAY TEXTIL	57.05 (57.50) 12909
VIMTA LABS	204.05 (204.05) 1170
VISAKA IND	662.50 (672.20) 8064
VISTA PHARMA	38.05 (40.55) 109289
VIVIMED LABS	62.75 (61.25) 212034
VJIL CONSULT	19.50 (19.85) 354
VST INDUS	3170 (3095.20) 64
YBRANT DIGIT	4.86 (5.11) 146138
ZENOTECH LAB	37.55 (38.25) 2682
ZENTECH	101.65 (106.45) 39141

గురువారం చెన్‌గన్నూరులో విజయం సాధించిన అనంతరం అభివాదం చేస్తున్న వామపక్ష అభ్యర్థి సజి చెరియన్

రాంచీలో విజయ సంకేతం చూపుతున్న సిలీ స్థానంలో గెలుపొందిన ఝార్ఖండ్ ముక్తి మోర్చా అభ్యర్థి సీమా మహతో

భండరా-గోండియా లోక్‌సభ స్థానంలో గెలుపొందిన అనంతరం తన భార్యతో కలిసి సంబరాల్లో పాల్గొన్న ఎన్సీపీ అభ్యర్థి కేఎం యశ్వంతరావ్

అసెంబ్లీ ఉప ఎన్నికలలో విజేతల ఆధిక్యాలు

నియోజకవర్గం	విజేత	సమీపప్రత్యర్థి	ఆధిక్యం
జోకీహాట్ (బిహార్)	షానవాజ్ ఆలం (ఆర్జేడీ)	ముర్షీద్ ఆలం (జేడీయూ)	41,000
నూర్‌పుర్ (ఉత్తర్‌ప్రదేశ్)	నయీముల్ హసన్ (సమాజ్‌వాదీపార్టీ)	అవనీసింగ్ (భాజపా)	5,662
షాకోట్ (పంజాబ్)	హర్‌దేవ్‌సింగ్ లాడీ (కాంగ్రెస్)	నాయబ్‌సింగ్ (శిరోమణి అకాలీదళ్)	38,802
గోమియా (ఝార్ఖండ్)	బబితాదేవి (జేఎంఎం)	లంబోదర్ మహతో (ఏజేఎస్‌యూ)	1,344
సిల్లి (ఝార్ఖండ్)	సీమామహతో (జేఎంఎం)	సుధేష్ మహతో (ఏజేఎస్‌యూ)	13,508
మహేస్థల (పశ్చిమబెంగాల్)	దులాల్‌దాస్ (తృణమూల్ కాంగ్రెస్)	సుజిత్‌ఘోష్ (భాజపా)	62,765
థరాలి (ఉత్తరాఖండ్)	మున్నిదేవీషా (భాజపా)	జీత్‌రామ్ (కాంగ్రెస్)	1,981
ఆర్‌ఆర్‌నగర్ (కర్ణాటక)	మునిరత్న (కాంగ్రెస్)	తులసి మునిరాజుగౌడ (భాజపా)	25,400
చెన్‌గన్నూర్ (కేరళ)	చేరియన్ (సీపీఎం)	విజయ్‌కుమార్ (కాంగ్రెస్)	20,956
అంపతి (మేఘాలయ)	మియాని డి షిరా (కాంగ్రెస్)	క్లైమెంట్ జి మొమిన్ (ఎన్‌పీపీ)	3,191

2019 లో

భాజపాకు ముచ్చెమటలేనా!

- ప్రతిపక్షాల ఐక్యతతో భారీ దెబ్బ తప్పదా?
- పట్టున్న రాష్ట్రాల్లోనూ కాషాయ పార్టీ పలుచన
- ఉప ఎన్నికల ఫలితాలతో మారుతున్న సరళి

మోదీ ప్రభంజనం ఎగిసిపడ్డ అలే అవుతుందా? 2019 సాధారణ ఎన్నికల్లో భాజపా చెమటోడ్చక తప్పదా? కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ తదితర విపక్షాలు కలిసి బరిలోకి దిగితే... కాషాయపార్టీ ఖంగు తినాల్సిందేనా? గట్టి పట్టున్న ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లోనూ పలుచనకాక తప్పదా? దేశవ్యాప్తంగా 4 లోక్‌సభ, 10 శాసనసభ స్థానాలకు జరిగిన తాజా ఉప ఎన్నికల ఫలితాలతో తీవ్ర చర్చకు తెరలేపిన ప్రశ్నలివి!

2014లో కేంద్రంలో అధికారం చేపట్టడానికి అవసరమైన మెజార్టీని భాజపా సొంతంగా, సంపూర్ణంగా సాధించి చరిత్ర సృష్టించింది. మోదీ ప్రభంజనం ఇందుకు తోడ్పడింది. కానీ, ఆ తర్వాత వరుసగా జరిగిన ఉపఎన్నికల్లో మాత్రం ఆ స్థాయి ప్రదర్శన చూపలేకపోయింది. ప్రతిపక్షాల ఐక్యత ముందు ఆ పార్టీ నిలబడలేకపోయింది. గట్టి పునాదులున్న ఉత్తరప్రదేశ్‌లోనూ కంచుకోటల్లాంటి మూడు లోక్‌సభ సిట్టింగ్ స్థానాలను చేజార్చుకుంది. దీన్నిబట్టి- 2014 నాటి ఫలితాలు భవిష్యత్తులో పునరావృతం కావని స్పష్టమవుతోంది. భాజపా మళ్లీ అధికారంలోకి వచ్చినా, ఎన్డీఏ పక్షాల మద్దతుతోనే అది సాధ్యమవుతుందన్నది నిపుణుల విశ్లేషణ.

ఆ రెండు రాష్ట్రాల్లో ఏమవుతుంది?

ఉత్తరప్రదేశ్ భాజపా కంచుకోట! గత లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ 42.30% ఓట్లు సాధించి, అధికారంలోకి వచ్చింది. బద్ధశత్రువులైన ఎస్పీ (22.20%), బీఎస్పీ(19.60%)లు విడివిడిగా పోటీ చేయడం కాషాయపార్టీకి కలిసొచ్చింది. కానీ, మోదీని దీటుగా ఎదుర్కొనే క్రమంలో విభేదాలను పక్కనపెట్టి ఇప్పుడు ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్‌లు ఒక్కటయ్యాయి. గోరఖ్‌పూర్, ఫుల్‌పుర్, కైరానా లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలిపి భాజపాను మట్టికరిపించాయి. ఇప్పుడిదే అధికార పార్టీకి కునుకులేకుండా చేస్తోంది. వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ విపక్షాలు కలిసి పోటీచేస్తే రాష్ట్రంలో 49.30% ఓట్లు వారి అభ్యర్థులకే పడతాయి. 'మోదీ వేవ్' సన్నగిల్లడం, కొంతలో కొంత ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా మరిన్ని ఓట్లు విపక్షాలకు మళ్లవచ్చు. అలాంటప్పుడు 80 స్థానాలున్న గుండెకాయలాంటి ఉత్తరప్రదేశ్‌లో భాజపా అత్యధిక స్థానాలను కోల్పోవాల్సి వస్తుంది.

ఇక 40 లోక్‌సభ సీట్లున్న బిహార్‌లో గతసారి భాజపా 29.40% ఓట్లతో 22 స్థానాలను దక్కించుకుంది. దూరమైన చిరకాల మిత్రుడు, 15.80% ఓట్లు సాధించిన జేడీ(యూ) నేత నీతీశ్ మళ్లీ తన గూటికి చేరడంతో రాష్ట్రంలో తనకు ఎదురులేదని కాషాయపార్టీ భావించింది. ముఖ్యమంత్రి నీతీశ్‌కు ఉన్న పలుకుబడి, పాలనా దక్షత తమకు కలిసొస్తుందని ఆ పార్టీ నేతలు యోచించారు. కానీ, ప్రజల నాడి మరోలా ఉందని తాజా ఉప ఎన్నికలు తేల్చేశాయి. ఆర్జేడీని వీడి సంకీర్ణ ధర్మానికి నీతీశ్ తూట్లు పొడిచారనీ, భాజపాతో అనైతికంగా జతకట్టారని నిరసిస్తూ జేడీ(యూ) సభ్యుడు సర్ఫరాజ్ ఆలం రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన 'జోకిహత్'లో ఆర్జేడీ అభ్యర్థి షానవాజ్ గెలుపొందడం జేడీ(యూ)కు చెంపపెట్టే! ఇప్పటికే ఎన్డీయేలో తనకు తగిన ప్రాధాన్యం దక్కలేదని భావిస్తున్న నీతీశ్.. వచ్చే ఎన్నికల్లో భాజపాతో కలిసి ముందుకెళ్లడం సందేహాస్పదమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఒకవేళ కాంగ్రెస్, ఆర్జేడీ, ఎన్సీపీ తదితర విపక్షాలు కలిసి పోటీచేస్తే... ఆ కూటమికి 30 శాతానికిపైగా ఓట్లు పోలవుతాయి. దీంతో రాష్ట్రంలోని చాలా సీట్లను భాజపా కోల్పోవాల్సి రావచ్చు.

గురువారం మహారాష్ట్రలోని భండారాలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సంబరాలు

హిందీ రాష్ట్రాల్లో పరిస్థితేంటి?

ఎన్నికలకు ముందే విపక్షాల మధ్య పొత్తు వికసిస్తే... పలు హిందీ రాష్ట్రాల్లోనూ భాజపా గట్టి పోటీని ఎదుర్కొక తప్పదు. 29 సీట్లున్న మధ్యప్రదేశ్‌లో 2014లో భాజపాకు 54% ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ 34.9%, బీఎస్పీ 3.8% ఓట్లు సాధించాయి. ఈ రెండు పార్టీలూ పొత్తుపెట్టుకోవడంతో పాటు... ఎన్డీయే సర్కారు పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమైతే మాత్రం ఇక్కడ భాజపా ఎక్కువ సీట్లనే కోల్పోవాల్సి వస్తుంది.

- రాజస్థాన్‌లో ఇప్పటికే భాజపా వ్యతిరేక పవనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో కాషాయపార్టీ అధికారంలో ఉన్నా- అల్వార్, అజ్‌మేర్ లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో ఆ పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. కనీసం మండల్‌గఢ్ శాసనసభ స్థానాన్నయినా నిలుపుకోలేకపోయింది. ఈ మూడింటినీ కాంగ్రెస్ పార్టీయే కొల్లగొట్టింది.
- ఉత్తరాఖండ్‌లోని తాజాగా 'తరాలీ' శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో భాజపా అభ్యర్థి మున్నీదేవి షా... కాంగ్రెస్ అభ్యర్థి జీత్‌రాంపై కేవలం 1,900 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. భర్త మరణంతో బరిలోకి దిగిన ఆమెకు సానుభూతి ఓట్లు కూడా పెద్దగా రాకపోవడం గమనార్హం. ఆమెకు బదులు మరో అభ్యర్థి పోటీచేసి ఉంటే భాజపా ఈ సీటును కోల్పోవాల్సి వచ్చేదన్న వాదన వినిపిస్తోంది.
- 14 స్థానాలున్న ఝార్ఖండ్‌లోనూ భాజపాకు ఎదురీత తప్పేలా లేదు. సిల్లీ, గోమియా శాసనసభ స్థానాలను జేఎంఎం నిలబెట్టుకోగలిగింది. 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో 40.10% ఓట్లు సాధించిన భాజపా మూడో స్థానానికే పరిమితమైంది. ఇక్కడ కాంగ్రెస్, జేఎంఎంలు పొత్తు పెట్టుకుంటే కొన్ని స్థానాల్లో భాజపాపై పైచేయి సాధించే వీలుంది.

గుజరాత్, మహారాష్ట్రల్లో లుకలుకలు...

భాజపాతో బహిరంగంగానే బాహాబాహీకి దిగుతున్న శివసేన... ఒంటరిగా పోటీచేస్తే మహారాష్ట్రలో కాషాయ పార్టీ మట్టి కరవాల్సిందేనన్న అభిప్రాయముంది. తాము అధికారంలోకి రాకపోయినా, భాజపాను అధికారానికి దూరం చేయాలన్న తాపత్రయం 'సేన'ధిపతుల్లో కనిపిస్తోంది. 2014లో భాజపా 27.30%, శివసేన 20.60% ఓట్లు సాధించాయి. కాంగ్రెస్‌కు 18.10%, ఎన్సీపీకి 16% ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్, ఎన్సీపీలు కలిసి పోటీ చేసి, శివసేన ఒంటరిగా బరిలోకి దిగితే... భాజపా విషమ పరిస్థితిని ఎదుర్కోవచ్చు.

ఇక గుజరాత్‌లో గత సార్వత్రిక ఎన్నికల్లో 60.11% ఓట్లు సాధించిన భాజపా... ఆ తర్వాత జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అతి కష్టం మీద 40.1% ఓట్లను తెచ్చుకోగలిగింది. అంటే ఆ రాష్ట్రంలో భాజపాకు సుమారు 16 లోక్‌సభ సీట్లు తగ్గిపోయినట్లే! జాతీయస్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పొత్తు కుదుర్చుకుంటే.. వచ్చే ఎన్నికలు భాజపాకు మాత్రం నల్లేరుపై నడక కాబోదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'పొత్తు'పొడిచేనా? సఖ్యత సాగేనా?

శక్తిమంతమైన పార్టీగా భాజపా అవతరించడం; చాలా రాష్ట్రాల్లో ఆ పార్టీయే అధికారంలో ఉండటం; ఇప్పటికీ ప్రధానిగా ఎక్కువమంది మోదీనే కోరుకుంటుండటంతో... విభేదాలను పక్కనపెట్టి ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వచ్చేందుకు సుముఖంగా ఉన్నాయి. కానీ, వాటి మధ్య పొత్తు ఎంతమేర వికసిస్తుందన్నది అనుమానమే. యూపీలో బద్ధశత్రువులుగా ఉన్న ఎస్పీ, బీఎస్పీలు వీలైనన్ని ఎక్కువ సీట్ల కోసం డిమాండ్ చేయవచ్చు. ఒంటరిగానే పోటీచేస్తామని బీఎస్పీ అధినాయకురాలు మాయావతి ఇటీవల చెప్పడం పొత్తుపై అనుమానాలకు తావిస్తోంది. ఎక్కడికక్కడ పొత్తు పెట్టుకోవాల్సి రావడంతో కాంగ్రెస్ చాలా స్థానాలను మిత్రులకు కేటాయించాల్సి వస్తుంది. ఆయా పార్టీలకు మద్దతుపలికే వర్గాల ఓట్లు మిత్రపక్షాల అభ్యర్థులకు పూర్తిగా బదిలీ అవుతాయని చెప్పలేం. పైగా, ఆయా పార్టీల్లోని భంగపడ్డ ఆశావహులకు భాజపా గాలం వేయవచ్చు. అయితే... తాజా ఉప ఎన్నికల ఫలితాలు కొత్త రాజకీయ సమీకరణాలకు నాందిగా పలు రాజకీయ పార్టీలు అభివర్ణిస్తుండటం విశేషం.

భాజపా ఎలా ఎదుర్కొంటుంది?

విపక్షాల ఐక్యతను దెబ్బతీయడమే ఇప్పుడు భాజపా ముందున్న పెద్ద సవాలు. 'విభజించి గెలవడం' ఒక ఎత్తయితే... ఏదైనా ఒక బలమైన సెంటిమెంటుతో గంపగుత్తగా ఓటర్లను ఆకర్షించడం, ఎన్నికల అనంతరం చాకచక్యతతో కొత్త పొత్తులకు వెళ్లడం వంటి ప్రత్యామ్నాయాలపై ఆ పార్టీ దృష్టి సారించవచ్చు. "ప్రతిపక్షాలు జట్టు కట్టినా 50% ఓట్లను రాబట్టుకోవడం ఎలాగో భాజపాకు తెలుసు"నంటూ ఇప్పటికే ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. మోదీ ప్రభతో ఒక్కో రాష్ట్రాన్నీ తాము గెలుచుకుంటూ వస్తున్నామనీ... స్థానిక అంశాలు, వర్గ ప్రాధాన్యంతో జరిగే ఉప ఎన్నికలకు అంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరంలేదని భాజపా అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో "జాతీయ అంశం"తో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని మరో నేత వ్యాఖ్యానించడం గమనార్హం!

– ఈనాడు ప్రత్యేక విభాగం

యూపీ నుంచి భాజపా పతనం ప్రారంభం

"భాజపాకు మృత్యుఘంటికలు వినిపిస్తున్నాయి. దాని పతనం ఉత్తర్‌ప్రదేశ్ నుంచే ప్రారంభమైంది. ఫెడరల్ ఫ్రంట్ ఫార్ములా విజయవంతమైంది. ప్రాంతీయపార్టీలు బలంగా ఉన్నాయి. అఖిలేష్‌యాదవ్, మాయావతి, అజిత్‌సింగ్ కలిసి వస్తే 2014 ఫలితాలను తారుమారు చేయవచ్చు. భాజపా వల్ల ప్రజలు బాధలు పడుతున్నారు."

- మమతాబెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

విద్యావంతుడైన ప్రధాని కావాలి

"మన్మోహన్‌సింగ్ వలే ప్రధాని విద్యావంతుడై ఉండాలి. మోదీ ప్రభుత్వంపై ప్రజలు ఎంత ఆగ్రహంగా ఉన్నారో ఫలితాలు తేటతెల్లం చేశాయి. ఇప్పటివరకు ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయం ఎవరని ప్రజలు ప్రశ్నించేవారు. ఇప్పుడు తక్షణమే ఆయన్ను ఆ స్థానం(ప్రధాని పదవి) నుంచి తప్పుకోమని శాసిస్తున్నారు. ముందు ఆయన్ను తొలగించండి"

- కేజ్రీవాల్, దిల్లీ ముఖ్యమంత్రి

నీతీష్ గద్దె దిగాలి

"బిహార్ ముఖ్యమంత్రి పదవికి నీతీష్ రాజీనామా చేయాలి జోకీహాట్ అసెంబ్లీ స్థానం ఉపఎన్నిక ఫలితంతో.. క్రితం సారి అసెంబ్లీ ఎన్నికల్లో తన తండ్రి, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్‌ను చూసే ప్రజలు జేడీయూకు 71 సీట్లు కట్టబెట్టారని స్పష్టమైంది. 'అంతరాత్మ' మాట విని నీతీష్ గద్దె దిగాలి. జేడీయూపై ఆర్జేడీ అభ్యర్థి షానవాజ్ ఆలం గెలవడం.. అవకాశవాదంపై 'లాలూ'వాదం సాధించిన విజయమే. ఎన్డీయేలో కలిసినందుకు నీతీష్‌పై ప్రజలు ప్రతీకారం తీర్చుకుంటున్నారు."

- ఆర్జేడీ నేత తేజస్వీ

2019 లో మేమే గెలుస్తాం

"ఓటమికి కారణాలను విశ్లేషిస్తాం. జాతీయ పార్టీ కాంగ్రెస్ ప్రాంతీయస్థాయిలో ఆలోచిస్తోంది. ప్రజలు ముఖ్యమంత్రి లేదా ప్రధానిని ఎన్నుకోలేదు. స్థానిక అంశాల ఆధారంగా ప్రజలు ఓట్లు వేశారు. జాతీయస్థాయిలో ఆలోచించినప్పుడు భాజపానే ఎన్నుకుంటారు. 2019 ఎన్నికల్లో 2014 కంటే ఎక్కువగా లోక్‌సభ సీట్లు సాధిస్తాం".

- సమిత్‌పాత్ర, భాజపా ప్రతినిధి

దళితులు, రైతుల సమస్యలను పరిష్కరించాలి

"ఎన్‌డీఏ సంకీర్ణంలోని పార్టీలతో బంధాన్ని బలోపేతం చేసుకోవడంపై భాజపా దృష్టి పెట్టాలి. పెట్రోలియం ధరలతో పాటు దళితులు, రైతుల సమస్యలను పరిష్కరించాలి. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీల చేతిలో ఓడిపోవడం గమనించాలి".

- కె.సి.త్యాగి, జేడీయూ ప్రతినిధి

మతరాజకీయాలకు చెంపపెట్టు

"మతరాజకీయాలను ప్రజలు ఏవగించుకుంటున్నారని స్పష్టమైంది. భాజపా పాలన, భిన్నత్వంలో ఏకత్వాన్ని ధ్వంసం చేయడాన్ని సహించబోమని ప్రజలు తేటతెల్లం చేశారు. 2019 ఎన్నికల్లో గెలవడానికి, హిందూత్వ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి ఆర్‌ఎస్‌ఎస్-భాజపా మతాల ప్రాతిపదికన విభజన రాజకీయాలకు తెరలేపే ప్రమాదం ఉంది".

- ఏచూరి, సీపీఎం

రేకులు రాలుతున్న కమలం!

- లోక్‌సభ ఉప ఎన్నికల్లో 2014 నుంచి 8 సిట్టింగ్ స్థానాల్లో ఓటమి
- 282 నుంచి 272కు పడిపోయిన భాజపా సొంత బలం

దిల్లీ: కమలం రేకులు ఒక్కటొక్కటిగా రాలుతున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 282 సీట్లు గెలుచుకున్న భాజపా.. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన బలం కంటే 10 సీట్లు ఎక్కువే సాధించి ధీమా చాటింది. నాలుగేళ్లు గడిచిపోయేసరికి ఎంపీల సంఖ్య 272కు పడిపోయి.. ప్రస్తుతం ఆ పార్టీ సొంత బలం.. సాధారణ మెజారిటీకి చేరువలోకి వచ్చింది.

2014 సాధారణ ఎన్నికల తర్వాత 13 భాజపా సిట్టింగ్ స్థానాలు సహా 27 లోక్‌సభ సీట్లకు ఉపఎన్నికలు జరిగాయి. వీటిలో తిరిగి 5 సొంత స్థానాలను మాత్రమే భాజపా గెలుచుకోగలిగింది. మిగిలిన 8 సీట్లను కోల్పోయింది. ఇటీవల కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికైన భాజపా ఎంపీలు యడ్యూరప్ప, శ్రీరాములు వారి ఎంపీ పదవులకు రాజీనామాలు సమర్పించారు. దీంతో లోక్‌సభలో భాజపా బలం 272కు పరిమితమైంది.

ఇద్దరు నామినేటెడ్ సభ్యులు మినహా 543 మంది ఎంపీలు ఉండే లోక్‌సభలో 4 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. (కర్ణాటకలో ఇద్దరు భాజపా ఎంపీలు, ఒక జేడీ-యూ ఎంపీ రాజీనామా చేయగా.. కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ స్థానం ఖాళీగా ఉంది) మిగిలిన 539 మంది సభ్యులకు గానూ.. సాధారణ మెజారిటీ 270. ప్రస్తుతం భాజపా బలం సాధారణ మెజారిటీ కంటే 2 సీట్లు ఎక్కువే. ఇద్దరు నామినేటెడ్ ఎంపీలూ భాజపాకే చెందుతారు కనుక ఆ పార్టీ.. సాధారణ మెజారిటీ కంటే 4 స్థానాలను ఎక్కువే కలిగి ఉన్నట్లు లెక్క. అలానే ఎన్డీయే కూటమికి లోక్‌సభలో 315 సీట్లు ఉన్న నేపథ్యంలో ఇది ఏమాత్రం ప్రభావం చూపనిదే.

2014 నుంచి జరిగిన ఉపఎన్నికలు- ఫలితాలు..

నియోజకవర్గం	రాష్ట్రం	తొలి విజేత	ఉపఎన్నిక విజేత
2014			
★ బీడ్	మహారాష్ట్ర	భాజపా	భాజపా
కంధమాల్	ఒడిశా	బీజేడీ	బీజేడీ
మెదక్	తెలంగాణ	తెరాస	తెరాస
★ వడోదర	గుజరాత్	భాజపా	భాజపా
మెయిన్‌పురి	యూపీ	ఎస్పీ	ఎస్పీ
2015			
★★రత్లాం	మధ్యప్రదేశ్	భాజపా	కాంగ్రెస్
వరంగల్	తెలంగాణ	తెరాస	తెరాస
బాన్‌గోన్	పశ్చిమ్‌బంగ	తృణమూల్	తృణమూల్
2016			
★లఖింపూర్	అస్సాం	భాజపా	భాజపా
★షాదోల్	మధ్యప్రదేశ్	భాజపా	భాజపా
కూచ్‌బెహర్	పశ్చిమ్‌బంగ	తృణమూల్	తృణమూల్
టామ్‌లక్	పశ్చిమ్‌బంగ	తృణమూల్	తృణమూల్
తురా	మేఘాలయ	ఎన్‌పీపీ	ఎన్‌పీపీ
2017			
అమృతసర్	పంజాబ్	కాంగ్రెస్	కాంగ్రెస్
★★గురుదాస్‌పూర్	పంజాబ్	భాజపా	కాంగ్రెస్
శ్రీనగర్	జమ్ముకశ్మీర్	పీడీపీ	ఎన్‌సీ
మలప్పురం	కేరళ	ఐయూఎంఎల్	ఐయూఎంఎల్
2018			
★★అల్వార్	రాజస్థాన్	భాజపా	కాంగ్రెస్
★★అజ్మీర్	రాజస్థాన్	భాజపా	కాంగ్రెస్
ఉలుబేరియా	పశ్చిమ్‌బంగ	తృణమూల్	తృణమూల్
★★గోరఖ్‌పూర్	యూపీ	భాజపా	ఎస్పీ
★★ఫుల్‌పూర్	యూపీ	భాజపా	ఎస్పీ
అరేరియా	బిహార్	ఆర్జేడీ	ఆర్జేడీ
తాజా ఫలితాలు			
★★కైరానా	యూపీ	భాజపా	ఆర్‌ఎల్డీ
★★భండారా-గోండియా	మహారాష్ట్ర	భాజపా	ఎన్సీపీ
★పాల్ఘర్	మహారాష్ట్ర	భాజపా	భాజపా
నాగాలాండ్	నాగాలాండ్	ఎన్డీపీపీ	ఎన్పీఎఫ్

(★ భాజపా గెలుచుకున్న సొంత స్థానం, ★★ భాజపా కోల్పోయిన సొంత స్థానం)

ఆర్జేడీ లాంతరుకు 'తేజస్సు'!

ప్రత్యర్థులకు చెమటలు పట్టిస్తున్న లాలూ కుమారుడు తేజస్వీ

పెద్ద చదువూ లేదు. టెన్త్ ఫెయిల్! వయసూ 28 ఏళ్లే! అంతగా రాజకీయ అనుభవమూ లేదు. అయినా ఆ యువకుడు రాజకీయ చక్రాన్ని చాకచక్యంగా తిప్పుతున్నాడు. కాకలు తీరిన యోధులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాడు. అతడే తేజస్వీ యాదవ్. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ కుమారుడు. తండ్రి జైలుపాలుతో దిక్కుతోచని స్థితిలో ఉన్న పార్టీ బాధ్యతలను తన లేత భుజాలపై వేసుకొని నడిపిస్తున్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుంటూ నాయకుడిగా ఎదుగుతున్నారు. మిణుక్కుమిణుక్కు మంటున్న ఆర్జేడీ 'లాంతర'లో కొత్త తేజస్సు నింపుతున్నారు. తాజాగా జోకీహాట్ అసెంబ్లీ స్థానంలో జేడీయూను మట్టికరిపించి తన నాయకత్వ పటిమను మరోసారి చాటుకున్నారు.

తొలుత క్రికెటర్‌గా ఎదిగిన తేజస్వీ.. 2015లో రాజకీయ అరంగేట్రం చేశారు. రాఘోపూర్ అసెంబ్లీ స్థానంలో విజయాన్ని నమోదుచేశారు. ఆ ఎన్నికల్లో జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్‌తో కూడిన మహాకూటమి విజయాన్ని సాధించింది. దీంతో 26 ఏళ్ల వయసులోనే తేజస్వీ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన అన్న తేజ్ ప్రతాప్ యాదవ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి అయ్యారు.

సాంకేతిక తోడ్పాటు..

ఆర్జేడీని కొత్త శకం రాజకీయాల్లోకి తేజస్వీ నడిపించారు. తండ్రి నుంచి నేర్చుకున్న రాజకీయాలకు తనదైన టచ్ ఇచ్చారు. యువతను ఆకర్షించడానికి సామాజిక మాధ్యమం వంటి సాధనాలను పార్టీ విరివిగా వాడాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఆ మేరకు కసరత్తు చేసి, పార్టీ ప్రాబల్యాన్ని విస్తరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గరిష్ఠ సంఖ్యలో సీట్లను గెలవడానికి పార్టీకి ఇది సాయపడింది. లాలూ ప్రసాద్ తరచూ 'యే ఐటీ-వైటీ క్యా హోతా హై?' (ఈ ఐటీ గొడవేంటి?) అని అసహనం వ్యక్తంచేసేవారు. ఆ తర్వాత ఆయన కూడా నిత్యం ట్వీట్లు చేయడం మొదలుపెట్టారు. ఇదంతా తేజస్వీ చొరవే.

నాయకత్వ లక్షణాలు..

కుటుంబంలో పెద్ద కుమారుడు కాకపోయినప్పటికీ తన నాయకత్వ పటిమతో తేజస్వీ.. తండ్రికి రాజకీయ వారసుడిగా

ఎదిగారు. అలాగే పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీనియర్లకు, యువతకు సమ ప్రాతినిధ్యం లభించేలా చేశారు. పార్టీపై పూర్తి పట్టు ప్రదర్శిస్తూ.. తండ్రిని సంప్రదిస్తూ ప్రధాన నిర్ణయాలను ఆయనే తీసుకునేవారు. ఈ గుణగణాలను గమనించిన రాజకీయ విశ్లేషకులు.. ఆయనను కాబోయే ముఖ్యమంత్రిగా అభివర్ణిస్తుంటారు. 2020లో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వీ కీలక పాత్ర పోషిస్తారంటూ భాజపా సీనియర్ నేత శత్రుఘ్న సిన్హా ఇటీవల కితాబిచ్చారు.

సంక్షోభాన్నే అవకాశంగా..

బిహార్‌లో ఎన్నికలకు ముందు ఆర్జేడీతో కుదుర్చుకున్న మైత్రిని పక్కనపెట్టేసి, గత ఏడాది అకస్మాత్తుగా భాజపా సాయంతో నీతీశ్.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తేజస్వీ రాజకీయ జీవితంలో పెద్ద మలుపు. అప్పటివరకూ ఉపముఖ్యమంత్రిగా ఉన్న ఆయనకు పదవి పోయింది. ఈ సంక్షోభాన్ని తేజస్వి అవకాశంగా మలచుకున్నారు. పాలకుడి నుంచి విపక్ష నేత పదవిలోకి అద్భుతంగా ఒదిగిపోయారు.

అద్భుత వాగ్ధాటి..

ప్రతి అంశంపైనా తేజస్వి.. ముందుగానే కసరత్తు చేస్తారు. వాటి ఆధారంగానే ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధిస్తుంటాడు. మంచి వాగ్ధాటిని అలవర్చుకున్నారు. నీతీశ్ తన వైఖరిని మార్చుకుంటూ వివిధ పార్టీలతో జట్టుకడుతూ.. నాలుగు మార్లు ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన తీరును ప్రముఖంగా ప్రస్తావిస్తుంటారు. ఆయన తరచూ సంధించే పదునైన ప్రశ్నలు.. భాజపా, జేడీయూ పెద్దలను ఆత్మరక్షణలో పడేస్తుంటాయి. సీబీఐ, ఈడీ కేసులు తేజస్వీ కుటుంబాన్ని వెంటాడుతున్నాయి. ఆయన విమర్శలు చేసిన ప్రతిసారీ.. ప్రత్యర్థి పార్టీలు వీటిని లేవనెత్తుతూ ఉక్కిరిబిక్కిరి చేస్తుంటారు. అయినా తేజస్వీ జోరు ఏ మాత్రం తగ్గలేదు.

అయినా విజయపరంపర..

లాలూ గత డిసెంబర్‌లో జైలు పాలుకాగా పార్టీ బాధ్యతలన్నీ పూర్తిగా తేజస్వీపై పడ్డాయి. తండ్రి పరోక్షంలో మార్చిలో అరారియా లోక్‌సభ స్థానానికి, జెహనాబాద్, భభువా అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలను తేజస్వి బాగా ఉపయోగించుకున్నారు. అరారియా, జెహనాబాద్‌లో తన పార్టీ అభ్యర్థులను, భభువాలో కాంగ్రెస్ అభ్యర్థిని దించి.. విపక్షాల్లో ఐక్యమత్యం ఉండేలా చేశారు. దళిత నేత మాంఝీని తనవైపు తిప్పుకొన్నారు. సమర్థ ప్రచారంతో అరారియా, జెహానాబాద్ విజయం సాధించారు.

అదే ఊపుతో మే నెలలో జోకీహాట్ అసెంబ్లీ స్థానంలో పోరుకు తేజస్వీ సిద్ధమయ్యారు. తన పార్టీ.. భాజపాతో జట్టు కట్టడాన్ని నిరసిస్తూ జేడీయూ సిట్టింగ్ ఎమ్మెల్యే సర్ఫరాజ్ ఆలమ్ రాజీనామాతో ఈ ఉప ఎన్నిక అవసరమైంది. ఆలమ్‌ను అరారియా లోక్‌సభ ఉపఎన్నికల్లో తమ అభ్యర్థిగా దించి, గెలిపించుకున్న తేజస్వీ.. ఇప్పుడు జోకీహాట్‌లో ఆలమ్ సోదరుడిని రంగంలోకి దించారు. తద్వారా జేడీయూను ఆత్మరక్షణలోకి నెట్టేశారు. తన అభ్యర్థికి మద్దతుగా నీతీశ్ తన క్యాబినెట్‌లోని సగం మందిని రంగంలోకి దించారు. అయినా తేజస్వీ వెరవలేదు. "గెలవడానికి ఏం చేయగలరో.. అన్నీ చేసుకోండి.. ఎన్నిచేసినా చివరికి గెలిచేది మేమే" అంటూ ధైర్యంగా సవాల్ విసిరారు. మొత్తం మీద 41వేల భారీ మెజార్టీతో తన అభ్యర్థిని గెలిపించుకున్నారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

మరో 13 రోజుల్లో

అది రష్యాలోని ఓ అటవీ ప్రాంతం. పదుల సంఖ్యలో యువకులు దేహ దారుఢ్యం పెంచుకోవడానికి తీవ్రంగా కష్టపడుతున్నారు. కఠినమైన కసరత్తులు చేస్తున్నారు. కండలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. వీళ్లు ఇంతలా కష్టపడుతోంది సరదాకి కాదు.. పోలీసో, సైనికుడో అయ్యి దేశానికి సేవ చేయడానికీ కాదు.. ప్రత్యర్థి జట్టు అభిమానులను చిత్తుగా కొట్టడానికి... ఎదురొచ్చిన వారిని పంచ్‌లతో హడలెత్తించడానికి.. కసితీరా పగ తీర్చుకోవడానికి. ఇదేం పైత్యం అంటారా? అయితే ఫుట్‌బాల్ మైదానాల్లో విధ్వంసాలు సృష్టించి రాక్షసానందం పొందే 'హూలిగన్స్' గురించి తెలుసుకోవాల్సిందే.

వీళ్ల అభిమానం.. కొట్టుకు చచ్చేంత!

ఈనాడు క్రీడావిభాగం

2016 యూరో ఫుట్‌బాల్ కప్ టోర్నీ. రష్యా, ఇంగ్లాండ్ మధ్య మ్యాచ్. అభిమానులు ఆ మ్యాచ్‌ను ఆనందంగా ఆస్వాదిస్తున్నారు. అంతలోనే ఉన్నట్లుండి స్టాండ్స్‌లో అలజడి మొదలైంది. రష్యాకు చెందిన కొంత మంది.. ఇంగ్లాండ్ అభిమానులను తిట్టడం మొదలెట్టారు. వీళ్లు నోటి దురుసు చూపించారు. గొడవ మాటల నుంచి చేతల్లోకి మారింది. పరిస్థితి చేయి దాటింది. పరస్పరం అభిమానులు తీవ్ర స్థాయిలో దాడులకు దిగారు. ఫలితంగా ఇద్దరు అభిమానులు కోమాలోకి వెళ్లారు. చాలా మంది తీవ్ర గాయాల పాలయ్యారు. నిజానికిది అనుకోకుండా జరిగిన గొడవ కాదు. ప్రత్యర్థుల్ని కవ్వించి గొడవకు దిగడమే లక్ష్యంగా వచ్చిన 'హూలిగన్స్' ప్రణాళికల్లో భాగం.

90 నిమిషాల పాటు మరో ప్రపంచంలోకి తీసుకెళ్లే ఫుట్‌బాల్ ఆటలో అభిమానుల హుషారు అంతా ఇంతా కాదు. తమ జట్టు గెలిస్తే ఆనందంతో నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకుంటారు. ఓడితే ఏడుస్తారు. సాధారణంగా అభిమానుల తీరిది. కానీ వీళ్లతో పాటుగా అభిమానుల పేరుతో విధ్వంసాలు సృష్టించే గూండాలూ ఉంటారు. వాళ్లే హూలిగన్స్. సాధారణంగా అల్లర్లకు పాల్పడే సంస్కృతిని 'హూలిగనిజం' అంటారు. ఫుట్‌బాల్‌లో ఇది మరీ ఎక్కువ. ఈ ఆటతోనే దీనికి విశేష ప్రచారం లభించింది. క్లబ్ మ్యాచ్‌లో, అంతర్జాతీయ పోటీల్లో అని తేడా ఏమీ లేదు. ఎక్కడైనా ఉంటారు ఈ హూలిగన్స్. సాధారణ అభిమానుల్లాగే మ్యాచ్‌లకు రావడంతో.. ప్రత్యర్థి జట్టు మద్దతుదారుల్ని కవ్వించడం.. గొడవ పెద్దది చేసి భౌతిక దాడులకు దిగడం.. స్టేడియాల్ని తగులబెట్టడం.. ఇలా వీళ్ల ఆగడాలు చాలానే ఉన్నాయి. కొన్నిసార్లు మైదానంలోకి దూకి రిఫరీల మీద దాడి చేస్తుంటారు. మైదానం నుంచి బయటికొచ్చాక కూడా హూలిగన్స్ రెచ్చిపోతుంటారు. ఈ గొడవల్లో అభిమానులు చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయంటే 'హూలిగనిజం' ఏ స్థాయిలో హింసను ప్రేరేపిస్తుందో అర్థమవుతోంది.

ఎలా మొదలైంది?: హూలిగన్స్ తొలిసారిగా రెచ్చిపోయింది 1885లో. ఆ ఏడాది ఇంగ్లాండ్‌లో జరిగిన ఓ స్నేహపూర్వక మ్యాచ్‌లో ప్రిస్టన్ నార్త్ ఎండ్ క్లబ్ 5-0 తేడాతో ఆస్టన్ విల్లాపై విజయం సాధించింది. దాంతో ఆగ్రహించిన ఆస్టన్ విల్లాకు చెందిన కొంతమంది మద్దతుదారులు రాళ్లు, కర్రలతో ప్రత్యర్థి జట్టు అభిమానులపై విరుచుకుపడ్డారు. రెండు గ్రూపుల మధ్య గొడవ తీవ్ర స్థాయికి చేరింది. ఈ గొడవలో ప్రిస్టన్‌కు చెందిన ఆటగాడొకడు తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. అదే ఏడాది ఓ రైల్వే స్టేషన్లో ప్రిస్టన్ అభిమానులు.. క్వీన్స్ పార్క్ మద్దతుదారులతో కలబడ్డారు. ఇది మైదానం బయట జరిగిన మొదటి హూలిగన్స్ గొడవ. 1950-60 ప్రాంతంలో బ్రిటన్‌లో ఫుట్‌బాల్‌పై మీడియా ప్రభావం చాలా ఉండేది. ఈ నేపథ్యంలో మీడియా దృష్టిని ఆకర్షించడానికి హూలిగన్స్ రెచ్చిపోవడంతో దాదాపు 25 సార్లు విధ్వంసాలు జరిగినట్లు చరిత్ర చెబుతోంది. తర్వాత కూడా ఈ విష సంస్కృతి కొనసాగుతూ వస్తోంది. కొన్ని జట్లు కూడా ఇలాంటి హూలిగన్స్ సొంతఖర్చుతో పోషిస్తాయి. ఫుట్‌బాల్ ఆడే ప్రతి దేశానికి ఒక హూలిగన్ గ్యాంగ్ ఉంటుంది.

మరి రష్యా సంగతేంటి?: గత రెండు మూడు ప్రపంచకప్పుల్లో హూలిగన్స్‌ను బాగానే నియంత్రించగలిగారు. చిన్న చిన్న ఘటనలే తప్ప.. పెద్ద విధ్వంసాలేమీ చోటు చేసుకోలేదు. కానీ రష్యా ఆతిథ్యమివ్వబోయే ప్రస్తుత టోర్నీ ముంగిట మాత్రం ప్రమాదకర సంకేతాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా రష్యా ఫుట్‌బాల్ అభిమానులు సౌమ్యులే. కానీ గత రెండు మూడేళ్లుగా వాళ్లలోనూ 'హూలిగన్' విష సంస్కృతి పెరుగుతూ వస్తోంది. 2016 యూరో కప్‌లో వాళ్ల ప్రవర్తన విస్మయపరిచింది. అప్పుడు ఇంగ్లాండ్ అభిమానులతో తీవ్ర స్థాయిలో గొడవపడ్డారు. ప్రపంచకప్ సందర్భంగా ఇంగ్లాండ్ అభిమానులతో రష్యన్లకు ఘర్షణ

తప్పదని భావిస్తున్నారు. వాళ్లను ఎదుర్కోవడానికే రష్యా హూలిగన్స్ అడవులు, మంచు ప్రాంతాల్లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నారట. అందులో అమ్మాయిలు కూడా ఉన్నట్లు వార్తలొస్తుండటం గమనార్హం. హూలిగన్స్‌ను ఈ మధ్య రష్యా ప్రోత్సహిస్తోందన్న ఆరోపణలున్నాయి. తమ దేశానికి వచ్చే అభిమానులకు ఎలాంటి హాని ఉండదని, భద్రతా పరంగా కట్టుదిట్టంగా వ్యవహరిస్తామని రష్యా హామీ ఇస్తున్నా.. మ్యాచ్‌లకు వచ్చేటప్పటికీ ఏం జరుగుతుందోననే సందేహం ప్రజల్లో ఉంది. ఇప్పటికే ప్రపంచకప్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనున్న నగరాల్లో క్లబ్‌లకు సంబంధించిన హూలిగన్లతో ప్రభుత్వం చర్చించింది. ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ప్రత్యేక బృందాలకు బాధ్యతలు అప్పగించింది. మొన్నటివరకూ తమను ప్రోత్సహించిన ప్రభుత్వం.. ఇప్పుడేమో అరెస్టులు చేసి జైళ్లలో పెడుతోందని హూలిగన్లు అంటున్నారు. కానీ ఇంగ్లాండ్ అభిమానుల కోసం కాచుకుని ఉన్న వీళ్లు మైదానంలో ఎలాంటి బీభత్సం సృష్టిస్తారో మరి?

కొన్ని విధ్వంసాలు..

- 1985 ఎఫ్ఏ కప్ క్వార్టర్ ఫైనల్లో మిల్వాల్, లూటాన్ క్లబ్‌లు తలపడ్డాయి. ఆ మ్యాచ్ జరిగిన మైదానం యుద్ధభూమినే తలపించింది. హూలిగన్లు మైదానంలో చేరి కుర్చీలు విసురుతూ విధ్వంసం సృష్టించారు. ఈ గొడవలో 47 మంది గాయపడ్డారు.
- 2003లో వ్రోక్లో, ఆర్కా క్లబ్‌ల మధ్య మ్యాచ్ జరుగుతుండగా మైదానానికి కిలోమీటర్ దూరంలో హూలిగన్లు రెచ్చిపోయారు. కత్తులు, కర్రలు, రాళ్లతో దాడులు చేసుకుంటూ రణరంగాన్ని తలపించారు. ఈ గొడవలో ఒక అభిమాని మృతి చెందాడు.



- 2007లో జరిగిన ఛాంపియన్స్ లీగ్‌లోనూ హూలిగన్లు తమ ప్రతాపం చూపించారు. ఏఎస్ రోమా, మాంచెస్టర్ యునైటెడ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా నీళ్లసీసాలు, రాళ్లు, కుర్చీలు విసురుకుంటూ భయానక వాతావరణాన్ని సృష్టించారు. అప్పుడు 15 మంది గాయాలపాలయ్యారు.
- 2016 యూరో కప్ హూలిగన్ల సమరానికి వేదికైంది. ఇంగ్లాండ్, రష్యా మధ్య మ్యాచ్ 1-1తో డ్రాగా ముగియడంతో కోపంతో ఊగిపోయిన దాదాపు 200 మంది రష్యా హూలిగన్లు ప్రత్యర్థి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకొని దాడి చేశారు. వారిని అదుపు చేయడానికి పోలీసులు టియర్‌గ్యాస్ ఉపయోగించారు. ఈ గొడవలో వందల మంది గాయాల పాలయ్యారు.

భారత పర్యటనకొస్తే.. అఫ్గాన్‌తో ఆడాల్సిందే..!

కాబుల్: కొత్తగా టెస్టు క్రికెట్లో అరంగేట్రం చేయనున్న అఫ్గానిస్థాన్ జట్టుకు బంపర్ ఆఫర్. అఫ్గానిస్థాన్ క్రికెట్ అభివృద్ధికి కొంతకాలంగా కృషి చేస్తున్న బీసీసీఐ.. ఆ జట్టుకు మేలు చేసే మరో నిర్ణయం తీసుకుంది. భారత పర్యటనకొచ్చే విదేశీ జట్లకు అఫ్గాన్ క్రికెట్ జట్టుతో ఓ ప్రాక్టీస్ మ్యాచ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి ఈ విషయాన్ని వెల్లడించాడు. అఫ్గాన్ పర్యటనలో ఉన్న చౌదరి ఆ దేశ క్రికెట్ బోర్డు ఛైర్మన్ ఆసిఫ్ మషాల్‌తో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలపై చర్చించాడు. అఫ్గాన్ ఆటగాళ్లలో ఉన్న నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు, వారికి అంతర్జాతీయ ఆటగాళ్లతో ఆడిన అనుభవాన్ని కల్పించేందుకు ఈ వార్మప్ మ్యాచ్‌లు ఉపయోగపడతాయని చౌదరి చెప్పాడు. టెస్టు హోదా సంపాదించిన అఫ్గానిస్థాన్.. భారత్‌లో తన తొలి మ్యాచ్ ఆడనున్న సంగతి తెలిసిందే. ఈ నెల 14న బెంగళూరులో ఈ మ్యాచ్ ఆరంభం కానుంది.

కోహ్లి సాధన షురూ

ముంబయి: టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మళ్లీ బ్యాట్ పట్టాడు. ఐపీఎల్ సందర్భంగా గాయానికి గురై. . కౌంటీ క్రికెట్‌కు దూరమైన కోహ్లి ముంబయిలో సాధన ఆరంభించాడు. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని నెట్స్‌లో టీమ్‌ఇండియా సహాయక కోచ్ సంజయ్ బంగర్ ఆధ్వర్యంలో అతను సాధన చేశాడు. మరో వారం అతడి ప్రాక్టీస్ కొనసాగే అవకాశముంది. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ ఆడనున్న కోహ్లి ఈ నెల 15న బెంగళూరులో ఫిట్‌నెస్ పరీక్ష ఎదుర్కోనున్నాడు. అప్పటిలోపు పూర్తి ఫిట్‌నెస్ అందుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. ఈ నెల 23న ఐర్లాండ్ పర్యటనకు కోహ్లి జట్టుతో పాటు వెళ్తాడని టీమ్‌ఇండియా వర్గాలు తెలిపాయి.

పండు వయసులో పదో ప్రపంచకప్

కోల్‌కతా: ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్‌కు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. ఇక ప్రపంచకప్ అంటే ఆ జోరు ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆటమీద ఉన్న అభిమానాన్ని ఒక్కొక్కరు ఒక్కోలా ప్రదర్శిస్తారు. కోల్‌కతాకు చెందిన పన్నాలాల్ (85), చైతలీ (76) దంపతులు 1982లో స్పెయిన్‌లో జరిగిన ప్రపంచకప్‌ను ప్రత్యక్షంగా వీక్షించినప్పటి నుంచి ఇక ప్రతి ప్రపంచకప్‌ను ప్రత్యక్షంగా చూడాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 14 నుంచి రష్యాలో ఆరంభం కానున్న ప్రపంచకప్ మ్యాచ్‌లను చూసేందుకు వెళ్లనున్నారు. ఇది వాళ్లు మైదానంలో చూసే పదో ప్రపంచకప్ కానుంది. "2022 వరకు నా వయసు 90ఏళ్లకు చేరువ అవుతుంది. దాంతో ఖతార్‌లో జరిగే ప్రపంచకప్‌కు వెళ్తానో లేదో చెప్పలేం" అని పన్నాలాల్ తెలిపాడు. ప్రపంచకప్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడాలన్న వాళ్ల కోరిక వెనక ఎన్నో త్యాగాలున్నాయి. ఇష్టమైన ఆహారాన్ని సైతం వద్దనుకొని, ఖర్చులు తగ్గించుకొని ప్రతిసారి ప్రపంచకప్‌కు వెళ్లేందుకు సరిపడా డబ్బు సమకూర్చుకుంటున్నారు. ఈ నెల 14న రష్యా వెళ్లనున్న ఈ దంపతులు 28న తిరిగి రానున్నారు. "మూడు మ్యాచ్‌లు చూసేందుకు మాత్రమే టికెట్లు కొనగలిగాం. మరిన్ని టికెట్లు ఇప్పించాల్సిందిగా ఫిఫాను కోరాం. వాళ్ల నుంచి ఎలాంటి స్పందన లేదు. మరికొన్ని టికెట్లు వస్తాయనే ఆశతో ఉన్నాం. మన దగ్గర జరిగిన అండర్-17 ప్రపంచకప్ సందర్భంగా ఫిఫా మాకు ప్రత్యేక వసతులు కల్పించింది" అని పన్నాలాల్ చెప్పాడు. దిగ్గజాలు మారడోనా, పీలే లాంటి ఆటగాళ్లను చూడడం, చారిత్రక 'హ్యాండ్ ఆఫ్ గాడ్' ఘటనకు సాక్ష్యంగా నిలవడం కంటే ఆనందం ఏముంటుంది అని సంతోషంగా చెబుతోంది ఈ జంట.

ఛాంపియన్

డోప్ పరీక్షలో సంజిత విఫలం

కామన్వెల్త్ స్వర్ణం వెనక్కి?

దిల్లీ: కామన్వెల్త్ క్రీడల్లో సత్తా చాటిన భారత్‌కు ఇది దిగ్భ్రాంతి కలిగించే పరిణామమే. డోపింగ్ భూతం మళ్లీ భారత వెయిట్‌లిఫ్టింగ్‌ను పట్టుకుంది. గోల్డ్‌కోస్ట్ క్రీడల్లో స్వర్ణం సాధించిన సంజిత చాను (53 కేజీ) డోప్ పరీక్షల్లో విఫలమైంది. నిషిద్ధ ఉత్ప్రేరకం వాడినట్లు పరీక్షల్లో తేలడంతో చానుపై ప్రాథమిక సస్పెన్షన్ విధించినట్లు అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎఫ్) తెలిపింది. "చాను శరీరంలో టెస్టొస్టెరోన్ చాలా ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. డోపింగ్ నిరోధ నిబంధనలను ఉల్లంఘించి ఉండొచ్చన్న ఉద్దేశంతో ఆమెపై ప్రాథమికంగా సస్పెన్షన్ విధించాం" అని ఐడబ్ల్యూఎఫ్ తన వెబ్‌సైట్లో పేర్కొంది. "ఒకవేళ.. ఆమె ఎలాంటి డోపింగ్ వ్యతిరేక నిబంధనలను ఉల్లంఘించలేదని తేలితే.. అప్పుడు తీసుకునే నిర్ణయాన్ని కూడా వెల్లడిస్తాం" అని చెప్పింది. నిరుడు నవంబరులో అనాహీమ్ (అమెరికా)లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో చాను.. 177 కిలోలతో 13వ స్థానం సాధించింది. ఆ టోర్నీకి ముందు తీసుకున్న 'ఎ' శాంపిల్ పరీక్షలోనే చాను విఫలమైంది. ఐతే ఇంత ఆలస్యంగా ఫలితాలను ఎందుకు ప్రకటించారో తెలియదు. కామన్వెల్త్ క్రీడలు ముగిసిన తర్వాత కూడా అంతర్జాతీయ సమాఖ్య బృందం లిఫ్టర్ల దగ్గర నమూనాలు తీసుకుంది. 'బి' శాంపిల్‌లోనూ విఫలమైతే చానుపై గరిష్ఠంగా నాలుగేళ్ల నిషేధం పడే అవకాశముంటుంది. ఆమె కామన్వెల్త్ స్వర్ణాన్ని కూడా వెనక్కి తీసుకుంటారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని షిలారూ సాయ్ సెంటర్లో ఉన్న సంజిత చానును శిబిరం విడిచి వెళ్లిపోవాలని భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య ఆదేశించినట్లు సమాచారం.

కూత కేక!

- రూ.45.93 కోట్లు.. 181 మంది ఆటగాళ్లు
- ముగిసిన ప్రొ కబడ్డీ వేలం

ముంబయి: ప్రొ కబడ్డీ లీగ్ వేలం పాట అదిరిపోయింది. రెండ్రోజుల పాటు జరిగిన వేలం పాటలో కబడ్డీ ఆటగాళ్ళపై కాసుల వర్షం కురిసింది. తొలి రోజు అగ్రశ్రేణి క్రీడాకారులపై కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఫ్రాంచైజీలు.. గురువారం జట్టులోని ఖాళీలను ద్వితీయ, తృతీయ శ్రేణి ఆటగాళ్ళతో భర్తీ చేసుకున్నాయి. రెండో రోజు వేలం పాటలో రైడర్ ప్రశాంత్‌కుమార్ అత్యధికంగా రూ.79 లక్షలు ధర పలికాడు. అతడిని యూపీ యోధాస్ సొంతం చేసుకుంది. మొత్తం 422 మంది వేలం పాటలో బరిలో ఉండగా. . 12 ఫ్రాంచైజీలు రూ.45.93 కోట్లు వెచ్చించి 181 మంది ఆటగాళ్లను కొనుక్కున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన మహేశ్‌గౌడ్ (రూ.12 లక్షలు)ను బంగాల్ వారియర్స్, గంగాధరి మల్లేష్ (రూ.8 లక్షలు)ను జైపూర్ పింక్ పాంథర్స్, మహేందర్‌రెడ్డి (రూ.8 లక్షలు)ని తెలుగు టైటాన్స్ దక్కించుకున్నాయి. ప్రొ కబడ్డీ ఆరో సీజన్ అక్టోబరు 19న ఆరంభమవుతుంది.

జట్లలోని కీలక ఆటగాళ్లు, ధరలు

బంగాల్ వారియర్స్: సుర్జీత్‌సింగ్ (రూ.80.3 లక్షలు), మణిందర్ (రూ.56.8 లక్షలు), జాంగ్ కున్ లీ (రూ.33 లక్షలు); **బెంగళూరు బుల్స్:** రోహిత్‌కుమార్ (రూ.89.1 లక్షలు), పవన్‌కుమార్ (రూ.52.8 లక్షలు), మహేందర్‌సింగ్ (రూ.40 లక్షలు); **దబాంగ్ దిల్లీ:** మిరాజ్ షేక్ (రూ.65.55 లక్షలు), చంద్రన్ రంజిత్ (రూ.61.25 లక్షలు), విశాల్ మానె (రూ.45 లక్షలు); **గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్:** సచిన్ తన్వర్ (రూ.56.87 లక్షలు), ప్రపంజన్ (రూ.38 లక్షలు), అజయ్‌కుమార్ (రూ.25 లక్షలు); **హరియాణా స్టీలర్స్:** మోను గోయత్ (రూ.1.51 కోట్లు), సురేందర్ (రూ.75 లక్షలు), వికాస్ (రూ.47 లక్షలు); **జైపూర్ పింక్ పాంథర్స్:** దీపక్ నివాస్ (రూ.1.15 కోట్లు), మోహిత్ చిల్లర్ (రూ.58 లక్షలు), అనూప్‌కుమార్ (రూ.30 లక్షలు); **పట్నా పైరేట్స్:** ప్రదీప్ నర్వాల్ (రూ.60.5 లక్షలు), దీపక్ నర్వాల్ (రూ.57 లక్షలు), జైదీప్ (రూ.55 లక్షలు); **పుణెరి పల్టాన్:** నితిన్ తోమర్ (రూ.1.15 కోట్లు), సందీప్ నర్వాల్ (రూ.72.60 లక్షలు), రాజేశ్ మోండల్ (రూ.24.55 లక్షలు); **తమిళ్ తలైవాస్:** అజయ్ ఠాకూర్ (రూ.76.23 లక్షలు), అమిత్ హుడా (రూ.69.30 లక్షలు), మంజీత్ చిల్లర్ (రూ.20 లక్షలు); **తెలుగు టైటాన్స్:** రాహుల్ చౌదరి (రూ.1.29 కోట్లు), నీలేష్ (రూ.56.87 లక్షలు), అబోజర్ (రూ.76 లక్షలు); **యు ముంబా:** అత్రాచలి (రూ.1 కోటి), ధర్మరాజ్ (రూ.46 లక్షలు), అభిషేక్‌సింగ్ (రూ.42.8 లక్షలు); **యూపీ యోధా:** రిషాంక్ (రూ.1.11 కోట్లు), ప్రశాంత్ (రూ.79 లక్షలు), జీవకుమార్ (రూ.45 లక్షలు)

బీసీసీఐకి రూ.121 కోట్ల జరిమానా

ముంబయి: ఐపీఎల్-2009 సందర్భంగా ఫెమా నిబంధనలు ఉల్లంఘించినందుకు బీసీసీఐ, బోర్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్, ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ, ఇతరులకు ఈడీ రూ.121 కోట్ల జరిమానా విధించింది. బీసీసీఐ 2009లో దక్షిణాఫ్రికాలో ఐపీఎల్‌ను నిర్వహించింది. నిర్వహణ కోసం రూ.243 కోట్లను బయటి దేశానికి బదిలీ చేసే క్రమంలో విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫెమా) అతిక్రమణ జరిగిందన్న ఆరోపణలపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్.. బీసీసీఐపై రూ.82.66 కోట్ల జరిమానా వేసింది. శ్రీనివాసన్‌కు రూ.11.53 కోట్లు, లలిత్ మోదీకి రూ.10.65 కోట్లు, బోర్డు మాజీ కోశాధికారి పాండవ్‌కు రూ. 9.72 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెన్‌కోర్ (ఎస్‌బీఐతో విలీనమైంది)కు రూ.7 కోట్లను జరిమానాగా విధించింది. మొత్తం రూ.121.56 కోట్ల జరిమానా విధించినట్లు ఈడీ అధికారులు తెలిపారు.

షరపోవా జోరు

నాదల్, హలెప్ ముందంజ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్లో రష్యా భామ మరియా షరపోవా దూసుకెళ్తోంది. ఆమె పెద్దగా కష్టపడకుండానే మూడో రౌండ్లో ప్రవేశించింది. ఆమెతో పాటు టైటిల్ ఫేవరెట్ రఫెల్ నాదల్ (స్పెయిన్), టాప్‌సీడ్ హలెప్, డెల్‌పొట్రో (అర్జెంటీనా) కూడా ముందంజ వేశారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో షరపోవా 7-5, 6-4తో వికిచ్ (క్రొయేషియా)ను ఓడించింది. తొలి సెట్లో మాత్రమే మరియాకు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైంది. ఇతర మ్యాచ్‌ల్లో హలెప్ 6-3, 6-1తో టౌన్‌సెండ్‌ను చిత్తు చేయగా.. మూడో సీడ్ ముగురుజ (స్పెయిన్) 6-3, 6-1తో ఫెర్రో (ఫ్రాన్స్)పై, ప్లిస్కోవా 3-6, 6-4, 6-1తో సఫరోవాపై విజయాలు సాధించారు. 12వ సీడ్ కెర్బర్ (జర్మనీ) 6-2, 6-3తో బాగ్‌డాన్ (రొమేనియా)ను ఓడించి మూడో రౌండ్ చేరింది. సమంత స్టోసర్ (ఆస్ట్రేలియా), మెర్టిన్స్ (బెల్జియం) కూడా మూడో రౌండ్ చేరారు.

ఎదురులేని రఫా: పదకొండో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌పై గురి పెట్టిన స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ అలవోకగా మూడో రౌండ్ చేరాడు. అతను 6-2, 6-1, 6-1తో పెల్లా (అర్జెంటీనా)ను ఓడించాడు. తొలి సెట్లో తప్ప. . రఫాకు ప్రత్యర్థి నుంచి ప్రతిఘటనే ఎదురు కాలేదు. డెల్‌పొట్రో 6-4, 6-3, 6-2తో బెనిట్యూ (ఫ్రాన్స్)పై గెలవగా, సిలిచ్ 6-2, 6-2, 6-7 (3-7), 7-5తో హర్‌కెజ్ (పోలెండ్)పై కష్టపడి నెగ్గాడు. ఏడో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా), ఫాగ్నిని (ఇటలీ), ఇస్నర్ (అమెరికా), అండర్సన్ (దక్షిణాఫ్రికా) కూడా రెండో రౌండ్ దాటారు.

ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జోడీ: పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న-రోజర్ వెస్లిన్ ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించారు. రెండో రౌండ్లో 6-1, 6-2తో జోంజి-జాక్ జంటను ఓడించారు. మరోవైపు భారత జోడీ యుకి బాంబ్రి-దివిజ్ శరణ్ జోడీ ముందంజ వేసింది. తొలి రౌండ్లో బాంబ్రి-దివిజ్ 6-3, 5-7, 6-4తో పూరవ్ రాజా-ఫాబ్రిస్ మార్టిన్‌లను ఓడించింది. రెండో రౌండ్లో యుకి జోడీ.. రెండో సీడ్ జంట ఒలివర్ మారాచ్-మాట్ పవిచ్ (క్రొయేషియా)తో తలపడనుంది.

షరపోవా

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

సగం సంపద దానధర్మాలకే!

- నీలేకనితోపాటు మరో ముగ్గురు భారత కోటీశ్వరుల ప్రతిజ్ఞ

న్యూయార్క్

తమ సంపదలో సగానికన్నా ఎక్కువ మొత్తాన్ని విరాళాలుగా ఇస్తామని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, ఆయన భార్య రోహిణి నీలేకని ప్రకటించారు. భారత సంతతికి చెందిన మరో ముగ్గురు కోటీశ్వరులు కూడా ఇదే వాగ్దానం చేశారు. బిల్ గేట్స్ ఆయన భార్య మెలిండా గేట్స్, వారెన్ బఫెట్‌లు నెలకొల్పిన 'గివింగ్ ప్లెడ్జ్' (ప్రతిజ్ఞ చేద్దాం) అనే స్వచ్ఛంద సంస్థకు ఈ మేరకు హామీ ఇచ్చారు. 40 మంది అమెరికన్ కోటీశ్వరులతో 2010లో నెలకొల్పిన ఈ సంస్థలో ఇంతవరకు 22 దేశాలకు చెందిన 183 మంది చేరారు. తమ జీవిత కాలంలోగానీ, వీలునామాల ద్వారాగానీ సంపదలో సగంకన్నా అధికమొత్తాన్ని సేవా కార్యక్రమాల కోసం ఇస్తామని వీరంతా ప్రకటించారు. ఈ ఏడాది 14 మంది కోటీశ్వరులు విరాళాలు ఇస్తామని ప్రకటించగా, అందులో నీలేకని దంపతులతో పాటు భారత సంతతికి చెందిన అనీల్-అల్లిసన్ భూస్రీ,

నందన్ నీలేకని

షంషీర్-శబీనా వయాలిల్, బీఆర్ శెట్టి-చంద్రముఖి రఘురాం శెట్టి ఉన్నారు.

భగవద్గీతను ఉటంకించిన నీలేకని దంపతులు

నీలేకని దంపతులు ఏక్‌స్టెప్ పేరుతో లాభాపేక్ష రహిత సంస్థను నడుపుతున్నారు. దీని ద్వారా 2 కోట్ల మంది ప్రాథమిక పాఠశాలల స్థాయి పిల్లల అభ్యాసన స్థాయిని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నారు. అర్ఘ్యం అనే మరో సంస్థ ద్వారా రోహిణి నిలేకని గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగునకు ప్రయత్నం చేస్తున్నారు. వారు గివింగ్ ప్లెడ్జ్ సంస్థకు లేఖ రాస్తూ భగవద్గీతను ఉటంకించారు. 'పనిచేయడానికే మనకు అధికారం ఉంది. కానీ, అందుకు తక్షణ ఫలితం పొందే అధికారం లేదు. ప్రత్యక్ష ఫలితం పొందలేమన్న భయంతో పనిచేయడాన్ని ఆపివేయకూడదు. ఈ ఆదర్శాన్ని పాటించడానికే మేం ప్రతిజ్ఞ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

అమెరికాకు చెందిన అనీల్ బూస్రీ.. వర్క్‌డ్ సాఫ్ట్‌వేర్ సంస్థ సహ వ్యవస్థాపకుడు. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం ఆయన సంపద 1.8 బిలియన్ డాలర్లు (రూ. 12,124 కోట్లు). ఇంటెల్ సంస్థ డైరెక్టర్ల బోర్డులో సభ్యునిగా ఉంటున్నారు. అల్లిసన్ థోరెసన్ బూస్రీ సాంకేతిక సంస్థల్లో ప్రధానంగా పెట్టుబడులు పెడుతున్నారు.

షంషీర్ వయాలిల్

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన షంషీర్ వయాలిల్, శబీనాలు వీపీఎస్ హెల్త్‌కేర్ పేరుతో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. నాలుగు దేశాల్లో 22 ఆసుపత్రులు, 125 ఆరోగ్య కేంద్రాలతో పాటు మందుల తయారీ సంస్థ ఉంది. 'విజయం అంటే ప్రజల జీవితాల్లో గుర్తించదగ్గ, సుస్థిర మార్పులు తీసుకురావడమేన'ని ప్లెడ్జ్ సంస్థకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన బీఆర్ శెట్టి దంపతులు కూడా ఎన్ఎంసీ హెల్త్‌పేరుతో 13 దేశాల్లో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. బీఆర్ లైఫ్ పేరుతో భారత్, నేపాల్, ఈజిప్టుల్లో పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారు. పలు విద్యా సంస్థలు కూడా నిర్వహిస్తున్నారు.

శరీరాన్ని కత్తి కోస్తుంటే.. చేతిలో గిటార్ రాగాలు పలికింది

- స్పృహలో ఉండగానే రోగికి శస్త్రచికిత్స

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: రోగి స్పృహలో ఉండగానే అతనికి విజయవంతగా శస్త్రచికిత్స చేసిన ఘటన బెంగళూరు భగవాన్ మహావీర్ వైద్యశాలలో చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌కు చెందిన గిటారిస్ట్, కంప్యూటర్ ఇంజినీరు టాస్కిన్ (31) ఫోకల్ హ్యాండ్ డిస్టోనియా లేదా గిటారిస్ట్ డిస్టోనియాతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో శస్త్ర చికిత్స కోసం నగరానికి వచ్చారు. ఆయనకు భగవాన్ మహావీర్ వైద్యశాలకు చెందిన వైద్యులు రెండు వారాల క్రితం శస్త్రచికిత్స చేశారు. ఆ సమయంలో టాస్కిన్ స్పృహలోనే ఉండటంతో బాటు, శరీరాన్ని కత్తితో కోసి ఆపరేషన్ పూర్తి చేసేంతవరకూ తన గిటారుపై పలు రాగాలు పలికించాడని, చికిత్స విజయవంతమైందని వైద్యులు డా. సంజీవ్, డా. శరణ్ శ్రీనివాసన్ గురువారం ప్రకటించారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న టాస్కిన్, అతని కుటుంబ సభ్యులు తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నారు. గతంలో ఉన్న సమస్యను అధిగమించానని టాస్కిన్ విలేకరులకు తెలిపారు. తన గిటారుపై పాటలు పాడి అలరించారు.

శస్త్రచికిత్స సమయంలో గిటార్ వాయిస్తున్న టాస్కిన్

కథువా అత్యాచార కేసుపై విచారణ మొదలు

పఠాన్‌కోట్: సంచలన కథువా అత్యాచార కేసుపై గురువారం విచారణ మొదలైంది. ఎనిమిది మంది నిందితుల్లో ఏడుగురిని పటిష్ఠ భద్రత నడుమ పఠాన్‌కోట్ జిల్లా, సెషన్సు న్యాయస్థానానికి అధికారులు తీసుకువచ్చారు. అభంశుభం తెలియని ఎనిమిదేళ్ల కశ్మీర్ చిన్నారిపై అత్యాచారం, హత్య కేసులో వీరు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. బాధిత కుటుంబం అభ్యర్థనపై ఈ కేసును జమ్మూకశ్మీర్ కోర్టు నుంచి పంజాబ్‌లోని పఠాన్‌కోట్ న్యాయస్థానానికి సుప్రీం కోర్టు బదిలీచేసింది. వాదోపవాదాలను విన్న అనంతరం.. అభియోగపత్రాలు, వాంగ్మూలాలు, కేసు పూర్వాపరాలను ఉర్దూ నుంచి ఆంగ్లంలోకి అనువదించి అందరికీ ఇవ్వాలని ప్రభుత్వ విచారణకర్తలకు న్యాయమూర్తి తేజ్‌వీందర్ సింగ్ ఆదేశించారు. ఏడుగురు నిందితులనూ పటిష్ఠ భద్రత నడుమ పోలీసుల బస్సులో న్యాయస్థానానికి తీసుకువచ్చారు.

ఇక రైల్వే రిజర్వేషన్ కేంద్రాల్లోనూ 'వికల్ప్'..

ఈనాడు, దిల్లీ: కోరుకున్న రైలులో సీటు/బెర్త్ దొరకకపోతే అదేరోజు తర్వాత బయల్దేరే ఏ రైలులోనైనా కేటాయించేలా అమలు చేస్తున్న వికల్ప్ సౌకర్యాన్ని రైల్వేశాఖ ఇకపై సాధారణ రిజర్వేషన్ కౌంటర్లలోనూ అందుబాటులోకి తెచ్చింది. ఇంతవరకూ అంతర్జాలంలో టిక్కెట్లు కొనుగోలు చేసేవారికి మాత్రమే 'వికల్ప్'కు వీలుండేది. తాజాగా దేశవ్యాప్తంగా అన్ని రిజర్వేషన్ కౌంటర్లలోనూ అమలు చేయడానికి నిర్ణయించారు. ఈ సౌకర్యాన్ని కోరుకునే వారు రిజర్వేషన్ దరఖాస్తులో 'వికల్ప్' అనే గడిని ఎంచుకోవాలి. అలాంటి ప్రయాణికులకు తదుపరి 12, 24, 48 గంటల్లో వచ్చే రైళ్లలో ఏవైనా ఖాళీలుంటే వాటిని కేటాయిస్తారు. అయితే ఈ సౌకర్యాన్ని ఎంచుకొనే ప్రయాణికులంతా రిజర్వేషన్ దరఖాస్తులో కచ్చితంగా ఆధార్ సంఖ్యను రాయాల్సి ఉంటుంది. దీంతో నిరీక్షణ జాబితాలోని ప్రయాణికులను ఇతర రైళ్లలో సర్దుబాటు చేయడానికి, అందుబాటులో ఉన్న సీట్లను గరిష్ఠస్థాయిలో ఉపయోగించుకోవడానికి వీలవుతుందని రైల్వేశాఖ పేర్కొంది. వికల్ప్ పథకాన్ని తొలిసారిగా దిల్లీ-లఖ్‌నవూ, దిల్లీ-జమ్మూ మార్గాల్లో 2015 నవంబరు 1న ప్రయోగాత్మకంగా అంతర్జాల వినియోగదారులకు మాత్రమే అమల్లోకి తెచ్చారు.

16కు చేరిన నిఫా మృతులు

కోజికోడ్: నిఫా వైరస్ కేరళలో మరొకరిని బలి తీసుకొంది. దీంతో రాష్ట్రంలో నిఫా మృతుల సంఖ్య 16కు పెరిగింది. కోజికోడ్ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 25ఏళ్ల రేసిన్ గురువారం మరణించినట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా 18 మందికి ఈ వైరస్ సోకిందని, వీరిలో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. మరోవైపు నిఫా ఇన్ఫెక్షన్‌పై దేశ రాజధానివాసులను దిల్లీ ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఖర్జూరం చెట్ల నుంచి సేకరించిన పానీయాలను తాగొద్దని సూచించింది.

అవకాశాలు అపారం.. కలిసి పంచుకుందాం

- భారత్‌కు సహజ భాగస్వామి సింగపూర్: మోదీ
- ద్వైపాక్షిక బంధాల బలోపేతానికి మలేసియాతోనూ చర్చలు

సింగపూర్

భవిష్యత్తు అంతా అపారమైన అవకాశాలేననీ, వాటిని కలిసి పంచుకుందామని భారత ప్రధాని నరేంద్రమోదీ... సింగపూర్‌కు పిలుపునిచ్చారు. రెండు దేశాల నడుమ చాలా కాలం నుంచి సన్నిహిత సంబంధాలున్నాయనీ, సమకాలీన భాగస్వామ్యం దిశగా ముందుకు వెళ్తున్నామనీ చెప్పారు. భారత్‌కు సహజ భాగస్వామిగా సింగపూర్ నిలుస్తోందన్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా గురువారం ఆయన సింగపూర్‌కు చేరుకున్నారు. ప్రవాస భారతీయుల్ని, వ్యాపార వర్గాలను ఉద్దేశించి ప్రసంగించారు. రక్షణరంగంలో రెండు దేశాల మధ్య బలమైన బంధాలున్నాయనీ, భారత్ నిరంతర నౌకాదళ విన్యాసాలను దీర్ఘకాలం నుంచి కొనసాగిస్తున్న దేశం సింగపూరేనని చెప్పారు. పెట్టుబడులకు వనరుగా, గమ్యంగా కూడా ఈ దేశం నిలుస్తోందన్నారు. ఆకర్షణీయ నగరాలు, ఆర్థిక రంగం, నైపుణ్యాభివృద్ధి, ఓడరేవులు, నౌకాయానం, పారిశ్రామిక సముదాయాల్లో సింగపూర్ కీలకమని చెప్పారు. ఇది చిన్నదేశమైనా ఉనికి మాత్రం ప్రపంచమంతటా ఉందన్నారు. సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్, సమాచార శాఖ మంత్రి ఎస్. ఈశ్వరన్‌లతో కలిసి 'ఇన్‌స్ప్రెన్యుయర్ 2.0' పేరుతో ఏర్పాటుచేసిన భారత్-సింగపూర్ వాణిజ్య, నవకల్పనల ప్రదర్శనను ఆయన సందర్శించారు. కృత్రిమ మేధ, వైద్య సాంకేతిక రంగాలకు సంబంధించిన దాదాపు 30 అంకుర సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. శుక్రవారం మోదీ, లూంగ్‌ల మధ్య చర్చలు జరగనున్నాయి. అధ్యక్షుడు హలిమా యాకూబ్‌ను భారత ప్రధాని మర్యాదపూర్వకంగా కలవనున్నారు. అనంతరం 'షాంగ్రి-లా డైలాగ్'లో కీలకోపన్యాసం చేస్తారు.

సింగపూర్ ప్రధాని లీ సేన్‌తో ప్రధాని మోదీ కరచాలనం

మలేసియా ప్రధానికి మోదీ అభినందన

కౌలాలంపూర్: ఇటీవల మలేసియా ప్రధానిగా ఎన్నికైన మహతిర్ మహమ్మద్ (92)ను భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. ఉభయ దేశాల నడుమ ద్వైపాక్షిక బంధాల బలోపేతం దిశగా వారిద్దరూ చర్చలు జరిపారు. ఇండోనేసియా పర్యటన ముగించుకుని మోదీ గురువారం సింగపూర్ వెళ్తూ... మార్గమధ్యంలో ఇక్కడ ఆగారు. పుత్రజయలోని మహతిర్ కార్యాలయానికి వెళ్లి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్-మలేసియాల నడుమ ఆర్థిక, సాంస్కృతికబంధాల బలోపేతానికి చర్చలు జరిపారు.

మలేషియా ప్రధాని మహతీర్ మహమ్మద్‌తో మోదీ

'టైమ్స్'లో ఐఐఎస్‌సీకి చోటు

- భారత్ నుంచి ఒకే ఒక్కటి..
- అమెరికా, యూకేలకే తొలి 5 స్థానాలు

లండన్: టైమ్స్ ప్రపంచస్థాయి ఉన్నత విద్యాసంస్థల ర్యాంకింగ్స్-2018లో భారత్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ-బెంగళూరు), 100 స్థానాల్లో చోటు దక్కించుకుంది. భారత్ నుంచి ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ మాత్రమే జాబితాలో నిలిచింది. 91-100 స్థానాల మధ్య ఐఐఎస్‌సీకి చోటు దక్కింది. 2011 తర్వాత తొలిసారిగా భారత్ చోటు దక్కించుకున్నట్లు ర్యాంకుల ఎడిటోరియల్ డైరెక్టర్ ఫిల్‌బటీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన విద్యాసంస్థలపై ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు 10 వేల మంది సీనియర్ విద్యావేత్తలు ఈ సర్వే నిర్వహించారు. 'ట్రంప్ స్లంప్'తో ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ అమెరికా తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నట్లు ఫిల్‌బటీ వెల్లడించారు.

యూఎస్, యూకేలదే అగ్రస్థానం.. జాబితాలో అమెరికన్ విశ్వవిద్యాలయాలు హార్వర్డ్, మసాచుట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), స్టాన్‌ఫర్డ్; యూకేకు చెందిన కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్‌లు తొలి 5 స్థానాల్లో నిలిచాయి. యూకే నుంచి గతేడాది 10 విద్యాసంస్థలకు చోటుదక్కగా.. ఈసారి 9 మాత్రమే జాబితాలో నిలిచాయి. డర్హమ్ విశ్వవిద్యాలయం చోటు కోల్పోయింది. బెంగళూరులోని ఐఐఎస్‌సీ 1909లో కేవలం 2 విభాగాల (జనరల్ అండ్ అప్లైడ్ కెమిస్ట్రీ, ఎలక్ట్రికల్ టెక్నాలజీ)తో ప్రారంభమైంది. అనంతరం ఎలక్ట్రికల్, ఇంటర్‌డిసిప్లినరీ రీసెర్చ్, మెకానికల్, జీవ, రసాయన, భౌతిక, గణిత శాస్త్రాల్లోని 40 విభాగాలకు విస్తరించి ప్రతిష్ఠాత్మక భారత విద్యాసంస్థగా ఖ్యాతిని ఆర్జించింది.

'మహాభారత కాలంలోనే జర్నలిజం ఆవిర్భావం!'

మథురా: జర్నలిజం మహాభారత కాలంలో నుంచే ప్రారంభమైందంటూ భాజపా నేత, ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి దినేశ్ శర్మ వ్యాఖ్యానించారు. 'హిందీ జర్నలిజం దినోత్సవం' సందర్భంగా మథురాలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జర్నలిజం పుట్టుకకు సంబంధించి ప్రచారంలో ఉన్న వివిధ ఇతర అంశాలను తోసిపుచ్చారు. తన వ్యాఖ్యలకు మద్దతుగా మహాభారతం నుంచి పలు దృష్టాంతాలను కూడా ఉదహరించారు. మహాభారత యుద్ధం గురించి విహంగవీక్షణాన్ని సంజయుడు హస్తినాపురంలో ధృతరాష్ట్రుడికి వివరించిన అంశాన్ని ఉదహరిస్తూ.. అది ప్రత్యక్ష ప్రసారం కాక మరేమిటని ప్రశ్నించారు. అలాగే నాటి నారద ముని పాత్రను నేటి గూగుల్‌తో పోల్చారు. ఈ సందర్భంగా దేశంలో పత్రికా స్వేచ్ఛను ఆయన కొనియాడారు. మీడియా ప్రతినిధుల భద్రతకు సంబంధించి ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

పెట్రోలు, డీజిల్ ధరలు స్వల్పంగా తగ్గాయి

దిల్లీ: అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడంతో గురువారం రెండో రోజు కూడా పెట్రోలు, డీజిల్ ధరలు స్వల్పంగా తగ్గాయి. పెట్రోలుపై లీటరుకు 7 పైసలు, డీజిల్‌పై 5 పైసలు తగ్గిస్తున్నట్టు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రకటించాయి. దీని ప్రకారం దిల్లీలో లీటరు పెట్రోలు ధర రూ. 78.42 నుంచి 78.35కు, డీజిల్ ధర రూ. 69.30 నుంచి రూ. 69.25కు తగ్గింది. బుధవారం లీటరు పెట్రోలు, డీజిల్‌లపై కేవలం ఒక్క పైసా వంతున తగ్గించడం గమనార్హం.

చిదంబరానికి ఊరట

దిల్లీ: సీబీఐ నమోదు చేసిన ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి. చిదంబరానికి గురువారం ఊరట లభించింది. ఈమేరకు జులై 3 వరకు ఆయన్ను అరెస్టు చేయకుండా దిల్లీ హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అయితే సీబీఐ ప్రశ్నించేందుకు ఎప్పుడు పిలిచినా వెళ్లి సహకరించాలని జస్టిస్ ఏకే పాథక్ స్పష్టం చేశారు. అలాగే చిదంబరం ముందస్తు బెయిల్ విజ్ఞాపనపై సమాధానం ఇవ్వాల్సిందిగా సీబీఐకి నోటీసు ఇస్తూ.. కేసు తదుపరి విచారణను హైకోర్టు అదే తేదీకి వాయిదా వేసింది. అంతకుముందు చిదంబరం దర్యాప్తు సంస్థకు పూర్తిగా సహకరిస్తారంటూ ఆయన తరఫు న్యాయవాదులు కపిల్ సిబాల్, సల్మాన్ ఖుర్షీద్‌లు న్యాయమూర్తికి నివేదించారు.



ప్రతిజ్ఞ బూనుదాం
ప్రగతి సాధిద్దాం

ఈనాడు

నవనిర్మాణ దీక్ష

విజయవాడ 2-6-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 293

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ప్రజలే ముందు
PEOPLE FIRST
1100

GOVERNMENT OF ANDHRA PRADESH
सत्यमेव जयते

2022
దేశంలో 3 అగ్రగామి రాష్ట్రాలలో ఒకటి
(తలసరి ఆదాయం రూ. 2.95 లక్షలు)

2029
దేశంలో అత్యుత్తమ రాష్ట్రం
(తలసరి ఆదాయం రూ. 9.65 లక్షలు)

2050
ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాల రాష్ట్రం
(తలసరి ఆదాయం రూ. 1.67 కోట్లు)

ప్రతిజ్ఞ బూనుదాం
ప్రగతి సాధిద్దాం

నవ నిర్మాణ దీక్ష

ప్రతిజ్ఞ సమయం: 2 జూన్ 2018 ఉదయం 9:15 గంటలకు

నేటి చర్చనీయాంశాలు

- ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం మరియు హామీలు
- చట్టం అమలుపై సమీక్ష
- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా
- గత నాలుగేళ్లలో సాధించిన విజయాలు

ముఖ్యమంత్రి గారిని సంప్రదించడానికి

NCBN అధికారిక యాప్ | ప్రజలే ముందు మొబైల్ యాప్ | ఏపి సీఎం ఫేస్ బుక్ | ఏపి సీఎం ట్విట్టర్

ప్రతిజ్ఞ

అవినీతి, అశాస్త్రీయ విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని మన కష్టంతో పూరించడానికి సంసిద్ధంగా ఉన్నాము. నమ్మక ద్రోహం, కుట్ర రాజకీయాలతో రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని సంఘటితంగా ప్రతిఘటించడానికి సమాయత్తంగా ఉంటాము. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని అంశాలు, నాటి ప్రధాని హామీలు అమలయ్యే వరకు ధర్మపోరాటాన్ని కొనసాగిద్దాము. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అలుపెరుగని శ్రమజీవులం మనము. ప్రతి సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలచుకుందాము.

దేశభక్తితో, సామాజిక బాధ్యతతో, క్రమశిక్షణతో మన రాష్ట్ర ప్రగతి కోసం, శ్రేయస్సు కోసం మనందరం భుజం భుజం కలిపి పనిచేద్దాం. 2022 నాటికి మన రాష్ట్రాన్ని దేశంలో మూడు అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా, 2029 నాటికి దేశంలో అత్యుత్తమ రాష్ట్రంగా, 2050 నాటికి ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే పవిత్ర లక్ష్యంగా నిర్దేశించుకున్నాము. అవినీతి లేని, ఆర్థిక అసమానతలు లేని, అందరికీ ఉపాధి కల్పించే ఆరోగ్యకరమైన, ఆనందమయమైన రాష్ట్రాన్ని నిర్మించుకుందాము. ఈ లక్ష్య సాధనకు సమర్పణ భావంతో, నిష్ఠతో, త్రికరణ శుద్ధిగా కృషిచేద్దాము. ఆంధ్రప్రదేశ్ నవ నిర్మాణ దీక్షను ఈ క్షణంలో మనమందరం చేపడుతున్నాము.

RAMOJI GROUP
priya
NEW MASALAS
తెలుగు రుచులు
వంట ఏదైనా...వావ్ అనిపించే అద్భుత రుచి!
సరికొత్త ప్రియ మసాలాలతో...
SPICY TELUGU SAMBAR MASALA
స్పైసి తెలుగు సాంబార్ మసాలా
SPICY TELUGU CHAARU MASALA
స్పైసి తెలుగు చారు మసాలా
GUTTI VANKAYA KURA MASALA
గుత్తి వంకాయ కూర మసాలా
NAATU KODI PULUSU MASALA
నాటు కోడి పులుసు మసాలా
ANDHRA CHICKEN MASALA
ఆంధ్రా చికెన్ మసాలా
KORAMEENU PULUSU / BOMMIDALA PULUSU MASALA
కొరమీను/బొమ్మిడాల పులుసు మసాలా
BOCHA CHEPA / CATLA FISH MASALA
బొచ్చె చేప మసాలా
ROYYALA / PRAWN MASALA
రొయ్యల మసాలా
Delicious & Authentic
All Priya Products are 100% Vegetarian
www.priyafoods.com

RAMOJI GROUP
priya
RICE RICH
RICE BRAN OIL
'రైస్‌రిచ్' తోడుంటే..
ఆరోగ్యం మీ వెంటే...
• రైస్ రిచ్ ఆయిల్‌లోని సహజ ఒరైజనాల్ చెడుకొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుటలో తోడ్పడుతుంది.
• రైస్ రిచ్ ఆయిల్ విటమిన్ "A" & "D" లతో ఫోర్టిఫికేషన్ చేయబడినది. ఇవి మీ ఇంటిల్లి పాదినీ మరింత ఆరోగ్యంగా ఉంచుతాయి.
Fortified & Refined Rice Bran Oil
Contains Natural ORYZANOL
1litre Net
Quality ensured in every step of process
www.priyafoods.com

దేశానికి ఆదర్శంగా...
అభివృద్ధి, సంక్షేమంలో
తెలంగాణ 1

ఈనాడు

విజయవాడ 2-6-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 293

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ప్రజలందరికి,
తెలంగాణ రాష్ట్ర
4వ అవతరణ దినోత్సవ
శుభాకాంక్షలు

గౌ. శ్రీ కె. చంద్రశేఖర్ రావు
ముఖ్యమంత్రి, తెలంగాణ

దేశానికి ఆదర్శంగా సరికొత్త రాష్ట్రం

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో అగ్రస్థానం

ప్రభుత్వ ప్రోత్సాహంతో వెల్లువలా కొత్త పరిశ్రమల స్థాపన

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో వినూత్న ఆవిష్కరణలతో నూతన శకం

అన్ని రంగాలకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాతో కొత్త వెలుగు

వ్యవసాయం-నీటిపారుదలకు అత్యధిక నిధులు వెచ్చిస్తున్న రాష్ట్రం

రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా కొత్త చరిత్ర

కేసీఆర్ కిట్స్ - ఆరోగ్య తెలంగాణ: ◆ గర్భం దాల్చినప్పుడు పనులు చేయలేకపోవడం వల్ల జరిగే వేతన నష్టాన్ని తెలంగాణలో ప్రభుత్వమే భరిస్తున్నది. ◆ అమ్మఒడి అనే పథకం ద్వారా గర్భిణీలను ప్రభుత్వ వాహనంలోనే ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్యం అందిస్తున్నారు. ◆ మూడు విడతల్లో రూ.12వేల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అమ్మాయి పుడితే అదనంగా మరో వెయ్యి ఇస్తున్నారు. తల్లీ బిడ్డలకు ఉపయోగపడే విధంగా రూ.3వేల విలువ చేసే 16 వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్ ను అందిస్తున్నారు. ◆ ప్రభుత్వ ఆసుపత్రులన్నింటిలో వసతులు కల్పించారు. వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ◆ ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించడానికి రాష్ట్ర వ్యాప్తంగా కంటి పరీక్షల శిబిరాలు నిర్వహిస్తున్నది.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం:

◆ నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టింది.
◆ ప్రభుత్వ స్థలంలో నూటికి నూరుపాళ్లు ప్రభుత్వ ఖర్చుతో ఒక్క రూపాయి కూడా లబ్దిదారుడిపై భారం పడకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నారు.
◆ ఒక్కో ఇంటికోసం గ్రామీణ ప్రాంతాల్లో రూ.5.04 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.5.30 లక్షలు ఖర్చు చేస్తున్నారు.
◆ ఈ ఇండ్లకు ప్రభుత్వ ఖర్చుతోనే విద్యుత్, రహదారులు, మంచినీరు, డ్రైనేజి లాంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

రైతులకు పెట్టుబడి సాయం

పంట పెట్టుబడి మద్దతు రైతు బంధు: ◆ రాష్ట్రంలోని రైతులందరికీ ఎకరానికి 8వేల రూపాయల చొప్పున పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం పూర్తి ఉచితంగా ఆర్థిక సహాయం అందిస్తున్నది. ◆ బడ్జెట్లో ఈ పథకం కోసం రూ.12,000 కోట్లను కేటాయించింది.

రైతులకు 5 లక్షల జీవిత భీమా:

◆ రాష్ట్రంలోని 18 నుంచి 60 ఏళ్ళ వయస్సులోపు ఉన్న రైతులందరికీ రూ॥5 లక్షల జీవిత భీమా సౌకర్యం. ◆ ప్రతీ రైతుకు 2271 రూపాయల ప్రీమియం ప్రభుత్వం పక్షాన చెల్లింపు. ◆ జూన్ 2వ తేదీ నుంచి భీమా పొందుతున్న రైతుల నుంచి నామినీల ప్రతిపాదనల స్వీకరణ. ◆ వచ్చే 15 ఆగస్టు నుంచి రైతులకు బాండ్ సర్టిఫికెట్ల జారీ.

జారీ చేయువారు: కమీషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ప్రగతిలో తెలంగాణ రాష్ట్రం 1

పారిశ్రామిక అనుమతుల్లో నూతన దృక్పథం - టీఎస్ ఐపాస్ :

◆ పారదర్శకమైన, వేగవంతమైన పారిశ్రామిక అనుమతుల విధానం అమలు చేస్తున్నారు. ◆ దరఖాస్తు చేసిన 15 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు జారీ చేయడంతోపాటు, సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం ప్రవేశ పెట్టారు. ◆ పరిశ్రమలకు కావాల్సిన భూమి, నీరు, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నది.

భారీ నీటి పారుదల ప్రాజెక్టులు - మిషన్ కాకతీయ:

◆ 1.23 కోట్ల భూములకు నీరందివ్వడాకి,1330 టీఎంసిలను వాడుకోవడానికి అనుగుణంగా రూ.2.6 లక్షల కోట్ల వ్యయంతో భారీ ప్రాజెక్టుల నిర్మాణం ◆ 46,000 చెరువుల పునరుద్ధరణకు 'మిషన్ కాకతీయ' ◆ ప్రతీ ఏటా బడ్జెట్లో సాగునీటి రంగానికి రూ.25,000 కోట్లు

ప్రబలమైన ఆర్థిక శక్తి:

◆ 21.1 శాతం ఆదాయాభివృద్ధి రేటుతో దేశంలోనే నెంబర్ వన్ స్థానం ◆ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో నెంబర్ వన్ స్థానం ◆ క్యాపిటల్ ఇన్వెస్టుమెంటులో దేశంలోనే నెంబర్ వన్ స్థానం ◆ జిడిపి వృద్ధి రేటు, తలసరి ఆదాయం, పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల్లో వృద్ధి, తలసరి విద్యుత్ వినియోగం, సేవారంగంలో వృద్ధి, ఐటి ఎగుమతుల్లో వృద్ధి తదితర అంశాల్లో తెలంగాణ రాష్ట్రం జాతీయ సగటును మించింది.

లోటు నుంచి మిగులు వైపు విద్యుత్ విజయం:

◆ స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం6,573 మెగావాట్ల నుంచి నాలుగేళ్లలో 16,180 మెగావాట్లకు పెరిగింది. ◆ 28,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో కొత్త ప్లాంట్ల నిర్మాణం జరుగుతున్నది. ◆ అన్ని రంగాలకు 24X7 నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగుతున్నది ◆ దేశంలో మరెక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా జరుగుతున్నది.

రహదారుల నిర్మాణంలో అద్భుత పురోగతి:

◆ రాష్ట్ర రాజధాని నుంచి జిల్లా కేంద్రానికి ఫోర్ లేన్, జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి డబుల్ లేన్, మండల కేంద్రం నుంచి ప్రతీ గ్రామానికి ఖచ్చితంగా పక్కా రోడ్డు ఉండాలనే నిబంధన తెలంగాణలో అమలవుతోంది. ◆ నాలుగేళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల పొడవు 2,527 కిలోమీటర్ల నుంచి 5,701 కిలోమీటర్లకు పెరిగింది. ◆ జాతీయ రహదారుల్లో జాతీయ సగటు 4 కిలోమీటర్లుగా ఉంటే, ఇప్పుడు తెలంగాణ సగటు 4.90 కిలోమీటర్లుంది.

సమగ్ర భూరికార్డుల ప్రక్షాళన- కొత్త పాస్ పుస్తకాలు:

◆ స్వతంత్ర భారతదేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని మిషన్ మోడ్ లో చేపట్టింది. ◆ 584 మండలాల్లోని 10,823 గ్రామాల్లో 100 రోజుల పాటు 1,507 అధికారుల బృందాలు పర్యటించారు. 72.13 లక్షల ఖాతా నెంబర్లలోని 1.78 కోట్ల సర్వే నెంబర్లను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి 2.40 కోట్ల ఎకరాలకు సంబంధించిన రికార్డులను సరిచేశారు. ◆ సవరించిన భూమి రికార్డుల వివరాలతో పారదర్శక పద్ధతిలో 'ధరణి' వెబ్ సైట్ నిర్వహిస్తుంది. – తెలంగాణ వ్యాప్తంగా రైతులందరికీ కొత్త పాస్ పుస్తకాలు అందించారు.

మహిళలకు భద్రత - షిటీమ్స్:

◆ విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం షి టీమ్స్ ఏర్పాటు చేసింది.

◆ మఫ్టీలో సాధారణ పౌరుల్లాగానే ఉండే మహిళా పోలీసులు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కాలేజీలు, ఇతర ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ ఈవ్ టీజింగ్ కు పాల్పడే వారిని గుర్తించి, తగు చర్యలు తీసుకుంటున్నారు.

తెలంగాణకు హరితహారం:

◆ గ్రీన్ కవర్ ను 33 శాతానికి పెంచడానికి తెలంగాణలో అతి పెద్ద ప్రయత్నం జరుగుతున్నది. ◆ 230 కోట్ల మొక్కలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకుని, ప్రతీ ఏడాది 40 కోట్ల మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తున్నారు. ◆ రాష్ట్రంలో అడవులు పెంచడానికి, పర్యావరణాన్ని కాపాడడానికి చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం:

◆ చేతి వృత్తులు, కుల వృత్తులకు తగిన ప్రోత్సాహకాలు అందించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి ప్రభుత్వం ప్రణాళిక రచించింది. ◆ 75 శాతం సబ్సిడీపై గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ చేస్తున్నది. ◆ వందశాతం సబ్సిడీతో చేపల పెంపకాన్ని చేపట్టింది. ◆ 50 శాతం సబ్సిడీతో నేత కార్మికులకు కావాల్సిన నూలు, రసాయనాలు అందిస్తున్నది. ◆ రాష్ట్ర వ్యాప్తంగా ఆధునిక సెలూన్ల ఏర్పాటుకు పూనుకున్నది. ◆ 80 శాతం సబ్సిడీతో స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తున్నది. ◆ ప్రతీ ఏటా బడ్జెట్లో వెయ్యి కోట్ల రూపాయలు కేటాయిస్తూ అత్యంత వెనుక బడిన వర్గాల అభివృద్ధి కోసం పథకాలు అమలు చేస్తున్నది.

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య- రెసిడెన్షియల్ స్కూళ్ళు:

◆ నిరుపేద విద్యార్థులు నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీల కోసం కేవలం నాలుగేళ్లలో 542 రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రారంభించారు. ◆ ఒక్కో విద్యార్థిపై సగటున ఏడాదికి లక్షా 20 వేల రూపాయల ఖర్చు చేస్తూ, మంచి భోజనం, వసతి, యూనిఫారాలు, పుస్తకాలు అందిస్తున్నది.

ప్రతీ రోజు ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన మంచినీరు- మిషన్ భగీరథ:

◆ రాష్ట్రంలోని మొత్తం 24వేల ఆవాస ప్రాంతాల్లో కోటి ఇండ్లకు ప్రతీ రోజు నల్లా ద్వారా సురక్షిత మంచినీరు అందించడానికి రూ.43,791 కోట్ల వ్యయంతో మిషన్ భగీరథ పథకం అమలు చేస్తున్నారు. ◆ గోదావరి, కృష్ణా నదుల నుంచి 71 టిఎంసిల నీటిని తీసుకుని, శుద్ధి చేసి, నేరుగా గ్రామాలకు పంపుతుతున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినా సరే, 365 రోజులు నిరంతరాయంగా మంచినీరు సరఫరా చేయడానికి అనువైన వ్యవస్థను రూపొందించారు.

కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్:

◆ పేదింటిలో ఆడపిల్ల పెండ్లి ఖర్చు భారాన్ని ప్రభుత్వమే భరించే కళ్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్నది. పెండ్లి ఖర్చుల కోసం రూ.1,00,116లను ప్రభుత్వం అందిస్తున్నది.

◆ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలతో పాటు ఇతర కులాల్లోని పేదలకు కూడా ఈ పథకాన్ని వర్తింప చేస్తున్నారు.

◆ 18 సంవత్సరాలు నిండిన వారికే ఆర్థిక సహాయం అనే నిబంధన పెట్టడం వల్ల తెలంగాణలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయి.

సంఘటిత శక్తిగా రైతులు- రైతు సమన్వయ సమితులు:

◆ సంఘటిత శక్తితోనే రైతులు ప్రయోజనం పొందగలుతారని భావించిన ప్రభుత్వం రాష్ట్రంలో రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసింది. ◆ లక్షా 61వేల మంది ప్రతినిధులతో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సమితులు ఏర్పాటయ్యాయి. ◆ విత్తనం వేసే దగ్గర నుంచి గిట్టుబాటు ధర వచ్చే వరకు ప్రతీ దశలోనూ రైతు సమన్వయ సమితులు రైతులకు చేదోడు వాదోడుగా ఉంటాయి.

సామాజిక భద్రతకు బాధ్యత సంక్షేమంలో నెంబర్ వన్:

◆ 40 వేల కోట్లతో 40 సంక్షేమ పథకాలు ◆ 42 లక్షల మందికి నెలకు వెయ్యి చొప్పున పెన్షన్లు ◆ 2.74 కోట్ల మందికి రూపాయికి కిలో చొప్పున నెలకు ఆరు కిలోల బియ్యం ◆ బడ్జెట్లో రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించి మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నది. ◆ 2018-19 బడ్జెట్లో ఎస్సీల సంక్షేమానికి రూ. 16,452కోట్లు, 2018-19 బడ్జెట్లో ఎస్టీల సంక్షేమానికి రూ. కోట్ల 9,693 కేటాయించారు.

సంక్షేమ రంగంలో స్వర్ణయుగం: కేసిఆర్

జారీ చేయువారు: కమీషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం



ఈనాడు

విజయవాడ 2-6-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 293

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

మోదీని నమ్మి మోసపోయాం

ఆయనతో పైసా లాభం లేదు

- కేంద్రానిది పద్ధతిలేని పాలన

సీఎం చంద్రబాబునాయుడు

ఈనాడు డిజిటల్ – అమరావతి

‘పెట్రోలు, డీజిల్ ధరల్ని విపరీతంగా పెంచారు. ధరలు తగ్గించారని తెలిసి పత్రికల్లో చూస్తే తగ్గింది పైసల్లో. ఇడ్లీ తినాలన్నా 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయింది. యువతకు ఉద్యోగాల్లేవు. కష్టపడి సంపాదించిన సొమ్ము తీసుకోవాలన్నా రోజుల తరబడి బ్యాంకుల ముందు నిలబడాలి. ఎన్ని రోజులని మనకీ కర్మ? నెలాఖరు వచ్చిందంటే పింఛన్లు ఇచ్చేందుకు డబ్బుల్లేవు. బ్యాంకులకు చెప్పాలని అధికారులు నన్ను కోరుతున్నారు. ముఖ్యమంత్రిగా నాకు ఇదేం పని? కేంద్ర ప్రభుత్వానిది ఓ పద్ధతి లేని పాలన. ఇన్ని సమస్యలున్నా ప్రధాని మోదీ మైక్ అందుకుంటే ఉపన్యాసాల మీద ఉపన్యాసాలిస్తారు. ఎన్నికల ముందు ఎన్నో చెప్పారు. అన్నీ అమలు చేస్తామన్నారు. చేతలు మాత్రం కరవయ్యాయి. ఆయన మాటలు విని అంతా మోసపోయాం. నరేంద్ర మోదీతో ఎవరికైనా పైసా లాభం ఉందా?...’ అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో ‘పీఎంజేజేవై- చంద్రన్న బీమా’ మూడో సంవత్సరం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రూ.366.23 కోట్ల బీమా ప్రీమియం చెక్‌ను జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ)కు అందించారు. ‘చంద్రన్న బీమా’ కరదీపికను ఆవిష్కరించారు. ‘రాజకీయాలు ఎంత దిగజారాయో ఇటీవల కర్ణాటకలో ప్రత్యక్షంగా చూశాం. డబ్బులిచ్చి ఎమ్మెల్యేలను (మిగతా 2లో)

చంద్రన్న బీమా సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రులు పితాని సత్యనారాయణ, కాలవ శ్రీనివాసులు తదితరులు

వైకాపా ఎంపీల రాజీనామాలను ఎందుకు ఆమోదించరు?

ఇది కుట్ర కాదా: ముఖ్యమంత్రి 3లో

సీజేఎఫ్‌ఎస్‌ల రద్దు

సాగుదారులకు యాజమాన్య హక్కులు 10లో

నేడు విజయవాడలో నవనిర్మాణ దీక్ష

- ర్యాలీగా వేదిక వద్దకు ముఖ్యమంత్రి చంద్రబాబు
- అభివృద్ధికి పునరంకితమయ్యేలా సంకల్పం.. ప్రతిజ్ఞ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ నేపథ్యంలో విజయవాడ వేదికగా శనివారం నవ నిర్మాణ దీక్ష చేపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, కొందరు మంత్రులు పాల్గొంటారు. రాష్ట్రాభివృద్ధికి ప్రజలను పునరంకితం చేసేలా గత నాలుగేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఈ దీక్షను చేపడుతూ వస్తోంది. బెంజిసర్కిల్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహణకు భారీ వేదిక ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బందరురోడ్డులోని డీవీ మేనర్ సెంటర్ నుంచి అందరితో కలిసి (మిగతా 2లో)

కోటి రూపాయలు మీవే!

- బినామీదారుల వివరాలిస్తే మీకే సొంతం
- విదేశాల్లో లావాదేవీలు వెల్లడిస్తే రూ.5 కోట్లు
- ఐటీ శాఖ నజరానా - వివరాలు బిజినెస్ పేజీలో

సమ్మె సందర్భంగా పుణెలో రోడ్డుపై పాలను పారబోస్తున్న ఓ రైతు

అన్నదాతల సమ్మెబాట

- పది రోజుల పాటు ‘గ్రామాల బందు’
- పట్టణాలకు పాలు, కూరగాయల సరఫరా నిలిపివేత
- దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రభావం చూపుతున్న ఆందోళన

2లో

మీ తోడ్పాటుతోనే విజయాలు

- మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఉండొచ్చు.. అది రాష్ట్రం బాగు కోసమే..
- నాలుగేళ్ల అభివృద్ధికి సూచికగా ప్రతి జిల్లాలో పైలాన్లు
- సంక్షేమ ఫలాలపై గ్రామం, వార్డుల్లో బోర్డులు
- కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- నవనిర్మాణ దీక్షలు విజయవంతం చేయాలని సూచన

ఈనాడు, అమరావతి: నవనిర్మాణ దీక్షలను సవాల్‌గా తీసుకోవాలని... అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'మీ అందరి సహకారంతో నాలుగేళ్లలో అద్భుత విజయాలు సాధించాం.. ఇందులో భాగంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఉండొచ్చు.. అది రాష్ట్రం బాగు కోసమే తప్ప మరోటి కాదు...' అని జిల్లాల కలెక్టర్లు, వివిధశాఖల అధికారులకు స్పష్టం చేశారు. వారితో పాటు స్థానిక సంస్థల ప్రతినిధులతో శుక్రవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నేటి నుంచి ప్రారంభం కానున్న నవనిర్మాణ దీక్షలు, నిర్వహించాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. విభజన కారణంగా రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కుపోయిందని, అందుకే వేడుకలు చేసుకునే విభజన కాదు మనదని పేర్కొన్నారు. ఈ ఏడు రోజుల దీక్షలను విజయవంతం చేయాలని సూచించారు.

- నాలుగేళ్ల అభివృద్ధికి సూచికగా ప్రతి జిల్లాలో పైలాన్లు ఆవిష్కరించాలి. గ్రామం, వార్డుల వారీగా ఎంత అభివృద్ధి జరిగింది? సంక్షేమ కార్యక్రమాలు ఎంత మందికి అందాయో తెలియజేస్తూ నోటీసు బోర్డులు పెట్టాలి.
- నాలుగేళ్ల పాలనపై ప్రజల్లో 76శాతం సంతృప్తి ఉంది. దీక్షలతో ఇది మరో 5శాతం పెరిగి 80 శాతానికి చేరాలి.
- దీక్ష పూర్తికాగానే నోడల్ బృందం ప్రతి గ్రామంలో పర్యటించాలి. అక్కడి సమస్యలు అధ్యయనం చేయాలి. అభివృద్ధిని సమీక్షించాలి. ప్రజల ఆకాంక్షలు తెలుసుకోవాలి. గ్రామం, వార్డుల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి.
- నిరుద్యోగ భృతికి మార్గదర్శకాలు ఇచ్చాం.
- అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తాం. ప్రభుత్వ భూముల్లో చోటివ్వడానికి ఎలాంటి అడ్డంకులు లేవు.
- ప్రతి ఇంటి నుంచి ఒక కంప్యూటర్ నిపుణుడు, ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలి.
- ఆక్వాలో సమస్యలు అధిగమించాం. శనగలు, కందులు, మిర్చి కొనుగోలు చేశాం. రైతులను ఆదుకున్నాం.
- రూ.50వేల కోట్లతో 19లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. త్వరలో 4లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు నిర్వహిస్తాం.
- ఉపాధిహామీ కింద ఈ నెలలో రూ.1,415కోట్ల నిధులు సద్వినియోగం చేసుకున్నాం.
- కేంద్ర తోడ్పాటు లేకున్నా ఎంతో చేశాం. 100 శాతం విద్యుత్తు, గ్యాస్ ఇచ్చాం. అక్టోబరు 2 నాటికి అన్ని పంచాయతీల్లో ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నాం.

నవనిర్మాణ దీక్షలిలా...

జూన్ 2 –	నవనిర్మాణ దీక్ష ప్రతిజ్ఞ, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, పార్లమెంటులో ఇచ్చిన హామీల అమలుపై చర్చ
జూన్ 3–	నీటి భద్రత, కరవురహిత రాష్ట్రం
జూన్ 4 –	రైతు సంక్షేమం-ఆహార భద్రత
జూన్ 5 –	సంక్షేమం-సాధికారత
జూన్ 6 –	జ్ఞానభూమి - ఉపాధి కల్పన
జూన్ 7 –	మౌలిక సదుపాయాలు - మెరుగైన జీవనం
జూన్ 8 –	సుపరిపాలన - అవినీతి రహిత సమాజంపై చర్చలు. అనంతరం మహాసంకల్పం.

నన్ను మెప్పించాలని చూడొద్దు: సీఎం

ఈ–ప్రగతి అమలులో తనను మెప్పించాలని చూస్తే ప్రయోజనం ఉండదని, దీని అమలు వల్ల ఎంత ప్రభావం కనిపించిందో చెప్పగలగాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఈ-ప్రగతి అమలు పురోగతిని సమీక్షించారు. రియల్ టైం గవర్నెన్స్(ఆర్‌టీజీ), ఈ-ప్రగతి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, ప్రజా సంతృప్తికి అందరూ పని చేయాలని సూచించారు. ఈ-ప్రగతి ఇంటిగ్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసి, అన్ని శాఖల్లో అమలు చేసేలా చూడాలని ఆదేశించారు. విద్యాశాఖలో ఆన్‌లైన్ ప్రవేశాలు, దరఖాస్తులకు సంబంధించిన మాడ్యుల్స్ పూర్తి చేశామని, సెప్టెంబరు 30నాటికి అమలులోకి తీసుకురానున్నామని అధికారులు వివరించారు. వసతిగృహాలు, ఉపకారవేతనాల అంశాలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ మొదలుపెట్టామని, రవాణాశాఖలో జులైనాటికి ఈ-ప్రగతి అమలు చేస్తామని వెల్లడించారు. డిజిటల్ పాదర్శకతకు నియోజవర్గాల వారీగా ఏడు సెక్టార్లను గుర్తించామని, పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి ఇబ్బందులు గుర్తించామని వారు పేర్కొన్నారు.

శుక్రవారం విజయవాడలో 'పీఎంజేజేవై-చంద్రన్న బీమా' మూడో సంవత్సర ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా.. కార్మిక శాఖ కమిషనర్ వరప్రసాద్‌ను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రి పితాని సత్యనారాయణ తదితరులు

మోదీని నమ్మి మోసపోయాం

(మొదటి పేజీ తరువాయి)

కొనేందుకు ప్రయత్నించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తవాళ్లొచ్చి ఏదేదో చేస్తామంటున్నారు. ప్రభుత్వం వేసిన రోడ్ల మీద నడుస్తూ పదవులు ఇస్తాం.. ఇంకా ఎక్కువ అభివృద్ధి చేస్తామని నోటికొచ్చినట్లు చెబుతారు. అలాంటి వాళ్ల మాటలు వింటే మొదటికే మోసం వస్తుంది..' అని విమర్శించారు.

అప్పుడే ఈ ఆలోచన వచ్చింది..

'మీ కోసం పాదయాత్ర సందర్భంగా రవాణా రంగంలోని కార్మికుల స్థితిగతులను చూశాను. దాని ఆధారంగానే చంద్రన్న బీమా ప్రవేశపెట్టాం. గతేడాది రూ.1200 కోట్ల పరిహారాన్ని బాధిత కుటుంబాలకు అందించాం. దీన్ని ఈ ఏడాది మరింత పెంచుతాం. ఈ పథకంపై ఏప్రిల్‌లో 98 శాతం మంది నుంచి సంతృప్తి వ్యక్తమైంది. విద్యార్థులు ఉండీ ఇతరులపై ఆధారపడకుండా, ఉద్యోగాలకు మరింత సన్నద్ధమయ్యేందుకు నిరుద్యోగభృతి ఉపయోగపడుతుంది. సంక్షేమఫలాలు మరింత సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ అన్యాయం జరిగినా వదిలిపెట్టేది లేదు. ప్రభుత్వంలో సమర్థంగా పనిచేసేవారే నాకు హితులు...' అని సీఎం చంద్రబాబు చెప్పారు. కొత్తగా వచ్చిన హలో గూగుల్ ద్వారా ఏది అడిగినా అవసరమైన సమాచారం వస్తుందని, ఫైబర్ గ్రిడ్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు ఇంట్లోని టీవీ ద్వారానే సమస్య పరిష్కారమయ్యేలా కొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. చంద్రన్న బీమా ఎక్కువ మందికి చేరువయ్యేలా కార్మికశాఖ కమిషనర్ వరప్రసాద్ చొరవ తీసుకుంటున్నారని ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పథకం పరిహారాన్ని నేరుగా లబ్ధిదారులకే బదలాయించాలని కేంద్రం మెలికపెట్టిందన్నారు. వాటన్నింటిని అధిగమించి గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) సహకారంతో ఎక్కువ మందికి చేరువయ్యేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్నందున ప్రధాని ఫోటో పెట్టాలన్న విమర్శలకు స్పందిస్తూ... ఫొటో అవసరం లేదని స్పష్టం చేశారు. మంత్రి కాలవ శ్రీనివాసులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్, కనీస వేతనాల సలహా బోర్డు ఛైర్మన్ ఆర్. రామ్మోహన్‌రావు, జీవిత బీమా సంస్థ ప్రాంతీయ మేనేజర్ జగన్నాథం, బీమా మిత్రలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిర్ణయించడంపై తెలుగు యువత విభాగం హర్షం వ్యక్తం చేసింది. దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు

6న సీబీఐ ముందుకు చిదంబరం

దిల్లీ: విదేశీ పెట్టుబడులకు అనుమతి మంజూరులో అక్రమాలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ నిమిత్తం ఈ నెల ఆరో తేదీన హాజరు కావాలని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరంను సీబీఐ ఆదేశించింది. మీడియా రంగ ప్రముఖుడు పీటర్ ముఖర్జియా, ఆయన భార్య ఇంద్రాణి నెలకొల్పిన ఐఎన్ఎక్స్ మీడియాకు రూ.305 కోట్ల విదేశీ పెట్టుబడులు వచ్చేలా అనుమతుల మంజూరులో అవినీతి చోటు చేసుకుందన్న కేసు నమోదయింది. ఆర్థిక మంత్రి హోదాలో విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ)ని ప్రభావితం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

భారత నర్సులకు సింగపూర్‌లో పెరగనున్న ఉపాధి అవకాశాలు

దిల్లీ: భారతీయ నర్సులకు ఇకపై సింగపూర్‌లో ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. నర్సింగ్ రంగంలో 'పరస్పర గుర్తింపు ఒప్పందం(ఎంఆర్ఏ)'పై భారత్, సింగపూర్ శుక్రవారం సంతకాలు చేశాయి. దీంతో మనదేశంలో నర్సింగ్ చదివినవారు సింగపూర్‌లో, అక్కడి నర్సులు మనదేశంలో ఉపాధి పొందేందుకు వీలు కలగనుంది.

అన్నదాతల సమ్మెబాట

ప్రధాన డిమాండ్లు

- రుణాలను పూర్తిగా మాఫీ చేయాలి
- స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలి
- నిరంతరం కనీస ఆదాయం లభించేలా చూడాలి

దిల్లీ: కష్టానికి తగిన ప్రతిఫలం లభించని అన్నదాతలు శుక్రవారం సమ్మె బాట పట్టారు. 'గావ్ బంద్' (గ్రామాల బంద్) పేరిట ఏకంగా పది రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె చేయనున్నారు. ఆందోళనలో భాగంగా పట్టణాలకు పాలు, కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాను నిలిపివేయనున్నారు. కిసాన్ ఏక్తా మంచ్, రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ (ఆర్‌కేఎం) పేరిట దాదాపు 172 రైతు సంఘాలు ఏకమయి ఈ ఆందోళనను నిర్వహిస్తున్నాయి. ఉద్యమంలో భాగంగా రాస్తారోకోలు చేయబోమని, రహదారుల పక్కన ధర్నాలు చేస్తామని నాయకులు ప్రకటించారు.

తొలి రోజున.. తొలిరోజున హరియాణా, రాజస్థాన్, జమ్ము-కశ్మీర్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల రైతులు ఆందోళనకు దిగారు. పంజాబ్ రైతులు ఆకుపచ్చ తలపాగాలు కట్టుకొని ఉద్యమంలో భాగస్వాములయ్యారు. పాలు, కూరగాయలు, పళ్లను రోడ్లపై పారబోశారు. హరియాణా రైతులు నగరాలకు పాలు, కూరగాయలను తీసుకెళ్లడాన్ని నిలిపివేశారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో కూడా రైతులు రోడ్లపై పాలను, టమాటోలను పారబోశారు. మధ్యప్రదేశ్‌లో పెద్దదయిన నీముచ్‌లోని వ్యవసాయ మార్కెట్‌కు రైతులు ఎవరూ వెళ్లలేదు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా అకోల్‌లో రైతులు ప్రదర్శన జరిపారు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్, హనుమాన్‌ఘర్, ఝుంజును జిల్లాల్లో పాలు, కూరగాయల సరఫరా నిలిచిపోయింది. బికనీర్, సికార్, నౌగార్ జిల్లాల్లో రైతులు ప్రదర్శనలు జరిపారు. మొదటి రోజు ఆందోళన ప్రశాంతంగా జరిగినట్టు సమాచారం అందింది.

పంజాబ్‌లోని మోగా జిల్లా బఘాపురానాలో రోడ్డుపై కాయగూరలు పారబోసి రైతుల నిరసన

నగరాల్లో ఆందోళన చేయబోం.. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఆర్‌కేఎం కన్వీనర్ శివకుమార్ శర్మ విలేకరులతో మాట్లాడుతూ 22 రాష్ట్రాల రైతులు సమ్మెలో పాల్గొన్నారని చెప్పారు. సమ్మె కాలంలో నగరాలకు కూడా వెళ్లబోమని తెలిపారు. నగరాలకు వెళ్లి అక్కడి జనజీవనానికి ఆటంకం కలిగించబోమని చెప్పారు. చివరి రోజైన జూన్ పదో తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు భారత్ బంద్ నిర్వహిస్తామని తెలిపారు. ఆ రోజున నగరాల్లో కూడా దుకాణాలు మూసివేయాలని వ్యాపారులను కోరుతామని చెప్పారు. ఎవరికైనా కూరగాయలు, పాలు అవసరమైతే వారు గ్రామాలకు వచ్చి కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

పాలు కొనుగోలుకు గ్రామానికి వెళ్లిన సిద్ధు.. పంజాబ్ మంత్రి, ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు నవజ్యోత్ సిద్ధు రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. పట్టో అనే గ్రామానికి వెళ్లి పాలు, కూరగాయలు కొనుగోలు చేశారు. ఆయన వెంట ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుల్జీత్ సింగ్ నగ్ర, గుర్‌ప్రీత్ సింగ్‌లు ఉన్నారు. పెట్రోలు ధర లీటరుకు రూ.20 ఉన్నప్పుడు పాలు ధర రూ.16 ఉండేదని, పెట్రోలు ధర రూ.80కి పెరిగినప్పుడు పాలు ధర రూ.45 మాత్రమే ఉందని అన్నారు. గత 25 ఏళ్లలో చమురు ధరలు 12 రెట్లు పెరగగా, పంటల మద్దతు ధరలు అయిదు శాతం మాత్రమే పెరిగాయని చెప్పారు.

మధ్యప్రదేశ్‌లో అప్రమత్తత

మధ్యప్రదేశ్‌లోని మంద్‌సౌర్‌లో రైతులపై పోలీసు కాల్పులు జరిగి ఈ నెల ఆరో తేదీకి ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో ఈ ఆందోళనకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోంటోంది. మద్దతుధర కోసం మంద్‌సౌర్‌లో నాడు రైతుల జరిపిన ఆందోళనే ఇప్పుడు జాతీయ ఉద్యమంగా మారిందని రైతు నాయకులు తెలిపారు. రైతులు లేవనెత్తిన సమస్యలు స్థానికమైనవని, వీటిని కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాల దృష్టికి తీసుకెళ్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎస్.కె.పట్టనాయక్ తెలిపారు.

నేడు విజయవాడలో నవనిర్మాణ దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శనగా బెంజిసర్కిల్‌కు చేరుకుంటారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి ముఖ్యమంత్రి స్వయంగా అందరితో నవ నిర్మాణ దీక్ష ప్రతిజ్ఞ చేయిస్తారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటి, ఎంత వరకు నెరవేరాయి- ఇంకా ఏం సాధించుకోవాల్సి ...వంటి అంశాలపై ప్రసంగిస్తారు. నాలుగేళ్లలో రాష్ట్రాన్ని ఏ స్థాయికి తీసుకువెళ్లింది వివరించనున్నారు. దీక్షల్లో భాగంగా వరుసగా వారం రోజుల పాటు వివిధ అంశాలపై చర్చలు జరుగుతాయి.

విదేశీ విరాళాలపై విశ్లేషణకు సాఫ్ట్‌వేర్

దిల్లీ: స్వచ్ఛంద సంస్థలకు వచ్చిన విదేశీ నిధులు, వాటి వినియోగాన్ని పర్యవేక్షించడానికి కేంద్ర హోం శాఖ ఆన్‌లైన్ విశ్లేషణ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం-2010 ప్రకారం నిధులు స్వీకరిస్తున్నదీ లేనిదీ తెలుసుకోవడంతో పాటు, ఆ సొమ్మును ఎందుకు వినియోగిస్తున్నదీ ఆధారాలతో సహా తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. ఈ సాఫ్ట్‌వేర్‌తో ఆయా సంస్థల బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేశారు. విదేశీ విరాళాల చట్టం కింద దాదాపు 25 వేల సంస్థలు పేర్లను నమోదు చేసుకున్నాయి. 2016-17లో 18,065 కోట్ల మేర విరాళాలు అందాయి.

గ్రహం అనుగ్రహం

2–6–2018 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
చవితి: రా. 1-30 తదుపరి పంచమి
పూర్వాషాఢ నక్షత్రం: ఉ. 7-03 తదుపరి ఉత్తరాషాఢ
అమృత ఘడియలు: రా. 2-34 నుంచి 4-21 వరకు
వర్జ్యం: మ. 3-55 నుంచి 5-42 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-28 నుంచి 7-12 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-27
సంకటహర చతుర్థి

నేడు, రేపు రాయలసీమలో భారీ వర్షాలు

రాష్ట్రంలో పలుచోట్ల పిడుగులు పడే అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఓ పక్క ఎండలు మండిపోతుండగా.. నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లో పలుచోట్ల శని, ఆదివారాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ తెలిపింది. కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతోపాటు ఈదురుగాలులు వీయొచ్చని వెల్లడించింది. మరోపక్క కోస్తాంధ్ర మీదుగా ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశం ఉంది. శని, ఆదివారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల పిడుగులు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయని వాతావరణ అధికారులు పేర్కొన్నారు.

'అయోధ్య స్థలాన్ని జాతీయ వారసత్వ ప్రాంతంగా ప్రకటించాలి'

దిల్లీ: అయోధ్యలోని వివాదాస్పద 'రామజన్మభూమి-బాబ్రీ మసీదు స్థలాన్ని జాతీయ వారసత్వ ప్రాంతంగా ప్రకటించాలన్న అనూ మెహతా అనే పిటిషనరును ....ఆ మేరకు కేంద్రానికి ఓ వినతిపత్రాన్ని సమర్పించాల్సిందిగా దిల్లీ హైకోర్టు ఆదేశించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిత్తల్, జస్టిస్ హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ... కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖకు వినతి పత్రం సమర్పించాల్సిందిగా అనూమెహతాను కోరింది. పిటిషనరు సమర్పించే సదరు వినతి పత్రాన్ని కేంద్రం పరిశీలిస్తుందేమోననీ... మూడునెలల వ్యవధిలో నిర్ణయం తీసుకోవచ్చనే అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేసింది. ఈ వివాదాస్పద స్థలంలో ఉన్న పురాతన కట్టడాలు, కళాఖండాలు, ఇతరత్రా వస్తువులన్నీ కూడా మన సుసంపన్న వారసత్వ సంపదలో భాగాలు అని పిటిషనరు పేర్కొన్నారు. అందుకే, ఆ స్థలాన్ని వారసత్వ ప్రాంతంగా ప్రకటించాలని దిల్లీ హైకోర్టును అభ్యర్థించారు.

S.I & కానిస్టేబుల్స్ VRO/VRA
మాల్యాద్రి సార్ గైడెన్స్‌లో NEW Batches
05-06-18 ఉ॥ 7గం॥ నుండి ప్రారంభం.
అడ్మిషన్లకై త్వరపడండి
భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్
చైతన్యపురి-హైదరాబాద్ 040-66338639, 24064477 | నాగమల్లి తోట, కాకినాడ 9652578639, 0884-2378639

స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ ఛాంపియన్ షిప్ ట్రోఫీతో కార్తిక్ నెమ్మాని

'స్పెల్లింగ్ బీ' విజేతగా కార్తీక్

మరోసారి భారతీయ-అమెరికన్‌కే టైటిల్

హ్యూస్టన్: ప్రతిష్ఠాత్మక 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ' 91వ టైటిల్ విజేతగా భారతీయ-అమెరికన్ బాలుడు కార్తీక్ నెమ్మాని(14) నిలిచాడు. తుదిపోటీలో క్రైస్తవ సమ్మేళనం అనే అర్థం వచ్చే 'koinonia' అనే పదానికి తప్పుల్లేకుండా స్పెల్లింగ్ చెప్పి ఈ విజయం సాధించాడు. వరుసగా 11వ సారి భారతీయ-అమెరికన్ ఈ పోటీ విజేతగా నిలవడం విశేషం. 8వ తరగతి (గ్రేడర్) చదువుతున్న టెక్సాస్‌లోని మెక్‌కిన్నేకు చెందిన కార్తీక్ మరో భారతీయ-అమెరికన్ విద్యార్థి నైసా మోదీపై తుది రౌండ్‌లో విజయం సాధించాడు. "నేను ఆత్మవిశ్వాసంతో ఉన్నప్పటికీ విజేతగా నిలుస్తానని అనుకోలేదు.. ఏళ్ల తరబడిన నా కల సాకారమైంది.." అని అనంతరం కార్తీక్ ఆనందం వ్యక్తం చేశాడు. స్పెల్లింగ్ బీ విజేతగా నిలవడం ద్వారా కార్తీక్ స్క్రైప్స్ బీ నుంచి 40 వేల డాలర్ల (సుమారు రూ. 26.85 లక్షలు) నగదు బహుమతి, ట్రోఫీతో పాటు మెరియమ్-వెబ్‌స్టార్ నుంచి 2,500 డాలర్లు అందుకున్నాడు. అలాగే మీడియా పర్యటనలో భాగంగా న్యూయార్క్, హాలీవుడ్ ప్రయాణాలు.. పాఠశాలలో పిజ్జా పార్టీ వంటివి కూడా ఉంటాయని వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. మొత్తం 516 మంది పాల్గొనగా గురువారం జరిగిన తుదిపోటీల్లో 41 మంది నిలిచారు. పోటీల్లో అమెరికా నలుమూలల నుంచి (కెనడా నుంచి ఒకరు) పలువురు పాల్గొన్నారు. గతేడాది అనన్య వినయ్ ఈ పోటీల్లో విజేతగా నిలిచింది.

సల్మాన్‌ఖాన్ సోదరుడు అర్బాజ్‌ఖాన్‌కు సమన్లు

ఐపీఎల్ మ్యాచుల్లో బెట్టింగ్‌కు పాల్పడినందుకు

ఠాణె: బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్‌ఖాన్ సోదరుడు అర్బాజ్‌ఖాన్‌కు బలవంత వసూళ్ల వ్యతిరేక దళం(ఏఈసీ) సమన్లు జారీ చేసింది. విచారణ నిమిత్తం శనివారం ఠాణెలోని తమ కార్యాలయానికి రావాలన్నారు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ మ్యాచుల్లో అర్బాజ్‌ఖాన్ బెట్టింగ్‌కు పాల్పడ్డాడని 'ఏఈసీ' అనుమానిస్తోంది. అతని బ్యాంకుఖాతాలను పరిశీలించాలని భావిస్తోంది. బెట్టింగ్‌లో రూ.2.8 కోట్లు కోల్పోయాడని, ఇవ్వకపోవడంతో బెదిరించానని సోనుజలన్ అలియాస్ సోనుమలద్ అనే బుకీ పోలీసుల విచారణలో వెల్లడించాడు. బుకింగ్‌కు పాల్పడుతున్నాడనే ఆరోపణలపై మే 15న సోనుతో పాటు మరో ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో భాగంగా అర్బజ్‌ఖాన్ గురించి వెల్లడించాడు. ఐపీఎల్ మ్యాచుల్లో బెట్టింగ్‌కు పాల్పడుతున్నాడని 2012లో కూడా ముంబయి నేరవిభాగం పోలీసులు సోనును అరెస్టు చేశారు.

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
హన్మకొండ	44.5	28.0
కడప	42.0	28.0
అనంతపురం	40.6	28.0
నెల్లూరు	40.0	34.0
తిరుపతి	40.0	24.0
విజయవాడ	39.2	28.9
హైదరాబాద్	38.9	24.3
గుంటూరు	38.5	26.8
రాజమహేంద్రవరం	38.0	25.5
ఒంగోలు	37.5	29.9
తాడేపల్లిగూడెం	37.5	28.0
కర్నూలు	36.9	26.7
శ్రీకాకుళం	36.0	29.0
విశాఖపట్నం	36.0	26.8
నరసాపురం	35.4	27.4

రూ.4,700 కోట్ల ఆస్తుల జప్తు

- బ్యాంకు మోసం, అక్రమ నగదు చలామణి కేసులో స్టెర్లింగ్ బయోటెక్‌పై ఈడీ చర్యలు
- విదేశాల్లోని ఆస్తుల జప్తునకు యోచన
- బ్యాంకుల నుంచి రూ.5వేల కోట్ల రుణం
- 300 డొల్ల కంపెనీల ద్వారా దారి మళ్లింపు

దిల్లీ: బ్యాంకు మోసం, అక్రమ నగదు చలామణికి సంబంధించిన ఒక కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శుక్రవారం భారీ ఎత్తున ఆస్తులను జప్తు చేసింది. స్టెర్లింగ్ బయోటెక్ గ్రూప్‌నకు చెందిన రూ.4,700 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. గుజరాత్‌కు చెందిన ఈ సంస్థ రూ.5వేల కోట్ల మేర బ్యాంకు మోసం, అక్రమ నగదు చలామణికి పాల్పడిందని ఆరోపణలను ఎదుర్కొంటోంది. నీరవ్‌మోదీ-మెహుల్ చోక్సీ బ్యాంకు మోసం కేసు తర్వాత ఈ ఏడాది జప్తు చేసిన ఆస్తుల్లో ఇదే పెద్ద మొత్తం. స్టెర్లింగ్ బయోటెక్‌పై ఈడీ గత ఏడాది అక్టోబరులో కేసు నమోదు చేసింది. 4వేల ఎకరాల స్థిరాస్తిని, కర్మాగారం, యంత్రాలను ఈ సంస్థతో సంబంధమున్న వివిధ కంపెనీలు, ప్రమోటర్లకు చెందిన 200 బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును, రూ.6.67 కోట్ల విలువైన షేర్లను, పలు విలాసవంతమయిన కార్లను జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో ఈ సంస్థకు ఉన్న స్థిరాస్తులనూ జప్తు చేసినట్లు వెల్లడించింది.

ఈ సంస్థ చేపట్టిన విదేశీ లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నామని, నైజీరియాలో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టిన పలు చమురు రిగ్గులను, చమురు క్షేత్రాలను, విదేశాల్లో ఈ సంస్థకున్న 50 బ్యాంకు ఖాతాలను జప్తు చేయడానికి విదేశీ న్యాయస్థానాలను సంప్రదించనునట్లు ఈడీ వెల్లడించింది.

స్టెర్లింగ్ బయోటెక్ ప్రమోటర్లు నితిన్, చేతన్ సందేసరలు పరారీలో ఉన్నారు. వారిపై ప్రత్యేక న్యాయస్థానం బెయిలుకు వీలు కాని అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఈ సంస్థపైనా, ప్రమోటర్లపైనా సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసింది. ఉన్నతస్థాయి రాజకీయనేతల తరఫున ఈ కంపెనీ పెద్ద ఎత్తున తరలించిన నల్లధనం వ్యవహారంపై సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఆదాయపు పన్ను విభాగానికి చెందిన ఉన్నతాధికారులు సహా పలువురు సీనియర్ అధికారుల పాత్రపైనా ఈడీ దర్యాప్తు చేస్తోంది. స్టెర్లింగ్ బయోటెక్, ఆ సంస్థ ప్రమోటర్లు తప్పుడు పత్రాలతో వివిధ బ్యాంకుల నుంచి రూ.5వేల కోట్ల రుణాలు తీసుకున్నారని, చివరికి ఆ రుణం నిరర్థక ఆస్తిగా మారిందని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.

బ్యాంకుల ద్వారా పొందిన రుణంతో వివిధ సంస్థల పేరుపై ఆస్తులు కొనుగోలు చేశారని, తమ కంపెనీల పనితీరు అద్భుతంగా ఉందని మార్కెట్లో చూపించుకోవడానికి స్టెర్లింగ్ బయోటెక్ లిమిటెడ్, స్టెర్లింగ్ ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ షేర్లను కొనుగోలు చేశారని ఈడీ వెల్లడించింది. బీఎండబ్ల్యూ, ఆడి వంటి విలాసవంతమైన కార్లనూ కొన్నారని తెలిపింది. నగలు కొనడం వంటి వ్యక్తిగత వినియోగానికి సంస్థ ప్రమోటర్లు వివిధ డొల్ల కంపెనీలు, బినామీ కంపెనీల ఖాతాల నుంచి దాదాపు రూ.140 కోట్లు విత్‌డ్రా చేసుకున్నారని వెల్లడించింది. దాదాపు 300 డొల్ల కంపెనీలు లేదా బినామీ కంపెనీల ద్వారా రుణ మొత్తాన్ని దారి మళ్లించారని, ఈ కంపెనీల లావాదేవీలన్నింటినీ దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది. ఈ కేసులో ఇప్పటి వరకు దిల్లీకి చెందిన వ్యాపారవేత్త గగన్ ధావన్, ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్ అనూప్ గార్గ్, స్టెర్లింగ్ బయోటెక్ లిమిటెడ్ డైరెక్టర్ రాజ్‌భూషణ్ దీక్షిత్ అరెస్టయ్యారు.

ఇదీ సంగతి!



మన పార్టీ మంత్రుల సమస్యను కూడా రాహుల్‌జీనే అడగాల్సింది. అసమ్మతి తలెత్తకుండా పదవులివ్వటం కష్టం!

వైకాపా ఎంపీల రాజీనామాలు ఆమోదించరేం?

- ఇది కుట్ర కాదా?
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఈనాడు - అమరావతి



వైకాపా ఎంపీల రాజీనామాలను ఎందుకు ఆమోదించడం లేదో సమాధానం చెప్పాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిమాండు చేశారు. ఆ పార్టీ ఎంపీలు స్వయంగా వెళ్లి వారి రాజీనామాలు ఆమోదించాలని కోరినా..అలా చేయకపోవడం కుట్ర కాదా? అని ప్రశ్నించారు. మిగతా ఎంపీల రాజీనామాలు ఆమోదించి వైకాపా వారివి చేయకపోవడం భాజపా, వైకాపా చేస్తున్న నాటకం కాదా? అని నిలదీశారు. ఉపఎన్నికలు జరిగితే ఆ రెండు పార్టీల బండారం బయటపడిపోతుందని, 2019లో జరిగే ఎన్నికల ఫలితాలు ముందే తేలిపోతాయనేది వారి భయమన్నారు. దేశవ్యాప్తంగా తాజాగా జరిగిన ఉపఎన్నికల ఫలితాల్లో భాజపా ఓటమిని మిగతా పత్రికలన్నీ ఒక రకంగా ఇస్తే..సాక్షి పత్రిక వాస్తవాలను కూడా ప్రచురించేందుకు భయపడిందని చెప్పారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి శుక్రవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. సాధారణంగా ఎక్కడైనా ఉపఎన్నికలు జరిగితే అధికారంలో ఉన్న పార్టీలే గెలుస్తుంటాయని...భాజపా ఓడిపోవడం ఆ పార్టీ పరిపాలనకు ప్రజలిచ్చిన తీర్పుగా భావించాలని చెప్పారు. వారి పరిపాలనలో ప్రజలు ఎంత నిరాశ, నిస్పృహలతో ఉన్నారో చెప్పేందుకు ఇది నిదర్శనమన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేయకపోతే ఇలాంటి పరిణామాలే ఎదురవుతుంటాయని వ్యాఖ్యానించారు. విభజనహామీలు, చట్టంలోని అంశాల అమలుపై సుప్రీంకోర్టును ఆశ్రయించడం చివరి అస్త్రం మాత్రమేనని... వీటి సాధనకు రాజకీయ పరిష్కారమే ముఖ్యమని చెప్పారు. అందుకే రాష్ట్రంలోని ప్రజలంతా ఒకే దారిలో నడిచి ఏకపక్షంగా తమకు మద్దతివ్వాలన్నారు. రాబోయే ఎన్నికల్లో 25 ఎంపీ స్థానాలు గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కొందరు నాయకులు ఏవేవో మాట్లాడుతున్నారని, వీరి కంటే ఎక్కువ మాట్లాడిన నరేంద్రమోదీ ఏమయ్యారో వారు తెలుసుకోవాలని చెప్పారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో అవినీతిని నియంత్రించామని, గత నాలుగేళ్ల పాలనలో ఒక్క కుంభకోణం కూడా లేదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాల్లో జరిగిన అగ్రిగోల్డ్, ఎర్రచందనం, వాన్‌పిక్, లేపాక్షి, బాక్సైట్ తదితర కుంభకోణాల వల్ల ఏర్పడిన పరిస్థితులను అధిగమించే చర్యలు చేపడుతున్నామన్నారు. 'నవనిర్మాణ దీక్ష, మహా సంకల్పంలో భాగంగా వివిధ అంశాలపై ప్రతి రోజూ అన్ని పంచాయతీలు, నియోజకవర్గాలు, మండలాలు, పురపాలక, నగరపాలక సంస్థలు, జిల్లాల్లో చర్చలు నిర్వహిస్తాం. దీని కోసం నోడల్ అధికారులను పంపిస్తున్నాం. ప్రతి రోజూ పది లక్షల మందికి ఫోన్‌లు చేసి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం. ప్రతి ఒక్కరూ ఈ సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయాలి. క్షేత్రస్థాయి సమాచారాన్ని అధికారుల నుంచి తెప్పించేందుకు ప్రత్యేకంగా యాప్ తీసుకొచ్చాం. ఆ రోజు నేను నవనిర్మాణ దీక్ష పెట్టకపోయుంటే మన రాష్ట్రంపై జరుగుతున్న కుట్రలను వెల్లడించేందుకు కూడా వేదిక ఉండేది కాదు..' అని సీఎం పేర్కొన్నారు.

జాతీయ రాజకీయాల్లో కుప్పిగంతులు వేయలేను

"జాతీయ రాజకీయాలకు సంబంధించి అందరి మాదిరి నేను కుప్పిగంతులు వేయడం సరికాదు. ఈ దేశంలో ఉన్న రాజకీయపార్టీలను అధ్యయనం చేసిన వ్యక్తిని నేను. అనేక సందర్భాల్లో వాటిల్లో భాగస్వామినయ్యాను. జాతీయ రాజకీయాల్లో సంక్లిష్టతలు తెలిసిన వాడిని. ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామన్నవి సాధించుకోవడం ఎలాగో నాకు తెలుసు. ప్రాంతీయ పార్టీలకు ఈ సారి ఎక్కువ సీట్లు వస్తాయి. మన ఆలోచనలకు దగ్గరగా ఉండే పార్టీలన్నీ మద్దతు తీసుకుని విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరుతాం. నీతి, నిజాయతీ వ్యాఖ్యలు వల్లించిన మోదీ కర్ణాటక ఎన్నికల్లో ఎమ్మెల్యేల కొనుగోలుకు తెరలేపి బరితెగించారు. ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారు. కేంద్రాన్ని విడిచిపెట్టం. సహకరించనందునే ధర్మపోరాటం చేస్తున్నాం.." అని సీఎం చంద్రబాబు వివరించారు.

నేను సైనికుడి మాదిరిగా పనిచేస్తా

జాతీయ రాజకీయాల్లో నాయకత్వం వహిస్తారా? అంటూ ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు... 'నేషనల్ ఫ్రంట్ పెడతా.. యునైటెడ్ ఫ్రంట్ పెడతా. నేనే ప్రధాన మంత్రిని అవుతా... అని నేను అన్నాననుకో... నీకు ఆనందం. నువ్వే రేపు వీడు ఒక ఫూల్..బఫూన్ అని రాస్తావు..' అని చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. అలాగే పలు ప్రశ్నలకు స్పందిస్తూ... 'నేను సైనికుడి మాదిరిగా పనిచేస్తాను. రాష్ట్రాలను బలోపేతం చేసుకోవాలనేదే నా ఉద్దేశం. జాతీయ రాజకీయాల్లో ఎవరికీ పోటీదారును కాను. రాబోయే రోజుల్లో కేసీఆర్, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్ ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం. ప్రాంతీయ పార్టీల కూటమి విషయంలో ఎప్పుడు ఏం చేయాలో నాకు తెలుసు. ప్రాంతీయ పార్టీల కూటమి ఎన్నికలకు ముందా? తర్వాత ఎలా కార్యారూపం దాల్చుతుందో మీరే చూస్తారు. కుమారస్వామి ప్రమాణ స్వీకారం సందర్భంగా రాహుల్ గాంధీతో కరచాలనం చేయడంలో తప్పేముంది. మోదీ, సోనియాగాంధీతో నాకు వ్యక్తిగత విరోధాలు ఏమీ లేవు. కాంగ్రెస్ అన్యాయం చేస్తే... భాజపా రాష్ట్రానికి అంతకంటే ఎక్కువే చేసింది...' అని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీలతో కలిసి పనిచేస్తామని కాంగ్రెస్ ముందుకొస్తే ఏం చేస్తారని అడగ్గా 'మీకెందుకు అంత తొందర' అన్నారు. 'ప్రజల మనోభావాలతో జాతీయ పార్టీలు ఆడుకుంటున్నాయి. అవి వారికి ఆటకావొచ్చు. మనకు జీవన్మరణ సమస్య. అలాంటి పరిస్థితి సృష్టించి నీకు దిక్కున్న దగ్గర చెప్పుకోమనడం ఏం పద్ధతి...' అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

'భూదార్'పై సీఎం సమీక్ష

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో శుక్రవారం 'భూదార్' పురోగతిని సమీక్షించారు. కృష్ణా జిల్లాల్లో ప్రయోగాత్మకంగా దీనిని ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అక్టోబరు 2వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి చేసే విషయాన్ని చర్చించారు. అటవీశాఖ భూములకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా ఆరా తీశారు. భూదార్ కింద తాత్కాలికంగా నెంబర్లను ఇస్తున్న విషయం తెలిసిందే. శాశ్వత నెంబరును ఇచ్చేందుకు మరింత సమయం పట్టనుంది. ఈ సందర్భంగానే 22ఏ నిషిద్ధ భూములు, చుక్కల భూముల వ్యవహారంలో పురోగతిని ప్రతి మంత్రివర్గ సమావేశానికి ముందు వివరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల స్పష్టతపై జరుగుతున్న అధ్యయనాన్ని సమీక్షించారు. గాలిజనార్ధనరెడ్డితో ముడిపడిన ఓబులాపురం మైనింగ్ వ్యవహారంలో సరిహద్దుల స్పష్టతపై సర్వే ఆఫ్ ఇండియా నేతృత్వంలో జరుగుతున్న అధ్యయన బృందంలో ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటివరకు జరిగిన పురోగతిని తెలుసుకున్న సీఎం అధికారులకు కొన్ని సూచనలు ఇచ్చారు. భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, సర్వే శాఖ సంచాలకులు ప్రభాకరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ సమస్యను ఈ నెలలోనే పరిష్కరించేలా చూడండి: సీఎం

ఈనాడు, అమరావతి: అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారానికి ఈ నెలలోనే పరిష్కారం దిశగా సత్వర చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. "అగ్రిగోల్డ్ సమస్య మళ్లీ వివాదాల్లో పడటానికి వీల్లేదు. మూడేళ్లు ట్రస్ట్ కోసం చూశాం. అన్ని సమస్యలపై న్యాయస్థానాన్ని ఒప్పించండి. వేలానికి మార్గదర్శకాలు రూపొందించండి. ప్రభుత్వ మార్గదర్శకాలను న్యాయస్థానానికి పంపండి. రాష్ట్ర ప్రభుత్వం కార్పస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. అగ్రిగోల్డ్ ఆస్తులపై బకాయిలు గురించి బ్యాంకర్లతో చర్చించండి. న్యాయస్థానం ఆధ్వర్యంలో, ప్రభుత్వ పర్యవేక్షణలో వేలం నిర్వహించడానికి అనుమతి అడగండి. 13జిల్లాల ప్రతినిధులు కూడా ఈ పరిష్కార ప్రక్రియలో భాగస్వాములను చేయాలి..." అని సీఎం సూచించారు.

భారతీయుల డీఎన్ఏలోనే లౌకికతత్వం

- ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఈనాడు, దిల్లీ: ప్రతి భారతీయుడి డీఎన్ఏలోనే లౌకికతత్వం ఉందని.. అందుకే దేశంలో భిన్న మతాలు, వర్గాల వారు క్షేమంగా ఉండగలుగుతున్నారని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. దిల్లీలో పద్మవిభూషణ్ నానాజీ దేశ్‌ముఖ్ ఎనిమిదో స్మారకోపన్యాసం సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడారు. బాల్యంలో అనేక కష్టాలను ఎదుర్కొన్న దేశ్‌ముఖ్ జ్ఞాన సముపార్జన, సమాజసేవను జీవితాంతం ఓ తపస్సులా చేపట్టారని కొనియాడారు. చిత్రకూట్ కేంద్రంగా వందలాది గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. నానాజీ స్ఫూర్తితోనే స్వర్ణ భారతి ట్రస్ట్ ఏర్పాటు చేశామని.. ఆయన మార్గంలోనే 70 ఏళ్లకు రాజకీయాల నుంచి తప్పుకొని సమాజసేవకు వెళతానని ప్రధానికి తెలిపినట్లు వివరించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడ ఏ సంఘటన చోటుచేసుకున్నా స్పందించి మనవంతు భాగస్వాములు కావడమే నిజమైన దేశభక్తిగా అభివర్ణించారు. దేశాన్ని భరతమాతగా పిలుస్తున్నామని, నదులకు మహిళల పేర్లే ఉన్నాయని.. కానీ అత్యాచారాలు పెరిగిపోతుండటం మన చరిత్ర, సంస్కృతులకు విరుద్ధమన్నారు. కేంద్ర మంత్రి థావర్‌చంద్ గెహ్లోత్, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ గర్వకారణం..

నిస్వార్థసేవకు తయారుగా ఉండడమే ఆర్ఎస్ఎస్ (రెడీ టూ సెల్ఫ్‌లెస్ సర్వీస్) అని.. అలాంటి సంస్థతో అనుబంధం ఉండడాన్ని గర్వంగా భావిస్తున్నట్లు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గాంధీజీ కూడా ఆర్ఎస్ఎస్ ప్రచారం చేసిన విలువలను గుర్తించినట్లు గుర్తుచేశారు. సంఘ్ ఆహ్వానాన్ని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అంగీకరించడంపై వివాదం తలెత్తిన నేపథ్యంలో వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు.

4న తిరుపతిలో 'ఆకాశదర్శన్' సిబ్బంది జాతీయ కౌన్సిల్ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: ఆకాశవాణి, దూరదర్శన్ కార్యక్రమాల(ప్రోగ్రాం) సిబ్బంది సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశం ఈ నెల 4వ తేదీన తిరుపతిలో జరగనుంది. ఈ సమావేశానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వంద మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నట్లు సంఘం ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రసార భారతి, ప్రభుత్వం.. కార్యక్రమ విభాగాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా ఎటువంటి పదోన్నతులు కల్పించకపోగా, జీతభత్యాలను తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

175 స్థానాల్లో భాజపా పోటీ

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: వచ్చే సాధారణ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 175 నియోజకవర్గాల్లో భాజపా పోటీ చేస్తుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం వంటి వ్యవస్థలను సంస్కరించే దిశగా బలమైన ఆలోచనలతో ప్రజల్లోకి వెళతామన్నారు. తితిదే రాజకీయాలకు అతీతంగా పనిచేయాలన్నారు. తితిదే వ్యవహారాలు ఆధ్యాత్మిక, ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తే మంచిదని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వస్తే దీనిపై భిన్నమైన ఆలోచన చేస్తామన్నారు.

చంద్రబాబుతో లగడపాటి భేటీ

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సమావేశమయ్యారు. వారిద్దరి భేటీ రాజకీయవర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది. వారి నడుమ ఏ చర్చ జరిగిందన్నది తెలియరాలేదు.

గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొస్తాం

- ఖాళీగా ఉన్న 1.42 లక్షల కొలువుల భర్తీ
- అధికారంలోకి వచ్చిన వారంలోగా సీపీఎస్ రద్దు
- పాలకొల్లు బహిరంగసభలో జగన్

పాలకొల్లులో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

ఈనాడు డిజిటల్, ఏలూరు: తాము అధికారంలోకి వస్తే గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొస్తామని వైకాపా అధినేత జగన్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ప్రారంభించిన ప్రజా సంకల్ప పాదయాత్ర మధ్యాహ్నానికి పాలకొల్లు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పాలకొల్లు పట్టణంలో సాయంత్రం బహిరంగసభలో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం గ్రామాల్లో పింఛను కావాలన్నా, రేషన్ కావాలన్నా, చివరికి మరుగుదొడ్డి కావాలన్నా లంచం ఇవ్వాల్సి వస్తోంది. ఈ వ్యవస్థను మార్చడానికి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొస్తాం. ప్రతి గ్రామం నుంచి స్థానికులు పది మందికి ఉద్యోగాలు ఇస్తాం. ఇలా రాష్ట్రంలోని 16 వేల గ్రామాల ద్వారా 1.60 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు అవుతుంది. వారి ద్వారా ఏ పథకానికి దరఖాస్తు చేసుకున్నా 72 గంటల్లో మంజూరు చేస్తాం. దీనిద్వారా ఉద్యోగాలు కల్పించడమే కాకుండా లంచాల వ్యవస్థ లేకుండా చేస్తాం. రాష్ట్ర విభజన నాటికి 1.42 లక్షల కొలువులు ఖాళీగా ఉన్నాయని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలవుతాయనే ఆశతో యువత ఎదురుచూస్తూనే ఉన్నారు. ఈ నాలుగేళ్లలో చంద్రబాబు చేసిందేమీ లేదు. తాము అధికారంలోకి వస్తే 1.42 లక్షల ఉద్యోగాలు రెగ్యులర్ విధానంలో భర్తీ చేస్తాం. సీపీఎస్ రద్దు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తాం. ఏ ప్రాజెక్టు వచ్చినా 75శాతం స్థానికులకు తప్పనిసరి ఉద్యోగాలు వచ్చేలా చేస్తాం. ముందుగా ఎవరితో పొత్తు పెట్టుకునే పని లేదు. రాష్ట్ర విభజన చేసి కాంగ్రెస్ అన్యాయం చేసింది. ప్రత్యేక హోదా ఇచ్చే స్థానంలో ఉన్న భాజపా ఇవ్వకుండా మోసం చేసింది. వచ్చే ఎన్నికల్లో 25 మంది ఎంపీలను గెలిపించండి. ప్రత్యేక హోదాకు సంతకం పెట్టే వారికే మద్దతు ఉండేలా నిర్ణయం తీసుకుంటాం. ప్రత్యేక హోదా వస్తే ప్రతి జిల్లా హైదరాబాద్ అవుతుందని' అని అన్నారు. 'చంద్రబాబు ఎన్నికల సమయంలో 1.70 కోట్ల మందికి నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ప్రస్తుతం 10 లక్షల మందికే ఇస్తామని చెబుతున్నారు. ముష్టి వేసినట్లు వెయ్యి ఇస్తారట. అదీ కూడా ఆరు నెలలేనట' అని అన్నారు. ఉపాధి కోసం ఉత్తరాంధ్ర నుంచి వలస వచ్చిన తూర్పుకాపులకు బీసీ ధ్రువపత్రాలు ఇవ్వకుండా అడ్డంకులు వేస్తూ ఈ ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పాలకొల్లు పట్టణంలో 10, 11 వార్డుల మధ్య డంపింగ్ యార్డు ఉందని.. దీనివల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని.. దానికి స్థలం కూడా కేటాయించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి తార్కాణమన్నారు.

వంట గ్యాస్ 'మంట'!

దిల్లీ: వంట గ్యాస్ ధరకు రెక్కలు వచ్చాయి. రాయితీతో కూడిన సిలిండర్ ధర రూ.2 కన్నా ఎక్కువగా పెరిగింది. రాయితీ లేని గ్యాస్ సిలిండర్ ధర 48.50 మేర పెరిగింది. విమానాల్లో వాడే జెట్ ఇంధనం ధరలు కూడా భగ్గుమన్నాయి. 7.17 శాతం మేర ప్రియమయ్యాయి. ఇది నాలుగేళ్ల గరిష్ఠ పెరుగుదల కావడం గమనార్హం. ఈ పెరుగుదల శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. రాయితీతో కూడిన గ్యాస్ సిలిండర్ (14.2 కిలోలు) ధర దిల్లీలో రూ.2.34 మేర పెరిగి.. రూ.493.55కు చేరింది. కోల్‌కతాలో రూ.2.42, ముంబయిలో రూ.2.37, చెన్నైలో రూ.2.42 మేర పెరిగాయి. ఒక్కో కుటుంబం.. రాయితీపై ఏటా 12 సిలిండర్లను పొందవచ్చు. ఏడాదిలో 13వ సిలిండర్ అవసరమైతే దానికి రాయితీ వర్తించదు. మార్కెట్ ధరకే పొందాల్సి ఉంటుంది. తాజాగా ఈ రాయితీయేతర వంట గ్యాస్ సిలిండర్ ధరనూ గణనీయంగా పెంచారు. దిల్లీలో ఈ పెరుగుదల రూ.48.50గా ఉంది. ఇప్పుడు ఈ సిలిండర్ ధర రూ.698.50కు చేరింది. కిరోసిన్ ధర కూడా లీటరుకు 26 పైసల మేర పెరిగింది. సబ్సిడీని పూర్తిగా తొలగించేందుకు నెలనెలా దీని ధరను స్వల్పంగా పెంచుతున్న సంగతి తెలిసిందే. దిల్లీని కిరోసిన్ రహిత నగరంగా ఇప్పటికే ప్రకటించారు. ముంబయిలో ఈ ఇంధనం ధర లోగడ లీటరుకు రూ.24.77గా ఉండగా.. ఇప్పుడు అది రూ.25.03కు పెరిగింది. విమానాల్లో వాడే ఏటీఎఫ్ ఇంధనం ధర దిల్లీలో కిలో లీటరుకు రూ.4,688 మేర పెరిగి, రూ.70,028కు చేరింది.

ఇంధన ధరల పెంపును నిరసిస్తూ భువనేశ్వర్‌లో బిజు మహిళా జనతాదళ్ కార్యకర్తల ఆందోళన

స్వల్పంగా తగ్గిన పెట్రోలు, డీజిల్ ధరలు: పెట్రోలు, డీజిల్ ధరల స్వల్ప తగ్గుదల పోకడ వరుసగా మూడో రోజూ కొనసాగింది. పెట్రోల్ ధర రూ.6 పైసల మేర, డీజిల్ ధర రూ.5 పైసల మేర తగ్గింది. అంతర్జాతీయ చమురు ధరలు కొద్దిగా తగ్గుముఖం పట్టడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం వల్ల ఇది సాధ్యమైంది.

కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థ ఏర్పాటు

దిల్లీ: కావేరీ నదీజలాల పంపిణీ వివాద పరిష్కారంలో భాగంగా కేంద్రం శుక్రవారం 'కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థ'(సీఎంఏ)ను ఏర్పాటుచేసింది. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరిల మధ్య కావేరీ జలాల పంపిణీపై వివాదం నేపథ్యంలో సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు కేంద్రం ఈ చర్య చేపట్టింది. వాస్తవానికి ఆరు వారాల వ్యవధిలోగా సీఎంఏను ఏర్పాటు చేయాల్సిందిగా ఫిబ్రవరి 16న ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించి ఉన్న విషయం గమనార్హం. ఉత్తర్వుల నేపథ్యంలో కేంద్రం ఏర్పాటుచేసిన సీఎంఏకు ఓ ఛైర్మన్ ఉంటారు. ఓ కార్యదర్శితో పాటూ ఎనిమిది మంది సభ్యులుంటారు.

జిప్‌మర్ టాపర్‌ను అభినందించిన సీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: జిప్‌మర్ (జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీజీ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) డీఎం, ఎంసీహెచ్ ప్రవేశ పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించిన గుర్రం రాంప్రకాశ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తాడికొండకు చెందిన రాంప్రకాశ్ తన తల్లిదండ్రులతో కలిసి సీఎం చంద్రబాబును శుక్రవారం సచివాలయంలో కలిశారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు జాతీయ పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలుస్తున్నారన్నాని ముఖ్యమంత్రి అన్నారు.

12 లక్షల కుటుంబాలకు రంజాన్ తోఫా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 12 లక్షల కుటుంబాలకు రంజాన్ తోఫా సక్రమంగా అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మైనార్టీ శాఖ అధికారులు, ఇతర ప్రముఖులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రంజాన్ పురస్కరించుకుని ఖురాన్‌పై పోటీలు జరపాలని ఆదేశించారు. పెద్ద మదర్సాల్లో కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చేయాలన్నారు.

Sri Balaji Educational Services, HYD & GUNTUR
Ag.B.Sc
ICAR Colleges in Maharastra
CSMSS COLLEGE OF AGRICULTURE, AURANGABAD
L. Venkat Reddy (www.csmss.org)
94917 46535, 63023 78991

www.bfitdoon.com
BFIT GROUP OF INSTITUTIONS
DEHRADUN INDIA
BEST-IN-CLASS HIGHER EDUCATION WELL WITHIN YOUR REACH

SCHOOL OF POLYTECHNIC- SOP Diploma Engineering 10th PASS	Fee/Annum
Civil • Mechanical • Electronics • Electrical • Computer Sc.	₹ 35,000
Lateral Entry in all Diploma Courses (10+2 PCM/ITI)	₹ 35,000

AFFILIATED TO UBTER & APPROVED BY AICTE, MINISTRY OF HRD, GOVT. OF INDIA
HNBGU CENTRAL GOVT. UNIVERSITY REGULAR DEGREE COURSES
(University Established since 1973, UGC Recognised, Ministry of HRD, NAAC Accredited University)

UG Courses	Fee/Annum	PG Courses	Fee/Annum
SCHOOL OF LIFE & ALLIED SCIENCES- SLAS			
B.Sc. (BioTech./Micro Bio)	₹ 40,000	M.Sc. (Micro Bio/Bio Tech)	₹ 55,000
B.Sc. (Geology)	₹ 40,000	M.Sc. (Geology)	₹ 49,500
B.Sc. (Eco/Statistics)	₹ 31,000	M.Sc. (Statistics)	₹ 39,500
B.Sc. (PCM/CBZ)	₹ 28,000	M.Sc. (Chem./Zoology)	₹ 45,000
B.Sc. (Home Sc.)	₹ 30,000	M.Sc. (Phys./Botany)	₹ 40,000
		M.Sc. (Bio Chemistry)	₹ 49,500
		M.Sc. (EVS/Math.)	₹ 35,000
SCHOOL OF AGRICULTURE SCIENCES- SAS			
B.Sc. (Agriculture)	₹ 59,500	M.Sc. (Agri./Agronomy)	₹ 59,500
B.Sc. (Forestry/Horticulture)	₹ 49,500	M.Sc. (Ag./Seed Sc.&Tech)	₹ 59,500
		M.Sc. (Horticulture/Forestry)	₹ 50,000
SCHOOL OF MANAGEMENT STUDIES- SMS			
B.B.A.	₹ 45,000	M.Com.	₹ 39,500
B.Com.	₹ 33,000		
B.Com (C.A.)	₹ 35,000		
BHM	₹ 59,500		
SCHOOL OF TECHNOLOGY, INFORMATION & COMPUTER SCIENCE- STICS			
B.Sc. (IT)	₹ 31,000	M.Sc. (IT)	₹ 35,000
B.C.A.	₹ 33,000	MCA	₹ 65,000
SCHOOL OF ARTS & JOURNALISM- SAJ			
B.A. (Hons.) Mass Comm.	₹ 40,000	M.A. (Mass Comm.)	₹ 49,500
B.A. (Econ./English)	₹ 28,000	M.A. (Math.)	₹ 35,000
B.A. (Socio./Pol.Sc./Hindi)	₹ 28,000	M.A.(Geography)	₹ 35,000
		M.A.(Eco./Eng./Pol.Sc./Edu.)	₹ 35,000
SCHOOL OF FOOD TECHNOLOGY		BUSINESS SCHOOL	
B.Sc Food Technology	₹ 49,500	MBA (Including Foreign Tour) APPROVED BY AICTE, MINISTRY OF HRD GOVT. OF INDIA	₹ 97,500
M.Sc Food Technology	₹ 59,500		

AFFILIATED TO UTTARAKHAND TECHNICAL UNIVERSITY- STATE GOVT. UNIVERSITY, GOVT. OF UTTARAKHAND
One Year Certified Course in Hotel Management : ₹ 30,000
Approved Institutions of AHLEI (U.S.A.)
Hostel Fee/Annum : ₹ 50,000 (Inclusive of food, Veg/Non-Veg)
HYDERABAD OFFICE Flat No. 201, 2nd Floor, Konark Tower, Above Konark Diagnostic Center, Dilsukhnagar, CALL- 7456000102
CAMPUS : BFIT GROUP OF INSTITUTIONS, DEHRADUN
Sudhowala, Chakrata Road, Dehradun Uttarakhand 248007
Phone : 7300900900, 7300900909, 7300900919, 7300900929

INTERNATIONAL INSTITUTE OF DIGITAL TECHNOLOGIES
BECOME THE LEADER IN THE DIGITAL ECONOMY
INDIA'S FIRST PREMIER DIGITAL TECHNOLOGY INSTITUTE
REGISTRATIONS Open for 3rd BATCH www.register.iidt.edu.in
http://iidt.edu.in/
95% LOAN AVAILABLE FOR STUDENTS WHO GOT SELECTED TO IIDT FROM ANDHRA BANK
100% PLACED FROM FIRST BATCH
Courses offered
Post Graduate Programme in Cyber Security
If you are thinking about a career change, then you might want to have a look at the burgeoning Cyber Security market which is expected to grow from $75 billion in 2015 to $170 billion by 2020.
Course Duration: 11 Months (Residential)
Faculty Partners: Gujarat Forensic Sciences University
Post Graduate Programme in Business Analytics
Data is everywhere and there is almost an urgent need to collect and preserve any data that is being generated. This is why analytics is in the frontier of IT and has become crucial today as it aids in improving business, decision making and providing the biggest edge over the competitors.
Course Duration: 11 Months (Residential)
Faculty Partners: Praxis Business School
LEADING ORGANIZATIONS THAT HAVE PLACED A PREMIUM ON IIDT GRADUATES FOR TOP NOTCH CAREERS
LAST DATE FOR REGISTRATION 05 JUNE 2018
ENTRANCE EXAMINATION 10 JUNE 2018
COURSE COMMENCEMENT 16 JULY 2018
FOR NEXT BATCH REGISTER ONLINE www.register.iidt.edu.in
+91-62815 39210 +91-62815 60725
An Initiative by The Government of Andhra Pradesh

ADMISSION NOTIFICATION
FOR B-CATEGORY SEATS INCLUDING NRI/ NRI SPONSOR
CHAITANYA BHARATHI INSTITUTE OF TECHNOLOGY (CBIT)
Chaitanya Bharathi P.O., CBIT Campus.
Kokapet Village, Ranga Reddy District, Hyderabad-500075
MAHATMA GANDHI INSTITUTE OF TECHNOLOGY (MGIT)
Chaitanya Bharathi P.O., MGIT Campus.
Kokapet Village, Ranga Reddy District, Hyderabad-500075
(Mobile: 7093973673 / 7093231763, Land Line : 7207003276)
Applications are called for "B" Category Seats for the academic year 2018-19 for admission into B.E./B.Tech Courses in CBIT & MGIT through Online process. Separate Applications and instructions are available on the following Web Sites from 02-06-2018 to 19-06-2018.
1) www.cbit.ac.in (or) cbit.bcategory-admissions2018.com for CBIT
2) www.mgit.ac.in (or) mgit.bcategory-admissions2018.com for MGIT
Last date for uploading/submission of applications is upto 8.00 PM on 19-06-2018.
Note: Separate applications for CBIT and MGIT should be uploaded/ submitted.
Sd/-
Date: 02-06-2018 President, CBIT & Secretary, MGIT

ఈనాడు

దేశంపై విషధూమం

అది వట్టి పొగాకు కాదు- మానవాళి భవితపై కత్తిగట్టి విషాద వృష్టికి కారణభూతమవుతున్న కర్కశ పగాకు. విశ్వవ్యాప్తంగా ఇప్పటికీ అది ఏటా 70 లక్షల మంది ప్రాణాలు తోడేస్తున్నదంటున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం- 'నిశ్శబ్ద హంతకి' దాష్టీకానికి తాజా రుజువు. ప్రపంచవ్యాప్తంగా పదిహేనేళ్లకు పైబడిన వ్యక్తుల ధూమపాన అలవాట్లను విశ్లేషించిన నివేదిక ప్రకారం- అత్యధిక పొగరాయుళ్లకు నెలవైన జనచైనా తరవాతి స్థానం భారత్‌ది. 2000 సంవత్సరం నాటికి ప్రపంచ జనాభాలో 27 శాతం పొగాకు వినియోగిస్తుండగా, దరిమిలా పదహారేళ్లలో ఆ సంఖ్య 20 శాతానికి తగ్గిందంటున్న నివేదిక నేడు సుమారు 110 కోట్ల మంది ధూమపాన ప్రియులున్నట్లు చెబుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం పద్దెనిమిదేళ్లనాడు 164 కోట్లకు పైబడి, రెండేళ్ల క్రితం 146 కోట్లకు తగ్గిన పొగరాయుళ్లు స్వల్పకాలంలోనే మరో 36 కోట్ల మేర తెగ్గోసుకుపోయారనడం విస్మయపరుస్తోంది. భారత్‌లో కేవలం 10.6 కోట్లమందినే పొగాకు వినిమయ జాబితాలో చేర్చడమూ అసంబద్ధమే. ప్రపంచవ్యాప్తంగా పొగరహిత పొగాకు వాడకందారులు 36.7 కోట్ల మందిలో 20 కోట్ల దాకా ఇండియాలో పోగుపడినట్లు డబ్ల్యూహెచ్ఓ నివేదికే వెల్లడిస్తోంది. ఖైనా, గుట్కా, పాన్ మసాలాల వినియోగానికి అలవాటుపడిన వారందరినీ కలిపి లెక్కేస్తే భారత్‌లో పొగాకు వాడకందారుల సంఖ్య చైనాను మించిపోతుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే ఏటా వేలకోట్ల రూపాయల పొగాకు ఉత్పత్తుల వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా సాగుతుండటం తెలిసిందే. భిన్న వయస్కుల్ని చుట్టేస్తున్న పొగపాము, వారి జీవితాలనే కాదు- చుట్టుపక్కలవారి బతుకుల్నీ మసకబార్చి సామాజిక విలయం సృష్టిస్తోంది. ధూమపాన మరణాల పరంగా తొలి నాలుగుదేశాల్లోనూ ఒకటైన భారత్‌లో రోజూ కొత్తగా వేలమంది ఆ వ్యసనం పాలబడుతున్నారన్న వివిధ అధ్యయనాంశాలు, పొగాకుపై సమగ్ర వ్యూహం ఆవశ్యకతను ఉద్బోధిస్తున్నాయి!

ప్రపంచంలో ఏటా సంభవిస్తున్న ఎయిడ్స్, క్షయ, మలేరియా మరణాలన్నింటికన్నా అధికంగా క్యాన్సర్ చావుల పద్దు విస్తరిస్తూపోతోంది. అధిక శాతం క్యాన్సర్లకు పొగాకు వాడకం పుణ్యం కట్టుకుంటున్నట్లు గణాంకాలు చాటుతున్నాయి. పొగాకు కేవలం క్యాన్సర్ కారకమే కాదు, గుండె వ్యాధుల్నీ ప్రజ్వరిల్లజేసి అసంఖ్యాక కుటుంబాల జీవనాధారాన్ని కుప్పకూలుస్తోందంటున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం- సామాజిక అవగాహన ఇనుమడించాలంటోంది. పొగాకు వినియోగం, కాల్చేవారి పక్కన ఉండి పొగపీల్చడం కారణంగా గుండె పనితీరు దెబ్బతిని ఏటా దాదాపు 30 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్న యథార్థం దిగ్భ్రాంతపరుస్తోంది. నికొటిన్‌తోపాటు ఎకాయెకి ఏడువేల రకాల విషతుల్యాలుండే పొగాకును ఏ రకంగా వినియోగించినా రక్తంలో మిళితమై ఒళ్లంతా వ్యాపించే రసాయనాలు పలు క్యాన్సర్లకు కారణమవుతున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజూ పెట్టెలకు పెట్టెలు ఉఫ్‌న ఊదిపారేసేవాళ్లనే ముప్పు ముంచుతుందనుకునే వీల్లేదు. రోజుకు ఒక్క సిగరెట్ తాగే వ్యక్తుల్లోనూ గుండెజబ్బులు, పక్షవాతం తీవ్రతరమవుతున్నట్లు లండన్ విశ్వవిద్యాలయ పరిశోధక బృందం ఇటీవలే ధ్రువీకరించింది. ధూమపానాన్ని నియంత్రించేవిగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ-సిగరెట్లతోనూ క్యాన్సర్ ప్రమాదం ఉందంటున్నారు. అందువల్ల పొగరాయుళ్లు తాము కాల్చే సిగరెట్ల సంఖ్యను తగ్గించడానికి పరిమితమైతే ప్రయోజనం లేదని, ధూమపానాన్ని పూర్తిగా త్యజించడమే శ్రేయస్కరమన్నది పరిశోధకుల ఉమ్మడి ఉద్బోధ. సరదాగా మొదలై వ్యసనంగా స్థిరపడే పొగాకు వినియోగం ప్రాణాంతకమని పదేపదే రుజువవుతున్నా అత్యధికులు ఆ ఉచ్చునుంచి వెలికిరాలేకపోతున్న దశలో- ప్రజాప్రభుత్వాల చొరవ బహుముఖం కావాల్సి ఉంది!

అణ్వాయుధాల ఉత్పాతం కన్నా ఏటికేడాది పెచ్చరిల్లుతున్న 'పొగ' ఉత్పత్తులే అత్యంత ప్రమాదకారకాలని జాతీయ పొగాకు నిర్మూలన సంస్థ (ఎన్‌ఓటీఈ) కేంద్ర ప్రభుత్వాన్ని గతంలో హెచ్చరించింది. పొగాకు పరిశ్రమలో పెట్టుబడులపై మారటోరియం విధించి, లైసెన్సులు స్తంభింపజేయాలని సూచించింది. ధూమపాన నిషేధం, సిగరెట్ పెట్టెలూ బీడీ కట్టలపై బొమ్మల ముద్రణలకే పరిమితమైన ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సుంకాలు పెంచి ఇబ్బడిముబ్బడిగా ఆదాయం కళ్లజూస్తున్నాయి. 'పొగాకు వ్యాధుల' చికిత్స నిమిత్తం ఆర్థిక వ్యవస్థపై భారం లక్ష కోట్ల రూపాయలకు ఏనాడో మించినా, పొగ ఉత్పత్తుల వినియోగం అసంఖ్యాక కుటుంబాల్ని ఛిద్రం చేస్తున్నా- నిర్ణాయక చర్యలకు సుముఖత, సన్నద్ధత కానరావడం లేదు. సుంకం మోత ద్వారా వినియోగాన్ని నిరుత్సాహపరుస్తున్నట్లు మభ్యపెట్టడం కాదు- మూలస్థానంలో పొగాకుపై వేటువేసే సమగ్ర కార్యాచరణను పట్టాలకు ఎక్కించాలి. దేశంలోని రమారమి 60 లక్షల మంది పొగాకు రైతుల్ని జాగృతపరచి, తగిన ప్రోత్సాహకాలు అందించి, వారిని ప్రత్యామ్నాయ పంటల సాగుకు పురిగొల్పాలి. పొగాకు ఉత్పత్తుల కర్మాగారాల్ని మూయించి, దిగుమతుల్నీ నిషేధించడంతోపాటు- ఏళ్ల తరబడి అదే బతుకుతెరువైనవారికి ప్రభుత్వమే కొత్తదారి చూపించాలి. భారత్ సహా 24 దేశాలే 2025 సంవత్సరం నాటికి పొగాకు వినియోగాన్ని 30 శాతం మేర నియంత్రించగల అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఊహిస్తోంది. నిర్ణీత కాలావధిలో పొగాకు సాగు విస్తీర్ణాన్ని అంచెలవారీగా తగ్గిస్తూ, ఉత్పత్తుల్ని సాంతం నిషేధించడమే లక్ష్యంగా భారత్ పురోగమించాలి. పొగ రాక్షసిపై సమరభేరి మోగించేలా తక్కిన దేశాల తోడ్పాటునూ కూడగట్టాలి. దేశంపై దట్టంగా ఆవరించిన విషధూమాన్ని చెదరగొట్టి జాతిని సాంత్వన పరచడంకన్నా పవిత్ర కర్తవ్య పాలన ఇంకేముంటుంది?



కష్టనష్టాలు అధిగమించి 'ఆన్‌లైన్'లో అభివృద్ధి

నాలుగేళ్ల నవ్యాంధ్ర ప్రస్థానం

సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఇదే రోజున ఉమ్మడి రాష్ట్రం విభజన తరవాత ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది. పాతపేరుతో ఏర్పడిన కొత్త రాష్ట్ర పాలన పొరుగు గడ్డ నుంచి మొదలైంది. పరిపాలన అనుభవం ఉన్న నాయకుడికి అధికార పగ్గాలు అందించినప్పటికీ ప్రతి ఒక్కరిలో భవిష్యత్తుపట్ల ఆందోళన గూడు కట్టుకుంది. హుద్‌హుద్ తుపాను, కరవులు, వరదల్లాంటి విపత్తులు ఇబ్బంది పెట్టినా ధైర్యం కోల్పోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన కృషిని ఎవరూ విస్మరించలేరు. మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయినప్పుడు కర్నూలు రాజధానిగా గుడారాల్లో పాలన సాగించిన చరిత్ర ఉంది. విభజన తరవాత ఏమవుతుందో అని భయపడినంతగా పరిస్థితులు దిగజారకుండా చూడటంలో ముఖ్యమంత్రి కృతకృత్యులయ్యారు. రాష్ట్ర విభజనకు ముందు అందరి గమ్యస్థానంగా హైదరాబాదే ఉండేది. అభివృద్ధి అక్కడే కేంద్రీకృతమైంది. విభజన తరవాత పరిస్థితి మారిపోయింది. నాలుగేళ్లలో అభివృద్ధి ఛాయలు రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. విజయవాడ, విశాఖ నగరాల రూపురేఖలు మారిపోయాయి. కాకినాడ, తిరుపతి లాంటి ద్వితీయశ్రేణి నగరాల పైనా శ్రద్ధ పెరిగింది. రాష్ట్రంలోని నాలుగు విమానాశ్రయాల్లో రాత్రిపూట విమానాలు దిగే పరిస్థితి ఏర్పడటం రాష్ట్రాభివృద్ధి వేగాన్ని సూచిస్తోంది.

వడివడిగా చర్యలు

పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ నుంచి పాలించే అవకాశం ఉన్నప్పటికీ ఏడాదిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగాన్ని అమరావతికి తరలించడం వల్ల రాష్ట్రాభివృద్ధిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడానికి వీలు కలిగింది. 2014 అక్టోబరు 12న హుద్‌హుద్ రూపంలో విరుచుకుపడిన ప్రకృతి విపత్తు ప్రభుత్వాన్ని అభివృద్ధి గురించి ఆలోచించలేని స్థితికి తీసుకెళ్లింది. తొలి ఆరునెలలంతా రైతు రుణ మాఫీ, సామాజిక పింఛన్ల పంపిణీ కోసమే ప్రభుత్వం సమయం కేటాయించింది. 2015 జనవరి నుంచి అభివృద్ధిపై మథనం మొదలైంది. ఆ నెలలోనే రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన భూ సమీకరణ ప్రక్రియకు పునాదిపడటం, మార్చిలో పట్టిసీమ ఎత్తిపోతలకు శంకుస్థాపనతో సానుకూల భావన మొదలైంది. రాష్ట్రం ముందుకెళ్తోందన్న నమ్మకం ప్రజల్లో కలిగింది. ఆరు నెలల్లో తాత్కాలిక సచివాలయ నిర్మాణం, సంవత్సరంలో పట్టిసీమ ప్రాజెక్టు ఫలాలు మొదలు కావడంతో ఆత్మవిశ్వాసం ఏర్పడింది. అప్పటినుంచి పారిశ్రామికీకరణ, పెట్టుబడుల ఆకర్షణ, పాలనా సంస్కరణలు, గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం, పంట కుంటల ద్వారా కరవు ప్రాంతాలకు నీటి భద్రత తదితర అంశాలపై ప్రభుత్వం ముందుకెళ్లడం మొదలైంది. విశాఖను ఐటీ, ఫార్మా, పర్యాటక రంగ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ పారిశ్రామికంగా ముందడుగు వేయగలుగుతోంది. ఈ నాలుగేళ్లలో 13 జిల్లాల్లోనూ ఏదో ఒక అభివృద్ధి కనబడుతోంది.

విభజన తరవాత ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితైనా ఉంటుందా అన్న అనుమానం ఉండేది. అలాంటి పరిస్థితిని అవలీలగా అధిగమించింది. అయిదు కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఇక్కడి కన్నా అధిక జనాభా ఉన్న తమిళనాడు, మధ్యప్రదేశ్, పశ్చిమ్ బంగ కంటే పెద్ద బడ్జెట్లు ప్రవేశపెట్టే స్థాయికి చేరింది. జనాభా విషయంలో దేశంలో పదోస్థానంలో ఉన్న రాష్ట్రం పెద్ద బడ్జెట్లు ప్రవేశపెట్టే అయిదో రాష్ట్రంగా నిలుస్తోంది. ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ్ బంగ తరవాత బడ్జెట్ పరిమాణం పెద్దగా ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశే. మానవ వనరులు, సహజ వనరులు, ఆర్థిక వనరులను సమర్థంగా వాడుకోవడంవల్లే ఇది సాధ్యమైంది. సంక్షేమ పథకాలన్నింటికీ ఆధార్ అనుసంధానం చేసి దుబారాను అరికట్టారు.

ఏపీ బడ్జెట్ రూ.కోట్లలో	
2014-15	1,12,067
2015-16	1,49,435
2016-17	1,66,699
2017-18	1,59,822
2018-19	1,91,064

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు	
2015 డిసెంబర్ వరకు	43,74,469
2016 అక్టోబర్ వరకు	43,18,632
2017 అక్టోబర్ వరకు	45,39,678
2018 జూన్ నాటికి	46,84,872

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు-పెట్టుబడులు (రూ.కోట్లలో)

సంవత్సరం	యూనిట్లు	పెట్టుబడి	ఉద్యోగ కల్పన
2014-15	2,847	2,019	42,326
2015-16	7,657	3,948	1,00,521
2016-17	74,332	24,106	7,64,797
2017(డిసెంబర్‌వరకు)	5,920	2,383	59,103

అతి తక్కువ ఖర్చుతో ఫైబర్‌నెట్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. సమైక్య రాష్ట్రంలో రూ.1,25,654.63 కోట్లతో చివరి బడ్జెట్ ప్రవేశపెట్టారు. నాలుగేళ్ల తిరిగేసరికి అవశేష రాష్ట్రం రూ.1,91,064 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టే స్థాయికి చేరుకుంది. ఏటా దాదాపు ఆరు వేలకోట్ల రూపాయల మేర సామాజిక సంక్షేమ పింఛన్లు ఇస్తోంది. నిలబడతామో లేదోనన్న ఆందోళనతో ప్రయాణం మొదలుపెట్టిన రాష్ట్రంలో అరకోటి మందికి సామాజిక భద్రత కల్పించడం చిన్న విషయం కాదు. గత మూడేళ్లలో సగటున 11 శాతం వృద్ధిరేటుతో ముందుకెళ్తోంది. తలసరి ఆదాయం సగటున రూ.12 వేలు పెంచుకుంటూ పోతోంది. విభజనకు ముందు అయిదేళ్లు తలసరి ఆదాయ వృద్ధి కేవలం రూ.6,500 మాత్రమే. ఇప్పుడది రెట్టింపైంది. విడిపోయిన తరవాతా భౌగోళికంగా దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో నిలుస్తోంది.

పరిశ్రమలకు ప్రాధాన్యం

పారిశ్రామికీకరణకు అవసరమయ్యే భూ లభ్యత తమిళనాడులో కంటే ఇక్కడే అధికం. దీన్ని ఆసరాగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంటోంది. అనంతపురం జిల్లాలో ఏర్పాటైన కియా పరిశ్రమే ఇందుకు ఉదాహరణ. ఒక్క రాజధానికే కాకుండా కేంద్ర విద్యాలయాలు, రహదారులు, పరిశ్రమలు, భోగాపురం విమానాశ్రయం, జలశయాల నిర్మాణాలకు సజావుగా వేల ఎకరాలను సమీకరించింది. సాగునీటి రంగంపై దృష్టి సారించడంవల్ల వ్యవసాయరంగ వృద్ధిలో రాష్ట్రం మధ్యప్రదేశ్‌తో పోటీ పడగలుగుతోంది. ఆ రాష్ట్రం దాదాపు 20 శాతం వృద్ధిరేటు సాధించి వ్యవసాయరంగానికి చుక్కానిగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ 17.76 శాతం వృద్ధి సాధించి రైతుల్లో విశ్వాసం నింపగలిగింది. నీరు-చెట్టు కార్యక్రమం కింద భూగర్భ జలాల వృద్ధిపై చూపిన శ్రద్ధ ఫలితాలను ఇస్తోంది. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం సాధించిన గొప్ప విజయం విద్యుత్తు లోటును అధిగమించడం. 22.5 మిలియన్ యూనిట్ల కొరతతో ప్రస్థానం మొదలుపెట్టిన రాష్ట్రం, ఇప్పుడు మిగులు రాష్ట్రంగా అవతరించడం చెప్పుకోదగ్గ విషయం. 24 గంటలూ విద్యుత్తు అందుబాటులోకి రావడం వల్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పాదకత సామర్థ్యం పెరిగింది. దేశంలో 100 శాతం విద్యుదీకరణ జరిగిన ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలబడటం మరో కీలకాంశం. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 17.17 కోట్ల పనిదినాలు కల్పించి దేశంలో రెండో స్థానం సాధించడం గుర్తించదగ్గ విషయం. కేంద్ర ప్రభుత్వంలోనూ లేని విధంగా సచివాలయంలో ఈ-ఆఫీసు విధానం ప్రారంభించి కాగిత రహిత పాలన తీసుకొచ్చారు. మరో 60 రోజుల్లో పంచాయతీ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయం వరకు కాగిత రహిత పాలనకు శ్రీకారంచుట్టే ప్రయత్నం జరుగుతోంది. అది కార్యరూపం దాలిస్తే మొత్తం 'ఆన్‌లైన్' పాలనలోకి వచ్చిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి గడిస్తుంది. పరిపాలనకు సాంకేతికత జోడింపు, ప్రభుత్వం తీసుకుంటున్న సంస్థాగత మార్పులు ఫలితాలిస్తున్నాయి.

పథకాల అమలులో లోటుపాట్లు

ఎన్‌సీఏఈఆర్ సంస్థ 2015-16 సంవత్సరానికి విడుదల చేసిన 'స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ పొటెన్షియల్ ఇండెక్స్' నివేదికలో అవినీతి విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉంది. ఆ మరుసటి ఏడాది నివేదికలో అదే రాష్ట్రం అవినీతిలో 19వ స్థానానికి చేరడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టింది. పౌరసేవల అవినీతిలో ఏడాది క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉన్నట్లు 'సెంటర్‌ఫర్ మీడియా స్టడీస్' సర్వేలో వెల్లడైంది. ఏడాది తిరిగేనాటికి అదే సంస్థ ఇచ్చిన నివేదికలో నాలుగో స్థానానికి చేరడం రాష్ట్రంలో పాలన గాడిలో పడుతోందనడానికి నిదర్శనం. అయినప్పటికీ సంస్థాగతంగా ఇంకా దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వెయ్యి రూపాయల పింఛను, మనిషికి అయిదు కేజీల బియ్యం పంపిణీ, ఎన్టీఆర్ వైద్యసేవ అమలు, అసంఘటిత కార్మికులకు అయిదు లక్షల రూపాయల ప్రమాద బీమా వంటి పథకాల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తున్నప్పటికీ ప్రజల్లో పాలనపై పూర్తిస్థాయి సంతృప్తి కల్పించడంలో ప్రభుత్వం సఫలీకృతం కాలేదు. అందుకు కారణం ప్రజలతో సంబంధం ఉన్న శాఖల్లో అవినీతి తాండవిస్తుండటమే. రెవిన్యూ, పోలీసు, రిజిస్ట్రేషన్ వంటి శాఖల్లో పనుల కోసం వెళ్లినవారికి చేదు అనుభవం ఎదురవుతుండటం ప్రభుత్వంపై సంతృప్తి పెరగకపోవడానికి ప్రధాన కారణం. పట్టణ, గ్రామీణ పేదల ఇళ్ల నిర్మాణంలో చెప్పుకోదగ్గ పురోగతి కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాములో జరిగిన ఇళ్ల నిర్మాణ అవకతవకలపై విచారణ పేరుతో మూడేళ్లు గడిపేయడం ప్రభుత్వం చేసిన పొరపాటు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించక పోవడం మాట తప్పడమే. కళ్లముందు కియా, హీరో, ఇసుజు, అపోలో టైర్స్, ఏసియన్ పెయింట్స్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు కనిపిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకున్నంత స్థాయిలో పారిశ్రామికీకరణ జరగలేదన్న భావన ప్రజల్లో ఉంది. భాగస్వామ్య సదస్సుల ద్వారా రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు, 36 లక్షల ఉద్యోగాలకు హామీ దొరికిందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అవి కళ్ల ముందు కనిపించేంతవరకూ నమ్మే పరిస్థితి లేదు. ఫైబర్‌నెట్ ఫలితాలు ఇంకా సమకూర లేదు. రూ.149కే టీవీ, ఇంటర్‌నెట్, ఫోన్ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నా అది ఆచరణకు నోచుకోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తయినా అనుసంధాన రోడ్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోతోంది. ఓడరేవుల అభివృద్ధి మందగించింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో 14 పోర్టులు నిర్మిస్తామని ముఖ్యమంత్రి పదేపదే చెప్పారు. కానీ ఇంతవరకూ ఒక్కటీ కార్యరూపం దాల్చకపోవడం వెలితిగా కనిపిస్తోంది.

- చల్లా విజయభాస్కర్

శిథిలమవుతున్న శిక్షణ

ప్రాథమిక విద్య ప్రాధాన్యం ఎనలేనిది. విద్యారంగానికే అది పునాది. జాతి పురోగతి దాని పైనే ఆధారపడి ఉంటుంది. ఇంతటి కీలక రంగంపట్ల ప్రభుత్వాలు అలక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను తీర్చిదిద్దే జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్- డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్)లు దయనీయ పరిస్థితిలో ఉన్నాయి. మౌలిక వసతులు, వనరుల కొరత, బోధకుల లేమి వంటి సమస్యలతో అవి సతమతమవుతున్నాయి. ఫలితంగా నాణ్యతా ప్రమాణాలు కొరవడుతున్నాయి. లక్ష్యాలు, ఆదర్శాలు కాగితాలకే పరిమితమై క్షేత్రస్థాయి పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. పర్యవేక్షణ సంస్థలు అలంకారప్రాయమై జవాబుదారీతనం కొరవడుతోంది.

పాఠశాల విద్యలో నాణ్యత మెరుగుదలకు, వివిధ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించి సలహాలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం 1961 సెప్టెంబరులో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ పరిషత్తు (ఎన్‌సీఈఆర్‌టీ) నెలకొల్పింది. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) 1967 జులైలో ప్రారంభమైంది. తరవాత జిల్లాస్థాయిలో జిల్లా విద్యా, శిక్షణ సంస్థ (డీఐఈటీ) అవతరించింది. డైట్‌లకు సంబంధించి ముసాయిదా మార్గదర్శకాలను రాష్ట్రాలకు అందజేశారు. దేశంలో ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున డైట్‌ల ఏర్పాటుకు కేంద్రం ముందుకొచ్చింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 13, తెలంగాణలో 10 డైట్‌లు ఉన్నాయి.

పరిశోధనలకు మద్దతు, ప్రాథమిక విద్యావ్యాప్తి, వయోజన విద్య, జాతీయ సాక్షరతా మిషన్ కార్యక్రమాల అమలు డైట్‌ల లక్ష్యాలు. డైట్‌లు ఆయా జిల్లాల్లో ప్రాథమిక, వయోజన విద్యావ్యవస్థలను పటిష్ఠీకరించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఇందుకు అవసరమైన అన్ని వనరులను అవి కలిగి ఉండాలి. సృజనాత్మక విధానాలతోపాటు మారుతున్న అవసరాలకు అనుగుణంగా వాటివద్ద పకడ్బందీ ప్రణాళిక ఉండాలి. జిల్లాల్లోని ఇతర విద్యా శిక్షణ సంస్థలకు ఇవి నమూనాలుగా ఉండాలి. కానీ ఎక్కడా ఆ పరిస్థితి లేదు. డైట్‌లు ప్రధానంగా మూడు విధులను కలిగి ఉంటాయి. నిరంతర శిక్షణ, మూల్యాంకనం, పరిశోధన. ఇవికాక ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల శిక్షణ బాధ్యత సైతం వాటిదే.

తెలంగాణలోని పది డైట్‌లలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 2,800 మంది, ఆంధ్రప్రదేశ్‌లోని 13 డైట్‌లలో 3,100 మంది ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్నారు. జిల్లాస్థాయిలో ప్రైవేటు రంగంలోని ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ సంస్థల అజమాయిషీ బాధ్యత సైతం డైట్‌లదే. ఈ విధులు నిర్వర్తించడానికి ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం ప్రతి కళాశాలకు సగటున 28 మంది చొప్పున బోధన సిబ్బంది అవసరం. తెలంగాణలో 10 మంది ప్రిన్సిపాళ్లకు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌లో 13 మందికి గాను అయిదుగురే ఉన్నారు. రెండు రాష్ట్రాల్లో 652 మంది బోధన సిబ్బంది ఉండాలి. ఉన్నది 71మందే. ప్రైవేటు ఉపాధ్యాయ శిక్షణ సంస్థల్లో బోధన సిబ్బంది తక్కువగా ఉన్నారంటూ వాటి గుర్తింపు రద్దుచేసే ఎస్‌సీఈఆర్‌టీలు- డైట్‌ల దుస్థితిని పట్టించుకోవడం లేదు. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం బోధన సిబ్బందిని నియమించాలి. అర్హులైన అభ్యర్థులు దొరకనట్లయితే పదవీ విరమణ చేసినవారి సేవలను రెండేళ్ల కాలపరిమితికి మించకుండా ఉపయోగించుకోవాలి. చాలాచోట్ల అలా జరగడం లేదు.

పడకేస్తున్న ఉపాధ్యాయ విద్య

ప్రతి 50 మంది విద్యార్థులు గల ఉపాధ్యాయ విద్యా శిక్షణ సంస్థ నిబంధనల ప్రకారం ప్రిన్సిపల్, ఎనిమిది మంది బోధన సిబ్బందిని కలిగి ఉండాలి. విద్యార్థుల సంఖ్య పెరిగితే అందుకు అనుగుణంగా సిబ్బందీ పెరగాలి. డైట్‌లలో ఖాళీలను 70 శాతం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారా, 30 శాతం ప్రత్యక్ష విధానంలో భర్తీ చేయాలి. ఇది అర్థం లేని నిబంధన. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు, డైట్‌లకు గల సంబంధం ఏమిటో ఎవరికీ తెలియదు.

విద్యకు సంబంధించి జిల్లా స్థాయిలో శిక్షణ, పరిశోధన ముఖ్యమైన అంశాలు. గత పదేళ్లలో డైట్‌లు ఎస్‌సీఈఆర్‌టీకి సమర్పించిన పరిశోధన అంశాలు ఎన్ని, ఆ పరిశోధనలు ఎవరు చేశారు? పరిశోధనలను పక్కనపెడితే గత పదేళ్లుగా డైట్‌లలో చదివిన ఉపాధ్యాయ శిక్షితులకు శిక్షణ ఇచ్చినవారెవరు, వారు ఎలా శిక్షణ పూర్తి చేశారన్న ప్రశ్నలకు సరైన సమాధానం లభించదు. ఎస్‌సీఈఆర్‌టీ అజమాయిషీలో ఉండే డైట్‌లలో తగినంత మంది బోధన సిబ్బంది లేనప్పుడు ప్రైవేటు సంస్థల్లో బోధన సిబ్బంది లేరని గుర్తింపు ఎలా రద్దు చేస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. డైట్‌లలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడాలంటే పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం అవసరం. తగిన మౌలిక వసతులు, వనరులనూ సమకూర్చాలి. ఆ దిశగా అడుగులు వేయడం తెలుగు రాష్ట్రాల తక్షణ కర్తవ్యం. అప్పుడే ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి!

- డాక్టర్ మండల చంద్రశేఖర్ గౌడ్

ఈనాడు లేఖలు

తపాలా సమ్మెతో ఇక్కట్లు

దేశవ్యాప్తంగా తపాలా శాఖలో పన్నెండు రోజులుగా సాగుతున్న గ్రామీణ డాక్‌సేవక్ (జీడీఎస్)ల సమ్మెతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరాలు, పార్సిళ్లు, పత్రికలు, ఎంవోల బట్వాడా నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్లు, పొదుపు ఖాతాలు తదితర సేవలూ స్తంభించిపోయాయి. నగదు జమలు, ఉపసంహరణలు ఆగిపోయాయి. జీడీఎస్‌లు న్యాయసమ్మతమైన కోరికలను పరిష్కరించడంలో కేంద్రం మీనమేషాలు లెక్కిస్తుండటంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. జీడీఎస్‌లకు వేతనాలను పెంచాలన్న కమలేశ్ చంద్ర కమిటీ చేసిన సిఫార్సులను కేంద్రం సత్వరం ఆమోదించాలి. కేంద్రం సానుకూలంగా స్పందిస్తే దేశం మొత్తంమీద ఉన్న 1.26 లక్షల తపాలా కార్యాలయాల్లో పనిచేస్తున్న 2.70 లక్షల జీడీఎస్ జీవితాల్లో వెలుగులు నిండుతాయి.

- వాంధ్రంగి కొండలరావు, పొందూరు, శ్రీకాకుళంజిల్లా

అధికార పక్షానికి ఎదురుదెబ్బ

ప్రతిపక్షాలు ఐక్యంగా ఉంటే ఎలాంటి సత్ఫలితాలు రాబట్టవచ్చో పది రాష్ట్రాల్లో జరిగిన తాజా ఉప ఎన్నికలు నిర్ద్వంద్వంగా నిరూపించాయి. యూపీలో కైరానా లోక్‌సభ స్థానాన్ని కోల్పోవడం అధికార భాజపా శ్రేణులకు తీవ్ర హెచ్చరిక లాంటిదే. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంతో ఈ విజయాలు ప్రతిపక్షాలకు కచ్చితంగా ఉత్సాహాన్ని ఇస్తాయి. ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం ఎంతో అవసరం. ప్రతిపక్షాలు కలిసికట్టుగా ఉంటే అధికారపక్షమూ జవాబుదారీతనంతో పాలన సాగిస్తుంది. దేశంలో ప్రతిపక్ష అనైక్యత వల్లే చట్టసభలు నిర్ణయాత్మకంగా సాగని పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షాలను అధికార పార్టీ ఖాతరు చేయకపోవడం వల్ల ఆమధ్య పార్లమెంటు సభలూ ఆసాంతం నీరుగారిపోవడమే అందుకు నిదర్శనం!

- వి.వెంకటేశ్వరరావు, యూసుఫ్‌గూడా, హైదరాబాద్

నైతిక విలువలు

స్వచ్ఛ భారతానికి, స్వచ్ఛ సమాజ నిర్మాణానికి భౌతిక, భౌగోళిక పరిశుభ్రతే కాదు- మనసును శుభ్రంగా ఉంచే నైతిక విలువలూ ఎంతో అవసరం. నైతిక విలువలు లేని దేశం ఎప్పటికీ పురోభివృద్ధి సాధించలేదు. దేశప్రగతిలో యువతదే కీలక పాత్ర. అటువంటి యువత నీతిమంతంగా ఎదగడానికి, సత్ప్రవర్తనతో బాధ్యతాయుతంగా మనగలగడానికి బాల్యం నుంచే గట్టి పునాది పడాలి.

నేటి సమాజంలో నీతి నిజాయతీలు లోపిస్తున్నాయని, విలువలు తరిగిపోతున్నాయన్నది కఠిన వాస్తవం. మంచైనా, చెడైనా పెద్దలను చూసి చిన్నవారు నేర్చుకుంటారు. పెద్దవారు పద్ధతిగా ఉంటే, చిన్నవారు వారిని అనుసరిస్తారు. నీతి నిజాయతీ, క్రమశిక్షణ, సమయపాలనలతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వారి జీవిత చరిత్రలను పిల్లలకు తల్లిదండ్రులు కథలు కథలుగా ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పగలగాలి. ప్రతి తల్లి, తండ్రి తమ సంతానం వరకు ఉత్తమ ఉపాధ్యాయులు కావాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తాము ఆచరిస్తూ చెప్పే బోధలు పిల్లలపై అత్యంత ప్రభావం చూపిస్తాయి. గాంధీ మహాత్ముడి స్వీయచరిత్ర నైతిక ప్రవర్తనకు ఉత్తమ పాఠ్య గ్రంథం. గాంధీజీ బాల్యంలో హరిశ్చంద్ర నాటకం చూసి, ఎన్ని కష్టాలు వచ్చినా సత్యాన్నే పలకాలని నిశ్చయించుకున్నారట. బాల్యంలో పడే ముద్ర అంత గాఢంగా ఉంటుంది.

తెలుగు భాషలో చిన్నారులను ఆకట్టుకునే ఎన్నో మంచి నీతికథలు ఉన్నాయి. వాటిని పిల్లల మనసులకు అర్థమయ్యేలా పెద్దవారు చెప్పగలగాలి. గురుముఖతః విన్నవాటికి ఎక్కువ ప్రభావముంటుంది. ఆ గురువు బాల్యంలో ఇంటి వద్ద తల్లిదండ్రులైనా కావచ్చు, పాఠశాలలో ఉపాధ్యాయుడైనా కావచ్చు! తేట తెలుగులో ఎన్నో నీతి శతకాలున్నాయి. భారత, రామాయణ, భాగవత గ్రంథాలు సైతం నీతి కథలు, ధర్మాలు, సత్ప్రవర్తన సూత్రాలతో నిండి ఉంటాయి. సాహిత్య సంపదను మాతృభాషలోనే అందించే ప్రయత్నం బాల్యంలో ప్రతి తల్లి తండ్రీ చేయాలి. పిల్లల కోసం తల్లిదండ్రులు ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నారన్న దానికన్నా, వారి కోసం ఎంత నాణ్యమైన సమయం వెచ్చిస్తున్నారన్న దానిపైనే పిల్లల నైతిక వర్తన, వ్యక్తిత్వ వికాసం ఆధారపడి ఉంటాయి. మాతృభాష సంస్కారాన్ని ఇస్తుంది. ఆలోచనా విధానాన్ని పెంచుతుంది. మాతృభాషతో అనుసంధానమైన చదువు- నైతిక జీవన వికాసానికి దోహదం చేస్తుంది. జ్ఞానాన్ని, విచక్షణను విశ్లేషణను ఇవ్వని విద్య నిరుపయోగం!



అంతర్యామి

నీతి నిజాయతీ, అహింస, సత్యసంధత, క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత, సత్ప్రవర్తన... వీటన్నింటి సమాహారమే నైతిక జీవనం! నీతిమంతమైన జీవితం అలవడాలంటే చిన్నారులకు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచాలి. ప్రాచీన సాహిత్యంలో గురుశిష్య పరంపరపై ఉత్తమ కథలున్నాయి. అవేవీ చదవకుండా, వినకుండా సత్ప్రవర్తన ఎలా అలవడుతుంది; పాఠ్యాంశాల్లో ఉండే విషయాలు పరీక్షలకే పరిమితమైతే జీవితం గాడి తప్పక ఏమవుతుంది?

నేర్చుకున్న విషయాలను జీవితంలో అమలుపరచకపోతే వ్యక్తిత్వం ఏనాటికీ వికసించదు. చదువుకున్న చదువుకు, జీవిత విధానానికి మధ్య ఉన్న పెద్ద అగాధం పూడ్చుకొన్నప్పుడే మానవ జీవితంలో మార్పు సాధ్యపడుతుంది. చేసే పనుల్లో చిత్తశుద్ధి, మమేకత లేకపోతే ఆ పనులకు విలువ ఉండదు.

నైతిక ప్రవర్తన లేని మనుషులు ప్రశాంతంగా జీవించలేరు. సంతోషంగా ఉండలేరు. అవినీతి మార్గమనే ముళ్లబాటలో నడిచేవారికి జీవితంలో స్థిమితం, గౌరవం లభించవు. ఒకవేళ గౌరవాదరాలు లభించినా అవి ఆ వ్యక్తికి ఆ సమయంలో సమాజంలో ఉన్న పలుకుబడి, గుర్తింపులకే కాని- ఆ వ్యక్తికి కాదు. మరణానంతరం కూడా మనిషిని శాశ్వతుణ్ని చేసేది తన నైతిక వర్తన, వ్యక్తిత్వమే! నైతిక విలువలను పెంపొందించుకోవాలంటే సత్సాంగత్యం, సద్గ్రంథ పఠనం తప్పనిసరి!

- వెంగల్వ బొడ్డపాటి రామలక్ష్మి

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: యనమల

ఈనాడు, అమరావతి: ఏడాదికి రూ.1000 కోట్ల అంచనా వ్యయంతో నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు తెలుగుదేశం ప్రభుత్వం సిద్ధమయితే పవన్‌కల్యాణ్ దీన్ని నమ్మవద్దనడం హాస్యాస్పదమని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఏ మాత్రం అనుభవం లేని మీ మాటలను జనం ఎలా నమ్ముతారనుకుంటున్నారని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నిరుద్యోగ భృతిపై ఎంతో కసరత్తు చేసి గట్టి విధానం రూపొందించామన్నారు. ముఖ్యమంత్రుల్ని చేయండి, తామే అన్నీ చేస్తామనే జగన్, పవన్‌కల్యాణ్‌లను ప్రజలు ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. నాలుగేళ్లలో ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన 98శాతం హామీలు అమలు చేశామని, ప్రజల్లో ప్రభుత్వం పట్ల 76శాతం సంతృప్తి ఉందని పేర్కొన్నారు.

భాజపా బాటలోనే పవన్: డొక్కా

ఈనాడు, అమరావతి: భాజపా బాటలోనే జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నడుస్తున్నారని శాసనమండలి విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ మండిపడ్డారు. రాయలసీమలో ఇంతకుముందు భాజపా మతాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని, ప్రస్తుతం పవన్ కూడా అదేవిధంగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, ఏమాత్రం అవగాహన లేకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును వల్లె వేస్తూ చౌకబారు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. అభివృద్ధి ఒకే ప్రాంతంలో ఏవిధంగా కేంద్రీకృతమవుతుందో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని అమరావతి అవసరం లేదా.. అంటూ నిలదీశారు. ఉత్తరాంధ్రలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ ఫోర్టు పూర్తి చేస్తున్న తీరు పవన్‌కు కనిపించక పోవడం విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు.

52 మంది క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

రూ. 10.58 లక్షల నగదు స్వాధీనం

గుంటూరు, న్యూస్‌టుడే: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడే 52 మంది సభ్యుల ముఠాను గ్రామీణ గుంటూరు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను రూరల్ ఎస్పీ వెంకట అప్పలనాయుడు వివరించారు. గుంటూరు జిల్లాలోని నరసరావుపేట, వినుకొండ, పిడుగురాళ్ల, రొంపిచర్ల పరిసర ప్రాంతాల్లోని వందలాది గ్రామాల్లోని వ్యక్తులతో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్పీ ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు. శుక్రవారం నరసరావుపేట సమీపంలోని చిలకలూరిపేట రోడ్డులో ఉన్న మాగం పుల్లారావు టౌన్‌షిప్ వద్ద, లింగంగుట్ల వద్ద బెట్టింగ్ నిర్వహిస్తున్న 8 మంది ప్రధాన బుకీలతోపాటు 42 మంది బెట్టింగ్ రాయుళ్లను కలిపి మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10.58 లక్షల నగదు, 6.50 కిలోల గంజాయి, 81 చరవాణులు, బెట్టింగ్ పరికరాలు, ఒక కారు, రెండు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు.

నేటి నుంచి ఆప్షన్ల మార్పునకు అవకాశం

ఈనాడు, అమరావతి: ఏపీ ఎంసెట్ (ఎంపీసీ స్ట్రీమ్) ఆప్షన్ల మార్పునకు శనివారం ఉదయం 11 నుంచి అవకాశం కల్పించనున్నారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆదివారం ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించగా విద్యార్థుల సౌలభ్యం కోసం రెండు రోజులపాటు ఆప్షన్ల నమోదు, మార్పునకు అవకాశం కల్పించినట్లు కన్వీనర్ పండాదాస్ తెలిపారు. 1-60వేలు ర్యాంకుల వారిలో 30,982 మంది ఆప్షన్లు నమోదు చేసుకోగా.. 60001-చివరి ర్యాంకు వరకు శుక్రవారం 19,927 మంది ఆప్షన్లు ఇచ్చారు.

5 నుంచి టెట్ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు సంబంధించి జిల్లాల్లో పరీక్షా కేంద్రాల ఎంపికకు గడువు ముగిసింది. మొత్తం 3,97,957 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా వీరిలో 3,83,066మంది పరీక్షా కేంద్రాలకు ఆప్షన్లు నమోదు చేసుకున్నారని కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఐదో తేదీ మధ్యాహ్నం 12 నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.

నిరుద్యోగభృతి మోసపూరితం

- ముఖ్యమంత్రి నివాస భవనానికే పర్యావరణ అనుమతుల్లేవు
- నాకు రాజకీయాలేమీ బ్రహ్మవిద్య కాదు
- విజయనగరం జిల్లాలో పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు

విజయనగరం జిల్లా సాలూరు పట్టణంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ఈనాడు – విజయనగరం

'బాగా తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందంట.. తెదేపా నేతలంతా తిని తిని ఉన్నారు. అమరావతిలో రాష్ట్ర సచివాలయం ఎక్కి కూయండి' అంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. 'తెదేపా నాయకులు బాగా తిని ఎక్కడ తిన్నామో నిరూపించండంటూ ఎదురుప్రశ్నలు వేస్తున్నారు. అంగన్‌వాడీ ఆయాల దగ్గర కూడా లక్షల లంచాలు తీసుకున్నారు. ఎవరైనా లంచాలకు రశీదులిస్తారా? వారు చేస్తున్నదీ అదే. రాష్ట్రంలో అక్రమాలు, ఇసుక, భూ మాఫియాలు అధికమయ్యాయి. గ్రామాల్లో గొలుసు దుకాణాలు నడుపుతూ పేదల కూలీ డబ్బంతా లాగేస్తున్నారు. అధికార, ప్రతిపక్షాలు రెండూ కూడబలుక్కుని ప్రజలకు న్యాయం చేయడంలేదు' అని విమర్శించారు. ప్రజాపోరాట యాత్రలో భాగంగా పవన్ కల్యాణ్ శుక్రవారం విజయనగరం జిల్లా సాలూరు, గజపతినగరాల్లో పర్యటించి బహిరంగ సభల్లో మాట్లాడారు. తనకు రాజకీయాలేమీ బ్రహ్మవిద్య కాదని, కూసువిద్యేనని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, ఆడబిడ్డలు, రైతులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జనసేనకు మారుమూల ప్రాంతాల్లోనూ అమితమైన స్పందన ఉందని, ప్రజాసమస్యల్ని బలంగా ముందుకు తీసుకెళుతుందని స్పష్టం చేశారు.

గిరిజన ప్రాంతాల్లో అనధికార మైనింగ్‌పై పోరాటం

'ముఖ్యమంత్రి రూ.1,000 నిరుద్యోగ భృతి ఇస్తామంటున్నారు. అదీ డిగ్రీ చదివినవారికేనట. మిగిలినవారు యువత కాదా. నిరుద్యోగ భృతి మోసపూరిత పథకం' అని పవన్ విమర్శించారు. నదీ పరిరక్షణపై చంద్రబాబుకు ప్రేమ, అభిమానం లేదని, అమరావతిలో పర్యావరణ అనుమతులు లేని భవనంలో నివాసముంటున్నారని పేర్కొన్నారు. ఇంకా అక్కడ కొత్తగా భవనాలు కడుతున్నారని వివరించారు. "కడియం నర్సరీలవాళ్లు 5 అంగుళాల మట్టి తీస్తే మైనింగ్ శాఖ కేసులు పెడుతుంది. అలాంటిది సాలూరు పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా బాక్సైట్ మైనింగ్ కొనసాగుతున్నా ఒక్కరూ అడగడంలేదు. దీన్ని అవినీతి అనరా? ప్రభుత్వం లంచాలు ముట్టజెప్పినవారికి మైనింగ్ అనుమతులిచ్చి గిరిజనుల జీవితాల్ని ధ్వంసం చేస్తోంది. అక్కడ బాక్సైట్ తవ్వకాలకు అనుమతులిస్తే 25 గ్రామాల గిరిజనుల జీవితాలు, వన్యప్రాణుల ఉనికి సర్వనాశనమయ్యే ప్రమాదముంది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా అనధికార మైనింగ్‌ని ప్రోత్సహిస్తే జనసేన పార్టీ స్థానిక పరిరక్షణ కమిటీలకు అండగా ఉంటుంది" అని పవన్ పేర్కొన్నారు. స్థానిక నాయకుడు భంజ్‌దేవ్ గిరిజనుడు కాదని చెబుతున్నా ముఖ్యమంత్రి ఎస్టీ ధ్రువపత్రం ఇచ్చి సాలూరు తెదేపా ఇన్‌ఛార్జిగా పెట్టారని, అది గిరిజనులకు ద్రోహం చేసినట్లు కాదా? అని ప్రశ్నించారు.

ఎక్కడకు వెళ్లినా ప్రభుత్వ ఉద్యోగులు కాంట్రిబ్యూటరీ పింఛను పథకం రద్దు గురించి అడుగుతున్నారని, జనసేన అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని రద్దు చేస్తామని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఒకవేళ ఈ పథకం కేంద్ర పరిధిలోనిదైతే వారిపై ఒత్తిడి తెచ్చి రద్దు చేయిస్తామని చెప్పారు. తక్కువ ధరకే వస్తున్నాయి కదాని ఎవరైనా అగ్రిగోల్డ్ ఆస్తుల్ని కొంటే జనసేన అధికారంలోకి రాగానే వాటిని వెనక్కి తీసుకుంటుందని పేర్కొన్నారు.

నిరుద్యోగ భృతి ప్రకటించినందుకు కృతజ్ఞతగా శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న దేవినేని అవినాష్, నిరుద్యోగులు

రూ.50 కోట్ల రుసా నిధులు వెనక్కి!

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 12 ఆదర్శ డిగ్రీ కళాశాలల (న్యూ మోడల్ డిగ్రీ కాలేజీ-ఎన్ఎండీసీ) ఏర్పాటుకు మంజూరు చేసిన నిధులను వెచ్చించకపోవడంతో వెనక్కి ఇవ్వాలంటూ కేంద్రం ఆదేశించింది. రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (రుసా) కింద రాష్ట్రంలో ఆదర్శ డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ రూ.50 కోట్లు విడుదల చేసింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో ఈ కళాశాలల భవనాల నిర్మాణానికి 2015 అక్టోబరులో నిధులు విడుదలయ్యాయి. భవనాల నిర్మాణ బాధ్యతలను రుసా తరఫున ఏపీ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)కి అప్పగించారు. రాష్ట్రంలో ఒక్క ఎస్.కోటలో మినహా ఎక్కడా ఈ పనులు ప్రారంభం కాలేదు. చిత్తూరు జిల్లా పీలేరు, పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు ఎన్ఎండీసీలకు టెండర్ల ప్రక్రియే పూర్తికాలేదు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిధులు వెనక్కి ఇవ్వాలంటూ ఇటీవల కేంద్రం నుంచి రుసాకు మౌఖిక ఆదేశాలు వచ్చాయి.

రాజకీయ లక్ష్యంతోనే తూత్తుకుడిలో కాల్పులు

నిజనిర్ధరణ కమిటీ వెల్లడి

హైదరాబాద్, న్యూస్‌టుడే: తమిళనాడు తూత్తుకుడిలోని వేదాంత గ్రూప్‌నకు చెందిన స్టెరిలైట్ పరిశ్రమకు వ్యతిరేకంగా 22 ఏళ్లుగా సాగుతున్న పౌర, ప్రజాతంత్ర ఉద్యమానికి గుణపాఠం చెప్పాలనే రాజకీయ లక్ష్యంతోనే గత మే 22న కాల్పులు జరిపారని ఆ ఘటనపై ఏర్పాటైన నిజనిర్ధరణ కమిటీ ఆరోపించింది. 13 మంది మృతి చెందిన ఘటనపై అఖిల భారత రైతు కూలీ సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం, న్యూడెమోక్రటిక్ లేబర్ ఫ్రంట్‌ల సమన్వయంతో ఏర్పడిన నిజ నిర్ధరణ కమిటీ బృందం వాస్తవాలను సేకరించింది. శుక్రవారం బృందం ప్రతినిధులు జె.వి.చలపతిరావు, ప్రసాద్, ఎం.లక్ష్మి, పాటూరి వెంకటరత్నం తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమాన్ని అణచివేసే లక్ష్యంతో ఉద్దేశ్యపూర్వకంగానే ప్రభుత్వం గురిచూసి కాల్పులు జరిపించిందని తమ విచారణలో రుజువైందన్నారు. వేదాంత గ్రూప్ యజమాని అనిల్ అగర్వాల్‌తో ప్రధాని మోదీకి గల అతి సాన్నిహిత్యం, ముఖ్యంగా ఆర్ఎస్ఎస్‌తో ఉన్న ఆంతరంగిక అనుబంధం స్టెరిలైట్ పరిశ్రమ విస్తరణకు, కాల్పులకూ కారణమైందని వారు ఆరోపించారు. కాల్పులపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

జులై నుంచి పక్కాగా సమయ నిర్దేశిత విధానం

- తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడి
- సెప్టెంబరు ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: జులై నుంచి టోకెన్ల పరిమితిని ఎత్తివేసి పక్కాగా సమయ నిర్దేశిత సర్వదర్శనాన్ని కల్పిస్తామని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఈ టోకెన్ల జారీ ప్రక్రియ విజయవంతమైందని తెలిపారు. తిరుమలలో శుక్రవారం ఆయన డయల్ తితిదే ఈవో కార్యక్రమంలో, అనంతరం విలేకరులతో మాట్లాడారు. తిరుమలలో మరో రెండు అన్నప్రసాద వితరణ కేంద్రాలను భక్తులకు అందుబాటులోకి తెచ్చామని ఈవో వివరించారు. శ్రీవారి ఆభరణాలన్నీ భద్రంగానే ఉన్నాయని పునరుద్ఘాటించారు. ఆలయ పూర్వ ప్రధానార్చకులు రమణ దీక్షితులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కొందరు తితిదే ఉద్యోగులు ఇటీవల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారని, నిరసన తీరు మంచిది కాదని తెలుసుకున్నాక విరమించుకున్నారని అన్నారు.

డయల్ తితిదే ఈవో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అనిల్‌కుమార్‌సింఘాల్. చిత్రంలో జేఈవోలు శ్రీనివాసరాజు, పోలా భాస్కర్

49 వేల ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల

స్వామివారి ఆర్జిత సేవాటిక్కెట్లు సెప్టెంబరు కోటాకు సంబంధించి 49,060 విడుదల చేసినట్లు ఈవో తెలిపారు. ఆన్‌లైన్ డిప్ విధానం కింద 8,235 టిక్కెట్లు విడుదల చేయగా ఇందులో సుప్రభాతం 6,805, తోమాల 80, అర్చన 80, అష్టదళ పాదపద్మారాధన సేవ 120, నిజపాద దర్శనం 1,150 ఉన్నాయి. ఆన్‌లైన్ జనరల్ విభాగం కింద 40,825 టిక్కెట్లు విడుదల చేయగా విశేషపూజ 1,500, కల్యాణోత్సవం 9,975, ఊంజలసేవ 3,150, ఆర్జిత బ్రహ్మోత్సవం 5,500, వసంతోత్సవం 9,900, సహస్రదీపాలంకరణ 10,800 టిక్కెట్లు ఉన్నాయి.

★ దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం ఈనెల 5న జరగనుంది. రమణ దీక్షితులు ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించనున్నట్లు సమాచారం.

అనిశా వలలో పరిశ్రమల శాఖ అధికారి

- రూ.12 కోట్ల విలువైన ఆస్తులు స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (అనిశా) ఉచ్చులో మరో పెద్ద చేప చిక్కింది. పరిశ్రమలకు అనుమతుల పేరుతో అవినీతినే పరిశ్రమగా మలుచుకున్న అధికారి బండారం బయటపడింది. మహబూబ్‌నగర్ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.సురేష్‌కుమార్ ఇళ్లపై అనిశా అధికారులు శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.12 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అనిశా అధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం అనిశా అధికారులు సురేష్‌కుమార్‌పై కేసు నమోదు చేసి మహబూబ్‌నగర్, హైదరాబాద్, విశాఖపట్నంలోని మొత్తం ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున మొదలైన సోదాలు సాయంత్రం వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సందర్భంగా పెద్ద మొత్తంలో నగదు, లాకర్లు, బంగారు ఆభరణాలు, స్థిర, చరాస్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సురేష్‌కుమార్‌ను అరెస్టు చేసి అనిశా న్యాయస్థానంలో హాజరుపరిచారు.

స్వాధీనం చేసుకున్న ఆస్తులు....... విలువ

1). మియాపూర్ బాలాజీనగర్‌లో ఐదంతస్తుల భవనం	రూ.90 లక్షలు
2). మియాపూర్ మదీనాగూడలోని ఒక ఫ్లాట్	రూ.32 లక్షలు
3). శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్లలో . 09 గుంటల స్థలం	రూ.1.93 కోట్లు
4). 2.6 కిలోల బంగారు ఆభరణాలు	రూ.73 లక్షలు
5). 2 కిలోల వెండి ఆభరణాలు	రూ.లక్ష
6). ఇంట్లోని లాకర్‌లో దొరికిన డబ్బు	రూ.15.64 లక్షలు
7). బ్యాంకులో ఉన్న నిల్వ మొత్తం	రూ.10.50 లక్షలు
8). బీమా పాలసీలు	రూ.3.18 లక్షలు
9). ఐ20 కారు	రూ.9 లక్షలు
10). రెండు యాక్టివా ద్విచక్ర వాహనాలు	రూ.1.1 లక్షలు
11). గృహోపకరణాలు	రూ.6.43 లక్షలు

★ అధికారిక లెక్కల ప్రకారం వీటి విలువను రూ.4.2 కోట్లుగా అంచనా వేయగా. మార్కెట్ విలువ ప్రకారం రూ.12 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.

సెప్టెంబరు 16న సీటెట్

ఈనాడు, హైదరాబాద్: కేంద్రీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(సీటెట్)ను సెప్టెంబరు 16(ఆదివారం)న నిర్వహించాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. కేంద్రీయ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సీటెట్‌ను జరుపుతారు. దీన్ని 2016 సెప్టెంబరులో నిర్వహించిన సీబీఎస్ఈ గతేడాది ప్రకటన జారీ చేయలేదు. తాజాగా మళ్లీ జరపాలని నిర్ణయించిన సీబీఎస్ఈ దీనికి సంబంధించి జూన్ 12న సవివరణ ప్రకటనను వెబ్‌సైట్(www.ctet.nic.in) లో ఉంచనుంది. జూన్ 22 నుంచి జులై 19 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 92 నగరాల్లో పరీక్ష జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

హైదరాబాద్ నుండి సింగ్‌పూర్ మార్గంలో ప్రస్తుతమున్న ఛార్జీల క్రమంలో విజయవాడ విమానాశ్రయం నుండి సింగపూర్ విమానాశ్రయానికి విమానాలను ప్రారంభించే సాధ్యాసాధ్యాలను పరీక్షించే ప్రతిపాదనపై యావన్మంది నుండి మరియు భాగస్వాముల నుండి అభిప్రాయాన్ని తెలుసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావిస్తున్నది.
ఈ ప్రకటన తేది నుండి 10 రోజులలోగా ఫోన్ నెం. "98681 75288"కు వాట్సాప్ ద్వారా "Interested" రూపంలో ప్రతిస్పందనలు కోరబడుచున్నవి. వాయిస్ కాల్ అనుమతించబడదు. Interestను APADCL వెబ్‌సైట్ "www.apadcl.com"పై నమోదు కావచ్చును.
DIPR No. 137PP/CL/ADVT/1/1/2018-19 సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522 034

ప్రవేశ ప్రకటన

ప్రకటన నెం.5306/ పాలిటెక్నిక్స్/డిప్లొమా అడ్మిషన్స్/2018 తేది:01.06.2018

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో మరియు విశ్వవిద్యాలయంచే గుర్తింపు పొందిన ప్రైవేటు వ్యవసాయ పాలిటెక్నిక్‌లలో రెండు సంవత్సరముల వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞాన, సేంద్రియ వ్యవసాయ డిప్లొమా కోర్సులకు మరియు మూడు సంవత్సరముల డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సునకు 2018-19 విద్యా సంవత్సరంలో ప్రవేశం కొరకు అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించబడును. వ్యవసాయ విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.angrau.ac.in లో ఆన్‌లైన్ దరఖాస్తు మరియు మార్గదర్శక సూత్రాలను పొందుపరచడమైనది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయుటకు చివరి తేది : 21.06.2018 (11:59 PM)

డి. భాస్కరరావు
రిజిస్ట్రార్

GOVERNMENT OF ANDHRA PRADESH
DEPARTMENT OF TECHNICAL EDUCATION

A.P - POLYCET - 2018 ADMISSIONS
FINAL PHASE NOTIFICATION
FOR WEB BASED COUNSELLING

The Qualified candidates of A.P-POLYCET - 2018 who are desirous of seeking admission into Diploma Courses are informed to exercise options on **08-06-2018 & 09-06 2018** for the seats now available. For complete details refer the detailed notification placed on the website **https //appolycet.nic.in**

Dated: 01-06-2018
Place: Vijayawada

Sri **G.S Panda Das, IAS**
CONVENOR, , APPOLYCET

IndianOil | Bharat Petroleum | HP

LPG డిస్ట్రిబ్యూటర్ల రీ-డ్రా కొరకు ప్రకటన (BPCL HPCL IOCL)

డిస్ట్రిక్ట్ కలెక్టరేట్ ఆఫీస్ రామారావుపేట, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా - 533001, వద్ద తేది: 06.06.2018న (ఉ. 9.30 గం.లకు) దిగువ ప్రాంతాల కొరకు LPG డిస్ట్రిబ్యూటర్ల కోసం రీ డ్రా నిర్వహించబడుతుందని ఇందుమూలంగా తెలియజేయడమైనది. రీ-డ్రాకు అర్హత పొందిన దరఖాస్తు దారులు నిర్దేశిత తేది ప్రదేశం, సమయమున ఏదేని ప్రభుత్వ శాఖచే జారీ చేయబడిన ఫోటో గుర్తింపు కార్డుతో స్వయంగా హాజరు కావలసిందిగా కోరడమైనది.

క్ర. సం.	ప్రదేశం పేరు	OMC	రీ-డ్రా తేది	రీ-డ్రా తీయు సమయం
1	కోటనందూరు	BPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
2	కుప్పిలి	BPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
3	లావేరు	BPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
4	తాళ్లముడి	BPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
5	పాతకోట	BPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
6	ఆనందపురం	BPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
7	వీరవాసరం	BPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
8	పెదబయలు	BPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
9	గుడివాకలంక	HPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
10	తూటిపాల	HPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
11	రాజవరం	HPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
12	అనుమునిలంక	HPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
13	కోణాల	HPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
14	అంతర్వేది	HPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
15	టైడ	HPC	06.06.2018	ఉ.09.30 గం.లకు
16	కత్తిపూడి	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
17	తదువై	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
18	బండిపాలెం	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
19	పుట్రేల	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
20	కూనవరం	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
21	పోలిపల్లె	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
22	వరరామచంద్రాపురం	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
23	గొల్లపల్లి	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
24	పద్మనాభం	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
25	కొమరాడ	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
26	కొలిస	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
27	పెనుగొండ	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు
28	వెలగపూడి	IOC	06.06.2018	ఉ.09.30 గం.లకు

నింగి నీడన.. నిత్య యాతన

నిత్యం వేలాదిమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీలోని అద్దెబస్సుల డ్రైవర్లు కంటినిండా నిద్రపోయేందుకూ వీలులేని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2200 బస్సులు ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు చేరుకునే అద్దెబస్సుల డ్రైవర్లు రాత్రివేళల్లో ఇక్కడ నిద్రించడానికి వసతులు కరవయ్యాయి. స్థానికంగా ఉన్న విశ్రాంతి కేంద్రాల్లోకి ఆర్టీసీ డ్రైవర్లను మాత్రమే అనుమతిస్తూ.. వీరికి ప్రవేశం నిరాకరిస్తున్నారు. దీంతో బస్సుపైభాగంలోనే వారు నిద్రకు ఉపక్రమిస్తుండటంతో సరైన విశ్రాంతి దొరకడం లేదు. ఇక దోమల బెడద తీవ్రంగా ఉండటంతో కొందరు చోదకులు ప్రత్యేకంగా దోమతెరలు కొని తెచ్చుకుంటున్నారు. మరోవైపు దొంగల భయంతో సామగ్రికి భద్రత లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ విశ్రాంతి కేంద్రాల్లోకి తమనూ అనుమతించాలని వేడుకుంటున్నారు. – **ఈనాడు, అమరావతి**

ప్రత్యేక హోదా ఇచ్చేది కాంగ్రెస్సే: రఘువీరారెడ్డి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి స్పష్టం చేశారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికలకు ప్రత్యేక హోదానే ప్రధానమైన ఎజెండా అవుతుందన్నారు. ప్రత్యేకహోదా కోసం కాంగ్రెస్ కోటి సంతకాల ఉద్యమం, మట్టి సత్యాగ్రహం, చలో దిల్లీ వంటి పలు కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. నోట్ల రద్దు ఉగ్రవాదంతో సమానమైన చర్యగా పేర్కొంటూ, ఇప్పటికీ ప్రజలకు కష్టాలు తప్పడం లేదని రఘువీరారెడ్డి పేర్కొన్నారు. జీఎస్టీతో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతికి చిరునామాగా మారాయని ఆరోపించారు. తెదేపా నేతలు 600 హామీలు అమలు చేశామని చెబుతున్నారని వాటిలో ఆరు హామీలైన నూరు శాతం అమలు చేశారా? అని ప్రశ్నించారు. పేదల భూములను లాగేసుకుంటున్నారని, 2013 భూసేకరణ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం విఫలమైందన్నారు.

పురుగు మందులు నిషేధిస్తేనే రైతుకు మేలు

- అప్పుడే ఆత్మహత్యల నివారణ
- ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నిపుణుల నివేదిక

ఈనాడు, దిల్లీ: భారత్‌లో పేద రైతుల ఆత్మహత్యలను నివారించాలంటే అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులను నిషేధించాలని ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆ విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఫర్ పెస్టిసైడ్ సూసైడ్ ప్రివెన్షన్' (పురుగుమందుల ద్వారా జరిగే ఆత్మహత్యల నివారణ కేంద్రం)కు చెందిన నిపుణులు ఈమేరకు 15 పేజీల నివేదికను కేంద్ర వ్యవసాయ శాఖ సంచాలకులు ఎస్కే మల్హోత్రాకు పంపారు. ఇదే అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సామాజిక కార్యకర్త కవితా కురుగంటి ద్వారా వారు ఈ నివేదికను అందజేశారు. 'అధికారిక గణాంకాల ప్రకారం 2014లో భారత్‌లో నమోదైన 1,31,666 ఆత్మహత్యల్లో 14,352 పురుగుమందు తాగే ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. ఇక్కడ అంచనాలు చాలా తక్కువ చేసి చూపారు. 2010లో ఓ సంస్థ దేశవ్యాప్తంగా జరిపిన సర్వేలో ఆ ఏడాది జరిగిన 1.87 లక్షల ఆత్మహత్యల్లో 49.2% (92,000) పురుగు మందు తాగడం వల్లే జరిగినట్లు తేలింది. ఇందులోనూ మిథైల్ పారథాన్, మోనోక్రోటోఫాస్, డయాజినాన్, పాస్ఫోమిడాన్‌లవల్ల ఎక్కువ మంది చనిపోతున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇలాంటి పురుగుమందులు కేవలం అనుమతి ఉన్న వారికి మాత్రమే అందుబాటులో ఉంటాయి. భారత్‌లో అందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. ఇలాంటి పురుగు మందులను నిషేధించడం వల్ల శ్రీలంకలో ఆత్మహత్యలు తగ్గాయి. అల్యూమినియం ఫాస్ఫైడ్‌ను 1970 చివరలో వ్యవసాయ వినియోగానికి అనుమతించిన తర్వాత ఉత్తర భారత దేశంలో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయి. అందువల్ల దీనినీ నిషేధించాలి. పురుగు మందులు తాగినవారిని బతికించడానికి అత్యంత ఖరీదైన వైద్యసేవలు అవసరం. దాంతో బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోతుంది. భారతదేశంలో ప్రస్తుతం ఏటా 90 వేలమంది పురుగు మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రమాదకరమైన పురుగుమందులను నిషేధిస్తే ఇలాంటి వారి ప్రాణాలు నిలబెట్టినట్లవుతుంద'ని పేర్కొన్నారు.

జాతీయ సాధన సర్వేలో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన జాతీయ సాధన సర్వే(ఎన్ఏఎస్)లో అన్ని సబ్జెక్టుల్లో సరాసరిన ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరి 5న జాతీయ సాధన సర్వేలో భాగంగా రాష్ట్రంలోని పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లం, సామాన్య, సాంఘికశాస్త్రం, తెలుగు(స్థానిక భాషలు)పై పరీక్షలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు ఈ సర్వే నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,052 పాఠశాలల్లోను ఈ సర్వేకు ఎంపిక చేయగా ఇందులో ప్రభుత్వ 1,040, ఎయిడెడ్ 4, ప్రైవేటు 8 పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు విభాగంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లోనూ సర్వే చేశారు. మొత్తం 34,838మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వీటి ఆధారంగా మార్కులు కేటాయించి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. గణితంలో సరాసరి 41.2%మార్కులతో ఏపీ దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. అన్ని సబ్జెక్టుల్లో కలిపి సరాసరి మార్కులు 45.6%తో డిల్లీ మొదటిస్థానంలో నిలవగా, ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత గోవా, కర్ణాటక, రాజస్థాన్‌లు ఉన్నాయి. జాతీయ స్థాయిలో రాష్ట్రాల ఎస్ఎస్‌సీ బోర్డులతో పోల్చితే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈల విద్యార్థుల సామర్థ్యాలు కొంచెం మెరుగ్గా ఉన్నట్లు సర్వే వెల్లడించింది.

మండల విద్యాధికారుల బదిలీల ఉత్తర్వులు జారీ: ఏపీటీఎఫ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పని చేస్తున్న మండల విద్యాధికారులు (ఎంఈవోలు) బదిలీలు చేపట్టాలని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య ఇచ్చిన వినతి మేరకు ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసింది. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు దరఖాస్తులను స్వీకరించి, బదిలీలను చేపడతారు. అభ్యర్థన, పరస్పర బదిలీలకు అవకాశం కల్పించారు. ఈ ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీటీఎఫ్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, హృదయరాజు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దక్షిణాదిలో కొత్త రాజకీయ శకం!

కన్నడనాట కాంగ్రెస్- దళ్ పొత్తు

ఈనాడు, బెంగళూరు: కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య కుదిరిన 2019 సార్వత్రిక ఎన్నికల పొత్తు దేశ రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలికింది. రాష్ట్రంలో తాజా ఎన్నికల అనంతరం సంకీర్ణ ప్రభుత్వానికి సిద్ధమై వారు భాజపాకు గట్టి దెబ్బకొట్టారు. కాంగ్రెస్, దళ్ పొత్తు భాజపా దూకుడుకు కచ్చితంగా కళ్లెం వేస్తుందనే విశ్లేషణలున్నాయి. పాత మైసూరులోని పలు జిల్లాల్లో జేడీఎస్‌కు ఎదురులేదు. కోలారు, చిక్కబళ్లాపుర, బెంగళూరు నగరం, గ్రామీణ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు, హైదరాబాదు- కర్ణాటక, ముంబయి- కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రాబల్యం ఉంది. మిగిలిన చోట్ల భాజపా బలం ఎక్కువ. విధానసభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ వల్ల భాజపాకు పలు నియోజకవర్గాల్లో లబ్ధి చేకూరింది. ముఖాముఖి పోటీలే ఉంటే కమలనాథులు ఎక్కువగానే ఓడిపోయేవారనే వ్యాఖ్యలున్నాయి. సామాజికవర్గాల ప్రాతిపదికన చూసినా లింగాయతులు, బ్రాహ్మణులు, ఇతర వ్యాపార వర్గాల్లో అత్యధికులు భాజపా మద్దతుదారులుగా భావిస్తారు. మిగిలిన సామాజికవర్గాల దన్ను జేడీఎస్, కాంగ్రెస్‌కు ఉన్నాయి. రెండు పార్టీల మధ్య ఒప్పందం కుదరటానికి ముందు శుక్రవారం ఉదయం దళపతి దేవేగౌడ చరవాణిలో రాహుల్‌తో చర్చించారు. 'మీరు ఇలాంటి సహాయ సహకారాల్ని అందిస్తే సుస్థిర, ప్రగతిశీల ప్రభుత్వాన్ని అందిస్తాం' అని దేవేగౌడ భరోసానిచ్చారు.

కర్ణాటకలో ఉపముఖ్యమంత్రిగా పరమేశ్వర్ ప్రమాణంపై వ్యాజ్యం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన డా.పరమేశ్వర్‌ను ఆ పదవి నుంచి తప్పించేందుకు చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టులో ప్రజాప్రయోజనం వ్యాజ్యం దాఖలైంది. రాజ్యాంగంలో ఉపముఖ్యమంత్రి పేరిట ప్రత్యేక పదవి ఏమీ లేదంటూ మైసూరుకు చెందిన శేఖర్ అయ్యర్ దావా వేశారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టవచ్చని, నేరుగా ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి రాజ్యాంగంలో అవకాశం లేదని ఆయన తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణకు స్వీకరించింది. తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదాపడింది.

వీఆర్వో పదోన్నతులపై ప్రత్యేక కమిటీ

ఈనాడు అమరావతి: వీఆర్వో పదోన్నతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. దీనికి సీసీఎల్ కార్యదర్శి ఛైర్మన్‌గా, అదనపు సహాయ కమిషనర్ (సర్వీసెస్) కన్వీనరుగా వ్యవహరిస్తారు. సభ్యులుగా జీఏడీ, న్యాయ, రెవెన్యూ శాఖల సీనియర్ అధికారులు ఉన్నారు. వీరితోపాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు కూడా కమిటీలో చోటిచ్చారు. ఈ కమిటీ అన్ని అంశాలపై అధ్యయనం జరిపి రెండు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

సర్వే శాఖకు వెలుగు కమ్యూనిటీ సూపర్‌వైజర్లు!

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)కు చెందిన 260 మంది వెలుగు కమ్యూనిటీ సూపర్‌వైజర్ల సేవలను సర్వే సెటిల్‌మెంట్ శాఖ పొందనుంది. సర్వే శాఖలో ఉన్న పనిభారం దృష్ట్యా ఈ సర్దుబాటు జరిగింది. ఈ మేరకు రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. వీరికి వేతనాల చెల్లింపులు సర్వే శాఖ ద్వారా జరుగుతాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
నెం. 92/2018-19, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది: 29.05.2018
సూపరింటెండింగ్ ఇంజినీర్, పంచాయతీరాజ్ సర్కిల్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని "PMGSY" గ్రాంట్‌లో 1 పనికి గాను అంచనా విలువ రూ. 285.87 లక్షలకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ డాక్యుమెంట్ల లభ్యత తేది: 5.6.2018 నుండి. టెండర్లు స్వీకరణ తేది: 5.6.2018 నుండి 12.6.2018 మ॥ 3 గం.ల వరకు. టెండర్లు సమర్పణ ముగింపు తేది: 12.6.2018 సా॥ 5 గంటలకు. సాంకేతిక బిడ్ తేది: 13.6.2018 ఉ॥ 11 గంటలకు. ఆర్థిక బిడ్ తెరచు తేది: 15.6.2018 ఉ॥ 11 గంటలకు. తదుపరి వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నుండి పొందవచ్చును.
సం/- పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతీరాజ్ సర్కిల్, ఏలూరు
DIPR No. 622/CL/Advt/1/1/2018-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 28–5–2018
అనంతపురము జిల్లాలో 86 పనుల కొరకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా విలువ: రూ. 10522.51 లక్షలు, 86 పనులకు బిడ్డర్లు టెండరు షెడ్యూళ్ళను NIT నెం 89 (PMGSY) కొరకు తేది 6-6-2018 నుండి 13-6-2018 వరకు మరియు 89 మినహా (ఇతర గ్రాంట్లు) అన్ని NIT నెం.లకు తేది 6-6-2018 నుండి 20-6-2018 డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి వివరాలు e-మార్కెట్ ప్రదేశం www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్ నెం.: 08554-275512.
సం/- పర్యవేక్షక ఇంజినీరు, పి.ఆర్., అనంతపురము
DIPR No. 637/CL/Advt/1/1/2018-19

OFFICE OF THE COMMISSIONER AND DIRECTOR OF AGRICULTURAL MARKETING
Government of Andhra Pradesh, Guntur, Amaravathi
TENDER NOTICE
Tender Notice.No.SE(AM)/AP/GNT/06/2018-19, Dated: 1-6-2018
Tenders are invited by the Superintending Engineer (AM) Guntur for the following items and the details can be had from **https://market.ap.nic.in** website **1. Audio Visual System, 2. LED Display Boards, 3. Nilkamal Chairs.** Tenders are invited for supply of **VISI coolers** by the Superintending Engineer (AM) Guntur and the details can be had from tender. **apeprocurement.gov.in** website and any other information can be had from Superintending Engineer, Agrl. Marketing, Guntur (Mobile No. **9182361159 & 9182361341**). **Sd/- Superintending Engineer(AM)**

VIZIANAGARAM MUNICIPALITY
EXPRESSION OF INTEREST (EOI) INVITED
Invited seal tenders on or before 04.06.2018 from eligible agencies for engaging of consultants for preparation of detailed project reports for sector wise i.e., water supply, storm water drainage, road projects, commercials complexes, slaughter house, markets, parks street furniture, playgrounds, stadiums, graveyards, conservation/beautification of water bodies/ canals, bridges, ROBs/RUBs/Flyovers/Elevated Corridors, BRTS etc., in entire municipal area in general and proposed merging villages in Vizianagaram Municipality in particular duly intergrating existing/core area.
COMMISSIONER

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
నెం. 72-91/2018-19 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది: 29-5-2018
సూపరింటెండింగ్ ఇంజినీర్, పంచాయతీ రాజ్ సర్కిల్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని 20 పనులకు గాను అంచనా విలువ రూ. 787.48 లక్షలతో చేపట్టుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండర్ డాక్యుమెంట్ల లభ్యత (నిట్ నెం: 72-83కి) 5-06-2018 నుండి. టెండర్లు స్వీకరణ తేది: 05-06-2018 నుండి 19-06-2018న మ. 3.00 గం. వరకు. టెండర్లు సమర్పణ ముగింపు తేది: 19-06-2018 సా. 5.00 గం.లకు. సాంకేతిక బిడ్ మరియు ఆర్థిక బిడ్ తేది: 20-06-2018న ఉ. 11.00 గం.లకు మరియు (నిట్ నెం: 84-91కి) 05-06-2018 నుండి. టెండర్లు స్వీకరణ తేది: 05-06-2018 నుండి 12-06-2018 న మ. 3.00 గం. వరకు. టెండర్లు సమర్పణ ముగింపు తేది: 12-06-2018 సా. 5.00 గం.లకు. సాంకేతిక బిడ్ మరియు ఆర్థిక బిడ్ తేది: 13-06-2018న ఉ. 11.00 గం.లకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్రదేశం www.apeprocurement.gov.in నుండి పొందవచ్చును.
సం/- పర్యవేక్షక ఇంజినీర్, పంచాయతీ రాజ్ సర్కిల్, ఏలూరు
DIPR No. 623/CL/Advt/1/1/2018-19

Invest in the "Most Happening Smart City, the Visakhapatnam" of Sunrise State of Andhra Pradesh
Life time investment opportunity in development of Prime sites at affordable prices at Madhurawada, Visakhapatnam under Lease cum Development model.

Development of three (3) star and above category Hotel in 5 acres of land.	Development of Amusement Park and three (3) star and above Hotel in 10 acres of land.	Development of three (3) star and above category Resort in 10 acres of land.

Prospective bidders can download, participate in the bids at **"https://tender.apeprocurement.gov.in"**. The Time lines are :

Downloading	: 04.06.2018 (11:00 AM) to 04.07.2018 (2:00 PM)
Pre-bid meeting	: 19.06.2018 (3:00 PM)
Submission of bids	: Upto 04.07.2018 (4:00 PM)
Opening of technical bids	: 04.07.2018 (4:30 PM)

aptdc
Further details : Srinivasa Rao (9542008882)
Sd/- Managing Director

వచ్చే ఎన్నికల్లో జేడీఎస్, కాంగ్రెస్ కలిసి పోటీ

- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడి
- కర్ణాటక మంత్రివర్గ విస్తరణకు 6న ముహూర్తం
- సంకీర్ణ నేతల నిర్ణయం

జనతాదళ్- కాంగ్రెస్ ఎన్నికల ఒప్పంద వివరాలు ప్రకటిస్తూ.. పరస్పరం సంతోషం వ్యక్తం చేస్తున్న రెండు పార్టీల నేతలు కుమారస్వామి, సిద్ధరామయ్య, వేణుగోపాల్, మల్లికార్జున ఖర్గే తదితరులు

ఈనాడు – బెంగళూరు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జేడీఎస్‌తో కలిసి పోటీ చేస్తామని కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల ఇన్‌ఛార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈ మేరకు ఒప్పందం కుదిరిందని వివరించారు. కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ముఖ్యమంత్రి కుమారస్వామితో కాంగ్రెస్ అగ్ర నేతలు వేణుగోపాల్, మల్లికార్జున ఖర్గే, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ.. 'దేశ విశాల ప్రయోజనాల దృష్ట్యా కర్ణాటకలో రెండు పార్టీల మధ్య పొత్తు అతి ముఖ్యం. ఈ సూత్ర ప్రాతిపదికనే ఇచ్చి పుచ్చుకోవాలని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ చేసిన సూచన మేరకు అవగాహన కుదుర్చుకున్నాం. ఆర్థిక శాఖ కోసం తొలుత మేము పట్టుబట్టినప్పటికీ ఆ తర్వాత జేడీఎస్‌కు కేటాయించేందుకు అంగీకరించడానికి ఇదే ప్రధాన కారణం' అని వివరించారు. రెండు పార్టీలకూ మంత్రిత్వ శాఖల పంపకం సామరస్యంగా కొనసాగిందని చెప్పారు. ప్రభుత్వం సాఫీగా సాగడానికి సమన్వయ, పర్యవేక్షణ సమితిని ఏర్పాటుచేశామన్నారు. ఈ సమితి నెలలో కనీసం ఒకసారి సమావేశమవుతుందని వెల్లడించారు. రెండు పార్టీల ఎన్నికల ప్రణాళికలను క్రోడీకరించి ఉమ్మడి కనీస కార్యక్రమాలను వీలైనంత త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో మూడింట రెండు వంతులు కాంగ్రెస్‌కు, ఒక వంతు జేడీఎస్‌కు కేటాయించారు. వాటి పాలకమండళ్ల నియామకాలకు సమన్వయ సమితి అనుమతి అనివార్యం. ఐదేళ్లపాటు కుమారస్వామి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఒక ప్రశ్నకు బదులుగా వేణుగోపాల్ చెప్పారు.

6న మంత్రివర్గ విస్తరణ

మంత్రివర్గాన్ని ఈ నెల ఆరోతేదీ బుధవారం విస్తరించనున్నట్లు ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రకటించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. దిల్లీలో వచ్చే ఆదివారం నుంచి మంగళవారం వరకూ జరగనున్న గవర్నర్ల సదస్సుకు కర్ణాటక గవర్నరు వజుభాయివాలా హాజరుకానున్నందున బుధవారం ఆయన కొత్త మంత్రులతో ప్రమాణం చేయిస్తారని వివరించారు. మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాజీ ప్రధాని దేవేగౌడతో ఫోన్‌లో మాట్లాడారని జేడీఎస్ ప్రధాన కార్యదర్శి దానిష్ అలీ తెలిపారు.

ఒప్పందంలో ముఖ్యాంశాలివి

- మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రెండు పార్టీల సమన్వయ సమితి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. జేడీఎస్ ప్రధాన కార్యదర్శి దానిశ్ అలీ నిర్వాహకుడిగా ఉంటారు. ముఖ్యమంత్రి కుమారస్వామి, ఉపముఖ్యమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి. కె.సి.వేణుగోపాల్ సభ్యులు.
- రెండు పార్టీలూ అధికార ప్రతినిధులను నియమిస్తాయి. వారు మాత్రమే మాధ్యమ ప్రతినిధులతో మాట్లాడతారు.

మంత్రిత్వశాఖల కేటాయింపు..

కాంగ్రెస్: హోం, సాగునీరు, వ్యవసాయం, వైద్య విద్య, ఆరోగ్యం, బెంగళూరు నగరాభివృద్ధి, సాధారణ నగరాభివృద్ధి, భారీ- మధ్యతరహా పరిశ్రమలు, చక్కెర, రెవెన్యూ, దేవాదాయ- ధర్మాదాయ, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం. సాంఘిక సంక్షేమం. అటవీ, పర్యావరణం, విజ్ఞానశాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, సమాచార- జీవ సాంకేతిక విజ్ఞానం, గనులు, భూగర్భం, కార్మిక, మహిళ- శిశుసంక్షేమం, ఆహారం- పౌర సరఫరాలు, అల్పసంఖ్యాకులు, న్యాయసభా వ్యవహారాలు, యువజన- క్రీడలు, కన్నడ సంస్కృతి, ఓడరేవులు, రవాణాభివృద్ధి.

జేడీఎస్: ఆర్థికం, ఎక్సైజ్, సమాచార పౌరసంబంధాలు, నిఘా, ప్రణాళిక, గణాంకాలు, సహకారం, పశుసంవర్ధకం, ఉద్యానవనాలు, పట్టు పరిశ్రమ, ఇంధనం, ప్రజాపనులు, పర్యాటకం, వైద్యవిద్య రహితంగా విద్య, మత్స్య, చిన్నతరహా పరిశ్రమలు, రవాణా, చిన్ననీటి పారుదల.

- మిగిలిన మంత్రిత్వ శాఖలను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చర్చించి సమన్వయ సమితి అనుమతితో రెండు పార్టీల మధ్య పంచుతారు.

పీసెట్ ఫలితాల విడుదల

- 24 గంటల్లోనే వెల్లడించిన ఏఎన్‌యూ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: వ్యాయామ కళాశాలలో ప్రవేశాల కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహించిన ఏపీ పీసెట్ ఫలితాలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజేంద్రప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. మే 24 నుంచి 31 వరకు నిర్వహించిన పీసెట్ పరీక్ష ఫలితాలను 24 గంటల్లోనే విడుదల చేసి ఏఎన్‌యూ కొత్త రికార్డు సృష్టించింది. తొలి పది ర్యాంకులను ఏడుగురు విద్యార్థినులు కైవసం చేసుకున్నారు. ర్యాంకులు దక్కించుకున్నవారిలో రాధిక (మొదటి), విజయలక్ష్మి (రెండవ), ఆదిలక్ష్మి (మూడవ), యేటూరి వినోద్, పాపర్లపాటి సౌమ్య, పుల్లసీ మనీషా, షేక్ నజీబ్ జాన్, రంగసముద్రం శోభ, గుత్తి నవీన్ కుమార్, మడివి నవీన్ తొలి పది స్థానాల్లో నిలిచారు.

రాధిక | విజయలక్ష్మి | ఆదిలక్ష్మి

సర్పంచికి పదో తరగతి విద్యార్హత!

- రాష్ట్రాల అభిప్రాయాన్ని కోరుతున్న కేంద్రం

ఈనాడు, అమరావతి: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచి అభ్యర్థులు ఇక నుంచి పదోతరగతి విద్యార్హత కలిగి ఉండాలా? అలాంటివారు మాత్రమే నామినేషన్ వేసేందుకు అర్హులా? అనే అంశాలపై కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ రాష్ట్రాల అభిప్రాయాలను తెలుసుకుంటోంది. 1994 రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టంలో సర్పంచి అభ్యర్థుల విద్యార్హతపై ఎలాంటి ప్రస్తావన లేదు. కేంద్ర ప్రభుత్వ సూచన అమలు చేయాలంటే చట్టంలో సవరణలు చేయాలి. దీంతో కేంద్ర ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పందన తెలియజేయలేదు. సర్పంచి, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న వారెవరికీ ఇప్పటివరకైతే విద్యార్హతపై నిబంధన లేదు. చాలా రాష్ట్రాల్లో సర్పంచుల పదవీ కాలం పూర్తవుతున్నందున పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు ఇప్పటికే ప్రకటన వెలువడింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ సర్పంచుల పదవీ కాలం త్వరలో ముగియనున్నందున రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. వెంటనే ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం లేదు. గడువు కోరుతూ ఎన్నికల సంఘానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ లేఖ రాయనుంది. సర్పంచి విద్యార్హతలపైనా ప్రజాప్రతినిధుల అభిప్రాయాన్ని తెలుసుకొని ఉన్నత స్థాయిలో చర్చించాకే కేంద్రానికి అభిప్రాయాన్ని తెలుపాలని రాష్ట్రం యోచిస్తోంది.

శిథిలావస్థలో ఉన్న పోలీసు భవనాల కూల్చివేతకు అనుమతి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో శిథిలావస్థకు చేరుకున్న పలు పోలీసుస్టేషన్ భవనాలు, సిబ్బంది నివాస సముదాయాల భవనాలను కూల్చేయాలని హోంశాఖ నిర్ణయించింది. మొత్తం 615 భవనాలను దీని కోసం గుర్తించింది. వీటిని కూల్చే బాధ్యతలను ఈ-ఆక్షన్ విధానంలో ఎమ్ఎస్‌టీసీఎల్ సంస్థకు అప్పగించింది. వీటిల్లో ఎక్కువ శాతం 1970, 1980 సంవత్సరాల నాటి భవనాలే ఉన్నాయి.

2024 నాటికి 60లక్షల మంది ప్రకృతి రైతులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 2024 సంవత్సరం నాటికి 60లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయదారులుగా మార్చటమే లక్ష్యంగా నిర్ణయించినట్లు ప్రభుత్వ వ్యవసాయ ప్రత్యేక సలహాదారు విజయకుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా కాజ సమీప బైబిల్ మిషన్ స్థలంలో రెండు రోజులపాటు జరిగే పెట్టుబడిలేని సహజసిద్ధ రైతు శిక్షకుల సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథి విజయకుమార్ మాట్లాడుతూ 2018-19లో రాష్ట్రంలోని మూడువేల గ్రామాల్లో ఐదువేల మంది శిక్షకులతో ఐదు లక్షల మంది రైతులను పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సదస్సులో నేడు సంబంధిత ప్రణాళిక ప్రకటిస్తారని చెప్పారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి ఐక్యరాజ్యసమితి పర్యావరణ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుందని తెలిపారు. కార్యక్రమంలో వెలుగుప్రాజెక్టు డైరెక్టర్ రాయుడు, సంయుక్త కలెక్టర్-2 విజయచంద్ర తదితరులు ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను వివరించారు.

అదనపు ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అయిదుగురు అదనపు ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించి ఆ హోదాలో పోస్టింగులు ఇచ్చింది. అలాగే మరో అయిదుగురు అదనపు ఎస్పీలను బదిలీ చేసింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏ.ఆర్. అనూరాధ శుక్రవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి పొందిన వారిలో జి.శ్రీకాంత్ (అదనపు ఎస్పీ, పరిపాలన, విశాఖపట్నం), పి.షేక్ షవాలి (అదనపు ఎస్పీ, పరిపాలన, కర్నూలు), షేక్ షరీన్ బేగం (అదనపు డీసీపీ, క్రైమ్స్, విజయవాడ), కె.వి.మురళీకృష్ణ (అదనపు ఎస్పీ, శాంతిభద్రతలు, తిరుమల), ఏబీటీఎస్ ఉదయ రాణి (అదనపు ఎస్పీ, పరిపాలన, ప్రకాశం) ఉన్నారు. వీరిలో జి.శ్రీకాంత్‌ను సీఐడీలో ఎస్పీ (నాన్ క్యాడర్)గా నియమించారు. మిగతా నలుగురు అధికారులను ప్రస్తుతం వారు పనిచేస్తున్న చోటే నాన్ క్యాడర్ ఎస్పీ హోదాలో పోస్టింగులు కల్పించారు.

సొమ్ము సర్కారుది.. సోకు ప్రైవేటుది!

- ప్రభుత్వ బోధన రుసుముల కోసం ఇంజినీరింగ్ విద్యార్థులకు గాలం

ఈనాడు – అమరావతి

'ఫీజు వద్దు, ఉచిత భోజన వసతి సౌకర్యాలను మేమే కల్పిస్తాం. ప్రత్యేక, పరీక్షల ఫీజులు మాత్రం మీరు చెల్లించండి'.. ఇది కృష్ణా జిల్లాలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను సంప్రదిస్తోన్న తీరు.. ఉచిత వసతి, బస్ సౌకర్యం కోసం సేవాసంస్థల నుంచి తమకు నిధులు వస్తాయని, అందువల్ల ఇలా చేయగలుగుతున్నామని డాంబికాలు పోతోంది. ఇలాంటి కళాశాలలు ప్రతి జిల్లాలోనూ కొనసాగుతున్నాయి. ప్రభుత్వ బోధన రుసుముల చెల్లింపు పథకాన్ని కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు తమకు అనువుగా మార్చుకుంటూ సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి. 'అత్త సొమ్మును అల్లుడు దానం చేసినట్లు' తంతు నడిపిస్తున్నాయి.. ఏడాదికి రూ.లక్షలోపు ఆదాయం కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు ప్రభుత్వం బోధన రుసుముల చెల్లింపు పథకాన్ని అమలుచేస్తోంది. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం పొందే విద్యార్థుల తరపున ప్రభుత్వం వార్షిక ఫీజును వాటి యాజమాన్యాలకు చెల్లిస్తోంది. దీన్ని తమకు అనుకూలంగా మలచుకుంటున్న కొన్ని కళాశాలలు తామే ఉచితంగా ఇంజినీరింగ్ విద్యను అందిస్తామంటూ ముందుకొస్తున్నాయి. ఏడాదికి రూ.లక్షలోపు ఆదాయం ఉన్నట్లు ధ్రువీకరణపత్రం ఉంటే చాలునని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. విద్యార్థుల చరవాణి నెంబర్లకు పదేపదే సందేశాలు పంపుతున్నాయి. ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇదే తంతు.. దీన్ని తిప్పికొట్టే ప్రయత్నాలు ప్రభుత్వపరంగా జరగడం లేదు. ప్రస్తుతం ఇంజినీరింగ్ విద్యలో కన్వీనర్ కోటా కింద ప్రవేశాల కోసం ఐచ్ఛికాల నమోదు మొదలైంది. ఈ నేపథ్యంలో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఫోన్లుచేస్తూ రకరకాలుగా ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

పెంచిన రుసుములు తగ్గించుకుని..

ఆంధ్రప్రదేశ్‌లో 285 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో వార్షిక ఫీజు కింద రూ.35వేలు మాత్రమే వసూలుచేసే కళాశాలల సంఖ్య దాదాపు 185. వీటిలో అత్యధికం బోధన రుసుముల చెల్లింపు పథకాన్ని నమ్ముకుని మనుగడ సాగిస్తున్నవే.. మిగిలిన కళాశాలల్లోని కొన్నింట్లో వార్షిక ఫీజు రూ.50వేల వరకు ఉన్నా అంతకన్నా తక్కువ మొత్తంతోనే సీట్ల భర్తీకి తంటాలు పడుతున్నాయి. కళాశాలల నిర్వహణ ఖర్చులను చూపించి ఫీజులను పెంచుకున్న ఈ కళాశాలలు సీట్లు మిగిలిపోతుండడంతో తగ్గింపు మంత్రాన్ని జపిస్తున్నాయి. ఫీజు ఎంత ఎక్కువగా ఉన్నా ప్రభుత్వ బోధన రుసుముల చెల్లింపు పథకం కింద రూ.35వేలు ప్రభుత్వం నుంచి వస్తుంది. మిగిలిన మొత్తాన్ని విద్యార్థుల నుంచి రాబట్టాలి. అయితే మిగిలిన మొత్తం అక్కర్లేదు.. ప్రవేశాన్ని తీసుకోండి చాలంటూ విద్యార్థులను కోరుతున్నాయి. ప్రవేశాలు పొందాక రకరకాల పేర్లు చెప్పి అనుకున్న మేరకు ఫీజులు గుంజుతున్నాయి.

నాణ్యత ఏపాటి..!

అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) మార్గదర్శకాల ప్రకారం అరవై మంది విద్యార్థులతో ఉండే ప్రతి సెక్షన్‌కు ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్, ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. ఇలా ఎన్ని సెక్షన్లుంటే అన్నింటికీ అర్హులైన బోధకులుండాలి. వీరందరికీ ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం వేతనాలతో పాటు బోధనేతర సిబ్బంది, ప్రయోగశాలలు, దైనందిన కార్యకలాపాలు, ఇతర ఖర్చుల కోసం భారీగా ఖర్చుపెట్టాల్సి వస్తుంది. అధిక శాతం కళాశాలలకు ఈ పరిస్థితి లేదు. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఉపాధ్యాయ విద్య, ఇతర కోర్సులను నిర్వహిస్తున్నారు. ప్రాంగణ నియామకాల పేరిట వీరు చెప్పే మాటల్లోనూ విశ్వసనీయత ఉండటంలేదు.

'చెట్టు' చిలకమ్మ

విజయనగరం జిల్లా గజపతినగరం పట్టణంలో ఉన్న మారుతీ వ్యాయామశాల ప్రాంగణంలో పెంచుతున్న ఓ చెట్టుకు కొత్తగా పుట్టుకొచ్చిన ఓ కొమ్మ స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చెట్టుపై చిలుక వాలినట్లుగా ఉన్న ఈ ఆకారం ప్రస్తుతం విశేషంగా అలరిస్తోంది. దానికివెనుకభాగంలో ఉన్న చిన్నఆకులు చిలుక తోకను తలపిస్తూ ప్రతిఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. **–న్యూస్‌టుడే, గజపతినగరం**

మంత్రి ఆదినారాయణకు ఈవోపై అంత ఆసక్తి ఎందుకు?

మళ్లీ విశాఖలో ఎలా నియమిస్తారు: ప్రశ్నించిన మంత్రి అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించారనే ఆరోపణలు ఎదుర్కొన్న విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి (ఈవో) సూర్యప్రకాశరావును మళ్లీ అదే స్థానంలో ఎలా నియమిస్తారని మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. శుక్రవారం నర్సీపట్నంలో విలేకర్లతో మాట్లాడారు. ఇంత గొడవ జరిగినా సూర్యప్రకాశ్‌కు అనుకూలంగా మంత్రి ఆదినారాయణ వ్యవహరించాల్సిన అవసరం ఎందుకొచ్చిందన్నారు. సీనియర్ మంత్రినైన తనను కనీసం ఫోన్లో సంప్రదించాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. 'సూర్యప్రకాశరావు లైంగిక వేధింపుల విషయం నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఆయన చర్యలకు ఆదేశిస్తే విజయనగరం బదిలీ చేశారు. ఆరేడు నెలల్లోనే విశాఖ తీసుకువచ్చారు' అని వివరించారు.

పథకాల అమలులో జాతీయస్థాయి గుర్తింపు

స్త్రీ, శిశు సంక్షేమశాఖకు సీఎం అభినందన

ఈనాడు, అమరావతి: 'ఐసీడీఎస్ ప్రత్యేక పథకం' అమల్లో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కల్పించడం ద్వారా గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలపై అవగాహన, మొబైల్ యాప్ వినియోగంలో రాష్ట్రం ముందుంది. ఈ కార్యక్రమాల అమలులో కేంద్రం నుంచి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు లభించింది. గత నెలాఖరులో దిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి రాష్ట్ర అధికారులకు ప్రశంసాపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం అభినందించారు.

రూ. 2798 కోట్ల ఆస్తుల జప్తు

- బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజీలలో వంచన సంస్థలపై విచారణ

బెంగళూరు, న్యూస్‌టుడే: బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజీలలో రూ.5600 కోట్ల వంచనలకు పాల్పడిన ఎన్.కె.ప్రాపర్టీస్, యతూరి అసోసియేట్స్, అష్టమినమెట్, లోటస్ రిఫైనరీ సంస్థలపై నమోదైన కేసుల విచారణ వేగం పెంచినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించింది. సోదాలను నిర్వహించి రూ.2798 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశామని ఈడీ అధికారులు శుక్రవారం వివరించారు. బెంగళూరు, ముంబయి, అహ్మదాబాద్, దిల్లీ తదితర ప్రాంతాల్లో ఆ సంస్థల ప్రమోటర్లు నిమిశ్ పటేల్, నీలేశ్ పటేల్, రాహుల్ ఆనంద, మోహిత్ సింఘాల్, అరుణ్ శర్మ తదితరుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి ఆస్తులను జప్తు చేశామన్నారు. సోదాల సమయంలో వారికి చెందిన రూ.350కోట్ల విలువైన అదనపు ఆస్తులు, పెట్టుబడులను గుర్తించి స్వాధీనపరచుకున్నారు. విలాసవంతమైన వాహనాలు, రూ.17 లక్షల నగదును స్వాధీనపరుచుకున్నామని ఈడీ అధికారులు ధ్రువీకరించారు.

జీతాల చెల్లింపు అధికారం ఎంఈవోలకే ఇవ్వాలి

- ఎమ్మెల్సీల కమిటీ సిఫార్సు

ఈనాడు, అమరావతి: ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాలు చెల్లింపు అధికారాలను జిల్లా విద్యాశాఖాధికారి నుంచి మండల విద్యాధికారులకు బదలాయించాలని ఎమ్మెల్సీల కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గతంలో ప్రభుత్వం ఎమ్మెల్సీలతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, గాదె శ్రీనివాసులునాయుడు, ఎ.ఎస్. రామకృష్ణ, బొడ్డు నాగేశ్వరరావు, వి.మాధవ్ సమావేశమయ్యారు. పాఠశాల సహాయకుల(ఎస్‌ఏ)లకు 40 శాతం జూనియర్ లెక్చరర్ పోస్టులను పదోన్నతుల ద్వారా ఇవ్వాలని ప్రతిపాదించారు. అప్‌గ్రేడైనా పండితులు, పీఈటీ పోస్టులన్నీ పదోన్నతుల ద్వారానే చేపట్టాలని, అప్‌గ్రేడ్ కాని 10వేలు పోస్టులను రెండో దశలో చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని నిర్ణయించారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులను పాఠశాల విద్యలో విలీనం చేయడం, డీఎస్సీ-1998లో 4,534 మంది, డీఎస్సీ-2008లో 1,831, డీఎస్సీ-2012లో 461మందిలో అర్హత కలిగిన ఉపాధ్యాయులకు టైమ్ స్కేల్ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎమ్మెల్సీ కమిటీ సిఫార్సు చేసింది.

ప్రధానోపాధ్యాయుల అకౌంట్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: జులైలో నిర్వహించే ప్రధానోపాధ్యాయుల అకౌంట్ పరీక్షకు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు సుబ్బారెడ్డి తెలిపారు. జూన్ 20వ తేదీలోపు పరీక్ష రుసుములు చెల్లించాలని వెల్లడించారు. దరఖాస్తులను సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారికి ఈ నెల 25వ తేదీలోపు సమర్పించాలని సూచించారు.

ఈద్గా మరమ్మతుల నిధులకు పరిపాలన అనుమతులు

ఈనాడు డిజిటల్, అమరావతి: రంజాన్ మాసం సందర్భంగా వక్ఫ్ ఆధ్వర్యంలోని ఈద్గా, దర్గాల మరమ్మతులు, జిల్లాస్థాయిలో ఇఫ్తార్ విందు నిర్వహణకు సంబంధించిన నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. ఈద్గా, దర్గాల మరమ్మతులకు అన్ని జిల్లాలకు కలిపి రూ.4.45 కోట్లు, ఇఫ్తార్ నిర్వహణకు రూ.55 లక్షల విడుదలకు అనుమతులిచ్చింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని మైనార్టీ శాఖ కార్యదర్శి కె.రామ్‌గోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

‘సీతను అపహరించింది రాముడు!’

• గుజరాత్ పాఠ్యపుస్తకంలో అనువాద దోషం

అహ్మదాబాద్: ‘సీతను రాముడు అపహరించాడు..’ ఈ వాక్యాన్ని చదివితే తప్పు అని ఎవరైనా ఠక్కున చెప్పేస్తారు. గుజరాత్‌లో మాత్రం సాక్షాత్తూ 12వ తరగతి ఆంగ్ల మాధ్యమ పాఠ్యపుస్తకంలో ఇలా ముద్రితమైంది. సంస్కృతాన్ని ఆంగ్లంలోకి అనువదించిన పుస్తకంలో దొర్లిన ఈ పొరపాటు వెలుగులోకి రావడంతో గుజరాత్ రాష్ట్ర పాఠ్యపుస్తకాల బోర్డు (జీఎస్ఎస్‌టీబీ) విచారణకు ఆదేశించింది. కాళిదాసు రాసిన ‘రఘువంశం’ ఇతివృత్తంపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించేందుకు చెప్పే పేరాలో ఇలా తప్పుగా ముద్రితమైంది. దీనిపై జీఎస్ఎస్‌టీబీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ పెథానీ వివరణ ఇస్తూ - సీతను రాముడు ‘త్యజించినప్పుడు..’ అని ఉండాల్సిన చోట అనువాదంలో జరిగిన పొరపాటుతో ‘అపహరించినప్పుడు’ అని వచ్చినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం దీనికి బాధ్యులుగా తేలిన ముద్రణ కాంట్రాక్టర్లను నిలిపివేస్తామని వివరించారు. అలాగే బోధించేటప్పుడు ఈ పొరపాటును సరిదిద్ది విద్యార్థులకు చెప్పాల్సిందిగా ఉపాధ్యాయులకు తెలియజేస్తామన్నారు.

సీత టెస్ట్‌ట్యూబ్ బేబీ?

• యూపీ డిప్యూటీ సీఎం అభివర్ణన

• ఆ వ్యాఖ్యలను ఖండించిన భాజపా

లఖ్‌నవూ: రామాయణ, మహాభారత కాలంలోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లిందంటూ యూపీ ఉప ముఖ్యమంత్రి దినేశ్‌శర్మ సంచలనాత్మక అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సీతాదేవిని టెస్ట్‌ట్యూబ్ బేబీగా... కురుక్షేత్ర యుద్ధ వివరాలను ఎప్పటికప్పుడు ధృతరాష్ట్రుడికి వివరించిన సంజయుడి(మహాభారతంలో) వ్యవహారాన్ని ప్రత్యక్షప్రసారంగా... నారదుడిని అలనాటి ‘గూగుల్’గా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో ఇరకాటంలో పడిన భాజపా నష్టనివారణ యత్నాల్లో పడింది. ఆయన వ్యాఖ్యలను ఖండించింది. మాటల విషయంలో సంయమనం పాటించాల్సిందిగా గట్టిగా చెప్పింది.

లఖ్‌నవూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసిన శర్మ గురువారం రాత్రి మాట్లాడుతూ...“శ్రీరాముడి ధర్మపత్ని సీత వాస్తవానికి టెస్ట్‌ట్యూబ్ బేబీకి చక్కటి ఉదాహరణ’ అంటూ అభిప్రాయపడ్డారు. “జనక మహారాజు భూమిని దున్నే సమయంలో ఓ మృణ్మయ పాత్రలో శిశువు లభించింది. ఆమే సీత. అంటే ఆ రోజుల్లో ప్రస్తుత టెస్ట్‌ట్యూబ్ బేబీ తరహా సాంకేతిక పరిజ్ఞానం ఉండి ఉండవచ్చు’ అంటూ ఆయన ఉద్ఘాటిస్తున్న వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర సంచలనానికి కారణమైంది.

డిప్యూటీ ముఖ్యమంత్రి దినేష్‌శర్మ ఈ కార్యక్రమంలో సీతామాత గురించే కాకుండా జర్నలిజం పుట్టు పూర్వోత్తరాల మీద కూడా మాట్లాడారు. అసలు జర్నలిజం అనేది మహాభారత సమయంలోనే పుట్టిందని ఉద్ఘాటించారు.

అంతేకాదు..., కురుక్షేత్ర సంగ్రామం గురించి ఎప్పటికప్పుడు ధృతరాష్ట్రుడికి కళ్లకు కట్టినట్లుగా సంజయుడు చెప్పడాన్ని ‘ప్రత్యక్ష ప్రసారం’గా దినేశ్‌శర్మ అభివర్ణించారు.

ఆ తర్వాత పురాతన భారతావనిలోనే నారద మహామునితో ‘మనదైన గూగుల్’ మొదలైందన్నారు. ఆయన కేవలం మూడు పర్యాయాలు ‘నారాయణ’ అనగానే ఒకచోట నుంచి మరోచోటికి ఇట్టే చేరి పోయేవారు. సమాచారాన్ని ఎవరి చెవిన వేయాలో వారికి చేరవేసేసేవారు అంటూ దినేశ్ శర్మ చెప్పుకొచ్చారు. నాటి పుష్పక విమానాన్ని ఆధునిక విమానంతో పోల్చారు.

దినేశ్‌శర్మ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. సైన్సుపై మతం ప్రభావాన్ని చూపేందుకు ఆయన యత్నించారంది. దినేశ్ శర్మ వంటి మేధావి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది.

సహజీవనం చేస్తున్నవారిని చట్టప్రకారం విడదీయలేం

• కేరళ హైకోర్టు సంచలన తీర్పు

కోచి: పెళ్లి చేసుకోకుండా సహజీవనం చేస్తుంటే, వారిని చట్టప్రకారం విడదీయలేమని కేరళ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. నిజం కళ్లు మూయలేమని, ఇలాంటి సంబంధాలు సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్నాయని వ్యాఖ్యానించింది. సహజీవనం చేస్తున్న అలప్పుజ జిల్లాకు చెందిన 18 ఏళ్ల బాలుడు, 19 ఏళ్ల బాలికను(ఇద్దరూ ముస్లింలే) చట్టప్రకారం విడదీయడానికి కుదరదని స్పష్టం చేసింది. జస్టిస్ వి.చితంబరేశ్, జస్టిస్ కె.పి.జ్యోతీంద్రనాథ్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం పైమేరకు తీర్పు ఇచ్చింది. తన కుమార్తెను బాలుడు చట్టవ్యతిరేకంగా చెరబట్టాడని బాలిక తండ్రి ఆరోపించాడు. నా కుమార్తెను నాకు అప్పగించాలని కోరుతూ హైకోర్టులో ‘హెబియస్ కార్పస్’ రిట్ వ్యాజ్యం దాఖలు చేశాడు. స్పందించిన కేరళ హైకోర్టు.. హెబియస్‌కార్పస్ రిట్ వ్యాజ్యం కింద ఆమెను అప్పగించలేమని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేసింది. పరస్పర అంగీకారంతో సహజీవనం చేస్తున్న వయోజనులైన భాగస్వాములను విడదీయడం చట్టవ్యతిరేకమని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉటంకించింది.

మోదీ పాలనపై కరదీపికలను విడుదల చేస్తున్న సీతారాం ఏచూరి, బృందాకారాట్

పాలన వైఫల్యాలపై 4 పుస్తకాలు

ఈనాడు, దిల్లీ: అందరితో కలిసి... అందరి అభివృద్ధి అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నినాదాలిచ్చారని, నాలుగేళ్ల తర్వాత చూస్తే దోపిడీ సర్కార్‌గా మిగిలిందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ‘కేంద్ర ప్రభుత్వ పాలన వైఫల్యాల’పై సీపీఎం ప్రచురించిన నాలుగు పుస్తకాలను దిల్లీలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ నాలుగేళ్ల భాజపా పాలనలో ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని, సాగు సంక్షోభం తీవ్రమై అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోయాయని అన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు కేవలం 2.05 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. నోట్ల రద్దు, జీఎస్టీతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయని చెప్పారు. సంక్షేమ పథకాల అమలును విస్మరించారని విమర్శించారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులను రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని, కేంద్ర, రాష్ట్ర సంబంధాలను ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు.

రేసులోకి కాంగ్రెస్

• కమల దళాన్ని ఓడించేందుకు ప్రతిపక్ష శిబిరానికి అవకాశం

• హస్తంపైనే సారథ్య సమర్థతను నిరూపించుకోవాల్సిన బాధ్యత

• ఉపఎన్నికల ఫలితాలతో మారిన పరిణామాలు

ఈనాడు - దిల్లీ

సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాదే మిగిలున్న తరుణంలో.. ప్రతిపక్ష శిబిరానికి తాజా ఉపఎన్నికల ఫలితాలు అవకాశంతోపాటు సవాలునూ ఇచ్చాయి. ఇదే సరళి లోక్‌సభ ఎన్నికల్లో పునరావృతమవుతుందని కచ్చితంగా చెప్పే అవకాశం లేనప్పటికీ.. పరిణామాలు వారికి సానుకూలంగా ఉన్నాయి. అజేయమనుకున్న భాజపాకు కలిగించిన నష్టం గురించి ఆనందంగా ఉన్న కాంగ్రెస్.. తమ సొంత అవకాశాలకు గండి కొట్టుకుని తృతీయ కూటమికి దారిపరస్తున్నామా అన్నదీ పరిశీలించుకోవాల్సిన అవసరముంది. హస్తం పార్టీ మరో బాధ్యతను తలకెత్తుకోవాల్సి ఉంది. భాజపాపై ప్రతిపక్ష పోరాటానికి తాము మాత్రమే సారథ్యం వహించగలమని మిగతా పార్టీలను కాంగ్రెస్ నమ్మించాలి. ఎన్సీపీ మినహా ప్రతిపక్ష శిబిరంలోని పార్టీలన్నీ కర్ణాటక తరహాలో పోరాట వ్యూహం ఉండాలని భావిస్తున్నాయి. విడివిడిగా పోటీచేసి.. ఫలితాల అనంతరం పొత్తులు పెట్టుకోవాలని అనుకుంటున్నాయి. తాము నామమాత్రంగా ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ కైరానా తరహాలోనే ప్రాంతీయ పార్టీలను అనుసరించాలి. ఇటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ప్రదర్శన కనబరిస్తేనే.. ప్రతిపక్ష శిబిరంలో కాంగ్రెస్ పలుకుబడి పెరుగుతుంది. వ్యతిరేక పక్షాలన్నీ కలిస్తే భాజపాకు పరాజయం సాధ్యమేనని కైరానా ఉపఎన్నిక ఫలితంతో స్పష్టమైంది. ఉపఎన్నికలు జరిగిన నాలుగు లోక్‌సభ స్థానాల్లో మూడు అంతకుముందు భాజపావే. అయితే ఆ మూడింటిలో రెండింటినీ ప్రతిపక్ష కూటమి సొంతం చేసుకుంది. ఉపఎన్నికలు జరిగిన 10 అసెంబ్లీ స్థానాల్లో తొమ్మిది చోట్ల విజయం సాధించింది. వీటిలో మూడింటిని కాంగ్రెస్ గెలుచుకుంది.

ప్రతిపక్షాల ఐక్యతతోపాటు భాజపాను కలవరపెట్టే మరిన్ని అంశాలు ఈ ఉపఎన్నికలతో బయటపడ్డాయి. మహారాష్ట్రలో పాల్ఘర్ లోక్‌సభలో భాజపాపై పోటీకి దిగి శివసేన ఓటమి పాలైంది. రాబోయే రోజుల్లో ఎన్డీయే నుంచి వైదొలగవచ్చని శివసేన సంకేతాలు కూడా ఇచ్చింది. అయితే తమకు గట్టి పట్టున్న విదర్భలోని భండారా-గోండియా లోక్‌సభ స్థానంలో ఓడిపోవడం, భాజపా అభ్యర్థిని ఓడించేందుకు శివసేన కూడా కృషి చేయడం కమలం పార్టీకి ఆందోళన కలిగించేవే. మరోవైపు ఎన్డీయేలో తాము తిరిగి చేరినా.. బిహార్‌లోని పస్మాందా ముస్లింలు తమ వెంటే ఉన్నట్లు జేడీయూ భావించింది. అయితే జోకీహాట్‌లో ఓటమి.. అందుకు విరుద్ధమైన సంకేతాలిచ్చింది. ఈ పరిణామం 2019 ఎన్నికల సీట్ల పంపకాలప్పుడు జేడీయూ బేరమాడే శక్తిని తగ్గించొచ్చు. ఇక హిందూ ఓట్లనే నమ్ముకోవాలని నీతీష్‌కు భాజపా సూచించొచ్చు. ఇటు లాలూప్రసాద్ లేని సమయంలో ఆర్జేడీ మరోసారి విజయం సాధించడంతో.. ఆయన కుమారుడు తేజస్వీ రాజకీయ వారసత్వానికి ప్రజల ఆమోదం లభించినట్లైంది. ఉత్తరాఖండ్‌లోని థరాలీలో భాజపా తిరిగి గెలిచినప్పటికీ.. ఆధిక్యం మరింత తగ్గింది. కాంగ్రెస్ ఓట్ల వాటా పెరిగింది. ఇక్కడి అసెంబ్లీలో 70కుగానూ 57 సీట్లు.. లోక్‌సభ స్థానాల్లో ఐదుకు ఐదు సీట్లు భాజపావే. ఇక్కడ తాజా పరిణామం కాషాయ పార్టీకి కాస్త ఆందోళన కలిగించేదే.

టీఎంసీకి పోటీ భాజపానే!

పశ్చిమ బెంగాల్‌లో మహేస్థలలో టీఎంసీ విజయం.. ముస్లింల ఆదరణకు సీపీఎం పూర్తిగా దూరమైందని సంకేతాలిస్తోంది. 41% ముస్లిం జనాభా ఉన్న ఈ నియోజకవర్గంలో టీఎంసీకి 58% ఓట్లు పడ్డాయి. గతంలో ముస్లిం ఓట్లు టీఎంసీ, సీపీఎం, కాంగ్రెస్‌ల మధ్య చీలిపోయేవి. ఇక్కడ 2016లో 15వేల ఓట్లు సాధించిన భాజపా.. తాజాగా 43వేల ఓట్లు సంపాదించింది. రాష్ట్రంలో టీఎంసీ వ్యతిరేక శక్తిగా.. సీపీఎం, కాంగ్రెస్‌ల స్థానాన్ని కమలం పార్టీ భర్తీ చేస్తోంది. 2019లో రాష్ట్రంలో ప్రధాన పోటీ టీఎంసీ, కాషాయ పార్టీల మధ్య ఉండొచ్చు. చెంగన్నూర్ సీటులో 21వేల ఓట్ల తేడాతో ఓటమి పాలవ్వడం.. కేరళలో భాజపా చాలా ఎదగాల్సి ఉందని చాటింది.

భాజపా వ్యతిరేక ఓట్లు చీలకుండా చూస్తాం: కాంగ్రెస్

దిల్లీ: వచ్చే సాధారణ ఎన్నికల్లో భాజపా వ్యతిరేక ఓట్లు చీలకుండా చూసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై కసరత్తు చేయనున్నట్లు కాంగ్రెస్ శుక్రవారం వెల్లడించింది. ఇందుకోసం ఆయా రాష్ట్రాల్లోని పార్టీలతో చర్చిస్తామని తెలిపింది. రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు, కూటముల ఏర్పాటుపై నిర్దిష్ట వైఖరేమీ లేదని, భాజపా వ్యతిరేక ఓట్లను కూడగట్టడమే ప్రాథమిక లక్ష్యమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ విలేకర్లతో చెప్పారు.

యోగి ప్రభుత్వ అవినీతే ఓటమికి కారణం

• యూపీ భాజపా ఎమ్మెల్యేల వ్యాఖ్యలు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉపఎన్నికల్లో భాజపా ఓటములకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలోని అవినీతే కారణమని ఆ పార్టీ ఎమ్మెల్యేలే ఆరోపించారు. అవినీతి మంత్రులపై వేటు వేయకపోతే రాష్ట్రంలో పార్టీ పతనమవ్వక తప్పదని బైరియా శాసనసభ్యుడు సురేంద్ర సింగ్ హెచ్చరించారు. ఇటు భాజపా వరుస ఓటములపై గోపమౌ ఎమ్మెల్యే శ్యాంప్రకాశ్ ఓ వ్యంగ్య కవిత రాసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. “ఉపఎన్నికల్లో ఓటములకు ముఖ్యమంత్రి కన్నా.. మంత్రులదే ఎక్కువ బాధ్యత. వారిలో సగం మంది తీరు సక్రమంగా లేదు. పార్టీ కార్యకర్తలకు వారు విలువే ఇవ్వరు. వారు పదవుల్లోనే కొనసాగితే.. పార్టీ పతనం తప్పదు. పోలీస్ స్టేషన్లలో, ప్రభుత్వ కార్యాలయాల్లో పేదల గోడును ఎవరూ వినిపించుకోవట్లేదు. భాజపా ప్రభుత్వం పారదర్శకమైన పాలనను అందించలేకపోతోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం కూడా ఓటమికి కారణమైందన్న వాదన సరైనదే” అని సురేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. ఇటు మోదీ పేరు మీద రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందని.. ప్రజల ఆశలను మాత్రం నెరవర్చలేకపోతోందని శ్యాంప్రకాశ్ తన కవితలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని నిందించడం తన ఉద్దేశం కాదని.. ఆయన అభిమతానికి అనుగుణంగా అధికారులు పనిచేయట్లేదని సందేశమివ్వాలనుకున్నానని ఆయన అన్నారు. అధికారుల అవినీతి కారణంగా.. ప్రజలు, భాజపా కార్యకర్తలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభ కోల్పోయినట్లు ఉపఎన్నికల ఫలితాలతో స్పష్టమైందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ తిప్పికొట్టారు. మోదీ ప్రభ తగ్గలేదని.. 2019లో మళ్లీ తామే అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఏటా 13వేల అత్యాచార కేసుల్లో

ఫోరెన్సిక్ పరీక్షలు జరగట్లేదు

చండీగఢ్: దేశంలో ఏటా దాదాపు 16వేల అత్యాచార కేసులు నమోదవుతుండగా.. వాటిలో 13వేల కేసుల్లో ఫోరెన్సిక్ పరీక్షలే జరగట్లేదని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనక గాంధీ తెలిపారు. ఫోరెన్సిక్ ప్రయోగశాల వసతులు కొరవడటమే ఈ పరిస్థితికి కారణమని.. వాటిని దేశవ్యాప్తంగా మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. చండీగఢ్‌లోని కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్) ప్రాంగణంలో ‘సఖి సురక్ష అధునాతన డీఎన్ఏ ఫోరెన్సిక్ ప్రయోగశాల’ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆమె ఈ మేరకు ప్రసంగించారు. అత్యాచార కేసుల్లో నేర నిరూపణకు ఆధారాల సేకరణ ముఖ్యమని.. ఇందు కోసం ఆసుపత్రులు, పోలీస్‌స్టేషన్లకు త్వరలోనే కిట్‌లు పంపిణీ చేస్తామని చెప్పారు.

కుంభకోణం జరగలేదు: నిర్మలా సీతారామన్

లూధియానా: ఏఎన్-32 రవాణా విమాన విడిభాగాల కొనుగోలుకు ఉక్రెయిన్‌తో కుదిరిన ఒప్పందంలో భారత రక్షణ శాఖ, వైమానిక దళ అధికారులకు ముడుపులు అందినట్లు వచ్చిన వార్తలను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఖండించారు. ఈ వ్యవహారంలో ‘అవినీతి’ అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆమె ఈ మేరకు స్పందించారు. ముడుపుల ఆరోపణలపై ఉక్రెయిన్ అవినీతి నిరోధక విభాగం దర్యాప్తు జరుపుతోందని, ఈ వ్యవహారంలో న్యాయ సాయం అందించాలని భారత రక్షణ శాఖను కోరినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఉక్రెయిన్ ప్రభుత్వ రంగ సంస్థ అధికారులకు వ్యతిరేకంగా సాగుతున్న దర్యాప్తులో న్యాయసాయం అందించాలని మాత్రమే తమకు విజ్ఞప్తి అందినట్లు రక్షణ శాఖ అంతకుముందు తెలిపింది. నిర్మలా సీతారామన్ దీనిపై లూధియానాలో మాట్లాడారు. సదరు ఒప్పందం.. రెండు దేశాల ప్రభుత్వాల మధ్య కుదిరిందని చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీతో రక్షణ శాఖ కానీ వైమానిక దళం కానీ ప్రత్యక్షంగా చర్చించలేదని, ఎలాంటి ఒప్పందాన్నీ కుదుర్చుకోలేదని తెలిపారు.

అమ్ములపొదిలోకి ‘స్పైక్’ క్షిపణి!

దిల్లీ: శత్రు యుద్ధట్యాంకులను ధ్వంసం చేసే అధునాతన ‘స్పైక్’ క్షిపణులను ఇజ్రాయెల్ నుంచి సమకూర్చుకునేందుకు భారత్ సన్నద్ధమవుతోంది. నిజానికి ఇలాంటి ట్యాంకు విధ్వంసక క్షిపణులను దేశీయంగానే అభివృద్ధి చేసేందుకు డీఆర్‌డీవో నడుం బిగించింది. అయితే వీటి అభివృద్ధికి మూడేళ్లు పట్టే అవకాశం ఉండటంతో సైన్యం తక్షణావసరాల కోసం ఇజ్రాయెల్ నుంచి స్పైక్ క్షిపణులను దిగుమతి చేసుకోవాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

మణిపూర్‌లో క్రీడల విశ్వవిద్యాలయం

దిల్లీ: మణిపూర్‌లో జాతీయ క్రీడల విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఉద్దేశించిన అత్యవసర ఆదేశాలపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేశారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు 2014 బడ్జెట్‌లోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మణిపూర్ ప్రభుత్వం ఇంఫాల్ జిల్లాలోని కౌత్రక్‌లో ఇందుకోసం 325.90 ఎకరాలను కేటాయించింది. ప్రత్యేకంగా క్రీడల కోసం దేశంలోనే తొలిసారిగా ఈ జాతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటవుతోంది. ఇక్కడ వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు క్రీడల యాజమాన్యం, క్రీడల సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు.

మూడు హైకోర్టులకు 14 మంది జడ్జీల నియామకం

దిల్లీ: మూడు హైకోర్టులకు 14 మంది అదనపు న్యాయమూర్తులను నియమించినట్టు న్యాయశాఖ తెలిపింది. మద్రాసు హైకోర్టుకు ఏడుగురు, కర్ణాటక హైకోర్టుకు ఇద్దరు, మధ్యప్రదేశ్ హైకోర్టుకు అయిదుగురిని నియమించినట్టు వివరించింది. మద్రాసు హైకోర్టులోని మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 75 కాగా ప్రస్తుతం 56 మంది ఉన్నారు. ఇంకా 19 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కర్ణాటక హైకోర్టుకు మొత్తం 62 న్యాయమూర్తి పదవులు మంజూరు కాగా, ప్రస్తుతం 29 మందే ఉన్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టులో 53 మంది న్యాయమూర్తులకుగానూ 31 మందే ఉన్నారు. ఇంకా 22 స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

పాక్ తాత్కాలిక ప్రధానిగా ముల్క్ ప్రమాణం

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తాత్కాలిక ప్రధానిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నసీరుల్ ముల్క్(67) శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. జులై 25న పార్లమెంటుకు ఎన్నికలు జరిగి, కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు ఈయన పదవిలో ఉంటారు. ఈ 2 నెలలు విధానపరంగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఆయనకు లేదు. 70 ఏళ్ల చరిత్రలో 2002 తరువాత కేంద్రప్రభుత్వం పూర్తిగా ఐదేళ్లు పాలించగలగడం ఇదిరెండోసారి. ఎక్కువ కాలం సైన్యమే పరిపాలించింది. గత 16 ఏళ్లలో ఏడుగురు ప్రధానులుగా ప్రమాణస్వీకారం చేయడం గమనార్హం.

కపిల్‌దేవ్‌తో షా భేటీ

దిల్లీ: క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్‌తో భాజపా అధ్యక్షుడు అమిత్ షా భేటీ అయ్యారు. మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలపై ప్రచారం చేసేందుకు పార్టీ చేపట్టిన “సహకారం కోసం సంప్రదింపులు (కాంటాక్ట్ ఫర్ సపోర్ట్)” కార్యక్రమంలో భాగంగా.. శుక్రవారం కపిల్ నివాసానికి షా వెళ్లారు. కేంద్రం చేపట్టిన వివిధ పథకాల గురించి కపిల్ కుటుంబ సభ్యులకు వివరించారు. మొత్తంగా 50 మంది ప్రముఖులను షా కలిసి.. వారికి ప్రభుత్వ విజయాలపై అవగాహన కల్పిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే మాజీ సైన్యాధిపతి దల్బీర్ సింగ్ సుహాగ్, రాజ్యాంగ నిపుణుడు సుభాష్ కశ్యప్‌లను షా కలిశారు. దాదాపు 4 వేల మంది భాజపా నాయకులు.. లక్ష మంది ప్రముఖులను కలిసేలా ఈ కార్యక్రమాన్ని భాజపా చేపట్టింది.

స్పెయిన్ ప్రధాని రాజీనామా

మాడ్రిడ్: అవిశ్వాస తీర్మానం ఎదుర్కోకముందే స్పెయిన్ దేశం ప్రధాని మరియానో రాజొయ్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ప్రతిపక్ష నేత పెడ్రో సాంచెజ్ బాధ్యతలు చేపట్టనున్నారు. రాజొయ్‌కు చెందిన పాపులర్ పార్టీపై అవినీతి ఆరోపణలు రావడంతో ప్రతిపక్ష సోషలిస్టులు గత వారంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి సోషలిస్టులను వ్యతిరేకించే ఇతర పార్టీలు కూడా మద్దతు పలకడంతో ఓటమి అనివార్యమయింది. పరిస్థితులను గమనించిన రాజొయ్ పదవి నుంచి తప్పుకొన్నారు. ఇతర పార్టీల మద్దతుతో ఏర్పాటయ్యే సాంచెజ్ ప్రభుత్వం సుస్థిరంగా ఉండబోదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోయలో పడిన బస్సు

• హిమాచల్‌ప్రదేశ్‌లో 9 మంది మృతి

శుక్రవారం సిమ్లాలో లోయలో పడిపోయిన బస్సు

సిమ్లా: కొండపై ఘాట్ మీదుగా ప్రయాణిస్తున్న బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో దారుణం చోటుచేసుకుంది. మలుపు తిరిగే సమయంలో బస్సు అదుపు తప్పడంతో లోయలో పడి తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మందికి తీవ్రగాయలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. సిమ్లాకు 45 కిమీ దూరంలోని ఝైలాకు సమీపాన గల గజేడ్రి వద్ద ఆర్టీసీబస్సు లోయలో పడిపోయిందని సిమ్లా ఎస్పీ తెలిపారు. కొండపైగల రోడ్డు పైనుంచి 250 మీటర్ల వరకు బస్సు పల్టీలు కొట్టడంతో ప్రయాణికులకు గట్టి దెబ్బలు తగిలాయన్నారు. డ్రైవర్ సహా 9 మంది చనిపోయారని చెప్పారు.

భారత్ సహా 39 దేశాల్లో పెన్సిలిన్ కరవు

దిల్లీ: చాలా దేశాల్లో యాంటీ బయాటిక్స్ కొరత నెలకొందని యాక్సెస్ టు మెడిసిన్ ఫౌండేషన్ (ఏఎంఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఫలితంగా ప్రాథమిక ఆరోగ్యం చిక్కుల్లో పడిందని పేర్కొంది. భారత్ సహా 39 దేశాల్లో ముఖ్యమైన పెన్సిలిన్ ఔషధం లభ్యం కావట్లేదని తెలిపింది. ఈ మేరకు ఓ నివేదికను విడుదల చేసింది. “2001-13 మధ్య అమెరికాలో 148 రకాల యాంటీ బయాటిక్స్ కొరత నెలకొంది. 2010లో 15 దేశాల్లో క్షయ నివారణకు అవసరమైన సూదిమందులు లభ్యం కాలేదు. 2015 నుంచి 39 దేశాల్లో ముఖ్యమైన పెన్సిలిన్ రకం అసలు దొరకడమే లేదు. ఇప్పుడు భారత్, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, అమెరికాలూ ఈ జాబితాలో చేరిపోయాయి. యాంటీ బయాటిక్స్ మార్కెట్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఔషధాలకు కొరత ఏర్పడుతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే కలుషిత ఆహారం, సాధారణ గాయాలు కూడా పెద్ద సమస్యలుగా మారతాయి” అని ఏఎంఎఫ్ కార్యనిర్వాహక సంచాలకురాలు జయశ్రీ కె అయ్యర్ తెలిపారు.

బోధ్‌గయ బాంబుపేలుళ్ల కేసు

ఐదుగురికి జీవితఖైదు

దిల్లీ: సంచలనం సృష్టించిన బోధ్‌గయ బాంబు పేలుళ్ల కేసులో శుక్రవారం తీర్పు వెలువడింది. మొత్తం ఐదుగురు దోషులకూ జీవితఖైదుతో పాటు రూ.50 వేలచొప్పున జరిమానా పడింది. ప్రత్యేక జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) న్యాయస్థానం న్యాయమూర్తి మనోజ్‌కుమార్‌సిన్హా ఈమేరకు తీర్పు ఇచ్చారు. ప్రపంచ ప్రసిద్ధ బౌద్ధుల పుణ్యక్షేత్రమైన బోధ్‌గయ.. జులై 7, 2013న వరుస బాంబు పేలుళ్లలో దద్దరిల్లిపోయింది. పలువురు పర్యాటకులు, బౌద్ధులు గాయపడ్డారు. ఇంతియాజ్ అన్సారీ, హైదర్ అలీ, ముజీబ్ ఉల్లా, ఒమైర్ సిద్ధిఖీ, అజారుద్దీన్ ఖురేషి ఈ ఘాతుకానికి పాల్పడ్డారని దర్యాప్తులో తేలింది. వీరికి తౌఫిక్ అహ్మద్ అనే బాలుడు సహకరించాడని గత ఏడాది అక్టోబరులో రుజువవడంతో, మూడేళ్లపాటు జైలుశిక్ష పడింది. అక్టోబరు 2013లో గుజరాత్ ముఖ్యమంత్రి మోదీ ఎన్నికలర్యాలీ సందర్భంగా ఈ ఆరుగురూ బాంబుపేలుళ్లకు పాల్పడ్డారనే కేసులోనూ వీరు నిందితులు. బోధ్‌గయలో బాంబుల కారణంగా ఎవరి ప్రాణాలు పోలేదు కాబట్టే జీవితఖైదు పడిందని, లేదంటే మరణశిక్ష పడేదని ప్రభుత్వన్యాయవాది లలన్‌కుమార్ సిన్హా పేర్కొన్నారు. మయన్మార్‌లో ముస్లింలపై జరిగిన అకృత్యాలను సహించలేక, యువకులు ఆవేశపడ్డారని; హైకోర్టుకు దరఖాస్తు చేస్తామని దోషుల తరఫు న్యాయవాది సూర్యప్రకాశ్‌సింగ్ చెప్పారు.

శుక్రవారం పట్నాలో ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం వద్ద బుద్ధ గయ పేలుళ్ల కేసు నిందితులు

ముంబయి పేలుళ్ల కుట్రదారు అహ్మద్‌షేక్ అరెస్టు

అహ్మదాబాద్: 1993లో ముంబయిలో జరిగిన వరుస బాంబుపేలుళ్ల కేసుకు సంబంధించి అహ్మద్ షేక్(52) అలియాస్ అహ్మద్ లంబు అనే కుట్రదారుడ్ని గుజరాత్ ఉగ్రవాద వ్యతిరేక దళం అరెస్టు చేసింది. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దక్షిణ గుజరాత్‌లోని వల్సాడ్ తీరంలో షేక్‌ను పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బాంబుపేలుళ్లకు కుట్ర పన్నిన షేక్, విధ్వంసం తరువాత మన దేశం విడిచివెళ్లిపోయాడన్నారు. ఇతన్ని పట్టుకుంటే రూ.ఐదు లక్షల రివార్డు ఉందని, ఇప్పటికే రెడ్‌కార్నర్ నోటీసు కూడా జారీ చేశామన్నారు.

భాజపా నేత శేఖర్‌కు ముందస్తు బెయిలు నిరాకరణ

దిల్లీ: మహిళా విలేకర్లు, మీడియా గురించి అభ్యంతరకర ప్రస్తావనలు ఉన్న ఫేస్‌బుక్ పోస్ట్‌ను పంచుకున్న కేసులో భాజపా నేత, నటుడు ఎస్వీఈ శేఖర్‌కు ముందస్తు బెయిలు ఇవ్వడానికి సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. సాధారణ బెయిలు కోసం తమిళనాడులోని ఎగ్మోర్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే అభియోగపత్రం నమోదు చేసినందున ముందస్తు బెయిలు కుదరదని న్యాయమూర్తులు జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు, జస్టిస్ ఎం.ఎం.శాంతనగౌడర్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. శేఖర్ పెద్ద నటుడు అన్న సంగతి తనకు తెలుసని, అయినా చట్టం కింద ఎవరికీ ప్రత్యేక వెసులుబాటు ఉండదని జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జూన్ 1 వరకు అరెస్టు చేయకుండా గత నెల 22న సుప్రీంకోర్టు శేఖర్‌కు ఉపశమనం కలిగించింది. తాను ఇతరులతో పంచుకున్న పోస్టులో ఉన్న అంశాలు తాను రాసినవి కావని, వేరే వ్యక్తి నుంచి వచ్చిన పోస్ట్‌ను పంచుకున్నానని, అందులోని అంశాల గురించి తెలిసిన తర్వాత దాన్ని తొలగించానని శేఖర్.. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన విజ్ఞప్తిలో పేర్కొన్నారు. తమిళనాడు గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్(78)ను గతంలో ఒక మహిళా విలేకరి ఒక ప్రశ్న వేయగా సమాధానాన్ని నిరాకరిస్తున్నట్లుగా ఆమె బుగ్గపై తట్టారు. గవర్నర్ తర్వాత ఆమెకు క్షమాపణలు తెలిపారు. ఈ సంఘటన నేపథ్యంలో మీడియా, మహిళావిలేకర్లపై ఫేస్‌బుక్ పోస్ట్‌లో అభ్యంతరకర ప్రస్తావనలు కనిపించడం వివాదాస్పదమయింది.

ఘర్షణలతో రగులుతున్న షిల్లాంగ్

షిల్లాంగ్: పరస్పర దాడులు, ఘర్షణలు, హింసాత్మక ఘటనలతో మేఘాలయ రాజధాని షిల్లాంగ్ రెండు రోజులుగా అట్టుడుకుతోంది. తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో 14 ప్రాంతాల్లో శుక్రవారం కర్ఫ్యూ విధించగా.. పలుచోట్ల అంతర్జాల సేవలను నిలిపివేశారు. ఈ ఘర్షణల్లో ఓ జర్నలిస్టు, ముగ్గురు స్థానికులతో పాటు పలువురు పోలీసులు గాయపడ్డారు. థెమ్ మెటోర్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు గురువారం ఓ బస్సు నిర్వాహకుడిపై దాడికి పాల్పడటం అల్లర్లకు దారితీసింది. అతను చనిపోయాడంటూ సామాజిక మాధ్యమాల్లో వదంతులు చెలరేగడంతో బస్సు డ్రైవర్లంతా మూకుమ్మడిగా అక్కడికి చేరుకోగా ఇరువర్గాల మధ్య ఘర్షణలు చెలరేగాయి. పోలీసులు భాష్పవాయు ప్రయోగంతో గుంపులను చెదరగొట్టారు. అనంతరం పలు ప్రాంతాలకు అల్లర్లు విస్తరించాయి. మోట్‌ఫ్రాన్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులపై స్థానికులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతల పరిస్థితిని ముఖ్యమంత్రి సీకే సంగ్మా సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రశాంత పరిస్థితులు నెలకొనేలా ప్రజలంతా సహకరించాలని సీఎం కోరారు.

3000 కోట్లా.. అంతా ఉత్తిదే

● కార్పొరేట్ పన్ను బకాయిలు రద్దు చేయలేదు
● ఆర్‌టీఐ కింద ఇచ్చిన సమాచారం తప్పు: ఐటీ విభాగం

ముంబయి: కార్పొరేట్ పన్ను బకాయిల రద్దుపై సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద ఇచ్చిన వివరాల్లో తప్పు దొర్లిందని ఆదాయపు పన్ను విభాగం స్పష్టత ఇచ్చింది. అసలు పన్ను బకాయిలేవీ రద్దు చేయలేదని తెలిపింది. కార్పొరేట్ పన్ను బకాయిల వివరాలు కోరుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ సామాజిక కార్యకర్త చంద్ర శేఖర్ గౌర్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సమాధానమిస్తూ 2016-17, 2017-18 సంవత్సరాల్లో రూ.3,002.20 కోట్ల మేర కార్పొరేట్ పన్ను బకాయిలు రద్దు చేసినట్లు ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (పీఆర్-సీసీఐటీ, హైదరాబాద్) తెలియజేసింది. మరోవైపు ఈ వివరాలను ఉపయోగించి ఆదాయపు పన్ను శాఖ భారీ మొత్తంలో పన్ను బకాయిలు రద్దు చేసినట్లు ఓ వార్తా సంస్థ కథనాన్ని ప్రచురించింది. అప్పుడు ఈ వార్తపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు అధికార ప్రతినిధి స్పందిస్తూ కార్పొరేట్ పన్ను బకాయిలను రద్దు వివరాలను ఆర్- సీసీఐటీ, హైదరాబాద్ తప్పుగా సమాచారం ఇచ్చిందని తెలిపారు. సీబీడీటీ ఛైర్‌పర్సన్ సురభి అహ్లువాలియా తాజాగా ఈ విషయంపై మాట్లాడుతూ 'ఆ రెండు ఆర్థిక సంవత్సరాల్లో వసూలైన పన్ను బకాయిలను రద్దయిన పన్ను బకాయిలుగా అనుకొని కేంద్ర ప్రధాన సమాచార అధికారి సమాచారం ఇచ్చార'ని వెల్లడించారు. ఈ సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసలు పన్ను బకాయిలే రద్దు చేయలేదని తెలిపారు. తప్పు దొర్లిన విషయాన్ని పన్ను బకాయిల రద్దుపై సమాచారం అడిగిన చంద్రశేఖర్ గౌర్‌కు కూడా తెలియజేశామని పేర్కొన్నారు.

ఈనాడు బిజినెస్

ఈ కోటి రూపాయలూ మీవే

● బినామీలపై సమాచారమివ్వండి.. డబ్బులు పట్టుకెళ్లండి
● విదేశీ నల్లధన గుట్టు రట్టుచేస్తే రూ.5 కోట్లు
● పన్ను ఎగవేతదార్లపై ఐటీ విభాగం మరో అస్త్రం

మీ చుట్టపక్కలో లేదంటే మీ ఊర్లో ఎవరైనా.. ఎవరికైనా బినామీగా ఉన్నారని మీకు తెలుసా.. అలాంటి సమాచారమేదైనా మీ దగ్గర ఉందా? అయితే ఇంకెందుకు ఆలస్యం.. సాక్ష్యాధారాలతో ఆదాయపు పన్ను(ఐటీ) విభాగానికి తెలియజేసి.. మంచి ప్రతిఫలం సొంతం చేసుకోండి.
వందలు కాదు.. వేలు కాదు.. లక్ష కాదు.. అక్షరాలా కోటి రూపాయలు.
అవాక్కవకండి.. మీరు విన్నది నిజమే..
ఒక సగటు జీవి ఎన్నేళ్లు పనిచేస్తే ఇంత కూడబెట్టగలడు.
మరి ఇంత పెద్ద మొత్తంలో బహుమానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధపడిందంటే..
పన్ను ఎగవేత కోసమని పెట్టిన బినామీ పుట్టల్లో ఎన్ని కోట్ల కోట్లు దాగున్నాయో..
ఎంత సంఖ్యలో స్థిరాస్తులు అజ్ఞాతవాసం చేస్తున్నాయో..
అందుకే వీటన్నింటి లెక్కలు తేల్చేందుకు ప్రజల సహకారాన్ని ప్రభుత్వం కోరుతోంది.. ప్రతిగా భారీ నజరానాను ఇస్తోంది..

ఏమిటా పథకం..: బినామీ లావాదేవీలపై సమాచారం చేరవేసిన వారికి ప్రోత్సాహక పథకాన్ని సీబీడీటీ ప్రారంభించింది. ఈ కొత్త పథకంలో భాగంగా బినామీ లావాదేవీలపై సమాచారమిస్తే రూ.కోటి వరకు బహుమానంగా ఇవ్వనుంది. అంతే కాదు.. విదేశాల్లో నల్లధనాన్ని దాచిన వారి సమాచారం తెలియచేస్తే బహుమతి విలువ రూ.5 కోట్ల వరకు పెరుగుతుంది. దేశ పౌరులే కాదు విదేశీయులు సమాచారమిచ్చినా నజరానా పొందేందుకు అర్హులే. అలాగే ఆదాయపు పన్ను ఎగ్గొట్టిన లేదంటే ఆస్తులు వెల్లడించని వారి సమాచారం ఇస్తే నజరానా కింద ఆదాయపు పన్ను విభాగం రూ.50 లక్షల వరకు ఇవ్వనుంది. ఇంతకు మునుపు ఉన్న పథకానికి ఈవిధంగా సవరణ చేసింది.

ఎవరికి చెప్పాలి..: నజరానా సంగతి సరే.. మరి బినామీ లావాదేవీల గురించి సమాచారాన్ని ఎవరికి తెలియజేయాలి? మేం సమాచారం ఇచ్చిన విషయం అవతలి వ్యక్తులకు తెలిస్తే మా పరిస్థితేంటి? ఇలాంటి ప్రశ్నలు మీలో ఉదయించడం సహజమే. వీటన్నింటిని పక్కకు పెట్టేయండి. బినామీ వ్యక్తుల సమాచారం తెలిస్తే ఆ వివరాలను నిర్దేశిత రూపంలో మీ దగ్గర్లో ఉన్న ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలోని సంయుక్త లేదా అదనపు కమీషనర్లకు సమర్పించాలి. వాళ్లు మీ పేరును గోప్యంగా ఉంచుతారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు, ప్రోత్సాహక బహుమతి వివరాలు బయటకు చెప్పబోమని ఆదాయపు పన్ను శాఖ ఇప్పటికే భరోసా ఇచ్చింది కూడా. దేశంలో నల్లధనం నియంత్రణకు, పన్ను ఎగవేతలను అరికట్టేందుకు ఆదాయపు పన్ను శాఖ చేపడుతోన్న చర్యల్లో ప్రజలు కూడా పాలుపంచుకునేలా చేయడమే ఈ ప్రోత్సాహక పథకం వెనక ప్రధాన ఉద్దేశం. ఈ పథకానికి సంబంధించి పూర్తి వివరాలు ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

మేము పంపలేదు

బ్యాంక్ స్పష్టీకరణ

దిల్లీ: స్వతంత్ర విచారణ పూర్తయ్యేవరకు సెలవుపై వెళ్లాలని చందా కొచ్చర్‌ను ఆదేశించినట్లు వచ్చిన వార్తలు నిజం కాదని ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డు తెలిపింది. చందాకొచ్చర్ తన వార్షిక సెలవును, ముందస్తు ప్రణాళిక ప్రకారమే వినియోగించుకుంటున్నారని పేర్కొంది. ఈ వారంలో చందాకొచ్చర్ కార్యాలయానికి రాలేదని, జూన్ 10న తిరిగి విధులకు హాజరు కావచ్చని సమాచారం. ఆమె స్థానంలో వేరొకరిని నియమించుకునేందుకు, ఎంపిక కమిటీని ఏర్పాటు చేశామన్న వార్త కూడా సరికాదని స్పష్టం చేసింది. ఆంగ్ల పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందిస్తూ, బ్యాంక్ బోర్డు ఈ వివరణ ఇచ్చింది.

కష్టకాలమే!

● ఏకపక్ష మద్దతు నుంచి విచారణ దిశగా బోర్డు
● దిగిపోవాలి లేదా సెలవుపై వెళ్లాలనే వాదనలు
● ఇదే సంప్రదాయమైతే దుర్వినియోగానికీ వీలు
● మరో విడత పదవి అనుమానమే ● బ్యాంక్ పటిష్ఠతపై బోర్డు దృష్టి

వీడియోకాన్ గ్రూప్‌నకు ఐసీఐసీఐ బ్యాంక్ రుణాలు మంజూరు చేయడంలో, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) చందాకొచ్చర్‌కు 'నీకిది-నాకది' ప్రయోజనాలు ఒనగూరాయని వచ్చిన ఆరోపణలపై బ్యాంక్ బోర్డు స్వతంత్ర విచారణకు ఆదేశించడం సంచలనం రేపుతోంది. ఈ విషయంలో ఎండీపై తమకు పూర్తి విశ్వాసం ఉందంటూ రెండు నెలల పాటు మద్దతు పలికిన బోర్డు, ఇప్పుడు 'స్వతంత్రత, విశ్వసనీయత' కలిగిన వ్యక్తితో విచారణ నిర్వహిస్తామని పేర్కొంది. అయితే చందాకొచ్చర్‌పై తాజాగా మరిన్ని ఆరోపణలు రావడం వల్లే, బ్యాంక్ బోర్డు తమ నిర్ణయాన్ని మార్చుకుందని సమాచారం. ముఖ్యంగా బ్యాంక్‌ను సంస్థాగతంగా పటిష్ఠం చేయడమే బోర్డు లక్ష్యంగా ఉంది. ఇప్పుడు చందాకొచ్చర్ సెలవుపై వెళ్లడంతో, బోర్డే ఆమెను సెలవుపై వెళ్లమందనే ఊహాగానాలు రేగాయి. దీన్ని బోర్డు ఖండించింది.

స్వతంత్ర కమిటీ వల్ల..

'తగిన కారణాలు వెల్లడించకనే, చందాకొచ్చర్‌కు ఎందుకు మద్దతు పలికారంటూ' మదుపుదార్లు, కార్పొరేట్ గవర్నెన్స్ నిపుణుల నుంచి ఎదురైన విమర్శల నుంచి కాపాడుకునేందుకు 'విచారణ కమిటీ నియామకం' బ్యాంక్ బోర్డుకు ఉపకరిస్తుంది. అన్ని అంశాలు స్వతంత్ర విచారణ పరిధిలోకి వస్తాయని, దీన్ని ఆడిట్ కమిటీ పర్యవేక్షిస్తుందని బోర్డు ప్రకటించడంతో, ఏకపక్షంగా చందాకొచ్చర్‌కు మద్దతు కొనసాగించబోమని స్పష్టం చేసినట్లయ్యింది. ఎండీపై ఆరోపణలు వచ్చాక, ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డు సమావేశాలకు ప్రభుత్వ ప్రతినిధి (నామినీ) హాజరు కాలేదు. స్వతంత్ర విచారణను ప్రకటించిన మంగళవారం నాటి సమావేశంలోనూ ఆయన పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో బ్యాంక్ బోర్డు మద్దతు చందాకొచ్చర్‌కు ఎంతో అవసరం. అయితే బోర్డు ప్రకటనలు గమనిస్తే, ఇప్పుడు బ్యాంకును కాపాడుకోవడమే ముఖ్యమని భావిస్తున్నట్లుంది. అందువల్లే రెండు నెలల క్రితం మాదిరి తమ ఎండీకి అండగా నిలవకుండా, విచారణకు ఆదేశించింది. ఇది బ్యాంక్‌తో పాటు వాటాదార్లకు కూడా మేలు చేసే పరిణామమే. అన్నీ సక్రమంగానే జరిగాయని కనుక విచారణలో తేలితే, చందాకొచ్చర్‌పై ఆరోపణలకు శాశ్వతంగా తెరపడుతుంది.

కొచ్చర్ భవితవ్యంపై మార్చిలో నిర్ణయం: చందాకొచ్చర్ పదవీకాలం పొడిగింపుపై వచ్చే మార్చిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆమెపై ఆరోపణలు రుజువు కాకపోయినా, మొండి బకాయిల విషయంలో సరిగా వ్యవహరించలేకపోయారనే అంశం ప్రతిబంధకం కావచ్చు. ఇప్పటికే యాక్సిస్ బ్యాంక్ ఎండీ శిఖా శర్మ విషయంలో ఇలానే జరగడం గమనార్హం. అందువల్ల మరో విడత పదవి పొందడం కష్టమే కావచ్చు.

ఇప్పుడే దిగిపోవాలా/ సెలవుపై వెళ్లాలా?

చందాకొచ్చర్ పదవి నుంచి ఇప్పుడే వైదొలగాలని లేదా విచారణ ముగిసేవరకు సెలవుపై వెళ్లాలనే చర్చా జరుగుతోంది. గతంలో ఇలాంటి వ్యవహారాలు పరిశీలిస్తే.. గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకును యూటీఐ బ్యాంక్‌లో విలీనం చేసుకోవాలన్న ప్రక్రియ గతంలో విఫలమైంది. అదే జరిగితే తనకు ప్రయోజనం లభిస్తుందనే ఆరోపణలు రావడంతో, బాధ్యుడిగా ఉన్న పీజే నారాయణ సెలవుపై వెళ్లారు. అనంతరం నాయక్‌పై ఆరోపణలన్నీ తప్పుగా రుజువయ్యాక, మళ్లీ బ్యాంక్‌లో బాధ్యతలు చేపట్టారు. అదే ఇప్పుడు యాక్సిస్ బ్యాంక్‌గా ఉంది. ఇప్పుడు ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డు కూడా విచారణకు పూర్తిగా సహకరిస్తామని పేర్కొంది. కానీ చందాకొచ్చర్ ఎండీగా తమపై అధికారం చెలాయిస్తున్న నేపథ్యంలో, ఇతర ఉన్నతాధికారులు స్వేచ్ఛగా వివరాలు వెల్లడిస్తారా అనేది అనుమానమే. వీడియోకాన్ ప్రమోటర్ వేణుగోపాల్ ధూత్‌తో తన భర్తకు ఉన్న లావాదేవీలను ఆమె ఎంతవరకు వెల్లడిస్తారనేదీ ప్రశ్నార్థకమే అంటున్నారు. వీడియోకాన్ గ్రూప్‌నకు ఐసీఐసీఐ బ్యాంక్ రుణాలిచ్చిన వ్యవహారాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 2016లో పరిశీలించి, అందులో తప్పులేమీ జరగలేదని పేర్కొందని ఇటీవల వెలుగులోకి వచ్చింది. కానీ.. చందాకొచ్చర్ భర్త సంస్థలకు పెట్టుబడులు ఎక్కడినుంచి వచ్చాయనే అంశంపై సందేహాలు వ్యక్తం చేసింది. ఈ విచారణ అంశం తమ పరిధిలోది కాదని ఆర్‌బీఐ అప్పట్లో పేర్కొంది.

దుర్వినియోగానికీ వీలు!

ఒకవేళ కొచ్చర్ కనుక పదవి నుంచి తప్పుకుంటే, ఇలాంటి ఆరోపణలు వచ్చినపుడు భవిష్యత్తులో కూడా బ్యాంకుల నిర్వాహకులు పదవి నుంచి వైదొలగే సంప్రదాయం పటిష్ఠమవుతుంది. ఉన్నతాధికార వ్యవస్థను బలహీనపరచే, దుర్వినియోగం చేసే సాధనంగా కూడా ఇది ఉపయోగ పడొచ్చు. అయితే చందాకొచ్చర్‌ను కొనసాగిస్తారా అనే చర్చ వచ్చినపుడు, ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డుపైనే ఇది ఆధారపడుతుందని చెప్పొచ్చు. విచారణ ప్రక్రియ కనుక సాఫీగా, స్వతంత్రంగా పూర్తయితే, సంస్థాగతంగా బ్యాంక్ మరిత బలోపేతం అవుతుంది. అన్ని విషయాలను తన వాటాదార్లకు సమయానుకూలంగా బ్యాంక్ వెల్లడించాల్సి ఉంటుంది.

ఎస్సార్ గ్రూప్ నుంచీ లబ్ధి

చందాకొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన న్యూపవర్‌లో పెట్టుబడులు పెట్టినందున, ఎస్సార్ గ్రూప్‌నకు చెందిన రుయా సోదరులు ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి మితిమీరిన ప్రతిఫలం పొందారని స్వతంత్ర కార్యకర్త అరవింద్ గుప్తా ఆరోపించారు. తమ అల్లుడు నిశాంత్ కనోడియా, మేనల్లుడు అనిరుధ్ భువల్కా ద్వారా 2010 డిసెంబరు నుంచి 2012 మార్చి మధ్య న్యూపవర్, దాని అనుబంధ సంస్థల్లోకి షేర్లు, తప్పనిసరిగా మార్పిడికి వీలున్న ప్రిఫరెన్స్ షేర్ల ద్వారా పెట్టుబడులు పెట్టారని ప్రధానికి 2016 మార్చిలో పంపిన లేఖలో గుప్తా తెలిపారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి పొందిన సమాచారం మేరకు మారిషస్ కంపెనీ ఫస్ట్‌ల్యాండ్ హోల్డింగ్స్ ద్వారా రూ.324.37 కోట్లు పెట్టుబడి పెట్టారు. అమెరికాలోని మిన్నసోటా, కెనడాలోని అల్‌గోమా స్టీల్ కొనుగోలు కోసం ఎస్సార్ గ్రూప్‌నకు సింగపూర్, బ్రిటన్, న్యూయార్క్‌లలోని ఐసీఐసీఐ బ్యాంక్ విదేశీ శాఖల నుంచి భారీ రుణాలు అందినపుడు, ఇది నడిచింది. ఎస్సార్ క్యాపిటల్ హోల్డింగ్స్ కూడా మరో రూ.163.53 కోట్లను న్యూపవర్ రెన్యూవబుల్ గ్రూప్‌లో పెట్టిందని ఆరోపించారు. ఈ ఆరోపణలను ఖండిస్తున్నట్లు ఎస్సార్ గ్రూప్ ప్రకటించింది.

పరుగులు తీశాయ్

మేలోనూ ఆకట్టుకున్న వాహన విక్రయాలు

దిల్లీ: కొత్త ఆర్థిక సంవత్సరంలో (2018-19) వరుసగా రెండో నెల (మే) కూడా వాహన సంస్థలు అమ్మకాల జోరు కొనసాగించాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, హోండా కార్స్, ఫోర్డ్ ఇండియా రెండంకెల వృద్ధి నమోదు చేశాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా ఒక అంకె వృద్ధి సాధించాయి. మారుతీ సుజుకీ దేశీయ విక్రయాలు 1,63,200గా ఉన్నాయి. గతేడాది మేలో కంపెనీ విక్రయించిన 1,30,676 కార్లతో పోలిస్తే ఇవి 24.9 శాతం అధికం. స్విఫ్ట్, ఎస్టిలో, డిజైర్, బాలెనోల అమ్మకాలు 51,234 నుంచి 50.8 శాతం వృద్ధితో 77,263కు చేరాయి. ఎర్టిగా, ఎస్-క్రాస్, విటారా బ్రెజాల అమ్మకాలు 22,608 నుంచి 13.4 శాతం వృద్ధితో 25,629కి పెరిగాయి. ఆల్టో, వ్యాగన్‌ఆర్‌లతో కూడిన చిన్న కార్ల విభాగ అమ్మకాలు 3.1 శాతం తగ్గి 37,864కు పరిమితమయ్యాయి. గత ఏడాది మేలో ఇవి 39,089గా ఉన్నాయి. టాటా మోటార్స్ 61 శాతం, హోండా కార్స్ 41 శాతం చొప్పున అమ్మకాలు పెంచుకున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు మాత్రం కేవలం 2 శాతం మాత్రమే పెరిగాయి. ఫోర్డ్ ఇండియా అమ్మకాలు 6,742 నుంచి 9,069కు చేరాయి. హ్యుందాయ్ అమ్మకాలు 11.4 శాతం పెరిగి 50,265 నుంచి 56,016కు చేరాయి.

ఇక ద్విచక్రవాహనాలకొస్తే.. హీరో మోటోకార్ప్ 11 శాతం వృద్ధితో 6,33,884 నుంచి 7,06,365 బైకుల్ని విక్రయించింది. బజాజ్ ఆటో విక్రయాలు 30 శాతం అధికమయ్యాయి. టీవీఎస్ మోటార్ విక్రయాలు 10 శాతం పెరిగాయి. వివిధ కంపెనీల విక్రయాల గణాంకాలు పట్టికలో..

మేలో వాహన విక్రయాలు (శాతంలో)

కంపెనీ	2018	2017	వృద్ధి/క్షీణత
మారుతీ సుజుకీ	1,63,200	1,30,676	24.9
టాటా మోటార్స్	17,489	10,855	61
మహీంద్రా అండ్ మహీంద్రా	20,715	20,392	2
హ్యుందాయ్ మోటార్	56,016	50,265	11.4
ఫోర్డ్ ఇండియా	9069	6742	34.5
ద్విచక్ర వాహనాలు			
హీరో మోటోకార్ప్	7,06,365	6,33,884	11
బజాజ్ ఆటో	4,07,044	3,13,756	30
టీవీఎస్ మోటార్	3,09,865	----	10
హోండా మోటార్ సైకిల్	5,51,601	5,37,035	3
రాయల్ ఎన్‌ఫీల్డ్	74,697	---	23
సుజుకీ మోటార్‌సైకిల్	53,167	38,923	36.59



మాల్యాపై సెబీ నిషేధం

దిల్లీ: బ్యాంకులకు రుణం ఎగ్గొట్టి లండన్‌కు పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యాను స్టాక్ మార్కెట్ల నుంచి మరో మూడేళ్లపాటు నిషేధిస్తున్నట్లు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వెల్లడించింది. నమోదిత కంపెనీల్లో డైరెక్టర్‌గా మరో అయిదేళ్లపాటు కొనసాగకుండా అతనిపై నిషేధం విధించింది. యునైటెడ్ స్పిరిట్స్‌లోకి అక్రమంగా నిధులు మళ్లించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. మాల్యాతో సహా మాజీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) అశోక్ కపూర్, మాజీ సీఎఫ్ఓ మురళిపై కూడా ఏడాదిపాటు నిషేధం విధించింది. జనవరి 2017లోనే మాల్యాతో సహా యునైటెడ్ స్పిరిట్స్‌కు చెందిన ఆరుగురు మాజీ అధికారులపై (అశోక్, మురళి ఉన్నారు) సెబీ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. తాజాగా అశోక్, మురళి కూడా నమోదిత కంపెనీల్లో డైరెక్టర్‌గా కొనసాగేందుకు వీలు లేకుండా వారిపైనా మరో ఏడాదిపాటు నిషేధం విధించింది. యునైటెడ్ స్పిరిట్స్ సంస్థకు ఛైర్మన్, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న మాల్యా ఫిబ్రవరి 2016లో రాజీనామా చేశారు. ప్రైస్ వాటర్ కూపర్స్ (పీడబ్ల్యూసీ) నివేదిక ప్రకారం, యునైటెడ్ స్పిరిట్స్ నుంచి యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) గ్రూపునకు దాదాపు రూ.655 కోట్ల నిధులను అక్రమంగా మళ్లించారు. దీంతో యునైటెడ్ స్పిరిట్స్ ఆస్తులు-అప్పులు పట్టిక (బ్యాలెన్స్ షీట్)పై తీవ్ర ప్రభావం పడింది. దీన్ని సరిచేసేందుకు తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ఖాతాల పుస్తకాల్లో మార్పు చేశారు. ఇవన్నీ మాల్యాతోపాటు మరికొంత మంది అధికారులకు ముందే తెలుసనని సెబీ గుర్తించింది. వెంటనే రంగంలోకి దిగి చర్యలు తీసుకుంది.

✦ ఇదిలా ఉంటే ఫార్ములా వన్ మోటార్ స్పోర్ట్ కంపెనీ ఫోర్స్ ఇండియా డైరెక్టర్ పదవికి మాల్యా రాజీనామా చేశారు.

రుణాలు ప్రియం

వడ్డీరేట్లు పెంచిన ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఐసీఐసీఐ

దిల్లీ: రుణ రేట్లు మరింత భారం అవుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య, పరపతి విధాన సమీక్షకు ముందే స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఐసీఐసీఐ బ్యాంక్ నిధుల వ్యయం ఆధారిత వడ్డీరేట్లు (ఎంసీఎల్‌ఆర్)ను 0.1 శాతం పెంచడమే ఇందుకు కారణం. శుక్రవారం నుంచే కొత్తరేట్లు అమల్లోకి వచ్చినందున, రుణాలపై వడ్డీరేటు పెరుగుతుంది. గృహ, వాహన రుణాలు ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమై ఉండటమే ఇందుకు కారణం.

ఎస్‌బీఐ: మూడేళ్ల వరకు అన్ని కాలావధి రుణాలపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్ల చొప్పున పెంచింది. నెల వ్యవధి రుణాలపై ఎంసీఎల్‌ఆర్ 7.8 శాతం నుంచి 7.9 శాతానికి చేరింది. 3 ఏళ్ల రుణాలపై 8.35 శాతం నుంచి 8.45 శాతానికి పెరిగింది.

పీఎన్‌బీ: కనీస (బేస్) రేటును 9.15 శాతం నుంచి 9.25 శాతానికి పెంచింది. మూడేళ్లకు ఎంసీఎల్‌ఆర్‌ను 8.55 శాతానికి, అయిదేళ్ల రుణాలకు 8.7 శాతానికి పెంచింది.

ఐసీఐసీఐ బ్యాంక్: అయిదేళ్ల కాలావధికి ఎంసీఎల్‌ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు పెంచి 8.70 శాతం, ఏడాది రుణాలపై 8.40 శాతం చేసింది. మూడేళ్ల కాలావధి రుణాలపైనా ఎంసీఎల్‌ఆర్‌ను 0.1 శాతం పెంచింది. 3 నెలల వరకు రుణాలపై వడ్డీరేట్లు మార్చలేదు.

హెచ్‌డీఎఫ్‌సీ: సవరించేందుకు వీలున్న గృహరుణ రేట్లకు ఆధారంగా ఉండే రిటైల్ ప్రైమ్ లెండింగ్ రేట్ (ఆర్‌పీఎల్‌ఆర్)ను ఈనెల 2 నుంచి 10 బేసిస్ పాయింట్ల చొప్పున పెంచుతోంది.

శామ్‌సంగ్ గెలాక్సీ జే4

ధర రూ.9,990-11,990

దిల్లీ: అందుబాటు ధర స్మార్ట్‌ఫోన్ల విభాగంలో సరికొత్త గెలాక్సీ జే4ను శామ్‌సంగ్ శుక్రవారం విడుదల చేసింది. పరిశ్రమలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన సిగ్నేచర్ శామ్‌సంగ్ సదుపాయాలు ఈ స్మార్ట్‌ఫోన్‌లోనూ ఉన్నాయని సంస్థ తెలిపింది. 5.5 అంగుళాల హెచ్‌డీ సూపర్‌అమోల్డ్ తెర, ఎగ్జినోస్ 1.4గిగాహెర్ట్జ్ క్వాడ్ కోర్ ప్రాసెసర్, వెనుక-ముందు 13 -5 మెగాపిక్సెల్ కెమేరాలు, 3,000 ఎంఏహెచ్ బ్యాటరీ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్ ఆండ్రాయిడ్ ఓరియో 8.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. 2జీబీ ర్యామ్, 16 జీబీ అంతర్గత మెమొరీ ఫోన్ ధర రూ.9,990 3జీబీ ర్యామ్, 32 జీబీ అంతర్గత మెమొరీ ఫోన్ రూ.11,990గా సంస్థ ప్రకటించింది. ఎస్‌డీ కార్డుతో మెమొరీని, రెండు ఫోన్లలోనూ 256 జీబీ వరకు పెంచుకోవచ్చు.

ప్రత్యేకతలివీ: సామాజిక మాధ్యమాల నుంచి చిత్రాలు, వీడియోలు నేరుగా మెమొరీకార్డులో నిక్షిప్తం అవ్వడానికి తోడు, ఒకే రకమైనవి ఉంటే, ఒక్కదాన్ని ఉంచి, మిగిలిన వాటిని తొలగింపు చేసే అడ్వాన్స్‌డ్ మెమొరీ మేనేజ్‌మెంట్ ఫీచర్ వల్ల, చోటు ఆదా అవుతుంది. అడాప్టివ్ వైఫై ఫీచర్ వల్ల వైఫై అందుబాటులో ఉంటే ఆన్ అవుతుంది లేకపోతే, ఆఫ్ అయిపోతుంది. శామ్‌సంగ్ మాల్ ఫీచర్ సాయంతో, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయాలనుకున్న వస్తువు చిత్రంపై క్లిక్‌చేస్తే, భిన్న పోర్టళ్లలో ఆ వస్తువు ధర ఎంతుందో చూసుకోవచ్చు. ఒకేసారి రెండు యాప్‌లను భిన్న విండోస్‌లలో వినియోగించుకోవచ్చు.

సెన్సెక్స్ ▼ 95 **35227** | నిఫ్టీ ▼ 40 **10696** | డోజోన్స్ 24642 ▲ 226 | నాస్‌డాక్ 7553 ▲ 111 | రూపాయి 67.06 ▲ 35 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 76.98 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఈనాడు బిజినెస్

ఘనం (+) / గ్రహణం (-)

నిఫ్టీ	1న	మార్పు %	నిఫ్టీ	1న	మార్పు %
BAJAJ AUTO	2896.55	5.32	EICHER MOTORS	29868.75	-2.96
MARUTI SUZUKI	8808.85	3.18	GAIL (INDIA)	341.35	-2.72
BHARTI AIRTEL	383.70	2.70	BAJAJ FINSERV	5882.20	-2.65
HERO MOTOCORP	3626.30	2.30	ONGC	173.20	-2.64
HINDALCO	238.50	1.84	TATA STEEL	560.65	-2.61
TATA MOTORS	287.20	1.66	M & M	901.60	-2.31
BPCL	409.25	1.31	INDUSIND BANK	1915.40	-2.05

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.27	71.05	బహ్రెయిన్ దీనార్	165.92	190.14
పౌండ్ స్టెర్లింగ్	81.26	94.25	కువైట్ దీనార్	184.17	229.26
యూరో	71.56	82.99	ఒమన్ రియాల్	162.48	185.89
జపనీస్ యెన్/100	56.10	65.07	సౌదీ రియాల్	16.30	19.31
ఆస్ట్రేలియా డాలరు	46.26	53.52	యూఏఈ దిర్హమ్	16.68	19.50
సింగపూర్ డాలరు	45.74	54.18	మలేషియా రింగిట్	15.06	18.52
థాయ్ బాత్/100	191.00	228.43	చైనీస్ యువాన్	7.42	12.04

శుక్రవారం నిఫ్టీ కదలికలు



దిద్దు'బాట'లో 9 బ్యాంకులు

రెండేళ్లకు ప్రణాళిక సమర్పణ

దిల్లీ: ఆర్‌బీఐ డేగ కన్ను కింద ఉన్న 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 9 బ్యాంకులు తాజాగా రెండేళ్ల రికవరీ ప్రణాళికను ప్రకటించాయి. అనుబంధ సంస్థల్లో వాటా విక్రయం, కార్పొరేట్ రుణ పుస్తకాన్ని తగ్గించుకోవడం తదితర చర్యలను పేర్కొన్నాయి. ఆర్‌బీఐ కనీస మూలధన నిబంధనలను పాటించడం కోసం ఆర్థికంగా బలోపేతం కావడానికి ఒక ప్రణాళికతో రావాలని 11 ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆర్థిక మంత్రి పియూశ్ గోయెల్ గత నెలలో కోరిన సంగతి తెలిసిందే. ఇందులో 9 బ్యాంకులు ఇప్పటికే ఆర్థిక సేవల విభాగానికి నివేదిక సమర్పించాయని ఒక అధికారి తెలిపారు. ఆర్‌బీఐ నేతృత్వంలో పటిష్ఠ దిద్దుబాటు ప్రణాళిక(పీసీఏ) కింద ఉన్న 11 బ్యాంకుల్లో దేనా బ్యాంకు, అలహాబాద్ బ్యాంకు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంక్, యూకో బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లున్న సంగతి తెలిసిందే. పీసీఏ కింద బ్యాంకులు వివిధ నిబంధనలను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే.

జీడీపీ వరమిచ్చినా..

- కరుణించని అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు
- వారాంతంలో నష్టాలు
- వారం మొత్తం మీద లాభాలే

అంచనాలకు మించి జీడీపీ రాణించినా.. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఫలితం లేకుండా చేశాయి. దీంతో స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాల పాలయ్యాయి. విద్యుత్, బ్యాంకింగ్‌లో వచ్చిన నష్టాలు.. వాహన షేర్లలో వచ్చిన లాభాలను తుడిచిపెట్టాయి. యూరోపియన్ యూనియన్(ఈయూ), కెనడా, మెక్సికోల నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకాల మినహాయింపును ఎత్తివేయడంతో అంతర్జాతీయంగా సంకేతాలు బలహీనపడ్డాయి. ఇది మన మార్కెట్లపైనా కనిపించింది. మరో పక్క, ముడి చమురు ధరల్లో ఊగిసలాటల కారణంగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచుతుందన్న అంచనాలు సైతం మార్కెట్‌పై ప్రభావం చూపించాయి.

ఊగిసలాటలలో..: జీడీపీ పరుగులు తీయడంతో ట్రేడింగ్ ప్రారంభంలో బీఎస్ఈ సెన్సెక్స్ 35,373.98 వద్ద మొదలై ఒక దశలో 35,438.22 వద్ద గరిష్ఠ స్థాయికి చేరింది. అయితే అంతర్జాతీయ బలహీన పవనాలతో ఊగిసలాటకు గురై చివరకు 95.12 పాయింట్ల నష్టంతో 35,227.26 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 39.95 పాయింట్లు కోల్పోయి 10,696.20 వద్ద ముగిసింది. అంతక్రితం 10,681.50 - 10,764.75 మధ్య కదలాడింది. అయితే వారం మొత్తం మీద చూస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రాణించడం విశేషం. సెన్సెక్స్ 302.39 పాయింట్లు; నిఫ్టీ 91.05 పాయింట్ల మేర పరుగులు తీశాయి.

నష్టపోయిన టాటా స్టీల్: సెన్సెక్స్ సూచీలో టాటా స్టీల్ ఎక్కువగా డీలా పడింది. 2.62 శాతం నష్టంతో రూ.560.35 వద్ద ముగిసింది. ఓఎన్‌జీసీ కూడా 2.48% తగ్గి రూ.172.95 వద్ద స్థిరపడింది. ఇంకా ఎం అండ్ ఎం(2.38%), హెచ్‌యూఎల్(1.96%), ఇండస్‌ఇండ్ బ్యాంక్(1.95%), ఎన్‌టీపీసీ(1.62%), పవర్ గ్రిడ్(1.46%)లు కూడా నేలచూపులే చూశాయి. అదానీ పోర్ట్స్, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫీ, ఏషియన్ పెయింట్స్, ఎస్‌బీఐ, టీసీఎస్, ఐటీసీ, విప్రోలు 0.34-1.33% వరకు నష్టపోయాయి.

వాహన షేర్ల జోరు: మే నెలలో వాహన విక్రయ గణాంకాలు రాణించడంతో వాహన కంపెనీల షేర్లు రాణించాయి. బజాజ్ ఆటో సెన్సెక్స్ షేర్లలో అత్యధిక లాభం(5.13%)తో రూ.2893.25 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలోనూ 5.26% పెరిగి రూ.2895 వద్దకు చేరడంతో మొత్తం మీద కంపెనీ మార్కెట్ విలువ రూ.4083.11 కోట్లు పెరిగి రూ.83,721.11 కోట్లకు చేరింది. ఇక మారుతీ సుజుకీ కూడా 3.01% రాణించి రూ.8792.15 వద్ద ముగిసింది. హీరోమోటోకార్ప్(2.16%), టాటా మోటార్స్(1.52%)లు కూడా ముందుకురికాయి. లాభపడ్డ ఇతర షేర్లలో భారతీ ఎయిర్‌టెల్(2.35%), ఐసీఐసీఐ బ్యాంక్(1.37%), రిలయన్స్ ఇండస్ట్రీస్(0.86%), హెచ్‌డీఎఫ్‌సీ(0.81%) లున్నాయి.

మేలో జీఎస్‌టీ వసూళ్లు రూ.94,016 కోట్లు

ఏప్రిల్‌తో పోలిస్తే తక్కువే

దిల్లీ: జీఎస్‌టీ రూపేణా మేలో రూ.94,016 కోట్లను ప్రభుత్వం వసూలు చేసింది. ఏప్రిల్‌లో వసూలైన రూ.1.03 లక్ష కోట్లతో పోలిస్తే ఇది తక్కువే. అయితే జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నెలవారీ వసూళ్ల సగటైన రూ.89,885 కోట్లతో పోలిస్తే మేలో వసూలైన జీఎస్‌టీ ఎక్కువే కావడం గమనార్హం. ఇక కిందటి నెలలో మొత్తం 62.47 లక్షల మంది వ్యాపారులు జీఎస్‌టీ అమ్మకాల రిటర్న్‌ను (జీఎస్‌టీఆర్-3బీ) దాఖలు చేశారు. ఏప్రిల్‌లో రిటర్న్‌లు సమర్పించిన వారి సంఖ్య 60.47 లక్షలు. అంటే మేతో పోలిస్తే ఏప్రిల్‌లో ఎక్కువ మంది రిటర్న్‌లు సమర్పించారన్నమాట. 'మేలో నెలవారీ వసూళ్ల సగటుకు మించి జీఎస్‌టీ వసూళ్లు నమోదయ్యాయి. ఇ-వే బిల్లు విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత నిబంధనలను పాటించే వారి సంఖ్య పెరుగుతోందనే విషయాన్ని ఇది అద్దం పడుతోంద'ని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా అన్నారు. అంతరాష్ట్ర సరకు రవాణాకు ఏప్రిల్ 1 నుంచి ఇ-వేబిల్లు విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర పరిధిలోపు సరకు రవాణాకు ఏప్రిల్ 15 నుంచి దశలవారీగా ఈ విధానాన్ని అమలు చేసుకుంటూ వస్తోంది. పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేసే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఇన్‌సెక్టిసైడ్స్ కొత్త క్రిమిసంహారకాలు

ఈనాడు, హైదరాబాద్: పత్తి, వరి, పప్పుధాన్యాలు, కూరగాయల పంటల రక్షణ కోసం ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా నాలుగు కొత్త క్రిమిసహారక ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. కొత్తగా విడుదల చేసిన ఎన్‌కౌంటర్, సోఫియా, అకిడో, హెర్క్యులస్ క్రిమిసహారక ఫార్ములేషన్లను కంపెనీ పరిశోధన, అభివృద్ధి కేంద్రంలో అభివృద్ధి చేశామని, పత్తి వంటి అన్ని రకాల వాణిజ్య పంటల రక్షణకు హెర్క్యులస్ దోహదం చేస్తుంది. ఆకుకు రెండు వైపులా రక్షణ కల్పిస్తుందని ఇన్‌సెక్టిసైడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ అగర్వాల్ తెలిపారు.

రూ.200 కోట్లతో విస్తరణ: కంపెనీకి దక్షిణాది మార్కెట్ కీలకమని, భవిష్యత్తులో దక్షిణాదిలో యూనిట్‌ను ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. వచ్చే మూడేళ్లలో రూ.200 కోట్లతో ప్రస్తుతమున్న యూనిట్ల సామర్థ్యాన్ని పెంచుతామని, సేంద్రియ ఎరువులపై దృష్టి కేంద్రీకరిస్తామని అగర్వాల్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ, ఏపీలో రూ.100 కోట్ల చొప్పున టర్నోవరు ఉందని, దక్షిణాదిలో రూ.325 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయని వివరించారు.

ఈ ఏడాది వృద్ధి 7.5%!

క్రిసిల్, ఎస్‌బీఐ ఆర్థికవేత్తల అంచనాలు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి 7.5 శాతం దాకా చేరొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వినియోగ ఆధారిత వృద్ధి ఇందుకు దోహదం చేస్తోందంటున్నారు. అయితే ముడి చమురు ధరలు ఆందోళనకరంగా ఉంటున్నాయని వారు చెబుతున్నారు. గురువారం వెలువడ్డ అధికారిక గణాంకాల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి 6.7 శాతంగా నమోదైంది. 'వృద్ధి ధోరణి కొనసాగుతుందని 2018-19 కల్లా అది 7.5 శాతానికి చేరుతుందని అంచనా వేస్తున్నాం. దీర్ఘకాలిక ధోరణి అయిన 7.6 శాతం కంటే ఇది తక్కువే. అదీ కాక ప్రస్తుత స్థాయిల్లోనే చమురు ధరలు కొనసాగితే.. వృద్ధి అంచనా మరి కొంత తగ్గే అవకాశం ఉంద'ని క్రిసిల్‌కు చెందిన ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఎస్‌బీఐకి చెందిన ఆర్థికవేత్తలు సైతం పెరుగుతున్న ముడి చమురు ధరలు వృద్ధికి ఆటంకంగా నిలిచే ప్రమాదం ఉందని అంటున్నారు.

ఎంత డబ్బిస్తే.. ఏం లాభం

- ప్రభుత్వ మూలధన సాయం 13 బిలియన్ డాలర్లూ హుష్
- బ్యాంకుల భారీ నష్టాలే కారణం
- ఈ ఏడాదీ అదే ధోరణి: ఫిచ్

ముంబయి: గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రభుత్వం నుంచి వచ్చిన మూలధన సహాయం కాస్తా.. వాటికొచ్చిన నష్టాల కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడకపోవచ్చని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంచనా వేస్తోంది. భారీ నష్టాల కారణంగా బ్యాంకుల రేటింగ్‌పై కూడా ప్రభావం పడవచ్చని హెచ్చరించింది. 'బ్యాంకుల మొత్తం నష్టాలు కలిస్తే ప్రభుత్వం 2017-18లో సహాయం చేసిన 13 బిలియన్ డాలర్లూ(దాదాపు రూ.84,000 కోట్లు) తుడిచిపెట్టుకుపోయింది. బలహీన పనితీరు ఈ ఏడాదీ కొనసాగవచ్చ'ని ఫిచ్ శుక్రవారం అంచనా వేసింది. నికర నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) సమీక్ష కారణంగా బ్యాంకులు బలహీన ఆర్థిక ఫలితాలను ప్రకటించాయని పేర్కొంది. దీర్ఘకాలంలో బ్యాంకుల పరిస్థితిని మెరుగుపరచడం కోసం చేస్తున్న ప్రక్షాళనలో భాగమే ఈ ఎన్‌పీఏల సమీక్ష. ఫిచ్ ఇంకా ఏమందంటే..

- ఎన్‌పీఏల సమీక్షల కారణంగా బ్యాంకుల రుణ వ్యయాలు 2.5 శాతం(2016-17) నుంచి 4.3 శాతానికి(2017-18లో) చేరాయి.
- ఎన్‌పీఏలు సైతం ఏడాది కిందటితో పోలిస్తే 9.3 శాతం నుంచి 12.1 శాతానికి పెరిగాయి.
- ప్రభుత్వ రంగ బ్యాంకుల సగటు ఎన్‌పీఏ 14.5 శాతానికి చేరింది. ఐడీబీఐ బ్యాంకు, యూకో బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల ఎన్‌పీఏలు 25 శాతానికి పైగా నమోదయ్యాయి.
- గత ఆర్థిక సంవత్సరంలో 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 19 నష్టాలను ప్రకటించాయి. ప్రైవేటు రంగ బ్యాంకులు సైతం ఇందుకు మినహాయింపు కాదు. యాక్సిస్ బ్యాంకు తన తొలి త్రైమాసిక నష్టాన్ని ప్రకటించింది.
- ఆరు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియంత్రణ సంస్థలు పేర్కొనే కనీస స్థాయి కంటే తక్కువకు మూలధన నిల్వలు పడిపోయాయి.
- 2018-19కి ప్రభుత్వం చేసే 11 బిలియన్ డాలర్ల సహాయంతో కొంత మేర ఆ స్థాయిలకు చేరే అవకాశం ఉంది. అయితే బ్యాంకుల బ్యాలెన్స్ షీట్ల స్థిరీకరణకు, మరింత వృద్ధికి మాత్రం ఎక్కువ మూలధనం అవసరం.
- అధిక ఎన్‌పీఏలు కనిపిస్తున్నాయంటే.. సమస్యను పూర్తిగా గుర్తించినట్లే లెక్క. ప్రొవిషన్ కవరేజీ నిష్పత్తి 50 శాతం పైగా పెరగడం ఆహ్వానించదగ్గ పరిణామం.
- దివాలా స్మృతి కింద చేపట్టే ఎన్‌పీఏల పరిష్కార వల్ల బ్యాంకులకు మూలధనం రావొచ్చు.. కానీ అందుకు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

హైదరాబాద్‌లో సైబర్ సెక్యూరిటీ సీఓఈ

ఈనాడు, హైదరాబాద్: సైబర్ సెక్యూరిటీ విభాగంలో హైదరాబాద్‌లో ఎక్సెలెన్స్ కేంద్రాన్ని (సీఓఈ) ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం తెలంగాణ ప్రభుత్వం డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్‌సీఐ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో దీన్ని అభివృద్ధి చేస్తారు. హైదరాబాద్‌ను సైబర్ సెక్యూరిటీ సేవలకు కేంద్రం చేసే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. వినూత్న సొల్యూషన్లను అభివృద్ధి చేయడం, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి ఈ రంగంలో అంకుర కంపెనీలను నెలకొల్పడం, నైపుణ్యాల పెంపు మొదలైన అంశాలపై ఈ కేంద్రం దృష్టి కేంద్రీకరిస్తుంది. పరిశ్రమ, విద్యా సంస్థలు, ప్రభుత్వాన్ని ఒక గొడుకు కిందకు తీసుకువచ్చేందుకు డీఎస్‌సీఐ కృషి చేస్తుంది.

హైదరాబాద్ ఫిన్‌టెక్ కంపెనీలో రూ.9 కోట్ల పెట్టుబడులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఫిన్‌టెక్ అంకుర కంపెనీ క్రెడ్‌రైట్‌లో వెంచర్ క్యాపిటలిస్టులు సంయుక్తంగా రూ.9 కోట్ల పెట్టుబడులు పెట్టారు. సీడ్ దశలో పెట్టుబడులు అందించే ఏషియన్ వెంచర్ ల్యాబ్, ఎర్లీ స్టేజ్ వెంచర్ కేపిటల్ ఫండ్ యువర్‌నెస్ట్, కొంత మంది ప్రముఖ ఏంజిల్ మదుపర్లు ఈ నిధులు అందించాయని క్రెడ్‌రైట్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ నీరజ్ బన్సాల్ తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలకు క్రెడ్‌రైట్ రుణాలను అందిస్తోంది. చిన్న కంపెనీల చెల్లింపు సరళిని తెలుసుకోవడానికి వారి డేటా కోసం చిట్ ఫండ్‌లతో క్రెడ్‌రైట్ చేతులు కలిపింది. కొత్తగా నిధులు సమకూరిన నేపథ్యంలో మరింత మందికి రుణాలు ఇవ్వాలని, సాంకేతిక పరిజ్ఞానంపై మదుపు చేయాలని భావిస్తున్నట్లు బన్సాల్ చెప్పారు.

మార్కెట్ కబుర్లు

- రూ.1,111 కోట్ల విలువైన పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే (ప్యాకేజీ 6) పనులు, రూ.1,393 కోట్ల విలువైన నాగపూర్, ముంబయి సూపర్ కమ్యూనికేషన్ ఎక్స్‌ప్రెస్‌వే మహారాష్ట్ర సమృద్ధి మహామార్గ్ ప్రాజెక్టుకు సంబంధించిన పనులకు బిడ్లను దాఖలు చేయడానికి **గాయత్రి ప్రాజెక్ట్స్**ను ఎల్-1 బిడ్డర్‌గా ప్రకటించారు.
- హైదరాబాద్ సమీపంలోని గాగిల్లాపూర్‌లో ఉన్న **గ్రాన్యూల్స్ ఇండియా** యూనిట్‌కు ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు (ఈఐఆర్)ను యూఎస్ఎఫ్‌డీఏ జారీ చేసింది. ఈ సదుపాయాన్ని మార్చిలో తనిఖీ చేశారు. ఎటువంటి 483 ఫారం పరిధిలోకి వచ్చే లోపాలను గుర్తించలేదు. ఇందులో ఫినిష్డ్ డోసేజీలను, ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ ఇంటర్మీడియేట్లను కంపెనీ తయారు చేస్తోంది.
- ముంజాల్-బర్మన్, మణిపాల్-టీపీజీ, మలేషియాకు చెందిన ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ బెర్హాద్, రేడియంట్ లైఫ్ కేర్‌లను కొనుగోలు బిడ్డింగ్ ప్రక్రియకు ఎంపిక చేసినట్లు **ఫోర్టిస్ హెల్త్‌కేర్** పేర్కొంది. ముంజాల్-బర్మన్‌లు గతంలో చేసిన కొనుగోలు ఆఫర్ రద్దు అయిన తర్వాత తన వ్యాపార విక్రయం కోసం గత వారం తాజాగా బిడ్డింగ్ ప్రక్రియను ఫోర్టిస్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.
- **బజాజ్ అలయంజ్** పాలసీదారులకు శుభవార్త. ఈ ప్రైవేటు రంగ జీవిత బీమా సంస్థ తమ పాలసీదారులకు వన్‌టైమ్ ప్రత్యేక బోనస్‌ను అందించనున్నట్లు ప్రకటించింది.

తొలి 'అపాచీ ఫ్యూజిలేజ్' సిద్ధం

- టాటా బోయింగ్ ఏరోస్పేస్ తయారీ
- హైదరాబాద్ 'ఏరోస్పేస్' ఘనత

ఈనాడు, హైదరాబాద్: టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్), బోయింగ్ సంయుక్త సంస్థ టాటా బోయింగ్ ఏరోస్పేస్ గడువు కంటే ముందుగానే తొలి ఏహెచ్-64 అపాచీ కంబ్యాట్ హెలికాప్టర్ ఫ్యూజిలేజ్ (హెలికాప్టర్ స్ట్రక్చర్)ను తయారు చేసి మెసా, ఏజెట్‌లోని బోయింగ్ ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్ల తయారు యూనిట్‌కు పంపుతోంది. ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్ల ఫ్యూజిలేజ్‌లను తయారు చేయడానికి దాదాపు ఏడాది క్రితం టీఏఎస్ఎల్, బోయింగ్‌లు చేతులు కలిపాయి. హైదరాబాద్‌లోని అత్యాధునిక తయారీ సదుపాయంలో ఫ్యూజిలేజ్‌ల తయారీని ప్రారంభించాయి. యూఎస్ రక్షణ దళం తదితర ఖాతాదారులకు బోయింగ్ ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్లను విక్రయిస్తోంది. ఈ హెలికాప్టర్లకు కావాల్సిన ఫ్యూజిలేజ్‌లు హైదరాబాద్‌లోని టాటా బోయింగ్ ఏరోస్పేస్ యూనిట్‌లో మాత్రమే తయారవుతాయి. హైదరాబాద్‌లోని యూనిట్‌లో బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడే కంబ్యాట్ హెలికాప్టర్లకు అవసరమైన సెకండరీ స్ట్రక్చర్లు, వర్టికల్ స్పేర్ బాక్సులను కూడా టాటా బోయింగ్ ఏరోస్పేస్ తయారు చేస్తోంది. టాటా బోయింగ్ ఏరోస్పేస్ సంయుక్త సంస్థ భారత్‌లో బోయింగ్‌కు ఉన్న తొలి ఈక్విటీ భాగస్వామ్య సంయుక్త సంస్థ కావడం విశేషం. ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్ల ఫ్యూజిలేజ్‌లను తయారు చేయడానికి టాటా బోయింగ్ ఏరోస్పేస్ 14,000 చదరపు మీటర్ల అత్యంత ఆధునిక యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలు కలిగిన 350 మంది నిపుణులు పని చేస్తున్నారు. 2015లో బోయింగ్‌తో టీఏఎస్ఎల్ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందుకు అనుగుణంగా టాటా బోయింగ్ ఏరోస్పేస్ సంయుక్త సంస్థను ఏర్పాటు చేశారు. ఫ్యూజిలేజ్‌లను తయారు చేయడానికి అవసరమైన యూనిట్ నిర్మాణాన్ని 2016లో చేపట్టారు. బోయింగ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ బంధం బలోపేతమయ్యే దిశలో తొలి ఫ్యూజిలేజ్ పంపిణీ కీలక మలుపని, అత్యంత నాణ్యమైన ఏరోస్ట్రక్చర్లను భారత్‌లో తయారు చేయడానికి బోయింగ్, టీఏఎస్ఎల్‌లు కట్టుబడి ఉన్నాయని బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రత్యూష్ కుమార్ తెలిపారు. యూనిట్ ప్రారంభించిన ఏడాది లోపే ఫ్యూజిలేజ్‌ను పంపిణీ చేయడం దేశీయ తయారీకి పెద్ద ఊపునిస్తుందని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సుకరణ్ సింగ్ తెలిపారు.

ప్రపంచ వ్యాప్తంగా..: ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 2,300 అపాచీ హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు. భారత్‌తో సహా 16 దేశాలకు చెందిన రక్షణ దళాలు కొనుగోలు చేయడానికి ఈ హెలికాప్టర్లను ఎంపిక చేశాయి. అమెరికాకు చెందిన రక్షణ దళంలోని అపాచీ హెలికాప్టర్లు 4.3 మిలియన్ ఫ్లైట్ గంటలు ప్రయాణించాయి. టాటా అనుబంధ సంస్థయిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రపంచ స్థాయి ఓఈఎంలలో (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మ్యాను ఫ్యాక్చరర్) ఒకటి. బోయింగ్‌తోనే కాక సికార్‌స్కీ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్, లాక్‌హీడ్ మార్టిన్ ఏరోనాటిక్స్ కంపెనీలతో కలిసి పని చేస్తోంది.

1న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	361	వరంగల్	363
చిల్లరగా(ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	366
బెంగళూరు	410	చెన్నై	435
2వ తేదీకి...		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	360	నమక్కల్	420

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

కంపెనీ	ముగింపు	(క్రితం)	పరిమాణం
ADANI PORT &	387.60	(392.15)	3219572
ASIAN PAINTS	1293.05	(1304.65)	368820
AXIS BANK LT	536.65	(545.90)	4061137
BAJAJ AUTO L	2896.55	(2750.30)	1799352
BAJAJ FINANC	2077.40	(2109.90)	604574
BAJAJ FINSER	5882.20	(6042.25)	153804
BHARTI AIRTE	383.70	(373.60)	4099108
BHARTI INFRA	300.65	(298.65)	1271174
BPCL	409.25	(403.95)	5185052
CIPLA	524.50	(524.80)	1625446
COAL INDIA L	294.65	(296.25)	3034848
DR. REDDYS	1941.40	(1936.60)	441861
EICHER MOTOR	29868.75	(30780.65)	68883
GAIL	341.35	(350.90)	3248685
GRASIM IND	1028.70	(1039.80)	910185
HCL TECH	904.85	(910.35)	969531
HDFC	1844.25	(1833.00)	2653497
HDFC BANK	2110.60	(2139.45)	5287839
HERO MOTOCOR	3626.30	(3544.90)	300310
HINDALCO IND	238.50	(234.20)	7341372
HINDUSTAN UN	1588.85	(1611.45)	1444570
HPCL	312.15	(311.85)	4799583
ICICI BANK	289.30	(285.80)	29675949
INDIABULLS H	1233.35	(1242.70)	1779839
INDIAN OIL	172.35	(174.10)	7345661
INDUSINDBANK	1915.40	(1955.45)	1082637
INFOSYS LTD	1220.80	(1231.80)	2499178
ITC	269.95	(271.65)	6607768
KOTAK MAHIND	1318.00	(1334.60)	2332688
LARSEN & TOU	1372.40	(1370.40)	2234018
LUPIN	764.45	(770.35)	1297715
M&M	901.60	(922.95)	3431462
MARUTI SUZIK	8808.85	(8537.20)	1002010
NTPC LTD	164.35	(167.55)	2479887
ONGC	173.20	(177.90)	9847581
POWER GRID C	205.95	(209.45)	9616721
RELIANCE IND	930.55	(921.35)	8765835
SBI	266.70	(269.55)	16574717
SUN PHARMA	484.35	(480.35)	3793797
TATA CONSULT	1732.45	(1741.05)	1603856
TATA MOTORS	287.20	(282.50)	15840810
TATA STEEL L	560.65	(575.65)	9249666
TECH MAHINDR	701.15	(712.35)	4585884
TITAN IND	900.00	(900.10)	1392273
ULTRATECH	3688.15	(3744.90)	232438
UPL LIMITED	697.75	(707.60)	814923
VEDANTA LIMI	248.25	(248.30)	18640874
WIPRO	260.60	(261.90)	1425020
YES BANK LTD	342.70	(346.20)	9470256
ZEE ENTERTAI	558.30	(556.05)	842901

నిఫ్టీ నెక్స్ట్ 50

కంపెనీ	ముగింపు	(క్రితం)	పరిమాణం
ABB	1203.85	(1231.85)	40761
ACC	1326.70	(1354.60)	829344
ADITYA BIRLA	144.40	(146.70)	1037784
AMBUJA CEMEN	203.55	(205.40)	2911603
ASHOK LEYLAN	150.85	(148.05)	16393908
AUROBIND PHA	535.30	(556.30)	3286212
AVENUE SUPER	1531.10	(1572.15)	1002870
BANK OFBAROD	136.95	(136.85)	11437804
BEL	111.40	(114.40)	6896646
BHEL	80.35	(83.65)	9306243
BOSCH LTD	18292.40	(18367.50)	9383
BRITANNIA	5812.45	(5923.95)	122383
CADILA HEALT	353.00	(361.30)	862303
COLGATE PALM	1247.10	(1259.70)	240385
CONTAINER	1337.10	(1379.05)	187671
CUMMINS INDI	684.15	(701.35)	420439
DABUR INDIA	386.75	(383.30)	1733390
DLF LIMITED	206.95	(209.90)	5138637
EMAMI LIMITE	1037.65	(1046.00)	71631
GENERAL INS	716.40	(724.55)	52052
GODREJ CONSU	1161.35	(1139.15)	597701
HAVELLS INDI	539.05	(544.15)	890100
HINDUSTAN ZI	291.25	(296.35)	2617279
IDEA CELLULR	61.80	(61.50)	12836665
INTERGLOBE A	1176.80	(1219.25)	906165
JSW STEEL LT	331.90	(331.90)	5033181
L&TFIN.HOLD	164.10	(169.85)	2687864
LIC HOUS.FIN	476.10	(475.15)	1261552
MARICO LIMIT	324.40	(321.85)	1586563
MCDOWELL	3260.75	(3343.60)	312490
MOTHERSON	306.80	(310.15)	3660476
MRF	74848.90	(75734.05)	4375
NHPC LTD	26.70	(26.50)	3124753
NMDC LTD	115.45	(117.45)	1746467
OIL INDIA	215.30	(215.85)	889875
ORACLE FIN S	3823.25	(3942.90)	31279
P&G HYG&HEAL	9343.05	(9301.50)	2387
PETRONET LNG	217.25	(219.65)	1292048
PIDILITE IND	1119.35	(1157.60)	883238
PIRAMAL ENTE	2438.10	(2371.45)	221861
PNB	82.95	(83.65)	20636225
POWER FIN CO	82.40	(80.55)	18651473
RURAL ELEC C	117.20	(118.15)	7195116
SAIL	72.25	(75.95)	24478761
SBI LIFE INS	676.00	(689.80)	250207
SHREE CEMENT	16656.40	(16880.60)	10689
SHRIRAM TRAN	1459.10	(1454.30)	598785
SIEMENS	1025.40	(1045.40)	134002
SUN TV LTD	886.55	(917.60)	1602686

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

కంపెనీ	ముగింపు	(క్రితం)	పరిమాణం
AMAR RAJA BA	777.40	(795.55)	20266
ANDHRA BANK	35.05	(36.35)	258448
ANDHRA CEMEN	10	(9.86)	9076
ANDHRA PAPER	325.25	(330.10)	3351
ANDHRA PETRO	46.15	(48.90)	121481
ANDHRA SUGAR	378.60	(385.75)	2516
ANJANI PORTL	173.65	(172.40)	2107
ASTRA MICROW	100.05	(103.10)	135620
AUROBINDO PH	534.95	(556.50)	201305
AVANTEL SOFT	418.50	(423.05)	12616
AVANTI FEEDS	1543.35	(1627.25)	39370
BALAJI AMIN	591.30	(599.55)	1589
BARTRONICS	11.32	(11.45)	13257
BHAGIRA CHEM	277	(277.25)	3330
BHAGYA NAG	42.20	(43)	5049
BN RATHI SEC	41.20	(42.40)	591
BRILLIANT SE	5.28	(5.55)	183371
CIL SECURI	24.45	(24.45)	5547
COMBAT DRUGS	21.45	(20.45)	2401
CONT COFFEE	294.85	(301.45)	1799
COROMAN FERT	458.65	(453)	9498
CYBERMATE	2.50	(2.45)	42716
CYIENT LIMIT	737.35	(733.80)	21828
DECCAN CEMEN	462	(472.55)	359
DIVI'S LAB	1049.75	(1051.45)	28932
DR REDDY	1941.45	(1946.80)	43765
GATI CORPN	93.80	(97.30)	154690
GAYATRI PROJ	186.05	(188.45)	17402
GMR INFRASTR	16.70	(18.15)	9403689
GOLDST INFRA	151.95	(158.55)	12107
GRANULES (I)	76.75	(78.65)	358863
GVK POWER	12.30	(12.94)	752431
HBL NIFE POW	37.30	(39.15)	98322
HERITAGE FOO	713	(719.85)	1072
HIL LTD	2074.35	(2162.75)	1020
IDL INDUSTRS	445.05	(453.80)	804
ILFS ENGINEE	29.50	(29.75)	6177
INNAREDY COM	1.92	(2.02)	3720
IVRCL INFRAS	1.60	(1.68)	1066679
KAKATIYA CEM	258.85	(261.85)	2320
KAVERI SEED	519.45	(535.80)	30879
KCP LTD	115.25	(119.70)	4392
KNR CONSTRUC	279.60	(297.95)	29670
LANCO INDUS	313.85	(315.60)	7467
LANCO INFRAT	0.98	(0.94)	115802
LAURUS LABS	459.25	(468.50)	2131
MADHUCON PRO	14.05	(15.45)	41782
MIC ELECTRON	3.91	(4.05)	37957
MOLD-TEK.TEC	41.95	(41)	535
MOLDTK PLA	316.65	(329.65)	2863
NAGARJAGRICH	29.90	(31.20)	15778
NATCO PHARMA	799.60	(804.10)	7098
NAVA BH VENT	141.20	(143.40)	198047
NCC	120.20	(120.10)	904546
NCL IND	192.55	(201)	5980
NEHA INTER	5.69	(5.71)	20393
NIHAR INFO	12.50	(13.10)	15482
OIL COUNTRY	21.15	(21.70)	3722
PANYAM CEMEN	30.40	(33.85)	17978
PENNER IND	53.85	(55.35)	68477
PIONEER DIST	270.75	(285)	5049
PRAJAY ENGS	10	(10.30)	28789
PREMIER EXPL	298.40	(308)	2339
PRISM CEMENT	109	(114.90)	2546619
PRUDENTL PHA	3.39	(3.49)	98674
RAIN INDUSTR	223	(234.70)	356836
SAMKRG PIST	248.85	(258.85)	2263
SATVAH. ISPA	14.90	(16.45)	20567
SMS PHARMA	63.20	(67.05)	1345
SUJANA UNIVE	0.53	(0.53)	28612
SURANA TELE	4.46	(4.83)	38885
SURYALAKSH.C	57	(57.35)	569
SURYALATA SP	128.30	(128.25)	50
SURYAVA SPIN	6.80	(6.65)	2576
SUVEN PHARMA	193.45	(190.40)	33983
TAJ GVK HOTE	220.60	(220.15)	3009
TANLA	30.10	(30.70)	25762
TERA SOFTWAR	44.10	(42.30)	3385
VICEROY HOTE	9.74	(10.25)	21929
VIJAY TEXTIL	56.75	(57.05)	8084
VIMTA LABS	205.25	(204.05)	2655
VISAKA IND	634.20	(662.50)	12430
VISTA PHARMA	34.25	(38.05)	49479
VIVIMED LABS	61.95	(62.75)	186366
ZENTECH	99.05	(101.65)	14060

కాలపరీక్షకు నిలిచిన బంధమిది

- భారత్-సింగపూర్ ద్వైపాక్షిక సంబంధాలపై ప్రధాని మోదీ వ్యాఖ్య
- అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై లూంగ్‌తో కలిసి విస్తృత చర్చలు
- ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు
- అమరావతి పనులు పురోగమనంలో ఉన్నాయన్న సింగపూర్ ప్రధాని

సింగపూర్

ఆర్థిక, రక్షణ రంగాల్లో ద్వైపాక్షిక బంధాల బలోపేతానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్‌లు అంగీకారం తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో నిష్పాక్షిక, స్నేహపూర్వక నావికా వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషిచేయాలని నిర్ణయించారు. పలు అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై వారిద్దరూ విస్తృతంగా చర్చించారు. శుక్రవారం అధ్యక్ష భవనం ఇస్తానాలో ఘనస్వాగతం లభించింది. దేశాధ్యక్షురాలు హలీమా యాకోబ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రధాని లూంగ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, ఉభయదేశాల నావికాదళాల మధ్య రవాణా సహకారం సహా ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. చర్చల అనంతరం నేతలిద్దరూ విలేకరులతో మాట్లాడారు.

వాణిజ్య ఒప్పందాన్ని ఉన్నతీకరిస్తాం: మోదీ

మోదీ మాట్లాడుతూ- "భారత్-సింగపూర్‌ల మధ్య

సింగపూర్‌లో టామీ కోహ్‌కు పద్మ శ్రీ పురస్కారాన్ని అందజేసిన ప్రధాని మోదీ. చిత్రంలో ఆ దేశ ప్రధాని లీ సేన్

వ్యూహాత్మక బంధం కాలపరీక్షను ఎదుర్కొని నిలిచింది. రెండు దేశాల మధ్య 2004లో కుదిరిన వాణిజ్య ఒప్పందం (సీఈసీఏ)పై సమీక్షించాం. దీన్ని త్వరలోనే ఉన్నతీకరిస్తాం. భవిష్యత్తులో సైబర్ భద్రతకు, ఉగ్రవాద నిర్మూలనలో సహకారానికి ప్రాధాన్యమిస్తాం. సముద్ర భద్రత విషయంలో 'నిబంధనల మేరకు నడిచే వ్యవస్థ' ఉండాలని పునరుద్ఘాటిస్తున్నాం. త్వరలోనే గగన సేవల ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం." అని మోదీ చెప్పారు.

రక్షణ ఒప్పందాలు 'శక్తిమంతం': లూంగ్

సింగపూర్ ప్రధాని లూంగ్ మాట్లాడుతూ-"తాజా ఒప్పందాలతో రెండు దేశాల రక్షణ ఒప్పందాలు శక్తిమంతమవుతాయి. 2015లో మోదీ వచ్చినప్పుడు చేపట్టిన రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు సమర్థంగా పూర్తయ్యాయి.

మాజీ దౌత్యవేత్తకు పద్మశ్రీ ప్రదానం

సింగపూర్ మాజీ రాయబారి టామీ కోహ్‌కు మోదీ 'పద్మశ్రీ' పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఇండియా-ఆసియాన్ భాగస్వామ్యం పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు టామీకి భారత్ ఈ పురస్కారాన్ని ప్రకటించింది.

భారత్-చైనాలు చేయికలిపితే ప్రపంచానికి మంచి భవిష్యత్తు

'షాంగ్రిలా డైలాగ్'లో మోదీ కీలకోపన్యాసం చేశారు. "భారత్-చైనాలు పరస్పర నమ్మకం, విశ్వాసంతో కలిసి పనిచేస్తే ఆసియాకూ, ప్రపంచానికి మెరుగైన భవిష్యత్తు ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్యం విషయంలో దేశాల నడుమ పోటీ సహజం. ఈ కారణంగా పొరపొచ్చాలు రాకూడదు. రెండు దేశాలు వేగవంతమైన ఆర్థిక వ్యవస్థలుగా అవతరిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ 7.5-8 శాతం వార్షిక వృద్ధిరేటును నిలుపుకొంటుంది. తదనుగుణంగా ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా భారత్ విస్తరణ ఉంటుంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో నిష్పాక్షికమైన, స్థిరమైన అంతర్జాతీయ వాణిజ్య విధానాన్ని కోరుకుంటున్నాం.' అని మోదీ ఉద్ఘాటించారు.

సాంకేతికతతో సామాజిక విభజన అంతం

సాంకేతికత ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి గొంతును అందిస్తోందనీ, సామాజిక విభజనను రూపుమాపడంలో కీలక భూమిక పోషిస్తోందని మోదీ అన్నారు. 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కోవడానికి మానవీయ విలువలతో కూడిన ఆవిష్కరణలు అవసరమని నొక్కి చెప్పారు. నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో 'ఆవిష్కరణల ద్వారా ఆసియా రూపాంతరీకరణ'పై ఆయన ప్రసంగించారు. "ప్రతి టెక్నాలజీ ముందు అవరోధంగానే అనిపిస్తుంది. కానీ, సామాజిక విభజనను చెరిపివేయడానికి సాంకేతిక ఆధార సమాజం దోహదపడుతుంది. నీరు, కాలుష్యం, వాతావరణ మార్పులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి సవాళ్లు మన ముందున్నాయి. విధానపరమైన ఆవిష్కరణలు, సాంకేతికతతో వీటిని అధిగమించగలం" అని మోదీ అన్నారు. పలు భారతీయ విశ్వవిద్యాలయాలు, ఎన్‌టీయూ మధ్య ఆరు విద్య, పారిశ్రామిక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. అనంతరం అక్కడి ప్రదర్శనలో కొలువుదీరిన మనుషులతో మాట్లాడే రోబోతో కాసేపు ఆయన సంభాషించారు. వేప చెట్టును నాటారు.

ప్రగతి పథంలో అమరావతి పనులు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరానికి సంబంధించిన సింగపూర్ కన్సార్టియం చేపట్టిన పనులు ప్రగతిపథంలో ఉన్నాయి. పుణె విమానాశ్రయ ప్రణాళిక, అభివృద్ధికి మహారాష్ట్ర-సింగపూర్ సంయుక్త కమిటీని ఇటీవలే నియమించాం. మా ఆర్థిక-సాంకేతిక (ఫిన్‌టెక్) సంస్థలకు పెద్దమార్కెట్ ఇండియానే. సింగపూర్ ద్వారా భారత్ ఆగ్నేయాసియా మార్కెట్లో కాలూనే అవకాశముంది. ఇందుకు సంబంధించిన ప్రయత్నాల్లో సహకారానికి సంయుక్త కార్యబృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. నవంబరులో ఇక్కడ జరిగే తూర్పు ఆసియా సదస్సుకు మోదీ వస్తారని ఆశిస్తున్నా" అని అన్నారు. ఆరో శతాబ్దానికి చెందిన బుద్ధగుప్తుని శిలాప్రతిమను లూంగ్‌కు మోదీ బహుకరించారు.

చంద్రన్న బీమాతో పదిరోజుల్లోనే ఆర్థిక సాయం

- రెండేళ్లలో 1.52లక్షల మందికి పరిహారం
- ఈ పథకం పరిధిలో 2.47 కోట్ల మంది

ఈనాడు, అమరావతి: కుటుంబ యజమానిని కోల్పోయిన వారికి చంద్రన్న బీమా అండగా నిలుస్తోంది. ప్రమాదంలో మరణిస్తే.. వారి కుటుంబాలకు పది రోజుల్లోనే రూ.5లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. సహజంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2లక్షల వరకు అందిస్తోంది. ఈ పథకం కింద తొలి ఏడాది 82 వేల మంది లబ్ధి పొందగా.. రెండో ఏడాది 70వేల మందికి పరిహారం అందింది. రెండేళ్లలో 37 లక్షల మంది విద్యార్థులకు ఏడాదికి రూ.1,200 చొప్పున ఉపకార వేతనమూ అందిస్తున్నారు. రెండేళ్లలో 2 వేల కోట్లు పరిహారం అందించగా.. రూ.444 కోట్లు ఉపకారవేతనాలు అందించారు. రాష్ట్రంలో 5 కోట్ల మంది జనాభా ఉంటే.. ఈ ఏడాది 2.47 కోట్ల మంది ఈ పథకం పరిధిలోకి రావడం విశేషం. సహజ మరణం, ప్రమాద మరణం జరిగినా వీరికి పరిహారం లభిస్తుంది.

అర్హులు..: అసంఘటిత రంగ కార్మికులు ఈ పథకంలో నమోదు చేసుకోవచ్చు. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, కార్పెంటర్, ఔట్ సోర్సింగ్, ఉపాధి హామీ కూలీలు, తోపుడు బండ్లు, కార్మికులు, కల్లుగీత కార్మికులు, బీడీ పనివారు, డ్రైవర్లు, నాయీ బ్రాహ్మణులు, రజక పనిచేసేవారు, ఇంటి పనిచేసే వారు, అంగన్‌వాడీ వర్కర్స్, తదితర రూ.15వేల కంటే తక్కువ జీతం పొందే ఎవరైనా ఇందులో చేరవచ్చు.

★ ప్రజాసాధికార సర్వేలో నమోదు చేసుకుని ఉండాలి. ★ సెర్ప్, మహిళా సమాఖ్యలు ఇళ్లకు వచ్చి నమోదు చేసుకుంటారు. దీనికి రూ.15 సేవా రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. వారికి ఏడాదికి పాలసీ బాండ్ ఇస్తారు. ★ ఏటా జూన్ 1 నుంచి తర్వాత ఏడాది మే 31 వరకు పాలసీ అమల్లో ఉంటుంది. ★ 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులు.

పది రోజుల్లో పరిహారం..: పాలసీదారు మరణిస్తే.. వారి కుటుంబానికి 24 గంటల్లో రూ.5వేల మొత్తాన్ని బీమా మిత్ర చెల్లించి దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఉంచుతారు. 10 రోజుల్లో కుటుంబంలోని నామిని బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ చేస్తారు.

పరిహారం అందించేదిలా..

వయసు	సహజమరణం	ప్రమాదమరణం	ఉపకారవేతనం
18-50	2,00,000	5,00,000	1,200
51-60	30,000	5,00,000	1,200
61-70	---	5,00,000	---

★ ప్రమాద బాధితులకు పూర్తి అంగవైకల్యానికి రూ.5లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.2.50లక్షలు అందిస్తారు. ★ బాధిత కుటుంబాల్లో 9 నుంచి 12 తరగతులు, ఇంటర్, ఐటీఐ చదువుతున్న పిల్లలకు సంవత్సరానికి రూ.1,200 చొప్పున ఉపకార వేతనం మంజూరవుతుంది.

అయినవాళ్లెవరూ ఆదుకోలేదు..

'నా భర్త ప్రమాదంలో మరణించారు. ఆయన బంధువులు కనీసం మమ్మల్ని పట్టించుకోలేదు. చంద్రన్నబీమా కింద అప్పటికప్పుడు రూ.5 వేల సాయం అందింది. నెల రోజుల్లోపు రూ.5 లక్షలు పరిహారం కింద వచ్చాయి. వచ్చిన వాటితో అప్పులు తీర్చా. కొంత మొత్తంతో రెండు కుట్టుమిషన్లు కొని స్వయంగా ఉపాధి పొందుతున్నా. ఇప్పుడు నా పిల్లల్ని చదివించుకోగలుగుతున్నా.

– లక్ష్మీనాగేశ్వరమ్మ, మోదుర్రు, కంకిపాడు

వనస్పతిలో కొవ్వు స్థాయి తగ్గింపు

దిల్లీ: మిఠాయిలు, వేపుళ్ల తయారీకి వాడే వనస్పతిలో అసంతృప్త కొవ్వులను దశలవారీగా 2 శాతం కంటే తక్కువ స్థాయికి తీసుకురావాలని భారత ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్ణయించింది. ఇందుకు పారిశ్రామిక వర్గాలు అంగీకారం తెలిపాయనీ, మూడు నాలుగు నెలల్లో ఆదేశాలు జారీ చేయనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. "2022 నాటికి ఆయా ఉత్పత్తుల్లో అసంతృప్త కొవ్వుల స్థాయిని 2% కంటే తక్కువకు తీసుకురావాలని నిర్ణయించాం. శాకాహార నూనెల్లో ఇప్పుడున్న 5% కొవ్వులను 2 శాతానికి తీసుకొస్తాం" అని ఆ సంస్థ సీఈవో పవన్ అగర్వాల్ తెలిపారు. ఈ కొవ్వులు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారా హృద్రోగ సమస్యలు తలెత్తుతాయి. ఇప్పటికే చాలా దేశాలు నూనెలు, వనస్పతి వంటి ఉత్పత్తుల్లో అసంతృప్త కొవ్వుల పరిమాణాన్ని 2 శాతానికంటే తక్కువకు తగ్గించాయి.

సంయుక్త సహకార వ్యవసాయ సంస్థల రద్దు

- భూముల సాగుదారులకు యాజమాన్య హక్కులు
- ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈనాడు–అమరావతి, నెల్లూరు: సంయుక్త సహకార వ్యవసాయ సంస్థలను (కో-ఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ- సీజేఎఫ్ఎస్) ప్రభుత్వం రద్దుచేసింది. వీటి పరిధిలో భూములను సాగు చేస్తున్న వారికి డీకే పట్టాలను ఇవ్వాలని నిర్ణయించింది. వీరి కుటుంబ సభ్యులకు లేదా వారసులకు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు.

★ ఇప్పటివరకు సీజేఎఫ్ఎస్ ద్వారా భూములు పొందిన వారికి వాటిపై హక్కులు లేవు. ఇందులో ఎస్సీ, ఎస్టీ వర్గాలవారే ఎక్కువ. ఇలాంటివారికి యాజమాన్య హక్కులను ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ భూములను ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల వారికి రాష్ట్రవ్యాప్తంగా 1975 నుంచి 1980 మధ్య అప్పగించారు. ఇందుకోసం ప్రత్యేకంగా సీజేఎఫ్ఎస్‌ను ఏర్పాటు చేసి, కేవలం భూములను సాగు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇలా.. రాష్ట్ర వ్యాప్తంగా 2.2 లక్షల ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో ఒక్క నెల్లూరు జిల్లాలోనే 99,500 ఎకరాలను 65వేల మంది ఎస్సీ, ఎస్టీ, ఇతరులకు ఇచ్చారు. దశాబ్దాల ఉంచి వీరే సాగుచేసుకుంటున్నా ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో సీజేఎఫ్ఎస్‌గా చూపుతున్నారు. ఈ భూముల స్థానంలో డి-పట్టాలను జారీచేయాలని నెల్లూరు జిల్లా కలెక్టరు ముత్యాలరాజు భూ పరిపాలన శాఖకు నివేదించారు. దీనిపై పరిశీలన జరిపిన ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్రపునేఠా పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులను జారీ చేసింది.

తాజా నిర్ణయంతో లబ్ధి ఇలా..

★ లబ్ధిదారులకు యాజమాన్య హక్కుల్ని కల్పిస్తూ పాసుపుస్తకం జారీ అవుతుంది. బ్యాంకుల నుంచి పంట రుణాలను పొందే అవకాశం వస్తుంది. ప్రభుత్వ పథకాలకూ అర్హత సాధిస్తారు. రెవెన్యూ అధికారులకు రికార్డుల నిర్వహణపరంగా సులువవుతుంది. ఈ భూములను ప్రభుత్వం తన పరిధిలోనికి తీసుకున్నట్లయితే నష్ట పరిహారం పొందేందుకు అర్హత సాధిస్తారు.

సాధ్యమైనంత త్వరగా రుణమివ్వండి

ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో సీఎస్ దినేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: రాజధాని నిర్మాణానికి సంబంధించిన రుణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ప్రపంచ బ్యాంకు ప్రతినిధులను కోరారు. రెండు రోజులుగా రాజధాని ప్రాంతంలో పర్యటించిన ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో దినేశ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. రాజధాని నిర్మాణంలో పనిచేస్తున్న కూలీలకు సౌకర్యాల కల్పనపై వారు సంతృప్తి వెలిబుచ్చారు. వెంకటపాలెం, కృష్ణాయపాలెం, రాయపూడి గ్రామాల్లో భూమిలేని నిరుపేదలతో మాట్లాడామని వివరించారు. రాజధాని ప్రాంతంలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రపంచబ్యాంకు రుణమివ్వడానికి ముందుకు రావడం హర్షణీయమని సీఎస్ పేర్కొన్నారు.

రూ.26 కోట్లతో కాపు భవనాలు: కొత్తపల్లి

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని 13 జిల్లాల్లో రూ.26 కోట్లతో కాపు సామాజిక భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తెలిపారు. ఒక్కో భవనానికి రూ.2 కోట్ల చొప్పున కేటాయిస్తున్నామని, సాధ్యమైనంత వేగంగా వీటి నిర్మాణం పూర్తి చేస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేల విజ్ఞప్తుల మేరకు ప్రజల అవసరాలకు అనుగుణంగా రూ.39.54 కోట్లతో 73 మినీ కాపు సామాజిక భవనాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామీణ తాగునీటి సరఫరా సీఈగా ప్రభాకరరావు

ఈనాడు, అమరాతి: గ్రామీణా తాగునీటి సరఫరా విభాగ ప్రధాన ఇంజినీర్ (సీఈ)గా టి.ప్రభాకరరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఏపీఐఐసీకి 'స్కాచ్' అవార్డు

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(ఏపీఐఐసీ) సుపరిపాలన అవార్డు-2018 కింద 'స్కాచ్ అవార్డు ఆఫ్ మెరిట్'కు ఎంపికైంది. పారిశ్రామిక రంగ అభివృద్ధిలో ఏపీఐఐసీ పాత్ర, భూముల కేటాయింపుల నుంచి అనుమతుల్లో పారదర్శకత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని అవార్డుకు నిర్వాహకులు ఎంపిక చేశారు. గత ఏడాది కూడా ఏపీఐఐసీ సేవలను గుర్తించి స్కాచ్ అవార్డుకు ఎంపిక చేశారని అధికారులు తెలిపారు.

రూ.2 వేల కోట్లకుపైగా ఉపాధి నిధులు వ్యయం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(నరేగా)లో గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు నెలల వ్యవధిలో రూ.2 వేల కోట్లుకుపైగా ఖర్చు చేశామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సంచాలకులు రంజిత్‌బాషా తెలిపారు. ఇందులో వేతనాలకు రూ.1513.68 కోట్లు, 'మెటీరియల్ కాంపోనెంట్'లో మరో రూ.463.19 కోట్లు ఖర్చు చేశామని శుక్రవారం ఓ ప్రకటనలో వివరించారు.

వేతనాల పెంపు పేరుతో వసూళ్లు: ఏపీ వీఆర్ఏల సంఘం

ఈనాడు డిజిటల్, అమరావతి: వేతనాలు పెంచుతామంటూ వీఆర్ఏల నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పేర్కొంది. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, వీఆర్ఏల వేతనాలు రూ.6 వేల నుంచి రూ.10,500లకు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కైకాల గోపాలరావు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నవనిర్మాణ దీక్షకు మద్దతు: ఏపీ రేషన్ డీలర్ల సమాఖ్య

కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నవనిర్మాణ దీక్షకు పూర్తి మద్దతునిస్తున్నట్లు ఏపీ రేషన్‌డీలర్ల సమాఖ్య ప్రకటించింది. ముఖ్యమంత్రికి సంఘీభావంగా రాష్ట్రంలోని రేషన్ డీలర్లు దీక్షలో పాల్గొంటారని సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎంఎల్‌పీ పరీక్షా ఫలితాలు వెల్లడి

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య స్వస్థ కేంద్రాలు (హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో) 1500 మిడ్ లెవెల్ ప్రొవైడర్ల (ఎంఎల్‌పీ) నియామకానికి నిర్వహించిన పరీక్షా ఫలితాలను రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సంచాలకులు శుక్రవారం రాత్రి విడుదల చేశారు. గత నెల 13న నిర్వహించిన రాతపరీక్షలో వచ్చిన మార్కులను ప్రకటించారు. ఈ మార్కులను ప్రాతిపదికగా తీసుకుని నాలుగు జోన్లలో రోస్టర్ పాయింట్ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి ఆరు నెలలు పాటు ఇగ్నో కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన వారికి నియామక పత్రాలను అందజేయనున్నారు. మార్కుల వివరాలు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

సమగ్ర ప్రాజెక్టు నివేదికలేవి?

- అవి లేకుండా అభిప్రాయాలు ఎలా చెప్పడం
- ఏపీ13, తెలంగాణ 8 ప్రాజెక్టుల నివేదికలివ్వాలి
- కృష్ణానదీ యాజమాన్య బోర్డు
- ఇరురాష్ట్రాలతో ఆరున సమావేశం
- తెలుగు రాష్ట్రాల ప్రతిపాదనలకు దక్కని చోటు
- నిర్వహణ కరదీపికపై బోర్డు దృష్టి

ఈనాడు – హైదరాబాద్

కృష్ణా బేసిన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి సమగ్ర నివేదికల(డీపీఆర్)పై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చర్చించనుంది. గత ఏడాది ఆగస్టు నుంచి జరిగిన బోర్డు సమావేశాల్లో డీపీఆర్‌లు అందజేయాలని కోరినా రాష్ట్రాలు పట్టించుకోలేదని, ఇవి లేకుండా అభిప్రాయం చెప్పడం, సాంకేతిక అనుమతి ఇవ్వడం సాధ్యం కాదని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ 13 ప్రాజెక్టులు, తెలంగాణ వాటర్‌గ్రిడ్‌తో సహా ఎనిమిది ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు అందజేయాలని పేర్కొంది. ఈ నెల ఆరో తేదీన జరగనున్న ఎనిమిదవ సర్వసభ్య సమావేశంలో చర్చించే అంశాలను బోర్డు ఖరారు చేసింది. ఈ బోర్డు సమావేశంలో చర్చించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు చేసిన ప్రతిపాదనలకు మాత్రం అజెండాలో చోటు లభించలేదు. రెండు రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా ఉన్న అనేక అంశాలను పక్కనపెట్టింది. 2014 సెప్టెంబరు నుంచి అనేక దఫాలుగా చర్చించినా నిర్వహణ కరదీపిక (వర్కింగ్ మాన్యువల్) ఖరారు కాలేదని, ఇప్పటికైనా దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని బోర్డు పేర్కొంది. పోతిరెడ్డిపాడు, నెట్టెంపాడు, పాలేరు కాలువ వద్ద టెలిమెట్రీల ఏర్పాటు, రెండవ దశ టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు గురించి అజెండాలో చేర్చింది. పుణెలోని నీరు-విద్యుత్తు పరిశోధనా కేంద్రం సిఫార్సు చేసినట్లుగా మొదటి దశలోని 15 టెలిమెట్రీల వద్ద అదనంగా ప్రవాహ సెన్సార్లను ఏర్పాటు చేయడం, టెలిమెట్రీ కేంద్రాల్లో మార్పు, రెండవ దశకు సంబంధించి నిర్ణయం తదితర అంశాలున్నాయి. తాగునీటికి కేటాయించిన నీటిలో 20 శాతాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం, శ్రీశైలం నుంచి విడుదల చేసిన నీరు నాగార్జునసాగర్‌కు చేరేటప్పటికి తక్కువగా ఉండటంపై ఏర్పాటు చేసిన కమిటీలిచ్చిన నివేదికలు, 2017-18లో నీటి వినియోగం, 2018-19లో నీరు, విద్యుత్తు పంపిణీ అంశాలపై కూడా ఆరున జరిగే బోర్డు సమావేశం చర్చించనుంది.

తెలంగాణ ప్రతిపాదనలివి

★ పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ నీటిని తీసుకొని తక్కువగా చూపించారు. ఈ తేడాను కూడా లెక్కల్లోకి తీసుకోవాలి.
★ గోదావరి నుంచి మళ్లించే నీటిలో తెలంగాణ వాటాను ఎ.ఎం.ఆర్-ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు కేటాయించడం.
★ కేటాయించిన నీటి కంటే ఎక్కువ నీటిని వినియోగించుకొన్న రాష్ట్రం వాటాను తర్వాత సంవత్సరంలో తగ్గించడం.
★ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినేలా ఏకపక్షంగా బోర్డు పరిధిపై కేంద్రానికి బోర్డు ఛైర్మన్ లేఖ రాయడంపై చర్చించాలి.)
★ కృష్ణా నదీ యాజమాన్యబోర్డు కార్యాలయాన్ని విజయవాడకు మార్చాలి.
★ బోర్డు ఛైర్మన్ మే నాలుగో తేదీన కేంద్రానికి పంపిన పరిధి ముసాయిదాలో నీటి కేటాయింపునకు సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 2015 జూన్‌లో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి వద్ద జరిగిన సమావేశంలో తీసుకొన్న నిర్ణయం ప్రకారం వినియోగం అని మార్చాలి.
★ ఆర్డీఎస్ పైన మూడు చోట్ల టెలిమెట్రీలు ఏర్పాటు చేయాలి.
★ పాలేరు రిజర్వాయర్ నుంచి భక్తరామదాసు ఎత్తిపోతలకు, గోదావరినుంచి కృష్ణాబేసిన్‌కు తెలంగాణ తరలించే 214 టీఎంసీలను పరిగణనలోకి తీసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలివి

★ జూరాల ప్రాజెక్టును బోర్డు పరిధిలోకి తీసుకోవడంతో పాటు, ఈ రిజర్వాయర్ నుంచి మొత్తం వినియోగంపై పరిమితులుండాలి.
★ తెలంగాణ ప్రభుత్వం కృష్ణాపై చేపట్టిన కొత్త ప్రాజెక్టులు పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల, తుంగభద్రపై చేపట్టిన తుమ్మిళ్ల ఎత్తిపోతల డీపీఆర్‌లను బోర్డు, కేంద్రజలసంఘం, అపెక్స్ కౌన్సిల్ పరిశీలనకు పెట్టాలి. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పురాకుండా కొత్త ప్రాజెక్టులపై ముందుకు పోవద్దని తెలంగాణకు సూచించాలి.
★ మిషన్‌కాకతీయ కింద చెరువులను బాగు చేయడం, వర్షాలు బాగున్నప్పుడు అన్ని చెరువులు నిండనున్నందున చిన్ననీటివనరుల కింద తెలంగాణకు ఉన్న మొత్తం కేటాయింపు 89.15 టీఎంసీలను పరిగణనలోకి తీసుకోవాలి.
★ జూరాల నుంచి విడుదల చేసిన మొత్తం నీరు శ్రీశైలానికి రాకపోవడం, జూరాల వినియోగం, మధ్యతరహా ప్రాజెక్టులు, చిన్ననీటివనరుల కింద వినియోగించిన నీటిని తక్కువగా చూపడం, సాగర్ ఎడమకాలువ పరిధిలో క్రాస్‌వాల్స్ తొలగించడం, సీఐఎస్ఎఫ్ సిబ్బంది నియామకం, సాగర్-పులిచింతల మధ్య ఎత్తిపోతల ద్వారా తీసుకొనే నీటికి లెక్కలు చెప్పడం తదితర అంశాలను అజెండాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ కోరింది.

తెలుగు రాష్ట్రాలకు గోకుల్ మిషన్ పురస్కారాలు

ఈనాడు, దిల్లీ: పశువుల పెంపకం, సంరక్షణలో సేవలందిస్తున్న రైతులు, అధికారులకు కేంద్ర ప్రభుత్వం పురస్కారాలు అందజేసింది. అంతర్జాతీయ పాల దినోత్సవం సందర్భంగా దిల్లీ పూసా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. గోకుల్ మిషన్‌లో భాగంగా ఏటా అందిస్తున్న ఈ అవార్డుల్లో ఈ సారి తెలంగాణకు నాలుగు, ఆంధ్రప్రదేశ్‌కు రెండు దక్కాయి. తెలంగాణకు సంబంధించి దేశీయ ఆవుల సంరక్షణకు కృషి చేస్తున్నందుకు అల్లోల దివ్యారెడ్డి (మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కోడలు)కి గోపాలరత్న పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దివ్యారెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా మల్కాపూర్‌లో గోశాలను ఏర్పాటు చేసి గిర్ జాతికి చెందిన దేశీయ ఆవులను సంరక్షిస్తున్నామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉత్తమ సేవలు అందిస్తున్నందుకుగాను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గోపాలమిత్రలు రోశిరెడ్డి, ప్రసాదరావులకు అవార్డులు దక్కాయి.

కన్నతండ్రే కాలయముడు

- భార్యపై అనుమానంతో 9 నెలల కుమారుడి హత్య
- అనంతరం ఉరేసుకుని ఆత్మహత్య

హత్యకు గురైన చిన్నారి గణేష్ ★ నరేష్ (పాత చిత్రం)

డోన్, న్యూస్‌టుడే: అనుమానం పెనుభూతమై ఇద్దరిని బలిగొంది. 9 నెలల పసికందుకు కన్నతండ్రే పురుగుల మందు తాగించి ఆపై గొంతునులిమి చంపేశాడు. అనంతరం మనస్థాపంతో తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు జిల్లా డోన్ మండలం అనుంపల్లెలో ఈ దారుణం జరిగింది. ఈశ్వరయ్య కుమారుడు నరేష్ (29)కు అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన గంగాధర్ కుమార్తె లక్ష్మిని ఇచ్చి మూడున్నరేళ్ల క్రితం వివాహం చేశారు. కొంతకాలం సజావుగా సాగిన వీరి కాపురంలో కలతలు రేగాయి. భార్యకు అక్రమ సంబంధం ఉందంటూ అనుమానించాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో రాజీ చేశారు. 9 నెలల క్రితం కుమారుడు గణేష్ జన్మించాడు. కుమారుడు తనకు పుట్టలేదంటూ.. గతంలోనే మూడు సార్లు బాలుడ్ని చంపేందుకు యత్నించాడు. అనుమానంతో రగిలిపోతూ చివరకు గురువారం రాత్రి కుమారుణ్ని బలితీసుకున్నాడు. శుక్రవారం ఉదయం విషయం బయటపడటంతో పట్టణ సీఐ రాజగోపాల్ నాయుడు, గ్రామీణ సీఐ చంద్రబాబు నాయుడు గ్రామానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న చిన్నారి తండ్రి సమీపంలోని కొండల్లోకి పారిపోయాడు. మనస్థాపంతో అక్కడే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో తల్లడిల్లిపోయిన లక్ష్మి ఆసుపత్రిలో సొమ్మసిల్లి పడిపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

మరింత కచ్చితత్వంతో వాతావరణ అంచనా

5 రోజుల ముందే మెరుగైన సమాచారం

ఈనాడు, దిల్లీ: మనదేశంలో వాతావరణాన్ని మరింత కచ్చితత్వంతో, మరింత ముందస్తుగా అంచనా వేసే సరికొత్త వ్యవస్థను భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అందుబాటులోకి తెచ్చింది. 8 పెటాఫ్లాప్స్ కంప్యూటింగ్ సామర్థ్యంతో పనిచేసే ఈ శక్తిమంతమైన వ్యవస్థతో.. 12 చదరపు కిలోమీటర్ల వ్యాసార్థంలో రాబోయే ఐదు రోజుల్లో వాతావరణం ఎలా ఉంటుందన్న సంగతిని గతంలో కంటే కచ్చితత్వంతో అంచనా వేయడం సాధ్యం కానుంది. ఫలితంగా ప్రభుత్వ యంత్రాంగాలు, రైతులు వాతావరణానికి తగ్గట్లు సమాయత్తం కావడానికి వీలవుతుందని కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ కార్యదర్శి ఎం.రాజీవన్, ఐఎండీ డైరెక్టర్ జనరల్ కె.జె.రమేష్ శుక్రవారమిక్కడ వెల్లడించారు.

95 శాతాన్ని సాధారణం కంటే తక్కువ అనుకోవద్దు: దక్షిణాది రాష్ట్రాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 95 శాతం మేర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని.. ఇదేమీ సాధారణంకంటే తక్కువ అనుకోవడానికి వీల్లేదని కె.జె.రమేష్ పేర్కొన్నారు. గత ఏడాది దేశవ్యాప్తంగా 95 శాతం వర్షం కురిసినా పంటల దిగుబడి బాగుందని చెప్పారు. ఈసారి దక్షిణాది రాష్ట్రాల్లో మంచి వర్షపాతం నమోదవుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో చెబుతున్నది మెరుపుల గురించే..: పిడుగుపాటు గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేస్తున్న అంచనాలు కచ్చితమైనవి కాదని కె.జె.రమేష్ పేర్కొన్నారు. పిడుగుపాటు గురించి అంచనా వేసే విధానం మనదేశంలో ఇంకా రాలేదని.. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మెరుపుల తీవ్రత ఆధారంగా పిడుగుపాటు గురించి ఊహించి చెబుతున్నారని తెలిపారు. వాటిలో స్పష్టత లేదన్నారు. పిడుగుపాటు గురించి ఇంకా పూర్తిస్థాయిలో పరిశోధనలు జరగాల్సి ఉందని వ్యాఖ్యానించారు.

సింగపూర్‌లో శిక్షణకు వెళ్లిన కమిషనర్ల బృందం

సింగపూర్‌లో రాష్ట్ర కమిషనర్ల బృందం

తెనాలి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని పలు పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల కమిషనర్లు శిక్షణార్థం శుక్రవారం సింగపూర్ చేరారు. ఈ నెల 1 నుంచి 15 వరకు వీరు అక్కడ పాలనాపరమైన అంశాలపై తర్ఫీదు పొందుతారు. ఇందుకోసం మొత్తం 25 మందిని ఎంపిక చేశారు.

'న్యాయ సేవలందించే వ్యవస్థలో సంపూర్ణ ప్రక్షాళన అవసరం'

దిల్లీ: ఇటీవల చట్టాల్లో బాలలకు అనుకూలంగా తీసుకొచ్చిన సవరణలు ఎండమావుల్లాంటివేనని, దేశంలో న్యాయ సేవలందించే వ్యవస్థలో సంపూర్ణ ప్రక్షాళన అవసరమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు. నోబెల్ పురస్కార గ్రహీత కైలాష్ సత్యార్థి ఇచ్చిన ఇంటర్వ్యూలు, రాసిన వ్యాసాల సంకలనంతో తీసుకొచ్చిన పుస్తకం 'ఎవ్రీ చైల్డ్ మేటర్స్'ను విడుదల చేసిన కార్యక్రమంలో జస్టిస్ రంజన్ గొగోయ్ మాట్లాడారు.

మరో 12 రోజుల్లో

సురెజ్

ఆట ఏదైనా ప్రపంచకప్ వస్తోందంటే.. ఏ జట్టు ఎలా ఉంది.. ఫేవరెట్ ఎవరు అన్న ఆసక్తి అందరిలోనూ మొదలవుతుంది. ఇక విపరీతమైన పోటీతత్వం ఉండే ఫుట్‌బాల్ ప్రపంచకప్ అంటే ఈ ఆసక్తి మరింత ఎక్కువ ఉంటుంది. ఏకంగా 32 జట్లు పోటీ పడే మెగా టోర్నీ ఇది. నాలుగేసి జట్లు.. ఎనిమిది గ్రూప్‌లుగా విడిపోయి తొలి దశలో తలపడతాయి. అర్హత టోర్నీని దాటి ప్రపంచకప్‌కు రావడమంటే మాటలు కాదు. ఇక్కడికొచ్చే ప్రతి జట్టూ నాణ్యమైనదే. కాబట్టి గ్రూప్ దశ అంత ఆషామాషీగా ఏమీ ఉండదు. ప్రతి మ్యాచ్ కీలకమే. ప్రతి ఫలితమూ ఉత్కంఠభరితమే. ఏ గ్రూప్ ఎలా ఉంది.. నాకౌట్ అవకాశాలు ఎవరికెలా ఉన్నాయన్నది ఆసక్తికరం. ముందుగా గ్రూప్-ఎ సంగతి చూద్దాం. ప్రపంచకప్‌కు ప్రత్యేక ఆకర్షణ అనదగ్గ స్టార్ ఆటగాళ్లు సురెజ్, సలా ఉన్నది ఈ గ్రూప్‌లోనే కావడం విశేషం.

ప్రపంచకప్ గ్రూప్-ఎ విశ్లేషణ

ఇద్దరు హీరోలు.. నాలుగు జట్లు

చాలా స్పష్టత ఉన్న గ్రూప్.. 'ఎ'. మాజీ విజేత ఉరుగ్వే గ్రూప్‌లో అత్యంత బలంగా కనిపిస్తోంది. అమ్ముల పొదిలో ఉన్న మో సలా వంటి స్టార్ ఆటగాడు ఉండడంతో ఈజిప్ట్ ఎన్నో ఆశలతో బరిలోకి దిగుతోంది. పెద్దగా అంచనాలు లేకున్నా.. ఆతిథ్య రష్యా కూడా నాకౌట్‌పై ఆశలు పెట్టుకుంది. ఇక గ్రూప్‌లో అత్యంత బలహీన జట్టుగా ఉన్న సౌదీ అరేబియా ముందంజ వేస్తే ఆ జట్టుకే ఆశ్చర్యం.

గ్రూప్-ఎ
రష్యా,
ఉరుగ్వే,
సౌదీ అరేబియా,
ఈజిప్ట్

ఉరుగ్వే గ్రూప్ ఫేవరెట్

రెండుసార్లు ఛాంపియన్ అయిన ఈ జట్టు గ్రూపు ఫేవరెట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. దక్షిణ అమెరికా క్వాలిఫయింగ్‌లో బ్రెజిల్ తర్వాత అత్యుత్తమ ప్రదర్శన ఉరుగ్వేదే. కొంత మంది స్టార్ల జోరు తగ్గినా ప్రపంచకప్ కోసం ప్రతిభావంతులైన కొత్త ఆటగాళ్లు వచ్చారు. డిఫెండర్ డీగో గోడిన్ (31), స్ట్రైకర్లు ఎడిన్సన్ కవాని (30), లూయిస్ సురెజ్ (30) ఇప్పటికీ ప్రత్యర్థులకు సమస్యలు సృష్టించగలరు. గ్రూపులో ఉరుగ్వేకు ఒక్క ఈజిప్ట్ నుంచి తప్ప ఏ జట్టు నుంచీ గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం లేదు. కోచ్ ఆస్కార్ తబారెజ్ వరుసగా మూడో ప్రపంచకప్‌లో ఉరుగ్వేను నడిపించనున్నాడు. కొత్త కుర్రాళ్లతో నిండిన ఉరుగ్వే టోర్నీలో ఆశ్చర్యకర ఫలితాలు రాబట్టగలదన్నది ఫుట్‌బాల్ పండితుల అంచనా.

వీళ్లు కీలకం: కవాని, సురెజ్.

కోచ్: ఆస్కార్ తబారెజ్.

రికార్డు: రెండు సార్లు ఛాంపియన్. మూడు సార్లు సెమీఫైనలిస్ట్.

అంచనా: గ్రూపులో అగ్రస్థానం.

రష్యా ముందుకెళ్లడం కష్టమే

స్మొలోవ్

ఆతిథ్య జట్టుగా ప్రపంచకప్‌లో చోటు సంపాదించింది. బలహీన జట్లలో ఒకటి. 2008 నుంచి ఏ టోర్నీలోనూ గ్రూప్ దశ దాటని ఈ జట్టుపై ఎలాంటి అంచనాలు లేవు. క్వార్టర్‌ఫైనల్స్ లక్ష్యమంటున్నారు కానీ.. గ్రూప్ దశ దాటే అవకాశాలు చాలా తక్కువ. ఉరుగ్వేతో డ్రా చేసుకున్నా గొప్పే. సౌదీ అరేబియాపై గెలిచే అవకాశమున్న రష్యా.. కష్టపడితే ఈజిప్ట్‌పై గెలవొచ్చని భావిస్తోంది. కానీ అది చాలా కష్టమైన విషయమే. సొంతగడ్డపై జరిగే ప్రపంచకప్‌కు సన్నాహకంగా 2016 నుంచి ఆడిన 18 స్నేహపూర్వక మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌ల్లో మాత్రమే నెగ్గింది. గ్రూప్‌లో మూడో స్థానంలో నిలిచే అవకాశాలే ఎక్కువ. మైదానం వెలుపల కూడా ఈ జట్టుకు సమస్యలున్నాయి. కోచ్‌కు ఆటగాళ్లకు మధ్య సఖ్యత లేదని వార్తలొచ్చాయి.

కీలక ఆటగాళ్లు: ఇగోర్ అకిన్‌ఫీవ్ (గోల్‌కీపర్), స్మొలోవ్.

కోచ్: స్టానిస్లావ్ చెర్చెసోవ్.

రికార్డు: రష్యా ఫెడరేషన్‌గా అత్యుత్తమంగా ఒకసారి సెమీస్ చేరింది. రష్యాగా ఎప్పుడూ కనీసం గ్రూప్ దాటలేదు.

అంచనా: గ్రూప్ దాటడం కష్టం.

ఈజిప్ట్ నాకౌట్ చేరొచ్చు

సలా

1990 తర్వాత తొలిసారి ప్రపంచ కప్ ఆడుతున్నా ఈజిప్ట్ ఆసక్తిరేపుతోంది. బలమైన డిఫెన్స్ ఈ జట్టు సొంతం. గ్రూప్‌లో ఫేవరెట్ ఉరుగ్వేనే అయినా.. ఈజిప్ట్ నుంచి పొంచి ఉన్న ముప్పును తేలిగ్గా తీసుకోలేదు. ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న లివర్‌పూల్ ఆటగాడు మో సలా ఈజిప్ట్‌కు పెద్ద బలం. క్వాలిఫయర్స్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రీమియర్ లీగ్‌లోనూ విశేషంగా రాణించి మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఐతే ప్రపంచకప్ ఆరంభానికి ముందే ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా గ్రూప్ దశలో కొన్ని మ్యాచ్‌లకు దూరం కావొచ్చు. అయినా ప్రతిభావంతులకు కొదువలేని ఈజిప్ట్.. గ్రూప్ నుంచి రెండో స్థానంతో రెండో రౌండ్‌కు అర్హత సాధించడం దాదాపు ఖాయం.

వీళ్లు కీలకం: మహ్మద్ సలా, అబ్దుల్లా.

కోచ్: హెక్టర్ కూపర్.

రికార్డు: గతంలో రెండుసార్లు మాత్రమే ప్రపంచకప్‌లో ఆడింది. గ్రూప్ దాటలేదు.

అంచనా: గ్రూప్‌లో రెండో స్థానం.

సౌదీ అరేబియా: ఆశలు లేవు

ప్రస్తుత ఫిఫా ర్యాంకింగ్స్‌లో అతి తక్కువ స్థానం (67)లో ఉన్న ప్రపంచకప్ జట్టు ఈ జట్టే. 12 ఏళ్ల తర్వాత ప్రపంచకప్‌లో అడుగుపెట్టినా.. ఈ సంబరానికి సౌదీ అరేబియా సన్నాహం ఏమాత్రం బాగాలేదు. టోర్నీకి అర్హత సాధించిన తర్వాత ఇద్దరు కోచ్‌లకు ఉద్వాసన చెప్పింది. సెప్టెంబరులో బెర్ట్ వాన్ మార్‌వ్జిక్ నుంచి బాధ్యతలు అందుకుని, కేవలం ఐదు స్నేహపూర్వక మ్యాచ్‌లకు మాత్రమే కోచ్‌గా ఉన్న బవుజాను ప్రపంచకప్ డ్రా తీయడానికి తొమ్మిది రోజుల ముందు ఉద్వాసన చెప్పింది. 1994 నుంచి వరుసగా నాలుగు ప్రపంచకప్‌లు ఆడిన ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన రెండో రౌండే. ఈసారి కూడా సౌదీ గొప్ప ప్రదర్శన చేయగలదని ఎవరూ భావించట్లేదు. పెద్దగా అంచనాలేని నేపథ్యంలో ఏమి సాధించినా సౌదీకి బోనసే.

వీళ్లు కీలకం: మహ్మద్ అల్ సలావి, అల్ మువాలద్.

కోచ్: జువాన్ ఆంటానియో పిజి.

రికార్డు: నాలుగు ప్రపంచకప్‌లు ఆడింది. 1994లో రెండో రౌండ్‌కు చేరడమే అత్యుత్తమ ప్రదర్శన.

అంచనా: గ్రూప్‌లో ఆఖరి స్థానం.

ఛాంపియన్స్

ఒక గోల్.. ఆకలి తీరుస్తుంది



మాస్కో: ఒక్క గోల్.. మ్యాచ్ గమనాన్ని మారుస్తుంది. ఒక్క గోల్.. అనామకుడిని రాత్రికి రాత్రే సూపర్‌స్టార్‌ను చేస్తుంది. ఇప్పుడు అదే ఒక్క గోల్.. 10 వేల మంది చిన్నారుల ఆకలి బాధను తీర్చనుంది. ఇక నుంచి అగ్రశ్రేణి ఫుట్‌బాలర్లు లియోనల్ మెస్సి (అర్జెంటీనా), నెయ్‌మార్ (బ్రెజిల్) కొట్టే ప్రతి గోల్ పదివేల మంది పాఠశాల విద్యార్థుల ఆకలి తీర్చనుంది. ఈ మహోన్నత కార్యక్రమానికి మాస్టర్‌కార్డ్ సంస్థ శ్రీకారం చుట్టింది. రష్యాలో జరగనున్న ప్రపంచ కప్ సహా ఇకపై జరిగే అధికారిక టోర్నీల్లో ఈ ఆటగాళ్లలో ఎవరు గోల్ కొట్టినా లాటిన్ అమెరికా, కరీబియన్ దీవుల్లోని 10 వేల మంది విద్యార్థులకు ఆ సంస్థ ఒక పూట భోజనం అందించనుంది. "ఈ కార్యక్రమంలో భాగమైనందుకు గర్వపడుతున్నా. దీని వల్ల వేలాది మంది చిన్నారుల జీవితాల్లో మార్పు వచ్చే అవకాశముంది. దీని ద్వారా పసివాళ్ల మోములో నవ్వులు పూస్తాయి" అని మెస్సి తెలిపాడు. చిన్నారులకు సహాయపడుతున్నందుకు ఆనందంగా ఉందని నెయ్‌మార్ చెప్పాడు. "చిన్నారులకు ప్లేట్ భోజనంతో పాటు గొప్ప నమ్మకాన్ని కల్పించాలి" అని నెయ్‌మార్ పేర్కొన్నాడు. 'లాటిన్ అమెరికాలో నాలుగు కోట్లకు పైగా ప్రజలు ఆకలితో బాధపడుతున్నారు. వారిలో చిన్నారుల సంఖ్య అధికం. ఆకలి తీర్చి.. వాళ్లను శక్తిమంతంగా తయారుచేస్తే పేదరికాన్ని దూరం చేసే అవకాశం ఉంది" అని మాస్టర్‌కార్డ్ ప్రతినిధి అన్నా ఫెరెల్ తెలిపింది. ఆ సంస్థ ఇప్పటికే మూడు లక్షల మందికి ఆహారం అందించింది.

అతడికి ధోని విందు



సుధీర్‌తో ధోని

రాంచి: టీమ్‌ఇండియా మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోని మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. భారత క్రికెట్ సూపర్ ఫ్యాన్ సుధీర్ గౌతమ్‌ను తన ఫామ్‌హౌస్‌కు ఆహ్వానించి అతడితో కలిసి ధోని విందు చేశాడు. సచిన్ తెందుల్కర్‌కు వీరాభిమాని అయిన సుధీర్.. ఒంటిపై సచిన్ పేరు, జెర్సీ నంబర్ రాసుకొని మ్యాచ్‌లకు హాజరవడం తెలిసిన సంగతే. అయితే సచిన్ రిటైర్మెంట్ తర్వాత కూడా అతను భారత జట్టు మ్యాచ్‌లకు హాజరవుతున్నాడు. ఈ నేపథ్యంలో ధోని తనను విందుకు ఆహ్వానించడంతో సుధీర్ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు. "కెప్టెన్ కూల్‌తో ప్రత్యేకమైన రోజు. ధోని కుటుంబంతో కలిసి భోజనం చేశా. ఆ క్షణాలను వర్ణించడానికి మాటలు రావట్లేదు. ధోని, సాక్షికి ధన్యవాదాలు" అని ధోని కుటుంబ సభ్యులతో దిగిన ఫోటోలను సుధీర్ ట్విట్టర్‌లో పంచుకున్నాడు.

వరల్డ్‌పై విండీస్ పైచేయి

టీ20 ఛాలెంజ్ మ్యాచ్

లూయిస్ (58)

లండన్: హరికేన్ రిలీఫ్ టీ20 ఛాలెంజ్ పోరులో వరల్డ్ ఎలెవన్‌పై వెస్టిండీస్ పైచేయి సాధించింది. గురువారం జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో విండీస్ 72 పరుగుల ఆధిక్యంతో వరల్డ్ ఎలెవన్‌ను చిత్తుచేసింది. మొదట విండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగుల భారీస్కోరు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లూయిస్ (58; 26 బంతుల్లో 5×4, 5×6), శామ్యూల్స్ (43; 22 బంతుల్లో 2×4, 4×6), రామ్‌దిన్ (44 నాటౌట్; 25 బంతుల్లో 3×4, 3×6), రసెల్ (21 నాటౌట్; 10 బంతుల్లో 3×6) మెరుపులు మెరిపించారు. అనంతరం వరల్డ్ ఎలెవన్ 16.4 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌటైంది. తిసార పెరీరా (61; 37 బంతుల్లో 7×4, 3×6) ఒక్కడే విండీస్ బౌలర్లకు ఎదురు నిలిచాడు. బద్రి (2/4), రసెల్ (2/25), విలియమ్స్ (3/42) విజృంభించి విండీస్‌కు విజయాన్ని అందించారు. నిరుడు హరికేన్ తుఫాన్ వల్ల కరీబియన్‌లో తీవ్రంగా దెబ్బతిన్న ఐదు స్టేడియాల పునర్నిర్మాణం కోసం ఈ చారిటీ మ్యాచ్ నిర్వహించారు. వరల్డ్ ఎలెవన్ కెప్టెన్ షాహిద్ అఫ్రిది తన స్వచ్ఛంద సంస్థ ద్వారా 20 వేల అమెరికన్ డాలర్లు విరాళంగా అందజేశాడు. మిగతా ఆటగాళ్లంతా తమ మ్యాచ్ ఫీజును విరాళంగా ఇచ్చారు.

మైదానంలో నాసిర్ వ్యాఖ్యానం: వరల్డ్ ఎలెవన్, విండీస్ జట్ల మ్యాచ్ సందర్భంగా అరుదైన సంఘటన చోటు చేసుకుంది. ఇంగ్లాండ్ కామెంటేటర్ నాసిర్ హుస్సేన్ ఏకంగా మైదానం నుంచి వ్యాఖ్యానం చేయడం గమనార్హం. విండీస్ ఇన్నింగ్స్ ఆరంభమవగానే మొదటి స్లిప్‌లో మైకు పట్టుకుని నాసిర్ వ్యాఖ్యానం కొనసాగించాడు. మ్యాచ్ జరుగుతుండగా మైదానంలోనే అఫ్రిదిని ఇంటర్వ్యూ చేశాడు.

ఏమీ లేదు.. ఉంటే చెప్తా

ముంబయి: బాలీవుడ్ భామ నిధి అగర్వాల్‌తో భారత యువ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్ ముంబయిలోని ఒక రెస్టారెంట్లో విందు చేస్తూ కనిపించడంతో వీళ్లిద్దరి మధ్య ప్రేమాయణం నడుస్తున్నట్లు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై రాహుల్ స్పందించాడు. నిధి, తాను స్నేహితులు మాత్రమే అని. తమ మధ్య అంతకుమించి ఏమీ లేదని అతను స్పష్టం చేశాడు. "ఒక అబ్బాయి, అమ్మాయి స్నేహితులుగా ఉండలేరా? అదంత కష్టమా? ఆమె నాకు చాలా కాలం నుంచి తెలుసు. ఇద్దరం ఒకే నగరం నుంచి వచ్చాం. తన రంగంలో ఆమె ఎదుగుతుండటం చాలా సంతోషం. తనతో పాటు విందులో పాల్గొన్నది నేనొక్కడినే కాదు. అక్కడ బెంగళూరు వాళ్లే ఇంకో ముగ్గురు నలుగురు ఉన్నారు. అక్కడ ఏమీ జరగలేదని హామీ ఇస్తున్నా. నేనో అమ్మాయిని ఇష్టపడితే అందరికీ కచ్చితంగా చెబుతా. ఆ అమ్మాయిని దేవతలా చూసుకుంటా. అందులో దాచేదేమీ లేదు" అని రాహుల్ అన్నాడు.

ఎస్‌జీఎంను ఆపండి

బీసీసీఐకి సీఓఏ ఆదేశం

వినోద్ రాయ్

దిల్లీ: సుప్రీంకోర్టు నియమించిన పరిపాలకుల కమిటీ (సీఓఏ), బీసీసీఐ మధ్య విభేదాలు మరింత ముదిరాయి. జూన్ 22న తలపెట్టిన ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం)ను నిలిపివేయాలంటూ బీసీసీఐని సీఓఏ ఆదేశించింది. ముందస్తుగా తమ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోనందున.. ఈ ఎస్‌జీఎం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఐతే ఎస్‌జీఎం నిర్వహణ బోర్డు సభ్యుల హక్కని.. దాన్ని ఆపే అధికారం సీఓఏకు లేదని బీసీసీఐ పెద్దలు భావిస్తున్నారు! సమావేశం యథాతథంగా నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో ఆగ్రహానికి గురైన వినోద్ రాయ్ నేతృత్వంలోని సీఓఏ.. ఉద్యోగులు, ఇతర సిబ్బంది ఎస్‌జీఎంకు సహకరించొద్దని.. టీఏ, డీఏ బిల్లులు కూడా చెల్లించొద్దని బీసీసీఐ అధికారుల్ని ఆదేశించింది. ఐసీసీ ఆదాయం పంపకాలు, ఎన్‌సీఏ నిర్వహణతో సహా 10 అంశాలపై చర్చించడం కోసం ఎస్‌జీఎం నిర్వహించాలంటూ 15 అనుబంధ సంఘాలు బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నాకు లేఖలు రాశాయి. నిబంధనల ప్రకారం 3 వారాల గడువిస్తూ ఎస్‌జీఎం ఏర్పాటు చేయాల్సిందిగా తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరికి ఖన్నా సూచించాడు.

పాక్ 174 ఆలౌట్

ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు

లీడ్స్: ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకే ఆలౌటైంది. శుక్రవారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్.. ఇంగ్లాండ్ పేసర్లు అండర్సన్ (3/43), బ్రాడ్ (3/38), వోక్స్ (3/55) ధాటికి నిలువలేకపోయింది. పరుగులేమి చేయకుండానే తొలి వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. ఒక దశలో 79/7కు చేరుకుని.. కనీసం వంద పరుగులైనా చేస్తుందా అనిపించింది. కానీ షాదాబ్‌ఖాన్ (56), హసన్ అలీ (24) పోరాడడంతో పాక్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ ఆట ఆఖరికి 2 వికెట్లకు 106 పరుగులు చేసింది. కుక్ (46), జెన్నింగ్స్ (29) ఔట్ కాగా... రూట్ (29), బెస్ (0) క్రీజులో ఉన్నారు.

స్వితోలినాకు షాక్

వోజ్నియాకి, జకోవిచ్ ముందంజ • దిమిత్రోవ్ ఔట్

ఫ్రెంచ్ ఓపెన్

జకోవిచ్

స్వితోలినా

పారిస్

ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో మరో సంచలనం నమోదైంది. నాలుగో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) తన కంటే తక్కువ ర్యాంకు క్రీడాకారిణి చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. శుక్రవారం మూడో రౌండ్లో స్వితోలినా 3-6, 5-7 తేడాతో బుజర్నెస్కు (రొమేనియా) చేతిలో పరాజయం పాలైంది. మ్యాచ్‌లో స్వితోలినా 11 విన్నర్లు కొట్టగా.. బుజర్నెస్కు 31 విన్నర్లతో సత్తాచాటింది. స్వితోలినా 29 అనవసర తప్పిదాలు చేసింది. ఆమె తొలిసెట్లోనే వెనకబడి పరాజయం కొనితెచ్చుకుంది. మరోవైపు బుజర్నెస్కు తనకు అందివచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని విజయం సాధించింది. రెండో సీడ్ వోజ్నియాకి జోరు కొనసాగిస్తోంది. మూడో రౌండ్లో వోజ్నియాకి (డెన్మార్క్) 6-0, 6-3 తేడాతో పాలిన్ పర్మెంటీర్ (ఫ్రాన్స్)ను చిత్తు చేసి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. మాడిసన్ కీస్ (యుఎస్ఏ) 6-1, 7-6 (9-7)తో నవోమి ఒసాకా (జపాన్)పై నెగ్గింది. కసట్కినా కూడా నాలుగో రౌండ్ చేరింది.

జకోవిచ్ కష్టంగా: పురుషుల సింగిల్స్‌లో మాజీ ఛాంపియన్ జకోవిచ్ కష్టంగా ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాడు. మూడో రౌండ్లో జకో (సెర్బియా) 6-4, 6-7 (6-8), 7-6 (7-4), 6-2 తేడాతో బటిస్ట అగట్ (స్పెయిన్)పై చెమటోడ్చి గెలిచాడు. నాలుగో సీడ్ దిమిత్రోవ్ ఇంటి ముఖం పట్టాడు. దిమిత్రోవ్ (బల్గేరియా) 6-7 (4-7), 2-6, 4-6తో ఫెర్నాండో (స్పెయిన్) చేతిలో ఓడాడు. రెండో సీడ్ జ్వెరెవ్ ముందంజ వేశాడు. మూడో రౌండ్లో జ్వెరెవ్ (జర్మనీ) 6-2, 3-6, 4-6, 7-6 (7-3), 7-5తో డామిర్ (బోస్నియా)పై పోరాడి గెలిచాడు. నిషికోరి (జపాన్) 6-3, 6-1, 6-3తో సిమన్ (ఫ్రాన్స్)పై నెగ్గాడు. ఏడో సీడ్ డొమినిక్ థీమ్ ముందంజ వేశాడు.

విలియమ్స్ జోరు: మహిళల డబుల్స్‌లో విలియమ్స్ సిస్టర్స్ ఆధిపత్యం చెలాయిస్తున్నారు. రెండో రౌండ్లో వీనస్- సెరెనా జోడీ 6-4, 6-2 తేడాతో సారా(ఇటలీ)- కిర్‌స్టెన్ (బెల్జియం) జంటపై విజయం సాధించింది.

భారత జోడీల ఓటమి: ఫ్రెంచ్ ఓపెన్‌లో భారత ఆటగాళ్ల పోరు ముగిసింది. పురుషుల డబుల్స్ రెండో రౌండ్లో యుకి- శరణ్ జోడీ 5-7, 3-6 తేడాతో ఒలివర్ (ఆస్ట్రియా)- పావిక్ (క్రొయేషియా) జంట చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో బాబోస్ (హంగేరి)తో జతకట్టిన రోహన్ బోపన్న తొలి రౌండ్లో 2-6, 3-6తో షు జంగ్ (చైనా)- జాన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడారు. మరో మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో దివిజ్ శరణ్- అయోమ (జపాన్) జోడీ పరాజయం పాలైంది.

ఆంధ్రా అద్భుతాలు చూడండి!

- రాష్ట్రంలోని 7 పర్యాటక కేంద్రాలకు జాతీయ స్థాయిలో ప్రకటనలు
- సెలబ్రిటీల ద్వారా ప్రచారం
- ప్రణాళిక సిద్ధం చేసిన పర్యాటకశాఖ

ఈనాడు – అమరావతి

ప్రపంచ పర్యాటక రంగంలో ఖ్యాతిగాంచిన ఏడు అద్భుతాల స్ఫూర్తితో... రాష్ట్రంలోని అత్యంత ఆకర్షణీయమైన 7 పర్యాటక కేంద్రాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు రంగం సిద్ధమైంది. ఈ కేంద్రాలకు పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించేందుకు... వివిధ రంగాల ప్రముఖులతో ప్రచారం కల్పించనున్నారు. ఈ మేరకు పర్యాటకశాఖ మార్కెటింగ్ విభాగం ప్రణాళికను రూపొందించింది. 2018-19లో ఇందుకోసం రూ.30 కోట్లతో దీన్ని అమలు చేయనుంది. అమరావతి, శ్రీశైలం, తిరుపతి, అరకు, గండికోట, కోనసీమ, అనంతపురం (టూరిజం సర్క్యూట్)ను.. 'ఏపీ 7 వండర్స్' పేరుతో ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు పర్యాటక శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. గుజరాత్, కేరళ, ఒడిశా, రాజస్థాన్‌లు తమ రాష్ట్రాల్లో పర్యాటకంపై పెద్దఎత్తున టీవీ మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నాయి. ఏపీ పర్యాటకంపైనా ఇలాగే ప్రచారం చేయాలని రాష్ట్ర అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రాష్ట్రంలోని పర్యాటకంపై ఆకర్షణీయంగా 30సెకన్ల నిడివితో వీడియోలు సిద్ధం చేయనున్నారు. సెలబ్రిటీలకు ఇక్కడి పర్యాటక కేంద్రాలను చూపించడం... వారి ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాంలో ఆ ఫొటోలను పోస్ట్ చేయించడం ద్వారా కూడా ప్రచారం చేయాలని నిర్ణయించారు.

మరికొన్ని నిర్ణయాలు..

★ మూడు ప్రధాన విమాన సర్వీసులకు చెందిన 100 విమానాల్లో సీట్ల వెనుక ఏపీ పర్యాటకంపై ఫొటోలు, బుక్‌లెట్స్ లాంటివి ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం రూ.1.80 కోట్లను వెచ్చించనున్నారు.

★ ప్రాంతీయ టీవీ ఛానెళ్లు, జాతీయ ఛానెళ్లలో ప్రచారం కల్పిస్తారు. ఆయా ఛానెళ్లే ఏపీలో ఎంపిక చేసిన పర్యాటక కేంద్రాలకు వెళ్లి షూట్ చేసుకుని 30 నిమిషాల పాటు చానెల్‌లో ప్రసారం చేసేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ప్రాంతీయ మీడియాకు రూ.4.50 కోట్లు, జాతీయ మీడియాకు మరో రూ.4.50కోట్ల మేర కేటాయించనున్నారు.

★ ఏపీకి ఎక్కువగా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, భువనేశ్వర్, కోల్‌కతాల నుంచి వస్తుంటారు. ఆ నగరాల్లో సంవత్సరం పొడవునా హోర్డింగులు ఏర్పాటు చేస్తారు.

★ ట్రిప్ అడ్వయిజర్, మేక్ మై ట్రిప్ వంటి డిజిటల్ మార్కెటింగ్ వ్యవస్థల్లో ప్రకటనలు ఇస్తారు. సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తారు.

చిన్న ఆలయాలకు శ్రీరామరక్ష!

- జీవో.76 అమలు ముఖ్యమంటున్న అర్చకులు

ఈనాడు–అమరావతి: చిన్న ఆలయాలపై ఆధారపడిన అర్చకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారి వంశ పారంపర్య హక్కులను కాపాడటంతో పాటు వారికి ఒక పథకం అమలుచేసేలా 2017లో జీవో 76ను రూపొందించారు. ఈ ఉత్తర్వు తుది ప్రకటన కోసం అర్చకులు నిరీక్షిస్తున్నారు. కమిటీ వేసి జీవోపై తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

జీవో 76 ద్వారా ఏం జరుగుతుంది? సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం 1987 దేవదాయ, ధర్మాదాయ చట్టానికి మార్పులు చేస్తూ సెక్షన్ 34(3), సెక్షన్ 35(4)లు చేరుస్తూ 144సెక్షన్‌కు కొన్ని నియమాలను జత చేస్తూ జీవో 76 రూపొందింది. ఇది వంశపారంపర్య అర్చకులకు నిబంధనలు చెబుతుంది. దీని అమలు వల్ల పల్లెల్లోని సంప్రదాయ హిందూ చిన్న ఆలయాలు మనగలుగుతాయని ఉత్తర్వు పేర్కొంటోంది. తిరుమల తిరుపతి దేవస్థానాలు మినహా రాష్ట్రంలోని మిగిలిన ఆలయాల్లో 17/1966 చట్టం ప్రకారం వంశపారంపర్య అర్చకులుగా గుర్తింపుపొందిన వారికి ఈ జీవో వర్తిసుంది.

వంశపారంపర్య అర్చకులకు 6 ఏ,బీ,సీ కింద నోటిఫై చేసిన అన్ని ఆలయాలు, సంస్థల్లో ఉన్నవారికి వంశపారంపర్య అర్చక పథకం వర్తిస్తుంది. రూ.ఐదు లక్షల్లోపు ఆదాయం ఉండి సెక్షన్ 144 ఎక్కడయితే వర్తించదో ఆ ఆలయాల్లో 1966లోని 17వ చట్టం ప్రకారం వారికి సంప్రదాయ హక్కులు లభిస్తాయి. వంశపారంపర్య అర్చక పథకంలో అర్చకులకు వర్తించే ప్రయోజనాల మార్గదర్శకాలన్నీ ధార్మిక పరిషత్ ఖరారు చేస్తుంది.

ఆలయాలకు, అర్చకునికి నాటి బంధం అవసరం: హిందూధర్మం ప్రకారం ఆలయాలను పరిరక్షించాలంటే పాతకాలంలో అర్చకుడికి, ఆలయానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని పునరుద్ధరించేలా చర్యలు, నిబంధనలు ఉండాలని దేవాలయాలకు సంబంధించి కీలక స్థానాల్లో పని చేసిన విశ్రాంత అధికారులు అభిప్రాయపడుతున్నారు. అర్చకత్వ అర్హతలకు మంత్రాలు, క్రియల్లో వారికున్న పట్టు కొలమానం కావాలని సూచిస్తున్నారు. జీవో 76 యథాతథంగా అమలు చేయాలని అర్చక సమాఖ్య నేతలు అగ్నిహోత్రం ఆత్రేయబాబు, పెద్దింటి రాంబాబులు కోరుతున్నారు.

సీట్ల పెంపుతోనే మెరికలకు ట్రిపుల్‌ఐటీ

- 4 వేల సీట్లకు 52,700 దరఖాస్తులు
- 2,000 సీట్లు పెంచితే పేద విద్యార్థులకు న్యాయం

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ప్రధాన ముఖద్వారం

వేంపల్లె, న్యూస్‌టుడే: ప్రతిభాన్విత గ్రామీణ విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్య అందించేందుకు రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో ఈ ఏడాది ప్రవేశాల కోసం తీవ్రపోటీ నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలలో ఈ ఏడాది ప్రవేశాల కోసం మే 30 నాటికి 52,700 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి చివరి గడువు జూన్ 8. ఈ లెక్కన ప్రవేశాల కోసం మరిన్ని దరఖాస్తులు చేరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ట్రిపుల్‌ఐటీల్లో ఈసారి 2,000 సీట్లు పెంచితేనే ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు న్యాయం జరిగే అవకాశం ఉంది. గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పూర్తిచేసే విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్య అందించేందుకు 2008లో ఆర్జీయూకేటీని స్థాపించి, ట్రిపుల్‌ఐటీలు ఏర్పాటుచేశారు. ప్రారంభంలో ప్రతిచోటా 2వేల మంది చొప్పున మొత్తం 6వేల సీట్లు కేటాయించారు. 2010లో ఒక్కో ట్రిపుల్‌ఐటీలో సీట్ల సంఖ్యను వెయ్యికి కుదించారు. నాటి నుంచీ వాటిలో ఏటా వెయ్యి మందికే ప్రవేశాలు కల్పిస్తున్నారు.

ప్రస్తుతం కోస్తాలోని 8 జిల్లాలకు 3 ట్రిపుల్‌ఐటీలు స్థానిక(లోకల్) పరిధిలో ఉన్నాయి. రాయలసీమ, నెల్లూరు కలిపి ఐదు జిల్లాలకు ఇడుపులపాయ ఒక్కటే లోకల్‌గా ఉంది. అనంతపురంలోనూ కొత్త ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుచేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు.

సీట్లు పెంచితేనే జరిగేను న్యాయం!

రాష్ట్రవ్యాప్తంగా ఈసారి 10వ తరగతిలో 29,921 మంది పదికి పది జీపీఏ గ్రేడింగ్ పాయింట్లు సాధించారు. అందులో ప్రైవేటు పాఠశాలలకు చెందిన 26,475 మంది ఉండగా, ప్రభుత్వ పాఠశాలలకు చెందినవారు 3,446 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదికి పది జీపీఏ సాధించిన వారు దరఖాస్తు చేసుకుంటే ట్రిపుల్ ఐటీ తొలి జాబితాలోనే వారికి సీట్లు లభిస్తాయి. ప్రైవేటు పాఠశాలల్లో పదికి పది జీపీఏ సాధించిన వెనుకబడిన సామాజిక వర్గీయులు కూడా ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించాలని దరఖాస్తు చేసుకున్నారు. దీంతో గట్టి పోటీ నెలకొంది.

ఎన్టీఆర్ గృహాలకు రూ.644 కోట్లు విడుదల

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకాల్లో నిర్మించిన గృహాలకు రూ.644 కోట్లను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. గత మూడు నెలలుగా 1.40 లక్షల గృహాలకు బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు గృహాల నిర్మాణాలను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రూ.376 కోట్లను వారం రోజుల కిందటే ప్రభుత్వం విడుదల చేయగా... దానికి అదనంగా రూ.644 కోట్లను విడుదల చేస్తూ జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాంకు ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో శుక్రవారం లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమ చేయనున్నారు. సీఎఫ్ఎంఎస్ విధానంలో బిల్లులు చెల్లించేందుకు సాంకేతిక సమస్యలు ఎదురవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని గృహ నిర్మాణ సంస్థకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఆదేశించడంతో ఆర్థిక శాఖ నిధులు విడుదల చేసింది.

ఆంగ్ల మాధ్యమ డీఈడీ కోర్సులు

ఈనాడు, అమరావతి: ఈ విద్యా సంవత్సరం(2018-19) నుంచి ప్రభుత్వ జిల్లా విద్యా, శిక్షణ సంస్థ(డైట్)ల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఒక్కో డైట్‌లో ప్రస్తుత తెలుగు మాధ్యమానికి సమాంతరంగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభిస్తారు. ఒక్కో కళాశాలలో 50సీట్లను అదనంగా కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ముందుగానే ప్రభుత్వం డైట్‌ల్లో ఆంగ్ల మాధ్యమ డీఈడీ కోర్సులను ప్రవేశపెడుతోంది.

మ్యూజియాలు, పురాతన కోటల అభివృద్ధికి రూ.16.70కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని మ్యూజియాలు, పురాతన కోటలు, గుహల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆరు మ్యూజియాలు, ఒక పురాతన కోట, గుహలు, అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయం అభివృద్ధికి కలిపి రూ.16.70కోట్లు విడుదల చేసింది.

సీపీఎస్ రద్దుకు జులై 21 నుంచి యూటీఎఫ్ పోరు యాత్ర

ఈనాడు, అమరావతి: కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం(సీపీఎస్) రద్దు, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యూటీఎఫ్) నిర్ణయించింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుకు ఈ నెల 8న పాఠశాల ఉపాధ్యాయ సమాఖ్య, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్యల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జులై 21 నుంచి ఆగస్టు 5 వరకు శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం నుంచి మూడు సీపీఎస్ జాతాలు ప్రారంభమవుతాయని, విజయవాడలో ఆగస్టు 5న భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

sports@eenadu.in
విజయవాడ
శనివారం, జూన్ 2, 2018

తరుముకొచ్చేస్తోంది ఫుట్‌బాల్ ప్రపంచకప్!

32 జట్లు పోటీ పడతాయి.. వందల మంది ఆటగాళ్లు బరిలోకి దిగుతారీ మెగా టోర్నీలో. కానీ దేశంతో సంబంధం లేకుండా ప్రపంచం దృష్టిని ఆకర్షించేది కొందరే. వాళ్ల విన్యాసాలు చూసి మైమరిచిపోవడానికి.. వాళ్లు మిగిల్చే గురుతుల్ని భద్రపరుచుకోవడానికి కోట్ల జతల కళ్లు కాచుకుని ఉంటాయి. ఈ కప్పులోనూ అలాంటి తారలున్నారు. వాళ్ల దేశం ఎలా ఆడుతుంది.. కప్పెవరు గెలుస్తారన్నది తర్వాత.. ఈ తారలు ఎలాంటి అద్భుతాలు చేస్తారు.. కప్పుపై ఎలాంటి ముద్ర వేస్తారన్నదే అమితాసక్తి రేపుతోంది. మరి వీరిలో అంచనాలందుకునేదెవరు? ప్రపంచకప్ హీరోగా నిలిచి.. తర్వాతి నాలుగేళ్లూ నీరాజనాలందుకునేదెవరు? ముందు తరం సూపర్ స్టార్లు రొనాల్డో మెస్సిలా.. తర్వాత వచ్చిన నెయ్‌మారా.. నవతరం తారలు సలా, డిబ్రుయిన్‌లా?

కళ్లన్నీ ఈ కాళ్లపైనే!

రొనాల్డో కెరీర్

అంతర్జాతీయ మ్యాచ్‌లు	149	గోల్స్	81
ప్రపంచకప్ మ్యాచ్‌లు	13	గోల్స్	3
2017–18లో మ్యాచ్‌లు	44	గోల్స్	44

మెస్సి కెరీర్..

అంతర్జాతీయ మ్యాచ్‌లు	124	గోల్స్	64
ప్రపంచకప్ మ్యాచ్‌లు	15	గోల్స్	5
2017–18లో మ్యాచ్‌లు	53	గోల్స్	45

డిబ్రుయిన్ కెరీర్

అంతర్జాతీయ మ్యాచ్‌లు	59	గోల్స్	14
ప్రపంచకప్ మ్యాచ్‌లు	4	గోల్స్	1
2017–18లో మ్యాచ్‌లు	52	గోల్స్	12

నెయ్‌మార్ కెరీర్

అంతర్జాతీయ మ్యాచ్‌లు	83	గోల్స్	53
ప్రపంచకప్ మ్యాచ్‌లు	5	గోల్స్	4
2017–18లో మ్యాచ్‌లు	30	గోల్స్	28

సలా కెరీర్

అంతర్జాతీయ మ్యాచ్‌లు	57	గోల్స్	33
ప్రపంచకప్ అనుభవం లేదు			
2017–18లో మ్యాచ్‌లు	52	గోల్స్	44

అతను ప్రత్యేకం

ఒంటిచేత్తో ఈజిప్ట్‌కు ప్రపంచకప్ బెర్తు సాధించిన సలా..ఆటతోనే కాక తన వ్యక్తిత్వంతోనూ ఆకట్టుకుంటున్నాడు. ఈజిప్ట్‌కు ప్రపంచకప్ బెర్తు సాధించి పెట్టినందుకు సలాకు ఒక రియల్ ఎస్టేట్ సంస్థ నజరానాగా ఒక భవంతిని ఇస్తే.. దాన్ని తాను పుట్టి పెరిగిన గ్రామాభివృద్ధికి ఇచ్చేశాడు. అభిమానులకు చాలా విలువ ఇచ్చే సలా, ఒక మ్యాచ్ సందర్భంగా స్టాండ్స్‌లో ఉన్న ఓ చిన్నారి 'సలా నీ టీషర్ట్ ఇవ్వవా' అన్న సందేశంతో ప్లకార్డు పట్టుకుని ఉండటం చూసి.. మ్యాచ్ అయ్యాక తన జెర్సీ విప్పి తనకివ్వడం విశేషం. ఇలాంటి ఘటనలెన్నో సలాను కోట్లాదిమందికి ఇష్టుడిగా మార్చింది.

లియొనెల్ మెస్సీ

మారడోనా లాంటి దిగ్గజం వచ్చిన అర్జెంటీనా నుంచి అతడిని మరిపించే మరో ఆటగాడు వస్తాడని ఎవ్వరూ అనుకుని ఉండరు! ఐతే తన మాయాజాలంతో డీగోను మరిపించేశాడు లియొనెల్ మెస్సి. ఈ తరంలోనే కాదు.. మొత్తం ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత గొప్ప ఆటగాళ్లలో మెస్సి ఒకడనడంలో ఎలాంటి సందేహం లేదు. అతడి ఆటలో సొగసు చూస్తే ఆహా అనాల్సిందే. ఆ వేగం.. బంతిపై ఆ నియంత్రణ.. గోల్స్ కొట్టడంలో నైపుణ్యం గురించి ఎంత చెప్పినా తక్కువే. యూట్యూబ్‌ల మెస్సి గోల్స్ అని కొడితే చాలు.. అతడి అద్భుత ఆటతీరుకు నిదర్శనంగా నిలిచే ఉదాహరణలు కోకొల్లలు. 2014 ప్రపంచకప్‌లో మెస్సి ఒక్క గోల్ కూడా కొట్టలేదు. అయినా అతడి ఆట అద్భుతమంటూ కొనియాడారు విశ్లేషకులు. మెస్సి నైపుణ్యం అలాంటిది. ఇప్పటికే మూడు ప్రపంచకప్‌లు ఆడాడీ స్ట్రైకర్. గత టోర్నీలో అర్జెంటీనాను ఫైనల్ దాకా తీసుకెళ్లాడు. రెండేళ్ల కిందట కోపా అమెరికా టోర్నీ ఫైనల్లో చిలీ చేతిలో అర్జెంటీనా ఓడిపోగానే మెస్సి అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేస్తున్నట్లు ప్రకటించాడు. కానీ అర్జెంటీనా అంతా గొల్లుమనడంతో వెనక్కి తగ్గక తప్పలేదు. అతను నిర్ణయాన్ని మార్చుకోకుంటే అర్జెంటీనా ప్రపంచకప్పే ఆడేది కాదేమో. ఘన చరిత్ర ఉన్న ఈ జట్టు క్వాలిఫయర్స్‌లోనే నిష్క్రమించే ప్రమాదంలో పడింది. చివరి క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో మూడు గోల్స్ కొట్టి తన జట్టుకు రష్యా బెర్తు సాధించి పెట్టిన ఘనత మెస్సిదే. టోర్నీ ముంగిట లియొనెల్ మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. 30 ఏళ్ల మెస్సికి ఇదే చివరి ప్రపంచకప్ కావచ్చు. మరి ఈసారైనా కప్పు కల నెరవేర్చుకుంటాడేమో చూడాలి.

మో సలా

ప్రతి ప్రపంచకప్‌లోనూ ఒక కొత్త హీరో అవతరిస్తుంటాడు. కానీ ఈసారి ఆ టోర్నీ కంటే ముందు ఒక ఆటగాడు సూపర్ స్టార్ అయిపోయాడు. అతనే.. మహ్మద్ సలా. కొన్నేళ్ల కిందటే ప్రతిభ చాటుకున్నప్పటికీ గత ఏడాది కాలంలో ఈ ఈజిప్ట్ స్ట్రైకర్ ఎదిగిన తీరు అసాధారణం. రొనాల్డో, మెస్సిలకు దీటైన ఆటతో ఛాంపియన్స్ లీగ్‌లో సూపర్ హీరోగా నిలిచాడతను. ఏకంగా 32 గోల్స్ కొట్టి ఫుట్‌బాల్ అభిమానుల్ని ఉర్రూతలూగించాడు. ఒకప్పుడు క్లబ్ ఫుట్‌బాల్ ఆడటం కోసం సలా ఎంత కష్టపడ్డాడో! కానీ అవకాశం వచ్చాక మాత్రం అద్భుత ప్రదర్శనతో విలువైన ఆటగాడిగా ఎదిగాడు. లివర్‌పూల్ లాంటి పెద్ద క్లబ్ రికార్డు స్థాయిలో రూ.290 కోట్ల బదిలీ ఫీజుతో అతడిని తమ సొంతం చేసుకోవడం విశేషం. సలా కోసం మరీ అంత రేటా అని అంతా ఆశ్చర్యపోయారు. కానీ అద్వితీయమైన ఆటతో తనకు కట్టిన రేటు తక్కువే అని రుజువు చేశాడు సలా. ఈజిప్ట్ 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఆడుతోందంటే సలా పుణ్యమే. క్వాలిఫయర్స్‌లో అద్భుత ప్రదర్శనతో తన జట్టుకు రష్యా టికెట్ తెప్పించింది సలానే. చావో రేవో అనదగ్గ చివరి మ్యాచ్‌లో అతడి గోలే ఈజిప్ట్‌ను గెలిపించింది. మైదానంలో సలా విన్యాసాల గురించి ఎంత చెప్పినా తక్కువే. అతడి వేగం, బంతిపై నియంత్రణ అసాధారణం. ఐతే సూపర్ ఫామ్‌తో రష్యా మెగా ఈవెంట్‌కు రెడీ అవుతున్న సమయంలో ఛాంపియన్స్ లీగ్ ఫైనల్ సందర్భంగా భుజానికి గాయం కావడం.. సలా ప్రపంచకప్ ఆశల్ని కొంచెం ప్రశ్నార్థకం చేసింది. ఐతే టోర్నీ సమయానికి అతను ఫిట్‌నెస్ సాధిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.

రొనాల్డో

క్రిస్టియానో రొనాల్డో.. ఈ పేరు చెబితే చాలు ఫుట్‌బాల్ ప్రేమికులు వెర్రెత్తిపోతారు. అతడి అద్భుత విన్యాసాలకు మైమరిచిపోతారు. ఏమా వేగం.. ఏమా నియంత్రణ.. ఏమా నైపుణ్యం.. ఫుట్‌బాల్ అంటే ఆసక్తి లేనివాళ్లు సైతం అతనాడుతుంటే.. ఏమిటీ మాయాజాలం అన్నట్లుగా అలా చూస్తుండిపోవాల్సిందే. క్లబ్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో సాధించిన ఘనతలు మరెవరికీ సాధ్యం కానివి. ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత విలువైన, ఖరీదైన ఆటగాళ్లలో అతనొకడు. అతడి నైపుణ్యం ఎలాంటిదో చెప్పడానికి ఇటీవలే ఛాంపియన్స్ లీగ్‌లో బైసికల్ కిక్‌తో కొట్టిన గోల్ ఒకటి చాలు. 33 ఏళ్ల వయసున్న ఆటగాడు పల్టీ కొడుతూ ఒడుపుగా గోల్ సాధించడమంటే మాటలా? పుష్కర కాలంగా ఇలా మరెన్నో విన్యాసాలతో అభిమానుల్ని అలరిస్తూ వస్తున్నాడు ఈ పోర్చుగల్ స్ట్రైకర్. కాకపోతే అతడి స్థాయికి, పోర్చుగల్ జట్టు ప్రమాణాలకు అంతరం చాలా ఎక్కువ. సహచరులు అతడి వేగాన్ని అందుకోలేరు. అందుకే ప్రపంచకప్‌లో పోర్చుగల్ ప్రదర్శన ఏమంత గొప్పగా లేదు. గత టోర్నీలో అయితే గ్రూప్ దశ కూడా దాటలేదా జట్టు. ఐతే రెండేళ్లుగా పోర్చుగల్ నిలకడగా ఆడుతోంది. 2016లో రొనాల్డో గొప్ప ప్రదర్శన చేయడంతో యూరో ఛాంపియన్ కాగలిగింది. అతను ఇదే మాయను ప్రపంచకప్‌లోనూ కొనసాగిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. ఛాంపియన్స్ లీగ్ సహా గత ఏడాది కాలంలో రొనాల్డో ప్రదర్శన బాగుంది. వయసు ప్రభావంతో కొంచెం వేగం తగ్గినా ఇప్పటికీ ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లలో అతనొకడు. రొనాల్డో కూడా ప్రపంచకప్‌లో కనిపించడం ఇదే చివరిసారి. వెళ్తూ వెళ్తూ ఈ టోర్నీపై తనదైన ముద్ర వేస్తాడని, ప్రపంచకప్‌లో పేలవంగా ఉన్న తన ప్రదర్శనను కూడా మారుస్తాడని అభిమానుల ఆశ.

నెయ్‌మార్

ఒక పీలే.. ఒక జికో.. ఒక రివాల్డో.. ఒక రొనాల్డో.. ప్రపంచ ఫుట్‌బాల్‌పై తమదైన ముద్ర వేసిన బ్రెజిల్ సూపర్ స్టార్లు. వీళ్ల తర్వాత బ్రెజిల్ నుంచి వచ్చి గొప్ప ప్రతిభావంతుడు నెయ్‌మార్ జూనియర్. టీనేజీలోనే తన అసాధారణ నైపుణ్యాల్ని చాటుకున్నాడీ కుర్రాడు. మైదానంలో మెరుపులా కదిలే నెయ్‌మార్.. చుట్టూ ఐదారుగురు ప్రత్యర్థులున్నా ఎవ్వరికీ చిక్కకుండా బంతిని తన నియంత్రణలోనే పెట్టుకుని కళ్లు చెదిరే రీతిలో గోల్స్ కొట్టేస్తాడు. అతనెలా మ్యాచ్‌లను తారుమారు చేస్తాడో.. ఎంత అద్భుతంగా గోల్స్ సాధిస్తాడో చెప్పడానికి ఒక ఉదాహరణ.. 2016లో విల్లా రియల్ క్లబ్‌పై సాధించిన గోల్. ఆ ఏడాది అత్యుత్తమ గోల్‌గా అది అనేక అవార్డులకూ ఎంపికైంది. ఇలాంటి మెరుపు గోల్స్ మరెన్నో సాధించాడతను. 26 ఏళ్ల ఈ స్ట్రైకర్.. 2014లో తమ సొంతగడ్డపైనే జరిగిన టోర్నీలో ప్రపంచకప్ అరంగేట్రం చేశాడు. అప్పటికి బలహీనంగా ఉన్న బ్రెజిల్.. నెయ్‌మార్ మీద అతిగా ఆధారపడింది. అప్పటికీ నెయ్‌మార్ తన మెరుపులతో ఆకట్టుకున్నాడు. జట్టును క్వార్టర్స్ చేర్చాడు. కానీ కొలంబియాతో జరిగిన నాకౌట్ మ్యాచ్‌లో తీవ్రంగా గాయపడి మైదానం వీడాడు. అతను లేక డీలా పడిపోయిన బ్రెజిల్ సెమీస్‌లో జర్మనీ చేతిలో ఏకంగా 1-7తో చిత్తయింది. ఈసారి బ్రెజిల్ జట్టు మెరుగైంది. చాలా మ్యాచ్‌ల్లో నెయ్‌మార్ లేకుండానే క్వాలిఫయింగ్ టోర్నీలో అదరగొట్టింది. జట్టులో చాలామంది ప్రతిభావంతులుండటంతో నెయ్‌మార్ స్వేచ్ఛగా ఆడేందుకు వీలు చిక్కనుంది. సహచరుల మద్దతుతో అతను మెరుపులు మెరిపిస్తాడని ఆశిస్తున్నారు అభిమానులు. నెయ్‌మార్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేసి, అతడికి సహచరుల నుంచి సహకారం అందితే ఈసారి బ్రెజిల్ కచ్చితంగా కప్పు గెలుస్తుందని భావిస్తున్నారు విశ్లేషకులు.

కెవిన్ డిబ్రుయిన్

కెవిన్ డిబ్రుయిన్.. గత రెండు మూడేళ్లలో శరవేగంగా ఎదిగి ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న బెల్జియం ఆటగాడు. ఫుట్‌బాల్ విశ్లేషకులు అతడిని సంపూర్ణ ఆటగాడిగా పేర్కొంటారు. గత ఏడాది 'గార్డియన్' ప్రపంచ అత్యుత్తమ ఫుట్‌బాలర్లంటూ ఇచ్చిన జాబితాలో అతడికి నాలుగో స్థానం దక్కింది. గత ప్రపంచకప్‌లో అతి కష్టం మీద క్వార్టర్స్ చేరి.. అంతకుముందు రెండు పర్యాయాలు టోర్నీ అర్హతే సాధించని బెల్జియం ఈసారి ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగుతోందంటే అందుకు డిబ్రుయిన్ కూడా ఒక కారణం. క్లబ్ ఫుట్‌బాల్‌లో మాంచెస్టర్ సిటీ తరఫున కెవిన్ అదరగొట్టాడు. ఈ మిడ్‌ఫీల్డర్ గోల్స్ కొట్టడం కంటే అందుకు అనుకూల వాతావరణం కల్పించడంలో సిద్ధహస్తుడు. అవసరానికి తగ్గట్లు వింగర్‌గా, స్ట్రైకర్‌గా మారుతాడు. చాలా దూరం నుంచి గోల్స్ కొట్టడంలో అతను నిపుణుడు. మైదానం నలుమూలలా ప్రభావం చూపగల ఆటగాడిగా డిబ్రుయిన్‌కు ప్రపంచ అత్యుత్తమ కోచ్‌ల్లో ఒకడైన గార్డియోలా కితాబిచ్చాడంటే డిబ్రుయిన్ ప్రతిభేంటో అర్థం చేసుకోవచ్చు. అతను గత ప్రపంచకప్‌లోనూ ఆడాడు. అప్పటికి అంత పేరున్న ఆటగాడేమీ కాదు. ఆ టోర్నీలో అతడికి పెద్దగా అవకాశాలు రాలేదు. ప్రిక్వార్టర్స్‌లో కీలకమైన గోల్ సాధించాడు. ఐతే గత రెండేళ్లలో అతను ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. ఆధునిక ఫుట్‌బాల్‌కు ప్రతినిధిగా అతడిని అభివర్ణిస్తారు విశ్లేషకులు. ఈసారి మాత్రం మంచి అంచనాలతో ప్రపంచకప్‌కు వస్తున్నాడు. టోర్నీలో బెల్జియం ఎక్కడిదాకా వెళ్తుందనేది నిర్దేశించే ఆటగాళ్లలో కెవిన్ ఒకడని అంచనా వేస్తున్నారు.

స్టార్ట్.. గన్.. 'షూటింగ్'

సినిమా పరిశ్రమలో హీరోగా ఒక్క హిట్టొస్తే చాలు.. పేరుకు పేరు.. డబ్బుకు డబ్బులు. పైగా సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినవాళ్ల సంగతి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. స్టార్ హోదా, పార్టీలు, అభిమానులు.. ఆ క్రేజ్ వేరేగా ఉంటుంది. అలాంటి జీవితాన్ని ఎవరన్నా వదులుకొంటారని అనుకుంటామా! ఊహించలేం కదా? కానీ అతను దాన్ని వదులుకున్నాడు. మనసు మాటే విన్నాడు. చిన్నప్పటి నుంచి సాధనచేస్తున్న ఆట కోసం సినిమా కెరీర్‌ను లెక్కచేయలేదు. వెండితెరపై కనబడేదాని కన్నా.. షూటింగ్ రేంజ్‌లో ప్రత్యర్థులకు సవాలు విసరడంలోనే మజా ఉందనుకున్నాడు. తన మనసుకు నచ్చిన ఆటలో కొనసాగడంలోనే అసలైన కిక్ దొరుకుతుందని భావించాడు. తెలంగాణ నుంచి ఎన్నో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. ప్రస్తుతం భారత షూటింగ్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. అతనే శ్రేయాన్ కపూర్. సహజనటి జయసుధ కొడుకు.

చిన్నపుడు సినిమాల్లో కథానాయకులు తుపాకీ పట్టి విన్యాసాలు చేస్తుంటే.. తను కూడా అలా చేయాలనుకున్నాడు. కానీ అది రీల్ లైఫ్‌లో కాదు రియల్ లైఫ్‌లో. ఒకసారి తుపాకీ పట్టుకున్నాక ఇక దాన్ని వదల్లేదు. ఆటగాడిగా రాష్ట్రం, దేశం తరఫున పోటీల్లో పాల్గొన్న శ్రేయాన్.. ఫిబ్రవరిలో భారత జట్టు కోచ్‌గా మారి భవిష్యత్ తరాలకు షూటింగ్ పాఠాలు చెబుతున్నాడు. గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో పతకాల పంట పండించిన భారత షూటర్ల బృందానికి శిక్షణ ఇచ్చిన కోచ్‌ల్లో శ్రేయాన్ ఒకడు. అతను శిక్షణ ఇచ్చిన షాట్‌గన్ విభాగంలో భారత్‌కు ఒక స్వర్ణం, ఒక కాంస్యం దక్కింది.

ఆ విజయం వల్లే: అది 2004 ఏథెన్స్ ఒలింపిక్స్. అప్పటి భారత అగ్రశ్రేణి షూటర్ రాజ్యవర్ధన్ సింగ్ రాఠోడ్ షూటింగ్ డబుల్‌ట్రాప్ విభాగంలో రజతం గెలవడంతో దేశం మొత్తం ఆనందోత్సాహాల్లో మునిగిపోయింది. ఆ విజయాన్ని చూసిన శ్రేయాన్ తుపాకీ పట్టాడు. చిన్న వయసులోనే శిక్షణ మొదలెట్టి అంచెలంచెలుగా ఎదిగాడు. మూడు సార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు. దాదాపు 30 పతకాలు సాధించాడు.

సినిమా ఫట్టు.. షూటింగ్ హిట్టు: నటి జయసుధ కొడుకు కావడంతో శ్రేయాన్ సినిమాల వైపు వస్తాడని అందరూ అనుకున్నారు. కానీ పదో తరగతిలోనే షూటింగ్ కెరీర్‌ను ఎంచుకున్నాడు. కానీ సినిమా నేపథ్యం ఉండడంతో పాటు మళ్లీ భవిష్యత్‌లో.. అరే! సినిమాలో ప్రయత్నించలేదే అనే అసంతృప్తి ఉండకూడదని చలనచిత్ర రంగంలో అడుగుపెట్టాడు. ముంబయి వెళ్లి నటనలో శిక్షణ పొందాడు. 2015లో బస్తీ చిత్రం ద్వారా హీరోగా పరిచయమయ్యాడు. ఓ వైపు సినిమా చేస్తున్నా అతని మనసు మొత్తం షూటింగ్‌పైనే ఉండేది. చిత్రీకరణ సమయంలోనూ వీలు దొరికినపుడు షూటింగ్ సాధన చేసేవాడు. మనసు షూటింగ్ మీదే లగ్నం చేసిన శ్రేయాన్ ఆ చిత్రాన్ని పూర్తి చేసిన తర్వాత సినిమాలకు గుడ్‌బై చెప్పి పూర్తి సమయం ఆటకే కేటాయించాడు.

"అమ్మా, నాన్న వాళ్ల భావాలను నాపై ఎప్పుడూ రుద్దలేదు. సినిమాలు వదిలేసి పూర్తిగా షూటింగే చేస్తానని చెప్పినపుడు కూడా నాకు మద్దతుగా నిలిచారు. వాళ్లు సినిమాలే చేయమంటే చేసేవాణ్నేమో! కానీ వ్యక్తిగత సంతృప్తి మాత్రం ఉండకపోయేది" అని శ్రేయాన్ తెలిపాడు. శ్రేయాన్ చిన్నతనంలో వాళ్లమ్మ జయసుధ సినిమాలతో తీరిక లేకుండా ఉండేది. దాంతో అతణ్ని చూసుకోవడానికి వీల్లేకపోయింది. అయినా చిన్నతనంలో జరిగినవి గుర్తులేదంటాడు శ్రేయాన్. వ్యవహారాలన్నింటినీ చక్కబెట్టడంలో అమ్మ తర్వాతే ఎవరైనా అని ఆనందంతో చెబుతున్నాడు.

అలా శిక్షణ వైపు: ఆటగాడిగా ఓ వైపు కొనసాగుతూనే హైదరాబాద్‌లోని యువ షూటర్లకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. గత రెండేళ్లుగా తెలంగాణ రైఫిల్ సంఘం ప్రోత్సాహంతో అతనే వ్యక్తిగతంగా క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాడు. మనకు వచ్చిన విద్యను భావితరాలకు అందించి వాళ్లను ఛాంపియన్లగా నిలపాలన్న లక్ష్యంతో కోచింగ్ ఆరంభించానని చెబుతున్నాడు శ్రేయాన్.

ఫుట్‌బాల్‌కు సాకర్‌కు ఏంటి తేడా?

ఫుట్‌బాల్.. సాకర్.. ఈ రెండు పదాలు క్రీడాభిమానులందరికి తెలిసినవే. ఫిఫా ప్రపంచకప్‌ను ఫుట్‌బాల్ ప్రపంచకప్ అని మాత్రమే కాదు సాకర్ ప్రపంచకప్ అని కూడా పిలుస్తారు. మరి ఫుట్‌బాల్‌కు సాకర్‌కు ఉన్న తేడా ఏంటి? ఈ రెండూ ఒకటేనా? ఫుట్‌బాల్.. సాకర్ ఏ పేరుతో పిలిచినా ఆట మాత్రం ఒకటే. ఇంగ్లిష్ వాళ్లు దీన్ని ఫుట్‌బాల్ అంటే.. అమెరికన్లు సాకర్ అనే పేరుతో పిలుస్తారు. ఐతే నిజానికి సాకర్ అనే పేరు పుట్టింది ఇంగ్లాండ్‌లోనే. దీన్ని మొదట ఉపయోగించింది ఆంగ్లేయులే. సుమారు 200 ఏళ్ల క్రితం బ్రిటన్‌లో ఫుట్‌బాల్‌ను భిన్నమైన నిబంధనలతో ఆడేవాళ్లు. ఈ ఆటల్లో గందరగోళం లేకుండా ఉండడం కోసం ఒక ఆటను రగ్బీ ఫుట్‌బాల్ అని, మరో ఆటను అసోసియేషన్ ఫుట్‌బాల్ అని విభజించారు. కాలక్రమేణా రగ్బీ ఫుట్‌బాల్ 'రగర్'గా మారితే.. అసోసియేషన్ ఫుట్‌బాల్ 'అసక్' అయింది. తర్వాత అది సాకర్ అని రూపాంతరం చెందింది. 1960 నుంచి 1980 మధ్య ఇంగ్లాండ్‌లో సాకర్, ఫుట్‌బాల్ రెండింటినీ వాడేవాళ్లు. కొన్నేళ్ల తర్వాత సాకర్ అనే పదాన్ని వాడడం మానేసి ఫుట్‌బాల్ పేరునే ఖరారు చేసుకున్నారు. అమెరికాలో ఫుట్‌బాల్ పరిచయమయ్యే సమయానికి గ్రిడిరాన్ ఫుట్‌బాల్ అనే ఆట ప్రాచుర్యంలో ఉంది. దీంతో ఫుట్‌బాల్‌ను సాకర్ అని పిలవడం మొదలుపెట్టారు అమెరికన్లు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్, సాకర్.. ఈ రెండు పేర్లూ వాడుకలో ఉన్నాయి.

ఈనాడు సినిమా

రాశీఖన్నా

మా కష్టాలు కనిపించవు!

కథానాయకుడు సిక్స్‌ప్యాక్ చేస్తే.. ‘జిమ్ముకు వెళ్లి గంటలు గంటలు కష్టపడ్డాడు’ అనుకుంటారు. గెడ్డం పెంచినా, లుక్ కాస్త కొత్తగా ట్రై చేసినా... అందులో వాళ్ల శారీరక శ్రమ కనిపిస్తుంది. కానీ కథానాయికలకు అలా కాదు. వాళ్లెంత శ్రమించినా.. ఎవ్వరికీ అర్థం కాదు. ఈ మాటే రాశీ ఖన్నా అంటోంది. “మేం ప్రతి సినిమాలోనూ ఒకేలా కనిపిస్తుంటాం. లుక్ పరంగా ఎలాంటి మార్పు కూడా ఉండదు. దాంతో మేమేదో జాలీగా సెట్‌కి వస్తున్నామనుకుంటారు. కానీ.. తెర వెనుక మేం పడే కష్టం మాకే తెలుస్తుంది. అదెవరికీ కనిపించదు. శారీరకంగా ఎలాంటి మార్పూ కనిపించకుండా ఉండాలంటే.. దానికీ కసరత్తులు చేయాల్సిందే. బరువు పెరిగినా, తగ్గినా ఆ ప్రభావం మొహంలో కనిపిస్తుంది. ఒక్కోసారి అధిక వ్యాయామాలు కూడా ఇబ్బంది కలిగిస్తాయి. గత నాలుగు సినిమాల్లోనూ కథానాయిక ఒకేలా కనిపించిందంటే.. కచ్చితంగా తను చెమటోడుస్తున్నట్టే. మా కష్టాలు ఒక్క సినిమాకి పరిమితం కావు. అది నిరంతరం సాగే ప్రక్రియ” అని చెప్పింది రాశీ ఖన్నా.

టీజర్ కోసం ‘పంతం’

గోపీచంద్

గోపీచంద్ కథానాయకుడిగా నటించిన చిత్రం ‘పంతం’. ఫర్ ఎ కాజ్ అనేది ఉపశీర్షిక. మెహరీన్ కథానాయిక. కె.చక్రవర్తి దర్శకత్వం వహించారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈనెల 5న టీజర్‌ని విడుదల చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ “గోపీచంద్ నటించిన 25వ చిత్రమిది. చాలా ప్రత్యేకంగా తీర్చిదిద్దాం. కథ, కథనాలు, ఆయన పాత్ర చిత్రణ ఆకట్టుకుంటాయి. టాకీ పూర్తయింది. లండన్, స్కాట్‌లాండ్‌ల్లోని అందమైన లొకేషన్లలో పాటల్ని తెరకెక్కిస్తున్నాం. జులై 5న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ”న్నారు. పృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: గోపీ సుందర్

పంచ్ డైలాగ్

జీవితంలో ఏదీ ఈజీ కాదు.
ప్రయత్నిస్తే ఏదీ కష్టం కాదు.
చిత్రం: లింగ
– పంపినవారు: శ్రీరామ్, పటవల

కాజల్

సాయి శ్రీనివాస్

శ్రీను కోసం... కాజల్ వచ్చింది

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా వంశధార క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. కాజల్ కథానాయిక. సొంటినేని నవీన్ నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా సెట్లో తొలిసారి కాజల్ అడుగుపెట్టింది. ప్రస్తుతం ఈ సినిమా కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్లో శ్రీనివాస్, కాజల్‌పై కొన్ని ముఖ్యమైన సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ “కథలో కథానాయిక పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. అందుకే కాజల్‌ని ఎంచుకున్నాం. ఇదో యాక్షన్ థ్రిల్లర్. త్వరలోనే టైటిల్‌ను ప్రకటిస్తాం. ఇప్పటికే హిందీ శాటిలైట్ హక్కులు రూ.9.5 కోట్లకు అమ్ముడయ్యాయి. ఓ యువ కథానాయుడి చిత్రానికి ఈ స్థాయిలో రేటు పలకడం ఆనందంగా ఉంద”న్నారు. హర్షవర్ధన్ రాణె కీలక పాత్ర పోషిస్తున్నారు. సంగీతం: తమన్

‘సంజు’లు కలిశారు

క్లిక్ క్లిక్

సంజయ్‌దత్, రణ్‌బీర్ కపూర్

ప్రముఖ బాలీవుడ్ కథానాయకుడు సంజయ్‌దత్ జీవితం వెండితెరపై ‘సంజు’గా తెరకెక్కుతోంది. ఆయన పాత్రను రణ్‌బీర్ కపూర్ పోషిస్తున్నాడు. రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. దీనికి విశేషమైన స్పందన లభిస్తోంది. సంజయ్ పాత్రలో రణ్‌బీర్ ఒదిగిపోయిన తీరు చూసి అందరూ ప్రశంసిస్తున్నారు. ఇక సినిమాలో ఎలా ఉంటుందో అనే అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. ఈ ట్రైలర్ సంజయ్‌దత్‌కు బాగా నచ్చేసిందట. అందుకే సినిమా షూటింగ్‌లో ఉన్న రణ్‌బీర్‌కపూర్‌ను ముంబయిలోని ఓ స్టూడియోలో ప్రత్యేకంగా కలిసి ఆప్యాయంగా కౌగిలించుకొని అభినందించారు సంజయ్. ఆ సమయంలో క్లిక్ మన్న ఫొటో ఇది.

చైనాలో ‘టాయ్‌లెట్ హీరో’


‘టాయ్‌లెట్ హీరో’లో భూమి ఫడ్నేకర్, అక్షయ్‌కుమార్

భారతీయ చిత్రాలకు చైనాలో బ్రహ్మరథం పడుతున్నారు. ‘దంగల్’, ‘బాహుబలి 2’, ‘సీక్రెట్ సూపర్‌స్టార్’, ‘భజరంగీ భాయిజాన్’.. చిత్రాలు అక్కడి ప్రేక్షకుల మనసుల్ని కొల్లగొట్టి రూ.కోట్ల రూపాయలు వసూళ్లు అందుకొన్నాయి. తాజాగా చైనా మార్కెట్‌పై మరో బాలీవుడ్ హీరో కన్నుపడింది. బాలీవుడ్ యాక్షన్ కథానాయకుడు అక్షయ్‌కుమార్ నటించిన ‘టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథ’ను చైనాలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో తెరకెక్కించిన ఈ చిత్రానికి మంచి ప్రశంసలే దక్కాయి. చైనాలో ఈ సినిమా పేరుని ‘టాయ్‌లెట్ హీరో’గా మార్చి విడుదల చేస్తున్నారు. చైనా భాషలో ఉన్న కొత్త టైటిల్‌తో ఉన్న పోస్టర్‌ను ట్విట్టర్‌లో పంచుకొన్నారు సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్. చిత్ర కథానాయిక భూమి ఫడ్నేకర్, అక్షయ్‌కుమార్ పెళ్లి దుస్తుల్లో ఉంటారు. వాళ్లిద్దరి మధ్యలో వెస్ట్రన్ టాయిలెట్ ఉన్న పోస్టర్ ఆకట్టుకుంటుంది. శ్రీ నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 8న చైనాలో విడుదల కానుంది.

సూపర్ 30లో హృతిక్ ఇలా..


హృతిక్ రోషన్

హృతిక్ రోషన్ నటిస్తున్న జీవిత కథా చిత్రం ‘సూపర్ 30’. గణిత శాస్త్రవేత్త ఆనంద్‌కుమార్ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా ఈ సినిమా షూటింగ్ నుంచి తన లుక్‌ని సోషల్ మీడియాలో పంచుకొన్నారు హృతిక్. గుబురు గడ్డంతో ఉన్న హృతిక్ ఫొటో ఆయన అభిమానుల్నే కాదు నెటిజన్లను ఆకట్టుకుంటోంది. బిహార్‌కు చెందిన ఆనంద్‌కుమార్ రూపొందించిన ‘సూపర్ 30’ ప్రోగ్రామ్ చుట్టూ తిరిగే కథ ఇది. ఈ గెటప్ చూస్తుంటే ఆనంద్‌కుమార్ పాత్రలో హృతిక్ పరకాయ ప్రవేశం చేసినట్టే ఉందంటున్నారు ఆయన అభిమానులు. వికాస్ భళ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో వచ్చే ఏడాది జనవరి 25న విడుదల కానుంది.

పోరాడి గెలిచే ‘ఆటగాళ్లు’

నారా రోహిత్

నారా రోహిత్, జగపతిబాబు కథానాయకులుగా నటించిన చిత్రం ‘ఆటగాళ్లు’. పరుచూరి మురళి దర్శకుడు. బ్రహ్మానందం, దర్శనా బానిక్ కీలక పాత్రలు పోషించారు. వాసిరెడ్డి రవీంద్రనాథ్, వాసిరెడ్డి శివాజీ ప్రసాద్, మక్కెన రాము, వడ్లపూడి జితేంద్ర నిర్మాతలు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జులై 5న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. దర్శకుడు మాట్లాడుతూ “రోహిత్, జగపతిబాబుల పాత్రలు రెండూ పోటా పోటీగా ఉంటాయి. ఏ ఒక్కరు లేకపోయినా ఈ సినిమా లేదు. వీళ్లిద్దరూ ఆడిన ఆటలో ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు? అనేది ఆసక్తికలిగించే అంశం” అన్నారు. సంగీతం: సాయి కార్తీక్

అమ్మాయిల జీవితాలతో ఆట

డి.వెంకటేష్

రెహమాన్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం ‘డాక్టర్ సత్యమూర్తి’. శనివారం విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత డి.వెంకటేష్ మాట్లాడుతూ “ఈతరానికి సంబంధించిన ఓ సమస్యని ఇతివృత్తంగా తీసుకుని తెరకెక్కించిన చిత్రమిది. ఫేస్ బుక్, ట్విట్టర్ ద్వారా యుక్త వయసులోని అమ్మాయిల్ని తన బుట్టలో వేసుకుని, వాళ్ల జీవితాలతో ఆడుకునే ఓ డాక్టర్ కథ ఇది. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఘటనలే తెరపైనా కనిపిస్తాయి. పిల్లలే కాదు, పెద్దవాళ్లూ తెలుసుకోవాల్సిన విషయాలు ఈ చిత్రంలో ఉన్నాయి. రెహమాన్ నటన ఆశ్చర్యపరుస్తుంది. ఆయన పాత్రలోని విభిన్నమైన కోణాలే ‘సత్యమూర్తి’ బలం. ప్రస్తుతం అనువాద చిత్రాలపైనే దృష్టి పెట్టినా, అతి త్వరలో తెలుగులో నేరుగా సినిమాలు చేయాలనుకుంటున్నా” అన్నారు.

మగాళ్లని రక్షించండి

శరశ్చంద్ర, నేహాదేశ్ పాండే

శరశ్చంద్ర, నేహాదేశ్ పాండే, ఆమని ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం ‘ఐపిసి సెక్షన్ భార్యాబంధు’. సేవ్ మెన్ ఫ్రమ్ ఉమెన్ అనేది ఉపశీర్షిక. రెట్టడి శ్రీనివాస్ దర్శకుడు. ఆలూరి సాంబశివరావు నిర్మాత. హైదరాబాద్‌లో పాటలు విడుదలయ్యాయి. తొలిసీడీని సి.కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ “ఐపీసీలోని ఓ సెక్షన్‌ని ఆధారంగా తీసుకుని తెరకెక్కించిన చిత్రమిది. సమాజంలోని సమస్యలకు అద్దం పడుతుంది. సందేశాన్ని సున్నితమైన వినోదం మేళవించి తెరకెక్కించాం. ఈ సినిమాలో చర్చించిన అంశాల గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటార”న్నారు. సంగీతం: విజయ్ కురాకుల

రుక్సార్‌తో ఏబీసీడీ

రుక్సార్ ధిల్లాన్

మలయాళంలో విజయవంతమైన చిత్రం ‘ఏబీసీడీ’. తెలుగులో ఈ చిత్రాన్ని రీమేక్ చేస్తున్నారు. అల్లు శిరీష్ కథానాయకుడు. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. మధుర శ్రీధర్, యష్ రంగినేని నిర్మాతలు. ఈ చిత్రంలో కథానాయికగా రుక్సార్ ధిల్లాన్‌ని ఎంచుకున్నారు. నాని కథానాయకుడిగా నటించిన ‘కృష్ణార్జున యుద్ధం’లో ఓ కథానాయికగా నటించింది రుక్సార్. ఇది ఆమెకు రెండో తెలుగు సినిమా. నిర్మాతలు మాట్లాడుతూ “మలయాళంలో దుల్కర్ సల్మాన్ పోషించిన పాత్రలో శిరీష్ కనిపిస్తారు. తెలుగు వాతావరణానికి, ఇక్కడి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు కథలో కొన్ని మార్పులు చేశాం. కన్నడలో పేరొందిన జుధా సాంధీ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తామ”న్నారు.

కొత్త కబుర్లు

విక్కీ కౌశల్

కరణ్ కామెడీలో విక్కీ!

‘రాజీ’ విజయంతో ఆలియాభట్‌కే కాదు అందులో నటించిన విక్కీ కౌశల్‌కు మంచి తెచ్చింది. దీంతో బాలీవుడ్ దృష్టి విక్కీపై పడింది. విక్కీ కూడా ఇదే దూకుడుతో మంచి కథల్ని ఎంచుకొంటూ ముందుకెళ్లాలని భావిస్తున్నాడట. ఓ హారర్ కామెడీ కోసం కరణ్‌జోహార్ ధర్మప్రొడక్షన్స్ విక్కీని సంప్రదించిందట. “పలు కథలు విక్కీని వెదుక్కొంటూ వస్తున్నాయి. అందులో ధర్మప్రొడక్షన్స్ వారి హారర్ కామెడీ విక్కీకి నచ్చింది”అని విక్కీ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. కొత్త జోనర్ కథలతో చిత్రాలు తెరకెక్కించడంలో ముందుండే కరణ్‌తో చేయడం విక్కీకి ఇష్టమే. గతంలో విక్కీ నటించిన ‘లస్ట్ స్టోరీస్’ అనే ఓ వెబ్‌సిరీస్‌కు కరణ్ దర్శకత్వం వహించారు. కానీ ఈ కొత్త చిత్రానికి కరణ్ కేవలం నిర్మాత మాత్రమే అని సమాచారం.

ఆషికీ 3 కథానాయకుడు?


సిద్ధార్థ్ మల్హోత్ర

మంచి మ్యూజికల్ హిట్స్‌గా నిలిచిన ‘ఆషికీ’ సిరీస్ చిత్రాలంటే ప్రేక్షకుల్లో క్రేజ్ ఉంది. అందుకే ఇప్పుడు ఈ సిరీస్‌లో ‘ఆషికీ 3’ని తెరకెక్కించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో కథానాయకుడిగా సిద్ధార్థ్ మల్హోత్ర నటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈమధ్య తను నటించిన చిత్రాలు బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టడంతో తనకు ఓ భారీ హిట్ అవసరం అని భావిస్తున్నాడు సిద్ధార్థ్. ఇందులో భాగంగానే మహేష్‌భట్‌ను కలిసి ఆషికీ 3కి సంబంధించి సిద్ధార్థ్ చర్చలు చేసినట్టు సమాచారం. “సిద్ధార్థ్ తను ‘ఆషికీ 3’లో నటించడానికి సిద్ధంగా ఉన్నట్టు భట్‌తో చెప్పారు. తన జోడీగా ఎవరు నటించినా తనకు ఇష్టమేనని, కొత్త కథానాయిక అయినా ఫర్వాలేదు”అని చెప్పినట్టు బాలీవుడ్ సమాచారం. ‘ఆషికీ 2’కి మోహిత్ సూరీ దర్శకత్వం వహించారు. మూడో చిత్రానికి దర్శకుడెవరనేది ఇంకా తేలాల్సి ఉంది.

ఒక్క దీపం వేల దీపాల్ని వెలిగిస్తుంది. ఒక మంచి ఆలోచన... వేలమందికి దారి చూపిస్తుంది. ఆ స్ఫూర్తే ఆమెను సేవా రంగాన్ని ఎంచుకునేలా చేసింది. 'వింగ్స్ ఫర్ లైఫ్ ఫౌండేషన్' పేరుతో అమ్మాయిలకు శానిటరీ న్యాప్‌కిన్లు పంచడం, వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించడం తన లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు పిల్లలకు ఉచితంగా ఆంగ్ల తరగతులు నిర్వహిస్తోంది. పర్యావరణ పరిరక్షణపైనా చైతన్యం తెస్తోంది. ఆమే వైజాగ్‌కు చెందిన జ్యోతిర్మయి ముక్తినేని.

చదువూ... ఆరోగ్యం అన్నీ కథలతోనే!

ఆ రోజు నాకు ఇప్పటికీ గుర్తే. అప్పుడు నేను గుడివాడలోని విశ్వభారతి స్కూలులో చదువుతున్నా. నేనూ, నా స్నేహితురాలు కలిసి స్కూలుకి వెళ్తోంటే దారిలో ఓ పిల్లాడు ఏడుస్తూ కనిపించాడు. దగ్గరకెళ్లి మాట్లాడితే 'ఇంట్లో నుంచి పారిపోయి వచ్చేశా' అని చెప్పాడు. అది తెలిసి కంగారు పడ్డాం. కానీ వాడిని వదిలేసి ఇంటికి వెళ్లబుద్ధికాలేదు. ఆకలేస్తే తిను అని అమ్మావాళ్లు పాకెట్ మనీగా ఇచ్చిన డబ్బుల్లో ఓ రెండు రూపాయలు తీసి ఇచ్చా. కానీ అవి సరిపోవని అనిపించింది. అందుకే మరో ఐదు, పది... ఇలా యాభైరూపాయలవరకూ ఇచ్చేశా. అయినా సంతృప్తి అనిపించలేదు. వాడేమైపోతాడో అని భయం వేసింది. అందుకే వాడిని వెంట పెట్టుకుని తెలిసినవాళ్లందరి ఇళ్లకీ తీసుకెళ్లి... అన్నం పెట్టి మీ దగ్గర ఉంచుకుంటారా? అని అడిగా. కానీ ఎవరూ ఒప్పుకోలేదు. ఏం చేయాలో తెలియదు. అలాగని వాడిని వదిలేసి వెళ్లాలనీ అనిపించలేదు. అందుకే మా ఇంటికి తీసుకెళ్లిపోయా. అమ్మ తిడుతుందనుకున్నా కానీ ఏమీ అనలేదు. మాతో పాటే ఉంచుకున్నాం. రెండు రోజులకి వాళ్ల నాన్న వెతుక్కుంటూ వచ్చాడు. సవతి తల్లి పెట్టే బాధలు భరించలేక వచ్చేశానని అప్పుడు చెప్పాడు వాడు. అది తెలిసి అమ్మ వాళ్ల నాన్నను కోప్పడింది. 'నీకు భారమైతే మేమే పెంచుకుంటాం' అని చెప్పింది. ఆ తరువాత వాడు వెళ్లి పోయాడనుకోండి. అది మొదలు స్కూలు దాటి కాలేజీకి వెళ్లినా

నా ఆలోచనలో మార్పు రాలేదు. ఎవరికి ఏ అవసరం వచ్చినా సరే... ముందుండేదాన్ని. అదే వింగ్స్ ఫర్ లైఫ్ ప్రారంభించడానికి దారితీసింది. వాస్తవానికి మా స్వస్థలం కృష్ణా జిల్లాలోని అంగలూరు. నాన్న ఉద్యోగ రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో చదువుకున్నా. అయితే నాకు సేవపై ఓ స్పష్టమైన అభిప్రాయం రావడానికి కారణం చిన్నప్పుడు నాకు ఎదురైన ఆ అబ్బాయే. బీసీఏ చదవడం, ఉద్యోగంలో చేరడం, పెళ్లవడంతో వైజాగ్‌కి వచ్చి స్థిరపడ్డాం. ఇక్కడికి వచ్చాక కాస్త తీరిక దొరికింది అనుకున్నప్పుడు ఎంఏ, ఎంఈడీ పూర్తిచేశా. ఆ తరువాతే ఈ కార్యక్రమాలు మొదలుపెట్టా.

ఆంగ్లం నేర్పిస్తున్నాం...

చిన్నారులు స్కూళ్లకు వెళ్తారు కానీ, వాళ్లకు పెద్దగా ఆంగ్లం రాదు. అలాంటి పిల్లలకు చేయూతగా స్పీకింగ్ చాక్‌తో కలిసి ఏడాది పొడవునా ఆంగ్ల తరగతులు నిర్వహించాం. అది కూడా ఎలా పడితే అలా కాకుండా కథల ద్వారా ఇంగ్లిష్ ఎలా మాట్లాడాలో వివరించేవాళ్లం. ఇందుకోసం మేం ప్రత్యేకంగా ఓ కరిక్యులమ్ ఏర్పాటుచేశాం. ఆ ప్రకారం గ్రామర్, ఇంగ్లిష్ ఎలా మాట్లాడాలీ... దానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్పించాం. ఈ తరగతులు కూడా దాదాపు ఆరువందలమంది విద్యార్థులకు నిర్వహించాం. ఇకపై కాస్త పెద్ద పిల్లలకు వాళ్ల హక్కులూ, న్యాయపరమైన అంశాల్ని కూడా చెప్పే విధంగా ప్రణాళికలు వేసుకుంటున్నాం. అలాగే ప్రతిభ ఉండి కూడా చదువుకోలేకపోతున్న ఆడపిల్లల బాధ్యత తీసుకున్నాం. ఇప్పటివరకూ పదిమంది అమ్మాయిల్ని దత్తత తీసుకున్నాం. వీరిలో ఇంటర్ నుంచి ఇంజినీరింగ్, ఎయిర్ హోస్టెస్ చదివే ఆడపిల్లలూ ఉన్నారు. దీనికోసం ఏటా మూడు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాం.

ఉడా సహకారంతో...

పర్యావరణ పరిరక్షణ అనగానే నాలుగు మొక్కలు నాటడం కాదు. విద్యార్థుల చేత మొక్కలు నాటిస్తాం. ప్రత్యేకంగా క్లీన్‌డ్రైవ్స్ ఏర్పాటు చేస్తాం. పోటీలూ పెడతాం. గెలిచినవారికి బహుమతులు ఉంటాయి. అలా మేం చేసిన వాటిల్లో గతేడాది బీచ్ డ్రైవ్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. కలెక్టర్ దాన్ని ప్రారంభించారు. పదిహేను వందల మంది విద్యార్థుల వరకూ పాల్గొన్నారు. అయితే మేం ఈ కార్యక్రమాన్ని అక్కడితో ఆపేయలేదు. సుమారు పన్నెండు వారాలు కొనసాగించాం. ఇప్పుడు దాన్ని ఉడా కొనసాగిస్తోంది.

– స్వాతి కొరపాటి

నెలసరి చిక్కులకు పరిష్కారం...

చాలామంది ఆడపిల్లలకు నెలసరిపై సరైన అవగాహన ఉండదు. దానికితోడు ఆ సమయంలో ఎదురయ్యే కొన్ని సమస్యలు అపోహల్ని పెంచుతాయి. వాటి గురించి తల్లిని అడగాలనే ఆలోచనా ఉండదు. అలాగని బాధ్యత తీసుకుని పెద్దలూ చెప్పరు. దాంతో మానసికంగా కుంగిపోతారు. చదువు మీద ఏకాగ్రతా పెట్టలేరు. ఇవన్నీ గుర్తించాక వారికి నెలసరీ, పీసీఓడీ... వాటివల్ల ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం. పిల్లలకు తేలిగ్గా అర్థం కావాలనే ఉద్దేశంతో కథల రూపంలో చెబుతున్నాం. ఉదాహరణకు పీసీఓడీ. ఆ సమస్య ఉందనేది ఎప్పుడో గానీ తెలుస్తుంది. నాకూ అదే సమస్య ఎదురైంది. ఎందుకంటే నేను శీతల పానీయాలు ఎక్కువగా తీసుకోవడమే అందుకు కారణం. పీసీఓడీ వల్ల బరువు పెరగడం, అధిక రక్తస్రావం, అవాంఛిత రోమాలు... ఇలా ఎన్నో సమస్యలుంటాయి. కాబట్టి నేను అమ్మాయిలకు అవగాహన కల్పిస్తున్నా. ఆహారం, వ్యాయామం ద్వారా అధికబరువూ తద్వారా నెలసరి ఇబ్బందుల్ని ఎలా అదుపులో ఉంచుకోవచ్చో వివరించే ప్రయత్నం చేస్తున్నా. వాళ్లు తినే జంక్‌ఫుడ్ చిన్నారులకు ఎలా హాని చేస్తోందో చెప్పాం. ఇందుకోసం మేం తల్లిదండ్రులు ఎక్కువగా పట్టించుకోని పిల్లలుండే స్కూళ్లనే ఎంచుకున్నాం. అలా వెయ్యిమంది విద్యార్థుల వరకూ ఈ అంశాల పట్ల అవగాహన కల్పించాం. మళ్లీ విద్యాసంవత్సరం మొదలైంది కాబట్టి.. ఈసారి తల్లిదండ్రులతోనూ మాట్లాడబోతున్నాం. మరో స్వచ్ఛంద సంస్థ సాయంతో ఆ అమ్మాయిలకు శానిటరీ న్యాప్‌కిన్లనూ అందిస్తున్నాం

సబ్బు వాడే ముందు...

ముఖం శుభ్రపరుచుకునే విషయంలో మనకు తెలీకుండా చేసే కొన్ని పొరపాట్లు చర్మానికి హాని చేస్తాయి. అవేంటో చూద్దాం.

- అలంకరణ తీసేయడానికి చాలామటుకూ క్లెన్సర్‌నే వాడుతుంటాం. కానీ దాంతో వాటర్‌ప్రూఫ్ మేకప్ సులభంగా వదలదు. దాని తాలూకు అవశేషాలు చర్మంపై పేరుకునే ఉంటాయి. అందుకే నూనె ఆధారిత మేకప్ రిమూవర్లను వాడాలి. ఒకవేళ అలంకరణ తొలగించేందుకు వైప్స్ వాడుతోంటే ఆ తరువాత చల్లటి నీళ్లతో ముఖం కడుక్కోవడం తప్పనిసరి.
- ముఖానికి ఫేస్‌వాష్ వాడితే ఇబ్బంది లేదు కానీ సబ్బులు వాడుతుంటే నేరుగా రాసుకోకూడదు. ముందు చేతులపై రుద్ది ఆ నురుగునే ముఖానికి రాయాలి. అది కూడా సున్నితంగా మర్దనా చేసుకుంటూ రాస్తే మృతకణాలు సులువుగా తొలగిపోతాయి.
- జుట్టుకీ, మిగతా శరీరానికి ఒకే తువాలు ఎట్టిపరిస్థితుల్లో వాడకూడదు. దానివల్ల జుట్టులో ఉండే జిడ్డూ, చుండ్రులాంటివి మిగతా భాగాలకీ చేరతాయి. ముఖంపై మొటిమలు వచ్చే అవకాశం కూడా ఎక్కువే. అలాగే తువాలు కూడా దీర్ఘకాలం వాడకుండా అప్పుడప్పుడూ మారుస్తుండాలి.
- ఇంట్లో ఉండే సహజ పదార్థాలతో ముఖానికి పూత వేసుకున్నప్పుడు నీళ్లతో శుభ్రం చేయడం తప్పనిసరి. కానీ దుకాణాల్లో దొరికే పీల్‌ఆఫ్‌మాస్కులు వాడినప్పుడు వాటిని తీసేసిన తరువాత సబ్బుతో ముఖం కడుక్కోకూడదు. దానివల్ల ఆ ప్రభావం తగ్గిపోతుంది. కేవలం నీళ్లతో శుభ్రం చేసుకుంటే చాలు. అయితే పూత వేసుకునే ముందు ముఖం కడుక్కోవడం మాత్రం తప్పనిసరి.

❖❖❖

రంగుతో మాయ చేసేద్దాం

ఇంట్లో గోడలకు తెలుపు రంగు ఉన్నప్పుడు ఇల్లు కాస్త సాదాసీదాగా కనిపిస్తుంది. అలాంటప్పుడు గదులను అలంకరించే విషయంలో కొన్ని మెలకువలు పాటించి చూడండి.

- తెలుపు రంగు హుందాతనానికి ప్రతీక. దానివల్ల మనసుకు కూడా ప్రశాంతంగా ఉంటుంది. దాన్ని అలంకరించడంలో కిటుకులు తెలిసుండాలంతే. ఉదాహరణకు పడకగదిలో అన్ని గోడలకు తెలుపు రంగే ఉంటే దుప్పట్లూ, దిండు గలేబులూ, పరదాలు... ఇలా అన్నింటినీ అదే రంగులో తీసుకుని చూడండి. వీటివల్ల వెలుతురు కూడా సరిగ్గా ఉంటుంది.
- గది మూలల్లో ఉంచే ఫ్లవర్‌వాజుల్లో రంగురంగుల కృత్రిమ పూలకు బదులు తెలుపు రంగులో ఉండే తాజా పూలనే ఎంచుకోవాలి. అంటే కాడ పొడవుగా ఉండే లిల్లీ లాంటివి వాడాలి. . వీటి నుంచి మంచి సువాసనా వస్తుంది. అలాగే బయట హ్యాంగింగ్ ఫ్లవర్‌వాజ్‌లు ఏమైనా ఉంటే వాటిలో కూడా తెలుపు రంగు పూలు పూసే మొక్కలే ఉండేట్లు చూసుకుంటే మంచిది.
- ఆరు బయట ఉండే కుర్చీలు, ఉయ్యాల... హాలులో ఉండే సోఫాలకు కూడా తెలుపు రంగు మేళవింపు ఉండేట్లుగా చూసుకోవాలి. ఒకవేళ ఫర్నిచరే తెలుపు రంగులో ఉంటే మాత్రం కుషన్లూ, కవర్లు... అన్నీ వేరే ముదురు రంగుల్లో ఉంటే చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తుంది.
- ముదురు రంగులు వేసినప్పుడు గోడలు ఖాళీగా ఉన్నా పెద్ద ప్రభావం ఉండదు. కానీ, తెలుపు రంగు గోడలు ఆ భావనను సులువుగా కలిగిస్తాయి. అందుకే హాలులో, పడకగదిలో పెద్ద వాల్‌పోస్టర్ ఏదైనా ఉండేలా చూసుకోవాలి. లేదంటే కుటుంబంతో కలిసి ఉన్న ఫొటోనైనా సరే పెద్దగా ఫ్రేము కట్టించి వేలాడదీయండి.

ఆ కణితి క్యాన్సరా?

? నా స్నేహితురాలికి చాలా కాలం నుంచి హైపోథైరాయిడిజమ్ ఉంది. వైద్యుల్ని సంప్రదిస్తే మెడ వద్ద అల్ట్రాసౌండ్ చేయించమని చెప్పారు. దానిలో రెండు సెంటీమీటర్ల పరిమాణంలో కణితి ఉన్నట్టు తేలింది. దాంతో మరోసారి పరీక్షించి ఈ కణితి ప్రమాదమనీ, క్యాన్సర్‌కు దారి తీస్తుందని చెబుతున్నారు. ఇది నిజమేనా. ఈ కణితి తగ్గడానికి శస్త్రచికిత్స చేయాలా? మందులతో తగ్గదా?

- ఓ సోదరి

✔ కొన్నిసార్లు హైపోథైరాయిడిజమ్... దీర్ఘకాలికంగా ఉంటే అది క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంటుంది. పరీక్షలో ఆ కణితి రెండు సెంటీమీటర్లు ఉండి, ఎఫ్ఎన్ఏసీ పరీక్షలో ప్రమాదం అని తేలితే శస్త్రచికిత్స తప్పదు. దీనికి మరో ప్రత్యామ్నాయ మార్గం లేదు. కణితి ఏ పక్కన అయితే ఉందో.. దాని దగ్గరున్న గ్రంథిని తొలగించి పరీక్షిస్తారు. అందులో క్యాన్సర్ అని తేలితే గనుక మిగిలిన థైరాయిడ్ గ్రంథిని కూడా తీసేయాల్సి ఉంటుంది. ఆ తరువాత అవసరం అయితే రేడియోఅయోడిన్ చికిత్స కూడా చేయించుకోవాల్సి ఉంటుంది. ప్రతి మూణ్నెల్లకోసారి వైద్యుల్ని సంప్రదిస్తూ, వాళ్లు సూచించిన మందులు వాడటం తప్పనిసరి. ఒకవేళ సాధారణ కణితి ఉందని తేలితే... భయపడాల్సిన అవసరంలేదు. దాన్ని మాత్రమే తొలగిస్తారు.

డియర్ వసుంధర

డా॥ గీతానాగశ్రీ
క్యాన్సర్ శస్త్రచికిత్సా నిపుణురాలు

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

01 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,900	32,000	31,900	30,050
ఆర్నమెంట్	29,800	29,900	29,600	29,750
వెండి (కిలో)	40,560	40,830	40,900	41,000

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,850	31,950	31,785	32,040
ఆర్నమెంట్	29,480	29,600	29,500	29,690
వెండి (కిలో)	40,600	41,000	40,300	40,800

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,740	31,840	-------	-------
ఆర్నమెంట్	29,520	29,620	2,950	2,960 గ్రా
వెండి (కిలో)	40,900	40,900	42.80	43.20 గ్రా

నజరానా

గడువు పూర్తయిన లిప్‌స్టిక్ కేస్‌ను పడేయకండి. దాన్ని శుభ్రం చేసి అందులో చిన్న చిన్న పక్కపిన్నులూ, సూదులు పెట్టుకోవచ్చు.

బృందావనం

కూరగాయలు పెంచుకుందామా!

జూన్ నెల వచ్చేసింది. అంటే తొలకరి వర్షాలకు సిద్ధమవుతున్నామన్నమాట. మీలో కొందరు ఈపాటికే పెరటి తోటలో, అంత స్థలం లేకపోతే మిద్దె మీదో, అదీ వీలు కాకపోతే బాల్కనీలో కూరగాయలు పెంచుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టే ఉంటారు కదా... దానికి సంబంధించి కొన్ని జాగ్రత్తలు తీసుకుందామా మరి.

ఇంట్లోనే కూరగాయలు సేంద్రియ పద్ధతిలోనే పెంచుకుంటే ఆరోగ్యానికీ మంచిది. జీవ ఎరువులనూ, జీవ శిలీంధ్ర నాశనులను పశువుల ఎరువుతో కలిపి వృద్ధి చేసుకోవడం, సారవంతమైన మట్టి మిశ్రమాన్ని తయారు చేసుకోవడం వంటివి ఇప్పటినుంచే మొదలుపెట్టాలి. నేలలో పెంచుకొనేవారు కాకుండా మిగిలిన వారంతా కుండీలు శుభ్రం చేసి పెట్టుకోవాలి. అవసరం అయితే గ్రో బ్యాగులు కూడా సిద్ధంగా పెట్టుకోవాలి. కూరగాయ విత్తనాలు కొనుక్కోవడమో, మంచి దేశవాళీ రకాలు తెలిసిన వాళ్ల దగ్గర సేకరించుకోవడమో చేయాలి.

ఎంపిక చేసుకున్నారా...

వంకాయలూ, టొమాటోలూ, పచ్చిమిర్చీ, బెండకాయలు ఎలాగూ కావాలి. ఆకుకూరలూ తప్పనిసరి. కొత్తిమీరా, పుదీనా, మెంతికూరా, ఎర్రగోంగూరా ముఖ్యమే. ఎర్రగోంగూర పుల్లగా ఉన్నా రుచి అద్భుతంగా ఉంటుంది. ఔషధ గుణాలూ ఉంటాయి. ఇక, ఈ పనులన్నింటిలో పిల్లల్ని భాగస్వాముల్ని చేస్తే వాళ్లకు అంతకు మించిన పర్యావరణ విజ్ఞానం ఇంకేముంటుంది... వాళ్ల చిట్టి చేతులతో పెంచితే ఏ కూరగాయనూ నచ్చలేదనరు. ఇలా తాజా కూరగాయలతో వండినప్పుడు ఎంత తక్కువ నూనె వేసినా సరే, ఆ రుచే వేరు.

మట్టి మిశ్రమమూ ముఖ్యమే...

కూరగాయల్ని సేంద్రియ పద్ధతిలో పెంచుకోవాలనుకుంటే అందుకు వాడాల్సిన మట్టి మిశ్రమం గురించి శ్రద్ధ తీసుకోవాలి. నేలలో పెంచుకునేటప్పుడు సారవంతంగా, నీరు నిలవకుండా ఉండేలా జాగ్రత్త పడాలి. అసలు నీరు నిలవకుండా పోసిన నీళ్లు పోసినట్లు ఇంకిపోయే ఇసుక నేలలూ, ఒకసారి వర్షం పడినా, నిండా నీళ్లు పెట్టినా చాలాసేపు అలాగే నిలిచిపోయే బంక నేలలూ, తగు మాత్రం తేమ నిలిచి ఉండే గరప నేలలు ఏ పంటకైనా శ్రేష్ఠం. నేల సరిగా లేకపోతే పశువుల ఎరువూ, పచ్చిరొట్ట లాంటివి కలిపి సారవంతం చేసుకోవచ్చు. నేల బరకగా ఉంటే ఇసుకా, కోకోపీట్ వంటివి కలిపి నీరు ఇంకేలా చేసుకోవాలి. అలాగే కుండీలతోనూ లాభాలున్నాయి. ఎండ ఎక్కువైందనుకుంటే నీడలోకి జరపొచ్చు. నీడ ఎక్కువై పూత సరిగా లేదనుకుంటే ఎండ పడే వైపు మార్చుకోవచ్చు. కాపు మీద ఉన్న మొక్కల కుండీలను ఎదురుగా, అందంగా అమర్చుకోవచ్చు. ఏదన్నా తెగులు ఆశించిన మొక్కను అది తగ్గేదాకా మిగిలిన మొక్కల నుంచి దూరంగా తీసుకుపోవచ్చు.

ఇలా తయారు చేసుకోవాలి...

సాధారణంగా కూరగాయల్ని కుండీల్లో లేదా గ్రో బ్యాగుల్లో పెంచుకోవాలనుకుంటే అయిదు పాళ్ల చొప్పున ఎర్రమట్టీ, కోకోపీట్, ఇసుకా, పశువుల ఎరువూ/కంపోస్టూ/వర్మికంపోస్టూ... ఒక పాలు ఎముకల పొడీ, రెండు పాళ్లు వేపపిండి/ఆముదం పిండి/కానుగ పిండి కలపడం మంచిది. ఈ మిశ్రమం సారవంతంగా ఉంటుంది. నీరు కూడా నిలవదు. త్వరగా పొడారిపోదు. చెదలూ, వేరు పురుగులూ రావు. పైగా ఇది తేలికగా ఉంటుంది కాబట్టి కుండీలను అటూ ఇటూ జరపడమూ సులువే. మిద్దె మీదా, బాల్కనీలో ఉంచినా బరువు ఎక్కువ పడదు. వీలైతే ట్రైకోడెర్మా విరిగె, సూడో మోనాస్ లాంటి జీవ శిలీంధ్ర నాశనులను, అజటోబాక్టర్, ఫాస్ఫోబ్యాక్టీరియా లాంటి జీవ ఎరువులను ఒక్కోటి వంద గ్రాముల చొప్పున తీసుకోవాలి. దీన్ని పది కిలోల పశువుల ఎరువు లేదా కంపోస్టుకు కలిపి, కొద్దిగా నీళ్లు చల్లి, నీడలో, పైన గోనె సంచితో కప్పి, వారం, పదిరోజుల తరువాత మట్టి మిశ్రమంలో కలిపితే ఎంతో మంచిది. ఇలా తయారు చేసిన ఎరువును మిగిలిన ఎరువులో కలిపి మట్టి మిశ్రమంలో కలిపేసుకోవచ్చు. ఇది ఎక్కువైనా నష్టమూ ఉండదు. మొక్కకు మేలు చేసే బ్యాక్టీరియా వృద్ధి చెంది మొక్కలకు పోషకాలు అదనంగా అందజేయడమే కాకుండా వ్యాధినిరోధక శక్తీ పెంచుతాయి.

గ్రోబ్యాగులూ...

గ్రో బ్యాగులు కూడా గుండ్రంగా, చతురస్రంగా, దీర్ఘచతురస్రంగా... ఇలా మనకు కావాల్సిన సైజుల్లో దొరుకుతాయి. కుండీలతో పోలిస్తే ఇవి బరువూ, రేటు రెండూ తక్కువే. అంతేకాదు ఎక్కువ కాలం మన్నుతాయి. ఆకుకూరల దగ్గర్నుంచీ పండ్ల మొక్కల వరకూ పెంచుకోవడానికి అనువైనట్టు పట్టణాల్లోనూ దొరుకుతున్నాయి. ఆన్‌లైన్‌లోనూ తెప్పించుకోవచ్చు. ఇవే కాదు, ప్యాకింగ్ చెక్క పెట్టెలూ, పాత ప్లాస్టిక్ డబ్బాలూ, పాత బకెట్‌లూ... వేటిలోనైనా పెంచుకోవచ్చు. మంచి మట్టి మిశ్రమం, సరిపడా వెలుతురూ, నాణ్యమైన విత్తనాలూ లేదా నారు... అన్నిటినీ మించి మీ శ్రద్ధ ఉంటే చాలు... ఆరోగ్యకరమైన, రుచికరమైన కూరగాయలు పెంచుకోవడం సులువు.

– బోడెంపూడి శ్రీదేవి, ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

కుర్తాలో కొత్తగా

కుర్తాలో మన లుక్కే మారిపోతోంది. అది వేసుకొని బయటికొస్తే.. అబ్బో అదిరింది.. ఏంటి స్పెషల్? అని నలుగురైనా అడుగుతారు. అందుకే కుర్తా ఎప్పుడూ ప్రత్యేకమే. ఈ ప్రత్యేకతకు కొత్తదనం జతచేస్తే అది మరింత అందం తెచ్చిపెడుతుంది. వేడుకలు, శుభకార్యాలు, పార్టీల్లో భిన్నంగా, కొత్తగా అందరినీ ఆకట్టుకోవాలంటే కుర్తాలో ఒదిగిపోవడం మంచిదంటున్నారు డిజైనర్లు. ఇందులో కాలర్, బాటమ్ కటింగ్, బటన్స్ అమరికలను బట్టి రకరకాలుగా డిజైన్ చేయించుకోవచ్చు. క్లాత్ ఎంపికలోనూ భిన్నత్వం మీలోని ఫ్యాషన్ ప్రియుణ్ని నలుగురికీ పరిచయం చేస్తుంది.

కాలర్ : చైనీస్, రౌండ్, ఓపెన్ నెక్ ఇలా అనేకమున్నాయి. మీ శరీరతత్వం, మెడ ఆకృతిని బట్టి డిజైనర్ సలహా మేరకు వీటిని ఎంపికచేసుకోవచ్చు.

బటన్ : క్రాస్, స్ట్రైట్ బటన్(త్రీ, ఫుల్)లాంటివి అందుబాటులో ఉన్నాయి. ఇందులో క్రాస్ బటన్ యువతను ఎక్కువగా ఆకట్టుకుంటోంది. లెఫ్ట్‌కట్, రైట్ కట్ రెండు రకాలుగా ఉంటాయి.

బాటమ్‌కటింగ్ : ఇది ఇప్పుడు ట్రెండీగా మారింది. క్రాస్ కటింగ్, ఫ్రంట్ ఓపెన్, సైడ్ కట్స్, లాంగ్ అండ్ షార్ట్ కట్స్... ఇలా అనేక రకాలను యువత ఫాలో అవుతున్నారు. మహేశ్‌బాబు, రానా, రణ్‌వీర్‌లాంటి హీరోలు ధరించడంతో వీటికి బాగా క్రేజ్ వచ్చింది.

క్లాత్ : కాటన్, లెనిన్, జూట్, ఇక్కత్, ఖాదీ, కలంకారీ, పోచంపల్లి, నారాయణ్‌పేట్ డిజైన్స్ ప్రస్తుత ట్రెండ్.

- యువత కాలేజీ ఫంక్షన్లకు క్రాస్‌బటన్స్, బాటమ్ కట్స్ ఎక్కువగా ధరిస్తున్నారు. చైనీస్ కాలర్లో ఫుల్, షార్ట్ కుర్తాలతో నైట్ పార్టీల్లో వెలిగిపోతున్నారు. రౌండ్‌నెక్ లాంగ్ కుర్తాలను పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇతర శుభకార్యాలకు ధరించి మెరిసిపోతున్నారు. కొత్తపంథాలో పయనిస్తున్న యువత డిజైనర్ల సలహా మేరకు శరీర ఆకృతిని బట్టి కుర్తాలను తయారు చేయించుకొని ట్రెండీగా మారుతున్నారు.

– **రవి అవ్వారు**, అవ్వారు డిజైన్స్

మిలియనిల్స్ ఓటు పేపర్‌బుక్స్‌కే

ఇప్పుడు ఏ వ్యాపారమైనా విస్తరించాలంటే మిలియనిల్స్ కోరుకుంటున్నదేమిటో కనుక్కోకుండా అడుగు ముందుకు వేయరు. అలా ఎలక్ట్రిక్ మార్కెట్స్ జర్నల్స్ జరిపిన సర్వేలో మిలియనల్స్ ఈ-బుక్స్ కంటే పేపర్ బుక్స్‌నే ఎక్కువగా ఇష్టపడుతున్నట్లు తేలింది. బేబీబూమర్స్(1940-1960కి మధ్య పుట్టిన వాళ్లు), జనరేషన్ ఎక్స్ (1960-1980 మధ్య పుట్టిన వాళ్లు), మిలియనిల్స్ (1980 తర్వాత జన్మించిన వాళ్లు) అభిప్రాయాలు తీసుకున్నారు. ఇందులో మిలియనిల్స్ కూడా ఎక్కువగా పేపర్ పుస్తకాలనే కొనడానికి మొగ్గుచూపుతున్నారని తెలిసింది. భౌతికంగా ఇది నా సొంతం అని చెప్పుకొనే వెసులుబాటు, సమాజంలో తన వద్ద పుస్తకం ఉన్నట్లు గుర్తింపు లభించడం వంటి కారణాలతో వీరు వీటి వైపు చూస్తున్నారని తేలింది. ఈ-బుక్స్‌ను పంచుకోవడానికి, బహుమతులుగా ఇవ్వడానికి, తిరిగి అమ్మేందుకు ఆన్‌లైన్ అనేక ఆంక్షలు ఉండటంతో వీటిపై ఆసక్తి చూపడం లేదని గుర్తించారు.

సమస్య ఏదైనా నేటి మిలీనియల్స్ చేతిలో ఉన్న అస్త్రం సోషల్ మీడియా. హ్యాష్ ట్యాగ్‌తో ఎంతటి నిశ్శబ్దాన్నైనా బ్రేక్ చేసేస్తున్నారు. సమస్యల్ని వెలుగులోకి తీసుకొచ్చేందుకు సోషల్ అడ్డాలనే వేదికలుగా చేసుకుంటున్నారు. క్షణాల్లోనే సమస్య తీవ్రతని వెలుగులోకి తెస్తున్నారు. మంచిదే!! ఇదంతా నాణేనికి ఒకవైపే. మరోవైపు సున్నితమైన సమాజంలోకి నకిలీ సమాచారం చేరిపోతుంది. మాల్వేర్‌లు మాటేసుకుని సిస్టమ్‌లో కూర్చుంటున్నాయి. వాస్తవాలేంటో తెలుసుకోకుండా చూసిందే తడువుగా.. నిశిత పరిశీలన లేకుండా వాట్సప్ గ్రూపుల్లో... పొట్టి వేదికల ట్వీటుల్లో ఫార్వర్డ్ చేస్తున్నా సమాచారం సమాజానికి క్షణాల్లో చేరిపోతుంది. భయాందోళనలకు గురి చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోంది. దీనికి ఫలితంగా విచక్షణ కోల్పోతున్న జనం చేతుల్లో కొందరు అమాయకులూ బలవుతున్నారు. ఇంకొందరైతే తమ వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్లకు సమర్పించుకుంటున్నారు. ఇందుకు ఈ మధ్య చోటు చేసుకుంటున్న ఘటనలే నిదర్శనాలు..

- పొడవైన కత్తులు... కలవరపెట్టే లుక్‌తో గ్యాంగ్‌లు... వేరే రాష్ట్రం నుంచి వచ్చారని.. అత్యంత కిరాతకంగా దాడులకు పాల్పడుతూ పిల్లల్ని ఎత్తుకెళ్లిపోతున్నారని.. ఇలాంటి వారు ఎక్కడ కనిపించినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓ హెచ్చరిక. వైరల్ అవుతూ అన్ని సోషల్ వేదికల్లో పలు పోస్టింగ్‌ల హల్‌చల్!
- ఎఫ్‌బీ వాల్‌పై షేరింగ్‌లు ఇలా... మీరు ఎనభై ఏళ్ల తర్వాత ఎలా ఉంటారు? మీ వ్యక్తిత్వం ఏంటో తెలుసుకోవాలా? మీరు ఏ సెలబ్రిటీతో మ్యాచ్ అవుతారు? ఆసక్తికరంగా అనిపించే వీటిని క్షణాల్లో క్లిక్ చేస్తారు. ప్రయత్నించి చూస్తారు. తిరిగి వాటిని ఇతరులకు తెలుపుతూ వాల్‌పై షేర్ చేస్తుంటారు.
- యాభైవేలు ఖరీదున్న ఫోన్ రూ.499. భారీ డిస్కౌంట్ ఆఫర్. ఇప్పుడే చెక్ చేసుకోండి. గోల్డెన్ యానివర్సరీ సందర్భంగా అమెజాన్‌లో అంటూ వాట్సాప్ మెసేజ్. చూసీచూడగానే.. నిజమో కాదో తెలుసుకోకుండానే ఫార్వర్డ్ చేసేస్తారు.

... ఇలాంటి వాటిని షేర్ చేసే ముందు ఎప్పుడైనా ఆలోచించారా? వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయో ఊహించారా? ఒకరి నుంచి మరొకరి ఫార్వర్డ్ అవుతూ వైరల్‌గా మారిన కిడ్నాప్ గ్యాంగ్‌ల సమాచారం ఎంతటి దుమారాన్ని రేపుతోందో? ఎంతమంది అమాయకుల ప్రాణాలు తీసిందో రోజూ చూస్తున్నాం. చదువుతున్నాం. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంది.. డేటా అందుబాటులో ఉంది కదా! అని వచ్చిన మెసేజ్‌లన్నీ షేర్లు, పోస్టులు చేసుకుంటూ పోతే చాలా ప్రమాదముంది. ప్రతి ఒక్కరూ కోరుకునేది సమాజ హితమే. కానీ, ఇలాంటి ఫార్వర్డ్ మెసేజ్‌ల ద్వారా సాధించేదేంటి? ప్రజలు చట్టాన్ని చేతిలోకి తీసుకునేంతల భయాందోళనల్ని ప్రేరేపించడమా? ఈ రకమైన చర్యలు ఏ మాత్రం సొసైటీకి మేలు చేసేవి కాదని పోలీసు వ్యవస్థ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా యువత ఇలాంటి వాటిని చూసే దృష్టికోణాన్ని మార్చుకోవాలని చెబుతున్నారు. ఎందుకంటే స్మార్ట్ ఫోన్లు ఎక్కువగా వాడేది వీరే.

షేరింగ్‌లో... అంత స్పీడొద్దు

వాట్సప్... ట్విట్టర్... ఫేస్‌బుక్ దేంట్లో ఏది కనిపించినా.. స్పీడ్‌గా ఫార్వర్డ్... రీట్వీట్.. షేర్ చేయడమేనా? ఆగి ఆలోచించే తీరిక లేదా? ఎందుకంత తొందర? మీరు ఫార్వర్డ్ చేస్తున్నవి ఏ రకమైన ఆలోచనల్ని రేకెత్తిస్తున్నాయ్! అది వార్తా?... దాని వెనుక దాగున్న మాల్వేర్ లింకా? వీటి పర్యవసానాలేంటి? జరగకూడంది ఏదైనా జరిగితే! అనర్థాలకు మీరే జవాబుదారీ! విచక్షణతో ఆలోచించి సోషల్ వేదికలపై షేర్ చేయండి!

ముందు ఆలోచించండి

వాట్సప్, ఇతర సోషల్ మీడియా వేదికల్లో షేర్ అవుతున్న ఒక పోస్టింగ్‌ని ఈ సందర్భంగా కచ్చితంగా గుర్తు చేసుకోవాలి. అదేంటంటే... ఒకతను తన కొడుకు బడికి వెళ్తుండగా తప్పిపోయాడని, కనిపిస్తే ఈ అడ్రస్‌కి పంపాల్సిందిగా కోరుతూ వాట్సప్ గ్రూపులో మెసేజ్ పెడతాడు. సాయంత్రానికల్లా కొడుకు జాడ తెలుస్తుంది. ఆనందపడతాడు. కానీ, తర్వాత రోజు నుంచే అసలు సమస్య మొదలవుతుంది. అదేంటంటే... వాట్సప్ గ్రూపులో పెట్టిన మెసేజ్ ఊర్లో చాలా మందికి చేరిపోతుంది. దీంతో కొడుకు స్కూల్ వెళ్తూ దారిలో ఎవరికి కనిపించినా తీసుకొచ్చి ఇంటి అడ్రస్‌లో దిగబెట్టేస్తుంటారు. ఇలా ఫార్వర్డ్ మెసేజ్ పిల్లాడి స్కూల్‌కి ఓ గండంగా తయారవుతుంది. ఇదే మాదిరి ఎన్నో రకాల ఫార్వర్డ్ మెసేజ్‌లు. ఆర్థిక సాయం కోరుతూ... ఉచితం అంటూ.. ఆఫర్లంటూ.. ఇలా చేస్తే మ్యాజిక్ జరుగుతుందంటూ ఇన్నా.. అన్నా!! వీటన్నింటి వెనకున్న ప్రధాన ఉద్దేశం ఒక్కటే. ఎక్కువ మందికి మెసేజ్ చేరేలా చేయడం. దీంతో ఏ హ్యాకర్ అయితే మెసేజ్‌ని సోషల్ మీడియా సముద్రంలోకి వదిలాడో అతని లక్ష్యం నెరవేరుతుంది. ఇక నకిలీ మెసేజ్‌ల్లోని యూఆర్‌ఎల్ లింకుల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎఫ్‌బీ వాల్స్‌పై అప్పుడప్పుడు కనిపించే ఆసక్తికరమైన ప్రకటనలూ అలాంటివే. సూపర్ ఆఫర్ అంటూ క్లిక్ చేస్తే అంతే సంగతులు. మీకు తెలియకుండానే ఫోన్‌లో 'స్పై'లా చేరిపోతారు. ఫోన్ అంతా హ్యాకర్ కంట్రోల్‌లోనే!

అవగాహన అవసరం

ఎంత స్మార్ట్ ఫోన్ అయినా అత్యుత్సాహానికి పోతే హ్యాకర్ వలకి కచ్చితంగా చిక్కుతారు. మీకొచ్చిన ఫార్వర్డ్ మెసేజ్ ఏదైనా నిశితంగా పరిశీలించండి. దాంట్లో ఏవైనా లింక్‌లు ఉంటే గూగుల్‌లో వెతికి చూడండి. అవి అధికారికమైనవో కాదో చెక్ చేసుకోండి. నకిలీలను వెతికి పట్టే థర్డ్‌పార్టీ సర్వీసులూ నెట్టింట్లో అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో https:/heck4spam.com/ వెబ్ సర్వీసు ఒకటి. వాట్సప్‌లో వైరల్ అవుతున్నవాటిలో ఏవి నకిలీలో విభాగాల వారీగా వెతికి చూడొచ్చు.

- ఆకట్టుకునేలా ప్రకటనలు ఏవైనా వస్తే వాస్తవ దృక్పథంతో ఆలోచించాలి. ఉదాహరణకు రూ.50,000 ఖరీదున్న ఫోన్‌ని కేవలం కూ.499కే ఇస్తున్నాం అంటే నమ్మొద్దు. అంత హైఎండ్ ఫోన్‌ని చౌకగా ఎలా అమ్మకానికి పెడతారనే స్పృహ ఉండాలి.
- చికిత్స నిమిత్తం సాయం ఆశిస్తూ ఏదైనా మెసేజ్ వస్తే. దాంట్లోని నిజమెంతో తెలుసుకోండి. కాంటాక్ట్ వివరాల్లో ఎవ్వరూ స్పందించకుంటే మెసేజ్‌ని డిలీట్ చేయాలి తప్పితే మరొకరికి ఫార్వర్డ్ చేయొద్దు.
- నకిలీ మెసేజ్ మీరు క్రియేట్ చేయనప్పటికీ ఎవరో క్రియేట్ చేసిన దాన్ని నమ్మి మీరూ ఇతరులతో పంచుకుంటే ఆ మోసంలో మీరూ భాగస్వాములవుతారని గుంస్తుంచుకోవాలి.

– **సీహెచ్ఏఎస్ మూర్తి**, జాయింట్ డైరెక్టర్, సీ-డాక్

ఇది ఒక రకమైన రుగ్మత

ఇలాంటి ఫేక్ మెసేజ్‌లు సృష్టించేవారికి యాంటి సోషల్ పర్సనాలిటీ డిజార్డర్ ఉంటుంది. వీరు తమ వల్ల ఇతరులు బాధపడితే సంతోషపడిపోతారు. ఇక షేర్ చేసేవారు... తమ వల్ల ఎంతో మంది మేలు జరుగుతుందని ఆలోచించకుండా చేస్తుంటారు. కొన్ని మెసేజ్‌ల్లో ఎంత నిజముందో తెలుసుకోకుండా అందరికీ పంపించేస్తారు. ఇలా వ్యక్తిగతంగా తాము గొప్పవారమని తృప్తి పడుతుంటారు. కుల, మతాల వంటి సెన్సిటివ్ విషయాలను షేర్ చేసేటప్పుడు కొంచెమైనా ఆలోచించాలి. ముఖ్యంగా యువతకు తొందరపాటు ఎక్కువ... అందరికంటే ముందు ఈ విషయాన్ని మేమే చేరవేయాలని ఆత్రుతలో చెక్ చేసుకోరు. దీనివల్ల ఎదురయ్యే ఫలితాల గురించి ఆలోచించరు. ముందు సమాచారం చేరవేశామా? లేదా? అని కాకుండా, పంచుకుంటున్నది సరైనదేనా అని చెక్ చేస్తే మేలు జరుగుతుంది.

– **వీరేందర్**, సైకాలజిస్ట్

ప్రాణం పోక ముందే కాల్ చెయ్

ఒక మధ్యాహ్నం బైక్‌పై వెళ్తున్నాను. రోడ్డు పక్కన స్మార్ట్ ఫోన్ పడి ఉంది. తీసుకొని దగ్గరలోని షాప్ వాళ్లను అడిగి చూశాను. తమది కాదన్నారు. ఫోన్‌లో నంబరు చూసైనా డయల్ చేద్దామంటే అది ఛార్జింగ్ అయిపోయి స్విచ్‌అఫ్ అయింది. ఇంటికెళ్లి ఛార్జింగ్ పెట్టాను. కొద్దిసేపటి తర్వాత ఆన్ చేశాను. ఎవరిదో కాల్ వచ్చింది. లిఫ్ట్ చేశాను. 'ఏరా నా ఫోన్ దొంగిలించడానికి నీకు ఎంత ధైర్యం... నీ మీద పోలీసు కంప్లైంట్ ఇస్తాను.' అవతల అమ్మాయి వాయిస్ గట్టిగా అడుగుతోంది. 'ప్లీజ్ కొంచెం ఆగండి...నేను చెప్పేది వినండి' అంటున్నా వినిపించుకోవడం లేదు. కొద్దిసేపటికి ఆ వాయిస్ తగ్గింది. దీంతో నేను విషయం చెప్పాను. 'సారీ అండి... నాకు ఆ ఫోన్ చాలా ముఖ్యం. అది మా కంపెనీ ఫోన్. చాలా వివరాలు అందులో ఉన్నాయి.' దయచేసి నాకివ్వండి అంది. సరే అని ఒక చోటు అనుకొని తనని కలిశాను. చాలా అందంగా ఉంది. తొలిచూపులోనే నాకు నచ్చేసింది. 'చాలా థ్యాంక్స్ అండి' అంది. 'నా పేరు లావణ్య..' అంటూ పరిచయం చేసుకొంది. కొద్దిసేపు మాట్లాడాక... మరోసారి థ్యాంక్స్ చెప్పి వెళ్లిపోయింది. తనని ఫాలో అయి... తన ఇల్లు చూశాను. వారం రోజులకు గుడిలో కన్పించింది. అందరూ ప్రసాదం తింటుంటే తను చాక్లెట్ తింటూ కనిపించింది. అప్పటి నుంచి తనని 'చాక్లెట్' అని పిలవాలనుకున్నాను. దగ్గరికెళ్లి పలకరించాను. చేయికలిపింది. నా మనసు ఎక్కడికో వెళ్లిపోయింది. మీరు ఏం చేస్తుంటారని అడిగింది. ఖాళీగా ఉంటున్నానని చెప్పాను. అయితే మా కంపెనీలో జాబ్ ఉంది చేస్తారా? అంది. ఓకే అన్నాను. అయితే నా నంబర్‌కి రెజ్యూమ్ వాట్సప్ చేయమని చెప్పి, తన నంబర్ ఇచ్చింది. తర్వాత రోజూ మెసేజ్ చేసేవాడిని. కొన్ని రోజులకు మాట్లాడుకోవడం మొదలైంది. తన అభిరుచులు, ఆశయాలు నాకు నచ్చాయి. నా ఇష్టాఇష్టాలను తను గౌరవిస్తుందని అనిపించింది. ఇంతలో నా కాలేజీ ఫ్రెండ్ రోషిణి పుట్టిన రోజుకు ఫ్రెండ్స్ అందరితో కలిసి వెళ్లాం. తనూ వచ్చింది. ఏమిటి.. ఇక్కడ? అంటూ పలుకరించాను. తన స్నేహితురాలు పిలిస్తే వచ్చానని చెప్పింది. అంటే తను రోషిణి ఫ్రెండ్‌కి ఫ్రెండ్ అన్నమాట. ఎన్నో కబుర్లు. సరదాలు, జోకులు, పాటలు... ఇలా పార్టీ అయ్యాక అమ్మాయిలందరినీ వాళ్ల ఇళ్ల దగ్గర వదిలిపెట్టే పని నాకు అప్పజెప్పారు. నేను కారు తీసుకొని వారందరినీ వదలడానికి బయలుదేరాను. ఒక్కొక్కరినీ వదులుతూ... చివరికి నేను, చాక్లెట్ మిగిలాం. తనింటి దగ్గరికి వచ్చాక ... నా మనసులో మాట చెప్పాను. తను నా కళ్లలోకి చూసి నవ్వి వెళ్లిపోయింది. తను నన్ను ప్రేమిస్తోందని నాకు అర్థమైంది. నేను ఎంతో ఆనందంగా పార్టీ దగ్గరికి వెళ్లాను. అక్కడ రోషిణి నన్ను పక్కకి పిలిచింది. తను నన్ను ప్రేమిస్తున్నట్లు చెప్పింది. నేను కాదన్నాను. నేను చాక్లెట్‌ను ప్రేమిస్తున్నానని చెప్పాను. తను ఏడుస్తూ వెళ్లిపోయింది. మరుసటి రోజు తనతో వివరంగా మాట్లాడాలని పార్క్‌కి రమ్మన్నాను. చాక్లెట్‌నూ అక్కడికి రమ్మన్నాను. రోషిణి ముందుగా వచ్చి ఏడ్చింది. నేను ఓదార్చాను. నాకు చాక్లెట్ అంటే ఎంత ఇష్టమో వివరంగా చెప్పాను. పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని చెప్పాను. నేను మాట్లాడుతుండగానే రోషిణి నన్ను హత్తుకొంది. ఇంతలో చాక్లెట్ అక్కడికి వచ్చి ఆ దృశ్యం చూసింది. అంతే నాతో మాట్లాడకుండా వెళ్లిపోయింది. తర్వాత నేను కాల్ చేస్తే తీయడం లేదు. మెసేజ్‌కి స్పందించడం లేదు. ఫోన్ నంబరు మార్చేసింది. నేను తన గురించి ఆలోచిస్తూ... పిచ్చివాణ్ని అయిపోతున్నా.



చాక్లెట్... నా మాట ఒక్కసారి విను. నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావు. ఆరోజు జరిగింది ఏమిటో దయచేసి చెప్పే అవకాశమైనా ఇవ్వు. నువ్వు లేకుండా నా జీవితం ఊహించుకోలేను. నా ప్రాణం పోకముందే దయచేసి నాతో ఒకసారి మాట్లాడు.

– **నీ కాల్ కోసం ఎదురుచూసే... నీ రాక్**

నిటారు స్తంభాన్ని నిలువునా ఎక్కచ్చు

విద్యుత్తు స్తంభం ఎక్కాలంటే ఎంత ప్రయాస?
కాలుజారి పడిన వాళ్లెందరో?
కాళ్లు చేతులు విరగొట్టుకున్న వాళ్లెందరో?
బతుకుబండి నడవాలంటే...
ఇలా తాను ఎక్కక తప్పలేదు.
ఈ సమస్య ఆలోచనను ఇచ్చింది.
పరిసరాలు పరిష్కారం చూపించాయి.
ఈ కష్టం నుంచి బయటపడటానికి చేసిన ఆవిష్కరణ జీవితాన్నే మార్చేసింది.
ఆ కష్టం... ఆ ఆలోచన.. ఈ ఆవిష్కరణ గురించి.. మీరే చదవండి.

సులువుగా విద్యుత్తు స్తంభం ఎక్కే సాధనాన్ని (పోల్ క్లైంబర్) రూపొందించాడు చీరాలకు చెందిన తిరుపతిరావు. ఈ పోల్‌క్లైంబర్‌కు జాతీయస్థాయిలో ఉత్తమ ఇన్నోవేషన్(ఆవిష్కరణ) అవార్డు వచ్చింది. దేశంలో ఈ అవార్డు ముగ్గురికి దక్కగా, వారిలో తిరుపతిరావు ఒకరు. దీంతో పాటు, రూ. 3 లక్షల నగదు బహుమతి అందుకొని అందరి ప్రశంసలూ పొందుతున్నాడు ఈ చీరాల చిన్నోడు.

> వివిధ రాష్ట్రాల్లోని విద్యుత్తు శాఖ అధికారుల ఆర్డర్ మేరకు ఇప్పుడు పోల్‌క్లైంబర్లు తయారు చేస్తున్నాను. గతేడాది వేల సాధనాలు తయారుచేశాను. ఇంటి వద్ద ఇప్పుడు నాతో పాటు మరో 12మందికి ఉపాధి ఇవ్వగలుగుతున్నాను. తాటి, ఈతచెట్లు సులువుగా ఎక్కే సాధనాలు రూపొందించాను. వాటిని త్వరలోనే ప్రదర్శిస్తాను.

పేద కుటుంబానికి పెద్ద కష్టం

ప్రకాశం జిల్లా చీరాలలోని కొత్తపేట ప్రాంతానికి చెందిన తిరుపతిరావు ఎనిమిది మంది సంతానంలో ఒకరు. తండ్రి రామదాసు హోంగార్డు. తల్లి వరదానమ్మ. ఆర్థిక కష్టాల మధ్య చదువు సాగేది. 2005లో రోడ్డు ప్రమాదానికి గురై ఒక అన్నయ్య చనిపోయాడు. ఏడాది తర్వాత మరో అన్నయ్య ప్రమాదానికి గురై అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. చికిత్స కోసం ఉన్న ఇంటిని అమ్ముకుని రూ. 5 లక్షల వరకు ఖర్చుచేశారు. అప్పులు చేశారు. అయినా అన్నయ్య దక్కలేదు. ఇలా కుటుంబం అప్పులపాలై ఆర్థికంగా ఇబ్బందుల్లో చిక్కుకుంది.

గైడ్ కొనలేక బడి మానేసి

అప్పుడు తిరుపతిరావు ఏడో తరగతి. బడిలో అందరూ గైడ్ తీసుకురావాలని ఉపాధ్యాయుడు ఆదేశించారు. వారం రోజులైన తిరుపతిరావు కొనలేదు. రూ. 25 ఖర్చు చేసే పరిస్థితి ఇంట్లో లేదు. బడిలో ఉపాధ్యాయుడు రోజూ కొట్టేవారు. దీన్ని భరించలేని తిరుపతిరావు ఇక చదువు మానేశాడు. కుటుంబ పరిస్థితులు పూట గడవడమే కష్టంగా ఉండడంతో కూలీగా మారాడు. విద్యుత్తు స్తంభాలు ఎక్కే పనికి వెళ్లాడు.

కష్టం నేర్పిన పాఠం

విద్యుత్తు స్తంభాలు ఎక్కేటప్పుడు చాలామంది కింద పడుతున్నారు. కాళ్లు, చేతులు విరుగుతున్నాయి. సులువుగా, కిందపడకుండా స్తంభాలు ఎక్కలేమా? అని తిరుపతిరావు ఆలోచించాడు. ఆ సమయంలో ఊరిలోని చర్చికి బల్లలు తయారు చేయాల్సి వచ్చింది. వాటిలో క్లింబర్లు పెట్టడం, వాటిని జాయింట్ చేయడం చూశాడు. వాటిని అతికించినట్టే మనిషి కాళ్లకు, స్తంభంపై పట్టు ఉండేలా చేస్తే పడిపోమని ఆలోచించాడు. అదే ఆవిష్కరణకు దారి తీసింది. స్తంభాన్ని గట్టిగా పట్టుకుని ఉండేలా క్లైంబర్‌ను రూపొందించాడు. దాన్ని కాళ్లకు పెట్టడం కుదరదు. పెడితే కాళ్లకు దెబ్బలు తగులుతున్నాయి. ఇలా దాదాపు రెండు వారాల పాటు వివిధ ప్రయోగాలు చేసి, చెప్పులకు అతికించాడు. దీంతో అనుకున్న ఫలితం వచ్చింది. దీన్ని తానే స్వయంగా ప్రయోగించి... స్తంభం ఎక్కుతూ వీడియో తీయించాడు. దాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడు. దీన్ని ఒక్కరోజులో 2 లక్షల మంది వీక్షించారు. కువైట్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల నుంచి కొందరు విద్యార్థులు ఫోన్ చేసి తమకు ఆ విధానం తెలియజేయాలని కోరారు. దేశవ్యాప్తంగా వందలాదిగా ప్రశంసలు, ఫోన్లు వచ్చాయి.

దిల్లీ నుంచి ప్రశంసలు

ఆవిష్కరణ విషయం దిల్లీకి చేరింది. జాతీయ సొసైటల్ ఆవిష్కరణ అవార్డు-2017 కి తిరుపతిరావు ఎంపికయ్యాడు. గత వారమే ఆయన ఈ అవార్డుని కేంద్రమంత్రి హర్షవర్ధన్ చేతులు మీదుగా అందుకున్నారు. దీంతో పాటు ఎన్ఐఆర్‌డీ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డులు దక్కాయి. విశాఖపట్నంలో గత ఏడాది జరిగిన 30 దేశాల ఆవిష్కరణల సదస్సులో ద్వితీయస్థానం దక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విదేశీ ప్రముఖుల చేతుల మీదుగా రజత పతకం అందుకున్నారు. ప్రస్తుతం తిరుపతిరావు దూరవిద్య ద్వారా ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

– **మానెం శ్రీనివాసరావు**
ఈనాడు డిజిటల్, ఒంగోలు

ఈనాడు



విజయవాడ 3-6-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 294
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-00 పేజీలు 16+20+32
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

నమ్మక ద్రోహం

ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- మోదీ వచ్చినప్పుడల్లా ఆదరించాం..
- ఒప్పించాలని చూశాం
- గౌరవిస్తే మోసం చేశారు
- మోదీ కోసమే మనకు పవన్ మద్దతు
- భాజపాకు అద్దె మైకు.. వైకాపాకు సొంత మైకులా కమలం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు
- ఇడ్లీ తిన్నా పన్నేస్తారేమో
- ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు
- విజయవాడలో 'నవ నిర్మాణ దీక్ష'

ఈనాడు – అమరావతి

'ఏమిచ్చారని మేం అవతరణ దినోత్సవం చేసుకుంటాం? గుజరాత్‌లోని ధోలేరాపై ఉండే అభిమానం అమరావతిపై లేదు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం సహకరించడం లేదు. విభజనతో నష్టపోయింది మేమా? వాళ్లా? లోటు భర్తీ చేయాల్సింది ఎవరికి?' అని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలదీశారు. 'అవినీతి పార్టీ అయితే తమ అదుపాజ్ఞల్లో ఉంటుందని వైకాపాకు మద్దతు పలుకుతున్నారు. ఉప ఎన్నికలు వస్తాయనే భయంతోనే వైకాపా ఎంపీల రాజీనామాలు ఆమోదించడం లేదు' అని ధ్వజమెత్తారు. మహా కుట్రలో భాగంగానే వైకాపా, పవన్ కల్యాణ్‌ను అడ్డం పెట్టుకుని భాజపా తమపై విమర్శలు చేయిస్తోందని మండిపడ్డారు. విజయవాడలో శనివారం ఉదయం నిర్వహించిన 'నవ నిర్మాణ దీక్ష' వేదికగా కేంద్రంలోని భాజపా ప్రభుత్వంపై ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు.

'నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాల్లో ఉన్నా అభివృద్ధి పనుల కోసం నేనే దిల్లీ వెళ్లేవాడిని. అలాగే ఈ ప్రభుత్వంలోనూ అందరి వద్దకూ ఓపికగా వెళ్లా. 29 సార్లు తిరిగా. రాష్ట్ర ప్రజానీకం తీవ్ర నిరాశలో.. కోపంలో (మిగతా 2లో)

'అమరావతిలో మేం భాగస్వాములవుతున్నాం.. అక్కడ బ్రహ్మాండమైన నగరం వస్తుందని సింగపూర్ ప్రధాని మన ప్రధాని మోదీకి చెప్పారు. అదీ ఆంధ్రప్రదేశ్ పని తీరు..

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం విషయంలో కేంద్రం ఇబ్బంది పెట్టినా. . సకాలంలో డబ్బు ఇవ్వకున్నా 55 శాతం పనులు పూర్తి చేశాం. ఇందులో మనకు ఇవ్వాల్సిన డబ్బులూ ఇవ్వడం లేదు. దస్త్రాలు పైకి కిందకు తిప్పుతున్నారు. వారానికి ఒకసారి రమ్మంటున్నారు.

విజయవాడలోని బెంజ్‌సర్కిల్ వద్ద నవ నిర్మాణ దీక్ష నిర్వహించేందుకు పాదయాత్రగా వస్తున్న సీఎం చంద్రబాబు

బ్యాటరీ కారు.. చైనా జోరు!

చైనా రాజధాని బీజింగ్‌తో పాటు ఆ దేశంలో ఏ నగరంలో చూసినా... ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాలు పరుగులు తీస్తూ కనిపిస్తాయి. పెట్రోలు, డీజిల్‌తో నడిచే బస్సులు, కార్లు ఎక్కడో కానీ ఉండవు. సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవటంతో పాటు కాలుష్యాన్ని దరిచేరనీయకూడదనే లక్ష్యంతో మనకు పొరుగున్న ఉన్న ఈ దేశం ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాల తయారీలో దూసుకుపోతోంది. ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనా అందిపుచ్చుకుంటున్న తీరును విశ్లేషిస్తే, 2040 నాటికి ఆదేశంలో 60 శాతానికి పైగా ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాలే ఉంటాయని పరిశీలిలకులు అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో మనదేశం మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. 2050 నాటికి కానీ మనదేశంలో ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాల వినియోగం విస్తరించే అవకాశం కనిపించటం లేదు. అగ్రరాజ్యమైన అమెరికా సైతం చైనా దూకుడును అందుకోలేకపోతోంది. ఇతర దేశాలు తనకు సాటి రాలేవని గమనించిన చైనా పెద్ద లక్ష్యాలపై గురిపెట్టింది. బ్యాటరీ వాహన పరిశ్రమకు కేంద్రస్థానంగా ఎదిగే సన్నాహాలు ప్రారంభించింది. – 12లో

సంతృప్తి కోసమే విటమిన్ మాత్రలు!

నీరసంగా ఉంటే.. నాలుగు విటమిన్ మాత్రలు వేసుకుంటే చాలనుకుంటాం. శక్తి పుంజుకుంటుందని ఆశిస్తాం. నిజానికి విటమిన్ మాత్రలతో పెద్ద ప్రయోజనం ఏమీ ఉండదట. అలాగని ప్రమాదమూ లేదట. ఇది టొరంటో వర్సిటీ పరిశోధకులు అంటున్న మాట. – 16లో

వినండి.. వినండి.. ఇక వినపడదండి!

చేతిలో స్మార్ట్‌ఫోన్. చెవిలో సంగీత హోరు. ఇదీ నవతరం పోకడ! భారీ శబ్దంతో పాటలు వినడం ఇప్పుడో ఫ్యాషన్. మొదట్లో బాగానే ఉంటుందిగానీ, రోజులు గడిచేకొద్దీ అసలు వినికిడిశక్తే ఉండదని హెచ్చరిస్తున్నారు... అమెరికాలోని సెంట్రల్ మిడిల్‌సెక్స్ ఆసుపత్రి పరిశోధకులు! – 16లో

వీఆర్‌ఏల వేతనాల పెంపు

రూ.10,500కు పెంచుతున్నట్లు ప్రకటించిన సీఎం

ఈనాడు డిజిటల్ – అమరావతి

గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ) వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వారి కష్టాలను దృష్టిలో ఉంచుకునే వేతనాలు రూ. 6,565 నుంచి రూ. 10,500కు పెంచుతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. శనివారం సాయంత్రం వీఆర్‌ఏల సంఘం గౌరవాధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీఆర్‌ఏలు ముఖ్యమంత్రిని ఉండవల్లిలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే వీఆర్‌ఏల వేతనాన్ని రూ. 3వేల నుంచి రూ. 6,565కు, నాలుగేళ్లలో మూడింతలు పెంచామని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. అంచెలంచెలుగా అభివృద్ధి సాధిస్తున్నామని వివరించారు. ఇదే స్ఫూర్తితో వీఆర్‌ఏలు గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తూ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. 'ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో ఆయా దేశాల ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ప్రస్తావిస్తున్నారు. ప్రధాని మోదీ సింగపూర్ పర్యటన సందర్భంగా అక్కడి ప్రధాని అమరావతి అభివృద్ధిని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి ప్రవాసులకూ మంచి ప్రేరణనిస్తోంది. అందువల్లే నవ నిర్మాణ దీక్షలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ స్ఫూర్తి భవిష్యత్తులోనూ కొనసాగాలి' అని సీఎం తెలిపారు. వేతనాలు పెంచినందుకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీఆర్‌ఏల సంఘ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సీఎంవో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం అధ్యక్షులు కైకాల గోపాలరావు, ప్రధాన కార్యదర్శి సుధాకర్ చౌదరి, (మిగతా 2లో)

తితిదేకి జీఎస్టీ ఊరట

- ధార్మిక సంస్థల ఉచితాహార ముడి సరకులపై పన్ను వెనక్కి
- తిరుమల అన్న ప్రసాద విభాగానికి మేలు 16లో

ఫేస్‌బుక్ కంటే యూట్యూబ్‌పైనే మొగ్గు!

వాషింగ్టన్: ఫేస్‌బుక్‌లో చాటింగ్ చేయడం కంటే... యూట్యూబ్‌లో వీడియోలు చూడ్డంలోనే ఎక్కువమంది నవ తరం యువత నిమగ్నమవుతోందట! ప్యూ పరిశోధన కేంద్రం ఇటీవల చేపట్టిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. 13-17 ఏళ్ల వయసు యువతీ యువకుల్లో 85% మంది యూట్యూబ్ వీడియోలను చూడ్డంలోనే ఎక్కువ సమయం గడుపుతుండగా... ఆ తర్వాత 72% మంది ఇన్‌స్టాగ్రాంలో; 69% మంది స్నాప్‌చాట్‌లో; 51% మంది ఫేస్‌బుక్‌లో సమయం వెచ్చిస్తున్నట్లు తేలింది. "ఈ వయోశ్రేణి అమెరికన్లలో 95% మందికి స్మార్ట్‌ఫోన్ వాడకం తెలుసు. 43% మంది నిత్యం ఇంటర్నెట్‌ను వాడుతున్నారు. సామాజిక మాధ్యమం వల్ల మంచే ఎక్కువని వారిలో 31% మంది; చేటే ఎక్కువని 24% మంది నమ్ముతున్నట్లు చెప్పారు" అని సర్వే సంస్థ నివేదికలో పేర్కొంది.

గోరుచుట్టుకు వాడే ఔషధంతో పేగు క్యాన్సర్‌కు చికిత్స!

లండన్: గోరుచుట్టు బాధ నుంచి ఉపశమనం పొందడానికి వాడే 'ఇట్రాకానాజోల్' ఔషధం... పేగు క్యాన్సర్ నియంత్రణకూ అద్భుతంగా పనిచేస్తుందట! కేంబ్రిడ్జ్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డా. సైమన్ బుజాకి బృందం పరిశోధనలో ఈ విషయం విస్పష్టమైంది. "ఔషధ ప్రభావాన్ని నిరోధించే కొన్ని ప్రత్యేక కణాలు... పేగుక్యాన్సర్ కణజాలంతో అంటకాగుతున్నాయి. ఫలితంగా చికిత్సలు పెద్దగా ఫలించట్లేదు. విచిత్రమేమంటే... స్పోరానోక్స్‌గా పిలిచే ఇట్రాకానాజోల్ ఔషధం ఈ క్యాన్సర్ కణాలను మట్టుబెడుతోంది. ఎలుకలపై చేపట్టిన ప్రయోగాల్లో ఈ విషయం స్పష్టమైంది. రోగులకు కీమో థెరపీతో పాటు ఈ మందును కూడా వాడటం వల్ల మంచి ప్రయోజనం ఉండవచ్చు." అని డా. సైమన్ వెల్లడించారు.

INTER / DEGREE + IAS
New Batch for CIVILS & Groups on 6-6-18
NANDHINI IAS ACADEMY
Opp. PVP, YV Rao Hospital Rd, Labbipet, VJA
Ph. 9666474466, 8019988299

SI/కానిస్టేబుల్స్ RPF State
అర్థమెటిక్ & రీజనింగ్ స్టేట్ నెం.1 ఫ్యాకల్టీ
శివాజీ SICE ఇన్‌స్టిట్యూట్ గుంటూరు 9346364702

కానిస్టేబుల్స్-SI
8th Batch Started
AP లో Police ఉద్యోగాల్లో No.1
జైహింద్ డిఫెన్స్ అకాడమి
www.jaihinddefenceacademy.co.in
9985223681, 9390155454 - VJA

RPF S.I & కానిస్టేబుల్స్
RRB గ్రూప్1,2,3,4 VRO
DSC: స్టాండర్డ్ కోచింగ్
V-రాహుల్ 9866715363 విజయవాడ.

RPF-SI, కానిస్టేబుల్స్
SI & కానిస్టేబుల్స్
శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ 0884 - 2362744, 98482 56254, 98481 36254

S.I. కానిస్టేబుల్
FREE DEMO
HIP హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్
Hyd. 9848262600, 9849771902

S.I & కానిస్టేబుల్స్ VRO/VRA
New Batches 05-06-18
భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్ 040-66338639, 24064477, 9652578639, 0884-2378639

RPF (కానిస్టేబుల్స్) అర్హత: 10th
RPF (SI) అర్హత: డిగ్రీ
వయస్సు: 18-30 / ఉద్యోగాలు: 9,500
కాపు విద్యార్థులకు ఉచిత కోచింగ్
హాల్మార్క్ ఇన్‌స్టిట్యూట్, విజయవాడ. 9160419854, 9030450459

EXCELLENT COACHING FOR
RPF కానిస్టేబుల్స్ SIs
SBI-POs SSC-CGL
Online Exams • హాస్టల్ వసతి కలదు
ఆదిత్య కాంపిటీషన్స్ New Batch: 4th June'18
కాపు విద్యార్థులకు ఉచిత శిక్షణ, స్టైఫండ్
GNT 98490 03166, VJA 91105 88864

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
RANK హామీ
Degree + IAS (50 students)
Prelims - cum - Mains, Hostel Facility
Demo 3rd June (Sunday) 10am & 5pm
Beside Nagarjuna Hospital, Kanuru, VJA.
Ph:6300181832

షైన్ ఇండియా అకాడమీ
APPSC GROUP-II
4th June న కొత్త బ్యాచ్ ప్రారంభం
Saeed Sir
Contact: Ashoknagar, Hyderabad. 9573193746

నమ్మక ద్రోహం

విజయవాడలో నిర్వహించిన నవనిర్మాణ దీక్షలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో పార్టీ నేతలు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు



ముస్లిం మహిళకు చంద్రన్న రంజాన్ తోఫాను అందజేస్తున్న ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారని చెప్పా. మా హక్కులు కాపాడాల్సిన బాధ్యత మీపై ఉందని చెప్పా. అయినా మోదీ గుండె కరగలేదు. వెంకటేశ్వరస్వామి సాక్షిగా ఇచ్చిన హామీలను ఆయన అమలు చేయలేదు. ఆ దేవుడికైనా గౌరవం ఇవ్వలేదు. నమ్మబలికి నమ్మక ద్రోహం చేశారు. అమరావతి రాజధాని శంకుస్థాపన సమయంలో మట్టి, నీళ్లు తెచ్చినప్పుడే.. ఏమీ ప్రకటించలేదని అందరూ విమర్శించారు. తర్వాత ఆయనలో మార్పు రాలేదు. బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్ పేరు ప్రస్తావించడానికి ఇష్టపడలేదు. అప్పుడే మోసం చేస్తున్నారని తెలిసింది.'

> మోదీ అమరావతికి వచ్చినప్పుడు మీరంతా చూశారు. ఆయనను గౌరవించాం.. ఆదరించాం. ఒప్పించాలని ప్రయత్నం చేశాం. ఇదంతా ఎవరి కోసం.. రాష్ట్రం కోసం.. భావితరాల భవిష్యత్తు కోసం.. అయినా రహస్య అజెండా పెట్టుకుని మనల్ని మోసం చేశారు.

ప్రధాని కార్యాలయంలో విశ్వాసం.. బయట అవిశ్వాసం..

'ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రాన్ని వైకాపా అడగదు. నిధులివ్వకుండా మోసం చేసినా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతిచ్చింది. తెదేపా ఎంపీలు పార్లమెంటులో రాజీలేని పోరాటం చేస్తుంటే వైకాపా ఎంపీలు డ్రామాలాడారు. ప్రధాని ఇంటికి, కార్యాలయానికి వెళ్లి విశ్వాసం ప్రకటించి.. బయట కొచ్చి అవిశ్వాసం అనేవాళ్లు.. ఆ పార్టీ ఎంపీలు రాజీనామాల లేఖలిచ్చినా వాటిని ఆమోదించడం లేదు. భావోద్వేగంలో చేశారని అంటున్నారు. ఇదెక్కడి దుర్మార్గం? ఈ నెల 5న రమ్మన్నారు. అప్పుడు ఆమోదిస్తే ఎన్నికలు రావు. అవే వస్తే ఏమవుతుందో వారికి తెలుసు. దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో భాజపా ఒకటి గెలిచి మిగిలిన చోట్ల దివాళా తీసింది. ఇక్కడా అదే జరుగుతుంది.'

> మోదీకి సహకరించాలనే ఆలోచనతోనే ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ మనకు మద్దతిచ్చారు. రాష్ట్ర విభజన సమయంలో ఆయన ఎప్పుడైనా బయటకు వచ్చారా? నేను కేంద్రంతో విభేదించాకే మనపై ఆయన విమర్శల దాడి మొదలైంది.

> భాజపాకు కొత్త అధ్యక్షుడు వచ్చారు. పదవి రాక ముందు ఆయన వైకాపాలోకి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలో అమిత్ షా జగన్‌కు ఫోన్ చేశారు. నీ దగ్గరున్నా.. మా దగ్గరున్నా ఒకటే.. అన్నారు. ఆయన భాజపాకు అద్దె మైకు.. వైకాపాకు సొంత మైకుగా తయారయ్యారు.

ఆపరేషన్ గరుడ.. మహా కుట్ర ఒకటేనేమో

'మహా కుట్రలో భాగంగానే.. పవన్ కల్యాణ్‌ను ఉత్తరాంధ్రకు పంపి అక్కడ ఏదో జరిగిపోతోందని విమర్శలు చేయిస్తున్నారు. అందుకే ఆయనకు ముందు మంచిగా.. ఇప్పుడు చెడుగా కనిపిస్తున్నాం. ఏం సమాధానం చెప్పాలి. నేను ఆయనను విమర్శించడం లేదు. ఉత్తరాంధ్రను ఎంతో అభివృద్ధి చేశాం. మంచి ఫలితాలు వస్తున్నాయి. అయినా అక్కడకెళ్లి ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. సినీనటుడు శివాజీ చెప్పినట్లు ఆపరేషన్ గరుడ.. ఈ మహా కుట్ర ఒకటే అనిపిస్తోంది. మీ కుట్రలు మా దగ్గర కాదు. . తెలుగుజాతి జోలికొస్తే ఖబడ్దార్.. వదిలిపెట్టం.'

10 రాష్ట్రాల్లో రైతుల తిరుగుబాటు

'పంట ఉత్పత్తుల ధరలు పెరిగే సమయంలో ఇతర దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్నారు. ఎగుమతులు, దిగుమతులకు హేతుబద్ధత లేదు. రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. బ్యాంకులు రుణాలివ్వడం లేదు. మద్దతు ధరలంటూనే వాటినీ ఇవ్వడం లేదు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పెట్టుబడి, రైతు కుటుంబ శ్రమపై 50 శాతం ఇస్తామన్న హామీ నెరవేర్చలేదు. కేంద్ర విధానాల కారణంగానే 10 రాష్ట్రాల్లో రైతులు తిరుగుబాటు చేసే పరిస్థితి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు రూ.24వేల కోట్లతో రుణ మాఫీ చేశాం. ఎన్నో రాయితీలిచ్చాం. ధరల్లేనప్పుడు కొనాలని ఆదేశించాం. రైతన్నకు న్యాయం చేయాలని ఎన్నో చేస్తున్నాం.'

ప్రాంతీయ పార్టీలే శక్తిమంతం

'ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన భాజపాను ఓడించాలని పిలుపునిస్తే కర్ణాటకలో అలాగే చేశారు. ఉప ఎన్నికల్లోనూ ప్రాంతీయ పార్టీలకు ఓటేసి అవే శక్తిమంతమైనవని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల్లో అభద్రతా భావం నెలకొంది. ట్రిపుల్ తలాక్ విషయంలో ముస్లింలపై కేసులు పెడతామంటున్నారు. వాళ్లూ ఈ దేశంలో పౌరులేనని గుర్తుంచుకోవాలి. నిరుద్యోగం పెరిగిపోతోంది. ఇడ్లీ తిన్నా పన్ను వేసే పరిస్థితి వచ్చింది. విశాఖ రైల్వేజోన్‌కు ఒడిశా అంగీకరించినా ఇవ్వడం లేదు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయలేదు. అమరావతిలో ప్రైవేటు విద్యా సంస్థలకు భూములిస్తే ఇప్పటికే భవనాలు నిర్మించి తరగతులు ప్రారంభించారు.'

నవనిర్మాణ దీక్షలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు

ఎన్నో అవార్డులు సాధించాం

'ఈ నాలుగేళ్ల పాలనలో ఎన్నో అవార్డులు సాధించాం. పంచాయతీరాజ్‌లో 54, విద్యుత్తులో 23, మెడికల్‌లో 19, పర్యాటకంలో 18, రెవెన్యూలో 6, సాగునీరులో 3 చొప్పున అవార్డులు సాధించాం. ఉద్యాన, పశు సంవర్ధక, యువజన, రవాణా, రిజిస్ట్రేషన్ విభాగాల్లోనూ అవార్డులొచ్చాయి. అధికార యంత్రాంగం బాగా పనిచేసింది. ప్రజాప్రతినిధులు అంకితభావంతో కృషి చేశారు.'

అశోక్ బాబు ప్రజాసేవకు రావాలి

మరో ఏడాదిలో పదవీ విరమణ చేయబోతున్న ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు పరుచూరి అశోక్ బాబు ప్రజా సేవకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. నవ నిర్మాణ దీక్ష ముగింపు సమయంలో సీఎం ఈ అంశాన్ని ప్రస్తావించారు. సమైక్య ఉద్యమంలో ఆయన గట్టిగా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు.

సింగపూర్‌లో నవ నిర్మాణ దీక్ష

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాల కమిషనర్ల బృందం నవ నిర్మాణ దీక్ష కార్యక్రమాన్ని సింగపూర్‌లోని లీ క్వాన్ యూ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించింది. దీక్ష ప్రతిజ్ఞ చేశారు.

నవ నిర్మాణ దీక్ష ప్రతిజ్ఞ

విజయవాడ నవ నిర్మాణ దీక్షకు హాజరైన అందరితో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిజ్ఞ చేయించారు. కుట్ర రాజకీయాలను ప్రతిఘటించడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

'అవినీతి, అశాస్త్రీయ విభజనవల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని మన కష్టంతో పూరించడానికి సంసిద్ధంగా ఉన్నాం. నమ్మక ద్రోహం కుట్ర రాజకీయాలతో రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని సంఘటితంగా ప్రతిఘటించడానికి సమాయత్తంగా ఉంటాం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని అంశాలు.. నాటి ప్రధాని హామీలు అమలయ్యేవరకూ ధర్మ పోరాటాన్ని కొనసాగిస్తాం. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అలుపెరగని శ్రమజీవులం మనం. ప్రతి సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలచుకుందాం. దేశభక్తి, సామాజిక బాధ్యత, క్రమశిక్షణతో రాష్ట్ర ప్రగతి, శ్రేయస్సు కోసం మనమంతా భుజం భుజం కలిపి పనిచేద్దాం. 2022 నాటికి రాష్ట్రాన్ని దేశంలో మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 నాటికి దేశంలో అత్యుత్తమ రాష్ట్రంగా, 2050 నాటికి ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే పవిత్ర లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. అవినీతి, ఆర్థిక అసమానతలు లేని, అందరికీ ఉపాధి కల్పించే ఆరోగ్యకరమైన, ఆనందమయమైన రాష్ట్రాన్ని నిర్మించుకుందాం. ఈ లక్ష్య సాధనకు సమర్పణ భావంతో, నిష్ఠతో త్రికరణ శుద్ధిగా కృషి చేద్దాం. ఆంధ్రప్రదేశ్ నవ నిర్మాణ దీక్షను ఈ క్షణంలో మనమంతా చేపడుతున్నాం. జై ఆంధ్రప్రదేశ్'.

తొలి రోజు నవ నిర్మాణ దీక్షలో 30 లక్షల మందికి పైగా..

ఈనాడు డిజిటల్, అమరావతి: అశాస్త్రీయ విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సంఘటితంగా పోరాడేందుకు, నిరంతర కృషి, శ్రమతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటామని ప్రతిన పూనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నవ నిర్మాణ దీక్ష జరిగింది. విజయవాడ బెంజి సర్కిల్‌లో జరిగిన దీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవ నిర్మాణ దీక్ష తొలి రోజు నిర్వహించిన తీరుపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు దీక్షలో 30లక్షలకు పైగా పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. భాజపా అన్యాయం చేసిందన్న కసి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిలో కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. గతంలో నిర్వహించిన దీక్షలతో పోలిస్తే ఈసారి ప్రజల్లో పట్టుదల ఎక్కువ కనిపిస్తోందని పేర్కొన్నారు. 'ఇప్పటివరకూ అందిన వివరాల ప్రకారం.. . రాష్ట్రవ్యాప్తంగా 30.3 లక్షల మంది దీక్షల్లో పాల్గొన్నారు. 3.36 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేశాం. 66,800 మందికి కార్డులు అందాయి. 33,202 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. పూర్తయిన 5వేల పనులు ప్రారంభమయ్యాయి. 4,092 చోట్ల నిర్దేశిత అంశంపై చర్చలు జరిగాయి. 10వేల సాంస్కృతిక కార్యక్రమాలు, 6,303 చోట్ల క్రీడాపోటీలు, 5 వేల ప్రదర్శనలు నిర్వహించారు' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

కిమ్ జోంగ్‌తో సమావేశం పక్కా!

ధ్రువీకరించిన ట్రంప్

వాషింగ్టన్: ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్‌తో తన భేటీ ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. అనుకున్నట్లుగానే సింగపూర్‌లో జూన్ 12న ఈ సమావేశం జరుగుతుందని స్పష్టం చేశారు. శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీస్‌లో ఉత్తర కొరియా దూత కిమ్ యాంగ్ చోల్‌తో 80 నిమిషాలపాటు చర్చలు జరిపిన ట్రంప్.. అనంతరం ఈ విషయాన్ని పాత్రికేయులకు వెల్లడించారు. కిమ్ రాసిన ఓ లేఖను ట్రంప్‌నకు చోల్ అందజేశారు. కిమ్‌తో సమావేశాన్ని తానెప్పుడూ రద్దు చేసుకోలేదని ట్రంప్ అన్నారు. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్ర రహితంగా మార్చే ప్రక్రియ తమ భేటీతో ఆరంభమవుతుందని వ్యాఖ్యానించారు. ఇటు ట్రంప్, కిమ్‌ల భేటీకి అయ్యే వ్యయంలో కొంతభాగం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సింగపూర్ రక్షణ మంత్రి ఎంగ్‌హెన్ పేర్కొన్నారు. చారిత్రక సమావేశంలో తామూ ఓ చిన్నపాత్ర పోషించాలనుకుంటున్నామని ఆయన అన్నారు.

ఆశల నైరుతి

- ఈ నెల 5లోపు రాష్ట్రంలోకి రుతుపవనాలు
- రేపటి నుంచి ప్రభావం మొదలు

ఈనాడు, విశాఖపట్నం: కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు రాష్ట్రం మీదుగా కదిలేందుకు అనుకూలత ఉన్నట్లు వాతావరణ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా జూన్ 1కి రాయలసీమ, ఆపై దక్షిణ కోస్తాలో రుతుపవనాలు ప్రవేశించాల్సి ఉంది. జూన్ 5లోపు తెలంగాణ, ఉత్తర కోస్తాకు తాకాల్సి ఉంది. వాటి కదలిక కాస్త నెమ్మదిస్తుండడంతో రాష్ట్రానికి రావడం కొంత ఆలస్యమవుతున్నట్లుగా చెబుతున్నారు. తాజా సమాచారం ప్రకారం.. సోమవారం నుంచి ముందస్తు రుతుపవన వర్షాల ప్రభావం రాష్ట్రం మీద ఉండొచ్చని అంచనా.

విస్తరణకు వారం పైనే..

నైరుతి కదలిక ప్రస్తుతం నెమ్మదిగానే ఉన్నా.. ఈ నెల 5లోపు రాయలసీమను తాకే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు అంచనాలు వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ఈసారి వారం, అంతకంటే ఎక్కువరోజులే పట్టే అవకాశం కనిపిస్తోందని వెల్లడిస్తున్నారు. రాయలసీమ, కోస్తా వ్యాప్తంగా రుతుపవనాలు ఈ నెల 12 నుంచి 15 మధ్య అన్ని ప్రాంతాలకు చేరే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

అల్పపీడనాలు, ఆవర్తనాలు లేకనే..

బంగాళాఖాతంలో, రాష్ట్ర పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఎలాంటి అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాలు ఏర్పడటం లేదు. ఇవి ఏర్పడితే రుతుపవనాలు చాలా వేగంగా వచ్చేవని నిపుణులు చెబుతున్నారు. అవి లేకపోవటంతోనే గమనం నెమ్మదించిందని అంటున్నారు. ప్రస్తుతానికైతే నైరుతి గాలుల తీవ్రత బలంగానే ఉందని వాతావరణశాఖ అధికారి రాజారావు తెలిపారు. 5వ తేదీలోపు రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

జోరు వానలే..

ఈ సీజన్‌లో నిర్ణీత సగటు వర్షపాతం నమోదయ్యేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణశాఖ వెల్లడిస్తోంది. రాష్ట్రంలో జూన్ నుంచి సెప్టెంబరు మధ్య 97 శాతం వరకు వర్షపాతం నమోదయ్యేందుకు అనుకూలత ఉంటుందని తెలిపింది. గత మూడేళ్లుగా కోస్తాలో అధిక వర్షపాతం అంటే.. సాధారణం కన్నా 10-16 శాతం ఎక్కువగానే కురిసింది. రాయలసీమలో గతేడాదే సాధారణం కన్నా 27 శాతం అదనంగా నమోదైంది. అంతకుముందు వరసగా మూడేళ్ల పాటు లోటు కనిపించింది.

శ్రీశైలం ఎడమగట్టు రహదారిపై కొండ చరియలు పడటంతో నిలిచిన రాకపోకలు

> **జూన్-సెప్టెంబరు మధ్య పడాల్సిన వర్షపాతం (సగటు)**
>
> రాయలసీమ: 398.6 సెం.మీ..
> కోస్తా: 580.8 సెం.మీ..
>
> ● కోస్తా, రాయలసీమలో సాధారణ వర్షపాతం కంటే ఈసారి ఒకటి నుంచి మూడు శాతం తగ్గే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ పరిస్థితిని సాధారణ వర్షపాతంగానే పరిగణించవచ్చని అంటోంది.

శ్రీశైలంలో విరిగిపడిన కొండచరియలు

సున్నిపెంట సర్కిల్, శ్రీశైలం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీవర్షం కురిసింది. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీశైలంలో తెల్లవారుజామున రెండు గంటలపాటు జడివాన కురవడంతో రెండుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. శ్రీశైలం ఆనకట్ట వద్ద తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు రహదారిపై భూగర్భ జలవిద్యుత్తు కేంద్రం ఎగువన కొండచరియలు విరిగిపడి పూర్తిగా మార్గం మూసుకుపోయింది. ఫలితంగా మూడు గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి యంత్రాలను రంగంలోకి దించి రాకపోకలు పునరుద్ధరించారు. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రం సమీపంలోనూ కొండ చరియలు విరిగిపడ్డాయి. సుమారు ఏడు సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు సహాయ గణాంక అధికారి బాలలక్ష్మయ్య తెలిపారు.

పిడుగుపాటుకు 8మంది మృత్యువాత

ఈనాడు, అమరావతి, విశాఖపట్నం: తెలంగాణ నుంచి దక్షిణ కోస్తా వరకు ఏర్పడిన ఉపరితల ద్రోణి కారణంగా వాతావరణం చల్లబడింది. శనివారం ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ దాకా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వానలు హోరెత్తించాయి. పిడుగుపాటు కారణంగా శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో ఇద్దరేసి.. విజయనగరం, కృష్ణా, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ఒక్కొక్కరు వంతున మొత్తంగా 8మంది మృత్యువాత పడ్డారు. శుక్రవారం కర్నూలు జిల్లా శ్రీశైలంలో 7.3 సెం.మీ., చిత్తూరు జిల్లా పలమనేరులో 6.3, కర్నూలు జిల్లా నంద్యాల, పాణ్యంలో 5.0 నుంచి 5.5 సెం.మీ.. వంతున వర్షం పడింది. కృష్ణా జిల్లా వత్సవాయిలో 8.2 సెం.మీ., శ్రీకాకుళం జిల్లా రాజాం 7, చిత్తూరు జిల్లా తొట్టంబేడులో 6.6 సెం.మీ., తూర్పుగోదావరి జిల్లా మిర్తిపాడులో 5.8, పశ్చిమగోదావరి జిల్లా టి.నర్సాపురంలో 5 సెం.మీ..వంతున వర్షం కురిసింది. కొన్నిచోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి. ద్రోణి కారణంగా కోస్తా, రాయలసీమ, తెలంగాణలో 3 నుంచి 4 రోజుల పాటు విస్తృతంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

బ్యాంకులో రూ.1200 కోట్ల దోపిడీకి యత్నం

అబుధాబిలో 28 మందికి జైలు శిక్ష

అబుధాబి: ఐటీని ఉపయోగించుకొని అబుధాబిలోని ఒక బ్యాంక్ నుంచి ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో దాదాపు రూ.1200 కోట్లు కొట్టేయడానికి ప్రయత్నించిన 28 మందికి స్థానిక కోర్టు.. కారాగార శిక్ష విధించింది. నిందితుల్లో భారత్, పాకిస్థాన్, అమెరికా, రష్యా, కెనడా పౌరులు ఉన్నారు. ఒక్కొక్కరికి 15 ఏళ్ల వరకూ జైలు శిక్ష పడింది.

గ్రహం అనుగ్రహం

3-6-2018 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
పంచమి: రా. 3-28 తదుపరి షష్ఠి
ఉత్తరాషాఢ నక్షత్రం: ఉ.9-14 తదుపరి శ్రవణం
అమృత ఘడియలు: రా. 12-43 నుంచి 2-29 వరకు
వర్జ్యం: మ. 2-06 నుంచి 3-52 వరకు
దుర్ముహూర్తం: సా. 4-43 నుంచి 5-35 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-27

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	40.0	29.0
తిరుపతి	38.6	24.2
ఒంగోలు	38.5	29.6
రాజమహేంద్రవరం	38.5	28.0
కడప	38.0	28.0
అనంతపురం	37.9	27.9
విజయవాడ	37.7	29.0
శ్రీకాకుళం	36.0	28.0
విశాఖపట్నం	35.7	27.6
నరసాపురం	35.2	27.4
కర్నూలు	33.1	27.6
తాడేపల్లిగూడెం	32.0	27.0
హైదరాబాద్	30.7	24.3
గుంటూరు	29.8	26.5

ఇదీ సంగతి!

ముఖ్యమంత్రి చంద్రబాబుతో వీఆర్ఏలు

వీఆర్ఏల వేతనాల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

టి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

వీఆర్ఏల కుటుంబాల్లో ఆనందం: బొప్పరాజు

చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న 27 వేల మంది వీఆర్ఏల వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వారి కుటుంబాల్లో ఆనందం నింపుతోందని రాష్ట్ర వీఆర్ఏల సంఘం గౌరవాధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తప్పుడు ధ్రువపత్రాలతో భారత పాస్‌పోర్టు

- పాకిస్థాన్ దేశీయుడు ఉస్మాన్ ఇక్రమ్‌కు సహకరించిన ముగ్గురి అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: తప్పుడు ధ్రువపత్రాలతో భారత పాస్‌పోర్టు పొందిన పాకిస్థాన్ దేశీయుడు ఎండీ ఉస్మాన్ ఇక్రమ్‌కు డిగ్రీ పత్రాలు (సర్టిఫికేట్లు) ఇచ్చిన ముగ్గురు నిందితులు మక్సూద్ అహ్మద్, సయ్యద్ కిర్మాణి, మహ్మద్ ఖాన్ నిజామ్ ఖాజాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అక్రమంగా పాస్‌పోర్టు పొందిన పాకిస్థానీయుడు ఎండీ ఉస్మాన్‌ను శుక్రవారం అరెస్ట్ చేసిన పోలీస్ అధికారులు పాస్‌పోర్టు ఎలా వచ్చిందని విచారించగా... ముగ్గురు నిందితుల వివరాలు తెలిశాయి. కరీంనగర్‌లోని ట్రినిటీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న మక్సూద్ అహ్మద్ ఈ పత్రాలు సమకూర్చాడని దర్యాప్తులో తేలింది. అతని ఇంట్లో సోదాలు నిర్వహించగా... దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు చెందిన 2వేల డిగ్రీ సర్టిఫికెట్లున్నాయని గుర్తించారు. మరిన్ని వివరాలను సేకరించేందుకు నలుగురినీ కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుంటామని డీసీపీ(నేర పరిశోధన) అవినాష్ మహంతి తెలిపారు. హైదరాబాద్ చాదర్‌ఘాట్‌కు చెందిన యువతిని పెళ్లి చేసుకున్న పాకిస్థానీ ఉస్మాన్ ఏడేళ్ల క్రితం ఆ దేశం నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు వచ్చాడు. పాకిస్థాన్ దేశస్థుడని తెలిసిన వెంటనే ఉస్మాన్ భార్య గొడవ పెట్టుకోగా... క్షమించాలంటూ కోరాడు. అనంతరం భారత పాస్‌పోర్టు పొందాలని అనుకున్నాడు. భార్య బాల్య స్నేహితుడు సయ్యద్ కిర్మాణిని సంప్రదించగా...ముందుగా ఏదైనా ఉద్యోగం చేయాలని, తర్వాతే పాస్‌పోర్టు వస్తుందని చెప్పాడు. డిగ్రీ చదివినట్టు పత్రాలు ఇప్పిస్తానంటూ మక్సూద్ ఏజెంట్ వద్దకు తీసుకెళ్లాడు. రూ.80వేలు తీసుకుని పది, ఇంటర్, డిగ్రీ పత్రాలను ఖాజా ఇచ్చాడు. వీటి సాయంతో 2011లో ఓ చిన్న దుకాణంలో ఉద్యోగిగా చేరాడు. రెండేళ్ల పాటు వేర్వేరు దుకాణాల్లో పనిచేశాడు. ఒక దుకాణంలో పనిచేస్తున్నట్లు ధ్రువపత్రం పొంది బ్యాంకులో ఖాతాను తెరిచాడు. 2013లో బ్యాంకు ఖాతా ఆధారంగా పాస్‌పోర్టుకు దరఖాస్తు చేశాడు. కొద్దిరోజులకే పాస్‌పోర్టు వచ్చింది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు అతనిని శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు.

నీటి భద్రత – కరువు రహిత రాష్ట్రం

నదుల అనుసంధానం దేశంలో అందరి కల. దానిని నిజం చేసిన ఘనత
మన రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిదే.

- 13 జిల్లాలలో నీటి పారుదల ప్రాజెక్టులపై గత నాలుగేళ్లలో రూ 49,981 కోట్లు ఖర్చు చేసాం
- నీరు-ప్రగతి, జలసంరక్షణ ఉద్యమాల ద్వారా భూగర్భజలాలు పెంచాం
- గత నాలుగేళ్లలో 7.25 లక్షల పంట కుంటలు తవ్వాం
- గోదావరి - కృష్ణా నదుల అనుసంధానంతో పవిత్ర సంగమం చేశాం
- వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా నదుల మహా సంగమానికి అడుగులు వేస్తున్నాం
- 54 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సంకల్పించాం

పోలవరం
ఆంధ్రప్రదేశ్ జీవనాడి

7.20 లక్షల ఎకరాలకు సాగు నీరు

హెడ్ వర్క్స్, కుడి -ఎడమ కాలువలు కలిపి 57% పూర్తి
2019 నాటికి గ్రావిటీ ద్వారా నీరు

28.5 లక్షల మంది ప్రజలకు తాగు నీరు

విశాఖ నగరానికి నీటి అవసరాల కోసం 23.44 టి ఎం సీ లు

960 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి

2022 దేశంలో 3 అగ్రగామి రాష్ట్రాలలో ఒకటి (తలసరి ఆదాయం రూ. 2.95 లక్షలు)

2029 దేశంలో అత్యుత్తమ రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 9.65 లక్షలు)

2050 ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాల రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 1.67 కోట్లు)

నేటి చర్చనీయాంశాలు

- నీటి నిర్వహణ - నీటి బడ్జెట్
- నీరు- చెట్టు, నీరు-ప్రగతి
- పంట కుంటలు
- నదుల అనుసంధానం
- చెక్ డ్యాంలు
- పోలవరం
- ప్రాధాన్యతాక్రమంలో ప్రాజెక్టులు
- భూగర్భ జలాల పెంపుదల
- తాగునీరు
- ప్రకృతి విపత్తులు, కరువులను ఎదుర్కోవడం, తుఫానుల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం

ముఖ్యమంత్రి గారిని సంప్రదించడానికి

NCBN అధికారిక యాప్

ప్రజలే ముందు మొబైల్ యాప్

ఏపి సీఎం ఫేస్ బుక్

ఏపి సీఎం ట్విట్టర్

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఈనాడు

వానకారు కోయిల

వానజల్లుకు నేలతల్లికి గల అవినాభావ సంబంధం అమూల్యమైనది. వానచినుకు అన్నం మెతుకు కావాలంటే- ఆ బంధం 'పచ్చగా' వర్ధిల్లాలి. గ్రీష్మతాపానికి గొంతు ఎండిపోయి నెర్రెలు విచ్చిన నేలతల్లి వానచినుకు కోసం బేల చూపులు చూస్తుంది. సినారె చెప్పినట్లు 'బీటవారిన చేల పీయూషములు దేల సాగుమా ఓ నీలిమేఘమా' అంటూ ప్రేమగీతాలు ఆలపిస్తుంది. కృష్ణశాస్త్రి మాటల్లో 'కురియుము కురియుము వర్షము వరలగ జగతికి హర్షము' అంటూ వలపు సందేశాలు పంపుతుంది. 'గగన మదనా లింగ నోత్సాహియై బిగువు నిట్టూర్పు బాహువుల సెగలెగయగా' స్వాగత వచనాలు పలుకుతుంది. ఆ సెగ సోకిన లేత గారాబు మబ్బుతునక, కరిగి నీటిచుక్కగా వచ్చి నెర్రెలలో టప్పున వాలుతుంది. భూకాంత ఆ నీటిబొట్టును చప్పున ఒడిసి పట్టి గుండెలో తుల్లో దాచేస్తుంది. 'కమ్మని మట్టి వాసనల కానుక లిచ్చెద స్వీకరింపుమా' అంటున్నట్లుగా పరిమళాలు వెదజల్లుతుంది. ఆ తొలకరి వలపు చినుకులను 'ఎలగోలు జల్లులు'గా అభివర్ణించాడు శ్రీకృష్ణదేవరాయలు. ఆ సొగసును అందిపుచ్చుకొన్న బేతవోలు కవి- అక్రూరుణ్ని ద్వారకకు ఆహ్వానిస్తూ విలాసినులు వెదజల్లిన పూలరేకులను 'ఎలగోలు మూకలై ఏతెంచు చినుకులే పురకామినుల్ జల్లు పూలుకాగ' అంటూ అందమైన పోలిక చెప్పారు. క్రమంగా వలపు తొలకరి ఉరుములు మెరుపులతో విజృంభిస్తుంది. తుంపరగా మొదలై జడివానగా మారుతుంది. 'కుంభ ద్రోణములు పట్టి కురిసెన్ వానల్' అని కవికర్ణ రసాయనకర్త చెప్పినట్లు కుంభవృష్టి కురుస్తుంది. భూతాపం తీరుతుంది. రైతాంగం సంతోషపడుతుంది. 'వణ్ణమెట్టే వానచినుకుకు దణ్ణమెట్టి ఒడిసిపట్టి' రైతులు ఒబ్బిడి చేసిన పుణ్యానికి భూకాంత భూమాత అవుతుంది. రైతుల కంట కృతజ్ఞతతో తారకలు పండుతాయి. చినుకును మెతుకును చేసి వర్షరుతువు మనిషికి బతుకునిస్తుంది.

భూమి మెత్తబడగానే రైతన్నలు నాగేటి చాళ్లతో పొలం దున్నుతారు. ఆ క్రమంలో నేలతల్లి దేహంపై ఏర్పడే గాయాలను పోతన 'తీపిగాయాలు' అన్నాడు. వర్షం అనే ప్రియుడు రతిపారవశ్యంలో భూకాంత దేహంపై గోళ్లతో చేసిన మృదుమధుర గాయాలవి... 'హర్షముతో నిండిన నవనఖాంకములు... భూమి సతిపై కర్షక హల(రైతుల నాగేటి కర్రులు) రేఖలమరె గహనాంతములన్(పొలాల్లో)' అంటూ ఎంతో అందంగా ఉత్ప్రేక్షించాడు. అవి తీపి గాయాలెందుకయ్యాయో చెబుతూ- వాటి తాకిడికి భూదేవికి పులకలు రేగాయి... ఆమె శరీరంపై రేగిన పులకాంకురాలే ఈ పచ్చని లేత పైర్లు... 'భూమి పులకములనగా మొలచి తలలెత్తి నిక్కుచు జాలువారె సస్యములు' అంటూ పోతన చక్కని బొమ్మ కట్టాడు. తొలకరి పలకరింతతో మొదలైన నేలతల్లి పులకరింత- సస్య శిశువు కేరింతలతో పరిపూర్ణతను సంతరించుకుంటుంది. వర్షరుతువును జీవరుతువు అనడానికి కారణం అదే. పాడిపంటలకు, సిరిసంపదలకు... అంతెందుకు- మనిషి మనుగడకే జీవనాధారమైంది వర్షరుతువు! ఆషాఢ, శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజాలు... నాలుగూ వార్షక మాసాలు. దాన్నే వానకారు అంటారు. వానకారులో వర్షపు నీటిని భూమి పీల్చుకొని సురభిళించడం, గర్భం ధరించడం, పైరును ప్రసవించడం ప్రకృతికే శోభను చేకూరుస్తుంది. కంకుల బరువుకు ఒరిగిన వరిపైర్లను కళ్లారా వీక్షించడమే నిజానికి గొప్ప(కన్నుల) పండుగ. 'కేదారంబులం పండి సోయగమై ఎన్నుల(వరి కంకుల) వ్రేగునన్ ధరణి మోయన్ వ్రాలె సస్యావళుల్' అంటూ కంకంటి పాపరాజు ఉత్తర రామాయణంలో వర్ణించింది ఆ అనుభూతినే! 'వర్షం వెళ్ళిపోయింది మబ్బుల రథాలెక్కి, జలదానం చేసిన మేఘాలకు జోహార్లు చెప్పాయి చరాచరాలు, భూమిలో ఉన్న ఓ చిన్నారి గింజ మెడ బయటపెట్టి, మొదట వచ్చిన రెండాకుల్ని చేతులుగా జోడించింది... కృతజ్ఞతతో...!' అన్న గుంటూరు శేషేంద్రశర్మ కవితలో చివరి పంక్తులు బోధపడితే- మనిషికి 'వర్షకళ' అంటే ఏమిటో తెలుస్తుంది.

గర్వంగా అరుస్తున్నందుకు కాదు, వర్షంగా కురుస్తున్నందుకు మేఘానికి గౌరవం దక్కుతోంది. 'అంబుదంబు ఉరిమిన యంతనే కురియకుండునె వర్షము లోకరక్షణ స్థిరతర పౌరుషంబున' అని మారనకవి భాస్కర శతకంలో వివరించింది దాని గురించే! మనిషి కబుర్లతో సరిపుచ్చడం కాదు, వాటిని చేతల్లోకి మార్చి లోకానికి మేలు చేసి చూపించాలి. మేఘం చేస్తున్న పని అదే. పురశ్శుక్ర యోగం ఏర్పడితే వర్షాలు బాగా పడతాయట. పురోంగార యోగం వల్ల అనావృష్టి దాపురిస్తుందట... 'పురోంగారేత్వనా వృష్టిః పురశ్శుక్రే ప్రవర్షతి' అంటూ జ్యోతిషశాస్త్రం వివరించింది. 'సారెకు మింటమేఘుడు...' పద్యంలో తనకు జలదాత అనే ఖ్యాతి లభించకుండా అడ్డుపడుతున్న అంగారకుణ్ని మేఘుడు నిరసించిన తీరును ఆముక్తమాల్యద వర్ణించింది. 'గ్రీష్మకాలే దావాగ్ని నా దగ్ధ ప్రదేశే అచిరకాలే వర్షర్తౌ వృష్టి పతనేన, భూయస్యః కోమల యుక్తాశ్చ ఓషధయః ప్రజాయన్తే... గ్రీష్మరుతువులో దావాగ్ని కారణంగా బూడిదగా మారిన చోటల్లా వర్షరుతువు కారణంగా కోమల ఔషధీలతలు, రోగ నివారణ వనమూలికలు పూర్వంకన్నా అధికంగా పుట్టుకొస్తాయి' అని వేదం విపులీకరించింది. అదీ వర్షాలతాలూకు పరమ ప్రయోజనం. అదే భూమికి సార్థక్యం! రుతుపవనాలు త్వరగా వస్తాయని కాని, వర్షపాతం బాగుంటుంది అని గాని వాతావరణ శాస్త్రజ్ఞులు ముందస్తు అంచనాలు వెలువరిస్తే చాలు- మనుషులకు ప్రాణాలు లేచొస్తున్నాయి. శుకసప్తతిలో కదిరీపతి చెప్పినట్లు 'అంబుధి(సముద్రాన్ని) తలక్రిందుగ బోర్లించి'నట్లో 'కడవల ఉదకంబు ముంచి తెచ్చి వంచిన గతి' అని మొల్లమాంబ చెప్పినట్లు వర్షాలు పడ్డాయో... ఇక పండుగే పండుగ!

సైద్ధాంతిక బలిమితోనే పటిష్ఠ చెలిమి

ప్రతిపక్షాల ఐక్యతా రాగం

> బలమైన పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలు ఏకమైతేనే దాన్ని గద్దె దింపగలం. – డాక్టర్ రాం మనోహర్ లోహియా

కర్ణాటక ముఖ్యమంత్రిగా కుమారస్వామి ప్రమాణ స్వీకార వేదిక ప్రతిపక్షాల ఐక్యత ఎంత వర్ణ రంజితంగా ఉంటుందో నిరూపించింది. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ రాష్ట్రాల ఉపఎన్నికల ఫలితాలు- ప్రతిపక్షాలు ఏకమైతే అజేయశక్తిగా కనిపిస్తున్న భాజపాను ఓడించడం అసాధ్యం కాదని రుజువు చేశాయి. పదకొండు రాష్ట్రాల్లో నాలుగు లోక్‌సభ, పదకొండు శాసనసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలను అంచనా వేయడానికి ఉపకరించడం విచిత్రమే కావచ్చు. కానీ అది వాస్తవం. మొత్తం 15 స్థానాలకు ఎన్నికలు జరిగితే భాజపా ఒక లోక్‌సభ, ఒక శాసనసభ స్థానాన్ని మాత్రమే గెలవగలిగింది. మిగతా అన్ని చోట్లా ప్రతిపక్షాలు విజయం సాధించాయి. ఈ ఫలితాల్లో మరో విశేషం- పశ్చిమ్‌బంగలో తృణమూల్, కేరళలో సీపీఐ(ఎం) తమ ప్రాబల్యాన్ని నిలబెట్టుకున్నాయి. పట్టు కోల్పోయిందల్లా భాజపానే! 2014లో భాజపా కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు సొంతంగా గాని, సంకీర్ణ ప్రభుత్వంలో గాని ఏడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండేది. ప్రస్తుతం 21 రాష్ట్రాల్లో చక్రం తిప్పుతోంది. 2014 తరవాత మొత్తం 10 లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే ఒక్క స్థానాన్ని మాత్రమే నిలబెట్టుకోగలిగింది. 2014లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొత్తం లోక్‌సభ స్థానాల్లో 73 చోట్ల గెలిచినప్పటికీ, తరవాత మూడు ఉప ఎన్నికల్లోనూ పరాజయం పాలైంది. ఉప ఎన్నికలకు ప్రధాని మోదీ భారీయెత్తున ప్రచారం చేసినా ఫలితం కనిపించ లేదు. గడువు ముగిసిన తరవాత అడ్డదారిలో ప్రచారం చేసినా, ప్రభుత్వ కార్యక్రమాలను పరోక్షంగా ప్రచారానికి వినియోగించుకున్నా ఫలితం దక్కలేదు. ఈ పరిస్థితిలో ఈ ఏడాది చివర రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికలు పార్టీకి నల్లేరుమీద నడక కాదు. పార్టీని ఎక్కువగా కుంగదీసింది యూపీలోని కైరానా స్థానంలో ఓటమి. అక్కడ విజయం కోసం సకల శక్తులూ ఒడ్డింది. సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి ప్రచారంలో కనిపించకపోయినా- రాష్ట్రీయ లోక్‌దళ్ అభ్యర్థి తబస్సుమ్ హసన్ విజయ బావుటా ఎగురవేయగలిగారు.

లోహియా సూత్రీకరణ

ప్రతిపక్షాల ఐక్యత విషయంలో అయిదు దశాబ్దాల క్రితం డాక్టర్ రాం మనోహర్ లోహియా చేసిన సూత్రీకరణ సత్యమని మరోసారి నిరూపితమైంది. 1967లో తొమ్మిది ఉత్తరాది రాష్ట్రాల్లో మొట్టమొదటిసారి అలా కాంగ్రెస్‌ను గద్దె దించగలిగారు. ఆ రాష్ట్రాల్లో సంయుక్త విధాయక్ దళ్ మంత్రివర్గాలు ఏర్పడ్డాయి. ఎమర్జెన్సీ తరవాత వామపక్షాలు మినహా ప్రతిపక్షాలన్నీ ఏకమై జనతాపార్టీగా ఏర్పడి కేంద్రంలో కాంగ్రెస్‌ను గద్దె దించాయి. ఇప్పుడు భాజపాను ఓడించాలన్నా విపక్షాల ఐక్యతే శరణ్యం. 1967లో, 1977లో ప్రాంతీయ పార్టీలకు ఇప్పుడున్న ప్రాబల్యం లేదు. 1989 నుంచి ప్రతిపక్షాల ఐక్యతలో అవి కీలకపాత్ర పోషిస్తున్నాయి. విపక్షాల ఏకసూత్రత- కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని గద్దె దించడమే. 1989లో, 1996 తరవాత కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 1989లో రాజీవ్‌గాంధీని గద్దె దించడంలో విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ కీలకపాత్ర పోషించారు. అటు భాజపా, ఇటు వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలు, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానికి అండగా నిలిచాయి. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడూ ప్రాంతీయ పార్టీలే చక్రం తిప్పాయి.

తాము చీలికలు పేలికలుగా ఉండటం వల్లే భాజపా విజయం సాధిస్తుందన్న వాస్తవాన్ని విపక్షాలు చివరకు గుర్తెరిగాయి. ఇటీవలి కాలంలో ప్రాంతీయ పార్టీలు ఏకమై మూడో ఫ్రంట్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి. తాజా ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాల విజయం వెనక మూడో ఫ్రంట్ పాత్ర ఏమీ లేదు. కానీ, ప్రతిపక్ష ఐక్యతా సూత్రం ఉపకరించింది. ప్రతిపక్షాల ఐక్యత 'అరాచకవాదుల'తో కూడుకున్నదని, 'కాల్పనికమైంది' అని, 'కలగూరగంప' లాంటిదని దెప్పిపొడిచినా- బలంగా కనిపించే భాజపాను ఓడించడానికి ఆ ఐక్యతే కారణమైంది. ప్రతిపక్షాల్లో ఏకశ్రుతి లేదని, వాటిలో కొన్ని అవసరార్థం సిద్ధాంతాలను మార్చగలవని అరుణ్ జైట్లీ లాంటివారు చురకలు వేసినా- ఫలితాలు అనుకూలంగానే ఉన్నాయి.

1977లో కాంగ్రెస్‌ను ఓడించడానికి భారతీయ జనసంఘ్ సైద్ధాంతికంగా తమకు ఏమాత్రం పొసగని సోషలిస్టులతో కలిసే జనతాపార్టీ ఏర్పాటులో భాగస్వామి అయింది. 1989లో రాజీవ్‌గాంధీని గద్దె దించాలన్న లక్ష్యంతో వీపీ సింగ్‌కు భాజపా వెలుపలి నుంచి మద్దతిచ్చింది. అదే పని వామపక్షాలూ చేశాయి. మెహబూబా ముఫ్తీ నాయకత్వంలోని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ జిహాదీల కొమ్ము కాస్తుందని ఒకప్పుడు తూర్పారబట్టిన భాజపా, ఇప్పుడు ఆ పార్టీతోనే కశ్మీర్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. భాజపాకు సైద్ధాంతికంగా చేరువైంది శివసేన ఒక్కటే. ఈ రెండు పార్టీల మధ్య సుదీర్ఘంగా కొనసాగిన పొత్తు ఇప్పుడు వికటించింది. నేషనల్ ఫ్రంట్ 1989లో ఏర్పడినప్పుడు మూడు శిబిరాలవారు ఏకమయ్యారు. సోషలిస్టులు, మాజీ కాంగ్రెస్‌వాదులు ఒక శిబిరంగా, భాజపా మరో శిబిరంగా, కమ్యూనిస్టులు ఇంకో శిబిరంగా ఉన్నా ఆచరణలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వీపీ సింగ్‌కు ఇవి మద్దతు ఇచ్చాయి. మొదట సోషలిస్టులు, మాజీ కాంగ్రెస్‌వాదులు కలిసి జనతాదళ్ ఏర్పాటు చేశారు. ఆ తరవాత నేషనల్ కాన్ఫరెన్స్, తెలుగుదేశం వంటి ప్రాంతీయ పార్టీలతో కలిసి నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు.

1977 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

మొత్తం స్థానాల సంఖ్య: 545

(ఓటింగ్ శాతం: 60.49)

మొరార్జీ దేశాయ్

పార్టీ	స్థానాలు	ఓట్ల శాతం
జనతా పార్టీ	295	41.32
కాంగ్రెస్	154	34.52
సీపీఐ (ఎం)	22	4.29
సీపీఐ	7	2.82
సీఎఫ్‌డీ(జగ్జీవన్)	13	5.28
ఏఐఏడీఎంకే	18	2.9
అకాలీదళ్	9	1.26
స్వతంత్రులు	9	5.5
ఇతర పార్టీలు	18	---

1989లో ప్రధాన పక్షాల బలాబలాలు

పార్టీ	స్థానాలు	ఓట్ల శాతం
నేషనల్ ఫ్రంట్	143	17.78
భాజపా	85	11.36
కాంగ్రెస్	197	39.53
సీపీఐ	12	2.57
సీపీఐ (ఎం)	33	6.55

1996లో ప్రధాన పక్షాల బలాబలాలు



పార్టీ	స్థానాలు	ఓట్ల శాతం
భాజపా+	161	20.29
కాంగ్రెస్	140	28.80
వామపక్షాలు	52	9.10
నేషనల్ ఫ్రంట్	79	14.43

(జనతాదళ్ 46, ఎస్పీ 17, టీడీపీ 16)

యునైటెడ్ ఫ్రంట్ కూటమి ఆవిర్భావం

కూటమి స్థానాలు: 192

భాగస్వాములు: నేషనల్ ఫ్రంట్ 79, వామపక్షాలు 52, టీఎంసీ (తమిళనాడు) 20, డీఎంకే 17, ఏజీపీ 5, ఇతరులు 19

కూటమికి వెలుపలి నుంచి మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 140

1967 నాటి సంయుక్త విధాయక్ దళ్: భారతీయ క్రాంతిదళ్, సంయుక్త సోషలిస్ట్ పార్టీ, ప్రజా సోషలిస్ట్ పార్టీ, జనసంఘ్

చేజిక్కించుకున్న రాష్ట్రాలు: బిహార్, యూపీ, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ్ బంగ, ఒడిశా, మద్రాసు, కేరళ

ప్రతిపక్షాల ఐక్యత ఎన్నికలకు ముందు ఉండాలా, తరవాత ఉండాలా అన్నది ప్రశ్న. 1989లో నేషనల్ ఫ్రంట్ ఎన్నికలకు ముందే ఏర్పాటయింది. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ఎన్నికల అనంతరం రూపుదిద్దుకుంది. ఇటీవల కర్ణాటకలో జేడీ(యు), కాంగ్రెస్ ఫ్రంట్ సైతం ఎన్నికల తరవాత ఆవిర్భవించింది. జాతీయస్థాయి కూటముల్లో ప్రాంతీయపార్టీలు ఒకసారి ఒక వైపు, మరోసారి మరోవైపు ఉన్న సందర్భాలూ కోకొల్లలు. ప్రాంతీయ పార్టీలకు తమ అస్తిత్వమే ప్రధానం. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దానితో మైత్రి కోసం అవి వెంపర్లాడటం, కుదరనప్పుడు వేరుకుంపటి పెట్టడం సహజ పరిణామం. తమిళనాడులో ఏఐఏడీఎంకే, డీఎంకే రెండు ప్రధాన పక్షాలతో వేర్వేరు సందర్భాల్లో కత్తు కలిపిన సందర్భాలూ ఉన్నాయి. పంజాబ్‌లో అకాలీదళ్, కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ వ్యవహార సరళీ అదే. తృణమూల్ కాంగ్రెస్, లాలూ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ చాలావరకు లౌకిక విధానాలకు కట్టుబడే ఉన్నాయి. నితీశ్ కుమార్ నాయకత్వంలోని జనతాదళ్ (యు), తెలుగుదేశం అటూ ఇటూ భుజం మార్చుకున్నాయి. ప్రతిపక్షాల ఐక్యత అధికారపక్షాన్ని గద్దెదించడమే పరమావధిగా సాగింది. నిర్దిష్టమైన దిశానిర్దేశం లేని ఐక్యత దీర్ఘకాలం సాగదని పలుసార్లు రుజువైంది. ఇప్పుడూ ఉపఎన్నికల ఫలితాలు ఒక రకమైన ప్రతిపక్ష ఐక్యత ప్రయోజనాన్నే నిరూపించాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, మమతా బెనర్జీ వంటివారు ఊహిస్తున్న ఐక్యత పరిమితమైన ప్రయోజనాలను ఉద్దేశించింది కాదు. అది జాతీయస్థాయిలో చేస్తున్న ప్రయత్నం. నాయకులు తలా ఒకవైపు లాగడం వల్ల విపక్షాల ఐక్యత మూణ్నాళ్ల ముచ్చట అవుతుందని, సంకీర్ణ ప్రభుత్వాలు సుస్థిరంగా ఉండవని, మంత్రివర్గాల్లో అనర్హులకు పదవులు దక్కుతాయని వాదించే వారుంటారు. మోదీ బలమైన నాయకుడు కనుక మొదటి అనుమానానికి ఆస్కారం లేకపోలేదు. రెండు పక్షాల తరఫునా బలమైన నాయకులు ఉంటేనే సమఉజ్జీలుగా ఉంటారన్న నమ్మకంతోనే ఈ వాదన చేస్తుంటారు. ఈ వాదన చేసేవారు మనది అధ్యక్ష తరహా పాలన కాదని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అన్న వాస్తవాన్ని విస్మరిస్తుంటారు. స్వతంత్ర భారత చరిత్రలో నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, వాజ్‌పేయీ, నరేంద్ర మోదీలనే ముందుగా ప్రధాని అభ్యర్థులుగా ప్రకటించారు.

అసంబద్ధ వాదనలు

1989లో రాజీవ్‌ను గద్దె దించాలనుకున్నప్పుడు వీపీ సింగ్ పేరు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చిన మాట నిజమే. కానీ ఆయన పేరునే స్పష్టంగా ఎవరూ ప్రకటించలేదు. దేవీలాల్‌ను జనతాదళ్ తమ నాయకుడిగా ఎన్నుకుంది. అయినప్పటికీ దేవీలాల్, వీపీ సింగ్ పేరు ప్రతిపాదించగా ఆయనే ప్రధాని అయ్యారు. 2004లో యూపీఏ విజయం సాధించినప్పుడు మన్మోహన్ సింగ్ పేరు ప్రచారంలో లేదు. విచిత్రం ఏమిటంటే- సంకీర్ణ ప్రభుత్వానికి సుదీర్ఘకాలం నాయకత్వం వహించిన ఏకైక నాయకుడాయన. సంకీర్ణ ప్రభుత్వాలకు సుస్థిరత ఉండదన్నది రెండో అనుమానం. 1996 నుంచి 1998 మధ్య యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాములో రాజకీయ అరాచకం రాజ్యమేలిందనేవారూ ఉన్నారు. అయితే ఆ సమయంలో స్థూల జాతీయోత్పత్తి, వృద్ధిరేటు తగ్గలేదు. దేశం కుప్పకూలలేదు. ఏ దేశమూ మనపై దాడి చేయలేదు. మతకలహాలు పెచ్చరిల్లలేదు. అప్పట్లోనే భారత సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి రెక్కలొచ్చాయని గుర్తుంచుకోవాలి. సంకీర్ణ ప్రభుత్వాల వల్ల అరాచకం ప్రబలిపోతుందనడంకన్నా, మంత్రివర్గ నిర్ణయాలు అరాచకానికి దారితీసే పరిస్థితులే ఎక్కువగా ఉంటాయి. అనర్హులకు మంత్రిపదవులు దక్కడం సంపూర్ణమైన మెజారిటీ ఉన్నప్పుడూ జరిగేదే. మోదీ మంత్రివర్గంలో స్మృతి ఇరానీ, బాబుల్ సుప్రియో, మహేశ్ శర్మ లాంటివారు రేపుతున్న కలకలం మెజారిటీ తగ్గడంవల్ల కాదు- అనర్హులను అందలం ఎక్కించినందువల్లే!

ప్రతిపక్ష ఐక్యతవల్ల ప్రయోజనం ఉన్నా సరైన దిశానిర్దేశం లేకపోతే, సిద్ధాంత బలిమి కొరవడితే అది తాత్కాలిక ప్రయోగంగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. మూడో ఫ్రంట్, ఫెడరల్ ఫ్రంట్ లాంటి ప్రయత్నాలన్నీ నిజమైన ప్రత్యామ్నాయానికి అందనంత దూరంలోనే ఉన్నాయి. అరకొర ప్రయత్నాలేవైనా, అరుణ్ జైట్లీ అంటున్నట్లు 'ఓటు బ్యాంకు రాజకీయాలకు' పరిమితం కాక తప్పదు. ప్రతిపక్ష ఐక్యత తక్షణావసరమైతే మోదీ విధానాలకు ప్రత్యామ్నాయం చూపించగలగాలి. అభివృద్ధి సాధన నినాదప్రాయం కాకూడదు. అభివృద్ధి ఫలాలు ఏ కొద్ది మందికో కాక, సామాన్య జనానికి దక్కాలి. ఐక్యత అనివార్యం అనుకున్నా ఆ బాటలో అడ్డంకులు ఉన్నాయి. వీటిని పరిష్కరించే ఐక్యతే మనగలుగుతుంది. ఐకమత్యం అంటే అందరూ ఒకే ధోరణిలో మాట్లాడటం కాదు- ఒకే బాటలో ప్రయాణించడం!

– ఆర్వీ రామారావ్

అవినీతి కాలుష్య మండళ్లు

అవినీతి సర్వాంతర్యామి అని ప్రధానిగా ఇందిర సూత్రీకరించేనాటికే అది దేశంలో వ్యవస్థీకృతమైపోయింది. సంక్షేమ పథకాలకు కేటాయించే ప్రతి రూపాయిలో 15 పైసలే సామాన్య లబ్ధిదారుడికి చేరుతోందని ఆమె తనయుడు రాజీవ్ నిష్ఠుర సత్యం పలికేనాటికి- అవినీతి నిరుపేదల కడుపుకొట్టే స్థాయికి ఎదిగింది. పిమ్మట ఈ మూడు దశాబ్దాల్లో అవినీతి రంగు రుచి వాసన జనసామాన్యం అందరికీ తెలిసొచ్చేలా పాలన వ్యవస్థ ఎంతగానో పురోగమించింది. డ్రైనేజీ మురుగు జత కలిసి నల్లాల్లో వచ్చే తాగునీరు రంగు మారిపోయిందా? కంటికి నదరుగా ఉన్నాయని కొనుక్కొచ్చిన అరటి, మామిడి పళ్లు రుచీపచీ లేకుండా ఉన్నాయా? సమీప పరిశ్రమల పొగ గొట్టాల విషధూమ కాలుష్యం ముక్కుపుటాలు అదరగొడుతోందా?... వాటన్నింటికీ కారణం- ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటైన సర్కారీ యంత్రాంగాలు అవినీతి మడుగులో ఈదులాడుతుండటం. తమిళనాడులోని తూత్తుకుడిలో పేలిన కరకు పోలీసు తూటా సాక్షిగా అదే, పచ్చినిజం.

కళ్లు తెరచి కనరా, సత్యం ఒళ్లు మరచి వినరా, సర్వం నీకే బోధపడురా... అని ఓ సినీకవి దశాబ్దాల క్రితమే చెవినిల్లు కట్టుకొని పాడారు. కాలుష్యం అనేది కాలకూట విషమేనని, అది గాలి నేల నీరులో కలిస్తే పెను సామాజిక ఉపద్రవం తప్పదన్న గ్రహింపుతోనే కేంద్రస్థాయిలో ఒకటి, దిగువన రాష్ట్రానికి ఒకటిగా కాలుష్య నియంత్రణ మండళ్లను ఏర్పాటు చేశారు. ఏ పరిశ్రమ అయినా విష కాలుష్య వ్యర్థాల్ని ఎవ్వరికీ ఏ చెరుపూ చెయ్యనివిధంగా, ప్రకృతి వనరుల్ని కలుషితం చెయ్యకుండా శాస్త్రీయ పద్ధతిలో వదిలించుకొనేలా సరైన సాంకేతిక పరిజ్ఞాన వినియోగం సక్రమంగా సాగేలా చూడటం వాటి విధి. కానీ, అవినీతి మైకంలో వాటి కళ్లు మూతలు పడిపోయి, 'మా బాధలు ఇవీ మహాప్రభో' అని జనం మొరపెట్టుకొన్నా ఏమీ పట్టించుకోనంతగా ఒళ్లు మరచిపోయిన కాలుష్య నియంత్రణ మండలి నిర్వాకమే- స్టెరిలైట్ రాగి పరిశ్రమ వ్యతిరేక ఆందోళన హింసాత్మకం కావడానికి, 13 నిండు ప్రాణాలు బలికావడానికి కారణభూతమైంది. స్టెరిలైట్ పరిశ్రమ వల్ల పర్యావరణ హాని జరిగిఉంటే ఎవరైనా దాన్ని నిరూపించవచ్చునని ఆ సంస్థకు పెద్దదిక్కు అయిన వేదాంత గ్రూప్ అధినేత అనిల్ అగర్వాల్ సవాళ్లు రువ్వుతున్నారు. పిల్లి గుడ్డిదైతే... అన్నట్లుగా కాలుష్య నియంత్రణ మండళ్లు కాసుల మైకంలో కళ్లు మూసుకొన్నంత కాలం- ప్రమాదకర విషవ్యర్థాలతో సామాన్యజనం ప్రాణాల్ని కబళిస్తూ పారిశ్రామిక సంస్థలు అలా ఎగిరెగిరిపడుతుంటాయని చెప్పక తప్పదు.

రెండు రాష్ట్రాల తిరస్కరణకు గురైన స్టెరిలైట్ రాగి పరిశ్రమ 1997లో తూత్తుకుడిలో ప్రారంభమైనప్పటి నుంచే సమీప గ్రామాల ప్రజలు తీవ్రాందోళన వ్యక్తీకరిస్తూ వచ్చారు. రాగి తవ్వకాలతో భూగర్భ జల సంక్షోభం ముమ్మరిస్తోందని, విష వ్యర్థాలను నిష్పూచీగా పారబోస్తుండటంతో జలవనరులు కలుషితం అవుతున్నాయని, అడపాదడపా గ్యాస్ లీకేజీలతో గాలి సైతం పీల్చలేని దుస్థితి దాపురించిందని స్థానికులు చిరకాలంగా మొత్తుకొంటున్నారు.

తూత్తుకుడిలో ప్రజా నిరసన

పుణ్యభూమి

2013లో గ్యాస్ లీక్ నేపథ్యంలో పరిశ్రమ మూసివేతకు జయ సర్కారు ఆదేశించినా, జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆ ఉత్తర్వులకు చెల్లుకొట్టింది. 2013 నుంచి గాలిలో భారలోహాల సాంద్రత, భూగర్భ జల నాణ్యత విశ్లేషణల్ని స్టెరిలైట్ అందించలేదంటూ ఇంత జరిగాక ఇప్పుడు దాని నిర్వహణ అనుమతుల్ని కాలుష్య మండలి రద్దు చేసిందిగాని, ఈ మధ్యకాలంలో మూడుసార్లు పరిశ్రమ కొనసాగడానికే ఓటేసి తరించిపోయింది. ఈ కర్మాగారానికి సమీపంలోని 15 ప్రదేశాల నుంచి సేకరించిన నీటి నమూనాల్లో సీసం వంటి హానికర న్యూరో టాక్సిన్లు సురక్షిత స్థాయికి మించి 39-55 రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. పరిశ్రమకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సిల్వర్‌పురం అనే కుగ్రామంలో ఇంటికో క్యాన్సర్ రోగి ఉన్నాడంటే, అది సృష్టించిన సామాజిక విధ్వంసానికి వేరే ఉదాహరణలెందుకు? ఇంతటి అరాచకానికి పేరు గొప్ప కాలుష్య నియంత్రణ మండళ్లదే బాధ్యత అనడంలో ఏ మాత్రం సందేహం లేదు!

'పరిశ్రమయేవ జయతే' అంటూ దేశప్రగతి సాధకాలుగా వాటిని గుర్తించి ప్రోత్సహించాలనడంలో మరో మాట లేకపోయినా- సామాజిక స్వస్థతకు, ఆర్థిక ప్రగతి వాహకాలుగా వాటిని తీర్చిదిద్దడంలో ఏ మాత్రం అలసత్వమైనా ఎంతటి అనర్థ హేతువవుతుందో తెలియనిది కాదు. 1984 డిసెంబరులో భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి వెలువడిన దాదాపు 40 టన్నుల మిథైల్ ఐసోసైనేట్ విషవాయువు సృష్టించిన మారణహోమం ఏ నాటికీ మరపునకు రాదు. సర్కారీ లెక్కల ప్రకారమే 5,295 మంది ప్రాణాలు బలిగొన్న నాటి వైపరీత్యం ఏకంగా అయిదు లక్షల 28 వేలమందిని పలు విధాలుగా దెబ్బతీసింది. ఆ ఘోరకలి నేటికీ తన విష ప్రభావం చూపుతూనే ఉందంటే, ప్రమాదకర పరిశ్రమల విషయంలో ఎన్నెన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందో బోధపడుతుంది. ప్రధానంగా వాయు, నీటి నాణ్యతల పరిరక్షణే ప్రధాన బాధ్యత అయిన కాలుష్య నియంత్రణ మండళ్లు- పరిశ్రమలు ఎక్కడ ఏర్పాటు కావాలన్నదానితోపాటు వ్యర్థాలశుద్ధి ప్రక్రియల వంటివాటిపైనా ఎప్పటికప్పుడు తనిఖీలతో పహరా కాస్తుండాలి. కానీ జరుగుతున్నదేమిటి? దేశంలో 2,672 అత్యంత కాలుష్య భరిత పరిశ్రమలున్నాయని, వాటిలో 1,551 కాలుష్య నిబంధనల్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పుష్కరకాలం నాడు కేంద్ర మండలే కుండ బద్దలుకొట్టింది. చిన్న, మధ్య తరగతి పరిశ్రమల వల్లే ఇండియాలో 70 శాతం దాకా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందని సంబంధిత మంత్రిత్వశాఖ స్పష్టీకరించింది. లొసుగులు కనిపెట్టడంతోనే బాధ్యత తీరిపోయినట్టు- కాలుష్య మండళ్లను దారినపెట్టే విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నోరెత్తితే, ఒట్టు!

'అయిదేళ్లలో ఏ ఒక్క కాలుష్యకారక పరిశ్రమపైన గాని, ప్రభుత్వ సంస్థ మీదగాని చర్య తీసుకున్నారా?'- 2015 డిసెంబరులో దిల్లీ హైకోర్టు సంధించిన సూటి ప్రశ్న ఇది. కనీసం ఒక్క తాకీదు సైతం ఇవ్వని నిష్క్రియాపరత్వాన్ని నిలదీస్తూ ఏ ఒక్కరికి శిక్ష పడినా తక్కిన ఉల్లంఘనలు అసలు చోటుచేసుకొనేవే కాదని కోర్టు నిష్ఠుర సత్యం పలికింది. నిరుడీ రోజుల్లో కేంద్ర పర్యావరణ మంత్రి తనవంతుగా కాలుష్య నియంత్రణ మండళ్లలో అవినీతి కశ్మల ప్రక్షాళన జరగాలని పిలుపిచ్చారు. అంతటితోనే మంత్రి సత్తములు స్వీయబాధ్యత తీరిపోయిందనుకొన్నారు. అన్ని రకాల అవినీతికీ తల్లివేరు అయిన రాజకీయ అవినీతి కాలుష్య నియంత్రణ మండళ్లనూ చుట్టుముట్టేసింది. పర్యావరణ రంగంలో అర్హుల్ని, విశేష జ్ఞాన సంపన్నుల్ని కాలుష్య మండళ్లకు పెద్దదిక్కుగా నియమించాలన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాల్ని కాలదన్ని ఒక్కోచోట అయితే పదో తరగతి అర్హతగా గద్దెనెక్కించిన వైనాలు, ఆయా పదవుల్ని రాజకీయ గద్దలే ఆక్రమించిన బాగోతాలు లెక్కకు మిక్కిలిగా పోగుపడ్డాయి. దాన్నిబట్టి తెలియడం లేదా- జనం ప్రాణాల్ని టోకున హరిస్తున్న పరిశ్రమలకు ప్రాణవాయువులు అందిస్తున్నదెవరో! కాలుష్య నియంత్రణ మండళ్లను సొంతం ప్రక్షాళించి అవి నిబంధనల్ని కచ్చితంగా అమలుచేసేలా చూడకపోతే- భోపాల్, తూత్తుకుడి మరెన్నిచోట్ల అభాగ్య జనం ప్రాణాల్ని బలిగొంటాయో! ఏమంటారు?

– పర్వతం మూర్తి

సాలె పురుగు

సృష్టిలో ఎనభై ఏడు లక్షల రకాల ప్రాణులున్నాయని పాశ్చాత్య శాస్త్రజ్ఞుల ప్రస్తుతపు అంచనా. జంతుజాతులు సుమారు డెబ్బై ఎనిమిది లక్షలు, వృక్షజాతులు సుమారు మూడు లక్షలు. ఇవికాక శిలీంధ్రాలు, సూక్ష్మజీవులు, క్రిములూ వంటివెన్నో.

ఈ ప్రాణులన్నీ తలా ఒక నీతికథలా మనిషికి ఎలా జీవించాలో, ఎలా జీవించకూడదో నేర్పుతాయి. ప్రకృతి విశ్వవిద్యాలయంలో ప్రాణులన్నీ మనిషికి పాఠాలు నేర్పగల ఆచార్యవర్గమే!

మనిషి జాతిని ప్రాణికోటిలో అగ్రస్థానంలో కూర్చోబెట్టింది- ఆ జాతికి ఉన్న తెలివి తేటలే అనేది నిర్వివాదాంశం. ఆ తెలివితేటల్లో అతి ముఖ్యమైనవి తెలియని విషయం నేర్చుకొనే శక్తి, నేర్చుకోవాలన్న జిజ్ఞాస. ప్రకృతి ప్రాణికోటిని మనిషికి బోధకులుగా మాత్రమే సృష్టించకపోయినా, సకల చరాచరాలను, స్థావరజంగమాలను తనకు గురువుగా భావించి, ప్రయోజం పొందే వివేకం మానవజాతికి ఉన్నది.

రాబర్ట్ బ్రూస్ స్కాట్లాండ్ దేశానికి రాజుగా ఉండే రోజుల్లో- బలవత్తరమైన పొరుగుదేశం ఇంగ్లాండ్, స్కాట్లాండ్ మీద దండెత్తి విజయం సాధించింది. తన రాజ్యం తిరిగి గెలుచుకోవటానికి బ్రూస్ కొద్దిపాటి సైన్యంతో ఆరుసార్లు యుద్ధం చేసి ప్రతిసారీ ఘోరంగా ఓడిపోయాడు. ఒకరోజు అడవిలో పాడుబడ్డ కుటీరంలో పడుకొని పైకప్పు చూస్తూ తన దుస్థితి సమీక్షించుకొంటుండగా, ఒక సాలెపురుగు కనిపించింది. అది గూడుకోసం ఒక దూలం నుంచి మరొక దూలం దాకా దారపుపోగు లాగే ప్రయత్నం చేస్తున్నది. ఆ ప్రయత్నంలో ఆ అల్పజీవి ఆరుసార్లు విఫలమైంది. తన కంటే అధ్వానంగా ఉన్న దాని అవస్థ చూసి బ్రూస్‌కు గుండె కరిగిపోయింది. సాలెపురుగు మాత్రం ఉత్సాహం వదలకుండా, ఏడోసారి ప్రయత్నించి విజయం సాధించింది. రాజు ఏడోసారి ఇంగ్లాండ్ సైన్యం మీద దాడిచేసి తన రాజ్యం తిరిగి గెలుకోవడం- పాశ్చాత్య దేశాల్లో అందరికీ స్ఫూర్తిదాయకమైన కథగా ఈ నాటికీ నిలిచిఉంది.



అంతర్యామి

సాలీడు (లూత, చెలది, చెలగం, శ్రీ, ఊర్ణనాభి అని దీనికి పర్యాయపదాలు) చిన్న కీటకాలను పట్టి తినేందుకు వల పన్నుతుంది. గూడు కట్టడంలో, వల పన్నడంలో ఎంతో ఓర్పును, నేర్పును, సృజనాత్మకతను చూపుతుంది. మనిషికున్నంత పెద్ద శరీరం, మెదడు వాటికి లేవుగానీ, ఉంటే- సాలీళ్ళు... ఎన్ని తాజ్‌మహళ్లు కట్టి చూపేవో!

మనిషికి సాలెపురుగు ఆధ్యాత్మిక మార్గదర్శనం కూడా చేసే కథ 'కాళహస్తి మాహాత్మ్యం' కావ్యంలో కనిపిస్తుంది. స్వర్ణముఖీ తీరంలో మారేడు చెట్టు మీద ఒక సాలెపురుగు ఉండేది. ఒక రోజు ఓ భక్తుడు శివపూజ కోసం మారేడు దళాలు కోసుకొని సమీపంలో శివాలయానికి తీసుకెళ్ళాడు. ఆ దళాలను అంటిపెట్టుకొని ఉన్న సాలె పురుగూ యాదృచ్ఛికంగా శివాలయానికి చేరింది. శివుడి దర్శనం కాగానే పూర్వజన్మల సంస్కారం వల్ల శివభక్తి తత్పరమైపోయింది. 'దేవా! నేను అల్పప్రాణిని. స్తుతులు, స్తోత్రాలు రావు. వేదశాస్త్రాలు తెలియవు. తెలిసి ఉంటే, అనాది మధ్యలయుడివైన నీ తత్వం వాటి ద్వారా బోధపడేది కాదు గదా! అందుకే నాకు చేతనైన కైంకర్యం చేసి, నీ పాదాలు కొలుచుకొంటాను!' అన్న భావనతో తన తంతువులతో స్వామి కళ్ళెదుట అందమైన ప్రాకారాలు, గోపురాలు, అంతఃపురాలు, క్రీడాశాలలు, మండపాలు కట్టి పెట్టింది.

దాన్ని పరీక్షించేందుకు ఆ కాళహస్తీశ్వరుడు ఆలయ దీపాల జ్వాలలతో సాలీడు సృష్టినంతా అగ్గిపాలు చేశాడు. దాంతో అదుపులేని ఆగ్రహంతో సాలీడు దీపాన్ని మింగేయడానికి పైకి దూకింది. శివుడు దాని భక్తికి మెచ్చుకొని దాన్ని తన చేతులతో రక్షించి, తనలో చేర్చుకొని శివ సాయుజ్యం ప్రసాదించాడు.

భగవంతుడు భక్తి శ్రద్ధలకు వశుడవుతాడు గాని, భాషాజ్ఞానానికి, బాహ్యాటోపాలకు లొంగడని చెలది కథ చెప్పే నీతి. అహంకారం, అవినయం, అన్యులను చులకన చేయడం బుద్ధిశాలుల లక్షణాలు కావు. బుద్ధిహీనతకు తార్కాణాలు అని శాస్త్రాలు బోధిస్తాయి. ప్రకృతి ప్రతి రోజూ, ప్రతి ప్రాణి ద్వారా మనకు నేర్పే పాఠం కూడా ఇదే!

– మల్లాది హనుమంతరావు

అమరావతిలో అవయవ మార్పిడి ఆసుపత్రి

- ముందుకొచ్చిన భారత్ వర్సిటీ
- ముఖ్యమంత్రిని కలిసిన ఛాన్స్‌లర్

ఈనాడు డిజిటల్, అమరావతి: అవయవాల మార్పిడికి సంబంధించిన ఆసుపత్రిని అమరావతిలో నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని అవయవ మార్పిడి నిపుణుడు, భారత్ విశ్వవిద్యాలయం(చెన్నై) ఛాన్స్‌లర్ మహ్మద్ రేలా ముఖ్యమంత్రికి తెలిపారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, గర్భాశయం వంటి ప్రధాన అవయవాలను మార్పిడి చేసే స్థాయిలో ఆసుపత్రిని నెలకొల్పుతామని వివరించారు. భారత్‌లో ఇలాంటి ఆసుపత్రి లేదని, అంతర్జాతీయ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి అమరావతిలో నిర్మించే ఈ సంస్థకు పదెకరాల భూమి అవసరమవుతుందని వివరించారు. శనివారం ఉండవల్లిలోని సీఎం నివాసం వద్దనున్న ప్రజాదర్బార్ హాలులో డాక్టర్ రేలా ముఖ్యమంత్రిని కలిశారు. ప్రతిపాదనకు సంబంధించిన సమగ్ర వివరాలతో వస్తే పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి డాక్టర్ రేలాకు హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ వర్సిటీలో స్వయం పోషక ఇంజినీరింగ్ కోర్సులు

ఈనాడు, అమరావతి: డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచి స్వయం పోషక ఇంజినీరింగ్ కోర్సులను ప్రవేశపెడుతూ ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. కంప్యూటర్ సైన్సు, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచిలను ప్రవేశపెడుతున్నారు.

ప్రకృతి సేద్యం రాష్ట్రవ్యాప్తం

- సాంకేతిక పరిజ్ఞానంతో సాగు అనుసంధానం
- ప్రకృతి వ్యవసాయ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు – అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ప్రకృతి సేద్యంపై ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రభుత్వ సలహాదారు విజయకుమార్, సిఫ్ అధ్యక్షుడు సత్య త్రిపాఠి తదితరులు

'పెట్టుబడి రహిత ప్రకృతి సేద్యానికి నాయకత్వం వహించే సత్తా ఆంధ్రప్రదేశ్ రైతులకు ఉంది. 2024 నాటికి రాష్ట్రం మొత్తాన్ని ప్రకృతి సేద్యం పరిధిలోకి తీసుకొచ్చి పెట్టుబడి రహిత సాగులో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 2024 నాటికి రాష్ట్రంలో 60లక్షల మందిని ప్రకృతి సేద్య రైతులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందుకు రూ.16వేల కోట్ల నిధులు అవసరమవుతాయని, ఆ నిధుల సమీకరణకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రకృతి సాగుకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు, ఆర్థిక సాయం, ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యం కోసం ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం ఆధ్వర్యంలోని సస్టెయినబుల్ ఇండియా ఫైనాన్స్ ఫెసిలిటీతో(ఎస్ఐఎఫ్ఎఫ్- సిఫ్) రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని రైతు సాధికార సంస్థ అవగాహనా ఒప్పందం చేసుకోవడం చరిత్రాత్మకమని ముఖ్యమంత్రి వెల్లడించారు. శనివారం గుంటూరు జిల్లా కాజ గ్రామ సమీప జైబెల్ మిషన్ స్థలంలో పెట్టుబడిలేని ప్రకృతి సాగు రైతు శిక్షకుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగానే ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు విజయ కుమార్, ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం కార్యనిర్వాహక సంచాలకుడు ఎరిక్ సోల్‌హెమ్ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. ఇప్పటి నుంచి ప్రకృతి సేద్యం విస్తరణను దీక్షగా తీసుకుంటున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో 1.63 లక్షల మంది 68వేల హెక్టార్లలో ప్రకృతి సేద్యం చేస్తున్నారని, 2018లో 5లక్షల మంది ప్రకృతి రైతులను తయారు చేస్తామని తెలిపారు. ప్రపంచ ప్రకృతి సేద్యానికి అంబాసిడర్‌గా ద్వారా మహిళలను తీర్చిదిద్దుతామని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ బాధ్యతలను తీసుకుని నడిపిస్తానని తెలిపారు. సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని సాగుతో అనుసంధానం చేసి ముందుకు తీసుకెళ్తామని వివరించారు. వినియోగదారులు తీసుకునే ఆహారం ఏ పొలం నుంచి వచ్చిందో? ఏ రైతు పండించారో తెలుసుకునే విధానాన్ని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రకృతి సాగు చేపట్టే... ఫలితాలు చూపి.. పది మందికి చెప్పడానికి సమగ్ర ఫలితాలు... సాక్ష్యాలు కావాలని, అది ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉందని ఎరిక్ సోల్‌హెమ్ ప్రశంసించారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి పట్నాయక్, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద బాబు, ఎమ్మెల్యే రావెల కిషోర్ బాబు, ఎమ్మెల్సీ రామకృష్ణ, జిల్లా కలెక్టర్ కోన శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ, కుట్ర, మోసం కేసులో...

ఎమ్మెల్యే అనుచరుడు మాగంటి బాబు, మరొకరి అరెస్టు

విజయవాడ, న్యూస్‌టుడే: ఫోర్జరీ, కుట్ర, మోసం తదితరాలకు పాల్పడిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అనుచరుడు మాగంటి బాబు, అతనికి సహకరించిన కాశినేని వాసులను నున్న గ్రామీణ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. జగ్గయ్యపేటకు చెందిన లీలా సుబ్రహ్మణ్యేశ్వరరావు వ్యవసాయదారు. ఈయనకు బావ వరసైన జగ్గయ్యపేటకు చెందిన కాశినేని వాసు(47), ఆయన స్నేహితుడు గాయత్రినగర్ వాసి మాగంటి బాబు(35)కు సుబ్రహ్మణ్యేశ్వరరావు నుంచి రూ.34 లక్షలు అప్పుగా ఇప్పించారు. 2013లో బాబు ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో బాధితుడు జగ్గయ్యపేట కోర్టును ఆశ్రయించారు. దీంతో వారెంట్లు జారీ అయ్యాయి. ఈ క్రమంలో కేసును ఉపసంహరించుకోవాలని న్యూరాజరాజేశ్వరిపేటలో ఉన్న 608 గజాల రామిరెడ్డి కోటేశ్వరరావు స్థలాన్ని వి.వి.ఎస్.వర్మతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ స్థలం స్వాతంత్ర్య సమరయోధులదని తెలుసుకున్న బాధితుడు ఇదేంటని మాగంటి బాబుకు ఫోన్‌చేస్తే.. ఎమ్మెల్యే బొండా ఉమా పేరు చెప్పి బెదిరిస్తున్నారని సుబ్రహ్మణ్యేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకానొక సందర్భంలో శాసనసభ్యుడు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పినట్లు అందులో పేర్కొన్నారు. 2009లో తీసుకున్న రుణానికి వడ్డీతో రూ.80లక్షలు అయిందని, ఆ మొత్తం అతని నుంచి ఇప్పించాల్సిందిగా పోలీసులను కోరారు. ఈ విషయంపై నున్న గ్రామీణ సీఐ ఎం.వి.దుర్గారావు కేసు దర్యాప్తు చేపట్టి బాధితుడ్ని విచారించారు. అనంతరం మాగంటి బాబు, కాశినేని వాసు, స్థలాన్ని ఫోర్జరీతో రిజిస్ట్రేషన్ చేసేందుకు సహకరించిన వి.వి.ఎస్.వర్మలపై ఫోర్జరీ, కుట్ర, బెదిరింపు మోసం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మాగంటి బాబు, కాశినేని వాసులను శనివారం అరెస్టు చేశారు. వర్మ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ చిన్నారి ప్రతిభ 'అక్షయ' సమానం!

- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రాయచోటి బాలికకు చోటు

అక్షయ

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రపంచంలోని నగరాలు, రాజధానులు, ప్రముఖుల పేర్లు, నదులు, తెలుగు సంవత్సరాలు ఇలా ఏ అంశానికి సంబంధించిన ప్రశ్న వేసినా.. క్షణాల్లో సమాధానం చెబుతోంది కడప జిల్లా రాయచోటికి చెందిన పల్ల అక్షయ(4). తన మేధోసంపత్తితో పలువురిని ఆకర్షిస్తోంది. రాయచోటిలోని సందీప్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న అక్షయ మేధోసంపత్తిని గుర్తించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ విద్యా నిపుణుల బృందం శనివారం రాయచోటిలో ఎంపిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ అంశాలు, తెలుగు రాష్ట్రాలు, తెలుగు భాష, నేతలు, శాస్త్రవేత్తలు, మేధావుల పేర్లు, పుట్టుక, హోదాలు, భారతం, భాగవతం, భగవద్గీత వంటి అంశాల ఆధారంగా రూపొందించిన ప్రశ్నలతో ఎంపిక కమిటీ బృందం సభ్యులు అక్షయ మేధస్సును పరీక్షించారు. మొత్తం 10 నిమిషాలలో 150 ప్రశ్నలు సంధించగా చిన్నారి టక్కున బదులిచ్చింది. దీంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపిక చేశారు. అనంతరం అక్షయకు జ్ఞాపిక, ధ్రువపత్రం, పతకాన్ని అందజేశారు. అక్షయ రాయచోటి పట్టణం రాజులకాలనీలో అమ్మమ్మ జగదీశ్వరి వద్ద ఉంటోంది. తండ్రి విజయకుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా తల్లి నిరీష గృహిణిగా ఉంటున్నారు.

'అంకుర ప్రాంతం'పై 7న కీలక ఒప్పందాలు

- చంద్రబాబు, ఈశ్వరన్‌ల అధ్యక్షతన జేఐఎస్‌సీ సమావేశం
- శంకుస్థాపన జరిగిన ఏడాది తర్వాత మరో ముందడుగు

ఈనాడు – అమరావతి

రాజధాని అమరావతిలోని 1691 ఎకరాల్లో అంకుర ప్రాంత(స్టార్టప్ ఏరియా) అభివృద్ధికి సంబంధించిన కీలక ఒప్పందాలు ఈ నెల ఏడున జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ మంత్రి ఎస్.ఈశ్వరన్‌ల సమక్షంలో సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ), సింగపూర్ సంస్థల కన్సార్షియంకి చెందిన జాయింట్ వెంచర్ కంపెనీ 'సింగపూర్ అమరావతి ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్స్(ఎస్ఏఐహెచ్)' సంస్థల మధ్య భాగస్వాముల ఒప్పందం, రాయితీ-అభివృద్ధి ఒప్పందం(కాడా) జరుగుతాయి. రెండు ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారానికి ఏర్పాటుచేసిన సంయుక్త అమలు కార్యాచరణ కమిటీ(జేఐఎస్‌సీ) సమావేశం ఈనెల 7న విజయవాడలో జరగనుంది. జేఐఎస్‌సీకి చంద్రబాబు, ఈశ్వరన్ ఛైర్మన్‌లుగా ఉన్నారు. ఈశ్వరన్ సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండేవారు. ఆయన శాఖ ఇటీవలే మారింది. ప్రస్తుతం కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ శాఖ బాధ్యతలు చూస్తున్నా.. ఆంధ్రప్రదేశ్‌తో సింగపూర్ సంబంధాల్ని ఆయనే పర్యవేక్షిస్తున్నారు.

సంవత్సరం అనంతరం..!

సింగపూర్‌కి చెందిన అసెండాస్-సింగ్‌బ్రిడ్జి, సెంబ్‌కార్ప్ సంస్థల కన్సార్షియం స్విస్ ఛాలెంజ్ విధానంలో స్టార్టప్ ప్రాంతానికి ప్రధాన అభివృద్ధిదారు(మాస్టర్ డెవలపర్)గా ఎంపికైంది. ఈ కన్సార్షియాన్ని మాస్టర్ డెవలపర్‌గా ఎంపిక చేస్తూ 2017 మే 15న జేఐఎస్‌సీ సమావేశంలోనే 'లెటర్ ఆఫ్ అవార్డ్' అందజేస్తూ.. స్టార్టప్ ప్రాంత అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. సింగపూర్ సంస్థల కన్సార్షియం, ఏడీసీల సంయుక్త భాగస్వామ్య సంస్థ 'అమరావతి అభివృద్ధి భాగస్వామి(ఏడీపీ)' ఆధ్వర్యంలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. శంకుస్థాపన జరిగి ఏడాదవుతున్నా క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు అమలు దిశగా ఒక్కడుగూ ముందుకు పడలేదు. న్యాయ, సాంకేతిక అంశాల్లో మరింత స్పష్టత కోసం ఇరు పక్షాలు పట్టుపట్టడం, కొన్నింటిలో త్వరగా ఏకాభిప్రాయానికి రాలేకపోవడం, ఒప్పందాల్లోని అంశాలను వివిధ దశల్లో క్షుణ్నంగా పరిశీలించడం వంటి కారణాలతో ప్రాజెక్టులో జాప్యం జరిగింది. స్టార్టప్ ప్రాంత ఒప్పందాలు, లావాదేవీలన్నీ నేరుగా ఏడీసీ, సీఆర్‌డీఏలతో సింగపూర్ సంస్థల కన్సార్షియమే నెరపాలని రాష్ట్రప్రభుత్వం పట్టుబట్టింది. నేరుగా ఒప్పందాలు చేసుకోబోమని, ఎస్ఏఐహెచ్ సంస్థే తమ వ్యవహారాలన్నీ చూస్తుందని కన్సార్షియం స్పష్టంచేసింది. దీనిపై స్పష్టత రావడానికి ఆరేడు నెలల సమయం పట్టింది.

ఇకనైనా ముందుకు..?

ఏడీసీ, ఎస్ఏఐహెచ్ సంస్థల మధ్య భాగస్వాముల ఒప్పందంలో.. ప్రాజెక్టులో ఎవరి వాటాలు ఎంతుండాలి? బాధ్యతలేంటి? ఎవరికి ఎలాంటి అధికారాలుంటాయి? తదితర అంశాలుంటాయి. అదయ్యాక... సీఆర్‌డీఏ, ఏడీపీ, ఎస్ఏఐహెచ్ మధ్య 'కాడా' ఒప్పందం జరుగుతుంది. ప్రాజెక్టుని ఎన్ని దశల్లో, ఎప్పటిలోగా పూర్తి చేయాలి? సీఆర్‌డీఏ తరఫున ఏడీపీకి ఎలాంటి రాయితీలు ఇవ్వాలి? వంటి అంశాలన్నీ అందులో ఉంటాయి. ఈ రెండూ జరిగితే.. క్షేత్రస్థాయి పనులు ప్రారంభించడానికి ముందుండే ప్రక్రియలన్నీ పూర్తయినట్టే. స్టార్టప్ ప్రాంతాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేయాలన్నది ప్రతిపాదన. తొలి దశలో భాగంగానే.. మొదట 50ఎకరాల్లో ఉత్ప్రేరకాభివృద్ధిగా పలు ప్రాజెక్టులు చేపడతామని సింగపూర్ కన్సార్షియం ప్రతిపాదించింది. ఇటీవలే కొత్తగా 'ఫేజ్ జీరో' పేరుతో 4,000 చ.మీటర్ల విస్తీర్ణంలో సందర్శకుల కేంద్రం, ఎగ్జిబిషన్ గ్యాలరీ వంటివి నిర్మిస్తామని ముందుకొచ్చింది. "ఏడీపీలో తమ వాటాగా ఏడీసీ రూ.220కోట్లు, సింగపూర్ సంస్థల కన్సార్షియం రూ.326కోట్లు జమచేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టుకి నిధుల కోసం వివిధ బ్యాంకులు, రుణ వితరణ సంస్థలతో సంప్రదింపుల ప్రక్రియ కొలిక్కి వచ్చిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కన్సార్షియం ప్రతినిధులు చెబుతున్నారు" అని సీఆర్‌డీఏ వర్గాలు పేర్కొన్నాయి.

ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదుకు యాప్

పంపించే వారి వివరాలు గోప్యం: సీఈసీ రావత్

కోల్‌కతా: ఎన్నికల్లో అక్రమాలను వెలుగులోకి తెచ్చే వారికి రక్షణ కల్పిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఓ.పి.రావత్ ప్రకటించారు. ఎన్నికల కమిషన్ యాప్‌కు సమాచారం పంపించేవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించబోమని అన్నారు. శనివారం ఆయన ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా ఈ యాప్‌ను వినియోగంలోకి తెచ్చామని, అక్రమాలపై 780 వీడియోలు అందాయని చెప్పారు. పంపించిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని తెలిపారు. అక్షాంశాలు, రేఖాంశాలు ఆధారంగా అది ఎక్కడ నుంచి వచ్చిందీ గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రతి ఎన్నికల్లోనూ ఈ యాప్‌ను వినియోగిస్తామని తెలిపారు. ఈవీఎంలపై రాజకీయ నాయకులు చేస్తున్న విమర్శలను ఆయన దృష్టికి తీసుకురాగా, ఓటింగ్ యంత్రాలు పూర్తి సురక్షితమని, ఎలాంటి అనుమానాలూ అక్కర్లేదని స్పష్టం చేశారు. ఇకపై ఎన్నికలు కూడా ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా నిర్వహిస్తామని, తిరిగి బ్యాలెట్ పత్రాలను ఉపయోగించేది లేదని తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాల ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగ సవరణతో పాటు, చట్టంలో మార్పులు అవసరమని అన్నారు. చురుగ్గాలేని పార్టీలను జాబితా నుంచి తొలగిస్తున్నామని, ఇంతవరకు వేయి పార్టీలను తొలగించామని వివరించారు.

ఎంసెట్ కౌన్సెలింగ్‌లో ఐచ్ఛికాలు ఇచ్చింది 62 వేల మంది

ఈనాడు, అమరావతి: ఏపీ ఎంసెట్-2018 కౌన్సెలింగ్‌లో 1,12,520 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయినట్లు కన్వీనర్ పండాదాస్ తెలిపారు. ఆప్షన్ల నమోదుకు 64,143 మంది పాస్‌వర్డ్‌ను సృష్టించుకోగా.. వీరిలో 62,268 మంది ఆప్షన్లు ఇచ్చారు. 98,598 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలన చేయగా.. సహాయకేంద్రాల ద్వారా 13,922 మంది పత్రాలను పరిశీలించారు.

ఈ నెల 15లోపే ఉచిత పుస్తకాల సరఫరా

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పుస్తకాలను ఈ నెల 15లోపు అందించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.07 కోట్లు పుస్తకాలు అవసరం కాగా.. ఈ నెల 8 నాటికి 1.47 కోట్లు సరఫరా చేయనున్నామని, రోజుకు 15 లక్షల చొప్పున సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. పుస్తకాల ముద్రణ, సరఫరాకు సంబంధించిన వివరాలను ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులకు అందించామని చెప్పారు. ఇప్పటివరకు 9.47 లక్షలు సరఫరా చేశామని వెల్లడించారు.

ఎన్టీఆర్ విద్యోన్నతి సివిల్స్ అభ్యర్థులకు అందని భృతి

నాలుగు నెలలుగా అవస్థలు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద సివిల్స్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు గత నాలుగు నెలలుగా ప్రోత్సాహకం అందడం లేదు. దీంతో కొంత మంది వసతిగృహాల నెలవారీ అద్దె చెల్లించలేక ఖాళీ చేసి స్వగ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన 1823 మంది సివిల్స్ అభ్యర్థులు వివిధ ప్రైవేటు సంస్థల్లో శిక్షణ పొందుతున్నారు. వీరందరికీ నెలకు రూ.10 వేల చొప్పున 9 నెలల పాటు ప్రభుత్వం ప్రోత్సాహకం అందాల్సి ఉంది. గత ఫిబ్రవరి నుంచి ఇది అందకపోవడంతో అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సమగ్ర ఆర్థిక నిర్వహణ విధానం(సీఎఫ్ఎంఎస్) కారణంగానే ఆలస్యమవుతోందని బీసీ సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. 'దూరప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంటున్నాం. 4 నెలలుగా ప్రభుత్వంనుంచి ప్రోత్సాహకం అందడం లేదు. నెలవారీ వసతిగృహాల అద్దెచెల్లించేందుకు, పుస్తకాలు కొనేందుకు ఇబ్బంది ఎదురవుతోంది. ఇంటి నుంచి డబ్బు తెచ్చుకునే ఆర్థిక స్థోమత లేదు. అప్పులు చేయాల్సి వస్తోంది. అద్దె చెల్లించలేక కొందరు హాస్టళ్లు ఖాళీ చేసి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు' అని పలువురు అభ్యర్థులు తెలిపారు.

34శాతం తెల్ల కార్డులు బోగస్..

- 2.75లక్షల కార్డులు తనిఖీ చేస్తే జాడ లేనివి 94వేలు
- ప్రతీనెలా రూ.కోట్లలో పీడీఎస్ రాయితీ పక్కదారి
- కుటుంబాలను మించి జారీ తంతు

ఈనాడు – అమరావతి

మూడు జిల్లాల్లోని 476 చౌకధర దుకాణాల పరిధిలో ఉన్న 2.75 లక్షల తెలుపురంగు కార్డులను తనిఖీ చేస్తే.. 94వేలు అంటే 34 శాతంపైగా కార్డుల జాడ కనిపించలేదు. రాష్ట్ర ఆహార కమిషన్ ఏపీ శాక్(ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్) ద్వారా రెండు విడతల్లో సామాజిక ఆడిట్ నిర్వహిస్తే బయటపడ్డ వాస్తవాలివి. తాజాగా కర్నూలు జిల్లాలో కర్నూలు పట్టణం, గ్రామీణంలోని 166 దుకాణాల పరిధిలోని 1.12లక్షల రేషన్‌కార్డుల వివరాలను విచారించగా అందులో కేవలం 54వేల కార్డులను మాత్రమే గుర్తించగలిగారు. మిగిలిన 58వేల కార్డుల చిరునామాలు తేలలేదు. దీన్నిబట్టి రాష్ట్రంలోని తెలుపురంగు రేషన్ కార్డుల్లో ఏ స్థాయిలో బోగస్ కార్డులున్నాయో విదితమవుతోంది. దాదాపుగా 34శాతం మేర బోగస్ కార్డులు ఉండే పరిస్థితి ఉందని అంచనాలు చెబుతున్నాయి. గతంలో గుంటూరు జిల్లాలోని 5మండలాలు, విశాఖలోని అనకాపల్లి, కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు మండలం.. ఇలా మొత్తం ఏడు మండలాల పరిధిలోని 310 దుకాణాల పరిధిలో 1.63లక్షల కార్డులను తనిఖీ చేస్తే 36వేల కార్డుల జాడ కనిపించలేదు.

బాధ్యులు ఎవరో తేలితేనే..

కేవలం మూడు జిల్లాల్లోని 9మండలాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 28,600లకు పైగా దుకాణాల పరిధిలోని 1.44కోట్ల కార్డుల్లో ఎన్ని బోగస్‌వుంటాయనేదీ లెక్క తేలాల్సి ఉంది. జాడలేని వేల కార్డులపై ప్రతీనెలా విడుదల చేస్తున్న పీడీఎస్(ప్రజా పంపిణీ వ్యవస్థ) బియ్యం, ఇతర సరకుల రూపేణా ప్రభుత్వం భరిస్తున్న కోట్ల రూపాయల రాయితీ ఎవరి బొక్కసాల్లోకి చేరుతుందనేది వెల్లడవ్వాల్సి ఉంది. ఈ వ్యవహారంలో అధికారులు, రేషన్ డీలర్ల బాధ్యత ఎంతనే దానిపై ప్రభుత్వం విచారణ జరిపించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని కుటుంబాల సంఖ్య కంటే తెలుపురంగు రేషన్ కార్డుల సంఖ్య దాదాపు 20లక్షలు పైగా ఉంది.

గణాంకాల్లో చూస్తే..

★ 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని కుటుంబాలు 1.27కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం చేయించిన ప్రజా సాధికార సర్వే ప్రకారం 1.39 కోట్లు.

★ రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న మొత్తం తెల్లరంగు కార్డులు 1.44కోట్లు.

★ ఈ నెలలో మరో 1.90లక్షల కొత్త కార్డులను జారీ చేయనున్నారు.

★ ఇవి కాకుండా జులైలో ప్రస్తుతమున్న కార్డుల నుంచే మరో 12లక్షల కార్డులను జారీచేయనున్నారు. (ఇప్పుడు తండ్రి కార్డులో కొడుకు పేరు ఉంటే..ఇప్పుడు అర్హతను బట్టి కొడుక్కీ కార్డు మంజూరు చేస్తారు)

★ ఈ లెక్కన మొత్తం కార్డుల సంఖ్య 1.58 కోట్లకు చేరనుంది.

★ అంటే రాష్ట్రంలోని కుటుంబాలు 1.39 కోట్ల కంటే తెల్ల కార్డులే 19లక్షలకుపైగా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

వసుంధర, శివరాజ్‌ల ఆధ్వర్యంలోనే ఎన్నికలకు..

- భాజపా నాయకత్వం నిర్ణయం

ఈనాడు, దిల్లీ: ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నప్పటికీ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల్లో నాయకత్వాన్ని మార్చకూడదని భాజపా అగ్రనాయకత్వం నిర్ణయించింది. రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి వసుంధర రాజే, మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్‌ల నాయకత్వంలోనే ఎన్నికలను ఎదుర్కోవాలని భావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో కూడా వారే ముఖ్యమంత్రి అభ్యర్థులు కానున్నారు. వారిరువురిపై వ్యతిరేకత ఉన్నట్టు పార్టీ గుర్తించింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తగ్గించడానికి వారిద్దరినీ మార్చాలని ఆయా రాష్ట్రాలకు చెందిన కొందరు నేతలు ఒత్తిడి తెచ్చారు కూడా. కనీసం వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నది ప్రకటించకుండా ఉండాలని కోరారు. అయినప్పటికీ మార్పులు చేయకూడదని నిర్ణయించింది. మరో వైపు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌పై ఎలాంటి వ్యతిరేకతా లేకపోవడంతో ఆయన ఆధ్వర్యంలోనే ఎన్నికలకు వెళ్లనుంది. ఈ మూడు రాష్ట్రాలకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ
లెనిన్ సెంటర్, గవర్నరుపేట్, విజయవాడ - 520002.
File no:CRDA-14023(38)/1/2017-ENV1-LSENV-APCRDA Dt: 02-06-2018

అమరావతి రాజధాని నగరంలో నిర్మించనున్న వివిధ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై పబ్లిక్ నోటీసు

స్టేట్ ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అథారిటీ. ఆంధ్రప్రదేశ్ మరియు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారు అమరావతి రాజధాని నగరంలో నిర్మించనున్న హైకోర్ట్ బిల్డింగ్ ప్రాజెక్ట్ మరియు హెచ్.ఒ.డి. స్టాఫ్ హౌసింగ్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఆమోదించినారని మేము ఇందుమూలముగా తెలియజేయడమైనది. కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, స్టేట్ ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అథారిటీ, ఎ.పి.సి.ఆర్.డి.ఎ మరియు కాలుష్య నియంత్రణ మండలి ఆంధ్రప్రదేశ్ వారి వద్ద ఉత్తర్వుల నకలు లభ్యమగును. ప్రాజెక్టులకు సంబంధించిన ఉత్తర్వులు క్రింది విదముగా ఉన్నవి...

1. హెచ్.ఒ.డి. స్టాఫ్ హౌసింగ్ ప్రాజెక్ట్ ఉత్తర్వు నెం.
   ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.//ఎ.పి/జి.యన్.టి./సి.ఒ.యన్./09/2017/422-321 – Dt: 17.05.2018
2. హైకోర్ట్ బిల్డింగ్ ప్రాజెక్ట్ ఉత్తర్వు నెం.
   ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.//ఎ.పి/జి.యన్.టి./సి.ఒ.యన్./09/2017/420-322 – Dt: 17.05.2018

సం/-కమీషనర్, ఎ.పి.సి.ఆర్.డి.ఎ & సి.ఎ., విజయవాడ

అంతస్తులు.. హరిత సోయగాలు

చుట్టూ బహుళఅంతస్తుల భవనాలు.. వాటికి అత్యంత సమీపంలోనే అరటి, కూరగాయల తోటలు పచ్చదనంతో కనువిందుచేస్తున్నాయి కదూ..! ఈ దృశ్యం విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో తాడేపల్లి పురపాలక సంఘం పరిధిలో కనిపించింది. రాజధాని అమరావతి నిర్మాణానికి ముందు స్థానికంగా వేల ఎకరాల్లో రైతులు పండ్ల తోటలు, పూలు, కూరగాయల సాగు చేపట్టేవారు. రాజధాని నిర్మాణ కార్యక్రమాలు జోరందుకున్నాక సంబంధిత భూముల్లో చాలావరకు సేద్యం కనుమరుగైంది. ప్రస్తుతమిక్కడ పెద్దసంఖ్యలో బహుళఅంతస్తుల భవనాలు వెలిశాయి. సాగుపై మమకారం వదులుకోని కొందరు రైతులు మాత్రం అక్కడక్కడా నేటికీ ఇలా తోటలు పెంచుతుండటంతో.. చుట్టూరా ఉన్న బహుళ అంతస్తుల భవనాల మధ్యలో ఇవి ప్రత్యేకంగా కనిపిస్తూ చూపరులను అలరిస్తున్నాయి. – ఈనాడు, అమరావతి

నాగ్‌పుర్‌లోనే స్పందిస్తాను

ఆర్ఎస్ఎస్ కార్యక్రమానికి హాజరయ్యే అంశంపై ప్రణబ్ స్పష్టీకరణ

కోల్‌కతా: ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ముఖ్యఅతిథిగా ప్రసంగించనున్నారని తెలిసి వెల్లువెత్తిన విమర్శల నేపథ్యంలో ఆయన నోరువిప్పారు. 'నేను చెప్పాలనుకున్నది నాగ్‌పుర్‌లోనే చెబుతాను. నాకెన్నో లేఖలు, ఫోన్‌కాల్స్ వచ్చాయి. నా ప్రతిస్పందన ఏమిటనేది ఇంకా ఎవరికీ చెప్పలేదు' అని ప్రణబ్ వ్యాఖ్యానించినట్లు బెంగాలీ దినపత్రిక 'ఆనంద్‌బజార్ పత్రిక' కథనం రాసింది. జూన్ 7న నాగ్‌పుర్‌లో ఆర్ఎస్ఎస్ నిర్వహించే విద్యార్థుల వీడ్కోలు వేడుకలో ప్రణబ్‌ముఖర్జీ ముఖ్యఅతిథిగా ప్రసంగించనున్న సంగతి తెలిసిందే. లౌకికవాదం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న కాంగ్రెస్ నాయకుడై ఉండి, ఆర్ఎస్ఎస్ భావజాలం తెలిసి కూడా ఎలా వెళ్తున్నారని పలువురు కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. మీ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు జైరాంరమేశ్, సీకేజాఫర్ షరీఫ్, రమేశ్ చెన్నితాల తదితరులు ప్రణబ్‌కు ఇప్పటికే లేఖలు రాశారు. ఇంతవరకు మాకు రాజకీయ మార్గదర్శిగా ఉన్న గొప్ప నాయకుడు ప్రణబ్‌కు అకస్మాత్తుగా ఏమైంది?, ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో ప్రసంగించడం ఏమిటి? అని జైరాం రమేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ కేంద్ర ఆర్థికమంత్రి పి.చిదంబరం మాత్రం ప్రణబ్‌ను తప్పక వెళ్లమని కోరుతున్నారు. 'ఆహ్వానాన్ని అంగీకరించారు. ఎందుకు అంగీకరించారనేది ఇప్పుడు అనవసరం. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి, వారి సైద్ధాంతిక భావజాలం ఎలా తప్పో వివరించండి' అని సలహా ఇచ్చారు. మరోవైపు ఆర్ఎస్ఎస్ అంటే పాకిస్థాన్ ఐఎస్ఐ కాదని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మాది జాతీయవాదుల సంఘమని అభివర్ణించారు. గతంలో మహాత్మాగాంధీ, జైప్రకాశ్ నారాయణ్, జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారని గుర్తు చేశారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR ANANTHAPURAMU-515002 & BLEKINGE INSTITUTE OF TECHNOLOGY (BTH), SWEDEN

Dt: 02-06-2018

Admission to 4 year B.Tech Programme

(3 years at JNTUA CEA, Ananthapuramu and 1 year at BTH, Sweden)

Applications are invited from eligible students for admission into 4 year B.Tech Programme to be offered by both JNTUA and BTH. For details of eligibility criteria, fee structure and other admission guidelines, please visit website www.jntua.ac.in. The last date to receive applications is 18-06-2018.

Sd/- REGISTRAR

4, 5 తేదీల్లో ప్రభుత్వ పథకాలపై చర్చ

కోల్‌కతా: ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ పథకాలు, వాటి అమలుతీరుపై రాష్ట్రపతిభవన్‌లో జూన్ 4, 5 తేదీల్లో చర్చించనున్నారు. దేశంలోని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు పాల్గొనే ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి అధ్యక్షత వహించనున్నారు. 1949లో గవర్నరు జనరల్ సి.రాజగోపాలాచారి అధ్యక్షతన తొలి సమావేశం జరిగింది. ఆయన తరువాత ఇలాంటి సమావేశాన్ని రాష్ట్రపతిభవన్‌లో ఏర్పాటు చేసిన రెండోవ్యక్తిగా కోవింద్ చరిత్ర సృష్టించారు. ఏడు సెషన్స్‌లో పలు పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అమలుతీరును పరిశీలిస్తారు. జూన్ 5న కేంద్రపాలిత ప్రాంతాల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నారు. ఉపరాష్ట్రపతి, ప్రధాని, నీతిఆయోగ్ సీఈవో, జాతీయ భద్రతా సలహాదారు తదితరులు ఈ సమావేశంలో ప్రసంగిస్తారు.

పుస్తకాలు అందక.. బోధన సాగక

- ఇంటర్ తరగతులు ప్రారంభమైనా మారని తీరు!

ఈనాడు, అమరావతి: ఇంటర్ కళాశాలలు ప్రారంభమైనా ఇంతవరకు కళాశాలలకు పుస్తకాలు చేరలేదు. ఇవికాకుండా ప్రైవేటు విద్యార్థుల కోసం మార్కెట్‌లో అందుబాటులో ఉంచాల్సిన పుస్తకాలు లభించని పరిస్థితి నెలకొంది. ఇంటర్ విద్యామండలి షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచే జూనియర్ కళాశాలల తరగతులు ప్రారంభయ్యాయి. ఈ ఏడాది ఇంటర్ మొదటి ఏడాది పాఠ్యాంశాలు మారాయి. ఆంగ్లం, తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం సబ్జెక్టులు పూర్తిగా మారాయి. ప్రతి నాలుగేళ్లకు భాష(లాంగ్వేజస్)ల పుస్తకాలను మార్పు చేస్తూ ఉంటారు. ఇందులో భాగంగా ఈసారి పాఠ్యాంశాల్లో మార్పు చేశారు. దీనికితోడు జాతీయస్థాయిలో నిర్వహించే నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ కోసం కొన్ని పాఠ్యాంశాలను కొత్తగా చేర్చారు. భౌతిక, రసాయనశాస్త్రాలు, గణితంలో ఒకటి, రెండు పాఠ్యాంశాలు అదనంగా చేర్చారు. భాషలకు సంబంధించి పుస్తకాలు లేనందున పిల్లలకు పాఠాల బోధన సాగడం లేదు. పాఠ్యాంశాలు మారడం, పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో చాలా చోట్ల బోధన సాగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఏడాది 4.78 కోట్లు మంది విద్యార్థులు ఇంటర్ మొదటి ఏడాదిలో చేరుతున్నారు. పాఠ్యాంశాల మార్పు, కళాశాల ప్రారంభం సమయం ముందే తెలిసిన అధికారులు ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం.

Devineni Venkata Ramana & Dr.Hima Sekhar

MIC College of Technology

NBA Accrediated Courses:CSE.ECE.EEE,Mech, Accrediated by NAAC with 'A'grade
Kanchikacherla - 521180 Ph: 08678-273535,273569
www.mictech.ac.in, e-mail:officemictech@gmail.com

WALK IN INTERVIEWS

Walk in interviews will be held for various faculty positions in the following disciplines:

S. No.	Discipline	Date of interview	Qualification
1	CSE, ECE & Civil	06.06.2018 @ 10 AM	M.Tech with 1st class
2	English, Maths		M.A, M.Sc, Ph.D
3	MBA		MBA, Ph.D
4	Diploma (ECE/EEE/Mech/Civil)	Mail application to hr@mictech.ac.in	B.Tech in relevant branch

Eligible interested candidates may walk in for an interview with all original & photo copies of certificates, Aadhar & Pan Card, Colour passport size photo & bio-data.

Date: 03.06.2018 Venue: College Campus

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

CA



వధువు కావలెను

బ్రాహ్మణ 28 B.Tech MBA 16L ★ 26 MBA/ Govt/ ★ 30/ B.Tech/ M.S (US) $ 1 Lakh ★ 34 B.Tech MBA/ SBI 9L/ ★ 29/ 5'9"/ MD ★ 9440449285 (A)

కమ్మ 32 Y/s 5.9" MCA జీతం 1,13,000/- Pm Sr.SWE, Hyd సొంత ఇల్లు, వెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను Direct 8121232121, 9948098180 (A)

బెస్త/ B.Tech/ Govt AE (R&B Dept)/ 65000/- Pm 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. ✆ 7288048678 (A)

క్రిస్టియన్ మాల / M.Tech/ Govt JTO/ (BSNL)/ 72000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

గౌడ/ B.Tech/ MBA/ Govt బ్యాంక్ మేనేజర్ (సిండికేట్‌బ్యాంక్)/ 55,000/-PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9703978131 (A)

మున్నూరుకాపు/ B.Tech/ MBA/ Govt AE/ (ఇరిగేషన్ Dept)/ 55000/-PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885050879 (A)

మాల/ B.Tech/ MBA/ C.Govt డిప్యూటీ మేనేజర్ (SBI) / 12 Lakhs PA/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9703794175 (A)

రెడ్డి/ B.Tech/ MBA/ C.Govt ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆఫీసర్/ 13 Lakhs PA/ 5'11" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014 (A)

బెస్త/ M.Tech/ C.Govt డిప్యూటీ మేనేజర్/ (BDL)/ 90,000/-PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A)

గౌడ/ M.Tech/ IIT/ C.Govt Asst Exq ట్రైనింగ్ ఆఫీసర్ (BHEL)/ 12Lakhs PA/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9989450693 (A)

మాల: A:27, Ht: 5'.7", B.Tech (IIT), SWE, Sal: 72 లక్షలు; A: 26, Ht: 5'.6", B.Tech (IIT) IRS కోటీశ్వరులు, 78930 13265 (N).

Naidu, Engg PHD Industrialist, Owner of Many Institutions, Including Medical, Business & Land Lord Seeks Suitable Doctor Naidu Bride Age Below 34. dominicrdc@gmail.com (A)

కమ్మ 36, 5'10" (UK/ PR) 9L PM, 4Cr ఆస్తి Fair వరుడికి Fair, కమ్మ వధువు కావలెను. (డైరెక్ట్) UK ✆ (Whatsapp) +44 7715919375 (A).

రెడ్డి 1989/5'7" B.Tech (IIT) MS/US/ 100K/ 40 Cr ★ 1991/5'6", B.Tech/ MS/ US నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1991/6', B.Tech/ MBA/ 12L P.A/ 40 Cr ★ 1989/ 5'11" MS/Pharmacy/ Canada/ P.R. 45L. P.A. 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1991/ 5'8" B.Tech/ M.S./ US/ 180K/ Rich ★ 1990/ 5'11", MBA/ US Citizen 100K. Rich Ph: 9848221166/ 8885559579 (A)

ఆర్యవైశ్య/లేట్ మ్యారేజ్/బిజినెస్ స్వ॥గో॥ఐనకుల మే॥గో॥మిధునకుల న॥ శతభిష/ఫెయిర్/5.6"/49Y/వరునకు వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ ✆ 98853 90717 (M).

కాపు/ 29/ 5'10"/ B.Tech/ IIT/ S/W/E విప్రో Hyd నెలకు 1లక్ష జీతం మంచి అలవాట్లు కల వరుడుకు తగిన వధువు కావలెను (అర్జెంట్) ✆ 8978799956 (A)

రెడ్డి/ కన్వర్ట్ క్రిస్టియన్/ 29/ 5'10"/ B.Tech IIT/ S/W/E విప్రో Hyd 1లక్ష జీతం గల ఫేర్‌ఫుల్ Boyకి తగిన వధువు కావలెను (అర్జెంట్) ✆ 7993975656 (A)

హైదరాబాద్‌లో ఉద్యోగము చేయుచున్న కమ్మ వరునికి కృష్ణ/ గుంటూర్/ ప.గో జిల్లాల నుండి కమ్మ వధువు కావలెను. చదువు కట్నకానుకలు పట్టింపు లేవు. ✆ 9908518976/ 8143499423 (A)

ముదిరాజ్/ డైవర్సీ/ కుల/ కట్న ప్రసక్తిలేని/ 40/ 5'8"/ Fr/ PG/ Govt. జాబ్/ Hyd/ 70,000/-PM/ వెల్ సెటిల్డ్/ ఓన్లి సన్ వరునికి అందమైన వధువు కావలెను. అర్జెంట్ ✆ 9160253545 (A)

కుల పట్టింపు లేని అందమైన వ్యక్తికి మొదటి లేక రెండవ సంబంధమైన వధువు కావలెను. మీ Photo వివరాలు ఈ క్రింది వాట్సాప్ నెం॥ సంప్ర : 99632 87740 (J).

బ్రాహ్మణ /26/6'/BE/ 10L ★ 27/6'/B.టెక్ (IIT), MBA (IIM)/25L ★ మధ్వ /26/5'8"/BE/ 8L ★ శ్రీవైష్ణవ / 31/5'9"/M.టెక్ /8L ★ డైవర్సీ 30/5'10"/B.టెక్/ 12L ✆ 9030036501 (A)

SC మాల: 28/5'5"/M.టెక్ రైల్వే ఇంజనీర్ ★ 30/5'7"/ MBBS, MS(GS) ★ 28/5'9"/ B.టెక్, MS/H1 వీసా ★ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

విశ్వబ్రాహ్మణ - 29/5'8"/ B.టెక్, MBA/SBI ఆఫీసర్ ★ 28/5'9"/B.టెక్, MS/H1 వీసా ★ 29/5'8"/MBBS, MS (ఆర్థో) సంప్ర: డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

వనజరావు క్విక్‌మ్యారేజెస్

పాణిగ్రహణం

దేశవిదేశాలలో లక్షలాది జంటల మదిలో కళ్యాణ గంటలు మ్రోగిస్తూ కోట్లాది కుటుంబాల కలయికకు సూత్రధారై అనేక బ్రాంచీలతో విస్తరించి అఖండ శిఖరాన్ని అధిరోహించిన ఏకైక వివాహవేదిక వనజరావు క్విక్‌మ్యారేజెస్ Ph: 9866667755, 9849033795. web: vanajarao.com (A)

వధువు కావలెను

Kamma ★29, 6', BE, MS $ 125K, 30C ★ 28, 5'11", BE, TCS, 40C ★ 29, 6', ME, Business, 200C ★ 27, 5'10", MBBS, MD 15C ★ 040-23741441 ★ 9989889191 (A)

Kapu ★ 29, 5'11", BE, MS $ 125K, 20C.★ 26, 6', BE, MS, MNC, 26L PA. 20C ★ 28, 6'1" BE, 100C ★ 27, 5'10" MBBS, MD 75C ★ 040-23753886 ★ 9866633988 (A)

Brahmin ★ 29, 5'11", BE, MS $ 120K ★ 28, 5'10", BE, MNC, 20L PA ★ 27, 6' BE, MBA(IIM), 15L★ 26, 5'11" MBBS, MD ★ 040-23755624 ★ 9989997766 (A)

Reddy ★ 28, 5'10", BE, MBA, MNC, 20L, 10C ★ 29, 6', BE, MS, $ 175K 15C ★ 30, 5'11" MBA, 100C ★ 27, 5'8" MBBS, MD 70C ★ 040-23753886 ★ 9866698833 (A)

Vysya ★ 27, 6', BE, MS $ 120K ★ 29, 5'9", BE, MS, MNC, 20L PA. 25C ★ 28, 5'8" BE, MBA, SWE 12L ★ 30, 5'10" MBBS, MS 20C ★ 040-23741441★ 9014939391 (A)

Velama ★ 28, 5'9", BE, MS $ 100K ★ 27, 6', BE, MNC, 10L PA ★ 30, 5'11", BE, MBA, Business, 20C ★ 29, 5'8", MBBS, MS, 20C ★ 040-23755624 ★ 9393823550 (A)

Mudiraj ★ 26, 5'9", BE, MS $ 100K, 10C ★ 30, 5'10", BE, TCS, 10C ★ 27, 6', BE, MBA, IBM ★ 31, 5'9", MBBS, MD, 10C ★ 040-40079997★ 9849033795 (A)

Yadava ★ 30, 5'11", BE, MS $ 100K ★ 28, 6', BE, INFOSYS, 12L ★ 29, 5,10", MBA, BUSINESS, 20C ★ 27, 5'8", MBBS, MD, 10C ★ 040-24152076★ 9849083241 (A)

MALA ★ 29, 6', BE, MS $ 100K ★ 26, 5'9" BE, MBA, 25C ★ 29, 5'9", MBA(IIM), MNC, 12L PA ★ 30, 5'8", MBBS, MD, 10C ★ 040-23741441★ 99899-97766/ 44464 (A)

Caste No Bar ★ 27, 5'10", BE, MS $ 120K, 20C ★ 30, 6', BE, CEO, 100C ★ 25, 6', BE, MBA, 30C ★ 27, 5'10", MBBS, MS, 20C ★ 040-23753886 ★ 9908891119 (A)

Kapu-Divorcee ★ 34, 5'10", BE, MS $ 500K, 10C ★ 36, 5'8", BE, ME, MNC, 22L PA, 5C ★ 32, 5'11', BE, MBA, 100C ★ 040-23755624 ★ 99599-82228/9 (A)

వరుడు కావలెను

Kapu ★ 26, 5'4", BE, NS, $80K, 100 C ★ 23, 5'5", BE, MBA, 25C ★ 25, 5'6", BE, MS, MNC, 18L, 10C ★ 25, 5'5", MBBS, MD, 15C ★ 040-23741441 ★ 9989997766

Kamma ★ 26, 5'6", BE, MS. $ 140K, 25C ★ 23, 5'6", MBBS, PG, 100C ★ 26, 5'5", BE, MNC 10L, 50C ★ 25, 5'4", MBA, 25C ★ 040-23753886 ★ 9959982228/ 9

Reddy ★ 27, 5'5", BE, MS, $ 90K, 25C ★ 25, 5'6", BE 100C ★ 26, 5'4", BE, MBA, Business, 20C ★ 24, 5'5", MBBS, PG, 50C ★ 040-23755624 ★ 9908891119

Vysya ★ 25, 5'5", MS, MNC, 5C ★ 26, 5'6", B.Tech, SWE, 5L PA, 10C ★ 27, 5'4", BE, MBA, MNC, 6L PA ★ 26, 5'3", CA, 5L, 5C ★ 040-23741441 ★ 9866698833

Brahmin ★ 26, 5'4", BE, MS, $ 60K, 10C ★ 24, 5'3", BE, SWE, 5L PA ★ 27, 5'4", MBA, MNC, 15L PA ★ 25, 5'5", MBBS, PG ★ 040-23755624 ★ 9959982228/9

Munnuru Kapu ★ 26, 5'5", BE, MS, $ 70K, 30C ★ 25, 5'6", Barch. 25C ★ 28, 5'2", MBA, 50C ★ 24, 5'3", MBBS, PG, 20C ★ 040-23741441 ★ 98490-33795

Padmashali ★ 25, 5'4", BE, MS, $ 70K, 10C ★ 23, 5'2", BE, MBA, 50C ★ 28, 5'4", B.Pharmacy, 15C ★ 26, 5'3", MBBS, PG ★ 040-23753886 ★ 9959982228/ 9

Gowda ★ 25, 5'6", BE, MS $ 60K, 5C ★ 26, 5'7", BE, MNC, 4L PA ★ 27, 5'2", Barch, 60C ★ 28, 5'4", MBBS, MD, 5C ★ 040-23755624 ★ 98666-98833/ 33988

Viswabrahmin ★ 27, 5'6", BE, MS, $ 60K, 5C ★ 25, 5'4", BE, Accenture, 5L ★ 26, 5'5", BE, ME, 5C ★ 25, 5'4", MBBS, MS ★ 040-23056755 ★ 9030650266

Christian ★ 27, 5'2", BE, MS, $ 90K ★ 26, 5'6", BE, SWE, 6L PA, 20 C ★ 25, 5'5", BE, MBA, 6L ★ 28, 5'3", MBBS, MD, 10C ★ 040-23741441 ★ 98666-33988

Divorcee - Caste No Bar ★ 29, 5'4", BE, MS $ 100K, 15C ★ 27, 5'5", BE, 50C ★ 25, 5'4", MBA, 30C ★ 37, 5'5", MBBS, MD, 50C ★ 040-23753886 ★ 9989889191

వెన్నెలైనా చీకటైనా.. మన చేతిలోనే!

పెళ్లి అనేది ఇద్దరు మనుషులను కలపడమేగాక రెండు కుటుంబాలను కలుపుతుంది. ఆ రెండు కుటుంబాలతో ముడిపడి ఉన్న వందలాదిమందిని బంధువుల్ని చేసేస్తుంది. అంతేనా? అందరికీ సరి కొత్త బాధ్యతలను నేర్పుతుంది. బంధుజనం పెరగడంతో ఒకరి మంచి చెడులను ఒకరు పట్టించుకోవడమే కాదు.. ఒకరికొకరు అండగా నిలబడడానికి ప్రాతిపదిక అవుతుంది. బలాన్ని, బలగాన్ని పెంచుతుంది. పెద్దరికాన్ని ఇవ్వడంవల్ల ఇంతకుముందులా ఎవరికిబడితేవారు ఏదిపడితే అది మాట్లాడడానికి వీల్లేకుండా కట్టడిచేస్తుంది.

ఉదాహరణకు వరుడి సంగతే తీసుకుంటే- అందకా అర్ధరాత్రుళ్లు అపరాత్రుళ్లు స్నేహితులంటూ సినిమాలంటూ తిరగడాలు వాటంతటవే తగ్గిపోతాయి. ఇంటివద్ద భార్య ఉంటుంది కనుక. వెళ్తే ఇద్దరూ కలిసే వెళ్లాలి కనుక! అలాగే విచ్చలవిడిగా ఖర్చుచేసే అలవాటుకూ కళ్లెం పడుతుంది. కారణం ఇన్నాళ్లూ తనొక్కడిసంగతే చూసుకునే వ్యక్తి ఇక భార్య బాధ్యత కూడా తీసుకోవాలి కనుక. ఉద్యోగం సద్యోగం లేకుండా అమ్మానాన్నా సంపాదించిపెడితే తిని తిరుగుతూ సరదాగా కాలక్షేపంచేసే కాలానికి 'శుభం' కార్డు పడ్డట్టే. తన భార్యను తాను పోషించుకోవాలి కనుక ఏదో ఒక కొలువు సంపాదించుకోవాలి. కొలువు లభించిందంటే ఆదాయం వ్యయం సమపాళ్లలో ఉన్నాయా లేవా? పొదుపు ఏమన్నా చేస్తున్నామా? లేదా వంటి ఆలోచనలు ఖాయం. రేపు పిల్లలు కలిగితే వాళ్ల అవసరాలు కూడా తీర్చాలి కాబట్టి విధిగా పొదుపుచేయాలి. తనకంటూ ఒక స్వంత కుటుంబం ఏర్పడినా తల్లిదండ్రులతో తోబుట్టువులతో బంధాలేమీ తెగిపోవు. అలాగే అత్తగారివైపు చుట్టరికాలూ అల్లుకుంటాయి. అందరినీ చూసుకోవాలి. బంధాల్ని అనుబంధాల్ని పంచుకోవాలి. పెంచుకోవాలి. అమ్మకి బాగోకపోయినా అత్తగారికి బాగోకపోయినా వెళ్లి చూసిరావాలి. అవసరమైతే అండగా నిలబడాలి. చికిత్సలు చేయించాలి. తమ్ముడో చెల్లెలో కాలేజీ ఫీజు కట్టాలి అన్నయ్యా అంటే వారికి సాయపడేలా ఆదాయం పెరగాలి. ఆదాయం పెరగాలంటే కష్టపడి పనిచేయాలి. ఉద్యోగులలో అధికారులలో మంచి పేరు తెచ్చుకోవాలి. పదోన్నతులు సాధించాలి. పిల్లలు పుడితే వారి పాలడబ్బాల నుంచి మందులు మాకులవరకూ అన్నీ చూసుకోవాలి.. ఇలా మగాడు బాధ్యతల వలయంలో చిక్కుకుపోతాడు.

బాధ్యతల వలయం అనేది పెద్దమాటలా అన్పించినా ఈ వలయంలోనే చిన్నిచిన్ని ఆనందాలూ పెద్దపెద్ద అనుభూతులూ కలగలిసే ఉంటాయి. భార్య నెలతప్పిందంటే కలిగే ఆనందాన్ని రూపాయల్లో కొలవగలమా? ఆ సమయంలో భార్యను కనుపాపలా కాలుకింద పెట్టకుండా చూసుకోవడం ఎంత చక్కని అనుభూతి! బిడ్డ పుడితే ఇక పండగే కదా? మగపిల్లాడైతే వంశోద్ధారకుడు.. ఆడపిల్లయితే మనింటి మహాలక్ష్మి! వాళ్ల బారసాలలు, బళ్లో వేయడాలు, పుట్టినరోజు వేడుకలు, పెళ్లిళ్లు, పండగలు పబ్బాలకు కొత్తబట్టలు కొనిపెట్టడం తీర్థయాత్రలు, ఊళ్లు తిప్పడం వల్ల కలిగే ఆనందానికి ఖరీదుకట్టే షరాబెవ్వడు? మనం ఈ లోకంలోకి తెచ్చిన బుజ్జిబుజ్జి పాపాయిలకు కాళ్లు కందకుండా అరచేతుల్లో పెట్టి పెంచుకోవడం అనుభవానికి వచ్చినప్పుడు మనసుకు కలిగే హాయి మాటలకందనిదే. మనతల్లిదండ్రులూ మనల్ని అలాగే పెంచుకుని వచ్చారన్న ఆలోచనా రావడం ఖాయం. వాళ్లపై మరింత ప్రేమానురాగాలూ ఆదరాభిమానాలు కలగడం సత్యం. నాన్నగారికో మామగారికో షష్టిపూర్తి వేడుకలు చేయడం దగ్గరుండి అన్నీ తానై నిర్వహించడం ఇచ్చే సంతోషానికి వెల కట్టగలమా? మన పిల్లలు పెరిగి పెద్దయి మంచి చదువులు చదివి ఉత్తమ పౌరులుగా తయారవడాన్ని మించిన ఆనందం ఎక్కడుంది? వాళ్లను అలా తయారు చేయడానికి మనం చేసిన త్యాగాలు, మనం పడిన కష్టాలూ ఆ తర్వాత కాలంలో కచ్చితంగా మనకు మధుర స్మృతులవుతాయి.

ఇదేకదా ఆనంద మకరందం! దీన్ని ఆస్వాదించుకుంటూ పోవడమే జీవితం. నవదంపతులు ముఖ్యంగా అబ్బాయిలు ఈ ఆనందాల్ని అందుకోవడానికి సిద్ధంగా ఉండాలి. రోమన్ తత్వవేత్త సిసిరో ఏమంటారంటే- మనం మన జీవితంలో సంతోష క్షణాల్ని మర్చిపోతాం. మనను బాధించే సంఘటనలనే ఎల్లవేళలా గుర్తుంచుకుంటాం అని. నిజమే కదా? పెళ్లి అనేది బాధ్యతల వలయం అందులోకి వెళ్తే బయటపడలేం అనుకుంటూ ఉండడం ఏ రకంగానూ సబబు కాదు. కౌమారాన్నుంచి వ్యక్తిగా ఎదిగే క్రమంలో పెళ్లి అనేది తొలి మెట్టు. అందుకే సంప్రదాయరీత్యా షోడశ సంస్కారాల్లో దానికి అత్యంత ప్రాముఖ్యం లభించింది. వైవాహిక జీవితాన్ని ఆనందంగా మలుచుకోవడమైనా హాలాహలంలా మార్చుకోవడమైనా మన చేతుల్లోనే ఉంటుంది అనేది సత్యం. ఇది యువత గ్రహించాలి.

- చంద్రప్రతాప్

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

కమ్మ – రెండో పెళ్లి - 38/6'/B.టెక్, MBA/ 3L PM/ 20 కోట్లు ★ 34/5'8"/B.టెక్, MBA/ బ్యాంక్ ఆఫీసర్/ 5 కోట్లు ★ 42/6'/MBBS, MS/ US డాక్టర్ ✆ 9393276969 (A)

Kamma, Divorcee/ 34Y/ Doctor/ 5'11"/ India/ 60Cr/ 34Y MS, USA, Software, 150K. 5'9", 15Cr, 36Y, USA/ DOCTOR/ 200K, 5'8" 3Cr. ✆ 8790515999 (A)

గౌడ/ శెట్టి బలిజ 31, 5'9" ఫెయిర్, B.E, 12Acers Land, కోనసీమ, ఇంటర్/ డిగ్రీ గల తగిన అందమైన వధువు కావలెను. నో బ్రోకర్స్. ✆ 9491684892 (A)

కమ్మ 28, 5'9", B.Tech, SWE, Deloitte 12 Lakhs P.A. వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9618483383. (A)

వడ్డె రాజులు (కట్న ప్రసక్తి లేదు) 27/ 5'10"/ B.Tech/ SWE/ Accenture 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246555529. (A)

వైశ్య కట్న ప్రసక్తి లేదు. 28/ 5'11" ఫెయిర్ B.Tech, MBA, SWE అమెజాన్ 12 లక్షలు P.A. వెల్‌సెటిల్డ్ వరుడికి వెల్‌సెటిల్డ్ వధువు కావలెను. అర్జెంట్ ✆ 9666567123. (A)

SC మాల కట్న ప్రసక్తి లేదు. 29/ 5'11" ఫెయిర్ B.Tech సివిల్, కస్టమ్స్ ఆఫీసర్ C. Govt. 75 వేలు P.M. వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. ✆ 9908200117. అర్జెంట్ (A)

పెద్ద కాపు (కుల పట్టింపు లేదు) 35/ 5'9"/ చీఫ్ ఇంజనీర్ 4 లక్షలు PM 15 ఎ॥ వ్యవసాయ భూమి ★ కమ్మ 30/ 5'10" S/W/E 1 లక్ష PM వరులకు వధువులు కావలెను. అర్జెంట్ ✆ 9550296562. (A)

కమ్మ (కట్న ప్రసక్తి లేదు) 27/ 5'10"/ B.Tech MBA USA S/W/E/ Sony 6L PM 6 Cr. ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. 9246964555. (A)

వడ్డెర: B.Tech/ C. Govt./ Asst. మేనేజర్/ SBI బ్యాంక్/ 50,000/- P.M. 5'11" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. 9618007823. (A)

అగ్నికుల క్షత్రియ: B.Tech/ Govt./ Asst. ఇంజనీర్/ ఇరిగేషన్ Dept. 60,000/- PM, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. 9618007823. (A)

రజక: M.Tech/ C. Govt./ Asst. ఇంజనీర్/ IOCL/ 65,000/- PM/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. 9618008271. (A)

ముదిరాజ్: M.Com/ C. Govt./ ఇంటెలిజెన్స్ ఆఫీసర్/ 40,000/- P.M./ 6' ఎత్తు/ 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271. (A)

కమ్మ/ Sweden/ 30Y 6' V.Fair B.Tech (ECE) Job-System Engineer 48 L P/A 3 Cr తగిన కమ్మ వధువు కావలెను. ✆ 73960 13998. (B)

కమ్మ ప్రత్యేకం 2 వ పెళ్ళి 34/ 29, B.Tech, MS, MBA, Amd డాక్టర్ వరులకు వధువు కావలెను. ✆ 9849413031 (A).

బ్రాహ్మణ, శ్రీవైష్ణవ 43, 5'6" BE, MBA, 9L PA, HR కన్సల్టెంట్ సొంత ఇల్లు తగిన వధువు కావలెను. 9581599099, 6309512250 (A).

2 వ పెళ్ళి కాపు 52Y, C.Govt, EMP, 75000 PM సొంత ఇల్లు, వరునికి తగిన సాంప్రదాయ వధువు కావలెను. కుల పట్టింపు లేదు. 6309593020 (A)

కమ్మ, 62, MBA రిటైర్డ్ ప్రైవేట్, మేనేజర్ Hyd సింగిల్‌కి, ఏ బాదరబందీలేని చదువుకున్న 50, 58 FC, BC యువతి కావలెను. డైరెక్ట్ 9618510985 (A).

దేవాంగ పద్మశాలి, డైవర్సీ 42, 5'4" B.E, Software, Eng పిల్లలు లేని వరునకు, పిల్లలు లేని వధువు కావలెను. డైరెక్ట్ Contact: 9880647639 (A).

SC, మాల హిందూ, M.Tech, IIT, 28, IBM, SWE, Hyd 1L PM చాలా అందమైన వరునికి తగిన వధువు కావలెను. 9705960270 (A).

కాపు/ డైవర్సీ/ కుల/ కట్న ప్రసక్తి లేని/ 40/ 5'7"/ Fr/ MBA/ IIM/ Govt జాబ్/ జోనల్ మేనేజర్/ Hyd/ 2 లక్షలు PM చాలా చాలా వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. ✆ 9705844329 (A)

క్షత్రియరాజులు – 28 సం॥ 5'10" C. Govt. 12.7 P/A Puneలో పనిచేస్తున్న వరునికి అందమైన చదువుకున్న క్షత్రియ వధువు కావలెను. ✆ 9347296575/ 9542503950. (A)

Kapu/Divorce/ 32 Yrs/ 5'.10"/ V.Fair/ Marine Engineer/ 25 L. PA/ Property 2 Cr. Requires I or II Bride from well settled OC/ BC Family. Call Directly. ✆ 8885895670. (C)

రెడ్డి: 29/ MD పిడియాట్రిక్ Doctor గా చేస్తున్న వెల్‌సెటిల్డ్ వరునికి అందమైన వధువు కావలెను. 89781 39904 (D)

పద్మశాలి: 28/ B.Tech, MBA, S/W, ORACLE, 15 L/PA, 2 Cr. వరునికి అందమైన వధువు కావలెను. Ph: 96762 94499 (D)

★ ★ ★

రజక 53 సం॥ గ॥జాబ్ చేయుచున్న వరుడుకు గవర్నమెంట్ జాబ్ చేయుచున్న BC/OC వధువు కావలెను. నో బ్రోకర్స్ సంప్ర: 6300955025 (R)

ఆర్యవైశ్య: 31Age, AP Govt సివిల్ ఇంజినీర్, మిధునకుల, పుబ్బా ★, అందమైన వరునికి 24 - 30 వయస్సు గల ఇంజినీరింగ్ డిగ్రీ అర్హతగల అందమైన వధువు కావలెను. ✆ 94412 23499 (D)

రెడ్డి/ 37Y/ Divorcee/ విదేశాలలో డాక్టర్‌గా పనిచేస్తున్న వరుడుకి తెల్లని అందమైన రెడ్డి వధువు కావలెను. No Dowry, Education No Bar. ✆ 9849294776/ 9848814599 (A)

★ ★ ★

అగ్నికుల క్షత్రియులు Govt. టీచర్ (VJA) 40K PM, 5.11 ఎత్తు, డైవర్సీ, 34 సం॥ అందమైన వరుడికి (BC, OC) Govt టీచర్ అయిన వధువు కావలెను. (డైరెక్ట్). ✆ 99664 61624. (B)

కాపు, 37, లేట్ మ్యారేజ్, నె. 70 వేలు ఆదాయం గల బిజినెస్, 1 కోటి ప్రోపర్టీ వరుడికి లేట్ మ్యారేజ్ లేదా సెకండ్ వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు, (డైరెక్ట్). ✆ 91549 58479. (G)

కాపు: గవర్నమెంట్ బ్యాంక్ మేనేజర్, 75 వేలు, సాఫ్ట్‌వేర్ 60 వేలు, FCI లో Job 30 వేలు, 8 కోట్లు ఆస్తి వరులకు తగిన కాపు వధువులు కావలెను. ✆ 85000 51199. (B)

యాదవ 2nd M. Govt. టీచర్ విడో 50, 5'2" గల వరునికి పిల్లలులేని 42 to 50 సం॥లోపు వధువు కావలెను. విడో ఎంప్లాయ్/సెటిల్డ్‌కు ప్రాధాన్యత. ✆ 99493 97682. (B)

Kamma Divorced 33 '6' Feet B.Tech SWE Australia 85 K - P.A. Fair seeks suitable Bride Abroad (or) India. Kamma Only. Direct. ✆ 95734 99765. (B)

కుల ప్రసక్తిలేదు. కాపు, బలిజ, 31 సం॥ MCA, బిజినెస్ చేస్తున్న వికలాంగుడైన వరునికి తగిన వధువు కావలెను. ✆ 93946 60771, 93969 16742. (B)

వరుడు కావలెను

Reddy/ B.Ta/ MBA/ 29/ 5'3"/ 50Cr+ (Prop) Needs well Settled boy/ Cont Sunder Reddy Hyd. Ph. 7093051111/ (Whatsapp) Direct Person. (A)

SC Hindu, Madiga 30Y, 5'4" SWE 7.5L P.A, B.Tech (ECE) Suitable B.Tech, M.Tech Groom, kk9matrimony@gmail.com ✆ 6302703551 (Direct) (A)

బ్రాహ్మణ/ 26/ 5'4"/ BA/ ★ 22/ B.Tech/ SWE/ CTS/ ★ 29/ M.Sc/ 2L/ ★ 27/ 5'3"/ MA B.Ed/ వశిష్ట/ ★ 25/ B.Tech MS/ (US)/ W.Kg (US) ★ 24/ MBBS/ ★ 9440449285 (A)

Brahmin 27,5'5", B.Tech (CA), Very Fair, Bride Groom Wanted. Preferably. IIT, CA, Software, Professional. Contact: 9246542952 (A)

మాదిగ/ B.Tech/ C.Govt ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్/ 65,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9642459724 (A)

పెరిక/ ఏకైక కుమార్తె/ M.Sc/ Govt అగ్రికల్చర్ ఆఫీసర్/ 25000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9052296834 (A)

రజక/ B.Tech/ Govt Jr.Asst (పంచాయితీ రాజ్ Dept) / 25,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

విశ్వబ్రాహ్మణ / ఏకైక కూమార్తె/ B.Tech/ Govt Jr. Asst (R&B)/ 25000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886512010 (A)

పద్మశాలి/ B.Tech/ C.Govt స్టెనోగ్రాఫర్ (రైల్వే) 28000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 7288048678 (A)

యాదవ/ B.Tech IT/ C.Govt Asst. మేనేజర్ (HPCL)/ 55000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885055185 (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

కుమ్మరి/ B.Tech/ C.Govt టాక్స్ ఆఫీసర్ (కమర్షియల్ టాక్స్ Dept) 40,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9989450693 (A)

పద్మశాలి/ B.Tech/ Govt AE/ (GHMC)/ 38000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8886957298 (A)

మాల/ B.Tech/ C.Govt JTO (BSNL)/ 45000/ PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298 (A)

కమ్మ/ 24Y/ 5'.5" ఫెయిర్/ B.Tech/ Hydలో వెల్‌సెటిల్డ్ గల తండ్రి లేని అందమైన వధువుకు సాంప్రదాయం గల మధ్యతరగతి వరుడు కావలెను. ఇల్లరికం OK. ✆ 7386012821. (C)

Yadava 29, 5'7" B.Tech, Ph.D, USA, 90K, Hyd, 9440831748 ★ 29, 5'4" B.Tech, MS, USA, 100K, MBNR 9441735157 ★ 28, 5'2" B.Tech, MS, USA, 100K, Krishna 9440759945 (A).

కమ్మ (డైవర్సీ) 29Y, 5'5" B.Tech, SWE, 6L PA, 4Cr ఆస్తి (No Issues) గల వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9618226996 (A).

రెడ్డి 1995/ 5'7". B.Tech/ Deloitte/ 5L. P.A/ Fair & Rich ★ 1989/ 5'4" M.Pharma/ V. Fair. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో. 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1993/ 5'5", B.Tech/ MS/ US/ Fair & Rich ★ 1993/ 5'4", B.E (CSE)/ QAE/ HYD. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1993/ 5'5", MS/US/ 90K/ V.Fair/ 25 Cr. ★ 1992/ 5'6", M.S Arch/ 50 Cr. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో, 9848221166/ 8885559579 (A)

రెడ్డి/ డైవర్సీ/ 1981, 120K, 5'5" Fair కలిగిన వధువుకి (Only OC, USA) Well Settled అయిన వరుడు కావలెను. (డైరెక్ట్ కాంటాక్ట్) ✆ 9849118060 (A)

మున్నూరుకాపు/ డైవర్సీ/ కుల ప్రసక్తి లేని/ 33/ 5'3"/ Fr/ B.Tech/ H1 వీసా/ Sr. SWE/ USA/ 4 లక్షలు PM/ వెల్ సెటిల్డ్ అందమైన వధువుకు USAలో ఉన్న వరుడు కావలెను. ✆ 9966538381 (A)

వాల్మీకి- బోయ 26, 5'5", వైట్, B.Tech, Sr. SWE L&T, 5 LPA వధువుకి వరుడు కావలెను. 79010 12671, 73961 57727 (D)

బ్రాహ్మణ /21/5'3"/ 9th ★ 23/5'2'/5th ★ 25/5'3"/10th కట్నం ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. పురోహితం అయినా OK. ✆ 7674078296 / 8106446865 (A)

కాపు /32/5'3"/ ఫెయిర్ /MBA/ SWE/8L PA/ స్వంత ఇల్లు అందమైన వధువుకు మంచి వరుడు కావలెను. వెరి వెరి అర్జెంట్ ✆ 7386427256, వాట్సప్: 7386103012 (A)

బ్రాహ్మణ /22/5'3"/M.Sc ★ 23/5'4"/B.టెక్ ★ 25/5'3"/ B.టెక్ /SWE/ 2L ★ మధ్వ /23/5'2"/ B.టెక్ /SWE/3L ★ శ్రీవైష్ణవ /22/5'5"/MBA ★ డైవర్సీ /32/5'4"/B.టెక్ ✆ 9440449285 (A)

కాపు: 27/5'4"/MBBS, DGO ★ 25/5'5"/ B.టెక్, MBA/ H1వీసా ★ 25/5'4"/ B.టెక్/ SBI ఆఫీసర్ ★ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

కాపు – రెండో పెళ్లి - 28/5'4"/B.టెక్/ H1 వీసా ★ 29/5'3"/ B.టెక్ /CTS/ 1L PM ★ 38/5'4"/MBBS, MD (P) Govt సంప్ర: డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

SC మాదిగ: 27/5'2"/B.టెక్, MBA/ SBI ఆఫీసర్ ★ 27/ 5'4"/ B.టెక్, MS/H1 వీసా ★ 28/5'3"/MBBS, MD (Paed) సంప్ర: డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

విశ్వబ్రాహ్మణ, 25, 5'5", Red, MBA (HR), SWE, Infosys, 4. LPA వధువుకి వరుడు కావలెను. 0877-2230289, 76610 24446 (D)

ముదిరాజ్, 24, 5'5", B.Tech, SWE, Accenture, 35,000/- PM, V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246555529 (A)

విశ్వబ్రాహ్మణ, 25, 5'4", Fr, B.Tech, Asst. Engr., మున్సిపల్ Dept, Govt. జాబ్, 50,000/- pm, సాంప్రదాయ కుటుంబపు వధువుకు వరుడు కావలెను. ✆ 9290022700 (A)

చౌదరి, డైవర్సీ, 30Y, 5'5", ఫైనాన్స్ బిజినెస్, 15 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 8106499144 (A)

SC హిందుమాల, 24, 5'5", B.Tech, IT S/W/E, TechMahindra 35,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246151501 (A)

బ్రాహ్మణ, 26, Degree, 5'4", 32, Inter, 5'5" గల వధువులకు పురోహితం, Job (or) బిజినెస్ గల వరుడు కావలెను. ✆ 7075024529, 9010133726 (A)

యాదవ, 24, 5'5", B.Tech, SWE, Accenture, 35,000/- PM, V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246333320 (A)

కులపట్టింపులేదు, కాపు, 29, 5'4", డిగ్రీ, Govt. జాబ్, 35 వేలు PM, వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు ఫొటో & బయోడేటా 9949595523 కు వాట్సాప్ చెయ్యండి. (ప్లీజ్ డోంట్ కాల్, వాట్సాప్ మెసేజెస్ ఓన్లీ) (A)

కమ్మ, 23, 5'6", ఫెయిర్ B.Tech, SWE, TCS, 35 వేలు P/M అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. సంప్ర: 8125777297 (A)

నాయీబ్రాహ్మణ, 24, 5'5", B.Tech, SWE, CTS, 35,000/- PM, V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. 9246964555 (A)

కమ్మ/ USA, 25Y, 5'6" Fair, MS (C.S.E.) $ 90K P/A (Apply H1B), 25 ఎ॥ పొలం, USAలో ఉన్న కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574. (B)

యాదవ: B.Tech/ C. Govt. డిప్యూటి మేనేజర్/ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 65,000/- PM/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 8008939651. (A)

బెస్త గంగపుత్ర/ B.Tech/ Govt. ఆఫీసర్/ పంచాయతీరాజ్ Dept./ 45,000/- PM/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9618007823. (A)

కాపు కులపట్టింపు లేదు. 51 సం॥ 5.3 HT గవర్నమెంట్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్. విడో పిల్లలు లేరు 42 ఎకరాల భూమి కల మహిళకు వరుడు కావలెను. 9948991741. (E)

బ్రాహ్మిణ్స్ 26, 5'5" డిగ్రీ, అందమైన వధువుకి వరుడు కావలెను. శాఖపట్టింపు లేదు. పురోహితం & బిజినెస్ & జాబ్ OK ✆ 8978691424, 040-48542181 (A).

కుల పట్టింపులేదు. 23 Yr/ 5'4"/ B.Tech ఫెయిర్ 1st మ్యాచ్/ Pvt జాబ్ 50K (PM) తండ్రి రెడ్డి, తల్లి కాపు అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 8897587959 (A)

కాపు 24,5'.5" V.Fair B.Tech MNC, Hyd 70,000 P.M. 3 Cr ప్రోపర్టీ ఉన్న అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8885725522, 8885925522. (C)

కమ్మ: 24Y/ 5'4"/ B.Tech (IT)/ S/W in TCS, 45,000 P/M, 4 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97045 66499 (D)

రెడ్డి: 25Y/ 5'4"/ B.Tech (CSE)/ S/W in CISCO/ 50,000 P/M/ 3 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97041 88499 (D)

క్షత్రియ/ రాజులు: 24 Y/ 5'5"/ B.Tech (IT)/ S/W in MNC, Banglur/ 48,000 P/M/ 2 Cr. property ఉన్న అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. 97042 77499 (D)

రెడ్డి: 28Y/ M.Tech, IIT, S/W/ Microsoft, 20 L/PA, 5 Cr. property గల వధువుకు వరుడు కావలెను. (CNB OK)c 91604 11832 (D)

పద్మశాలి: 24/B.Tech, IT, S/W, Infosys, 6 Lak/ PA, 30 L వధువుకు తగిన వరుడు కావలెను. 98664 27407 (D)

Besta-25/B.Tech, CSE, S/W, HCL, 5 L/PA, 30L వధువుకు తగిన వరుడు కావలెను. 96767 88428 (D)

బ్రాహ్మణ: 25/ B.Tech, Bitsphilani, S/W "ACCENTURE"/ 6 L/PA అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 99636 06222 (D)

రెడ్డి/ 25/ 5'5"/ V.Fair/ M.Tech/ TCS/ Bangalore/ 8 LPA/ 20 C ఉన్న వధువుకు వరుడు కావలెను. సంప్రదించవలసిన నం. 63031 15956 (D)

క్షత్రియ/ 24/ 5'6"/ V.Fair/ B.Tech/ Cap Gemini/ HYD/ 6 LPA/ 5 C ఉన్న వధువుకు వరుడు కావలెను. సంప్రదించవలసిన నం: 63031 57289 (D)

బ్రాహ్మిణ్/ 23/ 5'5"/ V.Fair/ B.Tech/ MNC/ Bangalore/ 5 LPA/ 10 C ఉన్న వధువుకు తగిన వరుడు కావలెను. సంప్రదించవలసిన నం: 63031 15976 (D)

★ ★ ★

గౌడ/శెట్టిబలిజ, 34/5'.3"/Govt. డాక్టర్, M.S. Gen. Surgeon, డైవర్సీ వధువుకు డాక్టర్ వరుడు కావలెను. Caste No Bar, తల్లిదండ్రులు డాక్టర్స్. సంప్ర: 98481 20353. (G)

★ ★ ★

వివాహ వేదిక

విశ్వబ్రాహ్మణ పెళ్ళి సంబంధాల ప్రత్యేక సంస్థ బ్రహ్మముడి, గుంటూరు. కమీషన్ డిమాండ్ లేదు. 0863-2261898, 94911 25725.

గంగపుత్రుల పెళ్ళి సంబంధాలకై శ్రీగంగాభవాని గంగపుత్రుల వివాహ పరిచయాలు (వాడబలిజ, బెస్త, గూండ్ల, అగ్నికులక్షత్రియ, జాలరి) & ఇతరత్ర అంబర్‌పేట్ Hyd: 9000541008 (A)

20 సం॥ల అనుభవం గల బ్రాహ్మణ వివాహవేదిక శ్రీసత్యసాయి వివాహవేదిక ✆ 9849414098/ 040-66317515. satyasaivivahavedika.com (A)

JEELAKARRABELLAM.COM వెబ్‌సైట్‌లో ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసుకోండి Free Subscription పొందండి. Marriage Mediators కు Special Packages కలవు. వివరాలకు. ✆ 97016 59125. (I).

క్రిస్టియన్ వధువు, వరుల సంబంధాలకై సంప్ర॥ for Quik Marriage ★ Shyam ✆ 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

ప్రవీణ్ మ్యారేజిలింక్స్ అన్ని కులములు & కుల పట్టింపు లేని వారికి 1st , 2nd & లేటు మ్యాచెస్ కేవలం 10 రోజులలో సూటబుల్ మ్యాచ్ చూపించబడును. ✆ 91337 21197, 90595 94402 (W). (B)

ఓన్లీ Govt ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్నిమతాల, కులాల 1వ, 2వ, లేట్ విడో/ డైవర్సీలకై వివాహాలు & Govt ఎంప్లాయిస్ సం॥ధాలు కొరకు వెరిఫాస్ట్ సెటిల్‌కై ✆ 9000185415 (A)

కులపట్టింపులేని వారికి అన్ని కులాల 1వ/ 2వ లేట్/ విడో/ డైవర్సీ/ విడోయర్స్/ పెన్షనర్స్ వ॥ 20-70 సం॥ స్త్రీలకు ఫ్రీ, పు॥ సర్వీస్ చార్జ్ త్వరగా సంబంధం కుదర్చబడును. 7893688248 (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మాల స్పెషల్: IAS, IPS, IRS, IRTS, MBBS, MD,MS, USA, Govt. Jobs, SWE, 78930 13265 (N).

కులపట్టింపులేని వారికి 2వ, లేట్ సంబందాలకు ప్రతి ఆదివారం 2pm-5pm పరిచయవేదిక జరుగును 1000 మంది వధువరుల లీస్ట్ ఇవ్వబడును. Hyd ✆ 9440937900 (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com, Hyd. 9440831748, Gunt. ✆ 9440759945, VSP. 9441735157 (A).

Whatsapp Your Photo & Biodata to 9347262769. We will send the suitable matches. www. pellisandadi.com ESTD 1991 (A).

నిఖిల్‌గౌడ్స్ మ్యారేజ్‌బ్యూరో Only గౌడ్స్, డాక్టర్స్/ Engg/ PG/ డిగ్రీ, దేశ/ విదేశ/ 1 వ, 2 వ లేట్ వధూవరులకై సంప్ర: రాంనగర్, Hyd. 9848041335, 9848371924 (A).

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ, Hyd. ✆ 9248600342, 8019207503, brahmininformationmatri@gmail.com (A)

అన్ని కులముల, కులాంతర దేశ, విదేశ 1వ, 2వ డాక్టర్, Engr, Govt, P.Job. వివాహ సంబంధాలకై హేమ ✆ 8497939432 (A)

కమ్మ పెళ్ళిసంబంధములు S.W.E., N.R.I.'s, డాక్టర్స్, బిజినెస్, ఇండస్ట్రియెలిస్ట్స్, High Status Matches కొరకు సంప్రదించండి. ✆ 98665 21319. (B)

అన్ని కులాలవారికి: డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, అబ్రాడ్స్, బిజినెస్, హైరిచర్స్ & ఆల్ గౌట్ ఎంప్లాయిస్, 1వ, 2వ, దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

కాపు, రెడ్డి, వెలమ, మున్నూరుకాపు, ఆల్ క్యాస్ట్ ఫాస్ట్ సెటిల్‌మెంట్ Since 18 Yrs. IIT, IIM, Doct, Engg, MS, USA సిటిజెన్స్ Hi ప్రొఫైల్స్ 2nd మ్యారేజెస్ సంప్ర: శ్రీ ప్రియదర్శిని మ్యారేజెస్. 9346344474, 9666984474, 040-48510670 (A)

Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MDS & డా॥కి మాత్రమే. 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదుర్చబడును. ✆ 9866411588 (A)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ క్యాస్ట్స్) MBBS/ MD/ MS/ MCH/ DM/ BDS & బిజినెస్ మ్యాన్స్‌కి 1వ, 2వ, విడో దేశవిదేశ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9966808059 (A)

వడ్డెర, వడ్డి, వడియరాజుల సంబంధాలకు మాత్రమే నమ్మకమైన ఏకైక సంస్థ వివరాలకు సంప్రదించండి CELL, 7661800534, 9390363507 (A).

ఆర్యవైశ్య: వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Suresh ✆ 7702262508/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

P.Supriyareddy, Rich Reddy Boys & Girls India & Abroad Matches, All Emp/ Govt./ Pvt./ SWE/ Doc's/ Business/ Divorcees from all Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040 - 23544820, 23545762. Email: palletisupriyareddy@gmail.com (A)

సెకండ్ మ్యారేజీలకు మాత్రమే శ్రీ బాలాజి మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. ✆ 9885144375 (A)

★ ★ ★

వాసవి – విజయవాడ (ర) వారి 55వ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక మరియు 11వ పునర్వివాహ పరిచయవేదిక 15.7.2018 తేదీన I.V. ప్యాలెస్, విజయవాడ నందు ఉ. 9 గంటలకు మరియు మధ్యాహ్నం 2 గంటలకు జరుగును. వివరాలకు: 99120 26286, 81064 54284. (B)

CA

ఈనాడు

హాయ్

విజయవాడ ఆదివారం జూన్ 3, 2018

వెన్నెలంత సమంత

మల్లెపూల మధ్య ముద్దబంతిలా.. ముత్తైదువ మెడలో పసుపుకొమ్ములా సమంత ఎంత చక్కగా ఉంటుందో. ఆ రూపం ఏనాడో మాయ చేసేసింది. నవ్వులో అమాయకత్వం, మాటలో కొంటెతనం, చూపులో జాణతనం ఇవన్నీ హోల్‌సేల్‌గా అమ్మాయి అయితే సమంత. అందుకే సమంత.. ఇసుమంత ఖాళీ లేకుండా మన మనసంతా ఆక్రమించేసుకుంది. సెంచరీ అయ్యాక బ్యాట్స్‌మెన్ వీర లెవెల్లో హిట్టింగ్ చేసినట్టు - పెళ్లయ్యాక సమంత విజృంభించేస్తోంది. 'రాజుగారి గది 2', 'రంగస్థలం', 'మహానటి', 'అభిమన్యుడు' ఇలా వరుసగా విజయాల్ని అందుకుంది. కెరీర్‌లోనే అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న సమంతని పలకరిస్తే.. 'హాయ్..' అంటూ తను మనసు విప్పింది.

● **సావిత్రి నుంచి నేర్చుకోగలిగే పాఠాలేంటి?**

చాలా ఉన్నాయి. ఓ నటిగా చూస్తే నాకు ఓ కోణంలో కనిపించారామె. సగటు గృహిణి కోణంలోంచి చూస్తే ఇంకోలా కనిపిస్తారు. ఆమె దయాగుణం గురించి తెలిసి చలించిపోయా. సెట్లో ఆమె ప్రవర్తించే తీరు, తన సిబ్బందితో ఉండే పద్ధతి ఇవన్నీ బాగా నచ్చాయి.

● **మీరూ మీ సిబ్బందిని చాలా బాగా చూసుకుంటారట కదా?**

అది మన బాధ్యత. తెరపై నేనో స్టార్ కావొచ్చు. నేను మాత్రమే కనిపించొచ్చు. నేను అంత అందంగా కనిపిస్తున్నానంటే కారణం.. నా సిబ్బంది కూడా. వాళ్లని నేను చూసుకోకపోతే ఎవరు చూసుకుంటారు?

● **పెళ్లయ్యాక బాగా కలిసొచ్చినట్లుంది.. 'రాజుగారి గది 2' నుంచి 'మహానటి' వరకూ విజయ పరంపర కొనసాగుతోంది!**

(నవ్వుతూ) అవును... నాకూ అదే అనిపిస్తోంది. పెళ్లయ్యాక విడుదలైన తొలి సినిమా 'రాజుగారి గది 2'. ఆ సమయంలో చాలా టెన్షన్ పడేదాన్ని. అక్కినేని కోడలుగా అదే నా తొలి సినిమా. స్వతహాగానే నా సినిమా విడుదల అవుతోందంటే.. ఎక్కడ లేని ఒత్తిడి పెరిగిపోతుంటుంది. ఆ సమయంలో ఎప్పుడూ పడనంత టెన్షన్ అనుభవించా. ఆ చిత్రాన్ని బాగా ఆదరించారు. దాంతో మనసు తేలికపడింది. 'రంగస్థలం', 'మహానటి' ఇలా వరుస విజయాలు అందాయి. 'అభిమన్యుడు'కీ మంచి స్పందన వస్తోంది. ఓరకంగా నాకు మంచి సీజన్ నడుస్తోందనే చెప్పాలి.

నా కథా సావిత్రిలా అయ్యేదేమో?!

చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటున్న అమ్మాయిల్ని చూస్తే చాలా గర్వంగా ఉంటుంది. వాళ్ల కాళ్లమీద నిలబడడానికి చేస్తున్న ప్రయత్నమది. చిన్నదో పెద్దదో చేతిలో ఓ ఉద్యోగం ఉంటే.. ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తుంది. నైన్ టూ ఫైవ్ ఉద్యోగాలు చేస్తూ, ఇంట్లో పనులు చక్కబెట్టుకుంటూ నెట్టుకురావడం.. చాలా కష్టం.

● **'మహానటి'లో డబ్బింగూ చెప్పుకొన్నారు.. ఇక మీదటా కొనసాగిస్తారా?**

తప్పకుండా. 'మహానటి'లో డబ్బింగ్ చెప్పాల్సిందే అని దర్శకుడు పట్టుపట్టారు. పైగా ఆ పాత్రకు నత్తి ఉంటుంది. కాస్త అటూ ఇటుగా చెప్పినా 'నత్తి'లో కొట్టుకుపోతుందని ధైర్యం చేశా.. (నవ్వుతూ). నా పాత్రని వెండి తెరపై చూసుకున్నప్పుడు సంపూర్ణమైన ఆనందాన్ని అనుభవించా. 'కనిపిస్తోంది నేనే... వినిపిస్తోందీ నేనే' అన్నప్పుడు ఆ ఫీలింగ్ మరోలా ఉంటుంది. దర్శకులు సమయం ఇస్తే.. ఇక మీదట ప్రతీ పాత్రకూ నాకు నేనే డబ్బింగ్ చెప్పుకొంటా.

● **'మహానటి' ఓ కథానాయిక కథ.. ఈ సినిమా చూశాక మీరెంత మారారు? ఏ విషయంలో?**

సావిత్రి గారి గురించి నాకు పెద్దగా తెలీదు. ఈ సినిమా చూశాక చాలా విషయాలు అర్థమయ్యాయి. కొన్ని కొన్ని చోట్ల 'అరె.. ఇది నా కథలా ఉందే' అని అనిపించింది. ప్రేమ విషయంలో ఓసారి నేనూ అలానే నమ్మాను కదా? కానీ అదృష్టం కొద్దీ తృటిలో తప్పించుకున్నాను. అందులోంచి త్వరగా బయటపడ్డాను. లేదంటే నా కథా సావిత్రిలానే అయ్యేది. నేను చేసుకున్న పుణ్యం, అదృష్టం వల్లే చై దొరికాడనిపించింది.

నాకు సవాళ్లంటే చాలా ఇష్టం. 'నీ వల్ల కాదు' అని ఎవరైనా అంటే పంతం వచ్చేస్తుంది. చేసి తీరాలన్న కసి పెరుగుతుంది. నన్ను భయపెడితే.. నాలో ఉన్న ప్రతిభ పూర్తి స్థాయిలో బయటకు వస్తుంది. అందుకే నన్ను భయపెట్టే పాత్రలు రావాలని కోరుకుంటాను. 'రంగస్థలం'లో మహాలక్ష్మి గానీ, 'మహానటి'లో మధురవాణి గానీ నన్ను అలా భయపెట్టిన పాత్రలే. కాబట్టే.. వాటి గురించి అంత శ్రమించాను. దానికి తగిన ఫలితాన్నీ పొందాను.

● **ఆ రోజులు పోయాయి**

"స్టార్ పేరు చూసి థియేటర్‌కి వెళ్లే రోజులు పోయాయి. ఇప్పుడు స్టార్ కాదు, కథే ముఖ్యం. చిన్న చిన్న సినిమాలు ఎవరూ ఊహించని స్థాయిలో విజయాలు అందుకుంటున్నాయి. అదే సమయంలో పెద్ద పెద్ద హీరోలు చేస్తున్న సినిమాల ఫలితాలు తలకిందులవుతున్నాయి. ఏది మంచి కథో, ఏది కాదో తెల్చుకోవడం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే మా చేతుల్లో ఉంది. చిన్న సినిమాలకు రాను రాను మరింత గౌరవం పెరుగుతుంది"

● **తెరపై ఇతర కథానాయకులతో రొమాన్స్ చేయడం తగ్గించేస్తారా?**

అలా ఏం లేదు. నేను నటిని. నటన నా వృత్తి. తెరపై వేరే హీరోతో రొమాన్సూ నటనే కదా? అటు అక్కినేని కుటుంబం గానీ, ఇటు దగ్గుబాటి కుటుంబం గానీ...సినిమాల గురించి పూర్తిగా తెలిసినవాళ్లు. మూడు తరాల నుంచి ఈ రంగంలో ఉన్నారు. వాళ్లు దీన్ని సీరియస్‌గా తీసుకుంటారని నేను అనుకోను. కాకపోతే నా పాత్రలు హుందాగా ఉండేలా చూసుకుంటా. అది నా బాధ్యత అనుకుంటున్నా.

● **డిగ్రీ వరకే చదివారు కదా? ఇంకా చదివుంటే బాగుండేది అనిపించలేదా?**

లేదు. ఇప్పుడు నటననూ చదువే అనుకుంటున్నా. డిగ్రీలకు ఓ కాలపరిమితి ఉంటుంది. సినిమాలకు అలా ఉండదు. తొంభై ఏళ్లొచ్చినా ఇంకా నేర్చుకుంటూనే, చదువుకుంటూనే ఉండాలి. నాకు చదువుకున్నవాళ్లంటే చాలా గౌరవం. నా స్నేహితుల్లో విద్యాధికులు చాలామంది ఉన్నారు. ఎవరైనా పిల్లలు కనిపిస్తే పేరేంటి? అని అడగను 'ఏం చదువుతున్నావ్' అనే అడుగుతా.

● **నేనూ.. నా హీరోలు**

"నేను సూర్యకి వీరాభిమానిని. కాలేజీ రోజుల్లో సూర్య అంటే పడి చచ్చిపోయేదాన్ని. అలాంటి నేను.. సూర్యతో కలసి నటించా. పరిశ్రమకొచ్చాక నేను సాధించిన ఘనతల్లో అదొకటి. నా లక్కీ హీరో ఎన్టీఆర్ అని చెప్పాలి. తారక్‌తో చేసిన ప్రతీ సినిమా బాగా ఆడింది. నా కెరీర్‌లో కీలకమైన దశల్లో విజయాలు అందించిన కథానాయకుడు ఎన్టీఆర్. ఇక.. చైతూ గురించి ఎంత చెప్పినా తక్కువే. తనతో పని చేయడం చాలా ఈజీ. నా భర్త అని కాదు. నా తొలి కథానాయకుడిగా తనకు ఎప్పుడూ మదిలో ఓ ప్రత్యేకమైన స్థానం ఉంటుంది"

● **తెలివైన నిర్ణయం**

"నేను తెలివైన దాన్నో, తెలివి తక్కువదాన్నో నాకే తెలీదు. కొన్నికొన్నిసార్లు తెలివిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటా. కొన్నిసార్లు 'ఇలాంటి నిర్ణయం తీసుకున్నానేంటి' అనిపిస్తుంది. నటిగా మాత్రం నేను తీసుకున్న నిర్ణయాల విషయంలో గర్వపడుతుంటా. ఎందుకంటే నేను 'నో' చెప్పిన సినిమాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. ఓ అమ్మాయిగా నేను తీసుకున్న తెలివైన నిర్ణయం చైతూని నా జీవిత భాగస్వామిగా ఎంచుకోవడమే"

● **ఎంత సంపాదించాలి?**

"సంపాదనపై నాకెప్పుడూ వ్యామోహం లేదు. 'ఇంత సంపాదించాలి' అనే లెక్కలెప్పుడూ వేసుకోలేదు. నేను మధ్యతరగతి నుంచి వచ్చినదాన్ని. సర్దుకుపోవడం అనేది నాకు బాగా తెలుసు. అలాంటి స్థితి నుంచి ఇప్పుడు నాకు కావల్సినదానికంటే ఎక్కువే సంపాదించాను. ఇంకెంత సంపాదించాలి? ఎంత సంపాదిస్తే సంతృప్తి దక్కుతుంది? సంతృప్తి అనేది డబ్బులో లేదు. ఖర్చు పెట్టడంలోనూ లేదు. ఆనందాల్ని అనుభవించడంలో ఉంటుంది. పంచుకోవడంలో ఉంటుంది. ఈ విషయం నాకు త్వరగానే అర్థమైంది"

– మహమ్మద్ అన్వర్

తెలుగమ్మాయి... వయా బాలీవుడ్ టూ టాలీవుడ్.
ఇది అదితీరావ్ హైదరీ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే..
రెండో మాటా ఉందండోయ్...!
ఈ అమ్మాయి మన వనపర్తి సంస్థానాధీశులకు మనవరాలు.
మూడో ముచ్చటేంటంటే?...
ప్రేక్షకుల్ని 'సమ్మోహనం' చేయడానికి త్వరలోనే తెలుగు తెరపై తళుక్కుమంటోంది.
రిషివ్యాలీలో చదువు, తెరంగేట్రం, అందుకున్న ప్రశంసలు, ఏడ్పించిన సంఘటనలు... ఇలా అదితీ చెప్పిన అచ్చ తెలుగు కబుర్లు ఎన్నో ఉన్నాయి...

ఈ అందం గొప్పేం కాదు

వనపర్తి యువరాణి సమ్మోహనం

■ **అదితీరావ్ హైదరీ.. పేరు కాస్త భిన్నంగా ఉందనిపిస్తోంది...?**

అవును.. అమ్మమ్మా, నానమ్మ కుటుంబాల పేర్లను నా నేమ్ పక్కన చేర్చుకున్నా. అందుకే అలా ఉంది. నిజానికి నేను తెలుగమ్మాయిని అని చాలామందికి తెలియదు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా పదహారణాల తెలుగమ్మాయిని అని చెప్పుకోవడానికే ఇష్టపడతాను. మాది వనపర్తి. మా తాతగారు వనపర్తి జమీందారు రామేశ్వర్‌రావు, అమ్మమ్మ శాంతా రామేశ్వర్ రావ్. తను కొంకణి. ఉన్నత విద్యావంతురాలు. హైదరాబాద్‌లో విద్యారణ్య స్కూలు అందరికీ తెలిసే ఉంటుంది. అది స్థాపించింది మా అమ్మమ్మే. మా అమ్మ విద్యారావ్. నేను పుట్టకముందే అమ్మమ్మా వాళ్లు వనపర్తి నుంచి హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. నాన్న ఇషాన్ హైదరీ. అమ్మానాన్నలది ప్రేమ వివాహం. నాన్నా వాళ్ల నాన్న నిజాం కాలంలో హైదరాబాద్ ప్రధానమంత్రి. ఉస్మానియా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించింది ఆయనే. నానమ్మ ఆడవాళ్ల కోసం హైదరీ క్లబ్ ప్రారంభించింది. రెండూ రాజకుటుంబాలే. నటుడు అమిర్ ఖాన్ భార్య కిరణ్‌రావ్.. మా మేనమామ కూతురు. ప్రతి దసరాకి మేం వనపర్తి వస్తాం.

■ **చదువు మాటేంటి?**

నాకు చదువుకంటే డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. లీలాసామ్‌సన్ అనే నిపుణురాలి దగ్గర చిన్నప్పుడే భరతనాట్యం నేర్చుకున్నా. ఆ యసులోనే నాకు సినిమాల్లో నటించాలని ఉండేది. మణిరత్నం సినిమాలు ఎక్కువగా చూసేదాన్ని. అందుకే హీరోయిన్ అవ్వాలనుకున్నా. ఇంటర్ వరకూ మదనపల్లి రిషీవ్యాలీ స్కూల్లోనే సాగింది. అమ్మకి క్రమశిక్షణ చాలా ఇష్టం. అందుకే అక్కడ చేర్పింది. దిల్లీ లేడీ శ్రీరామ్ కాలేజీలో సోషియాలజీలో పీజీ చేశా.

■ **సినిమాల్లోకి ఎలా వచ్చారు?**

నేను మా డ్యాన్స్ బృందంతో కలిసి దేశవిదేశాల్లో భరతనాట్య ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. ఓ ప్రదర్శనలో వేదిక మీద తమిళ దర్శకురాలు శారదా రామనాథన్ చూశారు. నా దగ్గరకు వచ్చి 'మా సినిమాలో నటిస్తావా' అని అడిగారు. స్క్రీన్ టెస్ట్ కూడా చేయలేదు. అలా నేను చేసిన మొదటి సినిమా 'శృంగారం'. నేను నటిస్తానంటే అమ్మ కాదనలేదు. 'నీకు ఆసక్తి ఎందులో ఉంటే అటే వెళ్లు' అంటూ ప్రోత్సహించింది. మా అమ్మమ్మ నన్ను వెండితెరపై చూసి ఎంతగానో మురిసిపోయేది.

■ **తెలుగు తెరపైకి రావడానికి ఎందుకు ఆలస్యమైంది?**

నాకూ తెలుగు సినిమాలు చేయాలనే ఉండేది. అయితే దిల్లీ నుంచి ముంబయికి మకాం మార్చిన తరువాత హిందీలోనే ఎక్కువగా అవకాశాలు వచ్చాయి. మణిరత్నం ద్విభాషా చిత్రమైన 'చెలియా'తో తెలుగు ప్రేక్షకులకు కొంత దగ్గరయ్యాననే చెప్పాలి. 'సమ్మోహనం' సినిమా కోసం మోహనకృష్ణ సర్ సంప్రదించినప్పుడే మనసులో చేయాలని నిర్ణయించుకున్నా. ఒక అమ్మాయి సినిమాలో నటించాలని నగరానికి వచ్చి.. హీరోయిన్‌గా ఎదిగిన తీరు నేపథ్యంలో ఈ చిత్ర కథ ఉంటుంది. ఈ చిత్రానికి నేనే డబ్బింగ్ చెప్పుకొన్నా. దర్శకుడు సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో వరుణ్‌తేజ్‌తో మరో చిత్రంలో నటిస్తున్నా. తెలుగులో వచ్చిన అవకాశాలను వదులుకోను.

■ **తెలుగు ఎప్పుడు నేర్చుకున్నారు?**

నార్త్‌లో పెరగడం వల్ల మొదట్లో తెలుగు రాలేదు. చదువూ, సినిమాల నేపథ్యంలో అవసరమే రాలేదు. 'సమ్మోహనం'లో నటిస్తున్నప్పుడు నేర్చుకున్నా. డబ్బింగ్ నేనే ఎందుకు చెప్పాలనుకున్నానంటే.. మన గొంతు వినిపించినప్పుడు ప్రేక్షకులకు ఇంకా దగ్గరవుతాం. ఆ ఉద్దేశంతోనే చెబుతానంటే మోహనకృష్ణ ఒప్పుకొన్నారు. పక్కా లోకల్ అమ్మాయిని అయి ఉండి వేరే వాళ్లతో డబ్బింగ్ చెప్పించుకోవడం ఏంటని ఆలోచించా. పట్టుదలతో నేర్చుకున్నా.

■ **'పద్మావత్'లో అవకాశం ఎలా వచ్చింది?**

సంజయ్‌లీలా బన్సాలీ స్వయంగా ఫోన్ చేసి.. మెహరున్నీసా పాత్ర నువ్వు చేయాలి అని చెప్పారు. ఆ తరువాత తెలిసిన విషయం ఏంటంటే.. జయాబచ్చన్ నన్ను చూసి 'మెహరున్నీసా పాత్రకు ఈ అమ్మాయి తప్ప ఎవరూ సూట్ కారు' అని చెప్పారంట. ఆమె గుర్తింపు ఓ ప్రశంసలానే భావిస్తా.

■ **షూటింగ్‌లో సమయం దొరికితే... ఏం చేస్తుంటారు?**

ఎక్కువగా బయటి ప్రపంచాన్ని చూస్తాను. ఇది మా అమ్మమ్మ దగ్గర్నుంచీ నేర్చుకున్నా. మనం మన చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరి దగ్గర్నుంచీ ఎంతో కొంత తెలుసుకోవాల్సింది ఉంటుంది. అందుకే నేను సెట్‌లో బాయ్ దగ్గర్నుంచీ నిర్మాత వరకూ ప్రతి ఒక్కర్నీ పలకరిస్తాను. వారి వృత్తుల గురించి అడిగి తెలుసుకుంటాను.

■ **అందానికి నిర్వచనం..?**

దానికి నిర్వచనం అనే బదులు నా ఫీలింగ్స్ చెబుతా. మనకు బయటకు కనిపించేది అందం అని నేను అనుకోను. ఇందులో ఏముంది అంతా జన్యుసంబంధం. అలాగాకుండా మన లోపల మనసు ఎంత నిష్కల్మషంగా ఉంటే అంత అందంగా ఉన్నట్టు. మన జీన్స్ వల్ల మనం అందంగా పుట్టొచ్చు. అంటే మా అమ్మ అందంగా ఉంది కాబట్టి నేను అందంగా ఉన్నాను. అది గొప్ప కాదు. మనం చేసే పనులూ అందంగా ఉండాలి.

■ **పరిశ్రమలో బాధపడిన ఘటనలు?**

నేను కెరీర్ మొదలుపెట్టిన తొలినాళ్లలో సోషల్ మీడియాలో ఒక ఫొటోని మార్ఫింగ్ చేసి.. చెత్త రాతలు రాసి పెట్టారు. అది చూసి మూడురోజులు అన్నం తినలేదు. నిద్రపోలేదు. ఏడుస్తూనే ఉన్నా.. చాలా బాధపడ్డాను. అప్పుడు అమ్మ ఒక మాట చెప్పింది. 'ఆ రాతలు వాళ్ల బుర్రలో నుంచి వచ్చినవి.. నీవి కాదు. అంటే సమస్య వాళ్లలో ఉంది,. నీలో లేదు' అంటూ ఓదార్చింది. దాదాపు మూడేళ్లు పట్టింది.. ఇలాంటి రూమర్స్ చదివినా కోలుకోవడానికి. అలాగని నేను సోషల్ మీడియాను తప్పు పట్టను. సినిమాల్లో నటన బాగుంటే మంచిగా రాస్తారు. ప్రశంసిస్తారు. నేను ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్ వాడతా. ట్విటర్‌లో గాసిప్‌లు రాస్తున్నారని మానేశా.

■ **మర్చిపోలేని ప్రశంసలు?**

ఒక సారి అమితాబ్‌బచ్చన్ సర్ కలిసినప్పుడు.. 'నిన్ను తెర మీద చూస్తున్నప్పుడు చూపు తిప్పుకోవడం కష్టం' అని చెప్పారు. గాల్లో తేలినట్టు అనిపించింది. అలానే పద్మావత్ సినిమా విడుదలయ్యాక రేఖ నాకో ఉత్తరం రాసి దాన్ని గులాబీ రేకుల్లో ఉంచి ఓ పార్సిల్ పంపారు. పూలరెక్కలు వాడిపోవచ్చు.. వాసన ఎప్పటికీ ఉంటుంది. అలానే సినిమా పాతదైపోవచ్చు.. నటన ఎప్పుడూ అలానే ఉంటుంది అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.

మూడు పూటలా మామిడే

ప్రతి వేసవికీ హైదరాబాద్ వచ్చేదాన్ని. అమ్మమ్మ నాకోసం బుట్టలు బుట్టలు మామిడి పండ్లు తెప్పించి ముందు పెట్టేది. లంచ్ డిన్నర్ ఉండేది కాదు. ఆకలి అంతా మామిడి పండ్లతోనే తీరేది. మా అమమ్మ చాలా మోడ్రన్. నన్నూ అలానే ఉండమనేది. మూడేళ్ల క్రితమే తను చనిపోయింది. దాంతో హైదరాబాద్ రావడం తగ్గిపోయింది.

అమ్మమ్మలా వండలేను

ఎగ్ దోశ, బిర్యానీ..కట్టీదాల్.. ఇలా చాలా రకాల వంటలు చేస్తాను. అమ్మమ్మలా పప్పు చారు మాత్రం చేయలేకపోతున్నా. ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ ఉన్న ప్రత్యేక వంటకాల్ని మా వాళ్లకి పార్సిల్ చేసిపంపుతుంటా. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్నా కదా.. హలీం పంపే పనిలోనే ఉన్నా.

– నిర్వాణ్

ఈనాడు సినిమా

కుర్రకారు... కిర్రాకు

❑ విడుదలకు ముందే వ్యాపారం ❑ నిర్మాతలకు కాసుల పంట

నాగచైతన్య

నాని

విత్తనం మొక్కై, మొక్క చెట్టై, ఆ చెట్టు పళ్లు ఇచ్చేంత వరకూ రైతుకు భరోసా ఉండదు. అలాగని విత్తనంపై ప్రేమా చావదు. ప్రతి రోజూ శ్రద్ధగా నీళ్లు పోస్తాడు. ఫలితం అందితే సరే సరి. లేదంటే మరో విత్తనం, మరో మొక్క సిద్ధం.

సినిమా కూడా అంతే. రోజుల తరబడి శ్రమ, రూ.కోట్ల ఖర్చు.. ఇవన్నీ సరైన ప్రతిఫలం ఇస్తాయా, లేదా? అనేది సినిమా విడుదలై మొదటి షో పడేంత వరకూ తెలీదు. సినిమా వ్యాపారంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవ్వరికీ తెలీదు. ఏ సినిమా హిట్టవుతుందో, ఏది కాసుల వర్షం కురిపిస్తుందో, ఏది నెత్తిన చెంగు వేసుకోవాల్సిన పరిస్థితి తెస్తుందో ఊహించలేం.

అలాంటప్పుడే 'విడుదల ముందస్తు వ్యాపారం' నిర్మాతల పాలిట వరంగా మారుతుంటుంది. 'ఈ మొక్క చెట్టై పళ్లు ఇచ్చినా ఇవ్వక పోయినా.. నేను కొనేస్తున్నా' అంటూ ఎవరైనా వచ్చి రైతుకి బయానా ఇస్తే ఎంత పొంగిపోతాడో? నిర్మాత పరిస్థితి కూడా అలానే ఉంటుంది. సినిమా సెట్లో ఉండగానే 'ఓవర్సీస్ నాది, నైజాం నాది, సీడెడ్ నాది' అంటూ క్యూ కడితే ఆ ఆనందానికి అంతు ఉండదు. అయితే ఇది వరకు ఈ ముందస్తు వ్యాపారం స్టార్ హీరోల చిత్రాలకే కనిపించేది. వాళ్లకంటూ ప్రత్యేక అభిమాన గణం, మార్కెట్ ఉండడంతో.. పంపిణీదారులు ముందే సినిమాని కొనడానికి ఎగబడేవారు. అందుకే బడా హీరోలతో సినిమాలు చేయడానికి నిర్మాతలు క్యూ కట్టేవారు. ఎందుకంటే వాళ్లతో సినిమా అంటే మినిమమ్ గ్యారెంటీ ఉంటుంది. ఇప్పుడు రోజులు మారాయి. ఎవరి దగ్గర హిట్లుంటే వాళ్లే స్టార్లు. ఎవరి సినిమా హిట్టయితే వాళ్లకే మార్కెట్టు. అందుకే నవతరం కథానాయకులకూ 'ప్రీ రిలీజ్ బిజినెస్' భారీగానే జరిగిపోతోంది. వాళ్ల సినిమా సెట్‌పై ఉండగానే హాట్ కేకులా అమ్ముడుపోతోంది. నిజంగా తెలుగు చిత్రసీమలో ఇది ఆహ్వానించదగిన పరిణామం.

విజయ్ దేవరకొండ



వరుణ్‌తేజ్

యువ కథానాయకుల్లో నానిది ప్రత్యేక స్థానం. వరుస విజయాలతో స్టార్‌డమ్ సంపాదించుకున్నాడు. వరుసగా ఎనిమిది విజయాలు అందుకుని ఎవరికీ సాధ్యం కాని అపురూపమైన రికార్డు సొంతం చేసుకున్నాడు. 'భలే భలే మగాడివోయ్' నుంచే నాని రేంజ్ పెరిగింది. ఆ సినిమాకి జరిగిన వ్యాపారం ట్రేడ్ వర్గాల్ని సైతం ఆకట్టుకుంది. అప్పటి నుంచి నాని సినిమా అంటే షూటింగ్ దశలోనే వ్యాపారం జరిగిపోవడం మొదలెట్టింది. ఇటీవల విడుదలైన 'కృష్ణార్జున యుద్ధం' సైతం విడుదలకు ముందే హాట్ కేకులా అమ్ముడైపోయింది. శాటిలైట్ పరంగానూ నాని సినిమాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఓవర్సీస్‌లో నాని సినిమా అంటే ఎగబడిపోతున్నారు. శర్వానంద్ కూడా తన జోరు చూపిస్తున్నాడు. 'రన్ రాజా రన్' నుంచి శర్వా కమర్షియల్ కథల్ని ఎంచుకోవడం మొదలెట్టాడు. దానికి తగ్గట్టుగానే తన చిత్రాలన్నీ ఆర్థిక విజయాల్ని సాధిస్తున్నాయి. 'మహానుభావుడు' శర్వా కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. దాంతో శర్వా మార్కెట్ మరింతగా విస్తృతమైంది. ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో 'పడి పడి లేచె మనసు'లో నటిస్తున్నాడు. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే వ్యాపారం పూర్తి చేసుకుంది. మరోవైపు సుధీర్‌వర్మ దర్శకత్వంలో నటిస్తున్నాడు శర్వా. ఈ చిత్రానికి మంచి ఆఫర్లు అందుతున్నాయి. విదేశాల్లోనూ శర్వా సినిమాకి మంచి డిమాండ్ ఏర్పడింది. అక్కినేని వారసుడిగా తెరంగేట్రం చేసినా.. తనకంటూ ఓ స్థాయి, మార్కెట్ సంపాదించుకున్నాడు నాగచైతన్య. అందుకే చైతూ సినిమా అంటే మార్కెట్ వర్గాల్లో ఆసక్తి మొదలైపోతుంటుంది. అందుకే 'శైలజారెడ్డి అల్లుడు' సెట్స్‌పై ఉండగానే.. వ్యాపారం జరుపుకోగలుగుతున్నాడు.

శర్వానంద్

'అర్జున్ రెడ్డి'తో యువ కథానాయకుల్లో తనకంటూ ఓ స్థానం ఏర్పరచుకున్నాడు విజయ్ దేవరకొండ. అతని కథల ఎంపికపై ఉన్న నమ్మకంతో.. పంపిణీదారులు ముందుగానే కర్చీఫ్‌లు వేసుకుంటున్నారు. 'టాక్సీవాలా'ని గీతా ఆర్ట్స్ సొంతంగా విడుదల చేస్తోంది. శాటిలైట్, డిజిటల్ కలిపి దాదాపుగా రూ.5 కోట్ల వరకూ పలికాయి. సాధారణంగా మెగా కథానాయకులకెప్పుడూ మార్కెట్ విషయంలో ఢోకా ఉండదు. ఇది వరకు సాయిధరమ్ తేజ్ సినిమాలకు మంచి గిరాకీ ఉండేది. వరుస పరాజయాలతో సాయి మార్కెట్‌కి బ్రేకులు పడ్డాయి. ఇప్పుడు వరుణ్‌తేజ్ చిత్రాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. 'ఫిదా', 'తొలి ప్రేమ'లతో పంపిణీదారుల దృష్టిని ఆకర్షించాడు వరుణ్. ఇప్పుడు సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో నటిస్తున్నాడు. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే అమ్ముడుపోయింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సినిమా కూడా ఇప్పుడు హాట్ కేక్ అని చెప్పుకోవాలి. 'అల్లుడు శీను'తోనే మాస్‌కి దగ్గరైపోయాడు శ్రీను. బోయపాటి శ్రీను 'జయ జానకి నాయక' దాదాపుగా రూ.45 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ చేసుకుంది. ప్రస్తుతం శ్రీనివాస్ నటించిన 'సాక్ష్యం' విడుదలకు సిద్ధం అవుతోంది. నైజాం రూ.7 కోట్లకు అమ్ముడైంది. శాటిలైట్, డిజిటల్ కలిపి 13.5 కోట్లకు అమ్ముడైంది. మరోవైపు శ్రీనివాస్ అనే యువ దర్శకుడితో ఓ సినిమా చేస్తున్నాడు బెల్లంకొండ. కాజల్ కథానాయిక. ప్రస్తుతం రెండో షెడ్యూలు జరుగుతోంది. ఇంతలోనే హిందీ శాటిలైట్ ఏకంగా రూ.9.5 కోట్లకు అమ్ముడైందని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

యువ కథానాయకుల జోరు కచ్చితంగా నిర్మాతల్లో ఉత్సాహాన్ని నింపేదే. అయితే.. మార్కెట్ ఎప్పుడూ జయాపజయాలపైనే ఆధారపడి ఉంటుంది. ఓ విజయం కొట్టగానే మార్కెట్ పుంజుకుంటుంది. ఓ పరాజయానికి పడిపోతుంది. విజయాన్ని కాపాడుకోవాలంటే మంచి కథల్ని ఎంచుకుంటూ ప్రయాణం సాగించడమే ఏకైక మార్గం. ఈ విషయాన్ని ఈ కథానాయకులంతా గుర్తిస్తే - తెలుగు చిత్రసీమ మునుముందు కూడా కళకళలాడిపోవడం ఖాయం.

సాయి శ్రీనివాస్

ప్రాణమైనా ఉంది కదా?!

రకుల్ ప్రీత్ సింగ్

"శరీరమే విలువైన ఆస్తి. కళ్లు, కాళ్లు, చేతులు అన్నీ బాగానే ఉన్నప్పుడు అంతకు మించిన సంతోషం ఎక్కడా ఉండదు. వీటికి మించి దేవుడ్ని ఇంకేం అడుగుతాం" అంటోంది రకుల్‌ప్రీత్ సింగ్. వాస్తవిక జీవితంలో బతకడం అంటే రకుల్‌కి చాలా ఇష్టం. తన మాటల్లో, చేతల్లో అది స్పష్టంగా కనిపిస్తుంది. "చేతిలో డబ్బులు పోయాయి, లేదంటే అనుకున్న పని జరగలేదు. అయితే ఏమైపోతుంది..? ఈరోజు బాగా లేదంటే, రేపు బాగుంటుందేమో. నిరాశ, నిస్పృహలెప్పుడూ మనల్ని కృంగదీస్తుంటాయి. ఆశావహ దృక్పథంతో బతకడం అలవాటు చేసుకోవాలి. కాళ్లూ, చేతులూ లేని వాళ్ల జీవితాల్ని, వాళ్లు పడుతున్న బాధల్ని ఒక్కసారి చూడండి. వాళ్లకంటే మన జీవితం ఎన్నిరెట్లు బాగుందో అర్థమవుతుంది. ఏమీ లేకపోయినా.. ప్రాణం ఉంది కదా? అది చాలు అనుకోండి. అప్పుడు ఎలాంటి పరాజయాలైనా చిన్నవిగా కనిపిస్తాయి" అంటూ హితబోధ చేస్తోంది రకుల్.

పంచ్ డైలాగ్

తప్పు నా వైపు ఉంది కాబట్టి తలొంచుకొని వెళ్తున్నా. లేకపోతే ఇక్కణ్నుంచి తలలు తీసుకెళ్లేవాణ్ని.

చిత్రం: ఇంద్ర – పంపినవారు: వి.సుబ్బయ్య, సింహాద్రిపురం

ట్రెండీ కళ్లజోడు

అప్పటి ముచ్చట!



ఏయన్నార్

పౌరాణిక చిత్రం ద్వారా కథానాయకుడైన ఏయన్నార్ తొలిరోజుల్లో జానపద హీరోగా జనానికి చేరువయ్యారు. ఆ దశలో సాంఘిక చిత్రాలకు సరిపోడన్న ముద్ర కూడా ఆయన మీద పడింది. అలాంటి రోజుల్లో ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో 'సంసారం' (1950)లో 'వేణు' పాత్రలో నటించే అవకాశం తొలిసారిగా వచ్చింది. జానపదాల నటుడికి ప్యాంటూ, షర్టూ పాత్రేమిటి? అని అప్పటి పరిశ్రమ వింతగా చెప్పుకొందట. దాన్ని సవాలుగా తీసుకున్న అక్కినేని ఆ వేషం కోసం పారితోషికాన్ని కూడా తగ్గించుకున్నారట. 'సంసారం' సినిమా ప్రథమార్ధంలో అమాయక పల్లెటూరి కుర్రాడిగా, మొరటుగా ఉండే 'వేణు' పాత్ర పట్నానికి చేరిన తర్వాత పూర్తిగా మారిపోతుంది. వేష, భాష, కవళికలు విభిన్నంగా కనిపిస్తాయి. తన పాత్ర మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టిన నాగేశ్వరరావు 'సంసారం'లోని "కల నిజమాయేగా కోరిక తీరేగా.." పాటలో గ్లామరస్‌గా కనిపించడం కోసం ఏదైనా చెయ్యాలని ఆలోచించారట. మద్రాసు మౌంట్ రోడ్డులోని 'మయో ఆప్టికల్స్' దుకాణానికి వెళ్లి, అప్పటి గుండ్రని అద్దాలకు భిన్నంగా తన ముఖానికి చక్కగా అమరే నలుచదరం కళ్లద్దాల్ని ఎంపిక చేసుకుని పాటలో ధరించారట. 'సంసారం' విజయం సాధించింది. మద్రాసు పరిసరాల్లోని పల్లవరంలో చాలా రోజులు ఆడటంతో పాటు 'కల నిజమాయేగా' కళ్లజోడు ట్రెండ్ సృష్టించింది. ఆ ఊపులో మద్రాసు 'మయో ఆప్టికల్స్' దుకాణంలో అప్పట్లోనే అయిదు వేల పైచిలుకు కళ్లద్దాలు అమ్ముడుపోయాయట. దుకాణం యజమానులు అక్కినేనికి కృతజ్ఞతలు చెప్పుకోవడం, అప్పటి నుంచి చాలాకాలం పాటు ఆయనకు కావలసిన కళ్లద్దాలు అక్కడి నుంచే రావడం దీనికి ముక్తాయింపు.

–శ్రీవత్స

తెలుగులో తొలిసారిగా

రవితేజ

టెక్నాలజీ విషయంలో తెలుగు చిత్రసీమ వడివడిగా ముందడుగులు వేస్తోంది. బాలీవుడ్, హాలీవుడ్ స్ఫూర్తితో ఆధునిక హంగుల్ని అద్దుకుంటోంది. కొత్త తరహా కెమెరాల్ని దిగుమతి చేసుకుని సంకేతికంగా తెలుగు సినిమాని వేరే స్థాయిలో చూపించాలని దర్శక నిర్మాతలు ఆరాటపడుతున్నారు. రవితేజ 'అమర్ అక్బర్ ఆంథోనీ' సినిమాలోనూ కొత్త సాంకేతిక హంగులు చూడొచ్చు. శ్రీనువైట్ల దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ సినిమా కోసం రెడ్ మాన్‌స్ట్రో కెమెరా, జీన్ సుప్రీమ్ లెన్సెస్‌ని ఉపయోగిస్తున్నారు. తెలుగులో 8కే రిజల్యూషన్ కెమెరాతో రూపొందుతున్న తొలి సినిమా ఇదే అని చిత్రబృందం తెలిపింది. మైత్రీ మూవీస్ సంస్థ రూపొందిస్తున్న ఈ చిత్రంలో ఇలియానా కథానాయిక. సునీల్ కీలక పాత్రధారి. తమన్ సంగీతం అందిస్తున్నారు.

మీడియాపై 'ముద్ర'

నిఖిల్

నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ముద్ర'. టి.ఎన్.సంతోష్ దర్శకత్వం వహిస్తున్నారు. లావణ్య త్రిపాఠి కథానాయిక. కార్య వేణుగోపాల్, రాజ్‌కుమార్ నిర్మాతలు. ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ''వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమిది. వార్తా సంస్థలు, ఛానళ్ల నేపథ్యంలో సాగుతుంది. నిఖిల్ ఓ రిపోర్టర్‌గా కనిపిస్తారు. ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంద''న్నారు. సంగీతం: శ్యాం సి.ఎస్, ఛాయాగ్రహణం: సూర్య

నవ్వుల బండి

మను, శ్రీనివాసరెడ్డి, సిద్ది ఇద్నాని, అనిల్ రావిపూడి

శ్రీనివాసరెడ్డి, సిద్ది ఇద్నాని జంటగా నటించిన చిత్రం 'జంబలకిడి పంబ'. జె.బి.మురళీకృష్ణ(మను) దర్శకుడు. రవి, జొజొ జోస్, ఎన్. శ్రీనివాసరెడ్డి నిర్మాతలు. గోపీ సుందర్ స్వరకర్త. ఈ నెల 14న విడుదల కానుంది. హైదరాబాద్‌లో 'ఓ మేరి లైలా....' అనే ప్రమోషనల్ సాంగ్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఈ పాట చిత్రీకరణ బాగుంది. మను సినిమానీ ఇంత చక్కగా తీసుంటాడు అనిపిస్తోంది. శ్రీనివాసరెడ్డి కథానాయకుడుగా చేసిన ఈ మూడో సినిమా ఆదరణ పొందాలని ఆశిస్తున్నాన"ని అన్నారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ "కథకి తగిన నటీనటులు, సాంకేతికనిపుణులు కుదిరారు. చక్కని నిర్మాణ విలువలతో దర్శకనిర్మాతలు తెరకెక్కించారు. గోపీ సుందర్ సంగీతం ప్రాణం. ఆద్యంతం ప్రేక్షకుల్ని నవ్వించేలానే ఉంటుంద"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈవీవీ సినిమాకీ ఈ సినిమాకి సంబంధమే ఉండదు. ఈ కథకి సరిపోతుంది కాబట్టి ఆ టైటిల్‌నే నిర్ణయించాం. భార్యాభర్తలు గొడవలు పడుతుంటారు. ఒకానొక పరిస్థితుల్లో భార్య భర్తగా, భర్త భార్యగా మారిపోవాల్సివస్తుంది. అలా ఎందుకు జరిగింది? తరవాత ఏమైంది? అనేది ఆసక్తికరం" అన్నారు. ఈ కార్యక్రమంలో జొజొ జోస్, సంతోష్, బి.సురేష్ రెడ్డి, కాసర్ల శ్యామ్, సతీష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి వీడ్కోలు

గోపాలరావు

ప్రముఖ నిర్మాత, తెలుగు చలన చిత్ర వాణిజ్యమండలి అధ్యక్షుడు జెమిని కిరణ్ తండ్రి పర్వతనేని గోపాలరావు (84) కన్నుమూశారు. వ్యాపార వేత్తగా పేరు తెచ్చుకున్న గోపాలరావు గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. శనివారం జూబ్లీహిల్స్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, సురేష్‌బాబు, శ్యాంప్రసాద్ రెడ్డి, తేజ, సందీప్‌కిషన్ తదితర సినీ ప్రముఖులు హాజరై తమ సంతాపం వ్యక్తం చేశారు. "గోపాలరావుగారికి చిత్రసీమతో సన్నిహిత సంబంధాలున్నాయి. వారి ఆత్మకు శాంతి కలగాల"ని పవన్ కల్యాణ్ తన సంతాపసందేశంలో పేర్కొన్నారు.

ఈ ఉత్సాహం ఇలా సాగిపోనీ..

సెట్లో సందడి

'సవ్యసాచి' అంటే రెండు చేతులతోనూ ఆయుధాన్ని సంధించేవాడని అర్థం. ఈ సినిమా వరకూ 'సవ్యసాచి' నాగచైతన్య కావొచ్చు. నిజానికి సెట్లో అడుగు పెడితే ప్రతీ దర్శకుడూ సవ్యసాచినే. అతనికి రెండు చేతులు సరిపోవు. పది చేతులు కావాలి. కథా రచన, దర్శకత్వం, మాటలు, స్క్రీన్ ప్లే... ఇలా ఎన్ని అందివ్వాలో? 24 ఫ్రేముల నిండా వినోదం పండించడానికి ఆ బుర్ర ఎన్ని రకాలుగా ఆలోచించాలో..? ఫ్రేములో ఇద్దరు స్టార్లు ఉంటే - ఆ పని మరింత పెరుగుతుంది. ఇక్కడ చూడండి.. అటు నాగచైతన్య, ఇటు మాధవన్. రెండు ఆయుధాలు సిద్ధంగా ఉన్నాయి. వాటిని సంధించడమే దర్శకుడు చందూ మొండేటి చేతిలో ఉన్న పని. సెట్లో స్టార్లుంటే దర్శకుడికి టెన్షన్ ఉంటుంది. వాళ్లని ఎలా హ్యాండిల్ చేయాలా? అంటూ హైరానా పడిపోవాల్సిందే. కానీ చైతూ, మాధవన్‌లను చూడండి. సీన్ బాగా నచ్చేసి ఉంటుంది.. అందుకే.. చెబుతున్నప్పుడే ఆస్వాదిస్తున్నారు. కాబట్టి చందూ కూడా కూల్... కూల్‌గా బండి నడిపేస్తున్నారు. 'సవ్యసాచి' సెట్లో కనిపించిన దృశ్యమిది.

చందూ మొండేటి, నాగ చైతన్య, మాధవన్

ఆ హంతకుడెవరు?

మంచు లక్ష్మి

మంచు లక్ష్మి ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'వైఫ్ ఆఫ్ రామ్'. విజయ్ యెలకంటి దర్శకుడు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించింది. త్వరలో విడుదల కానుంది. కెనడాలోని ఒట్టావాలో ఈనెల 13 నుంచి 17 వరకూ జరిగే ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఫిక్షన్ విభాగంలో ఈ చిత్రం ప్రదర్శనకు నోచుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ''దీక్ష అనే వివాహిత కథ ఇది. తన భర్తని ఎవరో చంపేస్తారు. ఆ హంతకుడ్ని పట్టుకోవడానికి దీక్ష ఏం చేసింది? అనేది ఆసక్తికరం. ఒట్టావా ఫిల్మ్ ఫెస్టివల్‌కి ఈ చిత్రం ఎంపిక కావడం ఆనందంగా ఉంది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామ''న్నారు.



అప్పుడు ఆమె చేతిలో ఉన్నది పదివేలు...
ఇప్పుడు ఆమె చేతుల్లో తిరుగుతున్నది కోట్ల రూపాయలు.
అప్పటినుంచీ ఇప్పటిదాకా ఆమె చేతులు సాయం చేయడం మరవలేదు.
ఆమె చేతలూ మారలేదు.
ఆ చేతులు ఏ చదువునీ ఆగిపోనివ్వడంలేదు...
ఆ చేతులు ఏ గొంతునీ ఎండనివ్వడంలేదు...
ఇప్పుడు ఆ చేతలూ, చేతులూ ఆస్తిలో సగభాగాన్ని
సేవకే కేటాయించడానికి సిద్ధమయ్యాయి.
ఈ మంచి మనసే ఆ సంపన్నురాలిని సుసంపన్నురాలిని చేసింది.
ఆమే ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని అర్ధాంగి రోహిణి.

భగవద్గీత సాక్షిగా...

ఆస్తిలో సగం సేవకే

'పని చేయడానికే మనకు అధికారం ఉంది. కానీ తక్షణ ఫలితం పొందే అధికారం లేదు. ప్రత్యక్ష ఫలితం పొందలేమన్న భయంతో పని చేయడాన్ని ఆపకూడదు. ఈ ఆదర్శాన్ని పాటించడానికే మేం ప్రతిజ్ఞ చేస్తున్నాం' అంటూ నందన్ నీలేకని దంపతులు భగవద్గీత సాక్షిగా ప్రమాణం చేశారు. సంపదలో సగానికంటే ఎక్కువ భాగాన్ని సేవకి కేటాయిస్తామని ప్రకటించారు. పెద్ద మనసు చాటుకున్న నందన్ నీలేకని భార్య రోహిణీ నిలేకని కేవలం అతని అర్ధాంగి మాత్రమే కాదు గొప్ప దానగుణమున్న వ్యక్తి. అర్ఘ్యం అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి గ్రామాల్లో తాగునీరూ, పారిశుద్ధ్యం మెరుగు కోసం పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. కోట్ల మంది చిన్నారుల చదువుకు సాయపడుతున్నారు. నందన్ నీలేకని ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడిగా.. పరిచయం అక్కర్లేని వ్యక్తి. అతని భాగస్వామి రోహిణి నీలేకనికి భర్త వల్లనే గుర్తింపు రాలేదు. ఆమె కంటూ స్వతహాగా ఓ గుర్తింపు ఉంది. ఎందుకంటే సమాజంపై ఆమె సేవా కార్యక్రమాలతో చెరిగిపోని సంతకం చేశారు. తనదైన ముద్రవేశారు.

సాధారణ మహిళ: రోహిణీ సోమన్... పెళ్లికి ముందు ఆమె పేరు అదే. ముంబయిలోని మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగారు. ఆమెకు విలాసాలూ, వినోదాలకు భిన్నమైన వాతావరణమే తెలుసు. చిన్నతనంలో చదువూ, సాహిత్యమంటే ఎనలేని ప్రేమ. మాతృభాష మరాఠీతోపాటూ ఆంగ్లం, హిందీ, కన్నడ, కొంకణీ, ఫ్రెంచ్‌లోనూ గలగలా మాట్లాడేయగలరు. స్పానిష్ అర్థం చేసుకుంటారు. రోహిణి పెళ్లికి ముందు ముంబయిలో చాలా సాధారణ జీవితం గడిపారు. స్నేహితురాళ్లతో కలిసి బస్సులో కాలేజీకి వెళ్లడం, సాయంత్రం పూట గోల్‌గప్పాలు (పానీపూరి) తినడం, పుస్తక ప్రదర్శనలకు వెళ్లడం... ఇలా ముంబయితో ఆమెకి ఎన్నో జ్ఞాపకాలున్నాయి. ఇప్పటికీ ఆమె ముంబయి వెళితే అక్కడి పానీపూరి రుచి చూడందే తిరిగి రారు. సాహిత్యాభిమానంతో ఫ్రెంచ్ సాహిత్యంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. పాత్రికేయ వృత్తి పట్ల ఆసక్తి ఉండటంతో 1977లో సెయింట్ జేవియర్ కాలేజీలో మాస్ కమ్యునికేషన్స్‌లో చేరారు. అక్కడ భారీ స్థాయిలో ఓ క్విజ్ పోటీ జరిగింది. దానికి ఐఐటీ పోవైలో బీటెక్ చదువుతోన్న నందన్ నిలేకని కూడా వచ్చారు. అనుకోకుండా ఇద్దరూ పరిచయమయ్యారు. ఒక్కమాటలో చెప్పాలంటే తొలిచూపులోనే ప్రేమలో పడ్డారు. కానీ ఇద్దరూ చదువుల్ని మాత్రం ఎక్కడా నిర్లక్ష్యం చేయలేదు. మూడేళ్లకి చదువు పూర్తయ్యాక రోహిణి ముంబయిలోని స్థానిక మేగజైన్‌లో రిపోర్టర్‌గా జీవితం ప్రారంభించారు. ఆ మరుసటి ఏడాది నందన్ నారాయణ మూర్తితో కలిసి ఇన్ఫోసిస్ స్థాపనకు ఏర్పాట్లు చేసుకుంటూనే రోహిణిని జీవిత భాగస్వామిగా చేసుకున్నారు. ఆమె పుట్టింటి నుంచి అప్పట్లో తెచ్చుకుంది కేవలం పదివేల రూపాయలు. అవన్నీ భర్త చేతిలో పెట్టారు. నందన్ ఆ డబ్బుతో ఆమె పేరిట ఇన్ఫోసిస్‌లోనే 1.67శాతం షేర్లు కొనుగోలు చేశారు. చాలా తక్కువ సమయంలోనే ఆ షేర్ల విలువ మూడొందల మిలియన్ల డాలర్లు దాటిపోయింది.

పేదలకి పుస్తకాలు: అలా షేర్ల విలువ పెరిగిపోయినప్పుడు ఎవరైనా సంతోషంతో చిందులు వేస్తారు. కానీ రోహిణి ఏం చేశారో తెలుసా.. అది యాక్సిడెంటల్‌గా వచ్చిన సంపద (అనుకోకుండా వచ్చిన సంపద) అని పరిగణించడమే కాదు, ఆ మొత్తం పేదలకు అందించాలని ఆలోచించారు. అలా 2004లో ప్రథమ్ పేరుతో ఓ ప్రచురణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఆమె స్వయంగా పుస్తకాలు రాసి ప్రచురించడమే కాదు.. పేద విద్యార్థులకు పంపిణీ చేయడం మొదలుపెట్టారు. పిల్లలకు అవసరమయ్యే విజ్ఞానం, కథలూ, నవలలు పలుభాషల్లో ముద్రించి దేశవ్యాప్తంగా ఉచితంగా అందించారు. అలానే అత్యంత పేద రాష్ట్రాల్లో ఒకటైన బీహార్ విద్యాశాఖకు సాయం చేయాలనే ఉద్దేశంతో కొన్నాళ్లపాటు అక్కడ దాదాపు డెబ్బైవేల పాఠశాలల్లో చదివే పిల్లలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం పద్దెనిమిది భాషల్లో రెండువేల రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ధర చాలా స్వల్పం. ఆన్‌లైన్‌లోనూ ఈ పుస్తకాలను అందిస్తున్నారు. పేద ఆడపిల్లలకు ఇప్పటికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చి చదువుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. చదువు తరువాత ఆమె గౌరవించేది ప్రకృతిని. అందుకే భూగర్భజలాలను పెంచే పనిలో పాలుపంచుకుంటున్నారు.

పిల్లలకు చదువు: ఏక్ స్టెప్ పేరుతో దేశంలోని ఓ ఇరవై భాషల్లో పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను నోట్స్, వీడియోల రూపంలో అంతర్జాలంలో ఉంచుతున్నారు. దానిని యాప్‌గా మార్చారు. ఆ యాప్‌ని పాఠశాల విద్యార్థులు ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెలుగులో కూడా పాఠాలు ఉన్నాయి. క్విజ్‌లూ, ఆటలూ, పజిళ్లు, గేమ్‌లూ.. ఇలా విజ్ఞానాన్ని అందించే ఎన్నో రకాలు ఈ యాప్‌లో ఉన్నాయి. తరగతినీ, భాషని బట్టి సమాచారం అందుబాటులో ఉంటుంది. ఆఫ్‌లైన్‌లోనూ ఏక్‌స్టెప్ సేవలు వాడుకోవచ్చు. దీని ద్వారా ఇప్పటి వరకూ రెండు కోట్ల మందికిపైనే చిన్నారులు సులువుగా చదువుకోగలుగుతున్నారు. ఇది 2014లో ప్రారంభమైంది. టీచర్లు కూడా ఈ యాప్‌ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ సేవా కార్యక్రమాలన్నింటిలో రోహిణితోపాటు నందన్ కూడా చాలా చురుగ్గా పాలుపంచుకుంటారు.

దానగుణమున్న ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం వారు యేల్ యూనివర్సిటీలో చదువుకుని.. కుటుంబ వ్యాపారాలూ, సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. రోహిణిని ఫోర్బ్స్ ప్రతిక సంపన్నురాలిగానే కాదు.. సేవలోనూ సంపన్నురాలని పలుమార్లు కొనియాడింది. ఎప్పుడూ టాప్ జాబితాలోనే ఆమె పేరును ఉంచుతోంది.

జలయజ్ఞం: మనదేశంలో ఎప్పటికప్పుడు నీటి కరవు పెరుగుతూనే ఉంది. దాన్ని అరికట్టడానికి 'అర్ఘ్యం' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు రోహిణి. నిజానికి అప్పట్లో ఆమె చేతిలో డబ్బులు లేవు. ఇన్ఫోసిస్‌లో తన పేరిట ఉన్న కొన్ని షేర్లను అమ్మేశారు. చాలా మంది ఆమెని ఆ సమయంలో తప్పుబట్టారు. లాభాలను కాదనుకోవడంలోని పరమార్థం అప్పుడు ఎవరికీ అర్థం కాలేదు. రోహిణి తన సేవా కార్యక్రమాల ద్వారానే వారికి సమాధానం చెప్పారు. దాదాపు షేర్ల వల్ల వచ్చిన నూట యాభై కోట్ల రూపాయల్ని అర్ఘ్యం ఫౌండేషన్‌కే కేటాయించారామె. దాని ద్వారా దేశవ్యాప్తంగా పందొమ్మిది రాష్ట్రాల్లో కరవున్న గ్రామాల్లో భూగర్భ జలాలను పెంచుతూ.. స్వచ్ఛమైన నీరు అందేలా పలు ప్రాజెక్టులు చేయించారు. దాంతో పది లక్షల కంటే ఎక్కువ మందికి లబ్ధి చేకూరింది. జలయజ్ఞానికి ఇప్పటివరకూ 47.4 కోట్ల రూపాయలను ఖర్చు చేశారామె. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రత్యక్షంగా చేసేది ఉండదు. పలు ప్రాంతాల్లో కరవూ, నీటి, పారుశుద్ధ్యం సమస్య ఉన్నప్పుడు ఎవరైనా స్థానిక నాయకులూ, ప్రజా ప్రతినిధులూ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆమెని సంప్రదిస్తే... దానికి అవసరమైన డబ్బును చేతిలో పెడతారు. ఆ తరువాత ఆ సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటారు. 'అర్ఘ్యం' వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, చిత్తూరు వంటి ప్రాంతాల్లోనూ నీటి సమస్యలు తీరి.. స్వచ్ఛమైన తాగు నీరు అందుతోంది. పంటలకీ నీటి వనరు సక్రమంగా ఉంటోంది. ఇక స్వచ్ఛంద సంస్థకోసం ఆమె ఏటా పన్నెండు నుంచి పదిహేనుకోట్ల రూపాయలను కేటాయిస్తున్నారు.

నుదురు చిన్నగా కనిపించాలంటే...

నుదురు పెద్దగా ఉంటే ఎంత చక్కగా అలంకరించుకున్నా సరే దృష్టి దానిమీదకే మళ్లుతుంది. అలా కాకుండా కొన్ని మేకప్ కిటుకులు పాటించి నుదురు చిన్నగా కనిపించేలా చేయొచ్చు. అవేంటంటే...

- పెళ్లిళ్లకూ, పార్టీలకు ఇప్పుడు జుట్టును బిగుతుగా కొప్పులా వేసుకోవడం ఫ్యాషన్. అంటే ముందు వైపు జుట్టును పైకి దువ్వుకోవాల్సిందే. దాంతో నుదురు ఇంకాస్త పెద్దగా కనిపిస్తుంది. అలాంటప్పుడు నుదురు మీద జుట్టు మొదలయ్యే చోట కాస్త ముదురు రంగు ఫౌండేషన్ రాసి చూడండి. అలాగనీ ముఖానికి రాసుకున్న ఫౌండేషన్‌కూ, దానికి మరీ ఎక్కువ తేడా ఉండకూడదు.

- నుదురు మధ్యభాగం హైలైట్ అయ్యేలా చూసుకోవాలి. మామూలు హైలైటర్‌కు బదులు షిమ్మర్ రకాలను వాడి చూడొచ్చు.
- బుగ్గలపై కూడా మరీ లేత రంగులో కాకుండా ముదురు రంగుల్లో మెరిసే బ్లష్‌లను ఎంచుకోవాలి. అయితే బుగ్గలపై బ్లష్ రాసుకున్నాక దాన్ని అక్కడికే పరిమితం చేయకుండా బ్రష్ సాయంతో కళ్లకన్నా కాస్త కింది వరకు అద్దాలి. కనుబొమల ఆకారం కూడా నుదురు పరిమాణం మీద ప్రభావం చూపుతుంది. ముఖాకృతికి నప్పుతుందనుకుంటే వాటి ఆకృతి యాంగులర్ తరహాలోనే ఉండేలా చూసుకోవాలి.

31 సంవత్సరాల కష్టం అది!

పంజాబ్‌కు చెందిన అరవై రెండు సంవత్సరాల నజీమ్ అక్తర్ చేతి ఎంబ్రాయిడరీ సాయంతో ఖురాన్‌కు అక్షర రూపం ఇచ్చింది. 1987లో ఆమెకీ ఆలోచన వచ్చింది. దాంతో ఖాళీ సమయం దొరికినప్పుడల్లా... తెల్లని వస్త్రంమీద ఖురాన్‌లోని అక్షరాలు రాసుకుని దానిమీద దారంతో కుట్టడం మొదలుపెట్టింది. అలా ఈ ఏడాది అంటే... దాదాపు ముప్ఫైఒక్క సంవత్సరాలకు ఆమె చేయాలనుకున్న పని పూర్తిచేసింది. వస్త్రంమీదే కుట్టిన ఈ ఖురాన్ బరువు 55 కిలోలు. దాన్ని పది పుస్తకాలుగా తీసుకురాగా ఒక్కో పుస్తకం పొడవు 22 అంగుళాలు, వెడల్పు 15 అంగుళాలు. ఈ మొత్తం పని పూర్తవడానికి దాదాపు 84 డబ్బాల నలుపూ, గులాబీ దారాల్ని వాడారు. ఇందుకోసం 300 యార్డుల తెల్లని వస్త్రం, 25 యార్డుల కాగితాన్ని ఉపయోగించింది. దీంట్లో ఉన్న మొత్తం పేజీల సంఖ్య 724. 'చాలా ఏళ్ల కిందట ప్రారంభించిన పని ఇప్పుడు పూర్తయ్యింది. దీన్ని మదీనాలోని గ్రంథాలయంలో ఉంచాలనేది నా కోరిక...' అని చెబుతోంది నజీమ్ అక్తర్.

సన్నగా ఉన్నా... అడ్డగీతలు బాగుంటాయా?

డియర్ వసుంధర

ధన్యా గుత్తా
డిజైనర్

? **నేను చాలా సన్నగా ఉంటాను. లావుగా కనిపించేందుకు అడ్డగీతలు ఉన్న దుస్తులు ఎంచుకోమని సలహా ఇస్తున్నారు స్నేహితులు. అయితే అది ఇప్పుడు ట్రెండ్‌లో ఉందా? ఉంటే ఏ డిజైన్లలో వీటిని ఎంచుకోవాలి.**

- వాసవి, తాడేపల్లిగూడెం

✔ నిజానికి నిలువూ, అడ్డ గీతలూ, గళ్లు... ఎప్పటికీ తరగని ఫ్యాషన్. మీ స్నేహితులు అన్నది నిజమే. సన్నగా ఉన్న వారు అడ్డగీతలు డిజైను ఉన్న దుస్తుల్ని ఎంచుకుంటే కాస్త లావుగా కనిపిస్తారు. శరీర పైభాగం మామూలుగా ఉండి కాళ్లు మరీ సన్నగా ఉన్నప్పుడు అడ్డగీతల స్కర్టులూ, పలాజోలూ వంటివాటిని ఎంచుకోవచ్చు. అయితే అడ్డగీతలు డిజైను పై నుంచి కిందవరకూ ఉండకూడదు. ఒకటి సాదాగా ఉండటం మంచిది. అలానే ఈ అడ్డగీతల డిజైను లేత రంగుల్లో ఎంచుకుంటే మేలు. లేదా తెలుపుతో మేళవించిన ఇతర రంగుల్ని ఎంచుకున్నా మంచిదే. వీటిల్లో తెలుపూ, నలుపూ గౌన్ కాలేజీలకూ, పార్టీలకూ బాగుంటుంది. ఇప్పుడు రఫుల్స్ ట్రెండ్ నడుస్తోంది. సన్నగా ఉన్న వారు అడ్డగీతల్లో ఈ టాప్‌ని ఎంచుకోవచ్చు. చీర కట్టుకుంటుంటే... అది సాదాగా, బ్లవుజుకు మాత్రం అడ్డగీతలు ఉండేలా చూసుకోవాలి.

– మీ సందేహాలను **vasufashion@eenadu.net** కు పంపించగలరు.

బంగారం వెండి 02న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,900	31,900	31,750	31,900
ఆర్నమెంట్	29,800	29,800	29,500	29,600
వెండి (కిలో)	40,560	40,560	40,800	40,900
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	31,800	31,850	32,100	31,785
ఆర్నమెంట్	29,420	29,480	29,850	29,500
వెండి (కిలో)	40,500	40,600	39,700	40,300
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,630	31,740	-------	-------
ఆర్నమెంట్	29,420	29,520	2,942	2,950 గ్రా
వెండి (కిలో)	40,900	40,900	42.60	42.80 గ్రా

మర్చిపోతే... గుర్తుచేస్తాయి!

ఉద్యోగం చేసే మహిళలు ఇల్లూ, ఆఫీసుకు సంబంధించిన పనులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాల్సిందే. ఏ ఒక్కటి గాడి తప్పినా ఇబ్బందే. కానీ ఎన్ని సమస్యలున్నా సరే అనుకున్న పనిని సరైన సమయంలో పక్కాగా పూర్తిచేయాల్సిందే కదా... అలాగని ఎన్ని పనులని గుర్తుంచుకుంటాం. మహిళలకు ఎదురయ్యే ఇలాంటి సమస్యలను సులువు చేయడానికి ఐక్, టైమ్ ట్రీ యాప్‌లు ఉపయోగపడతాయి. మొదటిదాంట్లో పనులన్నింటిని వాటి ప్రాధాన్యం బట్టి విభజించుకోవచ్చు. ఉదాహరణకు నెలాఖరులో ఓ రోజు డాక్టర్ దగ్గరకు వెళ్లాలనుకుంటే అది ముఖ్యమైన పనుల జాబితాలోకి చేరుతుంది. దానికి మనం రిమైండర్ కూడా పెట్టుకోవచ్చు. దీంతోపాటే ఆడియో ఫైళ్లు, ఫొటోలు కూడా నిక్షిప్తం చేసుకోవచ్చు. ఇలా చేసిన పనులన్నింటి ప్రణాళిక మన దగ్గర పొందుపరచుకోవచ్చన్నమాట. ఇక టైమ్ ట్రీ యాప్ ఒక స్మార్ట్ క్యాలెండర్. పనుల్లో పడి కుటుంబసభ్యుల పుట్టినరోజులూ, పెళ్లి తేదీలూ, ఉద్యోగానికి సంబంధించిన పనులు మర్చిపోతుంటాం. ఈ యాప్ ద్వారా అలాంటివాటన్నింటికీ ప్రత్యేకంగా క్యాలెండర్లు తయారుచేసుకోవచ్చు. అందులో ఆ పనిలో భాగస్వామ్యంగా ఉన్న వాళ్లందరితో ఒక గ్రూప్ తయారు చేసుకొని చాట్ కూడా చేయొచ్చు. ఆ క్యాలెండర్లను వేరే వాళ్లకి నేరుగా షేర్ చేసుకోవచ్చు.

నడుమునొప్పికి రాజకపోతాసనం

అదేపనిగా కూర్చుని పనిచేయడం వల్ల నడుమునొప్పీ, ఒత్తిడి వంటి సమస్యలు తప్పవు. నడుము కిందిభాగంలోనూ కొవ్వు పేరుకుంటుంది. ఈ సమస్యలను అదుపులో ఉంచుకోవాలంటే... రాజకపోతాసనం సరైన పరిష్కారం. దీన్ని ఒకేసారి వేయలేరు. పైగా సొంతంగా చేయకూడదు. అందుకే ఓ పద్ధతి ప్రకారం... ప్రయత్నించి చూడాలి. ఆ ఆసనాలే ఇవి.

1

ఉత్తానపృష్ఠాసనం: ముందుకు వంగి చిత్రంలో చూపిన విధంగా ఎడమకాలిని వెనక్కి చాపాలి. చేతుల్ని నేలపై ఉంచాలి. కుడికాలిని మడిచి ఆ పాదానికి కుడి అరచేయి ఆనించాలి. ఇలా వీలైనంత సేపు ఉండి... తరువాత విశ్రాంతి తీసుకోవాలి. తరువాత కాలు మార్చాలి. దీన్ని దాదాపు పదిహేను రోజులపాటు సాధన చేయాలి. ఇది పూర్తిగా వచ్చాకే రెండో ఆసనానికి వెళ్లాలి. ఇది రాజకపోతాసనానికి మొదటిదశ.

ఏకపాద రాజకపోతాసనం: ఇప్పుడు నెమ్మదిగా కుడికాలిని మొత్తం వెనక్కి ఉంచాలి. రెండు చేతులను చిత్రంలో చూపిన విధంగా పెట్టుకోవాలి. ఎడమ కాలిని మడిచి పెట్టుకోవాలి. ఇలా వీలైనంత సేపు ఉన్నాక విశ్రాంతి తీసుకోవాలి. మళ్లీ కాలు మార్చి చేయాలి. దీన్ని కూడా పదిహేను రోజులపాటు సాధన చేయాల్సి ఉంటుంది. ఇది రెండోదశ.

2

ఇంతకు ముందున్న స్థితిలోనే ఉంటూ ఎడమకాలిని కుడి తొడకు దగ్గరగా జరపాలి. కుడికాలిని వెనక్కి మడిచి, కాలుపైకెత్తాలి. కుడిచేత్తో ఆ కాలిని పట్టుకోవాలి. ఎడమ చేతినీ వెనక్కి ఉంచాలి. రాజ కపోతాసనం చేయడానికి ముఖ్యమైన ఆసనం ఇది.

3

ఇప్పుడు కుడికాలిని నెమ్మదిగా తలకు ఆనించే ప్రయత్నం చేయాలి. కుడిచేత్తో తలకు ఆనించిన పాదాన్ని పట్టుకోవాలి. దీన్ని చాలా నిదానంగా చేయాలి. పై మూడు ఆసనాలు అయ్యాకే దీన్ని వేయాలి. దీనివల్ల మొత్తం శరీరానికి వ్యాయామం అందుతుంది.

4

లాభాలు: దీనివల్ల సయాటికా, నడుము నొప్పి తగ్గుతాయి. ఒత్తిడి అదుపులో ఉంటుంది. చేతులూ, తుంటి కండరాలు దృఢంగా ఉంటాయి. మొదటి మూడు ఆసనాలను కాళ్లు మారుస్తూ 10-12 సార్లు చేయాల్సి ఉంటుంది. ఒక్కో దాన్ని దాదాపు పదిహేను రోజుల పాటు సాధన చేసిన తరువాతే చివరి ఆసనం వేయాలి.

డా॥ మణిపవిత్ర
ఫిట్‌నెస్ నిపుణురాలు

రామోజీ ఫౌండేషన్

ఇనుప తుక్కుతో..
వినూత్న శిల్పాలు!

వేణువులాంటి పరికరం 'సికు' కబుర్లు
అప్పట్లో పలకలు ఎలా ఉండేవో తెలుసా?
ఎడారిలో తోటలు పెంచుతున్నారట.. చూసొద్దామా!

పిల్లలకూ పెద్దలకూ పుస్తక నేస్తం..
బాలభారతం

అన్ని పుస్తక విక్రయ కేంద్రాలలో 'బాలభారతం' మాస పత్రిక జూన్ సంచిక లభిస్తుంది. పేజీలు 84 (రంగుల్లో) ధర రూ.20/- మీ ప్రతి కోసం ఈనాడు ఏజెంటును సంప్రదించండి. లేదా 08415 246888, 8008551844 నంబరుకు ఫోన్ చెయ్యండి. లేదా BBSUB, Subscriber Name, Address టైప్ చేసి 9246 399 299కి SMS చెయ్యండి!

ఆహా! .. ఏమి రుచి

aha@eenadu.in



దిష్టి తీయడానికి, కమ్మని వడియాలు పెట్టుకోడానికి మాత్రమే బూడిద గుమ్మడికాయల్ని ఎక్కువగా వాడుతుంటాం. కానీ బరువు తగ్గించే మంత్రంగా ప్రపంచం మొత్తం బూడిదగుమ్మడివైపు ఆశగా చూస్తోంది. 'వింటర్‌మెలన్ టీ'కి రోజురోజుకీ అందుకే డిమాండ్ పెరుగుతోంది. మన ఆయుర్వేదం కూడా ఈ 'పాలం గుమ్మడి'లో పోషకాల గురించే పోరుపెడుతోంది. మరింకెందుకు ఆలస్యం... దీనిలోని పోషకాల గురించి, దీంతో చేసే రుచికరమైన వంటకాల గురించీ తెలుసుకుందాం రండి...

వీరి వీరి గుమ్మాడి!

వీటి రుచి ఏమీ

దిల్లీ వెళ్లే రైలు ఆగ్రాలో అడుగుపెడుతూనే ఆగ్రాకాపేటా తీయతీయగా పలకరిస్తుంది. పలుకుపలుకులో తేనెలూరే ఈ మిఠాయిని మనం వడియాలు పెట్టుకునే ఈ గుమ్మడితోనే చేస్తారు.

సుస్మిత
హైదరాబాద్

వడియాలంటే... గుమ్మడి వడియాలే అనుకుంటారు చాలామంది. అందుకే ఎండలు విరగ్గాసే కాలంలో బూడిదగుమ్మడికాయలతో ఏడాదికి సరిపడా వడియాలు పెట్టుకుని, అంతటితో సరిపుచ్చుకుంటాం. అలా చేసిన వడియాలతో ఏ పులుసో పెట్టుకోవడం తెలుసుకానీ... అంతకుమించి మనం పెద్దగా ప్రయోగాలు చేయం. కానీ ఈ గుమ్మడితో కమ్మని బరడా, తీయని పెటాలతో పాటూ కూటు, సూపు, కేకులు, నాన్‌వెజ్‌తో కలిపి చేసిన మాంసాహార వంటకాలు అదిరిపోతాయి.

కూటు

కావాల్సినవి: ఉడికించిన బూడిద గుమ్మడి ముక్కలు- రెండు కప్పులు, ధనియాలు, ఆవాలు, సెనగపప్పు, బియ్యం, నువ్వులు- చెంచా చొప్పున, కొబ్బరి తురుము- అరచిప్ప, నూనె- ఒక పెద్దచెంచా, కరివేపాకు- నాలుగు రెబ్బలు, ఎండుమిర్చి- ఐదు, మెంతులు- పావుచెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- చిటికెడు, చింతపండు గుజ్జు- చెంచా, బెల్లం- పావుకప్పు, నీరు, ఉప్పు- తగినంత

తయారీ: కొబ్బరి తురుముని దోరగా వేయించుకోవాలి. కడాయిలో కొద్దిగా నూనె వేసుకుని అందులో ధనియాలు, సెనగపప్పు, బియ్యం, నువ్వులు, ఎండుమిర్చి, మెంతులు వేయించి పెట్టుకుని కొబ్బరి తురుము, చింతపండుతో కలిపి రుబ్బుకోవాలి. కడాయిలో ఉడికించిన బూడిదగుమ్మడి ముక్కలు, రుబ్బుకున్న కొబ్బరి మిశ్రమం, బెల్లం, ఉప్పు వేసి తగినంత నీరుపోసుకుని సన్నసెగపై ఉడికించుకోవాలి. ఆవాలు, ఇంగువ, పసుపు, కరివేపాకుతో పైపోపు వేసి కలపాలి.

కేక్



కావాల్సినవి: గుమ్మడి గుజ్జు- కప్పు, గుడ్లు- రెండు, నూనె- అరకప్పు, వెనిల్లా- చెంచా, పంచదార- కప్పు, మైదా- ఒకటిన్నర కప్పు, దాల్చినచెక్కపొడి- పావుచెంచా, జాజికాయపొడి- పావుచెంచా, బేకింగ్ పొడి- అర చెంచా, బేకింగ్ సోడా- అరచెంచా, టూటీఫ్రూటీ ముక్కలు- అరకప్పు, ఉప్పు- చిటికెడు

తయారీ: వెడల్పాటి పాత్రలో గుడ్లు, బూడిదగుమ్మడి గుజ్జు, నూనె, వెనిల్లా ఎసెన్స్ వేసి బాగా గిలక్కొట్టాలి. తర్వాత అందులోనే మైదా, పంచదార, దాల్చినచెక్క, జాజికాయపొడి, ఉప్పు, బేకింగ్‌పొడి, బేకింగ్ సోడా వేసి ఉండలు లేకుండా మరోసారి గిలక్కొట్టాలి. తర్వాత టూటీఫ్రూటీ ముక్కలు కలపాలి. ఈ మిశ్రమాన్ని వెన్నరాసిన కేక్‌పాన్‌లోకి తీసుకుని ప్రీహీట్ చేసుకున్న అవెన్‌లో 180 డిగ్రీల సెల్సియస్ దగ్గర 40 నిమిషాలు బేక్ చేసుకోవాలి. చల్లారిన తర్వాత ముక్కలుగా చేసుకుని మరుసటి రోజు తింటే చాలా బాగుంటుంది.

ఒక వంతు గుమ్మడి గుజ్జుని, రెండు వంతుల పంచదారతో కలిపి పాకం పట్టుకుంటే గుమ్మడి సిరప్ సిద్ధం. దీనికి తగినన్ని నీళ్లు కలుపుకొంటే గుమ్మడి చాయ్ రెడీ !

పెరుగుపచ్చడి

కావాల్సినవి: బూడిద గుమ్మడి ముక్కలు- కప్పు, పచ్చిమిర్చి- రెండు, గిలక్కొట్టిన చిక్కని పెరుగు- కప్పు, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అరటీస్పూను, జీలకర్ర- అరటీస్పూను, కరివేపాకు- నాలుగు రెబ్బలు, ఎండుమిర్చి- ఒకటి, నీరు- కప్పు, ఉప్పు- తగినంత

తయారీ: ఒక పాత్రలో బూడిదగుమ్మడికాయ ముక్కలు, నిలువునా చీల్చిన పచ్చిమిర్చి, ఉప్పు వేసి మూతపెట్టి ముక్కలు మరీ మెత్తగా కాకుండా ఉడికించుకోవాలి. దానికి చల్లారిన తర్వాత గిలక్కొట్టిన పెరుగు కలుపుకోవాలి. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చితో తాలింపు పెట్టుకుంటే పచ్చడి సిద్ధం.

బరడా

కావాల్సినవి: బూడిదగుమ్మడిముక్కలు- అరకిలో, పెసరపప్పు- 100గ్రా, సెనగపప్పు- 100గ్రా, జీలకర్ర- చెంచా, ఇంగువ- కొద్దిగా, నిమ్మకాయలు- రెండు, నూనె- రెండు పెద్ద చెంచాలు, ఉప్పు, కారం, పసుపు- తగినంత, ధనియాలపొడి- పావుచెంచా

తయారీ: ముందుగా గుమ్మడికాయ ముక్కలని ఓ మోస్తరుగా పరిమాణంలో ఉండేటట్టు తరగాలి. పెసరపప్పు, సెనగపప్పు, ఇంగువ వీటిని బరకగా మిక్సీలో వేసి ఆడించుకోవాలి. ఈ రవ్వనే బరడా అంటారు. ఒక పాత్రలో కొద్దిగా నూనె వేసి అందులో గుమ్మడిముక్కలు, ఉప్పు, కారం, పసుపు, ధనియాలపొడివేసి ముక్క ఉడికేంత వరకూ ఉంచాలి. ఇందాక మనం ఆడించిపెట్టుకున్న బరడాలో కొద్దిగా ఉప్పు, నూనె వేసి కూరలో కలుపుకోవాలి. ఇలా పదినిమిషాల పాటు ఉడికించిన తర్వాత రెండు నిమ్మకాయల రసం పిండుకుని పొయ్యి కట్టేస్తే బరడా సిద్ధం.

జామ్

కావాల్సినవి: గుమ్మడి తురుము- కప్పు, నీళ్లు- పావుకప్పు, పంచదార- ఒకటిన్నర కప్పు, యాలకులపొడి- అరటీస్పూను, దాల్చిన చెక్క- అంగుళం ముక్క.

తయారీ: మందపాటి పాత్రలో బూడిదగుమ్మడి తురుము, పంచదార, నీళ్లు పోసుకుని పంచదార కరిగేంతవరకూ ఉడికించుకోవాలి. లేత తీగపాకం వచ్చేముందు మంట తగ్గించి యాలకులపొడి, దాల్చిన చెక్క వేసి మరో మూడునిమిషాల పాటు ఉంచాలి. తర్వాత పాత్రను దించేయాలి. మిశ్రమం చల్లారిన తర్వాత దాల్చిన చెక్క తీసేసి, గాజు సీసాలో పోసి ఫ్రిజ్‌లో ఉంచితే చల్లని జామ్ భలే రుచిగా ఉంటుంది.

గుమ్మడిలోని పుష్కలమైన ఇనుము ఏకాగ్రతని, జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

కంటి సమస్యలు రాకుండా...

ఫైటో న్యూట్రియంట్లు అధికంగా ఉండే ఆహారం ఇది. దీనిలో అధికంగా ఉండే పొటాషియం, విటమిన్ సిలు గుండెజబ్బుల నుంచి రక్షణగా నిలబడతాయి.

- రోజువారీ మనకి కావాల్సిన విటమిన్ సి అవసరాల్లో 19 శాతం వరకూ సునాయాసంగా తీరుస్తుంది. దాంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. ఆహార సంబంధిత పీచు అధికంగా ఉంటుంది. దాంతో జీర్ణప్రక్రియలో ఏ ఇబ్బందులూ కలగకుండా ఉంటాయి.
- శరీరంలోని వ్యర్థాలని మూత్రం రూపంలో బయటకు పంపిస్తుంది.
- దీనిలో కెలోరీలు తక్కువ... పీచు ఎక్కువ. బరువు తగ్గాలనుకునే వారికి చక్కని ఆహారం.
- వయసుతో పాటూ వచ్చే కంటిసమస్యలని అడ్డుకుంటుంది.

పక్కాలోకల్

ఖవ్వాల చెరువు...

పాలకోవా అసలుసిసలు రుచి తెలియాలంటే కడప గువ్వలచెరువుకు వెళ్లాల్సిందే. అక్కడ దొరికే 'ఖవ్వా' పాలకోవా పనిపట్టాల్సిందే..

గువ్వలచెరువు.. కడప జిల్లాలో కడప-రాయచోటి ప్రధాన రహదారికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నగ్రామం. కొండ దిగువన ఓ వైపు గువ్వలచెరువు ఉంటే మరోవైపు చింతకొమ్మదిన్నెకు చెందిన తండాలు ఉంటాయి. కడప నుంచి ప్రయాణించే వారికి ఘాట్‌రోడ్డు దిగగానే.. గువ్వలచెరువు గ్రామం కనిపిస్తుంది. ఇక్కడ సాయంత్రమైతే చాలు.. రోడ్డు వెంబడి భారీగా వాహనాలు బారులు తీరుతాయి. అందుకు కారణం.. పాలకోవా అలియాస్ ఖవ్వా.

80 సంవత్సరాల చరిత్ర...

ఎనభై ఏళ్ల క్రితం ఒకరిద్దరు ఇక్కడ కోవా తయారీ ప్రారంభించారు. వీళ్లు సమీపంలో ఉన్న గ్రామాల నుంచి పాలు సేకరించి కోవా తయారు చేసి అమ్మేవారు. అదేబాటలో చాలామంది నడవడంతో ప్రస్తుతం ఈ గ్రామం కోవాకు కేరాఫ్‌గా మారింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే కర్ణాటక వాసులు ఇక్కడ ఎక్కువగా కొనుగోళ్లు జరుపుతుంటారు. చిక్‌బళ్లాపుర, దొడ్డబళ్లాపురతో పాటు దేవనహళ్లి, హొస్పేట, బెంగళూరు, కడప, కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన ప్రయాణికులు కొనుగోలు చేస్తుంటారు. అలాగే రాజకీయ పార్టీల వేడుకలు, వివాహ కార్యక్రమాలు.. చిత్ర పరిశ్రమలో ప్రముఖులకు బహుమతుల రూపంలో ఇవ్వడానికి గువ్వలఖవ్వాను పంపిస్తుంటారు.

కోవాబన్ను ప్రత్యేకం..

కడపజిల్లాలో గువ్వలచెరువు పాలకోవా స్పెషల్ అయితే అందులో మరింత స్పెషల్ కోవాబన్ను. కోవా ఉంచిన బన్నులని కడపతో పాటు మైదుకూరు, బద్వేలు ప్రాంతాల్లో ఎక్కువగా అమ్ముతుంటారు. అలాగే అనంతపురం నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఈతరహా కోవాబన్ను ఎక్కువగా తింటుంటారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో ఐస్‌క్రీం కోవా స్పెషల్‌గా చెప్పొచ్చు. ఇక్కడ శ్రీకాళహస్తీశ్వరుడి కోవెల ప్రపంచ ప్రసిద్ధి చెందితే.. అక్కడికి వచ్చే శివయ్య భక్తులకు ఈ ఐస్‌క్రీంకోవాతో విడదీయరాని బంధం ఉంది. శ్రీకాళహస్తి పాల సరఫరా సంఘం ఆధ్వర్యంలో తయారయ్యే కోవా రుచి, నాణ్యతలో తనదైన ముద్ర వేసుకుంది. ఈ కోవాని ఐస్‌క్రీంతో పాటు అమ్ముతుంటారు. రూ.30-70 వరకు రకాన్ని బట్టి ధర ఉంటుంది. ఆరు దశాబ్దాల క్రితం శ్రీకాళహస్తి పాల సరఫరా సంఘం ఏర్పాటు కాగా.. ప్రస్తుతం రూ.10కోట్ల వార్షిక టర్నోవర్‌తో రికార్డు సృష్టిస్తోంది.

– గాలి సురేష్, ఈనాడు, కడప
చిత్రాలు: శ్రీనివాస పట్నాయక్

అమ్మ..ఆమె...ఖీమాబిర్యాని!

సెలబ్రిటీ రుచి

ఫుడ్ ట్రాక్ నేపథ్యంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'పెళ్లిచూపులు'. ఈ సినిమా దర్శకుడు తరుణ్ భాస్కర్. ఫుడ్ మీద ఉండే పిచ్చితోనే మొదటిచిత్రంలో ఈ ట్రాక్‌ను రాసుకున్నాడు. నేను ఫుడీని. ఖాళీగా ఉంటే ఇంట్లో వాళ్లకోసం, స్నేహితుల కోసం వండుతా. అనే తరుణ్ భాస్కర్ 'ఆహా' అనిపించే విషయాలు షేర్ చేసుకున్నారిలా..

కొత్తరకాల వంటలు తినటం ఇష్టం. సొంతంగా వండుకోవడం మరీ ఇష్టం. వంటింట్లో గరిటె తిప్పటానికి కారణం మా అమ్మే. మా అమ్మ గీత ('ఫిదా' చిత్రంలో కథానాయిక మేనత్త పాత్ర చేసింది) టీచర్. కిచెన్‌లోకి వెళ్తూనే రేడియో ఆన్ చేసి పాటలు వింటూ, పాడుతూ వంట చేస్తుంది. చిన్నప్పుడు నన్ను ఎత్తుకుని వంట చేసేది. అలా నాకూ వంట చేయాలనిపించిందేమో! ఎంత బిజీగా ఉన్నా.. ఇప్పటికీ మా అమ్మ అంతే! ఎఫ్.ఎమ్. రేడియోలో పాటలు వస్తుంటే.. కమ్మని వంటల్ని రెడీ చేస్తుంది. అమ్మ మటన్ బిర్యానీ బాగా చేస్తుంది. అదంటే హీరో విజయ్‌దేవరకొండకి చాలా ఇష్టం.

వంటచేసి ప్రేమని చెప్పొచ్చు..

సినిమాలమీద ఆసక్తితో దర్శకుడినయ్యాను. ఒకవేళ సినిమాలు వర్కవుట్ కాకపోయి ఉంటే చెఫ్‌గా జీవితాన్ని గడిపేవాణ్ణి. వంట అంటే అంతిష్టం. మష్రూమ్ బిర్యానీ, ఫ్రైడ్ మష్రూమ్ నా సిగ్నేచర్ ఫుడ్. ఓసారి నా స్నేహితులకోసం చికెన్‌తో ఆమ్లెట్ చేశాను. వచ్చినప్పుడల్లా అదే చేయమని అడుగుతున్నారు(నవ్వులు). మాఅమ్మ, మా ఆవిడ, స్నేహితులకు వండటం నాకిష్టం. ఎందుకంటే ఇష్టమైన వాళ్లకు వంట చేసిపెట్టడంలో ఆనందముంటుంది. అవతలి వ్యక్తిపై ఎంత ప్రేమ ఉందో దాన్ని ఒక్క వంట చేసి మాత్రమే ఎక్స్‌ప్రెస్ చేయొచ్చు. మా నాన్నది వరంగల్, అమ్మవాళ్ల ఊరు చిత్తూరు. నానమ్మ ఇంటికి వెళ్తే మటన్, తలకాయకూర, రోటీపచ్చళ్లు, సకినాలు తినేవాడ్ని. అమ్మమ్మ ఇంటికెళ్తే కొబ్బరిపాలతో చేసిన ఆహారం, సీఫుడ్ తినేవాణ్ణి. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఓసారి ఖీమా బిర్యానీ తిన్నా. మహాద్భుతం. మా ఆవిడ చేసే పల్లీచట్నీ, దోసెల రుచిని నేనెంత కాపీ కొడదామన్నా నా వల్ల కావట్లేదు.

– రాళ్లపల్లి రాజావలి

కొత్తకొత్తగా...

ఏక్ తందూరి చాయ్ లా!

తందూరి చికెన్ గురించి తెలుసు కానీ కొత్తగా ఈ తందూరి చాయ్ ఏంటి? అక్కడికే వస్తున్నాం! కొలిమిలోంచి అప్పటికప్పుడు వేడివేడిగా తీసిన మట్టిపిడత, అందులో బుసబుసలాడుతూ మట్టి పరిమళంతో పొంగే స్మోకీ చాయ్. అదే తందూరి చాయ్ ప్రత్యేకత. పుణెలోని చాయ్‌లా దుకాణం తయారుచేసే తందూరి తడఖా చాయ్ రుచికి ఒక్క పుణెవాసులే కాదు తక్కిన ప్రాంతాల వాళ్లు ఫిదా అవుతున్నారు. కొలిమిలో కాలుతున్న మట్టిపిడతని తీసుకుని అందులో అప్పటికే సగం కాచి ఉన్న టీని పోస్తారు. కాలిన మట్టిపిడత మీద పడిన ఆ చాయ్ బుసబుసా పొంగుతుంది. దీన్ని ఒక ఇత్తడి పాత్రలోకి తీసుకుని మట్టిగ్లాసుల్లో పోసి అందిస్తారు. ఈ చాయ్‌ని తయారుచేసిన అమోల్‌దిలీప్‌కి ఈ ఆలోచన ఎలా వచ్చిందో తెలుసా? ఓ రోజు జలుబుతో బాధపడుతున్న అమోల్‌కి వాళ్ల నాయనమ్మ కుంపట్లో తయారుచేసిన చాయ్‌ని ఇచ్చిందట. ఆ రుచి స్ఫూర్తితోనే తందూరిచాయ్‌ని తయారుచేశా అంటున్నాడు అమోల్.

ప్ర & జ

మా ఇంట్లో చికెన్ ఉన్న రోజు పిల్లలు ఇష్టంగా తినేస్తారు. అదే కాయగూర భోజనం వండితే మూతి ముడుచుకుంటున్నారు. శాకాహార వంటలనే వెరైటీగా ఎలా చేయగలనో చెప్పండి? – రాధిక, మెదక్

కూర రుచి పెరగాలంటే...

ఎప్పుడూ వండే వంటలని చిన్న మార్పులతో రుచికరంగా ఎలా వండుకోవచ్చో చూద్దాం. కూర రుచిని పెంచే డ్రైమసాలాపొడర్‌ని ఎలా చేసుకోవాలో చెబుతాను. ఎండు మిరపకాయలు- 20, ధనియాలు- అరకప్పు, దాల్చినచెక్కలు- నాలుగు, ఇలాచి- ఆరు, లవంగాలు- టేబుల్ స్పూను, నల్లమిరియాలు- టేబుల్ స్పూను, జీలకర్ర- మూడు చెంచాలు, సోంపు, ఉప్పు, పసుపు- కొద్దిగా ఉప్పు, పసుపు తప్పించి తక్కిన వాటిని మందమైన అడుగు ఉన్న కడాయిలో వేసి దోరగా వేయించుకోవాలి. వీటిని మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇది ప్రాథమికంగా పొడి తయారీ.

- దీనిలో రెండు చెంచాల కొబ్బరి పొడి, మూడు టొమాటోలు మిక్సీలో వేసి కూరకు కలుపుకొంటే కుర్మారుచి వస్తుంది. ఇదే మసాలాపొడికి గసాలు, కొబ్బరిపొడి కలిపి పెట్టుకుంటే వైట్ గ్రేవీ వస్తుంది. పల్లీపొడి, నువ్వుల పొడి కూడా కలుపుకోవచ్చు.
- అయితే కొబ్బరిని ఎందులో వేసినా అది ఎక్కువ రోజులు నిల్వ ఉండదు. పైగా జిడ్డు వాసన వస్తుంది. కూరంతా అయ్యాక కొబ్బరిపొడి కలుపుకుంటే మంచిది.

– శ్రీదేవి, హోటల్‌మేనేజ్‌మెంట్ నిపుణురాలు

ఈనాడు బిజినెస్ వారాంతం

జిగేల్.. జియో

● కలిసిరానున్న ఆర్‌కామ్ ● పెరగనున్న వాటా ● ఐడియా-వొడాఫోన్ తర్వాతి స్థానం

జియో హవా కొనసాగుతోంది. ఇటు వినియోగదార్లను ఆకట్టుకోవడంతో పాటు.. అటు నెట్‌వర్క్ విస్తరణలోనూ అంతే వేగంతో ఉంది. రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్)కు చెందిన స్పెక్ట్రమ్ కొనుగోలు వల్ల రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ మార్కెట్ వాటాలో ముందంజ వేయనుంది. ఐడియా-వొడాఫోన్ విలీన సంస్థకు, తనకు ఉన్న మార్కెట్ వాటా విషయంలో ఉన్న దూరాన్ని తగ్గించుకోనుంది. అపుడు భారతీ ఎయిర్‌టెల్ మూడో స్థానానికి పరిమితం అవుతుందని విశ్లేషకులు అంటున్నారు.

ఇదీ వాటాల వరుస..: ఆర్‌కామ్ వాయుతరంగాలతో జియో స్పెక్ట్రమ్ మార్కెట్ వాటా 23.6 శాతానికి చేరుతుంది. టెలినార్ ఇండియాతో కలిపి భారతీ ఎయిర్‌టెల్ వాటా 23.5 శాతంగా మాత్రమే ఉంది. ఇక జూన్‌లో విలీనం పూర్తి కానున్న ఐడియా-వొడాఫోన్ ఇండియా సంయుక్త సంస్థ వాటా 27.2 శాతంగా ఉండబోతోంది. విడిగా చూస్తే జియో, ఆర్‌కామ్‌ల వాటా వరుసగా 16.2 శాతం; 7.4 శాతంగా ఉంది. కలిపితే 23.6 శాతానికి చేరి రెండో స్థానంలోకి చేరుతుంది.

ఎరిక్సన్‌తో పరిష్కారం వల్లే..

ఎరిక్సన్‌తో ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న న్యాయ వివాదాన్ని ఆర్‌కామ్ గత బుధవారం పరిష్కరించుకుంది. దీంతో వైర్‌లెస్ ఆస్తుల(స్పెక్ట్రమ్ సహా)ను విక్రయించుకోవడానికి మార్గం సుగమం అయింది. వాటిని రూ.17,000 కోట్లకు పైగా విలువకు జియోకు విక్రయించనుంది.

జియోకు ఇప్పటికే 850 మెగాహెర్ట్జ్ బాండ్‌లో వాయుతరంగాలున్నాయి

ఆర్‌కామ్ స్పెక్ట్రమ్ కూడా జతకలిస్తే.. 4జీ ఎల్‌టీఈ కవరేజీ నాణ్యత భారీ స్థాయిలో మెరుగుపడుతుంది. వీఓఎల్‌టీఈ, బ్రాడ్‌బ్యాండ్ కవరేజీ పెరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. తన వైర్‌లెస్ ఆస్తులన్నీ జియోకు విక్రయించడానికి గత డిసెంబరులో పూర్తి నగదు ఒప్పందాన్ని ఆర్‌కామ్ కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తన 850, 900, 1800, 2100 మెగాహెర్ట్జ్ బాండ్లలోని 122 యూనిట్ల 4జీ స్పెక్ట్రమ్‌ను విక్రయిస్తుంది. ఇంకా టవర్లు, ఆప్టిక్ ఫైబర్ ఆస్తులు, సంబంధిత మౌలిక వసతులూ అందులోనే కలిసి ఉంటాయి.

వాటినీ కొనే అవకాశం

వీటితో పాటు ఆర్‌కామ్ వద్ద 850 మెగాహెర్ట్జ్ బాండ్‌లో మిగిలి పోయే 66 యూనిట్ల స్పెక్ట్రమ్‌ను రూ.3700 కోట్లకు కొనుగోలు చేసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. ప్రతీ బాండ్‌లో విలీనం తర్వాత 50 శాతానికి మించి స్పెక్ట్రమ్ ఉండరాదని నిబంధనను ప్రభుత్వం ఇటీవలే తొలగించడం వల్ల ఈ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టవర్ల అద్దె మిగులుతుంది

మొత్తం మీద ఆర్‌కామ్ టవర్ల, ఫైబర్ ఆస్తుల కొనుగోలు తర్వాత జియోకు భారీ ప్రయోజనాలే చేకూరనున్నాయని విశ్లేషకులు అంచనా కడుతున్నారు. ఆర్‌కామ్ టవర్లను కొనుగోలు చేసిన అనంతరం టవర్ల అద్దెల విషయంలో జియో మాతృ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆదా చేసుకునే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ అంటోంది. ఎందుకంటే ప్రస్తుతం ఆర్‌కామ్ టవర్లను వినియోగించుకున్నందుకు ఏటా రూ.1500-1600 కోట్లను జియో చెల్లిస్తోంది. ఆర్‌కామ్‌కు 43,000 టవర్ల కొనుగోలు వల్ల జియో నెట్‌వర్క్ కార్యకలాపాల వ్యయాలు కూడా తగ్గుతాయని గోల్డ్‌మాన్ శాక్స్ అంటోంది. అన్నిటికీ మించి జియో భారీ స్థాయిలో తీసుకురానున్న 'ఫైబర్ టు ద హోమ్(ఎఫ్‌టీటీహెచ్), ఎంటర్‌ప్రైజ్ సేవలకు ఆర్‌కామ్ ఫైబర్ ఆస్తులు బాగా కలిసిరానున్నాయి.

కొసమెరుపు: అన్న ముకేశ్ అంబానీకి చెందిన జియో మరింత విస్తరించడానికి తమ్ముడు అనిల్ అంబానీ ఆర్‌కామ్ స్పెక్ట్రమ్ ఆస్తుల విక్రయం ద్వారా సహకరిస్తుంటే.. తమ్ముడి అప్పులు తగ్గడానికి అన్న సహాయం చేస్తూ.. ఇరువురూ ఒకరికొకరుగా ఉండడం విశేషం.

రూపాయికి జ్వరమొచ్చింది



ఏడాది కాలంలో 5% క్షీణత

● ముున్ముందు రూ.70కి పడిపోవచ్చు!

● దిగుమతుల బిల్లు భారమే ● వాణిజ్యలోటుపైనా ప్రభావం

● వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ● ఐటీ, ఆరోగ్య సంరక్షణ షేర్లకు మేలు

రూపాయి కలవరపెడుతోంది. డాలరుతో పోలిస్తే అంతకంతకు క్షీణిస్తూ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందికర పరిణామాన్ని సృష్టిస్తోంది. చమురు ధరలు పెరగడం కూడా రూపాయి క్షీణతకు ఆజ్యం పోస్తోంది. సమీప భవిష్యత్‌లో రూపాయి మారకం విలువ రూ.70కు పడిపోయే అభిప్రాయం వినిపిస్తోంది. ఇదే జరిగితే దిగుమతుల భారం మరింత పెరుగుతుంది. వాణిజ్యలోటుపైనా ప్రతికూల ప్రభావం తప్పదు. ఇదంతా రూపాయికు ఓ వైపు. మరోవైపు రూపాయి క్షీణతతో లాభపడే రంగాలూ ఉన్నాయి.

ప్రస్తుత ఏడాదిలో రూపాయి మారకం విలువ ఇప్పటికే 7 శాతానికి పైగా క్షీణించింది. అంతేకాదు సంవత్సర కాలంలో 5 వరకు నష్టపోయింది. చమురు ధరలు పెరగడం డాలరుకు గిరాకీని పెంచుతుండటం వల్లే రూపాయి బలహీనపడుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా బాండ్ల ప్రతిఫలాలు పెరగడం కూడా రూపాయి క్షీణతకు మరో కారణంగా విశ్లేషిస్తున్నారు. అమెరికా బాండ్ల ప్రభావం భారత్ కరెన్సీపైనే కాకుండా ఇతర వర్ధమాన దేశాల కరెన్సీలపైనా కనిపిస్తోంది. అయితే బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ నివేదిక ప్రకారం ఆసియాలో ప్రస్తుతం అత్యంత అధ్వాన పనితీరును కనబరుస్తున్న కరెన్సీ రూపాయేనట. వాణిజ్య యుద్ధ భయాలు, ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, విదేశీ పెట్టుబడులు తగ్గుతుండటం లాంటివి కూడా రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

ప్రధాన కరెన్సీలతో పోలిస్తే ఏడాది కాలంలో రూపాయి క్షీణత

అమెరికా డాలరు	-	4.47%
బ్రిటీష్ పౌండు	-	8.53%
యూరో	-	9.5%

విదేశీ పర్యటనలు ప్రియం

రూపాయి క్షీణత కారణంగా సెలవు రోజుల్లో విదేశీ పర్యటనలకు వెళ్లేవారికి వ్యయ భారం పెరుగుతుంది. తరుచూ వ్యాపార కార్యకలాపాల నిమిత్తం దేశాలు తిరిగేవారిపైనా భారం పడుతుంది. అయితే ఎంత మేర ప్రభావం పడుతుందనే విషయం వాళ్లు వెళ్లే దేశంపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా విదేశీ పర్యటనకు వెళ్లేందుకు చాలా మంది ముందస్తు ప్రణాళికతో డబ్బును కూడబెడతారు. విమాన టికెట్ల బుకింగ్, హోటళ్ల బుకింగ్‌లను ఆరు ఏడు నెలలు లేదంటే కనీసం మూడు నెలల ముందుగానే చేసుకుంటుంటారు. అయితే విదేశీ పర్యటనకు వెళ్లే సమయానికి రూపాయి విలువ బాగా తగ్గితే. . ముందుగా నిర్దేశించుకున్న బడ్జెట్ పెరుగుతుంది. దైనందిక అవసరాలకు రూపాయి రూపంలో చేసే ఖర్చులు పెరుగుతాయి. పర్యాటక ప్రాంతాలు చూపించే గైడ్‌లకు, ఆహార పదార్థాలకు, షాపింగ్‌లకు అధికంగా వెచ్చించాల్సి వస్తుంది. నాలుగు నక్షత్రాల హోటల్‌లో దిగాలనుకునే వారు పెరిగే ఖర్చును దృష్టిలో ఉంచుకొని మూడు నక్షత్రాల హోటల్‌కు పరిమితమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే నగరానికి దూరంగా ఉండే హోటళ్లలో బస చేసేందుకు కూడా నిర్ణయం తీసుకోవాల్సి రావచ్చు. అందువల్ల వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని రూపాయి విలువ బాగా తగ్గినప్పుడు ఆ ప్రభావం పెద్దగా పడని దేశాల పర్యటనకు వెళ్లడమే మంచిది.

విదేశీ చదువులూ భారమే: రూపాయి క్షీణత వల్ల భారత్ నుంచి విదేశాలకు చదువు నిమిత్తం వెళ్లేవారికి, ఇప్పటికే అక్కడ చదువుకుంటున్న వారికి ఖర్చుల బడ్జెట్ పెరుగుతుంది. ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు దరఖాస్తు రుసుం, పరీక్షల రుసుం, ట్యూషన్ రుసుంతో పాటు అక్కడ రోజువారి అవసరాలకు వ్యయాల భారం అధికమవుతుంది. ఇవే కాదు రూపాయి క్షీణతతో మరికొన్ని ఇబ్బందికర పరిణామాలూ ఉన్నాయి. అవి ఇవీ..

- ✦ రూపాయి క్షీణత వల్ల బాండ్ల ప్రతిఫలాలు అధిక స్థాయిలో ఉంటాయి. వడ్డీ రేట్ల పెంపునకు ఇది దారి తీస్తుంది. ఎందుకంటే వడ్డీ రేట్లు పెంచితే విదేశీ పెట్టుబడులు ఆకర్షించే వీలుంటుంది. తద్వారా రూపాయి మరింత క్షీణించకుండా అడ్డుకట్ట వేయొచ్చు. అయితే అధిక వడ్డీ రేట్లతో గృహ, వాహన రుణాల ఈఎంఐలు పెరుగుతాయి.
- ✦ జాతీయ పింఛను పథకంలోని ప్రభుత్వ బాండ్ల ప్రతిఫలాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది.
- ✦ దిగుమతుల వ్యయాలు భారం అవుతుండటంతో ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది.
- ✦ విదేశీ సంస్థాగత మదుపర్ల పెట్టుబడులు కూడా తగ్గుతాయి.

వేటికి ప్రయోజనం..

రూపాయి క్షీణత కొన్ని రంగాలకు సానుకూల పరిణామం. విదేశీ కరెన్సీ రూపంలో ఆదాయాన్ని ఆర్జించే ఐటీ, ఆరోగ్య సంరక్షణ, ఎగుమతి ఆధారిత రంగాలు ప్రయోజనం ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రభావం ఈ కంపెనీల షేర్లపై కనిపిస్తోంది. ఏడాది కాలంలో నిఫ్టీ ఐటీ సూచీ 25.5 శాతం పెరిగింది. ఈ సమయంలో నిఫ్టీ పెరిగింది కేవలం 11.27 శాతం మాత్రమే. అలాగే సాంకేతిక రంగ ఫండ్‌లు కూడా ఏడాది కాలంలో 37.71 శాతం ప్రతిఫలాన్ని ఇచ్చాయని వ్యాల్యూ రీసెర్చ్ చెబుతోంది. ఇదే సమయంలో లార్జ్ క్యాప్ షేర్ల ఫండ్‌లు 11.06% ప్రతిఫలం పంచగా.. మధ్య స్థాయి షేర్ల ఫండ్‌లు 12.02 ప్రతిఫలాన్ని ఆర్జించి పెట్టాయి.

ఆయా రంగాల విక్రయాల్లో ఎగుమతుల వాటా

ఐటీ	- 88.6%
నాన్ ఫెర్రస్	- 52%
ఆరోగ్య సంరక్షణ	- 51%

మరింత క్షీణిస్తే ఏంటి?: రూపాయి విలువ మరింత క్షీణిస్తే డాలరు రూపేణా రుణం తీసుకున్న కంపెనీలకు ఇది ఇబ్బందికర పరిణామం. ముడి సరుకును దిగుమతి చేసుకునే కంపెనీలపైనా రూపాయి క్షీణత ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. చమురు మార్కెటింగ్ కంపెనీల వ్యయాలను కూడా పెంచుతుంది. ఈ భారాన్ని వినియోగదారులపై మోపాల్సిన పరిస్థితి ఏర్పడితే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయి. మరోవైపు రూపాయి మరింత క్షీణిస్తే ఐటీ, ఆరోగ్య సంరక్షణ కంపెనీలకు లాభదాయకం. అయితే ఆర్‌బీఐ వద్ద భారీ స్థాయిలో విదేశీ మారక నిల్వలు ఉండటం వల్ల రూపాయి మరింత క్షీణించక పోవచ్చనే అభిప్రాయమూ వినిపిస్తోంది. ఈ నిల్వలను ఉపయోగించి రూపాయి పతనాన్ని ఆర్‌బీఐ అడ్డుకునే అవకాశం ఉంది.

42450 కోట్ల డాలర్లు
2018 మార్చి చివరి నాటికి విదేశీ మారక నిల్వలు

కుర్రోడు గట్టోడే

● వ్యాపార ఒప్పందాల్లో అనిల్ తనయుడి తొలి ముద్ర
● కోడ్‌మాస్టర్స్ వాటా విక్రయంలో కీలక భూమిక
● రిలయన్స్ గ్రూపునకు రూ.1700 కోట్ల సమీకరణ

ముంబయి

పిల్లలు ఏదైనా విజయం సాధిస్తే తల్లిదండ్రులు పొందే సంతోషం అంతా ఇంతా కాదు. రిలయన్స్ గ్రూపు అధినేత అనిల్ అంబానీ కూడా ప్రస్తుతం ఇదే తరహా ఆనందంలో ఉన్నారేమో! ఎందుకంటారా? ఆయన తనయుడు అనుమోల్ అంబానీ మొదటి ప్రయత్నంలోనే ఓ ఒప్పంద ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అది కూడా మామూలు ఒప్పందం కాదు.. గ్రూపునకు రూ.1700 కోట్ల నిధులు తెచ్చిపెట్టిన లావాదేవీ ఇది. 2016లో రిలయన్స్ కేపిటల్ బోర్డులో డైరెక్టరుగా బాధ్యతలు చేపట్టిన 28 ఏళ్ల అనుమోల్.. రెండేళ్ల వ్యవధిలోనే ఇంత పెద్ద బాధ్యతను భుజస్కంధాలపై వేసుకోవడమే కాకుండా విజయవంతంగా పూర్తి చేయడం అనిల్‌కు ఓ విధంగా పుత్రోత్సాహమే!!

ఆ ఒప్పందం ఏమిటంటే..

బ్రిటన్‌లో వీడియోగేమ్‌లు అభివృద్ధి చేసే కోడ్‌మాస్టర్స్‌లో రిలయన్స్ గ్రూపునకు 90 శాతం వాటా ఉంది. ఈ వాటాను 2009లో రూ.100 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు ఇందులో 60 శాతం వాటాను రూ.1700 కోట్లకు విక్రయించింది. అంటే అప్పుడు పెట్టిన పెట్టుబడిపై 25 రెట్ల ప్రతిఫలం వచ్చిందన్నమాట. ఈ విక్రయ లావాదేవీలో అనుమోల్ అంబానీ కీలక భూమిక పోషించారు. తాజా లావాదేవీ ప్రకారం లెక్కిస్తే కోడ్‌మాస్టర్స్‌లో రిలయన్స్ గ్రూపునకు ఉన్న మిగిలిన 30 శాతం వాటా విలువ రూ.850 కోట్ల వరకు ఉంటుంది. కోడ్‌మాస్టర్స్‌లో వాటా విక్రయించిన విషయాన్ని రిలయన్స్ గ్రూపు అధికార ప్రతినిధి కూడా ధ్రువీకరించారు. మరిన్ని విషయాలు వెల్లడించడానికి మాత్రం నిరాకరించారు. కోడ్‌మాస్టర్స్‌లోనే కాదు హాలీవుడ్ మూవీ స్టూడియో డ్రీమ్ వర్క్స్‌లోనూ రిలయన్స్ గ్రూపునకు పెట్టుబడులు ఉన్నాయి.

కోడ్‌మాస్టర్స్ నేపథ్యం

1986లో వ్యవస్థాపితమైన కోడ్‌మాస్టర్స్‌లో కంపెనీ యాజమాన్యానికి 10 శాతం వాటా ఉండగా.. రిలయన్స్ గ్రూపునకు 90 శాతం వాటా ఉంది. ఇప్పుడు రిలయన్స్ గ్రూపు 60 శాతం అమ్మేయడంతో దాని చేతిలో 30 శాతం వాటా మిగిలి ఉంది. కోడ్‌మాస్టర్స్‌కు ఇంగ్లండ్‌లో మూడు, కౌలాలంపూర్‌లో ఒక ప్లాంటుతో కలిపి మొత్తం 4 ప్లాంట్లు ఉన్నాయి. దాదాపు 500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2016లో 31 మిలియన్ పౌండ్లుగా ఉన్న ఆదాయం 2017-2018లో రెండింతలకు పైగా పెరిగి 64 మిలియన్ పౌండ్లకు చేరింది.

కోడి గుడ్లు



2న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	361	వరంగల్	363
చిల్లరగా (ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	366
బెంగళూరు	410	చెన్నై	435
3వ తేదీకి		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	360	నమక్కల్	420

ఉలవచారు మరుగుతోంది

● కిలో రూ.300కు చేరిన ధర
● రైతులకూ సంతృప్తికర ఆదాయం

ఉలవచారు.. వివాహాది శుభకార్యాల్లో ఖరీదైన వంటకాల్లో ఒకటిగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో మధ్యతరగతి, సంపన్న వర్గాల భోజనాల్లో ఇది తప్పనిసరిగా ఉంటోంది. దీని తయారీకి వినియోగించే ఉలవలకు గిరాకీ పెరగడం వల్ల, ధర అధికమై రైతులకు ఆదాయం సంతృప్తికరంగా ఉందని చెబుతున్నారు. పూర్వం ఇళ్లలో తయారు చేసుకుని వినియోగించుకునేవారు. వాణిజ్యపరంగా విక్రయాలు ప్రారంభమయ్యాక, పుష్కరం క్రితం వరకు రిటైల్‌గా కిలో రూ.100 పలికిన ఉలవచారు ఇప్పుడు రూ.300కు చేరింది.

ఈనాడు వాణిజ్య విభాగం

వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉలవలు సాగుచేస్తుంటారు. తెలుగు రాష్ట్రాలకు వస్తే రాయలసీమ జిల్లాలు, శ్రీకాకుళం, కర్ణాటక, తమిళనాడుల్లో వీటి సాగు అధికం. ఒడిశా, మహారాష్ట్రలో కూడా కొంతమేర పండిస్తుంటారు. తక్కువ నీటి లభ్యతతో సాగయ్యే మెట్టపంట కావడం దీని ప్రత్యేకత. కండరాల పటిష్టతకు ఉలవలు ఉపయోగపడతాయని చెబుతారు. ఉడికించినపుడు వచ్చే నీటిని చారులాగా కాసుకుని, ఉలవలను మాత్రం గుర్రాలు, ఎడ్లకు పెట్టేవారు. తొలకరి వరకు ఎడ్లు ఖాళీగా ఉంటాయి కనుక, పనుల ప్రారంభంలో వాటితో పనిచేయించేందుకు ఉలవలు తినిపించేవారు. గుర్రాల పెంపకం సామాన్యులు చేయరు. వ్యవసాయంలో యంత్రాల వాడకం పెరిగి, ఎడ్ల పాత్ర తగ్గాక, ఉలవల సాగు తగ్గింది. తమిళనాడు, కర్ణాటకలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ఎడ్లు పెంచే వారు మాత్రమే వినియోగించేవారు. వాణిజ్యపరంగా ఉలవచారు తయారీ ప్రారంభమయ్యాక, ఉలవల సాగు మళ్లీ పెరిగింది. పుష్కరకాలం క్రితం వరకు క్వింటాలు (100 కిలోలు) ఉలవల ధర రూ.300 మేర ఉండేది. ఇప్పుడు క్వింటాలు రూ.3,700కు చేరింది. గతేడాది దిగుబడి తగ్గడంతో, అనూహ్యంగా క్వింటాలు రూ.8,000కు చేరి, కొద్దిమంది రైతులకు మంచి ఆదాయం లభించింది.

100 కిలోలు మరిగిస్తే 33 కిలోల ఉలవచారు: ఉలవచారు తయారీని వాణిజ్య పరంగా దాదాపు 20 ఏళ్ల క్రితం చేపట్టారు. విజయవాడ ప్రధాన కేంద్రంగా వీటి తయారీ సాగుతోంది. 100 కిలోల ఉలవలను దాదాపు 12 గంటల పాటు మరిగిస్తే, 33 కిలోల మేర ఉలవచారు లభిస్తుంది. ఇందులో ప్రధానంగా చింతపండు, ఉల్లిపాయలు కూడా వేస్తారు. తెలుగు రాష్ట్రాల్లోనే, భోజనాల్లో ఉలవచారు వినియోగం అధికం. శ్రీకాకుళం ప్రాంతంలో పప్పుచారు మాదిరిగా కూడా వీటిని కాసుకుంటారు. ఎక్కువకాలం నిల్వ ఉండటంతో, విదేశాల్లోని తెలుగువారు వీటిని తీసుకెళ్తుంటారు. స్వల్ప పరిమాణంలో ఎగుమతి కూడా అవుతుంది. ఉత్తర భారతానికి వచ్చేసరికి బీహార్‌లో ఉలవల ఉండలు (లడ్డూల మాదిరి) చేసుకుని భుజిస్తారని చెబుతారు.

గిరాకీ ఇలా: దేశంలో ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఏడాదికి 17,000-20,000 టన్నుల ఉలవలకు గిరాకీ లభిస్తోందని అంచనా. రాయలసీమ జిల్లాల్లో ఎకరానికి 7 బస్తాల (క్వింటాళ్ల) వరకు, కర్ణాటక - తమిళనాడుల్లో అయితే 10-12 బస్తాల వరకు ఉలవల దిగుబడి వస్తోందని అంచనా. వినియోగం అధికంగా ఉన్నా, ధర లేనందునే తెలుగు రాష్ట్రాల్లో వీటి సాగు బాగా తగ్గింది. గతేడాది క్వింటాలు రూ.8,000 వరకు చేరడం, ఈ ఏడాది కూడా మినుములు రూ.5,000 వరకు ఉండగా, ఉలవల ధర కూడా రూ.,3700కు చేరడంతో, వీటిని కొనుగోలు చేసి, నిల్వ చేసే ధోరణి పెరుగుతోంది. ఏదైనా పంటకు అధిక ధర వస్తే, దానిపై దృష్టి సారించి, ఎక్కువమంది సాగు చేస్తున్నారు. ఫలితంగా తదుపరి పంట దిగుబడుల సమయానికి ధర క్షీణించి, నష్టపోతున్నారు. ఉల్లిపాయ, టమాటా విషయంలో ఇది తరచు రుజువవుతోంది. ఉలవల విషయంలోనూ ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలి. దేశం మొత్తం గిరాకీ లేకపోవడం, దక్షిణాదిలో మాత్రమే వినియోగం అధికంగా ఉండే ఈ పంటపై పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పనిసరి కాని ఆహార పదార్థం మాత్రమే అని గుర్తించాలని పేర్కొంటున్నారు.

ముడి సరకుల ధరల పెరగడం వల్లే..

ఉలవలకు తోడు చింతపండు, ఉల్లిపాయల ధర పెరగడం వల్లే ఉలవచారు ధర పెరిగిందని తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన తయారీ సంస్థ ఇందిరా ఫుడ్స్ యజమాని వెంకటరత్నం తెలిపారు. దాదాపు 12 గంటల పాటు మరిగించాల్సి ఉందని, ఇందుకు కొంతవరకు విద్యుత్తును, మరికొంతమేర కట్టెపుల్లలు వినియోగించాల్సి వస్తోందన్నారు. వీటి ధరలు కూడా అధికమయ్యాయని తెలిపారు. అయినా పుష్కరకాలంలో రిటైల్ ధర రూ.100 నుంచి రూ.300కు మాత్రమే పెరిగిందని గుర్తు చేశారు. తాము ఏడాదికి దాదాపు 450 టన్నుల ఉలవలు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

సిరి రేపటి సంచికలో

డాక్టర్ రెడ్డీస్ శ్రీకాకుళం యూనిట్‌కు పచ్చజెండా!

ఈనాడు, హైదరాబాద్: శ్రీకాకుళంలోని డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన ముడి ఔషధాల (ఏపీఐ) తయారీ ప్లాంటును అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తనిఖీ చేసింది. తనిఖీ అనంతరం ఎటువంటి లోపాన్ని వెల్లడించలేదని, ఏపీఐ యూనిట్ లోప రహిత యూనిట్‌గా నిలిచిందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. ఈ యూనిట్ (సెజ్) శ్రీకాకుళంలోని పైడి భీమవరం వద్ద ఉంది. ఇందులో ఇబుప్రోఫెన్, నప్రాక్సెన్, సెలికోక్సిబ్ వంటి ముడి ఔషధాలను డాక్టర్ రెడ్డీస్ తయారు చేస్తోంది. వీటిని ఎగుమతి చేస్తోంది. 2014, నవంబరులో ఈ యూనిట్‌లో తనిఖీలు నిర్వహించి ఎఫ్‌డీఏ ఫారమ్ 483 పరిధిలోకి వచ్చే 9 లోపాలను గుర్తించింది. ఆ తర్వాత 2015లో జరిగిన తనిఖీల అనంతరం హెచ్చరిక లేఖను యూఎస్ఎఫ్‌డీఏ జారీ చేసింది. ఈ నేపథ్యంలో లోపాలు లేవని యూఎస్ఎఫ్‌డీఏ వెల్లడించడం కంపెనీకి ఊరట కలిగించే అంశం. దాదాపు గత రెండేళ్లుగా డాక్టర్ రెడ్డీస్ యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలతో ఇబ్బందులు పడుతోంది. ఇటీవల ఫలితాలను వెల్లడించే సమయంలో కూడా తయారీ యూనిట్లను నియంత్రణ సంస్థల నిబంధనలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని కంపెనీ సీఈఓ జి.వి.ప్రసాద్ తెలిపారు.

ఎలక్ట్రిక్ కిక్!

- బ్యాటరీ వాహనాల మార్కెట్లో చైనా మహా జోరు
- దిగివస్తున్న ఎలక్ట్రిక్ బ్యాటరీల ధర
- మనదేశంలో ఏదీ సత్వర కార్యాచరణ?

నిన్న మొన్నటి వరకూ ఎలక్ట్రిక్ వాహనం అంటే, అదెప్పుడొచ్చేనో.. అనుకునేవారు. బ్యాటరీ పరిజ్ఞానం సంక్లిష్టమైనది కావటం, ప్రతిసారీ రీ-ఛార్జి చేయటం, రీ-చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు.. ఇవన్నీ సమస్యలే. కొన్నేళ్లపాటు పెట్రోలు, డీజిల్ వాహనాలు తప్పవని నిర్ధారణకు వచ్చారు. కానీ ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతిక పరిజ్ఞానం అనూహ్యంగా తెరమీదకు వచ్చింది. బ్యాటరీ తయారీ నైపుణ్యం విస్తరించటంతో పాటు, ఒకసారి ఛార్జితో వందల కిలోమీటర్లు ప్రయాణించగల వాహనాలు రూపుదిద్దుకున్నాయి. దీంతో అంచనాల కంటే ముందుగానే ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల యుగం వచ్చేసినట్లయింది. ఈ ఆసక్తికరమైన మార్పులో చైనా అగ్రభాగాన నిలవటం ప్రత్యేకత.

ధర తగ్గుతోంది..

బ్యాటరీల ధరలు 2010 కంటే ముందు ఎంతో అధికంగా ఉండగా, ఆ తర్వాత నెమ్మదిగా దిగివచ్చింది. 2030 నాటికి ఇంకా తగ్గిపోతుందని అంచనా. ఏటేటా ఇంకా సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తూనే ఉంది. దీనివల్ల బ్యాటరీల్లో ఇంధన నిల్వ (ఎనర్జీ డెన్సిటీ) ఏటా 5- 7% వరకూ పెరుగుతోంది. 2020 నాటికి పెట్రోలు, డీజిల్ వాహనాల ధరల స్థాయికి ఎలక్ట్రిక్ వాహనాల ధరలు దిగివస్తాయని అంచనా. అంతేగాక పెట్రోలు, డీజిల్ వాహనాల కొనుగోలు, వినియోగంపై కఠినమైన నిబంధనలు అమల్లోకి వస్తాయి. ఫలితంగా బ్యాటరీ వాహనాల విక్రయాలు పెరిగిపోతాయి. అమెరికాలో ప్రస్తుతం 40 మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. 2022 నాటికి ఈ సంఖ్య 100కు పెరగవచ్చు. ఆ సమయానికి ప్రపంచవ్యాప్తంగా 300 మోడళ్లు ఉంటాయని భావిస్తున్నారు.

ఆ దూకుడు మనకేదీ?

- పొరుగున ఉన్న చైనా బ్యాటరీ వాహనాల వైపు దూసుకుపోతుండగా మనదేశంలో అంతే స్థాయిలో మార్పు కనిపించటం లేదు.
- ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తే మనదేశానికి ఎంతో లబ్ధి చేకూరుతుంది. ముడి చమురు దిగుమతి చేసుకోవటానికి మనదేశం పెద్దఎత్తున విదేశీ మారకద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. పూర్తిగా బ్యాటరీ వాహనాలకు మారగలిగితే చమురు దిగుమతులను తగ్గించుకునే అవకాశం లభిస్తుంది.
- 2030 నాటికి దేశంలో అన్నీ బ్యాటరీ వాహనాలే ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన కాగా, ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే అది సాధ్యం అయ్యేటట్లు కనిపించటం లేదు. అందుకు 2050 వరకూ ఆగాల్సి వస్తుందనేది నిపుణుల అభిప్రాయం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దేశీయంగా అందుబాటులో లేకపోవటానికి తోడు ఛార్జింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయటానికి సమయం పడుతుండటం దీనికి ప్రధాన కారణం.
- మధ్యేమార్గంగా సమీప భవిష్యత్తులో 'స్మార్ట్ హైబ్రీడ్' వాహనాలు మనదేశంలో అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. ఈ తరహా వాహనాలు బ్యాటరీతోపాటు, పెట్రోలు/ డీజిల్‌తో నడిచేవిగా ఉంటాయి.
- మనదేశంలో కార్ల కంటే ముందుగా బస్సులు పూర్తిగా బ్యాటరీ వైపు మళ్లే అవకాశం కనిపిస్తోంది. అగ్రగామి చైనా సంస్థ అయిన బీవైడీ మనదేశంలో ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేయటానికి సన్నాహాలు చేస్తోంది. ఈ సంస్థ హైదరాబాద్ సమీపంలో ఈ కర్మాగారాన్ని నెలకొల్పనుంది.
- ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించటం ద్వారా పెట్టుబడులను ఆకర్షించటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎలక్ట్రిక్ మొబిలిటీ' విధానాన్ని ఆవిష్కరించింది. దీని ప్రకారం విద్యుత్తు కార్ల తయారీదార్లు, బ్యాటరీ తయారీ సంస్థలు, ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తుంది. అంతేగాక ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టటానికి టయోటా కిర్లోస్కర్ మోటార్స్, రాష్ట్ర ప్రభుత్వంతో కొంతకాలం క్రితం ఒప్పందం కుదుర్చుకుంది.

అమెరికా.. నెమ్మదిగా.. విచిత్రమేమిటంటే.. ఎలక్ట్రిక్ వాహనాల పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటంలో అమెరికా క్రియాశీలకంగా కనిపించటం లేదు. 2017లో అమెరికాలో నమోదైన కార్ల విక్రయాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 1% మాత్రమే. ఈ ఏడాది ఏప్రిల్‌లో అక్కడ 20,000 ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు నమోదయితే, చైనాలో 72,000 కార్ల అమ్మకాలు జరిగాయి. కానీ భవిష్యత్తులో ధరలు తగ్గి ఎక్కువ మోడళ్లు అందుబాటులోకి వస్తే అమెరికాలోనూ వీటి విక్రయాలు పెరుగుతాయి.



- ఈనాడు ప్రత్యేక విభాగం

'పోలవరం' నిలిపేయాలంటూ ఒడిశా ముఖ్యమంత్రి లేఖ

ఈనాడు, దిల్లీ-భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: పోలవరం నిర్మాణం తక్షణమే నిలుపుదల చేయాలని ఒడిశా ప్రభుత్వం డిమాండు చేసింది. ఒడిశా అభ్యంతరాలు పరిష్కారమయ్యే వరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిలిపివేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు మూడు పేజీల సుదీర్ఘలేఖ రాశారు. "ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఒడిశా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ స్టాప్ వర్క్ఆర్డర్ నిలుపదల చేసిందని, పోలవరం నిర్మాణం రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని 16.9.2015, 28.11.2017న ప్రధాని నరేంద్రమోదీకి రెండులేఖలు రాశాను. సమస్యలు పరిష్కరించకుండా పోలవరం చేపట్టడం వల్ల ఒడిశాలోని గిరిజన ప్రజలకు ఎంతో నష్టం కలుగుతుందని కూడా గతంలో రాసిన లేఖల్లో ప్రస్తావించాను. ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఒడిశా పరిధిలోని శబరి, సీలేరు నదుల్లో ఎంత మేర నీరు నిలుస్తుందని కచ్చితంగా అంచనా వేయలేదు. గోదావరి నదీ జలాల వివాద పరిష్కార ట్రైబ్యునల్ అవార్డును ఉల్లంఘిస్తూ నిర్మాణం చేపడుతున్నారు. పోలవరం నిర్మాణం వల్ల తీవ్రంగా ప్రభావం పడే మల్కనగిరి జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించలేదు. ఈ అంశాలన్నింటిపై గతంలో తాము అభ్యంతరాలు వ్యక్తంచేయగా.. ఛత్తీస్‌గఢ్, ఒడిశా లేవనెత్తిన సమస్యలను పరిష్కరించే వరకు రిజర్వాయరు నింపమని ఏపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని కేంద్ర పర్యావరణ అటవీ శాఖ పేర్కొంది. కానీ ఒడిశా ప్రభుత్వం విజ్ఞప్తులను ఏపీ ప్రభుత్వం, కేంద్ర జలసంఘం పరిగణనలోకి తీసుకోవడం లేదు. పదేపదే స్టాప్ వర్క్ ఆర్డర్‌ను నిలుపుదల చేయడం వల్ల నిరంతరంగా ప్రాజెక్టు పనులు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒడిశా అభ్యంతరాలు పరిష్కార మయ్యే వరకు ప్రాజెక్టు పనులు తక్షణమే నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా" అని నవీన్ పట్నాయక్ లేఖలో పేర్కొన్నారు.

నేడు సివిల్స్ ప్రాథమిక పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ ప్రాథమిక పరీక్ష ఆదివారం జరగనుంది. దాదాపు 10 లక్షల మంది దరఖాస్తు చేసినా వారిలో సాధారణంగా 50 శాతం మందే పరీక్ష రాస్తున్నారు. మొత్తం 49 నగరాల్లో పరీక్ష జరగనుండగా తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, ఏపీలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలలో పరీక్ష జరగనుంది. రెండు రాష్ట్రాల నుంచి సుమారు 87 వేల మంది దరఖాస్తు చేశారు. హైదరాబాద్‌లోని 101 కేంద్రాల్లో 49 వేల మంది, వరంగల్‌లో 11 కేందాల్లో 5,204, విజయవాడ నుంచి 12,176 మంది హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 9.20 గంటలు, మధ్యాహ్నం 2.20 గంటలకు పరీక్ష నిర్వహించనున్నారు. ఫలితాలు 25 రోజుల్లో వెలువడనున్నాయి. రుణాత్మక మార్కులున్నందున అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలనీ, యూపీఎస్సీ నిషేధించిన ఫోన్లు తదితర వస్తువుల్ని తెచ్చుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు.

కోచింగ్ కేంద్రాలపై యంత్రాంగం దృష్టి: సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలపై ఈసారి అధికారులు గట్టి నిఘా పెట్టారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కొందరు ప్రశ్న పత్రాలను బయటకు చేరవేస్తున్న సంఘటనలు వెలుగు చూసిన నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించారు. 2016లో బీటెక్ విద్యార్థి వసీం అహ్మద్ బ్లూటూత్ సహాయంతో స్నేహితుల నుంచి జవాబులు సేకరిస్తూ అధ్యాపకులకు పట్టుబడ్డారు. 2017లో తమిళనాడు కేడర్‌కు చెందిన కరీం ఐపీఎస్ శిక్షణ ముగించుకుని ప్రొబేషనరీలో విధులు నిర్వర్తిస్తూ, ఐఏఎస్ కోసం మరోసారి సివిల్స్‌కు సిద్ధమై, మాస్‌కాపీయింగ్‌ను నమ్ముకున్నారు. దానికి ఆయన భార్య సహకరించడం విశేషం. తమిళనాడులో పరీక్ష రాస్తున్న కరీంకు హైదరాబాద్‌లోని ఓ కోచింగ్ కేంద్రం నుంచి జవాబులు చేరవేశారు. పరీక్ష రాసే సమయంలో కరీం చెవిలో మైక్రోఫోన్, చొక్కా గుండీలో కెమెరా అమర్చి ప్రశ్నపత్రం స్కాన్ చేసి గూగుల్‌డ్రైవ్‌కు చేరవేయగా.. కరీం భార్య జాయ్సీ జాయి సమాధానాలు ఫోన్ ద్వారా చేరవేసినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఇందుకు ఓ కోచింగ్ కేంద్రం నిర్వాహకులు సహకరించినట్లు నిర్ధరించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో హైదరాబాద్ కేంద్రంగా హైటెక్ మాస్ కాపీయింగ్ జరగడాన్ని యూపీఎస్సీ తీవ్రంగా తీసుకుంది. ఇలాంటి ఘటనలు మళ్లీ చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టింది. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలనూ అనుమతించరు. కేంద్రాల వద్ద జామర్లు సైతం ఏర్పాటు చేశారు. కొన్ని కోచింగ్ కేంద్రాలపై కూడా నిఘా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం.

దొలేరాకు రూ.కోట్ల తరలింపుపై ప్రశ్నించే ధైర్యముందా?

- జగన్, పవన్‌లపై

మంత్రి దేవినేని ఉమా ధ్వజం

విజయవాడ, న్యూస్‌టుడే: దొలేరా నగరానికి, గుజరాత్ రాష్ట్రానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం రూ.వేల కోట్లు తరలిస్తున్న విషయంపై ప్రశ్నించే దమ్ము, ధైర్యం వైకాపా అధినేత జగన్‌కు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఉందా? అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. శనివారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. వైకాపా, జనసేన, భాజపాలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. జగన్ గతంలో జైలు నుంచి బయటకు రావడానికి కాంగ్రెస్‌తో లాలూచీ పడ్డారని.. ఇప్పుడు కేసుల నుంచి తప్పించుకోవడానికి భాజపాతో దోస్తీకి సిద్ధమయ్యారని విమర్శించారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో భాజపా ఘోర పరాజయం పాలైతే, సాక్షి దినపత్రికలో ఆ వార్తలను ప్రాధాన్యం లేకుండా ప్రచురించారని ఆరోపించారు. వైకాపాకు భాజపాతో బంధం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. వైకాపా తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధమైన నాయకుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారని పేర్కొన్నారు. జగన్ పాదయాత్ర ఉదయపు, సాయంత్రం నడకలా సాగుతోందని, యాత్రను శ్రీకాకుళం జిల్లా నుంచి కాశీ వరకూ పొడిగిస్తే పుణ్యం దక్కుతుందని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.3,400 కోట్లు కేంద్రం నుంచి బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఈ నెల 11న పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్‌ను ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభిస్తారని, దీనిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్డ్ డ్యామ్ వస్తుందన్నారు.

ముఖ్యమంత్రిని విమర్శిస్తూ వెళ్తే ప్రజలు ఊరుకోరు: సుజయ్‌కృష్ణ

విజయనగరం, న్యూస్‌టుడే: జనసేన నేత పవన్‌కల్యాణ్ ఆయన పార్టీ సిద్ధాంతాలను చెప్పి, వాస్తవాలను మాట్లాడాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. శనివారం సాయంత్రం విజయనగరంలో విలేకరులతో మాట్లాడారు. యాత్ర పేరుతో తెదేపాను, ముఖ్యమంత్రిని విమర్శిస్తూ వెళ్తే ప్రజలు ఊరుకోరన్నారు. పవన్ అన్న చిరంజీవి పార్టీ పెట్టి రాష్ట్రానికి అన్యాయం చేసిన పార్టీలో విలీనం చేసిన చేదు అనుభవాన్ని గ్రహించాలన్నారు. మీకు ఓట్లు వేస్తే భాజపాకు వెళ్లే పరిస్థితి ఉందన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయన్నారు. ప్రతిపక్షనేత జగన్ పాదయాత్రలో సీఎంను విమర్శించడానికే సమయం కేటాయిస్తున్నారని, కేంద్రం, ప్రత్యేకహోదా విషయాన్ని విస్మరించారని విమర్శించారు.

భాజపా ఒక్క సీటూ గెలవదు: కేఈ

కర్నూలు, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లాలో భాజపా ఒక్క సీటు గెలిచినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. కర్నూలులో నిర్వహించిన నవ నిర్మాణ దీక్షలో మాట్లాడారు. గుజరాత్ రాజధానికి కేంద్రం రూ. లక్షల కోట్లు కేటాయిస్తే.. ఆంధ్ర రాజధానికి కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించిందన్నారు. నవ్యాంధ్ర గురించి ఏనాడైనా మాట్లాడారా అని జగన్‌ను ప్రశ్నించారు. నీవు ఎప్పటికీ సీఎం కుర్చీ ఎక్కలేవన్నారు. పవన్ అన్నప్రాసన రోజునే ఆవకాయ తింటానంటాడని, సభలకు వచ్చే జనాన్ని చూసి మురిసిపోతున్నారని విమర్శించారు.

త్యాగాలు చేసిన వారిని విస్మరిస్తారా?: చలసాని

ఈనాడు, అమరావతి: సమైక్యాంధ్ర, ప్రత్యేక హోదా ఉద్యమాల్లో త్యాగాలు చేసిన వారిని విస్మరించి... ఉద్యమానికి ద్రోహం చేసిన వ్యక్తిగా తాము భావిస్తున్న వ్యక్తిని చంద్రబాబు ఆకాశానికెత్తడం మేము చేసిన ఉద్యమాలను అవమానించడమేనని హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం కోసం ఆత్మత్యాగం చేసుకున్న వారి పేర్లను కూడా నవనిర్మాణ దీక్షలో ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. అక్టోబరు 1ని ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే పోరాటానికి మద్దతు ఇస్తామని.. ఉమ్మడి పోరుకు కలిసి రావాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలుగు అమలు చేయని బడులపై చర్యలు

- తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ఒకటి నుంచి పదో తరగతి వరకు ఒక సబ్జెక్టుగా తెలుగు బోధన అమలు చేయని పాఠశాలల యాజమాన్యాలపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝుళిపించనుంది. ఇలాంటి బడులకు రెండుదఫాలు జరిమానా విధించి.. తర్వాత కూడా చట్టాన్ని అతిక్రమిస్తుంటే అనుమతులను రద్దు చేస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 2018-19 విద్యా సంవత్సరం నుంచి తెలుగు తప్పనిసరి చేస్తూ మార్చిలో ప్రభుత్వం చట్టం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర పాఠ్య ప్రణాళికతోపాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ తదితర బోర్డుల ప్రైవేట్ పాఠశాలలు తెలుగు అమలు చేయకుండా మొదటిసారి పట్టుబడితే రూ.50 వేలు జరిమానా, రెండోసారి అయితే రూ.లక్ష జరిమానా విధిస్తారు. మొదటిసారి నిబంధనలు అతిక్రమించారని గుర్తిస్తే అధికారులు యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తారు. ఒకవేళ ఉల్లంఘన చేస్తున్నారని నిర్ధరణకు వస్తే లోపాలను సవరించుకోవడానికి నెల గడువు ఇస్తారు. ఆలోపు అమలు చేయని పక్షంలో మొదటి ఉల్లంఘనగా రూ.50 వేలు జరిమానా విధిస్తారు. రెండోసారి ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తారు. తర్వాత కూడా నిబంధనల ఉల్లంఘన కొనసాగితే జీఓ 1 ప్రకారం డీఈఓ లేదా విద్యాశాఖ కమిషనర్ ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తారు.

తెలుగు రాష్ట్రాలకు ప్రధాని శుభాకాంక్షలు

ఈనాడు, దిల్లీ : తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు నా శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రజల కలలు, ఆశలు ఫలించాలని కోరుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్ సోదర సోదరీమణులకు నా శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రజలకు మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కలగాలని ప్రార్థిస్తున్నాను' అని ప్రధాని పేర్కొన్నారు.

బీసీలకు పెద్దపీట వేస్తాం: జగన్

- అభివాదం, స్వీయచిత్రాలతో సాగిన పాదయాత్ర

ఆచంట, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు పెద్దపీట వేస్తామని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ముద్దాడ గణేష్ భవాని శనివారం జగన్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీలకు చట్టపరంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, రూ.25 వేల కోట్లతో బీసీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని ఆయన కోరగా మనందరి ప్రభుత్వం రాగానే బీసీలకు పెద్దపీట వేస్తామని జగన్ బదులిచ్చారు. జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర శనివారం ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో అభివాదం, స్వీయ చిత్రాలు, వినతులు తీసుకోవడంతోనే ముందుకు సాగింది. శనివారం ఉదయం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు శివారు ఉల్లంపర్రులో ప్రారంభమైన పాదయాత్ర మధ్యాహ్నానికి ఆచంట నియోజకవర్గంలో ప్రవేశించింది. నియోజకవర్గ కన్వీనరు చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కవురు శ్రీనివాస్ తదితరులు వేడంగిలో జగన్‌కు స్వాగతం పలికారు. భోజన విరామం అనంతరం మరో మూడు గ్రామాల మీదుగా పాదయాత్ర జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు పోడూరు మండలం జగన్నాథపురంలో పాదయాత్ర ముగిసింది. రెండు నియోజకవర్గాల పరిధిలో ఎక్కడా సభలు, సమావేశాలు లేకపోవడంతో దారి పొడవునా కలిసిన ప్రజలకు, కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ జగన్ ముందుకు వెళ్లారు. దారి పొడవునా యువకులు, యువతులు, పిల్లలు జగన్‌తో స్వీయచిత్రాలు తీసుకున్నారు. కాస్త నీరసంగా ఉండటంతో పలు కూడళ్లలో మాట్లాడకుండానే జగన్ ముందుకు సాగారు. పలు గ్రామాల్లో స్థానికుల సమస్యలను ఆలకించారు. వినతులు తీసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానంటూ హామీ ఇచ్చారు. రహదారిపై పలుచోట్ల తారసపడిన కొబ్బరి వలుపు కార్మికులు, జట్టు కార్మికులను పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషబాబు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, స్థానిక నాయకులు పాదయాత్రలో పాల్గొన్నారు.

పాదయాత్రలో అభివాదం చేస్తున్న జగన్

2019లో ప్రజలు గుణపాఠం చెబుతారు

ఈనాడు డిజిటల్, అమరావతి: విభజన జరిగి నాలుగేళ్లైనా ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగలేదని జగన్ పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలును విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని శనివారం ట్విట్టర్‌లో విమర్శించారు. ప్రభుత్వాల విశ్వాస ఘాతుకానికి 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

'నిషిద్ధ' కార్యాచరణపై ఆశలు

- రెవెన్యూ అధికారులకు ఇతర విధులు కేటాయించొద్దని ఇప్పటికే ఆదేశాలు

ఈనాడు, అమరావతి: నిషేధిత భూములు, చుక్కల భూముల పరిష్కారంపై వచ్చేనెల నుంచి ప్రత్యేక కార్యాచరణ అమలు కాబోతున్న తరుణంలో బాధితుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. గత కొన్నేళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు జరిగిన ప్రయత్నాలు తగిన ఫలితాలు ఇవ్వలేదు. సీసీఎల్ఏ అధికారులు తరచూ జిల్లా అధికారులతో సమీక్షిస్తున్నా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జిల్లా అధికారులు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు.. ఈ విషయాన్ని ప్రభుత్వ వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ నెల 13 నుంచి 30వరకు రెవెన్యూ శాఖ ఈ సమస్యల పరిష్కారంపైనే పూర్తిస్థాయిలో దృష్టిపెట్టనుంది. ఇందులో భాగంగానే రెవెన్యూ శాఖ అధికారులకు ఇతర విధులను కేటాయించొద్దని ఇప్పటికే జిల్లాల అధికారులను కోరింది.

2479 దరఖాస్తులేనా?: 20-ఎ నిషిద్ధభూముల జాబితా కింద మూడు కేటగిరిల్లో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 2,479 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 528 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. నిషిద్ధ జాబితా చట్రంలో ఇరుకున్న వారు రాష్ట్రంలో లక్షలమంది ఉన్నప్పటికీ పరిష్కారానికి ఎవరికి విజ్ఞప్తి చేసుకోవాలో అవగాహనలేక కేవలం 2,479 దరఖాస్తులు మాత్రమే మీసేవా అందాయి. వీటికి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు వచ్చిన విజ్ఞప్తులు అదనం.

రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షల ఎకరాల చుక్కల భూములు ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 60,164 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కేవలం 1,047 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. గుంటూరు, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, కడప, చిత్తూరు జిల్లాల్లో చుక్కల భూముల సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఈ భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసిన 6 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని అధికారికంగా ఉత్తర్వులను జారీచేసినా తగిన ఫలితం కనిపించలేదు. బ్రిటిష్ హయాంలో భూముల సర్వే సందర్భంగా ఆ సమయంలో భూమిపై ఎవరున్నారో తెలియని చోట చుక్కలు పెట్టి వదిలేశారు. వాటినే చుక్కల భూములుగా పేర్కొంటున్నారు. దశాబ్దాల పాటు వాటికి రిజిస్ట్రేషన్లు జరిగాయి. భారీగా చేతులు మారాయి. అయితే వీటిని సర్కారు భూములుగా పేర్కొంటున్న ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపడంతో సమస్య మొదలైంది.

అసైన్డ్‌భూములు-చుక్కల భూములు: 1954కు ముందు పేదలకు అసైన్డ్ చేసిన భూములను 22-ఎ జాబితా నుంచి తొలగించే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. పట్టాలు ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై నిర్ణయాన్ని తీసుకోనందున ఈ భూములన్నీ 22-ఎ నిషేధ జాబితాలోకి వెళ్లాయి. చుక్కల భూముల సమస్యల పరిష్కారంలో అసైన్డ్ భూముల వ్యవహారం కీలకం. వీటికి పరిష్కారం చూపకుండా చుక్కల భూముల సమస్యలను పరిష్కరించడం కష్టమని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. బ్రిటిష్ ప్రభుత్వ కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చాక 1954 దాకా భూముల పంపిణీ భారీగా జరిగింది. రాష్ట్రంలో 2.56లక్షల ఎకరాలు అసైన్డ్ కింద ఉన్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం ఈ భూములపై 1.11లక్షల మంది రైతులు ఉన్నారు. 1954 సంవత్సరానికి ముందు ఏ నిబంధనలు లేకుండా అసైన్డ్ చేసిన భూములు పీఓటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) చట్టం వర్తించదని హైకోర్టు తీర్పులు ఉన్నాయి. ఇటువంటి భూములను 22-ఎ నుంచి తొలగించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది.

జిల్లాల వారీగా అసైన్డ్ భూములు కలిగిన రైతులు

జిల్లా	ఎకరాలు	రైతులు
ప్రకాశం	88,088	53,063
అనంతపురం	65,789	20,318
గుంటూరు	56,545	18,216
విశాఖపట్నం	7,459	6,320
చిత్తూరు	6,085	9,817
కడప	5,707	2,083
పశ్చిమగోదావరి	3,501	2,560

- తూర్పుగోదావరి, శ్రీకాకుళం, నెల్లూరు, విశాఖపట్టణం జిల్లాల్లో ఈ సమస్య తక్కువగా ఉంది.

వారసత్వ రాజకీయాలు సహజం: జేసీ

అనంతపురం (రాణినగర్), న్యూస్‌టుడే: కశ్మీర్ మొదలుకుని దక్షిణాన కర్ణాటక, తెలంగాణలో వారసత్వ రాజకీయాలున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబూ తన కుమారుడు లోకేష్‌కు పట్టాభిషేకం చేయాలనుకోవడం సహజమని, అయితే ఆ విషయాన్ని ఆయన బయటకు వ్యక్తం చేయడం లేదని అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అనంతపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రధానిగా ఉన్నంత కాలం రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాదని చెప్పారు. జగన్‌పై ఎక్కడా పరుషంగా మాట్లాడలేదని, వాస్తవ చరిత్రను చెప్పానని వివరించారు. తాను మాట్లాడిన ప్రతి అక్షరం నిరూపిస్తానని, పులివెందులకైనా వెళతానని సవాల్ విసిరారు. ఇటీవల తన వ్యాఖ్యలకు నిరసనగా పలువురు దిష్టిబొమ్మ శవయాత్ర, దహనం వంటివి చేపడుతున్నారని, హిందూ సంప్రదాయం ప్రకారం ఇలాంటి క్రతువు తండ్రికి కుమారులు చేస్తారని, తనకు ఇంతమంది కుమారులు ఎక్కడి నుంచి వచ్చారో తెలియడం లేదని వ్యాఖ్యానించారు.

తన మరణానికి కారణం తెలుపుతూ చేతిపై రాతలు ★ ధనుంజయ్(పాత చిత్రం)

అందంగా లేనని.. ఆత్మహత్య!

- రైలు కిందపడి యువకుడి బలవన్మరణం
- విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఘటన

బొబ్బిలి/ సాలూరు, న్యూస్‌టుడే: అందంగా లేననే బాధ ఓవైపు, ఎక్కడికెళ్లినా పని లభించకపోవడం, ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. విజయనగరం జిల్లా బొబ్బిలి రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. సాలూరు మండలం కోదుకరకవలసకు చెందిన మారోజు ధనుంజయ(25) మృతదేహం రైలుపట్టాలపై పడి ఉంది. తన చావుకు గల కారణాలు చేతిపై రాసుకోవడంతో పాటు సోదరుడు పరమేశ్వరరావుకు చరవాణిలో సందేశం పంపాడు. సోదరుడు తేరుకుని స్టేషన్‌కు వచ్చేసరికి ధనుంజయ మృతి చెందాడు. మృతుడు ఐటీఐ, ఇంటర్ పూర్తిచేసి దూరవిద్యలో డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల గ్రామంలో పెళ్లి సంబంధం కోసం బంధువుల ఇంటికి వెళ్లగా 'నీ ముఖం అద్దంలో చూసుకుంటే బాగుంటుంది' అని పలువురు ఎగతాళి చేసినట్లుగా తెలుస్తోంది. దీంతోపాటు ఏ దుకాణంలోకి వెళ్లినా ఉపాధి అవకాశాలు ఇవ్వకపోవడంతో తనలో తాను బాధపడేవాడని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లోనే బలవన్మరణం పొంది ఉంటాడని భావిస్తున్నారు.

అనిశాకు చిక్కిన కర్మాగారాల డీసీఐ

రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

కృష్ణయ్య కేశవులు

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ (డీసీఐ) ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణయ్య కేశవులు.. శనివారం అవినీతి నిరోధక శాఖ(అనిశా) వలకు చిక్కారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన జి. వెంకటేశ్వర్లు తమ గ్రామంలో విఘ్నేశ్వరా కోల్డు అండ్ డ్రై ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు పరిశ్రమల శాఖ నుంచి అనుమతులకు ఏప్రిల్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు కృష్ణయ్య కేశవులు రూ.50వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు వెంకటేశ్వరరావు అనిశా అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం కృష్ణయ్య కేశవులు అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో బాధితుని నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా అనిశా డీఎస్పీ దేవానంద్‌శాంతో, సీఐలు వెంకటేశ్వరరావు, ఫిరోజ్‌లు పట్టుకున్నారు.

దీక్షల పేరిట ప్రజాధనం దుర్వినియోగం: జనచైతన్య వేదిక

ఈనాడు డిజిటల్, అమరావతి: నవ నిర్మాణ దీక్షలు, ధర్మ పోరాట దీక్షల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కార్యక్రమాలు నిర్వహించడం ఆపాలని జన చైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అన్నారు. విజయవాడలో రద్దీ ఎక్కువగా ఉండే బెంజి సర్కిల్‌లో కార్యక్రమాలు జరిపి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని శనివారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ రూ.వేల కోట్ల కుంభకోణానికి పాలడుతున్నారని ఆరోపించారు. ప్రపంచంలోని 50 వేల నగరాల్లో ఒకటిగా కూడా లేని అమరావతిని ప్రపంచంలో ఐదో స్థానానికి తీసుకెళ్తానని, ఒలింపిక్స్ క్రీడలు నిర్వహిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని జిల్లాల సమగ్ర అభివృద్ధికి ప్రయత్నించకుండా కేంద్రీకృత అభివృద్ధి ధోరణులు మంచివి కాదని హితవు పలికారు.

చేవ నిండింది... చందనం పండింది

ఎర్రచందనం చెట్లను పరిరక్షించాలన్న అధికారుల ఆశలు ఫలించాయి. తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో 25 ఎకరాల్లో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనుల కోసం ఆ ప్రాంతం (వెటర్నరీ వర్సిటీ వెనుక వైపు) చదును చేసే క్రమంలో అక్కడ 25 ఎర్రచందనం వృక్షాలను తొలగించారు. ఆ మొద్దులను ఎండబెట్టి తరలించేందుకు ఇష్టపడని అధికారులు జంతు ప్రదర్శనశాలలో ఓ వైపు వరుస క్రమంలో నాటారు. ఒక్కోచెట్టుకు రూ. 35వేలకు పైగా ఖర్చు పెట్టి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంతవరకూ ఇలాంటి ప్రయోగం చేయని కారణంగా అవి చిగురులు వేస్తాయే లేదేనన్న ఆందోళన ఉండేది. ఇటీవల వర్షాలకు అన్ని చెట్టు చిగురులు వేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – ఈనాడు, తిరుపతి

సాంకేతిక పనుల దృష్ట్యా.. రైళ్ల వేళల్లో మార్పులు

రైల్వేస్టేషన్(విజయవాడ) న్యూస్‌టుడే: గూడూరు రైల్వేస్టేషన్ సమీపంలో సాంకేతిక పనుల దృష్ట్యా పలు రైళ్ల వేళల్లో మార్పు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమయ వేళల్లో మార్పు చేసిన రైళ్లు..

- విజయవాడ-చెన్నై పినాకినీ ఎక్స్‌ప్రెస్ రైలు(12711) ఈ నెల 3, 4, 6, 7, 9, 10, 11, 13, 14, 16, 17వ తేదీల్లో విజయవాడలో ఉదయం 7 గంటలకు బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో చెన్నైలో మధ్యాహ్నం 3.05కి బయలుదేరనుంది.
- నెల్లూరు-సూళూరుపేట మెము ప్యాసింజరు(66030) ఈ నెల 3, 4, 6, 7, 9, 10, 11, 13, 14, 16, 17వ తేదీల్లో ఉదయం 11 గంటలకు బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో సూళ్లూరుపేటలో మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరుతుంది.

దారి మళ్లించిన రైళ్లు..

అండమాన్ ఎక్స్‌ప్రెస్(16031) ఈ నెల 10న వయా చెన్నై సెంట్రల్ అరక్కోణం, రేణిగుంట, గూడూరు మీదుగా నడుస్తుంది. చెన్నైసెంట్రల్-హజ్రత్‌నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్(12433) ఈ నెల 10న వయా చెన్నై సెంట్రల్, అరక్కోణం, రేణిగుంట, గూడూరు మీదుగా వెళుతుంది.

నేడు పోలీసులు, సినీతారల క్రికెట్ మ్యాచ్

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో..

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎల్బీ సేడియం వేదికగా పోలీస్ అధికారులు, సినీ తారలు ఆదివారం క్రికెట్ మ్యాచ్ ఆడనున్నారు. పోలీసులు, ప్రజల మధ్య అనుబంధాన్ని పెంచేందుకు హైదరాబాద్ పోలీసులు హైదరాబాద్ పీపుల్స్ లీగ్(హెచ్‌పీఎల్) పేరుతో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుతో మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, యువ కథానాయకులు నాని, అఖిల్, విజయ్ దేవరకొండ తదితరులు ఆడనున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

దిల్లీలో జరిగిన యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం ★ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దేశ సౌభాగ్యానికే ఆధ్యాత్మిక కార్యక్రమాలు

- యాదాద్రీశుడి కల్యాణ మహోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: ఆధ్యాత్మిక కార్యక్రమం లోక కల్యాణాన్ని కాంక్షిస్తుందని, అనంతమైన ఆధ్యాత్మిక సంపద ఉన్న భారతీయులు వసుధైక కుటుంబం అనే భావనతో ముందుకుసాగాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. శనివారమిక్కడ తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన శ్రీ యాదాద్రి లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవానికి సతీసమేతంగా హాజరైన ఆయన స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. యాదాద్రి నుంచి లక్ష్మీ నృసింహస్వామి తరలివచ్చి, దేశరాజధాని ఇంద్రప్రస్థంలో కల్యాణం జరిపించుకోవడం దేశ ప్రజలందరి భాగ్యమన్నారు. నాలుగేళ్లుగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వెంకయ్యనాయుడు శుభాకాంక్షలు తెలిపారు. 'భారతీయుడిగా అన్ని రాష్ట్రాలు నాకు సమానమే. ప్రజల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకారమే కీలకం. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలు పక్కన పెట్టి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర సహకారంతో పరస్పర సహకారంతో తెలుగు ప్రజలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నా. రాష్ట్రాల మధ్య సమస్యలు ఉంటే ముఖ్యమంత్రులిద్దరూ కూర్చొని కలిసి చర్చించుకొని పరిష్కారం చేసుకొని తెలుగు ప్రజల్ని ప్రగతి బాటలో ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నా' అని వెంకయ్యనాయుడు అన్నారు. కార్యక్రమానికి గవర్నర్ నరసింహన్ సతీసమేతంగా హాజరయ్యారు.

మిడ్ లెవెల్ ప్రొవైడర్ల వివరాల్లో తప్పులు!

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో 1500 మంది మిడ్ లెవెల్ ప్రొవైడర్ల నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సంచాలకులు శుక్రవారం వెల్లడించిన వివరాల్లో తప్పులు దొర్లాయని పలువురు అభ్యర్థులు తెలుపుతున్నారు. దరఖాస్తులో సూచించిన సామాజిక వర్గానికి బదులుగా మరోటి ప్రకటించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని నాలుగు జోన్లలో రోస్టర్ పాయింట్ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయాలంటే షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనకబడిన తరగతులకు చెందిన అభ్యర్థుల సమాచారం కచ్చితంగా ఉండాల్సిన అవసరం ఉందని గుర్తుచేస్తున్నారు. అందువల్ల జరిగిన తప్పులను సరిచేసి జాబితాను తిరిగి ప్రకటించాలని కోరుతున్నారు. ఈ జాబితాలో సామాజిక వర్గానికి సంబంధించిన వివరాల్లో తప్పులు దొర్లినట్లు సంబంధిత ఉద్యోగులు కూడా అంగీకరించారు.

ఈ కాలుష్యం మ'నదే'

విచ్చలవిడి పారిశ్రామికీకరణకు తోడు, పర్యావరణాన్ని ధ్వంసం చేయటం, పట్టణ పారిశుద్ధ్యంపై నిర్లక్షం... దేశంలో జీవ నదుల పాలిట శాపంగా మారుతోంది. రసాయన కాలుష్యం నదీ జలాలను కలుషితం చేస్తోంది. కాడ్మియం, క్రోమియం, నికెల్, పాదరసం వంటి ప్రమాదకరమైన రసాయనాలు పరిమితికి మించి నదీ జలాల్లో పేరుకుపోతున్నాయి. ఫలితంగా కొన్ని చోట్ల నదీ జలాలు తాగటానికి కూడా పనికిరానంతగా పాడైపోయాయి. కేంద్ర జల సంఘం నిర్వహించిన అధ్యయనంలో ఈ ఆందోళనకరమైన వాస్తవం వెలుగుచూసింది. ఉత్తరాదిలోని గంగా, యమునా నదుల నుంచి దక్షిణాది నదులైన గోదావరి, కృష్ణా, కావేరి వరకూ రసాయన కాలుష్యం పెనుసమస్యగా మారినట్లు వెల్లడైంది.

ఎన్నో కారణాలు

- నదీ జలాల్లో విష రసాయనాలు పెరిగిపోవటానికి విచ్చలవిడి పారిశ్రామికీకరణ, పట్టణీకరణలే ప్రధాన కారణం. తోళ్ల శుద్ధి పరిశ్రమలు, పాలిషింగ్ యూనిట్ల వల్ల పాదరసం, క్రోమియం, నికెల్, సెలీనియమ్, జింక్ తదితర రసాయనాలు నదీ జలాల్లో కలుస్తున్నాయి.
- గనుల తవ్వకం వల్ల కూడా నదులు కలుషితం అవుతున్నట్లు కేంద్ర జల సంఘం గుర్తించింది. దేశంలోని పలు నదీ తీర ప్రాంతాల్లో బొగ్గు, ఇనుప ఖనిజం, మాంగనీసు గనుల తవ్వకం అధికంగా సాగుతోంది.
- పట్టణ, నగర ప్రాంతాల్లోని మురుగు, వ్యర్థాలు నేరుగా నదుల్లోకి చేరుతున్నాయి. డిటర్జెంట్లు, క్రోమియం, నికెల్, కోబాల్ట్, జింక్, పాదరసం మురుగునీటితో కలిసి నదుల్లోకి చేరుతున్నాయి.
- పాదరసం, కాడ్మియం, పాదరసం వంటి భార లోహాలు ప్రజారోగ్యానికి ఎంతో హానికరం. క్రోమియం వల్ల చర్మ వ్యాధులు రావటం, కడుపులో అల్సర్లు, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులకు లోనుకావటం సర్వసాధారణం. రోగ నిరోధక శక్తి క్షీణిస్తుంది.
- తినే ఆహారం లేదా తాగే నీటిలో పరిమితికి మించి రాగి ఉంటే.. దానివల్ల తలనొప్పి, కడుపు నొప్పి, వాంతులు కలుగుతాయి. మూత్రపిండాల వ్యాధులు కూడా ప్రబలుతాయి. నికెల్, జింక్ కూడా పరిమితికి మించితే ప్రమాదమే.

తాగటానికీ పనికిరావు!

దేశవ్యాప్తంగా నదులపై 57 నీటి నాణ్యత పరీక్షా కేంద్రాల వద్ద తీసిన నమూనాల్లో 2 రసాయనాలు పరిమితికి మించి కనిపించాయి. 168 కేంద్రాల వద్ద సేకరించిన నీటిలో రసాయనాలు ప్రమాదకరమైన స్థాయిలో కనిపించాయి. ఆ నీరు తాగటానికి పనికిరాదని నిర్ధారణ అయింది. 19 చోట్ల కాడ్మియం ఎక్కువగా ఉంది. నాలుగు స్టేషన్ల వద్ద నమూనాల్లో నికెల్ ఎక్కువగా కనిపించింది. మరికొన్ని నమూనాల్లో క్రోమియం, నికెల్, పాదరసం పరిమితికి మించి ఉన్నాయి.

యమునకు యమగండం

దిల్లీ నగరానికి ప్రధాన మంచినీటి వనరు యమునానదే. 13 నీటి నాణ్యత పరిశీలనా కేంద్రాల వద్ద శాంపిల్స్ తీసి పరీక్షించారు. రుతుపవనాల కాలంలో ఆగ్రా వద్ద యమునా నీటిలో ఇనుము నిక్షేపాలు అధికంగా కనిపించాయి. ఇది పారిశ్రామిక కాలుష్యం ప్రభావమే. 6% నమూనాల్లో కాడ్మియమ్, 3% నమూనాల్లో పాదరసం నిల్వలు అధికంగా ఉన్నట్లు వెల్లడైంది.

గంగకు తీరని బెంగ

పారిశ్రామికీకరణ వల్ల ఈ నదికి కాలుష్యం సమస్య తీవ్రంగా ఉంది. ఆగ్రా, కాన్పూర్ వంటి ప్రాంతాల్లో తోళ్ల శుద్ధి పరిశ్రమలు గంగకు పెద్ద ముప్పుగా మారుతున్నాయి. ఈ జీవనది ఒడ్డున వెలసిన నగరాలు, పట్టణాల మురుగు మొత్తం ఇందులోకే కలుస్తోంది. దీంతో గంగలో మునిగితే పుణ్యం సంగతేమోకాని రోగాలు రావడం మాత్రం ఖాయంగా కనిపిస్తోంది. గంగా జలాల్లో వర్షాకాలంలో కొన్నిప్రాంతాల్లో ఇనుము అధికంగా ఉన్నట్లు స్పష్టమైంది. క్రోమియం, పాదరసం నిల్వలు సైతం ఎక్కువగా ఉన్నట్లు తేలింది.



తుంగభద్ర ఎంత భద్రం?

కర్ణాటకలో పుట్టి 531 కిలోమీటర్లు ప్రయాణించి ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు తర్వాత కృష్ణా నదిలో కలుస్తోంది. ఈ నది జలాల్లో హొన్నాలి, హర్లహల్లి ప్రాంతాల్లో ఇనుము నిల్వలు అధికంగా నమోదయ్యాయి. కాడ్మియం, నికెల్, పాదరసం నిల్వలు కూడా పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమైంది.

గోదావరి.. దారేది?

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రవహించే గోదావరినది పొడవు 1,465 కిలోమీటర్లు. వర్షాకాలంలో మంచిర్యాల సమీపంలో గోదావరి నీటిలో ఇనుము నిల్వలు అధికంగా ఉన్నట్లు అధ్యయనాల్లో తేలింది. కొన్ని ఇతర ప్రదేశాల్లో పాదరసం నిల్వలు కనిపించాయి. వివిధ ప్రాంతాల్లో నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షించగా, 5% నమూనాల్లో పాదరసం, 19% నమూనాల్లో పాదరసం నిల్వలు పరిమితికి మించి అధికంగా కనిపించాయి.

భోరుమంటున్న కావేరీ

కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రాణాధారమైన కావేరీ కూడా కాలుష్యం బారిన పడుతోంది. ఈ జలాల్లో ఛుఛంకట్టే, కుదిగి ప్రాంతాల్లో వర్షాకాలంలో ఇనుము నిల్వలు అధికంగా కనిపించాయి. ఈ నదిలో 6% నమూనాల్లో పాదరసం, 8% నమూనాల్లో ఇనుము నిల్వలు ఎక్కువగా ఉన్నాయి.

కృష్ణా విలవిల

మనదేశంలో తూర్పు దిక్కుకు ప్రవహించే నదుల్లో రెండవ అతి పెద్దది కృష్ణా నది. తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నది జీవనది. ఈ నదీ జలాల్లో అర్జున్‌వాడ్, హువిన్‌హెడ్గి వద్ద ఇనుము నిల్వలు అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. క్రోమియం, నికెల్, పాదరసం, ఇనుము పరిమితికి మించి ఉన్నట్లు స్పష్టమైంది. ఇందులో నికెల్, ఇనుము ఇతర లోహాల కంటే ఎక్కువ మొత్తంలో కనిపించాయి.

ఏమిటి పరిష్కారం?

- నదీ జలాలు కలుషితం కావటానికి మానవ తప్పిదాలే ప్రధాన కారణమని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.
- వ్యవసాయంలో అధికంగా ఎరువులు, పురుగుమందుల వినియోగం, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు నదీ జలాల్లో కలిసి ప్రమాదకర రసాయనాలు పేరుకుపోతున్నాయి.
- తోళ్ల శుద్ధి పరిశ్రమలు, గనుల తవ్వకం, రసాయన పరిశ్రమల వల్ల క్రోమియం, ఇతర భార లోహాలు నదీ జలాల్లో కలుస్తున్నాయి.
- కాలుష్యాన్ని అదుపు చేయటానికి పటిష్ఠమైన చట్టాలు, కట్టుదిట్టమైన చర్యలు అవసరమని కేంద్ర జలసంఘం అభిప్రాయపడింది.
- రసాయనాలు పరిమితికి మించి కనిపిస్తున్న ప్రాంతాల్లో మరింత లోతైన అధ్యయనాన్ని చేపట్టాల్సి ఉన్నట్లు పేర్కొంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం

పర్యావరణాన్ని విస్మరించి పనుల అప్పగింతా?

- ఒకే ఏజెన్సీకి వేరే ధరతో వెలిగొండ అనుబంధ పనులా..
- నామినేషన్ విధానంలో అప్పగించేందుకు యత్నాలు!
- నిబంధనలకు విరుద్ధమంటున్న సాంకేతిక యంత్రాంగం

ఈనాడు – అమరావతి

వెలిగొండ ప్రాజెక్టులో కొల్లంవాగు వైపు నుంచి మొదటి టన్నెల్ 500 మీటర్ల మేర తవ్వేందుకు రూ. 30 కోట్ల విలువైన పని ఆర్‌కె ఇన్‌ఫ్రా కంపెనీకి నామినేషన్‌పై అప్పగించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రస్తుతం హెడ్ రెగ్యులేటర్ పనులు చేస్తున్న ఏజన్సీకే ఈ పనులు కట్టబెట్టేలా ఫైళ్లు కదులుతున్నాయి. డ్రిల్లింగ్, బ్లాస్టింగు పద్ధతిలో (డీబీఎం)ఈ పని చేసేందుకు ఆ ఏజన్సీ ముందుకొచ్చింది. వెలిగొండ ప్రాజెక్టు పనులు ఎలాంటి పేలుళ్లు లేకుండా చేపడతామని కేంద్ర అటవీ పర్యావరణశాఖతో ఒప్పందం కుదుర్చుకుని అనుమతులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పేలుళ్లు జరుపుతూ అరకిలోమీటరు మేర పని చేసేందుకు అనుమతి ఇచ్చే ప్రయత్నాన్ని జలవనరులశాఖ నిపుణులు తప్పుపడుతున్నారు. దీని ఆధారంగా ఎవరైనా పర్యావరణశాఖకు ఫిర్యాదు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు. పైగా హెడ్ రెగ్యులేటర్ పనులు చేస్తున్న ఆర్ కె ఇన్‌ఫ్రా కంపెనీ 28 మీటర్ల మేర టన్నెల్ పనులు కూడా చేసింది. అక్కడ రన్నింగ్ మీటరుకు రూ. 12.17 లక్షలకు పని చేసి ఇప్పుడు అదే ఏజన్సీ రన్నింగ్ మీటరు రూ. 6.18 లక్షలకు చేసేందుకు ముందుకు వస్తోంది. ఇలా అనుబంధ పనిగా అప్పగించడానికి నిబంధనలు అంగీకరించవని జలవనరులశాఖ నిపుణుల అభిప్రాయం.

ఏమిటీ పని

- శ్రీశైలం జలాశయం కుడిగట్టు కొల్లంవాగు పై నుంచి కొండల్లో రెండు టన్నెళ్లు తొలుచుకుంటూ నీటిని తీసుకువెళ్లే పద్ధతిలో వెలిగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. శ్రీశైలంలో నిర్దుష్ట నీటిమట్టం ఉన్న వేళల్లో కృష్ణా వరద నీటిని 43.50 టీఎంసీలు వినియోగించుకునేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది.

ప్రస్తుత దశ ఏమిటి?

- వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ఎప్పుడో ప్రారంభించారు. కాలువల నిర్మాణమూ, జలాశయాల నిర్మాణమూ కొలిక్కి వస్తున్నా టన్నెళ్ల తవ్వకమే ఆలస్యమవుతోంది. ఒక టన్నెల్ 15.08కిలోమీటర్లు (మొత్తం 18.82కి.మీ) పూర్తయింది. రెండో టన్నెల్ 10.69 కి.మీ. (మొత్తం నిర్మాణం 18.84 కి.మీ) పూర్తయింది.
- పాత గుత్తేదారులు పనులు ఆలస్యం చేయడంతో వారి పని రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచారు. పాత గుత్తేదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో టెండర్ల ఖరారు ప్రక్రియ నిలిచిపోయింది.
- ఈ లోపు హెడ్ రెగ్యులేటర్ పనులు చేస్తున్న ఆర్ కె ఇన్‌ఫ్రా కంపెనీ రెండు టన్నెళ్లలో 500 మీటర్ల చొప్పున తాను చేస్తున్న ధరకే టన్నెల్ పని చేస్తానని ముందుకొచ్చింది. అయితే కొత్తగా ఆహ్వానించిన టెండర్లలో ఒక టన్నెల్‌లో రన్నింగ్ మీటరు రూ. 6.18 లక్షలకు, మరో టన్నెల్‌లో రూ. 6.92 లక్షలకు (ఇందులో డయా ఎక్కువ వల్ల ధర పెరిగిందని చెబుతున్నారు) టెండర్లు పిలిచి ఇప్పుడు అదే పనిని రెట్టింపు ధరకు ఇవ్వడం ఏమిటని ఐబీఎం కమిటీ ఛైర్మన్ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కొత్త టెండర్‌లో ప్రతిపాదించిన ధరకే తాను పని చేస్తానంటూ ఆర్. కె. ఇన్‌ఫ్రా ముందుకొచ్చింది. పని అప్పచెప్పేందుకు ప్రతిపాదన ముందుకు సాగుతోంది.

ఉత్తరాంధ్రను వెనక్కి నెట్టారు

- భూకబ్జాలు, ఇసుక-మైనింగ్ మాఫియాల్లో వైకాపా నేతలను మించిపోయారు
- విజయనగరం జిల్లా యాత్రలో పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు

ఈనాడు – విజయనగరం

చీపురుపల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

గత ఎన్నికల్లో 90 స్థానాల్లో పోటీకి దిగే అవకాశమున్నా విరమించుకుని తెదేపాకు అండగా నిలబడితే ఉత్తరాంధ్రని గాలికొదిలేశారని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శించారు. శనివారం విజయనగరం జిల్లా చీపురుపల్లి, భోగాపురం, విజయనగరం పట్టణాల్లో సాగిన ప్రజా పోరాట యాత్రలో ఆయన మరోసారి అధికారపార్టీ తీరును దుయ్యబట్టారు. ఇక్కడి జూట్, ఫెర్రో పరిశ్రమలు మూత పడుతున్నా తెదేపా నేతలు పట్టించుకోలేదని ఆరోపించారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు గురవలేదని, వెనక్కి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో తెదేపా, వైకాపాలను చిత్తుగా ఓడిస్తేనే ఉత్తరాంధ్రలో అభివృద్ధి జరుగుతుందన్నారు. గత ఎన్నికల సమయంలో తెదేపా నేతలు తన దగ్గరకు వచ్చి వైకాపా అధికారంలోకి వస్తే కాంగ్రెస్ తరహాలోనే భూకబ్జాలు, ఇసుక మాఫియాలు పెరిగిపోతాయని చెబితే అందరిలాగే తాను నమ్మానన్నారు. కాని భూకబ్జాలు, ఇసుక-మైనింగ్ మాఫియాలో తెదేపా నేతలంతా వైకాపా నేతలను సైతం మించిపోయారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా గరివిడి ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే గనుల్ని తవ్వుకుపోతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో ఉచితమనే పేరు చెప్పి ఇసుక మాఫియాకు సైతం చట్టబద్ధత కల్పించారంటూ పవన్‌కల్యాణ్ మండిపడ్డారు. విజయనగరం జిల్లాలోని చంపావతి నదిలో ఇసుక మాఫియా నిత్యం వందల లారీల ఇసుక తరలించేస్తోందన్నారు. తాను ముఖ్యమంత్రి కావడానికి ప్రతి జనసేన కార్యకర్త 500 ఓట్లు వేయించాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగాలివ్వడమంటే లోకేష్‌ని మంత్రి చేయడమా

హుద్‌హుద్ తుపాను సమయంలో బాధితుల కోసం తనవంతుగా రూ. 50 లక్షల ఆర్థికసాయం అందించానని పవన్‌కల్యాణ్ గుర్తుచేశారు. అసలు ప్రజల నుంచి సేకరించిన విరాళాలు ఎక్కడికి పోయాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమంటే తన తనయుడు లోకేష్‌ని మంత్రిని చేయడం కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం పట్టణంలో పందులు, కుక్కలు విపరీతంగా ఉన్నా 'ఆకర్షణీయ నగరం' అవార్డులు ఇస్తున్నారని, దయచేసి ఇవ్వొద్దని ప్రధానికి ప్రజలే తెలియజేయాలని కోరారు.

భూసేకరణ పేరుతో రైతుల నోట్లో మట్టి కొట్టారు

ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయం, తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టుల భూసేకరణ పేరుతో రైతుల నోట్లో మట్టి కొట్టిందని, వారికి తగిన బుద్ధి చెప్పాలని పవన్ పేర్కొన్నారు. అవసరానికి మించి భూసేకరణ చేసి స్థిరాస్తి వ్యాపారానికి అనుకూలంగా ఆ ప్రాంతాలను తన చేతుల్లో పెట్టుకోవడంలో చంద్రబాబు ఆరితేరారని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేశామంటూ గతంలో బొత్స, నేడు అశోక్ చెప్పుకోవడమే తప్ప నేటికీ ఈ ప్రాంతంలో కనీసం రహదారులు కూడా లేవన్నారు.

విశాఖపట్నంలో గ్యాస్‌బండను భుజానికి ఎత్తుకొని నిరసన తెలుపుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

పెంచిన గ్యాస్ ధరలు రద్దుచేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్

జగదాంబకూడలి(విశాఖపట్నం), న్యూస్‌టుడే: గ్యాస్ ధరలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. ధరల పెంపును నిరసిస్తూ శనివారం విశాఖలోని సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మధు గ్యాస్ బండను భుజానికి ఎత్తుకొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదలపై భారం వేయటం దారుణమన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతుంటే మనదేశంలో పన్నులు పెంచి ధరలను ఇష్టానుసారంగా పెంచుతున్నారని మండిపడ్డారు. తక్షణమే పెంచిన ధరలను రద్దుచేయాలని లేనీ పక్షంలో దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ నరసింగరావు, జిల్లా, నగర కార్యదర్శి కె.లోకనాథం, బి.గంగారావు, వీఎస్ పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

కావేరి మండలిపై నిపుణులతో చర్చించాకే స్పందిస్తా

- కుమారస్వామి స్పష్టీకరణ

ఈనాడు, బెంగళూరు: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఏర్పాటు చేసిన కావేరి నదీజలాల నిర్వహణ మండలిపై సాగునీటి నిపుణులు, న్యాయకోవిదులు, వ్యవసాయ శాస్త్రవేత్తలో సమాలోచనలు జరిపాకే తదుపరి నిర్ణయం తీసుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి తెలిపారు. శనివారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు. నిర్వహణా మండలి ఏర్పాటు వల్ల కర్ణాటక కావేరి ఆయకట్టుకు కలిగే లాభనష్టాలపై విశ్లేషించాల్సి ఉందన్నారు. అనంతరం దానిపై తమ నిర్ణయాన్ని కేంద్రానికి తెలుపుతామని వివరించారు. బడ్జెట్, శాసనసభా సమావేశాల నిర్వహణకు సన్నాహాల్ని ప్రారంభించినట్లు కుమారస్వామి తెలిపారు. మూడు, నాలుగు రోజుల్లో బడ్జెట్ తయారీకి సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. సంకీర్ణ సర్కారులో మంత్రిత్వ శాఖల విషయంలో జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ జోక్యం చేసుకోలేదని ముఖ్యమంత్రి కుమారస్వామి స్పష్టంచేశారు. ఈ విషయమై రెండు పార్టీల మధ్య వివాదం చోటుచేసుకున్నట్లు మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదని చెప్పారు. ఇంధన శాఖ కోసం సభ్యులు రేవణ్ణ, శివకుమార్ ఇద్దరూ ఆసక్తి చూపడం నిజమేనన్నారు. సంకీర్ణ సర్కారులో ఇచ్చి పుచ్చుకునే ధోరణిని కలకాలం పాటించడం అనివార్యమని చెప్పారు. దేవేగౌడతో సంప్రదింపుల్ని జరిపిన తర్వాత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మంత్రిత్వ శాఖల పంపకాన్ని ఖరారు చేశారని వివరించారు. మార్గదర్శకాల్ని దేవేగౌడ వినటమే తప్ప వాటి సవరణల్ని ప్రతిపాదించలేదన్నారు. "కాంగ్రెస్ నేతలకు అంతా తెలుసు. నేనే ఆర్థిక శాఖను అడిగింది నిజం. ఇతర శాఖల విషయంలో వాగ్వాదాలు జరగలేదు. ఏ విషయంలోనూ కాంగ్రెస్‌ను ఒత్తిడి చేయలేదు. శివకుమార్‌తోనూ ఇంధనశాఖ గురించి మాట్లాడాను. ఆయనకు ఏ శాఖ కేటాయించాలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీర్మానిస్తుంది" అని సీఎం పేర్కొన్నారు.

గాండీవ ప్రాజెక్టుకు రూ.20 కోట్లు మంజూరు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో ఎంపిక చేసిన అథ్లెట్లు, క్రీడాకారులకు ప్రముఖ కోచ్‌లతో అంతర్జాతీయ స్థాయి శిక్షణనిచ్చే ఉద్దేశంతో చేపట్టిన గాండీవ ప్రాజెక్టు కోసం రూ. 20.42 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు అర్హత కలిగిన క్రీడాకారులకు ప్రముఖ ప్రైవేటు సంస్థల ద్వారా అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. పాఠశాల స్థాయిలో చిన్నారుల్లో ప్రతిభను గుర్తించి వారు అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు ఇది తోడ్పడనుంది.

సింగపూర్ క్లిఫర్డ్ రేవులో మహాత్మాగాంధీ స్మారకాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ

అమెరికా రక్షణ మంత్రితో మోదీ భేటీ

సింగపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం అమెరికా రక్షణ శాఖ మంత్రి జిమ్ మాటిస్‌తో ఇక్కడ సమావేశమయ్యారు. సుమారు గంట సేపు జరిగిన ఈ రహస్య సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ పాల్గొన్నారు. అమెరికా రక్షణ వ్యూహాల్లో భారత్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని హవాయిలో ఉన్న ఆ దేశ సైనిక స్థావరం పేరును పసిఫిక్ కమాండ్ బదులుగా ఇండో-పసిఫిక్ కమాండ్‌గా మార్చిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ అంశాలతో పాటు, పరస్పరం ఆసక్తి ఉన్న ప్రపంచ అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. శనివారం ఇక్కడ జరిగిన షాంగ్రీ లా డైలాగ్ సదస్సులో మాట్లాడిన మాటిస్ ముందురోజు మోదీ ప్రసంగంలోని పలు అంశాలను ప్రస్తావించి ఆయన దార్శనికతను ప్రశంసించారు. అనంతరం సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ హిందూ మహా సముద్రం ప్రాంతంలో భారత్ ప్రాధాన్యతను గుర్తించామని, వాస్తవికతను ప్రతిబింబించే విధంగా తమ దేశ స్థావరం పేరును ఇండో-పసిఫిక్ కమాండ్‌గా మార్చామని వివరించారు.

ఛాంగి నౌకా స్థావరాన్ని సందర్శించిన మోదీ: సింగపూర్‌లోని ఛాంగి నౌకా స్థావరాన్ని మోదీ సందర్శించారు. భారత నౌకా దళం, సింగపూర్ రాయల్ నౌకా దళం అధికారులు, నావికులతో మాట్లాడారు. మోహరింపులో భాగంగా ఇక్కడికి వచ్చిన భారత నౌకాదళం యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ సత్పూరను అధిరోహించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఇక్కడి భారత వారసత్వ కేంద్రంలో రూపే కార్డును ఉపయోగించి ప్రధాని మోదీ మధుబని చిత్రాన్ని కొనుగోలు చేశారు. ఇక్కడి పురాతన హిందూ దేవాలయమైన శ్రీమరియమ్మన్ కోవెలను సందర్శించారు. ఇక్కడి చైనాటౌన్‌లో భారతీయులు నిర్మించిన చులియా మసీదుతో పాటు, బుద్ధుని దంతం ఉన్న ఆలయాన్ని కూడా సందర్శించారు. భారతీయ వారసత్వ కేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఉద్దేశించిన వేదిక కళా సంగంను ప్రారంభించారు. మహాత్ముని అస్థికలు నిమజ్జనం చేసిన క్లిఫ్‌ఫోర్డు రేవు వద్ద ఫలకాన్ని ఆవిష్కరించారు. ఇక్కడి నేసనల్ ఆర్కిడ్ గార్డెన్‌లో ఒక జాతి పూల మొక్కకు మోదీ పేరు పెట్టి సింగపూర్ ప్రభుత్వం గౌరవించింది. ఇండోనేసియా, మలేసియా, సింగపూర్‌లలో మూడు రోజుల పర్యటన ముగించుకొని మోదీ తిరిగి దిల్లీ చేరుకున్నారు.

కైరానాలో ఓటమికి కారణాలెన్నో..

- భాజపా పరాజయానికి చెరకు రైతుల బకాయిలు మాత్రమే కాదు
- ఆర్‌ఎల్‌డీకి ఓటు వేసిన జాట్‌లు
- పెట్రోల్ ధరలపై భగ్గుమన్న ఓటరు

లఖ్‌నవూ: ఇటీవల జరిగిన కైరానా ఉప ఎన్నికలో భాజపా ఓటమికి చెరకు రైతులే ప్రధాన కారణమా?. బకాయిల వివరాలు పరిశీలిస్తే కానేకాదని వెల్లడవుతోంది. పెట్రోల్ ధరల పెరుగుదలపై ఆగ్రహం, ముస్లిం-జాట్-దళితులు ఏకమవడమే ప్రధాన కారణాలని తెలుస్తోంది. కైరానా లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో భాజపా అభ్యర్థిపై ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన ఆర్‌ఎల్‌డీ అభ్యర్థి తబస్సుం హసన్ గెలుపొందిన సంగతి తెలిసిందే.

కైరానా లోక్‌సభ నియోజకవర్గంలో నకుర్, గంగోహ్, కైరానా, థానాభవన్, షామ్లి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో నకుర్, గంగోహ్ స్థానాలు సహరన్‌పుర్ జిల్లాలోను; మిగిలిన మూడు స్థానాలు షామ్లి జిల్లాలో ఉన్నాయి. షామ్లిలో ఉన్న మూడు పంచదార మిల్లులు రైతులకు రూ.512.71 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. సహరన్‌పుర్‌లో ఉన్న మూడు మిల్లుల బకాయిలు రూ.261.74 కోట్లు మాత్రమే. ఇక్కడి ఓటింగ్ సరళిని పరిశీలిస్తే, ప్రతిపక్షాలు చెబుతున్నట్లు చెరకు రైతులకు బకాయిలు చెల్లించకపోవడం వల్ల భాజపా ఓడిపోలేదు.

యోగి ప్రచారాన్ని నమ్మని ఓటరు: యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెరకురైతుల బకాయిల గురించి పెద్దగా పట్టించుకోలేదు. ముజఫర్‌నగర్‌లో అల్లర్లకు ఎస్పీ, దాని మిత్రపక్షాలే కారణమని ప్రచారం చేశారు. పాకిస్థాన్ నాయకుడు జిన్నాకు మనదేశంలో ప్రచారం కల్పించడం అంత మంచిది కాదన్నారు. రాష్ట్రీయ లోక్‌దళ్ మాత్రం రైతులకు బకాయిలు, ముజఫర్‌నగర్ అల్లర్లు, జిన్నా అంశంపై భాజపాను తప్పుపడుతూ ప్రచారం చేసింది. రైతులకు బకాయిలు చెల్లించినా, చెల్లించలేదని ప్రతిపక్షాలు చేసిన ప్రచారమే తమను దెబ్బ తీసిందని భాజపా యూపీ అధ్యక్షుడు మహేంద్రనాథ్ సైతం శనివారం అభిప్రాయపడ్డారు. పెట్రోల ధరల పెంపు కూడా తమకు వ్యతిరేకంగా పనిచేసిందన్నారు. భాజపాకు ఓటుబ్యాంకుగా ఉన్న జాట్‌లు ఈసారి ఆర్‌ఎల్‌డీకి మద్దతుగా నిలిచారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముస్లింలు సంఘటితమయ్యారు. వీరికి దళితులు కలవడంతో పాత ముస్లిం-అహిర్-జాట్-గుజ్జర్- దళితుల ఫార్ములా ఫలించింది.

మధ్యప్రదేశ్‌లో బీఎస్పీతో కాంగ్రెస్ దోస్తీ!

- రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌పైనా సమాలోచనలు
- కర్ణాటక ప్రయోగాన్ని విస్తరించాలని కసరత్తు

దిల్లీ: కర్ణాటకలో భాజపాను అధికారం నుంచి దూరం చేయడానికి జనతాదళ్ (ఎస్)తో చేతులు కలిపిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మధ్యప్రదేశ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో అదే విధమైన పొత్తు కుదుర్చుకునేందుకు సమాయత్తమవుతోంది. ఎన్నికలు జరగబోతున్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలోనూ ఇలాంటి పొత్తులకు అవకాశాలను వేగంగా పరిశీలిస్తోంది. మధ్యప్రదేశ్‌లో బీఎస్పీకి గత 20 ఏళ్లుగా సగటున 7% ఓట్లు లభిస్తున్నాయి. ఆ రాష్ట్రాన్ని గత 15 ఏళ్లుగా పాలిస్తున్న కమలనాథుల్ని గద్దె దించాలంటే ఈ ఓట్లు కీలకమని కాంగ్రెస్ భావిస్తోంది. కాంగ్రెస్‌కి 36%, భాజపాకి 45% చొప్పున ఓట్లు వస్తున్నాయి. ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌పై కనిపిస్తున్న వ్యతిరేకత వల్ల భాజపాకి కొంత శాతం ఓట్లు తగ్గిపోతాయనీ, ఇలాంటి సమయంలో బీఎస్పీ రూపంలో అదనపు బలం కలిస్తే అక్కడ అధికార పార్టీని ఓడించడం సులభమవుతుందని కాంగ్రెస్ నాయకుడొకరు విశ్లేషించారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన ప్రతిపాదనకు బీఎస్పీ సానుకూలంగా స్పందించడమే కాకుండా పొత్తును మధ్యప్రదేశ్‌కే పరిమితం చేయకుండా మిగిలిన రెండు రాష్ట్రాలకూ విస్తరించాలని ఆసక్తితో ఉన్నట్లు సమాచారం. ఆ రెండు రాష్ట్రాల్లో సుమారు 5% ఓట్లు బీఎస్పీకి వస్తున్నాయి.

ప్రాథమిక దశలో చర్చలు

మధ్యప్రదేశ్‌లో పొత్తుపై కాంగ్రెస్-బీఎస్పీ చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. 2019 సార్వత్రికానికి సెమీ ఫైనల్స్‌గా మూడు రాష్ట్రాల ఎన్నికలను భావిస్తున్నారు. అందువల్ల రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. ఇటీవలి కాలంలో చిన్నపార్టీల ఆధిపత్యానికి కాంగ్రెస్ తలొగ్గుతూ వస్తోంది. కర్ణాటకలో ఆర్థిక శాఖను జేడీ(ఎస్)కు విడిచిపెట్టేందుకు ముందుకు రావడం దీనికి తాజా ఉదాహరణ. మధ్యప్రదేశ్‌లో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ ఇప్పుడే మాట్లాడకపోయినా... విజయావకాశాల ఆధారంగా బీఎస్పీ డిమాండుకు తలొగ్గే అవకాశాలే ఎక్కువ. ఛత్తీసగఢ్‌లోనూ పొత్తు పెట్టుకునేందుకు కాంగ్రెస్ సిద్ధంగానే ఉన్నా, రాజస్థాన్ వరకు మాత్రం అలాంటిది వద్దని కొందరు నేతలు పట్టుపడుతున్నారు.

దిల్లీపై దోబూచులాట

దిల్లీ వరకు కాంగ్రెస్-ఆప్‌ల మధ్య పొత్తుకు సంబంధించి దోబూచులాట వీడడం లేదు. కాంగ్రెస్ తమను సంప్రదించిందని ఆప్ నేత దిలీప్ పాండే చెప్పగా, దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ మకెన్ మాత్రం తాము దానికి అనుకూలంగా లేమని అంటున్నారు. దిల్లీ వెలుపల ఆప్ లేనేలేదనీ, గతంలో ఆ పార్టీకి మద్దతు పలికి కాంగ్రెస్ నష్టపోయిందనీ ఆయన చెబుతున్నారు. ప్రజల చేతిలో తిరస్కారానికి గురవుతున్న పార్టీతో తాము కలవాల్సిన అవసరం లేదన్నారు. అయితే దిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాల్లో అయిదింటికే బాధ్యుల్ని (ఇన్‌ఛార్జిల్ని) నియమించి, మిగిలిన రెండింటిని ఆప్ వదిలిపెట్టడంతో పొత్తుపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతలు తమతో చర్చిస్తున్నారని ఆప్ అధికార ప్రతినిధి దిలీప్ పాండే చెప్పారు.

స్పెయిన్ ప్రధానిగా సాంచెజ్

మాడ్రిడ్: స్పెయిన్ నూతన ప్రధానిగా అక్కడి సోషలిస్టు పార్టీ నేత పెడ్రో సాంచెజ్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజు ఫెలెప్-6 సమక్షంలో శనివారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. సాంచెజ్‌కు ముందు ఆరున్నరేళ్లు ప్రధానిగా ఉన్న మారియానో రజోయ్.. తనపార్టీ నేతలు అవినీతి కేసుల్లో చిక్కుకోవడంతో అధికారం కోల్పోయారు. రజోయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారమే అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందింది.

సిసీ మళ్లీ..: ఈజిప్ట్ అధ్యక్షుడిగా అబ్దెల్ ఫతహ్ అల్-సిసీ మరో నాలుగేళ్లు కొనసాగనున్నారు. శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

బాధ్యతాయుత పర్యవేక్షక శక్తిగా భారత్: మాటిస్

సింగపూర్: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ బాధ్యతాయుత పర్యవేక్షకునిగా వ్యవహరిస్తోందని అమెరికా రక్షణ శాఖ మంత్రి జేమ్స్ మాటిస్ ప్రశంసించారు. ఈ ప్రాంతంతో పాటు, ప్రపంచ భద్రత విషయంలో కీలకపాత్ర పోషిస్తోందని, స్థిరీకరణ శక్తిగా వ్యవహరిస్తోందని అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన షాంగ్రీ లా డైలాగ్ సదస్సులో ఆయన మాట్లాడారు. చైనాతో ఫలితాలు ఇచ్చే సంబంధాలు ఉండాలని కోరుకుంటున్నట్టు మాటిస్ చెప్పారు. అయితే దక్షిణ చైనాలో దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తోందని, దీనిని గట్టిగానే ఎదుర్కొంటామని అన్నారు.

ట్రంప్ సుంకాల యుద్ధంపై ఈయూ గరంగరం

విజిలర్ (కెనడా): ఉక్కు, అల్యూమినియంపై అమెరికా విధించిన సుంకాలపై ఐరోపా సంఘం (ఈయూ) తీవ్ర స్థాయిలో ఎదురు దాడి చేసింది. తామూ అమెరికా ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలను విధిస్తామని హెచ్చరించాయి. మరోపక్క 24 ఏళ్లనాటి ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందా (నాఫ్తా)ను రద్దు చేసే అంశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరపైకి తెచ్చారు. దీనికి బదులు కెనడా, మెక్సికోతో రెండు వేరువేరు ద్వైపాక్షిక ఒప్పందాలను కుదుర్చుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. ఆగ్రహంగా ఉన్న ఆయా దేశాల వాణిజ్య మంత్రులతో అమెరికా కెనడాలో చర్చలను ఆరంభించింది. ఇందులో ఏడు దేశాల వాణిజ్య మంత్రులు పాల్గొన్నారు. అమెరికా మంత్రి స్టీవెన్‌పై మిగతావారంతా విరుచుకుపడ్డారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ట్రంప్ దెబ్బతీస్తున్నారంటూ మండిపడ్డారు.

కాలిఫోర్నియా గవర్నర్ పదవికి 22ఏళ్ల భారతీయ అమెరికన్ పోటీ

హైదరాబాద్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ పదవికి ఓ భారత సంతతి యువకుడు పోటీకి దిగాడు. ఉత్తర్‌ప్రదేశ్ నేపథ్యమున్న 22ఏళ్ల శుభమ్ గోయల్.. మెగాఫోన్ చేతపట్టి అక్కడి వీధుల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నాడు. 'వర్చువల్ రియాలిటీ (వీఆర్)' నిపుణుడిగా పనిచేస్తున్న అతడు.. అదే సాంకేతికతను వాడుకుంటూ అక్కడి ప్రజలకు తన ప్రణాళికలు వివరిస్తున్నాడు. విద్యావ్యవస్థలోని ఎన్నో సమస్యలను వీఆర్ ద్వారా పరిష్కరించవచ్చని.. తనకు అవకాశమిస్తే చేసిచూపుతానని హామీ ఇస్తున్నాడు. శుభమ్ తల్లిదండ్రుల స్వస్థలం ఉత్తర్‌ప్రదేశ్. చాలా ఏళ్ల క్రితం వారు అమెరికాకు వలస వెళ్లి.. ఐటీ నిపుణులుగా స్థిరపడ్డారు. ప్రస్తుతం అక్కడే ఓ సంస్థనూ నడుపుతున్నారు.

పురులియాలో మరోవ్యక్తి అనుమానాస్పద మృతి!

- ఇది రాజకీయ హత్య: జావడేకర్

కోల్‌కతా/పురులియా(పశ్చిమబెంగాల్): పురులియాలో మరో వ్యక్తి మృతదేహం శనివారం విద్యుత్ టవర్‌కు వేలాడుతూ కనిపించడం....స్థానికుల్లో తీవ్ర నిరసనలకు కారణమైంది. ఇక్కడి ఓ హై టెన్షన్ విద్యుత్ టవర్‌కు దులాల్ కుమార్(35) మృతదేహం వేలాడుతూ కనిపించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడు తమ పార్టీ కార్యకర్త అని భాజపా పేర్కొంది. దులాల్‌ది 'రాజకీయ హత్య' అని కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ ఆరోపించారు. ఇటీవల జరిగిన త్రిలోచన్ మహతో హత్య కూడా ఇదే కోవలోకి చెందినదని భాజపా ఆరోపిస్తోంది. కాగా, మే నెల 30వ తేదీన భాజపా కార్యకర్త అయిన త్రిలోచన్ మహతో(20) మృతదేహం బలరాంపూర్ జిల్లాలో ఓ చెట్టుకు వేలాడుతుండగా పోలీసులు కనుగొన్నారు. ఈ రెండు మరణాలూ కచ్చితంగా తృణమూల్ కాంగ్రెస్ చేయించిన హత్యలేనని భాజపా నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పురులియాలో దులాల్ శవం కనిపించడంతో తీవ్ర నిరసనలు వ్యక్తమైనాయి. స్థానికులు పోలీసు స్టేషన్‌ముందు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు.

రైతుల నిరసనతో మొదలైన ఇక్కట్లు

- నగరాలకు నిలిచిపోతున్న సరఫరాలు
- అధిక ఉత్పత్తే సంక్షోభానికి కారణం: గడ్కరీ
- నాలుగేళ్లలో దిగుబడులు గణనీయంగా పెరిగాయి: రాధామోహన్
- మహారాష్ట్రలో ఉధృతం కానున్న ఉద్యమం: ఏఐకేఎస్

దిల్లీ: రైతు రుణమాఫీ, కనీస ఆదాయ హామీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు వంటి డిమాండ్లతో దేశవ్యాప్తంగా రైతులు చేపట్టిన 10 రోజుల నిరసన కార్యక్రమం శనివారం రెండో రోజుకు చేరింది. మార్కెట్లపై ఆ ప్రభావం మొదలయింది. నగరాలకు కూరగాయలు, పండ్ల సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించడంతో పలుచోట్ల వీటి ధరలు పెరుగుతున్నాయి. పంజాబ్, హరియాణాల్లోని మార్కెట్లలో కూరగాయల ధరలు కిలోకి రూ.10-20 చొప్పున పెరిగిపోయాయి. టమాటా ధర ఒక్కరోజులో రెట్టింపయింది. పాల సరఫరాకూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. దిల్లీలో కూరగాయల ధరలు ఇప్పటికే 20-50% మేర పెరిగాయి. మహారాష్ట్రలో పలుచోట్ల రైతులు పాలను రోడ్లపై పారబోశారు. రెండ్రోజుల తర్వాత కొత్త సరకు రాకపోతే పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందని దిల్లీలోని ఆజాద్‌పూర్ మండీ ఛైర్మన్ ఆదిల్ ఖాన్ చెప్పారు. వ్యవసాయరంగ సంక్షోభానికి అధిక దిగుబడులే కారణమన్న వాదనను కేంద్రం వినిపిస్తోంది.

పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు: అధికోత్పత్తి, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు ప్రస్తుత రైతుల కష్టాలకు కారణమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాగ్‌పుర్‌లో విలేకరుల సమావేశంలో చెప్పారు. రైతు సమస్యల పరిష్కారానికి మధ్యతరహా, దీర్ఘకాలిక విధానాలపై కేంద్రం యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తోందని చెప్పారు. కనీస మద్దతు ధర లభించకపోవడం, పాల ధరలు పడిపోవడంతో రైతులు కొన్ని ఇబ్బందులు పడుతున్నారని అభిప్రాయపడ్డారు. రైతుల సమస్యల్ని ప్రభుత్వం త్వరలోనే తీరుస్తుందని కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ కోల్‌కతాలో చెప్పారు. మోదీ సర్కారు నాలుగేళ్ల పాలనలో వ్యవసాయ రంగం అనూహ్యంగా వృద్ధి చెందిందనీ, రైతుల ఆదాయం పెంపుదలపై దృష్టి కేంద్రీకరించామనీ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ చెప్పారు. పెద్దగా సభ్యులు లేని సంఘాల తరపున రైతులు ప్రసార మాధ్యమాల దృష్టిలో పడడం కోసమే విపరీత చర్యలకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలపై బిహార్‌లో విపక్షాలు మండిపడ్డాయి. రైతు కష్టాలపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న మంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. కేంద్రంపై రైతుల్లో ఉన్న వ్యతిరేకత తాజా ఆందోళన రూపంలో వ్యక్తమవుతోందని పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ చండీగఢ్‌లో పేర్కొన్నారు. రైతుల బదులు దళారుల్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఏఐసీసీ సమాచార విభాగం బాధ్యుడు రణదీప్ సూర్జేవాలా దిల్లీలో ఆరోపించారు. రైతులకిచ్చిన ఏ హామీనీ ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు.

6న మంద్‌సౌర్‌కు రాహుల్: మధ్యప్రదేశ్‌లోని మంద్‌సౌర్‌లో ఈ నెల 6న రైతులు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పాల్గొనబోతున్నారు. ఈ విషయాన్ని ఆయన ట్విటర్‌ద్వారా తెలిపారు.

5 నుంచి మరింత ముమ్మరం

ముంబయి: రైతు సమస్యలపై ఈ నెల 5వ తేదీ నుంచి ఆందోళనను ఉద్ధృతం చేయాలని నిర్ణయించినట్లు అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) ప్రకటించింది. గత నెలలో ఇచ్చిన ఏ హామీనీ మహారాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి అజిత్ నావ్లే విమర్శించారు. ఆందోళనను ముమ్మరం చేయాలని రైతు సంఘాలు నిర్ణయించినట్లు విలేకరులకు తెలిపారు.

మేరఠ్‌లో శుక్రవారం రాత్రి గాలిదుమారానికి వాహనంపై పడిన స్తంభం

ఉత్తరాదిన గాలి దుమారం, భారీ వర్షాలు

- 27 మంది మృతి
- ఒక్క యూపీలోనే 17 మంది దుర్మరణం
- నేడు రాజస్థాన్‌లో గాలి దుమారం
- ఏపీ, తెలంగాణల్లో పిడుగులు

లఖ్‌నవూ/డెహ్రాదూన్/కోల్‌కతా: ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో గాలి దుమారం, భారీవర్షాలు బీభత్సం సృష్టించాయి. శుక్రవారం సాయంత్రం సంభవించిన ఈ విపత్తుల కారణంగా 27 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో గాలి దుమారం కారణంగా 17 మంది మృతి చెందగా, మరో 11 మంది గాయపడ్డారు. పెనుగాలులకు చెట్లు, ఇళ్లు కూలిపోవడంతో ఈ మరణాలు సంభవించాయని శనివారం అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో గత నెల 2-3, 9, 12 తేదీల్లో వచ్చిన మూడు గాలి దుమారాలు కారణంగా 130 మంది మరణించారు.

ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు: ఒకరి మృతి

ఉత్తరాఖండ్‌లో ఈదురుగాలులు వీయడంతో పాటు వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా ఆకస్మిక వరదలు రావడంతో ఉత్తరకాశీ జిల్లా గంగతాడీ గ్రామంలో ఓ బాలిక కొట్టుకుపోయింది. డెహ్రాదూన్‌లోనే 15 గంటల పాటు విద్యుత్తు నిలిచిపోయింది.

పిడుగులు పడి 9 మంది మృత్యువాత

పశ్చిమబెంగాల్‌లో పిడుగులు పడడం, గోడలు కూలిన సంఘటనల్లో 9 మంది మరణించగా, 12 మంది గాయపడ్డారు. హుగ్లీ, బీర్‌భం, పూర్బ బుర్ద్వాన్, హవడా, దక్షిణ 24 పరగణాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి.

నేడు మహారాష్ట్రలో భారీ వర్షాలు

దిల్లీ: మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాల్లో ఆదివారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం తెలిపింది. రాజస్థాన్‌లో గాలి దుమారం వీస్తుందని పేర్కొంది. ఉత్తర, మధ్య భారతంలో వేడి గాలులు వీస్తాయి. మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వాతావరణం ఓ మోస్తరు వేడిగా ఉంటుంది. ఆ విభాగం తెలిపిన సమాచారం ప్రకారం వివిధ రాష్ట్రాల్లో వాతావరణం ఇలా..

భారీ వర్షాలు: పశ్చిమ బెంగాల్, సిక్కిం, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు.

గాలి దుమారం: రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలు

ఉరుములతో కూడిన జల్లులు, పెనుగాలులు: పశ్చిమ బెంగాల్‌లోని గంగానది ప్రాంతం.

ఉరుములతో కూడిన వానలు, ఈదురుగాలులు, పిడుగులు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, విదర్భ, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, మహారాష్ట్ర.

ఔను.. ఐదారేళ్లుగా బెట్టింగ్ చేస్తున్నా!

- విచారణలో అంగీకరించిన అర్బాజ్‌ఖాన్
- మరో బాలీవుడ్ నిర్మాతకు సమన్లు

ఠాణె: ఐదారేళ్లుగా ఐపీఎల్ మ్యాచులతో పాటు టెస్ట్ సిరీసుల్లో బెట్టింగ్ చేశానని సల్మాన్‌ఖాన్ సోదరుడు, బాలీవుడ్ నిర్మాత, నటుడు అర్బాజ్‌ఖాన్(50) పోలీసుల విచారణలో అంగీకరించాడు. ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచుల్లో మాత్రం బెట్టింగ్‌కు పాల్పడలేదని స్పష్టం చేశాడు. పోలీసుల విచారణలో ఈమేరకు అంగీకరించాడని పేరు చెప్పడానికి ఇష్టపడని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. బెట్టింగ్ మానేయాలని అర్బాజ్ భార్య మలైకా, సోదరుడు, తండ్రి అడ్డుకున్నా వారి మాట వినలేదన్నారు. అతని వైవాహిక జీవితంలో ఇబ్బందులు తలెత్తడానికి ఇది కూడా ఒక కారణమన్నారు. బెట్టింగ్ ర్యాకెట్ నిర్వహిస్తున్న సోనుజలన్(41) అనే బుకీ సహా నలుగురు ముంబయికి చెందిన వ్యక్తులను ఠాణెలోని బలవంతపు వసూళ్ల వ్యతిరేక దళం మే 15న అరెస్టు చేసింది. సోను వద్ద ఉన్న డైరీలో అనేకమంది పెద్దల జాతకాలు బయటపడ్డాయి.

అర్బాజ్‌ఖాన్ రూ.2.80 కోట్లు పోగొట్టుకున్నాడని, ఇవ్వకపోవడంతో బెదిరించానని విచారణలో సోను వెల్లడించాడు. ఖాన్‌ను శనివారం విచారణకు హాజరు కావాల్సిందిగా 'ఏఈసీ' శుక్రవారం సమన్లు జారీ చేసింది. మరోవైపు సోను వెల్లడించిన వివరాల మేరకు బాలీవుడ్ నిర్మాత పరాగ్ సంఘ్వీకి శనివారం సమన్లు జారీ చేశారు. కె. సెరాసెరా అనే మీడియా కంపెనీకి ఈయన మాజీ ఎండీ. రామ్‌గోపాల్‌వర్మ తీసిన చిత్రాలకు ఫైనాన్సింగ్ చేయడంతో పాటు పంపిణీదారుడిగా వ్యవహరించారు.

అర్బాజ్ ఖాన్

బీసీసీఐ లేదా ఐపీఎల్‌కు సంబంధం లేదు.. రాజీవ్‌శుక్లా: అర్బాజ్‌ఖాన్ కేసుతో బీసీసీఐ లేదా ఐపీఎల్‌కు ఎలాంటి సంబంధం లేదని ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్‌శుక్లా స్పష్టం చేశారు. బీసీసీఐ, ఐసీసీలకు ప్రత్యేకంగా అవినీతి నిరోధక యూనిట్లు ఉన్నాయన్నారు. అవసరమైతే పోలీసులకు వారు సాయం చేస్తారని చెప్పారు. 'బాలీవుడ్ ప్రముఖుడెవరైనా ఐపీఎల్ మ్యాచుల్లో బెట్టింగ్‌కు పాల్పడితే.. మేం చేశామని ఎవరూ సంతకాలు చేయరు. మహా అయితే జూదం చట్టం కింద విచారిస్తారు. చిన్న జరిమానా విధిస్తారు. ఒకవేళ బుకీ లేదా ఆ ప్రముఖుడు ఎవరైనా ఆటగాడిని మభ్యపెట్టి తప్పు చేయిస్తే, అప్పుడు విషయం పెద్దది అవుతుంది' అని బీసీసీఐ లంచం వ్యతిరేక యూనిట్ మాజీ అధ్యక్షుడు నీరజ్‌కుమార్ పేర్కొన్నారు.

శ్రీనగర్‌లో ఘర్షణల సెగలు

- కర్ఫ్యూ, 144వ సెక్షన్ అమలు

శ్రీనగర్: కశ్మీరం మళ్లీ రాజుకుంటోంది.. శ్రీనగర్‌లో ప్రారంభమైన అల్లర్లు వివిధ ప్రాంతాలకు విస్తరించడంతో రెండు రోజులుగా తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కశ్మీర్ వ్యాప్తంగా వేర్పాటువాదులు సమ్మెకు పిలుపునివ్వగా.. శ్రీనగర్‌లో కర్ఫ్యూ, 144వ సెక్షన్ విధించారు. నగరంలోని నౌహట్టాలో శుక్రవారం ప్రార్థనల అనంతరం గుంపుగా వచ్చిన ఆందోళనకారులు తొలుత భద్రతదళాలపైకి రాళ్లు రువ్వారు. కొందరు సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడికి ప్రయత్నిస్తూ అడ్డం పడటంతో.. ఇద్దరు యువకులు అదే వాహనం ఢీకొని గాయపడ్డారు. వారిలో కైజర్‌భట్(21) అనే వ్యక్తి మృతి చెందడంతో ఉద్రిక్తతలు రాజుకున్నాయి. ఫతేకాదల్ వద్ద భట్ శవయాత్రను శనివారం భద్రతదళాలు అడ్డుకోవడంతో ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. ఉద్రిక్తతల నేపథ్యంలో శ్రీనగర్‌తో పాటు బడ్‌గామ్ జిల్లాలో చరవాణి, అంతర్జాల సేవలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. సమ్మెతో వాణిజ్య సంస్థలు, ప్రైవేటు విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఆందోళనకారులు తమ సిబ్బందిపై దాడి చేసేందుకుగాను.. వాహనం వెనుకవైపు తలుపు తెరవడానికి ప్రయత్నించినట్లు సీఆర్‌పీఎఫ్ అధికారులు వివరణ ఇచ్చారు.

సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి గాయాలు..: శ్రీనగర్‌లోని ఫతేకాదల్, బుద్‌షా చౌక్, మగర్‌మల్ ప్రాంతాల్లో భద్రతదళాలపై తీవ్రవాదులు శనివారం జరిపిన గ్రనేడ్ దాడుల్లో నలుగురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఇద్దరు పౌరులు గాయపడ్డారు.

ఇ-టికెట్లపై రైల్వే అప్పీలు కొట్టివేత

దిల్లీ: ఇ-టికెట్ తీసుకుని, జాబితా ముద్రణ సమయానికి కూడా నిరీక్షణ జాబితాలోనే ఉన్నవారు రైలెక్కడానికి వీల్లేదన్న నిబంధనపై దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మీద రైల్వేశాఖ దాఖలుచేసిన అప్పీలును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్టేషన్‌లో టికెట్ తీసుకున్నవారైతే బెర్తు ఖరారు కాకపోయినా- కావాలనుకుంటే రైల్లో ప్రయాణించగలుగుతుండగా ఇ-టికెట్‌దారులకు అలాంటి అవకాశం లేకపోవడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఇలాంటి వివక్ష తగదని జస్టిస్ మదన్ బి లోకుర్ నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల స్పష్టంచేసింది. రైల్వే తరపున వాదనలు వినిపించడానికి న్యాయవాదులెవరూ హాజరుకాకపోవడంతో సెలవుకాలీన వ్యాజ్యాన్ని (ఎస్‌ఎల్‌పీని) కొట్టివేస్తున్నట్లు పేర్కొంది. దీంతో రెండు రకాల టికెట్‌దారుల మధ్య భేదాన్ని తొలగించే మార్గాలను రైల్వేశాఖ తప్పనిసరిగా చేయాల్సి ఉంది.

ముషారఫ్ అరెస్టుకు అవకాశం!

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌ను దేశద్రోహం కింద అరెస్టు చేసే అవకాశం ఉంది. ముషారఫ్ పాస్‌పోర్టును, గుర్తింపు కార్డు(కంప్యూటరైజ్డ్ నేషనల్ ఐడెంటిటీ కార్డు)ను తాత్కాలికంగా రద్దు చేయాల్సిందిగా అంతర్గత భద్రతా వ్యవహారాల మంత్రిత్వశాఖను ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఆయన అరెస్టుకు చర్యలు చేపట్టాల్సిందిగా కోరినట్లు మీడియా శుక్రవారం పేర్కొంది. 2007లో పాకిస్థాన్‌లో ఎమర్జెన్సీని ప్రకటించిన వ్యవహారంలో ఆయన విచారణను ఎదుర్కొంటున్నారు.

రోహింగ్యా శరణార్థులను వెనక్కితీసుకునేందుకు సిద్ధం: మయన్మార్

సింగపూర్: దేశం విడిచి వెళ్లిన దాదాపు 7 లక్షల మంది రోహింగ్యా ముస్లింలు స్వచ్ఛందంగా తిరిగివస్తే.. స్వీకరించేందుకు మయన్మార్ సిద్ధంగా ఉందని ఆ దేశ జాతీయ భద్రత సలహాదారు తవుంగ్ టున్ వెల్లడించారు. సింగపూర్‌లో జరిగిన శాంగ్రి-లా సదస్సులో పాల్గొన్న ఆయన.. ఈ మేరకు వివరణ ఇచ్చారు. "రఖైన్ రాష్ట్రంలో యుద్ధమేమీ జరగట్లేదు. కాబట్టి అవి యుద్ధ నేరాలు కావు. అక్కడ సంక్షోభం ఉన్న విషయాన్ని మేమూ అంగీకరిస్తున్నాం. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు జరగడం ఆందోళనకరమే. ముస్లింలు నష్టపోయిన మాట వాస్తవం. అయితే వారికన్నా బౌద్ధులు, హిందువుల పడ్డ బాధలూ తక్కువేమీ కాదు. ప్రపంచానికి మాత్రం అసంపూర్ణమైన, తప్పుదోవ పట్టించే కథనాలు చేరుతున్నాయి" అని తవుంగ్ చెప్పారు.

9 పైసల మేర తగ్గిన పెట్రో ధరలు

దిల్లీ: వరుసగా నాలుగో రోజు కూడా పెట్రోలు, డీజిల్ ధరలు స్వల్పంగా తగ్గాయి. ఈ రెండు రకాల ఇంధనం ధరలు 9 పైసల మేర తగ్గుముఖం పట్టాయి. ఈ తగ్గుదల తర్వాత దిల్లీలో పెట్రోలు ధర లీటరుకు రూ.78.20గా, డీజిల్ రూ.69.11గా ఉన్నాయి.

పాక్ ఎన్నికల్లో హఫీజ్ సయీద్ ముఠా పోటీ

లాహోర్: ముంబయి ఉగ్రవాద దాడులు సూత్రధారి హఫీజ్ సయీద్‌కు చెందిన జమాతుద్ దవా పార్టీ పాకిస్థాన్ ఎన్నికల్లో పోటీ చేయనుంది. 'అల్లాహూ అక్బర్ తెహ్రీక్' (ఏఏటీ) అనే పార్టీ పేరిట రంగంలోకి దిగనుంది. జమాతుద్ దవాకు చెందిన మిల్లీ ముస్లిం లీగ్‌ను ఇంకా రాజకీయ పార్టీగా నమోదు చేయకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకుంది.

హిమాచల్‌లో జపాన్ మహిళపై అత్యాచారం!

కులు: హిమాచల్‌ప్రదేశ్‌లో జపాన్‌కు చెందిన ఓ మహిళపై అత్యాచారం జరిగింది. ఈ మేరకు కుల్లు పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తనపై ఓ ట్యాక్సీ డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడ్డట్లు ఆమె పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరపుతున్నామని పోలీసులు వెల్లడించారు. వైద్య పరీక్షల ఫలితాలు రావాల్సి ఉందని.. ఆమె ఇచ్చిన సమాచారం ఆధారంగా ఓ వ్యక్తిని అరెస్టు చేశామని పేర్కొన్నారు.

ప్రభుత్వ భవనాలను ఖాళీ చేసిన మాజీ ముఖ్యమంత్రులు

లఖ్‌నవూ: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఐదుగురు ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు శనివారం ప్రభుత్వ భవనాలను ఖాళీ చేశారు. వీరిలో ములాయంసింగ్‌యాదవ్, కల్యాణ్‌సింగ్, మాయావతి, రాజ్‌నాథ్‌సింగ్, అఖిలేష్‌యాదవ్ ఉన్నారు. తన భర్త ఎన్.డి.తివారి తీవ్ర అనారోగ్యంతో చివరిక్షణాల్లో ఉన్నారని, మరింత గడువు కావాలని ఆయన భార్య ఉజ్వల తివారి విజ్ఞప్తి చేశారు. మాయావతి కూడా ప్రభుత్వ బంగళాను ఖాళీ చేసి, సొంత ప్రైవేటుబంగ్లాకు వెళ్లిపోయారు. మరో భవనాన్ని ఖాళీ చేయడానికి మాత్రం ఆమె ససేమిరా అన్నారు. ఆ భవంతిని కాన్షీరాం స్మారకస్థలంగా మార్చినట్లు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రులు జీవితాంతం ప్రభుత్వ బంగ్లాల్లో ఉండవచ్చని అఖిలేష్‌యాదవ్ హయాంలో యూపీ మంత్రుల చట్టం-1981కు సవరణ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ 'లోక్‌ప్రహరి' అనే స్వచ్ఛంద సేవాసంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. చట్టసవరణ చెల్లదని కొట్టేసిన సుప్రీంకోర్టు... మాజీ ముఖ్యమంత్రులంతా 15 రోజుల్లోగా ఖాళీ చేయాలని ఆదేశించింది. ఆ గడువు ఆదివారంతో ముగిసిపోనుంది.

లఖ్‌నవూలో ప్రభుత్వ భవనాన్ని ఖాళీ చేసి వెళ్తున్న అఖిలేశ్ యాదవ్, కుటుంబ సభ్యులు

ఛాంపియన్స్

తిట్టండి.. కానీ చూడండి

దిల్లీ

తిట్టండి... విమర్శించండి.. కానీ మైదానాలకు వచ్చి భారత ఫుట్‌బాల్ జట్టు ఆట చూడండి.. అని అభిమానులకు పిలుపునిస్తున్నాడు భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి. లియొనెల్ మెస్సి, నెయ్‌మార్, రొనాల్డోలను ఎంత అభిమానించినా.. మనకూ ఓ జట్టు ఉందనే విషయం మరిచిపోవద్దని అతనన్నాడు. "మమ్మల్ని తిట్టండి. విమర్శించండి. కానీ దయచేసి భారత జాతీయ ఫుట్‌బాల్ జట్టు ఆడుతుంటే మైదానాలకు వచ్చి చూడండి" అని ఛెత్రి ఆవేదనగా చెప్పాడు. ఆటతీరులో మెరుగై ఫిఫా ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 97వ స్థానంలో ఉన్న భారత ఫుట్‌బాల్ జట్టు శుక్రవారం మొదలైన నాలుగు దేశాల టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో 5-0 తేడాతో చైనీస్ తైపీపై విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌కు కేవలం 2000 మంది అభిమానులు మాత్రమే హాజరవడంతో ముంబయిలోని ఫుట్‌బాల్ ఎరీనా స్టేడియం బోసిపోయి కనిపించింది. ఛెత్రి అద్భుతంగా రాణించి హ్యాట్రిక్‌తో జట్టుకు విజయాన్ని అందించినా అతడిలో ఆనందం కనిపించలేదు. దానికి కారణం ఫుట్‌బాల్ జట్టుకు ప్రజల నుంచి తగిన ఆదరణ లభించకపోవడమే. "యూరోపియన్ క్లబ్‌లను అనుసరిస్తూ వారికి మద్దతు తెలిపే మీ అందరికీ ఒకటి చెప్పాలనుకుంటున్నా. ఆటతీరులో మేం వారి స్థాయిని అందుకోకపోవచ్చు. మా మ్యాచ్‌కు వచ్చి సమయం ఎందుకు వృథా చేసుకోవాలని మీకు అనిపించి ఉండొచ్చు. దాన్ని మేం కాదనట్లేదు. ఆ స్థాయిలో మా ఆట లేదనే విషయాన్ని మేం కూడా ఒప్పుకుంటాం. కానీ ఆట పట్ల మా నిబద్ధత, ప్రేమతో మిమ్మల్ని అలరించడానికి కష్టపడతామని మాత్రం చెప్పగలను. మీకు సరైన వినోదాన్ని అందిస్తాం. భారత ఫుట్‌బాల్ జట్టు మీద నమ్మకం కోల్పోయిన మీరు ఒక సారి స్టేడియానికి వచ్చి మా ఆట చూడండి. అంతర్జాలంలో మమ్మల్ని దూషించడం సరికాదు. మైదానాలకు రండి. మా ముఖం మీదే తిట్టండి. మా మీద అరవండి. మీ ప్రవర్తనలో ఒక రోజు మార్పు రావొచ్చు. మీ మద్దతు మాకు ఎంత అవసరమో మీరు తెలుసుకోలేకపోతున్నారు" అని ఛెత్రి అన్నాడు.

ఛెత్రి

రొనాల్డో

పరుపుల్లో ప్రపంచకప్ జట్టు

బ్రసెల్స్: ఈసారి ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో బరిలోకి దిగుతున్న బలమైన జట్లలో బెల్జియం ఒకటి. గత టోర్నీతో పోలిస్తే పటిష్ఠంగా తయారైందా జట్టు. ఐతే ప్రపంచకప్ జట్టులో చోటు కోసం చాలామంది ఆటగాళ్లు పోటీలో ఉన్న నేపథ్యంలో రష్యా వెళ్లే జట్టేదన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. ప్రపంచకప్ జట్టును ప్రకటించడానికి తుది గడువు సోమవారం కాగా.. ఆ రోజే బెల్జియం కోచ్ ప్రకటన చేయబోతున్నాడు. కానీ ఈలోపే బెల్జియం జట్టు వివరాలు అనుకోని రీతిలో వెల్లడైపోయాయి. ప్రపంచకప్‌లో పాల్గొనే 23 మంది సభ్యులు రష్యాలో ఏ ఇబ్బందీ లేకుండా విశ్రాంతి పొందేందుకుగాను ప్రత్యేకంగా తయారు చేయించిన పరుపుల్ని ఇటీవలే రష్యాకు పంపే ఏర్పాట్లు చేశారు అధికారులు. ఐతే ఆ పరుపులపై ఆటగాళ్ల పేర్లు ముద్రించి ఉండటంతో ఒక మీడియా సంస్థ.. ప్రపంచకప్ జట్టిదే అంటూ వార్త ఇచ్చేసింది. అలా ముందే ఉత్కంఠకు తెరపడిపోయింది. కానీ బెల్జియం జట్టు వర్గాలు మాత్రం అధికారిక తుది జట్టు ఇది కాదంటున్నాయి. మరి సోమవారం వెల్లడయ్యే జట్టుకు, ముందే వార్తల్లోకి వచ్చిన జట్టుకు ఏమాత్రం తేడాలుంటాయో చూడాలి.

అంతరిక్షంలోనూ ఆడేశారు

మాస్కో: ప్రస్తుతం ప్రపంచ క్రీడా ప్రియుల దృష్టంతా ఇంకో 11 రోజుల్లో మొదలయ్యే ఫుట్‌బాల్ ప్రపంచకప్ మీదే ఉంది. ఇక ఆతిథ్య రష్యాలో పరిస్థితేంటో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఈ నేపథ్యంలో ఆ దేశ వ్యోమగాములు అంతరిక్షంలో ఫుట్‌బాల్ ఆడటం విశేషం. అంటాన్ ష్కప్లెరోవ్, ఒలెగ్ ఆర్టెమ్యెవ్ అనే వ్యోమగాములు అంతరిక్ష కేంద్రంలో ఫుట్‌బాల్ ఆడి.. దానికి సంబంధించిన వీడియోను శాటిలైట్ ద్వారా కిందికి పంపారు. గాల్లో తేలిపోతూ.. మెలికలు తిరుగుతూ, పల్టీలు కొడుతూ ఫుట్‌బాల్‌ను అందుకోవడం, తన్నడం.. ఇదంతా చాలా సరదాగా సాగి వీక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి.

ఫుట్‌బాల్‌లో కబడ్డీ కూత

లండన్: భారత క్రికెటర్లు ప్రాక్టీస్‌లో ఫుట్‌బాల్ ఆడడం చూశాం. మరి ఇంగ్లాండ్ ఫుట్‌బాలర్లు ప్రాక్టీస్‌లో ఏం చేస్తున్నారో తెలుసా? కబడ్డీ ఆడుతున్నారు. మీరు విన్నది నిజమే. ప్రపంచకప్ సమరానికి సన్నద్ధమవుతోన్న ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఇప్పుడు కబడ్డీ కూత కూస్తున్నారు. టోర్నీకి ముందు ఉల్లాసంగా ఉండడం కోసం ఇంగ్లాండ్ కోచ్ గారెత్ సౌత్‌గేట్ తమ ఆటగాళ్లతో కబడ్డీ ఆడిస్తున్నాడు. శనివారం శిక్షణలో భాగంగా ఇంగ్లాండ్ స్టార్ ఆటగాళ్లందరూ కబడ్డీ ఆడారు. హ్యారీ కేన్, డాని వెల్‌బాక్, గ్యారీ కాహిల్ లాంటి స్టార్లు కబడ్డీ ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. ఫుట్‌బాల్ ప్రపంచకప్ గ్రూప్ దశలో ఇంగ్లాండ్ టూనీషియా, బెల్జియం, పనామాలతో తలపడనుంది.

సాహా స్థానంలో దినేశ్ కార్తీక్

ముంబయి: ఐపీఎల్ సందర్భంగా గాయపడ్డ భారత వికెట్‌కీపర్ వృద్ధిమాన్ సాహా అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టుకు దూరమయ్యాడు. సెలక్షన్ కమిటీ అతడి స్థానంలో పార్థివ్ పటేల్‌ను కాదని దినేశ్ కార్తీక్‌ను జట్టులోకి తీసుకుంది. సాహా బొటన వేలి గాయంతో బాధపడుతున్నాడు. అతడు కోలుకోవడానికి కనీసం ఐదారు వారాలు పట్టొచ్చు. అఫ్గాన్‌తో టెస్టు జూన్ 14న ఆరంభమవుతుంది. కార్తీక్ చివరిసారి 2010లో టెస్టు మ్యాచ్ ఆడాడు.

తల్లిదండ్రులకు అనుమతి లేదు!

ఆసియా క్రీడలకు దూరం పెట్టిన ప్రభుత్వం

దిల్లీ: త్వరలో జరగబోయే ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత క్రీడాకారులకు తోడుగా వారి తల్లిదండ్రులెవరినీ అనుమతించకూడదని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నిర్ణయించింది. క్రీడాకారుల కుటుంబ సభ్యులెవరికీ గుర్తింపు కార్డులు ఇవ్వబోవట్లేదని ఐఓఏ స్పష్టం చేసింది. ఏప్రిల్‌లో కామన్వెల్త్ క్రీడల సందర్భంగా సైనా తండ్రి హర్వీర్ సింగ్‌కు గుర్తింపు కార్డు ఇవ్వకపోవడంపై వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. తన తండ్రికి ఈ సౌలభ్యం కల్పించకపోతే క్రీడల నుంచే తప్పుకుంటానని సైనా హెచ్చరించడం దుమారం రేపింది. ఈ నేపథ్యంలో ఆగస్టులో జరిగే ఆసియా క్రీడలకు క్రీడాకారుల తల్లిదండ్రుల్ని దూరం పెట్టాలని ఐఓఏ నిర్ణయం తీసుకుంది.

అఫ్గాన్, బంగ్లా టీ20 నేడు

డెహ్రాడూన్: టెస్టు అరంగేట్రానికి సిద్ధమవుతున్న అఫ్గానిస్థాన్.. అంతకంటే ముందు టీ20 పరీక్షను ఎదుర్కోనుంది. బంగ్లాదేశ్‌తో 3 టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఆదివారం జరుగుతుంది. ఈ సిరీస్‌కు భారత్‌లోని డెహ్రాడూన్ ఆతిథ్యం ఇవ్వనుండటం విశేషం.

గ్రూప్-బి విశ్లేషణ

స్పెయిన్‌కు ఎదురుందా?

ఫిఫా ప్రపంచకప్ మరో 11 రోజుల్లో

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో అత్యంత ఆసక్తి కలిగిస్తోన్న గ్రూపుల్లో 'బి' ఒకటి. అగ్ర జట్లు స్పెయిన్, పోర్చుగల్ ఇందులో ఉండడమే అందుకు కారణం. మాజీ ఛాంపియన్ స్పెయిన్ ఫేవరెట్‌గా కనిపిస్తున్నా.. యూరో విజేత పోర్చుగల్ కూడా గట్టిపోటీదారే. గత ప్రపంచకప్‌లో గ్రూప్ దశ దాటని స్పెయిన్ ఈ సారి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. చివరి ప్రపంచకప్ ఆడబోతున్న రొనాల్డో ఎలాంటి ముద్ర వేస్తాడన్నది ఆసక్తికరం. సంచలనాలు నమోదైతే తప్ప ఈ గ్రూపు నుంచి ముందంజ వేసేది స్పెయిన్, పోర్చుగల్ జట్లే. ఇరాన్, మొరాకో ఎలా ఆడతాయో చూడాలి.

స్పెయిన్
మిడ్‌ఫీల్డే బలం

రామోస్

ప్రపంచకప్‌లోనే బలమైన జట్లలో ఒకటి. 2010 ప్రపంచకప్ గెలిచిన తర్వాత క్రమంగా బలహీనపడ్డ స్పెయిన్ డెల్ బోస్క్ నుంచి జులెన్ లొపెటెగి కోచ్‌గా బాధ్యతలు అందుకున్నాక పునరుత్తేజం పొందింది. ప్రతిభావంతులతో కూడిన జట్టు చాలా ఉత్సాహంగా ఉంది. ఎప్పటిలాగే మిడ్‌ఫీల్డే స్పెయిన్ బలం. ఆండ్రీ ఇనియెస్టా, సెర్గియో బస్కెట్స్, ఇస్కో, కొకె, డేవిడ్ సిల్వా వంటి వారితో అత్యంత పటిష్ఠమైన మిడ్‌ఫీల్డ్ ఆ జట్టుకు ఉంది. నాకౌట్ చేరడం ఖాయం. ఐతే గ్రూప్ నుంచి అగ్రస్థానంపై కన్నేసిన స్పెయిన్‌కు ఏ జట్టు నుంచైనా గట్టి పోటీ ఉంటుంది అంటే అది పోర్చుగల్ నుంచే. తొలి మ్యాచ్‌లోనే ఆ జట్టుతో తలపడాల్సి రావడం స్పెయిన్‌కు సవాలే. గత ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి తొలి మ్యాచ్‌లో 5-1తో నెదర్లాండ్స్ చేతిలో చిత్తయిన స్పెయిన్.. ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి పరిస్థితిని పునరావృతం కానివ్వొద్దనే పట్టుదలతో ఉంది. ఇరాన్, మొరాకోలు తీసిపారేసేవి కాకపోయినా ఆ జట్ల నుంచి ముప్పేమీ ఉండకపోవచ్చు.

కీలక ఆటగాళ్లు: ఇనియెస్టా, డేవిడ్ సిల్వా, రామోస్ **కోచ్:** లొపెటెగి **ప్రస్తుత ర్యాంకు:** 8
రికార్డు: 2010 ఛాంపియన్. నాలుగుసార్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు, ఓసారి సెమీఫైనల్‌కు చేరింది.

పోర్చుగల్
రొనాల్డో చుట్టూ..

పోర్చుగల్ అంటే టక్కున గుర్తొచ్చే పేరు క్రిస్టియానో రొనాల్డో. ఇప్పటికీ ఆ జట్టు ప్రధాన అస్త్రం అతడే. కానీ ప్రపంచంలోనే మేటి ఫుట్‌బాలరైనా రొనాల్డో ప్రపంచకప్ కల ఇప్పటికీ కలగానే ఉంది. 32 ఏళ్ల రొనాల్డోకు బహుశా ఇదే ఆఖరి అవకాశం. ఐతే పోర్చుగల్ ఇప్పటిదాకా ప్రపంచకప్ గెలిచి ఉండకపోవచ్చు కానీ.. పెద్ద టోర్నీలో గెలిచే సత్తా తమకు ఉందని 2016 యూరో టైటిల్‌తో నిరూపించింది. రొనాల్డో కాసేపటికే గాయపడ్డా ఫైనల్లో ఆతిథ్య ఫ్రాన్స్‌కు షాకిచ్చింది. ఈసారి చాలా అనుభవజ్ఞులతో రష్యాకు కప్పు వేటకు వెళ్తోంది. డిఫెన్స్‌లో పెపె దుర్భేద్యంగా నిలిస్తే. . జావో మౌటినో తన పాసింగ్ నైపుణ్యంతో మిడ్‌ఫీల్డ్ పదును పెంచుతాడు. ఆండ్రూ సిల్వా ఎటాకింగ్‌లో రొనాల్డోకు సహకరిస్తాడు. అగ్రస్థానం కోసం స్పెయిన్‌తో పోటీ పడనున్న పోర్చుగల్.. కనీసం రెండో స్థానంతోనైనా ముందంజ వేయగలదు.

కీలక ఆటగాళ్లు: క్రిస్టియానో రొనాల్డో, పెపె, ఆండ్రూ సిల్వా
కోచ్: ఫెర్నాండో శాంతోస్
రికార్డు: ఆరు ప్రయత్నాల్లో అత్యుత్తమంగా మూడో స్థానం (1966) సాధించింది.
ప్రస్తుత ర్యాంకు: 4

మొరాకో
విషయం ఉంది కానీ..

ఐవరీకోస్ట్, గబోన్, మాలిలను తోసిరాజని హోరాహోరీ పోరు నడిచిన ఆఫ్రికా జోన్ గ్రూప్-సి నుంచి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. 20 ఏళ్ల తర్వాత తిరిగి విశ్వ సమరంలో అడుగుపెట్టిన ఈ ఉత్తర ఆఫ్రికా జట్టు ఏమి సాధించినా బోనసే. ఐతే హకిమ్ జియెచ్, బెలందా వంటి ప్రతిభావంతులు ఆ జట్టుపై ఆసక్తి కలిగిస్తున్నారు. కోచ్ రెనార్డ్.. ఎటాకింగ్‌తో పాటు డిఫెన్స్‌లోనూ మొరాకోను బాగా సానపట్టాడు. ఇరాన్‌పై ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. పోర్చుగల్‌కు పోటీ ఇవ్వగలదని భావిస్తున్నారు. కానీ నాకౌట్ చేరడం కష్టమే.

వీళ్లు కీలకం: నబిల్ దిరార్, హకిమ్ జియెచ్
కోచ్: హెర్వ్ రెనార్డ్
రికార్డు: నాలుగు ప్రపంచకప్‌లు ఆడింది. ప్రిక్వార్టర్స్ చేరడం అత్యుత్తమ ప్రదర్శన.
ప్రస్తుత ర్యాంకు: 42

గ్రూప్ అంచనా:
1. స్పెయిన్
2. పోర్చుగల్
3. మొరాకో
4. ఇరాన్

● ప్రతి గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ప్రిక్వార్టర్స్ (16 జట్ల రౌండ్)కు అర్హత సాధిస్తాయి.

ఇరాన్
ముందుకు కష్టమే

ఆసియా నుంచి ప్రపంచకప్ అర్హత సాధించిన తొలి జట్టు ఇరానే. బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి జట్లను అసహనానికి గురి చేసే జట్టుగా ఇరాన్‌కు పేరుంది. క్వాలిఫయింగ్ దశలో రెండు రౌండ్లలో 18 మ్యాచ్‌లు ఆడి అజేయంగా నిలిచింది. ఐతే ఐదోసారి ప్రపంచకప్ ఆడుతున్న ఈ జట్టుపై పెద్దగా అంచనాలేమీ లేవు. కోచ్ కార్లోస్ క్వీరోజ్ నాకౌటే తమ లక్ష్యం అంటున్నాడు కానీ.. స్పెయిన్, పోర్చుగల్ వంటి జట్లను కాదని ముందంజ వేయడం ఇరాన్‌కు కష్టమే. ఆ జట్టుకు విజయావకాశమున్నది ఒక్క మొరాకోపైనే.

వీళ్లు కీలకం: సదర్దార్ అజ్‌మౌన్
కోచ్: కార్లోస్ క్వీరోజ్
రికార్డు: నాలుగు ప్రపంచకప్పుల్లో ఆడినా ఎప్పుడూ గ్రూప్ దశ దాటలేదు.
ప్రస్తుత ర్యాంకు: 36

రూట్ (45)

ఇంగ్లాండ్‌కు ఆధిక్యం

లీడ్స్: పాకిస్థాన్‌తో తొలి టెస్టులో కంగుతిన్న ఇంగ్లాండ్.. రెండో టెస్టులో పుంజుకుంది. ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కీలక ఆధిక్యం సాధించింది. రెండో రోజు, శనివారం కడపటి వార్తలందేసరికి ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 302 పరుగులు చేసింది. ఆ జట్టు అప్పటికే 128 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 106/2తో బ్యాటింగ్ కొనసాగించిన ఆ జట్టును రూట్ (45), బెస్ (49), మలన్ (28) మంచి స్థితికి చేర్చారు. ఐతే ఒక దశలో 200/3తో ఉన్న ఇంగ్లాండ్.. తర్వాత తడబడింది. ఆట ఆఖరుకు బట్లర్ (34), కుర్రన్ (16) క్రీజులో ఉన్నారు. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

షరపోవా హవా

- ముగురుజ, నాదల్ ముందంజ
- క్వితోవా ఔట్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో మాజీ నంబర్‌వన్ షరపోవా (రష్యా) సత్తా చాటుతోంది. దాదాపు రెండేళ్ల తర్వాత రోలాండ్ గారోస్ టోర్నీ ఆడుతున్న షరపోవా ప్రిక్వార్టర్స్ చేరింది. శనివారం మహిళల సింగిల్స్ మూడో రౌండ్లో షరపోవా 6-2, 6-1 తేడాతో ఆరో సీడ్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)కు షాకిచ్చింది. తన మునుపటి జోరును ప్రదర్శించిన ఆమె మ్యాచ్‌లో 18 విన్నర్లు కొట్టింది. తన తర్వాతి మ్యాచ్‌లో ఆమె.. సెరెనా విలియమ్స్‌తో పోటీ పడే అవకాశం ఉంది. మరోవైపు టాప్ సీడ్ హలెప్ (రొమేనియా) నాలుగో రౌండ్ చేరింది. హలెప్ 7-5, 6-0తో పెట్కోవిచ్ (జర్మనీ)పై విజయం సాధించింది. మూడోసీడ్ ముగురుజ (స్పెయిన్) ముందంజ వేసింది. ముగురుజ 6-0, 6-2తో స్టోసర్ (ఆస్ట్రేలియా)ను చిత్తుచేసింది. ఎనిమిదో సీడ్ క్విటోవాకు ఊహించని షాక్ తగిలింది. తనకంటే తక్కువ ర్యాంకు క్రీడాకారిణి చేతిలో ఓడి ఇంటి ముఖం పట్టింది. క్విటోవా (చెక్ రిపబ్లిక్) 6-7 (6-8), 6-7 (4-7)తో అనెట్ (ఈస్తోనియా) చేతిలో పోరాడి ఓడింది. పదోసీడ్ స్టీఫెన్స్ (యుఎస్ఏ), మెర్టెన్స్ (బెల్జియం) కూడా విజయాలు సాధించారు.

నాదల్ అలవోకగా: తనకు అచ్చొచ్చిన ఎర్రమట్టి కోర్టులో నాదల్ రెచ్చిపోతున్నాడు. ప్రపంచ నంబర్‌వన్ నాదల్ పురుషుల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్ చేరాడు. మూడో రౌండ్లో నాదల్ (స్పెయిన్) 6-3, 6-2, 6-2 తేడాతో తన చిన్ననాటి స్నేహితుడు గాస్కెట్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. మరో మ్యాచ్‌లో మూడో సీడ్ సిలిచ్ (క్రొయేషియా) 6-3, 6-2, 6-4తో జాన్సన్ (యుఎస్ఏ)ని చిత్తుచేశాడు. ఎనిమిదో సీడ్ గోఫిన్ విజయం సాధించడానికి కష్టపడాల్సి వచ్చింది. గోఫిన్ (బెల్జియం) 6-7 (6-8), 6-3, 4-6, 7-5, 6-3తో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. టోర్నీలో మిషా జ్వెరెవ్ కథ ముగిసింది. జ్వెరెవ్ (జర్మనీ) 1-6, 7-6 (7-3), 3-6, 6-7 (4-7)తో అండర్సన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. కచనోవ్ (రష్యా), ఫోగ్నిని (ఇటలీ) కూడా ముందంజ వేశారు.

ముగురుజ

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్‌లో బోపన్న జోడీ సంచలనం నమోదు చేసింది. టాప్ సీడ్‌కు షాకిచ్చి క్వార్టర్స్ చేరింది. ప్రిక్వార్టర్స్‌లో 13వ సీడ్ బోపన్న- ఎడ్వర్డ్ రోజర్ (ఫ్రాన్స్) జోడీ 6-4, 7-6 (7-1) తేడాతో టాప్ సీడ్ మార్సిలో (బ్రెజిల్)- లుకాజ్ (పోలాండ్) జంటపై విజయం సాధించింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్స్ చేరడం బోపన్నకిది మూడోసారి. ఇంతకుముందు 2011, 2016లో బోపన్న క్వార్టర్స్ చేరాడు.

నిధులున్నా నిర్లక్ష్యమే!

- పట్టణాలకు ఏడాదిన్నరలో కేటాయించిన పనులు 18,056
- ఇప్పటికీ ప్రారంభించనివి 5,209
- ఎమ్మెల్యేలు, ఛైర్మన్ల అనుచరులదే హవా
- ఉదాసీనంగా కమిషనర్లు, ఇంజినీర్లు

వివిధ దశల్లో పనులు	పనులు ప్రారంభించి పూర్తి చేసినవి	ప్రారంభించి వివిధ దశల్లో ఉన్నవి	సాంకేతిక అనుమతి రావలసినవి	టెండర్ల దశలో ఉన్న పనులు
	4,595	4,364	2,481	1,409

ఈనాడు, అమరావతి: పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు సమృద్ధిగా ఉన్నా వాటిని సకాలంలో ఖర్చు చేయని పరిస్థితి నెలకొంది. వచ్చే నెలాఖరు నుంచి వర్షాలు మొదలైతే మరో రెండు, మూడు నెలల వరకూ పనులు పూర్తి చేసే అవకాశం ఉండదు. రాష్ట్రంలోని 110 పట్టణాల్లో

ప్రకాశం జిల్లా మార్కాపురం పదో వార్డులో నిధులు విడుదలైనా మొదలు కాని కాలువ పనులు

18,056 పనుల కోసం ఏడాదిన్నర క్రితం నిధులు కేటాయిస్తే ఇప్పటికీ 5,209 పనులు ప్రారంభించని పరిస్థితి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, నెల్లూరు జిల్లాల్లో పనులు 35 శాతం కూడా పూర్తి కాలేదు. మిగతా జిల్లాల్లో 60 నుంచి 75 శాతం పూర్తయ్యాయి. పురపాలక సంఘాల్లో ఎమ్మెల్యేల నుంచి ఛైర్మన్లు, కౌన్సిలర్ల జోక్యం పెరగడంతో అభివృద్ధి పనులపై ఆ ప్రభావం పడుతోంది. ఉభయ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో కొన్ని పురపాలక సంఘాల్లో ప్రజాప్రతినిధులు మితిమీరిన జోక్యం చేసుకుంటుండటంతో పనులు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది. టెండర్లను ఎమ్మెల్యేలు, ఛైర్మన్లు, కౌన్సిలర్ల అనుచరులు దక్కించుకుని సకాలంలో ప్రారంభించడం లేదు. ఇటీవల రాయలసీమ జిల్లాలోని ఒక పెద్ద పురపాలక సంఘంలో పనులేవీ ప్రారంభించకపోవడంపై అధికారులు ఆరా తీస్తే ఒక ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్ మనుషులు టెండర్లు దక్కించుకుని ప్రారంభించలేదని వెల్లడైంది. గట్టిగా ప్రశ్నించి పనులు చేయించే పరిస్థితిలో కమిషనరు లేనట్లుగా గుర్తించారు. కృష్ణా జిల్లాలో మరో ఎమ్మెల్యే పురపాలక సంఘం తరఫున చేసే పనులన్నీ తమ మనుషులకే దక్కాలని, లేదంటే సెలవు పెట్టి వెళ్లిపోవాలని కమిషనరును హెచ్చరించడతో ఆయన ఇప్పటికీ టెండర్ల ప్రక్రియే ప్రారంభించలేదు. ప్రకాశం జిల్లాలోని మరో పురపాలక సంఘంలో పనులన్నీ బినామీలే చేస్తుంటారు. ఎప్పుడు పూర్తయితే అప్పుడు వీటి కొలతలు తీసి ఇంజినీర్లు బిల్లులు తయారు చేయాలి.

పనులు చేయని కమిషనర్లు వెనక్కి...

'పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయిస్తున్నా అధికారులు సరిగా పని చేయడం లేదు. అలాంటి వారందరినీ వెనక్కి పంపి కొత్త కమిషనర్లను నియమించడానికి చర్యలు తీసుకుంటాం. ప్రతిపాదిత పనులు పూర్తి చేస్తే పట్టణ రూపురేఖలే మారిపోయే అవకాశాలున్నాయి. వీటిని పూర్తి చేస్తే అదనంగా మరో రూ.12వేల కోట్ల నిధులు పట్టణాల్లో వివిధ పనుల కోసం కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది'

-పి.నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి

విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలోని 23వ వార్డులో నిధులు కేటాయించినా ప్రారంభం కాని సిమెంట్ రోడ్డు పనులు

ఊరందరిదీ ఒక దారైతే...

నిధులుండీ అనేక పట్టణాల్లో పనులు ప్రారంభించని పరిస్థితి ఒకవైపు ఉంటే.. విశాఖ మహానగర శివారు ధారపాలెంలో ఎస్టీ ఉప ప్రణాళిక కింద జనసంచారం లేని చోట ఇంజినీర్లు రహదారిని నిర్మించి ఘనతను చాటుకున్నారు. రెండు విడతలుగా 1500 అడుగులకుపైగా రహదారి కోసం రూ.39.50 లక్షలు ఖర్చు చేశారు. ఇక్కడ ఎస్టీ ఆవాసాల్లేక పోగా కొందరు స్థిరాస్తి వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేలా నిబంధనలకు విరుద్ధంగా రహదారి నిర్మించారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం ఉన్నతస్థాయి విచారణ జరుగుతోంది.

తితిదేకి జీఎస్టీ ఊరట

తిరుమల అన్న ప్రసాద విభాగానికి మేలు

ఈనాడు, తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం అన్న ప్రసాద విభాగానికి జీఎస్టీ నుంచి ఊరట లభించింది. కేంద్రం శనివారం ధార్మిక, మత సంస్థలతోపాటు ఆలయాలకు సీజీఎస్టీ, ఐజీఎస్టీ సొమ్మును తిరిగివ్వాలని నిర్ణయించింది. 'సేవ్ భోజన్ యోజన' పేరుతో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భక్తులకు ఉచితంగా భోజనం అందించే పెద్ద ఆలయాలకు ప్రయోజనం కలగనుంది. ఈ పథకం అమలుకు కేంద్రం రూ.325 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తుంది. దీనిపై త్వరలోనే పూర్తి విధివిధానాలు ఖరారు చేయనున్నారు. ఈ పథకంలో తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం గరిష్ఠంగా జీఎస్టీ పన్ను నుంచి మినహాయింపు పొందనున్నాయి. ముడి సరకుల కొనుగోలులో జీఎస్టీని ఆయా సంస్థలకు తిరిగి చెల్లించనున్నారు. అయితే ముడి పదార్థాలను గుత్తేదారులు కాకుండా.. ఆధ్యాత్మిక సంస్థలు పంపిణీ చేస్తేనే ఈ నిబంధన వర్తిస్తుంది. దీనివల్ల తిరుమల తిరుపతి దేవస్థానానికి ఏటా ముడి పదార్థాలకు చెల్లించే సొమ్ము వెనక్కి వస్తుంది. ఏటా తితిదే దీనికోసం రూ.96 కోట్ల మేర ఖర్చు చేస్తోంది. ఇందులో సుమారు రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకూ తితిదేకి తిరిగే వచ్చే అవకాశముంది. ఇప్పటికే ప్రసాదాలపై జీఎస్టీని కేంద్రం మినహాయించింది.

'ఎన్‌సీఈఆర్‌టీ' సిలబస్ సగానికి తగ్గింపు

కేంద్ర మంత్రి జావడేకర్ వెల్లడి

కోల్‌కతా: విద్యార్థులకు గుదిబండగా మారిన 'జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)' సిలబస్‌ను సగానికి తగ్గించనున్నట్లు కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి శనివారం ఆయనిక్కడ పలు వివరాలను వెల్లడించారు. "చదువంటే పాఠాలను బట్టీ కొట్టి, సమాధానపత్రాల్లో రాయడం కాదు. నాణ్యమైన విద్యతో పాటు ఆటపాటల్లోనూ, జీవన నైపుణ్యాల్లోనూ చిన్నారులు రాణించాలి. అందుకే... సిలబస్‌ను సగానికి తగ్గించాలని నిర్ణయించాం. తద్వారా క్రీడల్లో పాల్గొనే అవకాశం విద్యార్థులకు కలుగుతుంది. తరగతులు, పాఠ్యాంశాలు, బోధనాంశాలకు సంబంధించి ఉపాధ్యాయులు, నిపుణుల నుంచి 37 వేల సూచనలు వచ్చాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తున్నాం.

పాఠశాలలకు క్రీడా సామగ్రి: విద్యార్థుల సమగ్ర వికాసం కోసం పాఠశాలలకు క్రీడా సామగ్రిని సమకూర్చనున్నాం. కేంద్ర సాయంతో నడిచే ప్రతి ప్రాథమిక పాఠశాలకు రూ.5 వేలు; ప్రాథమికోన్నత బడులకు రూ.10 వేలు; ఉన్నత (ఎస్ఎస్‌సీ, హయ్యర్ సెకెండరీ) పాఠశాలలకు రూ.25 వేల విలువైన క్రీడా పరికరాలను సమకూర్చుతాం. బడులకు గ్రంథాలయ నిధుల కింద రూ.5,000-20,000 వేలు అందజేస్తాం.

వచ్చే నెలలో విద్యా హక్కుచట్టం సవరణ బిల్లు: ఐదు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వాలు పరీక్షలు నిర్వహించుకునేలా అవకాశం కల్పిస్తూ... విద్యాహక్కు చట్టానికి సవరణలు చేస్తున్నాం. జులైలో ఇది పార్లమెంటు ముందుకు వస్తుంది.

- ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా విద్యార్థులను పైతరగతులకు పంపే విధానం ఆగస్టు నాటికల్లా రూపొందుతుంది. దీని అమలుపై నిర్ణయం ఇక ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదే.
- నూతన జాతీయ విద్యా విధాన నమూనా ఈ నెలాఖరుకల్లా మంత్రివర్గం ముందుకు రానుంది.
- ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలను నిర్వహించేందుకు ఏర్పాటుచేస్తున్న 'జాతీయ పరీక్ష సంస్థ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)'కి త్వరలోనే ఛైర్మన్‌ను నియమిస్తాం. 2019 నుంచి దీని కార్యకలాపాలు ప్రారంభమవుతాయి" అని జావడేకర్ తెలిపారు.

అన్యాయం చేసేందుకు కుట్ర

కృష్ణా జిల్లా సభలో మంద కృష్ణమాదిగ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ చట్టాలను నీరుగార్చడం ద్వారా దళితులకు అన్యాయం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులో శనివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టానికి కేంద్ర పాలకులు తూట్లు పొడుస్తున్నారని ధ్వజమెత్తారు. న్యాయస్థానాల ద్వారా చట్టాన్ని నీరుగార్చేలా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయన్నారు. ఈ చట్టాన్ని పరిరక్షించుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న దళిత సంఘాల నాయకులు ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. దీని కోసమే ఈనెల 10న వరంగల్‌లో దళిత గిరిజన సింహగర్జన పేరిట మహాసభ ఏర్పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ చర్యలతో కోర్టులు చట్టాన్ని నీరుగార్చుతున్నాయన్నారు. దళిత గిరిజన చట్టాల పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ దొండపాటి సుధాకర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర సమన్వయకర్త మాదగాని గురునాథం తదితరులు పాల్గొన్నారు.

చాలిక.. ఇంకెన్నాళ్లు బతుకుతావ్..

- తండ్రిపై కుమారుడి నిర్దయ
- ఆస్తి లాక్కొని వైద్యానికి నిరాకరణ
- విసిగి వేసారి.. ఆత్మహత్యకు అనుమతివ్వాలని ఎస్పీకి వినతి

ఎస్పీని అనుమతి కోరుతున్న వృద్ధ దంపతులు

బాలాజీ చెరువు, సర్పవరం జంక్షన్(కాకినాడ), న్యూస్‌టుడే: ఇది వృద్ధులై అసహాయులైన ఓ తల్లీ తండ్రీ కథ.. కుమారుడి నిర్లక్ష్యానికి గురైన దంపతుల వ్యథ.. పట్టి పీడిస్తున్న అనారోగ్యం కంటే కుమారుడికి సోకిన డబ్బు జబ్బే ప్రాణం తినేస్తుందంటున్న వారి దయనీయ గాథ... చాలా ఏళ్లొచ్చాయ్.. ఇంకేం బతుకుతావ్.. అంటూ కన్నవాడే కాటికి వెళ్లమంటున్న కన్నీటి కథ.. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ గ్రామీణం మండలం సర్పవరానికి చెందిన పిట్లా అప్పారావు అనే 62 ఏళ్ల వృద్ధుడికి ఎదురైన చీదరింపులివి.. కన్న కుమారుడే ఇలా చేయడంతో ఖిన్నులైన ఆ దంపతులు ఆత్మహత్య చేసుకుంటామని, అనుమతివ్వాలని శనివారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ విశాల్ గున్నిని కలిసి విజ్ఞప్తి చేశారు. తన భర్త అనారోగ్యం పాలై ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటాననంటే డబ్బు దండగని కుమారుడు నిరాకరిస్తున్నాడని, అనారోగ్యంతో ప్రాణాలొదలబోయే తన భర్తతోపాటే తానూ చనిపోయేందుకు సిద్ధమయ్యానంటూ అప్పారావు భార్య మరణానికి అనుమతి కోరింది. 'ఇప్పటికే 70 ఏళ్లకు దగ్గరపడ్డావ్.. ఇంకెన్నాళ్లు బతికేస్తావ్. వైద్యానికి ఖర్చెందుకని మా కుమారుడు అంటున్నాడు. నాకొచ్చిన జబ్బు కంటే నా కుమారుడికి సోకిన డబ్బు జబ్బే ప్రాణాలను హరిస్తోంది' అంటూ ఆ తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు.

పిట్లా అప్పారావుకు భార్య లక్ష్మితోపాటు కుమారుడు రవి, ఇద్దరు కుమార్తెలున్నారు. గ్రామంలోనే ఓ కిళ్లీ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తూ వచ్చిన ఆయన పిల్లలు ముగ్గురికీ వివాహాలు చేశారు. కుమారుడు రవి తండ్రి సహకారంతో ఆయన దుకాణం పక్కనే మరో కిళ్లీ దుకాణం పెట్టుకున్నాడు. ఒకే ఇంట్లో ఉండే వీరి మధ్య పెద్దగా మాటలుండవు. ఏడాదిన్నర క్రితం మధుమేహం, రక్తపోటు బారిన పడ్డ అప్పారావుకు మూత్రపిండాల వ్యాధి సోకింది. వారానికి రెండుసార్లు డయాలసిస్‌పై ఆధారపడి జీవిస్తున్నాడు. ఆయన మూత్రపిండ దాతల కోసం దరఖాస్తు చేసుకోగా త్వరలో అది ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం అందింది. అందుకు అప్పారావు రూ.15 లక్షల వరకూ చెల్లించాల్సి ఉంది. ఆయన ఏళ్లపాటు శ్రమించి సంపాదించిన ఆస్తి రూ.2 కోట్లకు చేరింది. కొన్నాళ్ల క్రితం తల్లిదండ్రుల నుంచి ఆస్తి పత్రాలను తీసుకున్న కుమారుడు రవి వాటిని తాకట్టు పెట్టాడు. కుమారుడు పట్టించుకోకపోవడం, వ్యాపారం తగిన విధంగా సాగక అప్పారావు అప్పుల పాలయ్యాడు. తన అవసరాల కోసం స్వార్జితమైన ఆస్తిలో 200 గజాల స్థలాన్ని అమ్మేందుకు సిద్ధపడ్డ ఆయన పత్రాలివ్వాలని కుమారుడిని అడిగారు. రవి నిరాకరించాడు. ఈ నేపథ్యంలో కుమారుడు పెడుతున్న శారీరక, మానసిక వేధింపులు తాళలేక దంపతులు ఆత్మహత్యకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసి అనుమతి కోరారు. ఎస్పీ వెంటనే విచారణకు ఆదేశించారు.

'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి'

ఈనాడు, దిల్లీ: అశాస్త్రీయంగా విభజించినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తోందని.. రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. నవనిర్మాణ దీక్షను పురస్కరించుకొని దిల్లీ ఏపీ భవన్‌లో అధికారులు, సిబ్బంది, స్థానిక తెలుగువారితో శనివారం ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దిల్లీలోని ఏపీ భవన్‌కు ఎంతో ప్రత్యేకత ఉందని దానిని మరింతగా పెంపొందించేందుకు నిబద్ధతతో కృషి చేయాలని సూచించారు. అదనపు రెసిడెంట్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి... ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ టి.సూర్యనారాయణ, ఏవో కె.లింగరాజు, లైజన్ ఆఫీసర్ కె.ఆనందరావు, వివిధ తెలుగు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అయిదేళ్ల చిన్నారిపై హత్యాచారం

పాప తండ్రి దుకాణంలో పనిచేసే వ్యక్తే నిందితుడు

ఫరీదాబాద్: అభంశుభం తెలియని అయిదేళ్ల వయసున్న పసిపాపపై అత్యాచారం చేసిన ఓ దుర్మార్గుడు ఆ తర్వాత ఆ చిన్నారిని కత్తితో పొడిచి చంపేసి. ...ఓ పెద్ద డబ్బాలో కుక్కి పెట్టేశాడు. అతడిని పోలీసులు అరెస్టు చేశారు. చిన్నారి తండ్రి మీద కక్షతో ఆ దుర్మార్గుడు ఈ అకృత్యానికి పాల్పడ్డాడు. ఇక్కడి అసోటీ గ్రామంలో గురువారం ఈ దారుణం జరిగింది. నిందితుడు భోలు అలియాస్ వీరేందర్ (24) ఆ పాప తండ్రి నడుపుతున్న టెంట్‌లు ఇతర సామగ్రి అద్దెకిచ్చే దుకాణంలోనే పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఏదో విషయమై ఆ దుకాణం యజమాని అయిన పాప తండ్రికి...భోలూకి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ కసిని మనసులో పెట్టుకున్న భోలూ గురువారం పాపను అపహరించాడు. తన ఇంటికి తీసుకెళ్లాడు. తర్వాత అదేరోజు రాత్రి భోలు ఈ దుర్మార్గానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈలోగా పాప కోసం తల్లిదండ్రులతో పాటూ గ్రామస్తులంతా కలిసి వెతికారు. చివరకు సీసీటీవీ ఫుటేజీ సాయంతో పాప ఏమైందో కనుక్కోగలిగారు. ఈ దారుణకృత్యంపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సంతృప్తి కోసమే విటమిన్ మాత్రలు!

ఒట్టావా: విటమిన్, మినరల్ మాత్రలు కేవలం సంతృప్తి కోసం తప్పితే... వాటితో పెద్దగా ప్రయోజనంగానీ, హానిగానీ ఉండదని తాజా అధ్యయనం తేల్చింది! టోరంటో విశ్వవిద్యాలయం, సెయింట్ మైఖేల్ ఆసుపత్రి పరిశోధకులు దీన్ని చేపట్టారు. జనవరి, 2012- అక్టోబరు, 2017 మధ్య... మల్టీవిటమిన్, విటమిన్-డి, కాల్షియం, విటమిన్-సి మాత్రలను వాడిన హృద్రోగుల ఆరోగ్య పరిస్థితిని వారు సమీక్షించారు. ఈ సప్లిమెంట్ల వల్ల వారికి ఎలాంటి ప్రయోజనం లేకపోయిందనీ.. గుండెపోటు, ముందస్తు మరణాలను నిలువరించలేకపోయాయని వారు విశ్లేషించారు. "ఈ మాత్రలతో ఎలాంటి ప్రమాదం లేదు. ప్రయోజనాలూ పెద్దగా ఉండవు. అయితే... ఫోలిక్ యాసిడ్; విటమిన్-బితో కూడిన ఫోలిక్ యాసిడ్ మాత్రలతో హృద్రోగ ముప్పు కొంత తగ్గుతుందని మాత్రం గమనించాం. ఔషధాలపై ఆధారపడటం కంటే- ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్లు, మినరల్స్‌ను భర్తీ చేసుకోవడం ఉత్తమం" అని పరిశోధనకు నేతృత్వం వహించిన డా.డేవిడ్ జెన్కిన్స్ చెప్పారు.

వినండి... వినండి... ఇక వినపడదండి!



వాషింగ్టన్: చాలామంది 30 ఏళ్లలోపు కుర్రాళ్లు నిత్యం భారీ శబ్దంతో సంగీతం వింటున్నారనీ... వీరికి భవిష్యత్తులో వినికిడి సమస్య వచ్చే ప్రమాదముందని అమెరికాలోని సెంట్రల్ మిడిల్‌సెక్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ పీడియాట్రిక్ ఆడియాలజిస్ట్, పరిశోధకుడు రాస్‌బిన్ సయీద్ అంటున్నారు. సెల్‌ఫోన్లు, హెడ్‌ఫోన్స్, ఇతరత్రా సౌండ్ పరికరాల ద్వారా "పెద్ద శబ్దంతో పాటలు వినడం.. జంబోజెట్ విమానశబ్దంతో సమానం. చెవి లోపలి శబ్దగ్రాహక అవయవం 'కోక్లియా' చాలా సున్నితమైనది. భారీ శబ్దాల వల్ల దీని పనితీరు దెబ్బతిని, వినికిడి సమస్య తలెత్తుతుంది. ఒక్క బ్రిటన్‌లోనే ప్రస్తుతం 11 మిలియన్ మంది యువత ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఇయర్ ఫోన్స్ పెట్టుకుని... హెచ్చుస్థాయిలో నిత్యం పాటలు వినేవారిలో 40% మందిని భవిష్యత్తులో వినికిడి సమస్య వేధించవచ్చు" అని హెచ్చరిస్తున్నారు సయీద్!

దంత సమస్యలు ఇక తూచ్!

లండన్: 'ఎనామిల్ పొర' దంతాలకు రక్షణ కవచం లాంటిది. ఒక్కసారి అది తొలగిపోయిందంటే... నొప్పి, సలుపులు ఎంతగా వేధిస్తాయో చెప్పలేం. పళ్లు కూడా పుచ్చిపోయే ప్రమాదముంటుంది. శరీరంలో అత్యంత గాఢమైన కణజాలం కూడా ఎనామిలే. క్వీన్‌మేరీ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు... సరికొత్త ఖనిజ పదార్థాన్ని తయారుచేశారు. దీనితో ఎముక భాగాలు, ఎనామిల్‌ను పునరాభివృద్ధి చేయవచ్చుట. ఆమ్లంతో కూడిన ఆహార పదార్థాలు, వేడివేడి పానీయాలను తాగితే... దంతాలపై ఉండే ఎనామిల్ కరిగిపోతుంది. ఫలితంగా దంత సమస్యలు తలెత్తుతాయి. అయితే, డా.షెరీఫ్ ఎల్షాక్రే బృందం... 'ప్రొటీన్ మ్యాట్రిక్స్'గా పిలిచే పదార్థాన్ని తయారుచేసింది. కాంటాక్టు లెన్స్ మాదిరి పారదర్శకంగా ఉండే ఈ పదార్థాన్ని దంతాలకు పూస్తారట. తర్వాత ఇది లాలాజలంలో సహజంగా లభించే కాల్షియం, ఫాస్ఫేట్‌ను గ్రహిస్తుందట. దీంతో దెబ్బతిన్న ఎనామిల్ మళ్లీ పునరాభివృద్ధి చెందుతుందని షెరీఫ్ వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది దంతరోగుల సమస్యలను చాలామటుకు మటుమాయం చేయడానికి ఈ సరికొత్త పదార్థం ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

దాహం తీర్చుతున్న 'ఆకాశగంగ'

- కొండలపై ఉండే రైల్వేస్టేషన్‌లో గాలి నుంచి నీరుతీసే యంత్రాలు
- ఒడిశాలోని రౌలీ స్టేషన్‌లో ఏర్పాటు



ఎత్తయిన కొండలపై ఉన్న రౌలీ రైల్వేస్టేషన్ ★ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆకాశగంగ యంత్రం

ఈనాడు, విశాఖపట్నం: కొండలపై ఉండే రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల దాహాన్ని తీర్చేందుకు గాలిలోని తేమ నుంచి మంచినీరు తీసే యంత్రాలను వినియోగిస్తున్నారు. ఒడిశాలోని రాయగడ జిల్లా రౌలీ రైల్వేస్టేషన్‌లో ఈ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో కొండలపై ఉండే మరికొన్ని రైల్వేస్టేషన్‌లోనూ వీటిని వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. వాల్తేరు రైల్వే డివిజన్‌లో ఓ చిన్న గ్రామం రౌలీ. సముద్ర మట్టానికి 970 మీటర్ల ఎత్తులో కొండల మీద రైల్వే స్టేషన్ ఉంది. తాగునీరు దొరకదు. కనీసం పైపు లైను వసతి కూడా లేదు. రౌలీ గ్రామం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటేనే 100 అడుగుల ఎత్తయిన కొండపైకి వెళ్లాలి. ఈ రైల్వేస్టేషన్‌లో తాగునీరు దొరకడం గగనమే. దీంతో వాల్తేరు డివిజన్ అధికారులు.. గాలిలో ఉన్న తేమ నుంచి మంచినీటిని తయారు చేసే యంత్రాన్ని ఇటీవల అక్కడ అమర్చారు. 'అట్మాస్పియరిక్ మాయిశ్చర్ ఎక్స్‌ట్రాక్టర్'గా పిలిచే ఈ యంత్రం ఖరీదు రూ.2.36 లక్షలు. గాలిలో 45శాతం కంటే ఎక్కువ తేమ ఉన్నప్పుడు ఈ యంత్రం గాలిని పీల్చుకుంటుంది. అందులోని కోల్డ్‌ఛాంబర్ తేమను వేడిచేసి నీటిని తీస్తుంది. గాలిలో తేమ 60 నుంచి 80 శాతం దాకా ఉండటంతో ఇలా రోజుకు 120 లీటర్ల శుద్ధిజలాన్ని అక్కడి ఉద్యోగులు, ప్రయాణికులకు ఈ యంత్రం అందిస్తోంది. దీంతో ఏళ్ల తరబడి మంచినీటికోసం ఇక్కడ పడుతున్న ప్రయాసలకు చక్కటి పరిష్కారం దొరికింది. ఈ యంత్రానికి రైల్వే అధికారులు 'ఆకాశగంగ' అని పేరుపెట్టారు.

అరకు స్టేషన్‌లోనూ...: అరకు, కిరండూల్-కొత్తవలస లైను, కిరండూల్-కోరాపుట్ లైన్లలోని ఇలాంటి 28 రైల్వేస్టేషన్లలో ఈ తరహా యంత్రాలు ఏర్పాటు చేసేందుకు వాల్తేరు డివిజన్ ముందుకొచ్చినట్లు సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సీహెచ్.విష్ణుమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

సామర్లకోట, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట ఉండూరు ఏడీబీ రోడ్డులోని రైల్వే వంతెన సమీపంలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను ట్యాంకర్ ఢీకొనడంతో ఆటోడ్రైవర్‌తోపాటు ఒకే కుటుంబానికి చెందిన మహిళ, ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం యానాది కాలనీకి చెందిన ఆరుగురు కుటుంబసభ్యులు తూ.గో. జిల్లా కాకినాడలోని రాయుడుపాలెంలో బంధువుల ఇంటికి వచ్చారు. శనివారం జన్మభూమి రైలు దిగి సామర్లకోట రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో ఉండూరు ఏడీబీ రోడ్డు మీదుగా బయలుదేరారు. వంతెన దాటాక అచ్చంపేట నుంచి సామర్లకోట వైపు వస్తున్న ట్యాంకర్ ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టి తర్వాత దాని వెనుక వస్తున్న ఆటోను ఢీకొని కొంతదూరం వరకు ఈడ్చుకుంటూ పోయింది. ఆటోలో డ్రైవరుతో కలిపి మొత్తం ఏడుగురున్నారు. వీరిలో ముగ్గురు చిన్నారులున్నారు. ప్రమాదంలో ఏడేళ్ల చిన్నారి, పదేళ్ల బాలుడు, అమీనబీ (60) అనే మహిళ, సామర్లకోట గణేష్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ర్యాలి సుబ్బారావు(50) అక్కడిక్కడే మృతి చెందారు. మరో చిన్నారి యాస్మిన్ (5), షేక్ రెహ్మత్ బీ (35), మహ్మద్ ఉన్నీషా(40), ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కాకినాడకు చెందిన ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.

షిల్లాంగ్‌లో ఘర్షణలు

షిల్లాంగ్: ఘర్షణలతో అట్టుడుకుతున్న షిల్లాంగ్ (మేఘాలయ)లో హింస చెలరేగడంతో నగర ఎస్పీ స్టీఫెన్ రింజా, కొందరు పోలీసులు సహా 10 మంది వరకు గాయపడ్డారు. శుక్రవారం రాత్రంతా అల్లర్లు కొనసాగాయి. గుంపుగా వచ్చిన కొందరు ఓ దుకాణాన్ని, ఇంటిని తగులబెట్టి.. 5 వాహనాలపై దాడికి పాల్పడ్డారు. మోట్‌ఫ్రాన్ ప్రాంతంలోపోలీసులపై రాళ్లు రువ్వారు.

ఈనాడు - హైదరాబాద్

ఏపీవన్నీ అబద్ధాలే..

- విద్యుత్తు సంస్థలకు ఐబీసీ వర్తించదు
- ఎన్‌సీఎల్‌టీలో తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థల కౌంటర్లు

ఆంధ్రప్రదేశ్ విద్యుదుత్పత్తి సంస్థ (ఏపీజెన్‌కో) జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు వాస్తవాలు చెప్పడంలేదని తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలైన టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లు పేర్కొన్నాయి. కేవలం తాము చెల్లించాల్సిన సొమ్ము గురించి చెబుతున్న జెన్‌కో.. అది తెలంగాణకు చెల్లించాల్సిన సొమ్ము గురించి ప్రస్తావించడం లేదని పేర్కొంది. టీఎస్ఎస్పీడీసీఎల్ రూ. 4,044.72 కోట్లు, టీఎస్ఎన్‌పీడీసీఎల్ రూ. 1,688.13 కోట్ల బకాయిలు చెల్లించడంలేదని, వాటి దివాలా ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ ఏపీ జెన్‌కో గత నెల ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్‌లో వేర్వేరుగా దరఖాస్తులు చేసిన విషయం విదితమే. దీనిపై విచారించిన ట్రైబ్యునల్ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలు శుక్రవారం వేర్వేరుగా కౌంటర్లు దాఖలు చేశాయి. ఏపీ విద్యుత్తు సంస్థలు తెలంగాణ విద్యుత్తు సంస్థలకు రూ. 2,137 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో చేసిన అప్పునకు సంబంధించి వడ్డీ చెల్లింపులో ఏపీ జెన్‌కో వాటాకుగాను రూ. 1,325 కోట్లు వడ్డీ కింద తామే చెల్లించామన్నాయి. ఈ మొత్తం ఏపీ సంస్థలు తిరిగి చెల్లించాల్సి ఉందన్నాయి. అప్పులోని అసలు వాటా తమకు రావాల్సి ఉందని తెలిపాయి. అసలు సొమ్ములో వాటాల మదింపు ఇంకా తేలలేదని, ఈ వివాదం రెండు రాష్ట్రాల విద్యుత్తు పంపిణీ సంస్థల మధ్య పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసీ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించిందని ఆక్షేపించాయి. పీఎఫ్ ట్రస్ట్ ఫండ్, పెన్షన్, గ్రాట్యుటీలకు సంబంధించి రూ. 1,771 కోట్లు ఏపీ జెన్‌కో నుంచి రావాల్సి ఉందని పేర్కొన్నాయి. జెన్‌కో చెల్లించాల్సిన సొమ్ము గురించి చెప్పకుండా కేవలం తాము ఇవ్వాల్సిన మొత్తాల గురించే ప్రస్తావించం సరికాదన్నాయి. అలాగే బకాయిల వివాదం నిపుణుల కమిటీ ముందు ఉందని తెలిపాయి. కమిటీలో వివాదం పెండింగ్‌లో ఉండగానే ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడం సరికాదన్నాయి. ఈ వివాదాన్ని దివాలా కోడ్ కింద ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడానికి వీల్లేదన్నాయి. ఇలాంటి వివాదాన్ని తేల్చుకోడానికి రాష్ట్ర ఎలక్ట్రిసిటీ చట్టం ప్రకారం రెగ్యులేటరీ కమిషన్ సరైన వేదిక అని, అందులోనే పరిష్కరించుకోవాల్సి ఉందని పేర్కొన్నాయి. ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యక్తిగత ప్రయోజనాలతో దరఖాస్తు దాఖలు చేసిందని ఆరోపించాయి. ప్రజాప్రయోజనాలకు సంబంధించిన సంస్థల వ్యవహారంలో దివాలా కోడ్ వర్తిస్తుందో లేదో కూడా తేలాల్సి ఉందని తెలిపాయి. ఏపీ దరఖాస్తును ట్రైబ్యునల్ ఆమోదిస్తే తెలంగాణ ప్రజలకు, సంస్థలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నాయి. రాష్ట్రానికి ఆర్థికంగా కూడా భారీ నష్టం వాటిల్లుతుందని, అందువల్ల దాన్ని కొట్టివేయాలని కోరింది. ఈ పిటిషన్‌లపై తదుపరి విచారణ ఈనెల 8న జరగనుంది.

దక్షిణ మధ్య రైల్వే మీదుగా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్

ఈనాడు, హైదరాబాద్: కోల్‌కతా-చెన్నైల మధ్య అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ ఆమోదం తెలిపిందని దక్షిణ మధ్య రైల్వే శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. వారానికి ఒకరోజు నడిచే ఈ రైలును ఈ నెల 4న రైల్వేశాఖ మంత్రి ప్రారంభిస్తారు. చెన్నై నుంచి ప్రయాణికులకు ఈ రైలు(నెం.22842) 6వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుంది. 11వ తేదీ నుంచి సంత్రగాచి(కోల్‌కతా) స్టేషన్ నుంచి అందుబాటులోకి వస్తుంది. ఎక్స్‌ప్రెస్ వేగంతో ప్రయాణించే ఈ రైలులో మొత్తం 16 జనరల్ బోగీలే ఉంటాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్ మీదుగా ప్రయాణించే ఈ రైలు పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, విశాఖపట్నం, సూళ్లూరుపేట స్టేషన్లలో ఆగనుంది.

INTER : MEC/CEC - 06 June
B.Com+CMA(ICWA) - 18 June
CMA(ICWA) INTER / FINAL - 20 June
MODERN ACADEMY
• MEC • CEC • B.Com (Hons, Tax, Comp) • BBA • CMA • CA
VIJAYAWADA. Cell : 94401 90494

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 4-6-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 295

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కొందరికి కీమో అవసరంలేదు

■ రొమ్ము క్యాన్సర్ రోగులకు శుభవార్త

రొమ్ము క్యాన్సర్ మొదటి దశలో ఉన్న వారిలో కొందరు కీమోథెరపీ ఇబ్బందులను తప్పించుకోవచ్చు. వారికి ఈ చికిత్స విధానం అవసరంలేదని తాజా అధ్యయనం నిర్ధరించింది. ఫలితంగా వారు ఈ కీమోథెరపీ మందులతో తలెత్తే దుష్ప్రభావాలను, ఖరీదైన ఆ ఔషధాల ఆర్థిక భారాన్ని మోయాల్సిన అవసరం ఉండదు.

16లో

లావెక్కింతయూ రాదు

■ ఆకలి తగ్గించే ఔషధం వస్తోంది...

తినకపోతే ఆకలి.. తింటే లావెక్కడం.. మరేం చేయాలి? ఊబకాయులకు ఇదే పెద్ద ప్రశ్న. వారికి శుభవార్త ఇది.. ఆకలిని నిరోధించడం ద్వారా బరువు తగ్గడంలో వారికి దోహదపడగల సరికొత్త ఔషధాన్ని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. ఈ ఔషధం ఆకలిని తగ్గిస్తుందని వెల్లడించారు.

16లో

ఆపుకోవాలన్నా ఆగదు

■ పెరుగుతున్న పేగుపూత వ్యాధులు

పేగుపూత వ్యాధుల సమస్య పెరుగుతోంది. అత్యవసరంగా మరుగుకు వెళ్లాల్సిన దుస్థితి తలెత్తుతోంది. ఇదంతా పెద్దవారిలో కాదు. యువతలోనే ఎక్కువగా కనిపిస్తుండటం గమనార్హం. కడుపు ఉబ్బరం.. నులిపెట్టి తిప్పినట్లు అనిపించటం.. ఏమాత్రం ఆపుకోలేని.. ఆలస్యం చేయలేని దుస్థితి. ఎందుకిలా?

6లో

ఖండాంతర అగ్ని

పరీక్ష విజయవంతం

- ఆరు నెలల వ్యవధిలో ఇది రెండో ప్రయోగం
- మరో పరీక్ష తర్వాత సైన్యం చేతికి క్షిపణి
- చైనా కదలికలతో జోరు పెంచిన భారత్!

బాలాసోర్

చైనా గుండెల్లో గుబులు పుట్టిస్తూ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అగ్ని-5ను భారత్ ఆదివారం విజయవంతంగా పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఈ అణ్వస్త్ర సామర్థ్య దీర్ఘశ్రేణి అస్త్రం.. 5వేల కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లి, శత్రు లక్ష్యాలను నాశనం చేయగలదు. చైనా మొత్తం దీని పరిధిలోకి వస్తుంది. ఈ అధునాతన క్షిపణిని పరీక్షించడం ఇది ఆరోసారి. దీన్ని సైన్యం చేతికి అప్పగించే (మిగతా 2లో)

అగ్ని-5 వివరాలివీ..

పరిధి: 5 వేల కిలోమీటర్లు
పొడవు: 17 మీటర్లు, వ్యాసం: 2 మీటర్లు
పేలోడ్: 1.5 టన్నులు, దశలు: మూడు
ఇంధనం: ఘన
లక్ష్యాలు: ఆసియా మొత్తం; ఆఫ్రికా, ఐరోపాలోని కొన్ని భాగాలు

ధైర్యముంటే ఎన్నికలకు రండి

- రాజీనామాలు చేసిన వైకాపా ఎంపీలకు చంద్రబాబు సవాల్
- కేంద్రంలో భాజపా రాదు... ప్రాంతీయ పార్టీలదే హవా
- 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ అడ్రస్ గల్లంతు కావాలని పిలుపు
- హోదాపై కేంద్రంతో పోరాడాలని పవన్‌కు హితవు
- కర్నూలు నవనిర్మాణ దీక్షలో నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు డిజిటల్ - కర్నూలు

కర్నూలు జిల్లా జొన్నగిరిలో చిన్నారిని ఎత్తుకుని గ్రామస్థులతో ముచ్చటిస్తున్న ముఖ్యమంత్రి

'భాజపాకు ఎన్ని ఓట్లు వస్తాయో? మీకు (వైకాపా) ఎన్ని ఓట్లు వస్తాయో? తేల్చాల్సింది ఎన్నికలే. వీటితోనే 2019 ఎన్నికల ఫలితాలు నిర్ణయమవుతాయి. నేను సవాల్ చేస్తున్నా. మేం పోటీ పెడతాం. మీకు ధైర్యముంటే ఎన్నికలకు రండి...' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నవనిర్మాణ దీక్షలో భాగంగా కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా వైకాపా ఎంపీల రాజీనామా వ్యవహారాన్ని ప్రస్తావించారు. 'మీ కుట్రలు.. కుతంత్రాలు బయటపడాలంటే ఎన్నికలు రావాలి. సంవత్సరానికే ఎన్నికలు రావు. రేపు, ఎల్లుండి ఆమోదానికి పిలుస్తారంటూ ఎవరి చెవిలో పువ్వు పెడతారు. వైకాపాకు ఎన్నికలంటే భయం. ఎక్కడ ఓడిపోతారో అని డ్రామాలాడుతూ రాజీనామాలు చేసినా ఎన్నికలు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. వాళ్లా నీతి గురించి మాట్లాడేది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 25 సీట్లకు 25 సీట్లు తెదేపా గెలవడం ద్వారా వైకాపా అడ్రస్సు గల్లంతు కావాలి. భాజపా కుట్రలో పాత్రధారులను.. సూత్రధారులను చిత్తు చిత్తుగా ఓడించాలి...' అని సీఎం పిలుపునిచ్చారు. కేంద్రంపై పోరాడుతూ తాను నవనిర్మాణ దీక్ష చేపడుతుంటే, కేంద్రానికి సహకరించడానికి వైకాపా వంచన దీక్ష చేస్తోందని, దీనిపై మీరు ఒప్పుకుంటారా తమ్ముళ్లు...' అంటూ ప్రశ్నించారు. మొన్ననే 11 శాసనసభ, నాలుగు లోక్‌సభ ఎన్నికలు రాగా... అందులో భాజపా ఒక్కొక్కటే గెలిచిందన్నారు.

కేంద్రంలో భాజపా రాదు. ప్రాంతీయ పార్టీలదే హవా. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఎవరొచ్చినా ప్రత్యేకహోదాతో పాటు అన్నీ (మిగతా 2లో)

కరవు రహిత రాష్ట్రంగా మారుస్తా

14 లో

- నీటి సంరక్షణ అందరి బాధ్యత
- ముఖ్యమంత్రి చంద్రబాబు

స్మార్ట్ రహదారులు

- సకల వసతులతో విశాలంగా..
- 9, 6 వరుసలుగా నిర్మాణం
- రాజధానిలో వేగంగా పనులు

ఈనాడు - అమరావతి

రాజధానిలో ప్రధాన రహదారులను సకల సౌకర్యాలతో 'స్మార్ట్'గా తీర్చిదిద్దుతున్నారు. అన్ని వసతులతో సమీకృత 'స్మార్ట్ రోడ్లు'గా నిర్మిస్తున్నారు. పచ్చదనం విరబూసేలా, భవిష్యత్తు అవసరాలను తీర్చేలా ఇవి ఉండబోతున్నాయి. అత్యంత వేగంగా నిర్మాణమవుతున్న ఈ రోడ్లలో మళ్లీ మళ్లీ తవ్వకుండా చర్యలు చేపడుతున్నారు. నీటి సరఫరా పైప్‌లైన్లు, కమ్యూనికేషన్ కేబుళ్లు, విద్యుత్ సరఫరా లైన్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ.. ఇలా సమస్తం రహదారుల నిర్మాణంలో భాగంగానే ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం ప్రత్యేక డక్టులు నిర్మిస్తున్నారు. అమరావతిలో మొత్తం 34 ప్రధాన, ఉపప్రధాన రహదారులున్నాయి. వీటి మొత్తం పొడవు 320 కి.మీ.లు. వీటిలో 238 కి.మీ.ల పొడవైన 24 రహదారుల పనులు ఇప్పటికే మొదలయ్యాయి. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాజధానిలోని ప్రధాన రహదారుల్లో తూర్పు నుంచి పడమరకు వెళ్లేవి 16 (మొత్తం పొడవు 150 కి.మీ.), ఉత్తరం నుంచి దక్షిణానికి వెళ్లేవి 18 (మొత్తం పొడవు 170 కి.మీ.) ఉన్నాయి. ప్రధాన (మిగతా 2లో)

ప్రత్యేకతలు..

ప్రతి రహదారికి సైకిల్ ట్రాక్‌లు, నడకదారుల కోసం కేటాయించిన ప్రాంతం కిందుగా వివిధ అవసరాల కోసం పైప్‌లైన్లు, డక్టులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, గ్యాస్ పైప్‌లైన్లు, మురుగు నీటిని శుద్ధి చేశాక పునర్వినియోగానికి సరఫరా చేసే పైప్‌లైన్లు, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, కమ్యూనికేషన్, విద్యుత్ కేబుళ్ల కోసం ప్రత్యేక డక్టులు, భవిష్యత్తులో డిస్ట్రిక్ట్ కూలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఆ పైప్‌లైన్లు వెళ్లేందుకు డక్టులు నిర్మిస్తున్నారు. హైవోల్టేజీ విద్యుత్ లైన్లు వెళ్లేచోట రహదారి మధ్యలో విడిగా డక్టు నిర్మిస్తున్నారు. నడక దారికి, సైకిల్ ట్రాక్‌కు మధ్యలో చెట్లు ఉంటాయి.

బుడతలకు పండగే

- ఒకటి, రెండో తరగతుల చిన్నారులకు హోంవర్క్ లేకుండా పార్లమెంటులో బిల్లు 6లో
- కేంద్ర మంత్రి జావడేకర్ వెల్లడి

సుష్మా ప్రయాణిస్తున్న విమానం 14 నిమిషాల పాటు గల్లంతు!

5లో

ఎర్ర స్మగ్లర్ల అక్రమాస్తులు ప్రభుత్వ పరం

- విధివిధానాలు ఖరారు చేసిన అటవీశాఖ
- అమలుకు అవసరమైన వ్యవస్థల ఏర్పాటుపై దృష్టి
- సిద్ధమవుతున్న నిందితుల జాబితా

ఈనాడు, అమరావతి, కడప: ఎర్రచందనాన్ని కొల్లగొట్టి రూ.కోట్లకు పడగలెత్తిన స్మగ్లర్ల అక్రమాస్తులను స్వాధీనం చేసుకునే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందుకు అనుసరించాల్సిన విధివిధానాలను కూడా ఇటీవల ఖరారు చేసింది. వాటిని అమలు చేసేందుకు అవసరమైన వ్యవస్థల ఏర్పాటుపై ప్రస్తుతం దృష్టిసారించింది. ఎర్ర స్మగ్లర్లను అరెస్టు చేసి పీడీ చట్టం కింద నిర్బంధిస్తున్నా....వారు అప్పటికే ఆర్జించిన సొమ్ముతో తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా స్మగ్లింగ్ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. అందువల్ల వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి ఆస్తుల జప్తే సరైన మార్గమని అటవీ, పోలీసు శాఖలు భావిస్తున్నాయి. ఇందుకోసం అటవీ చట్టానికి సవరణలు తీసుకొచ్చాయి. ఈ చట్టం అమల్లోకి వచ్చి రెండేళ్లు గడిచినా అందుకు అనుసరించాల్సిన విధివిధానాలు ఖరారు కాకపోవడంతో ఆచరణ రూపం దాల్చలేదు. గత జనవరిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో...ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో (మిగతా 2లో)

ఆంధ్రా ఒడికి.. పెట్టుబడి

3 ఏళ్లలో రూ.లక్ష కోట్ల విలువైన ఒప్పందాలు

- ఇప్పటికే రూ.24,901 కోట్లతో పరిశ్రమల స్థాపన
- అన్నీ ఆచరణకు వస్తే 2 లక్షల మందికిపైగా ఉపాధి

ఈనాడు - అమరావతి

రాష్ట్ర పారిశ్రామికరంగంలో విదేశీ పెట్టుబడులు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ తాజా నివేదిక ప్రకారం విదేశీ సంస్థలు రూ.1,00,141 కోట్లతో 55 పరిశ్రమల స్థాపనకు చేసుకున్న ఒప్పందాల్లో 65 శాతానికిపైగా ఆచరణకు నోచుకున్నాయి. మిగతా 35 శాతం వివిధ దశల్లో ఉన్నాయి. విదేశీ పెట్టుబడులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికిపైగా ఉపాధి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా అనంతపురం, చిత్తూరు, విశాఖపట్నంలో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, సౌర, పవన విద్యుత్తురంగాల్లో ఎక్కువగా విదేశీసంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి.

ఉపాధి మార్గం..

★ రాష్ట్రంలో 30విదేశీ సంస్థలు రూ.24,901 కోట్ల పెట్టుబడులు పెట్టి ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయి. వీటిలో 33,904 మందికి ఉపాధి లభిస్తోంది. ముఖ్యమంత్రి చైనా పర్యటనలో ఒప్పందం చేసుకున్న ఫాక్స్‌కాన్, హెంగ్‌జౌ హాటాంగ్, సాఫ్ట్ బ్యాంకు ఎస్‌బీజీ క్లీన్‌టెక్, దావోస్ పర్యటనలో ఒప్పందం చేసుకున్న సుజ్‌లోన్ ఎనర్జీ, గమేషా రినవబుల్, అమెరికా పర్యటనలో ముందుకొచ్చిన పై డేటా సెంటర్‌తోసాటు ఇతర దేశాలకు చెందిన సన్ ఎడిషన్, పెప్సీ, మాండెలెజ్, హాస్పిరా తదితర సంస్థలు వీటిలో ఉన్నాయి.

★ మరో 18 విదేశీ సంస్థల ఆధ్వర్యంలో రూ.30,195 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు (మిగతా 2లో)

విదేశీ సంస్థలను ఆకర్షిస్తున్న అంశాలు..

★ ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో పరిశ్రమల ఏర్పాటుకు భూములను అభివృద్ధి చేసి సిద్ధం చేయడం.
★ 24 గంటలూ విద్యుత్తు, నీటి సదుపాయం, రోడ్డు, జల, వాయురవాణా మార్గాలు అందుబాటులో ఉండటం.
★ ఏక గవాక్ష విధానంలో 21 రోజుల్లో ప్రభుత్వశాఖల నుంచి ఆన్‌లైన్‌లో అనుమతులిచ్చేలా చర్యలు, ఇతర రాయితీలు.

ఇదీ సంగతి!

పొత్తు ఖరారు చేయటానికి మాయావతి స్వయంగా వచ్చారు, సీట్ల సర్దుబాటు చర్చలకు దీన్ని పంపించారు సార్.

ఆప్షన్లు పెట్టింది 51 శాతమే

- ఎంసెట్‌లో కంప్యూటర్‌సైన్సుకే అత్యధికమంది మొగ్గు
- 5న సీట్ల కేటాయింపు

ఈనాడు - అమరావతి

ఏపీఎంసెట్(ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన, ఆప్షన్ల నమోదు, మార్పునకు ఆదివారంతో గడువు ముగిసింది. మొదటి విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు మంగళవారం(5వ తేదీన) చేయనున్నారు. ఆప్షన్ల నమోదులో ఎక్కువ మంది కంప్యూటర్ సైన్సుకే మొగ్గుచూపారు. రెండో ప్రాధాన్యంగా ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్‌ను ఎంచుకున్నారు.

ఎంసెట్‌లో 1,90,992మంది అర్హత సాధించగా ఇంటర్ ఉత్తీర్ణత సాధించకపోవడం, మార్కుల వివరాలు అందకపోవడంతో 1,26,197మంది ర్యాంకులు ప్రకటించారు. ఇటీవల సీబీఎస్ఈ పరీక్షల ఫలితాలు రావడంతో తాజాగా 1,730మంది ర్యాంకులను వెల్లడించారు. దీంతో మొత్తం ర్యాంకుల ప్రకటన 1,27,927కు చేరింది. వీరిలో 66,995మంది ప్రాసెసింగ్ రుసుము చెల్లించారు. ఆప్షన్ల నమోదుకు 66,098మంది పాస్‌వర్డ్‌ను సృష్టించుకోగా.. ఆదివారం సాయంత్రం 5.30గంటలకు వీరిలో 65,546మంది మాత్రమే ఆప్షన్లు ఇచ్చారు. ఉత్తమ ర్యాంకర్లు దూరంగా ఉన్నందున వెనుక వరసలో ఉన్న విద్యార్థులకు ప్రయోజనం పొందనున్నారు. తొలి వంద

ర్యాంకర్లలో ముగ్గురు మాత్రమే ఆప్షన్లు ఇచ్చారు. 2001-5వేలు ర్యాంకులోపులో కేవలం 1531మంది మాత్రమే తమ బ్రాంచిలను ఎంచుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు అవకాశం ఉన్నందున ఈ సంఖ్యలో స్వల్పంగా మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇంజినీరింగ్ పరీక్ష ద్వారా ఉత్తమ ర్యాంకుల్ని సాధించిన వారిలో ఎక్కువ మంది జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచినవారే ఉంటున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి ఆ విద్యార్థులు ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు దూరంగా ఉన్నారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు చెందిన ఇంజినీరింగ్ కళాశాలలోల ప్రవేశాల్ని పొందేందుకు ఉత్తమ ర్యాంకర్లు ప్రాధాన్యమిస్తారు. వీరి తర్వాతే వెనుక వరసలో ఉన్న విద్యార్థులకు సీట్లు లభిస్తాయి. 5వేలలోపు ర్యాంకర్లలో 2,090మాత్రమే ప్రవేశాలకు ఆసక్తి చూపారు. దీంతో వెనుకవరసలో (మిగతా 2లో)

ధైర్యముంటే ఎన్నికలకు రండి

రాష్ట్రంలో 5 లక్షల పంటకుంటలు పూర్తి చేసిన సందర్భంగా జొన్నగిరిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం చంద్రబాబునాయుడు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటాం. ఇంతకు ముందు తెదేపా చక్రం తిప్పింది. భవిష్యత్తులో కూడా దేశ రాజకీయాల్లో మార్పు కోసం కృషి చేస్తుంది. కేంద్రం నుంచి నిధులు వచ్చే పరిస్థితి లేదు. జీఎస్టీ వల్ల ఇబ్బందులు వచ్చాయి. న్యాయం కోసం పోరాడుతున్నాం. భాజపా కుట్రలు చేస్తోంది. అందుకే నమ్మక ద్రోహం... కుట్ర రాజకీయాలపై ధర్మ పోరాటానికి దిగాను. మహా కుట్రలో భాగంగా అందరినీ రెచ్చగొడుతూ రాష్ట్రాన్ని అతలాకుతలం చేయడానికి, అభద్రత, అస్థిరత్వాన్ని సృష్టించాలని చూస్తున్నారు. రమణదీక్షితులతో వెంకటేశ్వరస్వామి జోలికి వెళ్లారు. పురావస్తుశాఖ ద్వారా కేంద్రం శ్రీవారి దేవాలయాన్ని తీసుకోవాలని చూస్తోంది. వెంకటేశ్వరస్వామి అలాంటి వారిని వదిలిపెట్టడు.

పవన్ రాజకీయం చేస్తున్నారు

నా 40 ఏళ్ల అనుభవంతో ఇసుక ఎక్కడెక్కడో అమ్ముకోవడానికి పనిచేస్తున్నానని పవన్‌కళ్యాణ్ అంటున్నారు. ఇసుక కావాల్సిన వారికి ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వానికి వచ్చే రూ.500-600 కోట్లను వదులుకున్నాం. ఎవరైనా ఎక్కడైనా అడ్డుపడితే తిరగబడి ఉచితంగా తీసుకెళ్లమంటున్నాం. అంతేకానీ తెలుగుదేశం ప్రభుత్వం ఇసుక దోపిడీ చేస్తోందని తప్పుడు ప్రచారం చేస్తామంటే కుదరదు. మీ దగ్గర ఆ శక్తి ఉంది... మనుషులను పెట్టి ఎక్కడైనా.. ఎవరైనా తప్పు చేస్తే ఎదిరిస్తే... నేను సహకరిస్తా. అంతేకానీ రాజకీయం చేయవద్దు. నీతివంతమైన సుపరిపాలన ఇస్తూ... సాంకేతిక సహకారంతో దేశంలోనే నెంబర్‌వన్‌గా రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే మాపై నిందలేస్తారా? ప్రత్యేక హోదాపై వీలైతే పవన్ భాజపాతో మాట్లాడాలి. కేంద్రంపై పోరాడాలి. ఇవన్నీ చూస్తుంటే ఓ వైపు ఆవేదన..మరో వైపు బాధ వేస్తుంది. రాష్ట్ర రాజకీయాలను ప్రజలు ఎప్పటికప్పుడు అర్థం చేసుకోవాలి. 2004లో తెదేపా ఓడిన తర్వాత చాలా ఇబ్బందులు పడ్డాం. అదే 2014లో రాష్ట్ర విభజనకు దారి తీసింది. మళ్లీ తెదేపా ప్రభుత్వం కొనసాగితే అన్ని కార్యక్రమాలు సజావుగా సాగుతాయి...' అని చంద్రబాబు వెల్లడించారు. ధనిక రాష్ట్రాలు ఇవ్వని విధంగా డిగ్రీ చదివిన నిరుద్యోగులకు రూ.వెయ్యి నిరుద్యోగభృతి ఇస్తున్నానని, అదీ వారిపై తనకున్న అభిమానమని చెప్పారు.

పోలవరం జోలికొస్తే ప్రజలు క్షమించరు

'దేశంలో నదుల అనుసంధానం చేసిన ఘనత తెదేపాదే. ఎన్డీయే మాటలు చెబితే.... చేతల్లో చేసి చూపించిన ప్రభుత్వం మనది. గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం తరహానే భవిష్యత్తులో డెల్టాను అనుసంధానం చేస్తాం. పోలవరం ఆంధ్ర ప్రజల జీవనాడి. కల్పతరువు. ఎవరు అడ్డుపడినా పోలవరం ఆగడానికి వీల్లేదు. రూ. 3,500 కోట్లు ఇంకా రావాల్సి ఉంది. కేంద్రం ఇవ్వలేదు. జాతీయ ప్రాజెక్టుగా పెట్టి... ఆర్ అండ్ ఆర్, భూసేకరణకు అయ్యే ఖర్చులు ఇస్తామన్నారు. అనేక ఇబ్బందులు సృష్టిస్తున్నారు. వైకాపా, పవన్, భాజపాలు ఈ ప్రాజెక్టు జోలికి వచ్చి అడ్డుపడితే ఆంధ్ర ప్రజానీకం క్షమించదు...' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు పెట్టినా పోలవరం పూర్తి చేస్తామని, ఇప్పటికే 55 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఈనెల 11న భూగర్భ జలాశయాన్ని, డ్యామ్‌ను పూర్తి చేస్తున్నామని వెల్లడించారు.

కర్నూలుజిల్లా జొన్నగిరిలో మహిళలతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

48,481 కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

- రెండో రోజు నవ నిర్మాణ దీక్షకు 19 లక్షల మంది హాజరు
- నేడు వ్యవసాయం-అనుబంధ రంగాలపై కార్యక్రమాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: నవ నిర్మాణ దీక్ష రెండో రోజు కార్యక్రమాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 19 లక్షల మందికి పైగా పాల్గొన్నారు. 48,481 మందికి కొత్తగా రేషన్ కార్డులు, 36,572 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయి. 'నీటి భద్రత- కరవు రహిత రాష్ట్రం' అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా 9876 గ్రామ సభల్లో చర్చా కార్యక్రమాలు జరిగినట్లు ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందింది. నీరు-చెట్టు, నీరు-ప్రగతి, చెక్‌డ్యామ్‌లు, పంట కుంటలు, నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టు, ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, భూగర్భ జలాల సంరక్షణ, తాగునీరు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించేలా కార్యక్రమాలు సాగాయి. వివిధ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించి 3810 శంకుస్థాపనలు, 8917 చోట్ల ప్రారంభోత్సవాలు, 3450 ప్రదర్శనలు జరిగాయి. ప్రజా సాధికార సర్వేలో తమ పేర్లు నమోదు చేయించాలని 6770 మంది నుంచి అభ్యర్థనలు వచ్చాయి. 3.86 లక్షల మందికి అధికారులు పింఛన్లు అందించారు. గ్రామ సభల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నవ నిర్మాణ దీక్ష మూడోరోజైన సోమవారం 'వ్యవసాయం- అనుబంధ రంగాల' పై గ్రామ సభలు, గ్రామదర్శిని కార్యక్రమాలు జరగనున్నాయి.

ఆరు నెలల్లో రాజధాని నిర్మాణాలకు రూపు తేవాలి

ఈనాడు, అమరావతి: రాజధానిలో భారీ నిర్మాణాలకు ఆరు నెలల్లోగా ఒక రూపు తెచ్చేలా పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించినట్లు ఇంధన, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పనులు జాప్యం జరగడానికి వీల్లేదని..గడువు నిర్దేశించుకుని దానికనుగుణంగా నెలవారీ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించినట్లు పేర్కొంది. వర్షాకాలంలోనూ పనులు కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించినట్లు వివరించింది. ఈ ఏడాది అక్టోబరు నాటికి ఉద్యోగులు, మంత్రుల నివాస సముదాయాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఆర్‌డీఏ కమిషనర్ సీహెచ్. శ్రీధర్ సీఎంకు వివరించారని వెల్లడించింది.

ఐఎస్ఎస్ నుంచి భూమికి చేరిన ముగ్గురు వ్యోమగాములు

కజికిస్థాన్: 168 రోజులుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో గడిపిన ముగ్గురు వ్యోమగాములు ఆదివారం క్షేమంగా కజికిస్థాన్‌లో దిగారు. రష్యాకు చెందిన ఆంటోన్ షెకప్లెరోవ్, అమెరికాకు చెందిన స్కాట్ టింగల్, జపాన్ జాతీయుడు నోరిషిగి కనాయ్‌ల స్థానంలో మరో ముగ్గురు బుధవారం ఐఎస్ఎస్‌కు పయనమవుతారు. ప్రస్తుతం ముగ్గురు వ్యోమగాములుమాత్రమే ఐఎస్ఎస్‌లో ఉన్నారు.

జపాన్ వ్యోమగామ నొరిషిగే కనాయ్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది

ఆప్షన్లు పెట్టింది 51 శాతమే

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న వారికి విశ్వవిద్యాలయాల కళాశాలల్లో సీట్లు లభించే పరిస్థితి నెలకొంది. గతేడాది ఎంసెట్‌లో అర్హత సాధించిన వారి సంఖ్య 1,45,254 కాగా వీరిలో మొదటి విడత కౌన్సెలింగ్‌లో 74,194మంది ఆప్షన్ల నమోదుకు చేసుకున్నారు.

ర్యాంకుల వారీగా ఆప్షన్లు ఇచ్చిన విద్యార్థులు..

ర్యాంకులు	ఆప్షన్లు ఇచ్చినవారు
1-100	3
101-200	7
201-300	8
301-400	15
401-500	14
501-600	23
601-700	24
701-800	25
801-900	22
901-1000	34
1001-1500	170
1501-2000	214
2001-5000	1531

బ్రాంచిల వారీగా విద్యార్థుల ఎంపిక

బ్రాంచి	మొదటి ఆప్షను ఇచ్చినవారు	రెండోఆప్షను
కంప్యూటర్‌సైన్సు	29,688	21,511
ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్	17,219	23,579
మెకానికల్	6,759	6,147
సివిల్	5,330	4,888
ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్	3,512	5,241
ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ	538	1600
అగ్రికల్చర్	477	286
కెమికల్	363	279
పెట్రోలియం ఇంజినీరింగ్ టెక్నాలజీ	92	75

ఖండాంతర అగ్ని

(మొదటి పేజీ తరువాయి)

దిశగా మరో ముందడుగు పడింది.

బంగాళాఖాతంలోని అబ్దుల్ కలాం దీవిలో ఉన్న నాలుగో లాంచ్ ప్యాడ్ నుంచి ఉదయం 9.48 గంటలకు అగ్ని-5 క్షిపణి దూసుకెళ్లింది. ఈ ప్రయోగంలో నిర్దేశిత పూర్తి దూరాన్ని ఈ అస్త్రం ప్రయాణించింది. దీని పనితీరును రాడార్లు, ట్రాకింగ్ సాధనాలు, పరిశీలన కేంద్రాలు ఆసాంతం పరిశీలించాయి. ఎప్పటికప్పుడు వివరాలను శాస్త్రవేత్తలకు అందజేశాయి. సముద్రంలో లక్ష్యంగా నిర్దేశించిన ఒక ప్రాంతాన్ని ఈ క్షిపణి తాకింది. అక్కడ, మార్గమధ్యంలో మోహరించిన నౌకలు.. తుది అంకాన్ని నిశితంగా పరిశీలించాయి.

అధునాతనం..

అగ్ని శ్రేణిలోని మిగతా క్షిపణుల కన్నా అగ్ని-5 చాలా అధునాతనమైనది. దీని దిక్సూచి, మార్గనిర్దేశ, వార్‌హెడ్, ఇంజిన్ చాలా మెరుగైనవి. కొత్తగా సిద్ధం చేసిన అనేక పరిజ్ఞానాలను ఈ అస్త్రంలో చొప్పించారు. నేవిగేషన్ వ్యవస్థలు, అత్యంత కచ్చితత్వంతో కూడిన రింగ్ లేజర్ జైరో ఆధారిత ఇనర్షియల్ నేవిగేషన్ వ్యవస్థ (ఆర్ఐఎన్ఎస్), అధునాతన మైక్రో నేవిగేషన్ వ్యవస్థ (ఎంఐఎన్ఎస్) వంటివి ఈ క్షిపణిని నిర్దేశిత లక్ష్యానికి అత్యంత కచ్చితత్వంతో చేరవేస్తాయి. దీని కచ్చితత్వంలో తేడాలు కేవలం కొన్ని మీటర్ల మేర మాత్రమే ఉంటాయి. క్షిపణిలో అత్యంత వేగంగా పనిచేసే కంప్యూటర్, లోపాలకు తావులేని సాఫ్ట్‌వేర్, పూర్తిస్థాయి డిజిటల్ నియంత్రణ, అధునాతన కంపాక్ట్ ఏవియానిక్స్ ఇతర వ్యవస్థలు ఉన్నాయి.

పయనం ఇలా..

ప్రయోగానంతరం ఈ క్షిపణి నిర్దేశించిన ఎత్తుకు చేరాక భూమి వైపునకు మళ్లింది. లక్ష్యం దిశగా పయనమైంది. భూమి గురుత్వాకర్షణ శక్తి కారణంగా దాని వేగం భారీగా పెరిగింది. ఈ క్రమంలో భూ వాతావరణంలోకి ఆ క్షిపణి తిరిగి ప్రవేశించింది. అప్పుడు వాతావరణ రాపిడి కారణంగా దాని ఉపరితలంపై తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు చెలరేగాయి. అది 4వేల డిగ్రీల సెల్సియస్‌ను మించిపోయింది. అయితే కార్బన్-కార్బన్ మిశ్రమ పదార్థంతో తయారుచేసిన ఉష్ణ కవచం.. ఈ ఉష్ణోగ్రత నుంచి క్షిపణిని కాపాడింది. ఈ అస్త్రం లోపలి భాగంలో వేడిమి 50 డిగ్రీల సెల్సియస్‌ను మించకుండా చూసింది.

గొట్టపు కవచం నుంచి..

అగ్ని-5 మొదటి పరీక్ష 2012 ఏప్రిల్ 19న జరిగింది. తర్వాతి దశల్లో గొట్టపు కవచాల్లో అమర్చి కూడా దీన్ని పరీక్షించారు. దీని వల్ల స్వల్ప సమయంలోనే ఈ అస్త్రాన్ని ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు. ఎక్కువకాలం కూడా మన్నుతుంది. నిర్వహణ భారం తగ్గుతుంది. సులువుగా ఒక చోటు నుంచి మరోచోటుకు తరలించవచ్చు. ప్రస్తుతం భారత అమ్ములపొదిలో అగ్ని-1 (700 కిలోమీటర్లు), అగ్ని-2 (2వేల కిలోమీటర్లు), అగ్ని-3, 4 (2500-3500 కిలోమీటర్లు) ఉన్నాయి.

ఖండాంతర క్షిపణి సామర్థ్య దేశాలు

- అమెరికా
- రష్యా
- బ్రిటన్
- ఫ్రాన్స్
- చైనా
- భారత్

వేగంగా సైన్యం చేతికి..

అగ్ని-5ను చివరిసారిగా ఈ ఏడాది జనవరి 18న పరీక్షించారు. ఆరు నెలల వ్యవధిలో దీన్ని మరోసారి ప్రయోగించడం ఇదే తొలిసారి. ఈ అస్త్రాన్ని సాధ్యమైనంత వేగంగా సైన్యం చేతికి అప్పగించాలన్న ఉద్దేశంలో ప్రభుత్వం ఉన్నట్లు కనపడుతోంది. హిందు మహాసముద్ర ప్రాంతంలోను, వాస్తవాధీన రేఖ వెంబడి చైనా సైనిక కదలికలు పెరుగుతున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. మరో ప్రయోగం తర్వాత ఈ అస్త్రాన్ని సైనిక దళాలకు అప్పగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

5,6 నాటికి ఆంధ్రకు నైరుతి

ఈనాడు, హైదరాబాద్ : నైరుతి రుతుపవనాలు ఈ నెల 7 నాటికి తెలంగాణకు వచ్చే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఆదివారానికల్లా తమిళనాడులో చాలా ప్రాంతాలకు విస్తరించాయని, 5, 6 తేదీల్లో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలను తాకవచ్చని ఆయన వివరించారు. ప్రస్తుతం తెలంగాణ విదర్భ ప్రాంతంపై ఉపరితల ఆవర్తనం ఉంది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నా ఇవి రుతుపవనాల వల్ల కాదని ఆయన తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలున్న చోట క్యుములోనింబస్ మేఘాలేర్పడి వర్షాలు పడుతున్నాయి. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకూ 73 ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఆదివారం పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయి.

స్మార్ట్ రహదారులు

(మొదటి పేజీ తరువాయి)

అనుసంధాన రహదారి (సీడ్ యాక్సెస్ రోడ్డు) సహా ఐదు ప్రధాన రహదారుల్ని తొమ్మిది వరుసలుగా, 29 ఉప ప్రధాన రహదారుల్ని ఆరు వరుసలుగా నిర్మిస్తున్నారు. తొమ్మిది వరుసల రహదారుల వెడల్పు 60 మీటర్లు ఉంటుంది. అటూ ఇటూ మూడు వరుసలు, మధ్యలో మూడు వరుసల బీఆర్‌టీఎస్ కారిడార్ ఉంటుంది. భవిష్యత్తులో ఈ రహదారులపై ఎలివేటెడ్ కారిడార్ వస్తుంది. బీఆర్‌టీఎస్ కారిడార్ మార్గాన్నే అవసరమైతే మెట్రో రైలు ఏర్పాటుకు వినియోగించుకుంటారు. ఉప ప్రధాన రహదారుల వెడల్పు 50 మీటర్లు. వీటిని ఆరు వరుసలుగా నిర్మిస్తారు. వీటిలో చాలా రహదారులకు మధ్యలో రెండు వరుసల బీఆర్‌టీఎస్ కారిడార్ వస్తుంది.

సైకిల్, నడక దారులు

ప్రతి ప్రధాన రహదారికి రెండు పక్కలా 10 మీటర్ల వెడల్పున నడక దారి, సైకిల్ ట్రాక్, చెట్లు, మొక్కలుంటాయి. ప్రధాన రహదారులకు ఒక పక్కన బఫర్ జోన్ ఉంటుంది. దీని వెడల్పు 10-15 మీటర్ల వరకు ఉంటుంది. అక్కడ రెండు, మూడు వరుసల్లో చెట్లు పెంచుతారు. చెట్లు నాటడం ఇప్పటికే మొదలైంది.

పురోగతి ఏంటి?

238 కి.మీ.ల పొడవైన 24 రహదారుల పనులు మొదలయ్యాయి. మొత్తం 15 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. వీటి విలువ రూ.9వేల కోట్లు. ప్రధాన అనుసంధాన రహదారి మొదటి దశ పనుల్ని 18.5 కి.మీ. మేర చేపట్టారు. మొదట్లో నాలుగు వరుసలకే టెండర్లు పిలిచారు. ఆ పనులు 60 శాతం పూర్తయ్యాయి. దీన్ని 9 వరుసలుగా విస్తరించేందుకు, మౌలిక వసతుల కల్పనకు విడిగా టెండరు పిలిచారు. పనులు మొదలయ్యాయి. ఏడాది క్రితం పనులు ప్రారంభించిన ఏడు ఉప ప్రాధాన్య రహదారుల పనులు 40-50 శాతం పూర్తయ్యాయి. ఈ రహదారుల నిర్మాణ పనులు మొదట ప్రారంభించి, ఇతర మౌలిక వసతులకు సంబంధించి విడిగా టెండర్లు పిలిచారు. దాంతో కొంత జాప్యం జరుగుతోంది. మిగతా రహదారుల పనులు సగటున 20-25 శాతం జరిగాయి. షెడ్యూల్ ప్రకారం ఇవి వచ్చే డిసెంబరులో పూర్తి కావాల్సి ఉంది.

రహదారి	పొడవు (కి.మీ.లలో)
లింగాయపాలెం నుంచి బోరుపాలెం	4.5
ఉండవల్లి నుంచి అబ్బరాజుపాలెం	18.5
వెంకటపాలెం నుంచి దొండపాడు	15.5
వెంకటపాలెం నుంచి మంగళగిరి	9.845
మందడం నుంచి అనంతవరం	11.569
కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు	14.945
కృష్ణాయపాలెం నుంచి అనంతవరం	14.118
పెనుమాక నుంచి ఐనవోలు	7.81
ఎర్రబాలెం నుంచి నీరుకొండ	6.31
ఎర్రబాలెం నుంచి కురగల్లు మీదుగా నీరుకొండ	6.791
నవులూరు నుంచి నిడమర్రు	7.4
మంగళగిరి నుంచి నిడమర్రు	4.5
వెంకటపాలెం నుంచి కృష్ణాయపాలెం, పెనుమాక మీదుఆ నవులూరు	4.8
వెంకటపాలెం నుంచి నవులూరు	7.2
తాళ్లాయపాలెం నుంచి కురగల్లు, బేతపూడి మీదుగా నిడమర్రు	12.8
ఉద్ధండరాయునిపాలెం నుంచి నిడమర్రు	15.9
ఉద్ధండరాయునిపాలెం నుంచి మల్కాపురం మీదుగా నిడమర్రు	12.5
లింగాయపాలెం నుంచి వెలగపూడి ఐనవోలు మీదుగా నిడమర్రు	16.3
లింగాయపాలెం నుంచి ఐనవోలు	8.7
లింగాయపాలెం నుంచి రాయపూడి, నేలపాడు మీదుగా శాఖమూరు	8.7
బోరుపాలెం, తుళ్లూరు మీదుగా నెక్కల్లు	8.3
బోరుపాలెం నుంచి దొండపాడు మీదుగా నెక్కల్లు	8.5
బోరుపాలెం నుంచి పిచ్చుకలపాలెం మీదుగా నెక్కల్లు	8.8
పిచ్చుకలపాలెం నుంచి నెక్కల్లు	7

థాయ్‌లాండ్‌లోని సోంగ్‌క్లాలో ఓ తిమింగలం కడుపులో నుంచి తీసిన 80 ప్లాస్టిక్ సంచులు

ఆంధ్రా ఒడికి.. పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న పరిశ్రమల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి పూర్తయి కార్యకలాపాలు ప్రారంభమైతే 78,535 మందికి ఉపాధి లభిస్తుంది. దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్, ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో ఒప్పందం చేసుకున్న ఎసండాస్, చైనా పర్యటనలో ముందుకొచ్చిన ట్రైనా సోలార్, లాంగి సిలికాన్, జపాన్ పర్యటనలో ఒప్పందం చేసుకున్న మిత్సుబిషి, చైనా పర్యటనలో ముందుకొచ్చిన చైనా ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ, ఆర్ఎస్ఎం గ్రూపు, టోరెయి తదితర సంస్థలు ఉన్నాయి.

- మరో ఏడు విదేశీ సంస్థలు తమ పెట్టుబడులపై ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకొని తదుపరి అనుమతుల కోసం యత్నిస్తున్నాయి. రూ. 44,325 కోట్లు పెట్టుబడులతో ఏర్పాటయ్యే ఈ పరిశ్రమలతో 1,18,400 మందికి ఉపాధి లభించనున్నది. వీటిలో ముఖ్యమంత్రి చైనా పర్యటనలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న గోల్డెన్ కాంకర్డ్ హోల్డింగ్స్, ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్సు, దావోస్ పర్యటనలో ముందుకొచ్చిన ఇందని గ్లోబల్, మెడ్‌టెక్ ఇన్నోవేషన్ పార్టనర్స్, రష్యా పర్యటనలో ఒప్పందం చేసుకున్న యునైటెడ్ షిప్ బిల్డింగ్ టెక్నోనికాల్ సంస్థలు ఉన్నాయి.

నేటి నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలకు అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు ఉరుములు మెరుపులు, ఈదురుగాలుల ప్రభావం కూడా బాగా ఉండే అవకాశం ఉంటుందని వివరిస్తున్నారు. గత రెండ్రోజులుగా కోస్తాలో మినహా మిగిలిన చోట్ల ఉష్ణోగ్రతలు కొంచెం తగ్గాయి. ఎక్కడా 40 డిగ్రీలు దాటలేదు.

గ్రహం అనుగ్రహం

4-6-2018 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
షష్ఠి: తె. 4-16 తదుపరి సప్తమి
శ్రవణం నక్షత్రం: మ. 12-13 తదుపరి ధనిష్ఠ
అమృత ఘడియలు: రా. 3-07 నుంచి 4-52 వరకు
వర్జ్యం: సా. 4-36 నుంచి 6-21 వరకు
దుర్ముహూర్తం: మ. 12-23 నుంచి 1-15 వరకు తిరిగి 2-59 నుంచి 3-51 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-27

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	45.0	28.0
కడప	40.0	28.0
విజయవాడ	39.5	26.0
గుంటూరు	38.5	28.5
రాజమహేంద్రవరం	38.5	25.0
ఒంగోలు	38.0	28.4
హైదరాబాద్	37.8	25.5
తిరుపతి	37.5	23.6
అనంతపురం	37.2	27.4
నెల్లూరు	37.0	27.0
విశాఖపట్నం	37.0	26.4
నరసాపురం	36.5	27.2
శ్రీకాకుళం	36.0	29.0
నిజామాబాద్	35.4	28.4
తాడేపల్లిగూడెం	35.0	26.0

ఎన్‌పీఏలపై నేడు పార్లమెంటరీ కమిటీ భేటీ

దిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల పాలిట గుదిబండగా పరిణమిస్తున్న నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ), ఇతరత్రా బ్యాంకింగ్ కుంభకోణాలపై ఆర్థిక శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సోమవారం సమీక్షించనుంది. వీరప్పమొయిలీ అధ్యక్షునిగా ఉన్న ఈ కమిటీ సమావేశానికి బ్యాంకుల ఉన్నతాధికారులు హాజరై తాజా పరిస్థితులు నివేదించనున్నారు.

ఎర్ర స్మగ్లర్ల అక్రమాస్తులు ప్రభుత్వ పరం

(మొదటి పేజీ తరువాయి)

మే 21న విధివిధానాలకు సంబంధించిన ఉత్తర్వులను అటవీశాఖ జారీ చేసింది. జప్తు చేసిన ఆస్తులను భద్రపరిచేందుకు అడ్మినిస్ట్రేటర్ నియామకం, వివిధ రకాల స్థిర, చరాస్తులను భద్రపరచాల్సిన విధానం, జప్తుపై ఎవరైనా అప్పీల్ చేసుకునేందుకు అమరావతి కేంద్రంగా అప్పీలేట్ ట్రైబ్యునల్ ఏర్పాటు, దాని పనితీరు మార్గదర్శకాలను ఈ ఉత్తర్వుల్లో పొందుపరిచింది. వీలైనంత త్వరగా ఈ వ్యవస్థల ఏర్పాటుపై అటవీ శాఖ దృష్టిసారించింది.

పదిహేనేళ్లలో 25 వేల మంది స్మగ్లర్లు

రాష్ట్రంలో 2002 నుంచి 2017 వరకూ దాదాపు 14 వేల ఎర్రచందనం కేసులు నమోదయ్యాయి. సుమారు 25 వేల మందిని అరెస్టు చేశారు. ఈ కాల వ్యవధిలో అక్రమార్జన ద్వారా కూలీల నుంచి కోటీశ్వరులుగా ఎదిగిన వారెంతో మంది ఉన్నారు. కేవలం 22 మంది అంతర్జాతీయ స్థాయి స్మగ్లర్ల అక్రమార్జన విలువే రూ.2795 కోట్లు ఉంటుందని పోలీసులు లెక్క కట్టారు. దేశ, విదేశాల్లో వారికున్న ఆస్తులు, వ్యాపారాల్లో పెట్టుబడులు, బినామీల పేరిట ఉన్న సంపద వివరాలతో అప్పట్లో నివేదిక కూడా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. వీరిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమబెంగాల్, మిజోరం, దిల్లీకి చెందిన స్మగ్లర్లు ఉన్నారు. ఈ జాబితాలో మధివన్నన్, మునిఅన్నన్, సింగరవేల్, నాగరాజన్, అయ్యప్పన్, శరవణన్, రియాజ్‌ఖాన్, అసిఫ్ అలీ ఖాన్, హమీద్ ఖాన్, రామనాథ్‌రెడ్డి, మస్తాన్‌వలీ, విజయానందరెడ్డి, విక్రమ్ మెహదీ, శామ్యూల్, శేఖర్ మోరీ, గంగిరెడ్డి తదితర ప్రధాన స్మగ్లర్ల పేర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఏ స్మగ్లర్ల ఆస్తులు జప్తు చేయలనేదానిపై అటవీ శాఖ అధికారులు దృష్టిసారించారు.

అక్రమాస్తులు జప్తు ఇలా..!

స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం ఉన్న వ్యక్తి వివరాలను అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్(కాంపిటెంట్ అథారిటీ) పోలీసు శాఖ డీఎస్పీకి ఫిర్యాదు ఇస్తారు. దాని ఆధారంగా డీఎస్పీ దర్యాప్తు జరిపి..సంబంధిత ఎర్రచందనం స్మగ్లర్ పేరిట, అతని కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న అక్రమాస్తులున్నింటినీ గుర్తించి..ఆ వివరాలను అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్‌కు నివేదిస్తారు. అవన్నీ అక్రమాస్తులేనని ఆయన నిర్ధరించుకున్న తర్వాత నోటీసు జారీ చేసి తాత్కాలిక జప్తు చేసుకుంటారు. వీటి నిర్వహణ, సంరక్షణ కోసం అటవీ శాఖ కన్జర్వేటర్‌ను అడ్మినిస్ట్రేటర్‌గా నియమిస్తారు. అవి అక్రమాస్తులు కావని స్మగ్లరు నిరూపించుకోదలిచితే అమరావతిలో ఏర్పాటు చేసే అప్పీలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలి. అక్కడ వచ్చే తుది తీర్పునకు లోబడి ఆ జప్తు ఆధారపడి ఉంటుంది. అవన్నీ అక్రమాస్తులనేని తెలితే జప్తు చేసిన ఆస్తులు ప్రభుత్వ పరమవుతాయి.

రైతు సంక్షేమం - ఆహార భద్రత

- రూ. 24 వేల కోట్ల రుణ ఉపశమనంలో రూ.15,038 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. దాదాపు 60 లక్షల మంది రైతు కుటుంబాల్లో వెలుగులు నింపాం.
- కౌలు రైతులకు రూ. 3098 కోట్లు రుణాలు ఇవ్వడం దేశంలోనే ఒక చరిత్ర.
- 94.46 లక్షల భూసార పరీక్ష కార్డులను పంపిణీ చేసి దేశంలోనే ముందు నిలిచాం.
- 33.84 లక్షల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు, లక్ష టన్నుల మైక్రో న్యూట్రియంట్స్ రైతులకు సబ్సిడీ పై అంద జేశాం.
- పెద్ద ఎత్తున యాంత్రీకరణ ప్రోత్సహిస్తున్నాం. రైతు రథాల పేరుతో 12 వేల ట్రాక్టర్లు సబ్సిడీపై అందజేస్తున్నాం.
- ఈ -పోస్ వినియోగం ద్వారా చౌక డిపోలలో అక్రమాలకు కళ్లెం వేసి రూ.800 కోట్లు ఆదా చేశాం
- ఇప్పటి వరకు రాష్ట్రంలో 1.44 కోట్ల తెల్ల రేషన్ కార్డులు వున్నాయి. కొత్తగా 1.91 లక్షలు జారీ చేయనున్నాం.
- 2014 లో ప్రాథమిక రంగ మిషన్‌ను ప్రారంభించాం.
- దేశానికే సీడ్ హబ్‌గా కర్నూలు.
- నాలుగేళ్లలో రూ.3370 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ అందజేశాం. ఈ ఏడాది రూ.1904 కోట్ల ఇన్ పుట్ సబ్సిడి 16.85 లక్షల మంది రైతులకు ఇచ్చాం.
- గత నాలుగేండ్లలో పండ్ల ఉత్పత్తిని 169.61 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 281.66 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాం.
- ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రతి సంవత్సరం నిధుల కేటాయింపులు పెంచుకుంటూ వెళ్తున్నాం
- రెయిన్ గన్లు, డ్రోన్లు, వాతవరణ అంచనా మిషన్లు, యాప్ ద్వారా వ్యవసాయ సమస్యల పరిష్కారం.
- దేశంలోనే ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. GVA పరంగా 33.32% వృద్ధి సాధించాం

2022 దేశంలో 3 అగ్రగామి రాష్ట్రాలలో ఒకటి (తలసరి ఆదాయం రూ. 2.95 లక్షలు)

2029 దేశంలో అత్యుత్తమ రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 9.65 లక్షలు)

2050 ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాల రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 1.67 కోట్లు)

నేటి చర్చనీయాంశాలు

- వ్యవసాయం - అనుబంధ రంగాలు (ఉద్యానవన పంటలు, పశు సంపద, మత్స్య సంపద)
- పొలం పిలుస్తోంది
- మైక్రో న్యూట్రియంట్స్
- దిగుబడి పెంపు
- వాతావరణ పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక - పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం
- వ్యవసాయ యాంత్రీకరణ: రైతు రథం - భూసార పరీక్ష కార్డులు
- పాల ఉత్పత్తికి పశు సంపద కొనుగోలు
- చేపలు ఆరబెట్టేందుకు సదుపాయాలు
- చేపల చెరువులు - యాంటీబయాటిక్స్ వాడకం నిషేధం
- రుణ ఉపశమనం
- సూక్ష్మ నీటిపారుదల: ఉద్యానవన పంటలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించడం
- ఎండు గడ్డి పంపిణీ

ముఖ్యమంత్రి గారిని సంప్రదించడానికి

NCBN అధికారిక యాప్ | ప్రజలే ముందు మొబైల్ యాప్ | ఏపీ సీఎం ఫేస్ బుక్ | ఏపీ సీఎం ట్విట్టర్

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఈనాడు

జాతి ఆరోగ్యానికి సరైన మందు

మాయదారి రోగాల ఉరవడి జన సామాన్యాన్ని ఠారెత్తిస్తున్న రోజులివి. సాంక్రామిక, సాంక్రామికేతర వ్యాధుల వెన్నంటి జీవనశైలి జబ్బులూ విజృంభిస్తుండటంతో తడిసిమోపెడవుతున్న వైద్య ఖర్చులు నడిమి బీద వర్గాల ప్రజల్ని నిలువునా కుంగదీస్తున్నాయి. రోగి చికిత్స వ్యయంలో 70శాతం దాకా మందులకు వెచ్చించేదే ఉంటోందని ఒక అంచనా. ఆరువేల రకాల ఔషధాలు అందుబాటులో ఉన్న ఇండియాలో అత్యవసరమైనవిగా గుర్తించిన 850 మందుల ధరల్నే ప్రభుత్వం నియంత్రిస్తోంది. టోకు ధరల సూచీ అనుసారం ఈ నియంత్రిత మందుల ధరల్లో పెరుగుదల ఆధారపడుతుంటే, తక్కిన ఔషధాల ధరల్ని ఏటా పది శాతానికి మించకుండా పెంచుకోగల వెసులుబాటు ఉంది. మందుల ధరవరల నిర్ధారణలో భిన్న పద్ధతులకు చెల్లుకొట్టి టోకు ద్రవ్యోల్బణం ఆధారంగా అన్నింటినీ ఒకే పంథాలో నియంత్రించాలన్న ప్రతిపాదనకు నీతి ఆయోగ్ మద్దతు పలికింది. దానిపై పరిశ్రమ వర్గాల అభ్యంతరాల్ని పరిగణనలోకి తీసుకొని సహేతుక ధరల నిర్ణాయక సూచీకి అనుగుణంగా ఔషధ ధరల్ని క్రమబద్ధీకరించాలని కేంద్ర సర్కారు సంకల్పించింది. సరికొత్త సూచీని ఔషధ విభాగం రూపొందిస్తుందని, దాని ఆధారంగా మందుల ధరల్లో పెరుగుదల రేటు గతంలోకంటే తక్కువే ఉంటుందని అంటున్నారు. ఎకాయెకి లక్ష కోట్ల రూపాయల దేశీయ ఔషధ విపణిలో ఇప్పటిదాకా జనం విరివిగా వినియోగించే 17శాతం మందులే ప్రభుత్వ నియంత్రణలో ఉండగా, ఇకపై తక్కినవీ సరసమైన ధరలకే లభ్యం కానుండటం కోట్లాది కుటుంబాలకు తీపికబురు! కేంద్ర ప్రభుత్వపరంగా ధరల నియంత్రణ ఉక్కు పిడికిలి తమ పరిశోధనల్ని దారుణంగా దెబ్బతీస్తోందని పరిశ్రమ వర్గాలు ఫిర్యాదు చేస్తున్న నేపథ్యంలో మేలిమి ఔషధాలు సహేతుక ధరలకు లభ్యమయ్యేలా చూసి, విశాల జనహితానికి తద్వారా స్వస్థ సమాజానికి గొడుగుపట్టడం- మోదీ సర్కారుకు గట్టి సవాలు!

ప్రపంచ మానవాళిలో 17శాతానికి పుట్టినిల్లయిన భారతావని, అంతర్జాతీయంగా వ్యాధుల భారంలో 20శాతాన్ని నెత్తిన మోస్తోంది. ఎవరికి వారు సొంతంగా వైద్య ఖర్చులు నిభాయించడంలో అంతర్జాతీయ సగటు 18శాతంగా నిగ్గుదేలుతుంటే, అది ఇండియాలో 63 శాతంగా ఉండటం కుటుంబాల ఆర్థిక సత్తువను ఖర్చు రాసేస్తోంది. నిరుపేదలు ఎవరైనా అత్యవసరంగా యాంటీబయాటిక్స్ వాడాల్సి వస్తే వారు రెండు రోజులు పస్తులుండాల్సిందేనంటూ, మందుల ధరాభారం సామాన్యుల జీవితాలతో ఎలా చెలగాటమాడుతోందో లోగడ సుప్రీంకోర్టు వెల్లడించింది. దేశ రాజధాని దిల్లీలోని నాలుగు పెద్దాసుపత్రుల అమానుష దందాపై జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ఇటీవల వెల్లడించిన అంశాలు దిగ్భ్రాంతపరుస్తున్నాయి. ఆయా ఆసుపత్రులు ధరల నియంత్రణ పరిధిలో లేని మందులపై 160-1200శాతం, నియంత్రణ పరిధిలోని ఔషధాలపై 115-360 శాతం లాభాలు దండుకొంటున్నాయని, చాలా మందులు తమ జాబితాలో లేకపోవడంతో తామేమీ చెయ్యలేకపోతున్నామనీ ఆ సంస్థ ప్రకటించింది. ఔషధాల్ని పెద్ద పరిమాణంలో ఆసుపత్రులు కొంటున్నందువల్ల వాటి కోరిక మేరకు గరిష్ఠ చిల్లర ధరను భారీగా పెంచి తయారీదారులు ముద్రిస్తున్నట్లు కేంద్ర సంస్థ కనుగొంది. రూ.14 ఖరీదు చేసే ఇంజక్షన్‌కు అయిదువేల రూపాయలు వసూలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు- వైద్య చికిత్సకు అయ్యే ఖర్చును తగ్గించాలని మొన్న మార్చిలో విస్పష్టంగా ఆదేశించింది. 2013నాటి ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వులో సవరణల ద్వారా, అన్ని మందుల విక్రయ ధరల్నీ హేతుబద్ధీకరించాలనుకొంటున్న ప్రభుత్వం- గరిష్ఠ చిల్లర ధరల్లో ఆసుపత్రుల గూడుపుఠాణినీ ఛేదించాలి. జనరిక్ ఔషధాలపట్ల ప్రజల్లో అపోహల్ని తొలగించి, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా, కుచేల భారతం పూర్తిగా కుదేలైపోకుండా కాచుకోవాలి!

మందులు భరింపశక్యం కానంత ఖరీదు కావడం పేద దేశాలకే పరిమితమైన సమస్య కాదని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది రోగుల్ని, ఆరోగ్య రక్షణ వ్యవస్థల్ని అది కృశింపజేస్తోందని ఐక్యరాజ్య సమితి నివేదిక 2016 సెప్టెంబరులో వెల్లడించింది. ఔషధాల ధరవరలకు, పరిశోధన అభివృద్ధి (ఆర్ అండ్ డీ) వ్యయానికీ మధ్య లంకె ఉండనే రాదంటూ, చౌక ధరల్లో జనరిక్ మందుల ఉత్పత్తిని ప్రోత్సహించాలని గట్టిగా సూచించింది. వేరే దేశాల్లో ఏవో కొన్ని డాలర్ల ఖరీదు చేసే మందులను అమెరికాకు వచ్చేసరికి వందల డాలర్లకు విక్రయించడం పూర్తిగా అసంబద్ధమని కన్నెర్ర చేస్తున్న అధ్యక్షుడు ట్రంప్- ఎక్కడికక్కడ లొసుగుల పరిహరణను లక్షించి మూడు వారాల క్రితం 44 పేజీల 'బ్లూ ప్రింట్'ను వెలువరించారు. ఆరోగ్య బీమా ఛత్రం విస్తృతంగా ఉన్నా తమ రోగులు ఖరీదైన మందులతో కుంగిపోరాదని అగ్రరాజ్యమే అంతగా తాపత్రయపడుతున్న వాస్తవాన్ని గుర్తించి- దేశీయంగా ధరల నియంత్రణ వ్యూహానికే పరిమితం కాకుండా మూల ఔషధం (జనరిక్) విస్తృత వ్యాప్తికి సమగ్రంగా బాటలు పరవాలిప్పుడు! అమెరికాలో వైద్యులు సూచిస్తున్న వాటిలో మూడొంతుల దాకా జనరిక్ ఔషధాలే. బ్రిటన్‌లో ఇంకా ఎక్కువే! జనరిక్ మందుల వాడకం కారణంగా 2015 లోనే రూ.14 లక్షల కోట్ల మొత్తాన్ని అమెరికన్ ప్రజ ఆదా చేసుకోగలిగిందని అక్కడి జనరిక్ ఫార్మా సంఘం 2016లో మదింపు వేసింది. ఆయా దేశాలకు జనరిక్ ఔషధాల్ని ఎగుమతి చేసి విశేష లబ్ధి పొందుతున్న సంస్థలు, ఇక్కడ మాత్రం ఖరీదైన మందుల్ని రోగులకు అంటగట్టడంలో ఆరితేరిపోయాయి. జన్ ఔషధికి జవజీవాలందించి, జనరిక్ మందులకు ప్రాచుర్యం కల్పించడం ద్వారా జాతి ఆరోగ్యాన్ని, జన జీవన సౌభాగ్యాన్ని జాగ్రత్తగా కాచుకోవడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధి!

కదల బారరాదు... ఖరీఫ్ లక్ష్యాలు!

తొలకరి జల్లులు అన్నదాతల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. గడచిన అయిదేళ్లలో ఎన్నడూ లేనంత త్వరగా ఈసారి నైరుతి రుతుపవనాలు దక్షిణాది రాష్ట్రాలను పలుకరించడం అన్నదాతల్లో భరోసాను నింపుతోంది. గత నెలాఖరులో రుతుపవనాలు కేరళ తీరం తాకడంతో వాతావరణ శాఖ అంచనాలపై విశ్వాసం పెరిగింది. ఈ ఏడాది సాధారణ వర్షపాతంలో 97 శాతం వర్షాలు కురుస్తాయని, జులైలో ఇబ్బడిముబ్బడిగా, ఆగస్టులో కాస్త తక్కువగా పడతాయని ఆ శాఖ విశ్లేషించింది. ఆ భరోసాతోనే ఈ సంవత్సరం ఏకంగా 28.37 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పండించాలని రైతులకు కేంద్రం భారీ లక్ష్యం నిర్దేశించింది. ఇది దేశ చరిత్రలోనే అత్యధికం. గతేడాదికన్నా ఏకంగా 42 లక్షల టన్నులు అధికంగా పండించాలని లక్ష్యాన్ని నిర్దేశించడం అందరినీ ఆకర్షిస్తోంది. కానీ అందుకు అనుగుణంగా కార్యాచరణ ఎంతమేరకు ఉంటుందన్నదే కీలక ప్రశ్న. వ్యవసాయ పద్దు కింద కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్న నిధుల శాతం ఏటికేడు కోసుకుపోతోంది. ఈ పరిస్థితుల్లో రికార్డు స్థాయిలో పంట దిగుబడులు సాధించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడం చర్చనీయాంశంగా మారింది.

విత్తన సాయమేది?

ఖరీఫ్ సీజన్ ఆరంభంలో ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సన్నద్ధతను బట్టి ఏ మేరకు దిగుబడులు పెరుగుతాయన్న విషయంలో స్పష్టత ఏర్పడుతుంది. స్వాతంత్ర్యానంతరం నిరుటి ఆర్థిక సంవత్సరం (2017-18)లో రికార్డు స్థాయిలో 27.95 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పండినట్లు కేంద్ర అర్థ, గణాంకశాఖ తాజా నివేదికలో వెల్లడించింది. ఈ రికార్డును వరసగా రెండో ఏడాది (2018-19)లో అధిగమించాలంటూ కేంద్రం 28.37 కోట్ల టన్నుల లక్ష్యాన్ని ఈ ఏడాదికి నిర్ణయించింది. ఈ అంకెల కథాకమామిషు ఎలా ఉన్నా ప్రజలకు వాస్తవంలో అందుతున్న ఆహారమెంత, రైతులకు చేరుతున్న గిట్టుబాటు ధరలేపాటి అన్న విషయాలను తరచి చూడాల్సి ఉంది. దేశ ఆహార పంటల్లో బియ్యం, గోధుమలే అత్యంత కీలకం. మొత్తం 28.37 కోట్ల టన్నుల్లో 21.30 కోట్ల టన్నులు ఈ రెండు పంటలే ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇనుమడిస్తున్న జనాభాకు అనుగుణంగా ఈ పంటల దిగుబడులు పెరగడం లేదని కేంద్రం తాజా నివేదికలో పేర్కొంది. ఉదాహరణకు 2015లో 125.91 కోట్ల జనాభా ఉండగా తలసరి రోజుకు 186 గ్రాముల బియ్యం అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు 130.28 కోట్లకు చేరిన జనాభాకు సైతం తలసరి బియ్యం అందుబాటు 186 గ్రాములే ఉన్నట్లు తేలింది. గడచిన నాలుగేళ్లలో దేశజనాభా అదనంగా అయిదు కోట్లు పెరిగింది. కానీ, బియ్యం దిగుబడి పెరుగుదల మాత్రం 61 లక్షల టన్నులుగానే ఉంది. పంటల సాగు విస్తీర్ణం అదనంగా పెంచడానికి సాగునీటి లభ్యత చెప్పుకోదగిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో ఉన్న భూముల్లోనే సగటు దిగుబడి పెరగాలి. ఇది జరగాలంటే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, నీటి లభ్యతపై రైతుకు హామీ ఉండాలి. ఖరీఫ్‌లో దేశంలో సాగుచేసే సోయాచిక్కుడు పంటకు 29.09 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. కాగా, 93,170 క్వింటాళ్ల కొరత ఉందని కేంద్ర వ్యవసాయశాఖ ఖరీఫ్ ప్రణాళికలో వెల్లడించింది. మొక్కజొన్న విత్తులూ బొటాబొటీగానే అందుబాటులో ఉన్నాయి. దేశంలోకెల్లా అత్యధికంగా సోయాచిక్కుడు పంట పండించే మధ్యప్రదేశ్ నుంచి నాణ్యమైన విత్తనాలు కొని రైతులకు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయశాఖ ఇటీవల ప్రయత్నాలు చేసింది. కానీ తమ వద్ద విత్తనాలే లేవని మధ్యప్రదేశ్ చేతులెత్తేయడంతో ప్రైవేటు కంపెనీల నుంచి అధిక ధరకు కొని రైతులకు అమ్మాల్సిన దుస్థితి తెలంగాణ, కర్ణాటకల్లో ఏర్పడింది. భూసారం పెంచే పచ్చిరొట్ట విత్తనాలు అధికంగా పండే ఉత్తర్‌ప్రదేశ్‌ను అడిగినా తమ వద్ద లేవని అక్కడి ప్రభుత్వమూ చేతులెత్తేసింది. ఏదైనా రాష్ట్రంలో అత్యధికంగా పండే విత్తనాలను వాటి కొరత ఉన్న రాష్ట్రాలకు తరలించే క్రమంలో కేంద్రం విఫలమవుతోంది. నిన్నగాక మొన్న హఠాత్తుగా పుట్టుకొచ్చిన ప్రైవేటు విత్తన కంపెనీలు ఏటా వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అమ్మేస్తున్నాయి. దశాబ్దాల క్రితం వెలసిన ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థలు చేయలేని పనిని- ఈ చిన్నపాటి కంపెనీలు ఎలా చేయగలుగుతున్నాయన్న విషయం తరచి చూస్తే నకిలీ, నాసిరకం విత్తనాల గుట్టు రట్టువుతుంది. బీటీ పత్తి విత్తనాలకు తెగుళ్లను తట్టుకునే శక్తి ఉందని చెప్పి ఏటా నాలుగు వేల కోట్ల రూపాయల వ్యాపారాన్ని ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. కానీ నిరుడు గులాబీ రంగు పురుగు సోకి 35 లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. ఖరీఫ్‌లో ఈ పురుగును తట్టుకోగల భరోసాతో విత్తనాలు ఇప్పిస్తారా అన్న విషయంలోనూ స్పష్టత లేదు. తెలుగు రాష్ట్రాల్లో పత్తి అత్యంత కీలక పంట. దీనిపైనే ఏటా 20వేల కోట్ల రూపాయలను తెలుగు రైతులు పెట్టుబడి పెడుతున్నారు. ఈ పంట విత్తు నాసిరకమైతే వారు నష్టపోయే సొమ్ము వేల కోట్ల రూపాయల్లో ఉంటోంది. ఇప్పటికే తెలంగాణ టాస్క్‌ఫోర్స్ బృందాలు అంతంత మాత్రంగా జరిపిన దాడుల్లో కోట్ల రూపాయల విలువైన అక్రమ, నకిలీ విత్తులు పట్టుబడ్డాయి. ఖరీఫ్ ఆరంభానికి ముందే ఇలాంటివి బయటపడితే రైతులకిక పంటలపై ధైర్యం ఎలా ఉంటుంది? పలు పథకాలకు నిధుల కేటాయింపు, వ్యయం సైతం అధ్వానంగా ఉంటోంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్కేవీవై) పథకం వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైనది. వ్యవసాయంతోపాటు ఉద్యాన, పశుసంవర్ధక, మార్కెటింగ్, సహకార శాఖలు, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సైతం ఈ పథకం కింద నిధులు వస్తాయి. మొత్తం కేటాయింపులో కేంద్రం గతంలో 85 శాతం ఇస్తే రాష్ట్రాలు 15 శాతం భరించేవి. గడచిన రెండేళ్లుగా కేంద్రం వాటా 60కి తగ్గగా రాష్ట్రాల వాటా 40కి పెరిగింది. దీనివల్ల చాలా రాష్ట్రాల్లో ఈ పథకం నిధులే ఖర్చు కావడం లేదు. ఉదాహరణకు పన్నెండో ప్రణాళిక (2012-17) కాలంలో ఈ పథకం కింద మొత్తంగా రూ.34,995 కోట్లు కేటాయించినట్లు కేంద్రం తెలిపింది. కానీ ప్రణాళికాంతానికి రూ.27,600.35 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి.

ప్రభుత్వాల క్రియాశీలతే కాడీమేడీ

సేద్యానికి అండా దండా

- మూడేళ్ల వ్యవధిలో 13.50 లక్షల ఎకరాల్లో అదనంగా వరి, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను సాగులోకి తేవాలన్నది కేంద్రం లక్ష్యం. ఇందులో భాగంగా 2020 మార్చి నాటికి 4.50 లక్షల ఎకరాల్లో వీటి సాగు అదనంగా పెంచాలి.
- పామాయిల్ దిగుమతులకు ఏటా మలేసియా, ఇండోనేసియాలకు వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు, ఇదే సొమ్మును రైతులకు ఇచ్చేందుకు రెండేళ్లలోగా దేశంలో అదనంగా 2.25 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచాలి.
- దేశవ్యాప్తంగా కొత్తగా 150 చోట్ల పప్పుధాన్యాల విత్తన పంటల హబ్‌లు ఏర్పాటు చేయాలి. జిల్లా కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు వీటిలో పాలు పంచుకోవాలి. ఇలాంటివే తొమ్మిది హబ్‌లను నూనెగింజల పంటలకు ఏర్పాటు చేయాలి.
- ఆహార భద్రత మిషన్ కింద రైతులకిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాల నిబంధలను మార్చుకునేందుకు రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ ఉండాలి.

దేశంలో ఆహార ధాన్యాల దిగుబడులు(కోట్ల టన్నులు)	
సంవత్సరం	దిగుబడి
2010–11	24.44
2011–12	25.92
2012–13	25.71
2013–14	26.50
2014–15	25.20
2015–16	25.15
2016–17	27.51
2017–18	27.95
2018–19	28.37

పన్నెండో ప్రణాళిక కాలం పూర్తయ్యాక ఆ పథకానికి పెద్దగా కేటాయింపులు లేకపోగా ఇంకా తగ్గాయి. కిందటి ఆర్థిక సంవత్సరానికి(2017-18) రూ.4790కోట్లు కేటాయించినా అవి పూర్తిగా ఖర్చుకాలేదంటూ ఈ ఏడాది బడ్జెట్లో కేంద్రం ఆ మొత్తాన్ని రూ.3600 కోట్లకు తగ్గించేసింది. ఇలా నిధులు తగ్గిస్తూ వెళితే రైతులకిచ్చే రాయితీలూ హరించుకుపోతాయి.

గిట్టుబాటు ధరకు భరోసా

రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందనే భరోసా సీజన్ ఆరంభంలోనే ఉండాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో 'మార్కెట్ ఇంటలిజెన్స్' విభాగం ఉంది. ఈ ఖరీఫ్‌లో ఇప్పుడు రైతులు విత్తబోతున్న పంటలకు వచ్చే నవంబరు నాటికి మార్కెట్ ధరలు ఎలా ఉంటాయన్న ముందస్తు అంచనాలను ఈ విభాగాలు ప్రస్తుతం ప్రకటించాలి. గడచిన కొన్నేళ్లుగా దేశంలో వివిధ పంటలకు పలికిన ధరలు, అవసరాలు, అంతర్జాతీయ మార్కెట్లను బేరీజు వేసి ఈ అంచనాలు చెప్పాలి. మార్కెట్ ఇంటలిజెన్స్ విభాగాలు సీజన్ ఆరంభంలో ఏ పంట వేస్తే అధిక ధర వస్తుందన్న విషయాన్ని రైతులకు చెప్పడం వల్ల మున్ముందు వాటిల్లే నష్టాల నుంచి వారిని కాపాడటానికి కొంతయినా అవకాశముంటుంది. కానీ ఈ విభాగాల నివేదికలు రైతులకు ముందుగా అందకపోవడం పెద్దలోపంగా ఉంది. దీన్ని సరిదిద్దాలి. పంట పెట్టుబడి కింద రైతులకు ఎకరానికి నాలుగు వేల రూపాయలు ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇప్పటికే కర్ణాటక, బీహార్ ప్రభుత్వాలు సైతం ఇదే తరహా పథకం ఆరంభానికి సన్నాహాలు ప్రారంభించాయి. వీటిని ఓట్లను రాల్చుకునే రాజకీయ పథకాలుగా మార్చకుండా దీర్ఘకాలిక లక్ష్యాలతో అమలు చేయాలి. ఈ సీజన్ నుంచి సాగు చేసే పంటలను వచ్చే అక్టోబరు నుంచి మద్దతు ధరకు కొనే విధానం నుంచి పూర్తిగా తప్పుకొనేందుకు కేంద్రం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఇక పంటలను మద్దతు ధరకు కొనే బాధ్యతంతా రాష్ట్రాలపైనే పడనుంది. అందుకు అనుగుణంగా అక్టోబరు నాటికి భారీగా నిధులు సమకూర్చుకుని పటిష్ఠ యంత్రాంగం, కార్యాచరణతో రాష్ట్రాలు సిద్ధం కావాలి. రాష్ట్రాల బడ్జెట్లలో మద్దతు ధరకు కొనేందుకు నిధులేమీ కేటాయించలేదు. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుంటేనే పంటలను కొనడానికి సాధ్యమవుతుంది. ఇలాంటి తాత్కాలిక ఏర్పాట్లతో నిధులు సమకూర్చుకోవడం, సకాలంలో సరైన ధరకు పంటలను కొనడం సాధ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు ఏమాత్రం ఆలస్యం చేసినా వ్యాపారులు పంటను తక్కువ ధరకు ఎగరేసుకుపోయి రైతులను నష్టపరచడం ఖాయం అన్న సంగతి గత ఏడాది కందులు, మొక్కజొన్న కొనుగోలు వ్యవహారాల్లో వెల్లడైంది. ఈ సీజన్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కాకుండా రాష్ట్రాలు జాగ్రత్త పడితేనే ఖరీఫ్‌లో కష్టాల కొలిమి నుంచి రైతులు బయటపడతారని పాలకులు గుర్తించాలి.

- మంగమూరి శ్రీనివాస్

'ఐటీ' బాటలో సహకారం

భారతీయ ఐటీ ఉద్యోగులకు కొంతకాలంగా గడ్డు రోజులు ఏర్పడ్డాయి. అమెరికా, బ్రిటన్, సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు రానురానూ భారతీయ సాంకేతిక నిపుణులకు పని పర్మిట్లు, వీసాలు ఇవ్వడానికి విముఖత చూపుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా నుంచి సానుకూల సంకేతాలు వెలువడ్డాయి. గత డిసెంబరులో చైనాలోని రేవు పట్టణం డాలియన్‌లో మొట్టమొదటి భారతీయ ఐటీ హబ్‌ను ప్రారంభించిన 'నాస్కామ్' కొద్ది రోజుల క్రితం గ్వియాంగ్ నగరంలో రెండో ఐటీ హబ్‌ను తెరచింది. డాలియన్ కారిడార్... ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పైన, గ్వియాంగ్ కారిడార్ 'బిగ్ డేటా'పై దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. ఈ రెండు హబ్‌లను పైలట్ ప్రాజెక్టులుగా పరిగణిస్తున్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో చైనా, సాఫ్ట్‌వేర్‌లో భారత్ ప్రపంచంలోనే అగ్రగాములుగా ఉన్న సంగతి తెలిసిందే. గ్వియాంగ్‌లో భారతీయ సర్వీస్ ప్రొవైడర్లకూ, చైనా ఖాతాదారులకూ మధ్య ఒప్పందాలు కుదిరాయి. 2013 లోనే 49,300 కోట్ల డాలర్ల స్థాయిని అందుకున్న చైనా ఐటీ పరిశ్రమలో భారతీయ ఐటీ కంపెనీలకు అవకాశాలు అపారం. గ్వియాంగ్‌లోని హార్డ్‌వేర్ కంపెనీలకు ఐటీ సేవలు అందించడం వల్ల మిగతా ప్రాంతాలకూ క్రమంగా విస్తరించగలుగుతాయి. మన అంకుర పరిశ్రమలను ఆకర్షించడానికి గ్వియాంగ్‌లో అద్దె లేకుండా కార్యాలయ వసతి కల్పించనున్నారు.

వాస్తవానికి పెద్ద భారతీయ ఐటీ కంపెనీలు ఇప్పటికే చైనాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నా, అవి సముద్రంలో నీటిబొట్టు లాంటివి. చైనాలో అతిపెద్ద పొరుగు సేవల కంపెనీల్లో టీసీఎస్ ఒకటి. ఇన్ఫోసిస్ ఇటీవలే ఆ దేశంలో తన మొదటి ప్రాంగణాన్ని తెరచింది. అక్కడ 2004 నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న విప్రో 2,000 మందికి ఉపాధి కల్పిస్తోంది. మొత్తం మీద చిన్నా పెద్ద భారతీయ ఐటీ సంస్థలు చైనాలో 10 నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తూ 25,000 మందికి ఉపాధి చూపుతున్నాయి. ఇంతకాలం చైనాలో భారతీయ చిన్న, మధ్యతరహా ఐటీ సంస్థలకు సరైన ప్రోత్సాహం లభించక ఆంగ్లభాష మాట్లాడే దేశాలపై ఆధారపడవలసి వచ్చేది. చైనాలో భాష, సంస్కృతీపరమైన అడ్డంకులు ఉండటం దీనికి ఒక ముఖ్య కారణం. డాలియాన్, గ్వియాంగ్‌లలో నెలకొన్న భారత్-చైనా డిజిటల్ సహకార కేంద్రాలు (సిడ్ కాప్) రెండు దేశాల సంస్థలకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత అనువాద వసతులు కల్పిస్తాయి. ఈ ఏఐ వేదికలు ఆంగ్లం నుంచి మాండరిన్‌కూ, మాండరిన్ నుంచి ఆంగ్లానికి తర్జుమా చేస్తాయి. జెటా-వి అనే భారతీయ కంపెనీ సిడ్ కాప్ కోసం ఈ ఏఐ వేదికను రూపొందించి ఇస్తుంది. గ్వియాంగ్ కారిడార్‌లో బిగ్ డేటా రంగంలో భారత్-చైనాలు కలిసి కొత్త ఉత్పత్తులు, సేవలను రూపొందిస్తాయి.

భారత వాణిజ్య లోటు తగ్గే మార్గం

గత నెలలో వుహాన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశం రెండు దేశాల మధ్య ఐటీ సహకార వృద్ధికి ప్రేరణ కలిగించింది. చైనాతో భారత్‌కు ఏర్పడిన 5,100 కోట్ల డాలర్ల వాణిజ్య లోటును భర్తీ చేయాలంటే భారత్ నుంచి ఐటీ సేవల ఎగుమతులు పెరగడమొక్కటే దారి. భారత్ ముడి సరకులను మాత్రమే చైనాకు ఎగుమతిచేస్తూ చైనా నుంచి ఎలక్ట్రానిక్స్, బల్క్ డ్రగ్స్ తదితరాలను దిగుమతి చేసుకొంటోంది. ఈ లోటు భర్తీకి చైనా విపణి ద్వారాలను భారతీయ ఐటీ, ఫార్మా కంపెనీల కోసం తెరవాలని దిల్లీ కోరుతోంది. భారతీయ ఐటీ సంస్థలు నేడు 70 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తూ ప్రపంచవ్యాప్తంగా కోటీ 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఏటా 16,400 కోట్ల డాలర్ల ఆదాయం ఆర్జిస్తున్న భారతీయ ఐటీ పరిశ్రమ 12,000 కోట్ల డాలర్ల మేరకు ఎగుమతులు చేస్తోంది. చైనా నుంచి ఆదాయం పెంచుకోవడానికి డాలియాన్, గ్వియాంగ్‌లకు తోడు మరో నాలుగు రాష్ట్రాల్లో ఐటీ కారిడార్లు తెరవడానికి 'నాస్కామ్' సంప్రదింపులు జరుపుతోంది. కొన్ని చైనా కంపెనీలు సైతం భారీ భారతీయ ఐటీ కంపెనీల సహకారంతో వ్యాపారాన్ని విస్తరించాలనుకొంటున్నాయి.

భారత ఐటీ పరిశ్రమ ఆదాయ వివరాలు



ఆధారం: నాస్కామ్ (వంద కోట్ల డాలర్లలో)

అవకాశాల గని... చైనా!

ఉభయులూ కలిసి కొత్త సేవలను సృష్టించాలనుకుంటున్నాయి.

కృత్రిమ మేధ (ఏఐ)లో చైనా ఎంతో ముందుండగా, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)లో భారత్ దూసుకెళుతోంది. 350 కోట్ల డాలర్ల ఐఓటీ పొరుగు సేవల వ్యాపారంలో 152 కోట్ల డాలర్ల వాటాతో భారత్‌దే అగ్ర స్థానం. 94 కోట్ల డాలర్ల వాటాతో పశ్చిమ ఐరోపా దేశాలు, 81 కోట్ల డాలర్లతో అమెరికా రెండు, మూడో స్థానాల్లో నిలుస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ, చిల్లర వర్తకం, పారిశ్రామికోత్పత్తి, రవాణా, టెలికమ్యూనికేషన్ రంగాల్లో ఐఓటీ ఉద్యోగావకాశాలు దండిగా ఉన్నందున భారతీయ నిపుణులు ఈ రంగంలో నైపుణ్యాలను పెంచుకోవడం కోసం సంబంధిత కోర్సులను అభ్యసిస్తున్నారు. 2017 అక్టోబరు-2018 మార్చి మధ్యకాలంలో అత్యాధునిక ఆన్‌లైన్ కోర్సులలో చేరినవారి సంఖ్య బాగా పెరిగిందని బెంగళూరుకు చెందిన 'ఆన్ లైన్' బోధన వేదిక ఎడ్యురేక తెలిపింది. ఉన్న ఉద్యోగాలు నిలబెట్టుకోవడానికీ, భావి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి భారతీయ నిపుణులు నేర్చుకొంటున్న కోర్సుల్లో అగ్రస్థానం ఐఓటీది కాగా, తదుపరి స్థానాల్లో కృత్రిమ మేధ, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, బ్లాక్ చెయిన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కోర్సులు ఉన్నాయి. ఈ విధంగా కాలంతో పరుగు పందెం ప్రారంభించిన భారత్, ప్రపంచానికే కర్మాగారం అయిన చైనాకు ఐఓటీ సేవలు అందించడం ఉభయులకూ ప్రయోజనకరమవుతుంది.

ఉమ్మడి కృషితో ఉభయులకూ మేలు

ఐఓటీలో భారత్ ముందున్నట్లే కృత్రిమ మేధ (ఏఐ)లో చైనా ఎంతో ఎదిగిపోయింది. ఏఐలో చైనా కన్నా మనం వెనకబడిపోయామని ఒప్పుకోక తప్పదు. దీన్ని అధిగమించడానికి నీతిఆయోగ్ జాతీయ కృత్రిమ మేధ అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతుందని ఈ ఏడాది కేంద్ర బడ్జెట్లో ప్రకటించారు. ఏఐని విస్తృతంగా వినియోగించే డిజిటల్ ఇండియా, మెషిన్ లెర్నింగ్, త్రీడీ ప్రింటింగ్ వంటి అధునాతన విభాగాల అభివృద్ధికి బడ్జెట్లో గత ఏడాదికన్నా రెండింతలు ఎక్కువగా ఈ ఏడాది రూ.3,073 కోట్లు కేటాయించారు. ఆధార్ కోసం సృష్టించిన కోడ్‌ల సంచయం ఇండియాస్టాక్‌కు మద్దతుగా బ్లాక్ చెయిన్ వ్యవస్థను ఏర్పరచడానికి ఇండియా చెయిన్ ప్రాజెక్టును నీతి ఆయోగ్ చేపట్టింది. దీంతో ఏఐ సేవలకు గిరాకీ ఏర్పడనుంది. ప్రస్తుతం ఏఐ రంగంలో అమెరికా, చైనా, కెనడాలు మొదటి మూడు స్థానాలను ఆక్రమిస్తున్నాయి. బిగ్‌డేటా, ఎనలిటిక్స్‌లో పరిశోధన- అభివృద్ధికి చైనా ఒక్క 2018లోనే 550 కోట్ల డాలర్లు వెచ్చించబోతోంది. ఈ టెక్నాలజీల విషయంలో భారత్‌తో చేతులు కలపాలని చైనా నిశ్చయించడం ఉభయులకూ మేలు చేయనుంది. కృత్రిమ మేధలో పరిశోధన-అభివృద్ధికి చైనా 40,920 కోట్ల డాలర్లు కేటాయించి 3,926 మంది పరిశోధకులను నియోగించింది. భారత్ 5000 కోట్ల డాలర్లు కేటాయించి 546 మంది పరిశోధకులతో సరిపెట్టుకుంటోంది. ఈ లోటును అధిగమించడానికి చైనాతో సహకారం ఉపకరించే మాట నిజమే కానీ, పెద్దఎత్తున మేధోహక్కుల చౌర్యానికి పాల్పడే చైనాతో భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలి. చైనాలో గూగుల్, ఫేస్‌బుక్ వంటి బహుళజాతి సంస్థలు ప్రభుత్వం నుంచి ప్రతికూలత ఎదుర్కొంటున్నాయి. అక్కడ విదేశీ కంపెనీలపై ఆంక్షలు పెట్టి స్వదేశీ కంపెనీలను ప్రోత్సహిస్తున్నారు. విదేశీ కంపెనీల వాణిజ్య రహస్యాలను కాజేస్తున్న ఘటనలు కొల్లలు. అలాంటి చోట భారతీయ కంపెనీలు ఎలా నెగ్గుకొస్తాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగని అనుమానాలు, భయాలతో సంపన్న చైనా మార్కెట్‌కు దూరం జరగడం వివేకమనిపించుకోదు. మన జాగ్రత్తలో మనం ఉంటూనే అవకాశాలను అందిపుచ్చుకోవాలి. భారత్-చైనాల మధ్య ఆర్థిక బంధం బలపడే కొద్దీ సరిహద్దు ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయి. భారత్ పాశ్చాత్య ఐటీ మార్కెట్లపై ఆధారపడే బదులు ప్రత్యామ్నాయాన్ని అందిపుచ్చుకొన్నట్లవుతుంది.

- వరప్రసాద్

అంతర్యాగం

పుణ్యక్షేత్రాలు, ఆలయాలపట్ల మనమెంతో భక్తి ప్రపత్తులు కలిగి ఉంటాం. వ్యయ ప్రయాసలకోర్చి స్వామిని దర్శిస్తాం. మన కోరికలు స్వామికి విన్నవిస్తాం- అదీ మనసులోనే. అంటే స్వామి మనలో కొలువై ఉన్నాడన్న మాట.

అంతఃకరణ, అంతరంగం, అంతర్యామి, అంతర్యాగం- సుపరిచితంగా అనిపించే ఈ పదాలు మనసుకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని సూచిస్తాయి. మనసు అనే అంతరంగంలో వసించేవాడు అంతర్యామి. నాలోనే ఉండి నాకు గోచరించకుండా నన్ను నియంత్రించేవాడు. కంటికి కనపడకుండానే కంటికి చూసే శక్తిని ఇచ్చేవాడు. బుద్ధికి గోచరించకుండా బుద్ధిని ప్రేరణ చేసేవాడు. చెవులకు వినపడకుండానే వినికిడి శక్తిని ఇచ్చేవాడు. ఇంద్రియాలను నడిపిస్తూ ఇంద్రియాలకు గోచరించని జ్ఞానజ్యోతి అంతర్యామి.

'నాలో వెలుగుతున్న అంతర్యామిని తెలుసుకోవడానికి నాకన్నా భిన్నంగా ఒక పరమాత్మ ఉన్నాడు' అని మనసులో భావించి ఆ పరమాత్మకు నామరూపాలు కల్పన చేసి ఆరాధన చేయాలి.

సాధన అంటే పూజ గదికి, దైవ మందిరానికి మాత్రమే పరిమితం కాదు. పూజ, హోమం, జపం మాత్రమే కాదు. అది ఒక జీవన విధానం. సంఘంలో సాధకుడు అంతర్యాగం. సంఘంలో ఉంటూ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించాలి. మానవ సేవ, మాధవ సేవను సమాన దృష్టితో స్వీకరించాలి. మనసులోని మాలిన్యంతోపాటు సమాజంలోని మాలిన్యాలను తొలగించడానికి కృషి చేయాలి. కీర్తికాంక్షలు వదిలి సేవాభావనలో సంతృప్తి పొందాలి. ఫలాపేక్ష లేని సేవలో ఆనందం ఉన్నదన్న సత్యాన్ని గ్రహించాలి. తెలియకుండా మనసులో పెరుగుతున్న అసూయ, ద్వేషం అనే శత్రువులను అనుక్షణం గమనిస్తూ జాగరూకుడై ఉండాలి. ప్రేమ, కరుణతో హృదయం నిండిపోవాలి. తద్వారా మనో, బుద్ధి, చిత్, అహంకారాలతో నిండి ఉన్న అంతఃకరణ శుద్ధి అవుతుంది. అంతఃకరణ శుద్ధి అయినప్పుడు సాధకుడి అంతరంగంలో పరమాత్మపై భక్తి, శ్రద్ధ, విశ్వాసం మెండుగా ఉంటాయి.

సాధకుడు తన శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా భావించి సత్కర్మలు చేస్తాడు. ఇంద్రియాలు అనే గుర్రాలను అదుపు చేయడానికి మనసును కళ్లెంగా వినియోగిస్తాడు. మనసును దైవం పైన, సన్మార్గం పైన ఉంచి ఇంద్రియ నిగ్రహాన్ని సాధిస్తాడు.



భక్తితో పరమాత్మ తత్వాన్ని ఆకళింపు చేసుకొని ద్వైత భావనతో చేసే ఆరాధన పరాకాష్ఠకు చేరితే సాధకుడి అంతరంగ పూజకు చేరువ అవుతాడు. ఈ స్థితికి చేరిన సాధకుడి హృదయపద్మం ఆసనమవుతుంది. మనసే అర్ఘ్యం అవుతుంది. ప్రాణం ధూపంగా భాసిస్తుంది. అనాహత ధ్వనులు ఘంటానాదమై, మనో చాంచల్యం నృత్యమై, చిత్తం- అలంకరణగా మారుతుంది. అహింస, ఇంద్రియ నిగ్రహం, దయ, క్షమ, జ్ఞానం... ఇవి పూజా పుష్పాలవుతాయి.

అంతరంగ పూజలో చేసే యజ్ఞమే- అంతర్యాగం. సాధకుడి ఆత్మే యజమాని. శ్రద్ధయే- భార్య (ధర్మపత్ని), ఇధ్మం (పుల్లలు) - శరీరం, కోరికలు- ఆజ్యం (నెయ్యి), కోపం- బలిపశువు, హృదయం- బలిపీఠం, తపస్సు- అగ్ని, ప్రాణమే- ఉద్గాత. అహింస, సత్యభాషణలు ఋత్విజులకు ఇచ్చే దక్షిణలు. సాధకుడు తన సర్వస్వాన్ని బ్రహ్మార్పణం చేయడమే పూర్ణాహుతి. ఇదే లయ యోగం.

సాధకుడు చేసే ప్రతి పనీ శివారాధనే. సాధకుడు- తత్వమసి 'నేను పరమాత్మనై ఉన్నాను' అనే ఎరుకతో ఉంటాడు. ఈ స్థితికి చేరిన సాధకుడు పరమాచార్యులుగా పరిఢవిల్లుతాడు. ఆచార్యులు అనే మాటకు నిజమైన నిర్వచనంగా లోకం వారిని కీర్తిస్తుంది. వారి బోధనలు ఆచరణీయం.

- పి.సి.వి.సత్యనారాయణ

అంతర్యామి

వరండాలు.. ఆరుబయటే వంటలు

- వంటగదుల నిర్మాణంలో నిర్లక్ష్యం..!
- ప్రభుత్వ బడుల్లో తగ్గుతున్న ప్రవేశాలు
- మధ్యాహ్న భోజనం తినే పిల్లలూ తగ్గుతున్న వైనం
- మధ్యాహ్న భోజన పథకం అమలుపై కేంద్రం నివేదిక విడుదల

ఈనాడు - అమరావతి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమై దశాబ్దాలు గడుస్తున్నా..నేటికీ వేల పాఠశాలల్లో ఆరుబయట, వరండాలు, చెట్లకింద వంటలు చేస్తున్న దుస్థితి. వేల సంఖ్యలో వంట గదుల నిర్మాణాలకు కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నా..నిధులు చాలవని కొన్ని ప్రారంభించకపోగా..ప్రారంభించినవీ సంవత్సరాల తరబడి సాగుతున్న పరిస్థితి. దీంతో చాలా పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణంలోనే వంటలు చేస్తున్నారు. పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుతుండడంతో భోజనం చేస్తున్న వారి సంఖ్యా తక్కువగా ఉంటోంది. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు అందిస్తున్న ఆరోగ్య పరీక్షలపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నివేదికను విడుదల చేసింది.

ఆ జిల్లాల్లో తక్కువ..

- ప్రాథమిక (1-5)స్థాయిలో ప్రవేశాలు తగ్గుతున్న నేపథ్యంలో మధ్యాహ్న భోజనం తినే వారి సంఖ్య తగ్గిపోతుంది. జాతీయ సరాసరి 76% కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ గతేడాది మొత్తం విద్యార్థుల్లో 1.40 లక్షల మంది మధ్యాహ్న భోజనానికి దూరంగా ఉన్నారు. ప్రాథమిక స్థాయిలో అనంతపురం జిల్లాలో ఇది 78%గా ఉంది. ప్రాథమికోన్నత(6-8) స్థాయిలో భోజనం తినే విద్యార్థుల సంఖ్య జాతీయ సరాసరి 76%కాగా.. చిత్తూరులో 74%, ప్రకాశంలో 75%, విశాఖపట్నం 76%గా ఉంది.
- మధ్యాహ్న భోజనం పథకానికి కేటాయిస్తున్న నిధుల్లో ఖర్చయినది గతేడాదితో పోల్చితే ఒకశాతం తగ్గింది. 2016-17లో 357 కోట్లు కేటాయించగా.. రూ.348 కోట్లు వ్యయమైంది. 2017-18లో 385 కోట్లు మంజూరు చేయగా రూ.369 కోట్లు వ్యయం చేశారు.

ప్రారంభించనవి వేలల్లోనే..

- కేంద్ర ప్రభుత్వం 44,875 వంటగదులను మంజూరు చేయగా..నిధులు సరిపోవడం లేదంటూ పాఠశాల విద్యశాఖ 19,523 వంట గదులను ప్రారంభించనే లేదు. మిగతా 25,352 గదుల్లో ఇప్పటి వరకు పూర్తి చేసింది 17,450 మాత్రమే. 1,874 వంట గదుల పనులు నిర్మాణ దశలో ఉండగా..మరో 6,028 గదులను ప్రారంభించనే లేదు. దీంతో చాలా పాఠశాలల్లో వంటలు పాఠశాల భవనాల వరండాలు, ఆరుబయట చేస్తున్నారు.
- రాష్ట్రంలో 45,505 మధ్యాహ్న భోజనం అందిస్తున్న పాఠశాలల్లో 29,36,308 విద్యార్థులు ఉంటే వీరిలో 75% మందికే ఐరన్ మాత్రలను అందిస్తున్నారు. 88% మందికి నట్టల నివారణ మందులను అందిస్తున్నారు. 92శాతం మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాల స్థాయి(1-5)లో విద్యార్థుల వివరాలు (లక్షల్లో)

సంవత్సరం	ప్రవేశాలు	కేంద్రం ఆమోదం (పీఏబీ)	భోజనం చేసినవారు
2015–16	20.4	20.0	18.3
2016–17	19.5	18.3	17.1
2017–18	18.0	17.4	16.6
ప్రాథమికోన్నత(6–8) స్థాయిలో ఇలా..			
2015–16	12.1	11.5	9.7
2016–17	12.2	9.7	9.7
2017–18	11.3	10.0	9.6

సగానికి లోపే శుద్ధ జలాలు..

మొత్తం పాఠశాలల్లో 4,152 బడుల్లో తాగునీటి సదుపాయం లేదు. సురక్షితమైన నీరు అందుబాటులో ఉన్న పాఠశాలు 39,035 ఉండగా. శుద్ధ జలాలు అందించేవి 18,376మాత్రమే ఉన్నాయి. చాలాచోట్ల విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇంటి నుంచే నీళ్లసీసాలను తెచ్చుకుంటున్నారు. శుద్ధ జలాలు లేనిచోట చేతిపంపులు, బోర్ల నుంచి వచ్చే నీటిని నేరుగా విద్యార్థులు తాగుతున్నారు.

ఈ ఏడాది ఆమోదం ఇలా..

- 2018-19కి ప్రాథమిక పాఠశాలల్లో 17.9లక్షల మందికి భోజనం కోసం పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించగా కేంద్రం 16.8లక్షల మందికి ఆమోదించింది.
- ప్రాథమికోన్నత పాఠశాల్లో 11.3లక్షల మందికి ప్రతిపాదించగా.. 9.7లక్షలకు ఆమోదం లభించింది.

రెండు నెలల్లో ఇంటింటికీ భాజపా

- చంద్రబాబుది నయవంచన దీక్ష
- భాజపా అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ధ్వజం

ఈనాడు, అమరావతి: రానున్న రెండు నెలల్లో ఇంటింటికి భాజపా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వెల్లడించారు. విజయవాడ పార్టీ కార్యాలయంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "దేశానికి, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న కృషిని ఇంటింటికి భాజపా కార్యక్రమం ద్వారా కరపత్రాల రూపంలో ప్రజలకు వివరిస్తాం. మూడేళ్లలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నవ నిర్మాణ దీక్షలు చేసిన చంద్రబాబు ప్రస్తుతం భాజపాను నిందిస్తున్నారు. ఆయన చేపట్టినది నవనిర్మాణ దీక్ష కాదు. నయవంచన దీక్ష. చంద్రబాబు కాంగ్రెస్‌కు అద్దె మైకులా మారారు. రాహుల్ ప్రాపకం కోసం ఆరాటపడుతున్నారు. పంచాయతీ ఎన్నికలకు వెళ్లే ధైర్యం కూడా తెదేపాకు లేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి చెందిన అన్ని వ్యవహారాలను తొలి నుంచి పర్యవేక్షించిన వెంకటేశ్వరరావును పక్కన బెట్టేసి, అనుభవం లేని ఏఈ శ్రీధర్‌కు అడ్డదారుల్లో పదోన్నతులు కల్పించి కీలక బాధ్యతలు అప్పగించారు. అవినీతికి పాల్పడేందుకు ఎవరూ అడ్డు ఉండకూడదనే ఉద్దేశంతోనే ఇలా చేశారు. గరుడ ఆపరేషన్ ఓ సృష్టి. నటుడు శివాజీ అసలెవరు? తెదేపా నేతలకు అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మలేదన్న ఉద్దేశంతో బాధితులు రోడ్డునపడేలా చేశారు. వారికి భాజపా అండగా ఉంటుంది' అని పేర్కొన్నారు.

రాష్ట్ర విభజనకు జగనే మూలకారణం

కన్నా ఊసరవెల్లి రకం: మంత్రి ఆనందబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవిభజనకు మూలకారణం ముమ్మాటికీ వైకాపా అధ్యక్షుడు జగనేనని సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు ధ్వజమెత్తారు. ఆర్థిక నేరాల కేసుల్లో గతంలో చంచల్‌గూడ జైలులో ఉన్న సమయంలో ఆర్టికల్ 3 ద్వారా రాష్ట్రాన్ని విభజించొచ్చని ఆయన లేఖ రాసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. గుంటూరులోని రాష్ట్ర తెదేపా కార్యాలయంలో ఆదివారం మంత్రి ఆనందబాబు మీడియాతో మాట్లాడుతూ.. అప్పట్లో రాష్ట్ర విభజనకు సహకరించిన జగన్ ప్రస్తుతం అభివృద్ధికి కూడా అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు కన్నా లక్ష్మీనారాయణ రాత్రికి రాత్రే రాజకీయపార్టీలు మారుతుంటారని మంత్రి ఆనందబాబు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించిన కన్నా అన్ని పదవులను అనుభవించి. . ప్రస్తుతం భాజపాలో ఏ సిద్ధాంతాలు నచ్చి చేరారని ప్రశ్నించారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

పవన్‌కు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకటరావు సూచన

రాజాం, న్యూస్‌టుడే: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కిమిడి కళావెంకటరావు హితవు పలికారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెదేపాపై పవన్‌కల్యాణ్ ఆధారరహిత ఆరోపణలు చేస్తూ.. ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జనసేన దిశానిర్దేశం లేని పార్టీ అని.. ఎవరో రాసిస్తున్న చిట్టీలు చదివి ప్రభుత్వంపై విమర్శలు చేయడమే దీనికి అద్దం పడుతోందని విమర్శించారు. 'ఉద్దానం కిడ్నీ సమస్యపై ప్రభుత్వం ఏయే చర్యలు తీసుకుందో గుర్తించారా? ఎన్ని డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసిందో తెలుసుకున్నారా?' అని ప్రశ్నించారు. శ్రీకాకుళంలో కిడ్నీ సమస్యపై ధర్నా చేస్తే ఒక్కరంటే ఒక్క బాధితుడూ రాలేదని. . బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నందు వల్లే రాలేదని గుర్తించాలన్నారు. వైకాపా, భాజపాలను ఏమీ మాటనకుండా కేవలం తెదేపా ప్రభుత్వంపై విరుచుకుపడటంలో ఆంతర్యమేమిటో ప్రజలు గుర్తించారని.. ఇప్పటికైనా వాస్తవలు తెలుసుకోవాలని సూచించారు.

నేడు దిల్లీలో అటవీశాఖ మంత్రుల సదస్సు

హాజరుకానున్న మంత్రి శిద్ధా

ఈనాడు, అమరావతి: దేశరాజధాని దిల్లీలో సోమవారం జరగనున్న అటవీ శాఖ మంత్రుల సదస్సుకు రాష్ట్రం తరపున మంత్రి శిద్ధా రాఘవరావు హాజరుకానున్నారు. వాతావరణ మార్పులు, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ ప్రభావ మదింపు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న అత్యుత్తమ ఆచరణలను సమావేశంలో మంత్రి శిద్ధా వివరించనున్నారు.

సామర్లకోట పట్టణ పరిధిలోని గోదావరి కాలువలో భారీగా ప్రవహిస్తున్న మురుగు

గోదావరి కాలువలోకి స్థానిక పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థజలాలు

గోదావరి కాలువ.. గరళంతో విలవిల

స్వచ్ఛమైన నీటితో గలగలా ప్రవహించాల్సిన గోదావరి కాలువల్లో ప్రస్తుతం గరళం పారుతోంది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి సామర్లకోట వరకు ఉన్న గోదావరి కాలువ నేడు ఇలా మురుగు నీటితో అధ్వానంగా దర్శనమిస్తోంది. ఈ కాలువ ద్వారా ప్రవహించే నీటిని సాగు అవసరాలతో పాటు కాకినాడ కార్పొరేషన్, సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లోని ప్రజల తాగునీటి కోసం వినియోగిస్తారు. అయితే, సామర్లకోట పరిధిలోని పెదబ్రహ్మదేవం, జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల నుంచి భారీగా మురుగు సంబంధిత కాలువలో కలుస్తోంది. స్థానిక పరిశ్రమలూ భారీఎత్తున వ్యర్థజలాలను ఈ కాలువలోకి మళ్లిస్తుండటంతో సమస్య మరింత తీవ్రతరమైంది. ఈ మురుగుజలాల నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతుండటంతో అక్కడి ప్రజలు తరచూ రోగాలబారిన పడుతున్నారు. త్వరలో ఈ కాలువలోకి గోదావరి జలాలను విడుదల చేయనున్న నేపథ్యంలో.. ప్రమాదకర రసాయనాలు వాటితో కలిస్తే ప్రజారోగ్యం ప్రమాదంలో పడే ముప్పు పొంచి ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

- ఈనాడు, కాకినాడ

కేరళ వైద్యురాలి రాకతో

చిత్తూరు జిల్లాలో కలకలం

- నిఫా నేపథ్యంలో వ్యాపించిన వదంతులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో రుయాలో వైద్యపరీక్షలు

రుయా ఆసుపత్రి వద్ద జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న

ఈనాడు, అమరావతి - తిరుపతి, న్యూస్‌టుడే: కేరళలో వైద్యురాలిగా పనిచేస్తున్న చిత్తూరు జిల్లాకు చెందిన ఓ యువతి అకస్మాత్తుగా స్వస్థలానికి రావడం కలకలాన్ని రేకెత్తించింది. 'నిఫా' వ్యాధి లక్షణాలు కలిగిన ఒకరికి వైద్యసేవలు అందించిన ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యబృందంలో ఉన్న ఆమె వ్యక్తిగత కారణాలతో చిత్తూరు జిల్లాకు వచ్చారు. ఇలాంటి సందర్భాల్లో రోగులకు వైద్య సేవలు అందించిన వైద్యులు కానీ, నర్సులు కానీ తగిన జాగ్రత్తలు తీసుకోవల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా తాము పనిచేసే ప్రాంతాలకు దూరంగా వెళ్లే సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. 'నిఫా' తరహా కేసుల విషయంలో.. ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి మార్గదర్శకాల ప్రకారం 14 రోజుల వరకు బయటకు వెళ్లకూడదు. దీనిని 'క్వారంటైన్ టైమ్'గా పేర్కొంటున్నారు. అయితే..ఈ యువతి స్వస్థలానికి తిరిగి వచ్చేయడంతో కేరళ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించారు. అనంతరం ఆమెను చరవాణి సాయంతో అధికారులు గుర్తించి తిరుపతి రుయా ఆస్పత్రికి శనివారం రాత్రి తీసుకువెళ్లారు. ఈ యువతికి నిఫా వైరస్ లక్షణాలు ఏమీలేవని, పూర్తిగా ఆరోగ్యవంతురాలుగా ఉన్నారని రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ బాబ్జీ వెల్లడించారు. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న ఆదివారం రుయా ఆస్పత్రిలో సంబంధిత వైద్యురాలితో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, నిఫాపై వచ్చే వదంతులను నమ్మొద్దని స్పష్టం చేశారు. తాజా పరిణామాల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ ప్రద్యుమ్న వివరించారు.

మూలరాములకు రూ.50 లక్షల వజ్రాల హారం

మంత్రాలయం, న్యూస్‌టుడే: మధ్వ మూల సంస్థానంలో నిత్య పూజలు అందుకునే మూలరాములకు రూ.50 లక్షలు విలువచేసే వజ్రాలహారం, బంగారు దండను కర్నూలు జిల్లాలోని మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు కానుకగా సమర్పించారు. ఆయనకు భక్తుల నుంచి వచ్చిన పాదకానుకల మొత్తంతో తయారు చేయించి ఇచ్చారు.

అక్రమ నగదు నిరోధానికి చట్ట సవరణ చేయనున్న స్విస్

బెర్న్, దిల్లీ: భారత్ సహా ఇతర దేశాలు చేసిన ఒత్తిళ్ల నేపథ్యంలో అక్రమ నగదు చలామణి నిరోధక చట్టంలో సవరణలు చేయాలని స్విట్జర్లాండ్ ప్రభుత్వం నిర్ణయించింది. స్విస్ బ్యాంకులు పాటించే గోప్యతను అనుకూలంగా మార్చుకొని పలు దేశాల వారు ఇక్కడ తమ అక్రమ సంపాదనను దాచిపెడుతుంటారు. అయితే నల్లధనంపై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయంగా ఒత్తిళ్లు రావడంతో చట్టంలో తగిన సవరణలు చేసేందుకు స్విస్ ఫెడరల్ కౌన్సిల్ సంప్రదింపులు ప్రారంభించింది. కొత్త నిబంధనల ప్రకారం ఆర్థిక సంస్థలు తమ ఖాతాదారుల వివరాలను తనిఖీ చేసి నిర్ధరించుకోవాల్సి ఉంటుంది. నిర్ణీత వ్యవధిలో తనిఖీలు చేసి, వారి తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. ఖాతాదార్ల వ్యవహారశైలికి అనుగుణంగా తనిఖీల కాలపరిమితిని నిర్ణయించుకోవాలి. బంగారం, రత్నాల వంటి విలువైన వస్తువుల కొనుగోలుకు నగదు రూపంలో చెల్లించే మొత్తాన్ని తగ్గించాలని ప్రతిపాదించింది.

మచ్చుకు మాత్రమే మలేరియా సిబ్బంది

- గుంటూరులో లక్షకు ఒకరు చొప్పున 9 మంది ఉద్యోగులు
- ఉన్న పోస్టులు మాత్రం 49
- సిబ్బంది కరవుతో పకడ్బందీగా సాగని రక్తపూతల సేకరణ
- పర్యవసానంగా విజృంభిస్తున్న మలేరియా, డెంగీ

ఈనాడు, గుంటూరు: విశాఖ మన్యంలో మలేరియా కేసుల తీవ్రత గురించి తరచుగా వింటుంటాం. కానీ ప్రస్తుతం విశాఖ జిల్లాను మించిపోయి గుంటూరు నగరంలో మలేరియా కేసులు అధికంగా నమోదు కావటం ఆందోళన కలిగిస్తోంది. అయితే 9 లక్షలకుపైగా జనాభా కలిగిన గుంటూరులో మలేరియా, డెంగీ వంటి వ్యాధులను అరికట్టడానికి 9 మంది ఆరోగ్య సహాయకులు (లక్షకు ఒకరు) మాత్రమే పనిచేస్తున్నారు. గుంటూరు నగరంలో మూడు మలేరియా యూనిట్లు ఉన్నాయి. వీటి పరిధిలో 49 పోస్టులు ఉండగా 9 మంది మాత్రమే విధి నిర్వహణలో ఉన్నారు. వీరిలోనూ ఐదుగురు రెగ్యులర్ ఉద్యోగులు కాగా మరో నలుగురు ఒప్పంద ఉద్యోగులు. మలేరియా విభాగంలో ఇంత తక్కువ సిబ్బంది ఉంటే.. మలేరియాను నియంత్రించటానికి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించటం సాధ్యమా అనే విమర్శలు వస్తున్నాయి.

9 మందిపై 16 మంది పర్యవేక్షణ...

విచిత్రమేమంటే ఈ 9 మంది ఉద్యోగులపై 16 మంది పర్యవేక్షకులు(సూపర్‌వైజర్లు) ఉన్నారు. అసలు క్షేత్రస్థాయిలో మలేరియా కేసులు గుర్తించే వారు లేరని, యాంటీ లార్వా ప్రయోగాలు చేసేవారు కరవయ్యారని అనుకుంటుంటే 16 మంది సూపర్‌వైజర్లను పర్యవేక్షకులుగా కొనసాగించటం మలేరియా విభాగానికే చెల్లింది. గడిచిన మూడు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 586 మలేరియా కేసులు నమోదయ్యాయి. దీనిలో ఒక్క గుంటూరు నగర పరిధిలోనే 172 కేసులు ఉండటం గమనార్హం. విశాఖ జిల్లా మొత్తం మీద 48 కేసులు ఉన్నట్లు గుర్తించారు. అదే గుంటూరు జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే 220 కేసులు నమోదైనట్లు అధికారులు తేల్చారు. గుంటూరులో నమోదవుతున్న కేసులను బట్టి నగరంలో మలేరియా విభాగం పనితీరును అంచనా వేయొచ్చు. వాస్తవానికి వర్షాలు పెరిగే కొద్దీ మలేరియా, డెంగీ కేసులు పెరుగుతాయి. కానీ ప్రస్తుతం వేసవిలో కూడా గుంటూరులో ఈ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

నగరంలో ఇంటింటికి వెళ్లి మలేరియా నిర్ధారణకు రక్తపూతలు సేకరించటానికి ఎక్కువ మంది సిబ్బంది అవసరం. కానీ సిబ్బంది లేమితో ఇంటింటికి తిరిగి రక్తపూతలు సేకరించేవారు లేక చాలా మంది దోమ కాటుకు గురై క్రమేపీ డెంగీ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖల్లో రిక్వెస్టు బదిలీలు, పరస్పర అంగీకార బదిలీలకు ప్రభుత్వం ఖాళీలను గుర్తించాలని ఆదేశించటంతో మలేరియా విభాగంలో నెలకొన్న ఖాళీలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. గుంటూరు నగరంలో మలేరియా తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వైద్య, ఆరోగ్యశాఖ యంత్రాంగం వెంటనే ఖాళీలను శాశ్వతంగా భర్తీ చేసి మలేరియా జ్వరాలు ప్రబలకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఇంటింటికి వెళ్లి రక్తపూతలు సేకరించటం, మలేరియా లక్షణాలు బయటపడిన వారికి మందులు ఇచ్చి కోలుకునేలా చేయటానికి హెల్త్ అసిస్టెంట్లు అవసరం.

తెలుగు రాష్ట్రాల గవర్నర్‌కు రూ.53 లక్షల భత్యాలు

- పశ్చిమబెంగాల్ గవర్నర్‌కు అత్యధికంగా రూ.1.81 కోట్లు
- ప్రయాణ, ఆతిథ్య ఖర్చులపై తాజా మార్గదర్శకాలు

దిల్లీ: గవర్నర్ల ప్రయాణ భత్యాలు, ఆతిథ్య ఖర్చులు తదితరాలపై కేంద్రం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. నాలుగు నెలల క్రితం వారి నెలవారీ జీతాలను రూ.3.5 లక్షలకు పెంచుతూ నిర్ణయించిన ప్రభుత్వం... తాజాగా భత్యాలను సవరించింది. దీని ప్రకారం పశ్చిమ బెంగాల్ గవర్నర్‌కు అత్యధికంగా రూ.1.81 కోట్లు వివిధ భత్యాలు, ఖర్చుల నిమిత్తం లభిస్తుంది. ఈ అవసరాల నిమిత్తం తెలుగు రాష్ట్రాల గవర్నర్‌కు రూ.53 లక్షలు లభిస్తుంది. కార్యాలయ హంగుల నిమిత్తం రూ.6 లక్షలు, హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నిర్వహణ నిమిత్తం మరో రూ.18.3 లక్షలు లభిస్తాయి. తమిళనాడు గవర్నర్‌కు భత్యాల నిమిత్తం రూ.1.66 కోట్లు, బిహార్‌కు రూ.1.62 కోట్లు, మహారాష్ట్రకు రూ.1.14 కోట్లు లభిస్తాయి. గవర్నర్ల భత్యాలను సవరించడం నాలుగేళ్లలో ఇది తొలిసారి.

సుష్మా ప్రయాణిస్తున్న విమానం 14 నిమిషాల పాటు గల్లంతు!

దిల్లీ: విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ ప్రయాణిస్తున్న విమానం దాదాపు 14 నిమిషాల సేపు గల్లంతై అధికార యంత్రాంగాన్ని హైరానాకు గురిచేసింది. బ్రిక్స్ దేశాల సదస్సులో పాల్గొనడానికి దిల్లీ నుంచి భారత వాయుసేన ప్రత్యేక విమానం ఐ.ఎఫ్.సి-31లో శనివారం ఆమె దక్షిణాఫ్రికాకు బయల్దేరారు. ఏకధాటిగా ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం లేనందున ఇంధనం కోసం ఆ విమానం తొలుత తిరువనంతపురంలో, ఆ తర్వాత మారిషస్‌లో దిగాల్సి ఉంది. మారిషస్ భూభాగంలో విమానం ప్రయాణించాక గగనతల రద్దీ నియంత్రణ (ఏటీసీ) విభాగంతో సంబంధాలు తెగిపోయాయని భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ) ఆదివారం తెలిపింది.

అంతర్జాతీయ నిబంధనల ప్రకారం- తమ విమాన సమాచార ప్రాంతం (ఎఫ్.ఐ.ఆర్.)లో విమానం ప్రవేశించాక దానితో సంబంధాలు కుదరకపోతే మూడు దశల్లో 30 నిమిషాలపాటు నిరీక్షించి, అది గల్లంతైనట్లు ప్రకటిస్తారు. సుష్మా విమానం మారిషస్‌లోకి ప్రవేశించాక ఎలాంటి సమాచారం అందకపోవడంతో అక్కడి అధికారులు అంతసేపు నిరీక్షించకుండానే 12 నిమిషాల తర్వాత- సాయంత్రం 4.44 గంటలకు తొలిదశ అలారం (ఇన్‌సెర్ఫా) మీట నొక్కారు. విమానం, దానిలోని ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారో లేదో తెలియడం లేదని దీనర్థం. చివరిసారిగా చెన్నై ఏటీసీని విమాన సిబ్బంది సంప్రదించి ఉండడంతో వారితో మారిషస్ అధికారులు మాట్లాడారు. ఈలోగా ఐ.ఎఫ్.సి-31 పైలట్లు 4.58 గంటలకు మారిషస్ ఏటీసీతో మాట్లాడారు. దీంతో రెండు దేశాల్లోని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సుష్మా ఆదివారం దక్షిణాఫ్రికా చేరుకున్నారు. అయిదురోజుల పాటు అక్కడ ఉంటారు.

100 వేమన పద్యాల పఠనం చేసిన విద్యార్థుల తరపున జీనియస్, వండర్ రికార్డులు అందుకున్న మేక్ మై బేబీ జీనిఎస్ పాఠశాల ఛైర్మన్ భాస్కరరాజు. చిత్రంలో పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

19 నిమిషాల్లో 100 వేమన పద్యాల పఠనం

జీనియస్, వండర్ రికార్డులు సొంతం చేసుకున్న చిన్నారులు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: తిరుపతిలోని మేక్ మై బేబీ జీనియస్ పాఠశాల చిన్నారులు ఆదివారం అరుదైన రికార్డు సాధించారు. 265 మంది 19 నిమిషాల 11 సెకండ్లలో 100 వేమన పద్యాలను పఠనం చేసి ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డులు సాధించడంతో పాటు వేమన శతక రత్న అవార్డు పొందారు. తిరుపతి ఖాదీకాలనీలోని పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే శ్రీ మద్భాగవద్గీతలోని రెండు అధ్యాయాలను పఠనం చేసిన 7సంవత్సరాలు లోపు చిన్నారులు 20 మందికి గీతా బాల అవార్డు, ఐదు అధ్యాయాల పఠనం చేసిన 28 మందికి గీతాఝరి అవార్డు, 18 అధ్యాయాలను పఠనం చేసిన అయిదుగురు చిన్నారులకు గీతా సాగర అవార్డులను ప్రదానం చేశారు. చిన్నారులతో పాటు 100 వేమన పద్యాలు నేర్పిన గురువుకు శతక రత్నాకర పురస్కారం అందజేశారు. గతంలో ఈ పాఠశాల చిన్నారులు 197 మంది 100 వేమన పద్యాలు పఠనం చేసి రికార్డులు సాధించారు.

డాక్టర్ రవిరాజుకు ఎఫ్ఆర్‌సీపీ పురస్కారం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ టి.రవిరాజుకు ఫెలోషిప్ రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ (ఎఫ్ఆర్‌సీపీ) పురస్కారం లభించింది. లండన్‌లోని రాయల్ కళాశాలలో జులై 25న జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని డాక్టర్ రవిరాజు అందుకోనున్నారు. వైద్యరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఎఫ్ఆర్‌సీపీ పురస్కారాలను 2018లో ప్రపంచ వ్యాప్తంగా 30 మంది వైద్య ప్రముఖులకు అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి డాక్టర్ రవిరాజును ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఎఫ్ఆర్‌సీపీ ప్రతినిధి హీథర్ డ్రేనె పంపిన సందేశంలో స్పష్టంచేశారు. మూత్రపిండాల వైద్యంలో మూడున్నర దశబ్దాలుగా రవిరాజు సేవలందిస్తున్నారు. కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారిగా, ఆంధ్ర వైద్యకళాశాల ప్రిన్సిపల్‌గా, వైద్యావిద్యా శాఖ సంచాలకుడిగా, ఎన్టీఆర్ వర్సిటీ వీసీగా ఆయన పనిచేశారు. మూత్రపిండాల వ్యాధులకు సంబంధించి రవిరాజు సమర్పించిన 20 వైద్య పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమయ్యాయి.

గృహిణి అమాయకత్వం.. 6.98 లక్షలు మాయం

ఆన్‌లైన్ మోసగాడికి 28 సార్లు పాస్‌వర్డ్ చెప్పిన వైనం

ముంబయి: నవీముంబయిలోని ధారావి గ్రామానికి చెందిన ఓ గృహిణి(40) ఆన్‌లైన్ మోసానికి గురైంది. ఫోన్ చేసిన మోసగాడికి.. ఒక్కసారి మాత్రమే ఉపయోగించే పాస్‌వర్డ్(ఓటీపీ) వివరాలు 28సార్లు చెప్పి రూ.6.98 లక్షలు కోల్పోయింది. ఫోన్ చేసిన మోసగాడు తనను తాను ఎస్‌బీఐ మేనేజరుగా పరిచయం చేసుకున్నాడు. మీ ఏటీఎం కార్డు పనిచేయడం లేదని, పనిచేయాలంటే ఏటీఎం కార్డు వివరాలు, మీకొచ్చే ఓటీపీ చెప్పాలన్నాడు. బ్యాంకు నుంచి వచ్చే సందేశాలను(ఎస్ఎంఎస్) చూడకుండా తీసేయాలని సూచించడంతో సదరు మహిళ అలాగే చేసింది. ఇటీవల బ్యాంకుకు పాస్‌బుక్‌లో వివరాల నమోదుకు వెళ్లడంతో మోసం బట్టబయలైంది. ఓటీపీ వివరాలు ఏకంగా 28సార్లు ఎలా చెప్పావమ్మా? అని పోలీసులు అడిగితే, ఆన్‌లైన్ గురించి నాకు అవగాహనలేదని తెల్లమొహం వేసింది. తన భర్త కువైట్‌లో ఉంటారని, ఇంటర్ చదువుతున్న తన కుమారుడి కోసం రూ.పది లక్షలు విద్యారుణం తీసుకున్నామని పోలీసులకు తెలిపింది. మే 17న మొదటిసారి జరిపిన లావాదేవీల సందర్భంగా అత్యల్పంగా రూ.4000 'ఆక్సిజెన్' వ్యాలెట్‌కు పంపిన మోసగాడు.. అత్యధికంగా ముంబయిలోని 'ఫోన్‌పే' వ్యాలెట్‌కు రూ.49,999 పంపినట్లు పోలీసులు గుర్తించారు.

ఎగుమతులకు ఊపు.. రైతుకు దిగాలు

- 70 లక్షలకు చేరుతున్న పత్తి ఎగుమతులు
- రైతులు అమ్మేశాక పెరిగిన డిమాండు
- గులాబీ పురుగు దెబ్బతో కుదేలవుతున్న రైతాంగం

ఈనాడు - అమరావతి

దేశవ్యాప్తంగా ఖరీఫ్‌లో పత్తి దిగుబడులు తగ్గగా.. విదేశాల నుంచి ఆర్డర్లు రావడంతో ఎగుమతులు మాత్రం గణనీయంగా పెరిగాయి. రైతు చేయి దాటాక ఎగుమతులు ఊపందుకోవడంతో వ్యాపారులకు భారీగా లాభాలు వచ్చాయి. ఈ ఏడాది కూడా పత్తి ధరలు ఆశాజనకంగానే ఉంటాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే గతేడాది గులాబీ పురుగు దెబ్బకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది.

అంచనా కంటే తక్కువే..: 2017-18లో 365 లక్షల బేళ్ల ఉత్పత్తి వస్తుందని కేంద్ర రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. కానీ మూడో ముందస్తు అంచనా ప్రకారం 348 లక్షల బేళ్లకు పడిపోయింది. బీటీ పత్తికి గులాబీ రంగు పురుగు ఆశించడంతో భారీ ఎత్తున పురుగుమందులు చల్లారు. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అనుమతి లేని గ్లైసెల్ పత్తిసాగు దేశవ్యాప్తంగా పెరిగింది. దిగుబడులు మాత్రం రాలేదు. మొత్తంగా చూస్తే అంచనా కంటే 17లక్షల బేళ్ల వరకు ఉత్పత్తిని దెబ్బతీసింది. నాణ్యత సరిగా లేదంటూ వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేశారు. రైతుకు సగటున క్వింటాలుకు రూ.4వేల కంటే తక్కువ ధరే లభించింది. రైతులు పత్తి అమ్మేశాక రూ.5వేల స్థాయికి చేరింది.

ఎగుమతులకు వెలుగు

గత నాలుగేళ్లతో పోలిస్తే ఈ ఏడాది పత్తి ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. గతేడాది 63 లక్షల బేళ్లు ఎగుమతి చేయగా.. ఈ ఏడాది 70 లక్షల బేళ్ల వరకు ఎగుమతులుంటాయని పరిశ్రమవర్గాలు అంచనా వేస్తున్నాయి. చైనా నుంచి ప్రస్తుతం ఆర్డర్లు ఉన్నాయి. బంగ్లాదేశ్, వియత్నాం, ఇండోనేసియా, టర్కీ నుంచి కూడా డిమాండు ఉంది. మొత్తంగా చూస్తే 70లక్షలకు పైనే చేరుకోనుంది. మరోవైపు దేశీయగా మిల్లుల వినియోగం 330 లక్షల బేళ్ల వరకు ఉండొచ్చని అంచనా. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో పత్తికి డిమాండు ఉంటుందనే అంచనా పరిశ్రమవర్గాల్లో వ్యక్తమవుతోంది. నైరుతి రుతుపవనాలు అనుకూలిస్తాయనే సూచనలు వ్యాపారుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. అయితే గులాబీ పురుగు కారణంగా తెలుగు రాష్ట్రాల్లో పత్తి సాగు కొంతమేర తగ్గే అవకాశం ఉంది. ఎగుమతిదారుల మాయాజాలం కారణంగా ధరల్లో హెచ్చు తగ్గులు వస్తున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే వచ్చే సీజన్లో పత్తి ధరల్లో నిలకడ కొనసాగుతుందని కాటన్ అసోసియేషన్ కార్యదర్శి గొర్రెపాటి రామారావు వివరించారు. ప్రస్తుతం నిల్వలు ఉన్న వాళ్లకు కూడా మంచి ధరే లభిస్తుందని వివరించారు. స్థానిక కొనుగోళ్లు మొదలైతే మార్కెట్ పుంజుకుంటుందని అభిప్రాయపడ్డారు.

అత్యవసరంగా 'మరుగు'కు..

- ఆపుకోవాలన్నా ఆగని దుస్థితి
- పెరుగుతున్న పేగుపూత వ్యాధులు
- 60 శాతానికి పైగా బాధితులు 21-40 ఏళ్ల మధ్య వయస్కులే
- 10 ఏళ్లలోపు పిల్లల్లోనూ 10 శాతం
- 80 శాతంమంది బాధితులు పట్టణాలు, నగరాల్లోని వారే
- అతి శుభ్రత, విచ్చలవిడి యాంటీ బయాటిక్స్,

కడుపు ఉబ్బరంగా ఉంటుంది. నులిపెట్టి తిప్పినట్లుగా అనిపిస్తుంది. అత్యవసరంగా పరుగు పరుగున మరుగుదొడ్డికి వెళ్లాల్సిందే. ఏమాత్రం ఆపుకోలేని.. ఆలస్యం చేయలేని దుస్థితి. ప్రయాణాల్లో అయితే మరీ ఇబ్బంది. ఇంట్లో, కార్యాలయాల్లో ఉన్నా.. మరుగుదొడ్డికి సమీపంలో ఉండాల్సిందే!

ఇది ప్రాణాలు తీసే ప్రమాదకర వ్యాధి కాకపోయినా.. అంతకంటే తీవ్రంగా వేధించే సమస్య.

మన రాష్ట్రానికి చెందిన ప్రముఖ జీర్ణకోశ వ్యాధుల చికిత్స సంస్థ అయిన 'ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ' అధ్యయనం ప్రకారం.. దీని బారినపడుతున్నవారి సంఖ్య తెలుగు రాష్ట్రాల్లో క్రమేణా పెరుగుతోంది. గత ఐదేళ్లలో ఏడాదికి సుమారు 1000కి పైగా వ్యాధిగ్రస్థుల చొప్పున మొత్తంగా సుమారు 5,000కు పైగా పేగుపూత బాధితులు ఇక్కడ చికిత్స కోసం నమోదయ్యారు. ఆధునిక సమాజంలో పెరుగుతున్న 'పేగుపూత వ్యాధుల (ఇన్‌ఫ్లమేటరీ బవల్ డిసీజ్-ఐబీడీ)' తీవ్రతను ఈ అధ్యయనం తెలియజేస్తోంది. ఆధునిక జీవనశైలి ప్రభావం కచ్చితంగా పేగుపూత వ్యాధులపై పడుతోందని అధ్యయనాన్ని పరిశీలిస్తే అవగతమవుతోంది. ఈ వ్యాధులపై వైద్యుల్లోనూ పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో.. రోగుల్లో అత్యధికులు ఏడాది తర్వాత గాని తమకు ఈ వ్యాధి సోకినట్లుగా గుర్తించలేకపోతున్నారు.

ఎందుకొస్తుంది?

- విచ్చలవిడి యాంటీబయాటిక్స్ వాడకం
- కాన్పు కోతలు
- పిల్లలకు చనుబాలు పట్టకపోవడం
- ధూమపానం, మద్యపానం
- తీవ్రమైన ఒత్తిడి
- పశు మాంసం అధికంగా తీసుకోవడం
- ఎక్కువగా ప్రయాణాలు చేయడం
- పర్యావరణ కాలుష్యం
- జన్యుపరమైన కారణాలు

ఏమిటీ వ్యాధి?

సాధారణంగా ఇన్‌ఫెక్షన్ కారణంగా పేగుల్లో వాపు వస్తుంటుంది. అది అమీబియాసిస్ అనే ప్రొటోజోవా వల్ల కావచ్చు.. షిగెల్లా, సాల్మొనెల్లా వంటి బ్యాక్టీరియాల వల్ల కావచ్చు. లేదా పేగుల్లో క్షయ వ్యాధి సోకడం వల్ల కూడా వాపు రావచ్చు. ఇవన్నీ ఏళ్లుగా అనుభవంలో ఉన్నవే.. ప్రొటోజోవాకు, బ్యాక్టీరియాకు చికిత్స ఇస్తే బాగయ్యేవారు. అయితే ఇటీవల కాలంలో ముఖ్యంగా గత పదేళ్లలో ఏ ఇన్‌ఫెక్షన్, ప్రొటోజోవా కారణాలు లేకుండానే పేగుల్లో వాపు కనిపిస్తోంది. శరీరంలో రక్షణగా నిలవాల్సిన అంతర్గత కణాలే ఎదురు తిరిగి ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతున్నాయి. దీన్నే వైద్యపరిభాషలో 'ఆటోఇమ్యూన్ డిసీజ్' అని అంటారు. ఇది రెండు రకాలుగా కనిపిస్తోంది.

1. **అల్సరైటివ్ కొలైటిస్:** పెద్దపేగులో పుండ్లు ఏర్పడడం.
2. **క్రోన్స్ డిసీజ్:** నోటి నుంచి మల ద్వారం వరకూ ఎక్కడైనా పుండ్లు రావచ్చు. ఎక్కువగా చిన్నపేగుల్లో కనిపిస్తుంటాయి. ఈ వ్యాధి అచ్చంగా క్షయను పోలి ఉంటుంది. దీంతో చాలా సందర్భాల్లో వైద్యులు కూడా గుర్తించడంలో పొరబడి.. పేగుల్లో క్షయ సోకిందను కొని చికిత్స చేస్తుంటారు. ఎంతకీ తగ్గకపోవడంతో అప్పుడు 'క్రోన్స్ డిసీజ్'గా గుర్తిస్తారు.

పెద్దపేగులో పుండ్లు పడినప్పుడు ఇలా..

- రక్తపు విరేచనాలు
- చీము బంకలాగా రావడం.
- కనీసం రోజుకు 10-15 సార్లు చీము పడడం.
- బరువు తగ్గిపోవడం.

క్రోన్స్ డిసీజ్‌లో..

- కడుపు ఉబ్బరం
- వాంతులు, వికారం
- నీళ్ల విరేచనాలు
- కడుపునొప్పి, నులిపెట్టినట్లుగా, పిసికినట్లుగా ఉంటుంది.
- ఆకలి తగ్గిపోవడం, బరువు విపరీతంగా తగ్గిపోవడం
- అత్యవసరంగా మరుగుకు వెళ్లాల్సి రావడం
- వెళ్లి వచ్చిన 10 నిమిషాల్లోనే మరోసారి వెళ్లాల్సి రావడం
- కీళ్లనొప్పులు
- కంటిలో ఎరుపుదనం
- పిల్లల్లో ఎదుగుదల తగ్గిపోవడం

మేలు చేసేవి

- ఆహారంలో చేపల్ని తీసుకోవడం
- ఆకుకూరలు, కూరగాయల వాడకం
- వంటల్లో పసుపును ఎక్కువగా వినియోగించడం

చికిత్స

- కొలెనోస్కొపీ, ఎంటరోస్కొపీ, క్యాప్సుల్ ఎండోస్కొపీ వల్ల ఈ వ్యాధుల నిర్ధారణ జరుగుతుంది.
- అల్సరైటివ్ కొలైటిస్‌కు కారణమయ్యే బ్యాక్టీరియాను తిరిగి ఔషధ రూపంలో ఇవ్వడం
- బయోలాజిక్స్, బయో సిమిలర్స్ వంటి ఔషధాలను అందించడం
- మూలకణ చికిత్స
- మల కణాల మార్పిడి.. ఈ చికిత్సలో ఆరోగ్యవంతుడైన వ్యక్తి నుంచి మలం స్వీకరించి.. దాని శుద్ధి చేసి ఔషధంగా కొలెనోస్కొపీ ద్వారా అందజేస్తున్నారు.

చేదు నిజాలు

- అత్యధిక పేగుపూత బాధితులు యువతే
- బాధితుల్లో 21-40 ఏళ్ల మధ్యవయస్కులు సుమారు 60 శాతం
- పదేళ్ల లోపు పిల్లల్లో సుమారు 10 శాతంమంది బాధితులు
- సుమారు 80 శాతానికి పైగా పట్టణాలు, నగరాల్లోని వారే
- దాదాపు 45 శాతం మంది బాధితుల్లో ఏడాది తర్వాత గానీ వ్యాధిని గుర్తించలేదు.

అతి శుభ్రతతోనూ ప్రమాదమే

–డాక్టర్ నాగేశ్వరరెడ్డి, ప్రముఖ జీర్ణకోశ వ్యాధుల నిపుణులు

ఎక్కువగా శుద్ధి చేసిన నీళ్లనే తాగడం, అతి పరిశుభ్రమైన వాతావరణంలో ఉండడం వంటివి కూడా శరీరానికి చేటు కలగజేస్తాయి. దీనివల్ల ఇప్పటి వరకూ మన పొట్టలో ఉన్న బ్యాక్టీరియా మారిపోతుంది. స్వరూపం మార్చుకున్న కొత్త బ్యాక్టీరియా మన శరీరంలోనే అంతర్గతంగా తిరుగుబాటు చేస్తుంది. రక్షణ వ్యవస్థ కణాలు గందరగోళానికి గురై.. సొంత కణాలపైనే దాడిచేస్తుంటాయి. ఇది శాస్త్రీయంగా రుజువైంది. మన దేశం నుంచి అమెరికాకు వెళ్లినవారిలో ఎక్కువమంది ఈ వ్యాధుల బారిన పడుతుండడానికి కారణమిదే. అక్కడ ఇక్కడి కంటే ఎక్కువ పరిశుభ్ర వాతావరణం ఉండడమూ ముఖ్యకారణమే. మన దగ్గర కూడా అలాంటి వాతావరణంలో పెరగడం ఇటీవల కాలంలో ఎక్కువగా అలవాటైంది. అందుకే పట్టణాలు, నగరాల కంటే గ్రామీణంలో కేవలం 20 శాతం మంది మాత్రమే బాధితులున్నారు. గిరిజనుల్లో అయితే మరీ స్వల్పం.

యాంటీ బయాటిక్స్‌తో సమస్య

– డాక్టర్ రూప, జీర్ణకోశ వ్యాధుల నిపుణులు

తేలిగ్గా తగ్గిపోయే దానికి కూడా యాంటీబయాటిక్స్ వాడడం సాధారణమైంది. ముఖ్యంగా పిల్లల్లో విచ్చలవిడి యాంటీబయాటిక్స్‌తో పేగుపూత వ్యాధులు చుట్టుముడుతున్నాయి. వీరిలో ఎదుగుదల ఉండదు. పదేళ్ల పిల్లలు కూడా ఐదేళ్ల వారి మాదిరిగా కనిపిస్తుంటారు. గుర్తించకపోవడంతో హార్మోన్ల చికిత్స కూడా ఇప్పిస్తుంటారు. ఈ కారణంగా పిల్లలు చదువులోనూ వెనుకబడుతుంటారు. సరిగ్గా గుర్తించి చికిత్స చేస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుంది.

- ఈనాడు, హైదరాబాద్

క్రీడా కేంద్రాలుగా అమరావతి, విశాఖ, తిరుపతి

మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రులు కొల్లు రవీంద్ర, అమరనాథరెడ్డి

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: రాజధాని అమరావతి సహా విశాఖపట్నం, తిరుపతి నగరాలను క్రీడా కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్వీయూ తారకరామ స్టేడియం వేదికగా ఆదివారం నుంచి ఈ నెల 7 వరకు జరగనున్న 36వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రతి నియోజకవర్గంలో రూ.3 కోట్లతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా లక్ష్యసాధనకూ దోహదం చేస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 24 బాలుర జట్లు, 23 బాలికల జట్లు తరలివచ్చాయి.

నేటి నుంచి 'మన ఊరు- మన బడి' కార్యక్రమం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు సోమవారం నుంచి 11వ తేదీ వరకు 'మన ఊరు- మన బడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి తెలిపారు. సర్కారు విద్యాలయాల్లో నాణ్యమైన బోధన, సౌకర్యాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించడంతోపాటు.. బడి బయట ఉన్న పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐదో తేదీన అంగన్వాడీ పూర్తిచేసినవారిని, 6న ఐదో తరగతి పూర్తి చేసిన వారిని ఆరోతరగతిలో, 7న ఏడు, తొమ్మిది తరగతులు పూర్తి చేసి బడిబయట ఉన్న పిల్లల్ని, 8న ప్రైవేటు పాఠశాలల్లో చదివేవారిని ప్రభుత్వ పాఠశాలకు ఆహ్వానించడం, 9న బడిబయట ఉన్న పిల్లల్ని బడిలో చేర్పించడం, 10న మురికివాడల్లోని పిల్లల్ని బడిలో చేర్పించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఎన్టీఆర్ విద్యోన్నతి దరఖాస్తు గడువు పొడిగింపు

ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద 2018-19లో ఉచిత సివిల్స్ శిక్షణ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రకటించింది. ఈ నెల 10 వరకూ బీసీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు బి.రామారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. www.jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హత, పూర్తి వివరాలుంటాయని పేర్కొన్నారు.

సీట్లు 64,500.. అభ్యర్థులు 58,732 మంది

తెలంగాణలో ముగిసిన ఇంజినీరింగ్ ధ్రువపత్రాల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: ఎంసెట్ ఎంపీసీ విద్యార్థులు బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన కౌన్సెలింగ్‌కు మొత్తం 58,732 మంది హాజరయ్యారు. ధ్రువపత్రాల పరిశీలన ఆదివారంతో ముగిసింది. ఎంసెట్ ఇంజినీరింగ్‌లో 1.06 లక్షలు అర్హత సాధించినా కొందరు ఇంటర్‌లో తప్పడంతో చివరకు 98 వేల మందికే ర్యాంకులు కేటాయించారు. అంటే కన్వీనర్ సీట్ల కోసం పోటీ పడేందుకు అర్హులైన వారు 98 వేలు ఉన్నా వారిలో 58,732 మంది(60 శాతం) మంది మాత్రమే చివరకు మిగిలారు. కన్వీనర్ కోటా కింద 64,500 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అంటే సీట్ల కంటే అభ్యర్థులే తక్కువ ఉన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరైనా కొందరు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోని వారూ ఉంటారు. ఓయూ రీజియన్ అభ్యర్థులకు 85 శాతం సీట్లు కేటాయిస్తారు. ఆంధ్రా, ఎస్వీయూ, స్థానికేతరులకు 15 శాతం సీట్లు ఉంటాయి. ఈ 15 శాతం సీట్లకు ఓయూ రీజియన్(తెలంగాణ) విద్యార్థులు కూడా పోటీ పడవచ్చు.

రీజియన్ల వారీగా కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు: ఓయూ: 55,354 ★ ఆంధ్రా(ఏయూ): 1807 ★ ఎస్వీయూ: 1157 ★ స్థానికేతరులు: 414

అమెరికా రాజకీయాలపై ప్రవాసాంధ్రులు దృష్టి సారించాలి

- మాజీ ఎంపీ యార్లగడ్డ

ఈనాడు, దిల్లీ, అమరావతి: ప్రవాసాంధ్రులు అమెరికా రాజకీయాలపై దృష్టి సారించాలని మాజీ ఎంపీ, కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభిలషించారు. తెలుగు మహాసభలు నిర్వహించేటప్పుడు అతిథులను రప్పించడానికి వెచ్చించే సొమ్మును స్థానిక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనే భారతీయ అమెరికన్లకు ఖర్చు చేయాలన్నారు. దానివల్ల భావితరాలకు మంచి భవిష్యత్తును కల్పించిన వారవుతారని ఆయన పేర్కొన్నారు. అమెరికా తెలుగు సంఘం (ఆటా), తెలంగాణ అమెరికా తెలుగు సంఘం (టాటా) సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం డాలస్‌లో జరిగిన తెలుగు మహాసభల ముగింపులో ఆయన జీవనసాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగువారు అమెరికా అధ్యక్షుల వుతారని ఎన్టీఆర్ 1993లో న్యూయార్క్‌లో చెప్పారని, ఆ దిశగా ప్రవాసులు కృషి చేయాలని కోరారు. ఎన్టీఆర్ తెలుగు భాషకు ప్రాణం ఇచ్చారని, వైఎస్ఆర్ తెలుగుకు ప్రాచీన హోదాకు కృషి చేశారని కొనియాడారు. ఆటా, టాటా అధ్యక్షులు ఆసిరెడ్డి కరుణాకర్, హరనాథ్ పొలిచర్ల, వ్యవస్థాపకులు హన్మంత్‌రెడ్డి, పైళ్ల మల్లారెడ్డి, ఆటా మాజీ అధ్యక్షురాలు గవ్వా సంధ్యారెడ్డి తదితరులు లక్ష్మీప్రసాద్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

వైఎస్‌కు ప్రతినిధుల నివాళి: వైకాపా

అమెరికాలోని డాలస్‌లో తెలుగు మహాసభల ముగింపు వేడుకల్లో శనివారం 'సెలబ్రేటింగ్ డాక్టర్ వైఎస్ఆర్ లైఫ్, లెగసీ' కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆటా, టాటా ప్రతినిధులు వైఎస్‌కు నివాళులర్పించారని వైకాపా ఆదివారమిక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్ చిరకాల మిత్రులు పలువురు వైఎస్‌తో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారని వెల్లడించింది.

ఆటా-టాటా ప్రతినిధుల నుంచి జీవన సాఫల్య పురస్కారాన్ని స్వీకరిస్తున్న యార్లగడ్డ

వనిత మహీంద్ర భరత్ (పాతచిత్రాలు)

వివాహేతర బంధానికి ముగ్గురు బలి

- తల్లీబిడ్డలను హత్యచేసిన యువకుడు
- అనంతరం ఆత్మహత్య

చిత్తూరు, న్యూస్‌టుడే: అక్రమ సంబంధం నేపథ్యంలో తలెత్తిన అనుమానం మూడు ప్రాణాలను బలిగొంది. చిత్తూరు గ్రామీణ మండలం మర్రిగుంటలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వనిత(33) భర్త మూడేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి ఆమె తన కుమార్తెను తిరుపతిలో, కుమారుడు మహీంద్ర(7)ను చిత్తూరులో ఉంచి చదివిస్తోంది. ఒంటరిగా ఉన్న వనితకు అదే గ్రామానికి చెందిన భరత్(22)తో సంబంధం ఏర్పడింది. మరోవైపు, ఇటీవల వనిత ఇతరులతో చనువుగా మాట్లాడడంతో భరత్‌లో అనుమానం మొదలైంది. అదే సమయంలో తనను పట్టించుకోకపోవడంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వనితను భరత్ కిరాతకంగా కత్తితో దాడిచేసి హత్య చేశాడు. పక్కనే నిద్రిస్తున్న ఆమె కుమారుడు మహీంద్రను సైతం నరికి చంపేశాడు. అనంతరం అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం రక్తపు మడుగులో ఉన్న మృతదేహాలను గుర్తించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. చిత్తూరు ఏఎస్పీ రాధిక సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆస్తి కోసం అమ్మనే చంపేశాడు

మరియమ్మ (పాతచిత్రం)

తాడికొండ, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల పేరు మీద ఉన్న ఆస్తి.. తన పేరు మీద రాయట్లేదనే కోపంతో కన్న కుమారుడే తల్లిని చంపేశాడు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం బడేపురం శివారులో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బడేపురం గ్రామానికి చెందిన బెజ్జం వెంకటేశ్వర్లు, మరియమ్మలకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉన్న ఆస్తిని కుమారులకు పంచి, తమ కోసం కొంత పొలం ఉంచుకున్నారు. వెంకటేశ్వర్లు పెద్దకుమారుడు కిషోర్‌కుమార్ అలియాస్ బాలరాజు(40) మద్యానికి బానిసై మిగిలిన ఆస్తిని సైతం తన పేరు మీద రాయాలంటూ తరచూ గొడవ పడేవాడు. బాలరాజు ప్రవర్తన సరిగా లేకపోవడంతో భార్య సైతం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న కిషోర్ కుమార్ ఆదివారం మరియమ్మ ఇంట్లో వంట చేస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చి కత్తితో వీపుపై పొడిచాడు. దీంతో మరియమ్మ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది.

జలపాతంలో కొట్టుకుపోయిన శాస్త్రవేత్త

కర్ణాటకలోని మైసూరు జిల్లాలో ఘటన

మైసూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని మైసూరు జిల్లా చుంచనకట్టె జలపాతంలో ఆదివారం ఓ శాస్త్రవేత్త కొట్టుకుపోయారు. ఈయనను సీనియర్ శాస్త్రవేత్త సోమశేఖర్ (40)గా గుర్తించారు. ఆయన కోసం గాలిస్తున్నారు. మరో ముగ్గురిని స్థానికులు రక్షించారు. ఓ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో సీనియర్ శాస్త్రవేత్త అయిన సోమశేఖర్ వారాంతాన్ని ఉల్లాసంగా గడిపేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన సందర్భంలో ఈ దుర్ఘటన సంభవించింది. విద్యుత్తు యూనిట్‌కు నీటి సరఫరాను నిలిపివేయడంతో జలపాతంలో నీరు అధికంగా ప్రవహిస్తున్నట్లు తెలిసింది.

శిశువుకేదీ రక్షణ?

- 50 మండలాల్లో శిశు మరణాలు అధికం
- బాల్య వివాహాలే ప్రధాన కారణం
- తొలిసారిగా మండలాలవారీగా గుర్తింపు

ఈనాడు అమరావతి: బాల్య వివాహాలు, గర్భిణి సమయంలో పొరపాట్ల వల్ల శిశు మరణాలు పెరుగుతున్నాయి. గర్భం దాల్చాక పౌష్టికాహారం తీసుకోకపోవడం, క్రమపద్ధతిలో మందులు వాడుతూ వైద్యసలహాలు పొందకపోవడం, దైనందిన కార్యకలాపాల్లో జాగ్రత్తలు తీసుకోని ప్రభావం మాతాశిశు ఆరోగ్యంపై స్పష్టంగా కనిపిస్తోంది. గర్భిణులకు ప్రభుత్వం తగిన ఆరోగ్య సలహాలు, ఆస్పత్రుల్లో ఉచితంగా మందులను అందిస్తున్నా కొన్ని ప్రాంతాల్లో శిశు మరణాల రేటు తగ్గడం లేదు. 2017 ఏప్రిల్ నుంచి 2018 మార్చి వరకు నమోదైన శిశు మరణాల్లో 32శాతం అనంతపురం, విశాఖ జిల్లాల నుంచే నమోదయ్యాయి. వీటితోపాటు శ్రీకాకుళం, గుంటూరు, కడప, చిత్తూరు జిల్లాల్లో గుర్తించిన 50 మండలాల్లో సాధారణ స్థాయికంటే ఎక్కువగా శిశు మరణాలు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతి వెయ్యి మందికి 39 మంది మరణిస్తుండగా రాష్ట్రంలో ఈ సంఖ్య 34 ఉంది. ప్రధానంగా 50 మండలాల్లోనే ఎందుకు ఎక్కువ మరణాలు జరుగుతున్నాయన్న దానిపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టిపెట్టింది. మండలాలవారీగా మరణాల సంఖ్యను గుర్తించి చర్యలు చేపట్టనుండటం ఇదే ప్రథమం. ఏడాదిలోపు మరణించిన శిశువులను లెక్కిస్తున్నారు.

అనంతపురం: జిల్లాలో ఏడాదిలో 584మంది చిన్నారులు మరణించారు. బీకేసముద్రం మండలంలో 50, ఆత్మకూరు-48, సింగనమల-41, అనంతపురం నగరం-41, గార్లదిన్నె-36, ముదిగుబ్బ-33, తాడిపత్రి గ్రామీణ-32, హిందూపురం గ్రామీణ-29, కదిరి-24, విడపనకల్లు-23, కల్యాణదుర్గం గ్రామీణ-21, సోమందేపల్లి-21, యల్లనూరు-20, ఉరవకొండ-20, ధర్మవరం పట్టణం-20, కనగానపల్లె-20, కుందుర్పి-19, మడకశిర-19, కనేకల్-18, పెద్దవడుగూరు-17, పుట్లూరు-16, యాడికి-16.

విశాఖపట్టణం: జిల్లాలో 449మంది చిన్నారులు ప్రాణాలు విడిచారు. విశాఖ అర్బన్‌లో 86, జీకే వీధి-68, పాడేరు-58, హుకుంపేట-52, అంతగిరి-30, జీమాడుగుల-29, చింతపల్లి-27, అంకపల్లి-23, కె.కోటపాడు-22, కొయ్యూరు-19, మాకవారిపాలెం-18, పెదబయలు-17 మంది ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

కడప జిల్లా: పెనగలూరు-36, రాయచోటి-20

శ్రీకాకుళం జిల్లా: మొత్తం 122 మరణాలు. శ్రీకాకుళం-31, ఎచ్చెర్ల-29, సీతంపేట-27, రాజాం-18, వీరఘట్టం-17

చిత్తూరు: నిమ్మనపల్లె-25, బైరెడ్డిపల్లె-17

గుంటూరు: మొత్తం 72 మరణాలు. గురజాల-20, వినుకొండ-18, గుంటూరుగ్రామీణ-17, మాచర్ల-17

నెల్లూరు: నెల్లూరు-20

విజయనగరం: జీఎల్‌పురం-18, కురుపాం-18

శిశుమరణాలకు వైద్యులు చెబుతున్న కారణాలు

- బాల్యవివాహాలు. శిశువుకు తగ్గట్టు గర్భసంచి తయారుకాకపోవడం.
- తక్కువ బరువుతో పుట్టడం. శ్వాసకోశ సమస్యలు
- శిశువులకు ముర్రుపాలు సహా చనుబాలు ఇవ్వలేని స్థితిలో తల్లులు ఉండడం. బయటి పాలు పట్టడం వల్ల ఇన్ఫెక్షన్లకు అవకాశం.
- తీవ్ర అనారోగ్య సమయంలో శిశువులను పెద్దాస్పత్రులకు తరలిస్తుండడంలో జాప్యం.
- గిరిజన ప్రాంతాల్లో ఇంటివద్దే ప్రసవాలు.
- వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన అధ్యయనంలో ఈ ఏడాది జనవరి నుంచి మార్చివరకు రాష్ట్రవ్యాప్తంగా 1939 మంది శిశువులు, 140 మంది తల్లులు మరణించారు. రక్తహీనత, రక్తపోటు సమస్యలు తల్లుల మరణాలకు కారణాలవుతున్నాయి.

ఒకటి, రెండో తరగతుల చిన్నారులకు హోంవర్క్ లేకుండా

పార్లమెంటులో బిల్లు: జావడేకర్

కోల్‌కతా: ఒకటి, రెండో తరగతుల విద్యార్థులకు పాఠశాలలు హోంవర్క్ ఇవ్వకుండా చేసేందుకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడతామని కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ అన్నారు. విద్య వినోదంతో కూడినదై ఉండాలని.. చిన్నారులపై ఒత్తిడి పెంచకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. పాఠశాల బ్యాగుల బరువు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రానికి నిర్దేశిస్తూ.. ఇటీవల మద్రాస్ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి, రెండు తరగతుల్లోనివారికి హోంవర్క్‌ను కూడా తీసేయాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే జావడేకర్ స్పందించారు. కోర్టు నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని.. తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెడతామని అన్నారు.

ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తితిదే ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తితిదే విద్యాశాఖాధికారి పేర్కొన్నారు. వివరాలకు admission.tirumala.org వెబ్‌సైట్‌లో చూడొచ్చు. 0877-2264597 ఫోను నంబరులోనూ సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

చిరుప్రాణులకు చిట్టిచేతుల సాయం

వేసవి ఎండల ప్రభావానికి రోజురోజుకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఆహారం, గుక్కెడు నీరు దొరక్క పశుపక్ష్యాదులు, మూగజీవాలు తీవ్రంగా అల్లాడుతున్నాయి. ఈ క్రమంలో వాటి ఆకలిదప్పులు తీర్చాలని నిర్ణయించుకున్న చిన్నారులు ఆ మేరకు చిరుప్రయత్నాలనూ చేపట్టారు. చిత్తూరులోని బాలభవన్ కేంద్రంలో ప్రస్తుతం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నిత్యం పెద్దసంఖ్యలో పిల్లలు ఇక్కడికి హాజరవుతున్నారు. ఈ ప్రాంగణంలో ఉన్న చెట్లకు ప్లాస్టిక్ పాత్రలు, ఖాళీసీసాలను వేలాడదీసి వాటిల్లో తిండిగింజలు, నీటిని నింపి పక్షులు, చిరుప్రాణులకు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం చిరుప్రాణులు సంబంధిత ఆహారం తింటూ, నీళ్లు తాగుతూ క్షుద్బాధ తీర్చుకుంటున్నాయి. మూగజీవాల పట్ల ఈ చిన్నారుల పెద్దమనస్సును స్థానికంగా ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

– ఈనాడు, చిత్తూరు

ఉడుతలు, పక్షుల కోసం చిత్తూరు బాలభవన్ కేంద్రంలోని చెట్లకు చిన్నారులు చేసిన ఏర్పాట్లు

త్వరలో ఏపీలో ప్రాచీన తెలుగు పీఠం ఏర్పాటు

ఈనాడు, దిల్లీ: కర్ణాటకలోని మైసూరులో ప్రస్తుతం ఉన్న ప్రాచీన తెలుగు భాష అధ్యయన పీఠాన్ని త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటామని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జాతీయ గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, వెంకయ్యనాయుడు మాజీ ఓఎస్‌డీ సత్యకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం తాము ఉపరాష్ట్రపతిని కలిసి ఈ విషయమై విజ్ఞప్తి చేసినప్పుడు.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

పెట్రో, గ్యాస్ ధరల పెంపుపై 9న రాస్తారోకో

- వామపక్ష పార్టీల నిర్ణయం

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీలు వెల్లడించాయి. విజయవాడ గవర్నర్‌పేట ఎం.బి.భవన్‌లో ఆదివారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పెట్రోల్ బంక్ డీలర్ల సంఘం అఖిల భారత నాయకులు ఎం.నారాయణ మాట్లాడుతూ.. పెట్రోలు అసలు ధర కంటే ప్రస్తుతం పన్నులే అధికంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా వినియోగదారులతో పాటు 55వేల మంది డీలర్లు నష్టపోతున్నారన్నారు. ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 9న రాస్తారోకోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో లారీ యజమానుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.సదాశివరావు, జనసేన, లోక్‌సత్తా, ఎంసీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, సీపీఐ (ఎంఎల్) పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

ఈనాడు డిజిటల్, అమరావతి: తెదేపా సింగపూర్ ఫోరం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. సింగపూర్‌లోని స్టిర్లింగ్ రోడ్డులో ఆదివారం నిర్వహించిన సంబంధిత వేడుకలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత నెల 29వ తేదీన నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేసిన పలువురికి ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలను అందజేసినట్లు తెదేపా సింగపూర్ ఫోరం ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

వారెవ్వా!

“లచ్చవ్వా! కచేరి కాడికి అస్తున్నవా?”
“ఆఁ! జర్రాగు.. భూమవ్వ రాని!!”
“నేనైతే పోతవ్వా!! సంఘం కిస్తి కట్టొచ్చి పని చేస్కోవాలె..”
ఆరుపదులు దాటినా.. వీళ్లందరి ముఖాల్లో సంతోషం ఉంది. చేతుల్లో పనుంది. చేతల్లో సమష్టి తత్వం ఉంది. అందరి వెనుకా ఓ సంఘం ఉంది. వయసు పైబడి బాగోగులు చూసేవాళ్లు లేక, పలకరించేవాడు రాక.. భారంగా బతుకీడిస్తున్న వృద్ధుల జీవిత గమనాన్ని పూర్తిగా మార్చేసిన ఘనత హెల్పేజ్ ఇండియా సంస్థకు దక్కుతుంది. పొదుపు సంఘాలతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది.

నా కొడుకు ఆటో నడిపించుకుంటా అంటే సంఘం నుంచి రూ.12వేలు అప్పు ఇచ్చారు. అవి కట్టి ట్రాలీ ఆటో కొని నడుపుతున్నడు. నేనూ, నా భర్త వ్యవసాయ పనులు చేసుకుంటున్నం. మా కుటుంబం ఆదాయం పెరిగింది.

– లోడె అనసూయ, స్వాములవారి లింగోటం

మలి సంధ్యలో.. మళ్లీ పొద్దు

కొడుకు కనికరించాలి.. కోడలు అనుగ్రహించాలి.. మనవడో, మనవరాలో సమర్థించాలి.. అప్పుడు గానీ, ఓ పండుటాకు డొక్క నిండదు! అదే కొడుకు, కోడలు వేరు కాపురముంటే? ఆ వృద్ధులకు ఆకలిమంటలతోనే కడుపు నిండుతుంది! బతుకు దుర్భరం అవుతుంది. జీవిత చరమాంకంలో ఇలాంటి దుస్థితి ఎదుర్కొనే వృద్ధులు ఎందరో! ఇలాంటి వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తోంది ‘హెల్పేజ్ ఇండియా’ సంస్థ. వారిని సంఘంలోకి ఆహ్వానించి.. వృద్ధాప్యంలోనూ సాంఘిక జీవనాన్ని కొనసాగించేలా ప్రోత్సహిస్తోంది. ఆ సంస్థ చొరవతో కృష్ణారామా అనుకునే వయసులో.. పొదుపు మంత్రం పఠిస్తున్నారు వృద్ధులు. రూపాయి రూపాయి పోగేసి.. లక్షల్లో మూటగట్టారు. రుణాలు తీసుకొని.. కడుపున పుట్టినవారికి రుణపడకుండా జీవితాన్ని వెళ్లదీసుకుంటున్నారు.

జీవితాల్లో మార్పు

2015 వరకు ఇక్కడి వృద్ధుల జీవితాలు భారంగా సాగేవి. బిడ్డలు మంచివాళ్లయితే ఇంట్లో చోటు ఉండేది. వేళకు భోజనం ఉండేది. లోకాభిరామాయణమే కాలక్షేపంగా జీవితాన్ని గడిపేవారు. అదే ఏడాది అక్టోబర్‌లో ‘హెల్పేజ్ ఇండియా’ సంస్థ ఇక్కడ అడుగుపెట్టింది. మీ జీవితాలు మార్చేస్తామంటూ ప్రచారం చేసింది. వాళ్లు వెలుగు నింపుతామన్నది పిల్లల చదువుల్లో కాదు, యువత బతుకుల్లో కాదు.. ముసలివాళ్ల జీవితాల్లో! అందరిలో ఆశ్చర్యం. ఎవరూ నమ్మలేదు. “ఇసొంటి సంఘాలు మస్తు జూసినం.. పో పోవయ్యా” అంటూ సంస్థ ప్రతినిధులను గుమ్మం నుంచే వెళ్లగొట్టారు. ఇప్పుడదే సంఘం నీడలో వందల మంది వృద్ధులు సేదతీరుతున్నారు. శేష జీవితాన్ని ఆత్మాభిమానంతో విశేషంగా గడుపుతున్నారు.

వృద్ధుల జట్టు

హాంకాంగ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ (హెచ్ఎస్‌బీసీ) సహకారంతో హెల్పేజ్ ఇండియా సంస్థ వృద్ధులను ఒక్క చోటికి తీసుకురావాలనే లక్ష్యంతో ‘గమన్’ పేరిట జీవనోపాధి ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. మహారాష్ట్ర, పుదుచ్చేరి, పశ్చిమ్ బంగా, తెలంగాణలో ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేసింది. తెలంగాణలో చౌటుప్పల్‌లో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసింది. ముందుచూపున్న వాళ్లు పొదుపు చేయగలరు. పనిచేసే శక్తి ఉన్నవాళ్లు తీసుకున్న రుణాలు తీర్చగలరు. డొక్కాడినా.. రెక్కాడని వృద్ధులకు సంఘాలేంటి? పొదుపు చేయడమేంటి? రుణాలివ్వడం దేనికి? అవి వచ్చే మార్గం ఏమిటి? ఇవేవీ ఆలోచించలేదు హెల్పేజ్ ఇండియా. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ బృహత్కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెలకు రూ.50 చొప్పున పొదుపు చేయాలని.. తాము కూడా అంతే మొత్తం విరాళంగా ఇస్తామని చెప్పింది. సంస్థపై నమ్మకం కుదరడంతో సంఘాల్లో చేరడానికి ఆసక్తి కనబరిచారు. 12 నుంచి 15 మందిని కలిపి ఒక సంఘంగా ఏర్పాటు చేశారు. అందులో ఇద్దరిని నాయకులుగా వాళ్లే ఎన్నుకుంటారు. 55 ఏళ్ల నుంచి మొదలుపెడితే.. 90 ఏళ్లు పైబడిన వృద్ధులూ సంఘంలో ఉన్నారు. ఒక్కో గ్రామంలోని సంఘాలన్నీ కలిసి గ్రామ సమాఖ్యగా ఏర్పడ్డాయి. గ్రామ సమాఖ్యలన్నీ కలిసి మండల సమాఖ్యగా రూపుదిద్దుకున్నాయి. మండలస్థాయిలో ఓ కమిటీని ఎన్నుకున్నారు.

లేదనకుండా రుణం

గమన్ కింద చౌటుప్పల్ మండలంలోని 16 గ్రామాల్లో 204 సంఘాలు ఏర్పడ్డాయి. వీటిల్లో 2,543 మంది సభ్యులున్నారు. ఇంతమంది రూపాయి, రూపాయి పోగేస్తే ఆ మొత్తం 38,34,172 రూపాయలకు చేరింది. ఈ వృద్ధుల సంకల్పానికి హెచ్ఎస్‌బీసీ రూ.23 లక్షలు విరాళంగా అందజేసింది. ఈ డబ్బు మొత్తం వృద్ధులకే. వైద్యానికి తీసుకోవచ్చు. జీవనోపాధికి పెట్టుబడిగా వాడుకోవచ్చు. కోరిన వారికి లేదనకుండా రుణం ఇస్తున్నారు. వాయిదాల ప్రకారం అప్పు తిరిగి చెల్లిస్తారు. నెల నెలా సమావేశాలుంటాయి. ఎవరి అవసరాలు, ఏమిటో తెలుసుకుంటారు. సభ్యులంతా కలిసి తీర్మానాలు చేస్తారు. సాయం అందజేస్తారు. ఆర్థిక అండ దొరకడంతో ఆ వృద్ధుల్లో తమను ఎవరు చూస్తారోనన్న బెంగ లేకుండా పోయింది. ఒకరికొకరు అన్న భావన ఏర్పడింది. తమ వెనుక ఇందరున్నారన్న నమ్మకం కుదిరింది. జీవితమంతా ఎలా గడిచినా.. ఈ వృద్ధుల చివరి మజిలీ మరుపురాని ఘట్టంగా మిగిలిపోయింది. ఆర్థికంగా పురోగమిస్తోంది. ఆనందమయమవుతోంది.

ఆరోగ్య భాగ్యమస్తు

సంఘంలోని సభ్యుల ఆరోగ్యం కోసం వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైద్యంపై అవగాహన ఉన్న వ్యక్తి, మరో స్వచ్ఛంద కార్యకర్త ఆరోగ్య కమిటీ సభ్యులుగా ఉంటారు. వీళ్లు ఇతర సభ్యులకు శిక్షణనిస్తుంటారు. ప్రతి సంఘానికో ‘ఆరోగ్య కిట్’ను అందజేశారు. ఇందులో ప్రాథమిక చికిత్సకు అవసరమైన అన్ని వస్తువులు, మందులు అందుబాటులో ఉంటాయి. నెలకోసారి నిపుణులైన వైద్యులతో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. 185 మంది వృద్ధులకు కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేయించారు. రూ.9 లక్షలు ఖర్చు చేసి 360 మందికి మోకాళ్ల తొడుగులు చేయించి ఇచ్చారు. వైద్య అవసరాలకు సభ్యులకు రుణాలు కూడా మంజూరు చేస్తారు.

ఉపాధి ప్రాప్తిరస్తు

జీవనోపాధి కోసం పెట్టుబడికి అవసరమయ్యే డబ్బు సంఘాలే సమకూరుస్తాయి. చేనేత అనుభవం ఉన్న చాలామంది వృద్ధులు రుణం తీసుకొని సొంతంగా నేత పని చేస్తున్నారు. ఆసరా కోసం ఎదురు చూడకుండా మూడుకాళ్ల వయసుకు దగ్గరవుతున్నా.. సొంతకాళ్లపై నిలబడుతున్నారు. పొదుపు మొత్తాన్ని పొతంగా వీరు వాడుకుంటున్న తీరు అభినందనీయం. ఇటీవల హెల్పేజ్ ద్వారా ఈ సంఘాలకు 4.50 లక్షల కార్పస్ ఫండ్ విడుదలైంది. ఈ డబ్బును 28 మంది వృద్ధులు చేనేత వృత్తికి పెట్టుబడిగా తీసుకొని జీవనోపాధి పొందుతున్నారు.

ఆహార సిద్ధిరస్తు

సంఘంలోని సభ్యులెవరూ అర్ధాకలితో అలమటించరాదనే నియమాన్ని వీళ్లు పాటిస్తున్నారు. ఇందుకోసం ‘ఆహార పదార్థాల బ్యాంకు’లు ఏర్పాటు చేశారు. హెల్పేజ్ సంస్థ సహకారంతో బియ్యం, ఉప్పు, పప్పు వంటి నిత్యావసర వస్తువులను బ్యాంకుల్లో నిల్వ చేస్తున్నారు. అవసరం ఉన్న వాళ్లు ఆహార బ్యాంకులోని వస్తువులను చౌక ధరకే తీసుకుపోవచ్చు. వాయిదాల పద్ధతిలో డబ్బు తిరిగి చెల్లిస్తారు.

కొండంత అండగా

– దూసరి మారమ్మ, స్వాములవారి లింగోటం

నాకు తొమ్మిదేళ్లున్నప్పుడు పెళ్లయింది. నా భర్త పేరు బాలయ్య. పిల్లల్లేరని నా భర్త రెండో పెళ్లి చేసుకుండు. చిన్న భార్యతో వేరే కాపురం పెట్టిండు. ఒంట్లో శక్తున్నంత వరకు కూలి పని చేసుకుంటూ బతికిన. పక్షవాతం లాంటిదొచ్చి ఇప్పుడు నడవలేకున్న. రెండేళ్ల కిందట సంఘంలో చేర్చుకున్నరు. తిండికి ఇబ్బంది పడుతున్నదని ‘ఆహార బ్యాంకు’ నుంచి బియ్యం అందించారు. మా ఆయన రెండోభార్య కొడుకులతో మాట్లాడి నాకు భోజనం పెట్టే ఏర్పాటు చేశారు. సంఘం వాళ్లు అప్పుడప్పుడు వచ్చి పలకరిస్తుంటరు. వాళ్లు నాకు కొండంత అండ.

ఆనంద యోగం

సంఘంలో వారానికోసారి ‘అలయ్‌బలయ్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి గ్రామంలోని వృద్ధులందరినీ ఆహ్వానిస్తారు. అందరూ మాట్లాడుకుంటారు. పాటల పోటీలో పాల్గొంటారు. సహపంక్తి భోజనాలు చేస్తారు. బోసి నవ్వులతో కొందరు, గుండెలోని బాధను మరచిపోయి ఇంకొందరు సంతోషాన్ని మూటగట్టుకుంటారు. కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను జరుపుకొంటున్నారు. టోపీలు ధరించి, బెలూన్లు చేతబూని చిన్నపిల్లలైపోతున్నారు. “రండి చేయి కలుపుదాం ఐక్యంగా సాగుదాం.. నిరాశలు, నిస్పృహలు దరి చేరనీయకుండా.. ఒంటరితనమే విడిచి ధైర్యంగా బతుకుదాం.. శక్తిలేదు అనుకోకు.. బందీగా ఉండొద్దు..” అంటూ స్ఫూర్తి గీతం పాడుకుంటూ ఆనందయోగాన్ని అనుభవిస్తున్నారు. సంఘం కోసం దాత నుంచి 450 గజాల భూమిని సేకరించారు. భవనం నిర్మించేందుకు నిధులు కూడా సమీకరిస్తున్నారు.

– సూరెపల్లి రఘుపతి, న్యూస్‌టుడే, చౌటుప్పల్ ఫొటోలు: కొండ శ్రీనివాస్ గౌడ్

మట్టిమనిషిలో విత్తుకున్న బంధం

నాన్న..పెంచి పోషిస్తాడు... ఎదిగేందుకు కృషిచేస్తాడు.
ఈ నాన్న విత్తనాలను పోషించి పెంచుతాడు. విస్తరించేందుకు కృషీవలుడవుతాడు.
అలా విత్తనాలకే నాన్నైన ధనుంజయనాయుడు ఎక్కడెక్కడి నుంచో అరుదైన విత్తనాలు సేకరిస్తాడు. ఇంటినే పొలంగా మార్చి... సంరక్షిస్తాడు. కనుమరుగైపోకుండా కాపాడతాడు. అందుకే ఆయన 200 రకాల విత్తనాలకు పోషకుడవుతాడు. నిత్య కర్షకుడవుతాడు.

ధనుంజయనాయుడుది చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపాలెం. ఆయన ఊళ్లో ఉంటే ఊరికే ఉండడు. ఎంతసేపూ పొలం పనిలోనే గడుపుతాడు. ఊళ్లో లేడంటే వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతున్న ఏదో ఊరికి వెళ్లి ఉంటాడని అర్థం. దేశమంతా తిరిగేస్తాడు. సాగుపథంలో సాగిపోతూనే ఉంటాడు. ఎక్కడ కొత్తరకం విత్తనం కనిపించినా సేకరిస్తాడు. పాతతరం వంగడం కనిపిస్తే అస్సలు వదిలిపెట్టడు. ఆయన సేకరించిన వాటిలో 35 రకాల టమాటా విత్తనాలు ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వివిధ ప్రాంతాల్లో పండించే టమాటా విత్తనాలు సేకరించి.. వాటిని తన వ్యవసాయ క్షేత్రంలో పండించి.. విత్తన భాండాగారాన్ని సమృద్ధి చేశాడు. వీటితో పాటు 40 రకాల వంకాయలు, ముల్లంగి, చిక్కుడు, ఎర్ర బెండ, ఎర్ర తోటకూర, కళింగ మిరప ఇలా వివిధ రకాల కాయగూరలు పెరటిలోనే పెంచుతున్నాడు. దిగుబడి నుంచి విత్తనాలను సంగ్రహించి నలుగురికీ పంచుతున్నాడు.

సేంద్రియ సాగు

దేశవాళి విత్తనాలను కాపాడాలనే లక్ష్యంతో ఈ పని చేస్తున్నాడు ధనుంజయనాయుడు. ఆయన సమకూర్చిన విత్తనాలు 200 రకాలు ఉన్నాయి. వీటిని సొంతంగా ప్యాక్ చేసి విక్రయిస్తుంటాడు. సాగులోనూ సేంద్రియ పద్ధతులు పాటిస్తాడాయన. గోమూత్రం, ఆవుపేడ, వేపనూనె ఇతర సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగిస్తాడు. మెరుగైన దిగుబడితో పాటు.. మేలైన విత్తనాలను సాధిస్తున్నాడు. మరిన్ని వంగడాలను సేకరించే పనిలో నిమగ్నమై ఉన్నాడు. ఈ రైతునేస్తం కృషిని మనమూ అభినందిద్దాం.

– మహంకాళి కిరణ్‌కుమార్, తిరుపతి
ఫొటోలు: హరి గంగాధర్

భావితరాల కోసం..

చాలామంది హైబ్రిడ్ విత్తనాలు వాడుతున్నారు. దీనివల్ల పంట అయిపోయాక.. మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోతున్నారు. దేశవాళి విత్తనాలు వినియోగిస్తే ఈ సమస్య రాదు. సేంద్రియ పద్ధతులు పాటిస్తే విత్తనాలు కొనాల్సిన అవసరమే రాదు. మొక్క బలంగా ఉంటేనే.. కాపు బాగుంటుంది. అలాంటి కాయగూరల నుంచి తర్వాతి పంటకు అవసరమయ్యే ఆరోగ్యకరమైన విత్తనాలు లభిస్తాయి. ఎప్పటికప్పుడు విత్తనాలను జాగ్రత్త చేసుకోవడం ద్వారా పాతతరం వంగడాలు భావితరాలకు అందజేయవచ్చు.

ఆల్ఫా.. బీటా.. బిబ్లియోబుర్రో..



కొలంబియాలో ఓ ఉపాధ్యాయుడు సంచార గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నాడు. ఇందులో గొప్పేముంది అంటారా? లైబ్రరీ బాధ్యతలు ఆ గురువు గారు చూసుకుంటే.. బరువు మాత్రం రెండు గాడిదలు మోస్తున్నాయి. లూయిస్ సోరియానో కొలంబియాలోని మాగ్దలేనా ప్రావిన్స్‌లో ఉన్న ఓ మారుమూల పల్లె లాగ్లోరియాలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. పాఠశాలలో చదివే విద్యార్థుల దగ్గర పుస్తకాలు కూడా లేకపోవడం లూయిస్‌ను కలవరపరిచింది. పరిసర గ్రామాల్లోని విద్యార్థుల పరిస్థితి కూడా అదే. ఈ సమస్యకు పరిష్కారంగా సంచార గ్రంథాలయాన్ని నిర్వహించాలనుకున్నాడు. తన దగ్గరున్న రెండు గాడిదలను (ఆల్ఫా, బీటా) గ్రంథాలయ నిర్వహణకు వాహనాలుగా ఎంచుకున్నాడు. గాడిదలపై పుస్తకాలు ఉంచి వారాంతాల్లో చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లడం మొదలుపెట్టాడు లూయిస్. కథలు, విజ్ఞాన పుస్తకాలను తీసుకెళ్లి.. విద్యార్థులకు చదివి, అర్థం చేయడమే పనిగా పెట్టుకున్నాడు. 70 పుస్తకాలతో మొదలైన లూయిస్ గ్రంథాలయంలో ఇప్పుడు నాలుగున్నర వేలకుపైగా పుస్తకాలు ఉన్నాయి. ఇరవై ఏళ్లుగా లూయిస్ ఈ సేవలు అందిస్తున్నాడు. ఇంతకీ ఆయన నిర్వహించే గ్రంథాలయం పేరేంటో చెప్పలేదు కదూ.. బిబ్లియోబుర్రో. అంటే స్పానిష్‌లో గాడిదలు మోసే గ్రంథాలయమని అర్థం.

సర్కారు బడికి ప్రేమతో...

ఆ పాఠశాలలో విద్యార్థి ప్రవేశించాలంటే.. ప్రవేశ పరీక్ష రాయాల్సిందే! అందులో ఉత్తీర్ణత సాధించాల్సిందే! అలాగని అది కాన్వెంట్ కాదు.. కార్పొరేట్ పాఠశాల కాదు.. సర్కార్ సక్సెస్ స్కూల్ అంతకన్నా కాదు. మామూలు ప్రభుత్వ పాఠశాల. అయినా దీని ప్రత్యేకతే వేరు. ఇక్కడి ఉపాధ్యాయుల నిబద్ధత, గ్రామస్తుల సహకారం.. ఈ బడిని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలబెట్టాయి.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాధిస్తున్న ఫలితాలు అసాధారణమైనవి. తమ పిల్లల్ని కిష్టాపూర్ పాఠశాలలో చదివిస్తున్నామని తల్లిదండ్రులు గొప్పగా చెప్పుకొంటున్నారు. ఈ పాఠశాల విద్యార్థుల ప్రతిభా పాటవాలు జాతీయ స్థాయిలోనూ చర్చనీయాంశమయ్యాయి. 2010 నుంచి 2018 వరకు 136 మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. గతేడాది ఏకంగా 43 మంది ఈ ఫలితాన్ని సాధించారు. ఈ ఏడాది నిరుపేద గిరిజన విద్యార్థిని బానోత్ సుహాని పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పది జీపీఏ సాధించింది. ఇలాంటి అద్భుత ఫలితాలు సాధించిన నిరుపేద విద్యార్థులు ఇక్కడ ఎందరో. ఎనిమిదేళ్లుగా కిష్టాపూర్ బడి నుంచి పది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఇక మేధా ట్రస్ట్ ద్వారా ఉచిత విద్యను పొందడానికి ఏటా ఒకరు తప్పకుండా ఎంపిక అవుతున్నారు.

అంతేనా?

పచ్చటి పొలాలు, సువిశాలమైన ఆట స్థలం, పెద్ద పెద్ద చెట్లతో ప్రశాంతమైన వాతావరణం కనిపిస్తుందిక్కడ. భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం ప్రయోగశాలలు, గ్రంథాలయం ఈ పాఠశాల సొంతం. ప్రైవేటు పాఠశాలల్లో లేని సౌకర్యాలు ఎన్నో ఉన్నాయి. ప్రొజెక్టర్ ద్వారా విద్యాబోధన చేస్తుంటారు. రోజూ సాయంత్రం ఆటలు, యోగా, ప్రాణాయామం నేర్పిస్తారు. కుస్తీ, కబడ్డీ, సాఫ్ట్‌బాల్ వంటి ఆటల్లో ఈ బడి నుంచి రాష్ట్రస్థాయి ఆటగాళ్లు తయారయ్యారు.

ప్రవేశం సులభం కాదు..

కిష్టాపూర్ పాఠశాలలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో కలిపి 731 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకోవడానికి ఒకప్పుడు ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించే వారు. కానీ ఇప్పుడు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రవేశం కోసం పాఠశాల చుట్టూ తిరగాల్సిందే. పాఠశాలలో నిర్వహించే ప్రతిభ పరీక్షలో కనీస మార్కులు సాధిస్తే తప్ప అడ్మిషన్ లభించదు.

ఇలా ప్రస్థానం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తమ పాఠశాల నిలవాలని ఎనిమిదేళ్ల కిందట అప్పటి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌నాయక్, ఆంగ్ల ఉపాధ్యాయుడు డి.కమలాకర్ భావించారు. ఆనాటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. మొదటి సంవత్సరమే మెరుగైన ఫలితాలు వచ్చాయి. అదే ఉత్సాహంతో పని చేయడం మొదలుపెట్టారు. ఉపాధ్యాయులంతా ఉదయం 7.30 గంటలకే వెళ్లి సాయంత్రం 6 గంటల వరకు పాఠశాలలోనే ఉంటారు. నెలకొకసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సిలబస్ వివరాలు, విద్యార్థుల ప్రతిభ, వారు ఏఏ అంశాల్లో వెనుకబడ్డారు తదితర అంశాలపై చర్చిస్తారు. విద్యార్థుల ప్రదర్శన మెరుగయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తారు. మరుసటి నెల సమీక్ష సమావేశం నాటికి ప్రణాళికలు అమలుపరచి ఫలితాలను విశ్లేషిస్తారు. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లినా ఇక్కడ మాత్రం పద్ధతి మారదు. వచ్చినవారంతా ఈ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. అందుకే కిష్టాపూర్ పాఠశాల ఏటికేడు మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది. ప్రైవేట్ స్కూళ్లను కాదని.. ఈ బడిపై ప్రేమతో 20 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే విద్యార్థులున్నారు. బస్సుల్లో కిష్టాపూర్‌కు వచ్చే పిల్లలు ఎందరో. ఆటోలు కట్టుకొని మరీ పాఠశాలకు హాజరవుతున్నారు.

– పూదరి సత్యనారాయణ, న్యూస్‌టుడే, జన్నారం

ఈనాడు సినిమా

పూజా హెగ్డే

వ్యసనమైనా ఫర్వాలేదు!

కొన్ని అలవాట్లు ఎంత మానేయాలనుకొన్నా సాధ్యం కావు. అవి కాస్త ముదిరి వ్యసనంగానూ మారిపోతుంటాయి. ఆ స్థాయిలో నాకూ ఒక అలవాటు ఉందని చెబుతోంది పూజా హెగ్డే. ఇంతకీ మీకున్న ఆ అలవాటేంటని అడిగితే కూలింగ్ గ్లాసెస్ అంటూ నవ్వేస్తోంది. 'కొత్త ప్రాంతాలకి వెళ్లినప్పుడు తప్పనిసరిగా షాపింగ్ చేయాలనిపిస్తుంది. అక్కడ విరివిగా దొరికే వస్తువుల్ని, ప్రత్యేకంగా అనిపించిన వస్తువుల్ని నాకు అవసరం ఉన్నా లేకపోయినా కొనేస్తుంటా. అలా గుర్తుగా ఇంట్లో ఉంచిన వస్తువులు చాలానే ఉన్నాయి. అయితే ఎక్కడికెళ్లినా నేను మొట్టమొదట వెతికేది కళ్లజోళ్లనే. వాటిని కొన్నాకే మిగతావాటిపైకి మనసు మళ్లుతుంది. కళ్లజోళ్లు కొనడం దాదాపుగా ఒక వ్యసనంగా మారింది. అయినా ఫర్వాలేదు. నా అందాన్ని కాపాడటంలో వాటి పాత్ర చాలా కీలకం కదా" అంటూ చెప్పింది పూజా. ప్రస్తుతం 'అరవింద సమేత'లో నటిస్తోంది. తదుపరి మహేష్, ప్రభాస్‌లతో జోడీ కట్టబోతోంది.

అంతరిక్ష ప్రయాణంలో...

'ఘాజీ'తో విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు సంకల్ప్‌రెడ్డి. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. అదితిరావు హైదరీ, లావణ్య త్రిపాఠీ కథానాయికలు. రాజీవ్ రెడ్డి నిర్మాత. అంతరిక్షం నేపథ్యంలో సాగే కథ ఇది. వరుణ్ వ్యోమగామిగా కనిపించనున్నాడు. ఇందుకోసం హైదరాబాద్‌లో ఓ ప్రత్యేకమైన సెట్ తీర్చిదిద్దారు. అంతరిక్షాన్ని పోలిన ఈ సెట్‌లో యాక్షన్ దృశ్యాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సన్నివేశంలో పాల్గొంటున్న వరుణ్, అదితిరావు తదితరులకు త్రీడీ స్కానింగ్ చేయిస్తున్నారు. నిర్మాత రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ "హాలీవుడ్ సాంకేతిక నిపుణుల సహకారంతో ఈ సన్నివేశాల్ని రూపొందిస్తున్నాం. నిర్మాణానంతర కార్యక్రమాలు జరిగేటప్పుడు ఈ టెక్నీషియన్లు అందుబాటులో ఉండరు. ఈ సెట్ కూడా ఉండదు. అప్పుడు ప్యాచ్‌వర్క్ ఏమైనా మిగిలిపోతే... త్రీడీ స్కానింగ్ ఉపయోగపడుతుంద"న్నారు. ఈ చిత్రం కోసం 'వ్యోమగామి', 'అంతరిక్షం' అనే పేర్లు పరిశీలిస్తున్నారు.

వరుణ్ తేజ్

అరవింద వినోదాలు

త్రివిక్రమ్ సినిమా అంటేనే వినోదాలు పుష్కలం. ప్రతి మాటతోనూ నవ్వులు పంచాలని చూస్తారాయన. ప్రస్తుతం ఎన్టీఆర్‌తో 'అరవింద సమేత వీర రాఘవ' తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. రాధామోహన్ నిర్మాత. రాయలసీమ నేపథ్యంలో సాగే కథ ఇది. యాక్షన్‌కి ప్రాధాన్యం ఉంది. అందుకే ఎన్టీఆర్‌తో సిక్స్‌ప్యాక్ చేయించారు త్రివిక్రమ్. ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో చిత్రీకరణ జరుగుతోంది. ప్రధాన తారాగణంపై కొన్ని వినోదాత్మక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం తొలిసారి ఎన్టీఆర్ రాయలసీమ మాండలికంలో డైలాగులు పలకబోతున్నారు. అందుకు సంబంధించి ఎన్టీఆర్ కాస్త ముందస్తు తర్ఫీదు తీసుకున్నారు. ఎన్టీఆర్ పలికే సంభాషణలు, రాయలసీమ నేపథ్యంలో సాగే సన్నివేశాలు కొత్తగా ఉంటాయని చిత్ర బృందం చెబుతోంది. దసరాకి ఈ చిత్రాన్ని విడుదల చేయాలన్నది దర్శక నిర్మాతల ఆలోచన. అందుకే ఎలాంటి విరామం లేకుండా శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేస్తున్నారు. సంగీతం: తమన్

ఎన్టీఆర్

దటీజ్ మహాలక్ష్మి

బాలీవుడ్‌లో ఘన విజయం సాధించిన చిత్రం 'క్వీన్'. ఇప్పుడు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రీమేక్ చేస్తున్నారు. తెలుగులో 'క్వీన్'గా తమన్నా కనిపించనుంది. తొలుత నీలకంఠని దర్శకుడిగా ఎంచుకున్నారు. ఆయన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రశాంత్ వర్మని తీసుకున్నారు. 'అ'తో దర్శకుడిగా పరిచయమయ్యాడు ప్రశాంత్ వర్మ. ఇటీవలే ఆయన 'క్వీన్' బాధ్యతని తీసుకున్నారు. ఈ చిత్రానికి 'దటీజ్ మహాలక్ష్మి' అనే పేరు పెట్టినట్టు సమాచారం. తమన్నా కెరీర్‌లో మర్చిపోలేని చిత్రం '100% లవ్'. అందులో తమన్నా పేరు మహాలక్ష్మి. 'దటీజ్ మహాలక్ష్మి' అంటూ ఆ సినిమాలో ఓ పాట కూడా ఉంది. నిజానికి '100% లవ్'కి ముందు అనుకున్న టైటిల్ 'దటీజ్ మహాలక్ష్మి'. ఆ తరవాతే '100% లవ్'గా మారింది. ఇప్పుడు ఆ పాత టైటిల్‌ని 'క్వీన్' కోసం వాడుకుంటున్నారన్నమాట. తమిళ 'క్వీన్'గా కాజల్ నటిస్తోంది. ఆ చిత్రానికి 'పారిస్ పారిస్' అనే పేరు పెట్టారు.

తమన్నా

అందమైన ప్రేమకథ

అడవి శేష్, శివానీ రాజశేఖర్ జంటగా నటిస్తున్న చిత్రం '2 స్టేట్స్'. వెంకట్ కుంచం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎం.ఎల్.వి.సత్యనారాయణ (సత్తిబాబు) నిర్మాత. చేతన్ భగత్ నవల '2 స్టేట్స్' ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల కోల్‌కతాలో జరిగింది. నిర్మాత మాట్లాడుతూ "అందమైన ప్రేమకథా చిత్రమిది. శేష్, శివాని జంట కనువిందు చేయనుంది. ఇటీవల కోల్‌కతాలో నాయకానాయికలతో పాటు భాగ్యశ్రీ, రజిత్ కపూర్, లిజి, ఆదిత్య మేనన్ తదితరులపై కీలకమైన సన్నివేశాల్ని చిత్రీకరించాం. త్వరలోనే హైదరాబాద్‌లో మరో షెడ్యూల్ మొదలవుతుంది" అన్నారు. ప్రియా చౌదరి, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ, విద్యుల్లేఖ రామన్, హేమ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఛాయాగ్రహణం: షానియల్ డియో.

శివానీ రాజశేఖర్

పంచ్ డైలాగ్

గురువులేని విద్య, తల్లిదండ్రులను మరచిన వాడి బతుకు రాణించవురా.

చిత్రం: పెదరాయుడు
– పంపినవారు: ఆర్.అశోక్ కుమార్, హైదరాబాద్

గీతోపదేశం

అవకాశం రాలేదంటూ
గుక్కే పెట్టి ఏడొద్దే
ఏనాడో వచ్చుంటాది
నువ్వే వదిలేసుంటావే
చీకటినే తిడుతూ తొంగుంటే
వేకువకీ చోటే లేదులే
నిన్నేం తిరిగిరాదు కదా
రేపేం జరుగుతుందో కదా
నీకై మిగిలి ఉంది ఇక ఈ రోజే

గీతం: పుడుతూనే ఉయ్యాల...
చిత్రం: నేనింతే, రచన: భాస్కరభట్ల
- పంపినవారు: పి.కృష్ణారావు, నూజివీడు

ఏ మాటకామాటే!

"కళంక్'లో శ్రీదేవి చేయాల్సిన పాత్రను నేను చేస్తున్నందుకు ఉత్కంఠగా అనిపిస్తోంది. శ్రీదేవికి, నాకు మధ్య గాఢమైన స్నేహం ఉందని నేను చెప్పను. కానీ ఒకరి పట్ల ఒకరికి గౌరవం ఉండేది. ఇంకా ఎంతో జీవితం ఉండగానే దురదృష్టవశాత్తూ శ్రీదేవి మనకు దూరం కావడం చాలా బాధగా ఉంది. ఆ విషయాన్ని ఇంకా నేను నమ్మలేకపోతున్నాను. ఆమె కుమార్తె జాన్వీది చాలా మంచి మనసు. నేను 'కళంక్'లో చేస్తున్నానని తెలియగానే ట్విట్టర్‌లో అభినందనలు తెలిపింది"

– మాధురీ దీక్షిత్

"విలువ, సమయం, డబ్బు ఖర్చుపెట్టి థియేటర్‌కి వచ్చే ప్రేక్షకుల్ని మెప్పిస్తానో లేదో అనే నేను కంగారు పడుతుంటాను. అంతేకానీ నాకు ఎవరు పోటీ? నా పాత్ర నిడివి ఎంత ఇలాంటి వాటి గురించి అసలు ఆలోచించను. నా సినిమా చూసిన ప్రేక్షకులు థియేటర్ నుంచి సంతోషంగా వెళితే అంతకంటే గొప్ప అవార్డు ఏదీ ఉండదు. అదే లక్ష్యంగా నా ప్రయాణం సాగుతుంది"

– దిశా పటానీ

అక్షయ్‌కు భార్యగా?

'వీరె ది వెడ్డింగ్'కు వస్తున్న స్పందనతో ఆనందంగా ఉంది అందులో ఓ కీలక పాత్ర పోషించిన కరీనాకపూర్. ఓ బిడ్డకు తల్లయ్యాకా ఆమె నటించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. మరి కరీనా తర్వాత చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సమాధానం దొరికినట్టే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. కరణ్‌జోహార్ సంస్థలో ఓ చిత్రం చేయడానికి కరీనా అంగీకరించినట్టు సమాచారం. కొత్త దర్శకుడు రాజ్ మెహతాతో ఓ సినిమాను తెరకెక్కించనున్నారు కరణ్. అందులో తల్లి పాత్రలో కరీనా నటించనుందట. మాతృత్వపు మాధుర్యాన్ని అనుభవిస్తున్న కరీనా ఈ పాత్రకు సరిగ్గా సరిపోతుందని చిత్రవర్గాలు భావిస్తున్నాయట. ఇందులో కథానాయకుడిగా అక్షయ్‌కుమార్ నటించే అవకాశాలున్నాయి. "భార్యాభర్తల కథ ఇది. ఇందులో కరీనా సరసన ఓ సీనియర్ నటుడు అయితే బాగుంటుందని అక్షయ్‌ను సంప్రదించి కథ వినిపించారు. ఆయనకు బాగా నచ్చింది"అని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. అక్షయ్, కరీనా జోడీ పలు చిత్రాల్లో నటించి మెప్పించారు. అక్షయ్ నటిస్తున్న 'హౌస్‌ఫుల్ 4' పూర్తయ్యాకా నవంబర్ నుంచి ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.

అక్షయ్

కరీనా కపూర్

జీవిత కథతో...

అర్జున్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'బగ్గిడి గోపాల్'. మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ జీవిత కథతో ఆయనే ప్రధాన పాత్రధారిగా ఈ చిత్రం రూపొందుతోంది. సుమన్, కవిత, గీతాంజలి, రమాకాంత్, మహేష్, చందన ఇతర కీలక పాత్రలు పోషించారు. జయసూర్య స్వరాలు సమకూర్చిన ఈ చిత్రంలోని గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య ముఖ్య అతిథిగా హాజరై తొలి సీడీని విడుదల చేశారు. నటి జమున, ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, మాజీ మంత్రి మారెప్ప వేడుకకి హాజరయ్యారు. ఈ సందర్భంగా బగ్గిడి గోపాల్ మాట్లాడుతూ "నా జీవితంలో యువతరానికి స్ఫూర్తినిచ్చే అంశాలు ఉన్నాయి. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నేను బస్సు కండక్టర్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగా. రాజకీయాల్లో నిజాయతీగా ఉన్నా. విద్యాసంస్థల్ని నెలకొల్పి ప్రస్తుతం ఎంతోమంది విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నా. నా 35 యేళ్ల మనోవేదనకి ప్రతిరూపంగా ఈ చిత్రం తెరకెక్కింది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. ఇందులో ఎనిమిది పాటలున్నాయి. జయసూర్య స్వర పరిచిన గీతాలు ఆకట్టుకుంటాయి" అన్నారు. అర్జున్‌కుమార్ మాట్లాడుతూ 'జీవిత కథతో తెరకెక్కుతున్న చిత్రమైనా వాణిజ్యాంశాలు పుష్కలంగా ఉంటాయి" అన్నారు.

చందన, మహేష్

హాలీవుడ్‌కి లుంగి డ్యాన్స్

లుంగి డ్యాన్స్..లుంగి డ్యాన్స్ అంటూ 'చెన్నై ఎక్స్‌ప్రెస్'లో షారుఖ్‌ఖాన్, దీపిక పదుకొణె వేసిన స్టెప్పులు ఉర్రూతలూగించాయి. ఇప్పుడు ఈ లుంగి డ్యాన్స్ హాలీవుడ్‌కీ వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'ట్రిపుల్‌క్స్: రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్'తో హాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది దీపిక. ఈ చిత్రం ప్రచారం కోసం విన్ డీజిల్ ఇండియాకు వచ్చినప్పుడు ఆయనతో కలిసి దీపిక చేసిన హాట్ హాట్ లుంగి డ్యాన్స్ సినిమాకీ మరింత ప్రచారాన్ని తెచ్చింది. ఈ పాట హాలీవుడ్ దర్శకుడు డి.జె.కురుసోను బాగా ఆకట్టుకుందట. అందుకే ఏది ఏమైనా 'ట్రిపుల్‌క్స్ 4'లో లుంగి డ్యాన్స్ పెట్టాలనుకుంటున్నాడట. "ట్రిపుల్‌క్స్ 4'ని బాలీవుడ్ డ్యాన్స్ సాంగ్‌తో ముగించాలి అనుకుంటున్నాను. బహుశా అది దీపికా లుంగి డ్యాన్స్‌లా కొత్తగా ఉండాలనుకుంటున్నాను"అని ట్వీట్ చేశాడు. కానీ ఈ చిత్రంలో దీపికా నటిస్తుందో లేదో అనే విషయంపై మాత్రం స్పష్టత రాలేదు.

దీపిక పదుకొణె

స్కూళ్లు మొదలవుతున్నాయంటే చాలు... పిల్లల గురించి తల్లుల్లో కంగారు... ఏం తింటారో? ఎలా తింటారో అని! లంచ్ బాక్సు తినకుండా, తిరిగి తీసుకురాకుండా ఏం చేయాలా అని! అందుకే ఏడాది పొడవునా ఎదురయ్యే ఈ సమస్యకి ఇప్పుడే చెక్‌పెడదాం. అదెలాగో చెబుతున్నారు పోషకాహార నిపుణులు...

లంచ్‌బాక్స్ లొట్టలేసుకు తినేలా!

చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలంటే...సరైన పోషకాహారం అవసరం. కానీ అసలు వారితో ఆహారం తినిపించడమే ఆ తల్లులకు కత్తిమీద సాము. ఇంట్లో ఉండే చిన్నారులకు ఏదో ఒకటి తినిపించొచ్చు. కానీ బడికెళ్లే పిల్లల విషయంలో ఇది మరింత కష్టం. ముఖ్యంగా పదేళ్ల లోపు చిన్నారులు తిండి విషయంలో చేసే మారాం అంతా ఇంతా కాదు. దీనివల్ల నీరసించిపోతారు. చదువుల్లో వెనకబడిపోతారు. పోషకాహారలోపం ఇబ్బందిపెడుతుంది. దగ్గరుండి తినిపించే అవకాశం ఉండదు కాబట్టి లంచ్ బాక్సు లోనే వీలైనన్ని పోషకాలు అందేలా చూడటం తప్పనిసరి. అది పోషకాల మిళితమై రుచికరంగా, ఆకర్షణీయంగా కనికట్టు చేయాలి. ఈ ఆహారంలో కొవ్వు, సంక్లిష్ట పిండిపదార్థాలూ, మాంసకృత్తులూ... వంటివాటితో పాటు విటమిన్లన్నీ అందాలి.

సర్దేయండిలా..

ఒకప్పుడు బాక్సులో అన్నం, పప్పు, కూర, పెరుగు లాంటివి పెడితే చెల్లిపోయేది. ఇప్పుడు పిల్లలు అలాంటివి ఇంట్లో తినడానికే ఇష్టపడతారు తప్ప బళ్లో కాదు. రెండు మూడు డబ్బాలు కూడా వాళ్లకు అంతగా నచ్చకపోవచ్చు. ఒకటీ లేదా రెండు డబ్బాలు అదీ వీలైనన్ని పోషకాలూ, కూరగాయలు అందించేలా ఉండాలి. దానికీ ఓ పద్ధతుంది.

కూరగాయలతో అన్నం: ఇలా చెప్పే పిల్లలకు చక్కని పరిష్కారం వెజిటబుల్ రైస్. క్యారెట్, బీన్స్, బఠాణీలూ... ఇలా అన్ని కూరగాయలతో చేసిచ్చే అన్నం వారికి నచ్చుతుంది. సువాసనతో పిల్లల్ని ఇంకాస్త ఎక్కువగా ఆకట్టుకుంటుంది. కావాలనుకుంటే ఇందులోనే సెగనలూ, రాజ్మా కూడా వేయొచ్చు. ఎప్పుడూ ఇదేనా అడిగే చిన్నారులకు అచ్చంగా క్యారెట్ రైస్, పుదీనా, పాలకూర, మెంతికూర... ఇలా రకరకాల ఆకుకూరలతో అన్నం వండి ఇవ్వొచ్చు. అయితే ఇలా వండేటప్పుడు నూనె బదులు నెయ్యి వాడితే మంచిది. ఇక, దాంతోపాటూ క్యారెట్, కీరా, ఉల్లిపాయ, టొమాటోతో పెరుగు పచ్చడి చేసిస్తే తరచూ అదే కావాలని అడగక మానరు. పెరుగన్నం కూడా పాత పద్ధతిలో కాకుండా కొద్దిగా కొత్తిమీర తరుగూ, దానిమ్మగింజలూ, క్యారెట్ తురుమూ, తాలింపు వేసి చేసిస్తే మరీ మంచిది. బఠాణీలు పిల్లల ఎదుగుదలకు అవసరమైన విటమిన్ ఏ ని పుష్కలంగా అందిస్తాయి. గుడ్డు తినిపించాలనుకుంటే అన్నంలో కాకుండా ఉడికించి చక్రాల్లా కోసి ఉప్పు, మిరియాలపొడి చల్లిస్తే సులువుగా తినేందుకు ఇష్టపడతారు.

చపాతీలను చుట్టేద్దాం... ఒక గిన్నెలో చపాతీలూ, మరో దాంట్లో కూర పెట్టిస్తే...వాళ్లకు నచ్చదు. వాటిని ఫ్రాంకీల్లా చుట్టేయండి. వాటిల్లో కూరగాయ ముక్కలూ, కాస్త పనీర్, మీల్‌మేకర్ కూడా పెడితే మరీ మంచిది. అప్పుడప్పుడూ పనీర్ పరోటా, ఆలూ పరోటా వంటివీ చేసివ్వండి. పావ్‌బాజీ తరహాలో కూర చేసి ఇచ్చినా మంచిదే. ఏ కూరగాయ వాడామో కూడా తెలియదు కాబట్టి నచ్చదు అనే మాట రాదు. ఇవి ఆకట్టుకునేలా కనిపించడానికి అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టండి.

పాస్తా ప్రత్యేకంగా... మీ పిల్లలకి నూడుల్స్ అంటే ఇష్టమా? కానీ అవి ఆరోగ్యానికి మంచివి కాదని పెట్టట్లేదా? అయితే ప్రత్యామ్నాయంగా గోధుమలతో చేసిన పాస్తాను ప్రయత్నించొచ్చు. వీటి తయారీలో క్యారెట్, ఆకుకూరలూ, క్యాబేజీలను సన్నగా తరిగి కలిపి ఇవ్వండి. అదనంగా చీజ్, వైట్‌సాస్, పనీర్ వంటివి వాడితే పోషకాలు సమృద్ధిగా అందుతాయి.

చిరుధాన్యాలు ప్రయత్నిద్దాం: చిన్నారుల ఎదుగుదలలో చిరుధాన్యాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పుడు బజార్లో చిరుధాన్యాలతో చేసిన రవ్వ దొరుకుతోంది. కూరగాయముక్కలన్నీ వేసి కిచిడీ, ఉప్మా, పొంగలి తరహాలో చేసి ఇవ్వొచ్చు. ఉదాహరణకు కొర్రలతో కట్టుపొంగలీ, దద్ధ్యోధనం, కిచిడీ... వంటివి చేస్తే ఇష్టంగా తింటారు. చేయడం కూడా సులువే.

డా. లతాశశి
పోషకాహార నిపుణురాలు
ఫెర్నాండెజ్ హాస్పిటల్

ఆహారంపై ఇష్టం పెంచాలంటే...

- పిల్లలకు ఎప్పుడూ ఒకే లంచ్ బాక్సు ఆసక్తిగా అనిపించదు. రోజుకో బాక్సు...అదీ వేర్వేరు ఆకృతుల్లో ఉన్నవైతే ఇష్టంగా పట్టుకెళ్తారు. వాటిల్లో ఆహారం పెట్టిస్తే తినాలన్న ఆసక్తీ పెరుగుతుంది.
- మొదటిసారి బడికి వెళ్లడానికి ముందే చిన్నారులకు సొంతంగా తినడం అలవాటు చేయాలి. అది మాత్రమే కాదు చేతులు కడుక్కోవడం, మూతి తుడుచుకోవడం, తినే పద్ధతి వంటివన్నీ తప్పనిసరిగా అలవాటు చేయాలి. దీనివల్ల వారు బడికి వెళ్లినప్పుడు సులువుగా తినగలుగుతారు.

- చేదూ, పులుపూ, కారం...ఇలా అన్నిరుచులూ కలిస్తేనే ఆహారం సంపూర్ణం. అందుకే వారికి అన్ని రుచులూ పరిచయం చేయాలి. ముఖ్యంగా తల్లిదండ్రుల తమ ఇష్టాయిష్టాలను పిల్లల మీద రుద్దకూడదు.
- పిల్లలు స్కూలు నుంచి రాగానే ఏదో ఒక చిరుతిండి పెడుతుంటాం. అయితే అవి నూనెల్లో వేయించినవి కాకుండా డ్రైఫ్రూట్స్, పల్లీ పట్టీ, నువ్వుల లడ్డూ, ఓట్స్ బిస్కెట్లు. .వంటివి అందించగలిగితే పోషకాహారలోపం అధిగమించొచ్చు.
- ఇతర ఆహార పదార్థాలతో పాటు కాలానుగుణంగా వచ్చే అన్ని పండ్లూ తప్పనిసరిగా పిల్లలతో తినిపించాలి. ఇవి జ్యూస్‌ల రూపంలోకాకుండా నేరుగా తినేలా చూడండి. తప్పనిసరి అయితే మిల్క్‌షేక్‌ల్లా చేసివ్వండి. అవసరాన్ని బట్టి ఆయా పండ్లను చక్కని ఆకృతుల్లో కత్తిరించి ఇస్తే ఇష్టంగా తినగలుగుతారు.

జుట్టుకు స్పా ఇంట్లోనే...

జుట్టుకు పోషణ అంది, ఆరోగ్యంగా కనిపించాలంటే స్పాకి వెళ్లడమే సరైన పరిష్కారం అనుకుంటారు కొందరు. అవసరం లేదు. ఆ స్పా చికిత్సనే మనం ఇంట్లోనూ ప్రయత్నించొచ్చు. అదెలాగంటే...

- జుట్టును బట్టి పావు కప్పు లేదా అరకప్పు కొబ్బరి నూనె తీసుకుని గోరువెచ్చగా చేసుకోవాలి. దానికి అంతే పరిమాణంలో ఆలివ్‌నూనె కలిపి తలకు రాసుకోవాలి. ఇప్పుడు మునివేళ్లతో నెమ్మదిగా మాడుని మర్దనా చేయాలి. ఇలా కనీసం ఐదు నుంచి పది నిమిషాలు చేస్తే తల్లో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది.
- ఆ తరువాత రెండు కోడిగుడ్ల సొనకు కొద్దిగా కొబ్బరినూనె, అరటిపండు గుజ్జు, పెరుగూ కలిపి మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని బాగా కలిపి కుదుళ్ల నుంచి చివర్ల వరకూ తలకు ప్యాక్‌లా వేసుకోవాలి. లేదంటే మరో ప్రత్యామ్నాయం కూడా ఉంది. బీట్‌రూట్‌ని తురిమి మందారపూల పొడితో కలిపి తలకు పూతలా వేసుకోవాలి. మందారపూల పొడిలో ఇనుమూ, ఇతర విటమిన్లు ఉంటాయి.
- ప్యాక్‌ని ఓ పదిహేను నిమిషాలు ఉంచాక వేడి నీటిలో తువాలును ముంచి... గట్టిగా పిండేసి తలకు చుట్టుకోవాలి. లేదంటే స్టీమర్‌నీ ఉపయోగించొచ్చు. ఆవిరి తలకు పట్టి ఆ ప్యాక్‌లోని పదార్థాల సుగుణాలు మాడుకి మేలు చేస్తాయి. జుట్టుకి పోషణని అందిస్తాయి.
- ఇలా ఓ పావుగంట ఉంచి గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి. వేడినీళ్లు జుట్టుకి హానిచేస్తాయి కాబట్టి గోరువెచ్చని నీళ్లను ఎంచుకోవడమే మేలు. చివరిగా తల తడిగా ఉన్నప్పుడే కొద్దిగా కండిషనర్ రాసుకుంటే సరి. స్పా చికిత్స పూర్తయినట్లే. ఇలా నెలకోసారి చేస్తే చాలు... జుట్టు ఆరోగ్యంగా పట్టుకుచ్చులా మెరిసిపోతుంది.

***

ప్రేమించే ముందు... ఒక్కక్షణం

ప్రేమలో పడ్డవారికి అదే ప్రపంచం అవుతుంది. ఎవరేం చెబుతున్నా వినిపించుకోరు. పట్టించుకోరు. ఈ రెండే కాదు... అలాంటి చాలా పొరపాట్లే చేస్తారట అమ్మాయిలు. అదే వాళ్లకు సమస్యలు తెచ్చిపెడుతుంది.

- ప్రేమలో పడిన వెంటనే చాలామంది అమ్మాయిలు చేసే మొదటి పొరపాటు స్నేహితుల్ని దూరం పెట్టేయడం. అతనే భవిష్యత్తు, ప్రపంచం అనుకుంటారు. కావచ్చు కానీ దానికోసం స్నేహితుల్నీ, సరదాల్ని వదులుకోవాలని లేదుగా. వాళ్లతోనూ కొంతసమయం గడిపేలా చూసుకోవాలి. లేదంటే ఏదయినా సమస్య వచ్చినప్పుడు చెప్పుకోవడానికి, సాయం అడిగేందుకు స్నేహితులు ఉండకపోవచ్చు.

- వాళ్ల ప్రవర్తనను అర్థం చేసుకోలేకపోవడం... మాట్లాడే తీరు, ఎదుటివారితో వ్యవహరించే విధానం, కోపం ప్రదర్శించే వైనం... ఇలాంటివి గమనిస్తే మనం ఎదుటివాళ్ల వ్యక్తిత్వాన్ని ఎంతో కొంత అంచనా వేయగలుగుతాం. దురుసుగా ప్రవర్తిస్తున్నా, అతికోపం వ్యక్తం చేసినా, ఇతరులను అదే పనిగా విమర్శిస్తోన్నా పట్టించుకోనట్లు వదిలేయకూడదు. భవిష్యత్తులో మీతోనూ అలాగే వ్యవహరించొచ్చని ఆలోచించాలి.
- స్నేహితులు అతని గురించి చెడుగా చెప్పినప్పుడు పట్టించుకోరు అమ్మాయిలు. కావాలని చెబుతున్నారని స్నేహితులకు దూరం జరగడం మొదలుపెడతారు. కానీ ఆ మాటల్ని హెచ్చరికలుగా భావించాలి. నిజమో, కాదో నిర్ధరించుకునే ప్రయత్నం చేయాలి. లేదంటే అతని నుంచి మీకే సమస్యలు ఎదురుకావచ్చు.
- ఒకవ్యక్తిలో లోపాలున్నాయని తెలిసినా ఇష్టపడుతుంటారు కొందరు. మార్చుకోవడం ఎంతసేపు అనుకుంటారు. కానీ అది సరికాదు. అవతలివ్యక్తి మీరు అనుకున్నట్లు మారకపోవచ్చు. అందుకే లోపాలను తెలుసుకుని అంచనా వేసుకున్నాకే ఇష్టపడాలా వద్దా అనేది నిర్ణయించుకోవాలి.

అలా నడవలేకపోతే...

ఎత్తు చెప్పులు వేసుకుని నడవడం నిజంగా ఒక కళ. అయితే వాటిని వేసుకున్నప్పుడు తడబడకుండా నడవాలంటే కొన్ని మెలకువలు పాటించి చూడండి.

- ఎత్తు చెప్పులు కొత్తయితే మొదట్లోనే ఎక్కువ ఎత్తు ఉన్న వాటి జోలికి పోకూడదు. కొత్తలో ఒకటీ, ఒకటిన్నర అంగుళాల కన్నా ఎక్కువ ఎత్తు లేకుండా చూసుకోవాలి. ముందు వైపు కప్పి ఉండే హీల్ , వెనుక వైపు ఆసరా ఉండే బెల్ట్ రకాలను ఎంచుకుంటే కాళ్లకు కాస్త పట్టు ఉంటుంది. వాటికి అలవాటు పడ్డాక ఇతర రకాలు ప్రయత్నించొచ్చు.
- అడుగు వేసేటప్పుడు తడబడకుండా ఉండాలంటే చెప్పు వెనకభాగం... అంటే హీల్ నేలను తాకి, ఆ తరువాత చెప్పు ముందుభాగం నేలను తాకాలి. దానివల్ల పడిపోతామనే భయం ఉండదు. వీలైతే ఇంట్లో ఏవయినా పాటలు పెట్టుకుని వాటికి అనుగుణంగా నడుస్తూ సాధన చేస్తే కొంతవరకూ అలవాటు అవుతుంది.

- ఎత్తు చెప్పులు వేసుకోవాలనుకున్నప్పుడు ట్రెండ్స్ కంటే సౌకర్యమే ముఖ్యం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. అలానే మీ పాదానికి సరిగ్గా నప్పేవాటినే ఎంచుకోవాలి. అంటే పాదం కంటే కాస్త పెద్దా, లేదంటే చిన్న వాటిని వేసుకోవడం వల్ల అడుగులు తడబడతాయి. మడమలూ నొప్పి పుడతాయి.

నజరానా

పిల్లలకు తలంటుతుంటే కళ్లచుట్టూ పెట్రోలియం జెల్లీ రాస్తే కళ్లలోకి కుంకుడుకాయ రసం, షాంపూ వెళ్లకుండా ఉంటాయి.

పేపర్‌తో పదిహేనువేల బహుమతి!

ఇరవై సంవత్సరాల వయసులో కాలక్షేపం కోసం మొదలుపెట్టిన ఒక ఆలోచనను వ్యాపారంగా మార్చుకుంది హైదరాబాద్‌కు చెందిన నిఖితా రోచిరమణి. కాగితంతో చిన్న చిన్న బహుమతులు తయారుచేయడం మొదలుపెట్టిన ఆమె ఇప్పుడు కార్పొరేట్ వేడుకలకు కానుకలు అందిస్తోంది. కాగితమే తన ఆదాయానికి ఆయుధమంటున్న ఆమె వివరాలు తెలుసుకుందాం.

నేను గ్రాఫిక్ డిజైనింగ్ విద్యార్థిని. నా డిగ్రీ చివరి సంవత్సరంలో ఉన్నప్పుడే కాగితంలో వివిధ వస్తువులు తయారు చేయడం అలవాటైంది. వాటిని చూసి కొంతమంది స్నేహితులు వాళ్లకీ తయారు చేసివ్వమని అడిగేవారు. దాంతో కొంత డబ్బు వచ్చేది. కానీ డిగ్రీ పూర్తయ్యాక దీని గురించి పెద్దగా ఆలోచించలేదు. వెంటనే ఉద్యోగంలో చేరిపోయా. ఓ సారి స్నేహితురాలి పుట్టిన రోజుకోసం ఒక బహుమతి చేశా. దాన్ని కాస్త భిన్నంగా, మా ఇద్దరి అనుబంధానికి ప్రతీకగా ఉండేలా కాగితంతో తయారు చేశా. అది అందరికీ నచ్చింది. అప్పటి నుంచి మా స్నేహితులూ, బంధువుల్లో కొంతమంది మాకూ చేసివ్వమంటూ అడిగేవారు. అలా ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయంలో పేపర్‌తో ఎక్స్‌ప్లోజన్ బాక్సులూ, ఫ్రేములూ, హ్యాంపర్లూ, థీమ్‌బేస్డ్ బహుమతులూ వంటివెన్నో చేయడం మొదలుపెట్టా.

ఒక్క ఆర్డరుతో మొదలుపెట్టా...

ఆర్డర్లు క్రమంగా పెరగడంతో 2015లో నా స్నేహితురాలు ఆకృతితో కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో, ఫేస్‌బుక్‌లో పేపర్‌టవర్స్ పేరుతో ఒక పేజీని ప్రారంభించా. వ్యాపారం విస్తరించుకోవడం కోసం వివిధ ఎగ్జిబిషన్లలో మేం తయారుచేసిన వస్తువులను ప్రదర్శనకు ఉంచేవాళ్లం. మొదట్లో నెలకు కేవలం ఒక్క ఆర్డర్‌ని మాత్రమే అందుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య సుమారు వందకు పైగా ఉంది. దీనికి సృజనాత్మకత అవసరం. కాస్త సమయం, సహనం పెడితే చాలు... ఎన్నో అందమైన ఆకృతుల్ని తీర్చిదిద్దవచ్చు. పది రూపాయల ఖరీదున్న కాగితానికి మా శ్రమా, పనితనం జతచేసి ఖరీదైన బహుమతిగా మార్చుతాం. అంత డబ్బు పెట్టి చేయించుకున్న బహుమతి నీళ్లు పడినా పాడైపోకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పెళ్లీ, పుట్టినరోజూ, ఫ్రెండ్‌షిప్ డే, ఫాదర్స్‌డే... ఇలా సందర్భం ఏదైనా ఎలాంటి బహుమతి ఇవ్వాలనుకుంటున్నారో చెబితే చాలు. దానికి కొంత సమాచారం, ఫొటోలు సేకరించి చూడచక్కని కానుకలు అందిస్తాం. ఆర్డర్‌ను బట్టి ఒక్కో బహుమతి తయారు చేయడానికి అయిదు రోజుల వరకూ సమయం పడుతుంది. వీటి ధరలు వంద రూపాయల నుంచి పదిహేను వేల వరకూ ఉన్నాయి. ఇలా ఇప్పటివరకూ రెండు వేల డిజైన్లు తయారు చేశాం. మా ఖాతాదారుల్లో కొన్ని కార్పొరేట్ సంసలూ ఉన్నాయి. ఇప్పుడు మేం కానుకల తయారీతో పాటు వివిధ వేడుకల్లో కాగితంతో అలంకరణాలూ చేస్తున్నాం.

పాపని వదిలేయకపోతే విడాకులు ఇస్తానంటున్నాడు

? నాకు ఐదేళ్ల క్రితం పెళ్లయ్యింది. మాకు మూడేళ్ల పాప ఉంది. ఆమె ఆటిజం సమస్యతో బాధపడుతోంది. పాపకు చికిత్స అందించాల్సిన సమయంలో "అలాంటి పాప మనకొద్దు అంటున్నారు అత్తింటి వాళ్లు". దాన్ని ఆయన ఖండించాల్సింది పోయి సమర్థిస్తున్నారు. ఒక వేళ పాపని కనుక వదిలేయకపోతే... నాకు విడాకులు ఇచ్చేస్తానంటున్నారు. కడుపున పుట్టిన పాప బాధ్యత ఆయనకి లేదా! కోర్టుద్వారా ఆయనికి చెప్పించలేనా? పైగా నా అనుమతి లేకుండా ఈ కారణం చూపించి విడాకులు తీసుకోవడం సాధ్యమేనా?

- ఓ సోదరి

✔ పాప ఎదుగుదలను కారణంగా చూపించి విడాకులు తీసుకోవడం సాధ్యం కాదు. ఇందుకోసం పాపని వదిలేయమనడం, విడాకులు ఇస్తానని బెదిరించడం రెండూ నేరమే. మీరు భయపడాల్సిన పనిలేదు. హిందూ వివాహ చట్టం సెక్షన్ 13 కింద విడాకులు కోరడానికి కొన్ని కారణాలు పొందుపరిచారు. అందులో పిల్లలు మానసిక సమస్యల గురించి ప్రస్తావన లేదు. ముందుగా మీరు చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఈ సమస్య గురించి ఫిర్యాదు చేయండి. అత్తింటివారు పెడుతున్న మానసిక క్షోభ గురించి ముందు ఫిర్యాదు చేయండి. బాలల న్యాయ సహాయ చట్టం సెక్షన్ 27 ప్రకారం...తల్లిదండ్రులు ఉన్నా భద్రత పొందని పిల్లలకూ, తల్లిదండ్రులు లేని అనాథలకూ ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది. మీ ఫిర్యాదు ఆధారంగా కమిటీ వారు మీ భర్తా, అత్తమామలను పిలిచి కౌన్సెలింగ్ చేస్తారు. లేదా మీ పాపకు పూర్తి భద్రత కల్పిస్తారు. అలానే మీరు మీ సమస్యను రాష్ట్రమహిళా కమిషన్, మానవహక్కుల కమిషన్‌కి కూడా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. వీటికి మీరు నేరుగా వెళ్లి ఫిర్యాదు చేయనవసరం లేదు. రిజిస్టర్‌పోస్టు పంపినా సరిపోతుంది. అయితే లేఖలో మీ చిరునామా అంటే మీ పేరూ, మీ భర్తా, అత్తమామల వివరాలు సంపూర్ణంగా ఉండాలి. ఇక పాప సమస్యను తగ్గించడానికి బోలెడు రిహాబిలిటేషన్ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో కొన్ని ఉచితంగా సేవలూ అందిస్తున్నాయి. కాబట్టి అక్కడికి తీసుకెళ్లండి. మీ పాపను డాక్టర్‌కి చూపించే స్థోమత లేకపోతే ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వారిని సంప్రదిస్తే ఆర్థిక సాయం కూడా పొందవచ్చు. వీటన్నింటికంటే ముందు దగ్గర్లోని ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌కి ఫిర్యాదు చేస్తే వారు కౌన్సెలింగ్ ద్వారా మీ అత్తమామలూ, భర్త ఆలోచనల్లో మార్పు తీసుకురాగలుగుతారు. ఇక మీ అనుమతీ, సరైన కారణం లేకుండా విడాకులు తీసుకోవడం సాధ్యం కాదు అనే విషయం వారికి అర్థమయ్యేలా చెబుతారు. ఇవేవీ ఫలితం ఇవ్వకపోతే అందరిమీదా గృహహింస చట్టం కింద కేసు వేయవచ్చు. ధైర్యంగా నిలబడండి. చట్టం మీకు సాయపడుతుంది.

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి
న్యాయవాది

vasulegal@eenadu.net

నైపుణ్య శిక్షణతో కొలువులకు సై

కంపెనీలు కోరుకునే నైపుణ్యాలు తమలో లేవని ఉద్యోగార్థులు నిరాశపడనక్కర్లేదు. డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను ఇస్తూ వారిలో ఇంటర్వ్యూలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తోంది ఏపీ ఐటీ అకాడమీ. కొత్తగా నేర్చుకోవాలనే తపన, ఉత్సాహం ఉన్నవారికి ఈ సదవకాశం ఎంతో మేలు చేస్తోంది. కంపెనీలు వర్చ్యువల్ రియాలిటీ (వీఆర్) గేమింగ్ ద్వారా వారిని గుర్తించి ఉద్యోగాలను కల్పిస్తున్నాయి!

కళాశాలల్లో వివిధ సంస్థలు జాబ్ మేళాలు నిర్వహించడం మామూలే. అభ్యర్థులు ఆ సంస్థలకు దరఖాస్తులను సమర్పించి, అక్కడ ఇంటర్వ్యూలు నిర్వహిస్తే వాటికి హాజరవుతుంటారు. నైపుణ్యాలుండి, ప్రతిభ చూపినవారే ఎంపికవుతారు. లేకపోతే అవకాశాలు కోల్పోతారు. ఆంధ్రప్రదేశ్ సమాచార, సాంకేతిక సంస్థ (ఏపీఐటీఏ) ఇందుకు భిన్నంగా ఉద్యోగార్థులకు లబ్ధి చేకూరేలా వారికి చేయూతనందించే వినూత్న కార్యక్రమం నిర్వహిస్తోంది.

దీని పేరు 'విద్యార్థుల చెంతకే కొలువులు'. దేశంలోనే మొదటిసారిగా 'ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగార్థుల కోసం అన్వేషణ' (లీప్) పేరుతో 15 రోజులపాటు 13 జిల్లాల్లో కార్యక్రమం నిర్వహించింది. ఫలితంగా 3,847 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారు.

దేశవ్యాప్తంగా వివిధ ఐటీ సంస్థల అవసరాలకూ, పట్టభద్రుల నైపుణ్యాలకూ మధ్య అనుసంధానం ఉండటం లేదు. ఈ లోపం సవరించేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 250 కళాశాలల్లో ఉన్న డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తోంది ఏపీఐటీఏ. ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చే విధానం.. ఇలా అనేక విషయాలపై వీరందరికీ అవగాహన కల్పిస్తోంది.

ఇలా విద్యార్థులు తగిన నైపుణ్యాలు పొందాక వారందరి కోసం జిల్లాల వారీగా ఐటీ, ఇతర వ్యాపార సంస్థల ప్రతినిధులను ప్రత్యేకంగా రూపొందించిన రెండు బస్సుల్లో తీసుకెళ్లి ఇంటర్వ్యూలు నిర్వహింపజేస్తోంది. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఇప్పటివరకూ 6092 మంది కళాశాలల విద్యార్థులు కొలువులు పొందటం విశేషం.

మూడు విభాగాల్లో శిక్షణ

అన్ని రంగాల్లోనూ సమాచార, సాంకేతికత (ఐటీ) అనుసంధానం పెరగడంతో ఇందుకు వీలుగా విద్యార్థులను తయారు చేయడంలో ఏపీఐటీఏ క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది.

ఐటీ కంపెనీలు, ఐటీ అనుబంధ సంస్థలు, ఐటీ సేవల వినియోగ సంస్థలు...ఇలా మూడు విభాగాల్లోనూ విద్యార్థులు రాణించేలా కళాశాల స్థాయిలో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆంగ్ల భాషలోనూ ప్రావీణ్యం సాధించేలా ప్రాధాన్యమిస్తున్నారు.

కిందటి నెల 15 నుంచి 29 వరకు 13 జిల్లాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 14,328 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 3847 మందికి ఉద్యోగ అవకాశం కల్పించారు. మరో 700 మంది పరిశీలనలో ఉన్నారు. అనంతపురం జిల్లా నుంచి అత్యధికంగా 473 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. తరువాతి స్థానాల్లో కడప, కర్నూలు జిల్లాల విద్యార్థులు నిలిచారు.

కంపెనీలు పోటాపోటీ..

ఏపీఐటీఏ 'లీప్' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఐటీ, ఇతర వ్యాపార సంస్థలు ఎక్కువగా హాజరవుతున్నాయి. గత నెలలో నిర్వహించిన కార్యక్రమానికి 140 కంపెనీలు హాజరయ్యాయి. బైజూస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్, పేటీఎం, ఫ్లిప్‌కార్ట్, జోహో, ఫాక్స్‌కాన్, జెన్‌టెక్, వాల్‌మార్ట్, మహీంద్ర, సింబయాసిస్, ఇండిగో ఎయిర్‌లైన్స్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, అమర్‌రాజా గ్రూపు తదితర కంపెనీలు ఉన్నాయి. ప్రతి జిల్లాలో సగటున 30 కంపెనీల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకర్షణీయమైన ప్యాకేజీలు

ఉద్యోగాలకు ఎంపికైన వారిలో విద్యార్థులు 63 శాతం, విద్యార్థినులు 37 శాతం ఉన్నారు.

భారీ లక్ష్యంతో ముందుకు...

'ఏపీఐటీఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 25 వేల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకెళుతున్నాం. గత నెలలో 15 రోజుల పాటు వరుసగా 13 జిల్లాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలకు విద్యార్థుల నుంచి చక్కని స్పందన లభించింది. హాజరైన కంపెనీల ప్రతినిధులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల చెంతకు కంపెనీలు వెళ్లే ఈ తరహా కార్యక్రమాన్ని నిర్వహించడం దేశంలోనే ఇదే మొదటి సారి. గిన్నిస్ రికార్డు, లిమ్కా అవార్డుల కోసం కూడా దరఖాస్తు చేశాం. కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాం'

-విన్నీ పాత్రో, ఏపీఐటీఏ అదనపు సీఈవో

- ఇన్ఫోసిస్ అత్యధికంగా 883 మందికి రూ.3.2 లక్షల ప్యాకేజీతో ఉద్యోగ అవకాశం కల్పించింది.
- పేటీఎం రూ.3.6 లక్షలు
- ఫ్లిప్‌కార్ట్ రూ.4.5 లక్షలు,
- హెచ్‌సీఎల్ రూ.3.6 లక్షలు
- బైజూస్ రూ.లక్షల ప్యాకేజీలు ఇచ్చాయి.

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్, టీం లీడ్ పొజిషన్, ప్రొడక్ట్, బిజినెస్ డెవలప్‌మెంట్, ప్రోసెస్ ఎగ్జిక్యూటివ్, ఐటీ సపోర్ట్ విభాగంలో విద్యార్థులకు కంపెనీలు అవకాశం కల్పించాయి. ఎంపికైనవారిలో ఎక్కువమంది గ్రామీణ నేపథ్యం కలిగి వెనుకబడిన ప్రాంతాల నుంచి వచ్చినవారు కావడం విశేషం.

- శిరికి సూర్యనారాయణ, ఈనాడు, అమరావతి

ఇంటర్వ్యూల్లో వీఆర్ గేమింగ్...

- ఇంటర్వ్యూల సందర్భంగా అత్యధిక కంపెనీలు విద్యార్థుల్లో చురుకుదనాన్నీ, ఆలోచన విధానాన్నీ, నైపుణ్యాన్నీ గుర్తించేందుకు వర్చ్యువల్ రియాలిటీ (వీఆర్) గేమింగ్ నిర్వహించాయి. అభ్యర్థులకు డివైజ్‌లు ఇచ్చి వారిలో సృజనను గమనించేందుకు వర్చ్యువల్ రియాలిటీ గేమింగ్ దోహదం చేస్తోంది. ఇందులో విద్యార్థుల్లో నైపుణ్యం, ఆలోచన విధానాలను గమనించాకే ఇంటర్వ్యూలో తదుపరి దశకు ఎంపిక చేస్తున్నారు.
- విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యంతోపాటు కొత్త విషయాలను నేర్చుకోవడానికి సంసిద్ధంగా ఉన్నారా? లేదా? అనే విషయాలను సంస్థలు ప్రధానంగా గమనిస్తున్నాయి. అలాంటి చురుకుదనం, ఉత్సాహం, కొత్తగా ఏదైనా నేర్చుకోవాలన్న తపన కలిగిన విద్యార్థులనే ఎంపిక చేస్తున్నారు.
- ఏపీఐటీఏలో నమోదైన కళాశాలలతోపాటు కొత్తగా కూడా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇందుకోసం www.apita.ap.gov.in వెబ్‌సైట్‌లో కళాశాలల పేర్లు నమోదు చేసేందుకు మరో పది రోజుల్లో ఏర్పాట్లు చేయనున్నారు. కళాశాలతో సంబంధం లేకుండా విద్యార్థులు కూడా నేరుగా తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశం కూడా కల్పించనున్నారు.

మంచి ప్రయత్నం

నైపుణ్యం కలిగిన విద్యార్థులకు కొదవ లేనప్పటికీ ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఏపీఐటీఏ వివిధ కంపెనీల ప్రతినిధులతో కలిసి జిల్లాల వారీగా ఉద్యోగార్థుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం మంచి పరిణామం. ఈ ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగం సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలు ఏటా నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి'

-స్వాతి, చిత్తూరు

ఊహించని పరిణామం...

'వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నాకు కళాశాల స్థాయిలోనే ఉద్యోగం వస్తుందని ఊహించలేదు. ఒకేసారి 35 సంస్థల ప్రతినిధుల హాజరై నైపుణ్యం కలిగిన విద్యార్థులను ఎంపిక చేశారు. వారిలో నేనొకణ్ణి కావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. జిల్లాల వారీగా ఏపీఐటీఏ ఇంటర్వ్యూలు నిర్వహించిన తీరు బాగుంది. ఇదే విధానాన్ని నిరంతరం కొనసాగిస్తే నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది'

-హేమంత్, కర్నూలు

హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో డిప్లొమా

చేనేత పరిశ్రమకు భారతదేశం ప్రసిద్ధి చెందింది. ఈ రంగం అభివృద్ధి చెందాలంటే నాణ్యమైన ఉత్పత్తులే కీలకం. వీటికోసం మంచి మానవ వనరుల సేవలు అవసరం. ఈ దిశగా ఆలోచించి ఏర్పాటు చేసినవే హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లు. తెలుగు రాష్ట్రాల్లో చేనేతకు సంబంధించి ప్రగడ కోటయ్య భారతీయ చేనేత శిక్షణ సంస్థ శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వెంకటగిరిలో ఉంది. 1992లో వెంకటగిరిలో ఈ సంస్థను ప్రారంభించారు. ఇక్కడి 'డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ' కోర్సులో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులకు 47 సీట్లు కేటాయించారు. వెంకటగిరితోపాటు హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కోర్సు అందిస్తున్న సంస్థలు మరికొన్ని ఉన్నాయి. వాటిలో తమిళనాడులోని సేలంలో 11, కర్ణాటకలోని గడగ్ లో 4 సీట్లు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించారు. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపికచేస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత టెక్స్‌టైల్స్ తయారీ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఇక్కడ చేరిన విద్యార్థులకు మొదటి ఏడాది రూ.1,000, రెండో సంవత్సరం రూ. 1,100, మూడో ఏట రూ. 1,200 ఉపకార వేతనంగా అందిస్తారు. బాలురకు వసతి గృహం అందుబాటులో ఉంది.

శిక్షణ ఇలా..: ప్రస్తుతం దేశవ్యాప్తంగా 10 హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ సంస్థలు ఉన్నాయి. వీటిలో ఆరు కేంద్ర సంస్థలు కాగా నాలుగు రాష్ట్రస్థాయివి. వెంకటగిరిలోని ఈ సంస్థ రాష్ట్ర స్థాయి కిందకి వస్తుంది. చేనేతకు సంబంధించి పరిశోధన, ప్రయోగాలు చేసి, నాణ్యమైన ఉత్పత్తులు అందించడానికి వీటిని నెలకొల్పారు. ఈ సంస్థలన్నీ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్ టైల్స్ ఆధ్వర్యంలో ఉంటాయి. మూడేళ్ల డిప్లొమాలో స్పిన్నింగ్, డైయింగ్, ప్రింటింగ్, ఫినిషింగ్, డిజైన్, క్వాలిటీ పరీక్షలు, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. మూడో సంవత్సరం కోర్సులో అదనంగా అపారెల్ గార్మెంట్రీ మేకింగ్ టెక్నాలజీ శిక్షణ ఇస్తున్నారు. పలు రకాలు వస్త్రాల తయారీలో మెలకువలు నేర్పుతారు. బ్యాగులు, ఇతర వస్తువుల తయారీలోనూ తర్ఫీదు అందిస్తారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చేనేత, జౌళి రంగంలోని పరిశ్రమల్లో కొలువులు సాధిస్తున్నారు. కోర్సు పూర్తి కాగానే కళాశాలలోనే వివిధ చేనేత, జౌళి పరిశ్రమలు ప్రాంగణ నియామకాలు చేపట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులు అనుభవంతో విదేశాల్లోనూ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. ఇంకా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన జౌళి, చేనేత విభాగాలు, సహకార సంఘాలు... మొదలైనవాటిలో వీరికి ఉపాధి లభిస్తుంది.

అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత
వయసు: జులై 1, 2018 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 15 - 23 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు
దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పూరించాలి. దాంతోపాటు రూ. వంద డీడీ జతచేసి సంస్థ చిరునామాకు పంపాలి.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: జూన్ 10
వెబ్‌సైట్: ttp://iihtvgr.com/index.htm

నోటీస్ బోర్డు

● ప్రభుత్వ ఉద్యోగాలు

2786 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ప్రకటనలు

తెలంగాణలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ప్రకటనలు జారీ చేసింది.
ఎ) గ్రూప్ 4 (జూనియర్ స్టెనో, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్)-1521
బి) ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్-72
సి) మండల ప్రణాళిక, గణాంక అధికారి/ సహాయ గణాంక అధికారి -474 డి) సీనియర్ స్టెనో-19 ఇ) వీఆర్‌ఓ-700
అర్హత, వయసు, ఎంపిక, దరఖాస్తు విధానం కోసం కమిషన్ వెబ్‌సైట్ చూడవచ్చు. **వెబ్‌సైట్:** https://tspsc.gov.in/

హిందీ ట్రాన్స్‌లేటర్ కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్

వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని హిందీ ట్రాన్స్‌లేటర్ తదితర పోస్టులను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ టెస్ట్ ద్వారా భర్తీ చేయనుంది. దీనికి సంబంధించిన సంక్షిప్త ప్రకటనను కమిషన్ విడుదల చేసింది. **పోస్టులు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, హిందీ ప్రధ్యాపక్.
అర్హత, వయసు, ఖాళీలు: ప్రకటనలో తెలిపిన విధంగా.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ రాతపరీక్ష ద్వారా. **పరీక్ష తేదీ:** 26.08.2018 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 06.06.2018 నుంచి 29.06.2018 వరకు. **వెబ్‌సైట్:** http://ssc.nic.in/

ఐఐటీ, దిల్లీలో 75 నాన్ టీచింగ్ పోస్టులు

పోస్టులు: సూపరింటెండెంట్, టెక్నికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజినీర్ తదితరాలు.
మొత్తం ఖాళీలు: 75 (గ్రూప్ ఎ-16, గ్రూప్ బి-59)
అర్హత, వయసు, అనుభవం: ఐఐటీ నిబంధనల ప్రకారం. **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్/ కంప్యూటర్ టెస్ట్, ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆన్‌లైన్. **చివరితేదీ:** 15.06.2018
వెబ్‌సైట్: https://ecampus.iitd.ac.in/

దక్షిణ మధ్య రైల్వేలో స్పోర్ట్స్ కోటా పోస్టులు

సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) 2018-19 సంవత్సరానికిగానూ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో గ్రూప్ సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 14
అర్హత: పదోతరగతిపాటు ఐటీఐ/ ఎన్‌ఏసీ లేదా ఇంటర్ ఉత్తీర్ణత. నిర్దేశించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ అర్హతలు ఉండాలి. **వయసు:** 18-33 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, సర్టిఫికెట్లకు ఇచ్చే మార్కుల ఆధారంగా. దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
ఎగ్జామ్ ఫీజు: రూ.500 **చివరి తేదీ:** 03.07.2018
వెబ్‌సైట్: http://www.scr.indianrailways.gov.in/

యూపీఎస్సీ-ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ ఎగ్జామ్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీలలో శిక్షణతోపాటు త్రివిధ దళాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాల నియామకానికి నిర్వహించే పరీక్ష ప్రకటనను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) జారీ చేసింది.
◆ నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్ (2), 2018 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 06.06.2018 నుంచి 02.07.2018 వరకు **అర్హత, వయసు, ఖాళీలు, ఇతర వివరాలు:** 06.06.2018 నుంచి యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. http://www.upsc.gov.in/

● ప్రవేశాలు

ఏపీ వ్యవసాయ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా కోర్సులు

గుంటూరులోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2018-19 సంవత్సరానికిగానూ వర్సిటీ అనుబంధ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
1) వ్యవసాయం (2 సంవత్సరాలు)
2) విత్తన సాంకేతిక పరిజ్ఞానం (2 సంవత్సరాలు)
3) సేంద్రియ వ్యవసాయం (2 సంవత్సరాలు)
4) అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ (3 సంవత్సరాలు)
మొత్తం సీట్ల సంఖ్య: 4050 (ప్రభుత్వ-620, ప్రైవేటు-3430)
అర్హత: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పదోతరగతి ఉత్తీర్ణులు. ఇంటర్మీడియట్, అంతకంటే ఎక్కువ విద్యార్హతలు ఉన్నవారు అర్హులు కారు. అభ్యర్థులు వారి 10 సంవత్సరాల చదువు కాలంలో కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదివి ఉండాలి. **వయసు:** 31.08.2018 నాటికి 15-22 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ద్వారా. **దరఖాస్తు ఫీజు:** రూ.500
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.06.2018
వెబ్‌సైట్: https://www.angrau.ac.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం
www.eenadupratibha.net చూడవచ్చు.

95వ పడిలోకి 'కలైంజర్'

రాష్ట్ర వ్యాప్తంగా కరుణానిధి జన్మదిన వేడుకలు

చెన్నై గోపాలపురంలోని కరుణానిధి నివాసంలో ఆయనతో స్టాలిన్, రాజా, అన్బళగన్ తదితరులు

ఈనాడు డిజిటల్, చెన్నై: రాజకీయ కురువృద్ధుడు, సినీ నటుడు, రచయిత, డీఎంకే పార్టీ అధినేత కరుణానిధి 95వ పడిలోకి అడుగుపెట్టారు. కరుణ జన్మదినం సందర్భంగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీతో పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని దేవేగౌడ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పశ్చిమ్ బంగ సీఎం మమతాబెనర్జీ, పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'దేశంలోనే అత్యంత సీనియర్ నాయకులు, కవి, రచయిత కరుణానిధికి జన్మదిన శుభాకాంక్షలు. ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నా' అని ప్రధాని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇటీవల కరుణను కలిసి సందర్భంగా తీసిన ఫొటోను ట్విట్టర్‌లో మోదీ ఉంచారు. కరుణానిధి కుమారుడు స్టాలిన్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పారు. దేశంలోనే సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడని, లౌకిక భావాలకు, ప్రశ్నించే తత్వానికి కరుణానిధి మారుపేరని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కొనియాడారు.

'టెట్' పరీక్షకు దూరాభారం

- పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో కేంద్రాలపై అభ్యర్థుల్లో ఆందోళన
- పాఠశాల విద్యాశాఖ నిర్ణయంపై విమర్శల వెల్లువ

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు అభ్యర్థుల నుంచి భారీగా దరఖాస్తులు వస్తాయని ముందే తెలుసు. అయినా పాఠశాల విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినవస్తున్నాయి. అవసరమైన పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ఈ శాఖ విఫలమవుతోంది. దాంతో అభ్యర్థులు పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లి పరీక్ష రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యయ, ప్రయాసలతో ఆర్థికంగా వారికి భారమవుతోంది. కనీసం పరీక్ష నిర్వహణ సమయ తేదీలను పొడిగించినా అందుబాటులో ఉన్న కేంద్రాల్లోనే అందరి అభ్యర్థులను సర్దుబాటు చేయవచ్చన్న ఆలోచనను కూడా చేయలేకపోవడం గమనార్హం. ఈసారి టెట్‌కు 3,97,957మంది దరఖాస్తు చేయగా వీరిలో 3,83,066 మంది కేంద్రాలను ఎంపిక చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో జూన్ 10 నుంచి 21వ తేదీ వరకు టెట్ పరీక్ష నిర్వహించనున్నారు. మొదట ఆప్షన్ ఇచ్చిన వారికి సొంత జిల్లాల్లోనే రాసే భాగ్యం కలిగింది. ఆ తర్వాత ఆప్షన్లు ఇచ్చిన వారు పక్క జిల్లాలు.... హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలోని కేంద్రాల్లో పరీక్షలు రాయాల్సి వస్తోంది. తద్వారా ఒక్కో అభ్యర్థి రూ.1000 నుంచి రూ.1500 వరకు ఖర్చు పెట్టాల్సి ఉండడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. తూర్పుగోదావరికి చెందిన కొందరు విద్యార్థులకు హైదరాబాద్‌లో పరీక్షా కేంద్రం వచ్చింది. మరికొందరికి కృష్ణా జిల్లాల్లో ఇచ్చారు. ఇప్పటికే రుసుము కింద ఒక్కో అభ్యర్థి రూ.500 చెల్లించారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

'తితిదే'పై కోర్టుకు వెళ్లనున్న సుబ్రహ్మణ్యస్వామి

ఈనాడు డిజిటల్, చెన్నై: తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించినట్లు భాజపా సీనియర్ నేత, ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి పేర్కొన్నారు. కోర్టులో దాఖలు నిమిత్తం ప్రజాప్రయోజన వ్యాజ్యం తయారు చేస్తున్నట్లు ట్విట్టర్‌లో తెలిపారు. దీనికి సంబంధించి చెన్నైలో న్యాయవాద మిత్రులు మోహన్‌దాస్, టీఆర్ రమేష్, ఆర్.రవిలతో సమావేశమైన చిత్రాన్ని కూడా పోస్టు చేశారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చోరీలు చేస్తూ.. జల్సాగా జీవిస్తూ...

- దురలవాట్లు... విలాసవంతమైన జీవితం
- వీటి కోసమే దోపిడీలు, దొంగతనాల బాట
- చోరీలు తదితర నేరాల్లో నిందితుల నేపథ్యం ఇదే

ఈనాడు - అమరావతి

అతి తక్కువ వార్షికాదాయం...అంతంతమాత్రం చదువు...దురలవాట్లు....విలాసవంతమైన జీవితంపై మోజు... ఇవే చాలా మందిని దొంగతనాల బాట పట్టిస్తున్నాయి. గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన చోరీలు, దోపిడీలు, దొంగతనాలు, లాభం కోసం హత్యలు తదితర ప్రాపర్టీ నేరాల్లో అరెస్టైన వారి కేసు నేపథ్యాలను విశ్లేషిస్తే ఈ విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 17,635 నేరాలు చోటు చేసుకోగా...మొత్తం 12,200 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి ఆర్థిక స్థితిగతులు, విద్యా నేపథ్యం, వారు ఈ తరహా నేరాల బాట పట్టడానికి గల కారణాలు తదితర అంశాలపై పోలీసు శాఖ అధ్యయనం చేసింది. అరెస్టైన వారిలో 59.27 శాతం మంది దురలవాట్లు, విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డారని, 20.46 శాతం మంది నిరక్షరాస్యులని తేలగా... రూ.25 వేలు అంతకంటే తక్కువ వార్షికాదాయం ఉండడంతో కడు పేదరికంతో 4843 మంది నేరాలకు పాల్పడుతున్నారని గుర్తించారు.

పెడదోవ పట్టిస్తున్న పేదరికం

దోపిడీలు, దొంగతనాలు, చోరీలు తదితర నేరాల్లో పట్టుబడ్డ వారిలో 85.19 శాతం మంది రూ.50 వేల లోపు వార్షికాదాయం కలిగిన వారే. వీరిలో ఎక్కువ శాతం మందికి పేదరికమే కారణం. మొత్తం 12,200 మంది 2017లో అరెస్టవగా... వారిలో కేవలం 399 మంది మాత్రమే రూ.లక్ష అంతకంటే ఎక్కువ సంవత్సర ఆదాయం కలిగిన వారు ఉన్నారు. మిగతా 11,801 మంది రూ.లక్ష లోపు ఆదాయం కలిగిన వారే.

అలవాట్లకు బానిసలై..

మద్యానికి బానిసగా మారి కొందరు....పేకాట, మట్కా, బెట్టింగులు తదితర జూదాలకు అలవాటు పడి మరికొందరు... ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినా ఖరీదైన కార్లలో తిరగాలని, విలాసవంతమైన జీవితాన్ని అనుభవించాలని భావిస్తున్న ఇంకొందరు ఇలాంటి అక్రమదారులు వెతుకుతున్నారు. 2017లో అరెస్టైన 12,200 మందిలో 7233 మంది వీటి కోసమే దొంగతనాలు, దోపిడీలకు తెగబడుతున్నారు. కుటుంబ అవసరాలు, ఉపాధి లేకపోవడం మూలంగా ఇలాంటి నేరాలు చేస్తున్న వారు 39.45 శాతం ఉండటం గమనార్హం. ప్రియురాళ్లకు ఖరీదైన బహుమతులు కొని ఇవ్వడానికి ... సులువుగా డబ్బు సంపాదించాలని కూడా కొందరు నేరాలు చేస్తున్నారు.

ఏయే కారణాలతో నేరాలు చేశారంటే

కారణం	అలాంటి వారి సంఖ్య	వారి శాతం
దురలవాట్లు	5,247	43.00
కుటుంబ అవసరాలు	4,667	38.25
విలాసవంతమైన జీవితం	1,986	16.27
ఉపాధి లేమి	147	1.20
వివాహేతర సంబంధాలు	59	0.48
ప్రేమ వ్యవహారాలు	50	0.40
సులువుగా డబ్బు సంపాదించాలని	41	0.33
మతిస్థిమితం లేకపోవడం	3	0.02
మొత్తం	12,200	100

ఆర్థిక స్థితిగతుల గణాంకాలు

వార్షికాదాయం (రూపాయల్లో)	సంఖ్య	వారి శాతం
25 వేల లోపు	4843	39.69
25,001-50,000	5552	45.50
50,001-1,00,000	1406	11.52
1,00,001-2,00,000	258	2.11
2,00,001-3,00,000	94	0.77
3,00,001-5,00,000	18	0.14
5,00,001-10,00,000	29	0.23
మొత్తం	12,200	100

అంతంతమాత్రం చదువులే

అలాగే 71.76 శాతం మంది పదో తరగతి లోపు చదివిన వారే. నిరక్షరాస్యులు 20.46 శాతం మంది ఉండగా... పీజీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్య చదివిన వారు కూడా దొంగతనాలు చేస్తున్నారు. వీరు విలాసాలకు అలవాటు పడి గొలుసు దొంగతనాలు వంటి వాటికి పాల్పడుతున్నారు.

విద్యా నేపథ్యం...గణాంకాలు

విద్యార్హత	సంఖ్య	వారి శాతం
నిరక్షరాస్యులు	2497	20.46
5వ తరగతి వరకూ	3258	26.70
5-10వ తరగతి	5498	45.06
ఇంటర్మీడియట్	625	5.12
డిగ్రీ	260	2.13
పీజీ	24	0.19
ఇంజినీరింగ్	38	0.31
మొత్తం	12,200	100

రాష్ట్రాన్ని అవినీతిలో నెం1గా నిలిపారు

- పెనుగొండ సభలో జగన్ విమర్శ

ఈనాడు డిజిటల్, ఏలూరు: అవినీతి, అత్యాచారాలు, రాజ్యాంగ ఉల్లంఘన, పార్టీ ఫిరాయింపులు, మద్యం అమ్మకాలు, ఆలయ భూముల ఆక్రమణలు, పెట్రోలు-డీజిలు ధరలు పెంచడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని నెంబరు-1 స్థానంలో నిలిపారని వైకాపా అధ్యక్షుడు జగన్ ఆరోపించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పెనుగొండ మండలంలో ఆదివారం ప్రజా సంకల్ప యాత్ర జరిగింది. పెనుగొండ సభలో ఆయన మాట్లాడుతూ.. 2016లోనే మనరాష్ట్రం అవినీతిలో మొదటి స్థానంలో నిలిచిందని నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్స్ అండ్ రీసెర్చ్ సంస్థ వెల్లడించిందన్నారు. గతనెలలో రాష్ట్రంలో అనేక అత్యాచార ఘటనలు వెలుగు చూశాయని చెప్పారు. "ప్రత్యేక హోదా సాధించడంలో ఈ నాలుగేళ్లు కాలయాపన చేసి ఉండకపోతే ఈ పాటికే రాష్ట్రం నెంబరు-1 స్థానంలో నిలిచేది. ఇప్పటికి సీఎం వయసు 70 సంవత్సరాలు. 2050 గురించి మాట్లాడతారు. అప్పటికి ఆయన వయస్సు 102 సంవత్సరాలు. అంటే అప్పటివరకు రాష్ట్రాన్ని దోచుకోవాలని తాపత్రయ పడుతున్నారు. అప్పటి వరకు మిమ్మల్ని భరించే శక్తి ఈ ప్రజలకు లేదు" అని అన్నారు. వైకాపా ఎంపీలతో పాటే తెదేపా ఎంపీలు కూడా రాజీనామా చేసి ఉంటే కేంద్రం దిగి వచ్చేది కదా.? అని ప్రశ్నించారు. 'నవనిర్మాణ దీక్ష పేరుతో పిల్లలను, అధికారులనూ రోడ్లపైకి తీసుకొచ్చి.. అవినీతి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రతిజ్ఞ చేయిస్తారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన వ్యక్తి ఈ ప్రతిజ్ఞలు చేయించడం విడ్డూరం. గోదావరి జిల్లాలో తాగడానికి నీళ్లు దొరకని పరిస్థితి తీసుకొచ్చారు. ఈ కలుషిత నీటిని పంచాయతీరాజ్ శాఖామంత్రిగా ఉన్న మీ కుమారుడి చేత తాగించాలి' అని సీఎంకు సవాల్ విసిరారు.

పెనుగొండ బహిరంగసభలో ప్రసంగిస్తున్న జగన్

'ప్రభుత్వాసుపత్రుల్లో ఫార్మసిస్టులను పెంచాలి'

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రుల్లో ఫార్మసిస్టుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని ఏపీ ఫార్మసిస్టుల సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. గుంటూరు ఎన్జీఓ సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ బోధనాసుపత్రుల్లో పడకల సంఖ్య ఆధారంగా ఫార్మసిస్టుల పోస్టులను మంజూరు చేయాలన్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో గత 30 ఏళ్ల నుంచి నియామకాలు లేనందున.. అక్కడ పని చేస్తున్నవారిపై పని భారం పెరిగిందన్నారు. పదోన్నతుల విషయంలోనూ అన్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా డీటీసీఓ, డీఎల్ఓ, వ్యాక్సిన్ స్టోర్సులలో కొత్తగా పోస్టులను మంజూరు చేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షుడు శ్రీనివాసరావుతో పాటు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

ఫెర్నాండెజ్ వంటి తిరుగుబాటు నేతలు దేశానికి అవసరం: ఆడ్వాణీ



దిల్లీ: జార్జి ఫెర్నాండెజ్ వంటి తిరుగుబాటు నేతలు అన్ని వేళలా అవసరమనీ, అలాంటివారు లేకుండా ఏ దేశమైనా అభివృద్ధి చెందబోదనీ భాజపా అగ్రనేత ఎల్‌కే ఆడ్వాణీ పేర్కొన్నారు. ఫెర్నాండెజ్ 88వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన జీవన ప్రస్థానంపై రూపొందిన వెబ్‌సైట్‌ను ఆదివారం ఆడ్వాణీ ప్రారంభించారు. అస్వస్థతతో ఉన్న నేతతో కాసేపు మాట్లాడారు. 'పార్లమెంటులో ఫెర్నాండెజ్‌తో కలిసి చాలాకాలం పనిచేశాను. ఆయనో ప్రత్యేక వ్యక్తి. అలాంటి నేతలు అవసరం. వారు లేకుండా ఏదీ ముందుకు జరగదు. తిరుగుబాటుదారులే లేకుంటే దేశానికి స్వాతంత్ర్యమే వచ్చేది కాదు' అని ఆడ్వాణీ చెప్పారు. ఫెర్నాండెజ్ జీవితమంతా పోరాటాలేనని సామ్యవాద నేత శరద్‌యాదవ్ పేర్కొన్నారు.

భాజపాకు మా పార్టీనే అతిపెద్ద రాజకీయ శత్రువు

శివసేన ఎంపీ వ్యాఖ్యలు

ముంబయి: భాజపాకు తమ పార్టీనే అతిపెద్ద 'రాజకీయ శత్రువు' అని శివసేన ఎంపీ సంజయ్ రావుత్ వర్ణించారు. దేశం ఇప్పుడున్న దుస్థితిలో నరేంద్ర మోదీ-అమిత్ షా ద్వయానికి బదులుగా.. కాంగ్రెస్ లేదా దేవెగౌడలనూ ఆమోదించవచ్చని అభిప్రాయపడ్డారు. భాజపా నాయకుడు చింతామన్ వనగా మృతితో ఖాళీ అయిన పాల్‌ఘర్ లోక్‌సభ స్థానంలో.. ఆయన కుమారుడినే ఓడించి ఆ పార్టీ 'గొప్ప నివాళి' అర్పించిందని సంజయ్ విమర్శించారు. శివసేన మద్దతుతో అధికారంలో ఉంటూనే.. ఆ పార్టీనే బలహీనపరిచేందుకు భాజపా ప్రయత్నిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధమున్న వ్యక్తులను వివిధ రాజ్యాంగ పదవుల్లో నియమించి.. ఎన్నికల ప్రక్రియను భాజపా నియంత్రిస్తోందని ఆరోపించారు. శివసేన అధికార పత్రిక 'సామ్నా'కు రాసిన ఓ వ్యాసంలో సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

అమిత్ షాతో పాసవాన్ భేటీ

దిల్లీ: ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టంలోని పాత నిబంధనలు వర్తింపజేసేలా కేంద్రం అత్యవసరాదేశం జారీ చేయాలన్న విన్నపంతో.. భాజపా అధ్యక్షుడు అమిత్ షాను ఎల్‌జేపీ అధినేత, కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాసవాన్ కలిశారు. దళితుల రిజర్వేషన్లూ సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరారు. చాలా రాష్ట్రాలు ప్రత్యేక హోదాను కోరుతున్నాయని.. బిహార్ మాత్రం దాన్ని పొందేందుకు అర్హత ఉన్న రాష్ట్రమని పాసవాన్ వ్యాఖ్యానించారు. అమిత్ షాతో సమావేశంలో ఈ విషయాన్నీ చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇటు వీరి భేటీలో పాసవాన్ కుమారుడు చిరాగ్ కూడా పాల్గొన్నారు. ఇటు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోదీ నాయకత్వంలో ఎన్డీయే ఘనవిజయం సాధిస్తుందని.. రాహుల్ గాంధీని ఎవరూ నాయకుడిగా పరిగణించట్లేదని మరో కార్యక్రమ సందర్భంగా పాసవాన్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల ఐక్యత కొద్ది కాలమేనని.. దేశ వ్యాప్తంగా జరిగే ఎన్నికల్లో ఇలాంటి సీట్ల సర్దుబాట్లు వీలుపడవని ఆయన అభిప్రాయపడ్డారు.

దమ్ముంటే మోదీపై విమర్శలు చేయండి

- విపక్ష నేతలపై మంత్రి లోకేష్ ధ్వజం
- పర్యటనలు, పాదయాత్రలు చేసే వారు రాష్ట్రంలో చిచ్చు పెడుతున్నారంటూ మండిపాటు

జగ్గయ్యపేట - న్యూస్‌టుడే

రాజధాని లేకుండా, లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని తన సమర్థతతో పట్టాలెక్కిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్న నాయకులకు దమ్ముంటే.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని ప్రధాని మోదీని విమర్శించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రంలో పాదయాత్రలు, పర్యటనలు చేస్తున్న నాయకులు రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా ప్రాంతాల వారీగా, వర్గాల వారీగా చిచ్చు పెట్టేందుకు పాటు పడుతున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అధ్యక్షతన నిర్వహించిన నవ నిర్మాణ దీక్ష సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రిపై అసూయతోనే కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ప్రజలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై అందరికీ పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అత్యద్భుతంగా ఉపయోగించుకుని, దేశంలోనే తొలి స్థానంలో నిలిస్తే వైకాపా ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నిధులు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై ఆరోపణలు చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆధారాలు ఉంటే ప్రజల ముందు పెట్టాలని, ఏ చర్చకైనా తాను సిద్ధమని తెలిపారు. సభలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీ రామకృష్ణ, జడ్పీ అధ్యక్షురాలు గద్దె అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నవ నిర్మాణ దీక్ష సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్, చిత్రంలో ఎంపీ నాని, జడ్పీ ఛైర్‌పర్సన్ అనూరాధ తదితరులు

'నిపా' వాహకాలేవో ఇంకా తేలలేదు

ఫలాలను ఆరగించే గబ్బిలాల్లోనూ వైరస్ జాడ లేదని తేల్చిన నిపుణులు

తిరువనంతపురం, కోల్‌కతా: కేరళలో దాదాపు రెండు వారాలుగా తీవ్ర భయాందోళనలు సృష్టిస్తున్న నిపా వైరస్‌కు ఏ జీవులు వాహకంగా పనిచేస్తున్నాయన్న సంగతి ఇప్పటికీ బయటపడట్లేదు. ఫలాలను ఆహారంగా తీసుకునే గబ్బిలాల నమూనాలను 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్(ఎన్ఐహెచ్ఎస్ఏడీ)' నిపుణులు తాజాగా పరిశీలించగా.. వాటిలో నిపా జాడలు కనిపించలేదు. పందులు, మేకలు, కీటక గబ్బిలాలు, పశువుల నమూనాలతో గతంలోనే పరిశీలించిన ఎన్ఐహెచ్ఎస్ఏడీ.. వాటిలోనూ నిపా జాడలేవీ లేవని తేల్చిచెప్పింది. మరోవైపు, ప్రస్తుతం రాష్ట్రంలో నిపా విజృంభణకు అడ్డుకట్ట పడిందని కేరళ ప్రభుత్వం వెల్లడించింది. ఈ వైరస్ బాధిత కొత్త కేసులేవీ నమోదవ్వడం లేదని తెలిపింది. రాష్ట్రంలో తాజా పరిస్థితులపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

ఆ జవాను మరణం.. 'నిపా'తో కాదు

కోల్‌కతాలో ఇటీవల మరణించిన జవాను శీను ప్రసాద్ జీవద్రవ నమూనాల్లో నిపా వైరస్ జాడలు లేవని తేలింది. కేరళకు చెందిన ప్రసాద్.. నెలరోజుల పాటు సెలవుపై స్వరాష్ట్రానికి వెళ్లి గత నెల 13న తిరిగి విధుల్లో చేరారు. ఆయనలో నిపా సంబంధిత లక్షణాలు బయటపడటంతో గత నెల 20న ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 5 రోజుల తర్వాత ప్రసాద్ మరణించారు. ప్రసాద్ జీవద్రవ నమూనాలను పుణెలోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ' పరీక్షించిందని.. ఆయన మరణానికి నిపా వైరస్‌తో సంబంధం లేదని తేల్చిందని సైన్యాధికారి ఒకరు వెల్లడించారు.

రైళ్లు ఆలస్యమైతే జీఎంల పదోన్నతులు ఆగుతాయ్

- ఈ నెల 30లోగా పరిస్థితి మారాలి
- రైల్వే మంత్రి పీయూష్ గోయల్ హెచ్చరిక

దిల్లీ: రైళ్లు ఆలస్యంగా నడిస్తే ఆ ప్రభావం సంబంధిత జోన్ల జనరల్ మేనేజర్లపై పడనుంది. వారి పదోన్నతులు ఆగిపోనున్నాయి. వారి పనితీరు నివేదికల్లోనూ ఈ విషయాన్ని ప్రస్తావించి వ్యతిరేకంగా రాయనున్నారు. నెల రోజుల్లో పరిస్థితి మారకపోతే కఠిన చర్యలు తప్పవని రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ హెచ్చరించారు. గతవారం జరిగిన జనరల్ మేనేజర్ల సమావేశంలో మంత్రి విరుచుకుపడ్డారు. లైన్ల నిర్వహణ, మరమ్మతులు కారణంగా రైళ్లు ఆలస్యమవుతున్నాయని చెప్పగా, అది కేవలం సాకు మాత్రమేనని మంత్రి వ్యాఖ్యానించారు. ఇలాంటివి కారణాలుగా చూపించి తప్పించుకోలేరని అన్నారు. 2017-18లో 30 శాతం రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ప్రస్తుత వేసవి సెలవుల సీజన్‌లోనూ ఇదే పరిస్థితి. ఉత్తర రైల్వే జోన్ జనరల్ మేనేజర్ మంత్రి ఆగ్రహానికి గురయ్యారు. ఈ ఏడాదిలో మే 29 వరకు ఆ జోన్‌లో 49.59 శాతం రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గత ఏడాది ఇదే కాలంలో రైళ్ల ఆలస్యం 32.74 శాతంగా ఉండడం గమనార్హం. పరిస్థితి మెరుగుపడకపోగా, దిగజారడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. లైన్ల నిర్వహణ వల్ల ఆలస్యమవుతుండడం వాస్తవమే అయినా, దీన్ని కారణంగా చూపి అసమర్థతను కప్పిపుచ్చుకోలేరని అన్నారు. ప్రతి జనరల్ మేనేజర్‌తోనూ విడివిడిగా మాట్లాడి సమయపాలన ఎందుకు పాటించడం లేదో అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

ప్రధాని హెచ్చరికతోనే..

గత నెలలో జరిగిన ప్రగతి సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైల్వేల సమయపాలన అధ్వానంగా ఉండడంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉత్తర రైల్వే జోన్‌లో అసలు సమయ పాలన పాటించని వైనాన్ని తప్పుపట్టారు. ఆ తరువాత స్థానాల్లో ఈశాన్య సరిహద్దు రైల్వే (27 శాతం ఆలస్యాలు), తూర్పు రైల్వే (26 శాతం ఆలస్యాలు) ఉన్నాయి. దాని పర్యవసానంగానే రైల్వే మంత్రి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. నిధుల దుర్వినియోగం కూడా రైళ్ల ఆలస్యానికి కారణమని చెప్పారు.

జనానికి దూరమవుతోన్న 'జనరిక్'

- వీటి నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకుంటున్న సెర్ప్
- ఇతరులకు అప్పగించిన వాటిలో అడ్డగోలుగా అమ్మకాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో జనరిక్ దుకాణాల పర్యవేక్షణ బాధ్యత నుంచి సెర్ప్ క్రమంగా వైదొలుగుతోంది. అన్నసంజీవని పేరుతో జనరిక్ దుకాణాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వాటి పర్యవేక్షణ బాధ్యత సెర్ప్‌కు అప్పగించింది. ప్రభుత్వ గదులు అందుబాటులో లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో వీటిని అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. నెలకు రూ. 6వేలు వేతనం చెల్లిస్తూ అర్హత కలిగిన ఫార్మాసిస్టులను నియమించారు. దీంతో పాటు కొంత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి మందులు, ఇతర ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు. ఎంతలేదన్నా నెలకు రూ.40 వేలు నుంచి రూ.50 వేలు వస్తే గాని నిర్వహణ ఖర్చులు భరించలేని పరిస్థితి. కానీ చాలాచోట్ల నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు కూడా రావడం లేదు. ఫలితంగా ఇప్పటికే కొన్ని చోట్ల మూతపడగా చాలా చోట్ల మూతదిశగా పయనిస్తున్నాయి. పలుచోట్ల అమ్మకాల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. దీంతో నిర్వహణ కోసం ముందుకు వచ్చే వారికి దుకాణాలను అప్పగిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 233 దుకాణాలు ఉండగా వీటిలో 72 దుకాణాల బాధ్యతల నుంచి సెర్ప్ తప్పుకుంది. పశ్చిమగోదావరి జిల్లాలో 24 దుకాణాలు, కృష్ణా జిల్లాలో 12, తూర్పు గోదావరి జిల్లాలో 8, కడప జిల్లాలో 6, కర్నూలు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో 2 చొప్పున ఇతరులకు అప్పగించారు. వీటిలో కొన్నింటిని డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు అప్పగించగా మరికొన్నింటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు.

నిబంధనలు గాలికి...

జనరిక్ దుకాణాల బాధ్యతల నుంచి వైదొలిగే క్రమంలో పెట్టిన పెట్టుబడిని విడతల వారీగా చెల్లించేలా దుకాణాల నిర్వాహకులతో అధికారులు ఒప్పందం చేసుకుంటున్నారు. అద్దె, వేతనాల చెల్లింపుతో సంబంధం లేకుండా ఒప్పందపత్రంలో రాయించుకుంటున్నారు. అన్న సంజీవని పథక నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. దుకాణాల్లో ఫార్మాసిస్టే తప్పనిసరిగా అమ్మకాలు చేపట్టాలని నిబంధనలు చెబుతున్నా చాలా చోట్ల దీనికి తిలోదకాలు ఇస్తున్నారు. బీ-ఫార్మసీ, ఎమ్-ఫార్మసీ చేసిన వారి ధ్రువపత్రాలు తీసుకు వచ్చిన సభ్యులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. కర్నూలు జిల్లా ఆలూరు, కృష్ణా జిల్లాలోని పామర్రు తదితర చోట్ల దుకాణాలు ఇదే తీరున కొనసాగుతున్నాయి. అన్న సంజీవని జనరిక్ దుకాణాల్లో ఎమ్మార్పీ ధరల కంటే తక్కువ ధరకే మందులు అమ్మాలన్న నిబంధనతోపాటు అమ్మిన ప్రతి మందుకు రశీదులు ఇవ్వాలి. ప్రస్తుతం ఇతరులకు అప్పగించిన దుకాణాల్లో చాలా చోట్ల ఇది అమలు కావడం లేదు. పూర్తి బాధ్యతలు సదరు నిర్వాహకులకు అప్పగించడంతో వెలుగు అధికారుల తనిఖీలకు అవకాశం లేదు. డ్వాక్రా సభ్యుల సమావేశాల్లో జనరిక్ మందుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై చర్చించి ప్రజలకు చేరువ చేయాలి. కానీ చాలా చోట్ల అది జరగడం లేదు. ఫలితంగా పథకం ప్రజలకు దూరమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కేజీబీవీల్లో ఇంటర్ విద్య ప్రారంభమెప్పుడో!

- పూర్తికాని భవనాల ఎంపిక
- అధ్యాపకుల నియామకమూ చేపట్టలేదు

ఈనాడు, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ) ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టాల్సి ఉండగా ఇంతవరకు అధికారులు భవనాల గుర్తింపే పూర్తిచేయలేదు. దేశవ్యాప్తంగా కేజీబీవీలో ఇంటర్ తరగతులు ప్రారంభించేందుకు కేంద్రం ఇటీవల అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో 352 కేజీబీవీలు ఉండగా 31వాటిల్లో ఈ ఏడాది నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. సొంత భవనాలు లేనందున అద్దెవాటిలో ఆరంభించాలని నిర్ణయించినా భవనాల ఎంపికకే సమయమంతా కరిగిపోతుంది. ఇంటర్ కొత్తగా ప్రారంభిస్తున్నందున అధ్యాపకులను నియమించుకోవాలి. ఈ నియామకాల భర్తీ ప్రక్రియను ఇప్పటివరకు చేపట్టలేదు. ఇంటర్ మొదటి ఏడాదిలో ఒక్కో కళాశాలలో 40 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. స్థానికంగా ఇంటర్‌లోని గ్రూపులకు ఉన్న డిమాండ్‌ను అనుసరించి ఒక్కోచోట ఒక్కో గ్రూపు ప్రవేశపెట్టాలని అధికారులు భావిస్తున్నారు. దీని కోసం జిల్లాలవారీగా వివరాలు ఇవ్వాలని సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ప్రాజెక్టు అధికారులను రాష్ట్ర కార్యాలయం కోరగా ఇంతవరకు ఈ వివరాలే అందలేదు. ఇంటర్ విద్యామండలి ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేసి, జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభించాలి. ఒక పక్క ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలలు ప్రవేశాలను ముగిస్తుండగా కేజీబీవీల్లో ప్రవేశాల ప్రక్రియనే మొదలు కాలేదు. దీంతో కేజీబీవీల్లో పదో తరగతి చదివిన విద్యార్థినులు కూడా ప్రవేశాల కోసం వేచిచూడాలా? లేదంటే మరో కళాశాలలో ప్రవేశాలు పొందాలో తెలియక సతమతమవుతున్నారు.

ఒడుదొడుకులు పెరగొచ్చు!



సమీక్ష : అంతర్జాతీయ, దేశీయ పరిణామాలు దన్నుగా నిలవడంతో గత వారం సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. మే డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు ప్రభావం చూపింది. ముడిచమురు ధరలు తగ్గడం, కంపెనీల త్రైమాసిక ఫలితాలు మెప్పించడం, ముందస్తు రుతుపవనాలు వంటి వార్తలు కలిసొచ్చాయి. మహీంద్రా, ఎల్ అండ్ టీ, కోల్ ఇండియా, టెక్ మహీంద్రాలు మంచి ఫలితాలు నమోదు చేయడంతో వీటిలో షేరు ఆధారిత కదలికలు కనిపించాయి. మేలో వాహన కంపెనీలు మంచి విక్రయాలు నమోదు చేశాయి. అంచనాల కంటే ముందే రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించడంతో వినియోగ ఆధారిత షేర్లు కళకళలాడాయి. 2017-18 నాలుగో త్రైమాసికంలో జీడీపీ 7.7 శాతానికి వృద్ధి చెందడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. అయితే చైనా- అమెరికా వాణిజ్య ఉద్రిక్తతలు, అమెరికా- ఉత్తర కొరియా అధ్యక్షుల భేటీ పరిణామాలు, ఇటలీలో రాజకీయ సంక్షోభం, స్పెయిన్‌లో ప్రధానిపై అవిశ్వాసం వంటి వాటివల్ల అంతర్జాతీయ మార్కెట్లు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ముడి చమురు ధరలు తగ్గడంతో చమురు మార్కెటింగ్ కంపెనీలు వెలుగులోకి వచ్చాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.9 శాతం పెరిగి 35,227 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 0.9 శాతం లాభంతో 10,696 పాయింట్ల దగ్గర స్థిరపడింది. చమురు- గ్యాస్, వాహన, బ్యాంకింగ్ షేర్లు లాభపడగా, మన్నికైన వినిమయ వస్తువులు, ఐటీ, స్థిరాస్తి షేర్లు డీలాపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌ఐఐలు) నికరంగా రూ.2,707 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్లు రూ. 2,426 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:5గా నమోదుకావడం.. షేర్లలో అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } 34,700 పాయింట్ల వద్ద మద్దతు లభించడంతో గత వారం మార్కెట్ జోరు కొనసాగించింది. ఇప్పుడు ఇదే స్థాయి వద్ద మద్దతు లభించొచ్చు. 34,700 పాయింట్ల దిగువకు చేరితే మాత్రం.. సమీప కాలంలో నష్టాలు ఎదురుకావొచ్చు. 35,650 స్థాయిని అధిగమిస్తేనే లాభాలు కొనసాగే అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, దేశీయ పరిణామాలు ఈవారం మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. దేశీయంగా చూస్తే.. నేటి నుంచి ప్రారంభం కానున్న మూడు రోజుల రిజర్వు బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాలు కీలకం కానున్నాయి. దూసుకెళ్తున్న ముడిచమురు ధరలు, రూపాయి క్షీణత వడ్డీ రేట్లపై ప్రభావం చూపొచ్చు. ఆర్‌బీఐ రేట్ల పెంపు చేపడితే మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కీలక రేట్లను యథాతథంగా కొనసాగిస్తే సానుకూలతలు కొనసాగొచ్చు. గత కొన్ని వారాలుగా చిన్న, మధ్య స్థాయి షేర్లు భారీగా డీలాపడ్డాయి. ఇవి మెరుగుపడితేనే మార్కెట్ కోలుకుని నిలబడే అవకాశం ఉంటుంది. సమీపకాలంలో రూపాయి కదలికలు, ఎఫ్‌ఐఐలు, డీఐఐల పెట్టుబడులు కూడా మార్కెట్‌కు దిశానిర్దేశం చేయొచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా, వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ఉద్రిక్తతలు ప్రభావం చూపొచ్చు. చైనా ఎగుమతులు, దిగుమతుల గణాంకాలు 8న వెలువడనున్నాయి. జపాన్ మొదటి త్రైమాసిక జీడీపీ అదే రోజు బయటకు రానుంది.

తక్షణ మద్దతు స్థాయిలు: 34,922, 34,700, 34,302; **తక్షణ నిరోధ స్థాయిలు:** 35,543, 35,738, 36,050

సమీపకాలంలో మార్కెట్లో ఒడుదొడుకులు పెరిగే అవకాశం ఉంది.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

హైదరాబాద్‌లో నాప్తాల్ విక్రయ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: టెలివిజన్ ప్రకటనలు, ఆన్‌లైన్ ద్వారా వస్తువులను విక్రయించే నాప్తాల్ హైదరాబాద్‌లో ఫ్రాంఛైజీ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించింది. దీనిద్వారా వినియోగదారులకు నేరుగా వస్తువులను విక్రయించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇందులో దుస్తులు, పాదరక్షలు, విద్యుత్ ఉపకరణాలు, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు తదితరాలన్నీ కలిపి దాదాపు 890 రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయని నాప్తాల్ బిజినెస్ హెడ్ మనీశ్ చౌబె పేర్కొన్నారు. ఆఫ్‌లైన్ స్టోర్ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఇది నాలుగో విక్రయ కేంద్రమన్నారు. రానున్న రెండేళ్లలో దేశంలో మొత్తం 150 కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు, ఈ ఏడాది 27 వరకూ ఉంటాయని తెలిపారు. ఇందులో హైదరాబాద్‌లో మరో 4-5 ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఫ్రాంఛైజీ స్టోర్ల ఏర్పాటును పరిశీలిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్ స్టోర్ల ద్వారా దాదాపు రూ.280 కోట్ల అమ్మకాలు ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తమకు 7 సొంత ఛానెళ్లున్నాయనీ.. వీటితోపాటు 35 ఇతర ఛానెళ్లలో ప్రకటనలు ఇస్తున్నామన్నారు.

అమెరికా విపణిలోకి 15 కొత్త ఉత్పత్తులు

- **డాక్టర్ రెడ్డీస్ 2018-19 ప్రణాళిక**

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15కు పైగా ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విడుదల చేసేందుకు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రయత్నాలు చేస్తోంది. దీంతోపాటు దేశీయ మార్కెట్లో రెండంకెల వృద్ధిని సాధిస్తామని అంచనా వేస్తోంది. 'సాధారణంగా ఏటా 10-15 ఉత్పత్తులను విడుదల చేసేందుకు పరిశోధన, అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తుంటాం. అయితే ఈ ఏడాది (2018-19) ఇవి 15కు మించి ఉండే అవకాశం ఉంద'ని సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సౌమెన్ చక్రవర్తి వివరించారు. డాక్టర్ రెడ్డీస్ 2017-18 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మూడు ఔషధాలను విడుదల చేసింది. 'ఇప్పటికే కొత్త ఔషధాలకు సంబంధించి 100 దరఖాస్తులు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) వద్ద అపరిష్కృతంగా ఉన్నాయని సీఈఓ జీవీ ప్రసాద్ పేర్కొన్నారు. వీటిలో కొన్ని ముడి ఔషధాల స్థాయిలో ఉండగా.. మరికొన్ని చివరి దశలో ఉన్నవని తెలిపారు. దువ్వాడలోని తయారీ ప్లాంటు లోపాలను సరిచేయడానికి అన్ని రకాల చర్యలూ తీసుకున్నట్లు పేర్కొన్నారు. జూన్ నెలాఖరు లేదా జులై ప్రారంభంలో తిరిగి తనిఖీలు చేయాలని ఎఫ్‌డీఏను కోరనున్నట్లు వెల్లడించారు. భారత్‌లో కంపెనీ వ్యాపారం గురించి సీఓఓ ఏరేజ్ ఇజ్రాయెలీ మాట్లాడుతూ..గత కొన్ని త్రైమాసికాలుగా భారత్‌లో సానుకూల వృద్ధి కనిపిస్తోందన్నారు.

ఈనాడు బిజినెస్

కోడిగుడ్లు	3న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)		
			(100కు రూపాయలలో)
హైదరాబాద్	361	వరంగల్	363
చిల్లరగా(ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	366
బెంగళూరు	410	చెన్నై	435
4వ తేదీకి		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	360	నమక్కల్	420

ఉచిత బ్యాంకింగ్ సేవలపై జీఎస్‌టీ లేదు

- **రెవెన్యూ శాఖ స్పష్టీకరణ**

దిల్లీ: ఏటీఎంల ద్వారా నగదు ఉపసంహరణ, చెక్ బుక్ జారీ, వంటి ఉచిత బ్యాంకింగ్ సేవలపై వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వర్తించదని రెవెన్యూ శాఖ స్పష్టం చేసింది. క్రెడిట్ కార్డ్ బిల్లు ఆలస్యంగా చెల్లిస్తే వేసే ఛార్జీలపై, ఎన్ఆర్ఐలు కొనుగోలు చేసే బీమా పాలసీలపై జీఎస్‌టీ ఉంటుందని వెల్లడించింది. బ్యాంకింగ్, బీమా, స్టాక్ బ్రోకర్లు వంటి రంగాల్లో జీఎస్‌టీ వర్తింపుపై రెవెన్యూ శాఖ పలు వివరణలు ఇచ్చింది. సెక్యూరిటీ లావాదేవీలు, డెరివేటివ్స్, ఫ్యూచర్, ఫార్వార్డ్ కాంట్రాక్టులకు సంబంధించిన లావాదేవీలకు సైతం జీఎస్‌టీ మినహాయింపు లభించింది.

ఉచిత బ్యాంకింగ్ సేవలపై జీఎస్‌టీ విధించే అంశంపై సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ స్పష్టత ఇచ్చింది. వినియోగదారులకు అందజేసిన ఉచిత సేవలపై గత నెలలో బ్యాంకులు సేవా పన్ను నోటీసులు అందుకోవడంతో రెవెన్యూ శాఖను ఆర్థిక సేవల విభాగం స్పష్టత కోరిన విషయం తెలిసిందే. 2017 సీజీఎస్‌టీ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం.. నిర్దేశిత వ్యక్తులకు అందించే సేవలను 'సరఫరా'గా మాత్రమే పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎన్ఆర్ఐలు కొనుగోలు చేసిన బీమా పాలసీలపై జీఎస్‌టీ విధింపుపై చెబుతూ 'ఎన్ఆర్ఐలు చెల్లిస్తున్న మొత్తం రూపాయిలో ఉంటోంది. మార్పిడి చేసే వీలున్న విదేశీ మారకంలో అందుకోవడం లేదు' అని పేర్కొంది. మ్యూచువల్ ఫండ్‌ల విక్రయంలో వేసే ఎగ్జిట్ లోడ్‌పై జీఎస్‌టీ విధించనున్నట్లు తెలిపింది. ఎగ్జిట్ లోడ్ కూడా ఒక ఫీజుగా పరిగణించింది. వీటితో పాటు క్రెడిట్ కార్డు బిల్లు ఆలస్యంగా చెల్లిస్తే వేసే ఛార్జీలు, ఫైనాన్స్ లీజు లావాదేవీలపై వేసే వడ్డీ కూడా జీఎస్‌టీ పరిధిలోకి వస్తాయి. ఫైనాన్స్ లీజు అనేది కుదువ పెట్టిన ఆస్తిపై తీసుకునే రుణమని వివరించింది.

అంతర్జాతీయ ప్రయాణికులకు ఊరట

విమానాశ్రయాల్లోని 'పన్ను రహిత' విక్రయశాలల్లో అంతర్జాతీయ ప్రయాణికులు కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్‌టీ మినహాయింపు లభించే అవకాశం ఉంది. త్వరలోనే ఈ మినహాయింపుపై రెవెన్యూ శాఖ స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని ఒక అధికారి పేర్కొన్నారు. విమానాశ్రయాల్లో విక్రయించే వస్తువులపై జీఎస్‌టీ విధించొచ్చని అథారిటీ ఫర్ అడ్వాన్స్ రూలింగ్ (ఏఏఆర్)కు చెందిన దిల్లీ బెంచ్ మార్చిలో అదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలపై స్పష్టత ఇవ్వాలని రెవెన్యూ శాఖను ఇప్పటికే పలువురు అభ్యర్థించారు. పన్ను రహిత షాపుల్లో కొనుగోళ్లపై జీఎస్‌టీ విధించకుండా త్వరలోనే స్పష్టత ఇస్తామని సంబంధిత అధికారు చెప్పారు. అంతర్జాతీయ ప్రయాణికులు కొనుగోళ్లు చేస్తే.. వారి నుంచి పాస్‌పోర్టు నకలు తీసుకోవాల్సిందిగా పన్ను రహిత విక్రయశాలలను ఆదేశిస్తామని, ఆ తర్వాత ప్రభుత్వం నుంచి జీఎస్‌టీ రిఫండ్ పొందొచ్చని వెల్లడించారు. తయారీదార్ల నుంచి వస్తువులు సేకరించి విక్రయించే ఎగుమతిదార్లు ప్రస్తుతం జీఎస్‌టీ రిఫండ్ ప్రక్రియను అవలంబిస్తున్నారు. దీంతో పన్ను రహిత షాపులు సైతం ఇదే పద్ధతి అనుసరించే అవకాశం ఉంది. అంతకు ముందు పరోక్ష పన్ను విధానంలో కేంద్ర విక్రయ పన్ను (సీఎస్‌టీ), విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ల నుంచి పన్ను రహిత షాపులకు మినహాయింపు ఉండేది. అంతర్జాతీయ అవగాహనలో ఇవి భాగమని నిపుణులు చెబుతున్నారు.

పసిడి బలహీనం!

కమొడిటీస్ ఈ వారం

- **పసిడి, వెండి**

గత వారం పసిడి ఆగస్టు కాంట్రాక్టు రూ.31,440 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత కూడా సానుకూలంగా చలించి రూ.31,596 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. అయితే వారాంతాన వెలువడే ఆర్థిక గణాంకాలను దృష్టిలో ఉంచుకొని ట్రేడర్లు లాభాలను స్వీకరించడంతో కాంట్రాక్టు రూ.30,875 వరకు దిద్దుబాటుకు లోనైంది. ఆఖరుకు 1.66% నష్టంతో రూ.30,919 వద్ద స్థిరపడింది. సాంకేతికంగా ఈవారం కాంట్రాక్టు బలహీనంగా కదలాడే అవకాశం ఉంది. అందువల్ల షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించడం మంచి వ్యూహం అవుతుంది. రూ.30,536 లక్ష్యంతో రూ.30,875- 31,130 మధ్య షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.31,257 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పెట్టుకోవాలి. జూన్ 13న అమెరికా ఫెడ్ సమావేశం ఉండటంతో ఆ లోపు ఫెడ్ అధికారులు చేసే వ్యాఖ్యలు, వెల్లడయ్యే ఆర్థిక గణాంకాలపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. డాలరు కదలికలను గమనించడం కూడా ముఖ్యమే. వెండి జులై కాంట్రాక్టుకు గత వారం ప్రారంభ ధర రూ.40,203. ఆ తర్వాత కొనుగోళ్ల మద్దతుతో రూ.40,220 వరకు వెళ్లింది. అనంతరం దిద్దుబాటుకు లోనై రూ.39,482 స్థాయికి పడిపోయింది. చివరకు 1.7% నష్టపోయి రూ.39,521 వద్ద ముగిసింది. సాంకేతికంగా ఈవారం రూ.40,479 స్థాయికి పైన నిలదొక్కుకుంటే కాంట్రాక్టు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.40,260 స్థాయి దిగువన కదలాడితే షార్ట్ పొజిషన్ల వైపు మొగ్గు చూపడం మేలు. లాంగ్ పొజిషన్లు తీసుకోదలిస్తే రూ.40,490 స్థాయి వరకు వేచి చూడటం మంచిది.

- **ప్రాథమిక లోహాలు**

రాగి జూన్ కాంట్రాక్టు ఈవారం కూడా ప్రతికూల ధోరణిలోనే సాగొచ్చు. అందువల్ల లాంగ్ పొజిషన్లుంటే రూ.454.85 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పెట్టుకోవాలి. ఎందుకంటే రూ.462 ఎగువకు వెళ్లకుంటే కాంట్రాక్టు మరింత పడిపోయే అవకాశం ఉంది. సీసం జూన్ కాంట్రాక్టుకు రూ.162 కంటే పైన కొనుగోళ్ల మద్దతు లభించే అవకాశం ఉంది. రూ.164- 168 మధ్య లాంగ్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.162 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణించాలి. జింక్ జూన్ కాంట్రాక్టు ఈరోజు రూ.209.80 కంటే పైన ముగిస్తే కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. ఒకవేళ అలా జరగకుంటే రూ.208.95 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని రూ.206.80 దిగువన షార్ట్ సెల్ చేయడం మంచి వ్యూహం అవుతుంది. అల్యూమినియం జూన్ కాంట్రాక్టు ఈవారం మరింత దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. రూ.153.65 స్థాయి వరకు పడిపోవచ్చు. నికెల్ జూన్ కాంట్రాక్టుకు సాంకేతికంగా రూ.1,077.45 వద్ద నిరోధం కనిపిస్తోంది. అయితే కాంట్రాక్టు కిందకు దిగివచ్చేందుకే అవకాశం ఉన్నందున రూ.1,062 దిగువన షార్ట్ సెల్ చేయడం మంచిది. రూ.1,077 దరిదాపులో స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

- **ఇంధన రంగం**

ముడి చమురు జూన్ కాంట్రాక్టుకు సాంకేతికంగా ప్రతికూల ధోరణి కొనసాగుతోంది. షార్ట్ సెల్ పొజిషన్లు ఉన్నవారు ఈవారం కూడా వాటిని కొనసాగించడం మేలే. ఒకవేళ కాంట్రాక్టు పుంజుకుంటే మరిన్ని షార్ట్ పొజిషన్లు కూడా జత చేసుకోవచ్చు. అయితే రూ.4,565 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణించాలి. సహజ వాయువు కాంట్రాక్టు ఈవారం మరింత కిందకు దిగివచ్చే అవకాశం ఉంది. అందువల్ల రూ.200.85 దిగువన షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) ఈవారం రూ.657 కంటే పైన ట్రేడ్ కాకుంటే పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లాలి. ఎందుకంటే ఈ కాంట్రాక్టుకు ప్రతికూల ధోరణి కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ&డెరివేటివ్స్

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (జూన్)	461	458.85	(0.47)
సీసం (జూన్)	163.60	164.90	0.79
జింక్ (జూన్)	207.65	207.60	(0.02)
అల్యూమినియం (జూన్)	154.95	155.35	0.26
నికెల్ (జూన్)	990.10	1,030.40	4.07
ముడి చమురు (జూన్)	4,580	4,428	(3.32)
సహజ వాయువు (జూన్)	200.50	198.30	(1.10)
సీపీఓ (జూన్)	663.20	652.60	(1.60)

ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష నేటి నుంచి

ముంబయి: నేటి నుంచి ప్రారంభం కానున్న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాల్లో అధిక ద్రవ్యోల్బణం, పెరుగుతున్న ముడిచమురు ధరలపైనే ఎక్కువగా చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నిర్వహిస్తోన్న రెండో సమీక్ష ఇదే. జనవరి- మార్చి త్రైమాసికంలో జీడీపీ 7.7 శాతానికి వృద్ధి చెందడం, సాధారణ వర్షపాత అంచనాలు వంటివి ఆర్‌బీఐ విధాన సమీక్షలో కీలకం కానున్నాయి. గతేడాది నవంబరు నుంచి ద్రవ్యోల్బణం 4 శాతం పైనే ఉండటం కలవరపెడుతోంది. ద్రవ్యోల్బణాన్ని కారణంగా చూపుతూ 2017 ఆగస్టు నుంచి రెపో రేటును ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. వడ్డీ రేట్లు పెరగొచ్చన్న అంచనాలతో.. ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఐసీఐసీఐ బ్యాంక్ సహా పలు బ్యాంక్‌లు జూన్ 1 నుంచి రుణ రేట్లు పెంచాయి. జీడీపీ బలంగా నమోదైనప్పటికీ.. ప్రైవేట్ పెట్టుబడులు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 7.3 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గాయని, ఆర్‌బీఐ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఎస్‌బీఐ పరిశోధనా పత్రంలో పేర్కొంది. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ నేతృత్వంలోని ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) ఈ సారి మూడు రోజులు పాటు సమావేశం కానుండటం గమనార్హం. బుధవారం మధ్యాహ్నం ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాల నిర్ణయాలను వెల్లడించనుంది.

రూ.135 కోట్లు చెల్లించండి

జీఎంఆర్ ఇన్‌ఫ్రాకు మాల్దీవుల ప్రభుత్వం పన్ను నోటీసు

హైదరాబాద్: మాలే అంతర్జాతీయ విమానాశ్రయ పనులకు సంబంధించి వ్యాపార లాభంపై పన్ను, అపరాధ రుసుములు కలిపి 20.5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.135 కోట్లు)ను చెల్లించాల్సిందిగా మాల్దీవుల ప్రభుత్వం జీఎంఆర్ గ్రూపునకు చెందిన జీఎంఆర్ మాలే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీఎంఐఏఎల్) సంస్థకు నోటీసు ఇచ్చింది. ఈ విమానాశ్రయ పనులను మధ్యలోనే ఆపేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత జీఎంఆర్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని (ఆర్బిట్రేషన్) ఆశ్రయించింది. ఇక్కడ జీఎంఆర్‌కు అనుకూలంగా 271 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాల్సిందిగా 2017-18 ఆర్థిక సంవత్సరంలో తీర్పు వచ్చింది. ఈ నేపథ్యంలో వ్యాపార లాభం పన్ను కింద 14.4మిలియన్లు, పన్ను చెల్లించనందుకుగాను 2.8మిలియన్లు, ఇతర రుసుముల కింద 3.3 మిలియన్లు, మొత్తంగా 20.5 మిలియన్ డాలర్లు చెల్లించాలని మాల్దీవ్స్ ఇన్‌లాండ్ రెవిన్యూ అథారిటీ (ఎంఐఆర్‌ఏ) నుంచి నోటీసు వచ్చినట్లు జీఎంఆర్ పేర్కొంది. మాల్దీవుల్లోని ఇబ్రహీం నాసిర్ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ, ఆధునికీకరణ, 25 ఏళ్లపాటు నిర్వహణ పనులు చేపట్టేందుకు జీఎంఆర్ జూన్ 28, 2010న మాల్దీవ్స్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ (ఎంఏసీఎల్), మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ అండ్ ట్రెజరీతో (ఎంఓఎఫ్‌టీ) ఒప్పందం చేసుకుంది. పనులు నిలిపివేయాల్సిందిగా పేర్కొంటూ ఎంఏసీఎల్, ఎంఓఎఫ్‌టీలు నవంబరు 27, 2012 జీఎంఐఏఎల్‌కు నోటీసులిచ్చాయి. ఆ తర్వాత డిసెంబరు 8, 2012లో ఆ విమానాశ్రయం నుంచి జీఎంఆర్ తప్పుకొంది. ఈ అంశాన్ని సింగపూరులోని మధ్యవర్తిత్వ న్యాయస్థానానికి జీఎంఆర్ తీసుకెళ్లి, పరిహారాన్ని పొందింది. ఇక పన్ను నోటీసులపై జీఎంఆర్ అధికార ప్రతినిధి స్పందిస్తూ.. జీఎంఐఏఎల్ అక్కడ ఎలాంటి వ్యాపారం నిర్వహించనందున, ఎంఐఆర్‌ఏ ఇచ్చిన నోటీసును తిరస్కరించినట్లు పేర్కొన్నారు. పొందిన నష్టపరిహారానికి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉందా అన్న విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎంఏసీఎల్ సమాధానం కోసం ఎదురుచూస్తున్నట్లు, జవాబును బట్టి, తదుపరి చర్యలు చేపడతామని వివరించారు.

స్టాక్ మార్కెట్ ఈ వారం

చాలా తక్కువ శ్రేణిలో సూచీలు కదలాడవచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చే సంకేతాలను బట్టి మార్కెట్లు చలించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. ఈ వారం నిఫ్టీ 10550-10800 మధ్య స్థాయిలో ట్రేడవవచ్చని అంటున్నారు. కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్‌ల నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దీని ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మనపైనా కనిపించొచ్చు. ఇక నేటినుంచి మూడు రోజులపాటు జరిగే రిజర్వ్ బ్యాంక్ పరపతి విధాన సమీక్షా సమావేశాలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. వడ్డీరేట్ల పెంపు ఉంటుందా.. లేదా.. అన్నది బుధవారం తేలనుంది. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు..

ఎల్లుండికోసం ఎదురుచూపులు

- ఆర్‌బీఐ పరపతి సమీక్ష నిర్ణయాలు కీలకం
- చాలా తక్కువ శ్రేణిలో సూచీల కదలికలు
- 10550-10800 మధ్య నిఫ్టీ
- అంతర్జాతీయ పరిణామాలపైనా దృష్టి
- విశ్లేషకుల అంచనాలు

❖ ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలు ఈ వారం కొంత ప్రతికూల ధోరణితో స్థిరీకరణ చెందే అవకాశం ఉంది. ప్రభుత్వ రంగ **చమురు** మార్కెటింగ్ కంపెనీలు (ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్) లాభాలను కొనసాగించొచ్చు. అధిక ఇంధన ధరలపై ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే కనక ఆ ప్రభావం పడొచ్చు.

❖ ఈ ఏడాది సాధారణ వర్షపాతం కురుస్తుందన్న అంచనాల మధ్య **సిమెంటు** రంగ కంపెనీలు రాణించే అవకాశం ఉంది. వర్షాకాలంలో సిమెంటుకు గిరాకీ తగ్గనున్నప్పటికీ.. మంచి వర్షాలతో గ్రామీణ ఆదాయం పెరిగితే తర్వాత సంవత్సరమంతా గిరాకీ పెరుగుతుంది.

❖ బుధవారం ఆర్‌బీఐ చేసే విధాన ప్రకటన నేపథ్యంలో **బ్యాంకింగ్** షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. వడ్డీ రేట్లపై అనిశ్చితి వల్ల మదుపర్లు ట్రేడింగ్‌కు దూరంగా ఉండొచ్చు. ఐసీఐసీఐ బ్యాంకు బోర్డు తమ సీఈఓపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసినందున.. ఏవైనా పరిణామాలు చోటు చేసుకుంటే అవి బ్యాంకు షేరుపై ప్రభావం చూపొచ్చు.

❖ **టెలికాం** షేర్లు ఈ వారం కూడా ప్రస్తుత స్థాయిల వద్దే కదలాడవచ్చు. రిలయన్స్ జియో మార్కెట్ వాటాను పెంచుకోవడం కోసం తక్కువ టారిఫ్‌లనే కొనసాగిస్తుందన్న అంచనాల మధ్య మదుపర్లు టెలికాం షేర్లలో పెట్టుబడులు పెట్టడం లేదు. ఐడియా-వొడాఫోన్ విలీనం పూర్తికి సమయం దగ్గరపడుతున్నందున ఈ షేర్లలో కదలికలను కొట్టిపారేయలేం.

❖ **వాహన** కంపెనీలు మిశ్రమ ధోరణిలో కదలాడవచ్చు. మారుతీ సుజుకీ బలంగా, టాటా మోటార్స్ బలహీనంగా కనిపిస్తున్నాయి. వాహన విక్రయాలు ఇందుకు నేపథ్యం.

❖ తమిళనాడులో వేదాంతకు చెందిన రాగి ప్లాంటు మూసివేత నేపథ్యంలో ఈ వారం ఆ కంపెనీ షేర్లపై దృష్టి కొనసాగుతుంది. మొత్తం మీద **లోహ, గనుల** కంపెనీల షేర్లు ఊగిసలాటకు లోనుకావొచ్చు. చాలా వరకు ఉక్కు కంపెనీలు ధరలను సవరించిన నేపథ్యంలో వాటిని కూడా మదుపర్లు గమనించొచ్చు.

❖ **ఎఫ్ఎమ్‌సీజీ** షేర్లు చాలా తక్కువ శ్రేణిలో ట్రేడింగ్ కావొచ్చు. ఆర్‌బీఐ నిర్ణయంపై ఓ కన్నేయవచ్చు. గత వారం 50 శాతం కోల్పోయిన మన్‌పసంద్ బెవరేజెస్‌పై ఈ వారం కూడా దృష్టి సారించొచ్చు.

❖ ఎల్ అండ్ టీ బలంగా ఉన్న నేపథ్యంలో ఈ వారం **యంత్ర పరికరాల** రంగ కంపెనీలకు చెందిన షేర్లు కొంత మేర లాభాలను పొందొచ్చు. గత వారం నష్టపోయిన భెల్, థెర్మాక్స్, సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల సొల్యూషన్స్ కంపెనీలు కొంత కోలుకోవచ్చు.

❖ **ఔషధ** రంగ షేర్లు స్తబ్దుగా ఉండొచ్చు. గత వారం నష్టపోయిన అరబిందో ఫార్మా, కేడిలా, సిప్లాలకు మద్దతు లభించకపోవచ్చు. మార్కెట్ చాలా తక్కువ శ్రేణికి పరిమితమై కదలాడుతుండడం ఇందుకు నేపథ్యం.

చమురు-గ్యాస్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	409.25	416.10	400.20
హెచ్‌పీసీఎల్	312.15	320.50	304.90
ఐఓసీ	172.35	177.50	168.60
ఓఎన్‌జీసీ	173.20	178.70	167.90
రిలయన్స్ ఇండస్ట్రీస్	930.55	945.60	911.00

సిమెంట్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1326.70	1392.50	1283.60
అంబుజా సిమెంట్స్	203.55	211.70	198.60
ఇండియా సిమెంట్స్	125.85	135.60	119.80
శ్రీ సిమెంట్	16656.40	17271.60	16273.30
అల్ట్రాటెక్ సిమెంట్	3688.15	3789.30	3609.50

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
యాక్సిస్ బ్యాంక్	536.65	549.40	526.50
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2110.60	2153.50	2079.50
ఐసీఐసీఐ బ్యాంక్	289.30	305.10	278.90
ఎస్‌బీఐ	266.70	272.20	261.80
యెస్ బ్యాంక్	342.70	352.30	335.40

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	383.70	394.10	367.40
ఐడియా సెల్యులార్	61.80	64.00	59.90
ఆర్‌కామ్	16.45	19.30	14.80
రిలయన్స్ ఇండస్ట్రీస్	930.55	945.60	911.00
టాటా కమ్యూనికేషన్స్	601.80	634.20	580.20

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	150.85	153.80	147.3
బజాజ్ ఆటో	2896.55	2995.00	2729.50
హీరో మోటోకార్ప్	3626.30	3688.60	3523.00
ఎం అండ్ ఎం	901.60	939.20	878.30
మారుతీ సుజుకీ	8808.85	9007.50	8490.80

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	238.50	244.80	227.90
హిందుస్థాన్ జింక్	291.25	301.90	281.40
ఎన్ఎమ్‌డీసీ	115.45	120.40	112.00
టాటా స్టీల్	560.65	588.80	542.20
వేదాంతా	248.25	263.00	239.20

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5812.45	6040.00	5680.40
కోల్గేట్ పామోలివ్	1247.10	1271.90	1231.10
డాబర్ ఇండియా	386.75	396.70	378.00
హిందుస్థాన్ యునిలీవర్	1588.85	1641.40	1554.80
ఐటీసీ	269.95	272.90	267.70

యంత్ర పరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	80.35	84.90	77.80
ఎల్ అండ్ టీ	1372.40	1410.40	1343.60
సీజీ పవర్	59.20	73.10	46.70
థెర్మాక్స్	1110.15	1140.20	1091.00

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	535.30	578.00	509.10
సిప్లా	524.50	535.10	515.70
డాక్టర్ రెడ్డీస్	1941.40	1976.80	1914.60
గ్లెన్‌మార్క్ ఫార్మా	535.85	551.50	521.50
లుపిన్	764.45	789.60	749.00

సిరి
విజయవాడ
సోమవారం జూన్ 4, 2018
siri@eenadu.net

ఫండ్ల పేర్లు... విభాగం..

ఎందుకు మారాయో తెలుసా?

వేలకొద్దీ మ్యూచువల్ ఫండ్ పథకాలు.. అందులో ఎన్నో విభాగాలు.. ఏది ఎక్కడ మదుపు చేస్తుంది? ఏ పథకాన్ని ఎంచుకుంటే బాగుంటుందో తెలుసుకోవడం సాధారణ మదుపరులకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఫండ్లను పునఃవర్గీకరణ చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో ప్రస్తుతం పలు ఫండ్ పథకాల పేర్లు మారిపోయాయి. ఇలా ఎందుకు? ఇది మదుపరులకు ఎలా మేలు చేయబోతోంది? ఫండ్ సంస్థలు దీని నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందబోతున్నాయి.. తెలుసుకుందాం!

గ్రాఫిక్: సుధాకర్

దాదాపు 25 ఏళ్ల క్రితం ప్రైవేటు మ్యూచువల్ ఫండ్ సంస్థలు ప్రారంభమైనప్పటి నుంచీ ఈ రంగం గణనీయంగా వృద్ధి చెందింది. ఫండ్ సంస్థలు మదుపరుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పథకాలను విడుదల చేయడం ప్రారంభించాయి. ఇందులో ఒక్కో ఫండ్‌దీ ఒక్కో విభిన్న శైలి.

మార్కెట్లో నడుస్తున్న ధోరణులు.. వృద్ధికి అవకాశం ఉన్న రంగాలను బట్టి, ఫండ్ సంస్థలు దానికి తగ్గట్టుగా పథకాలను అందిస్తూ వస్తున్నాయి. దీంతో ఇప్పుడు 42 ఫండ్ సంస్థల నుంచి దాదాపు 2వేలకు పైగానే ఉన్నాయి. ఇందులో 800 వరకూ ఎఫ్‌ఎంపీలు కూడా ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్ రంగం వృద్ధి బాటలో సాగుతోందని అనిపించినా.. ఈ పథకాల్లో వేటిని ఎంచుకోవాలన్నది తెలుసుకోవడం మదుపరులకు కష్టంగా మారింది. పరిస్థితులను గమనించిన మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ దీనికి ఓ పరిష్కారం చూపాలని నిర్ణయించింది. దీని ప్రధాన లక్ష్యం.. మ్యూచువల్ ఫండ్ రంగాన్ని క్రమబద్ధీకరించడం, పథకాలను వాటి పెట్టుబడి వ్యూహాల ఆధారంగా ఒకే విభాగం కిందకు చేర్చడం.

ఎప్పుడు ప్రారంభమైంది?

2015లో యాంఫీ, అప్పటి సెబీ ఛైర్మన్‌తో కలిసి ఉమ్మడిగా కేంద్ర ఆర్థిక శాఖకు ఒక వినతిపత్రం అందించాయి. మ్యూచువల్ ఫండ్ పథకాల ఏకీకరణలో భాగంగా ఒక పథకం నుంచి మరో పథకానికి యూనిట్లను బదిలీ చేసినప్పుడు.. ఆ బదిలీని.. స్వల్పకాలిక, దీర్ఘకాలిక మూలధన లాభం/నష్టంగా పరిగణించకూడదని అందులో విన్నవించాయి. దీని వల్ల మ్యూచువల్ ఫండ్ మదుపరులకు పన్ను ప్రయోజనం లభించడంతోపాటు.. ఒకే తరహా పథకాలను ఏకీకరణ చేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆర్థిక శాఖ 'ది ఫైనాన్స్ యాక్ట్ 2015, సెక్షన్ 47'లో మార్పులు చేసింది. దీని ప్రకారం పథకాల ఏకీకరణలో భాగంగా యూనిట్ల బదిలీ జరిగినప్పుడు దానికి పన్ను విధించకుండా మినహాయింపు ఇచ్చింది.

ఈ సవరణతో మదుపరులకు ప్రయోజనం లభిస్తుండటంతో చాలా మ్యూచువల్ ఫండ్ సంస్థలు పథకాలను తగ్గించడం ప్రారంభించాయి. గతంలో కేవలం ఎన్ఎఫ్ఓ సమయంలోనే మదుపు చేయాలనే ధోరణిలో పెట్టుబడిదారులు ఉండేవారు. కానీ, మదుపరులకు మ్యూచువల్ ఫండ్ పథకాలపై పెరిగిన అవగాహన నేపథ్యంలో వారి ఆలోచనా ధోరణి మారింది. పాత పథకాల్లోనూ మదుపు చేయడానికి ముందుకు వస్తున్నారు. ఎన్ఏవీతో సంబంధం లేకుండా ఓపెన్ ఎండెడ్ పాత పథకాల్లోనూ పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఫలితంగా ఫండ్ సంస్థలకూ కొత్త పథకాలను విడుదల చేయాల్సిన అవసరం అంతగా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఫండ్ సంస్థలు పథకాలను సెబీ నిబంధనలకు అనుగుణంగా పునః వర్గీకరించడం ప్రారంభించాయి.

సెబీ నిబంధనల ప్రకారం ఈక్విటీ ఫండ్లలో 10, డెట్ పథకాల్లో 16, హైబ్రీడ్ ఫండ్లలో 6, సొల్యూషన్ బేస్డ్ ఫండ్స్‌లో 2, ఇండెక్స్ ఫండ్/ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లో 1 చొప్పున విభాగం ఉన్నాయి. ఇలా మొత్తం 36 విభాగాల్లోనే ఫండ్లను అందించాల్సి ఉంటుంది.

మదుపరులకు ఏం లాభం?

ఫండ్ పథకాల పునఃవర్గీకరణ వల్ల మదుపరులకు తమకు అనుకూలమైన పథకాలను ఎంచుకోవడం సులువవుతుంది. తమ పెట్టుబడి లక్ష్యాలకు అనువైన పథకాలు ఏమిటి? పెట్టుబడి తీరు, ఎన్నాళ్లు మదుపు చేయాలి? లాంటివి అర్థం చేసుకోవచ్చు. ఫండ్ పథకాలకు ఉన్న స్పష్టమైన నిర్వచనం వల్ల.. మదుపరులు మరింత అవగాహనతో తమ పెట్టుబడులను నిర్వహించుకునేందుకు వీలవుతుంది. ఒకసారి ఈ పునఃవర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఫండ్ పథకాలను సులభంగా పోల్చుకునేందుకూ తేలికవుతుంది. ఒక పథకం గురించి పూర్తి వివరాలు తెలియజేసి, అది మీకు ఎందుకు సరిపోతుందో.. ఎందుకు మదుపు చేయకూడదో చెప్పేందుకు కూడా సలహాదార్లకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ప్రపంచంలోనే ఇలాంటి ప్రక్రియ ఇదే మొదటిసారి.

మ్యూచువల్ ఫండ్ సంస్థలూ వృద్ధి చెందేందుకు ఈ పునః వర్గీకరణ ఉపయోగపడుతుంది. ఫండ్ నిర్వాహకులు.. ప్రస్తుతం అనుసరిస్తున్న పెట్టుబడి వ్యూహాలతో పోలిస్తే.. కాస్త పరిమితులతో పెట్టుబడులను నిర్వహించాల్సి వస్తుంది. పోర్ట్‌ఫోలియో నిర్వహణలో సరైన రంగం, షేరును ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. స్పష్టమైన పెట్టుబడి తీరు ఉండటంతో నష్టభయం తగ్గేందుకు వీలుంటుంది. కచ్చితమైన పద్ధతుల్లో మదుపు చేయడం ద్వారా వృద్ధిని ఊహిస్తూ ముందుకువెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అదే సమయంలో మార్కెట్ పతనాల్లో నష్టభయం కూడా అంతగా ఉండకుండా చూసుకునేందుకు వీలవుతుంది.

- **ఎ.బాలసుబ్రమణియన్**, సీఈఓ, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ

ఏయే విభాగాలుగా...

ప్రస్తుతం అందుబాటులో ఉన్న పథకాలన్నీ కూడా పునః వర్గీకరణ తర్వాత ప్రధానంగా ఐదు విభాగాల్లోకి మారాల్సి ఉంటుంది.

1) ఈక్విటీ పథకాలు 2) డెట్ పథకాలు 3) హైబ్రీడ్ పథకాలు 4) సొల్యూషన్ ఓరియంటెడ్ పథకాలు 5) ఇతర పథకాలు..

ఇందులో తిరిగి ఒక్కో విభాగంలోనూ కొన్ని ఉప విభాగాలు ఉంటాయి. ముఖ్యంగా మదుపరులు ఎక్కువగా పెట్టుబడి పెట్టే.. ఈక్విటీ, డెట్, హైబ్రీడ్ పథకాల్లో ఉండే ఉప విభాగాల గురించి ఫండ్ మదుపరులకు అవగాహన ఉండాల్సిన అవసరం ఉంది.

ఈక్విటీ పథకాలను పరిశీలిస్తే...

- **లార్జ్ క్యాప్ ఫండ్లు:** పెట్టుబడి మొత్తంలో 80శాతానికి మించి లార్జ్‌క్యాప్ షేర్లలో మదుపు చేయాల్సి ఉంటుంది.
- **లార్జ్ అండ్ మిడ్ క్యాప్:** లార్జ్ క్యాప్ షేర్లలో 35 శాతం, మిడ్ క్యాప్ షేర్లలో 35శాతాన్ని పెట్టుబడి పెట్టే ఫండ్లివి.
- **మల్టీ క్యాప్ ఫండ్లు:** ఈ తరహా ఫండ్లలో ఫండ్ మేనేజర్ మార్కెట్ పరిస్థితిని బట్టి ఏ షేర్లను ఎంచుకోవాలో నిర్ణయించుకుంటాడు. కచ్చితంగా 65శాతం వరకూ ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టాలన్నదే ఇక్కడ పాటించాల్సిన ప్రధాన నిబంధన.
- **మిడ్ క్యాప్ ఫండ్లు:** పెట్టుబడిలో 65శాతం వరకూ మిడ్ క్యాప్ స్టాక్స్‌లో ఉండాలి.
- **స్మాల్ క్యాప్ ఫండ్లు:** పోర్ట్‌ఫోలియోలో 65శాతం వరకూ పెట్టుబడులు స్మాల్ క్యాప్ షేర్లకు కేటాయించే పథకాలివి.
- **వాల్యూ ఫండ్:** విలువ ఆధారిత పెట్టుబడి వ్యూహాన్ని పాటించే పథకాలివి.
- **కాంట్రా ఫండ్:** మార్కెట్ పనితీరుకు భిన్నంగా పెట్టుబడి వ్యూహంతో పనిచేసేవి. 65శాతం ఈక్విటీలో పెట్టుబడి ఉండాలన్నది నిబంధన
- **ఫోకస్డ్ ఫండ్స్:** అన్ని మార్కెట్ క్యాప్ ఫండ్లలో కలిపి గరిష్ఠంగా 30 షేర్లను ఎంపిక చేసుకుని మదుపు చేసే వ్యూహంతో ఉన్న పథకాలు.
- **ఈఎల్ఎస్ఎస్:** ఈక్విటీల్లో కనీసం 80శాతం వరకూ మదుపు చేస్తాయివి.

ఏవి ఏ షేర్లు...

సాధారణంగా మార్కెట్ పెట్టుబడులకు సంబంధించి లార్జ్ క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు అని వింటుంటాం. ఏవి ఏ విభాగంలోకి వస్తాయో అనే విషయంలో యాంఫీ స్పష్టమైన వివరణ ఇచ్చింది.

- **లార్జ్ క్యాప్** షేర్లంటే... మార్కెట్ మూలధనం పరంగా మొదటి 100 స్థానాల్లో ఉన్న షేర్లను లార్జ్ క్యాప్ స్టాక్స్‌గా వ్యవహరిస్తారు.
- **మిడ్ క్యాప్:** మార్కెట్ మూలధనం పరంగా 101 నుంచి 250 స్థానాల వరకూ ఉన్న షేర్లను మిడ్ క్యాప్‌గా వ్యవహరిస్తారు.
- **స్మాల్ క్యాప్:** మార్కెట్ మూలధనం పరంగా 251 స్థానం నుంచి ఆపైన ఉన్నవన్నీ కూడా స్మాల్ క్యాప్ షేర్లు.

ప్రతి ఆరు నెలలకోసారి అంటే.. జూన్, డిసెంబరు నెలల్లో కంపెనీల మూలధనం ఆధారంగా ఈ జాబితాను సవరిస్తుంటారు.

హైబ్రీడ్ పథకాల్లో...

- **అగ్రెసివ్ హైబ్రీడ్ ఫండ్:** గతంలో వీటిని బ్యాలెన్స్‌డ్ ఫండ్లుగా పిలిచేవారు. ఇందులో ఫండ్ మేనేజర్ పెట్టుబడి మొత్తాన్ని 65-80శాతం వరకూ ఈక్విటీలకూ.. 20-35శాతం వరకూ డెట్ ఫండ్లకూ మళ్లిస్తారు.
- **డైనమిక్ అసెట్ అలొకేషన్/బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లు:** మార్కెట్ పరిస్థితులను బట్టి, ఫండ్ మేనేజర్ ఈక్విటీ, డెట్ పథకాల్లో పెట్టుబడి శాతాలను మారుస్తూ ఉంటారు.
- **కన్జర్వేటివ్ హైబ్రీడ్ ఫండ్:** ఈక్విటీల్లో పెట్టుబడి 10-25శాతం వరకే పరిమితం. డెట్ పథకాల్లో 75-90శాతం వరకూ మదుపు చేసే పథకాలివి.
- **మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్స్:** మూడు రకాల పెట్టుబడి విభాగాల్లో (అసెట్ క్లాసెస్) వైవిధ్యంగా ఇది మదుపు చేసి ఉండాలి. ఇందులో ఒక్కో విభాగంలో కనీసం 10శాతం పెట్టుబడులు ఉండాలి.
- **ఆర్బిట్రేజ్ ఫండ్లు:** కనీసం 65శాతం పెట్టుబడులు ఈక్విటీల్లో ఉంటూ.. ఆర్బిట్రేజ్ వ్యూహాన్ని పాటించే ఫండ్లన్నీ ఈ విభాగం కిందకు వస్తాయి.
- **ఈక్విటీ సేవింగ్స్ విభాగం:** ఈక్విటీల్లో కనీసం 65శాతంతోపాటు, కనీసం 10శాతం పెట్టుబడులు డెట్ పథకాల్లో ఉండాలి.

డెట్ విభాగం ఫండ్లలో...

ఇందులో మొత్తం 16 ఉపవిభాగాలున్నాయి. ఇందులో ప్రముఖంగా వినిపించేవి ఇక్కడ చూద్దాం!

- **లిక్విడ్ ఫండ్లు:** 91 రోజుల వరకూ కాల వ్యవధితో.. మొత్తం పెట్టుబడిని డెట్, మనీ మార్కెట్లో మదుపు చేసే పథకాలివి.
- **అల్ట్రా షార్ట్ డ్యూరేషన్ ఫండ్లు:** పెట్టుబడులు డెట్, మనీ మార్కెట్ పథకాల్లో ఉంటూ.. 3-6నెలల మధ్య కాలావధి ఉండేవి.
- **లో డ్యూరేషన్ ఫండ్లు:** పెట్టుబడులు డెట్, మనీ మార్కెట్ పథకాల్లో ఉంటూ.. 6-12నెలల మధ్య కాలావధి ఉండేవి.
- **షార్ట్ డ్యూరేషన్:** పెట్టుబడులు డెట్, మనీ మార్కెట్ పథకాల్లో ఉంటూ.. 1-3 ఏళ్ల మధ్య కాలావధి ఉండేవి.
- **మనీ మార్కెట్ ఫండ్లు:** పెట్టుబడులు మొత్తం నగదు ఆధారిత మార్కెట్లో మదుపు చేసి, కాలావధి ఏడాది వరకూ ఉండేవి.
- **గిల్ట్ ఫండ్లు:** ప్రభుత్వ సెక్యూరిటీల్లో 80శాతం వరకూ మదుపు చేసేవి.
- **కార్పొరేట్ బాండ్ ఫండ్స్:** 80శాతం వరకూ పెట్టుబడులను అధిక రేటింగ్ ఉన్న కార్పొరేట్ బాండ్లలో మదుపు చేసేవి.

ప్రస్తుతం ఈ విభాగాల పరిధిలోకి ఇప్పటికే ఉన్న పథకాలను తీసుకొచ్చేందుకు మ్యూచువల్ ఫండ్ సంస్థలు పథకాల పేర్లను మారుస్తున్నాయి. కాబట్టి, మీరు ఇప్పటికే మదుపు చేస్తున్న పథకం పేరు మారిందా.. అలాగే కొనసాగుతోందా ఒకసారి చూసుకోండి. మనం ఎందులో మదుపు చేస్తున్నాం అని తెలుసుకోవడం మదుపరిగా మన కనీస బాధ్యత!

- **సాయికృష్ణ పత్రి**, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

పాలసీ.. ఇవన్నీ చూశాకే!

వైద్య ద్రవ్యోల్బణం గత 10 ఏళ్లుగా గణనీయంగా పెరిగిపోయింది. ఒక వ్యక్తికి అనారోగ్యం వచ్చిందంటే.. అటు మానసికంగా ఇబ్బందితోపాటు.. కుటుంబ ఆర్థిక పరిస్థితిపై కూడా ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా పాలసీ అనేది ప్రతి వ్యక్తి ఆర్థిక ప్రణాళికలో తప్పనిసరి అవసరం అయ్యింది.

ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాలన్న తొందరలో ఏదో ఒకటి ఎంచుకోవడం ఎప్పుడూ సరికాదు. కేవలం ఇప్పటి అంశాలనే కాకుండా... భవిష్యత్తులో రాబోయే ఇబ్బందులనూ దృష్టిలో పెట్టుకొని పాలసీని తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కనీసం రూ.5లక్షల పాలసీ ఉంటేనే బాగుంటుంది. దీన్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉండాలి. కుటుంబంలో ఆర్జించే వ్యక్తి పేరుమీద క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ కూడా ఉండాల్సిందే.

ఆరోగ్య బీమా పాలసీని తీసుకోవాలనుకుంటున్నప్పుడు గమనించాల్సిన అంశాలేమిటంటే..

- **ఎంత ఉండాలి?:** పాలసీ ఎంత మొత్తానికి తీసుకోవాలని నిర్ణయించడంలో మీరు ఎక్కడ నివసిస్తున్నారన్నదీ కీలకమే. మెట్రో నగరాల్లో ఉండే వారికి వైద్య ఖర్చులు అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. నగరంలోనూ.. ప్రాంతాలను బట్టి, వైద్య చికిత్సల అందుబాటు, ధరల్లో తేడా ఉంటుంది. కొన్ని ఆసుపత్రులు అధిక ఛార్జీలను వసూలు చేయవచ్చు. దీంతోపాటు.. ఆరోగ్య ద్రవ్యోల్బణాన్ని కూడా దృష్టి పెట్టుకోవాలి. పాలసీ విలువ ఆరోగ్య ద్రవ్యోల్బణానికి మించి ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మీరు పూర్తిగా ఓ రక్షణ చక్రంలో ఉన్నట్లు లెక్క.
- **వేచి ఉండే సమయం:** పాలసీని ఎంచుకునేప్పుడు ముందుగానే ఉన్న వ్యాధులకు ఎప్పటి నుంచి రక్షణ కల్పిస్తారన్నదీ చూసుకోవాలి. దీన్నే బీమా పరిభాషలో వేచి ఉండే సమయం అంటారు. ఏ వ్యాధులూ సోకనప్పుడే.. అంటే వయసు తక్కువగా ఉన్నప్పుడే ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడమే ఎప్పుడూ మేలు.



- **అదనపు ప్రయోజనాలు:** ఆరోగ్య బీమా పాలసీతోపాటు ఎలాంటి అదనపు ప్రయోజనాలు అందుతున్నాయన్నదీ ముఖ్యమే. క్యుములేటివ్ బోనస్, తగ్గింపులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రపంచంలో ఎక్కడైనా బీమా రక్షణ, మంచి జీవన శైలికి రివార్డులు, ప్రసూతి ఖర్చులను చెల్లించడంలాంటివి ఇక్కడ గమనించాల్సిన అంశాలు.
- **పరిమితులున్నాయా?:** పాలసీకి సంబంధించిన నియమనిబంధనలను పక్కాగా తెలుసుకోండి. ఆసుపత్రి గది అద్దె, ఇంటికి వెళ్లాక అయ్యే ఖర్చులు, ఇతర వ్యయాలకు సంబంధించి పరిహారం ఎలా అందుతుందో చూసుకోండి. పరిమితులున్నాయా తెలుసుకోండి.

కేవలం ఆరోగ్య బీమా తీసుకోవడంతోనే సరిపోదు.. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడమూ ఇప్పటి పరిస్థితుల్లో అనివార్యం. దీనివల్ల ఊహించని కష్టాలు రాకుండా చూసుకోగలం.

- **సందీప్ పటేల్**, ఎండీ, సీఈఓ; సిగ్నా టీటీకే హెల్త్ ఇన్సూరెన్స్

పొదుపు చేశారా?

మీ ఆదాయానికి రెట్టింపు!

ఇలా చదువు పూర్తికాగానే.. అలా వేల రూపాయల కొలువులో చేరిపోతున్నారు నేటి యువత. మరి, సంపాదనలో ఎంత పొదుపు చేస్తున్నారనే విషయంలో అనుమానమే. 22 ఏళ్లకు ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఒక వ్యక్తికి 35 ఏళ్లు వచ్చేనాటికి తన ఆదాయం కన్నా రెట్టింపు మొత్తం చేతిలో ఉండాలి. ఇది ఎలా సాధ్యం అనే సందేహం వస్తోందా?

వయసు (ఏళ్లలో)	వార్షిక వేతనం రూ.	పొదుపు 15%	12% రాబడి అంచనాతో సిప్ చేస్తే రూ.*
22	2,40,000.0	36,000.0	38,428.0
23	2,64,000.0	39,600.0	85,572.0
24	2,90,400.0	43,560.0	1,42,923.0
25	3,19,440.0	47,916.0	2,12,197.0
26	3,51,384.0	52,707.6	2,95,371.0
27	3,86,522.4	57,978.4	3,94,720.0
28	4,25,174.6	63,776.2	5,12,858.0
29	4,67,692.1	70,153.8	6,52,787.0
30	5,14,461.3	77,169.2	8,17,950.0
31	5,65,907.4	84,886.1	10,12,298.0
32	6,22,498.2	93,374.7	12,40,355.0
33	6,84,748.0	1,02,712.2	15,07,302.0
34	7,53,222.8	1,12,983.4	18,19,070.0

*వార్షిక పొదుపు మొత్తాన్ని నెలనెలా సమానంగా సిప్ చేసుకుంటూ వెళ్లినప్పుడు, ఏడాది చివరికల్లా జమ అయ్యే మొత్తం)

నిజం చెప్పాలంటే.. ఇది ఏమాత్రం కష్టం కాదు. ఉద్యోగం వచ్చిన మొదటి నెల నుంచే క్రమశిక్షణతో పొదుపు చేసుకుంటూ.. దాన్ని సరైన చోట మదుపు చేస్తే చాలు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి పెద్ద కష్టపడాల్సిన అవసరమే లేదు.

ఏం చేయాలి?

ఇక్కడ ఒక ఉదాహరణ చూద్దాం...

ప్రస్తుతం మీ వయసు 22 ఏళ్లు. ఏటా మీ ఆదాయం 10శాతం చొప్పున పెరుగుతుంది. 22 ఏళ్లప్పుడు మీ ఆదాయం ఎంత ఉందన్నది ఇక్కడ సంబంధం లేదు. ఏటా 10శాతం పెరుగుతుందని అంచనా వేసుకుందాం. మీకు 35 ఏళ్ల వయసు రావడానికి ఇంకా 13 ఏళ్ల సమయం ఉంది. చేయాల్సిందేమిటంటే.. మీకు వచ్చే వార్షికాదాయంలో 15శాతం పొదుపు చేయడమే. (ఇక్కడ 15శాతం అనేదే కీలకం. ఒకవేళ ఇంతకన్నా తక్కువ పొదుపు చేస్తే.. 35 ఏళ్లనాటికి రెట్టింపు పొదుపు అనే లక్ష్యం నెరవేరకపోవచ్చు.).

ఇక ఇలా పొదుపు చేసిన మొత్తాన్ని కనీసం 10శాతం వార్షిక రాబడినిచ్చే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయాలి. వీటిల్లో నెలనెలా నిర్ణీత మొత్తాన్ని క్రమానుగత మదుపు విధానం (సిప్)లో పెట్టుబడి పెట్టాలి. మీరు మదుపు చేస్తున్న ఫండ్లు వార్షిక రాబడి 12శాతం ఇచ్చాయనుకోండి.. మీరు మీ వార్షికాదాయానికి సరైన మొత్తం 27 ఏళ్లు వచ్చేనాటికే సాధిస్తారు. 33 ఏళ్లు వచ్చేనాటికి మీ చేతిలో మీ వార్షికాదాయానికి రెట్టింపు మొత్తం ఉంటుంది.

పట్టికను గమనిస్తే.. 22 ఏళ్ల వ్యక్తి ఏడాదికి రూ.2.4లక్షలు ఆర్జిస్తున్నాడు. అతని ఆదాయం ఏటా 10శాతం పెరుగుతుందని అంచనా వేసుకున్నప్పుడు.. 34 ఏళ్లనాటికి దాదాపు రూ.7.53లక్షలకు ఆదాయానికి చేరుకుంటాడు. 35 ఏళ్లు వచ్చేనాటికి అతని పెట్టుబడుల విలువ రూ.18.19లక్షలు అవుతుంది. అంటే.. అతని ఆదాయానికి 2.42 రెట్లు అవుతుందన్నమాట.

ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే.. పెట్టుబడుల్లో ఆలస్యం చేసిన కొద్దీ.. అనుకున్న లక్ష్యాన్ని సాధించడమూ ఆలస్యం అవుతుంది. అప్పుడు అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఉదాహరణకు 28 ఏళ్ల వరకూ ఒక్క పెట్టుబడి కూడా లేకపోతే.. వచ్చిన ఆదాయంలో నుంచి 30శాతం వరకూ మదుపు చేస్తేనే.. 35 ఏళ్ల వయసు నాటికి వార్షిక సంపాదనకు రెండు రెట్లు కూడబెట్టగలం. 30 ఏళ్ల తర్వాత ప్రారంభిస్తే.. సంపాదనలో 40శాతం మదుపు చేయాల్సిందే. ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఎంత తొందరగా పెట్టుబడి ప్రారంభిస్తే.. అంత తొందరగా ఆర్థిక లక్ష్యం నెరవేరుతుంది.

ఎక్కడ మదుపు చేయాలి?

దీర్ఘకాలం మదుపు చేయాలనే ఆలోచన ఉన్నప్పుడు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడమే సరైన నిర్ణయం. ఫండ్లలో ఎంత రాబడి వస్తుందనేదానికి ఎలాంటి హామీ ఉండదు. మార్కెట్ పరిస్థితులను బట్టి, ఇది మారుతూ ఉంటుంది. గత 10ఏళ్ల సగటు రాబడిని పరిగణనలోనికి తీసుకుంటే.. సగటున ఇవి 11.80శాతం వార్షిక రాబడిని అందించాయి. బ్యాలెన్స్‌డ్ ఫండ్లు కూడా సగటున 12.53 శాతం వరకూ రాబడినిచ్చాయి. కాబట్టి, వ్యవధి ఎక్కువగా ఉన్నప్పుడు మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడమే ప్రయోజనం. ఆదాయపు పన్ను మినహాయింపు కావాలనుకునే వారు పెట్టుబడి కోసం ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్) ఎంచుకోవచ్చు.

- **నవీన్ చందాని**, చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, BankBazaar.com

కాఫీ అధరహో!

ప్రపంచంలోని వివిధ నగరాల్లో కప్పు కాఫీ ధరపై యూబీఎస్ సర్వే

కప్పు కాఫీ- బద్ధకాన్ని వదిలిస్తుంది. మానసికోల్లాసాన్నిస్తుంది. మెదడును క్రియాశీలం చేస్తుంది. కాఫీ చుక్క నాలుకకు తగిలితే ఆ కిక్కే వేరు. ఒక్కో గుటకా మింగుతున్న కొద్దీ పొందే అనుభూతి వర్ణనాతీతం. పొద్దున్నే నిద్ర లేవగానే కాఫీ గొంతులోకి దిగితే కానీ చాలా మందికి పొద్దు గడవదు. మిత్రులతో, వ్యాపార భాగస్వాములతో చర్చల్లో కాఫీ పాత్ర మరువలేనిది. బంధుమిత్రులు ఇంటికొచ్చినపుడు కాఫీ కప్పు ఆతిథ్యం తిరుగులేనిది. ప్రపంచంలో సార్వత్రిక పానీయంగా గుర్తింపుపొందిన, ప్రపంచ మానవాళిని చేరువ చేస్తున్న కాఫీ ధర మాత్రం అన్ని దేశాల్లో ఒకేలా లేదు. స్థానిక పరిస్థితుల్ని బట్టి ఈ ధర మారిపోతూ ఉంటోంది. ఒకే దేశంలో సైతం వివిధ నగరాల మధ్య ధరల్లో తేడా ఉంటోంది. పర్యటనల కోసం వివిధ దేశాలకు వెళ్లే పర్యాటకులు అక్కడి ధరలకు అనుగుణంగా పర్సును సిద్ధంచేసుకోవాల్సిందే. కాఫీ ధరలపై స్విట్జర్లాండ్‌కు చెందిన 'యూబీఎస్' గ్రూపు ప్రపంచంలోని వివిధ నగరాల్లో సర్వే చేసింది. దాని ప్రకారం కప్పు కాఫీ ధరలు సగటున ఎలా ఉన్నాయన్నది ఆసక్తికరం.

అత్యంత ఖరీదైన నగరాలు..

1. దోహా(ఖతార్) -	రూ. 428
2. కోపెన్‌హాగెన్(డెన్మార్క్)-	రూ. 418
3. దుబాయ్-	రూ. 381

అత్యంత చౌకైన నగరాలు

1. లాగోస్(నైజీరియా)-	రూ. 41.54
2. లిస్బన్(పోర్చుగల్)-	రూ. 49.58
3. రోమ్(ఇటలీ)-	రూ. 66.33

ఇండొనేషియాలో ఎక్కువే

ప్రపంచంలో కాఫీ ఎగుమతి దేశాల్లో ఇండొనేషియాది నాలుగోస్థానం. కానీ ఈ దేశంలోని అత్యంత పెద్దనగరం జకార్తాలో కప్పు కాఫీ ధర రూ.296 పలుకుతోంది. కాఫీ ఎగుమతిలో మిగతా మూడు పెద్ద దేశాలు బ్రెజిల్(సావొపాలోలో రూ.100.51), వియత్నాం, కొలంబియాల్లో మాత్రం కప్పు కాఫీ ధర తక్కువగా ఉంది. గల్ఫ్‌లో ఆర్థికంగా బలోపేతమైన నగరాలైన దోహా, దుబాయ్‌లలో ఈ ధరలు మండిపోతున్నాయి. అమెరికాలోని పలు నగరాల్లో ధర 3.93 డాలర్లు(రూ.263) పలుకుతోంది.

భారత్‌లో చౌకే..

ఐరోపా, అమెరికా, గల్ఫ్ దేశాల్లో కాఫీ ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ.. భారత్, మరి కొన్ని దక్షిణాసియా దేశాల్లో కప్పు కాఫీ ధర తక్కువగానే ఉంది. ఉదాహరణకు భారత్‌లోని చాలా చోట్ల కప్పు కాఫీ రూ.20 కన్నా తక్కువగానే దొరుకుతోంది. కాస్త ఖరీదైన రెస్టారెంట్లలో మాత్రం ఈ ధర రూ.50-150 మధ్య పలుకుతోంది.



- ఈనాడు ప్రత్యేక విభాగం

కరవు రహిత రాష్ట్రంగా మారుస్తా

- నీటి సంరక్షణ అందరి బాధ్యత
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

నవ నిర్మాణ దీక్ష సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వేదికపై ఉప ముఖ్యమంత్రి కేఈ, తదితరులు

ఈనాడు డిజిటల్, కర్నూలు: నీరు అనేది జీవితమని, ఎక్కడ నీరుంటుందో అక్కడే నాగరికత... ప్రగతి ఉంటాయని, ఎక్కడా నీటి కరవు తలెత్తకుండా జలసంరక్షణకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరిలో ఆదివారం నిర్వహించిన నవనిర్మాణ దీక్షలో పాల్గొన్నారు. తొలుత గ్రామదర్శినికి హాజరై... ఆ తర్వాత జలహారతి, పంటకుంటలు, 66 చెరువులకు శంకుస్థాపన, అయిదు లక్షల పంట కుంటలకు పైలాన్ ఆవిష్కరణ వంటి కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. 'ఒక సెంటీమీటరు వర్షాన్ని భూగర్భ జలంగా మారిస్తే 55 టీఎంసీల నీళ్లు వస్తాయి. అదే భూమిలో ఒక మీటరు జలం పెరిగితే 90 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుంది. ఆ నీటితో పది లక్షల ఎకరాల నీళ్లిచ్చే అవకాశం ఉంటుంది. భూమిలో నీళ్లుంటే బ్యాంకులో డబ్బున్నట్లే. నీటి పట్ల చైతన్యం...అవగాహన పెంచుకోవాలి. ప్రతి ఒక్కరూ జలసంరక్షణను బాధ్యతగా చేపట్టాలి. నా వంతుగా నదుల అనుసంధానంతో 2 కోట్ల ఎకరాలకు నీరిచ్చే బాధ్యత తీసుకుంటాను. కరవు రహిత రాష్ట్రంగా మారుస్తాను...' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేస్తాం

'తెదేపా ప్రభుత్వం నీటికి పెద్దపీట వేసింది కనుకే ప్రాజెక్టుల కోసం రూ.52 వేల కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలో 54 ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎనిమిది పూర్తవ్వగా... మరో 15 ఈ ఏడాది జూన్, జులై నెలల్లో ప్రారంభిస్తాం. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 ఈ నెలలో ప్రారంభిస్తాం. విజయనగరంలోని తార్నాక కీర్తి సాగరం ప్రాజెక్టు 2019 జూన్‌కు పూర్తి చేస్తాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి పోలవరం నుంచి నీళ్లు ఇవ్వడానికి వచ్చే ఏడాది ఆగస్టు వరకు పడుతుంది. చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేసి కృష్ణా ఎడమ కాలువకు నీరిస్తాం. కృష్ణా డెల్టాలో ఓ బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచి సాగర్‌కు కుడికాల్వకు నీరిచ్చి సోమశిలకు తీసుకెళతాం...' అని చంద్రబాబు వివరించారు. 30 శాతం నుంచి వందశాతం మరుగుదొడ్లు నిర్మించిన ఘనత తెదేపాదేనని చెప్పారు. పశువుల పేడను సేకరించి సంపద కేంద్రాల్లో ఎరువుగా మార్చి రైతుల పొలాలకు చేర్చడానికి కసరత్తు జరుగుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు, ఎంపీలు టీజీ వెంకటేష్, బుట్టా రేణుక, ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్షం శుభ సూచిక..

కర్నూలు జిల్లాలో చేపట్టిన నవనిర్మాణ దీక్షలో సీఎం జలహారతి ఇవ్వగానే వర్షం జోరున కురిసింది. ఆ తర్వాత సభలో ఆయన ప్రసంగం మధ్యలోనూ పలు పర్యాయాలు వర్షం పడింది. ప్రకృతితో మనం మమేకం కావాలని... మనం చేసే మంచి పనులకు వరుణ దేవుడు ఆశీర్వదిస్తూ ఇలా వర్షం కురిపించడం ఓ శుభసూచికమని చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పుడు ఎక్కువ వర్షం కురిసినా హెలికాప్టర్ ఎగరడం కష్టమని ఆయన అనడంతో చిరునవ్వులు విరిశాయి. గ్రామదర్శినిలో పాల్గొన్న చంద్రబాబు బీసీ కాలనీలో రోడ్డు పక్కనున్న ప్రతి ఇంటి గడపకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా స్థానికులు పొట్టేలు పిల్లను చూపించగా ' చాలా బాగుంది... తినాలనిపిస్తుంది...నేను శాకాహారినయ్యానని..' చెబుతూ ఆయన నవ్వులు కురిపించారు.

ఐరోపాలో ఆనందంగా బతుకుదామని వెళ్తుంటే..

- మధ్యధరా సముద్రంలో మునిగిన మత్స్యకారుల పడవ

టునిస్: అక్రమంగా ఐరోపాలోకి వలసవెళ్లడానికి ప్రయత్నించిన 46 మంది ప్రాణాలు కోల్పోయిన విషాదమిది. మధ్యధరా సముద్రం దాటే ప్రయత్నంలో దక్షిణ ట్యునీషియాతీరాన శనివారంరాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మరో 68 మంది ట్యునీషియా నావికాదళం రక్షించింది. వీరంతా ప్రయాణిస్తున్న చేపలపడవ మునిగిపోయిందని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. మృతుల్లో ఐవరీ కోస్ట్, మాలి, మొరాకో, కామెరూన్ దేశస్థులు ఉన్నారని తెలిపాయి. మరోవైపు స్పీడ్‌బోటులో ప్రయాణిస్తున్న మరో తొమ్మిది మంది సైతం ప్రాణాలు కోల్పోయారు. వీరు కూడా అక్రమంగా ట్యునీషియా నుంచి మధ్యధరా సముద్రం మీదుగా ఐరోపా చేరే ప్రయత్నం చేసినవారే కావడం విచారకరం. మరో ఐదుగుర్ని ప్రాణాలతో రక్షించారు.

మోదీయే మా అభ్యర్థి.. ఆయనే మళ్లీ ప్రధాని

- దేశంలో మైనారిటీలు సురక్షితం: నఖ్వీ

పనాజీ: 2019 ఎన్నికల కోసం ప్రధానమంత్రి కుర్చీ ఏమీ ఖాళీగా లేదనీ, భాజపా అభ్యర్థిగా నరేంద్రమోదీయే మళ్లీ నిల్చొని ఆ పదవికి రావడం ఖాయమనీ కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ చెప్పారు. ఈసారి అభ్యర్థిని మారుస్తారన్న ఊహాగానాల్లో నిజం లేదని కొట్టిపారేశారు. ఆదివారం ఆయన పనాజీలో విలేకరులతో మాట్లాడారు. మోదీ వ్యతిరేక కూటమిలో ప్రధాని పదవికి ఆశావహులు రెండు డజన్లకు పైగా ఉన్నారనీ, వారు ఏమాత్రం స్థిరత్వాన్ని ఇవ్వలేరని నఖ్వీ స్పష్టం చేశారు. దేశంలో మైనారిటీలు సురక్షితంగా ఉన్నారనీ, వారి హక్కులకు ఎలాంటి భంగం కలగడం లేదనీ చెప్పారు. మత హింస పరంగా గత నాలుగేళ్లలో చెదురుమదురు ఘటనలు జరిగినా అవి సకాలంలోనే నియంత్రణలోకి వచ్చాయని తెలిపారు.

భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా మోర్టార్ల వర్షం

- పాక్ కాల్పుల్లో ఇద్దరు మృతి, పది మందికి గాయాలు
- కాల్పులను దురదృష్టకరంగా అభివర్ణించిన మెహబూబా ముఫ్తీ

జమ్ము, శ్రీనగర్: జమ్మూకశ్మీరులోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారత సైనికస్థావరాలే లక్ష్యంగా పాక్ విచక్షణారహితంగా మోర్టార్లవర్షం కురిపిస్తోంది. నియంత్రణరేఖకు దగ్గరగా ఉన్న అఖ్నూర్ సెక్టార్‌లోని ప్రగ్వాల్, ఖౌర్ సెక్టార్‌లోని కనాచక్ ప్రాంతాలపై కాల్పులు జరిపింది. ఇద్దరు మృతి చెందగా, పదిమంది గాయపడ్డారు. బీఎస్ఎఫ్ ఏఎస్ఐ ఎస్.ఎన్.యాదవ్(48), కానిస్టేబుల్ వి.కె.పాండే ప్రాణాలు కోల్పోయారు. సెలెక్షన్‌గ్రేడ్ కానిస్టేబుల్ జకీర్‌ఖాన్ సహా మరో తొమ్మిది మంది పౌరులు గాయపడ్డారు. 2003లో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని కచ్చితంగా అమలు చేద్దామని మే 29, 2018లో ఇరుదేశాల 'డీజీఎంఓ'ల సమావేశంలో ఇటీవల నిర్ణయానికి వచ్చిన సంగతి విదితమే. తాజాగా పాక్ కాల్పులపై జమ్మూకశ్మీరు ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ స్పందించారు. కాల్పులను దురదృష్టకరమని అభివర్ణించారు. మరోసారి డీజీఎంఓలు సమావేశమై, రక్తపాతాన్ని అరికట్టాన్నారు. పాకిస్థాన్ చెప్పేదొకటి, చేసేదొకటని తేటతెల్లమైందని బీఎస్ఎఫ్ ఐజీ రామ్ అవతార్ వ్యాఖ్యానించారు. పాక్ దుస్సాహసానికి తగిన గుణపాఠం చెప్పితీరాలని జమ్మూకశ్మీరు విద్యుత్తు మంత్రి సునీల్‌శర్మ పేర్కొన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని కాల్పుల విరమణ పాటిస్తున్నామని, దాయాదిదేశం విచక్షణారహితకాల్పులు ఆపకుంటే విరమణ ఒప్పందం రద్దు అయ్యే పరిస్థితి ఉత్పన్నం అవుతుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ అహిర్ పేర్కొన్నారు.

ఉగ్రవాదుల్లో చేరిన ఐపీఎస్ సోదరుడు?

షోపియాన్‌లోని ఐపీఎస్ అధికారి ఇనాముల్ హక్ మెంగ్నూ సోదరుడు, ఉనాని వైద్యుడిగా పని చేస్తున్న యువకుడు ఒకరు ఉగ్రవాదుల్లో చేరాడని భద్రతాదళాలు అనుమానిస్తున్నాయి. షోపియాన్, పుల్వామా జిల్లాల నుంచి ఉగ్రవాదంవైపు ఆకర్షితులవుతున్న యువత సంఖ్య నెలనెలా పెరుగుతోంది. మేలో 20 మంది, ఏప్రిల్‌లో 45 మంది చేరారని సమాచారం. మొత్తానికి ఈ ఏడాది 81మంది చేరారు. పూంఛ్, రాజౌరి జిల్లాల్లో చొరబాట్లు కూడా పెరిగిపోయాయి. 2017లో 126 మంది తీవ్రవాదులుగా మారారు.

సబర్మతీ ఆశ్రమం ఎదుట భారీ రాట్నం ఏర్పాటు!!

- జాతిపిత మహాత్ముడికి నివాళిగా...

దిల్లీ: జాతిపిత మహాత్మాగాంధీకి ఘన నివాళిగా అహ్మదాబాద్‌లోని సబర్మతీ ఆశ్రమం వద్ద భారీ రాట్నాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆశ్రమానికి ఎదురుగా సబర్మతీ నదీ తీరాన పదకొండు అడుగుల ఎత్తు... 22 అడుగుల పొడవు.... 6.5 అడుగుల వెడల్పున్న భారీ స్టెయిన్‌లెస్ స్టీలు రాట్నాన్ని ఏర్పాటు చేస్తారు. 'ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్(కేవీఐసీ) ఈ రాట్నం ఏర్పాటు ప్రక్రియను మొదలుపెట్టింది. ఇందుకోసం నాలుగు అడుగుల ఎత్తైన గ్రానైట్ వేదిక నిర్మాణం మొదలైంది. మహాత్ముడి 150వ జయంతిని పురస్కరించుకుని దీనిని ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు కేవీఐసీ సారథి వినయ్ కుమార్ సక్సేనా వెల్లడించారు. 2019 అక్టోబరులో మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.

భారతీయుడికి యూఏఈలో జాక్‌పాట్

- రూ. 18కోట్లు గెలుచుకున్న అబ్రహాం

దుబాయ్: మరో భారతీయుడు యూఏఈలో భారీ జాక్‌పాట్ కొట్టేశారు. డిక్సన్ కట్టిథర అబ్రహాం అనే భారతీయుడికి ఏకంగా రూ.18 కోట్ల 22 లక్షల 25వేలు ఈ లాటరీ ద్వారా లభించింది. వాస్తవానికి డిక్సన్ కట్టిథర అబ్రహాం నైజీరియాలో నివసిస్తున్నారు. ఆయన అబూదాబీలోని బిగ్‌టికెట్‌లో ఈ లాటరీ టిక్కెట్‌ను కొనుగోలు చేసినట్లు 'ఖలీజ్ టైమ్స్' తెలిపింది. ఆయన జాక్‌పాట్ గెలుచుకున్న విషయాన్ని అబూదాబీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆగమన విభాగం హాలులో ఆదివారం పదేపదే ప్రకటించారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయంలో డ్రా తీసే బిగ్‌టికెట్ అబూదాబీకి ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ప్రజాదరణ ఉంది. తాజా డ్రాలో డబ్బు గెలుచుకున్న 9 మందిలో అయిదుగురు భారతీయులు, ముగ్గురు పాకిస్థాన్ దేశస్థులు కాగా...ఒకరు మాత్రమ యూఏఈకి చెందిన వారని 'ఖలీజ్ టైమ్స్' వెల్లడించింది.

కొత్త సాంకేతికతతో ఉద్యోగాలు పోవు

- కేంద్ర ఐ.టి. మంత్రి రవిశంకర్ ప్రసాద్

దిల్లీ: కృత్రిమ మేధస్సు వంటి కొత్త సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల కొత్త ఉద్యోగాలు వస్తాయే గానీ, ఉన్న ఉద్యోగాలు పోవని కేంద్ర ఐ.టి.శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టంచేశారు. అయితే మారుతున్న డిజిటల్ ప్రపంచానికి తగ్గట్టుగా ప్రజలు తమ నైపుణ్యాలను పెంచుకోవడం ముఖ్యమని చెప్పారు. ఇలాంటి నైపుణ్యాలను పెంచడం కోసం భారతీయ ఐ.టి. కంపెనీలు మరింత పెద్దపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నీతి ఆయోగ్, నాస్కాంలతో కలిసి తమ మంత్రిత్వ శాఖ కూడా ఈ దిశగా వివిధ కోణాల్లో కసరత్తు చేస్తోందని ఆయనొక వార్తాసంస్థకు చెప్పారు. ఐ.టి. రంగంలో 39.8 లక్షల మంది ప్రత్యక్షంగా, 1.3 కోట్ల మంది పరోక్షంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి సేవా కేంద్రాలు 10 లక్షల మందికి, చరవాణి తయారీ రంగం 4.5 లక్షల మందికి ఉపాధి చూపిస్తోందని చెప్పారు.

ఔషధాల్లో నాణ్యత కొరవడితే జైలుశిక్ష

దిల్లీ: ఔషధాల్లో నాణ్యతాప్రమాణాలు మెరుగుపర్చడమే ధ్యేయంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రజలకు ప్రయోజనకరమైన ప్రతిపాదనలు చేసింది. ఔషధాల్లో నాణ్యత కొరవడినా, అవి పనిచేయకపోయినా వాటిని అమ్మే(మార్కెటింగ్) కంపెనీలను బాధ్యులను చేయాలని యోచిస్తోంది. నాణ్యత కొరవడితే మూడు నుంచి ఐదేళ్ల జైలుశిక్ష; నాసిరకంగా ఉండి పనిచేయకపోతే(నకిలీ మందులు) జీవిత ఖైదు విధించనుంది. ఈమేరకు ఔషధాలు, సౌందర్య ఉత్పత్తుల చట్టానికి సవరణ చేయనుంది. ప్రభుత్వ ప్రతిపాదనలకు మనదేశంలోని అత్యున్నత ఔషధ సలహాబోర్డు (డీటీఏబీ) ఇప్పటికే ఆమోదం తెలిపింది. ప్రస్తుత చట్టాల ప్రకారం ఏదైనా మందు అమ్మితే, దాని నాణ్యతను పరిశీలించి ఉత్పత్తిదారుడిని మాత్రమే బాధ్యుణ్ని చేస్తున్నారు. దీని ఆసరాగా తీసుకుని పలు పెద్ద కంపెనీలు చిన్నచిన్న మందుల కంపెనీలకు ఔషధాల తయారీ బాధ్యత అప్పగిస్తున్నాయి. వాటి నుంచి కొనుగోలు చేసి, విపణిలో అమ్ముతున్నాయి. నాణ్యతకు బాధ్యత వహించాల్సి వస్తే చిన్న కంపెనీలకు శిక్షలు పడుతున్నాయి.

ఆస్తులు జప్తు చేసినా.. విచారించేదెవరు?

- ఏడాదిన్నరగా ఏర్పాటుకాని న్యాయ నిర్ణయాధికార సంస్థ
- బినామీ ఆస్తుల కేసులు మురిగిపోయే ప్రమాదం?

దిల్లీ: బినామీ ఆస్తులపై పెట్టిన కేసులు మురిగిపోనున్నాయా? వీటిని విచారించేందుకు ప్రభుత్వం న్యాయ నిర్ణయాధికార సంస్థ (అడ్జుడికేటింగ్ అథారిటీని)ను ఏర్పాటు చేయకపోవడంతో ఇలాంటి అనుమానాలు తలెత్తుతున్నాయి. నల్లధనం, అవినీతిపై ఉక్కుపాదం మోపాలని భావించిన కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు అనంతరం బినామీ ఆస్తుల లావాదేవీల చట్టం-1988కి సవరణలు తీసుకొచ్చింది. కొత్త నిబంధనలు 2016 నవంబరు ఒకటో తేదీ నుంచి అమలయ్యేలా ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో న్యాయ నిర్ణయాధికార సంస్థను నియమించాల్సి ఉంది. ఆదాయపు పన్ను విభాగం స్వాధీనం చేసుకున్న బినామీ ఆస్తుల చెల్లుబాటును ఈ సంస్థ నిర్ధరించవలసి ఉంది. ఆదాయపు పన్ను విభాగం రూ.కోట్లు విలువ చేసే 780కి పైగా బినామీ ఆస్తులను స్వాధీనం చేసుకున్నా, గత ఏడాదిన్నరగా న్యాయనిర్ణయాధికార సంస్థను ఏర్పాటు చేయకపోవడంతో కేసుల పరిస్థితిపై అయోమయం నెలకొంది. నిబంధనల ప్రకారం ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకున్న అనంతరం ఆ ఆస్తులు బినామీవా? కావా? అన్న విషయాన్ని స్పష్టం చేస్తూ ఏడాదిలోగా తీర్పును వెలువరించాల్సి ఉంది. అయితే ఏడాదిన్నరగా నిర్ణయాధికార సంస్థే లేకపోవడంతో కేసులు రద్దయిపోవచ్చన్న సందేహాలు నెలకొన్నాయి. ఒక వేళ కేసులు రద్దయితే అది ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారడంతో పాటు, అనంతరం చట్టపరమైన చిక్కులు తలెత్తే వీలుంది.

తాత్కాలిక ఏర్పాటు

ఈ కేసులను విచారించే బాధ్యతను అక్రమ నగదు చలామణి నిరోధక చట్టం (పీఎల్ఎంఏ) కింద నమోదు చేసే కేసులను విచారించే న్యాయనిర్ణయాధికార సంస్థకు ప్రభుత్వం తాత్కాలికంగా అప్పగించింది. ఈ సంస్థ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులను విచారిస్తుంది. ఈ సంస్థకు ఇప్పటికే సిబ్బంది కొరత ఉండగా, అదనంగా వచ్చిన కేసులను చూడడం సాధ్యపడడం లేదు. మొత్తం 860 కేసుల్లో కేవలం 80 కేసులనే పరిష్కరించింది. ఇంకా 780 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అందువల్ల కొత్త కేసులను తమ వద్దకు పంపించవద్దని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డుకు సూచించింది. రెండు చట్టాల కింద నమోదయ్యే కేసులను పరిష్కరించడం ఒక సంస్థకు సాధ్యం కాదని పేర్కొంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ సంస్థ వద్ద ఇప్పటికే 230 పీఎల్ఎంఏ కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆ సంస్థ ఛైర్మన్ మార్చి 31న పదవీ విరమణ చేయడంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇద్దరు సభ్యులే పనిచేస్తున్నారు. బినామీ ఆస్తుల కేసులను కనీసం ఇద్దరు సభ్యుల ధర్మాసనం పరిష్కరించాల్సి ఉండడంతో పని భారం పెరిగింది. బినామీ ఆస్తుల న్యాయ నిర్ణయాధికార సంస్థ సభ్యులుగా ఆదాయపు పన్ను విభాగంలో కమిషనర్ స్థాయి అధికారిని గానీ, న్యాయ శాఖలో సంయుక్త కార్యదర్శి స్థాయి అధికారినిగానీ, ఇండియన్ లీగల్ సర్వీసెస్ అధికారులనుగానీ నియమించాల్సి ఉంది. నల్లధనం నిర్మూలనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ సంస్థను త్వరగా నియమించకపోతే అసలు లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆర్థిక శాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

సగానికి పైగా డుమ్మా!

- సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు తగ్గిన హాజరు
- వర్తమాన అంశాలపై కఠిన ప్రశ్నలు: అభ్యర్థులు

హైదరాబాద్‌లోని ఓ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

ఈనాడు, హైదరాబాద్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. గత అనుభవాల దృష్ట్యా ఈ సారి పరీక్ష నిర్వహణలో నిబంధనలు కఠినతరం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, జామర్లు ఏర్పాటుచేశారు. పెద్దఎత్తున అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నా హాజరుశాతం సగానికి పైగా తగ్గటం గమనార్హం. హైదరాబాద్‌లో 101, వరంగల్‌లో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి 48,939 దరఖాస్తు చేసుకోగా పేపర్-1 23,890, పేపర్-2కు 2,809 మంది హాజరయ్యారు. వరంగల్-5,204 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పేపర్- 1కు 2,485, పేపర్-2కు 2,439 మంది హాజరయ్యారు. అబిడ్స్, నారాయణగూడ, నాంపల్లిలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలకు కొందరు అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. అధికారులు లోపలకు పంపించేందుకు అంగీకరించలేదు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా సివిల్స్ ప్రాథమిక పరీక్ష నిర్వహణను సమీక్షించారు. ప్రశ్నాపత్రాలు కఠినంగా ఉన్నట్లు అభ్యర్థులు తెలిపారు.

ప్రశ్నలెంతో క్లిష్టం

సివిల్స్ సర్వీసెస్ ప్రాథమిక పరీక్షలో అడిగిన ప్రశ్నలు చాలా క్లిష్టమైనవి, కష్టమైనవి. అభ్యర్థుల సామర్థ్యం గుర్తించేందుకు ఇంతలోతుగా ప్రశ్నలు అడిగారనిపిస్తుంది. గతంతో పోలిస్తే ఇది అభ్యర్థులకు సవాల్ వంటిదే. యూపీఎస్సీ అభ్యర్థుల నుంచి ఏమి కోరుకుంటుందనేది అంచనా వేయటం కూడా కష్టమే. లక్ష్యం సాధించేందుకు కొన్ని అంశాలమీదనే గురిపెడితే చాలదని అర్థం చేసుకోవచ్చు. పరీక్ష ఇలా ఉండవచ్చంటూ ఊహించుకున్న దానికి భిన్నంగా ఉంది.

- వి.గోపాలకృష్ణ, డైరెక్టర్, బ్రెయిన్‌ట్రీ

సైనిక దళాలకు అధునాతన కామోవ్ హెలికాప్టర్లు!

- అక్టోబర్ కల్లా ఒప్పందం ఖరారు

దిల్లీ: రష్యాకు చెందిన 200 కామోవ్-226టీ సైనిక హెలికాప్టర్లను సమకూర్చుకునేందుకు భారత్ సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన కీలక ఒప్పందం అక్టోబర్‌లోగా ఖరారవుతుంది. రష్యా హెలికాప్టర్స్, భారత్‌కు చెందిన హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ మధ్య ఏర్పాటైన జాయింట్ వెంచర్ సంస్థ ద్వారా ఇవి సరఫరా అవుతాయి. భారత సైనిక దళాల్లో కాలం చెల్లిన చీతా, చేతక్ హెలికాప్టర్ల స్థానంలో కామోవ్‌లను ప్రవేశపెడతారు. వీటి సమీకరణకు 2015లో భారత్, రష్యాల మధ్య ఒక ప్రాథమిక ఒప్పందం కుదిరింది. జాయింట్ వెంచర్ ఏర్పాటుపై రెండు దేశాలు 2016 అక్టోబర్‌లో ఒక అంగీకారానికి వచ్చాయి. తాజాగా సదరు జాయింట్ వెంచర్ నుంచి ప్రతిపాదనలను కోరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీనికి ఆగస్టు చివరిలోగా స్పందన వస్తుందని, అక్టోబర్ కల్లా తుది ఒప్పందాన్ని ఖరారు చేస్తామని పేర్కొన్నాయి. ప్రాథమిక ఒప్పందం ప్రకారం.. 60 హెలికాప్టర్లను నేరుగా రష్యా సరఫరా చేస్తుంది. మిగతా 140 హెలికాప్టర్లను జాయింట్ వెంచర్ సంస్థ ద్వారా భారత్‌లో రూపొందిస్తారు. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని రష్యా అందిస్తుంది. రెండు ఇంజిన్లు కలిగిన కామోవ్-226టీ హెలికాప్టర్.. బహుళ అవసరాలకు ఉపయోగపడుతుంది. పర్వత ప్రాంతాల్లో అద్భుత విన్యాసాలను ప్రదర్శించగలదు. సైన్యం, వైమానిక దళంలో వీటిని ప్రవేశపెడతారు.

38 మంది భారతీయులను కాపాడిన నావికాదళం

దిల్లీ: తుపాను ధాటికి యెమెన్‌లోని సొకొత్రాద్వీపంలో పదిరోజులుగా చిక్కుకుపోయిన 38 మంది భారతీయులను భారతీయ నావికాదళం కాపాడింది. ఐఎన్ఎస్ 'సునయన' యుద్ధనౌక ఆదివారం చేపట్టిన ఆపరేషన్ 'నిస్తార్' విజయవంతమైందని కెప్టెన్ డి.కె.శర్మ తెలిపారు. అందర్నీ తమ నౌకలో ఎక్కించుకుని గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు తరలిస్తున్నామన్నారు. భారతీయులంతా క్షేమంగా ఉన్నారన్నారు. మే 24న వచ్చిన మెకును తుపాను ధాటికి భారతీయులకు చెందిన మూడు పడవలు ధ్వంసమయ్యాయి. సొకొత్రాద్వీపంలో ప్రాణాలతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. నౌకయాన డైరెక్టర్ జనరల్, భారతీయ సముద్ర పడవల సంఘం విజ్ఞప్తి మేరకు గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో గస్తీ తిరుగుతున్న ఐఎన్ఎస్ 'సునయన' ఆపన్నహస్తం అందించింది.

మధ్యప్రదేశ్‌లో 60లక్షల నకిలీ ఓటర్లున్నారని కాంగ్రెస్ ఆరోపణ

- భాజపా ప్రభుత్వమే చేర్చిందంటూ ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన ఈసీ

దిల్లీ: మధ్యప్రదేశ్ ఓటర్ల జాబితాలో దాదాపు 60 లక్షల నకిలీ పేర్లను భాజపా ప్రభుత్వం చేర్చిందని ఆరోపిస్తూ.. ఎన్నికల సంఘం (ఈసీ)కి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్ నేతృత్వంలోని నాయకుల బృందం.. ఆదివారం ఈసీ అధికారులను కలిసింది. మొత్తం 230 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాల నుంచి నకిలీలను తొలగించాలని విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ ఆరోపణలపై ఈసీ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం రెండు బృందాలను ఏర్పాటు చేసింది. నరెలా, భోజ్‌పూర్, సివనీ-మాల్వా, హోశంగాబాద్ నియోజకవర్గాల్లో ఈ బృందాలు పర్యటించి.. అవకతవకలు ఎలా జరిగాయన్నది గుర్తించనున్నాయి. జూన్ 7లోగా విచారణను పూర్తిచేసి ఈసీకి నివేదికలు అందజేయనున్నాయి. "ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఈసీకి ఆధారాలు సమర్పించాం. 100 నియోజకవర్గాల్లో మేం సొంతంగా విచారణ చేశాం. ఒకే పేరు, చిరునామా, తండ్రి పేరుతో.. మూడేసి నియోజకవర్గాల్లో పేర్లు నమోదై ఉన్నాయి. ఇది పొరపాటున జరిగింది కాదు. రాష్ట్ర ప్రభుత్వమే చేయించింది" అని కమల్‌నాథ్ ఆరోపించారు. ఈ మోసంలో పాత్ర వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు కాంగ్రెస్ ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.

రాష్ట్రపతి కోవింద్ తిరస్కరణకు గురైన తొలి క్షమాభిక్ష అభ్యర్థన

- బిహారులో కుటుంబ సజీవ దహనం కేసులో

దిల్లీ: మరణశిక్ష పడిన ఓ వ్యక్తి క్షమాభిక్ష కోరుతూ దాఖలు చేసుకున్న అభ్యర్థనను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరణకు గురైన తొలి క్షమాభిక్ష అభ్యర్థన ఇదే అవుతుంది. రాష్ట్రపతి వద్ద ఇప్పుడిక ఈ తరహా పిటిషన్‌లేవీ పెండింగ్‌లో లేవు. ఓ గేదె అపహరణ వ్యవహారంలో చెలరేగిన వివాదంతో ఏకంగా ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు వ్యక్తులను సజీవ దహనం చేసిన జగత్‌రాయ్ అనే వ్యక్తికి చివరకు సుప్రీంకోర్టు మరణశిక్షను ఖరారు చేసింది. 2006లో బిహారులోని వైశాలి జిల్లాలో ఈ దుర్ఘటన జరిగింది. తన గేదెను అపహరించారంటూ మహతో అనే వ్యక్తి జగత్‌రాయ్, వజీర్‌రాయ్, అజయ్‌రాయ్ అనే ముగ్గురిపై కేసుపెట్టారు. ఆ కేసును ఉపసంహరించుకోవలసిందిగా అతడిపై నిందితులు ఒత్తిడి తెచ్చారు. అందుకు మహతో నిరాకరించారు. దాంతో, కక్షపెంచుకున్న జగత్‌రాయ్ ఓ రోజు రాత్రి మహతో ఇంటికి నిప్పంటించాడు. ఆ ఘటనలో మహతో భార్య... అయిదుగురు చిన్నారులు సజీవదహనమైనారు. తీవ్రంగా కాలిపోయిన మహతో ఆ తర్వాత కొన్నాళ్లకు మరణించాడు.

దులాల్‌కుమార్‌ది హత్య కాదు ఆత్మహత్యే!

- నిర్ధారించిన ఐదుగురు వైద్యుల బృందం

పురులియా: పశ్చిమబెంగాల్‌లో విద్యుత్తు టవర్‌కు అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని మరణించిన దులాల్‌కుమార్‌ది ఆత్మహత్యేనని, హత్యకాదని నిర్ధారణ అయిందని పురులియా ఎస్పీ ఆకాశ్ మఘారియా తెలిపారు. ఐదుగురు వైద్యుల బృందం శవపరీక్ష చేసి ఈ మేరకు నివేదిక ఇచ్చారని ఆదివారం చెప్పారు. బలరాంపుర్ పోలీసుస్టేషన్ పరిధిలో కుమార్ శనివారం చెట్టుకు వేలాడుతూ చనిపోయిన సంగతి విదితమే. పంచాయతీ ఎన్నికల్లో టీఎంసీకి వ్యతిరేకంగా పనిచేసినందుకే తమ కార్యకర్తను చంపేశారని భాజపా ఆరోపించింది. ఆదివారం 12 గంటలపాటు బంద్‌కు పిలుపు ఇచ్చింది. అంతకుముందు ఇదే బలరాంపుర్‌లో టి.మహతో(20) అనే భాజపా కార్యకర్తను మే 30న చెట్టుకు ఉరేసి చంపారు. టీఎంసీకి వ్యతిరేకంగా పంచాయతీ ఎన్నికల్లో పనిచేసినందుకే చంపేశామని మృతదేహం వద్ద లేఖ సైతం దొరికింది. ఇవి రాజకీయ హత్యలేనంటూ అమిత్‌షా, ప్రకాశ్ జావడేకర్ ఆరోపించారు. దీంతో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పురులియా జిల్లా ఎస్పీ జోయ్ బిస్వాస్‌ను బదిలీ చేసి కొత్తగా ఆకాశ్‌ను నియమించింది.

ఆ రోజు ఆడి ఉంటే..

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో పాల్గొనడమంటే మాటలు కాదు. మహా క్రతువులా సాగే క్వాలిఫయింగ్ టోర్నీలో ఎన్నో అడ్డంకులు దాటితే కానీ.. ప్రపంచకప్ బెర్తు దక్కదు. కొన్నిసార్లు ఛాంపియన్ జట్లు సైతం అర్హత అవకాశాన్ని కోల్పోతుంటాయి. అలాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీకి రారమ్మని నిర్వాహకులు ఆహ్వానిస్తే.. చాలావరకు మీ ఖర్చులు కూడా మేమే భరిస్తాం అంటే.. ఏ జట్టయినా కాదంటుందా? కానీ భారత ఫుట్‌బాల్ జట్టే ఆ పని చేసింది. నాటి ఆ నిర్ణయం భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుకే చేటు చేసింది. మూడు లక్షల జనాభా ఉన్న ఐస్‌లాండ్ ఈసారి ప్రపంచకప్ ఆడబోతుంటే.. 125 కోట్ల జనాభా ఉన్న భారత్ ప్రేక్షక పాత్ర వహిస్తోంది. మరి ఆ రోజు ఆ సువర్ణావకాశాన్ని భారత్ ఎందుకు వదులుకుంది.. అందుకు దారితీసిన కారణాలేంటి?

1948 ఒలింపిక్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు

ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్-100లోకి వస్తే దాన్ని గొప్ప ఘనతగా భావించే స్థితిలో ఉంది మన దేశ ఫుట్‌బాల్. ఇక క్వాలిఫయింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన 32 జట్లు పోటీ పడే ప్రపంచకప్ గురించి ఆలోచించే పరిస్థితి ఎక్కడుంది? ప్రపంచకప్ కాదు.. దాని క్వాలిఫయింగ్ టోర్నీ ఆడటానికి తగ్గ ప్రమాణాలు భారత్‌కు లేవన్నది చేదు నిజం. అలాగని భారత ఫుట్‌బాల్ మొదట్నుంచి ఇంతే అనుకోవడానికేమీ లేదు. 1950-60 మధ్య భారత్‌కు మేటి జట్టుండేది. ప్రపంచ స్థాయి ఆటగాళ్లు జట్టులో ఉండేవాళ్లు. ఒలింపిక్స్‌లోనూ మన జట్టు సత్తా చాటింది. ఆ తరుణంలోనే భారత్‌కు ఫిఫా ప్రపంచకప్ ఆడే అవకాశం కూడా దక్కింది. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా రెండు పర్యాయాలు ఆగిన ప్రపంచకప్.. 1950 పునఃప్రారంభమైన సంగతి తెలిసిందే. అప్పటికి అర్హత టోర్నీలేమీ లేవు. ఫిఫా నేరుగా ఎంట్రీలు ఇచ్చేది. ఆసియా తరపున ఒక జట్టుకు కూడా అవకాశమివ్వాలని భావించింది. ఐతే ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, బర్మా ప్రపంచకప్ వెళ్లడానికి విముఖత చూపించడంతో అవకాశం భారత్‌ను వరించింది. కానీ భారత్ ఫిఫా విన్నపాన్ని మన్నించలేదు. అందుకు కారణాలేంటన్న దానిపై రకరకాల ఊహాగానాలున్నాయి. బూట్లు లేకుండా ఆడటానికి ఫిఫా అనుమతించనందుకే భారత జట్టు ఆ ప్రపంచకప్ ఆడలేదన్న ప్రచారం కూడా ఉండటం విశేషం. ప్రపంచకప్ కోసం బ్రెజిల్ వరకు వెళ్లడానికి డబ్బుల్లేక భారత జట్టు వెనక్కి తగ్గిందనే వారూ లేకపోలేదు.

అప్పటికి ఫుట్‌బాలర్లకు ఒలింపిక్స్ అత్యున్నత ఈవెంట్. ఫిఫా ప్రపంచకప్ ఏమంత గొప్ప టోర్నీగా కనిపించలేదు. అప్పటిదాకా ఆ టోర్నీలో పాల్గొన్న అనుభవమూ లేదు. ఉన్నట్లుండి అవకాశం రావడంతో ఆటగాళ్లలో సరైన సన్నద్ధత లేకపోయింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి మూడేళ్లు కూడా కాలేదు. ఫుట్‌బాలర్లను నడిపించేందుకు సరైన వ్యవస్థ లేకపోవడంతో ఆటగాళ్లకు టోర్నీ గురించి చెప్పి సరైన సమాచారం అందించి.. వాళ్లను సన్నద్ధం చేసే వాళ్లే లేరు. భారత్ నుంచి బ్రెజిల్ వరకు ప్రయాణం అప్పట్లో చాలా ప్రయాసతో కూడుకున్న పని. అప్పటికప్పుడు నిధులు సమకూర్చి, ఆటగాళ్లను టోర్నీకి పంపే ఏర్పాట్లు చేసేవాళ్లు కరవయ్యారు.

బూట్లు లేక.. ఒక అబద్ధం!: అప్పటికి భారత ఆటగాళ్లలో చాలామంది బూట్లు లేకుండానే ఫుట్‌బాల్ ఆడేవాళ్లు. 1948 ఒలింపిక్స్‌లో ఉత్త కాళ్లతోనే ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఆడారు కొందరు. మరికొందరు కాళ్లకు సాక్సులు ధరించారు. షూలు ధరించిన వాళ్లూ ఉన్నారు. ఫొటోలకు పోజులిచ్చినపుడు కూడా ఆటగాళ్ల కాళ్లకు బూట్లున్నాయి. ఐతే ప్రపంచకప్‌లో మాత్రం బూట్లు తప్పనిసరి అన్నది ఫిఫా నిబంధన. కేవలం ఆ నిబంధన వల్లే భారత జట్టు ప్రపంచకప్‌కు వెళ్లలేదన్నది అబద్ధం! ఇది అతిశయోక్తి అని.. నిజానికి అప్పుడు టోర్నీకి వెళ్లకపోవడానికి వేరే కారణాలున్నాయన్నది చరిత్రకారుల మాట. అసలు భారత జట్టు 1950 ప్రపంచకప్‌కు వెళ్లకపోవడానికి కారణాలేంటో తెలుసుకునేందుకు కొన్నేళ్ల కిందటే ఇండియా స్పోర్ట్స్ ఇలస్ట్రేటెడ్ పరిశోధన జరిపింది. అప్పటితరం ఆటగాళ్లు, అధికారుల్ని కలిసింది. ఈ సంస్థ కథనం ప్రకారం ఆసియా నుంచి ప్రాతినిధ్యం తప్పక ఉండాలని భావించిన ఫిఫా.. ప్రయాణ ఖర్చుల్లో చాలావరకు భరించడానికి, భారత ఫుట్‌బాల్ సంఘానికి ఆర్థిక సాయం అందించడానికి కూడా ముందుకొచ్చిందట. అయినప్పటికీ భారత జట్టు ప్రపంచకప్‌కు వెళ్లలేదు. ఫిఫా ప్రపంచకప్ ప్రాధాన్యమేంటో తెలియకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నది అప్పటి జట్టు వర్గాల మాట. టోర్నీకి వచ్చాక ఫిఫా ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చినా, ముందు జట్టును అక్కడికి పంపడానికి ఎవరూ చొరవ తీసుకోలేదని అంటారు అప్పటి ఆటగాళ్లు. భారత్ ప్రపంచకప్‌కు వెళ్తే కెప్టెన్ కావాల్సిన సైలెన్ మన్నా దీనిపై స్పందిస్తూ.. "మాకప్పుడు ఒలింపిక్సే అత్యున్నతంగా కనిపించేది. దాన్ని మించింది ఏదీ లేదనుకునే వాళ్లం. ఫిఫా ప్రపంచకప్ గురించి మాకు పెద్దగా తెలియదు. మాకు ముందుగా చెబితే టోర్నీకి సన్నద్ధమయ్యేవాళ్లం" అని 2012లో చనిపోవడానికంటే ముందు అన్నాడు. ఆ టోర్నీకి దూరంగా ఉండి తామెంత పెద్ద తప్పు చేశామో తర్వాత అర్థమైందని మన్నా చెప్పాడు. ఆ టోర్నీలో పాల్గొని ఉంటే భారత ఫుట్‌బాల్ ముఖచిత్రమే వేరుగా ఉండేదన్నది మన్నా మాట. 1948 ఒలింపిక్స్‌లో ఫ్రాన్స్ లాంటి పెద్ద జట్టుకు గట్టి పోటీ ఇచ్చింది భారత్. 70 నిమిషాల వరకు స్కోరు 1-1తో సమంగా ఉంది. తర్వాత మరో గోల్ కొట్టి ఫ్రాన్స్ మ్యాచ్ గెలిచింది. అప్పటి భారత జట్టు ప్రమాణాల ప్రకారం చూస్తే.. ఫిఫా ప్రపంచకప్‌లోనూ సత్తా చాటగలిగేదే. ఆ టోర్నీలో పాల్గొన్న అనుభవం భారత్‌కు ఎంతో మేలు చేసేది.. దేశంలో ఫుట్‌బాల్ సంస్కృతి, ఆదరణ పెరిగేది.. ఆటలో ప్రమాణాలు మెరుగయ్యేవి అన్నది విశ్లేషకుల మాట. ఒకప్పుడు ఉన్నతంగా ఉన్న భారత ఫుట్‌బాల్ ప్రమాణాలు పడిపోతూ వచ్చి.. ప్రపంచ టాప్-100లోకి రావడాన్నే గొప్ప ఘనతగా భావించే స్థితిలో ఉన్నామిప్పుడు!

ఛాంపియన్స్

మైదానాలకు వెళ్లి ఫుట్‌బాల్ చూడండి

దిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు ఆడుతున్నప్పుడు మైదానాలకు వెళ్లి మ్యాచ్‌లు చూడాలని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి కోరాడు. తమను తిట్టినా.. దూషించినా.. మ్యాచ్‌లు మాత్రం చూడండని భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రి సామజిక మాధ్యమంలో అభ్యర్థించిన నేపథ్యంలో కోహ్లి ఈ వ్యాఖ్యలు చేశాడు. "నా స్నేహితుడు ఛెత్రి సామాజిక మాధ్యమంలో తాజాగా ఒక వీడియో పెట్టాడు. ప్రతి ఒక్క అభిమానిని కోరేది ఒక్కటే భారత జట్టు మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు చూడమని. స్టేడియానికి వెళ్లి ఆటగాళ్లను ప్రోత్సహించమని. ఎందుకంటే ఫలితాల కోసం భారత్ ఎంతో కష్టపడుతోంది. గత కొన్ని సీజన్లుగా ఎంతో మెరుగైంది. మనది గొప్ప క్రీడా దేశమని చెప్పుకోవాలంటే అన్ని క్రీడలను సమానంగా చూసి ప్రాధాన్యమివ్వాలి. మిగిలిన క్రీడల్లాగే జాతీయ ఫుట్‌బాల్ ఆటగాళ్లకు గౌరవం ఇవ్వాలి. ఎందుకంటే వాళ్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు" అని కోహ్లి చెప్పాడు. సోమవారం జరిగే ఇంటర్ కాంటినెంటల్ కప్ మ్యాచ్‌లో భారత్.. కెన్యాతో తలపడనుంది. కెప్టెన్ సునీల్ ఛెత్రి కెరీర్‌లో 100వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడబోతున్నాడు.

మహిళల టీ20 ఆసియాకప్

చితక్కొట్టిన మిథాలీ.. చిత్తయిన మలేసియా

మిథాలీరాజ్ (97 నాటౌట్)

కౌలాలంపూర్: మహిళల టీ20 ఆసియాకప్‌ను భారత్ ఘనంగా ఆరంభించింది. మిథాలీరాజ్ విధ్వంసం (97 నాటౌట్; 69 బంతుల్లో 13×4, 1×6) సృష్టించడంతో ఆదివారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో 142 పరుగుల తేడాతో మలేసియాను చిత్తు చేసింది. మిథాలీతో పాటు హర్మన్‌ప్రీత్ (32) మెరవడంతో మొదట భారత్ 3 వికెట్లకు 169 పరుగులు సాధించింది. 35కే 2 వికెట్లు కోల్పోయిన దశలో హర్మన్‌ప్రీత్‌తో కలిసి జట్టును భారీ స్కోరు దిశగా నడిపించిన మిథాలీ.. దీప్తి శర్మ (18 నాటౌట్)తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఆఖర్లో నెమ్మదించిన ఆమె సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. భారత బౌలర్ల ధాటికి ఛేదనలో మలేసియా 13.4 ఓవర్లలో 27 పరుగులకే కుప్పకూలింది. పూజ వస్త్రాకర్ ఆరు పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టగా.. అనుజ పాటిల్, పూనమ్ యాదవ్‌లు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. మలేసియా జట్టు 5 ఓవర్లలోనే సగం వికెట్లు కోల్పోయింది. ఐదుగురు మాత్రమే ఖాతా తెరిచారు. ఒక్కరూ రెండంకెల స్కోరు చేరుకోలేదు. షాషా అజ్మి (9) టాప్ స్కోరర్. ఈ టోర్నీలో పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ జట్లూ ఆడుతున్నాయి.

గ్రూప్-సి విశ్లేషణ

అవకాశం ఆ రెండింటికే

ఒకవైపు మాజీ ఛాంపియన్ ఫ్రాన్స్.. మరోవైపు జోరు మీదున్న డెన్మార్క్.. సంచలనాలు సృష్టించగల ఆస్ట్రేలియా, పెరూ! ఫిఫా ప్రపంచకప్‌లో ఈ నాలుగు జట్లు మొహరించిన గ్రూప్-సి ఆసక్తిని రేపుతోంది. అనుభవం, స్టార్ ఆటగాళ్ల కొలమానాలు చూసుకుంటే ఈ మూడింటిపై ఫ్రాన్స్‌దే పైచేయిగా కనిపిస్తుంది. అలా అని మిగిలిన జట్లను తక్కువగా అంచనా వేయలేం. ముఖ్యంగా అర్హత టోర్నీల్లో వరుసగా విజయాలు సాధించిన డెన్మార్క్ డార్క్‌హార్స్‌గా బరిలో దిగుతోంది. ఏదేమైనా ఈ గ్రూపులో అగ్రస్థానం ఫ్రాన్స్‌కు దాదాపు ఖరారు అయినట్లే.. ఇక రెండో స్థానం కోసమే మూడు జట్ల మధ్య పోటీ ఉంది.

ఫిఫా ప్రపంచకప్ మరో 10 రోజుల్లో

ఫ్రాన్స్ జట్టు

ఫ్రాన్స్ హాట్ ఫేవరెట్

ఫిఫా ర్యాంకు 7

యువ ఆటగాళ్లతో నిండిన ఫ్రాన్స్ సమరోత్సాహంతో తొణికిసలాడుతోంది. గత ప్రపంచకప్ విజేత జర్మనీని ఇటీవల టోర్నీల్లో రెండుసార్లు ఓడించడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. ఎదురుదాడి చేయడమే ఫ్రాన్స్ ప్రధాన వ్యూహం. 2006 ప్రపంచకప్ ఫైనల్లో ఇటలీ చేతిలో పెనాల్టీ షూటౌట్లో ఓడడం, 2014 ప్రపంచకప్‌లో క్వార్టర్స్‌లో జర్మనీ చేతిలో పరాజయం చవిచూడడం, యూరో 2016 ఫైనల్లో పోర్చుగల్ చేతిలో ఓడిపోవడం లాంటివి పెద్ద టోర్నీల్లో ఫ్రాన్స్ రాణించలేదనే ముద్రను వేశాయి. అయితే ఈసారి కోచ్ డిడియర్ డిషామ్ నేతృత్వంలో చరిత్ర తిరగరాయాలనే సంకల్పంతో ఉంది ఫ్రాన్స్. కెప్టెన్ హ్యూగొ లోరిస్ సారథ్యంలో ఊపు మీదున్న ఫ్రాన్స్ ప్రస్తుత లక్ష్యం గ్రూప్-సిలో అగ్రస్థానంలో నిలవడమే.

కీలక ఆటగాళ్లు: వారెనె, పోగ్బా, గ్రీజ్‌మన్
కోచ్: డిడియర్ డిషామ్
రికార్డు: 15 ప్రపంచకప్‌లు ఆడిన ఫ్రాన్స్ 1998లో ఛాంపియన్‌గా నిలిచింది.

టిమ్ కహిల్

ఆస్ట్రేలియా నాలుగోసారి

ఫిఫా ర్యాంకు 40

ప్రపంచకప్‌కు అర్హత సాధించడం ఆస్ట్రేలియాకు ఇది వరుసగా నాలుగోసారి. ఐతే ఈసారి ఆ జట్టు కాస్త కష్టంగా రష్యాకు వెళుతోంది. నేరుగా బెర్తు సాధించడంలో విఫలమైన సాకరూస్.. హోండురస్‌తో ప్లేఆఫ్ మ్యాచ్‌లో గెలిచి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. టిమ్ కహిల్ అనుభవం, మిడ్‌ఫీల్డ్‌లో మిలె ఎడ్‌నాక్ దూకుడు ఆస్ట్రేలియాకు ఎంతో అవసరం. అయితే ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా అర్హత సాధించిన వారం లోపే కోచ్ ఏంజ్ పొస్టాకొగ్లో పదవికి రాజీనామా చేశాడు. అతని స్థానంలో కొత్తగా నెదర్లాండ్స్‌కు చెందిన బెర్ట్ వాన్ మార్క్ బాధ్యతలు చేపట్టాడు. 2010 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ ఫైనల్ చేరడంలో బెర్ట్‌దే కీలకపాత్ర. గ్రూప్ దశలో ఒక్క సంచలన విజయం సాధించగలిగినా సాకరూస్ పెద్ద ఘనత సాధించినట్లే.

కీలక ఆటగాళ్లు: మిలె ఎడ్‌నాక్, టిమ్ కహిల్
కోచ్: బెర్ట్ వాన్ మార్క్
రికార్డు: ఐదుసార్లు ఆడింది. ఉత్తమంగా 2006లో ప్రిక్వార్టర్స్ చేరింది

డెన్మార్క్ ఊపు మీదుంది

ఐరోపాలో వేగంగా ఎదుగుతున్న ఫుట్‌బాల్ జట్లలో డెన్మార్క్ ఒకటి. 2012 యూరోపియన్ ఛాంపియన్‌షిప్ తర్వాత ఆ జట్టు పెద్ద టోర్నీలు ఆడలేదు. అయితే అర్హత పోటీల్లో డెన్మార్క్ తన మార్క్ చూపించింది. వరుసగా 11 మ్యాచ్‌లు గెలిచి ఔరా అనిపించింది. అందులో టాప్‌సీడ్ పోలెండ్‌పై వాళ్ల ఆట అద్భుతం. మెరుపు పాసింగ్, సమన్వయం వారి బలం. గ్రూప్-సి నుంచి నాకౌట్‌కు వెళ్లే జట్లలో డెన్మార్క్ కూడా ఉంటుందనేది నిపుణుల అంచనా. ఇరిక్‌సన్‌పైనే ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. 2010 ప్రపంచకప్‌లో 18 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన ఎరిక్‌సన్ ఇప్పుడు సీనియర్ ఆటగాడిగా, జట్టులో కీలక సభ్యుడిగా ఉన్నాడు. ఇటీవల డెన్మార్క్ తరపున ఎనిమిదో మ్యాచ్‌ల్లో 11 గోల్స్ కొట్టాడు.

కీలక ఆటగాళ్లు: క్రిస్టియన్ ఇరిక్‌సెన్, అండ్రిస్
కోచ్: ఏజ్ హరెడె
రికార్డు: ఐదుసార్లు ప్రపంచకప్ ఆడింది. 1998లో క్వార్టర్స్ చేరడం ఉత్తమం.

ఫిఫా ర్యాంకు 12



క్రిస్టియన్ ఇరిక్‌సెన్

గ్రూప్ అంచనా: ఫ్రాన్స్, డెన్మార్క్‌లకు ముందుకెళ్లే అవకాశం ఉంది.
తప్పక చూడాల్సిన మ్యాచ్‌లు:
ఫ్రాన్స్ × డెన్మార్క్
పెరూ × డెన్మార్క్

పెరూ సంచలనాలే లక్ష్యం

ఫిఫా ర్యాంకు 11

దక్షిణ అమెరికాలో మిగిలిన ఐదో ప్రపంచకప్ బెర్తును పెద్ద జట్లను పక్కకునెడుతూ పెరూ ఎగరేసుకుపోయింది. ఈ జట్టులో ఎక్కువమంది ఆటగాళ్లు మెక్సికో క్లబ్‌లకు చెందినవాళ్లే. గోల్‌కీపర్ పెడ్రో గాలెస్, డిఫెండర్ లూయిస్ అడ్‌విన్‌కూ, మిడ్‌ఫీల్డర్ పెడ్రో అక్వినొ, స్ట్రైకర్ రాల్ రూయిజ్, ఆండీ పోలో మెక్సికోకు చెందిన వాళ్లే. 36 ఏళ్ల తర్వాత ప్రపంచకప్‌కు అర్హత సాధించిన పెరూ.. నాకౌట్ చేరాలనే లక్ష్యంతో ఉంది. ఐతే ఆ జట్టు కెప్టెన్ పాలో గురెరో ఎలా రాణిస్తాడన్న దానిపై ఆ జట్టు అవకాశాలు ఆధారపడివున్నాయి. 33 ఏళ్ల ఈ పాలో అర్హత పోటీల్లో ఆరు గోల్స్ కొట్టాడు. అయితే డోపింగ్ ఆరోపణల నేపథ్యంలో రష్యాకు వెళ్తున్న అతడు ఎలా రాణిస్తాడన్న దానిపైనే ఆ జట్టు అవకాశాలు ఆధారపడివున్నాయి.

కీలక ఆటగాళ్లు: గురెరో, రుడియాజ్
కోచ్: రికార్డో గరెచా.
రికార్డు: 4 ప్రపంచకప్‌లు ఆడింది. 1970లో క్వార్టర్స్ చేరడం ఉత్తమం.



గురెరో

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ విజయం



బట్లర్

లీడ్స్: పాకిస్థాన్‌తో రెండు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో కంగుతిన్న ఇంగ్లాండ్.. రెండో మ్యాచ్‌లో పుంజుకుని ఘనవిజయం సాధించింది. సిరీస్‌ను 1-1తో సమం చేసింది. రెండో టెస్టులో పాక్ మూడు రోజుల్లోనే, ఇన్నింగ్స్ 55 పరుగుల తేడాతో చిత్తయింది. ఓవర్‌నైట్ స్కోరు 302/7తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 363 పరుగులకు ఆలౌటైంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' బట్లర్ 80 పరుగులతో అజేయంగా నిలిచాడు. అనంతరం 189 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్.. కేవలం 134 పరుగులకే కుప్పకూలింది. బ్రాడ్ (3/28), బెస్ (3/33), అండర్సన్ (2/35) పాక్ పతనాన్ని శాసించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 174 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.

జ్వెరెవ్ అదరహో..

క్వార్టర్స్‌లో ప్రవేశం

జ్వెరెవ్

పారిస్: మంచి భవిష్యత్తున్న ఆటగాడిగా భారీ అంచనాలున్న జర్మనీ యువ కెరటం అలెగ్జాండర్ జ్వెరెవ్ కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. ఆదివారం జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ నాలుగో రౌండ్లో రెండో సీడ్ జ్వెరెవ్ 4-6, 7-6 (7-4), 2-6, 6-3, 6-3తో కరెన్ కచనోవ్ (రష్యా)ను ఓడించాడు. 21 ఏళ్ల జ్వెరెవ్ మ్యాచ్‌లో మొత్తం 63 విన్నర్లు, 17 ఏస్‌లు కొట్టాడు. క్వార్టర్‌ఫైనల్లో అతడు డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)తో తలపడతాడు. ప్రిక్వార్టర్స్‌లో థీమ్ 6-2, 6-0, 5-7, 6-4తో జపాన్ ఆటగాడు నిషికోరిని మట్టికరిపించాడు. పూర్వవైభవం కోసం తపిస్తోన్న మాజీ నంబర్‌వన్ జకోవిచ్ (సెర్బియా) కూడా క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. నాలుగో రౌండ్లో అతడు 6-3, 6-4, 6-2తో ఫెర్నాండో వెర్డాస్కో (స్పెయిన్)పై నెగ్గాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరడం జకోవిచ్‌కు ఇది వరుసగా తొమ్మిదోసారి కావడం విశేషం. మహిళల సింగిల్స్‌లో పదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా) తుది ఎనిమిదిలోకి దూసుకెళ్లింది. నాలుగో రౌండ్లో ఆమె 6-0, 6-2తో ఎస్తోనియాకు చెందిన అనెట్ కొంటావీట్‌ను ఓడించింది. మాడిసన్ కీస్ (అమెరికా), పుతిన్‌త్సెవా (రష్యా) కూడా క్వార్టర్స్‌లో ప్రవేశించారు. కీస్ 6-1, 6-4తో మిహేలా బుజార్నెస్కు (రొమేనియా)పై నెగ్గగా.. పుతిన్‌త్సెవా 6-4, 6-3తో స్ట్రికోవా (చెక్)పై విజయం సాధించింది.

అక్కాచెల్లెళ్ల జోడీ ఔట్: మహిళల డబుల్స్‌లో అక్కాచెల్లెళ్లు సెరెనా విలియమ్స్, వీనస్ విలియమ్స్‌ల కథ ముగిసింది. మూడో రౌండ్లో ఈ ద్వయం 4-6, 7-6 (7-4), 0-6తో క్లెపాక్ (స్లొవేనియా), మార్టినెజ్ శాంచెజ్ (స్పెయిన్) జంట చేతిలో పరాజయంపాలైంది. సెరెనా సింగిల్స్‌లో మాత్రం దూసుకుపోతోంది. మూడో రౌండ్లో ఆమె 6-3, 6-4తో జులియా జార్జెస్ (జర్మనీ)ను ఓడించింది.

షరపోవా మాటలు అబద్ధం

పారిస్: షరపోవా ఆత్మకథ 'అన్‌స్టాపబుల్'లో తన గురించి పేర్కొన్న విషయాలు అబద్ధమని సెరెనా విలియమ్స్ చెప్పింది. 2004లో వింబుల్డన్ ఫైనల్లో తన చేతిలో ఓటమి పాలైన అనంతరం సెరెనా ఏడ్చిందని.. తనపై ద్వేషం పెంచుకుందని ఈ పుస్తకంలో షరపోవా పేర్కొంది. "నేను మ్యాచ్‌లు ఓడినపుడు చాలాసార్లు లాకర్ గదిలో ఏడ్చాను. అలా చాలామంది చేస్తారు. వింబుల్డన్ ఫైనల్లో ఓడాక కచ్చితంగా షాకవుతాం. కన్నీళ్లు పెట్టుకుంటాం. అందుకు ద్వేషించాల్సిన అవసరం లేదు. ఆ పుస్తకంలో ఉన్నది అబద్ధం" అని సెరెనా పేర్కొంది. ఫ్రెంచ్ ఓపెన్ ప్రిక్వార్టర్స్‌లో సెరెనా షరపోవానే ఢీకొనబోతోంది.

బంగ్లాకు అఫ్గాన్ షాక్

రషీద్

డెహ్రాడూన్: బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌లో అఫ్గానిస్థాన్ శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో 45 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తు చేసింది. మొదట మహ్మద్ షెజాద్ (40; 37 బంతుల్లో 5×4), షెన్వారి (36; 18 బంతుల్లో 3×4, 3×6) మెరుపులతో అఫ్గాన్ 167 పరుగులు (8 వికెట్లకు) చేసింది. అనంతరం బంగ్లా 19 ఓవర్లలో 122 పరుగులకే ఆలౌటైంది. లిటన్ దాస్ (30), మహ్మదుల్లా (29) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. రషీద్ ఖాన్ (3/13), షాపూర్ జార్దాన్ (3/40), ముజీబ్ రెహ్మాన్ (1/20) బంగ్లా పతనాన్ని శాసించారు. ఈ సిరీస్‌కు భారత్‌లోని డెహ్రాడూన్ ఆతిథ్యమిస్తుండటం విశేషం.

కేపీసీసీ కార్యాధ్యక్షుడు ఎస్.ఆర్.పాటిల్ రాజీనామా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: కర్ణాటకలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం మంత్రి మండలి ఇంకా అస్తిత్వంలోకి రాకముందే కాంగ్రెస్‌లో అసమ్మతి రాగం బయటపడింది. ఉత్తర కర్ణాటకలో ఆశించిన స్థాయిలో స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలవనందుకు నైతిక బాధ్యత వహించి కేపీసీసీ కార్యాధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎస్.ఆర్.పాటిల్ ఆదివారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. స్థానిక నేతల తీరును నిరసిస్తూ గత నెల 25నే ఆయన తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి మెయిల్‌లో పంపినట్లు సమాచారం. ఉత్తర కర్ణాటకలో లింగాయత నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. విధాన పరిషత్తు సభ్యుడైన పాటిల్... సిద్ధరామయ్య మంత్రివర్గంలో ఐటీబీటీ శాఖ మంత్రిగా మూడేళ్లు పని చేశారు. కర్ణాటకలో ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువ రోజులు బతికి బట్టకట్టడం కష్టమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప వ్యాఖ్యానించారు. మంత్రి పదవి దక్కదన్న బాధతో ఎస్.ఆర్.పాటిల్ తన పదవికి రాజీనామా చేశారని పేర్కొన్నారు.

కొందరికి కీమో అవసరం లేదు

- రొమ్ము క్యాన్సర్ రోగులకు శుభవార్త
- తేల్చిన తాజా పరిశోధన

షికాగో

క్యాన్సర్ చికిత్స ఇప్పుడు ఒకప్పటి కీమోథెరపీ ఔషధాల నుంచి క్రమంగా దూరం జరుగుతోంది. జన్యువులను లక్ష్యంగా చేసుకునే చికిత్సలు, హార్మోన్లను అడ్డుకునే ఔషధాలు, ఇమ్యునోథెరపీ చికిత్సలు వస్తున్నాయి. ఇప్పుడు కీమో ఇచ్చినా.. దాన్ని స్వల్పకాలానికి కానీ మునుపటితో పోలిస్తే తక్కువ మోతాదుకు కానీ పరిమితం చేస్తున్నారు. రొమ్ము క్యాన్సర్ మొదటి దశలో ఉన్న వారిలో కొందరు కీమోథెరపీ ఇబ్బందులను తప్పించుకోవచ్చని.. తాజాగా రొమ్ము క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన అతి పెద్ద అధ్యయనం తేల్చింది. దీనివల్ల ఒక్క అమెరికాలోనే 70వేల మంది రోగులు, ప్రపంచవ్యాప్తంగా మరింత ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతుంది.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌కూ..

మరోవైపు సాధారణంగా వచ్చే 'నాన్-స్మాల్-సెల్ లంగ్ క్యాన్సర్' అనే ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలోనూ ఇదే రుజువైనట్లు మరో పరిశోధన తేల్చింది. కీమోతో పోలిస్తే కీట్రుడా అనే ఇమ్యునోథెరపీ చికిత్స ద్వారా ఎక్కువ ప్రయోజనం ఉన్నట్లు వెల్లడైంది. దాదాపు 1200 మందిపై అధ్యయనం చేసి, ఈ విషయాన్ని తేల్చారు. కీట్రుడాను చర్మ క్యాన్సర్ చికిత్సకు ఉపయోగిస్తున్నారు.

అధ్యయనం ఎవరిపై?

తాజా అధ్యయనంలో కీమో ప్రయోజనంపై సందేహాల వ్యక్తమవుతున్న కేసులపై దృష్టిసారించారు. రొమ్ము క్యాన్సర్ తొలిదశలో ఉండి, లింఫ్ నోడ్‌లకు వ్యాప్తి చెందని; ఈస్ట్రోజన్ లేదా ప్రోజెస్టిరాన్ కారణంగా వృద్ధి చెందుతున్న; హెర్‌సెప్టిన్ మందుకు లొంగని రకంపై దృష్టిసారించారు. ఈ తరహా రోగులకు శస్త్రచికిత్స చేసి, ఏళ్ల తరబడి హార్మోన్-బ్లాకింగ్ ఔషధాన్ని ఇస్తుంటారు. ఎక్కడైనా క్యాన్సర్ కణాలు మిగిలి ఉన్నాయోమోనన్న అనుమానంతో కొందరికి కీమోను సూచిస్తుంటారు. చాలావరకూ ఇది అవసరం లేదని వైద్యులకు రేఖామాత్రంగా తెలిసినప్పటికీ.. ఆ మేరకు గట్టి ఆధారాలు లేకపోవడం వల్ల దృఢంగా వ్యవహరించలేకపోతున్నారు.

అధ్యయనంలో భాగంగా 10,273 మంది రోగులకు ఆంకోటైప్ డీఎక్స్ అనే పరీక్షను నిర్వహించారు. ఇందులో రిస్కు ఎక్కువగా ఉన్నవారికి కీమోను సూచించారు. 16 శాతం మందికి తక్కువ రిస్కు స్కోరు వచ్చింది. వారికి కీమో అవసరం లేదన్నారు. ఒకమోస్తరు స్థాయి ముప్పు ఉన్న 67 శాతం మందిపై ప్రధానంగా దృష్టిసారించారు. వీరందరూ శస్త్రచికిత్స, హార్మోన్ థెరపీని తీసుకున్నారు. సగం మంది కీమోనూ తీసుకున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత మరోసారి రోగులను పరిశీలించారు. రెండు బృందాల్లో 94 శాతం మంది సజీవంగానే ఉన్నట్లు తేలింది. వారిలో 84 శాతం మందిలో క్యాన్సర్ లక్షణాలు లేవు. దీన్నిబట్టి కీమో ఇవ్వడం వల్ల అదనంగా ఎలాంటి ప్రయోజనం లేదని, వీరికి హార్మోన్ చికిత్స ఒక్కటే ఇచ్చినా ప్రయోజనం దక్కుతుందని స్పష్టమైంది.

ఊబకాయుల ఆకలికి అడ్డుకట్ట!

★ బరువు తగ్గేందుకు దోహదపడే ఔషధాన్ని గుర్తించిన శాస్త్రవేత్తలు

లండన్: జన్యుపరమైన ఊబకాయంతో బాధపడుతున్న వ్యక్తులకు శుభవార్త! ఆకలిని నిరోధించడం ద్వారా బరువు తగ్గడంలో వారికి దోహదపడగల సరికొత్త ఔషధాన్ని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. సాధారణంగా మన శరీరంలో కొన్ని జన్యువులు ఆకలిని నియంత్రిస్తాయి. వాటిలో ఉత్పరివర్తనాలు తలెత్తితే.. ఆకలి పెరుగుతుంది. ఎంత తిన్నా తృప్తి కలగదు. ఫలితంగా ఊబకాయం వస్తుంది. జన్యుపరమైన ఇలాంటి ఊబకాయాన్ని తగ్గించడంలో సాధారణ చికిత్సలు సఫలీకృతం కాలేవు. అయితే, 'లిరాగ్లుటైడ్' అనే ఔషధంతో ఈ ఊబకాయాన్ని నయం చేయవచ్చునని డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. పేగుల్లో సహజసిద్ధంగా ఉత్పత్తయ్యే 'జీఎల్‌పీ-1' హార్మోన్ నిర్మాణంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా లిరాగ్లుటైడ్‌ను తయారుచేయవచ్చునని తెలిపారు. జన్యుపరమైన ఊబకాయంతో బాధపడుతున్నవారిలో ఆకలిని ఈ ఔషధం తగ్గిస్తుందని వెల్లడించారు. ఫలితంగా వారు త్వరగా బరువు తగ్గుతారని వివరించారు.

స్మార్ట్‌ఫోన్ యాప్‌తో చిన్నారుల్లో 'ఆటిజం' బట్టబయలు

వాషింగ్టన్: చిన్నారుల్లో ఆటిజం లక్షణాలను గుర్తించేందుకు ఇక ప్రయోగశాలలు అక్కర్లేదు! గంటల తరబడి నిరీక్షణ కూడా అవసరం లేదు! స్మార్ట్‌ఫోన్ యాప్‌తో ఈ లక్షణాలను విజయవంతంగా గుర్తించవచ్చునని అమెరికాలోని డ్యూక్ విశ్వవిద్యాలయం పరిశోధకులు వెల్లడించారు. సినిమాలు చూస్తున్నప్పుడు పిల్లల ముఖంలో కనిపించే వేర్వేరు హావభావాలను విశ్లేషించడం ద్వారా ఆటిజం ముప్పును స్మార్ట్‌ఫోన్ యాప్ గుర్తిస్తుంది. సహజ వాతావరణంలో చిన్నారుల భావోద్వేగాలు కనిపించే వీడియోలను అందజేస్తే.. కేవలం 20 నిమిషాల్లో పని పూర్తిచేస్తుంది. వీడియోలతోపాటు వినియోగదారులు తమ చిన్నారులకు సంబంధించి ప్రత్యేకమైన ప్రశ్నావళికి సమాధానాలు పంపించాల్సి ఉంటుందని పరిశోధకులు వెల్లడించారు.

గగనతలంలోనే ఆకృతి మార్చుకునే రోబో

లండన్: గాల్లో ప్రయాణిస్తూనే అవసరానికి అనుగుణంగా ఆకృతిని మార్చుకోగల వినూత్న రోబోను ప్రపంచంలోనే తొలిసారిగా ఫ్రాన్స్‌లోని 'సెంటర్ నేషనల్ డి లా రిచర్చె సైంటిఫిక్(సీఎన్ఆర్ఎస్)' శాస్త్రవేత్తలు తాజాగా ఆవిష్కరించారు. 'క్వాడ్ మార్ఫింగ్'గా పిలుస్తున్న ఈ గగనతల రోబోను.. పక్షుల ప్రయాణ శైలిని ప్రేరణగా తీసుకొని అభివృద్ధి చేశారు. ఇరుకైన ప్రదేశాల గుండా వెళ్లాల్సి వచ్చినప్పుడు.. ఈ రోబో అచ్చం పక్షుల తరహాలో రెక్కలను వేగంగా ముడుచుకుంటుంది. అవసరమైన స్థాయిలో వాటి వైశాల్యాన్ని తగ్గించుకుంటుంది. తద్వారా తన ముందున్న ప్రతికూల ప్రయాణ పరిస్థితులను సులువుగా అధిగమిస్తుంది.

జమ్మలమడుగులో ఉద్రిక్తత

- మంత్రి ఆది వర్గీయులు, వైకాపా కార్యకర్తల మధ్య ఘర్షణ
- రాళ్లు రువ్వుకున్న ఇరు వర్గాలు
- నలుగురికి గాయాలు
- భారీగా బలగాల మోహరింపు

ప్రొద్దుటూరు మండలం చౌడూరు వద్ద ఎంపీ అవినాష్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగు మండలంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పార్టీలో చేరే విషయంలో మంత్రి ఆదినారాయణరెడ్డి వర్గీయులు, వైకాపా కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. మండలంలోని పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సంపత్‌కు మే 25న వివాహమైంది. ఈ వివాహానికి కడప ఎంపీ అవినాష్‌రెడ్డి హాజరు కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల రాలేకపోయారు. ఈ క్రమంలో ఎంపీ ఆదివారం సాయంత్రం ప్రొద్దుటూరు మండలం చౌడూరులో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంపత్‌కు పెళ్లి శుభాకాంక్షలు చెప్పడంతోపాటు సుగుమంచిపల్లె, పెద్దదండ్లూరులో కొన్ని కుటుంబాలు వైకాపాలో చేర్చుకునేందుకు పెద్దదండ్లూరుకు ఎంపీ బయల్దేరారు. ఆయన రాకను నిరసిస్తూ మంత్రి ఆదినారాయణరెడ్డి వర్గీయులు పెద్దదండ్లూరులో సంపత్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన షామియానా, కుర్చీలు, కూలర్, ఫ్యానులను ధ్వంసం చేశారు. దీంతో ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాలు రాళ్లు రువ్వుకోవడంతో నలుగురు గాయపడ్డారు. మరో వ్యక్తిని గాలించే విషయంలో ప్రభుత్వ విప్ పి.రామసుబ్బారెడ్డి వర్గీయుడైన సంజీవరెడ్డి ఇంటికి వెళ్లగా, అక్కడ వారిరువురి మధ్య వివాదం చెలరేగింది. పెద్దదండ్లూరు గ్రామంలోకి వెళ్లాలంటే సుగుమంచిపల్లె దాటి వెళ్లాలి. మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచరులు సుగుమంచిపల్లెలోనే పెద్దఎత్తున మోహరించి అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం ఎంపీ అవినాష్‌రెడ్డికి తెలియగానే పెద్దదండ్లూరు వెళ్లాల్సిందేనని పట్టుబడగా...వారిని పోలీసులు చౌడూరు వద్దనే ఆపేశారు. దీంతో ఎంపీ అనుచరులు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ప్రత్యేక బలగాలు వచ్చి ఎంపీని చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్‌కు తరలించారు. తమ అనుచరులపై దాడి చేశారని తెలియడంతో ప్రభుత్వ విప్ పి.రామసుబ్బారెడ్డి హుటాహుటిన పెద్దదండ్లూరు గ్రామానికి బయల్దేరగా, జమ్మలమడుగు పాత బస్టాండ్‌లోనే పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు. పరిస్థితి చేజారిపోకుండా ప్రత్యేక పోలీసు బృందాలు పెద్ద ఎత్తున సుగుమంచిపల్లె, పెద్దదండ్లూరు, జమ్మలమడుగులో మోహరించాయి.

పెద్దదండ్లూరు గ్రామంలో ధ్వంసమైన ఇంటి సామగ్రి

మంత్రి అనుచరులపై కేసు నమోదు చేయాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: జమ్మలమడుగు మండలంలో దళితుడిపై దాడి చేసిన మంత్రి ఆదినారాయణ రెడ్డి అనుచరులపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. దళితుడైన కానిస్టేబుల్ సంపత్‌పై దాడి దుర్మార్గమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సీటులోనే ప్రాణాలు విడిచిన డ్రైవర్ అరుణాచలం

గుండెపోటుతో సీట్లోనే ఆర్టీసీ డ్రైవర్ మృతి

ప్రయాణికులు క్షేమం

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు నడుపుతూ డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందారు. చిత్తూరు జిల్లా పిచ్చాటూరులో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు సమీప కరింబేడు గ్రామానికి చెందిన అరుణాచలం(45) సుమారు 15 ఏళ్లుగా ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం తిరుమల డిపోకు చెందిన తిరుమల-చెన్నై సర్వీసు డ్రైవర్‌గా చెన్నైకు వెళ్లిన ఆయన సాయంత్రానికి అస్వస్థతకు గురయ్యారు. చెన్నై నుంచి సుమారు 65 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆయన మార్గమధ్యలోని రెడ్‌హిల్స్‌లో బస్సు ఆపి మాత్రలు వేసుకున్నారు. ఇబ్బంది పడుతూనే రాత్రి పిచ్చాటూరుకు చేరుకున్న ఆయన ప్రయాణికులను దించేందుకు బస్సు ఆపారు. మందులు వేసుకొని మళ్లీ తిరుమలకు బయలుదేరేందుకు ప్రయత్నిస్తుండగానే గుండెపోటుతో స్టీరింగ్‌పై వాలిపోయి అక్కడికక్కడే మృతిచెందారు. బస్సులోని సుమారు 50 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.

ఔషధ వ్యాపారంలో జాగ్రత్తగా ఉండాలి

- నాణ్యమైన మందులనే అమ్మాలి
- శాసనసభాపతి కోడెల సూచన

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కోడెల శివప్రసాదరావు

నరసరావుపేట, న్యూస్‌టుడే: ఔషధ వ్యాపారం అత్యంత సున్నితమైందని, ప్రజారోగ్యానికి నష్టం కలగకుండా నాణ్యమైన మందులు మాత్రమే అమ్మాలని శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు సూచించారు. వ్యాపారంలో అత్యంత జాగురకతతో వ్యవహరించాలని ఆయన అన్నారు. ఆదివారం నరసరావుపేటలో నిర్వహించిన సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో కోడెల ప్రసంగించారు. ఆస్పత్రుల్లోనే మెడికల్ షాపుల నేపథ్యంలో బయట షాపులు మనుగడ సాగించలేకపోతున్నాయన్నారు. మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వమే ఔషధాలు అందించేలా కృషి చేయాలన్నారు. శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒకరకం ఔషధం ఒక సంస్థ రూ.5 అమ్మితే, అదే ఔషధాన్ని మరో సంస్థ రూ.75కు అమ్ముతుంది. ఈ వ్యాపార దృక్పథం మారాలని కోరారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడు పాలకొల్లుకు చెందిన టి.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఔషధ వ్యాపారులకు సంబంధించిన లైసెన్స్‌లు 13 జిల్లాల్లో 13 రకాలుగా అమలు చేస్తున్నారని, ఇది ఔషధ నియంత్రణ అధికారులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఔషధ నియంత్రణ శాఖ జేడీ పి.వినయ్‌కుమార్, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.కృష్ణారెడ్డి, గౌరవ ప్రధాన కార్యదర్శి కె.పి.రంగారావు, కోశాధికారి టి.నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున ఈ సందర్భంగా బహుకరించారు.

బీసీల సంక్షేమానికి తోడ్పడేవారికే మద్దతు

నగరంపాలెం(గుంటూరు సిటీ), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని బీసీల అభ్యున్నతికి పాటుపడేవారికే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మద్దతు తెలుపుతామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. ఆదివారం గుంటూరు నగరంపాలెంలోని ఓ హోటల్‌లో సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమావేశం, సంఘం నూతన ప్రధాన కార్యదర్శి నియామకాల కార్యక్రమం జరిగింది. ఈ సభలో కేశన శంకరరావు మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలోనే బీసీలపై ఎనలేని ప్రేమ చూపుతారని, అధికారంలోకి వచ్చాక అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి చెందిన సామాజిక వర్గాలను బీసీ జాబితాలో చేర్చే ప్రయత్నాలను సహించేది లేదన్నారు. రాబోయే ఎన్నికల సమయానికి 175 నియోజకవర్గాల్లో కోటిమందికి సభ్యత్వం అందించే కార్యక్రమం సాగుతుందన్నారు. అనంతరం విడదల రజనీకి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు విదేశీ నౌకలకు అనుమతి

దిల్లీ: రైతులకు మేలు కలిగేలా నౌకాయాన నిబంధనల్లో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. దేశంలోని ఇతర ఓడరేవులకు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకెళ్లేందుకు విదేశీ నౌకలు ఎలాంటి లైసెన్సులు తీసుకోవాల్సిన అవసరం లేదు. వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలు, మత్స్య, పశుపోషణ రంగాలకు కూడా ఇది వర్తిస్తుందని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఎవరైనా తమ స్వంత విదేశీ నౌకలో వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసేందుకు కూడా అనుమతిస్తామని తెలిపారు. ప్రస్తుతం చేపలను సింగపూర్ తీసుకెళ్లి అక్కడ శుద్ధి చేసి జపాన్‌కు ఎగుమతి చేస్తుండగా, ఇకపై ఇక్కడే చేయనున్నామని చెప్పారు. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా సముద్ర ఉత్పత్తుల శుద్ధికి ఇక్కడే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. రైళ్లు, లారీలతో పోల్చితే నౌకల ద్వారా రవాణాకు తక్కువ ఖర్చు అవుతుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. దీని ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని అన్నారు. వాణిజ్య నౌకలోని మొత్తం సరకులో సగభాగం వ్యవసాయ ఉత్పత్తులు ఉంటే అందుకు లైసెన్సు తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

రెండుపూటలా తిండికి సరిపడే డబ్బు ఇచ్చినంత మాత్రాన సరిపోదు!

పిల్లల సంరక్షణకు ఇచ్చే మొత్తంపై కోర్టు వ్యాఖ్య

దిల్లీ: భార్య నుంచి విడిగా ఉంటున్న సందర్భంలో బిడ్డ సంరక్షణ ఖర్చుల నిమిత్తం తండ్రి ఇచ్చే డబ్బు కేవలం రెండుపూటలా ఆ చిన్నారి భోజనానికి సరిపడినంత మాత్రానికే పరిమితం కాదని దిల్లీ అదనపు సెషన్స్ కోర్టు అభిప్రాయపడింది. తల్లిదండ్రులిద్దరితో కలిసి ఉంటున్న సందర్భంలో ఎలాంటి వసతులు, ప్రయోజనాలను ఆ పాప/బాబు పొందుతారో...వాటి ప్రాతిపదికన సదరు మొత్తాన్ని నిర్ధారించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

నెట్లో చూసి నాటు తుపాకీ తయారీ

తూప్రాన్‌లో యువకుడి అరెస్టు

తూప్రాన్, న్యూస్‌టుడే: అంతర్జాలంలో చూసి నాటు తుపాకీని తయారు చేసి గాల్లోకి కాల్పులు జరిపిన యువకుడిని తూప్రాన్ పోలీసులు అరెస్టు చేశారు. తూప్రాన్ డీఎస్పీ రామ్‌గోపాల్‌రావు తెలిపిన వివరాల మేరకు..విజయనగరం జిల్లా బాడంగి మండలం కోడూర్‌కు చెందిన మార్డాన రమేశ్(26) ఐటీఐ పూర్తి చేశాడు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రామాయపల్లి పంచాయతీ పరిధి పాలట శివారులోని ఓ పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. పరిశ్రమలో ఉండే ఇనుప పరికరాలతో నాటు తుపాకీని తయారు చేయాలనుకున్నాడు. అంతర్జాలంలోని వీడియోల ఆధారంగా నాటుతుపాకీతోపాటు తూటాలనూ తయారు చేశాడు. నాలుగు రోజుల క్రితం అతను ఉంటున్న గది పక్కన ఒక రౌండ్ గోడకు కాల్పులు జరిపి తుపాకీ పని తీరును గమనించాడు. ఆదివారం మద్యం మత్తులో పట్టణంలోని ఓ కల్లు దుకాణం వద్ద తుపాకీని నేలకు పెట్టి ఒక రౌండ్ కాల్పులు జరిపాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తుపాకీతోపాటు మూడు తూటాలను స్వాధీనం చేసుకున్నారు. పందులను వేటాడేందుకు తుపాకీని తయారు చేశానని విచారణలో రమేశ్ చెప్పినట్లు డీఎస్పీ తెలిపారు.

పెట్రోలు ధర వరుసగా అయిదో రోజైన ఆదివారం నాడు కూడా తగ్గింది. దిల్లీ, ముంబయి, కోల్‌కత్తాల్లో పెట్రోలు ధర 9 పైసలు మేర తగ్గింది.

తాజ్ చుట్టూ ప్లాస్టిక్ నిషేధం

ఆగ్రా: చారిత్రక కట్టడమైన తాజ్‌మహల్ చుట్టూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిషేధించడానికి ఉద్దేశించిన 'తాజ్ ప్రకటన' ఆదివారం ఆమోదం పొందింది. దీని ప్రకారం తాజ్ చుట్టూ 500 మీటర్ల మేర ప్రాంతాన్ని చెత్తాచెదారం లేకుండా చూడడంతో పాటు- వాడిపారేసే ప్లాస్టిక్‌ను క్రమంగా విడనాడనున్నారు. ఈ నెల 5న జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తాజ్ ప్రకటనను వెలువరించారు. దీనిలో కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి మహేశ్ శర్మ, ఐరాస పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ) సుహృద్భావ రాయబారి దియా మీర్జా తదితరులు పాల్గొన్నారు. విపరీతంగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కారణంగా మన దేశంతో పాటు యావత్ ప్రపంచం పెద్ద సమస్యను ఎదుర్కొంటోందని మహేశ్ శర్మ చెప్పారు. గంగానది శుద్ధి కార్యక్రమంలోనూ వీరంతా పాల్గొన్నారు.

'కోహినూర్'ను రప్పించడానికి ఏం చేశారు?

- తీసుకున్న చర్యలను బహిర్గతం చేయండి
- ప్రధాని కార్యాలయాన్ని ఆదేశించిన కేంద్ర సమాచార కమిషను

ఈనాడు, దిల్లీ: కోహినూర్ వజ్రంతోపాటు భారత్ నుంచి తరలిపోయిన విలువైన చారిత్రక సంపదను తిరిగి రప్పించడానికి కేంద్రం ఇంతవరకూ తీసుకున్న చర్యలేమిటో బహిర్గతం చేయాలని ప్రధానమంత్రి కార్యాలయాన్ని కేంద్ర సమాచారశాఖ కమిషను ఆదేశించింది. ఈ అంశంపై సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని దరఖాస్తుదారుడైన బీఎస్‌కేవీఎస్‌అయ్యంగార్‌కు ఇవ్వాలని సమాచార కమిషనరు మాడభూషి శ్రీధరాచార్యులు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కోహినూర్ వజ్రం, సుల్తాన్‌గంజ్ బుద్ధ, నస్సాక్ వజ్రం, టిప్పుసుల్తాన్ ఖడ్గం, ఉంగరం, మహారాజా రంజిత్ సింగ్ సింహాసనం, షాజహాన్ రత్నఖచిత మధుపానపాత్ర, అమరావతి రెయిలింగ్స్, సరస్వతి పాలరాతి విగ్రహం, టిప్పు సుల్తాన్ యాంత్రిక వ్యాఘ్రం, ఇతర నగలను భారత్‌కు రప్పించడానికి కేంద్రం తీసుకున్న చర్యలేమిటి?, అవి ఎంతవరకు ఫలించాయో చెప్పాలంటూ సమాచారహక్కు చట్టం కింద పీఎంఒ, సాంస్కృతికశాఖ, భారత పురాతత్వసర్వేశాఖలకు అయ్యంగార్ దరఖాస్తు చేశారు. వాటికి స్పష్టమైన సమాధానం ఇవ్వడానికి నిరాకరించడంతో కేంద్రసమాచారశాఖ కమిషన్‌ను ఆశ్రయించారు. సమాధానం ఇవ్వకుండా ఆర్‌టీఐ దరఖాస్తులను నిబంధనలకు విరుద్ధంగా ఏఎస్ఐకి బదిలీ చేసినందుకుజరిమానా ఎందుకు విధించకూడదో చెప్పాలని సాంస్కృతికశాఖ అధికారులను కమిషను సంజాయిషీ కోరింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 5-6-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 296

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

పేదలు, ధనికులు అనే తేడాలేకుండా వేలాది మందికి మెరిట్‌లోనే మెడికల్ సీట్లు సాధిస్తున్న

శ్రీచైతన్య విజయవాడ రెసిడెన్షియల్ క్యాంపస్‌లు

శ్రీమతి సుష్మ, అకడమిక్ డైరెక్టర్
శ్రీచైతన్య విద్యాసంస్థలు

ఇక పల్లెపల్లె నుండీ..ప్రముఖ డాక్టర్లు!

ఒత్తిడిని తగ్గించి, విజ్ఞానాన్ని పెంచి,
విజయాన్ని చేరువచేస్తోన్న
శ్రీచైతన్య రెసిడెన్షియల్ క్యాంపస్‌లు

3285 విద్యార్థులు

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో టాపు 200 లోపు 32 ర్యాంకుల్లోనూ శ్రీచైతన్యదే ఆధిపత్యం

Rank	Name	H.T.No.
14	O V S HARSHA VARDHAN	500807970
16	MENDA JAIDEEP	500813901
19	KODURU SRIHARSHA	500813379
25	SIDDHARTH RAVI	512513705
36	VARADA RAVIKIRAN	500810196
37	LOKESH PARAS M	508609435
57	G K SREEVATHSAV	512526330
63	S J B RAFIYA KULSUM	500808480
68	A SAHITH REDDY	512525281
71	NITYA BORAD	512528930
73	Y SANJEEVA KUMAR	512525182
81	B V N TARUN VARMA	500900536
92	R R C ABHISHEK	500804349
94	M SRIYUDH REDDY	512530096
104	Y SREE SAI REDDY	512526287
119	GUDURU SAIEESH	512535804
122	PERIGALA NAMRATHA	512510222
130	B PRANAV BOSE	512523429
131	P SREE CHAITHANYA	512516293
136	K VENAKTA TEJA	500909487
160	G SIRI CHANDANA	512538307
171	A VINAY RAIDU	18453931
177	J SAI SUPRIYA	500901152
182	GANDE ADARSH	512516856
185	C LIKHITH REDDY	500803935
187	S SAMEENA TASNEEM	512536296
192	A LOHITHAKSH YADAV	512522446
194	T SAMANVITHA	500811389
197	ABHIJIT JAIN	507302372

ఒక్క తెలుగు రాష్ట్రాల నుండే మెడికల్ సీట్లు సాధించగల శ్రీచైతన్య విద్యార్థులు **5750**

32 ర్యాంక్స్ 200లోపు

62 ర్యాంక్స్ 500లోపు

114 ర్యాంక్స్ 1000లోపు

NEETలో శ్రీచైతన్య మొత్తం ర్యాంకులు **24,730**

విద్యార్థుల మనోభావాలు

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 8 వ ర్యాంక్
మెడిసిన్ చదవాలనే లక్ష్యంతోనే 9వ తరగతి నుండి నీట్ పరీక్ష రాసే వరకు శ్రీచైతన్యలోనే చదివాను. స్ట్రాంగ్ ఫౌండేషన్‌తో టాపర్‌గా నిలిచాను.
ఎ. అనిరుధ్ బాబు, హా.టి.నం. 500805753

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 14 వ ర్యాంక్
నిష్ణాతులైన ప్రొఫెసర్ల శిక్షణలో రాబడేని ఏ సిలబస్ నైనా అలవోకగా బోధించగలిగే సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌ల ద్వారా శిక్షణ పొందటం నిజంగా నా అదృష్టం
ఒ వి ఎస్ హర్షవర్ధన్ రెడ్డి, హా.టి.నం. 500807970

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 16 వ ర్యాంక్
మెడికల్ అంటేనే శ్రీచైతన్య, శ్రీచైతన్య అంటేనే మెడికల్. అందుకే శ్రీచైతన్యలో చేరాను. నా డాక్టర్ కల నెరవేర్చుకున్నాను. థ్యాంక్స్ టు శ్రీచైతన్య.
ఎమ్ జయదీప్, హా.టి.నం. 500813901

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 19 వ ర్యాంక్
టాప్ 10లోపు, 100లోపు ర్యాంకుల సాధనే లక్ష్యంగా శ్రీచైతన్య సృష్టించిన ప్రత్యేక లాంగ్‌టర్మ్ ప్రోగ్రామ్స్ వల్లే నాకు ఈ ర్యాంకు సాధ్యమైంది.
కె. శ్రీహర్ష, హా.టి.నం. 500813379

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 36 వ ర్యాంక్
ప్రాథమిక అంశాలతోపాటు ప్రతి కాన్సెప్ట్‌నూ సులభంగా గుర్తించుకునేలా షార్ట్ అండ్ స్మార్ట్ మెథడ్స్‌తో సృష్టించిన మెటీరియల్ ద్వారానే నాకు ఈ విజయం.
వి. రవికిరణ్, హా.టి.నం. 500810196

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 63 వ ర్యాంక్
క్లాస్ రూమ్ సెషన్స్‌ను అనుసరించే డౌట్ క్లారిఫికేషన్ సెషన్స్‌వల్ల వెంటనే నా సందేహాలు నివృత్తి అయ్యేవి. సబ్జెక్ట్ అర్థమవటం వల్ల నెక్స్ట్ క్లాస్ ఈజీగా ఉండేది
షేక్ జానుభాయ్ రఫీయా కులుసుమ్, హా.టి.నం. 512525182

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 92 వ ర్యాంక్
వందల్లో ర్యాంకు వ్యత్యాసానికి కారణమయ్యే ప్రతి ఒక్క అంశంపై ప్రత్యేక శ్రద్ధ, విజ్ఞానంలోనూ నిర్లక్ష్యం దరిచేరనివ్వని వ్యూహం వల్లే నాకు ఇంతటి ర్యాంకు.
రాజ్ చెందూర్ అభిషేక్, హా.టి.నం. 500804349

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 8 వ ర్యాంక్ సాధించిన తమ బిడ్డతో ఆనందాన్ని పంచుకుంటున్న తల్లిదండ్రులు

పేరెంట్స్ మనోభావాలు

మాటల్లో చెప్పలేని ఆనందం ఇది. ఇదంతా శ్రీచైతన్య ప్రోగ్రామ్స్ ఫలితం, వాళ్ళు మా అబ్బాయిని ఉన్నతంగా మా కళ్ళ ముందు నిలబెట్టారు. అందుకే శ్రీచైతన్య అంటే తల్లిదండ్రులకు నమ్మకం.
- ఒ వి ఎస్ హర్షవర్ధన్ రెడ్డి తల్లిదండ్రులు

అద్భుతమైన శిక్షణతో మా అబ్బాయిని ర్యాంకర్‌గా నిలిపిన శ్రీచైతన్యకు మేమెప్పుడూ ఋణపడి ఉంటాము. మెడికల్ శిక్షణలో శ్రీచైతన్యకు తిరుగులేదని మరోసారి నిరూపణ అయ్యింది.
- వి రవికిరణ్ తల్లిదండ్రులు

అద్భుత ప్రోగ్రాముతో మా అమ్మాయికి చదువు చెప్పి డాక్టర్‌గా మార్చిన శ్రీచైతన్యకు మేము ఎప్పుడూ ఋణపడి ఉంటాము. శ్రీచైతన్య మానమ్మకాన్ని నిజంచేసి మా కలను సాకారం చేసింది. థ్యాంక్స్ టు శ్రీచైతన్య.
- షేక్ జానుభాయ్ రఫీయా తల్లిదండ్రులు

శ్రీచైతన్య ప్రోగ్రామ్స్, ఫ్యాకల్టీ, ప్లానింగ్ అన్నీ ఎక్సలెంట్. వి ఆర్ వెరీ హ్యాపీ. థ్యాంక్స్‌టు శ్రీచైతన్య. ఒక్క శ్రీచైతన్యకు తప్ప మెడికల్ లో ఇంతటి ఫలితాలు సాధించే సత్తా దేశంలోనే మరెవరికీ లేదనేది మా నమ్మకం.
- పి. సమన్విత చౌదరి తల్లిదండ్రులు

LONG TERM-2019

1st Batch Classes Starts From
Dt. 18.06.2018

అడ్మిషన్ల కొరకు సంప్రదించండి
✆ 040-66060606

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Long Term 2018-19 Batch Concessions in Vijayawada

NEET-18 Marks	% of Concession
>425	90%
400-424	75%
375-399	50%
350-374	25%

The above concessions are upto 15th June 2018

www.srichaitanya.net

ఈ ప్రకటనలో ఏమైనా ముద్రణాలోపాలు ఉంటే మా దృష్టికి తీసుకురాగలరు.

NEET 2018 లో
అన్ని కేటగిరీలలో
10 లోపు 13 ఆలిండియా ర్యాంకులు
నారాయణ మెడికల్ అకాడమి - ఇండియా

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 5-6-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 296

రూ. 5-00 పేజీలు 20+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

NEET 2018 లో
అన్ని కేటగిరీలలో
100 లోపు 53 ఆలిండియా ర్యాంకులు
నారాయణ మెడికల్ అకాడమి - ఇండియా

ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా టాప్ 10లో 4 ర్యాంకులు

అన్ని కేటగిరీలలో 10లోపు 13, 100లోపు 53 ర్యాంకులు సాధించిన ఏకైక విద్యాసంస్థ నారాయణ

నారాయణ NEET ఫలితాలు

నారాయణ Bi.P.C విద్యార్థులలో సుమారు 38% మంది విద్యార్థులు డాక్టర్స్ కాబోతున్నారు.

ఏ చైతన్యవంతమైన విద్యాసంస్థ ఇంత ఎక్కువ శాతం మంది విద్యార్థులను డాక్టర్స్ చేయటం లేదు... లేదు...లేదు...!

3800 మంది డాక్టర్స్‌ను సగర్వంగా భారతదేశానికి అందించబోతున్న నారాయణ

జాతీయస్థాయిలో నీట్ 2018లో అద్భుత ఫలితాల ద్వారా
ఎవ్వరైనా నారాయణ తరువాతే అని నిరూపించాం

1st Rank



PIYUSH MEENA, H.T.No.511006504 ST CAT.

ఆల్ఇండియా అన్ని కేటగిరీలలో
10లోపు 13 ర్యాంకులు
100లోపు 53 ర్యాంకులు
నారాయణకు మాత్రమే సాధ్యమైన రికార్డ్

1st Rank

PRINCE CHOUDARY H.T.No.510801630 OBC CAT.

1st Rank

PIYUSH MEENA
H.T.No.511006504, ST CAT.

1st Rank

PRINCE CHOUDARY
H.T.No.510801630, OBC CAT.

2

TARUN KUMAR D
H.T.No.511036661, ST CAT.

3

HIMANSHU SHARMA
H.T.No.502701296, OPEN CAT.

5

ANURAJ
H.T.No.511211092, PH CAT.

5

NAVYA YADAV
H.T.No.511011665, OBC CAT.

5

PRINCE CHOUDARY
H.T.No.510801630, OPEN CAT.

7

MADHVA GUPTA
H.T.No.510602291, CAT.

7

VIRENDRA CHOUDARY
H.T.No.510901106, OBC CAT.

8

R KAUR MAHAL
H.T.No.510603363, CAT.

9

THAMTHAM MAHESH
H.T.No.512508570, OBC CAT.

9

MADHVAN GUPTA
H.T.No.510602291, OPEN CAT.

10

R KAUR MAHAL
H.T.No.510603363, OPEN CAT.

పై ఫలితాలన్నీ నారాయణ గ్రూపులోని అన్ని ప్రోగ్రాములు కలిపి సాధించినవి.

నారాయణ మెడికల్ అకాడమి

NEET-2018 లో ఆల్ఇండియా అన్ని కేటగిరీలలో
100లోపు టాప్ ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులు

13
Jitendra Yadav
H.T.No.511019975

14
Varthiya Kunal
H.T.No.512521247

15
Gaurav Bundela
H.T.No.502409325

18
Dungavath Bhoomika
H.T.No.500401758

21
Kushal Brar
H.T.No.510602999

23
Piyush Arunkumar A
H.T.No.507711994

28
Shikhar Bansal
H.T.No.514100662

28
Prerak T
H.T.No.513816883

29
Panabaka Madhu Kiran
H.T.No.500501982

30
S R Apuroopa
H.T.No.505500113

30
Badde Anandraj
H.T.No.500201845

32
Navya Yadav
H.T.No.511011665

33
P Tripathi
H.T.No.513816883

38
P Paramita Mahanta
H.T.No.510107072

38
P Virendra Choudhary
H.T.No.510901106

41
Bapanapalli Sandhya
H.T.No.500500856

43
Eathakota Kavya
H.T.No.512520082

46
S Gnaneshwar
H.T.No.512538925

52
Pratham Singla
H.T.No.511102030

53
Thamtham Mahesh
H.T.No.512508570

64
R L Kaasyap Sriram
H.T.No.500707039

65
Korra Shashidhar
H.T.No.512527431

67
Kunta Alekhya
H.T.No.512508458

69
Avvaru Manvitha
H.T.No.500808860

73
Debayan Mandal
H.T.No.502709423

73
Shilpa R
H.T.No.505022901

75
Abhinav Gupta
H.T.No.501807152

76
V Raghuram Reddy
H.T.No.512807584

77
Rathod Nikhitha
H.T.No.512504530

79
Pulkit Gupta
H.T.No.510802257

84
Rahul
H.T.No.504008112

86
Abhishek Saini
H.T.No.511009753

87
Abhinav Gupta
H.T.No.501807152

88
Amgoth Raj Kumar
H.T.No.512528378

96
Jitendra Yadav
H.T.No.511019975

పై ఫలితాలన్నీ నారాయణ గ్రూపులోని అన్ని ప్రోగ్రామ్‌లు కలిపి సాధించినవి.

ఏ రేంజ్‌లోనైనా నారాయణకు సమానంగా వృద్ధిశాతం ఉన్న విద్యాసంస్థ ఇంకొకటి లేదు

ర్యాంకు రేంజ్	2017లో సాధించిన ర్యాంకులు	2018లో సాధించిన ర్యాంకులు	వృద్ధిశాతం
<10	1	9	800%
<100	10	53	430%
<1000	61	189	206%
<5000	182	582	218%
<10000	367	996	170%

అన్ని కేటగిరీలలో

2019 నీట్ కొరకు లాంగ్‌టర్మ్ కోచింగ్ క్లాసులు ప్రారంభం 18-06-2018

హైదరాబాద్
మాదాపూర్ : 9912341118
కూకట్‌పల్లి : 9030795870
నారాయణగూడ : 8179880486
నాగోల్ : 9912343880
దిల్‌సుఖ్‌నగర్ : 9912396620
SR నగర్ : 8179880514

ఆంధ్రప్రదేశ్
విశాఖపట్నం : 8179880708
కాకినాడ : 9912342816
విజయవాడ : 8179880651
గుంటూరు : 8179880134
నెల్లూరు : 8179881289
తిరుపతి : 8179880549
కర్నూలు : 8179880438.

SRAMAYEVA JAYATHE
THE NARAYANA GROUP

నారాయణ
మెడికల్ అకాడమి

ఈనాడు

విజయవాడ 5-6-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 296

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

‘ఉత్తర భారతదేశంలో వేలాది మంది రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అయినా కేంద్రం పట్టించుకోవడం లేదు. రైతుకి గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడెందుకు పట్టించుకోవడం లేదు. కొందరు వారి కుటుంబాల కోసం అయ్యప్పదీక్ష, భవానీదీక్ష, రంజాన్ దీక్షల్లాంటివి చేపడుతుంటారు. నేను మాత్రం అయిదుకోట్ల మంది ప్రజల కోసం చేపట్టిన ఏకైక దీక్ష నవనిర్మాణదీక్ష. వచ్చే ఎన్నికల్లో కుట్రదారులైన భాజపాని... పాత్రధారులైన వైకాపా, జనసేనల్ని చిత్తుచిత్తుగా ఓడించి వారికి బుద్ధి చెప్పండి. భాజపాకు ఒకటే చెబుతున్నా తెదేపాతో పెట్టుకుంటే ఖబడ్దార్.. మీ కుట్రలు ఏ రాష్ట్రంలోనైనా చెల్లుతాయేమో... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సాగవు...’

తెదేపాతో పెట్టుకుంటే ఖబడ్దార్



- వచ్చే ఎన్నికల్లో కుట్రదారులను చిత్తుచిత్తుగా ఓడించాలి
- రైతులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి
- ఆన్‌లైన్‌లో వ్యవసాయ పరికరాలను బాడుగకు ఉంచుతాం
- శృంగవరపుకోట నవనిర్మాణదీక్షలో చంద్రబాబు

ఈనాడు – విజయనగరం

రాష్ట్రంలో రైతులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిలషించారు. దాని కోసం తాను అన్ని విధాలా సహకరిస్తానన్నారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో సోమవారం జరిగిన నవనిర్మాణదీక్షలో పాల్గొన్నారు. తొలుత లక్కవరపుకోట మండలం జమ్మాదేవిపేటలో గ్రామదర్శిని, రచ్చబండల్లో పాల్గొని గ్రామస్థులతో మమేకమయ్యారు. సంక్షేమపథకాలు ఎలా అమలవుతున్నాయో శాఖల వారీగా ఇటు అధికారుల్ని... అటు ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నవనిర్మాణదీక్ష సభా ప్రాంగణానికి చేరుకుని వ్యవసాయం-అనుబంధ రంగాలపై చర్చ లేవదీశారు. ‘ప్రపంచమంతా ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. పండ్లు, మాంసం, పాలు, చేపలు, రొయ్యల వినియోగం గణనీయంగా పెరుగుతోంది. అందుకే అన్నదాతలు వ్యవసాయంతోనే ఆగిపోకూడదు. ఉద్యానపంటలూ పండించాలి. పాడిపైనా దృష్టిసారించాలి. సంఘాలుగా ఏర్పడి వ్యవసాయ ఆధారిత పరిశ్రమల వైపు అడుగులేయాలి. ఉత్పత్తులను ప్రాసెస్ చేసి ఎగుమతులు చేయాలి....’ అని సీఎం పేర్కొన్నారు.

వ్యవసాయరంగంలో దేశంలో 3 శాతం వృద్ధి కనిపిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 17.3 శాతం ఉండడం మన పనితీరుకి నిదర్శనం. భూసార పరీక్షలపై శ్రద్ధ పెట్టాం. ఉచితంగా సూక్ష్మపోషకాల్ని అందించడంతో రూ.350 కోట్ల విలువైన రసాయనిక ఎరువుల వాడకం తగ్గింది. భవిష్యత్తులో ఎలాంటి వ్యవసాయ పనిముట్లు అవసరమైనా బాడుగకు తీసుకోవడానికి ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉండేలా ఓ యాప్ తీసుకొస్తాం. దీనివల్ల బాడుగ ఖర్చులు తగ్గిపోతాయి. ఎవరైనా రైతుల జోలికొచ్చి నకిలీ క్రిమిసంహారక మందులు, నాసిరకం విత్తనాలు తయారుచేస్తే టాడా, పీడీ చట్టాల కింద కేసులు పెట్టి జైల్లో పెడతాం. ఏరువాకను రాష్ట్ర కార్యక్రమంగా ఏర్పాటు చేస్తాం. రైతుల్ని పైకి తీసుకొచ్చే బాధ్యత నా భుజస్కంధాలపై పెట్టుకున్నాను. సేంద్రీయ వ్యవసాయంలో ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతాం...’ అని (మిగతా 2లో)

తెలుగు వెలుగు

రోహన్

కల్పనా కుమారి

- నీట్‌లో ఏపీ, తెలంగాణ విద్యార్థులకు ర్యాంకులు
- మొదటి స్థానంలో బిహార్ బాలిక కల్పనా కుమారి

దిల్లీ: వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన “నీట్”లో ఏపీ, తెలంగాణ విద్యార్థులు సత్తాచాటారు. 2, 8 ర్యాంకులను తెలంగాణ, ఏపీ విద్యార్థులు సాధించారు. బిహార్ బాలిక కల్పనా కుమారి 691 మార్కులతో (99.99% స్కోర్) మొదటి స్థానాన్ని సాధించింది. రెండో ర్యాంకును దిల్లీ బాలుడు హిమాన్షు శర్మతో కలిసి తెలంగాణ విద్యార్థి రోహన్ పంచుకున్నాడు. 686 మార్కులతో మూడో స్థానంలో దిల్లీ బాలుడు ఆరోష్ ధమీజా, రాజస్థాన్ బాలుడు ప్రిన్స్ చౌధరిని నిలిచారు. రాష్ట్రాల వారీగాచూస్తే ఉత్తర్ ప్రదేశ్ విద్యార్థులు ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా ఈ ఏడాది 13.36 లక్షల మంది నీట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 12.69 లక్షల మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 7.14 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందినవారు 76,778 మంది వున్నారు. కేరళ (72,000), మహారాష్ట్ర (70,000) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దేశ వ్యాప్తంగా 136 నగరాల్లోని 11 భాషల్లో మే ఆరో తేదీన కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) నీట్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు దీనిలో ఉత్తీర్ణత తప్పనిసరి.

100లో 8 మంది మనోళ్లే

దేవ సహాయం 1వ ర్యాంకు (దివ్యాంగుల కోటా)

- జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు కైవసం
- దివ్యాంగుల కోటాలో తొలిర్యాంకు 6లో

అనిరుద్ (8వ ర్యాంకు)

చొరవ తీసుకోండి

- పేద ప్రజల అభ్యున్నతికి పనిచేయండి
- విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాల పెంపునకు చర్యలు తీసుకోండి
- గవర్నర్లకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్బోధ 7లో

గవర్నర్లను పరిచయం చేసుకుంటున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రభుత్వ పథకానికో కార్డు!

- రేషన్‌కార్డు చౌక సరకులకే పరిమితం
- దుర్వినియోగం నివారణకు రాష్ట్ర సర్కారు యోచన 12లో

రోగికో రకం క్యాన్సర్ చికిత్స!



- విడిగా విశ్లేషణలకు సరికొత్త నమూనా సిద్ధం
- జపాన్ శాస్త్రవేత్తల ఘనత

టోక్యో: క్యాన్సర్ తీరుతెన్నులను విశ్లేషించడానికి శాస్త్రవేత్తలు ఒక శక్తిమంతమైన నమూనాను అభివృద్ధి చేశారు. దీనిద్వారా ఎవరికివారికి ప్రత్యేకమైన చికిత్సను సిద్ధం చేయడానికి వీలవుతుందని చెప్పారు. జపాన్‌లోని క్యోటో విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు ‘చికెన్ ఎగ్ ట్యూమర్ మోడల్’ను సిద్ధం చేశారు. ఇందులో పది రోజుల వయసున్న కోడి పిండం ఉంటుంది. ఈ పిండం పైపొర మీదకు.. (మిగతా 2లో)

తల్లి అంత్యక్రియలకు వెళుతూ పెనువిషాదం

- లారీని కారు ఢీకొని తనయుడు ఆయన మరదలు మృతి 12లో
- ప్రాణాలు కాపాడని బెలూన్లు
- మృతులు పశ్చిమగోదావరి జిల్లా వాసులు

అక్కడే కావాలి..

- సీడ్ యాక్సెస్ రహదారికి భలే గిరాకీ!
- అటూ ఇటూ ఉన్న ప్రాంతానికి పెరిగిన డిమాండ్
- పలు సంస్థలకు సీఆర్‌డీఏ స్థలాల కేటాయింపు



ఈనాడు అమరావతి: అమరావతిలో నిర్మిస్తున్న ప్రధాన అనుసంధాన రహదారి (సీడ్ యాక్సెస్ రోడ్డు)కి అటూ ఇటూ ఉన్న ప్రాంతానికి ఇప్పుడు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కీలకమైన సంస్థలు, కార్యాలయాలు, హోటళ్లు, సమావేశమందిరాలు ఈ రహదారికి పక్కనే వస్తున్నాయి. ఈ రోడ్డుకి అటూ ఇటూ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ఇప్పటికే పలు సంస్థలకు స్థలాలు కేటాయించింది. మరికొన్ని ప్రతిపాదనలూ పరిశీలనలో ఉన్నాయి. రాజధానిలో మొదట నిర్మిస్తున్న ప్రధాన రహదారి ఇదే కావడం, కృష్ణా నదికి అత్యంత సమీపం నుంచి కరకట్టకు సమాంతరంగా ఈ మార్గం నిర్మిస్తుండడం వంటి కారణాల వల్ల దీనికి ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా ఆతిథ్య, పర్యాటక రంగానికి చెందిన ప్రాజెక్టులు ఎక్కువగా ఈ రహదారి పక్కనే వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వెంకటపాలెం నుంచి కొండమరాజుపాలెం మధ్య ఈ రహదారి పక్కన ప్రస్తుతం ఎక్కువ గిరాకీ ఉంది. ఈ రహదారికి పక్కనే అమరావతి మెరీనా, మూడు నక్షత్రాల రిసార్ట్, రెండు 5 నక్షత్రాల (మిగతా 2లో)

దుర్గాప్రసాద్ దగ్గర ఆస్తులు కొన్నారా?

- కొన్న ఆస్తిని ఎవరి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు 5లో
- వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించిన ఏసీబీ

ఇదీ సంగతి!



రేపో మాపో నిధులు

- పోలవరం తొలి డీపీఆర్‌లో రావాల్సింది రూ.400 కోట్లే
- సవరించిన అంచనాల ఆమోదమే ఇక కీలకం
- 6000 క్యూబిక్ మీటర్ల రికార్డు స్థాయి కాంక్రీటు పనులు
- డయాఫ్రం వాల్ పనులు మిగిలింది 18 మీటర్లే

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు విషయమై గత ఆరు నెలలుగా నిధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంలోని అనేక శాఖల మధ్య, అనేక సంస్థల మధ్య అటూ, ఇటూ రకరకాలుగా కదులుతున్న దస్త్రం ఒక కొలిక్కి వచ్చింది. అన్ని దశలు దాటుకుని నాబార్డుకు వెళ్లింది. ప్రస్తుతం నాబార్డు... మార్కెట్ నుంచి నిధుల సమీకరణ ప్రయత్నాల్లో ఉంది. ప్రస్తుతం రెండు విడతలుగా మంజూరైన మొత్తం రూ.1400 కోట్లు ఈ వారంలోనే (మిగతా 2లో)

విద్యుత్తు కేంద్రం మినహా పోలవరం పాత అంచనాలు:	రూ. 13,466 కోట్లు
జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన 2014 మార్చి తర్వాత ఖర్చు:	రూ. 8330 కోట్లు
ఇంతవరకు చెల్లించింది:	రూ. 5342 కోట్లు
ఇంకా రావాల్సింది:	రూ. 2988 కోట్లు
విడుదలకు సిద్ధంగా ఉన్నది:	రూ. 1400 కోట్లు
తొలి డీపీఆర్‌కు సంబంధించి ఇంకా రావాల్సింది (రమారమి):	రూ. 400 కోట్లు
మే నెలాఖరు వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది:	మరో రూ. 300 కోట్లు

తెదేపాతో పెట్టుకుంటే ఖబడ్దార్

ముఖ్యమంత్రి చంద్రబాబుపై వర్షం చినుకులు పడకుండా గొడుగుపట్టిన భద్రతా సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)
సీఎం వివరించారు.

'గతంలో మనకి అన్యాయం చేసినందుకే కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోయింది. విభజన చట్టం ప్రకారం రావాల్సినవన్నీ ఇస్తామని, దిల్లీ కంటే అమరావతిని అభివృద్ధి చేస్తామంటూ ప్రధాని నరేంద్రమోదీ తిరుపతి వెంకన్న సాక్షిగా చెప్పినా చేయకుండా నమ్మకద్రోహం చేశారు. నాలుగో ఏడాది బడ్జెట్ చూశాక ఇక లాభం లేదని మరో మార్గం లేకే తిరుగుబావుటా ఎగరేశాను. కేంద్రమంత్రిగా ఉన్న అశోక్‌గజపతిరాజుని రాజీనామా చేయమనగానే నిమిషమైనా ఆలోచించకుండా చేసేశారు. వైకాపా మాత్రం ఇప్పటికీ రాజీనామాల పేరుతో డ్రామాలాడుతోంది. వైకాపా అవిశ్వాసం పెడితే ఒక్కరు రాలేదు. తెదేపా పెడితే వంద మంది ఎంపీలు మద్దతు పలికారంటే మన పార్టీకి ఉన్న విశ్వసనీయత అది. ఎన్నికలు పెట్టేందుకు సమయం మించిపోయినందున... నేడోరేపో వైకాపా ఎంపీల రాజీనామాలు ఆమోదించినా ఆశ్చర్యం లేదు. ఇంతకాలం నన్ను పొగిడిన పవన్‌కల్యాణ్ మహాకుట్రలో భాగంగానే విమర్శించడం మొదలుపెట్టారు. నా మీద బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు..' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

జన్మనిచ్చిన గడ్డను మరవకూడదు

మనం ఎంత ఎత్తుకి ఎదిగినా జన్మనిచ్చిన గడ్డను మాత్రం మరిచిపోకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నిరుపేదలే నా కులం, బలం అంటూ వ్యాఖ్యానించారు. గ్రామాల్లో సీసీ రహదారులు, ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించడం, చంద్రన్నబీమా, పెళ్లిళ్లకు ఆర్థికసాయం లాంటి మంచి కార్యక్రమాల కారణంగా ప్రజల్లో తెదేపాకు మంచి ఆదరణ ఉందన్నారు. సోమవారం ఉదయం ఆయన లక్కవరపుకోట మండలం జమ్మాదేవిపేటలో గ్రామ సందర్శన నిర్వహించారు. జమ్మాదేవిపేటలో విద్యార్థులతో ధింసా నృత్యం చేశారు. ఆయనను గిరిజన వేషధారణతో అలంకరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. బోని రాము అనే వృద్ధుడితో ముచ్చటించారు. పింఛను పంపిణీ సక్రమంగా జరుగుతుందా అని ప్రశ్నించారు. దీర్ఘకాల వ్యాధితో బాధపడుతూ మంచం పట్టిన కిలపర్తి స్వాతిని పరామర్శించారు. చిన్నప్పటి నుంచి ఇంతేనా అని బాధితురాలి తల్లిదండ్రులను అడిగారు. రూ. 2లక్షల ఆర్థిక సాయం అందజేస్తానని అక్కడికక్కడే ప్రకటించారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారు పి.పద్మకు స్వాధీన పత్రం అందజేశారు. రచ్చబండలో పాల్గొని పింఛన్లు, రేషన్, చంద్రన్న బీమా తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై శాఖల వారీగా ఆరా తీశారు. పథకాల అమలుకి ఎవరైనా లంచం అడుగుతున్నారా? అంటూ గ్రామస్థుల్ని ప్రశ్నించగా... వారు లేదనేసరికి సంతృప్తి వ్యక్తం చేశారు.

గాలివాన బీభత్సంతో హడలిపోయిన ప్రజలు

శృంగవరపుకోటలో సోమవారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నవనిర్మాణదీక్ష సభకు భారీ వర్షం అంతరాయం కలిగించింది. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతుండగా ఒక్కసారిగా వర్షం కురిసింది. ఈదురుగాలులకు సభా ప్రాంగణం చిగురుటాకులా వణికింది. రెండువైపులా రేకులు ఎగిరిపోవడంతో అదెక్కడ కూలిపోతుందోనని పలువురు హడలిపోయారు. వేదికపై ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై కూడా వర్షం నీరు పడడంతో ఆయన కుర్చీ మారగా భద్రతా సిబ్బంది గొడుగుపట్టాల్సి వచ్చింది. దాదాపు అరగంట తర్వాత వర్షం తగ్గుముఖం పట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరిగి సభను ప్రారంభించి ఏకధాటిగా 1.20 గంటల పాటు ప్రసంగించారు. నవనిర్మాణదీక్ష సభలో రాష్ట్ర గనులశాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట మండలం జమ్మాదేవిపేటలో ఓ వృద్ధుడి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పక్కన రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

40 లక్షలు దాటిన ముఖ్యమంత్రి ట్విట్టర్ ఖాతా అనుచరులు

- **మద్దతిచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు**

ఈనాడు అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ట్విట్టర్ ఖాతాను అనుసరిస్తున్నవారి (ఫాలోయర్స్) సంఖ్య ఈ నెల ఒకటో తేదీకి 40 లక్షలు దాటింది. చంద్రబాబు తన ఖాతాను 2009 అక్టోబరులో ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ఆయన ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు. ఆయన పాల్గొనే వివిధ కార్యక్రమాల లైవ్ ప్రసారాలను ట్విట్టర్ ఖాతాలోనూ వీక్షించే సదుపాయం కల్పిస్తున్నారు. ట్విట్టర్ ఫాలోయర్ల పరంగా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో అరవింద్ కేజ్రీవాల్ (13.9 మిలియన్లు), మనోహర్ పర్రీకర్ (6.29 మిలియన్లు), శివరాజ్‌సింగ్ చౌహాన్ (4.7 మిలియన్లు), నితీష్ కుమార్ (4.33 మిలియన్లు) ముందంజలో ఉన్నారు. "నా ట్విట్టర్ ఖాతాను అనుసరిస్తున్నవారి సంఖ్య 40 లక్షలు దాటడం సంతోషంగా ఉంది. ట్విట్టర్ ద్వారా మంచి సలహాలు, వ్యాఖ్యలతో మద్దతిచ్చిన వారందరికీ కృతజ్ఞతలు" అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలతో అను నిత్యం అనుసంధానమయ్యేందుకు, వ్యక్తిగతంగా సమాచారం అందించేందుకు, వారి విలువైన స్పందన తెలుసుకునేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఆయన తెలిపారు.

"చాలీచాలని నిద్ర"తో రూ.లక్షల కోట్లు ఆవిరి!

మెల్‌బోర్న్: "చాలీచాలని నిద్ర" సమస్యతో ప్రపంచ దేశాలు లక్షల కోట్ల రూపాయలను నష్టపోతున్నాయని తాజా అధ్యయనం తేల్చింది. ప్రతి ముగ్గురిలో ఒకరు సరిగా కునుకు పడక సతమతం అవుతున్న తరుణంలో ఈ ఫలితాలు ప్రాముఖ్యం సంతరించుకొన్నాయి. వెస్టెర్న్ ఆస్ట్రేలియా, విక్టోరియా వర్సిటీల నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. ఆర్థిక వ్యవస్థపై నిద్రచూపే ప్రభావాన్ని వారు అంచనావేశారు. "నిద్రకు ఉపక్రమించడంలో ఇబ్బందులు, నిద్ర సమస్యలతో రోజువారీ పనులపై ఏకాగ్రత పెట్టలేకపోవడం"లాంటి అంశాలను దీనిలో పరిగణలోకి తీసుకున్నారు. వీటి వల్ల "వైద్య ఖర్చులు; ఆరోగ్య సంరక్షణేతర చెల్లింపులు; ఉత్పాదకత కోల్పోవడం; రోడ్డు ప్రమాదాలు; పన్నులు తగ్గడం, సంరక్షణ ఖర్చులు పెరగడంతో ప్రభుత్వ ఖజానాకు కోత; రోగుల సంఖ్య పెరగడంతో చుట్టుముట్టే ఇతర ఖర్చులు" తదితర ఖర్చులు/చెల్లింపులు, నష్టాలపై పడే ప్రభావాన్ని విశ్లేషించారు.

రోగికో రకం క్యాన్సర్ చికిత్స!

(మొదటి పేజీ తరువాయి)
ప్రయోగశాలలో వృద్ధి చేసిన అండాశయ క్యాన్సర్ కణాలను శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. ఫలితంగా 3రోజుల్లోనే అక్కడ అండాశయ కణితి ఏర్పడింది. నేరుగా రోగుల నుంచి అండాశయ కణితి నమూనాలను సేకరించి, ఉపయోగించినప్పుడూ ఇవే ఫలితాలు వచ్చాయి. మూడు రోజుల్లో కణితి ఏర్పడటం శాస్త్రవేత్తల్లో ఆశ్చర్యం కలిగించింది. ఎలుకల్లో ఇది వృద్ధి చెందడానికి కొన్ని వారాలు పడుతుంది. ఒక్కో రోగి అవసరాలు తీర్చేలా ప్రత్యేకమైన చికిత్స విధానాలను అభివృద్ధి చేయడానికి ఈ నమూనాను ఉపయోగించవచ్చని పరిశోధకులు చెప్పారు. 'బయోడిగ్రేడబుల్ పీఎంవో' అనే సిలికా నానో రేణువును కూడా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనిలోకి డాక్సోరూబిసిన్ అనే క్యాన్సర్ చికిత్స ఔషధాన్ని చొప్పించారు. చికెన్ నమూనాపై వృద్ధి చేసిన మానవ అండాశయ కణితిపైకి ఈ రేణువులను ప్రయోగించారు. కోడి పిండంలోని ఇతర కణాలజోలికి పోకుండా మానవ అండాశయ కణితి కణాలనే అవి నిర్మూలించాయి. నానో రేణువుల్లో కాకుండా నేరుగా ఈ ఔషధాన్ని ప్రయోగించినప్పుడు కోడి పిండంలోని పలు అవయవాలు దెబ్బతిన్నాయి. దీన్నిబట్టి నానో రేణువుల ద్వారా క్యాన్సర్ ఔషధాల దుష్ప్రభావాలను తగ్గించొచ్చని తేల్చారు.

బిహార్‌లో 'సీటు'మాటు రాజకీయాలు!

- 25 లోక్‌సభ స్థానాలు కోరుతున్న జేడీ(యూ)
- పార్టీ ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి నీతీశ్ మంతనాలు
- తమ సీట్లకు కోత పెట్టొద్దని అమిత్ షాను కోరిన పాసవాన్!
- ఎన్డీయే పక్షాల సమావేశం నేపథ్యంలో సీట్ల పంపకంపై మొదలైన వేడి

దిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది ఉండగానే భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ పక్షాల్లో సీట్ల సెగ మొదలైంది! 40 లోక్‌సభ స్థానాలున్న బిహార్‌లో 25 చోట్ల బరిలోకి దిగుతామని... ముఖ్యమంత్రి నీతీశ్ నేతృత్వంలోని జేడీ(యూ) మనసులో మాటను బయటపెట్టింది. మరోవైపు, తమ సీట్లకు కోత పెట్టవద్దంటూ... భాజపా అధ్యక్షుడు అమిత్‌షాతో కేంద్ర మంత్రి, లోక్‌జనశక్తి (ఎల్జేపీ) నేత రాంవిలాస్ పాసవాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్డీఏను వీడిన నీతీశ్ మళ్లీ అదే గూటికి చేరడంతో... రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. బిహార్‌లో లోక్‌సభ సీట్లను ఎన్డీఏ పక్షాలు ఎలా పంచుకుంటాయన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

2019 సంగ్రామం సమీపిస్తున్న తరుణంలో... ఈనెల 7న ఎన్డీఏ పక్షాలు సమావేశం కానున్నాయి. ఈ క్రమంలో పట్నాలోని ముఖ్యమంత్రి నీతీశ్ నివాసంలో ఆదివారం రాత్రి జేడీ(యూ) కోర్ కమిటీ మంతనాలు సాగించింది. పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ త్యాగి, పవన్ వర్మలతో పాటు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కూడా హాజరుకావడం విశేషం! సమావేశం తర్వాత పవన్‌వర్మ మాట్లాడుతూ-"బిహార్‌లో ఎన్డీఏకు నీతీశ్ సారథ్యం వహిస్తారు" అని వెల్లడించారు. పార్టీ అధికార ప్రతినిధి అజయ్ అలోక్ మరింత స్పష్టంగా స్వరం వినిపించారు. "ఎన్డీఏ పక్షాల మధ్య సీట్ల పంపకం విషయంలో అస్పష్టతేమీ లేదు. 25 స్థానాల్లో జేడీ(యూ), 15 స్థానాల్లో భాజపా పోటీ చేయడం ఆనవాయితీ. ఇప్పుడు చాలా పార్టీలు కూటమిలో ఉన్నందున... అన్ని పక్షాల అధినేతలు చర్చించి, సీట్ల సంఖ్యను నిర్ణయిస్తారు" అని ట్వీట్ చేశారు.

ఆ ఫార్ములా ఇప్పుడు పనిచేస్తుందా?

2013లో ప్రధాని అభ్యర్థిగా మోదీని భాజపా తెరపైకి తేవడాన్ని నీతీశ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ క్రమంలోనే ఎన్డీఏ నుంచి జేడీ(యూ) బయటకు వచ్చేసింది. దీంతో 2014లో బిహార్‌లో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. అంతకుముందు వరకూ జేడీ(యూ) 25 సీట్లలో, భాజపా 15 సీట్లలో పోటీ చేసేవి. కానీ, గత లోక్‌సభ ఎన్నికల్లో భాజపా, ఎల్జేపీలతోపాటు ఉపేంద్ర కుశ్వాహ ఆధ్వర్యంలోని రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎస్‌పీ) ఉమ్మడిగా బరిలోకి దిగాయి. ఈ కూటమికి మొత్తం 31 సీట్లు వచ్చాయి. ఆర్జేడీ-కాంగ్రెస్‌లు 6 స్థానాల్లో పాగా వేశాయి. జేడీ(యూ) మాత్రం రెండు స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

పాసవాన్ పావులు...

జేడీ(యూ) మంతనాల నేపథ్యంలో- ఎల్జేపీ అధినేత పాసవాన్ కూడా పావులు కదిపారు. 2014లో భాజపా-ఎల్జేపీ మైత్రికి పునాదులు వేసిన తన కుమారుడు చిరాగ్ పాసవాన్‌తో కలిసి ఆదివారం భాజపా అధ్యక్షుడు అమిత్ షాతో భేటీ అయ్యారు. జేడీ(యూ) పునరాగమనంతో బిహార్‌లో చోటుచేసుకున్న కొత్త రాజకీయ సమీకరణాలపై వారు చర్చించినట్లు సమాచారం. ఏదేమైనా, తమ సీట్లలో మాత్రం కోత విధించవద్దని షాను పాసవాన్ కోరినట్లు తెలిసింది.

మునుపటి ప్రాధాన్యం దక్కుతుందా?

జేడీ(యూ)కు కాషాయపార్టీ మునుపటి ప్రాధాన్యం ఇవ్వబోదని నేతల వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. భాజపా నేత, బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోదీ సోమవారం దిల్లీలో మాట్లాడుతూ... "మోదీ జాతీయ నేత. ఎన్డీఏకు చుక్కాని. నీతీశ్‌కుమార్ బిహార్‌లో నాయకుడు. ఈ విషయంలో మరో అభిప్రాయానికి తావులేదు. మనసులు కలిశాయి. ఇక సీట్ల పంపకం పెద్ద విషయం కాబోదు" అన్నారు. కుమార్‌ను తీవ్రంగా వ్యతిరేకించే కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మోదీ నేతృత్వంలోనే వచ్చే సార్వత్రిక ఎన్నికలను ఎన్డీఏ ఎదుర్కొంటుందని భాజపా నేత, మరో కేంద్ర మంత్రి రాంకృపాల్ యాదవ్ వ్యాఖ్యానించారు.

2014లో బిహార్ లోక్‌సభ స్థానాల్లో గెలుపు ఇలా...

పార్టీ	గెలుపొందిన స్థానాలు
భాజపా	22
ఎల్జేపీ	6
ఆర్‌ఎల్‌ఎస్‌పీ	3
జేడీ(యూ)	2
కాంగ్రెస్	2
ఆర్జేడీ	4
ఎన్సీపీ	1
మొత్తం సీట్లు	40

రేపో మాపో నిధులు

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్ర ఖజానాకు చేరుతుందని భావిస్తున్నారు. విద్యుత్తు ప్రాజెక్టు మినహాయిస్తే తొలి డీపీఆర్ కింద రూ.13,466 కోట్లకు కేంద్రం ఆమోదించిన బడ్జెట్‌లో ఇక కేంద్రం నుంచి రావాల్సిన మొత్తం రూ.400 కోట్లే. అంతకుమించి రాష్ట్రం ఇప్పటికే దాదాపు రూ.1500 కోట్లు ఖర్చు చేసి ఉంది. ఆ నిధులూ కేంద్రం నుంచి రావాలి. ఆ మొత్తం విడుదల కావాలంటే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.58 వేల కోట్లకు సవరిస్తూ పంపిన అంచనాలను కేంద్రం ఆమోదించాల్సి ఉంటుంది. ఇవి ఆమోదం పొందే లోపు అడ్వాన్సుగా కొంత నిధులు ఇవ్వాలని రాష్ట్రం కేంద్రానికి విన్నవించనుంది.

కాంక్రీటు పనుల్లో తాజా రికార్డు

పోలవరం కాంక్రీటు పనుల్లో ఈ వారంలో తాజా రికార్డు సాధించారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్ కాంక్రీటు కలిపి ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకూ 6000 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైన తర్వాత ఈ స్థాయిలో కాంక్రీటు పనులు చేసింది ఇప్పుడే. ఏ ప్రాజెక్టులోనూ రాష్ట్రంలో ఇంతవరకు ఈ స్థాయిలో ఒక్క రోజులో కాంక్రీటు వేసింది లేదని అధికారులు చెబుతున్నారు.

- డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి కావచ్చింది. ఇక కేవలం 18 మీటర్ల మేర మాత్రమే పని మిగిలి ఉంది. మరో నాలుగైదు రోజుల్లో ఇది పూర్తవుతుందని చెబుతున్నారు. కాఫర్ డ్యాంలో ఎగువ డ్యాం పనులు వేగంగా సాగుతున్నాయి. జూన్ 11న ముఖ్యమంత్రి పోలవరం సందర్శించనున్నారు. ఆ రోజుకి డయాఫ్రంవాల్ పనులు పూర్తవుతాయని చెబుతున్నారు.

ఐశ్వర్య, లక్ష్మీ మేనన్, సిమ్రాన్

అందాల రాణులు... కోచిలో నిర్వహించిన 'భారత యువరాణి-2018' పోటీల్లో అందాల రాణిగా కేరళకు చెందిన లక్ష్మీ మేనన్ ఎంపికయ్యారు. తొలి రన్నరప్‌గా పంజాబ్‌కు చెందిన సిమ్రాన్ మల్హోత్రా, సెకండ్ రన్నరప్‌గా దిల్లీకి చెందిన ఐశ్వర్య సహదేవ్ ఎన్నికయ్యారు

డల్లాస్ క్రీడా మైదానంలో కాల్పులు!

డల్లాస్: ఫుట్‌బాల్ ఆటను తిలకిస్తుండగా... ఓ ఆగంతకుడు అకస్మాత్తుగా మైదానంలోకి ప్రవేశించి, ప్రేక్షకులపై కాల్పులు జరిపాడు! ఈ ఘటనలో మొత్తం ఐదు మంది గాయాలపాలయ్యారు. ఆదివారం సాయంత్రం డల్లాస్‌లోని క్రీడా మైదానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిలో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆగంతకుడిపై కొందరు ప్రేక్షకులు ఎదురుకాల్పులు చేయడంతో.. గాయపడినవారిలో అతడు కూడా ఉన్నాడా అన్నది తేలాల్సి ఉంది.

అక్కడే కావాలి..

(మొదటి పేజీ తరువాయి)
హోటళ్లు, రెండు 4 నక్షత్రాల హోటళ్లు, ఒక సమావేశమందిరం, ఒక షాపింగ్ మాల్, హ్యూమన్ ఫ్యూచర్ పెవిలియన్, ఐటీ టవర్, మైస్ సెంటర్, కార్పొరేట్ స్ట్రీట్ వంటివి ఇప్పటి వరకు ఉన్న ప్రతిపాదనలు. వీటిలో చాలా ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ ఇప్పటికే స్థలాలు కేటాయించింది. సీడ్ యాక్సెస్‌రోడ్డు తొలి దశలో ఉండవల్లి నుంచి అబ్బరాజుపాలెం వరకు 18.27 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్నారు.

ప్రాజెక్టుల విశేషాలివీ!

అమరావతి మెరీనా: వెంకటపాలెం సమీపంలో 8.3 ఎకరాల్లో వస్తుంది. ఇది పర్యాటక ప్రాజెక్టు. చిన్న చిన్న బోట్లు నిలిపే స్థలాన్నే మెరీనాగా వ్యవహరిస్తారు. కృష్ణా తీరంలో వచ్చే ఈ ప్రాజెక్టు టెండరు దశలో ఉంది.

నక్షత్ర హోటళ్లు: వెంకటపాలెం దగ్గర్లో ఒక 5నక్షత్రాల హోటల్, ఒక 4నక్షత్రాల హోటల్, కొండమరాజు పాలెం దగ్గర్లో ఒక 5నక్షత్రాల హోటల్, ఒక 4నక్షత్రాల హోటల్ నిర్మాణానికి రెండు ప్రముఖ సంస్థలకు సీఆర్‌డీఏ స్థలాలు కేటాయించింది. ఉండవల్లి నుంచి వెళ్లేటప్పుడు రహదారికి ఎడమ పక్కన ఇవి వస్తాయి.

మూడు నక్షత్రాల రిసార్ట్: 3.5 ఎకరాల్లో కనీసం 50 గదులతో రిసార్టు నిర్మిస్తారు. రహదారికి కుడిపక్కన వస్తుంది. కృష్ణా కరకట్టకు, నదికి మధ్యలో 1.5 ఎకరాలు, ప్రధాన అనుసంధాన రహదారికి, కరకట్టకు మధ్యలో 2 ఎకరాలు కేటాయించారు. వెంకటపాలెం దగ్గర్లోనే ఇది వస్తుంది.

సమావేశమందిరం, భారీ దుకాణ సముదాయం: ఇవి రెండూ ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మిస్తారు. మూడు ఎకరాల్లో సమావేశమందిరం, రెండు ఎకరాల్లో భారీ దుకాణ సముదాయం (షాపింగ్ మాల్) వస్తుంది. కొండమరాజుపాలెం- మందడం గ్రామాల మధ్యలో ఇది ఉంటుంది.

ఐటీ టవర్: వెంకటపాలెం, మందడం గ్రామాల మధ్యలో 10 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో ఐటీ టవర్ నిర్మిస్తారు. డిజైన్లు రూపొందించే దశలో ప్రాజెక్టు ఉంది.

హ్యూమన్ ఫ్యూచర్ పెవిలియన్: జపాన్ సాంస్కృతిక కేంద్రం, చిన్న సమావేశమందిరం వస్తాయి. జపాన్ సంస్థ సహకారంతో 2 ఎకరాల్లో నిర్మిస్తారు.

మైస్ హబ్: 42 ఎకరాల్లో నిర్మించే భారీ సమావేశమందిరం (కన్వెన్షన్ సెంటర్) ఇది. వెంకటపాలెం సమీపంలో వస్తుంది.

కార్పొరేట్ స్ట్రీట్: ప్రముఖ కార్పొరేట్ కంపెనీల కార్యాలయాల ఏర్పాటుకి ప్రధాన అనుసంధాన రహదారి పక్కనే సీఆర్‌డీఏ 20-30 ఎకరాల్లో స్థలాలు కేటాయించనుంది.

సీఆర్‌డీఏ కార్యాలయం: రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) రాజధానిలోని తన కార్యాలయాన్ని కూడా ప్రధాన అనుసంధాన రహదారి పక్కనే నిర్మిస్తోంది.

రహదారి నిర్మాణం ప్రస్తుత పరిస్థితి!

ప్రధాన అనుసంధాన రహదారిని తొలి దశలో ఉండవల్లి నుంచి అబ్బరాజుపాలెం వరకు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం వెంకటపాలెం సమీపం నుంచి అబ్బరాజుపాలెం వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర నాలుగు వరుసలుగా రహదారి నిర్మాణం పూర్తయింది. దీన్ని తొమ్మిది వరుసల రహదారిగా నిర్మిస్తున్నారు. రెండో దశలో దీన్ని కనకదుర్గమ్మ వారధి దాటాక జాతీయ రహదారికి అనుసంధానించాలన్నది ప్రతిపాదన. ఈ రహదారి రాజధాని పరిపాలన నగరం మీదుగా వెళుతుంది.

ఫేస్‌బుక్‌పై మరో ఆరోపణ

- వినియోగదారులు, వారి స్నేహితుల సమాచార సేకరణకు యాపిల్, శాంసంగ్ తదితర సంస్థలకు అవకాశం

వాషింగ్టన్: వినియోగదారుల సమాచారాన్ని రాజకీయ అవసరాలకు ఇతరులు ఉపయోగించుకోవడానికి అవకాశం ఇచ్చిందని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫేస్‌బుక్‌పై మరో ఆరోపణ వచ్చింది. తన వినియోగదారులు, వారి స్నేహితుల సమాచారాన్ని ఉపకరణాల సంస్థలు తెలుసుకోవడానికి అవకాశం ఇచ్చిందని న్యూయార్క్ టైమ్స్ కథనం పేర్కొంది. ఈ మేరకు యాపిల్, మైక్రోసాఫ్ట్ సహా 60 సంస్థలతో డేటా-షేరింగ్ భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకుందని వెల్లడించింది. ఇలా భాగస్వామ్యాల్ని ఏర్పాటు చేసుకున్న సంస్థల్లో అమెజాన్, బ్లాక్‌బెర్రీ, శాంసంగ్ కూడ ఉన్నాయి. ఫేస్‌బుక్ యాప్‌లు అందుబాటులోకి రాక ముందు వాటితో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల కారణంగా ఫేస్‌బుక్ తన వ్యాప్తిని పెంచుకోవడానికి వీలయింది. ఆయా ఉపకరణాల సంస్థలు తమ వినియోగదారులకు మెసేజింగ్, లైక్ బటన్‌లు, అడ్రస్ బుక్‌లు వంటి ప్రముఖ ఫీచర్లు అందించడానికి వీలయింది. వ్యక్తిగత గోప్యత రక్షణలకు కట్టుబడి ఉంటామని ఫెడరల్ ట్రేడ్ కమిషన్‌కు ఫేస్‌బుక్ ఇచ్చిన హామీపై సందేహాలు రావడానికి ఈ ఒప్పందాలు అవకాశం ఇచ్చాయి. కొన్ని ఉపకరణ సంస్థలు వినియోగదారుల స్నేహితుల సమాచారాన్ని కూడా సేకరించుకోగల్గాయని న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. అయితే న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. ఈ ఒప్పందాలను ఫేస్‌బుక్ సమర్థించుకుంది. వ్యక్తిగత గోప్యత విధానాలకు లోబడే ఇవి ఉన్నాయని పేర్కొంది. ఫేస్‌బుక్ లాంటి అనుభవాన్ని ఇచ్చే వర్షన్లను అందించడానికి మాత్రమే ఈ భాగస్వాములు ఫేస్‌బుక్ డేటాను వినియోగించుకోవడానికి వీలవుతుంది అని ఆ సంస్థ అధికారులు చెప్పారు. ఫేస్‌బుక్‌కు చెందిన లక్షల మంది వినియోగదారుల సమాచారాన్ని కేంబ్రిడ్జ్ ఎనలిటికా ఉపయోగించుకుందని బయటకు పొక్కి తీవ్ర వివాదం అయిన నేపథ్యంలో తాజా ఆరోపణలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి.

డ్రోన్ గొడుగు..

లండన్: డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరో మెట్టుకు చేరుస్తూ జపాన్ సంస్థ ఒకటి సరికొత్త గొడుగును ఆవిష్కరించింది. ఎవరూ పట్టుకోకుండానే.. నిర్దేశిత వ్యక్తి తలను అనుసరించి కదులుతూ.. ఎండ నుంచి, వర్షం నుంచి రక్షణ కల్పించడం ఈ గొడుగు ప్రత్యేకత. వ్యక్తి కదలికలను అనుసరించేందుకు ఈ గొడుగులో కెమెరా, కృత్రిమ మేధను వినియోగించారు. ఈ పరిజ్ఞానాన్ని ఇప్పటికే డ్రోన్లలో వినియోగిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి చేసిన ఈ డ్రోన్ గొడుగు బరువు 5 కిలోల వరకూ ఉంది. అలానే ఇది ఎగిరే సమయం (ఒకసారి ఛార్జింగ్‌తో) 20 నిమిషాలు మాత్రమే. ఈ గొడుగు బరువును కిలో కంటే తక్కువకు తగ్గించడం, ఎగిరే సమయాన్ని గంటకు పెంచడం లక్ష్యంగా సదరు సంస్థ కృషి చేస్తోంది. వచ్చే ఏడాదికి ఇది మార్కెట్‌లోకి వస్తుందని చెబుతున్నారు.

గ్రహం అనుగ్రహం

5-6-2018 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
సప్తమి: పూర్తి
ధనిష్ఠ నక్షత్రం: మ. 2-31 తదుపరి శతభిష
అమృత ఘడియలు: లేవు
వర్జ్యం: రా. 10-18 నుంచి 12-02 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-04 నుంచి 8-56 వరకు
తిరిగి రా. 10-51 నుంచి 11-35 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-27

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	45.0	27.0
రాజమహేంద్రవరం	41.5	27.5
ఒంగోలు	41.4	29.6
గుంటూరు	41.4	28.5
విజయవాడ	41.1	29.0
నెల్లూరు	40.0	27.0
తిరుపతి	38.4	26.0
హైదరాబాద్	37.8	25.3
విశాఖపట్నం	37.0	29.0

శ్రీ భవిష్య ఎడ్యుకేషనల్ అకాడమీ విజయవాడ
www.sribhavishya.com
మీ భవిష్యత్తుకు మా భరోసా...!
NEET-2018 ఫలితాలలో కేవలం లాంగ్‌టర్మ్ నుండి
అతి సాధారణ విద్యార్థులతో "శ్రీ భవిష్య ఎడ్యుకేషనల్ అకాడమీ" సంచలన ఫలితాలు
579 MARKS | 570 MARKS | 569 MARKS | 557 MARKS | 555 MARKS | 555 MARKS | 552 MARKS
మొత్తం హాజరైన విద్యార్థులలో 98% ఉత్తీర్ణత
500 మార్కులపైన - 31 | 475 మార్కులపైన - 64 | 450 మార్కులపైన - 102 | 400 మార్కులపైన - 213
సబ్జెక్టుల వారీగా గరిష్ఠ మార్కులు: ఫిజిక్స్ - 141/180 కెమిస్ట్రీ - 153/180 బయాలజీ - 330/360
NEET-2019 LONG TERM అడ్మిషన్లు జరుగుచున్నవి.
1st Batch క్లాసులు 09-06-2018 నుండి ప్రారంభం.
ప్రతి తరగతి యందు 45 మంది విద్యార్థులు మాత్రమే
మెరిట్ విద్యార్థులకు ఫీజు రాయితీ కలదు
రెసిడెన్షియల్ క్యాంపస్ 95813 06030
డేస్కాలర్ క్యాంపస్ 85003 03037
సిద్ధార్థ నగర్, 1వ లైను, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్, గాయత్రీనగర్, విజయవాడ.
95813 06060, 95819 4400 1 to 9

సంక్షేమం - సాధికారత

అందరి సంక్షేమం- చంద్రన్న ధ్యేయం.

గోరు ముద్దలు తినే వయసు మొదలు వృద్ధాప్య భరోసా వరకు ...

- 47,31,774 మందికి ఎన్టీఆర్ భరోసా పథకం కింద సంక్షేమ పెన్షన్లు
- చంద్రన్న బీమా ద్వారా 2.5 కోట్ల అసంఘటిత కార్మికులకు రూ.2 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు బీమా సౌకర్యం
- రూ.50 వేల కోట్ల వ్యయంతో 19 లక్షల గృహాల నిర్మాణం. అర్హత గల ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు
- ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 1.31 కోట్ల పేద కుటుంబాలకు ఏడాదికి రూ. 2.50 లక్షల వరకు ఉచిత వైద్య సాయం
- బీసీలకు 35 వేలు, ఎస్సీలకు రూ.40 వేలు, ఎస్టీలకు - రూ.50 వేలు, మైనార్టీలకు - రూ. 50 వేలు చొప్పున చంద్రన్న పెళ్లి కానుక.
- గత నాలుగేళ్లలో కాపు కార్పొరేషన్‌కు రూ.3,100 కోట్ల కేటాయింపులు.
- నెల నెలా ఇమామ్‌లకు, రూ.5000, మౌజన్లకు రూ.3000 పారితోషికం.
- బ్రాహ్మణ కార్పొరేషన్‌కు గత నాలుగేళ్లలో రూ.210 కోట్ల కేటాయింపులు. 91,144 మందికి ఆర్థిక సాయం.
- క్రైస్తవుల జెరూసలెం యాత్రకు రూ.40 వేల ఆర్థిక సాయం.
- రూ.750 కోట్లతో బీసీ లకు ఆదరణ పథకం పునరుద్ధరణ. 70% సబ్సిడీ పై పనిముట్ల పంపిణీ. 5 లక్షల మందికి లబ్ది
- ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ, అంబేద్కర్ విదేశీ విద్యోన్నతి ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీ సీలకు విదేశాలలో చదువుకునేందుకు రూ.10 లక్షల ఆర్థిక సాయం.
- జగ్జీవన్ జ్యోతి పథకం ద్వారా 12.41 లక్షల ఎస్సీ,ఎస్టీల కుటుంబాలకు 75 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్

2022 దేశంలో 3 అగ్రగామి రాష్ట్రాలలో ఒకటి (తలసరి ఆదాయం రూ. 2.95 లక్షలు)

2029 దేశంలో అత్యుత్తమ రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 9.65 లక్షలు)

2050 ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాల రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 1.67 కోట్లు)

నేటి చర్చనీయాంశాలు

- ప్రధానమైన సంక్షేమ, అభివృద్ధి పథకాలుపై చర్చ
- గ్రామీణ, పట్టణ ప్రాంత గృహ నిర్మాణం
- స్వచ్ఛ ఆంధ్రా - ఓడిఎఫ్, ఓడిఎఫ్ ప్లస్
- ఆరోగ్యం, పోషకాలు
- ఐఎమ్ఆర్ -ఎమ్ఎమ్ఆర్ - పోషకాహార లోపం, రక్తహీనతలను రూపుమాపడం.

ముఖ్యమంత్రి గారిని సంప్రదించడానికి

NCBN అధికారిక యాప్

ప్రజలే ముందు మొబైల్ యాప్

ఏపి సీఎం ఫేస్ బుక్

ఏపి సీఎం ట్విట్టర్

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఈనాడు

ఎన్నికలపై నమ్మకం పెంచేలా...

ఓటర్ల చేతిలో ఫొటో గుర్తింపు కార్డు, పోలింగ్ కేంద్రంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)- 2001 నాటి స్వర్ణోత్సవాల సందర్భంగా ఎన్నికల సంఘం స్వయంగా నిర్దేశించుకొన్న సహస్రాబ్ది లక్ష్యమది. ప్రజాస్వామ్య కుంభమేళాగా వాసికెక్కిన ఎన్నికల మహాక్రతువు స్ఫూర్తిని గతంలో సీఈసీగా శేషన్ చెప్పిన దశ మహాపాతకాలూ ఏటికేడు ఇంతలంతలై చెండుకుతింటున్నా ఏమీ చెయ్యలేకపోతున్న ఈసీ- ఫొటో గుర్తింపు కార్డు, ఈవీఎమ్‌ల వినియోగాన్ని నలుచెరగులా విస్తరించడంలో గణనీయ విజయం సాధించింది. పదిహేడేళ్లుగా మూడు లోక్‌సభ, 115 దాకా అసెంబ్లీ ఎన్నికల్ని ఈవీఎమ్‌ల ద్వారానే నిర్వహించిన ఎలక్షన్ కమిషన్, కొన్నేళ్లుగా ఓటింగ్ యంత్రాల విశ్వసనీయతపై కీలక ప్రశ్నల్ని ఎదుర్కొంటోంది. ఈవీఎమ్‌ల ద్వారా ఎవరైనా ఎలా అవకతవకలకు పాల్పడగల వీలుందో రుజువు చెయ్యాలంటూ నిరుడీ రోజుల్లో ఈసీ విసిరిన సవాలుకు పార్టీల వైపునుంచి స్పందనే కొరవడింది. ఓటింగ్ యంత్రాల కిరికిరితోనే ఫలితాలు తారుమారవుతున్నాయంటూ పార్టీలు తీవ్రారోపణలు గుప్పిస్తున్న నేపథ్యంలో- 'ఆడలేక మద్దెల ఓడు' చందంగా ఓడిపోయిన పార్టీలు ఈవీఎమ్‌లపై నింద మోపుతున్నాయన్నది సీఈసీ రావత్ తాజా ఆక్షేపణ. మళ్ళీ పాత రోజులకు మళ్ళి బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిపే అవకాశమే లేదన్నది ఆయన వివరణ! ఓటింగ్ యంత్రాలు మొరాయించడానికి, సక్రమంగా పని చెయ్యకపోవడానికి కారణం పోలింగ్ సిబ్బంది సరైన శిక్షణ తీసుకోకపోవడమేనంటున్న రావత్, అత్యంత ప్రధానమైన ఆ లొసుగును ఎలా సరిదిద్దదలచిందీ చెప్పడంలేదు. సరళతర సాంకేతిక అద్భుతంగా భారత ఈవీఎమ్‌లను పలు దేశాలు అక్కున చేర్చుకొంటున్నా దేశీయంగా పార్టీలూ, ప్రజల విశ్వాసాన్ని అవి చూరగొనేలా సుప్రీం సూచనమేరకు- వేసిన ఓటు ఎవరికి పడిందో స్పష్టతనిచ్చే రశీదు యంత్రాన్నీ వాటికి సత్వరం అనుసంధానించాలి. ఎన్నికల నిర్వహణలో 68 ఏళ్ల అనుభవాన్ని మూటగట్టుకున్న ఈసీ, నేటికీ ఓటర్ల జాబితాల్ని కట్టుదిట్టంగా రూపొందించలేక పోతోందంటే ఏమనుకోవాలి?

ఓటర్ల జాబితాల తయారీ ఎంతో నిష్ఠగా చేపట్టాల్సిన కర్తవ్యమని భారతరత్న అంబేడ్కర్ ఏనాడో స్పష్టీకరించారు. స్వేచ్ఛగా సక్రమంగా ఎన్నికల నిర్వహణకు ఎలాంటి తప్పులూ లేని ఓటర్ల జాబితాలే ప్రాణాధారమని సెలవిచ్చే ఎలక్షన్ కమిషన్ ఆ విధివిహిత బాధ్యత నిర్వహణలో దశాబ్దాలుగా భ్రష్ట నిర్వాకమే వెలగబెడుతోందని చెప్పకతప్పదు. వచ్చే నవంబరులో ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లో 60 లక్షల బోగస్ ఓటర్లు నమోదై ఉన్నారని విపక్ష కాంగ్రెస్ ఈసీకి ఫిర్యాదు చేసింది. పదేళ్ల కాలావధిలో రాష్ట్ర జనాభా పెరుగుదల 24 శాతంగా ఉంటే, ఓటర్లు 40 శాతం పెరగడం ఏమిటంటూ నూటొక్క నియోజకవర్గాల్లో 24 లక్షలకు పైగా బోగస్ ఓటర్లను తాము పసిగట్టగలిగినట్లు చెబుతోంది. భోజ్‌పూర్‌కు చెందిన ఓ మహిళ వేర్వేరు పేర్లతో 26చోట్ల ఓటరుగా నమోదై ఉన్న వైపరీత్యాన్ని కళ్లకు కట్టిన కాంగ్రెస్ అభియోగాలపై విచారణకు ఈసీ రెండు బృందాల్ని పురమాయించింది. మధ్యప్రదేశ్ అనే కాదు, ఎప్పుడు ఎక్కడ ఎన్నికలు జరిగినా లోపభూయిష్ఠంగా ఉంటున్న ఓటర్ల జాబితాలు- సగటు ఓటర్లలో పరవళ్లెత్తే ప్రజాతంత్ర చైతన్యాన్ని నీరు కార్చేస్తున్నాయి. ఓటర్ల జాబితాలో ఏకపక్షంగా పేర్లు తొలగించడం కుదరదని, అధికారులు సహజ న్యాయసూత్రాల్ని అమలుపరచాల్సిందేనని ఉన్నత న్యాయస్థానాలు ఎన్నిపర్యాయాలు నిర్దేశించినా ఓటి జాబితాలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఓడించేస్తున్నాయి. ఫొటో గుర్తింపు కార్డులు ప్రవేశపెట్టినా బోగస్ ఓటర్లు జాబితాల్లోకి ఎలా చొరబడగలుగుతున్నారన్న ప్రశ్నలకూ ఈసీ సమాధానం ఇవ్వాలి. పేరొకరిది- ఫొటో వేరొకరిది, ఒక్కరికే పలు ఓట్లు, కొందరి పేర్లు టోకున గల్లంతు- ఈ తరహా వైపరీత్యాలన్నింటికీ ఎన్నికల సంఘమే జవాబుదారీ!

గుర్తింపు పొందిన రాజకీయ పక్షాలు తమ చుట్టూ వృత్తం ఒకటి గీస్తే, ఎక్కడా బెసగకుండా నడి మధ్యన నిలవడమే స్వీయ రాజ్యాంగ నైతిక ధర్మమని సీఈసీగా డాక్టర్ ఎంఎస్ గిల్ అభిప్రాయపడ్డారు. 'మీరు ప్రకటించే ఫలితాల్ని పార్టీలు ఆమోదిస్తాయా' అంటూ భూటాన్‌లో ఎదురైన ప్రశ్నకు- ఇండియాలో ఏ రాజకీయ పక్షమూ నిర్వాచన్ సదన్ పట్ల ఎన్నడూ అలాంటి విశ్వాసరాహిత్యం ప్రదర్శించలేదని ఆయనే ఘనంగా చాటారు! నేడూ అదే పరిస్థితి ఉందా అంటే, లేదన్నదే సమాధానం. ఈవీఎమ్‌ల ద్వారా ఓటింగ్ సరళిని ఎవరూ ఏ స్థాయిలోనూ, ఏ దశలోనైనా, ఏ విధంగానూ ప్రభావితం చెయ్యలేరని గట్టిగా విశ్వసిస్తున్న ఈసీ- అదే నమ్మకాన్ని పార్టీలకు కలిగించడంలో ఎందుకు విఫలం అవుతోందో ఆత్మావలోకనం చేసుకోవాలి. న్యాయం చెయ్యడమే కాదు చేస్తున్నట్లూ కనిపించాలన్న ఒరవడే నిర్వాచన్ సదన్ పనిపోకడలకు కరదీపిక కావాలి. ఎనభై కోట్ల పైచిలుకు ఓటర్ల నమ్మకమే భారత ప్రజాస్వామ్యానికి ఊపిరి! ప్రజల వలన ప్రజల చేత ప్రజల కొరకు అంటున్న ప్రజాస్వామ్యంలో న్యాయబద్ధ ఓటర్ల హక్కుకు దిక్కు లేకుండా పోతున్న వైనం, దొంగ ఓటర్ల దందాకు ఓటర్ల జాబితాలే నెలవవుతున్న ఘోరం- ఈసీ ప్రయోజకత్వాన్నే బోనెక్కిస్తున్నాయి. 2014లో ముంబయిలో రెండు లక్షల ఓట్లు గల్లంతు కావడం ఘోరమైన కార్యనిర్వాహక తప్పిదమంటూ ఎన్నికల సంఘం లెంపలు వేసుకొంది. ఓటర్ల జాబితాల పవిత్రతను కాపాడే క్రతువులో ఈసీ, రాజకీయ పక్షాల నిఘాయే సరిపోదని రుజువవుతున్నందున జాగృత ప్రజానీకమూ దగాకోరుల చేతివాటంపై ఓ కన్నేసి ఉంచాలి. దొంగఓట్ల జాడ్యాన్ని జాతిద్రోహంగా జమకట్టి కఠిన దండనల కొరడా ఝుళిపిస్తేనే అక్రమార్కులు తోక ముడుస్తారని గుర్తించాలి!

మానవాళికి మహాశత్రువు

డాక్టర్ జీవీఎల్ విజయకుమార్

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణానికి నేడు పెనుసవాలుగా పరిణమించింది- శిలాజ ఇంధనాల వాడకమో, అడవుల నరికివేతో, వాయు కాలుష్యమో కాదు. వీటిన్నింటినీ మించి అత్యంత ప్రమాదకరమైనది- ప్లాస్టిక్ కాలుష్యమే. ప్రపంచ ప్లాస్టిక్ వినియోగ వివరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా 50 వేలకోట్ల (500 బిలియన్ల) ప్లాస్టిక్ సంచులను ప్రపంచ మానవాళి వినియోగిస్తోంది. కనీసం 80 లక్షల టన్నుల ప్లాస్టిక్ పదార్థాలు ఏటా సముద్రాల్లో కలుస్తున్నాయి. ఇది ప్రతి నిమిషానికి ఒక ట్రక్కు వ్యర్థాలతో సమానం. శతాబ్దంలో ఉత్పత్తయిన పరిమాణానికి మించిన ప్లాస్టిక్‌రాశి గత పదేళ్లలోనే తయారైందంటే దాని వినియోగం ఎంతగా పెచ్చరిల్లిందో ఊహించవచ్చు.

భయానక ఉపద్రవం

మానవాళి వాడుతున్న ప్లాస్టిక్‌లో దాదాపు 50 శాతానికిపైగా వాడిపారేసేదే ఉంటుంది. నిమిషానికి 10 లక్షల ప్లాస్టిక్ సీసాలను ప్రపంచ ప్రజలు కొంటున్నారు. మొత్తం వ్యర్థాల్లో 10 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. వీటిని తింటున్న నోరులేని మూగజీవాలు (పశువులు, పక్షులు) పెద్దయెత్తున మృత్యువాత పడుతున్నాయి. పచ్చిగడ్డి తిని పాలిచ్చే పశువుల పొట్టల్లో కేజీలకొద్దీ ప్లాస్టిక్ ముద్దలు బయటపడుతున్న తీరు- పర్యావరణానికి, జీవవైవిధ్యానికి మానవజాతి తలపెడుతున్న హాని ఎలాంటిదో ప్రస్ఫుటీకరిస్తోంది. మానవజాతి పురుడు పోసుకోక మునుపే ఈ భూమండలంపై వైవిధ్యభరితమైన జీవజాతులు, కొండలు, కోనలు, నదీనదాలు, కొన్ని వేల రకాల జంతు, వృక్షజాతులతో కూడిన ఆవరణ వ్యవస్థ నెలకొంది. మానవ నాగరికత వికాస క్రమంలో అభివృద్ధి, పారిశ్రామికీకరణ, పట్టణీకరణల రూపంలో పర్యావరణ వ్యవస్థలోని సహజ వనరులను కొల్లగొట్టడం మొదలైంది. అప్పటి నుంచి ఏడో దశకం దాకా ప్రజల్లో పర్యావరణం పట్ల స్పృహే జనించలేదు. తరవాత పర్యావరణ పరిరక్షణ ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలనే ఆలోచనలు మొగ్గతొడిగాయి. ఆ క్రమంలో 1972 నుంచి పర్యావరణ దినోత్సవం కార్యరూపంలోకి వచ్చింది. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సంబరాలకు భారతదేశం ఆతిథ్యమిస్తోంది. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమే' లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

పర్యావరణానికి పొంచి ఉన్న పెను ప్రమాదాల్లో ప్లాస్టిక్ కాలుష్యానిదే అగ్రతాంబూలం. భూ తాపం, అడవుల నిర్మూలన, వాయుకాలుష్యం, ఈ-వ్యర్థాలు పర్యావరణ వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేస్తున్న ఇతర అంశాలు. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు జీవజాలం మనుగడపై తీవ్ర వ్యతిరేక ప్రభావం చూపుతున్నాయి. పనిచేయని, వాడకుండా పడేసిన ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, వీడియోగేమ్ పరికరాలు, టేప్‌రికార్డర్లు, వాక్‌మెన్, కెమెరాలు తదితర పాత ఎలక్ట్రానిక్ వస్తువులను భూమిలో పాతిపెట్టినా, కాల్చేసినా ప్రమాదకరమే. వీటి తయారీలో ఉపయోగించే సీసం, పాదరసం వంటి భారలోహాలు భూ వాతావరణంలోకి విడుదలైనప్పుడు, ఆ గాలిని పీలిస్తే మానవులకు నాడీ, రక్తప్రసరణ, సంతానోత్పత్తి, శ్వాసకోశ, మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు తలెత్తే ప్రమాదముంది. ఈ వ్యర్థాలను భూమిలో పూడ్చిపెట్టడం వల్ల, అవి వర్షాలకు తడిసినప్పుడు వాటిలోని భారలోహాలు భూగర్భ జలాల్లో కలుస్తాయి. ఆ నీరు తాగడం ఆరోగ్యానికి హానికరం. ఆ వ్యర్థాలను కాల్చినప్పుడు గాలిలోకి విడుదలయ్యే రసాయనాల పొగ క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు కారణమవుతుంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది.

పెచ్చరిల్లుతున్న ప్లాస్టిక్ వినియోగం

దుష్ప్రభావాలు

- ✔ స్వభావరీత్యా ప్లాస్టిక్ విషపూరితమైనది.
- ✔ జీవావరణ వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన ఆహారపు గొలుసు క్రమాన్ని ప్రభావితంచేసి విచ్ఛిన్నం చేస్తుంది.
- ✔ జలాశయాలు, చెరువులు, కాలువల ద్వారా వ్యర్థాల రేణువులు భూగర్భ జలాలను విష కలుషితం చేస్తున్నాయి.
- ✔ హానికర రసాయన వ్యర్థాలు నేల పొరల్లోని నీటి నాణ్యతను దెబ్బతీస్తాయి.
- ✔ నేలలు నిస్సారమవుతాయి. వాయు కాలుష్యం పెంచుతుంది.
- ✔ పశుపక్ష్యాదులు విపరీతమైన బాధతో దారుణంగా చనిపోతున్నాయి.
- ✔ బాధిత ప్రాంతాలను శుద్ధి చేయడం అత్యంత వ్యయప్రయాసలతో కూడుకున్న పని.

మేలుకొంటున్న పాలకులు

పర్యావరణ నిపుణుల అంచనా ప్రకారం ఏటా ప్రపంచవ్యాప్తంగా 1,900 కోట్ల పౌండ్ల ప్లాస్టిక్ పదార్థాలు సముద్రాల్లో కలుస్తున్నాయి. 2025 నాటికి ఇది రెట్టింపయ్యే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర సంపదైన పగడపు దీవులను సైతం ధ్వంసం కావిస్తున్నాయి. సూక్ష్మాతి సూక్ష్మమైన ప్లాస్టిక్ రేణువులు ఆహారోత్పత్తుల్లోనూ కలిసిపోయి మానవుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. భూ ఆవరణ, సముద్రావరణలోని ప్రాంతాలను మృతుల దిబ్బగా మార్చేసి జీవవైవిధ్యాన్ని, పర్యావరణ వ్యవస్థలను ఛిద్రం చేసే అవకాశాలు పుష్కలంగా ఉండటంతో ప్లాస్టిక్ కాలుష్యానికి అడ్డుకట్ట వేయడం మానవాళికి ప్రాణావసరం. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో గడచిన అయిదేళ్లుగా చేపడుతున్న సముద్రతీర ప్రాంతాల శుద్ధి కార్యక్రమంలో భాగంగా 75 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను వెలికితీశారు. ప్రపంచంలోని అన్ని సముద్ర తీరప్రాంతాల వెంట 43.70 కోట్ల నుంచి 830 కోట్ల టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకున్నాయని తెలుస్తోంది. మొత్తం భూగోళం మీద ఏటా దాదాపు 3.5 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, వీటిలో నాలుగోవంతు సముద్రాలు, ఇతర జలాశయాల్లోనే కలుస్తుండటం సమస్య తీవ్రతకు నిదర్శనం. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అత్యధికంగా వెదజల్లుతున్న తొలి 20 దేశాల జాబితాలో చైనా, ఇండొనేసియా, ఫిలిప్పీన్స్ వరసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. భారత్ 12వ స్థానంలో ఉంది. ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్యంలో దాదాపు 60 శాతం వాటా జాబితాలోని తొలి అయిదు అగ్రదేశాలదే కావడం గమనార్హం!

ప్లాస్టిక్ కాలుష్య నిరోధానికి అనేక దేశాలు పట్టుదలతో కృషి చేస్తున్నాయి. నగర పాలికలు నియంత్రణ చర్యలు చేపడుతున్నాయి. ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉండటం లేదు. తాజాగా ఐరోపా సమాఖ్య దేశాలు ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడానికి గట్టిగా సంకల్పించాయి. ఏప్రిల్‌లో నిర్వహించిన 48వ ప్రపంచ ధరిత్రీ దినోత్సవంలోనూ ప్లాస్టిక్ కాలుష్యంపైనే ప్రధానంగా చర్చ జరిగింది. గత డిసెంబరులో అమెరికా, చైనా, భారత్ సహా 200 దేశాలు 'పేరుకుపోతున్న ప్లాస్టిక్ నుంచి సముద్రాలకు విముక్తి' అనే ఐక్యరాజ్య సమితి తీర్మానంపై సంతకాలు చేశాయి. కానీ, ఒప్పందం అమలుపై అడుగు ముందుకుపడక పోవడం దురదృష్టకరం. ప్రపంచంలోనే వ్యర్థాల పునరుత్పాదక విషయంలో అగ్రస్థానంలో ఉన్న దేశాల జాబితాలో భారత్ ఒకటి కావడం హర్షణీయం. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సంబరాల్లో భాగంగా వరస కార్యక్రమాలతో ప్రజల్లో స్ఫూర్తి, చైతన్యాలను నింపడానికి ప్రభుత్వం కృషి సల్పుతోంది. నివాస ప్రాంతాలను, అడవులను, జాతీయ రక్షిత వన్యప్రాణి కేంద్రాలను ప్లాస్టిక్ రహితం చేయడానికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పర్యావరణ పరిరక్షణ ఉద్యమస్ఫూర్తితో సాగుతోంది. హరితహారం, మన ఊరు-మన చెట్టు వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నారు.



సమన్వయంతోనే లక్ష్య సాధన

భారత్‌ను అల్పస్థాయి కర్బన ఉద్గారాల ఆర్థికవ్యవస్థ దిశగా మళ్లించాల్సిన అవసరం ఉరుముతోంది. ప్లాస్టిక్ కాలుష్యాన్ని భారీ స్థాయిలో అరికట్టడానికి భారత్ మరిన్ని పటిష్ఠ చర్యలు చేపట్టాలి. సముద్రాలు, తీర ప్రాంతాలను ప్లాస్టిక్ నాశనం చేస్తోంది. భూ ఉపరితలంతోపాటు సముద్ర తీరాలనూ కాపాడుకునే దిశగా భారత్ మరింత ఉత్సాహంతో పని చేయాలి. భారతీయ తాత్వికత, తత్వ దర్శనం, జీవన విధానం ప్రకృతితో మమేకమై ఉంటుంది. అందుకే ఈ భూ మండలాన్ని హరితమయంగా, ఆరోగ్య ప్రదాయినిగా మార్చాల్సిన స్వీయ బాధ్యతను ప్రతి భారతీయుడూ గుర్తించాలి. వస్తువుల కొనుగోలు (షాపింగ్) సమయంలో పర్యావరణ హితకరమైన జనపనార, కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలి. మంచినీటికి సైతం పునర్వినియోగార్హమైన సీసాలనే వాడాలి. ఆహారం, ఇతర తినుబండారాల ప్యాకింగ్‌కు ప్లాస్టిక్ పెట్టెలు వాడటాన్ని నియంత్రించాలి. వ్యాపారస్తులు, వినియోగదారులు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పునర్వినియోగ సంచులు, వెదురు పుల్లలతో తయారు చేసిన తొట్లను వినియోగించేలా ప్రోత్సహించాలి. ఈ విషయంలో పౌరులు, విధాన నిర్ణేతలు, ప్రభుత్వం సమన్వయంతో కృషి చేయాలి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ విధానాల సృష్టికి, పరిశోధన- అభివృద్ధికి నిధులు కేటాయించాలి. ఇందుకోసం సృజనాత్మక ఆవిష్కరణలను జోడించాలి. పునరుత్పాదక, పునర్వినియోగ పద్ధతుల ద్వారానే ప్లాస్టిక్‌కు చరమగీతం పలకాలి. అప్పుడే ప్లాస్టిక్ రహిత ప్రపంచం సాకారమవుతుంది!

భారత్‌లో ఏటా ఉత్పత్తి అవుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (మెట్రిక్ టన్నుల్లో)

నగరం	వ్యర్థాలు
ముంబయి	1,20,000
దిల్లీ	98,000
బెంగళూరు	92,000
చెన్నై	67,000
కోల్‌కతా	55,000
అహ్మదాబాద్	36,000
హైదరాబాద్	32,000
పుణె	25,000

ఆధారం: అసోచామ్ సర్వే

విధేయ స్వామ్యం

'శ్రీరాహుల్ దయ చేతను
ఆరూఢిగ పదవి దక్కె. ఔరాయనగా' అని కర్ణాటక కొత్త ముఖ్యమంత్రి (రా)కుమారస్వామి విధేయతకు మూల 'కంద'మైన పద్యం చదువుతుంటే, కమలదళాక్షులేమో
'ముందుగతి కానవే చిలకా
ఆ 'చెయ్యే' పట్టు నీ పిలక' అని ఎగతాళి చేస్తున్నారు. అంతేకాదు- 'చెప్పింది విను... చరిత్ర తెలుసుకో' అంటున్నారు. ఫలితంగా రాజకీయాల్లో విధేయతా వేషాలు చర్చనీయాంశమయ్యాయి. సిద్దరామయ్య మళ్ళీ ముఖ్యమంత్రి అయినా 'ఇంత గొప్పగా విధేయతా స్వరం వినిపించేవారా' అని కాంగ్రెస్ 'పెద్దలూ' కాదు కాదు 'పిన్నలూ' అనుకోవడం సహజం. భజన పలకలు పట్టుకున్న తరవాత కొత్త ముఖ్యమంత్రి హద్దెరగడు అని జనం అనుకుంటున్నారు. ఎవర్నికైనా కాంగ్రెస్ పార్టీ బయట నుంచి మద్దతిచ్చినా, లోపలి నుంచి మద్దతు ఇచ్చినా కొంతకాలం తరవాత వారి రాజకీయ బతుకు బస్టాండేనన్న నానుడి ఎప్పటి నుంచో పాతుకుపోయింది.

చరణ్‌సింగ్ నుంచి గుజ్రాల్ వరకు దివంగత ప్రధానుల ఎవరి చరిత్ర చదివినా కాంగ్రెస్ 'చరిత్ర' బయట పడుతుంది. తనకు అనువు కానప్పుడు ఇతరులను గద్దెనెక్కించడం, ఎన్నికలు వస్తే తాను గెలుస్తాననుకున్నప్పుడు మద్దతు ఉపసంహరించుకోవడం అనేది 'ఇందిరా గాంధీయిజం' అయిపోయింది. అయితే ఈ సంస్కృతి క్రమేణా ఇతర పార్టీలకూ పాకింది.

ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికా బాటపట్టే అవకాశవాద రాజకీయాల్లో కాంగ్రెస్‌కు వారసత్వ పార్టీలూ తయారయ్యాయి. 'అందరికీ కాంగ్రెసే అంతరాత్మ' అని వ్యాఖ్యాన గీతాలూ వినిపిస్తున్నాయి. 'అందరివీ కాంగ్రెస్ సిద్ధాంతాలే. ఎటొచ్చీ కొందరు కాంగ్రెస్ పార్టీలో ఉంటారు. మరికొందరు వేరే పార్టీల్లో ఉంటారు. అంతే తేడా' అన్న చురకా ఉంది. అయినా రాజకీయ పార్టీలు సిద్ధాంతాల మీద నిలబడే రోజులా ఇవి? తాజాగా కర్'నాటక రంగస్థలం' మీద 'పాత్రోచిత' అభినయాలు, సంభాషణలు మొదలయ్యాయి.

'మేమే గెలుస్తాం... మేమే నిలుస్తాం' అని ఎన్నికల ప్రచారంలో ఉత్తరకుమారుడి తాతలనిపించుకున్నవాళ్లు, పార్టీలు ఫలితాలను చూసి బిత్తరపోయారు. ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాకపోవడం వల్ల అవసరార్థం 'అతిపెద్ద'(పార్టీ) సిద్ధాంతం ఒరలో నుంచి తెర మీదకు వచ్చింది. ఈ సిద్ధాంతం శాశ్వతమైంది, తిరుగులేనిది అనుకుంటే 'తప్పు'లో కాలు వేసినట్టే. రాజకీయ వాణిజ్యంలో కూడా 'షరతులు వర్తిస్తాయి'. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అవసరాల మేరకు సిద్ధాంతాలకు సానపడతారు.

ఒకప్పుడు అతిపెద్ద పార్టీకి అధికారం అనే మాటకు విలువ ఉండేది. అదే ఇప్పుడు ఎన్ని పార్టీలు కలిస్తేనేం మెజారిటీ ఉంటే సరి అనేదానికి విలువ పెరిగింది. ఇందులో కూడా ఓ 'తెర'కాసు ఉంది. ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్నారా, ఎన్నికల తరవాత పెట్టుకున్నారా అనే చర్చనూ లేవదీస్తారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపా, జనతాదళ్(ఎస్)లలో దేనికీ ప్రజలు పట్టం కట్టలేదు. కాంగ్రెస్‌కు 78, భాజపాకు 104, జనతాదళ్ (ఎస్)కు 38 స్థానాలు వచ్చాయి. ఎవరికోసం ఈ 'మంద'హాసం అనేది అంతుబట్టలేదు. దాంతో ప్రజాస్వామ్యం సంగతేమైనా నాయకస్వామ్యానికి గిరాకీ పెరిగింది.

అతిపెద్ద పార్టీకి అధికారం కట్టబెట్టాలా, మెజారిటీ సీట్లున్న (కాంగ్రెస్+జనతాదళ్) కూటమికి అధికారం దఖలుపరచాలా అన్నది గవర్'నరుడి'ముందు

తలెత్తిన సమస్య. 'గవర్నర్లు కేంద్రానికి గూఢచారులు' అని వెనకటికి ఎన్టీఆర్ అన్నారు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ జమానా! రాజ్యాంగ పరిరక్షకులైన గవర్నర్లు కేంద్రానికి గూఢచారులు అయినా, కాకపోయినా, రాష్ట్రంలో అధికార పార్టీ ఏదైనా... కేంద్రానికి అనుకూలంగా వ్యవహరించక తప్పడం లేదు. కర్ణాటకలో ఆయారాం, గయారామ్‌లు దొరక్కపోవడంతో అభాసుపాలుకాక తప్పదనుకుని, బలపరీక్షకు ముందే యడ్యూరప్ప తప్పుకొన్నారు. ప్రాప్తకాలజ్ఞత ప్రదర్శించారు. అప్పుడు మెజారిటీ సిద్ధాంతం ముందుకొచ్చింది.

గవర్నర్ ఆహ్వానం మేరకు కుమారస్వామి ముఖ్యమంత్రిగా జనతాదళ్-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. తరవాత 'ఎంత దయో దాసులపై' అన్న పద్యాన్ని కుమారస్వామి అందుకున్నారు. 'నేను కర్ణాటక ప్రజల వల్ల కాదు... కాంగ్రెస్ దయ వల్ల ముఖ్యమంత్రినయ్యా' అని 'గుండె బద్దలు కొట్టినట్టు' కుమారస్వామి చెప్పారు. దీంతో తామే స్వయంగా ముఖ్యమంత్రిని చేయకుండా ఏమన్నా పొరపాటు చేశామా అని జనం అనుకునేట్లు చేశారు కుమారస్వామి. ఆయన భాజపాకు గుణపాఠం చెప్పారా, ప్రజలకు గుణపాఠం చెప్పారా అన్న ప్రశ్నలూ వినిపించాయి.

ఒక పార్టీ తరఫున గెలిచి, తరవాత ఆ పార్టీకి నామం పెట్టి విధేయతను మార్చుకునే నాయకులూ ఉన్నారు. ఎన్నికలయ్యే వరకు ప్రజాస్వామ్యం... తరవాత విధేయతా స్వామ్యం! మొదటిదానికన్నా రెండోది బలవత్తరమైంది. ప్రజల భవిష్యత్తును అది శాసిస్తుంది. వెనకటికి భజన్‌లాల్ అనే మహాశయుడు టోకు ఫిరాయింపులకు పాల్పడి హరియాణాను హైరానా పట్టించిన ఘనచరిత్ర అందరికీ తెలుసు. అందువల్ల నాయక మనస్తత్వాన్ని పసికట్టడం ప్రజాస్వామ్యంలో కీలకమైంది! ఎందుకయ్యా... నాయకులూ ఇలా మాట మారుస్తారు? ఒక్క పార్టీకే విధేయులుగా ఉండవచ్చుగా అంటే నాయకులకు తిక్క రేగుతుంది. జనం మాత్రం ఎన్నికలకు, ఎన్నికలకు అభిప్రాయం మార్చడం లేదా, దాన్ని ఏమంటారు అని ప్రశ్నిస్తున్నారు. కల్యాణానికే విడాకులుంటాయా, లోక కల్యాణానికి ఉండవా అని ఒట్లబల్ల గుద్ది చెబుతున్నారు.

'లాబీ'ల మధ్య లాలూచీలకూ బోలెడు మతలబులున్నాయి. 'పదవి నీకు, పెత్తనం నాకు' అనే సర్దుబాట్లు ఉన్నాయి. ఇది కీలుబొమ్మ స్వామ్యం! ఇలాంటి సందర్భాల్లో 'పదవి కోసమై వలలో పడెనే పాపం పసివాడు' అని సానుభూతి చూపిస్తారు. గెలిచిన అయిదేళ్ల కాలంలో చెరిసగం కాలం అధికారం పంచుకుందాం అనే 'పంపక స్వామ్యం' కూడా ఉంది. అయితే 'పూర్తి అయిదేళ్ల కాలం నేనే ముఖ్యమంత్రిగా ఉంటా' అని కుమారస్వామి అవతార ప్రకటన చేశారు. 'ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ' అన్న పాట బయటికి వినపడకపోయినా- కుమారస్వామి అంతరాత్మ పాడుతూనే ఉంది. అయినా 'మైకు'పోతు గాంభీర్యం తప్పదు. విధేయతా గీతం ఆలపించక తప్పదు. తమ రాజకీయ భవిష్యత్తు గురించి 'చెడు చెప్పరాదు... చెడు చదవరాదు... చెడు వినరాదు' అన్న కోతులు- నాయకుల ఇళ్లలోనే తిష్ఠవేసి ఉంటాయి. ప్రతిష్ఠ కాపాడుతుంటాయి.

కదిలేదీ కదిలించేదీ మునుముందుకు నడిపించేదీ విధేయతేగా... అదే రాజకీయ మహాప్రస్థానం! అయినా నాయకులు ప్రజలకు మాత్రమే విధేయులుగా ఉండేరోజు ఎప్పుడొస్తుందో? ఏమో!

– శంకరనారాయణ

కృషి రుషితత్వం

యజ్ఞం అంటే వేలిమి. త్యాగబుద్ధితో చేసే లోకహితమైన చర్యలన్నీ యజ్ఞాలే అవుతాయి. మానవులు చేయదగని స్వార్థ క్రియాయోగమే యజ్ఞం. అలా స్వార్థం లేకుండా చేపట్టిన చర్యలు ఇటు జనప్రియ కర్మలుగా, అటు దైవప్రీతి పాత్రమైన సత్కర్మలుగా తగిన ఫలితాలను ప్రసాదిస్తాయి. చిక్కుముడి అక్కడే ఉంది. మానవమాత్రులు ఫలితం ఆశించకుండా ఏ పనినైనా మొదలు పెట్టడానికి ఇష్టపడరు. లాభనష్టాలు బేరీజు వేసుకొని ప్రారంభించిన పని ఫలాసక్తితో చేపట్టిన చర్య అవుతుంది. అలాంటి కామ్యకర్మలు యజ్ఞానికి పనికి రావు. పైగా అలాంటి కర్మలు బంధాలై మోక్షానికి ప్రతిబంధకాలవుతాయి. కర్మఫలం గురించి ఆలోచించకుండా, యజ్ఞ కార్యానికి దోహదం చేసే కర్తవ్యకర్మలు చేపడితే, యోగ్యమైన ఫలితాలు వర్షిస్తాయి. త్యాగముక్తమైన నియతకర్మలను అనుష్ఠించటమే కర్మయోగం. బ్రహ్మ ప్రజలను యజ్ఞంకోసం సృష్టి చేశాడని, వాటి ద్వారా మానవకోటి వృద్ధి పొందుతుందని, అది కామధేనువులా వారి కోరికలను ఈడేరుస్తుందని బ్రహ్మ యజ్ఞాలను సంకల్పించినట్లు గీత(మూడు-10) చెబుతున్నది.

కర్మలు మూడురకాలు. విశుద్ధకర్మ, నిష్కామకర్మ, నిషిద్ధకర్మ. కర్మ, అకర్మ, వికర్మలుగా వీటిని గ్రహించవచ్చు. శాస్త్రసమ్మతమైన కర్మ ఆచరించడం వల్ల దోషాలు అంటవు. విధియుక్తమైన కర్మానుష్ఠానం ధర్మసమ్మతమే. అర్జునుడు యుద్ధం చేయడం అన్నది విధ్యుక్తధర్మమైన కర్తవ్యకర్మ, స్వధర్మం అవశ్యం ఆచరణీయం. అది ఎలాంటిదైనా పరధర్మంకన్నా శ్రేష్ఠమే. ధర్మవ్యాధుడు మాంసం తేవడం, అమ్మడం, అతడి స్వధర్మం. అలా వేట హింసాత్మకమైనా ధర్మసమ్మతమే అవుతుంది. ఫలాభిసంధి రహితంగా చేపట్టే కర్మ మనిషిని మోక్షగామిగా తీర్చిదిద్దుతుంది. కర్మఫలాన్ని వదిలి కర్మతో యోగించినప్పుడే ఆ కర్మానుభవం కర్మయోగంగా మారుతుంది. నిషిద్ధకర్మ శాస్త్రవిరుద్ధం కాబట్టి దాన్ని వదిలివేయాలి. కర్మలో విభాగాలున్నట్టుగానే యజ్ఞంలోనూ తేడాలు ఉన్నాయి. ద్రవ్య యజ్ఞంకన్నా, జ్ఞానయజ్ఞం మిన్న. జ్ఞానాగ్ని కర్మలను సమిధల్లా కాల్చి బూడిద చేస్తుంది. కర్మయోగం చివరికి జ్ఞానయజ్ఞంగా పరిణమించి భక్తిరసంలో పరిపుష్టమై కర్మయోగిని జ్ఞాన శిఖరం చేరుస్తుంది. అంచేత, కర్మయజ్ఞం కర్మయోగంలానే మిక్కిలి శ్రేష్ఠం.

అంతర్యామి

వజ్రాన్ని వజ్రంతో ఛేదించే చందంగా, కర్తవ్యకర్మ నిర్వహణ ద్వారా, కర్మఫలాలను ఆ పరమాత్మపరం చేయాలి. అనుమానాలు, భయాలు, ఉద్రేకాలు, ఉద్వేగాలు- ఇలాంటి చాపల్యాలకు దూరమైన మనసు నిలకడగా ఉంటుంది. బుద్ధి వికసిస్తుంది. చిత్తం దైవదత్తమై, అహంకారం అంతరిస్తుంది. ఎప్పుడైతే మనసు, చిత్తం, అహంకారం సాధకుడి వశవర్తిగా మారతాయో- అప్పుడు కర్మ తన ధృతరాష్ట్ర కౌగిలిలో అతణ్ని బంధించలేదు.

మాయాజనితమైన గుణాలు ఈ మానవ శరీరాన్ని, ఇంద్రియాలను, మనసును మభ్యపెట్టి మనిషిని తమ చుట్టూ తిప్పుకొంటూ ఉంటాయి. ఈ సత్యాన్ని తెలుసుకున్న సాధకుడికి కర్మాచరణ ఒక చిద్విలాసంగా, భౌతిక వినోద క్రీడగా కనిపిస్తుంది. కర్మలు చేయకుండా లోకంలో బతకడం సాధ్యం కాదు. వాటిలో తనను అంటే 'నేను' అన్న భావన ప్రవేశపెట్టకూడదు. అలాంటి 'ఎరుక'తో పనులు చేస్తుండటంవల్ల, ఆ సాధకుడు సన్యాసిగా లేక సాంఖ్యయోగిగా గుర్తింపు పొందుతాడు.

కృష్ణపరమాత్మ అర్జునుణ్ని కర్మయోగివి కావాలని ఆదేశించాడు. ఈ జీవితం ఒక వరం. జీవితం ఎడారిగా, అడవి కాచిన వెన్నెలలా వృథా కాకూడదు. మృత్యురూపమైన మర్త్య జీవితంలో అమృతత్వం సాధించడమే జీవిత పరమార్థం. అమృతంతో మన జన్మభూమిని దేవభూమిగా తీర్చిదిద్దడమే పరమగమ్యం. ఆ లక్ష్యాన్ని సాధించడానికి రెండే మార్గాలు. ఒకటి జ్ఞానమార్గం. రెండోది కర్మమార్గం. ఏది సాధ్యమో నిర్ణయించుకోవలసింది సాధకుడు. ఆపై అందుకు నిరంతరం కృషిచేయాలి.

– ఉప్పు రాఘవేంద్రరావు

దేశంలో మనదే సమర్థ బృందం

- సీఎం, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేస్తే మరింత అభివృద్ధి
- ఆర్నెళ్లుపోతే కార్యాలయాలకు వచ్చే పని ఉండదు
- అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్‌లో అందిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఈనాడు - విశాఖపట్నం

'ముఖ్యమంత్రిగా నేను కష్టపడుతున్నాను.. ఉద్యోగులూ కష్టపడుతున్నారు.. అంతా కలిసికట్టుగా పనిచేస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుంది.. మీ సమస్యలేమైనా ఉంటే చెప్పండి.. మీరంతా ఒకటి గమనించాలి.. ఇంతకు ముందు ఉద్యోగుల పట్ల గట్టిగా ఉండేవాడ్ని.. ఇప్పుడు ఉద్యోగులందర్నీ కలుపుతూ వస్తున్నాను.. అందరం ఒక బృందంగా పనిచేశాం.. అభివృద్ధి సాధిస్తున్నాం.. అందుకే భారతదేశంలో సమర్థంగా పనిచేస్తున్న బృందం ఆంధ్రప్రదేశ్‌గా గుర్తింపు పొందుతోంది.. ."అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తహసీల్దారు కార్యాలయాలను సోమవారం సాయంత్రం విశాఖ విమానాశ్రయంలోని ఎయిర్‌పోర్టు లాంజ్ నుంచి ప్రారంభిస్తూ శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎన్నో కష్టాలున్నా అన్ని అంశాల్లోనూ గత నాలుగేళ్లుగా 10.5 శాతం ప్రగతిని సాధిస్తున్నామన్నారు. రియల్‌టైం గవర్నెన్స్ తెచ్చామని.. ప్రతి ఒక్కర్ని సంతృప్తికర దిశగా తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్క పథకం, కార్యక్రమం గురించి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సంతృప్తి స్థాయి తెలుసుకుంటున్న ప్రభుత్వం ప్రపంచంలో మనదేనని చెప్పారు. నిత్యం 15 లక్షల సెల్‌ఫోన్ల నుంచి ఐవీఆర్ఎస్ సమాచారాలు వెళ్తున్నాయని.. వారిచ్చే ఫీడ్ బ్యాక్‌పై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నట్లు వివరించారు. డ్వాక్రా సంఘాల బీమాలో 98 శాతం సంతృప్తి

తహసీల్దారు కార్యాలయాల శిలాఫలకాలను విశాఖ విమానాశ్రయ లాంజ్‌లో ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

వస్తుండడం ఆనందంగా ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మనమే అగ్రస్థానంలో ఉన్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ఇతర సేవలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టేస్తున్నామని.. ఇంకో ఆర్నెళ్లు పోతే ఎవరూ కార్యాలయాలకు వచ్చే పని ఉండదని చెప్పారు. ప్రజలు ఎప్పుడైనా కార్యాలయాలకు వస్తే మర్యాదగా మాట్లాడి పంపించే రోజులు రాబోతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో... అధికారుల్లో మంచి నాయకుడు ఉంటే ఆ పరిధిలోని అన్నీ మార్చేస్తాడన్న విషయాన్ని రుజువు చేస్తూ విజయనగరం జిల్లాలోని జమ్మిదేవిపేటలో పారదర్శకంగా పథకాలు అమలవుతున్న తీరును ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కలెక్టర్, జేసీ, ఆర్డీవో ఎమ్మార్వో, ఎమ్మెల్యే, ఎంపీ, నగరాభివృద్ధి ఉపాధ్యక్షుడు ఇలా ఎవరి పరిధిలో వారు సమర్థ నాయకత్వం ఇవ్వగలిగి... సమర్థంగా పనిచేస్తే పారదర్శకత, శాంతిభద్రతలు సరిగ్గా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విప్ పీజీవీఆర్ నాయుడు (గణబాబు), ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వాసుపల్లి గణేష్‌కుమార్, పల్లా శ్రీనివాసరావు, భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవానీ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, వుడా వీసీ బసంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా స్ఫూర్తితో సహజ సేద్యం

ఈనాడు డిజిటల్, అమరావతి: కృష్ణా జిల్లాను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన జిల్లాల్లోని రైతులు కూడా సహజసేద్యాన్ని అవలంబించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. హరియాణా తర్వాత రైతుల తలసరి ఆదాయంలో కృష్ణా జిల్లా ముందంజలో ఉందని, ఈ జిల్లాలో లక్ష మంది రైతులు సహజ సేద్యం వైపు మళ్లారని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు వస్తాయన్నారు. నవ నిర్మాణ దీక్షల నిర్వహణపై సోమవారం ముఖ్యమంత్రి తన నివాసం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రతి ఒక్కరిలో నవ నిర్మాణ స్ఫూర్తి ఉండాలి. గ్రామస్థులను చైతన్యపర్చి వారి భాగస్వామ్యం పెంచే బాధ్యతను సాధికారమిత్రలు తీసుకోవాలి. రెండో రోజు దీక్షలో 15.59 లక్షల మంది భాగస్వాములయ్యారు. నోడల్ బృందాలు 12,226 పనులు పరిశీలించాయి. దీక్షల సందర్భంగా 8,589 చోట్ల నిర్దేశిత అంశంపై చర్చించారు. రెండో రోజు 1,42,219 మందికి పింఛన్లు, 2,07,115 మందికి రేషన్‌కార్డులు అందజేశారు' అని వివరించారు. దీక్షల సందర్భంగా ప్రతి శాఖాధిపతి గ్రామాలను సందర్శించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. గ్రామాల్లో వారం రోజులు ఉంటున్న సందర్భాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

68 చెరువులు నింపడం సంతృప్తినిచ్చింది

'పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లోని చెరువులు నీళ్లు లేక ఎండిపోయాయి. రూ.280 కోట్లు ఖర్చు చేసి హంద్రీ-నీవా ద్వారా చెరువులను నీటితో నింపాం. దీక్షల్లో రెండో రోజు 68 చెరువులను నింపడం సంతృప్తినిచ్చిం'దని ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. సంతృప్త స్థాయిని మరింత పెంచాలని పిలుపునిచ్చారు. టెలీకాన్ఫరెన్స్‌లో ప్రణాళికాశాఖ కార్యదర్శి సంజయ్‌గుప్తా, రియల్‌టైం గవర్నెన్స్ ఎండీ అహ్మద్‌బాబు, వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్ దగ్గర ఆస్తులు కొన్నారా?

- కొన్న ఆస్తిని ఎవరి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు
- వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించిన ఏసీబీ

ఈనాడు, అమరావతి: డీఎస్పీ దుర్గాప్రసాద్ దగ్గర మీరు ఆస్తులు కొన్నారా? ఎప్పుడు? ఎంత మొత్తానికి కొన్నారు? ఆయనతో మీకెంత కాలంగా పరిచయం ఉంది? మీరు కొన్న ఆస్తిని ఎవరి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు?... అంటూ వైకాపాకు చెందిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై ఏసీబీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో గతేడాది పట్టుబడిన ఒంగోలు పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ) డీఎస్పీ దుర్గాప్రసాద్ నుంచి రామకృష్ణారెడ్డి భూములు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో భాగంగా ఏసీబీ గుర్తించింది. ఈ వ్యవహారంలో మంగళవారం తమ ఎదుట హాజరుకావాలని కోరుతూ సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు జారీ చేయగా...వాటికి స్పందనగా ఒకరోజు ముందుగానే సోమవారం ఆయన దర్యాప్తు అధికారుల ఎదుట హాజరయ్యారు. డీఎస్పీ రమాదేవి ఆధ్వర్యంలోని బృందం దాదాపు రెండు గంటల పాటు 20కు పైగా ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టింది. ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కొన్నింటికి సూటిగానే సమాధానం చెప్పిన ఆయన...మరికొన్నింటికి మాత్రం "లేదు....తెలియదు" అని చెప్పినట్లు సమాచారం. అవసరమైతే మరోసారి పిలుస్తామని, విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని చెప్పారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఆళ్ల రామకృష్ణారెడ్డి

నన్ను సాక్షిగానే పిలిచామన్నారు: ఆళ్ల

నన్నుసాక్షిగానే పిలిచామని ఏసీబీ అధికారులు చెప్పారు. కేసులో స్వాధీనం చేసుకున్న వాటి జాబితాలో నాకు సంబంధించిన ఆస్తులేవి లేవు. 2006-07లో దుర్గాప్రసాద్ భూమి విక్రయిస్తే నేను కొనుగోలు చేశా. ఇవే విషయాలను వివరించాను. ఓటుకు నోటు కేసు విచారణ పూర్తయి సీఎం చంద్రబాబు జైలుకు వెళ్లే వరకూ అలుపెరగని పోరాటం చేస్తాను. ఈ కేసు విచారణకు సంబంధించి గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశాను. ఈ కక్షతోనే చంద్రబాబు నాపై అనిశాను ఉసిగొల్పుతున్నారని అన్నారు.

'ఎస్ఎస్ఏ ఉద్యోగాల్లో డబ్బులు వసూలు చేస్తే చర్యలు'

ఈనాడు, అమరావతి: సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ)లో పొరుగుసేవల ఉద్యోగాల నియామకాల్లో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలపై విచారణ చేపట్టాలని ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకులు(ఎస్పీడీ) జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం జిల్లా ప్రాజెక్టు అధికారులతో దృశ్య సమీక్ష నిర్వహించారు. డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తెలితే సంబంధిత సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పొరుగు సేవల సంస్థలు పంపించే అభ్యర్థుల్లోనూ అర్హతలు లేకపోతే ఆ పోస్టును భర్తీ చేయకుండా నిలిపివేయాలన్నారు. నియామక ప్రక్రియలో తప్పనిసరిగా రోస్టర్ విధానం అమలయ్యేలా చూడాలన్నారు. జిల్లాల్లో అయా సంస్థలు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

EDUCATION
★ SEATS: MBBS / BVSC / AGB.Sc / BAMS / BHMS. Gokul College. Hyd. ✆ 7996350670

EDUCATION
★ ADMISSIONS Ag.B.Sc, ICAR APPROVED@7.5L. ✆ 7083847452.

ప్రాజెక్టులు, చెరువుల గేట్లు తనిఖీ చేయండి

- ఏరువాక విజయవంతం చేయాలి
- నీరు-ప్రగతి టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబునాయుడు

ఈనాడు, అమరావతి: సాగునీటి ప్రాజెక్టులు, చెరువులకు ఉన్న 750 గేట్లు తనిఖీ చేయాలని, పకడ్బందీగా నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. నీరు-ప్రగతిపై సోమవారం తన నివాసం నుంచి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పది రాష్ట్రాల రైతులు రోడ్లెక్కినా మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదంటే మనం చేసిన పనులే కారణమని చెప్పారు.

★ ఈ ఏడాది కూడా కృష్ణా ఆయకట్టుకు ముందే సాగునీటిని ఇవ్వాలి. ఏరువాక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.
★ ఖరీఫ్‌లో రెయిన్‌గన్స్, జెబా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి.
★ సీజన్‌లో సాగునీటి విడుదలపై రైతుల్లో భరోసా పెంచాలి. తేదీలను ముందే ప్రకటించాలి.
★ పంటకాల్వలు, చెరువుల్లో నీటి నిల్వకు అన్ని ఏర్పాట్లు చేయాలి. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి.
★ భూగర్భాన్ని అతిపెద్ద జలాశయంగా మార్చాలి. జలసంరక్షణ చర్యలు ముమ్మరం చేయాలి.
★ సూక్ష్మసేద్యం మరో నాలుగింతలు పెరగాలి. కోటి ఎకరాల్లో పండ్లతోటల సాగు ప్రోత్సహించాలి.
★ వర్షపాతాన్ని ముందుగా అంచనా వేయాలి. దానికి అనుగుణంగా వర్షాభావ సమయంలో ప్రణాళికలు తయారు చేసుకోవాలి.
★ ఆదరణ ఉన్న ధాన్యం రకాల సేద్యాన్ని ప్రోత్సహించాలి.
★ బ్యాంకర్లు, రైతుల మధ్య వారధిగా రైతు సాధికార సంస్థ పనిచేయాలి.
★ ఈ ఏడాది రూ.10వేల కోట్ల ఉపాధి నిధులు వినియోగించుకోవాలి.

రూ.350 కోట్లు వెనక్కి తీసుకున్న కేంద్రం: యనమల

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు. కేంద్రంతో విభేదించి బయటకొచ్చాక ఇలాంటి చర్యలు పెరిగాయన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో సోమవారం జరిగిన నవ నిర్మాణ దీక్ష కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం మంజూరు చేసిన రూ.350 కోట్లు నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు జమ అయ్యాయని, అయితే ప్రధాని అనుమతిలేదని చెప్పి నిధులను వెనక్కి తీసుకున్నారని, గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 3.50 లక్షల పింఛన్లను మంజూరు చేసిందని.. ఆశా వర్కర్లకు కన్సాలిడెంట్ పే కింద సముచిత వేతనాలు చెల్లించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచామని, మళ్లీ పెంచాలన్న వారి విజ్ఞప్తిని సీఎం పరిశీలిస్తున్నారని చెప్పారు. నిరుద్యోగ భృతిపై జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని.. అర్హులందరికీ ఇస్తామన్నారు.

ప్రజల మనోభావాలు ఇప్పటికైనా గుర్తించండి

- 'ట్వీట్'తో ప్రజలను సంతృప్తిపరచలేరు
- ప్రధాని శుభాకాంక్షలపై మంత్రి లోకేశ్ స్పందన

ఈనాడు, అమరావతి: ప్రజల మనోభావాలను ఇప్పటికైనా గుర్తించి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలని పంచాయతీరాజ్, ఐటీశాఖ మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్రమోదీని కోరారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు అంటూ ప్రధాని చేసిన ట్వీట్‌కు సోమవారం మంత్రి స్పందిస్తూ 'ట్వీట్‌తో రాష్ట్ర ప్రజలను సంతృప్తి పరచాలని మీరు అనుకుంటున్నారు...మీ ట్వీట్‌పై ప్రజల ఆవేదన ఎలా ఉందో మీరు అర్థం చేసుకోవాలని.. మీకు ప్రజల స్పందన ట్వీట్లు కూడా జత పరుస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు.

నేరాల గురించి మీరా మాట్లాడేది: జగన్‌కు ట్వీట్

కిడ్నాపర్లు, బెట్టింగ్ రాయుళ్లు, ఎర్రచందనం స్మగ్లర్లు, భూకబ్జాదారులు, అత్యాచారాలకు పాల్పడే వ్యక్తులు ఉన్న పార్టీకి అధినేతగా ఉన్న మీరు రాష్ట్రంలో నేరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందంటూ వైకాపా అధినేత జగన్‌ను ఉద్దేశించి లోకేశ్ ట్వీట్ చేశారు. కరప్షన్ కింగ్ ఆఫ్ ఇండియాగా ఘనత వహించి.. 13 కేసుల్లో ఏ1 ముద్దాయిగా ఉంటూ షరతులతో కూడిన బెయిల్‌పై తిరుగుతున్నారంటూ ఆక్షేపించారు.

750 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం

- ఎన్‌టీపీసీతో కుదుర్చుకున్న డిస్కమ్‌లు
- ఒక్కో యూనిట్ ధర రూ.2.72

ఈనాడు, అమరావతి: ఒక్కో యూనిట్ రూ.2.72 చొప్పున మొత్తం 750 మెగావాట్ల సౌరవిద్యుత్తును కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టీపీసీతో కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుంది. ఇందులో భాగంగా డిస్కమ్‌లు సకాలంలో సొమ్ము చెల్లిస్తే రెండు శాతం మేర రాయితీ కూడా లభించనుంది. విజయవాడలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్‌లతో పాటు ఈపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ సీఎండీల సమక్షంలో ఆయా డిస్కమ్‌ల చీఫ్ మేనేజర్లు, ఎన్‌టీపీసీ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. అనంతపురంలోని ఎన్‌పీ కుంట సౌరవిద్యుత్తు పార్కు నుంచి ఈ విద్యుత్తును ఎన్‌టీపీసీ సరఫరా చేస్తుంది. దీని కోసం కాంపిటేటివ్ బిడ్డింగ్ విధానం ద్వారా స్ప్రింగ్ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌బీ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, అయాన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను ఎన్‌టీపీసీ ఎంపిక చేసింది. ఒక్కో సంస్థ నుంచి చెరో 250 మెగవాట్ల సౌర విద్యుత్తును సమకూర్చుకుని డిస్కమ్‌లకు సరఫరా చేయనుంది. ఒప్పందంలో భాగంగా ఎనిమిది నుంచి పది నెలల వ్యవధిలో విద్యుత్తు సరఫరా ప్రారంభం కానుంది. ఇంత తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలు చేయడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే తొలిసారని అజయ్‌జైన్, విజయానంద్ ప్రకటించారు.

ఎన్‌టీపీసీతో సౌరవిద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకుంటున్న రాష్ట్ర విద్యుత్ శాఖ అధికారులు

టెట్ పరీక్ష కేంద్రాల మార్పునకు అవకాశం లేదు: కన్వీనర్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల సామర్థ్యం ఆధారంగానే సెంటర్లను కేటాయించామని కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఒకవేళ జిల్లాల్లో పరిమితి మించితే ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లోని కేంద్రాలకు అభ్యర్థులు ఆప్షన్లు పెట్టుకున్నారన్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌ల్లో 23వేల మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని వెల్లడించారు. ఎలాంటి ఆప్షన్లు పెట్టని 14,891మందికి విద్యాశాఖే పరీక్షా కేంద్రాలను కేటాయించిందన్నారు. పరీక్షా కేంద్రాల మార్పునకు అవకాశం లేదన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షా కేంద్రాల ఎంపికలో మొదట ఆప్షన్లు ఇచ్చినవారికి సొంత జిల్లాలు ఆ తర్వాత ఆప్షన్లు పెట్టుకున్నవారికి ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించిన అధికారులు.. అభ్యర్థులే ఇష్ట ప్రకారం ఆప్షన్లు ఇచ్చుకున్నారని చెప్పడం విశేషం.

24 గంటల్లో తప్పులను బయటపెడతాం!

- వాస్తవాలను వక్రీకరిస్తే పర్యవసనాలకు సిద్ధంగా ఉండాలి
- ముఖ్యమంత్రికి భాజపా హెచ్చరిక

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు వాస్తవాలను వక్రీకరిస్తే 24 గంటల్లో అసలు విషయాలు బయటపెడతానని భాజపా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. దీని పర్యవసనాలను ముఖ్యమంత్రి ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన సోమవారం విజయవాడలో విలేకర్లతో మాట్లాడుతూ 'గుజరాత్‌కు సంబంధించి వల్లభాయ్‌పటేల్ ప్రాజెక్టు కోసం కేంద్రం రూ.3000 కోట్ల నిధులు కేటాయించినట్లు సీఎం ప్రకటించడం హాస్యాస్పదం. కేంద్రం తన వాటా కింద రూ.300 కోట్లు మాత్రమే ఇచ్చింది. ధొలేరా ప్రాజెక్టుకు కేంద్రం రూ.1293 కోట్లు మాత్రమే ఇవ్వగా రూ.98వేల కోట్లు ఇచ్చినట్లు చంద్రబాబు ప్రకటించడం విడ్డూరం. పారిశ్రామికవాడలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చిన భూమి విలువకు సమానంగా నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఇదే కోవలో కృష్ణపట్నం పారిశ్రామిక నడవకు కేంద్రం నిధులు ఇస్తోంది. ఇందుకు 12వేల ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1500 ఎకరాలు మాత్రమే పూర్తయింది. భూసేకరణ పూర్తి చేయకుండా కేంద్రాన్ని విమర్శించడం ఎందుకు? రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు కూడా వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారు. 'ఇండియన్ కరప్షన్ స్టడీస్' అధ్యయన నివేదికలో తెలుగు రాష్ట్రాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణకంటే ఏపీ ముందుంద'ని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 'భాజపా, వైకాపాకు అక్రమ సంబంధాన్ని అంటగట్టి చంద్రబాబు ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్నారు. చంద్రబాబు అతి తెలివికి ఇది నిదర్శనం. చేతకానితనంతో ప్రత్యేక ప్యాకేజీ కింద రాష్ట్రానికి వచ్చే నిధులను వాడుకోలేకపోతున్నారు. ప్రాజెక్టులకు నివేదికలను కోరినా చంద్రబాబు నుంచి స్పందన లేదు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ముఖ్యమంత్రి ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు' అని పేర్కొన్నారు.

పూరీ రత్నభాండాగారం తాళం చెవి మాయం

- న్యాయ విచారణకు ముఖ్యమంత్రి ఆదేశం

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రం రత్నభాండాగారం ప్రధాన(3వ) గది తాళం చెవి మాయమైంది. రెండు నెలలుగా దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. శుక్రవారం ఏర్పాటైన శ్రీక్షేత్రం పాలకవర్గ సమావేశంలో ఈ విషయం లీకైంది. దీంతో విపక్షాలు, ఇతర ఆధ్యాత్మిక సంస్థలు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి, పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాళం మాయమవడంపై పూరీలో రెండు రోజులుగా ఆధ్యాత్మిక సంస్థలు, ఇతరులు ఆందోళన చేస్తున్నారు. సోమవారం భువనేశ్వర్‌లోని సీబీఐ కార్యాలయం ఎదుట పూరీ, భువనేశ్వర్ న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. సీబీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, న్యాయశాఖ మంత్రి ప్రతాప్ జెనా సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కలిశారు. అనంతరం ఈ వ్యవహారంపై సమగ్ర న్యాయ విచారణకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమిస్తామని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. కాంగ్రెస్, భాజపా, ధార్మిక సంస్థలు మాత్రం.. సీబీఐ లేదా క్రైంబ్రాంచ్ ద్వారా దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నాయి.

భువనేశ్వర్ సీబీఐ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

ఇంటర్ కొత్త పాఠ్య పుస్తకాల ఆవిష్కరణ

ఈనాడు డిజిటల్, అమరావతి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నూతన పాఠ్యపుస్తకాలను సోమవారం సచివాలయంలో ఇంటర్ విద్యామండలి కార్యదర్శి ఉదయలక్ష్మీ ఆవిష్కరించారు. తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ, సంస్కృతం పాఠ్యపుస్తకాలను విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం భాషా పుస్తకాల్లో పూర్తిస్థాయిలో మార్పు చేసినట్లు ఉదయలక్ష్మీ వెల్లడించారు. గ్రూప్ సబ్జెక్టుల్లో కొన్ని పాఠ్యాంశాలను చేర్చి కొత్తదనం తీసుకువచ్చామన్నారు. సీఏ, నీట్, జేఈఈ తదితర జాతీయస్థాయి పోటీ పరీక్షల సన్నద్ధతకు బోర్డు పాఠ్యపుస్తకాలు ఉపయోగపడేలా కొత్త సిలబస్‌ను రూపొందించినట్లు వివరించారు. వచ్చే ఏడాది ద్వితీయ సంవత్సరం సిలబస్‌ను మార్చనున్నట్లు ప్రకటించారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన కొత్త పాఠ్యపుస్తకాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గతేడాది నిబంధనలు పాటించని 300 కళాశాలలకు అఫ్లియేషన్ రద్దు చేశామన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై ఏర్పాటైన నీరజ కమిటీ, చక్రపాణి కమిటీ సూచనలు పాటించాలని అన్ని కళాశాలకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నీట్ వయోపరిమితి నిబంధనపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు

దిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షకు అర్హతగా భారత వైద్య మండలి (ఎంసీఐ).. విధించిన వయోపరిమితుల నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సమాధానం ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టు సోమవారం కేంద్రానికి, సీబీఎస్ఈకి, కేరళ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయెల్, జస్టిస్ అశోక్ భూషణ్‌తో కూడిన ధర్మాసనం. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. సాధారణ కేటగిరీ అభ్యర్థులకు 25 ఏళ్లు, రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులకు 30 ఏళ్లను వయోపరిమితిగా ఎంసీఐ నిర్దేశించింది. కొంత మంది అభ్యర్థులు దిల్లీ హైకోర్టులో గత నెల 11న సవాల్ చేయగా వయోపరిమితి నిబంధనను దిల్లీ హైకోర్టు సమర్థించింది. దిల్లీ హైకోర్టు తీర్పును పిటిషనర్లు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. మరోవైపు.. నీట్-2018 ఫలితాలను నిలిపివేయాలని సంకల్ప్ ఛారిటబుల్ ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. నీట్ ప్రశ్నపత్రాల అనువాదాల్లో చాలా తప్పులున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు.

గుండె సమస్యలకు మధుమేహ ఔషధం!

లండన్: మధుమేహ సమస్యకు వాడే మెట్‌ఫార్మిన్ ఔషధం గుండె సంబంధ సమస్యలనూ తగ్గిస్తుందని తాజా పరిశోధన చెబుతోంది. బ్రిటిష్ పరిశోధకులు నిర్వహించిన రెండు అధ్యయనాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. గుండె సంబంధ సమస్యలు ఉన్నవారికి డుండి యూనివర్సిటీ పరిశోధకులు ఈ ఔషధాన్ని ఇచ్చి పరిశీలన నిర్వహించారు. టైప్ 2 మధుమేహ సమస్యకు సాధారణంగా వాడే ఈ ఔషధం.. గుండెలో ప్రధాన సరఫరా వ్యవస్థ అయిన ఎడమ జఠరికలో (వెంట్రికిల్) ఏర్పడే ప్రమాదకర మందాన్ని తగ్గించినట్లు గుర్తించారు. రోజుకు ఒక మాత్ర చొప్పున ఏడాది పాటు ఈ మాత్రను వినియోగించిన వారిలో ఎడమ జఠరిక మందం రెండు రెట్లు తగ్గడంతో పాటు రక్తపోటు అదుపులో ఉండడం, రోగులు 3 కిలోల వరకూ బరువు తగ్గడాన్ని గుర్తించారు. ఇదే విశ్వవిద్యాలయం నిర్వహించిన రెండో అధ్యయనంలో గుండె వైఫల్యానికి కారణమయ్యే ఆర్టిక్ స్టెనోసిస్ (ఏఎస్) సమస్యకు మెట్‌ఫార్మిన్ ఔషధాన్ని వినియోగించారు. ఈ మాత్రలు వినియోగించిన మధుమేహ రోగుల్లో గుండెపోటు లేక గుండె వైఫల్యంతో మృత్యువాత పడడం దాదాపుగా తగ్గినట్లు తేల్చారు. మాంచెస్టర్‌లో నిర్వహిస్తున్న బ్రిటిష్ కార్డియోవాస్క్యులర్ సొసైటీ సమావేశంలో ఈ అధ్యయనాల వివరాలను పరిశోధకులు సోమవారం సమర్పించారు. ఈ ఫలితాలను నిర్ధరించుకునేందుకు.. ఇంకా సమగ్ర అధ్యయనం నిర్వహించాల్సిన అవసరం ఉందని, విజయవంతమైతే లక్షల మందికి ఉపయోగపడుతుందని వర్సిటీ ఆచార్యుడు డా. ఇఫిమోర్డి తెలిపారు.

మహిళలను అసభ్యంగా చిత్రీకరించే డిజిటల్ సందేశాలు పంపడం శిక్షార్హం!

దిల్లీ: మహిళలను కించపరుస్తూ వాట్సప్, స్కైప్ తదితర డిజిటల్ వేదికల్లో సందేశాలు పంపడం త్వరలో శిక్షార్హం కానుంది. పార్లమెంటు స్థాయీ సంఘం; జాతీయ మహిళా కమిషన్‌లు ఈ మేరకు కేంద్ర స్త్రీ, శిశు అభివృద్ధిశాఖకు ప్రతిపాదించాయి. త్వరలోనే 1986 నాటి 'మహిళల అసభ్య చిత్రీకరణ నిరోధక చట్టం' పరిధిలోకి డిజిటల్ సందేశ మాధ్యమాలను తీసుకొస్తూ చట్టసవరణ చేపట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు సోమవారమిక్కడ వెల్లడించాయి.

ప్రధానమంత్రి సహాయ నిధికి 9 పైసల విరాళం

పెట్రో ధరల పెంపుపై వినూత్న నిరసన

సిరిసిల్లగ్రామీణం, న్యూస్‌టుడే: పెట్రో ధరలు భారీగా పెంచుతూ, స్వల్ప మొత్తంలో తగ్గించడంపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ యువకుడు వినూత్న నిరసన తెలిపారు. సోమవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రధానమంత్రి సహాయ నిధికి విరాళంగా 9 పైసల చెక్కును కలెక్టర్ డి.కృష్ణభాస్కర్‌కు సిరిసిల్ల మండలం చంద్రంపేటకు చెందిన వీరగోని చందుగౌడ్ అందజేశారు.

భారతీయ ఖాద్య నిగమ్
ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, 3వ అంతస్తు, హాకా భవన్, పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్-04
No. S & C 15(40)/2017-18/RIV.MOVT/TN & KRL/CONTS/Vol II తేది: 5-6-2018
టెండరు ఆహ్వాన ప్రకటన
ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయము, హైదరాబాద్ వారు ఇ-టెండరింగ్/ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కాకినాడ యొక్క నిర్దేశిత డిపోల నుండి కేరళ రీజియన్ యొక్క నిర్దేశిత డిపోలకు జలమార్గము ద్వారా ఆహారధాన్యాల రవాణా నిమిత్తం మల్టి మోడల్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్ట్ యొక్క నియామకం కొరకు టెండరును ఆహ్వానిస్తున్నారు; టెండరు డాక్యుమెంట్‌ను www.fci.gov.in & www.eprocure.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఔత్సాహిక టెండరుదారులు తమ టెండరు డాక్యుమెంట్లను (PDF ఫార్మేట్) www.eprocure.gov.in మీద మాత్రమే దాఖలు చేయవచ్చును. ఈ కార్యాలయము 13-6-2018న మ. 3.00 గం.లకు FCI, R.O., హైదరాబాద్ వద్ద ప్రీ-బిడ్ సమావేశాన్ని నిర్వహిస్తున్నది.
సం/- జనరల్ మేనేజర్ (రీజియన్) తరపున

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ప్రజా ఆరోగ్యము & మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ
ఏపి e-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No. 1693/BPTL/Mpty/AFS/Gen/UTO1/2018-1
WTP ... DI K9 ... www.apeprocurement.gov.in ...
సం/- పర్యవేక్షక ఇంజనీర్, P.H.Q.C ...
DIPR No. 638/CL/Advt/1/1/2018-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పే అండ్ అకౌంట్స్ కార్యాలయము
టెండరు ప్రకటన
... 'C' ... 22-06-2018 ...
సం/- పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్
DIPR No. 648/CL/Advt/1/1/2018-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పశుసంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయము
ఆసక్తి వ్యక్తీకరణ (EOI)
EOI. Notification No. 10144-2/RKVY/RK3/2018 తేది: 28-5-2018
... RFID ... (EOI) ... http://www.ahd.aponline.gov.in ...
DIPR No. 647/CL/Advt/1/1/2018-19 సం/- సంచాలకులు

మార్క్‌ఫెడ్ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, 30-71/ఎ, బొమ్మల సత్రం, నంద్యాల-518501, కర్నూలు జిల్లా, ఫోన్: 9652076548
ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ల కొరకు టెండరు ప్రకటన
... 20-06-2018 ... 520007 ... 01-06-2018 ... 21-06-2018 ... 11.15 ... 2,000/- ... 2,00,000/- ... 50,000/- ... 21-06-2018 ... 11.30 ... 12.30 ... - ప్లాంట్ మేనేజర్

Andhra Pradesh Capital Region Development Authority
Lenin Center, Governorpet, Vijayawada – 520002 (A.P.)
E-Procurement Tender Notice
NIT No:AP CRDA-13023(38)/51/2018, Dt:04-06-2018
Name of Work : AP CRDA – (1) Construction of C.C. Roads & CC Drains in **Lingayapalem** Village in Amaravati Capital City Area (Est. Amount- Rs.55.00 Lakhs.), (2) Construction of C.C Roads & C.C. Drains in Ambedkar Colony of **Dondapadu** Village in Amaravathi Capital City Area (Est. Amount- Rs.65.00 Lakhs.), (3) Widening and Strengthening of R&B Main Road from Ayyappaswami Temple to Balayesu Colony including Construction of CC Roads & CC Drains in **Thulluru** Village Limits in Amaravathi Capital City Area (Est. Amount- Rs.930.00 Lakhs.), (4) Construction of C.C Roads & C.C. Drains in **Abbarajupalam** Village in Amaravati Capital City Area (Est. Amount- Rs.55.00 Lakhs.), (5) Construction of C.C. Roads & CC Drains in SC Colony of **Velagapudi** Village in Amaravati Capital City Area (Est. Amount- Rs.195.00 Lakhs.)
The bid can be downloaded on AP e-procurement portal from 06-06-2018 to 20-06-2018 (16:00 Hrs). Due date for submission of bid 20-06-2018 @ 16.30 Hrs, Bid opening on 20-06-2018 @16:45 Hrs. Please refer to www.apeprocurement.gov.in or www.crda.ap.gov.in for details.
For any further clarifications contact Sri.Ch.Dhanunjaya, Superintending Engineer (H&B) on 7095599008 / dhanunjaya.ch@apcrda.org.
Sd/-CHIEF ENGINEER (H&B), APCRDA

వందలో ఎనిమిది మంది మనోళ్లే

వెంకటసాయి (14)

జయదీప్ (16)

శ్రీహర్ష (19)

రవికిరణ్ (36)

శ్రీవాస్తవ్(57)

షేక్ జాన్(63)

రాజ్ చందూర్(92)

ఈనాడు – అమరావతి

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-2018 ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. జాతీయస్థాయి వందలోపు ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు నిలిచారు. 8, 14, 16, 19, 36, 57, 63, 92 ర్యాంకులను సాధించారు. సోమవారం ఈ నీట్ ఫలితాలు విడుదలయ్యాయి.

తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తంగా 94,130 మంది పరీక్షకు హాజరు కాగా.. వీరిలో 66,644 మంది(70.8శాతం) ఉత్తీర్ణులయ్యారు. అత్యధిక ఉత్తీర్ణత శాతంలో తెలుగు రాష్ట్రాలు జాతీయస్థాయిలో ఐదో స్థానంలో నిలిచాయి. తెలుగు రాష్ట్రాల నుంచి తొలి 25 ర్యాంకుల్లో ఏడుగురు, తొలి 50 ర్యాంకుల్లో 8 మంది తెలుగువారే కావటం విశేషం.

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం శాంతినగర్‌కు చెందిన అంకడాల అనిరుద్‌బాబు జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. తండ్రి అంకడాల తేజేశ్వరరావు మెళియాపుట్టి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా తల్లి రమాదేవి గృహిణి. కార్డియాలజీ లేదా న్యూరాలజీ విభాగంలో పీజీ పొందాలన్నదే అనిరుద్ లక్ష్యమని కుటుంబసభ్యులు తెలిపారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఒంటేరు వెంకటసాయి హర్షవర్ధన్ రెడ్డి 14వ ర్యాంకు, శ్రీకాకుళం విద్యార్థి ఎం. జయదీప్ 16, కృష్ణా జిల్లా విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన కోడూరు శ్రీహర్ష 19, శ్రీకాకుళం జిల్లా రాజాం విద్యార్థి వరద రవికిరణ్ 36, కర్నూలు జిల్లా ఆదోనిలోని విక్టోరియాపేటకు చెందిన జి.శ్రీవాస్తవ్‌కు 57, అనంతపురం జిల్లా కదిరికి చెందిన షేక్ జానూభాయ్ రఫియా కుల్సమ్‌కు 63, విజయవాడలో చదువుకుని ఇక్కడే నీట్ రాసిన తమిళనాడుకు చెందిన రాజ్ చందూర్ అభిషేక్ 92వ ర్యాంకు సాధించాడు. కృష్ణా జిల్లా గొల్లపూడి విద్యార్థి గుడిపాటి దేవ సహాయం జాతీయ స్థాయిలో దివ్యాంగుల కేటగిరీలో మొదటి ర్యాంకు సాధించాడు. తండ్రి శామ్యూల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి శ్రీలత గృహిణి. దేవసహాయం ఆరు నెలల వయసు నుంచే అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. ఆరు శస్త్రచికిత్సలు చేసిన తర్వాత నడవగలిగాడు. ఆర్థోపెడిక్ వైద్యుడిని కావడమే తన లక్ష్యమని దేవ సహాయం వివరించాడు.

కాన్సర్ వైద్య నిపుణుడు కావాలన్నదే లక్ష్యం

– ఒంటేరు వెంకటసాయి హర్షవర్ధన్‌రెడ్డి, 14వ ర్యాంకు

'తల్లిదండ్రులు ఒంటేరు శ్రీహరిరెడ్డి, శ్రీదేవి. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉండగా తల్లి బ్లడ్ కాన్సర్‌తో మృతిచెందింది. అప్పటి నుంచి మరింత బాధ్యతగా చదివాను. దిల్లీలోని ఎయిమ్స్‌లో సీటు సంపాదించి కాన్సర్ వైద్య నిపుణుడు కావాలన్నదే నా లక్ష్యం. పదోతరగతిలో 9.8 పాయింట్లు, ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించాను'

గుండె చికిత్సల రంగంపై ఆసక్తి..

– కోడూరు శ్రీహర్ష, 19వ ర్యాంకు

'తల్లిదండ్రులు కె.రవిసుబ్రమణ్యం, సుధామాధురి ఇద్దరూ పశు వైద్యులు. వారి స్ఫూర్తితో చిన్ననాటి నుంచి వైద్యుడు కావాలన్న లక్ష్యంతో ముందుకు సాగాను. ఇంటర్‌లో 985 మార్కులతో పాటు ఎంసెట్‌లో 3వ ర్యాంకు సాధించా. ఎయిమ్స్‌లో సీటు సంపాదించి గుండె చికిత్సల నిపుణుడిగా సమాజానికి సేవ లందించాలనేది నా ఆకాంక్ష. ప్రణాళికతో చదవడం వల్లే అనుకున్నది సాధించాను.

న్యూరోసర్జన్ కావాలన్నదే లక్ష్యం

–జి.శ్రీవాస్తవ్, 57 ర్యాంకు

'తండ్రి లెప్రసీ డిప్యూటీ పారామెడికల్ అధికారి జి. సీతారాముడు, తల్లి వెంకటలక్ష్మి. న్యూరోసర్జన్ కావాలన్నదే నా లక్ష్యం. ఏపీ ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 6వ ర్యాంకు సాధించా.'

తెలంగాణ విద్యార్థుల సత్తా

ఈనాడు, హైదరాబాద్: నీట్-2018(జాతీయ వైద్య విద్య అర్హత ప్రవేశ పరీక్ష)లో తెలంగాణ విద్యార్థులు సత్తా చాటారు. అఖిల భారత ర్యాంకుల్లో ఓపెన్ కేటగిరీలో లక్షలాది మంది విద్యార్థులు పోటీపడగా.. తొలి పది స్థానాల్లో రెండింటిని కైవసం చేసుకొని అగ్రభాగాన నిలిచారు. జాతీయస్థాయి ఫలితాల్లో 690 మార్కులతో తెలంగాణ విద్యార్థి రోహన్ పురోహిత్ రెండో ర్యాంకు సాధించాడు. రాష్ట్రానికే చెందిన ముప్పిడి వరుణ్ 685 మార్కులతో ఆరో ర్యాంకు సొంతం చేసుకున్నాడు. తొలి 50 ర్యాంకుల్లో రాష్ట్ర విద్యార్థులు మూడు ర్యాంకుల్ని సొంతం చేసుకోవడం విశేషం. తెలంగాణ విద్యార్థి రావి సిద్ధార్థ 672 మార్కులతో 25వ ర్యాంకును సాధించాడు. అఖిల భారతస్థాయిలో తొలి వంద ర్యాంకుల్లోనూ బాలురే ఎక్కువమంది ఉన్నారు. ఈనెల రెండోవారం లోగా రాష్ట్రానికి ర్యాంకులను సీబీఎస్ఈ పంపించనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. వాటితో రాష్ట్రస్థాయిలో జాబితాను రూపొందిస్తారు. అఖిల భారత వైద్యవిద్య కూటమి ప్రవేశ ప్రక్రియ మొదలైన అనంతరమే రాష్ట్ర స్థాయిలో ప్రవేశాలను నిర్వహిస్తారు. జులై రెండోవారంలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుందని కాళోజీ వర్సిటీ వర్గాలు తెలిపాయి.

నిరుపేదలకు వైద్య సేవలందిస్తా అమ్మానాన్నలే నాకు స్ఫూర్తి

– రోహన్ పురోహిత్, 2వ ర్యాంకు

వైద్యుడిగా నిరుపేదలకు సేవలందించాలనేది నాలక్ష్యం. నాన్న భరత్ విజయ్ పురోహిత్ కార్డియాలజిస్టు, అమ్మ నిర్మల వైద్యవృత్తిలోనే ఉన్నారు. వీరిద్దరే నాకు స్ఫూర్తి. ఉపాధ్యాయుల ప్రోత్సాహం నా విజయానికి తోడ్పాటునిచ్చింది. ఉదయం 7గంటలకే ఇంటి వద్ద బయలుదేరేవాడిని. రాత్రి 9గంటల వరకు తరగతులకు హాజరయ్యా. నాకు ఏ చిన్న సందేహమొచ్చినా శ్రీచైతన్యలోని ఉపాధ్యాయులు నివృత్తి చేసేవారు.

రోహన్ విజయం ఆనందాన్నిచ్చింది

– భరత్ విజయ్(2వ ర్యాంకర్ రోహన్ తండ్రి)

రోహన్‌కు ఇంత తక్కువ ర్యాంకు వస్తుందని ఊహించలేదు. నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ఎంత ప్రతిభ ఉన్న వారైనా కష్టపడకపోతే విజయం సొంతం కాదు.

డాక్టర్ కావాలనేది నా కల

–వరుణ్ ముప్పిడి, 6వ ర్యాంకు

డాక్టర్ కావాలన్నది నాకల. దేశవ్యాప్తంగా 6వ ర్యాంకు సాధిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. ఇంటర్‌లో నాకు 975 మార్కులు వచ్చాయి. మా నాన్న శ్రీనివాస్‌రెడ్డి వ్యాపారవేత్త. అమ్మ హారతిరెడ్డి ఆర్థికవేత్త. నా విజయానికి వారిద్దరి సహకారం ఎంతగానో తోడ్పాటునిచ్చింది.

దిల్లీ ఎయిమ్స్‌లో చేరతా

–రావి సిద్ధార్థ, 25వ ర్యాంకు

దిల్లీలోని ఎయిమ్స్‌లో చేరాలనుకుంటున్నా. మానాన్న శ్రీనివాస్‌మూర్తి మార్కెటింగ్ మేనేజర్. తల్లి సూర్యకాంతం స్కూల్‌లో ఉద్యోగిని. వారి ఇద్దరి సహాయ సహకారాలతో పాటు ఉపాధ్యాయుల తోడ్పాటుతోనే ఈ ర్యాంకు దక్కింది. నీట్‌లో 672 మార్కులు సాధించాను. ఇంటర్‌లో 946 మార్కులు వచ్చాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ కళాశాలలోనే చదివాను. తరగతిలో ఉపాధ్యాయులు చెప్పింది బాగా అర్థం చేసుకునే వాడిని.

కార్డియాలజిస్టు అవుతా

–బి.నిత్య 71వ ర్యాంకు

మా నాన్న నాకు స్ఫూర్తి. ఆయన మాదిరిగా కార్డియాలజిస్టుని కావాలన్నది నా కోరిక. వందపైనే ర్యాంకు వస్తుందని అనుకున్నా. 71వ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది.

అమ్మానాన్న సహకారం

–వై.సంజీవ్‌కుమార్‌రెడ్డి, 73వ ర్యాంకు

నాకు నీట్‌లో 73వ ర్యాంకు వస్తుందని ఊహించలేదు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయం సాధించాను. నాన్న పద్మనాభరెడ్డి రైల్వేలో పనిచేస్తారు. అమ్మ గీత వైద్యవృత్తిలో ఉన్నారు. వారి ప్రోత్సాహం నా విజయంలో కీలకపాత్ర పోషించింది. ఇంటర్‌లో 990 మార్కులు సాధించాను.

ఉపాధ్యాయుల తోడ్పాటు మరవలేను

–ఎం.శ్రీయుద్‌రెడ్డి, 94వ ర్యాంకు

మా నాన్న దేవేందర్‌రెడ్డి వైద్యుడు. ఆయనే నాకు స్ఫూర్తి. అమ్మ సునీత నన్ను ఎంతగానో ప్రోత్సహించింది. వారివల్లే నాకు వందలోపు ర్యాంకు దక్కింది. మా ఉపాధ్యాయుల తోడ్పాటు మరువలేను. దిల్లీలోని ఎయిమ్స్‌లో చేరాలని ఉంది.

'నీట్'లో ర్యాంకు రాలేదని యువకుడి ఆత్మహత్య

ఎనిమిదో అంతస్తు నుంచి దూకి దుర్మరణం

దిల్లీ: 'నీట్' వైద్య ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణుడు కాలేకపోయాననే బాధతో 19 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దిల్లీలోని ద్వారకాసెక్టార్ 12లో గల ఎనిమిదో అంతస్తు నుంచి దూకి దుర్మరణం చెందాడు. 2016లో ఇంటర్ ఉత్తీర్ణుడైన ఎం.పర్వవ్ రెండేళ్లుగా 'నీట్'లో మంచి ర్యాంకు కోసం శ్రమిస్తున్నాడు. సోమవారం ఫలితాలు విడుదలయ్యాక ఉత్తీర్ణుడయ్యానని తల్లిదండ్రులకు చెప్పాడు. వాస్తవానికి అతడు ఉత్తీర్ణుడు కాలేకపోయాడు. ఇదే విషయాన్ని తన ఫ్లాట్ గదిలో రాసిన ఆత్మహత్యలేఖలో ప్రస్తావించాడు. అదే గదిలో సీలింగ్‌ఫ్యాన్‌కు దుపట్టా కట్టి ఉంది. అంటే ముందు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకోవడానికి ఆలోచించి ఉంటాడని, ఆ ఆలోచన విరమించుకుని అపార్ట్‌మెంట్ పైనుంచి దూకాడని ప్రాథమిక ఆధారాలను బట్టి పోలీసులు నిర్ధారించారు.

గర్వించే స్థాయికి ఎదిగిన బాలసుబ్రహ్మణ్యం

- బాలు జన్మదిన వేడుకలో ప్రముఖ గాయని ఎస్.జానకి

నెల్లూరు, న్యూస్‌టుడే: 'విభిన్న ప్రతిభ.. ప్రావీణ్యంతో గాయకుడుగా రాణించి దేశం గర్వించదగిన స్థాయికి బాలసుబ్రహ్మణ్యం ఎదిగాడు.. తన ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పడం అతనికి నాపై ఉన్న అభిమానానికి నిదర్శనం' అని ప్రముఖ నేపథ్యగాయని ఎస్.జానకి అన్నారు. నెల్లూరు పురమందిరంలో సోమవారం రాత్రి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు విజేత ఆర్ట్సు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్.జానకి మాట్లాడుతూ తాను పురస్కారాలను తీసుకోవడంలేదని, పాడటం, కచేరీలు చేయడం పూర్తిగా మానేశానన్నారు. బాలసుబ్రహ్మణ్యాన్ని ఆశీర్వదించేందుకే ఈ కార్యక్రమానికి హాజరయ్యానన్నారు. బాలుతో కలిసి ఎన్నో గీతాలను ఆలపించానన్నారు. ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలు మాట్లాడుతూ తొలినాళ్లలో గూడూరులో జరిగిన పోటీలలో పాల్గొని జానకమ్మ చేతులమీదుగా బహుమతితో పాటు ఆశీర్వాదాన్ని అందుకున్నానన్నారు. ఆమె ఆశీర్వాద ఫలంతో పాటు ఎందరో ప్రముఖ సంగీత దర్శకులు వేలుపట్టి నన్ను ముందుకు నడిపి ఈ స్థాయికి చేర్చారన్నారు. ఈ సందర్భంగా ఆయన తల్లి శకుంతలమ్మ, గాయని ఎస్.జానకిలకు పాదాభివందనం చేసి ఆశీర్వాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డు పేరుతో అందించాలనుకున్న రూ.లక్షను హైదరాబాద్‌కు చెందిన స్పర్శ్ సంస్థకు అందజేశామని బాలసుబ్రహ్మణ్యం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు, ఆయన సోదరి శైలజ, ప్రముఖ పారిశ్రామికవేత్త శాంతబయోటెక్స్ అధినేత వరప్రసాద్‌రెడ్డి, ప్రముఖ విశ్లేషకులు వీఏకే రంగారావు, సంగీత దర్శకులు విద్యాసాగర్, సినీ రచయితలు భువనచంద్ర, వెన్నెలకంటి, జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ, లాయర్ పత్రికా సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులోని పురమందిరంలో ప్రముఖ గాయని ఎస్.జానకికి ఆత్మీయసన్మానం.. చిత్రంలో ఎస్.పి.బాలు కుటుంబ సభ్యులు, ఎస్పీ శైలజ, ఎ.కె.రంగారావు, భువనచంద్ర, జిల్లా ఎస్పీ రామకృష్ణ తదితరులు

నారాయణ అద్భుత ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: వైద్యవిద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-2018లో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు శరణి నారాయణ, సింధూర నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో 1, 1, 2, 3, 5, 5, 5, 7, 7 వంటి ర్యాంకులతో 10లోపు 12, 50లోపు 31, 100లోపు 49 ర్యాంకులు పొందినట్లు వారు వివరించారు. లక్షలాదిమంది పోటీపడిన నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించడం నారాయణ ఎన్-40 ప్రోగ్రాం సత్తాకు నిదర్శనమన్నారు. ర్యాంకులు పొందిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య విజయకేతనం

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ వెల్లడించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 2, 6, 8 ర్యాంకులతో మొదటి 10లోపు 3, 100లోపు 17 ర్యాంకులు సాధించినట్లు వివరించారు. సోమవారం హైదరాబాద్‌లో.. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కలిసి శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డా.బీఎస్ రావు కేకు కోసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. రెండో ర్యాంకు సాధించిన రోహన్ పురోహిత్‌కు రూ.25 లక్షలు, ఆరో ర్యాంకు సాధించిన ముప్పిడి వరుణ్‌కు రూ.10 లక్షలు, 8వ ర్యాంకు సాధించిన అనిరుధ్‌కు రూ.10 లక్షల చొప్పున పారితోషికాన్ని అందజేశారు.

తిరుమల విజయభేరి

ఈనాడు, హైదరాబాద్: వైద్యవిద్య ప్రవేశ పరీక్ష(నీట్)లో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జాతీయ స్థాయిలో యు.సత్యవెంకటరాధ 1961వ ర్యాంకు, బీ.వీరవెంకట దేవీమహతి 3950, డి.భావన రమాదేవి 4632, డి.గణేశ్‌రాయ్ 4758, ఎస్.మహతి 5163, కె.హారికాదేవి 7096, ఎం.సృజన 7522, ఎల్.విష్ణుదేవీ ప్రియాంక 8063, యు.హెచ్.వి.రవికుమార్ 8375, పి.లక్ష్మీప్రసన్న 8947వ ర్యాంకులు సొంతం చేసుకున్నారని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. శిక్షణ తీసుకున్న 371 మందిలో 367 మంది ఎంబీబీఎస్ అర్హత సాధించారని ఛైర్మన్ పేర్కొన్నారు.

శశి జైత్రయాత్ర

ఈనాడు, హైదరాబాద్: శశి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు నీట్‌లో జైత్రయాత్ర కొనసాగించారని శశి విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన జాతీయస్థాయి పూల్‌లో 988, 1368, 3633, 4351, 4425, 4442, 4818వ ర్యాంకులతో పాటు పదివేలలోపు 14 ర్యాంకులు, 15వేలలోపు 25 ర్యాంకులు, 20 వేలలోపు 38 ర్యాంకులు సాధించారని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ర్యాంకర్లను శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి రవికుమార్, లక్ష్మీ సుప్రియ అభినందించారు.

శ్రీ భవిష్య విద్యార్థుల జయకేతనం

ఈనాడు, హైదరాబాద్: నీట్-2018 ఫలితాలలో విజయవాడ కానూరులోని శ్రీ భవిష్య ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థులు సంచలన ఫలితాలు సాధించారని సంస్థ డైరెక్టర్లు తెలిపారు. సంస్థ నుంచి హాజరైన మొత్తం విద్యార్థుల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 579, 570, 569, 557, 555, 555, 552 వంటి ప్రతిష్టాత్మక మార్కులతో పాటు..500 మార్కులకు పైగా 31మంది, 475 మార్కులకు పైగా 64 మంది, 450 మార్కులకు పైగా 102 మంది, 400 మార్కులకు పైగా 213మంది సాధించారని పేర్కొన్నారు.

భాష్యం విజయభేరి

నీట్-2018 మెడికల్ ఫలితాల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు ఆ విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. దాసరి జయం సులేఖ ఆలిండియా 12వ ర్యాంకు, సముద్రాల రిత్విక్ 26వ ర్యాంకు, కత్రావత్ వినయ్ 60వ ర్యాంకు పొందినట్లు వివరించారు. మొత్తం 100లోపు 3, 1000లోపు 12 ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

ముస్లిం మతపెద్దలే లక్ష్యంగా ఆత్మాహుతి దాడి

కాబుల్‌లో 8 మంది దుర్మరణం

కాబుల్: ముస్లిం మతపెద్దలే లక్ష్యంగా జరిగిన ఆత్మాహుతి దాడిలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటికే సమావేశం ముగిసిపోవడంతో మృతుల్లో మతపెద్దలు, సాధారణ పౌరులు ఎంతమంది అనేది నిర్ధారణ కాలేదు. కాబుల్‌లోని లోయా జిర్గా వద్ద సోమవారం ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. మోటారుసైకిల్‌పై వచ్చిన ఉగ్రవాది శిబిరం(టెంట్)లోకి దూసుకుపోయి తనను తాను పేల్చేసుకున్నాడు. అంతకుముందే దేశవ్యాప్తంగా 2000 మంది మతపెద్దలు సమావేశమై తాలిబన్ల హింసాకాండను ఖండించారు. ఆత్మాహుతిదాడులు కూడదంటూ ఫత్వా జారీ చేశారు. విదేశీయులు దేశం విడిచి వెళ్లిపోవాలంటే తాలిబన్లు శాంతిసామరస్యాలతో ఉండాలనిఅభిప్రాయపడ్డారు. మరోవైపు అక్టోబరు 20న జరగనున్న పార్లమెంటరీ, జిల్లా కౌన్సిల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను భయపెట్టడానికి ఉగ్రవాద చర్యలు ఇటీవల పెరుగుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పొట్టి శ్రీరాములు స్మారక భవనం నిర్వహణకు కమిటీ

ఈనాడు, అమరావతి: చెన్నైలోని పొట్టి శ్రీరాములు స్మారక భవనం నిర్వహణకు కమిటీని వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఛైర్మన్‌గా మేడిశెట్టి తిరుమల కుమార్, కార్యదర్శి, ట్రెజరర్‌గా యెర్రమల్లి రమణకృష్ణ, సంయుక్త కార్యదర్శి వి.కృష్ణారావు, సభ్యులుగా 9 మందిని నియమించారు.

లావాలో బతుకులు బుగ్గి

- గ్వాటెమాలాలో బద్దలైన అగ్నిపర్వతం
- 25 మంది దుర్మరణం

గ్వాటెమాలా: మధ్య అమెరికా దేశం గ్వాటెమాలాలోని 'ఫ్యూగో' అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. చుట్టుపక్కల ప్రాంతాలను లావాతో ముంచెత్తింది. ఉవ్వెత్తున బూడిదను వెదజల్లింది. లావాలో చిక్కుకొని 25 మంది దుర్మరణం పాలయ్యారు. దాదాపు 300 మంది గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులున్నారు. 3,763 మీటర్ల ఎత్తుండే 'ఫ్యూగో' ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ బద్దలవ్వడంతో.. ఆకాశంలోకి 1.7 కిలోమీటర్ల ఎత్తున బూడిద ఎగిసిపడింది.

'ఫ్యూగో' నుంచి ఆదివారం వెలువడిన ప్రాణాంతక లావా దాదాపు ఎనిమిది కిలోమీటర్ల వరకు నది తరహాలో ప్రవహించింది. దీంతో అక్కడికి సమీపంలోని ఎల్ రొడియో అలొటెనంగో, శాన్ మిగ్వెల్ లాస్ లోటెస్ ప్రాంతాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. పొలాల్లో పనిచేస్తున్న పలువురు లావాలో

కూరుకుపోయి మృత్యువాతపడ్డారు. దట్టమైన పొగ, బూడిద చుట్టుపక్కల ప్రాంతాలను కమ్మేసింది. దాదాపు 3,100 మందిని అగ్నిపర్వతం పరిసర ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. లావా, బూడిదలో కూరుకుపోయినవారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బూడిద విపరీతంగా వ్యాపిస్తుండటంతో గ్వాటెమాలా సిటీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

'బాలమురళీ కృష్ణ' గ్రామాభివృద్ధికి కమిటీ

ఈనాడు, అమరావతి: మంగళంపల్లి బాలమురళీ కృష్ణ జన్మించిన తూర్పుగోదావరి జిల్లాలోని శంకరగుప్తం గ్రామ అభివృద్ధికి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సృజనాత్మకత, సంప్రదాయ కమిషన్ సీఈవోను సభ్య కన్వీనర్‌గా, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, బాలమురళీకృష్ణ కుమారుడు ఎం.అభిరామ్, ఎమ్మెల్యే గొల్లపల్లి సుర్యారావులను సభ్యులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని పారదోలుదాం

నేటి పర్యావరణ దినోత్సవ నినాదం ఇదే

దిల్లీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నాడిక్కడ జరిగే భారీ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తారు. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని పారద్రోలుదాం' అన్న నినాదం ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ఇతివృత్తంగా ఉంది. ఈ సందర్భంగా మంగళవారం రాజ్‌పథ్ లాన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన తిలకిస్తారు. ఈ ఏడాది జరుగుతున్న పర్యావరణ దినోత్సవానికి భారత్ ఆతిథ్యం ఇస్తోంది. పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో పర్యావరణ మంత్రులు, ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు, పలు పారిశ్రామిక సంస్థల సభ్యులు... ఇతర ప్రముఖులు పాల్గొంటారని ఓ అధికారిక ప్రకటన తెలిపింది.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పూరీ బీచ్‌లో 55 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పున ప్లాస్టిక్ సీసాలతో అందంగా తయారుచేసిన సైకతశిల్పం

పర్యావరణంతో భావోద్వేగ బంధం

- రాష్ట్రాలు కలిసొస్తే పర్యావరణ లక్ష్యాలను అందుకోవచ్చు
- కేంద్ర మంత్రి హర్షవర్ధన్ వ్యాఖ్యలు

దిల్లీ: రాష్ట్రాలు కలసికట్టుగా పనిచేస్తే పర్యావరణ సంబంధ లక్ష్యాలన్నింటినీ ఏడాదిలోగానే భారత్ అందుకోవచ్చని కేంద్ర మంత్రి హర్షవర్ధన్ చెప్పారు. పర్యావరణంతో భావోద్వేగ బంధాన్ని ఏర్పర్చుకోగలిగితేనే దాన్ని పరిరక్షించుకోవడం సాధ్యమవుతుందన్నారు. సోమవారం ఆయన ఇక్కడ.. రాష్ట్రాల పర్యావరణ మంత్రుల సదస్సులో మాట్లాడారు. పర్యావరణ రంగంలో కేంద్ర ప్రభుత్వం అనేక విజయాలను నమోదు చేసిందన్నారు. ప్రకృతి పరిరక్షణపై మరింత సమర్థంగా పనిచేయడానికి రాష్ట్రాలకు మరిన్ని అధికారలను అప్పగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరాస పర్యావరణ కార్యక్రమ (యూఎన్ఈపీ) కార్య నిర్వాహక డైరెక్టర్ ఎరిక్ సొల్హైమ్ కూడా పాల్గొన్నారు. ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని భారత్‌లో నిర్వహించాలన్న తన నిర్ణయానికి కారణం.. దేశంలోని జనాభా, వేగవంతమైన ఆర్థిక వృద్ధి వంటివి కారణమన్నారు. దేశంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణను ప్రస్తావిస్తూ.. పర్యావరణ అంశాన్ని పౌరులకు మరింత చేరువ చేయాలని కోరారు. ప్లాస్టిక్ కాలుష్యంపై కార్యాచరణ అవసరమని కేంద్ర పర్యావరణం, అటవీశాఖ సహాయ మంత్రి మహేశ్ శర్మ పేర్కొన్నారు.

చొరవ తీసుకోండి

- పేదల అభ్యున్నతికి పనిచేయండి
- గవర్నర్లకు రాష్ట్రపతి ఉద్బోధ

ఈనాడు - దిల్లీ

ఇప్పటివరకూ అభివృద్ధి ఫలాలు అందుకోని వెనుకబడిన జిల్లాల ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి గవర్నర్లు తగిన చొరవ తీసుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్బోధించారు. సోమవారం ఇక్కడి రాష్ట్రపతిభవన్‌లో ఆయన అధ్యక్షతన 49వ గవర్నర్ల వార్షిక సదస్సు ప్రారంభమయింది. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరయిన ఈ సమావేశంలో తెలుగురాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్‌నరసింహన్, మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావుతోపాటు అన్నిరాష్ట్రాల గవర్నర్లు, లెఫ్టినెంట్‌గవర్నర్లు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రారంభోపన్యాసంచేస్తూ "దేశవ్యాప్తంగా ఉన్న 115 ఆకాంక్షిత జిల్లాలు అభివృద్ధిపథంలో ముందడుగువేయాలని కోరుకుంటున్నాయి. ఆ జిల్లాల వెనుకబాటుతనానికి దారితీసిన నేపథ్యాన్ని అర్థంచేసుకుంటే అక్కడి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం మరింత సులువవుతుంది. మన తోటి ప్రజల అభ్యున్నతికి బాటలువేయడానికి అనువైన మార్గసూచి తయారుచేయడంలో గవర్నర్లుగా మీవంతు సాయం చేయొచ్చు" అని పేర్కొన్నారు. రాజ్యాంగపరంగా గవర్నర్‌పదవికి ఉన్నత స్థానం ఉందని, గవర్నర్ కార్యాలయం అంటే ఆలోచనలు, విలువలకు ఆలవాలమని ప్రజలు భావిస్తారని చెప్పారు. దేశంలో 69 శాతం విశ్వవిద్యాలయాలు రాష్ట్రప్రభుత్వాల పరిధిలోకి వస్తాయని, ఉన్నత విద్య అభ్యసించేవారిలో 94% మంది ఇందులోనే చదువుతున్నారని గుర్తుచేశారు. ఈ విశ్వవిద్యాలయాలన్నిటికీ గవర్నర్లే కులపతులుగా ఉంటున్నందున ఆ విద్యాలయాల్లో ప్రమాణాలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లడానికి తమవంతు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రవేశాలు, అధ్యాపకుల నియామక ప్రక్రియ అంతా సకాలంలో, పారదర్శకంగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. "గవర్నర్లుగా మీరంతా యువతకు సంరక్షకులు. వారు నైతిక విలువలు అలవర్చుకునేలా మీరు స్ఫూర్తిని కల్పించవచ్చు. వారు ఆధునిక విద్యను అభ్యసిస్తూనే భారత విలువలు పాటించేలా ప్రేరణ కలిగించవచ్చు." అని పేర్కొన్నారు.

సమాఖ్య వ్యవస్థలో గవర్నర్లది కీలక పాత్ర: ప్రధాని

ప్రారంభ సదస్సును ఉద్దేశించి ప్రదాని మోదీ ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి పథకాల ప్రయోజనాల ద్వారా ప్రజలు గరిష్ఠంగా లబ్ధి పొందేందుకు గవర్నర్లు తమ అనుభవాన్ని ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. మన సమాఖ్య వ్యవస్థలో గవర్నర్ వ్యవస్థకు అత్యంత కీలకమైన పాత్ర ఉందని పేర్కొన్నారు. విద్య, క్రీడలు తదితర రంగాల్లో ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాల ఫలాలను గిరిజనులు అందుకొనేలా గవర్నర్లు చొరవచూపాలని కోరారు. ఈ నెల 21న యోగాదినోత్సవం అని గుర్తు చేస్తూ గవర్నర్లు విశ్వవిద్యాలయాల కులపతులు కాబట్టి యువతలో యోగాపట్ల అవగాహన కల్పించడానికి కృషిచేయాలని కోరారు. మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవ నిర్వహణలో విశ్వవిద్యాలయాలు ప్రధాన భూమిక పోషించేలా చూడాలని కోరారు. ఇటీవల కాలంలో విద్యుత్తు సౌకర్యం పొందిన గ్రామాలను గవర్నర్లు సందర్శించి విద్యుత్తు కారణంగా లభించిన ప్రయోజాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే బాగుంటుందన్నారు. మంగళవారం కూడా జరిగే ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల గురించి చర్చిస్తారు.

'మిషన్ ఫిట్ ఇండియా' కార్యక్రమం ప్రారంభంలో భాగంగా సోమవారం దిల్లీలో యోగాసనం వేస్తున్న బాబా రాందేవ్‌ను తిలకిస్తున్న బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి తదితరులు

రైఫిళ్లకు నిధులు లేవండి

- 2.5 లక్షల తుపాకులనే కొనుగోలు చేయనున్న సైన్యం
- మూడో వంతుకు సంఖ్య కుదింపు

దిల్లీ: సైనికుడి కనీస ఆయుధమైన రైఫిల్ కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న భారత సైన్యానికి అరకొరగానే అవసరాలు తీరబోతున్నాయి. ఆధునిక రైఫిళ్ల కోసం పెడుతున్న ఆర్డర్‌ను 2.5లక్షలకే పరిమితం చేయాలని సైన్యం నిర్ణయించింది. కావాల్సిన తుపాకుల సంఖ్యలో ఇది మూడో వంతే కావడం గమనార్హం. నిధుల కొరత, వేగంగా ఆయుధాలను అందుకోవాల్సిన ఆవశ్యకత వంటి కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ రైఫిళ్లను ప్రధానంగా పదాతి దళ సైనికులు ఉపయోగిస్తుంటారు. వీరు కశ్మీర్, నియంత్రణ రేఖ, ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాదులు, శత్రు సైనికుల నుంచి తీవ్ర దాడులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వీరు వినియోగిస్తున్న ఇన్సాస్ రైఫిల్‌కు కాలం చెల్లింది. దీంతో ఆధునిక తుపాకీ సమీకరణపై సైన్యం దృష్టిపెట్టింది. 250 కోట్ల డాలర్లతో 8లక్షల రైఫిళ్లను కొనుగోలు చేయాలని తొలుత నిర్ణయించింది. అధికారుల అలసత్వం వంటి కారణాల వల్ల ఇది ఇంత కాలం జాప్యమవుతూ వస్తోంది. దీనికితోడు బడ్జెట్ కొరత వంటి కారణాల వల్ల ఈ సంఖ్యను తాజాగా కుదించింది. ఇప్పుడు 2.5 లక్షల ఆయుధాలకే ఆర్డర్లు పెట్టబోతోంది. ఈ నెలాఖరులో సైనిక బృందాలు.. ఇటలీ, స్విట్జర్లాండ్, చెక్ రిపబ్లిక్, ఇజ్రాయెల్ వెళ్లి, అక్కడి ఆయుధ తయారీ కంపెనీలతో సమావేశమవుతాయి. సైన్యం అవసరాలు తీర్చే అధునాతన రైఫిల్‌ను ఎంపిక చేస్తాయి. మిగతా సైనికుల అవసరాలను ఏకే శ్రేణి, ఇన్సాస్ తుపాకులతో తీర్చాలని సైన్యం భావిస్తోంది.

ఆసుపత్రి నుంచి ఇంటికి జైట్లీ

దిల్లీ: మూత్రపిండ మార్పిడి కోసం అఖిల భారత వైద్య విజ్ఞానసంస్థ (ఎయిమ్స్)లో చేరిన కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ (65) మూడు వారాల తర్వాత సోమవారం ఇంటికి చేరుకున్నారు. తన ఆరోగ్యం విషయంలో జాగ్రత్త తీసుకుంటూ సేవలందించిన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి ఆయన ట్విట్టర్‌లో ధన్యవాదాలు తెలిపారు. తాను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన శ్రేయోభిలాషులు, సహచరులు, మిత్రులు తదితరులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. మే 12న ఆయన ఆసుపత్రిలో చేరగా 14న శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం ఎలాంటి ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఆయనను వేరుగా ప్రత్యేకవార్డులో ఉంచి చికిత్స అందించారు. జైట్లీ చికిత్స పొందుతున్న సమయంలో ఆయన చూస్తున్న ఆర్థికశాఖ అదనపు బాధ్యతలను రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే.

ఇంటికి చేరుకున్న అరుణ్‌జైట్లీ పరిమిత వాతావరణంలో ఇంటినుంచే పనిని ప్రారంభించారు. ఈమేరకు సోమవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో దృశ్యశ్రవణ విధానంలో (వీడియో కాన్ఫరెన్స్) సమావేశమయ్యారు. ఆర్థికశాఖ కార్యదర్శి హస్ముఖ్ ఆధియా, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్, ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్‌లు వివిధ అంశాలను మంత్రికి వివరించారు. జైట్లీ ఇలాంటి సమావేశాలు మరిన్ని నిర్వహించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

1977 పరిస్థితులే ఇప్పుడూ

- కాషాయ పార్టీ ఓటమి చిన్న విషయం కాదు
- ప్రతిపక్షాలు ఏకమైతే భాజపాను ఓడించవచ్చు: శరద్‌పవార్

ముంబయి: తాజా ఉప ఎన్నికల్లో భాజపా ఓటమి పాలవడం అంత తేలిగ్గా కొట్టిపారేసే విషయం కాదని ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలు ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని, అవసరమైతే తానే అందుకు చొరవ తీసుకుంటానని చెప్పారు. పాల్‌ఘర్ లోక్‌సభ స్థానంలో భాజపా గెలిచినప్పటికీ, వ్యతిరేక ఓట్లు రెట్టింపు కంటే ఎక్కువగా పోలైన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఇటీవల దేశవ్యాప్తంగా 14చోట్ల అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో భాజపా, దాని మిత్రపక్షాలు మూడుస్థానాల్లోను; ప్రతిపక్షాలు 11 స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఉప ఎన్నికల్లో భాజపా ఓటమి చెందడం చిన్నవిషయం కాదని పవార్ అన్నారు. 1977లో ఉన్న పరిస్థితులే ఇప్పుడూ కనిపిస్తున్నాయని, అప్పట్లో ప్రతిపక్షాలు ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించాయని గుర్తు చేశారు. కేరళలో వామపక్షాలు, కర్ణాటకలో జేడీఎస్, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, తెలంగాణలో తెరాస, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ, మహారాష్ట్రలో ఎన్సీపీ, కాంగ్రెస్ బలంగా ఉన్న కర్ణాటక, పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్రలో ఆయా పార్టీలు ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు.

షిల్లాంగ్‌కు అదనపు బలగాలు

- పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై దాడి

షిల్లాంగ్/ దిల్లీ: అల్లర్లతో అట్టుడుకుతున్న షిల్లాంగ్ (మేఘాలయ)కు అదనంగా 6 కంపెనీల పారామిలటరీ సిబ్బందిని పంపించేందుకు కేంద్రం ఆమోదించింది. ఇప్పటికే 10 కంపెనీలకు చెందిన వెయ్యి మందిని తరలిచింది. తాజాగా ఆదివారం రాత్రి కూడా షిల్లాంగ్‌లో హింస చెలరేగింది. పంజాబీలైన్ ప్రాంతానికి సమీపంలో కొందరు ఆందోళనకారులు దాక్కోవడంతో.. వారిని అక్కడి నుంచి పంపించేందుకు పోలీసులు ప్రయత్నించగా కొందరు ఎదురుతిరిగి ఓ అధికారిపై దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు బాష్పవాయు ప్రయోగం చేశారు. 14 ప్రాంతాల్లో కర్ఫ్యూ కొనసాగుతున్న నేపథ్యంలో సోమవారం కూడా సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగింది. మల్వాలీలో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో ముగ్గురు గాయపడ్డారు. గత గురువారం ఓ బస్సు నిర్వాహకుడిపై స్థానికులు కొందరు దాడికి పాల్పడటంతో.. షిల్లాంగ్‌లోని పంజాబీ లైన్ ప్రాంతంలో రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలు క్రమేపీ విస్తరించిన సంగతి తెలిసిందే. అల్లర్ల నేపథ్యంలో పరిస్థితిని అంచనా వేసేందుకు పంజాబ్‌కు చెందిన ఓ సభ్యుడిని షిల్లాంగ్ పంపించేందుకు జాతీయ మైనార్టీల కమిషన్ నిర్ణయించింది. అలాగే కేబినెట్ మంత్రి నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందాన్ని పంపుతున్నట్లు పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ వెల్లడించారు.

షిల్లాంగ్‌లో పహారా కాస్తున్న సైనికులు

సాకులు కుదరవు

- వైద్యపరమైన నిర్లక్ష్యంపై దిల్లీ వినియోగదారుల కమిషన్ స్పష్టీకరణ

దిల్లీ: వార్డులన్నీ రోగులతో కిక్కిరిసి ఉన్నాయి!. ..డ్యూటీ డాక్టర్లు ఓవర్‌టైమ్ చేస్తున్నారు!...వంటి కుంటిసాకులతో...వైద్యపరమైన నిర్లక్ష్యాన్ని సమర్థించుకోవడానికి కుదరదని దిల్లీ వినియోగదారుల కమిషన్ స్పష్టం చేసింది. వైద్యసేవల లోపంతో మరణించిన మహిళ భర్తకు రూ.11.05 లక్షలను పరిహారంగా చెల్లించాల్సిందిగా ఇక్కడి సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిని ఆదేశించింది. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లో సెలవురోజుల్లోనైనా...పనిదినాల్లోనైనా సరే సర్వదా తగినంత మంది వైద్యులు, నిపుణులు కచ్చితంగా అందుబాటులో ఉండాల్సిందేనని కమిషన్ పేర్కొంది. 2006 ఏప్రిల్ 26వ తేదీన తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన ఓ మహిళకు వెంటిలేటర్ అవసరం ఉన్నప్పటికీ ఐసీయూలో ఆరోజు వెంటిలేటర్లు అందుబాటులో లేవు. కనీసం ఒక పడక కూడా ఖాళీలేదు. పైగా, ఎవరూ పెద్దగా స్పందించలేదు. దీంతో, ఉదయం 8 గంటల ప్రాంతంలో ఆ రోగి ప్రాణాలు కోల్పోయింది. ఈ మరణం వైద్యపరమైన నిర్లక్ష్యం కిందకే వస్తుందని కమిషన్ సుస్పష్టం చేసింది.

రూ.10కే 4 రుతురుమాళ్లు

మహిళలు, బాలికల సౌకర్యార్థం అతి తక్కువ ధరకే శానిటరీ నాప్‌కిన్లు అందించేందుకు కేంద్రప్రభుత్వం ముందుకొచ్చింది. 'ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పీఎంబీజేపీ)' కింద ఒక్కో శానిటరీ నాప్‌కిన్ ప్యాడ్‌ను రూ.2.50కే అందించే బృహత్తర కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 3,600కుపైగా జనౌషధి కేంద్రాల్లో ఈ 'సువిధ ఆక్సో-బయోడీగ్రేడబుల్' శానిటరీ నాప్‌కిన్లు అందుబాటులో ఉంటాయని కేంద్ర సహాయమంత్రి మన్సుఖ్ ఎల్ మాండవీయ తెలిపారు.

శివసేనతో పొత్తుకే ఫడణవిస్ మొగ్గు

ముంబయి: వచ్చే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు గాను శివసేనతో పొత్తుకు ప్రయత్నించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవిస్ భాజపా రాష్ట్ర నేతలకు సూచించారు. ఇటీవల జరిగిన పాల్‌గఢ్, భండారా-గోండియా ఉప ఎన్నికల్లో భాజపా పనితీరుపైన.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వ్యూహాలపైనా సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు ఏకమయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ఆందోళన అవసరం లేదని కార్యకర్తలకు స్పష్టం చేశారు. అందుకు దీటుగా సిద్ధమవుదామని పేర్కొన్నారు. శివసేనతో జట్టు కట్టేందుకు ప్రయత్నించాలని.. కుదరని పక్షంలో ఒంటరిపోరుకు సిద్ధం కావాలని ఫడణవిస్ స్పష్టం చేసినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రావుసాహెబ్ దన్వే విలేకరులకు తెలిపారు. కాగా భవిష్యత్తు ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోరాడుతామంటూ గత కొద్ది నెలలుగా శివసేన చెబుతూ వస్తోంది. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన శివసేన జాతీయ కార్యనిర్వాహక సమావేశంలోనూ ఈమేరకు తీర్మానం చేసింది.

సౌదీలో తొలిసారి మహిళలకు డ్రైవింగ్ లైసెన్సుల జారీ!

రియాద్: సౌదీ అరేబియాలో సోమవారం తొలిసారిగా ఓ మహిళా బృందానికి డ్రైవింగ్‌లైసెన్సులు జారీ అయినాయి. సౌదీలో మహిళల డ్రైవింగ్ పై ఎన్నో దశాబ్దాల నుంచీ నిషేధం కొనసాగుతోంది. మహిళా డ్రైవర్లకు ఎన్ని లైసెన్సులు మంజూరు చేశారన్న వివరాలు మాత్రం వెంటనే తెలియరాలేదు.

జోర్డాన్ ప్రధాని రాజీనామా

అమ్మాన్: పొదుపు పేరుతో జోర్డాన్ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన ఆందోళనకు తలొగ్గి ప్రధాని హనీ ముల్కీ సోమవారం రాజీనామా చేశారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 ఆయనను పిలిపించి రాజీనామా చేయాలని కోరారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి ఒమర్ అల్ రజాజ్‌ను సూచించారు.

భారత్-పాక్ యుద్ధానికి తావు లేదు

పాకిస్థాన్ సైన్యం అభిప్రాయం

ఇస్లామాబాద్: భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధానికి తావు లేదని పాక్ సైన్యం అభిప్రాయపడింది. ఇరుదేశాల వద్ద అణ్వస్త్రాలున్న సంగతిని గుర్తుచేసింది. పాక్ సైన్యపు మీడియా విభాగమైన 'ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్)' డైరెక్టర్ జనరల్ అసిఫ్ ఘఫూర్ సోమవారమిక్కడ విలేకర్ల సదస్సులో ఈ మేరకు మాట్లాడారు. 2018 ఆరంభం నుంచి ఇప్పటివరకు సరిహద్దుల్లో భారత సైన్యం 1,077 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. తమ శాంతి కాముఖతను బలహీనతగా పొరపడొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం భారత్-పాక్ ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరుపుకుంటున్నాయని పేర్కొన్నారు.

రైతుల ఆందోళనలో విద్రోహ శక్తుల చొరబాటు

దిల్లీ: ఉత్తరాది రాష్ట్రాల్లో రైతులు చేస్తున్న 'గ్రామాల బందు' ఆందోళన సోమవారం నాలుగో రోజుకు చేరుకుంది. రాజస్థాన్‌లో సంఘ విద్రోహ శక్తులు చొరబడి ఉద్యమంలో అరాచకం సృష్టించారు. మరో వైపు ఈ నెల ఆరో తేదీన ఉద్యమం విరమించాలని పంజాబ్ రైతులు నిర్ణయించారు. మిగిలిన రాష్ట్రాల్లో ముందుగా అనుకున్న మేరకు ఈ నెల పదో తేదీ వరకు సమ్మె కొనసాగనుంది. సంఘవిద్రోహ శక్తులు రాజస్థాన్‌లోని జైపూర్ డెయిరీకి చెందిన 12 ట్యాంకర్లను ధ్వంసం చేసి 60 వేల లీటర్ల పాలను నేల పాలు చేశారు. ఇది సంఘవిద్రోహ శక్తుల పనేనని రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ నాయకుడు ఒకరు తెలిపారు. పాల సేకరణను కూడా అడ్డుకుంటున్నారని చెప్పారు. సరఫరా నిలిచిపోవడంతో చాలా చోట్ల కూరగాయల ధరలు 25-30 శాతం మేర పెరిగాయి.

చట్టసభ్యులపై విచారణ.. ప్రత్యేక న్యాయస్థానాలకు కేంద్రం నిధులు!

దిల్లీ: చట్టసభ్యులపై నమోదైన కేసులను విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానాలకు కేంద్రం నిధులను మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా శాసన, పార్లమెంటు సభ్యులపై మొత్తం 1,581 కేసులున్నాయి. వీటిపై 11 రాష్ట్రాల్లో ఉన్న మొత్తం 12 ప్రత్యేక న్యాయస్థానాలు విచారణ చేపడుతున్నాయి. ఈ కోర్టుల నిర్వహణకు ఏటా రూ.8 కోట్ల మేర అవసరమవుతుందని అంచనా. ఈ క్రమంలో కేంద్ర న్యాయశాఖ సోమవారం రూ.1.79 కోట్లను విడుదల చేసింది. రాష్ట్రాల నుంచి నిధుల వినియోగపత్రాలు అందిన తర్వాత కేంద్రం మలివిడత నిధులను విడుదల చేయనుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న కేసుల విచారణకు వీటిని నెలకొల్పాలని గత నవంబరులో సుప్రీంకోర్టు ఆదేశించింది.

తక్షణ ప్రశ్నలకు మోదీ సమాధానాలు ఇవ్వలేరు

- రాహుల్ గాంధీ వ్యాఖ్య

దిల్లీ: సమావేశాల్లో అప్పటికప్పుడు అడిగే అసలు ప్రశ్నలకు ప్రధాని నరేంద్ర మోదీ సమాధానాలు ఇవ్వలేరని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 'తక్షణ ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇవ్వరు. ఒక వేళ ఇస్తే మనందరికీ ఇబ్బందికరమే' అంటూ ట్వీట్ చేశారు. సింగపూర్‌లోని నన్యాంగ్ సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన హిందీలో సమాధానాలు ఇచ్చారు. వాటిని అనువాదకుడు తర్జుమా చేశారు. ఒక ప్రశ్నకు ఆయన హిందీలో సమాధానం ఇవ్వగా, అనువాదకుడు మాత్రం ఓ కాగితం తీసి చాలా సేపు చదివారు. మోదీ చెప్పని అంకెలు, విషయాలను కూడా ప్రస్తావించారు. అంటే ఆ ప్రశ్నలు, ఇచ్చిన సమాధానాలు ముందుగా అనుకున్నవే తప్ప, అప్పటికప్పుడు అడిగినవి కావని రాహుల్ అభిప్రాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన ట్వీట్‌తో జత చేశారు.

మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ 40 రోజుల ప్రచారం

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 40 రోజుల పాటు దేశ వ్యాప్తంగా ప్రచారం చేయనున్నట్టు ప్రముఖ కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆ సంఘం నాయకురాలు అమర్జీత్ కౌర్ సోమవారం ఇక్కడ చెప్పారు. ఆగస్టు 9 నుంచి సెప్టెంబరు 18 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మోదీ దేశాన్ని అమ్మకానికి పెట్టారని, కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చలు జరపడానికి కూడా ఇష్టపడడం లేదని ఆరోపించారు. ఫిబ్రవరిలో జరగాల్సిన వార్షిక జాతీయ కార్మిక సదస్సును కూడా రద్దు చేశారని, ఆ తరువాత మళ్లీ తేదీలు ప్రకటించలేదని అన్నారు.

కర్మాగారాన్ని మూసేయించిన ప్రజాగ్రహం

నోయిడాలోని సెక్టార్ 123 వద్ద నిర్మించిన వ్యర్థాల నుంచి విద్యుచ్ఛక్తిని తయారుచేసే కర్మాగారానికి వ్యతిరేకంగా కదం తొక్కిన ప్రజానీకం వీరు. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలను తోసిరాజని కర్మాగారంలో పనులను సోమవారం వీరు నిలిపివేయించారు.

అంకిత్ తండ్రి మంచి పని చేశారు

- పుత్రశోకాన్ని దిగమింగుకుని మత సామరస్యం కోసం ఇఫ్తార్ విందు

యశ్‌పాల్ సక్సేనా

దిల్లీ: ఆయనకు ఉన్నది ఒక్కగానొక్క కుమారుడు. ఆ కుమారుడిని మరో మతానికి చెందిన ఒక కుటుంబం హత్య చేసింది. కారణం తమ అమ్మాయిని వేరే మతానికి చెందిన ఆ అబ్బాయి ప్రేమిస్తున్నాడనే ద్వేషమే. చనిపోయిన ఆ అబ్బాయి పేరు అంకిత్. ఈ సంఘటన జరిగి కొన్ని నెలలు గడిచిపోయింది. అంకిత్ తండ్రి యశ్‌పాల్ సక్సేనా పుత్ర శోకం దిగమింగుకుని ఇప్పుడొక మంచి పని చేశారు. మత సామరస్యాన్ని ప్రోత్సహించడానికి తమ ఇంట్లో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. దిల్లీలోని ఆయన నివాసంలో ఆదివారం రాత్రి పండగ వాతావరణం కనిపించింది. అంకిత్ హత్య మతం రంగు పులుముకోవడానికి అవకాశం ఇవ్వకూడదనే లక్ష్యంతో హిందూ, ముస్లిం- రెండు మతాలకు చెందిన వారు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. "అంకిత్ హత్య కేవలం ద్వేషంతోనే జరిగింది. పరస్పరం కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించుకుందాం అని అప్పట్లో ఆ అమ్మాయి తల్లిదండ్రులకు చెప్పాను. కానీ వారు చాలా కోపంతో ఉన్నారు. నా మాట వినలేదు." అని యశ్‌పాల్ సక్సేనా సోమవారం అన్నారు. ద్వేషాన్ని కాకుండా మతసామరస్యం, ప్రేమ, శాంతి సందేశాలను వ్యాప్తి చేయాలనే లక్ష్యంతోనే తాను ఇఫ్తార్‌ను నిర్వహించినట్లు తెలిపారు.

సెన్సెక్స్ ▼ 215	నిఫ్టీ ▼ 68	డోజోన్స్ 24819 ▲ 185	నాస్‌డాక్ 7594 ▲ 39	రూపాయి 67.11 ▼ 5 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	ముడి చమురు 75.45 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)
35012	10629				

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఈనాడు బిజినెస్

ఘనం (+)

నిఫ్టీ	4న	మార్పు %
DR. REDDYS LAB	1996.00	2.81
INFOSYS	1239.40	1.52
M & M	914.50	1.43
HINDALCO	241.60	1.30
LUPIN	773.95	1.24
RELIANCE IND	940.85	1.11
TATA STEEL	566.15	0.98

గ్రహణం (-)

నిఫ్టీ	4న	మార్పు %
INDIABULLS HSG	1173.95	-4.82
HDFC BANK	2046.20	-3.05
BHARTI AIRTEL	372.30	-2.97
ADANI PORT	378.55	-2.33
BAJAJ FINSERV	5748.55	-2.27
POWER GRID CORP.	201.70	-2.06
GAIL (INDIA)	335.05	-1.85

విదేశీ మారకపు రేట్లు (థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	60.83	70.54	బహ్రెయిన్ దినార్	164.84	188.40
పౌండ్ స్టెర్లింగ్	81.37	94.36	కువైట్ దినార్	182.85	227.62
యూరో	71.14	82.50	ఒమన్ రియాల్	161.32	184.56
జపనీస్ యెన్/100	55.53	64.40	సౌదీ రియాల్	16.18	19.17
ఆస్ట్రేలియా డాలరు	46.31	53.60	యూఏఈ దిర్హమ్	16.56	19.34
సింగపూర్ డాలరు	45.51	53.91	మలేషియా రింగిట్	14.97	18.41
థాయ్ బాత్/100	190.04	227.29	చైనీస్ యువాన్	7.37	11.95

సోమవారం నిఫ్టీ కదలికలు



నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సారి కీలక రేట్లు పెంపు ఉండొచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు బలహీనతలు కొనసాగొచ్చు. షేరు కొనుగోలుకు విదేశీ సంస్థాగత మదుపర్లకు తిరిగి అనుమతి ఇచ్చినప్పటికీ.. స్పందన రాకపోవడమే ఇందుకు కారణం. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. అమెరికా- చైనా వాణిజ్య ఉద్రిక్తతలపై దృష్టి పెట్టొచ్చు. మధ్య, చిన్న షేర్లలో నష్టాలు కొనసాగే అవకాశం ఉంది. ఇవి మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపొచ్చు. స్థిరాస్తి రంగ కొనసాగి.. షేరు విలువలు మరింత పడిపోవచ్చని అంటున్నారు. నేడు నిఫ్టీ 10590-10680 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నేడు ఎఫ్ఎంసీజీ, వాహన షేర్లు రాణించొచ్చని, బ్యాంకులు డీలాపడొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

రేట్ల పెంపు భయాలతో..

● వెల్లువెత్తిన అమ్మకాలు ● 215 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ ● స్థిరాస్తి, విద్యుత్ షేర్లు డీలా



సూచీల ఆరంభ జోరుకు కళ్లెం పడింది. ద్రవ్యోల్బణం పెరుగుతుండటం వల్ల నాలుగేళ్లలోనే తొలిసారిగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రేట్లు పెంచొచ్చన్న వార్తలు ఇందుకు కారణమయ్యాయి. సోమవారం ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. రేట్ల ఆధారిత రంగాలైన స్థిరాస్తి, బ్యాంకింగ్ షేర్లు కుదేలయ్యాయి. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,503.24 పాయింట్ల వద్ద భారీ లాభాల్లో ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ.. ఇంట్రాడేలో 35,555.59 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. అనంతరం అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లోకి జారిన సూచీ.. ఒకానొకదశలో 34,982.25 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 215.37 పాయింట్ల నష్టంతో 35,011.89 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ 67.70 పాయింట్లు కోల్పోయి 10,628.50 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,618.35- 10,770.30 పాయింట్ల మధ్య కదలాడింది.

డాక్టర్ రెడ్డీస్ దూకుడు: శ్రీకాకుళంలోని ఏపీఐ ప్లాంట్ తనిఖీలను అమెరికా ఔషధ నియంత్రణ యూఎస్ఎఫ్‌డీఏ పూర్తి చేసి, ఎటువంటి అభ్యంతరాలు తెలుపకపోవడంతో డాక్టర్ రెడ్డీస్ షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో 4.25 శాతం పెరిగిన షేరు.. చివరకు 2.86 శాతం లాభంతో రూ.1,996.95 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.912.62 కోట్లు పెరిగి రూ.33,122.62 కోట్లకు చేరింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టాలు చవిచూశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.99%, భారతీ ఎయిర్‌టెల్ 2.81%, అదానీ పోర్ట్స్ 2.47%, పవర్‌గ్రిడ్ 2.06%, హిందుస్థాన్ యునిలీవర్ 1.73%, ఎన్‌టీపీసీ 1.43%, ఎస్‌బీఐ 1.37%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.14%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.13%, ఓఎన్‌జీసీ 0.98% చొప్పున డీలాపడ్డాయి. ఇన్ఫోసిస్ 1.59%, ఎం అండ్ ఎం 1.45%, టాటా స్టీల్ 1.18%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.09%, టీసీఎస్ 0.71% లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 3.25% కోల్పోయింది. విద్యుత్, టెలికాం, మన్నికైన వినియోగ వస్తువులు, ఫైనాన్స్, బ్యాంకింగ్, మౌలిక, యంత్ర పరికరాలు, పీఎస్‌యూ, ఎఫ్ఎంసీజీ షేర్లు అదే బాటలో నడిచాయి. ఐటీ, లోహ షేర్లు మాత్రం రాణించాయి.

రాంకీ ఎన్విరో ఇంజినీర్స్‌లో వాటా కొనుగోలు చేసిన కేకేఆర్?

హైదరాబాద్: వ్యర్థ పదార్థాల నిర్వహణ సంస్థ రాంకీ ఎన్విరో ఇంజినీర్స్‌లో అంతర్జాతీయ ప్రైవేటు ఈక్విటీ సంస్థ కేకేఆర్ వాటా సొంతం చేసుకుంటుంది. ఇందులో 60శాతం వాటాను దాదాపు రూ.4వేల కోట్లకు (600మిలియన్ డాలర్లు) చేజిక్కించుకోనుందని సమాచారం. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తోన్న రాంకీ గ్రూపు మౌలిక వసతులు, ఫార్మా రంగంలో వ్యాపారాలు నిర్వహిస్తోంది. పారిశ్రామిక, మున్సిపల్, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఉన్న రాంకీ ఎన్విరో భారత్‌తో పాటు, సింగపూర్, యూఏఈ, ఆఫ్రికా దేశాల్లో సేవలు అందిస్తోంది. మన దేశంలో 17 రాష్ట్రాల్లో, 55 ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సంస్థకు దాదాపు 7800 మంది ఉద్యోగులున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థ ఆదాయం దాదాపు రూ.1,900 కోట్లు. ప్రస్తుతం సంస్థ ప్రమోటర్ల వాటా నుంచి, ప్రస్తుతం ఉన్న ప్రైవేటు ఈక్విటీ భాగస్వాములైన స్టాండర్డ్ చార్టర్డ్ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రోత్ ఫండ్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ పీఈ సంస్థలకున్న 10శాతం వాటాను కేకేఆర్ కొనుగోలు చేయబోతోంది.

ఫండ్‌ల అదనపు రుసుములో కోత

5 బేసిస్ పాయింట్లకే పరిమితం: సెబి

దిల్లీ: మ్యూచువల్ ఫండ్‌ల వైపు మరింత మంది ఆకర్షితులయ్యేందుకు ఫండ్ సంస్థలు విధిస్తున్న 'అదనపు రుసుము'ను 5 బేసిస్ పాయింట్లకు (0.05%) సెబీ తగ్గించింది. ఇంతకుముందు ఇది 20 బేసిస్ పాయింట్లు (0.20%)గా ఉంది. ఫండ్ పథకాల్లో పెట్టుబడులపై ఖర్చు తగ్గేందుకు తాజా పరిణామం దోహదం చేస్తుంది. అదే సమయంలో ఫండ్ పథకాలు విక్రయించే/ చేసే సంస్థలు/ పంపిణీదారుల కమిషన్లు తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అదనంగా 0.20% రుసుము విధించేందుకు 2012లో ఫండ్ సంస్థలకు సెబీ అనుమతినిచ్చింది.

మార్కెట్ కబుర్లు

- అమెరికా బయోటెక్ సంస్థ మోన్‌శాంటో కొనుగోలు పూర్తి చేసినట్లు జర్మనీ రసాయనాలు, ఔషధ దిగ్గజం **బేయర్ ఏజీ** ప్రకటించింది. ఈ కొనుగోలుకు కంపెనీ 63 బిలియన్ డాలర్లు వెచ్చించింది.
- **టాటా మోటార్స్** ఎలక్ట్రిక్ మొబిలిటీ వ్యాపారం అధిపతిగా శైలేశ్ చంద్ర నియమితులయ్యారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ వ్యాపారం, కార్పొరేట్ వ్యూహాల అధ్యక్షుడిగా సైతం కొనసాగనున్నారు.
- **పంజాబ్ నేషనల్ బ్యాంక్** రేటింగ్‌ను బీ నుంచి 'బీబీ-'కు ఫిచ్ రేటింగ్స్ తగ్గించింది. రుణ పుస్తకం క్షీణించడాన్ని ఇందుకు కారణంగా పేర్కొంది.
- రుణాల ఊబిలో కూరుకున్న **రుచి సోయా** కొనుగోలుకు మళ్లీ బిడ్డింగ్ వేయాల్సిందిగా పతంజలి ఆయుర్వేద్, అదానీ గ్రూప్‌లను రుణదాతలు కోరినట్లు బాబా రామ్‌దేవ్ తెలిపారు.
- కంపెనీలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పరిమితిని 100 శాతానికి పెంచేందుకు **ఐడియా సెల్యులార్**‌కు టెలికాం శాఖ అనుమతి లభించింది. తద్వారా వొడాఫోన్‌తో విలీనానికి దాదాపు అడ్డంకులు తొలగిపోయాయి.
- **ఇన్ఫీబీమ్** త్వరలో చెల్లింపుల బ్యాంకును ఏర్పాటు చేసేందుకు యోచన చేస్తోంది. ఈనెల 28న జరిగే అసాధారణ సర్వసభ్య సమావేశంలో ఈ ప్రతిపాదనపై వాటాదార్ల అంగీకారం కోరనుంది.
- జపాన్‌కు చెందిన **సుజుకీ మోటార్ కార్పొరేషన్ (ఎస్‌ఎంసీ)** భారతదేశంలో 2 కోట్ల వాహనాల ఉత్పత్తి మైలురాయిని దాటినట్లు తెలిపింది. జపాన్ తరవాత 2 కోట్ల వాహనాల మైలురాయిని భారత్‌లోనే దాటామని కంపెనీ వెల్లడించింది.

మొండి బకాయిలకు పరిష్కారం చూపండి

● బ్యాంకుల సంఘాన్ని కోరిన పార్లమెంటరీ సంఘం

దిల్లీ: పెరుగుతున్న మొండి బకాయిల పరిష్కారానికి ప్రణాళికను సిద్ధం చేయమంటూ భారత బ్యాంకుల సంఘా(ఐబీఏ)న్ని పార్లమెంటరీ సంఘం కోరింది. అదే సమయంలో వీడియోకాన్ గ్రూప్‌నకు రుణం ఇవ్వడంలో ఐసీఐసీఐ బ్యాంకు ఎండీ, సీఈఓ చందా కొచ్చర్ పక్షపాతం వహించినట్లుగా వచ్చిన ఆరోపణలపైనా ప్రశ్నలు లేవనెత్తినట్లు తెలుస్తోంది. ఉద్దేశపూర్వక ఎగవేతదార్లను, కార్పొరేట్లను ఒకే విధంగా చూడకూడదని లోక్‌సభ సభ్యుడు వీరప్ప మొయిలీ ఆధ్వర్యంలో జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(ఫైనాన్స్), బ్యాంకర్ల మధ్య జరిగిన సమావేశం అభిప్రాయ పడినట్లు సమాచారం. డిసెంబరు 2017 చివరి నాటికి బ్యాంకుల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) రూ.8.31 లక్షల కోట్లకు చేరిన సంగతి తెలిసిందే.

ఎన్‌పీఏలు, బ్యాంకు మోసాల్లోని వివిధ కోణాలను ఐబీఏ డిప్యూటీ ఛైర్మన్, ఎస్‌బీఐ అధిపతి రజనీశ్ కుమార్, పీఎన్‌బీ ఎండీ సునీల్ మెహతాలు సమావేశంలో సభ్యుల ముందుంచారు. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ కూడా కమిటీ ముందు తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. కొంత మంది సభ్యులు చందాకొచ్చర్‌పై వచ్చిన ఆరోపణలపై ప్రశ్నించినట్లు విశ్వసనీయ సమాచారం. రుణాలు మంజూరు చేయడంలో, ప్రైవేటు బ్యాంకులు కూడా పక్షపాతం చూపుతాయా అని ఒక సభ్యుడు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

కౌంటరు దాఖలుకు గడువు కోరిన ఆన్‌రాక్

● గ్లోస్టర్ కేబుల్స్ పిటిషన్‌పై ఎన్‌సీఎల్‌టీ విచారణ
● జులై 9కి వాయిదా

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌రాక్ అల్యూమినియం లిమిటెడ్ దివాలా ప్రక్రియ ప్రారంభించాలని కోరుతూ సికింద్రాబాద్‌కు చెందిన గ్లోస్టర్ కేబుల్స్ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటరు దాఖలు చేయడానికి గడువు ఇవ్వాలని, ఆన్‌రాక్ కంపెనీ తరఫు న్యాయవాది జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌ను కోరారు. కేబుల్స్ సరఫరాకు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడంతో ఆన్‌రాక్ దివాలా ప్రక్రియ చేపట్టాలని కోరుతూ గోస్టర్స్ కేబుల్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యులు రాటకొండ మురళి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది లింగాల వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ 2013 సెప్టెంబరు వరకు 12 ఆర్డర్లపై రూ.1.57 కోట్ల విలువైన కేబుళ్లను సరఫరా చేసినట్లు చెప్పారు. దీనికింద ఆన్‌రాక్ రూ.26.74 లక్షలు అసలు, వడ్డీగా రూ.14.72 లక్షలు మొత్తం రూ.41.46 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆన్‌రాక్ కంపెనీకి నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో ట్రైబ్యునల్‌ను ఆశ్రయించినట్లు తెలిపింది. కౌంటరు దాఖలుకు గడువు కావాలని ఆన్‌రాక్ తరఫు న్యాయవాది గడువు కోరారు. రూ.677.32 కోట్ల బకాయిలు రాబట్టుకోవడానికి ఆన్‌రాక్ దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ ఇప్పటికే ఎస్‌బీఐ ఇక్కడ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టును ఆశ్రయించామని, విచారణ ప్రక్రియను నిలిపివేస్తూ ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ట్రైబ్యునల్ దృష్టికి తీసుకువచ్చారు. ఆన్‌రాక్ న్యాయవాది అభ్యర్థన మేరకు తదుపరి విచారణను జులై 9వ తేదీకి వాయిదా వేశారు. ఎస్‌బీఐ పిటిషన్‌పై కూడా విచారణను అదే తేదీకి వాయిదా వేశారు.

కొత్త ఛైర్మన్ కోసం ఐసీఐసీఐ బ్యాంక్ అన్వేషణ

దిల్లీ: ప్రస్తుత నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎం.కె. శర్మ పదవీ కాలం జూన్ 30న ముగియనున్న నేపథ్యంలో, ఐసీఐసీఐ బ్యాంక్ కొత్త ఛైర్మన్ నియామక ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుత స్వతంత్ర డైరెక్టర్ల నుంచే నియమించాలా లేదా బయటి వ్యక్తికి ఆహ్వానం పలకలా అన్న దానిపై బోర్డులో చర్చలు ప్రారంభమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం స్వతంత్ర డైరెక్టర్‌గా ఉన్న (బ్యాంక్ ఆఫ్ బరోడా మాజీ సీఎండీ) ఎం.డి.మాల్యా ఈ పదవిని చేపట్టగల వారిలో ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. మే 29నే ఆయన్ని స్వతంత్ర డైరెక్టర్‌గా తిరిగి నియమించడం గమనార్హం. కాగా, ఇతర స్వతంత్ర డైరెక్టర్లలో ఉదయ్ చిటాలే, దిలీప్ చోక్సీ, నీలమ్ ధావన్, రాధాకృష్ణన్ నాయర్, వి.కె. శర్మ(ఎల్ఐసీ ఛైర్మన్), లోక్ రంజన్(ప్రభుత్వ నామినీ డైరెక్టర్)లు ఉన్నారు.

గ్రీన్‌కో ఎనర్జీ చేతికి సింగపూర్ సంస్థ

ఈనాడు, హైదరాబాద్: సంప్రదాయేతర ఇంధన విద్యుత్తు ఉత్పత్తి సంస్థ గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్, సింగపూర్‌కు చెందిన ఆరంజ్ రెన్యూవబుల్స్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీని విలువ 922 మిలియన్ డాలర్లు. ఆరంజ్‌కు సౌర, పవన ఆధారిత 907 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్లతో పాటు, మరో 500 మెగావాట్లు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న గ్రీన్‌కో ప్రస్తుతం 3 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుత ఒప్పందంతో సౌర, పవన, జల విద్యుత్ ఉత్పత్తి అంతా కలిపి 4 గిగావాట్లకు చేరుతుందని సంస్థ పేర్కొంది. దీంతోపాటు మరో 7గిగావాట్ల విద్యుత్ శక్తి ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో మొత్తం సామర్థ్యం 11 గిగావాట్లకు చేరనుంది. సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి, నాణ్యత, ధర విషయంలో థర్మల్ విద్యుత్‌తో పోటీ పడే లక్ష్యంతో ఉన్నట్లు గ్రీన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ చలమశెట్టి పేర్కొన్నారు.

మా దగ్గర డబ్బులెక్కడివి?

● ఇంధన ధరల భారాన్ని పంచుకోలేం ● ప్రభుత్వానికి ఓఎన్‌జీసీ స్పష్టీకరణ!

దిల్లీ: అధిక ఇంధన ధరల భారాన్ని పంచుకోవడానికి సిద్ధంగా లేమని ప్రభుత్వ రంగ అప్‌స్ట్రీమ్ దిగ్గజం ఓఎన్‌జీసీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. రుణ భారం ఎక్కువగా ఉండడంతో పెట్రోలు, డీజిల్‌లపై ఎటువంటి సబ్సిడీని పంచుకునే పరిస్థితిలో లేమని ప్రభుత్వానికి ఆ సంస్థ తెలిపినట్లు ఈ పరిణామాలతో దగ్గరి సంబంధమున్న వర్గాలు కోజెన్సిస్‌తో తెలిపాయి.

హిందుస్థాన్ పెట్రోలియం కార్ప్, కేజీ క్షేత్రంలో గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్ప్ క్షేత్రాన్ని కొనుగోలు చేసిన అనంతరం కంపెనీకి ఆర్థికంగా ఇంధన ధరల సబ్సిడీలను మోసే శక్తి పోయిందని ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి తెలిపినట్లు సమాచారం.

అంతక్రితం రూ.10,000 కోట్ల నగదు నిల్వలున్న ఈ కంపెనీ ఆ రెండు లావాదేవీల అనంతరం రూ.24,600 కోట్ల నికర రుణాలున్న స్థాయికి పడిపోయింది. పెట్రోలు, డీజిల్ ధరలను అదుపులో పెట్టేందుకు, ప్రభుత్వం వివిధ మార్గాలు అన్వేషిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా కొంత భారాన్ని మోయాలని ఓఎన్‌జీసీకి సూచించారు. అంతక్రితం ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలు కొంత సబ్సిడీ భారాన్ని మోసేవి.. అయితే ముడి చమురు ధరలు భారీగా తగ్గడానికి తోడు.. డీజిల్ ధరలపై నియంత్రణ ఎత్తివేయడంతో 2015లో సబ్సిడీ భారం మోయడం నుంచి ఈ రెండు కంపెనీలను ప్రభుత్వం మినహాయించింది.

కాగా, పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని ఆర్థిక శాఖ భావించడం లేదు. అది కేంద్రానికి భారీ ఆదాయ నష్టాన్ని తెచ్చిపెడుతుంది. ద్రవ్యలోటుపై ప్రభావాన్ని చూపుతుంది. రాష్ట్రాలు కూడా వ్యాట్‌ను తగ్గించాలని భావించడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తోంది.

రోజు వారీ ధరలపై సమీక్ష లేదు: ప్రధాన్

పెట్రోల్, డీజిల్‌ల రోజు వారీ ధరల మార్పు విధానాన్ని సమీక్షించే ప్రతిపాదనేదీ లేదని చమురు మంత్రిత్వ శాఖ ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. పెట్రోలు, డీజిల్‌లపై హేతుబద్ధమైన పన్ను విధించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. దీర్ఘకాల కాంట్రాక్టు కింద రష్యా నుంచి తొలి ఎల్ఎన్‌జీ కార్గో వచ్చిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది జూన్ మధ్యలో ఈ రోజువారీ ధరల మార్పును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ధరలపై దీర్ఘకాల పరిష్కారం కోసం చూస్తున్నట్లు ప్రధాన్ చెప్పుకొచ్చారు.

24 లోతైన బావులపై రూ.16000 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 24 లోతైన బావుల (డీప్ వాటర్ వెల్స్)పై ఓఎన్‌జీసీ 2.4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16000 కోట్లు)కు పైగా వెచ్చించడానికి సన్నాహాలు చేస్తోంది. కృష్ణా- గోదావరి (కేజీ) బేసిన్‌లోని కేజీ-డీడబ్ల్యూఎన్- 98/2 క్షేత్రం మెగా ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. 'ప్రతి లోతైన బావికి 100 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.650 కోట్లు) ఖర్చు అవుతుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న 24 బావుల్లో ఎక్కువగా ఉన్నవి అభివృద్ధి చేయాల్సినవే. లోతైన బావుల్లో దాదాపు 20 శాతం వాటిలో చమురు నిక్షేపాలున్నవి ఉంటాయి' అని తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.32,100 కోట్ల మూలధన వ్యయాలుగా ఖర్చు చేయడానికి ఓఎన్‌జీసీ అంచనాలు వేసుకుంది. 5.1 బిలియన్ డాలర్ల విలువైన కేజీ-డీడబ్ల్యూఎన్- 98/2 బ్లాక్ మెగా ప్రాజెక్ట్‌లో భాగంగా కంపెనీ మొత్తం 34 బావులు తవ్వడానికి సన్నాహాలు చేస్తోంది.

ఎయిరిండియాలో 100% వాటా అమ్మేయడం మేలు: కాపా

దిల్లీ: ఎయిరిండియా కొనుగోలు బిడ్డింగ్ ఆకర్షణీయం కావాలంటే, 100 శాతం వాటా విక్రయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని విమానయాన కన్సల్టెన్సీ సంస్థ సెంటర్ ఫర్ ఏషియా- పసిఫిక్ ఏవియేషన్ (కాపా) సూచించింది. ఇప్పటివరకు ఒక్క బిడ్ కూడా రాలేదని ఆందోళన చెందడం కంటే ఆఫర్‌ను ఆకర్షణీయం చేయడంపై దృష్టి పెట్టాలని పేర్కొంది. రాబోయే రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఎయిరిండియా నష్టం 150 -200 కోట్ల డాలర్ల (సుమారు రూ.9750-13,000 కోట్ల)కు చేరొచ్చని, రుణభారం మరింత పెరగొచ్చని అంచనా వేసింది. ప్రత్యర్థి సంస్థల నుంచి పోటీ తీవ్రమవుతుండటంతో దేశీయ విమానయాన విపణిలో ఎయిరిండియా వాటా 10 శాతం దిగువకు పడిపోవచ్చని పేర్కొంది. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో ప్రస్తుతమున్న అగ్రస్థానాన్నీ కోల్పోయే ప్రమాదం ఉందని వివరించింది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని 2018-19 చివరికల్లా వాటా విక్రయ ప్రతిపాదనను పూర్తి చేసేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని పేర్కొంది.



4న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) — కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	361	వరంగల్	363
చిల్లరగా(ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	366
బెంగళూరు	410	చెన్నై	435
5వ తేదీకి...		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	360	నమక్కల్	420

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT &	378.55	(387.60)	2481566
ASIAN PAINTS	1284.45	(1293.05)	939794
AXIS BANK LT	537.05	(536.65)	4291186
BAJAJ AUTO L	2878.50	(2896.55)	759197
BAJAJ FINANC	2062.85	(2077.40)	513152
BAJAJ FINSER	5748.55	(5882.20)	103183
BHARTI AIRTE	372.30	(383.70)	3567479
BHARTI INFRA	295.15	(300.65)	926733
BPCL	408.50	(409.25)	7862335
CIPLA	520.70	(524.50)	1247023
COAL INDIA L	292.60	(294.65)	1557911
DR. REDDYS	1996.00	(1941.40)	1400421
EICHER MOTOR	29377.65	(29868.75)	34668
GAIL	335.05	(341.35)	3194664
GRASIM IND	1034.85	(1028.70)	835325
HCL TECH	900.70	(904.85)	752943
HDFC	1833.15	(1844.25)	2010526
HDFC BANK	2046.20	(2110.60)	22199081
HERO MOTOCOR	3613.60	(3626.30)	230153
HINDALCO IND	241.60	(238.50)	8045521
HINDUSTAN UN	1563.20	(1588.85)	857157
HPCL	312.20	(312.15)	7403199
ICICI BANK	286.75	(289.30)	17188567
INDIABULLS H	1173.95	(1233.35)	1323752
INDIAN OIL	173.80	(172.35)	6514084
INDUSINDBANK	1902.20	(1915.40)	964088
INFOSYS LTD	1239.40	(1220.80)	2135078
ITC	268.90	(269.95)	7984112
KOTAK MAHIND	1303.95	(1318.00)	1462047
LARSEN & TOU	1357.85	(1372.40)	1346919
LUPIN	773.95	(764.45)	1801475
M&M	914.50	(901.60)	3364222
MARUTI SUZIK	8749.85	(8808.85)	380690
NTPC LTD	162.05	(164.35)	4184615
ONGC	171.10	(173.20)	5294603
POWER GRID C	201.70	(205.95)	8131730
RELIANCE IND	940.85	(930.55)	5600357
SBI	263.00	(266.70)	12933824
SUN PHARMA	478.60	(484.35)	2995860
TATA CONSULT	1744.25	(1732.45)	1681483
TATA MOTORS	286.65	(287.20)	10835487
TATA STEEL L	566.15	(560.65)	8742527
TECH MAHINDR	698.30	(701.15)	2864750
TITAN IND	885.35	(900.00)	1529852
ULTRATECH	3711.15	(3688.15)	200526
UPL LIMITED	686.45	(697.75)	575852
VEDANTA LIMI	246.75	(248.25)	11484275
WIPRO	260.15	(260.60)	1583746
YES BANK LTD	342.95	(342.70)	14501600
ZEE ENTERTAI	560.25	(558.30)	1328975

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB	1185.25	(1203.85)	57698
ACC	1308.05	(1326.70)	558346
ADITYA BIRLA	141.65	(144.40)	1314196
AMBUJA CEMEN	201.45	(203.55)	6313873
ASHOK LEYLAN	146.90	(150.85)	9461068
AUROBIND PHA	533.35	(535.30)	2613575
AVENUE SUPER	1486.40	(1531.10)	1084158
BANK OFBAROD	131.55	(136.95)	22267362
BEL	112.10	(111.40)	8168201
BHEL	75.25	(80.35)	14237353
BOSCH LTD	18142.90	(18292.40)	7038
BRITANNIA	5766.20	(5812.45)	117493
CADILA HEALT	352.00	(353.00)	1306674
COLGATE PALM	1233.75	(1247.10)	241454
CONTAINER	1313.30	(1337.10)	321992
CUMMINS INDI	682.25	(684.15)	784074
DABUR INDIA	384.95	(386.75)	926051
DLF LIMITED	199.15	(206.95)	4693026
EMAMI LIMITE	1031.85	(1037.65)	36776
GENERAL INS	707.25	(716.40)	93357
GODREJ CONSU	1134.65	(1161.35)	339444
HAVELLS INDI	536.60	(539.05)	685761
HINDUSTAN ZI	286.15	(291.25)	2264249
IDEA CELLULR	62.90	(61.80)	10720038
INTERGLOBE A	1177.20	(1176.80)	1091795
JSW STEEL LT	331.85	(331.90)	2301143
L&TFIN.HOLD	165.00	(164.10)	3363948
LIC HOUS.FIN	474.10	(476.10)	1998456
MARICO LIMIT	322.65	(324.40)	1449007
MCDOWELL	3296.25	(3260.75)	291961
MOTHERSON	306.55	(306.80)	2146938
MRF	74480.60	(74848.90)	3391
NHPC LTD	26.15	(26.70)	3748353
NMDC LTD	114.85	(115.45)	1317161
OIL INDIA	218.50	(215.30)	1235044
ORACLE FIN S	3769.35	(3823.25)	21585
P&G HYG&HEAL	9223.90	(9343.05)	2259
PETRONET LNG	217.20	(217.25)	2098731
PIDILITE IND	1120.35	(1119.35)	1040512
PIRAMAL ENTE	2406.85	(2438.10)	224468
PNB	83.20	(82.95)	15456025
POWER FIN CO	82.00	(82.40)	13067692
RURAL ELEC C	113.60	(117.20)	2906802
SAIL	75.50	(72.25)	24106642
SBI LIFE INS	660.05	(676.00)	635824
SHREE CEMENT	16357.55	(16656.40)	12667
SHRIRAM TRAN	1445.45	(1459.10)	482401
SIEMENS	993.40	(1025.40)	382627
SUN TV LTD	920.50	(886.55)	3220041

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE	3.82	(4.16)	2864
ALPHAGEO	680.70	(715.40)	2633
AMAR RAJA BA	761.30	(777.40)	9656
ANDHRA BANK	34.05	(35.05)	276189
ANDHRA CEMEN	9.60	(10)	5426
ANDHRA PAPER	316.05	(325.25)	4315
ANDHRA PETRO	42.05	(46.15)	160958
ANDHRA SUGAR	363.55	(378.60)	4147
ANJANI PORTL	164.40	(173.65)	812
ASTRA MICROW	97.65	(100.05)	40914
AUROBINDO PH	532.65	(534.95)	123055
AVANTEL SOFT	382.95	(418.50)	21579
AVANTI FEEDS	1489.60	(1543.35)	34221
AVON ORG	10.94	(11.50)	2031
BALAJI AMIN	563.20	(591.30)	8726
BARTRONICS	10.87	(11.32)	15890
BHAGIRA CHEM	281.35	(277)	11887
BHAGYA NAG	40.10	(42.20)	7121
BN RATHI SEC	40.40	(41.20)	3840
BRILLIANT SE	5.02	(5.28)	36174
CIL SECURI	23.95	(24.45)	7365
COMBAT DRUGS	20.40	(21.45)	200
CONT COFFEE	293.95	(294.85)	1178
COROMAN FERT	450.95	(458.65)	3574
CUBEX TUB	18.20	(19)	104
CYBERMATE	2.28	(2.50)	59528
CYIENT LIMIT	705.95	(737.35)	38093
DECCAN CEMEN	449.70	(462)	138
DIVI'S LAB	1045.50	(1049.75)	18331
DIVYA GRANIT	78.35	(76.10)	350
DR REDDY	1996.95	(1941.45)	100012
FOUR SOFT	67.15	(71.70)	1604
GATI CORPN	90.80	(93.80)	127909
GAYATRI PROJ	183.50	(186.05)	3187
GMR INFRASTR	16.45	(16.70)	1727763
GOLDST INFRA	148.20	(151.95)	58035
GOLDSTONE EN	15.20	(14.48)	21307
GRANULES (I)	74.65	(76.75)	300547
GSS AMERICA	84.70	(88.95)	286026
GVK POWER	11.69	(12.30)	1146603
HBL NIFE POW	35.80	(37.30)	52070
HERITAGE FOO	710.85	(713)	152769
HIL LTD	2047.75	(2074.35)	4061
HIND FLUROCA	13.87	(14.59)	9
IDL INDUSTRS	430	(445.05)	296
IKF SOFT	0.53	(0.55)	95971
ILFS ENGINEE	29.20	(29.50)	3085
INCAP	73.30	(77.15)	140
INNAREDY COM	1.83	(1.92)	13323
IVRCL INFRAS	1.52	(1.60)	2216055
JEEVAN SCIEN	35.50	(35)	1459
KAKATIYA CEM	245.70	(258.85)	7380
KAKATIYA TEX	2.70	(2.67)	100
KALLAM SPG	27.80	(28.10)	7464
KAVERI SEED	504.75	(519.45)	25991
KCP LTD	112.80	(115.25)	16554
KERNEX MICRO	33.75	(35.50)	3217
KNR CONSTRUC	279.20	(279.60)	20522
KREBS BIO	153.80	(152.75)	10
LANCO INDUS	295.90	(313.85)	10150
LANCO INFRAT	0.94	(0.98)	1310602
LAURUS LABS	461	(459.25)	3400
LOKESH MACH	66.90	(70.60)	3607
MADHUCON PRO	12.65	(14.05)	48368
MEGA SOFT	9.50	(9.76)	6830
MIC ELECTRON	3.78	(3.91)	64657
MOLD-TEK.TEC	40.80	(41.95)	750
MOLDTK PLA	302.15	(316.65)	5159
MSR INDIA LT	35.30	(39.80)	1241
NAGARJAGRICH	29.05	(29.90)	4546
NATCO PHARMA	787.90	(799.60)	5658
NAVA BH VENT	135.20	(141.20)	52441
NCC	114.90	(120.20)	687712
NCL IND	187.35	(192.55)	6142
NEHA INTER	5.62	(5.69)	6771
NETTLINX	58.70	(58.80)	18081
NEULAND LAB	688.35	(693)	169
NIHAR INFO	11.90	(12.50)	6000
NILE	584.25	(604.90)	3633
NORTHGATE TE	0.63	(0.63)	7605
OIL COUNTRY	20.10	(21.15)	13498
PANKAJ POLY	7.98	(8.40)	111
PANYAM CEMEN	29.95	(30.40)	27113
PENNER IND	51.35	(53.85)	41929
PHYTOCHEM I	48.80	(51.35)	7873
PIONEER DIST	257.25	(270.75)	6260
PITTI LAMIN	86.15	(88.70)	18011
POKARNA	151.70	(162.35)	5579
PRAJAY ENGS	9.45	(10)	3914
PREMIER EXPL	284.25	(298.40)	1892
PRISM CEMENT	105.30	(109)	20712
PRUDENTL PHA	3.12	(3.39)	192769
RAASI REFRAC	3.09	(3.09)	100
RAGSAN PETRO	63.20	(66.15)	500
RAIN INDUSTR	211.85	(223)	129664
RAJ PACKAGIN	28.10	(29.75)	1923
RAM INFORMAT	41.20	(40.50)	1940
SAGAR CEM	865.15	(902.90)	475
SAMKRG PIST	241.90	(248.85)	2986
SAMPRE NUTRI	54	(54.50)	1701
SATVAH. ISPA	15.35	(14.90)	18735
SMS PHARMA	64.20	(63.20)	1240
SOUTH BIO TE	1.66	(1.74)	7522
SPHERE GLOBA	27.85	(28)	8323
SREE RAYAL A	36	(38.35)	115768
SRINIVASA SH	37.65	(40.15)	2355
SS ORGANICS	6.50	(6.84)	2000
STARCHIK SP	24.25	(23.10)	2078
STEEL EXCHAN	23.60	(24.95)	7480
SUJANA METAL	0.98	(0.94)	57245
SUJANA TOWER	2.49	(2.38)	2520
SUJANA UNIVE	0.51	(0.53)	7867
SURANA TELE	4.77	(4.46)	9474
SURYALAKSH.C	55.95	(57)	800
SURYALATA SP	130	(128.30)	57
SUVEN PHARMA	186	(193.45)	48074
TAJ GVK HOTE	209.70	(220.60)	5960
TANLA	29.20	(30.10)	28104
TERA SOFTWAR	42	(44.10)	1979
TRANS BIOTEK	2.21	(2.17)	7352
TRENDY KNIT	0.19	(0.19)	3516
VAMSHI RUBB	47.55	(48.60)	4557
VBC FERRO	41	(40.10)	31
VICEROY HOTE	9.26	(9.74)	18039
VIJAY TEXTIL	54.10	(56.75)	12553
VIMTA LABS	197.25	(205.25)	1016
VISAKA IND	630.85	(634.20)	31444
VISTA PHARMA	33.15	(34.25)	21359
VIVIMED LABS	59.80	(61.95)	55885
VJIL CONSULT	18.70	(19.50)	1049
VST INDUS	3006.45	(3186.40)	117
YBRANT DIGIT	4.72	(4.64)	171378
ZENTECH	93.90	(99.05)	7275

CA

ఆహార తయారీ రంగంలో 4 లక్షల కొత్త ఉద్యోగాలు

ఈ ఆర్థిక సంవత్సరంలోనే: మంత్రి హర్‌సిమ్రత్

దిల్లీ: ఆహార తయారీ రంగంలో గత నాలుగేళ్లలో 3.85 లక్షల ఉద్యోగాలు లభించాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి మరో 4 లక్షల కొత్త ఉద్యోగాలు ఈ రంగంలో లభిస్తాయని కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ తెలిపారు. 'కొత్తగా 15 మెగా ఫుడ్ పార్క్‌ల్లో కార్యకలాపాలు మొదలయ్యాయి. ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన కింద ఆమోదం పొందిన 122 ప్రాజెక్టుల్లో కార్యకలాపాలు ప్రారంభమైతే 3.4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల్ని కల్పించవచ్చు. ఈ రంగం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థను (ఎన్‌బీఎఫ్‌సీ) స్థాపించి అవసరమైన నిధులు సమకూర్చేలా ప్రయత్నిస్తోంది. 2008-14 మధ్య కాంగ్రెస్ పాలనలో ఆహార తయారీ రంగం పూర్తిగా నిర్వీర్యమైపోయింది. గత నాలుగేళ్లుగా మా ప్రభుత్వం ఈ రంగానికి చేయూతనిచ్చింద'ని బాదల్ వివరించారు.

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ఎమ్‌కే జైన్

ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్ ఎండీ

దిల్లీ: ఐడీబీఐ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ) ఎమ్‌కే జైన్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన మూడేళ్లు ఈ పదవిలో కొనసాగుతారు. గతేడాది జులైలో మూడేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న ఎస్.ఎస్. ముంద్రా స్థానంలో ఈయన పదవీ బాధ్యతలు చేపడతారని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ట్వీట్ చేశారు. మంత్రిమండలి కార్యదర్శి ఆధ్వర్యంలోని ఓ సంఘం, ఈ పదవి కోసం ముగ్గురు సీనియర్ అధికార్లను మే 10న ఇంటర్వ్యూ చేసినట్లు తెలుస్తోంది. ఆర్‌బీఐ గవర్నర్, ఆర్థిక సేవల కార్యదర్శి, కొంత మంది స్వతంత్ర సభ్యులు ఈ కమిటీలో ఉన్నారు. బ్యాంకింగ్ రంగంలో 30 ఏళ్ల అనుభవం ఉన్న మహేశ్ కుమార్ జైన్ మార్చి 2017 నుంచి ఐడీబీఐ బ్యాంక్ ఎండీగా ఉన్నారు. అంతక్రితం ఇండియన్ బ్యాంక్ ఎండీగా విధులు నిర్వర్తించారు. పలు బ్యాంకింగ్ రంగ ప్యానెళ్లలో ఆయన సేవలందించారు. బసంత్ సేథ్ కమిటీకి కార్యదర్శి, సమన్వయ కర్తగా కూడా పనిచేశారు.

ఆర్‌బీఐ చట్టం ప్రకారం.. ఆర్‌బీఐలో నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉండాలి. అందులో ఒకరు వాణిజ్య బ్యాంకరు, మరొకరు ఆర్థికవేత్త అయి ఉండాలి. ప్రస్తుతం విరల్ వి ఆచార్య, ఎన్.ఎస్. విశ్వనాథన్, బి.పి. కనుంగోలు డిప్యూటీ గవర్నర్లుగా ఉన్నారు. డిప్యూటీ గవర్నర్‌కు నెలకు రూ.2.25 లక్షల స్థిర వేతనంతో పాటు ఇతర భత్యాలుంటాయి.

రూ.669 నుంచీ విమాన ప్రయాణం: ట్రూజెట్

ఈనాడు, హైదరాబాద్: ఎంపిక చేసిన మార్గాల్లో తక్కువ ధరకే టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు ట్రూజెట్ ప్రకటించింది. జూన్ 9 వరకు ఈ టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. ఈ నెల జూన్ 20 నుంచి సెప్టెంబరు 30 మధ్య ప్రయాణించేందుకు ఆఫర్‌పై లభించే ఈ టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చు. చెన్నై-కడప-చెన్నై మార్గంలో రూ.699, విజయవాడ-కడప-విజయవాడ మార్గంలో రూ.899, హైదరాబాద్ నుంచి బళ్లారి, నాందేడ్‌లకు రూ.899, విజయవాడ-హైదరాబాద్‌కు రూ.1,299, కడప-హైదరాబాద్‌కు రూ.1,399, తిరుపతి-హైదరాబాద్‌కు రూ.1,499, హైదరాబాద్- రాజమహేంద్రవరం రూ.1,599, హైదరాబాద్-విజయవాడ రూ.1,599, హైదరాబాద్-గోవా-హైదరాబాద్ రూ.1,799; హైదరాబాద్-తిరుపతి రూ.1,699, హైదరాబాద్ నుంచి చెన్నై, ఔరంగాబాద్‌లకు రూ.1,999లుగా టిక్కెట్ల ధరలు ఉన్నాయి. వీటితోపాటు పలు ఇతర మార్గాల్లోనూ ఈ తక్కువ ధర టిక్కెట్లు అందుబాటులో ఉన్నట్లు సంస్థ పేర్కొంది.

ఈనాడు బిజినెస్

వడ్డీ రేట్లు పెరుగుతాయా?

● 25 బేసిస్ పాయింట్లకు మించకపోవచ్చని అంచనాలు ● ఆర్‌బీఐ 'సమీక్ష'కు ముందే బ్యాంకుల నిర్ణయం!

ఆర్థిక వ్యవస్థ రాణించడం, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, చమురు ధరల క్షీణత వల్ల నాలుగున్నరేళ్లుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను పెంచాలనే నిర్ణయం తీసుకోలేదు. కానీ, ఈ పరిస్థితులన్నీ ఇప్పుడు మారిపోయాయి. కనుక ఇకపై వడ్డీ రేట్ల సవరణ తప్పదా? ఇకనుంచి రేట్ల పెంపే మినహా. తగ్గింపు ఉండదా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. బ్యాంకులు, మార్కెట్ వర్గాలు కూడా ఇదే భావనతో ఉన్నాయి. సోమవారం ప్రారంభమైన ఆర్‌బీఐ ద్రవ్య పరపతి కమిటీ (ఎంపీసీ) సమావేశంలో ఏం జరుగుతోంది? బుధవారం ఏ నిర్ణయం వెలువడుతుందనే అంశం కీలకంగా మారనుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండోసారి జరుగుతున్న ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాలపై అందరికీ ఆసక్తి పెరిగింది. దీనికి కారణం లేకపోలేదు.. జనవరి 2014లో రెపో రేటును 8 శాతంగా ఆర్‌బీఐ నిర్ణయించింది. ఆ తర్వాత నుంచి కొద్దికొద్దిగా తగ్గించడమో.. లేదా యథాతథంగా ఉంచడమో చేస్తూ వచ్చింది. ప్రస్తుతం ఈ రేటు 6శాతంగా ఉంది. వరుసగా 7 త్రైమాసికాలపాటు జీడీపీ వృద్ధి చెందుతుండటం, ఈ ఏడాది జనవరి- మార్చి త్రైమాసికంలో కూడా ఇది 7.7శాతం కావడం, ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని అంచనాలు ఉన్నప్పటికీ.. వడ్డీ రేట్ల యథాతథ స్థితికి ఇవి ఎంత వరకూ ప్రభావం చూపిస్తాయనేది కీలకంగా మారనుంది. ప్రస్తుతం ఉన్న స్థితి కొనసాగింపునకే 70శాతం అవకాశాలున్నాయనేది బ్యాంకింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

పరిస్థితులు భిన్నంగా..

సాధారణంగా బ్యాంకుల పనితీరు గమనిస్తే.. వడ్డీ రేట్లు తగ్గేది ఉంటే.. ఆ ప్రయోజనాన్ని ఖాతాదారులకు అందించేందుకు కొంత సమయం తీసుకుంటాయి. కానీ.. వడ్డీ రేట్లు పెరుగుతున్నాయనే సూచనలు ఉంటే మాత్రం.. ముందే దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాయి. ప్రస్తుతం ఈ ధోరణే కనిపిస్తోంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల సమీక్ష కన్నా ముందే బ్యాంకులు తమ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెడింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను జూన్ 1నే సవరించాయి. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ దీనికి ముందుగా బాటలు వేసింది. ఇది తన అన్ని రుణ వ్యవధుల ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్ల మేరకు పెంచింది. డిపాజిట్ రేట్లను కూడా బ్యాంకులు పెంచుతున్నాయి. ఈ పెరుగుదలకన్నా అధికంగానే రుణ వడ్డీ రేట్లు ఉండే అవకాశం ఉందని పలువురు నిపుణులు భావిస్తున్నారు. ఎస్‌బీఐని అనుకరిస్తూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐసీఐసీఐ

బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు కూడా 10-20 బేసిస్ పాయింట్ల వరకూ తమ ఎంసీఎల్ఆర్‌లను సవరించాయి. దీనివల్ల రూ.1లక్ష రుణానికి రూ.100వరకూ భారం పెరిగే అవకాశం ఉంది.

కారణాలు అనేకం...

పాత పెద్ద నోట్ల రద్దు అనంతరం బ్యాంకుల్లోకి ఇబ్బడిముబ్బడిగా డబ్బు వచ్చి చేరింది. ఫలితంగా బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను గణనీయంగా తగ్గించాయి. వ్యక్తిగత, వాహన, గృహ రుణాల్లో జోరు పెంచాయి. కానీ, తర్వాత పరిణామాల నేపథ్యంలో.. ముఖ్యంగా ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లు భయంతో పెద్ద ఎత్తున డిపాజిట్లు బ్యాంకుల నుంచి బయటకు వెళ్లిపోయాయి. మరో పక్క కొండల్లా పేరుకున్న మొండి బకాయిల నేపథ్యంలో, బ్యాంకులు తప్పనిసరిగా తమ రుణ వితరణ రేట్లను పెంచాల్సిన అవసరం ఏర్పడుతోందని బ్యాంకింగ్ రంగ నిపుణుల మాట.

- రెపో రేటుతో పోలిస్తే.. 10ఏళ్ల ప్రభుత్వ సెక్యూరిటీల వడ్డీ రేటు దాదాపు 189 బేసిస్ పాయింట్లు అధికంగా ఉంది. ఇది కాస్త ఆందోళన కలిగించే విషయమే. ప్రస్తుతం ఉన్న 4శాతం ద్రవ్యోల్బణంతో పోల్చి చూస్తే ఇది నికరంగా 300 బేసిస్ పాయింట్ల వరకూ ఉంది. ఈ బాండ్ల వడ్డీ రేట్లు పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలు, ద్రవ్యలోటు పెరగడం, ఎఫ్‌డీఐ వడ్డీ రేట్ల పెంపు, ముడి చమురు ధరల్లో పెరుగుదల ఫలితంగా ద్రవ్యోల్బణం అధిక మవుతుందనే సంకేతాలే కారణం. ఆర్‌బీఐ వడ్డీ రేటును పెంచేందుకు ఇదీ ఒక కారణం అయ్యే అవకాశం లేకపోలేదు.
- పెట్రోలు, డీజిల్ రేట్లు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలకూ రెక్కలు వచ్చాయి. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4శాతానికి కట్టడి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా.. ఇది 4.58శాతానికి పైగానే నమోదవుతోంది. ఇదీ వడ్డీ రేట్ల పెంపునకు ఉత్ప్రేరకంగా పనిచేసే ఆస్కారం ఉంది. జీడీపీ వృద్ధి 7.7శాతం కావడమే ఇక్కడ సానుకూలాంశం.

ఒకవేళ ఆర్‌బీఐ కీలక వడ్డీ రేటు రెపో శాతాన్ని 6శాతం నుంచి సవరించినా ఇది 25 బేసిస్ పాయింట్లకు మించి ఉండకపోవచ్చనేది నిపుణుల మాట. దీనివల్ల గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారిపై పెద్ద భారం ఏమీ ఉండకపోయినా.. భవిష్యత్తు మాత్రం ఆందోళన కలిగించేదే. ఇక నుంచి ప్రతి సమీక్షా సమావేశంలో వడ్డీ రేట్ల పెంపు గురించి చర్చ మాత్రం తప్పనిసరిగా వస్తుందని చెప్పొచ్చు. అంటే.. తక్కువ వడ్డీకే రుణాలన్నది పాతమాటేనన్నమాట.

– ఈనాడు, హైదరాబాద్

విపణిలోకి కొమియో స్మార్ట్‌ఫోన్లు

హైదరాబాద్ (గచ్చిబౌలి), న్యూస్‌టుడే: తక్కువ ధర స్మార్ట్‌ఫోన్లను అందించే చైనా సంస్థ కొమియో కొత్తగా 'ఎక్స్ 1 నోట్'ను విడుదల చేసింది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సినీనటి ప్రణీత ఈ ఫోనును విడుదల చేశారు. సంస్థ సీఈఓ సంజయ్ కలిరోనా మాట్లాడుతూ భారత్‌లో ప్రస్తుతం నెలకు లక్ష మొబైల్ ఫోన్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి 30లక్షల ఫోన్లు విక్రయించే లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.5-10వేల ధరల శ్రేణిలో 5 రకాల స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 650 పట్టణాల్లో, 2వేలకు పైగా రిటైల్ దుకాణాల్లో ఫోన్లు అందుబాటులో ఉన్నాయనీ, 400 సర్వీస్ సెంటర్లు ఉన్నట్లు వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 35 విక్రయ కేంద్రాల్లో ఈ ఫోన్లు లభిస్తున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే నెలకు 10లక్షల సెల్‌ఫోన్ల తయారీ సామర్థ్యంతో సొంతంగా ఉత్పత్తి కేంద్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో రూ.150 కోట్ల పెట్టుబడితో ప్రారంభించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ఫోన్లు కొనుగోలు చేసిన వారికి జియోతో ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపారు.

ఎక్స్ 1 నోట్ విశేషాలు: ఆండ్రాయిడ్ ఓరియో ఆపరేటింగ్ సిస్టం, 6 అంగుళాల తెర. వెనకాల 13 ఎంపీ, 5 ఎంపీ రెండు కెమేరాలు, ముందుభాగంలో 8 ఎంపీ కెమేరా. 4జీ-వోల్టే డ్యూయల్ సిమ్, బ్యాటరీ సామర్థ్యం 2,900 ఎంఏహెచ్. 3జీబీ ర్యామ్, 32జీబీ అంతర్గత మెమొరీ.

సోమవారం హైదరాబాద్‌లో కొమియో ఎక్స్ 1 నోట్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటి ప్రణీత

విశాఖలో ఎగుమతుల తనిఖీ సంస్థ కార్యాలయం

● మరో 15 ప్రాజెక్టులకు ఆమోదం

దిల్లీ: విశాఖపట్నంలో ఎగుమతుల తనిఖీ సంస్థ కార్యాలయం, లేబొరేటరీ కాంప్లెక్స్ నిర్మాణం సహా 15 ప్రాజెక్టుల ఏర్పాటుకు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఎగుమతుల ప్రోత్సాహానికి అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి గతేడాది వాణిజ్య శాఖ ప్రారంభించిన ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీమ్ (టైస్)లో భాగంగా వీటిని ప్రకటించినట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వాణిజ్య శాఖ ఆమోదం పొందిన 15 ప్రాజెక్టుల్లో మధ్యప్రదేశ్‌లో కోల్డ్ చైన్, ఇంఫాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సమీకృత కార్గో టెర్మినల్, భోపాల్‌లో ట్రేడ్ ప్రమోషన్ సెంటర్ ఏర్పాటు, నోయిడా సెజ్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ వంటివి ఉన్నాయి. వీటిని అమలు చేయనున్న సంస్థల్లో కర్ణాటక ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, బెంగళూరు విశ్వేశ్వరాయ ట్రేడ్ ప్రమోషన్ సెంటర్, కొచ్చి సెజ్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, కాఫీ బోర్డ్, ఎక్స్‌పోర్ట్స్ ఇన్‌స్పెక్షన్ కౌన్సిల్, ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్‌లు ఉన్నాయి. టైస్ పథకం కింద నిర్మించే ప్రాజెక్టులకు అయ్యే వ్యయాలను రాష్ట్రాలు, కేంద్రం సమానంగా వెచ్చిస్తాయి.

ఫ్లాట్‌పై రెండింతల భారం

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం అమల్లోకి వచ్చి, మరికొన్ని రోజుల్లో ఏడాది పూర్తికానుంది. ఈ కొత్త పన్ను విధానంపై అటు వ్యాపారులు, ఇటు ప్రజల్లో ఇప్పటికీ అనేక సందేహాలు నెలకొన్నాయి. జీఎస్‌టీ కింద ఎంత చెల్లించాలనే విషయంపై ఫ్లాట్ల కొనుగోలుదార్లలో అయోమయ స్థితి కొనసాగుతోంది. గత సంవత్సరకాలంలో పాఠకుల నుంచి మాకు వెల్లువెత్తిన ప్రశ్నలే ఇందుకు నిదర్శనం. అందుకే ఫ్లాట్‌ల క్రయ విక్రయాలకు జీఎస్‌టీ వర్తింపుపై మరోమారు ప్రాథమిక అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. ముఖ్యంగా కొనుగోలుదారు కోణంలో సందేహాలు తీర్చడంపై ప్రధానంగా దృష్టి పెట్టాం.

సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్

సొంతింటి కల నెరవేర్చుకునేందుకు పైసా పైసా కూడబెడుతూ ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళుతుంటారు చాలా మంది. ఈ ప్రణాళికలో కాస్త తేడా వచ్చినా మన దగ్గరున్న డబ్బులు సరిపోక అప్పు చేయాల్సి వస్తుంది. అందుకే ఇంటిని కొనేముందు అన్ని రకాలుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటుంటారు. స్థలం పూర్వాపరాల నుంచి మార్కెట్ విలువ ఎంత? మనం పెడుతున్న ధర సరైనదేనా? రిజిస్ట్రేషనుకు అయ్యే ఖర్చు ఎంత? ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్నంగా తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇప్పుడు ఈ జాబితాలో 'జీఎస్‌టీ' కూడా చేరిపోయింది. అయితే కొత్త పన్ను విధానం కావడంతో ఎంత జీఎస్‌టీ కట్టాలి, ఏయే సందర్భాల్లో పన్ను మినహాయింపు ఉంటుంది తదితర విషయాలపై స్పష్టత లేక కొనుగోలుదార్లు ఇప్పటికీ గందరగోళానికి లోనవుతూనే ఉన్నారు.

● పన్ను రేటు ఎంత?

వాస్తవానికి ఫ్లాట్ కొనుగోలుపై 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది. అయితే కొనుగోలు విలువలో స్థలం విలువ కలిపి ఉంటే పన్ను రేటు 1/3 మేర (6%) తగ్గుతుంది. అంటే నికరంగా 18%- 6%= 12% జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుందన్న మాట. అదే స్థలం విలువ కలపకుంటే పూర్తిగా 18% జీఎస్‌టీ చెల్లించాలి.

● మినహాయింపు ఎప్పుడు

జీఎస్‌టీ చట్టం ప్రకారం ఫ్లాట్ కొనుగోలుపై జీఎస్‌టీ మినహాయింపు లభించాలంటే రెండు షరతులను తృప్తిపరచాలి.

మొదటిది.. జీఎస్‌టీ అమల్లోకి రాకముందే నిర్మాణదారు ఫ్లాట్ నిర్మాణాన్ని పూర్తి చేసి ఉండాలి. సంబంధిత అధికారుల నుంచి నిర్మాణ పూర్తి ధ్రువీకరణ పత్రాన్ని పొందాలి.

రెండోది.. నిర్మాణం పూర్తయిన ధ్రువీకరణ పత్రాన్ని పొందడానికి ముందు కొనుగోలుదారు దగ్గర నుంచి నిర్మాణదారు ఎలాంటి ముందస్తు డబ్బులు తీసుకొని ఉండకూడదు.

పై రెండు షరతుల్లో ఏ ఒక్క దానిని సంతృప్తి పర్చకపోయినా జీఎస్‌టీ కట్టాల్సిందే.

● కొనుగోలుదారు ఐటీసీకి అర్హుడేనా

- ఫ్లాట్ కొనుగోలుపై చెల్లించిన జీఎస్‌టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తిరిగి పొందే వీలుందా? ఈ ప్రశ్న చాలా మంది పాఠకుల నుంచి నాకు ఎదురైంది. ఆ సమయంలోనే కాదు ఇప్పుడు కూడా చెబుతున్నాను.. కొనుగోలుదారుకు ఐటీసీ రాదు. జీఎస్‌టీ చట్టం ప్రకారం జీఎస్‌టీ గుర్తింపు ఉన్న వ్యక్తులు లేదా వ్యాపారులు తాము పొందిన సేవను మరొకరికి సరఫరా చేయడం లేదా అందించినప్పుడే ఐటీసీ పొందేందుకు అర్హులవుతారు. ఫ్లాట్ కొనుగోలు విషయానికే వస్తే.. చాలా సందర్భాల్లో కొనుగోలుదారు ఫ్లాట్‌ను కొనేది తన కోసమే కాని ఇతరులకు అమ్మడానికి కాదు. అందువల్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందే వీలుండదు.
- ఒకవేళ ఫ్లాట్‌ను కొని కొన్నేళ్ల తర్వాత విక్రయిస్తే ఏంటి పరిస్థితి? ముందుగా కొనుగోలు చేసిన వ్యక్తి ఐటీసీకి అర్హుడా? ఇలాంటి సందేహాలు కూడా పాఠకుల నుంచి వచ్చాయి. దీనికి కూడా 'ఐటీసీ రాదు' అనేదే నా సమాధానం. ఎందుకంటే ఫ్లాట్‌ను రెండో సారి విక్రయించినప్పుడు అది 'స్థిరాస్తుల విక్రయం కిందకు' వస్తుంది. జీఎస్‌టీ చట్టం ప్రకారం స్థిరాస్తుల విక్రయానికి ఐటీసీ వర్తించదు. అందువల్ల ముందుగా కొన్న కొనుగోలుదారు ఐటీసీ పొందేందుకు అనర్హుడు.
- నిర్మాణ సామగ్రిపై పొందిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కొనుగోలుదారుకు నిర్మాణదారు బదిలీ చేయాల్సిన అవసరం లేదా? అనే ప్రశ్నను కూడా కొందరు పాఠకులు నా ముందుంచారు. అయితే దీనికి వాళ్లకు నేను చెప్పే సమాధానం.. నిర్మాణదారు ఐటీసీని బదిలీ చేయాల్సిన అవసరం లేదు. మీరు మొబైల్ ఫోనును కొనుగోలు చేసినప్పుడు దుకాణదారును ఐటీసీ ఇవ్వమని అడుగుతారా? లేదు కదా. ఇక్కడ కూడా అంతే. నిర్మాణ సామగ్రి కొనుగోళ్లపై కట్టిన పన్నులనే నిర్మాణదారు ఐటీసీ కింద పొందాడనే విషయాన్ని ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి. అందువల్ల వీటిపై పొందిన ఐటీసీని కొనుగోలుదారుకు నిర్మాణదారు బదిలీ చేయాల్సిన అవసరం లేదు.

● విక్రయ ఒప్పందం అవసరమా?

విక్రయ ఒప్పందం (సేల్ అగ్రిమెంట్) లేకుంటే ఫ్లాట్ కొనుగోలు లావాదేవీని రెండు రకాలుగా విభజించి చూస్తారు. మొదటిదేమో.. రిజిస్ట్రేషన్‌కు ముందు. రెండోది. . రిజిస్ట్రేషన్ తరవాత. తొలి భాగంలో చేసిన చెల్లింపులకు 12% జీఎస్‌టీ కట్టాలి. రెండో భాగంలో చేసే మిగిలిన చెల్లింపులకు 18% జీఎస్‌టీ వర్తిస్తుంది. ఫ్లాట్‌కు నిర్ణయించిన ధరకు ప్రారంభంలోనే కొనుగోలుదారు, నిర్మాణదారు ఒప్పందం కుదుర్చుకుంటే ఆ మొత్తం విలువకు 12% జీఎస్‌టీ చెల్లించాలి. ఫ్లాట్ కొనుగోలు ప్రక్రియలో విక్రయ ఒప్పంద పత్రం కీలకం. అయితే కొనుగోలుదారు, విక్రయదారు తాము వీలును బట్టి ఈ ఒప్పంద పత్రాన్ని వివిధ విభాగాలుగా విభజించుకుంటూ ఉంటారు.

● పన్ను భారం రెండింతలు

జీఎస్‌టీ అమల్లోకి రాకముందు తెలుగు రాష్ట్రాల్లో ఫ్లాట్ కొనుగోలుపై 1.25% వ్యాట్ విధించేవారు. సేవా పన్ను 4-5% మధ్య ఉండేది. మొత్తం కలిపితే గరిష్ఠంగా 6.25% చెల్లిస్తే సరిపోయేది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక.. ఫ్లాట్ కొనుగోలుపై పన్ను రేటు 12 శాతానికి పెరిగింది. అంటే ఇంచుమించు పన్ను భారం రెట్టింపు అయ్యిందన్నమాట. అంతేకాదు జీఎస్‌టీతో పాటు రాష్ట్రాల స్టాంప్ డ్యూటీ కూడా అదనంగా చెలించాలి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఫ్లాట్‌లపై జీఎస్‌టీ రేటును ప్రభుత్వం తగ్గిస్తే బాగుంటుంది. లేదంటే కనీసం స్టాంప్ డ్యూటీనైనా జీఎస్‌టీలో కలిపేయాలి. ఇలా చేస్తే సాధారణ ప్రజానీకానికి గొప్ప ఊరటనిచ్చినట్లవుతుంది.

ముందు.. తరవాత

- జీఎస్‌టీ అమల్లోకి (2017, జులై 1) రాక ముందే ఫ్లాట్ నిర్మాణం, డబ్బులు చెల్లించడం, రిజిస్ట్రేషన్ పూర్తయితే.. జీఎస్‌టీ వర్తించదు.
- ఒకవేళ ఫ్లాట్ నిర్మాణం పూర్తయినా.. డబ్బులు పూర్తిగా చెల్లించకుంటే, రిజిస్ట్రేషన్ కూడా చేసుకోకుంటే జీఎస్‌టీ అమల్లోకి రాకముందు చెల్లించిన మొత్తంపై వ్యాట్, సేవా పన్ను వర్తిస్తుంది. మిగిలిన మొత్తానికి జీఎస్‌టీ చెలించాల్సి ఉంటుంది.
- జీఎస్‌టీ అమల్లోకి రాకముందు ఒప్పందం మాత్రమే కుదుర్చుకొని, ఫ్లాట్ నిర్మాణం, డబ్బులు చెల్లించడం, రిజిస్ట్రేషన్ చేసుకోవడం జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక పూర్తయితే, కొనుగోలు ధర మొత్తానికి జీఎస్‌టీ కట్టాల్సిందే.
- ఫ్లాట్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోవడం దగ్గర నుంచి రిజిస్ట్రేషన్ వరకు అన్నీ జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక జరిగితే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.
- జీఎస్‌టీ అమల్లోకి రాకముందు ఫ్లాట్ కొనుగోలు ధరలో కొంత భాగానికి వ్యాట్, సేవా పన్ను చెల్లిస్తే. . ఆ తర్వాత మిగిలిన మొత్తానికి జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుంది.

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి..మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా

eenadubusinessdesk@gmail.com;
businessdesk@eenadu.net

మీ సందేహాలు పంపండి

ఫిఫా ప్రపంచకప్ మరో 9 రోజుల్లో

ఛాంపియన్స్



ఈ సారి టెల్‌స్టార్ 18

మాస్కో: ఈసారి ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో వాడే బంతి పేరు 'టెల్‌స్టార్ 18'గా నిర్ణయించారు. 1970 నుంచి ప్రపంచకప్ కోసం అడిడాస్ సంస్థ బంతులను తయారుచేస్తోంది. ఆ సంస్థ ప్రపంచకప్ కోసం తొలిసారిగా తయారుచేసిన బంతికి 'టెల్‌స్టార్' అని పేరు పెట్టింది. దాని కొనసాగింపుగా 2018 సంవత్సరాన్ని సూచిస్తూ ప్రస్తుత టోర్నీలో వాడే బంతికి 'టెల్‌స్టార్ 18' అని పేరు పెట్టారు. ఈసారి ప్రపంచకప్‌లో వాడబోయే ఈ బంతులను చైనా, పాకిస్థాన్ దేశాల్లో తయారుచేశారు. బంతిపై ఆరు ప్యానెల్స్ ఉన్నాయి. బరువు 215 గ్రాములు. 1930లో జరిగిన తొలి ప్రపంచకప్ కోసం ప్రత్యేకంగా అధికారిక బంతి అంటూ ఏమీలేదు. బంతిపై ఆంగ్ల అక్షరం 'టి'ని పోలిన కుట్లు ఉండడంతో దాన్ని టీ-మోడల్ అని పిలిచేవారు.

గ్రూప్-డి విశ్లేషణ

మెస్సీ జట్టు ఫేవరెటే కానీ..

ఈ ప్రపంచకప్‌లోనే కఠినమైన గ్రూపుల్లో 'డి' ఒకటి. బలమైన జట్లున్న ఈ గ్రూపే 'గ్రూప్ ఆఫ్ డెత్' అని కొందరు ఫుట్‌బాల్ పండితులు అంటున్నారు. రెండుసార్లు ఛాంపియన్ అర్జెంటీనా ఫేవరెట్‌గా కనిపిస్తున్నా.. ముందుకెళ్లడం మరీ అంత తేలికేమీ కాదు. 'డి'లో ఏ జట్టునూ తేలిగ్గా తీసేయలేం. సంచలనాల ఐస్‌లాండ్, ప్రతిభావంతులతో నిండిన క్రొయేషియా, ఆఫ్రికా నుంచి నిలకడగా ప్రపంచకప్‌లలో ఆడుతున్న నైజీరియాలు ప్రమాదకర జట్లే.

మెస్సి

అంచనా
1. అర్జెంటీనా
2. క్రొయేషియా
3. నైజీరియా
4. ఐస్‌లాండ్

అర్జెంటీనా
గట్టి పోటీ తప్పదు

టోర్నీలోనే బలమైన జట్లలో ఒకటి. కానీ అతికష్టంగా ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ దశలో ఆఖరి మ్యాచ్‌లో ఈక్వెడార్‌పై లియోనల్ మెస్సి హ్యాట్రిక్ కొట్టడంతో గట్టెక్కింది. మెస్సితోపాటు గొంజాలో హిగెయిన్, అగ్వెరో వంటి స్టార్లతో నిండిన అర్జెంటీనా ఇప్పటికీ ఫేవరెటే అయినప్పటికీ. . ఇంకా మెరుగుపడాల్సివుంది. ముఖ్యంగా నిలకడ సాధించాలి. ఒక్క ఏడాదిలోనే అర్జెంటీనాకు ముగ్గురు కోచ్‌లు మారారు. ప్రస్తుత కోచ్ సంపావ్‌లీ ఆధ్వర్యంలోని జట్టు పెద్దగా ఆకట్టుకోలేదు. నాలుగు అధికారిక మ్యాచ్‌ల్లో ఒకటి మాత్రమే నెగ్గింది. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ముందుకెళ్లడం నల్లేరుపై నడకేం కాదు. మిగతా మూడు జట్లు బలంగానే రేసులో ఉన్నాయి. మూడూ ప్రమాదకరమైనవే. గ్రూపులో అగ్రస్థానం సాధించడం అర్జెంటీనాకు సవాలే.

కీలక ఆటగాళ్లు: మెస్సి, హిగెయిన్, అగెరో
కోచ్: జార్జ్ సంపావ్‌లి
రికార్డు: రెండు సార్లు విజేత

ప్రస్తుత ర్యాంకు 4

నైజీరియా
రేసులో ఉంది

ఆఫ్రికా ప్రాంతం నుంచి అత్యంత నిలకడగా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తున్న జట్టు. ఆఫ్రికా ఛాంపియన్ కామెరూన్, మాజీ ఛాంపియన్ జాంబియా, అల్జీరియాలను తోసిరాజని ఈసారి విశ్వసమరానికి టిక్కెట్ సంపాదించింది. రెండో రౌండ్‌కు బలంగా పోటీలో ఉంది. నవంబరులో జరిగిన స్నేహపూర్వక మ్యాచ్‌లో అర్జెంటీనాపై 4-2తో గెలవడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. అలెక్స్ ఇవోబి, కెలెచి ఇహియాంచో, విక్టర్ మోసెస్‌లతో మంచి ఎటాకింగ్ నైజీరియా సొంతం. ఐతే డిఫెన్స్ బలహీనంగా ఉండడం ఆ జట్టుకు సమస్యే. అర్జెంటీనా ఉన్న గ్రూపులో ఉండడం నైజీరియాకు ఇది ఐదోసారి కావడం గమనార్హం.

మికెల్

కీలక ఆటగాళ్లు: జాన్ ఒబి మికెల్, అలెక్ ఇవోబి
కోచ్: గెర్నాట్ రోర్
రికార్డు: ఐదు కప్పుల్లో అత్యుత్తమ ప్రదర్శన ప్రిక్వార్టర్ ఫైనల్.

ప్రస్తుత ర్యాంకు 41

ఐస్‌లాండ్
పిట్ట కొంచెం...

కేవలం 3 లక్షల 30 వేల జనాభా గల ఈ దేశం ప్రపంచకప్‌కు అర్హత సాధించిన అతి చిన్న దేశంగా రికార్డు సృష్టించింది. చిన్న జట్టే అయినా చాలా గట్టి జట్టు. నాణ్యమైన ఆటగాళ్లతో కూడిన ఐస్‌లాండ్‌కు సంచలనాలు సృష్టించే సత్తా ఉంది. తొలిసారి ప్రపంచకప్‌లో ఆడబోతున్నా తనదైన రోజున ఏ జట్టుకైనా షాకివ్వగలదు. 2016 యూరో క్వార్టర్‌ఫైనల్ చేరడం ద్వారా తన ప్రతిభను, పట్టుదలను ఐస్‌లాండ్ నిరూపించుకుంది. ప్రపంచకప్‌లోనూ ఆశలతో ఉంది. బలమైన గ్రూపులోనే ఉన్నా నాకౌట్ అవకాశాలను కొట్టిపారేయలేం. క్రొయేషియా, టర్కీ, ఇంగ్లాండ్ వంటి జట్లపై గెలిచిన అనుభవమున్న ఐస్‌లాండ్ ప్రపంచకప్‌లో ఎంతో ఆసక్తిరేపుతోంది.

గునర్సన్

కీలక ఆటగాళ్లు: ఆరోన్ గునర్సన్, సిగుర్డ్‌సన్
కోచ్: హాల్‌గ్రిమ్సన్
రికార్డు: తొలిసారి ప్రపంచకప్ ఆడబోతోంది

ప్రస్తుత ర్యాంకు 21

క్రొయేషియా
ఆ సత్తా ఉంది

గ్రూపులో అర్జెంటీనాకు అతి పెద్ద ముప్పు క్రొయేషియాతోనే. ప్రతిభావంతులతో కూడిన ఆ జట్టు గ్రూప్ విజేతగా 16 జట్ల రౌండ్‌కు చేరితే ఆశ్చర్యపోనక్కర్లేదు. లుకా మోడ్రిచ్, మ్యాటో కొవాసిచ్, ఇవాన్ రకితిచ్‌లతో కూడి మిడ్‌ఫీల్డ్ త్రయం రష్యాలోని ఏ అగ్రశ్రేణి జట్టు మిడ్‌ఫీల్డర్లకూ తీసిపోదు. మారియో మంజుకిచ్, ఇవాన్ పెరిసిచ్‌ల రూపంలో నాణ్యమైన ఫార్వర్డ్లూ ఉన్నారు. నమ్మకదగ్గ రక్షణ శ్రేణి కూడా ఉన్న క్రొయేషియా కాగితంపై అత్యంత శక్తివంతంగా కనిపిస్తోంది. క్లబ్‌ల తరఫున విశేషంగా రాణించిన ఆటగాళ్లు అంతర్జాతీయ వేదికపై ఆ ప్రదర్శనను పునరావృతం ఆ జట్టుకు చాలా అవసరం.

మోడ్రిచ్

కీలక ఆటగాళ్లు: లుకా మోడ్రిచ్, మారియో మంజుకిచ్
కోచ్: జ్లాట్కో దలిచ్
రికార్డు: నాలుగు ప్రపంచకప్‌లు ఆడింది. అత్యుత్తమ ప్రదర్శన సెమీ ఫైనల్.

ప్రస్తుత ర్యాంకు 18

నెయ్‌మార్ వచ్చాడు.. కొట్టాడు

సన్నాహక మ్యాచ్‌లో బ్రెజిల్ విజయం

లివర్‌పూల్: బ్రెజిల్ ప్రపంచకప్ ఆశలను మోస్తున్న అగ్రశ్రేణి ఆటగాడు నెయ్‌మార్ అదరగొట్టాడు. క్రొయేషియాతో జరిగిన సన్నాహక మ్యాచ్‌లో గోల్ కొట్టి 2-0 తేడాతో బ్రెజిల్ విజయం సాధించడంలో తోడ్పడ్డాడు. ఎడమ పాదానికి శస్త్ర చికిత్స చేసుకొని మూడు నెలల పాటు ఆటకు దూరంగా నెయ్‌మార్ ప్రపంచకప్‌లో మునుపటి జోరు చూపించగలడా అనే అభిమానుల సందేహాలన్నింటినీ పటాపంచలు చేశాడు. రెండో అర్ధభాగంలో మైదానంలో దిగిన అతను జట్టును సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాడు. "తిరిగి ఫుట్‌బాల్ ఆడుతున్నందుకు ఆనందంగా ఉంది. దీని కోసం చాలా కాలం కృషి చేశాను. మూడు నెలలు కఠినంగా గడిచాయి. గోల్ కొట్టగానే.. నాకు తోడ్పాటునుంచిన డా. లస్మార్, కుటుంబం, స్నేహితులు గుర్తుకొచ్చారు" అని నెయ్‌మార్ తెలిపాడు.

ఛెత్రి మాయ

కెన్యాపై భారత్ గెలుపు

ముంబయి: భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి మరోమారు మాయ చేశాడు. తన వందో అంతర్జాతీయ మ్యాచ్‌లో చెలరేగి ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. అతను రెండు గోల్స్ (68వ, 71వ నిమిషాల్లో) చేయడంతో ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0 తేడాతో కెన్యాను చిత్తుచేసి ఫైనల్లో అడుగుపెట్టింది. పూర్తిగా నిండిపోయిన స్టేడియంలో.. అభిమానుల కేరింతల మధ్య భారత జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. తొలి అర్ధభాగంలో గోల్సేమీ నమోదు కాలేదు. దాని తర్వాత వర్షం పడడంతో మ్యాచ్‌కు కొద్దిగా అంతరాయం ఏర్పడింది. తిరిగి మ్యాచ్ మొదలైన కొంతసేపటికే ఛెత్రి పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. దాంతో స్టేడియం హోరెత్తిపోయింది. ఆ తర్వాత మూడో నిమిషాల్లోపే జేజె లాల్‌పెహ్లువా (71వ నిమిషంలో) గోల్ చేసి భారత్‌కు రెట్టింపు ఆనందాన్ని అందించాడు. కొన్ని నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా ఛెత్రి (92వ నిమిషంలో) గోల్ కొట్టాడు. మ్యాచ్‌కు ముందు వందో అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న ఛెత్రిని మాజీ కెప్టెన్లు భైచుంగ్, విజయన్ సన్మానించారు. మైదానంలో అడుగుపెడుతున్న సమయంలో ఛెత్రికి సహచరులు 'గార్డ్ ఆఫ్ హానర్' గౌరవాన్నందించారు.

ఛెత్రి

విల్లాను దాటేశాడు..

వందో అంతర్జాతీయ మ్యాచ్‌లో ఛెత్రి అరుదైన రికార్డు సృష్టించాడు. ఓ వైపు వర్షం.. మరో వైపు అభిమానుల హర్షం.. ఈ రెండింటి నడుమ ఛెత్రి మాయ చేశాడు. మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన అతను తన ఖాతాలో అరుదైన రికార్డు చేర్చుకున్నాడు. ప్రస్తుతం 61 గోల్స్‌తో ఉన్న ఛెత్రి... ప్రస్తుతం ఫుట్‌బాల్ ఆడుతూ అత్యధిక గోల్స్ చేసిన అంతర్జాతీయ ఆటగాళ్లలో మూడో స్థానంలో నిలిచాడు. మ్యాచ్ ముందు వరకూ 59 గోల్స్‌తో డేవిడ్ విల్లా (స్పెయిన్)తో సమానంగా ఉన్న ఛెత్రి... ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్‌తో అతణ్ని అధిగమించాడు. ఛెత్రి కన్నా ముందు రొనాల్డో (81), మెస్సీ (64) మాత్రమే ముందున్నారు.

అతను పిలిచాడని..

స్టేడియం మొత్తం నిండిపోయింది.. ఎక్కడ చూసినా త్రివర్ణ పతాకాలు రెపరెపలాడుతున్నాయి.. కమాన్ ఇండియా అంటూ అభిమానులు నినాదాలతో హోరెత్తుతున్నారు. ఇదేదో భారత్ క్రికెట్ జట్టు ఆడే మ్యాచ్ అనుకుంటే మీరు పొరబడ్డట్టే. అది ఫుట్‌బాల్ మ్యాచ్. భారత్‌లో పెద్దగా ఆదరణ లేని జాతీయ ఫుట్‌బాల్ జట్టు ఆడుతుంటే చూడడానికి జనం ఇంతలా ఎగబడడానికి కారణం సునీల్ ఛెత్రి. మాకు మద్దతుగా నిలవండి అంటూ ఆవేదనగా అతను చేసిన విన్నపానికి దేశం స్పందించింది. మాజీ కెప్టెన్లు భైచుంగ్ భుటియా, విజయన్‌లతో పాటు వేలాది మంది అభిమానులు ఖండాంతర ఫుట్‌బాల్ కప్‌లో భాగంగా సోమవారం కెన్యాతో జరుగుతున్న పోరును ప్రత్యక్షంగా చూస్తూ ఆస్వాదించారు. "నా విన్నపానికి ఈ స్థాయిలో స్పందన వస్తుందని అనుకోలేదు. జాతీయ జట్టు తరపున ఆడుతున్నపుడు అభిమానుల మద్దతు చాలా అవసరం" అని ఛెత్రి మ్యాచ్‌కు ముందు చెప్పాడు. ఛెత్రి ట్విటర్ వీడియో చూసి మ్యాచ్‌కు వచ్చానని దిల్లీకి చెందిన అనిల్ చెప్పాడు. నికుంజ్ అనే వ్యక్తి ఏకంగా వెయ్యి టికెట్లు కొనుగోలు చేయడం విశేషం.

హర్మన్‌ప్రీత్

హర్మన్ మెరుపులు

భారత్‌కు రెండో విజయం

కౌలాలంపూర్: ఆసియాకప్ మహిళల టీ20 టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ జోరు కొనసాగుతోంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 నాటౌట్; 3/11) ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయడంతో 66 పరుగుల తేడాతో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసి, వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. 20 ఓవర్లలో 4 వికెట్లకు 132 పరుగులు చేసింది. ఓపెనర్లు మోనా (32; 45 బంతుల్లో 2×4), స్మృతి మంధాన (29; 22 బంతుల్లో 1×4, 2×6) తొలి వికెట్‌కు 53 పరుగులు జోడించి శుభారంభం అందించగా.. ఆఖర్లో హర్మన్‌ప్రీత్, అనుజ పాటిల్ (22) ధాటిగా ఆడి స్కోరు పెంచారు. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి థాయ్‌లాండ్ నిలువలేకపోయింది. హర్మన్‌తో పాటు దీప్తి శర్మ (2/16), పూనమ్ (1/15), పూజ (1/5) విజృంభించడంతో థాయ్.. 20 ఓవర్లలో 8 వికెట్లకు 66 పరుగులే చేయగలిగింది. మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది.

కసాకినా

ఫ్రెంచ్ ఓపెన్లో అనూహ్య పరిణామం! మాజీ ఛాంపియన్ సెరెనా విలియమ్స్ టోర్నీ నుంచి వైదొలిగింది. తల్లి అయిన తర్వాత తొలిసారి గ్రాండ్‌స్లామ్ బరిలో నిలిచి ప్రిక్వార్టర్స్ చేరిన ఈ అమెరికా తార.. గాయం కారణంగా మధ్యలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. షరపోవాతో సెరెనా పోరు కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న వేళ.. ఆమె ఈ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఇక మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ వోజ్నియాకి ప్రిక్వార్టర్స్‌లో ఇంటిముఖం పట్టగా.. టాప్‌సీడ్ హలెప్ ముందంజ వేసింది. పురుషుల్లో హాట్ ఫేవరెట్ రఫెల్ నాదల్ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు.

పారిస్

అమ్మ తప్పుకుంది

- గాయంతో వైదొలిగిన సెరెనా
- నాదల్ రికార్డు విజయం

సెరెనా

నాదల్

16 నెలల సుదీర్ఘ విరామం తర్వాత గ్రాండ్‌స్లామ్ బరిలో దిగిన అమెరికా తార సెరెనా విలియమ్స్‌కు తీవ్ర నిరాశ. గాయం కారణంగా ఆమె ఫ్రెంచ్ ఓపెన్ నుంచి వైదొలిగింది. రష్యా భామ మరియా షరపోవాతో ప్రిక్వార్టర్స్ పోరుకు కొన్ని నిమిషాల ముందు ఆమె ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఛాతీకి గాయం కావడంతో సర్వీస్ చేయడానికి ఇబ్బందని భావించి పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ఆమె విలేకరులతో చెప్పింది. దీంతో షరపోవా నేరుగా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. మరోవైపు రెండో సీడ్ వోజ్నియాకి (డెన్మార్క్) ప్రిక్వార్టర్స్‌లోనే ఓడిపోయింది. ఆమె 6-7 (5-7), 3-6తో దరియా కసాకినా (రష్యా) చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. 33 అనవసర తప్పిదాలు చేసిన వోజ్నియాకి.. నాలుగుసార్లు సర్వీసు కోల్పోయి పరాజయం చవిచూసింది. టాప్‌సీడ్ హలెప్, జర్మనీ అమ్మాయి కెర్బర్ క్వార్టర్స్ చేరారు. హలెప్ 6-2, 6-1తో మెర్టిన్స్ (బెల్జియం)ను చిత్తు చేయగా.. కెర్బర్ 6-2, 6-3తో గర్సియా (ఫ్రాన్స్)ను ఓడించింది.

రఫాకు 900వ విజయం: రికార్డు స్థాయిలో పదకొండో టైటిల్ మీద గురి పెట్టిన స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ మరో అడుగు ముందుకేశాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో అతను 6-3, 6-2, 7-6 (7-4)తో మెర్టెరర్ (జర్మనీ)పై విజయం సాధించాడు. మూడో సెట్లో తప్ప రఫాకు ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. కెరీర్‌లో నాదల్‌కు ఇది 900వ ఏటీపీ విజయం కావడం విశేషం. మరోవైపు ఆరోసీడ్ కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)కు షాకిస్తూ స్క్వార్జ్‌మన్ (అర్జెంటీనా) క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. అతను 1-6, 2-6, 7-5, 7-6 (7), 6-2తో అండర్సన్‌ను ఓడించాడు. తొలి రెండు సెట్లు ఓడి... మూడో సెట్లో వెనకబడి కూడా అద్భుతంగా పోరాడిన ఈ అర్జెంటీనా కుర్రాడు అనూహ్య విజయాన్ని అందుకున్నాడు. ఐదో సీడ్ డెల్‌పొట్రో కూడా క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. అతను 6-4, 6-4, 6-4తో జాన్ ఇస్నర్ (అమెరికా)ను ఓడించాడు. ఈ మ్యాచ్‌లో ఆరు ఏస్‌లు, 37 విన్నర్లు కొట్టిన పొట్రో. . మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు. హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో మూడో సీడ్ సిలిచ్ (క్రొయేషియా) 6-4, 6-1, 3-6, 6-7 (4-7), 6-3తో ఫాగ్నిని (ఇటలీ)ని ఓడించాడు. తొలి రెండు సెట్లు గెలిచి.. ఆ తర్వాత రెండు సెట్లు ఓడిన సిలిచ్.. ఆఖరి సెట్లో విజృంభించి ఆడాడు. మూడు గంటలకు పైగా సాగిన ఈ మ్యాచ్‌లో సిలిచ్ 8 ఏస్‌లతో పాటు 44 విన్నర్లు కొట్టాడు.

ఆసియా క్రీడలకు పేస్

తెలుగమ్మాయి ప్రాంజలకు చోటు

దిల్లీ: ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్టులో లియాండర్ పేస్ చోటు సంపాదించాడు. ఈ మెగా ఈవెంట్లో పాల్గొనే 12 మంది సభ్యుల జట్టును భారత టెన్నిస్ సంఘం (ఐటా) సోమవారం ప్రకటించింది. ఈ జట్టులో లియాండర్‌ను చేర్చిన ఐటా.. సింగిల్స్ స్టార్ యుకి బాంబ్రికి మినహాయింపు ఇచ్చింది. ఆసియా క్రీడలు జరిగే సమయంలోనే యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ప్రారంభం కావడమే దీనికి కారణం. పురుషుల జట్టులో రామ్‌కుమార్, ప్రజ్నేశ్, సుమిత్ నగాల్, పేస్, బోపన్న, దివిజ్ శరణ్ ఉండగా.. మహిళల విభాగంలో తెలుగమ్మాయి యడ్లపల్లి ప్రాంజల, అంకిత రైనా, కర్మాన్‌కౌర్, రుతుజ భోంస్లే, రియా భాటియా, ప్రార్థన తోంబ్రేలకు చోటు దక్కింది.

ఇక ముందంతా 'ఈ' ముప్పే

- ఎలక్ట్రానిక్ వ్యర్థాలకు శాస్త్రీయ విధానమే లేదు
- పొంచి ఉన్న పర్యావరణ, ఆరోగ్య సమస్యలు

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ-వేస్ట్) మనదేశంలో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఈ విషయంలో అగ్రరాజ్యాలు కూడా మనకు సాటి రావు. ఒకపక్క వ్యర్థాలను పెద్ద సంఖ్యలో తయారు చేస్తూ, మరోపక్క వాటిని సరైన రీతిలో నిర్మూలించేందుకు ప్రయత్నించని దుర్భరస్థితి మనదేశంలో కనిపిస్తోంది. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సృష్టిలో చైనా, అమెరికా, జపాన్, జర్మనీ దేశాల సరసన భారతదేశం ఉన్నట్లు అసోఛామ్- ఎన్‌ఈసీ సంయుక్తంగా నిర్వహించిన తాజా అధ్యయనంలో స్పష్టమైంది.

ఎంత వృథానో...

- ఎలక్ట్రానిక్ వ్యర్థాలు 2016 సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా 4.47 కోట్ల టన్నులు ఉండగా, 2021 నాటికి 5.22 కోట్ల టన్నులకు పెరుగతాయని అంచనా.
- 2016లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో కేవలం 20 శాతం మేరకు మాత్రమే సరైన పద్ధతిలో సేకరించి..., నిర్మూలించటం, రీ-సైక్లింగ్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయి.
- ప్రపంచ వ్యాప్తంగా ఇ-వ్యర్థాలు పెరుగుతున్నాయి. 2018లో 4.75 కోట్ల టన్నుల వ్యర్థాలు పోగవుతాయని అంచనా వేస్తున్నారు.

ఇదీ ఈ-వేస్ట్...

ఈ-వ్యర్థాల్లో కంప్యూటర్లు, కంప్యూటర్ విడిభాగాలే అధికంగా ఉంటున్నాయి. దాదాపు 70 శాతం వాటా వీటిదే. టెలీకమ్యూనికేషన్ల విడిభాగాలు 12 శాతం వరకూ ఉంటాయి. ఎలక్ట్రికల్ విడిభాగాలు 8 శాతం, వైద్య ఉపకరణాలు 7 శాతం, గృహోపకరణాలు, ఇతరత్రా 4 శాతం ఉంటాయి.

ఈ-వ్యర్థాలకు 'మహా' రాష్ట్ర

దేశీయంగా చూస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వేస్ట్) సృష్టిలో మహారాష్ట్ర అగ్రగామిలో ఉంది.

ఆ విలువ 61.05 బిలియన్ డాలర్లు!

వ్యర్థాల విలువ తక్కేవేం లేదు. 2016లో పోగైన వ్యర్థాల విలువ 61.05 బిలియన్ డాలర్లు (1 బిలియన్ డాలర్లు= రూ.6,700 కోట్లు) ఉంటుంది. ఎన్నో దేశాల స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) కంటే ఈ మొత్తం ఎంతో అధికం.

ఆరోగ్యానికి పెను ముప్పు

ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో పాదరసం, ఇంకా అత్యంత ప్రమాదకరమైన విష రసాయనాలు ఉంటాయి. వీటిని సరైన రీతిలో నిర్మూలించకపోతే ప్రజారోగ్యానికి పెను ముప్పు తప్పదు. దీర్ఘకాలం పాటు ఇటువంటి వస్తువులకు సమీపంగా ఉంటే ఎన్నో అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి. నరాల సమస్యలు, రక్త సంబంధ వ్యాధులు, మూత్రపిండాలు, మెదడు వ్యాధులు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు, చర్మ వ్యాధులు, ఉబ్బసం, ఊపిరితిత్తుల కేన్సర్, గుండె జబ్బులు, కాలేయ వ్యాధులు రావచ్చు.

ఇవన్నీ ఈ-వ్యర్థాలే...

కంప్యూటర్ మోనిటర్
మదర్ బోర్డు
కేథోడ్ రే ట్యూబ్ (సీఆర్‌టీ)
ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీ)
మొబైల్ ఫోన్
ఛార్జర్
కాంపాక్ట్ డిస్క్ (సీడీ)
హెడ్ ఫోన్
ఎల్‌సీడీ/ ప్లాస్మా టీవీ
ఏసీ
రిఫ్రిరేటర్



ఏ రాష్ట్రంలో ఎంత?

రాష్ట్రం	శాతం
మహారాష్ట్ర	19.8
తమిళనాడు	13.0
ఉత్తరప్రదేశ్	10.1
పశ్చిమ బెంగాల్	9.8
దిల్లీ	9.5
కర్ణాటక	8.9
గుజరాత్	8.8
మధ్యప్రదేశ్	7.6

సరైన విధానం ఏదీ?

ఈ- వ్యర్థాలకు సంబంధించి మనదేశంలో సరైన విధానం లేదు. శాస్త్రోక్తంగా కాకుండా వీటిని ఇష్టానుసారం వదిలించుకుంటున్నారు. కేవలం 5% వ్యర్థాలను మాత్రమే సక్రమంగా నిర్మూలిస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఎక్కువ భాగం అసంఘటిత రంగం నుంచి వస్తున్నట్లు తెలుస్తోంది. అందువల్ల వాటిని స్క్రాప్ డీలర్లు చెత్త కింద సేకరించి, తమకు కావలసిన వస్తువులు తీసుకొని మిగతా వ్యర్థాలను డంపింగ్ యార్డులకు చేర్చుతున్నారు. తత్ఫలితంగా పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

శ్రీవారి సేవలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి

తిరుమలలో రమణ్‌సింగ్ దంపతులు

తిరుమల, న్యూస్‌టుడే: కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో స్వామివారి సేవలో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయ మహాద్వారం వద్ద అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రమణ్‌సింగ్, కుటుంబసభ్యులకు పండితులు వేదాశీర్వచనం చేశారు.

3 రోజులు ఆర్జితసేవలు రద్దు: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారికి ఈ నెల 24 నుంచి జరగనున్న జ్యేష్ఠాభిషేకం ఉత్సవాల నేపథ్యంలో మూడు రోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తితిదే సోమవారం తెలిపింది. అభిషేకాది క్రతువులతో అత్యంత ప్రాచీనమైన శ్రీవారి ఉత్సవమూర్తుల విగ్రహాలు అరిగిపోకుండా పరిరక్షించేందుకు చేసే ఉత్సవమే జ్యేష్ఠాభిషేకం. ఈ వేడుకల్లో మొదటి రోజు శ్రీమలయప్ప స్వామివారికి బంగారు కవచాన్ని తీసివేసి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. వజ్రకవచం అలంకరించి తిరువీధుల్లో ఊరేగిస్తారు. రెండో రోజు ముత్యాల కవచ సమర్పణ, 26న బంగారు కవచ సమర్పణ చేసి చతుర్మాడవీధుల్లో విహరింపజేస్తారు. ఈ ఉత్సవం నేపథ్యంలో శ్రీవారికి 25న విశేషపూజ, 26న అష్టదళ పాదపద్మారాధన సేవ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, 3 రోజుల పాటు వసంతోత్సవాన్ని రద్దు చేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనుంది.

ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు కృషి చేయాలి

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ ప్రసాద్

ఈనాడు, దిల్లీ: ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ బీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారమిక్కడ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సదస్సుకు హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని జయిద్దాం' అన్న ప్రధాన అంశంతో సాగుతున్న సదస్సులో రాష్ట్రంలో చేపట్టిన పర్యావరణహిత కార్యక్రమాలను వివరించామన్నారు. ఏపీలో 50 నుంచి 60 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు పునర్వినియోగం అవుతున్నాయని, ఈ-వ్యర్థాలు, బయో మెడికల్ వ్యర్థాలపైనా దృష్టి సారించామన్నారు. ప్రజల్లో ఈ విషయంలో అవగాహన మరింత పెరగాల్సి ఉందని ప్రసాద్ తెలిపారు.

గిరిజనుల ఆమోదంతోనే బాక్సైట్‌ను తవ్వాలి

ఈ విషయంలో వారికి అండగా ఉంటా • జనసేన అధినేత పవన్‌కల్యాణ్

విశాఖ జిల్లా అరకులోయలో గిరిజన యువతతో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

అరకులోయ, న్యూస్‌టుడే: విశాఖ మన్యంలో నిక్షిప్తమై ఉన్న అపార బాక్సైట్ ఖనిజాన్ని గిరిజనుల ఆమోదంతోనే వెలికితీయాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. ఈ విషయంలో వారికి తమ పార్టీ పూర్తిగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. సోమవారం అరకులోయలో స్థానిక గిరిజన యువతతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. బాక్సైట్ వెలికితీత 70 శాతం మంది గిరిజనుల ఆమోదంతోనే జరగాలన్నారు. గ్రామసభలు ఏర్పాటుచేసి గిరిజనుల ఆమోదం పొందాలన్నారు. ఇందుకు భిన్నంగా కొంతమంది ఏసీ గదుల్లో కూర్చొని గిరిజన పాలసీలు రాస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధికి ఖనిజాన్వేషణ అవసరమేనన్నారు. ఎక్కడ, ఎంతమేర తవ్వాలి అన్న విషయాలపైనే ఇది ఆధారపడి ఉంటుందన్నారు. నిబంధనలకు అనుగుణంగానే తవ్వకాలు జరపాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంటి కింద తవ్వినా ఏదో ఒక ఖనిజం బయటపడుతుందని, అటువంటపుడు ఆయన ఇంటిని కూలదోసి ఖనిజాన్ని తీస్తారా అని పవన్ ప్రశ్నించారు. గిరిజనుల మనసులు, ఆలోచనల్లో స్వచ్ఛత ఉంటుందన్నారు. ప్రకృతి సంపద ఇంకా మిగిలి ఉందంటే దానికి కారణం గిరిజనులేనని పవన్ కొనియాడారు. ప్రకృతికి దగ్గరగా బతికేవారి వద్ద అవినీతికి తావుండదన్నారు. గిరిజనులను రెచ్చగొట్టడానికి తాను మన్యం పర్యటనకి రాలేదని.. గిరిజనులను భయపెట్టి, బలహీనులుగా చేసేవారిపై పోరాడడానికే వచ్చినట్లు చెప్పారు. బాక్సైట్ మైనింగ్ విషయంలో ఎలాంటి అన్యాయం జరగకుండా పోరాడతానని ఆయన వారికి భరోసానిచ్చారు. మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చుతామని తెదేపా తన ఎన్నికల ప్రణాళికలో పెట్టిందని పవన్ గుర్తుచేశారు. దీనిని తాను ప్రశ్నిస్తే గిరిజనులను తనపై రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు. నాలుగు దశాబ్దాల చంద్రబాబు అనుభవం కులాల మధ్య కుమ్ములాటలు పెట్టడానికే పనికొచ్చిందని పవన్ ఎద్దేవా చేశారు. అలాగే ముఖ్యమంత్రి దత్తత పంచాయతీ పెదలబుడులోని సమస్యలపైనా ఆయన ఆరాతీశారు. గిరిజన ప్రాంతంలోని విద్య, వైద్య సౌకర్యాల తీరును అడిగి తెలుసుకున్నారు. వారికి అత్యవసరంగా కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరాతీశారు. ఆరుబయట సమావేశం జరుగుతుండగా వర్షం పడడంతో రిసార్టులోనే గిరిజనులతో మాట్లాడారు.

పోలవరంలో కాంక్రీటు పనుల వేగం పెంచాలి

పనులపై మంత్రి ఉమ సమీక్ష

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో క్రమేణా కాంక్రీటు పనులు పెంచుకుంటూ వెళ్లాలని జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌లు సూచించారు. మరిన్ని బ్లాచింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు గుత్తేదారులు వివరించగా... తొందరగా వాటిని ఏర్పాటు చేసి రోజుకు 10వేల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీటు వేయాలని, స్టిల్లింగ్ బేసిన్, స్పిల్ ఛానల్‌లోను వేగవంతం చేయాలని చెప్పారు. ఉత్తరాంధ్ర పర్యటన నుంచి సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాలేకపోవడంతో సోమవారం రాత్రి 10గంటలకు, మంత్రి, కార్యదర్శి ప్రాజెక్టుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. డయా ఫ్రం వాల్ పని ఇక 18 మీటర్లే మిగిలి ఉన్నందున త్వరగా పూర్తి చేయాలన్నారు. మంగళవారం సాయంత్రానికల్లా జెట్ గ్రౌటింగు పనులకు పంపు సిద్ధం చేసి వేగం పెంచాలని చెప్పారు.

వేతన కమిషన్‌కు తాత్కాలిక ఉద్యోగుల మంజూరు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యోగుల వేతన కమిషన్ కోసం ఏడు పోస్టులు మంజూరు చేస్తూ ఆర్థికశాఖ కార్యదర్శి రవిచంద్ర ఉత్తర్వులు ఇచ్చారు. వేతన సవరణ కమిషన్‌కు కార్యదర్శి (ప్రభుత్వ అదనపు కార్యదర్శి స్థాయి), డిప్యూటీ సెక్రెటరీ, అసిస్టెంట్ సెక్రెటరీ, సెక్షన్ ఆఫీసర్, వేతన కమిషనర్‌కు ప్రయివేటు సెక్రెటరీ, పీఏ, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులు మంజూరు చేస్తూ ఈ ఉత్తర్వులు ఇచ్చారు.

★ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టును మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. కార్మికశాఖ అదనపు కార్యదర్శి స్థాయి పోస్టును ఈ సంస్థకు కేటాయించింది.

★ రెవెన్యూ శాఖలో 392 జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలను సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలుగా గుర్తిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌గా ప్రభాకరరావు బాధ్యతల స్వీకారం

గొల్లపూడి (విజయవాడ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌గా తోట ప్రభాకరరావు పేర్కొన్నారు. ఇక్కడి ఈ శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈలుగా రాజేశ్వరరావు, ఆర్.వి.కృష్ణారెడ్డిలు కూడా బాధ్యతలు చేపట్టారు.

'ప్రిలిమ్స్'కు అనుమతించలేదని..!

దిల్లీలో విద్యార్థి ఆత్మహత్య

దిల్లీ: ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకోవడంతో.. సివిల్ సర్వీసుల ప్రిలిమ్స్ రాయలేకపోయిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్ణాటకకు చెందిన వరుణ్(28) దిల్లీలోని రాజేంద్రనగర్‌లో ఉంటూ దీర్ఘకాలంగా ఈ పరీక్షకు తయారయ్యాడు. ఉత్తర దిల్లీలోని పహార్‌గంజ్‌లో ఆదివారం పరీక్ష రాయాల్సి ఉండగా.. కేంద్రంలోకి తనను అనుమతించకపోవడంతో మనోవేదనకు లోనై తాను అద్దెకుంటున్న గదిలోనే అతను ప్రాణాలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తన కుటుంబ సభ్యులకు క్షమాపణలు చెబుతూ వరుణ్ రాసిన నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆర్‌ఆర్ 'ప్రభావిత' అర్హులు లేరు

427 భూసేకరణ ప్రకటనల్లో

- హైకోర్టుకు వివరాలు సమర్పించిన ఏపీ సర్కారు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని 448 భూసేకరణ ప్రకటనల్లో 427 ప్రకటనలకు సంబంధించి పునరావాస, పునర్నిర్మాణ (ఆర్.ఆర్.ప్యాకేజ్) ప్రయోజనాలు పొందేందుకు అర్హతగల 'ప్రభావిత కుటుంబాలు' లేవని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. మిగిలిన 21 ప్రకటనల్లో 14 పునఃపరిశీలన చేయాల్సి ఉందని, 7 ప్రకటనల్లో 529 ప్రభావిత కుటుంబాలకు ఆర్.ఆర్. ప్రయోజనాలు కల్పించామని పేర్కొంది. 427 ప్రకటనలకు సంబంధించి భూములు కోల్పోయిన 7,935 ప్రభావిత కుటుంబాలు ఆర్.ఆర్. ప్యాకేజీ పొందేందుకు అనర్హులుగా ప్రకటించినట్లు తెలిపింది. ఈ మేరకు ఆర్.ఆర్. ప్రత్యేక కమిషనర్ జీ.రేఖారాణి సోమవారం హైకోర్టుకు నివేదిక సమర్పించారు. ఏపీ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ప్రభావిత కుంటుబాలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించామన్నారు. గ్రామ పంచాయతీలలో సంబంధిత వివరాలను ప్రదర్శనకు ఉంచి అభ్యంతరాలను ఆహ్వానించగా.. ఎవరి నుంచీ అభ్యంతరాలు రాలేదన్నారు.

133 ప్రకటనల్లో ప్రక్రియ పూర్తి... ఈ ఏడాది మే చివరి నాటికి రాష్ట్రంలో (448 ప్రకటనలు కాకుండా) మిగిలిన 152 భూసేకరణ ప్రకటనల్లోనూ ప్రభావితుల వ్యవహారమై ఆర్‌ఆర్ అవార్డులు జారీచేయమని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో 133 ప్రకటనల్లో ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ఇంకా 19 ప్రకటనల్లో ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. అందుకు సమయం కావాలని కోరారు. అనంతపురం, కర్నూలు జిల్లాలకు సంబంధించి 14 భూసేకరణ ప్రకటనల విషయంలో నూతన భూసేకరణ చట్ట నిబంధనలను పాటించలేదని గుర్తించామన్నారు. చట్ట నిబంధనల ప్రకారం వ్యవహరించి వివరాలు సమర్పించేందుకు గడువుకావాలని కోరారు.

కర్నూలు జిల్లా కలెక్టర్ హాజరు...

కర్నూలు జిల్లా ఓర్వకల్లు భూసేకరణ విషయంలో ప్రభావితులను గుర్తించే ప్రక్రియను గత నెల 31లోపు పూర్తి చేయాలని.. ఆ వివరాల్ని సమర్పించాలని కోర్టు ఆదేశించినప్పటికీ వివరాలు సమర్పించడంలో కలెక్టర్ సత్యనారాయణ విఫలమయినందుకు ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. సోమవారం కోర్టుకు హాజరైన కలెక్టర్.. వివరాలు సమర్పించేందుకు పది రోజుల గడువు కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది. తదుపరి విచారణకు హాజరు కావాల్సిందేనని స్పష్టంచేసింది.

మరోవైపు పిటీషనర్ తరపు న్యాయవాది.. ప్రభుత్వం దాఖలు చేసిన నివేదికపై తిరుగు సమాధానంగా ప్రమాణ పత్రం దాఖలు చేసేందుకు పది రోజుల గడువు కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

ఏపీలో వివిధ ప్రాజెక్టుల నిమిత్తం సేకరించిన భూములపై ఆధారపడి జీవించే ప్రభావితులైన రైతు కూలీలు, తదితరులకు భూసేకరణ చట్టం ప్రకారం కల్పించాల్సిన పునరావాస ప్రయోజనాల్ని కల్పించేలా సర్కారును ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఏపీ వ్యవసాయ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. 448 ప్రకటనల్లో ఆర్‌ఆర్‌కు ఒక్కరూ అర్హులు లేరని చెప్పడంపై ఆశ్చర్యం వ్యక్తంచేసింది.

ఆరోపణలు చేసేవారు సీబీఐ విచారణకు సిద్ధమా?

- తితిదే మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు సవాల్

హైదరాబాద్, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తనపై చేసిన ఆరోపణలపై తాను సీబీఐ విచారణకు సిద్ధంగా ఉన్నానని తితిదే మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు స్పష్టం చేశారు. ఆదాయానికి మించి రూ.10 ఎక్కువ ఆస్తి ఉన్నట్లు తేలినా.. తాను ఏ శిక్షకైనా సిద్ధమనీ, తనపై ఆరోపణలు చేసినవారూ సీబీఐ విచారణ ఎదుర్కోడానికి తయారుగా ఉన్నారా.. అంటూ సవాలు విసిరారు. సోమవారం సికింద్రాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై వచ్చిన ఆరోపణలకు తీవ్రంగా ఆవేదన చెందానని, భక్తులకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే మీడియా ముందుకొచ్చినట్లు వివరించారు. మాస్టర్‌ప్లాన్ కోసమంటూ వెయ్యికాళ్ల మంటపాన్ని కూల్చివేశారనీ, దీనిపై ఎంతో పోరాడినట్లు వివరించారు. ప్రాచీనమైన, వంశపారంపర్యంగా వచ్చిన తన ఇంటినీ కూల్చివేశారని వాపోయారు. జేఈఓలుగా పనిచేసిన బాలసుబ్రమణ్యం, ధర్మారెడ్డి, శ్రీనివాసరాజులపై ఆయన పలు ఆరోపణలు చేశారు. 1800 నాటి బ్రిటిష్ మాన్యువల్స్‌లో తిరుమలలోని శ్రీవారి వంటశాల పక్కనున్న నేలమాళిగల్లో నిధులున్నట్లు ఉందనీ, అక్కడ కొంతకాలం కిందట తవ్వకాలు జరిపారనీ, బయటపడిన నగలు మాయమయ్యాయనే అంశంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

దీక్షలతో ప్రజా ధనం దుర్వినియోగం: సీపీఐ

ఈనాడు, దిల్లీ: నవ నిర్మాణ దీక్షలంటూ ప్రజాధనం దుర్వినియోగం చేయడం తగదని సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలకు హాజరైన ఆయన సోమవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. చాలా సీనియర్ నాయకుడునని చెప్పుకొంటున్న చంద్రబాబు దీక్షలకు సొమ్ములు ఎవరు ఇస్తున్నారో కూడా చెప్పాలని డిమాండు చేశారు. తెదేపా సొమ్ములతోనో, సొంత సొమ్ములతోనో దీక్షలు చేసుకుంటే ఎవరూ ఏమీ అనరని, ప్రజల ధనాన్ని వృథా చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్ర మోసం చేసిందని చెప్తూ ప్రతిపక్షాలపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుకి రాజకీయ చిత్తశుద్ధి ఉంటే ఫిరాయించిన 23 మంది ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఎన్నికలకు వెళ్లాలని రామకృష్ణ డిమాండు చేశారు.

ఎర్రచందనం వేలంలో రూ.107.96 కోట్ల ఆదాయం

ఈనాడు, అమరావతి: మూడు దశల్లో జరిగిన పదో విడత ఎర్రచందనం వేలం ద్వారా అటవీ శాఖకు రూ.107.96 కోట్ల మేర ఆదాయం లభించింది. మొత్తం 283 మెట్రిక్ టన్నుల విక్రయించారు. సగటున ఒక్కో మెట్రిక్ టన్ను ధర రూ.38 లక్షలు పలికింది. ఏప్రిల్ 24-26, మే 1-3, మే 8-10వ తేదీ మధ్య ఈ వేలం ప్రక్రియ నిర్వహించారు. ఆ వేలాన్ని ఖరారు చేస్తూ అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము ఉత్తర్వులు జారీ చేశారు.

'కాంట్రాక్టు లెక్చరర్ల' ఒప్పందం పొడిగింపు

ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద లెక్చరర్లు, సిబ్బంది ఒప్పందాన్ని పొడిగిస్తూ (రెన్యువల్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. 2018-19 సంవత్సరానికి 3,802 మందికి సంబంధించిన ఒప్పందాన్ని రెన్యువల్ చేశారు.

జీఎస్టీ పరిధిలోకి తెచ్చినా.. పెట్రోలు ధర తగ్గదు

రాష్ట్ర జీఎస్టీ కమిషనరు శ్యామలరావు

కప్ప స్తంభం వద్ద పూజలు చేస్తున్న శ్యామలరావు దంపతులు

సింహాచలం (విశాఖపట్నం), న్యూస్‌టుడే: డీజిల్, పెట్రోల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చినా ధరలు తగ్గే అవకాశం లేదని రాష్ట్ర జీఎస్టీ కమిషనరు జె.శ్యామలరావు అభిప్రాయపడ్డారు. సోమవారం అప్పన్నస్వామిని దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. దానిని అమలు చేస్తే అన్ని రాష్ట్రాల్లో వీటి ధరలు ఒకే విధంగా ఉంటాయన్నారు. జీఎస్టీతో ప్రధాన దేవాలయాలపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

విజయవాడ నుంచి సింగపూర్‌కు విమాన సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఈనాడు, అమరావతి: విజయవాడ నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసులను నడిపేందుకు సాధ్యాసాధ్యాలను రాష్ట్ర విమానయాన అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) పరిశీలిస్తోంది. హైదరాబాద్ నుంచి సింగపూర్ మార్గంలో ప్రస్తుతం ఉన్న ఛార్జీలను దృష్టిలో పెట్టుకొని విజయవాడ నుంచి విమాన సర్వీసులు ప్రవేశపెట్టే యోచనతో ప్రజలు, భాగస్వాముల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. పది రోజుల్లోగా అభిప్రాయాలు, ప్రతిపాదనలు 98681 75288కు వాట్సాప్ రూపంలో తెలియజేయాలని ఏపీఏడీసీఎల్ కోరుతోంది. వాయిస్ కాల్ అనుమతించమని, అభిప్రాయాలను www.apadcl.com వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చని అధికారులు సూచించారు.

ఉద్యోగ అవకాశాలు

WANTED
EXPERIENCED
MARKETING PERSONS
for the Sale of Pesticides, Micronutrients, Bioproducts to work at Krishna, Guntur, Prakasam & Nellore Dists.
❖ Qualification : Any Degree
❖ Experience : Min. 5 Years ❖ Salary : Negotiable
Interested Candidates may send your resume for the below email address.
Sovereign Agro Insecticides
8639749674 email : sovereignanil@gmail.com

NEW ZEALAND FINAL CLIENT INTERVIEW ON 9TH & 10TH JUNE 2018 IN MUMBAI OFFICE
•PACKAGING HELPER •DELIVERY HELPER •FARM HELPER
•HOUSE & GARDEN •HELPER •CLEANER •HOUSEKEEPER
•HOTEL HELPER •FRUIT PACKING HELPER •BUILDING LABOUR
REQUIRES IN LARGE NO'S.MINIMUM 2YRS. OF EXP IN THEIR RESPECTIVE FIELD. CARRY 2 SET OF CVS , ORGINAL EXP. CERTIFICATE AND PASSPORT. FRESHERS ARE WELCOME. ECR PASSPORT ACCEPTED.
DHITECH Consultancy Services
401, Arenja Corner, SEC - 17, Vashi, Navi Mumbai - 703.
Tel: 27891741 / 0725 / 9152084164 Email : Europe@dhitechcs.com
http://www.dhitechcs.com • ISO Certified - 9001:2008
Lic No: B-0019/MUM/PER/1000+/5/7712/2006

LIFE PHARMACY U.A.E
THE LARGEST RETAIL PHARMACY CHAIN U.A.E
Walk in Interview on 7, 8, 9 June 2018 at Bangaluru

Position	Qualification	Experience
PHARMACIST PHARMACY EXECUTIVES	D-PHARM / B-PHARM / M-PHARM/ PHARM-D/DHA/MOH	Freshers/Experienced
SALES ASSOCIATES WAREHOUSE ASSISTANT	SSLC / DIPLOMA / DEGREE	Exp. In medical rep/ Medical Store/ Pharmacy Ware House
PHARMACY SUPPORT STAFF	SSLC Passed	Any Local experiences

Documents : CV,Educational & Experience Certificate, Original Passport and Photo.
Age below 28, ECNR Only Total No. of Vacancies : 370 Salary 1200-3500 Dhs + Acc
Only the short listed Candidates will be eligible for Final Interview
SUHAIL ENTERPRISES
Approved by Govt. of India Ministry of External Affairs
Reg. No: B-0024/KER/PER/1000+/5/5492/2000
Mas Tower, Opp. Vanitha Jail,Attakulangara,Trivandrum-9
Tel : 0471-2571970 / 9745207861
Email : suhaillife2015@gmail.com
Visit: www.suhailmanpower.com
S.C. : Twenty Thousand
Interview at :
RAHMAN ENTERPRISES
1880/17, South End Main, 28th Main, 'C' Cross Road, 9th Block, Jaya Nagar, Bangalore-560069
Tel : 9986099750, 080-25988919
Mangalore : 7411410111
e-mail : rehmanmlr@yahoo.co.in
cvtorem@gmail.com

WANTED Agrisol (India) Pvt.Ltd. & Amish Crop Sciences Pvt.Ltd (Technical & Formulations) Companies coming up at Dhone, Kurnool District requires candidate for the following positions. The candidates willing to relocate to Dhone only need to apply.

S.No	Position	Department	Qualification	Exp(yrs)
1.	SR. Manager/Manager	Production (Formulations)	Bsc/Msc(Organic/ Analytical chem.)	10-15
2.	Manager/Dep.Manager (Engg.& Solvents)	Purchase (For H.O,Hyd.)	B.Tech/Diploma- Mech./Chemical	8-10
3.	Manager/Dep.Manager /sr.Chemist/Chemist	Q.C Lab	Bsc/Msc(Organic/ Analytical chem.)	4-10
4.	Executive/Sr.Chemists	ETP	Bsc/Msc(Organic/ Analytical chem.)	4-8
5.	Supervisors/Operators	Maintenance & R.O Plant, MEE	Diploma-Mech. & Elec. & B.Sc (Chem.)	3-5
6.	Fitters /Operators	Maintenance & Utilities	ITI-Fitters/Electrical	2-4
7.	Boiler Operators	Boilers	ITI (1st or 2nd Class Boiler certificate)	4-10
8.	Asst.Manager	Stores	Bsc	8-10
9.	Regional/Area Manager /Sales Officers for Rayalaseema & Telangana Region	Sales/ Marketing	Bsc(Agri)/Bsc. with relavant experience	4-15

Note: The candidates must be from Agro Chemical / Any Bulk Drug/ Formulations Industry Background and can forward their resumes mentioning the post applied for in the Subject line within a week to hr@agrisolindia.in

ఆ మూడూ దగాకోరు పార్టీలు

ప్రభుత్వ విప్ మాణిక్యవరప్రసాద్ ధ్వజం

ఈనాడు అమరావతి: భాజపా, వైకాపా, జనసేన దగాకోరు పార్టీలని శాసనమండలిలో ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ ధ్వజమెత్తారు. ఇటీవల కొత్తగా వచ్చిన అవినీతి నిఫా వైరస్ ఆ మూడు పార్టీలకు సోకిందని, తెలుగు ప్రజలకు నమ్మకద్రోహం చేసినందుకు అవి వచ్చే ఎన్నికల్లో మట్టి కొట్టుకుపోవడం ఖాయమని పేర్కొన్నారు. గుంటూరులోని తెదేపా కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుత భాజపా నాయకత్వానికి సిద్ధాంతాలు, విలువలపై ఏ మాత్రం గౌరవం లేదని విమర్శించారు. విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చకపోయినా, ప్రత్యేకహోదాపై మోసగించినా, రాజధాని నిర్మాణానికి అరకొరగా నిధులిచ్చి చేతులు దులిపేసుకున్న కేంద్రాన్ని జగన్, పవన్ ఏ మాత్రం ప్రశ్నించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి లోకేష్‌ను ఆడిపోసుకుంటున్నారని మండిపడ్డారు. విలువలకు తిలోదకాలిచ్చి భాజపా రాష్ట్రాల హక్కులను హరిస్తోందని దుయ్యబట్టారు.

దూర ప్రాంత రైళ్ల వేగం పెంపునకు కసరత్తు

కోల్‌కతా: దూర ప్రాంతాలకు వెళ్లే అన్ని రైళ్ల వేగాన్ని 2022 నాటికి గంటకు 25 కి.మీ మేర పెంచడానికి రైల్వేలు కసరత్తు చేస్తున్నట్లు ఆ శాఖ సహాయ మంత్రి రాజెన్ గొహైన్ సోమవారం చెప్పారు. 2022 నాటికి 25 కి.మీ. మేర వేగాన్ని పెంచడానికి వీలుగా ప్రతి ఏటా ఐదు కి.మీ. చొప్పున వేగం పెంచడంపై కసరత్తు చేయాలని జోనల్ రైల్వే జనరల్ మేనేజర్లందరికీ సూచించినట్లు తెలిపారు.

తల్లి అంత్యక్రియలకు వెళుతూ మృత్యుఒడికి

- లారీని కారు ఢీకొని తనయుడు ఆయన మరదలు మృతి
- ప్రాణాలు కాపాడని బెలూన్లు
- మృతులు పశ్చిమగోదావరి జిల్లా వాసులు

ఘటనా స్థలంలో వెంకటసత్యనారాయణ మృతదేహం ★ మృతురాలు మాధురి ★ క్షతగాత్రురాలు సౌజన్య

కోదాడ రూరల్, ఆచంట, న్యూస్‌టుడే: విధి ఆడిన వింత నాటకంలో ఓ కుటుంబం బలయిపోయింది. సొంతూరులో అర్ధరాత్రి అస్వస్థతతో తల్లి మరణించింది.. ఉబికివస్తున్న కన్నీటిధారను అణచుకుంటూ వాహనంలో వెళుతున్న ఆమె కుమారుడిని మృత్యువు కబళించింది. గర్భిణి అయిన ఆయన భార్యకు తీవ్రగాయాలవడంతో పాటు మరో యువతి ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాదం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కోమరబండలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతులు పశ్చిమగోదావరి జిల్లావాసులు. తల్లికి తలకొరివి పెట్టకుండానే ఆమె ఏకైక తనయుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. సిద్ధాంతం గ్రామానికి చెందిన ఆరిమిల్లి వెంకట సత్యనారాయణ(32) హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివసిస్తూ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తున్నారు. స్వగ్రామంలో ఉన్న తల్లి గోవిందలక్ష్మి ఆదివారం రాత్రి 11.30గంటల ప్రాంతంలో గుండెపోటుతో మరణించారు. సమాచారం తెలిసిన వెంటనే తన భార్య, ఏడు నెలల గర్భిణి అయిన వెంకటసౌజన్య, పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి చెందిన మరదలు (భార్య సోదరి) గుళ్లపల్లి వెంకటమాధురి(21)తో కలిసి క్యాబ్‌లో సొంతూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో తెల్లవారుజామున 3.45 గంటల ప్రాంతంలో కోమరబండ వద్ద క్రాసింగ్ దాటాక ముందు వెళ్తున్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎడమవైపు కూర్చున్న సత్యనారాయణ, మాధురి అక్కడికక్కడే మరణించారు. కుడివైపున కూర్చున్న డ్రైవర్ కరంగోతు రాజేష్, సౌజన్యకు తీవ్రగాయాలయ్యాయి. గర్భిణి సౌజన్యను హుటాహుటిన విజయవాడకు తరలించారు. డ్రైవర్‌కాలు, చేయి విరగడంతో కోదాడలో చికిత్సనందించారు.

పగిలిన భద్రతా బెలూన్లు: ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు వారు తీసుకున్నారు. సీటుబెల్టు కూడా పెట్టుకున్నారు. లారీని ఒక్కసారిగా వెనక నుంచి బలంగా ఢీకొట్టడంతో బెలూన్లు తెరుచుకున్నాయి. కారు ముందుభాగంలో ఉన్న అద్దాలు పగిలి గాజుముక్కలు బెలూన్లకు గుచ్చుకోవడంతో అవి పగిలిపోయాయి. దీంతో సత్యనారాయణ, వెనక సీట్లో ఉన్న మాధురి అక్కడికక్కడే మరణించారు. బెలూన్లు ఉన్నప్పటికీ వారి ప్రాణాలను కాపాడలేకపోయాయి. తల్లీ కొడుకులు గంటల వ్యవధిలోనే కన్నుమూయడంతో సిద్ధాంతం గ్రామం శోకసంద్రమైంది. మృతురాలు మాధురి ఖరగ్‌పూర్ ఐఐటీలో బీటెక్ చేసి క్యాంపస్ ఎంపికలో ఇన్ఫో డిజైనింగ్ కంపెనీ చెన్నైలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. కల నెరవేరకుండానే తనువు చాలించారు.

నవనిర్మాణ దీక్షల పేరుతో తెదేపా ప్రచారం

సీఎం చంద్రబాబు తీరుపై ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరా ధ్వజం

ఈనాడు డిజిటల్, అమరావతి: నవనిర్మాణ దీక్షల పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, తెదేపా ప్రచారానికి వినియోగిస్తున్నారని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆరోపించారు. నవనిర్మాణ దీక్షలలో భాగంగా అవాస్తవాలు ప్రచారం చేస్తూ రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. సంబంధిత దీక్షల పేరుతో నాలుగేళ్లుగా ఎంత ఖర్చు చేశారో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సోమవారం ఒక ప్రకటనలో రఘువీరా డిమాండ్ చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించకుండా చంద్రబాబు వంచనకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

తెదేపా నాలుగేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు సహా గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వమ్ముచేసిన తీరుపై జూన్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజావంచన వారం'గా నిర్వహిస్తామని రఘువీరా తెలిపారు. ఏపీసీసీ తరపున ఛార్జిషీటు విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. జూన్ 8వ తేదీన అన్ని జిల్లా, నగర కేంద్రాల్లో, 9 నుంచి 15 వరకూ అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

తెలంగాణ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సుధాకర్ ఇరిగేషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ మీలా సత్యనారాయణ. చిత్రంలో సంస్థ డైరెక్టర్లు జయదేవ్, ప్రభాకర్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు. ఈ కార్యక్రమంలో సుధాకర్ ఇరిగేషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ మహదేవ్ కూడా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకానికో కార్డు!

- రేషన్‌కార్డు చౌక సరకులకే పరిమితం
- మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడి
- కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ నేడు ప్రారంభం

ఈనాడు, అమరావతి: రేషన్ కార్డును చౌక సరకుల కొనుగోలుకే పరిమితం చేసి..వివిధ ప్రభుత్వ పథకాల్లో లబ్ధి కల్పించేందుకు ప్రత్యేక కార్డు అందజేయాలని ప్రభుత్వం యోచిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఆరోగ్యశ్రీ, వేరే పథకాల్లో లబ్ధి పొందేందుకు రేషన్ కార్డును ప్రాతిపదికగా చేసుకోవడం వల్ల చౌక సరకులు తీసుకోని వారు సయితం రేషన్‌కార్డు కోసం ఒత్తిడి చేస్తున్న మాట వాస్తవమేనని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అందుకే ఆరోగ్యశ్రీ వంటి వాటి కోసం ప్రత్యేక కార్డులిచ్చి, రేషన్‌కార్డును కేవలం చౌక సరకులకు పరిమితం చేస్తే ఎలా ఉంటుందని ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి పుల్లారావు, పౌర సరఫరాల కార్పొరేషన్ ఎండీ సూర్యకుమారిలు చంద్రన్న విలేజ్ మాల్స్‌పై సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ..'ప్రభుత్వం కొత్తగా 2.42 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తోంది. ఈ కార్డుల పంపిణీ ప్రక్రియ మంగళవారం కాకినాడలో సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారు. కుటుంబాల సంఖ్య కన్నా రేషన్‌కార్డుల సంఖ్య ఎక్కువగా ఉండటానికి కారణం ప్రజలందరూ ప్రజాసాధికార సర్వేలో తమ వివరాలు పూర్తిగా నమోదు చేసుకోపోవడమే. దాదాపు 30 లక్షల మంది ప్రజాసాధికార సర్వేలోకి రాలేదని సమాచారం. వారిని ఆ సర్వేలో నమోదు చేయించే ఏర్పాట్లు జరుగుతున్నాయి' అని ప్రత్తిపాటి వివరించారు. చంద్రన్న విలేజ్ మాల్స్ లాభదాయకంగా మారుతున్నాయని, ఈ నెలలో మరో 71 చంద్రన్న మాల్స్ ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. పాత తాలూకాల పరిధిలో ఒక్కో చంద్రన్నమాల్ వస్తుందని పేర్కొన్నారు.

ప్రవాసాంధ్రుల పిల్లలకు తెలుగు నేర్పించాలి

- అమెరికాలో మంత్రి గంటా వెల్లడి

ఈనాడు, అమరావతి: తెలుగుజాతి విశిష్టత, వారసత్వాన్ని అందిపుచ్చుకునే క్రమంలో ప్రవాసాంధ్రుల పిల్లలు తెలుగు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కాలిఫోర్నియా రాష్ట్రంలోని మిల్పిల్‌థస్ కమ్యూనిటీ సెంటర్‌లో జరిగిన పాఠశాల సంస్థ వసంతోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ పిల్లలు అమెరికాలో స్థిరపడినందుకు ఏపీలో ఉన్న పెద్దవాళ్లు సంతోషపడుతున్నారని, అదే క్రమంలో తమ మనవళ్లు తెలుగు మాట్లాడడం రాకపోవడంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. తెలుగు భాషను నేర్పించడంలో పాఠశాల సంస్థ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఏపీ ప్రభుత్వ సహకారంతో పాఠశాల సంస్థలో నాలుగేళ్ల తెలుగు కోర్సును నిర్వహిస్తుండడం, తొలి బ్యాచ్ పూర్తికావడం అభినందనీయమన్నారు. అనంతరం పిల్లలకు గ్రాడ్యుయేషన్ ధ్రువీకరణ పత్రాలను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, ఏపీ ఉన్నత విద్యామండలి సలహాదారు ఈదరవెంకట్, ఉత్తర అమెరికాలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం పాల్గొన్నారు.

సుధాకర్ పైపుల కంపెనీకి తెలంగాణ ప్రభుత్వ పురస్కారం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో శాఖలు గల సుధాకర్ ఇరిగేషన్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు తెలంగాణ ప్రభుత్వ పురస్కారం లభించింది. పీవీసీ, హెచ్‌డీపీఈ గొట్టాలను ఉత్పత్తి చేసే ఆ సంస్థ ఇప్పటివరకు రూ.1.08 కోట్లు విద్య, క్రీడలు, సాంస్కృతిక, రక్షితనీరు, హరితహారం వంటి కార్యక్రమాలకు వెచ్చించింది. ఇందుకుగానూ సంస్థకు ఉత్తమ కార్పొరేటు సామాజిక బాధ్యతల నిర్వహణ పురస్కారం దక్కగా..సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ దీనిని ప్రదానం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 'సైబర్‌ల్యాబ్'లు

- శిక్షణ విభాగం ఐ.జి.పి. ఎన్.సంజయ్

ఈనాడు, విశాఖపట్నం: సైబర్ నేరాలను ఛేదించడంలో కీలకమైన సైబర్‌ల్యాబ్‌లను త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పోలీసు శిక్షణ విభాగం ఐ.జి.పి. ఎన్.సంజయ్ పేర్కొన్నారు. వీటికి సుమారు రూ.5 కోట్ల వ్యయం అవుతుందన్నారు. సోమవారం విశాఖలోని పోలీస్‌మెస్‌లో ఎస్.హెచ్.ఒ.లకు సైబర్ నేరాల దర్యాప్తులపై మూడురోజుల అవగాహన కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'మహిళలు, పిల్లలపై సైబర్ నేరాల నిరోధం' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మొదటిబ్యాచ్ ఎస్.హెచ్.ఒ.లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవలే సివిల్, ఎ.ఆర్.విభాగాలకు చెందిన ఎస్.ఐ.లు, కానిస్టేబుళ్లు 5,866 మందికి సైబర్‌నేరాల దర్యాప్తులపై అవగాహన కల్పించామన్నారు. ప్రస్తుతం 190 మందికి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో జేసీపీ-1 డి.నాగేంద్రకుమార్, ఏడీసీపీ మహేంద్రపాత్రుడు తదితరులు పాల్గొన్నారు

నాగేంద్రకుమార్, సంజయ్

పాలిసెట్ రెండోవిడత కౌన్సెలింగ్‌కు ప్రకటన

ఈనాడు, అమరావతి: పాలిసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌కు కన్వీనర్ పండాదాస్ ప్రకటన జారీ చేశారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన వారు ఈనెల 8,9 తేదీల్లో విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకానివారు సైతం సహాయ కేంద్రాలకు వెళ్లి పత్రాల పరిశీలన చేయించుకోవచ్చని సూచించారు.

భవన నిర్మాణ ప్రాంతంలో ఇంజినీర్లకు బయోమెట్రిక్ హాజరు

ఈనాడు, అమరావతి: నిర్మాణ నాణ్యత పెంచడం, పని ప్రదేశాన్ని ఇంజినీర్లు నిత్యం పర్యవేక్షించేలా చూసేందుకు పనుల ప్రాంతాల్లో బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ విద్య, సంక్షేమ మౌలిక వసతుల కల్పన సంస్థ(ఏపీఈడబ్ల్యుఐడీసీ) నిర్ణయించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రూ.2కోట్లు దాటిన పనుల వద్ద ఈ బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేయనున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లే ఇంజినీర్లు అక్కడే హాజరు వేయాల్సి ఉంటుంది. దీంతో ఒక ఇంజినీరు పని ప్రాంతానికి ఎన్ని పర్యాయాలు వెళ్లారనే సమాచారం ప్రధాన కార్యాలయానికి చేరుతుంది.

ఐదింటికి జిల్లా ఆసుపత్రులుగా గుర్తింపు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని ఐదు ప్రాంతీయ ఆసుపత్రులను జిల్లా ఆసుపత్రులుగా మారుస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి, అనంతపురం జిల్లా హిందూపురం, ప్రకాశం జిల్లా మార్కాపురం, చిత్తూరు జిల్లా మదనపల్లె, నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని ప్రాంతీయ ఆసుపత్రులను ఇకపై జిల్లా ఆసుపత్రులుగా గుర్తించనుంది.

నైరుతి రుతుపవనాలు వచ్చేశాయ్..

- మూడ్రోజుల్లో విస్తరణ
- బంగాళాఖాతంలో అల్పపీడనానికి అవకాశం
- అనంతపురం జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే బృందం: నైరుతీ రుతుపవనాలు వచ్చేశాయి. సోమవారం రాయలసీమ, దక్షిణ కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించాయి. అనంతపురం జిల్లాలో పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చిత్తూరు జిల్లా ఆరోగ్యవరం, నెల్లూరు జిల్లా శ్రీహరికోట పరిసర ప్రాంతాల్లో వర్షప్రభావం మొదలైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. వచ్చే రెండు, మూడ్రోజుల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాలోని మరిన్ని ప్రాంతాలకు అవి విస్తరించడానికి అనువైన వాతావరణం కనిపిస్తోందని తెలిపింది. మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అక్కడక్కడా భారీ వర్షాలకు అవకాశం ఉందని వివరించింది. ఉరుములు మెరుపులు, ఈదురుగాలులు కూడా ఉంటాయని పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రం మీదుగా సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఒక ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల వాతావరణం ఉందని, అది ఈ నెల 8వ తేదీలోపు ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అనంతపురం జిల్లా ఆత్మకూరులో 16 సెం.మీ, తంబలపల్లెలో 8 సెం.మీ, ఆలూరు, చెన్నెకొత్తపల్లెలో 7 సెం.మీ, నల్లమడ, గోరంట్ల, ఓబుళవారిచెరువు, ఆమడగూరులో 6 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. సోమవారం బాపట్ల, ఒంగోలులో 41.4, విజయవాడలో 41.1, జంగమహేశ్వరపురంలో 40.6, మచిలీపట్నంలో 40.5, నెల్లూరులో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విశాఖ జిల్లాలో పిడుగులు పడి ముగ్గురు మృతి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా అనకాపల్లి, చోడవరం మండలాల్లో సోమవారం పిడుగులు పడి ముగ్గురు యువకులు మృతిచెందారు. అనకాపల్లి మండలం సంపతిపురం పంచాయతీ టి.వెంకుపాలెం వద్ద విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా వర్షం కురిసింది. దీంతో వీరిలో 10 మంది సమీపంలోని టేకుచెట్టు కిందకు వెళ్లారు. దానిపై పిడుగుపడటంతో కశింకోట మండలం విస్సన్నపేట గ్రామానికి చెందిన పి.హేమంత చంద్రశేఖర్, ఎన్.పవన్‌కుమార్ మృతిచెందారు. హేమంత్ చంద్రశేఖర్ ఇంటర్, పవన్ కుమార్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న అనకాపల్లి శాసనసభ్యులు పీలాగోవింద సత్యనారాయణ ఎన్టీఆర్ ఆసుపత్రికి వచ్చి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. మరో ఘటనలో చోడవరం మండలం గోవాడ వద్ద పిడుగుపడి గేదెల కాపరి సుంకర శ్రీనివాసరావు(20) మృతిచెందాడు.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన యంత్రం

■ యంత్రంలో వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా ముక్కలవుతాయి..

'పునర్వినియోగం'తో ప్లాస్టిక్ భూతానికి అడ్డుకట్ట

స్వచ్ఛభారత్ అమలులోభాగంగా విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్లాస్టిక్‌ను పునర్వినియోగించుకునేలా తొలిసారిగా ఓ యంత్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. నిత్యం వందల సంఖ్యలో రైళ్లు వచ్చిపోయే ఈ స్టేషన్‌లో.. భారీగా ప్లాస్టిక్ తాగునీటి సీసాలు, శీతలపానీయాల డబ్బాలు సహా ఇతరత్రా వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. వాటిని సంబంధిత యంత్రంలో వేస్తే క్షణాల్లో ఇలా ముక్కలుగా మారిపోతాయి. అనంతరం ఈ వ్యర్థాలను పునర్వినియోగించుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కొంతమేరకైనా పాటుపడే వీలుంది. త్వరలో ఈ తరహా యంత్రాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేయనున్నారు. –ఈనాడు, అమరావతి

అదిగదిగో హెచ్‌టీ పత్తి విత్తనం

- నమూనాల్లో బయటపడుతున్న జాడ

ఈనాడు, అమరావతి: ఖరీఫ్ మొదలు కావడంతోనే పత్తిలో హెచ్‌టీ (హెర్బిసైడ్ టోలరెంట్) విత్తనం జాడలు మొదలయ్యాయి. అధికారికంగా విక్రయిస్తున్న దుకాణాల నుంచి తీసే నమూనాల్లోనే వీటి లక్షణాలు బయటపడుతున్నాయి. ఇక గ్రామాల్లో అమ్మకాలకు లెక్కే లేదు. పత్తికి కలుపు సమస్య అధికంగా ఉంటుంది. హెచ్‌టీ రకం విత్తనాలు వేసిన పొలంలో కలుపు మందు చల్లినా పత్తి మొక్కకు ఎలాంటి నష్టం జరగదు. దీనికి కేంద్రం నుంచి అనుమతి లేదు. అయినా మూడు, నాలుగేళ్ల నుంచి గుజరాత్, మహారాష్ట్ర ప్రాంతాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గతేడాది 15లక్షల ప్యాకెట్ల వరకు హెచ్‌టీ పత్తి విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తాయి. కొన్ని విత్తన సంస్థలు కూడా ఈ రకం విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నాయి. అనధికారికంగా ఏదో ఒక పేరుతో రైతులకు చేరవేస్తున్నాయి.

నమూనాల్లో బట్టబయలు..: విత్తన సంస్థలు వివిధ దశల్లో పూర్తిస్థాయి తనిఖీల తర్వాతే విత్తనాలను ప్యాకెట్లలో నింపి బ్యాచ్ నంబర్లు ఇచ్చి మార్కెట్‌కు చేరవేస్తాయి. అనంతరం దుకాణాలకు తరలించి రైతులకు అమ్ముతారు. ఇలా అమ్మే ప్యాకెట్లలోనూ హెచ్‌టీ జాడలు బయటపడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 705 విత్తన నమూనాలు పరిశీలించారు. వీటిలో 248 పత్తి విత్తనాలకు సంబంధించినవే ఉన్నాయి. పత్తి విత్తనాలకు సంబంధించి పదికిపైగా నమూనాల్లో హెచ్‌టీ ఆనవాళ్లు బయటపడ్డాయి. ఇందులో కర్నూలులోనే అధిక సంఖ్యలో ఉన్నాయి. వీరికి నోటీసులు ఇచ్చిన వ్యవసాయశాఖ కేసులు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

మాకేం సంబంధం: వ్యాపారులు: పత్తి విత్తనంలో ఎలాంటి లోపం గుర్తించినా సంబంధిత దుకాణాలపై కేసులు నమోదు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా హెచ్‌టీ రకం ఆనవాళ్లు గుర్తించిన దుకాణాలపై అధికారులు కేసుల నమోదుకు సన్నాహాలు చేస్తున్నారు. సంబంధిత యజమానుల్లో దీనిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విత్తనాల తయారీతో తమకు సంబంధం లేనప్పుడు కేసులెలా పెడతారనే ప్రశ్న లేవనెత్తుతున్నారు. మరోవైపు, తమ విత్తనంలో హెచ్‌టీ ఉండదని లేఖ ఇవ్వాలని స్పష్టం చేస్తున్నారు. అలా ఇచ్చిన వారి విత్తనాలనే రైతులకు అమ్ముతున్నారు. ఇందుకు అనుగుణంగా పేరున్న విత్తన సంస్థలు సైతం లేఖలు ఇస్తుండడం విశేషం.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

కుంగుబాటు కుదేలు

జీవితంలో కష్టనష్టాలు సహజం. ఎప్పుడో అప్పుడు పలకరించే అనూహ్యమైన విపత్తులు, విషాదకర ఘటనలూ మామూలే. ఇలాంటివన్నీ కాస్త 'కుంగుబాటు'ను తెచ్చిపెట్టటం సహజమే. దీన్నుంచి మనం త్వరలోనే, తేలికగా కోలుకుంటుంటాం. కానీ కొందరిలో మాత్రం ఇది విడవకుండా వేధిస్తుండొచ్చు. సమస్యగానూ (డిప్రెషన్) మారిపోవచ్చు. జీవితంలో అన్నీ బాగున్నా కూడా కొందరు డిప్రెషన్ కోరల్లో చిక్కుకోవచ్చు. ఎప్పుడూ ఏదో తెలియని వెలితి. ఆందోళన, బాధ, చికాకు. దేని మీదా ఆసక్తి ఉండదు. ఏకాగ్రతా కుదరదు. పడుకుంటే కంటికి మీద కునుకు వాలదు. ఇలాంటి లక్షణాలు వేధిస్తున్నపుడు ఓసారి పచ్చటి ప్రకృతిలోకి తొంగి చూడండి. నలుగురితో కలిసి నాలుగడుగులు నడవండి. దీంతో కుంగుబాటు తగ్గుతుంది. సెరటోనిన్, డోపమైన్ వంటి నాడీ సమాచార వాహకాలు విడుదలవుతాయి. వీటితో ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. మానసికంగానే కాదు, శారీరకంగానూ కొత్త ఉత్తేజం పుట్టుకొస్తుంది. మిషిగన్ విశ్వవిద్యాలయ అధ్యయనం ఈ విషయాన్నే ఘోషిస్తోంది. తీవ్రమైన జబ్బులు, ఆత్మీయుల మరణం, విడాకులు, ఉద్యోగం కోల్పోవటం వంటి విపత్కర పరిస్థితుల మూలంగా ఒత్తిడికి గురైనవారు పచ్చటి వాతావరణంలో నలుగురితో కలిసి ఒక బృందంగా నడవటం వల్ల చింత, బాధ, దుఃఖం వంటివి దూరమవుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. కాబట్టి ఎప్పుడూ ఇంట్లోనే కూచోకుండా అప్పుడప్పుడు అలా ప్రకృతిలోకి తొంగిచూడండి. మనసు తేలిక పడుతుంది. కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తుంది.

ప్రకృతే ఆధారం. మన కథ ఆరంభమైందీ అక్కడే. పచ్చని చెట్లతో దోబూచులాడుతూ.. హరిత హారాలతో చెట్టపట్టాలేసుకుంటూనే పెరిగాం. కానీ ఎక్కడో దారితప్పిపోయాం. క్రమంగా పచ్చటి పరిసరాలకు దూరమవుతున్నాం. కాంక్రీటు అరణ్యాలను శరణుజొచ్చుతున్నాం. కాలుష్య కాసారాల్లో మునిగిపోతున్నాం. దీంతో ఎన్నెన్నో సమస్యలను, జబ్బులను చేజేతులా 'కొని'తెచ్చుకుంటున్నాం. మనం దూరం చేసుకుంటున్నా ప్రకృతి కనికరించటం మానలేదు. తన ఒడిలోకి రమ్మనే ఆహ్వానిస్తోంది. ఆధునిక ఒత్తిళ్లు, సాంకేతిక పరిజ్ఞాన సందోహం మోసుకొస్తున్న ఎన్నెన్నో ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపిస్తానంటోంది. ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగానైనా ప్రకృతి మాటను మన్నిద్దాం. పచ్చటి పరిసరాలతో ఒనగూడే ప్రయోజనాలపై ఓ కన్నేద్దాం.

పచ్చని ప్రకృతి తోడుంటే..

నేడు ప్రపంచ పర్యావరణ దినం

క

ళకళలాడే పచ్చని చెట్లు, జలజలపారే నదులు, కిలకిలమనే పక్షులు.. ఇలాంటి దృశ్యం కంటికి కనబడితే మనసు ఆహ్లాదంతో నిండిపోతుంది. సంతోషంతో ఉప్పొంగుతుంది. అవును మరి.. ప్రకృతి శోభకు పులకరించని మనసుంటుందా? అయితే ఇది కేవలం అందానికే పరిమితమైంది కాదు, ఆరోగ్యంతోనూ ముడిపడిన అంశం. చుట్టుపక్కల పరిసరాలు, వాతావరణం మన ఆరోగ్యంపై చూపే ప్రభావం అంతాఇంతా కాదు. అందుకే స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం కోసం అనాదిగా మానవుడు తాపత్రయ పడుతూనే ఉన్నాడు. రోజురోజుకీ పట్టణీకరణ, కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఇది మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది కూడా. నేటి ఉరుకుల పరుగుల జీవితం మోసుకొస్తున్న పలు సమస్యలకు పచ్చని ప్రకృతి సహజ పరిష్కార మార్గం కాగలదని అధ్యయనాలూ ఘోషిస్తున్నాయి.

విటమిన్ డి రక్షణ

మధుమేహం, గుండెజబ్బులు, క్యాన్సర్లు. ప్రస్తుతం అందరినీ భయపెడుతున్న సమస్యలు. వీటి బారినపడకుండా చూసుకోవటానికీ ప్రకృతే మార్గం చూపెడుతోంది. అదీ చాలా తేలికైంది. ఎలాంటి ఖర్చూ లేనిది. రోజూ కాసేపు ఒంటికి ఎండ తగిలేలా చూసుకుంటే చాలు. విటమిన్ డి రూపంలో అవసరమైన రక్షణ లభిస్తుంది. సాధారణంగా విటమిన్లను మన శరీరం తయారుచేసుకోలేదు. వీటిని ఆహారం ద్వారానే తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విటమిన్ డి అలా కాదు. సూర్యరశ్మి సహాయంతో మన శరీరమే దీన్ని చాలావరకు తయారుచేసుకుంటుంది. ఇది ఎముకలను బలోపేతం చేయటంలో, రోగనిరోధకశక్తి పెంపొందటంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. విటమిన్ డి రక్తనాళాలనూ ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇన్సులిన్ ఉత్పత్తి సజావుగా సాగేలా చేస్తుంది. కణ విభజననూ నియంత్రిస్తుంది. వాపు ప్రక్రియ తలెత్తకుండానూ కాపాడుతుంది. ఇవన్నీ మధుమేహం, క్యాన్సర్ల వంటి సమస్యల బారినపడకుండా కాపాడేవే. ఇన్ని ప్రయోజనాలు చర్మానికి ఎండ తగలటం వల్లనే లభిస్తుండటం విశేషం. అందువల్ల వీలైనప్పుడల్లా పచ్చటి ప్రకృతిలో విహరించటం అలవాటు చేసుకోండి. దీంతో ఆధునిక జీవనశైలితో ముడిపడిన ఎన్నెన్నో సమస్యలను దూరం చేసుకోవచ్చు.

గుండెకు 'హరిత' బలం

గుండెజబ్బు నివారణ అనగానే ఆహారం, పొగ మానెయ్యటం, వ్యాయామం చేయటం వంటి జీవనశైలి మార్పులే గుర్తుకొస్తాయి. కానీ పార్కులకు, పచ్చని పరిసరాలకు ఎంత దగ్గరగా జీవిస్తున్నామనే సంగతిని పెద్దగా పట్టించుకోరు. నిజానికి గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యల ముప్పులు పచ్చని పరిసరాలకు ఎంత సమీపంలో జీవిస్తున్నారనే దాంతోనూ ముడిపడి ఉంటున్నాయని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఉద్యానవనాలకు సమీపంలో నివసిస్తున్నవారితో పోలిస్తే.. దూరంగా ఉంటున్నవారిలో గుండెజబ్బులు ఎక్కువగా కనబడుతుండటమే కాదు, వీటితో మరణాలు కూడా అధికంగానే సంభవిస్తుండటం గమనార్హం. పార్కులకు వెళ్లేవారు నలుగురితో కలివిడిగా ఉండటం, మరింత చురుకుగా ఉండటం, బరువు అదుపులో పెట్టుకోవటం, పొగ జోలికి వెళ్లకపోవటం వంటి పలు అంశాలు ఇందుకు దోహదం చేస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

సృజనకు పదును

చేతిలో స్మార్ట్‌ఫోన్. లేదంటే ట్యాబ్లెట్. ఇంట్లో, ఆఫీసులో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు సరేసరి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సందోహంలో మునిగితేలుతున్న అందరిదీ ఇప్పుడిదే ధోరణి. ఈ యావలో శారీరక ఆరోగ్యమే కాదు.. తెలివితేటలు, సృజనాత్మక శక్తి సైతం దెబ్బతింటోంది. అంతమాత్రాన నిరాశ పడాల్సిన పనేమీ లేదు. ప్రకృతి ఒడే దీనికి పరిష్కారం చూపుతోంది. ఎలక్ట్రానిక్ పరికరాలను ఇంట్లోనే వదిలిపెట్టేసి, నాలుగైదు రోజుల పాటు పర్వతారోహణ చేసి వచ్చినవారిలో సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం గణనీయంగా మెరుగుపడినట్టు ఉటా, కన్సాస్ విశ్వవిద్యాలయాల అధ్యయనాల్లో వెల్లడైంది. ఏకాగ్రతకు తోడ్పడే మెదడులోని భాగాలు పునరుత్తేజితం కావటానికి ప్రకృతి తోడ్పడుతోందన్నది పరిశోధకుల భావన. ఇదే సృజనాత్మకత పెరగటానికి దోహదం చేస్తోందన్నమాట. సెల్‌ఫోన్‌తో మాట్లాడటం, సందేశాలు పంపటం, ఫొటోలు తీయటం.. ఇలా ఒకే సమయంలో పలు పనులు చేయటం వల్ల నుదురు వద్ద గల మెదడు భాగం మీద విపరీతంగా భారం పడి అలసిపోతోందని.. ఇది విషయగ్రహణ సామర్థ్యం తగ్గటానికి దారితీస్తోందన్నది పరిశోధకుల భావన. అయితే పచ్చని ప్రకృతి ఇలాంటి దుష్ప్రభావాలు తగ్గటానికి తోడ్పడుతుండటం గమనార్హం.

ఒత్తిడి హుష్

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవటానికి ప్రకృతి సన్నిధిలో గడపటం చవకైన, ఉత్తమమైన మార్గం! వినోదాన్ని అందించే సాధనాల ఇది ఒత్తిడి తగ్గటానికి గణనీయంగా తోడ్పడుతున్నట్టు నెదర్లాండ్స్ పరిశోధకులు గుర్తించారు. ఒత్తిడికి గురైనప్పుడు కార్టిజోల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు పెద్దమొత్తంలో విడుదలవుతాయి. ఇవి దీర్ఘకాలంలో తీవ్ర అనర్థాలకు దారితీస్తాయి. అయితే పచ్చని వాతావరణంలో గడపటం వల్ల ఒత్తిడి హార్మోన్ల స్థాయులు బాగా తగ్గుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కిటికీల ద్వారా చెట్లు, గడ్డి కనిపించేలా చేస్తే- రోగులు త్వరగా కోలుకోవటానికి, విద్యార్థులు చదువుల్లో మరింత బాగా రాణించటానికి, హింసాత్మక ప్రవృత్తి తగ్గటానికి తోడ్పడుతున్నట్టు తేలటం విశేషం. పచ్చని చెట్ల మధ్య 15 నిమిషాలు నడిచినా రక్తపోటు 2%, గుండె వేగం 4% తగ్గినట్టు జపాన్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. వీటన్నింటికీ మూలం పచ్చని దృశ్యాలు కంటికి కనబడినపుడు శ్వాస, గుండె వేగం తగ్గి.. మనసులో ప్రశాంత స్థితి నెలకొంటుండటమే.

క్యాన్సర్లకు కళ్లెం

వృక్షాల పచ్చదనం క్యాన్సర్ల నివారణకూ తోడ్పడుతుంది. అటవీ విహారం మూలంగా తెల్లరక్తకణాల్లో క్యాన్సర్ నిరోధక ప్రోటీన్లు పెరుగుతాయి. వైరస్‌ల ప్రభావానికి గురైన కణాలను చంపటంలోనూ.. క్యాన్సర్ తొలి సంకేతాలను గుర్తించి, వాటిని నిర్వీర్యం చేయటంలోనూ పాలు పంచుకునే సహజ హంతక (న్యాచురల్ కిల్లర్) కణాల సంఖ్య కూడా పెరుగుతుంది. అంటే వన విహారం కణితుల నివారణకూ తోడ్పడుతుందన్నమాట. వన విహారం ముగిసిన వారం తర్వాత కూడా వీటి ప్రభావం కనబడుతుండటం గమనార్హం. చెట్ల నుంచి విడుదలయ్యే ఆల్ఫా పైనేన్, బీటా పైనేన్ అనే ఫైటాన్‌సైడ్లకు ఒత్తిడిని తగ్గించే గుణముందని, ఇదే నేచురల్ కిల్లర్ కణాల పనితీరు పుంజుకోవటానికి దోహదం చేస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

దీర్ఘాయుష్షు సొంతం

పచ్చని చెట్లు ఆయుష్షునూ పెంచుతాయి! దగ్గర్లో పార్కులు, చెట్లతో కూడిన వీధులు గల చోట్ల నివసించే వృద్ధులు ఐదేళ్లు ఎక్కువగా జీవిస్తున్నట్టు జపాన్ పరిశోధకులు గుర్తించారు. పచ్చటి పరిసరాల మధ్య జీవించేవారిలో ఎలాంటి కారణంతోనైనా సంభవించే మరణాలు తగ్గుముఖం పడుతున్నట్టు ఇంగ్లాండ్ అధ్యయనంలోనూ బయటపడింది. కెనడా అధ్యయనంలోనూ ఇలాంటి విషయమే బయటపడింది. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలతో తలెత్తే మరణాలు గణనీయంగా తగ్గుతున్నట్టు వెల్లడైంది. కాబట్టి ఇంటి ఆవరణలో చెట్లు పెంచుకోవటం, సమీపంలో ఉద్యానవనాల వంటివి ఉండేలా చూసుకుంటే జీవనకాలాన్ని కూడా పెంచుకోవచ్చు.

పిల్ల ఊబకాయం దూరం

గత 20, 30 ఏళ్లలో పిల్లల్లో ఊబకాయం గణనీయంగా పెరిగిపోయింది. ఇందుకు జంక్‌ఫుడ్, బజారులో దొరికే ఆహార ఉత్పత్తులు, చక్కెర్లనే చాలామంది నిందిస్తుంటారు. కానీ గాలి కాలుష్యమూ ఇందుకు దోహదం చేస్తోంది. కాలుష్య కారకాలకు.. ముఖ్యంగా పాలీసైక్లిక్ అరోమాటిక్ హైడ్రోకార్బన్ల (పీఏహెచ్‌లు) ప్రభావానికి గురైన గర్భిణులకు పుట్టిన పిల్లలకు ఏడేళ్ల వయసుకు వచ్చేసరికి ఊబకాయం బారినపడే అవకాశం రెట్టింపు అవుతున్నట్టు కొలంబియా విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొంటోంది. బొగ్గు, పొగాకు, నూనె, చెక్క వంటివి మండినపుడు వాటిలోంచి పీఏహెచ్‌లు విడుదలై గాలిలో కలుస్తాయి. కార్ల వంటి వాహనాల పొగలోనూ ఇలాంటివి ఉంటాయి. ఇవి ఒంట్లో కొవ్వులు విడిపోయే ప్రక్రియను నిలువరిస్తూ పిల్లల్లో ఊబకాయానికి దారితీస్తున్నాయి. అంటే గర్భిణులు పచ్చటి వాతావరణంలో గడిపితే పిల్లల్లోనూ ఊబకాయాన్ని నివారించుకునే వీలుందన్నమాట.

కరుణామృతం, దయాగుణం

ఎంత ఎత్తుకు ఎదిగినా చెట్లు నీడనివ్వటం మానుకోవు. అహంకారం ఏ కోశానా కనబడదు. అలాంటి చెట్ల ముందు నిలబడి నిశితంగా గమనిస్తే మనం ఎంత చిన్నవాళ్లమో అనిపించకమానదు. ప్రకృతి మధ్యలో గడిపినప్పుడు ఇలాంటి ఆలోచనలే మనసులో కదలాడుతున్నట్టు.. ఇది కరుణామృతం ఉప్పొంగటానికి, దయాగుణం వెల్లివిరియటానికి దారితీస్తున్నట్టు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ అధ్యయనం చెబుతోంది. అందమైన దృశ్యాలను చూసిన తర్వాత ఎదుటివారి పట్ల దయ, నమ్మకం పెరుగుతున్నట్టు బయటపడింది. పనిచేసే చోట పచ్చని మొక్కలను అమర్చగా.. సేవ చేయాలనే భావన మరింత ఎక్కువవుతున్నట్టు తేలటం గమనార్హం. అందమైన ప్రకృతి మనకు తెలియకుండానే మనలో సున్నితత్వం, నిస్వార్థం వంటివి పాదుకొల్పుతూ.. ప్రవర్తన మారటానికి దోహదం చేస్తోందన్నమాట. ఇలా ఇది కోపం, ఉద్రేకం వంటివి తగ్గేలా చేస్తూ.. ఆనందం, సంతోషం, తృప్తి వంటి మానసిక భావనలు పెరగటానికి తోడ్పడుతుంది. అందువల్ల ఎప్పుడైనా ఆగ్రహావేశాలతో మనసు కల్లోలితమైతే కాసేపు పచ్చని చెట్ల మధ్య సేదతీరేందుకు ప్రయత్నించటం మంచిది.

హెపటైటిస్ బి మా పిల్లలకూ వస్తుందా?

ప్రశ్న: ఇటీవల మా పెద్దన్నయ్యకు హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టు నిర్ధరణ అయ్యింది. ఇదేమైనా అంటువ్యాధా? ముట్టుకున్నా కూడా వస్తుందని చుట్టుపక్కలవాళ్లు అంటున్నారు. ఇది నిజమేనా? మాకు చిన్న పిల్లలున్నారు. భయంగా ఉంది. దీనికి చికిత్స లేదా?

– డి.బి.ఎన్. వాసు
(ఈమెయిల్ ద్వారా)

సమస్య - సలహా



జవాబు: హెపటైటిస్ బి వైరస్ రక్తం లేదా శారీరక స్రావాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. అంతేగానీ ఒకరినొకరు ముట్టుకోవటం, తాకటం, ఒకరు తాగిన గ్లాసుతో నీరు తాగటం, ఒకరు భోజనం చేసిన ప్లేటులో భోజనం చేయటం ద్వారా వ్యాపించదు. కాబట్టి మీరు భయపడాల్సిన పనేమీ లేదు. అయితే బ్లేడ్లు, సూదులు, నెయిల్ కట్టర్ల వంటి పదునుగా ఉండే వస్తువులను ఒకరు వాడినవి మరొకరు వాడుకోకుండా చూసుకోవాలి. అలాగే టూత్‌బ్రష్షులనూ మరొకరు వాడకూడదు. ఇప్పుడు పిల్లలకు పుట్టగానే హెపటైటిస్ టీకా కూడా ఇస్తున్నారు. కాబట్టి మీ పిల్లలకు హెపటైటిస్ టీకా ఇచ్చారో లేదో ఒకసారి నిర్ధరించుకోండి. టీకా ఇచ్చి ఉంటే వైరస్ సోకే అవకాశం దాదాపు లేదనే చెప్పుకోవాలి. అలాగే కుటుంబ సభ్యులంతా హెపటైటిస్ బి టీకా తీసుకోవటం మంచిది. ఇంట్లో ఎవరికైనా హెపటైటిస్ బి ఉన్నట్టయితే కుటుంబ సభ్యులందరూ టీకా తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేస్తోంది. మీ అన్నయ్యకు హెపటైటిస్ బి నిర్ధరణ అయ్యింది కాబట్టి కుటుంబంలోని అందరూ టీకా తీసుకోవటం మేలు. దీంతో వైరస్ బారినపడకుండా చూసుకోవచ్చు. అప్పటికే వైరస్ సోకిందేమోననే అనుమానమూ కొందరికి వస్తుంటుంది. అయితే దీన్ని నిర్ధరించుకోవటానికి తప్పనిసరిగా పరీక్షలు చేసుకోవాలనేమీ లేదు. వీలైనవారు చేయించుకోవచ్చు. పరీక్షలేమీ చేయించుకోకపోయినా టీకా తీసుకోవచ్చు. అందరూ గమనించాల్సిన విషయం ఏంటంటే- హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ ఉన్నా కూడా కుటుంబంతో కలిసి హాయిగా జీవించొచ్చు. ఎలాంటి ఇబ్బందీ లేదు. ఇలాంటివాళ్లు మన సమాజంలో చాలామందే ఉన్నారు. పెళ్లిళ్లు కూడా చేసుకుంటున్నారు. హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్‌కు ఇప్పుడు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. ఇన్‌ఫెక్షన్ ఎంత కాలం నుంచి ఉంది? వైరస్ చురుకుగా ఉందా? నిద్రాణంగా ఉందా? వైరస్ సంఖ్య ఎంత ఎక్కువగా ఉంది? అనే వాటిని బట్టి డాక్టర్లు చికిత్స చేస్తారు. కాబట్టి లేనిపోని అపోహలతో భయపడిపోవద్దు.

డా॥ కె. జగన్మోహనరావు
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్

మీ సమస్యలను, సందేహాలను పంపాల్సిన చిరునామా:
సమస్య – సలహా, **సుఖీభవ,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in

ఆనందంగా ఆరోగ్యం!

శ్రావ్యమైన సంగీతం వినగానే మనసు గాల్లో తేలిపోతుంది. ఎంతటి విచారమైనా మటుమాయమవుతుంది. అవును.. సంగీతం మన మెదడులోని వివిధ భాగాలను ఉత్తేజితం చేస్తుంది. ఇది కేవలం ఆనందానికి సంబంధించిందే కాదు, ఆరోగ్యం ఇనుమడించటానికీ తోడ్పడుతుంది. సంగీతం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుముఖం పడుతున్నట్టు శాస్త్రీయంగానూ రుజువైంది. సంగీతం వింటున్నా, సంగీతాన్ని సృష్టిస్తున్నా.. అంటే వాయిద్య పరికరాలను వాయించినా, గానం చేసినా మెదడులో కొన్ని ప్రత్యేకమైన రసాయనాలు విడుదలవుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఇవి మనం చేస్తున్న పనిని మరింత ఎక్కువసేపు చేసేలా పురికొల్పుతున్నాయని.. దీంతో మరింత ఎక్కువ సేపు వ్యాయామం చేయటానికి అవసరమైన ఉత్సాహం లభిస్తోందని కనుగొన్నారు. సాధారణంగా మనకు వినబడే శబ్దాలు మస్తిష్క మూలంలో విభజన చెందటం మొదలవుతుంటాయి. గుండె, శ్వాస వేగాలనూ ఇదే నియంత్రిస్తుంటుంది. అందువల్ల మనసుకు ప్రశాంతతను చేకూర్చే సంగీతం మూలంగా గుండె కొట్టుకునే వేగం, శ్వాస వేగం, రక్తపోటు సైతం తగ్గుముఖం పడతాయి. తమ అభిరుచులకు అనుగుణంగా సంగీతాన్ని ఎంచుకోవటం వల్ల మరింత ఎక్కువ ప్రయోజనమూ కనబడుతుండటం విశేషం.

ఆహారంతోనూ ఒంటి కంపు

చెమట పట్టినపుడు శరీరం ఒకరకమైన వాసన వేయటం తెలిసిందే. దీనికి కారణం చర్మం మీదుండే బ్యాక్టీరియా చెమటలోని రసాయనాలను విడగొట్టటమే. యుక్తవయసుకు చేరుకునేటప్పుడు, మధుమేహం వంటి జబ్బులు గలవారిలోనూ శరీరం వాసన వేస్తుంటుంది. ఇందుకు కొన్ని పదార్థాలూ దోహదం చేస్తుంటాయి!

- **మసాలాలు:** లవంగాలు, ఇలాచీ, పసుపు, మెంతుల వంటి మసాలాలు నాలుకకు, దంతాలకు అతుక్కుపోయి ఒకరకమైన వాసన వచ్చేలా చేస్తాయి. మసాలాల అవశేషాలు మన శ్వాసలో, వెంట్రుకల్లో, చర్మం మీద గంటల కొద్దీ ఉండిపోతాయి!
- **వెల్లుల్లి, ఉల్లి:** ఇవి నాలుకకు, దవడలకు అతుక్కుపోవటం వల్ల నోటి నుంచి వాసన వెలువడుతుంటుంది. ఉల్లి, వెల్లుల్లి కొందరిలో జీవక్రియలు, శరీర ఉష్ణోగ్రత పెరిగేలా చేస్తాయి. చెమట కూడా ఎక్కువగా పడుతుంది. ఇది చర్మం మీద బ్యాక్టీరియాతో కలిసిపోయి ఒకరకమైన వాసన వస్తుంది.
- **మాంసం:** ఇది వాసనలేని ప్రోటీన్లను విడుదల చేస్తుంది. శ్వాస ద్వారా వెలుపలికి వచ్చే ఈ ప్రోటీన్లు చర్మం మీద బ్యాక్టీరియాతో కలగలసి వాసన మరింత ఎక్కువయ్యేలా చేస్తాయి.
- **క్యాబేజీ, గోబీ:** ఇవి సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని విడుదల చేస్తాయి. ఇది చెమట, శ్వాస, గ్యాస్ ద్వారా బయటకు వచ్చేటప్పుడు దీని వాసన మరింత ఎక్కువవుతుంది..

తెలుగు ప్రేక్షకుల ప్రేమ నా భాగ్యం!

- రజనీకాంత్

ఈనాడు సినిమా

ఈశ్వరీ రావు, పా.రంజిత్, రజనీకాంత్, హ్యూమా ఖురేషి, ధనుష్, ఎన్వీ ప్రసాద్

"అవకాశం దొరికితే వదలకూడదు. కష్టపడి శ్రమించి పనిచేస్తే తప్పకుండా అందుకు తగ్గ ప్రతిఫలం దొరుకుతుంది" అన్నారు రజనీకాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కాలా'. హ్యూమా ఖురేషి కథానాయిక. పా.రంజిత్ దర్శకత్వం వహించారు. ధనుష్ నిర్మాత. చిత్రం ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. రజనీకాంత్ మాట్లాడుతూ "1978లో తెలుగులో నా 'అంతులేని కథ' విడుదలైంది. ఆ తర్వాత 'అన్నదమ్ముల సవాల్', 'ఇద్దరూ అసాధ్యులే' ఇలా పది, ఇరవై సినిమాలు చేశా. ఆ తర్వాత కాస్త విరామం వచ్చింది. తెలుగు ప్రేక్షకుల ప్రోత్సాహాన్ని చూసి తెలుగుపై దృష్టిపెట్టాలా, తమిళంపై దృష్టిపెట్టాలా అనిపించింది. అప్పుడు తమిళంలోనే బాలచందర్ నన్ను పరిచయం చేశారు కాబట్టి అక్కడే నా కెరీర్ కొనసాగింది. కానీ తమిళ ప్రేక్షకులు ఎంత ప్రేమ చూపిస్తున్నారో, అంతే ప్రేమ తెలుగు ప్రేక్షకులూ చూపిస్తున్నారు. అది నాకు దక్కిన భాగ్యం. తమిళ సినిమాలు చేస్తున్న దశలో 'పెదరాయుడు'తో మోహన్‌బాబు నాకు తెలుగులో మరో మలుపునిచ్చారు. ఆ తర్వాత 'బాషా', 'నరసింహ', 'ముత్తు', 'చంద్రముఖి', 'రోబో', 'శివాజీ' ఇలా వరుసగా నా సినిమాలు తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. వాటికి మంచి ఆదరణ లభించింది. ఎప్పుడు హైదరాబాద్‌కి వచ్చినా పెద్దాయన ఎన్టీఆర్‌ని కలిసి ఆయన ఆశీర్వాదాలు తీసుకొనేవాణ్ని. ఆయన లేని లోటు ఇప్పుడు బాగా తెలుస్తోంది. ఎన్టీఆర్ ఇప్పుడు చాలా గుర్తుకొస్తున్నారు. అది ఎందుకో అందరికీ తెలుసు. బాలచందర్ తర్వాత నాకు గురువుగారు దాసరి నారాయణరావు. నన్ను తన బిడ్డలాగా ప్రేమించారు. వారి ఆత్మకి దేవుడు శాంతి చేకూర్చాలి. నా అల్లుడు ధనుష్ ఒకే రజనీకాంత్ అని చెబుతున్నాడు. ఒకే చిరంజీవి, ఒకే నాగార్జున, ఒకే బాలకృష్ణ, ఒకే వెంకటేష్. ఎవరి శైలి వాళ్లది. ఇక్కడ అవకాశం గొప్పది. దొరికిన అవకాశాన్ని సరైన రీతిలో వినియోగించాలి. నేను, రంజిత్ కలిసి చేసిన చివరి చిత్రం 'కబాలి'. రంజిత్‌కి అవకాశం ఇవ్వడం చూసి చాలా మంది రకరకాలుగా మాట్లాడారు. కానీ 'కబాలి' చిత్రాన్ని ఆయన చాలా బాగా తీర్చిదిద్దారు. 'కాలా' కూడా చాలా బాగుంటుంది. వాణిజ్య ప్రధానమైన కథలో సహజత్వాన్ని మేళవించి సినిమాని తీస్తాడు రంజిత్. ఇందులో మంచి సందేశం ఉంది. ఆసియా ఖండంలోనే పెద్ద మురికివాడ ధారావి. అక్కడుండే మనుషుల జీవితాలు ఎలా ఉంటాయి? వాళ్ల సమస్యలు ఎలా ఉంటాయనేది ఈ సినిమాలో చాలా బాగా చూపించారు. అక్కడ మనుషులతో గడిపి వచ్చినట్టే ఉంటుంది ఈ సినిమా చూస్తే. మామూలుగా ఒక సినిమాలో ఒక పాత్ర నచ్చుతుంది, లేదంటే రెండు పాత్రలు నచ్చుతాయి. కానీ ఈ సినిమా చూశాక ఐదారు పాత్రలు గుర్తుండిపోతాయి. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణ్ ఉత్తమమైన పనితీరును కనబరిచారు. చాలా క్లాస్‌గా ఈ సినిమా చేశారు. తెలుగమ్మాయి ఈశ్వరీ రావు నటన చాలా బాగుంది. కథానాయిక హ్యూమా సహకారం మరిచిపోలేనిది. మా అల్లుడు ధనుష్ సినిమాని ఎలా నిర్మిస్తాడో అనే సందేహం ఉండేది. మంచి నటుడినే కాదు, మంచి నిర్మాత అని కూడా నిరూపించారు. ఈ సినిమా ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది" అన్నారు. ధనుష్ మాట్లాడుతూ "ప్రజల సినిమా ఇది. ప్రజల కొరకు, ప్రజలకి సంబంధించిన అంశాలతో తీశాం. ఇదొక సాహసోపేతమైన ప్రయత్నం అని కూడా చెబుతా. దర్శకుడు పరిశోధన చేసి ధారావి జీవితాల్ని అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చారు. ఒక్క ధారావి అనే కాదు, నిర్లక్ష్యానికి గురవుతున్న సామాన్యుడి కథ ఇది. నలభయ్యేళ్లుగా ప్రజలు ఆరాధిస్తున్నారు రజనీకాంత్‌ని. సినిమా రంగంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరి లక్ష్యం రజనీకాంత్ అవ్వడమే. కానీ ఒక్క రజనీకాంత్ మాత్రమే ఉంటారు. దేశానికి గర్వకారణం ఆయన. అలాంటి నటుడితో 'కాలా' సినిమాని నిర్మించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది" అన్నారు. "భూమికి సంబంధించిన సమస్యల్ని స్పృశిస్తూ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. ఈ చిత్రం ప్రేక్షకుల్ని తప్పకుండా మెప్పిస్తుంది" అన్నారు దర్శకుడు పా. రంజిత్. "నా జీవితంలో మరిచిపోలేని పాత్ర ఏదైనా ఉందంటే అది సూపర్‌స్టార్ రజనీకాంత్‌కి జోడీగా నటించడమే" అన్నారు ఈశ్వరీరావు. హ్యూమా ఖురేషి మాట్లాడుతూ "నా అదృష్టం ఈ సినిమాలో నటించడం. దర్శకుడు గొప్ప పాత్రల్ని సృష్టించార"న్నారు. ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్‌లో అప్పట్లో 'బాబా' సినిమాని విడుదల చేసే అవకాశం నాకు ఇచ్చారు రజనీకాంత్. ఆ సినిమాతో ఎంత నష్టం వచ్చిందో కనుక్కొని దానికంటే ఒక రూ.లక్ష అదనంగా ఇచ్చారు. సినిమా పరిశ్రమలో మనకు కనిపించే దేవుడు రజనీకాంత్‌గారు. ఆయన మంచితనం, నిజాయతీ, నిబద్ధత గొప్పవి" అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ "రజనీకాంత్, రంజిత్ కాంబినేషన్ ప్రత్యేకమైనది. మరొక మంచి కథతో ఈ సినిమా తీసుంటారని నమ్ముతున్నా" అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ "1999లో నేను 'నరసింహ' సినిమాని పంపిణీ చేశాను. 19 యేళ్ల తర్వాత మళ్లీ నైజాంలో రజనీకాంత్ నటించిన ఈ సినిమాని విడుదల చేసే అవకాశం లభించింది. నటనపరంగా జాతీయ పురస్కార గ్రహీత అయిన ధనుష్ నిర్మాతగా కూడా ఈ సినిమాని చేశాడంటే ఆయనకి సినిమాపై ఉన్న తపన ఎలాంటిదో అర్థమవుతోంది" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.రత్నం, లైకా కరుణాకరన్ తదితరులు పాల్గొన్నారు.

దట్టమైన 'అరణ్య'ంలో



రానా

రానా కథానాయకుడిగా తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ప్రభుసాల్మన్ దర్శకుడు. హిందీలో ఈ చిత్రాన్ని 'హాథీ మేరీ సాథీ' పేరుతో విడుదల చేస్తారు. తమిళంలో 'కాదన్' అని నామకరణం చేశారు. తెలుగులో 'అరణ్య' అనే పేరు ఖరారు చేశారు. అటవీ నేపథ్యంలో సాగే కథ ఇది. ఏనుగులకు, మనుషులకూ ఉండే అనుబంధాన్ని తెరపై చూపించబోతున్నారు. దీపావళి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు.

సమంత

ఆ ప్రశ్న ఎన్నోసార్లు!

"విజయాలు నాకు కొత్త కాదు. వృత్తిపరంగా నేను ఆశించే సంతృప్తి ఇటీవల ప్రతి సినిమాతోనూ పుష్కలంగా లభిస్తోంది. అన్నిటికంటే అదే నాకు గొప్ప విషయం" అంటోంది సమంత. ఈ యేడాది ఆమె 'రంగస్థలం', 'మహానటి' చిత్రాలతో మరిచిపోలేని విజయాల్ని సొంతం చేసుకొంది. మంచి పాత్రల్లో నటించాక, వాటికి ప్రేక్షకుల నుంచి లభించే స్పందన మీపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుంటుందని అడిగితే... "నిజం చెప్పాలంటే ఆ స్పందన, ఆ సంతృప్తే నాలోని నటికి ఊపిరి పోస్తోంది" అని జవాబిస్తోంది సమంత. "ఎన్నోసార్లు ఇక నటించడం అవసరమా? అనే ప్రశ్న తలెత్తేది. కొత్తదనం లేని పాత్రలు రావడమే అందుకు ప్రధాన కారణం. కానీ ఎప్పుడైతే నటిగా ఆత్మసంతృప్తినిచ్చే పాత్రలు దగ్గరికి రావడం మొదలైందో అప్పట్నుంచి కొత్త ఉత్సాహాన్ని కూడగట్టుకొన్నా. ఇలా అంటున్నానని, నేనేమీ నాయికా ప్రాధాన్యంతో కూడుకొన్న పాత్రల్ని ఆశించను. స్వతహాగా నాకూ వాణిజ్య ప్రధానమైన సినిమాలంటేనే ఇష్టం. వాటినే ఎక్కువగా చూస్తుంటా. వాణిజ్య ప్రధానమైన కథల్లోనూ బలమైన కథానాయికకి చోటుందని చాలా సినిమాలు నిరూపిస్తుంటాయి. అలాంటి కథల్లోనే భాగం కావాలనుకొంటా. అదృష్టవశాత్తూ ఈమధ్య దర్శకులు బలమైన పాత్రల్ని సృష్టిస్తున్నార"ని చెప్పుకొచ్చింది సమంత.

గుర్రమెక్కి 'రణ్‌భూమి'లోకి!

వరుణ్ ధావన్

బాలీవుడ్ యువ కథానాయకుడు వరుణ్ ధావన్ ఇప్పటివరకూ ఎక్కువగా ప్రేమ కథా చిత్రాల్లోనే కనిపించాడు. కానీ త్వరలో అతడు గుర్రమెక్కి రణభూమిలోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నాడు. కత్తి ఝుళిపిస్తూ పోరాటాలు చేయనున్నాడు. ఇదంతా 'రణ్‌భూమి' చిత్రం కోసమట. ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహార్ నిర్మించబోతున్న భారీ పీరియాడికల్ చిత్రమిది. వరుణ్ కథానాయకుడిగా నటించనున్నాడు. అతనితో 'హంప్టీ శర్మకీ దుల్హనియా', 'బద్రీనాథ్ కీ దుల్హనియా' లాంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన శశాంక్ ఖైతాన్ దీనికి దర్శకుడు. బాలీవుడ్‌లోనే అత్యధిక బడ్జెట్ చిత్రంగా దీన్ని రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రం గురించి వరుణ్ మాట్లాడుతూ "'రణ్‌భూమి' నా తొలి పీరియాడికల్ చిత్రం. అందుకు చాలా ఉత్కంఠగా ఉంది. గుర్రాలు, కత్తులు, యుద్ధ వీరుల నేపథ్యంలో ఉండే ఇలాంటి చిత్రం ఇప్పటివరకూ చేయలేదు. కరణ్ కూడా తన సుదీర్ఘ కెరీర్‌లోనే ఆ తరహా చిత్రం చేయలేద"ని చెప్పాడు. వరుణ్‌కు కథానాయికగా నటించే అవకాశం ఎవరిని వరిస్తుందో చూడాలి.

ప్రియాంక ప్రేమలో పడిందా?

వీలైతే ప్రేమిద్దాం డ్యూడ్. పోయేదేముంది.. మహా అయితే తిరిగి ప్రేమిస్తారు.
చిత్రం: మిర్చి
– పంపినవారు: ఎస్.కోనయ్య, హిందూపురం



ప్రియాంక చోప్రా, నిక్ జోనాస్

అనుష్కశర్మ... విరాట్ కోహ్లీ ప్రేమాయణం తర్వాత సోనమ్ కపూర్, ఆనంద్ ఆహుజా ప్రేమ కథ గురించి బోలెడన్ని వదంతులు. చివరకు ఈ రెండు జంటల కథ పెళ్లితో సుఖాంతమైంది. మళ్లీ కొన్ని నెలలుగా రణ్‌బీర్‌కపూర్, ఆలియాభట్ ప్రేమ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చిందంటూ వార్తలొస్తున్నాయి. తాజాగా మరో జంట ప్రేమ కథ హాట్ టాపిక్ అయ్యింది. 'క్వాంటికో' టీవీ షోతో బాలీవుడ్ నుంచి వెళ్లి హాలీవుడ్ ప్రేక్షకుల్ని పలకరించింది ప్రియాంక చోప్రా. ఆ తర్వాత అక్కడ పేరు తెచ్చుకోవడం మొదలుపెట్టింది. ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించింది. అక్కడితో ఆగలేదు. ఓ హాలీవుడ్ నటుడి మనసు దోచేసిందనే వార్తలు ఇప్పుడు హాలీవుడ్, బాలీవుడ్‌ల్లో హల్‌చల్ చేస్తున్నాయి. హాలీవుడ్ నటుడు నిక్ జోనాస్‌తో ప్రియాంక ప్రేమలో ఉందంటూ వార్తలొస్తున్నాయి. అప్పుడప్పుడు ఈ ఇద్దరూ కలిసి కనిపించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేశాయి. అవును నిజమే.. నిక్‌తో ప్రియాంక ప్రేమలో ఉంది.. అందుకే చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్నారని కొందరంటే...అలాంటిదేం లేదు... హాలీవుడ్‌లో స్థానాన్ని సుస్థిరపరచుకునే క్రమంలో అందరినీ కలుపుకొనిపోతుంది ప్రియాంక, అందులో భాగంగానే నిక్‌తోనూ స్నేహం చేస్తుందని కొదరు అంటున్నారు. కానీ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఇద్దరి చేస్తున్న కామెంట్లు చూస్తుంటే ఏదో ఉందనే అనుమానం కలగక మానదు. తనకిష్టమైన స్నేహితులతో కలిసి బర్గర్ తింటూ ముసిముసిగా నవ్వేస్తుంది ప్రియాంక. ఈ ఫొటోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెడితే దానికి నిక్ జోనాస్ 'ఆ నవ్వే...' అని రాసి పక్కన రెడ్ హార్ట్ ఎమోజీని పెట్టాడు. ప్రియాంక కూడా తక్కువేం చేయలేదు. నిక్ తన స్నేహితుడితో కలిసి ఉన్న ఫొటోను పెడితే దానికి పింక్ హార్ట్ ఎమోజీతో పాటు నువ్వు చాలా హాట్ అనేలా ఫైర్ ఎమోజీని పెట్టింది. ఈ కామెంట్లతోనే ఈ ఇద్దరూ ప్రేమలో ఉండటం పక్కా అంటూ హాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ అందరూ మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో విషయం ఏంటంటే నిక్ కంటే ప్రియాంక 11 ఏళ్లు పెద్దది. ప్రేమకు వయసుతో పని లేదు అని చాలామంది సినీ తారలు ఇప్పటికే నిరూపించారు కాబట్టి వాళ్లకు ఇష్టమైతే అదేమంత విషయం కాదు. ఇంతకీ నిక్‌తో ఉన్నది ప్రేమో... స్నేహమో... ఏంటో తెలియాలంటే ప్రియాంక స్పందించాల్సిందే.

అందుకే 'అభిమన్యుడు' నచ్చాడు

జి.హరి

"విశాల్ సినీ జీవితంలో 'పందెంకోడి' తర్వాత ఆయనకి అతి పెద్ద విజయాన్ని అందించింది 'అభిమన్యుడు' చిత్రమే" అన్నారు నిర్మాత జి.హరి. ఆయన ఇటీవల తెలుగులో విడుదల చేసిన చిత్రమే 'అభిమన్యుడు'. విశాల్, సమంత జంటగా నటించారు. అర్జున్ ముఖ్యభూమిక పోషించారు. మిత్రన్ దర్శకుడు. చిత్రానికి లభిస్తున్న స్పందన పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. "సామాన్యుడు ఎదుర్కొంటున్న కష్టాల్ని కళ్లకు కట్టింది మా 'అభిమన్యుడు'. సామాజిక బాధ్యతతో వ్యవహరించే విశాల్ ఇందులో నిజ జీవితానికి దగ్గరైన పాత్రలో కనిపించారు. కథ నచ్చడంతో, ఇదొక సాహసంతో కూడిన సినిమా అయినప్పటికీ ఆయనే స్వయంగా నిర్మించారు. మంచి చిత్రాల్ని తెలుగు ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని మరోమారు 'అభిమన్యుడు' రుజువు చేసింది. విశాల్ ఈ సినిమాకి కొనసాగింపుగా మరో చిత్రం చేయబోతున్నార"న్నారు జి.హరి.

పండించేవాడూ దేవుడే

కార్తి కథానాయకుడిగా నటించిన చిత్రం 'చినబాబు'. సాయేష, ప్రియా భవాని శంకర్, సత్యరాజ్, భానుప్రియ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పాండిరాజ్ దర్శకుడు. సూర్య, మిరియాల రవీందర్‌రెడ్డి నిర్మాతలు. "రైతుల గొప్పదనం గురించి తెలియజెప్పే చిత్రమిది. 'పుట్టించినవాడు దేవుడైతే.. పండించినవాడు కూడా దేవుడే. నువ్వు రైతు అయితే కాలర్ ఎగరేసుకుని తిరుగు' అంటూ సాగే ప్రచార చిత్రం విడుదల చేశాం. మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రంలో చర్చించిన అంశాల గురించి ప్రేక్షకులు తప్పకుండా మాట్లాడుకుంటారు. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు నిర్మాతలు. సంగీతం: డి.ఇమాన్

కార్తి, సాయేష

పెళ్లయ్యిందా?

మౌర్య, చరిష్మా

మౌర్య, చరిష్మా శ్రీకర్, వెంకట్‌రాజ్, అవంతిక ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'ఆర్ యు మ్యారీడ్...?'. అళహరి స్వీయ నిర్మాణంలో తెరకెక్కించారు. జయ సూర్య స్వరకర్త. ఈ చిత్రంలోని గీతాల్ని సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. మల్కాపురం శివకుమార్, అరిమండ విజయశారదా రెడ్డి, బి.శ్రీధర్, జె.భగవాన్, జేవీఆర్, సాయివెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. "అళహరి ఇందులో ఓ కీలకపాత్ర పోషించారు. ఆయన అభిరుచికి అద్దం పట్టేలా ట్రైలర్, పాటలు ఉన్నాయి. ఆసక్తికరమైన పేరుతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకం మాకుంది" అన్నారు అతిథులు. "ప్రేమతో పాటు భావోద్వేగాలకి ప్రాధాన్యమిస్తూ తెరకెక్కించిన చిత్రమిది. మీకు పెళ్లయిందా? అని ఎవరిని ఎవరడిగారనేది తెరపైనే చూడాలి" అన్నారు దర్శకనిర్మాత. "ఒక మంచి చిత్రానికి సంగీతం అందించాననే తృప్తినిచ్చిన సినిమా ఇది" అన్నారు స్వరకర్త. ఈ కార్యక్రమంలో కాంచనపల్లి రాజేంద్రరాజుతో పాటు చిత్రబృందం పాల్గొంది.

ప్రేమ పదిలమే

ప్రీతి, శ్రీకరణ్

"ఒకరినొకరు చూసుకోకుండా ప్రేమలో పడిన ఓ జంట కథే మా చిత్రం" అన్నారు శ్రీకరణ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'బెస్ట్ లవర్స్'. అమృత, నిషా, దివ్య, ప్రీతి కథానాయికలు. నంది వెంకట రెడ్డి దర్శకత్వంలో శ్రీకాంత్ గొంటి నిర్మిస్తున్నారు. ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు మాట్లాడుతూ "సామాజిక మాధ్యమాల నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. నిజమైన ప్రేమ ఎప్పటికీ పదిలమే అనే విషయాన్ని ఓ జంట ఎలా నిరూపించిందన్నది ఆసక్తికరం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "విజయవాడ అమ్మాయి, హైదరాబాద్ అబ్బాయి మధ్య జరిగిన నిజమైన కథే ఈ సినిమా. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఆ ప్రేమ ఎలా సాగింది? ఎలాంటి పరిణామాలకి దారితీసిందనేది ఆసక్తికరం" అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి రామసత్యనారాయణ, అట్లూరి రామకృష్ణ, సాయివెంకట్‌తోపాటు చిత్ర సంగీత దర్శకుడు సాయికిరణ్, అలీబాబు, విక్రమ్ గొంటి తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ వాడుతున్నారా...

మనం రోజూ ఉపయోగించే ఫేస్‌బుక్, వాట్సాప్‌లతో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. దీన్ని గుర్తించిన ఫేస్‌బుక్ ఈ సమస్యలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తాజాగా ఓ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనికోసం జాతీయ మహిళా కమిషన్‌తో భాగస్వామి అయ్యింది. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లోని 60 వేలమందికి పైగా మహిళలకు ఈ-మెయిల్, వాట్సాప్, ఫేస్‌బుక్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నేర్పిస్తోంది. ఈ శిక్షణాకాలం ఏడాదిపాటు ఉంటుంది. సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలన్నీ ఇందులో ఉంటాయి. ఈ శిక్షణలో ఝార్ఖండ్, రాంచీకి చెందిన సైబర్ పీస్ ఫౌండేషన్ కూడా ఫేస్‌బుక్‌తో చేయి కలిపింది. తొలి విడతగా హరియాణా, దిల్లీ, మణిపూర్, సిక్కిం, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లోని మహిళలకు 'డిజిటల్ లిటరసీ ప్రోగ్రాం' పేరుతో శిక్షణ అందించనున్నారు. ఆ ప్రాంత మహిళలు తమ స్థానిక భాషలోనే సందేహాలను ప్రశ్నల రూపంలో ఫేస్‌బుక్‌కి పంపిస్తే, వాటికి పరిష్కారాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా అదే భాషల్లో అందిస్తారు. ఈ శిక్షణ అంతా అంతర్జాలంలోనే కొనసాగుతుంది.

***

రోజంతా అదే జోరుతో

ఒకే దగ్గర కూర్చుని రోజంతా పని చేయడం వల్ల మనకు తెలీకుండానే ఒత్తిడీ, ఆందోళన ఎదురవుతాయి. అలాంటప్పుడు దినచర్యలో కొన్నిమార్పులు చేసుకుని చూడండి.

❖ వ్యాయామానికి ఒత్తిడిని తగ్గించే శక్తి ఉంటుంది. పొద్దున నిద్ర లేచిన వెంటనే కనీసం అరగంట వ్యాయామం చేయటం అలవాటు చేసుకోవాలి. దానివల్ల రక్తప్రసరణ కూడా మెరుగుపడుతుంది. రోజు మొత్తం హుషారుగా ఉండగలుగుతాం. ఎక్కువసేపు కదలకుండా కూర్చోకుండా కనీసం గంటకోసారైనా పది నిమిషాలు అటూ ఇటూ నడవాలి.

❖ ఇప్పుడు కంప్యూటర్, ఫోను వాడకం లేని ఉద్యోగం లేదు. కానీ వాటని తదేకంగా చూడటం వల్ల శారీరకంగా కన్నా మానసికంగానే ఎక్కువ అలిసిపోతాం. అందుకే కనీసం గంటకోసారైనా మధ్యలో కంటికి సంబంధించిన వ్యాయామాలు చేయాలి. అలాగే పడుకునేటప్పుడూ, నిద్రలేవగానే కనీసం అయిదు నిమిషాలు ధ్యానం చేయడం మంచిది.

❖ కొంచెంసేపు పనిచేసినా సరే అలిసిపోయినట్లు అనిపిస్తే ఆహారంలో మార్పు చేసుకోవాల్సిందే. ఎక్కువగా ఆకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలూ, కూరగాయలను తీసుకోవాలి. దానివల్ల రోగ నిరోధకశక్తీ, జీర్ణశక్తి మెరుగవుతాయి. శరీరానికి కావాల్సిన శక్తి అంది ఎక్కువసేపు చలాకీగా ఉండగలుగుతాం.

❖ ఒత్తిడికి ముఖ్య కారణం సరైన నిద్ర లేకపోవడం. నిద్రలేమి, సమయం లేకపోవడం... ఇలా ఏదైనా కావచ్చు దాని ప్రభావం తరువాతి రోజు మీద పడుతుంది. అందుకే ఎన్ని పనులున్నా సరే ఎనిమిది గంటల నిద్ర ఉండేలా చూసుకోండి. అంతేకాదు తరచూ ఒత్తిడి సమస్య వేధిస్తోంటో ఒకసారి నిపుణులను సంప్రదించడం మంచిది.

కాలేజీలు తెరిచారుగా... రంగు రంగుల సీతాకోక చిలుకల్లా అమ్మాయిలు నయా ఫ్యాషన్‌లతో సందడిచేసే సమయం వచ్చేసింది. అలాంటి ఫ్యాషన్‌లలో చెప్పుకోవాల్సింది స్కర్టుల గురించే. తరాలు మారినా తరగని ట్రెండ్ దీని సొంతం. ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లలో కనికట్టు చేస్తుంది. మీరూ ఎంచుకోవాలనుకుంటే... డిజైనర్ సుప్రజ చలసాని చెబుతోన్న సూచనలు చూడండోసారి.

స్కర్టుతో మాయ చేసేద్దాం

మారుతున్న ఫ్యాషన్‌లతో పాటు అటు పాశ్చాత్య, ఇటు సంప్రదాయ శైలినీ కలిపి నయా డిజైన్‌లలో మెప్పిస్తోంది స్కర్టు. కాలేజీలకు ట్రెండీగా, పార్టీలకు సొగసుగా సందర్భాన్ని బట్టి సౌకర్యంగా సర్దుకుపోతుంది స్కర్టు. దీనిలో ఎన్నో రకాలూ ఉన్నాయి. ప్లీటెడ్, బయాస్, తులిప్, గేదర్డ్, టియర్డ్, లేయర్డ్, డబుల్ లేయర్డ్, హ్యాండ్ ఖర్చీఫ్, ఎసెమెట్రికల్, హై అండ్ లో, డబుల్ ప్యానల్, మినీ, మాక్సీ... ఇలా ఎన్నో రకాలున్నాయి.

పాతే కొత్తగా...

టీనేజీ అమ్మాయిలకు మోకాలివరకూ ఉండే నీలెంగ్త్, ఇంకాస్త కిందకు అంటే కాఫ్‌లెంగ్త్‌లో ఉండే మాక్సీలు, ప్లీటెడ్, గేదర్డ్ స్కర్టులు బాగుంటాయి. చేనేత రకాల్లో వీటిని కుట్టించుకుని జేబులూ, టాజిల్స్ వంటి అదనపు హంగులు చేరిస్తే ట్రెండీగా కనిపించొచ్చు. పార్టీలూ, ఇతర వేడుకలకు మాక్సీ, ఎసెమెట్రికల్ స్కర్టులు బాగుంటాయి. తులిప్, పెన్సిల్, బాక్స్ ప్లీటెడ్ స్కర్ట్సులు కాలేజీ విద్యార్థినులకే కాదు అప్పుడప్పుడే ఆఫీసులకు వెళ్లేవాళ్లకీ బాగుంటాయి.

■ ట్రెండీగా కనిపించాలనుకునే అమ్మాయిలకు ఎసెమెట్రికల్ స్కర్టు చక్కని ఎంపిక. దీనికి కలీలు ఉండవు. జాలువారే ఫ్యాబ్రిక్‌తో కూడా అంచుల్లో ఎగుడుదిగుడు ఉండేలా డిజైన్ చేస్తారు. వీటిల్లో లేయర్డ్ డిజైను సన్నగా ఉన్న అమ్మాయిలకు బాగుంటుంది. ఈ స్కర్టు మీదకు కాఫ్తాన్, టీ షర్ట్ ఏదైనా ఎంచుకోవచ్చు. ప్లెయిన్ ప్రింటెడ్ మేళవింపులో ఎంచుకుంటే మరింత సౌకర్యంగా అనిపిస్తుంది. ఒకే వస్త్రం కాకుండా కాటన్, నెట్, జార్జెట్ వంటివాటిని కూడా ప్రయత్నించొచ్చు.

■ ఏ-లైన్ డిజైనర్ స్కర్టు శరీరాకృతి సరిగా లేదనుకునేవారికి చక్కని ఎంపిక. వీటికి ప్యాచెస్, ప్యానెల్స్ ఉండవు కాబట్టి కాళ్లు సన్నగా ఉన్నవారూ, పొట్ట కనిపిస్తుంది అనుకునేవారు ఎంచుకోవచ్చు.

■ కాలేజీ పార్టీలూ, వేడుకల్లో మ్యాక్సీ స్కర్ట్‌లూ, హై అండ్ లో, జేబులతో మోకాలివరకూ ఉండే నీలెంగ్త్ బాక్సీ స్కర్టులు అదిరిపోతాయి.

■ ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్, సెమినార్‌ల వంటి వాటికి పెన్సిల్ స్ట్రిప్ స్కర్ట్స్, షార్ట్ లేయర్డ్ తరహావి నప్పుతాయి. అయితే ఫార్మల్ వేర్ ఏదైనా మోకాళ్లకు రెండు ఇంచులు పైకి కానీ మూడు ఇంచుల కిందకి కానీ ఉండేలా చూసుకోవాలి.

■ ఎంబ్రాయిడరీ, మోటిఫ్‌లూ, బుటీల వంటి అదనపు హంగులు ఉండే రిచ్ ఫ్యాబ్రిక్‌ని ఉపయోగించినప్పుడు ప్యానల్ స్కర్టులా కుట్టించుకోవచ్చు. దీన్నే కలీ డిజైన్ స్కర్ట్ అనీ అంటారు. ఇవి స్వాగతోత్సవ వేడుకల్లో వేసుకోవచ్చు. జతగా క్రాప్ టాప్ మెప్పిస్తుంది. వీటిమీదకు వీలైనంతవరకూ కనీసం రెండు అంగుళాల ఎత్తున్న చెప్పుల్ని ఎంచుకుంటే ఇక తిరుగుండదు. ప్రయత్నించి చూడండి మరి.



మేకప్ బ్రష్‌లు కలిపేస్తే ఎలా!

ముఖానికి అలంకరణ చేసుకోవాలంటే కనీసం కొన్ని బ్రష్‌లు అయినా వాడతాం కదా... అలాగే వాటిని భద్రపరిచే విషయంలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

❖ లిప్‌స్టిక్, ఫౌండేషన్, మస్కారా... లాంటి సామగ్రితో పాటూ మేకప్ బ్రష్‌లను కూడా ఒక బ్యాగులో వేసి సర్దేస్తుంటాం. దాని వల్ల బ్రష్ బ్రిజిల్స్ పాడైపోతాయి. బ్రష్ ఆకృతిని కోల్పోయి మేకప్ వేసుకోవడానికి అనువుగా ఉండదు. అందుకే ప్రత్యేకంగా ఒక కాగితంలో కానీ, సంచిలో కానీ చుట్టి బ్యాగులో పెట్టుకుంటే మంచిది.

❖ మేకప్ వేసుకోవడం పూర్తయ్యాక ఆ బ్రష్‌లను తప్పకుండా శుభ్రం చేయాలి. లేదంటే అవి గట్టిగా మారిపోయి మరోసారి వాడుకోవాలనుకున్నప్పుడు ఇబ్బంది అవుతుంది. అలా వీలుకాకపోతే కనీసం వారానికి ఒకసారైనా వాటిని శుభ్రం చేయడం తప్పనిసరి. వీలైతే ఒక స్ప్రే శానిటైజర్ దగ్గరుంచుకుంటే పని తేలికవుతుంది.

❖ బ్రష్‌లను సరిగ్గా శుభ్రం చేయాలి కదా అని అదేపనిగా రుద్దకూడదు. వాటి ఆకృతి పోతాయి. బజార్లో దొరికే బ్రష్ క్లీనింగ్ గ్లోవ్స్ వాడి చూడొచ్చు. దానివల్ల బ్రష్‌లలో మేకప్ తాలూకు అవశేషాలేమైనా ఉంటే పూర్తిగా తొలిగిపోతాయి. అలాగే వాటిని శుభ్రం చేశాక తిరగేసి కాసేపు ఉంచితే నీరంతా పోతుంది.

❖ బ్లెండర్‌లూ, స్పాంజిలు వాడుతుంటే వాటిని గోరువెచ్చని నీళ్లూ, గాఢత తక్కువగా ఉన్న షాంపూలతో శుభ్రం చేయాలి. తేమ పూర్తిగా ఆరిపోయాకే వాటిని లోపల పెట్టాలి. సరిగ్గా శుభ్రం చేయకపోతే పేరుకుని ఉన్న మురికీ, క్రిములు మళ్లీ చర్మంలో చేరతాయి.

నజరానా

పాదాలు నొప్పిగా ఉంటే... వేపాకులు వేసి వేడిచేసిన నీటిలో పాదాలు ఉంచండి. వెంటనే ఉపశమనం ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు ఉన్నా తగ్గుతాయి.

బంగారం వెండి

04న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం (24క్యా)	31,800	31,900	31,700	31,750
ఆర్నమెంట్	29,710	29,800	29,450	29,500
వెండి (కిలో)	40,670	40,560	40,700	40,800

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం (24క్యా)	31,700	31,800	31,780	32,100
ఆర్నమెంట్	29,350	29,420	29,370	29,850
వెండి (కిలో)	40,600	40,500	40,550	39,700

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం (24క్యా)	31,630	31,630	-------	-------
ఆర్నమెంట్	29,420	29,420	2,937	2,942 గ్రా
వెండి (కిలో)	40,900	40,900	42.70	42.60 గ్రా

మేనేజర్ లేనప్పుడు మాట్లాడుకోవచ్చా?

? నేను ఒక ప్రాజెక్టు కోసం కొత్త బృందంతో కలిసి పనిచేస్తున్నా. అందులో నాతో కలిపి అయిదుగురు ఉద్యోగులూ, ఒక మేనేజర్ ఉంటారు. మేం చేసే పనులన్నింటి గురించి మా మేనేజర్‌కు రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది. దానికోసం ప్రతి నెలా రెండు సార్లు అందరం సమావేశం అవుతుంటాం. అందులో మేం మిగతా రోజులు చేయాల్సిన పనేంటో ఆయన మాకు చెబుతారు. అయితే మా బృందంలో ఉన్న వాళ్లందరం ముందు మాట్లాడుకుంటేనే ఆయనకు రిపోర్టు సరిగ్గా ఇవ్వగలం. అందుకే ఆయనతో సమావేశం అవడానికన్నా ముందే మేమంతా కలిసి పూర్తి చేసిన పనులకు సంబంధించి మాట్లాడుకోడానికి వారాంతపు సమావేశాలు పెట్టుకోవాలని నిర్ణయించుకున్నాం. ఈ విషయం ఆయనకు తెలిసి 'మీరు నేను లేకుండా అలా మీటింగులు పెట్టుకోకూడదు' అంటున్నారు. నిజంగా ఆయన లేనప్పుడు పని గురించి మాట్లాడుకోవడం సరికాదా? ఒక వేళ సరైందే అయితే ఆయనతో ఈ విషయం ఎలా చెప్పాలి?

– ఓ సోదరి

✔ మీరు చెప్పిన విషయాల్ని బట్టి చూస్తే మీ మేనేజర్‌కు ఆయన ఉద్యోగం గురించి కాస్త అభద్రతాభావం ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన కొత్తగా ఈ పదవిలోకి రావడం, లేదంటే తన ప్రవర్తనా, వ్యవహార తీరుపై ఆయనకు నమ్మకం లేకపోవడం... ఈ రెండే ఆయన తీరుకు ముఖ్య కారణాలు కావొచ్చు. ఆయన లేనప్పుడు మీరేవైనా నిర్ణయాలు తీసుకుంటే తన అధికారానికి ఆటంకం రావచ్చేమో అనే భయం కూడా ఉండొచ్చు. నిజానికి పనికోసం, దాన్ని సులువు చేయడం కోసం సమావేశం కావడం ఏమాత్రం తప్పుకాదు. ఆయన చెప్పిన దాన్ని బట్టి తన చుట్టూ ఉన్న పరిస్థితులను ఆయన అధీనంలో పెట్టుకోవాలని చూస్తున్నట్లు అర్థమవుతోంది. అందుకే ముందు ఆయనతో మీరెందుకు సమావేశం అవ్వాలనుకుంటున్నారో వివరించండి. 'మేం చేస్తున్న పని సులభంగా పూర్తవ్వాలంటే అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఎవరెవరు ఏం చేయాలనుకుంటున్నారో అందరికీ చెప్పాలి. పైగా ఈ సమావేశం వల్ల ఒకరికున్న ఆలోచనలూ, పరిజ్ఞానం అందరితో పంచుకోగలం. దానివల్ల ఎలాంటి సమస్యా ఉండదు. మేం చేసిన పనికి సంబంధించిన నివేదిక సులభంగా, స్పష్టంగా మీకు వివరించొచ్చు' అని చెప్పండి. అనుమతి గురించి మరోసారి ఆలోచించమని అడగండి. లేదంటే దీనికి ఇంకో మార్గం... వారాంతపు సమావేశాలకు వీలున్నప్పుడల్లా ఆయన్ని కూడా ఆహ్వానించడం. రాలేకపోతే అక్కడ చర్చించుకున్న విషయాలన్నీ ఎవరో ఒకరు అదేరోజు ఆయనకు సంక్షిప్తంగా వివరించొచ్చు. అందరితో కలిసి పని చేస్తున్నప్పుడు ఇలాంటి సందర్భాలు సహజమే. అలాంటి సమస్య ఉందని గుర్తించిన వెంటనే దానికి తగ్గట్టుగా ఎదుటి వ్యక్తి ధైర్యాన్ని దెబ్బతీయకుండా, కలిసి పనిచేయడం మొదలుపెట్టాలి. వారిలో ఉన్న అభద్రతా భావం తొలగించాల్సిన బాధ్యత కూడా ఉద్యోగులకు ఉంటుంది. అప్పుడే పని వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

డియర్ వసుంధర

డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

మీ ప్రశ్నల్ని vasucareer@eenadu.net కు పంపించగలరు.

ఎయిమ్స్ లక్ష్యంగా కష్టపడ్డా!

బిహార్ అక్షరాస్యతలో... అందులోనూ బాలికా విద్యలో వెనుకబడిన రాష్ట్రం... కానీ అక్కడి ఆడపిల్లే ఇప్పుడు అందరికీ స్ఫూర్తిగా నిలిచింది. ఆ చరిత్రను తిరగ రాసింది. ఆమే కల్పనా కుమారి. జాతీయ స్థాయి వైద్యవిద్య ప్రవేశ పరీక్ష అయిన నీట్‌లో 99.99 పర్సంటైల్‌తో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా వసుంధరతో మాట్లాడింది. ఆమె మాటల్లో...

చదువే భవిష్యత్తుని నిలబెడుతుంది అని మా ఇంట్లో వాళ్లు అంటారు. దాన్ని నమ్మాను కాబట్టే చిన్నప్పటి నుంచీ చదువే ప్రపంచం అనుకున్నా. అయితే లక్ష్యం లేని చదువూ ముందుకెళ్లదు. అలానే ఫలితం కోసం ఎదురు చూడకుండా కష్టపడితేనే... అది సులువుగా మన వశం అవుతుందనేది నా నమ్మకం. ఆ ప్రతిఫలంగానే ఇప్పుడు ఈ ర్యాంక్ వచ్చిందని అనుకుంటున్నా. ఈ ఫలితాలు వచ్చేవరకూ నేను టాపర్‌ని అవుతానని ఊహించలేదు. మంచి ర్యాంకు తెచ్చుకోవాలి. వైద్యవిద్యను ఎయిమ్స్‌లోనే చదవాలనే లక్ష్యం మాత్రమే పెట్టుకున్నా. నాకు వైద్యవృత్తిపై ఇష్టం రావడానికి కారణం మాత్రం మా అన్నయ్య ప్రణయ్ ప్రతాప్. తను ఐఐటీ గువహాటి విద్యార్థి. అక్క భారతీ కుమారి ఐఈఎస్‌కి ఎంపికయ్యింది. నాన్న రాకేశ్ మిశ్రా లెక్చరర్. అమ్మ మమతా కుమారి టీచర్. 'కల్పనా మన ఇంట్లో వైద్యులెవరూ లేరు. కచ్చితంగా నువ్వు డాక్టర్ అయి చరిత్ర మార్చు...' అని అన్నయ్య అనడం, ఇంట్లోవాళ్లూ ప్రోత్సహించడంతో నాకు తెలియకుండానే వైద్య వృత్తిపై ఇష్టం ఏర్పడింది.

ఎవరి బలవంతం లేదు...

మా కెరీర్‌లను మా అంతట మేమే ఎంచుకునే స్వేచ్ఛను చిన్నతనం నుంచీ మా అమ్మానాన్నలు మాకు ఇచ్చారు. వైద్య వృత్తి ఖరీదైన విద్య అని తెలిసినా చేయమన్నారు. అలాని మేమేమీ సంపన్నులేమీ కాదు. చదువే భవిష్యత్తుని ఇస్తుంది అని నమ్ముకున్న సాధారణ మధ్యతరగతి కుటుంబం మాది. మా స్వస్థలం బిహార్‌లోని శివ్‌ఘడ్. పదోతరగతి వరకూ నవోదయాలోనే మెరిట్ స్కాలర్‌షిప్‌లో చదువుకున్నా. ప్లస్‌టూ కూడా అక్కడే వైకే జైన్ కాలేజీ నుంచి పూర్తిచేశా. అప్పటికే నా లక్ష్యం స్థిరంగా ఉండటంతో ఆ దిశగా అడుగులు వేశా. నీట్‌కి తగిన కోచింగ్ అవసరం అనిపించి దిల్లీ వచ్చి బంధువుల ఇంట్లో ఉండి చదువుకోవడం మొదలుపెట్టా. మొదటి రోజు నుంచే ఎప్పటి సిలబస్‌ని అప్పుడు పూర్తిచేసుకునేదాన్ని. రోజూ పన్నెండు నుంచి పద్నాలుగు గంటల పాటు పుస్తకాలు ముందేసుకుని కూర్చునేదాన్ని. అన్నేసి గంటలు కూర్చుని చదవడం కష్టమే అయినా... ఇష్టంగా భావించా కాబట్టి ఒత్తిడిగా అనిపించలేదు. ఇంకాస్త ఉత్సాహం కావాలంటే షటిల్ బాడ్మింటన్ ఆడేదాన్ని. అదీ కాసేపే. ఏ రోజు ప్రణాళిక ఆ రోజు పూర్తిచేసినప్పటికీ రివిజన్ చేయడంలో మాత్రం కాస్త బద్ధకించేదాన్ని. ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా నన్ను నేను మెరుగుపరుచుకునేందుకు సాయపడింది. అయితే మిగిలిన సబ్జెక్టుల కంటే ఫిజిక్స్ కొద్దిగా కష్టం అనిపించింది. అయినా భయపడలేదు. నేను ఊహించినదాన్ని కన్నా ఎక్కువ మార్కులొచ్చాయి. కార్డియాలజీ రంగాన్ని ఎంచుకోవాలనుకుంటున్నా. ఆ తరువాత కార్డియాలజిస్టుగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలన్నదే ముందున్న ఆశయం. ఎవరైనా సరే ఏ పోటీ పరీక్షలు రాస్తున్నా... వందశాతం ఏకాగ్రతతో ఇష్టంగా కష్టపడితే అనుకున్నది సాధించడం సులువే.

- సహకారం: కూచిభట్ల సూర్యప్రకాశ్,
ఈనాడు, దిల్లీ

చదువు

ఈనాడు | విజయవాడ | 16
మంగళవారం జూన్ 5, 2018 ■ e-mail: edc@eenadu.in



ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు కొద్ది రోజుల్లో విడుదల కానున్నాయి. ఇప్పటికే తమకు ఎన్ని మార్కులు వస్తాయో విద్యార్థులకు అవగాహన ఏర్పడింది. తమ స్థాయికీ, ఇష్టానికీ తగ్గట్లుగా ఎక్కడ సీటు సాధించడానికి వీలుందో బేరీజు వేసుకునే తరుణమిది. గత ఏడాది కటాఫ్ మార్కులు, సీట్ల కేటాయింపును పరిశీలించడం ద్వారా తమ సీటు అవకాశాలను అంచనా వేసుకోవచ్చు. సరైన అంచనాతో దరఖాస్తు చేసుకోగలిగితే రెండేళ్ల కష్టానికి ప్రతిఫలం లభించినట్లు అవుతుంది. ఆ రకంగా కౌన్సెలింగ్ ప్రక్రియలో తడబడకుండా ముందస్తుగా సన్నద్ధం కావొచ్చు!

ఐఐటీ సీటుకు అవకాశం ఎంత?

ఇంటర్ ఎంపీసీ విభాగంలో చేరినవారిలో చాలా మందికి ఐఐటీల్లో ఇంజినీరింగ్ చదవాలనే బలమైన కోరిక ఉంటుంది. అయితే 11,98,989 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంటే వారిలో 2,31,024 మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి ఎంపిక చేశారు. వారిలో కేవలం 1,60,716 మంది పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారు. అంటే పరీక్ష క్లిష్టంగా ఉంటుందనే భయంతో క్వాలిఫై అయినవారిలో 70 శాతం మాత్రమే పరీక్ష రాశారు. 10,998 ఐఐటీ సీట్లు ఉన్నాయి కాబట్టి, అంతమంది విద్యార్థులు ఐఐటీల్లో చేరే అవకాశం ఉంది.

పి.వి.ఆర్.కె. మూర్తి
శ్రీ గాయత్రి అకాడమీ

అంటే తుదిపరీక్షలోనూ పోటీ 1:16 ఉందని చెప్పొచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసిన ప్రతి 16 మంది విద్యార్థుల్లో ఒకరు మాత్రమే ఐఐటీల్లో చేరవచ్చు.

ఈసారి ఐఐటీ కాన్పూర్ ఈ పరీక్షను నిర్వహించింది. ఫలితాలు జూన్ 10న విడుదల అవుతున్నాయి. అయితే కీ, ఓఎంఆర్ షీట్ ఇచ్చారు కాబట్టి, మార్కులపై విద్యార్థులకు అవగాహన ఉంది. గత ఏడాదితో పోలిస్తే ప్రథమ ర్యాంకు మార్కులతోపాటు తొలి పది ర్యాంకుల కటాఫ్ మార్కులు పెరిగే సూచనలున్నాయి. ఈ ఏడాది పేపర్-1, 2 కలిపి 360 మార్కులకు పరీక్ష జరిగితే వాటిలో 337 వరకు పొందినట్లుగా విద్యార్థులు చెబుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలి పది ర్యాంకుల్లో ఎవరూ లేరనీ, ఉత్తర భారతదేశంలోనే ఎక్కువమంది ఉత్తమ ర్యాంకులు పొందే అవకాశం ఉందనీ ఓ అంచనా.

ఫలితాలు వెలువడిన వెంటనే ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ)కు హాజరు కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో 10, 11 తేదీల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. పరీక్ష జూన్ 14న నిర్వహిస్తారు. ఫలితాలను జూన్ 18న విడుదల చేస్తారు. జూన్ 19 నుంచి జులై 15 వరకు సీట్ల కేటాయింపు జరుగుతుంది. అంటే జూన్ 19 నుంచి జరిగే సీట్ల కేటాయింపునకు దరఖాస్తు చేసుకునే విద్యార్థి సీట్ల విషయంలో పూర్తి అవగాహనతో కళాశాల, బ్రాంచి ఎంపిక సరిగా చేసుకునేలా విశ్లేషించుకోవాలి. తప్పుగా గుర్తిస్తే తరువాత మార్చుకునే అవకాశం లభించకపోవచ్చు.

కౌన్సెలింగ్ జాగ్రత్తలు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీల్లో ప్రవేశానికి 7 రౌండ్లలో కౌన్సెలింగ్ జరుగుతుంది. వీటిలో 2, 3 రౌండ్లను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవచ్చు. కౌన్సెలింగ్ ప్రక్రియ వరుసక్రమం ఇలా ఉంటుంది- రిజిస్ట్రేషన్, కౌన్సెలింగ్, కోరిన కాలేజీ/ బ్రాంచి ఎంపిక చేసుకోవడం, సీట్ల కేటాయింపు, సీటు పొందిన కళాశాలలో రిపోర్టింగ్ చేయడం, ప్రొవిజినల్ కేటాయింపు పొందడం. వీటిపై అవగాహన ఏర్పరచుకోవాలి. జేఈఈ అడ్వాన్స్‌డ్-2018 రోల్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ ఉంచుకుని రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు.

ఇవన్నీ జూన్ 19లోపు ఉంచుకుని రిజిస్ట్రేషన్ చేస్తే జూన్ 19 నుంచి జులై 15 లోపు సీట్ల కేటాయింపు జరుగుతుంది. కాలేజీ బ్రాంచి విషయంలోనూ గత

సంవత్సర విశ్లేషణ చూసుకుని మొదట కాలేజీలు, బ్రాంచీల వరుస క్రమాన్ని తయారు చేసుకోవాలి. ఎన్ని కళాశాలలనే నిబంధన లేదు. కాబట్టి అన్నింటినీ సంబంధిత బ్రాంచీలతో ఆప్షన్లు పెట్టుకుని, సరిగా సీటు కేటాయింపు జరిగేలా శ్రద్ధ తీసుకోవాలి.

ఎంపికలో ప్రాధాన్యక్రమం

గత ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తొలి ర్యాంకు సాధించిన విద్యార్థి సర్వేష్ ఐఐటీ-బాంబేలో కంప్యూటర్ సైన్స్ తీసుకున్నాడు. గత రెండు, మూడేళ్ల నుంచి ఎక్కువమంది విద్యార్థుల ఎంపిక ఐఐటీ-బాంబేనే అవుతోంది. వీటిలోనూ ఎక్కువమంది కోర్ గ్రూప్ సబ్జెక్టులపై ఆసక్తి చూపిస్తున్నారు. వీళ్ల ఎంపిక కూడా తొలి 8 ఐఐటీలు (బీహెచ్‌యూతో కలిపి), తరువాత రెండో విడతలో ప్రారంభించిన 8 ఐఐటీలు, ఆ తరువాత మిగిలిన 7 ఐఐటీలకు (కొత్తగా ప్రారంభించినవి) ప్రాధాన్యం ఇస్తున్నారు. ఐఐటీ-హైదరాబాద్‌కు మాత్రం పాత కళాశాలలకు పోటీగానే ప్రాధాన్యమిస్తున్నారు. గత సంవత్సర ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకులను గ్రూపులవారీగా పరిశీలనకు తీసుకుంటే ప్రాధాన్యక్రమం అర్థమవుతుంది.

ఐదువేల లోపు, ఆపై ర్యాంకులుంటే

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 5000లోపు ర్యాంకు సాధించినవారు ఎక్కువగా కోర్ గ్రూపు సబ్జెక్టులు, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఈసీఈ, ఈఈఈలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇక ఎక్కువ ర్యాంకు అంటే 5000 పైన సాధించినవారు ఇంజినీరింగ్ ఫిజిక్స్, మేథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్‌లకు ప్రాధాన్యమిస్తున్నారు.

రెండు సంస్థలకు అధిక ప్రాధాన్యం

ఐఐటీలే కాకుండా జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ద్వారా ప్రవేశాలు కల్పించే ప్రముఖ సంస్థలు 9 ఉన్నాయి.

1. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు 2. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ), విశాఖపట్నం 3. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఇంజినీరింగ్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), భోపాల్ 4. ఐఐఎస్ఈఆర్- మొహాలీ 5. ఐఐఎస్ఈఆర్-కోల్‌కతా 6. ఐఐఎస్ఈఆర్-పుణె 7. ఐఐఎస్ఈఆర్-తిరువనంతపురం 8. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ), తిరువనంతపురం 9. రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ), రాయ్‌బరేలీ

వీటిల్లోనూ ఐఐఎస్‌టీ, ఐఐఎస్సీ-బెంగళూరులకు విద్యార్థులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. వీటిలో కొన్నింటికి కేవీపీవై-ఎస్‌ఏ, కేవీపీవై-ఎస్‌బీ, కేవీపీవై-ఎస్ఎక్స్ ద్వారానూ, కొన్నింటిని జేఈఈ-మెయిన్ స్కోరు ద్వారా, మరికొన్నింటిని నీట్-యూజీ మార్కుల ఆధారంగానూ ప్రవేశాలు ఇస్తున్నారు. ఉదాహరణకు- ఐఐఎస్సీ, బెంగళూరులో బాచిలర్ ఆఫ్ సైన్స్ (రిసెర్చ్) ప్రోగ్రామ్‌లో ఆరు బ్రాంచీలు ఉన్నాయి. అవి: బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మేథమేటిక్స్, ఫిజిక్స్. వీటిలో బయాలజీలో ప్రవేశానికి నీట్-యూజీ మార్కులు తీసుకుంటున్నారు. దీనిలో గతంలో నీట్‌లో 300లోపు మార్కులకు కూడా సీటు సాధించారు.

ఎన్ఐటీల్లో సీటు అవకాశాలు ఎక్కువ

ఆర్కిటెక్చర్‌వైపు ఆసక్తి ఉన్నవారికి కూడా ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ) మంచి అవకాశం. పరీక్షలో సాధారణ ప్రదర్శనతో కూడా మంచి కళాశాలలో సీటు సాధించే అవకాశం ఉంది. వీరికి కేవలం ఏఏటీ పరీక్షలోని ర్యాంకు ఆధారంగానే సీటు కేటాయిస్తారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 10,000కుపైగా ర్యాంకు సాధించినవారు జేఈఈ మెయిన్ ర్యాంకు ఆధారంగా ఎన్ఐటీల్లో ప్రయత్నించడం మేలు. ఎన్ఐటీల్లో సీట్లు ఎక్కువగా ఉన్నాయి, ప్రతి రాష్ట్రంలో స్వరాష్ట్ర విద్యార్థులకు 50% సీట్లు కేటాయిస్తారు. కాబట్టి సీటు పొందే అవకాశాలు ఎక్కువ.

ఐఐటీలు, ఎన్ఐటీల కౌన్సెలింగ్‌కి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐఐటీల్లో ఏదో ఒక బ్రాంచి కంటే ఎన్ఐటీల్లో విద్యార్థి తనకు నచ్చిన బ్రాంచి ఎంపిక చేసుకోవడం మేలు. అలాగే ఎన్ఐటీల్లో బాగా ఎక్కువ ర్యాంకు పొంది, వాటిలో ఏదో ఒక బ్రాంచిలో చేరడం కంటే ఎంసెట్ ర్యాంకు ద్వారా యూనివర్సిటీ కళాశాలల్లో కోరిన బ్రాంచిలో ఇంజినీరింగ్ చేరడం మెరుగైన నిర్ణయమవుతుంది.

గత సంవత్సరాల కౌన్సెలింగ్ సరళిని చూసుకుని అవగాహనతో నిర్ణయం తీసుకుంటే మంచి విద్యాసంస్థలో సీటు లభించి, ఆపై జీవితంలో చక్కగా స్థిరపడటానికి అవకాశం దొరుకుతుంది.

కటాఫ్ తగ్గితే.... ప్రిపరేటరీ కోర్సు

ఐఐటీల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సీట్ల సంఖ్య ఎంత ఉన్నదో అంతమంది విద్యార్థులు క్వాలిఫై కావడం లేదు. చదివే విద్యార్థుల్లో ప్రాథమిక అంశాలపై అవగాహన సరిగా ఏర్పరచాలనే ఉద్దేశంతో ఐఐటీల్లో ప్రిపరేటరీ కోర్సును ప్రారంభించారు. దీని ప్రకారం క్వాలిఫై కాని విద్యార్థులతో ఖాళీ సీట్లను భర్తీ చేస్తారు. ఈ విద్యార్థుల సంఖ్య 30 నుంచి 40 వరకూ ఉంటోంది. దివ్యాంగుల కేటగిరీలో కూడా 2009 నుంచి ప్రిపరేటరీ కోర్సును ప్రవేశపెట్టారు.

ఎలా ఎంపిక చేస్తారు?

రిజర్వేషన్ కేటగిరీల్లో కటాఫ్ మార్కు కంటే తక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల్లో వారు పొందిన మార్కులను ఆరోహణ క్రమంలో అమర్చి, ఆ వరసక్రమంలో విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఈ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు ఒక సంవత్సరం రెండు సెమిస్టర్లలో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ నేర్పించి వారి సామర్థ్యాన్ని పెంచుతారు. అంతర్గతంగా పరీక్షలు నిర్వహించి తర్వాతి విద్యాసంవత్సంలో ఫస్టియర్ ఇంజినీరింగ్ చదివే విధంగా చేస్తారు. ఈ విద్యార్థులు కచ్చితంగా రెసిడెన్షియల్‌గానే కొనసాగాలి. ప్రిపరేటరీ కోర్సు అన్ని ఐఐటీల్లోనూ ఉండకపోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సీట్లు మిగిలిపోయిన ఐఐటీల్లో మాత్రమే దీన్ని అమలుచేస్తారు.

అమ్మాయిలకు అదనపు సీట్లు

ఐఐటీలు, ఐఐఎస్సీ, వివిధ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరుతున్న విద్యార్థుల్లో అమ్మాయిల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది.

2014లో సుమారు 8.8% విద్యార్థినులు ఐఐటీల్లో చేరగా, 2015లో ఇది 9 శాతానికి చేరింది. మళ్లీ 2016లో 8 శాతానికి పడిపోయింది. ఈ పరిస్థితుల్లో మానవ వనరుల మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఆర్‌డీ), కేంద్ర ప్రభుత్వం విద్యార్థినుల ప్రవేశాల సంఖ్యను పెంచాలని భావించాయి.

జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) ఈ పరిస్థితిని అధిగమించే మార్గాలను కనుక్కోవడానికి ప్రొఫెసర్ టిమోతీ గోన్‌సాల్వ్స్ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేసింది. ఈ కమిటీ సూచనల మేరకు బోర్డు 'సూపర్ న్యూమరసీ' కోటాను దశలవారీగా అమలు చేస్తున్నారు. ఈ సంవత్సరం నుంచి విద్యార్థినుల శాతం 14 చేసి, దాన్ని వరుసగా పెంచుతూ 2026 నాటికి 20 శాతం చేయాలని జేఏబీ ఉద్దేశం.

అంటే ఈ సంవత్సరం అమ్మాయిలకు గతంతో పోలిస్తే 600పైన సీట్లు పెరుగుతాయి. ఇది వారికి ఎంతో ఉపయోగపడే అంశం. విద్యార్థినుల్లో సీట్ల కోసం పోటీ బాగా తగ్గుతుందని చెప్పవచ్చు. ఒక సీటుకు పదిమంది లోపే పోటీ పడనున్నారు.

అబ్బాయిలకు నష్టం ఉండదు

అమ్మాయిలకు కేటాయించిన ఈ రిజర్వేషన్ కారణంగా అబ్బాయిల సీట్లపై ప్రభావం పడటమో, సంఖ్య తగ్గడమో ఉండదని ఎంహెచ్ఆర్‌డీ చెబుతోంది. ఈ ఏడాది 14% అమ్మాయిలను నింపడానికి నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువ సంఖ్యలో సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇవే 'సూపర్ న్యూమరసీ సీట్లు'. వీటిని జేఈఈ (అడ్వాన్స్‌డ్) క్వాలిఫై అయిన వారికి కేటాయిస్తారు. అయితే వారు బోర్డు ఎగ్జామ్స్‌లోనూ టాప్ 20 పర్సంటైల్ కలిగినవారై ఉండాలని ఎంహెచ్ఆర్‌డీ అధికారులు తెలిపారు.

ఒక ఉదాహరణను పరిశీలిద్దాం. ఒక ఐఐటీలో 100 సీట్లు ఉన్నాయనుకుంటే.. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఆ సంస్థలో 8 మంది అమ్మాయిలు, 92 మంది అబ్బాయిలకు ప్రవేశం లభిస్తుందనుకుందాం. ఈ 14% రిజర్వేషన్ రూల్ ప్రకారం అదనంగా ఆరుగురు అమ్మాయిలకు ప్రవేశం దొరుకుతుంది. వీరిని ప్రత్యేకమైన అమ్మాయిల మెరిట్ లిస్ట్ నుంచి ఎంపిక చేస్తారు. అబ్బాయిల ప్రవేశ సంఖ్య 92లో ఎలాంటి మార్పూ ఉండదు. కాబట్టి, అబ్బాయిల సీట్ల సంఖ్యలో కోత పడుతుందన్న బెంగ అవసరం లేదు.

గత ఏడాది ఐఐటీల్లో సీట్లు సాధించిన ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకుల పట్టిక, ప్రముఖ 9 విద్యా సంస్థల్లో కటాఫ్ ర్యాంకుల పట్టికలను www.eenadupratibha.net లో చూడండి.

మెటలర్జీలో ఉద్యోగావకాశాలేంటి?

■ ఇంటర్ పూర్తిచేశాను. మెటలర్జీ కోర్సుకి సంబంధించిన వివరాలను తెలియజేయండి. ఉద్యోగావకాశాలెలా ఉంటాయి?

- ఉపేంద్ర కుమార్ రెడ్డి

జ: ఇంటర్ తరువాత మెటలర్జీ ఇంజినీరింగ్ కానీ, డిప్లొమా ఇన్ మెటలర్జీ ఇంజినీరింగ్ కోర్సును కానీ చేయొచ్చు. జేఎన్‌టీయూ పరిధిలోని అతికొద్ది ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ ఇంజినీరింగ్ కోర్సు అందుబాటులో ఉంది. ఎంసెట్ ర్యాంకు ద్వారా ప్రవేశం పొందొచ్చు. పాలీసెట్ ద్వారా కూడా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొంది లేటరల్ ఎంట్రీ ద్వారా మూడేళ్ల ఇంజినీరింగ్ కోర్సులో చేరొచ్చు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లానింగ్ అండ్ టెక్నాలజీ- గుజరాత్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫౌండ్రి అండ్ ఫోర్జ్ టెక్నాలజీ- రాంచీ, ఐఐటీ- మద్రాస్, బాంబే, రూర్కీ, కాన్పూర్, వారణాసి, కొన్ని ఎన్ఐటీలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

ఈ కోర్సు చదివినవారికి ప్రైవేటు ఉక్కు కర్మాగారాలు, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్, హిండాల్కో ఇండస్ట్రీస్, కేబుల్ కార్పొరేషన్ లాంటి సంస్థల్లో మెటలర్జికల్ ఇంజినీర్లు, టెక్నీషియన్లు, ప్రాసెస్ అనలిస్టులుగా ఉద్యోగాలు పొందే అవకాశాలున్నాయి. మెటల్ ఎక్స్‌ట్రాక్షన్, అల్లాయ్ మ్యానుఫాక్చరింగ్, హెవీ మెషిన్ తయారీ కర్మాగారాల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

మల్టీమీడియా అండ్ యానిమేషన్..

■ ఇంటర్ పూర్తిచేశాను. బీఎస్సీ మల్టీమీడియా అండ్ యానిమేషన్ చేయాలనుంది. కోర్సు వివరాలు, అందించే సంస్థలేవి? - షణ్ముఖి

జ: మల్టీమీడియా అండ్ యానిమేషన్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంది. ఇది పూర్తిగా సృజనాత్మకతకు సంబంధించింది. ఈ రంగంలోకి వెళ్లే ముందు ఈ కోర్సు చదవడానికి ముందూ, చదివిన తర్వాతా రాణించడానికి కావాల్సిన లక్షణాలు మీకున్నాయో లేవో బేరీజు వేసుకోండి. సృజనాత్మకతతోపాటు కంప్యూటర్‌తో ఎక్కువసేపు పనిచేయగలిగే నేర్పు, ఓర్పు చాలా అవసరమవుతాయి.

ఈ కోర్సు చదివినవారికి గ్రాఫిక్స్, టీవీ, మీడియా, అడ్వర్టైజింగ్, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, వెబ్‌సైట్ డిజైనింగ్, యానిమేషన్, ప్రింట్, డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ కంటెంట్ తయారీ సంబంధిత సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఈ కోర్సును అతికొద్ది సంస్థలు మాత్రమే అందిస్తున్నాయి. కేఎల్ యూనివర్సిటీ- విజయవాడ, జేవియర్ యూనివర్సిటీ- భువనేశ్వర్, వీఐటీ- వెల్లూర్, అమిటీ యూనివర్సిటీ- ముంబయి, మణిపాల్ యూనివర్సిటీ- మణిపాల్, లయోలా అకాడమీ- సికింద్రాబాద్ మొదలైనవి వాటిలో కొన్ని.



ఈ కోర్సులు చాలావరకూ ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనే అందుబాటులో ఉన్నాయి. ఈ రంగంలో అవకాశాలతోపాటు పోటీ కూడా తీవ్రంగా ఉంటుంది. ఈ విషయాన్ని గమనించి సబ్జెక్టుపై పట్టు, నైపుణ్యాలను సాధించగలిగితే భవిష్యత్తు చాలా బాగుంటుంది.

- ప్రొ. బి. రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

సీడ్యాక్‌లో ఖాళీలు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) వివిధ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు. **పోస్టు-ఖాళీలు:** ప్రాజెక్ట్ మేనేజర్- 02, ప్రాజెక్ట్ ఇంజినీర్- 12, ప్రాజెక్ట్ ఆఫీసర్- 02, ప్రాజెక్ట్ అసోసియేట్- 02.

అర్హత: సంబంధిత బ్రాంచులు/ సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఈ/ ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీ, పని అనుభవం.

ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.06.2018

వెబ్‌సైట్: https://cdac.in/

ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్‌లు

భిలాయ్ (ఛత్తీస్‌గఢ్)లోని ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: ఎగ్జిక్యూటివ్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్, ఎస్‌ఏపీ)- 11, జూనియర్ మేనేజర్ (మెయింటెనెన్స్ మెకానికల్)- 01, డిప్యూటీ జనరల్ మేనేజర్ (మెకానికల్)- 01. **అర్హత:** కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, సీఏ/ ఐసీఎంఏ/ ఎంబీఏ/ ఎంసీఏ, పీజీ డిప్లొమా, పని అనుభవం.

ఎంపిక: రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేదీ: 22.06.2018.

వెబ్‌సైట్: http://www.fsnl.co.in/

ప్రవేశాలు

జేఎన్‌టీయూహెచ్‌లో ఎంఎస్సీ కోర్సులు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో 2018-19 సంవత్సరానికి ఎంఎస్సీ కోర్సు ప్రవేశాలు.

విభాగాలు: బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ. **సీట్ల సంఖ్య:** ఒక్కో విభాగంలో 25 చొప్పున మొత్తం 100. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.

ఎంపిక: ప్రవేశపరీక్ష ఆధారంగా. **పరీక్ష తేదీ:** 10.07.2018.

దరఖాస్తు: ఆఫ్‌లైన్. **చివరి తేదీ:** 23.06.2018.

వెబ్‌సైట్: http://jntuh.ac.in/

ఐఐఎస్‌టీలో యూజీ ప్రోగ్రాం

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ 2018-19 విద్యా సంవత్సరానికి యూజీ ప్రోగ్రాంలో ప్రవేశాలు.

ప్రోగ్రాం-సీట్లు: నాలుగేళ్ల బీటెక్ (ఏరోస్పేస్)- 60, నాలుగేళ్ల బీటెక్ (ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్- ఏవియానిక్స్)- 60, అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ (బీటెక్, ఎంఎస్సీ/ ఎంటెక్)- 20.

అర్హత: 75 శాతం మార్కులతో పన్నెండో తరగతి(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్), జేఈఈ (అడ్వాన్స్‌డ్)-2018 ఉత్తీర్ణత.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 05.06.2018 నుంచి 15.06.2018. **వెబ్‌సైట్:** www.iist.ac.in

ఆర్‌జీఐపీటీలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు

అమేథీ(ఉత్తర్‌ప్రదేశ్)లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ 2018-19 విద్యాసంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలు.

కోర్సు-సీట్లు: బీటెక్(పెట్రోలియం/ కెమికల్ ఇంజినీరింగ్)- 120, ఎంటెక్ (పెట్రోలియం/ కెమికల్ ఇంజినీరింగ్)- 40, పీహెచ్‌డీ (పీఈజీ, ఇంజినీరింగ్, బేసిక్ సైన్స్, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్).

అర్హత: సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచుల్లో ఇంటర్, బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత, జేఈఈ (అడ్వాన్స్‌డ్), నెట్, గేట్, క్యాట్, జీమ్యాట్, జీఆర్ఈ స్కోరు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: బీటెక్ కోర్సుకు 05.07.2018; ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులకు 12.06.2018.

వెబ్‌సైట్: www.rgipt.ac.in

ఎంటెక్ (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ)

హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం, సీఆర్ రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ సంయుక్తంగా ఎంటెక్ (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ) కోర్సు అందిస్తున్నాయి.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీటెక్ (సీఎస్ఈ/ ఐటీ/ ఈఈఈ/ఈసీఈ) లేదా ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ (మ్యాథ్స్/ స్టాట్/ ఐటీ/ సీఎస్/ ఎలక్ట్రానిక్స్) కోర్సుల్లో ఉత్తీర్ణత. దీంతోపాటు కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ విభాగంలో గేట్ స్కోర్ అవసరం.

దరఖాస్తు: జూన్ 7 నుంచి జూన్ 30 వరకు.

వెబ్‌సైట్: http://acad.uohyd.ac.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు



ఈనాడు

విజయవాడ 6-6-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 297 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 5-00 పేజీలు 16+20 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



భయపెడితే భయపడం

మా వనరులను దోపిడీ చేస్తూ అభివృద్ధికి నిధులివ్వరేం

- ఈ ప్రాంతం నుంచే ఆయిల్, గ్యాస్ తరలింపు
- అయినా పట్టించుకోని కేంద్రం
- మనలో ఐక్యతే మనకు రక్ష
- ఎన్నికలు రాని రాజీనామాలెందుకు?
- అందుకే ఇప్పటిదాకా డ్రామా
- ఇప్పుడు ఆమోదించినా నిష్ఫలమే
- అమలాపురం నవనిర్మాణ దీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

‘పోలవరానికి ఇస్తామన్న నిధులను కేంద్రం ఇవ్వలేదు. కాకినాడ వద్ద పెట్రో కెమికల్ పరిశ్రమ ఏర్పాటు విషయంలోనూ రూ.5500 కోట్లను ముందే చెల్లించాలంటూ ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారు. విశాఖకు రైల్వే జోన్ ఇస్తామని ఒడిశాను రెచ్చగొట్టి ఇబ్బంది పెట్టాలని చూశారు. విశాఖలో గిరిజన విశ్వవిద్యాలయం, లోటు బడ్జెట్ విషయంలో కేంద్రం సహకరించలేదు. భయపెట్టాలని చూస్తే భయపడే పరిస్థితిలో లేం.

ఏడాది కంటే ఎక్కువ సమయం ఉన్నప్పుడే రాజీనామాలు చేస్తే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. ఆ ధైర్యం లేకే ఏడాదిలోపు సమయం ఉండేట్లు చూసుకుని స్పీకరుతో మాట్లాడుకుని రాజీనామాలను వైకాపా ఎంపీలు ఆమోదించుకోకుండా వాయిదా వేసుకున్నారు. వారి రాజీనామాలు ఏప్రిల్‌లోనే ఆమోదం పొంది ఉంటే ఇటీవల జరిగిన ఉప ఎన్నికలతోపాటు ఎన్నికలు జరిగేవి. ఇదే జరిగి ఉంటే 2019లో ఎవరేమిటనేది తేలిపోయేది.’ – చంద్రబాబు

తూర్పుగోదావరి జిల్లా రంగాపురం శివాలయంలో మృత్యుంజయ హోమంలో పాల్గొని పూజలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు – కాకినాడ

ఇక్కడి గ్యాస్, ఆయిల్ నిక్షేపాలను తరలించుకుని పోతూ ఈ ప్రాంత అభివృద్ధికి ఎందుకు సహకరించడం లేదని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలదీశారు. రాష్ట్రానికి మంచి జరుగుతుందని ఎన్‌డీఏలో భాగస్వాములుగా చేరితే భాజపా నమ్మక ద్రోహం చేసిందని, అభివృద్ధికి సహకరిస్తామని నమ్మించి మోసం చేసిందని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే భాజపాకు పడుతుందని హెచ్చరించారు. ‘సంక్షేమం. . సాధికారిత’ పేరుతో తూర్పు గోదావరి జిల్లా అమలాపురం మండలంలో మంగళవారం నిర్వహించిన నాలుగో రోజు నవ నిర్మాణ దీక్షలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

‘కొంత మంది కలసి కుట్ర రాజకీయాలు చేస్తున్న తరుణంలో ధృడ సంకల్పంతో ముందుకు పోవాల్సిన అవసరముంది. ఐక్యతా భావనతో పని చేయడానికే నవ నిర్మాణ దీక్షలు చేపడుతున్నాం. ఎన్ని ఆటంకాలు సృష్టించినా వెనకడుగు వేసేది లేదు. దేశంలో 50లక్షల 50 వేల మందికి పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఏపీనే. రాష్ట్రంలో మంగళవారం ఒక్క రోజే 1,05,072 మందికి రూ.717 కోట్ల ఆర్థిక సహాయం అందించాం. బీసీల రిజర్వేషన్లకు ఇబ్బంది లేకుండా కాపులను బీసీల్లో చేర్చి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం.’

కుట్ర రాజకీయాలను తిప్పికొడదాం

‘కుట్ర రాజకీయాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ధృడ సంకల్పంతో ఉండాలి. కేంద్రం ప్రవేశ పెట్టిన ఐదో బడ్జెట్‌లోనూ (మిగతా 2లో)

50 కోట్ల మందికి సామాజిక భద్రత!

- మోదీ మదిలో మరో పథకం

దిల్లీ: దేశవ్యాప్తంగా 50 కోట్ల మందికి ప్రయోజనం చేకూర్చే మరో బృహత్తర పథకం అమలుకు ప్రధాని మోదీ యోచిస్తున్నారు. దాదాపు 10 కోట్ల పేద కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు గత ఫిబ్రవరిలో ‘మోదీ కేర్’ను ప్రకటించిన సంగతి తెలిసిందే. కొత్త సంక్షేమ పథకంలో సామాజిక భద్రతకు పెద్దపీట వేయనున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోపే.. ప్రయోగాత్మకంగా 6 జిల్లాల్లో అమలు చేసేందుకు యోచిస్తున్నారు. సమయం, వనరులు పరిమితంగా ఉండటంతో తొలుత వృద్ధాప్య పింఛన్లు, జీవిత బీమా, ప్రసూతి ప్రయోజనాల కల్పనపై దృష్టి సారించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రపంచంలో అత్యధిక పేదలున్న మూడో దేశమైన భారత్‌లో పేదరికాన్ని తగ్గించేందుకు.. దిగువ తరగతివారికి సామాజిక భద్రత కల్పించేందుకు ఇది దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అసంఘటిత రంగానికి ఊతమిస్తుందని అంచనా వేస్తున్నారు. జీడీపీలో దాదాపు సగం భాగస్వామ్యం (మిగతా 2లో)



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దిల్లీలో తనకు బహూకరించిన మొక్కతో ప్రధాని మోదీ

సౌర‘కుసుమ్’

- రూ.1.4లక్షల కోట్లతో రైతులకు సౌరశక్తి
- కేంద్రం కొత్త పథకం

11లో

కేంద్రంలో ప్రకంపనలు వస్తాయ్

- నెలరోజుల్లో 2 అతిపెద్ద కుంభకోణాలను బయటపెడతాం
- ప్రధానికి సన్నిహితమైన వ్యాపారసంస్థకు లాభం చేకూర్చారు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు ఆరోపణ

14లో

కొత్త డీజీపీ ఎవరో?

- ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న మాలకొండయ్య
- రేసులో ఆర్.పి.ఠాకూర్, గౌతమ్‌సవాంగ్, సురేంద్రబాబు, అనూరాధ

2లో

పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల రిజర్వేషన్లకు సుప్రీం పచ్చజెండా

- కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం అనుమతి

11లో

తిరుమలేశుని ఆభరణాల ప్రదర్శనకు సుముఖం

- తితిదే తీర్మానం

2లో



Bi.P.C. విద్యార్థులకు టెక్నికల్ కోర్సులతో ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు

NEET, EAMCETలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు విజ్ఞాన్ వారి అభినందనలు...

అయితే.. నీట్‌లో ర్యాంకు రాలేదనో.. మెడిసిన్ లో సీటు దక్కలేదనో నిరాశ చెందడం ఎంతమాత్రం సహేతుకం కాదు. కాలం మారింది. ఈ ఆధునిక యుగంలో వైద్య వృత్తికి దీటైన మరెన్నో కోర్సులు బైపీసీ విద్యార్థుల కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం ఆయా రంగాల్లో ఎంతగానో డిమాండ్ ఉన్న పలు కోర్సులను విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ బైపీసీ విద్యార్థుల కోసం అందిస్తోంది.

బి.టెక్ | బయోటెక్నాలజీ | బయో ఇన్‌ఫర్‌మాటిక్స్ | బయోమెడికల్ | ఫుడ్ టెక్నాలజీ బీ.ఫార్మసీ

పై కోర్సుల్లోని ముఖ్యాంశాలు

- పైన తెలిపిన కోర్సులు పూర్తిచేసుకున్న బైపీసీ విద్యార్థులకు బయోటెక్, ఫార్మా రంగాలతోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలోనూ ఉద్యోగాలు.
- విజ్ఞాన్ యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విద్యార్థులకు 100% మందికి ఉద్యోగాలు.
- ఇతర కోర్సుల్లోనూ 85% కి పైగా విద్యార్థులకు బహుళజాతి సంస్థల్లో కొలువులు.

జూన్ 7 నుండి 10 వ తేదీ వరకు అడ్మిషన్లు

ప్రతిభకు ప్రోత్సాహం	స్కాలర్‌షిప్స్	100%	50%	25%
	స్టేట్ నీట్ ర్యాంకు	6000 లోపు	6001 - 14000	14001 - 20000
	ఎంసెట్ (బైపిసి)	4000 లోపు	4001 - 20000	20001 - 30000
	ఇంటర్ మార్కులు	985 కు పైగా	980 - 984	960 - 979
	సిబిఎస్ఇ +2 మార్కులు	425 కు పైగా	401 - 424	375 - 400

నీట్ / ఎంసెట్ అర్హత సాధించి, ఇంటర్‌లో 960కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం

M.P.C. విద్యార్థులకు ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా పరిమిత సంఖ్యలో అడ్మిషన్లు

వివరాలకు : | 9666505597 | 9948084843

విజ్ఞాన్స్
Foundation for Science, Technology & Research
(డీమ్డ్ టు బి యూనివర్సిటీ)
-Estd. u/s 3 of UGC Act 1956
NAAC 'A' Accredited

వివరాలకు : | బయోటెక్నాలజీ 9985361424 | ఫుడ్ టెక్నాలజీ 9789007208 | బయోమెడికల్ 9398917124 | బయో ఇన్‌ఫర్‌మాటిక్స్ 8297164147 | బీ.ఫార్మసీ 9866394437

వడ్లమూడి, గుంటూరు జిల్లా - 522 213. ఆంధ్రప్రదేశ్. | ఫోన్ 0863 2344777 | టోల్‌ఫ్రీ : 1800-425-2529 | www.vignanuniversity.org

భయపెడితే భయపడం



తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో మంగళవారం నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి మోడీ అన్యాయం చేశారు. అందుకే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చాం. రాజీనామాల పేరుతో వైకాపా నాటకాలు ఆడింది. 2015లో చేస్తామని ఒకసారి, 2016లో మరోసారి, 2017లో ఇంకోసారి.. చివరకు 2018లో ఉప ఎన్నికలు రాకుండా చూసుకుని రాజీనామా చేస్తున్నట్లు డ్రామాలు ఆడారు. వైకాపా, భాజపా నాటకాలను గమనించి పాత్రధారులను, సూత్రధారులను చిత్తుగా ఓడించాలి. నోట్ల రద్దుతో సామాన్యులకు బ్యాంకులపై నమ్మకం పోయింది. దేశంలో రైతులు గిట్టుబాటు ధర లేక చితికి పోతున్నారు.'

కుట్రలు, కుతంత్రాలకు పరాకాష్ట

'వెంకటేశ్వర స్వామినీ కుట్రల్లో ఇరికిస్తున్నారు. ఇటీవల ఒక పూజారితో కుట్ర రాజకీయాలు చేశారు. యాదవ కులానికి చెందిన వ్యక్తిని తితిదే ఛైర్మన్‌గా నియమిస్తే భాజపా రాద్ధాంతం చేసింది. తెలుగు ప్రజల ఆరాధ్య దైవమైన వెంకటేశ్వర స్వామితో ఆడుకోవద్దు. అలజడి, గొడవలు చేసి ప్రభుత్వం ఏమీ చేయలేకపోతుందనే ప్రచారం చేసి బలహీన పరిచే కుట్ర చేస్తున్నారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భాజపా రాయలసీమ డిక్లరేషన్ అంటే పవన్ కల్యాణ్ ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నారు. జగన్ కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారు. తుని సంఘటన ఇలా జరిగిందే. ప్రజలంతా సమైక్యంగా ఉంటూ వీటిని ఎదుర్కోవాలి. 2019 ఎన్నికలు రాష్ట్రానికి చరిత్రాత్మక అవసరం. మరో 5 సంవత్సరాలు కష్టపడితే మిగిలిన రాష్ట్రాలతో సమానంగా మనం అభివృద్ధిలోకి వస్తాం. జరగరానిది జరిగితే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతుంది.'

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

మంగళవారం ఉదయం అమలాపురం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలుత నల్ల వంతెన దగ్గర రూ. 10 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను ప్రారంభించారు. తరువాత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్టీఆర్, మెట్ల సత్యనారాయణ విగ్రహాలను ఆవిష్కరించారు. అక్కడి నుంచి కామనగరువు మీదుగా గ్రామదర్శిని కార్యక్రమం కోసం సమనస, వన్నె చింతలపూడి గ్రామాల్లో పర్యటించారు. వన్నె చింతలపూడి బీసీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులంతా ఐఏఎస్‌లమవుతామని చెప్పడంతో అందరూ ఐఏఎస్‌లైతే ఎలా? అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలని సూచించారు. నీట్ ఫలితాల్లో ఏపీ నుంచి పరీక్ష రాసిన వారిలో 73 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అనంతరం కిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో క్యాథ్ ల్యాబ్‌ను ప్రారంభించారు.

ఎస్సీ, ఎస్టీల కోసం పోరాడతా

'ఎస్సీ, ఎస్టీల అత్యాచారాల కేసుల విషయంలో కేంద్రం పట్టించుకోకపోయినా మీ అందరి కోసం నేను పోరాటం చేస్తా' అని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వన్నె చింతలపూడిలో నిర్వహించిన గ్రామదర్శని కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తొలుత అక్కడ ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. కులం, మతం, ప్రాంతం అనేది తన దృష్టిలో లేదని, 5 కోట్ల మందీ తనకు ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతుండగా యువతీయువకులంతా కార్యక్రమాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. దానిని చూసిన ఆయన 'మీరు ఇంత ఉత్సాహంగా ఈ కార్యక్రమానికి హాజరైనందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఇక్కడే ఉండిపోవాలని ఉంది' అని పేర్కొన్నారు.

EXCLUSIVE COUNSELLING FOR JEE Rankers & CBSE / ICSE Top Scorers

KL UNIVERSITY (DEEMED TO BE)

K L (Vijayawada) & K L H (Hyderabad) Campuses

25% seats are reserved for the following categories

JEE Main 1 to 3,00,000 Rankers | JEE Advanced All Rankers

CBSE + 2 CGPA: 8.0 & above | ICSE + 2 CGPA: 8.0 & above

AP EAMCET 1 to 40,000 Rankers | TS EAMCET 1 to 40,000 Rankers

AP Intermediate 900 & above marks | TS Intermediate 900 & above marks

11.06.2018 (Monday) & 12.06.2018 (Tuesday) 9 AM onwards

- For Scholarships, Reservations visit : www.kluniversity.in
- Bank Loans (Education) available
- Counselling at our Campus

100% Placements THIS YEAR ALSO WITH PAY PACKAGE UPTO ₹20 LAKHS
* for all registered & eligible students

NAAC 'A' Grade

Vijayawada Campus: Green Fields, Vaddeswaram, Andhra Pradesh Ph: 7997995703, 7997995730, 7997995696, 9490361111, 7997995732, 0863-2399999

Admin Office : 29-36-38, Museum Road, Governorpet, Vijayawada - 500002. Andhra Pradesh. Ph: 0866-2577715

గౌతమ్ సవాంగ్

ఠాకూర్

సురేంద్రబాబు

అనూరాధ

కొత్త డీజీపీ ఎవరో?

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు కొత్త డీజీపీ ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. డీజీపీ ఎం. మాలకొండయ్య ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో పోలీసు దళాల అధిపతిగా ఎవరిని నియమించాలనే దానిపైన త్వరలో కసరత్తు మొదలుపెట్టనుంది. గతేడాది వరకూ ఈ పదవికి ఎంపిక ప్రక్రియ యూపీఎస్సీతో ముడిపడి ఉండేది. రాష్ట్రంలో డీజీపీ హోదా కలిగిన అధికారుల జాబితాను రాష్ట్రం కేంద్రానికి పంపిస్తే వారి సీనియారిటీ, సర్వీసు చరిత్ర ఆధారంగా యూపీఎస్సీ ఆధ్వర్యంలోని కమిటీ ముగ్గురు అధికారుల పేర్లను ఎంపిక చేసి రాష్ట్రానికి పంపించేది. వారిలో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమించేది. గతేడాది చివర్లో ఆంధ్రప్రదేశ్ పోలీసు చట్టం(సంస్కరణలు)-2014కు సవరణలు చేయడంతో రాష్ట్రమే సొంతంగా డీజీపీని నియమించుకునేందుకు అవకాశమేర్పడింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటయ్యే ఎంపిక కమిటీ అర్హులైన అధికారుల జాబితాను రూపొందిస్తే వారిలో నుంచి ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం ఏడుగురు ఐపీఎస్ అధికారులు డీజీపీ హోదా కలిగి ఉన్నారు. మాలకొండయ్యను మినహాయిస్తే 1986 బ్యాచికి చెందిన ఆర్.పి. ఠాకూర్ (ఏసీబీ డీజీపీ), గౌతమ్ సవాంగ్ (విజయవాడ నగర పోలీసు కమిషనర్), వీఎస్‌కే కౌముది (కేంద్ర సర్వీసుల్లో డిప్యూటేషన్), వినయ్‌రంజన్ రే (జైళ్ల శాఖ డీజీ), 1987వ బ్యాచ్‌కు చెందిన ఎన్.వి.సురేంద్రబాబు(ఆర్టీసీ ఎండీ), ఏఆర్ అనూరాధ (హోంశాఖ ముఖ్య కార్యదర్శి)లు డీజీపీ హోదా కలిగి ఉన్నారు. ఈ ఆరుగురిలో నుంచి ఎంపిక కమిటీ అర్హుల జాబితాను సిద్ధం చేయనుంది. ఆర్.పి.ఠాకూర్, గౌతమ్‌సవాంగ్, సురేంద్రబాబు, అనూరాధలలో ఒకరు డీజీపీ అయ్యే అవకాశముందని పోలీసు వర్గాల్లో విస్తృత ప్రచారం సాగుతోంది. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని కోణాల్లోనూ విశ్లేషించి సమర్థుడైన అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

శ్రీవారి ఆభరణాల ప్రదర్శనకు సుముఖం

- **దీనిపై ఆగమ సలహా మండలి అనుమతి కోరుతూ తితిదే ధర్మకర్తల మండలి తీర్మానం**
- **రమణ దీక్షితులువి అసత్య ఆరోపణలన్న ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పుట్టా**

తితిదే ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారి స్వర్ణాభరణాలను ప్రదర్శించాలని తిరుమల, తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఇందుకు దేవస్థానం ఆగమ సలహామండలి అనుమతి కోరింది. అనుమతిరాగానే భారీ భద్రత కల్పించి భక్తుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసే దిశగా ప్రదర్శించాలని సంకల్పించింది. మిరాశీ వ్యవస్థ రద్దయిన అనంతరం ఆలయ అధికారులకు అప్పగించిన ఆభరణాలన్నింటినీ తిరువాభరణం దస్త్రాల్లో నమోదు చేసిన మేరకు ప్రదర్శనకు ఉంచాలని తీర్మానించింది. తిరుమలలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం అధ్యక్షుడు పుట్టా సుధాకర్ యాదవ్ నేతృత్వంలో జరిగింది. అజెండాలోని 208 అంశాలపై చర్చ మొదలు పెట్టగానే శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు వ్యవహారంపై ముందుగా చర్చించాలని మండలి సభ్యులు సండ్ర వెంకట వీరయ్య, పొట్లూరి రమేష్‌బాబు, కె.రాఘవేంద్రరావు తదితరులు పట్టుబట్టారు. ఈనెల 26న మరోసారి సమావేశమై అధ్యక్షుడితో పాటు సభ్యులు ఆభరణాలు పరిశీలించాలని నిర్ణయించారు. ఇందుకు కూడా ఆగమ సలహామండలి అనుమతి తీసుకోవాలని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు సూచించారు. తవ్వేసినట్లుగా రమణదీక్షితులు ఆరోపిస్తున్న వకుళామాత పోటును పరిశీలించాలని నిర్ణయించారు. శ్రీవారి ఆలయ పవిత్రత, తితిదే ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు, విమర్శలు చేస్తున్న వ్యక్తులకు లీగల్ నోటీసులు ఇవ్వాలని తీర్మానించారు. నోటీసులు అందుకోనున్న వారిలో రమణదీక్షితులుతో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు దేవస్థానం ఉన్నతాధికారులు తెలిపారు. అధ్యక్షుడు పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రమణదీక్షితులు రోజుకో నగరానికి వెళ్లి అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ధైర్యం ఉంటే ధర్మకర్తల మండలి ముందుకు వచ్చి నిరూపించాలని సవాల్ విసిరారు. అసత్య ఆరోపణలతో భక్తుల మనోభావాలు దెబ్బతీయవద్దని సూచించారు.

సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు
www.eenadu.net లో

నిరూపిస్తే ప్రాణత్యాగం చేసుకుంటా

రమణ దీక్షితులుకు బాలసుబ్రమణ్యం సవాల్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల జేఈవోగానే కాదు, నా మొత్తం సర్వీసులో ఎక్కడైనా ఒక్క రూపాయి అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే శ్రీవేంకటేశ్వర స్వామివారి సాక్షిగా ప్రాణత్యాగం చేసుకుంటానని విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.బాలసుబ్రమణ్యం ప్రకటించారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులుకు సవాల్ విసిరారు. రమణ దీక్షితులు సోమవారం చేసిన ఆరోపణల నేపథ్యంలో బాలసుబ్రహ్మణ్యం మంగళవారం ఇక్కడ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తిరుమల జేఈవోగా తొమ్మిదన్నరేళ్ల పాటు పని చేశానని, వేయికాళ్ల మండపాన్ని తొలగించాలని తాను కోరలేదన్నారు. రోజుకు రూ.50 చొప్పున కూలీ ఇచ్చినట్లు చేసిన ఆరోపణలో ఏమాత్రం వాస్తవంలేదని, సంభావన అర్చకులకు మాత్రమే చెల్లించినట్లు పేర్కొన్నారు.

50 కోట్ల మందికి సామాజిక భద్రత!

(మొదటి పేజీ తరువాయి)

కలిగిన అసంఘటిత రంగంలోని వారికి అధిక ప్రయోజనాలను కల్పించడం ద్వారా ఉత్పత్తిని పెంచడంతో పాటు, వారికి నాణ్యమైన జీవితాన్ని ఇవ్వడానికి మాత్రం వీలు పడుతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అయితే ఆర్థికరంగంపై ఒత్తిడిని పెంచుతుందని సూచిస్తున్నారు.

మళ్లీ రేసులోకి ఎస్సెల్ గ్రూపు

- **'అగ్రిగోల్డ్'ను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమని వెల్లడి**

ఈనాడు, హైదరాబాద్: అగ్రిగోల్డ్ ఆస్తుల స్వాధీనానికి ఎస్సెల్ గ్రూపు(సుభాష్‌చంద్ర ఫౌండేషన్) మళ్లీ ముందుకొచ్చింది. సంస్థ ఆస్తుల కంటే అప్పులే ఎక్కువగా ఉన్నాయంటూ అగ్రిగోల్డ్‌ను స్వాధీనం చేసుకునే ఉద్దేశం లేదని, ఆస్తి అప్పుల మదింపు ప్రక్రియను నిలిపివేస్తున్నామంటూ ఏప్రిల్‌లో హైకోర్టుకు ఎస్సెల్ నివేదించిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఈ ప్రక్రియ నుంచి తప్పుకోవడానికి అనుమతించాలని, తాము డిపాజిట్ చేసిన రూ.10 కోట్లను వాపసు ఇప్పించాలంటూ ఈ నెల 1న అఫిడవిట్ సిద్ధం చేసి 4న కోర్టులో దాఖలు చేసిన ఎస్సెల్ గ్రూపు 5న కోర్టులో విచారణకు రాగానే ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించాలని అభ్యర్థించింది. ఈ మేరకు ఎస్సెల్ గ్రూపు తరపు సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం అభ్యర్థనను హైకోర్టు అనుమతించింది. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఎస్సెల్ గ్రూపు 24 గంటల్లో మాట మార్చడం విశేషం.

మరోవైపు అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి సంబంధించి జిల్లా జడ్జి ఛైర్మన్‌గా, కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతేగాకుండా అవసరమైతే కొంత మొత్తాన్ని విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అనుమతిస్తే బ్యాంకులతో ఓటీఎస్(ఒన్ టైం సెటిల్‌మెంట్)కు చర్చిస్తామని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. అత్యధిక విలువ ఉన్న 10 ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రార్, వాల్యువర్, రియల్టర్‌లు సమర్పించిన ధరలను సీఐడీ హైకోర్టుకు సమర్పించింది. అయితే ఈ ధరలు తక్కువగా ఉన్నాయని, వాస్తవ ధరలు చెప్పడానికి 10 రోజుల గడువు కావాలన్న అగ్రిగోల్డ్ యాజమాన్యం అభ్యర్థనపై తదుపరి విచారణను 8వ తేదీకి వాయిదా వేసింది. కోట్ల రూపాయల డిపాజిట్‌లు స్వీకరించి చేతులెత్తేసిన అగ్రిగోల్డ్ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్.వి.భట్‌లతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. అన్ని పక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ అదే రోజు ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టు సమర్పించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణలో ఉన్న ఆస్తులకు సంబంధించి ఏపీ సీఐడీలాగా విలువైన ఆస్తుల గుర్తించి వాటి విలువను మదింపు చేసి సమర్పించాలని తెలంగాణ సీఐడీని ఆదేశించింది.

అక్షయ్‌గోల్డ్‌కు చెందిన రెండు ఆస్తులకు బిడ్‌లు

అక్షయ్ గోల్డ్‌కు చెందిన 4 ఆస్తుల వేలానికి బిడ్‌లు ఆహ్వానించగా కర్నూలు, అనంతపురం జిల్లాలోని రెండింటికి వచ్చాయంటూ ఏపీ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కృష్ణప్రకాశ్ హైకోర్టుకు తెలిపారు. అక్షయ్‌గోల్డ్ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ ఏజెంట్ల సంక్షేమ సంఘం దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్.వి.భట్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

హైకోర్టుకు అగ్రిగోల్డ్ ఆస్తుల జాబితా

- **అత్యధిక విలువ కలిగిన పది ఆస్తుల వివరాలు సమర్పించిన ఏపీ సీఐడీ**

ఈనాడు, అమరావతి: అగ్రిగోల్డ్‌కు సంబంధించి అత్యధిక విలువ కలిగిన పది ఆస్తుల జాబితాను ఏపీ సీఐడీ మంగళవారం హైకోర్టుకు సమర్పించింది. ఏప్రిల్ 25న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు దీన్ని రూపొందించింది. ఇవన్నీ ఏ బ్యాంకులోనూ తనఖాలో లేనివే. అగ్రిగోల్డ్ కేసులో కాంపిటెంట్ అథారిటీగా వ్యవహరిస్తున్న సీఐడీ అదనపు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఈ వివరాలను హైకోర్టుకు నివేదించారు.

ఆస్తుల జాబితాలోని కొన్నింటి వివరాలు

- మచిలీపట్నంలోని చల్లపల్లి జమీందార్ వీధిలో ఖాళీ ప్లాట్
- విజయవాడ మొగల్రాజపురంలో 24000.92 చదరపు అడుగుల నిర్మిత ప్రాంతం కలిగిన జీ ప్లస్ 4 భవనం. విలువ రూ.10.55 కోట్లు.
- విజయవాడ కండ్రికలో 4199.7 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన పారిశ్రామిక భవనం (5427.64 నిర్మితప్రాంతం). విలువ రూ.9.23 కోట్లు.
- కృష్ణా జిల్లా వీరులపాడు మండలం చట్టన్నవరం గ్రామం అల్లూరు రోడ్డులోని వ్యవసాయ భూమి.
- విజయవాడ వాంబే కాలనీలో ఖాళీ ప్లాట్.
- నెల్లూరు జిల్లా సైదాపురం మండలం పోతెగుంట గ్రామంలో వ్యవసాయ భూమి. విలువ రూ.6.7 కోట్లు.
- విజయనగరం జిల్లా కొమరాడ మండలంలో 75.96 ఎకరాల భూమి (టేకు, చింత తదితర చెట్లున్నాయి). విలువ రూ.4.93 కోట్లు.

2017 - SI సెలక్షన్స్‌లో స్టేట్ 1st ర్యాంకు సాధించిన సంస్థచే
RPF-SI, కానిస్టేబుల్స్ SI & కానిస్టేబుల్స్
17వ బ్యాచ్: 9-6-18, 9am
జిమ్ & హాస్టల్ కలదు
శ్యామ్ ఇన్‌స్టిట్యూట్
0884 - 2362744
98482 56254
98481 36254

S.I. కానిస్టేబుల్
FREE DEMO 06-06-18
HIP హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్
9848262600, 9849771902

Civils/Groups రంగరాయ ఆధ్వర్యంలో
EXCELLENT PRE-TRAINING for
»INTER + IAS, IPS, IFS... »DEGREE + IAS, IPS, IFS...
»CIVILS/GROUP - I&II, Prelims & Mains
హైదరాబాద్ | అమరావతి | రాజమండ్రి
9676413716 | 9492755270 | 8096951705
హాస్టల్ & ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కలదు
UBR's RANGARAYA IAS ACADEMY
KALYANI ADS

గుజరాత్‌లో నేలకూలిన జాగ్వార్ యుద్ధ విమానం

- **ఎయిర్ కమోడోర్ మృతి**

కచ్: భారత వైమానిక దళానికి చెందిన జాగ్వార్ యుద్ధ విమానం నేలకూలిన ప్రమాదంలో మంగళవారం సీనియర్ అధికారి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. గుజరాత్‌లోని కచ్ జిల్లా జామ్‌నగర్ వైమానిక స్థావరం నుంచి గాల్లోకి ఎగిరిన వెంటనే యుద్ధవిమానం బరేజా గ్రామానికి చెందిన పొలాల్లో కుప్పకూలి తునాతునకలైంది. విమాన శకలాలు చాలా దూరం మేర ఎగిరి పడ్డాయి. ఈ ప్రమాదంలో జామ్‌నగర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కమాండింగ్ అధికారి, ఎయిర్ కమోడోర్ సంజయ్ చౌహాన్ మృతి చెందినట్లు రక్షణశాఖ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ మనీష్ ఓఝా తెలిపారు. రోజువారీ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 10.30 గంటల ప్రాంతంలో బయల్దేరిన జాగ్వార్ ప్రమాదానికి గురైనట్లు వెల్లడించారు. ఈ ఘటనపై న్యాయ విచారణకు వైమానిక దళ ప్రధాన కార్యాలయం ఆదేశించింది. కాగా విమాన శకలాలు తగిలి పొలాల్లో ఉన్న కొన్ని ఆవులు కూడా మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకున్న భద్రత సంస్థలు ఆ ప్రదేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా నేడు భారీవర్షాలు

ఈనాడు, విశాఖపట్నం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఆయా ప్రాంతాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులు కూడా ఉంటాయని హెచ్చరించింది. మరోపక్క రాష్ట్రంలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా మన్యంలోని రాజవొమ్మంగిలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. గ్రామంలోని ఓ కొబ్బరి చెట్టుపై పిడుగుపడి మంటలు వ్యాపించాయి.

రైల్లో లగేజీ ఎక్కువైతే జరిమానా



దిల్లీ: రైలు ప్రయాణికులారా పారాహుషార్! ఇకపై మీ వెంట తీసుకెళ్లే సామాన్ల(లగేజీ) బరువుపై జాగ్రత్తగా కన్నేయండి. పరిమితికి మించి లగేజీని వెంట మోసుకెళ్తే.. జరిమానా మోతెక్కిపోక తప్పదు! ఈ మేరకు సామాన్ల బరువుకు సంబంధించిన నిబంధనలను పక్కాగా అమలు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. అదనపు లగేజీతో బోగీలు నిండిపోతున్నాయని.. ఫలితంగా ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయని ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో రైల్వేవర్గాలు ఈ అంశంపై దృష్టిసారించాయి. సామాన్లకు సంబంధించి దాదాపు మూడు దశాబ్దాల క్రితమే రూపొందించుకున్న నిబంధనలను ఇకపై కఠినంగా అమలు చేయాలని నిర్ణయించాయి. ఈ నిబంధనల ప్రకారం.. పరిమితికి మించిన బరువులను వెంట తీసుకెళ్లే ప్రయాణికులకు సదరు లగేజీ టికెట్ ధరకు ఆరు రెట్ల మొత్తాన్ని జరిమానాగా విధిస్తారు. ప్రస్తుతం స్లీపర్ క్లాస్ ప్రయాణికులు 40 కిలోల సామాన్లను, సెకండ్ క్లాస్ ప్రయాణికులు 35 కిలోల లగేజీని ఉచితంగా తమ వెంట తీసుకెళ్లేందుకు రైల్వే అనుమతిస్తోంది. అంతకంటే ఎక్కువ లగేజీ ఉంటే.. అదనపు డబ్బు చెల్లించాలి. సదరు అదనపు సామానును నిర్దేశిత బోగీలో ఉంచాలి.

పర్యావరణహిత ప్లేట్లలో భోజనం.. పాలీమర్లతో తయారైన ప్లేట్లకు బదులుగా.. చెరకు పిప్పితో చేసిన పర్యావరణహిత ప్లేట్లలో ప్రయాణికులకు భోజనాలు అందించే బృహత్తర కార్యక్రమానికి.. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రైల్వే ఆహార, విహార సంస్థ(ఐఆర్‌సీటీసీ) మంగళవారం శ్రీకారం చుట్టింది. దిల్లీ నుంచి ప్రయాణాన్ని మొదలుపెట్టే నాలుగు శతాబ్ది, నాలుగు రాజధాని రైళ్లలో ప్రస్తుతం ఈ సదుపాయాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించింది.

గ్రహం అనుగ్రహం

6-6-2018 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
సప్తమి: ఉ. 6-49 తదుపరి అష్టమి
శతభిష నక్షత్రం: సా. 4-28 తదుపరి పూర్వాభాద్ర
అమృత ఘడియలు: ఉ. 8-41 నుంచి 10-25 వరకు
వర్జ్యం: రా. 11-16 నుంచి 12-58 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-32 నుంచి 12-24 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-28

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
గుంటూరు	41.6	29.6
విజయవాడ	41.1	29.0
ఒంగోలు	40.6	30.0
సూర్యాపేట	40.0	27.0
నెల్లూరు	40.0	27.0
హైదరాబాద్	39.2	26.0
కడప	39.0	28.0
రాజమహేంద్రవరం	39.0	27.0
తిరుపతి	39.0	26.0
కర్నూలు	38.7	27.2
శ్రీకాకుళం	38.0	29.0
నరసాపురం	37.8	30.0
తాడేపల్లిగూడెం	37.0	28.5
అనంతపురం	36.8	27.3
విశాఖపట్నం	34.1	27.6

ఇదీ సంగతి!



ఇవి విద్యార్థులు లేని పాఠశాలలు సార్, అవి పాఠశాలలు లేని విద్యార్థుల సంఖ్య.

జ్ఞాన భూమి - ఉపాధి కల్పన

- జ్ఞాన భూమిగా, ఇన్నోవేషన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించడమే ధ్యేయంగా పని చేస్తున్నాం
- బడికొస్తా పథకం కింద 8,9 వ తరగతి బాలికలకు 5,62,338 సైకిళ్ళు అందజేసాం
- రాష్ట్రం లో 47% పాఠశాలలు 100% ఫలితాలను సాధించాయి
- 2,358 డిజిటల్ క్లాసురూంలు ఏర్పాటు చేశాం. 4,000 వర్చువల్ క్లాసురూంలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నాం
- నూటికి నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ అమలు చేస్తున్నాం
- 175 నియోజకవర్గాలలో 175 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పుతున్నాం
- పరిశ్రమలకు 24 గంటల విద్యుత్తు అందిస్తున్నాం
- 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఒకటవ స్థానంలో వున్నాం.
- కీయా మోటార్స్, ఇసుజు, హీరో మోటార్ కార్ప్, అపోలో టైర్స్ వంటి పరిశ్రమలను తెచ్చి ఆంధ్రప్రదేశ్‌ను ఆటోమొబైల్ హబ్‌గా మారుస్తున్నాం
- విశాఖపట్నం ఐటీ హబ్‌గా రూపొందుతోంది. అటు సాఫ్ట్‌వేర్ ఇటు హార్డ్‌వేర్‌లకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నాం
- 3 భాగస్వామ్య సదస్సులు విజయవంతంగా నిర్వహించాం. 2018 లో జరిగిన భాగస్వామ్య సదస్సులో వివిధ సంస్థలతో 734 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. వీటి ద్వారా 4,39,765 కోట్ల పెట్టుబడి, 11,02,125 ఉపాధి అవకాశాలు
- ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 2020 నాటికి 14 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నాం

2022 దేశంలో 3 అగ్రగామి రాష్ట్రాలలో ఒకటి (తలసరి ఆదాయం రూ. 2.95 లక్షలు)

2029 దేశంలో అత్యుత్తమ రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 9.65 లక్షలు)

2050 ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాల రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 1.67 కోట్లు)

నేటి చర్చనీయాంశాలు

- మానవ వనరుల అభివృద్ధి
- 100% అక్షరాస్యత సాధించడం
- 100% బడిలో నమోదు
- వర్చువల్ క్లాస్‌రూంలు
- డిజిటల్ క్లాస్‌రూంలు
- ఉన్నత విద్యాభ్యాసంలో స్థూల నమోదు శాతం (జీఈఆర్)
- ఎమ్ఎస్ఎమ్ఈలు
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన.

ముఖ్యమంత్రి గారిని సంప్రదించడానికి

NCBN అధికారిక యాప్ | ప్రజలే ముందు మొబైల్ యాప్ | ఏపి సీఎం ఫేస్ బుక్ | ఏపి సీఎం ట్విట్టర్

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఈనాడు

వైద్యవిద్యకు సత్వర చికిత్స

దేశం నలుమూలలా అసంఖ్యాక విద్యార్థులు, తల్లిదండ్రుల బంగారు స్వప్నం- వైద్య విద్యాభ్యాసం. అత్యంత అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్న పట్టుదలతో, విపరీతమైన పోటీని తట్టుకొని, జాతీయ వైద్యవిద్య అర్హత ప్రవేశ పరీక్ష(నీట్)లో ఉభయ రాష్ట్రాల అభ్యర్థులు విశేషంగా రాణించిన తీరు తెలుగుజాతి అంతటికీ గర్వకారణం. ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి సంక్లిష్ట పోటీ పరీక్షలో తొలి 50 ర్యాంకులకుగాను ఎనిమిదింటిని తెలుగు విద్యార్థులు ఒడిసిపట్టారు! సంవత్సరం క్రితం దేశవ్యాప్తంగా 'నీట్'కి హాజరైన సుమారు 10 లక్షల 90 వేల మందిలో ప్రవేశార్హత సాధించినవారి సంఖ్య 6.11 లక్షలు. తనవంతుగా ఈ ఏడాది చివరిసారి 'నీట్' నిర్వహించిన కేంద్ర మాధ్యమిక విద్యామండలి (సీబీఎస్ఈ) గణాంకాల ప్రకారం ఇప్పుడు 12.69 లక్షల మందిలో నిర్ణీత అర్హత మార్కులు పొందినవారు 7.14 లక్షలు. సంఖ్యాపరంగా ఎక్కువ మంది ప్రవేశార్హత సాధించిన జాబితాలో యూపీ (76వేలు), కేరళ (72వేలు), మహారాష్ట్ర (70వేలు); హాజరైనవారిలో గరిష్ఠ ఉత్తీర్ణతతో రాజస్థాన్, ఏపీ రికార్డులు సృష్టించినా- అంతిమంగా వారిలో సీటు దక్కే అదృష్టవంతులెవరన్నది గడ్డు ప్రశ్న. నిర్దిష్ట నిబంధనావళిని పాటించలేదన్న కారణంతో ప్రస్తుత విద్యా సంవత్సరం 12 ప్రభుత్వ, 70 ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియపై కేంద్రం తాజాగా ఆంక్షలు విధించింది. కొత్తగా అనుమతులు లభించిన 68 వైద్య కళాశాలలు ఎటువంటి కార్యకలాపాలూ చేపట్టరాదని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నిషేధాస్త్రం ప్రయోగించింది. పర్యవసానంగా దాదాపు 11,400 మెడిసిన్ సీట్లు తెగ్గోసుకుపోనున్నాయన్న చేదు కబురు- ఎందరో విద్యార్థులు, వారి కుటుంబాల పాలిట అక్షరాలా పిడుగుపాటు!

గత విద్యా సంవత్సరం (2017-18)లో దేశవ్యాప్తంగా మొత్తం 67 వేల వైద్య, 27 వేల దంతవైద్య సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈసారి ప్రవేశార్హత సాధించిన విద్యార్థుల సంఖ్యలో వృద్ధికి అనుగుణంగా సీట్ల సంఖ్య పెరగకపోగా తరుగుపడేలా ఉంది. రాష్ట్రాలవారీగా మదింపు వేస్తే కర్ణాటక (8,845), మహారాష్ట్ర (7,270) వైద్య విద్యా సీట్లలో ముందున్నాయి. 'తగిన సంఖ్యలో వైద్య విద్యాసంస్థలు ఉన్నట్లయితే దేశంలో వైద్యుల కొరతను అధిగమించగలిగేవాళ్లం...' అంటూ సమస్య లోతులు స్పృశించిన మోదీ ప్రభుత్వం- నూతన కళాశాలల ఏర్పాటుకు రెండేళ్ల క్రితం చొరవచూపిన మాట వాస్తవం. జిల్లా వైద్య ఆస్పత్రులు, రిఫరల్ ఆస్పత్రులకు అనుబంధంగా వైద్య కళాశాలల అవతరణకు నాలుగు నెలల క్రితమే కేంద్రం ఆమోదముద్ర వేసింది. తద్వారా కొత్తగా 10 వేల ఎంబీబీఎస్, ఎనిమిది వేల పీజీ సీట్లు అందుబాటులోకి రానున్నాయన్న సంబరానికి తాజా విధాన నిర్ణయంతో ఒక్కుదుటున గాలి తీసేసినట్లయింది. నిర్ణీత పరిమాణంలో బోధన సిబ్బంది లేకపోవడం, తగినన్ని మౌలిక వసతులు కొరవడటం, రోగుల సంఖ్యా బక్కచిక్కిపోవడాన్ని కఠిన నిర్ణయానికి ప్రధాన ప్రేరకాలుగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ చెబుతోంది. ఏకపెట్టున 11 వేలకు పైగా ఎంబీబీఎస్ సీట్లు నష్టపోవడమన్నది నాణానికి ఒక పార్శ్వమే. నెత్తిన కత్తిలా వేలాడుతున్న నిపుణ మానవ వనరుల కొరత, విస్మరించజాలని రెండో పార్శ్వం. 2019 నాటికి జిల్లా ఆస్పత్రులకు అనుబంధంగా నెలకొల్పదలచామంటున్న వైద్య కళాశాలలకు ఈ స్వల్ప కాలావధిలో బోధన సిబ్బంది ఎక్కడినుంచి పుట్టుకొస్తారు? ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్ని కలిపి లెక్కిస్తే వైద్య విద్యా సీట్ల ప్రాతిపదికన మధ్యప్రదేశ్ (2,600), పశ్చిమ్ బంగ (2,700), తెలంగాణ (3,650), ఏపీ (4,750) వంటివి ఇప్పటికే చిన్నబోతున్నాయి. ఈ దశలో విస్తరణ మాట అలాఉంచి పాత సీట్లకే ఎసరొచ్చే స్థితిగతుల సాకల్య క్షాళనపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సి ఉంది!

జనాభాలో ప్రతి వెయ్యిమందికీ కనీసం ఒక వైద్యుడు ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశిస్తోంది. ఆ ఆదర్శప్రాయ నిష్పత్తిని భారత్ అందిపుచ్చుకోగల అవకాశం కనుచూపు మేరలో కానరావడం లేదు. ప్రతి లక్షమందికీ ఆస్ట్రేలియాలో 337 మంది, బ్రెజిల్‌లో 185 మంది, చైనాలో 149 మంది వైద్యులుండగా- ఇండియాలో ఆ సంఖ్య 62కే పరిమితమైంది. సుమారు ఎనిమిది లక్షల మంది వైద్యులున్న భారత్‌లో కనీసం ఏడున్నర లక్షల మంది డాక్టర్ల కొరత ఆరోగ్య సేవల నాణ్యతా ప్రమాణాల్ని కుళ్లబొడుస్తోంది. 32 రకాల వ్యాధులకు వైద్యచికిత్సల ఆధారంగా రూపొందిన 'లాన్సెట్' నివేదిక ప్రకారం బంగ్లాదేశ్, భూటాన్ వంటి చిన్న దేశాల సరసనా ఆరోగ్య సేవల లభ్యత, నాణ్యతల పరంగా భారత్ వెలాతెలాపోతోంది. సాంక్రామిక, సాంక్రామికేతర వ్యాధుల విజృంభణ కోట్లాది భారతీయుల్ని నిలువునా కుంగదీస్తోంది. దేశానికిప్పుడు లక్షల సంఖ్యలో వైద్యులు, స్పెషలిస్టుల అవసరముంది. వ్యాధిగ్రస్త జీవితాల్లో ఊపిరులూదగల పవిత్ర వృత్తిని చేపట్టడమే లక్ష్యమంటూ లక్షల సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలకు పోటీపడుతుండగా, కొన్ని వేలమందే గమ్యం చేరగలుగుతున్నారు. అర్హులైన అనుభవజ్ఞులైన ఆచార్యుల కొరత, మౌలిక వసతుల పరంగా లోటుపాట్లు జతపడి ఉన్న సీట్లకే ఎసరుపెడుతున్న దశలో- తక్షణ, దీర్ఘకాలిక దిద్దుబాటు చర్యలపై ప్రభుత్వాలు ఇక ఎంతమాత్రం జాప్యం చేయకూడదు. రాష్ట్రాలవారీగా ప్రస్తుత, ప్రతిపాదిత కళాశాలల అవసరాలకు అనుగుణంగా విదేశీ బోధన నిపుణుల్ని రప్పించి, అంచెలవారీగా ప్రాథమిక సదుపాయాల్ని పరిపుష్టీకరించే కసరత్తు సత్వరం పట్టాలకు ఎక్కాలి. పదేళ్ల కార్యాచరణ ప్రణాళికతో జనాభాలో వైద్యుల నిష్పత్తి, ఆరోగ్య సేవల లభ్యత నాణ్యతలు ఇనుమడింపజేసే ఉమ్మడి సంకల్పసిద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబద్ధత చాటాలి. అటువంటి జాతీయ అజెండా సక్రమంగా అమలుకు నోచుకుంటేనే 'ఆయుష్మాన్ భారత్' కల ఏ నాటికైనా సాకారమయ్యేది!

కేసుల కొండ... సాంకేతికతే అండ

శీఘ్ర న్యాయానికి దగ్గరి దారి

సవాలక్ష కారణాలతో సామాన్యుడికి సత్వర సమన్యాయం అందనంత దూరంలోనే ఉంటోంది. సంస్కరణల పేరుతో ప్రభుత్వాలు, ఉన్నత న్యాయస్థానాలు ఎన్నెన్ని ప్రయత్నాలు చేసినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మిగులుతోంది. ఆస్తి వివాదాల్లో కోర్టుకు వెళ్లడంకంటే వదులుకోవడమే ఉత్తమమన్న అభిప్రాయం కక్షిదారుల్లో నెలకొన్నదనడం అతిశయోక్తి కాదు. కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా వివాదం తేలేసరికి తరాలు గడిచిపోతున్నాయి. తాతల ఆస్తి మనవళ్లకూ దక్కని పరిస్థితి ఉంది. క్రిమినల్ కేసుల్లో మరీ దారుణ పరిస్థితులు ఉన్నాయి. చిన్నాచితకా నేరాల్లో, పడే శిక్షకన్నా జైళ్లలో మగ్గిపోయిన కాలమే ఎక్కువవుతోంది. పది పదిహేనేళ్ల తరవాత నిర్దోషులంటూ కోర్టు తీర్పు వెలువరించేనాటికి అపార నష్టం జరిగిపోతోంది. చేయని తప్పిదానికి ప్రభుత్వం నుంచి పరిహారం కోరే ఓపికా లేక ఎలాగో బయటపడ్డామనుకుని మౌనంగా రోదిస్తున్నవారెందరో ఉన్నారు. ఆంగ్లేయుల కాలంనాటి 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్' వల్ల కేసుల విచారణ దీర్ఘకాలం సాగుతోంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకుని సత్వర న్యాయం అందించే దిశగా ప్రభుత్వాలతోపాటు సుప్రీం, హైకోర్టులు చేస్తున్న ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. సాక్షుల నుంచి వాంగ్మూలాలు, సాక్ష్యాల నమోదు ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. అందుబాటులో ఉన్న వీడియో కాన్ఫరెన్స్, రికార్డింగ్‌ల వంటి సాంకేతిక సమన్వయంతో సత్వర న్యాయసాధనకు అవకాశాలున్నాయి.

కిక్కిరిసిపోతున్న కారాగారాలు

ఖైదీలకూ మానవ హక్కులుంటాయని, వారిని జంతువుల్లా జైళ్లలో ఉంచడం సరికాదంటూ ప్రభుత్వాల తీరుపై సుప్రీంకోర్టు కటువుగానే స్పందించింది. సరైన చర్యలు తీసుకోకపోతే వారి విడుదలకు ఆదేశాలిస్తామని హెచ్చరించింది. దిల్లీతో సహా అరడజను రాష్ట్రాల్లోని జైళ్లలో సామర్థ్యానికి మించి 150 శాతం ఉండటంపై ఆవేదన వ్యక్తం చేసింది. దేశంలోని 1,382 జైళ్లలో సిబ్బంది కొరతతోపాటు కిక్కిరిసిన జైళ్ల సమస్యను ఆయా రాష్ట్రాల హైకోర్టులు సుమోటోగా స్వీకరించాలని సుప్రీంకోర్టు సూచించింది. సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ గత నెల 16న అన్ని రాష్ట్ర హైకోర్టులకు లేఖ రాశారు. ఆ మేరకు స్పందించిన హైకోర్టులు చర్యలు చేపట్టనున్నాయి. విచారణ ఖైదీల గురించి పర్యవేక్షణ నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ' పనితీరుపైనా సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణ ఖైదీల విడుదల నిమిత్తం దేశవ్యాప్తంగా ఏకరూప విధానాన్ని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్- ఎస్ఓపీ) రూపొందించే బాధ్యతను ప్రభుత్వం జాతీయ న్యాయసేవాధికార సంస్థ (నల్సా)కు అప్పగించింది. నల్సా ఎస్ఓపీని ఇప్పటికే రూపొందించినప్పటికీ తుదిరూపం ఇవ్వాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా దీనికి తుదిరూపు ఇచ్చి అన్ని హైకోర్టులు, జిల్లా కోర్టులకు పంపనుంది. జైళ్లలో ఉన్న ఖైదీల వివరాలను కంప్యూటరీకరించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఏయే నేరం కింద ఎప్పుడు జైలుకు వచ్చారన్న వివరాలన్నింటినీ అందులో ఉంచి పర్యవేక్షించాలని నిర్ణయించింది. కోర్టులు బెయిలు ఇచ్చినప్పటికీ షరతుల్లో భాగంగా పూచీకత్తులు సమర్పించలేక జైళ్లలో మగ్గిపోతున్నవారూ ఉన్నారు. దేశవ్యాప్తంగా జైళ్లశాఖకు మంజూరైన సిబ్బంది 77,230 మంది. 2017 డిసెంబరునాటికి 24,588 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

దిగువస్థాయి, జిల్లా కోర్టుల నుంచి హైకోర్టు, సుప్రీంకోర్టుల దాకా న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 31మందికిగాను 24 మంది న్యాయమూర్తులున్నారు. 24 హైకోర్టుల్లో 1,079 న్యాయమూర్తుల పోస్టులు మంజూరైనా, 659 మందే పనిచేస్తున్నారు. 420 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏపీ, తెలంగాణ ఉమ్మడి హైకోర్టుకు 61 పోస్టులు మంజూరయ్యాయి. సగానికిపైగా ఖాళీగా ఉన్నాయి. దిల్లీ హైకోర్టులోనూ దాదాపు ఇదే పరిస్థితి. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో వచ్చే ఆగస్టు నాటికి ప్రధాన న్యాయమూర్తి పోస్టు ఖాళీగా ఉండి రెండేళ్లు పూర్తవుతోంది. జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 22623 న్యాయాధికారుల పోస్టులు మంజూరైనా 5,925 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. 2009 ఆగస్టు, 2013 ఏప్రిల్ నెలల్లో జరిగిన ముఖ్యమంత్రులు, ప్రధాన న్యాయమూర్తుల సమావేశాల్లో ప్రస్తుతం ఉన్న న్యాయమూర్తుల సంఖ్యను పెంచడంతోపాటు ఖాళీల భర్తీకి వెంటవెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై సుదీర్ఘ చర్చ జరిగినప్పటికీ ఆచరణలో అమలుకావడంలేదు. న్యాయమూర్తులు, న్యాయాధికారుల సంఖ్య నానాటికీ తగ్గుతుండగా కోర్టుకు వచ్చే కేసుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. అక్షరాస్యత, చైతన్యం పెరగడంతో న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించేవారు ఎక్కువగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే కొత్త చట్టాల వల్ల మరిన్ని కేసులు పుట్టుకొస్తున్నాయి. నూతన చట్టాల వల్ల తలెత్తే 'లిటిగేషన్స్' పరిష్కారానికి కొత్త కోర్టులను ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంలేదు. ఈ ఏడాది మార్చినాటికి హైకోర్టుల్లో 42.67 లక్షలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో పది లక్షల కేసుల వరకు 10 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ, తెలంగాణ ఉమ్మడి హైకోర్టులో 51 వేల కేసులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. బ్యాక్‌లాగ్ కేసుల విచారణ నిమిత్తం 11వ ఆర్థిక సంఘం 1,734 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి 2015వరకు కొనసాగించింది. ఇప్పటికీ తెలంగాణ, ఏపీలతో సహా కొన్ని రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు కొనసాగుతున్నాయి. గత డిసెంబరు నాటికి 5.7 లక్షల కేసులు ఈ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి.



విచారణ ఖైదీలే అధికం

జాతీయ నేరగణాంక సంస్థ 2015 డిసెంబరు చివరినాటి లెక్కల ప్రకారం దేశంలో ఓపెన్ ఎయిర్ జైళ్లతోపాటు 1,401 కారాగారాలు ఉండగా, వాటి సామర్థ్యం 3,66,781 మంది మాత్రమే. దీనికి భిన్నంగా 4,19,623 మంది జైళ్లలో ఉండగా ఇందులో విచారణ ఖైదీలే (అండర్ ట్రయల్స్) 2,82,076 మంది ఉన్నారు. అత్యధికంగా దాద్రా, నాగర్ హవేలీలో 276.7 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 233.9 శాతం, దిల్లీలో 226.9, మేఘాలయలో 177.9, ఉత్తర్ ప్రదేశ్‌లో 168.8 శాతం మేర ఖైదీలున్నారు. ప్రస్తుతం తెలంగాణలో 5,679 మంది ఖైదీలుండగా 3,703 దాకా విచారణ ఖైదీలున్నారు. తెలంగాణ జైళ్ల సామర్థ్యం 6,848; అంతకంటే తక్కువగా 5,679 మంది మాత్రమే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు అయిదు వేల మంది దాకా విచారణ ఖైదీలుండగా, మూడు వేలమంది దాకా శిక్ష పడినవారున్నారు.

వడివడిగా అడుగులు

పెండింగ్ కేసుల పరిష్కారంలో భాగంగా ముున్ముందు పరిపాలన వ్యవహారాల్లో కంప్యూటర్ సేవలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని కోర్టులను దశలవారీగా కంప్యూటీకరించడానికి సమాయత్తమైంది. 2010-15 మధ్య మొదటి దశలో ఇ-కోర్టుల ప్రాజెక్టుకు 14,249 కోర్టులను కంప్యూటీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 13,672 కోర్టులను కంప్యూటీకరించారు. దీనికోసం రూ.935 కోట్లు కేటాయించగా రూ.639.41 కోట్లు ఖర్చయింది. రెండోదశ కోసం (2015-'2019 మధ్యకాలంలో) రూ.1,670 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు కేంద్రం రూ.921.75 కోట్లు విడుదల చేసింది. 16,089 కోర్టుల్లో కంప్యూటరీకరణ పూర్తయింది. 488 కోర్టు సముదాయాల్లో, 342 జైళ్లలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉంది. 14,309 మంది న్యాయాధికారులకు ల్యాప్‌టాప్‌లను అందజేసి, శిక్షణ సైతం అందజేసింది. ప్రస్తుతం కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకోవడానికి అవకాశం ఉంది. 9.38 కోట్ల కేసుల స్థాయి, 5.85 కోట్ల తీర్పులు, ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో కక్షిదారులకు అందుబాటులో ఉన్నాయి. సీఆర్‌పీసీ 164 పరిధిలోనివి కాకుండా రిమాండ్, సివిల్, క్రిమినల్ కేసుల విచారణ, బెయిలు పిటిషన్లపై విచారణలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతున్నాయి. విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారి నుంచి సాక్ష్యాలు, వాంగ్మూలాల నమోదుకు దీన్ని వినియోగిస్తున్నారు. దాంపత్య వివాదాలు, విడాకులు, పిల్లల సంరక్షణ కేసుల్లో అవసరమైతే వ్యక్తిగతంగా హాజరుకాకపోయినా వీడియో ద్వారా వాంగ్మూలాలు, సాక్ష్యాలు సేకరించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని సుప్రీంకోర్టు అన్ని హైకోర్టులకు సూచించింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లోని విడాకుల కేసును హైదరాబాద్‌కు బదిలీ చేయాలన్న పిటిషన్ మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంటూ సుప్రీంకోర్టుకు చేరగా దీనిపై విచారణ సందర్భంగా ఈ సూచనలు చేసింది. ప్రస్తుతం జైళ్ల నుంచి ఖైదీలను కోర్టుకు హాజరు నిమిత్తం మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాలను కోర్టులు వినియోగిస్తున్నాయి. రాష్ట్రం వెలుపల, విదేశాలతో సహా అన్ని ప్రాంతాల నుంచి రిమాండ్ పొడిగింపు, బెయిలు దరఖాస్తులు, సివిల్, క్రిమినల్ కేసుల విచారణ నిమిత్తం ఏపీ, తెలంగాణల ఉమ్మడి హైకోర్టు గత ఏడాది మార్గదర్శకాలు జారీ చేసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే విచారణ ప్రక్రియకు చట్టబద్ధమైన అనుమతి ఉంటుంది. కోర్టు గది లేదంటే నిర్దేశిత ప్రాంతంలో కోర్టు నియమించిన కమిషనర్ సాక్ష్యాలను నమోదు చేయడానికి అవకాశం కల్పించింది. ఈ విధానం ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. ఇది కార్యరూపం దాలిస్తే సాక్షులు, నిందితుల రాక కోసం పదే పదే వాయిదాలు వేయకుండా కేసుల సత్వర విచారణకు అవకాశం ఉంటుంది.

- దండు నారాయణరెడ్డి

నిరసన హక్కు... ప్రజాస్వామ్యానికి దిక్కు

చట్టాన్ని చట్టబద్ధంగా అమలు చేయడానికి, చట్టవ్యతిరేకంగా అమలుచేయడానికి మధ్య ఉన్న తేడాని అర్థం చేసుకోవడంలో భారత పోలీసులు దశాబ్దాలుగా విఫలమవుతూనే ఉన్నారు. ముఖ్యంగా ప్రజాందోళనలను నిభాయించడంలో వాళ్లు అనుసరిస్తున్న విధానాలు వందల మంది సామాన్యులను బలిగొంటున్నాయి. శాంతియుత నిరసన ప్రదర్శన అనేది ప్రజాస్వామ్య పాలన వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యానికి ప్రతీక. అన్ని ప్రాథమిక హక్కులతో పాటు శాంతియుత నిరసనలు తెలిపే హక్కుకూ భారత రాజ్యాంగం హామీ ఇస్తోంది అన్నారు ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి అజిత్‌కుమార్. మార్చి, 2016లో జెనీవాలో జరిగిన ఐక్యరాజ్య సమితి మానవహక్కుల వేదిక సమావేశంలో ఆయన ఇలా ఉద్ఘాటించిన ఆరునెలలకే (అక్టోబరు, 2016) ఝార్ఖండ్‌లోని దండికాలా గ్రామంలో నలుగురు నిరసనకారులను పోలీసులు పొట్టనబెట్టుకున్నారు. ఎన్టీపీసీ కోసం 28 గ్రామాల పరిధిలో చేపట్టిన ఎనిమిది వేల ఎకరాల భూసేకరణలోని లోటుపాట్లను నిరసించినవాళ్ల మీద విచక్షణరహితంగా కాల్పులు జరిపి, ప్రాణాలు తీశారు. ఇటీవల తమిళనాడులోని తూత్తుకుడిలో స్టెరిలైట్ రాగి పరిశ్రమకు వ్యతిరేకంగా పోరుబాట పట్టిన వాళ్లలో పదమూడు మంది కూడా ఇలాగే 'రక్షక'భటుల చేతుల్లో హతమయ్యారు.

సహనం ప్రధానం

భారత రాజ్యాంగంలోని 19(1)(బి) అధికరణ ప్రకారం పౌరులందరికీ శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు ఉంది. దీని కింద నిరసన ప్రదర్శనలూ నిర్వహించవచ్చు. కానీ, చాలా సందర్భాల్లో పోలీసులు, పాలకులు ఈ విషయాన్ని గుర్తించడంలేదు. ఏ విషయం మీద ఏ వర్గం వారు నిరసనకు దిగినా అది రాజ్యం మీద యుద్ధం ప్రకటించడంగానే భావిస్తున్నారు. అక్కడే వస్తోంది అసలు సమస్య! అనితాఠాకూర్ వర్సెస్ జమ్మూకశ్మీర్ ప్రభుత్వం కేసులో 2016లో సుప్రీంకోర్టు తీర్పిస్తూ- 'ప్రణాళికాబద్ధమైన అహింసాయుత నిరసనలతోనే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. శాంతియుతంగా నిరసన తెలపడాన్ని ఓ ప్రాథమిక హక్కుగా మన రాజ్యాంగం గుర్తించింది. పోలీసులు శాంతిభద్రతలను కాపాడటం ఎంత ముఖ్యమో అనవసర బలప్రయోగానికి దిగకపోవడమూ అంతే ముఖ్యం. పోలీసుల అపరిమిత బలప్రయోగం వల్లే చాలా సందర్భాల్లో పరిస్థితులు దిగజారిపోతున్నాయి. మానవహక్కులతో పాటు మానవ గౌరవానికి కూడా విఘాతం కలిగించే పరిణామమిది' అంటూ ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ నేరగణాంకాల సంస్థ లెక్కల ప్రకారం 2009-'15 మధ్యకాలంలో పోలీసు కాల్పుల్లో 796 మంది సామాన్యులు మరణించారు. అంతకు ముందు, ఆ తరవాత కూడా దేశంలోని వివిధ ప్రాంతాల్లో కాల్పులు జరిగాయి.

తమ హక్కుల కోసమో, జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగానో నిరసన బాట పట్టిన సమూహాలను సమాధానపరచడంలో కీలకమైంది భద్రతా దళాల సహనం. 'మీ పోలీసులకు చెప్పండి. ప్రజాందోళనలు జరిగేటప్పుడు నిరసనకారుల మీద అరవొద్దని చెప్పండి. ఉద్రేకపడవద్దని చెప్పండి. మీ ఉద్రేకాలు ఉద్యమశక్తులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. మీరు ప్రజల మనస్తత్వాలను అర్థం చేసుకుని వ్యవహరించాలి' అని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏనాడో సూచించారు. ఆ సూచనలు వాళ్లు చెవికెక్కించుకోలేదు. నిరసనకారులను వ్యూహాత్మకంగా సంభాళించడం మాని మూర్ఖంగా ఎదుర్కొంటున్నారు. చట్టప్రకారంగానీ, 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్' మార్గదర్శకాల మేరకు గానీ నిరసనకారుల మీదకి మారణాయుధాలు ఉపయోగించకూడదు. కానీ, పోలీసులు 'అసాల్ట్ రైఫిళ్ల'తో కాల్పులు జరుపుతున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినప్పుడు గుంపును చెదరగొట్టడమే లక్ష్యంగా పరిమిత స్థాయిలో బలప్రయోగం జరగాలి గానీ గాయపరచే/ చంపే ఉద్దేశంతో చేయకూడదు. కానీ, తూత్తుకుడిలో 'కనీసం ఒక్కడైనా చావాలి' అంటూ పోలీసులు కాల్పులకు దిగడాన్ని దేశం మొత్తం విభ్రమతో చూసింది!

ప్రామాణికత కొరవడిన బల ప్రయోగం

ప్రజాందోళనలను అదుపు చేసే క్రమంలో బలప్రయోగం చేయడం మీద 1962కు ముందువరకూ దేశవ్యాప్తంగా ఓ ప్రామాణిక పద్ధతి అంటూ లేదు. ఒక్కో రాష్ట్రానిది ఒక్కో పద్ధతి. ఆ సంవత్సరం జరిగిన అన్ని రాష్ట్రాల పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరళ్ల సమావేశంలో దీని మీద చర్చ జరిగింది. దరిమిలా ఏర్పాటైన సంఘం చేసిన సిఫార్సులతో కొన్ని నియమాలు ఉనికిలోకి వచ్చాయి. ప్రజాందోళనల సమయంలో అవసరమైన దానికంటే ఎక్కువగా బలప్రయోగం చేయకూడదు. గుంపును చెదరగొట్టడానికి బలప్రయోగాన్ని వాడాలి తప్ప నిరసనకారులను దండించే చర్యగా చూడకూడదు. గుంపు చెదిరిపోగానే బలప్రయోగాన్ని ఆపేయాలి. ఈ మూడు మార్గదర్శకాలు కీలకమైనవి. పోలీసులు వీటిని అనుసరిస్తే ఎక్కడా ప్రాణాలు తీసేంతస్థాయిలో కాల్పులు జరపాల్సిన అవసరం రాదు. నిజానికి ప్రాణాలు తీసే అధికారం వాళ్లకు లేనే లేదు. నిరసనలు, ప్రజాందోళనల నియంత్రణలో బలప్రయోగం చేయాల్సి వస్తే ముందు హెచ్చరికలు జారీచేయాలి. భాష్పవాయు గోళాలు, జలఫిరంగులు, లాఠీఛార్జి, రబ్బరు తూటాలు అన్నీ ప్రయోగించినా ఫలితం రాకపోతేనే కాల్పులకు సంబంధిత అధికారి ఆదేశాలివ్వాలి. ఇది కట్టకడపటి ఐచ్ఛికం. అత్యంత అరుదైన సందర్భాల్లోనే దీన్ని ప్రయోగించాలి. ఆ సందర్భంలోనూ కాళ్ల మీదే కాల్పులు జరపాలి. లాఠీఛార్జి చేసేటప్పుడు కూడా తల మీద కొట్టకూడదు. కానీ, క్షేత్రస్థాయిలో వీటిని పట్టించుకుంటున్న దాఖలాల్లేవు.

శిక్షణ అవసరం

'ప్రజాందోళలను అదుపు చేయడంలో పోలీసులకు ప్రత్యేక శిక్షణ అవసరం' అని అనితాఠాకూర్ కేసులో తీర్పిచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనం (జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ ఆర్‌కే అగర్వాల్) సూచించింది. తరచూ జరుగుతున్న పోలీసు కాల్పుల ఘటనలను పరిశీలిస్తే శిక్షణ అవసరమేననిపిస్తుంది. మరోవైపు కొన్ని నిరసన ప్రదర్శనలు జరిగిన తీరు, ఆ సమయంలో సంబంధిత పోలీసుల స్పందన కూడా ఈ విషయంలో మిగిలిన వారికి దిశానిర్దేశం చేస్తుంది. ఈ ఏడాది మార్చిలోనే మహారాష్ట్రలో 35 వేల మంది రైతులు నాసిక్ నుంచి ముంబయి వరకూ 180 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. ఆరు రోజుల పాటు సాగిన ఈ నిరసన యాత్రలో ఎలాంటి ప్రతికూల సన్నివేశాలూ కనిపించలేదు. పోలీసులూ సంయమనంతో వ్యవహరించడంతో శాంతిభద్రతలకు ఏమాత్రం ఇబ్బంది కలగలేదు. అలాగే, 2011లో జన్‌లోక్‌పాల్ బిల్లు కోసం అన్నాహజారే నిరసన దీక్షకు దిగారు. ఆ సమయంలో వేలాది మంది రోడ్ల మీదకి వచ్చారు. అయినా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. అలాగే, 2017లో జల్లికట్టు కోసం తమిళనాడు యువత ఉద్యమించినప్పుడూ- చెన్నై సముద్రతీరంలో వేల మంది కదలకుండా కూర్చున్నప్పుడూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోలేదు. ఇదే తమిళనాడులో 1999లో తిరునల్వేలిలోని మంజూలై టీఎస్టేట్స్ కార్మికులు ఓ వినతిపత్రం ఇవ్వడానికి కలెక్టరేట్‌కు బయల్దేరారు. చాలీచాలని వేతనాలు, నివాసాల దగ్గరి దుర్భరపరిస్థితుల గురించి కలెక్టరుకు విన్నవించుకోవాలని పిల్లాజెల్లా, ఆడమగా అందరూ కలిసి నడిచారు. వాళ్ల మీద అకారణంగా అమానుషంగా విరుచుకుపడ్డారు పోలీసులు. లాఠీలతో చావబాదారు. ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కొంతమంది పరిగెత్తుతూ దగ్గర్లోని తమిళపరణి నది వంతెన మీదకి చేరుకున్నారు. వారు దాన్ని దాటేలోపే ఆ వంతెన కూలిపోయింది. ఇద్దరు మహిళలు, రెండేళ్ల బాబుతో సహా 17 మంది జలసమాధి అయ్యారు. మొన్నటికి మొన్న మధ్యప్రదేశ్‌లోని మందసౌర్‌లో గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కిన రైతన్నల మీద కాల్పులు జరిపారు. అయిదుగురు అన్నదాతలను చంపేశారు. ఇలాంటి కార్మికులు, రైతులే కదా ఈ దేశానికి పునాదులు. వాళ్ల మీద పోలీసులకెందుకు ఇంత కసి? సరిహద్దుల్లో శత్రువులతో వ్యవహరించినట్టు తన తోటివాళ్లతో ప్రవర్తించడానికి కారణమేంటి? ఏదిఏమైనా నిరసన తెలపడం పౌరుల ప్రాథమిక హక్కు. దాన్ని గౌరవించి, వాళ్లు లేవనెత్తిన అంశాల్లోని లోటుపాట్లను సరిదిద్దుకోవడం ప్రభుత్వాల బాధ్యత. అంతేకాని నిరసన తెలిపే గొంతులను నులిమేయాలనుకోవడం మూర్ఖత్వం... దేశ ప్రజాస్వామ్య సౌధాన్ని బీటలు వార్చే ప్రమాదకర ప్రయత్నం!

- శైలేష్ నిమ్మగడ్డ

జీవితం ఒక ధ్యానసాధన

జీవితాన్ని అనుక్షణం ఆస్వాదించే యోగం అందరికీ ఉండదు. కానీ అందరికీ ఆ అవకాశం ఉంటుంది. ఆ యోగం ఉంది. అలా ఉందనే అవగాహనే అందరికీ లేదు. మనిషి జీవితకాలాన్ని 'గడపటం' వేరు. 'జీవించటం' వేరు. అందరూ జీవించలేరు. అందరూ గడపనూ లేరు. వ్యక్తిగతమైన అభిరుచులు, విలువలు వేరు వేరుగా ఉంటాయి. ఇవి అకస్మాత్తుగా ఒక ప్రాతఃకాలంలో వచ్చి సమకూరేవి కావు. బాల్యం నుంచీ క్రమేణా ప్రోది చేసుకోవాల్సినవి. పెంపొందించుకోవాల్సినవి. పెంపకం, పెరిగిన వాతావరణం, వంశానుగతంగా సమకూరే సంస్కారాలు... ఎన్నో. ఈ అన్నింటికంటే ముఖ్యం జ్ఞానం కలగటం ప్రారంభమయ్యాక వ్యక్తి సొంత ఆసక్తితో, సొంత బాధ్యతతో సమకూర్చుకునే విలువలు, జీవితంపట్ల అవగాహన. ఆ రీత్యా జీవితపు అత్యంత అమూల్యతను, ఉత్కృష్టతను ఔపోసన పట్టాలనే జిజ్ఞాస. ఇది పట్టుబడితే, ఇవన్నీ పట్టుబడితే వ్యక్తి జీవితపు ప్రతి క్షణాన్నీ ఉత్తమ విలువలతో మలచుకోగలడు. ఆస్వాదించగలడు. ఆరాధించగలడు.

అందరిలాగే మనకూ జీవితం లభించింది. అందరిలాగే మనమూ బతికేస్తున్నాం. మనమే కాదు. పురుగు, పుట్ట, చెట్టు, చేమా జీవిస్తున్నాయి! సామాన్యుడు మొదలు చక్రవర్తి దాకా, చీమ మొదలు ఏనుగు దాకా ప్రాణికోటి యావత్తూ జీవనం సాగిస్తున్నాయి. ఏమిటి తేడా? చిన్న వైవిధ్యం, చిన్న చిన్న తేడాలు. అంతేకదా అంటే అంతే! కానీ, అక్కడే ఉంది కిటుకు.

ఆహార నిద్రాభయ మైథునాలతో సారూప్యత కలిగి ఉన్న జీవరాసులు జీవన విధాన వైవిధ్యం వల్ల, విలువల వల్ల, పోషణవల్ల అంతులేని తేడా కలిగిఉంటాయి. కలిగి ఉంటారు. మానవుడైన ఒక రాముడు జీవితమంతా ధర్మనిరతిని పోషించి దేవుడైపోయాడు. సత్యపాలనతో హరిశ్చంద్రుడు సత్యానికే పర్యాయపదంగా వినుతికెక్కాడు. భక్తి అతిశయంతో ఒక బోయ తిన్నడు కన్నడైపోయాడు. కుల్లాయి మాత్రమే కట్టిన ఒక నిరాడంబర అహింసావాది రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించి దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టాడు. ఎవరో ప్రయాణ సన్నాహం చేస్తే అమెరికా వెళ్లిన ఒక సన్యాసి, భారతీయ ఆధ్యాత్మిక సౌరభాన్ని దశదిశలా పరిమళింపజేసి భారతదేశ ఔన్నత్యాన్ని శాశ్వతంగా స్థాపించాడు. ఇలా ఎందరో!



అంతర్యామి

వీరందరి జన్మలు ప్రత్యేకం కాదు. జీవించిన తీరు, సమకూర్చుకున్న సంస్కారాలు, అనుసరించిన విధానాలు, ఎన్నుకున్న ఆదర్శమార్గాలు వీరికి ఆ ఘనతను సంతరించిపెట్టాయి. వీళ్లంతా ఫలాలకోసం జీవన గమనాన్ని ఎన్నుకోలేదు. వారి గమన వైశిష్ట్యం వల్ల ఫలాలు పొందారు.

మామిడి చెట్టును నాటి, పెంచి పోషిస్తే మామిడి పళ్లు కాయడంలో విశేషం లేదు. అయితే విత్తుకున్నప్పుడే, ఎన్నుకున్నప్పుడే మామిడి బీజం ఎన్నుకోవాలి. విత్తుకోవాలి. దాని ఆరోగ్యకర ఎదుగుదలకు తగిన ఆదరువులు అందించాలి. నిజానికి విత్తు శ్రేష్ఠమైనదైనా సరైన పోషణ లేకపోతే చెట్టుగా ఎదగదు. తగిన ఫలాల నివ్వదు. జీవితమూ అంతే. దుర్లభమైన మానవ జన్మ ఎత్తినంత మాత్రాన సరిపోదు. దాని విలువ గ్రహించాలి. అదెంత అపురూపమో అవగాహన చేసుకోవాలి. జీవితాన్ని ఒక ధ్యాన సాధనగా, కళాత్మకమైన అనుభవంగా, పవిత్రమైన పూజగా మలచుకుంటూ అనుభవంలోకి తెచ్చుకుంటూ, వందేళ్ల మధురమైన అనుభూతిగా జీవించాలి.

మనకు గొప్ప అంశం లభించటం గొప్పకాదు. దాని అపురూపత, అమూల్యతలను గ్రహించటం గొప్ప. అప్పుడే దాన్ని సరైన రీతిగా వినియోగించుకోగలం. సార్థక్యాన్ని పొందగలం. మానవజన్మ అలాంటిది. జీవితం అలాంటిది. పూలతోటలో నడిచినట్లు, పన్నీటివానలో తడిసినట్లు, అమృతం తాగినట్లు... అన్నింటినీ మించి పద్మాసనంలో ధ్యానవశిష్టుడైన ఒక సాధకుడిలా జీవితాన్ని పవిత్రంగా, ప్రశాంతంగా జీవిస్తే- తన సృజనకు న్యాయం చేసిన ఆ వ్యక్తిని చూసి భగవంతుడే గర్విస్తాడు!

- చక్కిలం విజయలక్ష్మి

సాఫ్ట్‌వేర్ వరుడే కావాలి

- ఎక్కువమంది యువతుల ఆకాంక్ష
- తెలుగు మాట్రిమోని అధ్యయనంలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఐటీ రంగం ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నా, ఆ రంగంలో పనిచేసేవారినే వరించాలని ఎక్కువమంది యువతులు కోరుకుంటున్నట్లు భారత్ మాట్రిమోని అనుబంధ సంస్థ తెలుగు మాట్రిమోని తెలిపింది. తాము చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైనట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. "వరుడు ఏ రంగానికి చెందినవాడై ఉండాలన్న ప్రశ్నకు... అధికశాతం మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని సమాధానం చెప్పారు. ఆ తర్వాత వైద్యులు, ఇంజినీర్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర రంగాలవారున్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, పుణె, ముంబయిలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, యూఏఈల్లో తెలుగు వధువుల అభిరుచులను తెలుసుకున్నాం. మాట్రిమోనిలను ఆశ్రయిస్తున్న యువతుల్లో 49% మంది ఇంజినీర్లు; 11% మంది మేనేజ్‌మెంట్ కోర్సులు చేసినవారు ఉంటున్నారు. పురుషుల్లో 42% మంది ఇంజినీర్లు, 12% మంది మేనేజ్‌మెంట్ రంగం వారు ఉన్నారు. 84% మంది యువతులు తమకు కాబోయే భర్తకు 20-29 ఏళ్లుండాలని కోరుతున్నారు. 89% యువకులు మాత్రం వధువు వయసు 25-35 ఏళ్ల మధ్య ఉండాలంటున్నారు. తెలుగు రాష్ట్రాలవారిలో 23% మంది వధువులు, 26% మంది పురుషులు తమ సొంత రాష్ట్రాలవారినే వివాహం చేసుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. మిగతావారు మాత్రం ఇతర రాష్ట్రాలవారు కావాలంటున్నారు" అని తెలుగు మాట్రిమోని పేర్కొంది.

సంస్కరణ చెంతనే సవాళ్లు?

- ఆటో మ్యూటేషన్‌తో కొత్త వివాదాలకు ఆస్కారం
- జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి అవసరం

ఈనాడు - అమరావతి

సంస్కరణల్లో భాగంగా రెవెన్యూ శాఖ ఆటో మ్యూటేషన్‌ను (కంప్యూటర్ తనంత తాను సవరించడం) అమల్లోకి తీసుకురాబోతోంది. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడంతో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో రాబోతున్నాయి. కొత్త విధానంలో ప్రజలు రెవెన్యూ కార్యాలయాలచుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. నిర్ణీత వ్యవధిలో పాస్‌పుస్తకం వచ్చేస్తుంది. అదే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే కొత్తగా భూ వివాదాలు తలెత్తుతాయని సంబంధిత వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

ప్రస్తుత విధానం

ప్రస్తుతం వ్యవసాయ భూములను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం పాస్ పుస్తకాల కోసం దస్తావేజు నకలుతో 'మీ సేవ' కేంద్రాల ద్వారా రెవెన్యూశాఖకు దరఖాస్తు చేస్తున్నారు. వీటిని రెవెన్యూ అధికారులు అధికారిక రికార్డుల్లోని సమాచారంతో సరిపోల్చి వివాదాలు లేకుండా ఉంటేనే మార్పులు చేసి, కొత్త పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నారు. దీనికి చాలా ఎక్కువ సమయం పడుతోంది. భూమి ధర, కొనుగోలు చేసిన భూమి ఆధారంగా క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు అమ్యామ్యాలు చెల్లించాల్సి వస్తోంది. ఈ చెల్లింపులు జరిగినా సకాలంలో కొనుగోలుదారులు పాస్‌పుస్తకాలను పొందలేకపోతున్నారు.

కొత్త విధానంలో..

త్వరలో అమల్లోకి రానున్న ఆటో మ్యూటేషన్ విధానంలో రిజిస్ట్రేషన్ అయిన తరువాత ఆ వివరాలు రెవెన్యూ అధికారులకు వెళతాయి. వాటిని పరిశీలించి ఆమోదించాలి. వారి నుంచి 30రోజుల్లో ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే రికార్డుల్లో వివరాలు మారిపోయి పాస్ పుస్తకాలు మంజూరవుతాయి.

పరోక్ష ఇబ్బందులెన్నో..

★ ఒక సర్వే నంబర్లో 10 ఎకరాల భూమి ఉంటే 8 మంది రైతులు ఉంటారు. ఎవరి పేరుతో ఎంత భూమి ఉంది? హద్దులు ఏమిటనేది సూచిస్తూ సబ్ డివిజన్ చేయాలి. ఇది తేలకుండా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆ సర్వేనంబర్లో భూమి ఉన్న రైతులంతా ఇబ్బందిపడాల్సిందే.

★ సబ్ డివిజన్లు చేయాలంటే సర్వేయర్లు భూమి కొలతలు నిర్వహించాలి. రాష్ట్రంలో భూముల కొలతలకు దరఖాస్తు చేసుకుని, సర్వేయర్ల రాక కోసం ఎదురుచూసే వారికి కొదవలేదు. ఈ క్రమంలో నెల రోజుల్లోగా సర్వేయర్లు కొలతలు వేయడం సాధ్యమవుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

★ పలుచోట్ల ప్రభుత్వ, ఈనాం, దేవాదాయ భూములకు అక్రమ పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. వీటిని రిజిస్టర్ చేశాక ఆటోమ్యుటేషన్ చేస్తే ఆ భూమిపై హక్కులు సంక్రమిస్తాయి. అధికారులు చూసీ చూడనట్లు వదిలేసినా, అక్రమాలకు పాల్పడినా, పని ఒత్తిడిలో పట్టించుకోకున్నా వివాదాలు తలెత్తుతాయి.

★ సబ్ డివిజన్ చేయకుండా ఒక సర్వే నెంబరులో కొంత భూమిని అమ్మితే అలాంటి సమయంలో మొత్తం భూమి కొనుగోలుదారుడి పేరుతో మారిపోయే ప్రమాదం ఉంది. లేదంటే మొత్తం భూమిలో అమ్మిన భూమి ఏ పక్కన ఉండేది అనే సమస్య తలెత్తుతుంది.

ఏం చేయాలంటే..

భూముల రిజిస్ట్రేషన్‌కు వెళ్లే సమయంలో సర్వేయర్ ద్వారా సబ్ డివిజన్ చేయించుకుని ధ్రువపత్రంతో వెళ్లేలా చేయాలి. దీనివల్ల వివాదాలు కొంత తగ్గుతాయి. గతంలో దీనిపై ఉత్తర్వులు ఇచ్చారు. సర్వేయర్ల కొరత నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఆదాయం తగ్గిపోయిందని అధికారులు గొడవ పెట్టడంతో దానిని ఎత్తివేశారు. ఇప్పుడైనా సర్వేయర్ల సంఖ్య పెంచి.. అవసరమైతే లైసెన్సు పొందిన సర్వేయర్ల ద్వారా అయినా ధ్రువీకరణపత్రం తెచ్చుకునే వెసులుబాటు కల్పించాలి.

★ ఆటో మ్యూటేషన్ జరిగాక అభ్యంతరం ఉంటే అప్పీలు చేసుకునే వెసులుబాటు కల్పించాలి. రెవెన్యూ శాఖలో ఇలాంటి దరఖాస్తులు పరిష్కరించాలంటే నెలలు, ఏళ్లు గడుస్తాయి. అలా కాకుండా.. అప్పీలు చేసుకున్నాక నిర్ణీత సమయంలోగా వాటిని పరిష్కరించాలి.

నమ్మించి మోసగించిన భాజపా: యనమల

ఈనాడు డిజిటల్, అమరావతి: నమ్మిన వాళ్లను మోసగించడం భాజపా విధానమని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఇది యూపీఏ భాగస్వామ్య పక్షాలతో పాటు ఎన్డీయే మిత్రపక్షాల అభిప్రాయం కూడా అని ఆయన తెలిపారు. బురదజల్లి పరుగెత్తడం తెదేపా నైజమంటూ భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు చేసిన వ్యాఖ్యలను మంగళవారం మంత్రి ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్ర హక్కులను పోరాడి సాధించుకోవడం తెదేపా విధానమని పేర్కొన్నారు. 36 ఏళ్ల తెదేపా చరిత్ర ఈ విషయాన్నే చెబుతోందని వివరించారు. ఒకరిపై బురదజల్లే అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే శివసేనతో పాటు జేడీ(యూ) కూడా ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నాయని తెలిపారు.

EDUCATION

★ ADMISSIONS Ag. B.Sc, ICAR APPROVED@7.5L. ✆ 7083847452.

★ Ag.BSc, ICAR Recognized Colleges of MH Starts from 7.5-14 Lakhs. 9399992802, 9399992803

B.Sc (Hons) Agri
Recog. by UGC, State Higher Education
Eligi : All Govt., Private Jobs
NO EAMCET, NO DONATION
www.sunagbsc.org
78427 36789

GUDLAVALLERU ENGINEERING COLLEGE
(An Autonomous Institute with Permanent Affiliation to JNTUK, Kakinada)
Seshadri Rao Knowledge, Village, GUDLAVALLERU-521356, Krishna District, A.P
NBA Accreditation:B.Tech. - CSE for 5 Years and CE, EEE, ME, ECE & IT for 3 Years Accredited by NAAC with 'A' Grade

కృతజ్ఞతలు

ఈ కళాశాల బి.టెక్ కోర్సులలోని కన్వీనర్ కోటాలో ప్రకటించిన మొత్తం 746 సీట్లు (స్పెషల్ కేటగిరి మినహా) మొదటి కౌన్సెలింగ్‌లోనే భర్తీ అయినవని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. మా కళాశాలపై నమ్మకముతో ప్రవేశము తీసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మా హృదయ పూర్వక కృతజ్ఞతలు. ప్రామాణికమైన విద్య అందించడానికి మేము చేస్తున్న కృషిని కొనసాగిస్తాము.

GEC/Advt./2018, dt. 06-06-2018 Seretary & Correspondent

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
ప్రకటన

తితిదేలో ఒక సంవత్సర కాలపాటు కాంట్రాక్టు ప్రాతిపదికపై సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగాల కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరడమైనది. ప్రకటన వివరాల కొరకు సంప్రదించవలసిన తితిదే వెబ్‌సైట్: www.tirumala.org
డౌన్‌లోడింగ్ కొరకు డైరెక్ట్ లింక్స్:
నోటిఫికేషన్: http://www.tirumala.org/Documents/201806051600085780.pdf.
దరఖాస్తు: http://www.tirumala.org/Documents/201806051317082759.pdf
సంప్రదించవలసిన ఫోన్ నెం: 0877-2264371, 4370
Roc.No.PR4/1090/Adv.No.90/PRO/2018, Dated: 05.06.2018. కార్యనిర్వహణాధికారి

RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES
Andhra Pradesh
Flat Number 202, Second Floor, NRI Block (C), Sri Mahendra Enclave, Opp: SBI, Highway Towers Back Side, Tadepalli, Guntur District.
Advertisement No: RGUKT-AP/ Estt.- 03/2018 Date: 06.06.2018
RGUKT invites applications from qualified and eligible candidates for the post of Director, Dr. A P J Abdul Kalam IIIT-Ongole, Ongole district. The initial term of appointment will be for a period of one year, and may be extended subject to terms and regulations of University. For further details please visit the website www.rgukt.in. The last date for receiving hard copy of application along with necessary documents is 5 PM, 23.06.2018.
Sd/-
Registrar (i/c)

మన్యంలో కలుషిత నీటితో అవస్థలు

- ఆరోగ్య అత్యవసర స్థితి ప్రకటించాలి: పవన్‌కళ్యాణ్

పోతంగిలో కలుషిత నీటి కుండీని పరిశీలిస్తున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: విశాఖ మన్యంలో వ్యాధుల అదుపునకు ప్రభుత్వం ఆరోగ్య అత్యవసర స్థితి(హెల్త్ ఎమర్జెన్సీ) ప్రకటించాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ డిమాండ్ చేశారు. మన్యం పర్యటనలో భాగంగా అరకులోయకు వచ్చిన ఆయన మంగళవారం డుంబ్రిగుడ మండలం పోతంగి, తోటవలస, కొత్తవలస గ్రామాల్లో పర్యటించారు. గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వనరులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'మన్యంలో కలుషిత తాగునీటితో గిరిజనులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రభుత్వం సురక్షిత పథకాలను నిర్మిస్తున్నామని గొప్పలు చెప్తున్నా అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. క్షేత్రస్థాయిలో కలుషిత ఊటగెడ్డ కుండీలతో దాహం తీర్చుకోవాల్సిన దుస్థితి కనిపిస్తోంది. పోతంగిలో తాగునీటి వసతులు అధ్వానంగా ఉన్నాయి. కలుషిత నీటితో టైఫాయిడ్, పచ్చకామెర్ల వ్యాధులతో గిరిజనులు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం' అంటూ విమర్శించారు.

ఆంత్రాక్స్ బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆంత్రాక్స్ లక్షణాలతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆదిమజాతి(పీటీజీ) గిరిజన కుటుంబాలను పవన్‌కళ్యాణ్ పరామర్శించారు. ఐటీడీఏ అధికారులు గిరిజన సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధిలని సూచించారు. జ్ఞానధార కార్యక్రమాన్ని చూసేందుకు కేజీబీవీ వెళ్లిన ఆయన.. బాలికల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి పూర్తిస్థాయిలో వసతుల కల్పనకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తానని హామీ ఇచ్చారు.

విద్య మౌలిక వసతుల్లో నిధులు పక్కదారి!

ఎమ్మెల్యే బాలకృష్ణ లేఖతో వెలుగులోకి..

ఈనాడు, అమరావతి: ఏపీ విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీఈడబ్ల్యుఐడీసీ)లో నిధుల దుర్వినియోగం వెలుగుచూసింది. అనంతపురం జిల్లా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ రాసిన లేఖ మేరకు విచారించిన అధికారులు అవకతవకలను గుర్తించారు. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. 2009-10 సంవత్సరంలో అనంతపురం జిల్లాలో నిర్మాణ పనుల కోసం ఇతర విభాగాల నుంచి ఏపీఈడబ్ల్యుఐడీసీ స్థానిక ఇంజినీరింగ్ కార్యాలయానికి నిధులిచ్చింది. వీటిల్లో రూ.5.9కోట్లు కొంతమంది ఇంజినీర్లు బయానా(అడ్వాన్సు) రూపంలో తీసేసుకున్నారు. ఇప్పటివరకు లెక్కలు చెప్పలేదని ఉన్నతాధికారులు గుర్తించారు. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడిన రోజే కొందరు అధికారులు మొత్తం డ్రా చేసేసినట్లు గుర్తించారు. ఇంజినీర్లు బయానా ఎలా తీసుకున్నారనే దానిపై విచారణ సాగుతోంది. ఏపీఈడబ్ల్యుఐడీసీకి నేరుగా పనుల మంజూరు లేనందున జిల్లాల్లో ఇతర శాఖలకు చెందిన పనులను ఈ సంస్థకు అప్పగిస్తూ ఉంటారు. ఆయా పనులకు సంబంధించిన నిధులను స్థానికంగా ఉండే సంస్థ ఖాతాకు జమ చేస్తారు. వీటికి చాలా జిల్లాల్లో లెక్కలు చూపడం లేదనే ఆరోపణలున్నాయి. అనంతపురం జిల్లాలో జరిగిన అక్రమాలూ ఇలాంటివేనా అనేదానిపైనా దృష్టి సారించారు. తమ అధికారులు ప్రాథమికంగా విచారించారని, పనులు చేయకుండా డ్రా చేశారా? లేదా నిధులు డ్రా చేసి గుత్తేదారుకు చెల్లింపులు చేశారా? అనేది తేలాల్సి ఉందని ఏపీఈడబ్ల్యుఐడీసీ ఎండీ విరల్ తెలిపారు.

రైల్వేలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయండి

జాతీయ ఎస్సీ కమిషన్ వైస్‌ఛైర్మన్ మురుగన్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ ఛైర్మన్ ఎల్.మురగన్ ఉన్నతాధికారులను కోరారు. సికింద్రాబాద్‌లోని రైలు నిలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ద.మ.రై. చేస్తున్న కృషిని మురగన్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులు, కారుణ్య నియామకాలు, కార్మిక సంఘాల కార్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనలో అవలంబిస్తున్న సంస్థాగత పద్ధతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. లోకోపైలెట్లకు పదోన్నతి కల్పించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి, దాని స్థానంలో పర్యావరణానికి మేలుచేసే వస్తువులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు.

పేదల సొంతింటి కల నెరవేరుతున్న వేళ..

- పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో రాయితీ ఇళ్లు
- కేంద్రం సూత్రప్రాయ అంగీకారం
- పది జిల్లాల్లో 2957 గ్రామాల్లో అమలు

ఈనాడు - గుంటూరు

కొన్నేళ్లుగా ప్రభుత్వ రాయితీ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్రంలోని పట్టణ పరిసర గ్రామాల్లోని పేదల ఆశలు నెరవేరనున్నాయి. పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పది జిల్లాల్లో పేదలకు రాయితీ ఇళ్ల మంజూరుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించింది. పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఇళ్ల నిర్మాణానికి సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారుచేయాలని గృహనిర్మాణ సంస్థను ప్రభుత్వం ఆదేశించింది. పశ్చిమగోదావరి, ప్రకాశం, కడప మినహా మిగిలిన జిల్లాల్లో పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో 196 మండలాల్లో 2957 గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కానున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఇంటి నిర్మాణానికి రాయితీ పొందని పేదలందరూ దీనికి అర్హులే. సొంత స్థలం ఉండి ఇంటి నిర్మాణాన్ని చేపట్టేవారికి (బీఎల్‌సీ) ఒక్కొక్క ఇంటికి రూ.రెండున్నర లక్షల రాయితీ సొమ్మునిస్తారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.లక్ష, కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ నుంచి రూ.లక్షన్నర వెచ్చిస్తారు. ఇంటి స్థలం లేని పేదల ప్రయోజనం(ఏహెచ్‌పీ) కింద జీ+3 విధానంలో బహుళ అంతస్తుల భవనాలను ప్రభుత్వ స్థలంలో నిర్మించి ఇస్తారు. ఈ భవనాల నిర్మాణంలో భాగంగా మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పిస్తుంది. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి చ.అడుగుకు సగటున రూ.1800 వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన ఒక్కొక్క ప్లాటుకు రూ.6లక్షల నుంచి రూ.7.5 లక్షలు ఖర్చవుతోంది. ఇందులో రూ.రెండున్నర లక్షలు రాయితీపోనూ మిగిలిన సొమ్ము బ్యాంకు రుణంగా లబ్ధిదారులకు అందిస్తారు.

తొలిసారిగా రూ.2.5లక్షల రాయితీ

రాష్ట్రంలో ఇప్పటివరకు పట్టణాల్లో పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.రెండున్నర లక్షల రాయితీనిస్తోంది. ప్రస్తుతం పట్టణాభివృద్ధి సంస్థ పరిధి మొత్తానికి లబ్ధిదారుల సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునే పథకం(బీఎల్‌సీ) విస్తరిస్తుండడంతో పట్టణ పరిసరాల పేదలకు కూడా ఇదే రాయితీ వర్తించనుంది. ఈ మేరకు రాష్ట్రం నుంచి గృహనిర్మాణ శాఖ ప్రతిపాదనలు పంపాక కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ రాయితీ ఇళ్లను మంజూరు చేయనుంది. కొత్తగా మంజూరయ్యే ఇళ్లకు నాలుగు దశల్లో సొమ్ము లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తామని వివరించాయి.

పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సాధికారమిత్రల వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో ఈ బాధ్యతల పర్యవేక్షణకుగాను అడిషనల్ మిషన్ డైరెక్టర్‌గా సీఆర్‌డీఏ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న కృష్ణ కపర్ధిని డిప్యూటేషన్‌పై నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

JAWAHARLAL NEHRU ARCHITECTURE AND FINE ARTS UNIVERSITY
Mahaveer Marg, Masab Tank, Hyderabad – 500 028. T.S

NOTIFICATION FOR FINE ARTS AND DESIGN ENTRANCE EXAMINATION – 2018

JNAFA University, Hyderabad is conducting Entrance Examination for Admissions into the Four Year Degree in **Bachelor of Fine Arts and Bachelor of Design Courses**, offered for the **Academic Year 2018-19.**
Eligible candidates who wish to apply may fill the online application forms for each course separately by visiting the University Website **www.jnafau.ac.in. Registration fee has to be paid online only for Rs.1,200/- (Rs.600/- in case of SC/ST candidates). Kindly note that the application form and fee payment has to be submitted online only.** The last date for online application & fee payment is **30-06-2018 (without late fee)** and **with late fee of Rs.3,000/- up to 07-07-2018.**

Date and Time of the Entrance Exam

Course	Date	Time
B.F.A (Applied Art, Painting, Sculpture & Animation)	14-07-2018	10:00 AM to 2:20 PM
B.F.A (Photography)	15-07-2018	10:00 AM to 12:30 PM
B.Design (Interior Design)	15-07-2018	2:00 PM to 5:00 PM

For detailed information regarding eligibility, rules of reservation, time table, syllabus and model question paper etc., visit university website or contact **040-23319462.**
Note: This is only a Notification for Entrance Examination. Candidate has to fulfill the eligibility criteria laid down in the relevant G.O.s at the time of admission. Offline applications are not accepted.
No. JNAFAU/Adms/FADEE-2018/1/2018 dt: 05-06-2018
Prof. K. Sunder Kumar
Co-ordinator, Admissions

పార్థీ ముఠా మహిళా నిందితుల అరెస్టు

- 123.724 గ్రాముల బంగారం స్వాధీనం

చోరీలకు పాల్పడే మహిళా నిందితులతో డీఎస్పీ లక్ష్మీనారాయణ, పోలీసులు

రాజంపేట, న్యూస్‌టుడే: వెంట్రుకల వ్యాపారం చేస్తూ అవకాశం దొరికినప్పుడు చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ఇద్దరు మహిళలను కడప జిల్లా రాజంపేట పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వారి నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. రాజంపేట రైల్వేస్టేషన్‌కు సమీపంలోని ఆర్వోబీ కింద మహిళా నిందితులు ఉన్నట్లు ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసు బృందం వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. విచారణలో వారు పార్థీ ముఠా సభ్యులు నివసించే ప్రాంతానికి చెందిన పార్థీ ఉప్పాడే రూప, పార్థీ ఉప్పాడే సరస్వతిగా గుర్తించినట్లు వివరించారు. ఈ మహిళలు ఇద్దరూ గతేడాది డిసెంబరు 26న రైల్వేస్టేషన్ సమీపంలోని తుమ్మల అగ్రహారంలో నివసించే లక్ష్మీదేవి ఇంట్లో నగదు, బంగారు నగలను దోచుకెళ్లారు. మరుసటి రోజే రాజంపేట కొలిమివీధికి చెందిన ఎల్.శ్రీనివాసులు ఇంట్లో సొత్తు అపహరించారు. మహారాష్ట్రలోని దాదర్ సిటీకి చెందిన పార్థీ జ్యోతితో కలిసి వీరు రాజంపేట ప్రాంతంలో చోరీలకు పాల్పడ్డారు. వీరే హైదరాబాద్‌లోని అంబర్‌పేట, పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ల పరిధిలో కూడా చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి రూ.4 లక్షల విలువచేసే 123.724 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. త్వరలో పార్థీ ముఠాకు చెందిన జ్యోతిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ లక్ష్మీనారాయణ విలేకరులకు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్.కె.సింగ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర విభజన వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య తలెత్తిన విద్యుత్ సమస్యలను త్వరలో సమీక్షించి పరిష్కరిస్తామని కేంద్ర విద్యుత్‌శాఖమంత్రి ఆర్.కె.సింగ్ తెలిపారు. మంగళవారం దిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని రాష్ట్రాల మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని కేంద్ర విద్యుత్ సంస్థ కార్యాలయం నుంచి రాష్ట్ర మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రెండు రాష్ట్రాల విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై వివాదాలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. వచ్చేనెలలో దేశవ్యాప్తంగా 'కిసాన్ ఊర్జా సురక్షా ఉత్థాన్ మహాభియాన్'(కుసుమ్) అనే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించనుందని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుదుత్పత్తిని పెంచి ప్రజలకు సులభంగా విద్యుత్‌ను అందించడం దీని లక్ష్యమని వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ఒక్కో చోట రెండు మెగావాట్ల సౌర విద్యుత్కేంద్రం ఏర్పాటు చేసి దానిని ఉత్పత్తి చేసే విద్యుత్‌ను సాధారణ కరెంటు లైన్లకు కలపాలన్నది ఉద్దేశమన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు సౌరవిద్యుత్ కల్పన ద్వారా సమస్య తీరుతుందన్నారు. దీనివల్ల రైతుల మోటార్లకు సౌరవిద్యుత్ పొందడమే కాకుండా అదనంగా ఉన్న కరెంటును విద్యుత్ సంస్థలకు అమ్ముకుని ఆదాయం పొందవచ్చన్నారు. దేశంలో కరెంటు సౌకర్యం లేని గ్రామాలన్నింటికీ ఈ సదుపాయం కల్పించామన్నారు. గత నాలుగేళ్లలో 4200 కోట్ల డాలర్ల పెట్టుబడులు సంప్రదాయేతర ఇంధన రంగంలో పెట్టినట్లు తెలిపారు.

సీలేరు విద్యుత్తు కేంద్రాల్లో 'స్పీడ్ గవర్నర్ల' ఏర్పాటు

మోతుగూడెం, న్యూస్‌టుడే: సీలేరులోని జల విద్యుత్కేంద్రాల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు పనులు ప్రారంభించినట్లు ముఖ్య ఇంజినీర్(సీఈ) ఎల్.మోహన్‌రావు తెలిపారు. 'ఇక్కడి యూనిట్లను 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. వాటిలో 50 మెగావాట్ల సామర్థ్యానికి మించిన యూనిట్లకు కొత్తగా స్పీడ్ గవర్నర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పనులను బెంగళూరుకు చెందిన ఓ సంస్థకు అప్పగించాం. పొల్లూరు జలవిద్యుత్తు కేంద్రంలోని 3,4 యూనిట్లకు ఎనిమిది నెలల క్రితమే వీటిని ఏర్పాటు చేయగా.. తాజాగా ప్రథమ యూనిట్‌లో ఆ పనులు చేస్తున్నారు. మరో 15 రోజుల్లో రెండో యూనిట్‌లో, జులైలో ఎగువ సీలేరులోని నాలుగు యూనిట్లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు' ఆయన తెలిపారు.

స్మృత్యంజలి



శ్రీ ఎం.ఎల్. స్వామి గారు
(1925 - 2018)
మాజీ ఇంజనీర్ - ఇన్ - చీఫ్
ఇరిగేషన్ శాఖ పూర్వ ఆం.ప్ర. ప్రభుత్వం
4-6-2018 సోమవారం రోజున అమెరికాలో స్వర్గస్తులైనారని తెలపడానికి చింతిస్తున్నాము.

మాది రెడ్డి సుబ్బారావు - కృష్ణవేణి,
ఎం. రమేష్ - జయశ్రీ,
ఎన్. సురేఖ - ఎన్. సాయినాథ్,
పి. సుచరిత - పి. ఫణిప్రకాష్
మరియు మనుమలు - మనువరాండ్లు

కారు-బస్సు ఢీ.. ముగ్గురు దుర్మరణం

- కడప జిల్లాలో ఘోరం
- మృతులంతా గుంటూరువాసులు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: కడప జిల్లాలో మైదుకూరు - బద్వేలు రహదారి బ్రహ్మంగారిమఠం మండలం నందిపల్లె వద్ద మంగళవారం తెల్లవారుజామున కారు, ప్రైవేటు బస్సు ఢీకొన్న ప్రమాదంలో గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న నగరం మండలం పూడివాడకు చెందిన ఎల్లాప్రగడ వెంకట సత్యసూర్య శివ నాగేంద్రశర్మ(49), అదే గ్రామానికి చెందిన సాలెం రాజు (23), జాలాది బాలు (22) అనే ఇద్దరు డ్రైవర్లు మృతి చెందారు. నాగేంద్ర శర్మ ఆదివారం గ్రామం నుంచి బెంగుళూరులో ఉంటున్న బంధువులను కలుసుకునేందుకు ఇద్దరు డ్రైవర్లతో కారులో బయలుదేరి వెళ్లారు. తిరిగొస్తున్న సమయంలో జగన్ పాదయాత్ర నుంచి తిరిగొస్తున్న ప్రైవేటు బస్సు కారును ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంతో కారు, బస్సు బాగా దెబ్బతిన్నాయి. బస్సులో ఉన్న వారంతా క్షేమంగా బయటపడ్డారు.

WWW.LPU.IN

LOVELY PROFESSIONAL UNIVERSITY PUNJAB (INDIA)

From Google to Microsoft, LPU students are working with top brands at packages of over ₹1 Crore.

Think BIG

1000's of LPU students placed in Top MNCs IN USA, UK, Canada, Australia etc.
600+ offers alone made by ten fortune 500 companies including Amazon, Xerox, HP to 2017 batch students.
80+ companies that recruit from IITS, NITS & IIMS also recruit from LPU.
500+ Multinational & National Companies including HP, Amazon, Honda, Cognizant, Samsung, GSK, Adobe have recruited LPU students.

APPLICATIONS OPEN FOR ENGINEERING PROGRAMMES

- B.Tech.
- B.Tech. (Hons.)
- Integrated B.Tech.-M.Tech.
- Integrated B.Tech.-MBA

STREAMS AVAILABLE
ECE, CSE, IT, ME, ME -Mechatronics, Aerospace Engg., Civil Engg. (CE), Electrical Engg. (EE), Electrical and Electronics Engg. (EEE), Automobile Engineering (AE), Chemical Engg. (CHE), CHE - Petroleum, Biotechnology (BT)+, Food Tech.+, Biomedical Engg. (BE)+

- B.Tech. [Lateral Entry]
- M.Tech. [Full Time] - (ECE, VLSI Design, CSE, Thermal Engg., Manufacturing Engg., Automobile Engg., Robotics, Geotechnical Engg., Structural Engg., Transportation Engg., Construction Mgt., EE, Power Systems, Food Technology)
- Diploma (Engg.) (After 10th) -ECE, CSE, ME, CE, EE, AE
- Ph.D. [Full Time/ Part Time]
- B.Arch./ B.Plan./ BCA/ MCA

+ Medical students can also apply
For stream details, refer website www.lpu.in

LAST DATE TO APPLY UNDER EDB 15th JUNE 2018

EARLY DECISION BENEFIT(EDB)

Take Early Decision to APPLY & REGISTER for Admission with LPU and get the Benefit of Paying LAST YEAR's PROGRAMME FEE (2017) & MAXIMUM SCHOLARSHIP

Scholarships up to ₹ 7.5 Lakh Per Student

Meet our counsellors in	Time : 10AM to 7PM	Toll Free: 1800-102-4428	
Vijayawada	#40-1-60, 1st Floor, Chand Imprea, Benz Circle	Ph: 09216656007	06-15 June
Guntur	Hotel Geetha Regency, 4th Lane, Arundelpet	Ph: 09780036429	08-10 June

LOVELY PROFESSIONAL UNIVERSITY (LPU) : Jalandhar-Delhi G.T. Road, Phagwara, Punjab
admissions@lpu.co.in | SMS LPU to 53030 | Toll Free : 1800-102-4428

ముగ్గురికి డీఐజీలుగా పదోన్నతి

ఈనాడు, అమరావతి: ముగ్గురు ఐపీఎస్ అధికారులకు డీఐజీలుగా పదోన్నతి లభించింది. సీఐడీలో సీనియర్ ఎస్పీగా పని చేస్తున్న ఎల్‌కేవీ రంగారావు, అనంతపురంలోని పోలీసు శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న పి.వెంకట్రామిరెడ్డికి పదోన్నతులు లభించాయి. పదోన్నతి పొందిన మరో అధికారి కె.కోటేశ్వరరావు ఇప్పటికే పదవీ విరమణ చేశారు. రాష్ట్ర పోలీసు సర్వీసు నుంచి ఐపీఎస్‌లుగా పదోన్నతి పొందిన వీరిని తొలుత 2005 బ్యాచ్‌గా పరిగణించారు. అయితే పలు మార్పుల తరువాత వీరిని 2004 బ్యాచ్‌గా కేంద్ర హోం మంత్రిత్వశాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో తాజా పదోన్నతులు లభించాయి.

విదేశీ పర్యటనకు చినరాజప్ప

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకూ విదేశాల్లో పర్యటించనున్నారు. ఇది పూర్తిగా వ్యక్తిగత పర్యటన. ఆయన యూకే, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్, జర్మనీ తదితర దేశాలను సందర్శించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టణ పేదల ఇళ్ల మౌలిక వసతులకు రూ.2595 కోట్లు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై), ఎన్టీఆర్ కాలనీల పేరుతో పట్టణ పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.2,594.89 కోట్లు ఖర్చు చేసేందుకు పరిపాలనా అనుమతులిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక జీవోలో రూ.1814.17 కోట్లు, మరో జీవోలో రూ.780.72 కోట్లు ఖర్చు చేసేందుకు అనుమతులిచ్చారు.

సీఏ ఫౌండేషన్ పరీక్ష తేదీలో మార్పులు

ఈనాడు డిజిటల్, అమరావతి: సీఏ ఫౌండేషన్ పరీక్ష నిర్వహణ తేదీలో స్వల్ప మార్పులు జరిగాయి. ఇకపై నవంబరులోనే ఈ పరీక్షను నిర్వహించనున్నారు. సీఏ కోర్సులోకి ప్రవేశించాలనుకునే విద్యార్థులకు గతంలో సీఏ సీపీటీ పరీక్ష డిసెంబరులో జరిగేది. మారిన విధానం ప్రకారం ఈ పరీక్ష నవంబరులోనే నిర్వహించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సీఏ ఫౌండేషన్ రిజిస్ట్రేషన్‌కు జూన్ 30ని చివరి తేదీగా నిర్ణయించారు.

వసతి గృహాల విద్యార్థుల కాస్మొటిక్, డైట్ ఛార్జీల పెంపు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, స్త్రీ, శిశు సంక్షేమశాఖల పరిధిలోని వసతి గృహాలు, గురుకులాల్లో చదివే విద్యార్థుల డైట్, కాస్మొటిక్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. 5 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులకు రూ.750 నుంచి రూ.1000కి, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.850 నుంచి రూ.1250కి, ఇంటర్ విద్యార్థులకు రూ.1250 నుంచి రూ.1400కు డైట్ చార్జీలు పెరిగాయి. కాస్మొటిక్ ఛార్జీలను బాలురకు రూ.55 నుంచి రూ.125కు బాలికలకు రూ.150కి పెంచారు.

కిక్కిరిసిన జైళ్లపై నివేదికలు ఇవ్వండి

ఈనాడు, హైదరాబాద్: కిక్కిరిసిన జైళ్లకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలంటూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను ఉమ్మడి హైకోర్టు మంగళవారం ఆదేశించింది. ప్రస్తుతం జిల్లా జైళ్ల సంఖ్య, సామర్థ్యం, ప్రస్తుతమున్న ఖైదీల వివరాలతోపాటు, మంజూరైన సిబ్బంది సంఖ్య, ఖాళీల వివరాలను తమ ముందు ఉంచాలని సూచించింది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు హైకోర్టు సుమోటోగా పరిగణనలోకి తీసుకుంది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ నివేదికలు సమర్పించాలంటూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

ఏ.పి.స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
e- ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన-4

టెండరు నెం. A 18 to A22/2018-19, తేది 4-6-2018, 5 సివిల్ పనుల కొరకు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు సంఖ్య, జిల్లాలోని పనులు, పనుల సంఖ్య & మొత్తం అంచనా విలువ (రూ. లక్షలలో) వరుసగా "A18, A19- తూర్పుగోదావరి- 2 - 549.87; A20, A21, 22 - గుంటూరు- 3 - 212.47; టెండరు నెం.లు A18 నుండి A22 వరకు బిడ్ల దాఖలుకు చివరి తేదీ/సమయము 22-6-2018, సా.గం. 5-00. వివరాలకు www.apeprocurement.gov.in ను దర్శించండి.

DIPR No. 145PP/CL/Advt/1/1/2018-19 సం/- చీఫ్ ఇంజనీర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
అటవీ శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ స్వల్ప వ్యవధి ప్రకటన

Rc.No.1125/2018-A1 తేది: 1-6-2018
రేంజ్ పేరు - ప్రతిపాదిత పనుల సంఖ్య & అంచనా విలువ: 1. గుంటూరు రేంజ్ - 2 నెం.లు - రూ. 26.610 లక్షలు. 2. వినుకొండ రేంజ్ - 3 నెం.లు - రూ. 80.168 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ జారీ: ది. 4-6-2018 ఉ. గం. 10.30 నుండి ది. 11-6-2018 ఉ. గం. 11.00 వరకు. బిడ్ దాఖలుకు చివరి తేది: 11-6-2018 మ. గం. 12.30. తెరచు తేది: 11-6-2018 మ. గం. 3.00. తదుపరి వివరాలు e-మార్కెట్ ప్రదేశం www.eprocurement.gov.in. ఫోన్ నెం. 0863- 2234256.

DIPR No. 651/CL/Advt/1/1/2018-19 సం/- డివిజనల్ అటవీ అధికారి, గుంటూరు

राष्ट्रीय इस्पात निगम लिमिटेड
RASHTRIYA ISPAT NIGAM LIMITED
(A Government of India Enterprise)
VISAKHAPATNAM STEEL PLANT
VIZAG STEEL Pride of Steel
WORKS CONTRACTS DEPARTMENT
OPEN TENDER RFx No.2600002411 DT:30.05.2018
WORK: Maintenance works of instrumentation systems in the expansion areas of Sinter Machine-3, Rolling Mills, ASP, CRMP and RMHP.
- Submission deadline date&time:**Before 3.00PM on 30.06.2018**
- Bid Opening date&time:**After 3.30PM on 30.06.2018**

Contact:Sri T Jagadeswara Rao, AGM(WC)Cell:9177161699
Email:jagadeesh@vizagsteel.com DGM(WC)I/C
For more details & corrigendums please visit regularly www.vizagsteel.com, http://www.eprocure.gov.in/epublish

APDWSC
ANDHRA PRADESH DRINKING WATER SUPPLY CORPORATION
1st Floor, Block B, Siva Durga Enclave, Besides Chanumolu Venkata Rao Flyover, KT Road, Vidhyadharapuram, Vijayawada, Andhra Pradesh
REQUEST FOR QUALIFICATION
Request for Qualification is invited for "Taking up Drinking Water Projects with an estimated cost of Rs. 9,400.00 Crores under Public Private Partnership (PPP) - Hybrid Annuity mode in 5 districts Viz., YSR Kadapa, Kurnool, Ananthapuramu, Chittoor and SPSR Nellore districts. Interested agencies can view and download the RFQ document from at www.tender.apeprocurement.gov.in from June 07, 2018. Contact details / email: mdapdwsc@gmail.com / Phone: +91 83749 99571.
Sd/-
Managing Director, APDWSC

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VIZAG ...ahead
ape-Procurement
Tender Notice NIT:04/2018-19/CE/SE/EE(PL&C)/ GVMC, Dt:01-06-2018
Name of the work: 1) Improvements and Providing Infrastructural facilities to the existing GVMC Park at VUDA Colony Phase-2, Gandhinagar, Sivalayam Children Park at Ward No.52 of Zone-V in Gajuwaka area under 14th Finance Commission Grant. ECV for Rs.59,25,230/-
స్వచ్ఛ భారత్

Down loading Starting Date	: 01.06.2018 at 05.30 PM
Down loading End Date	: 18.06.2018 at 02.30 PM
Last date of Submission of Bid	: 18.06.2018 at 03.00 PM
Date of opening of Technical Bid	: 18.06.2018 at 03.01 PM
Date of opening of Price Bid	: 20.06.2018 at 03.00 PM

Note: For further details visit http://www.apeprocurement.gov.in
Contact: Exe.Engineer (PL&C) : 7729995916
Sd/- xxx For COMMISSIONER GVMC
స్వచ్ఛ ఆంధ్ర / స్వచ్ఛ విశాఖ
స్వచ్ఛ విశాఖ మన లక్ష్యం - స్వచ్ఛ ఆంధ్ర మన గమ్యం

‘అగ్రి’ బాధితులకు న్యాయం చేస్తా

- అధికారంలోకి రాగానే రూ.1100 కోట్లు ఇస్తా
- తణుకు సభలో జగన్ ప్రకటన

ఈనాడు డిజిటల్ - ఏలూరు

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో ప్రదర్శనగా వస్తున్న జగన్

‘అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం. రూ.1100 కోట్లు విడుదల చేస్తే 80 శాతం మందికి లబ్ధి చేకూరుతుందని గతంలో శాసనసభలో చెప్పాం. కానీ ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ మొత్తం విడుదల చేస్తాం. మిగిలిన వారికి అగ్రి గోల్డ్ ఆస్తులు అమ్మి సొమ్ము ఇస్తాం’ అని వైకాపా అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలంలో మంగళవారం ప్రజాసంకల్ప యాత్ర సాగింది. తణుకులో సాయంత్రం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ‘చంద్రబాబు ఏ చిన్న పని చేసినా పెద్ద ప్రచారం చేసుకుంటారు. కానీ ఇటీవల తెల్లవారుజామున 3గంటల సమయంలో దిల్లీ వెళ్లి అగ్రి గోల్డ్ ఆస్తుల విషయమై ఓ సంస్థతో సంప్రదింపులు జరిపారు. ఆ వార్తను మాత్రం ఏ పత్రికలోనూ రాకుండా చేసుకోగలిగారు. ఎందుకంటే అగ్రి గోల్డ్ ఆస్తుల మొత్తం మార్కెట్ విలువ రూ.30వేల కోట్లు. కానీ దానిని రూ.4వేల కోట్లేనని చెబుతూ కాజేయాలని ప్రయత్నిస్తున్నారు. నేను అధికారంలోకి వచ్చిన వెంటనే వీరందరినీ జైలుకు పంపిస్తా. వేలికి ఉంగరం, చేతికి గడియారం, మెడలో బంగారం వేసుకోనని చంద్రబాబు చెబుతుంటారు. కానీ రూ.4 లక్షల కోట్ల విలువైన ఆస్తులు, హైదరాబాద్‌లో రాజ భవనం, రూ.వేల కోట్ల విలువ చేసే హెరిటేజ్ సంస్థ ఉంటుంది. సెల్‌ఫోన్, కంప్యూటరును తానే తెచ్చానని చంద్రబాబు చెబుతారు. సత్య నాదెళ్లకు శిక్షణ ఇచ్చానని, సింధుకు బాడ్మింటన్ నేర్పానని చెబుతుంటారు. కానీ తన కుమారుడికి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ అందించలేక పోయారు. తణుకు నియోజకవర్గంలోని ఇరగవరం మండలంలో ఇరువర్గాల ఘర్షణలో న్యాయబద్ధంగా కేసులు నమోదు చేసిన ఎస్సైని నేలపై కూర్చోబెట్టి నిర్బంధించిన ఘనత స్థానిక నాయకులది. అలాంటి నాయకులను జైల్లో వేయకుండా చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారంటే పాలన ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. నిడదవోలు ప్రాంతంలో నదీ గర్భంలో 10 నుంచి 20 అడుగుల లోపలివరకూ ఇసుకను తవ్వేస్తున్నారు. అదంతా తణుకు మీద నుంచే తరలిస్తున్నారు. దానికి స్థానిక ఎమ్మెల్యేకు రూ.లక్షల్లో ముట్టజెబుతున్నారు’ అని జగన్ ధ్వజమెత్తారు.

మూడు వర్సిటీల ఉపకులపతుల నియామకంలో జాప్యం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మూడు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సెర్చ్ కమిటీ సిఫార్సులు చేసినా ఇంతవరకు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు కార్యాలయంలోనే సీల్డ్ కవర్‌లు మగ్గుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 9న రాయలసీమ, విక్రమసింహపురి, జవహర్‌లాల్‌నెహ్రూ సాంకేతిక వర్సిటీ (కాకినాడ), ఉపకులపతుల పదవీకాలం ముగిసింది. వీరి స్థానంలో ఇన్‌ఛార్జిలను నియమించిన ఉన్నత విద్యాశాఖ కొత్తవారి ఎంపికలో మాత్రం జాప్యం చేస్తోంది. ఎంపిక ప్రక్రియకు మూడు నెలలు సమయం పడుతుందని భావించిన ఉన్నత విద్యామండలి ముందుగానే వివరాలను ఉన్నత విద్యాశాఖకు పంపించింది. సెర్చ్ కమిటీ నియమించిన అధికారులు ఆ కమిటీ సిఫార్సులను మాత్రం పట్టించుకోలేదు. జేఎన్‌టీయూ కాకినాడకు సెర్చ్ కమిటీ ముగ్గురు పేర్లు సిఫార్సు చేయగా..వీరిలో ఎవరిపైనా ప్రభుత్వానికి ఆసక్తి లేనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరోమారు సెర్చ్ కమిటీ వేస్తారా? లేక మొదటి సిఫార్సు చేసిన వారిలోని పేర్లనే గవర్నర్‌కు సిఫార్సు చేస్తారా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ఇదిలా ఉండగా.. శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ వీసీ ఇటీవల రాజీనామా చేయడంతో అక్కడ ఖాళీ ఉంది.

హత్యకు గురైన ఉదయభాను, వినోద్ కుమార్ ★ నిందితుడు ఆనంద్

కర్నూలులో భార్య, మూడేళ్ల కుమారుడిని చంపిన భర్త

హతురాలు 3 నెలల గర్భిణి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కట్టుకున్న భార్యను, కడుపులో ఉన్న బిడ్డను, అభం శుభం తెలియని మూడేళ్ల కుమారుడిని చంపేశాడో దుర్మార్గపు భర్త. కర్నూలు బళ్లారి చౌరస్తా సమీప సంపత్‌నగర్‌లో భర్త చేతిలో డి.ఉదయ భాను(23), వినోద్ కుమార్ అలియాస్ పండు (3) మంగళవారం దారుణ హత్యకు గురయ్యారు. పాణ్యం మండలం బలపనూరుకు చెందిన ఉస్సేనయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె ఉదయభానుకు నాలుగేళ్ల క్రితం ప్రకాశం జిల్లా బైనపల్లికి చెందిన ఆనంద్‌తో వివాహం జరిగింది. కొంతకాలంగా ఆనంద్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. మద్యం తాగడం మరో మహిళతో చనువుగా ఉండటం గుర్తించిన భార్య ప్రశ్నించటంతో వారి మధ్య గొడవ మొదలైంది. దీంతో అదనపు కట్నం తెస్తేనే కాపురం చేస్తానని అతడు బెదిరించడం మొదలుపెట్టాడు. ఆమె పలుమార్లు పుట్టింటి నుంచి కొంత డబ్బు తెచ్చి ఇచ్చినా తీరు మారలేదు. ఏకంగా మరో మహిళను ఇంటికే తీసుకురావడంతో గొడవలు తీవ్రమయ్యాయి. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన అతడు మంగళవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో అందరికీ ఫోన్ చేసి తన భార్య, కుమారుడు చనిపోయారని, ఎవరో చంపేశారని కట్టుకథలు చెప్పాడు. పోలీసుల దర్యాప్తులో అతడే చంపినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి.

బీడీ రూపాయి.. బియ్యం రూపాయేనా..!

- రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబే మరోసారి సీఎం కావాలి: ఎంపీ జేసీ

యాడికి, న్యూస్‌టుడే: ఐదు నిమిషాలు కాల్చిపడేసే బీడీ ఖరీదు రూపాయి... మార్కెట్‌లో రూ.20కి కొని చౌకదుకాణాల్లో ఇచ్చే బియ్యం విలువ రూపాయేనా..? అంటూ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అనంతపురం ఎంపీ నియోజకవర్గ పరిధిలోని నాయకులను, కార్యకర్తలను కలుసుకోవడంలో భాగంగా ఆయన మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించారు. యాడికిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. బీడీ తాగి మరణించినా.. తిరిగి చంద్రన్న బీమా ద్వారా ప్రభుత్వం ఆదుకుంటోందని, ప్రజలకు ఇంతకంటే ఎక్కువ ఎవరూ చేయలేరని అన్నారు. చంద్రబాబు నాయుడుకు ఐదు తరాలు తిన్నా తరగని ఆస్తులు ఉన్నాయనీ, ఆయన సీఎంగా లేకపోయినా బాగా బతకగలరనీ.. అయినా రాష్ట్రం బాగుపడాలంటే ఆయనే మరోసారి సీఎం కావాలని జేసీ పేర్కొన్నారు. తాగు, సాగునీటికి కొరత లేకుండా చేస్తున్నారని ఇన్ని చేస్తున్నా ప్రజలు ఆయనను మరచిపోతే అంతకన్నా కృతఘ్నులు ఎవరూ ఉండరన్నారు. వైఎస్ జగన్ తనకు చిన్నప్పటి నుంచి తెలుసనీ, అతనికి ప్రజా సమస్యలపై సరైన అవగాహన లేదన్నారు. వాటిపై అవగాహన పెంచుకొని ప్రజల్లోకి తీసుకెళ్లే శక్తి కూడా ఆయనకు లేదన్నారు. ప్రేమలకు, పెళ్లిళ్లకు కులాలు, మతాలు లేవనీ ఓట్ల వరకు వచ్చే సరికి అభ్యర్థి గుణం కంటే కులానికి, మతానికి ప్రాధాన్యం ఇవ్వడం మంచి పద్ధతి కాదని ఆయన తెలిపారు.

పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలి: శిద్దా

ఈనాడు, దిల్లీ: ప్రజలందరూ పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ మంత్రి శిద్దా రాఘవరావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారమిక్కడ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు అటవీ విభాగంలో అనేక కార్యక్రమాలు చేపట్టి పచ్చదనం పెంచడానికి కృషి చేస్తున్నారని, ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ముందుకెళ్లాలని ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఎక్కువ కాలుష్యం విడుదల చేసే పరిశ్రమలపై దృష్టి పెట్టామని, పర్యావరణ హిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

భాజపాను తరిమికొడతాం

- దమ్ము, ధైర్యం ఉంటే చేసిన ఆరోపణలు నిరూపించండి
- జగన్, పవన్ కళ్యాణ్‌లకు మంత్రి లోకేష్ సవాల్

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

వినుకొండ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌ను చిన్నచూపు చూస్తే భాజపా నేతలను తరిమి తరిమి కొట్టే రోజులు వస్తాయని పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా వినుకొండ నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. శావల్యాపురం మండలంలో పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు చేశారు. వినుకొండలో నిర్వహించిన నవ నిర్మాణ దీక్ష సభలో మాట్లాడారు. రాష్ట్రాన్ని చిన్నచూపు చూసిన కాంగ్రెస్‌కు 175 నియోజకవర్గాల్లో డిపాజిట్‌లు లేకుండా చేసిన ఘనత తెలుగువారిదేనన్నారు. మన దయాదాక్షిణ్యాలతోనే భాజపాకు చెందిన ఇద్దరు నేతలు రాజ్యసభలో ఎంపీలుగా కూర్చున్న విషయం ఆ పార్టీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. మోదీ ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రతిపక్ష నేత ఏనాడూ ప్రధానికి వ్యతిరేకంగా మాట్లాడరని విమర్శించారు. జగన్మోహన రెడ్డి, పవన్‌కల్యాణ్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని.. దమ్ము, ధైర్యం ఉంటే ఆధారాలతో రావాలని వారికి సవాల్ విసిరారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా ముఖ్యమంత్రిని ప్రోత్సాహించాలని కోరారు. ఎవరైనా కులం గురించి ప్రశ్నిస్తే ఆంధ్రులం అన్నమాటే చెప్పాలన్నారు. నరేంద్రమోదీ కన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే గొప్ప పరిపాలనా అనుభవం ఉన్న నాయకుడని అన్నారు. వినుకొండ శాసనసభ్యుడు జి.వి.ఆంజనేయులు సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కదిరి శాసనసభ్యుడు చాంద్‌బాషా, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ కార్యదర్శి రామాంజనేయులు, కలెక్టరు కోనశశిధర్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా ఎంపీల రాజీనామా డ్రామాలకు అవార్డులివ్వాలి

ఈనాడు, అమరావతి: భాజపాతో కుమ్మక్కయి ఉప ఎన్నికలు రాకుండా చేసుకుంటున్న వైకాపా ఎంపీల రాజీనామాల డ్రామాలకు భాస్కర్ అవార్డులివ్వాలని మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. ఈ రెండు పార్టీలూ వారి సొంత కథతో ‘ఏ1 మరియు అరడజన్ దొంగలు’ సినిమా తీస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ఏపీ ప్రభుత్వం సమర్పించిన యూసీలు సరిగా లేవని చెప్పడానికి జీవీఎల్ నరసింహరావు ఎవరని ప్రశ్నించారు. వెనుకబడిన జిల్లాలకు కేటాయించిన రూ.వెయ్యి కోట్ల నిధులకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన యూసీలను కేంద్ర ప్రభుత్వశాఖలు ఆమోదించిన విషయం తెలియదా? అని నరసింహారావును ప్రశ్నించారు.

ఎస్‌టీఐపీఎల్ యాజమాన్యంపై సీబీఐ కేసు

ఈనాడు, హైదరాబాద్: రివర్స్ ఓస్మోసిస్ (ఆర్వో) ప్లాంట్లు నెలకొల్పుతామంటూ రూ.28 కోట్ల మేర మోసగించారని ఆరోపిస్తూ... హైదరాబాద్‌కు చెందిన స్విస్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌టీఐపీఎల్) యాజమాన్యంపై సీబీఐ కేసు నమోదు చేసింది. వీరికి సహకరించిన కేంద్ర ప్రభుత్వ సంస్థ అధికారులనూ నిందితులుగా పేర్కొంది. 2012లో చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, వరంగల్ జిల్లాల్లో ఆర్వో ప్లాంట్లు పెట్టేందుకని... ఎస్‌టీఐపీఎల్ సంస్థ దిల్లీకి చెందిన ఇరిగేషన్ అండ్ వాటర్ రిసోర్సెస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐడబ్ల్యూఆర్ఎఫ్‌సీఎల్)ను సంప్రదించింది. ఒక్కో ప్లాంటుకు రూ.7.5 లక్షల చొప్పున.. మొత్తం 500 ప్లాంట్ల ఏర్పాటుకు రూ.37.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు ఇచ్చింది. రూ.9.5 కోట్లను సొంత పెట్టుబడిగా చూపుతూ, మిగతా రూ.28 కోట్లను ఆ సంస్థ నుంచి రుణంగా పొందింది. ఉభయ సంస్థల ప్రతినిధులు కుమ్మక్కయి, ప్లాంట్లు పూర్తి కాకముందే తప్పుడు పత్రాలతో రుణ మొత్తాన్ని కొల్లగొట్టినట్లు సీబీఐకి సమాచారం అందింది. అధికారులు దర్యాప్తు జరిపారు. ఎస్‌టీఐపీఎల్ డైరెక్టర్లు బి.దేవాథ్ రెడ్డి, సౌజన్యలతో పాటు... ఐడబ్ల్యూఆర్ఎఫ్‌సీఎల్ ఏజీఎం సంజీవ్‌కుమార్ అగర్వాల్, మేనేజర్లు అజయ్ ప్రతాప్‌సింగ్, నేహాశర్మలపై కేసు నమోదు చేశారు.

ఉద్యాన పంటల కృషీవలుడు.. ‘అనంత’ రైతుకు జాతీయ అవార్డు

‘ఫెలో ఆఫ్ ఛాయ్’ అవార్డు అందుకుంటున్న అనంతరం జిల్లా రైతు రామ్మోహన్‌చౌదరి (కుడి)

ఈనాడు, దిల్లీ: కరవు జిల్లా అనంతపురానికి 20ఏళ్ల క్రితమే సూక్ష్మసేద్యాన్ని పరిచయం చేసి, రెండు దశాబ్దాలుగా ఉద్యాన పంటల విస్తృతికి పాటుపడిన రైతు మండా రామ్మోహన్‌చౌదరికి కాన్ఫెడరేషన్ ఆఫ్ హార్టికల్చర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఛాయ్) 2018 సంవత్సరానికి ఫెలో ఆఫ్ ఛాయ్ పురస్కారాన్నిచ్చి సత్కరించింది. బిహార్‌లోని సమస్థీపూర్‌లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ అగ్రికల్చర్ యూనివర్శిటీలో ‘జీవనయానం, గ్రామీణాభివృద్ధికి అనువుగా సాగులో వైవిధ్యం, విస్తరణ’ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు సందర్భంగా రామ్మోహన్‌కు ఈ అవార్డునిచ్చి సత్కరించారు.

అనంతపురం జిల్లా నార్పల మండలం గంగనపల్లికి చెందిన రామ్మోహన్‌చౌదరి వినూత్న ఆలోచనలతో వ్యవసాయం కొనసాగిస్తున్నారు. అనంతపురం జిల్లాకు 1996లో తొలిసారి సూక్ష్మసేద్యాన్ని, టిష్యూకల్చర్ అరటిని ఆయన పరిచయం చేశారు. తెగుళ్లను తట్టుకొనేలా కర్బూజా, పుచ్చపంట సాగును మొదలుపెట్టి తోటి రైతులకూ అవగాహన కల్పించారు. దానిమ్మ సాగులో ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ రైతుగా పేరొందారు. కరివేపాకు, బత్తాయి, పూలు, కూరగాయల సాగులో విస్తృత ప్రయోగాలతోపాటు తోటిరైతులను ప్రోత్సహించినందుకు గుర్తింపుగా భారతీయ ఉద్యానవన సంఘాల సమాఖ్య ఆయనకు ఈ అవార్డు అందజేసింది. జాతీయ ఉద్యానశాఖ సంచాలకులు బి.ఎన్.ఎస్ మూర్తి ఆయనకు అవార్డుతోపాటు, ప్రశంసాపత్రం అందించి సత్కరించారు.

ప్రభుత్వ ఆధీనంలోనే ఇసుక రేవులు

- జిల్లా స్థాయిలో కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యతలు
- ఇసుక విధానంలో మార్పులకు ప్రతిపాదనలు సిద్ధం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ఇసుక ర్యాంపులన్నింటినీ ప్రభుత్వ ఆధీనంలోనే నడిపే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. జిల్లా స్థాయిలో వీటి పర్యవేక్షణ బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించాలని యోచిస్తోంది. నిర్వహణ కోసం ఒక్కో ర్యాంపునకు ఒక్కో అధికారిని నియమించాలని భావిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న ఇసుక విధానంలో ఈ మేరకు పలు కీలకమైన మార్పులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

- ★ వినియోగదారుడు ఫోన్ ద్వారానే ఇసుకను బుక్ చేసుకోవచ్చు.
- ★ వినియోగదారులకు ఉచితంగానే అందిస్తారు. సరఫరా చేయడానికి అవసరమైన రవాణా సదుపాయాన్ని కలెక్టర్లే ఏర్పాటు చేసి... అందుకయ్యే ఖర్చులను వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు.
- ★ అన్ని ర్యాంపుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. వినియోగదారుడి పేరు మీద ఇతరులు ఇసుక తీసుకెళ్లకుండా ఉండేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటారు.
- ★ మధ్యవర్తి జోక్యాన్ని నియంత్రించేందుకు బుక్ చేసుకున్న వినియోగదారుడి ఫోన్ నెంబరుకే ఓటీపీ పంపించే విషయాన్ని పరిశీలిస్తున్నారు. ఆధార్ నెంబరును అనుసంధానించాలని యోచిస్తున్నారు.
- ★ ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను జీపీఎస్‌తో అనుసంధానించి పర్యవేక్షిస్తారు.
- ★ పరిష్కార వేదిక 1100 ద్వారా వినియోగదారుడిని సంప్రదించి సమాచారం సేకరిస్తారు.

కర్ణాటక ఎన్నికల్లో అక్రమాలపై విచారణ

హీరా గ్రూప్ కార్యాలయంలో సోదాలు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరం బంజారాహిల్స్‌లోని హీరా గ్రూప్ సంస్థ కార్యాలయంలో కర్ణాటక పోలీసులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు కార్యాలయంలో తనిఖీలు చేస్తూ.. హీరా గ్రూప్ నిర్వాహకురాలు నౌహరా షేక్‌ను పలు కోణాల్లో విచారించినట్లు సమాచారం. మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ(ఎంఈపీ)ని స్థాపించిన నౌహరా షేక్ కర్ణాటక ఎన్నికల్లో ఎంఈపీ తరపున సీట్లు అమ్ముకున్నారని ఆరోపణలు రావడంతో బెంగళూరు ఇందిరానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై కేసు నమోదైంది. బెంగళూరులోని పలు పీఎస్‌లలో ఆమెపై ఐపీసీ 420, 406, 506 రెడ్‌విత్ 34 కింద కేసులు నమోదయ్యాయి. గతంలో పలు రాష్ట్రాల్లో నౌహరాషేక్‌పై పలు చీటింగ్ కేసులు నమోదయ్యాయి. రూ.లక్షకు నెలకు రూ.3 వేల వడ్డీ పేరుతో హీరా గోల్డ్ స్కీములు పెట్టినట్లు తెలియవచ్చింది. దేశవ్యాప్తంగా హీరాగోల్డ్ కంపెనీకి వేలాది మంది డిపాజిటర్లున్నారు. ఆర్‌బీఐ, సెబీ అనుమతి లేకుండా మనీ స్కీములు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎంఈపీ నేత నౌహరా షేక్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

కర్ణాటక మంత్రివర్గ విస్తరణ నేడే

ఈనాడు, బెంగళూరు: కన్నడనాట హెచ్.డి.కుమారస్వామి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ మంత్రివర్గ తొలి విస్తరణ బుధవారం చేపడుతున్నారు. బెంగళూరు రాజ్‌భవన్‌లో మధ్యాహ్నం రెండింటికి జరగనున్న నిరాడంబర కార్యక్రమంలో గవర్నర్ వజుభాయివాలా కొత్త మంత్రులతో ప్రమాణాలు చేయించనున్నారు. ముందు జాగ్రత్త దృష్ట్యా రెండు విడతల్లో మంత్రివర్గాన్ని విస్తరించాలని మిత్రపక్షాలు కాంగ్రెస్, జనతాదళ్ తీర్మానించినట్లు సమాచారం. బుధవారం రెండు పార్టీలకు చెందిన 25కంటే ఎక్కువ మంది మంత్రులుగా ప్రమాణాలు చేయనున్నారు. నియమావళి ప్రకారం మంత్రివర్గ సభ్యుల సంఖ్య 34 దాటరాదు. ప్రస్తుత మంత్రివర్గ ఖాళీల సంఖ్య 32. గత నెల 23న కుమారస్వామి ముఖ్యమంత్రిగా, పరమేశ్వర్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణాలు చేశారు. జేడీఎస్ ఎమ్మెల్యేలు ఏడెనిమిది మంది, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 17 మంది మాత్రమే మంత్రులుగా ప్రమాణాలు చేస్తారని రెండు పార్టీల ప్రముఖులూ తెలిపారు. దళ్ తరపున మంత్రుల జాబితాను దళపతి దేవేగౌడ, కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఖరారు చేశారు.

దీక్షల పేరుతో అభివృద్ధిని విస్మరిస్తున్నారు: మాధవ్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు దీక్షల పేరుతో అభివృద్ధిని విస్మరిస్తున్నారని భాజపా ఎమ్మెల్సీ మాధవ్ విమర్శించారు. నవ నిర్మాణ దీక్ష పేరుతో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ కేంద్రాన్ని దుయ్యబట్టడానికి, ప్రధాని మోదీని తీవ్ర పదజాలంతో దూషించడానికి వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలపై అత్యాచారాలకు ప్రధాని మోదీ ఉసిగొల్పుతున్నారని మంత్రి అఖిల ప్రియ మాట్లాడటం సభ్య సమాజానికే సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

ఏపీ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవద్దు

- కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణానదీ యాజమాన్య బోర్డులో చర్చకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన అంశాలను పరిగణలోకి తీసుకోవద్దని తెలంగాణ నీటిపారుదల శాఖ సూచించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాశారు. కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఎనిమిదవ సమావేశం బుధవారం జరగనుంది. ఈ సమావేశానికి అజెండాను బోర్డు ఖరారు చేసింది. రెండు రాష్ట్రాల నుంచి అజెండాలో చేర్చాల్సిన అంశాలపై బోర్డు ప్రతిపాదనలు కోరింది. వచ్చిన ప్రతిపాదనల్ని అజెండాలో చేర్చలేదు. అయితే అధ్యక్షుడు అనుమతి ఇస్తే సమావేశంలో వీటిని చర్చించే అవకాశం ఉంది. గోదావరి నుంచి కృష్ణాలోకి మళ్లించిన 214 టీఎంసీలు, భక్తరామదాసు, మిషన్‌భగీరథ, బోర్డు పరిధి, కొత్త ప్రాజెక్టులు ఇలా పలు అంశాలను అజెండాలో చేర్చాలని ఏపీ కోరింది. ఈ అంశాలపై సిద్ధం కావడానికి తగిన సమయం లేకుండా చివర్లో వచ్చినందున అజెండాలో చేర్చవద్దని తెలంగాణ కోరినట్లు తెలిసింది. తెలంగాణ తరపున ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేందరరావు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఏపీ ప్రతిపాదనలు చేర్చకుంటే తెలంగాణ అంశాలకు ఆ రాష్ట్రం అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఏపీ తరపున కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు హాజరుకానున్నారు. మరోపక్క.. పోలవరం ప్రాజెక్టు వల్ల తమ రాష్ట్రాల్లో ముంపు ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న ఒడిశా, తెలంగాణలు దీనిపై సంయుక్త కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి.

రాష్ట్రంలో పట్టణీకరణ పెంపునకు కృషి

- మంత్రి నారాయణ

మంగళగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పట్టణీకరణ పెంచటానికి కృషి జరుగుతోందని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన నవనిర్మాణ దీక్షలో పాల్గొన్న ఆయన సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పురపాలక సంఘాలకు సమీపాన ఉన్న గ్రామాలను కలుపుకొని పట్టణీకరణ పెంచటానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు. పెద్ద పంచాయతీలను పురపాలక సంఘాలుగా మార్చాలని ఆదేశించారని తెలిపారు. ఈ రెండు అంశాలపైన మున్సిపల్‌శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారని నారాయణ చెప్పారు. రాష్ట్రంలో పట్టణీకరణ తక్కువగా ఉందని అది పెరిగితే కేంద్రం నుంచి నిధులు రావటానికి ఆస్కారం ఉంటుందన్నారు. ‘రాజధాని అమరావతి నిర్మాణానికి 48వేల కోట్లు ఖర్చవుతుంది. రూ.24వేల కోట్ల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో రూ.6వేల కోట్ల పనులు టెండర్లు పిలుస్తున్నాం. రాజధానిలో 3540 అపార్టుమెంట్లు నిర్మిస్తున్నాం...డిసెంబరు నాటికి అవి పూర్తవుతాయి. రైతు కూలీలకు 7వేల ఇళ్లు నిర్మిస్తున్నాం. మార్చికి పూర్తవుతాయని’ మంత్రి చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో 7.37లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని, కొన్ని చోట్ల స్థలాల కొరత ఉందని తెలిపారు. అవసరమైన చోట స్థలం కొనుగోలు చేసి ఇళ్లు కట్టించాలని ముఖ్యమంత్రి కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.

ఈనాడు
its@eenadu.in
ఈనాడు 7
బుధవారం జూన్ 6, 2018
విజయవాడ

బుల్లి 'జేబీఎల్'

పోర్టబుల్ స్పీకర్ల జాబితాలో మ్యూజిక్ ప్రియుల్ని ఎంతగానో ఆకట్టుకుంటున్న జేబీఎల్ మరో కొత్త వెర్షన్ బ్లూటూత్ స్పీకర్‌ని దేశీయ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. అదే జేబీఎల్ గో2. నాణ్యమైన ఆడియో అవుట్‌పుట్‌తో వాటర్‌ప్రూఫ్ కవచంతో ముందుకొచ్చింది. దీంతో వచ్చే వానా కాలమంతా మ్యూజిక్ జడిలో మునిగితేలడమే. సముద్ర తీరాల్లో... కెరటాల అంచుల్లోనూ... మ్యూజిక్ ట్రాక్స్‌తో మస్తీ చేయొచ్చు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఐదు గంటలు మ్యూజిక్ వినిపిస్తుంది. బిల్ట్‌ఇన్ మైక్రోఫోన్‌తో ఫోన్ కాల్స్ మాట్లాడొచ్చు. బయటి శబ్దాల్ని అడ్డుకుని ఫోన్ మాట్లాడుతున్న వారి మాటల్ని మాత్రమే వినిపిస్తుంది. 12 రంగుల్లో స్పీకర్లను అందిస్తున్నారు. ☛ ధర రూ.2,999

అదిరే హెడ్‌ఫోన్

తోలుతో డిజైన్ చేసిన హెడ్‌బ్యాండ్‌తో ఆకట్టుకునేలా ముందుకొచ్చింది Ambrane WH-1100 హెడ్‌ఫోన్. బ్లూటూత్ నెట్‌వర్క్‌తో ఫోన్, ఇతర గ్యాడ్జెట్‌లో జతకట్టి మ్యూజిక్ వినిపిస్తుంది. 10 మీటర్ల వరకూ నెట్‌వర్క్‌ని అందుకుంటుంది. ఫుల్ ఛార్జ్ చేస్తే 8 గంటల పాటు పని చేస్తుంది. బ్యాటరీ సామర్థ్యం 300ఎంఏహెచ్. 'క్విక్‌ఛార్జ్'తో 90 నిమిషాల్లోనే ఫుల్‌ఛార్జ్ అవుతుంది. మైక్రోఫోన్‌తో ఫోన్‌కాల్స్ మాట్లాడొచ్చు. హెడ్‌సెట్‌కి ఒకవైపు వాల్యూమ్ కంట్రోల్స్‌ని కూడా ఏర్పాటు చేశారు.

☛ ధర రూ.2,199

ప్రశ్న - జవాబు

యూట్యూబ్ ఛానల్ పెట్టాలంటే?

● యూట్యూబ్ ఛానల్‌ని స్టార్ట్ చేద్దాం అనుకుంటున్నా. వీడియోలు అప్‌లోడ్ చేయడం... వాటిని పబ్లిష్ చేసి డబ్బు సంపాదించేందుకు ఉన్న మార్గాల్ని తెలుపగలరు?
– వంశీకృష్ణ

జీమెయిల్ ఎకౌంట్‌తోనే యూట్యూబ్ ఛానల్ క్రియేట్ చేసుకోవచ్చు. ఎకౌంట్ క్రియేట్ చేయగానే జీమెయిల్, గూగుల్ డ్రైవ్ యాక్సెస్ వచ్చేస్తుంది. ఛానల్ పేరు, ఇతర వివరాల్ని ఎంటర్ చేసి హోం పేజీలోని ఛానల్ ఇంటర్ఫేస్‌ని అర్థం చేసుకోవాలి. చిత్రీకరించిన వీడియోలను జాబితాగా పెట్టుకుని హోం పేజీలోని అప్‌లోడ్ ఆప్షన్‌తో ఛానల్‌లో పెట్టొచ్చు. అప్‌లోడ్ చేసే క్రమంలో వీడియోలకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా ఎంటర్ చేయాలి. ఆ వివరాలతోనే ఛానల్‌లో పొందుపరిచిన వీడియోలు వీక్షకులు వెతికనప్పుడు ముందుకొస్తాయి. ఛానల్‌లో పెట్టే వీడియోలు మీదైన ప్రత్యేకతతో ఉండాలి. అలాగే, ఎక్కువ మంది ఛానల్‌ని చూడాలంటే ఎప్పటికప్పుడు వీడియోలు అప్‌లోడ్ చేస్తుండాలి. అప్పుడే ఛానల్ ఎక్కువ మందిని చేరుతుంది. ఛానల్‌ని సబ్‌స్క్రైబ్ చేసేందుకు ఇష్టపడతారు. మీరు వాడే సోషల్ నెట్‌వర్క్‌ల్లోనూ ఛానల్‌ని పబ్లిసిటీ చేయాలి. వీడియోలను లింక్‌లతో షేర్ చేస్తుండాలి. ఛానల్‌ని చూస్తున్న వీక్షకుల ఆధారంగా గూగుల్ యాడ్‌సెన్స్ ద్వారా డబ్బు సంపాదించేందుకు వీలుంది. ఈ మొత్తం ప్రాసెస్‌కి సమర్థంగా చేసేందుకు మీకు కంప్యూటర్ పరిజ్ఞానం తెలుసుండాలి.

– యశస్విన్ రెడ్డి, www.rdp.in

కొత్త సంగతి

సూపర్ బ్యాటరీ

సువిశాల ప్రపంచం చిన్నదవుతోంది! అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల ఆవిష్కరణలతో రోజురోజుకీ కుంచించుకుపోతోంది!! స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్, ల్యాప్‌టాప్‌ల వంటి పరికరాల రూపంలో ఇప్పుడు అరచేతిలోనే ఇమిడిపోతోంది. ఒకవైపు వీటితో ప్రపంచంలోని సమస్త సమాచారం, సమస్త విజ్ఞానం క్షణాల్లో కళ్ల ముందు కదలాడుతుంటే.. మరోవైపు ఆయా పరికరాలు అత్యంత వేగంగా, సుదీర్ఘంగా పనిచేయాల్సిన అవసరమూ పెరుగుతోంది. అంతేకాదు, మరింత త్వరగా.. క్షణాల్లో శక్తిని నింపుకోవాల్సిన (ఛార్జింగ్) అగత్యమూ ఏర్పడుతోంది. దీనికి పరిష్కారం చూపటానికే కార్నెల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు వినూత్న '3డీ బ్యాటరీ'ల నిర్మాణానికి బీజం వేశారు. ఇవి చాలా త్వరగా ఛార్జింగ్ అవుతాయి. అందుకే వీటిని పెద్దఎత్తున తయారుచేసి, అందరికీ అందుబాటులోకి తెస్తే ఛార్జింగ్ కష్టాలన్నీ తీరినట్టేనని భావిస్తున్నారు.



ఏంటీ ప్రత్యేకత?

మామూలు బ్యాటరీల్లో మూడు భాగాలు- ఒక చివర యానోడ్, మరో చివర కాథోడ్, మధ్యలో ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. లోపల జరిగే రసాయనిక చర్యల ఫలితంగా యానోడ్ వద్ద పోగుపడిన ఎలక్ట్రాన్లు నిరంతరం కాథోడ్ వైపునకు వెళ్లాలని ప్రయత్నిస్తుంటాయి. కానీ మధ్యలో ఎలక్ట్రోలైట్లు అడ్డుగా ఉండటం వల్ల ఈ రెండు చివర్లను అనుసంధానించే సర్క్యూట్ ద్వారా అవతలి వైపునకు చేరుకుంటాయి. ఈ క్రమంలోనే బల్బులు వెలగటం, ఫోన్ ఛార్జింగ్ కావటం వంటివి జరుగుతాయి. అయితే కొత్తరకం బ్యాటరీ దీనికి పూర్తిగా భిన్నం. దీని లోపల వర్తులంగా చుట్టుకుంటూ వెళ్లే మార్గాలతో కూడిన ప్రత్యేక 3డీ నిర్మాణముంటుంది. ఇందులోనే యానోడ్లు, కాథోడ్లు ఒకదాంతో మరొటి కలిసిపోయి ఉంటాయి. శక్తిని నిల్వ చేసుకోవటానికి, పంపిణీ చేయటానికి అతి సూక్ష్మమైన రంధ్రాలు తోడ్పడుతుంటాయి. కర్బన పదార్థంతో రూపొందించిన 3డీ వర్తుల నిర్మాణం తనకు తానే అవసరానికి అనుగుణంగా అమరికను మార్చుకోగలదు కూడా. వీటన్నింటినీ నానో స్థాయిలోకి తీసుకురావటం వల్ల విద్యుత్తు సాంద్రత కూడా గణనీయంగా పెరగటానికి అవకాశం ఏర్పడింది. అందువల్ల సంప్రదాయ బ్యాటరీల కన్నా ఇది చాలా తక్కువ సమయంలోనే శక్తిని నింపుకొంటుంది. ఇంకా చెప్పాలంటే- ఛార్జర్‌ను సాకెట్‌లో పెట్టిన మరుక్షణమే బ్యాటరీ ఛార్జ్ అవుతుందన్నమాట. ఈ పరిజ్ఞానాన్ని పరిశోధకులు మరింత మెరుగ్గా తీర్చిదిద్దటానికి ప్రయత్నిస్తున్నారు.

ఫోన్.. రివర్స్ గేర్

● పొద్దునే వ్యాయామానికి వెళ్లాలి. చాటంత స్మార్ట్‌ఫోన్‌నో... ఖరీదైన ఐఫోన్‌నో వెంట తీసుకెళ్తే. పద్ధతిగా పట్టుకోవాలి... పదే పదే వచ్చే నోటిఫికేషన్లని చూడాలి. ఓ చెత్తో పట్టుకుని మరో చేత్తో ఒత్తాలి... విసుగొస్తుంటుంది!!

● రద్దీగా ఉన్న వీధిలో నడిచి వెళ్లాలి. అదీ ఫోన్ మాట్లాడుతూ. ఎవరో జనంలో డ్యాష్ ఇచ్చారు. ఖరీదైన ఫోన్ కింది పడుతుంది. ఒక్కసారి గుండెఝల్లుమంటుంది!!

..ఆ క్షణం మీకేమనిపిస్తుంది? 'ఎంచక్కా బుడ్డి ఫోన్‌గానీ... బేసిక్ ఫోన్‌గానీ అయితే బాగుంటుందని' యస్.. కరెక్టే. మీరే కాదు. చాలా మంది ఇలానే ఆలోచిస్తున్నారు. అవయవాల్లో ఒక్కటైనట్టుగా అంటిపెట్టుకుపోయిన పెద్ద పెద్ద స్మార్ట్‌ఫోన్లపై వినియోగదారులు బ్రేక్ తీసుకోవాలన కుంటున్నారు. వారిని వశపరుచుకునేలా కాకుండా... ప్రశాంత పరిచే ఫోన్లకై వెతుకున్నారు! ప్రైవసీకి భంగం కలగకుండా హుందాగా నడుచుకునే ఫోన్లకై చూస్తున్నారు. అవెలా ముస్తాబవు తున్నాయంటే?

చూడ్డానికి అచ్చంగా స్మార్ట్‌ఫోన్‌లానే.. నాజూకుగా.. నాలుగు పలకలుగా... ఫినిషింగ్ చూసి ఫిదా అవ్వాల్సిందే. కానీ, అదో బేసిక్ ఫోన్. డిస్‌ప్లే తాకేతెరలానే ఉంటుంది. కానీ, తాకేతెర కాదు. స్లీప్ మోడ్‌లో ఉన్న రంగుల ఫోనేమో అనుకుంటాం. కానీ, తాకితే రెయిన్‌బో రంగులేం కనిపించవు. కేవలం నలుపు, తెలుపే! యాప్‌ల జాడైతే వెతికినా ఎక్కడా కనిపించవు. ఫోన్ వస్తే మాట్లాడడం... మెసేజ్ వచ్చే స్పందించడం. అంతేనా? ఇవేమంత ప్రత్యేకం? గతంలో వాడిన నోకియా 3310 మోడల్ వాడాంగా అనుకుంటే పొరబాటే. దీనికంటూ కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఇంకోటి గుప్పెట్లో ఒదిగిపోతుంది. ఎంతలా అంటే... జీన్స్ ప్యాంటుకి ఉండే చిన్న జేబులో (కాయిన్ పాకెట్) పట్టేస్తుంది. మొబైల్ ప్రియుల సున్నితమైన సమస్యలకు పరిష్కారాలుగా ఇవి ముస్తాబై ముందుకొస్తున్నాయి.

అప్పట్లో అలరించిన 'స్లైడ్' మళ్లీ రానుంది. కీప్యాడ్‌ని కప్పేసే తొడుగుతో కూడిన ఫోన్‌ని నోకియా కొత్తగా రూపొందించింది.

నోకియా 'నయా'

పాతతరం ఫోన్లే కదా మళ్లీ ఏం వాడతారనుకోవడం పొరబాటని నోకియా '3310' నిరూపించింది. ఇప్పుడు మరో మోడల్‌తో ఫ్లిప్ ఫోన్‌ని త్వరలో పరిచయం చేయనుంది. నోకియా '8110'తో ముస్తాబైన ఈ నాజూకైన ఫోను 4జీ నెట్‌వర్క్‌ని సపోర్ట్ చేస్తుంది. ట్రెండీ రూపం, ఆకట్టుకునే రంగులతో మిలీనియల్స్ మదిని దోచేందుకు సిద్ధం అవుతోంది. నిటారుగా లేకుండా కాస్త ఒంపు తిరిగింది. ఫోన్ వస్తే స్లైడ్‌ని కిందిగి లాగి మాట్లాడొచ్చు. స్లైడ్‌ని తిరిగి మూస్తే ఫోన్ కట్ అవుతుంది. ఫోన్‌ని వై-ఫై హాట్‌స్పాట్‌గానూ వాడుకోవచ్చు. తెర పరిమాణం 2.4 అంగుళాలు. ఎల్‌ఈడీ ఫ్లాష్‌తో 2 మెగాపిక్సల్ కెమెరా ఉంది. ర్యామ్ 512ఎంబీ. ఇంటర్నల్ మెమొరీ 4జీబీ. జీమెయిల్‌లోకి లాగిన్ అవగానే కాంటాక్ట్‌లన్నీ ఫోన్‌లోకి సింక్ అవుతాయి. బ్యాటరీ సామర్థ్యం 1500ఎంఏహెచ్. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 25 రోజుల పాటు స్టాండ్‌బైలో ఉంటుంది. డ్యూయల్ సిమ్‌లను సపోర్ట్ చేస్తుంది.

● వీడియో, ఇతర వివరాలకు https://goo.gl/mj9ao9

'లైట్' తీసుకోండి

పదే పదే మీ దృష్టి ఫోన్‌పైకి పోదు. ఎందుకంటే యాప్‌ల అలర్టులు వినిపించవు. రంగు రంగుల హైఎండ్ గ్రాఫిక్‌లు కనిపించవు... కళ్లు ఎలాంటి ఒత్తిడికి లోనవ్వవు. అదెట్టా అంటే? తెరలో కనిపించేవి రెండే రంగులు. నలుపు, తెలుపు. తక్కువ బరువుతో తనువుకీ... తేలికైన ఆప్షన్లతో మనసుకి హాయిగా అనిపిస్తుంది. ఏంటా ఫోనూ అంటారా? 'లైట్ ఫోన్ 2'. ఇదో 4జీ ఫోన్. నానో సిమ్‌ని పెట్టుకుని వాడుకోవడమే. ఈ-పుస్తక రీడర్ల తెరల్ని తయారు చేసినట్టుగానే ఈ-ఇంకుతో రూపొందించారు. అంతా నలుపు తెలుపులోనే. కాల్, మెసేజ్ వస్తేనే ఫోన్ అలర్ట్ చేస్తుంది. లేకుంటే... స్లీప్‌మోడ్‌లో వెంటే ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఏకాగ్రతకు భంగం కలిగించదు. ప్రైవసీకి చిల్లులు పెట్టే స్మార్ట్‌ఫోన్‌లా కాకుండా వినియోగదారుల విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా హుందాగా ప్రవర్తిస్తుంది. అదనంగా అందించే సౌకర్యాలేంటంటే... అలారంతో చెప్పిన సమయానికి నిద్రలేపుతుంది. మ్యూజిక్ ట్రాన్స్‌ని వినిపిస్తుంది. దారి మర్చిపోతే చెబుతుంది. వాయిస్ కమాండ్స్‌ని కూడా స్వీకరిస్తుంది. రెండే నావిగేషన్ బటన్లు ఉన్నాయి. రెండిటినీ నొక్కితూ ఆప్షన్స్‌ని స్క్రోల్ చేయొచ్చు. టైపింగ్, ఆప్షన్స్‌ని సెలెక్ట్ చేయడం అంతా తాకేతెరపై తాకినట్టుగా (టైపోగ్రాఫిక్ ఇంటర్ఫేస్) ఉంటుంది. ఫోన్ ఓఎస్ ప్రత్యేకం. 'లైట్‌ఓఎస్'. ఫోన్ కింది భాగంలో ఛార్జ్ చేసేందుకు యూఎస్‌బీ టైప్-సీ పోర్టు ఉంది. తడిసినా పాడవకుండా వాటర్‌ప్రూఫ్ రక్షణ ఉంది. ర్యామ్ 1జీబీ. ఇంటర్నల్ మెమొరీ 8జీబీ. బ్యాటరీ సామర్థ్యం 500ఎంఏహెచ్.

● వీడియో, ఇతర వివరాలకు https://goo.gl/oQzNF8

ప్రైవసీకి చిల్లులు పెట్టే స్మార్ట్‌ఫోన్‌లా కాకుండా వినియోగదారుల విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా హుందాగా ప్రవర్తిస్తుంది.

బుడ్డి 'జెల్లీ' ఫోన్

ఉదయం నడకలోనో... వ్యాయామం చేస్తున్నప్పుడో చాటంత స్మార్ట్‌ఫోన్లను తీసుకెళ్తే సౌకర్యంగా కనిపించదు. మరైతే... ప్రత్యేక బ్యాండ్‌లా మణికట్టుకో.. భుజానికో పెట్టుకునేంత స్మార్ట్‌ఫోన్ ఉంటే బాగుంటుంది అనుకునేవారికి 'జెల్లీ యునిహెర్జ్' ప్రత్యేకమైంది. జీన్ ప్యాంటు కాయిన్ పాకెట్‌లో పెట్టేస్తుంది. ఇదో 4జీ స్మార్ట్‌ఫోన్. తెర పరిమాణం ఎంతంటే 2.45 అంగుళాలు. రిజల్యూషన్ 240X432 పిక్సల్స్. బ్యాటరీతో కలుపుకుని ఫోన్ బరువు 60.4 గ్రాములు. జెల్లీ (ర్యామ్1జీబీ, ఇంటర్నల్ 8జీబీ), జెల్లీ ప్రో (2జీబీ,16జీబీ) పేర్లతో రెండు రకాలు ఉన్నాయి. డ్యూయల్ కెమెరాలు (వెనక 8 మెగాపిక్సల్, ముందు 2మెగాపిక్సల్). రెండు సిమ్‌లను సపోర్ట్ చేస్తుంది. బ్యాటరీ సామర్థ్యం 950ఎంఏహెచ్. ఆండ్రాయిడ్ 7.0 ఓఎస్ వెర్షన్‌తో పని చేస్తుంది. ఫిట్‌నెస్ పరికరంలా బిల్ట్‌ఇన్ జీపీఎస్, పెడోమీటర్లతో మీరెంత దూరం నడిచారో ట్రాక్ చేసుకుని చూడొచ్చు.

చాటంత ఫోన్‌ని పట్టుకోలేం. గుప్పెట్లో ఒదిగిపోవాలి అనుకునేవారికి ప్రత్యేకం. క్రెడిట్ కార్డంతే ఉంటుంది. అంతర్లీనంగా పొందుపరిచిన జీపీఎస్, పెడోమీటర్లతో మీరెంత దూరం నడిచారో ట్రాక్ చేసుకుని చూడొచ్చు.

● వీడియో, ఇతర వివరాలకు https://goo.gl/QxWvFC

ఎంతెంత చల్లనో!



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పట్నుంచీ కొత్త విషయాలను తెలుసుకోవాలనే కోరికతో అనవరతం రగిలిపోతూనే ఉన్నాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి విశ్వంలోనే అతి శీతలమైన చోటును సృష్టించటానికి పూనుకున్నాడు. ఇందుకు అంతరిక్షాన్నే వేదికగా చేసుకోవటం విశేషం. అలా పుట్టుకొచ్చిందే 'కోల్డ్ ఆటమ్ ల్యాబ్'. నాసా అంతరిక్ష వాహనం సైగ్నస్ ద్వారా ఇది ఇటీవలే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుంది. ఈ ప్రాజెక్టు పురుడు పోసుకోవటానికి మూలం భారతీయ-అమెరికన్ మహిళా శాస్త్రవేత్త అనితా సేన్ గుప్తా కావటం మరింత విశేషం.

కోల్డ్ ఆటమ్ ల్యాబ్

అతి శీతల ఉష్ణోగ్రతలను సృష్టించాలనే తపన ఈనాటిది కాదు. శాస్త్రవేత్తలు వందేళ్లకు పైగా వీటి కోసం అన్వేషిస్తూనే ఉన్నారు. ఈ ప్రయత్నాల్లో భాగంగానే అతి వాహకత, అతి ప్రవాహకత వంటివి ఆవిష్కృతమయ్యాయి. ఇటీవల వెలుగు చూసిన లేజర్ కూలింగ్ పద్ధతులు, బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్స్ (బీఈసీ) అణు వాయువుల పరిశీలన వంటివన్నీ దీని ఫలితాలే. అందుకే దీనిపై శాస్త్రవేత్తలకు అంత ఆసక్తి. ఇదే **అనితా సేన్ గుప్తా**ను ముందుకు దూకించింది. కోల్డ్ ఆటమ్ ల్యాబొరేటరీ ప్రాజెక్టు రూపకల్పనకు పురికొల్పింది. ఆమె 2012 నుంచి 2017 వరకూ దీనికి నేతృత్వం వహించారు. ఏరోస్పేస్ ఇంజినీర్, శాస్త్రవేత్త కూడా అయిన ఆమె 20 ఏళ్లుగా ఎన్నెన్నో పరిజ్ఞానాలను అభివృద్ధి చేశారు. బోయింగ్ స్పేస్ అండ్ కమ్యూనికేషన్స్‌లో సమాచార ఉపగ్రహాలు, రాకెట్లపై పనిచేయటంతో ఆమె తన ప్రస్థానాన్ని ఆరంభించారు. తర్వాత నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ లేబరేటరీలో పరిశోధనలు కొనసాగించారు. 2012లో అంగారకుడి మీదికి పంపించిన క్యూరియాసిటీ రోవర్‌కు అమర్చిన సూపర్‌సోనిక్ ప్యారాచూట్ వ్యవస్థను అభివృద్ధి చేసింది కూడా అనితానే..

ఏంటీ అతి శీతల స్థితి?

అతి శీతల ఉష్ణోగ్రత- పరమ శూన్య (అబ్సల్యూట్ జీరో) ఉష్ణోగ్రత. ఇది మైనస్ 273.15 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతకు (జీరో కెల్విన్) సమానం. దీని గురించి సైద్ధాంతికంగా వివరించినప్పటికీ.. శాస్త్రవేత్తలు దీన్ని ఎన్నడూ సాధించలేదు. ఎందుకంటే పదార్థం జీరో కెల్విన్ స్థాయికి చేరుతున్నకొద్దీ వేడితో పాటు శక్తినీ కోల్పోతుంది. ఇలాంటి శీతల స్థితిలో అణువులు ఒకదాంతో మరొటి అంటుకుపోయి.. ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు ఒక క్రమంలో ఇమిడిపోతాయి (బోస్ ఐన్‌స్టీన్ కండన్సేట్). అప్పుడు కణాలు తరంగాల మాదిరిగా వ్యవహరిస్తాయి. క్వాంటమ్ గుణాలను ప్రదర్శిస్తాయి. దీన్ని సాధించగలిగితే ఎన్నెన్నో వినూత్న పరికరాలు ఆవిష్కృతమవుతాయి. అందుకే శాస్త్రవేత్తలు పరమ శూన్య ఉష్ణోగ్రతలను సాధించటంపై చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్నారు.

అంతరిక్షంలో ఎందుకు?

పరమశూన్య ఉష్ణోగ్రతలను భూమ్మీద సృష్టించటం కష్టం. గురుత్వాకర్షణ శక్తి దీనికి ప్రతికూలంగా మారుతోంది. ఈ అడ్డంకిని అధిగమించటానికే కోల్డ్ ఆటమ్ ల్యాబొరేటరీని అంతరిక్షంలోకి పంపించి అధ్యయనాలు చేయాలని సంకల్పించారు. దీని ఫలితమే కోల్డ్ ఆటమ్ ల్యాబ్. ఇది అంతరిక్షంలోని శూన్యం కన్నా వెయ్యికోట్ల రెట్లు చల్లగా ఉంటుంది! అత్యంత శూన్య స్థితితో కూడిన గది, శక్తిమంతమైన లేజర్లతో కూడిన దీన్ని గురుత్వాకర్షణ రహిత స్థితిలో అతి శీతల వాయువులపై అధ్యయనం చేయటానికి వీలుగా తీర్చిదిద్దారు. ఇది వాయువులను పరమశూన్య ఉష్ణోగ్రతతో కూడిన వాతావరణాన్ని సృష్టించటమే కాదు, దాన్ని 10 సెకండ్ల పాటు అలాగే నియంత్రించగలదు కూడా. కాబట్టి అక్కడ నిర్వహించే అధ్యయనాలు కొత్త గ్రాహకాలు, క్వాంటమ్ కంప్యూటర్లు, అంతరిక్ష వాహనాలకు దిశా నిర్దేశం చేసే అణు గడియారాల వంటివి ఆవిష్కృతం కావటానికి దారితీయగలదని భావిస్తున్నారు.

సుకుమార్, క్రిష్, సందీప్‌రెడ్డి, రాజమౌళి, వంశీ పైడిపల్లి, నాగ్ అశ్విన్, కొరటాల శివ, అనిల్ రావిపూడి, హరీష్ శంకర్

ఈనాడు సినిమా

తెల్లవార్లూ... సరదా కబుర్లు!

ఇద్దరు ముగ్గురు దర్శకులు కలసి ముచ్చట్లు పెట్టుకుంటే - వాళ్ల చుట్టూ ఎన్నో కబుర్లు. దాదాపు అన్నీ సినిమా గురించే అయ్యుంటాయి. అలాంటిది ముగ్గురు కాదు, నలుగురు కాదు.. ఏకంగా తొమ్మిదిమంది దర్శకులు కలిస్తే - ఆ సందడి ఎలా ఉంటుంది? వాళ్ల చుట్టూ ఎన్ని సరదా సంగతులు తిరిగుంటాయి? అవును.. ఇలాంటి అపురూప సంగమం చోటు చేసుకుంది. రాజమౌళి, సుకుమార్, క్రిష్, కొరటాల శివ, వంశీ పైడిపల్లి, హరీష్ శంకర్, అనిల్ రావిపూడి, నాగ్ అశ్విన్, సందీప్‌రెడ్డి.. ఇలా తొమ్మిది మంది దర్శకులు కలసి పార్టీ చేసుకున్నారు. రాత్రంతా కబుర్లు చెబుతూ గడిపారు. ఈ ఫొటోని ఎస్.ఎస్.రాజమౌళి తన ట్విట్టర్ ఖాతా ద్వారా పంచుకున్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు వంశీ పైడిపల్లి ఇంట్లో వీళ్లంతా సరదాగా గడిపారు. తెల్లవారుఝాము నాలుగు గంటల వరకూ కబుర్లు చెప్పుకున్నారు. వాటిలో సినిమా విషయాలే ఎక్కువ దొర్లాయట. "హరీష్, కొరటాల చెప్పిన కథలు మర్చిపోలేనివి. ఉదయం నాలుగ్గంటల వరకూ నవ్వుకుంటూనే ఉన్నాం" అని తన ఆనందాన్ని పంచుకున్నారు రాజమౌళి. "ఈ పార్టీకి ప్రత్యేక కారణమేమీ లేదు. అనుకోకుండా కుదిరింది. గ్యాంగ్‌లో మరో ఇద్దరు ముగ్గురు రాలేకపోయారు. ఈసారి మాత్రం అందరం కలుసుకుంటాం. యేటా ఓ రోజు ఇలానే అందరం కలుసుకోవాలని నిర్ణయించుకున్నాం" అన్నారు క్రిష్.

దిస్ ఈజ్ మహాలక్ష్మి

తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో హిందీ చిత్రం 'క్వీన్'ను రీమేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం మైసూర్‌లో చిత్రీకరణ జరుగుతోంది. కన్నడ 'క్వీన్'గా పారుల్ యాదవ్ నటిస్తోంది. మంగళవారం పారుల్ పుట్టిన రోజుని 'క్వీన్' సెట్లో జరుపుకున్నారు. ఈ వేడుకలో తెలుగు 'క్వీన్' తమన్నా కూడా పాల్గొంది. చీర కట్టు, కళ్లజోడుతో తమన్నా ఇది వరకటి కంటే కాస్త బొద్దుగా కనిపిస్తోంది. తెలుగు 'క్వీన్'లో తమన్నా లుక్ ఇదే! ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ "ఈ చిత్రానికి 'దటీజ్ మహాలక్ష్మి' అనే పేరు ఖరారు చేశారు. '100% లవ్'లో నా పేరు మహాలక్ష్మి. ఆ సినిమా నాకు మంచి పేరు తీసుకొచ్చింది. ఆ పాత్ర పేరుతో ఓ సినిమా తీయడం, అందులో నేను నటించడం సంతోషంగా ఉంద"ని చెప్పింది. సిద్ధు జొన్నలగడ్డ, జివిఎల్ నరసింహరావ్, మాస్టర్ సంపత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మనుకుమార్ నిర్మాత.

తమన్నా, పారుల్, మనుకుమార్

అన్నీ నేనే చేయాలంటే ఎలా?

ప్రతి కథానాయికకూ కొన్ని కలల పాత్రలుంటాయి. 'ఫలానా పాత్ర నాకు దక్కితే బాగుంటుంది కదా' అని ఆశల పల్లకిలో ఊరేగుతుంటారు. అనుష్కకీ అలాంటి కలలు ఉన్నాయా? ఏ పాత్రనైనా చూసి 'నాకూ ఇలాంటి అవకాశం వస్తే బాగుణ్ణు' అనుకుందా? ఇదే విషయాలపై తను స్పందిస్తూ... "తెరపై కొన్ని పాత్రలు చూసినప్పుడు అలాంటి భావన కలగడం సహజం. కానీ నేను అన్ని పాత్రలూ చేయలేను. 'అన్నీ నేనే చేసేయాలి' అనుకుంటే దాన్ని మించిన మూర్ఖత్వం మరోటి ఉండదు. కొన్ని పాత్రల్ని చూసి ఆస్వాదించాలంతే. నా పరిమితులేంటో నాకు తెలుసు. అన్నిటికంటే ముఖ్యంగా మనం ఒకదాని కోసం ఆశ పడుతున్నామంటే... దానికే పరిమితమైపోతాము. 'నేను ఇలాంటి పాత్ర చేయాలి' అంటే మరో మంచి పాత్ర వచ్చినా మనస్ఫూర్తిగా స్వీకరించలేం. మన చేతికి అందిన అవకాశం ఇంకెవ్వరూ చేయనంత గొప్పగా సద్వినియోగం చేసుకోవాలి. నేనెప్పుడూ ఇలానే ఆలోచిస్తా" అంది.

అనుష్క

పంచ్ డైలాగ్

చుట్టూ జనం మధ్యలో మనం.
అలా ఉండాలి లైఫ్ అంటే.
చిత్రం: నేల టికెట్టు
– పంపినవారు: తడ్డి లోకేష్, లక్ష్మీపురం
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

సరిహద్దుల్లో సంగ్రామం

మోహన్‌లాల్, అల్లు శిరీష్ ప్రధాన పాత్రలు పోషించిన మలయాళ చిత్రం '1971 బియాండ్ బార్డర్స్'. మేజర్ రవి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని తెలుగులో 'యుద్ధభూమి' పేరుతో విడుదల చేస్తున్నారు. ఏఎన్ బాలాజీ నిర్మాత. ఈనెల 22న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "దర్శకుడు రవి సైన్యంలో పనిచేసినవారే. ఆ అనుభవంతో రాసుకున్న కథ ఇది. 1971లో భారత్ - పాక్ మధ్య జరిగిన యుద్ధాన్ని ఈ చిత్రంలో చూపిస్తున్నాం. దేశభక్తి పెంపొందించే సన్నివేశాలు ఇందులో చాలా ఉన్నాయి. మోహన్‌లాల్, శిరీష్‌ల నటన ఆకట్టుకుంటుంద"న్నారు. సంగీతం: సిద్దార్థ్ విపిన్.

అల్లు శిరీష్

నిజ జీవితంలోనూ ఇలాంటి ప్రేమకథలుంటాయి!



శివలెంక కృష్ణప్రసాద్

"నేను ఎవరితో సినిమా చేసినా సరే... నిర్మాణ పరంగా రాజీపడను. 'సమ్మోహనం' కూడా అదే తరహాలో రూపుదిద్దుకొంది" అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. చిత్ర పరిశ్రమలో ముప్పయ్యేళ్లుగా ప్రయాణం చేస్తున్న నిర్మాత ఆయన. రెండేళ్ల కిందట నాని కథానాయకుడిగా 'జెంటిల్‌మేన్' నిర్మించారు. ఆ చిత్రాన్ని తెరకెక్కించిన మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలోనే ఇప్పుడు 'సమ్మోహనం' నిర్మించారు. సుధీర్‌బాబు, అదితి రావు హైదరీ జంటగా నటించిన 'సమ్మోహనం' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

"చిత్రకారుడైన ఒక సాధారణ మధ్య తరగతి యువకుడు, ఒక అగ్ర కథానాయికకీ మధ్య జరిగే కథే 'సమ్మోహనం'. సినిమా ప్రపంచంపై సదభిప్రాయం లేని ఆ యువకుడికి, అగ్ర కథానాయిక ఎలా పరిచయమైంది? వారి మధ్య ప్రేమ ఎలా చిగురించింది? ఆ ఇద్దరి ప్రయాణం ఎక్కడిదాకా సాగింది? అనే విషయాలతో ఈ సినిమా సాగుతుంది. నిజ జీవితంలోనూ ఇలాంటి ప్రేమకథలు చాలానే ఉంటాయి. అనుభూతితో కూడిన ఒక అందమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. కుటుంబంతో కలిసి హాయిగా చూసి నవ్వుకునేలా ఉంటుందీ చిత్రం".

- "'జెంటిల్‌మేన్' తర్వాత నేను, మోహనకృష్ణ ఇంద్రగంటి కలిసి మరొక సినిమా చేయాలనుకొన్నాం. సంభాషణలతో సహా సినిమాని ఓ పుస్తకంగా రాసి మోహనకృష్ణ నాకు ఇచ్చారు. పాత్రలకి తగ్గట్టుగానే సుధీర్‌బాబు, అదితిరావు హైదరీ, నరేష్ వంటి నటులు కుదిరారు".
- "మంచి దర్శకులతో కలిసి పనిచేస్తున్నా. వచ్చే పదేళ్లలో ఎలాంటి సినిమాలు చేస్తానో ప్రేక్షకులే చూస్తారు. బాలకృష్ణతో 'ఆదిత్య 369', 'వంశానికొక్కడు', 'భలేవాడివి బాసు', 'మిత్రుడు' చిత్రాలు నిర్మించా. మంచి కథ కుదిరితే తప్పకుండా బాలకృష్ణతో సినిమా చేస్తా".

ఏ మాటకామాటే!

"చిత్రసీమలో కథానాయికల వివాహాలకు సంబంధించి ఆలోచనా విధానం మారింది. స్త్రీలు పెళ్లి చేసుకుని, తల్లిగా మారినా కూడా పనిచేయగలరన్న విషయాన్ని పరిశ్రమలోనివారు గతంలో అర్థం చేసుకోలేకపోయారు. కానీ ఇప్పుడు పెళ్లి అనేది ఇద్దరి మధ్య ప్రేమకు తర్వాతి దశ మాత్రమే అని, అది నాయికల కెరీర్‌కు ముగింపు కాదని అంగీకరిస్తున్నారు. నిజానికి పెళ్లి అనేది మరో అందమైన ప్రయాణానికి ప్రారంభం. విద్యా బాలన్, అనుష్క శర్మ, ఇప్పుడు సోనమ్ కపూర్, నేను.. ఇలా పెళ్లి చేసుకున్న కథానాయికలు అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతుండటం శుభపరిణామం."

– కరీనా కపూర్

"నేను ఇప్పుడు 'సింగ్ ఈజ్ కింగ్'కు రెండో భాగం చేస్తే చూడటానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నారు. ఆ సినిమాతో కోట్లాది రూపాయలు సంపాదించగలను. కానీ నాకు ఆసక్తి లేదు. ఓ సెలబ్రిటీగా నా సినిమాలతో ఏదైనా మార్పు తీసుకురావాలనేది నా లక్ష్యం. ఓ మంచి పని కోసం యువతరం ముందుకు కదిలేలా వాళ్లను నేను ప్రభావితం చేయగలగాలి. ప్రస్తుతం నాకు తెలిసిన మార్గంలో అదే పని చేస్తున్నాను"

– అక్షయ్‌కుమార్

బాక్సింగ్ రింగ్‌లో అర్జున్ రెడ్డి

తెలుగులో సంచలన విజయం సాధించిన 'అర్జున్ రెడ్డి' బాలీవుడ్ రీమేక్‌లో షాహిద్ కపూర్ కథానాయకుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ఇంకా సెట్స్‌పైకి వెళ్లకముందే తదుపరి చిత్రానికీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు షాహిద్. నిజ జీవిత కథా చిత్రాల జోరు కొనసాగుతున్న తరుణంలో షాహిద్ తర్వాతి చిత్రమూ అదే కోవలో తెరకెక్కనుంది. ఓ ప్రొఫెషనల్ బాక్సర్ జీవితం ఆధారంగా ఆయన ఎదుర్కొన్న ఎత్తుపల్లాలను కళ్లకు కట్టేలా ఆ చిత్రం రూపొందనుందట. అయితే ఆ బాక్సర్ ఎవరన్న విషయం వెల్లడి చేయలేదు. 'ఎయిర్‌లిఫ్ట్'తో ఆకట్టుకున్న రాజాకృష్ణ మేనన్ దీన్ని తెరకెక్కించనున్నారు. తన పాత్ర కోసం షాహిద్ శిక్షణ తీసుకోవడానికి సిద్ధమవుతున్నాడు. నిజమైన బాక్సర్‌గా కనిపించేందుకు, బాక్సింగ్‌లోని మెలకువలు నేర్చుకునేందుకు ఓ శిక్షకుడి దగ్గర మూడు నెలల పాటు తర్ఫీదు తీసుకోనున్నాడు షాహిద్. ఈ చిత్రం డిసెంబరులో సెట్స్‌పైకి వెళ్లనుంది. కాగా షాహిద్ ప్రస్తుతం 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ' దర్శకుడు శ్రీ నారాయణ సింగ్ తెరకెక్కిస్తున్న 'బట్టీ గుల్ మీటర్ చాలు' చిత్రంలో శ్రద్ధా కపూర్, యామీ గౌతమ్‌లతో కలసి నటిస్తున్నాడు.

షాహిద్ కపూర్

గీతోపదేశం

పువ్వెందుకు తీగపై పుడుతుంది
జడలోనో గుడిలోనో నిలవాలని
ముత్యమేల కడలిలో పుడుతుంది
ముచ్చటైన హారంలో మెరవాలని
ప్రతి మనిషి తన జన్మకు పరమార్థం తెలుసుకొని
తన కోసమే కాదు పరుల కొరకు బ్రతకాలి
తానున్నా లేకున్నా తన పేరు మిగలాలి

గీతం: పుట్టిన రోజు పండగే అందరికీ...
చిత్రం: జీవన తరంగాలు
రచన: సి.నారాయణరెడ్డి
– పంపినవారు: పి.రాజయ్య, బాన్సువాడ

కాలా వర్సెస్ డైనోసార్

'జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్'



'కాలా'లో రజనీకాంత్

రజనీకాంత్ కొత్త చిత్రం వస్తోందంటే ప్రేక్షకుల్లో ఉండే మేనియానే వేరు. చిత్ర పరిశ్రమలోని వారికీ రజనీ క్రేజ్ గురించి బాగా తెలుసు. అందుకే ఆయన సినిమాకు పోటీగా తమ చిత్రాలను విడుదల చేయడానికి ఎవరూ సాహసించరు. పా రంజిత్ దర్శకత్వంలో రజనీ నటించిన తాజా చిత్రం 'కాలా'పై కూడా అదే స్థాయిలో ఆసక్తి నెలకొంది. 'కబాలి' కలయికలో వస్తున్న చిత్రం కావడంతో పాటు రజనీ మరోసారి తనకు అచ్చొచ్చిన డాన్ పాత్రలో నటించడంతో 'కాలా'పై భారీ అంచనాలే ఉన్నాయి. అందుకే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ నెల 7న మరే ప్రముఖ కథానాయకుడి చిత్రాన్నీ విడుదల చేయడం లేదు. అయితే ఈసారి బాక్సాఫీసు వద్ద ఓ ఆసక్తికరమైన పరిస్థితి నెలకొంది. 'కాలా'కు పోటీగా డైనోసార్ రంగంలోకి దిగబోతోంది. డైనోసార్ల నేపథ్యంలో 2015లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఘనవిజయం సాధించిన చిత్రం 'జురాసిక్ వరల్డ్'. ఇండియాలోనే ఈ చిత్రం సుమారు రూ.150 కోట్లు వసూలు చేయడం గమనార్హం. ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్' తెరకెక్కింది. దీనిపైనా 'జురాసిక్..' చిత్రాల అభిమానులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. ఈ చిత్రం 'కాలా' విడుదలవుతున్న రోజునే ఇండియాలో భారీ స్థాయిలో విడుదలవుతోంది. సినీ విశ్లేషకుల సమాచారం ప్రకారం 'కాలా' తెలుగు, తమిళం, హిందీ భాషల్లో కలిపి రెండు వేలకు పైగా తెరల్లో విడుదలవుతుంటే, 'జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్' 2,300కు పైగా తెరల్లో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రం కూడా తెలుగు, తమిళం, హిందీ భాషల్లోనూ విడుదలవుతోంది. ఈ లెక్కన కాలా, డైనోసార్ల మధ్య పోరు రసవత్తరంగా ఉండబోతోందన్నమాట.

సరిపడని వాటి జోలికెళ్లొద్దు!

బాలీవుడ్ బొద్దుగుమ్మ సోనాక్షి సిన్హా అనే మాట నుంచి బాలీవుడ్ సన్నజాజి సోనాక్షి అనే వరకూ తనను మార్చేసుకుంది ఈ దబాంగ్ భామ. ప్రస్తుతం సెలబ్రిటీల మధ్య ఫిట్‌నెస్ సవాళ్ల హవా నడుస్తోంది. సోనాక్షి సవాళ్లు విసరడం...స్వీకరించడం లాంటివి ఏమీ చేయడం లేదు కానీ తను ఫిట్‌గా ఉండటానికి ఏం చేస్తుందో చెబుతోంది. సోనాక్షి ఈ మధ్య ఫిట్‌నెస్‌కు సంబంధించిన వీడియోలను సోషల్‌మీడియాలో పంచుకుంటోంది. మీరు బాగా ఫిట్‌గా ఉంటారనే నమ్మకంతో వీడియోలు పంచుకొంటున్నారా? అంటే "నా వరకు నేను ఫిట్‌గానే ఉన్నాను. నిలకడ వ్యాయామమే నా ఫిట్‌నెస్ మంత్రం. మనం చేసే వ్యాయామాలు ఏవైనా సరే క్రమం తప్పకుండా చేయాలి. అంతే కానీ తొందరపడి ఇష్టం వచ్చినట్టు మార్చుకొంటూ పోకూడదు" అని చెప్పింది. వర్కవుట్స్ విషయంలో చాలా కఠినంగా ఉంటారా? అంటే "అస్సలు ఉండను. నా పరిధుల్లోనే చేస్తాను. నా శరీరానికి సరిపడేవాటి జోలికే వెళతాను. అంతేకానీ ఒక్కసారిగా ఏదో అద్భుతం సాధించేయాలని నా శరీరాన్ని కష్టపెట్టను. బేసిక్స్ తెలుసుకున్నాక నెమ్మదిగా మొదలుపెడతాను. వాటి వల్ల నా శరీరాకృతి మరింత మెరుగవుతుంది అనిపిస్తేనే ముందుకెళతాను. అంతేకానీ ఇతరులతో పోల్చుకుంటూ పిచ్చిపిచ్చిగా ఏదో చేయడం నాకు నచ్చదు. ఎలాంటి వర్కవుట్లు చేసేవారైనా తమకు సరిపడే వాటినే మరింత శ్రద్ధగా చేయడం మంచిది" అని సలహా ఇచ్చింది సోనాక్షి.

మరో యాక్షన్ చిత్రం

సోనాక్షి చేతిలో మూడు భారీ చిత్రాలున్నాయి. వీటి తర్వాత మరో యాక్షన్ చిత్రం చేయడానికి అంగీకరించిందని సమాచారం. 'అఖిర'లాంటి యాక్షన్ చిత్రం చేసినా సోనాక్షికి కలిసి రాలేదు. దీంతో ఇప్పట్లో యాక్షన్‌వైపు వెళ్లదు అనుకున్నారు. కానీ ఓ యాక్షన్ కథ బాగా నచ్చడం... అందులో తనదే కీలక పాత్రకావడంతో సోనాక్షి అంగీకరించిందని బాలీవుడ్ సమాచారం.

సోనాక్షి సిన్హా

కొత్త పంపిణీ విధానం కోసం...

"ప్రస్తుత డిజిటల్ పంపిణీ విధానం నిర్మాతలకి, ప్రదర్శనకారులకి, పంపిణీదారులకి భారంగా మారింది. దీనికి పరిష్కారంగా హాలీవుడ్ తరహాలో తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలపై కసరత్తులు చేస్తున్నామ"ని తెలంగాణ రాష్ట్ర సినిమా అభివృద్ధి కార్పొరేషన్ (టి.ఎస్.ఎఫ్.డి.సి) వర్గాలు వెల్లడించాయి. కొత్త సాంకేతికతని అందుబాటులోకి తీసుకొస్తున్న డిజిక్వెస్ట్ సంస్థ సహకారంతో నిర్మాతల మండలి, ప్రదర్శనకారుల విభాగం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కలిసి త్వరలోనే ఒక ల్యాబ్‌ని ప్రారంభించే ప్రయత్నాలు చేస్తున్నామని, ఆ మేరకు పరిశ్రమ వర్గాలతో సమావేశం నిర్వహించినట్టు తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పి.రామ్‌మోహన్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తక్కువ ఖర్చుతో పంపిణీ, ప్రదర్శన జరిపే వెసులుబాటుతో పాటు, పైరసీని నిర్మూలించేందుకు కూడా కొత్త సాంకేతికత దోహదం చేస్తుండటంతో దీని గురించి త్వరలోనే ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్టు రామ్‌మోహన్ తెలిపారు.

పారాహుషార్

సహోద్యోగే... లొంగదీసుకునే ప్రయత్నం చేస్తే!

ఆమె పేరు లలిత (పేరు మార్చాం). ఎంతో ఇష్టంగా హోటల్‌మేనేజిమెంట్ కోర్సు పూర్తిచేసింది. చదువైపోయిన వెంటనే ఓ పెద్ద హోటల్లో అవకాశం రావడంతో ఏ మాత్రం ఆలోచించకుండా చేరిపోయింది. అక్కడ చేరిన కొన్నాళ్లకే ఆమెకో సమస్య ఎదురైంది. పనిలో క్షణం తీరిక లేకుండా ఉన్నప్పుడు ఆమె మొబైల్‌కి ఓ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఓ గంటయ్యాక చూసుకుంటే... ఆమె స్నానం చేసిన ఫొటోలు. ఎవరు తీశారో, ఎలా తీశారో అర్థంకాలేదు. అలాగని ఎవరికీ చూపించుకోలేని పరిస్థితి. ఇంట్లో చెబితే ఉద్యోగం మాన్పించేస్తారు. అది తనకు ఇష్టంలేదు. అతనికి ఏం కావాలో తెలుసుకునే ప్రయత్నం చేసింది. అదే అడిగింది ఆ వ్యక్తిని. అతని నుంచి వచ్చిన సమాధానం 'నువ్వే' అని. తన సమస్యను ఎవరికి, ఎలా చెప్పుకోవాలో తెలియదు. అయినా చివరకు పోలీసుల్ని ఆశ్రయించింది. దీన్ని ఎలా పరిష్కరించారో వివరించారు సైబరాబాద్ డీసీపీ జానకీ షర్మిల.

లలిత ఫిర్యాదు చేశాక... ఆ నంబర్ ఒక అజ్ఞాతవ్యక్తి నుంచి వస్తోందని తెలిసింది. అయితే ఎంత ట్రేస్ చేయడానికి ప్రయత్నించినా కూడా ఆ వ్యక్తి ఎవరనేది తెలియలేదు. ఎందుకంటే ఆ మెసేజ్ వచ్చింది ఓ ప్రయివేట్ నంబరు నుంచి. కానీ ఎంత పెద్ద నిందితుడు అయినా సరే... ఎక్కడోచోట చిన్న తప్పయినా చేస్తాడని మా నమ్మకం. ఫొటోలు పంపించడంతోపాటూ ఆమె దినచర్యను కూడా ప్రస్తావించేవాడు. అందుకే ఆ పని బయటి వాళ్లు కాదనీ, తెలిసిన వ్యక్తే చేస్తున్నాడని మాకు అనిపించింది. ఇంకా నిశితంగా, ప్రతి చిన్న విషయాన్ని కూడా గమనించడం మొదలుపెట్టాం. వచ్చిన ప్రతి మెసేజ్‌నీ మళ్లీమళ్లీ చూసి, ఏదయినా క్లూ దొరుకుతుందేమో ప్రయత్నించేవాళ్లం. లలిత పోలీస్‌స్టేషన్‌కి వచ్చినప్పుడల్లా ఆమెతోపాటూ ఓ సహోద్యోగి ఉండేవాడు. అతను కూడా లలిత విషయంలో ఎంతో బాధపడేవాడు. మమ్మల్ని కేసు ఎంతవరకూ వచ్చిందని అడిగి తెలుసుకుంటూ ఆరా తీసేవాడు. ఓ రోజయితే 'వాడెవడో నాకు కూడా ఫొటోలు పంపించాడు చూడండి' అని ఫొటోలు చూపించాడు. అవి చూశాక ఆ సహోద్యోగే ఇదంతా చేసి ఉండొచ్చు అని అనుమానించాం. అదే విషయం ఆ అమ్మాయికి చెబితే.. 'అతను అలాంటి వ్యక్తి కాదు. చాలా మంచివాడు' అని నమ్మకంగా చెప్పింది. ఆమె ఎంత చెప్పినా అతనెందుకు కాకూడదు అని మాకు అనిపించింది. అందుకే ఆ అమ్మాయి చెప్పినా మాదైన శైలిలో మరోసారి విచారించడం మొదలుపెట్టాం. అతని ఫోను తీసుకుని పరిశీలిస్తే... అతను రెండు వాట్సాప్ మెసేంజర్లు వాడుతున్నాడని తెలిసింది. అదీ ఒక ఫోనులో. ఒకటేమో అందరికీ తెలిసింది. రెండోదే ఆ ప్రయివేట్ నంబరు. వాస్తవానికి అతని ఫోను మేం తీసుకోవడానికి ముందే అతని నంబర్‌ని ట్రేస్ చేశాం. అతనో యాప్ కొన్నాడనే విషయం అతని మెయిల్‌లో ఉంది. అలా నిందితుడు దొరికాడు. అతను ఆ ప్రయివేట్ నంబరు నుంచే ఇవన్నీ చేశాడు. ఆ విషయాలన్నీ ఆధారాలతో సహా లలితకు వివరిస్తే షాక్‌కి గురైంది. 'వీడిని అరెస్టు చేయండి' అని చెప్పేసి వెళ్లిపోయింది.

లలిత మంచివాడని చెప్పిన ఆ వ్యక్తే నిందితుడు. కేవలం మంచి అనే ముసుగులో ఆమెను లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. వాస్తవానికి ప్రయివేట్ నంబరుతో వచ్చే ప్రతి మెసేజ్‌ని మనం ఏ విదేశాల నుంచో వచ్చిందనుకుంటాం. కానీ మన పక్కన ఉన్నవారే ఇలా మోసం చేయొచ్చు. అమ్మాయిలూ తస్మాత్ జాగ్రత్త!

sho_cybercrimes@cyb.tspolice.gov.in కి సంప్రదించొచ్చు.

కూతురిగా విజేత ఆమె! తల్లిగా కన్నీళ్లు పెట్టుకుంది! విధితో పెద్ద పోరాటమే చేసింది. అయితేనేం తనలాంటి మహిళలకు బాసటగా నిలవాలని 'మహిళా మిత్ర' స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎందరో బాధిత మహిళలకు ఓదార్పుగా నిలబడుతోంది. ఉపాధి చూపుతోంది. ఆమే కీర్తి బొల్లినేని. ఆమె సేవల్ని గుర్తించిన యూనివర్సిటీ ఆఫ్ హాంగ్‌కాంగ్ విక్టిమాలజీ విద్యార్థులకు అతిథి తరగతులు చెప్పడానికి కీర్తిని ఆహ్వానించింది. అందుకు హాంగ్‌కాంగ్ వెళ్లిన ఆమె తనకి ఆ అవకాశం ఎలా వచ్చిందో వివరించిందిలా...

విద్యాదానం...

ప్రతిభ ఉన్న పేద విద్యార్థుల్ని నేను చదివిస్తున్నా. ఒక అమ్మాయికి తండ్రి చనిపోయాడు. తల్లి, తమ్ముడు బధిరులు. ఆ అమ్మాయిని మెడిసిన్ చేయించా. ఇప్పుడు ప్రభుత్వ వైద్యురాలిగా పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉంటోంది. ఇంకో అమ్మాయిని నర్సింగ్, ఒకబ్బాయికి సివిల్స్ కోచింగ్ ఇప్పిస్తున్నా. ఇప్పటి వరకూ ప్రత్యక్షంగా నా డబ్బులు పెట్టి పదమూడు మందికి ఉన్నత చదువు చదివించా. వాస్యవ విద్యామండలి ద్వారా వేల మందిని ఉచితంగా చదివించా. ఇక లైంగిక వేధింపులకు సంబంధించి విశాఖ గైడ్‌లైన్స్ వచ్చినప్పట్నుంచీ పోలీస్, రైల్వేస్, పోస్టల్, డీఆర్‌డీఏ వంటి పది ప్రభుత్వ, కొన్ని కార్పొరేట్ సంస్థలూ, ఆసుపత్రుల్లో ఇంటర్నల్ కమిటీలో కీలక సభ్యురాలిగా పనిచేస్తున్నా. సంస్థల్లో మహిళలకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా. దాంతోపాటు కష్టాలను అధిగమించి జీవితాన్ని నిలబెట్టుకున్న వారిపై పుస్తకాలు రాస్తున్నా.

అందుకే... హాంగ్‌కాంగ్ ఆహ్వానం

విక్టిమాలజీ అంటే మనకు కాస్త కొత్తగా అనిపించొచ్చు. విక్టిమ్స్ అంటే బాధితులు. వాళ్లకు సంబంధించిన పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సును విక్టిమాలజీ అంటున్నారు. నేను విజయవాడలో గృహహింసా, అత్యాచార, యాసిడ్ బాధితులకోసం పోలీస్‌లతో కలిసి పలురకాల సేవలు అందిస్తున్నా. నా గురించి తెలిసిన ఓ తమిళ ప్రొఫెసర్ హాంగ్‌కాంగ్‌లోని ఆ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. ఆమె సలహా మేరకు యూనివర్సిటీ బృందం నన్ను విక్టిమాలజీ విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ఆహ్వానించింది. ప్రస్తుతం అక్కడే ఉన్నా. ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకూ పోలీస్‌లతో కలిసి బాధితుల్ని ఎలా ఆదుకుంటున్నానో పాఠాలుగా చెబుతాను. ఇక నా గురించి చెప్పాలంటే... నేను ఇటు వైపు పేరుకోసం రాలేదు. మహిళగా నేను పడిన బాధలు ఇతరులు పడకూడదనే ఉద్దేశంతో సామాజిక కార్యక్రమాల్లో ముందుంటున్నా. నా కుటుంబం గురించి చెప్పాలంటే.. నేను రాజకీయ నాయకురాలు చెన్నుపాటి విద్య కూతుర్నై ఉండొచ్చు. కానీ ఆమెపేరు చెప్పుకుని సామాజిక సేవ మాత్రం చేయట్లేదు. చిన్నతనం నుంచీ అదొక ఆసక్తి. మొదట్లో నాకూ దేశ సరిహద్దుల్లో మన రక్షణ కోసం కృషి చేసే సైనికులకు వైద్యం చేయాలని బలంగా ఉండేది. అందుకే చదువుకునే రోజుల్లో సైనికుల కోసం విరాళాలు సేకరించి పంపేదాన్ని. అయితే నాకు ఇంటర్ అయ్యాక మెడిసన్ సీటు రాకపోవడంతో బీఏ సోషయాలజీలో చేరా. ఆ తరువాత పీజీ చేశా. తరవాత క్లాస్‌మేట్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నా.

కళ్లు దానమిచ్చా...

ఆయన వ్యాపారం చేసేవారు. మూడేళ్లకి పాప పుట్టింది. మా ఇద్దరి కళ్లు దానిమీదే. పాపని గొప్పదాన్ని చేయాలని కలల మేడలు కట్టుకునేవాళ్లం. కానీ పెళ్లైన తొమ్మిదేళ్లకి ఘోర రోడ్డు ప్రమాదంలో ఆయన కన్నుమూశారు. ఆశలన్నీ చెల్లాచెదురయ్యాయి. ఆ తరువాత కుటుంబంలో మరికొన్ని సమస్యలు. చివరికి దాన్ని చూసుకుంటూ అయినా బతకొచ్చు అనుకున్నా. ఆయన వ్యాపార బాధ్యతలు నా మీద వేసుకున్నా. కానీ ఆయన బాధనుంచీ బయట పడలేకపోయా. ఆయన్ని పాపలో అయినా చూసుకుందామనుకున్నా. కానీ ఆ దేవుడు మళ్లీ నన్ను మోసం చేశాడు. నవ్వుతూ.. ఇంట్లో ఆడుకుంటున్న నా బంగారుతల్లిని తీసుకెళ్లిపోయాడు. వైరల్ ఫీవర్ అని ఆసుపత్రిలో చేరిస్తే ఉన్నట్టుండి పరిస్థితి విషమించి అదీ కన్ను మూసింది. ఆరేళ్ల నా చిట్టితల్లి వాళ్ల నాన్న చనిపోయాక ఏదో సందర్భంలో మా కుటుంబ సభ్యులు నేత్రదానం గురించి మాట్లాడుకుంటుంటే అదీ పట్టుబట్టి కళ్లు దానం చేస్తానని రాసిచ్చింది. చనిపోయిన మరుక్షణమే దానికళ్లు దానం చేశాను. అది లేకపోయినా దాని కళ్లు ఇతరులకు చూపునిచ్చాయని ఓ చిరు సంతృప్తి మిగిలింది. అలా 27 ఏళ్ల వయసులో భర్తనీ, కూతుర్ని దూరం చేసుకుని ఒంటరిగా మిగిలిపోయా.

ఆ బాధ వర్ణనాతీతం...

ఎవరితో మాట్లాడేదాన్ని కాదు. అమ్మానాన్నలు నన్ను చూడలేక చదువుకోమని ప్రోత్సహించారు. అప్పటికే నాకు కెనడాలో ఓ యూనివర్సిటీలో చదువుకోవడానికి ఫెలోషిప్ వచ్చింది. పాప పుట్టడంతో వెళ్లలేకపోయా. తెలిసిన వాళ్ల సాయంతో మళ్లీ అవకాశం ఇవ్వమని అడిగి అక్కడికి వెళ్లిపోయా. తీరా అక్కడికి వెళ్లాక ఆరోగ్యం పాడైంది. భరించలేని కడుపు నొప్పి. ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. అయినా సరే పట్టుదలగా చదువుకున్నా. అలా ఏడు నెలల తరవాత విజయవాడ వచ్చి.. అమ్మ 1975లో ఏర్పాటు చేసిన వాసవ్య మహిళా మండలిలో చేరా. మహిళల్ని చైతన్య పరుస్తూ రకరకాల కార్యక్రమాలు చేపట్టేదాన్ని. అప్పట్లోనే అంటే 1991లో మురికి వాడల్లోని మహిళల చేత ఖాతాలు ఏర్పాటు చేయించి... పొదుపు చేసేలా ప్రోత్సహించేదాన్ని. అంటే డ్వాక్రా గ్రూపు మాదిరి. వందల మంది మహిళల్ని కలుసుకుని రకరకాల కార్యక్రమాలు చేసేదాన్ని. అలా నన్ను నేను బిజీగా ఉంచుకుంటూ బాధల్ని మర్చిపోవడానికి ప్రయత్నించేదాన్ని. అయితే అమ్మా వాళ్లు మాత్రం 'ఆడపిల్ల ఇలా ఒంటరిగా ఉండటం సరికాదు. మళ్లీ పెళ్లి చేసుకోవాల్సిందే' అంటూ పట్టుబట్టారు. అలా ముప్పై ఐదేళ్ల వయసులో రెండోసారి పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. కానీ అతను ఇబ్బంది పెట్టేవాడు. డబ్బులు కావాలని గొడవ చేసేవాడు. తీవ్రంగా హింసించేవాడు. మారతాడులే అనుకుని ఓపిక పట్టా. అమ్మా వాళ్ల దగ్గర విషయం దాచా. ఇంకా ఇంకా బాధిస్తోంటే భరించలేక విడాకులు తీసుకున్నా. దాంతో ఇంట్లోవాళ్లు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయారు. ఈ సారి మాత్రం నేను బాధపడలేదు. నాలా ఇంకెందరు ఉంటారో కదా అనిపించింది. అలాంటి వారికి ఏదైనా చేయాలనుకున్నా. రెండేళ్లు పారిస్ వెళ్లి సామాజిక సేవకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో పీహెచ్‌డీ చేశా.

బాధితులకు బాసట...

2011 నుంచి విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గృహహింసా, అత్యాచార బాధితులూ, యాసిడ్ దాడికి గురైన వారికి సాంత్వన అందించడం మొదలుపెట్టా. 'మహిళా మిత్ర' పేరుతో ఈ కార్యక్రమాలు చేస్తున్నా. అలా ఇప్పటి వరకూ 134 మంది బాధితుల్ని బయటకు తీసుకొచ్చి వాళ్లకాళ్లపై వాళ్లు నిలబడేలా చేశా. ఈ మధ్య ఒకమ్మాయి వచ్చింది. తనకి కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చినా వెళ్లనివ్వకుండా భర్త అడ్డుపడ్డాడు. కలిసి ఉండకుండా మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. చివరికి భార్యనీ, కూతుర్ని నడి రోడ్డు మీద వదిలేశాడు. ఆ అమ్మాయి నన్ను సంప్రదించింది. న్యాయపరంగా సేవలు అందిస్తూ.. పిల్లల్ని చదివిస్తున్నా. తనకి వచ్చిన కంప్యూటర్ కోర్సులో ఇంకాస్త మెరుగైన శిక్షణ ఇప్పించా. ఓ సంస్థలో ఉద్యోగంలో చేర్పించా. ఇలా బాధితుల నైపుణ్యాలు తెలుసుకుని తదనుగుణంగా శిక్షణ ఇప్పిస్తా. కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ ఆఫీసులూ, మరికొన్ని కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి బాధితులకు ఉద్యోగాలు చూస్తున్నా. ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ కూడా చేస్తున్నా. వాళ్లు వీలైనంతవరకూ పోలీస్‌స్టేషన్ వరకూ రాకుండా చూస్తున్నా. వచ్చినా కౌన్సెలింగ్ సాయంతో దంపతుల్ని కలిపేందుకే ప్రయత్నిస్తున్నా. ఇప్పటి వరకూ 220 మందికి కౌన్సెలింగ్ చేస్తే వారిలో 77 శాతం మంది మళ్లీ కలిసిపోయి కుటుంబంతో సంతోషంగా ఉంటున్నారు. అలానే పలు ప్రాంతాలకు వెళ్లి భార్యాభర్తల గొడవలు జరిగినప్పుడు.. చుట్టుపక్కల పెద్దల్ని కల్పించుకుని వాటిని ఎలా పరిష్కరించాలో వివరిస్తూ అవగాహనా కార్యక్రమాలూ నిర్వహిస్తున్నా.

– పద్మ వడ్డె

email: vasundhara@eenadu.net

బంగారం వెండి

05న ముగింపు-క్రితం

	ముగింపు	క్రితం
హైదరాబాద్		
బంగారం (24క్యా)	31,760	31,800
ఆర్నమెంట్	29,660	29,710
వెండి (కిలో)	40,470	40,670
విజయవాడ		
బంగారం (24క్యా)	31,750	31,700
ఆర్నమెంట్	29,500	29,450
వెండి (కిలో)	40,800	40,700
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,700	31,700
ఆర్నమెంట్	29,350	29,350
వెండి (కిలో)	40,600	40,600
రాజమహేంద్రవరం		
బంగారం (24క్యా)	32,200	31,780
ఆర్నమెంట్	29,400	29,370
వెండి (కిలో)	41,100	40,550
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,480	31,630
ఆర్నమెంట్	29,280	29,420
వెండి (కిలో)	40,900	40,900
తమిళనాడు		
ఆర్నమెంట్ (గ్రా)	2,939	2,937
వెండి (గ్రా)	42.70	42.70

(రూ. లలో)

గోళ్లకి ఉంగరాలు

చేతి వేళ్లకు ఉంగరాలు పెట్టుకోవడం మామూలే. అందుకే ఇప్పుడు గోళ్లకు ఉంగరాలు పెట్టుకుంటూ నయా ట్రెండ్‌ని సృష్టిస్తున్నారు అమ్మాయిలు. గోళ్లకి వీటిని ఎలా పెట్టుకోవచ్చు అనుకుంటున్నారా... వేళ్లని ఆధారంగా చేసుకుని గోళ్లను పట్టి ఉంచే విధంగా వీటిని రూపొందిస్తారు. అలాంటి డిజైన్లే ఇవన్నీ. మరి మీరూ ఓ లుక్కేయండి.

నజరానా

కనురెప్పలపై బేబీ పౌడర్‌ను చల్లి ఆ తరువాత మస్కారా వేసుకోండి. ఇలా చేయడం వల్ల కనురెప్పలు అందంగా, నిండుగా కనిపిస్తాయి.

చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెరిగేలా...



కొందరు చిన్నారులు తరచూ ఆత్మన్యూనతకు లోనవుతుంటారు. అలాంటివారిలో మార్పు తేవాలంటే... తల్లిదండ్రుల వల్లే సాధ్యం అవుతుంది. దీనికీ కొన్ని పద్ధతులున్నాయి.

- పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని కలిగించాలి. వాళ్లకు నచ్చిన ఏదో ఒక ఆట... క్రికెట్, ఫుట్‌బాల్... ఇలా ఒకదాంట్లో చేర్పించాలి. ఆటలో భాగంగా వ్యాయామం చేస్తారు. అది వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆరోగ్యంగానూ ఉంటారు.
- చిన్నచిన్న విషయాలు అయినా సరే.. వాళ్లంతట వాళ్లే నిర్ణయం తీసుకునేలా చూడండి. కొన్నిసార్లు వాళ్లు నిర్ణయించుకోలేకపోవచ్చు. కానీ పక్కన ఉండి 'ఇలా చేస్తే బాగుంటుంది, అలా చేయకూడదు, నువ్వే ఆలోచించు' అని సూచిస్తే.. వాళ్లే నిర్ణయించుకోగలుగుతారు. వాళ్లపై వాళ్లకు నమ్మకం కూడా పెరుగుతుంది.
- వాళ్లు ఏ విషయంలో ఆత్మన్యూనతకు లోనవుతున్నారో తెలుసుకోవాలి. దాన్నుంచి ఎలా బయటపడాలో వివరించాలి. కుదిరితే మీరెలా బయటపడ్డారో వివరిస్తే సులువుగా అర్థం చేసుకుంటారు.
- నిద్ర పోయే సమయాల్లో వారికి కథల రూపంలో ఆత్మవిశ్వాసం ఎలా పెంచుకోవచ్చో వివరించాలి.

అమ్మగా స్పందించింది!

ఓ తల్లి ఆ బిడ్డను కాదనుకుంది. పుట్టగానే కనీసం బొడ్డు తాడు కూడా తీయకుండా.. పేపర్లలో చుట్టి, ప్లాస్టిక్ సంచిలో వేసి నిర్మిస్తున్న ఓ భవంతిలో వదిలేసింది. కనీసం కనికరం లేని కన్నతల్లి చేసిన ఆ పనికి మరో తల్లి కరిగిపోయింది. అమ్మగా ఆ బిడ్డను అక్కున చేర్చుకుంది. ఇంతకీ ఏం జరిగిందంటే..

బెంగళూరు శివారులోని ఓ పెద్ద భవంతి నిర్మాణం జరుగుతోంది. ఆ చుట్టుపక్కల కాస్త నిర్మానుష్యంగా ఉంటుంది. చెత్త ఏరుకుంటూ అటుగా వెళ్లిన వారికి కవరులో చుట్టిన బిడ్డ రక్తం మరకలతో కనిపించింది. వెంటనే ఎలక్ట్రానిక్స్ సిటీ పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తే... వారు బిడ్డను తీసుకుని స్టేషన్‌కి వెళ్లారు. సంచిలోంచి బయటకు తీస్తే బాలుడు అని తెలిసింది. ఆ పసిగుడ్డును ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ప్రాథమిక పద్ధతి ఉంటుంది. కానీ దానికి సమయం పడుతుంది. మరోవైపు ఆ బిడ్డ శ్వాస తీసుకుంటున్నాడు కానీ ఉలుకూ పలుకూ లేదు. వాడికేమన్నా అవుతుందేమోనని అందరూ భయపడుతున్నారు. అదంతా గమనించిన అర్చన అనే మహిళా కానిస్టేబుల్ ఎవరి అనుమతీ లేకుండానే బిడ్డను పక్కకు తీసుకెళ్లింది. ఆమె అలా ఎందుకు చేసిందో ఎవరికీ అర్థం కాలేదు. కాసేపటికి బాబు కెవ్వున ఏడవడంతో విషయం అర్థమైంది. ఆమె పాలు ఇచ్చింది. గుండెలకు హత్తుకుంది. తల్లి వెచ్చదనాన్ని అందించింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అర్చన మూడునెలల బాలింత. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. ఆమె ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విధుల్లో చేరాల్సి వచ్చింది. అలా అమ్మగా స్పందించి బిడ్డను కాపాడింది. వెంటనే పోలీస్‌లు ఆ బాబుకి దుస్తులు కొని తెస్తే శుభ్రం చేసి వేసింది. చివరకు అవసరమైన చికిత్స కూడా చేయించారు. ఇప్పుడు పోలీసులంతా వాడిని ప్రభుత్వ బిడ్డగా ప్రకటించి.. నూతన ముఖ్యమంత్రి కుమారస్వామి పేరునే పెట్టారు. ఇక మీదట ఆ సిబ్బందే వాడి బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. అమ్మగా అర్చన చేసిన పనిని మెచ్చుకోకుండా ఉండలేకపోయారు.

కాలినడకన ప్లాస్టిక్‌పై పోరాటం!

నలభై ఐదు రోజులు.. ఇరవై రెండు నగరాలు.. 1100 కిలోమీటర్లు.. వడోదర నుంచి దిల్లీ వరకూ కాలి నడకన వెళ్లింది ముప్పై రెండేళ్ల రాజేశ్వరీ సింగ్. రవీంద్రనాథ్ ఠాగూర్ కవితలకు ఆకర్షితురాలైన రాజేశ్వరి ఓ వ్యాపారవేత్త. ఆమె ప్లాస్టిక్ పై పోరాటం చేద్దామంటూ.. కాలిన నడకన వడోదర నుంచి ప్రపంచ ధరిత్రీ దినం అంటే ఏప్రిల్ 22న బయల్దేరి ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున దిల్లీకి చేరాలనుకుంది. పక్కా ప్రణాళికతో అనుకున్నది సాధించింది. గుజరాత్, హరియాణా, రాజస్థాన్.. మీదుగా దిల్లీ చేరుకుంది.

మొదట రాజేశ్వరి ఆలోచన నచ్చి గుజరాత్ ప్రభుత్వంతోపాటు, రాష్ట్ర పర్యటక శాఖా, ఐరాస ఆర్థిక సాయమందించాయి. రాజేశ్వరి కేవలం దుస్తులు తప్ప మరేమీ తీసుకెళ్లలేదు. కనీసం మంచినీళ్ల సీసా కూడా. అలాగని నీళ్లసీసాలు కూడా కొనుక్కోలేదు. నీళ్ల పంపులు కనిపిస్తే తాగేది. లేదంటే స్థానిక గ్రామస్తుల్ని అడిగేది. ప్రతిరోజూ ముప్పై నుంచి ముప్పై ఐదు కిలోమీటర్లు నడిచేది. ఉదయం నాలుగున్నరకి నడక మొదలుపెట్టేది. మధ్యాహ్నం పూట కాసేపు విరామం తీసుకునేది. ప్రభుత్వ భవనాలూ, అతిథి గృహాల్లో రాత్రిపూట బస చేసేది. పాఠశాలలూ, కాలేజీలూ, గేటెడ్ కమ్యూనిటీలూ.. ఇలా జనసందోహం ఎక్కువగా ఉన్న చోటకు వెళ్లి ప్లాస్టిక్ గురించి వివరించేది. ప్లాస్టిక్‌కి ఎందుకు దూరంగా ఉండాలీ, దానివల్ల జరిగే హాని, పర్యావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తోంది వంటివన్నీ వివరించింది. కాలినడకన ఇంత సాహసం చేసిన రాజేశ్వరి ఇంతకుముందెన్నడూ అంతగా నడిచిన దాఖలాలు లేవు. దాంతో మొదట్లో నడవలేకపోయింది. కాళ్ల నొప్పులతో బాధపడింది. యోగా, ధ్యానం చేస్తూ శరీరాన్ని నడకకు సన్నద్ధం చేసుకుంది. అయితే అహ్మదాబాద్‌లో మాత్రం తెల్లవారుజామున నడక ప్రారంభించినప్పుడు కుక్కలు దాడి చేసి, ఆమె దుస్తులు చించేశాయి. ప్లాస్టిక్‌పై పోరాటం చేద్దామనే వాక్యాల్ని బోర్డుపై రాసి, మెళ్లో వేసుకోవడంతో చాలామంది ఆమెను వింతగా చూసేవారు.కానీ ఆమె ఉద్దేశం అర్థం చేసుకున్నవారు మాత్రం ఆమెకు మద్దతు తెలుపుతూ కొంత దూరం ఆమెతో నడిచేవారు.

CA

రక్షణ రంగంలో ఉద్యోగాలకు మూడు ప్రకటనలు వెలువడ్డాయి. డిగ్రీతో ఎయిర్‌ఫోర్స్, ఇంటర్‌తో నేవీలో సబ్‌లెఫ్టినెంట్‌లు, సెయిలర్‌లుగా చేరడానికి అవకాశాలు వచ్చాయి. మంచి వేతనం, ఇతర సౌకర్యాలతో సమాజంలో గౌరవనీయ హోదాను ఈ కొలువులు సమకూరుస్తాయి. ఎయిర్‌ఫోర్స్‌లో రూ.ఎనభైవేలకు పైగా వేతనం అందుతుంటే, నేవీ క్యాడెట్ ఎంట్రీ స్కీంలో ఇంజినీరింగ్ విద్యను ఉచితంగా అందిస్తారు.

రక్షణ రంగంలో ఉద్యోగాలు

పిలుస్తున్నాయ్.. నింగీ నీరూ!

డిగ్రీ అర్హతతో ఉన్న మేటి కొలువుల్లో ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్టు (ఏఎఫ్ క్యాట్) ఒకటి. దీనిద్వారా భారత వైమానిక దళంలో ఫ్లయింగ్ (పైలట్), గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్) విభాగాల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు. విధుల్లో చేరినవారికి రూ. ఎనభై వేలకు పైగా వేతనంతోపాటు పలు ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఈ పోస్టులకు విద్యార్థినులూ దరఖాస్తు చేసుకోవచ్చు. తాజాగా 182 ఖాళీల భర్తీకి ఏఎఫ్ క్యాట్ ప్రకటన వెలువడింది.

ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్), ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ (ఫ్లయింగ్), మెటీరియాలజీ బ్రాంచ్ గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్) ఖాళీల భర్తీకి భారత వైమానిక దళం ఏడాదికి రెండు సార్లు నిర్వహించే ఉమ్మడి ప్రవేశపరీక్షే.. ఏఎఫ్ క్యాట్. ఏటా మే/జూన్, డిసెంబరుల్లో ఈ ప్రకటన వెలువడుతుంది. పరీక్షను ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్నారు. కాబట్టి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇదే లక్ష్యంగా సన్నద్ధమైతే ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు.

అభ్యర్థులు ఏఎఫ్ క్యాట్ ఎంట్రీ, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ, మెటీరియాలజీ ఎంట్రీ విభాగాల్లో ఉద్యోగాలకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవాలి. తగు అర్హతలు ఉంటే మూడింటికీ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏఎఫ్ క్యాట్

ఫ్లయింగ్ బ్రాంచి

విద్యార్హత: ఈ విభాగంలోని పోస్టులకు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇంటర్ / +2లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి.

వయసు: జులై 1, 2019 నాటికి 20 నుంచి 24 ఏళ్లలోపు ఉండాలి. **ఎత్తు:** కనీసం 162.5 సెం.మీ ఉండాలి. ఎలాంటి దృష్టి దోషం ఉండకూడదు.

గ్రౌండ్ డ్యూటీ - టెక్నికల్ బ్రాంచి

విభాగం: ఏరోనాటికల్ ఇంజినీర్ (ఎలక్ట్రానిక్స్)

విద్యార్హత: 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ లేదా ఎలక్ట్రికల్ లేదా కమ్యూనికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్... తదితర విభాగాల్లో ఎందులోనైనా బీటెక్/ బీఈ పూర్తిచేసినవాళ్లు అర్హులు. ఇంటర్/ +2లో ఫిజిక్స్, మ్యాథ్స్‌ల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.

విభాగం: ఏరోనాటికల్ ఇంజినీర్ (మెకానికల్)

విద్యార్హత: 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ లేదా ఏరోస్పేస్ లేదా ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ లేదా మెకానికల్ లేదా ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ వీటిలో ఏ విభాగంలోనైనా బీటెక్/ బీఈ పూర్తిచేసినవాళ్లు అర్హులు. ఇంటర్/+2లో ఫిజిక్స్, మ్యాథ్స్‌ల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: పై రెండు పోస్టులకు జులై 1, 2019 నాటికి 20 నుంచి 26 ఏళ్లలోపు వయసువారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎత్తు: పురుషులైతే 157.5, మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ బ్రాంచి

ఇందులో 4 విభాగాలున్నాయి. 1. అడ్మినిస్ట్రేషన్ 2. లాజిస్టిక్స్ 3. అకౌంట్స్ 4. ఎడ్యుకేషన్. **అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్:** కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ.

అకౌంట్స్: 60 శాతం మార్కులతో బీకాం.

ఎడ్యుకేషన్: ఏదైనా డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు పీజీలో ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇంటర్నేషనల్ స్టడీస్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, ఐటీ, మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం, పబ్లిక్ రిలేషన్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్ వీటిలో ఏదైనా కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

వయసు: పై నాలుగు పోస్టులకు జులై 1, 2019 నాటికి 20 నుంచి 26 ఏళ్లలోపువాళ్లు అర్హులు. **ఎత్తు:** పురుషులు 157.5, మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ విభాగానికి ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ సి సర్టిఫికెట్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీతోపాటు 10+2లో మ్యాథ్స్, ఫిజిక్స్ ల్లోనూ 60 శాతం తప్పనిసరి.

మెటీరియాలజీ బ్రాంచి: ఈ బ్రాంచి కూడా గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ విభాగంలోకే వస్తుంది. డిగ్రీలో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు కనీసం 50 శాతం మార్కులతో సైన్స్ కోర్సుల్లో పీజీ పూర్తిచేసివవారు అర్హులు.

దరఖాస్తులు: ఆన్‌లైన్‌లో జూన్ 16 నుంచి జులై 15 వరకు. **పరీక్ష తేదీ:** తర్వాత ప్రకటిస్తారు. **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం:** హైదరాబాద్

వెబ్‌సైట్: https://afcat.cdac.in, http://careerairforce.nic.in

ఎంపిక ఇలా!

రాతపరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఏ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అభ్యర్థులందరికీ ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. అంటే ప్రశ్నపత్రం అన్ని విభాగాలకూ ఒక్కటే. టెక్నికల్ బ్రాంచి పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారు అదనంగా ఇంజినీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ (ఈకేటీ) రాయాల్సి ఉంటుంది. రాత పరీక్షలో వంద మార్కులకు బహుళైచ్ఛిక విధానంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. స్టేజ్ -1లో చిన్న అసైన్‌మెంట్స్, పజిల్స్ లాంటి వాటి ద్వారా అభ్యర్థి మేధో స్థాయిలను తెలుసుకుంటారు. ఇందులో అర్హత సాధించినవారే స్టేజ్ -2కి వెళ్తారు. స్టేజ్ -2లో సైకాలజిస్టు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఫ్లయింగ్ బ్రాంచికి దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూ అనంతరం కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టం (సీపీఎస్ఎస్) పరీక్ష ఉంటుంది అన్ని పరీక్షలూ విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులను శిక్షణలోకి తీసుకుంటారు.

నేవీలో సెయిలర్లు

ఇండియన్ నేవీ సెయిలర్ (సీనియర్ సెకండరీ రిక్రూట్స్ (ఎస్ఎస్ఆర్), ఆర్టిఫిషర్ అప్రెంటిస్ (ఏఏ) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసినవాళ్లు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. రాతపరీక్ష, ఫిజికల్, మెడికల్ టెస్టుల ద్వారా నియామకాలు చేపడతారు. ఎంపికైనవారికి ఫిబ్రవరి, 2019 నుంచి శిక్షణ మొదలవుతుంది. విధుల్లోకి చేరిన తర్వాత రూ.35,000 - 42,000 వరకు ప్రారంభ వేతనం పొందవచ్చు. దీంతోపాటు పలు ప్రోత్సాహకాలు లభిస్తాయి. భవిష్యత్తులో చీఫ్ పెటీ ఆఫీసర్-1 హోదా వరకు చేరుకోవచ్చు. రెండు పోస్టులకు విడిగా దరఖాస్తు చేసుకోవాలి.

విద్యార్హత: ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్‌తోపాటు కెమిస్ట్రీ/ బయాలజీ/ కంప్యూటర్ సైన్స్ వీటిల్లో ఏదో ఒక సబ్జెక్టు చదివుండాలి. ఆర్టిఫిషర్ అప్రెంటిస్ పోస్టులకు ఈ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. ఈ రెండు పోస్టులకూ కేవలం పురుష అభ్యర్థులే అర్హులు.

వయసు: ఎస్ఎస్ఆర్ పోస్టులకు ఫిబ్రవరి 1, 1998 - జనవరి 31, 2002 మధ్య జన్మించినవాళ్లు అర్హులు. ఏఏ పోస్టులకు ఫిబ్రవరి 1, 1999- జనవరి 31, 2002 మధ్య జన్మించినవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక విధానం: రెండు పోస్టులకు రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టు (పీఎఫ్‌టీ), మెడికల్ టెస్టుల ద్వారా అర్హులను ఎంపికచేస్తారు. సెప్టెంబరు / అక్టోబరుల్లో పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు నిర్దేశిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి. ఎస్ఎస్ఆర్ పోస్టులకు పరీక్ష జరిగిన రోజే ఫలితాలు వెలువడతాయి. ఇందులో ఎంపికైనవారికి పీఎఫ్‌టీ, మెడికల్ టెస్టులు ఒకటి లేదా రెండు రోజుల్లో పూర్తిచేస్తారు. ఏఏ పోస్టులకు పరీక్ష అనంతరం రెండు వారాల తర్వాత ఫలితాలు వెలువడతాయి. రాత పరీక్షలో ప్రతిభ ప్రాతిపదికన 1200 మందిని తర్వాత దశ పరీక్షలకు ఎంపికచేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 15

కాల్ లెటర్లు: ఆగస్టు చివరి నాటికి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి.

పరీక్షలు: సెప్టెంబరు / అక్టోబరులో ఉంటాయి.

ఫలితాలు: డిసెంబరు 20 నాటికి నేవీ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంటాయి.

వెబ్ సైట్: www.joinindiannavy.gov.in

10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ

ఉచితంగా బీటెక్ చదువు, కోర్సు పూర్తికాగానే కొలువు కల్పిస్తోంది ఇండియన్ నేవీ. 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ స్కీం ద్వారా ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని అందుకోవచ్చు. ఎంపికైనవారు కేరళలోని నేవల్ అకాడమీ- ఎజిమాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ లేదా మెకానికల్ బ్రాంచీల్లో నాలుగేళ్లపాటు ఇంజినీరింగ్ చదువుతారు. జేఎన్‌యూ, న్యూదిల్లీ బీటెక్ పట్టా అందిస్తుంది.

విద్యార్హత: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌ల్లో 70 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు పదోతరగతి లేదా ఇంటర్ ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి.

ఇతర అర్హతలు: అభ్యర్థులు జేఈఈ మెయిన్ -2018లో అర్హత సాధించాలి. ఈ పోస్టులకు అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఎత్తు కనీసం 157 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు తప్పనిసరి.

వయసు: జులై 2, 1999 - జనవరి 1, 2002 మధ్య జన్మించినవారు అర్హులు

ఎంపిక: దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను జేఈఈ-2018 మెయిన్‌లో సాధించిన ర్యాంకు ద్వారా షార్ట్‌లిస్టు చేస్తారు. సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) బెంగళూరు, భోపాల్, కోయంబత్తూరు, విశాఖపట్నంల్లో ఏదోఒక చోట జులై - అక్టోబరు మధ్య కాలంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ముఖాముఖి నిర్వహిస్తారు.

శిక్షణ: ఎంపికైనవారికి శిక్షణ తరగతులు జనవరి 2019 నుంచి ప్రారంభవుతాయి. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్న వారికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)-న్యూదిల్లీ ఇంజినీరింగ్ డిగ్రీని ప్రదానం చేస్తుంది. కోర్సు ఫీజు, భోజనం, వసతి, దుస్తులు తదితర ఖర్చులన్నీ నేవీ భరిస్తుంది. కోర్సు అనంతరం సబ్‌లెఫ్టినెంట్ హోదాతో నేవీలో విధుల్లోకి చేరతారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 21

వెబ్‌సైట్: https://www.joinindian-navy.gov.in

జీఎస్‌పై పట్టు గెలుపు మెట్టు!

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రెండువేల ఏడువందలకు పైగా ఖాళీలతో భారీ నోటిఫికేషన్లను విడుదల చేసింది. దాదాపు పది లక్షలమంది అభ్యర్థులు ఈ పరీక్షల్లో పోటీ పడవచ్చని ఒక అంచనా. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు వరిస్తాయి. ఇంటర్వ్యూలు లేవు. పోటీ తీవ్రంగా ఉంటుంది. సీనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టులకు మినహా మిగతా అన్ని ఉద్యోగ పరీక్షల్లో జనరల్ స్టడీస్ ఉంది. సిలబస్ విస్తృతంగా ఉన్న నేపథ్యంలో పోటీలో ఈ పేపర్ నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది. అందుకే జీఎస్ పేపర్‌పై సరైన అవగాహనతో వ్యూహాత్మకంగా ప్రిపేర్ కావాలి.



టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4, వీఆర్‌ఓ, టీఎస్‌ఆర్టీసీ, ఏఎస్‌ఓ పరీక్షల ప్రిపరేషన్ ప్లాన్

టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన ప్రస్తుత పరీక్షలకు లక్షల మంది అభ్యర్థులు పోటీపడతారని అంచనా వేస్తున్నారు. గ్రూప్-4, వీఆర్‌వో, టీఎస్ఆర్టీసీ, ఏఎస్‌వో నోటిఫికేషన్లకు సంబంధించి జనరల్ స్టడీస్ కీలకమైంది. గ్రూప్-4కి 11, వీఆర్‌వోకి 9, టీఎస్ఆర్టీసీకి 11, ఏఎస్‌వోకి 13 విభాగాలను జీఎస్ సిలబస్‌గా సూచించారు.

సిలబస్ ఎక్కువ, కష్టమూ అధికమే. అందుకే జీఎస్ విభాగం ఉద్యోగ ఎంపికలో ప్రధానమైందని చెప్పవచ్చు. ప్రతి ఒక్క మార్కు మెరిట్ లిస్ట్‌పై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది.

ఎ.ఎం. రెడ్డి
కెరియర్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్

వర్తమాన విషయాలు: ఈ విభాగం నుంచి 15-20 ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుంది. వీటిలో వర్తమాన ఆర్థికాంశాలు, వర్తమాన రాజకీయ అంశాలూ ఉంటాయి. సాధారణంగా పరీక్ష తేదీకి ముందు ఒక సంవత్సరకాలంలో జరిగిన సంఘటనల నుంచి ప్రశ్నలు వస్తాయి. సగాని కంటే ఎక్కువ ప్రశ్నలు పరీక్ష తేదీకి మూడు/ నాలుగు నెలలకు ముందు జరిగిన అంశాల నుంచే ఉంటాయి.

జనరల్ సైన్స్: దీని నుంచి దాదాపు 10- 15 ప్రశ్నలు రావచ్చు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురణలు, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల ప్రచురణలు, 8, 9, 10 తరగతుల్లోని భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించి రోజువారీ జీవితంలో వాటి వినియోగాలను తెలుసుకోవాలి.

పర్యావరణ సమస్యలు– విపత్తు నిర్వహణ: దీనిలో ముఖ్యంగా కాలుష్యం, అడవుల విధ్వంసం- భూతాపం - హరిత గృహ వాయువులు - కరవులు - వరదలు - చక్రవాతాలు - సునామీలు - భూకంపాలు- అగ్నిపర్వతాల విస్ఫోటం - మానవ కారణమైన భారీ ప్రమాదాలు మొదలైనవి చదవాలి.

భారతదేశ, తెలంగాణ రాష్ట్ర భౌగోళికాంశాలు: భౌగోళిక ఉనికి- శీతోష్ణస్థితి- నేలలు లేదా మృత్తికలు, ముఖ్యమైన నదులు, ఉపనదులు, అడవులు- వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, జాతీయ పార్కులు, వ్యవసాయ పంటలు, నీటి పారుదల ప్రాజెక్టులు ముఖ్యంగా జనాభాకు సంబంధించిన అంశాలను చదవాలి. కొత్త జిల్లాల సమాచారాన్ని జిల్లాలవారీగా ప్రదేశాలు, ప్రాజెక్టులు, ఖనిజ వనరులపై దృష్టిసారించాలి.

భారతదేశ, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ: జాతీయ ఆదాయ భావనలను, పేదరిక సమస్యలను, వాటి నిర్మూలన పథకాలను, నిరుద్యోగ నిర్మూలన పథకాలను, వివిధ పంచవర్ష ప్రణాళికలను ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఇటీవల ప్రవేశపెట్టిన, అమలుచేస్తున్న ఆర్థికాభివృద్ధి పథకాలు ముఖ్యం. పంచవర్ష ప్రణాళికలతోపాటు నీతి ఆయోగ్ ఏర్పాటు, నిర్వహణ, విధులను చదవాలి.

భారతదేశ రాజకీయ వ్యవస్థ, భారత రాజ్యాంగం: అత్యంత ప్రధానమైన విభాగమిది. దీని నుంచి సాధారణంగా ఎక్కువ ప్రశ్నలుంటాయి. భారత రాజ్యాంగ విశిష్ట లక్షణాలు- విభాగాలు, షెడ్యూల్స్ - పీఠిక - కొత్త రాష్ట్రాల ఏర్పాటు - ప్రాథమిక హక్కులు - ఆదేశ సూత్రాలు - ప్రాథమిక విధులు - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్మాణం - అధికారాలు - విధులు - పార్లమెంట్ రాష్ట్ర శాసన సభలు - సుప్రీంకోర్టు - హైకోర్టులు - కేంద్ర రాష్ట్ర సంబంధాలు, రాజ్యాంగ సవరణలు లాంటి వాటిని అధ్యయనం చేయాలి.

ఆధునిక భారతదేశ చరిత్ర, భారత స్వాతంత్ర్యోద్యమం: ప్రాచీన, మధ్యయుగ భారతదేశ చరిత్రలను కాకుండా ఆధునిక భారతదేశ చరిత్రనూ, భారత స్వాతంత్రోద్యమాన్నీ సమగ్రంగా అధ్యయనం చేయాలి. దీని కోసం తెలుగు అకాడమీ ప్రచురణలను, నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురణలు ఉపయోగం.

అభ్యర్థులందరూ పూర్తిగా దృష్టి కేంద్రీకరించాల్సిన అంశాలు- తెలంగాణ చరిత్ర, సంస్కృతి; తెలంగాణ ప్రభుత్వ విధానాలు, 'తెలంగాణ ఉద్యమం - తెలంగాణ రాష్ట్ర సాధన'. ముఖ్యంగా మలి ఉద్యమ కాలాన్ని అంటే 2001 నుంచి జరిగిన సంఘటనలపై దృష్టి అవసరం. తెలంగాణ సమాజంలో వాడుకలో ఉన్న కొన్ని ప్రత్యేక పదాలపై ప్రశ్నలుంటాయి.

వీఆర్వోలకు ప్రత్యేకం

నైతిక విలువలు, మహిళలు, బలహీన వర్గాల సమస్యలు: వీఆర్వో పరీక్షలో మరో ప్రత్యేకాంశాన్ని చేర్చారు. అదే నైతిక విలువలు, సమాజంలోని మహిళా సమస్యలు, బలహీన వర్గాల సమస్యల పట్ల అవగాహన, వారి పట్ల సున్నితంగా, గౌరవంగా, వ్యవహరించే ధోరణులు. వారి కోసం రూపొందించి, అమలు చేస్తున్న పథకాలు, వారి రక్షణ, గౌరవ మర్యాదలకు సంబంధించిన చట్టాలపై ప్రాథమిక అవగాహన ఉండాలి. దీంతోపాటు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌పై ఎక్కువ ప్రశ్నలు ఉంటాయనే విషయాన్ని గుర్తించి ప్రిపేర్ కావాలి.

నోటీస్ బోర్డు

● ప్రభుత్వ ఉద్యోగాలు

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ డిప్యూటేషన్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ. ఎస్‌పీఏ 2017 ఫిబ్రవరి 23న విడుదల చేసిన నోటిఫికేషన్‌కు ఇది కొనసాగింపు ఉద్యోగ ప్రకటన. **విభాగాలు:** ప్లానింగ్, ఆర్కిటెక్చర్. **పోస్టు–ఖాళీలు:** ప్రొఫెసర్- 05, అసోసియేట్ ప్రొఫెసర్- 11, అసిస్టెంట్ ప్రొఫెసర్- 17. **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్/ మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు బోధన, పరిశోధన అనుభవం ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరితేది:** 06.07.2018.

వెబ్‌సైట్: www.spav.ac.in

● అర్హత పరీక్ష

సీటెట్- సెప్టెంబర్ 2018

కేంద్రీయ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం నిర్వహించే కేంద్రీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(సీటెట్) ప్రకటనను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. **అర్హత:** సీనియర్ సెకండరీ ఉత్తీర్ణతతోపాటు డీఎడ్ లేదా గ్రాడ్యుయేషన్‌తో డీఎడ్/ బీఎడ్ ఉండాలి. **రాతపరీక్ష తేది:** 16.09.2018. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 22.06.2018 నుంచి 19.07.2018 వరకు. **పూర్తి వివరాలు:** 12.06.2018 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. **వెబ్‌సైట్:** https://ctet.nic.in/

● వాక్ ఇన్స్

ఎంఎస్ఎంఈ- టూల్ రూమ్

హైదరాబాద్‌లోని ఎంఎస్ఎంఈ- టూల్ రూమ్‌లో ఒప్పంద ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ. **విభాగాలు / పోస్టులు:** సీఏడీ/ సీఏఎం/ సీఏఈ, ఎంబెడెడ్ సిస్టమ్స్, అకడమిక్, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, ఆపరేటర్స్/ ట్రేడ్స్‌మెన్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్/ పర్సనల్ సెక్రటరీ, హార్డ్‌వేర్ ఇంజినీర్/ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్. **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, బీఏ, ఎంఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణత. **ఇంటర్వ్యూ తేది:** 08.06.2018.

వెబ్‌సైట్: http://www.citdindia.org/

పుణె కంటోన్మెంట్ బోర్డులో ఖాళీలు

పుణె కంటోన్మెంట్ బోర్డు నిర్వహిస్తున్న వివిధ పాఠశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ.

పోస్టు: స్పెషల్ ఎడ్యుకేటర్స్, కౌన్సెలర్, సబ్జెక్టు టీచర్లు, ఆయా, ల్యాబ్ అసిస్టెంట్, టెక్నికల్ హెల్పర్, ప్యూన్ తదితరాలు. **ఖాళీలు:** 95 **అర్హత:** ఐటీఐ, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఎడ్. **ఇంటర్వ్యూ తేదీలు:** జూన్ 11, 12.

వేదిక: డాక్టర్ అంబేడ్కర్ మెమోరియల్ హై స్కూల్, షోలాపూర్ బజార్, పుణె. **వెబ్‌సైట్:** www.punecantonmentboard.org

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

ప్లాస్టిక్ రహిత రాష్ట్రాలకు ప్రతిన

మంగళవారం మొరాదాబాద్‌లో యోగా చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న యువతులు

- వినియోగాన్ని నిషేధించిన ఐదుగురు ముఖ్యమంత్రులు
- చేయిచేయి కలిపి ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం..
- 'ప్రపంచ పర్యావరణ దినోత్సవ సదస్సు'లో ప్రధాని నరేంద్రమోదీ

చెన్నై, డెహ్రాడూన్, రాంచి, దిల్లీ: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్లాస్టిక్‌రహిత రాష్ట్రాలుగా ఆవిర్భవించాలని తమిళనాడు, నాగాలాండ్, మహారాష్ట్ర, జార్ఖండ్ నిర్ణయించాయి. జూన్ 5ను పర్యావరణ దినోత్సవం, 2018 ప్రపంచ పర్యావరణ దినం వేడుకలకు మనదేశం ఆతిథ్యం ఇచ్చిన నేపథ్యంలో ఈమేరకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు మంగళవారం ప్రకటించారు. జులై 31 నుంచి పాలిథీన్ వాడకూడకాన్ని ఉత్తరాఖండ్ నిషేధించింది. భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్‌రహిత రాష్ట్రాన్ని బహుమతిగా ఇవ్వడానికి జనవరి 2019 నుంచి ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 5నాటికి జార్ఖండ్ ప్లాస్టిక్‌రహిత రాష్ట్రంగా మారాలని ముఖ్యమంత్రి రఘుబర్‌దాస్ ప్రకటించారు. ఈమేరకు 3.25 కోట్లమంది రాష్ట్రప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈ ఏడాది డిసెంబరునాటికి ప్లాస్టిక్ వాడకం కనిపించకూడదని నాగాలాండ్ ముఖ్యమంత్రి ఎన్.రియో పిలుపు ఇచ్చారు. వచ్చే ఏడాదిలో పూర్తిగా ప్లాస్టిక్‌రహిత రాష్ట్రంగా ఆవిర్భవించనున్నట్లు మహారాష్ట్ర పర్యావరణమంత్రి రామ్‌దాస్ కదమ్ తెలిపారు. మన దేశంలో 1998లో మొదటిసారిగా సిక్కిం ప్లాస్టిక్ సంచులను నిషేధించిన తొలి రాష్ట్రంగా చరిత్ర సృష్టించింది.

కాలుష్యరహిత, సతతహరిత ధరిత్రి సాధనకు పాటుపడాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. తద్వారా భావితరాలు పచ్చని పర్యావరణం... ప్రకృతితో మమేకమైన మనుగడ సాగిస్తాయని ఆయన అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2018ను పురస్కరించుకుని మంగళవారం నాడిక్కడ జరిగిన ప్లీనరీ సెషన్‌కు ఆయన అధ్యక్షత వహించారు.

వస్తు సంపద కోసం పాకులాట ఎక్కువైందనీ... ఇందుకోసం ప్రాణాధారమైన పర్యావరణాన్ని పణంగా పెట్టరాదనీ ప్రధాని పిలుపునిచ్చారు. ఇప్పటికే మైక్రో ప్లాస్టిక్ బారిన పడి సాగరజీవజాలం మనుగడ అయోమయంలో పడిందన్నారు. 'సాగర ప్రక్షాళన ఉద్యమం'లో భాగస్వామి అయ్యేందుకు భారత్ యత్నిస్తోందని చెప్పారు. మిగిలిన ఎన్నో ప్రాంతాలతో పోలిస్తే భారత్‌లోనే తలసరి ప్లాస్టిక్ వినియోగం బాగా తక్కువని ఆయన చెప్పారు. భారత ప్రజల జీవనప్రమాణాలను పెంచడానికి తాము కట్టుబడి ఉన్నామనీ... అయితే ఈ లక్ష్యాన్ని పర్యావరణానికి ఏ మాత్రం ఇబ్బంది కలగని రీతిలోనే సాధించనున్నామన్నారు. నిలకడైన, పర్యావరణ హితమైన ప్రగతి సాధనే లక్ష్యమన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సిమ్లాలో 'ప్లాస్టిక్ వాడొద్దు' అనే సందేశంతో మానవహారంగా ఏర్పడ్డ సంత్ నిరంకారీ సంస్థ ప్రతినిధులు

పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల రిజర్వేషన్లకు సుప్రీం పచ్చజెండా

- తుది ఆదేశాలకు లోబడి ముందుకుసాగొచ్చు
- కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం అనుమతి

దిల్లీ: ఎస్సీ, ఎస్టీ విభాగానికి చెందిన ఉద్యోగులకు పదోన్నతుల్లో 'చట్ట ప్రకారం' రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు అనుమతించింది. ఈ అంశంపై వివిధ హైకోర్టులు ఇచ్చిన ఆదేశాలు, 2015లో సుప్రీం కోర్టు విధించిన 'యథాతథ స్థితి' వల్ల పదోన్నతుల ప్రక్రియ స్తంభించిపోయిందన్న ప్రభుత్వ వినతిని పరిగణనలోకి తీసుకొని ఈ మేరకు పచ్చజెండా ఊపింది. "ఈ కేసులో తుది ఆదేశాలకు లోబడి, తదుపరి విచారణ పెండింగ్‌లో ఉండగా.. చట్ట ప్రకారం పదోన్నతులు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి అడ్డంకేమీ లేదు" అని జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయెల్, జస్టిస్ అశోక్ భూషణ్‌తో కూడిన సెలవుకాలపు ధర్మాసనం మంగళవారం స్పష్టంచేసింది.

తాజా కేసులో కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) మణిందర్ సింగ్ వాదనలు వినిపించారు. 2006లో ఎం.నాగరాజ్ కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఈ కేసుకు వర్తిస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు 'సంపన్నశ్రేణి' భావన వర్తించదని నాగరాజ్ కేసులో తీర్పు వచ్చింది. పదోన్నతులకు కేంద్రం తీసుకునే చర్యలకు.. పెండింగ్‌లో ఉన్న పిటిషన్ అడ్డంకి కాబోదని ఇదే తరహా కేసులో జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం గత నెల 17న ఉత్తర్వులిచ్చిందని ఏఎస్‌జీ చెప్పారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. "ప్రస్తుతం పదోన్నతులు ఎలా సాగుతున్నాయి" అని ప్రశ్నించింది. పదోన్నతులేమీ జరగడంలేదని, ఆ ప్రక్రియ స్తంభించిపోయిందని ఏఎస్‌జీ చెప్పారు. రాజ్యాంగ ప్రకారం ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అనుమతించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. చట్ట ప్రకారం పదోన్నతుల్లో ముందుకెళ్లేందుకు కేంద్రానికి అనుమతిస్తున్నట్లు తెలిపింది. మరోవైపు సుప్రీం కోర్టు ఆదేశాలను కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాసవాన్ స్వాగతించారు.

భూగర్భజల శోకం

- ప్రపంచదేశాల వినియోగంలో నాలుగోవంతు మనదే
- సంయుక్తంగా చైనా, అమెరికాలను మించిపోయాం

కోచి: భారత్‌లో విచ్చలవిడిగా భూగర్భజలాలను తోడేస్తున్నారని 'వాటర్‌ఎయిడ్' అనే సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు వినియోగించుకున్న నీటిలో ఒక్క మనదేశమే నాలుగోవంతు వాడేసిందని వెల్లడించింది. ఇది అమెరికా-చైనా సంయుక్తంగా వాడిన నీటికంటే ఎక్కువని తెలిపింది.

- ఉత్తర-మధ్య భారతదేశంలో కోట్లమంది నీటికొరతతో బాధపడుతున్నారని, భూగర్భజలాలు దిగువకు పడిపోయాయని పేర్కొంది. సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం మనదేశంలో 16.3 కోట్ల మందికి స్వచ్ఛజలాలు ఎండమావే. పట్టణప్రాంతాల్లోని ఏడు శాతం, గ్రామాల్లోని 15 శాతం మందికి మురికినీరే దిక్కు.
- భారత్‌తో పాటు బంగ్లాదేశ్, మయన్మార్, దక్షిణ మడగాస్కర్, దక్షిణ మొజాంబిక్ దేశాల్లో కోట్లమంది ప్రజలు తీవ్రనీటి కొరత ఎదుర్కొంటున్నారు. ఉత్తర ఆస్ట్రేలియా, కాలిఫోర్నియాలో భూగర్భజలాలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి.
- 'భారత్‌లో నీటివనరులను కలుషితం చేయకుండా కఠినచర్యలు చేపట్టాలి. అనవసరంగా భూగర్భజలాల వాడకాన్ని అరికట్టాలి. నీటిసమృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రచారం కల్పించాలి. వాననీటిని సంరక్షించాలి. వ్యర్థజలాలను శుభ్రం చేసి, మళ్లీ వాడాలి' అని వాటర్‌ఎయిడ్ భారత్ సంచాలకుడు అవినాశ్ కుమార్ పేర్కొన్నారు.
- ప్రతిఇంటికి పైపులతో నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన 'అమృత్', 'హర్ ఘర్ జల్' పథకాలు విజయవంతం కావడానికి చర్యలు చేపట్టాలన్నారు.



పర్యావరణ హిత ప్లాస్టిక్‌ను వినియోగించాలి

ఈనాడు, దిల్లీ: ప్రజలందరూ పర్యావరణ హిత ప్లాస్టిక్‌ను వినియోగించాలని ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జగ్గీ వాసుదేవ్ పిలుపునిచ్చారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా 400 ప్రాంతాల్లో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారమిక్కడ నిర్వహించిన కార్యక్రమంలో ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ విభాగ అధ్యక్షుడు ఎరిక్ సోల్‌హిమ్, ఐక్యరాజ్య సమితి రాయబారి, బాలీవుడ్ నటి దియా మీర్జాలతో కలిసి ఆయన ప్లాస్టిక్ వల్ల వచ్చే అనర్థాలు, నివారణ చర్యలపై చర్చిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలంటూ తలపై ముసుగులు వేసి ప్లాస్టిక్ వినియోగంపట్ల వ్యతిరేకత వ్యక్తం చేశారు. వినియోగంలో ఉన్న ప్లాస్టిక్‌లో 40శాతం శుద్ధి చేయలేనిదని, దానిని పూర్తిగా నిషేధించాలని జగ్గీ వాసుదేవ్ కోరారు. 'మా తరంలో ప్లాస్టిక్ వాడకుండానే పెరిగాం. ప్రత్యామ్నాయం చూసుకుని మళ్లీ ప్లాస్టిక్ వినియోగించని పరిస్థితి రావాలి. పరిశ్రమలకు వ్యతిరేకంగా ఆందోళన చేయడంపై మాకు నమ్మకం లేదు. కాలుష్య కారకాల నుంచి కాలుష్యం లేని పద్ధతుల వైపు పరిశ్రమలు మళ్లాలని విశ్వసిస్తాం' అని పేర్కొన్నారు.



పర్యావరణ పరిరక్షణపై మంగళవారం దిల్లీలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జగ్గీ వాసుదేవ్

కొనసాగుతున్న 'పెట్రో' ధరల తగ్గింపు

- పెట్రోల్ 12–14 పైసలు, డీజిల్ 9–10 పైసలు తగ్గింపు

దిల్లీ: పెట్రోల్, డీజిల్ ధరలు మంగళవారం కూడా తగ్గాయి. దిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నైలో లీటరు పెట్రోల్ ధర 12-14 పైసలు; డీజిల్ 9-10 పైసలు తగ్గించినట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెబ్‌సైటు వెల్లడించింది. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి పెట్రోల్ ధర దిల్లీలో రూ.77.83, కోల్‌కతాలో రూ.80.47, ముంబయిలో రూ.85.65, చెన్నైలో రూ.80.80; వరుసగా ఇదే నగరాల్లో డీజిల్ ధరలు రూ.68.88, 71.43, 73.33, 72.72కు కొనుగోలు ధర ఉంటుందని తెలిపింది. మొత్తానికి వరుసగా గత ఏడురోజులుగా పెట్రోల్ ధర 46-49 పైసలు; ఆరురోజులుగా డీజిల్ ధర 34-36 పైసలు తగ్గాయి.

చక్కెర పరిశ్రమకు త్వరలో రూ.8వేల కోట్ల ప్యాకేజీ

దిల్లీ: కష్టాల్లో ఉన్న చక్కెర పరిశ్రమకు రూ.8వేల కోట్ల ప్యాకేజీని ప్రభుత్వం త్వరలో ప్రకటించనుందని కేంద్ర ఆహారశాఖ మంత్రి రాంవిలాస్ పాస్వాన్ వెల్లడించారు. దేశంలో చక్కెర మిల్లులు రూ.22000 కోట్ల మేర రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తంలో సగం యూపీలోనే ఉన్నట్లు సమాచారం. ఇటీవల యూపీలోని కైరానా లోక్‌సభ స్థానం ఉప ఎన్నికల్లో భాజపా ఓటమికి ప్రధాన కారణం అక్కడి చెరకు రైతుల్లోని ఆగ్రహమే కారణమని సమాచారం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

దేశీయంగానే లిథియం-అయాన్ బ్యాటరీల ఉత్పత్తి

దిల్లీ: 'భారత్‌లో తయారీ'లో భాగంగా దేశీయంగానే త్వరలోనే 'లిథియం-అయాన్' బ్యాటరీలను ఉత్పత్తి చేయనున్నామని కేంద్రమంత్రి అనంత్‌గీతె తెలిపారు. విద్యుత్తు వాహనాల్లో వాడే ఈ బ్యాటరీలను ప్రస్తుతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. విద్యుత్తు బస్సులో వాడే దీని ఖరీదు రూ.50-60 లక్షలు ఉందని, ఈ బ్యాటరీని దేశీయంగానే తయారుచేస్తే, ఉత్పత్తి వ్యయం తగ్గి ప్రయాణికులకు తక్కువ ధరకే టికెట్లు అమ్మగలుతారని చెప్పారు.

శశిథరూర్‌కు సమన్లు

- సునందా మృతి కేసులో జులై 7న విచారణకు హాజరుకావాలని దిల్లీ కోర్టు ఆదేశాలు

దిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్‌ను భార్య సునందా పుష్కర్ మృతి కేసులో నిందితుడిగా పేర్కొంటూ దిల్లీ కోర్టు మంగళవారం సమన్లు జారీచేసింది. జులై ఏడున తమ ఎదుట విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. సునంద పట్ల ఆయన క్రూరంగా ప్రవర్తించారని, ఆమె ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారని ఆరోపణలతో నమోదైన అభియోగపత్రాన్నీ పరిగణలోకి తీసుకుంది. ఈ అంశంపై అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సమర్ విశాల్ విచారణ చేపట్టారు. 'విచారణకర్తల వాదనలువిన్నాను. అభియోగపత్రంతోపాటు దానికి అనుబంధంగా సమర్పించిన పత్రాలన్నీ క్షుణ్నంగా పరిశీలించాను. వీటి ఆధారంగా.. భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 306, 498ఏల కింద ఆయనపై చర్యలు తీసుకోవచ్చు"అని విశాల్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో థరూర్‌ను నిందితుడిగా పేర్కొంటూ సమన్లు జారీ చేయాలా? వద్దాఅనే అంశంపై నిర్ణయాన్ని మే 28న కోర్టు రిజర్వులో పెట్టింది. అయితే ఆయనపై చర్యలు తీసుకునేందుకు తగిన ఆధారాలున్నాయని దిల్లీ పోలీసులు వాదించారు. 2014 జనవరి 17న ఓ విలాసవంతమైన హోటల్‌లో సునంద మృతదేహమై కనిపించారు. 498ఏ(భార్యపై క్రూరత్వం) కింద నేరం రుజువైతే గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష పడే అవకాశముంది. అదే 306(ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించడం) కింద నేరం రుజువైతే గరిష్ఠంగా పదేళ్లు జైలు శిక్ష అనుభవించాల్సి వుంటుంది. అభియోగపత్రంలోని ఆరోపణలన్నీ నిరాధారమైనవని శశిథరూర్ వ్యాఖ్యానించారు. వీటిపై పోరాడతానని, చివరికి నిజమే గెలుస్తుందని చెప్పారు.

ఈ కేసులో విచారణకర్తలకు సహాయం చేసేందుకు అనుమతించాలంటూ భాజపా సీనియర్ నాయకుడు సుబ్రమణ్యస్వామి అభ్యర్థన దాఖలుచేశారు. దీన్ని ప్రభుత్వ అదనపు విచారణకర్త అతుల్ శ్రీవాస్తవ వ్యతిరేకించారు. దీనిపై వచ్చే నెల ఏడో తేదీన విచారణ చేపడతామని కోర్టు తెలిపింది.

చిదంబర రహస్యం చెప్పండి

- ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో 6 గంటల పాటు విచారణ
- జులై 10 వరకూ అరెస్టు వద్దు: కోర్టు

దిల్లీ: ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాదాపు 6 గంటల పాటు ప్రశ్నించింది. ఆయనను విచారించడం ఇదే మొదటిసారి. మరోవైపు ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు జులై 10 వరకూ అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. దర్యాప్తు అధికారుల సమన్ల మేరకు చిదంబరం మంగళవారం ఉదయం 11.00 గంటల సమయంలో తన న్యాయవాదితో కలసి దిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా చిదంబరం వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. ఆర్థిక మంత్రి హోదాలో విదేశీ పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ) అనుమతులు ఇవ్వడంలో చిదంబరం పోషించిన పాత్రపై నాటి అధికారులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగానూ ఆయనను విచారించారు. విచారణ అనంతరం చిదంబరం మాట్లాడుతూ.. అధికారులు సంధించిన అన్ని ప్రశ్నలకూ తన సమాధానం ప్రభుత్వ పత్రాల్లో ఇప్పటికే నమోదై ఉందన్నారు. 2006లో ఎయిర్‌సెల్‌లో రూ.3500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు 'గ్లోబల్ కమ్యూనికేషన్ హోల్డింగ్ సర్వీసెస్ లిమిటెడ్' (మ్యాక్సిస్ అనుబంధ సంస్థ)కు ఎఫ్ఐపీబీ అనుమతి ఇవ్వడంపై ఈ కేసు నమోదైంది. ఆర్థిక మంత్రి హోదాలో రూ.600 కోట్ల ప్రతిపాదనలకు మాత్రమే ఎఫ్ఐపీబీ అనుమతులను ఇచ్చే అధికారం ఉందని ఈడీ పేర్కొంది. ఈ కేసులో ఈడీ ఇప్పటికే చిదంబరం కుమారుడు కార్తీని ప్రశ్నించింది.

రాజ్ కుంద్రాను ప్రశ్నించిన ఈడీ

ముంబయి: క్రిప్టోకరెన్సీ బిట్ కాయిన్ లావాదేవీలకు సంబంధించిన కేసులో.. బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాజ్ కుంద్రాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారించింది. క్రిప్టోకరెన్సీ లావాదేవీలతో కుంద్రాకు సంబంధాలున్నట్లు గుర్తించామని.. అందుకే ఆయన్ను పిలిపించి ఇదే విషయంపై ప్రశ్నించామని అధికారులు తెలిపారు.

భారత ప్రధానులపై భావితరాలకు అవగాహన

- నెహ్రూ అధికారిక నివాసం ఆవరణలో ప్రత్యేక ప్రదర్శనశాల
- మూడు కమిటీలు ఏర్పాటు చేసిన కేంద్ర సాంస్కృతికశాఖ
- సభ్యులుగా సూర్యప్రకాశ్, స్వపన్‌దాస్‌గుప్తా

దిల్లీ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న 'భారత ప్రధానుల ప్రదర్శనశాల' ప్రాజెక్టు కోసం కేంద్ర సాంస్కృతికశాఖ మూడు కమిటీలను ఏర్పాటు చేసింది.

అసలైన ముఖ్యకార్యనిర్వాహకులుగా మన దేశానికి ప్రధానులు అందించిన సేవలను భవిష్యత్తుతరాలకు తెలియపర్చడానికి, స్వాతంత్ర్య సంగ్రామం విశేషాలపై అవగాహన కల్పించడానికి కేంద్రం ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. మొదటి ప్రధాని నెహ్రూ అధికారిక నివాసం తీన్‌మూర్తి ఎస్టేట్ ఆవరణలో దీన్ని నిర్మించనున్నారు. ప్రదర్శనశాలలో ఎలాంటి అంశాలు ఉండాలనే విషయమై నెహ్రూ స్మారక ప్రదర్శనశాల, గ్రంథాలయం సంచాలకుడు శక్తిసిన్హా అధ్యక్షతన మొదటి కమిటీ ఏర్పాటు చేశారు. చరిత్రకారుడు మఖన్‌లాల్, ప్రొఫెసరు శ్రీప్రకాశ్‌సింగ్ ఇందులో సభ్యులు. భారత ప్రధానులకు సంబంధించి ఏమేం విషయాలను ప్రదర్శించాలనే అంశంపై రాజ్యసభ సభ్యుడు స్వపన్‌దాస్‌గుప్తా అధ్యక్షతన ఏర్పాటైన రెండో కమిటీ పర్యవేక్షిస్తుంది. ఇందులో ప్రసారభారతి అధ్యక్షుడు ఎ.సూర్యప్రకాశ్ సభ్యుడిగా ఉంటారు. సీపీడబ్ల్యూడీ అధికారులతో కలసి శక్తిసిన్హా అధ్యక్షతన ఏర్పాటు చేసిన మూడో కమిటీ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తుంది.

సౌర 'కుసుమ్'

- రూ.1.4లక్షల కోట్లతో రైతులకు సౌర విద్యుత్ పంపులు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'కుసుమ్' పథకం జులై నుంచి అమలులోకి రానుందని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్కే సింగ్ వెల్లడించారు. రూ.1.4లక్షల కోట్ల వ్యయమయ్యే ఈ పథకంలో భాగంగా రైతులకు 27.5లక్షల సౌరవిద్యుత్ మోటార్లను ప్రభుత్వం అందజేయనుంది. సౌర విద్యుత్ వినియోగించేలా రైతులను ప్రోత్సహించటం ఈ పథకం ముఖ్య లక్ష్యం. కుసుమ్ (కిసాన్ ఊర్జా సురక్షా ఏవమ్ ఉత్థాన్ మహాభియాన్) పథకం కింద ఇచ్చే సౌర విద్యుత్ మోటార్లు రెండు విధాలుగా ఉంటాయి. 17.5లక్షల మోటార్ల వద్ద ఏర్పాటు చేసే సోలార్ ప్యానల్స్ నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఆ మోటార్ల కోసమే వినియోగిస్తారు. మరో 10లక్షల సౌర విద్యుత్తు మోటార్ల వద్ద ఏర్పాటు చేసే సోలార్ ప్యానల్స్ నుంచి ఉత్పత్తయ్యే అదనపు విద్యుత్‌ను రైతులు విక్రయించుకోవచ్చు. దీనికోసం వీటిని గ్రిడ్‌తో అనుసంధానం చేస్తారు. మిగులు సౌర విద్యుత్‌ను విక్రయించుకొనే అవకాశం కల్పించటం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందుతారని మంత్రి వెల్లడించారు. రెండో పద్ధతిలో రైతులు దాదాపు 10 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీనికోసం ఒక్కో రైతు 0.5 నుంచి 2 మెగావాట్ల సామర్థ్యమున్న సౌర విద్యుత్ కేంద్రాలను సొంతంగా ఏర్పాటు చేసుకొనేలా ప్రభుత్వం తగిన సహాయసహకారాలు అందిస్తుందని మంగళవారం మంత్రి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మార్గదర్శక పాత్ర పోషించండి

- సున్నిత అంశాలపై గవర్నర్లు వ్యక్తిగత అభిప్రాయాలు వెల్లడించొద్దు
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఉద్బోధ

ఈనాడు, దిల్లీ: రాజ్‌భవన్లు సమాంతర అధికార కేంద్రాలు కాదని, అభివృద్ధి ప్రక్రియలో గవర్నర్లు మార్గదర్శక పాత్ర పోషించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు వెల్లడించడం, విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేయడం; సున్నితమైన, రాజకీయఅంశాలపై ట్వీట్లు పోస్టు చేయడం మంచిది కాదని హితవు పలికారు. రాష్ట్రపతిభవన్‌లో జరిగిన గవర్నర్ల సదస్సు ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గవర్నర్లు అభివృద్ధికి ఉత్ప్రేరకంగా మారాలని సూచించారు. ప్రధాని మోదీ చెప్పిన 'సంస్కరణ, అమలు, మార్పు' సిద్ధాంత స్ఫూర్తిని ఆచరణలో పెట్టడానికి గవర్నర్లు కృషి చేయాలని సూచించారు. నిరాడంబరతకు మారుపేరుగా తయారై చేనేతవస్త్రాలు, స్థానికంగా తయారయ్యే వస్తు వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 'మీరు తెలివైన సలహాదారులు, గురువులు, స్నేహితులు, సిద్ధాంతకర్తలు, మార్గదర్శకులు' అని గవర్నర్లను అభివర్ణించారు. 10వ తరగతివరకూ తప్పనిసరిగా స్థానిక భాషను ఉపయోగించేలా రాష్ట్ర ప్రభుత్వాలకు నచ్చజెప్పాలన్నారు.

గవర్నర్ల సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

నాలుగేళ్ల చిన్నోడు... భళే పుస్తకం రాశాడు!

లఖీంపూర్ (అసోం): అక్షరాలు నేర్చుకునే వయసులో... పొట్టి కథల పుస్తకం రాశాడు! పెన్ను పట్టుకోవడం చేతకాని ప్రాయంలో.. రంగు రంగుల బొమ్మలేసి అబ్బురపరిచాడు!! ఆ చిన్నోడే.. అసోంలోని లఖీంపూర్‌కు చెందిన నాలుగేళ్ల ఆయాన్ గొగొయ్ గొహైన్. తన రచనలతో ప్రముఖ రచయితల ప్రశంసలు కూడా పొందాడు కాబట్టే... 'ది ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' ఈ బుడ్డోడిని 'భారతదేశ అత్యంత పిన్న వయస్కుడైన రచయిత'గా గుర్తించింది.

నార్త్ లఖీంపూర్‌కు చెందిన గొహైన్.. పూర్వ పాఠశాల విద్యార్థి. ఏడాది వయసులోనే బొమ్మలేయడం ఆరంభించాడు. మూడేళ్ల ప్రాయం నుంచే కథలు రాసేవాడట. మాటలను, రంగులను, రుచులను, శబ్దాలను ఎంతో నిశితంగా పరిశీలిస్తుంటాడని అతని తాతయ్య పూర్ణకాంత గొగొయ్ చెప్పారు. ఇలా 30 చిట్టికథలతో 'హనీకూంబ్' పేరుతో గొహైన్ గత జనవరిలో పుస్తకం ప్రచురించాడు. ఇందులోని కథలకే కాకుండా... పుస్తకం ముఖపత్ర చిత్రాన్నీ స్వయంగా తానే వేశాడట. దీని ఖరీదు రూ.250. తల్లిదండ్రులు మిజోరాంలో ఉంటే... ఇతగాడు మాత్రం తన తాతయ్య, బామ్మతో కలిసి లఖీంపూర్‌లోనే ఉంటున్నాడు. 'హనీకూంబ్'ను ప్రముఖ రచయిత, కవి దిలీప్ మహాపాత్ర, నార్త్ కరొలినాకు చెందిన రచయిత్రి జొయాన్ లియోటా తదితర సాహిత్యకారులెందరో సమీక్షించారు. 'పిన్నలనే కాదు పెద్దలనూ ఆకట్టుకుంటుందీ పుస్తకం' అని పలువురు రచయితలు ప్రశంసించడం విశేషం!

వయో పరిమితి నిబంధనకు భాజపా మంగళం!

- ఆడ్వాణీని 2019 ఎన్నికల బరిలోకి దించే యోచనలో పార్టీ
- ఆయన పోటీ చేయాలన్నది ప్రధాని మోదీ అభిమతమని సమాచారం
- మురళీమనోహర్ జోషీకీ అవకాశం!

దిల్లీ: వయో పరిమితి నిబంధనతో పలువురు పార్టీ అగ్రనేతలను ప్రభుత్వ, పార్టీ పదవులకు దూరంగా పెట్టిన కమలనాథులు వచ్చే సాధారణ ఎన్నికల్లో ఆ నిబంధనను పక్కన పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేత ఎల్.కె.ఆడ్వాణీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా కోరుకుంటున్నారని సమాచారం. మురళీ మనోహర్ జోషీ లాంటి నేతలనూ ఎన్నికల బరిలోకి దించే యోచనతో భాజపా ఉందని అంటున్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని ఆడ్వాణీ ఇంటికి వెళ్లి వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ పోటీచేయాలని కోరినట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది. 90 ఏళ్ల ఎల్.కె.ఆడ్వాణీ ప్రస్తుతం భాజపా ఎంపీ అయినప్పటికీ ఏ ప్రభుత్వ పదవిలోనూ లేరు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన గాంధీనగర్ స్థానం నుంచి ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే, మంత్రి మండలిలో ప్రవేశానికి వయో పరిమితి నిబంధనను ముందుకు తీసుకురావటంతో ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషీ తదితర సీనియర్ నేతలు ప్రభుత్వ పదవులకు దూరమవ్వాల్సి వచ్చింది. పార్టీ అత్యున్నత విధాన నిర్ణయాక మండలి పార్లమెంటరీ బోర్డులోనూ వారికి చోటు దక్కలేదు. ఆ తర్వాత అయిదుగురు సభ్యులతో కూడిన మార్గ దర్శక్ మండలిని భాజపా అధ్యక్షుడు అమిత్ షా ఏర్పాటుచేసి దానిలో ఆడ్వాణీ, మురళీమనోహర్ జోషీలకు చోటుకల్పించినా ఆ మండలి ఇంత వరకు ఒక్కసారి కూడా భేటీ కాలేదు.

విపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తున్న నేపథ్యంలో...

వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా గెలుపొందగలిగే అభ్యర్థులనే రంగంలోకి దించాలని దీని కోసం వయోపరిమితి నిబంధనను అటకెక్కించి ఆడ్వాణీ, జోషీ లాంటి ముఖ్య నేతలను పోటీచేయించాలని భాజపా నాయకత్వం యోచిస్తోందని అంటున్నారు. ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 75ఏళ్ల వయస్సు పైబడిన యడ్యూరప్ప పోటీ చేసిన విషయం తెలిసిందే. ఎన్డీయే నుంచి తెదేపా వైదొలగటం; శివసేన ఆగ్రహంతో ఉండటం; బిహార్‌లో జేడీ(యూ) మరిన్ని సీట్లకు పట్టుపట్టడం వంటి పరిస్థితులకు తోడు భాజపాకి వ్యతిరేకంగా విపక్షాలు దగ్గరవుతుండటం వంటి పరిస్థితుల్లో కమలనాథుల ఎన్నికల వ్యూహాల్లో మార్పులు జరుగుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

విప్రో ఉద్యోగులకు వేతన పెంపు

దిల్లీ: విప్రో సంస్థ తమ ఉద్యోగులకు జూన్ 1 నుంచి వేతనాలు పెంచింది. దేశీయంగా విధులు నిర్వర్తిస్తున్న వారికి (ఆఫ్‌షోర్ ఉద్యోగులు) అధికంగా, ఇతర దేశాల్లో (ఆన్‌సైట్ ఉద్యోగులు) ఖాతాదారుల (క్లయింట్స్) ప్రాంగణాల్లో పని చేసే వారికి తక్కువగా వేతనాలు పెంచింది. అయితే అందరి వేతనాల్లో ఒక అంకె వృద్ధి మాత్రమే ఉండటం గమనార్హం. ఆఫ్‌షోర్ ఉద్యోగులకు అధికంగా, ఆన్‌సైట్ ఉద్యోగులకు తక్కువగా పెంచింది. 'మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులు, భవిష్యత్తు కేంద్రీకృత సాంకేతిక పరిజ్ఞానం, డొమైన్లలో పని చేసే వారికి ఎక్కువగా పెంచామ'ని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే ఎంత శాతం పెంచింది? ఎంతమంది ఉద్యోగులకు పెంచింది? తదితర వివరాలు మాత్రం వెల్లడించలేదు.

ఈనాడు బిజినెస్

ఎయిర్‌టెల్ సేవలన్నిటికీ ఒకే బిల్లు!

దిల్లీ: ఎయిర్‌టెల్ అందిస్తున్న బ్రాడ్‌బ్యాండ్, ఫిక్స్‌డ్ లైన్, పోస్ట్‌పెయిడ్ మొబైల్, డిజిటల్ టీవీ తదితర సేవల్ని వినియోగించే ఖాతాదారులకు శుభవార్త. ఒకే వ్యక్తి పేరిట ఈ బిల్లులన్నీ ఉంటే, ఒకే బిల్లుగా చెల్లించవచ్చు. ఇందుకోసం వినియోగదారులకు 10 శాతం వరకు బిల్లుపై రాయితీ ఇవ్వనున్నట్లు ఎయిర్‌టెల్ ఓ ప్రకటనలో పేర్కొంది. 'మై ఎయిర్‌టెల్' యాప్‌లో ఎయిర్‌టెల్ హోమ్ సదుపాయాన్ని ఉపయోగించుకుని వినియోగదారులు ఈ ప్రీమియం వినియోగదారు సేవను పొందవచ్చని కంపెనీ తెలిపింది. 'మేము అందిస్తున్న వివిధ రకాల సేవలకు వేర్వేరు బిల్లుల్ని వేర్వేరు తేదీల్లో చెల్లించడం వినియోగదారులకు ఇబ్బందికరంగా ఉండడంతో ఏకీకృత బిల్లును తీసుకొచ్చామని' కంపెనీ ప్రతినిధి తెలిపారు.

ప్రత్యేక డిపాజిట్లతో ఆకర్షణ

ఈనాడు - హైదరాబాద్

ఆర్‌బీఐ వడ్డీ రేటును సవరిస్తుందన్న అంచనాలతో బ్యాంకులు ముందుగానే డిపాజిట్లు, రుణాలపై వడ్డీ రేట్లను పెంచడం ప్రారంభించాయి. ఈ పోటీలో ముందుండేందుకు పలు బ్యాంకులు, బ్యాంకింగేతర రుణ సంస్థలు కొత్త పథకాలతో డిపాజిట్‌దారులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పెట్టుబడికి రక్షణ.. వడ్డీకి హామీ.. సురక్షితం.. ఇలా పలు కారణాలతో చాలామంది బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై మొగ్గు చూపిస్తారు. పొదుపు, పెట్టుబడి ఏదైనా దీనితోనే అని నమ్ముతారు. భారతీయ బ్యాంకుల్లో దాదాపు రూ.లక్షన్నర కోట్ల వరకూ ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని అంచనా. గత ఆరు నెలలుగా మాత్రం డిపాజిట్ చేసేవారి సంఖ్య తగ్గుతోంది. బ్యాంకులకు కొత్త డిపాజిట్లు రావడం కష్టంగా మారింది. ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు భయం. వరుసగా బ్యాంకు కుంభకోణాలు బయటపడుతుండటమే ఇందుకు కారణమని జగమెరిగిన సత్యమే. పాత పెద్ద నోట్ల రద్దు తరవాత బ్యాంకుల దగ్గరున్న డబ్బంతా తిరిగి ఆర్థిక వ్యవస్థలోకి రావడం.. కొత్తగా తిరిగి బ్యాంకులో జమ చేసేవారి సంఖ్య తగ్గడంతో బ్యాంకులకు లిక్విడిటీ (నగదు లభ్యత) సమస్య ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకే ఇప్పుడు అధిక వడ్డీ ఆశ చూపిస్తున్నాయి. దీనికోసం ఇవి పరిమిత కాలపు ప్రత్యేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి.



చిన్న డిపాజిట్‌దారులే లక్ష్యంగా..

బ్యాంకులకు రాజపోషకులు చిన్న డిపాజిట్‌దారులు.. రుణ గ్రహీతలే. పెద్ద కంపెనీల డిపాజిట్లు కరెంటు ఖాతాల్లో ఉండి.. ఎప్పుడు బయటకు వెళ్తాయో.. కార్పొరేట్ రుణగ్రహీతలు అప్పు ఎప్పుడు ఎగవేస్తారో అర్థం కాని పరిస్థితుల్లో బ్యాంకులు ఉన్నాయి. దీంతో వాటి లక్ష్యం అంతా చిన్న డిపాజిట్‌దారులను ఆకర్షించడమే లక్ష్యంగా ఉంటోంది. దీనికోసమే పరిమిత కాల వ్యవధితో ప్రత్యేక డిపాజిట్ పథకాలను అందుబాటులోకి తెస్తున్నాయి.

- ఆంధ్రాబ్యాంకు ఇప్పటికే 'ధనవృద్ధి రిటైల్' పేరుతో 400 రోజుల కాలవ్యవధి డిపాజిట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో జమ చేయడానికి ఈ నెల 30 వరకు సమయం ఇచ్చింది. కనీసం రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.కోటి వరకూ ఇందులో జమ చేయొచ్చు. వార్షిక వడ్డీ 6.80శాతం (సీనియర్ సిటిజన్లకు 0.50శాతం అధికం). ప్రస్తుతం ఈ బ్యాంకు 1-2ఏళ్ల డిపాజిట్లపై 6.60శాతం వడ్డీని అందిస్తోంది. ఈ ప్రత్యేక డిపాజిట్ పథకంలో 20 బేసిస్ పాయింట్లను అధికంగా అందిస్తోందన్నమాట. మే నెలలో రుణ వడ్డీ రేట్లకు సంబంధించి ఎంసీఎల్ఆర్‌ను సవరించక ముందే ఇది ఈ డిపాజిట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది.
- తాజాగా ప్రైవేటు బ్యాంకులూ ఇలాంటి పథకాలకు శ్రీకారం చుట్టాయి. యెస్ బ్యాంకు మంగళవారం నుంచి కొత్త డిపాజిట్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ 'గ్రీన్ ఫ్యూచర్:డిపాజిట్'లో వార్షిక వడ్డీ రేటు 7.50శాతం. (సీనియర్ సిటిజన్లకు 8శాతం) ఈ పథకంలో భాగంగా.. రానున్న మూడు నెలల్లో రూ.1,000 కోట్లు సమీకరించాలని బ్యాంకు లక్ష్యంగా విధించుకుంది. దీన్ని 18 నెలల 8 రోజుల నుంచి 18 నెలల 18 రోజుల వ్యవధికి తీసుకోవచ్చు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు ప్రారంభించిన ఈ పథకంలో మరో విశేషం కూడా ఉంది. కేవలం బ్యాంకు వెబ్‌సైటు లేదా యాప్ నుంచి మాత్రమే ఈ డిపాజిట్ చేసేందుకు అవకాశం ఉంది. ప్రతి డిపాజిట్‌దారుడి పేరుమీదా ఒక మొక్క నాటి, అది ఎక్కడ నాటారో పేర్కొంటూ ఒక పత్రం కూడా అందిస్తారు!

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలూ..

బ్యాంకులతోపాటు బ్యాంకింగేతర రుణ సంస్థలూ ఇటీవల కాలంలో డిపాజిట్ల సేకరణకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. బ్యాంకులతో పోలిస్తే.. వీటిల్లో వడ్డీ రేట్లు అధికంగా ఉండటం, ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లులాంటి భయాలు లేకపోవడంతో చాలామంది డిపాజిట్‌దారులు వీటిపట్ల ఆకర్షితులవుతున్నారు.

బజాజ్ ఫైనాన్స్ 36-60 నెలల కాల వ్యవధి డిపాజిట్లపై ప్రస్తుతం ఉన్న వడ్డీ రేటు 30బేసిస్ పాయింట్లు పెంచి 8.40శాతానికి తీసుకొచ్చింది. ఇది కొత్త డిపాజిట్‌దారులకు వర్తిస్తుంది. ఇప్పటికే ఉన్న డిపాజిట్‌దారులకు దీనిపై అదనంగా 25 బేసిస్ పాయింట్లు పెంచింది. అంటే.. వారికి 8.65శాతం వడ్డీ లభిస్తుందన్నమాట. సీనియర్ సిటిజన్లకు 8.75శాతం వడ్డీ లభించనుంది. ఈ పెంపుతో పాటు.. 15 నెలల కాల వ్యవధికి కొత్తగా ఒక డిపాజిట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో కనీసం రూ.లక్ష నుంచి డిపాజిట్ చేయవచ్చు. వార్షిక వడ్డీ రేటు 7.85శాతం. సీనియర్ సిటిజన్లకు 8.20శాతం.

ఎంసీఎల్ఆర్ పెంపు..

రుణ వడ్డీ రేట్ల నిర్ణయంలో పరిగణనలోనికి తీసుకునే ఎంసీఎల్ఆర్‌ను కూడా పలు బ్యాంకులు సవరించాయి. ఆర్‌బీఐ ద్రవ్య విధాన సమీక్షకు ముందే వడ్డీ రేట్ల పెంపును ఊహించి ఇవి నిర్ణయం తీసుకుంటున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా జూన్ 7 నుంచి అమల్లోకి వచ్చేలా తన కొత్త ఎంసీఎల్ఆర్‌ను 5 బేసిస్ పాయింట్ల మేరకు పెంచింది. ఏడాది వ్యవధి రుణాల ఎంసీఎల్ఆర్ ప్రస్తుతం ఉన్న 8.40శాతం నుంచి 8.45శాతానికి చేరింది. నిధుల సమీకరణకు అధికంగా ఖర్చు అవుతుండటం, వడ్డీ రేట్లు పెరుగుతాయనే అంచనాలు ఉండటమే ఈ పెంపునకు కారణమని బ్యాంకు చెబుతోంది. రోజు, నెల, మూడు, ఆరునెలల ఎంసీఎల్ఆర్‌లు వరుసగా 7.95%, 8%, 8.10%, 8.30%గా మారాయి. ప్రస్తుతం ఈ బ్యాంకు బేస్ రేటు 9.15శాతంగా ఉంది. ఇప్పటికే పలు బ్యాంకులు తమ ఎంసీఎల్ఆర్‌లను పెంచిన విషయం తెలిసిందే. ఆర్‌బీఐ కీలక వడ్డీ రేటును ఈసారి సవరించకపోవచ్చనే వార్తలూ వినిపిస్తున్న నేపథ్యంలోనూ బ్యాంకులు డిపాజిట్, రుణ వడ్డీ రేట్లను పెంచేశాయి. నిజంగానే ఆర్‌బీఐ వడ్డీరేట్లు పెంచితే.. ఇవి మరోసారి తమ వడ్డీ రేట్లను సవరిస్తాయా? వడ్డీ పెంచితే డిపాజిట్‌దారులకు ఆనందం.. రుణదాతలకు భారం.. చూద్దాం! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది కదా!

ఉద్దేశపూర్వక ఎగవేతలకు ప్రత్యేక విభాగం

దిల్లీ: నికర నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) నుంచి ఉద్దేశపూర్వక ఎగవేతలను విడదీసి ఒక ప్రత్యేక విభాగంగా చూపించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(ఫైనాన్స్) ప్రభుత్వానికి సిఫారసు చేసే అవకాశం ఉంది. 'మొత్తం మీద రెండు విభాగాలు ఉండాలని కమిటీ భావిస్తోంది. ఒకటి ఉద్దేశపూర్వక ఎగవేత.. రెండోది. సాధారణ ఎన్‌పీఏలు..' అని ఒక సభ్యుడు పేర్కొన్నారు. రుణాలను తీర్చడానికి శక్తి ఉన్నా.. ఎగవేసినపుడు ఆ వ్యక్తి లేదా సంస్థను ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా పరిగణిస్తారని ఆర్‌బీఐ నిర్వచనం చెబుతోంది. బ్యాంకుల్లో ఒత్తిడిలో ఉన్న ఆస్తులు, నిరర్థక ఆస్తులపై భారత బ్యాంకుల సంఘం(ఐబీఏ) ప్రతినిధులు పేర్కొన్న అంశాలను పార్లమెంటరీ సంఘం సోమవారం ఆలకించింది. అంతక్రితం ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ తదితర ఆర్థిక మంత్రిత్వ అధికారులను సైతం కలిసిన ఈ ప్యానెల్ జూన్ 12న ఉర్జిత్ పటేల్‌తో మొండి బకాయిల అంశంపై చర్చించనుంది. తన నివేదికను పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో సమర్పించనుంది. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో మొండి బకాయిలను విడిగా వర్గీకరించాలని ఆ సంఘం భావిస్తోంది.

పెంపా.. యథాతథమా

- రెండో రోజూ ఆర్‌బీఐ 'సమీక్ష' చర్చలు
- నేడు కీలక రేట్లపై నిర్ణయం

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన కమిటీ (ఎమ్‌పీసీ) రెండో రోజూ చర్చలు జరిపింది. పెంపు పావు శాతం ఉండొచ్చని కొంత మంది; ఆగస్టు వరకు కీలక రేట్లను పెంచకుండా ఆర్‌బీఐ వేచిచూడవచ్చని మరి కొంత మంది విశ్లేషకులు అంటున్నారు. అధిక ఇంధన ధరల కారణంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి ఆగస్టులో రేట్లను పెంచే అవకాశం ఉందని అంటున్నారు. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల ఎమ్‌పీసీ తొలిసారిగా మూడు రోజుల పాటు సమీక్ష సమావేశాలను నిర్వహించింది. కొన్ని పాలనపరమైన సర్దుబాట్ల కోసం ఇలా చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో ద్వైమాసిక పరపతి విధాన సమావేశం(జూన్ 4-6) నిర్ణయాన్ని నేటి మధ్యాహ్నం వెలువరచనుంది. ఆర్‌బీఐ చివరి సారిగా జనవరి 2014లో రెపో రేటును 8 శాతానికి పెంచింది. ఆ తర్వాత రేట్లను తగ్గించడం లేదా యథాతథంగా ఉంచడం గమనార్హం. ప్రస్తుతం రెపో రేటు 6 శాతం వద్ద ఉంది.

ఆగస్టు-అక్టోబరు మధ్య అర శాతం పెంపు

ఆగస్టు-అక్టోబరుల మధ్య ఆర్‌బీఐ అర శాతం మేర కీలక రేట్లను పెంచే అవకాశం ఉందని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ పేర్కొంది. కాగా, జూన్ సమావేశంలోనూ ఎమ్‌పీసీ ఓట్లు సమతౌల్యంతో ఉండొచ్చని రేట్ల పెంపునకూ అవకాశాలూ ఉండొచ్చని అంటోంది. జనవరి-మార్చి 2017-18 త్రైమాసికంలో జీడీపీ 7 త్రైమాసికాల గరిష్ఠమైన 7.7 శాతంగా నమోదు కావడం; ఈ సారి సాధారణ వర్షపాతం నమోదు కావొచ్చన్న అంచనాలు కలిసి రేట్ల కోతకున్న అవకాశాలను తగ్గించాయి.

'ఈ సారి పావు శాతం ఉండొచ్చు'

ఆర్‌బీఐ రేట్ల నిర్ణయానికి కీలక గణాంకమైన రిటైల్ ద్రవ్యోల్బణం నవంబరు 2017 నుంచి 4 శాతం పైనే ఉండడం గమనార్హం. మరో పక్క, ముడి చమురు ధరలు కూడా గత కొద్ది నెలలుగా పెరుగుతూ రావడంతో పెట్రోలు, డీజిల్ ధరలు జీవనకాల గరిష్ఠాలకు చేరాయి. ఈ నేపథ్యంలో రెపో రేటు ఈ సారి సమీక్షలోనే ఉండొచ్చని డీబీఎస్ గ్రూప్ భారత ఆర్థికవేత్త రాధికా రావు అంచనా వేస్తున్నారు. కనీసం పావు శాతం మేర రేట్ల పెంపు ఉండొచ్చని ఆమె అంటున్నారు.

విమానాశ్రయాల ప్రైవేటీకరణ వల్ల వ్యయాలు పెరగకూడదు: ఐఏటీఏ

సిడ్నీ: విమానాశ్రయాల ప్రైవేటీకరణ వల్ల ప్రయాణికులపై అదనపు భారం పడటం సరి కాదని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) అభిప్రాయపడుతోంది. ప్రజాధనం వృథా కాకుండా ఉండేందుకు అంతర్జాతీయంగా ఓ విధానాన్ని తీసుకొచ్చేందుకు సంఘం ప్రయత్నిస్తోంది. వివిధ దేశాల్లో విమానాశ్రయాల్ని ప్రైవేటీకరణ చేయడానికి ముందు, తరవాత వాటి పరిస్థితి ఎలా ఉందనే విషయమై ప్రపంచంలోని 90 విమానాశ్రయాల్లో ఐఏటీఏ అధ్యయనం చేసింది. ప్రభుత్వ రంగంలోని వాటి కంటే ప్రైవేటు విమానాశ్రయాల్లో రుసుములు, ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ రంగంలోని విమానాశ్రయాల కంటే వీటికి విపరీతమైన లాభాలు వస్తున్నాయి. అయితే నిర్వహణ విషయానికి వస్తే ప్రభుత్వ విమానాశ్రయాల కంటే ప్రైవేటువి అంత గొప్పగా ఏమీ లేవు. నిర్వహణ బాగున్న వాటిలో ప్రతి ఆరింటిలో అయిదు విమానాశ్రయాలు ప్రభుత్వాల ఆధీనంలో ఉన్నవే కావడం గమనార్హం. సిడ్నీలో ప్రపంచ విమానాశ్రయ సమ్మేళనంలో పాల్గొన్న ఐఏటీఏ ముఖ్య ఆర్థికవేత్త బ్రియాన్ పియర్స్ మాట్లాడుతూ 'ప్రైవేటీకరణ వల్ల సౌకర్యాలు మెరుగు పడాలి కానీ, అదనపు వసూళ్లే అంటే అంగీకరించలేమ'ని పేర్కొన్నారు. 'నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వాలు విమానాశ్రయ సామర్థ్యాల్ని పెంచడానికి ప్రైవేటు రంగాన్ని ఆశ్రయిస్తున్నాయి. దీని వల్ల ప్రయాణికులపై భారం పడుతోంది. స్వల్పకాలికంగా నిధులు సమకూర్చుకోవడానికి విమానాశ్రయ ఆస్తుల్ని అమ్ముకోవడం తప్పిదమే అవుతుంద'ని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్, సీఈఓ అలెగ్జాండ్రె డె జునాయిక్ అభిప్రాయపడ్డారు.

రూ.1.24 లక్షల ఇ-స్కూటర్

దిల్లీ: విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ అంకుర సంస్థ అథెర్ ఎనర్జీ విద్యుత్ స్కూటర్ ఎథెర్ 450ని మార్కెట్లోకి విడుదల చేసింది. ధర రూ.1.24 లక్షలు. అథెర్ 340ని కూడా రూ.1.09 లక్షలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అథెర్ 450ని నగర పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దారు. గంటకు 80 కి.మీ అత్యధిక వేగం, 3.9 సెకన్లలో 40 కి.మీ వేగాన్ని అందుకోవడం దీని ప్రత్యేకతలు. 'విద్యుత్ స్కూటర్ల తయారీని నాలుగేళ్ల కిందట ఐఐటీ మద్రాస్‌లో ప్రారంభించాం. ఇవాళ అథెర్ 340, అథెర్ 450 మోడళ్లను విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంద'ని అథెర్ ఎనర్జీ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) తరుణ్ మెహతా తెలిపారు. 2013లో ఐఐటీ పట్టభద్రులైన తరుణ్ మెహతా, స్వప్నిల్ జైన్ సంయుక్తంగా అథెర్ ఎనర్జీ అనే అంకుర సంస్థను ప్రారంభించారు. దీనికి హీరో మోటోకార్ప్ ఆర్థిక మద్దతు ఉంది.

మొండి బకాయిలు మరింత పెరగొచ్చు: ఇక్రా

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులకు నిరర్థక ఆస్తులు మరికొంత పెరిగే అవకాశం ఉందని ఇక్రా నివేదిక అంచనా వేస్తోంది. దేశీయ బ్యాంకింగ్ రంగ స్థూల నిరర్థక ఆస్తులు 2017-18లో 11.2 శాతం కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 11.5 శాతానికి పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. 2016-17 ఆఖరుకు మొత్తం రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు 9.5 శాతం (రూ.8 లక్షల కోట్లు) ఉండగా.. 2017-18 చివరినాటికి 11.2 శాతానికి (రూ.10.3 లక్షల కోట్లు) చేరాయి. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల ఎన్‌పీఏలు 11.5 శాతానికి చేరి, ఆ తర్వాత నుంచి తగ్గడం మొదలుపెడతాయ'ని క్రిసిల్ తన నివేదికలో వెల్లడించింది. మొండి బకాయిలు గణనీయంగా పెరగడం, వీటికి తగ్గట్లుగా కేటాయింపులు చేయాల్సి రావడంతో గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రూ.40,000 కోట్ల నష్టాన్ని ప్రకటించాయి. రూ.5 లక్షల కోట్ల రుణాలు మొండి బకాయిలుగా మారాయి. దీంతో గత మూడు త్రైమాసికాల్లో నిరర్థక ఆస్తులు రూ.13.6 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో ఐదొంతుల మొండి బకాయిలకు కారణం.. ఫిబ్రవరిలో ఆర్‌బీఐ జారీ చేసిన మార్గదర్శకాల వల్లేనని నివేదిక అభిప్రాయపడింది. దివాలా చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ఫిబ్రవరిలో ఆర్‌బీఐ వివిధ రుణ పునర్వ్యవస్థీకరణ పథకాలను ఆర్‌బీఐ ఎత్తివేసిన సంగతి తెలిసిందే. పరిస్థితిలో క్రమక్రమంగా మార్పు వస్తున్నందున ముమ్ముందు మొండి బకాయిలు తగ్గుతాయని అనుకుంటున్నామని ఇక్రా పేర్కొంది.

ఆకాశ్, శ్లోకల నిశ్చితార్థం 30న!

ముకేశ్ అంబానీ, నీతా అంబానీల కుమారుడు ఆకాశ్; వజ్రాల వ్యాపారి రసెల్ మెహతా, మోనాల కుమార్తె శ్లోక మెహతాల నిశ్చితార్థానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 30న ముకేశ్ నివాసమైన యాంటెలాలో జరగబోయే ఈ అంగరంగ వైభోగ కార్యక్రమంలో ఈ జంట ఉంగరాలు మార్చుకోనున్నారని సమాచారం. ఈ నిశ్చితార్థానికి ఆహ్వానం పలుకుతూ ఉన్న పత్రిక ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. 'ఓ సూర్యదేవ.. మా ఆకాశ్‌లో నీవు వెలుగువు. మా ప్రతీ 'శ్లోకం'లో నీవు మెరుపువు.' అంటూ ఆహ్వాన పత్రిక ప్రారంభంలో సూర్యదేవున్ని స్మరించారు. అదే సమయంలో ముకేశ్ అంబానీ తల్లిదండ్రులు కోకిలా బెన్, ధీరూభాయ్ అంబానీలు, నీతా అంబానీ తల్లిదండ్రులు పూర్ణిమాబెన్, రవీంద్రభాయ్ దలాల్ ఆశీస్సులతో.. ఈ నిశ్చితార్థానికి ఆహ్వానం పలకడానికి సంతోషిస్తున్నామని అందులో పేర్కొన్నారు. వధువు తల్లిదండ్రుల పేర్ల(మోనా, రసెల్ మెహతా)ను కూడా ఉంచారు. చివర్లో నీతా, ముకేశ్, ఈశా, అనంత్ అంబానీలు ఈ నిశ్చితార్థానికి ఆహ్వానం పలుకుతున్నట్లు పత్రికలో ముద్రించారు. పూర్తి సంప్రదాయబద్ధంగా ఈ పత్రిక ఉంది. వీడియో రూపంలోనూ ఆహ్వానాలు వెళ్లినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ సినిమా 'కాయ్ పో చె'లోని 'శుభారంభ్' పాటతో పత్రికలోని విషయాలతో, వధూవరుల చిత్రాలతో ఒక నిమిషపు వీడియో ఆహ్వానాన్ని రూపొందించారు. ఇరు వైపు కుటుంబాలు మార్చి 24న గోవాలో ముందస్తు నిశ్చితార్థ వేడుకలు జరుపుకున్న సంగతి తెలిసిందే.

ఈ నిశ్చితార్థ శుభ ముహూర్తంలోనే పెళ్లి తేదీలను ఖరారు చేయొచ్చని తెలుస్తోంది. చిన్నప్పటి స్నేహితులైన వీరి పెళ్లి డిసెంబరులో ఉండొచ్చు.

వర్షంలో ఇక్కడికెళ్తేనా..

- దేశీయంగా గోవా.. అంతర్జాతీయంగా బాలి
- రుతుపవనాల సీజన్‌లో మనోళ్ల ఎంపిక ఇదే

ముంబయి: పిల్లలకు సెలవులుంటాయి కనుక విహార యాత్రలకు వేసవిని ఎక్కువమంది వినియోగించుకుంటున్నారు. శీతల ప్రదేశాలకు వెళ్లి ఊరట చెందుతుంటారు. రుతపవనాలు మొదలై వర్షాలు పడుతున్న సమయంలో, వెళ్లేందుకు గతంలో ఆసక్తి చూపించేవారు కాదు. అయితే పాశ్చాత్యులు మాత్రం ఈ సమయంలోనూ విహార యాత్రలకు వస్తుంటారు. వర్షపు జల్లుల్లో పర్వత ప్రాంతాలు, సముద్ర తీరాల్లో సేదతీరుతూ, ఆనందానుభూతి పొందేవారు. ఇప్పుడు భారతీయులు కూడా ఈ సీజన్‌లో ప్రయాణించేందుకు సిద్ధపడుతున్నారని ఓ నివేదిక వెల్లడిస్తోంది. జులై, ఆగస్టులో విహార యాత్రలకు వెళ్లేందుకు ఏయే ప్రదేశాలు బాగుంటాయనే అంశాన్ని ఆన్‌లైన్‌లో పరిశీలిస్తూ, బుకింగ్‌లు చేస్తున్నారని పేర్కొంటోంది. దేశీయంగా గోవా, అంతర్జాతీయంగా బాలి వెళ్లేందుకు ఎక్కువమంది భారతీయులు ఇష్టపడుతున్నారని, ఆయా ప్రాంతాల్లో హోటల్ వసతి కోసం శోధిస్తున్నారని వివరించింది. ఈ ఏడాది జులై-ఆగస్టులో హోటల్ వసతి కోసం హోటల్స్.కామ్ వెబ్‌సైట్‌లో భారతీయులు వెతికిన ప్రదేశాల ఆధారంగా ఆ వెబ్‌సైట్ ఓ నివేదిక విడుదల చేసింది.

అంతర్జాతీయంగా బాలి తరవాత లండన్, పారిస్, సింగపూర్, పట్టాయ వెళ్లేందుకు అధికులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. తదుపరి స్థానాల్లో న్యూయార్క్ (యూఎస్), దుబాయ్, బ్యాంకాక్ (థాయ్‌లాండ్), శాంతోరిని (గ్రీస్), ఆమ్‌స్టర్‌డ్యామ్ (నెదర్లాండ్స్) ఉన్నాయి. పుకెట్ (థాయ్‌లాండ్), ఈడెన్‌బర్గ్ (స్కాట్లాండ్), మాస్కో (రష్యా), ఫ్లోరెన్స్ (ఇటలీ) మైకోనెస్ (గ్రీస్) కూడా ఈ జాబితాలో ఉన్నాయి.



కొత్త ప్రదేశాల అన్వేషణలో భారతీయులు ఉన్నారు. ఇంతకు మునుపు వెళ్లిన స్థలాలు కాకుండా కొత్తవాటిని ఎంపిక చేసుకొని సరికొత్త అనుభవాన్ని పొందేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

దేశీయంగా కాలన్‌గూట్ (గోవా) జాబితాలో తొలి స్థానం సంపాదించుకొంది. తరవాత స్థానాల్లో ముంబయి, దిల్లీ, కాండోలిమ్ (గోవా), ఉదయ్‌పూర్ (రాజస్థాన్), తిరువనంతపురం, మున్నార్, జయపూర్ (రాజస్థాన్), శ్రీనగర్, లేహ్ (జమ్ము - కశ్మీర్) ఉన్నాయి.

దేశీయంగా విహారయాత్రకు ఎక్కువ మంది గమ్యస్థానం గోవా కావడం విశేషం. అత్యధిక వృద్ధి సాధించి పోటీ లేని విజేతగా గోవా నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఈ యేడు కోల్వా, అర్పోరా, డోనా పౌలా, కన్సాలియం ప్రాంతాల్లో వసతి కోసం వరుసగా 156, 153, 105, 57 శాతం వృద్ధి కనిపించిందట.

సెన్సెక్స్	నిఫ్టీ	డోజోన్స్	నాస్‌డాక్	రూపాయి	ముడి చమురు
34903 ▼ 109	10593 ▼ 35	24782 ▼ 31	7626 ▲ 19	67.15 ▼ 4 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	74.80 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	5న	మార్పు %
CIPLA	542.10	4.11
BAJAJ FINANCE	2100.60	1.83
TATA STEEL	572.10	1.05
HDFC BANK	2063.60	0.85
HDFC	1848.40	0.83
HPCL	314.75	0.82
RELIANCE IND	947.65	0.72

గ్రహణం (-)

నిఫ్టీ	5న	మార్పు %
ZEE ENTERTAINMENT	544.35	-2.84
COAL INDIA	285.25	-2.51
INDIABULLS HSG	1145.00	-2.47
TITAN COMPANY	863.95	-2.42
BHARTI AIRTEL	364.30	-2.15
WIPRO	255.25	-1.88
YES BANK	336.75	-1.81

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.07	70.82	బహ్రెయిన్ దీనార్	165.48	189.23
పౌండ్ స్టెర్లింగ్	81.30	94.30	కువైట్ దీనార్	183.64	228.60
యూరో	71.41	82.82	ఒమన్ రియాల్	161.96	185.30
జపనీస్ యెన్/100	55.59	64.47	సౌదీ రియాల్	16.24	19.24
ఆస్ట్రేలియా డాలరు	46.65	53.97	యూఏఈ దిర్హమ్	16.63	19.42
సింగపూర్ డాలరు	45.74	53.18	మలేషియా రింగిట్	15.05	18.50
థాయ్ బాత్/100	191.10	228.55	చైనీస్ యువాన్	7.41	12.01

మంగళవారం నిఫ్టీ కదలికలు



మార్కెట్ కబుర్లు

- ✦ కంపెనీ పూర్తి అనుబంధ సంస్థ జెన్ టెక్నాలజీస్ యూఎస్‌ఏ ఐఎన్‌సీలో 20 లక్షల డాలర్ల వరకూ పెట్టుబడులు పెట్టడానికి **జెన్ టెక్నాలజీస్** బోర్డు ఆమోదం తెలిపింది.
- ✦ ఇండస్‌ఇండ్ బ్యాంకులో భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ విలీనం కావడానికి ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈలు ఆమోదం తెలిపాయి. ఈ మేరకు నిరభ్యంతర లేఖలు జారీ చేసినట్లు **భారత్ ఫైనాన్షియల్** తెలిపింది.
- ✦ **ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)** బోర్డులో స్వతంత్ర డైరెక్టరు పదవికి చమురు శాఖ మాజీ కార్యదర్శి వివేక్ రే రాజీనామా చేశారు. వివిధ విషయాలపై సంస్థ యాజమాన్యంతో విభేదాలు తలెత్తడమే ఆయన రాజీనామాకు కారణంగా తెలుస్తోంది.
- ✦ **బంధన్ బ్యాంక్** నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నరు హెచ్.ఆర్.ఖాన్ నియమితులయ్యారు.
- ✦ బయోకాన్‌తో కలిసి **మైలాన్** తయారు చేసిన 'ఫుల్‌ఫిలా' బయోసిమిలర్‌కు యూఎస్ఎఫ్‌డీఏ అనుమతినిచ్చింది. ఈ బయోసిమిలర్‌ను కేన్సర్ చికిత్సలో వాడతారు.
- ✦ ఉత్తరప్రదేశ్‌లో రూ.6000 కోట్లతో ప్రతిపాదించిన మెగా ఫుడ్‌పార్కుకు ఆ రాష్ట్రప్రభుత్వం అనుమతులీయనందున, వేరే ప్రాంతానికి తరలిస్తామని **పతంజలి ఆయుర్వేద** వెల్లడించింది.

రొయ్యల ధరే కారణమా?

• నెలలో 44% క్షీణించిన 'అవంతీ' షేరు • తాత్కాలికమే అంటున్న కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: గత కొద్ది రోజుల్లో అవంతీ ఫీడ్స్ షేరు ధర బాగా క్షీణించింది. దాదాపు నెల రోజుల క్రితం (మే 2 తేదీ) ఈ కంపెనీ షేరు ధర బీఎస్ఈలో రూ.2,415.35 ఉంటే.. మంగళవారం ముగింపు (జూన్ 5) రూ.1,353.70 ఉంది. అంటే 44 శాతం క్షీణించింది. క్రితం ముగింపుతో పోలిస్తే మంగళవారం 9.12 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరానికి, చివరి త్రైమాసికానికి ఇటీవల కంపెనీ ప్రకటించిన ఫలితాలు సంతృప్తికరంగా ఉండడంతో పాటు, బోనస్ ఇష్యూను ప్రతిపాదించినప్పటికీ.. షేరు ధర తగ్గడానికి రొయ్యల ఎగుమతుల ధరలు తగ్గడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ ఏడాదిలో రొయ్యల ధరలు, ఉత్పత్తి మరింత తగ్గొచ్చని, దేశీయ ఆక్వా పరిశ్రమ పనితీరు ఆశాజనకంగా ఉండకపోవచ్చని కొంత మంది విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో రొయ్యల వినియోగం తగ్గడం, ఇండోనేషియా, వియాత్నం వంటి దేశాల్లో రొయ్యల ఉత్పత్తి స్థిరంగా ఉండడం వంటి కారణాల వల్ల గత మూడు, నాలుగు నెలలుగా రొయ్యల ఎగుమతి ధరలు క్షీణించాయి.

తాత్కాలికమే..: ఎగుమతి ధరలు తగ్గడం తాత్కాలికమేనని, అమెరికాలో రొయ్యల వినియోగం మళ్లీ పుంజుకుందని అవంతీ ఫీడ్స్ చెబుతోంది. త్వరలోనే సాధారణ స్థాయికి చేరుతుందని అంచనా వేస్తోంది. రానున్న నెలల్లో చైనా చేసుకునే దిగుమతులు కూడా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. గత కొద్ది నెలలుగా రైతులకు చెల్లిస్తున్న ధర భారీగా తగ్గింది. ఈ పరిస్థితులు కూడా మారతాయని కంపెనీ భావిస్తోంది.

భవిష్యత్తు ప్రణాళికలు..: గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాదిలో కంపెనీ మేత తయారీ సామర్థ్య వినియోగం 10 శాతం పెరగొచ్చని, ప్రాసెసింగ్, రొయ్యల ఎగుమతుల్లో సామర్థ్య వినియోగం 60-65 శాతం ఉండొచ్చని అవంతీ ఫీడ్స్ భావిస్తోంది. వార్షిక మేత తయారీ సామర్థ్యాన్ని 4.25 లక్షల టన్నుల నుంచి 6 లక్షల టన్నులకు కంపెనీ పెంచింది. 2018-19కి రొయ్యల మేత విక్రయాల్లో కనీసం 10 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది. ఫీడ్ మార్కెట్‌లో వాటాను 43 శాతం నుంచి 45 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్ అదనపు సామర్థ్యం ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి స్థాయిలో వినియోగంలోకి రానుంది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 75 శాతం పెరగగలవని కంపెనీ అంచనా. విలువ చేర్చిన ఉత్పత్తులపై కూడా దృష్టి పెట్టనుంది. మొత్తం మీద 2022 నాటికి బిలియన్ డాలర్ల మైలురాయిని చేరాలని అవంతీ ఫీడ్స్ ఆశిస్తోంది.

ఆపరేటర్లు, ఉద్యోగులపై త్వరలో చర్యలు!

వాట్సాప్ లీకుల కేసులో సెబీ

దిల్లీ: వాట్సాప్ ద్వారా ముందే ఆర్థిక ఫలితాలు విడుదలైన ఘటనలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ త్వరలో చర్యలు చేపట్టనుంది. డజనుకు పైగా బ్లూచిప్ కంపెనీలకు చెందిన సీనియర్ ఉద్యోగులు, కొందరు మార్కెట్ ఆపరేటర్లపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. షేరు ధరను ప్రభావితం చేసే సమాచారాన్ని కాపాడటంలో అవకతవకలు చోటుచేసుకోవడంతో, సంబంధిత కంపెనీలపై సెబీ గట్టి చర్యలు తీసుకోవచ్చని సంబంధిత వర్గాలు చెబుతున్నారు. మదుపర్లకు బహిరంగంగా ఫలితాలు వెల్లడించకముందే వాట్సాప్‌లో కొన్ని కంపెనీల త్రైమాసిక ఫలితాలు బహిర్గతమైన విషయం తెలిసిందే. ఇలా వెలుగుచూసిన సమాచారంతో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా ఏమైనా లాభాలు ఆర్జించారా లేదా కంపెనీలు ఇచ్చిన సమాచారం సరైనదా అన్న కోణాల్లో సెబీ దర్యాప్తు చేసింది. సెబీ అడిగిన ప్రశ్నలకు దాదాపు అన్ని కంపెనీలు సమాధానం ఇచ్చాయి. షేరు కదలికలపై ప్రభావం చూసే సమాచారం బయటకు రావడానికి బాధ్యులను కంపెనీలు వెల్లడించడంలో విఫలమైతే.. అటువంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోనుందని సెబీ వర్గాలు అంటున్నాయి. కొన్ని బ్రోకరేజీ సంస్థల ఉద్యోగులు, మార్కెట్ ఆపరేటర్లు, కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లపై సెబీ కన్నేసింది. వాట్సాప్ ద్వారా ఆర్థిక ఫలితాలు లీకైన కంపెనీల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, బాటా ఇండియా, డాక్టర్ రెడ్డీస్ వంటి దిగ్గజ కంపెనీలు ఉన్నాయి.

ఎన్ఏసీఎల్, ఏటీజీసీ బయోటెక్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: పర్యావరణానికి హాని చేయని కీటక నియంత్రణ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు సంయుక్త సంస్థ ఏర్పాటు చేయడానికి ఎన్ఏసీఎల్ (గతంలో నాగార్జునా అగ్రికెమ్), హైదరాబాద్‌కే చెందిన ఏటీజీసీ బయోటెక్‌లు అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. సెమియో రసాయనాల పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తుల తయారీలో ఏటీజీసీ బయోటెక్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కంపెనీ చేసే పరిశోధనకు ప్రభుత్వ గ్రాంట్లు లభిస్తున్నాయి. రెండు కంపెనీలు కలిసి సెమియో రసాయన ఉత్పత్తులను తయారీ చేసి విక్రయిస్తాయని ఎన్ఏసీఎల్ తెలిపింది.

నెమ్మదించిన సేవా రంగం

3 నెలల కనిష్ఠానికి మే పీఎంఐ సూచీ

దిల్లీ: భారత సేవా రంగ ప్రగతి నెమ్మదించింది. గత మూడు నెలల్లో తొలిసారి క్షీణత బాట పట్టింది. కొత్త వ్యాపార ఆర్డర్లలో స్తబ్దత, అధిక చమురు ధరల నేపథ్యంలో వ్యయ భారం తీవ్రమవడం లాంటివి ఇందుకు కారణమయ్యాయి. నిక్కీ భారత సేవల వ్యాపార కార్యకలాపాల సూచీ మేలో 49.6 పాయింట్లకు దిగివచ్చింది. ఏప్రిల్‌లో ఇది 51.4 పాయింట్ల వద్ద ఉంది. సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు పరిగణిస్తారు. 50 పాయింట్ల దిగువకు వస్తే క్షీణించినట్లు భావిస్తారు. సేవా రంగ సూచీ చివరిసారిగా ఫిబ్రవరిలో 50 పాయింట్ల కిందకు వచ్చింది. గత మూడు నెలల్లో తొలిసారిగా ఉత్పత్తి తగ్గిందని ఐహెచ్ఎస్ మార్కిట్ ఆర్థికవేత్త ఆష్నా డోధియా తెలిపారు. సేవా రంగంలో ఉద్యోగాల పైనా ఉత్పత్తి క్షీణత ప్రభావం పడింది. ఏప్రిల్‌లో ఏడేళ్ల గరిష్ఠంగా ఉన్న ఉద్యోగాల వృద్ధి.. మేలో నెమ్మదించింది.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తాం

• పర్యావరణ దినోత్సవం రోజున కంపెనీల ప్రతిన

దిల్లీ: వ్యాపార కార్యకలాపాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తామని పర్యావరణ దినోత్సవం రోజున ఐటీసీ, ఆర్‌బీ, పెప్సీకో, నెస్లే, హ్యుందాయ్ లాంటి దిగ్గజ కంపెనీలు ప్రతిన పూనాయి. ప్లాస్టిక్ పునర్వినియోగాన్ని (రీసైక్లింగ్) పెంచుతామని, ప్యాకింగ్ కోసం ప్రత్యామ్నాయ, పర్యావరహణహిత ఉత్పత్తులను అన్వేషిస్తామని తెలిపాయి.

ఐటీసీ: ఉత్పత్తుల ప్యాకింగ్ కోసం వాడిన ప్లాస్టిక్‌ను 100 శాతం పునర్వినియోగించేలా రానున్న దశాబ్ద కాలంలో పరిష్కార మార్గాలను కనిపెడతాం. ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలకు ప్రాధాన్యం పెంచుతున్నామని ఐటీసీ ఎండీ సంజవ్ పురి తెలిపారు.

పెప్సీకో ఇండియా: వినియోగ అనంతర వ్యర్థ ప్లాస్టిక్‌ను 100 శాతం పునర్వినియోగించేలా వచ్చే కొన్నేళ్లలో మార్గాలు అన్వేషిస్తాం. ప్యాకింగ్‌కు పర్యావరణహిత ఉత్పత్తుల తయారీ కోసం కొత్త సాంకేతికతల అభివృద్ధికి భాగస్వామ్య సంస్థలతో కలిసి పనిచేస్తాం. లేస్, కుర్‌కురే వంటి స్నాక్స్‌కు సేంద్రియ ప్యాకింగ్ కోసం భారత్‌లో ప్రయోగాత్మక ప్లాంటును ప్రారంభించనున్నాం.

నెస్లే ఇండియా: గతేడాది ఉత్పత్తుల ప్యాకేజింగ్‌లో సుమారు 1532 టన్నుల మేర ప్లాస్టిక్‌ను తగ్గించాం. వినియోగ ప్లాస్టిక్‌ను తిరిగి ఇంధనంగా మార్చే చర్యలకూ సహకరిస్తున్నాం.

మారుతీ సుజుకీ ఇండియా: పర్యావరణహిత సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి పెట్టుబడులు పెడుతున్నాం. బాలెనో, ఇగ్నిస్, స్విఫ్ట్, డిజైర్ కార్లను కొత్త ప్లాట్‌ఫామ్‌లో రూపొందించబోతున్నాం.

5న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	363	వరంగల్	365
చిల్లరగా(ఒక గుడ్డు)	4.25	విశాఖపట్నం	366
బెంగళూరు	410	చెన్నై	435
6వ తేదీకి...		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	360	నమక్కల్	420

మూడో రోజూ కిందకే

• ఆర్‌బీఐ పరపతి సమీక్ష నేపథ్యం
• సెన్సెక్స్‌కు 109 పాయింట్ల నష్టం

సూచీలు వరుసగా మూడో రోజూ డీలాపడ్డాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయం నేడు వెలువడనుండటంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. వడ్డీరేట్ల ఆధారిత స్థిరాస్తి, బ్యాంకింగ్, వాహన షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఫలితంగా నిఫ్టీ కీలకమైన 10600 పాయింట్ల దిగువకు చేరింది. భారత సేవల రంగం మూడు నెలల్లో తొలిసారిగా క్షీణించడం ప్రభావం చూపింది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. ఐరోపా షేర్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35029.45 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. రోజులో ఎక్కువ భాగం నష్టాల్లో కదలాడిన సూచీ 35,073.12 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 34,784.68 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 108.68 పాయింట్లు కోల్పోయి 34,903.21 పాయింట్ల దగ్గర స్థిరపడింది. గత మూడు సెషన్లలో సూచీ 419.17 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ సైతం 35.35 పాయింట్లు తగ్గి 10,593.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,550.90-10,633.15 పాయింట్ల మధ్య కదలాడింది.



చక్కెర షేర్ల కళకళ: చెరకు రైతులకు బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించనుందన్న అంచనాలతో చక్కెర షేర్లు కళకళలాడాయి. ధంపూర్ షుగర్ మిల్స్ అత్యధికంగా 3.24 శాతం పెరిగింది. బలరాంపూర్ చీనీ 3.14%, మవానా షుగర్స్ 2.14%, ఉత్తమ్ షుగర్ మిల్స్ 1.63%, అవధ్ షుగర్ 0.48% చొప్పున లాభాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 నష్టాలు చవిచూశాయి. కోల్ ఇండియా 2.36%, భారతీ ఎయిర్‌టెల్ 2.16%, ఎల్ అండ్ టీ 1.93%, డాక్టర్ రెడ్డీస్ 1.87%, యెస్ బ్యాంక్ 1.84%, విప్రో 1.77%, ఇన్ఫోసిస్ 1.48%, ఎం అండ్ ఎం 1.39%, టీసీఎస్ 1.34%, చొప్పున డీలాపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.90%, టాటా స్టీల్ 0.88%, హెచ్‌డీఎఫ్‌సీ 0.78%లు రాణించాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం 3.08% కోల్పోయింది. యంత్ర పరికరాలు, మౌలిక, టెక్, ఐటీ, ఆరోగ్య సంరక్షణ, మన్నికైన వినిమయ వస్తువులు, విద్యుత్, స్థిరాస్తి, పీఎస్‌యూ షేర్లు అదే బాటలో నడిచాయి.

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 373.60 (378.55) 2767220
ASIAN PAINTS 1273.60 (1284.45) 524237
AXIS BANK LT 530.90 (537.05) 5088506
BAJAJ AUTO L 2847.55 (2878.50) 367916
BAJAJ FINANC 2100.60 (2062.85) 816879
BAJAJ FINSER 5770.95 (5748.55) 137632
BHARTI AIRTE 364.30 (372.30) 4989187
BHARTI INFRA 294.65 (295.15) 2364464
BPCL 405.35 (408.50) 3511616
CIPLA 542.10 (520.70) 3398337
COAL INDIA L 285.25 (292.60) 2305088
DR. REDDYS 1963.40 (1996.00) 365344
EICHER MOTOR 29236.35 (29377.65) 24133
GAIL 334.70 (335.05) 2687919
GRASIM IND 1024.25 (1034.85) 670548
HCL TECH 885.05 (900.70) 1273868
HDFC 1848.40 (1833.15) 1539190
HDFC BANK 2063.60 (2046.20) 4276365
HERO MOTOCOR 3610.40 (3613.60) 225466
HINDALCO IND 242.05 (241.60) 5490029
HINDUSTAN UN 1562.80 (1563.20) 1531015
HPCL 314.75 (312.20) 6010379
ICICI BANK 284.10 (286.75) 12376050
INDIABULLS H 1145.00 (1173.95) 3354803
INDIAN OIL 173.95 (173.80) 4952657
INDUSINDBANK 1899.40 (1902.20) 708586
INFOSYS LTD 1220.85 (1239.40) 2355431
ITC 267.50 (268.90) 5788321
KOTAK MAHIND 1304.70 (1303.95) 2085438
LARSEN & TOU 1333.75 (1357.85) 1905926
LUPIN 760.25 (773.95) 1363084
M&M 901.30 (914.50) 1836194
MARUTI SUZIK 8810.40 (8749.85) 400886
NTPC LTD 161.30 (162.05) 1974515
ONGC 171.20 (171.10) 5918946
POWER GRID C 198.85 (201.70) 7756212
RELIANCE IND 947.65 (940.85) 7971524
SBI 263.55 (263.00) 14102731
SUN PHARMA 473.50 (478.60) 3076737
TATA CONSULT 1721.60 (1744.25) 2449568
TATA MOTORS 284.95 (286.65) 7456195
TATA STEEL L 572.10 (566.15) 4688204
TECH MAHINDR 701.25 (698.30) 3710175
TITAN IND 863.95 (885.35) 2948255
ULTRATECH 3676.85 (3711.15) 204863
UPL LIMITED 685.70 (686.45) 800021
VEDANTA LIMI 246.25 (246.75) 8543831
WIPRO 255.25 (260.15) 2464517
YES BANK LTD 336.75 (342.95) 8492155
ZEE ENTERTAI 544.35 (560.25) 2846864

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1161.15 (1185.25) 51268
ACC 1285.05 (1308.05) 759372
ADITYA BIRLA 138.20 (141.65) 2255973
AMBUJA CEMEN 202.05 (201.45) 2631652
ASHOK LEYLAN 146.20 (146.90) 14155550
AUROBIND PHA 536.90 (533.35) 2178940
AVENUE SUPER 1453.75 (1486.40) 1286074
BANK OFBAROD 127.75 (131.55) 21462369
BEL 113.00 (112.10) 5875524
BHEL 73.15 (75.25) 12195205
BOSCH LTD 17912.45 (18142.90) 6950
BRITANNIA 5811.80 (5766.20) 73104
CADILA HEALT 348.50 (352.00) 666265
COLGATE PALM 1234.90 (1233.75) 582197
CONTAINER 1334.50 (1313.30) 442419
CUMMINS INDI 676.15 (682.25) 294399
DABUR INDIA 380.90 (384.95) 790381
DLF LIMITED 199.55 (199.15) 5729316
EMAMI LIMITE 1024.80 (1031.85) 229105
GENERAL INS 704.90 (707.25) 64726
GODREJ CONSU 1136.40 (1134.65) 258788
HAVELLS INDI 528.55 (536.60) 1007325
HINDUSTAN ZI 284.65 (286.15) 2292835
ICICI PRU LI 402.85 (411.75) 489575
IDEA CELLULR 56.55 (62.90) 39333464
INTERGLOBE A 1176.50 (1177.20) 734856
JSW STEEL LT 329.10 (331.85) 2804584
L&TFIN.HOLD 164.10 (165.00) 3251870
LIC HOUS.FIN 478.40 (474.10) 1217342
MARICO LIMIT 326.45 (322.65) 2165106
MCDOWELL 3249.95 (3296.25) 291800
MOTHERSON 307.65 (306.55) 2396021
MRF 73815.65 (74480.60) 5761
NHPC LTD 26.20 (26.15) 8009200
NMDC LTD 112.95 (114.85) 1310126
OIL INDIA 214.75 (218.50) 852272
ORACLE FIN S 3722.50 (3769.35) 22555
P&G HYG&HEAL 9309.60 (9223.90) 2399
PETRONET LNG 216.85 (217.20) 2075688
PIDILITE IND 1091.45 (1120.35) 444345
PIRAMAL ENTE 2331.25 (2406.85) 230586
PNB 82.65 (83.20) 14615089
POWER FIN CO 79.00 (82.00) 10093342
RURAL ELEC C 108.90 (113.60) 3848084
SAIL 75.70 (75.50) 15835111
SBI LIFE INS 665.00 (660.05) 189718
SHREE CEMENT 16102.00 (16357.55) 18075
SHRIRAM TRAN 1380.85 (1445.45) 932010
SIEMENS 968.25 (993.40) 463207
SUN TV LTD 902.50 (920.50) 1313360

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 3.60 (3.82) 6312
ALPHAGEO 600.80 (680.70) 5869
AMAR RAJA BA 774.75 (761.30) 18118
ANDHRA BANK 33.55 (34.05) 243198
ANDHRA CEMEN 9.12 (9.60) 22767
ANDHRA PAPER 315.10 (316.05) 2470
ANDHRA PETRO 39.85 (42.05) 106165
ANDHRA SUGAR 349.20 (363.55) 10699
ANJANI PORTL 157.25 (164.40) 106
ASTRA MICROW 95.85 (97.65) 92546
AUROBINDO PH 536.35 (532.65) 119391
AVANTEL SOFT 363.85 (382.95) 9240
AVANTI FEEDS 1353.70 (1489.60) 104598
BALAJI AMIN 523.60 (563.20) 11965
BARTRONICS 10.33 (10.87) 14662
BHAGIRA CHEM 260.40 (281.35) 2153
BHAGYA NAG 39.35 (40.10) 9802
BN RATHI SEC 38.50 (40.40) 2761
BRILLIANT SE 4.77 (5.02) 713115
COMBAT DRUGS 21.40 (20.40) 5682
CONT COFFEE 283.60 (293.95) 5832
COROMAN FERT 431.95 (450.95) 6862
CUBEX TUB 18.10 (18.20) 1594
CYBERMATE 2.09 (2.28) 36665
CYIENT LIMIT 682.90 (705.95) 19903
DECCAN CEMEN 417.10 (449.70) 201
DIVI'S LAB 1034.85 (1045.50) 73750
DIVYA GRANIT 75 (78.35) 6
DR REDDY 1959.60 (1996.95) 27074
FOUR SOFT 61.65 (67.15) 1223
GATI CORPN 87.15 (90.80) 86183
GAYATRI PROJ 177.15 (183.50) 4916
GMR INFRASTR 15.90 (16.45) 4340996
GOLDST INFRA 140.80 (148.20) 2906
GOLDSTONE EN 15.73 (15.20) 26256
GRANULES (I) 73 (74.65) 180105
GSS AMERICA 80.50 (84.70) 19165
GVK POWER 11.11 (11.69) 474295
HBL NIFE POW 35.10 (35.80) 71802
HERITAGE FOO 686.80 (710.85) 1002
HIL LTD 1945.40 (2047.75) 1400
IDL INDUSTRS 406.95 (430) 2201
IKF SOFT 0.52 (0.53) 52307
ILFS ENGINEE 27.30 (29.20) 15480
INNAREDY COM 1.91 (1.83) 8647
IVRCL INFRAS 1.45 (1.52) 716909
JEEVAN SCIEN 34.10 (35.50) 1985
KAKATIYA CEM 241.35 (245.70) 3475
KAKATIYA TEX 2.70 (2.70) 600
KALLAM SPG 26.80 (27.80) 39015
KAVERI SEED 503.70 (504.75) 15801
KCP LTD 105.45 (112.80) 10673
KERNEX MICRO 32.10 (33.75) 11824
KNR CONSTRUC 270.95 (279.20) 12346
LANCO INDUS 288.10 (295.90) 12795
LANCO INFRAT 0.90 (0.94) 165425
LASER DOT 7.90 (7.61) 2
LAURUS LABS 452.10 (461) 6219
LOKESH MACH 63.60 (66.90) 9605
MADHUCON PRO 12.75 (12.65) 39636
MEGA SOFT 9.14 (9.50) 3443
MIC ELECTRON 3.60 (3.78) 79866
MOLD-TEK.TEC 39.80 (40.80) 3109
MOLDTK PLA 290.50 (302.15) 3728
NAGARJAGRICH 29.05 (29.05) 22758
NATCO PHARMA 744.45 (787.90) 24439
NAVA BH VENT 133.90 (135.20) 68023
NCC 109.40 (114.90) 679778
NCL IND 180.50 (187.35) 5613
NEHA INTER 5.43 (5.62) 10694
NETTLINX 58 (58.70) 9610
NEULAND LAB 665.10 (688.35) 491
NIHAR INFO 12.45 (11.90) 6200
NILE 569.50 (584.25) 4916
NORTHGATE TE 0.63 (0.63) 21037
OIL COUNTRY 19.20 (20.10) 9660
PANKAJ POLY 7.59 (7.98) 20
PANYAM CEMEN 30 (29.95) 16170
PENNER IND 50.30 (51.35) 47809
PHYTOCHEM I 46.90 (48.80) 4925
PIONEER DIST 247.45 (257.25) 13524
PITTI LAMIN 84 (86.15) 7341
POKARNA 151.95 (151.70) 3686
PRAJAY ENGS 8.61 (9.45) 14985
PREMIER EXPL 271.30 (284.25) 913
PRISM CEMENT 104.55 (105.30) 37891
PRUDENTL PHA 3.05 (3.12) 144630
RAASI REFRAC 3.12 (3.09) 1100
RAIN INDUSTR 201.30 (211.85) 42433
RAJ PACKAGIN 28.50 (28.10) 300
RAM INFORMAT 40.80 (41.20) 2063
SAGAR CEM 826.30 (865.15) 316
SAMKRG PIST 230.90 (241.90) 7796
SATVAH. ISPA 13.90 (15.35) 845
SMS PHARMA 64.95 (64.20) 887
SOUTH BIO TE 1.58 (1.66) 6678
SPHERE GLOBA 26.20 (27.85) 39704
SREE RAYAL A 32.40 (36) 370654
SRI KPR INDU 26.80 (26.55) 531
SRINIVASA SH 39.65 (37.65) 820
STARCHIK SP 25.45 (24.25) 2615
STEEL EXCHAN 23.65 (23.60) 4836
SUJANA METAL 0.94 (0.98) 34019
SUJANA TOWER 2.40 (2.49) 2232
SUJANA UNIVE 0.49 (0.51) 10568
SURANA TELE 4.47 (4.77) 15501
SURYALAKSH.C 54 (55.95) 1471
SURYALATA SP 126.25 (130) 243
SUVEN PHARMA 185.80 (186) 78675
TAJ GVK HOTE 192.85 (209.70) 19769
TANLA 27.75 (29.20) 73188
TERA SOFTWAR 41.65 (42) 1490
TRANS BIOTEK 2.10 (2.21) 1006
VAMSHI RUBB 49.90 (47.55) 1052
VICEROY HOTE 8.80 (9.26) 1505
VIJAY TEXTIL 51.45 (54.10) 9800
VIMTA LABS 192.15 (197.25) 3910
VISAKA IND 614.85 (630.85) 9792
VISTA PHARMA 31.60 (33.15) 23056
VIVIMED LABS 57.50 (59.80) 123804
VJIL CONSULT 19.60 (18.70) 3920
VST INDUS 3013.55 (3006.45) 80
YBRANT DIGIT 4.49 (4.72) 106459
ZENOTECH LAB 35.70 (37) 4397
ZENTECH 85.30 (93.90) 40512

కేంద్రంలో ప్రకంపనలు వస్తాయ్

- నెలరోజుల్లో 2 అతిపెద్ద కుంభకోణాలను బయటపెడతాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు వెల్లడి

ఈనాడు - అమరావతి

కేంద్ర ప్రభుత్వంలో ప్రకంపనలు సృష్టించే రెండు అతి పెద్ద కుంభకోణాలను నెలరోజుల్లో బయటపెడతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి. కుటుంబరావు ప్రకటించారు. అది కూడా ప్రధాని మోదీకి బాగా సన్నిహితమైన వ్యాపార సంస్థ(గ్రూప్)కు చేసిన లాభమని పేర్కొన్నారు. దానిపై న్యాయస్థానాన్నీ ఆశ్రయిస్తామన్నారు. మంగళవారం ఆయనిక్కడ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎయిర్ ఏషియా అంశంలో ఏమీ లేకపోయినా బురద జల్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థుడు, ప్రధానమంత్రి అభ్యర్థి కూడా అవగలరు. ఆయన చెబితే పనులు అవుతాయి, ఆయన మంత్రే కదా విమానయానశాఖ మంత్రిగా ఉన్నారు" అని ఎయిర్ ఏషియా అధిపతి టోనీ ఫెర్నాండెజ్, ఆ సంస్థ సీఈఓ ఫోన్‌లో మాట్లాడుకుంటే.. చంద్రబాబును, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజును ఇందులో ఇరికించాలని చూడడమేంటని ప్రశ్నించారు. "ఆ సంభాషణలో అవినీతిని బలపరిచే ఒక్క పదమైన ఉందా? వారు(భాజపా) చెబితే వారి తోక పత్రిక సాక్షి రాయడమేంటి? అసలు దేశంలో పౌరుల ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతి ఉందా? ఎయిర్ ఏషియా ఓనర్, సీఈఓ ఫోన్ సంభాషణను ఎవరు ట్యాప్ చేశారు? మొదట అది బయటపెట్టాలి" అని డిమాండ్ చేశారు. "ఆ అంశానికి సంబంధించి 85శాతం నిర్ణయం యూపీఏ-2 హయాంలో జరిగింది. ఆ నిర్ణయాన్ని నరేంద్రమోదీ మంత్రిమండలి ఆమోదించింది. అంటే మోదీతో సహా కేంద్ర మంత్రిమండలి మొత్తం డబ్బు తినే ఆమోదించిందా? లేదా అందులో తప్పుంది అనుకుంటే మంత్రిమండలి చూడలేదా? చూడదా" అని కుటుంబరావు ప్రశ్నించారు.

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రధాని ఒక్కసారైనా నోరుతెరిచారా?

రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రధాని ఒక్కసారైనా నోరుతెరిచి సమాధానం చెప్పారా? అని కుటుంబరావు ప్రశ్నించారు. 2016-17లో దిల్లీ-ముంబయి పారిశ్రామిక కారిడార్‌కు రూ. 495.49 కోట్లు ఇవ్వగా మిగిలిన కారిడార్లన్నింటికీ కలిపి రూ. 4.50కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. 2017-18లో దిల్లీ-ముంబయి కారిడార్‌కు రూ. 1031.79 కోట్లు ఇస్తే మిగిలినవాటికి రూ. 13కోట్లు ఇచ్చారని వివరించారు. ఒక్క దిల్లీ-ముంబయి కారిడార్‌లో 25 అభివృద్ధి చేస్తున్న ప్రాంతాలుండగా అందులో 5 గుజరాత్‌లోనే ఉన్నాయన్నారు. ఆ అయిదింటిలో ప్రధాని మానసపుత్రిక అయిన ధొలేరా ఒకటని అన్నారు. ఆయన సింగపూర్, కెనడా, దుబాయ్‌కు వెళ్లినపుడు ధొలేరాకు ప్రాజెక్టులు వచ్చేలా వ్యవహరించారన్నారు. "కెనడియన్ పెన్షన్ ఫండ్ భారత్‌కు వస్తుండగా పీఎంఓ దాన్ని ధొలేరాలో పెట్టమందని, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ విషయంలోనూ ఇలాగే జరిగిందని ఈ మాదిరి ప్రపంచవ్యాప్తంగా ప్రధాని ప్రభావితం చేసి ధొలేరాకు రూ. 50వేల కోట్ల పెట్టుబడులు వచ్చేందుకు మార్గం సుగమం చేశారని అన్నారు.

జీవీఎల్ నరసింహారావువి పచ్చి అబద్ధాలు

భాజపా జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు ఏపీకి వచ్చి పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రభుత్వంపై నెపం వేసే ప్రయత్నం చేస్తున్నారని కుటుంబరావు విమర్శించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు కేంద్రం రూ. 8వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా రాష్ట్రం తీసుకోవట్లేదంటున్నారని మరి ఆ ప్రాజెక్టులేంటో ఆయన ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన యూసీల్లో తేడా ఉంటే 24 గంటల్లోపే కేంద్ర ప్రభుత్వ అధికారులను పంపి తనిఖీ చేయించాలని తప్పుంటే తలదించుకుంటామని సవాల్ విసిరారు. చెన్నై-బెంగళూరు కారిడార్‌లో కృష్ణపట్నం పెడుతూ డిసెంబరు-2017లోనే సంబంధిత ట్రస్టుతో ఏపీ ప్రభుత్వం ఒప్పంద ప్రక్రియ పూర్తిచేయగా దానికి కేంద్రం ఇప్పటివరకూ క్లియరెన్స్ ఇవ్వలేదన్నారు. అలాగే విశాఖ-చెన్నై కారిడార్ విషయమూ కేంద్రం వద్దే పెండింగులో ఉందన్నారు.

ఏపీ ఎంసెట్ కౌన్సెలింగ్‌లో 68% సీట్లే భర్తీ

- ప్రైవేటు కళాశాలల్లో సుమారు 25వేల ఇంజినీరింగ్ సీట్లు మిగులు
- 44 ఫార్మసీ కాలేజీల్లో ఒక్కరూ చేరని వైనం
- ముగిసిన ఎంసెట్ మొదటి విడత కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: ఏపీఎంసెట్-2018(ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్ ముగిసింది. ఐచ్ఛికాలు(ఆప్షన్లు) ఇచ్చిన విద్యార్థులకు మంగళవారం సీట్ల కేటాయింపు పూర్తిచేశారు. మొత్తం విద్యార్థుల్లో 52శాతం మందే ప్రవేశాలకు ఆప్షన్లు ఇవ్వగా.. ఇంజినీరింగ్, ఫార్మసీ కలిపి కన్వీనర్ కోటా సీట్లు 68శాతమే భర్తీ అయ్యాయి. రెండింటిలో కలిపి 89,592 సీట్లుండగా.. 60,943 భర్తీ అయ్యాయి. వర్సిటీ కళాశాల్లో ఇంజినీరింగ్ సీట్లన్నీ నిండగా.. ప్రైవేటు కళాశాలల్లో 32శాతం మిగిలాయి. ఫార్మసీకి సంబంధించి వర్సిటీలో 79, ప్రైవేటులో 2,616 సీట్లు మిగిలాయి. ప్రైవేటు, విశ్వవిద్యాలయాల కళాశాలలన్నీ కలిపి 394 ఉండగా . .62 కళాశాలల్లోనే మొత్తం సీట్లు నిండాయి. 44 ఫార్మసీ కళాశాలల్లో ఒక్క సీటూ భర్తీ కాలేదు! 1-5 మంది విద్యార్థులు ఎంపిక చేసుకున్న కళాశాలలు ఐదుండగా.. 401-450 మందితో సీట్లు భర్తీ అయినవి నాలుగు కళాశాలలే ఉన్నాయి. 801-900, ఆ పైన సీట్లు భర్తీ అయిన కళాశాల ఒక్కోటే ఉండడం గమనార్హం. ప్రస్తుతం సీట్ల కేటాయింపు పొందిన వారిలోనూ అందరూ కళాశాలల్లో చేరే అవకాశం ఉండదు. ఎన్‌సీసీ, క్రీడలు, విభిన్న ప్రతిభావంతులు, క్యాంప్ కోటా కింద దరఖాస్తు చేసిన 6,185 మందికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ పండాదాస్ తెలిపారు.

బ్రాంచీల వారీగా సీట్ల భర్తీ..

బ్రాంచి	సీట్లు	కేటాయింపు	మిగిలినవి
ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్	22,354	16,832	5,522
కంప్యూటర్ సైన్సు	19,838	17,272	2,566
మెకానికల్	15,740	8,842	6,898
ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్	12,307	6,959	5,348
సివిల్	11,624	6,490	5,134
బీఫార్మసీ	2,961	266	2,695
ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ	2,416	2,351	65
అగ్రికల్చరల్ ఇంజినీరింగ్	535	437	98

'నీట్'లో సంక్షేమ విద్యార్థుల ప్రతిభ

ఈనాడు డిజిటల్, అమరావతి: నీట్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 137 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇందులో 85 మంది ఓపెన్ కేటగిరిలో అర్హత పొందారు. మద్దిరాల సుబ్రమణ్యేశ్వరరావు అనే విద్యార్థికి అత్యధికంగా 433 మార్కులు వచ్చాయి. గతేడాది 29 మంది విద్యార్థులు నీట్‌కు అర్హత సాధించగా ఈ సారి ఆ సంఖ్య నాలుగు రెట్లు పెరిగిందని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి కల్నల్ రాములు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎస్వీబీసీ ఇన్‌ఛార్జి సీఈవోగా పోలా భాస్కర్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్(ఎస్వీబీసీ) ఇన్‌ఛార్జి సీఈవోగా తితిదే తిరుపతి జేఈవో పోలా భాస్కర్‌ను నియమిస్తూ ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఇది వరకు ఇన్‌ఛార్జి సీఈవోగా పని చేసిన ఎన్.ముక్తేశ్వరరావుకు తితిదేలో ఒప్పంద కాలం ఈ నెల 3వ తేదీతో ముగిసింది.

ఎంసెట్ విద్యార్థులకు వల

- కన్వీనర్ పేరిట ఆప్షన్లకు సహకరిస్తామంటూ సందేశాలు
- విజయవాడ కేంద్రంగా వ్యవహారం

ఈనాడు, హైదరాబాద్: 'ఎంసెట్‌లో మీరు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారా?.. ఇచ్చుకుంటే 8985099274కు 'అవును' అని ఎస్ఎంఎస్ ఇవ్వండి... లేకుంటే 8074053315 నంబరుకు 'లేదు' అని సంక్షిప్త సందేశం పంపండి- ఎండీ కన్వీనర్'.. అని ఆంగ్లంలో వేలమందికి సందేశాలు పంపుతూ కొందరు అక్రమార్కులు ఎంసెట్ ర్యాంకర్లకు గాలం వేస్తున్నారు. తెలంగాణ, ఏపీ అనే వివరాలు లేకున్నా కన్వీనర్ అని ఉండటంతో చాలా మంది తిరుగు సమాధానం కూడా ఇచ్చారు. ఒకవేళ ఆప్షన్లు ఇచ్చుకోకుంటే వెంటనే విజయవాడ వచ్చి ఇచ్చుకోండి అంటూ ఫోన్ చేసి అడుగుతున్నారు. దీనిపై కొందరు తల్లిదండ్రులకు అనుమానం వచ్చి తెలంగాణ ఎంసెట్ ప్రవేశాల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాంటి సందేశాల్ని తాము ఇవ్వలేదనే సమాధానం వచ్చింది. అధికారులు ఏపీ ఎంసెట్ ప్రవేశాల అధికారులను సంప్రదిస్తే వారూ తాము అలాంటివి పంపలేదని చెప్పారు. సంక్షిప్త సందేశాల్లో ఉన్న ఫోన్ నంబర్లకు తెలంగాణ ఎంసెట్ ప్రవేశాల క్యాంపు అధికారి బి.శ్రీనివాస్ ఫోన్ చేసి మాట్లాడగా.. తమది విజయవాడ అనీ, ఆప్షన్లు ఇచ్చుకోకుంటే సహాయం చేద్దామని పంపామని సమాధానం ఇచ్చారు. తాము ఏపీ ఎంసెట్ అభ్యర్థులను దృష్టిలో పెట్టుకొని పంపామనీ.. క్షమించాలంటూ ఫోన్ కట్ చేశారు. ఎస్ఎంఎస్‌లు ఇచ్చింది ఓ కన్సల్టెన్సీ సంస్థ అని వెల్లడైంది. ఇంజినీరింగ్ కళాశాలలతో ఒప్పందం కుదుర్చుకొని ఉండొచ్చనీ, వారి వద్దకు వచ్చిన విద్యార్థులకు ఒప్పందం ఉన్న కళాశాలల్లో సీట్లు వచ్చేలా ఆప్షన్లు ఇవ్వడమే కన్సల్టెన్సీ ఉద్దేశమని సమాచారం.

ఆశ నెరవేరలేదని.. ఆత్మహత్య!

- 'నీట్'కు అర్హత సాధించలేదన్న మనస్తాపంతో విద్యార్థిని బలవన్మరణం
- జనం చూస్తుండగానే..పది అంతస్తుల భవనం పైనుంచి దూకిన జస్లీన్ కౌర్
- అక్కడికక్కడే మృతి

పదంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని జస్లీన్ కౌర్. సీసీ కెమెరా దృశ్యాలివి.. మెట్లపై నుంచి నడిచి భవనం పైకి వెళ్తూ.. భవనం పైనుంచి దూకుతూ.. విగతజీవిగా..

ఈనాడు, హైదరాబాద్: 'నీట్'(జాతీయ వైద్య విద్య అర్హత పరీక్ష)కు అర్హత సాధించలేదన్న మనస్తాపంతో పదంతస్తుల భవనం పైనుంచి దూకి విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడటం హైదరాబాద్‌లో మంగళవారం కలకలం సృష్టించింది. అందరూ చూస్తుండగా...వద్దంటూ వారిస్తున్నా వినకుండా..కాపాడే ప్రయత్నం చేసేలోపే బాలిక జనసమ్మర్ద ప్రాంతంలో దూకేయడం అందర్నీ విస్మయానికి గురిచేసింది. ఈ ఘటనలో జస్లీన్‌కౌర్(18) అక్కడికక్కడే మరణించింది. విద్యార్థిని జస్లీన్ కౌర్ తల్లిదండ్రులు రణ్‌వీర్ సింగ్, లవ్లీసింగ్‌లతో కలిసి బర్కత్‌పుర లోని ఖైబాన్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తోంది. ఇంటర్‌లో 950 మార్కులు సాధించింది. వైద్య విద్యను అభ్యసించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. నీట్‌లో లక్షకుపైగా ర్యాంకు రావడంతో వైద్యవిద్యనభ్యసించే అవకాశాన్ని కోల్పోయింది. సోమవారం ఫలితాలు వెల్లడైనప్పట్నుంచి మనోవేదనతో ఉన్న ఆమె..మంగళవారం ఉదయం జిమ్‌కు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి స్కూటీలో బయటకు వచ్చింది. 9.30-10 గంటల ప్రాంతంలో ఆబిడ్స్‌లోని మయూర్ కుషాల్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. పదంతస్తుల భవనం పైకెక్కి దూకేందుకు యత్నిస్తుండగా రహదారిపై ఉన్న యువకులు, మహిళలు గమనించారు. దూకొద్దంటూ కేకలు వేశారు. మరికొందరు రక్షించేందుకు లిఫ్టులో భవనం పైభాగానికి వెళ్లారు. ఈ లోపే బాలిక దూకేయడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి శవాగారానికి తరలించారు. తలవెనుక బలమైన గాయాలు, మెదడు దెబ్బతినడం, కాళ్లు, పక్కటెముకలు విరిగిపోయి రక్తస్రావమవడంవల్ల ఆమె మరణించినట్టు మరణోత్తర పరీక్ష నిర్వహించిన వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని చిన్నాన్న సురేందర్ సింగ్‌కు పోలీసులు అప్పగించారు.

మెట్ల నుంచే పది అంతస్తులూ ఎక్కి..: లిఫ్టులో వెళితే ఎవరైనా ప్రశ్నిస్తారన్న అనుమానంతో జస్లీన్ కౌర్ పది అంతస్తులూ మెట్ల గుండానే ఎక్కిందని పోలీసులు ప్రాథమిక ఆధారాలను సేకరించారు. 'ఆరో అంతస్తు వద్దనున్న సీసీ కెమెరాలో అమె మెట్లెక్కుతున్న దృశ్యాలు నిక్షిప్తమయ్యాయి. పది అంతస్తుల తర్వాత భవనం పైభాగానికి వెళ్లేందుకు రెండు గేట్లు ఉండగా...మరమ్మతుల కారణంగా రెండింటిని తెరిచే ఉంచారు. ఒకదాని గుండా ఆమె భవనం పైకెక్కింది. ఇప్పటివరకైతే ఆమె మరణంపై అనుమానాలు లేవు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో లేరు. వారు వచ్చి అనుమానాలు వ్యక్తంచేస్తే దర్యాప్తును ఆ దిశగానూ కొనసాగిస్తాం' అని మధ్య మండలం డీసీపీ, విశ్వప్రసాద్ వెల్లడించారు. వైద్యవిద్య చదివే అదృష్టం తనకు లేదని భావించి..ఆత్మహత్యే శరణ్యమన్న బలమైన నిర్ణయంతోనే బాలిక బలవన్మరణానికి పాల్పడిందని పోలీసులు భావిస్తున్నారు. ఎత్తయిన ప్రదేశం నుంచి దూకితే వెంటనే చనిపోతానన్న భావనతోనే ఆ భవనాన్ని ఎంచుకుని ఉంటుందన్న నిర్ణయానికి వచ్చారు.

ఏడాది దాటితే చెల్లదు!

ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికా యానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

2019 వరకు చెల్లుబాటయ్యే గ్రీన్‌కార్డు ఉంది. 2016 మేలో భారతదేశం వచ్చిన నేను ఇంకా ఇక్కడే ఉన్నాను. గ్రీన్‌కార్డును పునరుద్ధరించుకునేందుకు అమెరికా వెళ్లాలనుకుంటున్నాను. పునరుద్ధరణ విధానం ఏమిటి? *- రమేష్ దేవరశెట్టి*

అమెరికా వెలుపల మీరు ఏడాదికిపైగా ఉంటున్నారు. మీ దగ్గర ఉన్న పత్రాలతో అమెరికా వెళ్లేందుకు ప్రయత్నిస్తే సమస్యల్లో చిక్కుకుంటారు. మీరు రిటర్నింగ్ రెసిడెంట్(ఎస్‌బి-1) వీసా కోసం దరఖాస్తు చేసుకోండి. ఎస్‌బి-1 వీసాలను హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం నిర్వహించదు. దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ఒక్కటే ఆ తరహా వీసాలను నిర్వహిస్తుంది. గ్రీన్‌కార్డుదారులు అమెరికా వెలుపల గడపాల్సిన సమయం తదితర సమాచారం కోసం https://www.uscis.gov/green-card/after-green-card-granted, ఎస్‌బి-1 వీసా సమాచారం https:/n/usembassy.gov/visas-mmigrant-visas/ returning-resident-visa/ ను పరిశీలించండి.

2023 వరకు చెల్లుబాటు అయ్యే బి1/బి2 వీసా ఉంది. ఈ ఆగస్టులో అమెరికా వెళ్దామనుకుంటున్నాను. రెండు వారాల పాటు అవగాహన కార్యక్రమానికి హాజరుకావాలనుకుంటున్నాను. ఇది రెగ్యులర్ కోర్స్ కాదు. హాజరు కావచ్చా? *- రవిచంద్ర మండవ*

వీసా బి1/బి2 వీసా అనేది పర్యాటక ప్రధానమైనది. అయితే, స్వల్పకాలిక కోర్సులను చేయాలనుకున్నవారు బి1/బి2 వీసా చెల్లుబాటయ్యే కాలంలో ఎప్పుడైనా వెళ్లవచ్చు. ఏదైనా కోర్సులో అర్హతపొందేందుకు అవగాహన తరగతుల ఫలితాలు ఆధారమైన పక్షంలో అక్కడికి వెళ్లేందుకు బి1/బి2 వీసా సరైనది కాదు. దరఖాస్తుదారుడు ఆయా విద్యా సంస్థల నుంచి ఐ-20ని కోరాలి. అది వచ్చిన తరువాతే విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. స్వల్పకాలిక కోర్సులతోపాటు అమెరికాలో చదువుకునేందుకు కావాల్సిన సమాచారం కోసం https://www.uscis.gov/working-united-states/students-and-exchange-visitors/students-and-employmenthanging-nonimmigrant-f-or-m-student-status ను చూడండి.

అమెరికాలో మాస్టర్స్ డిగ్రీని త్వరలో పూర్తి చేయబోతున్నాను. ఓపీటీకి అర్హుడని. ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి? *- సరిత ఇనగంటి*

విద్యా కార్యక్రమం పూర్తి కావటానికి 60 రోజుల ముందుగా ఓపీటీ కోసం దరఖాస్తు చేసుకోవాలి. మీరు ఆ గడువులోపలే ఉంటే మీ విశ్వవిద్యాలయ అంతర్జాతీయ కార్యాలయాన్ని సంప్రదించి ఓపీటీ దరఖాస్తును సిద్ధం చేసుకోండి. ఓపీటీకి దరఖాస్తు చేయాలంటే యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్)కు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ, అవసరమైన దరఖాస్తుల కోసం www.uscis.gov/optని చూడండి.

హెచ్-4 వీసాపై అమెరికాలో ఉంటున్నాను. అమెరికాలోనే మాస్టర్స్ చేయాలనుకుంటున్నాను. ఏ తరహా వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి? *- పద్మనాభన్*

చెల్లుబాటయ్యే హెచ్-4 వీసాపై ఉన్న వ్యక్తులు అమెరికాలో విద్యాలయాలకు వెళ్లేందుకు అనుమతుంది. ఆ చదువు ఉత్పాదక పనికి సంబంధించినదైతే ఉదాహరణకు పీహెచ్‌డీలో భాగంగా అసిస్టెంట్‌షిప్‌లాంటివైతే ఎఫ్-1 వీసా అవసరం. మీ వీసా స్థితి, పర్యటనను మార్చుకోవాలంటే అమెరికాలో ఉండేందుకు అనుమతించిన గడువు ముగియకముందుగానే మీరు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్)కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీసా స్థితిని మార్చుకునేందుకు సంబంధించిన సమాచారం కోసం https://www.uscis.gov/visit-united-states-hange-my-nonimmigrant-status-calegoryhange-my-non-immigrant-statusను పరిశీలించండి.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను suppor-tindia@ustraveldocs.coకు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.govను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

గౌరీలంకేశ్, భౌమిక్‌లకు అరుదైన గౌరవం

ప్రతిష్ఠాత్మక 'న్యూస్ ప్రదర్శనశాల'లో చోటు

వాషింగ్టన్: భారతీయ పాత్రికేయులు దివంగత గౌరీలంకేశ్, సుదీప్‌దత్త భౌమిక్‌లకు అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్ఠాత్మక న్యూస్‌ప్రదర్శనశాల(న్యూజియం)లో చోటు దక్కింది. పాత్రికేయుల సంస్మరణార్థం మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా 18 మంది పాత్రికేయుల వివరాలను కొత్తగా న్యూజియంలో చేర్చారు. వీరిలో ఎనిమిది మంది మహిళలు కావడం విశేషం. పాత్రికేయ వృత్తికోసం ప్రాణాలర్పించిన 2323 మంది ఫొటోలతో, మరింతమంది వివరాలతో అమెరికాలో గ్లాస్‌తో కూడిన స్మారకభవనం ఉంది. ప్రతిఏడాది పత్రికా స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించినవారి వివరాలు, వారి మరణాలకు గల కారణాలతో కొంతమందిని గుర్తిస్తారు. 'కుల వ్యవస్థ, హిందూత్వంపై జీవితాంతం పోరాడిన గౌరీలంకేశ్‌ను సెప్టెంబరు 5, 2017న ఆమె ఇంటి ముందే కాల్చి చంపారు. త్రిపురలోని స్థానిక పత్రికలో పనిచేసిన సుదీప్‌దత్త భౌమిక్ పోలీసుల అవినీతి గురించి అనేక కథనాలు రాశారన్నారు.

నీట్‌లో నెగ్గుకు రాలేదని విద్యార్థిని బలవన్మరణం

- తమిళనాడు శాసనసభను కుదిపేసిన సంఘటన

ప్రతిభ (పాత చిత్రం)

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: వైద్య విద్యలో ప్రవేశానికి నిర్వహించిన నీట్‌లో నెగ్గుకు రాలేకపోయాననే ఆవేదనతో తమిళనాడులోని విలుపురం జిల్లా చెంజి పెరవలూరుకు చెందిన ప్రతిభ(19) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకొంది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. సోమవారం రాత్రి ఆమె పురుగుల మందు తాగగా తల్లిదండ్రులు గుర్తించి వెంటనే తిరువణ్ణామలై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ చనిపోయింది. ఆమె పదోతరగతి పరీక్షల్లో 500 మార్కులకు 490 మార్కులు సాధించింది. గత ఏడాది ప్లస్‌టూ పరీక్షల్లో 1200 మార్కులకు 1,125 మార్కులు సాధించింది. అదే సంవత్సరం నీట్‌లో 155 మార్కులు రాగా ఈసారి 39 మార్కులు వచ్చాయి. గతేడాది వచ్చిన మార్కులతో ప్రైవేటు కళాశాలలో చదివే అవకాశం దక్కినా పేదరికం కారణంగా అప్పుడు వైద్య విద్యలో చేరలేదని విద్యాశాఖ మంత్రి సెంగొట్టయ్యన్ తెలిపారు. 'డాక్టర్ కావాలని నేను ఎన్నో కలలు కన్నాను. కానీ ఈ సారి నీట్‌లో ఇచ్చిన ప్రశ్నలు కనీసం అర్థం చేసుకోడానికి కూడా వీల్లేకుండా ఉన్నాయి' అని ఆమె రాసిన సూసైడ్ నోట్‌లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

అసెంబ్లీని కుదిపేసిన సంఘటన: ప్రతిభ మృతితో ఆమె కుటుంబ సభ్యులు, స్థానికులు, వివిధ పార్టీల నాయకులు నీట్‌ను రద్దు చేయాలని, బాధితులకు న్యాయం చేయాలంటూ తిరువణ్ణామలైలో ధర్నాకు దిగారు. కలెక్టరు కందస్వామి, ఎస్పీ పొన్ని వారికి సర్దిచెప్పారు. ఇదే అంశం మంగళవారం శాసనసభను కుదిపేసింది. గత ఏడాది అనిత అనే విద్యార్థిని మృతి చెందగా ఈ ఏడాది మరో విద్యార్థిని నీట్‌కు బలైందని, రాష్ట్రానికి నీట్ నుంచి మినహాయింపు తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని డీఎంకే పక్ష నేత స్టాలిన్ విమర్శించారు. ఆ పార్టీ సభ్యులు సభ నుంచి నిష్క్రమించి నిరసన తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రి సి. విజయభాస్కర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సెంగొట్టయ్యన్‌లు మాట్లాడుతూ ఇప్పటికే రెండుసార్లు శాసనసభలో దీనిపై తీర్మానం చేశామన్నారు. విద్యార్థిని మృతిపై నటుడు రజనీకాంత్ కూడా విచారం వ్యక్తం చేశారు.

గుంటూరు నార్త్‌క్లబ్‌పై పోలీసుల దాడి

- 247 మంది అరెస్టు
- భారీగా నగదు స్వాధీనం

పట్టాభిపురం(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు స్వామి థియేటర్ సమీపంలోని నార్త్‌క్లబ్‌పై మంగళవారం పోలీసులు మెరుపు దాడులు చేశారు. 247 మందిని అరెస్టు చేసి రూ. 20,28,522 నగదు స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ ఎస్పీ విజయరావు ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ వలయ డీఎస్పీ సరిత ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, స్పెషల్ టాస్క్‌ఫోర్సు సిబ్బంది మొత్తం 70 మంది పోలీసులు ఏకకాలంలో క్లబ్‌పై దాడులు చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైన పోలీసుల తనిఖీలు సాయంత్రం 6.00గంటల వరకు కొనసాగాయి.

నేడు లోక్‌సభ స్పీకరుతో వైకాపా ఎంపీల భేటీ

ఈనాడు, దిల్లీ: లోక్‌సభ స్పీకరు సుమిత్రా మహాజన్‌తో బుధవారం వైకాపా ఎంపీలు భేటీ కానున్నారు. రాజీనామాలపై ఇటీవల ఎంపీలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, వరప్రసాదరావు, అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డిలను సభాపతి పిలిపించి మాట్లాడారు. బుధవారం మరోసారి భేటీ కావాలని సభాపతి కార్యాలయం నుంచి వైకాపా ఎంపీలకు సమాచారం అందింది. రాజీనామాలపై వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ఎంపీ మేకపాటి స్పష్టం చేశారు.

ఏపీ మహిళా కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా సీతక్క

ఆంధ్రప్రదేశ్ మహిళ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా దనసరి అనసూయ అలియాస్ సీతక్కను నియమించారు. ఈ మేరకు మంగళవారమిక్కడ అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుస్మితా దేవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. హాజీనా సయ్యద్ స్థానంలో సీతక్కను నియమిస్తున్నట్లు తెలిపారు.

దేశంలోనే అత్యుత్తమ యంత్రాంగం మనది

- నీట్‌లో రాష్ట్ర సత్తా చాటారు
- టెలీ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి

ఈనాడు డిజిటల్, అమరావతి: మన వార్డు, మన ఊరు భావనతో అభివృద్ధి యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర యంత్రాంగం దేశంలోనే అత్యుత్తమమైనదిగా అభివర్ణించారు. నాలుగేళ్లుగా సాధించిన విజయాల స్ఫూర్తితో మరింత ముందుకు సాగాలని సూచించారు. సమర్థ నాయకత్వంతో మెరుగైన సేవలు, అవినీతి రహిత పాలన అందిస్తేనే ప్రజల్లో సంతృప్తి వస్తుందని చెప్పారు. మూడో రోజు నవ నిర్మాణ దీక్షలో 17లక్షల మంది పాల్గొన్నారని వివరించారు. నవ నిర్మాణ దీక్ష నాలుగోజైన మంగళవారం ఉదయం శాఖాధిపతులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'నీట్‌లో రాష్ట్ర విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఐఐటీ, ఐఐఎం ప్రవేశాల్లోనూ మనవాళ్లు ముందుంటున్నారు. విజ్ఞానానికి కుల, మత భేదాల్లేవు. డబ్బున్నవారు, లేనివారు అనే భావనను అధిగమించాలి' అని పేర్కొన్నారు. 'సాధికార మిత్రలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్య పరచాలి. రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా నవ నిర్మాణ దీక్షల్లో పాల్గొనాలి. మూడో రోజు దీక్ష సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 19వేల శంకుస్థాపనలు జరిగాయి. 7వేల చోట్ల ఆటల పోటీలు, 7445 ప్రదేశాల్లో సాంస్కృతిక పోటీలు జరిగాయి. దీక్షల నిర్వహణలో గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు ముందంజలో ఉన్నాయి. కడప, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాలు దిగువన ఉన్నాయి. నవ నిర్మాణ దీక్షల నిర్వహణతో ప్రజల్లో సంతృప్తి శాతం 80 శాతానికి చేరింది. తాగునీటి సమస్యలపై 57 శాతం, పోలవరం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని 53 శాతం, నదుల అనుసంధానంపై 58 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. నీరు- ప్రగతి పనులపై 48 శాతం, రైతు రథంపై 56 శాతం, రైతు రుణ మాఫీ 54 శాతం మంది బాగుందన్నారు. వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞాన అనుసంధానంపై 59 శాతం సంతృప్తి ఉంది.

మోదీ పాలనపై దేశవ్యాప్త ఉద్యమాలు

పవన్ కల్యాణ్ కలిసి వస్తున్నారు: సురవరం

ఈనాడు, దిల్లీ: కేంద్రంలోని భాజపా సర్కారు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో దేశానికి తీవ్రనష్టం వాటిల్లిందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ జాతీయ కార్యదర్శులు డి.రాజా, కె.నారాయణలతో కలిసి మంగళవారం ఆయనిక్కడ విలేకరులతో మాట్లాడారు. ఇంధన, నిత్యావసరాల ధరల పెరుగుదలకు నిరసనగా ఈనెల 20వ తేదీని ధరల వ్యతిరేకదినంగా పాటిస్తామనీ, ఆరోజు దేశవ్యాప్త నిరసనలు ఉంటాయన్నారు. యడ్యూరప్ప రాజీనామాను వెంటనే ఆమోదించిన లోక్‌సభ స్పీకర్... వైకాపా ఎంపీల రాజీనామాలపై ఎందుకు నిర్ణయం తీసుకోలేదో తెలియదన్నారు. తెదేపాలో చేరిన వైకాపా ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబునాయుడు రాజీనామాలు చేయించి, ఆ తర్వాతే ఉప ఎన్నికలకు సిద్ధపడటం సమంజసమన్నారు. కేసీఆర్ థర్డ్ ఫ్రంట్‌ను ఎంతకు అమ్మినా కొనేవారు లేరనీ, అది భాజపా బి-జట్టు అని సురవరం అభివర్ణించారు. కొన్ని అంశాల్లో పవన్‌కల్యాణ్ కలిసి వస్తున్నారనీ, తెలుగు రాష్ట్రాల్లో కలిసివచ్చే శక్తులతో ఎన్నికలకు వెళతామన్నారు. ఐక్య పోరాటాల్లో కాంగ్రెస్ ఉంటే తాము రాలేమని వైకాపా అంటోందనీ, అలాంటివారితో కలవడం కష్టమని అన్నారు.

నమోదు.. ఆదిలోనే హంసపాదు

- మొక్కజొన్న, జొన్న పంటల విషయంలో రైతుల పాట్లు
- వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తప్పని ప్రదక్షిణలు

ఈనాడు, అమరావతి: క్వింటాలుకు రూ. 200 చొప్పున ఇచ్చే ఆర్థిక సాయం కోసం.. మొక్కజొన్న, జొన్న రైతులకు పంట నమోదు కష్టాలు తప్పడం లేదు. కోసిన మొక్కజొన్న జాడలు పొలంలో కన్పిస్తున్నా.. అధికారులు కనికరించడం లేదు. బుధవారం జూన్ 6 వరకు ఉన్న గడువు ముగిసే దశలోనూ మండలానికిచ్చిన లక్ష్యం పూర్తయిందంటూ వ్యవసాయాధికారులు పుస్తకాలు మూసేస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 24లక్షల టన్నుల పంట నమోదు కావాల్సి ఉంటే.. ఇప్పటికీ 4.92 లక్షల టన్నుల మొక్కజొన్న, 96వేల టన్నుల జొన్నను మాత్రమే నమోదు చేసుకున్నారు. నేటితో గడువు ముగుస్తున్నా లక్ష్యంలో 25శాతం కూడా పూర్తి చేసుకోలేకపోయారు.

★ రాష్ట్రంలో ఈ ఏడాది 2.28లక్షల హెక్టార్లలో మొక్కజొన్న, 1.10లక్షల హెక్టార్లలో జొన్న సాగైంది. ఈ పంటల విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే 93వేల హెక్టార్ల వరకు చేరింది. దిగుబడులు భారీగా పెరిగాయి. ఇంత పంట కొనలేమని మార్క్‌ఫెడ్ చేతులెత్తేయటంతో.. క్వింటాలుకు రూ. 200 చొప్పున 100 క్వింటాళ్ల వరకు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే

మొక్కజొన్న, జొన్న రైతుల వివరాలు వ్యవసాయ శాఖ వద్ద లేవు. దీంతో వారు స్వచ్ఛందంగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని అధికారులు ప్రకటించారు. ఆర్టీజీఎస్ ఆధ్వర్యంలో యాప్ తయారుచేశారు. రైతులు సాగు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా తమ మొబైల్స్ నుంచి నమోదు చేసుకోవచ్చని చెప్పారు. కలెక్టర్ల సదస్సులోనూ సంబంధిత కార్యాచరణను ముఖ్యమంత్రి ముందుంచారు. తర్వాత వ్యవసాయశాఖ తామే యాప్ తయారుచేస్తామని మెలిక పెట్టింది. గడువు దాటాక తీరిగ్గా విడుదల చేసినా ప్రచారం కొరవడింది. ఎంపీఈఓల ద్వారా నమోదు చేయించుకోవాలనే నిబంధన పెట్టారు. దీంతో రైతులంతా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

జాబితాలు పూర్తయ్యాయి.. వెళ్లిపొండి..

రబీ లెక్కల సమయంలో గ్రామాల వారీగా కాకిలెక్కలు ఇచ్చారు. దాని ఆధారంగానే రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న 2.28లక్షల హెక్టార్లు, జొన్న 1.10లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు. ఇప్పుడు ఆ లెక్కల ఆధారంగానే సాగు చేసిన రైతుల జాబితా తయారుచేయాల్సి వస్తోంది.

★ ముందుగా వచ్చిన వారి పేర్లనే జాబితాల్లో రాస్తున్నారు. గ్రామానికి ఇచ్చిన విస్తీర్ణం పూర్తయిందంటున్నారు. నిజంగా సాగుచేసిన వారి పేర్లను పరిగణనలోకి తీసుకోవడం లేదు.

సైనా, సింధు వేరుబాట!

దిల్లీ: భారత అగ్రశ్రేణి క్రీడాకారిణులు సైనా నెహ్వాల్, పి.వి.సింధు వేరుబాట పట్టారు! ఇద్దరు క్రీడాకారిణులు జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ దగ్గరే తర్ఫీదు పొందుతున్నా.. వేరువేరుగా శిక్షణ తీసుకుంటున్నారు. వ్యూహాలు, ఆటపై గోప్యత ఉండాలన్నదే ఈ నిర్ణయం వెనుక అసలు కారణం. కామన్వెల్త్ క్రీడల సింగిల్స్‌లో సైనా చేతిలో సింధు ఓటమి తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. అంతకుముందు 2017 జాతీయ ఛాంపియన్‌షిప్ ఫైనల్, 2018 ఇండోనేసియా ఓపెన్ క్వార్టర్స్‌లో సైనా చేతిలో సింధుకు చుక్కెదురైంది. దీంతో కామన్వెల్త్ క్రీడల అనంతరం సాయ్- గోపీచంద్ అకాడమీలో సైనా శిక్షణ కొనసాగిస్తుండగా.. గచ్చిబౌలిలోని పాత అకాడమీలో సింధు తర్ఫీదు పొందుతోంది. గోపీచంద్ మార్గనిర్దేశనంలో సైనా, సింధు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. "కొత్త అకాడమీలో శిక్షణ సింధుకు అసౌకర్యంగా అనిపిస్తుంది. బ్యాడ్మింటన్ వ్యక్తిగత క్రీడ కాబట్టి పోటీ సహజం. సొంతంగా వ్యూహాల్ని సిద్ధం చేసుకోడానికే పాత అకాడమీలో సింధు శిక్షణ తీసుకుంటుంది. సైనా, సింధు కలిసి సాధన చేస్తే ఇద్దరి బలహీనతలు, ఫిట్‌నెస్, ఆటపై ఒకరికొకరికి అవగాహన ఏర్పడుతుంది. ఏ విభాగంపై ఎక్కువగా దృష్టిసారిస్తున్నారు.. ఎక్కడ బలహీనంగా ఉన్నారో సులువుగా తెలిసిపోతుంది. సైనా కూడా ఇదే కారణంతో గోపీచంద్ అకాడమీని వీడి విమల్‌కుమార్ దగ్గర శిక్షణ తీసుకుంది. మూడేళ్ల తర్వాత మళ్లీ గోపీచంద్ అకాడమీకి వచ్చింది. ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు సింధుకు గోపీ శిక్షణ ఇస్తాడు. అనంతరం ఇద్దరు ఇండోనేసియా కోచ్‌లు సాధన చేయిస్తారు. జూనియర్ బాలురు, డబుల్స్ క్రీడాకారులు సింధుతో కలిసి ఆడతారు. ఒకస్థాయికి చేరుకున్న క్రీడాకారులకు ఎలాంటి శిక్షణ తీసుకోవాలన్న దానిపై స్పష్టత ఏర్పడుతుంది. పరిణతి కలిగిన క్రీడాకారులకు తమ లోపాలపై అవగాహన ఉంటుంది. ప్రస్తుతం సింధు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంది. ఈనెలలో జరిగే మలేసియా ఓపెన్‌లో సింధు బరిలో దిగుతుంది. ఇండోనేసియా, థాయ్‌లాండ్ ఓపెన్‌లలో కూడా పాల్గొంటుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కారణంగా సింగపూర్ ఓపెన్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది" అని సింధు తండ్రి రమణ తెలిపాడు.

రషీద్ ఖాన్ (4/12)

రషీద్ మాయ

అఫ్గాన్‌దే టీ20 సిరీస్

డెహ్రాడూన్: స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ విజృంభించిన వేళ అఫ్గానిస్థాన్ మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే చేజిక్కించుకుంది. మంగళవారం జరిగిన రెండో టీ20లో 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రషీద్ ఖాన్ (4/12), ఆఫ్ స్పిన్నర్ మహ్మద్ నబి (2/19)ల ధాటికి బంగ్లా నిర్ణీత ఓవర్లలో 134 (8 వికెట్లకు) పరుగులకే పరిమితమైంది. తమీమ్ ఇక్బాల్ (43) ఆ జట్టులో టాప్ స్కోరర్. లక్ష్యాన్ని అఫ్గాన్ 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సమియుల్లా షెన్వారి (49) రాణించాడు. మ్యాచ్ నువ్వానేనా అన్నట్టుగా సాగుతున్న సమయంలో మహ్మద్ నబి (31 నాటౌట్; 15 బంతుల్లో 3×4, 2×6) చెలరేగడంతో మరో 7 బంతులు ఉండగానే అఫ్గాన్ లక్ష్యాన్ని చేరుకుంది.

ఉత్తమ క్రికెటర్‌గా నితీశ్

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్ర అండర్-16 జట్టు వైస్ కెప్టెన్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ నితీశ్‌కుమార్‌రెడ్డి 2017-18 సీజన్‌కు ఉత్తమ అండర్-16 క్రికెటర్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 12న బెంగళూరులో జరిగే బీసీసీఐ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో నితీశ్‌కు రూ.1.5 లక్షల బహుమతి, దాల్మియా ట్రోఫీని అందజేయనున్నట్లు వెల్లడించింది. బీసీసీఐ నుంచి ఉత్తమ క్రికెటర్ అవార్డు రావడం 65 ఏళ్ల ఆంధ్ర క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. 2017-18 సీజన్‌లో 7 మ్యాచ్‌లాడిన నితీశ్.. 176.71 సగటుతో 1237 పరుగులు సాధించాడు. 13.84 సగటుతో 26 వికెట్లు తీశాడు.

ఛాంపియన్స్

ఫిఫా ప్రపంచకప్ మరో 8 రోజుల్లో

గ్రూప్-ఇ విశ్లేషణ

ఐదుసార్లు ఛాంపియన్ అయిన బ్రెజిల్ ఉన్న ఈ గ్రూప్ నిస్సందేహంగా అత్యంత ఆకర్షణీయ గ్రూప్. స్టార్లతో కూడిన బ్రెజిల్ ఫేవరెటే అయినా మిగతా మూడు జట్లు కూడా బలహీనమైనవేమీ కాకపోవడంతో ఈ గ్రూప్ అత్యంత ఆసక్తి కలిగిస్తోంది. కిందటిసారి సంచలనాత్మక రీతిలో క్వార్టర్స్ చేరిన కోస్టారికా, దృఢకాయులతో దూకుడుగా ఆడే సెర్బియా, ప్రతిభావంతులతో నిండిన స్విట్జర్లాండ్‌లు కూడా నాకౌట్‌పై కన్నేశాయి. ఫలితాలు అంత తేలిగ్గా తేలబోవు. అభిమానులకు చక్కని వినోదం ఖాయం.

ఈ గ్రూప్ బ్రెజిల్‌దే

నెయ్‌మార్

బ్రెజిల్ కసిగా సిద్ధమైంది

ఫిఫా ర్యాంకు 2

ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్టు బ్రెజిల్. అన్ని ప్రపంచకప్‌లకూ అర్హత సాధించిన ఏకైక జట్టు కూడా. ఈ సాంబా జట్టు విన్యాసాలను చూసేందుకు విశ్వవ్యాప్త ఫుట్‌బాల్ అభిమానులంతా అత్యంత ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. చాకు లాంటి ఆటగాళ్లున్న బ్రెజిల్.. గ్రూప్‌కే కాదు మొత్తం టోర్నీకే ఫేవరెట్. నాలుగేళ్ల కింద సొంతగడ్డపై సెమీస్‌లో 1-7తో జర్మనీ చేతిలో ఓటమి ఇంకా వెంటాడుతుంటే చాలా బలమైన జట్టుతో కసిగా టోర్నమెంట్‌కు సిద్ధమైంది. ఆరో ట్రోఫీతో ఆ చేదు అనుభవాన్ని మరిచిపోవాలనుకుంటోంది. గత ప్రపంచకప్ తర్వాత పూర్తిగా రూపాంతరం చెందిన బ్రెజిల్... క్వాలిఫయర్స్‌లో చక్కని ప్రదర్శన చేసింది. ఈ ప్రపంచకప్‌కు అర్హత దక్కించుకున్న తొలి జట్టు బ్రెజిలే కావడం విశేషం. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఫుటబాలర్ నెయ్‌మార్ ఆ జట్టుకు బ్రహ్మాస్త్రం. గాబ్రియెల్ జీసస్, ఫ్రెడ్, జో వంటి ఇతర స్టార్లూ బ్రెజిల్‌పై అంచనాలను పెంచుతున్నారు. బలమైన మిడ్‌ఫీల్డ్, అలిసన్ బెకర్, ఎడర్సన్ మొరేస్‌ల రూపంలో ఇద్దరు అత్యుత్తమ గోల్‌కీపర్లు బ్రెజిల్‌కు ఉన్నారు. మోకాలి గాయంతో కారణంగా డాని అల్వెస్ దూరం కావడం పెద్ద ఎదురుదెబ్బే అయినా మార్సెలో వాంటి వారితో డిఫెన్స్ కూడా దుర్భేద్యంగా ఉంది. అన్ని విభాగాల్లోనూ అత్యంత పటిష్టంగా ఉన్న బ్రెజిల్‌కు గ్రూపులో అగ్రస్థానం ఖాయమే అయినా..మిగతా జట్లపై విజయం మరీ అంత తేలికైతే కాదు.

కీలక ఆటగాళ్లు: నెయ్‌మార్, మార్సెలో, ఫిర్మినో

కోచ్: అదెనార్ బచ్చి (టైట్)

రికార్డు: ఐదుసార్లు ఛాంపియన్

నవాస్

కోస్టారికా చిన్నదే కానీ...

ఫిఫా ర్యాంకు 25

గట్టిగా 50 లక్షల జనాభా లేని ఈ దేశం ఐదో ప్రపంచకప్ ఆడుతుండడం విశేషం. చిన్న దేశమే కాని ఆటలో చిన్నదేమీ కాదు. నాలుగేళ్ల కింద బ్రెజిల్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లి సంచలనం సృష్టించింది. బ్రయాన్ రుయిజ్ ఎటాకింగ్‌లో ఆ జట్టుకు చాలా కీలకం. మిడ్‌ఫీల్డ్‌లో సెల్సో బోర్గెస్ ముఖ్య పాత్ర పోషించనున్నాడు. ఇటీవల స్నేహపూర్వక మ్యాచ్‌ల్లో 5-0తో స్పెయిన్ చేతిలో, 1-0తో హంగేరి చేతిలో ఓడినా.. కోస్టారికా ప్రమాదకర జట్టే. గత ప్రపంచకప్‌లో ఇటలీ, ఉరుగ్వే, ఇంగ్లాండ్ వంటి మేటి జట్లు ఉన్న గ్రూప్‌లో అగ్రస్థానం సాధించిన కోస్టారికాను తక్కువ అంచనా వేస్తే పొరపాటే. నాకౌట్లో స్థానం కోసం బలంగా రేసులో ఉంది. ఈ నాలుగేళ్లలో కోస్టారికా జట్టు పెద్దగా మారలేదు. బ్రెజిల్‌లో ఆడిన చాలా మంది ఈసారి రష్యాలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

కీలక ఆటగాళ్లు: కీలర్ నవాస్, బ్రయాన్ రుయిజ్

కోచ్: ఆస్కార్ రమిరెజ్

రికార్డు: క్వార్టర్‌ఫైనలే అత్యుత్తమ ప్రదర్శన.

వాలోన్ బెహ్రామి

స్విట్జర్లాండ్ సమతూకంగా...

ఫిఫా ర్యాంకు 6

ఈ గ్రూపులో బ్రెజిల్ తర్వాత మెరుగైన జట్టు స్విట్జర్లాండే. ఫిఫా ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంలో ఉంది. అనుభవజ్ఞులు, కుర్రాళ్లతో సమతూకంగా ఉంది. ఎంతో మంది ప్రతిభావంతులున్న ఈ జట్టు సత్తామేరకు ఆడితే క్వార్టర్‌ఫైనల్ వరకు వెళ్లొచ్చని ఫుట్‌బాల్ పండితులు భావిస్తున్నారు. 2009 అండర్-17 ప్రపంచకప్ గెలిచిన స్విస్ జట్టులోని చాలా మంది ఆటగాళ్లు ప్రస్తుత ప్రపంచకప్ జట్టులో ఉన్నారు. యాన్ సోమర్ రూపంలో మంచి గోల్‌కీపర్ ఆ జట్టుకు ఉన్నాడు. రికార్డో రోడ్రిగెజ్, స్టెఫాన్ లిస్టీనర్ వంటి వారితో ఆధారపడదగ్గ రక్షణశ్రేణి స్విట్జర్లాండ్‌కు ఉంది. యువ ఆటగాళ్లు మాన్యుయెల్ అకంజి, బ్రీల్ ఎంబోలోలు ఆసక్తిరేపుతున్నారు. గ్రూపు నుంచి ముందంజ వేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ అందుకు స్టార్ ఆటగాళ్లు సమష్టిగా రాణించాల్సివుంది.

కీలక ఆటగాళ్లు: వాలోన్ బెహ్రామి, రోడ్రిగెజ్

కోచ్: వ్లాదిమర్ పెట్కోవిచ్

రికార్డు: అత్యుత్తమ ప్రదర్శన క్వార్టర్‌ఫైనల్

బ్రానిస్లావ్

సెర్బియా గట్టి పోటీదారే

ఫిఫా ర్యాంకు 35

ఎనిమిదేళ్ల విరామం తర్వాత ప్రపంచకప్‌లో అడుగుపెట్టింది. స్వతంత్ర దేశంగా టోర్నీలో ఆడడం ఇది రెండోసారి మాత్రమే. క్వాలిఫయింగ్ దశలో తన గ్రూపులో అత్యధిక గోల్స్ (20) కొట్టింది. అలెగ్జాండర్ మిత్రోవిచ్ అందరికన్నా ఎక్కువగా ఆరు గోల్స్ కొట్టాడు. ప్రపంచకప్‌లో సెర్బియా అవకాశాలకు అతడే ముఖ్యం. శారీరకంగా బాగా దృఢంగా ఉన్న ఆటగాళ్లతో దూకుడుగా ఆడే సెర్బియాను అడ్డుకోవడం మిగతా జట్లకు అంత తేలిక కాదు. రక్షణాత్మక మిడ్‌ఫీల్డ్, బలమైన డిఫెన్స్‌ను కాదని సెర్బియాపై గోల్స్ కొట్టడం ప్రత్యర్థులకు కష్టమైన పనే. బ్రెజిల్‌ను కాదని అగ్రస్థానం సాధించలేకపోయినా.. స్విట్జర్లాండ్, కోస్టారికాలను పక్కకు నెట్టి రెండో స్థానంతోనైనా ముందంజ వేయగలననే నమ్మకంతో ఉంది.

కీలక ఆటగాళ్లు: బ్రానిస్లావ్ ఇవనోవిచ్, అలెగ్జాండర్ మిత్రోవిచ్; **కోచ్:** మ్లదెన్ క్రిటాజిచ్.

రికార్డు: గ్రూప్ దశ దాటలేదు.

అంచనా: అత్యంత పటిష్టంగా ఉన్న బ్రెజిల్ గ్రూపులో ఫేవరెట్. కానీ మూడు మ్యాచ్‌ల్లో దేన్నీ తేలిగ్గా తీసుకునేందుకు వీల్లేదు. అగ్రస్థానంతో ముందుకెళ్లడం దాదాపుగా ఖాయం. రెండో స్థానం కోసం స్విట్జర్లాండ్ ముందు వరుసలో ఉన్నా.. ఆ స్థానం ఏ జట్టుదైనా కావొచ్చు.

అలా ఉపవాసం వీడారు!

రంజాన్ మాసంలో ప్రపంచకప్ సమరం. ముస్లిం ఆటగాళ్లతో నిండిన టూనీసియా జట్టుకు ఇది కాస్త ఇబ్బందికర పరిస్థితే. ఉపవాసం ఉంటూ మ్యాచ్‌లు ఆడటమంటే పెద్ద సవాలే. అది వారి ఆటపై ప్రభావం చూపెడుతోంది. మ్యాచ్ మధ్యలో ఉపవాసం విడిచే సమయం ఆసన్నమైనా ఇఫ్తార్ స్వీకరించే అవకాశం వారికి లభించడం లేదు. ఐతే ఈ సమస్యను టూనీసియా ఆటగాళ్లు తెలివిగా ఎదుర్కొన్నారు. పోర్చుగల్‌తో సన్నాహక మ్యాచ్ సందర్భంగా 58వ నిమిషంలో ఆ జట్టు గోల్‌కీపర్ మొయిాజ్ హస్సన్ గాయమైందని మైదానంలో పడిపోయాడు. వైద్య బృందం వచ్చేలోపే.. ఆ జట్టు ఆటగాళ్లంతా టచ్‌లైన్ దగ్గరకు చేరుకుని ఫలహారాలు స్వీకరించారు. అప్పటికి 1-2తో వెనకబడిన ఆ జట్టు ఆ తర్వాత 2-2తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. శనివారం టర్కీతో మ్యాచ్ సందర్భంగా కూడా హస్సన్ గాయమైందని చెప్పడంతో వెంటనే వైద్య సిబ్బంది మైదానంలోకి వచ్చింది. అదే సమయంలో జట్టులోని ఆటగాళ్లంతా మైదానం అంచుకు వెళ్లి ఆహారాన్ని తీసుకున్నారు. ఆ మ్యాచ్‌ను టూనీసియా 2-2తో డ్రా చేసుకోవడం విశేషం. ఐతే ప్రపంచకప్‌లో టూనీసియా ఆటగాళ్లకు ఎలాంటి సమస్య ఉండదు. ట్యూనిసియా జూన్ 18న ఇంగ్లాండ్‌తో తొలి మ్యాచ్ ఆడే సమయానికి రంజాన్ మాసం ముగుస్తుంది.

హస్సన్

గోల్ కొట్టకున్నా భోజనాలు!

సావో పాలో: ప్రపంచ అగ్రశ్రేణి ఫుట్‌బాలర్లు లియొనెల్ మెస్సి, నెయ్‌మార్ ఇకపై అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో గోల్ కొట్టినపుడల్లా కరీబియన్ దీవుల్లోని 10 వేల మంది పేద విద్యార్థులకు భోజనం పెడతామంటూ ప్రకటించిన మాస్టర్ కార్డ్ సంస్థ.. తన నిర్ణయాన్ని మార్చుకుంది. పిల్లలకు భోజనాలకు, ఆటగాళ్లు కొట్టే గోల్స్‌తో ముడి పెట్టడం సహేతుకం కాదని.. ఇది ఆటగాళ్లపై ఒత్తిడి కూడా పెంచుతుందని విమర్శలు రావడంతో పథకంలో మార్పులు చేసిందా సంస్థ. వాళ్లు కొట్టే గోల్స్‌తో సంబంధం లేకుండా విద్యార్థులకు భోజనాలు అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ సంస్థ 4 లక్షల భోజనాలు సరఫరా చేయగా.. ఈ ఏడాది ఇంకో 10 లక్షల భోజనాలు అందించాలని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

సెచినాటో

జకోవిచ్‌కు షాక్

క్వార్టర్స్‌లో సెచినాటో సంచలనం ● సెమీఫైనల్లో థీమ్, స్టీఫెన్స్, కీస్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో సంచలనం. మాజీ నంబర్‌వన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) కథ ముగిసింది. మంగళవారం హోరాహోరీగా జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఇటలీకి చెందిన ప్రపంచ నంబర్-72 ఆటగాడు మార్కో సెచినాటో 6-3, 7-6 (7-4), 1-6, 7-6 (13-11)తో జకోవిచ్‌కు షాకిచ్చాడు. తొలి రెండు సెట్లు కోల్పోయిన జకోవిచ్... బలంగా పుంజుకుని మూడో సెట్‌ను అలవోకగా గెలుచుకున్నాడు. నాలుగో సెట్ హోరాహోరీగా సాగింది. టైబ్రేకర్‌లో మూడు మ్యాచ్ పాయింట్లను కాచుకున్నా జకోవిచ్ ఓటమిని తప్పించుకోలేకపోయాడు. మ్యాచ్‌లో సెచినాటో మొత్తం ఆరు ఏస్‌లు సంధించాడు. ఈ విజయంతో అతడు గత 40 ఏళ్లలో రొలాండ్‌గారోస్ పురుషుల సింగిల్స్ సెమీస్ చేరిన తొలి ఇటలీ ఆటగాడిగా ఘనత సాధించాడు. తాను వింబుల్డన్‌లో ఆడతానో లేదో తెలియదని మ్యాచ్ అనంతరం జకోవిచ్ వ్యాఖ్యానించాడు. ప్రస్తుతానికి తాను టెన్నిస్ గురించి మాట్లాడాలనుకోవట్లేదని అన్నాడు. సెచినాటో సెమీస్‌లో ఏడో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)ను ఢీకొంటాడు. క్వార్టర్స్‌లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన థీమ్ 6-4, 6-2, 6-1తో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను మట్టికరిపించాడు. పదునైన సర్వీసులు చేసిన థీమ్.. ఐదు ఏస్‌లు కొట్టాడు. జ్వెరెవ్ 42 అనవసర తప్పిదాలు చేశాడు. థీమ్‌కు ఇది వరుసగా మూడో ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్ కావడం విశేషం. మహిళల సింగిల్స్‌లో అమెరికా అమ్మాయిలు పదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్, 13వ సీడ్ మాడిసన్ కీస్ తుది నాలుగులో చోటు సంపాదించారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో స్టీఫెన్స్ 6-3, 6-1తో కసాత్కిన (రష్యా)ను చిత్తు చేయగా.. హోరాహోరీ పోరులో కీస్ 7-6 (7-5), 6-4తో పుతిన్‌త్సెవా (రష్యా)పై విజయం సాధించింది. స్టీఫెన్స్, కీస్ సెమీస్‌లో తలపడతారు. కీస్‌కు ఇదే తొలి రొలాండ్‌గారోస్ సెమీఫైనల్.

బోపన్న జోడీ ఔట్: పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న జోడీ పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో బోపన్న, రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) ద్వయం 6-7 (4-7), 2-6తో మెక్టిచ్ (క్రొయేషియా), అలెగ్జాండర్ పెయా (ఆస్ట్రియా) జంట చేతిలో పరాజయంపాలైంది.

జకోవిచ్

సరిహద్దుల్లో ప్రతి దాడికీ సైన్యం దీటుగా బదులు

- కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ

దిల్లీ: రంజాన్ మాసం కారణంగా జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న కాల్పుల విరమణను సైన్యం గౌరవిస్తుందని.. అయితే సరిహద్దుకు ఆవల నుంచి అకారణంగా జరిగే దాడులకు మాత్రం దీటుగా బదులిస్తుందని రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్రంలో ఎన్డీఏ సర్కారు నాలుగేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రంజాన్ నేపథ్యంలో కాల్పుల విరమణతోపాటు భారత్, పాకిస్థాన్‌ల సైన్య కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ (డీజీఎమ్‌ఓ)ల మధ్య జరిగిన చర్చల్లో అంగీకారం కుదిరినా.. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కాల్పులు చోటుచేసుకున్నాయి. వారం రోజుల్లో కశ్మీర్ లోయలో ముష్కరులు 12 సార్లు గ్రెనేడ్ దాడులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలోనే నిర్మలా ఈ విధంగా స్పందించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో అవినీతి జరిగినట్లుగా వచ్చిన ఆరోపణలనూ ఆమె కొట్టిపారేశారు. త్రివిధ దళాలకు నిధుల కొరత లేదని.. నాలుగేళ్లుగా తగినన్ని ఆర్థిక వనరులు సమకూర్చామని తెలిపారు.

అంబులెన్స్‌ల కుంభకోణం..
వాయిలార్ రవి కుమారుడిపై ఛార్జిషీట్!

దిల్లీ: రాజస్థాన్‌లో అంబులెన్స్‌ల నిర్వహణ కుంభకోణంలో జికిట్జా హెల్త్ కేర్ ప్రయివేట్ లిమిటెడ్ డైరక్టరు రవి కృష్ణపై సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసింది. మాజీ మంత్రి వాయలార్ రవి కుమారుడైన రవికృష్ణ ఈ వ్యవహారంలో భారీ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తటం గమనార్హం. సోమవారం అభియోగ పత్రాలు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

బొగ్గు కుంభకోణంలో.... పారిశ్రామిక దిగ్గజం, మాజీ పార్లమెంటు సభ్యుడు (కాంగ్రెస్) నవీన్ జిందాల్‌ను బొగ్గు క్షేత్రాల కేటాయింపు కుంభకోణానికి సంబంధించిన కేసులో సీబీఐ ప్రశ్నించింది. ఇక్కడి సీబీఐ ప్రధాన కార్యాలయంలో సోమవారం నవీన్ జిందాల్‌ను దాదాపు అయిదు గంటల పాటు ప్రశించినట్లు అధికారులు తెలిపారు.

ఎయిర్‌ఏసియా కేసు....

ఇక ఎయిర్ ఏసియా కేసులో దళారీగా వ్యవహరించిన సునీల్‌కపూర్‌ను సీబీఐ మంగళవారం ప్రశ్నించింది. ఎయిర్ ఏసియా సీఈవో టోనీ ఫెర్నాండెజ్‌కు అవసరం అయిన లైసెన్సులను అక్రమ మార్గంలో సంపాదించేందుకు సునీల్ కపూర్ సాయపడినట్లు ఆరోపణలున్నాయి. బుధవారం ఇదే కేసులో టోనీ ఫెర్నాండెజ్‌ను సీబీఐ ప్రశ్నించనుంది.

ప్రమాదంలో భారత రాజ్యాంగం

- మనస్సాక్షిని నమ్మి ఓట్లేయండి
- గోవా క్యాథలిక్కులకు మతగురువు ఫెర్రో లేఖ

గోవా: దేశంలోని రాజకీయ వాతావరణమే ప్రధానాంశంగా గోవాలోని క్యాథలిక్కుల క్రైస్తవ మతగురువు (ఆర్చ్ బిషప్) ఫిలిప్పీ-నెరి-ఫెర్రో రాసిన మతసంబంధమైన లేఖ దుమారం లేపుతోంది. భారత రాజ్యాంగం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని, ఒకవిధమైన 'ఏక సాంస్కృతికత' ప్రబలిందని లేఖలో పేర్కొన్నారు. ఏం తినాలి, ఏం కట్టుకోవాలి, ఎవర్ని ఆరాధించాలి? అనే విషయాలపై కూడా అందరూ ఒక్కటే పాటించాలనే కొత్తధోరణి కనిపిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో క్రియాశీల పాత్ర పోషించడానికి క్యాథలిక్కులు సిద్ధంకావాలన్నారు. నీచమైన రాజకీయాలను తిరస్కరించాలని, మనస్సాక్షి చెప్పేది విని ఓటేయాలని సూచించారు. సామాజిక న్యాయం, అవినీతిపై పోరాటానికి ప్రథమప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అభివృద్ధి పేరిట భూములు, ఇళ్లు లాక్కుంటున్నారని.. మానవహక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందన్నారు. గోవాలోని జనాభాలో సుమారు నాలుగోవంతు ఉన్న క్యాథలిక్కులను ఉద్దేశించి ప్రతిఏడాది జూన్‌లో ఆర్చ్‌బిషప్ లేఖ రాయడం ఆనవాయితీ. భారత్‌లో ప్రస్తుతం దౌర్జన్యపూరితమైన రాజకీయాల వాతావరణం నెలకొందని దిల్లీ ఆర్చ్‌బిషప్ అనిల్ కౌటో ఇటీవల వ్యాఖ్యానించడంతో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సైతం విమర్శించారు. అనంతరం 'భాజపా -ఆర్‌ఎస్‌ఎస్'లను ఉద్దేశించి తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని అనిల్ వివరణ ఇచ్చారు.

82 వైద్య కళాశాలలకు అనుమతుల నిరాకరణ

దిల్లీ: అనుమతులు పునరుద్ధరించాలంటూ 82 వైద్య కళాశాలలు పెట్టుకొన్న అభ్యర్థనలను భారత వైద్య మండలి (ఎంసీఐ) తిరస్కరించింది. మరోవైపు 68 కొత్త కళాశాలల ఏర్పాటు ప్రతిపాదనలనూ తోసిపుచ్చింది. దీంతో మొత్తంగా 150 కళాశాలల్లోని 15,000 సీట్లు అందుబాటులే లేకుండా పోయాయి. మరోవైపు ప్రస్తుతం అనుమతుల పునరుద్ధరణకు నోచుకోని విద్యా సంస్థల్లో చదువుతున్న దాదాపు 20,000 మంది విద్యార్థుల భవిష్యత్తు డోలాయమానంలో పడింది. కొత్త విద్యార్థుల చేరికకు అనుమతి నిరాకరించడంతో తమ సంస్థలు కొనసాగించడం చాలా ఇబ్బందికరంగా మారిందని వైద్య కళాశాలల నిర్వాహకులూ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అనుమతుల పునరుద్ధరణకు నిరాకరించిన విద్యా సంస్థల్లో ఎక్కువ ప్రైవేటువే ఉన్నాయి. ఎంసీఐ చాలా కఠినంగా వ్యవహరిస్తోందని ప్రైవేటు కళాశాలల యాజమాన్యం ఆరోపిస్తోంది. అయితే నిబంధనలకు అనుగుణంగా లేకపోవడం వల్లే అనుమతుల పునరుద్ధరణకు నిరాకరించినట్లు ఎంసీఐ స్పష్టీకరిస్తోంది.

లంచం అడిగితే ముఖంపై కొట్టండి

- భాజపా ఎమ్మెల్యే సురేంద్రసింగ్

బల్లియా: తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వస్తున్న బైరియా ఎమ్మెల్యే సురేంద్రసింగ్ ఈసారి ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారు. లంచం అడిగే ఉద్యోగుల ముఖంపై కొట్టాలని, అయినా పనిచేయకపోతే బూట్లతో కొట్టాలన్నారు. బైరియా తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తహసీల్ కార్యాలయంలో ఎవరైనా లంచం అడిగితే రికార్డు చేసి, తన వద్దకు రావాలని సూచించారు. ప్రజల కోసమే తాను పనిచేస్తానని, వారి కోసం అవసరమైతే జైలుకైనా వెళ్తానన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సింగ్‌కు కొత్తేమీ కాదు.

'నాసా-ఏఎంఈఎస్' పోటీలో.. ప్రపంచ ఛాంపియన్‌గా శ్రీ చైతన్య

ఈనాడు, హైదరాబాద్: నాసా-ఏఎంఈఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ పోటీకి సంబంధించి మే 24 నుంచి 27 వరకూ అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో నిర్వహించిన.. ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌లో శ్రీచైతన్య ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిందని విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. భారత్ నుండి మొత్తం 125 మంది దీనిలో పాల్గొనగా శ్రీచైతన్య నుంచే 105 మంది ఉండటం విశేషమని ఆమె మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 25 దేశాల నుంచి 480 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో శ్రీ చైతన్య.. 1, 2, 3 బహుమతులతో పాటు అత్యధిక గెలుపు ప్రాజెక్టులు సాధించి, వరుసగా ఐదేళ్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిందని వివరించారు. విజేతలను శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత బీఎస్ రావు అభినందించారు.

Authorised Maruti Suzuki Dealers: MITHRA AUTO: 8297174444, SANTOSH: 9209094999, VARUN: 9885260333, JAYALAKSHMI: Guntur : 7093522444, Ongole : 9618599433, BHARGAVI : Nellore : 7658923339, E-Outlet: VARUN: Gudivada: 9885260333, Jaggiahpet: 9885260333, Nuzvid: 9885260333, MITHRA AUTO : Machilipatnam: 8886063493, JAYALAKSHMI: Chirala: 9100980063, Tenali: 08644226100, Narasaraopet: 9676323334, BHARGAVI: Kavali: 7658923339, Gudur: 7658923339,

TOLL-FREE NUMBER: 1800 121 7996

Ride safe. Wear a helmet.

Andhra Pradesh: East Godavari: Rajamundry, Kantipudi Engineering Co. Pvt. Ltd. Ph: 0883-2474849,8688335577, **Chittor: Tirupati, Garuda Bikes Pvt. Ltd.** Ph: 0877-2237700, 9866999313, **Cuddapah: Cuddapah, Khwaja Automotive Pvt. Ltd.** Ph: 08562-241189, 7674887111, **West Godavari: Eluru, Sri Lakshmi Krishna Motors Pvt. Ltd.**, Ph: 08812-222344, 9397699998, **Guntur: Guntur, Saripudi Automotives Pvt. Ltd.** Ph: 0863-2264355, 7799156421, **Krishna: Vijayawada MG Road: Padmaja Commercial Corporation**, Ph: 0866-2474060, 9666662985, **Vijayawada - Ring Road: Vijaywada, Padmaja Commercial Corporation** Ph: 7799652444, **Anantpur: Amruth Automotives Pvt. Ltd.** Ph: 9154121351, **Vizianagaram: Venugopala Motors Pvt. Ltd.** Ph: 9618944299, **Vishakapatnam: Singam Motors Pvt. Ltd.** Ph: 0891-2555562, 8886661518, **Srikakulam: DAS Automobile Services India Pvt. Ltd.** Ph: 9491211111, **Prakasam: Ongole, Saripudi Automobiles Pvt. Ltd.** Ph: 08592-282119 9666177479, Vishakapatnam: Gajuwaka, Padmaja Commercial Corporation- 0891-2757833, 9885794646,**Nellore: Abhinav Motors Pvt Ltd.** Ph:9100089855, **Chittoor, S&S Suzuki** Ph: 08572-246233, 9000940008 | **Branch: Vijayawada: Gudivada: Padmaja Suzuki** Ph: 08674-244449, 9951134999, **Ashok Nagar: Padmaja Suzuki** Ph: 7660978694, **Guntur: Narsaraopet, Saripudi Suzuki** Ph: 9885800043/08647228889, **Pattabhipuram, Saripudi Suzuki** Ph: 7799217930/7799157387/ 08632264355, **Chilakaluripeta, Saripudi Suzuki** Ph: 9390830309, 08647-259972, **Sattenapalli, Saripudi Suzuki** Ph: 9059439646/ 08641-234199, **Rajamundry: Kakinada, Kantipudi Suzuki** Ph: 0884-2357273, 9248087726, **Cuddapah: Proddatur, Khwaja Automotive** Ph: 7674885111, **Eluru: Bhimavaram, Sri Lakshmi Krishna Motors** Ph: 08816-225448, 9393794848, **Tanuku, Sri Lakshmi Krishna Motors** Ph: 08819-222848, 9393494846, **Vishakhapatnam : Murlinagar: Padmaja Suzuki** Ph: 8886617022

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 7-6-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 298

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

Our Top Performers from General Category

and many more...

1276 Aakashians Qualified in CBSE NEET-UG 2018 from Andhra Pradesh Branches

Our Top Performers in Classroom Programs from Andhra Pradesh

Enrollment Started for Classroom Courses

REGULAR COURSE
(Long Term / Repeater Batch)
NEET & AIIMS | JEE (Main) & Other Engineering Entrance Exams 2019
For Class XII Passed Students

POWER STEP COURSE
(Long Term / Repeater Batch)
JEE (Main & Advanced) 2019
For Class XII Passed Students

ONE YEAR / TWO YEAR INTEGRATED COURSE
NEET & AIIMS | JEE (Main & Advanced) / Other Engineering Entrance Exams 2019, 2020
For Class XII / XI Studying Students

FOUNDATION COURSES
School / Board Exams, NTSE & Olympiads
For Class IX / X Studying Students

ACST ADMISSION CUM SCHOLARSHIP TEST
10th & 17th June, 2018

For Digital / Distance Learning Programs Call on TOLL-FREE: 1800-120-3021 OR Give a Missed Call: 9599698683 | Website: www.digital.aakash.ac.in

Aakash
Medical | IIT-JEE | Foundations
(Divisions of Aakash Educational Services Pvt. Ltd.)

SCAN FOR NEAREST CENTRE & CONTACT DETAILS

CORPORATE BRANCH - VIJAYAWADA (BENZ CIRCLE)

OTHER CORPORATE BRANCHES ANDHRA PRADESH: Kurnool | Tirupati | Visakhapatnam (Dwarka Nagar & Gajuwaka) **OTHER CORPORATE BRANCHES:** Hyderabad (S. R. Nagar, Himayath Nagar, Kukatpally, Kothapet & Shaikpet) | Secunderabad (Trimulgherry) | Karimnagar | Warangal

www.aakash.ac.in instagram.com/aakasheducation facebook.com/aakasheducation twitter.com/aakash_twitted youtube.com/AakashEducation aakash.ac.in/blogs

Registered Office: Aakash Tower, 8, Pusa Road, New Delhi-110005. **Ph.:** (011) 47623456 | **E-mail:** reach.us@aesl.in | SUNDAY OPEN

*Detailed Result is under compilation. Published result as per information received so far and include all categories. | Though every care has been taken to publish the result correctly, however in case of any error the institute shall not be responsible. | History is specific to Results of Aakash.

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 7-6-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 298
రూ. 5-00 పేజీలు 18+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

మన శక్తి నిరూపిస్తా

365 రోజులూ అన్న క్యాంటీన్లు

రూ.15కే మూడు పూటలా ఆహారం

- ఏటా ఖర్చు రూ.131 కోట్లు
- పనితీరు పరిశీలనకు వాస్తవిక సమీక్ష వ్యవస్థ
- వారం రోజుల్లో 40 చోట్ల ప్రాథమికంగా ప్రారంభం
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: పేదల క్షుద్బాధను తీర్చేందుకు త్వరలో ప్రారంభించే అన్న క్యాంటీన్లు ఏడాదిలో 365 రోజులూ పని చేసేలా ప్రభుత్వం బుధవారం మార్గదర్శకాలు జారీ చేసింది. పూటకు కనీసం 350 మందికి అల్పాహారం/ఆహారం అందించేలా రూపొందిస్తున్న వీటి నిర్వహణ పరిశీలనకు వాస్తవిక సమీక్ష వ్యవస్థ (రియల్ టైం మోనిటరింగ్ సిస్టం)ను ప్రవేశపెడుతున్నారు. 50వేల జనాభా పైబడిన 71 పట్టణాల్లో వీటిని 203చోట్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మొదటి విడతగా 40 క్యాంటీన్లను వారంరోజుల్లో ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒకటి, రెండు నెలల్లో మొత్తం ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. దేశంలో తమిళనాడు, కర్ణాటక తర్వాత పేదలకు ప్రత్యేకంగా వీటిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం కలిపి రూ.15కే అందించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.131 కోట్లు ఖర్చు చేయనుంది. తగిన సదుపాయాలతో ఒక్కో క్యాంటీన్ నిర్మాణానికి రూ.36 లక్షలు చొప్పున మరో రూ.80 కోట్లు వెచ్చిస్తున్నారు. 750 చదరపు అడుగుల విస్తీర్ణం (ఎస్ఎఫ్‌టీ)లో చేపట్టే భవనాల్లో తాగునీటి సదుపాయం, విద్యుత్తు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాటు, అంతర్జాలం (ఇంటర్నెట్), ఎల్‌సీడీలు, సీసీ టీవీలు, చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయనున్నారు. ఆధార్ అనుసంధానించి ప్రజల నుంచి బయోమెట్రిక్ తీసుకొని ఎలక్ట్రానిక్ విధానంలో టోకెన్లు జారీ (మిగతా 2లో)

హక్కుల కోసం ధర్మపోరాటం చేస్తున్నా

- ఓడిపోతామని భావించే భాజపా దిగొచ్చి... ఆ పార్టీ సీనియర్లను సంప్రదిస్తోంది
- వైకాపా రాజీనామాలు ఇప్పుడు ఆమోదించినా ఉపఎన్నికలు వచ్చే పరిస్థితి లేదు
- ఆంధ్రప్రదేశ్‌ను జ్ఞానభూమిగా మార్చడానికి కృషి
- కడప నవనిర్మాణ దీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఈనాడు - కడప

ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజుపల్లెలో నవనిర్మాణ దీక్షలో భాగంగా రచ్చబండలో మహిళ నాగలక్ష్మమ్మ సమస్యలను ఆలకిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. వేదికపై మంత్రి ఆదినారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కలెక్టరు హరికిరణ్ తదితరులు

ప్రజల్లో వ్యతిరేకత చూసి... భవిష్యత్తులో చిత్తుచిత్తుగా ఓడిపోతామని భావించి భారతీయ జనతా పార్టీ దిగొచ్చిందని, అందుకే ఆ పార్టీ సీనియర్ నేతలు అద్వానీ, మురళీ మనోహర్‌జోషి దగ్గరకు వెళ్లి సలహాలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 'మొన్న 11 అసెంబ్లీ, 4 పార్లమెంటుకు స్థానాలకు ఉపఎన్నికలు వస్తే 1 పార్లమెంటు, 1 అసెంబ్లీలో వారు గెలిచారు. చూశారా! తమ్ముళ్లూ.. ఇన్నాళ్లూ ఆకాశంలో ఉండి ఇప్పుడు భూమి మీదకు వచ్చారు. ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది. . ఎందుకు ఆ రోజు మాటలు చెప్పారు.. మీరు చెప్పిన మాటలు నిలబెట్టుకున్నారా? ఆఖరుకు మనం సంపాదించిన డబ్బులు తీసుకోవాలంటే ఏటీఎంలలో డబ్బులు లేవు. . బ్యాంకుల్లో డబ్బులు లేవు.. కేంద్రం వారు ఏం చేశారని మిమ్మల్ని అని అడుగుతున్నా...' అని ఆయన పేర్కొన్నారు. కడప, ప్రొద్దుటూరుల్లో బుధవారం జరిగిన నవనిర్మాణ దీక్ష, ఇతర కార్యక్రమాల్లో ప్రసంగించారు. 'నేను భయపడను తమ్ముళ్లూ.. నా జీవితంలో నిప్పులా బతికా. మన హక్కుల కోసం ధర్మపోరాటాన్ని చేస్తా... చేసి మన శక్తి ఏంటో నిరూపిస్తా...' అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 25 ఎంపీ సీట్లు గెలిస్తే కేంద్రంలో మన సత్తా ఏంటో చూపిస్తామని.. 2019లో తెదేపా అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని స్పష్టం చేశారు. 'వైకాపా రాజీ డ్రామాలు ఆడుతోంది.. ఆ పార్టీ ఎంపీలు గత నెల 29న వెళ్లి రాజీనామాలు ఆమోదించుకుని ఉంటే ఉపఎన్నికలు వచ్చేవి.. సత్తా ఏంటో తెలిసేది.. ఇప్పుడు ఆమోదించుకున్నా ఎన్నికలు వచ్చే అవకాశం లేకపోవడంతోనే ఇవాళ వెళ్లి పట్టుబడుతున్నారు.. ఆమోదించాలనీ లేఖ ఇచ్చారు. వాళ్ల రాజీనామాలు ఆమోదించకపోవడానికి నేను కారణమని వైకాపా వాళ్లంటున్నారు. మీరు నమ్ముతారా తమ్ముళ్లూ.. మన మాట కేంద్రం వినే పరిస్థితి ఉంటే నేను ప్రత్యేకహోదా సాధించుకునే వాణ్ని కదా?....'' అని వ్యాఖ్యానించారు. 11 కేసుల్లో 43 వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ప్రతిపక్ష నేత తనను విమర్శిస్తారా? అని ప్రశ్నించారు. తాను ప్రధాని కాగానే విదేశాల్లోని నల్ల ధనాన్ని వెనక్కి తెచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ చెప్పారని.. ఇప్పుడు ఆ హామీ ఏమైందన్నారు. అవినీతిపరులను పక్కన పెట్టుకుంటున్నారని.. తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి ఇస్తున్నారన్నారు. రాష్ట్రానికి 11 విద్యాసంస్థలు ప్రకటించినా నిధుల కేటాయింపు లేదని చెప్పారు.

కడప ఉక్కుపై కేంద్రం తాత్సారం

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తామని హామీ (మిగతా 2లో)

ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్

'గృహం' ఇక ప్రియం కానీ..

గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. నాలుగున్నరేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కీలక రేట్లను పావు శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ఇందుకు నేపథ్యం. ముడి చమురు ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పడుతుందన్న భావనల మధ్య ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే అందుబాటు ధరల ఇళ్లను ప్రాధాన్య రంగ రుణాల జాబితాలోకి చేర్చడం ద్వారా ఇళ్ల కొనుగోలుదార్లకు ఆర్‌బీఐ వరం ఇచ్చింది. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' పథకంలో ఇప్పటి వరకు ఉన్న రుణ మొత్తాన్ని పెంచింది. ప్రాంతాలను, జనాభాను బట్టి ఈ పెంపు ఉంటుంది. 10 లక్షలపైన ఉన్న జనాభా ఉన్న నగరాల్లో ఇప్పటి వరకు ఉన్న రుణ మొత్తాన్ని రూ.28 లక్షల నుంచి రూ.35 లక్షలకు; ఇతర ప్రాంతాల్లోని వారికి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచింది. మరో పక్క, కీలక రేట్ల పెంపును తక్షణం వినియోగదార్లకు బదిలీ చేస్తామని బ్యాంకర్లు పేర్కొనగా.. పరిశ్రమ వర్గాలు పెంచిన రేట్లపై ఆందోళన వ్యక్తం చేశాయి.

- పూర్తి వివరాలు బిజినెస్ పేజీలో

మళ్లీ ధ్రువీకరణ లేఖలు ఇవ్వండి

- వైకాపా ఎంపీలకు సభాపతి సూచన
- లేఖలిచ్చాం.. రాజీనామాలు ఆమోదించినట్లే: ఎంపీలు

6లో

ఉప ఎన్నికలు వస్తాయా? రావా?

- వైకాపా ఎంపీల రాజీనామాల నేపథ్యంలో చర్చ
- ఆమోదించే తేదీపై ఆధారపడి ఉంటుందని నిపుణుల విశ్లేషణ
- ఏడాది లోపైతే అక్కర్లేదని మాజీ సీఈసీ సంపత్ వ్యాఖ్య

చెరకు రైతులకు తీపి కబురు

- బకాయిల చెల్లింపు, ఇథనాల్ ఉత్పత్తి పెంపునకు రూ.8,500 కోట్ల ప్యాకేజీ
- చక్కెర కనీస విక్రయ ధర కిలోకి రూ.29
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయం
- గ్రామీణ డాక్ సేవక్‌ల మూల వేతనం మూడింతలు పెంపు

2లో

ఇల్లు కొనుగోలుదారులకూ రుణదాత హక్కు

- నూతన దివాలా స్మృతికి ఆమోదం
- ఆర్డినెన్సుపై రాష్ట్రపతి సంతకం
- స్థిరాస్తి సంస్థల అక్రమాలను ఎదుర్కొనేలా అధికారాలు

స్థల హక్కులపై బీమా!

- అపార్టుమెంట్లలో ప్రవేశపెట్టేందుకు 'రెరా' సన్నాహాలు
- అమలులోకి వస్తే దేశంలోనే మొదటిసారి

ఈనాడు - అమరావతి

అపార్టుమెంట్లలో స్థల హక్కులపై (టైటిల్) వ్యాపారులతో (బిల్డర్లు) బీమా చేయించేందుకు స్థిరాస్తి వ్యాపార నియంత్రణ సంస్థ (రెరా) ప్రయత్నిస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వరంగ బీమా సంస్థ 'న్యూ ఇండియా ఇన్సూరెన్స్'తో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. అపార్టుమెంట్ నిర్మాణాలపై టైటిల్ బీమా ఇప్పటి వరకూ ఏ రాష్ట్రంలోనూ అమలులో లేదు. 'టైటిల్ ఇన్సూరెన్స్' విధానం అమెరికాలో అమలులో ఉంది. ఆ దేశంలోని ప్రఖ్యాత బీమా సంస్థతో 'న్యూ ఇండియా ఇన్సూరెన్స్' అవగాహనా ఒప్పందం చేసుకుని మన దేశంలో సేవల కోసం ఏర్పాట్లు చేసుకుంటోంది. రెరా చట్టంలో కీలకమైన అంశాల్లో అపార్టుమెంట్లు నిర్మించేందుకు ఉపయోగించే స్థల హక్కు పత్రం (టైటిల్) బీమా ప్రధానమైనది. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో రెరా అధికారులు న్యూ ఇండియా ఇన్సూరెన్స్‌ను సంప్రదించి తదుపరి చర్యలు ప్రారంభించారు.

ఉపయోగం ఏమిటి?

టైటిల్ బీమాతో తదుపరి స్థలం/భూమిపై ఎలాంటి వివాదాలు తలెత్తినా బీమా సంస్థలే బాధ్యత వహిస్తాయి. చాలా రాష్ట్రాల్లో వివాదాస్పద భూముల్లో వ్యాపారులు అపార్టుమెంట్లు నిర్మించి ప్రజలకు ఫ్లాట్లను విక్రయించాక గొడవలు, కోర్టు కేసులు తలెత్తడంతో కొనుగోలుదారులకు దిక్కుతోచని పరిస్థితులు ఏర్పడిన సందర్భాలున్నాయి. విశాఖపట్నంలో వ్యాపారులు అపార్టుమెంట్లు నిర్మించి విక్రయించాక సంబంధిత సర్వే నెంబర్లలో స్థలాన్ని ప్రభుత్వ నిషేధిత భూముల (22ఏ) జాబితాలో చేర్చిన ఘటనలున్నాయి. దీనివల్ల తదుపరి క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. విజయవాడలోనూ (మిగతా 2లో)

కన్నడనాట మంత్రివర్గ విస్తరణ

- కాంగ్రెస్ తరఫున 14 మంది
- దళపతులు తొమ్మండుగురు
- బీఎస్పీ, కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీ నుంచి చెరొకరు
- అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

5లో

ఏడు విడతల్లో జేఈఈ కౌన్సెలింగ్

- జోసా ద్వారా 100 విద్యాసంస్థల్లో సీట్ల భర్తీ
- 15 నుంచి రిజిస్ట్రేషన్, ఆప్షన్ల ప్రక్రియ
- 27న మొదటి విడత సీట్ల కేటాయింపు
- జులై 19కి కౌన్సెలింగ్ పూర్తి

6లో

ఇదీ సంగతి!



కుదరని 'ఏకాభిప్రాయం'

- నీటి వినియోగం సహా పలు అంశాలపై తెలంగాణ, ఏపీ భిన్నాభిప్రాయాలు
- కృష్ణా బోర్డు సమావేశంలో పోతిరెడ్డిపాడుపై ఇరు రాష్ట్రాల అధికారుల వాదోపవాదాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత సంవత్సరం నీటి వినియోగంతో సహా అనేక అంశాలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కృష్ణా బోర్డులో ఏకాభిప్రాయం కుదరలేదు. కొన్నింటిపై మళ్లీ సమావేశం కావాలని నిర్ణయం తీసుకోగా, మరికొన్నింటిపై కమిటీలతో ముగించారు. పోతిరెడ్డిపాడు విషయంలో రెండు రాష్ట్రాల అధికారుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా బేసిన్‌లో ఉన్న కేటాయింపులో గత ఏడాది ఏపీ 66 శాతం, తెలంగాణ 34 శాతం వినియోగించుకొనేలా ఒప్పందం జరిగింది. ఈ సంవత్సరం కూడా ఇదే పద్ధతిలో వినియోగించుకోవడానికి తెలంగాణ అంగీకరించలేదు. బచావత్ ట్రైబ్యునల్ ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపుల ప్రకారం ఉండాలని కోరింది. ఏపీ గత ఏడాదిలాగానే వినియోగానికి అంగీకరించింది. తెలంగాణ (మిగతా 2లో)

మన శక్తి నిరూపిస్తా

కడపలో నవనిర్మాణ దీక్షకు హాజరైన సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కలెక్టరు హరికిరణ్

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చినా కేంద్రం తాత్సారం చేస్తోందని విమర్శించారు. 'కడప ఉక్కు తమ హక్కు' అంటూ నినదించారు. నీట్‌లో ఉత్తీర్ణత సాధించిన ఫాతిమా కళాశాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని, పరీక్ష రాయని వారికి డబ్బులు వెనక్కి ఇప్పిస్తామని చెప్పారు. యాజమాన్యం మోసగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుప్పం కంటే ముందుగా పులివెందులకు నీళ్లిచ్చి తన మాట నిలబెట్టుకున్నానని వెల్లడించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, బోధనను పేద విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను జ్ఞాన భూమిగా మార్చాలనే ఉద్దేశంతో కృషి చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. జేఈఈలో 12 శాతం ఉత్తీర్ణత సాధించడం అందుకు నిదర్శనమని. . నీట్‌లో మనవాళ్లు 100కు 73 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. త్వరలో 3 వేల మంది విద్యార్థులను విదేశాలకు పంపిస్తున్నట్లు చెప్పారు. పది వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 జూనియర్ కళాశాలలు, 15 డిగ్రీ కళాశాలల మంజూరుకు త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. ఇక నుంచి కళాశాలల్లోని విద్యార్థులకు ఉపకార వేతనాలు వారి ఖాతాల్లోనే జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎవరెస్టు అధిరోహించిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. తొలుత ప్రొద్దుటూరులోని నాగాయపల్లె, చెన్నంరాజుపల్లిలో జరిగిన గ్రామదర్శిని, గ్రామసభల్లో పాల్గొన్నారు. నాగాయపల్లిలో అంగన్వాడీ కేంద్రం, ఎన్టీఆర్ గృహం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన ఆయన గర్భిణులకు సీమంతాలు జరిపారు. అనంతరం చెన్నంరాజుపల్లిలో రచ్చబండలో గ్రామస్థులతో ముచ్చటించారు. అనంతరం ప్రొద్దుటూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన ముఖ్యమంత్రి కడప మునిసిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన నవనిర్మాణదీక్షకు హాజరయ్యారు. స్టాళ్ల సందర్శన, వివిధ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేపట్టారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం సభా వేదికపై ప్రసంగించారు. మంత్రులు ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, బీటెక్ రవి, విప్ మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ హరికిరణ్, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్థల హక్కులపై బీమా!

(మొదటి పేజీ తరువాయి)

ఒకటి, రెండు చోట్ల ఫ్లాట్ల క్రయ విక్రయాలు పూర్తయ్యాక పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టం (యూఎల్‌సీ) పరిధిలో చేర్చడం, అదే స్థలాలపై ప్రైవేటు పార్టీలు కోర్టుల్లో కేసులు వేసిన సందర్భాలున్నాయి. టైటిల్ బీమాతో తదుపరి ఎలాంటి వివాదాలు తలెత్తినా బీమా సంస్థలే బాధ్యత వహిస్తాయి.

2% చెల్లించాలంటున్న బీమా సంస్థ

అపార్టుమెంట్ కోసం వినియోగించిన స్థలం/భూమి విలువపై బీమా కోసం ఏటా 2శాతం చెల్లించాల్సి ఉంటుందని రెరాకు బీమా సంస్థ తాజాగా సూచించింది. అయితే అంత మొత్తాన్ని చెల్లించేందుకు బిల్డర్లు ససేమిరా అంటున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో నిర్మిస్తున్న కొన్ని భారీ అపార్టుమెంట్ల కోసం కొనుగోలు చేస్తున్న స్థలం/భూమి విలువ రూ.50 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకూ ఉంటోంది. టైటిల్ బీమా అంటే ఏటా రూ.కోటికిపైగా ఐదేళ్లపాటు (నిర్వహణ కాలం) చెల్లించాలి. తరువాత అపార్టుమెంట్ నివాస సంఘాలు ప్రీమియం చెల్లింపు బాధ్యత తీసుకోవాలి. బిల్డర్ల అభ్యంతరంతో రెరా అధికారులు బీమా మొత్తాన్ని 2 నుంచి 1 శాతానికి తగ్గించే విషయాన్ని పరిశీలించాలని ప్రతిపాదించే పనిలో ఉన్నారు.

భాజపాలో చేరే ప్రసక్తే లేదు: శర్మిష్ఠ

దిల్లీ: తాను భాజపాలో చేరవచ్చంటూ వస్తున్న వార్తలను కాంగ్రెస్ నాయకురాలు, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె అయిన శర్మిష్ఠ ముఖర్జీ ఖండించారు. అవన్నీ కూడా ఊహాగానాలేనని బుధవారం నాడిక్కడ ఖండించారు. కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని కూడా స్పష్టం చేశారు. నాగపూర్‌లో గురువారం జరగనున్న ఆరెస్సెస్ కార్యక్రమానికి తండ్రి ప్రణబ్‌ముఖర్జీ హాజరౌతున్న నేపథ్యంలో తాను భాజపాలో చేరుతున్నానంటూ వార్తలొస్తున్నాయని ఆమె ట్విటర్‌లో పేర్కొన్నారు. నాగపూర్‌లో జరగనున్న ఆరెస్సెస్ కార్యక్రమానికి హాజరుకావాలనుకున్న ప్రణబ్ ముఖర్జీ నిర్ణయంతో ఆయన కుమార్తె శర్మిష్ఠ విబేధించారు. అబద్ధపు ప్రచారాలు చేయడంలో భాజపా అందెవేసిన చెయ్యి అనే విషయాన్ని ప్రణబ్ గుర్తెరగాలని ఆమె ట్విటర్‌లో పేర్కొన్నారు.

ఆర్టీఐ దరఖాస్తుదారుల కోసం ఈసీ పోర్టల్

దిల్లీ: సమాచార హక్కు(ఆర్టీఐ) చట్టం కింద వివరాలు కోరేవారికి తోడ్పడేందుకు వీలుగా కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) బుధవారం ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించింది. ఈసీ వెబ్‌సైట్ హోంపేజీపై ఈ పోర్టల్ దర్శనమిస్తుంది. దరఖాస్తు రుసుమును ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ఇందులో వీలుంటుంది. తమ దరఖాస్తుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాలు, ఈ-మెయిళ్ల రూపంలో దరఖాస్తుదారులకు ఈ పోర్టల్ చేరవేస్తుంది.

'హెచ్1-బీ'లో పెద్ద మార్పులుండవు!

- అమెరికా డీసీఎం వెల్లడి

దిల్లీ: అమెరికా హెచ్1-బీ వీసా విధానంలో పెద్ద మార్పులుండవని దిల్లీలోని యూఎస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్(డీసీఎం) మేరీకే ఎల్ కార్ల్‌సన్ బుధవారం తెలిపారు. హెచ్-4 విధానంపై కూడా కొత్తగా ఏమీ ఉండదని వెల్లడించారు. ఉద్యోగ వీసా, పని అనుమతుల (వర్క్ పర్మిట్లు)కు సంబంధించి దేశ సార్వభౌమాధికార నిర్ణయానికి అనుగుణంగా ఉంటాయని వివరించారు. దిల్లీలో నిర్వహించిన 'విద్యార్థి వీసా దినోత్సవం' సందర్భంగా కార్ల్‌సన్ విలేకరులతో మాట్లాడారు. అమెరికాలో విద్యార్థి వీసాకు దరఖాస్తు చేసుకున్నవారి కోసం యూఎస్ మిషన్ ఈ 'వీసా దినోత్సవాన్ని' కేటాయించింది. దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంతో పాటు, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, ముంబయిలలోని కాన్సులేట్ జనరళ్లు - వీసాలకు దరఖాస్తు చేసుకున్న 4 వేలకు పైగా భారతీయ విద్యార్థులను ఆహ్వానించాయి. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ యూఎస్ఏ, అమెరికన్ లైబ్రరీ ప్రతినిధులతో పాటు తాజాగా అమెరికాలో పట్టభద్రులైన పలువురు పాల్గొన్నారు. యూఎస్‌లో ఉన్నతవిద్యపై విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అమెరికాలో చదువులకు వెళ్లే విదేశీ విద్యార్థుల్లో భారత్ నుంచే 17 శాతం మంది వరకు ఉంటుంటారు. కాగా ట్రంప్ ప్రభుత్వం ఒబామా హయాంలోని నిబంధనలకు చరమగీతం పలికేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో వర్క్ పర్మిట్లు ఉన్న 70 వేలకు పైగా హెచ్-4 వీసాదారులపై ఆ ప్రభావం పడే అవకాశం ఉంది. హెచ్1-బీ వీసాదారుల జీవితభాగస్వాములకు హెచ్-4 జారీ చేస్తారు. వీరిలో భారత్ నుంచి నిపుణులైన ఉద్యోగులే అధిక సంఖ్యలో ఉంటారు. హెచ్-4పై ట్రంప్ ప్రభుత్వానికి నచ్చజెప్పేందుకు భారత్ అన్నివిధాలుగా కృషి చేస్తున్నట్లు భారత విదేశీవ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ గత నెలలో వెల్లడించిన సంగతి తెలిసిందే.

5 శాతం విరాళాల వివరాలనే వెల్లడించారు!

దిల్లీ: గుర్తింపులేని రాజకీయ పార్టీల్లో కేవలం అయిదుశాతం మాత్రమే తమకు అందిన విరాళాల వివరాలను వెల్లడించినట్లు ఒక నివేదిక వెల్లడించింది. వాస్తవానికి 2013-14, 2015-2016 సంవత్సరాల మధ్య కాలంలో గుర్తింపులేని రాజకీయ పార్టీలకు రూ.25.27 కోట్ల విరాళాల రూపంలో అందినట్లు తెలుస్తోంది. అదే సమయంలో జాతీయ, ప్రాంతీయ పార్టీలు 2015-16 కొత్తగా రిజిస్టర్ అయిన పార్టీలను, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో తగినంత ఓటింగ్ పర్సంటేజీ దక్కని, అసలు ఏనాడూ ఎన్నికల్లో పోటీచేయని పార్టీలను గుర్తింపులేని రాజకీయ పార్టీలుగా పేర్కొంటున్నారు.

ఇల్లు కొనుగోలుదారులకూ రుణదాత హక్కు

దిల్లీ: ఇళ్ల కొనుగోలుదారులు కూడా రుణదాతల హక్కుల్ని పొందేందుకు ఉద్దేశించిన- 'రుణాలు చెల్లించలేని అశక్తత, దివాలా స్మృతి (సవరణ) అత్యవసర ఆదేశాలు-2018' (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్-ఐబీసీ)పై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేశారు. స్థిరాస్తి అభివృద్ధిదారుల (డెవలపర్ల) కారణంగా ఇబ్బందులు ఎదురయినపుడు కొనుగోలుదారులు పరిహారం పొందడానికి ఈ ఆర్డినెన్స్ ఉపకరిస్తుంది. 'ఈ అత్యవసరాదేశంతో ఇళ్ల కొనుగోలుదార్లకు ఊరట లభిస్తుంది. రుణదాతల కమిటీ (కమిటీ ఆఫ్ క్రెడిటర్స్-సీఓసీ)లో స్థానం, నిర్ణయాలు తీసుకోవడంలో భాగస్వామ్యం లభిస్తుంద'ని ప్రభుత్వం పేర్కొంది. తప్పులు చేసే డెవలపర్లపై చర్యలు తీసుకొనే అధికారం ఇళ్ల కొనుగోలుదార్లకు కలుగుతుంది. సంబంధిత డెవలపర్‌పై దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ దరఖాస్తు చేసే అధికారం లభిస్తుంది.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మేలు

నూతన దివాలా స్మృతి కారణంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు తక్షణ ప్రయోజనం కలగనుంది. దివాలా ప్రక్రియ ప్రారంభమైనప్పుడు ఆ సంస్థ వ్యవస్థాపకుడు కూడా దానిని తిరిగి చేజిక్కించుకోవడానికి ప్రయత్నించవచ్చు. ఎంఎస్ఎంఈ సంస్థలకు మరిన్ని మినహాయింపులిచ్చే అధికారం కేంద్రానికి ఈ ఆర్డినెన్సుతో లభిస్తుంది. దివాలా ప్రక్రియ ఉపసంహరణ దరఖాస్తుకు అనుకూలంగా రుణదాతల కమిటీలో 90 శాతం మంది అంగీకరించాలి. సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలే తప్ప, సంస్థను మూసివేయించాలన్న ధోరణి ఉండకూడదన్నది నూతన విధానం సారాంశం. అందరు రుణదాతలూ తమ అధీకృత ప్రతినిధులను పంపించడానికి అవకాశం ఉంది. దివాలా ప్రక్రియ ప్రారంభించాలని దరఖాస్తు చేసే వారు తొలుత తమ అర్హతలను రుజువు చేసుకుంటూ ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఏదైనా సంస్థ తనకు తానుగా దివాలా ప్రక్రియను ప్రారంభించాలని కోరడానికి ప్రత్యేక తీర్మానం అవసరం ఉంటుంది. ఈ వ్యవహారాల్లో దివాలా బోర్డు (ది ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా-ఐబీబీఐ)కు ప్రభుత్వం ప్రత్యేకాధికారాలిచ్చింది.

కుదరని ఏకాభిప్రాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదన ఏమిటో రాతపూర్వకంగా తెలిపితే దానిపై స్పందిస్తామని పేర్కొంది. దీంతో ఈ నెలాఖరులోగా మరోసారి సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా దీనిపై చర్చించాలని బోర్డు నిర్ణయించింది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఎనిమిదవ సమావేశం ఛైర్మన్ సాహూ అధ్యక్షతన బుధవారం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేందరరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సునీల్, ఏపీ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, కర్నూలు ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ నారాయణరెడ్డి, బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం, ఇంజినీర్లు పాల్గొన్నారు. శ్రీశైలం నుంచి విడుదల చేసిన నీరు నాగార్జునసాగర్‌కు చేరేటప్పటికి తక్కువగా ఉంటుందని, పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ తీసుకొని తక్కువగా చూపుతున్నారని తెలంగాణ పేర్కొనగా, దీనిపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి ఆరోపణలు చేయడం తగదని పేర్కొంది. ఎక్కడ సమస్య వచ్చినా పోతిరెడ్డిపాడు గురించి మాట్లాడటం తగదంది. దీనిపై రెండు రాష్ట్రాల అధికారుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. నెలాఖరులోగా పోతిరెడ్డిపాడు పాత గేట్లకు లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయిస్తామని కర్నూలు చీఫ్ ఇంజినీర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. 2017-18లో వినియోగించుకొన్న నీటి లెక్కలపై కూడా వాదనలు జరిగినట్లు సమాచారం. నీటి నష్టాలు, ఎక్కువ వినియోగం తదితర అంశాలపై చర్చ జరిగిన తర్వాత, ఈ ఏడాది నీటిని వచ్చే ఏడాదిలో వినియోగించుకోవడం లాంటిది లేదని బోర్డు అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో ఓ కమిటీ వేసి ప్రతి 15 రోజులకో లేదా నెలకోసారో నీటి నష్టం ఎంత ఉందన్న దానిపై ఓ అంచనాకు వచ్చి నివారణ చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. తాగునీటికి కేటాయించిన నీటిలో 20 శాతం మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్న తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ అంగీకరించలేదు. రెండు రాష్ట్రాలు కూర్చొని దీనిపై సూచనలు ఇస్తే తర్వాత తుది నిర్ణయం తీసుకొంటామని బోర్డు ఛైర్మన్ సాహూ స్పష్టం చేసినట్లు సమాచారం. గోదావరి బోర్డు తరహాలోనే కృష్ణాబోర్డుకు వర్కింగు మాన్యువల్‌ను ఖరారు చేయాలని నిర్ణయించారు. దీనికి తగ్గట్లుగా బోర్డు ముసాయిదాను తయారు చేసి రెండు రాష్ట్రాలకు పంపనుంది. టెలిమెట్రీలపై చర్చించి ఓ నిర్ణయానికి రాలేకపోవడంతో రెండు రాష్ట్రాల అధికారులతో మళ్లీ చర్చించి ఓ కార్యాచరణను సిద్ధం చేయాలని నిర్ణయించారు. పోతిరెడ్డిపాడు వద్ద నీటిని కొలిచేందుకు టెలిమెట్రీ వద్ద డాపులర్ కరెంట్ ప్రొఫైలర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శ్రీశైలం నుంచి విడుదల చేసిన నీటికి నాగార్జునసాగర్‌కు చేరే నీటికి ఉన్న తేడాపై సమగ్రంగా శాస్త్రీయ అధ్యయనం చేయాల్సి ఉందని, ఇందుకోసం పుణెలోని కేంద్ర నీరు, విద్యుత్తు పరిశోధన సంస్థను సంప్రదించాలని కూడా సమావేశం నిర్ణయించింది. ఇతర ప్రాజెక్టుల్లో కూడా ఇలాంటి అధ్యయనాలు చేయాలని నిర్ణయించింది. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నీటి నష్టాలను 2018-19లో కూడా పరిశీలించాలని నిర్ణయించింది. పరిశీలన కోసం ఇతర కాలువల కింద కూడా వివరాలు సేకరించాలని నిర్ణయించింది. శ్రీశైలంలో విద్యుదుత్పత్తిని 2018-19లో కూడా చెరి యాభై శాతం వినియోగించుకోవాలని నిర్ణయించింది. కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇచ్చేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించినట్లు బోర్డు విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

వేతనపెంపును నిరాకరించిన ఛత్తీస్‌గఢ్ గవర్నర్

రాయ్‌పూర్: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో ప్రకటించిన వేతనపెంపును ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బలరామ్‌జీ దాస్ నిరాకరించారు. వేతన సవరణ అనంతరం గవర్నర్ల జీతం నెలకు రూ. 1.10 లక్షల నుంచి రూ. 3.5 లక్షలకు పెరిగింది. కాగా పెంపుతో పాటు, సంబంధిత బకాయిలను కూడా అంగీకరించరాదని గవర్నర్ నిర్ణయించినట్లు ఆయన కార్యాలయం బుధవారం వెల్లడించింది.

చెరకు రైతులకు తీపి కబురు

దిల్లీ: ఉప ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని చెరకు సాగు ప్రాంతంలో భాజపా ఓటమి చవి చూసిన నేపథ్యంలో చెరకు రైతుల సమస్యలు తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం రూ.8,500 కోట్ల ప్యాకేజిని ప్రకటించింది. చక్కెర నిల్వలు ఏర్పాటు చేయడానికి, ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి ఈ ప్యాకేజిని నిర్ణయించారు. మిల్లులు విక్రయించే చక్కెరకు కనీస ధరను ప్రభుత్వం తొలిసారిగా కిలోకు రూ.29గా నిర్ణయించింది. ఇంతకన్నా తక్కువకు మిల్లులు విక్రయించడానికి వీల్లేదు. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. చెరకు రైతులకు బకాయి పడ్డ రూ.22వేల కోట్లను తీర్చడానికి చక్కెర కర్మాగారాలకు సహాయపడేందుకు ఈ ప్యాకేజిని ఉద్దేశించారు. ఏడాదిపాటు 3 మిలియన్ టన్నుల చక్కెర నిల్వను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంపై రూ.1,175 కోట్ల భారం పడుతుందని ఆహార శాఖ మంత్రి రాం విలాస్ పాసవాన్ చెప్పారు. కర్మాగారాల గోదాముల్లోనే చక్కెరను నిల్వ ఉంచుతారు. నిల్వకు అయ్యే ఖర్చంతా కేంద్రమే భరిస్తుంది. ఈ ఖర్చు కింద ఇచ్చే మొత్తాన్ని మిల్లుల తరపున బకాయిలు తీర్చేందుకు ప్రభుత్వమే నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. చక్కెర కర్మాగారాలు ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు రూ.4,440 కోట్ల రుణాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఎక్కువగా ఉత్పత్తి అయిన చెరకును ఇథనాల్ ఉత్పత్తికి ఉపయోగిస్తారు.

దిల్లీలో మంత్రివర్గ సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్. చిత్రంలో మంత్రి రాంవిలాస్ పాసవాన్

గ్రామీణ డాక్ సేవక్‌లకు శుభవార్త

గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్)లకు శుభవార్త. వారి మూల వేతనాన్ని ప్రభుత్వం మూడింతలు పెంచింది. 2016, జనవరి 1 నుంచి ఈ పెంపు వర్తిస్తుంది. ఈ బకాయిలను ఒకే విడతలో చెల్లిస్తారు. నెలకు రూ.2,295 మూల వేతనం వస్తున్న జీడీఎస్‌లకు ఇక నుంచి రూ.10వేలు వస్తుంది. రూ.2,745 ఉన్నవారికి రూ.12వేలు, రూ.4,115 ఉన్న వారికి రూ.14,500 వస్తుంది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పెంపు నిర్ణయం తీసుకున్నారు. దేశ వ్యాప్తంగా 1.3లక్షల గ్రామీణ తపాలా కార్యాలయాల్లో 2.6లక్షల మంది జీడీఎస్‌లున్నారు. వేతన పెంపు కోసం జీడీఎస్‌లు కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నారు. జీడీఎస్‌ల విజ్ఞప్తి మేరకు వార్షికంగా మూడు శాతం పెంపునకు కూడా అంగీకరించినట్లు టెలికం మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. రిస్క్, హార్డ్‌షిప్ భత్యం కింద నెలకు రూ.500 చెల్లించనున్నట్లు మంత్రి చెప్పారు. కార్యాలయ నిర్వహణ భత్యం, సైకిల్ నిర్వహణ భత్యం, పడవ భత్యం తదితరాలు కూడా పెంచినట్లు తెలిపారు. మొత్తం మీద జీడీఎస్‌ల కనీస వేతనాన్ని నెలకు రూ.10వేలకు, గరిష్ఠంగా నెలకు రూ.35,480కి పెంచారు.

- సంప్రదాయ విద్యుత్తు లైన్లు లేని ప్రాంతాల్లో సౌరశక్తితో విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు ఉద్దేశించిన 'ఆఫ్ గ్రిడ్ అండ్ డీసెంట్రలైజ్డ్ సోలార్ పీవీ అప్లికేషన్స్ కార్యక్రమం' మూడో దశ అమలుకు ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ సంఘం ఆమోదం తెలిపింది. ఈ పథకంలో భాగంగా గ్రిడ్ లేని ప్రాంతాల్లో దేశ వ్యాప్తంగా సౌర విద్యుత్తుతో నడిచే వీధిదీపాలను ఏర్పాటు చేస్తారు. ఈశాన్య రాష్ట్రాలు, వామపక్ష తీవ్రవాద ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తారు. విద్యార్థులు చదువుకునేందుకు సౌర లాంతర్లను కూడా అందజేస్తారు. లబ్ధిదారులు 15శాతం వ్యయాన్ని భరిస్తే చాలు. గ్రిడ్ లేని ప్రాంతాల్లో పాఠశాలలు, వసతి గృహాలు, పంచాయితీ కార్యాలయాలు, పోలీసు ఠాణాలు, ఇతర ప్రభుత్వ సేవల సంస్థలకు విద్యుత్తు సౌకర్యం కలిగించడానికి ఈ మూడోదశ కార్యక్రమం ఉపకరిస్తుంది.
- పీఎస్ఎల్‌వీ కార్యక్రమం (ఆరో దశ) కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం. 2019-24 మధ్య ఈ కార్యక్రమం అమలవుతుంది. జీఎస్ఎల్‌వీ మార్క్-3 కార్యక్రమం (మొదటి దశ) కొనసాగింపునకూ ఆమోదం లభించింది. ఈ రెండు కార్యక్రమాల అమలుకు రూ.10,469 కోట్ల ఖర్చవుతుంది. జీఎస్ఎల్‌వీ మార్క్-3 కింద నాలుగు టన్నుల శ్రేణిలోని కమ్యూనికేషన్ ఉపగ్రహాలను ప్రయోగిస్తారు.
- నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్దేశిత గడువు లోపు మూసివేయడానికి ఉద్దేశించిన సవరణ మార్గదర్శకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మూసివేసే ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో ఉన్న భూములను గృహనిర్మాణ పథకానికి ఉపయోగిస్తారు. ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల వేతన స్కేలుతో నిమిత్తం లేకుండా 2007 నోషనల్ వేతన స్కేలుపై వీఆర్ఎస్ ఇస్తారు.
- ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్‌లో గంగానదిపై 9.9 కి.మీ. పొడవున వంతెన నిర్మించాలన్న ప్రతిపాదనకు ఆమోదం. ఇందుకు రూ.1,948.25 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

హజ్‌యాత్రికులు వినియోగదారులు కారు!

జాతీయ వినియోగదారుల కమిషన్ స్పష్టీకరణ.

దిల్లీ: హజ్ యాత్రికులు వినియోగదారులు కారు. అసలు ఆపరిధిలోకే రారు. వాస్తవానికి హజ్ కమిటీ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవలను అందచేస్తుందని జాతీయ వినియోగదారుల కమిషన్ స్పష్టం చేసింది. హజ్‌యాత్రకు తగిన ఏర్పాట్లు చేయడానికి అయ్యే ఖర్చుల వరకూ మాత్రమే 'భారత హజ్‌కమిటీ' యాత్రికుల నుంచి సేకరిస్తుందని కమిషన్ వివరించింది. ఈ కమిటీ అసలు ఏ విధమైన ఫీజును కానీ...సర్వీసు ఛార్జీలను కానీ సేకరించకుండానే యాత్రికులకు సేవలు అందచేస్తుందని కమిషన్ పునరుద్ఘాటించింది. ఉన్నతస్థాయి కేటగిరీ కోసం 2008లో తాము డబ్బు చెల్లించి ఉన్నప్పటికీ....తమకు తక్కువస్థాయి సేవలను అందచేశారంటూ ఓ యాత్రికుడు, ఆయన కుమారుడు ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తాము చెల్లించిన డబ్బును వాపసు చేయాల్సిందిగా కోరారు.

గ్రహం అనుగ్రహం

7-6-2018 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
అష్టమి: ఉ. 7-52 తదుపరి నవమి
పూర్వాభాద్ర నక్షత్రం: సా. 5-59 తదుపరి ఉత్తరాభాద్ర
అమృత ఘడియలు: ఉ. 9-28 నుంచి 11-10 వరకు
వర్జ్యం: తె. 4-00 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 9-48 నుంచి 10-40 వరకు
తిరిగి మ. 3-00 నుంచి 3-52 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-28

365 రోజులూ అన్న క్యాంటీన్లు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తారు. ఆహారం తయారీ, పంపిణీ టెండర్‌ను అక్షయపాత్ర దక్కించుకుంది. వాస్తవిక సమీక్ష వ్యవస్థ(ఆర్టీఎం)తో వీటి పనితీరును సచివాలయం నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు గమనించవచ్చు. ఆహార పదార్థాల నాణ్యత నుంచి ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేలా ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సచివాలయం సమీపంలోని మందడం గ్రామంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన అన్న క్యాంటీను విజయవంతంగా కొనసాగుతుంది.



బుధవారం అహ్మదాబాద్‌లోని ఓ ఆలయంలో శ్రీకృష్ణుడికి మధురఫల(మామిడి) నివేదన

తొలకరి గంట

- విస్తరించిన నైరుతి రుతుపవనాలు
- రాయలసీమ దాటి.. మచిలీపట్నం దాకా ప్రభావం
- పలు ప్రాంతాల్లో వర్షాలు

ఈనాడు, అమరావతి, విశాఖపట్నం: రాష్ట్రంలో తొలకరి గంట కొట్టింది. రాయలసీమ దాటి.. కోస్తాలోకి అడుగిడిన నైరుతి రుతుపవనాలు బుధవారం సాయంత్రానికి మచిలీపట్నం చేరాయి. ఇవి చురుగ్గా కదులుతూ.. గురు, శుక్రవారాల్లో రాష్ట్రమంతా విస్తరించనున్నాయి. వీటి ప్రభావంవల్ల పలు ప్రాంతాల్లో తొలకరి వర్షాలు మొదలయ్యాయి. ఉక్కపోత కొనసాగుతున్నా.. పగటి ఉష్ణోగ్రతలు తగ్గాయి. అమరావతి రాజధాని ప్రాంతంతోపాటు విజయవాడలో బుధవారం రాత్రి జోరు వాన కురిసింది. రాబోయే 24 గంటల్లో రాష్ట్రమంతా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచించింది. రుతుపవనాలకు ఉపరితల ద్రోణి తోడవటంతో ఉత్తరాంధ్రలోనూ ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల దాకా. . తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం మండలం సేతపల్లివాగులో 98.5 మి.మీ, పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వలో 53.25 మి.మీ, వరరామచంద్రాపురంలో 53 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి విశాఖపట్నం జిల్లా కశింకోట మండలం కన్నూరిపాలెంలో 53 మి.మీ, విజయనగరం జిల్లా మోదవలసలో 48, తూర్పుగోదావరి జిల్లా కోటనందూరులో 46 మి.మీ వర్షం కురిసింది. మొత్తం 85 చోట్ల 15.60 మి.మీ నుంచి 64.40 మి.మీ లోపు వర్షపాతం నమోదైంది.

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కరీంనగర్	41.0	25.0
రామగుండం	40.4	28.5
కడప	40.0	28.0
తిరుపతి	39.0	28.4
నెల్లూరు	38.0	30.0
సూర్యాపేట	38.0	27.0
హైదరాబాద్	37.9	26.3
కర్నూలు	36.8	26.9
శ్రీకాకుళం	36.0	28.0
అనంతపురం	35.7	26.2
విశాఖపట్నం	34.8	28.0
ఒంగోలు	33.7	30.0
గుంటూరు	32.9	26.4
రాజమహేంద్రవరం	31.0	26.0
విజయవాడ	29.7	24.6
నరసాపురం	28.5	27.0
తాడేపల్లిగూడెం	28.0	26.0

2017 - SI సెలక్షన్స్‌లో స్టేట్ 1st ర్యాంకు సాధించిన సంస్థచే
RPF-SI, కానిస్టేబుల్స్ SI & కానిస్టేబుల్స్
17వ బ్యాచ్: 9-6-18, 9am
జిమ్ & హాస్టల్ కలదు
శ్యామ్ ఇన్‌స్టిట్యూట్
విద్యుత్‌నగర్, కాకినాడ, తూ.గో.జిల్లా. 0884 - 2362744, 98482 56254, 98481 36254

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P: VIJAYAWADA-8.
No. 607/A1/11 NOTIFICATION Dt: 06-06-2018
Applications in the prescribed proforma are invited for recognition of Hospitals of excellence having requisite facilities in Andhra Pradesh for starting PDF (Post Doctoral Fellowship & Certificate courses) in specified Medical Branches for the year 2018-19. Last date for receiving of applications on 06th July, 2018 at 5.00 P.M. For details please visit http://ntruhs.ap.nic.in.
Sd/- REGISTRAR

GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TSPOLYCET-2018 ADMISSIONS
FINAL PHASE NOTIFICATION
PAYMENT OF PROCESSING FEE, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING.
The Qualified candidates of TSPOLYCET-2018 who have participated or not participated in first phase of counselling and desirous of seeking admission into Diploma Courses in Polytechnics are informed that final phase web counselling will commence on 11-06-2018. Further details and counselling schedule can be seen in the website: https://tspolycet.nic.in on 08-06-2018.
Date: 06-06-2018 Sd/- Navin Mittal, IAS
Place: Hyderabad Convenor, TSPOLYCET-2018 & CTE
DIPR 750DP/ CL/ADVT/2018-19

శ్రీ భవిష్య ఎడ్యుకేషనల్ అకాడమి విజయవాడ
www.sribhavishya.com మీ భవిష్యత్తుకు మా భరోసా...!
NEET-2018 ఫలితాలలో కేవలం లాంగ్‌టర్మ్ నుండి
అతి సాధారణ విద్యార్థులతో "శ్రీ భవిష్య ఎడ్యుకేషనల్ అకాడమీ" సంచలన ఫలితాలు
579 MARKS, 570 MARKS, 569 MARKS, 557 MARKS, 555 MARKS, 555 MARKS, 552 MARKS
మొత్తం హాజరైన విద్యార్థులలో 98% ఉత్తీర్ణత
500 మార్కులపైన - 32 | 475 మార్కులపైన - 65 | 450 మార్కులపైన - 103 | 400 మార్కులపైన - 214
సబ్జెక్టుల వారీగా గరిష్ఠ మార్కులు: ఫిజిక్స్ - 141/180 కెమిస్ట్రీ - 153/180 బయాలజీ - 330/360
NEET-2019 LONG TERM అడ్మిషన్లు జరుగుచున్నవి.
1st Batch క్లాసులు 09-06-2018 నుండి ప్రారంభం.
మెరిట్ విద్యార్థులకు ఫీజు రాయితీ కలదు
ప్రతి తరగతి నందు 45 మంది విద్యార్థులు మాత్రమే
Long Term 2018-19 Batch Concessions
NEET-18 Marks: >420 | 400-419 | 375-399 | 350-374
% of Concession: 90% | 75% | 50% | 25%
*The above concessions are valid for first 100 Students only
95813 06030, 95819 44007
95819 44003, 85003 03037

ప్రజలే ముందు
PEOPLE FIRST
1100

GOVERNMENT OF ANDHRA PRADESH

మౌలిక సదుపాయాలు - మెరుగైన జీవనం

మౌలిక సదుపాయాల్లో సాధించిన ప్రగతి

- ప్రపంచానికే తలమానికంగా ప్రజా రాజధాని అమరావతి
- రాష్ట్రంలో కోతల్లేని, కొరత లేని విద్యుత్తు
- 17,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి
- 6 విమానాశ్రయాలు, 6 ఓడ రేవుల అభివృద్ధి
- 100% ఒడిఎఫ్ అమలు. డిసెంబరు 2018 నాటికి ఒడిఎఫ్ ప్లస్ లక్ష్యం
- రూ.313.73 కోట్లతో 7,944 అంగన్ వాడీ భవనాలు, 71 సి డి పి ఓ భవనాల నిర్మాణం
- అనంతపురం, కడప జిల్లాలలో 4,000 మెగా వాట్ సోలార్ పార్కులు
- ఏడాది కాలంలో 13 జిల్లాలలో 723 ఓవర్ హెడ్ ట్యాంకుల మరమ్మత్తులు. 60 రకాల నీటి నాణ్యతా ప్రమాణాలను తెలిపేలా సెన్సార్ల ఏర్పాటు
- 2018 స్వచ్ఛ సర్వేక్షణలో 'ఘన వ్యర్థ పథార్థాల నిర్వహణ'లో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన తిరుపతి
- దేశంలోని సుందర నగరాలలో విశాఖపట్నం, విజయవాడలకు చోటు
- కూచిపూడి నాట్యారామానికి రూ.100 కోట్లు. సాంస్కృతిక గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్
- ప్రతి వారాంతం హ్యాపీ సండే, ప్రతి సంవత్సరం ఆనంద నగరాల సదస్సు. ఆనందమయ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం.

2022 దేశంలో 3 అగ్రగామి రాష్ట్రాలలో ఒకటి (తలసరి ఆదాయం రూ. 2.95 లక్షలు)

2029 దేశంలో అత్యుత్తమ రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 9.65 లక్షలు)

2050 ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాల రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 1.67 కోట్లు)

నేటి చర్చనీయాంశాలు

- రోడ్లు
- మురుగు నీటిపారుదల
- వీధి దీపాలు
- ఫైబర్ నెట్
- విద్యుత్తు
- ఇతర మౌలికసదుపాయాలు

ముఖ్యమంత్రి గారిని సంప్రదించడానికి

NCBN అధికారిక యాప్ | ప్రజలే ముందు మొబైల్ యాప్ | ఏపి సీఎం ఫేస్ బుక్ | ఏపి సీఎం ట్విట్టర్

జారీ చేసిన వారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఈనాడు

పరిధి మీరుతున్న అమెరికా

తన కోడి కుంపటి లేకపోతే తెల్లవారదనుకొనే అమెరికా ఆధిజాత్యం తెలియనిది కాదు. దశాబ్దాల తరబడి తాని చ్చింది వరం, పెట్టింది శాపంగా చలాయించుకొంటున్న అగ్రరాజ్యం- ఇటీవల రష్యాపై విధించిన వాణిజ్య ఆంక్షలు, పరోక్షంగా భారత్ రక్షణ కొనుగోళ్లనే ఇరకాటంలోకి నెట్టేస్తున్నాయిప్పుడు! క్రిమియా దురాక్రమణ, సిరియా అంతర్యుద్ధంలోనూ, అమెరికా అధ్యక్ష ఎన్నిక ల్లోనూ జోక్యం చేసుకోవడాన్ని గర్హిస్తూ, ఆంక్షల ద్వారా అమెరికా ప్రత్యర్థుల్ని ఎదుర్కొనే చట్టాన్ని(కాట్సా) రష్యాపై అగ్రరాజ్యం ఎక్కు పెట్టింది. సంబంధిత చట్టంలోని 231వ విభాగం రష్యాకు చెందిన రక్షణ, నిఘా విభాగాలతో గణనీయ లావాదేవీలు జరిపే దేశాలపైనా ఆంక్షలు విధించాలని స్పష్టీకరిస్తోంది. కోటిన్నర డాలర్ల లావాదేవీ లను మించి సహించేది లేదని తమ చట్టం నిర్దేశిస్తోందంటూ, భారత్ రష్యాల మధ్య కుదిరిన 550 కోట్ల డాలర్ల (రూ.39వేల కోట్లు) ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు వ్యవహారంపై అమెరికా కన్నెర్ర చేస్తోంది. అత్యంతాధునాతన క్షిపణి వ్యవస్థను రష్యా నుంచి ఇండియా కొనుగోలు చేస్తే భారత్ అమెరికా సైన్యాలు ఆ దేశ స్వరం కలివిడిగా పనిచేసే వాతావరణం దెబ్బతింటుందని ఆ దేశ రక్షణ వ్యవహారాల సభా సంఘానికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న మాక్ థార్న్ బెర్రీ వారం రోజుల క్రితం దిల్లీలో ప్రకటించారు. చట్టం, నిబం ధనల్ని పక్కన పెట్టి చూసినా, ఆ క్షిపణి వ్యవస్థ కొనుగోలు తమకు ఇబ్బందులు కలిగిస్తుందంటూ అసలు సంగతి బయటపెట్టారు. ఇటీ వలే కరకు ఆంక్షల చట్టానికి చేసిన సవరణలతో ఇండియాలాంటి దేశాలకు కొంత వెసులుబాటు కలిగించామని, రష్యానుంచి దశాబ్దా లుగా సైనిక సామగ్రి కొనుగోలు చేస్తున్న దేశాలు, వాటికి అవసర మైన విడి భాగాలు దిగుమతి చేసుకోవడానికి అనుమతించామనీ ఆ రిపబ్లికన్ పెద్ద తాము చేసింది మహోపకారమన్నట్లు గొప్పలు చెప్పారు. భారత్‌లాంటి సర్వసత్తాక ప్రజాస్వామ్య మేరునగాన్ని మిడిమేలపు ఆంక్షల చట్రంలో అమెరికా బంధించాలనుకోవడమే విడ్డూరం. రక్షణ కొనుగోళ్ల విషయంలో ఎవరి ఫర్మానాలకూ తలొగ్గేది లేదన్నట్లుగా మోదీ సర్కారు నిర్ణయం, సంస్తుతిపాత్రం!

కాలం చెల్లిన ప్రచ్ఛన్న యుద్ధ భావజాలంలో నేటికీ కొట్టుకు పోతున్న అగ్రరాజ్యం నాతో ఉంటే మిత్రుడు లేదా శత్రువు (విత్ మీ ఆర్ ఎనిమీ) అన్న ధోరణినే కొనసాగిస్తోంది. శ్వేత సౌధాధిప తిగా ట్రంప్ పాలన పగ్గాలు చేపట్టాక- అమెరికాకే తొలి ప్రాధాన్య మంటూ తీసుకొంటున్న దుందుడుకు చర్యలు ఎక్కడికక్కడ కొత్త కుంపట్లను రాజేస్తున్నాయి. భారత్ రష్యాల వ్యూహాత్మక భాగ స్వామ్యం మరే దేశానికి కూటమికీ వ్యతిరేకం కాదని పద్దెనిమిదేళ్ల నాటి 'దిల్లీ డిక్లరేషన్' స్పష్టీకరించింది. విక్రేత-కొనుగోలుదారుగా ఉన్న సంబంధాన్ని మరింత పటిష్ఠీకరించుకొని ఆయుధాలు, విమా నాల ఉత్పత్తికి అపుడే ఉభయ దేశాలూ సమ్మతించాయి. అర వయ్యో దశకంలోనే రష్యాతో అంకురించిన రక్షణ రంగ వాణిజ్య పరిమాణం ఇప్పటికి 6500 కోట్ల డాలర్లు (దాదాపు రూ.4,25,000 కోట్లు)కు చేరింది. దిల్లీ మాస్కోల రక్షణ సహకారానికి బ్రహ్మోస్ క్షిపణి తయారీ శిరోభూషణం లాంటిది! కొద్దిపాటి అపార్థాలు, పంతాలు పట్టింపులతో రష్యాతో రక్షణ వాణిజ్యం ఇటీవల కొద్దిగా మందగించిన నేపథ్యంలో- 2007 లగాయతూ అమెరికా ఎకాయెకి 1500 కోట్ల డాలర్ల కాంట్రాక్టుల్ని ఒడిసిపట్టింది. ఆంక్షల పేరిట రష్యాను ఏకాకిని చేసేస్తే, ఓ వంక తన రాజకీయ పంతం నెరవే రడంతోపాటు, భారత్ వంటి దేశాలనుంచి మరెన్నో వేల కోట్ల రూపాయల విలువైన రక్షణ కాంట్రాక్టులు ఎగిరివచ్చి తన చేతిలో పడతాయని ట్రంప్ సర్కారు భావిస్తున్నట్లుంది. దేశీయ రక్షణ వ్యవ స్థకు అత్యంత కీలకమైన శత్రు దుర్భేద్య వ్యవస్థల కోసం మాస్కోతో 1200 కోట్ల డాలర్ల ఒడంబడికల్ని భారత్ సిద్ధం చేసింది. అమెరికా చట్టసభ శాసనాలు ప్రపంచ దేశాలకు శిరోధార్యం కానేకావని, రక్షణ కొనుగోళ్ల విషయంలో భారత్ ఏమాత్రం రాజీ పడబోదన్న సంగతి ట్రంప్ సర్కారుకు ఈ పాటికే అర్థమై ఉండాలి!

చిన్న పెద్ద అన్న వ్యత్యాసం లేకుండా స్వీయ రక్షణ విష యంలో ఎలాంటి నిర్ణయం తీసుకొనే హక్కు అయినా ప్రతి సార్వ భౌమాధికార దేశానికీ ఉంది. ఇరాన్ రష్యాలపై కత్తి కట్టిన అమె రికా వాటిపై ద్వైపాక్షికంగా తీవ్రమైన ఆంక్షలు విధించిందంటే, అది దాని ఇష్టం; అంతటితో ఆగకుండా వాటితో ఏ దేశమూ ఎలాంటి లావాదేవీలూ జరపరాదని ఫర్మానాలు జారీచేసే హక్కు అగ్రరాజ్యా నికి ఎక్కడిది? అణ్వాయుధం తయారు చెయ్యకుండా టెహరాన్‌ను నిలువరించాలనే బృహత్ సంకల్పంతో బ్రిటన్ ఫ్రాన్స్ రష్యా జర్మనీ ప్రభృత దేశాలన్నీ కలిసి చరిత్రాత్మక ఒప్పందాన్ని పట్టాలకెక్కిస్తే- దాన్ని ఒక్కపెట్టున తిరస్కరించిన ట్రంప్, మరింత కఠినతర ఆంక్ష లకు రంగం సిద్ధం చేసి, ప్రపంచదేశాలన్నీ వాటిని ఔదలదాల్చాలని రంకెలెయ్యడం విడ్డూరంగా ఉంది. ఇరాన్‌పై ఆంక్షలు తొలగిన రెండేళ్ల కాలంలో ఆ దేశంతో పలు వాణిజ్య లావాదేవీలు మొదలు పెట్టిన దేశాలన్నీ వెనక్కి మళ్ళాలట. లేకపోతే ఆయా దేశాల మీదా ఆంక్షల కొరడా ఝుళిపిస్తారట! ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు అభి వృద్ధికోసం ఎంతో ఖర్చుపెట్టిన ఇండియా- ట్రంప్ పైత్య ప్రకోపా నికి మూటా ముల్లె సర్దుకోవాలా? ఇంతకాలం ఐక్యరాజ్య సమితిని పిండిబొమ్మను చేసి ఏకధ్రువ ప్రపంచంలో తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నట్లు వ్యవహరించిన అమెరికా, శరవేగంగా మారు తున్న ప్రపంచ పోకడల్ని గుర్తించడం లేదు. అగ్రరాజ్యం భౌగోళిక రాజకీయ చదరంగంలో మూగపావుగా మారేందుకు ఏ దేశమూ సిద్ధంగా లేదు. ఇరాన్ విషయంలో అమెరికాను బేఖాతరు చేసి అణు ఒప్పందానికి కట్టుబాటు చాటుతున్న దేశాల ధోరణి నుంచి, రష్యాతో వాణిజ్యం విషయంలో రాజీపడేది లేదంటున్న ఇండియా వైఖరి నుంచి అగ్రరాజ్యం గ్రహించాల్సిన వాస్తవం అది.

డాక్టర్ మహేంద్రబాబు కురువ

నాగరిక పంథాలో నగరీకరణ

దేశంలోని నగరాలన్నీ జనంతో కిక్కిరిసి పోతున్నాయి. పల్లెలనుంచి వలసవస్తున్న జనానికి తోడు, వివిధ పనుల మీద రోజూ సందర్శించే ప్రజల సంఖ్య భారీగా పెరిగి పోవడంతో కనీస వసతి, రవాణా సౌకర్యాలకూ దిక్కులేక నగరాలు అల్లాడుతున్నాయి. ప్రపంచ నగరీకరణ తీరుతెన్నులపై ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సామాజిక అధ్యయనాల సంస్థ ఇటీవల ప్రచురించిన నివేదికలోని వాస్తవాలు మనం అనుసరిస్తున్న అభివృద్ధి నమూనాను పునస్సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని వెల్లడించాయి. ప్రపంచ నగర జనాభాలో 2050నాటికి భారత్, చైనా, నైజీరియాలు మూడోవంతుకు పైగా ప్రాతినిధ్యం వహించనున్నాయని ఆ నివేదిక స్పష్టం చేసింది. భారతీయ నగరాల భవిష్యత్తుపట్ల ఆందోళనతోపాటు, ఒకింత ఆశాభావాన్నీ కలిగిస్తున్న వాస్తవాలివి. మంచి విషయాన్నే మొదట చెప్పుకొందాం. 2011నాటి జనాభా లెక్కల ప్రకారం దేశంలో 37.7 కోట్లమంది అంటే 31.1 శాతం (ప్రస్తుతం 34 శాతం) నగరాల్లో జీవిస్తున్నారు. 'సమితి' తాజా నివేదిక ప్రకారం 2050నాటికి ఆ సంఖ్య 52.8 శాతానికి పెరగనుంది. మరోవంక 2028నాటికి టోక్యో జనాభాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధికులు నివసిస్తున్న నగరంగా దిల్లీ ఆవిర్భవించనుంది. నగరీకరణ పెరిగితే ఆర్థికాభివృద్ధి రేటుకు చురుకు పుడుతుంది. ఆర్థిక రంగాన్ని కొత్తపుంతలు తొక్కించగల శక్తి నగరీకరణకు ఉందని గతానుభవాలు చాటుతున్నాయి. ఆధునిక ప్రపంచ చరిత్రను ఒకసారి తరచి చూస్తే నగరీకరణ వల్ల ప్రజల ఆదాయాలు పెరిగి పేదరికం కనీస స్థాయికి పడిపోయిన దాఖలాలు అనేకం కనిపిస్తాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో పారిశ్రామిక విప్లవం తలెత్తిన దశలో ప్రజావాహినిలో అధిక భాగం పొలాలను వీడి కర్మాగారాలకు తరలడానికి; కార్మికుల ఆదాయాలు రెట్టింపు స్థాయికి చేరేందుకు 150 ఏళ్ల కాలం పట్టింది. ఆ తరవాత కాలంలో అంటే రెండో దశలో ఐరోపా గుణాత్మకంగా మారిపోయింది. యాభయ్యేళ్ల కాలంలో ప్రజల ఆదాయాలు రెట్టింపయ్యాయి. ప్రపంచంలో నగరీకరణ బాట పట్టకుండా అభివృద్ధి చెందిన దేశం ఒక్కటీ లేదు. భారత్‌లో నగర జనాభా ఇంతలంతలవుతుందని వెల్లడించిన 'సమితి' నివేదిక ఒకరకంగా అభివృద్ధి ఆశలకు అంటుకడుతోంది.

ఆధునిక సవాళ్లకు దీటుగా అభివృద్ధి

సవాళ్లకు పరిష్కారాలు

పొలాలను మార్చి పట్టణాలు, నగరాలను కూర్చినంత మాత్రాన దేశాలు అభివృద్ధి చెందవు. నగరీకరణ ద్వారా సాధించే అభివృద్ధిని స్థిర కక్ష్యలో నిలబెట్టలేని పక్షంలో ఏ దేశమైనా వెనకబడే ఉంటుంది. భారత్ ఎదుర్కోవాల్సిన అసలుసిసలు సవాలు ఇది. భారత్ ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంది. కోట్లాది జనం భారతీయ నగరాలకు వచ్చి చేరితే, ఏదో స్థాయిలో అభివృద్ధి సాకారమవుతుందనడంలో మరో మాట లేదు. అయితే దాన్ని ఎంతకాలం స్థిరంగా నిలబెట్టుకోగలమన్నదే ప్రశ్న. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినప్పుడు వర్ధమాన ప్రపంచంలో నగరీకరణ చాలా భిన్నమైనది. అభివృద్ధి చెందిన సమాజాలది సంఘటిత, ప్రణాళికాబద్ధ నగరీకరణ. ఆయా దేశాల్లో నగర పాలన తీరుతెన్నులు, ప్రజల జీవన నాణ్యత అత్యుత్తమ స్థాయిలో ఉన్నాయి. వర్ధమాన దేశాల్లో నగరాలు అస్తవ్యస్తంగా, ఏ మాత్రం ప్రణాళిక లేకుండా ఉంటున్నాయి. మనదేశంలో నగరీకరణే ఇందుకు ఉదాహరణ. భారతీయ నగరాల్లో జనాభా స్థిరంగా పెరుగుతోంది. 'సమితి' నివేదికలోని గణాంకాలు భారతీయ నగరాల ముందున్న సవాళ్లను స్పష్టంగా వెల్లడించాయి. మౌలిక సౌకర్యాలు కొరవడటం మన నగరాలకున్న అతిపెద్ద సమస్య. ప్రణాళిక లేని నగర పాలన మరో ముఖ్య సమస్య. ఈ రోజు గడిస్తే చాలునన్న ఆలోచనే తప్ప- సుస్థిర, ఆరోగ్యవంతమైన నగర జీవనానికి బాటలు పరవాలన్న దృక్పథం ప్రభుత్వాల్లోనూ, ప్రజల్లోనూ పాదుకొనకపోవడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఇటీవల వెలువరించిన గణాంకాల ప్రకారం అత్యంత కలుషితమైన గాలితో సతమతమవుతున్న ప్రపంచంలోని 20 నగరాల్లో 14 భారత్‌లోనే పోగుబడి ఉండటం కలవరం కలిగిస్తున్న పరిణామం. అయితే 'ఆకర్షణీయ నగరాల'ను (స్మార్ట్ సిటీస్) విస్తరిస్తే దేశంలో 'నాణ్యతలేని గాలి' సమస్యను కట్టడి చేయవచ్చునని విధాన కర్తలు, మేధావులు వాదించవచ్చు. ప్రధాన స్రవంతితో సంబంధం లేని ఒంటరి ప్రాంతాలుగా 'ఆకర్షణీయ నగరాల'ను తీర్చిదిద్దితే ఉపయోగం లేదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ప్రధాన నగరాలకు దూరంగా, మంచి గాలి, అద్భుతమైన రోడ్లు, చక్కటి విద్యుత్తు వెలుగులతో అత్యధిక ఆదాయం ఉన్న వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండే విధంగా 'స్మార్ట్ సిటీ'లను నిర్మిస్తే దానివల్ల అసమానతలు పెరుగుతాయేగానీ తగ్గవు. అందరికీ అందుబాటులో, దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి నగరాలకు వస్తున్న వలసదారులకు నివాస యోగ్యంగా వీటిని నిర్మించాలి. వలసదారులపై ప్రత్యేక దృష్టిపెట్టి నగర జీవనాన్ని నవీకరించడంవల్ల దీర్ఘకాలంలో అనేక ప్రయోజనాలు సాధ్యపడతాయి. నగర సంస్కృతి భారత్‌కు కొత్త కాదు. భారతీయ చరిత్రను స్పృశిస్తే అద్భుతమైన నగర జీవనం దర్శనమిస్తుంది. కాలక్రమంలో 'మెట్రో' నగరాలు వచ్చాక కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. భారతీయ ఆర్థిక వ్యవస్థకు జీవనాడులుగా భాసిస్తున్న 'మెట్రో' నగరాలు- ప్రకృతి విపత్తులు విరుచుకుపడినప్పుడు మాత్రం నరకానికి నకళ్లుగా మారిపోతున్నాయి. నదులకు వరదలొస్తే ముంబయి, చెన్నై, హైదరాబాద్ సహా అనేక నగరాలు నీట మునుగుతున్నాయి. గురుగ్రామ్, దిల్లీ వంటిచోట్ల కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్‌లు జాతీయ వార్తాంశాలుగా మారుతున్నాయి. ఆధునిక అవసరాలకు తగినట్లుగా నగరాలను మార్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజెబుతున్న సమస్యలివి. సింగపూర్ వంటివాటిని చూసి నగర పాలనను ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుకోవాలి. అభివృద్ధికి నోచుకోకుండా ఎక్కడివక్కడేగా మిగిలిపోయిన నగర పంచాయతీలు (సెన్సస్ టౌన్స్) దేశ నగరీకరణకు అతిపెద్ద సమస్యగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన నగర ప్రాంతాలుగా గుర్తింపు పొందినప్పటికీ- పాలన అంతా పంచాయతీల ఆధ్వర్యంలో సాగుతున్న ఈ 'నగర పంచాయతీలు' పురోగతి పథంలో వెనకబడి ఉన్నాయి. పంచాయతీల సారథ్యంలో కొనసాగుతుండటంవల్ల ఈ ప్రాంతాలకు వనరులపరంగా, అభివృద్ధిపరంగా అన్యాయం జరుగుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 3,894 నగర పంచాయతీలున్నాయి. ప్రణాళికాబద్ధ నగరీకరణ కోసం, నాణ్యమైన పౌర సేవలు అందుబాటులోకి రావడానికి నగర పంచాయతీలపై దృష్టిపెట్టాలి. నగర పంచాయతీలను నగర అంతర్భాగాలుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని 2016లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ రాష్ట్రాలకు మార్గనిర్దేశం చేసింది. ఈ విషయంలో రాష్ట్రాలు చురుగ్గా స్పందించడం లేదు.

ఆసియాలోని వివిధ దేశాల్లో నగర జనాభా

(శాతాల్లో)

దేశం	శాతం
జపాన్	91.6
ఇరాన్	74.9
చైనా	59.2
భూటాన్	40.9
మాల్దీవులు	39.8
పాకిస్థాన్	36.7
బంగ్లాదేశ్	36.6
భారత్	34.0
అఫ్గాన్	25.5
నేపాల్	19.7
శ్రీలంక	18.5

ఆధారం: ప్రపంచ నగరీకరణపై ఐరాస నివేదిక (2018)

సమన్వయంతో సత్ఫలితాలు

ఒక ప్రాంతాన్ని నగర అంతర్భాగంగా గుర్తించడమా లేక గ్రామంగా పరిగణించడమా అనే విషయంలో దేశంలోని రాష్ట్రాలు ఒకదానితో మరొకటి పొంతనలేని నిబంధనలను అనుసరిస్తున్నాయి. భౌగోళికంగా, జనాభాపరంగా విభిన్నమైన లక్షణాలతో అలరారుతున్న భారత్ వంటి దేశంలో- స్థానిక అవసరాలకు అనుగుణంగా ఏ ప్రాంతం ఏ పరిధిలోకి వస్తుంది అని నిర్ధారించుకునే వెసులుబాటు రాష్ట్రాలకు ఉండాలని కేంద్రం భావించింది. నగర పంచాయతీలను గ్రామాల పరిధిలో ఉంచడంవల్ల కేంద్రంనుంచి దఖలుపడే రాయితీలు, ఇతర రకాల నిధులను ఒడిసిపట్టాలన్న ఆలోచన ధోరణే ప్రస్తుత సమస్యకు కారణం. ఈ తరహా సంకుచిత దృక్పథం కొనసాగితే దేశంలో నగరీకరణ చుట్టూ అల్లుకుంటున్న ప్రణాళికల అమలు దుస్సాధ్యంగా మారుతుంది. రాష్ట్రాల సహాయ నిరాకరణ సమాఖ్య స్ఫూర్తినీ నీరుగారుస్తుంది.

పెరుగుతున్న నేరాలు నగరాలను సంక్షోభంలోకి నెడుతున్నాయి. నగరాల్లో జనాభా ఇనుమడించే కొద్దీ సహజంగానే అక్కడి పరిమిత వనరులకోసం పోటీ ఉద్ధృతమవుతుంది. ఈ పోటీలో వెనకబడే వర్గాలు నగర జీవనంలోని సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో నేర సంస్కృతిని అందిపుచ్చుకొంటున్నాయి. నగర పాలన, అభివృద్ధి తీరు మారక తప్పని అవసరాన్ని తెలియజెబుతున్న పరిణామాలివి. ఈ పునాది స్థాయి సమస్యలను పరిష్కరించకుండా దేశంలోని విధానకర్తలు కంటితుడుపు చర్యలకే పరిమితమవుతుండటం ఆందోళనకరం. శాంతిభద్రతల సమస్యను 'వలసదారుల'పైకి తోసేసి చేతులు దులిపేసుకుంటున్నారు. అన్ని కోణాల్లో ఆలోచించి నగరాల సమగ్రాభివృద్ధిపై దృష్టిపెట్టాల్సి ఉంది. ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పిస్తూ జాతీయ నగరాభివృద్ధి విధానం (ఎన్‌యూపీ) రూపొందించుకొని, అమలు చేస్తే తప్ప భారతీయ నగరీకరణలోని సమస్యలు పరిష్కారం కావు. ప్రపంచవ్యాప్తంగా మూడింట ఒకవంతు దేశాలు సొంత ఎన్‌యూపీతో ముందుకు కదులుతున్నాయి. దేశీయంగా నగరాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన 'అమృత్', 'హృదయ్', ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలన్నింటినీ జాతీయ నగరాభివృద్ధి విధానం గొడుగు నీడలోకి తీసుకురావాల్సి ఉంది. 2018-'19కిగాను గృహ, పట్టణాభివృద్ధి శాఖ బడ్జెట్‌ను 2.8 శాతం మేర (రూ.41,765 కోట్లు) పెంచారు. ఈ మొత్తాన్ని ఉపాధి, కనీస వసతుల కల్పనపై ఖర్చుపెడితే భారతీయ నగరాల ముఖచిత్రం మారే అవకాశం ఉంది. ఈ అభివృద్ధి సాధ్యం కావాలంటే ముందుగా సమస్యలపై సవిస్తార చర్చ జరగాలి. నగరాలపై పేలడానికి సిద్ధంగా ఉన్న 'జనాభా' బాంబును గుర్తించాలి!

(రచయిత- హెచ్‌ఎన్‌బీ గఢ్వాల్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ డీన్)

ఆరోగ్యానికి ఆయువు పట్టు

దేశంలో వేల ఏళ్లుగా వనమూలికలను, ప్రకృతి సిద్ధ ఆహార పదార్థాలను, ఆయుర్వేద ఔషధాలను వివిధ రకాల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తున్నారు. సుదీర్ఘకాలంపాటు జాతి జీవనంలో సహజ ఔషధాల వినియోగం అంతర్భాగంగా మారడంతో అడుగడుగునా ఆరోగ్యం తొణికిసలాడింది. ప్రజలు నిశ్చింతగా ఉండేవారు. తినే ఆహారం, వాడే వస్తువుల గురించి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఏ పదార్థం తినాలన్నా, ఏ వస్తువు ఉపయోగించాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సి వస్తోంది. కుండలో ఉండాల్సిన నీళ్లు సీసాల్లోకి చేరిపోయాయి. ఇత్తడి పాత్రలకు బదులు అల్యూమినియం, ప్లాస్టిక్, మైక్రోవేవ్, టెఫ్లాన్‌లతో చేసిన వస్తువులు రంగం మీదకు వచ్చాయి. వేపపుల్ల స్థానే రసాయనాల మిశ్రమంతో తయారు చేసిన పేస్టులు వచ్చి చేరాయి. పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు వివిధ రసాయనాలతో తయారు చేసిన పదార్థాలను వాడటంవల్ల- పలు శారీరక, మానసిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరీ ముఖ్యంగా రసాయనాలతో తయారైన సౌందర్య సాధనాల కారణంగా శరీరంపై రకరకాల వాపులు, అలర్జీలు పెరిగిపోతున్నాయి. చిన్న పిల్లలకు వాడే 'షాంపూల' నుంచి, 'డైపర్ల' వరకు అన్నీ రసాయనాలతో తయారైనవే. ఉత్పత్తి త్వరగా జరగడం, విపణిలోకి సత్వరం ప్రవేశించడం, సహజ పదార్థాల కంటే చౌకగా ఉండటం ఇవి విస్తరించడానికి ముఖ్యకారణాలు. ఉదాహరణకు దేశంలో తలకు రంగు వేసుకునేవారి సంఖ్య 80 శాతానికి పెరిగింది. ఈ ఉత్పత్తుల్లో వాడే రసాయనాలు (పారబెన్లు) పరిమితి మీరితే చర్మ సమస్యలు, దురదలు, చర్మం పొడిబారటం, కొంతమంది స్త్రీలలో హార్మోన్ సమస్యలు తలెత్తవచ్చని వెల్లడైంది. ముఖ్యంగా మహిళల శరీరాల్లో యాభై మిల్లీ గ్రాముల మేర రసాయన 'పారబెన్లు' సౌందర్య పదార్థాల ద్వారానే వెళుతున్నట్లు తెలుస్తోంది. కెనడా, ఐరోపాల్లో వీటి వాడకాన్ని కట్టుదిట్టం చేశారు. ప్రపంచ దేశాల్లో రసాయన మిళితమైన సౌందర్య సాధనాలవల్ల వాటిల్లే హానిని దృష్టిలో పెట్టుకొని- సహజసిద్ధ పదార్థాలను, నూనెలను, లేపనాలను ప్రోత్సహిస్తున్నారు. వీటివల్ల మనుషుల ఆరోగ్యానికి భరోసా లభించడంతోపాటు- వాణిజ్యావకాశాలూ వెల్లువెత్తుతాయి.

అపార అవకాశాలు

భారత్‌లో 45వేల జాతుల వనమూలికలు ఉన్నాయి. వాటిలో 15వేలనుంచి 20వేల దాకా ఔషధ గుణాలు ఉన్నాయి. వైద్యపరంగా ఉపయోగపడే వనమూలికలు దేశంలో సుమారు ఏడున్నరవేల దాకా లభ్యమవుతున్నాయి. ఆయుర్వేదంలో 2000, యునానిలో 1000, సిద్ధవైద్యంలో 1300, టిబెటన్ల వైద్యంలో 500, ఆధునిక వైద్యంలో 200 వరకు ఈ వనమూలికలను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆధునిక రసాయనాలతో పాటు ఔషధ మొక్కలను, వాటి మూలపదార్థాలను కలిపి వాడుతున్నారు. మూలికల ద్వారా సేకరించిన పదార్థాల విలువ ఎనిమిది కోట్ల డాలర్లకు పైమాటే అని అంచనా. మిగిలిన దేశాలతో పోలిస్తే భారత్‌లో వనమూలికా సిరులను వాణిజ్య విస్తరణకు ఉపయోగించడం బాగా తక్కువ. భారత్‌లో 7,800 చిన్న, పెద్ద యూనిట్లలో సుమారు 200 టన్నుల మూలికలను మాత్రమే ఉపయోగిస్తున్నారని అంచనా. సహజ ఔషధ మొక్కల ఉపయోగం ఇతర దేశాల్లో గణనీయంగా పెరిగింది. ఆహార, సౌందర్యావసరాలకోసం వినియోగించే సహజ పదార్థాలను, వనమూలికలతో తయారు చేసిన మిశ్రమాలను ఐరోపాలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఆహార పదార్థాల్లో సుగంధ ద్రవ్యాలు, సహజ వనరులతో తయారు చేసిన నూనెలను పాశ్చాత్యదేశాల్లో అధికంగా వినియోగిస్తున్నారు. భారత్‌లోనూ సౌందర్య సాధనాలు, ఆహార పదార్థాల్లో కొంతమేర సహజ ఔషధాలను కలిపి వాడుతున్నారు. ఇది హర్షించదగిన విషయం. అయితే బహుళజాతి కంపెనీల రంగ ప్రవేశంతో పరిస్థితి మారిపోయింది. రసాయనాలను ఉపయోగించి తయారు చేసినవాటిని కూడా 'సహజ పదార్థాల' (నేచురల్, హెర్బల్) పేరిట విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. భారతీయులు

ప్రకృతి సిద్ధ వైద్యం - దేశానికి వరం

సహజ పదార్థాలను ఇష్టపడటం ఇందుకు ఒక కారణం. మరోవంక ఆయుర్వేద ఔషధాలు, సౌందర్య సాధనాలపై పన్నులు కనిష్ఠంగా ఉండటం మరో కారణం. అందుకే వివిధ కంపెనీలు 'సహజం' అన్న పేరిట అసహజ రసాయన పదార్థాలనూ ప్రజలకు అంటకట్టేస్తున్నాయి. అంతర్జాతీయ, జాతీయ ప్రమాణాల ప్రాతిపదికన తయారైన వస్తువులను కొంతవరకు నమ్మకంగా ఉపయోగించవచ్చుగానీ- పూర్తి వాణిజ్యావసరాలకోసమే విక్రయిస్తున్న పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండక తప్పదు. బాహ్యంగా ఈ పదార్థాలను ఉపయోగిస్తే పెద్ద నష్టం ఉండకపోవచ్చు. అయితే వాటిని ఔషధ రూపంలో వాడాలంటే మాత్రం వైద్యుల సలహా తప్పనిసరి.

భారత్‌లో ఆయుర్వేద, సిద్ధ, యునాని, హోమియో ఔషధాలకు సంబంధించి చట్టపరమైన ప్రమాణాలున్నాయి. వాటి తయారీ, వాడకాలపై 1940లో చట్టం తీసుకువచ్చారు. భారత ప్రభుత్వం ఔషధ మొక్కల తయారీ, విక్రయంపై 2005లో నిబంధనలు ప్రవేశపెట్టింది. ప్రతి ఔషధ మూలికకు సంబంధించి ప్రమాణాలు నిర్దేశించింది. వాటి పేరు, లక్షణాలు, ఉపయోగాలను లిఖితబద్ధం చేసి- మేధాచౌర్యం జరగకుండా చర్యలు తీసుకొంది. ఏది ఎలా పనిచేస్తుందన్న వివరాలు వెల్లడిస్తూ, 320 రకాల ఔషధాల గురించి చర్చించారు. చైనా, యూకే, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాల్లో ఔషధ మొక్కలకు సంబంధించి స్పష్టమైన విధానాన్ని రూపొందించే క్రమంలో వాటిని మూలికలుగా నిర్ధారించారు. అమెరికా, నెదర్లాండ్స్‌లలో వీటిని ఆహార అనుబంధ పదార్థాలుగా నిర్ధారించారు. దీనివల్ల ఈ ఔషధాలను ఒక దేశంనుంచి మరో దేశానికి ఎగుమతి, దిగుమతి చేసుకోవాలంటే పద్ధతులు మారుతుంటాయి.

ఆదరిస్తే బహుళ ప్రయోజనాలు

భారత్‌లో 326 ఔషధ మొక్కలను ఆయుర్వేద ధ్రువీకృత జాబితాగా రూపొందించారు. మన దేశంలో లభ్యమవుతున్న అపారమైన వనమూలికా సిరులతో పోలిస్తే ఈ సంఖ్య బాగా తక్కువ. వీటిని నిర్దిష్ట ప్రమాణాల్లో 'ప్యాక్' చేయాలని, పూర్తి వివరాలను పేర్కొనాలని, ఎప్పటిలోగా ఉపయోగించాలన్న తుది గడువును నిర్దేశించాలన్న నిబంధనలు రూపొందించారు. అత్యంత శుభ్రమైన వాతావరణంలో సేకరించి, సకల వసతులతో కూడిన కర్మాగారంలో ఈ ఔషధాలను తయారు చేయాల్సి ఉంటుంది. భారత్‌లో గణనీయమైన వన సంపద ఉన్నప్పటికీ- అవగాహన లోపాల కారణంగా మిగిలిన దేశాలతో పోలిస్తే ఎగుమతుల విషయంలో వెనకబడుతున్నాం. 1945నాటి చట్టంలోని 17ఏ ప్రకారం కల్తీ ఔషధాలు, 17బి ప్రకారం హానికారక పదార్థాలుగానీ ఉంటే- భారతీయ శిక్షాస్మృతిలోని 320 నిబంధన ప్రకారం శిక్షార్హులు. ఒకవేళ సరైన 'లైసెన్స్' లేకుండా విక్రయిస్తే సెక్షన్-18 ప్రకారం ఏడాదిపాటు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. సౌందర్య సాధనాల చట్టంలోని 17డి, 17ఈ నిబంధనల ప్రకారం విక్రయించిన వస్తువులు ప్రమాదకరమైనవని, చర్మ సమస్యలు పెంచేవని తేలితే కనీసం మూడేళ్లకు తక్కువ కాకుండా జైలుశిక్ష విధించవచ్చు. సహజ వనరుల పరిరక్షణకు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వివిధ ప్రయత్నాలు చేస్తున్నాయి. అదృష్టవశాత్తూ భారత్‌లో వనసంపదకు కొదవలేదు. ప్రభుత్వ సంస్థలు, స్థానిక వ్యవస్థలు, గ్రామీణులు, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటుతో ఈ వనమూలికా సిరులను పరిరక్షించుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అన్ని రకాల వృక్షాలను, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించే చెట్లను ప్రభుత్వ పాఠశాలల్లో, మైదానాల్లో నాటాలి. అప్పుడే అవి ముందు తరాలవారికి ఆరోగ్యాన్ని హామీగా ఇస్తాయి. ప్రభుత్వపరంగా ఉత్పత్తి, నాణ్యత, పరిశోధన-అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేస్తే దేశీయ ఔషధాలకు ఎగుమతి విలువ ఇనుమడిస్తుంది. సహజ సిద్ధ వనరులతో తయారైన ఔషధాల తయారీ, పంపిణీ, వినియోగాల పర్యవేక్షణకు 'ఆయుర్వేద సమన్వయ కమిటీ'ని ఏర్పాటు చేయాలి. సహజ సిద్ధ ఔషధాలకు సంబంధించి భారత ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు కదిపితే- జాతి జనులను వేధిస్తున్న ఎన్నో ఆరోగ్య సమస్యలకు సహజ పరిష్కారాలు సాధ్యపడతాయి!

- డాక్టర్ పెద్ది రమాదేవి

వాడిన మొగ్గలు

మొక్కై వంగనిది మానై వంగుతుందా?' అని ఒక సామెత ఉంది. ఈ సామెత ఎదిగే పిల్లల విషయంలో వాడుకలో ఉన్నదని అందరికీ తెలుసు. పసితనం మొగ్గలాంటిది. యౌవనం కాయలాంటిది. వార్ధక్యం పండులాంటిది. ఈ మూడు దశలూ వాడిపోకుండా వికసించాలంటే మొగ్గదశ వాడిపోకుండా ఉండాలి. మొగ్గ దశలోనే వాడిపోతే రాలిపోవడం తప్ప మరో దారి లేదు. నేడు సమాజంలో బాల్యం ఇలాంటి దుర్భరావస్థను ఎదుర్కొంటోంది. కాలపరిణామంలో మనిషి దిన దిన ప్రవర్ధమానం కావాలేగానీ దినదిన పతనం కాకూడదు. మొగ్గలు పతనమై ముళ్లదారుల్లోకి చేరుతున్నా తోటమాలులు అటువైపు చూడటం లేదు. ఇదంతా పసివాళ్ల పట్ల పెద్దల అలసత్వానికి నిదర్శనమే.

పెద్దలు పూర్వం తల్లిదండ్రులకు ఎన్నో హితబోధలు చేసేవారు. పిల్లలను అయిదేళ్ల వయసుదాకా గారాబంగా లాలిస్తూ పెంచాలని, అయిదు నుంచి పదేళ్లదాకా భయభక్తులను తెలియజెప్పి, అదుపులో ఉంచాలని, పదహారేళ్ల తరవాత పిల్లలను స్నేహితుల్లా చూడాలని ప్రబోధించేవారు. ఈ ప్రబోధాలను ఇప్పుడు వినేవారే కరవయ్యారు.

అలనాటి పిల్లల చదువులకు, ఈనాటి పిల్లల చదువులకు 'హస్తిమశకాంతర భేదం' (ఏనుగుకు, దోమకు ఉన్నంత తేడా) ఉంది. పూర్వం చదువులన్నీ గురుకులాల్లో జరిగేవి. గురువు శిక్షణ మాత్రమే కాదు, ప్రవర్తననూ ప్రబోధించేవాడు. శుకనాసుని వంటి గురువులు చంద్రాపీడుని వంటి శిష్యులకు ఏది సన్మార్గమో, ఏది దుర్మార్గమో విశదీకరించి చెప్పి, సన్మార్గంలో నడిపించేవారు. 'చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!' అంటూ ప్రహ్లాదుడి వంటి కొడుకు, తండ్రికి తాను చదువుల రహస్యాలను తెలుసుకొన్నానని చెప్పేవాడు. కానీ నేడు తల్లిదండ్రులు, పిల్లలు చదువుల పట్ల అవగాహనతో ఉన్నారో లేదో తెలియదు. ప్రపంచంలో స్పర్ధకు (పోటీకి) నిలబడే చదువులను చదివించాలనుకునే తల్లిదండ్రులు, అపార ధనాన్ని సంపాదించడానికి ఉపయుక్త విద్యలే చదవాలనే కాంక్షగల పిల్లలు- నైతికతకు, మానవ సంబంధాలకు

అంతర్యామి

తిలోదకాలిచ్చి విద్యాభ్యాసంలో పురోగమిస్తున్నామనుకోవడం శోచనీయం.

అధునాతన విద్యల పుణ్యమా అని అనుచిత వ్యసనాలు పసిమొగ్గలను కాల్చివేస్తున్నాయి. చిన్నారులను సన్మార్గంలో ఉంచాలనే స్పృహను కోల్పోతున్న ఎందరో పెద్దలు ప్రాచీనుల సూక్తులను చెవికి ఎక్కించుకోవడం లేదు. అడుగడుగునా అలసత్వం, అణువణువునా ఉదాసీనత- మొగ్గలకు పతన మార్గాలను తెరుస్తున్నాయి. ఉన్మాదభరితమైన వాతావరణానికి అలవాటుపడే విధంగా ప్రోత్సహిస్తున్నాయి. చేతినిండా పుష్కలంగా ధనం, విచ్చలవిడిగా తిరిగే స్వేచ్ఛ తల్లిదండ్రులు ప్రసాదిస్తుంటే మొగ్గలకు విద్యాఫలాల మాధుర్యం ఎలా తెలుస్తుంది?

నీతి లేదు. రీతి లేదు. ఖ్యాతి అవసరం లేదు. ఇదీ నేటి ఎందరో వైఖరి. ఏ మహనీయులు మాతృభూమి రుణం తీర్చుకోవడానికి వీధి దీపాల కింద చదువుకొని ప్రపంచానికే వెలుగుదీపాలు వెలిగించారో, ఆ మహనీయులు పుట్టిన నేలలో చీకటి వ్యామోహ సామ్రాజ్యాల్లో గుడ్లగూబలవలె మొగ్గలు తిరుగుతూ ఉండటం అవమానకరం. సమాజానికి మార్గదర్శకులు తల్లిదండ్రులే. తల్లిదండ్రుల ప్రవర్తన నూటికి నూరుపాళ్లు మొగ్గలవంటి పిల్లలపై ప్రసరిస్తుంది. వాడిన పువ్వులే కాదు, వాడిన మొగ్గలూ మట్టిలో కలిసిపోతాయి. వాటికి రూపం కూడా మిగలదు. కనుక పసితనాన్ని వాడనీయకుండా చక్కగా పెంచి పోషించవలసిన గురుతర బాధ్యత తల్లిదండ్రులదే!

- డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

చంద్రబాబు, ఈశ్వరన్ సారథ్యంలో నేడు జేఐఎస్‌సీ సమావేశం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ మంత్రి ఎస్.ఈశ్వరన్‌ల అధ్యక్షతన గురువారం ఉదయం సంయుక్త అమలు పర్యవేక్షణ కమిటీ (జేఐఎస్‌సీ) సమావేశం జరగనుంది. ఆంధ్రప్రదేశ్, సింగపూర్ అధికారులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. చంద్రబాబు, ఈశ్వరన్‌ల సారథ్యంలో జరుగుతున్న మూడో జేఐఎస్‌సీ సమావేశం ఇది. విజయవాడలోని ఒక హోటల్‌లో ఈ సమావేశం జరుగుతుంది. రాజధానిలో 1691 ఎకరాల్లో అంకుర ప్రాంతం అభివృద్ధికి సంబంధించి కీలక ఒప్పందాలు జరుగుతాయి. అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ), సింగపూర్-అమరావతి ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్స్(ఎస్ఏఐహెచ్) మధ్య భాగస్వాముల ఒప్పందం, సీఆర్‌డీఏ, ఏడీసీ, ఎస్ఏఐహెచ్ మధ్య రాయితీ ఒప్పందం జరుగుతాయి.

నాలుగేళ్లలో నలభై ఏళ్ల అభివృద్ధి: కంభంపాటి

ఈనాడు అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఈ నాలుగేళ్లలో నలభై ఏళ్ల అభివృద్ధిని సాధించిందని తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కంభంపాటి రామ్మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్, 22 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటుతో పాలనా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు... రాజధాని కూడా లేని రాష్ట్రాన్ని ఇతర రాష్ట్రాలు అబ్బురపడేలా అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. దేశంలో రైతులు, పేదల సంక్షేమానికి ఎక్కువగా నిధులు ఖర్చు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ఏటా రూ.60 వేల కోట్లు కేవలం సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని కంభంపాటి పేర్కొన్నారు.

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నిపుణులతో కార్యదళం

అమరావతిలో నిర్మాణాలపై సలహాలు, సూచనల కోసం ఏర్పాటు

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లోని నగరాల పరిశోధనా విభాగంలో నిపుణులైన 10 మందితో 'అమరావతి కార్యదళం (టాస్క్‌ఫోర్సు)' ఏర్పాటైంది. పట్టణాల అభివృద్ధి, ప్రణాళికా వ్యవహారాల్లో 20ఏళ్ల అనుభవం ఉన్న కొలంబియా, జొహాన్నెస్‌బర్గ్, దుబాయ్ తదితర దేశాలకు చెందిన నిపుణులు ఇందులో ఉంటారు. వీరంతా ఆగస్టులోగా ఒక వ్యూహ పత్రాన్ని రూపొందిస్తారు. సీఆర్‌డీఏ కమిషనరు శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌ను సందర్శించిన సందర్భంగా ఈ ఏర్పాటు జరిగింది.

8న సీపీఎస్ రద్దు కోసం ధర్నాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: కాంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని(సీపీఎస్) రద్దు కోరుతూ జూన్ 8న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు సమాఖ్య ఛైర్మన్ బాబురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఐకాస, ఫ్యాప్టో సభ్య సంఘాలు పాల్గొనాలని కోరారు.

కన్నడనాట మంత్రివర్గ విస్తరణ

ఈనాడు - బెంగళూరు

కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్.డి.కుమారస్వామి బుధవారం 25 మందితో మంత్రివర్గాన్ని మొదటి సారిగా విస్తరించారు. దీంతో మంత్రివర్గంలోని సభ్యుల సంఖ్య 27కి పెరిగింది. బెంగళూరు రాజభవన్‌లో బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు గవర్నరు వజూభాయి వాలా ప్రమాణం చేయించారు. కాంగ్రెస్ నుంచి 14 మంది; జేడీఎస్ తరఫున తొమ్మిది మంది; ఎన్నికల్లో జనతాదళ్ మిత్రపక్షంగా వ్యవహరించిన బీఎస్పీ, కాంగ్రెస్ అనుబంధంగా పనిచేసిన కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీల నుంచి ఒక్కొక్కరు మంత్రులయ్యారు. మంత్రివర్గ సభ్యుల గరిష్ఠ సంఖ్య 34. తాజా విస్తరణ తర్వాత కూడా ఇంకా ఏడుగురికి అవకాశం ఉంది. ఇందులో కాంగ్రెస్ వాటా ఆరు, జేడీఎస్‌ది ఒకటి. అసమ్మతి తెలియజేస్తున్న వారిని బుజ్జగించేందుకు, తిరుగుబాటు దార్ల నియంత్రణకు వాటిని వినియోగించుకోనున్నట్లు రెండు పార్టీల వర్గాల ద్వారా తెలుస్తోంది.

ప్రమాణ స్వీకార అనంతరం గవర్నర్‌తో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు

మంత్రుల జాబితా(కాంగ్రెస్): 1. ఆర్.వి.దేశ్‌పాండే 2. డి.కె.శివకుమార్ 3. కృష్ణ బైరేగౌడ 4. ప్రియాంక్ ఖర్గే 5. వెంకటరమణప్ప 6. జమీర్ అహ్మద్‌ఖాన్ 7. అబ్దుల్ ఖాదర్ 8. శివశంకరరెడ్డి 9. శివానంద పాటిల్ 10. రాజశేఖర పాటిల్ 11. కె.జె.జార్జి 12. రమేశ్ జార్ఖిహోళి 13. పుట్టరంగశెట్టి 14. జయమాల (విధానపరిషత్తు సభ్యులు) 15. ఆర్.శంకర్ (కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పక్ష).

జనతాదళ్ అమాత్యులు: 1. హెచ్.డి.రేవణ్ణ 2. బండెప్ప కాశంపూర్ 3. డి.సి.తమ్మణ్ణ 4. పుట్టరాజు 5. జి.టి.దేవేగౌడ 6. సా.రా.మహేశ్ 7. వెంకటరావు నాడగౌడ 8. ఎం.సిమనుగొళి 9. శ్రీనివాస్ 10. మహేశ్ (బీఎస్పీ).

రత్నప్రభపై కర్ణాటక స్పీకర్ ఆగ్రహం

రాజధానిలో బుధవారం నిర్వహించిన కుమారస్వామి ప్రభుత్వ మంత్రివర్గ తొలి విస్తరణ కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకున్న అధికార యంత్రాంగం పట్ల విధాన సభాపతి రమేశ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రధాన కార్యదర్శి రత్నప్రభ కారణమని తప్పుపట్టారు. ఆమె క్షమించరాని నేరానికి పాల్పడినట్లు ధ్వజమెత్తారు. 'మీ ఆహ్వానం ప్రకారం మంత్రివర్గ విస్తరణ కార్యక్రమానికి బయలుదేరి రాజ్‌భవన్ ఎదుట అరగంట పాటు నిరీక్షించా. అక్కడ సిబ్బంది ఎవ్వరూ సహకరించలేదు. చివరికి నిస్సహాయంగా వెనుదిరిగా. మీ అధికారుల దురహంకారం, అజ్ఞానం, రాజ్‌భవన్ లోపలి అధికారుల తీరే ప్రస్తుత పరిస్థితికి కారణం. మీ ఈ క్షమించరాని నేరాన్ని ప్రతిఘటిస్తూ ఉత్తరాన్ని ముగిస్తున్నాను'అని అధికార యంత్రాంగం కర్తవ్య పాలనా రాహిత్యాన్ని ఎండగట్టారు.

మంత్రి పదవి చేపట్టిన శివశంకర్‌రెడ్డిని అభినందిస్తున్న స్పీకర్ రమేష్‌కుమార్

కర్ణాటక మంత్రివర్గంలో తెలుగువారికి ఒక్కరికే అవకాశం

ఈనాడు-బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణలో తెలుగు మూలాలున్న ఒకరికి మాత్రమే స్థానం లభించింది. చిక్కబళ్లాపుర జిల్లా గౌరిబిదనూరు విధానసభ స్థానం నుంచి ఐదుసార్లు ఎన్నికైన శివశంకరరెడ్డిని ఎట్టకేలకు మంత్రి పదవి వరించింది. ఆయన గత ప్రభుత్వంలో విధానసభ ఉపసభాపతిగా పని చేశారు. ప్రస్తుత సభాపతి రమేశ్‌కుమార్ మూలాలు కూడా తెలుగే.

ప్రవాసాంధ్రుల కోసం ఎన్ఆర్ తెదేపా

• రాబోయే ఎన్నికల్లో మరింత భాగస్వామ్యం

ఈనాడు, అమరావతి: పార్టీ కార్యక్రమాల్లో ప్రవాసాంధ్రులకు మరింత భాగస్వామ్యం కల్పించాలని తెదేపా నిర్ణయించింది. రాబోయే ఎన్నికల్లో వారి సేవలను విస్తృతంగా వినియోగించుకునేలా వ్యూహాలు సిద్ధం చేస్తోంది. ప్రవాసాంధ్రులు జన్మభూమి సేవకు ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. రహదారుల నిర్మాణం, తాగునీటి సరఫరా, గుడి, బడి.. తదితర సామాజిక కార్యక్రమాలకు తమ వంతు ఆర్థికసాయం అందిస్తున్నారు. దీన్ని పార్టీకి అనుకూలంగా మలచుకోవాలని తెదేపా నిర్ణయించింది. ఇందులో భాగంగా 'ఎన్ఆర్ తెదేపా విభాగం' ఏర్పాటుపై దృష్టి పెట్టింది. అమెరికాలోని డాలస్ వేదికగా జరిగిన మహానాడుకు హాజరైన మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపీ సీఎం రమేష్, ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధి కోమటి జయరాం సమక్షంలో వివిధ అంశాలకు సంబంధించి 17 తీర్మానాలను ఆమోదించారు. పల్లెల వారీగా అందరి వివరాలు సేకరించి ఎన్ఆర్ తెదేపా సభ్యత్వాలివ్వడం, తరచూ గ్రామాలను సందర్శిస్తూ స్థానికంగా సంబంధాలు పెంచుకోవడంపై దృష్టి సారిస్తారు. అనంతరం వీరంతా ఎన్నికలకు కొద్దిరోజుల ముందే వచ్చి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తెలంగాణలోనూ ఇదే తరహాలో సలహాలు, సూచనలు స్వీకరించనుంది. పలు అంశాల్లో ప్రవాసాంధ్రులకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారు.

ఆనంద సూచికలో ఆంధ్రప్రదేశ్‌కి 44వ స్థానం

ఈనాడు డిజిటల్, విజయవాడ: ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి నెట్‌వర్క్ సంస్థ చేపట్టిన ఆనంద సూచిక సర్వేలో ఆంధ్రప్రదేశ్ 44వ స్థానంలో... రాష్ట్రంలో కృష్ణా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర ప్రణాళికశాఖ కార్యదర్శి సంజయ్‌గుప్తా తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. సామాజికపరంగా ప్రజలకు అందుతున్న మద్దతు, జీవన విధానాన్ని ఎంపిక చేసుకోవడంలో వారికుండే స్వేచ్ఛ, వారిలో వెల్లివిరిసే దాతృత్వం, ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో అవినీతి స్థాయి వంటి పలు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారని ఒక ప్రకటనలో వివరించారు.

'కాలా' విడుదలకు సుప్రీం పచ్చజెండా

దిల్లీ: తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించిన 'కాలా' సినిమా విడుదలకు సుప్రీం కోర్టు పచ్చజెండా ఊపింది. ఆ చిత్ర ప్రదర్శన జరగకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన అభ్యర్థనను తిరస్కరించింది. 'కాలా' చిత్రం కథ, సన్నివేశాలు, పాటలు తమవని పేర్కొంటూ కేఎస్ రాజశేఖరన్ అనే నిర్మాత ఈ పిటిషన్ వేశారు.

పులికాట్‌లో తప్పిన పడవ ప్రమాదం

తడ, న్యూస్‌టుడే: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా తడ మండలంలోని పులికాట్ సరస్సులో బుధవారం సాయంత్రం పడవ ప్రమాదం త్రుటిలో తప్పింది. ఇరకం దీవి నుంచి భీములవారిపాలేనికి 30 మంది భక్తులతో వస్తున్న పడవ నీళ్లలో మునిగిపోయింది. ఒడ్డుకు దగ్గర్లో ఈ ఘటన జరగడంతో.. పెనుప్రమాదం తప్పినట్లయింది. ఇరకం దీవిలో పొన్నియమ్మ రథోత్సవాన్ని వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ఫ్రాన్స్‌వాసికి 'డబ్బుల్' ధమాకా!

పారిస్: ఫ్రాన్స్‌కు చెందిన ఓ వ్యక్తిని లాటరీ లక్ష్మి 18 నెలలవ్యవధిలో 2సార్లు వరించింది. 'మై మిలియన్' లాటరీ 2016 నవంబరు 11న వరించిందని.. గత నెల 18న మరో సారి తగిలిందని వార్తాసంస్థ ఒకటి వెల్లడించింది. లాటరీ కనీస బహుమతి రూ.7.87 కోట్లు కావడం గమనార్హం.

చట్టాలు తెలుగులో అనువాదానికి న్యాయశాఖ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: పదిహేను రాష్ట్ర చట్టాలను తెలుగులో అనువాదం చేసి గెజిట్ ప్రచురించే నిమిత్తం ఏపీ న్యాయశాఖ బుధవారం 'తెలుగు'లో జీవో జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సవరణ) చట్టం-2017, ఏపీ జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్(సవరణ) చట్టం-2017 తదితర చట్టాల్ని తెలుగు అనువాదం చేసేందుకు న్యాయశాఖ కార్యదర్శి దుప్పల వెంకట రమణ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు: ఎస్.ఇ (ఎలక్ట్రికల్), తిరుపతి

ఆసక్తి వ్యక్తీకరణ

2018వ సంవత్సరంలో జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు (సాలకట్ల మరియు నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండింటికీ కూడా) తిరుమలకు విచ్చేయు భక్తులకు ఆధ్యాత్మిక ఆహ్లాదాన్ని కల్పించే విషయమై ఇల వైకుంఠంగా ఖ్యాతిగాంచి శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైయున్న తిరుమల కొండను దగద్ధగాయమైన విద్యుద్దీపాలంకరణను ఏర్పాటు చేయుటకు తితిదే భావించడమైనది. వివరాలకుగాను లాగాన్ అవ్వవలసిన వెబ్‌సైట్ www.tirumala.org

Roc.No.PR4/1090/Adv.No.94/PRO/2018, Dated: 06.06.2018. - కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఆరోగ్యము మరియు కుటుంబ సంక్షేమ శాఖ

ప్రకటన

No. 17/CH&FW/NHM/QA&QM/2015 తేది: 4-6-2018

నేషనల్ హెల్త్ మిషన్, ఆంధ్రప్రదేశ్ నందు పూర్తిగా ఒప్పంద ప్రాతిపదికపై దిగువ పేర్కొన్న వివరాలతో దిగువ చూపబడిన ఉద్యోగాల భర్తీ కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవి. స్టేట్ కన్సల్టెంట్ ఫర్ పబ్లిక్ హెల్త్: (స్టేట్ లెవెల్ 1 పోస్టు), O/o CH&FW, గొల్లపూడి, విజయవాడ, డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ ఫర్ పబ్లిక్ హెల్త్ 13 పోస్టులు. (ప్రతి జిల్లా నందు 1 పోస్టు). దరఖాస్తులు మా వెబ్‌సైట్ cfw.ap.nic.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. పూర్తిచేసిన దరఖాస్తులు CH & FW అధికారికి వ్యక్తిగతంగా లేదా తపాలా లేదా e-మెయిల్ ద్వారా (apstatequality@gmail.com) గానీ దాఖలు చేయవచ్చును. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది: 19-6-2018 సా.గం. 4.00.

సం/- కమిషనర్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్ & మిషన్ డైరెక్టర్, నేషనల్ హెల్త్ మిషన్

DIPR No. 689/CL/Advt/1/1/2018-19

ओएनजीसी ONGC

HPHT ఎసెట్, కాకినాడ (ఆం.ప్ర.)

ఆసక్తి వ్యక్తీకరణ

ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్, గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మరియు జ్యూబిలంట్ ఆఫ్‌షోర్ డ్రిల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కూడిన జాయింట్ వెంచర్ (JV) DDW ఫీల్డ్‌ను అభివృద్ధి పరచుచున్నది. HPHT ఎసెట్, ONGC లిమిటెడ్, ఇండియా వారు ప్రముఖ సర్వీస్ ప్రొవైడర్ల నుండి JV బ్లాక్ KG-OSN-2001/3 నందు వెల్స్ కొరకు HF కన్సల్టెన్సీ సర్వీసెస్ ఏర్పాటు కొరకు "పార్టీస్ టు ప్రీ క్వాలిఫై" ఆహ్వానిస్తున్నారు. కాంట్రాక్టు నిర్వహణ ప్రదేశం: KG-OSN-2001/3 బ్లాక్ (ఈస్టర్న్ ఆఫ్‌షోర్, ఇండియా), HPHT ఎసెట్, ఆం.ప్ర., ఇండియా. డాక్యుమెంట్లు దాఖలు: వెబ్‌సైట్ నందు ప్రచురితమైన విధంగా PQC నందు కోరిన విధంగా సమకూర్చవలసిన అవసరం గలవి, తప్పనిసరిగా అమలులో ఉన్న డాక్యుమెంట్లు దాఖలు చేయవలెను. డాక్యుమెంట్లు దాఖలు తేది మరియు ప్రదేశం: ఈ ప్రకటన ప్రచురితమైన తేదీ నుండి 10 కేలండర్ రోజులలోపు. PQC మరియు అనుబంధంలు డౌన్‌లోడింగ్: PQC మరియు అనుబంధంలు డౌన్‌లోడ్ చేసుకొనుటకు దర్శించండి వెబ్‌సైట్ లింక్: https://tenders.ongc.co.in

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
ADMINISTRATIVE OFFICE, LAM, GUNTUR-522 034, ANDHRA PRADESH

Ref. No.14181/Exams/Admissions/2018(3) Dated: 05-06-2018

Admission Notification

Applications are invited for admission into the following U.G. degree courses of Acharya N.G. Ranga Agricultural University (ANGRAU), Guntur, Andhra Pradesh for the academic year 2018-19.

S. No	Name of the Degree Course(s)	Eligibility Criteria	Type of Application Form
1.	a) B.Tech. (Agricultural Engineering) b) B.Tech.(Food Technology)	AP EAMCET 2018 under M.P.C stream for farmers Quota (40%) seats only	Form - B
2.	B.Sc.(Hons) Community Science (Girls Only) (formerly B.Sc. (Hons) Home Science)	Intermediate (Bi.P.C / M.P.C / M.Bi.P.C.) marks basis without EAMCET	Form - C

The candidates have to download the application forms accordingly **(Form 'B' and Form 'C' as may be applicable)** and information brochure from the University website **www.angrau.ac.in**. The duly filled in application along with enclosures and proof of payment should reach **REGISTRAR, Acharya N.G. Ranga Agricultural University, Administrative Office, LAM, Guntur-522 034, A.P.** on or before **26.06.2018 by 4.00 P.M.** Candidates must read carefully the information brochure before applying. Candidates who apply only will be called for counseling. The seats will be allotted during open manual counseling.

The admission notification for various U.G Courses under Bi.P.C. stream in ANGRAU, SVVU & Dr.YSRHU viz., B.Sc.(Hons) Agriculture, B.Tech. (Food Technology), B.V.Sc. & A.H, B.F.Sc. and B.Sc. (Hons) Horticulture will be issued soon.

D. BHASKARA RAO
REGISTRAR

వైకాపా ఎంపీలది రాజీనామా డ్రామా

సార్వత్రిక ఎన్నికలకు సంవత్సరం ముందు ఎన్నికలు రావని తెలిసే వైకాపా ఎంపీలంతా రాజీనామా చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు వారి చర్యలను గమనిస్తున్నారు. ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతారు.
– మంత్రి జవహర్ (అనంతపురం జిల్లా లేపాక్షిలో నవనిర్మాణ దీక్షలో)

నమ్మక ద్రోహం!: రోజుకో డ్రామా ఆడుతూ వైకాపా ఎంపీలు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తున్నారు. కర్ణాటక ఎంపీలు యడ్యూరప్ప, శ్రీరాములు తమ రాజీనామాలను 48 గంటల్లో ఆమోదింప చేసుకున్నారు. ఏప్రిల్ 6న రాజీనామాలు చేసిన వైకాపా ఎంపీలు ఇప్పటివరకు ఎందుకు ఆమోదింప చేసుకోలేకపోయారో చెప్పాలి. – ఎంపీ కేసినేని (దిల్లీలో విలేకరులతో)

ఎదిరించే దమ్ములేకే..: ఎంపీలుగా గెలిపించి, పార్లమెంటులో ప్రశ్నించే హక్కు ప్రజలు కల్పిస్తే, మోదీ ప్రభుత్వాన్ని ఎదిరించే దమ్ములేక వైకాపా ఎంపీలు రాజీనామా నాటకాలు ఆడుతున్నారు. రెండు, మూడేళ్లుగా రాజీనామాలంటూ వైకాపా ఎంపీలు చెబుతూ, తీరా ఉప ఎన్నికలు రాని తరుణంలో రాజీనామా నాటకానికి తెరలేపారు.
–మంత్రి దేవినేని ఉమా (విజయవాడలో విలేకరులతో)

గూగుల్ వెస్టెడ్ టూ లోటస్: జీవీఎల్ అంటే 'గూగుల్ వెస్టెడ్ టూ లోటస్' లా తయారయ్యారు. ఎన్నికలు జరగకుండా వైకాపా ఎంపీల రాజీనామాలు ఆమోదం చేసుకునే కుట్రలో జీవీఎల్ నరసింహారావు పాత్రపై అనుమానాలు ఉన్నాయి. జగన్ ఏజెంట్‌గా జీవీఎల్ వ్యవహరిస్తూ.. రాష్ట్రం కోసం సేవ చేస్తున్న కుటుంబరావుపై వ్యక్తిగతంగా మాట్లాడడం ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనం. విభజన హామీల అమలులో చేసిన మోసాన్ని పక్కదోవ పట్టించేందుకే ఎయిర్ ఏసియా వ్యవహారంలో చంద్రబాబు పేరును ప్రస్తావిస్తున్నారు.
– తెదేపా అధికార ప్రతినిధి లంకా దినకర్ (అమరావతిలో విలేకరులతో)

వైకాపా ఎంపీల రాజీనామాపై చర్చ అనవసరం: వైకాపా ఎంపీల రాజీనామాలపై చర్చించాల్సిన అవసరం లేదు. పోరాడాల్సిన, త్యాగాలు చేయాల్సిన సమయంలో పట్టించుకోకుండా ఇప్పుడు పోరాటాలు, రాజీనామాలు చేసి ప్రయోజనం ఏమిటీ?.–పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి (దిల్లీలో విలేకరులతో)
–న్యూస్‌టుడే, లేపాక్షి, విజయవాడ, ఈనాడు, దిల్లీ, అమరావతి

మళ్లీ ధ్రువీకరణ లేఖలు ఇవ్వండి

- వైకాపా ఎంపీలకు సభాపతి సూచన
- లేఖలిచ్చాం.. రాజీనామాలు ఆమోదించినట్లే: వైకాపా ఎంపీలు

ఈనాడు – దిల్లీ

రాజీనామాలు చేస్తున్నట్లు మళ్లీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని వైకాపా ఎంపీలకు లోక్‌సభ స్పీకరు సుమిత్రా మహాజన్ సూచించారు. బుధవారం ఆమెతో వైకాపా ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం మహాజన్ మీడియాతో మాట్లాడారు. రాజీనామాలపై పునరాలోచించుకోవాలని ఎంపీలకు సూచించానని, రాజీనామాలకు కట్టుబడి ఉంటామని వారు చెప్పడంతో మరోసారి ధ్రువీకరణ లేఖలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. లేఖలు ఇచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు. వైకాపా ఎంపీలు మీడియాతో మాట్లాడుతూ.. సభాపతి కోరిన మేరకు మళ్లీ ధ్రువీకరణ లేఖలు ఇచ్చామని తెలిపారు. రాజీనామాలను ఆమోదించాల్సిందేనని విజ్ఞప్తి చేశామని చెప్పారు. తుది నిర్ణయం ఇదేనా అని స్పీకరు ప్రశ్నించారని, అవునని సమాధానమిచ్చామని వెల్లడించారు. పార్టీ ఫిరాయించిన ఎంపీల అనర్హతపైనా చర్చించామని, ఇద్దరు ఎంపీలపై ఇప్పటికే లేఖలిచ్చామని చెప్పామని, మరో ఎంపీపై ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. ఈ అంశాన్ని కూడా పరిశీలిస్తానని స్పీకరు హామీ ఇచ్చారని తెలిపారు.

బుధవారం దిల్లీలో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిసిన వైకాపా ఎంపీలు

ఎంపీలందరి రాజీనామాతోనే ప్రత్యేక హోదా

- వైకాపా అధ్యక్షుడు జగన్ స్పష్టీకరణ

ఉండ్రాజవరం, పెరవలి గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎంపీలందరూ ఒకేసారి రాజీనామా చేసి, నిరాహార దీక్ష చేపట్టి ఉంటే కేంద్రం దిగి వచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేదని వైకాపా నేత జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెరవలి మండలం నడిపల్లికోటలో బుధవారం ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 23 మంది వైకాపా ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ వైపు తిప్పుకున్నారని విమర్శించారు. వారితో ఎందుకు రాజీనామా చేయించడం లేదని ప్రశ్నించారు. అందులో నలుగురికి మంత్రి పదవులిచ్చి కేబినెట్‌లోకి తీసుకున్నారని, వారికి తెదేపా టిక్కెట్ ఇచ్చి గెలిపించే సత్తా, నమ్మకం ముఖ్యమంత్రికి లేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో తెదేపా ఎంపీలతో రాజీనామా చేయించి ఉంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎప్పుడో వచ్చేదని అభిప్రాయపడ్డారు. 4 పేపర్లు, 4 ఛానళ్లు తెదేపాకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. చిత్తశుద్ధితో వైకాపా ఎంపీలు రాజీనామాలు చేస్తే దాన్ని వక్రీకరించే అధ్వానమైన పరిస్థితి ఎక్కడైనా ఉంటుందా అని ప్రశ్నించారు. బుధవారం ఆయన ప్రజాసంకల్ప యాత్ర నిడదవోలు నియోజకవర్గం పరిధిలోని ఉండ్రాజవరం మండలంలో సాగింది.

విలేకరులతో మాట్లాడుతున్న జగన్

అభివృద్ధి పనులపై సానుకూలత

టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: తెదేపా చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజల్లో సానుకూలత ఉందని, దీన్ని మరింత పెంచేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవనిర్మాణ దీక్షలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ దీక్షల నిర్వహణపై బుధవారం ఉదయం కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సత్యం చాలా శక్తిమంతమైనదైనా... ప్రచారం లేకపోతే నిజంపై అబద్ధానిది పైచేయి అవుతుందని వ్యాఖ్యానించారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. నాలుగోరోజు దీక్షలో 26,27,000 మంది పాల్గొనడం శుభసూచకమని పేర్కొన్నారు. 13,607 గ్రామాల్లో అభివృద్ధి పనులు సందర్శించారని, 'సంక్షేమం-సాధికారత'పై 9,073 ప్రాంతాల్లో చర్చలు, 10,912 సాంస్కృతిక, 10,396 క్రీడాపోటీలు, 7,967 ప్రదర్శనలు నిర్వహించినట్లు వివరించారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వ కార్యక్రమాలు బాగున్నాయని 55 శాతం మంది, చంద్రన్న బీమాపై 70 శాతం, చంద్రన్న పెళ్లికానుకపై 69 శాతం, గృహ నిర్మాణంపై 55 శాతం సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. నాలుగో రోజు చర్చలు జరిగాయా అన్న ప్రశ్నకు 47 శాతం జరిగాయని, 53 శాతం జరగలేదని తెలిపినట్లు పేర్కొన్నారు. నిర్దేశిత అంశాలపై చర్చలు మరింతగా జరపాలని ఆదేశించారు. గ్రామసభల్లో అభివృద్ధి ప్రణాళికను చదివి వినిపించాలని చెప్పారు. 5వరోజు 'జ్ఞానభూమి-ఉపాధి కల్పన' అంశంపై చర్చలు నిర్వహించాలని చెప్పారు. నాలుగురోజులూ దీక్షను విజయవంతం చేశారని, మిగతారోజులు మరింత ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు.

రాజధాని గ్రామాల పేదల పింఛన్లకు రూ.16.40 కోట్లు

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాలకు చెందిన భూమిలేని నిరుపేద కుటుంబాలకు పింఛన్లు చెల్లించేందుకు రూ.16.40 కోట్లు విడుదల చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి సంబంధించిన నిధులు. రాజధాని గ్రామాల్లోని భూమిలేని నిరుపేద కుటుంబాలకు నెలకు రూ.2,500 చొప్పున ప్రభుత్వం పింఛను అందజేస్తోంది.

ఉప ఎన్నికలు వస్తాయా? రావా?

ఈనాడు, దిల్లీ: వైకాపా ఎంపీల రాజీనామాలను లోక్‌సభ స్పీకరు సుమిత్రా మహాజన్ ఆమోదిస్తే ఉప ఎన్నికలు వస్తాయా? రావా? అన్న అంశం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 151ఎ ప్రకారం... ఏదైనా నియోజకవర్గం ఖాళీ అయిన రోజు నుంచి 6 నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాలి. అయితే సభ్యుడి పదవీ కాలం ఏడాదిలోపే ఉంటే ఈ నిబంధన వర్తించదని అదే సెక్షన్ కింద ఉన్న మరో ఉప నిబంధన స్పష్టం చేస్తోంది. ఇలాంటి సందర్భాల్లో ఎన్నికల సంఘం.. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి ఆ సమయం లోగా ఉప ఎన్నిక నిర్వహించడం కష్టమని ధ్రువీకరించవచ్చని ఆ నిబంధన చెబుతోంది. ఇదంతా స్పీకరు రాజీనామాలను ఏ తేదీ నుంచి ఆమోదిస్తారు? ఏ తేదీ నుంచి వారి స్థానాలు ఖాళీ అయినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారన్న దానిపై ఆధారపడి ఉంటుందన్న వాదన ఉంది. సాధారణంగా అయితే ఏడాదిలోపు కాలం మిగిలి ఉన్న సమయంలో ఉప ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం లేదని కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనరు సంపత్ పేర్కొన్నారు. చట్టసభ తొలి సమావేశం అయిన రోజు నుంచి ఏడాది కాలాన్ని లెక్కిస్తారని చెప్పారు. వైసీపీ ఎంపీలు ఏప్రిల్ 6వ తేదీన రాజీనామా పత్రాలు సమర్పించారు. దానిపై స్పీకరు సుమిత్రా మహాజన్ మే 29న వారితో సమావేశమై పునరాలోచించుకోవాలని కోరారు. తిరిగి బుధవారం సమావేశమైనప్పుడు అదే విజ్ఞప్తిని మరోసారి చేశారు. ఇప్పటికీ మీరు రాజీనామాలకే కట్టుబడి ఉంటే వాటిని పునఃధ్రువీకరిస్తూ మరోసారి లేఖలు ఇవ్వాలని కోరారు. దీంతో వారు జూన్ 6వ తేదీతో మరోసారి లేఖలు ఇచ్చారు. ఈ లేఖలను పరిగణనలోకి తీసుకుని స్పీకరు రాజీనామాలను ఆమోదిస్తే మిగిలిన సమయం ఏడాదిలోపే ఉంటుంది కాబట్టి ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న విశ్లేషణ వినిపిస్తోంది. అలా కాకుండా వాళ్లు ఏప్రిల్ 6వ తేదీన ఇచ్చిన లేఖలను పరిగణనలోకి తీసుకొని ఆ రోజు నుంచే రాజీనామాలను ఆమోదిస్తున్నట్లు చెబితే ఉప ఎన్నికలకు అవకాశం ఉండొచ్చన్న వాదన ఉంది. 16వ లోక్‌సభ తొలి సమావేశం జూన్ 4న జరిగినందున ఆ తేదీ నుంచి సాధారణ ఎన్నికలు జరగడానికి ఏడాదిలోపే సమయం మిగిలి ఉంటుంది కాబట్టి ఉప ఎన్నికలు పెట్టాల్సిన అవసరం ఉండదని కేంద్ర ఎన్నికల సంఘం మాజీ సలహాదారు కేజే రావు పేర్కొన్నారు.

మోదీతో గవర్నర్ నరసింహన్ భేటీ

- తెలుగు రాష్ట్రాల్లో పాలన పరిణామాలపై నివేదన

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ బుధవారం దిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు వీరి మధ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పాలన, పరిణామాలు, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులు ఇతర అంశాలపై సమగ్ర నివేదికను అందజేశారు. వాటి గురించి సవివరంగా వెల్లడించినట్లు తెలిసింది. తెలంగాణ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం కోసం చేపట్టిన రైతుబంధు, రైతుల కోసం ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్న రైతులకు జీవిత బీమా, ఏపీ ప్రభుత్వం చేపట్టిన నిరుద్యోగ భృతి పథకాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు సమాచారం. ఇతర కార్యక్రమాలు, పథకాల పురోగతిని సైతం ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పురోగతి, పోలవరం ప్రాజెక్టు పనుల నిర్వహణ తీరును గవర్నర్ తెలియజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విభజన అంశాల స్థితిగతులు, తొమ్మిదో, పదో షెడ్యూలు సంస్థల విభజన, విభజన చట్టంలోని అపరిష్కృత హామీలపైనా నరసింహన్ చర్చించారు. ఈ సందర్భంగా రాజకీయ పరిణామాలు, విపక్ష పార్టీలు, ఇతర పార్టీల వ్యవహారాలు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ప్రధానితో భేటీ అనంతరం గవర్నర్ నరసింహన్ దిల్లీ నుంచి బయల్దేరి రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఐదు రోజులుపాటు జరిగిన పర్యటనలో రాష్ట్రపతి అధ్యక్షతన నిర్వహించిన గవర్నర్ల సదస్సులో ఆయన పాల్గొన్న విషయం తెలిసిందే.

3.24 లక్షల పింఛన్ల మంజూరు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద పేదలకు 3,24,976 పింఛన్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జన్మభూమి కమిటీల ఎంపికలో పారదర్శకత లోపించడంతో వీటిని ఆర్టీజీఎస్ ద్వారా ఎంపిక చేసింది. వీటిలో 2,24,846 మంది వృద్ధులు, 61,990మంది వితంతువులు, 17,335 మంది దివ్యాంగులు, 1,866 మంది చేనేత కార్మికులు, 919 మంది కల్లు గీత కార్మికులు ఉన్నారు. ఇప్పటికే 47 లక్షల పింఛన్లను అందిస్తున్న సర్కారు ఇందు కోసం నెలనెలా రూ.522 కోట్లు వెచ్చిస్తోంది. ప్రస్తుతం ఎంపిక చేసిన పింఛన్ల పంపిణీతో ప్రతినెలా అదనంగా మరో రూ.33.37కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.

ఆధార్ అనుసంధానం కాకపోయినా...

ఇళ్ల లబ్ధిదారులకు సొమ్ము జమ

ఈనాడు డిజిటల్, అమరావతి: వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్ల మంజూరు పొంది.. ఆధార్ అనుసంధానం కాక నగదు పొందలేకపోతున్న వారికి ఊరటనిచ్చే విషయమిది. అలాంటివారిని గుర్తించి గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (డీఈఈ) ధ్రువీకరిస్తే వారి ఖాతాలో నగదు జమ చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ 24న 'ఇళ్ల పథకాలకు అనుసంధానం కాక' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ అనుసంధానం కాని కారణంగా సుమారు 60 వేల మంది నగదు అందక అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో డీఈఈ గుర్తింపుతో నేరుగా వారి ఖాతాల్లోకి నగదు జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రెండు సార్లు బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేసినా ఆధార్ అనుసంధానం కాని కారణంగా తిరిగి వెనక్కి వస్తే అలాంటి వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం లబ్ధిదారుల బ్యాంకు ఖాతా నకలు, ఆ ఖాతా నిజమైన లబ్ధిదారుని దేనంటూ డీఈఈ జారీ చేసిన ధ్రువీకరణను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మార్పులకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
సుమారు రూ.136.00 లక్షల విలువ గల 5 పనుల నిమిత్తము నిట్ నెం. SE/(R & B)/GNT/16 నుండి 20/2018-19 తేది: 1-6-2018 ద్వారా టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ www.tender.apeprocurement.gov.in నందు చూడగలరు. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 19-6-2018 సా.3.30 గం.వరకు.
DIPR No. 682/CL/Advt/1/1/2018-19 సం/– పర్యవేక్షక ఇంజినీరు, (ర.భ) వలయము, గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఆర్‌డబ్ల్యుఎస్ & ఎస్ శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.13 నుండి 42/ 2018-19 తేది : 30.5.2018
పనిపేరు : SPSR నెల్లూరు జిల్లాలో NRDWP- SCP & TSP గ్రాంట్ క్రింద మంజూరు కాబడిన 22 SC మరియు 8 ST ఆవాసాల యందు సింగిల్ విలేజ్ స్కీంల ఏర్పాటు. అంచనా విలువ : రూ. 777.00 లక్షలు. టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 7.6.2018. బిడ్ల అప్‌లోడ్‌కు చివరి తేది: 23-6-2018. ఆర్థిక బిడ్ తెరచు తేది : 25-6-2018. తదుపరి వివరాలు e-మార్కెట్ ప్రదేశం www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/– పర్యవేక్షక ఇంజినీరు
DIPR No. 673/CL/Advt/1/1/2018-19 ఆర్‌డబ్ల్యుఎస్ & ఎస్ సర్కిల్, SPSR నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
ప్లాట్ నెం. 9, సర్వే నెం. 49, IT పార్క్, మంగళగిరి–522 503, గుంటూరు జిల్లా అమరావతి రీజియన్, ఆంధ్రప్రదేశ్
టెండరు నోటీసు నెం. 4/APMSIDC/2018-19 తేది: 6–6–2018
దిగువ పనుల కొరకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద టెండర్లు కోరబడుచున్నవి. 1) ఆర్కిటెక్చరల్ అండ్ ఇంజినీరింగ్ సర్వీసెస్: పనుల సంఖ్య: 7. పనుల రమారమి విలువ: రూ. 1,095.50 లక్షలు. 2) సివిల్ పనులు, పనుల సంఖ్య: 22, పనుల రమారమి విలువ: రూ. 8,267.27 లక్షలు. & 3) ఎలక్ట్రికల్ పనులు, పనుల సంఖ్య: 5, పనుల రమారమి విలువ: రూ. 1574.57 లక్షలు. ఇతర వివరాలు వెబ్‌సైట్ http://msidc.ap.nic.in వద్ద చూడవచ్చును.
DIPR No. 149PP/CL/Advt/1/1/2018-19 సం/- మేనేజింగ్ డైరెక్టర్

SRI VENKATESWARA VETERINARY UNIVERSITY
ADMINISTRATIVE OFFICE : DR. Y.S.R. BHAVAN : TIRUPATI-517501 :: ANDHRA PRADESH
SHORT TENDER NOTIFICATION FOR DEVELOPING SOFTWARE FOR INVITING ONLINE APPLICATIONS (AP e.procurement Tender No. 197592)
Ref.No.2893/Acad.-I/2018 Dated : 04-06-2018
Sealed tenders are invited from reputed software firms / organizations for developing & implementing suitable software for "inviting online applications from candidates seeking admission into various diploma courses of SVVU during the academic year 2018-19". Tender forms and other details can be downloaded from www.svvu.edu.in from 07-06-2018. Filled in tender forms should accompany ₹ 5,000/- [rupees five thousand only] towards application fee through D.D. drawn in favour of "The Comptroller, Sri Venkateswara Veterinary University, Tirupati". The Technical bid form and financial bid form are to be placed in two separate sealed covers kept in a single cover, should be submitted to the University on or before 15-06-2018 at 4.00 P.M. Tenders will be opened on 18-06-2018 at 10.00 A.M.
D. SRINIVASA RAO
REGISTRAR

TIRUPATI SMART CITY CORPORATION LIMITED :: TIRUPATI
Managing Director. Tirupati Smart City Corporation Limited, Tirupati invites the request for proposals on e-procurement platform from the reputed consulting firms for the following works

RFPs No	Name of the RFPs
5&6 TSCCL/ Projects/ 2018. Dated: 05-06-2018	RFP-5:- Procurement and Maintenance of E-Scooters with GPS Tracking under Implementation of the smart city Mission in Tirupati. RFP-6:- Design, Supply, Installation and Commissioning of Roof Top Solar Photo Voltaic Power Projects Across Multiple Buildings with Operation and Maintenance of 10 years in Tirupati.

The RFPs can be downloaded from https://tender.apeprocurement.gov.in Further details can be obtained from the above website or from the Corporation office during working hours.
Sd/- Managing Director, TSCCL, Tirupati

ఏడు విడతల్లో జేఈఈ కౌన్సెలింగ్

- జోసా ద్వారా 100 విద్యాసంస్థల్లో సీట్ల భర్తీ
- 15 నుంచి రిజిస్ట్రేషన్, ఆప్షన్ల ప్రక్రియ
- 27న మొదటి విడత సీట్ల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే ఇతర విద్యాసంస్థల్లో సీట్ల భర్తీకి జేఈఈ కౌన్సెలింగ్(జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) ప్రక్రియ ఈనెల 15 నుంచి మొదలుకానుంది. మొత్తం ఏడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 10న జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకులు వెల్లడికానున్నాయి. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ కాలపట్టికను జోసా విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, 23 ట్రిపుల్‌ఐటీలు, మరో 23 జీఎఫ్‌టీఐల్లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుంది. గతేడాది 97 విద్యాసంస్థలే ఉండగా ఈసారి జీఎఫ్‌టీఐ విభాగంలో మూడు పెరిగాయి. తెలంగాణలో ఐఐటీ హైదరాబాద్, ఎన్ఐటీ వరంగల్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(ఐదేళ్ల కంప్యూటర్ సైన్స్‌లో 21 సీట్లు), ఏపీలో ఐఐటీ, ఎన్ఐటీతో పాటు శ్రీసిటీలోని ట్రిపుల్‌ఐటీ, కర్నూలులోని ట్రిపుల్ ఐటీ డిజైన్ అండ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)లో సీట్లను జోసా ద్వారా భర్తీ చేస్తారు. గతేడాది సుమారు 37వేల సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసారి మూడు సంస్థలు పెరగడంతోపాటు ఐఐటీలు, ఎన్ఐటీల్లో బాలికలకు 8శాతం సీట్లు దక్కేలా సూపర్ న్యూమరీ కోటా కింద కేటాయిస్తున్నందున సీట్ల సంఖ్య మరో రెండు వేలకుపైగా పెరగనుందని అంచనా.

ఐఐటీల్లో పెరగనున్న 291 సీట్లు

దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో ఈసారి సీట్ల సంఖ్య పెరిగింది. గతేడాది 10,988 సీట్లుండగా ఈసారి 291 పెరిగి 11,279కు చేరుకుంది. గతేడాది వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైన విదేశీ, రక్షణశాఖ ఉద్యోగుల పిల్లలకు సూపర్ న్యూమరీ కింద సీట్లు ఇచ్చేవారు. ఒక్కో ఐఐటీకి గరిష్ఠంగా ఇద్దరు రక్షణ శాఖ ఉద్యోగుల(డీఎస్) పిల్లలను తీసుకునేవారు. ఈసారి బాలికలకు సూపర్ న్యూమరీ కింద 800 సీట్లు కేటాయిస్తున్నట్లు జోసా తెలిపింది. బాలికలకు ప్రత్యేకంగా సీట్లు పెంచినా బాలుర సీట్లు ఏమీ తగ్గవని స్పష్టంచేసింది.

నాగ్‌పుర్ చేరుకున్న ప్రణబ్ ముఖర్జీ

నాగ్‌పుర్: ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న సంఘ్ శిక్ష వర్గ్ కార్యక్రమం ముగింపు వేడుకలో పాల్గొనేందుకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ బుధవారం నాగ్‌పుర్ చేరుకున్నారు. ఈ కార్యక్రమం గురువారం జరుగుతుంది.

'ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ సగానికి తగ్గింపు'

దిల్లీ: ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల సిలబస్‌ను సగానికి సగం తగ్గించనున్నట్టు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావ్‌డేకర్ వెల్లడించారు. 'మెట్రో మ్యాన్' ఇ.శ్రీధరన్ నెలకొల్పిన ఫౌండేషన్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ నేషనల్ వాల్యూస్ (ఎఫ్ఆర్ఎన్‌వీ) సంస్థ పదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

16 లాంచీలకు అనుమతి నిరాకరణ

- బోట్లకు మోటారు వాహనాల చట్టం అమలు

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరిలో తిరుగుతున్న 16 బోట్లు, లాంచీల్లో ఆశించిన స్థాయిలో ప్రమాణాలు లేవని, వాటిలో ప్రయాణం చేస్తే ప్రమాదం కనుక వాటిని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ఓడరేవుల సహాయకుడు కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. పోలవరం మండలం సింగన్నపల్లి కంపెనీ వద్ద ఉన్న బోట్లను బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. బోట్లు, లాంచీలను మోటారు వాహనాల చట్టం పరిధిలోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఏటా వాటి సామర్థ్యానికి సంబంధించి అనుమతి పత్రాలు తీసుకోవడంతో పాటు ప్రతి రెండున్నర సంవత్సరాలకు ఒకసారి ఒడ్డుకు తీసుకొచ్చి మరమ్మతులు చేయాల్సి ఉంటుందన్నారు. అందులో ప్రయాణించే వారికి, బోటుకు బీమా సదుపాయం ఉండాలని పేర్కొన్నారు. నదిలో తిరిగే లాంచీలకు ఎనిమిది ఎంఎం, బోట్లకు 12 నుంచి 16 ఎంఎం మందం కలిగిన రేకును ఉపయోగించాల్సి ఉందని చెప్పారు. ఈ నిబంధనల ప్రకారం బోట్లు తయారు చేస్తే ప్రమాదం జరిగిన గంట నుంచి గంటన్నర సమయం మునగదని, పర్యాటకులను సురక్షితంగా బయటకు తీసుకుని రావచ్చన్నారు. బోట్ల సిబ్బందికి కాకినాడలో శిక్షణ ఇస్తున్నారని, వారి కోసం మరో రెండు కోర్సులు చెబుతున్నామని తెలిపారు.

సాక్ష్యాధారాలు లభించాయి

- కేంద్ర ప్రభుత్వ కుంభకోణంపై త్వరలోనే వివరాలు: కుటుంబరావు

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఓ కుంభకోణంలో సాక్ష్యాధారాలు లభించాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు తెలిపారు. న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ సుప్రీంకోర్టులో ఈ కేసును వాదిస్తున్నారని, జస్టిస్ అరుణ్ మిశ్రా ధర్మాసనం ఈ కేసును విచారిస్తోందని తెలిపారు. ఇందులో ప్రధాని నరేంద్రమోదీ పేరు ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ వద్ద ఉన్న సమాచారాన్ని పూర్తిగా నిర్ధరించుకున్నాకే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. 2జీ కుంభకోణం ఎలా నిర్వీర్యం అయ్యింది త్వరలోనే బయటకు వస్తుందని, కొన్ని నెలల్లోనే ఆ వివరాలను బయటపెడతామని వ్యాఖ్యానించారు. పారిశ్రామిక నడవాలపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలోని మీడియా కేంద్రంలో కుటుంబరావు విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాక కొన్ని లక్షల ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు అసహనంతోనే రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రూ.వేల కోట్లు రాష్ట్రానికి రావాలన్న పవన్ ఆ తర్వాత మాయమైపోయారని విమర్శించారు. తనకు ఆర్థిక రంగంపై అనుభవం ఉన్నందునే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పజెప్పారన్నారు. 2019 ఎన్నికల్లో భాజపా అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించినా 150కి మించి లోక్‌సభ స్థానాలు దక్కకపోవచ్చునని వ్యాఖ్యానించారు.

జగన్ న్యాయస్థానంలో ఇంప్లీడ్ కావొచ్చు: అగ్రిగోల్డ్ కేసు విచారణలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రపై అనుమానాలుంటే వైకాపా అధినేత జగన్ న్యాయస్థానంలో ఇంప్లీడ్ కావొచ్చునని కుటుంబరావు సవాల్ విసిరారు. అవసరమైతే ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసుకోవచ్చునని సూచించారు. బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్న జగన్ రూ.1,100 కోట్లు పెట్టి అగ్రిగోల్డ్ ఆస్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ తగ్గించి చూపుతున్నారన్న జగన్ ఆరోపణలను ఖండించారు.

ఏపీ భవన్ విభజనపై కుదరని ఏకాభిప్రాయం

ఈనాడు, హైదరాబాద్: దిల్లీలోని ఏపీభవన్ విభజనపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. సమావేశంలో వెల్లడయిన అభిప్రాయాలను ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు వివరించాలని నిర్ణయించారు. ఏపీ భవన్ విభజనపై బుధవారం సచివాలయంలో జరిగిన సమావేశానికి తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఉన్నతాధికారులు రామకృష్ణారావు, ప్రేమ్ చంద్రారెడ్డి, దిల్లీలోని నివాస కమిషనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థలాలు, గదుల విభజన తదితర అంశాలపై అధికారులు వేర్వేరు వాదనలు వినిపించారు. దిల్లీలోని ఏపీభవన్ విభజనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అయిదు ప్రతిపాదనలు చేసింది. ఏపీ భవన్‌ను తమకు అప్పగిస్తే పటౌడి హౌస్ ప్రాంతాన్ని తెలంగాణ తీసుకోవాలని, ఏపీ భవన్‌ను తెలంగాణ తీసుకుంటే పటౌడి హౌస్ ఉన్న ప్రాంతాన్ని తమకు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. కొత్తభవన్ నిర్మించేందుకు అనువుగా నగదు మార్పిడి జరగాలని ప్రతిపాదించింది. జనాభా ప్రాతిపదికన ఏపీ భవన్‌ను విభజించి కొన్ని బ్లాక్‌లకు తమకు, మరికొన్నింటిని ఏపీకి ఇవ్వాలనే అంశాలను తెలంగాణ అధికారులు ప్రస్తావించారు.

సీటివ్వకపోవడం వైఫల్యమే

- టిక్కెట్‌లో తేడాతో పాటు రూ.10 వేల నష్టపరిహారం చెల్లించాలి
- ద.మ.రైల్వేకు ఏపీ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు తగిన కారణం లేకుండా సీటు కేటాయించకపోవడం సేవా లోపంగానే పరిగణించాల్సి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ తేల్చిచెప్పింది. ఏసీ మొదటి తరగతిలో రిజర్వేషన్ చేసుకున్న వ్యక్తికి సీటు కేటాయించకపోవడంతో బలవంతంగా మూడో తరగతిలో ప్రయాణించాల్సి వచ్చినపుడు ఆ తేడా సొమ్మును వాపసు చేయాల్సిందేనంటూ జస్టిస్ నౌషద్ అలి, సభ్యులు ముత్యాలనాయుడులతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రైల్వేల వైఫల్యంతో బాధితుడైన వ్యక్తికి సొమ్ము వాపసు చేయకపోవడం సరికాదని స్పష్టం చేసింది. గుంటూరు నుంచి చెన్నైకి మొదటి తరగతి టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకుని.. మూడో తరగతిలో ప్రయాణించాల్సి వచ్చిన గుంటూరు జిల్లా వాసి వి.వి.ఎస్. బాలక్రిష్ణకు రూ.10వేలు చెల్లించాలని, ఖర్చుల కింద రూ.2వేలు, టిక్కెట్‌లో తేడా మొత్తం రూ.615 తిరిగివ్వాలంటూ తీర్పిచ్చింది. జిల్లా ఫోరం తీర్పును సమర్థిస్తూ సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్‌లకు ఆదేశాలు జారీచేసింది. రైల్వేలు సర్వీసును రద్దుచేసినా, రిజర్వేషన్ ప్రకారం సీటు కేటాయించలేకపోయినా అది సేవా లోపమేనంది. టిక్కెట్ సొమ్మును తిరిగిస్తూ.. పరిహారం కూడా చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. గుంటూరు జిల్లా ఫోరం తీర్పును సవాలు చేస్తూ రైల్వే డీఆర్ఎం, చీఫ్ కమర్షియల్ మేనేజర్‌లు దాఖలు చేసిన అప్పీలుపై రాష్ట్ర ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది.

ఇదీ నేపథ్యం: 2015 జులైలో గుంటూరు నుంచి చెన్నై వెళ్లడానికి బాలక్రిష్ణ చెన్నై ఎక్స్‌ప్రెస్ ఏసీ మొదటి తరగతిలో రిజర్వు చేయించుకున్నారు. బండికి బోగీ జత చేయకపోవడంతో మూడో తరగతి ఏసీలో ప్రయాణించగా, టిక్కెట్‌లో తేడా సొమ్మును చెన్నై స్టేషన్‌లో తీసుకోవచ్చని టిక్కెట్ కలెక్టర్ పేర్కొన్నారు. చెన్నైలో అడిగితే టిక్కెట్ తీసుకున్నచోటే ఆ సొమ్ము ఇస్తారని చెప్పారు. తీరా గుంటూరులో అడిగితే రెండు రోజుల తరువాత సొమ్ము వాపసు ఇవ్వడం కుదరదని చెప్పారు. రైల్వే ఉన్నతాధికారులకు లేఖ రాసినా ఫలితం లేకపోవడం, లీగల్ నోటీసుకూ స్పందించకపోవడంతో బాధితుడు జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. టిక్కెట్‌లో తేడా సొమ్ము, పరిహారం, ఖర్చులు చెల్లించాలంటూ అక్కడ తీర్పు వెలువరించారు. దీనిపై రైల్వే అధికారులు అప్పీలు చేయగా.. రాష్ట్ర వినియోగదారుల ఫోరం విచారణ జరిపి దాన్ని కొట్టివేస్తూ.. తాజాగా తీర్పిచ్చింది. నిబంధనల ప్రకారం రెండో రోజుల్లో టికెట్ సొమ్మును తీసుకోని పక్షంలో అడిగే హక్కును ప్రయాణికులు కోల్పోతారన్న రైల్వేల వాదనను తోసిపుచ్చింది.

క్లాట్ కౌన్సెలింగ్ నిలుపుదలకు సుప్రీం తిరస్కృతి

దిల్లీ: దేశంలోని 19 ప్రతిష్ఠాత్మక న్యాయవిద్య కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశపరీక్ష (క్లాట్)-2018 కౌన్సెలింగ్ ప్రక్రియను నిలుపుదల(స్టే) చేయడానికి సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. తదుపరి చేపట్టే చర్యలు మాత్రం న్యాయస్థానం ఆదేశాలకు లోబడి ఉండాలని జస్టిస్ ఆదర్శ్‌కుమార్ గోయల్, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది. మే 31న క్లాట్ ఫలితాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. మే 13న నిర్వహించిన ఈ పరీక్షలో సాంకేతిక లోపాలున్నాయంటూ అభ్యర్థుల నుంచి ఫిర్యాదులందాయి. వాటి పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీ తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది.

ఉద్ధవ్ ఠాక్రేతో అమిత్‌షా భేటీ

- రతన్‌టాటా, మాధురీ దీక్షిత్‌తోనూ సమావేశం
- మోదీ ప్రభుత్వ విజయాలను వివరించిన భాజపా అధ్యక్షుడు
- ఉప ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇప్పుడెందుకు కలుసుకుంటున్నట్లు?: శివసేన

బుధవారం ముంబయిలో శివసేన అధినేత ఉద్ధవ్ ఠాకరేతో భాజపా అధ్యక్షుడు అమిత్ షా. చిత్రంలో సీఎం ఫడణవిస్

సినీనటి మాధురీ దీక్షిత్ దంపతులతో అమిత్‌షా

ముంబయి: భాజపా అధ్యక్షుడు అమిత్ షా బుధవారం శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేను ఆయన నివాసం మాతోశ్రీలో కలుసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా ఏడాది ఉన్న నేపథ్యంలో... మద్దతు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన ప్రచార కార్యక్రమం 'సంపర్క్ ఫర్ సమర్థన్'లో భాగంగా ఉద్ధవ్‌ను కలిసినట్లు భాజపా వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంలో భాజపా, శివసేన భాగస్వామ్యపక్షాలుగా ఉన్నా వాటి మధ్య సంబంధం ఉప్పు, నిప్పుగా ఉన్న నేపథ్యంలో ఉద్ధవ్‌తో అమిత్‌షా సమావేశమవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2019 సాధారణ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని శివసేన ఇప్పటికే ప్రకటించింది. వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన ఉప ఎన్నికలోల భాజపా ఓటమిపాలయిన తర్వాత ఇప్పుడు ఈ సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని పార్టీ.. తమ పత్రిక అయిన సామ్నా సంపాదకీయంలో ప్రశ్నించింది.

ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటా, ప్రముఖ సినీ నటి మాధురీ దీక్షిత్‌ను కూడా వారి నివాసాల్లో అమిత్‌షా కలుసుకున్నారు. గత నాలుగేళ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాల గురించి అమిత్‌షా ఈ భేటీల్లో వివరించారు. ప్రముఖ గాయనీమణి లతా మంగేష్కర్‌తోనూ సమావేశమవ్వాల్సి ఉండగా ఆమెకు అనారోగ్యం కారణంగా రద్దయింది.

ఉగ్ర హెచ్చరికలతో యూపీలో అప్రమత్తత

లఖ్‌నవూ: ఉత్తర్ ప్రదేశ్‌లోని రైల్వే స్టేషన్లతోపాటు దేవాలయాలపైనా దాడులు చేస్తామని లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) ముష్కరులు హెచ్చరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తత ప్రకటించారు. గత నెలలో ఉత్తర రైల్వే విభాగానికి ఎల్‌ఈటీ కమాండర్ మౌలానా అబూ షేక్ ఓ లేఖ రాశాడు. సహరన్‌పుర్, హాపుర్‌లపై దాడిచేయనున్నట్లు దీనిలో అబూ హెచ్చరించాడు. 'ఈ లేఖ ఫిరోజ్‌పూర్ అధికారులకు అందింది. ఉత్తర్ ప్రదేశ్‌తోపాటు హరియాణా, పంజాబ్, రాజస్థాన్‌లలోనూ దాడులుచేస్తామని ముష్కరులు దీనిలో హెచ్చరించారు'అని ఉత్తర్ ప్రదేశ్ అనదపు డీజీపీ ఆనంద్ కుమార్ తెలిపారు. మథురలోని కృష్ణ జన్మభూమి, వారణాసిలోని కాశీ విశ్వనాథ్ దేవాలయంలపైనా దాడులు చేస్తామని హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే అబూ ఇప్పుడు ఎక్కడున్నాడో నిఘా సంస్థల వద్ద సమాచారం లేదని వివరించారు.

లావాలో చిక్కుకొని 192 మంది గల్లంతు

- గ్వాటెమాలాలో 73కు పెరిగిన మృతుల సంఖ్య

గ్వాటెమాలా సిటీ: మధ్య అమెరికా దేశం గ్వాటెమాలాలో గతవారం ఫ్యూగో అగ్నిపర్వతం బద్దలవ్వడంతో మృత్యువాతపడ్డవారి సంఖ్య 73కు పెరిగింది. మరో 192 మంది జాడ ఇప్పటికీ తెలియరావడం లేదని తెలిపారు. గల్లంతైన వారంతా లావాలో చిక్కుకొని ఉండొచ్చని.. ఇక వారు ప్రాణాలతో బయటపడే అవకాశాలు దాదాపుగా లేవని అభిప్రాయపడ్డారు. అగ్నిపర్వతం నుంచి లావా ప్రవాహం తగ్గకపోవడంతో సహాయక చర్యలను ప్రస్తుతానికి నిలిపివేశామని చెప్పారు. హవాయిలోని కిలయీ అగ్నిపర్వతం నుంచి మంగళవారం రాత్రి వెలువడ్డ లావా.. కాపోహో బీచ్ లాట్స్, వెకేషన్‌లాండ్ ప్రాంతాల్లో వందలాది ఇళ్లను ధ్వంసం చేసింది. అధికారుల హెచ్చరికల మేరకు ప్రజలు ముందుగానే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఫ్యూగో అగ్నిపర్వతం విస్ఫోట ప్రమాదంలో చిక్కుకున్న చిన్నారిని రక్షిస్తున్న సైనికుడు

కమలం బుజ్జగింపు వ్యూహం...

ఈనాడు, దిల్లీ: లౌకిక పార్టీల ఐక్యత పేరుతో విపక్షాలన్నీ ఒక్కటి అవుతుండడంతో భాజపా ఇప్పుడు ఎన్డీఏ నినాదాన్ని వినిపిస్తోంది. కీలక రాష్ట్రాల్లో ఉన్న లోక్‌సభ స్థానాలను దృష్టిలో పెట్టుకుని కూటమిని బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా బుధవారం శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో సమావేశం కావడం దీనిలో భాగమే. మహారాష్ట్ర (48), యూపీ (80), బిహార్ (40), పంజాబ్ (13)లలో కలిపి 181 లోక్‌సభ స్థానాలున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో వీటిలో 151 స్థానాలను భాజపా, మిత్రపక్షాలు దక్కించుకున్నాయి. వీటిలో 118 చోట్ల భాజపా సొంతంగానే నెగ్గింది. అప్పట్లో నరేంద్ర మోదీ ప్రభంజనం, ఆయా రాష్ట్రాల్లో మిత్రపక్షాలకున్న సామాజిక వర్గాల అండదండలు ఈ కూటమి విజయానికి కారణమయ్యాయి. మోదీ ప్రభంజనం మునుపటి స్థాయిలో ఇప్పుడు లేకపోవడం, విపక్షాలన్నీ భాజపాకి వ్యతిరేకంగా సంఘటితం అవుతుండడం వంటి కారణాలతో మిత్రపక్షాలతో సుహృద్భావం కోసం భాజపా ప్రయత్నిస్తోంది.

ఎదురుదెబ్బలతో మారిన వైఖరి: యూపీలో ప్రతిష్ఠాత్మకమైన గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాలను ఉప ఎన్నికల్లో భాజపా కోల్పోయిన తర్వాత అమిత్ షా రంగంలో దిగి యూపీలో మిత్రపక్షాల అధినేతలతో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ప్రతీ 15 రోజులకోసారి సంకీర్ణ భాగస్వాములతో భేటీ అవుతారని భరోసా ఇచ్చారు.

- మహారాష్ట్రలో ఉన్న 48 స్థానాలకూ గానూ గత ఎన్నికల్లో భాజపా 23, శివసేన 18 దక్కించుకున్నాయి. ఆ తర్వాత సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇటీవల పాల్ఘడ్ లోక్‌సభ స్థానంలో శివసేనను భాజపా ఓడించాక సంబంధాలు ఇంకా క్షీణించాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలనూ దృష్టిలో పెట్టుకుని ఠాక్రేతో షా భేటీ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని సేన ప్రకటించినా ఈ భేటీ జరగడం విశేషం.
- బిహార్‌కు చెందిన కేంద్ర మంత్రి, ఎల్‌జేపీ అధినేత రాంవిలాస్ పాస్వాన్‌తో షా ఈనెల 3న భేటీ అయ్యారు.
- పంజాబ్‌లో గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. అకాలీదళ్ అధినేత ప్రకాశ్‌సింగ్ బాదల్, ఆయన తనయుడు సుఖ్‌బీర్ బాదల్‌లతో గురువారం షా భేటీ కానున్నారు.

సీట్ల సంఖ్యపై తకరారు

ఇటీవలి ఎన్నికల్లో భాజపా ఓటమి తీరును చూశాక... వచ్చే ఎన్నికల్లో సీట్ల విషయంలో మిత్రపక్షాలు తమ పట్టు బిగించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీని దృష్ట్యా... నష్ట నివారణ చర్యల్ని భాజపా చేపట్టింది. మరిన్ని పక్షాలూ సంక్లిష్టంగా మారడమో, కూటమి నుంచి బయటకు వెళ్లిపోవడమో జరగవచ్చని భయపడుతోంది. దానిని తప్పించడం కోసం భేటీలపై ఆధారపడుతోంది.

మోదీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వాటికన్‌తో కలిసి చర్చిల కుట్ర

- విశ్వహిందూ పరిషత్ ఆరోపణ

దిల్లీ: మోదీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వాటికన్ సిటీతో కలిసి భారత్‌లోని చర్చిలు కుట్ర పన్నాయని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆరోపించింది. ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చే 'కిరాయి హంతకులు'గా.. 'తోలుబొమ్మ' ప్రభుత్వాలను ఆడించే సాధనాలుగా అవి మారాయని మండిపడింది. దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని.. ప్రజలు భయాందోళనల మధ్య బతుకుతున్నారని ఇటీవల చర్చిలకు దిల్లీ ఆర్చ్‌బిషప్ వివాదాస్పద లేఖ రాసిన నేపథ్యంలో వీహెచ్‌పీ ఈ విధంగా స్పందించింది. 2019 లోక్‌సభ ఎన్నికల కోసం ప్రార్థనలు కూడా చేయాలని ఆర్చ్‌బిషప్ ఇందులో పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపైనున్న ప్రజలకున్న నమ్మకాన్ని దెబ్బతీసేందుకు చర్చిలు వాటికన్‌తో కలిసి పనిచేస్తున్నట్లు తాజా ఉదంతంతో స్పష్టమైందని వీహెచ్‌పీ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ వ్యాఖ్యానించారు. చర్చిల రాజకీయ వైఖరి, మత మార్పిడి ఎజెండాతోనే రాజ్యాంగానికి ప్రమాదం ఉందని ఆయన అన్నారు. దేశంలో అత్యయిక పరిస్థితి విధించినప్పుడు, కశ్మీరీ పండిట్‌లపై హత్యలు సాగినప్పుడు, 1984ల్లో సిక్కుల ఊచకోత జరిగినప్పుడు.. ఇదే చర్చి మౌన ప్రేక్షక పాత్ర పోషించిందని చెప్పారు.

పికాసో చిత్రం దిగువ పొరల్లో దాగిన వార్తాపత్రిక

వాషింగ్టన్: ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పాబ్లో పికాసో కుంచె నుంచి జాలువారిన ఓ పెయింటింగ్ దిగువన వార్తాపత్రిక పేజీ ఉన్నట్లు అమెరికాలోని 'నేషనల్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్' పరిశోధకులు తాజాగా గుర్తించారు. తల్లి తన బిడ్డను పొత్తిళ్లలో పట్టుకొని సముద్రపు ఒడ్డున కూర్చున్నట్లు చూపిస్తూ పికాసో గీసిన చిత్రం చాలా ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం జపాన్‌లోని పోలా వస్తుప్రదర్శనశాలలో ఉన్న ఈ చిత్రాన్ని శాస్త్రవేత్తలు 'హైపర్‌స్పెక్ట్రల్ ఇన్‌ఫ్రారెడ్ ఇమేజింగ్' సాంకేతికతతో పరిశీలించారు. పెయింటింగ్ దిగువన ఉన్న పొరల్లో.. 1902 జనవరి 18 నాటి ఫ్రాన్స్ వార్తాపత్రికకు చెందిన ఓ పేజీ కూడా ఉన్నట్లు గుర్తించారు. పారిస్ నుంచి బార్సిలోనాకు పికాసో ఎప్పుడు తన మకాం మార్చారో తెలుసుకోవడంలో పరిశోధక విద్యార్థులకు తాజా ఆవిష్కరణ దోహదపడే అవకాశముందని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

కెన్యాలో విమానం గల్లంతు

నైరోబి: కెన్యా రాజధాని నైరోబీ పరిసరాల్లో పది మందితో ప్రయాణిస్తున్న ఓ విమానం గల్లంతైంది. ఈస్ట్ ఆఫ్రికన్ సఫారీ ఎయిర్ ఎక్స్‌ప్రెస్ సంస్థకు చెందిన ఈ విమానం మంగళవారం మధ్యాహ్నం కీటెల్ నగరం నుంచి బయలుదేరింది. ఇది నైరోబీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉంది. అయితే బయలుదేరిన 80 నిమిషాల తర్వాత రాడార్‌తో దీని సంబంధాలు తెగిపోయాయి. చివరిసారిగా నైరోబీకి ఉత్తర దిశగా 80 కి.మీ. దూరంలోని అబెర్డార్ పర్వత ప్రాంతం పరిసరాల్లో దీన్ని గుర్తించారు. హెలీకాప్టర్ సాయంతో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

రాష్ట్రపతి భవన్‌లో ఇఫ్తార్ విందు లేదు

దిల్లీ: ఈ ఏడాది రాష్ట్రపతి భవన్‌లో ఇఫ్తార్ విందు ఉండదు. రాష్ట్రపతిగా రామ్‌నాథ్‌కోవింద్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రపతి భవన్ వంటి ప్రభుత్వ ప్రాంగణాల్లో ...ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే డబ్బుతో మతపరమైన ఉత్సవాలు వేటినీ నిర్వహించరాదని నిర్ణయించారు. లౌకిక ప్రభుత్వ స్ఫూర్తి, సూత్రానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒక్క ఇఫ్తారే కాదు...అసలు ఏ మతానికి సంబంధించిన ఉత్సవాన్ని కూడా రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించరాదని నిర్ణయించినట్లు రాష్ట్రపతి ప్రెస్ కార్యదర్శి అశోక్‌మాలిక్ తెలిపారు. అబ్దుల్‌కలాం రాష్ట్రపతిగా ఉన్న సమయంలో తప్ప ఎన్నోఏళ్ల నుంచీ ప్రతి ఏటా రాష్ట్రపతి భవన్‌లో ఇఫ్తార్ విందును ఇస్తూనే వచ్చారు.

అంకురాలే చోదక శక్తి

- పుష్కలంగా నిధులు కేటాయించాం
- గ్రామాలు, పట్టణాలకూ విస్తరిస్తున్న స్ఫూర్తి
- యువ పారిశ్రామికవేత్తలతో ముచ్చటించిన ప్రధాని

దిల్లీ: అంకురాలే మన దేశానికి చోదక శక్తి అనీ, అందుకే అవి అన్నిచోట్లకూ విస్తరించేలా చూడడంతో పాటు నిధులకు ఏమాత్రం కొరత రానీయకుండా తగిన ఏర్పాట్లు చేశామనీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. దీర్ఘకాలంలో రూ.లక్ష కోట్ల అంకుర పరిశ్రమలు రావడానికి వీలుగా రూ.10,000 కోట్ల నిధుల్ని ప్రత్యేకంగా కేటాయించామని తెలిపారు. అంకుర భారత్ పథకం కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కావాల్సిన సుహృద్భావ వాతావరణాన్ని ప్రభుత్వం సృష్టించిందని చెప్పారు. దీనివల్ల చిన్నచిన్న పట్టణాల్లోనూ వ్యవసాయం సహా విభిన్న రంగాల్లో అంకురాలు రాగలుగుతున్నాయన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో బుధవారం ఆయన ముచ్చటించారు. నియంత్రణ అడ్డంకులను తొలగించడంతో పాటు అంకురాలు నిలదొక్కుకునేందుకు కావాల్సిన కేంద్రాలను ఏర్పాటు చేసి, పన్ను రాయితీలను కల్పించి, న్యాయ/ మేధోహక్కుల సంబంధిత అంశాల్లోనూ సహాయ హస్తం అందిస్తున్నట్లు వివరించారు. 'తగిన పెట్టుబడి, ధైర్యసాహసాలతో పాటు ప్రజలతో అనుసంధానత ఉంటే అంకురాల రంగం రాణిస్తుంది. వ్యవసాయ రంగాన్ని రూపాంతరీకరించే మార్పుల్ని యువత నుంచి ఆహ్వానిస్తున్నాం. యువత ఇప్పుడు ఉద్యోగాలిచ్చే స్థాయికి వచ్చింది. జనాభాపరమైన సానుకూలతను అవకాశంగా మలచుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రస్తుతం పెద్దపెద్ద కంపెనీలుగా అవతరించినవన్నీ ఒకప్పుడు అంకురాలే. ప్రజలు నవకల్పనలను ప్రోత్సహించాలి. అంకురాల నుంచి వచ్చే ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఇ-మార్కెట్‌ప్లేస్‌ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం. కొత్తగా ఆలోచించకపోతే వెనుకబడిపోతాం. నవకల్పన భారత్ అనేది ప్రజా ఉద్యమంగా మారాలి' అని ప్రధాని చెప్పారు.

5 రాష్ట్రాలకు ఆకస్మిక వరద ముప్పు

- అప్రమత్తం చేసిన కేంద్రం

దిల్లీ: భారీ వర్షాలతో నదులు ఒక్కసారిగా ఉప్పొంగి ఆకస్మిక వరదలు ముంచెత్తవచ్చని ఐదు రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసింది. పశ్చిమ కనుమల్లో పుట్టిన నదులు పొంగి పొర్లవచ్చని కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, గుజరాత్ రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 7 నుంచి 12 వరకు కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, మరి కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురవవచ్చని భారత వాతావరణ విభాగం చేసిన హెచ్చరికను ఉటంకిస్తూ కేంద్ర జలవనరుల శాఖ ఆయా రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. తాపి, తాద్రి, గోదావరి, కృష్ణ, కావేరి, వాటి ఉపనదుల్లో నీటి మట్టాలు పెరగవచ్చని పేర్కొంది. తుంగభద్రలోనూ ప్రవాహం పెరగవచ్చని అంచనా వేసింది.

మాతృ మరణాల నిష్పత్తిలో 22% తగ్గుదల

దిల్లీ: 2013తో పోలిస్తే దేశంలో మాతృ మరణాల నిష్పత్తి (ఎంఎంఆర్)లో 22% మేర తగ్గింది. ప్రతీ లక్ష మంది సజీవ శిశువుల జననంలో ఎంత మంది తల్లులు మరణిస్తున్నారో తెలిపేదే ఎంఎంఆర్. 2011-13లో ఇది 167గా ఉంటే, 2014-16లో 130కి తగ్గింది. దక్షిణాది రాష్ట్రాల్లో ఇది 93 నుంచి 77కి తగ్గితే, ఇతరరాష్ట్రాల్లో 115నుంచి 93కి తగ్గింది.

మంద్‌సౌర్‌లో గతేడాది పోలీసు కాల్పుల్లో మరణించిన రైతు కుటుంబసభ్యుడిని ఓదార్చుతున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

'భారత్‌లో తయారీ' విఫలమైంది

- మధ్యప్రదేశ్‌లో అధికారంలోకి వస్తే పది రోజుల్లో రైతు రుణాలు మాఫీ
- మంద్‌సౌర్‌లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

మంద్‌సౌర్: మోదీ ప్రభుత్వం తలపెట్టిన 'భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా)' కార్యక్రమం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. దేశంలో ఎక్కడ చూసినా చైనా ఉత్పత్తులే దర్శనమిస్తున్నాయని అన్నారు. ' 'గుజరాత్‌లో చైనా అధ్యక్షుడితో కలిసి మన ప్రధాని ఊయల ఊగారు. ఆ దేశ సైన్యమేమో డోక్లాంలోకి ప్రవేశించింది. మోదీ ఒక్కమాటైనా మాట్లాడలేదు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. మద్దతు ధర, రుణ మాఫీ కోరుతున్న రైతులనునిరాశపరచడమే కాకుండా.. అసలు వ్యవసాయ రంగానికి సహకారం అందించడంలోనే మోదీ విఫలమయ్యారని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని మంద్‌సౌర్‌లో ఏర్పాటు చేసిన రైతుల సంస్మరణ సభలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది ఇదే రోజున ఇక్కడ నిరసనలో పాల్గొన్న రైతులపై.. పోలీసులు కాల్పులు జరిపారు. దీంతో ఆరుగురు అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. వారిని స్మరించుకునేందుకే.. బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఏడాది చివర్లో మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. పది రోజుల్లో రైతుల రుణాలు మాఫీ చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. 15 మంది పారిశ్రామికవేత్తలకు మొత్తం రూ.2.5 లక్షల కోట్ల రుణాలను ఎన్డీయే ప్రభుత్వం మాఫీ చేసిందని.. అన్నదాతలకూ కనీసం ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదని అన్నారు. అన్ని జిల్లాల్లోనూ ఆహార శుద్ధి కేంద్రాలను నెలకొల్పి.. తమ పంటలను రైతులు నేరుగా అక్కడికే తీసుకువెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. పదేళ్లలో బీజింగ్ సైతం 'మంద్‌సౌర్' వెల్లుల్లి వినియోగించే పరిస్థితి తెస్తామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో రైతుల రుణాలు మాఫీ అయ్యాయని రాహుల్ వెల్లడించారు.

రాహుల్ తెలిసే మాట్లాడుతున్నారా?: జైట్లీ

దిల్లీ: మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ కొట్టిపారేశారు. 'రాహుల్ అవగాహన ఉండే మాట్లాడుతున్నారా?' అంటూ బుధవారం సందేహం వ్యక్తం చేశారు. 15 మంది పారిశ్రామికవేత్తలకు మోదీ ప్రభుత్వం రూ.2.5 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిందన్న రాహుల్ ఆరోపణ పూర్తిగా అబద్ధమని కొట్టిపారేశారు. "ఏ వ్యాపారవేత్తకూ రూపాయి కూడా ప్రభుత్వం మాఫీ చేయలేదు. బ్యాంకులు, ఇతర సంస్థలకు రుణాలు ఎగవేసినవారిని దివాలాకోరులుగా ప్రకటించాం. వారిపై చర్యలు తీసుకున్నాం. ఈ మొండి బాకీల్లో ఎక్కువ భాగం యూపీఏ హయాంలో ఇచ్చినవే " అని జైట్లీ అన్నారు.

ఎన్ఆర్ఐ వివాహాలు 48 గంటల్లో నమోదు తప్పనిసరి

- లేదంటే వీసా, పాస్‌పోర్టుల జారీ ఉండదు
- త్వరలో కొత్త విధానం అమల్లోకి: మేనకాగాంధీ

ఈనాడు, దిల్లీ: ఎన్ఆర్ఐ వివాహాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకురాబోతోంది. ఇలాంటి వివాహాలు జరిగిన 48 గంటల్లోపు సమీప రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. లేదంటే పాస్‌పోర్టు, వీసాలను జారీచేయరు. త్వరలో కేంద్ర మహిళా శిశుసంక్షేమశాఖ దేశంలోని రిజిస్ట్రార్ కార్యాలయాలన్నిటికీ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేయబోతున్నట్లు ఆశాఖ మంత్రి మేనకా గాంధీ వెల్లడించారు. మహిళలు, పిల్లలపై పెరిగిపోతున్న నేరాల నియంత్రణపై బుధవారం ఇక్కడ జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. లైంగిక దాడికేసుల్లో నిందితులను సాక్ష్యాధారాలతో సహా పట్టుకోవడానికి వీలుగా దేశంలోని అన్ని పోలీసు స్టేషన్లు, ఆసుపత్రులకు జులై నెలాఖరుకల్లా ప్రత్యేక ఫోరెన్సిక్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అత్యాచారాలు, లైంగికదాడి కేసుల్లో నేరనిరూపణకు సేకరించాల్సిన సాక్ష్యాధారాలు, నమూనాల జాబితాతోపాటు, వాటి సేకరణకు అవసరమైన సామగ్రి కూడా ఆ కిట్లలో ఉంటుందన్నారు.

ఇక...పనిచేసే ప్రాంతాల్లో ఎదురయ్యే లైంగికవేధింపుల గురించి ఫిర్యాదు చేయడానికి 2017లో ఆన్‌లైన్ ఫిర్యాదు విభాగాన్ని ఏర్పాటుచేశామని, ఇప్పటి వరకూ 191 ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. మహిళలపై పెరిగిపోతున్న సైబర్ నేరాలను అరికట్టడానికి వీలుగా వచ్చే మూడునెలల్లో ఆన్‌లైన్ కేంద్రీకృత రిపోర్టింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంకల్పించామన్నారు. వెబ్‌సైట్లలో మహిళలు, పిల్లలకు సంబంధించిన అభ్యంతరకరమైన వివరాలు పోస్టు చేసినప్పుడు వాటిని తక్షణం తొలగించే వ్యవస్థను తీసుకురావాలని నిర్ణయించారు.

బీఎస్ఎఫ్ మాజీ డీఐజీ, జమ్ము కశ్మీర్ మాజీ డీఎస్పీలకు పదేళ్ల జైలు

- వ్యభిచార ఉదంతం కేసులో ఐదుగురికి శిక్ష

చండీగఢ్: జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించిన వ్యభిచార ఉదంతానికి సంబంధించిన కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఐదుగురు దోషులకు పదేళ్ల చొప్పున జైలుశిక్షను విధించింది. బీఎస్ఎఫ్ మాజీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కేసీ పాడీ, జమ్ముకశ్మీర్ మాజీ డీఎస్పీ మహమ్మద్ అష్రఫ్ మీర్‌లు కూడా దోషుల జాబితాలో ఉన్నారు. వీరిద్దరికీ కోర్టు రూ.లక్ష చొప్పున జరిమానా కూడా విధించింది. దాన్ని చెల్లించడంలో విఫలమైతే.. అదనంగా మరో ఏడాది జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పునిచ్చింది. మిగతా ముగ్గురు దోషులకు రూ.50 వేల జరిమానా వేసింది. చండీగఢ్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి గగన్ జీత్ కౌర్ బుధవారం ఈ తీర్పును వెల్లడించారు. మే 30నే వీరందరినీ కోర్టు దోషులుగా ప్రకటించింది. గతంలో జమ్ముకశ్మీర్ అదనపు అడ్వొకేట్ జనరల్‌గా పనిచేసిన వ్యక్తితోపాటు మరొకరికి కేసు నుంచి విముక్తి కల్పించింది. కశ్మీర్‌కు చెందిన మైనర్‌లపై కొందరు లైంగిక చర్యలకు పాల్పడుతున్న దృశ్యాలున్న సీడీలను.. 2006లో పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో ఈ ఉదంతం వెలుగుచూసింది. ఇద్దరు మైనర్లను కొంతమంది బలవంతంగా వ్యభిచార కూపంలోకి దింపి.. ఉన్నతాధికారులు, రాజకీయనాయకులు, లొంగిపోయిన ఉగ్రవాదుల వద్దకు వారిని పంపారు. ఈ వ్యభిచార ముఠాను నిర్వహించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న సబీనా, ఆమె భర్త అబ్దుల్ హమీద్ విచారణ సాగుతుండగానే చనిపోయారు. ఈ కేసు దర్యాప్తు సమయంలో జమ్ముకశ్మీర్ పోలీసులు.. 56 మంది అనుమానితులతో ఓ జాబితా రూపొందించారు. కొందరు మంత్రులపైనా ఆరోపణలు రావడంతో.. 2006లో సీబీఐ ఈ కేసును స్వీకరించింది.

చిదంబరాన్ని ప్రశ్నించిన సీబీఐ

దిల్లీ, చెన్నై, న్యూస్‌టుడే: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరంను సీబీఐ బుధవారం దాదాపు 4 గంటల పాటు ప్రశ్నించింది. విచారణ అనంతరం తనకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్‌లో ఎలాంటి అభియోగాలు లేవని చిదంబరం పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎఫ్ఐపీబీ) దస్త్రాల ఆధారంగానే ప్రశ్నలు-జవాబులు ఉన్నాయని.. ఈమేరకు స్వల్పంగా అదనపు సమాచారం రికార్డుల్లో చేరినట్లు ట్విట్టర్‌లో తెలిపారు. చిదంబరం ఆర్థికమంత్రిగా పనిచేసిన కాలంలో (2007) ఐఎన్ఎక్స్ మీడియా రూ.305 కోట్ల విదేశీ నిధులను పొందడానికి ఎఫ్ఐపీబీ అనుమతుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు సీబీఐ కేసు నమోదు చేసింది.

12న మళ్లీ విచారణ.. ఈడీ: ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ నగదు అక్రమ చెలామణి కేసులో మరోదఫా విచారణకు ఈనెల 12న హాజరు కావాల్సిందిగా చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీచేసింది.

జాతీయ డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపల్‌పై సీబీఐ కేసు

దిల్లీ: తమ అకాడమిక్ మార్కులను ఎక్కువచేసి చూపడం ద్వారా వక్రమార్గంలో ఉద్యోగాలు దక్కించుకున్నారన్న ఆరోపణలతో జాతీయ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ) ప్రిన్సిపల్ ఓం ప్రకాశ్ శుక్లా సహా మరో నలుగురు బోధనా సిబ్బందిపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కేసు నమోదుచేసింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)తోపాటు రక్షణ శాఖకు చెందిన ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ప్రధాన కార్యాలయంలోని కొందరు అధికారులను మాయ చేసి.. శుక్లాతోపాటు రాజనీతి శాస్త్రం ఆచార్యులు జగ్మోహన్ మెహెర్, రసాయనశాస్త్రం అసోసియేట్ ఆచార్యులు వనిత పూరి, గణితశాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ రాజీవ్ బన్సల్, రసాయనశాస్త్రం విభాగాధిపతి మహేశ్వర్ రాయ్ ఉద్యోగాలు సంపాదించినట్లు సీబీఐ ఆరోపించింది. కేసు నమోదు అనంతరం ఎన్‌డీఏతో పాటు నిందితుల ఇళ్లు, కార్యాలయాల్లో బుధవారం సోదాలు నిర్వహించినట్లు సీబీఐ అధికార ప్రతినిధి ఆర్.కె.గౌర్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం

- శ్రీశ్రీ రవిశంకర్ పిలుపు

దిల్లీ: ప్లాస్టిక్ వినియోగాన్ని సగానికి తగ్గిద్దామని ఆర్ట్ ఆఫ్ లివింగ్(ఏవోఎల్) వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ నేపథ్యంలో.. 'కాలుష్యానికి వ్యతిరేకంగా గొంతు కలుపుదాం. హరిత శక్తివైపు పయనిద్దాం'పేరిట ఐరాసతో కలిసి ఏవోఎల్ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. దీనిలో 80 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రవిశంకర్ మాట్లాడుతూ.. 'ప్లాస్టిక్ వినియోగాన్ని సగానికి తగ్గించేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేద్దామని మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం. కాలుష్యమనేది బాహ్య వాతావరణానికి సంబంధించినది మాత్రమే కాదు. మానసిక స్థాయిలో ఈ విషయాన్ని గ్రహించినప్పుడు.. సహజంగానే ప్లాస్టిక్ వినియోగాన్ని మీరు తగ్గించేస్తారు'అని వ్యాఖ్యానించారు. పునర్వినియోగ ప్లాస్టిక్‌ను ఉపయోగించడం ద్వారా కొంతవరకూ ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆయన చెప్పారు. అనంతరం వెయ్యి మంది పర్యావరణ పరిరక్షకులతో ఓ బృందాన్ని ఏర్పాటుచేసేందుకు దిల్లీ పోలీస్ డైరెక్టర్ జనరల్ జేకే శర్మతో ఏవోఎల్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వీరంతా ప్లాస్టిక్‌తో పొంచివున్న ముప్పులపై దిల్లీలో ప్రచారం చేపట్టనున్నారు.

ఈ ఏడాది చిన్నారుల పదం 'ప్లాస్టిక్'

దిల్లీ: ఈ ఏడాది చిన్నారుల పదంగా 'ప్లాస్టిక్'ను ప్రకటించారు. ప్లాస్టిక్‌ను పిల్లలు సర్వసాధారణంగా వాడుతుంటారు. అంతేకాదు, ప్లాస్టిక్ కాలుష్య సమస్యల గురించి కూడా బాగా వారికి తెలుసని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రకటించింది. ప్లాస్టిక్, మహాసముద్రం, డొనాల్డ్‌ట్రంప్, బ్రెగ్జిట్, గ్రెన్‌ఫెల్‌టవర్, యూనికార్న్స్, స్మైల్ వంటివి బ్రిటిష్ చిన్నారుల సృజనాత్మకతపై ప్రగాఢముద్ర వేశాయి. వారి భాషపైనా వీటి ప్రభావం ఎక్కువని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ బుధవారం ప్రచురించిన ఒక నివేదిక వివరించింది.

సెన్సెక్స్ ▲ 276 **35179** | నిఫ్టీ ▲ 92 **10685** | డోజోన్స్ 25025 ▲ 225 | నాస్‌డాక్ 7656 ▲ 17 | రూపాయి 66.92 ▲ 23 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 75.10 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	6న	మార్పు %
BHARTI AIRTEL	379.75	4.24
TITAN COMPANY	899.45	4.11
TATA MOTORS	295.65	3.76
SUN PHARMA	489.85	3.45
INDIABULLS HSG	1180.10	3.07
BAJAJ FINANCE	2160.65	2.86
HCL TECH	908.95	2.70

గ్రహణం (-)

నిఫ్టీ	6న	మార్పు %
TECH MAHINDRA	691.75	-1.35
HPCL	310.80	-1.25
ASIAN PAINTS	1262.80	-0.85
CIPLA	538.45	-0.67
ONGC	170.30	-0.53
GAIL (INDIA)	332.95	-0.52
HDFC BANK	2057.35	-0.30

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.07	70.81	బహ్రెయిన్ దీనార్	165.47	189.22
పౌండ్ స్టెర్లింగ్	81.86	94.94	కువైట్ దీనార్	183.63	228.59
యూరో	71.58	83.02	ఒమన్ రియాల్	161.95	185.28
జపనీస్ యెన్/100	56.00	64.00	సౌదీ రియాల్	16.24	19.24
ఆస్ట్రేలియా డాలరు	46.74	54.08	యూఏఈ దిర్హమ్	16.62	19.42
సింగపూర్ డాలరు	45.80	54.26	మలేషియా రింగిట్	15.05	18.51
థాయ్ బాత్/100	192.00	229.00	చైనీస్ యువాన్	7.42	12.04

బుధవారం నిఫ్టీ కదలికలు

ఆర్‌బీఐ సమీక్ష నచ్చింది

- మెప్పించిన తటస్థ వైఖరి
- 276 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- రాణించిన రేట్ల ఆధారిత షేర్లు

సమీక్ష

వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత రిజర్వు బ్యాంక్ కీలక రేట్లు పెంచినప్పటికీ.. భవిష్యత్‌లో తటస్థ వైఖరి కొనసాగిస్తామన్న వ్యాఖ్యలు మదుపర్లను మెప్పించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు అంచనా అయిన 7.4 శాతాన్ని కొనసాగించడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం, అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలు ఇందుకు తోడయ్యాయి. ఆసియా మార్కెట్లు రాణించగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 34932.49 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 35,230.54 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఆర్‌బీఐ సమీక్ష ప్రకటన తర్వాత కొంత డీలాపడినా.. వెంటనే బలంగా పుంజుకుంది. చివరకు 275.67 పాయింట్ల లాభంతో 35,178.88 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 91.50 పాయింట్లు పెరిగి 10,684.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,587.50- 10,698.35 పాయింట్ల మధ్య కదలాడింది.

బ్యాంకింగ్ పరుగులు: ఆర్‌బీఐ సమీక్ష నేపథ్యంలో వడ్డీ రేట్ల ఆధారిత బ్యాంకింగ్, వాహన, స్థిరాస్తి రంగ షేర్లు రాణించాయి. బ్యాంకింగ్ షేర్లలో ఎస్‌బీఐ 2.43%, పీఎన్‌బీ 2.36%, బీఓబీ 2.03%, ఫెడరల్ బ్యాంక్ 1.09%, కోటక్ బ్యాంక్ 0.90%, యెస్ బ్యాంక్ 0.70% చొప్పున పెరిగాయి. స్థిరాస్తి షేర్లలో ఐబీ రియల్ ఎస్టేట్ 2.81%, గోద్రేజ్ ప్రోపర్టీస్ 2.76%, యునిటెక్ 2.45%, ఒబెరాయ్ రియాల్టీ 1.63%, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ 1.06% మేర రాణించాయి. వాహన షేర్లలో.. టాటా మోటార్స్ 3.56%, ఐషర్ 2.20%, బజాజ్ ఆటో 1.78%, అశోక్ లేలాండ్ 1.64% మేర లాభాలు నమోదు చేశాయి.

- ✦ కేపిటల్ ఫస్ట్, కేపిటల్ ఫస్ట్ హోమ్ ఫైనాన్స్, కేపిటల్ ఫస్ట్ సెక్యూరిటీస్‌లతో విలీనానికి ఆర్‌బీఐ ఆమోదం లభించడంతో ఐడీబీఐ బ్యాంక్ షేరు ఒకానొకదశలో 8.49 శాతం పెరిగింది. చివరకు 7.32 శాతం లాభంతో రూ.41.05 వద్ద ముగిసింది. కేపిటల్ ఫస్ట్ 5.32 శాతం పెరిగి రూ.561.35 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 26 లాభాలతో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్ 4.55%, టాటా మోటార్స్ 3.56%, సన్‌ఫార్మా 3.21%, కోల్ ఇండియా 1.98%, విప్రో 1.57%, ఎం అండ్ ఎం 1.42%, బజాజ్ ఆటో 1.42%, టాటా స్టీల్ 1.36%, ఐటీసీ 1.23%, ఇన్ఫోసిస్ 1.18% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్ (0.73%), ఓఎన్‌జీసీ (0.47%)లు మాత్రం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం 3.02 శాతం లాభపడింది. మన్నికైన వినిమయ వస్తువులు, లోహ, వాహన, స్థిరాస్తి, విద్యుత్, యంత్ర పరికరాలు, పీఎస్‌యూ, ఆరోగ్య సంరక్షణ, టెక్, ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లు అదే బాటలో నడిచాయి.

నేటి మార్కెట్

నేడు సూచీల లాభాలు కొనసాగే అవకాశం ఉంది. కీలక రేట్ల విషయంలో రిజర్వు బ్యాంక్ తటస్థ వైఖరి కొనసాగిస్తామని వెల్లడించడం మదుపర్లను మెప్పించింది. భవిష్యత్‌లో రేట్ల పెంపునకు సంకేతాలు ఇవ్వకపోవడం కలిసొచ్చే అంశమని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్షకు ముందు మదుపర్లు షార్ట్ పొజిషన్లు తీసుకున్నారని, ఆర్‌బీఐ సమీక్ష తర్వాత షార్ట్ కవరింగ్ చేయడంతో మార్కెట్లు పరుగులు తీశాయని సాంకేతిక విశ్లేషకులు అంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. వచ్చే 3-4 సెషన్లలో ఎన్‌బీఎఫ్‌సీలు, గృహ రుణ సంస్థలు, మిడ్ క్యాప్‌లు రాణించే అవకాశం ఉందని బ్రోకరేజీలు భావిస్తున్నాయి. నేడు నిఫ్టీ 10620-10690 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అందుబాటు గృహాలకు ఇచ్చే ప్రాధాన్య రుణాల పరిమితిని ఆర్‌బీఐ పెంచడంతో స్థిరాస్తి షేర్లు వెలుగులోకి రావొచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లు రాణించొచ్చు.

వృద్ధి ఆశలపై నీళ్లు

- ఆర్‌బీఐ రేట్ల పెంపుపై పరిశ్రమ సంఘాలు
- స్థిరాస్తి రంగంపై ప్రభావం స్వల్పమే: నిపుణులు

ఆర్‌బీఐ రెపో రేటును పెంచడంపై పరిశ్రమ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న దేశ వృద్ధికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు తాజా పరిణామంపై స్థిరాస్తి రంగ నిపుణుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కీలక రేట్ల పెంపుతో గృహాల గిరాకీపై పెద్దగా ప్రభావం ఉండబోదని కొందరు అంటుండగా.. మరికొందరు స్థిరాస్తి రంగం పుంజుకోవడం ఆలస్యం కావొచ్చని చెబుతున్నారు. వీళ్ల అభిప్రాయాలు ఇలా ఉంటే విశ్లేషకులు మాత్రం ముందు మరిన్ని రేట్ల పెంపులకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఎవరెవరు ఏమన్నారంటే..

కీలక రేట్ల పెంపు వృద్ధికి అవరోధంగా మారొచ్చు. అయితే ముమ్ముందు తన విధాన వైఖరిపై ఆర్‌బీఐ పునరాలోచిస్తుందని భావిస్తున్నాం. వృద్ధికి ఊతమిచ్చేందుకు తిరిగి రేట్ల కోతకు మొగ్గు చూపుతుందని అనుకుంటున్నాం.

– చంద్రజిత్ బెనర్జీ, డైరెక్టర్ జనరల్, సీఐఐ

వడ్డీ రేట్ల పెంపు పరిస్థితులు కనీసం మరికొన్ని నెలలు కొనసాగొచ్చని అనుకుంటున్నాం. అయితే ఇలాంటి పరిస్థితులను మేం ఏమాత్రం కోరుకోవడం లేదు.

– డి.ఎస్.రావత్, సెక్రటరీ జనరల్, అసోచామ్

తాజా పరిణామంతో బ్యాంకుల రుణ రేట్లు పెరుగుతాయి. ఇది వాటి మార్జిన్లపై ప్రభావం చూపుతుంది. ఈ ఏడాదిలో మరోమారు రేట్ల పెంపు ఉంటుందని మేం అనుకుంటున్నాం. తటస్థ వైఖరిని కొనసాగించడం ద్వారా భవిష్యత్‌లో ఆర్థిక గణాంకాల ఆధారంగానే రేట్ల పెంపు ఉంటుందనే సంకేతాలను ఆర్‌బీఐ ఇచ్చింది.

– నరేశ్ టక్కర్, ఎండీ, ఇక్రా రేటింగ్స్

దేశీయ ద్రవ్యోల్బణం, అంతర్జాతీయంగా వడ్డీ రేట్లు, చమురు ధరలు పెరుగుతుండటం వల్లే కీలక రేట్లను పెంచాల్సి వచ్చిందని ఆర్‌బీఐ సమర్థించుకుంది. తాజా పరిణామంతో స్థిరాస్తి రంగంపై పెద్దగా ప్రభావం పడదు. అయితే దీర్ఘకాలంలో వడ్డీ రేట్లు దిగిరావాలన్నదే మా కోరిక.

– నిరంజన్ హిరానందనీ, ప్రెసిడెంట్, నరెడ్కో

కీలక రేట్ల పెంపు వల్ల స్థిరాస్తిపై పడే ప్రభావం చాలా స్వల్పం లేదా అసలు ఉండకపోవచ్చు కూడా. ఎందుకంటే ప్రస్తుతం గృహ రుణాలు చాలా వరకు చలన రేటు పద్ధతిలోనే తీసుకుంటున్నారు. అందువల్ల వడ్డీరేట్లు పెరగడం లేదా తగ్గడం వల్ల గృహ అమ్మకాలపై ప్రభావం పడదని అనుకుంటున్నాం.

– రమేశ్ నాయర్, సీఈఓ, జేఎల్ఎల్ ఇండియా

పావు శాతం వడ్డీ రేటు పెంపును చూసి ఇళ్లు కొనాలనుకునేవారు నిర్ణయాన్ని మార్చుకుంటారని నేను భావించడం లేదు. గృహాలకు గిరాకీని పెంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో చర్యలు చేపట్టింది. గృహ రుణాలు ఇప్పటికీ ఆకర్షణీయ రీతిలోనే ఉన్నాయి.

– పంకజ్ బజాజ్, ప్రెసిడెంట్, క్రెడాయ్ (ఎన్‌సీఆర్)

గత కొన్ని నెలలుగా సానుకూల దిశలో సాగుతున్న స్థిరాస్తి రంగంపై తాజా వడ్డీ రేట్ల పెంపు ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. అయితే మధ్య తరగతి, అందుబాటు గృహ రుణాల గిరాకీలో ఎలాంటి మార్పు ఉండదనే మేం అనుకుంటున్నాం.

– సమీర్ జసుజా, సీఈఓ, ప్రోప్‌ఈక్విటీ

అదనపు సామగ్రిపై కిలోకు రూ.500

- ఎయిరిండియా బ్యాగేజీ చార్జీల పెంపు
- దేశీయ మార్గాల్లో 11 నుంచి అమలు

ముంబయి: దేశీయ మార్గాల్లో ప్రయాణించే వారి అదనపు బ్యాగేజీ చార్జీలను పెంచుతున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఒక టిక్కెట్టుపై అనుమతించిన బరువు కంటే అదనంగా తీసుకెళ్లేందుకు ప్రస్తుతం కిలోకు రూ.400 వసూలు చేస్తుండగా, రూ.100 పెంచి రూ.500 చేస్తున్నట్లు తెలిపింది. సాధారణ ప్రయాణికులకు దీనిపై 5 శాతం వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ), ఇతరులకు 12 శాతం జీఎస్‌టీ కూడా జత చేరుతుంది. ఈనెల 11 నుంచి కొత్త చార్జీ అమల్లోకి వస్తుందని వివరించింది. దేశీయంగా ఎయిరిండియా నిర్వహిస్తున్న అన్ని విమానాల్లో ఇవి అమలవుతాయి. అరుణాచల్ ప్రదేశ్, మిజోరం, త్రిపుర, అస్సోం, మణిపుర్, మేఘాలయా, నాగాలాండ్, సిక్కిం, పశ్చిమబంగాలోని బాగ్డోగ్రా విమానాశ్రయాలకు వెళ్లే, అక్కడనుంచి బయలుదేరే విమానాల్లోని లగేజీ చార్జీలపై జీఎస్‌టీ విధించరు. అయితే అనుబంధ సంస్థ అలయన్స్ ఎయిర్ బ్రాండ్‌పై నిర్వహిస్తున్న ప్రాంతీయ సర్వీసుల్లో ఈ మార్పులేమీ ఉండవు.

పెట్టుబడి సగం... ఆదాయం రెండింతలు!

- దూసుకెళ్తున్న

మహిళా లోకం: నివేదిక

దిల్లీ: మహిళలు ఏం వ్యాపారం చేస్తారులే అనుకొనే వారికి ఇదో కనువిప్పు. వారి ఆలోచనా విధానం, వ్యాపారం నిర్వహించే తీరు అద్భుతంగా ఉంటాయని మరోసారి రుజువైంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఆర్జించడంలో వారు పురుషుల కంటే ఎంతో ముందున్నారు. ఇంతకీ ఎందుకు ఇదంతా చెప్పాల్సి వచ్చిందంటే. .మహిళలు స్థాపించిన అంకుర సంస్థలకు పురుషులు స్థాపించిన అంకుర సంస్థలతో పోలిస్తే తక్కువ పెట్టుబడులు వచ్చినట్లు బీసీజీ నివేదిక తెలిపింది. అయితే ఆర్జించిన ఆదాయపరంగా చూస్తే మహిళలు స్థాపించిన అంకురాలే మంచి వృద్ధి నమోదు చేశాయని నివేదిక వెల్లడించింది. అందులోని వివరాలు..

- ✦ మహిళా వ్యాపారులు అంకుర సంస్థకు సంబంధించిన ఆలోచనను తొలుత పెట్టుబడిదారులతో పంచుకున్నపుడు వారికి అందిన పెట్టుబడులు చాలా తక్కువగా ఉన్నాయి.
- ✦ మహిళలు స్థాపించిన అంకుర సంస్థల్లోకి సరాసరిన వచ్చిన పెట్టుబడి దాదాపు రూ.6.25 కోట్లు. ఇదే సమయంలో పురుషులు స్థాపించిన అంకురాల్లో పెట్టిన సరాసరి పెట్టుబడి దాదాపు రూ.14 కోట్లు. అంటే పురుషులు స్థాపించిన అంకురాల్లోకి వచ్చిన పెట్టుబడిలో సగం కూడా మహిళలు స్థాపించిన అంకురాల్లోకి రాలేదన్నమాట.
- ✦ అయితేనేం, పెట్టుబడుల్లో భారీ వ్యత్యాసం ఉన్నప్పటికీ మహిళలు స్థాపించిన అంకురాలు అయిదేళ్ల కాలంలో ఆర్జించిన సంచిత ఆదాయంలో 10% వృద్ధి కనిపించింది. ప్రతి డాలరు పెట్టుబడికి మహిళలు స్థాపించిన అంకురాలు 78 సెంట్లు ఆర్జించగా, పురుషులు స్థాపించిన అంకురాలు సగం కంటే తక్కువగా 31 సెంట్లకు మాత్రమే పరిమితమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం.VII

(చట్టం నెం.30/2013లోని సెక్షన్ 19(1) మరియు రూలు25(1) ప్రకారం)

రూఢీ ప్రకటన

ఆర్.సి.నెం. 5812/2015–జి1 తేది: 05.06.2018

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్ట పరిచిన గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం మల్కాపురం గ్రామములో గల 7.6000 ఎకరముల భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా "రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్" ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు ఏర్పాటు చేయుటకు అవసరమని అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన గుంటూరు జిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తులు అభ్యంతరములను దాఖలు చేసినందున చట్టం 30/2013లోని సెక్షన్ 15 ప్రకారం విచారణ మీదట మరియు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు భూసేకరణకు అవసరమగు పైకము జమ చేసి యున్నందున సంతృప్తి చెందినవారై గుంటూరు జిల్లా కలెక్టరు గారు చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013)లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.

రూఢీ ప్రకటన

దిగువ షెడ్యూలులో పేర్కొనిన 7.6000 సెంట్లు భూమి కొంచెం హెచ్చుతగ్గులలో, చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013)లోని సెక్షన్ 19(1) ప్రకారము ప్రజాహిత కార్యక్రమాలకు అనగా "రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్" ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ, విజయవాడ వారు ఏర్పాటు చేయుటకు అవసరమని గుంటూరు జిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించుచున్నారు.

షెడ్యూలు

ప్రాజెక్టు పేరు : రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్

జిల్లా : గుంటూరు మండలము : తుళ్ళూరు గ్రామము: మల్కాపురం

వరుస నెం	సర్వే నెం.	సబ్ డివిజన్ నెం.	మొత్తము విస్తీర్ణము (ఎ.సెం)	సేకరించవలసిన విస్తీర్ణము (ఎ.సెం.)	భూస్వభావము	వర్గీకరణ	ఆసక్తిగల వ్యక్తుల పేర్లు మరియు చిరునామా	హద్దులు: ఉత్తరము స.నెం.	తూర్పు స.నెం.	దక్షిణము స.నెం.	పడమర స.నెం.	చెట్లు, కట్టడాలు మొదలగు వాటి వివరములు
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
1	2	6	1.9200	1.9200	మెట్ట	పట్టా	గద్దె పద్మ మరియు ఇతరులు	81	2/7ఎ,7బి &2/8	73	2/5బి &5ఎ	
2	3	1ఎ (భాగం)	1.5000	0.5600 0.5000	మెట్ట	పట్టా	నూతక్కి రమాదేవి నూతక్కి రాములు	80&78	78&3/2	3/1బి	79	
3	3	2	1.7800	0.1800 0.1800 0.1900 0.3400 0.3400 0.2750 0.2750	మెట్ట	పట్టా	నూతక్కి సురేష్ నూతక్కి శ్రీనివాసరావు నూతక్కి సురేఖ నూతక్కి సూర్యప్రకాశరావు నూతక్కి ఏపాప్ర కొమ్మినేని కోటేశ్వరరావు దొప్పలపూడి వెంకటరత్నం	78	78&77	79	3/1బి&1ఎ	
4	9	3బి	0.6400	0.6400	మెట్ట	పట్టా	గద్దె పద్మ మరియు ఇతరులు	9/3ఎ	10	9/5ఎ&4ఎ	7	
5	9	5బి	1.3100	1.3100	మెట్ట	పట్టా	చెరుకూరి గౌరి	9/5ఎ	10	వెలగపూడి గ్రామం	9/4బి	
6	10	2బి (భాగం)	0.5300	0.1500 0.1500 0.0600 0.1000	మెట్ట	పట్టా	చుండూరు సుశీల నన్నపనేని లక్ష్మితులసి తోకల సత్యనారాయణ కట్టా శ్రీనివాసరావు	10/2ఎ &75	11	10/3ఎ	10/1బి &2ఎ	
7	10	5(భాగం)	0.8600	0.1400 0.1400 0.1500	మెట్ట	పట్టా	చుండూరు సుశీల నన్నపనేని లక్ష్మితులసి తోకల సత్యనారాయణ	10/3సి	11	వెలగపూడి గ్రామం	10/4	
		మొత్తం:		7.6000								

స్పెషల్ డిప్యూటి కలెక్టర్ మరియు భూసేకరణ అధికారి, **ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ,** రాయపూడి గ్రామంలో ఉన్న మల్కాపురం వారి కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించ కొనవచ్చును.

భూ సేకరణ వలన పునరావాస పునఃనిర్మాణము చేయవలసి వచ్చు కుటుంబముల సంఖ్య లేవు. అందువలన పునరావాస స్థలము గుర్తించబడలేదు. పునరావాస మరియు పునఃనిర్మాణ పథకము సంగ్రహ నివేదిక రాయపూడి గ్రామంలో ఉన్న భూసేకరణ అధికారి మల్కాపురం వారి కార్యాలయము నందు, ఏ.పి.సి.ఆర్.డి.ఎ వెబ్ సైట్ www.crda.ap.gov.in మరియు గుంటూరు జిల్లా కలెక్టర్ వారి వెబ్ సైట్ www.guntur.ap.gov.in నందు ఉంచబడినది.

ప్రాజెక్ట్ నిర్మాణ దశలో అవసరమైన భాగములో గనులు మరియు ఖనిజములు త్రవ్వుట - తొలగించుట - వినియోగించుట తప్ప భూసేకరణ షెడ్యూలు మిగిలిన భూములలో ఉన్న బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజములు అవసరము లేదు.

స్థలము : గుంటూరు సం/- కోన శశిధర్

తేది : 05-06-2018 జిల్లా కలెక్టరు, గుంటూరు జిల్లా

ఆధార్ సమర్పణకు మరింత గడువు

- సుప్రీం తుదితీర్పు వరకు
- సెబీ ఆదేశాలు

దిల్లీ: క్యాపిటల్ మార్కెట్లలో పెట్టుబడి పెట్టేవారు, తమ ఆధార్ వివరాలు జతచేసేందుకు గడువును మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మరింత పెంచింది. ఆర్థిక కార్యకలాపాలకు ఆధార్‌ను అనుసంధానించడంపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇచ్చేవరకు, మదుపర్లు తమ వివరాలు జత చేసుకునేందుకు సమయం ఇచ్చింది. అయితే సెక్యూరిటీ మార్కెట్లకు సంబంధించి, మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ) పూర్తికి శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) వివరాలు మాత్రం తప్పనిసరి అని సెబీ స్పష్టం చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) నిబంధనలు సవరిస్తూ ఆర్థిక శాఖ మార్చి 31న నోటిఫికేషన్ విడుదల చేసినందున, తాజాగా సెబీ ఈ ఆదేశాలిచ్చింది. బ్యాంక్ ఖాతాతో పాటు ఇతర ఆర్థిక ఖాతాలకు ఆధార్‌ను ఈ ఏడాది మార్చి 31లోగా అనుసంధానించాలన్నది గత ప్రణాళిక. ఈ గడువును పొడిగిస్తూ, సుప్రీంకోర్టు తుదితీర్పునకు లోబడి ఇది జరగాలని తాజాగా పేర్కొంది. స్టాక్ బ్రోకర్లు, డిపాజిటరీ భాగస్వాములకు ఈ ఆదేశాలను తెలపాలని స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీలకు సెబీ సూచించింది. ప్రతి 6 నెలలకు నిర్వహించే అంతర్గత ఆడిట్‌లలో 'ఈ ఆదేశాలు సరిగా అమలవుతున్నాయో, లేదో' పరిశీలించాలని కోరింది.

లాజిస్టిక్స్, పారిశ్రామిక స్థిరాస్తి రంగాల్లో

రూ.2,000 కోట్ల పెట్టుబడులు

- టెమాసెక్, అసెండస్ ప్రణాళికలు

దిల్లీ: దేశీయంగా లాజిస్టిక్స్, పారిశ్రామిక స్థిరాస్తి రంగాల్లో రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ పెట్టుబడి సంస్థ టెమాసెక్, సింగపూర్‌కు చెందిన అసెండస్-సింగ్‌బ్రిడ్జ్ ప్రణాళిక రూపొందించాయి. అసెండస్-సింగ్‌బ్రిడ్జ్ కలిసి అసెండస్ ఇండియా లాజిస్టిక్స్ పథకాన్ని రూపొందించగా, ఇందులో ముఖ్య పెట్టుబడిదారుగా టెమాసెక్ ఉండనుంది. ఈ విషయాన్ని అసెండస్ వెల్లడించింది. అసెండస్-సింగ్‌బ్రిడ్జ్, ఫస్ట్ పేస్ సంస్థలు కలిసి 2017లో నెలకొల్పిన వేదిక అసెండస్-ఫస్ట్ పేస్ ఈ పెట్టుబడి వ్యూహాన్ని పర్యవేక్షిస్తుంది. ముంబయి, దేశ రాజధాని ప్రాంతం, పుణె, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్ వంటి ప్రాంతాల్లోని తయారీ, గోదాముల ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు వస్తాయి.

దేశీయంగా వినియోగం బాగా పెరుగుతున్న క్రమంలో, అధిక నాణ్యత కలిగిన లాజిస్టిక్, పారిశ్రామిక స్థిరాస్తి సేవలకు గిరాకీ పెరుగుతోందని అసెండస్-సింగ్‌బ్రిడ్జ్ ముఖ్య పెట్టుబడి అధికారి హి జిహాంగ్ పేర్కొన్నారు.

మెక్‌టన్ విమానాశ్రయంలో రెండో టెర్మినల్ ప్రారంభం

అభివృద్ధి చేసిన జీఎంఆర్-మెగవిడే కన్సార్టియం

హైదరాబాద్: జీఎంఆర్-మెగవిడే కన్సార్టియం అభివృద్ధి చేసిన మెక్‌టన్ సెబు అంతర్జాతీయ విమానాశ్రయం రెండో టెర్మినల్ నేడు ప్రారంభం కానుంది. ఫిలిప్పీన్స్ ప్రెసిడెంట్ రోడ్రిగో డుటెర్ట్ దీన్ని ప్రారంభించనున్నారని జీఎంఆర్ గ్రూప్ వర్గాలు తెలిపాయి. జూన్ 7 రెండు టెర్మినల్‌ను ప్రారంభిస్తారని, జులై ఒకటి నుంచి విమానాల రాకపోకలు ప్రారంభమవుతాయని వివరించారు. 2015, జూన్‌లో కొత్త టెర్మినల్ నిర్మాణాన్ని జీఎంఆర్-మెగవిడే సెబు ఎయిర్‌పోర్ట్ కార్పొరేషన్ (జీఎంసీఏసీ) ప్రారంభించింది. 2024 నాటికి విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీని అంచనా వేసి అందుకు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచడానికి రెండో టెర్మినల్‌ను నిర్మించారు. మెక్‌టన్ సెబు ఇంటర్నేషనల్ విమానాశ్రయం నిర్వహణను 2014, నవంబరులో సీఎంసీఏసీ తీసుకుంది. కన్సెషన్ ఒప్పందం 25 సంవత్సరాల పాటు ఉంటుంది.

భారత జీడీపీ 7.3%

ప్రపంచ బ్యాంక్ అంచనా

వాషింగ్టన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.3 శాతం మేర వృద్ధి చెందొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో 7.5 శాతం మేర ముందుకెళ్లొచ్చని అభిప్రాయపడింది. భారత వృద్ధికి ప్రతిబంధకంగా మారిన కారకాలు వెనక్కి వెళ్లాయని పేర్కొంది. తద్వారా ప్రపంచంలో వేగవంతమైన వృద్ధి సాధిస్తున్న వర్ధమాన దేశంగా భారత్ తన స్థానాన్ని తిరిగి దక్కించుకోనుంది. భారత ఆర్థిక వ్యవస్థకి స్థిరమైన వృద్ధి సాధించగల సత్తా ఉందని ప్రపంచ బ్యాంక్ డైరెక్టర్ (డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్స్ గ్రూప్) అయాన్ కోస్ తెలిపారు. ప్రైవేట్ రంగ పెట్టుబడులు, వినియోగం పుంజుకోవడం భారత్‌కు కలిసొస్తుందని గ్లోబల్ ఎకనమిక్ ప్రోస్పెక్ట్-జూన్ నివేదికలో వెల్లడించింది. 2018లో దక్షిణాసియా వృద్ధి 6.9 శాతానికి పెరగొచ్చని, 2019లో 7.1 శాతానికి చేరొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ ప్రారంభ దశలో అవాంతరాలు భారత వృద్ధిపై ప్రభావం చూపాయని ఇంతకు ముందు ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. ఇక 2017లో 6.9 శాతంగా ఉన్న చైనా వృద్ధి.. 2018లో 6.5 శాతానికి తగ్గొచ్చని ప్రపంచ బ్యాంక్ వెల్లడించింది. 2019లో మరింత తగ్గి 6.3 శాతానికి, 2020లో 6.2 శాతానికి పడిపోవచ్చని తెలిపింది.

200వ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరో అక్కినేని అఖిల్. పక్కన బిగ్ సి సీఎండీ బాలు చౌదరి, డైరెక్టర్లు స్వప్న కుమార్ తదితరులు.

పొరుగు రాష్ట్రాలకు బిగ్ సి

- ఏడాదిలో మరో 150 విక్రయ కేంద్రాలు
- 200వ షోరూమ్‌ను ప్రారంభించిన కంపెనీ

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో గొలుసుకట్టు రిటైల్ విక్రయ కేంద్రాల ద్వారా మొబైల్ ఫోన్లను విక్రయిస్తున్న బిగ్ సి పొరుగు రాష్ట్రాలకు విక్రయ కేంద్రాలను విస్తరించనుంది. ప్రస్తుతం మొత్తం విక్రయ కేంద్రాలు 200లను దాటగా.. వచ్చే ఏడాది కాలంలో మరో 150 వరకూ విక్రయశాలలను ఏర్పాటు చేయనున్నామని, ఇందులో 75 వరకూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రారంభించనున్నామని, మరో 75 దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొల్పనున్నామని బిగ్ సి వ్యవస్థాపకుడు, సీఎండీ ఎం.బాలు చౌదరి తెలిపారు. ముందుగా కర్ణాటకలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఒక్కో విక్రయశాల ఏర్పాటు చేయడానికి రూ.20-50 లక్షలవుతుందన్నారు. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో 200వ షోరూమ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దీన్ని యువ హీరో అక్కినేని అఖిల్ ప్రారంభించారు. బుధవారం ఒకే రోజు హైదరాబాద్‌లో 6 షోరూమ్‌లను కంపెనీ ప్రారంభించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 60 విక్రయ కేంద్రాలు ఉన్నాయని రెండు నెలల్లో 40 ప్రారంభించనున్నామని చౌదరి చెప్పారు. 2002లో ఒక్క షోరూమ్‌తో బిగ్ సి కార్యకలాపాలను ప్రారంభించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల టర్నోవరును నమోదు చేసిన కంపెనీ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,000 కోట్ల అమ్మకాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. విక్రయ కేంద్రాల విస్తరణతోపాటు షోరూమ్‌లలో ఎక్స్‌పీరియన్స్ కేంద్రాలను నెలకొల్పడం, ఇంటి వద్దకే మొబైల్ ఫోన్‌ను తీసుకువచ్చి ఇవ్వడం, ఫోన్‌లోని సౌకర్యాలను వివరించడం ద్వారా అమ్మకాలను పెంచుకోనున్నట్లు చెప్పారు.

6న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	365	వరంగల్	367
చిల్లరగా(ఒక గుడ్డు)	4.25	విశాఖపట్నం	366
బెంగళూరు	410	చెన్నై	435
7వ తేదీకి...		చిత్తూరు	428
విజయవాడ/గోదావరి	360	నమక్కల్	420

ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష

- రెపో, రివర్స్ రెపో రేట్లను పావు శాతం పెంచి వరుసగా 6.. 6.25 శాతానికి చేర్చింది.
- మోదీ ప్రభుత్వం గద్దెనెక్కాక.. అంటే గత నాలుగేళ్లలో రేట్ల పెంపు ఇదే తొలిసారి కావడం విశేషం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7.4 శాతంగా నమోదు కావొచ్చని అంచనా.

ముఖ్యాంశాలు..

- ఏప్రిల్-సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.8-4.9 శాతంగా నమోదు కావొచ్చని అంచనా. 2018-19 ప్రథమార్ధంలో 4.7 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా.
- ముడి చమురు ధరలు 12 శాతం మేర పెరగడంతో ద్రవ్యోల్బణంపై ఒత్తిడి కనిపించొచ్చు.
- పట్టణ సహకార బ్యాంకుల(యూసీబీలు)ను చిన్న బ్యాంకులు(స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్స్)గా మార్చే పథకాన్ని త్వరలో తీసుకురానుంది.
- బ్యాంకు నోట్లను గుర్తించడంలో అంధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరలోనే మార్గదర్శకాలు.
- నికర నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) వర్గీకరణ నిబంధనలను సడలించడం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీల(ఎమ్ఎస్ఎమ్ఈ)కు ఆర్‌బీఐ పెద్ద ఊరటనిచ్చింది.

జూన్ 20న సమీక్ష వివరాలు(మినిట్స్) వెలువడతాయి. ఎమ్‌పీసీ తదుపరి సమావేశం జులై 31, ఆగస్టు 1న

'తటస్థ వైఖరిని కొనసాగించడం ద్వారా మున్ముందు ఎలాంటి విధాన నిర్ణయానికైనా అవకాశాలు సజీవంగా ఉన్నట్లే. కీలక రేట్ల పెంపు, తటస్థ వైఖరిని కొనసాగించే విషయంలో ఎంపీసీ సభ్యులందరూ ఏకాభిప్రాయంపై నిలిచారు. అంతర్జాతీయ చమురు ధరలు పెరుగుతున్న కారణంగా ద్రవ్యోల్బణ అంచనాలపై అనిశ్చితి ఏర్పడింది. 2018 సాధారణ వర్షపాత అంచనాలు వ్యవసాయ రంగానికి ఆశాజనక సంకేతాలు ఇస్తున్నాయి. అయితే అనిశ్చితుల వల్లే తటస్థవైఖరికి మొగ్గుచూపాం. వడ్డీ రేట్ల పెంపునకు నిర్ణయం తీసుకున్నాం. వివిధ రాష్ట్రాలు చేస్తున్న రైతు రుణ మాఫీల కారణంగా నికర నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏలు)పై ఎటువంటి ప్రభావం లేదు.'

- ఉర్జిత్ పటేల్, ఆర్‌బీఐ గవర్నరు

బుధవారం ముంబయిలోని ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయంలో పరపతి విధాన సమీక్షకు ముందు డిప్యూటీ గవర్నర్లతో రిజర్వుబ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్

ఇక భరించాల్సిందే..

మోదీ వచ్చాక మొదటిసారి

అది.. జనవరి 28, 2014.. కీలక రేట్లను ఆర్‌బీఐ పావు శాతం మేర పెంచింది. రెపో రేటు 8 శాతానికి చేరింది. మోదీ ప్రభుత్వం గద్దెనెక్క ముందు ఈ పెంపు జరిగింది.

ఇది.. జూన్ 06, 2018.. మోదీ ప్రభుత్వం కొలువుతీరాక ఇప్పటి వరకు ఆరుసార్లు ఆర్‌బీఐ కీలక రేట్లను తగ్గించింది. పెంచనే లేదు.

చివరి సారిగా ఆగస్టు 2, 2017న పావు శాతం మేర తగ్గించి రెపో రేటును 6 శాతానికి చేర్చింది. ఆ తర్వాత యథాతథ స్థితిని కొనసాగింది. బుధవారం తాజాగా నాలుగేళ్ల తర్వాత రెపో రేటును పావు శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత విధాన సమీక్షలో పరపతి విధాన కమిటీ(ఎమ్‌పీసీ) రేట్ల పెంపునకే ఓటు వేసింది. ఎమ్‌పీసీలోని ఆరుగురు సభ్యులూ ఏకగ్రీవంగా పావు శాతం పెంపునకు మొగ్గుచూపడం విశేషం. దీంతో బ్యాంకులకు ఆర్‌బీఐ ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు అయిన రెపో రేటు 6 శాతం నుంచి 6.25 శాతానికి చేరింది. ఇక బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీ రేటు అయిన రివర్స్ రెపో రేటు 6 శాతానికి చేరింది. బ్యాంక్ రేటు, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ(ఎమ్ఎస్ఎఫ్) రేటును 6.5 శాతానికి చేర్చింది.

ఎందుకు పెంచిందంటే.. రిజర్వ్ బ్యాంక్ దృష్టి ఎపుడూ ద్రవ్యోల్బణంపైనే ఉంటుంది. అది అదుపులో ఉన్నంత కాలం ఆర్‌బీఐ రేట్ల పెంపుపై దృష్టి సారించదు. కానీ తాజాగా ముడి చమురు ధరలు పెరుగుతూ వచ్చాయి. గత సమీక్ష జరిగిన ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు చూస్తే పీపా చమురు ధర 66 డాలర్ల నుంచి 74 డాలర్లకు చేరింది. దీని ప్రభావం పెట్రోలు, డీజిల్ రేట్లపైనా కనిపిస్తోంది. అవి జీవన కాల గరిష్ఠాలకు చేరాయి. ఇంధన ధరల ప్రభావం సాధారణంగానే కూరగాయలపైనా ఉంటుంది. దీంతో ద్రవ్యోల్బణం అదుపులో ఉంచడం కోసం రేట్ల పెంపు వైపు మొగ్గింది. సీపీఐ ద్రవ్యోల్బణ మధ్య కాల లక్ష్యమైన 4 శాతాన్ని చేరడంతో పాటు వృద్ధికి ఊతమిచ్చేందు కోసం ఎమ్‌పీసీ ఈ నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో తన 'తటస్థ' వైఖరిని కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది స్టాక్ మార్కెట్ లాభాలకు కారణమైంది. విచిత్రం ఏమిటంటే.. విశ్లేషకుల్లో అధికభాగం యథాతథ స్థితి కొనసాగుతుందని అంచనా వేయగా.. రేట్లను పెంచి వారిని ఆర్‌బీఐ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

కీలక రేట్ల పెంపును ముందే అంచనా వేసిన పలు బ్యాంకులు రుణ రేట్లను గత వారంలోనే పెంచాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలు 0.1 శాతం మేర రుణ రేట్లను ప్రియం చేశాయి.

కీలక రేట్లు పావు శాతం పెంపు

- ముడి చమురు ధరలే కారణం
- ద్రవ్యోల్బణంపై ఒత్తిడి తగ్గించడానికే
- పెరగనున్న రుణాల రేట్లు

డిపాజిట్‌దార్లకు శుభవార్తే...

కచ్చితమైన వడ్డీ రాబడి కోసం చాలామంది ఫిక్స్‌డ్ డిపాజిట్లమీదే ఆధారపడుతుంటారు. కొంతకాలంగా, ముఖ్యంగా పాత పెద్ద నోట్ల రద్దు తర్వాత ఈ వడ్డీ రేట్లు తగ్గుతుండటంతో చాలామందికి ఆందోళన కల్గిస్తోంది. వడ్డీ ఆదాయం తగ్గడంతో సీనియర్ సిటిజన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వడ్డీ రేట్ల పెంపు ఇప్పుడు వీరికి శుభవార్తే. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచాయి. ప్రత్యేక పథకాలతో డిపాజిట్‌దారులను ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకూ ఎవరైనా అధిక వడ్డీ ఆశతో తక్కువ రేటింగ్ ఉన్న బాండ్లు, డిబెంచర్లలో మదుపు చేస్తే.. వారు బ్యాంకుల డిపాజిట్ పథకాలకు మళ్లవచ్చు. ఉదాహరణకు బీ, సీ, డీ రేటింగ్‌లతో ఉన్న బాండ్లు అధిక వడ్డీ ఇస్తాయి. కానీ, వీటిని నమ్మలేం. ఇలాంటివాటి నుంచి ఈ సమయంలో బయటకు రావడమే మంచిది. ఎఫ్‌డీలకు ప్రత్యామ్నాయంగా డెట్ ఫండ్లలో మదుపు చేయాలనుకుంటే.. స్వల్పకాలిక లిక్విడ్ లేదా షార్ట్ టర్మ్ ఫండ్లను ఎంచుకోండి. వడ్డీ రేట్లు పెరిగితే వీటిల్లో డెట్ ఫండ్లలో లాభం ఉండదు, కాబట్టి, కావాల్సిన వడ్డీ రేటు వచ్చినప్పుడు ఎఫ్‌డీలో జమ చేయవచ్చు. ఇక్కడ మరో విషయం.. వడ్డీ స్వల్పంగా పెరిగితే.. పాత ఎఫ్‌డీని రద్దు చేసుకొని, కొత్త దాంట్లోకి మారే ప్రయత్నం చేయకండి. ఉదాహరణకు మీకు ప్రస్తుతం 6.5శాతం వడ్డీ వస్తుందనుకుందాం. వడ్డీ రేటు 6.75శాతం ఉంటే అందులోకి మారడం ఆచరణీయం కాదు. ఇలాంటప్పుడు లాభం కన్నా రుసుములతో నష్టమే ఎక్కువ. కానీ.. ఎక్కడైనా 8శాతం వస్తుంటే ఆలోచించాల్సిందే.

✦ పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, ఎన్ఎస్‌సీ పథకాల్లో కూడా ఇప్పుడు వడ్డీ రేటు పెరిగే అవకాశం ఉంది. చిన్నమొత్తాల పొదుపు పథకాలను నమ్మేవారికి ఇదీ మంచి వార్తే.

రేట్ల పెంపు బదలాయింపు త్వరలో

రేట్ల పెంపు బదలాయింపు త్వరలోనే ఉంటుందంటున్న వివిధ బ్యాంకర్ల అభిప్రాయాలు ఇలా..

అందుబాటు గృహ రుణ పరిమితిని పెంచడం సహా పరపతి విధాన కమిటీ తీసుకున్న వివిధ నిర్ణయాలను స్వాగతిస్తున్నాం. తటస్థ వైఖరి వైపు మొగ్గు చూపడం ద్వారా మున్ముందు ఎలాంటి విధానం నిర్ణయమైనా తీసుకునే అవకాశాన్ని ఆర్‌బీఐ చేతిలో అట్టేపెట్టుకుంది.

- రజనీశ్ కుమార్, ఛైర్మన్, ఎస్‌బీఐ

కీలక రేట్ల పెంపు ద్వారా పరిస్థితులకు అనుగుణంగా అప్రమత్తతో వ్యవహరించే సెంట్రల్ బ్యాంకుగా ఆర్‌బీఐ మరోసారి నిరూపించుకుంది. ముఖ్యంగా అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో తాజా నిర్ణయం స్వాగతించదగినది.

- చందా కొచ్చర్, సీఈఓ, ఐసీఐసీఐ బ్యాంక్

సమతుల్యంతో తీసుకున్న విధాన నిర్ణయం ఇది. భవిష్యత్‌లో రేట్ల పెంపు విషయంలో దూకుడు ఉండకపోవచ్చనే సంకేతాలను కూడా ఆర్‌బీఐ ఇచ్చింది.

- శిఖా శర్మ, ఎండీ, యాక్సిస్ బ్యాంక్

ద్రవ్యోల్బణాన్ని తిరిగి అదుపులోకి తీసుకొచ్చే సన్నద్ధతలో భాగంగా కీలక రేట్ల పెంపునకు ఆర్‌బీఐ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

- రాణా కపూర్, ఎండీ, సీఈఓ, యెస్ బ్యాంక్

రుణాలు ప్రియం

ఈనాడు - హైదరాబాద్

నాలుగేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను పెంచాలని నిర్ణయం తీసుకుంది. పెంపు పావుశాతమే.. చూడ్డానికి స్వల్పమే.. కానీ, భవిష్యత్తులో పెరిగే వడ్డీ రేట్లకు బీజం పడిందని చెప్పుకోవచ్చు. తాజా పెంపుతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాల రేట్లు భారం కాబోతున్నాయి. మరోవైపు అందుబాటు ధరల ఇళ్లను ప్రాధాన్య రుణాల జాబితాలోకి చేర్చింది. వీటికి నిర్వచనాన్నీ మార్చింది. అదేసమయంలో వీటిలో పేరుకుపోతున్న నిరర్థక ఆస్తులను కట్టడి చేయాలని బ్యాంకులకు సూచిస్తూనే.. ఆదేశించింది.

అనుకున్నట్లే.. ఆర్‌బీఐ రెపో రేటును .25శాతం పెంచింది. సాధారణంగా వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పుడు తమకేమీ పట్టనట్లు ఉండే బ్యాంకులు.. ఈసారి మాత్రం వడ్డీ రేట్ల పెంపును ముందే ఊహించినట్లున్నాయి. అందుకే ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానం కన్నా ముందే ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, పీఎన్‌బీ, బీఓబీ తదితర బ్యాంకులన్నీ తమ రుణాలపై వడ్డీ రేట్లను 10 బేసిస్ పాయింట్ల మేర పెంచాయి. రెపో రేటు పెరిగినప్పుడల్లా.. ఆ వడ్డీ భారం ఎంత అన్న విషయంలో ముందుగా భయపడేది గృహ రుణగ్రహీతలే. చలన రేటులో దీర్ఘ కాలానికి కొనసాగే ఈ అప్పు వడ్డీ కాస్త పెరిగినా అంతిమంగా ఇది రూ. లక్షల్లోనే భారం పడుతుంది. అయితే, నెలసరి సమాన వాయిదాల్లాంటివి మారకున్నా.. చెల్లించాల్సిన గృహరుణ వ్యవధి పెరుగుతుంది. ఉదాహరణకు రూ.25లక్షల గృహరుణం 240 నెలల వ్యవధికి 8.60శాతం వడ్డీకి తీసుకుంటే.. వడ్డీ భారం 0.25శాతం పెరిగితే.. అధికంగా మరో 13 నెలలపాటు ఈఎంఐని చెల్లించాల్సి ఉంటుంది.

మరింత పెరుగుతాయా?: బ్యాంకులు తమ ఎంసీఎల్ఆర్‌లో 5-10 బేసిస్ పాయింట్లను ఇప్పటికే పెంచాయి. ఇక రెపో రేటు పెరగడంతో మరో 15 పాయింట్లు ఇప్పుడే పెంచుతాయా.. లేదా అన్నదే ప్రధాన ప్రశ్న. ఇప్పటికే రుణం తీసుకున్నా.. కొత్తగా తీసుకోవాలనుకుంటున్నా.. వడ్డీ భారం పెరుగుతుందని మానసికంగా సిద్ధంకండి.

ఏం చేయాలి?

వడ్డీ రేట్లు ఇక నుంచీ పెరుగుతూనే ఉంటాయనే విషయం ఖరారైనట్లే.. ఇన్నాళ్లూ తక్కువ వడ్డీ ప్రయోజనాన్ని అందుకున్న గృహరుణగ్రహీతలు ఈ దశలో ఏం చేయాలన్నదీ ఆలోచించాల్సిందే. వడ్డీ కాస్త పెరిగినప్పటికీ.. ఇప్పటికీ అందుబాటు ధరలోనే ఉన్నాయన్నది కొంతమంది బ్యాంకింగ్ నిపుణుల మాట. 'బ్యాంకులు మరింత పెంచేలోపే మీకు కావాల్సిన రుణం తీసుకొని, ఈ కాస్త సమయమైనా తక్కువ రుణ వడ్డీ రేట్ల ప్రయోజనాన్ని పొందండి. ఒకవేళ మీరు ఇప్పటికే అధిక వడ్డీ రేటును చెల్లిస్తూ ఉంటే.. తక్కువ వడ్డీకి రుణం ఇస్తున్న బ్యాంకుకు మీ గృహరుణాన్ని మార్చుకోండి. మున్ముందు అధిక వడ్డీ భారం ఉండే అవకాశం ఉంది కాబట్టి, ఇప్పటికే మీరు తీసుకున్న రుణానికి విడతల వారీగా అసలులో కొంత మొత్తాన్ని చెల్లిస్తూ ఉండండి' అంటూ చెబుతున్నారు బ్యాంక్‌బజార్.కామ్ సీఈఓ అధిల్‌శెట్టి. రుణ వ్యవధి చివర్లో ఉన్నవారు మాత్రం సాధారణ ఈఎంఐలను చెల్లిస్తూ వెళ్లడమే ఉత్తమమని సూచిస్తున్నారు.

గృహరుణాలు.. కొత్తగా తీసుకుంటుంటే..

కొత్తగా గృహరుణాలు తీసుకునేవారు స్థిర, చలన వడ్డీల్లో దేన్ని ఎంచుకోవాలన్నది ఇప్పుడు కీలకం. వడ్డీ రేట్లు పెరుగుతున్నప్పుడు స్థిరవడ్డీ రుణాలే ఎప్పుడూ ఉత్తమం. ఇందులో మూడు/ఐదేళ్లపాటు స్థిరంగా ఉండి, ఆ తర్వాత చలన వడ్డీకి మారే రుణాలను ఎంచుకోవడం ఒకమార్గం. రుణ వ్యవధి మొత్తం స్థిర వడ్డీ ఉండేవి కాస్త ఖరీదు. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారు.. వేరే బ్యాంకుకు మారడం.. లేదా ఉన్న బ్యాంకులోనే కొంత రుసుము చెల్లించడం ద్వారా ఈ స్థిర వడ్డీలోకి రావడానికి అవకాశం ఉంది.

వ్యక్తిగత రుణాలు భారమే

ఏ అవసరానికైనా రుణం కావాలనుకుంటే వ్యక్తిగత రుణాలే శరణ్యం. వడ్డీ రేట్లు పెరుగుతుండటంతో వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లూ పెరుగుతాయి. వ్యక్తిగత రుణాలు ఇప్పటికే ఖరీదెక్కువ. బ్యాంకులను బట్టి ఇవి 11.59% - 24% వరకూ వడ్డీకి లభిస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని తీసుకుంటున్నవారు అధికంగానే ఉంటున్నారు. మిగతా విభాగాలతో పోలిస్తే ఈ రుణాల్లో ఎన్‌పీఏలు అంతగా ఉండకపోవడం, అధిక వడ్డీ ఉండటంతో ఇన్నాళ్లూ బ్యాంకులూ వీటిపై అధిక శ్రద్ధ చూపిస్తూ వచ్చాయి. బ్యాంకులకు రోజురోజుకూ నగదు కొరత అధికమవుతుండటంతో ఇప్పుడు వీటి విషయంలో కాస్త జాగ్రత్తగానే ఉండే అవకాశం ఉంది.

అందుబాటు ఇళ్లు.. రుణం పెరిగింది

అందరికీ ఇళ్లు ఉండాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి తమ వంతుగా సాయం చేసే లక్ష్యంతో ఆర్‌బీఐ ఈ గృహరుణాలను ప్రాధాన్య రంగ రుణాల (పీఎస్ఎల్) జాబితాలోకి చేర్చింది. దీనికిగాను 10లక్షలకన్నా అధిక జనాభా ఉన్న నగరాల్లో ఇల్లు కొనాలనుకునే వారికి 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' పథకంలో ఇప్పటివరకూ ఉన్న రుణమొత్తాన్ని రూ.28లక్షల నుంచి రూ.35లక్షలకు పెంచింది. అంటే.. రూ.45లక్షల్లోపు విలువైన ఇంటిని, రూ.35లక్షల వరకూ గృహరుణం తీసుకొని కొనుగోలు చేయవచ్చన్నమాట. ఇక ఇతర ప్రాంతాల్లో ఇప్పటివరకూ ఉన్న రూ.20లక్షల రుణాన్ని రూ.25లక్షలకు పెంచింది. రూ.30లక్షల ఇంటిని రూ.25లక్షల వరకూ గృహరుణం తీసుకొని కొనేందుకు అవకాశం కల్పించిదన్నమాట. ఆర్థికంగా వెనకబడిన వారికీ, తక్కువ ఆదాయం ఉన్న వారికీ ఈ పథకం మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను జూన్ 30, 2018న వెల్లడిస్తామని ప్రకటించింది.

రూ.2లక్షల రుణాలపై కాస్త కటువుగా ఉండండి!

'గృహరుణాలకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలిస్తే.. రూ.2లక్షల వరకూ తీసుకున్న గృహరుణాల్లో నిరర్థక ఆస్తులు చాలా అధికంగా కనిపిస్తున్నాయి. ఇవి వేగంగా పెరుగుతున్నాయి కూడా..' అని ఆర్‌బీఐ పేర్కొంది. ఈ తరహా రుణాలను ఇచ్చేప్పుడు రుణగ్రహీతను మరింత లోతుగా పరీక్షించాలని బ్యాంకులకు సూచించింది. ఎప్పటికప్పుడు ఈ రుణ విభాగాన్ని సమీక్షించాలని నిర్దేశించింది. ఈ రుణాలను ఎప్పటికప్పుడు తాము గమనిస్తూ ఉంటామనీ, అవసరమైతే ఆస్తి విలువ, రుణ నిష్పత్తులను సవరించడం, నష్టసూచీని పెంచడంలాంటివి విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటామనీ పేర్కొంది. ఈ సూచన నేపథ్యంలో బ్యాంకులు చిన్న రుణ గ్రహీతలను ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. తక్కువ ఆదాయం ఉండి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సరిగా లేనివారు ఇక నుంచి రుణం పొందడం అంత తేలికేమీ కాదనే చెప్పాలి.

వడ్డీ రేటు 0.25శాతం పెరిగితే...

ప్రస్తుత వడ్డీ రేటు 8.60శాతం ఉందనుకుందాం. ఆర్‌బీఐ రెపో రేటును పెంచినట్లే.. బ్యాంకులూ 0.25 శాతం వడ్డీని పెంచాయనుకుందాం. అప్పుడు గృహ రుణ వడ్డీ రేటు 8.85శాతానికి చేరుకునే అవకాశం ఉంది. మరి, దీని భారం ఎలా ఉంటుందంటే...

రూ.లక్ష రుణానికి.. పదేళ్ల వ్యవధికి		
ప్రస్తుత వడ్డీ రేటు		8.60%
కొత్త వడ్డీ రేటు		8.85%
ఈఎంఐ	రూ.1,245	రూ. 1,259
మొత్తం వడ్డీ	రూ.49,425	రూ.51,038
పెరిగే వడ్డీ భారం		రూ.1,613
రూ.25 లక్షల రుణానికి.. 20 ఏళ్ల వ్యవధికి		
ప్రస్తుత వడ్డీ రేటు		8.60%
కొత్త వడ్డీ రేటు		8.85%
ఈఎంఐ	రూ.21,854	రూ.22,253
మొత్తం వడ్డీ	రూ.27,44,977	రూ. 28,40,610
పెరిగే వడ్డీ భారం		రూ.95,633
రూ.30 లక్షల రుణానికి.. 25 ఏళ్ల వ్యవధికి		
ప్రస్తుత వడ్డీ రేటు		8.60%
కొత్త వడ్డీ రేటు		8.85%
ఈఎంఐ	రూ. 24,359	రూ.24,868
మొత్తం వడ్డీ	రూ.43,07,794	రూ.44,60,537
పెరిగే వడ్డీ భారం		రూ.1,52,743

(★ రూపాయలు దగ్గరి విలువకు సర్దుబాటు)

ఒకే ఒక్కడు విరాట్

ఫోర్బ్స్ టాప్-100లో ఏకైక క్రికెటర్

రూ.160 కోట్ల వార్షి కాదాయంతో 83వ స్థానం

న్యూయార్క్

భారత క్రికెట్ సూపర్‌స్టార్, టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఆటలోనే కాదు.. ఆదాయంలోనూ తానే ప్రపంచ మేటి అని రుజువు చేశాడు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఆదాయం ఆర్జించే టాప్-100 క్రీడాకారుల జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక క్రికెటర్ అతనే. ఫోర్బ్స్ ప్రకటించిన ఈ జాబితాలో విరాట్‌కు 83వ స్థానం దక్కింది. గత ఏడాది 89వ స్థానంలో ఉన్న విరాట్.. ఈసారి ఆరు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. అతడి వార్షికాదాయం 24 మిలియన్ డాలర్లు (సుమారు రూ.160 కోట్లు) కావడం విశేషం.

- బీసీసీఐ కాంట్రాక్టు కింద విరాట్‌కు ఏటా సుమారు రూ.6.7 కోట్లు అందుతున్నాయి. ఐపీఎల్ ఫ్రాంఛైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అతడికి ఒప్పందం కింద దాదాపు రూ.18 కోట్లు చెల్లిస్తుంది. మ్యాచ్ ఫీజులు, ఇతర భత్యాలు కలిపితే.. ఆట ద్వారా మొత్తంగా 4 మిలియన్ డాలర్లు (సుమారు రూ.27.5 కోట్లు) ఆర్జిస్తున్నాడు విరాట్.
- ఆటతో సంపాదించే దాంతో పోలిస్తే వాణిజ్య ఒప్పందాల ద్వారా ఐదు రెట్లు అధికంగా ఆర్జిస్తున్నాడు విరాట్. ఏడాదిలో ఈ ఆదాయం 20 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.133 కోట్లు)గా ఉంది.

- బాస్కెట్‌బాల్ స్టార్ మార్క్ గాసోల్ (84వ స్థానం, 23.7 మిలియన్ల ఆదాయం), ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు నొవాక్ జకోవిచ్ (86-23.5 మి.), ఫుట్‌బాల్ స్టార్ సెర్జియో అగెరో (86, 23.5 మి.)ల కంటే కోహ్లి మెరుగైన స్థానంలో ఉన్నాడు..
- కేవలం వాణిజ్య ఒప్పందాల ద్వారా వస్తున్న ఆదాయాన్నే పరిగణనలోకి తీసుకుంటే కోహ్లి 15వ స్థానంలో ఉండటం విశేషం. ఆట ద్వారా పొందే ఆదాయం ప్రకారం చూస్తే అతను 95వ స్థానంలో ఉన్నాడు.
- ఈ జాబితాలో బాక్సర్ ఫ్లాయిడ్ మేవెదర్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతడి వార్షికాదాయం 275 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1837 కోట్లు) కావడం విశేషం. అతను గత ఏడాది మెక్‌గ్రెగార్‌తో ఫైట్ ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాడు. రెండో స్థానంలో ఉన్న ఫుట్‌బాలర్ మెస్సితో (రూ.742 కోట్లు) పోలిస్తే రెట్టింపుకన్నా ఎక్కువ ఆర్జించాడు మేవెదర్. ఐతే అతను వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆర్జించింది 10 మిలియన్ డాలర్లే. మేవెదర్‌తో పోలిస్తే ఈ రూపంలో విరాట్ రెట్టింపు సంపాదించడం విశేషం.
- ఈసారి ఫోర్బ్స్ టాప్-100 జాబితాలో ఒక్క మహిళకూ చోటు దక్కలేదు. గత ఏడాది జాబితాలో ఉన్న సెరెనా విలియమ్స్ బిడ్డకు జన్మనివ్వడం కోసం ఏడాదికి పైగా ఆటకు దూరం కావడంతో ఆమెకీసారి చోటు దక్కలేదు.

ఛాంపియన్స్

మేవెదర్

టాప్-10లో వీళ్లే..

1. మేవెదర్ (బాక్సింగ్-285 మిలియన్ డాలర్లు)
2. మెస్సి (ఫుట్‌బాల్-111 మిలియన్లు)
3. రొనాల్డో (ఫుట్‌బాల్-108 మిలియన్లు)
4. మెక్‌గ్రెగార్ (బాక్సింగ్-99 మిలియన్లు)
5. నెయ్‌మార్ (ఫుట్‌బాల్-90 మిలియన్లు)
6. లెబ్రాన్ జేమ్స్ (బాస్కెట్‌బాల్-85.5 మిలియన్లు)
7. ఫెదరర్ (టెన్నిస్-77.2 మిలియన్లు)
8. స్టీఫెన్ కర్రీ (బాస్కెట్‌బాల్-76.9 మిలియన్లు)
9. మాట్ ర్యాన్ (అమెరికన్ ఫుట్‌బాల్-67.3 మిలియన్లు)
10. స్టాఫర్డ్ (అమెరికన్ ఫుట్‌బాల్-59.5 మిలియన్లు)

83. కోహ్లి (24 మిలియన్లు)

టుస్సాడ్స్‌లోకి వచ్చేశాడు!

దిల్లీ: దేశ రాజధానిలో ఏర్పాటైన మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి మైనపు విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. భారత జట్టు జెర్సీ ధరించిన కోహ్లి బ్యాక్‌ఫుట్ తీసుకుని షాట్ ఆడేందుకు తీక్షణంగా చూస్తున్నట్లుగా ఉంది ఈ విగ్రహం. అతడి బొమ్మకు సమీపంలోనే భారత ఫాస్ట్‌బౌలింగ్ దిగ్గజం కపిల్ దేవ్ మైనపు విగ్రహం ఉండటం విశేషం. "నా బొమ్మ తయారు చేయడానికి చేసిన ప్రయత్నాలను అభినందిస్తున్నా. విగ్రహ ఏర్పాటుకు నన్ను ఎంపిక చేయడం ద్వారా జీవిత కాల అనుభవాన్ని మిగిల్చిన టుస్సాడ్స్‌కు ధన్యవాదాలు. నా విగ్రహం చూసి అభిమానులు ఎలా స్పందిస్తారో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అని కోహ్లి ఓ ప్రకటనలో తెలిపాడు. దిల్లీ టుస్సాడ్స్‌లో బోల్ట్, మెస్సి లాంటి ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

ఫిఫా ప్రపంచకప్ మరో 7 రోజుల్లో

జో చిమ్ లా

జర్మనీ జోరుగా..

ప్రపంచ ఛాంపియన్ జర్మనీ ఒకవైపు.. సంచలనాలు సృష్టించగల స్వీడన్, మెక్సికో, దక్షిణకొరియా మరోవైపు. టైటిల్ నిలబెట్టుకోవాలన్న పోరాటం ఒకరిది.. నాకౌట్ చేరాలన్న ఆశ ముగ్గురిది. ఫిఫా ప్రపంచకప్‌లో గ్రూప్-ఎఫ్ ఆసక్తికరంగా ఉంది. ఐతే జర్మనీనే గ్రూప్ ఫేవరెట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక రెండో స్థానం కోసం స్వీడన్, మెక్సికో మధ్య గట్టి పోటీ ఉంది. అలాగని దక్షిణకొరియాను తక్కువగా అంచనా వేస్తే అది పొరపాటే.

గ్రూప్-ఎఫ్ విశ్లేషణ

జర్మనీ జోరుగా హుషారుగా..

ఫిఫా ర్యాంకు 1

గత ప్రపంచకప్ విజేత జర్మనీ మొహరించిన గ్రూప్-ఎఫ్ మీదే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానంలో ఉన్న జర్మనీ.. ఈసారి కూడా హాట్ ఫేవరెట్‌గా బరిలో దిగుతోంది. రష్యా వేదికగా జరిగిన ప్రపంచకప్ సన్నాహక టోర్నీ కాన్ఫడరేషన్ కప్‌లో విజేతగా నిలిచిన జర్మనీ.. ఫిఫా ప్రపంచకప్‌నూ నిలబెట్టుకోవాలనే ఉత్సాహంతో ఉంది. ప్రపంచకప్ అర్హత టోర్నీలో 10 మ్యాచ్‌లు ఆడి పదింట్లోనూ గెలిచిన ఈ ఐరోపా జట్టు.. రికార్డు స్థాయిలో ఈ టోర్నీలో 43 గోల్స్ సాధించింది. 2014 ప్రపంచకప్‌లో జర్మనీ విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించిన కోచ్ జో చిమ్ లా.. మరోసారి కప్పు గెలిపించాలనే పట్టుదలతో ఉన్నాడు. వెటరన్ ఆటగాళ్లు థామస్ ముల్లర్, మాన్యుయల్ న్యూర్‌తో పాటు టిమో వెర్నర్, జొనాస్ హెక్టార్, ఆంటోనియో రుడిజర్, మరియో గొమెజ్ రాణించడం కీలకం.

కీలక ఆటగాళ్లు: టోని క్రూస్, న్యూర్, ముల్లర్; **కోచ్:** జో చిమ్ లా

గత రికార్డు: 18సార్లు ప్రపంచకప్ ఆడి 1954, 74, 90, 2014 టోర్నీల్లో విజేతగా నిలిచింది.

దక్షిణ కొరియా అంచనాలు లేవు కానీ..

సోన్ హియాంగ్

ఫిఫా ర్యాంకు 61

ఫిఫా ప్రపంచకప్‌లో 1986 టోర్నీ నుంచి దక్షిణ కొరియా క్రమం తప్పకుండా పోటీపడుతుంది. 2002 టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పెను సంచలనం సృష్టించిన ఈ ఆసియా జట్టు.. 2014లో పేలవ ఆటతో గ్రూపు దశలోనే వెనుదిరిగింది. ఈసారి అర్హత టోర్నీలోనూ దక్షిణకొరియా అతికష్టమ్మీద గట్టెక్కి రష్యా వెళుతోంది. ఉజ్బెకిస్థాన్‌తో ఆఖరి మ్యాచ్ డ్రా కావడం, ఇరాన్‌పై గెలవడంలో సిరియా విఫలం కావడంతో దక్షిణకొరియాకు ప్రపంచకప్ బెర్తు దక్కింది. ఇంగ్లిష్ ప్రిమియర్ లీగ్‌లో ఆడిన అనుభవం ఉన్న సోన్ హియాంగ్ మిన్, కి సుంగ్ యుంగ్, లీ చుంగ్ యంగ్‌లపైనే దక్షిణకొరియా ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ జట్టుపై పెద్దగా అంచనాలేమీ లేవు. కానీ ప్రతిభావంతులతో నిండిన కొరియాను తీసిపారేయలేం కూడా.

కీలక ఆటగాడు: సోన్ హియాంగ్ మిన్, కి సంగ్-యంగ్; **కోచ్:** షిన్ టె యంగ్

రికార్డు: 10 టోర్నీల్లో ఆడింది. 2002లో సెమీస్ చేరింది.

గ్రూప్ అంచనా: గ్రూప్ విజేతగా జర్మనీ నాకౌట్లో అడుగుపెట్టొచ్చు. దక్షిణ కొరియాకు పెద్దగా అవకాశాలు లేవు. స్వీడన్-మెక్సికో మధ్య పోరే అత్యంత కీలకం కానుంది. గ్రూప్ నుంచి ముందంజ వేసే జట్టును నిర్ణయించే మ్యాచ్ అదే కావొచ్చు.

మెక్సికో ముందుకెళ్లే సత్తా ఉంది

హెర్నాండెజ్

ఫిఫా ర్యాంకు 16

ప్రపంచకప్‌కు క్రమం తప్పకుండా అర్హత సాధించే జట్లలో మెక్సికో ముందంజలో ఉంటుంది. గత ఆరు ప్రపంచకప్‌లలో ఆడిన మెక్సికో ప్రిక్వార్టర్స్ నుంచే వెనుదిరిగింది. ఈసారి క్వార్టర్‌ఫైనల్ చేరినా ఆ జట్టు పెద్ద ఘనత సాధించినట్లే. 1970, 86 టోర్నీల్లో మాత్రమే మెక్సికో క్వార్టర్స్ వరకు వెళ్లగలిగింది. బ్రెజిల్‌లో జరిగిన గత ప్రపంచకప్‌లో మెక్సికో మెరుగ్గానే ఆడింది. ఈసారి నాకౌట్ అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కీలక ఆటగాడు: హెర్నాండెజ్, లొజానో

కోచ్: జువాన్ కార్లోస్ ఒసోరియో

రికార్డు: 16సార్లు ప్రపంచకప్ ఆడింది. 1970, 1986లో క్వార్టర్స్ చేరింది.

స్వీడన్ సంచలనాలే లక్ష్యం

ఫిఫా ర్యాంకు 23

ఫోర్స్‌బెర్గ్

అర్హత టోర్నీ ప్లేఆఫ్స్‌లో గత ఛాంపియన్ ఇటలీకి షాకిచ్చి ఈసారి ప్రపంచకప్‌లో బరిలో దిగుతోంది స్వీడన్. 2006 తర్వాత ఆ జట్టు మళ్లీ ఇప్పుడే ప్రపంచకప్ ఆడబోతోంది. గతేడాది యూరోపియన్ ఛాంపియన్‌షిప్ తర్వాత ఆ జట్టు స్టార్ ఆటగాడు ఇబ్రహిమోవిచ్ వీడ్కోలు పలకడం స్వీడన్ జట్టుకు పెద్ద దెబ్బే. ఎమిల్ ఫోర్స్‌బెర్గ్‌కు మాత్రమే ప్రత్యర్థులకు సమస్యలు సృష్టించగల ఆటగాడిగా పేరుంది. 2016 యూరో కప్ తర్వాత స్వీడన్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన జానె అండర్సన్.. జట్లపై తెగించి ఆడే ధైర్యాన్ని నింపాడు. దాని ఫలితమే ప్రపంచకప్ అర్హత టోర్నీలో ఇటలీపై విజయం.

కీలక ఆటగాళ్లు: ఎమిల్ ఫోర్స్‌బర్గ్, మార్కస్ బెర్గ్; **కోచ్:** జేన్ అండర్సన్;

రికార్డు: 12సార్లు ప్రపంచకప్ ఆడింది. 1958లో రన్నరప్‌గా నిలిచింది.

అమ్మాయిలకు బంగ్లా షాక్

7 వికెట్ల తేడాతో భారత్ ఓటమి

కౌలాలంపూర్: అలసత్వం భారత్ కొంప ముంచింది. మహిళల ఆసియాకప్ టీ20లో బుధవారం హర్మన్‌ప్రీత్ నాయకత్వంలోని భారత్ జట్టుకు బంగ్లాదేశ్ షాకిచ్చింది. 7 వికెట్ల తేడాతో విజయం సాధించి.. అంతర్జాతీయ క్రికెట్లో భారత్‌పై తొలి విజయం (ఏ ఫార్మాట్లోనైనా) నమోదు చేసింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో థాయ్‌లాండ్, మలేసియాలను చిత్తు చేసిన డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. బంగ్లాదేశ్‌పై పేలవంగా ఆడింది.

హర్మన్‌ప్రీత్

ముఖ్యంగా బ్యాటింగ్‌లో తడబడింది. మొదట 7 వికెట్లకు 141 పరుగులే చేయగలిగింది. ఓపెనర్లు మిథాలీరాజ్ (15), స్మృతి మంధాన (2) వైఫల్యం జట్టును దెబ్బతీసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (42; 37 బంతుల్లో 6×4) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమె.. దీప్తి శర్మ (32; 28 బంతుల్లో 5×4)తో నాలుగో వికెట్‌కు 50 పరుగులు జోడించింది. ఆఖరి ఐదు ఓవర్లలో భారత్ కేవలం 30 పరుగులే రాబట్టగలిగింది. లెగ్ స్పిన్నర్ రుమానా అహ్మద్ (3/21) భారత్‌ను కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించింది. ఫర్గానా హక్ (52 నాటౌట్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రుమానా అహ్మద్ (42 నాటౌట్) చెలరేగడంతో లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 19.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

వేశ్యలతో వీడ్కోలు విందు

మెక్సికో జట్టుపై ఆరోపణలు

మెక్సికో సిటీ: మెక్సికో ప్రపంచకప్ జట్టు వివాదంలో చిక్కుకుంది. రషా వెళ్లేముందు ఆ జట్టు సభ్యులు దాదాపు 30 మంది వేశ్యలతో వీడ్కోలు విందులో పాల్గొన్నారనే వార్తలు వెలువడ్డాయి. గత శనివారం స్కాట్లాండ్‌తో సన్నాహక మ్యాచ్‌లో 1-0తో విజయం సాధించిన మెక్సికో జట్టు ఆ రాత్రి సంబరాలు చేసుకుంది. దానికి సంబంధించి ఆటగాళ్ల చిత్రాలు బయటకు వచ్చాయి. దీనిపై స్పందించిన జట్టు అధికారులు... ఆటగాళ్లు ఖాళీ సమయంలో పార్టీ చేసుకున్నారని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని తెలిపారు. "శిక్షణ శిబిరాన్ని ఎగ్గొట్టి ఆటగాళ్లు ఈ విందులో పాల్గొనలేదు. కాబట్టి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేం'' అని మెక్సికో ఫుట్‌బాల్ సంఘం సాధారణ కార్యదర్శి కెంటూ తెలిపాడు. మెక్సికో జట్టు మీద ఇంతకుముందు కూడా ఇలాంటి వార్తలు వచ్చాయి. 2011 జూన్‌లో వేశ్యలతో హోటల్ గదిలో గడిపినందుకు ఆటగాళ్లు ఆర్నెళ్లు నిషేధానికి గురయ్యారు.

సాయ్ కోచ్‌పై వేటు

దిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ తమిళనాడు కోచ్‌పై కేంద్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) వేటు వేసింది. పేరు వెల్లడి కాని ఆ కోచ్.. తమిళనాడులోని ఓ సాయ్ కేంద్రంలో శిక్షణ కోసం వచ్చిన జూనియర్ క్రీడాకారిణుల్ని లైంగికంగా వేధించినట్లు సమాచారం. 15 మంది క్రీడాకారిణులు అతడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. అంతర్గత విచారణ అనంతరం అతడిపై వేటు వేశారు. మరోవైపు బెంగళూరులోని సాయ్ కేంద్రంలో ఓ మహిళా కోచ్‌కు అసభ్య సందేశాలు పంపిన అకౌంటెంటును స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవాల్సిందిగా అధికారులు ఆదేశహించారు. మహిళా క్రీడాకారిణులు, కోచ్‌లకు సాయ్ కేంద్రాలు సురక్షితమన్న సంకేతాలిచ్చేందుకు ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ముగురుజ

హలెప్

షరపోవాకు పరాభవం

ముగురుజ చేతిలో చిత్తు చిత్తు ● కెర్బర్‌పై హలెప్ విజయం

పారిస్

ప్రిక్వార్టర్స్‌లో తలపడాల్సిన సెరెనా గాయంతో తప్పుకుంది.. ఇంకేముంది పునరాగమనంలో తొలి గ్రాండ్‌స్లామ్ గెలవడానికి మరియా షరపోవాకు మార్గం సుగమమైనట్లే అనుకున్నారు అభిమానులు. కానీ తర్వాతి పోరులో ఈ రష్యా భామకు ఎదురు పడ్డ ప్రత్యర్థి చెలరేగిపోయింది. షరపోవా కెరీర్లోనే అత్యంత అవమానకర ఓటమిని ఆమెకు రుచి చూపించింది. ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో షరపోవా 2-6, 1-6తో మూడో సీడ్, స్పెయిన్ క్రీడాకారిణి గార్బిన్ ముగురుజ చేతిలో పరాజయం చవిచూసింది. 2012 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అజరెంకా చేతిలో 3-6, 0-6తో చిత్తయ్యాక షరపోవా ఒక గ్రాండ్‌స్లామ్‌లో ఇంత ఘోరంగా ఓడటం ఇదే తొలిసారి. ముగురుజ.. ఏకంగా ఆరుసార్లు షరపోవా సర్వీస్‌ను బ్రేక్ చేయడం విశేషం. షరపోవా మాత్రం బ్రేక్ పాయింట్ కూడా సాధించలేకపోయింది. 27 అనవసర తప్పిదాలు చేసిన ఆమె.. రెండో సెట్ మొత్తంలో కేవలం ఐదు పాయింట్లు మాత్రమే సాధించింది. తొలి సెట్ ఆరంభంలోనే వరుసగా రెండుసార్లు షరపోవా సర్వీస్‌ను బ్రేక్ చేయడం ద్వారా 4-0 ఆధిక్యంలోకి వెళ్లిన ముగురుజ.. తర్వాత వెనుదిరిగి చూడలేదు. తర్వాతి రెండు సర్వీస్‌లను నిలుపుకొన్నప్పటికీ ప్రత్యర్థి సర్వీస్‌ను మాత్రం బ్రేక్ చేయలేకపోయింది. రెండో సెట్లో అయితే ఆమె నుంచి కనీస ప్రతిఘటన లేకపోయింది. 25 నిమిషాల్లోనే ఈ సెట్ ముగిసిపోవడం గమనార్హం. మొత్తంగా గంటా 13 నిమిషాల్లో షరపోవా పని పట్టి సెమీస్‌కు దూసుకెళ్లింది ముగురుజ. డోపింగ్ వల్ల పడ్డ నిషేధం కారణంగా 2016లో ఫ్రెంచ్ ఓపెన్‌కు దూరమైన షరపోవా.. నిరుడు వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించకపోవడంతో ఈ టోర్నీలో ఆడలేకపోయింది.

షరపోవా

తొలి సెట్ ఓడినా..: మరో క్వార్టర్స్‌లో టాప్ సీడ్ హలెప్ తొలి సెట్ ఓడినా.. తర్వాత గొప్పగా పుంజుకుని విజయం సాధించింది. ఆమె 6-7 (2-7), 6-3, 6-2తో 12వ సీడ్, జర్మనీ క్రీడాకారిణి ఏంజెలినా కెర్బర్‌ను ఓడించింది. 2 గంటల 14 నిమిషాలు సాగిన ఈ పోరులో తొలి సెట్ మాత్రం హోరాహోరీగా సాగింది. ఆరంభంలో కెర్బర్ జోరు చూపించింది. వరుసగా రెండు బ్రేక్ పాయింట్లతో 4-0 ఆధిక్యంలో నిలిచింది. ఐతే హలెప్ పుంజుకుని రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది. తర్వాత ఇద్దరూ తలో సర్వీస్ కోల్పోయారు. చివరికి స్కోరు 6-6తో సమమై టై బ్రేకర్‌కు దారి తీయగా.. కెర్బర్ ధాటిగా ఆడి సెట్‌ను సొంతం చేసుకుంది. ఐతే తర్వాతి రెండు సెట్లలో హలెప్ చెలరేగి ఆడింది. రెండు సెట్లలో ఒక్కసారి మాత్రమే సర్వీస్ కోల్పోయిన హలెప్.. ఐదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

నాదల్ మ్యాచ్‌కు ఆటంకం: పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ మ్యాచ్‌లకు వర్షం అడ్డంకిగా నిలిచింది. 11వ సీడ్ ష్వార్జ్‌మన్ (అర్జెంటీనా)తో పోరులో తొలి సెట్‌ను 4-6తో కోల్పోయిన టాప్ సీడ్ నాదల్.. రెండో సెట్‌లో 5-3తో ఆధిక్యంలో ఉన్న స్థితిలో మ్యాచ్ ఆగింది. సిలిచ్-డెల్‌పొట్రో మధ్య మరో క్వార్టర్స్‌లో తొలి సెట్ టైబ్రేకర్‌లో స్కోరు 5-5తో సమమైన దశలో మ్యాచ్‌కు బ్రేక్ పడింది. ఈ మ్యాచ్‌లు శుక్రవారం కొనసాగనున్నాయి.

టికెట్లు లేవు

ముంబయి: మొన్నటి వరకు అభిమానులు లేక వెలవెలబోయిన ఫుట్‌బాల్ స్టేడియం.. ఇప్పుడు కిటకిటలాడుతోంది. మ్యాచ్ చూద్దామంటే టికెట్లు కూడా దొరికే పరిస్థితి లేదు. 'తిట్టండి కానీ మా మ్యాచ్‌లు చూడండి.. మైదానాలకు రండి' అంటూ భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రి సామాజిక మాధ్యమాల్లో ఆవేదన వ్యక్తం చేశాక మారిన పరిస్థితి ఇది. ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా గురువారం భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే మ్యాచ్ టికెట్లన్నీ అప్పుడే అమ్ముడుపోయాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్ టికెట్లూ అయిపోయాయని నిర్వాహకులు ప్రకటించారు. వరుసగా రెండు విజయాలతో ఇప్పటికే ఫైనల్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకున్న భారత్.. మరో విజయంతో గ్రూప్ దశను ముగించాలని పట్టుదలగా ఉంది. విజయం సాధిస్తే అజేయంగా తుది పోరుకు వెళ్తుంది. లేదంటే మెరుగైన గోల్ తేడాతో ముందంజ వేసే అవకాశముంది. భారత్‌తో పాటు.. ఫైనల్ రేసులో న్యూజిలాండ్, కెన్యా కూడా ఉన్నాయి. ఆ రెండు జట్లు ఒక్కో విజయం సాధించాయి.. రెండు మ్యాచ్‌ల్లో ఓడి భారీగా గోల్స్ సమర్పించుకున్న చైనీస్ తైపీ రేసు నుంచి నిష్క్రమించినట్లే.

నేడు న్యూజిలాండ్‌తో భారత్ ఢీ

- రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

కొలువు పోరులోనే కన్నుమూశారు

- ప్రాణస్నేహితులను పొట్టన పెట్టుకున్న రోడ్డు ప్రమాదం
- కారును లారీ ఢీకొనడంతో నలుగురు దుర్మరణం
- మృతులు కర్నూలు జిల్లా వాసులు

కృష్ణవేణి, శ్రీనివాస్ రాఘవేంద్ర, ఉపేంద్రరెడ్డి

లారీ ముందు భాగంలోకి దూసుకుపోయిన కారు

భర్త, పిల్లలతో విజయలక్ష్మి

త్రిపురాంతకం, ఈనాడు డిజిటల్, కర్నూలు, కర్నూలు, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలోని.. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై కారు, సిమెంటు లారీ ఢీకొనడంతో నాలుగు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. కర్నూలుకు చెందిన కృష్ణవేణి(38), ఆమె స్నేహితురాలు ఐవీ విజయలక్ష్మి(39) ఇద్దరూ దివ్యాంగులు. ఇటీవల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి మంగళవారం ప్రకటించిన తుది జాబితాలో వీరిద్దరి పేర్లు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఏమయిందో తెలుసుకునేందుకు అమరావతిలోని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి వెళ్లాలనుకున్నారు. విజయలక్ష్మి కారులో ఆమెతో పాటు కృష్ణవేణి, ఆమె భర్త మట్టా శ్రీనివాస రాఘవేంద్ర (40), డ్రైవర్ దాసరి ఉపేంద్రరెడ్డి(21)లు తెల్లవారుజామున నాలుగు గంటలకు బయలుదేరారు. ఉదయం 7 గంటల సమయంలో మార్గ మధ్యలోని వెల్లంపల్లి- గొల్లపల్లి మధ్య దామరచర్ల నుంచి కర్నూలు వెళుతున్న సిమెంటు లారీ మితిమీరిన వేగంతో కారును ఢీకొంది. ఈ ధాటికి కారు లారీ కిందకు దూసుకుపోయి నుజ్జునుజ్జయ్యింది. దీంతో కారులోని నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. లారీ కింద ఇరుక్కుపోయిన కారును, మృతదేహాలను వెలికితీయడానికి పోలీసులు శ్రమించారు. పొక్లెయిన్ తెప్పించి తాళ్లతో కట్టి బయటకు లాగారు.

విధి ఆడిన వింత నాటకం..: ప్రభుత్వ ఉద్యోగం కోసం ఇతరులను వెనక్కినెట్టి మరీ పోటీ పరీక్షలో విజయం సాధించిన ఆ స్నేహితులు విధి ఆడిన వింతనాటకంలో ఓడిపోయారు. కొలువు కొట్టిన సంబరం తీరకుండానే.. విధికి కన్నుకుట్టడంతో కన్నుమూశారు. కర్నూలుకు చెందిన దివ్యాంగులు ఐవీ విజయలక్ష్మి, ఎం.కృష్ణవేణిలదే ఈ విషాదగాథ. డిగ్రీ కళాశాల అధ్యాపకుల(డీఎల్) భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహించిన పోటీ పరీక్షలు 2017, జూన్ 6న జరిగాయి. గతేడాది సెప్టెంబరులో ఫలితాలు విడుదలయ్యాయి. నవంబరులో మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ రెండింటిలో అర్హత సాధించిన విజయలక్ష్మి, కృష్ణవేణి ఈ ఏడాది ఫిబ్రవరిలో కొలువులకు ఎంపికైనట్లు నిర్ధరణ అయింది. అనంతరం మౌఖిక పరీక్షల మార్కుల విషయంపై కొందరు న్యాయస్థానం గడప తొక్కగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొంత జాప్యమైంది. ప్రస్తుతం వారం రోజుల నుంచి భర్తీ ప్రక్రియ జరుగుతోంది. అర్హత సాధించిన కంప్యూటర్ సైన్సు అభ్యర్థుల జాబితాలో 16 మందికి నియామక పత్రాలిచ్చి మిగిలిన నలుగురికి పోస్టింగ్‌లు నిలిపేశారు. ఆ నలుగురిలో వీరిద్దరి పేర్లు ఉండడంతో ఫోన్లో విచారించారు. ఓసీ మహిళ జోన్-4 కింద సమస్య ఉన్నట్లు తెలుసుకున్నారు. అసలు విషయం తెలుసుకోవడానికి బుధవారం తెల్లవారుజామున అమరావతికి బయలుదేరారు. సరిగ్గా ఏడాది క్రితం జూన్ 6న పరీక్ష రాసిన ఇద్దరూ ఈ ఏడాది అదే తేదీన మరణించడం విషాదకరం.

ప్రతిభలో గెలిచి: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన కంప్యూటర్ సైన్సు సహాయ ఆచార్యురాలిగా ఐవీ విజయలక్ష్మి రెండేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. భర్త విజయ్‌కిషోర్ ప్రైవేటు మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. కుమార్తె తన్వి 8వ తరగతి, కుమారుడు తన్య మహేష్ 6వ తరగతి చదువుతున్నారు. విజయలక్ష్మి ప్రస్తుతం ఎస్వీ వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 'ఇమేజ్ అండ్ డాటా మైనింగ్' అంశంపై పీహెచ్‌డీ చేస్తున్నారు. చిన్నతనంలోనే కంప్యూటర్ విభాగం హెచ్‌వోడీగా పలు కార్యశాలలు నిర్వహించడం ఆమె ప్రతిభకు తార్కాణం. అమరావతికి బయలుదేరి వెళ్లిన విజయలక్ష్మి కన్నా.. ఆమె మరణవార్తే ముందు వచ్చిందంటూ భర్త విజయ్‌కిషోర్ కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రేమ బంధం విషాదాంతం..: కర్నూలుకు చెందిన మట్టే శ్రీనివాస్ రాఘవేంద్ర, భార్య కృష్ణవేణిలది కులాంతర వివాహం. పెద్దలకు ఇష్టం లేకపోవడంతో.. అందరికీ దూరంగానే జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు దుర్గా సాత్విక్(8వ తరగతి), ముకుందసాయి(3వ తరగతి) ఉన్నారు. శ్రీనివాస్ రాఘవేంద్ర స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. కృష్ణవేణి కొంత కాలం ఆర్‌యూలో, ప్రస్తుతం కేవీఆర్ డిగ్రీ కళాశాలలో పార్ట్‌టైంగా పనిచేస్తున్నారు. ఎమ్మెస్సీ బీఈడీ పూర్తిచేసిన కృష్ణవేణి ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకురాలిగా కొలువు సాధించారు. ఉద్యోగం సాధించిన నేపథ్యంలో అపార్ట్‌మెంట్ వాసులకు విందు ఇచ్చి ఆనందాన్ని పంచుకున్నారు. బుధవారం తెల్లవారుజామున సోదరుడి ఇంట్లో పిల్లలను వదిలిపెట్టి భార్యాభర్తలు ఇద్దరూ అమరావతికి బయలుదేరారు. అనంతరం కొన్ని గంటల్లోనే వారిని మృత్యువు కబళించింది.

విద్యుదాఘాతంతో ఇద్దరి దుర్మరణం

- పవన్ పర్యటనకు ఫ్లెక్సీ కడుతుండగా అపశ్రుతి

బి.శివ

టి.నాగరాజు

పాయకరావుపేట, అరకులోయ, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పాయకరావుపేటలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటనకు సంబంధించి ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతానికి గురైన ఇద్దరు అభిమానులు దుర్మరణం చెందారు. ఈ నెల ఏడున(నేడు) పవన్ పాయకరావుపేటలో పోరాటయాత్రకు రానున్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని పవన్ అభిమానులు పెద్దఎత్తున ఫ్లెక్సీలు కడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక పాయకరావుపేటకు చెందిన భీమవరపు శివ(31), తూర్పు గోదావరి జిల్లా తునికి చెందిన తోళెం నాగరాజు(28) పవన్ భారీ ఫ్లెక్సీని భవనం పైనుంచి అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇద్దరు భవనంపైన ఉండగా.. శివ, నాగరాజు కిందుండి ఫ్లెక్సీని పట్టుకున్నారు. ఒక్కసారిగా ఈదురుగాలి వీయడంతో పైన ఉన్న వ్యక్తులు ఫ్లెక్సీని వదిలేశారు. ఈ క్రమంలో అది పక్కనే ఉన్న 33 కె.వి.విద్యుత్ తీగలపై పడింది. ఫ్లెక్సీ చుట్టూ ఇనుప ఫ్రేము ఉండడంతో విద్యుదాఘాతానికి గురైన శివ, నాగరాజు సంఘటన స్థలంలోనే మృతిచెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పాయకరావుపేట ఎస్సై ఎల్.రామకృష్ణ తెలిపారు.

కార్యకర్తల మరణం కలచివేసింది: పవన్

ఫ్లెక్సీలు కడుతూ జనసేన కార్యకర్తలు మరణించటం తననెంతో కలచివేసిందని పవన్‌కళ్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోడానికి చర్చలు తీసుకుంటానన్నారు. వారి కుటుంబీకులను కలసి పరామర్శించనున్నట్లు ఆయన తెలిపారు.

కొళాయి వద్ద విద్యుదాఘాతంతో
ఇద్దరు మహిళల మృతి

మలికిపురం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా మలికిపురంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై నల్లి వరలక్ష్మి(52), నల్లి పైడికుమారి(22) అనే ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారు. వరసకు అత్తాకోడళ్లవుతారు. పద్మజ సినిమాహాలు ఎదురుగా ఇంటి ప్రహరీకి ఉన్న కొళాయి నుంచి నీళ్లు పట్టుకొంటున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సమీప విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధిదీపాల కనెక్షన్ తీగలు ఊడిపోయి ఉండడంతో ప్రమాదం జరిగింది. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ సంఘటన జరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

కన్నబిడ్డలతో రైల్లోంచి దూకేసిన తల్లి

- తల్లి, కుమారుడు అక్కడికక్కడే మృతి.. బయటపడిన కుమార్తె

జ్యోత్స్న

విశాఖపట్నం(గోపాలపట్నం), న్యూస్‌టుడే: కన్నబిడ్డలిద్దరితో సహా ఓ తల్లి కదులుతున్న రైల్లోంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన బుధవారం విశాఖపట్నంలోని గోపాలపట్నం సమీపంలో చోటు చేసుకుంది. విజయనగరం జిల్లా జియ్యమ్మవలస మండలం పరజిపాడు గ్రామానికి చెందిన కోరాడ ఇందుమతికి, శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలం వెంకంపేట గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహమైంది. వీరికి జ్యోత్స్న(6), బద్రీనాథ్(5) సంతానం. ఏడాది కిందటే బతుకుదెరువు కోసం విశాఖపట్నంలోని వడ్లపూడి దరి కణితి ఆర్‌హెచ్‌కాలనీకి వచ్చేసి నివాసం ఉంటున్నారు. పిల్లలిద్దరి చదువుల నిమిత్తం తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో మనస్తాపం చెందిన ఇందుమతి తన పిల్లలతో బుధవారం దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు ఎక్కింది. సరిగ్గా గోపాలపట్నం దరి భగత్‌సింగ్‌నగర్ దగ్గరకు వచ్చే సరికి పిల్లలతో సహా ఆమె కూడా కదులుతున్న రైలు నుంచి దూకేసింది. తల్లి ఇందుమతి, కుమారుడు బద్రీనాథ్ అక్కడికక్కడే మృతి చెందారు. కుమార్తె జ్యోత్స్నకు తీవ్రగాయాలయ్యాయి.

మానవ మృగం

- భార్యకు రాత్రంతా చిత్రహింసలు
- అవయవాలు కోసి కారం చల్లిన భర్త

గాయాలతో బాధిత మహిళ, నిందితుడు రాజు

డోన్ పట్టణం, కృష్ణగిరి, న్యూస్‌టుడే: భార్యపై అనుమానంతో భర్త అత్యంత కిరాతకంగా చిత్రహింసలకు గురిచేశాడు. ఆమె అవయవాలను కోసి కారం చల్లాడు. నిప్పుతో కాల్చి పైశాచికంగా వ్యవహరించాడు. కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలంలోని ఓ గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది. బేతంచెర్ల మండలానికి చెందిన యువతిని.. కృష్ణగిరి మండలానికి చెందిన రత్నమయ్య కుమారుడు రాజుకు ఇచ్చి 14 నెలల క్రితం వివాహం చేశారు. వారి కాపురం 15 రోజులు సజావుగా సాగినా కలతలు మొదలయ్యాయి. అప్పటి నుంచి భార్యపై అనుమానంతో పలుమార్లు చిత్రహింసలకు గురిచేశారు. మంగళవారం మరింత రాక్షసంగా ప్రవర్తించాడు. ఆమె చేతులు కాళ్లు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి మరింత దారుణానికి ఒడిగట్టాడు. సున్నిత అవయవాలను కోసి కారం చల్లాడు. నిప్పుకర్రతో ఆమె కాళ్లు, నడుము భాగంలో కాల్చాడు. రాత్రంతా ఈ బాధలను భరించిన యువతి.. ఉదయం అతను లేని సమయంలో ఇంట్లో నుంచి తప్పించుకొని కృష్ణగిరి పోలీసులను ఆశ్రయించింది. నిందితుడు రాజు మొదటి నుంచి అనుమాన ధోరణితో వ్యవహరించేవాడని గ్రామస్థులు తెలిపారు. మొదటి వివాహం అత్తకూతురితో జరగ్గా ఆమెను ఇలానే చిత్రహింసలకు గురిచేయడంతో విడిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయభాస్కర్ వెల్లడించారు.

బాలికపై లైంగిక దాడి

- అవమాన భారంతో ఆత్మహత్యాయత్నం
- 90% గాయాలతో మృత్యువుతో పోరాటం

పాలసముద్రం, న్యూస్‌టుడే: ఓ కామాంధుడి చేతిలో లైంగిక దాడికి గురైన 17 ఏళ్ల బాలిక.. అవమానభారంతో ఆత్మహత్యకు యత్నించింది. 90 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బాధితురాలు కుప్పంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన మునస్వామి అనే యువకుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా అరవడంతో పారిపోయాడు. బాధితురాలు జరిగిన సంఘటనను తల్లిదండ్రులకు వివరించింది. వారు యువకుడి తల్లిదండ్రులను ప్రశ్నించడంతో గ్రామంలో వివాదం రాజుకుంది. ఇరు కుటుంబాల మధ్య దాడికి దారితీసింది. విషయం ఊరంతా తెలిసిందన్న అవమాన భారంతో.. ఆమె ఇంట్లోకి పరుగెత్తి కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు గమనించేలోపే 90 శాతం శరీరం కాలిపోయింది. గ్రామస్థులు ఆమెను ముందుగా తమిళనాడులోని షోళింగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో.. అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. ఎస్సై రాజశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.185 కోట్లు మింగేశాడు

- రుణాలు పొందేందుకు డొల్ల కంపెనీలు ఏర్పాటు
- బినామీలు, కుటుంబ సభ్యులకు రూ.35 కోట్లు బదిలీ

చదలవాడ రవీంద్రబాబు

ఈనాడు, హైదరాబాద్: చదలవాడ రవీంద్రబాబు.. ప్రకాశం జిల్లా మంగమూరు వాసి. పదిహేడేళ్ల వయస్సులో ఇంటర్మీడియేట్ ఫెయిలయ్యాడు.. ఇంట్లో తిరస్కారాలు భరించలేక బయటకొచ్చాడు.. రూ.కోట్లకు అధిపతి కావాలనుకున్నాడు.. ఉపాధి కోసం పదేళ్ల క్రితం బిహార్ వెళ్లాడు. అక్కడ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం, నిర్వహణ కాంట్రాక్టర్ నుంచి సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. లాభాలు రావడంతో బిహార్‌లోనే మరో జిల్లాకు వెళ్లాడు. తానే గుత్తేదారుగా కాంట్రాక్టు తీసుకున్నాడు. 70 మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉప విద్యుత్ స్టేషన్లు నిర్మించాడు. లాభాలు రావడంతో ఉత్తర్‌ప్రదేశ్, కోల్‌కతా, ఛత్తీస్‌గఢ్, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లలో విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణ కాంట్రాక్టులు పొందాడు. ఐదేళ్లకే రూ.10కోట్ల లాభాన్ని పొందాడు. మరిన్ని లాభాలు పొందాలంటే బ్యాంకుల నుంచి రుణం తీసుకుని ఎగ్గొట్టాలనుకున్నాడు. ఇందుకోసం చదలవాడ ఇన్‌ఫ్రాటెక్ పేరుతో సంస్థను ప్రారంభించాడు. బ్యాంకులతో పాటు పెట్టుబడిదారులను వంచించాలన్న లక్ష్యంతో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంలో పెట్టుబడులు పెట్టించాడు. ఇలా ఐదేళ్ల వ్యవధిలో బ్యాంకుల నుంచి రూ.185కోట్లు రుణం తీసుకున్నాడు. చదలవాడ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ సీఎండీగా పదవి ఇస్తానంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కె.మోహన్ రావు నుంచి ఐదేళ్ల క్రితం రూ.2కోట్లు తీసుకున్నాడు. ఆ డబ్బు చెల్లించకపోవడంతో మోహన్‌రావు గత నెల సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు మే 26న రవీంద్రబాబును అరెస్టు చేసి విచారణ జరిపారు. రవీంద్రబాబు రుణం చెల్లించకపోయినా బ్యాంకులు అతడిపై ఫిర్యాదు చేయకపోవడంతో బ్యాంకు అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అన్న కోణంలో విచారిస్తున్నామని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అతడిపై 36 నాన్‌బెయిలబుల్ కేసులున్నాయన్నారు. బినామీలు, కుటుంబ సభ్యులకు రూ.35 కోట్లు బదిలీ చేసినట్లు గుర్తించారు. భారీ కుంభకోణమైనందున చదలవాడ స్థిర, చరాస్థులు జప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు పోలీసులు లేఖ రాశారు.



సీఎంకు ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు

ఈనాడు అమరావతి: ఆర్య వైశ్యుల సంక్షేమానికి కేటాయింపులు పెంచుతున్నట్లు ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఆర్యవైశ్య నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. తెదేపా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంబికా కృష్ణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు బుధవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రిని కలిశారు. ఆర్యవైశ్యుల సంక్షేమ సంస్థను ఏర్పాటు చేసినప్పుడు కేటాయించిన రూ.30కోట్ల మొత్తాన్ని రూ.60కోట్లకు పెంచుతున్నట్టు తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కనకదుర్గ దేవాలయం పాలక మండలి సభ్యుడు చంద్రపాటి లక్ష్మీనారాయణ, విజయవాడ నగర తెదేపా వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈము రైతులకు ఆసరాగా రూ.35.19కోట్లు

ఈనాడు, అమరావతి: ఈము రైతులను ఆదుకునేందుకు అనువుగా రూ.35.19 కోట్లకు పరిపాలనా అనుమతి మంజూరైంది. రాష్ట్రంలో ఈముపక్షుల పెంపకానికి తీసుకున్న బ్యాంకు రుణాల్లో 50శాతం చెల్లింపునకు ప్రభుత్వం ఈ మొత్తాన్ని విడుదల చేసింది. మిగిలిన 50 శాతంలో బ్యాంకులు సగం రద్దుచేస్తాయి. రైతులు 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది.

మత్స్యకారులకు రూ.32కోట్లు

వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు అందించే ఆర్థిక సాయం కోసం ప్రభుత్వం రూ.32కోట్లు మంజూరు చేసింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల వేట నిషేధ కాలానికి సంబంధించి ఒక్కో మత్స్యకారుడికి రూ.4వేల చొప్పున అందిస్తారు.

పింఛనుదారుల డీఏ విడుదలకు వినతి

ఈనాడు డిజిటల్, అమరావతి: ఉద్యోగులు, పింఛనుదారులకు రావలసిన రెండు డీఏలలో ఒకటైనా మంజూరు చేస్తూ వెంటనే ఉత్తర్వులివ్వాలని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలో పింఛనుదారుల చర్చావేదిక అధ్యక్షులు ఈదర వీరయ్య కోరారు. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లయినా ఇంకా విభజన కష్టాల పేరు చెప్పి డీఏ ఇవ్వలేకపోతున్నానని పేర్కొనడం సహేతుకం కాదన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులు, పెట్రో ధరల దృష్ట్యా ఒక డీఏనైనా వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా ఐవీ సుబ్బారావు

ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులుగా ఐవీ సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే నాటికి సుబ్బారావు నామినేషన్ ఒక్కటే మిగలడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి శ్రీనివాసరావు బుధవారం ప్రకటించారు.

ఆరోగ్య కార్డుల దరఖాస్తుల గడువు జూన్ 30

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉద్యోగులకు ఆరోగ్యకార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని ఆ సంస్థ ఐక్యకార్యాచరణ సమితి ఛైర్మన్, కార్యనిర్వాహక కార్యదర్శి బి.సాల్మన్, హర్షవర్ధన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్డుల కోసం ఈ నెల 30లోగా ఎన్టీఆర్ ఆరోగ్య ట్రస్టు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అందులో తెలిపారు.

20 రోజులు నిరాటంకంగా నీళ్లివ్వాలి

- కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు సాగునీటి సంఘాల సారథుల వినతి

ఈనాడు, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించినట్లుగా సాగర్ ఎడమ కాలువలో 20 రోజులు నిరాటంకంగా నీటిని సరఫరా చేసి 10 రోజులు వారబందీ పెడితే చివరి ప్రాంతాలకు నీరు అందుతుందని పలువురు సాగునీటి సంఘాల సారథులు కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. సాగునీటి సంఘాల రాష్ట్ర సర్వోన్నత కమిటీ సభ్యులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణ, ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వై.పుల్లయ్యచౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు, దేవభక్తుని సీతారాం ప్రసాద్ తదితరులు ఈ మేరకు కృష్ణా నదీ యాజమాన్యబోర్డు ఛైర్మన్ హెచ్.కె.సాహుకు బుధవారం హైదరాబాద్‌లో వినతిపత్రం సమర్పించారు. సాగర్ ఎడమ కాలువ కింద సమస్యలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌తో సంప్రదించకుండా ఏక పక్షంగా 9 రోజులు ఆన్ 6 రోజులు ఆఫ్ పద్ధతి అమలు చేయడంతో ఎడమ కాలువ కింద చివరి రైతులం ఎంతో నష్టపోయామన్నారు. బోర్డు 18.427 టీఎంసీలు సాగర్ ఎడమ కాలువకు కేటాయించగా సీజన్ మొత్తం మీద 11.59 టీఎంసీలే నీటి నష్టాలతో కలిపి విడుదల చేశారని వివరించారు.

కృష్ణా బోర్డు ఛైర్మన్ సాహూకు వినతిపత్రం అందజేస్తున్న సాగునీటి సంఘాల సారథులు ఆళ్ల వెంకటగోపాలకృష్ణరావు, పుల్లయ్య చౌదరి, నాగేశ్వరరావు తదితరులు

- ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు ఎగువన సాగర్ ఎడమ కాలువలో నాలుగు చోట్ల రెండు మీటర్ల ఎత్తున అడ్డుగోడలు నిర్మించి చట్ట విరుద్ధంగా నీటిని వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సయితం జత చేశారు. దీని వల్ల 2, 3 జోన్లకు నీరు అందడం లేదని పేర్కొన్నారు.
- తెలంగాణ ప్రాంతంలో 8 ఎత్తిపోతల పథకాలు, 3000 అయిల్ ఇంజిన్ల ద్వారా 1200 క్యూసెక్కులు అక్రమంగా వాడుకుంటున్నారని, ఏపీకి నీటిని విడుదల చేసిన సమయంలోనే ఇలా నీటిని తీసేసుకోవడం వల్ల ఇబ్బంది కలుగుతోందన్నారు.
- భక్త రామదాసు ఎత్తిపోతల పథకం పేరుతో రోజుకు 700 క్యూసెక్కులు తరలించేస్తున్నారని, ఈ పథకం రాష్ట్ర పునర్ విభజన చట్టానికి వ్యతిరేకంగా నిర్మించారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.
- ప్రత్యేకంగా పెట్రోలింగు నిర్వహించి తెలంగాణ ప్రాంతంలో నీరు అక్రమంగా వాడుకోకుండా చర్యలు తీసుకోవాలని వీరు విన్నవించారు.

ఏపీలో 800 ఎంబీబీఎస్ సీట్లకు కోత

- ఒక కొత్త వైద్యకళాశాలకు అనుమతి నిరాకరణ
- కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజా ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో 800 ఎంబీబీఎస్ వైద్యవిద్య సీట్లకు కోత పడింది. 6 వైద్యకళాశాలల్లో 2018-19 వైద్యవిద్య సంవత్సరానికి సీట్లను పునరుద్ధరించడానికి కేంద్ర సర్కారు అనుమతి నిరాకరించింది. కొత్తగా నెలకొల్పాలని సంకల్పించిన ఒక వైద్య కళాశాలకు అనుమతి మంజూరు చేయలేదు. ఈ మేరకు తాజాగా కేంద్ర ఆరోగ్య కుటుంబ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. రేణిగుంటలో శ్రీ పద్మావతి వైద్యకళాశాల పేరిట 150 సీట్లతో కొత్తగా నెలకొల్పడానికి దరఖాస్తు చేసుకోగా.. దానిని కేంద్రం తిరస్కరించింది. కోనసీమ వైద్యకళాశాలలో 150 సీట్ల నుంచి 200 సీట్లకు కొత్తగా 50 సీట్లను అదనంగా పెంచడానికి పెట్టుకున్న దరఖాస్తునూ మన్నించలేదు. ఇవి కాకుండా గత ఏడాది అందుబాటులో ఉన్న 800 ఎంబీబీఎస్ సీట్ల పునరుద్ధరణకు అనుమతించలేదు. విశ్వభారతి(కర్నూలు), గీతం(విశాఖ), నిమ్రా (జూపూడి), గాయత్రి(విశాఖపట్టణం), ఆర్‌వీఎస్(చిత్తూరు) వైద్యకళాశాలల్లో ఒక్కో కళాశాలలో 150 సీట్ల చొప్పున మొత్తం ఐదు కళాశాలల్లోనూ 750 సీట్లకూ.. జీఎస్ఎల్(రాజమహేంద్రవరం) వైద్యకళాశాలలో గతేడాది 150 నుంచి 200కు పెంచిన సీట్లలో 50 సీట్లకు కోత పెట్టింది. దీంతో జీఎస్ఎల్ వైద్యకళాశాలలో ప్రస్తుతం 150 ఎంబీబీఎస్ సీట్లకే అనుమతులు రాగా.. మిగిలిన ఐదింటిలో మొత్తం 150 సీట్ల చొప్పున పూర్తిగా అనుమతులు రద్దయ్యాయి.

అమరావతిలో అక్రమాలు జరిగాయి

భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆరోపణ

ఈనాడు డిజిటల్, అమరావతి: అమరావతిలో అక్రమాలు జరిగినట్లు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో వెల్లడైందని భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆరోపించారు. బుధవారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అభద్రతా భావంతో భాజపా నాయకుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేస్తోందని... సాక్ష్యాధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. ఎయిర్ ఏషియా కుంభకోణంలో బయట కొచ్చిన ఫోన్ సంభాషణలు సీబీఐ, ఈడీ దర్యాప్తులో భాగమయ్యే అవకాశముందన్నారు. రాష్ట్రంలోని ఏడు వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకోలేదన్నారు. చేయని పనులను చేసినట్లు చూపారని ఇప్పటికే కేంద్రానికి ఫిర్యాదులు అందాయని చెప్పారు. షేర్ మార్కెట్‌లో అనుభవం ఉన్న కుటుంబరావును ప్రణాళిక సంఘం అధ్యక్షునిగా నియమించారన్నారు. 'రెండు నెలల్లో పెద్ద కుంభకోణాలను బయటపెడతామంటున్నారు.. అదేదో ఇప్పుడే ఎందుకు బయటపెట్టడం లేదు?' అని నిలదీశారు.

తెదేపా బయటకొచ్చాక భాజపాకి బోధపడింది

- ఇప్పుడు భాగస్వామ్య పక్షాల చుట్టూ తిరుగుతోంది: యనమల

ఈనాడు అమరావతి: ఎన్డీయే నుంచి తెదేపా బయటకు వచ్చాక భాగస్వామ్య పార్టీల ప్రాధాన్యత ఏమిటో భాజపాకి బోధపడిందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. ఇక పార్టీకి పుట్టగతులుండవన్న ఉద్దేశంతో నష్ట నివారణ చర్యలు చేపట్టిందని..ఇప్పుడు భాగస్వాముల చుట్టూ తిరుగుతోందని అన్నారు. ఆ పార్టీ తీరు 'చేతులు కాలాకా ఆకులు పట్టుకున్నట్టు'గా ఉందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ' 'మోదీ, అమిత్‌షా అహంభావ రాజకీయాలు చేశారు. సీనియర్ నాయకులు అడ్వాణి, మురళీ మనోహర్ జోషీలను అవమానించారు. ప్రజల్లో వ్యతిరేకత చూసి యూటర్న్ తీసుకున్నారు. వాళ్లు గడప గడపకూ తిరగడమే దీనికి

నిదర్శనం. శివసేన, జేడీ(యూ), అకాళీదళ్ చుట్టూ ప్రదక్షిణలు చేయడం భాజపా దుస్థితికి అద్దం పడుతోంది." అని యనమల పేర్కొన్నారు. నాలుగేళ్ల నరేంద్ర మోదీ పాలనలో అన్నీ వైఫల్యాలేనన్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మచ్చ

వైకాపా ఎంపీల రాజీనామా డ్రామా చరమాంకానికి చేరిందని, ఉప ఎన్నికలు రాకుండా చేయడంలో వారు కృతకృత్యులయ్యారని యనమల మండిపడ్డారు. "ఉప ఎన్నికలంటే వైకాపాకి భయం పట్టుకుంది. ఇటీవల పరిణామాలతో భాజపా, వైకాపాల ప్రతిష్ఠ దెబ్బతినడంతో వాళ్లు బెంబేలెత్తారు. భాజపా, వైకాపా కలిసి ఆడిన ఈ 'రాజీ డ్రామా' పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ" అని ఆయన ధ్వజమెత్తారు.

దిల్లీలో సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం

ఈనాడు, దిల్లీ: దేశ రాజధానిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో స్థానిక గోల్ మార్కెట్‌లోని శ్రీవారి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు బుధవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నవరం దేవస్థానం ప్రధాన అర్చకులచే సత్యనారాయణస్వామి వ్రతం ఈ నెల 9న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, 10న సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు కల్యాణం నిర్వహించనున్నట్లు ప్రవీణ్ ప్రకాశ్ వివరించారు. దిల్లీ వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు ఎం.వి. రంగయ్య (9818506647), శ్రీరాములు (8588862170), సురేశ్ (9811179696), నాగేశ్వరరావు (9893847742)లను సంప్రదించాలని కోరారు.

ప్రపంచ శాంతి సూచీలో భారత్ స్థానం 136

దిల్లీ, లండన్: ప్రపంచ శాంతి సూచీ-2018లో భారత్‌కు 136వ స్థానం లభించింది. అంతకుముందు సంవత్సరంలో 137వ ర్యాంకు లభించగా, కాస్త మెరుగు పడడం గమనార్హం. 2016లో 141వ స్థానం వచ్చింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ (ఐఈపీ) ఇచ్చిన ఈ ర్యాంకుల్లో ఐస్‌లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రియాలకు తొలి మూడు స్థానాలు లభించాయి. తీవ్రమైన నేరాల అదుపునకు భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలించడం, ఆయుధాల దిగుమతి తగ్గడంతో పరిస్థితి మెరుగయిందని ఆ సంస్థ తెలిపింది. హింసాత్మక సంఘటనల్లో మరణాల సంఖ్య కూడా తగ్గిందని పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్యాలయంలో అధికారం కేంద్రీకృతం కావడంతో రాజకీయ సుస్థిర సూచీ తగ్గిందని తెలిపింది. రాజకీయ అల్లర్ల సూచీ 4 పాయింట్లు, అంతర్గత వివాదాల సూచీ 4.7 పాయింట్లుగా ఉంది. మొత్తం 163 దేశాల్లోని పరిస్థితులను విశ్లేషించగా, సిరియా శాంతి లేని దేశంగా చివరి స్థానం పొందింది. దానిపై స్థానంలో అఫ్గానిస్థాన్ ఉంది.

భీమా కోరేగాం అల్లర్ల కేసులో అయిదుగురి అరెస్టు

పుణె: మహారాష్ట్రలోని భీమా-కోరేగాంలో జనవరి 1న జరిగిన అల్లర్ల వ్యవహారంలో పోలీసులు అయిదుగుర్ని అరెస్టుచేశారు. వీరందరికీ మావోయిస్టులతో సంబంధాలున్నాయని సంయుక్త పోలీసు కమిషనర్ తెలిపారు. దళిత ఉద్యమనేత సుధీర్ ధవాలేను ముంబయిలోని ఆయన స్వగృహంలో అరెస్టు చేశారు. ఆయన మరాఠీ పత్రిక విరోధికి సంపాదకుడు. న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్, సామాజిక కార్యకర్త మహేష్ రౌత్, నాగ్‌పుర్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ షోమా సెన్‌లను నాగ్‌పుర్‌లోను, రోనా విల్సన్‌ను దిల్లీలో అరెస్టు చేశారు.

ప్రజా సంఘాల నేతల్ని విడుదల చేయాలి

హైదరాబాద్, న్యూస్‌టుడే: అక్రమంగా అరెస్టు చేసిన ప్రజా సంఘాల నేతల్ని వెంటనే విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. విరసం నేత వరవరరావు, సీఎల్‌పీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొ.గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు, ఉపాధ్యక్షులు నలమాస కృష్ణ, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ప్రధాన కార్యదర్శి బల్లా రవీంద్రనాథ్, ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర కన్వీనర్ చిక్కుడు ప్రభాకర్ తదితరులు విలేకరుతో మాట్లాడారు.

పాక్ నుంచి డ్రోన్ ద్వారా మాదక ద్రవ్యాల స్మగ్లింగ్

చండీగఢ్: పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ జరుగుతున్నట్టు బీఎస్‌ఎఫ్ అధికార్ల పరిశీలనలో తేలింది. డ్రోన్లకు హెరాయిన్ సంచులను కట్టి సరిహద్దు గ్రామాల్లో జారవిడుస్తున్నట్టు గమనించారు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలోని ఓ గ్రామంలో హెరాయిన్ సంచిని జారవిడవడానికి ఓ డ్రోన్ రాగా, దాన్ని గుర్తించారు. బీఎస్‌ఎఫ్ జవాన్లను గమనించిన స్మగ్లర్లు ఆ డ్రోన్‌ను తిరిగి పాకిస్థాన్ వైపు మళ్లించారు.

సెజ్ విధానాలపై అధ్యయనానికి బృందం

ఈనాడు, దిల్లీ: దేశంలోని ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్) విధి విధానాలపై అధ్యయనానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ పలువురు వ్యాపార వేత్తలు, ప్రముఖులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. భారత్ ఫోర్జ్ ఛైర్మన్ బాబా కళ్యాణి బృందానికి నేతృత్వం వహించనున్నారు. సభ్యులుగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, కె.రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజా, టాటా స్టీల్ సెజ్ లిమిటెడ్ ఎండీ అరుణ్ మిశ్రా, మహీంద్రా లైఫ్ స్పేస్ డెవలపర్ ఎండీ అనితా అర్జున్ దాస్, గిఫ్ట్ సిటీ సెజ్ ఎండీ, గ్రూప్ సీఈవో అజయ్ పాండే, హైదరాబాద్ ఫినిక్స్ డెవలపర్ డైరెక్టర్ శ్రీకాంత్ బాడిగ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ పరిశ్రమలశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, మెంబరు సెక్రటరీగా వాణిజ్యశాఖ సెజ్ విభాగపు ఇన్‌ఛార్జి, సమన్వయాధికారిగా వాణిజ్య శాఖ డెరెక్టరు నియమితులయ్యారు. దేశంలో ప్రస్తుతం సెజ్‌ల పనితీరు.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఎగుమతిదారుల అవసరాలు తీర్చడం... ప్రపంచ వాణిజ్య సంస్థ విధానాలకు అనుకూలంగా సెజ్‌లలో చేయాల్సిన మార్పులు.. దిద్దుబాట్లు.. తదితర అంశాలపై ఈ బృందం అధ్యయనం చేస్తుంది.

Sri Balaji Educational Services, HYD & GUNTUR
Ag.B.Sc
ICAR Colleges in Maharastra
For Admissions Plz meet in GUNTUR, RAJAMANDRY & VIJAYANAGARAM
L. Venkat Reddy (www.csmss.org)
94917 46535, 63023 78991

Admission Guidance
MBBS, BDS
All India & Nepal
8790511616



CRUISE CONTROL | PUSH START/STOP & TOUCH SENSOR BASED SMART ENTRY SYSTEM | STANDARD DUAL AIRBAGS & ABS WITH EBD | BIG 420L BOOT SPACE

For more information, SMS <AMAZE> to 53030 or log on to www.hondacarindia.com/honda-amaze

Follow us at: http://facebook.com/hondacarindia http://twitter.com/hondacarindia • For corporate sales enquiries, write to corporatesales@hondacarindia.com • To exchange any existing car with Honda Amaze, write to autoterrace@hondacarindia.com • Terms & conditions apply • Colours, features, specifications and mileage figures are grade specific • Images are for reference and creative visualisation only • Actual colours may vary from the ones shown here • Segment is defined as sedan cars with overall length less than 4000mm • **Applicable for periodic maintenance part & labour as per the respective owner's manual. Cost can be changed without prior notice. • Fuel efficiency as certified by iCAT under Rule 115 of CMVR 1989 • Fuel efficiency figures are based on standard test conditions • Actual fuel efficiency may vary based on road conditions, driving technique and driving conditions • *Warranty of unlimited kms in a 3 year period from date of sale of new vehicle is part of standard Amaze purchase • Standardised Ex-showroom Price across India • Price is for E(MT) Petrol.

ANDHRA PRADESH: VIJAYWADA: Sundaram Honda, 7675800509; VIZAG: Central Honda, 8886635043; Sundaram Honda, 9849120325; NELLORE: Express Honda, 7702366699; TIRUPATI: Express Honda, 9959900130; RAJAHMUNDRY: Elite Honda, 7799900576; BHIMAVARAM: Elite Honda, 7799900553; ANANTHAPUR: Premium Honda, 7375004872; KADAPA: Premium Honda, 9100102999; KURNOOL: Premium Honda, 7799766426; GUNTUR: Express Honda, 7680909731. TELANGANA: HYDERABAD/SECUNDERABAD: Green Honda, LB Nagar 9225100999, Malakpet 9225100999; Metro Honda, 9581456720; Pride Honda, Madhapur 8099938844, Banjara Hills 7671811445, Miyapur 9014105450; Sundaram Honda, Ranigunj 7330832233, Shaikpet 7330832233; NIZAMABAD: Pride Honda, 9618076120; WARANGAL: Green Honda, 7799701912; NALGONDA: Pride Honda, 9848532368; MAHBUBNAGAR: Green Honda, 8897588155; KARIMNAGAR: Green Honda, 9100032923; KHAMMAM: Green Honda, 8886999118.

353 OUTLETS 241 CITIES

Map Not to Scale, only for depiction/representation purposes

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఇస్లాం సందేశం

ఆ రాత్రే ఖురాన్ పుట్టింది

ఖురాన్ అవతరణకు కృతజ్ఞతగా ముస్లింలు రంజాన్ మాసంలో రోజాలు పాటిస్తారు. ఈ నెలలో ఖురాన్ ఎప్పుడు అవతరించింది? ఈ ప్రశ్నకు సమాధానమే 'లైలతుల్ ఖద్ర్'.

పవిత్రమైన 'లైలతుల్ ఖద్ర్' అనే మాటలో లైల్ అంటే రాత్రి అని అర్థం. ఖద్ర్ అంటే అదృష్టం, భాగ్యం. సృష్టిలోని సర్వరాశుల విధిరాత ఈ రాత్రే లిఖిస్తారని నమ్మకం. అందుకే దీనిని లైలతుల్ ఖద్ర్ అని వ్యవహరిస్తారు. ఖద్ర్ అంటే శ్రేష్ఠమైన అని మరో అర్థం ఉంది. అందుకే దీనిని శ్రేష్ఠమైన రాత్రిగా కూడా అభివర్ణించారు. ఖద్ర్ అంటే

"దేవా! నీవు అమితంగా క్షమించేవాడివి. క్షమించడమంటే నీకెంతో ఇష్టం. కనుక నన్ను క్షమించు."

– ముహమ్మద్ ప్రవక్త (స)

ఇరుకు అనే భావం ఉంది. ఈ రాత్రి దైవదూతలతో భూలోకమంతా కిక్కిరిసిపోతుందంట. సౌభాగ్య, దౌర్భాగ్యాల నిర్ణయం జరిగే రాత్రి ఇది. అందుకే దీనిని మహత్పూరకమైన, గౌరవాదరణల రాత్రి అని ఖురాన్ విశదీకరించింది.

"మేము దీనిని (ఖురాన్) ఘనమైన రాత్రిలో అవతరింపజేశాము. ఆ ఘనమైన రాత్రి ఏమిటో మీకు తెలుసా? అది వెయ్యి నెలల కన్నా ఎంతో శ్రేష్ఠమైనది. ఆ రాత్రి ఆత్మ, దైవదూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతిఆజ్ఞను తీసుకొని అవతరిస్తారు. ఆ రాత్రి తెల్లవార్లూ పూర్తిగా శాంతి, శ్రేయాలే అవతరిస్తుంటాయి" (దివ్యఖురాన్ 97: 1-5)

హిరాగుహలో ప్రవక్త ముహమ్మద్ (స)కు వినిపించిన దైవవాణి ఇది. అది వినిపించిన రాత్రి మరేదో కాదు లైలతుల్ ఖద్ర్. అదృష్ట, దురదృష్టాల నిర్ణయాల అమలుకు అల్లాహ్ దైవదూతలకు ఫర్మానాలు అందజేసే రాత్రి ఇది.

రాత్రిని అన్వేషించాలి

ఈ శ్రేష్ఠమైన రాత్రిని అందరూ అన్వేషించాలని సూచించారు ప్రవక్త. రంజాన్ నెలలో చివరి పది రోజులు ఆయన మసీదులోని నాలుగు గోడలకే పరిమితం అయ్యేవారు. పూర్తిగా దైవారాధనలో మునిగిపోయేవారు. ఇలా పది రోజులు మసీదులోనే గడపడాన్ని 'ఏతికాఫ్' అంటారు. "లైలతుల్ ఖద్ర్‌లో పూర్ణ విశ్వాసంతో, దైవం ప్రసాదించే ప్రతిఫలాన్ని ఆశించి ఆరాధన చేసిన వారి గత అపరాధాలన్నిటినీ దైవం క్షమిస్తాడు" అని ప్రవక్త ఉపదేశించారు. అందుకు అనుగుణంగా రంజాన్ చివరి పదిరోజులు ముస్లింలు ఏతికాఫ్ పాటిస్తారు. ఖురాన్ పారాయణం చేస్తారు. రాత్రంతా దైవారాధనలో గడుపుతారు.

– ఖైరున్నీసాబేగం

ఎప్పుడంటే..

రంజాన్ మాసంలో చివరి పది రోజుల్లో ఒక బేసి రాత్రి దివ్యఖురాన్ అవతరించిందని సెలవిచ్చారు ముహమ్మద్ ప్రవక్త. 21, 23, 25, 27, 29వ రాత్రుల్లోని ఏదైనా ఒక రాత్రి లైలతుల్ ఖద్ర్ కావొచ్చని ప్రవక్త బోధనల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా 27 లేదా 29వ రాత్రి అవుతుందని వారు సెలవిచ్చారు.

గమ్యం తెలియని జీవన గమనానికి దారి చూపే దీపం చదువు. విద్యార్థి జీవితం సజావుగా సాగేందుకు ఆ దీపాన్ని భద్రంగా పట్టుకొని ఉండే జ్ఞానాధారం గురువు. విద్యార్జన మహాయాగం వంటిది. దానిని నిర్వహించే బ్రహ్మ గురువు. ఆయన అనుగ్రహం విద్యార్థిని జ్ఞానవంతుడిని చేస్తుంది. విద్యార్థి చదువు గురువుతో ఉండే అనుబంధం మీద ఆధారపడి ఉంటుంది. గురుశిష్యుల సంబంధం గురించి, సమాజహితాన్ని కోరే చదువు గురించి మన సనాతన ధర్మం ఏం చెప్పిందంటే..

విద్యార్థికి ఈ సమాజం అంతా గురువే. తెలియని విషయాలు చెప్పేవారందరూ గురువులే. చేపలు పట్టే వ్యక్తి కూడా ఏకాగ్రత విషయంలో గురువే అని వివరిస్తుంది మహాభాగవతంలోని అవధూత ఉపాఖ్యానం. సమాజం నుంచి సమగ్రమైన విజ్ఞానం లభిస్తుంది. మనసు వికసిస్తుంది. తుదిగా ఆ సమాజంపై గౌరవం ఏర్పడుతుంది.



ఎవరు గురువు? ఏది చదువు?

తమ చిన్నారికి మూడో యేడు వచ్చిందో లేదో తల్లిదండ్రులకు ఆరాటం. ఎప్పుడెప్పుడు అక్షరస్వీకారం చేయిస్తామో.. ఎప్పుడెప్పుడు బడికి పంపిస్తామో అని. మన సంప్రదాయంలో పిల్లలను బడిలో వేయడం కూడా ఒక సంబరమే. పప్పు బెల్లాలు, పలకాబలపాలు తోటి పిల్లలకు పంచిపెట్టి.. తమ పిల్లలతో ఓనమాలు దిద్దిస్తారు. ఆనందంగా మొదలయ్యే విద్యార్థి జీవితం ఓ మధురానుభూతి. చదువంటే ఓ సంతోషం, ఓ ఆనందం. బడికి పోవాలనే ఒకటే ఆరాటం. ఎలాంటి ఒత్తిడి లేకుండా, హాయిగా చదువుకోవడం తొలినాళ్ల నుంచి మన విద్యావ్యవస్థలో కనిపిస్తుంది. అప్పుడే పునాది గట్టిగా ఉంటుంది. దానిపై భవిష్యత్ బంగారుమేడ గట్టిగా నిలవగలుగుతుంది.

మనిద్దరం కలిసి..

విద్యార్థి జీవితం గురువుపైనే ఆధారపడి ఉంటుంది. గురుశిష్యుల బంధం ఎంత బలంగా ఉంటే.. ఆ విద్యార్థి భవిష్యత్తు అంత ఉజ్వలంగా ఉంటుంది. సనాతన విద్యావిధానం గురుశిష్యుల సంబంధాన్ని చాలా సందర్భాల్లో స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన సారాంశం కేనోపనిషత్తు శాంతి మంత్రంలో కనిపిస్తుంది.

"ఓం సహనావవతు, సహనౌభునక్తు..
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై
ఓం శాంతిః శాంతిః శాంతిః"

ఈ శాంతి మంత్రం విద్యావిధానానికి ఓ దిక్సూచి లాంటిది. దీనిలో ఉన్న గురుశిష్య సంబంధ అంశాలను పరిశీలిస్తే మన సంప్రదాయం వారి బంధానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో తెలుస్తుంది. శిష్యుడిని గురువు ఎంత ప్రేమగా చూసుకోవాలో అర్థమవుతుంది. "ఓ శిష్యుడా! మనమిద్దరినీ భగవంతుడు రక్షిస్తూ, పోషిస్తూ ఉండాలి. మనమిద్దరం శక్తిమంతులమై శ్రమిస్తూ ఉండాలి. మన అధ్యయనం తేజోవంతంగా ఉండాలి. మనిద్దరం నిరంతరం ద్వేషం లేకుండా ఉందాం" ఇది కేనోపనిషత్తులోని శాంతిమంత్ర ప్రసాదం. గురు-శిష్య సంబంధం గురించి విద్యార్థికి ప్రతి గురువూ తెలియజేయాలి. అప్పుడు ఆ విద్యార్థికి గురువు ప్రాణసమానుడు అవుతాడు.

అందరికీ చదువు

విద్య అందరికీ అవసరమే. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. పురాణాల కాలంలోనూ ఇదే కనిపిస్తుంది. మనుషులు, దేవతలే కాదు.. చదువు ఎంత గొప్పదో అసురుల్లోనూ నాటుకుపోయింది. ఈ విషయాన్ని పోతన మహాభాగవతం ఏడో స్కందంలోని 130, 132 పద్యాల సారాంశం మనకు విశదీకరిస్తుంది. హిరణ్యకశిపుడు రాక్షసరాజు. ఆయన కుమారుడు ప్రహ్లాదుడు. ఓ రోజు చిన్నారి ప్రహ్లాదుడిని చెంతకు పిలిచిన హిరణ్యకశిపుడు లాలనగా..

చదువని వాడజ్ఞుండగు,
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువగ వలయును జనులకు, జదివించెద
నార్యులొద్ద జదువుము తండ్రీ!'

అని అన్నాడు. "జీవితానికి చదువు చాలా ముఖ్యం, చదువుకోని వాడు అజ్ఞానిగా ఉంటాడు.. వాడు పశువుతో సమానం. చదువుకుంటే తెలివితేటలు బాగా వస్తాయి. చదువనేది మంచి ఏమిటి? చెడు ఏమిటి? అనే వివేకాన్ని కలిగిస్తుంది. అందుకే పుట్టిన ప్రతివాడూ చదువుకోవాలి. నిన్ను మంచి గురువుల దగ్గర చదివిస్తాను" అని ఆ పద్య భావం. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్య ప్రాధాన్యం తెలియజేయాలి. తగిన విధంగా ప్రోత్సహించాలి. విద్యపై ఆసక్తి కలిగించే విషయాలు చెప్పాలి. అప్పుడు పిల్లలకూ బడిపై మమకారం పెరుగుతుంది. చదువుపై ఆసక్తి కలుగుతుంది.

సంస్కరించే విద్య..

ఇప్పుడు చదువంటే.. మార్కులు. ఉత్తీర్ణత శాతం. పోటాపోటీ పరుగు. తల్లిదండ్రులు కూడా అలాగే వ్యవహరిస్తున్నారు. బాగా చదవాలంటూ పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లి తమ పిల్లాడికి మార్కుల గురించి అడుగుతున్నారే కానీ, ఎలాంటి విద్య బోధిస్తున్నారో, ఏం నేర్పించాలో సూచించడం లేదు. కానీ, తల్లిదండ్రులు పిల్లవాడిని బడికి పంపినప్పుడు ఎలా వ్యవహరించారో హిరణ్యకశిపుడి ద్వారా మనకు తెలియజేశారు పోతన. ప్రహ్లాదుడిని గురువులకు అప్పగిస్తూ హిరణ్యకశిపుడు.. "ఓ గురువులారా! మా పిల్లవాడు ఇప్పటిదాకా జీవితానికి సంబంధించిన జ్ఞానం లేకుండా ఉన్నాడు. నేను మా అబ్బాయి పైకి రావాలని అనుకుంటున్నాను. దయచేసి మా పిల్లవాడికి చదువు చెప్పి గ్రంథాలు చదివించండి. నీతిశాస్త్రం నేర్పించి సంస్కరించి మమ్మల్ని రక్షించండి" అని విన్నవించుకున్నాడు. ఇందులో తన కుమారుడికి నైతిక విలువలున్న విద్య నేర్పించండని కోరడం కనిపిస్తుంది. విద్యకు ముందు కావాల్సింది నైతికత. మన సంప్రదాయం నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ తరం తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఉన్నత విద్యతో పాటు, ఉన్నత విలువలు రావాలని ఆకాంక్షించాలి. మన విద్యావిధానంలో ప్రతి అంశానికీ నైతిక విలువలు జోడించి చెప్పడం సాధ్యమేనని విద్యావేత్తలు చెబుతున్నారు. ఫలితంగా పిల్లలకు విజ్ఞానంతో పాటు నైతికత అబ్బుతుంది. నీతిగా మెలగాలన్న స్ఫురణ కలుగుతుంది.

ఏదైనా.. విజ్ఞాన గని

ప్రతి మనిషి చదువుకోవాలి. చదువుకుంటేనే మంచి మనుగడ. పరిణామ క్రమంలో విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. పురాణకాలంలో గురుకులాల్లో చదువుకునేవారు. బౌద్ధమత రోజుల్లో అది ఆరామాలకు చేరుకుంది. తర్వాత అనేక సంస్కరణలకు నోచుకుంది, అనేక విధానాలు అలవర్చుకుంది. ఒకనాడు గురుకులం.. ఇంకోనాడు ఆరామం.. ఇప్పుడు పాఠశాల.. ఏదైనా విజ్ఞానాన్ని ప్రసాదించే ఆలయమే. అక్కడ గురువే దైవం. అక్కడికి వచ్చే శిష్యుడు పరమభక్తుడు. ఆ భక్తుడిని పరిపూర్ణంగా అనుగ్రహించాల్సింది గురుదేవుడే. ఒత్తిడి లేని చదువును అనుగ్రహించి.. విజ్ఞానాన్ని కటాక్షించి.. వారి జీవిత మార్గానికి వెలుగు ప్రసాదించాలి.

– డా.యల్లాప్రగడ మల్లికార్జునరావు

విలువలకు కట్టుబడి

గురువు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. విరాటరాజు కొలువులో బృహన్నలగా ఉన్న అర్జునుడు రాకుమారి ఉత్తరకు నాట్యం నేర్పించేవాడు. ఉత్తర అపురూప సౌందర్యరాశి. అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత ఉత్తరను వివాహం చేసుకోవాల్సిందిగా అర్జునుడిని కోరుతాడు విరాటరాజు. అప్పుడు అర్జునుడు 'గురువుగా ధర్మం తప్పడం మంచిది కాదని, ఉత్తరను తన కుమారుడు అభిమన్యుడికిచ్చి వివాహం చేస్తాన'ని విరాటరాజుకు వివరించి చెబుతాడు.

వినయమే విద్యార్జనకు తొలిమెట్టు. గురువు కూర్చునే ఆసనం, ఆయన వినియోగించే వస్తువులను కూడా సాక్షాత్తు గురువే అనే భావనతో ఉండేవారు అప్పటి విద్యార్థులు. పాఠం ముగించుకొని గురువు వెళ్లాక.. ఆయన వినియోగించిన ఆసనాన్ని తాకడానికి సాహసించేవారు కాదు. గురువుపై అంతటి భక్తిప్రపత్తులుండేవి.

విద్యార్థుల ప్రవర్తన

పాఠశాల ఒక సామాజిక దేవాలయం. అక్కడ అందరూ సమానం. పేద, ధనిక భేదాలు ఉండకూడదు. పురాణాల కాలం నుంచి మన విద్యావ్యవస్థలో ఇది కనిపిస్తుంది. దశరథ మహారాజు కుమారులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వసిష్ఠుడి దగ్గర, బలరామకృష్ణులు సాందీపని ముని దగ్గర ధనవంతుల పిల్లల్లా విద్యనభ్యసించలేదు. నిరాడంబరంగా, సామాన్యుల్లాగే చదువుకున్నారు. సామాజిక, రాజనీతి విషయాలలో శ్రీరామచంద్రుడు ఈనాటికీ ఆదర్శమూర్తిగా భావించడానికి కారణం గురువు దగ్గర వినయంగా విద్యనభ్యసించడమే. శ్రీకృష్ణుడు నిరుపేద అయిన కుచేలుడితో స్నేహం చేశాడు. వారి మైత్రి గురుకులం వరకే పరిమితం కాలేదు. కృష్ణుడు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగాక కూడా కుచేలుడిని ఆదరించాడు. తన సరసన కూర్చోబెట్టుకొని, గౌరవించేంతటి సంస్కారం ఆనాటి విద్యావిధానం నేర్పినదే.



అమృత బిందువు

ఆ మాటలు ఆలకించకుంటే..

ముక్కు, చెవులు కోసి తనను అవమానించిన రామలక్ష్మణులపై పగ తీర్చుకోవాలనుకుంది శూర్పణక. అన్న రావణాసురుడి దగ్గరికి వెళ్లింది. 'రాముడి భార్య సీత మహా సౌందర్యవతి. నీకు మాత్రమే తగినది. ఎలాగైనా సరే.. ఆమెను నీ దానిని చేసుకో!' అన్నది. రావణుడు ఎంతగానో ఆనందించాడు. అడవిలో ఆశ్రమ జీవితం గడుపుతున్న మారీచుడి దగ్గరికి వెళ్లాడు. సీతను అపహరించడానికి అతడి సాయం కోరాడు.

రావణుడి మాటలు విన్న మారీచుడికి నోరు ఎండిపోయింది. 'ఎవరయ్యా? నీకు ఈ సలహా ఇచ్చింది. ఆ సీతాదేవి సౌశీల్యాన్ని గురించి, రామచంద్రుడి పరాక్రమాన్ని గురించి నీకు తెలిసినట్లుగా లేదే!' అంటూ వారి గురించి వివరంగా చెప్పాడు. రావణుడు కోపంతో ఊగిపోయాడు. 'నా మాట వినకపోతే చంపేస్తా' అని బెదిరించాడు.



అప్పుడు మారీచుడు..

"సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః
అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః"

అంటాడు. 'రావణా! మనకిష్టమైన మాటలనూ, మనం మెచ్చుకొనే మాటలనూ చెప్పేవాళ్లు ఎంతమందైనా సులభంగా దొరుకుతారు. ఆ మాట మనకు మేలు చేస్తుందా? కీడు చేస్తుందా? అనేది వారికి అనవసరం. కానీ మనకు ఇష్టాన్ని కలిగించకపోయినా.. మేలు చేసే మాటను చెప్పే వాళ్లు, చెప్పినా వినేవాళ్లు అన్ని చోట్లా దొరకరు. నీ ప్రయత్నాన్ని మానుకో!' అన్నాడు.

మారీచుడు చెప్పిన ఈ మాట అక్షర సత్యం. ఈ విధంగా మనకు హితాన్ని చెప్పేవారు తటస్థపడినట్లయితే వారి మాటను శిరసా వహించడం మంచిది. ఈ విషయంలో రెండో ఆలోచనకు తావు ఇవ్వొద్దు.

– డా. పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

ధర్మ సందేహం

జ్యేష్ఠులకిప్పుడు పెళ్లి కూడదా?

జ్యేష్ఠమాసంలో ఇంట్లో పెద్దపిల్లల పెళ్లి చేయకూడదు అంటారు ఎందుకు?

జయరాం, నల్లగొండ

వధువు, వరుడు జ్యేష్ఠ సంతానం (ఇంట మొదట పుట్టిన వారు) అయితే, వారికి జ్యేష్ఠ మాసంలో వివాహం తగదు. దీనినే త్రిజ్యేష్ఠం అంటారు. సాధారణంగా భార్యాభర్తల అన్యోన్య దాంపత్యానికి మనసే ప్రధానం. జ్యోతిష సంప్రదాయంలో చంద్రుడిని మనఃకారకుడిగా అభివర్ణించారు. వివాహ ముహూర్త నిర్ణయంలో చంద్రబలం తప్పనిసరిగా చూడాలని కూడా చెబుతారు. జ్యేష్ఠ మాసంలో.. పౌర్ణమి నాటి చంద్రుడు జ్యేష్ఠా నక్షత్రంతో కూడి ఉంటాడు. వధూవరులిద్దరూ జ్యేష్ఠ సంతానమైతే... జ్యేష్ఠమాసంలో నిర్ణయించే ముహూర్తానికి చంద్రబలం చాలదని జ్యోతిశ్శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అందుకే జ్యేష్ఠ మాసంలో ఇంట్లో జ్యేష్ఠుల వివాహం అంత ప్రశస్త్యం కాదని నిర్ణయించారు.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

క్రీస్తువాణి

ప్రేమతో గెలుద్దాం

ఒక పెద్దాయనకు కొత్తగా ఓ కార్యాలయానికి బదిలీ అయింది. అక్కడ పనిచేసేవారంతా ఆయన కన్నా చిన్నవారే. సలహాల కోసం పెద్దాయనను సంప్రతించేవారు. క్రమేణా అందరూ తననో పెద్దదిక్కుగా భావిస్తున్నారనే అభిప్రాయానికి వచ్చేశాడు ఆ పెద్దాయన. అందరినీ అజమాయిషీ చేసేవాడు. వారు చేసే పనిలో కల్పించుకొని సంజాయిషీ అడిగేవాడు. క్రమంగా తనను ప్రేమించిన ఉద్యోగులకే దూరమయ్యాడు. మిత్రుడనుకున్న ఆయనను అందరూ శత్రువుగా భావించే పరిస్థితి వచ్చింది.

ఈ సందర్భంలో క్రీస్తు ప్రభువు చెప్పిన ఒక వాక్యం ఆ పెద్దాయన వ్యక్తిత్వానికి సరిపోతుంది.

"మీరు తీర్పు తీర్చబడకుండునట్లు ఇతరులకు తీర్పు తీర్చకండి" ఇతరులకు తీర్పు చెప్పడం పెద్ద తప్పిదంగా భావించేవారు ప్రభువు. ఈ లోకంలో ఒక వ్యక్తిలోని గుణగణాలు చూడటం కన్నా.. వారిలో లోటుపాట్లను చూడటానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఇతరులను విమర్శించకపోవడం మన మంచికే అంటారు ప్రభువు. ఎవరూ తమను విమర్శించాలని, తమను దోషిగా నిలబెట్టాలని కోరుకోరు.

ఎదుటివారి కంటిలోని నలుసు చూసే ముందు నీ కంటిలోని దూలము గురించి గమనించమన్నారు క్రీస్తు. అంటే మన దృష్టిని సరిచేసుకోమన్నారు. దేహానికి దీపం కన్నే! కనుక ఆ నేత్రం తేటగా ఉంటేనే.. దేహం పరిశుద్ధమవుతుందని క్రీస్తువాణి.

ఇతరుల్లోని అద్భుతమైన వ్యక్తిత్వాలను మనం కీర్తించాలి. వారి లోపాల

విషయంలో మౌనం వహించాలి. అలా చేయడం ద్వారా ఆ వ్యక్తిని ఉన్నతుడిని చేయగలం. తనంతట తానే లోపాలను సరిదిద్దుకొనే అవకాశం వారికి కలుగుతుంది. అలాకాక, అందరికీ తీర్పునిస్తూ వెళితే మనకు వ్యతిరేకంగా దేవుని అంతిమతీర్పు ఎదుర్కోవలసి ఉంటుంది. ఇతరులు మనలకు ప్రేమగా కీర్తించాలని కోరుకున్నప్పుడు, వారు మన నుంచి అదే ఆశిస్తారన్న విషయాన్ని విస్మరించరాదు. మన హృదయంలో నుంచి ఒక మృదువైన మాటా వస్తుంది. కఠినమైన వాక్యమూ వస్తుంది. మన నుంచి ఏం వెలువడుతుందో.. మళ్లీ అదే పొందుతాం. ఒకరి గురించి ప్రేమగా పలికితే.. అదే ప్రేమపూరిత వాక్యాలు వినిపిస్తాయి. అంతిమంగా దేవుని ప్రేమను పొందుతాం. అందుకే ఒకరిని ఇంకొకరు గెలవాలంటే దానికి దగ్గరి దారి ప్రేమ. అలా ప్రేమతోనే గెలుద్దాం.

– డా.ఎమ్. సుగుణరావు

కథాస్రవంతి

సత్యాన్ని ఆశ్రయిస్తే..



జంబూనదంలో ఒక యువకుడు మరుసటి రోజు పెళ్లి అనగా 'బుద్ధ భగవానుడు నా పెళ్లికి వస్తే బాగుండు' అనుకున్నాడు. అతడు అనుకున్నట్లే మరునాడు అటు వచ్చిన బుద్ధుడు ఆ యువకుడిని కలుసుకున్నాడు. బుద్ధుని వెంట ఆయన పరివారం, భిక్షువులు కూడా వచ్చారు. ఇంటి యజమాని అంతమందికి భోజనం పెట్టగల ఆదాయవంతుడు కాదు. అయినా ఉన్నదానిలోనే ఆతిథ్యమిచ్చి 'స్వామీ! మీరు, మీ భిక్షువులు కోరినంత తినండి' అన్నాడు. భిక్షువులు ఎంత తిన్నా ఆహార పానీయాలు తరగలేదు. యజమాని ఆశ్చర్యపోయాడు. 'నా బంధుమిత్రులందరినీ పిలిచినా సరిపోయేటంత ఉంది. వారిని పిలిస్తే బాగుండేది' అని మనసులో అనుకున్నాడు. మరుక్షణంలో.. బంధుమిత్రులందరూ ఇంట్లోకి ప్రవేశించారు. అందరూ తృప్తిగా భోజనం చేశారు. బుద్ధుడు కూడా సంతోషించాడు. వారికి సత్య వచనాలు చెబుతూ... 'ప్రేమించుకునే రెండు హృదయాలను ముడివేసి బంధించే వివాహం మనిషి ఊహించగల అత్యధికమైన సుఖం. కానీ ఇంతకంటే అధికమైన సుఖం ఉంది. అది సత్యాన్ని స్వీకరించడం వల్ల కలుగుతుంది. భార్యభర్తల్ని మరణం వేరు చేస్తుంది. కానీ సత్యాన్ని ఆశ్రయించిన వాడిని మృత్యువేమీ చేయదు. అందువల్ల సత్యంతో వివాహ బంధాన్ని ఏర్పాటు చేసుకుని, సత్యంతో జీవించండి. భార్యను ప్రేమించేవాడు ఆమెకు విశ్వాస పాత్రుడుగా, సత్యం పట్ల విశ్వాసం చూపుతున్నట్లుగా ఉండాలి. అప్పుడు భార్య అతనిపై నమ్మకముంచుతుంది. భార్య విషయంలోనూ అంతే. ఇలాంటివారి బిడ్డలు కూడా తల్లిదండ్రుల వలె ఉన్నతంగా ఉంటారు" అని ఉపదేశించాడు.

ఈనాడు సినిమా

దసరాకి దూసుకొస్తున్నారు

వేసవి సీజన్ దాదాపుగా ముగింపు దశకు వచ్చేస్తోంది. ఈ మూడు మాసాల లాభ నష్టాల ఖాతా తయారు చేసుకోవడంలో టాలీవుడ్ బిజీగా ఉంది. ఇంతలోనే మరో సీజన్‌కి సైరన్ మోత మోగింది. ఇప్పుడు దసరా వైపు దృష్టి పెట్టింది టాలీవుడ్. సెప్టెంబరులో దసరా పండగ వస్తోంది. అందుకు దాదాపు మరో వంద రోజుల సమయం మిగిలి ఉంది. అయినా సరే... దసరా కోసం ప్రణాళికలు సిద్ధమైపోతున్నాయి. జులై - ఆగస్టులలో పూర్తయ్యే చిత్రాల్ని దసరాకి విడుదల చేస్తే బాగుంటుందన్నది దర్శక నిర్మాతల ఆలోచన. వేసవి తరవాత దసరా మంచి సీజన్. దసరా, దీపావళి ముగిస్తే - సినిమాల హడావుడి బాగా తగ్గిపోతుంది. అందుకే కీలకమైన చిత్రాల్ని దసరాకి తీసుకురావాలన్న ధ్యేయంతో ఉన్నారంతా. ఇప్పటికే కొన్ని దసరా బెర్తులు ఖాయమయ్యాయి. మరి కొన్ని సినిమాలు దసరాకి రావాలనే కృతనిశ్చయంతో ఉన్నాయి.

ఎన్టీఆర్ - త్రివిక్రమ్‌ల 'అరవింద సమేత వీర రాఘవ' దసరాకే వస్తోంది. ఈ చిత్రాన్ని దసరాకి తీసుకొస్తామని చిత్రబృందం ఇది వరకే ప్రకటించింది. దానికి తగ్గట్టుగానే పక్కా ప్రణాళికతో చిత్రీకరణ జరుపుతున్నారు. సాధారణంగా మేకింగ్ విషయంలో త్రివిక్రమ్ ఆచి తూచి వ్యవహరిస్తారు. ఆయన సినిమా అంటే ఏడాది సమయం తీసుకోవడం ఖాయం. అయితే దసరాకి రావాలన్న పట్టుదలతో 'అరవింద..' షూటింగ్‌ని నిరవధికంగా కొనసాగిస్తున్నారు. రవితేజ - శ్రీనువైట్ల కలయికలో 'అమర్ అక్బర్ ఆంటోనీ' రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం అమెరికాలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇది కూడా దసరా లక్ష్యంతో తయారవుతున్న సినిమానే. శ్రీనువైట్ల మేకింగ్‌లో యమ ఫాస్టు. దానికి తోడు.. రవితేజ కూడా సింగిల్ టేక్‌లో తన పని పూర్తి చేస్తారు. కాబట్టి... 'అమర్..' దసరాకి ముందే సిద్ధమైపోవడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. రామ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'హలో గురూ ప్రేమ కోసమే జీవితం' కూడా దసరాకే వస్తోంది. త్రినాథ్ నక్కిన దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. ఆయన ఓ టైమ్ అనుకున్నారంటే.. ఎట్టిపరిస్థితుల్లోనూ సినిమా విడుదల చేసేస్తుంటారు. ప్రతి పండక్కీ... దిల్‌రాజు నుంచి ఓ సినిమా రావడం ఆనవాయితీగా మారింది. ఈసారి ఆయన దసరాకి రామ్ చిత్రాన్ని అందివ్వనున్నారు.

నాగార్జున-నానిల కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్ రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్నారు. నాగ్ ఓ మాఫియా డాన్‌గా, నాని ఓ డాక్టర్‌గా కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్నీ దసరాకే విడుదల చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. "నా షూటింగ్ వరకూ జూన్‌లో పూర్తయిపోతుంది. జులై, ఆగస్టులో ప్రీ ప్రొడక్షన్ పనులు అయిపోతాయి" అని నాగార్జున అంటున్నారు. అంటే... దసరాకి నాగ్-నానిల సినిమా సిద్ధమైపోవడం ఖాయమన్నయమాట. ఇక వరుస విజయాలతో దూసుకుపోతున్న కథానాయకుడు శర్వానంద్. తన 'పడి పడి లేచె మనసు'ని దసరాకి విడుదల చేయబోతున్నారు. సాయి పల్లవి కథానాయికగా నటిస్తోంది. హను రాఘవపూడి దర్శకుడు. చిత్రీకరణ యమ ఫాస్టుగా సాగుతోంది. "దసరాకి విడుదల చేయాలన్న ఆలోచన ఉంది. సినిమాలకు అది మంచి సీజన్. ఇంటిల్లిపాదీ చూసే చిత్రాలకు దసరా సీజన్‌లో మంచి ఆదరణ ఉంటుంది. మాదీ అలాంటి కథే.." అని హను రాఘవపూడి చెబుతున్నారు. ఇన్ని సినిమాలూ ఒకేసారి వచ్చే అవకాశం అయితే లేదు. రెండు వారాల వ్యవధిలో కనీసం నాలుగు పెద్ద చిత్రాలు విడుదలవ్వడం మాత్రం ఖాయం. అయితే ఏది ముందు? ఏది వెనుక అనేది తేలాల్సి వుంది. ఈ అయిదు చిత్రాలపైనా మంచి అంచనాలే ఉన్నాయి కాబట్టి... ఈ దసరాకి సినిమా సరదాలకు కొదవ లేదనిపిస్తోంది. హీరోలంతా వినోదాలు పంచడానికి సమాయత్తం అయ్యారు. దసరా కోసం సినీ అభిమానులు ఎదురుచూడడమే తరువాయి.

కొత్త లుక్‌తో తిరిగొచ్చారు!

మహేష్‌బాబు తన 25వ చిత్రం కోసం త్వరలోనే రంగంలోకి దిగబోతున్నారు. డెహ్రాడూన్‌లో చిత్రీకరణని ఆరంభించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు తెలిసింది. దాంతో వేసవి విహారం కోసం విదేశాలకి వెళ్లిన మహేష్ కూడా తిరిగొచ్చేశారు. ఇక చిత్రానికి కొబ్బరికాయ కొట్టడమే ఆలస్యం. అయితే ఈసారి మహేష్ విదేశాల నుంచి వస్తూ వస్తూ కొత్త లుక్‌తో తిరిగొచ్చారు. సినిమా కోసమే ఆయన తన లుక్‌ని మార్చుకొన్నట్టు తెలుస్తోంది. తెరపై చిన్నపాటి గడ్డం, మీసాలతో కనిపించే మహేష్ కొత్త చిత్రంలో మాత్రం అందుకు భిన్నంగా కనిపించాలని దర్శకుడు వంశీ పైడిపల్లి సూచించారట. దాంతో మహేష్ గుబురుగా గెడ్డం, మీసాలు పెంచి కొత్త అవతారంలోకి మారినట్టు సమాచారం. మహేష్ ఇటీవల అదే లుక్‌తోనే కెమెరా కంటికి చిక్కారు. ఆ చిత్రాలు అభిమానుల్ని ఆకట్టుకుంటున్నాయి. 'భరత్ అనే నేను'లో కూడా ఒక పాటలో కాసేపు మీసాలతో తళుక్కున మెరిసి అభిమానుల్ని అలరించారు. అచ్చం తండ్రి కృష్ణలా ఉన్నారనే కితాబుని అందుకొన్నారు. మరి కొత్త చిత్రంలో ఆయన ఎలా మురిపిస్తారో చూడాలి. అశ్వనీదత్, దిల్‌రాజు కలిసి నిర్మిస్తున్న ఆ చిత్రంలో మహేష్ సరసన పూజా హెగ్డే నటిస్తోంది.

జోయా జిందా హై!

సల్మాన్‌ఖాన్, కత్రినాకైఫ్

సల్మాన్‌ఖాన్, కత్రినాకైఫ్ జంటగా నటించిన బాలీవుడ్ చిత్రం 'టైగర్ జిందా హై'. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీసుని వసూళ్లతో నింపేసింది. ఇండియాలోనే సుమారు రూ.300 కోట్లు వసూలు చేసింది. 'ఏక్ థా టైగర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రానికి మరో కొనసాగింపు చిత్రం వస్తుందంటూ వార్తలొస్తున్నాయి. తాజాగా సల్మాన్ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'టైగర్..'కు సీక్వెల్ చేసే ఆలోచన ఉందా? అన్న ప్రశ్నకు "టైగర్..'కు సీక్వెల్ కచ్చితంగా వస్తుంది. ఆ కథ కూడా విన్నాను. టైటిల్.. 'జోయా జిందా హై' అంటూ నవ్వేశాడు. ఇంతకీ విషయం ఏంటంటే 'టైగర్..'లో కత్రినా పాత్ర పేరు జోయా. కత్రినా అభిమానులు 'జోయా జిందా హై' పేరుతో సినిమా రావాలని కోరుకుంటున్నట్టు వార్తలొస్తున్నాయని పలు వెబ్‌సైట్‌లు రాశాయట. అందుకే సల్మాన్ అలా జోక్ చేశాడు. అలీ ప్రస్తుతం సల్మాన్‌తో 'భారత్'ను తెరకెక్కించే పనిలో ఉన్నాడు. దాని తర్వాత నిజంగానే 'టైగర్..' సీక్వెల్ చేసే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

పంచ్ డైలాగ్

కొన్ని విషయాలు ఎవరితోనూ షేర్ చేసుకోము. కానీ ఫ్రెండ్స్ దగ్గర చిన్న విషయం నుంచి సీక్రెట్స్ దాకా షేర్ చేసుకుంటాం. ఎందుకో తెలుసా.. బాధేస్తే ఓదారుస్తారు. సంతోషమొస్తే రెట్టింపు చేస్తారు.

చిత్రం: కేరింత – పంపినవారు: గోవింద్ మల్లేష్, దత్తాపూర్

దటీజ్ ప్రియాంక

ప్రియాంక చోప్రా, హృతిక్ రోషన్

బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా చిత్ర పరిశ్రమలో ఎదిగిన తీరుని చాలామంది స్ఫూర్తిగా తీసుకుంటారు. సొంత ప్రతిభతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిందామె. స్వశక్తిని తప్ప ఇతరులపై ఆధారపడటం ప్రియాంకకు అసలు ఇష్టం ఉండదట. హృతిక్ రోషన్, ప్రియాంక చోప్రా మధ్య మంచి అనుబంధమే ఉంది. 'క్రిష్' చిత్రంలో ఈ జంట ప్రేక్షకుల్ని అలరించింది. 'క్రిష్' చిత్రీకరణ సమయంలో జరిగిన ఓ సంఘటనను గుర్తు చేసుకున్నాడు హృతిక్. "'క్రిష్' చిత్రీకరణ మనాలిలో జరుగుతోంది. ఎత్తైన కొండపై షూటింగ్ కావడంతో ఆక్సిజన్ కూడా సరిగ్గా అందడం లేదు. ప్రియాంక కొండమీద నుంచి జారబోతుంటే చిత్రబృందం గమనించి ఆమెను రక్షించారు. ఆ సంఘటనతో ప్రియాంక సరిగ్గా నడవలేకపోవడం, నీరసంగా కనిపించడంతో కొంతమంది ఆమెను ఎత్తుకొని హోటల్‌కు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. పూర్తిగా స్పృహ లేకపోయినా నన్ను దించేయండి అంటూ ఆమె అరవడం నాకు ఇంకా గుర్తే" అని చెప్పాడు హృతిక్. "స్వయంకృషితో ఎదగాలి, స్వతంత్రంగా బతకాలి.. ఇలాంటి మంచి లక్షణాలు ప్రియాంకలో చాలానే ఉన్నాయి" అంటూ తెగ పొగిడేశాడు హృతిక్. 'క్రిష్ 4'లో ఈ జంట మళ్లీ కలిసి నటించే అవకాశాలున్నాయి. కత్రినా పేరు కూడా వినిపిస్తుంది. ఇద్దరు నాయికలు ఉన్నా ఆశ్చర్యపడక్కర్లేదు అని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి.

సోనమ్ మెగాఫోన్ పట్టనుందా?

సోనమ్‌కపూర్

సోనమ్‌కపూర్ నటిగా మంచి పేరు తెచ్చుకొంది. నటన ఒక్కటే కాదు మెగాఫోన్ పట్టాలనే ఆలోచన కూడా ఆమె మనసులో ఉంది. ఆ విషయం ఆమె ఎప్పుడూ బయటపెట్టలేదు కానీ ఇప్పుడు ఆమె స్నేహితురాలు, నటి స్వర భాస్కర్ మాటలు వింటే సోనమ్ త్వరలోనే కెప్టెన్ కుర్చీ ఎక్కడం ఖాయంగా కనిపిస్తోంది. సోనమ్ కపూర్, స్వర భాస్కర్, కరీనాకపూర్, శిఖ తలసానియా నటించిన 'వీరె ది వెడ్డింగ్' మంచి విజయం సాధించింది. బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లు రాబడుతోంది. ఇందులో స్నేహితులుగా నటించిన వీరంతా 'వీరె ది..' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. మరోసారి సోనమ్‌తో కలిసి నటించాలనే కోరికను బయటపెట్టింది స్వర. ఆమె మాట్లాడుతూ "సోనమ్ చాలా తెలివైంది. ఓ కొత్త కథ చెప్పింది. సోనమ్ కచ్చితంగా గొప్ప దర్శకురాలు అవుతుంది. ఆమె ఆలోచనలు, సినిమాని చూసే కోణం నాకు బాగా నచ్చాయి. ఆమె దర్శకురాలు కాబోయే రోజు కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ఈ ప్రపంచంలో నాకు అత్యంత ఇష్టమైన వ్యక్తి సోనమ్" అని చెప్పింది. సోనమ్, స్వర భాస్కర్ గతంలో 'రంజానా', 'ప్రేమ్ రతన్ ధన్ పాయో'లోనూ కలిసి నటించారు.

'జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్'

డైనోసార్ల నేపథ్యంలో స్టీవెన్ స్పీల్‌బర్గ్ తెరకెక్కించిన 'జురాసిక్ పార్క్' సిరీస్ చిత్రాలను ఇప్పటికీ మర్చిపోలేం. ఆ రాక్షస బల్లుల కథకు కొత్త హంగులు జోడిస్తూ 2015లో 'జురాసిక్ వరల్డ్' వచ్చింది. గత 'జురాసిక్..' చిత్రాల్లాగే అదీ ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్' తెరకెక్కింది. 'జురాసిక్ వరల్డ్'లో ప్రధాన పాత్రల్లో నటించిన క్రిస్ ప్రాట్, బ్రిస్ డల్లాస్ హోవార్డ్ సీక్వెల్‌లోనూ అవే పాత్రల్లో నటించారు. ఏజే బయోనా దర్శకత్వం వహించారు. స్టీవెన్ స్పీల్‌బర్గ్ నిర్మాణ సారథిగా వ్యవహరించారు. గురువారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇండియాలో ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.

రాక్షస బల్లులు మళ్లీ వచ్చేశాయి..!

విడుదలకు సిద్ధం

రాక్షస బల్లులు లక్షల సంవత్సరాల క్రితమే అంతరించిపోయాయి. కానీ పాతికేళ్ల కిందట మళ్లీ ప్రాణం పోసుకుని మన ముందుకు వచ్చాయి. తమ ఆకారం, విన్యాసాలతో అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాయి. దాని వెనకున్న ఘనత స్టీవెన్ స్పీల్‌బర్గ్‌దే. తన సాంకేతిక మాయాజాలంతో రాక్షస బల్లులకు జీవం పోసి వెండితెర 'జురాసిక్ పార్క్'లో ప్రదర్శించారు స్పీల్‌బర్గ్. రాక్షస బల్లులను తలచుకుంటేనే అందరికీ హడల్. కానీ స్పీల్‌బర్గ్ సృష్టించిన 'జురాసిక్ పార్క్'లో డైనోసార్లను చూసేందుకు పిల్లలు పెద్దలు తేడా లేకుండా ఎగబడ్డారు. 1993లో వచ్చిన ఆ చిత్రానికి వసూళ్ల వర్షం కురిసింది. అప్పట్నుంచి డైనోసార్లు ప్రేక్షకులకు ప్రీతిపాత్రమయ్యాయి. 'జురాసిక్' పార్క్‌కు సీక్వెల్‌గా వచ్చిన మరో రెండు చిత్రాలు కూడా విజయం సాధించాయి.

'పార్క్'ను ప్రపంచంగా మార్చి

'జురాసిక్ పార్క్ 3' వచ్చిన 14 ఏళ్ల తర్వాత డైనోసార్లకు కొత్త హంగులు అద్దడానికి సన్నాహాలు జరిగాయి. అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికతతో అబ్బురపరిచే విజువల్ ఎఫెక్ట్స్‌తో సరికొత్తగా కనిపించే డైనోసార్లను సృష్టించి మరో 'జురాసిక్..' ట్రైలాజీని రూపొందించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. అందులో భాగంగానే 2015లో 'జురాసిక్ వరల్డ్' విడుదలైంది. ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా చక్కటి ఆదరణ లభించింది. 150 మిలియన్ డాలర్ల (రూ.1004 కోట్లకు పైగా) బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి 1.6 బిలియన్ డాలర్లు (రూ.10,700 కోట్లకు పైగా) వసూళ్లు దక్కాయి. ఇండియాలోనే ఈ చిత్రం రూ.150 కోట్లకు పైగా వసూలు చేయడం గమనార్హం. అందుకే ఈ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జురాసిక్ వరల్డ్: ఫాలెన్ కింగ్‌డమ్'పై ఆసక్తి నెలకొంది.

కథేంటి: ఓ దీవిలో ఉన్న జురాసిక్ వరల్డ్ థీమ్ పార్క్‌ను కొన్ని కారణాల వల్ల మూసేస్తారు. ఆ తర్వాత అందులోని రాక్షస బల్లులు ఆ దీవిలో స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. అయితే అక్కడున్న అగ్ని పర్వతం త్వరలో బద్దలవబోతోందని, దీంతో రాక్షస బల్లులు అంతరించిపోతాయని తెలుస్తుంది. వాటిని రక్షించి జంతు సంరక్షణ కేంద్రానికి తరలించేందుకు పార్క్ మాజీ మేనేజర్ క్లేరి (హోవార్డ్) డైనోసార్ ప్రొటెక్షన్ గ్రూప్ పేరుతో ఓ బృందాన్ని ఏర్పాటు చేస్తుంది. ఆ దీవికి వెళ్లిన క్లేరికి బ్లూ అనే రాక్షస బల్లి కనిపించలేదని తెలుస్తుంది. దాన్ని వెతికేందుకు తన బాయ్‌ఫ్రెండ్ రాక్షసబల్లుల శిక్షకుడు గ్రేడీ (క్రిస్‌ప్రాట్) సహాయం కోరుతుంది. ఈ క్రమంలోనే ఆ రాక్షస బల్లులను ఓ ఎస్టేట్‌లో వేలం వేస్తున్నారన్న రహస్యం తెలుస్తుంది. అక్కణ్నుంచి అత్యంత ప్రమాదకారి అయిన తెలివైన హైబ్రిడ్ డైనోసార్ ఒకటి తప్పించుకుంటుంది. దాన్ని పట్టుకోకపోతే నగరం మీద పడి జనాలను మట్టుబెట్టడం ఖాయం. ఆ ప్రమాదాన్ని అరికట్టడానికి గ్రేడీ, క్లేరి ఏం చేశారన్నది తెరపై చూడాలి.

వసుంధర

చదువు పూర్తికావడం ఆలస్యం... క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు వచ్చేస్తోన్న రోజులివి. ఇష్టపడిన రంగం, కోరుకున్న జీతం... ఇక్కడితోనే ప్రయాణం ఆగిపోకూడదు కదా... అంచెలంచెలుగా ఎదగాలి. మనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలి. అందులోనే ఉంటుంది అసలైన కిక్. ఆ గెలుపును అందుకోవాలంటే...

ఉద్యోగంలో చేరిన మొదటి నుంచే కొన్ని నైపుణ్యాలు మన సొంతం కావాలి.

ఇష్టంగా కష్టపడాలి....

సహోద్యగుల్నే గమనిస్తే... వారిలో కొందరు వారం మొత్తంలో 60-70 గంటలు పనిచేసే వారూ ఉన్నారు. త్వరగా వస్తారు. త్వరగా పనులు మొదలుపెడతారు. వారి లక్ష్యాలను అనుకున్న సమయం కంటే ముందే పూర్తి చేస్తారు. సంస్థ అలాంటివారిని ఎప్పుడూ గుర్తిస్తుంది. కొత్త అవకాశాలే కాదు, పదోన్నతలూ ఇచ్చి ప్రోత్సహిస్తుంది.

■ ప్రణతికి బీ.టెక్ అయిన వెంటనే ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం వచ్చింది. కానీ ఆమె అక్కడ ఇమడానికి మాత్రం చాలా రోజులే పట్టింది. సహోద్యోగులూ, కార్యాలయ వ్యవహారాలు ఓ పట్టాన అర్థంకాక... అయోమయానికి గురైంది.

■ దివ్య మార్కెటింగ్ సంస్థలో ఉద్యోగి. 0చిన్న వయసులోనే ఉద్యోగం అందుకున్నా తను చేస్తోన్న పనికి సరైన గుర్తింపు రావడం లేదని అసంతృప్తిగా ఉంటోంది. ఎందుకిలా...

నచ్చిన కొలువులో నెగ్గుకొద్దామిలా...!

వీళ్లనే కాదు... చాలామందికి ఎదురయ్యే సమస్యలే ఇవి. నిజమే... ఉద్యోగంలో చేరగానే సరిపోదు. దాన్ని ఎంత సమర్థంగా నిర్వర్తిస్తున్నామనేదీ ముఖ్యమే. కొన్ని నైపుణ్యాలు పెంచుకోకపోవడం, ముఖ్యమైన విషయాలు తెలుసుకోకపోవడం, మొహమాటం, ఇతరులతో పోల్చినప్పుడు వెనకపడిపోవడం, బృందస్ఫూర్తి లేకపోవడం... ఇవన్నీ ఉన్నతి మెట్లు ఎక్కడానికి ఆటంకంగా మారతాయి. దాంతో క్రమంగా పనిపై ఆసక్తి తగ్గుతుంది. ఉద్యోగజీవితం అయితే యాంత్రికంగా మారుతుంది. లేదా విపరీతంగా ఒత్తిడికి లోనయ్యే పరిస్థితి ఎదురవుతుంది. వాస్తవానికి పైన చెప్పిన సమస్యలు పెద్దవేం కావు. కొన్ని ముందుజాగ్రత్తలు తీసుకుంటే... మనంతట మనమే వాటిని పరిష్కరించుకోవచ్చు. అది సాధ్యం కావాలంటే...

అవగాహన రావాలి...

ముందు ఆ సంస్థ పనితీరూ, వ్యవహారాలన్నింటినీ వీలైనంత త్వరగా అర్థం చేసుకోగలగాలి. చేరిన కొత్తల్లో ఎవరికీ పనితెలియకపోవచ్చు. కానీ నేర్చుకోవడంలో వేగం ఉండాలి. ఫాస్ట్‌లెర్నర్లుగా మారాలి. అలా నేర్చుకోవడం కూడా ఓ సవాలే కాబట్టి... పనివేళలకు పరిమితులు పెట్టుకోకుండా అవసరం అనుకుంటే ఎక్కువగంటలు కష్టపడగలగాలి. ఉద్యోగంలో చేరిన మొదటి రోజే మీకంటూ కొన్ని లక్ష్యాలను రూపొందించుకోవడం తప్పనిసరి. అవి ఉన్నతంగా, ఆచరణీయంగా ఉండేలా చూసుకోవాలి. వీటిల్లో స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు రెండూ ఉంటే మరీ మంచిది. వాటికి అనుగుణంగా ప్రణాళికలు రచించుకోవడం, అవసరాన్ని బట్టి మార్పు చేర్పులకు సిద్ధంగా ఉండటం వంటివన్నీ మిమ్మల్ని లక్ష్యానికి చేరువ చేస్తాయి.

ఇక, పనివాతావరణంలో ప్రతి వ్యక్తి తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరికొన్ని ఉంటాయి.

సాయం అడగడం: ఆఫీసులో చేరిన మొదట్లో కొంత బెరుకు సహజం. క్రమంగా ఆ పరిసరాలకు మీరు అలవాటు పడతారు. ముందు అక్కడి వాతావరణాన్ని గమనించండి. కొత్తగా చేరిన మీకు అన్ని విషయాలూ తెలియకపోవచ్చు. అందుకు బాధపడకూడదు. భయపడకూడదు. మీకు తెలియని వాటిని మీ సహోద్యోగులనూ, అధికారులనూ, స్నేహితులను అడిగి తెలుసుకోవాలి. అలాగే సహోద్యోగినో, ఉన్నత స్థానంలో ఉన్న మరో ఉద్యోగినో మెంటార్‌గా ఎంచుకోవాలి.

ప్రశ్నలు అవసరమే: మనకు ప్రశ్నించేతత్వం ఉన్నప్పుడే ఈ పరుగుల ప్రపంచంలో ముందుకు వెళ్లగలం. ఎవరేం చెప్పినా అడ్డుచెప్పకుండా సొంతం విని, అవసరమైనంత మేరకే తీసుకోవాలి. సందేహాలను ప్రశ్నల రూపంలో అడిగి తెలుసుకోవాలి. అలానే సంస్థ అభివృద్ధికి మీవైపు నుంచి కూడా కొన్ని సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు పై అధికారికి నివేదించండి.

సాంకేతికతపై పట్టు: అవును. సాంకేతిక నైపుణ్యాలను ఎప్పటిప్పుడు పెంచుకుంటూ ఉండాలి. ఈ రోజుల్లో ఇది చాలా అవసరం కూడా. అవసరమైనవాటిని అందిపుచ్చుకోగలగాలి. అప్పుడే మనం కూడా ఆ పోటీలో నిలబడగలుగుతాం.

ప్రతిభా, వ్యక్తిత్వం: మీరు ఏ పనిలో అయినా విజయం సాధించాలంటే మొదట దాన్ని ప్రేమించాలి. ఆ తరువాత శోధించాలి. చివరకు సాధించాలి. అది ప్రతిభతోనే సాధ్యం. దాంతోపాటు వ్యక్తిత్వం కూడా ముఖ్యమే. అందరితో స్నేహంగా ఉండాలి. దాంతోపాటూ ఓ పరిధీ గీసుకోవాలి. మీ సానుకూల వైఖరే మిమ్మల్ని ముందుకు నడుపుతుంది. మీ సంస్థలో ఉన్నత స్థానంలో ఉన్న వారిని చూడండి. వారు ఆ స్థాయికి ఎలా వచ్చారో తెలుసుకోండి. మీరూ అలా గొప్ప వ్యక్తిలా మారాలని అనుకోవాలి. పత్రికలూ, మ్యాగజైన్లలో వచ్చే ప్రముఖుల కథనాలు చదివి స్ఫూర్తి పొందండి.

బాధ్యతగా, చొరవతో: కొత్తగా చేరా కదా! అని పనిని తేలిగ్గా తీసుకోకూడదు. ఏ కొత్త పని ఇచ్చినా తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. 'నేను కొత్తగా వచ్చా. నాకేం తెలియదు' లాంటి వాటిని పక్కన పెట్టి పక్కాగా చేయగలనని ఆత్మవిశ్వాసంతో చెప్పండి. చాలామంది బాస్ పురమాయించాడనో, అధికారి ఆదేశించాడనో, సంస్థ చెప్పిందనో పనిచేస్తారు. మీరు ఆ కోవలో ఉండకూడదు. మీరే కొత్త పనులు ఏమైనా ఉన్నాయా అంటూ మీ పై అధికారి వెంటపడండి. మీకు ఇచ్చిన పనిని తక్కువ సమయంలో పరిపూర్ణంగా పూర్తి చేయండి. ఫలానా అమ్మాయికి ఇస్తే ఆ పని త్వరగా పూర్తవుతుందని యాజమాన్యం మీ గురించి అనుకునేలా కష్టపడాలి.

సంస్థలు ఉద్యోగుల విషయంలో ఎలాంటి అంశాలను పరిగణిస్తాయో చూద్దాం.

■ ఉద్యోగంలో చేరిన కొత్తలో చాలామంది బృంద చర్చల్లో, సమావేశాల్లో ఏం మాట్లాడకుండా ఉంటారు. అయితే వీరిలో చాలా కొత్త రకాల ఆలోచనలూ, మరెన్నో సందేహాలూ ఉంటాయి. వాటిని అడగొచ్చో లేదో అనుకుంటూ మౌనంగా ఉండిపోతారు. ఇది సరైన పద్ధతి కాదు. ఇలా ఉంటే కెరీర్‌లో ఎదగడం చాలా కష్టం అవుతుంది. కాబట్టి సమావేశం ఎందుకు పెడుతున్నారు... ఏయే అంశాలపైనా చర్చ జరుగుతుంది... తదితర విషయాలను ముందే తెలుసుకుని ఆ అంశంపై పూర్తి కసరత్తు చేసుకుని వెళ్లాలి. దానిపై మీకు వచ్చిన సందేహాలను నిస్సంకోచంగా అడగాలి. ఆ చొరవ ఉండటం తప్పనిసరి. అలాగే ఆలోచనలనీ చెప్పాలి. అలాగే ప్రతి సమావేశానికి ముందు సిద్ధంగా ఉండాలి. మనం అనుకున్న విషయాన్ని ధైర్యంగా బృంద సభ్యుల ముందు ఉంచాలి. దాన్ని వారు పరిగణిస్తారా లేదా అనేది తరువాతి విషయం.

■ ఏ సంస్థ అయినా క్రమశిక్షణకే మొదటి ప్రాధాన్యం ఇస్తుంది. ఉద్యోగులు సమయానికి కార్యాలయానికి వస్తున్నారా లేదా... ఇచ్చిన సమయంలో పని పూర్తి చేస్తున్నారా లేదా వృథా చేసున్నారా... అనే విషయాలనే గమనిస్తుంది. కాబట్టి పనివేళలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి.

■ కాలేజీల నుంచి క్యాంపస్ సెలక్షన్ల ద్వారా కార్యాలయాలకు నేటితరం వెళుతోంది. అయితే కాలేజీలో ఉన్నట్లు కార్యాలయంలో ఉంటామంటే కుదరదు. ఆఫీసులో హుందాగా ఉండటానికి పెద్దపీట వేయాలి. దుస్తులూ, నడకా, మాట్లాడటం ఇలా అన్నీ అలాగే ఉండాలి. ఇది త్వరగా అలవాటు చేసుకునే ప్రయత్నం చేయాలి. వ్యక్తిగత విషయాలూ, రాజకీయ, సినిమా సంబంధ విషయాలూ, ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది.

డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

యాపిల్ సీఈవో మెచ్చిన యాప్!

మూడు రోజుల క్రితం ప్రముఖ యాపిల్ సంస్థ వరల్డ్ వైడ్ డెవలపర్ కాన్ఫరెన్స్ జరిపింది. క్యాలిఫోర్నియాలోని శాన్‌జోస్ నగరంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో యాపిల్ సీఈవోని మెప్పించి ప్రత్యేకంగా నిలిచింది ఆష్నా నరుల. అది ఎందుకూ.. ఏంటి అనేది శాన్‌జోస్‌లో ఉన్న ఆమె వసుంధరతో ఇలా పంచుకుంది.

ప్రతి సంవత్సరం యాపిల్ సంస్థ ఈ వరల్డ్ వైడ్ డెవలపర్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసి.. సృజనాత్మకంగా యాప్‌లు తయారు చేసిన వారిని ఆహ్వానిస్తుంది. నేనూ రెండు నెలల క్రితం ఓ యాప్‌ని రూపొందించా. అది పిల్లలకు మేలు చేస్తుంది. నాకు ఈ సదస్సు ఆహ్వానం గురించి తెలిసి.. నా యాప్ వివరాలను యాపిల్ సంస్థకు మెయిల్ చేశా. అలా ఈ సదస్సుకు వెళ్లే అవకాశం వచ్చింది. అలా ఈనెల నాలుగో తేదీన యాపిల్ సీఈవో టిమ్‌కుక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో మూడొందల యాభైమంది యాపిల్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. మన దేశం నుంచి ఏడుగురు అందుకు ఎంపికైతే.. వారిలో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. అందుకు నాకు చాలా గర్వంగా ఉంది. టిమ్‌కుక్ నేను రూపొందించిన యాప్‌ని ఎంతో మెచ్చుకున్నారు. దాంతోపాటు తన ట్విటర్‌లో మమ్మల్ని మెచ్చుకుంటూ ఓ వీడియో పోస్ట్ చేశారు. అందులో కొందరితో మాట్లాడించారు. మొదట నాతోనే మాట్లాడించడం మాత్రం చెప్పలేని ఆనందాన్నిచ్చింది.

ఒకే ఒక్క అమ్మాయిని: ఇక నా గురించీ, నా యాప్ గురించి చెబుతా.. మాది దిల్లీ. నేను పుట్టిపెరిగింది అక్కడే. ప్రస్తుతం దిల్లీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సు చదువుతున్నా. యాప్ విషయానికొస్తే ఐదేళ్ల నా మేనల్లుడు కార్తీక్ కాస్త బుద్ధి మాంద్యమున్న పిల్లవాడు. వాడు ఆకారాల్నీ, బొమ్మల్నీ అస్సలు గుర్తుపట్టలేదు. అన్నీ ఒకేలా ఉన్నట్టు భావిస్తుంటాడు. అంటే రంగులూ, ఆకారాలూ, అక్షరాలు, నంబర్లు.. అలా అన్నమాట. వాడికి అన్నీ ఒకేలా అనిపిస్తాయి. అది మానసిక సమస్య. అయితే సాధారణంగా స్కూళ్లలో పిల్లలకు ఇలాంటివి ముందు చెప్పకుండా.. అక్షరమాల, సంఖ్యలు చెబుతారు. కానీ రంగులూ, ఇతర అంశాలనూ వారికి బడిలో చేర్పించక ముందే నేర్పిస్తే ఎంతో ఉపయోగం కూడా. వారూ చురుగ్గా ఉంటారు. అందుకే స్మార్ట్ ఫోన్లు వేదికగా మార్చుకుని 'లెట్స్‌షపై' అనే యాప్‌ని రూపొందించా. ఇందులో రంగుల్ని వేరు చేయడం.. లేదంటే ఒకేలాంటివి ఒక చోట పెట్టడం.. భిన్న ఆకృతుల్ని గుర్తించి.. వరుస క్రమంలో పెట్టడం లేదంటే ఒకే చోట ఉంచడం.. ఇలా పలు ఆటలతో ఈ యాప్‌ని రూపొందించా. ఐదేళ్లలోపు పిల్లలకు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తుందీ యాప్. అందుకే టిమ్‌కుక్ ప్రత్యేకంగా అభినందించారు. నాకు స్కాలర్ షిప్పుగా... బీటా వర్షన్‌లో వచ్చే ప్రతి యాపిల్ ఉత్పత్తి మార్కెట్‌లోకి రాకముందే వాడుకునే అవకాశం ఇచ్చారు. దాంతోపాటు ఇరవై వేల రూపాయల విలువ చేసే ఎయిర్‌పోడ్స్ అందించారు. స్టీవ్‌జాబ్స్ యాపిల్ థియేటర్, పార్క్ తిప్పి చూపించారు. అక్కడ పనితీరు విధానం వివరించారు. ప్రస్తుతం నేను అక్కడే ఉన్నాను. టెక్నాలజీకి సంబంధించిన విషయ పరిజ్ఞానం పెంచుకుంటున్నా. నా లక్ష్యం ఏంటంటే.. ఐఒస్ మీద పట్టు సాధించి నా యాప్‌ని ఇంకా అభివృద్ధి చేసి ప్లేస్టోర్‌లో తల్లిదండ్రులకీ, టీచర్లకీ అందుబాటులో ఉంచుతా.

బంగారం వెండి

06న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,941	2,939
వెండి (గ్రా)	42.90	42.70

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,700	31,760	31,800	31,750	31,760	31,700	------	32,200	31,580	31,480
ఆర్నమెంట్	29,600	29,660	29,500	29,500	29,380	29,350	29,360	29,400	29,370	29,280
వెండి(కిలో)	40,900	40,470	41,000	40,800	40,700	40,600	40,900	41,100	40,900	40,900

తడిసినా తలస్నానం తప్పదు!

ఎండాకాలంలో జుట్టు మీద చూపినంత శ్రద్ధ వర్షకాలంలో పెట్టం. దానివల్ల జుట్టు ఇంకా పాడయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఎండాకాలంలో జుట్టు జిడ్డుగా మారిందని వారానికి రెండుమూడు సార్లు తలస్నానం చేస్తుంటాం. వాతావరణం కాస్త చల్లబడగానే అది మానుకుంటాం. అలాకాకుండా వర్షకాలంలో కూడా తప్పకుండా వారానికి రెండు సార్లు తలస్నానం చేయాలి.
- వర్షంలో తడిసినప్పుడు సాధ్యమైనంత వరకు బయటినుంచి రాగానే షాంపూతో తలస్నానం చేయటం మంచిది. వీలైతే స్నానం చేసే నీళ్లలో వేపాకులు వేసుకుంటే ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.
- వాతావరణం చల్లగా ఉండటం వల్ల జుట్టుకు సరైన పోషణ లేకపోతే ఇంకాస్త పొడిబారే ప్రమాదం ఉంటుంది. కాబట్టి జుట్టుకు తేమ అందించే కండిషనర్లూ, షాంపూలు వాడాలి. అలాగే జుట్టు తడిగా ఉన్నప్పుడు ముడి వేసుకోకూడదు.

యువరాణిగా మెరిసింది!

పేరు – లక్ష్మీ మేనన్

ఊరు: కేరళలోని అలెప్పీ

వయసు: 23 సంవత్సరాలు.

ఏంటీ ప్రత్యేకత: కేరళలోని ఓ ప్రయివేటు సంస్థ నిర్వహిస్తోన్న అందాల పోటీలో పాల్గొని భారతదేశ యువరాణి కిరీటాన్ని దక్కించుకుంది.

కుటుంబం, చదువు: తండ్రి సైన్యంలో పనిచేస్తారు. తల్లి గృహిణి. చిన్నతనం నుంచీ మోడలింగ్ అంటే ఆసక్తి. ఇంట్లో వాళ్లు చదువయ్యాకే ఫ్యాషన్ రంగంలోకి వెళ్లాలన్నారు. అలా ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ పూర్తిచేశాక మోడలింగ్‌లోకి వచ్చింది.

అవకాశం ఎలా: 'మిస్ కేరళ ఫిట్‌నెస్ అండ్ ఫ్యాషన్' పోటీల వివరాలను చూసి ధైర్యంగా దరఖాస్తు చేసింది. రన్నర్‌గా నిలిచింది. ఆ తరువాత 'మిస్ సౌత్ ఇండియా' పోటీలు. అందులోనూ 'మిస్ సౌత్ ఇండియా'గా కిరీటాన్ని గెలుచుకుంది.

గెలుపు ఎలా సాధ్యం: 'ఈ పోటీలో ఓటమి వస్తే ఏం చేస్తావు' అని అడిగారట లక్ష్మిని. 'ఓటమిని కూడా గెలుపుగా భావిస్తా. దాన్నో పాఠంగా మార్చుకుంటా...' అని చెప్పింది. అలాగే మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చి 'మిస్ క్వీన్ ఆఫ్ ఇండియా' కిరీటాన్ని సొంతం చేసుకుంది. 'మిస్ సౌత్ ఇండియా' కిరీటాన్ని, ' మిస్ క్వీన్ ఆఫ్ ఇండియా' కిరీటాన్నీ వరుసగా అందుకుంది. ఇలా అందుకున్న మొదటి అమ్మాయి కూడా లక్ష్మీనే.

సేవ: తీరిక ఉన్నప్పుడల్లా పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తోంది. పాఠశాలల్లో అమ్మాయిల్ని చేర్పించి, చదివించాలని పిలుపునిచ్చే కార్యక్రమాల్లోనూ పాల్గొంటోంది. కేరళలోని పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తోంది.

చెల్లి తీరు చిత్రంగా ఉంది!

? మా చెల్లి డిగ్రీ పూర్తి చేసింది. తనతో సమస్య ఏంటంటే.. మనసులో మాట బయటకు చెప్పదు. అంతర్ముఖి (ఇంట్రావర్ట్). చిన్నతనం నుంచీ ఎవరితో ఎక్కువగా మాట్లాడదు. ఏ నిర్ణయం వెంటనే తీసుకోలేదు. తనేం అవ్వాలనుకుంటుందో కూడా స్పష్టత లేదు. విషయం ఏదైనా పరిస్థితి చేయిదాటిపోయాక చెబుతుంది. ఎందుకిలా చేస్తోందో అర్థం కావట్లేదు. ఈ సమస్యకి పరిష్కారం ఉంటుందా...? **- ఓసోదరి**

✔ మీ ఉత్తరాన్ని బట్టి చూస్తోంటే.. ఆమెలో ఆత్మవిశ్వాసలోపం కనిపిస్తోంది. అందుకే మీతో మాట్లాడటంలేదు. మథనపడితే గానీ విషయాన్ని బయటకు చెప్పడం లేదు. తన ఆలోచనల్ని పరిమితం చేసుకుంటోంది. ముందు మీరు తను అలా చేస్తోందని బాధపడటం కాదు. అలా చేస్తున్నందుకు కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేశారా... లేదంటే ముందు ఆపనిలో ఉండండి. చెల్లి ఇంకా చదువుకుంటోంది. తనకి మంచి భవిష్యత్తు ఉంటుంది. ఆమెలో ఆత్మవిశ్వాసం ఎందుకు లేదో గమనించండి. కుటుంబసభ్యులూ లేదంటే ఇతరుల తీరు వల్ల అలా మారిపోయిందా అనేది తెలుసుకునే ప్రయత్నం చేయండి. చాలా సందర్భాల్లో కుటుంబసభ్యులు పిల్లల మీద తెలియకుండానే ఆధిపత్యం ప్రదర్శిస్తుంటారు. ఏం చెప్పినా, మాట్లాడినా తప్పుబడుతుంటారు. కొన్నిసార్లు విపరీతంగా కాపాడే ప్రయత్నం చేస్తారు. అమ్మాయి చిన్నది ఏం చేతకాదు అనే ఉద్దేశంతో చూస్తారు. అలా చేయడం వల్ల కూడా ఇంట్రావర్ట్‌గా మారిపోతారు. అలాంటి పరిస్థితుల్లో పిల్లలు వీలైనంత మౌనంగాఉండిపోతారు. లోలోపల బాధపడుతుంటారు. ఫలితంగా భావవ్యక్తీకరణ లోపం తలెత్తుతుంది. ఇంకొందరు పెద్దలు తమ చిన్నారులు నిర్ణయం తీసుకోలేరు అని వారి ముందే అంటారు. అలాంటి పరిస్థితుల్లోనూ నిర్ణయాలను తీసుకునే తత్వాన్ని కోల్పోతారు. మీ చెల్లి ప్రవర్తనకు అదే కారణమా అనేది ఆలోచించండి. ఒకవేళ ఆత్మవిశ్వాసం ఉన్నా మిగిలినవారి పట్ల నమ్మకం లేదా, చేదు అనుభవాలు ఎదురయ్యాయా, ఎవరినైనా నమ్మడం వల్ల నష్టం జరిగిందా.. వంటివన్నీ విశ్లేషించాలి. అలానే మీ చెల్లి మాట్లాడుతున్న తీరునూ, ఏ సందర్భంలో నవ్వుతుందో గమనించండి. ఎలాంటి వాతావరణంలో సానుకూలంగా ఉంటుందో కూడా చూడాలి. వాటన్నింటినీ బట్టి తనని మార్చే ప్రయత్నం చేయొచ్చు.

తనకి మానసిక నిపుణుల సాయం కూడా అవసరం. అలాగని తనకే సమస్య ఉంది.. చికిత్స ఆమెకే చేయాలని అనుకోవద్దు. కుటుంబసభ్యులకీ ఇక్కడ కౌన్సెలింగ్ అవసరమవుతుంది. చెల్లితో ఎలా వ్యవహరించాలో, ఎలా అండగా ఉండాలనేది చెబుతారు. కాబట్టి ఇదొక పెద్ద జబ్బు అని మీరు బాధపడి.. ఆమెని కంగారుపెట్టకండి. సానుకూలంగా ఆలోచించి చెల్లిని తీర్చిదిద్దేలా చూడండి.

డియర్ వసుంధర

డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

మీ ప్రశ్నలు ఇకపై **vasupsych@eenadu.net** కు పంపించగలరు.

కర్పూరంతో జలుబు దూరం

నాలుగు చినుకులు మొదలైతే చాలు.. జలుబూ, దగ్గూ, జ్వరం వంటివి పిల్లల్నే కాదు, పెద్దలనీ బాధిస్తాయి. చిన్నారుల్లో అయితే కొన్నిసార్లు కఫం కూడా పేరుకుని నానా ఇబ్బంది పెడతారు. దీనికి వాతావరణంలో మార్పులు ఒక కారణమైతే రోగనిరోధకశక్తి తగ్గడం.. మరో కారణం. ఇలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్త పడటమే కాదు, కొన్ని చిట్కాలు పాటిస్తే... మాత్రల అవసరం లేకుండా ఆ సమస్యల్ని నివారించుకోవచ్చు.

ఇంటివైద్యం

ఇవి తీసుకోకూడదు: వాతావరణం ఎలా ఉన్నా సరే... ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంట్లో దుమ్మూ, బూజూ చేరకుండా చూసుకోవాలి. అలాగే గోడలమీదా, పైకప్పులోనూ చెమ్మ చేరకుండా జాగ్రత్త పడాలి. లేదంటే, తడి, చెమ్మ ఆరకుండా ఉండే ప్రదేశాల్లో సూక్ష్మజీవులు చేరి అవే ఇన్‌ఫెక్షన్, ఎలర్జీలకు కారణమవుతాయి. వంటింట్లో చిన్న చిన్న పురుగులూ, బొద్దింకలూ లేకుండా జాగ్రత్తపడాలి. బొద్దింకల గూళ్లు కూడా పలు రకాల సమస్యలను తీసుకువస్తాయి. రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు పెంపుడు జంతువులకు దూరంగా ఉంటే మంచిది. శరీరంలో కఫాన్ని పెంచే ఆహారపదార్థాలు తినడం తగ్గించుకోవాలి. మిఠాయిలూ, పాలతో తయారుచేసే పదార్థాలూ, కేకులూ, చాక్లెట్లూ, క్రీం బిస్కట్లూ, శీతలపానీయాలకు దూరంగా ఉండటం మంచిది.

చిట్కాలు: జలుబూ, దగ్గు వంటివాటికి ఇంట్లోనే చిన్నపాటి చిట్కాలతో ఉపశమనం పొందవచ్చు. ముక్కు మూసుకుపోయి, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉన్నప్పుడు కొద్దిగా ముద్ద కర్పూరం, ఒకటి రెండు చెంచాలు బియ్యం తీసుకోవాలి. రెండింటినీ కలిపి శుభ్రమైన తెల్లని కాటన్ వస్త్రంలో మూటకట్టాలి. ఆ మూటను వాసన చూస్తూ ఉంటే శ్వాస తీసుకోవడం తేలిక అవుతుంది. వేడి నీళ్లల్లో పసుపు వేసి ఆవిరి పట్టినా ప్రయోజనం ఉంటుంది. కొబ్బరి నూనెను వేడిచేసి, అందులో కాస్త కర్పూరం కలపాలి. అది కరిగిపోయాక ఒక శుభ్రమైన సీసాలో పోయాలి. ఈ నూనెను అప్పుడప్పుడు పిల్లల ఛాతీపై రాస్తే, లోపల కఫం విడిపోయి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది తగ్గుతుంది. యాలకులూ, లవంగాలూ, దాల్చిన చెక్కా, ఎండిన తులసి ఆకులు సమపాళ్లల్లో తీసుకుని మెత్తగా చేసుకోవాలి. కప్పు నీళ్లు మరిగించి, అందులో ఈ పొడిని పావు చెంచా వేసి టీ లాగా కాచి వేడివేడిగా తాగితే ఉపశమనం కలుగుతుంది. తమలపాకుల

రసం లేదా తులసి ఆకుల రసాన్ని రెండు చెంచాలు తీసుకుని దానికి కొంచెం తేనె కలిపి తీసుకున్నా దగ్గూ, జలుబూ తగ్గుతాయి. దీనిని తక్కువ పరిమాణంలో చిన్నపిల్లలకు కూడా వాడవచ్చు. అయితే, చిన్నారులకు జలుబుతోపాటు జ్వరం ఎక్కువగా ఉన్నా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కనబడుతున్నా వైద్యనిపుణులను సంప్రదించాలి. మిగిలిన సమయాల్లో ఈ తేలికపాటి పరిష్కారాలను పాటించవచ్చు.

డాక్టర్ గాయత్రీదేవి, ఆరోగ్యపీఠం. 9848598797

పదోతరగతి తర్వాత!

ఉద్యోగ ధీమానిచ్చే వ్యవసాయ డిప్లొమా!

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలే వెన్నెముకగా ఉన్న మన దేశానికి క్షేత్రస్థాయిలో నిపుణుల అవసరం ఎంతో ఉంది. గ్రామీణ విద్యార్థుల్లో వ్యవసాయ సంబంధమైన విజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు స్వయం ఉపాధి, ఇతర ఉద్యోగావకాశాలను విస్తృతం చేసే లక్ష్యంతో కొన్ని ప్రత్యేక పాలిటెక్నిక్ కోర్సులను యూనివర్సిటీలు అందిస్తున్నాయి. సంప్రదాయ చదువులకు భిన్నంగా వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాస్త్ర, ఉద్యాన విభాగాల్లో ఇస్తున్న ఈ డిప్లొమాలు గ్రామీణ యువతకు ఉపాధి భరోసానిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంత యువతీయువకులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వ్యవసాయం, పశుసంర్ధక, మత్స్యశాస్త్ర, ఉద్యాన విభాగాల్లో ఈ కోర్సులను రూపొందించారు. మత్స్యశాస్త్రం మినహా మిగతా వాటిలో ప్రైవేటు పాలిటెక్నిక్‌లు కూడా ఉన్నాయి.

వ్యవసాయం, పశుపోషణ, ఉద్యాన, మత్స్యశాస్త్రాల్లో నిపుణుల కొరత ఎక్కువగా ఉంది. సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా శాస్త్రీయంగా ఆయా రంగాల్లో సూచనలు సలహాలు ఇచ్చేవారు కరవయ్యారు. ఉన్నత విద్యావంతులు, శాస్త్రవేత్తలు జిల్లా, మండల కేంద్రాలకే పరిమితమయ్యారు. వ్యవసాయం, ఉద్యాన, మత్స్య, పశుపోషణపై ఆసక్తి ఉన్న యువతకు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ కోర్సులను రూపకల్పన చేశారు. వీటికి డిమాండ్ బాగా పెరిగింది. రైతులకు అండగా నిలిచే లక్ష్యంతో కరిక్యులమ్ తయారుచేసి తెలుగు మాధ్యమంలో బోధిస్తున్నారు.

పదోతరగతి, గ్రామీణ నేపథ్యం

ఒకటి నుంచి పదోతరగతి మధ్య కనీసం నాలుగు సంవత్సరాలైనా నగరపాలిక, పురపాలికేతర ప్రాంతాల్లో అంటే గ్రామాల్లో చదివిన వారు మాత్రమే ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి. పదోతరగతి లేదా తత్సమాన సర్టిఫికెట్ కనీస విద్యార్హత. ఇంటర్ మొదటి లేదా రెండో సంవత్సరం చదువుతున్న వారూ, పదోతరగతి కంపార్టుమెంట్‌లో ఉత్తీర్ణులైన వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు, ఆపై అర్హతలు ఉన్నవారు కోర్సు దరఖాస్తుకు అనర్హులు. వయసు 15-22 సంవత్సరాలు. ఎలాంటి రాతపరీక్ష లేదు. పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. రాష్ట్రస్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లను భర్తీ చేస్తారు.

ఉద్యోగావకాశాలు

వ్యవసాయంలో డిప్లొమా పూర్తిచేసిన వారికి వ్యవసాయశాఖలో ఏఈవో, ఎంపీఈవోలతోపాటు ప్రైవేటు విత్తన, ఎరువుల సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. పురుగుల మందులు, ఎరువులు విక్రయించే దుకాణ అనుమతులకు వ్యవసాయ డిప్లొమా తప్పనిసరి అనే నిబంధనను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశుసంవర్ధక పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసినవారికి పశుసంవర్ధకశాఖలో ఎంపీఈవోలుగా, పశువైద్య సహాయకులుగా ఉద్యోగాలు లభిస్తాయి. కోళ్ల పరిశ్రమ, దాణా తయారీ కర్మాగారాల్లోనూ ఉపాధి సాధించుకోవచ్చు. డెయిరీ ప్రాసెసింగ్ డిప్లొమా పూర్తి చేసినవారు ప్రైవేటు డెయిరీ కర్మాగారాల్లో నిపుణులుగా చేరవచ్చు. ఉద్యాన పాలిటెక్నిక్ పూర్తిచేసిన వారికి ఉద్యానశాఖలో ఏహెచ్‌వో, ఎంపీఈవోలుగా, ప్రైవేటు విత్తన సంస్థలు, ప్రైవేటు నర్సరీల్లో కొలువులు దొరుకుతాయి.

ఉన్నత విద్య

రెండేళ్ల ఈ డిప్లొమా కోర్సును ఇంటర్‌తో సమానంగా పరిగణించరు. అయితే వీరికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు నిర్వహించే అగ్రిసెట్, హార్టీసెట్ ద్వారా నేరుగా బీఎస్సీ (వ్యవసాయం) బీఎస్సీ (ఉద్యానం) కోర్సుల్లో ప్రవేశించేందుకు అవకాశం ఉంది. ఆ సెట్లలో డిప్లొమా విద్యార్థులకు ఎంసెట్‌తో సంబంధం లేకుండా మొత్తం సీట్లలో 20 శాతం సీట్లు కేటాయించి భర్తీ చేస్తారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిగ్రీ అడ్మిషన్ల కోసం అగ్రిసెట్ ప్రకటన వెలువరించింది. జూన్ 25 వరకు దరఖాస్తులు పంపవచ్చు. డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం కూడా డిగ్రీ ప్రవేశాల కోసం హార్టీసెట్ ప్రకటన విడుదల చేసింది. జూన్ 18 వరకు దరఖాస్తులు పంపవచ్చు.

పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ ప్రాసెసింగ్ డిప్లొమా విద్యార్థులకు ఈ వెసులుబాటు లేదు. పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ ప్రాసెసింగ్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులను బీవీఎస్సీ (పశుసంవర్ధకం), బీటెక్ (డెయిరీ టెక్నాలజీ), బీఎఫ్ఎస్సీ కోర్సులకు అనుమతించరు. మళ్లీ ఇంటర్మీడియట్ చదివి ఎంసెట్‌లో ర్యాంకులు సాధిస్తేనే వీరికి ఉన్నత విద్యావకాశాలు ఉంటాయి.

- పసుపులేటి వేణుగోపాల్, న్యూస్‌టుడే-తిరుపతి

తెలంగాణలో!

పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం: తెలంగాణ రాష్ట్రంలోని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో కరీంనగర్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, మామ్‌నూర్‌లో నాలుగు పశుసంవర్ధక పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో 20 డిప్లొమా ఇన్ యానిమల్ హజ్‌బెండ్రి సీట్లు ఉన్నాయి. పశుసంవర్ధకశాఖలో ప్రైవేటు పాలిటెక్నిక్‌లు తెలంగాణలో లేవు. **వెబ్‌సైట్:** http://tsvu.nic.in/

కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం: ఈ విశ్వవిద్యాలయం పరిధిలో రెండు ఉద్యాన పాలిటెక్నిక్‌లు దస్నాపూర్, రామగిరి ఖిల్లాల్లో ఉన్నాయి. వీటిలో ఒక్కోదానిలో 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. డిప్లొమా ఇన్ హార్టీకల్చర్ పేరుతో కోర్సు అందిస్తున్నారు. **వెబ్‌సైట్:** http://skltshu.ac.in/

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం: ఈ యూనివర్సిటీ పరిధిలో 10 వ్యవసాయ పాలిటెక్నిక్‌లు, ఒక విత్తన సాంకేతిక, ఒక వ్యవసాయ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 8 ప్రైవేటు పాలిటెక్నిక్‌లు, మూడు వ్యవసాయ ఇంజినీరింగ్, ఒక విత్తన సాంకేతిక పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. ఈ కళాశాలల పరిధిలో మొత్తం 1020 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం సీట్ల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించింది. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపాలి. చివరి తేదీ 18 జూన్, 2018.

వెబ్‌సైట్: www.pjtsau.ac.in

ఆంధ్రప్రదేశ్‌లో

శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి కేంద్రంగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ ప్రాసెసింగ్ విభాగాల్లో డిప్లొమా కోర్సులను అందిస్తోంది. ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా ఈ యూనివర్సిటీ పరిధిలో 10 పశుసంవర్ధక, ఒక మత్స్యశాస్త్ర పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. వీటిలో 20 మత్స్యశాస్త్రపు సీట్లతో పాటు మరో 210 పాలిటెక్నిక్ సీట్లు ఉన్నాయి. గత ఏడాది నుంచి ఈ పశువైద్య విశ్వవిద్యాలయం ప్రైవేటు రంగంలో పాలిటెక్నిక్‌లను అనుమతించింది. ప్రైవేటులో 3 పశుసంవర్ధక, ఒక మత్స్య, ఒక డెయిరీ ప్రాసెసింగ్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.svvu.edu.in నుంచి దరఖాస్తు విధానం, సీట్లు, కళాశాలలు ఉన్న ప్రాంతాల వివరాలు పొందవచ్చు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. సీట్లనూ ఆన్‌లైన్ విధానంలోనే కేటాయిస్తారు.

డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం: పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో నాలుగు ఉద్యాన పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. వాటిలో సీట్లు 145. గత ఏడాది నుంచి ప్రైవేటు ఉద్యాన పాలిటెక్నిక్‌లను అనుమతించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 5 ప్రైవేటు ఉద్యాన పాలిటెక్నిక్‌లలో 200 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. ఉద్యాన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.drysrhu.edu.in నుంచి వివరాలు పొందవచ్చు. తెలుగు మాధ్యమంలో డిప్లొమా బోధన ఉంటుంది.

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు జిల్లా లాం కేంద్రంగా పనిచేస్తోంది. ఈ విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రియ వ్యవసాయం విభాగాల్లో రెండేళ్ల డిప్లొమా కోర్సులను అందిస్తున్నారు. వీటిని తెలుగు మాధ్యమంలో బోధిస్తారు. మూడేళ్ల కాలపరిమితి ఉన్న వ్యవసాయ ఇంజినీరింగ్ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో అందిస్తారు. ఈ విశ్వవిద్యాలయం పరిధిలో 15 వ్యవసాయ పాలిటెక్నిక్‌లు, 53 ప్రైవేటు వ్యవసాయ పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. విత్తన సాంకేతిక పరిజ్ఞానం విభాగంలో విశ్వవిద్యాలయానికి సంబంధించి రెండు పాలిటెక్నిక్, ప్రైవేటులో పది పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. సేంద్రియ వ్యవసాయంలో విశ్వవిద్యాలయం కింద ఒక పాలిటెక్నిక్, ప్రైవేటు యాజమాన్యంలో మూడు ఉన్నాయి. వ్యవసాయ ఇంజినీరింగ్‌లో విశ్వవిద్యాలయం కింద రెండు, ప్రైవేటులో 15 ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 21 జూన్, 2018. మరిన్ని వివరాల కోసం www.angrau.ac.in వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

హెచ్‌యూఆర్‌ఎల్, దిల్లీ

సంస్థ: హిందుస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్, దిల్లీ

పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, చీఫ్ మేనేజర్.

అర్హత: సంబంధిత బ్రాంచులు/ సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజినీరింగ్), సీఏ/ సీఎంఏ/ ఎంబీఏ, పీజీ, పీజీ డిప్లొమా, అనుభవం. **ఖాళీలు:** 67

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్

చివరి తేదీ: 18.06.2018

వెబ్‌సైట్: http://www.hurl.net.in/

విద్యుత్ కంపెనీల్లో 47 ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

సంస్థ: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, పవర్ సిస్టమ్ ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (పోస్కో).

పోస్టు: ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (ఫైనాన్స్)

ఖాళీలు: 47 (పవర్‌గ్రిడ్-35, పోస్కో-12)

అర్హత: సీఏ/ ఐసీడబ్ల్యూఏ (సీఎంఏ) ఉత్తీర్ణత.

వయసు: 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు: 09.06.2018 నుంచి 30.06.2018 వరకు.

https://www.powergridindia.com/

అలయన్స్ ఎయిర్‌లో 39 ఖాళీలు

సంస్థ: ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ లిమిటెడ్ (అలయన్స్ ఎయిర్), న్యూదిల్లీ.
పోస్టులు: అసిస్టెంట్ ఇంజినీర్, క్రూ కంట్రోలర్ తదితరాలు.

ఖాళీలు: 39 **అర్హత, వయసు, అనుభవం:** నిబంధనల ప్రకారం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరి తేదీ:** 29.06.2018
వెబ్‌సైట్: http://www.airindia.in/careers.htm

ప్రవేశాలు

ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామ్

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు: బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (ఇంటీరియర్ డిజైన్).

కాలవ్యవధి: 4 సంవత్సరాలు

సీట్ల సంఖ్య: 270

అర్హత: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.

ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.

పరీక్ష తేదీ: 2018 జులై 14, 15

దరఖాస్తు: ఆన్‌లైన్

చివరి తేదీ: 30.06.2018 (రూ.3000 అపరాధ రుసుముతో 07.07.2018)

వెబ్‌సైట్: www.jnafauadmissions.com

మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు

జర్నలిజం చేయాలంటే?

ఇంటర్ పూర్తిచేశాను. జర్నలిజం చేయాలనుంది. డిగ్రీలో ఏ కోర్సులు ఎంచుకుంటే మేలు? ఈ రంగంలో భవిష్యత్తు ఎలా ఉంటుంది? - *ఎస్. పవన్,* రైల్వే కోడూరు

జ: ఇంటర్ పూర్తిచేయగానే ఏదో ఒక డిగ్రీలో చేరాలని అనుకోకుండా భవిష్యత్తులో చేరాలనుకుంటున్న రంగానికి అనుగుణంగా కోర్సును ఎంచుకోవాలనుకోవడం చాలా మంచి ఆలోచన. జర్నలిజం కోర్సు చేయాలనుకునేవారికి ముందుగా దానిపట్ల ఆసక్తి ఉండటం ప్రధానం. మీరు డిగ్రీలో జర్నలిజం కాంబినేషన్‌లో బీఏ చేస్తే జర్నలిజం పట్ల అవగాహన ఏర్పడుతుంది. సమాజం పట్ల ఆసక్తి, మానవ సంబంధాల పరిశీలన, రాజకీయాలపై అవగాహన, భాష మీద పట్టు, అన్నింటికీ మించి పరిశోధన, విశ్లేషణ శక్తి ఉంటే ఈ రంగంలో రాణించగలుగుతారు. ఈ అంశాలపై అవగాహన రావాలంటే ఇంగ్లిష్, సైకాలజీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ వంటి సబ్జెక్టుల్లో కమ్యూనికేషన్‌ను ఒక సబ్జెక్టుగా చదివే ప్రయత్నం చేయండి. అలా కుదరకపోతే ఏ సామాజిక శాస్త్రాల్లో అయినా డిగ్రీ పొందే ప్రయత్నం చేస్తూ జర్నలిజంను మాత్రం మీకు మీరుగా వివిధ పత్రికలు, పుస్తకాలు, అంతర్జాలం ద్వారా నేర్చుకునే ప్రయత్నం చేయండి.

ఈ రంగంలో భవిష్యత్తు చాలా బాగుంటుంది. డిగ్రీ తరువాత తప్పకుండా జర్నలిజంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసేలా ప్రయత్నించండి. పీజీలో మీరు ఎంచుకున్న రంగాన్నిబట్టి మీకు ఉద్యోగావకాశాలుంటాయి. పత్రిక, టీవీ, ఎన్‌జీఓ, ఆకాశవాణి, ఇంకా వివిధ సంస్థల్లో ప్రజాసంబంధ అధికారులు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో, వివిధ అంతర్జాతీయ సంస్థలు, పరిశోధన రంగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల్లో ఉద్యోగావకాశాలుంటాయి.

ఏ రంగంలోనైనా రాణించాలంటే దానిపై పరిజ్ఞానం, భావప్రకటన సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, పరిశీలన, పరిశోధన, సృజనాత్మక వంటి అంశాల్లో మిమ్మల్ని మీరు మెరుగుపరచుకుంటే అవకాశాలే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

To bump into.. అంటే?

MODERN ENGLISH USAGE

ఎం. సురేశన్

ఎక్కడోచోట అనుకోకుండా కొందరిని కలుస్తుంటాం. దాన్ని అర్థవంతంగా ఇంగ్లిష్‌లో ఎలా చెప్పాలి? దానికో వ్యక్తీకరణ ఉంది. దాన్ని సంభాషణల్లో ఉపయోగించే విధానం గురించి ఉదాహరణల సాయంతో తెలుసుకుందామా?

Prasad: I bumped into Sriram yesterday. He appeared very healthy. He seems to have recovered from his illness (నేను నిన్న శ్రీరామ్‌ను అనుకోకుండా కలుసుకున్నా. వాడు చాలా ఆరోగ్యంగా కనపడ్డాడు. జబ్బు నుంచి బాగా కోలుకున్నట్టు కనిపించాడు).

Srinivas: That is good news. I'd like to meet him too. OK, leave that alone. There is a problem that I'd like to discuss with you (అది శుభవార్త. నేను కూడా అతన్ని కలుసుకోవాలనుకుంటున్నా. అది సరే, దాన్ని అటుంచు. నాతో నా సమస్యను ఒకదాన్ని చర్చించాలని కోరుకుంటున్నా).

Prasad: Right now I am very busy. We can talk the problem over tomorrow morning. I will certainly call on you (ఇప్పుడు నేను తీరిక లేకుండా ఉన్నా. రేపు పొద్దున దాన్ని చర్చిద్దాం. నేనే రేపు నీ దగ్గరికి వస్తాను).

Srinivas: That is very good of you. When I tried to discuss the problem with Sudhakar, he talked back to me. He did not even sympathize with me (అది నీ మంచితనం. నేను దాన్ని సుధాకర్‌తో చర్చించాలనుకుంటే నాతో చాలా అసహనంతో మాట్లాడాడు. నాపట్ల అతను సానుభూతి కూడా చూపలేదు.)

Prasad: He is always like that. He is too impatient. But when it is his problem, he makes us sit and find a solution to it (అతనెప్పుడూ అంతే. ఓర్పు మరీ తక్కువ. కానీ అది అతని సమస్య అయినపుడు మాత్రం, మనల్ని కూర్చోబెట్టి దానికి పరిష్కారం చూపించే దాకా వదలడు).

Srinivas: There were many occasions when he wanted to find solution with my help. I reminded him of it yesterday, but he was not moved in any way (నా సాయంతో తన సమస్యలు ఎన్నింటికో పరిష్కారం కనుక్కున్నాడు. నిన్న నేనది అతనికి గుర్తుచేశా. కానీ, అతనేమీ చలించలేదు).

Now look at the following sentences from the conversation above:

1) To bump into = Meet people by chance or accident (అనుకోకుండా ఒకరిని కలుసుకోవడం).

Nagendra: I met Sekhar by accident yesterday, after a long time. He has changed a lot and is very tall now. It is years since we saw him, isn't it? (నిన్న శేఖర్‌ను అనుకోకుండా కలుసుకున్నా, చాలాకాలం తరువాత. అతను చాలా మారిపోయాడు. మనం వాడిని చూసి ఏళ్లు గడిచిపోయాయి కదా?)

Seshagiri: I bumped into him too, this morning. As you say he has changed a lot. But he is the same old Sekhar. He is quite friendly and warm (నేను కూడా ఇవ్వాళ పొద్దున అతన్ని యాదృచ్ఛికంగా కలుసుకున్నా. నువ్వన్నట్టు అతను చాలా మారిపోయాడు. అయితే అతను మన పాత శేఖర్‌లాగానే ఉన్నాడు. మనతో స్నేహంగా, అభిమానంతో ఉన్నాడు).

2) Talk a problem over = discuss a problem and find a solution to it (ఒక సమస్యను చర్చించి దానికి పరిష్కారం కనుక్కోవడం).

Sitaram: What you have said to me is a knotty problem. We can't find a solution to it immediately. Let us discuss it tomorrow (నువ్వు నాకు వివరించింది చాలా చిక్కు సమస్య. దానికి మనం వెంటనే పరిష్కారం కనుక్కోలేం. రేపు దాని గురించి చర్చిద్దాం).

Sri Hari: That would be fine. I have no work to keep me busy tomorrow. We will talk the problem over tomorrow and find a solution to it. There is always a solution to any problem (అది బాగుంది. రేపు నాకేం పని లేదు, తీరిక లేకుండా చేసేందుకు. ఆ సమస్యను మనం రేపు చర్చించి ఒక పరిష్కారాన్ని కనుక్కుందాం. ప్రతి సమస్యకూ పరిష్కారం అనేది ఉంటుంది).

సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు

ఈనాడు

మహా సంకల్పం

విజయవాడ 8-6-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 299

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ప్రజలే ముందు
PEOPLE FIRST
1100

GOVERNMENT OF ANDHRA PRADESH

2022	దేశంలో 3 అగ్రగామి రాష్ట్రాలలో ఒకటి (తలసరి ఆదాయం రూ. 2.95 లక్షలు)
2029	దేశంలో అత్యుత్తమ రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 9.65 లక్షలు)
2050	ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాల రాష్ట్రం (తలసరి ఆదాయం రూ. 1.67 కోట్లు)

మహాసంకల్పం 2018

- 2029 నాటికి దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
- అవినీతి రహిత, సుస్థిర, సురక్షిత, ప్రశాంత సమాజమే ప్రభుత్వ ప్రాధాన్యత
- 2018-19 లో జీ వీ ఏ లక్ష్యం రూ 6,35,692, వృద్ధి రేటు లక్ష్యం 15.91 శాతం
- వ్యవసాయం అనుబంధ రంగాలలో వృద్ధి లక్ష్యం 22.66 శాతం
- పారిశ్రామిక రంగంలో 13.07 శాతం వృద్ధి లక్ష్యం
- సేవా రంగంలో 15.91 శాతం వృద్ధి లక్ష్యం
- మీ కోసం ప్రజలే ముందు ఫోన్ లైన్ ద్వారా ప్రజా సమస్యల సత్వర పరిష్కారం
- సుపరిపాలనలో టెక్నాలజీ వినియోగంలో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్
- రియల్ టైం గవర్నెన్స్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల పని తీరు, సంక్షేమ పథకాల అమలు పై నేరుగా ముఖ్య మంత్రి కార్యాలయం నుండే పర్యవేక్షణ
- విస్తృతంగా సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, పోలీస్ వ్యవస్థను ఆధునీకరించి నేరస్థుల కదలికలను గమనిస్తూ, నేరాలను నిరోధించటం, అవసరమైన చోట తక్షణ చర్యలు
- ఏపీ ఫైబర్ నెట్ ద్వారా 13 జిల్లాలలో ప్రతి ఇంటికి కేవలం రూ.149 లకే ఇంటర్నెట్ సౌకర్యం, టెలిఫోన్ కనెక్షన్. 2019 నాటికి కోటి కనెక్షన్‌లు
- డ్రోన్లు, సెన్సార్లు, IOT పరికరాలు, డిజిటల్ క్లాస్ రూంల ఏర్పాటు ద్వారా అన్ని పౌర సేవలు సులభంగా అందేలా చర్యలు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ప్రతి శాఖలో బయోమెట్రిక్ ద్వారా హాజరు.
- ఈ -ఆఫీస్ విధానం ద్వారా వేగవంతమైన, జవాబుదారి పరిపాలన

'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు' అని మనకు ఎన్టీఆర్ ఇచ్చిన సందేశం నుంచి స్ఫూర్తి పొందుతూ ఆర్థిక సంస్కరణల ఫలాలను ప్రజలందరికీ అందించి, పేదరికం లేని, ఆర్థిక అసమానతలు లేని, ప్రశాంత, సురక్షిత, ఆనందదాయకమైన సమాజ నిర్మాణమే మన లక్ష్యం. ఈ లక్ష్య సాధనే కర్తవ్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి సహకరిస్తానని మహాసంకల్పం చేస్తున్నాను.

ముఖ్యమంత్రి గారిని సంప్రదించడానికి

NCBN అధికారిక యాప్ | ప్రజలే ముందు మొబైల్ యాప్ | ఏపి సీఎం ఫేస్ బుక్ | ఏపి సీఎం ట్విట్టర్

నేటి చర్చనీయాంశాలు

- ప్రజలే ముందు
- అవినీతి రహిత సమాజం
- సులభంగా పౌర సేవలు
- పారదర్శకత, జవాబుదారీ సుపరిపాలన
- రియల్‌టైం గవర్నెన్స్ (ఆర్‌టీజీ) - పరిష్కార వేదిక
- ఆర్థికాభివృద్ధి ప్రణాళిక
- స్వర్ణాంధ్ర సాధనకు విజన్ -2029

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

అందుబాటు ధరలతో అందరికీ ఆరోగ్యం

- వైద్య చికిత్సల భారాన్ని తగ్గించాం
- రూ.29వేలకు దిగివచ్చిన స్టెంట్ల ధరలు
- రూ.80వేలకు తగ్గిన మోకాలు ట్రాన్స్‌ప్లాంట్
- డయాలసిస్ యోజన కింద 2.25 లక్షల మందికి రక్తశుద్ధి
- జన ఔషధీ కేంద్రాల ద్వారా చౌకలో మందులు: ప్రధాని మోదీ

దిల్లీ: ఔషధాల కొనుగోలు పేదలకు పెద్ద సమస్యగా మారిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ ఆర్థిక భారాన్ని తగ్గించి, ప్రతి భారతీయుడికి అందుబాటు ధరలో ఆరోగ్య పరిరక్షణ కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆరోగ్య పరిరక్షణను ఒక ప్రజా ఉద్యమంగా మలచాలని అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ పరియోజన (పీఎంబీజేపీ) లబ్ధిదారులు, చౌకలో హృద్రోగ స్టెంట్లు, మోకాలు ఇంప్లాంట్ల కార్యక్రమం కింద ప్రయోజనం పొందిన రోగులతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రసంగించారు.

మరిన్ని పడకలు, ఆసుపత్రులు, వైద్యులను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పేదలు, దిగువ, ఎగువ మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఔషధాలను అందించేందుకు పీఎంబీజేపీని ప్రారంభించినట్లు మోదీ తెలిపారు. దేశవ్యాప్తంగా 3600 జన ఔషధీ కేంద్రాలను ప్రారంభించామని, అక్కడ 700కుపైగా జెనిరిక్ ఔషధాలను మార్కెట్ ధర కన్నా 50-90 శాతం తక్కువకే అందిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఈ కేంద్రాల సంఖ్యను 5వేలకు పెంచుతామన్నారు. 'ఆయుష్మాన్ భారత్' కింద 10 కోట్ల కుటుంబాలకు, 50 కోట్ల మంది ప్రజలకు రూ.5లక్షల మేర ఆరోగ్య బీమా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ మొదటి దశకు శ్రీకారం చుట్టామని, త్వరలో దీనివల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. చిన్న గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలు.. దూరంగా ఉన్న ఆసుపత్రులకు వెళ్లడం కష్టంగా ఉందని, అందువల్ల దేశవ్యాప్తంగా 1.5 లక్షల ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. అక్కడ ఔషధాలతోపాటు వ్యాధి నిర్ధారణ సౌకర్యాలూ లభ్యమవుతాయని చెప్పారు. పేదలపై చికిత్సల భారాన్ని తగ్గించేందుకు తాము సరైన దిశలో చేపట్టిన చర్యల వల్ల క్షేత్రస్థాయిలో ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు.

దిగి వచ్చిన స్టెంట్లు..: హృద్రోగులు స్టెంట్ల కోసం ఆస్తులను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి లోగడ ఉండేదన్నారు. ఇప్పుడు స్టెంట్ల ధరలు రూ.2లక్షల నుంచి రూ.29వేలకు తగ్గిందని చెప్పారు. మోకాలుకు అమర్చే ట్రాన్స్‌ప్లాంట్ల ధరలను రూ.2.5 లక్షల నుంచి రూ.70 వేలు-80వేలకు తగ్గించామని తెలిపారు. దీనివల్ల ప్రజలకు రూ.1500 కోట్ల మేర ఆదా అవుతోందన్నారు. మూత్రపిండాల రోగుల కోసం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ డయాలసిస్ యోజన' కింద ఎంపిక చేసిన నగరాల్లో రక్త శుద్ధి నిర్వహిస్తున్నట్లు వివరించారు. 500కుపైగా జిల్లాల్లో 2.25 లక్షల మంది రోగులకు 22 లక్షలకుపైగా డయాలసిస్ సెషన్లను నిర్వహించినట్లు తెలిపారు. 90కిపైగా వైద్య కళాశాలలను ప్రారంభించామని, దీనివల్ల 15 వేల ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయని వివరించారు. అంతర్జాతీయంగా నిర్దేశించిన గడువు కన్నా ఐదేళ్ల ముందే.. అంటే 2025 నాటికి దేశం నుంచి క్షయ వ్యాధిని తరిమేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. మిషన్ ఇంద్రధనుష్ కింద 3.15 కోట్ల మంది చిన్నారులకు, 80 లక్షల మంది గర్భిణులకు టీకాల వేశామన్నారు. 2020 నాటికి చిన్నారులందరికీ టీకాలు వేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. యోగాను జీవితంలో భాగంగా మలచుకోవాలని కోరారు. దేశంలో పారిశుద్ధ్య విస్తృతి 38 శాతం నుంచి 80 శాతానికి పెరిగిందని మోదీ చెప్పారు. 'ఆరోగ్య భారత్' సాకారంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. 3.5 లక్షల గ్రామాలు.. 'బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలు'గా ప్రకటించుకున్నాయని చెప్పారు.

రేపు జిన్‌పింగ్‌తో మోదీ భేటీ

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం భేటీ అవుతారు. కింగ్‌డావోలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించే షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) 18వ శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఇరువురు నేతల మధ్య సమావేశం జరుగుతుందని విదేశీ వ్యవహారాలశాఖ ప్రతినిధి రవీష్ కుమార్ గురువారం వెల్లడించారు. ఉహాన్‌లో నెల క్రితం జరిగిన అనధికార సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలుచేసే విషయం చర్చకు వచ్చే వీలుందన్నారు. ఎస్సీవో సదస్సుకు జిన్‌పింగ్ అధ్యక్షత వహిస్తారు. సభ్యదేశాల మధ్య సహకారం, ప్రాంతం (రీజన్)లో పరిస్థితులతో పాటు రాజకీయ, భద్రతాంశాలు, ఆర్థిక-సాంస్కృతిక సహకారం తదితర అంశాలపై సదస్సు దృష్టి సారించే అవకాశముంది. అయితే, పాకిస్థాన్ అధ్యక్షుడు మమ్‌నూన్ హుస్సేన్‌తో ప్రధాని భేటీ ఉంటుందా? లేదా? అన్నది ఇంకా తెలియరాలేదు.

'అదనపు సామాన్లకు జరిమానా' లేనట్లే..: రైల్వేశాఖ

దిల్లీ: ప్రయాణికుల నుంచి వ్యతిరేకత ఎదురైన నేపథ్యంలో.. రైళ్లలో పరిమితికి మించి సామాన్లు(లగేజీ) తీసుకెళ్లేవారి నుంచి జరిమానా వసూలు చేయాలన్న యోచనను రైల్వేశాఖ పక్కనపెట్టింది. మూడు దశాబ్దాల నాటి ఈ పాత నిబంధనను అమలు చేసేందుకు ఉద్దేశించి.. నిర్ణయం తీసుకునేందుకు గాను ఈనెల 1 నుంచి 6 రోజుల పాటు రైల్వేశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని (డ్రైవ్) చేపట్టింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తడంతో.. ప్రయాణికులను చైతన్యపరిచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరణ ఇచ్చింది. పరిమితికి మించి సామాన్లు తీసుకొస్తే తోటి ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడతారో తెలియజెప్పేందుకే డ్రైవ్ చేపట్టినట్లు రైల్వే శాఖ ప్రతినిధి రాజేష్ తెలిపారు. అలాగే సామాన్లకు సంబంధించిన నిబంధనలను ప్రయాణికులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశించినట్లు వివరించారు.

అబూ సలేంకు ఏడేళ్ల జైలు శిక్ష

దిల్లీ: రూ.కోట్లు చెల్లించాలంటూ ఓ వ్యాపారిని బెదిరించినందుకు గ్యాంగ్‌స్టర్ అబూ సలేంకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.పదివేల జరిమానా విధిస్తూ గురువారం ఇక్కడి కోర్టు తీర్పు చెప్పింది. ఇతర నేరగాళ్ల నుంచి రక్షణ కల్పించడానికి తనకు రూ.5 కోట్లు ఇవ్వాలంటూ 2002లో దక్షిణ దిల్లీలోని గ్రేటర్ కైలాశ్‌లో నివసించే అశోక్ గుప్తాను బెదిరించినట్లు కేసు నమోదయింది. తగినన్ని సాక్ష్యాలు లేనందున ఈ కేసులో మరో అయిదుగురిని విడుదల చేస్తూ అదనపు సెషన్స్ జడ్జి తరుణ్ శెరావత్ తీర్పు చెప్పారు.

డెబిట్ కార్డిచ్చి ఎవరినీ పంపొద్దు!

- కనీసం భార్య కార్డునైనా భర్త ఉపయోగించే వీల్లేదు
- డబ్బులు రాకపోతే బ్యాంకుకు సంబంధం లేదు

బెంగళూరు: ఏటీఎం నుంచి నగదు తీసుకురావాలంటూ మీ ఏటీఎం కార్డును సమీప బంధువులు, స్నేహితులకు ఇవ్వకూడదా? కనీసం భార్య కార్డునైనా భర్త ఉపయోగించకూడదా? అలా చేయకూడదని భారతీయ స్టేటు బ్యాంకు (ఎస్‌బీఐ) చెబుతోంది. ఇది సబబేనని న్యాయస్థానం కూడా అంగీకరిస్తోంది. ఏటీఎం కార్డును బదిలీ చేయడానికి వీల్లేదని, ఖాతాదారుడు తప్పించి, ఇతరులు ఉపయోగించకూడదన్న నిబంధన ఉందని స్పష్టం చేస్తోంది. ఈ నిబంధనే ఓ బాలింతకు కష్టాలు తెచ్చిపెట్టింది. దాదాపు అయిదున్నరేళ్లపాటు ఎన్నో ప్రయత్నాలు చేసినా పోయిన సొమ్మును తిరిగి తెచ్చుకోలేకపోయింది.

బెంగళూరులోని మారతహళ్లికి చెందిన వందన 2013 నవంబరు 14న తన డెబిట్ కార్డును భర్త రాజేశ్ కుమార్‌కు ఇచ్చి నగదు తీసుకురావాలని చెప్పింది. రాజేష్ స్థానికంగా ఉండే ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లి రూ.25 వేలు తీయడానికి కార్డును స్వైప్ చేశారు. సొమ్ము వచ్చినట్టు రసీదు వచ్చినా, నగదు మాత్రం రాలేదు. దాంతో ఆయన కాల్‌సెంటర్‌కు ఫోన్ చేశారు. ఏటీఎం తప్పిదం కారణంగా నగదు రాలేదని, 24 గంటల్లో సొమ్మును ఖాతాలో జమఅవుతుందని సమాధానం వచ్చింది. మరుసటి రోజు కూడా నగదు జమ కాకపోవడంతో బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. కొన్ని రోజుల తరువాత.. జరిగిన లావాదేవీ నిజమని, సొమ్ము ఖాతాదారునికి ముట్టిందంటూ సమాధానం వచ్చింది. రాజేష్ కార్డును ఉపయోగించినట్టు, నగదు బయటకు రానట్టు ఏటీఎం సీసీటీవీల పుటేజీలో కనిపించింది. సమాచార హక్కు చట్టం కింద 2014 నవంబరు 16నాడు ఆ ఏటీఎంలో రూ.25 వేలు మిగులు ఉన్న విషయాన్ని కూడా తెలుసుకున్నారు. ఈ వివరాలన్నీ తీసుకొని మళ్లీ బ్యాంకును ఆశ్రయించగా సమస్య దర్యాప్తు సంఘం దృష్టికి వెళ్లింది. సీసీటీవీలో ఖాతాదారురాలైన వందన కనిపించడం లేదని, కార్డును ఉపయోగించిందిఅసలు ఖాతాదారుడు కాదని పేర్కొంది. దీనిపై బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌కి ఫిర్యాదు చేయగా, 'రహస్య సంకేతా(పిన్)న్ని పంచుకున్నారు. కేసును ముగిస్తున్నాం' అంటూ తీర్పు వెలువడింది. అనంతరం నాలుగో అదనపు జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. కొద్ది కాలం క్రితమే బిడ్డకు జన్మనిచ్చినందున, బయటకు వెళ్లే పరిస్థితి లేదని, అందుకే భర్తకు ఏటీఎం కార్డు ఇచ్చానని ఆమె తెలిపింది. మరోవైపు, ఏటీఎం ద్వారా ఖాతాదారునకు నగదు అందిందని, ఎక్కడా సాంకేతిక తప్పిదాలు జరగలేదని, ఎస్‌బీఐ పత్రాలు సమర్పించింది. ఏటీఎంలో రూ.25 వేలు మిగులు ఉన్నట్టు గతంలో సమాచార హక్కు కింద తెలపగా, కోర్టులో మాత్రం మిగులు నగదు ఏమీ లేదంటూ పత్రాలు ఇచ్చింది. గత నెల 29న తీర్పు వెలువరించిన ఫోరం 'ఏటీఎం పిన్‌ను ఇతరులతో పంచుకోవడం ఉల్లంఘన కిందకు వస్తుంద'న్న నిబంధనను పేర్కొంటూ కేసును కొట్టివేసింది.

గ్వాటెమాలాలో ఫ్యూగో అగ్నిపర్వత విస్ఫోటన ధాటికి దెబ్బతిన్న ప్రాంతం. పైన ఫిబ్రవరి 5న ఉపగ్రహ ఛాయాచిత్రంలో కనిపించిన నివాసాలు, అటవీప్రాంతం. కింది చిత్రంలో అగ్నిపర్వత విస్ఫోటన అనంతరం దెబ్బతిన్న ప్రాంతం

400 రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై

దిల్లీ: 'రైల్‌టెల్' సహకారంతో దేశంలోని 400 రైల్వే స్టేషన్లలో ప్రజలకు ఉచితంగా వైఫై సేవలను అందిస్తున్నట్లు గూగుల్ సంస్థ గురువారం తెలిపింది. 'డిజిటల్ ఇండియా'లో భాగంగా 2016 జనవరిలో ముంబయి సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో ఈ సేవలను ప్రారంభించారు. గురువారం అసోంలోని డిబ్రూగఢ్.. ఈ సౌకర్యాన్ని పొందిన 400వ స్టేషన్‌గా అవతరించిందని గూగుల్ తెలిపింది. ఇంటర్నెట్ లేని లక్షల మందికి రైల్‌టెల్ ద్వారా సంధానత కల్పించాలన్న లక్ష్యాన్ని ఇది సాధించిందని పేర్కొంది. ప్రాజెక్టును చేపట్టిన మొదటి ఏడాదిలోనే 100 స్టేషన్లలో వైఫైను అందించామని తెలిపింది. దీనివల్ల నిత్యం 15వేల మంది కొత్తగా ఇంటర్నెట్ అనుభవాన్ని పొందుతున్నారని పేర్కొంది. నెలకు 80లక్షల మందికిపైగా వినియోగదారులు ఈ నెట్‌వర్క్‌కు అనుసంధానమవుతున్నారని వివరించింది. ఈ పథకం కింద 30 నిమిషాల పాటు ఉచితంగా ఇంటర్నెట్ పొందొచ్చు. సరాసరిన ఒక విడతలో 350 ఎంబీ మేర డేటాను వినియోగదారులు వాడుతున్నారు. వీరిలో ఎక్కువ మంది 19-34 ఏళ్ల మధ్య ఉన్నారు. వృద్ధులు, తొలిసారి వినియోగదారులు కూడా ఈ సౌకర్యాన్ని పొందేందుకు.. క్షేత్రస్థాయి సహాయ సిబ్బంది సాయం చేస్తున్నారని గూగుల్ పేర్కొంది.

ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి

- ఐఐటీ-మద్రాస్ శాస్త్రవేత్తల ఆవిష్కరణ

దిల్లీ: పునర్వినియోగానికి పనికిరాని ప్లాస్టిక్‌ను ఇంధనంగా మార్చగల సౌర విద్యుత్ ఆధారిత వ్యవస్థను ఐఐటీ-మద్రాస్ శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. ఈ విధానంలో ఉత్పత్తయ్యే చమురును జనరేటర్లు, ఇంజిన్లలో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చునని వెల్లడించారు. మన దేశంలో ప్రతిరోజు దాదాపు 15 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగుపడుతున్నాయి. ఈ సమస్యలపై తమిళనాడులోని ఐఐటీ-మద్రాస్ శాస్త్రవేత్తలు విస్తృత పరిశోధనలు నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఇంధనంగా మార్చగల అద్భుత వ్యవస్థను సృష్టించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని దిల్లీలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన ఓ కార్యక్రమంలో తమ ప్రాజెక్టును వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఇంధనంగా మార్చే విధానంలో 'పైరోలైసిస్' అనే ప్రత్యేక ప్రక్రియ భాగంగా ఉంటుంది. ఇందులో ప్రాణవాయువు(ఆక్సిజన్) రహిత పరిస్థితుల్లో ప్లాస్టిక్‌ను 350-500 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు గురిచేస్తారు. దీంతో ప్లాస్టిక్‌లోని పాలీమర్ గొలుసులు తెగిపోయి.. తక్కువ సాంద్రతతో కూడిన చమురు లభిస్తుంది.

ఫేస్‌బుక్‌ను వివరణ కోరిన కేంద్రం

దిల్లీ: ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ తమ వినియోగదారుల సమాచారాన్ని మొబైల్‌ఫోన్ తయారీ సంస్థలతో పంచుకున్నట్లు కథనాలు రావడంతో కేంద్రం స్పందించింది. ఈ అంశంపై సమగ్ర సమాచారంతో వివరణ ఇవ్వాలని ఫేస్‌బుక్‌ను కేంద్ర ఐటీ శాఖ ఆదేశించింది. జూన్ 20లోగా ఈ నివేదికను అందజేయాలని కోరింది. కథనాలపై తమకు తాముగా స్పందించి ఈ చర్య తీసుకున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. వినియోగదారులు, వారి స్నేహితుల సమాచారాన్ని ఎలాంటి అనుమతీ తీసుకోకుండానే.. మొబైల్, ఇతర పరికరాలు తయారీ సంస్థలకు ఇచ్చేలా ఫేస్‌బుక్ అంగీకారం కుదుర్చుకున్నట్లు ఆరోపించిన కథనాలు తమ దృష్టికి వచ్చాయని తెలిపింది. ఇలాంటి ఉల్లంఘనలను కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని పేర్కొంది. ఇటు ఈ విషయంపై ఫేస్‌బుక్ స్పందించింది. "వినియోగదారుల సమాచారాన్ని భద్రంగా ఉంచేందుకు మేము కట్టుబడి ఉన్నాం. ప్రభుత్వం వ్యక్తపరిచే ప్రశ్నలకు సమాధానాలిచ్చేందుకు మేము ఎప్పుడూ సంసిద్ధమే" అని ఫేస్‌బుక్ అధికార ప్రతినిధి తెలిపారు.

సోనియా సూచనతోనే ప్రణబ్‌పై విమర్శలు!

- ఆమె చెప్పిన తర్వాతే పటేల్ ట్వీట్

దిల్లీ: నాగ్‌పుర్‌లోని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) కార్యక్రమానికి మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ముఖ్య అతిథిగా వెళ్లడంపై కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడానికి వెనుక పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. 'ప్రణబ్ నుంచి ఇలాంటిది నేను ఊహించలేదు...' అంటూ సోనియా రాజకీయ సలహాదారుడు అహ్మద్ పటేల్ బుధవారం రాత్రి ట్వీట్ చేశారు. అది సోనియా ఆదేశాల మేరకే జరిగిందని పార్టీ వర్గాలను ఉటంకిస్తూ ఎన్డీటీవీ వెల్లడించింది. ప్రణబ్ ఆరెస్సెస్ కార్యక్రమానికి వెళ్లకుండా చూడాలని ఆయన కుమారుడు, కుమార్తెతో పాటు సీనియర్ నేత ఆనంద్‌శర్మ వంటివారు చాలా ప్రయత్నించారు. ఆయన్ని కలిసి మాట్లాడి, ఎలాగైనా పర్యటన రద్దయ్యేలా చేయాలని చూశారు.

ప్రణబ్ వారసుల భవితవ్యంపై ప్రభావం! ఆరెస్సెస్ కార్యక్రమానికి ప్రణబ్ వెళ్లడం వల్ల ఆయన వారసుల రాజకీయ భవితవ్యంపై ప్రభావం పడవచ్చనే చర్చ జరుగుతోంది. పశ్చిమబెంగాల్‌లోని మాల్దా నుంచి భాజపా టికెట్‌పై కుమార్తె షర్మిష్ఠను లోక్‌సభకు పోటీ చేయించడానికే ప్రణబ్ ఆరెస్సెస్ కార్యక్రమానికి వెళ్లారని షీలా దీక్షిత్ వర్గం ఇప్పటికే ప్రచారం చేస్తోంది.

ఆరెస్సెస్‌కు ప్రణబ్ వెళ్లడంతో కార్యకర్తల్లో క్షోభ: కాంగ్రెస్

దిల్లీ: ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సందర్శించడం, అక్కడ ఆయన చిత్రాలు కనిపించడంతో లక్షలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలకు క్షోభ కలిగిందని పార్టీ సీనియర్ నేత ఆనంద్‌శర్మ పేర్కొన్నారు. బహుళత్వాన్ని, భారతీయ గణతంత్ర వైవిధ్యాలను విశ్వసించేవారికి ఆయన పర్యటన వేదన కలిగించిందని చెప్పారు. విని, ఆచరించడానికి ఆసక్తి ఉన్న వారితోనైతే చర్చించవచ్చునీ, ఆరెస్సెస్ తమ అజెండా నుంచి మారుతుందని చెప్పే అవకాశాలు ఎంతమాత్రం లేవనీ ట్విటర్లో వ్యాఖ్యానించారు.

సవ్యంగా ఆలోచించేవారితోనే చర్చలు

- జమ్మూ-కశ్మీర్‌పై హోం మంత్రి రాజ్‌నాథ్

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌లో శాంతిస్థాపనకు.. సరైనదిశలో ఆలోచించే వారందరితోనూ చర్చలు జరిపేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం పేర్కొన్నారు. భద్రత పరిస్థితిని సమీక్షించేందుకు రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో ఉన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. "ప్రతి ఒక్కరితోనూ చర్చలకు సిద్ధం.. దీనికి భావసారూప్యతే అవసరం లేదు, సవ్యంగా ఆలోచించగలిగితే చాలు.." అని వేర్పాటువాదులనుద్దేశించి పేర్కొన్నారు. యువతను తప్పుతోవ పట్టించవద్దని కోరారు. జమ్మూ-కశ్మీర్‌లో పరిస్థితిని సమీక్షించిన అనంతరం రంజాన్ తర్వాత కూడా 'కాల్పుల విరమణ'ను పొడిగించే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. పాకిస్థాన్ తన భూభాగంలో ఉగ్రవాద కార్యకలాపాలను నియంత్రించాలని.. అలా చేయలేకపోతే భారత్ సహకారం తీసుకోవాలని సూచించారు. యువతను విద్య, క్రీడల్లో ప్రోత్సహిస్తూ వారి సాధికారితకు కృషి చేస్తున్నట్లు రాజ్‌నాథ్ పేర్కొన్నారు. జమ్మూ-కశ్మీర్‌పై ప్రధాని మోదీకి అమితమైన ప్రేమ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జమ్మూ-కశ్మీర్ ముఖచిత్రాన్ని, భవితవ్యాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. శ్రీనగర్‌లోని షేర్-ఈ-కశ్మీర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత విధ్వంసబాటను కాకుండా, అభివృద్ధి మార్గాన్ని ఎంచుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్. చిత్రంలో మెహబూబా ముఫ్తీ

నాయకత్వం కోసం ప్రపంచం చూస్తోంది

- సుష్మాస్వరాజ్ వెల్లడి

పీటర్‌మారిట్జ్‌బర్గ్: నాయకత్వం కోసం భారత్, దక్షిణాఫ్రికా వైపు ప్రపంచం చూస్తోందని విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ అన్నారు. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీని శ్వేతజాత్యాహంకారంతో రైలు పెట్టెలోంచి తోసేసి 125 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఇక్కడి సిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుష్మాస్వరాజ్ కీలకోపన్యాసం ఇచ్చారు. గాంధీని రైలు పెట్టెలోంచి తోసేసిన సంఘటన 1893, జూన్7న జరిగింది. ఆ నాటి సంఘటనే గాంధీ.. సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించేందుకు నాంది అయింది. ఆ తర్వాతే ఆయన దక్షిణాఫ్రికాలో, భారత్‌లో శాంతియుత నిరసన ఉద్యమాన్ని ప్రారంభించారు. సుష్మాస్వరాజ్ మాట్లాడుతూ "మన కారణంగానే ప్రపంచం మెరుగ్గా ఉంది. మన నుంచి ప్రపంచం చాలా లబ్ధి పొందాలి. నాయకత్వం కోసం ప్రపంచం మనవైపు చూస్తోంది." అన్నారు. గాంధీ, నెల్సన్ మండేలాలు అన్యాయం, వివక్ష ఎదుర్కొంటున్న వారికి ఆశాదీపంగా నిలిచారని చెప్పారు. "పీటర్‌మారిట్జ్‌బర్గ్‌లో ఈ ఇద్దరు గొప్పనేతలు విశ్వాసానికి పునర్నిర్వచనం ఇచ్చారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు.. ముఖ్యంగా భారత్, ఆఫ్రికన్ దేశాల్లో విశ్వాసం కల్పించారు. వలసపాలకుల నుంచి విముక్తి కల్పించారు." అని పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో వలసపాలనకు, జాతివివక్షకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో భారత సంతతి ప్రజల త్యాగం మరవలేనిదని కొనియాడారు. పెన్‌ట్రిచ్ నుంచి పీటర్‌మారిట్జ్‌బర్గ్ స్టేషన్ వరకు సుష్మాస్వరాజ్ రైల్లో ప్రయాణించారు. గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రెండు వైపులా గాంధీ ముఖం ఉండడం ఈ విగ్రహం ప్రత్యేకత. ఒక వైపు యువకుడిగా ఉన్నప్పటి ముఖం, మరోవైపు ఇప్పుడు మనందరికీ తెలిసిన ముఖం ఉన్నాయి. మహాత్మాగాంధీ డిజిటల్ ప్రదర్శనశాలను కూడా మంత్రి ప్రారంభించారు.

తొలి 20 బ్రిక్స్ వర్సిటీల్లో.. 4 భారత విద్యా సంస్థలకు చోటు

లండన్, దిల్లీ: బ్రిక్స్ దేశాల్లోని తొలి 20 అగ్ర వర్సిటీల జాబితాలో నాలుగు భారత విద్యా సంస్థలు చోటు సంపాదించాయి. ఐఐటీ బాంబే (9), ఐఐఎస్సీ బెంగళూరు (10), ఐఐటీ దిల్లీ (17), ఐఐటీ మద్రాస్ (18) ఈ ఘనత సాధించాయి. 2018 సంవత్సరానికిగాను క్యూఎస్ సంస్థ ఈ జాబితా విడుదలచేసింది. విద్యార్థులు-అధ్యాపకుల నిష్పత్తి, పరిశోధక విద్యార్థుల సంఖ్య లాంటి ఎనిమిది పరామితుల సాయంతో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా (బ్రిక్స్)ల్లోని విద్యా సంస్థలకు ర్యాంకులు కేటాయించింది. వీటిలో మొదటి పది వర్సిటీల్లో ఏడు చైనా విద్యా సంస్థలున్నాయి. మొదటి 300 వర్సిటీల్లో 65 భారత విద్యా సంస్థలు చోటు సంపాదించాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, మార్గదర్శనలో అహర్నిశలూ కృషిచేయడం వల్లే క్యూఎస్ జాబితాలో భారత విద్యా సంస్థలు మంచి ర్యాంకులు సంపాదించగలిగాయని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ వ్యాఖ్యానించారు. మంచి ర్యాంకులు సాధించిన వర్సిటీలకు ఆయన అభినందనలు తెలిపారు.

కొంకణ్ తీరాన్ని తాకిన నైరుతి

ముంబయి: నైరుతి రుతుపవనాలు కొంకణ్ తీరాన్ని తాకడంతో బుధవారంరాత్రి నుంచి గురువారం వరకు ముంబయిని వర్షాలు ముంచెత్తాయి. పలు రైళ్లు 10 నుంచి 15 నిముషాలు ఆలస్యంగా నడిచాయి. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ దాదర్, పరేల్, బాంద్రా, బొరివలి, అంధేరిల్లో నీళ్లు నిలిచిపోయాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని భారత వాతావరణశాఖ(ఐఎండీ) హెచ్చరించింది. జూన్ 8, 9 తేదీల్లో ముంబయిలో భారీవర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు వీలైనంతవరకు బయట తిరగవద్దని సూచించింది. కొంకణ్‌తీరంలోని రత్నగిరి, సింధుదుర్గ్, ముంబయి, థాణె, రాయిగఢ్, పాల్ఘడ్ జిల్లాల్లో జూన్ 9, 10, 11 తేదీల్లో అతి భారీవర్షాలు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మరోవైపు బీఎంసీ ఉన్నతాధికారుల సెలవులను కమిషనరు అజోయ్‌మెహతా రద్దు చేశారు. పరేల్, మన్‌ఖుర్ద్, అంధేరిలో మూడు జాతీయ విపత్తుల సహాయక బృందాలను సిద్ధంగా ఉంచారు.

గగనతల రక్షణకు అధునాతన రాడార్లు

దిల్లీ: రూ.5,500 కోట్ల విలువైన సైనిక సామగ్రి కొనుగోలుకు రక్షణ మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. భారత వైమానిక దళం కోసం 12 శక్తిమంతమైన రాడార్ల సమీకరణ కూడా వీటిలో ఉన్నాయి. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఈ మేరకు నిర్ణయించింది. ఈ రాడార్లు ఎక్కువ పరిధిని కలిగి ఉంటాయి. ఆకాశంలో మధ్యశ్రేణి నుంచి ఎగువ స్థాయి వరకూ నిఘా వేయగలుగుతాయి. అత్యంత వేగంగా దూసుకొచ్చే శత్రు లక్ష్యాలను గుర్తించగలుగుతాయి. పెద్దగా నిర్వహణ లేకుండానే 24 గంటల పాటు ఇవి పనిచేస్తాయి. నలుదిక్కుల్లో నిఘా వేస్తాయి. వీటివల్ల దేశ గగనతల రక్షణ సామర్థ్యం మెరుగుపడుతుంది. తీర రక్షణ దళం, భారత సైన్యం కోసం 'ఎయిర్ కూషన్ వాహనాల' కొనుగోలుకూ డీఏసీ ఆమోదం తెలిపింది. లోతు తక్కువగా ఉన్న నీళ్లు, ఇసుకమయంగా ఉండే తీర ప్రాంతాల్లో దూసుకెళతాయి.

గర్భవిచ్ఛిత్తి చట్టానికి వ్యతిరేకంగా ఆదేశాలివ్వలేం

- బ్రిటన్ సుప్రీంకోర్టు వెల్లడి

లండన్: ఉత్తర ఐర్లాండ్‌లో గర్భవిచ్ఛిత్తికి సంబంధించి అమల్లో ఉన్న కఠిన నిబంధనలను వ్యతిరేకిస్తూ 'ఉత్తర ఐర్లాండ్ మానవ హక్కుల సంఘం(ఎన్ఐహెచ్‌ఆర్‌సీ)' దాఖలు చేసిన పిటిషన్‌పై తాము ఆదేశాలేవీ వెలువరించలేమని బ్రిటన్ సుప్రీంకోర్టు గురువారం తెలిపింది. గర్భవిచ్ఛిత్తి చట్టంలో జోక్యం చేసుకునే అధికారం తమకు లేదని అభిప్రాయపడింది. తమకు అధికారం ఉండి ఉంటే మాత్రం.. ఎక్కువమంది న్యాయమూర్తులు ఈ కఠిన చట్టానికి వ్యతిరేకంగానే తీర్పు చెప్పి ఉండేవారని వ్యాఖ్యానించింది.

ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలన్నీ కలసికట్టుగా ఉండాలి: సుఖ్‌బీర్‌సింగ్

చండీగఢ్, ముంబయి: భాజపాతో తమ మైత్రి శాశ్వతమని శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ గురువారం స్పష్టం చేశారు. 2019లో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇతర ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలన్నీ కూడా కలిసికట్టుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. భాజపా అధ్యక్షుడు అమిత్‌షా గురువారం సుఖ్‌బీర్ సింగ్ తండ్రి ప్రకాశ్ సింగ్ బాదల్ సహా ఎస్ఏడీ అగ్రనేతలతో భేటీ అయ్యారు. అనంతరం సుఖ్‌బీర్ సింగ్ విలేకర్లతో మాట్లాడారు. భాజపాకు తమకు మధ్య విభేదాలేమీ లేవని ఆయన స్పష్టం చేశారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎస్ఏడీ సభ్యులు అమిత్‌షాతో చర్చించారని తెలిపారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు బల్బీర్ సింగ్ (94), ప్రముఖ అథ్లెట్ మిల్కా సింగ్ (85)లతోనూ వారి నివాసాల్లో అమిత్‌షా సమావేశమయ్యారు. మరోవైపు.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలన్న తమ నిర్ణయాన్ని భాజపా అధ్యక్షుడు అమిత్‌షా మార్చలేరని శివసేన నేత సంజయ్ రౌత్ గురువారం స్పష్టం చేశారు.

మహిళల భద్రతకు స్మార్ట్ పరికరం.. భారత బృందానికి రూ.6.7 కోట్ల బహుమతి

ఐరాస, దిల్లీ: మహిళల భద్రతే లక్ష్యంగా భారత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అభివృద్ధిచేసిన స్మార్ట్ పరికరానికి అంతర్జాతీయ పోటీలో అగ్రస్థానం లభించింది. దీనిలో భాగంగా రూ.6.72 కోట్ల బహుమతి వీరిని వరించింది. "ఉమెన్స్ సేఫ్టీ ఎక్స్‌ప్రైజ్" పేరిట ప్రముఖ సామాజిక సేవకులు, భారతీయ అమెరికన్లు అనూ, నవీన్ జైన్ ఓ పోటీ నిర్వహించారు. దీనిలో 18 దేశాలకు చెందిన 85 బృందాలు పాలుపంచుకున్నాయి. వీటిలో భారత్‌కు చెందిన "లీఫ్ వేరబుల్స్" అంకుర సంస్థ ఒకటి. 2012లో దిల్లీలో చోటుచేసుకున్న నిర్భయ సామూహిక అత్యాచారం అనంతరం దీన్ని ఐఐటీ దిల్లీ, దిల్లీ సాంకేతిక విశ్వవిద్యాలయం విద్యార్థులు నెలకొల్పారు. మహిళల భద్రతకు వీరు ఇప్పటికే రెండు స్మార్ట్ పరికరాలు అభివృద్ధి చేశారు. తాజా పోటీ కోసం వీరు "సేఫ్ ప్రో" పేరిట ఓ వేరబుల్ (ధరించే) పరికరాన్ని సిద్ధంచేశారు. మహిళలపై దాడులు జరిగేటప్పుడు అత్యవసర సందేశాలు పంపడం దీని ప్రత్యేకత. అంతేకాదు ఆ సమయంలో జరిగే సంభాషణలనూ ఇది రికార్డు చేయగలదు. వీటిని ఫిర్యాదులు నమోదుచేసేటప్పుడు సాక్ష్యంగా ఉపయోగించే వీలుంది. పైగా చరవాణి లేదా వైఫై అందుబాటులోలేకున్నా ఈ పరికరం పనిచేయగలదు. దీంతో ఈ పరికరం తయారుచేసిన మణిక్ మెహ్తా, నిహారిక రాజీవ్, అవినాశ్ బన్సల్‌లకు మొదటి బహుమతి అందించారు.

ఆధార్ వివరాల మార్పుల చరిత్రను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

దిల్లీ: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక నుంచి ఆధార్ వినియోగదారులు... తమ వివరాలను తాజాపర్చుకుంటే ఆ చరిత్రను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ వెసులుబాటు ఉండడంతో చిరునామా మార్పు వంటి వివరాలను అవసరమయితే రుజువుగా సమర్పించుకోవచ్చు. పేరు, పుట్టినతేదీ.. ఇలా ఏ మార్పు చేసుకున్నా ఆ చరిత్రను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రస్తుతానికి ఈ సౌకర్యానికి సంబంధించి బీటా వర్షన్‌ను ప్రారంభించినట్లు యూఐడీఏఐ సీఈవో డాక్టర్ అజయ్ భూషణ్ వెల్లడించారు.

శరద్ యాదవ్ ఎంపీ జీతభత్యాలు పొందలేరు: సుప్రీం

దిల్లీ: రాజ్యసభ ఛైర్మన్ అనర్హుడిగా ప్రకటించిన జేడీయూ మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్ ఎంపీగా జీతభత్యాలు వంటివి పొందలేరని సుప్రీంకోర్టు గురువారం స్పష్టంచేసింది. ఈమేరకు దిల్లీ హైకోర్టు గతేడాది డిసెంబరులో ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం మార్పు చేసింది. తనను అనర్హుడిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ శరద్ యాదవ్ గతంలో వ్యాజ్యం దాఖలు చేయగా.. అది పూర్తికానంతవరకూ ఆయన జీతభత్యాలు, ఇతర సదుపాయాలు పొందవచ్చంటూ హైకోర్టు అప్పట్లో ఆదేశాలిచ్చింది. కాగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు శరద్‌యాదవ్ అధికారిక బంగ్లాలో ఉండటానికి (వ్యాజ్యం పూర్తయ్యేంత వరకు) మాత్రం జస్టిస్ ఏకే గోయల్, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం అనుమతించింది.

హిందూ మహాసముద్రంపై పరిశోధనలకు జట్టుకట్టిన భారత్, అమెరికా

వాషింగ్టన్: హిందూ మహాసముద్రానికి సంబంధించి.. వాతావరణ పరిస్థితులను మరింత క్షుణ్నంగా పరిశీలించేందుకుగాను భారత్, అమెరికా జట్టు కట్టాయి. ఇందులో భాగంగా మనదేశానికి చెందిన మహాసముద్రాలు-వాతావరణ శాస్త్రవేత్తలతో అమెరికా 'జాతీయ మహాసముద్ర, వాతావరణ యంత్రాంగం(ఎన్ఓఏఏ)'కు చెందిన 20 మంది శాస్త్రవేత్తలు గోవాలో వచ్చే వారం సమావేశం కానున్నారు. హిందూమహాసముద్రంలో పరిశోధనలకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోనున్నారు.

రాయితీ పంట రుణాలు నగదుగా ఇవ్వరు: ఆర్బీఐ

ముంబయి: వడ్డీ రాయితీపై మంజూరు చేసే స్వల్ప కాలిక పంట రుణాలను నగదుగా కాకుండా, వస్తువులు/సేవల కొనుగోలు నిమిత్తం బదిలీ చేయాలని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ఆదేశించింది. మంజూరయిన రుణాలను రైతులు సంబంధిత వస్తువుల కొనుగోలు/ సేవల వినియోగం నిమిత్తం బ్యాంకుల ద్వారా బదిలీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది. వడ్డీ సహాయ పథకం (ఇంట్రెస్ట్ సబ్‌వెన్షన్ స్కీం-ఐఎస్ఎస్) కింద రైతులకు 7 శాతం వడ్డీరేటుపై రూ.3 లక్షల వరకు పంట రుణం మంజూరవుతుంది. సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ రేటు 4 శాతమే ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్ల మేర పంట రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాయితీల మంజూరుకు అనుసరిస్తున్న ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్-డీబీటీ) విధానాన్నే దీనికీ అనుసరించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఐఎస్ఎస్ పోర్టల్/డీబీటీ ప్లాట్‌ఫారంను అభివృద్ధి చేయనుంది. లబ్ధిదారుల వివరాలను ఓసీ, ఎస్టీ, ఎస్టీ.. ఇతర వర్గాల వారీగా సమర్పించాలని బ్యాంకులను ఆదేశించింది.

ఎన్నికల్లో పోటీకి ముషారఫ్‌కు అనుమతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ నియంత జనరల్ పర్వేజ్ ముషారఫ్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి నామపత్రాలు దాఖలు చేయవచ్చంటూ గురువారం సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ నెల 13న లాహోర్ కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అరెస్టు చేయబోదని కూడా హామీ ఇచ్చింది. దేశద్రోహం నేరాలను ఎదుర్కొంటున్న ముషారఫ్ ఎన్నికల్లో పోటీ చేయకుండా గతంలో పెషావర్ హైకోర్టు జీవితకాల నిషేధం విధించింది. ప్రస్తుతం దుబాయిలో నివసిస్తుండడంతో కోర్టు ఆయనను పరారీలో ఉన్న నిందితునిగా ప్రకటించింది.



ఈనాడు

విజయవాడ 8-6-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 299 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

గురువారం నాగ్‌పూర్‌లో జరిగిన సంఘ్ శిక్షావర్గ్‌లో ప్రసంగిస్తున్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ. చిత్రంలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ తదితరులు

అసహనంతో అస్తిత్వానికి ముప్పు

- బహుళత్వమే భారత్ ఆత్మ
- ఒకే భాష... ఒకే మతం మన జాతీయ భావన కాదు
- శాంతి-సామరస్యాలను మాతృభూమి కోరుతోంది
- ప్రజల ఆనందమే రాజుకు ఆనందం
- హెడ్గేవార్ భరతమాత ముద్దుబిడ్డ
- ఆరెస్సెస్ శిక్షా వర్గ్ సభలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ఉద్ఘాటన

నాగ్‌పూర్: మతం, పిడివాదం, అసహనం వంటివాటి ద్వారా భారత్‌ను నిర్వచించడానికి జరిగే ఏ ప్రయత్నమైనా దేశ అస్తిత్వానికి ముప్పు తీసుకువస్తుందని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ హెచ్చరించారు. సార్వత్రిక వాదం, కలిసి జీవించడం, అందరినీ కలుపుకొనిపోవడమనేవి ప్రాతిపదికలుగా జాతీయతావాదం ఆవిర్భవించిందని చెప్పారు. ద్వేషం, అసహనం పెరిగితే భారతదేశ ఉనికిని పలుచన చేస్తుందని పేర్కొన్నారు. బహుళత్వం, సహనం భారత్‌కు ఆత్మ వంటివని చెప్పారు. గురువారం సాయంత్రం నాగ్‌పూర్‌లోని 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' (ఆరెస్సెస్) ప్రధాన కార్యాలయంలో 'శిక్షా వర్గ్'ను ఉద్దేశించి ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. శిక్షణ పూర్తి చేసుకున్న కార్యకర్తల కవాతును వీక్షించారు. అయిదు దశాబ్దాలుగా (మిగతా 2లో)

ఐదులోకి అడుగు!

విభజన ఉత్పాతం... హుద్‌హుద్ ఉపద్రవం.. బాలారిష్టాలను దాటుకుని.. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు పథకాలకు శ్రీకారం చుట్టారు. అమరావతి, పోలవరం, పట్టిసీమ.. ఇప్పుడీ ఎన్నికల ఏడాదిలో.. ఈ ప్రణాళికలు, పథకాలే అజెండాగా ప్రజల ముందుకు వెళ్లటం తథ్యం! అందుకే తెదేపా సర్కారు ఐదో ఏట అడుగుపెడుతున్న ఈ తరుణంలో కీలక పథకాలు, ప్రణాళికలేమిటి? వీటి విశిష్టతలేమిటన్న దానిపై లోతైన సమీక్ష..

6, 7 పేజీల్లో

అంకురించిన అభివృద్ధి

- 'సింగపూర్' పనులిక వేగవంతం
- కీలక ఒప్పందాలపై సంతకం
- ఇదో చరిత్రాత్మక దినం
- ఇక ప్రతి 3 నెలలకు పురోగతి
- సీఎం చంద్రబాబు వెల్లడి
- 6 నెలల్లో ఒక రూపు
- సింగపూర్ మంత్రి ఈశ్వరన్ వెల్లడి

ఒప్పందాలివీ..

- ★ అంకుర ప్రాంత అభివృద్ధికి సంబంధించి సింగపూర్ అమరావతి ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్స్ (ఎస్ఏఐహెచ్), అమరావతి అభివృద్ధి సంస్థల (ఏడీసీ) మధ్య భాగస్వాముల (షేర్ హోల్డర్స్) ఒప్పందం.
- ★ ఎస్ఏఐహెచ్, ఏడీసీ సంస్థల భాగస్వామ్యంతో ఏర్పడిన ఏడీపీతో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) రాయితీ, అభివృద్ధి ఒప్పందం.

ఈనాడు - అమరావతి

అమరావతి అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. అత్యంత కీలకమైన 1691 ఎకరాల అంకుర ప్రాంత అభివృద్ధి శ్రీకారం చుట్టుకుంది. న్యాయ, ఆర్థికపరమైన అడ్డంకులను దాటుకుని వచ్చిన ఈ ప్రాజెక్టు అత్యంత వేగంగా పూర్తయ్యేలా సింగపూర్ సంస్థలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం రెండు కీలక ఒప్పందాలు చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సింగపూర్ కమ్యూనికేషన్లు, సమాచారశాఖల మంత్రి ఎస్. ఈశ్వరన్ సమక్షంలో సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులు, సింగపూర్ సంస్థల డైరెక్టర్లు ఒప్పందాలపై సంతకాలు చేశారు. అనంతరం అంకుర ప్రాంతంలో ఉత్ప్రేరకాభివృద్ధిలో భాగంగా త్వరలోనే 'ఫేజ్ జీరో' ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు సింగపూర్ సంస్థలు ప్రకటించాయి. సింగపూర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం కోసం ఏర్పాటైన సంయుక్త కార్యాచరణ అమలు కమిటీ (జేఐఎస్‌సీ) మూడో సమావేశం విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో గురువారం జరిగింది. మొదట చంద్రబాబు, ఈశ్వరన్ మధ్య ముఖాముఖి చర్చలు, అనంతరం జేఐఎస్‌సీ సమావేశం జరిగాయి. సమావేశంలో సింగపూర్, విజయవాడ మధ్య నేరుగా విమాన సర్వీసులు, ఏటా 10వేల మందికి శిక్షణనిచ్చేలా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు, వచ్చే నెలలో సింగపూర్‌లో జరిగే వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యం వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఒప్పందాలు జరిగాయి. ఆ తర్వాత చంద్రబాబు, ఈశ్వరన్ విలేకరులతో మాట్లాడారు. అంకుర ప్రాంత అభివృద్ధికి ఈ రోజు నుంచి లెక్కింపు (జీరో డేట్ ఆఫ్ కనస్ట్రక్షన్) మొదలైందని చంద్రబాబు ప్రకటించారు. రాజధానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఆర్థిక (మిగతా 2లో)

ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ మంత్రి ఈశ్వరన్ సమక్షంలో.. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సింగపూర్ అమరావతి ఇన్వెస్టిమెంట్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల మధ్య జరిగిన షేర్ హోల్డర్స్ ఒప్పందానికి సంబంధించి పత్రాలను చూపుతున్న ఏపీ, సింగపూర్ ప్రతినిధులు లక్ష్మీపార్థసారథి, వినమ్ర శ్రీవాస్తవ్, కెల్విన్ టియో

"ఇదో చరిత్రాత్మక దినం. అన్ని ప్రక్రియలనూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాం. స్టార్టప్ ప్రాంత అభివృద్ధికి ఒప్పందాల ప్రక్రియలన్నీ పూర్తి చేసి ఇప్పుడు కార్యాచరణలోకి దిగుతున్నాం. ఇకపై కచ్చితమైన లక్ష్యాలు నిర్దేశించుకుని సకాలంలో వాటిని పూర్తి చేస్తాం. ప్రతి 3 నెలలకు క్షేత్ర స్థాయిలో పురోగతి కనిపిస్తుంది."

- ముఖ్యమంత్రి చంద్రబాబు

"ఈ రోజు ముఖ్యమైన మైలురాయిని దాటాం. అంకుర ప్రాంత అభివృద్ధి ప్రణాళికల అమలుకు ఈ రోజు చేసుకున్న రెండు ఒప్పందాలు చాలా కీలకం. అన్నీ జాగ్రత్తగా చూసుకోవడంవల్ల కొంత సమయం పట్టింది. వెల్‌కం సెంటర్ (ఫేజ్ జీరో) నిర్మాణంతో ప్రాజెక్టు ప్రారంభిస్తాం. మరో 6 నెలల్లో చాలా పురోగతి కనిపిస్తుంది."

- సింగపూర్ మంత్రి ఈశ్వరన్

ఎకరం రూ.4 కోట్లు!

- అంకుర ప్రాంతంలో తొలి దశలో కనీస ధర ఇది
- అంతకంటే తక్కువకు విక్రయించ కూడదు
- 70 శాతం విక్రయించి, పెట్టుబడులు వచ్చాకే రెండో దశ అభివృద్ధి
- ఏడీపీకి సీఆర్‌డీఏ షరతులు

5లో

కేసుల భయంతో లాలూచీ

- అందుకే భాజపాకు దగ్గరైన వైకాపా
- దేవుడి సాక్షిగా మోదీ మోసం
- మదనపల్లె నవ నిర్మాణ దీక్షలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
- ముస్లింలకు ఇఫ్తార్ విందు

5లో

గ్రీన్‌కార్డుకు రెడ్ సిగ్నల్!

- అమెరికాలో భారతీయ వృత్తి నిపుణుల ఎదురుచూపులు
- శాశ్వత నివాస హోదా నిరీక్షణ జాబితాలో నాలుగింట మూడొంతుల మందికిపైగా మనోళ్లే
- 7% కోటా నిబంధనతో తీవ్ర ఇక్కట్లు

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో చట్టబద్ధ శాశ్వత నివాస హోదా- 'గ్రీన్‌కార్డు' కోసం నిరీక్షిస్తున్న వృత్తి నిపుణుల్లో నాలుగింట మూడొంతుల మందికి పైగా భారతీయులేనని వెల్లడైంది. ఉద్యోగ ఆధారిత ప్రాధాన్య విభాగం కింద గ్రీన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న విదేశీయుల మొత్తం సంఖ్య ఈ ఏడాది మే నాటికి 3,95,025గా ఉండగా..అందులో (మిగతా 2లో)

గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులతో

ఆంధ్రప్రదేశ్‌కు నష్టం

- ఏపీ జలవనరుల శాఖ సాంకేతిక సలహా కమిటీ వెల్లడి
- న్యాయపోరాట అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వానికి సూచన

ఈనాడు - హైదరాబాద్

గోదావరిపై తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు నష్టం వాటిల్లుతోందని ఏపీ జలవనరుల శాఖ సాంకేతిక సలహా కమిటీ పేర్కొంది. ఈ ప్రాజెక్టులపై న్యాయపోరాటం లేదా తెలంగాణతో చర్చించి ఓ అంగీకారానికి వచ్చే అవకాశాలను పరిశీలించాలని సూచించింది. గోదావరి బేసిన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వినియోగం, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టుల నీటి అవసరాలు, ఎగువన చేపట్టిన ప్రాజెక్టుల ప్రభావం తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ అంతర్‌రాష్ట్ర జలవనరుల విభాగం సాంకేతిక నిపుణులతో గురువారం సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, సలహాదారు బి.రోశయ్య, విశ్రాంత ఇంజినీర్ ఇన్ చీఫ్ రెహ్మాన్, విశ్రాంత చీఫ్ ఇంజినీర్లు కె.వి.సుబ్బారావు, వి.వి.ఎస్.రామ్మూర్తి, అంతర్‌రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను, కమిటీ సిఫార్సులను ప్రభుత్వానికి పంపారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నివేదిక ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరిలో ఇప్పటివరకు ఉన్న నీటి వినియోగం 659.691 టీఎంసీలు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 116.2 టీఎంసీలు, ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులకు 320 టీఎంసీల (మిగతా 2లో)

ఇదీ సంగతి!

డైరెక్టుగా ఇక్కడికే చేరారు.

వైకాపా ఎంపీల రాజీనామాలకు

నేడు ఆమోదం!

- విదేశాలకు వెళ్లే ముందు నిర్ణయం తీసుకోనున్న స్పీకరు
- ఉప ఎన్నికలకు అవకాశం ఉండకపోవచ్చని లోక్‌సభ సిబ్బంది అభిప్రాయం

ఈనాడు, దిల్లీ: వైకాపా ఎంపీల రాజీనామాలకు స్పీకరు సుమిత్రా మహాజన్ శుక్రవారం ఆమోద ముద్ర వేసే అవకాశముంది. ఆమె శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పార్లమెంటరీ బృందాన్ని తీసుకుని 10 రోజుల లాత్వియా, బెలారస్ పర్యటనకు వెళ్తున్నారు. ఈలోగా 12 గంటలకల్లా రాజీనామాలకు ఆమోద ముద్ర వేయొచ్చని భావిస్తున్నామని లోక్‌సభ సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఆమె సంతకం చేసిన నాటి నుంచే రాజీనామాల ఆమోదం అమల్లోకి వస్తుందని తెలిపారు. ఉప ఎన్నికలకు అవకాశం ఉండకపోవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఐదుగురు వైకాపా ఎంపీలు ఏప్రిల్ 6వ తేదీన రాజీనామాలు సమర్పించినప్పటికీ వాటి ఆమోదం స్పీకరు సంతకం పెట్టిన తేదీ నుంచి అమల్లోకి వస్తుందని వివరించారు. వాస్తవానికి 16వ లోక్‌సభ మే 18వ తేదీన ఏర్పడింది. దాని తొలి సమావేశం జూన్ 4న జరిగింది. వాస్తవానికి లోక్‌సభ ఏర్పడిన నాటి నుంచి లెక్కించి ఏడాదిలోపు సాధారణ ఎన్నికలు వచ్చే అవకాశముంటే ఉప (మిగతా 2లో)

చిత్ర పరిశ్రమలో ఏపీది ప్రముఖ పాత్ర

- వ్యాపార అనుకూల రాష్ట్రాల జాబితాలోనూ అగ్రగామి
- హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా వ్యాఖ్య
- విజయవాడలో తొలిసారిగా అమెరికా స్వాతంత్ర్య వేడుకలు

11లో



వేసవి ముగిసి నైరుతి తాకిన వేళ.. శేషాచలం కొండలు హరితశోభితంగా మారాయి. నాలుగు రోజులుగా సాయంత్ర సమయంలో వర్షాలు కురుస్తుండటంతో శేషాచల శిఖరాల సహజ సంపద పచ్చగా మారి ఆహ్లాదాన్ని పంచుతోంది. తిరునగరికి విచ్చేసే భక్తులను ఈ దృశ్యం ఎంతో కనువిందు చేస్తోంది.

– ఈనాడు తిరుపతి

గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులతో ఏపీకి నష్టం

(మొదటి పేజీ తరువాయి)

వరద నీరు అవసరం. వరద నీటితో సహా ఆంధ్రప్రదేశ్ అవసరాలు గోదావరిలో 1095.89 టీఎంసీలు. తెలంగాణలో ఉన్న వినియోగం 471.686 టీఎంసీలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 178.116 టీఎంసీలు. మరో 450.31 టీఎంసీల వినియోగంతో అనధికారికంగా ప్రాజెక్టులను నిర్మిస్తున్నట్లు పేర్కొని మొత్తం అవసరాలు 1100.11 టీఎంసీలుగా పేర్కొంది. పునర్విభజన తర్వాత 450 టీఎంసీల వినియోగంతో తెలంగాణ ప్రాజెక్టులను చేపట్టిందని కమిటీ పేర్కొంది. కొత్త ప్రాజెక్టులు చేపట్టినపుడు అపెక్స్ కౌన్సిల్ లేదా నదీ యాజమాన్య బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉందని, అలాంటిదేమీ లేదని పేర్కొంది. కాళేశ్వరం ఎత్తిపోతల కూడా అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా నిర్మిస్తున్నదేనని, దీని వల్ల దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ఎత్తిపోతలను 33 టీఎంసీలతో చేపట్టిందని.. దీనికి కేంద్ర జలసంఘం ఆమోదించలేదని, రాష్ట్ర పునర్విభజన తర్వాత వీటి స్థానంలో 70 టీఎంసీలతో సీతారామ ఎత్తిపోతల మొదటి దశను తెలంగాణ చేపట్టిందని తెలిపింది. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ ప్రాజెక్టు వల్ల ఎక్కువ నష్టం వాటిల్లుతుందని అభిప్రాయపడింది. కేంద్ర జలసంఘం అనుమతి రాకపోయినా రూ.2000 కోట్లకుపైగా వెచ్చించిందని పేర్కొంది. ప్రాజెక్టు నిర్మాణ స్థలం వరకు నీటిని తెలంగాణ వినియోగించుకోవచ్చని, తప్పనిసరిగా దిగువకు విడుదల చేసే వ్యవస్థ ఏమీ లేదని వివరించింది. దిగువన ఉన్న సబ్‌బేసిన్ల నుంచి ఆంధ్రప్రదేశ్ అవసరాలు తీరతాయని వారి ప్రాజెక్టు నివేదికలో పేర్కొనడం సరైనది కాదని తెలిపింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ముందుకెళ్లకుండా న్యాయపోరాటం చేయాలని కమిటీ సూచించింది. వంద టీఎంసీల నీటిని మళ్లించే వీలున్న తుపాకులగూడెం ప్రాజెక్టుపై కూడా ఇదే సూచన చేసింది. గోదావరి జలాలకు సంబంధించి తెలంగాణతో సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోడానికి ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలని సూచించింది. ఇందిరాసాగర్ ఎత్తిపోతలను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసినందున పశ్చిమగోదావరి జిల్లాలో ఈ ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన ఆయకట్టు కోసం ప్రత్యేకంగా ఓ పథకాన్ని చేపట్టే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని పేర్కొంది. గోదావరిలో నీటి లభ్యతపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కమిటీ సూచించింది.

అసహనంతో అస్తిత్వానికి ముప్పు

సంఘ్ శిక్షావర్గ్‌లో ముచ్చటించుకుంటున్న ప్రణబ్ ముఖర్జీ, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో ఉంటూ, పలు సందర్భాల్లో సంఘ్‌ను విమర్శించిన ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకావడంపై సొంతపార్టీతో సహా వివిధ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేయడం, అది రాజకీయ రాద్ధాంతానికి దారి తీయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రణబ్ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి రేకెత్తింది. దేశం, జాతీయత గురించి హితబోధ చేసే రీతిలో ఆయన ప్రసంగం అరగంటపాటు కొనసాగింది.

కలిసి ఉండాలి... కోపతాపాలు వీడాలి...

'జాతి, జాతీయత, దేశభక్తి అనే ఆలోచనలపై నాకున్న అవగాహన గురించి మాట్లాడడానికి ఈ రోజు మీ ముందుకు వచ్చాను...' అంటూ ప్రణబ్ తన ప్రసంగం ప్రారంభించారు. 'హిందువులు, ముస్లింలు, సిక్కులు వంటి అనేక మతాలు, కులాలకు చెందినవారందరి కలయికే జాతీయతావాదం. ఎవరూ అంతరించిపోకుండా అందరూ కలిసి ఉండాలనేది దీనర్థం. ఘర్షణ, హింస, కోపతాపాల నుంచి దూరంగా జరగాలి... శాంతి, సామరస్యత, ఆనందాల దిశగా కదలాలి. మన మాతృభూమి అదే కోరుతోంది. భరతమాతకు అది ఇవ్వాలి కూడా. భారతదేశంలో సహనం నుంచే మనకు బలం లభిస్తుంది. బహుళత్వాన్ని మనం గౌరవిస్తాం. భిన్నత్వాన్ని పండుగలా చేసుకుంటాం. అన్నిరకాల భయాందోళన, హింసల నుంచి ప్రజలకు మనం విముక్తి కల్పించాలి' అని మాజీ రాష్ట్రపతి చెప్పారు. 'రాజ్యం ఏం చేసినా ప్రజలే దానికి కేంద్రం. వారిని విభజించడానికి ఎలాంటి చర్యలూ చేపట్టకూడదు. రాజ్యాంగం నుంచి మన జాతీయవాదం ఉద్భవించింది. భారతీయ జాతీయవాద నిర్మాణమంటే రాజ్యాంగపరమైన దేశభక్తి భావన. రోజూ మన చుట్టూ హింస ప్రజ్వరిల్లడాన్ని చూస్తునే ఉన్నాం. భయం,విశ్వాసరాహిత్యం, అంధకారం దీనికి కారణం. భౌతిక, వాక్కురూప హింసల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాల'న్నారు. జాతీయ వాదమంటే మతంతో, జాతితో ముడిపడిన అంశం కాదన్నారు.

మనల్ని కలుపుతున్నది భారతీయత

ఒకే జాతి- ఒకే సంస్కృతి అనే నినాదాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ప్రణబ్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. 'ఒకే భాష... ఒకే మతం... ఒకే శత్రువు అనేది భారత జాతీయ భావన కానే కాదు. 130 కోట్ల మంది ప్రజలు, 122 భాషలు, 1600 మాండలికాలు ఉన్న నిరంతర విశ్వజనీనత మనది. ఏడు ప్రధాన మతాలున్నా మనమంతా ఒకే వ్యవస్థ, ఒకే జెండా, భారతీయత అనే ఒకే అస్తిత్వం కింద కలిసి జీవిస్తున్నాం. మనలో మనకు శత్రువుల్లేరు. ఇదే మన దేశాన్ని విభిన్నమైనదిగా, ఐక్యజాతిగా నిలబెడుతోంది. వసుధైక కుటుంబమే మన భావన' అని చెప్పారు. జాతీయ ప్రాధాన్యమున్న అన్ని అంశాల్లో ప్రజల్ని భాగస్వాముల్ని చేయడం ప్రజాస్వామ్యంలో అవసరమని తెలిపారు.

చర్చలే ఏకాభిప్రాయానికి సోపానం

'భిన్న ప్రయోజనాలమధ్య సమతౌల్యానికే కాకుండా, ఏకాభిప్రాయ సాధనకూ చర్చలు అవసరం. ప్రజల్లో ఉన్న భిన్న భావనల్ని గుర్తించాలి. మనం ఏకీభవించినా, విభేదించినా అభిప్రాయాల్లో బహుళత్వాన్ని తిరస్కరించజాలం. క్లిష్టమైన సమస్యల్ని పరిష్కరించడం చర్చలతో సాధ్యమవుతుంది. అనారోగ్యకర ఘర్షణల్ని దీనిద్వారా నివారించవచ్చు' అని చెప్పారు. ప్రపంచంలో ఆర్థికంగా భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రణబ్ కొనియాడారు. అయినా ఒక జాతిగా భారతీయులు ఆనందంగా ఎందుకు లేరని ప్రశ్నించారు. ఆనంద సూచీలో 150 దేశాల్లో 133వ స్థానంలో భారత్ ఉందని గుర్తు చేశారు.

గురువారం నాగ్‌పుర్‌లో ఆరెస్సెస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ నివాసాన్ని సందర్శిస్తున్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ. చిత్రంలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్

అత్యాచారాలపై ఆవేదన

చిన్నారులు సయితం అత్యాచారాలకు గురవుతున్న తీరుపై ముఖర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలతో భారత్ ఆత్మ గాయపడుతోందన్నారు. హింసకు తావులేని సమాజమే ప్రజాస్వామ్య ప్రక్రియలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా చేయగలుగుతుందని చెప్పారు. భారతదేశాన్ని పాలించిన రాజవంశాలు, ముస్లిం దండయాత్రలు, బ్రిటిష్ సామ్రాజ్యం సహా మన దేశానికి ఉన్న వేల సంవత్సరాల చరిత్రను ఆయన ప్రస్తావించారు. జవహర్‌లాల్‌నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, బాల గంగాధర్ తిలక్ వంటివారు చేసిన కృషిని వివరించారు. వేర్వేరు రాజ్యాలను ఒక్క దేశం కిందికి తీసుకురావడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని కొనియాడారు. ఆయన ప్రసంగం అర్ధగంటపాటు కొనసాగింది.

హెడ్గేవార్ పుట్టినిల్లు సందర్శన

నాగ్‌పుర్‌లో ఆరెస్సెస్ వ్యవస్థాపక సర్‌సంఘచాలక్ కె.బి.హెడ్గేవార్ పుట్టినింటిని ప్రణబ్ సందర్శించారు. 'హెడ్గేవార్ భరతమాత ముద్దుబిడ్డ. ఆయనకు నివాళులర్పించడానికి ఈరోజు ఇక్కడికి వచ్చాను' అంటూ సందర్శకుల పుస్తకంలో ఆయన రాశారు. తొలుత ఆయనకు మోహన్ భగవత్ స్వాగతం పలికారు. ఇరుకు సందుల్లో నడుచుకుంటూ హెడ్గేవార్ నివాసానికి ఆయన చేరుకున్నారు. చెప్పులు బయట విడిచిపెట్టి లోపలకు వెళ్లారు. నిజానికి ఇది ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమం కాదు. అప్పటికప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయం.

ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎవరూ పరాయివారు కాదు

- ఈ కార్యక్రమం తర్వాతా ప్రణబ్.. ప్రణబ్‌లానే ఉంటారు
- అందర్నీ ఏకతాటిపైకి తీసుకురావడానికి మా సంస్థ ప్రయత్నం
- మోహన్ భగవత్ స్పష్టీకరణ

నాగ్‌పుర్: ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎవరూ బయటివారు కాదని, ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమానికి ప్రణబ్ ముఖర్జీని ఆహ్వానించడంపై చర్చ అర్థం లేనిదని ఆ సంస్థ అధిపతి మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ప్రణబ్ ముఖర్జీ ప్రసంగానికి ముందు భగవత్ మాట్లాడారు. ఈ కార్యక్రమం తర్వాత కూడా ప్రణబ్.. ప్రణబ్‌లాగానే, ఆర్‌ఎస్‌ఎస్.. ఆర్‌ఎస్‌ఎస్‌లాగానే ఉంటుందని భగవత్ చెప్పారు. ప్రజలకు భిన్నాభిప్రాయాలు ఉండవచ్చని, కానీ వారంతా భరతమాత బిడ్డలని చెప్పారు. ప్రతి ఏడాదీ సంఘ్.. ప్రముఖ వ్యక్తులను ఆహ్వానిస్తోందని గుర్తు చేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు ప్రణబ్ ముఖర్జీకి ధన్యవాదాలు తెలిపారు. "ఆయన మేధావి. ఆయనను అందుకే ఆహ్వానించాం. ప్రముఖులను ఆహ్వానించే సంప్రదాయం మాకుంది." అని చెప్పారు.

ఆర్‌ఎస్‌ఎస్..హిందూ సంస్థ అన్న ముద్ర వేయడాన్ని మోహన్‌భగవత్ ఖండించారు. తమ సంస్థ మొత్తం దేశానికి అంకితమయిందన్నారు. "భిన్నత్వంలో ఏకత్వమే.. భారత్ మౌలిక గుర్తింపు. దేశంలోని ప్రతి ఒక్కరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తోంది. హిందూ సంస్థ అని నిరూపించుకోవడానికి ప్రయత్నించడం లేదు. మా సంస్థకు ఎవరూ పరాయివారు కాదు." అని చెప్పారు. ప్రతి ఒక్కరికీ రాజకీయ అభిప్రాయం ఉంటుందని, కానీ ఆ అభిప్రాయాన్ని వ్యతిరేకించడానికి పరిమితి ఉంటుందని అన్నారు. "భారత్‌లో పుట్టిన ప్రతి ఒక్కరూ ఈ దేశ పౌరులే. దేశాభివృద్ధి కోసం పని చేయడానికి వారంతా కర్తవ్యోన్ముఖులై ఉన్నారు." అని చెప్పారు. ప్రజలు దేశ నిర్మాణంలో పాలుపంచుకోవాలని మోహన్‌భగవత్ పిలుపునిచ్చారు. "ప్రభుత్వమొక్కటే దేశ భవితను మార్చలేదు. సమాజం మొత్తం దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలి. అప్పుడే ప్రభుత్వం తన బాధ్యతలను నిర్వర్తించగలదు." అని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ పేరు ప్రఖ్యాతల కోసం పని చేయడం లేదని, దేశాన్ని ప్రగతి పథంలో పయనింప చేయాలనుకుంటోందని అన్నారు.

ఆరెస్సెస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ స్మారకం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రణబ్ ముఖర్జీ, మోహన్ భగవత్

గ్రీన్‌కార్డుకు రెడ్ సిగ్నల్!

(మొదటి పేజీ తరువాయి)

భారతీయులే 3,06,601 మంది ఉన్నారు. అమెరికా పౌరసత్వం, వలస సేవల సంస్థ(యూఎస్‌సీఐఎస్) ఈ మేరకు తాజా గణాంకాలను విడుదల చేసింది. గ్రీన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్న విదేశీయుల జాబితాలో రెండో స్థానంలో చైనీయులు ఉన్నారు. అయితే, వారి సంఖ్య మనవాళ్లతో పోలిస్తే చాలా తక్కువ. ప్రస్తుతం 67,031 మంది చైనీయులు అమెరికా శాశ్వత నివాస హోదా కోసం ప్రతీక్షిస్తున్నారు. ఈ జాబితాలో ఇతర ఏ ఒక్క దేశ పౌరుల సంఖ్య కూడా 10 వేలను దాటలేదు. చైనా తర్వాతి స్థానాల్లో ఎల్ సాల్వడార్(7,252), గ్వాటెమాలా(6,027), హోండురస్(5,402), ఫిలిప్పీన్స్(1,491), మెక్సికో(700), వియత్నాం(521) ఉన్నాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే దేశానికి చెందిన పౌరులకు ఇచ్చే గ్రీన్‌కార్డుల సంఖ్య.. మొత్తంగా ఆ ఏడాది జారీచేసే గ్రీన్‌కార్డుల సంఖ్యలో ఏడు శాతానికి మించకూడదని అమెరికా చట్టాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో భారతీయులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కోటా నిబంధన కొనసాగితే.. గ్రీన్‌కార్డు పొందాలంటే మనదేశ వృత్తి నిపుణులు 25-92 ఏళ్లపాటు వేచి చూడాల్సి ఉంటుందని ఓ నివేదిక అంచనా వేసింది.

వైకాపా ఎంపీల రాజీనామాలకు నేడు ఆమోదం!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉండదని లోక్‌సభ సచివాలయ సిబ్బంది అభిప్రాయపడ్డారు. కానీ మరికొందరు లోక్‌సభ తొలి సమావేశం తేదీ నుంచి ఏడాదిలోపు ఉండాలని చెప్పడంవల్లే ఆమె తన నిర్ణయాన్ని జూన్ 4 తర్వాతకు వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఈ ఏడాది కాలానికి ఎవరు ఎలాంటి నిర్వచనం ఇచ్చుకున్నా ఉప ఎన్నికలకు అవకాశం ఉండదన్న ఉద్దేశంతోనే స్పీకరు జూన్ 4వ తేదీ తర్వాత రాజీనామాలకు ఆమోద ముద్ర వేయాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు కనిపిస్తోందని లోక్‌సభ సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. స్పీకరు రాజీనామాలకు ఆమోద ముద్ర వేసిన వెంటనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి, ఐదు స్థానాలు ఖాళీ అయినట్లు ఎన్నికల సంఘానికి వర్తమానం పంపుతారు. ఇప్పటికే కర్ణాటకకు చెందిన యడ్యూరప్ప, శ్రీరాములు చేసిన రాజీనామాలను మే 18న, సీఎస్ పుట్టరాజు రాజీనామాను మే 21న స్పీకరు ఆమోదించారు. 16వ లోక్‌సభ మే 18న ఏర్పడినందున ఇక మిగిలిన కాలం ఏడాదిలోపే ఉన్నందున ఈ స్థానాలకూ ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని లోక్‌సభ సచివాలయ సిబ్బంది అభిప్రాయపడ్డారు. రాజీనామా లేఖలు ఏ ఫార్మాట్‌లో ఇచ్చినా వాటిపై నిర్ణయం తీసుకునే సర్వాధికారం స్పీకరుకు ఉందని, కచ్చితంగా స్పీకరు ఫార్మాట్‌లోనే ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆ లేఖలు ఇచ్చిన సభ్యులు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు అనుగుణంగా సభాపతి నిర్ణయాలు ఉంటాయన్నారు.

రాష్ట్రపతి పర్యటనలో నాటు బాంబుల కలకలం!

అగర్తలా: రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ పర్యటనలో నాటు బాంబులు కలకలం సృష్టించాయి! ఓ క్షౌరశాలలో వార్తాపత్రికలో చుట్టి పెట్టిన మూడు బాంబులను పోలీసులు నిర్వీర్యం చేయడంతో... అంతా ఊపిరి పీల్చుకున్నారు. శాంతి భద్రతల ఐజీ స్మృతిరంజన్ దాస్ ఈ వివరాలను వెల్లడించారు. రెండు రోజుల త్రిపుర పర్యటనలో ఉన్న రాష్ట్రపతి- గురువారం గోమతి జిల్లా ఉదయ్‌పూర్‌లో జాతీయ రహదారిని ప్రారంభించారు. ఆయనను తీసుకెళ్లేందుకు అదే జిల్లా చందాపూర్‌లో హెలీపాడ్‌ను ఏర్పాటుచేశారు. పరిసర ప్రాంతాల్లో పోలీసులు సోదాలు చేపట్టగా... అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలోని ఓ క్షౌరశాలలో 3 నాటు బాంబులు వెలుగుచూశాయి. పోలీసులు వాటిని నిర్వీర్యం చేశారు. యజమానిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు ఐజీ తెలిపారు. కాగా, కార్యక్రమం అనంతరం రాష్ట్రపతి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లిపోయారు.

S.I. కానిస్టేబుల్
వెంకటరెడ్డి - అర్థమెటిక్ ఫేం, ఇసాక్ - రీజనింగ్, G.S - HIP Team చే బోధన
FREE DEMO కొత్తబ్యాచ్ 11-06-18 నుండి ప్రారంభం
HIP హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్
దిల్‌సుఖ్‌నగర్, Hyd. ☎ 9848262600, 9849771902

2017 - SI సెలక్షన్స్‌లో స్టేట్ 1st ర్యాంకు సాధించిన సంస్థచే
RPF-SI, కానిస్టేబుల్స్ SI & కానిస్టేబుల్స్
17వ బ్యాచ్: 9-6-18, 9am
జిమ్ & హాస్టల్ కలదు
శ్యామ్ ఇన్‌స్టిట్యూట్
విద్యుత్‌నగర్, కాకినాడ, తూ.గో.జిల్లా. 0884 - 2362744 98482 56254 98481 36254

IBPS RRB CWE-VII Officers and Office Assts. Notification Released
Qlf: Any Degree Age: 18-28 years
Last Dt: 2-7-18 PRELIMS in Aug-18 MAINS in Oct-18
Batches on 11-6-18 (6.30 am - 9.30 am)
Sreedhar's CCE COLLEGE FOR COMPETITIVE EXAMS
Suryaraopet, VIJAYAWADA-2.
Ph 2438383, 9392668899
www.sreedharscce.com

అంకురించిన అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

కార్యకలాపాలు వేగం పుంజుకునేందుకు ఉత్ప్రేరకాభివృద్ధి ఒక ప్రధాన మాధ్యమం. మౌలిక వసతులు, పర్యాటకం, విద్య, సేవారంగాల్లో సమీకృతాభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం సహకారం కావాలి' అని కోరారు. ఏపీకి సింగపూర్ వంటి రాజధాని నిర్మిస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పానని, అధికారంలోకి వచ్చిన వెంటనే సింగపూర్ వెళ్లి రాజధాని నిర్మాణానికి సహకరించాల్సిందిగా కోరానని తెలిపారు.

పారిశ్రామికాభివృద్ధిపైనా దృష్టి: ఈశ్వరన్

'ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ, ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధిపైనా మేం దృష్టి పెడుతున్నాం. ఆహారం, వ్యవసాయం, రవాణా, పట్టణ ప్రణాళికా రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందించేందుకు సింగపూర్‌లో ప్రత్యేకంగా అమరావతి పార్టనర్‌షిప్ కార్యాలయం (ఏపీవో) ఏర్పాటు చేశాం. ఆంధ్రప్రదేశ్‌కు కంపెనీలను తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నాం. జులైలో సింగపూర్‌లో వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో చంద్రబాబు పాల్గొంటారు. అమరావతి గురించి వివిధ దేశాలకు వివరించేందుకు అదో మంచి అవకాశం' అని ఈశ్వరన్ పేర్కొన్నారు.

సింగపూర్‌కు నెల రోజుల్లో విమానం..

'జులై 8న సింగపూర్ నుంచి వచ్చిన విమానం గన్నవరం విమానాశ్రయంలో దిగాలి. దీనికి అవసరమైన అన్ని ప్రక్రియలూ పూర్తి చేయండి' అని జేఐఎస్‌సీ సమావేశంలో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మౌలిక వసతులపరంగా అంతా సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం ఎదురు చూస్తున్నామని గన్నవరం విమానాశ్రయం డైరెక్టరు మధుసూదనరావు తెలిపారు.

10 వేల మందికి శిక్షణనిచ్చేందుకు 'మెష్'

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ), సింగపూర్‌కు చెందిన స్కిల్స్ ఎస్‌జీ వెంచర్స్ కన్సార్షియం సంయుక్త భాగస్వామ్యంలో మల్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్కిల్స్ హబ్ (మెష్) ఏర్పాటవుతుంది. నెల రోజుల్లోనే కార్యాచరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొదట లక్ష చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంలో దీన్ని ప్రారంభిస్తారు. రెండో దశలో 5 లక్షల చదరపు అడుగులకు విస్తరిస్తారు. ఏటా 10వేల మందికి శిక్షణనివ్వడం దీని లక్ష్యం. జేఐఎస్‌సీ భేటీ ముగిసిన వెంటనే సింగపూర్ ప్రతినిధులతో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఎండీ, సీఈవో కోగంటి సాంబశివరావు సమావేశమై చర్చలు జరిపారు. భవిష్యత్తు కార్యాచరణపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

జులై 8న సింగపూర్‌కు చంద్రబాబు

సింగపూర్‌లో జులై 8 నుంచి 10 వరకూ జరిగే వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా చంద్రబాబును ఈశ్వరన్ ఆహ్వానించారు. దీనికి ఆయన అంగీకారం తెలిపారు. జులై 8న జరిగే మేయర్స్ ఫోరంలోనూ, 9న ప్రారంభ ప్లీనరీ సెషన్‌లోనూ సీఎం ప్రసంగిస్తారు. జులై 10న సీఆర్‌డీఏ కమిషనరు ఈ సదస్సులో పాల్గొని అమరావతి గురించి వివరిస్తారు. అమరావతి ప్రణాళిక, అభివృద్ధిని ప్రదర్శించేందుకు ఒక పెవిలియన్‌ను కేటాయిస్తారు.

రాజధాని నిర్మాణంపై సింగపూర్ ఆర్కిటెక్చర్ విద్యార్థులు చిత్రాలతో రూపొందించిన జ్ఞాపికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తున్న సింగపూర్ మంత్రి ఈశ్వరన్

సంతకాలు చేసింది వీరే..

భాగస్వాముల ఒప్పందంపై ఏడీసీ తరపున సీఎండీ లక్ష్మీ పార్థసారథి, ఎస్‌ఏఐహెచ్ డైరెక్టర్ వినమ్ర శ్రీవాస్తవ సంతకాలు చేశారు. కాడాపై సీఆర్‌డీఏ తరపున కమిషనరు శ్రీధర్, ఏడీపీ తరపున డైరెక్టర్ టియో బాన్ సెంగ్ (కెల్విన్ టియో) సంతకాలు చేశారు.

ముఖ్యమంత్రికి 'రాజధాని స్కెచ్'ల బహూకరణ

ఈశ్వరన్‌కు చంద్రబాబు గౌతమ బుద్ధుడు ధ్యాన ముద్రలో ఉన్న బొమ్మను బహుమతిగా అందజేశారు. రాజధాని ప్రాంతంలోని ప్రజల జీవన విధానంపై సింగపూర్‌కు చెందిన నిపుణులు వేసిన స్కెచ్‌లతో రూపొందించిన చిత్రపటాన్ని చంద్రబాబుకు ఈశ్వరన్ అందజేశారు.

జేఐఎస్‌సీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్చలకు వచ్చిన మరిన్ని ముఖ్యాంశాలు..

- అంకుర ప్రాంతంలో ఫేజ్ జీరో ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేయనున్న వెల్‌కం గ్యాలరీ, సందర్శకుల కేంద్రం, ప్రదర్శన కేంద్రాలకు సంబంధించి ఊహాత్మక చిత్రాలను ఏడీపీ ప్రదర్శించింది. వచ్చే ఏడాది ఆరంభం నాటికి వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఏడీపీకి ఈశ్వరన్ సూచించారు.
- మాధ్యమిక, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల్ని 'స్టూడెంట్ ఎక్స్ఛేంజ్' కార్యక్రమం కింద సింగపూర్ పంపుతామని ముఖ్యమంత్రి ప్రతిపాదించగా ఈశ్వరన్ అంగీకారం తెలిపారు.
- ఆంధ్రప్రదేశ్‌లో 'కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ సిటీ' ఏర్పాటు చేస్తున్నామని, సింగపూర్ సంస్థలు ముందుకొస్తే ప్రాజెక్టు వేగవంతమవుతుందని సీఎం పేర్కొన్నారు.
- అమరావతిలో హరిత భవనాల ఆవశ్యకతపై సింగపూర్‌కు చెందిన బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ అథారిటీ ప్రజెంటేషన్ ఇచ్చింది. 2030 నాటికి సింగపూర్‌లోని 80 శాతం భవనాల్ని హరిత ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపింది.
- ఏపీ- సింగపూర్ బిజినెస్ కౌన్సిల్ ఏర్పాటుపై చర్చ జరిగింది. సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్), సీఐఐ కలిసి దీన్ని ఏర్పాటు చేస్తాయి.
- అమరావతిలో వినూత్నమైన పట్టణ నిర్వహణ విధానాల్ని అమలు చేసేందుకు ఇన్నోవేషన్ కారిడార్ ఏర్పాటు చేస్తారు.
- ఆంధ్రప్రదేశ్, సింగపూర్ మధ్య విస్తృత సహకారానికి అవకాశమున్న నాలుగు రంగాలను ఏపీవో, ఏపీఈడీబీ గుర్తించాయి. అవి. 1. నిర్మాణ, అర్బన్ సొల్యూషన్ రంగాలు. 2. రవాణా, అనుసంధానత 3. వ్యవసాయ, ఆహార శుద్ధి 4. పర్యాటకం. వీటిపై జేఐఎస్‌సీ సమావేశంలో చర్చ జరిగింది.

గ్రహం అనుగ్రహం

8–6–2018 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
నవమి: ఉ. 8-25 తదుపరి దశమి
ఉత్తరాభాద్ర నక్షత్రం: రా. 7-01 తదుపరి రేవతి
అమృత ఘడియలు: మ. 2-00 నుంచి 3-40 వరకు
వర్జ్యం: ఉ.శే. 5-40 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-04 నుంచి 8-56 వరకు
తిరిగి మ. 12-25 నుంచి 1-17 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-29

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కరీంనగర్	41.0	23.0
నెల్లూరు	39.0	29.0
కడప	39.0	27.0
తిరుపతి	38.8	27.0
శ్రీకాకుళం	38.0	29.0
విశాఖపట్నం	37.8	25.4
రామగుండం	37.6	27.7
ఒంగోలు	37.5	28.6
అనంతపురం	36.2	25.4
రాజమహేంద్రవరం	36.0	26.0
కర్నూలు	35.6	24.7
నల్గొండ	35.5	25.6
ఖమ్మం	35.0	32.0
హన్మకొండ	35.0	24.5
విజయవాడ	34.6	24.5
గుంటూరు	34.0	26.0
నరసాపురం	33.9	26.0
హైదరాబాద్	33.4	23.4
మహబూబ్‌నగర్	31.9	23.6
తాడేపల్లిగూడెం	30.0	26.0

ప్రజాసంకల్పయాత్రలో వైకాపా అధినేత జగన్

ప్రజా సంకల్ప యాత్రలో తేనెటీగల కలకలం

- పది మందికి గాయాలు
- శుక్రవారం విరామమిచ్చిన జగన్

పెరవలి గ్రామీణ, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజా సంకల్ప యాత్ర గురువారం నిడదవోలు నియోజకవర్గం పరిధిలో సాగింది. ఉదయం పెరవలి మండలం నడిపల్లికోట నుంచి కానూరు వరకు 2.7 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. కానూరు కొండాలమ్మ గుడి వద్దకు వచ్చేసరికి తేనెటీగలు దాడి చేశాయి. అప్రమత్తమైన పోలీసులు, అభిమానులు జగన్ చుట్టూ ఉండి, తేనెటీగలు రాకుండా కండువాలు తిప్పుతూ ముందుకు సాగారు. తేనెటీగల దాడిలో 10 మంది వరకు గాయపడగా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం జగన్ కోర్టుకు హాజరు కావల్సిన నేపథ్యంలో కానూరు వద్ద పాదయాత్ర ముగించారు. అనంతరం కాన్వాయిలో బయలుదేరి హైదరాబాద్ వెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఉప ఎన్నికలు వస్తే ఓడిపోతామనే నాటకాలు

అందుకే ధ్రువీకరణ లేఖలు అంటూ సాగదీత: యనమల

ఈనాడు డిజిటల్, అమరావతి: రాజీనామాలు ఆమోదం పొందడం వల్ల ఉప ఎన్నికలు వస్తే ఓడిపోతామనే భయంతోనే వైకాపా నేతలు రాజీడ్రామాలు ఆడుతున్నారని రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల కంటే ముందు ఓటమి ఎదురైతే ఆ పార్టీ కార్యకర్తలు నైరాశ్యంలో కూరుకుపోతారనే ఆందోళన వారిని పట్టిపీడిస్తున్నట్లు తెలిపారు. స్పీకర్ ఫార్మాట్‌లోనే రాజీనామా లేఖలు ఇచ్చామని ఆ పార్టీ ఎంపీలు గతంలోనే స్పష్టం చేసినా మళ్లీ ధ్రువీకరణపత్రాలు ఇవ్వాలని స్పీకర్ కోరడం జాప్యంలో భాగమేనని గురువారమిక్కడ యనమల ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. రాజీనామాలు స్వచ్ఛందంగా చిత్తశుద్ధితో ఇచ్చారని, వ్యక్తిగతంగా స్పీకర్ పరిశీలించాక ఆమోదించడంలో తాత్సారం ఎందుకని ప్రశ్నించారు. ధ్రువీకరణపత్రాలు ఇవ్వాలని స్పీకర్ కోరడం పార్లమెంటరీ విధానానికి విరుద్ధమన్నారు. భాజపా, వైకాపా ఉమ్మడి కుట్రలో భాగంగానే ఈ నాటకాలు ఆడుతున్నట్లు ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి పార్లమెంటు సరైన వేదికని, రాజీనామాలతో ఆ అవకాశాన్ని కోల్పోవడానికి తెదేపా సిద్ధంగా లేదని యనమల రామకృష్ణుడు స్పష్టంచేశారు.

జిల్లా పర్యటనలకు భాజపా నేతలు

ఈనాడు, అమరావతి: భాజపా నేతలు జిల్లాల్లో పర్యటించబోతున్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కృషిని వివరిస్తూ తెదేపా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా ఈ పర్యటనలు కొనసాగుతాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 10న విజయవాడలో జరిగే సమావేశంలో పర్యటనల తేదీలను ఖరారు చేయనున్నారు. సమావేశంలో రాష్ట్ర ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, జిల్లాల అధ్యక్షులు, బాధ్యులు పాల్గొనబోతున్నారు. పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ నేతృత్వంలో నేతలు ఒక్కో జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించే అవకాశాలు ఉన్నాయి. ఒకరోజు సభల్లో పాల్గొంటూ మరుసటిరోజు కార్యకర్తలతో నేరుగా సమావేశమయ్యేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. మరోవైపు ఈ నెల 11న పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా కార్యక్రమం జరగనుంది. భాజపా కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొంటూ ధర్నా నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

సమ్మెకు దిగితే ఆర్టీసీ మూతే: కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: తీవ్ర నష్టాలతో తెలంగాణ ఆర్టీసీ తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో మరో రూ.1400 కోట్ల భారం సంస్థపై పడేలా కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసు ఇవ్వడం అసమంజసం, అసంబద్ధం, బాధ్యతారాహిత్యానికి నిదర్శమని సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని హితవు చెప్పారు. సమ్మె ఆలోచనే ఆత్మహత్యా సదృశ్యమని, అదే జరిగితే ఆర్టీసీ చరిత్రలో ఇదే చివరి సమ్మెగా మిగిలిపోతుందని, సంస్థ మూసివేయాల్సి వస్తుందన్నారు. సమ్మెలో పాల్గొంటే కార్మికులను తక్షణమే ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఉద్యోగాలు పోగొట్టుకున్న వారు సమ్మెకుదిగోచ్చని స్పష్టం చేశారు.

శ్రీవారికి తలనీలాల ద్వారా రూ.10.48 కోట్ల ఆదాయం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించుకున్న తలనీలాల వేలం ద్వారా తితిదేకు రూ.10.48 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రతినెలా మొదటి గురువారం తలనీలాలను తితిదే ఈ- వేలం ద్వారా విక్రయిస్తుంది. తాజాగా అమ్మకానికి పెట్టగా 8,200 కిలోలు అమ్ముడయ్యాయి. ఇంకా వేలాది కిలోల తలనీలాలు మిగిలాయి. వచ్చేనెల మొదటి గురువారం మళ్లీ వేలం వేయనున్నారు.

తిరుపతిలో పునుగు పిల్లుల పెంపక కేంద్రం

తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు అనుబంధంగా పునుగు పిల్లుల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తితిదే సంకల్పించింది. ఈ మేరకు రూ.2.12 కోట్లు కేటాయించింది. పునుగు పిల్లుల నుంచి తీసిన తైలంతో తిరుమల స్వామివారి మూలవిరాట్టును అభిషేకం చేస్తారు.

ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తే యుద్ధమే!

- ఎమ్మెల్యే అక్రమ మైనింగ్‌తో రూ.9 కోట్లకు గండి
- లోకేశ్ ఒక జీతాన్ని వదిలేయలేరా?
- బాక్సైట్‌పై పోరు: పవన్‌కల్యాణ్

పాడేరు - న్యూస్‌టుడే

పాడేరు సభలో బాణం ఎక్కుపెడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిర్లక్ష్య వైఖరి చూపుతోందని, ఇలా అయితే ప్రాంతీయతత్వం బలపడి 'కళింగ యుద్ధం' వస్తుందనే భయాందోళన కలుగుతోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రజా పోరాట యాత్రలో భాగంగా గురువారం ఆయన విశాఖ జిల్లాలో పర్యటించారు. పాడేరు, మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల్లో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. తొలుత హుకుంపేట మండలం గూడలో రాళ్ల క్వారీ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పాడేరు సభలో ప్రసంగించారు. మత్స్యకారుల విషయంలో తన అభిప్రాయాన్ని తెదేపా నాయకులు వక్రీకరించారని, మత్స్యకారుల జనాభా వివరాలు సేకరించాలని మాత్రమే తాను అన్నట్లు పవన్ చెప్పారు. గూడలో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.9 కోట్లకు గండి పడిందని ఆరోపించారు. వైకాపా నుంచి తెదేపాలోకి వచ్చిన ఎమ్మెల్యే ఇదంతా చేస్తున్నారని స్థానికులు చెప్పారని ఆయన వెల్లడించారు. బాక్సైట్ వ్యతిరేక పోరాటానికి జనసేన ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రకటించారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని వారికి అనువైన ప్రాంతంలోనే ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. సీఎం కుమారుడు.. ఓవైపు హెరిటేజ్ సంస్థ ద్వారా, మరో వైపు మంత్రి హోదాలో రెండు జీతాలు పొందుతున్నారని పవన్ వ్యాఖ్యానించారు. మంత్రి పదవి ద్వారా వస్తున్న జీతాన్ని వదిలేయలేరా అని ప్రశ్నించారు. ఐటీ మంత్రిత్వ శాఖలో జరుగుతున్న అవినీతి బాగోతం అంతా తనకు తెలుసునని, విశాఖ నడిబొడ్డులోనే ఆ గుట్టు విప్పుతానని పేర్కొన్నారు. సీఎం చేస్తున్న ఒక్కొక్క దీక్షకు రూ.కోటి ప్రజాధనం వృథా అవుతోందని, ఆ సొమ్మును పాడేరు ప్రాంతీయ ఆసుపత్రికి మళ్లించగలిగితే ఉపయోగం ఉంటుందన్నారు. సీఎం దత్తత గ్రామమైన అరకులోయలోనే ఎన్టీఆర్ సుజల పథకం పనిచేయకపోడం సిగ్గుచేటని విమర్శించారు. నేను పర్యటించిన గ్రామాల్లో అసలు రోడ్డేలేక ప్రజలు అవస్థలు పడుతున్నారని పవన్ తెలిపారు.

వెళ్లిపోయిన వారంతా తిరిగి రండి

- ఏపీసీసీ బాధ్యుడు ఊమెన్ చాందీ పిలుపు
- రాహుల్‌గాంధీతో రఘువీరా భేటీ
- నేడు ప్రభుత్వంపై ఛార్జిషీటు విడుదల

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో పార్టీని వీడిన వారంతా తిరిగి రావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ పిలుపునిచ్చారు. గురువారమిక్కడ ఏఐసీసీలో పార్టీ సీనియర్ నాయకుడు మోతీలాల్ ఓరా సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఇందులో పీసీసీ అధ్యక్షుడు రఘువీరా సహా పలువురు ఏపీ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. అనంతరం చాందీ మీడియాతో మాట్లాడారు. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు కాంగ్రెస్‌తో ఉన్నారని, కొన్ని కారణాల వల్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని దాన్ని అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సాయంత్రం రాహుల్‌గాంధీతో ఊమెన్‌చాందీ, రఘువీరా రెడ్డి, శైలజానాథ్ భేటీ అయ్యారు. ఈ నెలాఖరున 20 మందికిపైగా రాష్ట్ర నేతలతో తాజా రాజకీయ పరిణామాలపై చర్చిస్తానని రాహుల్‌గాంధీ చెప్పారని రఘువీరా రెడ్డి మీడియాకు వివరించారు. రాష్ట్రంలో అవినీతి, మోసం, దగాల తెదేపా ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నేటి(8వ తేదీ) నుంచి 15 వరకు ప్రజా వంచన వారంగా చేపడతున్నామన్నారు. తొలి రోజున తెదేపా ప్రభుత్వంపై ఛార్జిషీటు విడుదల చేస్తామన్నారు. భాజపాతో కలిసి, విడిపోయి తెదేపా చేసిన మోసం ప్రజలకు వివరించే యత్నం చేస్తామన్నారు. 12న విజయవాడలో పార్టీ సీనియర్ నేతలతో చాందీ సమావేశమవుతారన్నారు. 13న ఏఐసీసీ రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ప్రమాదవశాత్తు తుపాకీ పేలి ఎస్.ఐ. దుర్మరణం

పశ్చిమ్‌బంగలో ఘటన

ఖరగ్‌పూర్(పశ్చిమ్ బంగ), న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ప్రమాదవశాత్తూ తుపాకీ (రివాల్వర్) పేలడంతో పోలీసు అధికారి దుర్మరణం పాలయ్యారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఉత్తమ్‌కుమార్ దే (59) విధులు ముగించుకుని తన తుపాకీని అప్పచెబుతుండగా ఈ ఘటన జరిగిందని మిడ్నాపూర్ ఎస్పీ అలోక్ రాజరియా తెలిపారు. 'రివాల్వర్‌ను దెబాసిష్ దాస్ అనే మరో అధికారికి అందజేస్తుండగా కిందపడింది. దానిని ఉత్తమ్‌కుమార్ దే కింద నుంచి తీస్తున్న తరుణంలో అది పేలి బుల్లెట్ గుండెల్లోకి దూసుకుపోయింది. దీంతో దే అక్కడే కుప్పకూలారు. ఆయన్ని వెంటనే ఖరగ్‌పూర్ సబ్‌డివిజన్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడని' ఎస్పీ తెలిపారు. దేకు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

బాల్య వివాహాలపై విస్తృత ప్రచారం

ఈనాడు డిజిటల్, అమరావతి: బాల్య వివాహాల నివారణపై ప్రభుత్వం ప్రచారాస్త్రాన్ని ఎంచుకుంది. చిన్నవయసులోనే పెళ్లి చేయడం వల్ల సామాజికంగా, శారీరకంగా చిన్నారులకు తలెత్తే సమస్యలు, అలాంటి వివాహాలను ప్రోత్సహించిన వారికి చట్టపరంగా ఉండే శిక్షలు వంటి వాటిని వివరిస్తూ ఈ ప్రచారాన్ని చేపట్టనుంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ మేరకు పోస్టర్లను సిద్ధం చేశారు. ఇటీవల అమలాపురంలో జరిగిన నవ నిర్మాణదీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిని ఆవిష్కరించారు. పోస్టర్లను ప్రయాణప్రాంగణాలు, రైల్వేస్టేషన్ల వంటి రద్దీ ప్రదేశాల్లో ప్రదర్శించనున్నట్టు మహిళా శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కమిషనర్ అరుణ్ కుమార్ వెల్లడించారు. గోరుముద్దలు తినిపించిన చేతులతో ఇదేం ఘోరం... తల్లిగా మీ బాధ్యత మరిచారా..? అంటూ తల్లి పాత్రను; చిన్నవయసులో పెళ్లి.. భవిష్యత్తు, ఆరోగ్యానికి ఉరి! అని తండ్రి పాత్రను; రక్ష కట్టిన చెల్లిపై కక్ష ఎందుకు? అంటూ సోదరుడి పాత్రను ప్రశ్నిస్తున్నట్టుగా ఒక పోస్టరు ఉంది. బాల్యవివాహాలు నిలువరించేందుకు 1098 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చునని అందులో పేర్కొన్నారు.

85 బీచ్‌ల అభివృద్ధి!

- మూడేళ్లలో 40 బీచ్‌ల పూర్తి
- 'ఈనాడు' కథనానికి స్పందన
- నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం

ఈనాడు అమరావతి: రాష్ట్రంలో 8 బీచ్‌లను సుందరంగా తీర్చిదిద్దారు. మరో 10 బీచ్‌లలో అభివృద్ధి పనులు వచ్చే ఆగస్టుకు పూర్తి కానున్నాయి. డిసెంబరు నాటికి మరో ఏడింటి పనులు పూర్తి చేయనున్నారు. మొత్తంగా ఈ సంవత్సరాంతానికి రాష్ట్రంలోని 25 బీచ్‌లలో పర్యాటకులను అలరించేలా అభివృద్ధి పనులు పూర్తయి సమగ్ర సౌకర్యాలూ అందుబాటులోకి రానున్నాయి. మరో 15 బీచ్‌లలో 2019 జనవరి నుంచి పనులు ఒక్కొక్కటిగా ప్రారంభించనున్నారు. తర్వాత మరో 45 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రపంచ సముద్ర (వరల్డ్ ఓషన్ డే) దినోత్సవం శుక్రవారం జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది బీచ్ పర్యాటకాన్ని థీమ్‌గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు జిల్లాలోని సూర్యలంక బీచ్‌ను పూర్తిగా పార్టీ డెస్టినేషన్‌గా అభివృద్ధి చేస్తున్నారు.

ఇంత కదలిక వెనుక..: సుమారు 974 కిలోమీటర్ల కోస్తా తీరం ఉన్న రాష్ట్రం మనది. ఇంత ఉన్నా అభివృద్ధి చేయకపోవడంతో పర్యాటకంగా వెనుకబడిపోయిన పరిస్థితి. ఇదే విషయాన్ని గత ఆగస్టులో అభివృద్ధి చేస్తే 'బీచ్‌లు బంగారు బాతులే' శీర్షికన 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ కథనంపై స్పందించిన రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆదేశాలతో ఒక సంస్థను ప్రత్యేకంగా నియమించి రాష్ట్రవ్యాప్తంగా కోస్తాతీరంలో ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధి చేయవచ్చో అధ్యయనం చేయించారు. 85 చోట్ల బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని ఆ సంస్థ నివేదిక సమర్పించింది. ఈ నివేదికను ప్రభుత్వం ఆమోదించడంతో గతేడాది చివర్లో 8 బీచ్‌లలో పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తయిన వాటిలో రిషికొండ దక్షిణం వైపు (విశాఖ), యారాడ (విశాఖ), పార్శలపూడి (తూర్పుగోదావరి), దొంగరాయపాలెం (పశ్చిమ గోదావరి), పేరుపాలెం (పశ్చిమ గోదావరి), డిండి (గుంటూరు), రామతీర్థం (నెల్లూరు), మైపాడ్ (నెల్లూరు) ఉన్నాయి.

ప్రజా భాగస్వామ్యం: బీచ్‌ల అభివృద్ధిలో ఏపీటీడీసీ స్థానిక కమ్యూనిటీ బృందాలను భాగస్వాములను చేస్తోందని ఆ సంస్థ ఎండీ హిమాన్షు శుక్లా తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. 'ఈనాడు'లో వచ్చిన కథనం వల్లే ఈ కసరత్తంతా చేశామని, పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు.

రూ.350 కోట్లపై వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్న కొణతాల

ఈనాడు, హైదరాబాద్: ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సహాయం(స్పెషల్ అసిస్టెన్స్) కింద 2017-18 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన రూ.350 కోట్లను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని సవాలు చేస్తూ మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ హైకోర్టులో దాఖలు చేసిన 'వ్యాజ్యాన్ని' ఉపసంహరించుకున్నారు. ఇదే అంశంపై 'ప్రజాహిత వ్యాజ్యం' దాఖలు చేసుకోవడానికి ధర్మాసనం అనుమతిచ్చింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మంజూరు చేసిన రూ.350 కోట్ల సొమ్మును కేంద్ర ప్రభుత్వం విడుదల చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ కొణతాల రామకృష్ణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గురువారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ అంశంపై వ్యక్తిగతంగా మీరెలా బాధితులవుతారని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఇందులో ప్రజా ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సి.రఘు స్పందిస్తూ.. వ్యాజ్యాన్ని ఉపసంహరించుకొని ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసుకునేందుకు వెసులుబాటు ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది.

A TOP RANKED AGRICULTURE SCHOOL - Silicon India

LOVELY PROFESSIONAL UNIVERSITY PUNJAB (INDIA)

AGRICULTURE PROGRAMMES

- B.Sc. (Hons.) Agriculture
- M.Sc. Ag. (Agronomy)
- M.Sc. Ag. (Soil Science & Agriculture Chemistry)
- M.Sc. Ag. (Genetics & Plant Breeding)
- M.Sc. Ag. (Entomology)
- M.Sc. Ag. (Plant Pathology)
- M.Sc. Ag. Horticulture (Vegetable Science)
- M.Sc. Ag. Horticulture (Fruit Science)

LAST DATE TO APPLY UNDER EDB 15th JUNE, 2018

EARLY DECISION BENEFIT(EDB) | Take Early Decision to APPLY & REGISTER for Admission with LPU and get the Benefit of Paying LAST YEAR'S (2017) PROGRAMME FEE & MAXIMUM SCHOLARSHIP

Scholarships SCHOLARSHIPS UPTO ₹ 2.8 LAKH PER STUDENT

Meet our counsellors in	Time : 10AM to 7PM	Toll Free: 1800-102-4428	
Vijayawada	#40-1-60, 1st Floor, Chand Imprea, Benz Circle	Ph: 09216656007	08-15 June
Guntur	Hotel Geetha Regency, 4th Lane, Arundelpet	Ph: 09780036429	08-10 June
Nellore	Hotel Minerva Grand, Grand Trunk Road, Saraswathi Ngr, Dargamitta	Ph: 09780036429	14-16 June

LOVELY PROFESSIONAL UNIVERSITY (LPU) SUNDAY OPEN
Jalandhar-Delhi G.T. Road, Phagwara, Punjab | SMS LPU to 53030
admissions@lpu.co.in | Toll Free : 1800-102-4428

TIRUMALA IIT & MEDICAL అకాడమి A/C Hostel Day Scholar

» రాజమహేంద్రవరం ✆: 888 614 7777, 888 664 2298 | » భీమవరం ✆: 9133332 101, 102 | » విశాఖపట్నం ✆: 9133332 103, 104, 105

5వ బ్యాచ్ అతి కొద్దిమంది విద్యార్థులతోనే అత్యద్భుత ఫలితాలు

JEE (Mains) - 2018కు హాజరయిన 687 మందిలో NIT/IIIT/BITS లలో సీట్లు సాధించగల వారు సుమారు 240 మంది

NEET - 2018కు హాజరయిన 371 మందిలో ఓపెన్ కేటగిరీలో 30 మందికి 20 వేలలోపు జాతీయ స్థాయి ర్యాంకులు, మెడికల్ సీట్లు సాధించగల వారు సుమారు 90 మంది

NEET - 2019 మరియు JEE (Mains & Advanced) - 2019 కొరకు
Long Term క్లాసులు ప్రారంభం : 20-06-2018

Long Term కోచింగ్‌కు A/c. హాస్టల్‌తో సహా ఫీజు రాయితీలు

JEE (Adv & Mains) - 2018 లో మార్కులు	NEET - 2018 లో మార్కులు	ఫీజు రాయితీ
150 పైన	400 పైన	100%
140 - 149	390 - 399	75%
130 - 139	375 - 389	50%
120 - 129	360 - 374	25%

KALYANI ADS

TVS Racing TVS

16.8PS* | 0-60km/h in 4.73s** | 4-Valve Racing Engine
Digital Racing Console | Race Tuned SHOWA Monoshock

Apache RTR 160 4V RACING DNA UNLEASHED

www.tvsapache.com | For further details please give a missed call to 18003157227

FOR ALL INSTITUTIONAL/BULK REQUIREMENTS PLEASE MAIL corporate.customersupport@tvsmotor.com CENTRAL ANDHRA AUTHORISED MAIN DEALERS: GARAPATI TVS, VIJAYAWADA: 7799740117, CASA TVS, VIJAYAWADA: 7799740116, CASA TVS, GUDIWADA: 7799740167, CASA TVS, KANURU: 7799740168, CASA TVS, MACHILIPATNAM: 9513482948, GARAPATI TVS, 1 TOWN: 9513482844, GARAPATI TVS, BHAVANIPURAM: 9513482889, GARAPATI TVS, SINGH NAGAR: 9513482900, PRATAP TVS, JAGGAIPETA: 7799740115, PRATAP TVS, KANCHIKACHERLA: 7799740166, PRATAP TVS, NANDIGAMA – 7799740165 PIONEER TVS, GUNTUR: 7799740114, PIONEER TVS, AMARAVATHI ROAD: 7799740164, VISHNUPRIYA TVS, ONGOLE: 7799740125, VISHNU PRIYA TVS- CHIRALA - 7799740132, LAKSHMIPRIYA TVS- NELLORE: 7799740127, VEGA TVS, NELLORE: 7799740129, SRI GOKUL TVS, ELURU: 7799740120, SRI GOKUL TVS, TADEPALLEGUDEM: 7799740175, SRI KRISHNA TVS, TANUKU: 7799740121, INDUBAALA TVS, PALAKOLE: 7799740122.

McCann/Blr/Tvs/571/05/18

ఈనాడు

క్షణికావేశానికి భారీ మూల్యం

రేపటి పౌరుల్ని ప్రగతి చోదక శక్తులుగా, విలువైన మానవ వనరులుగా తీర్చిదిద్దాల్సింది చదువు. అంతటి కీలక విద్యారంగాన్నేలేత మొగ్గలాంటి పిల్లల్లో మానసిక ఆందోళన విపరీతమై ఆత్మన్యూనత ఇంతలంతలై బలవన్మరణాలు పెచ్చరిల్లడం- పరీక్షలు ప్రాణాంతకాలవుతున్నాయనడానికి గట్టి రుజువు. కన్నవారి కలల్ని కాల్చేస్తూ, వైఫల్యాల్ని నిబ్బరంగా ఎదుర్కోలేక ఎంతోమంది విద్యార్థులు తమనుతాము అంతమొందించుకోవడం నిశ్చేష్టపరుస్తోంది. జాతీయ వైద్యవిద్య అర్హత ప్రవేశ పరీక్ష(నీట్)లో రాణించలేకపోయానన్న మనస్తాపంతో హైదరాబాద్‌లో జస్లీన్ కౌర్ పది అంతస్తుల భవనం పైనుంచి అమాంతం దూకేసింది. అదే పరీక్షలో నెగ్గుకురాలేకపోయానన్న వ్యధతో ఓ విద్యార్థిని పురుగుల మందు తాగి కడతేరిన ఘటన తమిళనాడు శాసనసభను కుదిపేసింది. పోటీ పరీక్షల శిక్షణ కేంద్రంగా పేరొందిన రాజస్థాన్, కోటా ప్రాంతాన ఈ నాలుగేళ్లలో సుమారు యాభై మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. దేశవ్యాప్తంగా చదువుకునే పిల్లల ఆత్మహత్యల పరంగా మహారాష్ట్ర, పశ్చిమ్‌బంగ, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తొలి అయిదు స్థానాల్లో నిలుస్తుండగా- ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ కళాశాలల్లోనూ విద్యాకుసుమాలు నేలరాలుతుండటం కలచివేస్తోంది. మూడు నెలలక్రితం రాజ్యసభాముఖంగా కేంద్రం వెల్లడించిన సమాచారం ప్రకారం 2014-16 సంవత్సరాలమధ్య దేశంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 26,500. గురువులు మందలించారని, తోటిపిల్లలు హేళన చేస్తున్నారని, తల్లిదండ్రులు కోప్పడ్డారని, చదువులో వెనకపడ్డామని గంటకో విద్యార్థి బలవన్మరణానికి తెగబడటం- సంక్షోభ తీవ్రతను కళ్లకు కడుతోంది. ఈ హత్యల ఉరవడి, సరైన దిద్దుబాటు చర్యలపై ప్రభుత్వాలు తక్షణం దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను ప్రస్ఫుటీకరిస్తోంది.

జీవితం అమూల్యమైనది. పరీక్ష తప్పినా, మెరుగైన ర్యాంకు పొందలేకపోయినా బతకడం వ్యర్థమన్న తీవ్ర నిర్ణయం తీసుకుంటున్న పిల్లల్లో- ఆ మౌలిక స్పృహే కొరవడుతోంది. అనర్థక ఒత్తిళ్లతో ఛిద్రమవుతున్న విద్యార్థుల బతుకు చిత్రం సమస్యకు ఒక పార్శ్వమే. తండ్రి మద్యం మానడంలేదన్న ఆవేదనతో ఉరేసుకున్న ఖమ్మం బాలుడి ఉదంతం, ప్రేమించినవాడు మోసం చేశాడని ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్న నిజామాబాద్ జిల్లా యువతి వ్యధ వంటి ఎన్నో చాటుతున్నదేమిటి? వేగం పెరిగి, గాడి తప్పిన జీవితాల్లో తొందరపాటు నిర్ణయాలు నిలువునా ముంచేస్తున్నాయి. వైవాహిక సమస్యలతో కొంతమంది, చిన్నపాటి అపార్థాలనే భూతద్దంలో చూసి బెంబేలెత్తి మరి కొందరు... బలవన్మరణాన్ని ఆశ్రయించే ధోరణులు పెచ్చుమీరుతున్నాయి. తోటివారితో పోల్చుకుని కుంగిపోయే స్వభావం, ఏ విమర్శనీ తట్టుకోలేని తత్వం, వాస్తవ దూర లక్ష్యాలు కోరికలతో చతికిలపడి నిలదొక్కుకోలేకపోవడం ఒత్తిళ్ల పెంచేసి కడకు మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నాయి. కుటుంబ జీవన బంధాలు పెళుసుబారడం కలిసి సాంత్వననూ ఎండమావి చేస్తోంది! ఒక్క విద్యార్థులనేముంది- దేశంలో అయిదుకోట్ల అరవై లక్షల మందికి పైగా మానసిక కుంగుబాటు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెబుతోంది. మరో మూడు కోట్ల ఎనభై లక్షలమందిని అలవిమాలిన ఒత్తిళ్లు వేధిస్తున్నాయనీ అది మదింపు వేసింది. పర్యవసానం, మానసిక సంతులనం కొరవడి క్షణికావేశంలో సరిదిద్దుకోలేని నిర్ణయాలు తీసుకుంటున్నవారి సంఖ్య అధికమవుతోంది. ఒకప్పటి ఉమ్మడి కుటుంబాల సంస్కృతి దాదాపుగా కనుమరుగై ఎక్కడికక్కడ 'న్యూక్లియర్' సంసారాలు జోరెత్తి సామాజిక వాతావరణాన్ని దుర్భరమవుతోంది. ఈ దురవస్థకు విరుగుడు సమకూర్చగలిగేది ఒక్క విద్యావ్యవస్థే!

ఏటా ఎకాయెకి లక్షా 35 వేలకు పైగా ఆత్మహత్యలు నమోదవుతున్న భారతావనిని కుదుటపరిచే చికిత్స బడిలోనే ఆరంభం కావాలి. విద్యాసంస్కరణల్లో భాగంగా జాతీయ విద్యాపరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) పాఠ్యాంశాల్ని సగానికి సగం తగ్గించనున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు ప్రకాశ్ జావడేకర్ చెబుతున్నారు. సిలబస్ తగ్గింపుతోనే సరికాదు- విద్యార్థులు కష్టంగా కాక ఇష్టంగా చదువులు కొనసాగించేలా విస్తృత మార్పులకు ప్రభుత్వం నడుంకట్టాలి. సుశిక్షిత మానవ వనరుల సృజనే లక్ష్యంగా ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, బెల్జియం ప్రభృత దేశాలు విద్యార్థులను ఆహ్లాదభరితంగా మలచి అత్యుత్తమ స్థాయి ప్రాథమిక చదువులు అందిస్తున్నాయి. విద్యార్థుల ప్రవర్తన, భావోద్వేగాలను నిశితంగా పరిశీలిస్తూ ఆత్మహత్యా ధోరణుల్ని మొగ్గలోనే తుంచే ఉమ్మడి కార్యాచరణను స్వీడన్, ఆస్ట్రియా, ఎస్తోనియా, జర్మనీ, హంగరీ, ఐర్లాండ్, ఇజ్రాయెల్, ఇటలీ వంటివి చిత్తశుద్ధితో క్రియాశీలకంగా చేపట్టాయి. మానసిక స్థైర్యం నూరిపోసేందుకు ఉన్నత విద్యాసంస్థలన్నింటా కౌన్సెలింగ్ కేంద్రాలు నెలకొల్పాలన్న ఆనందకృష్ణన్ కమిటీ సిఫార్సు ఇక్కడ ఏళ్లతరబడి నీరోడుతోంది! విద్య వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలి. జీవితంలో అనివార్య ఒత్తిళ్లను, ఒడుదొడుకుల్ని విజ్ఞతతో ప్రశాంతంగా ఎలా అధిగమించాలో నేర్పాలి. ప్రకృతిలో చీకటి వెలుగుల్లాగే జీవితంలో ఆకాంక్షలు, ఆశాభంగాలు ఉంటాయనే వాస్తవిక దృష్టిని అలవరచాలి. అటువంటి విద్యే జాతి నిర్మాణంలో కీలక అంతర్భాగమవుతుంది. యువతను న్యూనత పాలబడకుండా అదృశ్య రక్షాకవచంగా విలసిల్లుతుంది. విద్యార్థుల్ని 'వర్రీయర్స్'గా కాక 'వారియర్స్'గా మార్చేలా విద్యావ్యవస్థ సమూల క్షాళనకు గతంలో ప్రధాని మోదీ ఓటేశారు. విద్యారంగంలో సాకారమయ్యే గుణాత్మక పరివర్తనే- ఆందోళనకర ఒత్తిళ్లపై, ఆత్మహనన ధోరణులపై వేటు వేయగలుగుతుంది!

కనుమరుగవుతున్న ఇసుక వనరు

ఆస్ట్రేలియా నుంచి తరలించిన ఇసుకతో దుబాయ్‌లో భారీ నిర్మాణం చేపడుతున్న వైనం

ఎడారుల్లో, సముద్ర తీరాల్లో ఉండే ఇసుకను చూసి అది అనంతం అనుకుంటాం. కానీ అది విరివిగా లభించే వనరు మాత్రమే తప్ప తరగని గని కాదు. ఒకటి మాత్రం నిజం. ఇసుక లేనిదే నాగరికత లేదు. ప్రాచీన ఈజిప్షియన్లు మొదలుకొని ఆధునికుల వరకు ఇసుక, ఇటుక, కంకరతోనే నగరాలు, ఇళ్లు, ఆనకట్టలు నిర్మించారు. 15వ శతాబ్దంలో ఇటాలియన్లు ఇసుక నుంచి పారదర్శక గాజును తయారు చేయడంతో మైక్రోస్కోప్, టెలిస్కోప్ వంటి శాస్త్రసాంకేతిక పరికరాల తయారీ సాధ్యమైంది. 20వ శతాబ్దంలో ఇసుక (సిలికాన్) నుంచి కంప్యూటర్ చిప్‌ల తయారీ వినూత్న సమాచార సాంకేతిక విప్లవానికి నాంది పలికింది. డిటర్జంట్లు, సౌందర్య ఉపకరణాలు, టూత్ పేస్టులు మొదలుకొని సౌర ఫలకాల వరకు అనేకానేక వస్తువులు రకరకాల ఇసుక రేణువులతోనే తయారవుతాయి. నాగరికత విస్తరణతో ఇసుక వినియోగం, గిరాకీ విపరీతంగా పెరిగిపోయాయి. అదే అనేక అనర్థాలకు దారితీస్తోంది.

వినియోగంలో సగం చైనాదే

ఆసియాలో ప్రస్తుతం నగరీకరణ వేగం పుంజుకోవడంతో ఇసుకే బంగారమవుతోంది. ముఖ్యంగా చైనా, భారత్ దీని కోసం ఆవురావురుమంటున్నాయి. నేడు ప్రపంచంలో ఏటా 4,000 కోట్ల టన్నుల ఇసుక వినియోగమవుతుంటే, అందులో సగాన్ని చైనాయే ఉపయోగించుకొంటోంది. 2011-2014 మధ్య కాలంలోనే చైనా 3.23 కోట్ల ఇళ్లు, 45 లక్షల కిలోమీటర్ల రహదారులు, ఎన్నో ఆనకట్టలు, ఇతర మౌలిక వసతులను నిర్మించింది. ఇసుక లేకుండా ఇదంతా సాధ్యపడేది కాదు. అమెరికా 20వ శతాబ్దమంతటా ఉపయోగించిన దానికన్నా ఎక్కువ కాంక్రీటును చైనా 2011-13 మధ్య కాలంలోనే వినియోగించింది. ఇసుక, కంకరతో తయారుచేసే కాంక్రీటు వినియోగంలో ఆసియా-పసిఫిక్ దేశాలు అమెరికా, ఐరోపా దేశాలను మించిపోతున్నాయి. 2010లో ప్రపంచంలో ఒక్క నిర్మాణ కార్యకలాపాల కోసమే 1,100 కోట్ల టన్నుల ఇసుకను వినియోగించారు. ఇంత గిరాకీ ఉంది కాబట్టి నేడు చమురు కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ పరిమాణంలో ఇసుక, కంకరలను తవ్వితీస్తున్నారు. ప్రపంచంలో ఏటా వెలికితీస్తున్న వనరుల్లో 85 శాతం ఇసుక, కంకరేనని ఐక్యరాజ్య సమితి పర్యావరణ సంస్థ వెల్లడించింది. 2012లో ప్రపంచ దేశాలు కేవలం కాంక్రీటు తయారీ కోసమే 3,000 కోట్ల టన్నుల ఇసుక, కంకర ఉపయోగించాయనీ వివరించింది. ఈ కాంక్రీటుతో భూమధ్య రేఖ చుట్టూ 27 మీటర్ల ఎత్తు, 27 మీటర్ల వెడల్పైన గోడను నిర్మించవచ్చునని లెక్కగట్టింది. 2016లో ప్రపంచంలో కోటికన్నా ఎక్కువ జనాభా కలిగిన నగరాల సంఖ్య 31; 2030కల్లా అవి 40కి పెరగనున్నాయని ఐక్యరాజ్య సమితి అంటోంది. ఆ పెద్ద నగరాల్లో ఇళ్లు రోడ్ల నిర్మాణానికి ఎంత ఇసుక కావాలో తలచుకొంటేనే ఆందోళన కలుగుతోంది.

పెరుగుతున్న గిరాకీ వల్ల ప్రపంచమంతటా ఇసుక నిల్వలు హరించుకుపోతూ పర్యావరణంతోపాటు మానవ ప్రాణాలకూ ముప్పు వాటిల్లుతోంది. నేడు ప్రపంచంలో మరే దేశంలోనూ లేనంతగా భారత్‌లో ఇసుక మాఫియా ఆగడాలు పెచ్చరిల్లాయి. ఈ మాఫియా ముఠాలు కొన్నేళ్ల నుంచి ఇసుకతోపాటు ప్రజల ప్రాణాలనూ తోడేస్తున్నాయి. వీరి చేతిలో హతమైనవారిలో సాధారణ పౌరులే కాదు- పోలీసు అధికారులు, ప్రభుత్వాధికారులు, పర్యావరణ ఉద్యమకారులు, పాత్రికేయులూ ఉన్నారు. ఆధునిక నాగరికతకు పునాది వేస్తున్న ఇసుకలో వీరందరి నెత్తుటి చారలు దాగి ఉన్నాయి. మొరాకో, కరీబియన్ దీవుల్లో దొంగలు సముద్ర తీర ఇసుకను అదేపనిగా తవ్వేసి అక్రమ రవాణా చేస్తున్నారు. వీరి దెబ్బకు ఆయా దేశాల రేవుల్లో ఇసుక అదృశ్యమై రాళ్లు తేలాయి.

మనం చూస్తున్న ఇసుకలో 70 శాతం క్వార్ట్జ్ మిశ్రమమే. క్వార్ట్జ్ అనేది సూక్ష్మ శిలల సమాహారం. నిర్మాణాలకు వాడే కాంక్రీటులో ఇదే ముఖ్య అంతర్భాగం. నదీతీరాల్లో ఇసుక హరించుకుపోతున్నప్పుడు విస్తారమైన ఎడారి ఇసుకతో పని జరగదా అన్న సందేహం వస్తుంది. పటిష్ఠమైన కాంక్రీటు తయారీకి నదులు, హిమనదాల్లో నీటి రాపిడి వల్ల పుట్టే ఇసుక ఉపకరించినట్లు గాలి రాపిడి వల్ల ఏర్పడే ఎడారి ఇసుక ఉపయోగపడదు. ఎడారి ఇసుక రేణువులు మరీ గుండ్రంగా, నున్నగా ఉండటం వల్ల అవి కాంక్రీటులో గట్టిగా అతుక్కోవు. దీంతో నదీ తీరాల్లో మితిమీరి తోడేస్తూ ఇసుక రాశులు వట్టిపోవడానికి కారణమవుతున్నాం. నదుల్లో కొత్త ఇసుక కొట్టుకువచ్చే లోపే పాత నిల్వలు వేగంగా హరించుకుపోతున్నాయి. ప్రపంచమంతటా ఇదే కథ. చైనా, భారత్, నైజీరియా వంటి దేశాల్లో నిర్మాణ



ప్రత్యామ్నాయం కొరవడి సంక్షోభం

కార్యకలాపాలు విజృంభించి ఇసుక నిల్వలు తరిగిపోతున్నాయి. వియత్నాంలో అందుబాటులో ఉన్న ఇసుకను మించి గిరాకీ ఉండటంతో 2020కల్లా ఆ దేశానికి ఇసుక కరవు ఏర్పడనుంది. కాంక్రీటు, రోడ్లు, గాజు, సిలికాన్ చిప్స్ తయారీతోపాటు సముద్రాన్ని పూడ్చి కొత్త నేల సృష్టించడానికీ ఇసుకే శరణ్యమవుతోంది. ఇంకా రేవుల్లో కొత్త ఇసుక పోసి పునరుద్ధరించడానికి, భూమిలో నుంచి షేల్ చమురు, గ్యాస్‌ను వెలికితీయడానికి పెద్దయెత్తున ఇసుకను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఉన్న ఇసుక చాలక ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొంటున్న సందర్భాలెన్నో!

ప్రపంచంలో నేడు అత్యధికంగా ఇసుకను దిగుమతి చేసుకొంటున్న దేశం- సింగపూర్. గత 40 ఏళ్లలో ఆ దేశం లక్షల టన్నుల ఇసుకను సముద్రంలో గుమ్మరించి 130 చదరపు కిలోమీటర్ల కొత్త నేలను సృష్టించుకొంది. దీనివల్ల 1960 నుంచి సింగపూర్ భూభాగం 20 శాతం పెరిగింది. దీని మాదిరిగా సంపన్న దేశమైన ఖతర్ సైతం భారీయెత్తున ఇసకను దిగుమతి చేసుకొంటోంది. దుబాయ్‌లో బుర్జ్ ఖలీఫా టవర్ నిర్మాణానికి ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకున్నారు. భూతాపం వల్ల పెరుగుతున్న సముద్ర మట్టం నుంచి తమ భూభాగాల రక్షణ కోసం మాల్దీవులు, కిరిబాటి దీవులు ఇసుక పోసి కరకట్టలు నిర్మించుకొంటున్నాయి. నానాటికీ గిరాకీ అధికమవుతుండటంతో ప్రపంచమంతటా నదీగర్భాలు, సముద్ర తీరాల నుంచి అక్రమంగా ఇసుకను తవ్వితీయడం ఎక్కువైంది. ఇండొనేసియాలో 2005 నుంచి కనీసం డజను దీవులు ఈ తవ్వకాల వల్ల అదృశ్యమయ్యాయి. అక్కడ తవ్వితీసిన ఇసుక అంతా సింగపూర్ చేరింది. ఆ దేశం సముద్రాన్ని పూడ్చే పనిని ఇప్పటికీ కొనసాగిస్తున్నందువల్ల ఇంకా ఇసుక కోసం ఆరాటపడుతోంది. దీంతో ఆందోళన చెందిన ఇండొనేసియా, వియత్నాం, మలేసియాలు ఎగుమతిని నిషేధించడమో, కఠిన ఆంక్షలు విధించడమో చేశాయి. ఒకప్పుడు స్థానికంగా దొరుకుతూ అక్కడే వినియోగమైన ఇసుక నేడు అంతర్జాతీయ వ్యాపార సరకుగా మారింది.

అంతర్జాతీయ చట్టం అవసరం

ఇసుక మాఫియాలు స్వైరవిహారం చేస్తున్న భారత్, ఇటలీ అనుభవాలను చూశాక దీనికి ప్రత్యామ్నాయంపై ఆలోచనలు ఊపందుకున్నాయి. కూలగొట్టిన భవనాల కాంక్రీటును మళ్లీ ఇసుక, కంకరగా నలగ్గొట్టి నిర్మాణాలకు వాడటం ఒక ప్రత్యామ్నాయం. కానీ, ఇది సంపన్న దేశాలకు నప్పినట్లుగా వర్ధమాన దేశాలకు నప్పదు. కారణం- వర్ధమాన దేశాల్లో పాత కట్టడాలు పరిమితం కాబట్టి వాటిని నలగ్గొడితే వచ్చేది తక్కువే. ప్రస్తుతానికి సంపన్న దేశాలు పాత కాంక్రీటును నలగ్గొట్టి పునర్వినియోగార్హంగా మార్చడానికి ప్రాముఖ్యమిస్తున్నాయి. 2014లో బ్రిటన్‌లో ఇళ్ల నిర్మాణానికి వాడిన సామగ్రిలో మూడో వంతు పునర్వినియోగార్హ కాంక్రీటే. నెదర్లాండ్స్‌లో చొచ్చుకొస్తున్న సముద్రాన్ని నిలువరించడానికి ఇసుకపై కన్నా డైక్‌లు (అడ్డుకట్టల) మీదనే ఆధారపడతారు. సింగపూర్ సైతం ఇదే పద్ధతి అనుసరించాలనుకొంటోంది. కొరత తీవ్రంగా ఉన్న భారత్ రాక్‌శాండ్ (కృత్రిమ ఇసుక)ను ఉపయోగించాలని ఆలోచించినా అది అంతగా ఆదరణకు నోచుకోలేదు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఇసుకకు ప్రత్యామ్నాయంగా వాడాలని గోవాలోని పరిశోధకులు యోచించి, 2014లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ నిపుణుడు జాన్ ఆర్ సహాయం కోరారు. ఆయన కాంక్రీటు నిర్మాణాలపై పరిశోధన చేస్తున్న ఇంజినీరు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఇసుక రేణువుల పరిమాణంలోకి కుదించి కాంక్రీటు నిర్మాణాల్లో ఉపయోగించడంపై వారు ప్రయోగాలు చేశారు. ప్లాస్టిక్‌తోపాటు కలప తదితర వ్యర్థాలతో ప్రయోగాలు జరిగినా, అవేమీ పెద్దయెత్తున ఆచరణలోకి రాలేదు. ఇసుక కొరత తీవ్రమవుతూ ధరలు పెరుగుతున్నందువల్ల ప్రత్యామ్నాయాన్ని కనుగొనక తప్పదు. స్వచ్ఛమైన గాలి, నీరు, జీవ వైవిధ్యంలానే ఇసుకనూ ముఖ్యమైన వనరుగా పరిగణించాలి. ఏ సంవత్సరం ఎంతెంత ఇసుక ఉపయోగించవచ్చునో స్థానికంగా, అంతర్జాతీయంగా బడ్జెట్లు రూపొందించాలి. ఇసుక సక్రమ వినియోగానికి అంతర్జాతీయ నియంత్రణ చట్టం అవసరం!

– ఏఏవీ ప్రసాద్

అనర్థాలు... అనేకం

అతిగా ఇసుకను తవ్వితే నదులు ప్రవాహగతిని మార్చుకునే ప్రమాదం ఉంది. సముద్ర తీర రూపు రేఖలూ మారిపోతాయి. నేల కోత, భూసార క్షయం పెరిగిపోతాయి. కోస్తా ప్రాంతాల్లో తవ్వకాల వల్ల భూగర్భ జలాల్లోకి సముద్ర నీరు చొచ్చుకొస్తోంది. భారత్ తోపాటు కొన్ని ఆసియా దేశాల నదుల్లో ఇసుక తవ్వకాల మూలంగా మొసళ్లు అంతరించిపోయే ముప్పు ఏర్పడింది. మొసళ్లు నదుల ఒడ్డున ఇసుక తిన్నెల్లో సేద తీరుతుంటాయి. ఇసుక లేకపోతే వాటి ఉనికి ప్రమాదంలో పడుతుంది. చేపలు, డాల్ఫిన్లు, నత్తగుల్లలు, పీతలకూ ప్రమాదం వాటిల్లుతోంది. ఉప్పెనల నుంచి, తుపానుల నుంచి సముద్ర తీరాలు, చిత్తడి నేలలు రక్షణ కల్పిస్తాయి. కానీ, నేడు ఇసుక తవ్వకాలతో తీరం కోతకు గురై రక్షణ కరవైపోతోంది. 2004లో హిందూ మహాసముద్రంలో సంభవించిన ఉప్పెన శ్రీలంకలో తీవ్ర నష్టం కలిగించడానికి కారణమిదే. వియత్నామ్‌కు అన్నపూర్ణ అయిన మెకాంగ్ నది డెల్టాకు ఇసుక తవ్వకాలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇసుకను తవ్వినప్పుడు ఏర్పడే గుంతల్లో నిల్వ నీరు చేరి మలేరియా, డెంగీ వంటి వ్యాధికారక దోమలు వృద్ధి చెందుతున్నాయి. కెన్యాలో తవ్వకాలు పగడాల దిబ్బలకు నష్టం కలిగిస్తున్నాయి. తవ్వోడలతో సముద్రం నుంచి ఇసుకను తవ్వితీయడం పర్యావరణాన్ని, స్థానిక జీవ వైవిధ్యాన్నీ దెబ్బతీస్తోంది.

నిద్ర వాంఛా ఫల సిద్ధిరస్తు

ఏ నాయకుడైనా చట్టసభలో నిద్రపోతున్నప్పుడు ఏమాత్రం ఎగతాళి చేయకుండా 'ముద్దుల మా నేత నిద్దరోతున్నాడు' అని పరవశించి పాడుకోవాల్సిన రోజులు వచ్చేశాయి. నిద్ర విలువ తెలుసుకుని 'బజ్జోనాయకా బజ్జో' అనాల్సిందే. ఆ మాటకొస్తే చట్టసభల్లో ఉయ్యాలలు ఏర్పాటు చేసి ప్రతినిధులు ఊగేట్టు చేస్తే ఇంకా ఎంతో మేలు! జనాలకు చాలీచాలని నిద్రవల్ల ప్రపంచదేశాలు లక్షలకోట్ల రూపాయల మేరకు నష్టపోతున్నాయని ఈ మధ్య ఒక అధ్యయనం వెల్లడించింది. 2016-2017లో ప్రజలకు తగినంత నిద్ర లేకపోవడంతో ఒక్క ఆస్ట్రేలియానే మూడు లక్షల కోట్ల రూపాయలకు నష్టపోయింది. నిద్ర తక్కువైన వాళ్లకు రకరకాల జబ్బులు వస్తాయి. అవి నయం కావడానికి బోలెడంత ఖర్చు. నిద్రపోనివాళ్లు సరిగ్గా పని చేయలేరు. ఉత్పాదకత దెబ్బ తింటుంది. ప్రమాదాలు జరుగుతాయి. ఇందువల్ల ఆర్థిక వ్యవస్థకు ఎంతో నష్టం! ఇదంతా తేలిన తరవాత గుర్రు పెట్టి నిద్రపోవాలని ఎవరికైనా అనిపించకపోతే ఎంత ద్రోహం!

నాయకుల వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని మెటికలు విరవకూడదు. ఎలా నిద్రపోవాలో వారి నుంచి నేర్చుకోవచ్చు. సమాజంలో ఉన్నతుల నుంచి మిగిలిన వాళ్లు నేర్చేసుకుంటారని శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో చెప్పాడు. చట్టసభల్లో నాయకులందరూ ఒళ్లు తెలియకుండా నిద్రపోయిన రోజే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు. ఇప్పుడు కర్ణాటక రాజకీయాల చక్రం తిప్పుతున్న దేవెగౌడ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, ఏదో సభలో నిద్రపోతుండగా- తత్వం తెలీక, అందరూ అపార్థం చేసుకున్నారు. అంతకు ముందు కర్ణాటక విధాన సౌధకూ ఆయన నిద్ర అనుభవం గురించి బాగా తెలుసు. దేవెగౌడతో సత్సంబంధాలున్న కాంగ్రెస్ భాగ్యవిధాత రాహుల్‌గాంధీ సైతం కొంతకాలం కిందట ధరల పెరుగుదల మీద పార్లమెంట్‌లో వాడివేడిగా చర్చలు జరుగుతున్న వేళ కునుకుతీశారు. గుజరాత్‌లో దళితుల నిరసనల గురించి పార్లమెంటులో కాంగ్రెస్ సభ్యులు హోరెత్తిస్తున్న సమయంలోనూ నాయకుడు రాహుల్‌గాంధీ చేతులతో తల పట్టుకుని నిద్రాలోకంలో విహరించారు. 'ఎవరన్నారది నిద్ర అని, సైద్ధాంతిక ముద్ర అది' అని కాంగ్రెస్ నాయకులు గొంతుచించుకుని చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. అంతెందుకు? యూపీఏ జమానాలో పదేళ్ల కాలం ప్రధానమంత్రిగా ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ సైతం బడ్జెట్ ఆమోదం పొందుతున్న సమయంలో నిద్రపోయారు. దేశానికి రాష్ట్రపతిగా పని చేసిన ప్రణబ్‌ముఖర్జీ ఒకసారి నిద్రను అదుపు చేసుకోలేకపోయారు. ఒకప్పుడు కేంద్రమంత్రులైన పవన్‌కుమార్ బన్సాల్, రాజీవ్ శుక్లా, కమల్‌నాథ్, లాలూ ప్రసాద్... ఎప్పుడో ఒకప్పుడు యథాశక్తి నిద్రాదేవి ప్రభావంలో ఢామ్మని పడిపోయినవారే. అప్పటి లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ జోక్యం చేసుకోవడంతో లాలూ ప్రసాద్‌కు నిద్రాభంగం కలిగింది. మాజీ ముఖ్యమంత్రులు వీరభద్ర సింగ్, దిగ్విజయ్‌సింగ్ ఎన్నో ఎన్నికల్లో గెలిచినా, నిద్రాదేవి చేతిలో మాత్రం ఓడిపోయారు! దీనివల్ల తేలేదేమిటి? మామూలు నాయకులు మేలుకుంటారు, మహనీయులు నిద్రపోతుంటారు అని! నాయకులు నిద్రపోవడం వల్ల ప్రజలకు వచ్చే ప్రయోజనం అంతా ఇంతా కాదు. ఎవరైనా మేలుకున్నప్పుడు హాని చేయగలరు కానీ నిద్రపోయినప్పుడు పగవారికి సైతం హానిచేయలేరు. అంతకన్నా ప్రజాసంక్షేమం ఏముంటుంది? అధికారపక్షాలు ప్రతిపక్షాలు



మొత్తం చర్చల సమయాన్ని 'ఎవరికి వారే నిద్ర తీరే'గా చెరి సగం పంచుకుని మొద్దు నిద్రపోతే ఎంత బాగుంటుంది! మన ప్రజాస్వామ్యానికి ఎంత మంచి పేరొస్తుంది! నాయకులకు, ప్రజలకు ఎంత ఆరోగ్యం! నిద్రపోయే ప్రతినిధి కనీసం మైకునూ విరగ్గొట్టలేడు. కాగితాలూ విసరలేడు.

నాయకులు దానకర్ణులుగా ఉండాలని కోరుకోవడం తప్పు... వాళ్లు కుంభకర్ణులు కావాలనుకోవడం ఒప్పు. దానకర్ణులైన నాయకులు ప్రజలకు ఇచ్చే సందేశం ఏముంటుంది? చేతిలో ఉన్న సొమ్మంతా దానధర్మాలు చేయమనే కదా! నాయకుల తీరు ప్రజలు నేర్చుకునేట్టు ఉండాలి కదా! దానకర్ణుడి అంశ ఉన్న నాయకుడు ఉన్నదంతా అలా ఊడ్చేస్తుంటే బిర్లా అంత డబ్బున్నవాడూ కొద్దిరోజుల్లో బికారి అయి రోడ్డున పడిపోతాడు. కొంపదీసి జనం కూడా ఈ పద్ధతి నేర్చేసుకుంటే ఇంకేమన్నా ఉందా? దేశం పరిస్థితి ఏమవుతుంది, కోశం పరిస్థితి ఏమవుతుంది? భారతదేశం పేదది కాదు కానీ భారతీయులే పేదవాళ్లు అని పదేపదే గుర్తు చేసుకోవాల్సి వస్తుంది.

వసుధైక కుటుంబం కావాలని పెద్దలు చెబుతుంటారు. అంత అవసరం లేదు. నిద్రైక కుటుంబాన్ని సాధిస్తే చాలు. సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. దొరలు నిద్రపోతుంటే, దొంగలూ నిద్రపోతారు. అప్పుడు దోపిడులు తగ్గిపోతాయి. కుంభకోణాలూ తగ్గిపోతాయి. మంత్రులు నిద్రపోతుంటే, అధికారులూ నిద్రపోతారు. అందువల్ల అవినీతి అడుగంటిపోతుంది. 'నిద్రవాంఛా ఫల సిద్ధిరస్తు' అని నేర్పిస్తే మంచిది.

స్వాతంత్ర్య సమరం రోజుల్లో 'కళ్లు మానండోయ్ బాబూ కళ్లు తెరవండోయ్' అని పాడేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. కల్లు మానకపోయినా ఇబ్బందేమీ లేదు. కళ్లు తెరిస్తే మాత్రం ఎంతో ఇబ్బంది. కళ్లు తెరిస్తే బోలెడన్ని సమస్యలు. కళ్లు తెరిచి చూస్తే ముందు దగా, వెనక దగా, కుడి ఎడమల దగా కనిపిస్తుంది. దానివల్ల నిజాయతీపరులకు రక్తపోటు పెరుగుతుంది. దానికి ఇంకెన్నో జబ్బులు తోడవుతాయి! కడుపు నిండా తిండి... కంటి నిండా నిద్ర అన్నారు. కడుపునిండా 'ప్రజాధనం' తిన్నాక నాయకులకు భయంతో నిద్ర పట్టదంటారు. అది తాతల నాటి సంగతి. ఇప్పుడు దేని దారి దానిదే. నిద్రకు, నిజాయతీకి సంబంధం లేదు. కొట్టేసిన డబ్బుతో కొన్ని తరాల వరకు ఢోకా లేదనే నమ్మకంతో గుండెల మీద చేయి వేసుకుని మరీ నిద్రపోవచ్చు! నాయకులకు ప్రజాసేవలో పోటీ పెడితే ఏం లాభం? నిద్రలో పోటీ పెట్టాలి! బాగా నిద్రపోయే వాళ్లనే గెలిపించాలి. 'నిద్రయేవ జయతే' అనే నినాదం హోరెత్తాలి.

పోలింగ్‌వేళ అధికారులు, ఓటర్లు నిద్రపోతే ఎలా అంటూ ప్రశ్నలు వేయకూడదు. ప్రతిపక్ష నాయకులకు ప్రభుత్వం మీద కోపం వచ్చినప్పుడు 'ఈ ప్రభుత్వం నిద్రపోతోంది' అని విమర్శిస్తుంటారు. అవును. నిద్రపోతే తప్పేమిటి? ప్రభుత్వాన్ని అంటే ప్రభుత్వ నాయకులను అన్నట్టేగా. ఎంతకీ నిద్ర పట్టనివాళ్లు నిద్ర పట్టేవాళ్ల మీద అసూయతో చేసే విమర్శ ఇది! దీనికి విలువ లేదు. ఈ ప్రపంచం కళకళలాడాలంటే నిద్రపోవడం అత్యవసరం. ఇందుకు రంగంలోకి దిగాల్సిన వాళ్లు నాయకులే.

'నిద్రేరా అన్నిటికీ మూలం
నిద్ర విలువ తెలుసుకొనుట నేతల ధర్మం!'
అందువల్ల ప్రజానాయకులారా పదండి ముందుకు... పడకల చెంతకు!!

– శంభు

అంతర్యామి

పరహితమే పర్వదినం

ప్రతి వ్యక్తీ ఉన్నత మనస్విగా ఎదిగినప్పుడు సకల జగత్తూ శుభప్రదమై శోభిల్లగలదన్నది ఇస్లామ్ పవిత్ర ఆశయం. ఇందుకు ఔదార్యంతో కూడిన ఉదాత్తగుణం అవసరం. సమాజంలో సజీవంగా కనిపిస్తున్న స్వార్థం, లోభం ఇంకిపోవాలి. అనాథల్ని ప్రేమించగలగాలి. పేదరికాన్ని రూపుమాపాలి.

రమజాన్ మాసంలోని శిక్షణలో భాగంగా మహాప్రవక్త దానశీలతను ఈ ఆశయ పరిపూర్తికోసం ప్రబోధించారు. హృదయాల్లో త్యాగం, సానుభూతి, సహనం వర్ధిల్లగలవన్నది ఉన్నత భావం. పొరుగువాడు పూటకు పట్టెడన్నం లేక ఆకలితో అలమటిస్తుంటే నీవు సుఖంగా జీవితం గడపడం మానవత్వం కాదు. కష్టాల్లో ఉన్నవారి కన్నీరు తుడవాలి. నీ సంపాదనలో కొంత భాగం వారికిచ్చి ఆదుకోవాలి. వారి బతుకుల్లో వెలుగులు నింపాలి. అప్పుడే జీవనయానానికి అర్థం పరమార్థం అని ఇస్లామ్ ప్రబోధం. దానం చేసే సమయంలో ఆలోచించదగ్గ అంశం కూడా ఉంది. నిజాయతీ, నిష్కాపట్యంతో దానం చేయనట్లయితే అది కపటదానం అవుతుంది. మానవాళిని హింసించి లేదా వంచించి అక్రమంగా చేసిన సంపాదన నుంచి దానం చేయడం ఇలాంటిదే. ఇస్లామ్ దీన్ని ఎంతమాత్రం అంగీకరించదు, సహించదు.

వీలైనంతవరకు దానం గుప్తంగా ఉండాలి. అది దేవుడి కానుకగా పేదలకు అందజేయాలి. పేదలసేవను ప్రతి ఒక్కరూ ఉన్నతమైందిగా భావించాలి. ప్రజలు తమ జీవితాల్లో వితరణబుద్ధి కలిగి ఉండటానికి ఉల్లేఖించదగ్గ ఒక ప్రక్రియను ఇస్లామ్ రూపొందించింది.

దీన్ని అనుసరించి మొదట 'ఫిత్రా' పేరిట నిర్ణీత దానం అనివార్యంగా ప్రతి ముస్లిమ్ పేదలకు ఆనందోత్సాహాలతో చెల్లించాలి. ఈ పని పండుగకన్నా వారం రోజులు ముందే చేయాలి. ఉపవాసం పాటిస్తున్న వ్యక్తి పొరపాటున ఏదైనా నియమం ఉల్లంఘించినా, లేదా అల్పదోషం జరిగినా ఫిత్రా దానం ఆ లోపాన్ని పూరించగలదు. అంతే కాదు, ఈ దానం స్వీకరించడం వల్ల లేమిని అనుభవించే వారి పండుగ అవసరాలు తీరతాయి. ఫిత్రాదానం చెల్లించనంతవరకు రమజాన్ ఉపవాసాలు ఫలప్రదం కావు.

రెండో అంశం- సంవత్సరమంతా ఒక వ్యక్తి వద్ద నిలువ ఉన్న ధనంలో నుంచి నిర్ణీత భాగాన్ని విశ్వప్రభువు పేర పేదలకు, సత్కార్యాలకు అందజేస్తే అది పరిశుద్ధ దానం అనిపిస్తుంది. దాన్నే 'జకాత్' అంటారు. ఈ 'జకాత్' సంపన్నులే చేస్తారు. ముస్లిములు జకాత్ చెల్లింపులకు శుభప్రదమని రమజాన్ మాసాన్నే ఎంచుకొంటారు. ఉపవాసం శారీరకపరమైన ఆరాధన అయితే, జకాత్ ఆర్థికపరమైన ఆరాధన. దీనివల్ల హృదయ కాఠిన్యం కరిగిపోతుంది. స్వార్థపూరిత మనస్తత్వం వ్యక్తికి సంఘానికి దేశానికి ప్రమాదకరం. స్వార్థపరుడు దాతృత్వం ప్రదర్శించినా తనకోసమే. అతడు పేదలకు సహాయంచేస్తే అనంతరం వారిని దోచుకోవడమే అతని లక్ష్యం. ఈ మనస్తత్వం ప్రబలితే కొందరి వద్దే ధనం కేంద్రీకృతమవుతుంది. అనేకులు నిరాధారులవుతారు. నిరుపేదల బతుకులు దైన్యంగా మారిపోతాయి. అలాకాకుండా జకాత్ లోభత్వాన్ని నివారిస్తుంది. సంకుచిత ధోరణిని తొలగిస్తుంది. దైవగుణాన్ని అలవరచుకొనేలా చేసి ఆనందాల పంట పండిస్తుంది.

కృత్రిమస్తుతుల కోసం, కొనితెచ్చుకొనే గౌరవం కోసం ఆరాటపడితే అది దైవదృష్టిలో క్షమించరాని నేరం. పరులను బాధించడం వల్ల ఉపవాస వ్రతాలు, దానాలు వ్యర్థమవుతాయి. ప్రతి ముస్లిమ్ అమలిన నిష్ఠతో జీవితం గడపడమే ధార్మికవిధి. అంతా గ్రహించిన ముస్లిమ్ దుష్కృత్యాలకు దూరమవుతాడు. ఉత్తమ ఆలోచనలకు బీటలు పడకుండా చూసుకొంటాడు. సత్యం, ధర్మం, దయ, ప్రేమ, సదాచారం, సుహృద్భావాలకు ప్రతీకగా ప్రవర్తిస్తాడు. మనలోని అహంభావాన్ని, అజ్ఞానాన్ని మనం గమనించనంత కాలం దేవుడు మన వైపు చూడడని సమాజానికి హితవాక్యాలు వివరిస్తాడు.

హృదయంలేని దానధర్మాలు వద్దు. ఎనలేని ఐశ్వర్యం మానవత్వాన్ని మరపింపజేస్తుంది. నీపై నీవు నిఘా ఉంచుకో. ఏ ముస్లిమూ విస్మరించరాని మాటలివి!

– డాక్టర్ షేక్ మహమ్మద్ ముస్తఫా

ఎకరం కనీస ధర 4 కోట్లు

- అంకుర ప్రాంతంలో అంతకంటే తక్కువకు విక్రయించ కూడదు
- 70 శాతం విక్రయించి, పెట్టుబడులు వచ్చాకే రెండో దశ అభివృద్ధి
- ఏడీపీకి సీఆర్‌డీఏ షరతులు

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతిలోని అంకుర ప్రాంతంలో మౌలిక వసతులు అభివృద్ధి చేసిన తర్వాత ప్రతి ఎకరం కనీస విలువ రూ.4 కోట్లకు తగ్గకుండా విక్రయించాలని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) షరతు విధించింది. 1691 ఎకరాల్లో అంకుర ప్రాంత ప్రధాన అభివృద్ధిదారుగా వ్యవహరిస్తున్న అమరావతి డెవలప్‌మెంట్ పార్ట్‌నర్ (ఏడీపీ)తో సీఆర్‌డీఏ గురువారం అభివృద్ధి, రాయితీ ఒప్పందం చేసుకుంది. సింగపూర్ అమరావతి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్(ఎస్ఏఐహెచ్), రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అంకుర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సంయుక్తంగా ఏడీపీని నెలకొల్పిన విషయం తెలిసిందే. ఏడీపీలో ఎస్ఏఐహెచ్‌కి 58 శాతం, ఏడీసీకి 42 శాతం వాటా ఉంది. ఏడీపీకి ఎస్ఏఐహెచ్ రూ.306 కోట్లు, ఏడీసీ రూ.222 కోట్లు తమ మూలధన వాటాగా జమచేయాలి. మిగతా నిధుల్ని వివిధ బ్యాంకులు, రుణ వితరణ సంస్థల నుంచి ఏడీపీ సమకూర్చుకుంటుంది.

- మొత్తం 1691 ఎకరాల్ని మూడు దశల్లో, 15 ఏళ్ల వ్యవధిలో ఏడీపీ అభివృద్ధి చేస్తుంది. తొలి దశలో 656 ఎకరాలు, రెండో దశలో 514 ఎకరాలు, మూడో దశలో 521 ఎకరాలు అభివృద్ధి చేయాలి.
- ప్రతి ఐదేళ్లకు ఒక దశ అభివృద్ధిని పూర్తి చేయాలి.
- 1691 ఎకరాలపై ఏడీపీకి సీఆర్‌డీఏ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) మాత్రమే ఇస్తుంది. యాజమాన్య హక్కు సీఆర్‌డీఏ వద్దే ఉంటుంది.
- అంకుర ప్రాంత అభివృద్ధి, మార్కెటింగ్, కొనుగోలుదారులతో విక్రయ, లీజు ఒప్పందాలు చేసుకునేందుకే ఏడీపీకి అధికారం ఉంటుంది. తుది సేల్ డీడ్‌పై సీఆర్‌డీఏనే సంతకం చేస్తుంది. అప్పుడే అది చెల్లుబాటవుతుంది.
- ప్రతి దశలో అభివృద్ధి చేసిన భూమిలో 70 శాతం విక్రయించి, పెట్టుబడులు తీసుకొచ్చినప్పుడే తదుపరి దశ అభివృద్ధి మొదలవుతుంది.
- అంకురప్రాంతంలో ఏడీపీ ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పించాలి. వివిధ రంగాలకు చెందిన అగ్రశ్రేణి సంస్థల్ని ఆకర్షించాలి.
- అభివృద్ధి చేసిన ప్లాట్లను వేలం ద్వారాగానీ, సంప్రదింపుల ద్వారాగానీ విక్రయించాలి. ప్రపంచంలోని అత్యుత్తమ కంపెనీలకు, పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే సంస్థలకే విక్రయించాలి.
- మొదటి దశలో విక్రయించే భూముల కనీస ధర ఎకరానికి రూ.4 కోట్లకు తగ్గకూడదు. రెండు, మూడు దశల్లో భూముల కనీస ధరను ఏడీపీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో ఏర్పాటయ్యే కమిటీ నిర్ణయిస్తుంది.

ఒప్పందంలో ప్రధానాంశాలు..

ఎస్ఏఐహెచ్, ఏడీసీ మధ్య గురువారం భాగస్వాముల (షేర్ హోల్డర్స్) ఒప్పందం జరిగింది.

- ఏడీపీలో మొత్తం ఆరుగురు డైరెక్టర్లు ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించినవారు ఇద్దరుంటారు.
- ప్రాజెక్టుకి సంబంధించిన వార్షిక వ్యాపార ప్రణాళిక, బడ్జెట్, ఆర్థిక ప్రణాళికలను ఏడీపీ బోర్డు ఆమోదించాలి.
- కంపెనీల చట్టం ప్రకారం భాగస్వామ్య కంపెనీలకు వర్తించే నిబంధనలన్నీ ఏడీపీకి వర్తిస్తాయి.

అంకుర ప్రాంత అభివృద్ధిలో ప్రధాన లక్ష్యాలు...

- రాజధానిలో ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చి, ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పించడం ద్వారా మొత్తం రాజధానికి ప్రమాణాలు నిర్దేశించడం.
- ప్రాజెక్టు మొదలైన మూడేళ్లలోగా 8.07 లక్షల చ. అడుగుల నిర్మితప్రాంతం కలిగిన బహుళ ప్రయోజకర భవనాల్ని నిర్మించాలి.
- ఈ ప్రాజెక్టు ద్వారా ఐదు నుంచి పది ప్రధాన కంపెనీల్ని ఆకర్షించాలి. 2-3 పారిశ్రామిక/వాణిజ్య క్లస్టర్లను ఈ ప్రాంతానికి తీసుకురావాలి.
- 15 ఏళ్ల వ్యవధిలో 2.50 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించాలి.
- అమరావతిలో సింగపూర్ ప్రభుత్వం ప్రాజెక్టు ఫెసిలిటేషన్ ఆఫీసు (పీఎఫ్ఓ) ఏర్పాటు చేయాలి.
- ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (ఏపీఐపీఏ), కేపిటల్ రీజియన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (క్రిపా)లను ఏర్పాటు చేయాలి.

2019లో గెలుపు చరిత్రాత్మక అవసరం

తెదేపా పోరాటంతోనే ఎన్డీఏ పతనం ఆరంభం: చంద్రబాబు

ఈనాడు, తిరుపతి: 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో గెలవాల్సిన చరిత్రాత్మక అవసరముందని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భాజపా, వైకాపాలను చిత్తుగా ఓడించాలనే దృఢ సంకల్పం ప్రతి కార్యకర్తలోనూ నెలకొందని, ఇదే స్ఫూర్తి ఎన్నికల వరకూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రాజకీయంగా పార్టీకి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని, అందరూ ఐకమత్యంతో కలిసి పని చేయాలని పేర్కొన్నారు. గురువారం రాత్రి పొద్దుపోయాక మదనపల్లెలో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 'రాబోయే ఎన్నికల్లో గెలిచే అభ్యర్థినే నిలబెడతాం. ప్రజల్లో ప్రభుత్వంపై 80శాతం సంతృప్తి ఉన్నా, స్థానిక నాయకత్వం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి' అని వ్యాఖ్యానించారు. 'స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 2014లో ఒక కాంగ్రెసేతర పార్టీ తొలిసారిగా పూర్తి స్థాయి మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారు. అదే పార్టీ ఇటీవల జరిగిన 11 అసెంబ్లీ, 4 పార్లమెంటు స్థానాల్లో ఒక్కో స్థానంలో మాత్రమే గెలిచింది. ఆ పార్టీ పతనం ప్రారంభమైంది. భాజపాతో పొత్తు లేదు కాబట్టి మైనారిటీ ఓట్లన్నీ మనకే వస్తాయి. ఉప ఎన్నికలు నిర్వహించి గెలుస్తామనే ధైర్యం భాజపా, వైకాపాలకు లేదు. పవన్ కల్యాణ్ ఇటీవల బ్రాకెట్ గురించి మాట్లాడుతున్నారు. విమర్శలు చేసేందుకు హద్దులు, పద్ధతులు ఉంటాయి. కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న భాజపా నాయకులు

ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు

- చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు ఏపీ భాజపా వినతి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఓ అధికారిక కార్యక్రమంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆంధ్రప్రదేశ్ భాజపా ఆరోపించింది. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ బృందం గవర్నర్ నరసింహన్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత కన్నా విలేకరులతో మాట్లాడుతూ 2019లో అధికారంలోకి రాలేమని గ్రహించి నరేంద్రమోదీపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల మంత్రి అఖిలప్రియ వాడిన బాష కారణంగా ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరామన్నారు. బృందంలో నేతలు కావూరి సాంబశివరావు, సుధీష్ రాంభొట్ల, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌నాయుడు, దినేష్‌రెడ్డి తదితరులున్నారు.

ఏపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నాలుగో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గవర్నర్ నరసింహన్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని గురువారం విడుదల చేసిన సందేశంలో ప్రశంసించారు.

చిత్తూరు జిల్లా చంద్రమాకులపల్లెలో ఓ వృద్ధురాలు తనకు ఇల్లు మంజూరు చేయలేదని ఫిర్యాదు చేసింది. వెంటనే మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించడంతో ఇలా ఆప్యాయంగా హత్తుకుని కృతజ్ఞతలు తెలిపింది.

కేసుల భయంతో లాలూచీ

- అందుకే భాజపాకు దగ్గరైన వైకాపా
- మదనపల్లె నవ నిర్మాణ దీక్షలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

> 'తిరుమలలోని ఓ పూజారి ద్వారా ప్రభుత్వాన్ని తిట్టిస్తున్నారు. ఆ పూజారి గురువారం జగన్‌ను కలిశారు. వారంతా కలిసి ఏవో కుట్రలు పన్నుతున్నారు. దేవుడిపైనా కుట్రలు చేసి తిరుమల పవిత్రతను నాశనం చేస్తున్నారు. స్వామిపై కుట్రలు పన్నే అందరి పాపాలు త్వరలోనే పండుతాయి'
>
> 'అవినీతి చేయాల్సిన అవసరం నాకు లేదు. ఎయిర్ ఏషియా అంశంలో ఎవరో ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటే.. దాని వెనుక నేనున్నానని పుకార్లు పుట్టించారు. చివరకు పవన్ కల్యాణ్ కూడా నాపై ఆరోపణలు చేయడం నేను ఊహించలేదు'
>
> \- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు డిజిటల్, చిత్తూరు: కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి సాక్షిగా మోదీ రాష్ట్రాన్ని మోసం చేశారని, గత ఎన్నికలప్పుడు తెదేపాతో పొత్తు పెట్టుకుని మరిన్ని సీట్లు తమ పార్టీకి రాకుండా చేశారని, ఇప్పుడేమో వైకాపాతో కలిసి కుట్రలు పన్నుతున్నారని భాజపాపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. కేసుల భయంతోనే వైకాపా భాజపాతో లాలూచీ పడిందని విమర్శించారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో గురువారం నిర్వహించిన నవ నిర్మాణ దీక్ష సభలో ఆయన ప్రసంగించారు. హోదా కోసం 29సార్లు దిల్లీ వెళ్లి అందరినీ కలిశానని, ఒక సీనియరు నాయకుడిగా ముందే తొందరపడకుండా చివరి వరకూ పోరాడానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవారికి ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నామని వివరించారు. 'ప్రస్తుతం రాష్ట్రంలో 1.63 లక్షల మంది ప్రకృతి సేద్యం చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్య 5 లక్షల వరకూ పెరిగేలా ప్రోత్సహిస్తున్నాం. ఎప్పుడు వర్షం, ఎక్కడ పిడుగుపడుతుంతో ప్రజలకు ముందస్తుగా చెప్పేలా సాంకేతికతను అభివృద్ధి చేశాం'అని తెలిపారు.

'అమిత్ షా దర్శకత్వంలో నడుస్తున్న వైకాపా ఓ డ్రామా కంపెనీలా మారింది. అందులో జగన్ కమెడియన్‌గా, ఎంపీలు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటిస్తున్నారు' అని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. మదనపల్లె సభలో ఆయన మాట్లాడారు. హోదా ఇవ్వని మోదీని వదిలేసి జగన్, పవన్ కల్యాణ్‌లు చంద్రబాబును విమర్శించడం అవివేకమని వ్యాఖ్యానించారు. మోదీని విమర్శిస్తూ.. చిత్తూరు ఎంపీ శివప్రసాద్ వేదికపై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

చంద్రమాకులపల్లి ఆదర్శం

నవ నిర్మాణ దీక్షలో భాగంగా చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలోని చంద్రమాకులపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గ్రామాన్ని 11 స్టార్ గ్రామంగా ప్రకటించారు. ప్రజలతో ముచ్చటించారు. 'సాంకేతిక పరిజ్ఞానాన్ని పల్లెలకు తీసుకొచ్చాం. ఇప్పుడే ఈ గ్రామస్థుడొకరు బెంగళూరులో పనిచేసే తన అబ్బాయితో వీడియో కాల్‌లో మాట్లాడారు. ఫైబర్ నెట్ ద్వారా సినిమాలు చూస్తున్నారు. అంతర్జాలం ద్వారా ఇంట్లోనే చదువుకుంటున్నారు. అన్ని సౌకర్యాలు మన దగ్గరకే వస్తున్నాయి. ఇదే తెదేపా ప్రభుత్వ పాలన ప్రత్యేకత' అని పేర్కొన్నారు. 'చంద్రమాకులపల్లె అమరావతి కంటే బాగుంది. అక్కడే ఉండిపోవాలనిపించింది. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో ఊహించని విధంగా అభివృద్ధి జరిగింది. ఓ మారుమూల గ్రామం ఇంతలా అభివృద్ధి చెందడం తెదేపా ప్రభుత్వంతోనే సాధ్యం' అని మదనపల్లె సభలో పేర్కొన్నారు.

రాష్ట్రం ఓడీఎఫ్

మదనపల్లెలో జరిగిన నవ నిర్మాణ దీక్షలో రాష్ట్రాన్ని బహిరంగ మల విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ముఖ్యమంత్రి ప్రకటించారు. మహిళలకు, వారి ఆత్మ గౌరవానికి ప్రాముఖ్యమిచ్చి దీనిని సాధించామని, వంట చేసే సమయంలో వారు ఇబ్బందులు పడకూడదని 'దీపం' పథకం కింద వంద శాతం గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామని ఆయన తెలిపారు. అతి తక్కువ కాలంలో అత్యధిక మరుగుదొడ్లను నిర్మించి చిత్తూరును ఓడీఎఫ్‌గా ప్రకటించడంపై కలెక్టర్ ప్రద్యుమ్నను అభినందించారు.

గురువారం మదనపల్లెలో ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు ఇచ్చారు. జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమం: సీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి చేకూరుస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నవ నిర్మాణ దీక్షలపై ఆయన గురువారం ఉదయం అమరావతి నుంచి కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మానవ జీవితంలోని అన్ని దశల్లో సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని చంద్రబాబు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా ఎడ్మర్ మండలానికి చెందిన రెవెన్యూ అధికారి రెడ్డప్ప ఈ నెలలో తన పదవీ విరమణను పురస్కరించుకుని రాజధానినిర్మాణానికి రూ.లక్ష విరాళం ప్రకటించడాన్ని సీఎం అభినందించారు. 5 వరోజు దీక్షలో 34.80 లక్షల మంది పాల్గొన్నారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య పెరగాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు బాగున్నాయని 56 శాతం మంది తెలిపినట్లు పేర్కొన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పనపై ప్రభుత్వ చర్యలు బాగున్నాయని 56 శాతం అభిప్రాయపడినట్లు తెలిపారు.

ANDHRA UNIVERSITY
VISAKHAPATNAM-530003,A.P
APSCHE, Guntur

REGISTRATION OF GATE / GPAT QUALIFIED CANDIDATES

NOTIFICATION

GATE/GPAT qualified and eligible candidates are informed to register through online from 12-06-2018 for admission into M.E/M.Tech/M.Pharm/Pharm-D (PB) courses in University and affiliated unaided private Engineering/ Pharmacy Colleges in AP State. The registration fee for SC/ST Candidates is Rs.300/- and for others it is Rs.600/-. Payment of registration fee and submission of application shall be made online at https://sche.ap.gov.in/pgecet/gate For details visit the website. Schedule for counselling will be notified separately.

Date: 07-06-2018 Convener
Place:Visakhapatnam APPGECET-2018

ప్రధాని పలకరింత.. విజయబాబు పులకరింత

గుంటూరు, తెనాలి, న్యూస్‌టుడే: తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న విజయబాబును ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. 'బాగున్నారా' అని తెలుగులో పలకరించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలపై గురువారం ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా.. గుంటూరు జిల్లా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిడుబ్రోలుకు చెందిన విజయబాబుతో ప్రధాని మాట్లాడారు. గుంటూరు కలెక్టరేట్ ఇందుకు వేదిక అయ్యింది. డయాలసిస్ కేంద్రంలో అందుతున్న వైద్య సేవల గురించి ఈ సందర్భంగా విజయబాబును ప్రధాని వివరాలు అడిగారు. అందుకు ఆయన బదులిస్తూ.. బయట డయాలసిస్ చేయించడం భారంగా మారిందని, ఇంతలో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సంగతి తెలిసి వైద్యులను సంప్రదించానని తెలిపారు. అప్పటి నుంచి 18 నెలలగా డయాలసిస్ సేవలు పొందుతున్నానని వివరించారు. మందులకు ఎక్కువ నగదు ఖర్చు అవుతోందని చెప్పారు. జనఔషధిలో కొంటున్నారా లేదా అని ప్రధాని అడగ్గా.. అక్కడే తీసుకుంటున్నానని బదులిచ్చారు. విజయబాబు తెలుగులో చెప్పిన వివరాలన్నింటినీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సనత్‌కుమారి హిందీలో ప్రధానికి వివరించారు.

కర్ణాటకలో 'కాలా'కు అడ్డంకులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన కాలా చిత్రం విడుదలకు ఉన్నత, సర్వోన్నత న్యాయస్థానాలు అనుమతి మంజూరు చేసినా, చిత్ర ప్రదర్శన గురువారం సాధ్యం కాలేదు. మంగళూరు మినహా కర్ణాటక రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చిత్ర ప్రదర్శన రద్దయింది. గోల్డి ఫిలింస్ ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు చర్యలు తీసుకున్న తరువాత ఆందోళనలు వ్యక్తమయ్యాయి. వారు వెనక్కు తగ్గటంతో పంపిణీదారుడు కనకపుర శ్రీనివాస్ ముందుకు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 130 థియేటర్లలో ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. అన్ని థియేటర్లు, మాల్స్‌లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. సినిమాను విడుదల చేయకూడదని డిమాండ్ చేస్తూ థియేటర్ల వద్ద కన్నడ సంఘాల కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. తుమకూరు, మైసూరు, చామరాజనగర, బెళగావి, బళ్లారి, శివమొగ్గ, రాయచూరు తదితర జిల్లాల్లో చిత్ర ప్రదర్శన ఉంటుందని బుధవారం ప్రకటించిన థియేటర్ల యాజమాన్యాలు గురువారం రద్దు చేసినట్లు ప్రకటించాయి. మంగళూరులోని బిగ్ సినిమాస్, పీవీఆర్ సినిమాస్‌లో మాత్రం కాలా చిత్రాన్ని ప్రదర్శించారు. బెంగళూరులో గురువారం రాత్రి రెండు షోలను ప్రదర్శించారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం అంకిత భావంతో సేవలందించాలని యువ ఐఏఎస్‌లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన 2017 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ఐఏఎస్‌లు గురువారం సచివాలయంలో సీఎస్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎస్ కాసేపు వారితో ముచ్చటించారు. దేశంలోనే ప్రగతిశీల రాష్ట్రంగా అభివృద్ధి చెందుతున్న ఏపీకి ఎంపిక కావడం అదృష్టంగా భావించాలన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి
(విద్యాశాఖ)
పత్రికా ప్రకటన (D1/10252/DEO/2015)

శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీర్వాదముతో టి.టి.డి. నిర్వహిస్తున్న రెండు జూనియర్ కళాశాలలలో 2018 - 19 విద్యాసంవత్సరము నందు విద్యార్థుల ప్రవేశము కొరకు ఈ నెల 16వ తేదీ నుండి http://admission.tirumala.org ద్వారా ఆన్‌లైన్ నందు దరఖాస్తులను ఆహ్వానించడమైనది. ఇందుకు విద్యార్థుల నుండి చాలా ఎక్కువ స్పందన వచ్చింది. ఈ రెండు కళాశాలల్లోగల మొత్తం సీట్లు 1760 కాగా దరఖాస్తు చేయుటకు ఆఖరి తేదీ అయిన 01-06-2018 నాటికి 8149 మంది అమ్మాయిలు, 7070 మంది అబ్బాయిలు మొత్తం 15219 మంది విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నారు. ఆన్‌లైన్ నందు దరఖాస్తు చేసుకొన్న అర్హులైన విద్యార్థినీ విద్యార్థులకు తేదీ 11-06-2018 నుండి 14-06-2018 వరకు శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల నందు కౌన్సిలింగ్ నిర్వహించి ప్రభుత్వము నిర్దేశించిన రిజర్వేషన్ల ప్రకారము విద్యార్థులు వారు పదవ తరగతి నందు సాధించిన మార్కుల ఆధారంగా వారి ఛాయిస్ ప్రకారం ఇంటర్మీడియట్ నందలి వివిధ గ్రూపులలోను మరియు వసతి గృహములందు ప్రవేశము కల్పించడము జరుగుతుంది. పై కౌన్సిలింగునకు ఏ విద్యార్థి ఏ తారీఖునాడు ఏ సమయమునకు హాజరు కావలయుననే విషయము, వారు చెల్లించవలసిన ఫీజులు మరియు కౌన్సిలింగునకు తమవెంట తీసుకురావలసిన ధ్రువీకరణ పత్రములు మొదలగు విషయములు http://admission.tirumala.org నందు తెలియపరచడము జరిగింది. కావున విద్యార్థులు పై వెబ్‌సైట్ నందు వివరములను పరిశీలించి వారికి కేటాయించిన తేదీ నాడు కేటాయించిన సమయమునకు అవసరమైన ధ్రువపత్రములతో హాజరు కావలసినదిగా తెలియజేయడమైనది. అట్లు హాజరు కాని విద్యార్థిని విద్యార్థులకు కళాశాలలందు ప్రవేశము కల్పించడము వీలుకాదు మరియు సంక్షిప్త సమాచారము అందినంత మాత్రమున సీటు కేటాయించబడినట్లు కాదు. కళాశాలలోని సీట్లను మెరిట్ ప్రాదిపదికపై రిజర్వేషన్ల వారీగా కేటాయించడము జరుగుతుంది.

సం/- కార్యనిర్వహణాధికారి

Roc.No.PR4/1090/Adv.No.95/PRO/2018, Dated: 7.06.2018.

మేధావుల అరెస్టు అప్రజాస్వామికం

- ప్రజా, పౌరహక్కుల సంఘాల ప్రతినిధుల నిరసన

హక్కుల కార్యకర్తల అరెస్టుకు నిరసనగా ట్యాంక్‌బండ్‌పై ఆందోళన చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

హైదరాబాద్, న్యూస్‌టుడే, దిల్లీ: మహారాష్ట్రలోని భీమా కోరేగాంలో గత జనవరిలో చోటుచేసుకున్న అల్లర్లకు సంబంధించి బాధ్యులను కాకుండా ప్రజాసమస్యలపై పోరాడుతున్న మేధావులను అరెస్టు చేయడం దారుణమని ప్రజా, పౌరహక్కుల సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన ధర్నాలో విరసం నాయకుడు వరవరరావు, పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు, టీపీఎఫ్ నాయకుడు చిక్కుడు ప్రభాకర్, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దిల్లీ, మహారాష్ట్రలలో అరెస్టు చేసిన దళిత ఉద్యమ నేత, సంపాదకుడు సుధీర్ ధవాలే; నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అధిపతి ప్రొఫెసర్ షోమా సేన్; సామాజిక కార్యకర్త మహేష్ రౌత్; రాజకీయ ఖైదీల విడుదల కమిటీ సభ్యుడు రోనా విల్సన్; ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్ సభ్యుడు సరేంద్ర గాడ్లింగ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కాల్పులు, అల్లర్లకు బాధ్యులైన ఆరెస్సెస్, భజరంగ్‌దళ్ సంస్థలకు చెందిన వారిని వదిలేసి మేధావులను వేధించడం ప్రజాగొంతును నొక్కే ప్రయత్నమేనని అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. మేధావుల అరెస్టులకు నిరసనగా గురువారం దిల్లీ జంతర్‌మంతర్ వద్ద పలు సంస్థలు నిరసన ప్రదర్శన జరిపాయి. హక్కుల కోసం పోరాడుతున్న వారిని ప్రభుత్వం మావోయిస్టులన్న ముద్ర వేస్తోందని వక్తలు ఆరోపించారు.

మావోయిస్టులతో కాంగ్రెస్‌కు సంబంధాలు: భాజపా

మావోయిస్టులతో కాంగ్రెస్‌కు సంబంధాలు ఉన్నాయని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రభంజనాన్ని అడ్డుకునే విధంగా అల్లర్లు సృష్టించడానికి మావోయిస్టులకు కాంగ్రెస్ నుంచి నిధులు అందాయని, ఈ విషయం ఆ నిషిద్ధ సంస్థ లేఖలో వెల్లడయిందని చెప్పారు.

kotak Securities

ఫ్రీ ఇంట్రాడే ట్రేడింగ్

క్యాష్, ఫ్యూచర్స్ మరియు ఆప్షన్స్‌లో

మీ ఫ్రీ ఇంట్రాడే ట్రేడింగ్ అకౌంట్‌ని తెరవడానికి
FIT అని 56161కి SMS పంపండి
లేదా 70667 70667కి మిస్డ్ కాల్ ఇవ్వండి

Terms and Conditions apply.

#FIT

సాంవత్సరిక సబ్‌స్క్రిప్షన్ ఫీ ₹999 వర్తిస్తుంది.

Kotak Securities Limited. Registered Office: 27 BKC, C 27, G Block, Bandra Kurla Complex, Bandra (E), Mumbai 400051. CIN: U99999MH1994PLC134051, Telephone No.: +22 43360000, Fax No.: +22 67132430. Website: www.kotaksecurities.com. Correspondence Address: Infinity IT Park, Bldg. No 21, Opp. Film City Road, A K Vaidya Marg, Malad (East), Mumbai 400097. Telephone No: 42856825. SEBI Registration No: NSE INB/INF/INE 230808130, BSE INB 010808153/INF 011133230, MSE INE 260808130/INB 260808135/INF 260808135, AMFI ARN 0164, PMS INP000000258 and Research Analyst INH000000586. NSDL/CDSL: IN-DP-NSDL-23-97. Brokerage will not exceed the SEBI prescribed limit. To avail the benefits of Free Intraday Trading product, customers need to open an account with Kotak Securities. Terms and conditions apply. Investments in securities market are subject to market risks, read all the related documents carefully before investing. Disclaimer: http://bit.ly/TCfit

ఎన్నికల ఏడాది..

పథకాల బాట మీదే..

పయనం!

అప్పుడంతా అయోమయం!

విభజన ఉత్పాతం.. అది మోసుకొచ్చిన అనిశ్చితి.. ఈ బాలారిష్టాల్లోనే హుద్‌హుద్ వంటి ఉపద్రవాలు.. అయినా 'అవశేషాంధ్ర'లా విలవిల్లాడకుండా.. విశ్వాసంతో నిబ్బరంగా నిలబడింది నవ్యాంధ్రప్రదేశ్!

అంతేకాదు.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నాలుగేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలన్న లక్ష్యంతో పలు పథకాలకు శ్రీకారం చుట్టారు. రాజధానిని అందమైన, అత్యాధునిక అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు బృహత్ ప్రణాళిక సిద్ధం చేశారు. పట్టిసీమతో వడివడిగా జలకళ తెచ్చారు. చిరకాల స్వప్నమైన పోలవరం వేగం పెంచారు. ఈ-పాలనతో, మరెన్నో పథకాలతో ప్రజలందరినీ ప్రతిక్షణం పలకరిస్తున్నారు.

ఇప్పుడీ ఎన్నికల ఏడాదిలో.. ఈ ప్రణాళికలు, పథకాలే అజెండాగా ప్రజల ముందుకు వెళ్లటం తథ్యం! దీంతో విపక్షాల చర్చోపచర్చలూ ఈ ఏడాదంతా వీటి చుట్టూనే తిరగటం సహజం! అందుకే తెదేపా సర్కారు ఐదో ఏట అడుగుపెడుతున్న ఈ తరుణంలో ఈ కీలక పథకాలు, ప్రణాళికలేమిటి? వీటి విశిష్టతలేమిటన్న సమీక్ష సముచితం, సందర్భోచితం!!

చంద్రన్న బీమా

#1: నిరుపేదకు ధీమా

ఒకప్పుడు ఇంటి పెద్ద మరణిస్తే నిరుపేద కుటుంబాలు కుదేలయ్యే పరిస్థితి. చదువుకునే పిల్లలు అనాథలుగా మారి కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి. అలాంటి బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు 'చంద్రన్న బీమా'తో ధీమా నింపుతోంది. యజమాని మరణంతో కుంగిపోయిన కుటుంబానికి అండగా నిలుస్తోంది. అసంఘటిత రంగంలోని కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు పది రోజుల్లోనే రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించి నిలదొక్కుకునేలా చేస్తుంది. రాష్ట్రంలో 2.47 కోట్ల మంది అంటే దాదాపు సగం జనాభా ఈ పథకం పరిధిలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాటిలో అత్యంత విజయవంతమైన పథకమిది. బాధిత కుటుంబాల్లోని పిల్లలకు రూ.444 కోట్లు ఉపకార వేతనాలుగా అందాయి. 2015లో రవాణా రంగంలోని కార్మికుల కోసం ప్రారంభించిన ఈ పథకం అనంతరం అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ వర్తించేలా ప్రభుత్వం మార్పులు చేసింది.

చంద్రన్న బీమా కింద గత రెండేళ్లలో 1.52 లక్షల కుటుంబాలకు రూ.2 వేల కోట్ల సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించింది.

- చంద్రన్న బీమా పథకంలో చేరాలంటే.. రూ.15 వేల కన్నా తక్కువ జీతం వచ్చే 18-70 ఏళ్ల మధ్య వయసున్న అసంఘటిత రంగంలోని కార్మికులంతా ఈ పథకానికి అర్హులు. ప్రజా, సాధికార సర్వేలో నమోదుచేసుకొని ఉండాలి.
- 18-50 ఏళ్ల మధ్య పాలసీదారుల సహజ మరణానికి రూ.2 లక్షలు, 51-60 ఏళ్ల మధ్య వారికి రూ.30 వేలు సహాయంగా అందుతాయి.
- ప్రమాద బాధితుల కుటుంబాల్లోని చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.1200 చొప్పున ఉపకార వేతనం ఇస్తోంది. రెండేళ్లలో 37 లక్షల మందికి రూ.444 కోట్ల ఉపకార వేతనం అందింది.
- పూర్తి అంగవైకల్యానికి రూ.5 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.2.50 లక్షలు ఇస్తున్నారు.

ఎక్కడా మధ్యవర్తుల్లేకుండా అవినీతికి ఆస్కారం లేకుండా పరిహారం చెల్లింపు మొత్తం పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తుండటం ఈ పథకం ప్రత్యేకత.



పోలవరం

#2: నవ్యాంధ్రకు జీవనాడి

2014 జూన్

బహుళార్థ సాధక ప్రాజెక్టును నిర్మించే ఆ ప్రాంతం నిశ్శబ్దంగా ఉంది. ఉభయ గోదావరి జిల్లాల్లోని 10 గిరిజన గ్రామాలు అక్కడ ఉన్నాయి. సరైన పునరావాసం, ప్యాకేజీ ఇస్తేనే ఊరు వదులుతామని గిరిజనులు తెగేసిచెబుతున్నారు. పనులు ఎలా చేస్తామని గుత్తేదారు ప్రశ్న. అవకాశం ఉన్నంతే చేయండి అంటూ అధికారుల నుంచి సమాధానం. ప్రాజెక్టు పనులు సాగకపోవడానికి ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్న దృశ్యం అది. పోలవరం పూర్తవుతుందనే నమ్మకం ఏ కోశానా లేని రోజులవి.

2018 జూన్ 8

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సగానికి పైగా పూర్తయింది. ఎంతో సవాలుతో కూడుకున్న గోదావరి అంతర్భాగ డ్యాంల నిర్మాణం కొలిక్కి వచ్చేసింది. దేశంలో ఇంతవరకూ ఎక్కడా నిర్మించనంతటి డయాఫ్రం వాల్ నిర్మాణం ఇక నాలుగు రోజుల్లో పూర్తి కానుంది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో పునాది పనులుగా పేర్కొనే జెట్ గ్రౌటింగ్ పనులు మూడొంతులకు పైగా పూర్తయ్యాయి. గడిచిన మూడేళ్లలో పోలవరంలో సాధించింది అంతా ఇంతా కాదు. స్పిల్ వే పనులు ఊపందుకున్నాయి. సమాంతరంగా ప్రాజెక్టుకు తలుపుల తయారీ కొలిక్కి వచ్చేసింది. మట్టి పని భారీ ఎత్తున జరిగింది.

-ఇక పోలవరం ఒక భరోసా. 2020 నాటికైనా ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు కాలువల్లో ప్రవహించడం ఖాయమనే నమ్మకం ఏర్పడుతోంది. 194.66 టీఎంసీల నీటిని నిల్వచేసే స్థాయిలో పునరావాసం పూర్తి కాకపోవచ్చేమో కానీ... 42.5 మీటర్ల స్థాయికి అన్ని పనుల్ని పూర్తిచేసి పోలవరంలో నీళ్లు నిలబెట్టి కాలువల ద్వారా మళ్లించే కల ఒక ఏడాది, రెండేళ్లలో సాకారమవుతుందనే నమ్మకాన్ని ఈ పనులు కల్పిస్తున్నాయి.

పోలవరంపై ఇప్పటి వరకు చేసిన ఖర్చు

రూ.13,466 కోట్లు

2014లో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక రాష్ట్రం చేసిన ఖర్చు

రూ.8330.55 కోట్లు

కేంద్రం రాష్ట్రానికి తిరిగి ఇచ్చింది

రూ.5342.26 కోట్లు

(మరో రూ.1400 కోట్లు తిరిగి ఇచ్చేందుకు ఏర్పాట్లు సిద్ధం)

ఇదీ ప్రాజెక్టు...

- నిల్వ సామర్థ్యం- 194.60 టీఎంసీలు
- లైవ్ స్టోరేజీ- 75.20 టీఎంసీలు
- విద్యుదుత్పత్తి- 960 మెగావాట్లు
- కృష్ణాకు నీటి మళ్లింపు- 80 టీఎంసీలు
- కొత్తగా నీరిచ్చేది- విశాఖ, ఉభయగోదావరి జిల్లాల్లో 15.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు
- విశాఖకు తాగు నీరు - 23.44 టీఎంసీలు
- ఆయకట్టు స్థిరీకరణ- 8 లక్షల ఎకరాలు(ఉభయ గోదావరి, కృష్ణా డెల్టాల్లో 23.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగం)
- తాగునీటి సౌకర్యం- 540 గ్రామాల్లోని 28.5 లక్షల మందికి
- ఇతర రాష్ట్రాలకు నీటి మళ్లింపు- ఒడిశాకు 5 టీఎంసీలు, ఛత్తీస్‌గఢ్‌కు 1.5 టీఎంసీలు

పరిశ్రమలు

#3: కొత్త ఒరవడి

పారిశ్రామిక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. విభజన తర్వాత- గత నాలుగేళ్లలో ఏపీకి అనేక పరిశ్రమలు వచ్చాయి. కియా మోటార్స్, అపోలో టైర్స్, హీరో మోటార్స్.. ఇవన్నీ రాష్ట్ర పారిశ్రామిక రంగంలో ఒక చరిత్ర. దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ భారత్‌లో తన మొట్టమొదటి కార్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్రానికి రావటం విశేషం. ఈ యూనిట్‌ను కియా అనంతపురం జిల్లాలో రూ13,500 కోట్లతో ఏర్పాటు చేస్తోంది. దీనికోసం ప్రభుత్వం ఎకరా రూ.6 లక్షల చొప్పున 580 ఎకరాలకుపైగా భూమిని కేటాయించింది. మౌలిక సదుపాయాలు, ఇతర రాయితీల కింద మరో రూ.650 కోట్లను ఖర్చు చేసింది. కియా మోటార్స్ పనులు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 11,000 మందికి పైగా ఉపాధి లభిస్తుంది. అపోలో టైర్స్, హీరో మోటార్స్‌తోనూ ఇలాంటి ప్రయోజనమే చేకూరనుంది.

కియా కార్ల యూనిట్ కోసం ఇతర రాష్ట్రాలూ ప్రయత్నించినా... చివరికి ఏపీనే నెగ్గింది.

పట్టిసీమ

#4: కరవు సీమలో నీటి కళ

కృష్ణా, గోదావరి నదుల అనుసంధానంలో కీలక అధ్యాయం పట్టిసీమ ఎత్తిపోతల పథకం. నీళ్లు వృథాగా పోతున్న చోట నుంచి కరవుతో అల్లాడుతున్న చోటికి మళ్లించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషించింది. ఒక్క కృష్ణా డెల్టాలోనే రూ.18 వేల కోట్ల పంటను రైతుల ఇళ్లకు చేర్చింది. గోదారమ్మకు రాయలసీమతో బంధమేసింది. రాయలసీమకు రూ.7,400 కోట్ల ప్రయోజనాన్ని అందించింది. గడిచిన మూడేళ్లలో కృష్ణా డెల్టాకు 138 టీఎంసీల నీళ్లిచ్చింది. శ్రీశైలం నుంచి దిగువకు నీరు వదలనవసరం లేకుండానే నేరుగా సీమ జిల్లాలకు నీటిని తరలించే భరోసా ఇచ్చింది. రెండేళ్లలో సీమకు ఏకంగా 200 టీఎంసీలను మించిన నీళ్లు ఇచ్చింది. చెరువులను నీళ్లతో నింపింది. వేసవి ఎద్దడిని తీర్చింది.

2017-18లో కృష్ణా డెల్టా కింద 1081608 ఎకరాలు సాగవ్వగా దానికోసం 118.01 టీఎంసీల నీరు అవసరమైంది. అందులో 85.66 టీఎంసీల నీరు ఒక్క పట్టిసీమ ద్వారానే అందటం విశేషం.

పట్టిసీమ ఇచ్చింది 160 టీఎంసీలు

గోదావరి వరదను 160 టీఎంసీలుగా పట్టిసీమ ఎత్తిపోసింది. పోలవరం కుడి కాలువ మార్గంలో పంటలకు, తాగునీటికి కొంత పోగా కృష్ణా డెల్టా పొలాల్లో 138 టీఎంసీలు పారింది. కృష్ణ నుంచి ప్రవాహాలే నామమాత్రమై శ్రీశైలంకూ చుక్కనీరూ దక్కని రోజుల్లో 10 లక్షలకు పైగా ఎకరాల్లో ఈ పథకం జీవం పోసింది. ఖర్చు పెట్టింది దాదాపు 1600 కోట్ల పైమాటే అయినా.. రూ.వేల కోట్ల పంటను ఇళ్లకు చేర్చింది. 2015-16 నుంచి గోదారమ్మ ఈ ఎత్తిపోతల రూపంలో ఎలా ఆదుకుందో గమనిస్తే....

రాయలసీమకూ ప్రాణాధారమై...

కృష్ణమ్మలో ప్రవాహాలు తగ్గిపోతున్న తాజా వాస్తవంలోనూ పట్టిసీమ రాయలసీమకు జీవాధారమవుతోంది. ఈ నీటి వల్ల రాయలసీమలోని అనేక చెరువులు, కాలువలు జలకళను సంతరించుకున్నాయి. జలాశయాల్లో నీటిని నింపగలిగారు. గత రెండు సంవత్సరాలుగా 100 టీఎంసీలకు పైగా నీటిని రాయలసీమకు శ్రీశైలం నుంచి ఇవ్వగలిగారు. 2016లో రూ.3060 కోట్ల పంట సాధించారు. 2017లో రూ.4300 కోట్ల వరకు దిగుబడులు వచ్చాయని ఒక అంచనా. తాగునీటి పథకాలకు రెండేళ్లలో నీటిని ఎత్తిపోయకుండా ఏటవాలుగా సరఫరా చేయడమూ వ్యయాన్ని తగ్గించి ప్రయోజనం కల్పించింది.

సంవత్సరం	శ్రీశైలం జలాశయం నుంచి (టీఎంసీల్లో)
2016-17	104.67
2017-18	138.56

పరిశ్రమల పురోగతి

ఇప్పటికే ప్రారంభమైనవి
రూ.38,919 కోట్ల పెట్టుబడులతో..
334 పరిశ్రమలు వచ్చాయి!
1,32,332 మందికి ఉపాధి దక్కింది.

»

ప్రారంభానికి సిద్ధం
రూ.1,512 కోట్లతో..
14 పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధం!
వీటితో మరో 2,634 మందికి ఉపాధి తథ్యం!

»

త్వరలో రానున్నవి
మరో 153 పరిశ్రమల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
ఇవి ప్రారంభమైతే 1,73,618 మందికి ఉపాధి లభిస్తుంది.

»

మున్ముందు
691 పరిశ్రమలు నెలకొల్పేందుకు ఇటీవలే సివిల్ పనులు మొదలయ్యాయి

»

మొత్తం నాలుగేళ్లలో
రూ.4,55,692 కోట్లతో 1193 పరిశ్రమలు నెలకొల్పేందుకు ఒప్పందాలు జరిగాయి.
వీటితో 13,53,655 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా

ఈనాడు
విజయవాడ
శుక్రవారం జూన్ 8, 2018
7

#5: ఆంధ్రకు చుక్కాని

అసెంబ్లీ భవనం

రాజధాని అమరావతి రూపంలో ఒక మహా నగరాన్ని నిర్మించే అవకాశం ఆంధ్రప్రదేశ్‌కు లభించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో కొత్తగా నిర్మిస్తున్న అతి పెద్ద నగరం ఇదే..! 217 చ.కి.మీ.ల విస్తీర్ణం(53,748 ఎకరాలు)లో అమరావతి నిర్మాణం జరుగుతోంది. ప్రపంచంలోని ఆధునిక నగరాలతో పోలిస్తే అత్యంత వేగంగా నిర్మాణం

అమరావతి నిర్మాణానికి సింగపూర్, జపాన్, జర్మనీ, ఇంగ్లండ్ వంటి దేశాల ఆసక్తి!

జరగడం అమరావతి ప్రత్యేకత. భూ సమీకరణ మొదలుపెట్టిన మూడున్నరేళ్లలోనే వివిధ ప్రణాళికలు, ఆకృతులు సిద్ధంచేసుకుని నిర్మాణాలూ ప్రారంభించారు. మరో ఆరు నెలల్లో రాజధానిలో నిర్మాణాలన్నీ పూర్తిస్థాయిలో మొదలవుతాయి. ప్రస్తుతం రూ.24 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. వచ్చే కొన్ని నెలల్లో మరో రూ.ఆరేడు కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలవనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అమరావతిని నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

- రైతులకు పదేళ్ల కౌలు చెల్లించడం, భూమిలేని పేదలకు నెలకు రూ.2500 చొప్పున పదేళ్లపాటు పింఛను, గూడులేని నిరుపేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం వంటివి ఇక్కడి ప్రత్యేకతలు.
- మొత్తం సీఆర్‌డీఏ ప్రాంతానికి, రాజధాని అమరావతికి, సీడ్ కేపిటల్‌కు సింగపూర్ ప్రభుత్వం వేర్వేరుగా ప్రణాళికలు రూపొందించి ఇచ్చింది. ఇవన్నీ వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పకడ్బందీగా రూపొందించిన ప్రణాళికలు.
- 45.129 ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక సచివాలయం, శాసనసభ భవనాలను ప్రభుత్వం ఏడు నెలల్లో నిర్మించింది. 2017 మార్చిలో బడ్జెట్ సమావేశాలు మొదలుకొని శాసనసభ సమవేశాలూ ఇక్కడే నిర్వహిస్తోంది.
- రాజధానిలో 9 థీమ్ సిటీలు, 29 టౌన్‌షిప్‌లు ఉంటాయి. గ్రిడ్ ప్యాటర్న్‌లో టౌన్‌షిప్‌లను డిజైన్ చేశారు. కార్యాలయాలు, ఆసుపత్రులు, షాపింగ్, వినోద కేంద్రాలు వంటి వసతులన్నీ... 10-15 నిమిషాల నడక దూరంలోనే ఉండేలా తీర్చిదిద్దడం విశేషం.

భేషుగ్గా భూ సేకరణ

- రైతుల నుంచి స్వచ్ఛందంగా భూములు తీసుకోవడానికి అమలుచేసిన భూ సమీకరణ విధానం దేశంలోనే వినూత్నం.
- 34 వేల ఎకరాలు రైతుల నుంచి తీసుకున్నారు. ఇంత భారీఎత్తున భూ సమీకరణ దేశంలో ఎక్కడా జరగలేదు.
- రైతులతో స్వయంగా ముఖ్యమంత్రే పలు దఫాలు సంప్రదింపులు జరిపి మెరుగైన ప్యాకేజీ ఇచ్చారు.
- రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తున్నారు. 28–29% భూమి రైతులకు తిరిగి వెళుతోంది.

సచివాలయం

హైకోర్టు భవనం

(నమూనా చిత్రాలు)

విద్యుత్తు రంగం

#6: సంక్షోభం నుంచి 'వెలుగుల' వైపు

గంటల తరబడి విద్యుత్తు కోతలు.. పరిశ్రమలకు పవర్ హాలీడేలు..రోజుకు 22 మిలియన్ యూనిట్ల కొరత- రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ రంగ పరిస్థితి ఇది. తెదేపా అధికారం చేపట్టిన ఆరు నెలల వ్యవధిలోనే ఈ సంక్షోభం నుంచి రాష్ట్రం పూర్తిగా గట్టెక్కింది. మిగులు విద్యుత్తు సాధించే స్థాయికి చేరుకుంది. పవర్ హాలీడేల మూలంగా పరిశ్రమలు మూతపడటం, ఇతర రాష్ట్రాలకు తరలిపోవడం, పెట్టుబడి దారులు రావడానికే భయపడే పరిస్థితి నుంచి దిగ్గజ పరిశ్రమల యూనిట్లు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పే స్థాయికి విద్యుత్తు సరఫరా మెరుగుపడింది. కోతల్లేకుండా వినియోగదారులకు నిరంతర విద్యుత్తు అందించే స్థాయికి ఎదిగింది.

నాలుగేళ్లలో విద్యుత్ రంగం **అంతా మంచే**

అంశం	2014లో	2018లో
ఉత్పాదక సామర్థ్యం	9,529 మెగావాట్లు	18,046 మెగావాట్లు ↑
సరఫరా, పంపిణీ నష్టాలు	12.10 %	9.72 % ↓
తలసరి విద్యుత్తు వినియోగం	957 యూనిట్లు	1101 యూనిట్లు ↑
సౌర విద్యుత్తు ఉత్పాదన సామర్థ్యం	57 మెగావాట్లు	2,147 మెగావాట్లు ↑
పవన విద్యుత్తు ఉత్పాదన సామర్థ్యం	732 మెగావాట్లు	3952 మెగావాట్లు ↑

- కాలుష్య రహిత పునరుత్పాదక ఇంధన సామర్థ్యం పెంపు రాష్ట్రంలో పెద్ద ఉద్యమంలా సాగింది. ఐదురెట్ల మేర సామర్థ్యాన్ని పెంచుకుంది. గత నాలుగేళ్ల వ్యవధిలో 5310 మెగావాట్ల సౌర, పవన విద్యుదుత్పాదక సామర్థ్యం సాధించిన ఘనత ఏపీ సొంతమైంది.
- దేశంలోనే అన్ని చోట్లా ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటుచేసిన తొలి జిల్లాగా తూర్పుగోదావరి ఘనతకెక్కింది.
- భవిష్యత్తులో విద్యుత్తు ఛార్జీలు పెంచ బోమని ప్రకటించిన తొలి రాష్ట్రంగా ఏపీ గుర్తింపు పొందింది.
- 2016 జూన్ నాటికి రాష్ట్రంలోని అన్ని గృహాలకు విద్యుత్తు కనక్షన్లు ఇచ్చిన మూడో రాష్ట్రంగా గుర్తింపు పొందింది.
- **ఎల్‌ఈడీ బల్బులు:** ఇంధన పరిరక్షణ, సామర్థ్య చర్యల పెంపులో భాగంగా రూ.218 కోట్ల విలువైన 2.18 కోట్ల ఎల్‌ఈడీ బల్బులను రాష్ట్రవ్యాప్తంగా అమర్చారు.
- **సౌర విద్యుత్తు పంపుసెట్లు:** ఒక్కోటి రూ.5 లక్షల విలువైన పంపుసెట్లును రూ.55 వేలకే అంది స్తున్నారు. ఇప్పటివరకూ 25 వేల పంపుసెట్లు పంపిణీ చేశారు.
- గత నాలుగేళ్లలో కృష్ణపట్నం క్రిటికల్ థర్మల్ విద్యుత్తు, నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ జల విద్యుత్తు, ఆర్‌టీపీపీ నాలుగో దశ విద్యుత్కేంద్రాలు ప్రారంభమయ్యాయి.
- 2017-18లో విద్యుత్తు కొనుగోలులో 17 శాతం పునరుత్పాదక విద్యుత్తు రంగం నుంచే సేకరించగా.. 2014-15లో ఇది 5 శాతం మాత్రమే.

రియల్‌టైం గవర్నెన్స్

#7: పరిపాలనలో అత్యాధునికత

ఐటీ, ఆధునిక పరిజ్ఞానాల్ని ఉపయోగించి ప్రజలకు ఆన్‌లైన్‌లో సేవలందించే ప్రక్రియల్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నతస్థాయికి తీసుకెళ్లింది. అవినీతికి ఆస్కారం లేకుండా, ప్రజలకు మెరుగైన, పారదర్శక పాలన, సత్వర సేవలందించేందుకు, దుబారాను, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రియల్‌టైం గవర్నెన్స్, ఇ-ప్రగతి, ఇ-ఆఫీసు వంటి వినూత్న విధానాల్ని దేశంలోనే మొదటిసారిగా అమల్లోకి తెచ్చింది.

రియల్‌టైం గవర్నెన్స్

అది విజయవాడ సమీపంలోని ఒక భవనం. కార్పొరేట్ కార్యాలయాన్ని, బీపీఓ కేంద్రాన్ని తలపిస్తుంది. షిఫ్ట్‌కి 700 మంది చొప్పున 2 వేల మంది పనిచేస్తుంటారు. ఫోన్లు చేస్తూ.. సమాచారం తీసుకుంటూ.. దాన్ని విశ్లేషిస్తూ బిజీగా కనిపిస్తారు. ఇక్కడ్నుంచి రోజూ సుమారు 15.50 లక్షల మందికి ఫోన్లు వెళతాయి. ప్రభుత్వ పథకాలపై ప్రజల స్పందన తెలుసుకోవడం, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం, ఎవరైనా ప్రమాదంలో ఉంటే వెంటనే స్పందించడం, సంబంధిత విభాగాల్ని అప్రమత్తం చేయడం, నేర నియంత్రణ, ట్రాఫిక్, వాతావరణ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం నిరంతరం చేస్తారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'పరిష్కార వేదిక'(రియల్‌టైం గవర్నెన్స్(ఆర్టీజీ)) కార్యాలయం. రోజూ అన్ని లక్షల మందిని సంప్రదించే వ్యవస్థ దేశంలో ఇంకెక్కడా లేదు. ఇంతటి వినూత్న, భారీ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌కే ప్రత్యేకం.

- మీకు సకాలంలో రేషన్ అందకపోవచ్చు. మీ ఇంటి ముందు రోడ్డు గుంతలు పడి ఉండొచ్చు. ఏ ప్రభుత్వ ఉద్యోగో మిమ్మల్ని లంచం అడిగి ఉండొచ్చు. సమస్య ఏదైనా.. 1100 నెంబర్‌కి ఫోన్‌చేసి మీ సమస్య చెబితే... దాన్ని పరిష్కరిస్తారు. రోజూ ఇలాంటి ఫోన్లు 25 వేల వరకు వస్తాయి. సమస్య పరిష్కారమైందీ లేనిదీ పరిష్కార వేదిక వాళ్లే మీకు ఫోన్ చేసి తెలుసుకుంటారు. ఇలాంటి విధానం దేశంలోనే మొదటిసారి.
- మీరో కొత్త వాహనం కొనుక్కున్నారు. రిజిస్ట్రేషన్ కోసం దళారులకు కమీషన్లు ఇచ్చుకోవడం, గంటల తరబడి క్యూల్లో నిలబడడం గతంలో మామూలే. ఇప్పుడా అవసరం లేదు. వాహనం కొనుక్కున్న షోరూంలోనే రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది.
- కొత్త ఇంటిని కట్టుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు, కొన్ని రోజుల్లోనే ప్లాన్ అప్రూవల్ వచ్చేస్తుంది.
- ప్రభుత్వ సిబ్బంది, అధికారుల అవినీతిపై వచ్చిన ఫిర్యాదుల్ని సంబంధిత జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పంపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఎవరైనా డబ్బులు తీసుకుంటే వెనక్కి ఇప్పించిన సంఘటనలున్నాయి. అవినీతిపై ఇంత వరకు 3297 ఫిర్యాదులు వచ్చాయి.
- 'మీ కోసం' వెబ్‌సైట్, ఏపీ సీఎం కనెక్ట్ యాప్, సామాజిక మాధ్యమాలు, ముద్రణ, ప్రసార మాధ్యమాల ద్వారాను, జన్మభూమి, ఇంటింటికీ తెలుగుదేశం వంటి కార్యక్రమాల్లోను వచ్చిన ఫిర్యాదులు, అర్జీల పరిష్కారాన్ని ఆర్టీజీ పర్యవేక్షిస్తుంది. ఇలాంటి ఫిర్యాదులు ఇంత వరకు 1.5 కోట్ల వరకు వచ్చాయి.
- ప్రత్యేక సెన్సర్ల ద్వారా రైతుల పొలాల్లో తేమను, రిజర్వాయర్లలో జల మట్టాలను, భూగర్భ జలాలను పర్యవేక్షించడం వంటి వినూత్న కార్యక్రమాలనేకం ఆర్టీజీ ద్వారా చేస్తున్నారు. డ్రోన్‌లు, నిఘా కెమేరాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వర్చువల్ తరగతులు వంటివి దీనిలో భాగం.

ఇ–ప్రగతి

దైనందిన సేవలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొట్టే పని ఇకపై లేదు. అన్ని ప్రభుత్వ విభాగాల్ని, సేవల్ని డిజిటైజ్ చేసేందుకు ఇ-ప్రగతి పేరుతో ప్రత్యేక ఇ-గవర్నెన్స్ అథారిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. మొదట 14 సెక్టార్లను, 800 సేవల్ని ఆన్‌లైన్‌లోకి తేవాలని నిర్ణయించారు. ఇంతవరకు రవాణా శాఖలో 60 సేవలు, పురపాలక శాఖలో 70-80 సేవల వరకు ఆన్‌లైన్‌లోకి తెచ్చారు. ప్రభుత్వ సేవలన్నీ ఇంట్లో కూర్చుని ఆన్‌లైన్‌లో పొందేలా చేయడమే ఇ-ప్రగతి అంతిమ లక్ష్యం. వివిధ శాఖల అవసరాలకు తగ్గట్టుగా ఐటీ సేవలు, డిజిటైజేషన్ ప్రక్రియకు అవసరమైన తోడ్పాటునందించేందుకు ఇ-ప్రగతి యాంకర్ ఏజెన్సీగా పనిచేస్తోంది. ఐటీ అప్లికేషన్లను సిద్ధం చేస్తోంది. తొలి విడతలో విద్య, పంచాయతీరాజ్, మౌలిక వసతుల విభాగాల డిజిటైజేషన్ ప్రక్రియ జరుగుతోంది.

భూధార్

మనుషులకు ఆధార్‌లానే భూములకు, స్థలాలకు 'భూధార్' పేరుతో ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వడం దీని ఉద్దేశం. మొత్తం భూముల్ని పక్కాగా సర్వేచేసి, శాటిలైట్ ఇమేజెస్ రూపొందిస్తారు. ప్రతి ఒక్కరి భూమికి 11 అంకెల భూధార్ నెంబరు కేటాయిస్తారు. కృష్ణా జిల్లాలో పైలట్ ప్రాజెక్టు చేపట్టారు. ఇది పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే భూ వివాదాలకు, మోసాలకు, అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఆన్‌లైన్‌లో నెంబరు కొడితే చాలు అన్ని వివరాలూ క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియా సాఫీగా జరుగుతుంది.

ప్రజలందరి డేటా సిద్ధం

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని కుటుంబాలు, పౌరుల సమాచారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక డేటా బ్యాంక్‌ను ఏర్పాటు చేసింది. 4,37,43,837 మందికి సంబంధించిన సమాచారం ఇప్పుడు సిద్ధంగా ఉంది. దీన్ని వివిధ ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేస్తున్నారు.

ఇ–ఆఫీసు

ప్రభుత్వ కార్యాలయాల్ని కాగిత రహితంగా చేయడం, దస్త్రాలన్నీ ఆన్‌లైన్‌లోనే(ఇ-ఫైల్) పరిష్కరించడం ఇ-ఆఫీసు లక్ష్యం. సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల్లోని దస్త్రాలన్నీ ఆన్‌లైన్ చేశారు. జిల్లాస్థాయి వరకు ఆన్‌లైన్ చేసే ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. ఏ ఫైలు ఎవరి దగ్గర పెండింగ్‌లో ఉంది? ఏ దస్త్రాన్ని పరిష్కరించడానికి ఎవరు ఎన్ని రోజులు సమయం తీసుకున్నారు? వంటి వివరాలన్నీ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

విదేశీ విద్య

#8: పేదలకు కొత్త ఆశ

విదేశాలకు వెళ్లిన వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులు

వర్గం	విద్యార్థులు
బీసీ, ఈబీసీ	1057
కాపు	915
ఎస్సీ, ఎస్టీ	354

ప్రతిభ ఉన్నా విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్య చదవాలంటే ఆర్థికంగా సహకరించని కుటుంబ నేపథ్యం. ఏం చేయాలో అర్థంకాక ఉన్న దాంతో సంతృప్తి పడే పరిస్థితి. బడుగు, బలహీన వర్గాలకు విదేశీ విద్య అంటే అందని ద్రాక్ష అనుకునే స్థితి. అలా భావించిన వారే ఇప్పుడు ధైర్యంగా విదేశీ గడ్డపై ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో చదవాలన్న కలలను నిజం చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక దన్ను ఇస్తుండడమే ఇందుకు కారణం. దాదాపు 15 దేశాల్లోని వర్సిటీల్లో వివిధ కోర్సులు అభ్యసించే అవకాశం ఏపీలోని పేద విద్యార్థులకు కలుగుతోంది. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి, ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదివేందుకు ప్రభుత్వం నేరుగా డబ్బు అందిస్తోంది. ఇందుకోసం ఒకొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఇస్తోంది. వీరి కోసం ప్రభుత్వం రూ.160 కోట్లకు పైగా ఖర్చుచేసింది. ఆయా వర్గాల నుంచి ఏటా 5 వేల మందిని విదేశాలకు పంపేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉంది. ఇప్పటి వరకూ 2300 మందికి పైగా విద్యార్థులు విదేశాలకు వెళ్లారు.

నిరుద్యోగ భృతి..

#9: యువతకు భరోసా

సామాజిక భద్రతా చర్యల్లో భాగంగా అరకోటి మందికిపైగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... తాజాగా నిరుద్యోగులకు చేయూత అందించేందుకు శ్రీకారం చుట్టింది. దాదాపు 10 లక్షల మంది యువతకు నెలకు రూ.వెయ్యి చొప్పున భృతిని చెల్లించనుంది. వచ్చే నెల నుంచి అమల్లోకి రానున్న ఈ కార్యక్రమం భవిష్యత్తులో అతి పెద్ద సంక్షేమ పథకంగా రూపుదాల్చనుంది. డిగ్రీ/డిప్లమో పూర్తిచేసుకున్న యువత ఉద్యోగ దరఖాస్తులు కొనుగోలుకు, పోటీ పరీక్షలు రాయడానికి వెళ్లేటప్పుడు ప్రయాణ ఖర్చులకు, ఉద్యోగాల సాధన కోసం అవసరమైన శిక్షణ పొందేందుకు...ప్రభుత్వం చెల్లించే భృతి సొమ్ము ఎంతో కొంత ఉపయోగపడనుంది. ఓ అయిదేళ్లు తర్వాత నిరుద్యోగ భృతి పొందే వారి సంఖ్య 13.75 లక్షలకు, పదేళ్ల తర్వాత 17.50 లక్షలకు చేరనున్నట్లు అంచనా. ఇదే జరిగితే ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే అతి పెద్ద వర్గం యువతే కానుంది.

కంపెనీల సందడి

చురుకుగా కియా
అనంతపురం జిల్లాలో కియా మోటార్స్ కార్ల పరిశ్రమ పనులు వేగంగా సాగుతున్నాయి. 11 వేల మందికి ఉపాధి దక్కనుంది. దీనికి అనుబంధంగా ఇదే ప్రాంతంలో మరో 17 కంపెనీలు రూ.4,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయి.

ఇసుజు మోటార్స్
జపాన్ ఇసుజు కంపెనీ శ్రీసిటీలో 107 ఎకరాల్లో మోటారు వాహనాల తయారీ కేంద్రం పనులు ప్రారంభించింది. పెట్టుబడి రూ.3 వేల కోట్లు. ఏటా 50 వేల వాహనాల తయారీ లక్ష్యం. ఇక్కడి నుంచే విదేశాలకూ ఎగుమతి కానున్నాయి.

ఏషియన్ పెయింట్స్
విశాఖ జిల్లా పూడి గ్రామంలో ఏషియన్ పెయింట్స్ తయారీ యూనిట్ పనులు మొదలయ్యాయి. పెట్టుబడులు రూ.1750 కోట్లు, ఉత్పత్తి.. ఏటా 4 లక్షల కిలో లీటర్లు

అపోలో టైర్స్
శ్రీసిటీ దగ్గరి చిన్న పండూరులో రూ.1800 కోట్లతో 200 ఎకరాల విస్తీర్ణంలో అపోలో టైర్స్ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి.

విశాఖ సదస్సులు
పారిశ్రామిక రంగానికి కొత్త ఉత్తేజం

హీరో వచ్చేసింది
చిత్తూరు జిల్లాలో హీరో మోటార్స్ తయారీ కేంద్రం పనులు ప్రారంభించింది. దీని విస్తీర్ణం: 600 ఎకరాలు పెట్టుబడులు రూ.1600 కోట్లు. దీంతో 12 వేల మందికి ఉపాధి లభిస్తుంది.

అద్భుత విధానం
ఏకగవాక్ష విధానంలో 21 రోజుల్లోనే అన్ని శాఖల నుంచి అనుమతులిచ్చే విధానాన్ని తీసుకురావటంతో పారిశ్రామిక రంగంలో అనూహ్యమైన పురోగతి ఆరంభమైంది.

ప్రోత్సాహకం
గత మూడేళ్లలో రూ.3,233.53 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందించింది. మరో రూ.2 వేల కోట్ల పంపిణీ కోసం ఏర్పాట్లు చేస్తోంది.

ప్రపంచ బ్యాంకు కితాబు
ప్రపంచ బ్యాంకు పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను గుర్తించటం విశేషం.



ఒక్క శ్రీసిటీలోనే రూ.25 వేల కోట్లకుపైగా పెట్టుబడులతో 30 వేల మందికి ఉపాధి లభిస్తోంది

ఆర్థిక పురోగతికి, భారీ ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్నే ప్రధానంగా ఎంచుకుంది

ఐటీ, ఔళి, ఆహార శుద్ధి, పర్యాటక రంగాల్లో

ఒప్పందాలు:
గత నాలుగేళ్లలో 1657 ప్రాజెక్టులు నెలకొల్పేందుకు ఒప్పందాలు జరిగాయి. వీటి విలువ రూ. 11,27,871 కోట్లకు పైగా ఉంటుంది. వీటితో 23 లక్షల మందికి పైగా ఉపాధి లభించనుంది.

ప్రారంభమైనవి:
రూ.4,53,887 కోట్లతో ఇప్పటి వరకూ 1065 ప్రాజెక్టులు ప్రారంభమై 8.27 లక్షల మందికిపైగా ఉపాధి చూపాయి. మిగతా ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి.

»

ప్రభుత్వం గత మూడేళ్ల వ్యవధిలో రూ.3,233.53 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందించింది. మరో రూ.2 వేల కోట్ల పంపిణీ కోసం ఏర్పాట్లు చేస్తోంది.

»

పరిశ్రమలకు అంతా అనుకూలం

- సుదీర్ఘ తీరప్రాంతం
- నౌకాశ్రయాలు
- విమానాశ్రయాల విస్తరణ, కొత్తవాటి నిర్మాణం
- నిరంతర విద్యుత్ సరఫరా
- నీటిలభ్యత
- మౌలిక సదుపాయాల కల్పన
- అందుబాటులో సరిపడా భూములు

రూ.4000 కోట్లతో 5 లక్షల వైఫై హాట్‌స్పాట్లు!

దిల్లీ: దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 5 లక్షలకు పైగా వైఫై హాట్‌స్పాట్లు ఏర్పాటు చేయడానికి టెలికాం విభాగం (డాట్) టెండర్లు ఆహ్వానించింది. దీనికి దాదాపు రూ. 4,000 కోట్ల పెట్టుబడి అవసరమని అంచనా. భారత్‌నెట్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీకి బ్రాడ్‌బ్యాండ్ పరిజ్ఞానం లేదా వైఫై హాట్‌స్పాట్లు అందివ్వడమే లక్ష్యమని టెండర్ పత్రంలో డాట్ పేర్కొంది. భారత్‌నెట్ బ్రాడ్‌బ్యాండ్ మౌలిక సదుపాయాలను వినియోగించుకోవడం ద్వారా పంచాయతీల్లో 5 లక్షల వైఫై హాట్‌స్పాట్ల ఏర్పాటుకు టెలికాం కమిషన్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది చివరి నాటికి ఈ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. గ్రామీణ ప్రజలకు అందుబాటులో వైఫై హాట్‌స్పాట్లను ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, తపాలా కార్యాలయాల వంటి వాటిని అనుసంధానించనున్నారు. టెండర్ పత్రం ప్రకారం.. 1000 మంది వరకు జనాభా కలిగిన పంచాయతీకి 1 వైఫై హాట్‌స్పాట్, 3500 మంది ఉంటే 2, 7,500 జనాభా వరకు 3, 12000 మందికి 4, 12,000 దాటితే 5 చొప్పున వైఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేయనున్నారు.

ముకేశ్ అంబానీ వేతనం.. పదో ఏడాదీ రూ. 15 కోట్లే

- రూ.24 కోట్లను వదులుకుంటున్న వైనం
- ఇతర ఎగ్జిక్యూటివ్‌ల జీతం పైకి

దిల్లీ: భారత కుబేరుల్లో అగ్రగణ్యుడు ముకేశ్ అంబానీ తన వార్షిక వేతనాన్ని వరుసగా పదో ఏడాదీ రూ. 15 కోట్లకే పరిమితం చేసుకున్నారు. 2017-18 లోనూ అంతే మొత్తాన్ని అందుకున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఛైర్మన్ హోదాలో 2008-09 నుంచీ జీతం, భత్యాలు, కమిషన్ అన్నీ కలిపి రూ. 15 కోట్లే తీసుకుంటున్నారు. దాదాపు ఏటా రూ. 24 కోట్లను వదులుకుంటున్నారు. కాగా, నిఖిల్, హితాల్ మేస్వానీలలతో పాటు కంపెనీ ఇతర శాశ్వత డైరెక్టర్ల వేతనాలు మాత్రం మార్చి 31, 2018తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారీగా పెరగడం గమనార్హం. 'యాజమాన్య వేతన స్థాయిలు తక్కువగా ఉండాలని చెప్పడానికి వ్యక్తిగత ఉదాహరణగా ముకేశ్ అంబానీ నిలిచారు. అందుకే రూ. 15 కోట్లకే వేతనాన్ని పరిమితం చేసుకున్నార'ని రిలయన్స్ ఇండస్ట్రీస్ తన తాజా వార్షిక నివేదికలో పేర్కొంది.

- ముకేశ్ అంబానీకి 2017-18 వేతనంలో రూ. 4.49 కోట్ల జీతం, భత్యాలున్నాయి. 2016-17 జీతభత్యాలైన రూ. 4.16 కోట్లతో పోలిస్తే ఇది కొంత ఎక్కువ. ఇక కమీషన్ రూ. 9.53 కోట్లలో మార్పు లేదు. ఇతర భత్యాలు మాత్రం రూ. 60 లక్షల నుంచి రూ. 27 లక్షలకు తగ్గింది. ఇక పదవీ విరమణ ప్రయోజనాలు రూ. 71 లక్షలుగా ఉన్నాయి.
- సీఈఓల వేతన పరిమాణాలపై చర్చ నేపథ్యంలో అక్టోబరు 2009న అంబానీ తన వేతనాన్ని స్వచ్ఛందంగా రూ. 15 కోట్లకు పరిమితం చేసుకున్నారు. ఇతర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల వేతనాలు పెరిగినప్పటికీ.. ఈయన మాత్రం ఆ మొత్తానికే కట్టుబడి ఉన్నారు.
- అంబానీ బంధువులు నిఖిల్ ఆర్. మేస్వానీ, హితాల్ ఆర్ మేస్వానీల వేతనాలు ఒక్కొక్కరికి రూ. 19.99 కోట్లకు పెరిగాయి. 2016-17లో వీరు రూ. 16.58 కోట్లు చొప్పున అందుకున్నారు. 2015-16లో నిఖిల్ రూ. 14.42 కోట్లు; హితాల్ రూ. 14.41 కోట్లు తీసుకోగా.. 2014-15లో ఇద్దరూ రూ. 12.03 కోట్లు చొప్పున వేతనాన్ని స్వీకరించారు.
- కీలక ఎగ్జిక్యూటివ్‌లలో ఒకరైన పి.ఎమ్.ఎస్. ప్రసాద్ వేతనం అంతక్రితం ఏడాదితో పోలిస్తే 2017-18లో రూ. 7.87 కోట్ల నుంచి రూ. 8.99 కోట్లకు చేరుకుంది. 2015-16లో రూ. 7.23 కోట్లు; 2014-15లో రూ. 6.03 కోట్లు తీసుకున్నారు.
- రిఫైనరీ చీఫ్ పవన్ కుమార్ కపిల్ వేతనం రూ. 3.47 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఏడాదుల్లో రూ. 2.54 కోట్లు(2016-17); రూ. 2.94 కోట్లు(2015-16); రూ. 2.41 కోట్లు(2014-15)గా ఉంది.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు(నీతా అంబానీ సహా) రూ. 1.5 కోట్లు చొప్పున కమీషన్ లభించింది. (సిట్టింగ్ ఫీజుకు ఇది అదనం.) అంతక్రితం ఏడాది ఇది రూ. 1.3 కోట్లుగా ఉంది.
- నీతా అంబానీ సిట్టింగ్ ఫీజు కింద రూ. 6 లక్షలు పొందారు. నీతా అంబానీ కాకుండా ఇతర నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లలో మాన్‌సింగ్ ఎల్ భక్త, యోగేంద్ర పి త్రివేది, డి.వి కపూర్, అశోక్ మిశ్రా, దీపక్ సి జైన్, రఘునాథ్ ఎ మషేల్కర్, అదిల్ జైనుల్బాయ్, రమిందర్ సింగ్ గుజ్రాల్, సుమిత్ బెనర్జీలున్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో లాజిస్టిక్స్ పార్క్!

120 ఎకరాల్లో ఏర్పాటు యోచన

ఈనాడు, హైదరాబాద్: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో ప్రతిపాదించిన ఎయిర్‌పోర్ట్ సిటీలో లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు చేసే అంశాన్ని జీఎంఆర్ గ్రూప్ పరిశీలిస్తోంది. లాజిస్టిక్స్ పార్కు అభివృద్ధిపై వివిధ ప్రతిపాదనలను జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్‌ఐఏఎల్) పరిశీలిస్తోందని జీఎంఆర్ గ్రూప్ ప్రతినిధి తెలిపారు. అయితే.. దీనిపై ఇంత వరకూ ఎటువంటి ఒప్పందాలు జరగలేదని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దిల్లీ, హైదరాబాద్‌లోని విమానాశ్రయాల్లో ఉన్న భూమిని సొమ్ము (మానిటైజ్) చేసుకోవాలని జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భావిస్తున్నట్లు, ఇందులో భాగంగా శంషాబాద్‌లోని దాదాపు 120 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్కును అభివృద్ధి చేయాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. విమానాశ్రయాల వ్యాపారంలో వృద్ధిరేటు ఆకర్షణీయంగా ఉండడంతో ఈ వ్యాపారంపై దృష్టి కేంద్రీకరించాలని జీఎంఆర్ యోచిస్తోంది. గత ఆర్థిక సంవత్సరానికి హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ 20 శాతం పెరగ్గా.. దిల్లీ విమానాశ్రయంలో 14 శాతం వృద్ధి చెందింది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆదాయం 2017-18లో 13 శాతం పెరిగి రూ. 1,105 కోట్ల నుంచి రూ. 1,249 కోట్లకు చేరింది. విమాన ప్రయాణికుల ద్వారా కాకుండా, ఇతర అంశాల (నాన్ ఏరో) ఆదాయం కూడా రూ. 397 కోట్ల నుంచి రూ. 444 కోట్లకు చేరింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి విమానాశ్రయానికి ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దాని ద్వారా ఆదాయం పొందాలని జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భావిస్తోంది.

కొచ్చర్ కేసులో సెబీతో సెటిల్‌మెంట్!

ఐసీఐసీఐ బ్యాంకు కోరే అవకాశం

దిల్లీ: వీడియోకాన్ రుణం కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓ చందాకొచ్చర్‌పై జరుగుతున్న దర్యాప్తునకు ముగింపు పలకడం కోసం సెబీతో బ్యాంకు సెటిల్‌మెంట్ కుదుర్చుకోనుందని సమాచారం.. ఇందు కోసం ఒక పిటిషన్ దాఖలు చేయాలని బ్యాంక్ భావిస్తోంది. ఈ పరిణామాలతో సంబంధమున్న వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ 'ఈటీ నౌ' తన కథనంలో ఆ మేరకు తెలిపింది.

సుదీర్ఘ న్యాయ విచారణలను తప్పించుకోవడం కోసం బ్యాంకు ప్రత్యామ్నాయ మార్గాల వెంట పయనిస్తోందని అందులో వివరించింది. కొచ్చర్ భర్త దీపక్‌కు చెందిన కంపెనీలకు ప్రయోజనం చేకూర్చడం కోసం 'నీకిది-నాకది' పద్ధతిలో వీడియోకాన్‌కు రుణాలు అందజేసినట్లు కొచ్చర్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే.

టయోటాతో జోడీ మాకు మంచిదే

- గిరాకీకి తగ్గట్టు ఉత్పత్తికి వీలవుతుంది
- పరిశ్రమలో స్థిరీకరణ జరుగుతోంది
- మా అగ్రస్థానాన్ని కొనసాగిస్తాం
- కియా రావడం పరిశ్రమకు మంచిదే

టయోటా మోటార్ కార్ప్‌తో సుజుకీ ఒప్పందం వల్ల, గిరాకీకి అనుగుణంగా వాహనాలు ఉత్పత్తి చేసే అవకాశం ఏర్పడుతుందని మారుతీ సుజుకీ ఛైర్మన్ ఆర్.సి. భార్గవ అంటున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పరిశోధనపై పెట్టిన పెట్టుబడులు తిరిగి రావాలంటే, భాగస్వామ్యాలు తప్పనిసరి అని ఆయన నొక్కి చెప్పారు. కంపెనీ ఇంకా ప్రవేశించని ప్రీమియం విభాగంపై; త్వరలో పాటించాల్సిన బీఎస్-6 నిబంధనలపై; పరిశ్రమలో స్థిరీకరణ వంటి పలు అంశాలపై వార్తా సంస్థ కోజెన్సిస్‌కిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఆ విశేషాలు..



ఇంటర్వ్యూ
మారుతీ సుజుకీ ఛైర్మన్
ఆర్.సి. భార్గవ

మారుతీ సుజుకీ కార్లకు గిరాకీ పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం 1,10,000 కార్ల కోసం వినియోగదార్లు వేచిచూస్తున్నారు. మేం అంచనా వేసిన దాని కంటే గిరాకీ ఎక్కువగా ఉంటోంది. అందుకనుగుణంగా ఉత్పత్తి పెంచాల్సి ఉంది. పరిశ్రమ మొత్తం మీద చూస్తే మాత్రం సామర్థ్య కొరత లేదు. టయోటా మోటార్ కార్ప్, సుజుకీ మోటార్ కార్ప్‌తో అంతర్జాతీయ ఒప్పందం కుదుర్చుకుంది. టయోటా ఇండియా తన సామర్థ్యం కంటే తక్కువ ఉత్పత్తి చేస్తోంది. ఈ ఒప్పందం వల్ల టయోటా సామర్థ్యాన్ని మా వాహనాల ఉత్పత్తి కోసం ఉపయోగించుకుంటాం. ఇది ఒక కాంట్రాక్ట్ తయారీలాంటిది. వాళ్లు కార్లను తయారు చేసి, ఆ ఉత్పత్తి వ్యయంపై కొంత మార్జిన్ పొందుతారు. మేం కూడా మా సాధారణ మార్జిన్లపైనే ఆ కార్లను విక్రయిస్తాం.

✦ బ్రాండ్లపై స్పష్టత ఉంది

మేం విక్రయించే కార్లన్నీ మా బ్రాండ్‌తోనే ఉంటాయి. టయోటా విక్రయించేవన్నీ టయోటా బ్యాడ్జ్‌తోనే వస్తాయి. విటారా బ్రెజాను విక్రయిస్తాం కానీ బ్రెజా అని పిలవం. అలాగే సుజుకీకి చెందిన 'ఎస్' మార్క్‌ను పెట్టమని గతంలో వారు(టయోటా) నాతో చెప్పారు. కారు బయటి భాగాల్లోనూ కొంత మార్పు చేసి మారుతీ బ్రెజాతో పోలిస్తే వైవిధ్యంగా ఉండేలా చూసుకుంటారు.

✦ విటారా బ్రెజా బ్రాండ్‌కు ప్రమాదం ఉండదు

మార్కెట్‌ను మరింత విస్తరించేందుకు ఇది ఒక అవకాశం. దీన్ని ప్రమాదంగా కంటే అవకాశంగా భావించాలి. ఎందుకంటే ప్రస్తుత టయోటా వినియోగదార్లు.. టయోటా డీలరు వద్ద మా కార్లను కొనుగోలు చేసినా.. పెరిగేది మా విక్రయాలే కదా. ప్రస్తుతానికి బ్రెజా విక్రయాల విషయంలోనే టయోటాతో చర్చలు జరిగాయి. భవిష్యత్‌లో ఇతర కార్ల గురించీ చర్చించే అవకాశం ఉంది.

✦ ప్లాంట్లను విస్తరిస్తాం కానీ..

ప్రస్తుతం టయోటా సామర్థ్యంలో 50 శాతం వినియోగించకుండా ఉంది. అంటే అదనంగా 1,50,000 కార్లను ఉత్పత్తి చేయగలదన్నమాట. మాకున్న గిరాకీ కంటే ఇది ఎక్కువే. అయితే గిరాకీ పెరగకుండా ఉండదు కదా. అందుకే మా వరకు గుజరాత్ ప్లాంటును మరింత విస్తరించాలనే భావిస్తున్నాం. సుజుకీ ప్రస్తుతం తొలి ప్లాంటుకే కట్టుబడి ఉంది. మొత్తం మీద రెండో, మూడో, నాలుగో ప్లాంట్లకు అవకాశం ఉంది. అయితే వాటిపై ఆలోచనలు ఎప్పుడన్నది ఇపుడే చెప్పలేం.

✦ భాగస్వామ్యాలు లేకపోతే ఎలా

టయోటా-సుజుకీలా వాహన రంగంలో ఇతర కంపెనీలూ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. (ఉదాహరణకు మహీంద్రా-ఫోర్డ్) మొత్తం మీద వాహన పరిశ్రమలో స్థిరీకరణ కనిపిస్తోంది. ప్రస్తుతం పరిశోధన-అభివృద్ధి(ఆర్ అండ్ డీ) వ్యయాలు భారీగా పెరిగాయి. అంటే నష్టభయం కూడా ఎక్కువైంది. ఆర్ అండ్ డీపై పెట్టిన పెట్టుబడులు వెనక్కి రావాలంటే భారీగా ఉత్పత్తి చేయాలి. భాగస్వామ్యాలు లేకపోతే అది కుదిరేపనేనా. సుజుకీ, టయోటాల భాగస్వామ్యం వల్ల ఇరు కంపెనీలకు నష్టభయం తగ్గుతుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనం పరిమాణ పరంగా ముందుండాలి. అంతర్జాతీయ వాహన దిగ్గజాలతో పోటీపడాలంటే.. ఈ తరహా భాగస్వామ్యాలు తప్పనిసరి.

ఆటోమోటివ్ విడిభాగాలు, ఆటోమొబైల్స్‌కు ప్రధాన కేంద్రంగా గుజరాత్ మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. పూర్తి స్థాయిలో ఇంకా అభివృద్ధి చెందలేదు. గుజరాత్‌లో 25-30 లక్షల కార్లను తయారు చేస్తే అపుడు అందరు సరఫరాదార్లను అక్కడ ఉంచాల్సిన అవసరం ఏర్పడుతుంది.

✦ కొత్త ఉత్పత్తి వచ్చినపుడు సాధారణమే

మూడో తరం స్విఫ్ట్ వచ్చాక అంతక్రితం అత్యుత్తమ విక్రయాలు సాధించిన బాలెనో వెనకపడింది. ఏదైనా కొత్త ఉత్పత్తి వచ్చి, ప్రజలు దాన్ని ఇష్టపడితే, సాధారణంగానే కొత్త మోడల్ విక్రయాలు పెరుగుతాయి. ఇతర మోడళ్ల విక్రయాలు తగ్గుతాయి. కానీ మొత్తం మీద మార్కెట్లో విక్రయాలు పెరుగుతాయి. అందులో పెద్ద ప్రమాదం ఏమీ లేదు. జీఎస్‌టీకి ముందు సియాజ్ విక్రయాలు బాగుండేవి. జీఎస్‌టీ రాకతో అదనంగా 15 శాతం సుంకం పడింది. హైబ్రిడ్ కార్ల ధరలన్నీ 15% మేర పెరిగాయి. దీంతో హైబ్రిడ్ సియాజ్ విక్రయాలూ తగ్గాయి. త్వరలోనే కొత్త సియాజ్ వచ్చేందుకు అవకాశాలున్నాయన్న వార్తల వల్లా విక్రయాలు తగ్గాయి.

✦ వినియోగదార్ల కోసం.. విద్యుత్ కార్లలోకి

మేం ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడానికైనా సిద్ధంగా ఉన్నాం. మా సాంకేతికత, మోడళ్లు, ఉత్పత్తి పరిమాణం అనేవి.. వినియోగదార్లు ఏం కొంటారన్న అంచనాలపై ఆధారపడి ఉంటుంది. ఒక వేళ వినియోగదార్లు తనకు విద్యుత్ వాహనాలు అందుబాటు ధరలో వస్తాయని.. వినియోగించడానికి బాగుంటుందని భావిస్తే మేం కూడా అదే దిశగా పయనిస్తాం. మార్కెట్లో మా అగ్రస్థానాన్ని కొనసాగిస్తాం. సుజుకి-టయోటా ద్వారా సాంకేతికతను కలిగి ఉన్నాం. ఇతరులతో పోలిస్తే అధిక తయారీ సామర్థ్యం ఉంది. ఇంత కంటే ఏం కావాలి.

✦ ప్రీమియం విభాగంలోకి...

ఇప్పటిదాకా మారుతీ ప్రీమియం విభాగంలో లేదు. టయోటా ఉంది. ఒక వేళ మేం ఆ విభాగంలోనూ విక్రయాలు చేయాలని భావిస్తే.. టయోటా నుంచి సహకారం అందుకుంటాం. ఇప్పటిదాకా దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

✦ ఈ ఏడాది రెండంకెల వృద్ధి

మంచి వర్షాలు కురుస్తాయన్న అంచనాల మధ్య మా విక్రయాలు రెండంకెల వృద్ధిని సాధిస్తాయని మేం భావిస్తున్నాం. 2019లో కియా మోటార్స్ ఉత్పత్తి ప్రారంభం కానుండటం వినియోగదార్లకు మంచిదే. పరిశ్రమకూ మంచిదే. ఇతర తయారీదార్లలాగే అదీ మాకు ఒక పోటీదారు అంతే. అంతకు మించిన ప్రభావం మాపై ఏమీ ఉండదు. ఏప్రిల్ 2020 నుంచి అమల్లోకి వచ్చే భారత్-6 ప్రమాణాల్లోకి మారడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అది సాఫీగా జరిగేలా ప్రణాళికలు రచించాం.

పనితీరు బాగుంటే సత్వర ప్రోత్సాహకాలు మేలు

ఉత్పాదకత పెరుగుతుంది: సర్వే

న్యూయార్క్: ఉద్యోగులకు ఏదైనా ఒక బాధ్యత అప్పజెప్పినపుడు, దానిని చురుకుగా నిర్వహిస్తున్న వారికి బహుమతి అందిస్తే, ఆ పనిని వారు ఆస్వాదిస్తూ చేస్తారని ఓ సర్వే పేర్కొంది. అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలోని పరిశోధకుల సర్వే ప్రకారం.. ఉద్యోగులకు ముందస్తుగా లభించే బోనస్‌ల వల్ల తమ పనిలో గొప్ప ప్రతిభ చూపిస్తారని.. ఆ తర్వాత ఆ బహుమతులను తొలగించినా అదే పనితనం కొనసాగిస్తారని తెలుస్తోంది.

- బహుమతులకు సదరు బాధ్యత అనంతరం తొలగించినా కూడా ఉద్యోగిలో ఆ ప్రేరణ కొనసాగుతుంది. అప్పటికే ఆ బాధ్యతకు చెల్లింపులు(వేతనం వంటివి) జరిగి ఉంటేనే ఈ తక్షణ బహుమతుల వల్ల అంతర్గత ప్రేరణ ఉంటుంది. కేవలం ఆ పనిని పూర్తి చేయడమనే పద్ధతి కాకుండా.. పూర్తి స్థాయిలో దానికి అంకితం అవుతారు.
- ఒకవేళ పెద్ద రివార్డును ఆలస్యంగా ఇస్తే, పని పూర్తయిన తర్వాత కూడా అదే ప్రేరణతో పని చేసేవారి సంఖ్య 19 శాతం మాత్రమే పెరిగింది. అదే తక్షణ బహుమతుల వల్ల అలా పెరిగే వారి సంఖ్య 35 శాతంగా ఉండడం గమనార్హం.
- బహుమతులు, ప్రోత్సాహకాల పరిమాణం కంటే ఇచ్చే సమయం ముఖ్యమని ఆ పరిశోధకులు అంటున్నారు. ఉదాహరణకు ఏడాది మొత్తానికి కలిపి ప్రోత్సాహకాలు ఇవ్వడం కంటే, ఏడాది పాటూ చిన్న పాటి బోనస్‌లను తరచూ ఇస్తూ ఉండడం ముఖ్యమని చెబుతున్నారు.

పసిడి నగదీకరణ పథకంలో మార్పులు

ముంబయి: పసిడి నగదీకరణ పథకాన్ని మరింత ఆకర్షణీయం చేసేందుకు స్వల్ప మార్పులను ఆర్‌బీఐ ప్రవేశపెట్టింది. పసిడి డిపాజిట్ ఖాతాను ప్రజలు సులువుగా తెరిచేలా వీలు కల్పించాలన్నది ఉద్దేశం. బ్యాంకుల్లో పసిడిని స్వల్పకాలానికి అంటే ఏడాది నుంచి మూడేళ్ల కాలపరిమితికి డిపాజిటు చేయొచ్చు. కాలపరిమితి గడువు తీరాక ఇష్టమైతే మళ్లీ డిపాజిట్ (రోలోవరు) చేసుకోవచ్చు. ఇక నుంచి పూర్తి సంవత్సరమనే కాకుండా సంవత్సరం మూడు నెలలు, రెండేళ్ల మూడు నెలల 5 రోజులు.. ఇలా మధ్యమధ్య రోజుల కాలపరిమితికి కూడా డిపాజిట్ చేసే వీలును ఆర్‌బీఐ కల్పించింది. అలాగే స్వల్పకాలిక పసిడి డిపాజిట్లను బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లలో తిరిగి చెల్లించాల్సిన బాకీ కింద చూపించాలని కూడా ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

దేశీయ ఫోన్లకు సర్క్యూట్ బోర్డులూ ఇక్కడే

అసెంబ్లింగ్ యూనిట్‌లో రూపొందిస్తాం: షియామీ

దిల్లీ: దేశీయంగా తయారు చేస్తున్న స్మార్ట్‌ఫోన్లకు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీ)లు కూడా ఇక్కడే బిగింప చేస్తామని చైనా దిగ్గజ సంస్థ షియామీ వెల్లడించింది. పీసీబీల అసెంబ్లింగ్ కోసం యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందువల్ల తమ తయారీ సామర్థ్యం మరింత పెరుగుతుందని షియామీ ఉపాధ్యక్షుడు, భారత్ మేనేజింగ్ డైరెక్టర్ మను జైన్ తెలిపారు. ఈ ఏడాది జులై-సెప్టెంబరు నుంచి దేశీయంగా రూపొందుతున్న 100% స్మార్ట్‌ఫోన్లలో, ఇక్కడి పీసీబీలే ఉండేలా చూడాలన్నది తమ ప్రణాళికని అన్నారు.

సెల్ఫీ ఫోన్ వై2 ఆవిష్కరణ: సెల్ఫీలు ఇష్టపడే వారికి అనువుగా వై2 స్మార్ట్‌ఫోన్‌ను షియామీ గురువారం ఆవిష్కరించింది. 6 అంగుళాల తెర, ముందు 16 మెగాపిక్సెల్, వెనుక 12+5 మెగాపిక్సెల్ కెమేరాలు, 3080 ఎంఏహెచ్ బ్యాటరీ, స్నాప్‌డ్రాగన్ 625 ప్రాసెసర్, 4జీ సిమ్‌కార్డులు 2, 256 జీబీ వరకు మెమొరీకార్డు అమర్చుకునే వీలు, ముఖంతో, వేలిముద్ర ద్వారా అన్‌లాక్ చేసుకునే సదుపాయం కలిగిన ఈ ఫోన్‌ను ఈనెల 12 నుంచి అమెజాన్, ఎంఐ డాట్‌కామ్ పోర్టళ్లు, ఎంఐ హోమ్‌స్టోర్స్‌లో కొనుగోలు చేసుకోవచ్చు. 3జీబీ ర్యామ్-32 జీబీ మెమొరీ ఫోన్ రూ. 9999, 4జీబీ ర్యామ్-64 జీబీ ఫోన్ రూ. 12,999గా సంస్థ ప్రకటించింది.

సగం ధరకే ఎమ్మారై స్కానింగ్!

- పోర్టబుల్ స్కానర్‌ను రూపొందించిన టాటా ట్రస్ట్స్
- మారుమూల ప్రాంతాలకూ తరలించే వీలు

దిల్లీ: టాటా ట్రస్ట్స్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఎఫ్‌ఐఎస్‌ఈ) హైటెక్ పోర్టబుల్ ఎమ్మారై స్కానర్‌ను ఆవిష్కరించింది. దీంతో ప్రస్తుత ధరలతో పోలిస్తే, సగానికే ఎమ్మారై స్కానింగ్ చేయించుకోవచ్చని టాటా ట్రస్ట్స్ గురువారం వెల్లడించింది. 8 మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు కలిసి రూ. 15 కోట్ల వ్యయంతో 1.5 టెల్సా హోల్ బాడీ ఎమ్మారై స్కానర్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. 'ప్రస్తుతం ఎమ్మారై స్కాన్‌కు దాదాపు రూ. 8,000-10,000 వరకు ఖర్చవుతోంది. మా శాస్త్రీయ ఆవిష్కరణతో ఖర్చు సగం వరకు తగ్గుతుంద'ని టాటా ట్రస్ట్స్ అధిపతి (ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్), ఎఫ్‌ఐఎస్‌ఈ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) మనోజ్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులో మరింత తక్కువ ధరకు ఎమ్మారై స్కాన్ అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నిస్తామని ఆయన వెల్లడించారు. టాటా ట్రస్ట్స్‌కు క్లినికల్ భాగస్వామిగా శ్రీ సత్య సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్ వ్యవహరించింది. ఇక్కడే తొలి స్కానర్‌ను అందుబాటులోకి తెచ్చారు. 'ఆగస్టు-డిసెంబరు మధ్య మనుషులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తూనే, ఎమ్మారై స్కానర్ల తయారీకి రూపకల్పన చేస్తాం. 2019లో ఈ స్కానర్లను విపణిలోకి తీసుచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. చిన్న పరిమాణంలో, తక్కువ బరువు ఉండటంతో చిన్న పట్టణాలు, మారుమూల ప్రాంతాలకు సైతం తీసుకెళ్లి రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేయొచ్చు. ఇప్పుడున్న ఎమ్మారై స్కానర్ల కంటే ఇవి 3-4 రెట్లు వేగంగా పని చేస్తాయి. ప్రతి రోగికి తక్కువ ధరకు ఎమ్మారై స్కానింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి సమాజంలో పెద్దస్థాయిలో స్థిరమైన ప్రభావాన్ని తీసుకురావాలన్నదే ఈ స్కానర్ ఆవిష్కరణ వెనక ప్రధాన ఉద్దేశం''ని మనోజ్ కుమార్ వివరించారు. 'ఏదైనా సాధించాలంటే సృజనాత్మకత, కష్టపడి పని చేసే తత్త్వం, సహనం ఎంతో అవసరం. మా ఎమ్మారై ప్రాజెక్టు జట్టు, తమ ఆవిష్కరణలో విజయం సాధించడం ఆనందంగా ఉంద'ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ రతన్ టాటా పేర్కొన్నారు.



బెంట్లీ రూ.3.78 కోట్ల కారు

దిల్లీ: విలాసవంత కార్ల సంస్థ బెంట్లీ.. కొత్త ఎస్‌యూవీ 'బెంటేగా వీ8' మోడల్‌ను భారత విపణిలోకి విడుదల చేసింది. దీని ధర రూ. 3.78 కోట్లు (ఎక్స్‌షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. కొత్త మోడల్ కోసం కంపెనీ ఎక్స్‌క్లూజివ్ మోటార్స్‌తో జట్టు కట్టింది. కేవలం ముందస్తు ఆర్డరు ద్వారా మాత్రమే ఈ కారు లభిస్తుందని కంపెనీ తెలిపింది. 'బెంటేగా శ్రేణిలోని ఇతర మోడళ్ల మాదిరిగా కొనుగోలుదార్లను ఈ కార్లు ఆకట్టుకుంటాయి. అదనంగా జత చేర్చిన ఎక్స్‌టీరియర్ ఫీచర్లు నచ్చుతాయి' అని ఎక్స్‌క్లూజివ్ మోటార్స్ డైరెక్టర్ సత్య బగ్లా తెలిపారు. కొత్త కారు గంటకు 0-100 కి.మీ వేగాన్ని కేవలం 4.5 సెకన్లలోనే అందుకోగలదు. దీని గరిష్ఠ వేగం గంటకు 290 కి.మీ. 4 లీటర్ ట్విన్ టర్బోఛార్జ్‌డ్ వీ8 పెట్రోల్ ఇంజిన్ కలిగిన బెంటేగా వీ8.. 542 బీహెచ్‌పీ పవర్‌ను అందిస్తుంది. దేశంలో కాంటినెంటల్ జీటీ, ఫ్లైయింగ్ స్పర్ వంటి మోడళ్లను బెంట్లీ విక్రయిస్తోంది.

సెన్సెక్స్ ▲ 284
35463

నిఫ్టీ ▲ 84
10768

డోజోన్స్ 25198 ▲ 52

నాస్‌డాక్ 7604 ▼ 84

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 67.12 ▼ 20 పైసలు
(ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 77.08 ▲
(బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+)

నిఫ్టీ	7న	మార్పు%
TATA STEEL	602.10	3.86
TATA MOTORS	305.40	3.30
ICICI BANK	290.90	2.47
INDIABULLS HSG FIN	1208.20	2.38
ASIAN PAINTS	1290.80	2.22
AXIS BANK	542.40	2.07
WIPRO	264.60	2.06

గ్రహణం (-)

నిఫ్టీ	7న	మార్పు%
TITAN COMPANY	887.15	-1.37
INDUSIND BANK	1900.45	-1.01
EICHER MOTORS	29712.40	-0.79
COAL INDIA	288.90	-0.60
KOTAK MAHI BANK	1310.45	-0.40
LUPIN	767.35	-0.35
ZEE ENTERTAINMENT ENT	549.25	-0.31

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	60.92	70.64	బహ్రెయిన్ దీనార్	165.07	188.77
పౌండ్ స్టెర్లింగ్	81.80	94.86	కువైట్ దీనార్	183.19	228.04
యూరో	71.82	83.31	ఒమన్ రియాల్	161.56	184.84
జపనీస్ యెన్/100	55.41	64.25	సౌదీ రియాల్	16.20	19.20
ఆస్ట్రేలియా డాలరు	46.63	53.95	యూఏఈ దిర్హమ్	16.58	19.37
సింగపూర్ డాలరు	45.76	54.20	మలేషియా రింగిట్	15.01	18.46
థాయ్ బాత్/100	190.93	228.34	చైనీస్ యువాన్	7.41	12.03

గురువారం నిఫ్టీ కదలికలు



నేటి మార్కెట్

నేడూ సూచీల లాభాలు కొనసాగే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, ఈ ఏడాది మంచి వర్షపాతం నమోదు కావొచ్చన్న అంచనాలు దోహదపడొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇటీవల ప్రకటించిన అమెరికా ఆర్థిక గణాంకాలు సానుకూలంగా ఉండటంతో.. భవిష్యత్‌లో మంచి వృద్ధి నమోదు చేయొచ్చన్న అంచనాలున్నాయి. ముడిచమురు ధరలపై దృష్టి పెట్టాలని డీలర్లు సూచిస్తున్నారు. ఈ నెలలో ఒపెక్, రష్యాల సమావేశ నిర్ణయాలు వెలువడే వరకు ముడిచమురు ధరలు మందకొడిగా ఉండొచ్చని అంటున్నారు. దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై సైతం దృష్టి పెట్టొచ్చు. నేడు నిఫ్టీ 10720- 10790 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిఫ్టీ రాబోయే రోజుల్లో 10900 పాయింట్లను పరీక్షించొచ్చని భావిస్తున్నారు. నేడు ఎఫ్‌ఎమ్‌సీజీ, ఐటీ షేర్ల జోరు కొనసాగే అవకాశం ఉంది.

దూకుడు కొనసాగింది

- రాణించిన స్థిరాస్తి, లోహ షేర్లు
- సెన్సెక్స్‌కు 284 పాయింట్ల లాభం
- 10700 ఎగువకు నిఫ్టీ

సూచీల జోరు కొనసాగింది. స్థిరాస్తి, లోహ, ఇంధన బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు దూసుకెళ్లాయి. మొండిబకాయిల వర్గీకరణ నిబంధనలను ఆర్‌బీఐ సడలించడంతో చిన్న, మధ్య శ్రేణి షేర్లు కళకళలాడాయి. మదుపర్లు పొజిషన్లను షార్ట్ కవరింగ్ చేయడం కూడా కలిసొచ్చింది. నిఫ్టీ కీలకమైన 10,700 పాయింట్లను అధిగమించింది. ఆర్‌బీఐ కీలక రేట్లపై స్థిరత్వ వైఖరి కొనసాగిస్తామని ప్రకటించడం సానుకూలతలకు దోహదపడింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా.. ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,278.38 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 35,628.49 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 284.20 పాయింట్ల లాభంతో 35,463.08 పాయింట్ల దగ్గర స్థిరపడింది. నిఫ్టీ సైతం 83.70 పాయింట్లు పెరిగి 10,768.35 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,722.60- 10,818 పాయింట్ల మధ్య కదలాడింది. మే 15 తర్వాత సెన్సెక్స్, నిఫ్టీలకు ఇదే గరిష్ఠ ముగింపు కావడం గమనార్హం.

టాటా మోటార్స్ పరుగులు: మే అంతర్జాతీయ విక్రయాల్లో జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) 6.1 శాతం వృద్ధి నమోదు చేయడంతో టాటా మోటార్స్ షేరు పరుగులు తీసింది. ఇంట్రాడేలో 3.70 శాతం పెరిగిన షేరు.. చివరకు 3.32 శాతం లాభంతో రూ.305.30 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,829.76 కోట్లు పెరిగి రూ.88,150.76 కోట్ల వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 22 లాభాలతో ముగిశాయి. టాటా స్టీల్ 3.73%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.52%, యాక్సిస్ బ్యాంక్ 2.25%, విప్రో 1.99%, ఏషియన్ పెయింట్స్ 1.90%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.89%, హిందుస్థాన్ యునిలీవర్ 1.84%, ఓఎన్‌జీసీ 1.38%, ఇన్ఫోసిస్ 1.23%, అదానీ పోర్ట్స్ 0.98% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. కోల్ ఇండియా (0.69%), ఇండస్‌ఇండ్ బ్యాంక్ (0.58%), కోటక్ బ్యాంక్ (0.57%)లు మాత్రం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 2.77 శాతం లాభపడింది. పరిశ్రమలు, ఇంధన, లోహ, మౌలిక, విద్యుత్, చమురు-గ్యాస్, టెలికాం, ఐటీ, యంత్ర పరికరాలు, టెక్, ఫైనాన్స్, పీఎస్‌యూ, ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లు అదే బాటలో నడిచాయి. మన్నికైన వినిమయ వస్తువుల షేర్లు మాత్రం డీలాపడ్డాయి.

హైదరాబాద్‌లో మరో ఏబీసీ కేంద్రం

ఏపీజే గ్రూప్ యోచన • కనీసం 250 సీట్ల సామర్థ్యం

ఈనాడు, హైదరాబాద్: ఏపీజే సురేంద్ర గ్రూప్‌నకు చెందిన ఏపీజే రియల్ ఎస్టేట్ హైదరాబాద్‌లో కో వర్కింగ్ సీట్ల సామర్థ్యాన్ని పెంచనుంది. సొంత కార్యాలయాల అవసరం లేకుండా, అన్ని సౌకర్యాలు ఉన్న కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుని కార్యకలాపాలు నిర్వహించే (కోవర్కింగ్) సంస్కృతి కార్పొరేట్ కంపెనీల్లో పెరుగుతోందని, హైదరాబాద్‌లో కో వర్కింగ్ స్థలానికి పెరుగుతున్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో సీట్ల సామర్థ్యాన్ని పెంచనున్నామని ఏపీజే రియల్ ఎస్టేట్ అధిపతి షౌవిక్ మండల్ తెలిపారు. ఏపీజే బిజినెస్ సెంటర్ (ఏబీసీ) బ్రాండ్‌తో కో వర్కింగ్ సేవలను కంపెనీ అందిస్తోంది. హైదరాబాద్‌లోని ద పార్క్ హోటల్‌ను కంపెనీ నిర్వహిస్తోంది. ఇందులో 475 సీట్ల సామర్థ్యంతో కో వర్కింగ్ కేంద్రం ఉందని, మరో 200 సీట్ల సామర్థ్యాన్ని వచ్చే కొద్ది నెలల్లో ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కనీసం 250 సీట్ల సామర్థ్యంతో హైటెక్ సిటీ లేదా గచ్చిబౌలిలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు.

7న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	367	వరంగల్	369
చిల్లరగా (ఒక గుడ్డు)	4.25	విశాఖపట్నం	368
బెంగళూరు	412	చెన్నై	440
8వ తేదీకి...		చిత్తూరు	433
విజయవాడ/గోదావరి	362	నమక్కల్	425

మార్కెట్ కబుర్లు

■ **మోన్‌శాంటో** కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినట్లు జర్మనీ ఫార్మా సంస్థ బేయర్ ఏజీ వెల్లడించింది. లావాదేవీ విలువ 6300 కోట్ల డాలర్లు. ప్రపంచంలోనే అతిపెద్ద రసాయనాలు, విత్తనాల కంపెనీగా అవతరించే లక్ష్యంతో ఈ కొనుగోలును బేయర్ చేపట్టింది.

■ **ఫ్యూచర్ రిటైల్‌లో** ఉన్న సగానికి పైగా వాటాను రూ.1,697 కోట్లకు **భారతీ గ్రూపు** సంస్థ సెడార్ సపోర్ట్ సర్వీసెస్ విక్రయించింది.

వడ్డీ రేట్లు పెంచిన బ్యాంకులు

- **జాబితాలో ఇండియన్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్**

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కీలక రేట్లను పెంచి ఒక రోజు గడిచిందో లేదో బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచడం మొదలుపెట్టాయి. దీంతో వాహన, గృహ, వాణిజ్య రుణాల నెలవారీ వాయిదా(ఈఎమ్‌ఐ)లు పెరగనున్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు గత వారమే నిధుల వ్యయం ఆధారిత రుణ రేట్ల(ఎమ్‌సీఎల్ఆర్)ను పెంచాయి. తాజాగా ఇండియన్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంకులు తమ ఎమ్‌సీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్ల మేర పెంచాయి. ఇండియన్ బ్యాంక్ తన 3 నెలల నుంచి 5 ఏళ్ల గడువు రుణాలపై 10 బేసిస్ పాయింట్లను పెంచగా.. కరూర్ వైశ్యా బ్యాంక్ కూడా ఆరు నెలల నుంచి ఒక ఏడాది వ్యవధి రుణాలకు అంతే మేర వడ్డీ రేటును పెంచింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కూడా రుణ రేట్లను పెంచే దిశగా సంకేతాలు ఇచ్చింది.

బ్యాంకు అధిపతులతో ఆర్థిక మంత్రి సమావేశం నేడు

పశ్చిమ, దక్షిణ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ రంగ బ్యాంకుల(పీఎస్‌బీ) అధిపతులతో ఆర్థిక మంత్రి పియూష్ గోయెల్ నేడు సమావేశం కానున్నారు. ఈ రెండు ప్రాంతాల్లోని 15 బ్యాంకుల సీఈఓలు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో, వివిధ సమస్యలకు ఈ సమావేశంలో పరిష్కారం చూపుతారని భావిస్తున్నారు.

క్లెయిము చేయని డిపాజిట్లపై వడ్డీ రేటు ఇక 3.5 శాతమే

ముంబయి: బ్యాంకుల్లో ఎవరూ క్లెయిము చేయని డిపాజిట్లను డిపాజిటర్ అవగాహన కార్యక్రమాల(డీఈఏ) నిధికి బదిలీ చేయడం పరిపాటే. వీటిపై వడ్డీ రేటును అర శాతం తగ్గించి 3.5 శాతానికి పరిమితం చేస్తున్నట్లు ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. ఈ డిపాజిట్లపై వార్షిక పద్ధతిన సాధారణ వడ్డీ రేటు 4 శాతాన్ని చెల్లించాలని జూన్ 2014లో ఆర్‌బీఐ నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజాగా దానిని 3.5 శాతానికి తగ్గిస్తున్నట్లు, జులై 1, 2018 నుంచి అమల్లోకి తెస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఒక పదేళ్ల పాటు డిపాజిటర్లెవరూ క్లెయిము చేయకపోతే వాటిని 'అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్' కిందకు తీసుకువస్తారు. ఆ మొత్తాలను డిపాజిటర్ల విద్య, స్పృహ అవసరాలకోసం ఏర్పాటు చేసిన నిధికి బదిలీ చేస్తారు. 10 ఏళ్ల గడువు తర్వాత ఎవరైనా డిపాజిటర్లు ఒకవేళ తమ డిపాజిట్లను క్లెయిము చేసిన పక్షంలో వడ్డీ సహా బ్యాంకులు చెల్లిస్తాయి. ప్రస్తుతం ఆ వడ్డీరేటునే తగ్గించారు.

రుణాల వృద్ధికి మూలధన సాయం సరిపోదు: మూడీస్

ముంబయి: ప్రభుత్వ రంగ 21 బ్యాంక్‌లకు ప్రభుత్వం ప్రకటించిన మూలధన సహాయ ప్రణాళిక.. వాటి మూలధన అవసరాలకు మాత్రమే సరిపోతుంది కానీ, రుణాల వృద్ధికి దన్నుగా నిలిచేందుకు చాలదని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ అభిప్రాయపడింది. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంక్‌లకు రూ.2.11 లక్షల కోట్ల మూలధన సహాయం చేయనున్నట్లు గతేడాది అక్టోబరులో ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఇందుకు రూ.65,000 కోట్లు కేటాయించింది. బ్యాంక్‌ల రుణాల వృద్ధికి ఈ మొత్తం ఎంత మాత్రం సరిపోదని మూడీస్ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ క్రెడిట్ ఆఫీసర్ అల్కా అన్బరసు పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులతో కామన్ ఈక్విటీ టైర్1 నిష్పత్తి 8 శాతం దాటేందుకు దోహదపడతాయని, మొత్తంగా రుణాల వృద్ధి 6-8 శాతం నమోదు కావొచ్చని అన్నారు. మార్కెట్ల నుంచి అదనంగా మూలధనం సమీకరించడంలో బ్యాంకులు విఫలమయ్యాయని, ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల షేర్ల ధరలు గణనీయంగా తగ్గడంతో నిధుల సమీకరణ మరింత కష్టతరంగా మారిందని వెల్లడించారు. ఆర్థిక ఫలితాలు, ప్రభుత్వ బాండు రాబడులు పెరగడం, పెట్టుబడుల ఆదాయం తగ్గడంపై ప్రభావం చూపిందని అన్బరసు చెప్పారు.

ద్రవ్యలోటు లక్ష్యాన్ని భారత్ సాధిస్తుంది

ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైతే మూలధన వ్యయాలను భారత్ తగ్గించుకునే అవకాశం ఉందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతం లోపునకు నియంత్రించాలని భారత్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న సంగతి తెలిసిందే. ఈ లక్ష్యాన్ని భారత్ సాధిస్తుందని భావిస్తున్నట్లు మూడీస్ వెల్లడించింది. ముడి చమురు అధిక ధరలను దృష్టిలో ఉంచుకొని పెట్రోలియమ్ ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తే రేటింగ్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించింది. 'బడ్జెట్లో ప్రతిపాదించిన లక్ష్యం కంటే ఆదాయం కాస్త తక్కువగా నమోదు కావొచ్చని మూడీస్ భావిస్తుంది. గత సంవత్సరాల మాదిరే ప్రణాళిక మూలధన వ్యయంలో ప్రభుత్వం మార్పు చేస్తుందని అనుకుంటున్నామ'ని మూడీస్ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ క్రెడిట్ ఆఫీసర్ విలియమ్ ఫోస్టర్ తెలిపారు.

తగ్గిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

ఐక్యరాజ్యసమితి: భారత్‌కు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లు తగ్గుముఖం పట్టాయి. 2016లో 4,400 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2,86,000 కోట్లు) మేర ఎఫ్‌డీఐలు రాగా, 2017లో 4,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.2,60,000 కోట్లు) మాత్రమే వచ్చాయని ఐక్యరాజ్య సమితి తాజా నివేదికలో వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2016తో పోలిస్తే గత ఏడాది 23 శాతం పడిపోయాయి. విలువ పరంగా చెప్పాలంటే, 2016లో 1.87 ట్రిలియన్ డాలర్లు (దాదాపు రూ.1,21,55,000 కోట్లు) ఉండగా, 2017లో 1.43 ట్రిలియన్ డాలర్ల (దాదాపు రూ.92,95,000 కోట్లు)కు పరిమితమయ్యాయి. నివేదికలోని ఇతర అంశాలు.

- 2016తో పోలిస్తే 2017లో భారత్ నుంచి బయటకు తరలిపోయిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండింతలు (11 బిలియన్ డాలర్లు) అయ్యాయి.
- ఇటీవలి కాలంలో ఓఎన్‌జీసీ విదేశీ ఆస్తులపై పెట్టుబడులు బాగా పెడుతోంది. 2016లో రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్ పీజేఎస్‌సీ అనుబంధ సంస్థ అయిన వాంకోనెఫ్ట్‌లో 26 శాతం వాటా కొనుగోలు చేసింది.

మార్చి కల్లా 99% జనాభాకు సేవలు!

- రిలయన్స్ జియో లక్ష్యం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశంలో 99 శాతం మంది జనాభాకు కంపెనీ సేవలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ టెలికాం సంస్థ రిలయన్స్ జియో నిర్దేశించుకుంది. ఈ విషయాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ తమ వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది మార్చికి కంపెనీకి 18.66 కోట్ల మంది చందాదారులున్నారు. గతేడాది మార్చికి ఈ సంఖ్య 8.3 కోట్లు మాత్రమే. కంపెనీ ప్రతి వినియోగదారుడిపైనా నెలకు రూ.137 సగటు ఆదాయం ఆర్జిస్తోంది. 'అతిపెద్ద, వేగంగా విస్తరిస్తున్న మొబైల్ డేటా నెట్‌వర్క్‌గా జియో నిలిచింది. మొదటి ఏడాదిలోనే లాభదాయకత సాధించడం ద్వారా ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాం' అని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ వెల్లడించారు.

జీఎస్‌టీ రిఫండ్‌లకు 'పాన్'తో మోక్షం

దిల్లీ: ఎగుమతిదార్లకు పాన్ ఆధారంగా జీఎస్‌టీ రిఫండ్ ఇచ్చేందుకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) అనుమతినిచ్చింది. ఎగుమతి బిల్లులోని జీఎస్‌టీ గుర్తింపు సంఖ్య (జీఎస్‌టీఐఎన్)తో రిటర్న్ ఫారంలో పొందుపరిచిన సంఖ్య సరిపోకపోవడం వల్ల నిలిచిపోయిన రిఫండ్‌లకు మాత్రమే ఇది వర్తిస్తుంది. సీబీఐసీ వద్ద వివిధ కారణాలతో సుమారు రూ.14,000 కోట్ల విలువైన రిఫండ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రిఫండ్‌లను త్వరితగతంగా మంజూరు చేసే ఉద్దేశంతో మే 31 నుంచి జూన్ 14 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జీఎస్‌టీఆర్-3బీ/ జీఎస్‌టీఆర్-1లోని పాన్ సంఖ్య, ఎగుమతి బిల్లులోని పాన్ సంఖ్య ఒకటే అయితే రిఫండ్ మంజూరు చేయాల్సిందిగా క్షేత్రస్థాయి అధికారులకు నోటిఫికేషన్ ద్వారా సీబీఐసీ సమాచారం ఇచ్చింది.

ఛాంపియన్

కోహ్లికి ఉమ్రిగర్ అవార్డు

హర్మన్, స్మృతిలకూ బీసీసీఐ పురస్కారాలు

ముంబయి: బీసీసీఐ వార్షిక అవార్డుల్లో టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి పంట పండింది. అంతర్జాతీయ క్రికెట్లో అత్యుత్తమ ప్రదర్శన భారత ఆటగాడికి ఇచ్చే పాలి ఉమ్రిగర్ అవార్డును 2016-17, 2017-2018 సీజన్లకు కోహ్లి గెలుచుకున్నాడు. బోర్డు తొలిసారి 'వుమన్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును కూడా ప్రకటించింది. 2016-17 సీజన్కు గాను హర్మన్ప్రీత్ కౌర్ను, 2017-18 సీజన్కు స్మృతి మంధానను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. వన్డేల్లో ప్రస్తుతం నంబర్వన్ బ్యాట్స్మన్ అయిన కోహ్లి... గత మూడేళ్లలో 91.90 సగటుతో 2757 పరుగులు చేశాడు. మహిళల క్రికెట్లో హర్మన్ప్రీత్ కూడా అద్భుతంగా రాణించింది. 2016లో టీ20 ప్రపంచకప్లో, 2017 ఆసియాకప్లో చక్కని ప్రదర్శన చేసింది. ఇక మంధాన ఇంగ్లాండ్పై 90 పరుగులతో 2017 ప్రపంచకప్ను ఘనంగా ఆరంభించింది. ఆ తర్వాత వెస్టిండీస్తో సిరీస్లోనూ రాణించింది. రంజీ ట్రోఫీ (2017-18)లో అత్యధిక పరుగు చేసినందుకు మయాంక్ అగర్వాల్, అత్యధిక వికెట్లు పడగొట్టినందుకు జలజ్ సక్సేనా మాధవరావు సింధియా అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ ఆల్రౌండర్గా లాలా అమర్నాథ్ పురస్కారాన్ని కూడా జలజ్ సక్సేనా అందుకోనున్నాడు. ఈ నెల 12న బీసీసీఐ అవార్డుల కార్యక్రమం జరగనుంది.

హర్మన్, స్మృతి

ఫిఫా ప్రపంచకప్ మరో 6 రోజుల్లో

శ్రీలంకపై భారత్ విజయం

కౌలాలంపూర్: మహిళల టీ20 ఆసియాకప్లో భారత్ బలంగా పుంజుకుంది. గురువారం 7 వికెట్ల తేడాతో శ్రీలంకపై విజయం సాధించింది. గత మ్యాచ్లో బంగ్లాదేశ్ చేతిలో ఓడిన భారత్.. లంకపై అన్ని రంగాల్లోనూ మెరుగైన ప్రదర్శన చేసింది. ఎడమ చేతి వాటం స్పిన్నర్ ఏక్తా బిష్త్ (2/20), జులన్ గోస్వామి (1/20), అనుజ పాటిల్ (1/19) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మొదట శ్రీలంక 7 వికెట్లకు 107 పరుగులే చేయగలిగింది. హాసిని పెరీరా (46) టాప్ స్కోరర్గా నిలిచింది. విజయ లక్ష్యాన్ని భారత్ మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఛేదనలో భారత్ 11.2 ఓవర్లలో ఓపెనర్లు మిథాలీరాజ్ (23), స్మృతి మంధాన (12) వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేసింది. తర్వాత హర్మన్ప్రీత్ (24) వెనుదిరిగినా.. వేద కృష్ణమూర్తి (29 నాటౌట్). . అనుజ (19 నాటౌట్)తో కలిసి పని పూర్తి చేసింది. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు మూడూ నాలుగు మ్యాచ్ల నుంచి ఆరు పాయింట్లు సాధించాయి. కానీ భారత్ మెరుగైన రన్రేట్ (+2.709)తో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. భారత్ తన తర్వాతి మ్యాచ్లో శనివారం పాకిస్థాన్తో తలపడుతుంది.

మిథాలీరాజ్

మిథాలీ 2000

అంతర్జాతీయ మహిళల టీ20 క్రికెట్లో 2000 పరుగుల మైలురాయిని అందుకున్న భారత తొలి బ్యాట్స్వుమన్గా మిథాలీ రాజ్ ఘనత సాధించింది. 35 ఏళ్ల మిథాలీ ఇప్పటివరకు 75 మ్యాచ్ల్లో 2,015 పరుగులు చేసింది. మొత్తంగా టీ20ల్లో రెండు వేల పరుగులు చేసిన ఏడో బ్యాట్స్వుమన్ ఆమె. బీసీసీఐ ఆమెను అభినందించింది. భారత పురుష క్రికెటర్లెవరూ పొట్టి క్రికెట్లో ఇంకా 2 వేల మైలురాయిని అందుకోలేదు. 1983 పరుగులతో కోహ్లి ముందున్నాడు. రోహిత్ శర్మ (1852), రైనా (1499) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

ఫైనల్లో హలెప్, స్టీఫెన్స్

సెమీస్లో నాదల్, పొట్రో

ఫ్రెంచ్ ఓపెన్ కిరీటాన్ని కొత్త రాణి ధరించబోతోంది. తొలి గ్రాండ్స్లామ్ కోసం తహతహలాడుతున్న టాప్ సీడ్ హలెప్, యుఎస్ ఓపెన్ ఛాంప్ స్లోన్ స్టీఫెన్స్ మహిళల సింగిల్స్ ఫైనల్కు దూసుకెళ్లారు. ఎవరు గెలిచినా రొలాండ్ గారోస్లో తొలిసారి ట్రోఫీని ముద్దాడతారు. ఇక మట్టికోర్టు మహారాజు రఫెల్ పురుషుల సింగిల్స్లో సెమీఫైనల్లో అడుగుపెట్టి డెల్పొట్రోతో పోరుకు సిద్ధమయ్యాడు.

పారిస్

నాదల్

గ్రాండ్స్లామ్ కలను నెరవేర్చుకోడానికి రొమేనియా అమ్మాయి సిమోనా హలెప్ అడుగుదూరంలో నిలిచింది. మూడోసారి ఫ్రెంచ్ ఫైనల్కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ నంబర్వన్ హలెప్ 6-1, 6-4తో మాజీ చాంపియన్ గార్బైన్ ముగురుజ (స్పెయిన్)పై విజయం సాధించింది. తొలి సెట్ను అలవోకగా గెలుచుకున్న హలెప్కు రెండో సెట్లో గట్టి పోటీ ఎదురైంది. మూడో గేమ్లో బ్రేక్ సాధించిన ముగురుజ, వెంటనే సర్వ్ నిలుపుకుని 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. హలెప్ ఎనిమిదో గేమ్లో బ్రేక్తో స్కోరు 4-4తో సమం చేసింది. సుదీర్ఘంగా సాగిన తొమ్మిదో గేమ్లో ఆమె మూడు బ్రేక్ పాయింట్లను కాచుకుంది. హలెప్ పదో గేమ్లో ముగురుజ సర్వీసును బ్రేక్ చేసి సెట్ను, మ్యాచ్ను గెలుచుకుంది. మ్యాచ్లో హలెప్ 16 విన్నర్లు కొట్టింది. హలెప్ 2014, 2017లోనూ ఇక్కడ ఫైనల్కు చేరుకుంది. ఆ రెండు సార్లూ ఓడిపోయిన ఆమె ఈసారి టైటిల్ కోసం పదో సీడ్ పదో సీడ్ అమెరికా అమ్మాయి స్లోన్ స్టీఫెన్స్తో తలపడుతుంది. సెమీఫైనల్లో స్టీఫెన్స్ 6-4, 6-4తో తన దేశానికే చెందిన మాడిసన్ కీస్పై విజయం సాధించింది.

ఎదురులేని నాదల్: పురుషుల సింగిల్స్లో ప్రపంచ నంబర్వన్ రఫెల్ నాదల్ సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. 11వ టైటిల్పై కన్నేసిన నాదల్.. క్వార్టర్ఫైనల్లో 4-6, 6-3, 6-2, 6-2తో డీగో ష్వార్జ్మన్ (అర్జెంటీనా)ను ఓడించాడు. జిమ్మీ కానర్స్ (యుఎస్ ఓపెన్), ఫెదరర్ (వింబుల్డన్) తర్వాత ఓ గ్రాండ్స్లామ్ టోర్నీలో 11 సార్లు సెమీఫైనల్ చేరిన మూడో ఆటగాడిగా 32 ఏళ్ల నాదల్ ఘనత సాధించాడు. మ్యాచ్లో నాదల్ 34 విన్నర్లు కొట్టాడు. ఫ్రెంచ్ ఓపెన్లో అతనెప్పుడూ సెమీస్ లేదా ఫైనల్లో ఓడిపోలేదు. ఫైనల్లో స్థానం కోసం నాదల్.. అర్జెంటీనా ఆటగాడు డెల్పొట్రోను ఢీకొంటాడు. ఐదో సీడ్ పొట్రో క్వార్టర్స్లో 7-6 (7-5), 5-7, 6-3, 7-5తో మూడో సీడ్ సిలిచ్ (క్రొయేషియా)ను మట్టికరిపించాడు. మరోవైపు లతిషా చాన్ (చైనీస్ తైపీ), ఇవాన్ దోడిగ్ (క్రొయేషియా) జోడీ మిక్స్డ్ డబుల్స్ టైటిల్ గెలుచుకుంది. ఫైనల్లో ఈ ద్వయం 6-1, 6-7 (5-7), 10-8తో దబ్రోవ్స్కి (కెనడా), మేట్ పవిచ్ (బోస్నియా-హెర్జెగోవినా) జోడీపై విజయం సాధించింది.

గ్రూప్-జి విశ్లేషణ

రోమెలు లుకాకు

కప్పుపై కన్నేసిన 'రెడ్ డెవిల్స్'

బెల్జియం టైటిల్ వేటలో...

ఫిఫా ప్రపంచ ర్యాంకింగ్స్లో మూడో స్థానంలో ఉన్న జట్టు ఒకవైపు.. తొలిసారి ప్రపంచకప్కు అర్హత సాధించిన జట్టు మరోవైపు. ఆడిన నాలుగు ప్రపంచకప్ టోర్నీల్లో ఒకే ఒక్కటే నెగ్గిన జట్టు ఒకటైతే.. అభిమానుల భారీ ఆశలను మోస్తూ టైటిల్ కోసం తపిస్తోన్న జట్టు మరోటి. ఇంతటి వైవిధ్యం ఉన్న గ్రూప్- జీలో ఫలితాలు ఎలా ఉంటాయో అనేది ఆసక్తికరం. జోరుమీదున్న బెల్జియంకు గ్రూప్ దశలో ఎదురు ఉండకపోవచ్చు. మరోవైపు ఇంగ్లాండ్ ముందడుగు వేసే అవకాశం ఉంది. టునీసియా, పనామాలు ఎలాంటి ప్రదర్శన చేస్తాయన్నది ఆసక్తికరం.

వరుసగా మూడో ప్రపంచకప్కు అర్హత సాధించిన బెల్జియం అత్యంత పటిష్ఠంగా ఉంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటని అంటున్నారు. నాణ్యతలో.. కప్పు గెలవడానికి ప్రధాన పోటీదారులైన జర్మనీ, బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్ల సరసన బెల్జియం నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రపంచకప్ అర్హత మ్యాచ్ల్లో ఆ జట్టు జోరు చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. క్వాలిఫయర్స్లో అజేయంగా నిలిచిన రెడ్ డెవిల్స్ మొత్తం 43 గోల్స్ కొట్టింది. అత్యధిక గోల్స్ చేసిన జట్టుగా డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీతో సమానంగా నిలిచింది. ఐతే కప్పుపై కన్నేసిన బెల్జియంకు నిలకడ లేమే పెద్ద సమస్య. ఒక టోర్నీలో అదరగొట్టే బెల్జియం.. మరో టోర్నీకి వచ్చేసరికి తడబడుతుంది. గత ప్రపంచకప్లో అర్జెంటీనా చేతిలో ఓడి క్వార్టర్స్లో నిష్క్రమించిన ఈ జట్టు మరోసారి క్వార్టర్స్ చేరే అవకాశాలు మెండు. సత్తా మేరకు ఆడితే కప్పు రేసులో ఉంటుది. దూకుడైన మిడ్ఫీల్డర్లు ఎడెన్ హజార్డ్, కెవిన్ డిబ్రూయిన్లపైనే ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. వీళ్లతో పాటు అనుభవజ్ఞులైన డిఫెండర్లు థామస్, విన్సెంట్ రాణిస్తే ఆ జట్టుకు తిరుగుండదు. మరోవైపు బెల్జియం అగ్రశ్రేణి మిడ్ఫీల్డర్ రడ్జ నైన్గొలన్ను కోచ్ రాబర్టో ప్రపంచకప్ జట్టుకు ఎంపిక చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బెల్జియంను గ్రూప్లో అగ్రస్థానం సాధించకుండా అడ్డుకోవడం మిగతా జట్లకు కష్టమే.

కోచ్: రాబెర్టో మార్టినెజ్.
కీలక ఆటగాళ్లు: కెవిన్ డిబ్రూయిన్, ఈడెన్ హజార్డ్, రోమెలు లుకాకు.
ఉత్తమ ప్రదర్శన: 1986 ప్రపంచకప్లో నాలుగోస్థానం.
ఫిఫా ర్యాంకు: 3
అంచనా: గ్రూప్లో అగ్రస్థానం.

ఇంగ్లాండ్ ఆశలతో..!

హ్యారీ కేన్

నిరుడు అండర్-20 ప్రపంచకప్, అండర్-17 ప్రపంచకప్, అండర్-19 యూరోపియన్ లీగ్ టైటిళ్లు గెలిచి ఊపు మీదున్న ఇంగ్లాండ్.. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలోనూ సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది. డెలె అల్లీ, రహీమ్ స్టెర్లింగ్, హ్యారీ కేన్ లాంటి ఆటగాళ్లతో జట్టు ప్రపంచకప్ కోసం సరికొత్తగా సిద్ధమైంది. యువ ఆటగాళ్లతో జట్టు జోరుమీదుంది. గత ప్రపంచకప్లో గ్రూప్ దశలోనే నిష్క్రమించడం నిరాశపరిచే విషయమైనా ఈ సారి యువ జట్టుతో అద్భుతాలు చేయాలని ఇంగ్లాండ్ భావిస్తోంది. పనామా, టునీసియా జట్లపై విజయాలు సాధించి గ్రూప్లో రెండోస్థానంతో ఇంగ్లాండ్ ముందంజ వేసే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ అగ్రశ్రేణి ఆటగాడు వేన్ రూనీ గతేడాది ఆటకు వీడ్కోలు పలికిన నేపథ్యంలో ఈ సారి ఆ జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందోననే ఆసక్తి నెలకొంది.

కీలక ఆటగాళ్లు: హ్యారీ కేన్, రహీమ్ స్టెర్లింగ్, జాన్ స్టోన్స్.
కోచ్: గారెత్ సౌత్గేట్. **ఉత్తమ ప్రదర్శన:** 1966 విజేత.
ఫిఫా ర్యాంకు: 12 **అంచనా:** గ్రూప్లో రెండోస్థానం.

టునీసియా ఒక్కటి గెలిచినా గొప్పే

ఖాజ్రి

నాలుగు సార్లు ప్రపంచకప్ మహా సంగ్రామంలో పోటీ పడ్డ టునీసియా ఒక్క మ్యాచ్లో మాత్రమే విజయం సాధించగలిగింది. దీన్ని బట్టి చూస్తే ఈ సారి కూడా ఆ జట్టు గ్రూప్ దశ దాటడం కష్టంగానే కనిపిస్తోంది. దాదాపు పన్నెండేళ్ల తర్వాత తిరిగి ప్రపంచకప్ ఆడుతున్న ఈ జట్టు బెల్జియం, ఇంగ్లాండ్ లాంటి జట్లపై గెలవడం దాదాపు అసాధ్యమే అని చెప్పాలి. అర్హత మ్యాచ్ల్లో ఓటమి అన్నది ఎరగకుండా ఈ మెగా టోర్నీకి చేరిన టునీసియా అద్భుతాలు చేస్తుందేమో చూడాలి. అయితే స్టార్ ఆటగాడు యుసెఫ్ మసక్ని గాయంతో దూరమవడం ఆ జట్టుకు పెద్ద దెబ్బే. టునీసియా ఆశలన్నీ మిడ్ఫీల్డర్ వాబి ఖాజ్రినే కీలకం.

కీలక ఆటగాళ్లు: వాబి ఖాజ్రి, తహ యాసిన్.
కోచ్: నబిల్ మాలౌల్. **ఫిఫా ర్యాంకు:** 21
ఉత్తమ ప్రదర్శన: గ్రూప్ దాటలేదు.
అంచనా: గ్రూప్ దాటడం కష్టం.

పనామా అర్హతే పదివేలు

ప్రపంచకప్లో పోటీపడడం కోసం ఫుట్బాల్ జట్లు ప్రాణం పెట్టి పోరాడతాయనడంలో అతిశయోక్తి లేదు. ఈ మెగా టోర్నీకి అర్హత సాధిస్తే ఆ జట్టు సంబరాలు మామూలుగా ఉండవు. తొలిసారిగా ప్రపంచకప్కు అర్హత సాధించిన పనామాలోనూ పరిస్థితులు దీనికి భిన్నంగా లేవు. పనామా ప్రపంచకప్ అర్హత సాధించిన రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రజలు భారీ ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మొదటిసారి ప్రపంచకప్లో పాల్గొంటున్న ఈ జట్టు నుంచి ఎక్కువగా ఆశించలేం. రోమన్ టోరెస్ పనామాకు ప్రధాన ఆటగాడు. ఈ జట్టు గ్రూప్ దశ దాటడం కష్టం. టునీసియా మ్యాచ్లోనైనా గెలుస్తుందా అన్నది ఆసక్తికరం.

కీలక ఆటగాళ్లు: రోమన్ టోరెస్, మైకెల్ మురిలో.
కోచ్: డారియో గోమెజ్.
ఉత్తమ ప్రదర్శన: ఇదే తొలి ప్రపంచకప్. **ఫిఫా ర్యాంకు:** 55
అంచనా: గ్రూప్కే పరిమితం కావొచ్చు.

ఛెత్రీసేన ఓడింది

కివీస్ చేతిలో 1-2తో పరాజయం

ముంబయి: వరుస విజయాలతో జోరుమీదున్న భారత ఫుట్బాల్ జట్టుకు బ్రేక్ పడింది. ఇంటర్ కాంటినెంటల్ కప్ టోర్నీలో బుధవారం న్యూజిలాండ్తో మ్యాచ్లో ఛెత్రీసేన 1-2తో పరాజయం చవిచూసింది. సూపర్ ఫామ్లో ఉన్న ఛెత్రి 47వ నిమిషంలో గోల్ కొట్టి పైచేయిలో నిలిపినప్పటికీ.. భారత్ ఎంతోసేపు ఆధిక్యాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ఇంకో రెండు నిమిషాలకే డి జాంగ్ గోల్ కొట్టడంతో స్కోరు సమమైంది. డ్రా ఖాయమనుకుంటుండగా 86వ నిమిషంలో డైయర్ గోల్ కొట్టి కివీస్కు అనూహ్య విజయాన్నందించాడు. కోచ్ కాన్స్టెంటైన్ మరీ ప్రయోగాలకు పోయి మ్యాచ్లో ఏకంగా ఏడు మార్పులు చేయడం భారత్కు చేటు చేసింది. ఐతే ఈ మ్యాచ్ ఓడినప్పటికీ భారత్ ఫైనల్ అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. చైనీస్ తైపీపై 5-0తో, కెన్యాపై 3-0తో గెలిచిన భారత్ ఆరు పాయింట్లు, మెరుగైన గోల్ తేడాతో మిగతా జట్ల కంటే ముందంజలో ఉంది. శుక్రవారం కెన్యా-చైనీస్ తైపీ మ్యాచ్ ఫలితాన్ని బట్టి ఫైనల్ జట్లేవో నిర్ణయమవుతుంది. గత మ్యాచ్కు ముందు తమ ఆట చూడాలంటూ అభిమానులకు ఛెత్రి ఇచ్చిన పిలుపుతో జనాలు స్టేడియానికి పోటెత్తుతున్నారు. కివీస్తో మ్యాచ్కు టికెట్లన్నీ అమ్ముడైపోయి, స్టాండ్స్ నిండుగా కనిపించడం విశేషం.

ఛెత్రి

భారత అండర్-19 జట్టులో అర్జున్

ముంబయి: సచిన్ తెందుల్కర్ తనయుడు అర్జున్ తెందుల్కర్ శ్రీలంకలో పర్యటించే భారత అండర్-19 జట్టులో చోటు సంపాదించాడు. రెండు నాలుగు రోజుల మ్యాచ్ల్లో అతడు ఆడతాడు. వన్డే మ్యాచ్లు ఆడే జట్టులో అతడు లేడు. 6 అడుగుల 1 అంగుళం పొడవున్న 18 ఏళ్ల అర్జున్ ఎడమచేతివాటం ఫాస్ట్బౌలర్. ఉపయుక్తమైన మిడిల్ ఆర్డర్ బ్యాట్స్మన్ కూడా. కూచ్ బెహార్ ట్రోఫీ (అండర్-19)లో ఐదు మ్యాచ్లో అతడు 18 వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్లో అత్యధిక వికెట్లు తీసుకున్న బౌలర్ల జాబితాలో అర్జున్ 43వ స్థానంలో ఉన్నాడు. అర్జున్ కన్నా ఎక్కువ వికెట్లు తీసుకున్నవారిలో ఎక్కువ మంది స్పిన్నర్లేనని, నిఖార్సైన పేసర్లు లేరని సెలక్షన్ కమిటీ వర్గాలు తెలిపాయి.

"అర్జున్ అండర్-19 జట్టుకు ఎంపికైనందుకు చాలా సంతోషంగా ఉంది. అతడి క్రికెట్ కెరీర్లో ఇది కీలక మైలురాయి. అర్జున్ ఏం చేయాలనుకున్నా నేను, అంజలి ఎప్పుడూ ప్రోత్సహిస్తాం. అతడి విజయం కోసం ప్రార్థిస్తాం" – సచిన్

ఔరా అఫ్గాన్

టీ20 సిరీస్ క్లీన్స్వీప్

డెహ్రాడూన్: అఫ్గానిస్థాన్ మరోసారి సంచలన ప్రదర్శన చేసింది. బంగ్లాదేశ్తో మూడు టీ20ల సిరీస్ను క్వీన్ స్వీప్ చేసింది. గురువారం తీవ్ర ఉత్కంఠ రేపిన చివరి టీ20లో ఒక్క పరుగు తేడాతో నెగ్గింది. మొదట అఫ్గాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. షెన్వారి (33 నాటౌట్) టాప్స్కోరర్. ఛేదనలో బంగ్లా ఒక దశలో 45 పరుగులకే 4 వికెట్లు కోల్పోయినప్పటికీ.. రహీమ్ (46), మహ్మదుల్లా (45) జట్టును విజయానికి చేరువ చేశారు. 19వ ఓవర్లో ఈ జోడీ 21 పరుగులు రాబట్టింది. ఐతే చివరి ఓవర్లో 9 పరుగులు అవసరం కాగా.. రషీద్ ఖాన్ (1/24) బంగ్లాకు అవకాశమివ్వలేదు. తొలి బంతికే రహీమ్ను ఔట్ చేసిన అతను. . తర్వాతి నాలుగు బంతుల్లో 5 పరుగులే ఇచ్చాడు. చివరి బంతికి 2 పరుగులే రావడంతో మ్యాచ్ అఫ్గాన్ సొంతమైంది.

నెయ్మార్ ఉంటే సరిపోదు..

సావో పౌలో: ప్రపంచకప్ ఫుట్బాల్లో బ్రెజిల్ ప్రధాన ఫేవరెట్. సాంబా జట్టు ఆరో ప్రపంచకప్ ఖాతాలో వేసుకుంటుందన్నది విశ్లేషకుల మాట. ఐతే ఆ జట్టు దిగ్గజం.. మూడు ప్రపంచకప్లో నెగ్గిన ఒకే ఒక్కడు పీలే మాత్రం బ్రెజిల్ జట్టుపై ఆందోళన వ్యక్తం చేశాడు. జట్టులో నిపుణులుంటే సరిపోదని, జట్టుగా ఆడినప్పుడే విజయం దక్కుతుందని, బ్రెజిల్కు సరైన మేళవింపు లేదని చెప్పాడు. టైట్ కోచ్ బాధ్యతలు చేపట్టాక గత 20 మ్యాచ్ల్లో బ్రెజిల్ ఒకే ఒక్క మ్యాచ్లో ఓడింది. ఐతే గత కొంతకాలంగా ఆటగాళ్ల గాయాల కారణంగా తరుచూ జట్టులో మార్పు చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. "టైట్ సత్తాపై నాకెలాంటి సంశయం లేదు. ఆందోళనంతా జట్టు కూర్పు గురించే. ప్రపంచకప్ ఆరంభానికి ఇంకెంతో సమయం లేదు. అయినా ఇప్పటికీ బ్రెజిల్కు సరైన మేళవింపు లేదు. జట్టులో సత్తాఉన్న ఆటగాళ్లే ఉన్నారు. ఐతే వారు జట్టుగా ఇంకా కలిసిపోలేదు" అని పీలె చెప్పాడు. స్టార్ ఆటగాడు నెయ్మార్ గురించి మాట్లాడుతూ.. ' 'ప్రపంచంలో అత్యుత్తమ ఆటగాళ్లలో నెయ్మార్ ఒకడు. ఇప్పుడు అతడు ఎంతో అనుభవం సంపాదించాడు. పరిణతి సాధించాడు. అయినా అతడొక్కడే బ్రెజిల్కు కప్పు అందించలేడన్నది వాస్తవం. సమష్టిగా ఆడినప్పుడే ప్రపంచకప్ సాధ్యం. ప్రపంచకప్లో తలపడిన బ్రెజిల్ జట్లలో 1970 ప్రపంచకప్ ఆడిన జట్టు అత్యుత్తమమైంది. మేటి ఆటగాళ్లు జట్టులో ఉన్నా.. అప్పుడు ఆరు నెలలు కలిసి సాధన చేశాం. అది మంచి ఫలితాన్నిచ్చింది" అని పీలె వివరించాడు. ప్రపంచకప్ ఆరంభానికి ముందు ఆదివారం ఆస్ట్రియాతో బ్రెజిల్ తన చివరి వార్మప్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-ఈలో ఉన్న బ్రెజిల్ జూన్ 17న స్విట్జర్లాండ్తో మ్యాచ్తో పోరాటాన్ని ఆరంభించనుంది.

మా జట్టు ఫేవరేట్ కాదు

మాస్కో: ప్రపంచకప్లో పోర్చుగల్ టైటిల్ ఫేవరేట్ కాదనే వాస్తవాన్ని గ్రహించాలని ఆ జట్టు కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో అంటున్నాడు. అయితే ఫుట్బాల్లో ఏదైనా సాధ్యమే అని నిరూపిస్తామని అతను చెబుతున్నాడు. ప్రపంచకప్ కోసం రష్యా వెళ్లనున్న పోర్చుగల్ జట్టుకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో రొనాల్డో మాట్లాడుతూ.. "వాస్తవంగా చూసుకుంటే మేం ఫేవరేట్లం కాదని మాకు తెలుసు. కానీ ఫుట్బాల్లో ఏదైనా సాధ్యమే. గ్రూప్ దశ చాలా కఠినంగా ఉండబోతుంది. అయినా మంచి ఆటగాళ్లతో కూడిన మా జట్టు అద్భుత ప్రదర్శన కనబరుస్తుందనే నమ్మకం ఉంది. చివరి వరకూ విజయం కోసం పోరాడుతాం" అని తెలిపాడు. పోర్చుగల్.. స్పెయిన్, మొరాకో, ఇరాన్లతో కలిసి గ్రూప్- బిలో ఉంది.

భారత్కు 4 పతకాలు

జిఫు (జపాన్): ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్లో తొలి రోజు భారత్ సత్తాచాటింది. గురువారం జరిగిన పోటీల్లో భారత క్రీడాకారులు 4 పతకాలు సాధించారు. హ్యామర్ త్రోలో ఆశిష్ జఖర్ స్వర్ణం, దమ్నీత్సింగ్ రజతం కైవసం చేసుకున్నారు. మహిళల ట్రిపుల్ జంప్లో ప్రియదర్శిని సురేశ్, 5000 మీ పరుగులో పూనమ్ కాంస్య పతకాలు సాధించారు.

ఆనంద్ ఓటమి

స్టావెంజర్ (నార్వే): ప్రపంచ మాజీ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్కు నార్వే చెస్ టోర్నీలో రెండో ఓటమి ఎదురైంది. 8వ రౌండ్లో ఫాబియానో కరువానా (అమెరికా) చేతిలో పరాజయం చవిచూశాడు. ఈ ఓటమితో ఆనంద్ (3.5) ఐదో స్థానానికి పడిపోయాడు. మాగ్నస్ కార్ల్సన్ (నార్వే), వెస్లీ (అమెరికా), నకముర హికారు (అమెరికా), కరువానా నాలుగేసి పాయింట్లతో ఉమ్మడిగా ఆధిక్యంలో ఉన్నారు.

చిత్ర సీమలో ఏపీది ప్రముఖ పాత్ర

- హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా

ఈనాడు - అమరావతి

చిత్ర పరిశ్రమ అభివృద్ధిలో ఏపీది ప్రముఖ పాత్రని ఈ రాష్ట్ర ప్రస్తావన లేకుండా చిత్ర పరిశ్రమ సృష్టి, అభివృద్ధి, భవిష్యత్తు గురించి మాట్లాడటం అసాధ్యమని హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా అన్నారు. "ఎన్.టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు తదితర మహామహులను తెలుగు చిత్ర పరిశ్రమకు అందించిన ఘనత ఆంధ్రప్రదేశ్‌దే. సావిత్రి జీవితచరిత్రను మహానటి సినిమాగా తీయడం మంచి ప్రయత్నం. వ్యాపార అనుకూల వాతావరణం కలిగిన రాష్ట్రాల జాబితాలో కూడా ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఇందులో విజయవాడ పాత్ర ఎంతో కీలకమైనది. అందుకే దేశంలోనే తొలిసారిగా ఈ నగరంలోనే హైపర్ లూప్ రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది" అని వివరించారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో గురువారం అమెరికా 242వ స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. "హాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ" అనే థీమ్‌తో వీటిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు, తెలుగు చిత్ర పరిశ్రమతో కలిసి మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు రెండు లఘు చిత్రాలు రూపొందించామని వీటిని త్వరలోనే విడుదల చేస్తామన్నారు. విజయవాడలో తొలిసారిగా, హైదరాబాద్ వెలుపల రెండోసారి అమెరికా స్వాతంత్ర్య వేడుకలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వేడుకలు ప్రారంభమైన వెంటనే తొలుత అమెరికా జాతీయ గీతం, ఆ తర్వాత భారత జాతీయ గీతాన్ని వినిపించారు. వివిధ రంగాల ప్రముఖులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దీనికి హాజరయ్యారు.

242వ అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా అమరావతిలో ప్రసంగిస్తున్న క్యాథరిన్ హడ్డా. చిత్రంలో మంత్రి యనమల

ఏపీలోనే అమెరికా వీసాలు తీసుకునే ఏర్పాటు చేయాలి: యనమల

అమెరికా వీసాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తున్నందున... ఈ రాష్ట్రంలోనే వీసాలు తీసుకునే ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కేథరిన్ హడ్డాను కోరారు. అమెరికా వీసాల మంజూరుపై కొంత భయాందోళనలు ఉన్న నేపథ్యంలో మరింత వెసులుబాటు కల్పించాలన్నారు. వేడుకలు జరిగిన ప్రాంగణంలో ఎన్టీఆర్, శ్రీదేవి, బాహుబలి చిత్రంలోని ప్రభాస్ కటౌట్లు; క్షణక్షణం, మాయాబజార్, యమదొంగ చిత్రాలకు సంబంధించిన పోస్టర్లను ఏర్పాటు చేశారు.

సముద్ర గర్భం నుంచి క్లౌడ్ సేవలు!

సిద్ధమవుతున్న మైక్రోసాఫ్ట్ డాటా కేంద్రం

లండన్: కంప్యూటర్ రంగంలో క్లౌడ్ సేవలను సముద్ర గర్భం నుంచి అందించేందుకు మైక్రోసాఫ్ట్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా షిప్పింగ్ కంటైనర్ పరిమాణంలో ఉండే డాటా కేంద్రాన్ని స్కాట్‌లాండ్ సమీపంలోని ఓర్కనీ ద్వీపంలో సముద్ర అంతర్భాగంలో 117 అడుగుల లోతులో ఏర్పాటు చేసింది. 'ప్రాజెక్ట్ నాటిక్' పేరుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు రెండో దశ పనులను తాజాగా ప్రారంభించింది. 40 అడుగుల పొడవు ఉండే ఈ కేంద్రంలో 12 అరలు, 864 సర్వర్లు, చల్లబరిచే యంత్రసామగ్రి ఉంటాయి. దీని నిర్వహణకు అవసరమయ్యే పావు మెగావాట్ విద్యుత్‌ను ఆర్కనీ ద్వీపం గ్రిడ్ నుంచి తీసుకోనున్నారు. సముద్ర గర్భంలో ఈ డాటా కేంద్రం పనితీరును వచ్చే 12 నెలల పాటు పరిశీలించనున్నారు. సముద్ర గర్భంలో ఇలా డాటా కేంద్రాలు ఏర్పాటు చేసి.. ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్న తీర ప్రాంత నగరాల్లోని ప్రజలకు మెరుగైన అంతర్జాల సేవలు అందించాలని మైక్రోసాఫ్ట్ యోచిస్తోంది. ఈ కేంద్రంతో డాటా ప్రయాణించే దూరం తగ్గుతుందని, ఈ ప్రాజెక్టు పర్యావరణహితమైనదని సంస్థ ప్రతినిధులు వివరిస్తున్నారు.

'వేధిస్తున్న మానసిక ఆరోగ్య కార్మికుల కొరత'

దిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా మానసిక ఆరోగ్య సేవల కార్మికుల కొరత వేధిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తాజా నివేదికలో తెలిపింది. సామాజిక మానసిక ఆరోగ్య కేంద్రాలకు పెట్టుబడి కరవైందనీ వివరించింది. "మెంటల్ హెల్త్ అట్లాస్-2017" పేరిట సంస్థ గురువారం నివేదిక విడుదలచేసింది. 177 దేశాల సమాచారాన్ని దీనిలో విశ్లేషించింది. దీనిలోని సమాచారం ప్రకారం..
★ ఏటా దాదాపు 8 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ★ అల్పాదాయ దేశాల్లో ప్రతి లక్ష మందికి ఇద్దరు మానసిక ఆరోగ్య సేవల కార్మికులు మాత్రమే అందుబాటులోనున్నారు. ధనిక దేశాల్లో ఈ సంఖ్య 70గా ఉంది. ★ మానసిక ఆరోగ్య పరిరక్షణకు 139 దేశాలు ప్రత్యేక ప్రణాళికలు, విధానాలను సిద్ధంచేశాయి. అయితే చాలావరకూ వీటికి సరిపడా నిధులు, మానవ వనరులను కేటాయించట్లేదు. ★ మానసిక ఆరోగ్య పరిరక్షణకు ఒక్కొక్కరిపై అల్పాదాయ దేశాలు వెచ్చిస్తున్న మొత్తం రూ.65 మాత్రమే. ధనిక దేశాల విషయంలో ఇది రూ.5300గా ఉంది.

సీఎస్ ఎఫ్ఏసీగా అనిల్‌చంద్ర పునేఠా

ఈనాడు అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠాకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ శుక్రవారం నుంచి 2 వారాలపాటు వైద్య సెలవులో వెళుతున్నందున ఈ ఏర్పాటు జరిగింది.

'తుంగభద్ర'లో 130 టీఎంసీల లభ్యత!

- ఏపీకి 41, తెలంగాణకు 4 టీఎంసీలు
- నీటి లెక్కింపు కమిటీ ప్రాథమిక అంచనా

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఈ వర్షాకాల సీజన్‌లో తుంగభద్ర జలాశయంలోకి 130 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉందంటూ తుంగభద్ర బోర్డు నీటి లెక్కింపు కమిటీ ప్రాథమికంగా అంచనా వేసింది. కేటాయింపుల ప్రకారం కర్ణాటకకు 85.230 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 40.778 టీఎంసీలు, తెలంగాణకు 3.992 టీఎంసీలు చొప్పున వస్తాయని లెక్కించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తుంగభద్ర బోర్డు నీటి లెక్కింపు కమిటీ సమీక్షా సమావేశాన్ని గురువారం అనంతపురం హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించారు. హెచ్చెల్సీ ఎస్ఈ సురేందర్‌రెడ్డి, టీబీ బోర్డు ఎస్ఈ వెంకటరమణ, కర్నూలు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, తెలంగాణ రాష్ట్ర జూరాల, మహబూబ్‌నగర్ ఎస్ఈలు రామారావు, ధనుంజయులు హాజరై పలు అంశాలపై చర్చించారు. 40 ఏళ్ల వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నీటి లెక్కలు కట్టారు. తుంగభద్ర జలాశయం పూర్తి సామర్థ్యం 212 టీఎంసీలు. గత సీజన్‌లో 165 టీఎంసీలు వస్తాయని లెక్కకడితే... 112 టీఎంసీలే వచ్చాయి. ఈ సమీక్షలో నిర్ణయించిన ప్రాథమిక అంచనా నీటి లెక్కలకు సంబంధించి బోర్డు ఆమోదం కోసం సిఫార్సు చేశామని హెచ్చెల్సీ ఎస్ఈ సురేందర్‌రెడ్డి చెప్పారు. ఆగస్టు ఆఖరులో లేదా సెప్టెంబరు మొదటి వారంలో పూర్తిస్థాయి బోర్డు సమీక్ష జరుగుతుందన్నారు. మరోవైపు.. ఏపీకి 40.778 టీఎంసీలు వస్తాయని అంచనా కేటాయింపులు జరిగాయి. వీటిలో ఎల్ఎల్‌సీకి 14.717, హెచ్చెల్సీకి 19.929, కేసీ కెనాల్‌కు 6.132 టీఎంసీల ప్రకారం కేటాయింపులు చేశారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులను పరిశీలించిన కేంద్ర బృందం

ఈనాడు, అమరావతి: అంతర్రాష్ట్ర సరిహద్దుల గుర్తింపు కోసం కేంద్ర సర్వే ఆఫ్ ఇండియా అధికారిక బృందం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులను పరిశీలించింది. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి అంతర్రాష్ట్ర సరిహద్దుల గుర్తింపుపై మరింత స్పష్టత కోసం సర్వే ఆఫ్ ఇండియా తరఫున అసిస్టెంట్ సర్వేయర్ జనరల్ లెఫ్టినెంట్ కల్నల్ పాండే నేతృత్వంలో 20 మంది అధికారులు స్వయంగా పరిశీలించారు. రాష్ట్రానికి సంబంధించి ఓబులాపురం, సిద్ధాపురం, మల్లప్పనగుడి సరిహద్దుల గురించి సర్వే శాఖ, అటవీ శాఖ అధికారులు కేంద్ర బృందానికి అధికారిక సాక్ష్యాలను చూపించి గుర్తులను వివరించారు. గనుల అక్రమ తవ్వకాల కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న గాలి జనార్దనరెడ్డి ఓబులాపురంలో రెండు రాష్ట్రాల సరిహద్దులను చెరిపేశారని, ఏపీలోని మైనింగ్ లీజులు పొంది కర్ణాటకలో గనులు తవ్వుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సింగపూర్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి

సీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ధర్నా

ఈనాడు, అమరావతి: రాజధాని అభివృద్ధి పేరుతో సింగపూర్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకోవాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోని అధికారులకు ప్రజాసంఘాల నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాజధాని ప్రాంత కన్వీనరు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణానికి రైతులు భూములిస్తే, రాష్ట్ర ప్రభుత్వం సింగపూర్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు, వైకాపా నేత ఆలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతుల నుంచి తీసుకున్న భూములను విదేశీ సంస్థలకు కేటాయించడాన్ని తప్పుపడుతున్నామని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.కేశవరావు, రాజధాని ప్రాంత రైతు నాయకుడు అనుమోలు గాంధీ, సీపీఎం డివిజన్ కార్యదర్శులు ఎం.రవి, డీవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులు

ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని నిలదీయాలి

సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ

విజయవాడ, న్యూస్‌టుడే: తెదేపా, వైకాపాలు ప్రత్యేక హోదా, విభజన హామీలపై కేంద్రాన్ని నిలదీయడం మాని, ఇక్కడ వ్యాఖ్యలు చేసుకోవడం ప్రజల్ని వంచించడమేనని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం విజయవాడలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై కేంద్రాన్ని నిలదీయాలన్నారు. ఈ నెల 20న విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి రాజకీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అఖిల భారత నేతలు డి.రాజా, బి.వి.రాఘవులు హాజరవుతారన్నారు. పెట్రోలు, డీజిల్ ధరల పెంపుపై ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జరిగే రాస్తారోకోకు అన్ని సంఘాల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. రాజీనామాలు చేస్తున్నామని చెప్పిన వైకాపా.. గతంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు భాజపాకు మద్దతుగా ఎందుకు నిలిచారో ప్రజలకు సమాధానమివ్వాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన మధు, వెంకటేశ్వరరావు తదితరులు

డీసీసీబీలకు రూ.14,310 కోట్ల రుణాలు

- ఆప్కాబ్ ఎండీ భవానిశంకర్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 13 జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.14,310 కోట్ల రుణాలను పంపిణీ చేసేందుకు నిర్ణయించినట్లు ఆప్కాబ్ ఎండీ కె.భవానిశంకర్ తెలిపారు. గురువారం గుంటూరులోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో రైతులకు రుణాల పంపిణీ, బ్యాంకు డిపాజిట్ల సేకరణపై నోడల్ అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పంట రుణాలు రూ.10,500 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.2,610 కోట్లు, స్వల్ప కాలిక రుణాలు రూ.1,200 కోట్లను పంపిణీ చేసేందుకు పాలకవర్గం ఆమోదించిందన్నారు. 2017-18లో రూ.12,071 కోట్ల రుణాలను విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత 2015, ఏప్రిల్‌లో ఆప్కాబ్ రూ.7వేల కోట్ల నిల్వతో ఉండగా ప్రస్తుతం రూ.11,600 కోట్లకు చేరుకున్నాయన్నారు. కౌలు రైతులకు సాగు నేస్తం పథకంలో బృంద రుణాలు మంజూరు చేసేందుకు నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, సొసైటీలు బహుళార్థక సేవలు అందజేసేందుకు రూ.100 కోట్ల రుణాలను పాలకవర్గం ఆమోదంతో పంపిణీ చేస్తామన్నారు. సహకార సొసైటీల్లో రైతులు నగదు లావాదేవీలు నిర్వహించేందుకు 2,500 సూక్ష్మ ఏటీఎంలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

నీట్‌లో ర్యాంకు రాలేదని ఇద్దరు ఆత్మహత్య

- తిరుపతి, తిరుచ్చిలో ఘోరం

తిరుపతి(నేరవిభాగం), చెన్నై, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి వైద్య ప్రవేశపరీక్ష(నీట్)లో మంచి ర్యాంకు రాలేదని ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో గురువారం ఇద్దరు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. తిరుపతిలోని కొర్లగుంట, సంజయ్ గాంధీకాలనీకి చెందిన సుబ్రమణ్యం, వనజకుమారిలకు ఇద్దరు కుమారులు. సుబ్రమణ్యం మరణించగా ఆయన ఉద్యోగం మొదటి కుమారుడు షణ్ముగానికి వచ్చింది. ప్రస్తుతం ఆయన తితిదే జేఈవో కార్యాలయంలో పనిచేస్తున్నారు. రెండో కుమారుడు కె.బాలాజీ(20) ఇంటర్మీడియట్ అనంతరం ఎంబీబీఎస్ చదవాలనే లక్ష్యంతో తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. రెండేళ్లుగా నీట్ రాస్తున్నా సీటు సాధించలేకపోయాడు. తాజా ఫలితాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు అతన్ని వెంటనే ప్రభుత్వ రుయా ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలాజీ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధరించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ సీఐ శివప్రసాద్ తెలిపారు.

కె.బాలాజీ

తమిళనాడులో మరో విద్యార్థిని..: నీట్‌లో ఉత్తీర్ణత సాధించలేక మనస్తాపం చెందిన తమిళనాడులోని తిరుచ్చి జిల్లాకు చెందిన శుభశ్రీ అనే విద్యార్థిని బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తిరుచ్చి నెం.1 టోల్ గేట్ సమీప ఉత్తమశీలి ప్రాంతానికి చెందిన కన్నన్ ప్రభుత్వ బస్సు డ్రైవర్. ఆయన కుమార్తె శుభశ్రీ. ఆమె 12వ తరగతిలో 907 మార్కులు సాధించింది. నీట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే వైద్యురాలు కావచ్చని భావించి తిరుచ్చిలోని కేర్ నీట్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందింది. ఈ పరీక్షలో 24 మార్కులే రావడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి తల్లిదండ్రులు ఆలయానికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు పేర్కొన్నారు.

ఆదివాసీలను చంపిన పోలీసులను విచారించాలి: మానవ హక్కుల వేదిక

హైదరాబాద్: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నైనెర్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నది సమీపంలోని అటవీ ప్రాంతాల్లో 22 మంది మావోయిస్టులు, 18 మంది పౌరుల మృతికి కారణమైన సి-60 కమెండోలు, సీఆర్‌పీఎఫ్, పోలీసు సిబ్బందిని ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధకచట్టం కింద విచారించాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఉద్దేశపూర్వకంగానే ఏప్రిల్ 22, 23 తేదీల్లో వారు బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారని ఆరోపించింది. మృతుల్లో పదిమంది ఆదివాసీలను నేటికీ గుర్తించలేదనీ, చిత్తశుద్ధితో అందుకు ప్రయత్నించాలని ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ మేరకు వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అమర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వై.రాజేష్, ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుధ, తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. "ఎదురుకాల్పులు జరిగిన ప్రాంతాలు, సమీప గ్రామాల్లో ఈనెల 2, 3 తేదీల్లో వేదిక నిజనిర్ధారణ కమిటీ పర్యటించింది. ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు చెబుతున్న ప్రదేశం వాస్తవ విరుద్ధంగా ఉంది. ఏప్రిల్ 22వ తేదీ తెల్లవారుజామున పోలీసులు వీరిని చుట్టుముట్టి, విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. 18 మంది ఆదివాసీలు సహా మొత్తం 34 మందిని హత్యచేశారు. మరో ఆరుగురు మావోయిస్టులను గడ్చిరోలి జిల్లా నైనెర్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి, మరుసటి రోజు చంపేశారు" అని వారు వివరించారు. చట్టాన్ని, హక్కులను కాలరాస్తూ జరిపిన ఈ హత్యల పట్ల ప్రజాస్వామ్యవాదులు గళమెత్తాలని పిలుపునిచ్చారు.

ఉద్యమకారుల అణచివేత వ్యతిరేక బహిరంగసభ 9న

ఈనాడు, హైదరాబాద్: ఉద్యమకారుల అణచివేతకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీ శనివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు పౌరహక్కుల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. అటవీ హక్కుల చట్టాలను అమలు చేయమని ఉద్యమిస్తున్న గిరిజనులను మహారాష్ట్ర ప్రభుత్వం, జీవించే హక్కు హరిస్తున్న స్టెరిలైట్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజలను తమిళనాడు ప్రభుత్వం.. కాల్చి చంపాయని పేర్కొంది. మొత్తం ఈ రెండు సంఘటనల్లో 70 మంది చనిపోయారని, ఇటువంటివి మరోసారి జరగకుండా అడ్డుకట్ట వేయడానికి ప్రజాస్వామిక పౌరులందరూ ముందుకు వచ్చి బహిరంగసభను విజయవంతం చేయాలని కోరింది.

జగన్‌తో రమణ దీక్షితులు భేటీ

ముఖ్యమంత్రి తమకు అన్యాయం చేశారని ఆరోపణ

ఈనాడు, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసంలో ఈ భేటీ జరిగింది. తితిదేలో తమకు అన్యాయం జరిగిందని, వంశపారంపర్యంగా సంక్రమించిన అర్చకత్వం నుంచి తమను దూరం చేశారని జగన్‌కు వివరించినట్లు సమాచారం. తనతోపాటు మరికొందరు అర్చకులను అక్రమంగా తొలగించారని, న్యాయం చేయాలని కోరారు. జగన్‌తో భేటీ అనంతరం రమణ దీక్షితులు మీడియాతో మాట్లాడుతూ.. 'మాకు జరిగిన అన్యాయాన్ని వివరించి సాయమందించాలని ప్రతిపక్ష నేతను కోరేందుకు వచ్చా. ఇదే విషయమై మాట్లాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా అపాయింట్‌మెంటు లభించలేదు. మాకు న్యాయం చేసే వారికి మద్దతిస్తాం' అన్నారు. జగన్ పోర్టికోలో నిల్చొని ఆయన్ను సాదరంగా ఆహ్వానించి లోనికి తీసుకెళ్లారు. భేటీ తర్వాత కూడా కారు వరకూ వచ్చి సాగనంపారు.

జగన్‌తో మాట్లాడుతున్న రమణ దీక్షితులు

భాజపా, వైకాపాల చేతిలో పావుగా రమణ దీక్షితులు: ముళ్లపూడి రేణుక

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా, భాజపా చేతిలో రమణదీక్షితులు పావుగా మారారని తెదేపా అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక ఆరోపించారు. ఆ రెండు పార్టీల కుట్రలో భాగంగానే ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేస్తున్నారన్నారు. రమణ దీక్షితులు గురువారం జగన్‌ను కలవడంతో ఈ విషయం తేలిపోయిందని విమర్శించారు. ఈ మేరకు గురువారం రేణుక ఓ ప్రకటన విడుదల చేశారు. జగన్, రమణ దీక్షితుల సూచనలతోనే శ్రీవారి నగల గురించి చంద్రబాబుపై విజయసాయిరెడ్డి అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు.

ఎంఎల్‌పీల కటాఫ్ మార్కుల వెల్లడి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య స్వస్థ కేంద్రాలు (హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు)లో 1500 మిడ్ లెవెల్ ప్రొవైడర్ల నియామకానికి నిర్వహించిన పరీక్షా ఫలితాల ఆధారంగా కటాఫ్ మార్కులను రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు గురువారం వెల్లడించారు. గత నెల 13న 300 మార్కులకు నిర్వహించిన రాతపరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యర్థులకు 120, పీహెచ్ కేటగిరికి 135, ఇతరులకు 150 కటాఫ్ మార్కుగా ప్రకటించారు. ఈ మార్కులను ప్రాతిపదికగా తీసుకుని నాలుగు జోన్లలో రోస్టర్ పాయింట్ల ఆధారంగా, కేటాయించిన పోస్టుల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని కమిషనర్ సూచించారు.

దాదాపు రూ.13 కోట్ల ఆదాయాన్ని దాచి ఉంచడంతోపాటు ఆదాయపు పన్ను రిటర్నుల్లో తప్పుడు వివరాలు పేర్కొన్నందుకు కర్ణాటకకు చెందిన ప్రముఖ వ్యాపారి విశ్వాస్ ఉదయ్‌సింగ్ లాడ్‌పై బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష సహా రూ.2 లక్షల జరిమానా విధించింది.

ఉద్యోగ అవకాశాలు

TOBACCO BOARD
(Department of Commerce, Ministry of Commerce & Industry, Govt. of India)
GUNTUR-522004, Andhra Pradesh. Phone : 0863-2358105, email:info@indiantobacco.com
SHORT TENDER NOTICE No.12(10)/AMC/2018-19/02
Sealed tenders are invited from reputed service providers for providing comprehensive annual maintenance services for Desktop Computers, Laptops, Printers and facilities management services. Visit www.tobaccoboard.com to download the tender form, terms and conditions etc. Corrigendum/addendum/extension/clarifications, if any, will be updated only in website. The due date/time for submission is **15:00 Hrs on 29-06-2018.**
Date : 06-06-2018 — Sd/- Secretary

A.P. CO-OPERATIVE OILSEEDS GROWERS' FEDN. LTD.,
APOILFED
D.No. 55-17, 2 to 4 "C" Block, 4th Floor, Road No.2, Industrial Estate, Jawahar Autonagar, Vijayawada-520 007, Ph No.: 0866-2974545, E-mail : apoilfedbrkr@gmail.com
No. BM/2783/PALM KERNEL/2017-18 — Dt : 07.06.2018
E-TENDER NOTIFICATION
APOILFED, Invites competitive Tenders for the sale of Palm Kernel from its Palm Oil Mill, Pedavegi, Near Eluru, West Godavari District. The quantity available for sale through NCDEX e-Markets Limited. The details are as follows: E- Auction will start on **15.06.2018 at 3.00 P.M onwards 4 Lots - (100 MT+100 MT+100 MT+100 MT).** All the details available on **www.neml.in.** Contact No's: **09642332994, 09014617696.**
Sd/- V. C & MANAGING DIRECTOR

విజయవాడ నగరపాలక సంస్థ
ఆర్.సి.యఫ్. 4–108153/2015 — తేది: 07–06–2018
షార్ట్ టెండర్ నోటీసు
విజయవాడ నగరపాలక సంస్థపరిధిలో అంటి లార్వేల్ ఆపరేషన్స్ నిర్వహించుట కొరకు 500 లీటర్లు తెమిఫోస్ 50% EC Themephos (ఎబెట్) సప్లై చేయుట కొరకు సీల్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. సదరు టెండరు షెడ్యూలు కొరకు గాను రూ. 1000/- నగదు రూపములో కార్పొరేషనులోని సిటిజన్ చార్టర్ కౌంటర్ నందుకాని, కమిషనర్, విజయవాడ నగరపాలక సంస్థ పేరునకాని డి.డి. రూపములో చెల్లించి షెడ్యూలు పొందవచ్చును.

టెండర్లు దరఖాస్తులు ఇచ్చు తేది, మరియు సమయము	ది.8-06-2018 నుండి 18-06-2018 వరకు ఉదయం 10.30 నిమిషముల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఆఫీసు పనిచేయు దినములలో
టెండర్లు దాఖలు చేయు సమయము	ది. 19-06-2018 ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు
టెండర్లు తెరచు సమయము	ది. 19-06-2018 మధ్యాహ్నం 3.30 నిమిషములకు

ఇతర వివరములకు ఆఫీసు వేళలలో ప్రజారోగ్యశాఖనందు సంప్రదించి తెలుసుకొనగలరు.
సం/- ప్రధాన వైద్యశాఖాధికారి

APSRTC ET & CCS Ltd.,
RECRUITMENT NOTIFICATION FOR THE POST OF SECRETARY
APSRTC ET & CCS Ltd., invites applications for the post of **SECRETARY (Chief Executive)** with C.A qualification in the scale of Pay Rs.36500-2000-76500+Grade pay of Rs.5,500 + Allowances (CTC would be approximately Rs.10.00 Lakhs per annum). Full details of the notification alongwith terms & conditions are available in the website http://apsrtc.ap.gov.in Last date For submission of applications is 22-06-2018.
No.CCS14/1921(EST)/Rect, Dt.08-06-2018 — Vice Chairman

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (APSEEDCO)
(ఆం.ప్ర. ప్రభుత్వము మరియు ఏ.పి. పవర్ యుటిలిటీస్ యొక్క ఒక జాయింట్ వెంచర్ :: CIN- U40101AP2016SGC103976)
కాంట్రాక్టు ప్రాతిపదిక మీద DGM (టెక్నికల్) మరియు PS to CEO/MD APSEEDCO నియామకం కొరకు ప్రకటన
APSEEDCO కాంట్రాక్టు ప్రాతిపదిక మీద ఒక డిప్యూటీ జనరల్ మేనేజర్ (టెక్నికల్) మరియు ఒక పర్సనల్ సెక్రెటరీ టు CEO/MD APSEEDCOను నియమించాలనుకుంటున్నది. వివరమైన పని వివరము, అర్హత నియమావళి, సూచనలు మరియు దరఖాస్తు ప్రొఫార్మాను www.aptransco.gov.in లేదా www.apspdcl.in లేదా www.apeasternpower.com నందు చూడవచ్చును లేదా md.apseedco@gmail.comకు అభ్యర్థన మెయిల్‌ను పంపి, పొందవచ్చును.
ప్రదేశం: విజయవాడ — సం/- CEO/MD APSEEDCO
తేది: 7-6-2018 — RO No.: 01/18-19 — LL: 0866–2577620.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (APSECM)
(EC చట్టం 2001 క్రింద BEE యొక్క స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ)
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము.
కాంట్రాక్టు ప్రాతిపదిక మీద ప్రాజెక్ట్ ఇంజనీర్(ల) నియామకం కొరకు ప్రకటన
APSECM వార్షిక కాంట్రాక్టు ప్రాతిపదిక మీద ఇద్దరు ప్రాజెక్ట్ ఇంజనీర్(ల)ను నియమించాలనుకుంటున్నది మరియు భారతదేశమంతటి నుండి అర్హులైన అభ్యర్థుల నుండి ఇందుమూలముగా దరఖాస్తులను కోరుతున్నది. అర్హత, పాత్ర మరియు బాధ్యతలు, వగైరాలకు సంబంధించిన తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్స్ www.aptransco.gov.in లేదా www.apeasternpower.com లేదా www.apspdcl.inను చూడండి లేదా ceo.secm@gmail.comకు అభ్యర్థన మెయిల్‌ను పంపి, పొందవచ్చును.
ప్రదేశం: విజయవాడ — సం/– CEO/APSECM
తేది: 7–6–2018 — RO No.: 03/18-19 — LL: 0866-2577620.

WANTED
MATHEMATICS FACULTY
Faculty required to teach Degree Mathematics in our Group of Degree Colleges at SRIKAKULAM, VIZIANAGARM, VISAKHAPATNAM, TUNI, KAKINADA, AMALAPURAM, RAJAHMUNDRY, PALAKOL, TADEPALLIGUDEM, ELURU, BHIMAVARAM.
Minimum Salary : **Rs. 25,000/-** per month
MAXIMUM SALARY - No limit for Capable and Talented Candidates
Apply with CV and Photo immediately by post/e-mail:
career@aditya.ac.in
ADITYA DEGREE COLLEGE
Lakshminarayana Nagar, KAKINADA-533 003.
Ph : 0884-2376665, 97043 76667

ANDHRA PRADESH TOURISM AUTHORITY (APTA)
GOVERNMENT OF ANDHRA PRADESH
Stalin Corporate Building, Auto Nagar, Vijayawada
RECRUITMENT NOTIFICATION
APTA is in need of active, knowledgeable person with positive attitude wanting to contribute to tourism developement for the following role.

S.No.	Name of the Post	Positions
1.	Director-Industry Development Group	1
2.	Assistant Director - Investments	1
3.	Assistant Director - Capacity Building	1
4.	IT-Executive	1
5.	Administrative Executive	3
6.	Senior Accounts Executive	1

Applicants are requested to send their CVs in Word/ PDF format to tourism.careers @ap.gov.in
Detailed notification and job description is available in our website: www.aptourism.gov.in
Last date for receiving applications is **22 June 2018** till 05.00 PM
DIPR No. 152PP/CL/Advt/1/1/2018-19 — Sd/- CEO

VIGNAN'S GROUP OF INSTITUTIONS
WALK-IN-INTERVIEW
Eligible candidates from reputed Universities/ institutions are invited to attend Walk-in-interview along with Bio-data and original testimonials for the posts of
Professors, Assoc. Professors and Asst. Professors

Date & Time of Written Test / Interview	Departments
09-06-2018, at 09.30 AM	CSE, IT, Mech., ECE.

Qualifications and Salary : As per **AICTE** norms. Appropriate pay will be offered based on the experience and qualifications. Fresh candidates with **GATE/ NET/ SET** qualifications are preferred. **Ph.D holders** will be considered for higher pay.
Venue for Interviews
Vignan's Foundation for Science, Technology and Research
1st Floor, A-Block, Vadlamudi, Chebrolu (M), Guntur Dist - 522 213
Contact Ph : 0863 - 2381200

WALK IN INTERVIEW
Sri Viswasanthi Educational Institutions
invite applications from well experienced & eligible candidates for our campus...
Wardens (Male / Female)
Coordinators / Floor Incharges (Male / Female)
P.E.Ts / Coaches (Male / Female)
Librarian (Male / Female)
WANTED : J.Ls/ A.Ls in MATHS, PHYSICS, CHEMISTRY, BOTANY, ZOOLOGY.
WANTED : Yoga / Karate / Kung-fu / Music/ Veena / Vocal / Jazz / Keyboard/ Guitar/ Dance / School Band
Attend Interview on **9/6/2018** & **12/6/2018.**
Come along with Bio Data, Passport size Photo & Original Certificates.
SRI VISWASANTHI
VUYYURU - 521 165 (Near Vijayawada), Krishna Dt., A.P.
visitus : www.sriviswasanthischools.in — email : director.sriviswasanthi@gmail.com

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
పటమటలంక, విజయవాడ
Cell: 80080 03297, 9959021300

టెట్ పరీక్ష.. రాసిన వెంటనే మార్కులు!

దరఖాస్తులో మార్పులకు మరో అవకాశం

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పూర్తికాగానే మార్కులు తెలుసుకునే సదుపాయాన్ని తొలిసారిగా కల్పించనున్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత అభ్యర్థులు ప్రశ్నాపత్రం సబ్‌మిట్ చేయగానే కంప్యూటర్ తెరపై వారికి ఎన్ని మార్కులు వచ్చాయో కనిపిస్తుంది. పరీక్ష రాసిన మరుసటి రోజు అభ్యర్థుల మొబైల్ ఫోన్‌కు మార్కులను పంపిస్తారు. మరోవైపు పేపర్, సబ్జెక్టు, మాధ్యమం మార్చుకునేందుకు అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ మరోమారు అవకాశం కల్పించింది. అభ్యర్థుల వినతుల మేరకు శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు ఈ అవకాశాన్ని కల్పించారు. విద్యార్థులు టెట్ వెబ్‌సైట్‌లో ఉంచిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం వివరాలను నింపి దరఖాస్తును స్కానింగ్ చేసి aptet18@gmail.com కు మెయిల్ చేయాలని కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ అభ్యర్థులకు ఆయా జిల్లా పరీక్షా కేంద్రాల్లోని పరిమితిని అనుసరించి కేంద్రాలను కేటాయిస్తామని వెల్లడించారు.

పీజీ ఇంజినీరింగ్, ఫార్మసీల్లో గేట్ అభ్యర్థులకు అవకాశం

ఈనాడు, అమరావతి: ఎంఈ, ఎంటెక్, ఎం-ఫార్మలో ప్రవేశాలకు గేట్, జీపీఏటీ అర్హత సాధించిన వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈనెల 12వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.300, ఇతరులు రూ.600 దరఖాస్తు రుసుము చెల్లించి, https://sche.ap.gov.in/pgecet/gate వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు సమర్పించాలి.

రూ.62 కోట్ల ఆర్థిక సాయం చేశాం

బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య వెల్లడి

ఈనాడు, అమరావతి: గత ఆర్థిక సంవత్సరంలో రూ.62 కోట్లతో 46,789 బ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించినట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య తెలిపారు. ఈ ఏడాది రూ.75కోట్ల బడ్జెట్ కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ సమావేశం గురువారం గొల్లపూడిలో జరిగింది. సంస్థ అమలుచేస్తున్న వివిధ పథకాలపై ఈ సమావేశంలో సమీక్షించారు. 2018-19 లో వేదవ్యాస, గాయత్రి, భారతి, వశిష్ఠ, ద్రోణాచార్య, గరుడ తదితర పథకాలను అమలు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్, కమిషనర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

వీఐటీ-ఏపీ వర్సిటీని సందర్శించిన అమెరికా కాన్సులేట్ బృందం

ఈనాడు, అమరావతి: అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ బృందం గురువారం సందర్శించింది. అమెరికన్ కాన్సులేట్ వైస్ కౌన్సిల్ చార్లెస్ స్పెక్ట్, సాంస్కృతిక వ్యవహారాల సహాయకుడు సెంథిల్, యూఎస్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ప్రాంతీయ అధికారి మోకానికా సేటియా వీఐటీని సందర్శించారు. ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి పర్డ్యూ విశ్వవిద్యాలయం, న్యూయార్క్ స్టేట్ వర్సిటీ, రోచెస్టర్ వర్సిటీ, విశ్వవిద్యాలయం ఆఫ్ మసాచుసెట్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుకు సంబంధించి మిచిగాన్-డీర్ బోర్న్ వర్సిటీతోపాటు పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వీఐటీ-ఏపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శేఖర్ విశ్వనాథన్ వివరించారు. అంతర్జాతీయ బదిలీ కార్యక్రమం బీటెక్ రెండేళ్లు స్థానికంగా అమెరికాలో మరో రెండేళ్లు చదివేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అమెరికాలో విద్యనభ్యసించేందుకు అవసరమైన ఉపకారవేతనాలపై అవగాహన కల్పించేందుకు వీఐటీ-ఏపీతో కలిసి పని చేయనున్నట్లు సెంథిల్ వెల్లడించారు.

హాజరు నుంచి డీజీపీకి మినహాయింపు

ఆర్టీసీ ఎండీగా ఉన్నప్పుడు దాఖలైన కేసులో హైకోర్టు ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: ఏపీఎస్ఆర్టీసీ ఎండీగా పనిచేస్తున్నప్పుడు దాఖలైన ఓ కోర్టుధిక్కరణ కేసులో ప్రస్తుత డీజీపీ మాలకొండయ్యకు శుక్రవారం(నేడు) వ్యక్తిగత హాజరు నుంచి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. అంతర్ రాష్ట్రాల డీజీపీల సదస్సు నేపథ్యంలో హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థిస్తూ డీజీపీ హైకోర్టులో దాఖలు చేసిన అనుబంధ పిటీషన్‌కు అనుమతినిచ్చింది.

పశ్చిమ బెంగాల్ గవర్నరు కె.ఎన్.త్రిపాఠికి త్రిపుర గవర్నరుగానూ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఆదేశాలు జారీ చేశారు.

IBPS Rural Banks POs& Clerks
రేపే బ్యాచ్ ప్రారంభం
R.K. స్టడీ సెంటర్
రాజమండ్రి -0883-2441891, 88866 66668

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు
విజయవాడ
శుక్రవారం జూన్ 8, 2018

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
autopage@eenadu.in

రయ్ రయ్

గోవా

క్లిక్ కొడితే నజరానా

మన దారిన మనం వెళ్తుంటే అడ్డదారిలో వచ్చి ఢీకొట్టేస్తాడో పోకిరి. రోడ్డుమీదే వాహనం పార్క్ చేసి ట్రాఫిక్ జామ్‌కి కారణం అవుతాడో పెద్దమనిషి. ఇలాంటి వాళ్లను చూస్తుంటే మహా కోపం వస్తుంది. వాళ్లనేం చేయలేమా? అనిపిస్తుంది. గోవాలో అయితే ఈ ఉల్లంఘనుల భరతం పట్టొచ్చు. ఇలా నిబంధనలు మీరిన వాళ్లను మన కెమేరా, సెల్‌ఫోన్‌తో క్లిక్‌మనిపించి ఫొటో లేదా వీడియో తీసి గోవా పోలీసులకు పంపొచ్చు. పైగా ఇలా చేస్తే నగదు నజరానాలు కూడా అందుతాయి. సమాచారం ఇచ్చినవాళ్ల వివరాలు గోప్యంగా ఉంచుతారు. దీనికోసమే 'ట్రాఫిక్ సెంటినెల్ స్కీమ్' అని ఒక పథకం ప్రవేశపెట్టారు. ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్ నెంబరుకి పంపిస్తే చాలు. ట్రిబుల్ రైడింగ్ ఫొటోకి పది పాయింట్లు.. నిబంధనలు ఉల్లంఘించిన చిత్రాలు పంపితే మూడు పాయింట్లు ఇస్తారు. వంద పాయింట్లు దాటితే వెయ్యి రూపాయల బహుమానం. ఇదే పనిలో బిజీగా ఉన్న ఓ నలభైమంది నిబంధనల రక్షకులు మూడున్నర లక్షల రూపాయల మొత్తం గెల్చుకున్నారు. మళ్లీ వీరిలోనూ లక్కీ డిప్ తీసి ఎంపికైన విజేతకు మోటార్‌సైకిల్, కారు అందజేస్తున్నారు. ఈ పథకంతో నిబంధనల ఉల్లంఘన కేసులు గణనీయంగా తగ్గుతున్నాయట.



జల్లుల వేళ
జర పదిలం!



వర్షాకాలం వచ్చేసింది.. వాహనాలకు ఇబ్బందులు మొదలైనట్టే! కదలనని మొరాయించే కార్లు.. ఉన్నట్టుండి ఆగిపోయే బైక్‌లు.. అక్కడక్కడా అనుకోని ప్రమాదాలూ నిత్యకృత్యాలే... ఈ ఇక్కట్ల జడివాన దాటేదెలా? సీజన్ ముగిసేవరకూ సురక్షితంగా గమ్యస్థానం చేరేదెలా? సింపుల్‌గా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చాలంటున్నారు నిపుణులు... అందుకు మీరు సిద్ధమేనా?

వర్షం ఎప్పుడొస్తుందో చెప్పలేం. కానీ దానివల్ల కలిగే పరిణామాల్ని ఊహించి అందుకు తగ్గట్టుగా సిద్ధమైతే చిక్కుల నుంచి గట్టెక్కుతాం. దానికోసం ముందు మన వాహనాల్ని మంచి కండిషన్‌లో ఉంచాలి. జోరుకు చెక్ పెడుతూ తగిన జాగ్రత్తలు తీసుకునేలా మానసికంగా సంసిద్ధం కావాలి. అప్పుడిక కుండపోత వానల్లోనూ ప్రమాదాలు దరి చేరవు.

కారులో షికారు

కారులో ప్రయాణిస్తుంటే ఆ హాయే వేరు. కానీ అనుకోని ఆపదల్లో చిక్కుకుంటే ప్రమాద తీవ్రతా ఎక్కువే. ఆ పరిస్థితి రాకుండా ఏం చేయాలి?

టైర్లు: వర్షాకాలంలో టైర్ల విషయంలో జాగ్రత్త అవసరం. అసహజంగా అరిగిపోయినవి, ఆకారం దెబ్బతిన్నవి నీటిపై తేలిగ్గా జారిపోతూ అదుపు తప్పుతుంటాయి. వీటికి రోడ్డుపై పట్టుండదు. కాబట్టి టైర్ల కండిషన్ సరిచూసుకోవాలి. వీటి ట్రెడ్ మందం కనీసం 5 నుంచి 8 మిల్లీమీటర్లు ఉండాలి.

వైపర్లు: విండ్‌షీల్డ్‌పై పడే వర్షపు నీటిని తొలగించి, అద్దాలపై దుమ్ముధూళి శుభ్రం చేస్తూ రోడ్డు స్పష్టంగా కనపడేలా చేసేవి వైపర్లు. చాలాకాలం వాడకపోతే పెళుసుబారిపోతాయి. ట్రాఫిక్ ఫిల్మ్ కారణంగా జిడ్డుగా తయారై బిగుసుకుపోతాయి. వీటి స్థానంలో కొత్తవి బిగించాలి. విండ్‌షీల్డ్ లిక్విడ్ ట్యాంకు మట్టం పరిశీలించాలి. దాంట్లో శుభ్రమైన నీరు, షాంపూ నీళ్లు నింపాలి.

బ్రేక్‌ప్యాడ్‌లు: ఈ సీజన్‌లో వాహనాల్ని చాలాసార్లు నిలిచి ఉన్న నీళ్లలోంచి నడపక తప్పదు. దీంతో బ్రేక్‌ప్యాడ్‌లు పాడైపోతాయి. పనిచేయని వాటిని మార్చాలి. బ్రేక్ ఫ్లూయిడ్ మట్టం పరిశీలించాలి. బ్రేక్ లైనర్లు సాఫీగా పనిచేయడానికి అందులో ఆయిల్ వేయాలి. వాహనానికి ఏబీఎస్ ఉంటే ఒకసారి పూర్తిస్థాయిలో చెక్ చేయించాలి.

లైట్లు: హెడ్‌లైట్లు, పార్కింగ్ లైట్లు, సిగ్నల్ లైట్లు.. వాహనానికి కీలకం. సాధారణంగా ఈ కాలంలో లైట్ల నుంచి వెలువడే కాంతిని తడిగా ఉండే రోడ్లు తమలో ఇముడ్చుకుంటాయి. ఇక సిగ్నళ్లు పడకపోయినా, వెలుతురు లేకపోయినా ప్రమాదాలు జరుగుతాయి. అందుకే అన్ని లైట్లు సరిగా పని చేస్తున్నాయో, లేదో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి. నాణ్యమైన బల్బులు వాడాలి.

విద్యుత్తు పరికరాలు: ఎలక్ట్రిక్ వ్యవస్థ సరిగా లేకపోయినా కారుకు ప్రమాదమే. హెడ్‌లైట్ల నుంచి టెయిల్ లైట్ల దాకా అన్ని విద్యుత్తు వైర్లు సరిగా ఉన్నాయో, లేదో చూడాలి. వదులు కనెక్షన్లు ఉంటే బాగు చేయించాలి. ఫ్యూజులు ముఖ్యం. కీలక విభాగాలను కలిపే టెర్మినళ్లకు పెట్రోలియం జెల్లీ రాస్తే తేమ ఎగిరిపోతుంది.

లోపలి భాగం: వాహన లోపలి భాగం ఎక్కువకాలం తడిగా ఉంటే ఫంగస్ పోగవుతుంది. నీళ్లు లోపలికి వస్తే కార్పెట్లు, ఫ్లోరింగ్ పాడవుతాయి. అందుకే రబ్బరు మ్యాట్‌లకు బదులు ఫ్యాబ్రిక్‌వి వాడాలి. లోపల తరచూ వాక్యూమ్ చేయాలి. సాధ్యమైనంత ఎక్కువగా కిటికీ అద్దాలను తెరిచి ఉంచాలి.

వాక్సింగ్: వాహనంపై ఎక్కువ వర్షపునీరు పడుతుంటే రంగు వెలిసిపోయి కళావిహీనంగా కనపడుతుంది. అలా జరగకుండా ఉండాలంటే వాక్స్ పాలిష్ చేయించాలి. ఇది రంగుకి రక్షణలా పని చేస్తుంది. దీనిపై వర్షపునీరు నిలవదు. దీంతోపాటు బయటికి కనిపించే లోహపు భాగాలు తుప్పు పట్టకుండా యాంటీ కరోజన్ స్ప్రే కొట్టాలి.

- సాయిభరత్ బొప్పరాజు, మోటోఫిక్స్

బైక్‌పై భద్రం

ఖరీదు ఎంతైనా.. ఆధునిక టెక్నాలజీ ఉన్నా వానాకాలంలో ద్విచక్రవాహనాలతో జాగ్రత్తగా ఉండకతప్పదు. అందుకే ఇలా చేయండి

- వర్షాకాలంలో ద్విచక్రవాహనానికి ఎదురయ్యే ప్రధాన సమస్య బండి స్కిడ్ అవడం. బాగా అరిగిపోయిన టైర్లు వాడినా, టైర్లలో గాలి ఒత్తిడి ఉండాల్సిన దానికన్నా ఎక్కువైనా, తక్కువైనా ఇలా జరుగుతుంది. ఇష్టమొచ్చినట్టు గాలి నింపితే రోడ్డుపై నియంత్రణ కోల్పోతాయి. ఏ టైరుకు ఎంత గాలి పెట్టించాలి అనేది వినియోగదారుడి వాహన వాడకం సూచిక ప్రకారమే పాటించాలి.
- సాధారణంగా ఎక్కువమంది వెనక బ్రేక్‌నే వాడతారు. ఇది తప్పు. పూర్తి ఒత్తిడి వెనక టైరు మీదే పడుతుంటే ఒక్కోసారి ఆ చక్రం లాక్ అయ్యే ప్రమాదం ఉంది. అందుకే బ్రేక్‌ని ముందు దానిపై 70శాతం, వెనక దానిపై 30శాతం ఒత్తిడి పడేలా నొక్కాలి. ఇలా చేయడం వల్ల బ్రేక్ వేయగానే తక్కువ దూరంలోనే బైక్ ఆగుతుంది. బండి స్కిడ్ అయ్యే అవకాశాలు తక్కువ.
- కాలం గడిచినకొద్దీ బ్రేకింగ్ సామర్థ్యం తగ్గుతుంది. ద్విచక్రవాహనాలకు డిస్క్ లేదా డ్రమ్ బ్రేక్‌లు ఉంటాయి. వాటి బ్రేక్‌ప్యాడ్‌లు, లైనర్లు చిరిగిపోయినా, చెడిపోయినా బ్రేక్‌ల పని చేయవు. డ్రమ్ బ్రేక్‌లైతే వాటిని లోపలి నుంచి చెక్ చేయాలి. డిస్క్ బ్రేక్‌ల్లో బ్రేక్ ఫ్లూయిడ్ తగినంత ఉందో, లేదో చూసుకోవాలి. డిస్క్‌లు, కాలిపర్లు శుభ్రం చేయాలి. పదివేల కిలోమీటర్లు లేదా ఏడాదికోసారి డిస్క్ ప్యాడ్‌లు మార్చాలి.
- వర్షం పడుతున్నపుడు, మేఘావృతం అయినపుడు వెలుతురు సరిగా లేక ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇలా జరగకూడదనే ప్రభుత్వం బీఎస్4 వాహనాలకు హెడ్‌లైట్ ఎప్పుడూ వెలిగి ఉండే ఏహెచ్‌వో ఫీచర్‌ని తప్పనిసరి చేసింది. వర్షం పడుతున్నపుడు, వాతావరణం సరిగా లేనపుడు పగలు అయినా సరే హెడ్‌ల్యాంప్‌లు ఆన్ చేయాలి.
- చైన్ సరిగా ఉంటేనే మోటార్‌సైకిళ్లు సాఫీగా ముందుకు సాగుతాయి. వర్షాకాలంలో ఈ చైన్‌కి ఎక్కువగా బురద అంటుకుంటుంది. మెరుగైన పనితీరు కనబరచాలంటే ఎప్పటికప్పుడు దాన్ని శుభ్రం చేయాలి. ఐదువందల కిలోమీటర్లకోసారి కందెన వేయాలి. ఇంజిన్ బయటి భాగాలకు సైతం ఇదే సమస్య. అంటుకున్న బురద ఎండిపోకముందే జాగ్రత్తగా, పూర్తిగా తొలగించాలి.

వర్షాకాలంలో చాలాచోట్ల రోడ్డుపై నీరు నిలిచి ఉంటుంది. వాటిల్లోంచి వెళ్లొద్దు. వాటి లోతు అంచనా వేయలేం. మ్యాన్‌హోళ్లులాంటివి ఉండొచ్చు. తప్పనిసరి వెళ్లాల్సి ఉంటే ఏదైనా భారీ వాహనాన్ని అనుసరిస్తూ వెళ్లాలి. ఉపరితలం తడిగా ఉన్నపుడు బైక్‌లు జారిపోతుంటాయి. వేగం తగ్గించాలి. ఎదుటివారు తప్పు చేసినా సరిదిద్దుకోవడానికి మనకు సమయం ఉంటుంది.

- డీనో, డీనోస్ వాల్ట్

బీమా పూర్తి ధీమా ఇవ్వదు

వాహనాలకు ఎలాంటి నష్టం జరిగినా బీమా ఉంటుందనే ఉద్దేశంతో చాలామంది నిర్లిప్తంగా ఉంటారు. అయితే వర్షాకాలంలో జరిగే కొన్నిరకాల ప్రమాద నష్టాలకు పరిహారం దక్కదనే విషయం గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా ఇంజిన్‌లోకి నీళ్లు వెళ్లినపుడు జరిగే నష్టం భారీగా ఉంటుంది. ఇలాంటి ఆపదల్లో మనల్ని ఆదుకునేది 'ఇంజిన్ ప్రొటెక్షన్' యాడ్‌ఆన్. మరికొంత ప్రీమియం చెల్లించి బీమా చేయిస్తే ఇంజిన్ నష్టానికి పరిహారం దక్కించుకోవచ్చు.

వర్షాకాలంలో చేయించదగ్గ మరికొన్ని యాడ్‌ఆన్స్

- **సున్నా తరుగుదల (జీరో డిప్):** ఇది వాహనం విడిభాగాల భర్తీపై తరుగుదల ఖర్చులను మినహాయించుకోకుండా పూర్తి పరిహారం చెల్లిస్తుంది.
- **రోడ్‌సైడ్ అసిస్టెన్స్:** వాహనం బ్రేక్‌డౌన్ అయిపోయినపుడు, కదలనని మొరాయించినపుడు బీమా ప్రతినిధులు రంగంలోకి దిగుతారు. పాడైపోయిన వాహనాన్ని షెడ్డులోకి తీస్కెళ్లి మరమ్మతులు చేయిస్తారు. అవసరమైతే కొత్త విడిభాగాలు అమరుస్తారు. ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చూస్తారు.
- **హైడ్రోస్టాటిక్ లాక్ కవర్:** కీలకమైన ఇంజిన్ విడిభాగాలకు వర్తిస్తుంది. ఏవి పాడైనా కవరేజీ ఉంటుంది.
- **కన్జ్యూమేబుల్ కవర్:** ఇంజిన్ ఆయిల్, కూలంట్‌లు, బ్రేక్ ఫ్లూయిడ్‌లు.. వినియోగించినకొద్దీ ఖర్చవుతాయి. ప్రమాదం జరిగినపుడు వీటికి సైతం పరిహారం ఇస్తారు.

- సజ్జా ప్రవీణ్‌చౌదరి, పాలసీబజార్ వాహన బీమా హెడ్

ఇవీ పాటించాలి

- బురద వెదజల్లుతున్న వాహనాలకు దూరం పాటించాలి. మనపై, వాహనాల అద్దాలపై మురికినీరు పడి ఏదీ స్పష్టంగా కనిపించక పడిపోవచ్చు.
- వర్షాలు, పొగమంచు కురుస్తున్నపుడు ఏసీ ఆన్ చేయాలి. వెంట్‌లను విండ్‌షీల్డ్ వైపు మరల్చి వేడి గాలి తగిలేలా చేయాలి.
- వానాకాలంలో వాహనాలపై కవర్లు కప్పి ఉంచకూడదు. లోపల తేమ తయారై కొన్ని భాగాలు తుప్పు పడతాయి. గాలి, ఎండ తగిలేచోటే నిలిపి ఉంచాలి.
- నలుపు రంగు, మెరుపుల విజర్ ఉన్న హెల్మెట్లు వాడొద్దు. మబ్బు పట్టి ఉన్న వాతావరణంలో ఎదురుగా ఉన్నవి స్పష్టంగా కనిపించవు.
- చిన్నపాటి వైపర్లు ఉన్న హెల్మెట్లు కూడా మార్కెట్లో దొరుకుతాయి. వర్షం పడుతున్నపుడు బయటికెళ్తే వీటిని వాడొచ్చు.
- ఫస్ట్ ఎయిడ్ కిట్, గొడుగు, ఫ్లాష్‌లైట్, పేపర్లు, బిస్కెట్లులాంటివి అందుబాటులో ఉంచుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో పనికొస్తాయి.
- వర్షాకాలం ప్రారంభంలోనే ఓసారి వీల్ అలైన్‌మెంట్ చేయించాలి. చక్రాల అమరికలో ఏవైనా లోపాలుంటే వానాకాలంలో ఆ ప్రభావం ఎక్కువ.

హెల్మెట్‌తో జుత్తు ఊడదు

'జుత్తు ఊడిపోతుంది'. హెల్మెట్ ఎందుకు ధరించరు? అని అడిగితే ఎక్కువమంది చెప్పే సమాధానం ఇదే. కానీ 'శిరస్త్రాణం ధరిస్తే కాదు.. వాడకపోతేనే జుత్తు కోల్పోయే అవకాశాలు ఎక్కువ' అంటున్నారు నిపుణులు. ఇంకేం చెప్పారంటే...

- హెల్మెట్ కాలుష్యం నుంచి కాపాడుతుంది. నగర రోడ్లు, ట్రాఫిక్‌లో నిత్యం ప్రయాణించేవారు శిరస్త్రాణం ధరించకపోతే శిరోజాలు పెళుసుబారి రాలిపోతాయి.
- బాగా వదులుగా ఉన్న శిరస్త్రాణం ధరిస్తే ప్రయాణ సమయంలో అటుఇటు కదులుతూ తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది. తల అటూఇటూ ఆడించినపుడు దానికనుగుణంగా హెల్మెట్ కదలాలి. జారిపోకూడదు.
- అమ్మాయిలైనా, అబ్బాయిలైనా పూర్తిగా ముఖాన్ని కప్పేవి ధరించాలి. అమ్మాయిలు శిరోజాలను హెయిర్ బ్యాండ్‌తో ముడివేసి ఆపై హెల్మెట్ ధరించాలి.
- శిరస్త్రాణాన్ని వారానికోసారైనా శుభ్రం చేయాలి. ఎండ తగిలేలా ఆరబెట్టాలి. లేదంటే మట్టి, తేమ చేరి ఫంగస్ ఏర్పడుతుంది.
- జుత్తుపై అసలేమాత్రం ఒత్తిడి పడొద్దు అనుకుంటే పొడిగుడ్డతో తలని చుట్టేసి దానిపై హెల్మెట్ ధరించాలి. తడిగా ఉన్న వెంట్రుకలపై అసలు ధరించవద్దు.

మరీ బిగుతుగా ఉన్న హెల్మెట్ ధరించవద్దు. ఇలా చేస్తే కుదుళ్లకు ఆక్సిజన్ అందక, రక్తప్రసరణ తగ్గి ఒత్తిడి ఎక్కువై బలహీన పడతాయి.

హీరోలా కొనేయండి

ద్విచక్రవాహనం మరమ్మతుకొచ్చినపుడు ఏదో వస్తువు పాడైపోయింది కొత్తది వేయాలంటాడు మెకానిక్. అసలు వాటి ధర ఎంతో మనకు తెలియదు. నాణ్యమైనవి వేస్తాడో, లేదో చెప్పలేం. ఈ చిక్కులు తీర్చేలా ప్రముఖ ద్విచక్రవాహన కంపెనీ హీరో మోటోకార్ప్ విడిభాగాల కోసం ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్ ప్రారంభించింది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చి ఎవరైనా నాణ్యమైన విడిభాగాలు కొనుక్కోవచ్చు. ప్రస్తుతం వాడుకలో ఉన్న బైక్‌ల విడిభాగాలే కాదు.. కరిజ్మా, యాంబిషన్, అచీవర్, హంక్, ఇగ్నైటర్, సీడీ 100ఎస్ఎస్‌లాంటి పాత మోడళ్ల విడిభాగాలు కూడా అందుబాటులో ఉంచారు. క్లచ్, బ్రేక్‌లు, ఇంజిన్ విడిభాగాలు, ట్రాన్స్‌మిషన్, బాడీ భాగాలు, విద్యుత్తు పరికరాలు.. ఇలా ప్రతీదీ దొరుకుతాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చేసి ఎంచక్కా అవసరమైన విడిభాగాలు ఇంటికే తెప్పించుకోవచ్చు.

విడుదల

ఈ-బండి స్మార్ట్!

వినియోగదారుల్ని ఆకట్టుకోవడానికి మరో బ్యాటరీ స్కూటర్ వచ్చేసింది. 340, 450 అనే రెండు వేరియంట్లలో దొరుకుతున్న ఈ స్కూటర్లని మేటి ఫీచర్లతో స్మార్ట్‌గా మలిచాం అంటోంది తయారీ కంపెనీ అథెర్. అవేంటంటే..

వేగం: ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని బ్యాటరీ స్కూటర్లకన్నా అత్యధిక వేగం మాదే అంటోంది కంపెనీ. 450 మోడల్ గంటకి 80కిమీల స్పీడ్‌తో పరుగులు పెడితే.. 340ది 70కిమీల వేగం. ఐదు సెకన్లలోనే నలభై కిలోమీటర్ల వేగం అందుకుంటుంది.

తెర: ఏడు అంగుళాల తాకే తెరలో వేగం, ఇంధనం, గమ్యం వివరాలు నమోదవుతాయి. పార్కింగ్ సాయం, టైర్లలో గాలి ఒత్తిడి వివరాలు, పుష్ నావిగేషన్, ఛార్జింగ్ స్టేషన్ సూచీ, కంబైన్డ్ బ్రేక్‌లు.. అన్ని వివరాలు చెబుతుంది. వీటిలో ఏదైనా తేడా వస్తే హెచ్చరిస్తుంది. అథెర్ యాప్‌తో కూడా ఈ స్మార్ట్ స్కూటర్‌ని అనుసంధానం కూడా చేసుకోవచ్చు.

సాయం: అథెర్ వన్ పేరుతో సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటే ఏడాదిపాటు ఉచితంగా ఛార్జింగ్ చేసుకోవచ్చు. నిర్వహణ, సర్వీసింగ్, అవసరమైన సాయం అందిస్తారు.

అండ: ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకులు సచిన్ బన్సాల్, బిన్నీ బన్సాల్ ఈ అథెర్ ఎనర్జీలో పెట్టుబడి పెట్టారు. దీంతోపాటు హీరోమోటోకార్ప్ కూడా ఇందులో భాగస్వామి.

ఛార్జ్: ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకధాటిగా అరవై కిలోమీటర్లు వెళ్తాయి. యాభై నిమిషాల్లోనే ఎనభైశాతం బ్యాటరీ ఛార్జ్ అవుతుంది. యాభై వేల కిలోమీటర్ల దాకా బ్యాటరీ మార్చాల్సిన అవసరం లేదు.

శక్తి: 6.8 హెచ్‌పీ శక్తి.. 14ఎన్ఎం టార్క్ విడుదల చేస్తుంది. 2.2కిలోవాట్ల లిథియం-అయాన్ బ్యాటరీతో పని చేస్తుంది. డిస్క్ బ్రేక్‌లు, కంబైన్డ్ బ్రేకింగ్ సిస్టం (సీబీఎస్) బ్రేక్‌లున్నాయి. మోనోషాక్ సస్పెన్షన్ ఉండటంతో గతుకుల రోడ్లపై కూడా ప్రయాణం సాఫీగా సాగుతుంది.

ధర: వరుసగా రూ.లక్షా 10వేలు, లక్షా 25వేలు.

రజనీకాంత్

ఈనాడు సినిమా

రజనీ నుంచి మరోటి

రజనీకాంత్ స్పీడు మామూలుగా లేదు. '2.0' పట్టాలపై ఉండగానే 'కాలా'ని మొదలెట్టి, పూర్తి చేసి, ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేశారు. 'కాలా' విడుదలైన రోజే మరో చిత్రానికి శ్రీకారం చుట్టారు. యువ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్‌తో రజనీ ఓ సినిమా చేస్తున్నారు. కళానిధి మారన్ నిర్మాత. గురువారం డార్జిలింగ్‌లో చిత్రీకరణ ప్రారంభమైంది. వైవిధ్యమైన చిత్రాలతో ఆకట్టుకుంటున్న కార్తీక్... రజనీకాంత్ కోసం ఓ సరికొత్త కథని సిద్ధం చేసినట్టు సమాచారం. రజనీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టేముందు వచ్చే చిత్రమిది. కాబట్టి రజనీ రాజకీయ ప్రస్థానానికి ఉపయోగపడేలా కథ, కథనాలు ఉండబోతున్నాయని తెలుస్తోంది. అనిరుథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో గానీ, 2019 ప్రథమార్ధంలో గానీ ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయి.

నాన్‌స్టాప్‌గా 40 రోజులు

'సైరా నరసింహారెడ్డి'గా సిద్ధమవుతున్నారు చిరంజీవి. ఆయన నటిస్తున్న 151వ చిత్రమిది. సురేందర్‌రెడ్డి దర్శకుడు. రామ్ చరణ్ నిర్మాత. నయనతార, తమన్నా కథానాయికలు. అమితాబ్‌బచ్చన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గురువారం నుంచి హైదరాబాద్‌లో మరో షెడ్యూలు మొదలైంది. నలభై రోజుల పాటు ఏకధాటిగా షూటింగ్ కొనసాగనుంది. ఇందులో పోరాట సన్నివేశాలతో పాటు, కొంత టాకీ పార్ట్ పూర్తి చేస్తారు. ఆగస్టు 22న చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసే అవకాశాలున్నాయి. కథ ప్రకారం యుద్ధ సన్నివేశాలకు ప్రాధాన్యం ఉంది. వాటిని హాలీవుడ్ సాంకేతిక నిపుణుల సహాయంతో తీర్చిదిద్దుతారు. 'సైరా' కోసం హైదరాబాద్ శివార్లలో ప్రత్యేకంగా ఓ సెట్‌ని రూపొందించారు. అక్కడే సింహభాగం చిత్రీకరణ జరగనుంది. 2019 వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

శాంతి కల వాడు సూర్యుడి కన్నా బాగా ప్రకాశిస్తాడు.

చిత్రం: శాంతి నివాసం

– పంపినవారు: షేక్ బాబ్జీ, ఊబలంక

పంచ్ డైలాగ్

ఓవైపు సంతోషం మరోవైపు ఉద్వేగం

కీర్తి సురేష్

'మహానటి' తరవాత కీర్తి సురేష్ 'కీర్తి' మరింత పెరిగింది. తనలో ఉన్న పరిపూర్ణ నటిని 'సావిత్రి' పాత్రతో ఆవిష్కరించగలిగింది. ఇప్పుడు కీర్తికి మరిన్ని కొత్త అవకాశాలు అందుతున్నాయి. 'మహానటి' కీర్తికి ఓ ఉద్వేగభరితమైన ప్రయాణం. షూటింగ్ చివరి రోజున సెట్లో.. కన్నీరు కూడా పెట్టుకుని భోరున ఏడ్చిందంటే.. సావిత్రి పాత్రని ఎంతలా మనసు లోతుల్లోకి తీసుకుందో అర్థం చేసుకోవచ్చు. ఆ రోజుల్ని కీర్తి మరోసారి గుర్తు చేసుకుంది. "'మహానటి' సినిమా చాలా ప్రత్యేకం. భవిష్యత్తులో ఇలాంటి పాత్రలు చేస్తానో, చేయనో తెలీదు. కానీ నా కెరీర్ మొత్తం ముగిశాక ఒక్కసారి ఆలోచించుకుంటే 'మహానటి' సినిమానే ముందు మెదులుతుంది. 'మహానటి' మొదలెట్టే ముందు సావిత్రి జీవితం గురించి నాకు పెద్దగా తెలీదు. సినిమా ఎలా రాబోతుంది? ఈ పాత్రని ఎలా నడిపించగలను? అనే సందేహాలెన్నో ఉండేవి. వాటిని దాటుకుంటూ షూటింగ్ పూర్తి చేశాం. ఈ పాత్ర కోసం శారీరకంగా మానసికంగా చాలా కష్టపడ్డా. దాంతో పాటు సావిత్రి పాత్రని పరిపూర్ణంగా అర్థం చేసుకున్నా. ఆమెతో కలసి ప్రయాణం చేశా. 'ఇక రేపటి నుంచి షూటింగ్‌కి రావాల్సిన పనిలేదు' అని తెలియగానే మనసు, గొంతూ రెండూ మూగబోయాయి. ఓవైపు మన కష్టం ఓ కొలిక్కి వచ్చిందన్న సంతోషం.. మరోవైపు 'సావిత్రి'ని విడిచి వెళ్లాలన్న ఉద్వేగం రెండూ ఒకేసారి కలిగాయి. అందుకే ఆరోజు కంటనీరు పెట్టా. మనం ఎంతో ప్రేమిస్తే, మన పనిలో వందశాతం లీనమైతే తప్ప అలాంటి సందర్భం రాదు" అంది.

షారుఖ్‌కు నాలుగో సంతానం... అభిమాని కల



బాలీవుడ్ కథానాయకుడు షారుఖ్‌ఖాన్‌కు ముగ్గురు పిల్లలు. కూతురు సినిమాల్లోకి వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయి. మరి ఈ సమయంలో షారుఖ్ వద్ద నాలుగో సంతానం ప్రస్తావన వస్తే ఎలా స్పందిస్తాడు అంటే చాలా సరదాగా అనే చెప్పొచ్చు. 'జబ్ హ్యారీ మెట్ సెజల్' తర్వాత మళ్లీ తెరపై కనపడలేదు షారుఖ్. ప్రస్తుతం 'జీరో' చిత్రీకరణలో ఉన్నాడు. దీంతో అభిమానులు ఆయన సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. కాగా షారుఖ్ సరదాగా 'ఆస్క్ ఎస్ఆర్‌కే' పేరుతో అభిమానులతో ట్విట్టర్‌లో ముచ్చటించాడు. కొందరి ప్రశ్నలకు చాలా ఫన్నీగా సమాధానం చెప్పాడు. ఇందులో భాగంగానే ఓ అభిమాని 'మీకు నాలుగో సంతానం కలగబోతున్నట్టు నాకు కల వచ్చిందని చెప్పాడు...'. దీనికి షారుఖ్ స్పందిస్తూ "అయితే మా అబ్బాయి అబ్రామ్ దుస్తులు జాగ్రత్తగా భద్రపరచాలి. బహుశా మీ కల నెరవేరితే ఎలాగో ఏంటో!' అని చెప్పాడు. 'మీకు ఒంటరితనం అనిపిస్తే ఏం చేస్తారు' అని అడిగితే "నాకు ముగ్గురు అందమైన పిల్లలు ఉన్నారు. అంతకంటే ప్రేమగా చూసుకొనే భార్య, సోదరి ఉన్నారు. అందువల్ల ఒంటరితనం ఆలోచన వచ్చే ఆస్కారమే లేదు" అని చెప్పాడు షారుఖ్.

మురికివాడల పిల్లలకు ఫుట్‌బాల్ కోచ్!

అమితాబ్ బచ్చన్

మరాఠీలో కొత్త తారలతో 'సైరత్' చిత్రాన్ని తెరకెక్కించి సంచలనం సృష్టించిన దర్శకుడు నాగ్‌రాజ్ మంజులె. ఆ చిత్రం రూ.100 కోట్లు వసూళ్లు సాధించిన తొలి మరాఠీ చిత్రంగా రికార్డు సృష్టించింది. దీంతో నాగ్‌రాజ్ పేరు బాలీవుడ్‌లోనూ మార్మోగిపోయింది. ఏకంగా అమితాబ్ బచ్చన్‌తో సినిమా చేసే అవకాశం వరించింది. గతేడాదే ఆ సినిమాను ప్రకటించారు కూడా. 'ఝుండ్' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో అమితాబ్ ప్రధాన పాత్రలో నటించనున్నాడు. ఈ చిత్రానికి సంబంధించి మరికొన్ని ఆసక్తికరమైన వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈ చిత్రంలో విశ్రాంత క్రీడా శిక్షకుడిగా అమితాబ్ కనిపించబోతున్నారట. ఓ మురికివాడలోని పిల్లలను చేరదీసి వారిని ఫుట్‌బాల్ క్రీడలో మెరికలుగా తీర్చిదిద్దేలా అమితాబ్ పాత్ర ఉంటుందని తెలుస్తోంది. మాదక ద్రవ్యాల వ్యసనంతో నేరాలకు పాల్పడే పిల్లలకు ఆటల్లోని మజా రుచి చూపించి వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే వ్యక్తిగా అమితాబ్ నటించబోతున్నాడని సమాచారం. స్లమ్ సాకర్స్ సంస్థను స్థాపించి మురికివాడల పిల్లలకు ఫుట్‌బాల్ ఆటలో శిక్షణ ఇస్తున్న విజయ్ బర్సె అనే వ్యక్తి జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కబోతోందని వినిపిస్తోంది. టి సిరీస్ అధినేత భూషణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని త్వరలోనే సెట్స్ మీదకు తీసుకెళ్లడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ఓ స్త్రీ రేపు రా!

శ్రద్ధాకపూర్, రాజ్‌కుమార్ రావ్

అదొక చిన్న టౌన్...అర్ధ రాత్రి సమయం...ఆ ఇంటి గోడలపై ఓ స్త్రీ రేపు రా అని రాసి ఉంది...వీధి మధ్యలో ఓ మహిళ గాల్లో నడుస్తుంది..మరి ఆ కథేంటో తెలియాలంటే 'స్త్రీ' చూడాల్సిందే. రాజ్‌కుమార్ రావ్, శ్రద్ధాకపూర్ జంటగా నటించిన హారర్ చిత్రమిది. అమర్ కౌశిక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్, ఫస్ట్‌లుక్‌ను ట్విట్టర్‌లో పంచుకొన్నారు రాజ్‌కుమార్, శ్రద్ధ. 'స్త్రీ' ఆగస్టు 31న వస్తుందని ట్వీట్ చేశారు. ఈ తరహా కథలో నటించడం శ్రద్ధకు ఇదే తొలిసారి. ఓ పక్క 'సాహో' లాంటి భారీ యాక్షన్ చిత్రంలో నటిస్తూనే కొత్త తరహా పాత్రలవైపు అడుగులేస్తుండటంతో ప్రశంసలు అందుకొంటోంది శ్రద్ధ. షాహిద్‌కపూర్‌తో 'బట్టీ గుల్ మీటర్ చాలు' కోసం సిద్ధమవుతోంది శ్రద్ధ.

'స్త్రీ' లోని ఓ దృశ్యం

హోలీ సందడిలో కొత్త జంట!

జాన్వీకపూర్, ఇషాన్ ఖత్తర్

శ్రీదేవి పెద్ద కూతురు జాన్వీకపూర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ధడక్'. శ్రీదేవి మరణించాకా ఆమె అభిమానులు జాన్వీలో శ్రీదేవిని చూసుకొంటున్నారు. దీంతో ఈ చిత్రంపై ఆసక్తి పెరిగింది. పైగా ఇది ఘన విజయం సాధించిన మరాఠీ చిత్రం 'సైరత్'కు హిందీ రీమేక్ కావడంతో అంచనాలు మరింత పెరిగాయి. ఇషాన్ ఖత్తర్ కథానాయకుడిగా శశాంత్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని జులై 20న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ట్వీట్ చేశారు ప్రముఖ సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్. హోలీ సందడిలో మునిగితేలుతున్న ఈ కొత్త జంట లుక్ బాగుందంటున్నారు నెటిజన్లు.

అత్తగారొస్తున్నారు

నాగచైతన్య

రమ్యకృష్ణ

తెలుగు తెరపై అత్తా అల్లుళ్ల ఫార్ములాకి ఎప్పటికీ తిరుగులేదు. ఈ నేపథ్యంలో ఎన్ని కథలు తెరకెక్కించినా తనివి తీరదు. అయితే గత కొంతకాలంగా అత్తా అల్లుళ్ల వినోదానికి అంతగా ఆస్కారం దొరకలేదు. ఆలోటు తీరుస్తున్నారు మారుతి. ఆయన దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'శైలజా రెడ్డి అల్లుడు'. నాగచైతన్య కథానాయకుడు. అత్తగా రమ్యకృష్ణ నటిస్తున్నారు. ఈనెల 18 నుంచి రామోజీ ఫిలిం సిటీలో చిత్రీకరణ జరగనుంది. దాదాపు 15 రోజుల పాటు కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తారు. ఈ షెడ్యూల్‌లోనే అత్తగా రమ్యకృష్ణ సెట్లో అడుగుపెట్టబోతున్నారు. జులైలో రాజమండ్రి, అమలాపురంలో మరో షెడ్యూల్ తెరకెక్కిస్తారు. ఆగస్టు చివరి వారంలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. అను ఇమ్మానియేల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి గోపీ సుందర్ స్వరాలు సమకూరుస్తున్నారు.

గీతోపదేశం

నిన్నటి నీడలే కనుపాపని ఆపితే
రేపటి వైపుగా నీ చూపు సాగదుగా
చుట్టమల్లె కష్టమొస్తే కళ్ల నీళ్లు పెట్టుకుంటు
కాళ్లు కడిగి స్వాగతించకు
ఒక్క చిన్న నవ్వు నవ్వి సాగనంపకుండా
లేని పోని సేవ చెయ్యకు

గీతం: సంతోషం సగం బలం...
చిత్రం: చిరునవ్వుతో
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి

– పంపినవారు: ఎస్వీ సుబ్బారావు, విజయనగరం

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

వీళ్లు మహా ముదుర్లు

పోసాని కృష్ణమురళి, పృథ్వీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'దేశ ముదుర్స్'. ఇద్దరూ 420 గాళ్లే అనేది ఉపశీర్షిక. కన్మణి దర్శకుడు. కుమార్ నిర్మాత. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోసాని మాట్లాడుతూ "సినిమాని నమ్మి తీసే నిర్మాత రామానాయుడు. మనుషుల్ని నమ్మి సినిమా తీసే నిర్మాత కుమార్. కన్మణి తెలివైన దర్శకుడు. కానీ ఆయనకు రావల్సినంత పేరు రాలేదు. ఈ చిత్రం ఆయనకు మంచి విజయాన్ని అందిస్తుందన్న నమ్మకం ఉంద"న్నారు. "కన్మణి తీసిన 'నా ఊపిరి' చాలా మంచి సినిమా. కానీ అనుకున్న స్థాయిలో విజయం సాధించలేదు. ఈ సినిమాతో తానేమిటో నిరూపించుకుంటార"న్నారు పృథ్వీ. "పోసాని, పృథ్వీ పాత్రలు రెండూ కొత్తగా ఉంటాయి. ఇద్దరూ మంచి టైమింగ్ ఉన్న నటులే" అన్నారు దర్శకుడు. ఈనెల 22న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామన్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో మహేంద్ర, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

కుమార్, కన్మణి, పృథ్వీ, మహేంద్ర, పోసాని కృష్ణమురళి, బెనర్జీ

రోజువారీ మాత్రమే కాదు... ప్రత్యేక సందర్భాల్లోనూ ఎంచుకునే వస్త్రశ్రేణి చుడీదార్. నేటి మహిళలు ఎంతో ఇష్టంగా వేసుకునే ఆ చుడీదార్ ఆకట్టుకునేలా ఉంటేనే కదా... ఓ ప్రత్యేకత ఉంటుంది. అలాంటి భిన్న రంగులూ.. విభిన్న డిజైన్లతో ఆకట్టుకుంటాయివి.

చుడీదార్ చమక్కులు!

ఫ్యాషన్ ఫ్యాషన్

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
సైఫాబాద్: 040–23231147/23423440
జూబ్లీహిల్స్: 040–23540862,
కూకట్‌పల్లి: 040–23152323
విజయవాడ: 0866–2496464
తిరుపతి: 0877–2238820
వైజాగ్: 0891–2577905

అందంగా... హుందాగా ఎంబ్రాయిడరీ హంగులతో రూపొందిన కాటన్ సల్వార్ సూట్.

డబుల్ లేయర్డ్ చుడీదార్‌కు గుండీలూ.. బంతిపూల మోటిఫ్‌లూ.. పూల డిజైన్‌తో ఆకట్టుకునే దుపట్టా ప్రత్యేకం.

చమక్కుమనే చందేరి కుర్తాకు... బ్లాక్‌ప్రింట్ వెయిస్ట్‌కోట్... టాజిల్స్ వేలాడుతోన్న మంగళగిరి దుపట్టా అదనపు ఆకర్షణ.

చందేరి సిల్కు అనార్కలీకి నప్పేలా ఎంబ్రాయిడరీ పని తీరుతో తీర్చిదిద్దిన దుపట్టా.

నజరానా

రసం తీసిన నిమ్మకాయ తొక్కలను పారేయకండి. వాటిని ఓ పదినిమిషాలు నీటిలో మరగబెడితే ఇల్లంతా మంచి వాసన వస్తుంది.

ఆ 48 రోజులు నరకమే!

నా కథ

ఆమె డాక్టర్. వృత్తీ, కుటుంబం రెండు కళ్లు. ఒక కంటికి సమస్య వచ్చిందని మరో కంటిని వదిలేసింది. కూతురు స్పెషల్ చైల్డ్ అని తెలియగానే తనలాంటి తల్లులకు సేవ చేయాలనుకుంది. పెద్ద మనసుతో తల్లులకీ.. ప్రత్యేకావసరాలున్న చిన్నారులకీ 'చేయూత'నిస్తోంది. ఆమే విజయవాడకు చెందిన డాక్టర్ కృష్ణకుమారి. అమ్మగా ఆమె ఎలా గెలిచిందో కథలా చెప్పుకొచ్చిందిలా...

అప్పుడు సమయం రాత్రి ఎనిమిది గంటలు. ఏడేళ్ల నా కూతురు మహతి హోంవర్క్ చేసి టీవీ ముందు కూర్చుకుంది. అన్నం పెడదామని వంటగదిలోకి వెళ్లా. పళ్లెంతో తిరిగి వచ్చేసరికి సోఫా మీద వాలిపోయి పడి ఉంది. దగ్గరకు వెళ్లి చేస్తే ఒళ్లు కాలిపోతోంది. ఎంత లేపినా లేవలేదు. కాసేపు కాలూ చేయి ఆడలేదు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళితే పాప కోమాలోకి వెళ్లిపోయిందన్నారు. అయ్యో దేవుడా అంటూ తలపట్టుకుని ఏడుస్తూనే నా కూతుర్ని లేపే ప్రయత్నం చేశా. ఓ డాక్టర్ అయ్యుండి నేను అలా చేస్తుంటే చాలామంది వింతగా చూశారు. ఎంతైనా తల్లిని కదా. పాప అలా అవ్వడానికి కారణం.. మెనింజైటిస్ వైరల్ ఇన్‌ఫెక్షన్. ఎంతోమంది వైద్యుల్ని సంప్రదించా. నిద్రలేని రాత్రులు గడిపా. తిండి కూడా సహించేది కాదు. దాని పక్కనే ఉండేదాన్ని. నలభై ఎనిమిది రోజులకు కళ్లు తెరిచింది. అప్పటి వరకు నరకం అనుభవించా.

ఆనందం ఆవిరైంది: ఆరోజు కళ్లు తెరిచింది అనగానే నా ఆనందం అంతా ఇంతా కాదు. కానీ అది ఎంతోసేపు కాదు. 'ఆ వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల పాప మెదడు దెబ్బతింది. జ్ఞాపకశక్తి పోయింది. వయసు పెరిగినా పసిపాపే' అని వైద్యులు చెప్పినప్పుడు ప్రాణం పోయినట్టు అనిపించింది. అబద్ధం అయితే బాగుండని ఎంతో మంది దేవుళ్లకి మొక్కా. ఎంతమంది ఎన్నిచెప్పినా నా మనసు మాత్రం అంగీకరించలేదు. నా సమయమంతా దానికే కేటాయించేదాన్ని. సన్నిహితులు చాలామంది 'నువ్వు ఇలా చేయడం కరెక్టేనా.. వైద్యులు లాభం లేదన్నా వినవేంటి? ఆ పాపని అలా వదిలెయ్' అంటూ ఉచిత సలహాలిచ్చేవారు. అయినా అవేమీ నా చెవికి ఎక్కేవి కాదు. ఇరవై నాలుగ్గంటలూ కంటికిరెప్పలా కాపాడుకుంటూ.. తన పనులు తను నేర్చుకునేలా మూడేళ్ల పాటు శిక్షణ ఇచ్చా. దాంతో నడవడం, మాట్లాడటం, తినడం, బాత్రూమ్‌కి వెళ్లడం నేర్చుకుంది. చాలా సంతోషంగా అనిపించింది. వైద్యులే ఆశ్చర్యపోయారు. ఈ లోపులో నాకు గర్భస్రావం కావడం, ఆరోగ్యం పాడవడంతో చాలా ఇబ్బంది పడ్డా. చివరకు నాకు క్యాన్సర్ వచ్చినా ఏడాది తరువాత మనోధైర్యంతో బతికి బయటపడ్డా.



బంగారం అమ్మేశా: ఇంతలో పాపకి పదేళ్లు వచ్చాయి. ఇంట్లోనే ఉండేది. నేను ఆసుపత్రిని చూసుకుంటూ పాపని వదిలేసేదాన్ని కాదు. అయితే నాకు మరోసారి గర్భం వచ్చింది. బాబు పుట్టాడు. వాడికి ఏడేళ్లు వచ్చేవరకూ మహతిని సరిగా చూసుకోలేకపోయా. దాంతో నేర్చుకున్నవన్నీ మర్చిపోయింది. మళ్లీ నా మీద ఆధారపడటం మొదలుపెట్టింది. అప్పుడు నేను ఎంత తప్పు చేశానో అర్థమైంది. దాన్ని సరిదిద్దుకోవాలనే ఉద్దేశంతో 2008లో 'చేయూత' అనే స్వచ్ఛంద సంస్థను మొదలుపెట్టా. అప్పటికే ఆర్థికంగా చాలా దెబ్బతిని ఉన్నా.. దాంతో ఆసుపత్రిని తీసేశా. నా బంగారం, కొన్ని ఆస్తులు అమ్మేశా. అలా వచ్చిన పది లక్షల రూపాయలతో స్థలం తీసుకుని మళ్లీ ఓ భవంతిని కట్టించా. థెరపిస్టులూ, వైద్యులూ, కొన్ని రకాల ఆట వస్తువులూ, ఇతర స్పీచ్‌థెరపీ పరికరాలు... అన్నీ తీసుకున్నా. అలా ఇద్దరితో మొదలైన నా చేయూత కేంద్రం ఇప్పుడు 95 మంది పిల్లలకు సాంత్వన అందిస్తోంది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏడాదిలోపు చిన్నారులకు గుర్తించి నా వద్దకు తీసుకురమ్మని అవగాహన కల్పిస్తున్నా. అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించి వారి ద్వారా విజయవాడ చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి ఈ విషయాలు చెబుతుంటా. చిన్నవయసులో వచ్చిన సమస్యల్లో కొన్నింటిని పూర్తిగా నయం చేయొచ్చు. అలాంటివి గుర్తించి, చికిత్స అందిస్తాం. అలానే మాటలు నేర్పించడం, జ్ఞాపకశక్తిని పెంచడం..ఇలా మరికొన్ని చేస్తున్నాం. తగిన చికిత్సలూ అందిస్తాం.

వందలమందికి సాయం: బుద్ధిమాంద్యం చిన్నారులకు ఫిజియోథెరపీ.. ఇతర చికిత్సలూ, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తా. నేను ఆయుర్వేద వైద్యం చదివినా సైకాలజీ, సైకోథెరపీలో పీజీ చేశా. ప్రస్తుతం ఆటిజానికి సంబంధించిన కోర్సు చేస్తున్నా. చేయూత పెట్టేటప్పుడు ఉచితంగానే సేవ చేయాలనుకున్నా. కానీ నాకూ ఆర్థిక సమస్యలున్నాయి. అందుకే ఎవరైనా ఫీజు ఇస్తానంటే మాత్రం తీసుకుంటున్నా. ఇక పదేళ్లలో తొమ్మిది వందల మంది పిల్లలకు చికిత్సలు అందించా. ఈ సంస్థ కోసం డబ్బుల కంటే విలువైన నా సమయం, ఆరోగ్యాన్నీ ఖర్చుపెట్టా. ఎన్ని చేసినా ముప్ఫై నాలుగేళ్ల నా కూతుర్ని పొత్తిళ్లలో బిడ్డ మాదిరే చూసుకోవాలి. అన్ని పనులూ నేనే చేయాలి. నా దగరకు వచ్చే పిల్లలకు చదువూ చెప్పిస్తా. రకరకాల నైపుణ్యాలు నేర్పించి ఉద్యోగాలు ఇప్పిస్తుంటా. ఇప్పటివరకూ పదిమంది అలా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఆరుగురు పదోతరగతి పరీక్షలు కూడా రాసి పాసయ్యారు. మా అమ్మాయి కూడా వీళ్లతోనే కలిసి ఉంటుంది. అమ్మగా నాలాంటి పిల్లలున్న మరికొందరు తల్లులకు చేతనైనంత చేయూతనివ్వాలన్నదే నా లక్ష్యం. నన్ను సంప్రదించాలనుకునేవారు 9440421781 నంబరుకి ఫోన్ చేయొచ్చు.

కూరగాయలు ప్రయత్నిద్దామా!

కూరగాయలు తీసుకోవడం వల్ల బరువు తగ్గొచ్చు. ఆరోగ్యానికి మంచిది. అంతే కాదు... మరెన్నో లాభాలున్నాయి. అవేంటో చూద్దామా!

- ఉదయంపూట తీసుకునే అల్పాహారంలో కూడా కూరగాయలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. పాలకూరతో చేసిన ఆమ్లెట్, పరోటా ఇలా ఏదైనా తీసుకోండి. అందులో వీలైనన్ని ఎక్కువ కూరగాయ ముక్కలు ఉండేలా చూసుకోవాలి.
- మనం రోజువారీ తీసుకునే పదార్థాల్లో డెబ్బై శాతంపైగా మొక్కల నుంచి వచ్చే పదార్థాలను తీసుకోవాలని ఓ అధ్యయనం తెలుపుతోంది. అందులో కూరగాయలూ, పండ్లూ, గింజధాన్యాలూ, చిక్కుళ్లూ, బీన్స్ ఉండేలా చూసుకోవాలి. మధ్యాహ్న భోజనంలో మీ పళ్లెంలో మూడు వంతుల కూరగాయలు ఉండేలా చూసుకోవాలి.
- పలు రకాల రంగుల్లో ఉండే కూరగాయలన్నింటినీ రుచి చూడండి. వీలైనంత ఎక్కువగా వాటిని తీసుకోవాలి. భిన్నమైన పోషకాలు కూడా అందుతాయి. మధ్యాహ్న భోజనంలో మూడు రకాల కూరగాయలు ఉండేలా చూసుకోండి.
- ప్రతివారం ఒక కొత్త కూరగాయను తీసుకోవడం అలవాటు చేసుకోండి. ఆయా కాలాల్లో వచ్చే రకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- కూరగాయలను ముక్కలుగా కోసుకుని తినడానికి సమయం లేనివారు రసం రూపంలో తాగొచ్చు. అలాచేస్తే ఎక్కువ పరిమాణంలో తీసుకునే అవకాశం ఉంటుంది.

తెల్లగా కావడం అసాధ్యమా?

డియర్ వసుంధర

● నాకు ఇరవై రెండేళ్లు. ఛామన ఛాయగా ఉంటా. ఈమధ్య నేను ఉద్యోగంలో చేరా. రంగు తక్కువగా ఉండటం వల్ల నాలో ఆత్మవిశ్వాసం తగ్గింది. అందరిలో కలవలేకపోతున్నా. అయితే నా స్నేహితురాలు కొన్ని రకాల క్రీమ్స్, చికిత్సలూ చేయించుకుంటే తెల్లబడొచ్చు అని చెప్పింది. నిజంగా అలాంటి చికిత్సలు ఉన్నాయా?

\- ఓ సోదరి

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

● ఇలా చాలామంది అనుకుంటారు. రకరకాల ప్రయోగాలు చేసి డబ్బులు వృథా చేసుకుంటారు. దానివల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ. మనం అందంగా కనిపించాలంటే రంగు ముఖ్యం కాదు. మచ్చలూ, మరకలు లేకుండా చర్మం ఆరోగ్యంగా, కాంతిమంతంగా కనిపించాలి. పుట్టుకతో వచ్చిన చర్మ రంగుని పూర్తిగా మార్చలేం. ఉదాహరణకు మైఖేల్ జాక్సన్‌ని తీసుకుంటే... అతను చికిత్సల ద్వారా చర్మానికి బొల్లిని తెచ్చుకున్నాడు. కొన్నిసార్లు చర్మక్యాన్సర్ కూడా రావచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సూచన మేరకే సరైన క్రీములు వాడాలి. అంటే స్టెరాయిడ్స్ ఉన్నవీ, లేబుళ్లు లేని సీసాలో ఉన్న క్రీముల జోలికి అసలు వెళ్లకూడదు. చర్మతత్వాన్ని బట్టి క్రీములు వాడాలి. కోజిక్ యాసిడ్, లాక్టిక్ యాసిడ్, గ్లైకాలిక్ యాసిడ్, రెటినాయిడ్ యాసిడ్, విటమిన్ సి ఆధారిత క్రీములు ఎంచుకోవాలి. కాలమేదైనా మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ తప్పనిసరి. అలానే మాండలిక్, గ్లైకాయిడ్, లాక్టిక్‌యాసిడ్, జస్టనల్ పీల్స్ అందుబాటులో ఉన్నాయి. అవి చర్మాన్ని కాంతిమంతంగా ఉంచేలా చేస్తాయి. ఇలాంటివి పార్లర్లలో చేయించుకుంటే చర్మం కాలినట్టు అవుతుంది. కాబట్టి నిపుణుల సమక్షంలోనే చేయించుకోవాలి. ఇక, మార్కెట్‌లో గ్లుటథయాన్, విటమిన్-సి 500 ఎంజీ, యాంటీఆక్సిడెంట్ ట్యాబ్లెట్లు లభ్యమవుతున్నాయి. అవి వైద్యుల సలహామేరకు వేసుకుంటే చర్మానికి నిగారింపు వస్తుంది. లేదంటే లేజర్ చికిత్స, గ్లుటథయాన్ ఇంజక్షన్ చేయించుకోవచ్చు. వీటితోపాటూ ఆరోగ్యకరమైన జీవనశైలి ముఖ్యం. వ్యాయామం, యోగా వంటివి చేయాలి. ఊబకాయం వల్ల కూడా చర్మం రంగును కోల్పోతుంది కాబట్టి బరువును అదుపులో ఉంచుకోవాలి. అలానే యాంటీఆక్సిడెంట్లూ, పీచూ, మాంసకృత్తులు అందేలా చూసుకోవాలి. ఇంట్లో ఉన్నప్పుడు చెంచా చొప్పున బొప్పాయి, అరటిపండు గుజ్జు, తేనెను తీసుకుని బాగా కలిపి పూతలా వేయాలి. పదినిమిషాలయ్యాక శుభ్రంగా కడిగేయాలి. చెంచా చొప్పున టొమాటో గుజ్జూ, పెరుగూ, అరటిపండు కలిపి పూతలా వేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేసుకోవాలి. చెంచా నారింజ తొక్కల పొడిలో కొద్దిగా కీరాదోస గుజ్జూ, పాలపొడి చేర్చి రాసుకోవాలి. కాసేపయ్యాక కడిగేసుకుంటే సరిపోతుంది. ఈ పూతలన్నీ ముఖం శుభ్రం చేసుకున్నాక వేసుకోవాలి. పూర్తయ్యాక మర్దన చేసుకుంటే చర్మానికి రక్తప్రసరణ సక్రమంగా అంది కాంతిమంతంగా మారుతుంది.

\- మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

07న ముగింపు-క్రితం

హైదరాబాద్	ముగింపు	క్రితం
బంగారం (24క్యా)	31,800	31,700
ఆర్నమెంట్	29,700	29,600
వెండి (కిలో)	41,900	40,900
విజయవాడ		
బంగారం (24క్యా)	31,850	31,800
ఆర్నమెంట్	29,550	29,500
వెండి (కిలో)	41,000	41,000
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,750	31,760
ఆర్నమెంట్	29,370	29,380
వెండి (కిలో)	41,000	40,700
రాజమహేంద్రవరం		
బంగారం (24క్యా)	31,850	....
ఆర్నమెంట్	29,420	29,360
వెండి (కిలో)	41,200	40,900
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,580	31,580
ఆర్నమెంట్	29,370	29,370
వెండి (కిలో)	40,900	40,900
తమిళనాడు		
ఆర్నమెంట్ (గ్రా)	2,942	2,941
వెండి (గ్రా)	43.30	42.90

(రూ. లలో)

ఒకవైపు అంతా ఉప్పునీళ్లు..
ఇంకోవైపు మొత్తం ఇసుక దిబ్బలు..
కానీ, ఆ పక్కనే ప్రపంచంలోనే అతి ఎత్తయిన భవనం..
అతి విశాలమైన దుకాణ సముదాయం..
అత్యంత పొడవైన హోటల్.. అదే దుబాయ్!
కడలి అంచుల్లో అదో కృత్రిమ స్వర్గం.. పదండి చూసొద్దాం..

ఇసుక దిబ్బపై ఇంద్రజాలం

దుబాయ్‌లో వాతావరణం ప్రతికూలమైనా.. జీవితం అనుకూలం. వర్షాలు తక్కువగా కురిసినా.. ఏడాదంతా హర్షాతిరేకాల్లో తడిసిముద్దవుతారు. ప్రకృతి వనరులు చాలా పరిమితం.. అభివృద్ధి మాత్రం ఆకాశమంత. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో సుందర నగరం దుబాయ్. అత్యంత సంపన్న నగరం కూడా. విస్తీర్ణంలో హైదరాబాద్ అంత కూడా ఉండదు. అయినా ట్రావెలోకంలో ప్రపంచ ప్రఖ్యాతి దీని సొంతం. ఇక్కడ జనాభా 30 లక్షలు. కానీ, 2017లో ఈ నగరాన్ని సందర్శించిన పర్యాటకుల సంఖ్య.. సుమారు కోటి అరవై లక్షలు. అందులో భారతీయుల వాటా 20 లక్షలపైమాటే! ఒకప్పుడు చమురు నిల్వల అమ్మకాల ద్వారా ఆదాయం సమకూర్చుకున్న దుబాయ్‌లో ఇప్పుడు పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరు. థీమ్ పార్కులు, సముద్ర తీరాలు, ఎడారి అందాలతో ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోంది. అందుకే పర్యాటక ప్రియులు ఇక్కడికి ఏడాది పొడవునా వస్తుంటారు.

గగన గమన భవనాలు

- దుబాయ్ అనగానే మదిలో మెదిలేది ఆకాశాన్నంటే భవనాలే. ప్రపంచంలో అతి ఎత్తయిన 'బుర్జ్ ఖలీఫా' టవర్ ఇక్కడే ఉంది. ఈ భవన నిర్మాణానికి అబుదాబి రాజు ఖలీఫా ఆర్థిక సహాయం చేయడంతో ఆయన పేరునే పెట్టారు. ఈ భవనం ఎత్తు 828 మీటర్లు. కిలోమీటర్‌కు కాస్త తక్కువ! ఇందులో 160 అంతస్తులున్నాయి. 148వ అంతస్తు వరకు పర్యాటకులను అనుమతిస్తారు. ఇక్కడి నుంచి చూస్తే దుబాయ్ నగరమంతా కనిపిస్తుంది. ప్రత్యేక రోజుల్లో ఆకాశహర్మ్యంపై లేజర్ కాంతులతో మిరుమిట్లు గొలిపే ప్రదర్శనలు ఉంటాయి.

టికెట్ ధరలు: 370 దిర్హామ్స్ (148 అంతస్తు వరకు), 135 దిర్హామ్స్ (125 అంతస్తు వరకు).

- దుబాయ్ మాల్ ప్రపంచంలోనే అతి విశాలమైనది. బుర్జ్ ఖలీఫాకి ముఖద్వారంగా ఉంటుంది. ప్రపంచంలోని అన్ని ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు దొరుకుతాయి. ఈ మాల్‌ని పూర్తిగా చూడాలంటే ఓ రోజు సరిపోదు. మాల్‌లో అండర్‌వాటర్ అక్వేరియం ప్రధాన ఆకర్షణ. ఇందులో నడుస్తూ వెళ్తుంటే సముద్రంలో ఉన్నామా? అన్న అనుభూతి కలుగుతుంది. దుబాయ్‌మాల్‌లోకి ప్రవేశం ఉచితం.

కృత్రిమ తీరాలు.. ప్రకృతి అందాలు..

- దుబాయ్‌కి వచ్చేవారు ఇక్కడి జ్యుమెరా తీరాన్ని సందర్శించకుండా ఉండరు. స్పీడ్ బోట్, వాటర్ సర్ఫింగ్, బనానా రైడ్ ఇలా బోలెడన్ని వాటర్‌గేమ్స్ అందుబాటులో ఉన్నాయి. బీచ్‌లో ఒంటెలపై విహారం భలేగా ఉంటుంది.
- పామ్ దీవులు.. ఇవి రెండు కృత్రిమ ద్వీపాలు. అవే పామ్ జ్యుమెరా, పామ్ జెబెల్ అలీ. పామ్ చెట్టు ఆకారంలో వీటిని నిర్మించారు. పర్యాటకులు సేదతీరడానికి ఏర్పాటు చేసిన తీరాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. వీటిని సందర్శించడానికి, సంద్రంలో విహరించడానికి స్పీడ్ బోటు సదుపాయం ఉంటుంది.

టికెట్ ధర: 200 దిర్హామ్స్.

- దుబాయ్‌లో ప్రపంచ ద్వీపాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. పేరుకు తగ్గట్టే దాదాపు అన్ని దేశాల పేర్లతో ఉన్న ఈ ద్వీపాల సముదాయం ప్రపంచపటాన్ని తలపిస్తుంది. ఈ దీవులను పూర్తిగా కొనుగోలు చేయవచ్చు. అద్దెకు తీసుకోవచ్చు. ఇక్కడ బస చేయాలంటే ఖర్చు ఎక్కువే! ఒక ద్వీపం నుంచి మరో ద్వీపానికి బోట్‌లోనో, హెలికాప్టర్లోనో వెళ్లాలి.

సాయంకాలం.. సాహస తీరం..

- దుబాయ్ పర్యటనలో సాహసవంతులను అలరించేది డెసర్ట్ సఫారీ. ఇసుక దిబ్బలపై జీపుల్లో ప్రయాణం. ధూళి తప్ప ఏం కనిపించదు. ఓ చోట ఏదో లోయలోకి జారిపోతున్నట్టు అనిపిస్తుంది. ఇంకోసారి అమాంతంగా కొండ ఎక్కిన అనుభూతి కలుగుతుంది. మరోసారి 45 డిగ్రీల కోణంలో గిర్రున బండి తిరిగితే.. వాహనం చుట్టూ

దుమ్ము రేగుతుంది. బండి ఏ పక్కకు ఒరిగినా.. ఆనందం పక్కా! సఫారీ కోసం నగరానికి దూరంగా వెళ్లాలి. బస్సులు అందుబాటులో ఉంటాయి. సాయంత్రం 5 గంటలకు విహారం మొదలవుతుంది. సాహసయాత్ర పూర్తయ్యాక సంప్రదాయ నృత్యాలతో కాలక్షేపం ఉంటుంది. ఆనంతరం ఇసుక తిన్నెల పైనుంచి శీతల గాలులు వీస్తుండగా విందు ఏర్పాటు చేస్తారు. ఒంటెలపై కూడా విహరించవచ్చు.

జీప్ సఫారీ టికెట్ ధర: 120 దిర్హామ్స్, మూడేళ్లలోపు వారికి ఉచితం.

- దుబాయ్‌లో అలరించే మరో సాహసక్రీడ స్కై డైవింగ్. హెలికాప్టర్ సాయంతో కొంత ఎత్తువరకు వెళ్లి అక్కడి నుంచి పామ్ జ్యుమెరా బీచ్ మీదుగా చేసే డైవింగ్ పర్యాటకులను అబ్బురపరుస్తుంది. సహాయకుడు అందుబాటులో ఉంటాడు. అధునాతన భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. నింగిలో అలా అలా తేలుతూ.. సముద్రం మీదుగా విహరిస్తూ.. పారాచూట్‌తో తీరంలో దిగాక కూడా ఆనందం ఇంకా ఆకాశంలోనే ఉంటుంది. ఈ సాహసాన్ని వీడియో తీసి అందించే సదుపాయమూ ఉంది.

టికెట్ ధర: 1,000 దిర్హామ్‌లు

ఎప్పుడైనా వెళ్లొచ్చు

ప్రస్తుత రంజాన్ మాసం దుబాయ్‌లో పర్యాటకానికి అన్‌సీజన్. యాత్రికులు తక్కువగానే ఉంటారు. గదుల అద్దెలూ తక్కువే! మిగతా ఏడాదంతా పర్యాటకులు ఇక్కడికి క్యూ కడతారు. దుబాయ్ ప్యాకేజీలు బోలెడున్నాయి. వీటి ధర రూ.45,000 నుంచి రూ.లక్ష వరకు ఉన్నాయి. పర్యటన రోజులు, చూపించే ప్రదేశాలు, వసతిని బట్టి ప్యాకేజీల ధరలున్నాయి. దుబాయ్ టూరిస్ట్ వీసా సులభంగానే లభిస్తుంది. పర్యాటకులు ఎంచుకునే వీసా రకాన్ని (ఎన్ని రోజులు) బట్టి రూ.4,500 నుంచి రూ.13,000 వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో వీసా పొందవచ్చు.

- దుబాయ్ కరెన్సీ దిర్హామ్ విలువ మన రూపాయి కంటే ఎక్కువే. ఒక్క దిర్హామ్ సుమారు రూ.18కి సమానం.

ఎన్నో ఎన్నెన్నో..

దుబాయ్‌లో ఉన్న అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు. జ్యుమెర మసీదు అరబ్బుల నిర్మాణ శైలికి అద్దంపడుతుంది. దుబాయ్, డేరా ప్రాంతాలను వేరు చేస్తూ ప్రవహించే దుబాయ్ క్రీక్ కాలువలో విహారం అద్భుతంగా సాగిపోతుంది. కొత్త, పాత దుబాయ్ నగరాలను వేరు చేస్తూ నిలువెత్తు నిల్చున్న దుబాయ్ ఫ్రేమ్ ఇప్పుడు టూరిస్ట్ స్పాట్. ప్రపంచ దేశాల ప్రత్యేకతలన్నీ కలిపి రూపుదిద్దుకున్న గ్లోబల్ విలేజ్ పర్యాటకులతో కిటకిటలాడుతుంటుంది. డాల్ఫిన్లతో పోటీగా ఈతకొట్టే అవకాశం ఉన్న డాల్ఫినారియం తప్పకుండా సందర్శించాల్సిన ప్రదేశం. ప్రకృతి ప్రేమికులకు ఇక్కడి మిరాకిల్ గార్డెన్, సాహసవంతులకు ఐఎంజీ వరల్డ్ ఆఫ్ అడ్వెంచర్.. ఇలా ఎన్నో ప్రదేశాలు పర్యాటకులను అలరిస్తున్నాయి.

– చంద్ర మదన్ మోహన్, ఈనాడు, హైదరాబాద్

దిక్సూచి



రావోయి మా ఇంటికి

ట్రావెలోకంలో సుందర ప్రదేశాలు కోకొల్లలు. అయితే ఎక్కడికి వెళ్లాలన్నా.. బెంగంతా వసతి గురించే! 'ఎయిర్‌బీఎన్‌బీ' (airbnb) యాప్ మీ దగ్గరుంటే ఎక్కడైనా ఇట్టే బస కుదిరిపోతుంది. ఆత్మీయ ఆతిథ్యం లభిస్తుంది. స్థానిక రుచులతో పసందైన విందూ దొరుకుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రాలన్నింటిలో ఎయిర్‌బీఎన్‌బీ సేవలు అందుబాటులో ఉన్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లలోని గదుల వివరాలు మాత్రమే కాదు ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు ఆతిథ్యమిచ్చే స్థానికుల వివరాలూ యాప్‌లో చూడొచ్చు. నచ్చిన ఇంట్లో అద్దెకు దిగితే సరి. కావాల్సినన్ని రోజులు ఉండొచ్చు. టీ, టిఫిన్, భోజనం అన్నీ వాళ్లే చూసుకుంటారు. ఆ ఇంట్లోవాళ్లతో కలివిడిగా ఉండగలిగితే.. వాళ్లే తోడుగా వచ్చి ఆ ప్రాంతమంతా తిప్పి చూపించే అవకాశమూ ఉంది. అంతేకాదు ఎయిర్‌బీఎన్‌బీ యాప్‌లో చేరితే.. 'రావోయి మా ఇంటికి..' అంటూ అతిథులనూ సాదరంగా ఆహ్వానించవచ్చు. వారికీ మరుపురాని ఆతిథ్యం ఇవ్వొచ్చు.

తప్పక చూడండి

నడి సంద్రంలో శిథిల సౌందర్యం

ఒకప్పుడు అండమాన్ దీవులకు ఆయువుపట్టు. అక్కడి నుంచే పరిపాలన సాగేది. అందమైన కట్టడాలు, ఆనందకరమైన జీవితం ఉండేది. అదే ప్రాంతంలో ఇప్పుడు మొండి గోడలు.. మర్రి ఊడలు మాత్రమే కనిపిస్తాయి. అయినా.. దాని ప్రత్యేకత పర్యాటకులను నేటికీ ఆకర్షిస్తుంటుంది. ప్రకృతి అందాలు, ప్రశాంత తీరాలతో అండమాన్ నికోబార్ దీవుల్లో ఉందీ ద్వీపం. దాని పేరు రాస్ ఐలాండ్. ఆ చారిత్రక దీవి గురించి ఇంకొంత..

రాస్ దీవి అండమాన్ నికోబార్ రాజధాని పోర్ట్‌బ్లెయిర్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పోర్ట్‌బ్లెయిర్ తీరాన్ని తొలిసారి గుర్తించిన సముద్ర సర్వేయర్ సర్ డానియల్ రాస్ పేరునే ఈ దీవికి పెట్టారు. అండమాన్ నికోబార్ దీవులకు ఒకప్పుడు ఇది పరిపాలన కేంద్రంగా వెలుగొందింది. 1857 సిపాయి తిరుగుబాటు సందర్భంగా.. చాలామంది ఆంగ్లేయులు కుటుంబాలతో వచ్చి రాస్ ద్వీపంలో స్థిరపడ్డారు. ఎనిమిది దశాబ్దాల పాటు అక్కడే జీవనం సాగించారు. విలాసవంతమైన జీవితం గడిపారు.

ప్రతి ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పర్యాటకులను దీవిలోకి అనుమతిస్తారు. ప్రతి బుధవారం ప్రవేశం నిషిద్ధం. ప్రవేశ రుసుం రూ.20.

భూకంపం దెబ్బ..

1941లో అండమాన్ ప్రాంతంలో వచ్చిన భారీ భూకంపం రాస్ ద్వీపాన్ని దాదాపు నేలమట్టం చేసింది. భూకంపం తీవ్రతకు భారీ భవనాలు, నివాసాలు, చర్చి, దుకాణాలు సముదాయాలు చాలా కూలిపోయాయి. నేటికీ ఆ శిథిలాలు కనిపిస్తాయి. ఆనాడు బ్రిటిష్‌వారు ఏర్పాటు చేసుకున్న టెన్నిస్ కోర్టులు, ఈతకొలనులు, క్రీడామైదానాల ఆనవాళ్లు కంటపడతాయి. పెచ్చులూడిన గోడలు.. కళాత్మకంగా కనిపించే శిథిల భవనాలు.. మర్రిఊడలు చుట్టుముట్టిన స్వాగత తోరణాలు.. కొత్తగా కనిపిస్తాయి. వీటిని చూసేందుకే పర్యాటకులు పోర్ట్ బ్లెయిర్ నుంచి మర పడవల్లో, స్పీడ్ బోట్లలో విచ్చేస్తుంటారు. రాస్ దీవి భారత నౌకాదళం సంరక్షణలో ఉంది. ఇక్కడి మ్యూజియంలో ద్వీపానికి చెందిన చారిత్రక విశేషాలను చూడవచ్చు. రాస్ ఐలాండ్‌పై డాక్యుమెంటరీని కూడా ప్రదర్శిస్తుంటారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి 9.45 గంటల వరకు, 11.30 నుంచి 11.45 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుంది.

ఎగిరిన జెండా

కొన్నాళ్లకు జపనీయులు రాస్ ద్వీపంపై ఆధిపత్యం చెలాయించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో 1942 నుంచి 45 వరకు జపనీయులు ఇక్కడ ఉన్నారు. జపాన్ సైన్యం ఏర్పాటు చేసుకున్న బంకర్లు, సొరంగాలు నేటికీ చూడొచ్చు. భారత స్వతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ రాస్ దీవిని సందర్శించారు. ఆ సందర్భంగా భారత పతాకాన్ని ఎగురవేశారట.

– ఆచార్య యడ్ల వెంకటరావు
కేంద్రీయ విశ్వవిద్యాలయం, పుదుచ్చేరి

పూలకు పుష్కరాలు

కేరళలో ఉన్న సుందర ప్రదేశం మున్నార్. ప్రకృతికి ఆలవాలమైన మున్నార్‌ను సందర్శించడానికి ఏడాదంతా పర్యాటకులు వస్తుంటారు. ఈ సంవత్సరం ఇంకా ఎక్కువగా విచ్చేయనున్నారు. ముఖ్యంగా జులై నుంచి అక్టోబర్ వరకు యాత్రికులు క్యూ కట్టనున్నారు. అంత ప్రత్యేకత ఏముంది అంటారా? ఇక్కడ పుష్కరాలు జరగనున్నాయి. ఏ నదికీ అంటారా? నదికి కాదండి.. పూల పుష్కరోత్సవం. మున్నార్ చుట్టుపక్కల ఉన్న కొండలు, లోయలు నీలికురింజి పూలతో కనువిందు చేయనున్నాయి. ఎక్కడ చూసినా నీలిరంగులో మెరిసిపోయే కుసుమాలు కనిపిస్తాయి. ఈ పుష్పాలు 12 ఏళ్లకోసారి విరబూస్తాయి. 2006లో అలరించిన నీలివిరులు.. మళ్లీ ఇప్పుడు అరవిరిసి అందాలు కురిపించనున్నాయి. ట్రెక్కింగ్ ప్రియులు, ఓషధి శాస్త్రజ్ఞులు మున్నార్ వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. నీలిపూల సౌందర్యాన్ని ఆస్వాదించడంతో పాటు మున్నార్‌లో హాయిగా సేదతీరవచ్చు. ఇక్కడికి సమీపంలోని ఎరవికులం నేషనల్ పార్క్, అనముడి పర్వతాన్ని సందర్శించవచ్చు.

కొత్తగా..

వన విహారికి ఘనమైన ఉపకారి

దట్టమైన అడవిలో వేడినీళ్లు కావాలన్నా, వేడివేడిగా ఏమైనా తినాలన్నా, ఫోన్‌కు ఛార్జింగ్ కావాలన్నా.. ఇట్టే కుదురుతాయి. బయోలైట్ క్యాంప్‌స్టవ్ వెంట పెట్టుకొని ఎక్కడికైనా వెళ్లిపోవచ్చు. ఈ స్టవ్‌లో నాలుగు కట్టెలు వేసి మంట రగిలిస్తే చాలు.. ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. పొయ్యి ద్వారా జనించే వేడి థర్మోఎలక్ట్రిసిటీగా మారుతుంది. అలా ఫోన్ ఛార్జింగ్ కూడా చేసుకోవచ్చు. ఎల్ఈడీ టార్చ్‌లైట్ కూడా దీనికి అమర్చుకోవచ్చు. స్టవ్‌కు అనుసంధానంగా ఇంటిగ్రేటెడ్ ఛార్జబుల్ బ్యాటరీ ఉంటుంది. ఇదే కాదు ఆన్‌లైన్ మార్కెట్‌లో రకరకాల క్యాంప్‌స్టవ్‌లు అందుబాటులో ఉన్నాయి. ట్రెక్కింగ్ ప్రియులకు, వనవిహారం చేసే పర్యాటకులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. వీటి ధరలు రూ.750 నుంచి పదివేల వరకూ పలుకుతున్నాయి.

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 9-6-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 300

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

“నాలుగేళ్లలో రాష్ట్రంలో నేనేం చేశానో చెబుతాను. కేంద్ర ప్రభుత్వానికి అంత దమ్ముందా? నల్లధనం నియంత్రణ కోసం నోట్ల రద్దు అని చెప్పారు. మీరు కష్టపడి సంపాదించుకున్న సొమ్ము తీసుకోటానికి కూడా బ్యాంకుల్లో డబ్బు ఉండటం లేదు. జీఎస్టీ అంటూ కొత్త చట్టాన్ని తెచ్చారు. ఇడ్లీ తిన్నా పన్ను కట్టి తీరాల్సిందే. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పారు. రైతులు దివాలా తీసే పరిస్థితి దేశంలో కల్పించారు.” - చంద్రబాబు



నెల్లూరు జిల్లా నాయుడుపేటలో మహా సంకల్ప వేదికపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మళ్లీ ఆశీర్వదించండి

- పార్టీలకతీతంగా పథకాలను అందించాం
- స్థానికంగా ఎవరోఒకరి వల్ల ఇబ్బంది కలిగినా ఎన్నికల సమయంలో వాటిని పట్టించుకోవద్దు
- మీ కోసం కేంద్రాన్ని దేహీ అన్నా ఫలితం లేకపోయింది
- రాజీనామాలతో వైకాపా డ్రామాలు
- కేంద్రాన్ని విమర్శించే ధైర్యం జగన్‌కు లేదు
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాల్సిందే
- నెల్లూరు జిల్లా నాయుడుపేటలో 'మహాసంకల్పం' ముగింపు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఈనాడు - నెల్లూరు; నాయుడుపేట, పెళ్లకూరు - న్యూస్‌టుడే

వచ్చే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని మరోసారి ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలను అందించటంలో ఎక్కడా పార్టీల వారీగా వివక్ష చూపలేదని అర్థమైతే చాలు.. పార్టీలకు అతీతంగా పథకాలను అందించామని స్పష్టం చేశారు. “స్థానికంగా మీకు ఎవరో ఒకరి వల్ల ఇబ్బంది కలిగి ఉంటుంది. ఎన్నికల సమయంలో ఇవేమీ పట్టించుకోవద్దు. నన్ను చూడండి. మీకు సంక్షేమ ఫలాలు అందించింది నేను. అందుకే రానున్న ఎన్నికల్లో మళ్లీ నన్ను గెలిపించాల్సిన చరిత్రాత్మక అవసరం మీపై ఉంది. నాలుగేళ్లు ఎంతో కష్టపడి రాష్ట్రాన్ని మంచి దారిలోకి తీసుకొచ్చా. ఇంకోసారి అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపే ప్రయత్నం చేస్తా. ఈ రోజు నెల్లూరు జిల్లాలోని తాళ్వాయిపాడు గ్రామానికి వెళ్తే అక్కడ ఒక మహిళ అన్న మాటలు నన్ను ఆలోచించేలా చేశాయి. 'మీ కోసం మేం ఉంటాం.. మీరు మా కోసం ఉండాలి' అంది. ఆమెలా మీరంతా ఆలోచించాలి. పార్టీలకు అతీతంగా నన్ను రానున్న ఎన్నికల్లో ఆదరిస్తే.. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయటానికి శక్తివంచన లేకుండా పనిచేస్తా. 25 ఎంపీ స్థానాల్లో తెదేపా అభ్యర్థులను గెలిపించండి. కేంద్రంలో ప్రధానమంత్రిగా ఎవరుండాలో నిర్దేశించే శక్తి నాకొస్తుంది. అప్పుడు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి రాబట్టడానికి వీలవుతుంది” అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం (మిగతా 6లో)

“వైకాపా ముసుగులో కేంద్రం రాష్ట్రాన్ని నాశనం చేయాలని చూస్తోంది. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం చేస్తున్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాల్సింది ఎవరు? కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలి. కానీ, వైకాపా నాయకులు నన్ను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నారు.

వైకాపా వారు 2015 నుంచి రాజీనామాలంటూ నాటకాలాడారు. ఆ పార్టీ అధినేతకు తమిళనాడులో శశికళకు పట్టిన గతి చూసి భయం. అందుకే మోదీని పల్లెత్తు మాట అనడు. నన్ను మాత్రం తిడుతూనే ఉంటాడు. మొన్నటి వరకు జనసేన అధినేత బాగానే కలిసొచ్చారు. ఇప్పుడు ఎందుకో ఆయన కూడా విమర్శలు చేస్తున్నారు. ఇద్దరినీ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రెచ్చగొడుతోంది.

నీతిమంతమైన పాలన అందిస్తామని చెప్పిన భాజపా కర్ణాటక ఎన్నికల్లో ఏం చేసింది? గనుల కుంభకోణంలో ప్రధాన నిందితుడు గాలి జనార్దన్‌రెడ్డిని వెంటపెట్టుకుంది. అక్కడ గాలి జనార్దన్‌రెడ్డి.. ఇక్కడ ఆయన తమ్ముడు జగన్మోహన్‌రెడ్డి.. ఇదీ భాజపా తీరు.”

పోలవరం నిధులు ఎట్టకేలకు విడుదల

- పీపీఏ ఖాతాకు చేరిన రూ.1400 కోట్లు
- తొలి డీపీఆర్ ప్రకారం రాష్ట్రానికి రావాల్సింది రూ.395 కోట్లే
- కొత్త డీపీఆర్‌కు ఆమోదంలో జాప్యం
- అనిశ్చితి కొనసాగితే నిధుల కొరత తలెత్తే ప్రమాదం
- దీనిపై కేంద్రానికి లేఖ రాయాలని భావిస్తున్న ముఖ్యమంత్రి

ఈనాడు - దిల్లీ

పోలవరం ప్రాజెక్టు కోసం 2017-18 ఆర్థిక సంవత్సరంలో రావాల్సిన రూ.1,400 కోట్లు ఎట్టకేలకు విడుదలయ్యాయి. ఈ మొత్తం శుక్రవారం ప్రాజెక్టు అథారిటీ ఖాతాలో జమయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఖర్చును కేంద్రం తిరిగి చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చి 31లోపే (2017-18 ఆర్థిక సంవత్సరం) రూ.1400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. అప్పట్లో కేంద్ర ఆర్థిక శాఖ ఈ నిధుల సమీకరణ కోసం నాబార్డుకు అనుమతినిచ్చినా వివిధ కారణాల వల్ల అది ఆ పని చేయలేకపోయింది. కాలక్రమంలో కొత్త ఆర్థిక సంవత్సరంలోకి అడుగుపెట్టడంతో పాత సంవత్సరంలో ఇచ్చిన అనుమతులకు కాలదోషం పట్టింది. దాంతో కేంద్ర ఆర్థిక శాఖ మరోసారి నిధుల సమీకరణకు నాబార్డుకు అనుమతిస్తూ మేలో ఉత్తర్వులు ఇచ్చింది. అప్పటినుంచి (మిగతా 6లో)

భూగర్భ జలాల్లో యురేనియం

- భారత్‌లో పరిస్థితి తీవ్రం
- ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు మించి ఉన్న రేడియోధార్మిక పదార్థం
- 16 రాష్ట్రాల సమాచారాన్ని అధ్యయనం చేసిన అమెరికా పరిశోధకులు
- మానవ చర్యలతో సమస్య మరింత జటిలం
- భారత ప్రమాణాల సంస్థ కలుషితాల జాబితాలో లేని యురేనియం 15లో



విశాఖ జిల్లా కోటవురట్ల మండలం అణుకు గ్రామం నుంచి గర్భిణిని మోసుకెళ్తున్న గిరిజనులు

6 కిలోమీటర్లు అష్టకష్టాలు

గర్భిణిని మోసుకెళ్లిన గ్రామస్థులు

మైదాన ప్రాంతంలోనూ మన్యం పరిస్థితులు కన్పిస్తున్నాయి. రోడ్డు సౌకర్యం లేక పురుటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని కర్రకు దుప్పటి కట్టి ఆరు కిలోమీటర్లు మోసుకెళ్లే దుస్థితి ఏర్పడింది. విశాఖ జిల్లా కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయతీ అణుకు గ్రామానికి చెందిన గమిల లింగో అనే గర్భిణికి శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి ఫోన్ చేశారు. రోడ్డు లేకపోవడంతో వాహనం ఈ గ్రామానికి రాలేదు. దీంతో కర్రకు దుప్పటి కట్టి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గొట్టివాడకు మోసుకెళ్లారు. అక్కడ నుంచి కోటవురట్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఆటోలో తీసుకెళ్లారు. అక్కడ నుంచి రాత్రి 9 గంటలకు నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. కొన్నేళ్లుగా ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, గొట్టివాడ (కోటవురట్ల)

అవినీతిలో అగ్రస్థానం

- తెదేపా నాలుగేళ్ల పాలనపై ఛార్జిషీటు విడుదల చేసిన వైకాపా
- ప్రత్యేకహోదా తాకట్టుతో రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి 11లో
- క్షీణించిన శాంతిభద్రతలు
- పేట్రేగిపోతున్న మాఫియాలు
- ఇవే చంద్రబాబు సాధించిన విజయాలంటూ ధ్వజం

44 వేల మంది ఒంటరి మహిళలకు పింఛన్లు

- జులై నుంచి పంపిణీకి చర్యలు
- నెలనెలా రూ.1000 చొప్పున ఇచ్చేందుకు నిర్ణయం 3లో

ఇదీ సంగతి!



మామూలు ఆటగాళ్లకు వద్దు సార్, పేకాటగాళ్లకూ బ్రాకెట్ ఆటగాళ్లకూ పెడదాం. మనకు మంచి ఆదాయం ఉంటుంది!

మోదీ హత్యకు కుట్ర!

- మావోయిస్టు అగ్రనేతల అంతర్గత లేఖల్లో వెల్లడి
- 'రాజీవ్ గాంధీ తరహా ఘటన'పై ఆలోచన
- లేఖలో వరవరరావు పేరు
- దాడులకు నిధులిచ్చినట్లు ప్రస్తావన
- బయటపెట్టిన మహారాష్ట్ర పోలీసులు

పుణె: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని 'రాజీవ్ గాంధీ తరహా ఘటన'లో హత్య చేసేందుకు మావోయిస్టులు కుట్ర పన్నినట్లు మహారాష్ట్ర పోలీసులు వెల్లడించారు. మావోయిస్టు అగ్రనేత ఒకరి నుంచి వచ్చిన లేఖలో ఈ ప్రస్తావన ఉందని పుణె కోర్టుకు తెలియజేశారు. 'భీమా-కోరెగావ్' అల్లర్లకు సంబంధించి ఇటీవల అరెస్టయిన ఐదుగురిలో ఒకరి ఇంట్లో ఈ లేఖ దొరికినట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన భీమా-కోరెగావ్ అల్లర్ల కేసులో పుణె పోలీసులు దళిత నాయకుడు సుధీర్ ధవాలే, న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్, గిరిజన కార్యకర్త (మిగతా 6లో)

తల్లుల ఆరోగ్యానికి భరోసా

- ఏపీలో మాతా మరణాలు తగ్గుముఖం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ విశేష కృషి

ఈనాడు - అమరావతి

తల్లుల మరణాలు దేశవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఈ దిశలో ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆశాజనకమైన పురోగతి కనిపిస్తోంది. రిజిస్ట్రార్ జనరల్ తాజాగా విడుదల చేసిన 2014-16 అధ్యయన నివేదిక ఈ అంశాన్ని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 15-49 ఏళ్ల మధ్య మహిళల్లో 62,96,101 మంది వద్ద స్వయంగా(శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్) అభిప్రాయాలను సేకరించి విశ్లేషించింది. సమాచారాన్ని ఇచ్చిన వారిలో 4,26,861 మంది తల్లులు ఉన్నారు. ఈ నివేదికలో పేర్కొన్న ప్రకారం.. 2011 నుంచి 2013 మధ్య ప్రతి లక్ష మంది తల్లుల్లో 167 మంది మరణించారు. 2014-16 సంవత్సరాల్లో ఈ సంఖ్య 130. దక్షిణాదిలో 2011-13 మధ్య లక్ష మందికి 93 మంది మరణించగా, ఈ సంఖ్య రెండేళ్లకు 77కు తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో మరణాల సంఖ్య ఇంకా తక్కువ 74గా నమోదైంది.

ఆసుపత్రుల్లోనే కాన్పులయ్యేలా చూడడం, గర్భం దాల్చినప్పటినుంచి ఏఎన్‌ఎంల ద్వారా క్రమపద్ధతిన ఆరోగ్య జాగ్రత్తలు సూచించడంవంటి చర్యలు రాష్ట్రంలో సత్ఫలితాలనిస్తున్నాయి. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పథకం అమలుతో పాటు గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్యసేవలు అందించేందుకు నడుపుతున్న బైక్ అంబులెన్సులు విశేష సేవలనందిస్తున్నాయి. దేశంలో తల్లుల మరణాలు తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు.

★ సమాచారాన్ని సేకరించిన వారి సంఖ్య ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంది. ఏపీలో సమాచారాన్నిచ్చిన వారి సంఖ్య మూడు లక్షలు దాటింది. అసోం, బిహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 21,37,849 మంది మహిళల నుంచి వివరాలను సేకరించారు. వీరిలో 18,82,504 మంది తల్లులున్నారు. ఇక్కడ లక్ష మందికి సరాసరిన 342 మంది మరణించారు. ఈ రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తల్లుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నాయి. గుజరాత్, హరియాణా, మహారాష్ట్ర, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఇతర రాష్ట్రాల్లో 27,08,251 మందిని కలుసుకోగా వీరిలో 1,56,400 మంది తల్లులున్నారు. లక్షమందికి 146 మంది మరణించారు.

వయస్సు	ప్రసవ అనంతర మరణాలు	ఇతర కారణాలతో మరణాలు
15-19	4%	9%
20-24	35%	10%
25-29	34%	12%
30-34	16%	12%
35-39	7%	15%
40-44	3%	19%
45-49	1%	22

కొత్త పార్టీ ప్రారంభించిన జస్టిస్ కర్ణన్

- 'యాంటీ కరప్షన్ డైనమిక్ పార్టీ'గా నామకరణం

చెన్నై, న్యూస్‌టుడే: విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కర్ణన్ కొత్త పార్టీ ప్రారంభించారు. అవినీతి నిర్మూలన కోసమే పార్టీని ప్రారంభించానని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోని అన్ని స్థానాల్లోనూ పోటీ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ పేరును 'యాంటీ కరప్షన్ డైనమిక్ పార్టీ'గా ప్రకటించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఆరోపణలు చేసి సంచలనం సృష్టించడంతో పాటు కోర్టు ధిక్కరణ కింద జైలు శిక్ష అనుభవించిన తమిళనాడుకు చెందిన జస్టిస్ కర్ణన్ కొత్త పార్టీ ప్రారంభించనున్నట్లు కొద్దిరోజుల క్రితమే ప్రకటించారు. ఈ నేపథ్యంలో పార్టీ ప్రారంభోత్సవ కార్యక్రమం చెన్నై రాజా అన్నామలైపురంలోని అంబేడ్కర్ స్మారక మండపంలో శుక్రవారం జరిగింది. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి జస్టిస్ కర్ణన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. తర్వాత పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండా పైభాగంలో నీలం, మధ్యభాగంలో పసుపు, కింది భాగంలో పచ్చరంగు ఉన్నాయి. పార్టీ అధ్యక్షుడిగా కర్ణన్ వ్యవహరించనుండగా ప్రధాన కార్యదర్శిగా అంతోని లిప్రో, కోశాధికారిగా రాహుల్ ఇస్లాం నియమితులయ్యారు.

పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జస్టిస్ కర్ణన్ తదితరులు

2017 - SI సెలక్షన్స్‌లో స్టేట్ 1st ర్యాంకు సాధించిన సంస్థచే
RPF-SI, కానిస్టేబుల్స్
SI & కానిస్టేబుల్స్
17వ బ్యాచ్: నేడే, ఉ. 9 గం.
జిమ్ & హాస్టల్ కలదు
శ్యామ్ ఇనిస్టిట్యూట్
విద్యుత్‌నగర్, కాకినాడ, తూ.గో.జిల్లా.
0884 - 2362744
98482 56254
98481 36254

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
13 సం॥ల అనుభవం కలిగిన ఎస్. విజయ్ కుమార్ రెడ్డి సార్ చే స్థాపించబడిన...
RANK హామీ ఇవ్వగలిగే APలో ఏకైక IAS సంస్థ
After Degree - Morning Batch (1 year)
During Degree - Evening Batch(2 years)
Degree + IAS (50 students) 3yrs Integrated Program
ఇంటిని మరిపించే Hostel facility
Civil Services IAS Exam పై ఉచిత అవగాహనా సదస్సు on June 10th Sunday 10 am
IAS Coaching సొంత పుస్తకాలు గల ఏకైక సంస్థ
విద్యార్థులు / తల్లిదండ్రులు అందరూ ఆహ్వానితులే
Beside Nagarjuna Hospital, Kanuru, VJA, Ph: 6300181832

సమాఖ్య స్ఫూర్తి.. జై భారత్ పార్టీ లక్ష్యం

- జెండా ఆవిష్కరించిన జాతీయ అధ్యక్షుడు చిన్నయ్యదొర

ఈనాడు, దిల్లీ: దేశంలో సమాఖ్య స్ఫూర్తి పెంపొందాలనే జైభారత్ పార్టీ స్థాపించినట్లు పార్టీ జాతీయ అధ్యక్షుడు చిన్నయ్యదొర తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫాసిస్టు పోకడలతో దేశం ఛిన్నాభిన్నమైందన్నారు. శుక్రవారమిక్కడ పార్టీని ప్రారంభించిన ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ సిద్ధాంతాలను దృశ్యాత్మకంగా వివరించారు. సభ్యత్వ నమోదు అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులు, మధ్యతరగతి, పేదలు, సైనికులు ఇలా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం పార్టీని ఏర్పాటు చేసినట్లు దొర తెలిపారు. కాంగ్రెస్, భాజపాలు దేశం గురించి ఆలోచించడం లేదని ఆరోపించారు. ఆ రెండు పార్టీలు మినహా ఏ పార్టీతోనైనా కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ఆదాయ పన్ను స్లాబు రేటు సవరించాలని ఆయన డిమాండు చేశారు. పార్టీ కేంద్రకమిటీ, కొన్ని రాష్ట్రాల అధ్యక్షుల పేర్లను ఆయన ప్రకటించారు. త్వరలోనే పార్టీని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని, 2019 ఎన్నికల్లో అన్ని లోక్‌సభ స్థానాల్లోనూ పోటీ చేస్తామని దొర వివరించారు.

కేఎల్ వర్సిటీలో అమెరికన్ కాన్సులేట్ బృందం

తాడేపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ బృందం శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. కాన్సులేట్ వైస్ కౌన్సిల్ చార్లిస్ స్పెక్ట్, సాంస్కృతిక వ్యవహారాల సహాయకులు సింథిల్, యూఎస్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ప్రాంతీయ అధికారి మెకానికా సేటియాతో కూడిన బృందం సభ్యులు కేఎల్ఈఎఫ్ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ఉపకులపతి డాక్టర్ ఎల్ఎస్ఎస్ రెడ్డి, అంతర్జాతీయ సంబంధాల సంచాలకులు డాక్టర్ కిషోర్ బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో తరగతి గదులతో పాటు పరిశోధన కేంద్రాలను పరిశీలించారు. పరిశోధనల వివరాలను తెలుసుకున్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. అనంతరం అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో సంయుక్తంగా విద్యావిధానాన్ని నిర్వహించే పలు కీలక అంశాలపై, అవగాహన ఒప్పందాలపై, అంతర్జాతీయ బదిలీ కార్యక్రమాలపై చర్చించారు. అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసంపై చర్చించినట్లు కేఎల్‌యూ ఉపకులపతి డాక్టర్ ఎల్ఎస్ఎస్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఆఫ్రికా, యూరప్, అరబ్ దేశాల విద్యార్థులు తమ విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేశారని తెలిపారు.

కేఎల్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన అమెరికా కాన్సులేట్ బృందంతో కేఎల్ఈఎఫ్ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ

K L UNIVERSITY (DEEMED TO BE UNIVERSITY)
EXCLUSIVE COUNSELLING FOR JEE Rankers & CBSE / ICSE Top Scorers
K L (Vijayawada) & K L (Hyderabad) Campuses
25% seats are reserved for the following categories
JEE Main 1 to 3,00,000 Rankers
JEE Advanced All Rankers
CBSE + 2 CGPA: 8.0 & above
ICSE + 2 CGPA: 8.0 & above
AP EAMCET 1 to 40,000 Rankers
TS EAMCET 1 to 40,000 Rankers
AP Intermediate 900 & above marks
TS Intermediate 900 & above marks
11.06.2018 (Monday) & 12.06.2018 (Tuesday) 9 AM onwards
- Rankers in the above categories who have not applied earlier, can directly attend the counselling
- Bank Loans (Education) available
- For Scholarships, Reservations visit : www.kluniversity.in
- Counselling at our Campus
100%* Placements THIS YEAR ALSO WITH PAY PACKAGE UPTO ₹20 LAKHS
* for all registered & eligible students
Vijayawada Campus: Green Fields, Vaddeswaram, Andhra Pradesh Ph: 9490361111, 7997995730, 7997995696, 7997995703, 7997995732, 0863-2399999
NAAC 'A' Grade
Admin Office : 29-36-38, Museum Road, Governorpet, Vijayawada - 500002. Andhra Pradesh. Ph: 8008790128, 9866034520

ముందు రుసుము చెల్లించండి!

- ఎంసెట్ కౌన్సెలింగ్ పూర్తికాకముందే కళాశాలల ఒత్తిడి
- ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్
- ఇలాచేస్తే గుర్తింపు రద్దు చేస్తామంటున్న అధికారులు

ఈనాడు, అమరావతి: ఎంసెట్ కౌన్సెలింగ్ పూర్తిగాక ముందే రుసుములు చెల్లించాలని విద్యార్థులపై కళాశాలలు ఒత్తిడి తీసుకువస్తున్నాయి. నిబంధనల ప్రకారం మూడు విడతల కౌన్సెలింగ్ ముగిసే వరకు విద్యార్థుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయకూడదు. మొదటి విడతలో కోరుకున్న బ్రాంచి, కళాశాలలో సీటు రాకపోతే రెండో విడత కౌన్సెలింగ్‌లో మెరుగైన సీటు కోసం ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం ఉంటుంది. దీంతో మొదట వచ్చిన సీటు రద్దై కొత్త కళాశాలలో సీటు కేటాయింపు వస్తుంది. కొన్ని కళాశాలలు సీట్లు భర్తీ అవుతాయో లేదోనని భావనతో కొంత రుసుము చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఒకవేళ విద్యార్థి రెండు, మూడో విడత కౌన్సెలింగ్‌లో కళాశాల మారితే ఆ డబ్బులు తిరిగిరావు. మరికొన్ని కళాశాలలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని అడుగుతున్నాయి. ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ జారీ చేసిన నిబంధనల ప్రకారం విద్యార్థులు ఆన్‌లైన్‌లోని సెల్ఫ్‌డిక్లరేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, కళాశాలలో సమర్పించాలి. దీంతోపాటు విద్యార్థి ధ్రువీకరణ పత్రాల నకలు ఇస్తే సరిపోతుంది. ఎలాంటి రుసుములు, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ, కళాశాలలు చేస్తున్న ఒత్తిడిపై గత రెండు రోజులుగా ఉన్నత విద్యామండలికి పలు ఫిర్యాదులు సైతం వచ్చాయి. ప్రస్తుతం కళాశాలల్లో చేరేందుకు వెళ్తున్న వారిని రుసుములు చెల్లించాలని అడిగితే గుర్తింపు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా ఆచరణలో మాత్రం పని చేయడం లేదు. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తికాగానే సహాయ కేంద్రాలను సైతం అధికారులు అందుబాటులో ఉంచడం లేదు. సీట్లు పొందిన విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులపై ఎవ్వరికి సమాచారం ఇవ్వాలో తెలియక చాలామంది తల్లిదండ్రులు కొన్ని కళాశాలల యాజమాన్యాలకు రుసుములు రూపంలో రూ.15-20వేలు వరకు చెల్లించేస్తున్నారు.

అర్హత మార్కుల తగ్గింపుపై చర్చలు..

ఎంసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత మార్కులు తగ్గించాలని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కోరుతున్నాయి. ఈ ఏడాది ప్రవేశాలు తక్కువగా ఉన్నందున అర్హత మార్కులు తగ్గిస్తే మరికొంతమందికి అవకాశం వస్తుందని పేర్కొంటున్నాయి. ఈ ఏడాది 52శాతం మంది మాత్రమే ప్రవేశాలకు ఆప్షన్లు ఇచ్చారు. వీరిలోనూ అందరూ కళాశాలల్లో చేరే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో అర్హత మార్కులు తగ్గించాలని మంత్రి గంటా శ్రీనివాసరావుకు విన్నవించారు. కానీ, మార్కులు తగ్గిస్తే నాణ్యత పడిపోతుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేసినట్లు సమాచారం. రెండో విడత కౌన్సెలింగ్ ఈనెల నాలుగోవారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మార్కుల తగ్గింపుపై చర్చలు సాగుతున్నాయి.

త్వరలో పీఆర్సీ బకాయిలు

- తొలివిడత రూ.260 కోట్లు నేరుగా ఉద్యోగుల ఖాతాలకు జమ
- పెన్షనర్లకు రూ.715 కోట్లు నగదుగా చెల్లించేలా ఏర్పాట్లు
- ఆర్థిక మంత్రి యనమల వెల్లడి

ఈనాడు – అమరావతి

ఉద్యోగులకు పీఆర్సీ బకాయిల కింద రూ.260 కోట్లను త్వరలోనే విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. సచివాలయంలో ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. "పీఆర్సీ కింద ఉద్యోగులకు మొత్తం రూ.3,919 కోట్లు చెల్లించాలి. తొలివిడతగా రూ.260 కోట్లను నగదు రూపంలో ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు జమ చేయబోతున్నాం. మిగిలిన మొత్తాన్ని జీపీఎఫ్‌లో కలుపుతాం. పెన్షనర్లకు రూ.715 కోట్లు నగదు రూపంలో చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సీపీఎఫ్ కింద రూ.730 కోట్లు చెల్లించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాం. తక్షణ చెల్లింపుల కింద ప్రభుత్వంపై రూ.1,750 కోట్ల మేర భారం పడుతుంది" అని వివరించారు. ఎన్టీఆర్ భరోసా కింద మరో 3.5 లక్షల మందికి పెన్షన్ల మంజూరుకు చర్యలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అర్హులందరికీ తెల్లరేషన్‌కార్డులను మంజూరు చేయబోతున్నామన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధిలో రాష్ట్రం ముందంజలో ఉందని సేవా రంగంలో తగిన వృద్ధి కనిపించడంలేదని అన్నారు. గడిచిన 4 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా వృద్ధిరేటులో రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉందన్నారు. ఏడు జిల్లాలకు కేటాయించిన రూ.350 కోట్లను కేంద్రం తిరిగి వెనక్కు తీసుకుందని రిజర్వు బ్యాంక్‌ను తన చేతిలో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. అభివృద్ధి గురించి తెలుసుకోకుండా లెఫ్ట్ పార్టీలు ఛార్జిషీటు విడుదల చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. వైకాపా ఎంపీల రాజీనామాలను స్పీకర్ ఆమోదించినా ఎన్నికలు వచ్చే పరిస్థితులు లేవన్నారు.

సెల్‌ఫోన్ తయారీదారుల సమస్యలను పరిష్కరిస్తాం: యనమల

ఈనాడు డిజిటల్, అమరావతి: చరవాణి తయారీ సంస్థలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యనమల రామకృష్ణుడు వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఇండియన్ సెల్యూలర్ అసోసియేషన్ ఎపెక్స్ కమిటీ సభ్యులు మంత్రితో సమావేశమై జీఎస్టీ వల్ల పడుతున్న ఆర్థిక భారం గురించి ఆందోళన వ్యక్తం చేశారు. రూ.1,200 నుంచి రూ.50 వేల విలువ కలిగిన చరవాణి వరకు ఒకే విధమైన జీఎస్టీ విధిస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ అమలులో వెసులబాటు కల్పించాలని వారు మంత్రిని కోరారు. ఈ సమావేశం అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ సీజీఎస్టీపై ఉన్న అభ్యంతరాలను జీఎస్టీ మండలి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మొబైల్ తయారీ సంస్థల ఏర్పాటుకు ముందుకొచ్చేవారికి రాయితీలు ఇస్తున్నామని చెప్పారు.

యనమలతో సమావేశమైన ఎపెక్స్ కమిటీ జాతీయ అధ్యక్షుడు మోహిందర్ నేతృత్వంలోని బృందం

భక్తుల మనోభావాలు దెబ్బతీయెుద్దు

రమణ దీక్షితులుకు తితిదే అధ్యక్షుడి హితవు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదేపై, ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ రమణ దీక్షితులు ప్రధాన అర్చకులుగా ఉన్న గౌరవాన్ని పోగొట్టుకుంటున్నారని, భక్తుల మనోభావాలు దెబ్బతీయెద్దని తితిదే ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పుట్టా సుధాకర యాదవ్ హితవు పలికారు. తిరుమలలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రమణ దీక్షితులు చెన్నై, దిల్లీ, హైదరాబాద్‌లో విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ.. రాజకీయ నాయకుడిలా ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, వైకాపా అధ్యక్షుడు జగన్‌ను కలవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అక్రమాలు జరిగి ఉంటే దేవస్థానం ధర్మకర్తల మండలి దృష్టికి తీసుకురావాలని, మీ ఎదుటే విచారణ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. శ్రీవారి ఆభరణాలను ప్రదర్శించాలని ధర్మకర్తల మండలి తీర్మానం చేసిందని, ఆగమ సలహా మండలి అనుమతి రాగానే తగిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.

భాజపా కుట్రలో పావులా మారారు: బ్రాహ్మణ కార్పొరేషన్

విజయవాడ, న్యూస్‌టుడే: తితిదే మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు భాజపా కుట్రలో పావులా మారారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య ఆరోపించారు. శుక్రవారం తెదేపా జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైకాపా అధ్యక్షుడు జగన్‌ని, చెన్నైలో భాజపా నాయకులను ఎందుకు కలిసిందీ ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. తితిదేలో అవినీతి జరిగినట్లుగా ఆరోపిస్తున్న వైకాపా నాయకుడు కరుణాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా వ్యవహరించిన కాలంలో ఎంత బంగారాన్ని కరిగించిందీ చెప్పాలన్నారు. చిత్తూరులో 13 ఎకరాల భూమిని ఆయన ఏవిధంగా కొనుగోలు చేశారని ప్రశ్నిస్తూ.. పింక్ డైమండ్ రిజిస్టర్‌లో లేదని తెలిసి కూడా ఆరోపణలు చేస్తుండడంలో ఆంతర్యం ఏంటని నిలదీశారు.

రాజకీయ ఒత్తిడితోనే సీపీఎస్ రద్దు

- ఏపీ ఎన్‌జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు
- ఉద్యోగుల కోసం పోరాడేవారికే ఓటు వేయండని సూచన

కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్‌బాబు

ఈనాడు డిజిటల్, విజయవాడ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం ఉద్యోగులంతా కలిసి ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలని ఏపీఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు పిలుపునిచ్చారు. విజయవాడ ధర్నాచౌక్‌లో శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. పీఆర్సీ, బకాయిల విషయంలో సంతకాలు పూర్తయ్యాయన్నారు. దేశవ్యాప్త సమ్మెలోకి వెళ్తే తప్ప ఉద్యోగుల సీపీఎస్ విధానం రద్దు కాదన్న ఆలోచనలో ఉన్నామని, దీనిపై జులైలో నిర్ణయం ప్రకటిస్తామన్నారు. 2004లో సీపీఎస్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి దాన్ని వ్యతిరేకిస్తున్నది కమ్యూనిస్టు పార్టీ అని, ఉద్యోగుల కోసం పోరాడే వారెవరో గుర్తించి వారికే ఓటు వేయాలని సూచించారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ కమిషనర్, మరో ఇద్దరిపై కేసు

విజయవాడ, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధ, అసిస్టెంట్ కమిషనర్ పుష్పవర్ధన్, సూపర్‌వైజర్ సాయిలపై కోర్టు ఉత్తర్వులు మేరకు కేసు నమోదు చేసినట్లు విజయవాడ వన్‌టౌన్ సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో స్పాట్ ఫొటోలు తీసే గుత్తేదారు యర్రబోయన వెంకటేశ్వరరావు వారిపై కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారన్నారు. ఈ ఏడాది జనవరి 22న వెంకటేశ్వరరావు నూతన రాజగోపురం వద్ద తన అనుచరులతో ఫొటోల విషయం మాట్లాడుతుండగా అప్పటి అసిస్టెంట్ కమిషనర్ పుష్పవర్ధన్, సూపర్‌వైజర్ సాయి స్పాట్ ఫొటోలకు వినియోగించే ప్రింటర్లు, కెమెరాలు లాక్కొని దౌర్జన్యంగా పంపించి వేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి దుర్గగుడి ఇన్‌ఛార్జి ఈవో అనూరాధ(ప్రస్తుత దేవాదాయశాఖ కమిషనర్) ఆదేశాల మేరకు ఉద్దేశపూర్వకంగానే వారు అలా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు.

44 వేల మంది ఒంటరి మహిళలకు పింఛన్లు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రభుత్వం ఏ తోడు లేని ఒంటరి మహిళల(వితంతువులు కాకుండా)కు జులై నుంచి నెల నెలా రూ.1000 చొప్పున పింఛను ఇవ్వనుంది. నెల్లూరు జిల్లా తాళ్వాయిగూడెంలో నిర్వహించిన గ్రామదర్శినిలో ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. భర్త నుంచి విడాకులు తీసుకున్న, భర్త వదిలేసిన 35 ఏళ్లు పైబడిన మహిళలు, పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు పింఛన్లు ఇవ్వనున్నారు. ప్రజాసాధికార సర్వే ద్వారా ఈ మూడు వర్గాలకు చెందిన వారు 44,477 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ జులై నుంచి పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా ఉన్న మహిళలకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికైతే 30 ఏళ్ల నుంచి, పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికైతే 35 ఏళ్ల వయస్సు నుంచి ప్రభుత్వ సాయాన్ని అందించనున్నారు. భర్త నుంచి విడిపోయి ఏడాది నుంచి దూరంగా జీవిస్తున్న మహిళలకే వర్తించేలా నిబంధనల్లో పొందుపరిచారు. వీరు భర్త నుంచి విడిపోయి జీవిస్తున్నట్లు ధ్రువీకరణపత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ధ్రువీకరణ ఏదీ లేకపోతే సంబంధిత మండల తహసీల్దారు స్థానికంగా విచారించి నిర్ధరించిన అనంతరం పింఛను ఇవ్వనున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో 200 గుండె శస్త్రచికిత్సలు పూర్తి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యాలయంలోని కార్డియోథొరాసిక్ విభాగంలో శుక్రవారం 200వ గుండె శస్త్రచికిత్స పూర్తిచేశారు. ఆ విభాగం అధిపతి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ. . 2016 సెప్టెంబరు 22న నంది కొట్కూరుకు చెందిన సాజీదాబీకి తొలిసారి గుండె శస్త్రచికిత్స చేశామని తెలిపారు. 2018 జూన్ ఏడో తేదీన బాలపుల్లయ్యకు చికిత్స చేయడంతో 200 శస్త్రచికిత్సలు పూర్తయ్యాయని తెలిపారు.

అమిత్‌షా ఏజెంట్‌లా రమణ దీక్షితులు: సాయినాథ్‌శర్మ

కమలాపురం, న్యూస్‌టుడే: రమణ దీక్షితులు భాజపా నేత అమిత్‌షాకు బ్రోకర్‌గా, ఏజెంట్‌గా మారారని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీభట్ల సాయినాథ్‌శర్మ ధ్వజమెత్తారు. తితిదే ప్రతిష్ఠను దెబ్బతీసి కేంద్రానికి అప్పజెప్పే కుట్రలో భాగంగానే బ్రోకర్‌గా వ్యవహరిస్తున్న దీక్షితులపై అటు తితిదే, ఇటు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం ఆయన కడప జిల్లా కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపా అధినేత జగన్ వద్దకు వెళ్లడం ఆయన నీచసంస్కృతికి నిదర్శనమన్నారు. బ్రాహ్మణ సంఘాలు ఆయన్ను వెలివేసే పరిస్థితులున్నాయన్నారు.

జగన్‌ని కలవడం మహాపచారం: శ్రీధర్‌శర్మ

నెహ్రూనగర్(గుంటూరు), న్యూస్‌టుడే: రమణ దీక్షితులు జగన్‌ను కలవడమంటే వేంకటేశ్వరస్వామికి మహాపచారం చేసినట్లేనని తెదేపా బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కోకన్వీనర్ శిరిపురపు శ్రీధర్ శర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన అర్చకుడిగా బాధ్యతలు నిర్వహించి స్వామివారిని స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్నారన్నారు.

చైనా- పాక్ కారిడార్‌పై సమీక్షించలేదు

రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

ఈనాడు డిజిటల్, చెన్నై: చైనా-పాక్ కారిడార్ విషయంలో భారత్ స్పందనపై సమీక్షించలేదని, ఆ రెండు దేశాల సంబంధాలను దృష్టిలో పెట్టుకుని చైనాతో మన సంబంధాలను చూడలేమని రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. చెన్నైలో శుక్రవారం 'చెన్నై సెంటర్ ఫర్ చైనా స్టడీస్' పదో వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీపీఈసీ ప్రాజెక్టు, దీనికి సంబంధించి ఆర్థికపరమైన అంశాలపై కేంద్రం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు.

ముస్లిం ఉపాధ్యాయులకు 12న ఐచ్ఛిక సెలవు

ఈనాడు, అమరావతి: ఈ నెల 12న పెద్దరాత్రి పండుగ సందర్భంగా ముస్లిం ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఐచ్ఛిక సెలవు ప్రకటించింది. ఈ మేరకు కమిషనర్ ఉత్తర్వులిచ్చారు.

దోపిడీ చేస్తున్న జన్మభూమి కమిటీలు

- తెదేపా కార్యకర్తలకే రుణాలు
- ప్రత్యేక హోదా ఉద్యమాన్ని నీరుగార్చారు
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శలు

ఎలమంచిలి, పాయకరావుపేట, తుని, న్యూస్‌టుడే: బతికున్నప్పుడు అన్నం పెట్టనివారు, చనిపోయాక పిండం పెడితే వారి ఆత్మకు శాంతి కలుగుతుందా? అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజమహేంద్రవరం పుష్కరాలకు రూ.రెండు వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. పుష్కరాలు చంద్రబాబు స్వార్థం కోసమే పనికి వచ్చాయని దుయ్యబట్టారు. విశాఖ జిల్లాలోని ఎలమంచిలి, పాయకరావుపేటలలో శుక్రవారం ఆయన జనసేన పోరాట యాత్ర నిర్వహించారు. జన్మభూమి కమిటీలు దగుల్బాజీ కమిటీలుగా మారాయని, ఇవి ప్రజలను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. తెదేపా జెండా పట్టుకుంటేనే బీసీ కార్పొరేషన్ రుణాలిస్తామని బెదిరిస్తున్నారని విమర్శించారు. ఆ కమిటీలను తరిమికొట్టాలని యువతకు పిలుపునిచ్చారు. లోకేష్‌కు ఐటీ మంత్రి పదవి ఇస్తే యువత అందరికీ ఉద్యోగాలు వచ్చేసినట్లేనని చంద్రబాబు భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. 2019లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సీపీఎస్ విధానం రద్దు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటే తక్షణమే రద్దు చేస్తామని, కేంద్రం చేతుల్లో ఉంటే శాసనసభలో తీర్మానించి పంపుతామని వివరించారు.

పాయకరావుపేటలో శివ భార్యకు చెక్కు అందజేస్తున్న పవన్
★ నాగరాజు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జనసేన అధినేత

రాజ్యాంగాన్ని గౌరవించని భాజపా

భాజపా ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకే ఉమ్మడి రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిందని పవన్‌కల్యాణ్ ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించకుండా ప్రత్యేక హోదాను విస్మరించారని ఆరోపించారు. తాను కాకినాడ, తిరుపతి, అనంతపురం సభలలో ప్రత్యేక హోదాపై నిలదీస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం లేదని, ప్రత్యేక ప్యాకేజీ బాగుంటుందంటూ అప్పట్లో సీఎం భాజపాకు మద్దతుగా మాట్లాడారని అన్నారు. తాను నిలదీసే వరకూ చంద్రబాబుకు ప్రత్యేక హోదా గుర్తుకు రాలేదన్నారు. కేంద్రంతో పోరాడదామని ఎన్నిసార్లు చెప్పినా చంద్రబాబు నీరుగార్చడంతో విసిగిపోయానని అన్నారు. ఈ మూడున్నరేళ్లలో చంద్రబాబు 36 సార్లు మాట మార్చారని విమర్శించారు.

అండగా నేనుంటా

పవన్ రాక సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి పాయకరావుపేటలో భారీ ఫ్లెక్సీ ఏర్పాటుచేస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందిన అభిమానుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని పవన్ హామీనిచ్చారు. మృతులు భీమవరపు శివ, నాగరాజు కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రవాస భారతీయులు ముద్రగడ కిషోర్, పి.చంద్ర, బి.గోపి తదితరులు పార్టీ తరపున ఇచ్చిన రూ.మూడు లక్షల చెక్కును బాధిత కుటుంబీకులకు అందజేశారు. మృతుడు శివ రెండు నెలల కుమారుడికి అనిరుధ్‌గా పేరుపెట్టారు. బాబు చదువు బాధ్యతను తీసుకుంటానని హామీనిచ్చారు. నాగరాజు ముగ్గురు మగ పిల్లల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. రూ. 3 లక్షల చెక్కును అందజేశారు. నాగరాజు చిన్న కుమారుడికి గౌరీశంకర్ అని పేరుపెట్టారు. కుటుంబ కష్టాలకు చలించిన పవన్ కంటతడి పెట్టారు.

సిరియాలో వైమానికదాడుల్లో 44 మంది పౌరులు మృతి

బీరుట్: సిరియాలోని వాయువ్య ప్రాంతంలో జరిగిన వైమానిక దాడుల్లో 44 మంది పౌరులు మృతిచెందినట్లు సిరియా మానవ హక్కుల పరిశీలక సంస్థ తెలిపింది. రష్యాకు చెందిన యుద్ధ విమానాలు వీటిని జరిపి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది.

కర్ణాటకలో బుజ్జగింపులకు కాంగ్రెస్ వ్యూహం

- మూడేళ్ల తరువాత మంత్రుల మార్పునకు అధిష్ఠానం నిర్ణయం!
- ఎట్టకేలకు మంత్రులకు శాఖల కేటాయింపు
- కూటమిగానే అసంతృప్త నేతలు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటకలో కుమారస్వామి మంత్రివర్గంలో స్థానం దక్కించుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ పార్టీలో ఎగసిపడుతున్న అసమ్మతిని చల్లార్చేందుకు ఆ పార్టీ అధిష్ఠానం నడుం కట్టింది. దీని కోసం ఒక ప్రత్యేక సూత్రాన్ని పార్టీ నాయకత్వం తయారుచేసిందని కేపీసీసీ వర్గాలు తెలిపాయి. మూడేళ్ల తరువాత ప్రస్తుత అసమ్మతీయుల్లో అర్హులకు పదవులు లభిస్తాయి. ఇప్పుడు అమాత్యులుగా ఉన్న వారి పనితీరును ఆరు నెలలకోసారి మూల్యాంకనం చేస్తారు. వారి పనితీరు సంతృప్తికరంగా లేకపోతే పదవి వీడాల్సి వస్తుంది. కాంగ్రెస్ తరఫున మంత్రులకూ ఇదే వర్తిస్తుందని కేపీసీసీ నాయకులు తెలిపారు.

27మంది మంత్రులకు శాఖల కేటాయింపు: రెండు రోజుల కసరత్తు అనంతరం శుక్రవారం మొత్తం 27 మంది మంత్రులకు శాఖలను కేటాయిస్తూ జాబితాను ముఖ్యమంత్రి కార్యాలయం రాజ్‌భవన్‌కు పంపింది. ఆయన ఆమోదించినట్లు రాత్రి ఎనిమిదింటి సమయంలో ప్రకటన వెలువడింది.



కాంగ్రెస్ అసమ్మతి నేత ఎంబీ పాటిల్‌తో చర్చించేందుకు వచ్చిన కుమారస్వామి

బుజ్జగింపులు

మంత్రి పదవుల కోసం కాంగ్రెస్‌లో అసమ్మతి కొనసాగుతూనే ఉంది. దళపతి దేవేగౌడ సలహా మేరకు ముఖ్యమంత్రి కుమారస్వామి బరిలోకి దిగినా నిష్ప్రయోజనమైంది. తమకు జరిగిన అన్యాయంపై నేరుగా దిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధినాయకత్వానికి వివరించనున్నట్లు అసమ్మతి ప్రముఖుడు ఒకరు తెలిపారు. 'మేము కాంగ్రెస్‌ను వదిలి మరో రాజకీయ పక్షంలో చేరం. అలాగని ఊరుకోబోం. సంకీర్ణ సర్కారుకు కంటిపై కునుకు లేకుండా చేస్తామ'ని అసమ్మతీయుల్లో పలువురు నేతలు హెచ్చరించారు. తన వెంట పాతిక కంటే ఎక్కువ మంది శాసనసభ్యులు ఉన్నారని, అందరం కలిసి తుది నిర్ణయం తీసుకుంటామని ఎం.బి.పాటిల్ పేర్కొనటం కాంగ్రెస్, జేడీఎస్ శిబిరాల్లో కలకలం సృష్టించింది. ఉపముఖ్యమంత్రి పరమేశ్వర్ సహా మంత్రులు శివకుమార్, జార్జి, దేశ్‌పాండేలు ఎం.బి.పాటిల్‌ను బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 'ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టి లోక్‌సభలో ఎక్కువ స్థానాల్లో గెలిచేందుకు కృషి చేయండి. అనంతరం మంత్రిగా నియమిస్తామ'ని పరమేశ్వర్ ఇచ్చిన సలహాతో కూడిన భరోసానూ తోసిపుచ్చారు. 'కాంగ్రెస్‌లో అసమ్మతి నివారణ నా బాధ్యత కాదు. సంకీర్ణ సర్కారు భాగస్వామిగా కర్తవ్యమిది. అందుకే చర్చలు జరిపాను' అని కుమారస్వామి పేర్కొన్నారు.

అసమ్మతీయులు వీరే..

మంత్రి పదవి కోసం నాయకత్వంపై ఆగ్రహించిన వారిలో ఎం.బి.పాటిల్, హెచ్.కె.పాటిల్, బి.సి.పాటిల్, సంగమేశ్, సతీశ్ జార్ఖిహొళి, తుకారాం, రఘుమూర్తి, మునియప్ప, హ్యారీస్, బి.నాగేంద్ర, శివళ్లి, డాక్టర్ సుధాకర్, భీమానాయక్, బి.నారాయణ, ఈశ్వర్‌ఖండ్రే, ఎం.బి.టి.నాగరాజులు తమ అసమ్మతిని బహిరంగంగా వ్యక్తపరిచారు. ఇంతకంటే ఎక్కువ మంది పరోక్షంగా నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారు. లింగాయత, వీరశైవ సామాజిక వర్గానికి చెందిన నేతలు రెండు, మూడు రోజుల్లో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నారు.

మామూలు విద్యార్థులు,
మా వద్ద LONGTERM లో
NEET-2018 లో
546 530 526 525 520 506
వంటి మార్కులతో అన్ని క్యాటగిరిలలో కలిపి దాదాపు
62% మంది MBBS మరియు
BDS లలో అర్హత సాధించినవారు
★ఫలితాలను ఆఫీసులో పొందవచ్చును★
LONGTERM NEET-2019
BATCHES FROM 14-06-2018
VENKATREDDY
MEDICAL ACADEMY
Himayathnagar, Street No.14, Hyderabad.
✆ 9618032609, 7893293954

భారత్ నిపుణ ముద్ర వేసేదెన్నడు?

ఐక్యరాజ్య సమితి గతంలో తీర్మానించినట్లు- యువత సాధికారతను, ఆత్మగౌరవాన్ని పెంపొందింపజేయడంలో నైపుణ్యాభివృద్ధి పాత్ర ఎనలేనిది. అందుకోసమేనంటూ దేశంలో 22 మంత్రిత్వ శాఖలు, విభాగాల తోడ్పాటుతో నైపుణ్య భారత్ మిషన్ ఆరంభించినా ఉపాధి కల్పన పెద్దగా ఊపందుకోలేదన్న విమర్శల నేపథ్యంలో, కేంద్రం కొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది! 'స్కిల్ ఇండియా మిషన్' కింద 2015 జులైలో 'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన'ను మోదీ ప్రభుత్వం పట్టాలకు ఎక్కించింది. తొలి రెండేళ్లలో రూపుదిద్దుకొన్న 450కి పైగా ప్రధానమంత్రి కౌశల్ కేంద్రాల సంఖ్య 2018 మార్చినెలలోగా ఏడువందలకు విస్తరించనుందంటున్నా, వాటి పనిపోకడలపై విమర్శల ముసురు తగ్గడంలేదు. 'వికాస్ యోజన' కింద 50 లక్షలు, ఇతరత్రా పథకాలన్నీ కలగలిపి మొత్తం 'స్కిల్ ఇండియా' పద్దులో మూడేళ్లుగా రెండున్నర కోట్లమందికి శిక్షణ గరపినట్లు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లెక్క చెబుతున్నారు. మొన్న నవంబరు నాటికి 'వికాస్ యోజన' శిక్షణ పొంది కొలువుల్లో కుదురుకున్నవారి సంఖ్య ఆరు లక్షల లోపేనన్న విశ్లేషణలు, నైపుణ్య భారత్ మౌలిక లక్ష్యాలనే ప్రశ్నిస్తున్నాయి. శిక్షణ పొంది నిరుద్యోగులుగానే మిగిలిన లక్షల మందికి ముద్రా యోజన కింద సొంత వ్యాపారం ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం రుణ వితరణ చేపడతామంటోంది! మోదీ 'మానస పుత్రిక'గా ప్రతీతమైన ముద్రా యోజనకు నాలుగు నెలల క్రితం కేంద్ర బడ్జెట్లో మూడు లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. ఇప్పటిదాకా ముద్రా యోజన లబ్ధిదారులు 12 కోట్ల మందిలో 28 శాతం ఔత్సాహిక పారిశ్రామికులేనంటున్న కేంద్రం నైపుణ్య శిక్షణ పొందిన ఎన్నో లక్షల మందికి అదే వరసలో లబ్ధి చేకూరగలదని విశ్వాసం వ్యక్తీకరిస్తోంది. 2022 సంవత్సరం నాటికి 50 కోట్లమందిని నిపుణ శ్రామికులుగా అవతరింపజేస్తామన్న 'స్కిల్ ఇండియా' నీరోడుతుండగా, శిక్షణ పొందినవారూ పెద్దయెత్తున నిరుద్యోగులుగా మిగలడం- తక్షణ దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను ఉద్బోధిస్తోంది.

పదును తేలినప్పుడే కత్తికి విలువ. నైపుణ్యాలు ఒంటపడితేనే మానవ వనరుల జీవికకు సరైన భరోసా. ఈ వాస్తవిక అవగాహన కొరవడ్డ పర్యవసానంగా- బట్టీయ చదువులతో దశాబ్దాలుగా దేశం ఎంతగానో నష్టపోయింది. పిల్లల సహజసిద్ధ ప్రతిభను వెలికితీసి సృజనాత్మక విద్యాభ్యాసానికి, నిర్మాణాత్మక వృత్తిపర బాధ్యతలకు అనుగుణమైన శిక్షణ ప్రదానానికి ప్రాధాన్యమిచ్చిన దేశాలు మనకన్నా యోజనాల దూరం ముందున్నాయి. దక్షిణ కొరియా 96 శాతం దాకా యువతను నిపుణ శ్రామికులుగా తీర్చిదిద్దుతోంది. నాణ్యమైన విద్యకు మేలిమి నైపుణ్యాలు జతకూర్చి సమధికంగా మానవ పెట్టుబడులు సమకూర్చుకోవడంలో నార్వే, ఫిన్లాండ్, స్విట్జర్లాండ్, డెన్మార్క్, జర్మనీ, న్యూజిలాండ్ ప్రభృత దేశాలు పోటీపడుతున్నాయి. అందుకు విరుద్ధంగా ఇక్కడ వారసత్వంగా సేద్య, చేతివృత్తుల మెళకువలు నేర్చుకుంటున్నవారు, వృత్తివిద్యా శిక్షణ పొందుతున్నవారి మొత్తం సంఖ్య జనాభాలో పదోవంతైనా లేదు. ఏటా ఇంజినీరింగ్ పట్టాలు పుచ్చుకొంటున్న పదిహేను లక్షల మందిలో 60 శాతం దాకా నిరుద్యోగులుగానే మిగులుతున్నారు. దేశవ్యాప్తంగా సగంమందికి పైగా పట్టభద్రులు, స్నాతకోత్తర పట్టభద్రులు సరైన ఉపాధికి నోచక కుములుతున్నట్లు గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. పరిస్థితిని చక్కదిద్దడంలో భాగంగా కౌశల్ వికాస్ యోజన ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో నిపుణ పట్టభద్రుల్ని అవతరింపజేస్తామన్న కేంద్రం అమలులో చతికిలపడింది. కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్)తో పాటు శారదా ప్రసాద్ కమిటీ నివేదికాంశాలు శిక్షణ గతిరీతుల్ని, ఫలితాల శాతాన్ని సూటిగా ప్రశ్నించాయి. బతుకుతెరువుకు భరోసా కల్పించడంలో నైపుణ్య శిక్షణ వైఫల్యాల్ని కేంద్రమే పరోక్షంగా అంగీకరిస్తున్న దృష్ట్యా- విధివిధానాల పునస్సమీక్షలో, కార్యాచరణను సరిదిద్దుకోవడంలో ఇక ఎంతమాత్రం జాప్యం పనికిరాదు!

సమకాలీన ప్రపంచంలో మరే దేశానికీ లేనంత యువత భారత్‌కున్నా, ఆ సహజ బలిమిని కలిమిగా మలచుకోవడంలో మందకొడితనం ఆందోళనపరుస్తోంది. పొరుగున చైనా, అగ్రరాజ్యం అమెరికా సహా పలు పాశ్చాత్య దేశాల్లో వయసుమీరిన జనాభా పోగుపడుతుండగా- జనసంఖ్యలో 65 శాతం దాకా 35 ఏళ్లలోపువారితో ఇండియా 'ప్రత్యేకత' చాటుకుంటోంది. అయితేనేం, నైపుణ్యాల కొరత ప్రగతి రథ ప్రస్థానాన్ని కుంగదీస్తోంది. పారిశ్రామిక, సేవారంగాల్లో దక్షిణ కొరియా పాతికేళ్లలో 41 నుంచి 81 శాతానికి పైగా ఉపాధి వృద్ధి నమోదు చేయడానికి ప్రధాన కారణం- వృత్తినైపుణ్యాలు దండిగా ఉన్న కార్మికశక్తే. భారతీయ కార్మికులతో పోలిస్తే ఉత్పాదక శక్తిలో జర్మనీ నాలుగింతలు, తైవాన్ అయిదు, అమెరికా ఆరు, సింగపూర్ పది రెట్ల మేర రికార్డులు నెలకొల్పడానికి బలం- నైపుణ్యాభివృద్ధి ప్రణాళికలే. ఇక్కడా శ్రామికశక్తికి నైపుణ్యాల నగిషీతోనే ఉపాధి విస్తరణలో సృజన వ్యూహాలు రెక్కలు విచ్చుకోగలిగేది. అధునాతన సాంకేతిక విప్లవం, కృత్రిమ మేధకు ఇనుమడిస్తున్న ప్రాధాన్యం, విశ్వవ్యాప్తంగా శీఘ్ర నగరీకరణ, ప్రజానీకం ఆదాయ వ్యయాల్లో జీవనశైలిలో విశేష మార్పుల మూలాన- ఉద్యోగావకాశాల స్వరూప స్వభావాలు, రంగాలవారీగా అవసరాలు భారీ పరివర్తనకు లోనవుతున్నాయి. వచ్చే నాలుగేళ్లలో రిటైల్ రంగాన అయిదు కోట్లు, సౌందర్య స్వాస్థ్య రంగాల్లో కోటీ 42 లక్షలు, టెలికాం రంగాన 21 లక్షల మేర కొత్తగా పుట్టుకొస్తాయంటున్న అదనపు అవకాశాల్ని ఒడుపుగా అందిపుచ్చుకొనేలా నిపుణ మానవ వనరుల సృజన ప్రణాళికాబద్ధంగా ఊపందుకోవాలి. ఎప్పటికి ఎక్కడ ఎంతమంది ఆవశ్యకమో రంగాలవారీగా మదింపు వేసి అందుకు తగ్గట్లు విద్యాలయాల్ని, పరిశ్రమల్ని అనుసంధానిస్తే భారతీయ యువత ఉత్పాదకత ఇనుమడిస్తుంది. మానవ వనరుల గరిష్ఠ సద్వినియోగం దేశాన్ని సమున్నత ప్రగతి కక్ష్యలో ప్రవేశపెడుతుంది!



ఏదైనా రాజకీయ పార్టీనుంచి లేదా పార్టీల సంకీర్ణంనుంచి ఒక్కొక్కరుగా గాని లేదా బృందంగా గాని బయటకు వెళ్ళిపోవాలనుకునే సభ్యులు తొలుత తమ ఎంఎల్ఏ, ఎంపీ సభ్యత్వాలకు కచ్చితంగా రాజీనామా చేసి, తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలి.

– జస్టిస్ వెంకటాచలయ్య కమిటీ

పార్టీలు ఏర్పాటు చేసుకొనే సంకీర్ణాలకు ఆమోద యోగ్యత రావాలంటే- వివిధ అంశాలపై అవి స్థూలంగా ఏకాభిప్రాయానికి వచ్చి కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ప్రకటించాలి. ఎన్నికలకు ముందుగాని లేదా ఫలితాలు వెలువడిన తరవాత ప్రభుత్వ ఏర్పాటుకు ముందుగాని పార్టీల కూటములు ఈ తరహా కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ప్రకటించవచ్చు. – వీరప్ప మొయిలీ కమిషన్

అవకాశవాద పొత్తులపై అంకుశం

ఎ.సూర్యప్రకాశ్

దేశంలో రోజురోజుకూ రాజకీయం దారి మారుతోంది. ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించిన నాయకులు జనానికి కట్టుబాటు చాటుతున్నారా అన్న ప్రశ్నకు అనేక సందర్భాల్లో నిరాశ కలిగించే సమాధానమే ఎదురవుతోంది. జనాభిప్రాయం ఒకరకంగా ఉంటే పైయెత్తున ప్రభుత్వాలు మరో రకంగా ఏర్పాటవుతున్న ఉదాహరణలూ కొంతకాలంగా పోటెత్తుతున్నాయి. కర్ణాటక ఎన్నికల్లో జనం వెలువరించిన సంకీర్ణ తీర్పు నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలు ఆలోచనలు రేకెత్తించాయి. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన పార్టీలు చేతులు కలిపి ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఈ ఘటన ప్రభుత్వాల ఏర్పాటు, పార్టీల వేర్పాట్లకు సంబంధించి ప్రస్తుతం అమలవుతున్న చట్టాలకు మరింత పదును పెట్టుకోవాల్సిన అవసరాన్నే సూచిస్తోంది. ఎన్నికలకు ముందు రాజకీయ పక్షాల మధ్య కుదిరిన పొత్తులకు చట్టబద్ధత కల్పిస్తూనో; ఫలితాలు వెలువడిన తరవాత అవసరార్థం ఒక్క దరిచేరే అవకాశవాద పొత్తులను చట్టవిరుద్ధంగా తీర్మానిస్తూనో ప్రభుత్వం ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది. ప్రజాతీర్పులకు పూర్తి విరుద్ధమైన పద్ధతిలో పైయెత్తున చోటుచేసుకొనే ప్రభుత్వాల ఏర్పాటును కట్టడి చేయాలంటే గట్టి చట్టం తప్పనిసరి!

రాజకీయ విషబీజం

శాసనసభ్యులను సంతలో సరకుల్ని కొన్నట్లుగా బహిరంగంగా కొని ప్రభుత్వాలను నిలబెట్టిన లేదా పడగొట్టిన ఉదాహరణలకు దేశచరిత్రలో కొదవ లేదు. కానీ ఆ రోజులు పోయాయి. స్వాతంత్ర్యానంతరం అటుఇటుగా రెండు దశాబ్దాలకే కాంగ్రెస్ పార్టీ పేరుప్రతిష్ఠలు మసకబారడం ప్రారంభమైంది. ఆరో దశకం మధ్యకాలం నాటికి సభ్యులు ఒక పార్టీనుంచి మరొక పార్టీలోకి దూకడం సాధారణ విషయంగా మారిపోయింది. మరీ ముఖ్యంగా దేశంలోని కొన్ని ఉత్తర, మధ్య ప్రాంత రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభ కొడిగట్టడంతో- ఆ పార్టీకి చెందిన సభ్యులు ఇతర రాజకీయ పక్షాల్లోకి మారడం ఉద్ధృతమైంది. జాతి నెత్తిన ఆత్యయిక పరిస్థితిని రుద్ది పరువుమాసిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా- మిగిలిన రాజకీయ పక్షాలు ఒక్కతాటిమీదకు రావడంతో ఏడో దశకం మలినాళ్లలో మొట్టమొదటి సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పాటైంది. కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వకుండా అడ్డుకోవడమే పరమ లక్ష్యంగా పార్టీలన్నీ ఆనాడు చేతులు కలిపాయి. ఆ తరవాత వివిధ సందర్భాల్లో సైద్ధాంతిక సారూప్యత లేకపోయినా, కాంగ్రెస్ వ్యతిరేకతే ఉమ్మడి లక్ష్యంగా రాష్ట్రాల్లోనూ పార్టీలు కూటములు కట్టాయి. కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ బలంగా ఉండి, అధికారానికి అలవాటుపడిన కాంగ్రెస్ పార్టీ అత్యంత పెళుసు ప్రాతిపదికలపై ఏర్పడిన ఈ సంకీర్ణాలను చిందరవందర చేసేందుకు అనేక వ్యూహాలు అమలు చేసేది. వివిధ పార్టీల్లోని శాసనసభ్యులను గుండుగుత్తగా కొనుగోలు చేసి సంకీర్ణ ప్రభుత్వాలను కుప్పకూల్చేది. ఏమాత్రం సందు దొరికినా కూలిన సంకీర్ణ శిథిలాలపై నడుచుకుంటూ వెళ్ళి ఆయా రాష్ట్రాల్లో గద్దెనెక్కేందుకే ప్రయత్నించేది.

రాజకీయ గోడదూకుళ్లు, డబ్బుకు లొంగిపోయి ఇష్టానుసారం పార్టీలు మారడం మితిమీరిన తరుణంలో 1985 పార్లమెంటు ఫిరాయింపు నిరోధక చట్టం వచ్చింది. యాభై రెండో రాజ్యాంగ సవరణ ద్వారా ఫిరాయింపు నిరోధక నిబంధనలకు రాజ్యాంగంలోని పదో షెడ్యూలులో స్థానం కల్పించారు. ఏదైనా రాజకీయ పార్టీ గుర్తుపై పోటీ చేసి గెలిచిన సభ్యుడు అక్కడినుంచి ఉన్నపళంగా మరో పక్షంలోకి దూకేయకుండా చట్టబద్ధ నియంత్రణలు తీసుకువచ్చారు. ఏదైనా పార్టీకి చెందిన మూడింట ఒకవంతు సభ్యులు బయటకు వచ్చి మరో పార్టీని ఏర్పాటు చేసుకొనేందుకు ఆ చట్టం వీలు కల్పించింది. అదేవిధంగా ఏదైనా పార్టీలోని మూడింట ఒకవంతు సభ్యులు బయటకు వచ్చి మరో పార్టీలో విలీనం అయ్యేందుకూ ఆ చట్టం వెసులుబాటు ఇచ్చింది. మొదట్లో ఈ చట్టం మంచి ఫలితాలనే కనబరచింది. కనీసం కొంతకాలంపాటు ఫిరాయింపులు, వేర్పాట్లకు విరామం దొరికింది. ఆ తరవాత వివిధ పార్టీలు చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని తమ పని చక్కబెట్టుకోవడం ప్రారంభించాయి. పార్టీల్లో చీలిక ఏర్పడితే మూడింట ఒక వంతు సభ్యులు మరో పక్షంలో కలిసిపోవడానికి వీలు కల్పిస్తూ చట్టంలో ఉన్న నిబంధనను వివిధ పార్టీలు వాటంగా ఉపయోగించుకున్నాయి. ఉదాహరణకు ఏ పార్టీకైనా శాసనసభలో బలనిరూపణకు రెండు సీట్లు తక్కువపడితే ఆ పక్షానికి చెందిన ముఖ్యమంత్రి అభ్యర్థి- ఆరుగురు సభ్యుల పార్టీలో 'చీలిక' తెచ్చి ఇద్దరిని తమ శిబిరంలోకి లాగేసుకోవచ్చు. ఈ లోపాన్ని పరిహరించేందుకు 91వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు మెరుగైన ప్రయత్నం చేసింది. అది 2004నుంచి అమలులోకి వచ్చింది. ఏ పార్టీనుంచైనా మూడింట ఒకవంతు సభ్యులు మరో రాజకీయ పక్షంలోకి చేరిపోవడానికి వీలు కల్పించే నిబంధనను ఈ రాజ్యాంగ సవరణ ద్వారా కొట్టేశారు.



పార్టీలకు దిక్సూచిగా జాతీయ చట్టం

పారని వ్యూహం

91వ రాజ్యాంగ సవరణ ప్రభావం కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో 2008లో యడ్యూరప్పపై పడింది. కర్ణాటక అసెంబ్లీలోని మొత్తం 224 సీట్లకుగాను ఆనాడు భాజపా 110 సీట్లు దక్కించుకొంది. మెజారిటీకి మరో మూడు సీట్ల దూరంలో ఆయన ఆగిపోయారు. ఆ తరుణంలో యడ్యూరప్ప ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులను తనవైపు తిప్పుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం తన స్థానాన్ని మరింత పదిలం చేసుకోవడం కోసం ఆయన 'ఆపరేషన్ కమల'కు తెర తీశారు. కాంగ్రెస్, జేడీ (ఎస్)లకు చెందిన కొందరు శాసనసభ్యులను నానా ప్రయత్నాల ద్వారా ఒప్పించి, వారి చేత పదవులకు రాజీనామా చేయించారు. అనంతరం వారందరికీ భాజపా టికెట్లు ఇచ్చి మళ్ళీ ఉపఎన్నికల బరిలోకి దింపారు. ఆ రకంగా పోటీకి దిగినవారిలో చాలామంది శాసనసభ్యులుగా గెలుపొందడంతో యడ్యూరప్ప స్థానం శాసనసభలో మరింత పదిలమైంది. ఇటీవలి ఎన్నికలు రాజకీయ సమీకరణల ప్రాతిపదికన అందుకు పూర్తిగా భిన్నమైనవి. అసెంబ్లీలో 104 స్థానాలు దక్కించుకున్న భాజపా అధికార పీఠానికి మరో తొమ్మిది సీట్ల దూరంలో నిలిచిపోయింది. పదేళ్ల క్రితం మాదిరి స్వతంత్రులను ఆకర్షించే అవకాశమూ లేదు. ఎందుకంటే సభలో ఉన్నదే ఇరువురు స్వతంత్ర సభ్యులు! వారు అందుబాటులో లేరు కాబట్టి రాజకీయ కోణంలో యడ్యూరప్ప ముందున్న అవకాశం ఒకటే. కాంగ్రెస్, జేడీ(ఎస్)లకు చెందిన శాసనసభ్యులను ఆకర్షించి, వారితో తమ పదవులకు రాజీనామా చేయించి, భాజపా టికెట్‌మీద తిరిగి వారిని బరిలో నిలపడమే ఆయనకు మిగిలిన ఏకైక మార్గం. ఒకవేళ యడ్యూరప్ప ఆ పనిచేస్తే భాజపా పరువు బజారున పడుతుంది. పార్టీ నైతికతపై ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రధాని నరేంద్ర మోదీపై ఉమ్మడిగా విరుచుకుపడేందుకు విపక్షాలకు అస్త్రాలు అందివస్తాయి. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని భాజపా బరినుంచి తప్పుకొంది. కానీ, ఓడిపోయిన రెండు పార్టీలూ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఫలితంగా ప్రజాభీష్టానికి తూట్లు పొడిచాయి.

ఇకనైనా ముందడుగు

ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా ప్రభుత్వాలు ఏర్పడుతున్న సంకీర్ణ యుగమిది. జనం ఆలోచనలతో మమేకమైన రాజకీయ పక్షానికి లేదా పార్టీల కూటమికి మాత్రమే అధికారం దక్కాలంటే అందుకోసం అవసరమైన చట్టబద్ధ మార్పులు చేయాల్సి ఉంటుంది. జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య సారథ్యంలో ఏర్పాటైన రాజ్యాంగ సమీక్షా సంఘం ఈ సమస్యను వివిధ కోణాల్లో అధ్యయనం చేసింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూలుకు మార్పు చేర్పులు సూచించింది. రాజకీయ పార్టీ నుంచి లేదా పార్టీల సంకీర్ణం నుంచి వైదొలగాలనుకునే సభ్యులు తొలుత తమ ఎంఎల్ఏ, ఎంపీ సభ్యత్వాలకు రాజీనామా చేసి, తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలన్న వెంకటాచలయ్య కమిటీ సూచనను ఆమోదించిన ప్రభుత్వం, 91వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీల్లో చీలికలకు అడ్డుకట్ట వేయగలిగింది. అయితే ఎన్నికలకు ముందు పార్టీల మధ్య పొత్తులకు చట్టబద్ధత కల్పించాలన్న 'కమిటీ' సూచన మాత్రం ఇప్పటివరకూ అమలులోకి రాలేదు. వీరప్ప మొయిలీ నేతృత్వంలో ఏర్పాటైన రెండో పాలన సంస్కరణల సంఘం ఈ విషయంలో కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ పార్టీకైనా అధికార స్థాపనకు అవసరమైన సభ్యుల సంఖ్యను సొంతంగా దక్కించుకోవడం కష్టమని, అందువల్లే సంకీర్ణాలు అనివార్యమయ్యాయని పాలన సంస్కరణల సంఘం అభిప్రాయపడింది. సంకీర్ణంగా ఏర్పడి కొంతకాలం కలిసి ప్రయాణం చేశాక, కొన్ని పార్టీలు ఆ జట్టునుంచి బయటకు వచ్చి మరో కూటమి కడుతున్న సందర్భాలు- సంకీర్ణాల ఏర్పాటులోని నైతికతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని వీరప్ప మొయిలీ కమిషన్ అభిప్రాయపడింది. అధికార కాంక్ష తలకెక్కిన పార్టీలు అవకాశవాద పొత్తులకు తెగబడుతూ సంకీర్ణాల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని సడలిస్తున్నాయని స్పష్టం చేసిన రెండో పాలన సంస్కరణల సంఘం నిర్దిష్ట కట్టుబాట్లను ఏర్పరచి ఈ తరహా గోడదూకుడు పోకడలను నియంత్రించాలని సూచించింది. ఎన్నికలకు ముందు రాజకీయ పక్షాలు కూటమిగా ఏర్పడి కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రకటించిన తరవాత ఇక విధానాలకే కట్టుబడి ప్రస్థానం సాగించాలని రెండో పాలన సంస్కరణల సంఘం అభిప్రాయపడింది. ఒకవేళ ఏవైనా పార్టీలు అందుకు భిన్నంగా సంకీర్ణ ధర్మాన్ని తోసిరాజని- బయటి పార్టీలతో అవకాశవాద పొత్తులకు దిగితే ఆ పార్టీల్లోని సభ్యులు తక్షణం రాజీనామా చేసి, ఎన్నికల్లో నిలబడి తిరిగి గెలవాలన్న నిబంధన తేవాలన్న పాలన సంస్కరణల సంఘం సూచన ప్రశంసనీయమైనది. ఎన్నికల సందర్భంగా ఒక దాన్ని మరొకటి తెగ తిట్టుకున్న రాజకీయ పక్షాలు కూడా ఫలితాలు వెలువడ్డాక అవసరాల మేరకు చేతులు కలిపి ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఇది ఒకరకంగా ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించడమే. కాబట్టి పరస్పరం కత్తులు దూసుకున్న పార్టీలు ఎన్నికల ఫలితాల అనంతరం అవకాశవాద పొత్తులకు తెగబడకుండా నియంత్రించే అవకాశాలనూ పరిశీలించాల్సి ఉంది!

(రచయిత- ప్రసారభారతి ఛైర్మన్)

పట్టులేని పాఠశాల విద్య

భారత విద్యావ్యవస్థ లక్ష్యాల సాధన కోసం పరుగులు తీస్తోంది తప్ప నాణ్యమైన విద్యపై దృష్టి పెట్టడం లేదు. ఆ మధ్య బిహార్‌లో రాష్ట్రస్థాయిలో వివిధ తరగతుల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు కనీస పరిజ్ఞానం కొరవడిందని ప్రసార మాధ్యమాలు హోరెత్తించాయి. తెలుగురాష్ట్రాల్లో పది శాతంలోపు ఇంజినీరింగ్ విద్యార్థులు మాత్రమే నైపుణ్యాలు కలిగి ఉన్నారన్న విశ్లేషణలకు కొదవలేదు. మాధ్యమిక విద్యార్థులు మాతృభాషలో సైతం తప్పులు లేకుండా రాయడంలో తడబడుతున్నారని వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయి. దీంతో నష్టనివారణ చర్యలపై దృష్టి సారించిన కేంద్రం ఇటీవల దిల్లీలో రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులతో సమావేశం నిర్వహించింది. వార్షిక పరీక్షల్లో నిర్ణీత మార్కులు రాకపోయినా పై తరగతికి పంపుతున్న (నాన్ డిటెన్షన్) విధానం వల్ల చదువుల్లో నాణ్యత కొరవడుతోందని, దాన్ని తొలగించి విద్యాహక్కు చట్టానికి సవరణలు తేవాలని ఈ సమావేశంలో ప్రతిపాదించారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి తగ్గించే క్రమంలో మూల్యాంకన విధానంలోనూ సవరణలు సూచించింది. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ఏడాదికి 200 పనిదినాలు, 800 పాఠ్యాంశ గంటలు, ఆరు నుంచి ఎనిమిది వరకు 220 పనిదినాలు 1000 పాఠ్యాంశ గంటలు ఉండాలని నిర్దేశించింది. విద్యార్థుల ఇంటి పని (హోమ్ వర్క్) రెండు, మూడు తరగతులకు 800 గంటలు; ఆరు, ఏడు తరగతులకు 1000 గంటలు ఉండగా, ప్రాథమిక, మాధ్యమిక విద్యావిధానంలో ప్రపంచంలోనే ఎంతో ముందున్న ఫిన్లాండ్‌లో రెండు, మూడు తరగతులకు 608 గంటలు, ఆరు ఏడు తరగతులకు 777 గంటలుగా ఉన్నాయి. మన విద్యార్థుల ఇంటిపని గంటలు అధికంగా ఉన్నాయి. దీంతో వారిపై అధికభారం పడుతోంది. ఇందుకోసం చాలామంది తల్లిదండ్రులు ప్రైవేటు తరగతులపై ఆధారపడుతున్నారు. మరికొందరు తమ దైనందిన జీవితంలో కొంత సమయం కేటాయిస్తున్నారు. గ్రామీణ ప్రాంత నిరక్షరాస్య తల్లిదండ్రుల పిల్లల అవస్థ వర్ణనాతీతం. ఫిన్లాండ్‌లో విద్యార్థులకు ప్రతి 45 నిమిషాల పాఠానికి 15 నిమిషాలు విశ్రాంతి ఇస్తారు. అందుకు అనుగుణంగా వారానికి కేవలం 2.45 గంటలు మాత్రమే ఇంటి పనిగా నిర్ధారించారు. ప్రపంచంలో ఏ దేశంతో పోల్చినా ఈ సమయం తక్కువే. ఇదే ఇంటిపని అమెరికాలో ఆరు గంటలుగా ఉంది. అక్కడ ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే సమయం కంటే పాఠ్యప్రణాళిక తయారీకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఫిన్లాండ్, దక్షిణ కొరియా, తైవాన్, హాంకాంగ్‌లలో ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ ఇస్తున్నారు.

వికాసమే ప్రధానం

నిలుపుదల లేకుండా పై తరగతిలోకి ప్రవేశించే విధానాన్ని మూల్యాంకన లేని ఉత్తీర్ణతగా పరిగణించవచ్చు. అంటే విద్యార్థి ప్రావీణ్యతతో సంబంధం లేకుండా పైతరగతికి అనుమతించడమన్న మాట. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత, తప్పనిసరి విద్య అందించాలి. ప్రాథమిక విద్య పూర్తయ్యేంతవరకు ఏ విద్యార్థినీ పై తరగతికి వెళ్లకుండా ఆపరాదు. నిలుపుదలలేని విధానంపై విద్యాహక్కుచట్టం అనేక సూచనలు చేసింది. అందులో ముఖ్యమైంది- నిరంతర సమగ్ర మూల్యాంకన, మార్కుల బదులు గ్రేడ్‌లు కేటాయించడం. ప్రావీణ్యత, సామర్థ్యం, స్థిరత్వం, బృంద పని (టీమ్ వర్క్), వేదికపై మాట్లాడటం, ప్రవర్తన ఆధారంగా వీటిని ఇవ్వాలని సూచించింది. ఇది విద్యార్థి సంపూర్ణ వికాసానికి దోహదపడుతుందని పేర్కొంది.

మూడున్నర దశాబ్దాలపాటు నిలుపుదల లేని విధానం విద్యారంగాన్ని ప్రభావితం చేసింది. అక్షరాస్యత పెరగడం, విద్యార్థి ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్య పూర్తిచేయడంలో ఇది కీలక పాత్ర పోషించింది. మూల్యాంకనంతో సంబంధం లేకుండా పాఠశాల విద్యను పూర్తి చేసినవారు దేశంలో లక్షల మంది ఉన్నారు. జాతీయ, అంతర్జాతీయ లక్ష్యాల మేరకు విద్యార్థుల సంఖ్యను చేర్చడంలో ఈ విధానం సఫలమైంది. అదే సమయంలో విద్యా ప్రమాణాలు క్షీణించసాగాయి. ఆసర్ నివేదిక, రాష్ట్రాల విద్యా పరిశోధన శిక్షణా మండళ్ల నివేదికలు పరిశీలించిన కేంద్రం, కొరవడుతున్న విద్యా ప్రమాణాలపై ఆందోళన చెందింది. విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం కేంద్రం నియమించిన గీతా బుక్కల్ ఉపసంఘం నిలుపుదల (డిటెన్షన్) విధానాన్ని సమర్థించింది.

అధిగమించాల్సిన సవాళ్లు అనేకం

దేశవ్యాప్తంగా ఒకే విద్యావిధానంపై ఈ మధ్యకాలంలో చర్చ ఊపందుకుంది. భిన్న సంస్కృతులు, భాషలు గల దేశంలో ఒకే విద్యా విధానం అంత సులభమైన విషయం కాదు. ఇటీవల రాష్ట్రాల విద్యా మంత్రుల సమావేశం విద్యాహక్కు చట్టాన్ని సవరిస్తూ దేశవ్యాప్తంగా అయిదో తరగతి నుంచి నిలుపుదల విద్యావిధానం ప్రవేశపెట్టాలని కోరింది. అన్ని పాఠశాలల్లో మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిరంతర మూల్యాంకన పద్ధతి కొనసాగించాలని సూచించింది. దీనిపై రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. కొన్ని రాష్ట్రాలు విద్యా ప్రమాణాలు దిగజారుతున్న దృష్ట్యా నిలుపుదల విద్య కోసం తొందరపడుతుండగా, ఈ విధానం వల్ల అర్ధాంతరంగా చదువు మానేసేవారు (డ్రాపౌట్లు) పెరుగుతారని తెలుగురాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ వాదిస్తున్నాయి. ఈ పరిణామాలపై తెలంగాణ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. నిలుపుదల విద్యావిధానంపై విద్యా హక్కుచట్టంలోని సెక్షన్ 16ను సవరించడాన్ని సమావేశం వ్యతిరేకించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేనందువల్ల ఈ విధానం వెనకబడిన వర్గాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని అభిప్రాయపడ్డాయి. రెండు తెలుగు రాష్ట్రాలు దాదాపు ఇదే అభిప్రాయం కలిగిఉన్నాయి. కానీ, విద్యా ప్రమాణాలు మెరుగు పడాలంటే నిలుపుదల విధానం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మార్కులే ప్రతిభకు కొలమానం కాకుండా, విద్యార్థి పూర్తి మనోవికాసంపై పరీక్షపెట్టే విధానం అవసరం.

ఆచితూచి నిర్ణయం

నిలుపుదల లేని విధానం వల్ల విద్యా ప్రమాణాల క్షీణిస్తాయి. దీన్ని గ్రహించనట్లయితే సమాజానికి నష్టం వాటిల్లుతుంది. ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వాల్ని కేంద్రం సహేతుక వాదనతో ఒప్పించాలి. ఆక్సోమ్ నివేదిక ప్రకారం దేశంలో అయిదు లక్షల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఆరున్నర లక్షల మంది ఉపాధ్యాయులకు సరైన శిక్షణ లేదు. మౌలిక సదుపాయాలు లేని పాఠశాలల సంఖ్య పెద్దసంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల, మౌలిక సదుపాయాల కొరత వాటిల్లో చదివే బలహీన వర్గాల విద్యార్థులపై ప్రభావం చూపుతుంది. వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, అరకొర వేతన జీవుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడి ఉన్నారు. సరైన ప్రమాణాలు లేకుండా నిలుపుదల విధానం ప్రవేశపెట్టడంపై ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలి. భిన్న సంస్కృతులు, భాషలు గల దేశంలో 'ఉమ్మడి పాఠ్య ప్రణాళిక' తయారీ సవాలే. ఆ దిశగా విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు పరిశోధన చేయాలి. నిలుపుదల విధానంపై తల్లిదండ్రుల్లో అవగాహన కలిగించాలి. విద్యా ప్రమాణాలు తమ బిడ్డలకు అవసరం లేదని ఏ తల్లితండ్రులూ కోరుకోరు. నిలుపుదల విద్యావిధానం వల్ల ఉపాధ్యాయులకు జవాబుదారీతనం పెరుగుతుంది. విద్యార్థుల నైపుణ్యాలు ఇనుమడిస్తాయి. ఇది సమర్థంగా అమలు జరగాలంటే కేంద్రం ముందుగా కొన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాలి. ఈ విధానంలోని లాభనష్టాలను సమగ్రంగా మదింపు వేసి, అందరిలో అవగాహన కలిగించి, దేశవ్యాప్తంగా అమలుచేస్తే మంచి ఫలితాలు వస్తాయి!

– డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి

(రచయిత- సహాయ ఆచార్యులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

'సూర్యుడు' అనే పదానికి ప్రజలను పనుల కొరకు ప్రేరేపించేవాడని అర్థం. సూర్యుడి వంశంలో జన్మించినవాడు శ్రీరామచంద్రుడు. రాముడి జీవితంలో దుష్టశిక్షణ, ధర్మ సంరక్షణ విధులు సూర్యుడి ప్రేరణతో ముడివడ్డాయి. శత్రుసంహారకాండ మొట్టమొదటగా తాటకతో ఆరంభించాడు రాముడు. దానికి ముందుగా యాగసంరక్షణకై రాముణ్ని తనవెంట తీసుకెళుతూ విశ్వామిత్ర మహర్షి 'పూర్వాసంధ్యా ప్రవర్తతే...' అంటూ సూర్యుడి ప్రస్తావనతోనే రాముణ్ని కర్తవ్యంలోకి మేలుకొల్పాడు.

రాముడి చేతుల్లో చిట్టచివరగా మరణించిన రాక్షస వీరుడు- రావణాసురుడు. రావణ సంహారం నిమిత్తం అగస్త్యమహర్షి 'ఆదిత్యహృదయం'తోనే రాముణ్ని ఉత్తేజితుణ్ని చేశాడని రామాయణం చెబుతోంది. రాముడి అవతార లక్ష్యసాధనలోని తొలి చివరి అంకాలు ఆ విధంగా సూర్యుడి ప్రమేయంతోనే నెరవేరాయి.

సూర్యుణ్ని స్తుతిస్తూ నూటపది పద్యాలతో భాస్కర శతకాన్ని లోకానికి కానుక చేసిన మారన కవి 'సూర్యుడే ఈ కవిత్వానికి ప్రేరణ' అని ప్రకటించాడు. 'మతం అంటూ ఒకదాన్ని నేను ఎంచుకోవలసివస్తే- లోకానికి వెలుగులు పంచే భాస్కరుణ్ని నా దేవుడిగా చెబుతాను' అన్నాడు నెపోలియన్... అభిమానంతో కాదు- అవగాహనతోనే. సూర్యుడు జగమంతటికీ ప్రేరణ!

వేదాల్లోని సౌరసూక్తాలు, రామాయణంలోని ఆదిత్య హృదయం- ఈ దేశంలో సూర్యారాధన ఎంత పురాతనమైనదో నిరూపిస్తాయి. మిత్ర, రవి, సూర్య, భాను, ఖగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కర... అనే 12 చైతన్యాలతో సూర్యుణ్ని ఉపాసకులు ఆరాధిస్తారు. వాటికి ద్వాదశ ఆదిత్యులు అని పేరు. సూర్యకిరణాలు అనంతమైనవే అయినా, ప్రధానంగా సుషమ్నం హరికేశం విశ్వకర్మ విశ్వవ్యచ సంపద్వంశ ఆర్వాగ్వం స్వరాడ్వసు... అనే

కర్మసాక్షి

ఏడు కిరణాలను వేదవిదులు సూర్యరథంలోని ఏడు గుర్రాలకు, ఇంద్రధనుస్సులోని ఏడు వర్ణాలకు అన్వయించి చెబుతారు. ప్రత్యక్ష నారాయణుడిగా లోకచక్షువుగా కర్మసాక్షిగా ప్రజలు సంభావిస్తారు. మహాభారతంలో కుంతీదేవి సూర్యభగవానుణ్ని

త్రిపురుషమూర్తిగా, త్రివేదమయుడిగా సంబోధించడం ఒక విశేషం. ఉదయం బ్రహ్మదేవుడిగా, మధ్యాహ్నం మహేశ్వర చైతన్యంగా, సాయంకాలం విష్ణుస్వరూపుడిగా సూర్యుణ్ని ఆరాధించడం సంప్రదాయం. కనుక ఆయన త్రిపురుషమూర్తి. అలాగే ఆ మూడు

అంతర్యామి

సంధ్యల్లో సూర్యభగవానుణ్ని వరసగా రుగ్వేద యజుర్వేద సామవేద స్వరూపుడిగా పురాణాలు అభివర్ణించాయి. ఆ రకంగా ఆయన త్రివేదమయుడు. 'ఒక సూర్యుడు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచు' అని పోతన ఊరికే అన్నాడా మరి!

ఉషాకిరణాలు తిమిర సంహరణాలు. తిమిరం అంటే చీకటి మాత్రమే కాదు, అజ్ఞానం కూడా! వెలుగులకు, వికాసానికి, జ్ఞానానికి సూర్యుడు ప్రతీక. అనుదినం చూస్తున్నదే అయినా ఏ రోజుకారోజు నిత్యనూతనంగా దర్శనం ఇవ్వడం ప్రభాత సూర్యుడిలో ప్రత్యేక ఆకర్షణ. అది కవులకు నిరంతరం ప్రేరణ. సూర్యనమస్కారాల వెనక ఆరోగ్యసూత్రాల గురించి ఆయుర్వేదం వెల్లడించింది. భాస్కరుడు ఆరోగ్యప్రదాత అని ఆధునిక వైద్యశాస్త్రాలు ప్రకటించాయి. సూర్యుడు సకల జనావళికి స్నేహితుడై, హితుడై- 'మిత్ర' శబ్దానికి సార్థక్యం చేకూర్చాడు. ఆ మైత్రిని నిలుపుకొన్నవారికి ఆరోగ్యం సిద్ధిస్తుంది.

– ఎర్రాప్రగడ రామకృష్ణ

అగ్రిగోల్డ్ ఆస్తుల విక్రయానికి కమిటీ

- సభ్యులుగా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి
- ఉమ్మడి హైకోర్టు ఆదేశం
- కృష్ణాలో 5 ఆస్తుల అమ్మకానికి సిఫారసు

ఈనాడు - హైదరాబాద్

అగ్రిగోల్డ్‌కు సంబంధించిన ఆస్తులను జిల్లా కమిటీ ద్వారా విక్రయించాలని ఉమ్మడి హైకోర్టు నిర్ణయించింది. జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులతో కూడిన కమిటీ వేలం ప్రక్రియ నిర్వహించాలని, వీరికి సీఐడీ అధికారి ఒకరు సహకారం అందించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. మొదటి విడతలో కృష్ణా జిల్లాలో గుర్తించిన అయిదు ఆస్తుల వేలానికిగాను కమిటీకి సిఫారసు చేసింది. రూ.కోట్ల డిపాజిట్‌లు స్వీకరించి చేతులెత్తేసిన అగ్రిగోల్డ్ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్.వి.భట్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణలో.. జిల్లా కమిటీల ద్వారా ఆస్తులను విక్రయించాలన్న ఆంధ్రప్రదేశ్ అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతిపాదనకు ధర్మాసనం ఆమోదం తెలిపింది. అయితే జిల్లా జడ్జి స్థానంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ఉంటారని వెల్లడించింది. మొదటి విడతగా కృష్ణా జిల్లా గాంధీనగర్‌లోని వాణిజ్య షెడ్, స్థలం కలిపి 1712 చదరపు గజాలు, మచిలీపట్నంలో ప్లాట్, విజయవాడ మొగల్రాజపురంలో భవనం, మచిలీపట్నంలో ప్లాట్, వీర్లపాడు మండలంలో వ్యవసాయ భూమి, విజయవాడ పాయకాపురంలో ఖాళీ ప్లాట్‌లను వేలం వేయాలని కమిటీకి సూచించింది. దీనిపై రెండు వారాల్లో నోటిఫికేషన్ జారీ చేయాలని, రెండు తెలుగు పత్రికల జిల్లా ఎడిషన్‌లలో వేలం గురించి తక్కువ ఖర్చుతో సంక్షిప్త ప్రకటన ఇవ్వాలని, పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచి అదే విషయాన్ని ప్రకటనలో తెలియజేయాలని సూచించింది. కరపత్రాలతోపాటు స్థానిక పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో వేలం నోటీసులు ఉంచాలని, దండోరా వేయించాలని ఆదేశించింది. ఈ-వేలంలో పేర్కొన్న నిబంధనలే ఇక్కడా వర్తిస్తాయని తెలిపింది. సీఐడీ మొత్తం 10 ఆస్తులను సిద్ధం చేసి విలువలను కోర్టుకు సమర్పించగా, అవి తక్కువగా ఉన్నాయంటూ అగ్రి యాజమాన్యం తెలిపింది. 10 ఆస్తుల్లో రెండు ఆంధ్రాబ్యాంకు తాకట్టులో ఉన్నాయని, ఒకటి ఇప్పటికే అమ్మివేసినట్లు వారి తరఫు సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ చెప్పారు. ఆస్తుల జప్తు జరగకముందే విక్రయించినట్లు చెప్పారు. అది రిజిస్టర్ కాలేదని ఏపీ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ విక్రయ దస్తావేజును సమర్పించాలంటూ యాజమాన్యం తరఫు న్యాయవాదిని ఆదేశించింది. ప్రభుత్వం, యాజమాన్యం సమర్పించిన ఆస్తుల విలువలు రెండు మినహా మిగిలినవి దగ్గరగా ఉండటంతో వాటి విక్రయానికి అనుమతించింది. ధరలో వ్యత్యాసం ఎక్కువగా ఉన్న వాటి గురించి వచ్చే విచారణలో పరిశీలిస్తామని పేర్కొంటూ విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టును ఏజీ కోర్టుకు అందజేస్తూ కేవలం కోర్టు పరిశీలనకు మాత్రమే ఇస్తున్నామని చెప్పారు.

అక్షయ్‌గోల్డ్ వ్యవహారంలో బిడ్‌దారు హాజరుకు ఆదేశం

అక్షయ్ గోల్డ్‌కు చెందిన గుర్తించిన 4 ఆస్తుల్లో రెండింటికి మాత్రమే బిడ్‌లు రాగా, ఒకదానికి రెండు బిడ్‌లు వచ్చిన విషయం విదితమే. ఇందులో కర్నూలులోని ఒక భవనం రూ. 1.31 కోట్లు బిడ్ రాగా, పిటిషనర్లు రూ.1.51 కోట్లు దాకా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది కరణం శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఈ నేపథ్యంలో అత్యధికంగా బిడ్ దాఖలు చేసిన వ్యక్తితోపాటు, పిటిషనర్ సూచించిన వ్యక్తి కూడా ఈ నెల 25న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. ఒకే బిడ్ వచ్చిన ఆస్తి వేలం ప్రక్రియను నిలిపివేస్తూ అగ్రిగోల్డ్ వ్యవహారంలోలాగా అక్షయ్‌గోల్డ్‌కు చెందిన ఆస్తులనూ విక్రయించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. అదేవిధంగా తెలంగాణలో అక్షయ్ గోల్డ్‌కు చెందిన 10 ఆస్తుల వివరాలను, వాటి విలువలను ప్రత్యేక న్యాయవాది శరత్‌కుమార్ అందజేశారు. వీటికి సంబంధించి అంచనా విలువలను సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది.

రాజధానిలో 8 నక్షత్ర హోటళ్ల నిర్మాణం

- భూకేటాయింపు పత్రాలు అందజేసిన సీఆర్‌డీఏ

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతిలో నక్షత్ర హోటళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చిన ఎనిమిది ప్రముఖ సంస్థలకు స్థలాలు కేటాయిస్తూ శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు (లెటర్ ఆఫ్ ఇంటెంట్) అందజేశారు. ఆయా సంస్థల ప్రతినిధులకు సీఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్ చెరుకూరి శ్రీధర్ వీటిని అందజేశారు. ఐదు, నాలుగు నక్షత్రాల హోటళ్లు నాలుగేసి చొప్పున నిర్మించనున్నారు. లింగాయపాలెం వద్ద నోవాటెల్, మందడం వద్ద డబుల్ ట్రీ బై హిల్టన్, శాఖమూరు వద్ద క్రౌన్ ప్లాజా, నవులూరు వద్ద హిల్టన్ సంస్థలు ఐదు నక్షత్రాల హోటళ్లు నిర్మిస్తాయి. ఈ హోటళ్లకు నాలుగెకరాల చొప్పున భూమిని సీఆర్‌డీఏ కేటాయించింది. మందడం వద్ద జీఆర్‌టీ హోటల్, కొండమరాజుపాలెం వద్ద హాలీడేఇన్, శాఖమూరు వద్ద దసపల్లా, నవులూరు వద్ద గ్రీన్‌పార్క్ సంస్థలు నాలుగు నక్షత్రాల హోటళ్లు నిర్మించనున్నాయి. ఒక్కొక్క నాలుగు నక్షత్రాల హోటల్‌కు రెండెకరాల చొప్పున సీఆర్‌డీఏ భూమి కేటాయించింది. స్టార్ హోటళ్ల నిర్మాణానికి ఎకరానికి రూ.కోటిన్నర చొప్పున ధర నిర్ణయించి కేటాయింపులు జరిపింది. ఆయా సంస్థలు మొత్తం చెల్లించాక సీఆర్‌డీఏ భూమి స్వాధీనం చేస్తుంది. ఆయా సంస్థలు భూమి స్వాధీనం చేసుకున్న మూడు నెలల్లో పనులు ప్రారంభించి మూడేళ్లలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని షరతు విధించింది.

చెన్నైలో 23చోట్ల ఐటీ సోదాలు

- గుజరాత్‌కు చెందిన వ్యాపారవేత్త దుకాణాలు లక్ష్యంగా తనిఖీలు

చెన్నై, న్యూస్‌టుడే: గుజరాత్‌లోని ఓ వ్యాపారవేత్తకు చెందిన సంస్థను లక్ష్యంగా చేసుకుని చెన్నైలో 23 చోట్ల ఐటీ సోదాలు జరిగాయి. జౌళి, నగల దుకాణాల్లో జరిగిన ఈ సోదాల్లో పలు కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గుజరాత్‌కు చెందిన దేవీచంద్ గాంధీ సారథ్యంలోని 'గాంధీ బ్రదర్స్ గ్రూపు'నకు చెన్నైలో టోకు వ్యాపారం నిర్వహించే జౌళి, నగల దుకాణాలున్నాయి. ఈ సంస్థ పన్ను ఎగవేతకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆదాయపన్ను శాఖ సిబ్బంది 110 మందితో కూడిన బృందం శుక్రవారం దుకాణాల్లో ఏకకాలంలో సోదాలు చేసింది. చెన్నై టీనగర్, షావుకారుపేట తదితర ప్రాంతాల్లోని దుకాణాలు, గోదాములను పరిశీలించింది. గోడౌన్ స్ట్రీట్‌లోని గాంధీ ఫ్యాషన్, గాంధీ హొజైరీ, పల్లావరంలోని శ్రీసంతోష్ జ్యువెలరీలో అధికారులు ఎక్కువసేపు సోదా చేశారు. నగర శివారు పల్లావరంలో దేవీచంద్ గాంధీ బంధువు గౌతమ్ నివాసంలోనూ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కీలకమైన పత్రాలు, లెక్కలోకి రాని నగదు, నగలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

17 ఏళ్ల యువకుడు సరదాగా తెచ్చుకున్న గ్రెనేడ్‌ను పోలిన బొమ్మ.. హ్యూస్టన్‌లోని విమానాశ్రయంలో కలకలానికి కారణమైంది. అతన్ని సోదా చేసిన సిబ్బంది నిజమైన గ్రెనేడ్‌గా అపోహ పడ్డారు. వెంటనే సదరు యువకుణ్ని అదుపులోకి తీసుకుని, విమానాశ్రయాన్ని పాక్షికంగా ఖాళీ చేయించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్
55-17-2 టు 4, 5వ అంతస్తు, స్టాలిన్ కార్పొరేట్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆటోనగర్, విజయవాడ-520 007
Email: procurement.apmarkfed@gmail.com
Webpage: www.apmarkfed.in
ఆంధ్రప్రదేశ్, కడప జిల్లాలో ముద్దనూరు, యశ్వంత్ Formers Warehouse గోదాములో అగ్ని ప్రమాదానికి పాక్షికంగా దెబ్బ తిన్న పసుపు కొమ్ములు సుమారు 450 టన్నులు NCDEX E-మార్కెట్ మరియు STAR AGRI BAZAR (అగ్రి బజార్) ద్వారా విక్రయము చేయుటకు ప్రకటన
e-Auction 15-06-2018 వ తేదీ నుండి మొదలగును RFP కొరకు www.apmarkfed.in, www.agribazaar.com మరియు www.neml.in, నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. వివరాల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం.: 9653372683, 9642332994, 8978381843.
సం/- జిల్లా మేనేజర్, ఎ.పి. మార్క్‌ఫెడ్, కడప

విజయనగరం తొలి ఎంపీ కె.ఎస్.తిలక్ ఇకలేరు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, విజయనగరం తొలిపార్లమెంట్ సభ్యులు కందాళ సుబ్రహ్మణ్య తిలక్(98) (కె.ఎస్.తిలక్) పరమపదించారు. విశాఖపట్నం అక్కయ్యపాలెంలోని తన కుమారుని గృహంలో శుక్రవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఆయన భార్య సూర్యకాంతం మూడేళ్ల క్రితమే మృతిచెందారు. ఆయనకు కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తిలక్ పార్థివదేహాన్ని శనివారం మధ్యాహ్నం విశాఖపట్నంలోని గాయత్రి వైద్య కళాశాలకు అప్పగించనున్నట్లు కుమారుడు అశోక్ చెప్పారు. 1920 జులై 15న విశాఖపట్నంలో జన్మించారు. విజయనగరం మహారాజా కళాశాల, బెల్గాం(కర్నాటక), బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించారు. విద్యార్థి నాయకునిగా పలు సమస్యలపై ఉద్యమించి నాలుగు నెలల జైలు జీవితం అనుభవించారు. పినతండ్రి కందాళ సర్వేశ్వరశాస్త్రితో కలిసి స్వాతంత్ర్య సమరంలో, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1952-57 తొలి పార్లమెంటులో విజయనగరం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. దేశంలోనే అత్యధిక ఓట్లతో గెలిచిన రెండో ఎంపీగా తిలక్ రికార్డు సాధించారు. పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, డాక్టర్. రామ్ మనోహర్‌లోహియా, జయప్రకాశ్‌నారాయణ్ వంటి ఉద్దండులతో కలిసి పనిచేశారు. వినోబాభావేతో కలిసి భూదాన్ ఉద్యమంలో పాల్గొన్నారు. తిలక్ మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆయన జాతికి అందించిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని సీఎం శ్లాఘించారు.

ఆంధ్రా రుచులకు ప్రాచుర్యం

- రాష్ట్రంలో నెలకో ప్రాంతంలో ఆహారోత్సవాలు
- పర్యాటకశాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడి

ఈనాడు - అమరావతి

తెలుగు వారి సంప్రదాయ వంటకాలు, రుచులకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 'తెలుగింటి సంప్రదాయ వంటకాల' ఆహారోత్సవాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 14 వరకూ వారం రోజులు ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ వారంలో 50 రకాల సంప్రదాయ రుచులకు ప్రచారం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ రుచికరమైన సంప్రదాయ వంటకాలు చాలా ఉన్నాయన్నారు. వాటన్నింటినీ దేశవిదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఆహారోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకనుంచి ప్రతినెలా రాష్ట్రంలోని ఒక్కో ప్రాంతంలో ఆహారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఎక్కడికక్కడ వంటల పోటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వాటిని పుస్తక రూపంలోకి తీసుకొస్తామన్నారు. వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు ఓ సీనియర్ అధికారిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది ఐదు స్థానిక వంటకాలకు భౌగోళిక గుర్తింపు

ఆంధ్ర వంటకాలు పరిశీలిస్తున్న పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా

తీసుకొచ్చేందుకు దరఖాస్తు చేస్తామన్నారు. ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ రీజియన్ ఛైర్మన్, గేట్‌వే హోటల్ అధినేత ఎం.రాజయ్య మాట్లాడుతూ.. మన సంప్రదాయ వంటకాలను ఒక్కసారి రుచి చూస్తే ఎవరూ వదిలిపెట్టరన్నారు. అమెరికా సహా ప్రపంచంలోని అనేక దేశాలకు సరఫరా అవుతున్న ఉలవచారులో 99శాతం కేవలం కృష్ణా జిల్లా నుంచే వెళ్తోందన్నారు. హైదరాబాద్ బిర్యానీకి దీటుగా ఆంధ్రా పలావ్ ఎప్పటినుంచో ఉందని పేర్కొన్నారు.

L.K | SAATCHI & SAATCHI

బుల్లి గొడుగు.. బంగారం

చిటికెన వేలుకన్నా చిన్నగా ఉన్న బంగారు గొడుగును చేసి అబ్బుర పరిచాడు హైదరాబాద్‌కు చెందిన ఆభరణాల తయారీదారు సత్యనారాయణ. బటన్ నొక్కగానే తెరుచుకునేలా తయారు చేసిన ఈ గొడుగు శుక్రవారం మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆభరణాల ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 51 విడిభాగాలతో ఈ సూక్ష్మ రూపాన్ని రూపొందించడం విశేషం

– ఈనాడు, హైదరాబాద్

బ్యారేజీల నిర్మాణానికి సన్నాహాలు

- వైకుంఠపురానికి రూ.2169 కోట్లతో పాలనామోదం
- చోడవరానికి రూ.600 కోట్ల అంచనా

ఈనాడు–అమరావతి: కృష్ణా నదిపై మరో రెండు బ్యారేజీల నిర్మాణానికి కసరత్తు వేగవంతమయింది. ప్రస్తుత ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం వద్ద ఒక బ్యారేజీ, దిగువన చోడవరం సమీపంలో మరో బ్యారేజీ నిర్మించనున్నారు. వైకుంఠపురం బ్యారేజీ రాజధాని అమరావతి తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు పులిచింతల దిగువన ఉత్పత్తయ్యే కృష్ణా జలాలు సముద్రంలో వృథా కాకుండా నిల్వ చేస్తుంది. బ్యారేజీ నిర్మాణానికి రూ. 2247.57 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. రూ. 2169 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణానికి జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం పాలనామోదం ఇచ్చారు. టెండర్లు పిలిచి గుత్తేదారును ఖరారు చేసి పనులు అప్పగించడమే తరువాయి.

★ ప్రకాశం బ్యారేజీకి ఎగువన 23 కిలోమీటర్ల దూరంలో వైకుంఠపురం బ్యారేజీ ఉంటుంది. దీనిలో పది టీఎంసీల నీరు నిల్వ చేస్తారు.

★ అంచనాల్లో పేర్కొన్న ధరలకు, నిబంధనలకు సాంకేతికంగా మంజూరు ఇచ్చే అధికారి బాధ్యుడిగా పేర్కొంటూ ఈ ఉత్తర్వులిచ్చారు. మెకానికల్ పనులకు సంబంధించి జలవనరుల శాఖలోని మెకానికల్ విభాగం పర్యవేక్షిస్తుందని ప్రస్తావించారు.

★ బడ్జెట్‌లో దీనికి కేటాయింపులు లేనందున తొలుత ఆర్థిక శాఖ అభ్యంతరాలు చెప్పినా.. ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా తక్షణమే చేపట్టాలని పేర్కొనడంతో ఆమోదం సాధ్యమయింది.

రూ600 కోట్లతో మరో బ్యారేజీ

ఇదే సమయంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన 12 కిలోమీటర్ల దూరంలో చోడవరం గ్రామం వద్ద కృష్ణాపై బ్యారేజీని నిర్మించనున్నారు. దీనికోసం అధికారులు రూ. 600 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపారు. 2.7 టీఎంసీల నీటి నిల్వతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని ఎనిమిది మండలాల్లో తాగునీటి సమస్య పరిష్కారం, 17వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణను ఉద్దేశించారు. సమీపంలో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. దీని నిర్మాణానికి 55 హెక్టార్ల భూసేకరణ కూడా అవసరం. ఈ ప్రతిపాదన జలవనరుల శాఖ నుంచి ఆర్థిక శాఖకు వెళ్లింది. అక్కడ అనుమతి లభించాక పాలనామోదం ఇవ్వనున్నారు.

ఇంటింటికి గ్యాస్ సరఫరా ప్రాజెక్టు

- కృష్ణా జిల్లాలో త్వరలో ప్రారంభం: మేఘా కంపెనీ

ఈనాడు, అమరావతి: దేశంలో తొలిసారి గృహ, వాణిజ్య అవసరాలకు గ్యాస్ సరఫరా చేసే ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా, కర్ణాటకలోని తుముకూరు, బెల్గాం జిల్లాలలో త్వరలో ప్రారంభించనున్నట్లు మేఘా ఇంజినీరింగ్ మెయిల్- హైడ్రోకార్బన్స్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పి.రాజేశ్వరరెడ్డి ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తారని వెల్లడించారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టు పనితీరును పరీక్షించామని, త్వరలోనే అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. కృష్ణా జిల్లా ఆగిరిపల్లి, కానూరుల్లో ఫిల్లింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని, దీనికి అవసరమైన భూగర్భ సరఫరా వ్యవస్థ సిద్ధమైందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య అవసరాలకు నేరుగా గ్యాస్ సరఫరా చేయడం ద్వారా జీవన ప్రమాణాలను, సమాజంలో ఇన్‌ఫ్రా ఫలాలను నేరుగా అందించేందుకు పర్యావరణ హిత పద్ధతులను అందుబాటులోకి తెచ్చామని ప్రకటించారు. కృష్ణా జిల్లా నాగాయలంకలో ఓఎన్‌జీసీ ప్రారంభించిన గ్యాస్ కేంద్రం నుంచి 90వేల ఎస్‌సీఎండీ (స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ పర్‌డే) గ్యాస్‌ను ఒక రోజులో పొందేలా త్వరలో ఓఎన్‌జీసీతో ఒప్పందం కుదుర్చుకోనున్నామని వివరించారు.

మాకూ ఓ 'ఈడీబీ' కావాలి..!

- పలు రాష్ట్రాల ఆసక్తి

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు వివిధ దేశాల నుంచి పెట్టుబడుల్ని, పరిశ్రమల్ని ఆకర్షించడంలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ (ఏపీఈడీబీ) క్రియాశీలకంగా వ్యవహరించడం, మంచి ఫలితాలు సాధించడం ఇతర రాష్ట్రాలనూ ఆకట్టుకుంటోంది. ఏపీఈడీబీ తరహాలో తామూ ఆర్థికాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేసుకునేందుకు ఆయా రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. సంస్థాగత నిర్మాణం, పనితీరు తదితర అంశాల్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ విషయంలో తమకు సహకరించాల్సిందిగా ఈడీబీని కోరుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఈ మేరకు ఒక లేఖ వచ్చిందని ఏపీఈడీబీ సీఈఓ జాస్తి కృష్ణకిశోర్ తెలిపారు. పంజాబ్ నుంచి ఇప్పటికే ఒక బృందం వచ్చి పనితీరుని అధ్యయనం చేసిందన్నారు. దీని తరహాలో ప్రత్యేక సంస్థలు ఏర్పాటు చేయాలని అసోం, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రులు ఆ రాష్ట్ర అధికారులను ఆదేశించారని, ఆ రెండు రాష్ట్రాల పరిశ్రమలశాఖ కార్యదర్శుల నుంచి తమకు లేఖలు వచ్చాయని వివరించారు. కర్ణాటకలో కూడా ఇలాంటి సంస్థను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఉన్నారన్నారు. ఈడీబీని ఉత్తమపనితీరు కనబరుస్తున్న సంస్థగా ప్రపంచబ్యాంకు, ఇన్వెస్ట్ ఇండియా సంయుక్తంగా నిర్ధరించాయని పేర్కొన్నారు.

ఈ నెల 13 నుంచి జపాన్ పర్యటన

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ఏపీ ఈడీబీ, పరిశ్రమలశాఖ అధికారులు ఈ నెల 13 నుంచి 22 వరకు జపాన్‌లో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా 390 సంస్థలకు చెందిన ప్రతినిధులతో ముఖాముఖి, బృందం సమావేశాలు నిర్వహించనున్నట్లు కృష్ణ కిశోర్ తెలిపారు

తెలుగులోకి 15 చట్టాల అనువాదం

ఈనాడు డిజిటల్, అమరావతి: పాలనలో తెలుగుభాష వినియోగానికి సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో రూపొందించిన 15 ముఖ్య చట్టాలను తెలుగులోకి అనువదించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయశాఖ కార్యదర్శి దుప్పల వెంకటరమణ ఈ ఉత్తర్వును తెలుగులో జారీ చేయడం విశేషం. చట్టాలను తెలుగులోకి అనువదించాలని ఉత్తర్వులివ్వడంపట్ల భాషావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రూపొందించిన, రూపొందించబోయే చట్టాలు మాతృభాషలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆయా శాస్త్రాలకు సంబంధించిన ఆంగ్ల పదాలకు సమాంతరంగా తెలుగుపదాలుండేలా చొరవ చూపాలని తెలుగు భాషా పరిరక్షణ సంఘం ఉభయ రాష్ట్రాల అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

సీబీఐ కోర్టుకు జగన్, గాలి

ఈనాడు, హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో జగన్‌మోహన్‌రెడ్డి, అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్దన్‌రెడ్డిలు శుక్రవారం సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో జగన్‌తోపాటు రెండో నిందితుడైన విజయసాయిరెడ్డి, ఎంపీ వై.వి. సుబ్బారెడ్డి, పెన్నా ప్రతాప్‌రెడ్డి, ఇందూ శ్యాంప్రసాద్ రెడ్డి, అయోధ్యరామిరెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఏఎస్‌లు మన్మోహన్‌సింగ్, శ్రీలక్ష్మి, వెంకటరామిరెడ్డి, గనుల శాఖ మాజీ డైరెక్టర్ వి.డి. రాజగోపాల్, మాజీ ఐఏఎస్ శామ్యూల్ తదితరులు హాజరయ్యారు. వాన్‌పిక్ వ్యవహారంలో జగతి పబ్లికేషన్స్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై వాదనలు కొనసాగాయి. వాదనలు పూర్తయ్యేదాకా జగన్ న్యాయస్థానంలోనే ఉన్నారు. ఓబుళాపురం మైనింగ్ కేసులో గాలి జనార్దన్‌రెడ్డి, బి.వి.శ్రీనివాసరెడ్డి, అలీఖాన్ తదితరులు హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణ వచ్చే నెలకు వాయిదా పడింది.

మోదీ హత్యకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

మహేశ్ రౌత్, నాగ్‌పుర్ వర్సిటీ ప్రొఫెసర్ షోమా సేన్, దిల్లీకి చెందిన కార్యకర్త రోనా విల్సన్‌లను బుధవారం అరెస్టు చేశారు. వీరికి మావోయిస్టులతో సంబంధాలున్నాయని పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్ 31న 'ఎల్గార్ పరిషద్' నిర్వహణలోను, ఆ మరుసటి రోజు జరిగిన భీమా-కొరెగావ్ అల్లర్లలోను ప్రమేయం ఉందని చెప్పారు. వీరిని గురువారం పుణెలోని సెషన్స్ కోర్టులో హాజరుపరచగా.. ఈ నెల 14 వరకూ పోలీసు కస్టడీని విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు. రోనా విల్సన్ నివాసంలో సోదాలు జరిపినప్పుడు కొన్ని లేఖలు బయటపడినట్లు పోలీసులు తెలిపారు. అందులో అంశాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వాలా పవార్.. న్యాయస్థానానికి తెలియజేశారు. సంబంధిత లేఖలో ఎక్కడా మోదీ పేరు లేదు. అయితే 'రాజీవ్ తరహా ఘటన' అని పేర్కొనడంతో మోదీయే లక్ష్యమని అనుమానిస్తున్నారు.

కామ్రేడ్ ప్రకాశ్‌ను ఉద్దేశిస్తూ 'ఆర్' అనే వ్యక్తి ఓ లేఖ రాశాడు. ఎం-4 తుపాకీ, 4లక్షల తూటాల కొనుగోలుకు రూ.8 కోట్లు అవసరమని ఈ అందులో ఉంది. "మోదీ నేతృత్వంలోని హిందూ ఫాసిస్టు పాలన.. దేశీయ ఆదివాసీల జీవితాలను కబళిస్తోంది. బిహార్, పశ్చిమ బెంగాల్‌లో ఓటమిపాలైనప్పటికీ 15కుపైగా రాష్ట్రాల్లో భాజపా ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో మోదీ విజయం సాధించారు. ఇదే జోరు కొనసాగితే మన పార్టీకి ఇబ్బందులు తప్పవు. మోదీ శకానికి ముగింపు పలికేందుకు కామ్రేడ్ కిషన్, మరికొందరు సీనియర్లు గట్టి చర్యలను ప్రతిపాదించారు. రాజీవ్ గాంధీ తరహా ఘటన గురించి ఆలోచిస్తున్నాం. అది ఆత్మహత్యాసదృశంగా అనిపించొచ్చు. అది విఫలమయ్యే అవకాశమూ ఉంది. అయినా మా ప్రతిపాదనపై పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ చర్చించాలి. రోడ్‌షోల్లో ఆయనను లక్ష్యంగా చేసుకోవచ్చు. అన్ని త్యాగాల కన్నా పార్టీ మనుగడే మనకు అత్యుత్తమం" అని ఆ లేఖలో ఉంది. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూరులో జరిగిన ఒక బహిరంగ సభలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని.. ఆత్మాహుతి దళ సభ్యురాలు హత్య చేసిన సంగతి తెలిసిందే.

మరో లేఖలో పట్టణ మావోయిజంలో పాలు పంచుకుంటున్న కామ్రేడ్ల చర్యలతో మావోయిస్టు పార్టీ ఏకీభవించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల పేర్కొన్నారు. "కోరెగావ్ కార్యక్రమాన్ని రెండు నెలలుగా కామ్రేడ్లు మంగలు, దీపూలు.. కామ్రేడ్ సుధీర్‌తో సమన్వయం చేసుకుంటున్నారు" అని లేఖలో ఉన్నట్లు చెప్పారు. భీమా-కోరేగావ్ 'కార్యక్రమం' కోసం కామ్రేడ్ సుధీర్‌కు నిధులు ఇచ్చినట్లు, భవిష్యత్ కార్యక్రమాలకు నిధులు అందించే బాధ్యతను కామ్రేడ్లు షోమా, సురేంద్రలకు అప్పగించినట్లు లేఖలో ఉందన్నారు.

అరెస్టయిన నిందితులు వీరే..

రోనా విల్సన్: ఈయన కేరళ వాసి. ప్రస్తుతం దిల్లీలో ఉంటున్నారు. రాజకీయ ఖైదీల విడుదలకు ఉద్దేశించిన 'కమిటీ ఫర్ పొలిటికల్ ప్రిజనర్స్' (సీఆర్‌పీపీ)కి ప్రజా సంబంధాల కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. సైనికదళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) వంటివాటికి వ్యతిరేకంగా చురుగ్గా ఉద్యమిస్తున్నారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో గత ఏడాది జీవిత ఖైదుకు గురైన దిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాకు ఈయన సన్నిహితుడు. సాయిబాబాకు శిక్ష పడ్డాక.. దేశంలో మావోయిస్టుకు సంబంధించిన పట్టణ, అటవీ ప్రాంతాలు, అంతర్జాతీయ నెట్‌వర్క్ సమన్వయం చేసే బాధ్యతను విల్సన్ చేపట్టినట్లు పోలీసులు చెప్పారు.

సుధీర్ ధవాలే: ఈయన దళిత కార్యకర్త. 'విరోధి' అనే మరాఠీ పత్రిక సంపాదకుడు. దళితలకు ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేయడం కోసం రిపబ్లికన్ పాంథర్స్‌ను స్థాపించారు. 'రాడికల్ అంబేడ్కర్' అనే ఉద్యమాన్ని ప్రారంభించారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయంటూ ఆయనపై 2011లో దేశద్రోహం కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. అయితే 2014లో కోర్టు ఆయనకు విముక్తి కల్పించింది. 'ఎల్గార్ పరిషద్' నిర్వహణలో ఆయన క్రియాశీలంగా వ్యవహరించారు.

సురేంద్ర గాడ్లింగ్: నాగ్‌పుర్‌కు చెందిన ఈయన.. న్యాయవాది. 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్' అనే సంస్థకు ప్రధాన కార్యదర్శి. గిరిజన, దళిత హక్కుల కార్యకర్త. మావోయిస్టులతో సంబంధాలున్నాయని అరెస్టయినవారికి ఈయన న్యాయ సహాయం చేస్తుంటారు. ఈయన సేవలు పొందినవారిలో సాయిబాబా, ధవాలే ఉన్నారు.

షోమా సేన్: నాగ్‌పుర్ వర్సిటీలో ఆంగ్ల భాషా ప్రొఫెసర్. వామపక్ష తీవ్రవాదులతో సంబంధాలకు సంబంధించి ఆమెపై చాలాకాలంగా దర్యాప్తు సంస్థలు నిఘా వేశాయి. 'ఎల్గార్ పరిషద్'కు ఆమె హాజరయ్యారు. మావోయిస్టు కేసులో ఆమె భర్త తుషార్ కాంతి భట్టాచార్య గత ఆగస్టులో అరెస్టయ్యారు. ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు.

మహేశ్ రౌత్: ముంబయిలో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో చదివారు. ప్రధాన మంత్రి గ్రామీణాభివృద్ధి (పీఎంఆర్‌డీ)లో మాజీ పరిశోధక విద్యార్థి. అడవుల్లో, పట్టణాల్లో ఉండే మావోయిస్టు విభాగాల మధ్య సంధానకర్తగా ఆయనను చెబుతారు. మావోయిస్టు ప్రభావిత గడ్చిరోలి జిల్లాలో గత కొన్నేళ్లుగా క్రియాశీలకంగా ఉన్నారు. మైనింగ్‌కు వ్యతిరేకంగా, ఆదివాసీల హక్కులకు అనుకూలంగా పోరాటాలు చేస్తుంటారు.

సుప్రీం తీర్పుపై..

కామ్రేడ్ ఆనంద్‌ను ఉద్దేశించి కామ్రేడ్ ప్రకాశ్‌కు రాసిన మరో లేఖలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలో సుప్రీం కోర్టు తెచ్చిన సవరణలను ప్రస్తావించారు. ఈ సవరణల వల్ల తీవ్ర స్థాయి ప్రతిస్పందన ఉంటుందని పేర్కొన్నారు. దళిత అంశాలపై సదస్సుల నిర్వహణకు అదనపు నిధులు ఇవ్వాలని కేంద్ర కమిటీని కోరారు.

వరవరవరావు ప్రస్తావన..

గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్, సూరజ్‌గఢ్‌లలో నిర్వహించిన దాడులు తమకు 'జాతీయ ప్రాముఖ్యత'ను తెచ్చిపెట్టాయని కామ్రేడ్ 'ఎం' అనే వ్యక్తి రాసిన లేఖలో ఉంది. 'మనకు పేరు తెచ్చిపెట్టే దాడులను రానున్న నెలల్లోనూ కొనసాగించాలి" అని అందులో కోరారు. ఇలాంటి దాడులకు తెలంగాణకు చెందిన మావోయిస్టు సానుభూతిపరుడు, కవి వరవరరావు.. సురేంద్ర గాడ్లింగ్ (తాజాగా అరెస్టయిన వ్యక్తి)కు నిధులు సమకూర్చినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఈ లేఖలను నిందితుల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. దర్యాప్తు అధికారులే వాటిని సృష్టించి ఉంటారని ఆరోపించారు. నిందితుల ఇళ్లల్లో ఏప్రిల్‌లోనే సోదాలు చేశారని, ఆ సమయంలో ఇలాంటి ఆందోళనకరమైన లేఖలు బయటపడినప్పుడు రెండు నెలల పాటు వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.

ఏమిటీ అల్లర్లు?

1818 జనవరి 1న జరిగిన భీమా కోరెగావ్ యుద్ధంలో దళితులైన మహర్ సైనికులు బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ తరఫున పోరాడి, పీష్వా బాజీరావు-2 సైన్యాన్ని ఓడించారు. తద్వారా బ్రాహ్మణ పీష్వా ఆధిపత్యానికి, మరాఠా పాలనకు ముగింపు పలికారు. అణచివేతకు వ్యతిరేకంగా తాము సాగిస్తున్న పోరులో ఈ యుద్ధం ఒక మేలిమలుపుగా దళిత వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏటా జనవరి 1న భీమా-కోరెగావ్‌లోని యుద్ధ స్మారకం వద్ద సంస్మరణ కార్యక్రమం చేపడతారు. ఈ ఏడాది జనవరి 1న నాటి యుద్ధానికి సంబంధించిన ద్విశత ఉత్సవాలను నిర్వహించతలపెట్టారు. దానికి ముందు రోజు.. అంటే గత ఏడాది డిసెంబర్ 31 పుణెలో 'ఎల్గార్ పరిషద్' నిర్వహించారు. అందులో వామపక్ష భావజాలమున్న బృందాలు, అంబేడ్కర్‌వాద వర్గాలకు చెందిన వెయ్యి మందికిపైగా పాల్గొన్నారు.

మరుసటి రోజు భీమా-కోరెగావ్‌లో దళితులు చేపట్టిన ర్యాలీని హిందుత్వ కార్యకర్తలు నిరసించడంతో హింస ప్రజ్వరిల్లింది. అందులో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. భారీగా ఆస్తి నష్టం జరిగింది. ముందురోజు జరిగిన ఎల్గార్ పరిషద్‌లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం వల్లే ఈ హింస ప్రజ్వరిల్లిందని ఆరోపణలు వచ్చాయి.

కుట్ర అవాస్తవం: వరవరరావు

గాంధీనగర్, న్యూస్‌టుడే: దేశంలో వివిధ ప్రాంతాల్లో పోలీసులు అరెస్టు చేసిన ప్రజాసంఘాల నేతలతో పరిచయం ఉన్నప్పటికీ.. ప్రధాని మోదీ హత్యకు కుట్ర వెనుక తాను ఉన్నాననడం అవాస్తవమని విరసం నేత వరవరరావు అన్నారు. శుక్రవారం మహారాష్ట్ర పోలీసులు వరవరరావును అరెస్టు చేస్తారని పుకార్లు రావడంతో నగరంలోని గాంధీనగర్‌లోని నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులు అరెస్టు చేసిన వారివద్ద లభించిన ల్యాప్‌టాప్‌లు, ఇతరత్రా వాటిలో ప్రధానిని హత్య చేయడానికి నిధుల కోసం చందాలు వసూలు చేయాలని వారికి రాసిన లేఖల్లో తన పేరు ఉందని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ప్రధాని హత్యకు మావోయిస్టులు కుట్ర పన్నారని తాను అనుకోనని అన్నారు. ప్రజా టెలిఫోన్ నుంచి ఒకతను ఫోన్ చేసి ఇంగ్లిషులో మాట్లాడుతూ పుణె పోలీసులకు సహకరిస్తారా? అని అడిగారని, తాను తప్పు చేయలేదని, ఎవరికైనా సహకరిస్తానని సమాధానమిచ్చానన్నారు. ప్రధాని హత్యకు కుట్ర పన్నారన్న వార్తలు అవాస్తవమని, రాజకీయ ఖైదీల విడుదల కోసం పోరాడుతున్న వారి గొంతు నొక్కడానికి చేస్తున్న కుట్ర అన్నారు. పోలీసులెవ్వరూ తనను సంప్రదించలేదని వరవరరావు స్పష్టం చేశారు.

ఇది ప్రజాస్వామ్య భావాలను అణచివేయడమే: విరసం

ఈనాడు, హైదరాబాద్: ప్రధాని మోదీని చంపేందుకు మావోయిస్టులు కుట్ర పన్నారని చెబుతూ అందులో వరవరరావు పేరు ఇరికించడం విప్లవ ప్రజాస్వామ్య భావాల వ్యక్తీకరణను అణచివేయడమేనని విప్లవరచయితల సంఘం (విరసం) దుయ్యబట్టింది. మహారాష్ట్రలోని కోరేగాం హింసకు కారకులైన అసలు నిందితులను అరెస్టు చేయాల్సింది పోయి దీనిని నిలదీస్తున్న ప్రజాసంఘాల నాయకులపై కేసులు పెడుతున్నారని విరసం సభ్యులు అన్నారు. ఈమేరకు విరసం కార్యదర్శి పాణి, సీనియర్ సభ్యులు కల్యాణరావు, కార్యవర్గసభ్యులు వరలక్ష్మి, కాశీం, రాంకీలు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరవరరావుపై కుట్ర ఆరోపణలు వెనుక అసలు ఉద్దేశం ప్రశ్నించే హక్కును అణచివేయడమేనని వారన్నారు. మోదీపై కుట్ర పెద్ద అబద్ధమని, అసలు కుట్ర ఆయన ప్రభుత్వమే చేస్తోందని, దీనిని తాము ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు.

ప్రధాని భద్రతపై అప్రమత్తం

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

జమ్ము: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భద్రత విషయంలో ప్రభుత్వం చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. మోదీ హత్యకు మావోయిస్టులు కుట్ర పన్నారన్న వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. జమ్ము-కశ్మీర్‌లో రెండు రోజుల పాటు పర్యటించిన ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'మేం ఎల్లప్పుడూ ప్రధాని భద్రతపై అప్రమత్తంగా ఉంటున్నాం. మావోయిస్టులు విఫల యుద్ధాన్ని చేస్తున్నారు. దేశంలోని కేవలం పది జిల్లాల్లోనే వారి కార్యకలాపాలు ఉన్నాయ'ని తెలిపారు.

నక్సల్స్‌తో చేతులు కలిపిన కొన్ని పార్టీలు: జైట్లీ

దిల్లీ: ఎన్‌డీఏకు వ్యతిరేకంగా కొన్ని పార్టీలు మావోయిస్టులను ఉపయోగించుకుంటున్నాయని కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ విమర్శించారు. 'పులి మీద స్వారీ చేయవద్దు. అది మిమ్మల్నే మింగేస్తుంద'న్నది తీవ్రవాదం నేర్పిన గుణపాఠమని, అయినా కొన్ని పార్టీలు మావోయిస్టులను సాధనాలుగా మార్చుకుంటున్నాయని ఆరోపించారు.

అంబేడ్కర్ అనుచరులు నక్సలైట్లు కాలేరు: అథవాలే

మోదీ హత్యకు మావోయిస్టులు వ్యూహం పన్నడాన్ని కేంద్రమంత్రి, దళిత నాయకుడు రాందాస్ అథవాలే ఖండించారు. అయితే భీమా కోరేగాం ఆందోళనకు, ఈల్గార్ పరిషద్‌కు మావోయిస్టులతో సంబంధాలు లేవని తెలిపారు. అంబేడ్కర్ అనుచరులు ఎవరూ నక్సలైట్లు కాలేరు. నక్సలైట్లు ఎప్పుడూ అంబేడ్కర్‌వాదులు కాలేరని వ్యాఖ్యానించారు.

భాజపా ద్వంద్వ వైఖరి వెల్లడయింది: కాంగ్రెస్

భీమా కోరేగాం ఆందోళన విషయంలో భాజపా ద్వంద్వ వైఖరి వెల్లడయిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా వ్యాఖ్యానించారు. ఆందోళనలో పాల్గొన్నవారికి మావోయిస్టులతో సంబంధం ఉందని ప్రభుత్వం చెబుతుండగా, వారికి ఎలాంటి సంబంధం లేదని కేంద్రమంత్రి అథవాలే చెప్పారని గుర్తుచేశారు. దళిత నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని కూడా అన్నారని తెలిపారు. అందువల్ల ఈ అల్లర్లపై నిష్పక్షపాతంగా, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపించాలని డిమాండు చేశారు.

ప్రముఖుల ఖండన: మోదీ హత్యకు మావోయిస్టులు ప్రయత్నించడాన్ని ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీరవిశంకర్, యోగా గురు బాబా రాందేవ్, ప్రముఖ కళాకారులు సోనాలి మాన్‌సింగ్, మాలినీ అవస్థి ఖండిస్తూ ట్వీట్లు చేశారు.

హింసను ఏకమై ఖండిద్దాం: కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రధాని నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను చంపుతామంటూ మావోయిస్టుల నుంచి బెదిరింపు లేఖలు రావడాన్ని కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి ఖండించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ వైరుధ్యాలున్నప్పటికీ హింస, దాడులను భారతీయులంతా ఏకమై ఖండించాలని శుక్రవారం ట్విటర్‌లో పిలుపునిచ్చారు.

మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు మావోయిస్టుల హెచ్చరిక లేఖలు

ముంబయి: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు, ఆయన కుటుంబసభ్యులకు హాని తలపెడతామని హెచ్చరిస్తూ మావోయిస్టు సంస్థలు రెండు లేఖలు పంపాయి. వారం కిత్రం ముఖ్యమంత్రి కార్యాలయానికి ఇవి వచ్చినట్లు హోంశాఖ అధికారులు తెలిపారు. తదుపరి విచారణ కోసం వీటిని పోలీసులకు అప్పగించామని పేర్కొన్నారు. ఇటీవల గడ్చిరోలీలో భద్రతదళాలు చేపట్టిన ఆపరేషన్లలో.. 39 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఘటనల ప్రస్తావన రెండు లేఖల్లోనూ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటు ఈ హెచ్చరికపై ఫడణవీస్ స్పందించారు. గతంలో మావోయిస్టులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితమయ్యేవారని.. ఇప్పుడు పట్టణ ప్రాంతాలకూ విస్తరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
'e' NIT No. 14/Corenet/MD, APRDC/2018-19, తేది: 4-6-2018.
పశ్చిమ గోదావరి జిల్లాలో ప్లాన్ క్రింద 1 పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 26-6-2018, మ. 3.30 గం. వరకు. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను మరియు యితర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్, అనగా www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
DIPR No. 705/CL/ADVT/1/1/2018-19. సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్ (R&B), SH & మేనేజింగ్ డైరెక్టర్, APRDC.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
నెం.13/2018-19 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 2.6.2018
పనిపేరు : ప్రకాశం జిల్లా, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ క్రింద సాయిరాం నగర్ గ్రామం ముద్దిగొండ పొట్టి బసవ్వాయపల్లి (కృష్ణాపురం) మరియు లక్ష్మీపురం నిర్వాసిత కుటుంబాలను పునరావాస కేంద్రమైన ఒందుట్ల (గ్రామం) వద్ద ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫసిలిటీస్ ఫార్మేషన్ ఆఫ్ ఇంటర్నల్ రోడ్స్, సి.సి. రోడ్స్, సి.సి. డ్రైన్స్ మరియు శ్లాబ్ కల్వెర్ట్స్ నిర్మాణం చేయుట గురించి. పనివిలువ : రూ. 4,80,77,434/-. షెడ్యూలు అమ్మకం తేది : 11.6.2018 ఉ. 11 గం.ల నుంచి. షెడ్యూలు అమ్మకం చివరి తేది: 18.6.2018 సా.3 గం. వరకు. టెండర్లు స్వీకరించుటకు చివరి తేది : 18.6.2018 సా.5 గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరచు తేది : 19.6.2018 ఉ.11గం.లకు. ప్రైస్ బిడ్ తెరచు తేది : 21.6.2018 ఉ.11 గం. మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
DIPR No. 720/CL/Advt/1/1/2018-19 సం/- పర్యవేక్షక ఇంజనీరు, కన్‌స్ట్రక్షన్ సర్కిల్, ఒంగోలు

మళ్లీ ఆశీర్వదించండి

(మొదటి పేజీ తరువాయి)

మహాసంకల్పం ముగింపు కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా నాయుడుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర అభివృద్ధి కోసం తెదేపా ప్రభుత్వం చేస్తున్న కృషిని.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరును వివరించారు. ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోటానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పెళ్లకూరు మండలంలో గ్రామదర్శిని కార్యక్రమంలో పాల్గొన్నారు. 2014 ఎన్నికల సమయంలో దగాపడ్డ రాష్ట్రం కోసం భాజపాతో పొత్తు పెట్టుకుంటే అధికారంలోకి వచ్చాక నమ్మక ద్రోహం చేశారని చంద్రబాబు విమర్శించారు. 'దెబ్బతిన్న రాష్ట్రానికి ఇబ్బంది రాకూడదని 29 సార్లు తలవంచుకుని దిల్లీ వెళ్లా. కేంద్రం ముందు చేయి చాచా. ఎలాంటి కనికరం లేదు. ప్రజలుగా మీరు చెప్పండి. నేనేమైనా కేంద్రాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరానా' అని ప్రశ్నించారు.

మోదీనే మనకు అన్యాయం చేస్తున్నారు

రాష్ట్ర విభజన సమయంలో మనకు అన్యాయం జరిగిందని తిరుపతి వెంకన్న సాక్షిగా చెప్పిన మోదీ ఇప్పుడు ప్రధానిగా ఆయనే మనకు అన్యాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. "విభజన వల్ల జరిగిన అన్యాయాన్ని సరిచేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. రాజకీయ కోణంలోనే ఆలోచిస్తోంది. అయినా అధైర్యపడేది లేదు. కట్టుబట్టలతో బయటికి వచ్చాం. నాడు బస్సులోనుంచి పాలన సాగించాల్సిన పరిస్థితి. ఇప్పుడు తాత్కాలిక రాజధాని నిర్మించుకున్నాం. మౌలిక వసతుల కోసం రూ.24 వేల కోట్లతో పనులు చేపట్టాం. తెలుగు జాతికి ఇలాంటి పట్టుదల ఉంటుంది. ప్రత్యేక హోదా అనేది మనకున్న హక్కు. విభజన చట్టంలోనే ఉంది. దీన్ని కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందే.

రోజుకు అయిదారు గంటలే నాకు విశ్రాంతి

గత ఎన్నికల్లో నాపై ఉన్న నమ్మకంతో మీరు ఓటు వేశారు. మీ సంక్షేమం చూడాల్సిన బాధ్యత నాది. కేంద్రం సహకరించినా.. లేకున్నా రాష్ట్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాను. రోజుకు అయిదారు గంటలే నాకు విశ్రాంతి. మిగిలిన సమయం అంతా రాష్ట్ర అభివృద్ధి కోసమే ఈ నాలుగేళ్లు కేటాయించా.

వైకాపా ఓ అవినీతి పార్టీ

తెదేపాను.. నన్ను వైకాపా అధినేత విమర్శిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శించే ధైర్యం జగన్‌కు లేదు. వైకాపా ఒక అవినీతి పార్టీ. ప్రతి శుక్రవారం ఆయన బోనెక్కి తలదించుకోవాలి. బయటకు వచ్చి నన్ను విమర్శిస్తాడు. నాది 40 ఏళ్ల రాజకీయ జీవితం. నన్ను ఇబ్బంది పెట్టాలని

తాళ్వాయిపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు

26 సార్లు విచారణకు ఆదేశాలు ఇచ్చారు. ఏం చేయలేక పోయారు. అంత స్వచ్ఛంగా ఉంటాను. భవిష్యత్తులో కూడా ఆదర్శంగానే ఉంటాను. వైకాపా ఎమ్మెల్యేలు అసలు అభివృద్ధిలో ఎక్కడ భాగస్వామ్యం అయ్యారు. వాళ్లు అసెంబ్లీకి రారు. ఆ ఎంపీలు రాజీనామా పేరుతో పార్లమెంటుకు వెళ్లరు. అలాంటి వారికి మీరు ఓట్లు వేస్తారా? ఆ ఎంపీల పరిస్థితి చూడండి. రాజీనామా చేశామని చెబుతారు. లోపలికి వెళ్లి కాళ్లు పట్టుకుంటున్నారు. ఎందుకంటే అయిదు ఎంపీ స్థానాలకు ఉప ఎన్నికలు వస్తే ఓడిపోతామన్నది వారి భయం. 2019 ఎన్నికల్లో గల్లంతు అవుతామన్న ఆందోళన. అందుకే ఉప ఎన్నికలు రాకుండా డ్రామాలు చేస్తున్నారు.

నాయుడుపేటలో మహాసంకల్ప ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఇంత కష్టాల్లో ఉన్నా...

రాష్ట్ర విభజన తర్వాత మనకు ఎలాంటి దిక్కు లేదు. అమరావతిలో ప్రజారాజధాని కోసం 33 వేల ఎకరాల భూమిని రైతులు ఇచ్చారు. ఏడు నెలల్లో తాత్కాలిక రాజధానిని నిర్మించి.. అక్కడి నుంచి పాలన ప్రారంభించాం. అయిదేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నది లక్ష్యం. 2016లో 25 శాతం, 2017లో 15 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇంత కష్టాల్లో ఉన్నా రాష్ట్ర అభివృద్ధి ఎక్కడా ఆగలేదు. కేంద్రం ఇబ్బందులకు గురిచేస్తున్నా రాష్ట్ర జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే 55 శాతం పనులు పూర్తయ్యాయి. 2019 నాటికి గ్రావిటీతో నీటిని ఇవ్వాలన్నదే లక్ష్యం. నదుల అనుసంధానానికి శ్రీకారం ఘనత మాదే. తెదేపా అధికారంలోకి వచ్చాక ఒక్క నెల్లూరు జిల్లాలోనే అటవీ అనుమతులను తీసుకొచ్చి లక్ష ఎకరాలకు అదనంగా ఆయకట్టు ఇచ్చిన ఘనత దక్కించుకున్నాం. అభివృద్ధిలో సాంకేతికతను వినియోగిస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడి సమాచారమైనా క్షణాల్లో వచ్చే వ్యవస్థ మనకు ఉంది. రాష్ట్ర విభజన సమయంలో అధికారులు కూడా మన దగ్గరకు రావటానికి ఇష్ట పడలేదు. వచ్చాక వారు బాగా కసితో పనిచేశారు. ఇప్పుడు దేశంలోనే సమర్థమైన అధికారుల బృందం మన రాష్ట్రంలో ఉంది. ఫైబర్ గ్రిడ్ ద్వారా 15 ఎంబీపీఎస్ నెట్ కనెక్షన్ ఇస్తున్నాం. రూ.149 చెల్లిస్తే చాలు. ప్రస్తుతం మూడు లక్షల మందికి ఇచ్చాం. డిసెంబరు నాటికి కోటి కనెక్షన్లు ఇవ్వాలన్నది ఆలోచన.

"గర్భిణిగా ఉన్న మహిళకు పౌష్టికాహారం అందించటం.. ఆసుపత్రిలో ప్రసవం.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి తీసుకెళ్లటం.. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు.. ఉచిత విద్య.. వృత్తి నైపుణ్య కేంద్రాల ద్వారా శిక్షణ.. ఉద్యోగం రాకుంటే నిరుద్యోగ భృతి, పెళ్లి చేసుకుంటే చంద్రన్న పెళ్లి కానుక... ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా.. రూ.24 వేల కోట్ల మొత్తాన్ని వ్యవసాయ రుణమాఫీ కింద ప్రభుత్వం దశల వారీగా చెల్లిస్తోంది. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

మా ఇంటి పేరు ఆనందం.. మా ఊరి పేరు పరిశుభ్రత

ఈనాడు డిజిటల్, అమరావతి: "మా ఇంటి పేరు ఆనందం.. మా ఊరి పేరు పరిశుభ్రత" అనే సంస్కృతి రాష్ట్రం మొత్తం విరాజిల్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'మహాసంకల్పం' నిర్వహణపై ఆయన కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నెలా ఇదే రోజు 'మహాసంకల్పం' పురోగతిని విశ్లేషించాలని సూచించారు. నాలుగేళ్లలో ఎన్నో మైలు రాళ్లు అధిగమించామన్న ఆయన.. సమష్టి కృషి, ప్రజా సహకారంతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. రోడ్లపై నీరు నిలవకుండా డ్రెయినేజీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలన్నారు. ఈ దీక్షల్లో కేవలం 2,891 ఫిర్యాదులే అందాయని, ఫిర్యాదులు తక్కువ రావడం పురోగతికి నిదర్శనమని ముఖ్యమంత్రి వివరించారు.

పోలవరం నిధులు ఎట్టకేలకు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

నిధుల సమీకరణ కోసం నాబార్డు చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించి నిధులు ప్రాజెక్టు అథారిటీ ఖాతాకు చేరాయి. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన మరో రూ.766 కోట్ల బిల్లులు ప్రస్తుతం ప్రాజెక్టు అథారిటీ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిశీలించి కేంద్ర జలవనరుల శాఖకు పంపితే ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు రావాల్సి ఉంటుంది. ఈ నిధులన్నీ కేంద్రం పాత డీపీఆర్ ప్రకారమే ఇస్తోంది. కొత్త డీపీఆర్‌కు ఆమోదముద్ర వేయలేదు. పాత డీపీఆర్ ప్రకారం పోలవరం ప్రాజెక్టు సాగునీటి విభాగం అంచనా వ్యయం రూ.12,294 కోట్లు. రాష్ట్ర విభజనకు ముందే దీనిపై రూ.5,136 కోట్లు వెచ్చించారు. ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వబోమని లోగడే కేంద్రం స్పష్టం చేసింది. అదిపోగా మిగిలిన రూ.7,158 కోట్లు చెల్లించాల్సి ఉంది. అందులో ఇప్పటివరకూ ప్రస్తుత రూ.1,400 కోట్లతో కలిపి రూ.6,764 కోట్లు చెల్లించినట్లయింది. ఇక మిగిలింది రూ.395 కోట్లు మాత్రమే. ఒకవేళ పోలవరం ప్రాజెక్టు సవరించిన డీపీఆర్‌కు కేంద్రం ఆమోదించకపోతే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం నుంచి కేవలం రూ.395 కోట్లు మాత్రమే వస్తుంది. 2013 భూసేకరణ చట్టం అమల్లోకి వచ్చాక సహాయ, పునరావాస ఖర్చులు పెరిగిపోవడం, 2014 జూన్ 2నాటికి ఉన్న ధరల ప్రకారం సాగునీటి విభాగం నిర్మాణ ఖర్చును కేంద్రం భరిస్తుందని హామీనివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.53వేల కోట్లతో సవరించిన అంచనాలు పంపింది. అందులో సహాయ, పునరావాసానికి రూ.33,225 కోట్లు, సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.20,509.46 కోట్లు ఖర్చవుతుందని అంచనా. సవరించిన అంచనాలపై సీడబ్ల్యూసీలో ఇప్పటికే పలు దఫాలు చర్చించారు. అది వేసిన కొర్రీలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం పంపింది. అయినప్పటికీ ఇంతవరకూ దానికి ఆమోదముద్ర వేసే విషయంలో సానుకూలత కనిపించడం లేదు. ఈ విషయంలో కేంద్రం జాప్యం చేస్తే మాత్రం మున్ముందు పోలవరానికి నిధుల కొరత ఎదురయ్యే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఏడాదికి తాత్కాలిక ప్రాతిపదికన పోలవరానికి రూ.10వేల కోట్లు విడుదల చేయాలంటూ లేఖ రాయాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. సవరించిన అంచనాలు ఆమోదించేంత వరకూ నిధులు ఇవ్వకపోతే ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యమయ్యే ప్రమాదం ఉన్నందున తాత్కాలికంగా రూ.10వేల కోట్లకు అనుమతినిచ్చి డీపీఆర్‌కు అంతిమ ఆమోదం పొందాక ఈ మొత్తాన్ని అందులో సర్దుబాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరనున్నట్లు సమాచారం.

రూ.10 వేల కోట్లు ఇవ్వండి

నితిన్‌గడ్కరీకి దేవినేని లేఖ

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు 2013-14 ధరల ప్రకారం సవరించిన అంచనాలు ఆమోదించే లోపు రూ.10 వేల కోట్లు ఇవ్వాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఏపీ జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఒక లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ పరంగా పరిష్కరించాల్సిన సమస్యలకు సంబంధించి సంబంధిత అధికారులతో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో విన్నవించారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.1400 కోట్లు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు.

కోస్తాలో నేడు భారీ వర్షాలు

సముద్రం చురుగ్గా ఉండే అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: నైరుతీ రుతుపవనాలు రాయలసీమ, దక్షిణ కోస్తా మీదుగా ఉత్తరకోస్తా వైపు విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం కళింగపట్నం వరకు విస్తరించినట్లు వాతావరణశాఖ తెలిపింది. శనివారంలోపు ఉత్తరకోస్తా అంతటా వ్యాపిస్తాయని వెల్లడించింది. వాయువ్య బంగాళాఖాతాన్ని కలుపుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం శనివారంలోపు అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారంలోపు ఇది వాయుగుండంగా మారి బంగ్లాదేశ్ తీరం దిశగా కదలొచ్చని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కోస్తాంధ్రలోని అన్ని జిల్లాల్లోనూ భారీ వర్ష సూచన ఇచ్చారు. తీరం వెంబడి సముద్రం చురుగ్గా ఉండొచ్చని, అలలు ఉద్ధృతంగా ఎగిసిపడతాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. సముద్రం నుంచి నైరుతీ దిశగా బలమైన గాలులు వీస్తున్నాయని, ఇవి గంటకి 45-50 కిలోమీటర్ల వేగంతో కదిలే అవకాశం కనిపిస్తోందని పేర్కొంది. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదంటూ హెచ్చరికలు జారీ చేసింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అమలాపురంలో 11 సెం.మీ, చోడవరం, పలాస, ఆత్మకూరు (కర్నూలు), మంత్రాలయంలో 5 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

గ్రహం అనుగ్రహం

9-6-2018 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
దశమి: ఉ. 8-29 తదుపరి ఏకాదశి
రేవతి నక్షత్రం: రా. 7-33 తదుపరి అశ్విని
అమృత ఘడియలు: సా. 5-06 నుంచి 6-44 వరకు
వర్జ్యం: ఉ. 7-17 నుంచి 8-55 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-28 నుంచి 7-12 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-29

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	39.2	27.5
నెల్లూరు	39.0	29.0
కడప	37.0	27.0
రాజమహేంద్రవరం	37.0	26.0
ఒంగోలు	36.9	28.3
అనంతపురం	36.2	27.5
గుంటూరు	36.1	25.1
శ్రీకాకుళం	36.0	28.0
విజయవాడ	35.6	26.5
విశాఖపట్నం	34.8	26.8
నరసాపురం	33.6	26.6
కర్నూలు	32.1	24.8
హైదరాబాద్	31.5	24.4
తాడేపల్లిగూడెం	30.5	26.6

జట్టులో 11 మంది ఆటగాళ్లుండాలి.. కనీసం ఏడుగురున్నా మ్యాచ్ ఆడేయొచ్చు.. మైదానంలో బంతిని చేత్తో పట్టుకుంటే ఫౌల్.. కానీ బంతి మైదానం దాటితే మాత్రం చేతితోనే విసరాల్సివుంటుంది.. కొన్నిసార్లు గోల్ అయినా గోల్ ఇవ్వరు.. గోల్ చేయకుండా ప్రత్యర్థిని అడ్డుకున్నా ఒప్పుకోరు.. తప్పు చేస్తే హెచ్చరిస్తారు.. హద్దుమీరితే బయటికి గెంటేస్తారు.. ప్రపంచం మెచ్చిన క్రీడ ఫుట్‌బాల్‌లో ఇలాంటి చిత్రాలెన్నో..! మరికొద్ది రోజుల్లో ప్రపంచ సాకర్ సంబరం ఆరంభంకానున్న నేపథ్యంలో కాల్బంతిలో నిబంధనలేమిటో ఓసారి చూద్దామా..!

- క్రికెట్లానే ఫుట్‌బాల్ జట్టులోనూ 11 మంది సభ్యులుంటారు. ఇందులో 10 మంది ఫీల్డ్ ప్లేయర్లు కాగా.. ఒకరు గోల్‌కీపర్. ఆట జరుగుతున్న సమయంలో అతడు మాత్రమే బంతిని చేతితో తాకే వీలుంటుంది.
- ఒక మ్యాచ్‌లో ముగ్గురికి మించి సబ్‌స్టిట్యూట్లను అనుమతించరు. ఆటగాడికి బదులుగా వచ్చే సబ్‌స్టిట్యూట్ హాఫ్‌వే లైన్ దగ్గర నుంచే.. మైదానంలోకి రావాల్సివుంటుంది.
- ఓ జట్టు మ్యాచ్‌లో పోటీపడాలంటే కనీసం ఏడుగురు ఆటగాళ్లుండాలి. ఏదైనా కారణాలతో లేదా రెడ్ కార్డుల కారణంగా ఆ సంఖ్య ఏడుకు తగ్గితే.. వెంటనే మ్యాచ్‌ను ఆపేసి ప్రత్యర్థి జట్టుకు విజయాన్ని కట్టబెడతారు.

కాల్బంతిలో కకా.. కికీ.. కుకూ..

రిఫరీకి తోడుగా సాంకేతికత..

ఫుట్‌బాల్‌లో ఆటగాళ్ల తప్పొప్పులను.. గోల్ అయ్యిందా లేదా అన్నది నిర్ణయించాల్సిన అధికారి రిఫరీ. క్రికెట్లోలా రిఫరీ మైదానం బయట ఉండడు. ఆటగాళ్లతో పాటే.. బంతితో పాటు మైదానంలో పరుగెడుతుంటాడు. తప్పు చేసిన ప్రతీసారి మ్యాచ్‌ను ఆపి సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఆయనదే. ఐతే బంతి ఆఫ్‌సైడ్‌లో ఉందా.. టచ్ లైన్ దాటిందా అన్న విషయంలో అతడికి తోడ్పాటు అందించేందుకు ఇద్దరు లైన్ అంపైర్లు అంటారు. ఈసారి ఫిఫా ప్రపంచకప్‌లో రిఫరీకి కాస్త వెసులుబాటు దొరకనుంది. సాంకేతికత ఉపయోగించే సౌకర్యం అతడికి ఉంది. వీడియో అసిస్టెంట్ రిఫరీలు (వీఏఆర్) అతడికి సహాయం అందిస్తారు. సందేహం వచ్చినప్పుడు నివృత్తి చేసుకునేందుకు అతడి వీఏఆర్ సహాయం కోరతాడు. రిప్లేలో పరిశీలించాక రిఫరీ తుది నిర్ణయం తీసుకుంటాడు.

రెండు చేతుల్తో విసరాల్సిందే..

బంతి టచ్ లైన్ దాటితే ప్రత్యర్థి జట్టుకు త్రో ఇన్ అవకాశం లభిస్తుంది. ఆటగాడు రెండు కాళ్లను నేలపై ఉంచి, రెండు చేతులతో బంతిని మైదానంలోకి విసరాలి. నిబంధన ప్రకారం చేయకపోతే ప్రత్యర్థి జట్టుకు త్రో ఇన్ అవకాశం దక్కుతుంది.

తప్పు చేస్తే కిక్

ప్రత్యర్థిని కొట్టినా, పడగొట్టినా అందుకు ప్రయత్నించినా, అడ్డుకున్నా, ప్రత్యర్థిపై దూకినా, ఉమ్మినా, ఉద్దేశపూర్వకంగా బంతిని పట్టుకున్నా దాన్ని ఫౌల్‌గా పరిగణిస్తారు.

- వీటిలో ఏ ఉల్లంఘనకు పాల్పడినా రిఫరీ ప్రత్యర్థి జట్టుకు డైరెక్ట్ ఫ్రీకిక్ ఇస్తాడు.
- ఇదే ఉల్లంఘనను పెనాల్టీ ప్రాంతంలో చేస్తే ప్రత్యర్థి జట్టుకు పెనాల్టీ లభిస్తుంది.
- ఆటగాడు ప్రమాదకరంగా ఆడినా, ప్రత్యర్థి లయను దెబ్బతీసేందుకు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నా.. ప్రత్యర్థి జట్టుకు ఇన్‌డైరెక్ట్ ఫ్రీకిక్ దక్కుతుంది.

ఫ్రీకిక్

ఫ్రీకిక్‌లో రెండు విభాగాలుంటాయి. ఆటగాడి తప్పు స్థాయిని ఆధారంగా ప్రత్యర్థి జట్టుకు రిఫరీ ఈ అవకాశాన్ని కల్పిస్తాడు. డైరెక్ట్ ఫ్రీకిక్ ద్వారా ఆటగాడు బంతిని నేరుగా ప్రత్యర్థి గోల్‌లోకి కొట్టొచ్చు. ఇన్‌డైరెక్ట్ ఫ్రీకిక్ ద్వారా ఆ అవకాశం ఉండదు. బంతిని గోల్‌లోకి పంపే ముందు దాన్ని మరో ఆటగాడికి కచ్చితంగా అందించాలి.

పెనాల్టీ కిక్

పెనాల్టీ ప్రాంతంలో ఫౌల్ చేస్తే ప్రత్యర్థి జట్టుకు పెనాల్టీ కిక్ లభిస్తుంది. బంతిని పెనాల్టీ స్పాట్‌పై ఏర్పాటు చేసి.. ప్రత్యర్థి గోల్‌పై దాడి చేసే అవకాశాన్ని ఆటగాడికి రిఫరీ కల్పిస్తాడు. ఈ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు పెనాల్టీ బాక్స్ ఆవల ఉండాలి. ఆటగాడు కిక్ చేసిన వెంటనే వారు బాక్స్ లోపలికి రావొచ్చు.

కిక్ ఆఫ్

సెంటర్ స్పాట్ నుంచి బంతిని కొట్టి ఆటను ఆరంభించడాన్ని కిక్ ఆఫ్ అంటారు. ఎవరు ఆటను ఆరంభించాలన్నది టాస్ ద్వారా నిర్ణయిస్తారు. టాస్ గెలిచిన కెప్టెన్ ఆటను ఆరంభించడం లేదా తనకు ఏ గోల్‌పోస్ట్ కావాలన్నది నిర్ణయించుకోవచ్చు. ప్రతి భాగం ఆరంభంలో, గోల్ కొట్టిన సమయంలో కిక్ ఆఫ్ చోటు చేసుకుంటుంది. ఓ జట్టు గోల్ చేస్తే.. ప్రత్యర్థి జట్టుకు తిరిగి ఆటను ఆరంభించే అవకాశం లభిస్తుంది. కిక్ ఆఫ్ ద్వారా నేరుగా బంతిని గోల్‌లోకి పంపొచ్చు. అలా గోల్స్ అయినా సందర్భాలూ ఉన్నాయి.

హద్దుమీరితే కార్డు పడుతుంది..

ఆటగాళ్లను నియంత్రణలో ఉంచేందుకు రిఫరీలు కఠినంగా వ్యవహరిస్తారు. హద్దుమీరి ప్రవర్తిస్తే పసుపు, ఎరుపు కార్డులు చూపించి చర్యలు తీసుకుంటారు.



పసుపు.. ఆటగాడిని హెచ్చరించేందుకు ఈ కార్డును ఉపయోగిస్తారు. క్రీడాస్ఫూర్తికి భిన్నంగా నడుచుకున్నా, నిబంధనలు ఉల్లంఘించినా, చేష్టలతో గానీ మాటలతో గానీ రిఫరీపై అసంతృప్తి వ్యక్తంచేసినా, ఆటకు అంతరాయం కలిగించినా, రిఫరీ అనుమతి లేకుండా మైదానంలో అడుగుపెట్టినా, వీడినా పసుపు కార్డుతో సదరు ఆటగాడిని రిఫరీ హెచ్చరిస్తాడు. అయినా ఆటగాడు మ్యాచ్‌లో కొనసాగే వీలుంటుంది. ఐతే ఒకే మ్యాచ్‌లో రెండో ఎల్లో కార్డు ఎదుర్కొంటేనే ప్రమాదం.

ఎరుపు..: తీవ్ర తప్పిదం చేసినా, ప్రమాదకరంగా ప్రవర్తించినా, ప్రత్యర్థిపై ఉమ్మినా, ఉద్దేశపూర్వకంగా బంతిని చేత్తో అడ్డుకుని ప్రత్యర్థి జట్టు గోల్ అవకాశాన్ని వృథా చేసినా, అసభ్యకరంగా లేదా అనుచితంగా ప్రవర్తించినా రిఫరీ వెంటనే ఆటగాడికి రెడ్ కార్డు చూపించి అతడిని మైదానం నుంచి గెంటేస్తాడు. ఆటగాడు ఒకవేళ ఒకే మ్యాచ్‌లో రెండో పసుపు కార్డు ఎదుర్కొంటే.. వెంటనే అతడికి రెడ్ కార్డును చూపించి బయటికి పంపించేస్తారు.

- సాధారణంగా ఫిఫా ప్రపంచకప్ లాంటి టోర్నీల్లో పసుపు కార్డు నిబంధనల్లో మార్పులుంటాయి. ఒకే మ్యాచ్‌లో కాకుండా.. టోర్నీలో వేర్వేరు మ్యాచ్‌ల్లో రెండు పసుపు కార్డులు ఎదుర్కొంటే అతడిపై ఓ మ్యాచ్ నిషేధం పడుతుంది.

గీత దాటితేనే గోల్

బంతి గోల్‌లైన్‌ను పూర్తిగా దాటినప్పుడే దాన్ని గోల్‌గా పరిగణిస్తారు. అత్యధిక గోల్స్ సాధించిన జట్టు మ్యాచ్‌లో విజయం సాధిస్తుంది..

మ్యాచ్ 45 నిమిషాల నిడివి గల రెండు భాగాల్లో సాగుతుంది. మ్యాచ్‌లో ఆటగాళ్ల గాయాలు, సబ్‌స్టిట్యూట్‌ల రాక కారణంగా వృథా అయ్యే సమయాన్ని లెక్కేసి.. సంబంధిత భాగం ముగిసిన వెంటనే ఆ సమయాన్ని ఆడిస్తారు. ఇంజూరీ సమయం ఎంత అన్నది రిఫరీ నిర్ణయిస్తాడు. టోర్నీల్లో కచ్చితంగా మ్యాచ్ ఫలితం తేలాల్సివస్తే.. నిర్ణీత సమయం ముగిశాక అదనపు సమయం కేటాయిస్తారు. ఇందులో 15 నిమిషాల నిడివిగల రెండు భాగాలుంటాయి. అదనపు సమయం పూర్తయినా స్కోరు సమంగా ఉంటే.. షూటౌట్ ద్వారా ఫలితాన్ని రాబడతారు.

ఆఫ్‌సైడ్

బంతిని గోల్‌లోకి పంపినా రిఫరీ దాన్ని నిరాకరించడం ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో చూస్తుంటాం. అందుకు ప్రధాన కారణం ఆఫ్‌సైడ్! మరి ఈ నిబంధనేంటో చూద్దాం..

- కింది చిత్రంలో ఒకటో నంబర్ ఆటగాడు ఆఫ్‌సైడ్ ప్రాంతంలో ఉన్నాడు. మూడో నంబర్ ఆటగాడు అతడికి పాస్ అందిస్తే అది ఆఫ్‌సైడ్ ఉల్లంఘనే. అప్పుడు ప్రత్యర్థి జట్టుకు ఇన్‌డైరెక్ట్ ఫ్రీకిక్ లభిస్తుంది.
- గోల్‌కిక్, త్రో ఇన్, కార్నర్ కిక్‌ల విషయంలో ఆఫ్‌సైడ్ వర్తించదు.

మైదానంలో డిఫెన్స్ జట్టులోని ఆటగాళ్ల స్థితి ఆధారంగా ఆఫ్‌సైడ్ ప్రాంతం తెలుస్తుంది. బంతిని అందుకునే సమయంలో అతడు గోల్‌పోస్ట్‌కు కనీసం ఇద్దరు డిఫెండర్ల ఆవల ఉండాలి. రక్షణశ్రేణిలో చివరి రెండో డిఫెండర్ (2) నిల్చున్న చోటు నుంచి గోల్‌లైన్ వరకు ఉన్న ప్రాంతాన్ని ఆఫ్‌సైడ్‌గా పరిగణిస్తారు. సహచరుడు పాస్ అందించే సమయానికి ఆఫ్‌సైడ్‌లో ఉన్న ఆటగాడు గోల్ చేసినా దాన్ని గోల్‌గా పరిగణించారు.

ఈ చిత్రంలో ఆఫ్‌సైడ్‌ను తప్పించుకోవాలంటే మూడో నంబర్ ఆటగాడు బంతిని పాస్ చేయగా.. నాలుగో నంబర్ ఆటగాడు పరుగెత్తుకుంటూ వెళ్లి దాన్ని అందుకోవాలి.

కార్నర్ కిక్

ఆటగాడు తమ జట్టు గోల్ లైన్ మీదుగా (గోల్ కానప్పుడు) బంతిని పంపిస్తే.. ప్రత్యర్థి జట్టుకు కార్నర్ కిక్ ప్రదానం చేస్తారు. బంతిని కార్నర్‌లో ఉంచి.. మైదానంలోకి కొడతారు. కార్నర్ కిక్ ద్వారా నేరుగా గోల్ చేయొచ్చు.

అప్పుడు పాల్.. ఇప్పుడు చెవిటి పిల్లి

అది 2010 ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్. తుది పోరులో స్పెయిన్ గెలుస్తుందని పాల్ చెప్పింది. పాల్ చెప్పినట్లుగానే స్పెయిన్ విజేతగా నిలిచి కప్పు అందుకుంది. అంత కచ్చితంగా ఫలితాలను అంచనావేసిన పాల్ క్రీడా రంగంలో తలపండిన విశ్లేషకురాలు అనుకుంటే మీరు సెల్ఫ్ గోల్ చేసినట్లే! ఎందుకంటే పాల్ అనేది మనిషి కాదు. అదో ఆక్టోపస్. ఆ ప్రపంచకప్‌లో అది చెప్పిన మ్యాచ్ ఫలితాలు చాలా వరకు నిజమయ్యాయి.

ఐతే ఆ ప్రపంచకప్ తర్వాత ఆక్టోపస్ కథ ముగిసింది. ఇక ప్రస్తుత ప్రపంచకప్‌లో దృష్టి మొత్తం అచిల్లెస్‌పై కేంద్రీకృతమైంది. అచిల్లెస్ అనేది రష్యాకు చెందిన పిల్లి. ఈసారి ప్రపంచకప్ మ్యాచ్‌ల ఫలితాల్ని అంచనా వేయడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంది. 2017 కాన్ఫెడరేషన్ కప్‌లో ఈ పిల్లి చెప్పినట్లుగానే ఫలితాలు రావడంతో అందరూ దీని గురించే మాట్లాడుకుంటున్నారు. సెయింట్‌బర్గ్‌లోని మ్యూజియంలో ఉండే ఈ తెల్లపిల్లి అంచనాలు వేయడంలో దిట్టగా పేరు పొందింది. ఆహారం నింపిన రెండు వేర్వేరు పాత్రల్లో మ్యాచ్‌లో తలపడనున్న జట్ల జాతీయ పతాకాలను విడివిడిగా పెడతారు. ఈ పిల్లి ఏదో ఒక పాత్రలోని ఆహారాన్ని తీసుకుంటుంది. ఆ పాత్రలో ఉన్న జాతీయ పతాకం గల జట్టు విజేతగా నిలుస్తుందన్న అంచనాకు వస్తారు. మరో విశేషం ఏమిటంటే ఈ పిల్లి చెవిటిది. కాబట్టి విజేతను అంచనా వేస్తున్నపుడు మాటలతో దాన్ని ప్రభావితం చేయలేరు. మరి 2018 ప్రపంచకప్‌లో ఈ పిల్లి అంచనాలు ఎలా ఉంటాయో చూద్దాం!

సంబరాల్లో ఇదో రకం!

ఫుట్‌బాల్ మ్యాచ్ చూడటానికి వచ్చే అభిమానులు మైదానాల్లో చేసే సందడి అంతా ఇంతా కాదు. తమ జట్టు గోల్ కొట్టినపుడు, విజయం సాధించినపుడు వాళ్ల సంబరాలు మామూలుగా ఉండవు. ఐతే ఈ సంబరాలు చేసుకోవడంలో కొన్ని దేశాల అభిమానులకు ప్రత్యేకత ఉంటుంది. ఎనిమిదేళ్ల కిందట దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చిన ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో వువుజెలాలు ఎంత సందడి చేశాయో గుర్తుండే ఉంటుంది. విపరీతమైన శబ్దం చేసే ఆ పీకలతో స్టేడియాల్ని హోరెత్తించేశారు సఫారీ అభిమానులు. ఈసారి రష్యా ఆతిథ్యమివ్వబోయే ప్రపంచకప్‌లో మరో కొత్త రకం సంబరాలు చూడబోతున్నాం. ఐస్‌లాండ్ అభిమానులు తమకే సొంతమైన 'వైకింగ్ క్లాప్స్'తో స్టేడియాలకు కొత్త కళ తేబోతున్నారు. మైదానాల్లో చప్పట్లు కొట్టడం ఎవ్వరైనా చేసే పనే. ఐతే ఐస్‌లాండ్ అభిమానుల చప్పట్లు చాలా భిన్నంగా ఉంటాయి. అవి చాలా లయబద్ధంగా సాగుతాయి. మైదానంలో వేలాది మంది అభిమానులు ఒకేసారి లేచి నిలబడి చక్కటి సమన్వయంతో చప్పట్లు చరుస్తారు. ఈ చప్పట్ల మధ్యలో డ్రమ్‌ల శబ్దం కూడా అంతే లయబద్ధంగా ఉంటుంది. దాన్ని అనుసరించి మధ్య మధ్యలో విరామం ఇస్తూ అభిమానులు చప్పట్లు చరుస్తారు. ముందు నెమ్మదిగా మొదలై.. ఆ తర్వాత అది వేగం పుంజుకుంటుంది. శబ్దం కూడా పెరుగుతుంది. అంతకంతకూ జోరు పెరిగి ఒక దశ దాటాక స్టేడియం హోరెత్తిపోతుంది. కొన్నిసార్లు ఆటగాళ్లు సైతం అభిమానులతో జత కలుస్తుంటారు. మైదానం నుంచి లయబద్ధంగా చప్పట్లు చరుస్తుంటారు. ఐస్‌లాండ్ అభిమానులు మొదలుపెట్టిన ఈ వైకింగ్ క్లాప్స్ సంస్కృతిని తర్వాత వేరే దేశాల వాళ్లూ అందిపుచ్చుకున్నారు. ఇది ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్న ఇంటర్ కాంటినెంటల్ కప్‌లో ఛెత్రి 100వ అంతర్జాతీయ మ్యాచ్‌లో భారత్ గెలిచిన అనంతరం భారత అభిమానులు కూడా వైకింగ్ క్లాప్స్‌తో హోరెత్తించారు. రాబోయే ప్రపంచకప్‌లో ఐస్‌లాండ్ ఆడేవాటితో పాటు వేరే మ్యాచ్‌ల్లోనూ వైకింగ్ క్లాప్స్ సందడి చూడొచ్చు!

www.relaxofootwear.com | Download ShopatRelaxo app on
Shop online at www.shopatrelaxo.com
• All names, logos & brands used here are property of their respective owners and are being used for identification purpose only, which does not imply any endorsement • Product images shown are for representation purpose only, actual may vary. Colour may vary due to printing limitations.
RELAXO AUTHORISED DISTRIBUTORS: Guntur: Jaiomkar Enterprises, Ph: 7386609375; Nellore: S.R.R Agencies, Ph: 9440455132; Ongole: Reethikaa Agency, Ph: 9290046204; Sri Lakshmi Srinivasa Associates, Ph: 9441326697; Vijayawada: Gowel Footwear, Ph: 9849534501; Paramount Footwear, Ph: 9849083061; Popular Footwear, Ph: 9848886457; Sri Annapurna Agencies, Ph: 9292550555; Shyam Enterprises, Ph: 9885777012.
Franchisee enquiries solicited for Relaxo Exclusive Stores, contact: Ashish Tyagi +91 9891279070, Email: ashishtyagi@relaxofootwear.com
/SparxGoForIt
Flipkart | amazon.in | paytm | snapdeal | AJIO.com | Myntra | WALKWAY | more. MEGASTORE | D Mart | METRO Cash & Carry

ఈనాడు సినిమా

తమన్నా

త్యాగాలు చేయాల్సిందే!

"ఏదో ఒక కొత్త విషయం నేర్పించకుండా సినిమా సెట్ బయటికి పంపదు. కాకపోతే నేర్చుకోవాలనే తపన మనలో ఉండాలంతే" అంటోంది తమన్నా. పుష్కరకాలంగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న అగ్ర కథానాయిక ఈమె. త్వరలోనే 'నా నువ్వే'తో సందడి చేయనున్న ఆమె, కొత్త చిత్రం 'దటీజ్ మహాలక్ష్మి' కోసం సెట్‌లో బిజీ బిజీగా గడుపుతోంది. "పన్నెండేళ్లుగా నటిస్తూనే ఉన్నా. పని లేకుండా గడిపిన రోజులు చాలా అరుదు. ఉదయం లేవగానే ఒక ఉత్సాహం మనసును తరుముతూ ఉంటుంది. ఆ ఉత్సాహం కొత్త పాత్రలు, సినిమా సెట్టే ఇస్తుంటాయి. ప్రతి పాత్ర, రోజూ సెట్‌లో గడిపే క్షణాలు ఏదో ఒక విషయాన్ని నేర్పిస్తూనే ఉంటాయ"ని చెబుతోంది తమన్నా. సినిమాల కోసం వదులుకొన్న విషయాలేమైనా ఉన్నాయా అని అడిగితే.. "సినిమా రంగం అంటే పేరు, డబ్బే కాదు... కొన్ని త్యాగాలు కూడా' ' అని సెలవిచ్చింది తమన్నా.

'సిల్లీ ఫెలోస్' హంగామా

కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి, భీమనేని శ్రీనివాస్‌రావు, సునీల్, చిత్ర శుక్లా, అల్లరి నరేష్

అల్లరి నరేష్, సునీల్ కథానాయకులుగా భీమనేని శ్రీనివాస్‌రావు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. చిత్ర శుక్లా కథానాయిక. కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి, వివేక్ కూచిభొట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'సిల్లీఫెలోస్' అనే పేరును ఖరారు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ "మూడేళ్లపాటు కథని సిద్ధం చేసి ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు దర్శకుడు భీమనేని. సినిమాకి సునీల్ కూడా తోడవడం ఆనందంగా ఉంది" అన్నారు. సునీల్ మాట్లాడుతూ "మళ్లీ హాస్యంతో అలరించబోతున్నా. ఒకప్పటి హాస్య భరితమైన చిత్రాల్ని తలపించేలా ఉంటుందీ 'సిల్లీఫెలోస్'. ఇలాంటి చిత్రాల్ని భీమనేని మాత్రమే తీయగలరు" అన్నారు. భీమనేని శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ "ప్రేక్షకులు ఏదైతే ఊహిస్తారో అది ఈ సినిమాలో ఉంటుంది. అల్లరి నరేష్, సునీల్ తపనతో పనిచేశారు. చిత్ర శుక్లా క్లిష్టమైన పాత్రలో చక్కగా నటించింది" అన్నారు. "మా సంస్థ నుంచి వస్తున్న మూడో చిత్రమిది. వరుసగా మరో విజయం మాకు లభించడం ఖాయం" అన్నారు నిర్మాతలు.

ఆ మంచితనం వందేళ్లూ ఉంటుంది!

స్వప్నదత్, రకుల్‌ప్రీత్ సింగ్, విజయ్, లక్ష్మీప్రసన్న, మోహన్‌బాబు, శిల్పారెడ్డి, వివేక్ కూచిభొట్ల, సమ్రాట్

"ప్రతినాయకుడిగా నటించేందుకు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టా. నా కూతురు లక్ష్మీప్రసన్న కూడా తొలి సినిమాలోనే ప్రతినాయికగా నటించింది, నంది పురస్కారాన్ని సొంతం చేసుకొంది. నాకు ఈ రోజు వరకూ నంది పురస్కారం లేదు. లక్ష్మీప్రసన్న మంచి నటి. దాని కంటే కూడా క్రమశిక్షణ విషయంలో తనని మెచ్చుకొంటా" అన్నారు ప్రముఖ నటుడు మోహన్‌బాబు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'వైఫ్ ఆఫ్ రామ్' ట్రైలర్ ఆవిష్కరణ వేడుకకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లక్ష్మీ మంచు ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రమిది. విజయ్ యెలకంటి దర్శకత్వం వహించారు. టి.జి.విశ్వప్రసాద్, లక్ష్మీ మంచు సంయుక్తంగా నిర్మించారు. రకుల్‌ప్రీత్ సింగ్, స్వప్న దత్, శిల్పారెడ్డి, వంశీకృష్ణ తదితరులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఈ వేడుకలో మోహన్‌బాబు ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "లక్ష్మీని నమ్మి, డబ్బు పెట్టానని నిర్మాత అన్నారు. ఆ విషయంలో నేను చాలా గర్వపడుతున్నా. జయాపజయాలు పక్కపెడితే మోహన్‌బాబు కుటుంబం ఎప్పుడూ మోసం చేయదు. ఆ మంచితనం వందేళ్లూ ఉంటుంది. కానీ నిర్మాత నిర్మాతగా ఉండాలి. సెట్స్‌కి రావాలి, నిర్మాణానికి ఎక్కడ ఎంత వ్యయమవుతుందో చూసుకోవాలి. ఈ సినిమా ట్రైలర్ చాలా బాగుంది. నటీనటులకి, సాంకేతిక నిపుణులకి ఈ సినిమా మంచి ఫలితాన్ని తీసుకురావాలని కోరుకొంటున్నా" అన్నారు. లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ "ఏ దశలోనూ నటిని కావాలని కోరుకోని నేను ఇప్పుడు ఈ వేదికపై ఉన్నానంటే అందుకు కారణం మా నాన్నే. ఆయనే నాకు పెద్ద బహుమానం. క్రమశిక్షణ అనే పునాదులపై పెరిగాం మేం. మోహన్‌బాబు కూతురిగా కాకుండా సొంత ప్రతిభతో ఎదిగే ప్రయత్నం చేస్తున్నా. ఈ సినిమా వెనక ఎంతోమంది ప్రతిభావంతులున్నారు. నిర్మాత నన్ను పూర్తిగా నమ్మడంతో నాపై మరింత బాధ్యత పెరిగింది. దర్శకుడు విజయ్ తనే ఒక నిర్మాతగా ఆలోచించి ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ సినిమా ప్రేక్షకుల్ని థ్రిల్ చేస్తుందని నమ్మకంగా చెబుతాన" న్నారు. "లక్ష్మీప్రసన్న చేసిన షోలు, వెబ్ సిరీస్‌లు, సినిమాలు గుర్తుకొస్తే మేం చేయాల్సింది చాలా ఉందనిపిస్తుంది. ఒకేసారి ఎన్నో పనులు చేస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది తను. ఈ సినిమాతో పెద్ద విజయం అందుకోవాలని కోరుకొంటున్నాన"న్నారు స్వప్న దత్. రకుల్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ "నాకు థ్రిల్లర్ కథలంటే ఇష్టం. ఇది విజయ్ చేసిన తొలి సినిమా అనిపించడం లేదు. అందరికంటే ముందుగా ఈ ట్రైలర్‌ని నేనే చూశా. అలాగే కొన్ని సన్నివేశాలు కూడా చూశా. బాగా నచ్చాయి. ఈ చిత్రబృందానికి, నా స్నేహితురాలు లక్ష్మీకి అభినందనలు" అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శి, శ్రీకాంత్, సమ్రాట్, శిల్పారెడ్డి, వివేక్ కూచిభొట్ల తదితరులు పాల్గొన్నారు.

పంచ్ డైలాగ్

లైఫ్‌లో కష్టం వచ్చిన ప్రతిసారి లైఫ్‌ను వదులుకోం. ప్రేమను మాత్రం వదులుకుంటాం. కానీ నేను వదలను. ఎందుకంటే నేను ప్రేమించా.

చిత్రం: జయజానకి నాయక
– పంపినవారు: ఈ. శ్రీను, గంగాధరపురం

గీతోపదేశం

రన్.. లైఫు అంటే రేసురా రన్
నీ కలల ఛేజురా రన్
గెలిచేంతవరకూ రన్ రన్
నిలబడకు ఎక్కడా రన్
తడబడకు ఎచ్చటా రన్
సాధించే వరకూ రన్ రన్

గీతం: రన్.. లైఫు అంటే రేసురా రన్...
చిత్రం: బ్రూస్‌లీ, రచన: శ్రీమణి
– పంపినవారు: పి.ఓబయ్య, రాయచోటి

కమల్ హాసన్

మూడు భాషల్లో ముగ్గురితో...

కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'విశ్వరూపం' విజయవంతమైంది. దానికి కొనసాగింపుగా 'విశ్వరూపం 2' తెరకెక్కింది. అంచనాలతో ఆసక్తిని రేకెత్తిస్తున్న ఆ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నెల 11న ట్రైలర్‌ని విడుదల చేయబోతున్నారు. మూడు భాషల్లో ముగ్గురు ప్రముఖులతో ట్రైలర్‌ని విడుదల చేయిస్తున్నారు. హిందీలో ప్రముఖ కథానాయకుడు ఆమీర్‌ఖాన్, తమిళంలో శ్రుతిహాసన్, తెలుగులో ఎన్టీఆర్ ట్రైలర్‌ని విడుదల చేయబోతున్నారు. స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో పూజాకుమార్, ఆండ్రియా, రాహుల్‌బోస్ తదితరులు నటించారు.

దొంగలు పడ్డారు!

గౌతమ్, పూరి జగన్నాథ్, ఖయ్యూం, షానీ

ఖయ్యూమ్, తనిష్క్ రాజన్, షానీ, పృథ్వీ రాజ్, సమీర్, లోహిత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దేశంలో దొంగలు పడ్డారు'. గౌతమ్ రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. రమా గౌతమ్ నిర్మాత. ఈ సినిమా టీజర్‌ని ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సినిమా పేరు ఆలోచింపజేసేలా ఉంది. టీజర్ కూడా చూడగానే నచ్చింది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నేరం నేపథ్యంలో సాగే థ్రిల్లర్ కథ ఇది. సమాజంలో జరుగుతున్న విషయాలు ఈ చిత్రంలో ప్రతిబింబిస్తాయి. ఇప్పటిదాకా తెరపై చూడని లొకేషన్లు ఇందులో కనిపిస్తాయి" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ప్రేక్షకుడికి కొత్త అనుభూతిని పంచే చిత్రమిది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. "పూరి జగన్నాథ్ చేతులమీదుగా టీజర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. నటుడిగా తృప్తినిచ్చిన చిత్రమిది" అన్నారు ఖయ్యూం.

మనం ప్రేక్షకుల్ని చేరుకోవడంలో ఆలస్యమైంది!

"తెలుగు సినిమాకి తెలుగు పేరు పెట్టి, మేం తెలుగులో పేరు పెట్టామంటూ గొప్పగా చెప్పుకొనే పరిస్థితుల్లో ఉన్నాం. తెలుగులో సినిమా తీసి ఇంకే భాషలో పేరు పెడతాం?" అంటున్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. తెలుగుదనం ఉట్టిపడేలా సినిమాలు తీయడంలో సిద్ధహస్తుడు మోహనకృష్ణ. 'జెంటిల్‌మేన్', 'అమీతుమీ' చిత్రాలతో వరుసగా విజయాల్ని అందుకొన్న ఆయన తాజాగా 'సమ్మోహనం' తెరకెక్కించారు. సుధీర్‌బాబు, అదితిరావు హైదరీ జంటగా నటించిన ఈ చిత్రం ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మోహనకృష్ణ ఇంద్రగంటి శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

✿ ఈమధ్య మీ వేగం పెరిగినట్టుంది?

రెండేళ్ల వ్యవధిలో మూడు సినిమాలు చేశాను. అయితే 14 యేళ్లుగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్నప్పటికీ తొమ్మిది సినిమాలే చేశాను. ఈమధ్య వేగంగా సినిమాలు చేయడానికి కారణం అప్పటికే రాసేసుకొన్న స్క్రిప్టులు నా దగ్గర ఉండటంతోనే. తర్వాత సినిమాకి మాత్రం మరో యేడాది సమయం తీసుకొంటానేమో.

✿ కొత్త స్క్రిప్టుని సిద్ధం చేయడానికి యేడాది పడుతుందా?

నా దగ్గర రచయితలంటూ ఎవ్వరూ ఉండరు. కథ, కథనాలతో పక్కాగా స్క్రిప్టు సిద్ధం చేయడానికి ఆరు నెలల సమయం పడుతుంది. నేను సెట్స్‌పైకి వెళుతున్నానంటే ఇక స్క్రిప్టులో మార్పు అంటూ ఉండకూడదు. సమయం, నిర్మాణ వ్యయం తదితర కారణాలవల్ల చిత్రీకరణే కాస్త ఇబ్బందిగా అనిపిస్తుంది.

✿ సినిమా పేరే 'సమ్మోహనం'గా ఉంది?

తెరపై కూడా రకరకాల సమ్మోహనాలు ఉంటాయి. నా కెరీర్‌లో అన్నీ బాగా కుదిరిన సినిమా ఇదే. సుధీర్ నటన పరంగా, లుక్ పరంగా చాలా బాగుంటాడు. అలాగే అదితిరావు హైదరీ అందంగా ఉంటుంది.

✿ ఈ కథ ఎలా పుట్టింది?

సినిమాలో నరేష్ పోషించిన పాత్రే ఈ సినిమాకి మూలం. 'గోల్కొండ హైస్కూల్' సినిమా చిత్రీకరణ సమయంలో సినిమాలంటే విపరీతమైన అభిమానం ఉన్న ఓ వ్యక్తి నన్ను కలిశారు. అతనికేమో సినిమా అంటే విపరీతమైన పిచ్చి. సినిమా గొప్ప కళ అని చెబుతుంటాడు. అతని కొడుకుకేమో సినిమాలో ఏముందనే ఓ చులకన భావం. అలాంటి పరిస్థితుల్లో ఒక కథానాయిక వీళ్ల జీవితంలోకి ప్రవేశించాక ఏం జరిగిందనే కోణంలో ఈ కథ సాగుతుంది.

✿ సినిమా ప్రపంచం భయంకరమైనదనే మాట ట్రైలర్‌లో వినిపిస్తోంది. అదే విషయాన్ని ఈ చిత్రంతో చెప్పబోతున్నారా?

అది కథానాయకుడి అభిప్రాయం. కానీ అది తప్పని తెలుసుకోవడమే ఈ సినిమా. సినిమా గొప్ప కళ, ప్రతి రంగంలో ఉన్నట్టే ఇందులో కూడా మంచి, చెడు ఉంటాయని మా కథానాయకుడు గుర్తిస్తాడు. అందుకోసం కథానాయిక ఏం చేసిందనేది తెరపైనే చూడాలి. బయట ప్రపంచానికి సినిమా అంటే చులకన భావం ఏర్పడటానికి కారణం మనం ఆడవాళ్ల పాత్రల్ని సృష్టించే విధానమేనా? పరిశ్రమ బయట నుంచి చూసే వాళ్లకి ఎలా కనిపిస్తోంది? తదితర ప్రశ్నల్ని, సమస్యల్ని సంస్కారవంతంగా ప్రస్తావించే ప్రయత్నం మేం చేశాం.

✿ 'అంతకుముందు ఆ తరువాత' సినిమా తర్వాత మీరు చేస్తున్న ప్రేమకథ ఇదే అనుకోవచ్చా?

అందులో ప్రేమ ఎక్కువ సేపు ఉండదు. ఇది దానికి భిన్నంగా ఉంటుంది. అనూహ్యమైన పరిస్థితుల్లో ఒక కథానాయిక, ఒక చిత్రకారుడు ఎలా ప్రేమించుకొన్నారు? ఎలా విడిపోయారు? మళ్లీ ఎలా కలుసుకొన్నారనే కథతో ఈ చిత్రం సాగుతుంది.

✿ 'జెంటిల్‌మేన్' తర్వాత మీరు అగ్ర కథానాయకులతో సినిమాలు చేస్తారని ఊహించారంతా. అటువైపు ఎందుకు దృష్టిపెట్టడం లేదు?

కచ్చితంగా అగ్ర కథానాయకులతో సినిమాలు చేస్తా. స్టార్లతో సినిమా తీస్తే ఆ మజానే వేరు. నేను చాలా మంది స్టార్లను కలిశా. నాతో సమస్య ఏంటంటే ఒక కథానాయకుడిని దృష్టిలో పెట్టుకొని, ఫార్ములా కథలు రాయను. ఒక కథ రాసుకొన్నాక దానికి ఎవరైతే బాగుంటారా అని ఆలోచించి వెళతాను. వాళ్లకి నచ్చొచ్చు, నచ్చకపోవచ్చు.

✿ ఈమధ్య అగ్ర కథానాయకులు కూడా ఇమేజ్‌ని పక్కనపెట్టి కథతో పాటే ప్రయాణం చేస్తున్నారు. ఈ పరిణామంపై మీ అభిప్రాయం?

చాలా మంచి ట్రెండ్ ఇది. 'రంగస్థలం', 'మహానటి' తదితర చిత్రాలు, విజయాలు మంచి పరిణామం. రామ్‌చరణ్ అలాంటి పాత్రలో కనిపించడం గొప్ప విషయం. ప్రేక్షకులు ఎప్పుడూ అక్కడే ఉన్నారు, మనం వాళ్లని చేరుకోవడంలో ఆలస్యమైందంతే. ప్రేక్షకులు ఏం కావాలనుకొంటున్నారో అది మనం ఇవ్వగలుగుతున్నాం ఇప్పుడు.

✿ కథానాయిక ప్రాధాన్యంతో కూడిన సినిమాలకి మంచి ఆదరణ లభిస్తోంది కదా?

ఆడవాళ్లని చులకన చేస్తూ సినిమాలు తీస్తే డబ్బులు ఎలా వస్తాయి? ఆడవాళ్లని మెచ్చుకొనేలా, వాళ్లని బాగా చూపించిన సినిమా తీస్తే వాళ్లు థియేటర్‌కి వస్తారు. వాళ్ల కుటుంబాన్ని కూడా తీసుకొస్తారు. హీరోయిజాన్ని బాగా చూపించాలని హీరోయిన్‌ని తక్కువ చేయడం ఎంత వరకు సమంజసం? మనం పిలుచుకొనే మన కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌కి పనేమీ ఉండదు. బావా ఎప్పుడు పెళ్లి చేసుకొంటావని హీరో చుట్టూ తిరగడమే ఆమె పని. ఇతర భాషల్లో కథానాయికల పాత్రలు ఇలా ఉండవు.

✿ స్వచ్ఛమైన వినోదంతో సినిమాలు తీసే దర్శకుడు అనే గుర్తింపు మీకుంది. దానిపై మీ అభిప్రాయం?

స్వచ్ఛమైన వినోదం అనే మాటకి పక్కాగా అర్థం తెలియదు. అలాగే కొద్దిమంది సెన్సిబుల్ డైరెక్టర్ అంటుంటారు. అంటే మిగతావాళ్లలో సున్నితత్వం ఉండదా? ఆ రకంగా అయితే మంచి దర్శకుడు అంటే చాలు. శృంగారానికీ, అసభ్యతకీ మధ్య తేడా తెలుసుకొని సినిమా చేస్తే చాలండీ.

పోలీస్ శక్తి

శివ జొన్నలగడ్డ

శివ జొన్నలగడ్డ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. సభ, లిఖిద కథానాయికలు. సురేష్‌రెడ్డి అక్కల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. టి. రమేష్ నిర్మాత. ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ సూర్యనారాయణ క్లాప్‌నిచ్చారు. గుద్దేటి బసవప్ప కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ప్రసన్నకుమార్ టౌరవ దర్శకత్వం వహించారు. కథానాయకుడు మాట్లాడుతూ "నేరాల వెనక చిక్కుముడుల్ని విప్పే ఒక శక్తివంతమైన పోలీసు అధికారి పాత్రలో నటిస్తున్నా. ఆ అధికారికి ఒక కేసు దర్యాప్తులో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయన్నది తెరపైనే చూడాలి. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. నా చిత్రాలకి దర్శకత్వ శాఖలో పనిచేసిన నా శిష్య బృందం కలిసి నాతో ఈ సినిమాని నిర్మిస్తున్నార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇది నా తొలి సినిమా. నేరం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ప్రేమ, రొమాన్స్‌కి ప్రాధాన్యం ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు శివరాం, చేతన్‌తో పాటు చిత్రబృందం పాల్గొంది.

'వీరె...' మరోసారి!

సోనమ్‌కపూర్, శిఖ తలసానియా, స్వరభాస్కర్, కరీనాకపూర్

'వీరె..దె వెడ్డింగ్'... బాలీవుడ్‌లో హాట్ టాపిక్. నలుగురు కథానాయికలు కలిసి తెరపై చేసిన సందడికి ప్రేక్షకులు ఫిదా అయిపోతున్నారు. వసూళ్ల పరంగానూ దూసుకుపోతోందీ చిత్రం. ఈ నెల 1న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఇప్పటికే రూ.57 కోట్లు వసూలు చేసి అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. సోనమ్‌కపూర్, కరీనాకపూర్, స్వరభాస్కర్, శిఖ తలసానియా కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని శశాంక్ ఘోష్ తెరకెక్కించారు. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్ చేసే ఆలోచనలో చిత్ర నిర్మాతలు ఏక్తాకపూర్, రియా కపూర్ ఉన్నట్టు బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రంలో పాత్రలు ప్రేక్షకులకు గుర్తుండేలా ఉండటంతో వాటిని కొనసాగిస్తే బాగుంటుందని ఈ సినిమా సక్సెస్ పార్టీలో చర్చకు వచ్చిందట. కాళింది (కరీనాకపూర్) పెళ్లి కోసం వచ్చిన స్నేహితులు.. వారి జీవితాల చుట్టూ 'వీరె...' కథ సాగుతుంది. కొన్నేళ్లు గడిచాకా ఆ నలుగురు జీవితాల ప్రయాణం ఎలా ఉంటుందో సీక్వెల్‌గా తెరకెక్కిస్తే బాగుంటుందనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్టు సమాచారం. "వీరె..." విజయంతో నిర్మాతలు ఆనందంగా ఉన్నారు. దీంతో సీక్వెల్ ఆలోచన చేస్తున్న మాట వాస్తవమే. ఈ కథ సిద్ధం కావాలంటే మరో ఏడాది అవసరం. ఒక్కసారి కథ ఓకే అయిపోతే ఆ నలుగురి నాయికల డేట్స్ సర్దుబాటు చేయడం తరువాయి సినిమా సెట్స్‌పైకి వెళ్లిపోతుంది" అని ఏక్తాకపూర్ సన్నిహిత వర్గాల చెప్పినట్టు సమాచారం.

నగరాల్లో వాహనాల రద్దీ... గమ్యానికి చేరాలంటే గంటల కొద్దీ ప్రయాణం! పాదచారుల సంగతైతే మరీ ఘోరం. కాలు పెట్టడానికీ, రోడ్లు దాటడానికీ దారి ఉండదు. మార్గం మధ్యలో అలసి కూర్చుందామంటే స్థలమే కనిపించదు. స్టాపులు ఒకచోటుంటే బస్సులు మరో చోట ఆగుతాయి.

కాలు బయట పెడితే చాలు.. సామాన్యుల కష్టాలు అన్నీ కాదు. దేశవ్యాప్తంగా ఉన్న అలాంటి సమస్యలకి పరిష్కారాలు చూపిస్తున్నారు శ్రేయ గాడేపల్లి. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ డెవలప్‌మెంట్ పాలసీ (ఐటీడీపీ) దక్షిణాసియా డైరెక్టర్‌గా పనిచేస్తోన్న ఈ తెలుగు తేజం వసుంధరతో ఆ వివరాలను పంచుకున్నారిలా!

* నేడు నగరాల్లో పార్కింగ్ సమస్య అందరినీ వేధిస్తోంది. అదనపు పార్కింగ్ సౌకర్యం ఈ సమస్యకు పరిష్కారం కాదు. వీధుల్లో ఉన్న వాహనాల రద్దీని నియంత్రించేందుకు రాంచీ, చెన్నై, పుణె నగరాల్లో పార్కింగ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో సాయపడ్డాం. రోజు రోజుకీ పెరుగుతోన్న వాహనాల వల్ల సైకిల్ వాడకం తగ్గిపోతుంది. దీన్ని ప్రోత్సహించడానికి అనేక నగరాల్లో సైకిల్ ట్రాక్‌లు నిర్మించడం, అద్దెకు సైకిల్ తీసుకునే విధంగా సైకిల్ షేరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో సాయపడ్డాం.

ట్రాఫిక్ సమస్యలా... మేం పరిష్కరిస్తాం

* కాలుష్య నియంత్రణ కోసం సైకిల్ రిక్షాలను ఆధునికీకరించాం. ఐదు రకాల ప్రోటోటైపు ద్వారా సుమారు ఐదు లక్షల రిక్షా సైకిళ్లు దేశవ్యాప్తంగా నడుస్తున్నాయి.
* పాదచారులకు అనుకూలంగా పుణె, చెన్నైల్లోని పలు వీధులను ప్రత్యేకంగా పునర్నిర్మించాం.

మనదేశంలో రోజురోజుకీ పట్టణీకరణ పెరుగుతోంది. కానీ దానికి తగ్గట్లుగా రవాణా సదుపాయాలూ, ఇతర సౌకర్యాలు మాత్రం పెరగడం లేదు. వ్యక్తిగత వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్, పాదచారులకు ఇబ్బందులూ, కాలుష్యం వంటివెన్నో సమస్యలు చుట్టుముడుతున్నాయి. దాంతో పట్టణ జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. ఈ సమస్యలన్నింటికీ మెరుగైన పరిష్కారాలు చూపించడమే మా ఐటీడీపీ లక్ష్యం. గత ఇరవై ఏళ్లుగా నేను ఈ సంస్థలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నా. ఇండియాతో పాటు దక్షిణాసియా దేశాల్లోని రవాణా వ్యవస్థలోని లోపాలూ, మెరుగైన పట్టణ జీవనానికి అవసరమైన ప్రాజెక్టులు ఎన్నో చేస్తున్నాం. నేను తెలుగమ్మాయినే. నాన్నది విజయవాడ. అమ్మది రాజమండ్రి. నాన్న వృత్తిరీత్యా నేను పుట్టిపెరిగిందంతా దిల్లీలోనే. ఐఐటీ దిల్లీ పూర్వ విద్యార్థినిని. చదువయ్యాక ఈ రంగంపై ఆసక్తి కలగడంతో ఈ సంస్థలో చేరా. నిజానికి రవాణా రంగంలో పూర్తిగా పురుషులదే హవా. అయినా సరే! నేననుకున్నది సాధించాలనే తపనతో ముందడుగు వేశా. దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టుల రూపకల్పనలో నాదైన ముద్రవేయగలిగా.

ఏం చేస్తామంటే...

మేం ముందుగా పలు ప్రాంతాల్లో పట్టణీకరణ వల్ల ఎదురైన ప్రధాన ఇబ్బందుల్ని గుర్తిస్తాం. ప్రజల సమస్యల్ని సర్వేల రూపంలో తెలుసుకుంటాం. చివరగా వాటికి మెరుగైన పరిష్కారాలను పాలసీల రూపంలో తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. వారిని ఒప్పించి ఆ ప్రాజెక్టులు చేపట్టేలా చేస్తాం. సొంత వాహనాల వాడకను తగ్గించడం, మెరుగైన ప్రజా రవాణా సౌకర్యం, సురక్షితమైన వీధులు నిర్మించడం మా ఎజెండాలోని కీలక అంశాలు. ఇప్పటికే అహ్మదాబాద్, పుణె, చెన్నై వంటి నగరాల్లో ప్రజా రవాణాకి సంబంధించిన సమస్యలను పరిశోధించి బస్సు ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (బీఆర్‌టీస్)ని ప్రతిపాదించాం. 2009 సంవత్సరంలో అహ్మదాబాద్ నగర పురపాలక సంస్థకు జన్‌మార్గ్ పేరుతో మెరుగైన ప్రజారవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడంలో సాయపడ్డాం. అదే విధంగా పుణెలో రెయిన్‌బో పేరుతో బీఆర్‌టీస్ వ్యవస్థని ఏర్పాటు చేశాం. దీనికి మెట్రో నిర్మాణం కంటే వ్యయం తక్కువ. వేగంగానూ పూర్తి అవుతుంది. ఈ విధానంలో రహదారి మధ్యలో బస్సులకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేస్తాం. ఈ మార్గంలో కార్లూ, బైకులూ, లారీ వంటి వాహనాలకు అనుమతించరు. బస్టాపులు కూడా ఈ ప్రత్యేక మార్గంలో ఏర్పాటు అవుతాయి. బస్సు, ప్లాట్‌ఫాం సమాన ఎత్తులో ఉండటం వల్ల వృద్ధులూ, వికలాంగులూ సులువుగా బస్సు ఎక్కగలుగుతారు. అదే కాకుండా ప్రయాణికులకు స్మార్ట్‌కార్డు, పాసెంజర్ ఇన్ఫర్మేషన్ సిస్టం వంటి మెరుగైన సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. రహదారి మధ్యలో ఉండటం, అందులోనూ ప్రత్యేక మార్గం కావడం వల్ల బస్సులు వేగంగా గమ్యానికి చేరుకుంటాయి. మొదట పన్నెండు కిలోమీటర్లతో మొదలైన జన్‌మార్గ్ అంచెలంచెలుగా 99 కిలోమీటర్లకు పెరిగి ప్రతిరోజూ లక్షాయాభైవేల మందిని తమ గమ్యస్థానాలకు చేర్చుతుంది.

ప్రజారవాణా వ్యవస్థ కోసం...

మనకు ఉండే మరో సమస్య కాలుష్యం. దాన్ని నియంత్రించాలనే ఉద్దేశంతో పుణెలో మొదటిసారి బస్‌డే చేయాలంటూ, దానివల్ల కలిగే లాభాల్ని అక్కడి ప్రభుత్వానికి విన్నవించాం. అలా అక్కడ నెలకోసారి బస్‌డే కార్యక్రమం విజయవంతంగా నడుస్తోంది. అంటే ఆ రోజున ఎవరూ తమ సొంత వాహనాలు బయటకు తీయరు. కేవలం బస్సుల్లోనే ప్రయాణిస్తారు. దానికోసం ప్రైవేట్ బస్సుల వారు కూడా సహకరించడం మొదలుపెట్టారు. సాధారణంగా అక్కడ రోజూ పదిహేను వందల బస్సులు తిరిగితే ఆ ఒక్కరోజే సుమారు మూడువేల బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. అక్కడ మాత్రమే కాదు... మా ఐటీడీపీ ద్వారా చెన్నై, తిరుచ్చీ సేలం, మధురై, నాసిక్, ధన్‌బాద్, రాంచీ, జంషెడ్‌పూర్ వంటి చోట్లా మా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

వీధుల పునర్నిర్మాణం...

ప్రతి సమస్యకీ ఒకటే మందు ఉండదు. ఆయా నగర నిర్మాణం ప్రత్యేకతలూ, చారిత్రక అంశాలూ, కట్టడాల వంటివన్నీ కూడా పరిశీలిస్తాం. వాటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే మేం ప్రణాళికలు సిద్ధం చేస్తాం. ఉదాహరణకు రోడ్డు ఇరవై అడుగులు ఉంటే దానికి తగ్గ పరిష్కారాలు చూపిస్తాం. నలభై అడుగుల రోడ్డు ఉంటే... ఫుట్‌పాత్‌లు ఎలా నిర్మించాలీ అనేది ఆలోచిస్తాం. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లూ, పాదచారులకు నడవడానికి లేని రోడ్లు రెండూ ప్రమాదకరమే. రోడ్లపై నడవడం అందరి హక్కు. అందుకే నాన్ మోటరైజ్డ్ పాలసీ విధానాన్ని అమలు చేస్తూ చెన్నైలోని వీధుల్లో కొన్నింటిని పునర్నిర్మించాం. అలానే ఇక్కడ డెబ్బైకిలోమీటర్ల మేరకు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశాం. రానున్న నాలుగేళ్లలో ఐదువందల కిలోమీటర్ల మేర ఇటువంటివి ఏర్పాటు చేయడమే మా లక్ష్యం. తమిళనాడులోని మిగిలిన స్మార్ట్ సిటీల్లోనూ వీటికోసం పని చేస్తున్నాం. వీటితో పాటూ ఆయా పట్టణాల్లో మున్సిపల్ ఇంజినీర్లకు మెరుగైన నగరాన్ని డిజైన్ చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా వర్క్‌షాప్‌లూ నిర్వహిస్తాం.

– స్వాతి కొరపాటి

ఇవీ ఒత్తిడి లక్షణాలే!

బాగా తలనొప్పిగా ఉంటేనో, అవసరానికి మించి బోలెడు పని చేస్తున్నప్పుడో ఒత్తిడికి గురవుతున్నామని అనుకుంటాం. కానీ... మనకు ఎదురయ్యే కొన్ని సమస్యలు కూడా ఒత్తిడికి సంకేతాలే అంటారు మానసిక నిపుణులు.

- ఎంతో చురుగ్గా ఉండే మీరు విపరీతంగా అలసిపోతుంటే అది ఒత్తిడే కావచ్చని చెబుతున్నారు యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా ఎండోక్రైనాలజీ విభాగానికి చెందిన నిపుణులు. మానసికంగానే కాదు, శారీరకంగానూ అలసిపోతుంటాం. రోజులో అవసరానికి మించి ఎక్కువ గంటలు నిద్రపోతున్నా... ఎప్పుడు అవకాశం వచ్చినా విశ్రాంతి పేరుతో నడుము వాల్చాలని చూస్తున్నా... నిర్లక్ష్యం చేయకపోవడం మంచిది.
- బరువు తగ్గుతున్నా లేదా పెరుగుతున్నా కూడా ఒత్తిడికి సంకేతం కావచ్చు. సమస్యలున్నప్పుడు కొందరు అసలు తినడం మానేస్తే, మరికొందరు విపరీతంగా తింటారట. అలా తినడం వల్ల ఊరట పొందుతారట. ముఖ్యంగా ఉప్పూ, తీపి, కొవ్వుశాతం ఎక్కువగా ఉన్న పదార్థాలు ఇష్టపడతారు. ఇవన్నీ కలిసి అధికబరువు పెరిగేందుకు దారి తీస్తాయి. అందుకే బరువు పెరుగుతున్నామనుకుంటే ఒత్తిడి ఉందేమో గమనించుకోవాలి.
- మన మనసు బాలేదనే పేరుతో టీవీ చూడటం మొదలుపెడతాం. గంటల తరబడి టీవీ ముందు కూర్చోవడం వల్ల ఆ ప్రభావం నిద్రపై పడుతుంది. అలా నిద్రలేమి సమస్య ఎదురవుతుంది. దాంతో శరీరానికి అవసరమైన ఏడెనిమిది గంటల నిద్ర ఉండదు. కాబట్టి తరచూ నిద్ర పట్టకపోతే...ఒత్తిడి ఉండొచ్చని అంచనా వేసుకోవాలి.
- తరచూ ఒళ్లునొప్పులు వేధిస్తోంటే ఏదో ఒక మాత్ర వేసుకోవాలనుకోకూడదు. కారణం వెతికే ప్రయత్నం చేయాలి. విపరీతంగా ఒత్తిడికి గురవుతున్నప్పుడూ ఈ సమస్య ఎదురవుతుందని మర్చిపోకూడదు.

బంగారం వెండి

08న ముగింపు-క్రితం

	ముగింపు	క్రితం
హైదరాబాద్		
బంగారం (24క్యా)	32,000	31,800
ఆర్నమెంట్	29,900	29,700
వెండి (కిలో)	41,570	41,900
విజయవాడ		
బంగారం (24క్యా)	31,750	31,850
ఆర్నమెంట్	29,450	29,550
వెండి (కిలో)	41,500	41,000
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,750	31,750
ఆర్నమెంట్	29,370	29,370
వెండి (కిలో)	41,200	41,000
రాజమహేంద్రవరం		
బంగారం (24క్యా)	32,045	31,850
ఆర్నమెంట్	29,670	29,420
వెండి (కిలో)	41,400	41,200
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,770	31,580
ఆర్నమెంట్	29,550	29,370
వెండి (కిలో)	40,900	40,900
తమిళనాడు		
ఆర్నమెంట్ (గ్రా)	2,967	2,942
వెండి (గ్రా)	43.60	43.30

(రూ. లలో)

నజరానా

గోళ్లు పొడిబారి నిర్జీవంగా మారితే... ఆలివ్‌నూనెలో ఓ అయిదు నిమిషాలు ఉంచి, ఆ తరువాత తేనెతో మర్దనా చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే తేమ అంది గోళ్లు ఆరోగ్యంగా తయారవుతాయి.

ప్లాస్టిక్‌ని కరిగించేస్తోంది

ముంబయిలోని జూహూ బీచ్‌లో ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది ఉబర్ కూల్ కియోస్క్. ఏంటి దీని ప్రత్యేకత అనుకుంటున్నారా.. ఈ కియోస్క్‌లో ప్లాస్టిక్ సీసాలను ఉంచితే.. అది వాటిని చిన్న ముక్కలుగా ఆ వెంటనే అతి చిన్న ముక్కలుగా మార్చేస్తుంది. ఈ యంత్రం ఒకేసారి ఐదొందల సీసాలను రీసైకిల్ చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. దీన్ని తయారు చేసింది ముంబయికి చెందిన అదితీ సిర్కార్. బీచ్‌కు విహారానికి వచ్చిన వారు నీళ్లూ, శీతలపానీయాల సీసాలను అక్కడే వదిలేసి వెళ్లిపోతుంటారు. అవి సముద్రంలోకి చేరితే జీవరాశులకీ ముప్పే. క్రూడ్ ఆయిల్ ఉత్పత్తికీ ప్రమాదమే. ఇదంతా గమనించి సీసాలను రీసైకిల్ చేసే యంత్రాలను తయారు చేసింది అదితి. జూహు స్థానిక కార్పొరేటర్ సాయంతో బీచ్‌లో ఏర్పాటు చేసింది. ఇలా రీసైకిల్ చేసిన ముడిపదార్థాన్ని అదితీ ఏం చేస్తుందో తెలుసా.. రోడ్ల నిర్మాణంలో, పెయింట్లూ, ప్లాస్టిక్ హ్యాంగర్లూ, కుర్చీల తయారీలో ఉయోగిస్తుంది. ఆరేళ్ల క్రితం అదితి భర్తతో కలిసి ఆప్రోగ్రీన్‌టెక్ అనే సంస్థను ఏర్పాటు చేసి ప్లాస్టిక్‌కి వ్యతిరేకంగా, పర్యావరణ హితంగా పలు ప్రాజెక్టులు చేస్తోంది. సోలార్ చెట్లను తయారు చేసి.. వాటికి సూర్య ట్రీ అనే పేరు పెట్టి పబ్లిక్ ప్రాంతాల్లో ఉంచుతోంది. ఈ చెట్లు సోలార్‌ని విద్యుత్తుగా మార్చుకుని వెలుగుతాయి. వీటికి ఆకుల రూపంలో లైట్లను ఉంచారు. ఇవి వెలుగుతున్నప్పుడు ఎలాంటి వేడీ రాదు. ఇలా ముంబయిలోని రద్దీ ఉన్న పన్నెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు అదితీ, ఆమె భర్త. అలానే రోడ్డు వేయడానికి తారుకు బదులు రబ్బరుటైర్లనూ, ప్లాస్టిక్ వస్తువులను రీసైకిల్ చేసి వచ్చిన ముడిపదార్థాన్ని ఉపయోగిస్తున్నారు. దీనివల్ల రోడ్ల మీద నీరు భూమిలో ఇంకిపోతుంది. దోమల బెడద ఉండదు. ఇది గమనించిన ప్రభుత్వం పలు రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులను అదితీ చేతుల్లో పెట్టింది. ప్లాస్టిక్ బాటిళ్లతో రకరకాల నిర్మాణాలూ చేస్తున్నారు. అలానే యూరప్ నుంచి దిగుమతి చేసుకున్న ఓ చెట్టులోపలి భాగాన్ని ప్రాసెస్ చేసి దాన్ని సిమెంట్‌కి ప్రత్యామ్నాయంగా వాడుతోంది. ఈ పదార్థంతో గోడలు కడితే.. ఇంట్లోని కార్బన్‌డయాక్సైడ్ పూర్తిగా పీల్చుకుంటుంది. ఇప్పుడిప్పుడే దీన్ని జనాల్లోకి తీసుకెళుతున్నారు అదితీ దంపతులు.

నెలసరి వస్తోంది కానీ...

డియర్ వసుంధర

డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

? నాకు ఇరవై సంవత్సరాలు. బీటెక్ చివరి ఏడాదిలో ఉన్నా. నాకు ముందు నుంచీ నెలసరి సరిగ్గా వచ్చేది కాదు. డాక్టర్ దగ్గరకు వెళ్తే పరీక్షలు చేసి పోషకాహారం తీసుకోమని చెప్పారు. అదే చేస్తే అప్పటి నుంచీ నెలసరి సక్రమంగానే వస్తోంది. అయితే బాత్రూంకి వెళ్లినప్పుడు మాత్రమే రక్తస్రావం కనిపిస్తోంది తప్ప మిగిలిన సమయాల్లో కాదు. దాదాపు ఇరవైరోజులకు పైగా నెలసరి వస్తోంది. ఇదేమైనా సమస్య అంటారా... – ఓ సోదరి

✔ ప్రతి ఒక్కరికీ శరీరంలో ఉండాల్సినంత కొవ్వు ఉండటం చాలా అవసరం. మీరు బహుశా సన్నగా ఉండి ఉంటారు. వైద్యులు పోషకాహారం తినమని చెప్పాక బరువు కాస్త పెరిగి ఉండొచ్చు. అయితే సన్నగా లేదంటే లావుగా ఉన్నా ఆ ప్రభావం హార్మోన్లపై పడుతుంది. అదే నెలసరికి ఆటంకంగా మారుతుంది. ఇప్పుడు హార్మోన్లు సమతూకంలో ఉండి ఉండాలి. అందుకే నెలసరి వస్తుండాలి. ఇక, నెలసరి సమయంలో రక్తస్రావం కేవలం బాత్రూంకి వెళ్లినప్పుడే కనిపిస్తోందంటున్నారు. ఇరవై రోజులపాటు రక్తస్రావం అవుతోందనీ అంటున్నారు. మీరు మరోసారి గైనకాలజిస్టు దగ్గరకు తప్పనిసరిగా వెళ్లి పరీక్ష చేయించుకోవడం మంచిది. వాళ్ల సలహాతో హార్మోన్లతోపాటూ రక్తం, థైరాయిడ్, అల్ట్రాసౌండ్ పెల్విక్ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. వాటిల్లో ఏ సమస్యలూ లేవని నిర్ధారణ అయితే గనుక పీసీఓఎస్, ఒవేరియన్ కణుతులు ఉన్నాయేమో తెలుసుకుంటారు. అవి ఉంటే గనుక మరి కొన్ని హార్మోన్ల పరీక్షలు చేయించుకోవాల్సి రావచ్చు. ఆ ఫలితాలన్నింటి ప్రకారం చికిత్స సూచిస్తారు. అన్నీ బాగానే ఉన్నాయనుకుంటే ఇంజినీరింగ్ చివరి ఏడాదిలో ఉన్నానంటున్నారు కాబట్టి ఒత్తిడి కారణం అయ్యుండొచ్చు. దానివల్ల హార్మోన్ల అసమతూకం ఎదురైనా కూడా ఈ సమస్యలు వస్తాయి. కాబట్టి ఒత్తిడిని అదుపులో ఉంచుకునే మార్గాలు ఆలోచించండి. సమతులమైన ఆహారం తింటూ, క్రమం తప్పకుండా వ్యాయామం కూడా చేయడం మంచిది.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

ఎదురుచూపులు ఎంత తియ్యనో!

మాది తూ.గో. జిల్లా. నాకు పాలిటెక్నిక్ కళాశాలలో సీటొచ్చింది. అక్కడ తొలిసారి తరగతిలోకి వెళ్లాలంటే కొబ్బరికాయ కొట్టి వెళ్లాలి. అలా కొట్టడం మొదలైంది. ఒక వైపు అమ్మాయిలు, మరోవైపు అబ్బాయిలు వరుసగా కొబ్బరికాయ కొడుతున్నారు. ఆ క్యూలో తను నాకు కన్పించింది. లోకంలోని అన్ని పూలు ఒకే తీగకు పూస్తే ఎంత అందంగా ఉంటుందో అలా ఉంది తను. చూపులు కలపడానికి చాలా ప్రయత్నించాను. కుదరడం లేదు. తను తల ఎత్తడం లేదు. నేను తననే చూస్తూ ముందుకు నడుస్తున్నాను. నా వంతు వచ్చింది తనవైపే చూస్తూ టెంకాయ కొట్టాను. ఆ కొట్టడంలో నా వేలికి దెబ్బతగిలింది. రక్తం వచ్చింది. నోట్లో పెట్టుకొని తననే చూస్తూ నడిచాను. వేర్వేరు తరగతుల్లో కూర్చోబెట్టారు. నిరాశ పడ్డాను. రోజూ తనని చూడటానికి ఆ తరగతి దగ్గరికి వెళ్లి వచ్చేవాడిని.. తను మా క్లాస్‌కొస్తే బాగుణ్ను అనుకునేవాణ్ని. దేవుడు ఆలకించాడు. సెక్షన్స్ షఫ్లింగ్‌లో తను మా క్లాస్‌కే వచ్చింది. ఇక నా ఆనందానికి అవధుల్లేవు. తనతో మాట్లాడటానికి ప్రయత్నించే వాడిని. కొన్ని రోజులకు క్లోజ్ అయ్యాం. నన్ను చూడగానే నవ్వేది. ఆ రోజు నా పుట్టిన రోజు... నన్ను విష్ చేసింది. ఇదే మంచి అవకాశం అనుకొని ప్రపోజ్ చేశాను. తను ఏం చెప్పకుండా వెళ్లిపోయింది. నాతో మాట్లాడటం ఆపేసింది. ఇలాంటి వాటిని వాళ్లింట్లో ఏ మాత్రం సహించరని .. తర్వాత తన ఫ్రెండ్స్‌తో చెప్పింది. అయినా నేను తనని చూడటం మానలేదు. అలా మరో మూడు నెలలు గడిచాయి. గడ్డం పెంచేశాను. దేనిమీద ఆసక్తి లేదు. చురుకుదనం లేకుండా పోయింది. నా బాధ చూడలేక తనే నా వద్దకు వచ్చింది. 'ఒరే నువ్వంటే నాకిష్టమేరా మా ఇంట్లో ఒప్పుకోరు... నా కోసం అనవసరంగా నీ జీవితం పాడు చేసుకోకు' అంది. నా ఆనందం ఎలాంటి రాకెట్ లేకుండానే చంద్రమండలానికి చేరింది. మళ్లీ మామూలు మనిషయ్యాను. తనతో మాట్లాడుతూ ఉండేవాడిని. ఒక సారి సినిమాకు వెళ్లాం. సినిమా అయ్యాక తనని బస్టాండులో నా బండి మీద వదలాటానికి వెళ్లాను. అది వాళ్ల బావకు తెలిసింది. అతను ఇంట్లో చెప్పి.. గొడవ చేశాడు. తనని అదే రోజు హైదరాబాద్ పంపించారు. మరుసటి రోజు తను కన్పించలేదు. ఫ్రెండ్స్ ద్వారా విషయం తెలిసింది. ఫోన్ చేస్తే స్విచ్ఆఫ్. మా కులాలు వేరు కావడంతో ఇంట్లో వాళ్లు తనని బాగా కొట్టారని తెలిసింది. చాలా బాధపడ్డాను. ఆరు నెలలు దుఃఖంలోనే గడిపాను. ఒకరోజు కాల్ వచ్చింది. తనే...! హైదరాబాద్ ఉప్పల్‌లో ఉంటున్నట్లు చెప్పింది. తను చెప్పిన గుర్తుల ప్రకారం... నేను బయలుదేరి అక్కడికి వెళ్లాను. తిరిగి..తిరిగి ఎలాగో తనని కలిశాను. నన్ను చూడగానే హత్తుకొంది. బాగా ఏడ్చింది. నేనూ అంతే. ప్రేమతో పాటు.. కన్నీళ్లలో తడిసిపోయాం. ఇక అప్పుడప్పుడూ కలిసేవాళ్లం. ఇదీ ఇంట్లో వాళ్లకి తెలిసి బాగా గొడవ చేశారు. మా ఇంటికి వచ్చి వార్నింగ్ ఇచ్చారు. తనని మళ్లీ ఎక్కడికో పంపారు. తన కాల్ కోసం ఎదురుచూశాను. నెల రోజుల తర్వాత మళ్లీ కాల్ చేసింది. తను బంజారాహిల్స్‌లో ఉంటున్నట్లు... చెప్పింది. నేను వెళ్లి కలుసుకున్నాను. 'ఒరేయ్ నేను నీ కోసం ఎంతకాలమైనా ఎదురుచూస్తా... నువ్వు మంచిగా చదువుకొని, ఉద్యోగం సంపాదించు మనిద్దరం పెళ్లిచేసుకుందాం' అంది. నా గుండెకు ఎంతో ధైర్యం వచ్చింది. ఇక నేను ఒక్క నిమిషం కూడా వృథా చేయదలుచుకోలేదు. చదువుపై శ్రద్ధ పెట్టాను. ఇప్పుడు ఇంజినీరింగ్ పూర్తిచేస్తున్నా. ఎలాగైనా మంచి ఉద్యోగం సంపాదించి తనని పెళ్లి చేసుకుంటా. మేం ఎక్కువగా కలుసుకోకపోయినా... ఎప్పుడూ తను నా పక్కనే ఉన్నట్లు ఉంటుంది. ప్రతి రోజూ ప్రతి పనిలో తననే చూసుకుంటున్నా. ఎదురుచూపులు ఎంత హాయిగా ఉంటాయో ప్రతిరోజూ నాకు తెలుస్తోంది.

– రామ్‌జాను

కళాశాల కబుర్లు

అలా 7చాడు

మాది నరసాపురం. 2004-07 మధ్యకాలంలో వైఎన్ కళాశాలలో డిగ్రీ చదివే రోజులు. మా కళాశాలలో సంస్కృతం తరగతులు బీకాం, బీఎస్సీ గ్రూపులకు కలిపి నిర్వహించేవారు. ఇలా ఒకరోజు అటెండెన్స్ తీసుకొనేటప్పుడు మా ఫ్రెండ్ ఒకడు హాజరు పలుకలేదు. తర్వాత అటెండెన్స్ మొత్తం పూర్తయ్యాక... మా ఫ్రెండ్ లెక్చరర్ వద్దకి వెళ్లి జరిగింది చెప్పాడు. సరే నీ నంబర్ ఎంత అన్నాడు. '7.. అన్నాడు.'.. ఏ 7? అన్నారు లెక్చరర్. అంటే బీకాం, బీఎస్సీలో ఏదీ? అని ఆయన ప్రశ్న. మా వాడేమో 27, 37, 47 అలా... అనుకొని 'సింగల్ 7' అన్నాడు. అంతే క్లాస్‌లోని అందరి ముఖాల్లో నవ్వులు పూశాయి. ఇప్పటికీ మా ఫ్రెండ్స్ మొబైల్స్‌లో వాడి ఫోన్‌నంబరు' సింగల్ 7'అనే సేవ్ చేసుకున్నారు.

– సత్యనారాయణ



మీరు ఫోమోనా.. జోమోనా.. నేమోనా!

రసాయన నామా(పేర్లు)ల మాదిరే... సోషల్ నెట్‌వర్క్ యూజర్లకూ నామాలు ఉన్నాయ్ తెలుసా? ఫోమో... జోమో... ఇప్పుడు కొత్తగా 'నేమో'. మరి, మీరు దేంట్లోకి వస్తారు? ఏమో... అంటారా?

- 'తింటున్న దోశ చూశారా? టేస్ట్ అదిరిపోయింది. మీరూ ట్రై చేస్తారా?' అంటూ ఎఫ్‌బీలో పోస్ట్ పెట్టాడు ఇషాన్. అది మొదలు లైక్‌లు ఎన్నొచ్చాయి... ఎవరెలా స్పందించారని పదే పదే చెక్ చేసుకోవడం... కామెంట్‌లకు రిప్లైలు ఇవ్వడం... అదో పనిగా చేస్తుంటాడు. ఎవరూ స్పందించకుంటే తెగ ఫీలైపోతాడు. కారణం ఏదైనా ఫోన్‌కి దూరంగా ఉండాల్సివస్తే. ఏదో మిస్ అయిపోతున్నట్లు ఫీలవుతాడు. సోషల్ మీడియా లైఫ్‌కి దూరంగా ఉండడం అంటే అదేదో నేరంగా భావిస్తుంటాడు. అయితే, ఇషాన్‌కి ఉన్న సోషల్ నామం... **'ఫోమో' (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్)**
- 'ఏంటీ లైక్‌లు.. పోస్టింగ్‌లు? బాహ్య ప్రపంచానికి దూరమైపోతూ అలా వర్చువల్ వరల్డ్‌లో విహరించడం మానవ సంబంధాల్ని దూరం చేసుకున్నట్టే..' అంటోంది అపూర్వ. ఫేస్‌బుక్‌ని తెరిచేది లేదు. ట్విట్టర్‌ని మాట్టాల్సిన అవసరం లేదు అనే ధోరణి తనది. మరైతే, అపూర్వ నామం.. **'జోమో' (జాయ్ ఆఫ్ మిస్సింగ్ అవుట్)**
- 'ఒకప్పుడు ఫేస్‌బుక్ ఓపెన్ చెయ్యనిదే రోజు ప్రారంభం అయ్యేది కాదు. అన్ని సోషల్ నెట్‌వర్క్ సర్వీసుల్ని ఫాలో అయ్యేవాడిని. అదో వ్యసనమే. నిద్ర తక్కువైంది... ఒత్తిడి... విసుగు... ఉన్నట్టుండి లావైపోయా. ఫోన్‌ని దూరం పెట్టాలనే నిర్ణయానికొచ్చా. అంతేకాదు.. అన్ని సోషల్ నెట్‌వర్క్ సర్వీసుల అడ్రస్‌లు మార్చేయమని తమ్ముడికి చెప్పా. ఏదో మిస్ అవుతున్నట్లు అనిపించేది. కానీ, నాలో మార్పు కనిపించింది. ఎప్పుడూ షేరింగ్‌లు చేసే నేను చదవడం మొదలుపెట్టా. అప్పుడప్పుడు ఎఫ్‌బీలోకి లాగిన్ అయ్యి అప్‌డేట్స్ చెక్ చేస్తున్నా. నెట్టింట్లో ఇతర అప్లికేషన్స్‌ని వాడుతూ కెరీర్‌కి ప్లస్ అయ్యేలా జాగ్రత్త పడుతున్నా' అంటున్నాడు కార్తిక్. అయితే, కార్తిక్ నామం.. **'నేమో' (నియర్లీ... బట్ నాట్ ఫుల్లీ మిస్సింగ్ అవుట్)**

ఇప్పుడు చెక్ చేసుకోండి. మీరెందులోకి వస్తారో? ఫోమో... జోమో... ఇప్పుడు పుట్టుకొచ్చిన సోషల్ నామాలేం కాదు. మిలీనియం మొదట్లోనే వచ్చాయి. అయితే, కొత్తగా పలకరిస్తున్నది మాత్రం 'నేమో'. సమతూకంగా ఆలోచిస్తున్న మిలీనియల్స్ ఆలోచనల నుంచి పుట్టిన సోషల్ నామం ఇది. ఫోమో లేదా జోమో... ఏ విధంగా ఉన్న ఇబ్బందేననేది వీరి అభిప్రాయం. అటు వ్యసనం కాకుండా... ఇటు అస్సలు ముట్టకుండా ఉండడం అనేది అభివృద్ధి నిరోధకం అంటున్నారు. కొన్ని సర్వేలు కూడా ఇదే చెబుతున్నాయ్. ప్రపంచ వ్యాప్తంగా 43 శాతం డిజిటల్ యూజర్లు ఫ్యామిలీతో కంటే ఫోన్ నుంచే కాస్త దూరం అవ్వాలనుకుంటున్నారట. నెల్లో కనీసం రెండు మూడు రోజులైనా ఫోన్‌ని దూరం పెడితే 'సోషల్' వల నుంచి కాస్తైనా దూరం అవ్వొచ్చని కోరుకుంటున్నారు. 40 కోట్ల మంది ఫేస్‌బుక్ యూజర్లు నెలకోసారైనా 'ముఖపుస్తకం' తెరకుండా దూరం పెడుతున్నారు.

స్పృహ ఎక్కువైంది

డేటా ప్యాక్‌లు ఎంత చౌకకైనప్పటికీ డిజిటల్ యూజర్లు సమతూకంతోనే ఆలోచిస్తున్నారు. 'ఫోమో'గా గడపడంలో చాలా సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తోందని చెబుతున్నారు. దీంట్లో భాగంగానే ప్రముఖ కంపెనీలు అందించే యాప్ సర్వీసుల్ని వాడుకుని ఏయే సోషల్ సర్వీసుల్లో ఎంతెంత సమయం గడుపుతున్నారో ట్రాక్ చేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ముందే అప్రమత్తమవుతున్నారు. దేశంలోని మెట్రో నగరాల్లోనూ 'ఇంటర్నెట్ డీ-అడిక్షన్' సెంటర్లూ పుట్టుకొస్తున్నాయి. ఇక కౌన్సెలింగ్ సైకాలజిస్టులు చెబుతున్న ప్రకారం ప్రతి ఐదుగురు యువకుల్లో ఒకరు 'సోషల్' లైఫ్ వల్లే ఆందోళన, ఒత్తిడికి లోనవుతున్నారు. దీనికి పరిష్కారంగా 'జోమో'గా మారడానికంటే 'నేమో' అయ్యేందుకే యూజర్లు మొగ్గుచూపుతున్నారు. పదుల సంఖ్యలో ఉన్న సోషల్ యాప్‌లను ఒకటి.. రెండుకి పరిమితం చేసి ఒత్తిడికి చెక్ పెడుతున్నారు.

గుర్తింపు కోసమే...

ఇంగ్లిష్‌లో 'యాంగ్జైటీ' మాదిరిగానే 'రింగ్జైటీ' ఉంది తెలుసా? సోషల్ మీడియా నోటిఫికేషన్లు రాకపోయినా వచ్చినట్టుగా ఎలర్ట్ రింగ్‌టోన్లు వినిపించడం... ఫోన్ రాకపోయినా రింగ్ అవుతున్నట్టుగా అనిపించడమే ఈ రింగ్జైటీ. మానసిక సమస్యలతో వస్తున్న విద్యార్థుల్లో ఐదుగురిలో ఒకరు ఫోన్, సోషల్ మీడియాని మితిమీరి వాడుతున్నారు. వాస్తవ ప్రపంచంలో కంటే వర్చువల్ వరల్డ్‌లో గుర్తింపు తెచ్చుకోవాలనే వీరి తాపత్రయం. అక్కడే ఈ 'ఫోమో' పుట్టేది. ఎదురైన అనుభవాలతో వీళ్ల 'జోమో'గానో... ఇప్పుడు కొత్తగా పరిచయమైన 'నేమో'గానో మారేందుకు అవకాశం ఉంటుంది. ఫోమోగా మారి సోషల్‌లైఫ్‌లో రెమో అవ్వడం ద్వారా ప్రయోజనం శూన్యం. వాస్తవ జీవనశైలికి దూరం అవుతారు. చుట్టూ ఒక్కరూ ఉండరూ... వర్చువల్‌గా మాత్రం వందల్లో ఉంటారు. దీంతో ఏం సాధించినట్టు? ఈ ప్రశ్న అందరికీ వర్తిస్తుంది. ముఖ్యంగా యువత వారి విలువైన సమయాన్ని ఎంత వృథా చేస్తున్నారో ట్రాక్ చేసుకోవాలి. దానిక్కూడా కొన్ని యాప్‌లు ఉన్నాయి. ఫోన్‌ని.. ఎఫ్‌బీని దూరం పెట్టమనికాదు... సరైన సమయానికి సైన్‌అవుట్ చేయడం ముఖ్యం అనే విషయం గుర్తుంచుకోవాలి.

– టీఎస్ రావు, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

> ఫ్రెండ్స్... అవుటింగ్‌లు... హ్యాంగ్‌అవుట్‌లు కాలేజీల్లో జరిగే సందడిని సోషల్‌వాల్స్‌పైకి తేవాలనుకుంటాం. దాంట్లోనే బాగంగానే నేనూ ఎఫ్‌బీ, ట్విట్టర్ వాడుతుంటా. అప్పుడప్పుడు 'ఫోమో'లోకి వస్తుంటా. అదీ ఎగ్జామ్స్ టైమ్‌లో. కానీ, అన్నీ బ్యాలెన్స్‌డ్‌గా చూసుకోవడం కెరీర్‌కి ముఖ్యం. అందుకే నేనూ 'నేమో'గా ఉండేందుకు ప్రయత్నిస్తా!' అంటోంది ఇంజినీరింగ్ చదువుతున్న నిఖిత.

> ఉద్యోగంలో భాగంగా కస్టమర్లకు దగ్గరయ్యేందుకు సోషల్ మీడియా వేదికల్ని యాక్సెస్ చేయాల్సిందే. ఇది కెరీర్‌కి సంబంధించింది. ఇప్పుడు అన్ని కంపెనీలు సోషల్ ప్రొఫైల్స్‌ని చూస్తున్నాయ్. వాటి ఆధారంగానూ ఉద్యోగి గుణగణాల్ని, సామర్థ్యాన్ని లెక్కగట్టే పరిస్థితి ఉంది. అలాగే, ఎఫ్‌బీ లాంటి సోషల్ వీడియోల్లో ఎక్కువగా ఫేక్ అప్‌డేట్స్ పెరిగిపోతున్నాయ్. దీంతో గతంలో కంటే ఎఫ్‌బీపై ఆసక్తి తగ్గుతోంది. వాట్సాప్‌లాంటి ఇన్‌స్టెంట్ మెసెంజర్లను ఎక్కువగా వాడుతున్నారు. మేమూ మెసెంజర్లలో గ్రూపులుగా ఏర్పడి బ్యాంకింగ్ ఇంటర్నల్ వ్యవహారాల్ని షేర్ చేసుకుంటాం. అయితే, కాలేజీ చదువుల్లో నేను 'ఫోమో'నే. ఇప్పుడు మాత్రం కచ్చితంగా 'నేమో'గానే వ్యవహరిస్తున్నా' అంటున్నారు ఓ బ్యాంకు మేనేజర్ అజయ్‌కుమార్.

విడమరిచి చెప్పాలి

మీడియా ఏదైనా వ్యవస్థని చైతన్య పరిచేందుకే. సోషల్ మీడియా ఉద్దేశమూ అదే. ఫేస్‌బుక్‌నే తీసుకుంటే కొందరు ఎన్నో రకాల సమస్యల్ని వాల్‌పై వెలుగులోకి తెస్తున్నారు. నాణేనికి రెండో వైపూ ఉంది. లైక్‌లు, కామెంట్‌ల కోసం కాలాన్ని ఐస్‌క్రీమ్‌లా కరిగించేస్తున్నారు. రోజులో వారు రిలాక్స్ అయ్యేందుకు దొరికే టైం చాలా తక్కువ. ఆ కాస్త సమయాన్ని 'ఫోమో'లా మారి ఆందోళన, ఒత్తిడిని తెచ్చుకుంటున్నారు. క్లాస్ రూంలోనూ ఆలోచన వాటిపైనే. తల్లిదండ్రులు దీన్ని గుర్తించాలి. వాడొద్దని దూరం చేయడం కంటే.. దేనికి ఎంత సమయం వాడాలనే నిబంధన పెట్టాలి. విద్యార్థి కమ్యూనిటీలకు దగ్గర చేసి వారి కెరీర్‌కి హెల్ప్ అయ్యేలా చూడాలి. ఎందుకంటే నేటి పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా సిద్ధం అయ్యేందుకు సోషల్ మీడియా అవసరమే. ఇక 'జోమో'ల విషయానికొస్తే వారితో పరిమిత ప్రపంచం. దానికి కారణం వారిలోని రుగ్మతలే. 'నేను చేయలేనేమో... నా వల్ల కాదేమో'అనుకుంటారు. దీంతో పోటీతత్వం తగ్గుతుంది. ఇప్పటి మిలీనియల్స్ అంతా చాలా స్మార్ట్. వారే 'నేమో'లు. సమయం విలువ తెలిసి మసులుకుంటారు. అర్జెంట్ అంటే కాల్ చేస్తారు.. టైమ్ ఉంటే మెసెంజర్‌లో పింగ్ చేస్తారు.. మరికాస్త సమయం ఉంటే సవివరంగా మెయిల్ చేస్తాయి. దీన్నే బ్యాలెన్స్‌డ్ పర్సనాలిటీ అంటారు. వీరు దేన్నీ మిస్ అవ్వరు... అలాగని దేనికీ బానిసవ్వరు. కచ్చితంగా టీనేజర్లంతా 'ఫైడింగ్ నేమో' వెతకడం అనివార్యం.

- వేణుగోపాల్‌రెడ్డి.ఎం, సైకాలజిస్ట్

మరికొన్ని...

- **ఫోజీ (ఫియర్ ఆఫ్ జాయినింగ్ ఇన్)**
  సోషల్‌లైఫ్‌లో బిక్కు బిక్కు మంటూ తిరగడం. పంచుకునేది ఏదైనా నెట్‌వర్క్‌లోని మిత్రులకు నచ్చుతుందో లేదో అనే ఉద్దేశంతో ఉంటారు. షేర్ చేసేందుకు సంకోచిస్తుంటారు. పోస్ట్ చేసిన తర్వాత ఆశించిన స్థాయిలో లైక్‌లు, కామెంట్‌లు రాకుంటే వాటిని తొలగించేస్తుంటారు.
- **మోమో (మిస్టరీ ఆఫ్ మిస్సింగ్ అవుట్)**
  వీరిని ట్యాగ్ చేయకుండా వాల్‌పై ఎలాంటి అప్‌డేట్ లేకపోవడమే సమస్య. తమతో కాకుండా మిత్రులంతా మరో గ్రూపుగా ఏర్పడి సోషల్ వేదికలపై సందడి చేస్తున్నారేమోనని ఆందోళనకు గురవుతుంటారు.
- **ఫోమోమో (ఫియర్ ఆఫ్ ది మిస్టరీ ఆఫ్ మిస్సింగ్ అవుట్)**
  అనుకోకుండా సోషల్ లైఫ్ నుంచి విరమించాల్సివస్తుందేమోననే భయం. మిత్రులతో అనుకోని బ్రేకప్స్.. బ్యాటరీ ఛార్జింగ్ అయిపోవడం లాంటి వాటి గురించి ఆలోచించడం.
- **స్లోమో (స్లో టు మిస్సింగ్ అవుట్)**
  ఏ నిద్రలోనూ ఉండగా మిత్రులేమైనా హ్యాంగ్‌అవుట్స్ ప్లాన్ చేస్తారనే ఆలోచన. పొద్దునే లేచే సరికి వారి టైమ్‌లైన్‌పై ఫొటోలు, ఇతర అప్‌డేట్స్‌ని చూసి మిస్ అయ్యానని చింతించడం.

ఇంటివద్దే మొబైల్ మరమ్మతులు

నగరాల్లో ఇప్పుడంతా ఇన్‌స్టంట్ లైఫ్.. అనుకున్నదే తడవుగా.. చిత్తం అంటూ సేవలు వాకిలి ముందుకొచ్చి పలకరించాలి.. అందుకే డోర్ డెలివరీ కాన్సెప్ట్‌నే నమ్ముకుంటున్నాయి అన్ని సంస్థలూ. కూరగాయలు,పండ్లు, బిర్యానీ, సరకులు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు.. ఇలా అన్నీ ఇంటి తలుపుతట్టాల్సిందే. ఇదే పంథాలో మీ ఇంటికొచ్చి, నట్టింటికొచ్చి అక్కడే పాడైపోయిన మీ స్మార్ట్‌ఫోన్‌ను తయారు చేస్తామంటోంది హైదరాబాద్‌కి చెందిన ఫిక్స్‌సెల్ అనే స్టార్టప్ సంస్థ. స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ పోయిందా..? అవతలివాళ్లు మాట్లాడేది వినిపించలేదా? జస్ట్ ఒకే ఒక్కకాల్..

అంకురార్పణ

కాల్ కొడితే తలుపు తడతారు

మన ఇంటికొచ్చి స్మార్ట్‌ఫోన్ మరమ్మతు చేస్తామంటోంది ఫిక్స్‌సెల్ సంస్థ. స్క్రీన్ పగిలితే ఇరవై నిమిషాల్లో కొత్తది వేస్తారు. స్పీకర్ల సమస్య వచ్చినా అక్కడికక్కడే సిద్ధం చేస్తారు. ఇతర సమస్యలు తలెత్తితే టైమ్ పడుతుందని స్మార్ట్‌ఫోన్‌ను యజమానికే ఇస్తారు టెక్నీషియన్. అతను గోడౌన్‌కి వెళ్లి సంబంధిత పరికరాన్ని తీసుకొని వచ్చి సమస్యను పరిష్కరిస్తాడు. సాఫ్ట్‌వేర్ సమస్యలు ఉంటే పరిశీలనకు ఒక రోజు వాళ్ల దగ్గర ఉంచుకొని పరీక్షిస్తారు. మరుసటి రోజే సమస్య పరిష్కరించి ఇంటికి తెచ్చిస్తారు. ఫోన్‌డెడ్ అయితే సర్వీస్ చేయటం బదులు కొత్తఫోన్ కొనటం మంచిదని సలహా ఇస్తారు. అంతేకానీ డబ్బులకోసం సర్వీస్ చేసినట్లు నటించరు. అదే వారిని మార్కెట్లో దూసుకుపోయేలా చేస్తోంది.

అవినాష్‌ది వైజాగ్, బీటెక్(ఈసీఈ) చదివే సమయంలో మొబైల్ మరమ్మతులకు గిరాకీ ఉందనుకున్నాడు. ఫేస్‌బుక్‌లో మొబైల్ రిపైర్ అనే పేజీని క్రియేట్ చేసి సమస్యలని పరిష్కరించేవాడు. పాకెట్‌మనీ వచ్చేది. హైదరాబాద్‌కు వచ్చి విస్తరించాలనుకున్నాడు. టీహబ్‌లో 'టోఅప్' (విమానంలోని కాక్‌పిట్‌ను కావాలనుకున్న చోట అసెంబుల్ చేసే సంస్థ) అనే స్టార్టప్ ఐడియా మేకర్ నేహను కలిశాడు. నేహ హైదరాబాద్‌లోని బాలనగర్‌కి చెందిన అమ్మాయి. అప్పటికే ఆమె ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేసింది. స్టార్టప్స్‌పై అవగాహన ఉంది. అవినాష్ ఐడియా బావుందని నేహ డిస్కస్ చేసింది. చివరికి ఇద్దరూ కలిసి 2016 నవంబర్‌లో 'ఫిక్స్‌సెల్' అనే పేరుతో సంస్థను రిజిస్టర్ చేశారు. ఆ తర్వాత టీహబ్‌లో చేరారు. ఇదే సమయంలో డిజిటల్ మార్కెట్‌పై పట్టుందని సందీప్ అనే యువకుడు వీళ్లతో కలిశాడు. మొదట మూన్నెళ్లపాటు మార్కెట్‌ను పరిశీలించారు. తయారీదారులు, నిపుణులు, వ్యాపారులతో మాట్లాడారు. 'ప్రస్తుతం మార్కెట్లో 720 రకాల స్మార్ట్‌ఫోన్స్ వాడుతున్నారు. ప్రతి నలుగురిలో ఒకరి ఫోన్‌కి సమస్య ఉంది. నమ్మకమే పెట్టుబడిగా మా సంస్థ ముందుకు వెళ్తోంద'ంటోంది నేహ.

ప్రతిరోజూ పది కాల్స్ వస్తాయి..

అవినాష్, నేహల దగ్గర సొంతంగా సంపాదించుకున్న డబ్బుల్లేవు. ఇంట్లోవారిని అడిగి టీహబ్స్ వెంట తిరిగారు. బాలనగర్‌లో ఓ మొబైల్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్ నెలకొల్పారు. పది ఫెయిల్ అయిన వారికి శిక్షణ ఇవ్వటం ప్రారంభించారు. అదే సమయంలో టీహబ్‌లో బెస్ట్ స్టార్టప్‌గా ఎంపికయిన ఫిక్స్‌సెల్ సంస్థకి ఐల్యాబ్స్‌లో ఉచితంగా స్పేస్ ఇచ్చారు. అక్కడున్న పదివేల మంది ఉద్యోగులకు కచ్చితంగా పదివేల స్మార్ట్‌ఫోన్లుంటాయి. అక్కడే పని మొదలు పెట్టారు. వారిలోనే దాదాపు 200 స్మార్ట్‌ఫోన్ల సమస్యలను విజయవంతంగా పరిష్కరించారు. సామర్థ్యంపై నమ్మకం వచ్చింది. మాసాబ్‌ట్యాంక్‌లో కార్యాలయం తెరిచారు. సంస్థ వెబ్‌సైట్ చూసి కొందరు కాల్స్ చేశారు. సేవల పొందిన వారు ఇతరులకు నెంబర్ ఇవ్వటంతో ఇంకొందరు స్పందించారు. ఇదే సమయంలో ఇరవై లక్షల రూపాయులు ఎస్‌బీఐ రుణం ఇచ్చింది. మొత్తం పదిహేను మంది బృందంగా పనిచేస్తూ... కొత్తదారిలో విజయకేతనం ఎగురవేస్తున్నారు.

> మార్కెట్‌లో మాకో కాంపిటేటర్ సంస్థ ఉంది. అయితే వాళ్లు డోర్ డెలివరీ సర్వీస్ ఇవ్వరు. మేం కాస్త ముందుకు అడుగేశాం. మాకో ఇంటర్నెల్ యాప్ ఉంది. ముందే కస్టమర్‌కి ఫోన్‌లో ఇంత ధర అవుతుందని చెబుతాం. తీరా టెక్నీషియన్ వెళ్లాక కస్టమర్ తాళం వేసి ఉంటే.. లేరని ఓ ఫొటో తీసి ఇంటర్నెల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలా ఎక్కడ ఏ టెక్నీషియన్ ఉన్నాడో మేం పర్యవేక్షిస్తుంటాం. సీనియర్ సిటిజన్స్, బిజీగా ఉండే ఉద్యోగులు, వ్యాపారస్థులు, విద్యార్థులు దగ్గరనుంచి కాల్స్ వస్తున్నాయి. ముఖ్యంగా ఇంటినుంచి బయటకు వెళ్లలేని పెద్దవాళ్లు మా సర్వీస్‌కి ఫిదా అవుతున్నారు. **- అవినాష్, నేహ.**

ఛార్జీలు ఇలా...

ఫోన్ కంపెనీ, మోడల్‌ను బట్టి ఫిక్స్‌సెల్ ఛార్జ్ తీసుకుంటుంది. ముందే సమస్య చెబితే దానికి సంబంధించిన కిట్‌తో టెక్నీషియన్ ఇంటిదగ్గరికి వస్తాడు. సమస్య చెప్పలేకపోయినా వచ్చి తెలుసుకుని సేవలందిస్తారు. సాఫ్ట్‌వేర్ సమస్య ఉంటే మొదట డాటా కాపీ చేసి తీసుకొని వెళ్లి మరుసటి రోజు ఇంటిదగ్గరే అందిస్తారు. ప్రస్తుతం వీళ్లు హైదరాబాద్‌లో స్టాల్స్ నిర్వహిస్తూ, నలభై శాతం మార్జిన్‌తో సేవలు అందిస్తున్నారు. ఫిక్స్‌సెల్‌ను వైజాగ్‌కూ విస్తరించారు.

- రాళ్లపల్లి రాజావలి

శుక్రవారం ఇజ్రాయెల్-గాజా సరిహద్దులో ఇజ్రాయెల్ దళాలు ప్రయోగించిన భాష్పవాయు గోళం నేరుగా ముఖానికి తగలడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న పాలస్తీనా నిరసనకారుడు

అవినీతిలో అగ్రస్థానం: వైకాపా

- తెదేపా నాలుగేళ్ల పాలనపై ఛార్జిషీటు

ఈనాడు డిజిటల్, అమరావతి, ఫిలింనగర్, న్యూస్‌టుడే: తెదేపా నాలుగేళ్ల పాలనపై 'అరాచకాలకు ప్రతిరూపం-అవినీతిలో విశ్వరూపం, అబద్ధాల విరాట్టు- అన్యాయాల సామ్రాట్టు' పేరుతో వైకాపా శుక్రవారం ఛార్జిషీట్ విడుదల చేసింది. తెదేపా పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, ఎన్నికల హామీలు నెరవేర్చలేదని పేర్కొంది. 2029కి రాష్ట్రాన్ని నంబర్ వన్ చేస్తానంటున్న చంద్రబాబు ప్రత్యేక హోదా డిమాండ్ తాకట్టు ద్వారా 15 ఏళ్లు వెనక్కి నెట్టారని ఆరోపించింది. 'రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయి. ఇసుక, భూ, మైనింగ్, లిక్కర్ మాఫియాలు చెలరేగుతున్నాయి. గొలుసు దుకాణాలు రద్దు చేస్తామని, ప్రతి రోజు ఇంటికి 20 లీటర్ల మినరల్ వాటర్ ఇస్తామని, రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానంటూ చేసిన మొదటి సంతకాల్లో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు కాలేదు. రాజధానికి కేంద్రం రూ.1500 కోట్లు విడుదల చేసినా ఒక్క శాశ్వత భవనాన్ని నిర్మించలేకపోయారు. అధికారంలోకి వచ్చాక జీవో నంబర్ 22 ద్వారా కాంట్రాక్టర్లకు కమీషన్లు పెంచడం తప్ప సాగు నీటి ప్రాజెక్టులేవీ పూర్తి చేయలేకపోయారు. అనుమతి లేకుండా తెలంగాణ ప్రాజెక్టులు కడుతుంటే ఓటుకు నోటు కేసు భయంతో వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు...' అని వివరించింది.

అవినీతి తారస్థాయికి...

చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో చేపట్టిన వివిధ పథకాల్లో అవినీతి తారస్థాయికి చేరినట్లు ఛార్జిషీట్‌లో వైకాపా పేర్కొంది. 'పోలవరం, పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టుల్లో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ జరపాలి. రాజధాని ప్రకటనకు ముందే బినామీలతో భూములు కొనిపించిన వైనం, భూకేటాయింపుల్లో చోటు చేసుకున్న కుంభకోణం, ఓటుకు నోటు కేసు, ఐఎంజీ భారత్, అగ్రిగోల్డ్ కుంభకోణాలు, నీరు-చెట్టు, కాల్‌మనీ సెక్స్ రాకెట్, తిరుమలలో అరాచకాలు, తదితర వ్యవహారాల్లో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ జరపాలి. పారిశ్రామిక సంస్థలకు భూ కేటాయింపుల్లో తెరవెనక లంచాలు, విద్యుత్తు కొనుగోళ్లలో, మద్యం ఉత్పత్తికి అనుమతుల జారీలో లంచాలు, ఎర్రచందనం అమ్మకాల్లో భారీ కమీషన్లతో రాష్ట్రాన్ని అవినీతిలో నంబర్ వన్ చేశారు. దొడ్డి దారిలో కొడుక్కి మంత్రి పదవి కట్టబెట్టి అధికారికంగా అవినీతి ఎలా చేయవచ్చో నేర్పుతున్న ఇలాంటి ముఖ్యమంత్రిని దేశంలో ఎక్కడా చూడలేదు. భూసేకరణ చట్టానికి సవరణ చేసి స్విస్ ఛాలెంజ్ పేరుతో రాజధాని ప్రాంతంలో దోపిడీకి తెరతీశారు...' అని ఆరోపించింది.

సంక్షేమంలో కోతలే....

దోచుకున్న అవినీతి సొమ్మును విదేశాల్లో దాచుకుంటున్నందుకా ప్రజలు మీకు అండగా ఉండాలని కోరుతున్నారని చంద్రబాబును సూటిగా ప్రశ్నించింది. 'నాలుగేళ్లలో సంక్షేమ పథకాల్లో కోతలే తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదు. ఎన్నికల ఏడాదిలో పింఛన్లు, రేషన్‌కార్డులు, అన్న క్యాంటీన్లు, నిరుద్యోగ భృతి అంటూ మరో మారు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి తెదేపా కార్యకర్తలకే పథకాలు అమలయ్యేలా చేశారు. పాలనలో మహిళల అక్రమరవాణా, దళితులపై దాడులు, దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఎమ్మెల్యేలకు ఇవ్వాల్సిన నియోజకవర్గ అభివృద్ధి నిధులను ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలున్న చోట తెదేపా నేతలకు ఇవ్వడం, ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలుచేసి ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వడం తెదేపా ఆరాచకాలను స్పష్టం చేస్తోంది...' అని వెల్లడించింది.

అభివృద్ధి శూన్యం

టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని, అందువల్లే రాష్ట్ర ప్రభుత్వంపై ఛార్జిషీట్ విడుదల చేస్తున్నామని ఆ పార్టీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. హైదరాబాదులోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డితో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

ప్రత్యేక హోదా సాధనలో తెదేపా విఫలం

తాడేపల్లిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రత్యేక హోదా సాధించడంలో తెదేపా పూర్తిగా విఫలమైందని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. తెదేపా నాలుగేళ్ల పాలన దగా అంటూ ఛార్జిషీట్ విడుదల కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ రుణాల మాఫీ పేరుతో అన్నంపెట్టే రైతన్నకు సున్నం పెట్టి మోసం చేశారని దుయ్యబట్టారు. మొత్తం రూ.87 వేల కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉండగా, నిబంధనలు పెట్టి రూ.24 వేల కోట్లు మాఫీ చేస్తామని ప్రకటించారన్నారు. ఇప్పటివరకు రూ.14 వేలు కోట్లు మాత్రమే మాఫీ చేశారని వివరించారు. డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికి రూ.30 వేల వరకూ మాఫీ చేయాల్సి ఉండగా, రూ.10 వేలు మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకూ రూ.6 వేలు మాత్రమే మాఫీ చేశారన్నారు. భాజపా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటిస్తే చంద్రబాబు ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి కింద ఒక్కొక్కరికి రూ.2 వేలు ఇస్తామని చెప్పి.. ప్రస్తుతం రూ.వెయ్యి ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. కాపులను బీసీల్లో చేర్చుతామని నమ్మించి వారిని మోసం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి 2018 నాటికి పూర్తిచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం విభజన బిల్లులో పెడితే, కమీషన్ల కోసం తెదేపా పోలవరం అంచనాలను అమాంతం పెంచేసిందని దుయ్యబట్టారు. చంద్రబాబు అసమర్థత వల్లే కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు తెచ్చుకోలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించారని గుర్తుచేశారు.

ఛార్జిషీట్‌ను విడుదల చేస్తున్న రఘువీరారెడ్డి తదితరులు

చంద్రబాబు-మోదీ రాష్ట్రాన్ని మోసం చేశారు: పల్లంరాజు

ప్రధాని మోదీ చేసిన మోసం- ముఖ్యమంత్రి చంద్రబాబు నిస్సహాయతతో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు విమర్శించారు. తెదేపా నాలుగేళ్ల పాలనపై ఏపీసీసీ రూపొందించిన ఛార్జిషీటును శుక్రవారం విజయవాడలో పల్లంరాజు ఆవిష్కరించారు.

21మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

ఈనాడు అమరావతి: రాష్ట్రంలో వివిధ పోస్టుల్లో పని చేస్తున్న పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 21 మంది బదిలీ అయ్యారు. వీరిలో ఆర్డీవోలు, డీఆర్వోలు, ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.

హెచ్‌కేఎం ట్రస్టు నుంచి అన్న క్యాంటీన్లకు ఆహారం

ఈనాడు డిజిటల్, అమరావతి: అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసేందుకు హెచ్‌కేఎం ఛారిటబుల్ ట్రస్టుకు అవకాశమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. మొత్తం 71 పురపాలికల్లో 203 క్యాంటీన్లకు ఆహార సరఫరాను తొలుత మూడు ప్యాకేజీలుగా విభజించారు. వాటికి క్యాటరింగ్ చేస్తామని హెచ్‌కేఎం సంస్థ సమర్పించిన వినతిని ప్రభుత్వం ఆమోదించింది.

వైఎస్ రాజారెడ్డి హత్య కేసులో జీవిత ఖైదీ విడుదల

- రాష్ట్రంలో 49మంది ఖైదీల విడుదల ఉత్తర్వులు

వేముల, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తండ్రి రాజారెడ్డి హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న కడప జిల్లా వేముల మండలం వేల్పులకు చెందిన రాగిపిండి సుధాకరరెడ్డికి విముక్తి లభించింది. 2018 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా 49 మంది ఖైదీలను విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఇందులో వేల్పులకు చెందిన సుధాకరరెడ్డి ఉన్నారు. రాజారెడ్డి 1998 మే 23న వేముల వద్ద హత్యకు గురి కాగా అప్పట్లో 19 మందిపై కేసు నమోదైంది. ఇందులో నిందితులు, తెదేపా నాయకులు సతీష్‌రెడ్డి, పార్థసారధి రెడ్డితోపాటు మరో నలుగురిపై సాక్ష్యాధారాలు లేకపోగా.. మరొకరు మృతి చెందారు. కేసును విచారించిన హైకోర్టు 2006 అక్టోబరు 16న 12 మందికి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. శిక్షాకాలం పూర్తికాక మునుపే వేములకు చెందిన రామకృష్ణారెడ్డి మృతి చెందారు. మిగిలిన 11 మందిలో పది మంది మంచి నడవడిక కలిగి ఉన్నారని 2016 జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం విడుదల చేసింది.

ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని ప్రధాని మోదీకి పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గల్లా జయదేవ్

కుట్ర రాజకీయాలు చెల్లవు

పోస్టుకార్డుల ఉద్యమంలో జయదేవ్

గుంటూరు, న్యూస్‌టుడే: కుమ్మక్కు, కుట్ర రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌లో చెల్లబోవని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలని ప్రధాని మోదీకి పోస్టుకార్డుల ఉద్యమాన్ని ఆయన గుంటూరులో శుక్రవారం ప్రారంభించారు. జయదేవ్ మాట్లాడుతూ.. దిల్లీని తలదన్నే రాజధాని నిర్మించేందుకు సహకరిస్తానంటూ తెలుగు ప్రజలను మోదీ మోసగించారని విమర్శించారు. చేసిన నమ్మకద్రోహం దిల్లీ పాలకులకు తెలిసేలా పోస్టుకార్డుల ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వని కేంద్రంలోని పెద్దలను ప్రశ్నించే ధైర్యం వైకాపా అధ్యక్షుడు జగన్, జనసేన అధ్యక్షుడు పవన్‌లకు ఏమాత్రం లేవని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఆడిపోసుకునేందుకు వారిద్దరూ మోదీ దర్శకత్వంలో యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఛార్జిషీటు నిండా అవాస్తవాలే

మంత్రి కళావెంకట్రావు ధ్వజం

ఈనాడు డిజిటల్, అమరావతి: ముఖ్యమంత్రి నాలుగేళ్ల పాలనపై వైకాపా, కాంగ్రెస్ ఛార్జిషీట్, ఫ్యాక్ట్‌షీట్లు విడుదల చేయడం హాస్యాస్పదమని.. వాటిల్లో అన్నీ అబద్ధాలు, అవాస్తవాలే ఉన్నాయని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళావెంకట్రావు పేర్కొన్నారు. సీబీఐ, ఈడీ కేసులకు సంబంధించి 12 ఛార్జిషీట్లలో ప్రధాన నిందితుడిగా ఉన్న జగన్ అధ్యక్షుడిగా ఓ పార్టీ, రాష్ట్రంలో వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని కాంగ్రెస్ పార్టీల కుట్ర, అజ్ఞానం వారి ఛార్జిషీట్లలో ప్రతిబింబించాయని మండిపడ్డారు. మిగులు బడ్జెట్ ఉండి కూడా 2004, 2009ల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 40 శాతం కూడా అమలు చేయలేదని కళావెంకట్రావు శుక్రవారం ప్రకటనలో విమర్శించారు. పోలవరం మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పినట్లు వైకాపా నాయకులు పేర్కొనడం పచ్చి అబద్ధమని దుయ్యబట్టారు.



అనిరుధ్‌బాబు సిద్ధార్థ్ రవి

జిప్‌మర్ టాపర్ మనవాడే

- జాతీయ స్థాయిలో అనిరుధ్‌బాబు ప్రథమం.. సిద్ధార్థ్ రవికి 9వ ర్యాంక్

గుణదల(విజయవాడ), పాతపట్నం, న్యూస్‌టుడే: జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్)లో అనిరుధ్‌బాబు జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో కృష్ణా జిల్లాకు పదిలోపు రెండు ర్యాంకులు వచ్చాయి. నీట్‌లో కూడా ఈ విద్యార్థికి 8వ ర్యాంకు లభించిన విషయం విదితమే. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం పంచాయతీకి చెందిన అంకడాల తేజేశ్వరరావు, రమాదేవిల కుమారుడు అనిరుధ్‌బాబు విజయవాడలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. వైద్య వృత్తిలో స్థిరపడాలన్న సంకల్పంతో నిత్యం కృషి చేసి, ఈ స్థానాన్ని దక్కించుకున్నట్లు అతను తెలిపాడు. అలాగే విజయవాడకు చెందిన సిద్ధార్థ్ రవికి జిప్‌మర్‌లో 9వ ర్యాంకు లభించింది. వీరు ఇద్దరూ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలకు చెందిన విద్యార్థులు.

1 నుంచి ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం

ఈనాడు అమరావతి: ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జులై 1 నుంచి ఈ పథకాన్ని అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది.

విశాఖపట్నం విమాన సర్వీసులపై రోజుకు ఐదుగంటల నిషేధం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖపట్నం విమానాశ్రయంలో పౌర విమానాల రాకపోకల వేళల్లో రోజుకు ఐదు గంటలపాటు నిషేధం విధిస్తూ తూర్పునౌకాదళం ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. నవంబరు ఒకటో తేదీ నుంచి నిషేధం అమల్లోకి వస్తుంది. ఈ కారణంగా విశాఖకు సర్వీసులు నడుపుతున్న ఏడు విమానయాన సంస్థల్లో ఆరు సంస్థలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. తూర్పునౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖలో విమానాశ్రయం రక్షణశాఖ పరిధిలో ఉంది. విమానాశ్రయాన్ని రక్షణ అవసరాలకే కాకుండా పౌర విమానాల రాకపోకలకు కూడా వినియోగిస్తున్నారు. నౌకాదళ కార్యకలాపాలు భారీగా పెరిగి విమానాశ్రయాన్ని పెద్దఎత్తున వినియోగించుకోవాల్సిన అవసరం తలెత్తింది. విశాఖ కేంద్రంగా మిగ్ 29 యుద్ధవిమానాల పైలెట్లకు శిక్షణను విస్తృతంగా ఇస్తున్నారు. ఒకే ప్రాంగణాన్ని ఒకే సమయంలో అటు రక్షణశాఖ, ఇటు పౌర విమానయాన శాఖలు వినియోగిస్తుండడంతో రహస్యంగా జరగాల్సిన కొన్ని కార్యకలాపాలు బహిర్గతమవుతున్నాయంటూ తూర్పునౌకాదళం నిషేధ నిర్ణయం తీసుకుంది.

త్వరలో ఎలక్ట్రిక్ వాహనాల రయ్..రయ్..

- మొదటి దశలో విజయవాడ, విశాఖ, తిరుపతి ఎంపిక
- 500 వాహనాల పంపిణీ కోసం ఈఈఎస్ఎల్ ఏర్పాట్లు
- దశల వారీగా రాష్ట్రమంతా విస్తరించేలా కార్యాచరణ
- కాలుష్యాన్ని జీరో శాతానికి తగ్గించే ప్రయత్నం

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగర రహదారులపైకి మరో రెండు నెలల్లో విద్యుత్ వాహనాలు రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే చేసుకున్న అవగాహన ఒప్పందం(ఎంఓయూ) మేరకు 500 ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాలను ఇంధన సామర్థ్య సేవల సంస్థ (ఈఈఎస్ఎల్) సరఫరా చేయనుంది. టాటా, మహేంద్ర సంస్థల నుంచి వాహనాలను కొనుగోలు చేసి వివిధ రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను ఈఈఎస్ఎల్ తీసుకుంది. మొదటి విడతగా వచ్చే వాహనాలను రాష్ట్రంలోని మూడు నగరాల్లోగల ప్రభుత్వశాఖల ఉన్నతాధికారుల వినియోగం కోసం కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దశల వారీగా మొత్తం పదివేల వాహనాలను ప్రభుత్వ అవసరాల కోసం ఉపయోగించుకోనున్నారు.

కోటికిపైగా పెరిగిన వాహనాల వినియోగం...

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర మోటారు వాహనాల వినియోగం తాజా లెక్కల ప్రకారం కోటికిపైగా పెరిగింది. లీటర్ డీజిల్ వినియోగంతో 2.5 కిలోల బొగ్గు పులుసు వాయువు గాలిలో కలుస్తూ వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంతో కర్బన ఉద్గారాలు జీరో శాతం ఉంటాయని, రూ.10 ధరకు లభించే యూనిట్ విద్యుత్తుతో ఆరు కిలో మీటర్ల దూరం కారులో ప్రయాణించొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో ప్రవేశపెట్టాక దశల వారీగా అన్ని ప్రాంతాలకు విస్తరింపజేసేలా రాష్ట్రంలో నోడల్ ఏజెన్సీగా ఉన్న సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్) ప్రణాళికలు రూపొందించింది. 2020-21 నాటికి రాష్ట్రంలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్లపైకి తీసుకురావాలన్నది ప్రయత్నం. దిల్లీ, ముంబయి, బెంగళూరు నగరాల్లో ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలు రహదారులపై పరుగులు తీస్తున్నాయి.

250 ఛార్జింగ్ స్టేషన్లు...

మూడు ప్రధాన నగరాల్లో ఎలక్ట్రిక్ వాహనాల రీఛార్జింగ్ కోసం 250 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్‌మాళ్లు, హోటళ్లు, ఆసుపత్రుల వద్ద వీటిని ప్రారంభిస్తారు. ఇలాంటి స్టేషన్లు కేవలం విద్యుత్తు ఉత్పాదక సంస్థలు మాత్రమే నిర్వహించాలన్న 2003 విద్యుత్ చట్టాన్ని సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవలే సవరణలు చేసింది. అందువల్ల ఆసక్తి ఉన్న ఎవరైనా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వం తరపున త్వరలో ప్రకటన చేయనున్నారు. ఏపీ 'ఎలక్ట్రానిక్ మొబిలిటీ విధానాన్ని' గత నెలలో మంత్రిమండలి ఆమోదించడంతో త్వరలో జీవో విడుదల కానున్నది. ఇందులో ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్డు పన్ను, వాహన రిజిస్ట్రేషన్ రుసుంలపై రెండు, మూడేళ్లపాటు మినహాయింపు ఇచ్చి ప్రోత్సహించనున్నారు. వాహనాలు, బ్యాటరీల తయారీ సంస్థలను ఆహ్వానించేందుకు 500 నుంచి 1000 ఎకరాల్లో ప్రత్యేక జోన్ ఏర్పాటు చేస్తున్నారు. దీన్ని ఎక్కడ నెలకొల్పాలన్న విషయమై నెలాఖరులోగా నిర్ణయం తీసుకోనున్నారు. దశల వారీగా 2030 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే తిరగాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని నెడ్‌క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కమలాకరబాబు అభిప్రాయపడ్డారు. కాలుష్యాన్ని జీరో శాతానికి తీసుకురావాలన్న గట్టి పట్టుదలతో ముఖ్యమంత్రి ఉన్నారని, కేంద్రం సైతం ఎంతో సహకారాన్ని అందిస్తోందని ఆయన వివరించారు.

బామ్మ మాట.. బ్యాటరీ బాట

విజయవాడలో బ్యాటరీ వాహనంపై రయ్‌మంటూ దూసుకుపోతూ అందరినీ అశ్చర్యపరుస్తోంది ముత్యాలంపాడు లక్ష్మీనగర్‌కు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు బోనేపల్లి కనకదుర్గ. ఒకసారి ఛార్జింగ్ పెడితే 25 నుంచి 30 కి.మీ దూరం ప్రయాణించే బ్యాటరీ వాహనాన్ని అమెరికా నుంచి ఆమె తెప్పించుకున్నారు. బ్యాంకు, రైల్వేస్టేషన్, కూరగాయల మార్కెట్.. ఇలా ఎక్కడికి వెళ్లాలన్నా ఈ వాహనంపైనే దూసుకెళ్తోంది.

— ఈనాడు అమరావతి

గిరిజన ప్రాంతాల్లో టెలీమెడిసిన్ సేవలు

- తొలిగా విజయనగరం, పాడేరు, రంపచోడవరం ప్రాంతాల్లో అందుబాటులోకి
- శిశువుల అపహరణ నిరోధానికి 'ఆర్ఎఫ్ఐడీ' విధానం
- 21న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ఈనాడు - అమరావతి

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడబోతున్నాయి. కొండలు, కోనల్లో నివాసం ఉండే వీరు వైద్య సేవలను సకాలంలో పొందలేకపోతున్నారు. ఈ క్రమంలో గిరిజన ప్రాంతాల్లోని ఉప ఆరోగ్య కేంద్రాల్లో టెలీమెడిసిన్ వైద్య సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. విజయనగరం, పాడేరు, రంపచోడవరం ప్రాంతాల్లో కలిపి ఎంపికచేసిన 30 ఉప ఆరోగ్య కేంద్రాల్లో టెలీమెడిసిన్ ద్వారా స్థానిక గిరిజనులకు వైద్య సేవలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కేంద్రాల ఏఎన్ఎంలు టెలీ విధానంలో వైద్యులను సంప్రదించి రోగుల అనారోగ్యాన్ని తెలియచేసి, వారు సూచించిన మందులను ఇవ్వనున్నారు. ఇందుకు అనుగుణంగా మిషన్లను సమకూర్చనున్నారు. ఇక్కడ ఫలితాలను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. ఈ విధానం వల్ల రోగులు అనారోగ్యానికి గురైన వెంటనే జాప్యం జరగకుండా వైద్యుల నుంచి సూచనలు పొంది.మందులను ఉపయోగించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. గర్భిణులకు ఈ విధానంలో ఉత్తమ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

మరోవంక...ప్రభుత్వ బోధన, జిల్లా ఆస్పత్రుల్లో ప్రాంతీయ, ఆస్పత్రుల్లో శిశువుల భద్రత కోసం రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ) విధానం కూడా త్వరలో అమల్లోకి రాబోతుంది. శిశువును నిర్దేశిత ప్రాంతం నుంచి 50 మీటర్ల దూరంలోకి తీసుకువెళ్లిన వెంటనే ఆర్ఎఫ్ఐడీ ద్వారా అలారం మోగుతుంది. దీనివల్ల శిశువుల అపహరణలు చోటుచేసుకోకుండా ఉంటాయని పూనం మాలకొండయ్య తెలిపారు. టెలీ మెడిసిన్, ఆర్ఎఫ్ఐడీ పథకాలు పీపీపీ విధానంలో అమలుకానున్నాయి.

బోధనాస్పత్రులుగా గుర్తింపు

శ్రీకాకుళం, ఒంగోలు, కడప రిమ్స్ ఆస్పత్రులను బోధనా ఆస్పత్రులుగా గుర్తించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇవి ఏర్పడ్డాయి. మిగిలిన బోధనా ఆస్పత్రుల్లో మాదిరిగానే వీటిల్లో సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. దీనికి త్వరలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

ఫాతిమా కళాశాల యాజమాన్యానికి హెచ్చరిక

డొనేషన్ల రూపంలో వసూలు చేసిన మొత్తాన్ని బాధిత వైద్య విద్యార్థులకు తిరిగి ఇచ్చేయాలని ఫాతిమా కళాశాల యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం హుకుం జారీచేసింది. రానున్న పది రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని పూనం మాలకొండయ్య హెచ్చరించారు.

విశాఖలో ఆరోగ్య ఉత్సవం

ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు ఆరోగ్య ఉత్సవం జరిపే విషయమై సమాలోచనలు జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య రంగంలో వచ్చిన సంస్కరణలు, తీసుకుంటున్న జాగ్రత్తలు, ఇతర అంశాల గురించి ఈ ఉత్సవం ద్వారా ప్రజలకు వివరించనున్నారు. ఈ సందర్భంగానే పైన పేర్కొన్న రెండు పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు 21న విశాఖపట్టణంలో ప్రారంభించనున్నారు.

'ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు ఏర్పాటుకు గడువు కావాలి'

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ)కి సంబంధించిన పూర్తి స్థాయి బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉందని, దీనికి మరో మూడు వారాల గడువు అవసరమని ఏపీ ప్రభుత్వం శుక్రవారం ఉమ్మడి హైకోర్టుకు నివేదించింది. ఆ మేరకు గడువు మంజూరు చేస్తూ తదుపరి విచారణను జులై 2వ తేదీకి వాయిదా వేసింది. సిబ్బంది పదవీ విరమణ వయస్సు పెంపుదలకు సంబంధించి గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ కండక్టర్ కృష్ణమూర్తి, తదితరులు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, ఆర్టీసీ ప్రధాన కార్యాలయం పర్సనల్ అధికారి రమేశ్, వెంకటగిరి డిపో మేనేజర్ పెంచలయ్యలు వ్యక్తిగతంగా హాజరయ్యారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఆర్టీసీ ఉమ్మడిగానే కొనసాగిందని, గత ఏప్రిల్ 27న ఆర్టీసీకి తాత్కాలిక పాలక మండలి ఏర్పాటు చేసినట్లు వివరించారు.

విద్యుదాఘాతానికి ముగ్గురి బలి

పెనుమంట్ర గ్రామీణ, కొవ్వూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం రెండు వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి చెందారు. పెనుమంట్ర మండలం భట్లమగుటూరులో భవన నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న ఇద్దరు తాపీమేస్త్రీలు గుడ్ల సూర్యనారాయణ(33), తోరం చంద్రశేఖర్(34) ఇనుప కమ్మీని భవనంపైకి అందుకుంటున్నారు. ఈ ఇంటిపై నుంచి 11 కేవీ విద్యుత్తు తీగెలు వెళుతున్నాయి. వాటికి ప్లాస్టిక్ పైపులు వేసి ఉన్నాయి. వీరు అందుకుంటున్న కమ్మీ ఆ తీగెలకు తగలడంతో వారిద్దరూ విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు.

- కొవ్వూరు మండలం తోగుమ్మిలో ముగ్గురిని రక్షించే క్రమంలో గ్యాస్ కంపెనీలో పనిచేసే కార్మికుడు భానుచందర్ (29) కన్నుమూశారు. ఆయన పొరుగింటిలో మోటారు నుంచి చేతిపంపునకు విద్యుత్తు ప్రసారం కావడంతో ఆ ఇంట్లోని దంపతులు, వారి కుమార్తె విద్యుదాఘాతానికి గురై కొట్టుకుంటున్నారు. వారిని కాపాడే క్రమంలో భానుచందర్ కాలుజారి మోటారు దిగువన ఉన్న ఇనుప పైపును ఢీకొని విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు.

వారిద్దరిని హతమార్చింది ఒకే పిస్తోలుతో..

- గౌరీ లంకేశ్ హత్య కేసుపై నివేదిక వెల్లడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: బెంగళూరులో పాత్రికేయురాలు గౌరీ లంకేశ్, ధార్వాడలో సాహితీవేత్త ఎం.ఎం.కలబుర్గిలను హత్య చేసేందుకు ఒకే పిస్తోలును ఉపయోగించారని దర్యాప్తు బృందం ప్రాథమికంగా గుర్తించింది. గౌరీ లంకేశ్‌ను హత్య చేసిన నిందితుడి కోసం గాలింపును వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటికే నవీన్ కుమార్ అలియాస్ హొట్టే మంజ, సుజిత్ అలియాస్ ప్రవీణ్ కుమార్‌లను సిట్ అధికారులు అరెస్టు చేశారు. మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణచేపట్టారు. అక్రమ ఆయుధాల సరఫరాలో నవీన్ కుమార్ ఉన్నాడని, అతని సహకారంతోనే నిందితులు హత్య చేశారని పోలీసులు అభియోగపత్రంలో పొందుపరిచారు. నిందితుల విచారణలో ఇప్పటి వరకు ఎలాంటి ఉపయుక్త సమాచారం పోలీసులకు లభించలేదు. పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు, అరెస్టయిన నిందితుల నుంచి షార్ప్ షూటర్‌కు సంబంధించిన వివరాలను గుర్తించలేకపోయారు. నవీన్‌కుమార్ నగరంలోని గౌరిపాళ్యలో 18 బుల్లెట్లు కొనుగోలు చేసినట్లు సిట్ గుర్తించింది. గౌరీ హత్యకు వాడిన బుల్లెట్లకు, నవీన్‌కుమార్ కొన్న బుల్లెట్లకు సంబంధంలేదని విచారణలో తేలింది.

పదో రోజూ తగ్గిన పెట్రోలు ధర

దిల్లీ: వరుసగా పదో రోజైన శుక్రవారం కూడా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇంధనం ధరలను తగ్గించింది. లీటరు పెట్రోలుపై 21 పైసలు, డీజిల్‌పై 15-16 పైసలు తగ్గించింది. దీని ప్రకారం దిల్లీలో లీటరు పెట్రోలు ధర రూ.77.42, డీజిల్ ధర రూ.68.58గా ఉంది. పెట్రోలు ధర కోల్‌కతాలో రూ.80.07, ముంబయిలో రూ.85.24, చెన్నైలో రూ.80.37 పలుకుతోంది.

డీసెట్‌లో తగ్గిన అర్హులు..!

ఈనాడు, అమరావతి: డీసెట్ (డీఈడీలో ప్రవేశాలకు) రాత పరీక్షల్లో వేలాది మంది అనర్హులయ్యారు. ఈ ఏడాది మే 17,18 తేదీల్లో నిర్వహించిన డీసెట్‌కు మొత్తం 62,907 మంది దరఖాస్తు చేయగా 52,936 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో కేవలం 25 శాతం మంది మాత్రమే అర్హత సాధించారని అనధికారిక సమాచారం. దాంతో ఫలితాల వెల్లడికి విద్యాశాఖ తర్జనభర్జనపడుతోంది.

నిర్ణయం తీసుకోని స్పీకర్

- వైకాపా ఎంపీల రాజీనామాల ఆమోదంపై కొనసాగుతున్న అనిశ్చితి

ఈనాడు, దిల్లీ: అయిదుగురు వైకాపా ఎంపీల రాజీనామాల ఆమోదంపై స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం కూడా నిర్ణయం తీసుకోలేదు. మధ్యాహ్నం 2 గంటలకు విదేశీ పర్యటనకు బయలుదేరే ముందు ఆమె వీటికి ఆమోదముద్ర వేయొచ్చని లోక్‌సభ వర్గాలు అంచనాగట్టాయి. ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ఆమె లాత్వియా, బెలారస్ పర్యటనకు వెళ్లిపోయారు. 18న తిరిగి వస్తారు. రాజీనామాలపై ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవచ్చన్న భావన వ్యక్తమవుతోంది. రాజీనామాల ఆమోదంలో జాప్యానికి కారణాలు ఎవ్వరూ చెప్పలేకపోతున్నారు. అది పూర్తిగా స్పీకర్ విచక్షణాధికారాల పరిధిలోకి వస్తుంది. కాబట్టి దాన్ని ఎవ్వరూ ప్రశ్నించడానికి వీల్లేదని చెబుతున్నారు. లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవ కూడా స్పీకర్‌తో పాటే పర్యటనకు బయలుదేరినందున ఇద్దరూ తిరిగి వచ్చే వరకూ ఈ అంశం కొలిక్కి వచ్చే అవకాశం లేదు. ఒకవేళ స్పీకర్ విదేశీ పర్యటనలోనే రాజీనామాల ఆమోదానికి సమ్మతిస్తే తప్ప దీనికి ఇప్పుడే తెరపడే అవకాశం లేదు.

సెన్సెక్స్ ▼ 19	నిఫ్టీ ▼ 01	డోజోన్స్ 25280 ▲ 39	నాస్‌డాక్ 7640 ▲ 05	రూపాయి 67.50 ▼ 38 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	ముడి చమురు 76.67 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)
35444	10768				

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	8న	మార్పు %
SUN PHARMA	528.25	8.08
LUPIN	810.05	5.56
DR. REDDYS LAB	2062.90	4.98
CIPLA	559.65	3.50
GAIL	342.40	2.13
BHARTI INFRATEL	298.40	1.57
TATA MOTORS	309.95	1.49

గ్రహణం (-)

నిఫ్టీ	8న	మార్పు %
HINDALCO	242.15	-2.59
POWER GRID CORP.	197.90	-2.39
HDFC	1840.45	-1.53
BPCL	409.85	-1.49
GRASIM	1028.60	-1.44
HPCL	311.30	-1.17
ITC	267.90	-1.16

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.45	71.25	బహ్రెయిన్ దీనార్	166.45	190.34
పౌండ్ స్టెర్లింగ్	82.41	95.59	కువైట్ దీనార్	184.90	230.17
యూరో	72.47	84.06	ఒమన్ రియాల్	162.96	186.44
జపనీస్ యెన్/100	56.00	64.94	సౌదీ రియాల్	16.34	19.36
ఆస్ట్రేలియా డాలరు	46.72	54.08	యూఏఈ దిర్హమ్	16.73	19.54
సింగపూర్ డాలరు	46.04	54.55	మలేషియా రింగిట్	15.11	18.57
థాయ్ బాత్/100	191.62	229.17	చైనీస్ యువాన్	7.46	12.11



ఎక్కడి సూచీలు అక్కడే

- స్తబ్దుగా ముగిసిన మార్కెట్లు
- జంట హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు డీలా

సమీక్ష

సూచీల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. ఇటీవల పెరిగిన షేర్లలో మదుపర్లు లాభాలు స్వీకరించడంతో మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. కీలకమైన జీ7 సమావేశాల నేపథ్యంలో అంతర్జాతీయ సంకేతాలు స్తబ్దుగా ఉన్నాయి. వరుస యూఎస్ఎఫ్‌డీఏ అనుమతులతో ఔషధ రంగ షేర్లు కళకళలాడాయి. అయితే హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ వంటి పెద్ద షేర్లు కుదేలవడం ప్రతికూల ప్రభావం చూపింది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. ఐరోపా షేర్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి. ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. వరుసగా మూడో వారం సూచీలు రాణించాయి. సెన్సెక్స్ 216.41 పాయింట్లు, నిఫ్టీ 71.45 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేయడం గమనార్హం.

సెన్సెక్స్ ఉదయం 35406.47 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. రోజులో ఎక్కువ భాగం నష్టాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 35,260 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. అనంతరం కోలుకున్న సూచీ 35,484.94 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 19.41 పాయింట్ల నష్టంతో 35,443.67 పాయింట్ల వద్ద ముగిసింది. ఆర్‌బీఐ సమీక్ష నేపథ్యంలో అంతక్రితం రెండు సెషన్లలో సూచీ 559.87 పాయింట్లు లాభపడింది. ఇక నిఫ్టీ 0.70 పాయింట్లు తగ్గి 10,767.65 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,709.05- 10,779.45 పాయింట్ల మధ్య కదలాడింది.

- ఒమెప్రజోల్ మాత్రల తయారీకి అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం ఇవ్వడంతో అరబిందో ఫార్మా షేరు 4.42 శాతం పెరిగింది. సన్‌ఫార్మా 8.13%, డాక్టర్ రెడ్డీస్ 4.92%, లుపిన్ 5.66%, గ్లెన్‌మార్క్ 3.82 శాతం చొప్పున లాభపడ్డాయి.
- ముడిచమురు ధరలు మళ్లీ పెరగడంతో బీపీసీఎల్ 1.62%, ఆయిల్ ఇండియా 1.35%, హెచ్‌పీసీఎల్ 1.17% చొప్పున డీలాపడ్డాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 నష్టాలు చవిచూశాయి. పవర్‌గ్రిడ్ 2.12%, హెచ్‌డీఎఫ్‌సీ 1.42%, యాక్సిస్ బ్యాంక్ 1.05%, ఐటీసీ 0.98%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.91%, ఎం అండ్ ఎం 0.91%, భారతీ ఎయిర్‌టెల్ 0.84%, ఏషియన్ పెయింట్స్ 0.80%, ఎల్ అండ్ టీ 0.78%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 0.77% చొప్పున డీలాపడ్డాయి. టాటా మోటార్స్ 1.56%, ఎస్‌బీఐ 1.28%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.24%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.79%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో విద్యుత్ 0.74% కోల్పోయింది. లోహ, ఎఫ్ఎమ్‌సీజీ, బ్యాంకింగ్, యంత్ర పరికరాలు, వాహన షేర్లు అదే బాటలో నడిచాయి. ఆరోగ్య సంరక్షణ, ఐటీ, చమురు- గ్యాస్, పీఎస్‌యూ షేర్లు మాత్రం రాణించాయి.

బ్యాంకింగ్ సంక్షోభానికి పరిష్కారం చూడాలి

పెట్టుబడులు, వృద్ధికి అవసరం: ఐఎంఎఫ్

వాషింగ్టన్: దేశీయంగా బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి భారత్ పరిష్కారం కనుగొనాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) పేర్కొంది. పెట్టుబడులు, వృద్ధి పెరిగేందుకు ఇది తప్పనిసరని అభిప్రాయపడింది. బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మరిన్ని అదనపు చర్యలు తీసుకుంటోందని ఐఎంఎఫ్ ప్రతినిధి గెర్రీ రైస్ వెల్లడించారు. బ్యాంకింగ్ రంగంలో బ్యాలెన్స్ షీట్ ఇబ్బందులు, ప్రభుత్వ రంగ బ్యాంకుల పనితీరు మెరుగుపరచడం భారత్‌కు చాలా ముఖ్యమని, పెట్టుబడులు, వృద్ధికి దన్నుగా నిలిచేందుకు ఇవి కీలకమని అన్నారు. నికర నిరర్థక ఆస్తుల గుర్తింపు, దివాలా స్మృతి కింద వాటిని పరిష్కరించడం చాలా అవసరమని, ఇవి ప్రారంభ దశలో ఉన్నందునా.. ఇది ప్రోత్సహించదగ్గ పరిణామమని తెలిపారు. గతేడాది ముగిసేనాటికి నికర నిరర్థక ఆస్తులు రూ.8.31 లక్షల కోట్లకు చేరాయి. ఆస్తుల నాణ్యత సమస్యలను గుర్తించి, దగ్గరుండి పర్యవేక్షించడం చాలా సానుకూల చర్యగా రైస్ అభివర్ణించారు. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు అభినందనీయమని, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు కార్యకలాపాలు పెరిగి, నష్టభయం తగ్గడానికి దోహదపడతాయని చెప్పుకొచ్చారు. ఆర్‌బీఐ కీలక రేట్లను పావు శాతం మేర పెంచడంపై ఐఎంఎఫ్ హర్షం వ్యక్తం చేసింది.

టాటా మోటార్స్ అదుర్స్

మేలో ప్రపంచ అమ్మకాల్లో 24% వృద్ధి

దిల్లీ: టాటా మోటార్స్ అమ్మకాలు మే నెలలో పెరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా 24 శాతం వృద్ధి నమోదైందని కంపెనీ వెల్లడించింది. తమ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్)తో కలిసి టాటా మోటార్స్ 1,07,343 యూనిట్లను గత నెలలో విక్రయించగలిగింది. గత ఏడాది ఇదే సమయంలో అమ్మకాలు 86,385 యూనిట్లుగా నమోదయ్యాయి.

- వాణిజ్య వాహనాల విభాగంలో 45 శాతం వృద్ధితో 28,310 నుంచి 40,989 యూనిట్లను, ప్రయాణికుల వాహనాల (పీవీ)విభాగంలో 14 శాతం వృద్ధితో 58,075 నుంచి 66,354 యూనిట్లను ప్రపంచవ్యాప్తంగా సంస్థ విక్రయించింది.
- జేఎల్ఆర్ మే నెలలో మొత్తం 48,786 యూనిట్లను అమ్మగలిగింది. ఇందులో జాగ్వార్ యూనిట్లు 15,320 కాగా, ల్యాండ్ రోవర్ యూనిట్లు 33,466. గత ఏడాది మేలో 47,131 యూనిట్లను జేఎల్ఆర్ విక్రయించింది.
- జేఎల్ఆర్ మొత్తం రిటైల్ అమ్మకాలు మే నెలలో 6.1% మేర పెరిగాయి.

కొత్త మోడళ్లు రేంజ్ రోవర్ వెలార్, జాగ్వార్ ఇ-పేస్, ల్యాండ్ రోవర్ డిస్కవరీ పరిచయంతోనే ఇది సాధ్యమైందని కంపెనీ తెలిపింది. విదేశీ మార్కెట్లలో 24 శాతం, యూకేలో 20.90 శాతం, ఉత్తర అమెరికాలో 16.70 శాతం వృద్ధి నమోదైందని, ఇదే సమయంలో యూరప్‌లో 8.7 శాతం, చైనాలో 8.1 శాతం అమ్మకాలు తగ్గాయని బీఎస్ఈకి ఇచ్చిన సమాచారంలో కంపెనీ పేర్కొంది.

ఎన్ఎస్ఈపై భారీ జరిమానా!

- కొందరు బ్రోకర్లపైనా
- కో-లొకేషన్ కేసులో సెబీ దర్యాప్తు నేపథ్యం

దిల్లీ: ఎన్ఎస్ఈ కో-లొకేషన్ కేసు దర్యాప్తు చివరి దశకు వచ్చింది. త్వరలోనే దీనిపై మార్కెట్ నియంత్రణ సంస్థ ఆదేశాలు జారీ చేయవచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ 'ఈటీ నౌ' పేర్కొంది. ఎక్స్ఛేంజ్‌కు చెందిన ట్రేడింగ్ ప్లాట్‌ఫాంపై కొంత మంది ట్రేడర్లు, బ్రోకర్లకు ప్రాధాన్యతనిచ్చిందన్న ఆరోపణలపై సెబీ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. బ్రోకర్లు, ఎన్ఎస్ఈ అధికారులు కలిసి ట్రేడింగ్ విషయంలో ప్రయోజనాలు పొందారని సెబీ గుర్తించినట్లు ఈ పరిణామాలతో దగ్గరి సంబంధమున్న వ్యక్తులు తెలిపారు. అయితే చట్టవ్యతిరేకంగా ఎంత మేర లాభాలు పొందారన్న దానిని నిరూపించడం ఎక్స్ఛేంజీకి క్లిష్టమేనని వారు అభిప్రాయపడుతున్నారు. కానీ ఎన్ఎస్ఈపై, భారీ స్థాయిలో అపరాధ రుసుము విధించే అవకాశం ఉందని.. అదే సమయంలో ఎంపిక చేసిన బ్రోకరేజీలపై కఠిన చర్యలు ఉండొచ్చని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నారు. బ్రోకర్లతో కుమ్మక్కయిన ఉద్యోగులను నిష్క్రమించమని ఎన్ఎస్ఈ కోరే అవకాశం ఉందంటున్నారు.

ఈ చర్యలు వెలువడితే సెబీ ప్రతిపాదిత ఐపీఓపై ప్రభావం ఉండొచ్చని ఆ వార్తా సంస్థ అంచనా వేస్తోంది. డిసెంబరు 2016లోనే సెబీకి ముసాయిదా పత్రాలను ఎన్ఎస్ఈ దాఖలు చేసింది. 2017లో పబ్లిక్ ఇష్యూకు రావాలన్న ప్రణాళిక. అయితే కేసు నేపథ్యంలో ఎన్ఎస్ఈ దరఖాస్తును సెబీ పక్కనపెట్టింది. ఎన్ఎస్ఈలోని సర్వర్లను బ్రోకర్లు ఉపయోగించుకోవడం ద్వారా అక్కడి సమాచారాన్ని(షేర్ల ధరలను) ముందుగా తెలుసుకుని అదాటు లాభాలను పొందారన్నదే ఈ కో లొకేషన్ కేసు.

వచ్చే అయిదేళ్లలో 20% వృద్ధి!

ఉత్తరాదిలోకి కావేరీ సీడ్ విస్తరణ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే మూడు నుంచి అయిదేళ్లలో 15-20 శాతం వృద్ధిరేటు నమోదు చేయాలని కావేరీ సీడ్ యోచిస్తోంది. ఇందుకు పత్తేతర విత్తనాలపై దృష్టి పెట్టడం, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లోకి వ్యాపార కార్యకలాపాలను విస్తరించడం, ఈ ప్రాంతాలకు అనువైన కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం వంటి చర్యల ద్వారా ఈ వృద్ధిరేటు సాధ్యం కాగలదని కంపెనీ భావిస్తోంది. గతంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలపై దృష్టి సారించిన కంపెనీ ప్రస్తుతం మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోకి అడుగుపెట్టింది. కంపెనీ వద్ద దాదాపు రూ.500 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరిశోధన, అభివృద్ధి రంగంలో పట్టున్న కంపెనీని కొనుగోలు చేయాలని ఆలోచన కూడా ఉందని కంపెనీ తెలిపింది.

విపణిలోకి నాట్కో కొత్త ఇంజెక్షన్

ఈనాడు, హైదరాబాద్: క్రోమ్‌థెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ వంటి వాటిలో వ్యాధినిరోధక శక్తి బలహీనపడి ఇన్‌ఫెక్షన్లు వచ్చినప్పుడు చికిత్స చేయడానికి వినియోగించే పొసాకొనాజోల్ ఇంజెక్షన్ జనరిక్‌ను భారత మార్కెట్‌లోకి నాట్కో ఫార్మా విడుదల చేసింది. 300 ఎంజీ/16.7 ఎంఎల్ మోతాదులో 'పొసానట్' బ్రాండ్‌తో ఔషధాన్ని ప్రవేశపెట్టామని, ఇంజెక్షన్ రూపంలో దేశంలో ఈ ఔషధం అందుబాటులోకి రావడం ఇదే ప్రథమమని కంపెనీ పేర్కొంది. ఇంట్రావీనస్ (4) వినియోగం కోసం 18.0 ఎంజీ/ఎంఎల్ మోతాదులోనూ పొసానట్ లభిస్తుంది. అమెరికా విపణిలో నొక్సాఫిల్ బ్రాండ్ పేరుతో మెర్క్ పొసాకొనాజోల్ ఇంజెక్షన్లను విక్రయిస్తోంది.

మార్కెట్ కబుర్లు

- జీఐసీ నిర్వహిస్తున్న గామ్నాట్ అనే పెట్టుబడుల సంస్థకు ప్రిఫరెన్షియల్ షేర్లను జారీ చేయడం ద్వారా **గోద్రేజ్ ప్రోపర్టీస్** రూ.1000 కోట్లను సమీకరించింది.
- ఎలి లిల్లీకి చెందిన ఇన్సులిన్ గ్లార్జిన్ ఇంజెక్షన్‌ను భారత్‌లో మార్కెటింగ్, పంపిణీ చేయడానికి ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు **సిప్లా** పేర్కొంది. ఆయితే ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలను బయటకు వెల్లడించలేదు.
- గుజరాత్‌లోని భారుచ్ జిల్లాలో పురుగుమందుల ప్లాంటు ఏర్పాటు చేయడానికి **ధనూకా అగ్రిటెక్**కు పర్యావరణ అనుమతులు లభించాయి. నెలకు 3,415 టన్నుల తయారీ సామర్థ్యం ఉండే ఈ ప్లాంటు ఏర్పాటుకు రూ.90 కోట్ల వ్యయం చేయనుంది.
- **టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)**కు 'పెగా 2018 పార్ట్‌నర్ ఎక్సెలెన్స్ ఇన్ థాట్ లీడర్‌షిప్: ఏజిల్ ఎంటర్‌ప్రైజ్(డిజిటల్ ప్రాసెస్ ఆటోమేషన్)' అవార్డు దక్కింది. ఆటోమేషన్, కృత్రిమ మేధను వ్యాపార ప్రక్రియల కోసం ఉపయోగించడంలో చూపిన నాయకత్వానికి ఈ అవార్డు ఇచ్చారు.
- అనుబంధ సంస్థ పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్‌తో పాటు బీఎస్ఈ, ఇక్రా, క్రిసిల్‌లలో తన వాటాను విక్రయించాలని **పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)** భావిస్తోంది. ఈ ఏడాది జనవరిలో తీసుకున్న సంస్కరణల్లో భాగంగా.. మార్కెట్ పరిస్థితులను బట్టి ఈ ప్రధానేతర ఆస్తులను అమ్మాలని నిర్ణయించింది.
- **పీవీఆర్**లో 5.67 లక్షల షేర్లు లేదా 1.21 శాతం వాటాను విదేశీ పెట్టుబడుదారు సంస్థ అయిన బారన్ ఎమర్జింగ్ మార్కెట్స్ ఫండ్ విక్రయించింది. సగటున ఒక్కో షేరు రూ.1332.15 ధర వద్ద మొత్తం రూ.75.53 కోట్లకు అమ్మింది.
- భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూషన్(బీఎఫ్ఐఎల్)ను విలీనం చేసుకోవడంలో భాగంగా ఒక పూర్తి స్థాయి అనుబంధ కంపెనీని ఏర్పాటు చేయడానికి **ఇండస్ఇండ్ బ్యాంక్**కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) అనుమతులు ఇచ్చింది.

వృద్ధి రేటు 8% దాటొచ్చు!

వచ్చే రెండేళ్లలో: మంత్రి సురేష్ ప్రభు



దిల్లీ: భారత్ వృద్ధి రేటు వచ్చే రెండేళ్లలో 8% దాటే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానం తీసుకొచ్చిందని, ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని రాబోయే 7-8 ఏళ్లలో 5,00,000 కోట్ల డాలర్ల (దాదాపు రూ.3,25,00,000 కోట్లు) స్థాయికి చేర్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టిందని ఆయన తెలిపారు. 'ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేందుకు వ్యూహాల్ని సిద్ధం చేస్తున్నాం. నాలుగేళ్లుగా మేం తీసుకున్న పలు చర్యల వల్ల ఇప్పుడు దేశం పురోగమిస్తోంద'ని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 'గత ఆర్థిక సంవత్సరం సాధించిన వృద్ధితో పోలిస్తే 2018-19లో మెరుగైన వృద్ధిని నమోదు చేస్తామన్న విశ్వాసం నాకుంది. రాబోయే త్రైమాసికాల్లో వృద్ధి 8 శాతానికి దగ్గరగా, ఇంకా చెప్పాలంటే దాన్ని దాటి కూడా నమోదు కాగలదు. కొన్ని రంగాలు బలమైన వృద్ధిని నమోదు చేయడంతో వచ్చే రెండేళ్లలో ఇది సాధ్యమే. ఎవర్నీ ఆశ్చర్యపరిచేందుకు నేనిలా చెప్పట్లేద'ని మంత్రి తెలిపారు. భారత జీడీపీ వృద్ధి రేటు జనవరి-మార్చి 2018 త్రైమాసికంలో 7.7 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే.

మేలో మ్యూచువల్ ఫండ్ల నుంచి.. రూ.66,000 కోట్లు వాపసు

దిల్లీ: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పరిశ్రమ నిర్వహణ ఆస్తుల విలువ (ఏయూఎం) మే నెలలో రూ.66,000 కోట్లు తగ్గి రూ.22.6 లక్షల కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా ఇన్‌కమ్, లిక్విడ్ పథకాల నుంచి మదుపర్లు ఎక్కువగా పెట్టుబడులు వాపసు తీసుకున్నారు. ఎంఎఫ్ పరిశ్రమలో ఉన్న మొత్తం 42 సంస్థల ఏయూఎం ఏప్రిల్‌లో రూ.23.25 లక్షలు ఉన్నట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫి) దగ్గరున్న సమాచారం. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను (ఎల్‌టీసీజీ) విధించడంతో మార్చిలో ఎంఎఫ్‌ల నుంచి మదుపర్లు రూ.50,752 కోట్లు వెనక్కు తీసుకున్నారు. అయితే ఏప్రిల్‌లో రూ.1,40,000 కోట్లు మళ్లీ పెట్టుబడులు పెట్టారు. మేలో లిక్విడ్ ఫండ్ల నుంచి రూ.46,724 కోట్లు, ఇన్‌కమ్ ఫండ్ల నుంచి రూ.20,000 కోట్లకుపైగా నిధులు వెనక్కు తీసుకున్నారు.

వొడాఫోన్ రూ.8,000 కోట్ల పెట్టుబడులు!

లండన్: బ్రిటిష్ టెలికాం దిగ్గజం వొడాఫోన్, భారత్‌లో మరో రూ.8,000 కోట్లు (బిలియన్ యూరోలు) పెట్టుబడి పెట్టనుంది. ఐడియా సెల్యులార్‌తో కలిసి ఏర్పాటు చేయనున్న సంయుక్త సంస్థలో ఈ మొత్తం ఈ నెలలోనే పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది. ఒకవేళ సంయుక్త సంస్థలో అదనపు పెట్టుబడులు పెట్టాలని భాగస్వామ్య సంస్థ ఆదిత్య బిర్లా గ్రూప్ కనుక నిర్ణయిస్తే, ఇండస్ టవర్స్‌లో వాటాను నగదీకరించి, ఆ మొత్తాన్ని కూడా వొడాఫోన్ పెట్టుబడి పెడుతుంది. సంయుక్త సంస్థలో వొడాఫోన్‌కు 47.5% వాటా ఉండనుంది. 43 కోట్ల మంది చందాదార్లతో సంయుక్త సంస్థ పెద్ద టెలికాం సంస్థగా అవతరించనుంది.

లాట్ మొబైల్స్ ప్రత్యేక తగ్గింపులు

ఈనాడు, హైదరాబాద్: మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసే వారికి లాట్ మొబైల్స్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. కొన్ని రకాల మొబైల్ కొనుగోళ్లపై టీవీలు, రైస్ కుక్కర్లను బహుమతిగా ఇస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని మొబైల్స్‌పై 55 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపింది. విడి భాగాలపై కూడా కంపెనీ తగ్గింపులను ప్రకటించింది. సినీ హీరో సాయిధరమ్ తేజ్, నటి అనుపమ పరమేశ్వరన్ ఆఫర్లను ప్రారంభించారు.

ఆఫర్లను ప్రారంభిస్తున్న సాయిధరమ్ తేజ్, అనుపమ పరమేశ్వరన్

ఉషా మార్టిన్ రేసులో టాటా స్టీల్!

- రూ.6,000 కోట్లతో కొనుగోలుకు సిద్ధం

ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో వేగవంత వృద్ధి కలిగిన మనదేశంలో ఉక్కు (స్టీల్)కు గిరాకీ పెరుగుతుందనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, స్టీల్ కంపెనీల కొనుగోళ్లు, స్వాధీనతలకు యత్నాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే 'ఉషా మార్టిన్ స్టీల్' కొనుగోలు రేసులో టాటా స్టీల్ చేరిందని సమాచారం. జంషెడ్‌పూర్‌లోని ఈ ప్లాంటును కొనుగోలు చేసేందుకు రూ.6,000 కోట్ల ప్రతిపాదనను టాటా స్టీల్ సమర్పించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. టాటా గ్రూప్‌కు ఈ నగరంలోనే ప్రధానమైన స్టీల్ ప్లాంట్ ఉన్న సంగతి విదితమే. ఉషామార్టిన్ ప్లాంటును కూడా కొనుగోలు చేస్తే, టాటా గ్రూప్ లాభాలు మరింత పెరిగేందుకు ఉపకరిస్తుంది. కోల్‌కతా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ఉషా మార్టిన్ గ్రూప్ రుణాలు గత మార్చి ఆఖరుకు రూ.3,723 కోట్లకు చేరాయి. బకాయిలు తీర్చేందుకు స్టీల్ ప్లాంటును విక్రయించాలని గ్రూప్ ప్రమోటర్లు నిర్ణయించారు. ఈ ప్లాంటు కోసం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ రూ.5,500 కోట్లతో బిడ్ వేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కోల్‌కతాలో ఉషామార్టిన్ అధికారులను కలిసిన టాటా స్టీల్ ప్రతినిధులు రూ.6,000 కోట్ల ప్రతిపాదనను అందించారని సమాచారం. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్దకు చేరిన ఎలక్ట్రోస్టీల్‌ను స్వాధీనం చేసుకోనున్న అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంతా కూడా ఉషా మార్టిన్ కోసం ప్రయత్నిస్తుందని చెబుతున్నారు. రుణాల్లో కూరుకుపోయిన భూషణ్ స్టీల్ కొనుగోలు కోసం టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ పోటీ పడుతున్న సంగతి విదితమే.

ఉషామార్టిన్ స్టీల్ ప్రత్యేకతలివీ

10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉషా మార్టిన్ స్టీల్ ప్లాంటుకు ఉంది. వైర్‌రోప్ తయారీలో ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థల్లో ఇది ఒకటి. స్పెషాలిటీ స్టీల్ వ్యాపారానికి సంబంధించి దేశంలో పెద్ద కంపెనీల్లో ఇదీ ఒకటి. సొంతగా స్టీల్ ప్లాంట్, దీని అవసరాల కోసం అత్యంత నాణ్యత కలిగిన సొంత ఇనుపఖనిజం గని, బొగ్గు గనులు ఉన్నాయి. ఈ ప్లాంటులో తయారయ్యే వైర్ రాడ్లు, కడ్డీలను, కంపెనీకి ఉన్న వైర్‌రోప్ వ్యాపారానికి వినియోగిస్తారు. ఫోర్జింగ్ అవసరాలకు, వాహనాలకు, ఇంజినీరింగ్ పరిశ్రమల్లోనూ ఇవి వాడతారు.

8న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	369	వరంగల్	371
చిల్లరగా(ఒక గుడ్డు)	4.30	విశాఖపట్నం	370
బెంగళూరు	415	చెన్నై	440
9వ తేదీకి...		చిత్తూరు	433
విజయవాడ/గోదావరి	364	నమక్కల్	425

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 380.50 (380.05) 1232441
ASIAN PAINTS 1278.85 (1290.80) 442333
AXIS BANK LT 537.40 (542.40) 4627913
BAJAJ AUTO L 2874.05 (2888.60) 269022
BAJAJ FINANC 2186.85 (2169.45) 3039595
BAJAJ FINSER 6025.50 (6014.25) 183674
BHARTI AIRTE 377.55 (379.95) 3874201
BHARTI INFRA 298.40 (293.80) 1360769
BPCL 409.85 (416.05) 3242037
CIPLA 559.65 (540.70) 4815940
COAL INDIA L 289.90 (288.90) 2039196
DR. REDDYS 2062.90 (1964.95) 1113559
EICHER MOTOR 29513.00 (29712.40) 17690
GAIL 342.40 (335.25) 3066653
GRASIM IND 1028.60 (1043.60) 808741
HCL TECH 928.70 (921.35) 1134214
HDFC 1840.45 (1869.00) 1947101
HDFC BANK 2049.35 (2062.20) 1545222
HERO MOTOCOR 3635.15 (3651.50) 175173
HINDALCO IND 242.15 (248.60) 6829526
HINDUSTAN UN 1595.60 (1603.05) 760059
HPCL 311.30 (315.00) 2927283
ICICI BANK 288.25 (290.90) 11340014
INDIABULLS H 1203.90 (1208.20) 1971913
INDIAN OIL 175.00 (174.80) 5311197
INDUSINDBANK 1888.70 (1900.45) 1889091
INFOSYS LTD 1260.05 (1252.45) 3229939
ITC 267.90 (271.05) 6769606
KOTAK MAHIND 1318.35 (1310.45) 1848047
LARSEN & TOU 1343.95 (1355.15) 2483519
LUPIN 810.05 (767.35) 4904878
M&M 911.65 (920.30) 1335422
MARUTI SUZIK 8932.45 (8911.25) 287823
NTPC LTD 161.45 (162.50) 1833117
ONGC 173.70 (172.65) 4323567
POWER GRID C 197.90 (202.75) 6991475
RELIANCE IND 984.35 (971.35) 6532599
SBI 273.00 (269.65) 14096549
SUN PHARMA 528.25 (488.75) 29224236
TATA CONSULT 1747.10 (1735.55) 2582138
TATA MOTORS 309.95 (305.40) 27249374
TATA STEEL L 600.50 (602.10) 8386078
TECH MAHINDR 706.95 (701.85) 4572713
TITAN IND 896.00 (887.15) 1672490
ULTRATECH 3715.15 (3723.15) 281709
UPL LIMITED 712.90 (704.05) 1787248
VEDANTA LIMI 246.30 (247.20) 10413596
WIPRO 264.00 (264.60) 1884800
YES BANK LTD 337.65 (339.55) 5851442
ZEE ENTERTAI 557.35 (549.25) 1435606

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1248.95 (1258.75) 65049
ACC 1315.10 (1316.45) 326601
ADITYA BIRLA 140.80 (141.50) 1206850
AMBUJA CEMEN 206.00 (206.00) 2601050
ASHOK LEYLAN 145.00 (147.80) 9888275
AUROBIND PHA 572.35 (547.75) 3973856
AVENUE SUPER 1593.55 (1555.55) 1045556
BANK OFBAROD 132.25 (131.40) 17691484
BEL 118.55 (121.70) 3488083
BHEL 77.55 (76.35) 7174973
BOSCH LTD 18450.25 (18620.20) 19779
BRITANNIA 5917.65 (5993.30) 88448
CADILA HEALT 364.35 (355.90) 2145021
COLGATE PALM 1229.95 (1234.30) 288154
CONTAINER 1362.70 (1347.65) 180425
CUMMINS INDI 690.90 (679.25) 154321
DABUR INDIA 382.35 (383.95) 1416758
DLF LIMITED 205.80 (203.05) 4442610
EMAMI LIMITE 1066.20 (1032.10) 539614
GENERAL INS 728.15 (715.25) 386084
GODREJ CONSU 1168.55 (1164.10) 299301
HAVELLS INDI 552.90 (547.30) 1075751
HINDUSTAN ZI 296.05 (297.45) 997787
IDEA CELLULR 64.15 (61.80) 21059875
INTERGLOBE A 1186.30 (1171.45) 698260
JSW STEEL LT 343.25 (343.50) 2138252
L&TFIN.HOLD 168.70 (167.25) 2201126
LIC HOUS.FIN 496.95 (493.30) 1962761
MARICO LIMIT 343.65 (334.00) 1494578
MCDOWELL 3355.00 (3345.65) 246112
MOTHERSON 310.05 (313.10) 2183346
MRF 75929.00 (75427.45) 4143
NHPC LTD 26.55 (26.55) 4203003
NMDC LTD 118.10 (116.10) 1650385
OIL INDIA 220.55 (222.50) 454683
ORACLE FIN S 3849.45 (3832.65) 64891
P&G HYG&HEAL 9401.55 (9362.05) 9564
PETRONET LNG 225.80 (218.95) 3851228
PIDILITE IND 1070.35 (1087.35) 629503
PIRAMAL ENTE 2408.20 (2408.20) 243231
PNB 90.45 (86.10) 39225458
POWER FIN CO 82.40 (83.20) 5640275
RURAL ELEC C 114.90 (117.00) 4787930
SAIL 83.85 (82.80) 33468439
SBI LIFE INS 692.35 (692.00) 231427
SHREE CEMENT 16224.40 (16327.85) 11553
SHRIRAM TRAN 1446.05 (1460.30) 312024
SIEMENS 1009.70 (1000.10) 140583
SUN TV LTD 921.15 (928.90) 1606003

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.27 (6.60) 450
AISHWARYA TE 3.94 (3.79) 2809
ALPHAGEO 659.75 (646.85) 2879
AMAR RAJA BA 785.65 (779.50) 14736
ANDHRA BANK 37.20 (35.20) 586268
ANDHRA CEMEN 9.53 (9.62) 8385
ANDHRA PAPER 320.95 (325.45) 2890
ANDHRA PETRO 46.50 (47.25) 59735
ANDHRA SUGAR 352.30 (352.10) 2730
ANJANI PORTL 170 (170.05) 350
ASTRA MICROW 97.90 (99.05) 50303
AUROBINDO PH 571.95 (547.75) 256613
AVANTEL SOFT 404.30 (397.60) 4098
AVANTI FEEDS 1825.60 (1821.35) 166076
AVON ORG 9.96 (10.36) 1401
BALAJI AMIN 594.50 (599.10) 4085
BARTRONICS 11.11 (10.65) 12415
BHAGIRA CHEM 273.45 (272.85) 512
BHAGYA NAG 41.65 (41.25) 4455
BN RATHI SEC 41.90 (42.10) 13981
BRILLIANT SE 4.11 (4.32) 141984
CIL SECURI 23.50 (22.85) 4087
COMBAT DRUGS 22.95 (22) 100
CONT COFFEE 283.95 (285.95) 1341
COROMAN FERT 450.80 (446.45) 4063
CUBEX TUB 18.80 (18.70) 661
CYBERMATE 2.05 (2.10) 34895
CYIENT LIMIT 727.20 (718) 10025
DECCAN CEMEN 431.50 (420) 85
DIVI'S LAB 1051.25 (1058.10) 18514
DIVYA GRANIT 79.95 (79.15) 1
DR REDDY 2062.90 (1966.20) 805004
FOUR SOFT 64.90 (65) 1145
GATI CORPN 90.60 (89.80) 86242
GAYATRI PROJ 180.95 (177.40) 8098
GMR INFRASTR 16.35 (16.85) 1357348
GOLDST INFRA 160.15 (152.55) 3584
GOLDSTONE EN 15.27 (15.35) 14224
GRANULES (I) 78.80 (78.40) 403486
GSS AMERICA 87.80 (84.30) 44924
GVK POWER 11.83 (11.80) 285804
HBL NIFE POW 35.80 (35.25) 108351
HERITAGE FOO 687.70 (698.50) 780
HIL LTD 2015.60 (2052.55) 293
HIND FLUROCA 11.34 (12.54) 200
IDL INDUSTRS 400.85 (395) 378
IKF SOFT 0.49 (0.51) 126660
ILFS ENGINEE 30.05 (29.05) 16324
INCAP 64.15 (67.50) 550
INNAREDY COM 1.96 (1.90) 1426
IVRCL INFRAS 1.37 (1.44) 368779
JEEVAN SCIEN 33.70 (33.05) 1154
KAKATIYA CEM 254.85 (257.55) 1441
KALLAM SPG 27.85 (28.05) 4572
KARAN WOO-SN 2.10 (2) 100
KAVERI SEED 526.20 (524.90) 15091
KCP LTD 110.20 (109.45) 12849
KERNEX MICRO 27.55 (29) 5525
KNR CONSTRUC 282.15 (286) 11375
KREBS BIO 144.85 (146.15) 315
LANCO INDUS 298.05 (299.15) 4292
LANCO INFRAT 0.86 (0.82) 384263
LAURUS LABS 482.40 (467.55) 7666
LOKESH MACH 67.15 (67.55) 6457
MADHUCON PRO 13.80 (13.40) 14308
MEGA SOFT 10.11 (9.80) 4776
MIC ELECTRON 3.89 (3.71) 71615
MOLD-TEK.TEC 42 (41.50) 271
MOLDTK PLA 302 (297.65) 10434
MSR INDIA LT 30 (33.75) 13631
NAGARJAGRICH 28.60 (29.60) 15563
NAGARJAGRITE 6.28 (5.99) 10
NATCO PHARMA 786.75 (764.95) 13381
NAVA BH VENT 137.60 (137.45) 62838
NCC 110.55 (110.05) 465080
NCL IND 185.50 (188.15) 2267
NEHA INTER 5.90 (5.69) 12359
NETTLINX 58.90 (57.60) 11114
NEULAND LAB 688.60 (689.25) 70
NIHAR INFO 10.79 (11.35) 3435
NILE 582.70 (599.65) 7577
OIL COUNTRY 20.40 (19.95) 4000
PANKAJ POLY 6.53 (6.86) 1011
PANYAM CEMEN 26.95 (31.25) 81868
PENNER IND 52.60 (53.25) 16574
PHYTOCHEM I 53.30 (51.35) 2315
PIONEER DIST 283.65 (272.85) 52690
PITTI LAMIN 88.45 (87.10) 4818
POKARNA 169.45 (160.40) 1670
PRAJAY ENGS 10.92 (9.69) 36229
PREMIER EXPL 278.05 (284.35) 348
PRISM CEMENT 109.35 (108.95) 14097
PRUDENTL PHA 3.46 (3.34) 746082
RAIN INDUSTR 232.95 (221.90) 546198
RAJ PACKAGIN 28.40 (30) 792
RAJVIR INDUS 34.75 (33.10) 80
RAM INFORMAT 41.70 (40) 210
REG.CERAMIC 3.89 (4.09) 5000
SAGAR CEM 818.80 (819.80) 356
SAMKRG PIST 245 (244.70) 858
SAMPRE NUTRI 48.25 (48.70) 7942
SATVAH. ISPA 14.30 (14.50) 2727
SOUTH BIO TE 1.52 (1.46) 6376
SPHERE GLOBA 27.90 (28.50) 24192
SREE RAYAL A 37.35 (36.10) 80747
SRI KPR INDU 26.25 (25.50) 1510
SRINIVASA SH 42.50 (42.70) 369
SS ORGANICS 5.60 (5.89) 200
STARCHIK SP 26.25 (25) 2008
STEEL EXCHAN 24.25 (24.55) 47760
SUJANA METAL 0.88 (0.89) 3167
SUJANA TOWER 2.74 (2.64) 435
SUJANA UNIVE 0.51 (0.52) 40828
SURANA TELE 4.63 (4.77) 4133
SURYALAKSH.C 56.95 (55.40) 2473
SURYALATA SP 128.30 (128.30) 65
SUVEN PHARMA 214.30 (203.20) 315517
TAJ GVK HOTE 211.40 (212.35) 6385
TANLA 30.55 (29.10) 25434
TERA SOFTWAR 39 (39.50) 2225
TRANS BIOTEK 2.04 (2) 10649
VBC FERRO 39.70 (37.85) 200
VICEROY HOTE 8.01 (8.19) 29153
VIJAY TEXTIL 56.05 (57.30) 12576
VIMTA LABS 218 (202.20) 2661
VISAKA IND 638.95 (653.30) 2803
VISTA PHARMA 38.35 (36.75) 26839
VIVIMED LABS 60.85 (60.60) 29430
VST INDUS 3017.90 (3017.90) 3
XL TELENE 1.45 (1.48) 2546
YBRANT DIGIT 4.25 (4.42) 429823
ZENOTECH LAB 36.80 (35.85) 4474
ZENTECH 87.20 (89.40) 7053

మరో ఐదేళ్లు ఈయనే

రిలయన్స్‌కు సీఎండీ ● వాటాదార్ల అనుమతే తరువాయి



దిల్లీ: మరో అయిదేళ్ల పాటు ముకేశ్ అంబానీని ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా కొనసాగించడానికి రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) వాటాదార్ల అనుమతిని కోరింది. ఆర్ఐఎల్ బోర్డులో అంబానీ 1977 నుంచీ ఉన్నారు. గ్రూప్ వ్యవస్థాపకులు ధీరూభాయ్ అంబానీ జులై 2002లో పరమపదించిన తర్వాత ఆయన స్థానంలో సీఎండీగా ముకేశ్ అంబానీ పదవీ బాధ్యతలు చేపట్టారు.

వచ్చే నెల 5న ముంబయిలో జరగనున్న 41వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎమ్)లో ముకేశ్ పునర్ నియామకంపై తీర్మానాన్ని పెట్టనున్నారు. 'ప్రస్తుత అయిదేళ్ల పదవీకాలం ఏప్రిల్ 19, 2019తో ముగియనున్న నేపథ్యంలో మరో అయిదేళ్ల పాటు కొనసాగడానికి వాటాదార్ల అనుమతిని కోరనున్న'ట్లు ఒక నోటీసులో కంపెనీ తెలిపింది. వార్షిక వేతనం రూ.4.17 కోట్లు; భత్యాలు రూ.59 లక్షలు చెల్లిస్తామని అందులో వెల్లడించింది. పదవీ విరమణ ప్రయోజనాలను అందులో కలపలేదు. నికర లాభాలపై బోనస్‌లు; వ్యాపార అవసరాల కోసం చేసే ప్రయాణాల్లో ఖర్చులు(భార్య, ఇతర సిబ్బందికి); ఆఫీసు కారు తదితరాలను పొందుతారు. అదే సమయంలో అంబానీ, కుటుంబ సభ్యులకు కల్పించే భద్రత వ్యయాలను భత్యాలుగా చూపించరు. వాటిని మొత్తం వేతన పరిమితి లెక్కింపునకు పరిగణనలోకి తీసుకోరు.

చిన్న కొడుకు వస్తున్నాడు

విప్రో ఎంటర్‌ప్రైజెస్ బోర్డులోకి ప్రేమ్‌జీ తనయుడు తారిఖ్

దిల్లీ: విప్రో ఎంటర్‌ప్రైజెస్ బోర్డులో అజీమ్ ప్రేమ్‌జీ చిన్న కొడుకు తారిఖ్ ప్రేమ్‌జీ చేరనున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదుకాని విప్రో ఎంటర్‌ప్రైజెస్ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తారిఖ్ వ్యవహరించనున్నారు. కంపెనీ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తారిఖ్ ప్రేమ్‌జీ నియమితులయ్యారని, తండ్రి అజీమ్ ప్రేమ్‌జీ, సోదరుడు రిషద్ ప్రేమ్‌జీలతో కలిసి పనిచేస్తారని విప్రో ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. విప్రో కన్జ్యూమర్ కేర్, విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్‌లను విప్రో ఎంటర్‌ప్రైజెస్ నిర్వహిస్తోంది. సౌందర్య ఉత్పత్తులు, లైట్లు, ఆఫీసు సామగ్రి వంటి వాటిలో విప్రో కన్జ్యూమర్ కేర్ కార్యకలాపాలు సాగిస్తోంది. ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాల్లో హైడ్రాలిక్ సొల్యూషన్లు, పారిశ్రామికక అవసరాలు మొదలైన వాటిని విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ అందిస్తోంది. విప్రో ఎంటర్‌ప్రైజెస్ బోర్డు అధిపతిగా అజీమ్ ప్రేమ్‌జీ ఉన్నారు. ఇతర బోర్డు సభ్యుల్లో కన్జ్యూమర్ కేర్ సీఈఓ సురేశ్ సేనాపతి, విప్రో ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీత్ అగర్వాల్, విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీఈఓ ప్రతీక్ కుమార్‌లు ఉన్నారు. ప్రస్తుతం రిషద్ ప్రేమ్‌జీ సైతం నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఐటీ దిగ్గజం విప్రో ముఖ్య స్ట్రేటజీ ఆఫీసర్‌గా సైతం వ్యవహరిస్తున్నారు.

ఈనాడు బిజినెస్

ఆస్తుల నిర్వహణకో కంపెనీ

● ఏర్పాటుకు కేంద్రం యత్నాలు ● సునీల్ మెహతా నేతృత్వంలో కమిటీ
● ౩౦ రోజుల్లో పీఎస్‌బీలకు అధిపతుల నియామకం ● ఆర్థిక మంత్రి పియూశ్ గోయెల్ వెల్లడి

ముంబయి: ఒత్తిడికి గురవుతున్న రుణాలను సత్వరం పరిష్కరించేందుకు వీలుగా ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీ (ఏఆర్‌సీ) లేదా ఆస్తుల నిర్వహణ కంపెనీ (ఏఎంసీ) ఏర్పాటుకు సూచనలిచ్చేందుకు కమిటీని నియమిస్తున్నట్లు ఆర్థిక మంత్రి పియూశ్ గోయెల్ ప్రకటించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ సునీల్ మెహతా నేతృత్వంలోని ఈ కమిటీ రెండు వారాల్లో సిఫారసులు చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల అధిపతులతో సమావేశానంతరం ఆయన ఈ విషయాన్ని తెలిపారు. 21 పీఎస్‌బీలలో ప్రతి ఒక్కదాని బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. ఒత్తిడికి గురవుతున్న రుణాల్లో అత్యధికం ఏఆర్‌సీ లేదా ఏఎంసీ పరిధిలోకి వస్తాయని గుర్తించినందునే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలానే బ్యాంకులు కూడా బయటి నిపుణులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసుకుంటాయని చెప్పారు. ఒత్తిడికి గురవుతున్న రుణాల విషయంలో నిర్ణయాలను సత్వరం, పారదర్శకంగా తీసుకునేందుకు ఇవి దోహద పడతాయన్నారు. రుణాల జారీ ఎలా ఉందో బ్యాంకర్లతో చర్చించామని, సరైన ప్రాజెక్టులకు రుణాల మంజూరులో అవరోధాలు లేకుండా చూడాలని నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చేందుకు నష్టభయాలను తగ్గించాలని, అందుకు తగిన వ్యవస్థ ఏర్పాటుకు బ్యాంకర్లందరూ మద్దతు తెలిపారని వివరించారు. పీఎస్‌బీలలో ఖాళీగా ఉన్న అధిపతుల పోస్టులను 30 రోజుల్లో భర్తీ చేస్తామని తెలిపారు. 12 మేనేజింగ్ డైరెక్టర్ పదవులు, 18 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది.

ముంబయిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి పియూశ్ గోయెల్. చిత్రంలో ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్, పీఎన్‌బీ ఛైర్మన్ సునీల్ మెహతా

స్థిరాస్తి మోసగాళ్లకు ఇక ముకుతాడు: జైట్లీ

దిల్లీ: దివాలా స్మృతికి చేసిన సవరణల వల్ల స్థిరాస్తి రంగంలో మోసగాళ్లకు ముకుతాడు పడుతుందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ప్రాజెక్టులు కూడా నిర్దేశిత సమయంలో పూర్తవుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 'ఇకపై ఇల్లు/ఫ్లాట్ కొనుగోలుదారులను కూడా ప్రాజెక్టుకు రుణం ఇచ్చిన వారిగా గుర్తిస్తారు కనుక, దివాలా ప్రక్రియలో వీరికీ భాగముంటుంది. అభివృద్ధిదారు కనుక సక్రమంగా వ్యవహరించకపోతే, వారిపై దివాలా ప్రక్రియ ప్రారంభించే వీలు ఒక కొనుగోలుదారుకీ లభిస్తుంది. రుణ దాతల కమిటీలో వీరికి చోటు లభిస్తుంది, ఓటు హక్కు ఉంటుంది. స్థిరాస్తి రంగ క్రమబద్ధీకరణకు ఇది దోహద పడుతుంద'ని ఫేస్‌బుక్ పోస్ట్‌లో మంత్రి పేర్కొన్నారు. 'స్థిరాస్తి రంగంలో అసలైన, మంచి అభివృద్ధి సంస్థలే మిగులుతాయి. డబ్బులు తీసుకుని, పరారయ్యే వారు వైదొలగుతారు. ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయి. పెట్టుబడి పెట్టిన వారికి వాటా వాటా వేగంగా అందుతుంది. నిర్మాణ రంగం రెండంకెల వృద్ధిని సాధిస్తుంది. రెరా చట్టం దీనికి మరింత ఉపకరిస్తుంది' అని వివరించారు. 'మోసగాళ్లు ప్రారంభించే స్థిరాస్తి ప్రాజెక్టులో నివాసం కోసం డబ్బులు కట్టినవారు, అప్పుల ఊబిలో చిక్కుకుపోతారు. జీవితకాలం కష్టపడి కూడబెట్టుకున్న మొత్తం పోతుంది. బ్యాంకుల వద్ద రుణం తీసుకుంటే, నెలవారీ కిస్తీ కూడా కట్టాల్సి వస్తుంది. ఇకపై ఈ పరిస్థితులు దూరం అవుతాయి' అని జైటీ తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లు పెంపు

దిల్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా నిధుల వ్యయం ఆధారిత రుణ రేట్ల(ఎమ్‌సీఎల్‌ఆర్)ను పెంచింది. వివిధ కాలవ్యవధులు కలిగిన రుణాలపై ఎంసీఎల్‌ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు (0.10 శాతం) పెంచింది. ఏడాది కాలవ్యధి కలిగిన రుణాలపై ఎంసీఎల్‌ఆర్‌ను 0.1 శాతం పెంచి 8.50 శాతంగా చేసింది. ఒక నెల, మూడు నెలల రుణాలపై ఎంసీఎల్‌ఆర్‌ను వరుసగా 8.20 శాతం, 8.30 శాతానికి పెంచింది. ఇక ఆరు నెలల రుణంపై ప్రస్తుతం 8.35 శాతంగా ఉన్న ఎంసీఎల్‌ఆర్.. 0.10 పెరిగి 8.45 శాతానికి చేరింది. కొత్త రేట్లు రేపటి నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. ఆర్‌బీఐ రేట్ల పెంపు నేపథ్యంలో ఇప్పటికే ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంకులు ఎమ్‌సీఎల్‌ఆర్‌ను పెంచిన విషయం తెలిసిందే.

తగ్గిన విదేశీ మారకపు నిల్వలు

ముంబయి: భారత విదేశీ మారకపు నిల్వలు జూన్ 1తో ముగిసిన వారానికి 593.7 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,850 కోట్లు) తగ్గి 412.23 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.26.79 లక్షల కోట్లు)కు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. పసిడి నిల్వలు తగ్గడం వల్లే మొత్తం నిల్వల్లో తగ్గుదల కనిపించిందని తెలిపింది. అంతక్రితం వారం కూడా విదేశీ మారకపు నిల్వలు 2.23 బి.డాలర్లు తగ్గడంతో 412.83 బి.డాలర్లకు పరిమితమయ్యాయి. ఏప్రిల్ 13తో ముగిసిన వారానికి 426.02 బి.డాలర్లకు చేరిన నిల్వలు గరిష్ఠ స్థాయిని నమోదు చేశాయి. గత ఏడాది సెప్టెంబరులో విదేశీ మారకపు నిల్వలు 400 బి.డాలర్ల మార్కును దాటాయి. డాలరుతో పోలిస్తే రూపాయి క్షీణిస్తుండటంతో నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. గత కొన్ని వారాలుగా పసిడి నిల్వల్లో పెద్దగా మార్పు ఉండేది కాదు. అయితే తాజాగా ఈ నిల్వలు 511 మి. డాలర్లు తగ్గి 21.18 బి.డాలర్లకు చేరాయి.

జీఎస్‌టీలోకి సహజ వాయువు!

దిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) పరిధిలోకి సహజవాయువును తీసుకువచ్చే అంశంపై వచ్చే సమావేశంలో చర్చించాలని జీఎస్‌టీ మండలి నిర్ణయించింది. పెట్రోలియం ఉత్పత్తుల్లో తొలుత దీనిని ప్రయోగాత్మకంగా చేపట్టాలని భావిస్తున్నారు. 5 పెట్రోలియం ఉత్పత్తుల్లో విమాన ఇంధనాన్ని (ఏటీఎఫ్) కూడా జీఎస్‌టీలోకి తేవాలని జీఎస్‌టీ మండలి సంయుక్త కార్యదర్శి ధీరజ్ రస్తోగీ పేర్కొన్నారు. అయితే సహజవాయువు, ఏటీఎఫ్‌ను ఎప్పటిలోగా జీఎస్‌టీ పరిధిలోకి తెస్తారనేది రస్తోగీ వెల్లడించలేదని పీహెచ్‌డీ ఛాంబర్ తెలిపింది. శుక్రవారం ఇక్కడ జరిగిన జీఎస్‌టీ వర్క్‌షాప్‌నకు సంబంధించి ఛాంబర్ ఈ వివరాలు వెల్లడించింది. జీఎస్‌టీ కింద సరఫరా నిర్వచనాన్ని కూడా సవరించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రివ్వుమంటున్న రిలయన్స్ రిటైల్

● భారీ విస్తరణ ప్రణాళికలు
● సంస్థ మరింత బలోపేతానికే

దిల్లీ

రిలయన్స్ రిటైల్ సంస్థాగత రిటైల్ విభాగంలో భారీ విస్తరణ ప్రణాళికలను కొనసాగించాలని భావిస్తోంది. వినియోగదారు కొనుగోలు అభిరుచులకు తగ్గట్లుగా మారుతూ తన స్థానాన్ని మరింత పదిలపరచుకోవాలని అనుకుంటున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజా వార్షిక నివేదికలో కంపెనీ పేర్కొంది.

10 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.రూ.65,000 కోట్లు) విక్రయాలను అధిగమించి ప్రపంచ అగ్రగామి 200 రిటైల్ కంపెనీల్లో చోటు దగ్గించుకున్న తొలి భారతీయ కంపెనీ రిలయన్స్ రిటైల్ కావడం విశేషం. ప్రస్తుతం సంస్థాగత రిటైల్‌లో తన నాయకత్వ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలనుకుంటోంది. ఇందుకోసం గ్రూప్‌నకు చెందిన రిలయన్స్ జియోను ఉపయోగించుకోవాలని భావిస్తోంది.

చిన్న నగరాల్లోకి..: కంపెనీ వ్యూహం ప్రకారం.. రెండో, మూడో శ్రేణి నగరాల్లోకి తన నెట్‌వర్క్‌ను విస్తరించడం కొనసాగిస్తుంది. మరిన్ని ప్రాంతాలకు రిటైల్ స్టోర్లను చేర్చడం; స్టోర్ల ఏర్పాటులో వినూత్న ఆలోచనలతో వెళ్లడం; వినియోగదార్లకు గొప్ప అనుభూతిని కల్పించడం; సాంకేతికతను అందిపుచ్చుకోవడం అనే నాలుగు కీలక అంశాలను గుర్తించింది. వీటిని అమలు చేయడానికి రిలయన్స్ జియోకున్న బలాలు ఉపయోగపడతాయని భావిస్తోంది.

అవకాశాలు బోలెడు: 'రిటైల్ రంగం వృద్ధి చెందడానికి భారీ అవకాశాలున్నాయి. మొత్తం భారత రిటైల్ మార్కెట్లో సంస్థాగత రిటైల్‌కు కేవలం 9 శాతం వాటానే ఉంది. అంటే అవకాశాలు భారీగా ఉన్నాయని దీని అర్థమ'ని కంపెనీ చెబుతోంది. రిలయన్స్ రిటైల్ ఆదాయాలు అంతక్రితం ఏడాదితో పోలిస్తే 104.9 శాతం వృద్ధితో రూ.69,198 కోట్లకు చేరాయి. గత అయిదేళ్లలో 45 శాతం సమ్మిళిత వృద్ధితో కొనసాగుతుండడం గమనార్హం.

కొత్త తరహా స్టోర్లతో..

రిలయన్స్ రిటైల్ ఈ ఏడాది 'ప్రాజెక్ట్ ఈవ్', 'ట్రెండ్స్ ఉమెన్' వంటి కొత్త తరహా స్టోర్లను ప్రారంభించింది. వినియోగదారు అవసరాల కోసం అంతర్జాతీయ బ్రాండ్లు, ప్రపంచ స్థాయి ఉత్పత్తులు, సేవలను అందించడం కొనసాగిస్తామని చెబుతోంది. 2.0 వ్యూహం కింద యువ వినియోగదార్లను ఆకట్టుకోవడం బ్రాండ్లు, నాణ్యత విషయంలో రాజీ పడడం లేదని తెలిపింది. సాంకేతికతను ఇష్టపడే ఈ తరానికి జియో ద్వారా దగ్గర కావాలని రిలయన్స్ రిటైల్ భావిస్తోంది. ఇందు కోసం తదుపరి తరం సాంకేతికతను అందిపుచ్చుకోనుంది. ఈ ఏడాది 221 స్టోర్లు, 3736 జియో పాయింట్ స్టోర్లను జత చేయడంతో మొత్తం 4,400 నగరాల్లో 7573 స్టోర్లకు నెట్‌వర్క్ పెరిగింది.

హైదరాబాద్‌లో ఒకే రోజు 20 'హ్యాపీ మొబైల్స్' షోరూమ్‌లు

25వ హ్యాపీ మొబైల్స్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామ్ చరణ్. పక్కన హ్యాపీ మొబైల్స్ ఎండీ కృష్ణ పవన్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: గొలుసుకట్టు విక్రయ కేంద్రాల ద్వారా మొబైల్ ఫోన్లను విక్రయిస్తున్న హ్యాపీ మొబైల్స్ శుక్రవారం ఒకే రోజు హైదరాబాద్‌లో 20 విక్రయ కేంద్రాలను ప్రారంభించింది. దీంతో విక్రయ కేంద్రాలు 25కు చేరతాయి. 25వ విక్రయ కేంద్రాన్ని చందానగర్‌లో సినీ హీరో రామ్ చరణ్ ప్రారంభించారు. హ్యాపీ మొబైల్స్‌కు చరణ్ ప్రచారకర్తగా ఉన్నారు. తొలి ఏడాదిలో కనీసం 150 నుంచి 200 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని హ్యాపీ మొబైల్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ పవన్ తెలిపారు. అంతర్జాతీయ బ్రాండ్లతో సహా విక్రయ కేంద్రాల్లో 200పైగా ఎస్‌కేయూలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. రుణ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని ఫోన్ల కొనుగోలుకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామని, నెలవారీ వాయిదాల్లో చెల్లింపులు చేయొచ్చని తెలిపారు.

పన్నుల తగ్గింపే పరిష్కారం

ఇంధన ధరలపై అసోచామ్

లఖ్‌నవూ: పన్నుల తగ్గింపుతోటే, ఇంధన ధరల పెరుగుదల సమస్యకు పరిష్కారం చూపగలమని పరిశ్రమల సంఘం అసోచామ్ పేర్కొంది. ఇంధన ధరలు తగ్గితే, ఎగుమతుల రంగానికి ఊతం లభిస్తుందని, ధర పరంగా ఇతర దేశాల ఉత్పత్తులతో పోటీ పడగలుగుతామని తెలిపింది. ఎగుమతులు వృద్ధి చెందితే దేశ కరెంట్ ఖాతా లోటు తగ్గుతుందని, రూపాయి క్షీణతకు అడ్డుకట్ట పడుతుందని అసోచామ్ సెక్రటరీ జనరల్ డీఎస్ రావత్ పేర్కొన్నారు. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) పరిధిలోకి పెట్రోలియం ఉత్పత్తులనూ తేవాలని, అప్పుడే అంతర్జాతీయ విపణి స్థాయిలో దేశీయంగా వాటి ధరలు ఉంటాయని తెలిపారు. అప్పుడు ఇంధన ధరలను ప్రభుత్వం పర్యవేక్షించాల్సిన అవసరం ఉండదని, అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ఉండే కమొడిటీ లాగానే వీటినీ చూస్తారని పేర్కొన్నారు. ఇంధన ధరల భారీ పెరుగుదల వల్ల కుటుంబ ఆర్థిక ప్రణాళికలు తల్లకిందులవుతున్నాయని, రవాణా ఖర్చుల కనుగుణంగా వస్తువుల ధరలు పెరిగి, ద్రవ్యోల్బణం అధికమవుతుందని వివరించారు. దేశీయంగా ఇంధన ధరలపై ఒక పత్రాన్ని విడుదల చేశారు. దీని ప్రకారం..

ధర ఇలా పెరుగుతోంది

- ✦ లీటరు ముడిచమురు దిగుమతి ధర రూ.26.
- ✦ దీన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు సేకరించి, 'ప్రవేశ పన్ను, శుద్ధి వ్యయాలు, నిల్వ వ్యయాలు, మార్జిన్లు' కలిపి డీలర్‌కు రూ.30 చొప్పున విక్రయిస్తున్నాయి.
- ✦ దీనిపై కేంద్రం లీటరుకు రూ.19 చొప్పున ఎక్సైజ్ సుంకంగా విధిస్తోంది. డీలర్ కమీషన్ రూ.3కు పైగా, రాష్ట్ర ప్రభుత్వ విలువ జత చేరిన సుంకం (వ్యాట్) జతచేరాక, పెట్రోల్ వినియోగదారుకు చేరుతుంది.
- ✦ అంటే డీలర్ వద్దకు రూ.30కే చేరుతున్న పెట్రోల్, సుంకాల వల్ల వినియోగదారులకు చేరే సరికి హైదరాబాద్‌లో రూ.80 దాటుతోంది. అంటే పన్నుల రూపేణ 130 శాతం ధర పెరుగుతోంది.

2013లో ఎక్సైజ్ రూ.9 మాత్రమే

2013లో ముడిచమురు ధర బ్యారెల్ 110 డాలర్లకు చేరింది. అప్పుడు కేంద్రప్రభుత్వ ఎక్సైజ్ లీటరుకు రూ.9 మాత్రమే ఉండేది. ఇప్పుడు లీటర్ పెట్రోల్‌పై రూ.19, డీజిల్‌పై రూ.15కు చేరింది.

- ✦ 2014 నవంబరు నుంచి 2016 జనవరి వరకు 9 విడతలలో ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం ద్వారా కేంద్రం ఇంధనంపై గణనీయంగా ఆదాయాన్ని పొందింది.
- ✦ ఇంధనంపై ఎక్సైజ్ సుంకం రూపేణ కేంద్రప్రభుత్వం రోజుకు రూ.660 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.450 కోట్ల చొప్పున ఆదాయం పొందాయి.
- ✦ 2016-17లో కేంద్రం రూ.2.4 లక్షల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.6 లక్షల కోట్లు ఇలా ఆర్జించాయని రావత్ వివరించారు.

రూ.4 లక్షల కోట్ల ఎఫ్‌డీఐలు వచ్చాయ్

2017-18పై డిప్ కార్యదర్శి రమేశ్

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 61.96 బిలియన్ డాలర్లు (సుమారు రూ.4.02 లక్షల కోట్లు) వచ్చాయని పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం (డిప్) కార్యదర్శి రమేశ్ అభిషేక్ తెలిపారు. 2016-17 ఎఫ్‌డీఐలు 60 బి.డాలర్ల (సుమారు రూ.3.90 లక్షల కోట్ల) కంటే ఇది 3 శాతం అధికమని వివరించారు. ఈక్విటీల్లోకి వచ్చిన పెట్టుబడులు, అంతకుముందు వచ్చిన లాభాలను మళ్లీ ఇక్కడే పెట్టుబడిగా పెట్టడం వంటివీ ఇందులో కలిసి ఉన్నాయని తెలిపారు. గత నాలుగేళ్లలో రక్షణ, వైద్య పరికరాలు, నిర్మాణ, రిటైల్, పౌరవిమానయాన రంగాల్లో ప్రభుత్వం ఎఫ్‌డీఐ నిబంధనలు సరళీకరించిన ఫలితమే ఎఫ్‌డీఐల వృద్ధి అని పేర్కొన్నారు. సేవలు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్-హార్డ్‌వేర్, టెలికమ్యూనికేషన్స్, నిర్మాణం, ట్రేడింగ్, వాహన రంగాల్లో విదేశీ నిధులు అధికంగా వచ్చాయని తెలిపారు.

నేరుగా వస్తున్నాయ్

విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలిని ప్రభుత్వం రద్దు చేసిందని, ఇప్పుడు నేరుగానే వివిధ రంగాల్లోకి వస్తున్నాయని వాణిజ్య, పరిశ్రమల శాఖల మంత్రి సురేశ్ ప్రభు గుర్తు చేశారు. దేశీయంగా పెట్టుబడులు పెట్టేందుకు యాపిల్, టెస్లా కంపెనీల నుంచి అధికారిక దరఖాస్తులు వచ్చాక, వాటిని పరిశీలిస్తామని మంత్రి వెల్లడించారు.

ఈ దేశాల నుంచి అధికం

మారిషస్, సింగపూర్, జపాన్, నెదర్లాండ్స్, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల నుంచి ఎక్కువగా పెట్టుబడులు తరలి వచ్చాయి.

అయితే ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం 2016లో దేశంలోకి 44 బి.డాలర్ల ఎఫ్‌డీఐ రాగా, 2017లో ఈ మొత్తం 40 బి.డాలర్లకు పరిమితమైంది. ఇదే సమయంలో భారత్ నుంచి విదేశాల్లోకి పెట్టుబడులు రెట్టింపు మేర తరలిపోయాయి.

తిరుపతిలో ఎక్సలెన్స్ కేంద్రం

ఐసీఏ అధ్యక్షుడు పంకజ్ మొహింద్రో



ఈనాడు అమరావతి: మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు సంబంధించి ప్రభుత్వ విధానాలు, ప్రోత్సాహం, మౌలిక వసతులు వంటి 43 అంశాల ప్రాతిపదికగా తమ సంస్థ రూపొందించిన 'కాంపిటీటివ్ ఇండెక్స్'లో ఆంధ్రప్రదేశ్ మూడేళ్లుగా దేశంలో మొదటి స్థానంలో నిలుస్తోందని ఇండియన్ సెల్యులర్ అసోసియేషన్ (ఐసీఏ) అధ్యక్షుడు పంకజ్ మొహింద్రో వెల్లడించారు. అయితే చైనా, వియత్నాం వంటి దేశాలతో పోటీ పడేందుకు ఇంకా ఎన్నో రంగాల్లో మెరుగుపడాల్సి ఉందని పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మొబైల్ ఫోన్ల డిజైన్లు, ఇన్‌క్యుబేషన్, టూలింగ్‌కు సంబంధించి తిరుపతి సమీపంలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తిరుపతి, శ్రీసిటీ ప్రాంతం ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, మొబైల్ ఫోన్ల తయారీకి ప్రపంచ తయారీ కేంద్రంగా మారుతుందనే ధీమా వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్ల తయారీలో దేశీయంగా ఉత్తరప్రదేశ్ తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందన్నారు. గ్రేటర్ నోయిడా, ముంబయి, బెంగళూరు వంటి రాష్ట్రాలతో పోలిస్తే కొత్తగా ఏర్పడిన ఏపీకి చాలా ప్రతికూలతలు ఉన్నా... మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరిశ్రమల్ని ఆకర్షించేందుకు చాలా కృషి చేస్తోందని, అది సత్ఫలితాలనూ ఇస్తోందని వివరించారు. దేశంలో అన్ని వసతులతో కూడిన పారిశ్రామికవాడలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో తమకు చిరకాల మైత్రి ఉందని, ఆయనతో ఉన్న సన్నిహిత సంబంధాల్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్రానికి ఫాక్స్‌కాన్ పరిశ్రమను తీసుకురావడానికి చాలా కృషి చేశామని చెప్పారు. ఫాక్స్‌కాన్, తిరుపతి సమీపంలో శ్రీ వేంకటేశ్వర ఈఎంసీ వంటివి వచ్చాక... మొబైల్ తయారీ పరిశ్రమల్లో నమ్మకం ఏర్పడిందన్నారు. శ్రీసిటీని బాగా నిర్వహిస్తున్నారని, అలాంటి ఇండస్ట్రియల్ పార్కులు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. పన్ను విధానం వ్యాట్ నుంచి జీఎస్టీకి మారే క్రమంలో మొబైల్ తయారీ పరిశ్రమలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వాటిని పరిష్కరించాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరినట్టు చెప్పారు.

ఛాంపియన్

సుజీ బేట్స్ (151)

వన్డే మ్యాచ్‌లో 490

అమ్మాయిల క్రికెట్లో కివీస్ అద్భుతం!

డబ్లిన్: మహిళల క్రికెట్లో ప్రకంపనలు రేపింది న్యూజిలాండ్. వన్డేల్లో ఏకంగా 490 పరుగుల భారీ స్కోరు సాధించి తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిందా జట్టు. ఐర్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం తొలి మ్యాచ్‌లో కివీస్ ఏకంగా 346 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. మొదట కెప్టెన్, ఓపెనర్ సుజీ బేట్స్ (151; 94 బంతుల్లో 24×4, 2×6)తో పాటు మ్యాడీ గ్రీన్ (121; 77 బంతుల్లో 15×4, 1×6), అమీలా కేర్ (81 నాటౌట్; 45 బంతులోల 9×4, 3×6)ల మెరుపులతో కివీస్ 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 490 పరుగులు చేసింది. అనంతరం కాస్పరెక్ (4/17), రోవ్ (2/23)ల ధాటికి ఐర్లాండ్ 144 పరుగులకే కుప్పకూలింది. ఇంతకు ముందు 1997లో కివీస్ పాకిస్థాన్‌పై 455/5తో ప్రపంచ రికార్డు నెల కొల్పింది. అదిప్పుడు బద్దలైంది. ఆ మ్యాచ్‌లో కివీస్ 408 పరుగుల తేడాతో నెగ్గి పరుగుల పరంగా అతి పెద్ద విజయం నమోదు చేసింది.

ఒడిషాలో గోపీచంద్ అకాడమీ

ఒడిషా: హైదరాబాద్‌లో అకాడమీలు ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయి షట్లర్లను వెలుగులోకి తెస్తున్న పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ ఫౌండేషన్ (పీజీఎంఎఫ్) ఒడిషాలో అకాడమీ పెట్టనుంది. ఒడిషాలో వర్ధమాన క్రీడాకారుల నైపుణ్యానికి మెరుగులద్ది వాళ్లను ప్రపంచస్థాయి షట్లర్లుగా తయారు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో (పీజీఎంఎఫ్) ఒప్పందం కుదుర్చుకుంది. ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఆ రాష్ట్ర క్రీడా, యువజన వ్యవహారాల విభాగం, పీజీఎంఎఫ్‌కు మధ్య ఒప్పందం జరిగింది.

అభిమానులూ.. గుండె జాగ్రత్త!

పారిస్: ఫుట్‌బాల్ ప్రపంచకప్ అంటే.. అభిమానుల్లో ఉరకలెత్తే ఉత్సాహం, ఊపిరి బిగబట్టే ఉత్కంఠ.. అంతులేని ఆనందం కనిపించడం సర్వసాధారణం. అయితే దీని వల్ల ప్రాణాలు తీసే వ్యాధులు కూడా వచ్చే అవకాశముందని అంటున్నారు వైద్య నిపుణులు. మ్యాచ్‌ల సమయంలో గుండెపోటుతో పాటు గుండెకు సంబంధించిన వ్యాధులు, అసురక్షిత సెక్స్, ప్రమాదాలు, ఆత్మహత్యలు, గృహ హింసకు దారి తీసే ఘటనలు జరిగే వీలుందని పరిశోధనలో

ఆరోగ్యంతో ఆటలొద్దు

తేలింది. ప్రపంచకప్ లాంటి ప్రధాన టోర్నీలు జరిగే సమయంలో హృదయ సంబంధ సమస్యలతో పాటు ప్రాణాలు పోతున్నాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ చేసిన పరిశోధనలో తేటతెల్లమైంది. తీవ్ర ఉత్కంఠగా సాగే మ్యాచ్‌ల వల్ల ఆరోగ్యానికి ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆ పరిశోధన తెలిపింది. మ్యాచ్ చూస్తుంటే గుండెపోటు వచ్చినంత పనైందని చాలా మంది చెబుతుంటే వింటామని ఇలాంటి సందర్భాల్లోనే జాగ్రత్తగా ఉండాలని సూచించింది. మ్యాచ్ చూస్తున్నప్పుడు కలిగే ఒత్తిడి, ఉత్కంఠ, కోపం వల్ల గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువని తెలిపింది. "ఇది ఉత్కంఠభరితమైన సమయం అని తెలుసు. కానీ గుండెను జాగ్రత్తగా చూసుకోవడం మర్చిపోవద్దు" అని బ్రిటీష్ హార్ట్ ఫౌండేషన్‌లోని ఓ సీనియర్ నర్సు చెప్పింది. 2003 రగ్బీ ప్రపంచకప్ సందర్భంగా సెమీ ఫైనల్లో న్యూజిలాండ్ జట్టు ఓటమి తర్వాత ఆసుపత్రిలో గుండె సంబంధిత సమస్యతో చేరిన వారి సంఖ్య 50 శాతం పెరిగిందని ఓ నివేదిక తెలిపింది. దాంట్లో ఆడవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉండడం విశేషం. 2014 ఫుట్‌బాల్ ప్రపంచకప్ సమయంలో ఎక్కువ మంది కంటి సంబంధిత వ్యాధితో బాధ పడ్డారని తేలింది. మరోవైపు మ్యాచ్ చూసుకుంటూ మోతాదుకు మించి మద్యం సేవించడం వల్ల రోడ్డు ప్రమాదాలు, హింస చెలరేగే అవకాశం ఉంది. అంతేకాకుండా 2002, 2006, 2010 ఫుట్‌బాల్ ప్రపంచకప్ సమయాల్లో ఇంగ్లాండ్‌లో గృహ హింస 26 శాతం పెరిగినట్లు తెలుస్తుంది. దాంతో పాటు తమ జట్టు ఓడిందనే నిరాశతో ఆత్మహత్య చేసుకున్న ఘటనలూ ఉన్నాయి. ఏదో సరదా కోసం మ్యాచ్ చూస్తే తప్పు లేదు కానీ.. ఒత్తిడితో మ్యాచ్ చూడొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ప్రపంచకప్‌ను ఆస్వాదించాలి అంతే కానీ ప్రాణాలు కోల్పోయేంత దూరం వెళ్లకుండా చూసుకోవాలి.

ఆనంద్‌కు రెండో స్థానం

స్టవేంజర్ (నార్వే): విశ్వనాథన్ ఆనంద్ (4.5) ఉమ్మడిగా రెండో స్థానంతో నార్వే చెస్ టోర్నమెంట్‌ను ముగించాడు. ఆఖరి రౌండ్లో అతడు సెర్గీ కర్జాకిన్ (రష్యా)పై 32 ఎత్తుల్లో విజయం సాధించాడు. ఫాబియానో కరౌనా (ఇటలీ) 5 పాయింట్లతో టోర్నీ విజేతగా నిలిచాడు. ఆనంద్‌తో పాటు నకముర (అమెరికా), కార్ల్‌సన్ (నార్వే) రెండో స్థానం సాధించారు.

ఒలింపిక్ ఛాంపియన్‌కు భారత బాక్సర్ షాక్

దిల్లీ: భారత యువ బాక్సర్ లాల్బియాకిమా సంచలన ప్రదర్శన చేశాడు. కజకిస్థాన్‌లో జరుగుతున్న ప్రెసిడెంట్స్ కప్ బాక్సింగ్ టోర్నమెంట్లో అతను ఒలింపిక్ ఛాంపియన్‌కు షాకిచ్చాడు. 49 కేజీల విభాగం క్వార్టర్‌ఫైనల్లో లాల్బియాకిమా 4-1తో హసన్‌బాయ్ దుస్మతోవ్‌ను మట్టికరిపించాడు. మణిపూర్‌కు చెందిన లాల్బియాకిమా కెరీర్లో ఇదే అతి పెద్ద విజయం. 2016 రియో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన దుస్మతోవ్.. గత ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచాడు.

కోహ్లి గడ్డానికి బీమా!

దిల్లీ: టీమ్ఇండియా సారథి విరాట్ కోహ్లి కొన్నేళ్లుగా గడ్డంతోనే కనిపిస్తున్న సంగతి తెలిసిందే. గడ్డం తనకు బాగా నప్పుతుందని, అందుకే దాన్ని పూర్తిగా తీసేసే ప్రసక్తే లేదని కోహ్లి ఇటీవలే నొక్కి వక్కాణించాడు. కాగా కోహ్లి తన గడ్డానికి బీమా చేయించుకున్నాడన్న వార్త నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. ఈ రకమైన సందేహాలు రేకెత్తించే వీడియోను టీమ్ఇండియా ఆటగాడు కేఎల్ రాహుల్ ట్విట్టర్లో పోస్ట్ చేశాడు. అందులో కోహ్లి గడ్డాన్ని ఓ వ్యక్తి కాస్త కత్తిరించి తీసుకోవడం.. ఆ తర్వాత కోహ్లి ఓ దస్త్రంపై సంతకం పెట్టడం కనిపించింది. తాను పోస్ట్ చేసిన వీడియో కింద.. "హాహా! నువ్వు నీ గడ్డాన్ని ఎంతలా ప్రేమిస్తావో నాకు తెలుసు. నా లెక్క ప్రకారం నువ్వు నీ గడ్డానికి బీమా చేయించుకుంటున్నావనుకుంటున్నా" అని రాహుల్ వ్యాఖ్య జోడించాడు. మరి విరాట్ నిజంగా గడ్డానికి బీమా చేయించుకున్నాడో లేదో అతడికే తెలియాలి. గతంలో ఫుట్‌బాల్ స్టార్ మెస్సి తన కాళ్లకు బీమా చేయించుకున్న విషయం తెలిసిందే.

ఫైనల్లో భారత్ X కెన్యా

ముంబయి: ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్‌తో పాటు కెన్యా ఫైనల్‌కు చేరుకున్నాయి. శుక్రవారం కెన్యా 4-0తో చైనీస్ తైపీని ఓడించింది. ఆ జట్టుతో పాటు భారత్, న్యూజిలాండ్ తలో ఆరు పాయింట్లతో సమమయ్యాయి. ఐతే మెరుగైన గోల్ తేడా ఉన్న భారత్ (+7), కెన్యా (+2) ఫైనల్‌కు అర్హత సాధించాయి. +1 గోల్ తేడాతో ఉన్న కివీస్‌కు నిరాశ తప్పలేదు. ఫైనల్ ఆదివారం జరుగుతుంది.

అథ్లెట్లు.. ఆదాయంలో మూడో వంతు ఇవ్వాలి

హరియాణాలో నోటిఫికేషన్.. విమర్శలతో నిర్ణయం వెనక్కి..

చండీగఢ్: ప్రభుత్వ ఉద్యోగం కలిగి ఉన్న అథ్లెట్లు ప్రొఫెషనల్‌గా, వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆర్జించే మొత్తంలో మూడో వంతును రాష్ట్ర క్రీడా మండలికి జమ చేయాలంటూ హరియాణా ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ వివాదాస్పదమైంది. క్రీడాకారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ప్రభుత్వం వెంటనే ఈ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంది. "తదుపరి ఉత్తర్వులు వెలువరించేంత వరకు నోటిఫికేషన్‌ను నిలిపి ఉంచాలని ఆదేశించా. క్రీడల్లో వారు సాధించిన ఘనతలు మాకు గర్వ కారణం. వారికి సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తాం" అని హరియాణా ముఖ్యమంత్రి ఎం.ఎల్.కట్టర్ ట్వీట్ చేశారు. క్రీడల మంత్రి అనిల్ విజ్ నోటిఫికేషన్‌ను సమర్థించారు. సర్వీసు నిబంధన ప్రకారమే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. బాక్సర్లు విజేందర్, అఖిల్, హాకీ ఆటగాడు సర్దార్ తదితరులు హరియాణా ప్రభుత్వ ఉద్యోగం కలిగి ఉన్నారు. గీత, యోగేశ్వర్ దత్ వంటి అథ్లెట్లు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టారు.

నువ్వా.. నేనా!

గ్రూప్ హెచ్ విశ్లేషణ

ఈ సారి ప్రపంచకప్ డ్రాను పరిశీలిస్తే గ్రూప్- హెచ్ కఠినంగానే ఉందనే మాట వినిపిస్తోంది. సంచలనాలకు మారుపేరైనా సెనెగల్.. సమతూకంగా కనిపిస్తున్న పోలెండ్.. అంచనాలను తలకిందులు చేసే కొలంబియా.. అనుభవమే ఆయుధంగా బరిలో దిగనున్న జపాన్..! ఇలా ఈ గ్రూప్‌లో ఏ జట్టు ముందడుగు వేస్తుందో చెప్పడం కాస్త కష్టమే. జపాన్ నుంచి మిగతా జట్లకు పెద్దగా ముప్పు ఉండకపోవచ్చు. సెనెగల్ జట్టుపై ఆధిపత్యం చెలాయిస్తే పోలెండ్, కొలంబియా రెండో రౌండ్‌కు చేరే అవకాశం ఉంది.

రోడ్రిగెజ్

కొలంబియా నాకౌట్ చేరగలదు

బ్రెజిల్‌లో జరిగిన గత ప్రపంచకప్‌లో అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన ఆటతీరుతో కొలంబియా క్వార్టర్ ఫైనల్ చేరింది. ఈ సారి కూడా అదే ప్రదర్శనను పునరావృతం చేసి ఈ ప్రపంచకప్‌ను మెరుగైన స్థానంతో ముగించాలని అనుకుంటోంది. అత్యంత సమతూకంగా కనిపిస్తున్న ఈ జట్టు సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది. అనామకుడిగా గత ప్రపంచకప్‌లో అడుగుపెట్టి అత్యధిక గోల్స్‌తో గోల్డెన్ బూట్ అవార్డు గెలుచుకున్న జేమ్స్ రోడ్రిగెజ్ జట్టులో కీలకం కానున్నాడు. అయితే ఆ ప్రపంచకప్ ప్రదర్శన తర్వాత జేమ్స్ అనుకున్న స్థాయిలో రాణించకపోవడం జట్టుకు ఆందోళన కలిగించే విషయమే. కానీ ఒక్కసారి అతను గాడిన పడితే ఆ జట్టుకు తిరుగుండదు. ఫాల్కోవ్, కార్లోస్ బాకాలతో కూడిన ఎటాకింగ్ విభాగం ఏ జట్టుకైనా గుబులు పుట్టించేదే. వ్యూహాలు పన్నడంలో దిట్ట అయిన కోచ్ జోస్ ఆధ్వర్యంలో జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. గ్రూప్ దశను దాటేలా కనిపిస్తున్న కొలంబియా ఆ తర్వాత ఎక్కడి వరకు వెళ్లగలదనేదే ప్రశ్న?

కీలక ఆటగాళ్లు: జేమ్స్ రోడ్రిగెజ్, ఫాల్కోవ్, కార్లోస్ బాకా
కోచ్: పెకెర్మన్ **ఉత్తమ ప్రదర్శన:** 2014లో క్వార్టర్‌ఫైనల్.
ఫిఫా ర్యాంకు: 16 **అంచనా:** గ్రూప్‌లో రెండో స్థానం.

పోలెండ్ గ్రూప్ ఫేవరెట్

రాబర్ట్

అర్హత మ్యాచ్‌ల్లో చక్కటి ప్రదర్శన చేసిన పోలెండ్ ఈ మెగాటోర్నీలోనూ మెరవాలనుకుంటోంది. క్వాలిఫయర్స్‌లో 10 మ్యాచ్‌ల్లో 8 విజయాలతో ప్రపంచకప్‌కు అర్హత సాధించిన పోలెండ్ జట్టు గత వైభవాన్ని తిరిగి పొందేందుకు శక్తిమేర ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు. కఠినమైన గ్రూప్‌లో కూడా ఫేవరేట్‌గా బరిలో దిగుతున్న ఈ జట్టుకు గ్రూప్ దశ దాటడం కష్టం కాకపోవచ్చు. అందరికంటే ఎక్కువగా అర్హత మ్యాచ్‌ల్లో 16 గోల్స్ చేసి అగ్రస్థానంలో నిలిచిన రాబర్టో లెవన్‌డోవిస్కీపై ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. ఈ ఎటాకింగ్ ఆటగాడికి ఏ జట్టు డిఫెన్స్‌నైనా ఛేదించే సామర్థ్యం ఉంది. అయితే రాబర్టోపై మరీ ఎక్కువగా ఆధారపడడం వల్ల ఆ జట్టుకు ఇబ్బంది ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. 2016 యూరో కప్ నుంచి రాబర్టో గోల్ చేయని మ్యాచ్‌ల్లో ఒక్కదాంట్లో కూడా పోలెండ్ విజయం సాధించలేదు. ఒకవేళ కొలంబియాతో మ్యాచ్‌లో తడబడినా.. జపాన్, సెనెగల్‌లపై నెగ్గి పోలెండ్ ముందంజ వేయగలదు.

కీలక ఆటగాళ్లు: రాబెర్ట్ లెవన్‌డోవిస్కీ, మిలిక్, లుకాజ్ టెడోర్జిక్.
కోచ్: ఆడమ్ నవాల్కా.
ఉత్తమ ప్రదర్శన: 1974, 1982 ప్రపంచకప్‌ల్లో మూడో స్థానం.
ఫిఫా ర్యాంకు: 8 **అంచనా:** గ్రూప్‌లో అగ్రస్థానం.

జపాన్ ముందుకెళ్లడం కష్టమే!

హోండా

చాలా ఏళ్లుగా అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వర్ధమాన జట్టుగానే ఉంటుంది. జపాన్‌కు ఇది వరుసగా ఆరో ప్రపంచకప్. ఏ టోర్నీలోనూ రెండో రౌండ్ దాటని జపాన్.. ఈసారి చరిత్ర తిరగరాయాలనే పట్టుదలతో ఉంది. ఐతే అనుభవజ్ఞులైన ఆటగాళ్లను నమ్ముకున్న ఈ జట్టు గ్రూప్ దశ దాటితే అద్భుతమే అని చెప్పాలి. ఒకవేళ సెనెగల్ మీద విజయం సాధించినా కూడా కొలంబియా, పోలెండ్ మీద నెగ్గడం చాలా చాలా కష్టం. అసాధారణ ప్రదర్శన చేస్తేనే అది సాధ్యం. కీసుకె హోండా ఆ జట్టుకు ప్రధాన ఆటగాడు. ప్రస్తుత జపాన్ జట్టులో అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లాడిన ఆడిన ఆటగాడు అతడే. ప్రపంచకప్‌కు కొద్ది నెలల ముందే కోచ్‌ను మార్చడం జపాన్‌కు ప్రతికూలాంశమే.

కీలక ఆటగాళ్లు: షిన్జి ఒకజాకి, కీసుకె హోండా, టకుమా అసానో
కోచ్: అకిర నిషినో **ఉత్తమ ప్రదర్శన:** రెండో రౌండ్
ఫిఫా ర్యాంకు: 61
అంచనా: గ్రూప్ దశ దాటడం కష్టం

సెనెగల్ తేలిగ్గా తీసుకోవద్దు


కలిడౌ

పదహారేళ్ల క్రితం ఆడిన తొలి ప్రపంచకప్‌లోనే క్వార్టర్స్ చేరి యావత్ ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది సెనెగల్ జట్టు. 2002 ప్రపంచకప్‌లో తొలిసారిగి బరిలో దిగిన ఈ జట్టు ఆరంభ మ్యాచ్‌లోనే అప్పటి ప్రపంచ ఛాంపియన్ ఫ్రాన్స్‌కు షాకిచ్చింది. మరోమారు ఇలాంటి సంచలనాలే లక్ష్యంగా ఈ సారి ప్రపంచకప్‌లో బరిలో దిగనుంది. రెండో ప్రపంచకప్ మాత్రమే ఆడుతున్న ఈ జట్టును తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. యువ, అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో జట్టు పటిష్ఠంగా కనిపిస్తోంది. కొలంబియా, పోలెండ్ జట్లకు సెనగల్‌తో మ్యాచ్‌లు పెద్ద సవాలే. లివర్‌పూల్ ఆటగాడు సాడియో మానె జట్టులో కీలకంగా మారే అవకాశం ఉంది. ప్రపంచకప్ అర్హత మ్యాచ్‌ల్లో అతడు కేవలం ఒక్క గోలే చేసినప్పటికీ లివర్‌పూల్ తరఫున అతని ప్రదర్శన అద్భుతం. జపాన్‌పై తేలిగ్గానే గెలిచే అవకాశమున్న ఈ జట్టు.. పోలెండ్, కొలంబియాలపై ఎలాంటి ప్రదర్శన చేస్తుందన్నది ఆసక్తికరం.

కీలక ఆటగాళ్లు: కలిడౌ కౌలిబలీ, సాడియో మానె, కీట బాల్డె.
కోచ్: అలియో సిస్సె. **ఉత్తమ ప్రదర్శన:** 2002లో క్వార్టర్‌ఫైనల్.
ఫిఫా ర్యాంకు: 27 **అంచనా:** పోరాడితే నాకౌట్ ఛాన్సుంది.

నాదల్ పదకొండోసారి..

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ప్రవేశం టైటిల్ పోరుకు థీమ్

రోలాండ్ గారోస్‌లో రసవత్తర పతాక సన్నివేశం ఊరిస్తోంది. పదకొండో టైటిల్‌పై కన్నేసిన క్లేకింగ్ రఫెల్ నాదల్.. జోరు మీదున్న యువకెరటం డొమినిక్ థీమ్ ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. వీళ్లిద్దరు ఆదివారం తలపడనుండగా.. మహిళల సింగిల్స్ ఫైనల్లో నేడు స్టీఫెన్స్‌ను హాలెప్ ఢీకొట్టనుంది.

పారిస్: తనకిష్టమైన మట్టికోర్టులో ప్రపంచ నంబర్‌వన్ రఫెల్ నాదల్ (స్పెయిన్) మరో టైటిల్ దిశగా సాగుతున్నాడు. తిరుగులేని ప్రదర్శనతో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. పదిసార్లు ఛాంపియన్ నాదల్..శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 6-4, 6-1, 6-2తో అర్జెంటీనా ఆటగాడు డెల్ పొట్రోను చిత్తు చేశాడు. ఇక్కడ అతడికిది 85 విజయం. ఫెదరర్ (వింబుల్డన్) తర్వాత ఒకే గ్రాండ్‌స్లామ్ టోర్నీలో 11సార్లు ఫైనల్ చేరిన రెండో ఆటగాడిగా నాదల్ ఘనత సాధించాడు. సెమీస్ తొలి సెట్లో పొట్రో గట్టిగానే పోరాడాడు. కానీ మూడు, తొమ్మిదో గేముల్లో బ్రేక్ సాధించే అవకాశాలను చేజార్చుకున్నాడు. పదో గేమ్‌లో నాదల్ బ్రేక్ సాధించి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెట్టించిన ఉత్సాహంతో ఆడిన అతడు ఆ తర్వాత రెండు సెట్లను అలవోకగా గెలుచుకున్నాడు. మ్యాచ్‌లో నాదల్ 35 విన్నర్లు కొట్టాడు. ఫైనల్లో అతడు ఏడో సీడ్ థీమ్‌ను ఢీకొంటాడు. సెమీఫైనల్లో థీమ్ 7-5, 7-6 (12-10), 6-1తో ఇటలీ సంచలనం మార్కో సెచినాటో (ఇటలీ)ను ఓడించాడు. థీమ్‌కు ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్. సెమీస్ చేరే క్రమంలో మాజీ నంబర్‌వన్ నొవాక్ జకోవిచ్ సహా ముగ్గురు సీడెడ్ ఆటగాళ్లను ఓడించిన సెచినాటో.. ఈసారి కూడా గట్టిగానే పోరాడినా ఫలితం లేకపోయింది. థీమ్.. తొలి గేమ్‌లోనే సెచినాటో సర్వీస్ బ్రేక్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆరు గేమ్‌లు ముగిసే సరికి థీమ్ సర్వీసులో సెచినాటో ఒక్క పాయింట్ మాత్రమే సంపాదించగలిగాడు. ఐతే ఎనిమిదో గేమ్‌లో సెచినాటో బ్రేక్ సాధించాడు. ఆ తర్వాత 5-4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. బలంగా పుంజుకున్న థీమ్ వరుసగా మూడు గేమ్‌లు గెలిచి సెట్‌ను చేజిక్కించుకన్నాడు. రెండో సెట్ 61 నిమిషాల పాటు మరింత హోరాహోరీగా సాగింది. ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు తలపడడంతో టైబ్రేక్‌కు దారితీసింది. థీమ్ మూడు సెట్ పాయింట్లు కాచుకుని మరీ సెట్‌ను గెలుచుకున్నాడు. అదే ఊపులో అలవోకగా మూడో సెట్‌ను చేజిక్కించుకున్నాడు. మ్యాచ్‌లో ఆరు ఏస్‌లు కొట్టిన థీమ్..37 విన్నర్లు సంధించాడు. థీమ్, నాదల్ ఇద్దరూ జోరు మీదున్న నేపథ్యంలో ఫైనల్ రసవత్తరంగా సాగడం ఖాయం. రొలాండ్ గారోస్‌లో నాదల్ తిరుగులేని ఆటగాడైనప్పటికీ 11వ టైటిల్ అంత తేలిక కాబోదు. థీమ్‌తో ముఖాముఖిలో 6-3తో నాదల్‌దే పైచేయి. కానీ గత రెండేళ్లలో క్లేకోర్టుపై నాదల్‌ను ఓడించిన ఏకైక ఆటగాడు థీమే కావడం గమనార్హం.

థీమ్

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్

సిమోనా హలెప్
× స్లోన్ స్టీఫెన్స్
సాయంత్రం 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

భూగర్భ జలాల్లో యురేనియం

వాషింగ్టన్: తాగునీటి కాలుష్యం ఎక్కువగానే ఉన్న భారత్‌లో మరో అనూహ్య ఉపద్రవం వెలుగులోకి వచ్చింది. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు యురేనియంతో తీవ్రంగా కలుషితమయినట్లు అధ్యయనంలో వెల్లడయింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ తాత్కాలికంగా నిర్దేశించిన ప్రమాణాల కన్నా ఎక్కువగా ఈ రేడియో ధార్మిక పదార్థం కలిసినట్లు తేలింది. 'ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెటర్స్' జర్నల్‌లో ఈ అంశం ప్రచురితమయింది. డ్యూక్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం చేపట్టారు. భారత్‌లో ఒక లీటరు తాగునీటిలో 30 మైక్రోగ్రాముల యురేనియం ఉండొచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాత్కాలిక ప్రమాణాన్ని నిర్దేశించింది. దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో గతంలో సేకరించిన భూగర్భ జలాల సమాచారాన్ని పరిశోధకులు విశ్లేషించారు. రాజస్థాన్, గుజరాత్‌లోని 324 బావుల్లో కొత్తగా సేకరించిన నీటి వివరాలను పరిశీలించారు. వీటన్నింటిలోనూ నిర్దేశిత ప్రమాణం కన్నా ఎక్కువగా యురేనియం ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు తాగునీటి కలుషితాలతో భారత ప్రమాణాల సంస్థ రూపొందించిన జాబితాలో యురేనియంను చేర్చలేదు. భారత్‌లో తాగునీటికి, వ్యవసాయ అవసరాలకు భూగర్భ జలాలు ప్రాథమిక వనరు. ఇప్పటికే ప్రకృతి పరంగా ఉన్న యురేనియం కలుషితం మరింత పెరగడానికి మానవచర్యలు కారణమవుతున్నాయని డ్యూక్ విశ్వవిద్యాలయం పరిశోధకుల అధ్యయనంలో వెల్లడయింది. భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేయడం, నైట్రేట్ కాలుష్యం వంటివి సమస్యను జటిలం చేస్తున్నాయని తెలిపింది. తాగునీటిలో యురేనియం ఎక్కువగా ఉంటే క్రానిక్ కిడ్నీ వ్యాధి బారిన పడతారని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. "రాజస్థాన్‌లో మేము పరీక్షించిన బావుల్లో దాదాపు మూడొంతుల బావుల్లో యురేనియం స్థాయులు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సురక్షిత తాగునీటి ప్రమాణాలకన్నా ఎక్కువగా ఉన్నాయి." అని డ్యూక్ విశ్వవిద్యాలయంలోని నికోలస్ స్కూల్ ఆఫ్ ది ఎన్విరాన్‌మెంట్‌లో భూరసాయన శాస్త్రం, నీటి నాణ్యత విభాగం ప్రొఫెసర్ ఎవ్నర్ వెంగోష్ వెల్లడించారు. గతంలోని నీటి నాణ్యత అధ్యయనాలను విశ్లేషించగా వాయవ్య భారత్‌లోని 26 జిల్లాలు, దక్షిణ లేదా ఆగ్నేయ భారత్‌లోని 9 జిల్లాల్లోనూ భూగర్భ జలాల్లో యురేనియం ఎక్కువగా ఉన్నట్లు తేలిందని ఆయన చెప్పారు.

భారత్‌లోని పలు భూగర్భ జలాశయాల్లో హిమాలయ శైథిల్యాల నుంచి బంకమట్టి, కంకర వచ్చి చేరతాయి. హిమాలయ శైథిల్యాలకు ప్రవాహాలు లేదా యురేనియం ఎక్కువగా ఉండే గ్రానిటిక్ శిలలు కారణం అవుతాయి. ఈ భూగర్భ జలాశయాల్లోని నీటిని ఎక్కువగా తోడేయడం వల్ల వాటిల్లోని నీటి మట్టాలు తగ్గిపోతాయి. ఫలితంగా ఆక్సీకరణానికి దారి తీస్తుంది. ఇంకా మిగిలి ఉన్న భూగర్భ జలాల్లో యురేనియం పెరగడానికి ఈ చర్య దారి తీస్తుంది. భారత్‌లో భూగర్భజలాల్లో యురేనియం కలవడానికి పలు కారణాలున్నట్లు వెంగోష్ ప్రయోగశాలలోని పీహెచ్‌డీ విద్యార్థి రేషెల్ ఎం కోట్ చెప్పారు. భూగర్భ జలాశయాల శిలల్లో ఎంత మొత్తం యురేనియం ఉంది? నీరు-శిలల చర్య-ప్రతిచర్యల కారణంగా ఆ శిలల నుంచి వచ్చే యురేనియం, నీటిలో ఆ యురేనియం కరిగే సామర్థ్యాన్ని పెంచే ఆక్సీకరణ పరిస్థితులు, భూగర్భ జలాల్లోని ఇతర రసాయనాలతో ఈ యురేనియం ప్రతిచర్య వంటివి ప్రభావిత అంశాలని తెలిపారు. భారత్‌లోని పలు ప్రాంతాల్లో ఈ అంశాలన్నీ భూగర్భజలాల్లో యురేనియం కలుషితానికి కారణమవుతున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ అవసరాలకు భూగర్భ జలాలను ఎక్కువగా తోడేయడం వంటి మానవ చర్యలు సమస్యను పెంచవచ్చన్నారు. తీవ్రంగా ఉన్న సమస్యను మానవ చర్యలు మరింత దారుణంగా మారుస్తున్నట్లు ఈ అధ్యయనంలో వెల్లడయిందన్నారు. అయితే పరిస్థితిని మెరుగుపర్చవచ్చని చెప్పారు.

భారత్‌లో ప్రస్తుతం ఉన్న నీటి నాణ్యత పర్యవేక్షణ కార్యక్రమాన్ని పునఃసమీక్షించాలని, యురేనియం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరోగ్యానికి వాటిల్లే ముప్పులను అంచనా వేయాలని, పరిష్కారానికి ఉపకరించే సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయాలని ఈ అధ్యయనం సూచించినట్లు వెంగోష్ చెప్పారు. సమస్య పరిష్కారానికి నివారణ చర్యలు అన్నింటికన్నా ముఖ్యమని పేర్కొన్నారు. మూత్రపిండాలపై యురేనియం హాని ప్రభావాల ఆధారంగా భారత ప్రమాణాల సంస్థ.. తాగునీటిలో యురేనియం ప్రమాణాలను నిర్దేశించాలని, ముప్పు ప్రాంతాల గుర్తింపునకు పర్యవేక్షక వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, కోట్ల మంది జనాభాకు సురక్షిత తాగునీటిని అందించే నిమిత్తం యురేనియం కలుషితాన్ని తొలగించడానికి లేదా నివారించడానికి కొత్త మార్గాలను అన్వేషించాలని వెంగోష్ సూచించారు.

జమ్ములో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్. చిత్రంలో పీఎంవో శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్

ఐఆర్‌పీ దళాల్లో సరిహద్దు వాసులకు 60% రిజర్వేషన్

- జమ్మూ-కశ్మీర్ పర్యటనలో రాజ్‌నాథ్

శ్రీనగర్: కొత్తగా ఏర్పాటు చేస్తున్న 5 భారతీయ రిజర్వ్ పోలీసు (ఐఆర్‌పీ) బెటాలియన్లలో జమ్మూ-కశ్మీర్ సరిహద్దు ప్రాంతాలవారికి 60 శాతం రిజర్వేషన్ కల్పించడానికి కేంద్రం నిర్ణయించినట్లు హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. 5 వేలకు పైగా ఐఆర్‌పీ సిబ్బందిని నియమిస్తుండగా.. సరిహద్దు నుంచి 10 కి.మీ.ల లోపు ఉన్నవారందరికీ రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు వివరించారు. వీటితో పాటు రెండు మహిళా బెటాలియన్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తదితరులతో కలిసి ఆయన ఉత్తర్ కశ్మీర్, జమ్మూ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు కుప్వారా జిల్లాలో సరిహద్దు ప్రాంతాల ప్రజలతో సమావేశమయ్యారు. తమ అవసరాలను గుజర్, బకెర్వాల్ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులైన్సను సందర్శించిన రాజ్‌నాథ్.. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పించారు. పోలీసు, సీఆర్‌పీఎఫ్ జవాన్లనుద్దేశించి మంత్రి ప్రసంగించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కింగ్‌డావోకు నేడు మోదీ

కింగ్‌డావో (చైనా): షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) వార్షిక సదస్సులో పాల్గొనేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా పలు దేశాల కీలక నేతలు శనివారం ఇక్కడకు చేరుకోనున్నారు. ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగే ఈ సదస్సులో- ఉగ్రవాదం, అతివాదం, విప్లవీకరణను ఎదుర్కోవడంతో పాటు.. పలు అంతర్జాతీయ అంశాలపైనా నేతలు చర్చించనున్నారు. ఇరాన్ అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలడం; చైనాతో ట్రంప్ సర్కారు ప్రచ్ఛన్న వాణిజ్య పోరుకు దిగడం వంటి పరిణామాల నేపథ్యంలో... కింగ్‌డావోలో జరిగే ఈ సదస్సు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్సీవో దేశాల పరిధిలో వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించడం; ఉగ్రవాదాన్ని తరిమివేయడం వంటి అంశాలపై భారత దృక్పథాన్ని మోదీ గట్టిగా వినిపించే అవకాశముంది. కనీసం ఆరు సభ్య దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారని భావిస్తున్నారు.

ముంబయిలో సలీంఖాన్, సల్మాన్‌ఖాన్‌లను కలిసిన గడ్కరీ

సల్మాన్‌ఖాన్‌తో గడ్కరీ భేటీ

ముంబయి: ప్రముఖ హిందీ సినీనటుడు సల్మాన్ ఖాన్‌తో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ భేటీ అయ్యారు. సల్మాన్ తండ్రి, దిగ్గజ సినీరచయిత సలీం ఖాన్, నానాపటేకర్, యెస్‌బ్యాంకు సీఈవో రాణాకపూర్‌లను సైతం వారివారి నివాసాల్లో కలిశారు. మోదీ ప్రభుత్వం నాలుగేళ్లలో సాధించిన విజయాలను గడ్కరీ వారిద్దరికీ వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారమున్న పుస్తకాలను వారికి అందజేశారు. మరోవైపు మైనార్టీ వ్యవహారాల మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ దేశరాజధానిలో దిల్లీ బిషప్ వారిస్ కె.మాసిహ్‌ను ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు.

కుమారస్వామి ప్రభుత్వం ఏర్పాటుపై అత్యవసర విచారణకు తిరస్కరణ

దిల్లీ: కర్ణాటకలో కుమారస్వామి ప్రభుత్వం ఏర్పాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించడానికి శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. 'క్షమించండి' అంటూ జస్టిస్ ఆదర్శ కుమార్ గోయల్, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం ఆ పిటిషన్‌ను దాఖలు చేసిన న్యాయవాదికి తెలిపింది. భద్రత కారణాల దృష్ట్యా ఆ న్యాయవాది తన అసలు పేరును పిటిషన్‌లో ప్రస్తావించలేదు. జేడీ(ఎస్) ఏకైక పెద్ద పార్టీ కాదని, కుమారస్వామిని ప్రజలు ముఖ్యమంత్రిగా ఎంచుకోలేదని న్యాయవాది వాదించారు.

రాష్ట్రపతి భవన్ ఉద్యోగుల గృహసముదాయంలో వ్యక్తి మృతదేహం

దిల్లీ: రాష్ట్రపతి భవన్ ఉద్యోగుల గృహ సముదాయం (సర్వెంట్ క్వార్టర్స్)లో ఓ వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మృతిచెందిన వ్యక్తిని రాష్ట్రపతి సచివాలయంలో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగిగా గుర్తించినట్లు వెల్లడించారు. ఆ వ్యక్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడని.. రెండు, మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఇందులో అనుమానాస్పదమేమీ లేదని పేర్కొన్నారు. లోపల గడియపెట్టిన ఓ గది నుంచి దుర్వాసన వెలువడుతుండటంతో పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు.

ఫేస్‌బుక్ గోప్యతకు మరోసారి భంగం

న్యూయార్క్: సాఫ్ట్‌వేర్ లోపంతో ఫేస్‌బుక్‌లోని గోప్యత సెట్టింగ్‌లో సమస్య తలెత్తి గత నెలలో 1.40 కోట్ల మంది వినియోగదారుల పోస్టులు వారి ప్రమేయం లేకుండానే అందరికీ చేరాయి. ఈ విషయాన్ని స్వయంగా ఆ సంస్థే వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించామని వెల్లడించింది. వినియోగదారులు తమ పోస్టులను స్నేహితులకు మాత్రమే అని సెట్టింగ్స్‌లో పేర్కొన్నా సాఫ్ట్‌వేర్‌లో లోపంతో గత నెలలో కొన్ని రోజులు అవి అందరికీ కనిపించాయి. వినియోగదారుల గోప్యతకు భంగం కలిగిస్తోందని ఇటీవల కాలంలో ఫేస్‌బుక్‌పై వరుసగా ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే.

నిర్వహణ లోపాలతో అగ్నిప్రమాదాలు

- లేఖలో ప్రస్తావించిన రైల్వే బోర్డు

దిల్లీ: రైళ్లలో గత అయిదు నెలల కాలంలో 15 అగ్ని ప్రమాద సంఘటనలు జరగడాన్ని రైల్వే బోర్డు తీవ్రంగా పరిగణించింది. సక్రమ నిర్వహణ, పర్యవేక్షణ లోపించడమే ఇందుకు కారణాలని పేర్కొంది. వీటి నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతూ అందరు జనరల్ మేనేజర్లకు లేఖలు రాసింది. ఇంజిన్లు, సరకు గోదాములు తదితర చోట్ల ప్రమాదాలు జరిగాయని, కొన్ని చోట్ల దుండగులు నిప్పుపెట్టారని తెలిపింది. ఇవన్నీ పర్యవేక్షణ, భద్రత లోపాలను బహిర్గతం చేస్తున్నాయని పేర్కొంది. జోన్ల వారీగా జరిగిన ప్రమాదాలను ఆ లేఖలో ప్రస్తావించింది.

రాహుల్ పిల్లవాడంటూ షా వ్యంగ్యాస్త్రం

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని భాజపా అధ్యక్షుడు అమిత్ షా చిన్నపిల్లవాడిగా అభివర్ణిస్తూ వ్యంగ్యాస్త్రం విసిరారు. ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ ఆయన తరచూ విమర్శిస్తుంటారని, అయితే దేశాన్ని ఏలిన ఆయన మూడు తరాల పాలకులు చేసిన పనులేమిటో చెప్పాలని అన్నారు. రాజస్థాన్‌లోని జయపుర గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పార్టీ కార్యకర్తలతో అమిత్ షా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "అరే బబువా (పిల్లోడా).. సోదరా.. 70 ఏళ్లలో మీరు చేసిందేమిటి? మీ మూడు తరాల వారు 70 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నారు. అప్పుడే వారు పనులన్నీ చేసి ఉంటే ఇప్పుడు ప్రజలకు మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చే అదృష్టం, వంట గ్యాస్ సమకూర్చిన అదృష్టం మాకు దక్కి ఉండేది కాదు." అని అన్నారు.

11న ఓబీసీ సదస్సులో రాహుల్ ప్రసంగం

దేశ రాజధాని దిల్లీలో ఈనెల 11న నిర్వహించే ఓబీసీ జాతీయ సదస్సుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరై ప్రసంగిస్తారు. తాల్కాతోరా మైదానంలో నిర్వహించే ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఓబీసీ అగ్ర నేతలు పాల్గొంటున్నట్లు కాంగ్రెస్ తెలిపింది.

దిల్లీలో ఐఐటీ పూర్వ విద్యార్థి ఆత్మహత్య

దిల్లీ: ఐఐటీ-దిల్లీ పూర్వ విద్యార్థి ఒకరు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రేటర్ కైలాష్ ప్రాంతానికి చెందిన అన్షుమన్ గుప్త(31) దక్షిణ దిల్లీ ప్రాంగణంలోని భవనం ఏడో అంతస్తు నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. 2010 బీటెక్ బ్యాచ్‌కు చెందిన అన్షుమన్ ఉద్యోగం రాక కలత చెందినట్లు తెలుస్తోందని డీసీపీ మిళింద్ మహదేవో దుంబెరే వెల్లడించారు.

భక్తుల కానుకలు సద్వినియోగం కావాలి

- ఆలయ సేవకులు తీసుకోకుండా చూడండి
- పూరీ జగన్నాథ మందిర నిర్వహణపై సుప్రీంకోర్టు ఆదేశాలు

దిల్లీ: పూరీలోని శ్రీజగన్నాథ స్వామి మందిరం నిర్వహణలో లోపాలు, దురాచారాలు లేకుండా ఉండేందుకు శుక్రవారం పలు సూచనలు చేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. మందిరంలోని 'సేవకుల' చేతిలో భక్తులు దోపిడీకి గురవుతున్నారన్న ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం దీన్ని అరికట్టాలని పేర్కొంది. భక్తులు ఇబ్బందులు పడకుండా దర్శనం చేసుకునేలా సౌకర్యాలు కల్పించాలని, వారు ఇచ్చే కానుకలు దుర్వినియోగం కాకుండా చూడాలని పేర్కొంది. మృణాళిని పాడి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. పూరీలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దోపిడీ విధానాలు, యాజమాన్యంలోని లోపాలపై ఈ నెల 30లోగా నివేదిక ఇవ్వాలని అక్కడి జిల్లా జడ్జిని ఆదేశించింది. ఇందుకోసం తగిన సౌకర్యాలు, నిధులు కల్పించాలని; కావలసిన సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్, ఆలయ పరిపాలన అధికారులను సూచించింది. వైష్ణోదేవి, స్వర్ణ దేవాలయం, సోమనాథ్ దేవాలయం, తిరుపతి వేంకటేశ్వరస్వామి, కర్ణాటకలోని ధర్మస్థల ఆలయాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసి, వాటిని ఇక్కడ అమలు చేసేందుకు ఓ కమిటీని నియమించాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించింది. ఈ కమిటీ కూడా ఈ నెల 30లోగానే నివేదిక అందజేయాల్సి ఉంది. దేశంలోని ప్రధాన ఆలయాల నిర్వహణ పద్ధతులపై అధ్యయనానికి ఓ కమిటీ వేయాలని కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆదేశించింది.

కొత్త గ్రహాన్ని కనుగొన్న ఇస్రో!

బెంగళూరు: భూమికి 600 కాంతి సంవత్సరాల దూరంలో... కె2-236 అనే నక్షత్రం చుట్టూ తిరుగుతున్న ఓ గ్రహాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు కనుగొన్నారు! భూమితో పోల్చితే ఆరింతల వ్యాసార్థం; 27 రెట్లు ఎక్కువ ద్రవ్యరాశి దీని సొంతమని లెక్కగట్టారు. ఇందులో 60-70% మంచు, సిలికేట్, ఇనుము తదితర పదార్థాలు ఉంటాయని అంచనా వేశారు. తాజా ఆవిష్కరణతో- కొత్తగా గ్రహాలను కనుగొన్న అతికొద్ది దేశాల సరసన భారత్ స్థానం సంపాదించింది!

అహ్మదాబాద్‌లోని ఇస్రో భౌతిక పరిశోధన ప్రయోగశాలకు చెందిన ప్రొఫెసర్ అభిజిత్ చక్రవర్తి బృందం ఈ పరిశోధన చేపట్టింది. మౌంట్ అబూ గురుశిఖర్ అబ్జర్వేటరీలోని పారాస్ స్పెక్ట్రోగ్రాఫ్ ద్వారా ఈ గ్రహాన్ని కనుగొన్నారు. నక్షత్రం చుట్టూ తిరిగే గ్రహాల ద్రవ్యరాశిని అంచనా వేయడం దీని ప్రత్యేకత. తన నక్షత్రం చుట్టూ పరిభ్రమించడానికి 19.5 రోజులు పడుతోందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. కె2-236(ఎపిక్ 211945201) చుట్టూ తిరుగుతున్నందున దీనికి కె2-236బి అని నామకరణం చేశారు.

కాన్పూర్‌లోని లాలా లజపతిరాయ్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారికి విసనకర్రతో బంధువు సపర్యలు

ఐసీయూలో 'ఏసీ'లు విఫలం.. వృద్ధుల దుర్మరణం

కాన్పూర్: ప్రభుత్వాసుపత్రిలోని అత్యవసర చికిత్స గది(ఐసీయూ)లో ఏసీలు పనిచేయక రెండురోజులుగా ఐదుగురు వృద్ధులు ప్రాణాలు కోల్పోయిన విషాదమిది. కాన్పూర్‌లోని లాలా లజపతిరాయ్ ప్రభుత్వాసుపత్రిలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనపై ప్రసారమాధ్యమాల్లో దుమారం చెలరేగడంతో కలెక్టర్ సురేంద్రసింగ్ దర్యాప్తునకు ఆదేశించారు. రెండురోజులుగా ఏసీలు పనిచేయని మాట వాస్తవమేనని, మెకానిక్‌లను బాగుచేయాలని ఆదేశించానని గణేశ్ శంకర్ విద్యార్థి వైద్య కళాశాల ప్రిన్సిపల్ నవ్‌నీత్‌కుమార్ అంగీకరించారు. వారు బాగుచేసిన తరువాత గురువారం మళ్లీ చెడిపోయాయన్నారు. వాటి కారణంగానే వృద్ధులు చనిపోలేదని, తీవ్ర అనారోగ్యంతో మరణించారన్నారు. ఏసీలు పనిచేయకపోయినా, ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు బాగానే పనిచేస్తున్నాయని సమర్థించుకున్నారు. రెండురోజులుగా ఏసీలు పనిచేయని మాట వాస్తవమేనని ఐసీయూ బాధ్యుడు డాక్టర్ సౌరవ్‌అగర్వాల్ అంగీకరించారు. ఏసీలు పనిచేయకపోవడంతో ఐసీయూ కిటికీలు, తలుపులు తీసి రోగులకు ఉపశమనం కల్పించారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. అయినా అధిక ఉష్ణోగ్రతల కారణంగా వృద్ధులు అల్లాడిపోయారని వాపోయారు. ఆక్సిజన్ సిలిండర్లు నిండుకోవడంతో గతఏడాది ఆగస్టులో 63 మంది చిన్నారులు గోరఖ్‌పూర్‌లో మృత్యువాత పడిన సంగతి విదితమే. ఒకనెల తరువాత ఫరూకాబాద్‌లో కూడా ఆక్సిజన్ కొరత కారణంగా 49 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.

దేశ సమకాలీన చరిత్రలో కీలక ఘట్టం

- ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంలో ప్రణబ్ ప్రసంగంపై ఆడ్వాణీ ప్రశంసలు

దిల్లీ: నాగ్‌పుర్‌లోని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) ప్రధాన కార్యాలయాన్ని గురువారం సందర్శించిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీపై భాజపా వెటరన్ నేత ఎల్.కె.ఆడ్వాణీ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రణబ్ పర్యటన, జాతీయవాదంపై ఆయన చేసిన ప్రసంగం.. దేశ సమకాలీన చరిత్రలో కీలక ఘట్టాలుగా మిగిలిపోతాయని అన్నారు. ఆరెస్సెస్ కార్యక్రమానికి ప్రణబ్‌ను ఆహ్వానించినందుకు సంస్థ అధిపతి మోహన్ భగవత్‌ను.. ఆయన ఆహ్వానాన్ని మన్నించినందుకు ప్రణబ్‌ను ప్రశంసిస్తూ ఆడ్వాణీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'శిక్షా వర్గ్'ను ఉద్దేశించి చేసిన ప్రసంగాల్లో ప్రణబ్, భగవత్ దాదాపుగా ఒకే రకమైన ఆలోచనలను వ్యక్తపరిచారని ఆడ్వాణీ పేర్కొన్నారు. భిన్నత్వాలను గౌరవించే ఐక్యత దేశానికి ఆవశ్యకమని వారు నొక్కిచెప్పిన సంగతిని గుర్తుచేశారు. భగవత్ నేతృత్వంలో ఆరెస్సెస్ ప్రజలకు చేరువవుతున్న తీరుపై ఆడ్వాణీ సంతోషం వ్యక్తం చేశారు.

హెడ్గేవార్ సిద్ధాంతాలను ప్రణబ్ ప్రస్తావించలేదు: తొగాడియా

జాతీయవాదంపై ఆరెస్సెస్ వ్యవస్థాపక సర్‌సంఘ్‌చాలక్ కె.బి.హెడ్గేవార్, వి.డి.సావర్కర్‌ల ఆలోచనా విధానాలను ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంలో చేసిన ప్రసంగంలో ప్రణబ్ ముఖర్జీ ప్రస్తావించలేదని విశ్వహిందూ పరిషద్(వీహెచ్‌పీ) మాజీ నేత ప్రవీణ్ తొగాడియా అన్నారు. జాతీయవాదంపై మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల సిద్ధాంతాలనే ప్రణబ్ తన ప్రసంగంలో వివరించారని ఇండోర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి వీలుగా పార్లమెంటులో చట్టం చేయాలని కేంద్రప్రభుత్వాన్ని తొగాడియా డిమాండ్ చేశారు.

భయపడినంతా జరిగింది..: శర్మిష్ఠ ముఖర్జీ

దిల్లీ/నాగ్‌పుర్: తాను భయపడినంతా జరిగిందంటూ - మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె, కాంగ్రెస్ నేత శర్మిష్ఠ ముఖర్జీ భాజపా/ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం(నాగ్‌పుర్)లో ప్రణబ్ ప్రసంగించిన కొద్ది గంటలకే కల్పిత మార్పులు(మార్ఫింగ్) చేసిన ఆయన చిత్రం ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. అందులో ఇతర నేతలతో కలిసి ఆర్‌ఎస్‌ఎస్ మాదిరిగా వందనం చేస్తూ ప్రణబ్ తన చేతిని ఛాతిపై ఉంచినట్లుగా ఉంది. వాస్తవంగా ఆయన అప్పుడు 'అటెన్షన్'లో నిల్చునే ఉన్నారు. ఈమేరకు ప్రణబ్ 'కల్పిత' చిత్రాన్ని శర్మిష్ఠ ట్వీట్ చేశారు. "చూడండి, నేనేదైతే భయపడి మా నాన్నకు హెచ్చరించానో.. సరిగ్గా అదే జరిగింది. కొద్ది గంటలైనా కాలేదు.. భాజపా/ఆర్‌ఎస్‌ఎస్ కల్పితాల విభాగం చురుగ్గా పనిచేసింది.." అని పేర్కొన్నారు.

'మాది ప్రజాస్వామ్య కుటుంబం..'

తమది ప్రజాస్వామ్య కుటుంబమని, ఎవరి అభిప్రాయాలను వారు స్పష్టంగా చెబుతామని శర్మిష్ఠ పేర్కొన్నారు. తానలాగే పెరిగానని.. అందుకే తండ్రితో విభేదించడానికి తనకెలాంటి సమస్య ఉండదని.. దీన్ని ఆయన నుంచే నేర్చుకున్నానని స్పష్టం చేశారు. ఆమెకు మద్దతుగా - ప్రతిఒక్కరికీ అభిప్రాయాలుంటాయంటూ భాజపా నేత సుబ్రమణియన్ స్వామి వ్యాఖ్యానించినట్లు వార్తలొచ్చాయి. దీనిపై ఆమె ట్విట్టర్‌లో స్పందించారు.

విభజిత శక్తుల పనే.. : ఆర్‌ఎస్‌ఎస్

కొన్ని విభజిత రాజకీయ శక్తులు ప్రణబ్ కల్పిత చిత్రాన్ని పెట్టాయని ఆర్‌ఎస్‌ఎస్ స్పష్టం చేసింది. ఆయన తమ కార్యక్రమానికి హాజరు కాకుండా చేసేందుకు ఆ శక్తులు తొలుత ప్రయత్నించాయని.. వీలు కాకపోవడంతో ఆర్‌ఎస్‌ఎస్‌ను అపఖ్యాతి పాల్జేసేందుకు ఇలాంటి కుటిల యత్నాలు చేస్తున్నాయని హిందుత్వ సంస్థ సంయుక్త ప్రధాన కార్యదర్శి మన్మోహన్ వైద్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ప్రణబ్ ముఖర్జీ ప్రసంగం 5 వేల సంవత్సరాల సంస్కృతీ సంప్రదాయాలతో కూడిన దేశ విఖ్యాత చరిత్రను గుర్తు చేసిందని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార్ ప్రముఖ్ అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

బలవంతపు శృంగారం విడాకులకు ప్రాతిపదికే

- పంజాబ్, హరియాణా హైకోర్టు

చండీగఢ్: జీవిత భాగస్వామితో బలవంతపు శృంగారం, అసహజ శృంగారం విడాకులకు ప్రాతిపదికేనని పంజాబ్, హరియాణా హైకోర్టు స్పష్టం చేసింది. తన భర్త నుంచి విడాకులు ఇప్పించాలని ఒక మహిళ చేసిన విజ్ఞప్తిపై విచారణ నిర్వహించిన ధర్మాసనం ఆమె విజ్ఞప్తిని మన్నించింది. తన భర్త అతని కోర్కె తీర్చుకోవడం కోసం తనను తరచూ కొట్టేవాడని, అసహజ లైంగిక చర్యలకు పాల్పడేవాడని ఆమె ఆరోపించింది. ఆమె విజ్ఞప్తిని దిగువ న్యాయస్థానం తోసిపుచ్చగా హైకోర్టును ఆశ్రయించింది. అసహజ లైంగిక కార్యకలాపాలకు పాల్పడినట్లు రుజువు చేయలేకపోయారన్న దిగువ న్యాయస్థానం అభిప్రాయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఇటువంటి చర్యలను ఇతరులెవ్వరూ చూడలేరని, వైద్యపరంగానూ అన్ని సార్లూ రుజువు చేయలేరని హైకోర్టు పేర్కొంది. ఈ కేసులో కట్నం కోసం డిమాండ్ చేయడం, భార్యను కొట్టడం వంటి వాటిని చూస్తే ఆమె భరించలేని పరిస్థితులను ఎదుర్కొన్నట్లు స్పష్టమవుతోందని న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం.ఎస్.బేడి, జస్టిస్ హరిపాల్ వర్మతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

అసోం యువతికి అరుదైన గౌరవం

- అమెరికాలో శాంతిస్థాపన కార్యక్రమం శిక్షణకు ఎంపిక

గువాహటి: అసోంకు చెందిన సల్మా హుస్సేన్(22) అనే యువతి అరుదైన ఘనత సాధించింది. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ శాంతిస్థాపన స్వచ్ఛంద సేవాసంస్థ అందించే సహాయానికి ఎంపికైంది. ప్రపంచవ్యాప్తంగా ఇలా ఎంపికైన ఎనిమిది మందిలో సల్మా ఒకరు. అంతేకాదు, మనదేశం నుంచి ఎంపికైన ఏకైక యువతి.

అసోంలోని కామ్‌రూప్(గ్రామీణ) జిల్లా సంటోలి గ్రామానికి చెందిన సల్మా ఇటీవల న్యాయశాస్త్రంలో డిగ్రీ చదివారు. అసోంలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని, దాన్ని 'శాంతివనం'గా మార్చాలని ఆకాంక్షిస్తున్నారు. ఆమె ఆకాంక్షను నెరవేర్చడానికి 'ఆండీ లీడర్‌షిప్ ఇనిస్టిట్యూట్ ఫర్ యంగ్ విమెన్' అనే సంస్థ ముందుకొచ్చింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడిన ఆండీ పరమొవచ్ అనే సామాజిక కార్యకర్త 2007లో ఇరాక్‌లో చనిపోయారు. ఆయన స్మృత్యర్థం ఏర్పడిన సంస్థ ప్రపంచవ్యాప్తంగా మహిళలకు ఆర్థికసాయం చేస్తోంది. ఆగస్టు 5 నుంచి 18 వరకు వాషింగ్టన్ డీసీలో సల్మాకు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఆ సమయంలో అక్కడికి వచ్చే మానవహక్కుల కార్యకర్తలతో తన ఆకాంక్ష గురించి, చర్చించి కార్యరూపం దాల్చడానికి తగిన సూచనలు, సలహాలు పొందుతారు.

దడ పుట్టించిన 'ధనుష్'!

- విజయవంతంగా ముగిసిన శతఘ్ని తుది పరీక్షలు

జబల్‌పూర్: 'దేశీయ బోఫోర్స్'గా పిలుస్తున్న తొలి భారతీయ దీర్ఘశ్రేణి శతఘ్ని 'ధనుష్' తుది పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసుకుంది! సైన్యం అమ్ములపొదిలో దీనిని ప్రవేశపెట్టేందుకు ఇక మార్గం సుగమమైనట్లేనని అధికారులు వెల్లడించారు. "పోఖ్రాన్‌లో ఈనెల 2-6 తేదీల నడుమ ఆరు ధనుష్ శతఘ్నుల ద్వారా 50 రౌండ్లు, ఏడో తేదీన 101 రౌండ్ల కాల్పులు నిర్వహించాం. అన్నీ విజయవంతంగా లక్ష్యాన్ని చేరుకున్నాయి" అని ఈ ప్రాజెక్టును చేపట్టిన గన్ క్యారేజ్ ఫ్యాక్టరీ (జీసీఎఫ్) సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్.కె.సింగ్ శుక్రవారమిక్కడ వెల్లడించారు. 2011లో ఈ ప్రాజెక్టును దక్కించుకున్న జీసీఎఫ్... 2014లోనే తొలి నమూనాను రూపొందించింది. తర్వాత మరో 11 నమూనాల ద్వారా మొత్తం 4,200 రౌండ్ల కాల్పులను ప్రయోగాత్మకంగా నిర్వహించింది. సిక్కిం, లేహ్, బాలాసోర్, బదీనా, పోఖ్రాన్ తదితర చోట్ల ప్రయోగాత్మక కాల్పులు చేపట్టామనీ... అత్యంత శీతల, ఉష్ణ ప్రాంతాల్లోనూ ఇవి లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించగలవని రూఢి పరుచుకున్నట్లు సింగ్ తెలిపారు. ఈ శతఘ్నుల్లో 81% పరికరాలు దేశీయంగా తయారైనవేననీ, 38 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఇవి చేరుకోగలవని ఆయన వివరించారు. రక్షణశాఖకు చెందిన పలు విభాగాలు విచారణ చేపట్టి, ధనుష్ లోపరహితమని నిర్ధారించాయన్నారు. మొత్తం 414 ధనుష్ శతఘ్నులను సైన్యానికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కో 155 ఎంఎం శతఘ్ని తయారీకి రూ.14.50 కోట్లు, ఒక్కో గుండుకు రూ.లక్ష చొప్పున ఖర్చవుతుందని జీసీఎఫ్ మాజీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

సమావేశానికి మరికొన్ని రోజుల సమయం ఉండగానే ఉత్తరకొరియా అగ్రనేత కిమ్ జాంగ్ ఉన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నారనుకుంటే మీరు పప్పులే కాలేసినట్లే. అచ్చంగా కిమ్, ట్రంప్‌లలా ఉన్న హవార్డ్, డెన్నిస్ ఎలెన్‌లు శుక్రవారం సింగపూర్‌లో ఇలా ఫొటోకు పోజిచ్చారు

సింగపూర్ చర్చలు సఫలమయితే కిమ్‌ను శ్వేతసౌధానికి ఆహ్వానిస్తా: ట్రంప్

వాషింగ్టన్: సింగపూర్ సదస్సులో ఉత్తరకొరియా అగ్రనేత కిమ్ జాంగ్ ఉన్‌తో చర్చలు సఫలమయితే ఆయనను శ్వేతసౌధానికి ఆహ్వానించే అంశాన్ని పరిశీలిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం చెప్పారు. అయితే మంగళవారం నాటి సదస్సులో తన లక్ష్యాలు నెరవేరకపోతే సమావేశం నుంచి బయటకొచ్చేస్తానని స్పష్టం చేశారు. ఈ నెల 12న జరుగుతున్న ఈ సమావేశం ఉత్తరకొరియా అగ్రనేతకు, అమెరికా అధ్యక్షుడికి మధ్య జరుగుతున్న తొలి సమావేశం. ఉత్తరకొరియా అణ్వాయుధాలను విడనాడాలని అమెరికా, ఆ దేశ ప్రాంతీయ భాగస్వామ్యపక్షాలు కోరుకుంటున్నాయి.

మన పర్యాటక ప్రాంతాలకు సింగపూర్ ప్రచారం

- ఆరు ప్రధాన రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు సహకారం
- ప్రతి రంగానికీ ప్రత్యేక టాస్క్‌ఫోర్సు

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రదేశాలకు ప్రపంచవ్యాప్తంగా సింగపూర్ ప్రచారం కల్పించనుంది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను సింగపూర్ 'మ్యాపింగ్' చేయనుంది. పర్యాటకంతో పాటు ఆరు ప్రధాన రంగాల్లో సహకరించనుంది. రెండు ప్రభుత్వాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా... సింగపూర్‌లోని అమరావతి భాగస్వామ్య కార్యాలయం (ఏపీఓ), ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి సంస్థ (ఏపీఈడీబీ) ఈ ఆరు రంగాలను గుర్తించాయి. అవి... 1. నిర్మాణ రంగం-పారిశ్రామిక పార్కులు, 2. రవాణా, అనుసంధానత, 3. వ్యవసాయం, ఆహార శుద్ధి, 4. పర్యాటకం, 5. ఎలక్ట్రానిక్స్, 6. ఫిన్‌టెక్ రంగాలు. వీటిలో ఏపీకి పెట్టుబడులు తీసుకురావడం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో సహకరిస్తుంది. దీనికి అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు ఏపీఈడీబీతో కలసి అసెండాస్-సింగ్ బ్రిడ్జి, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్, సింగపూర్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డులు పనిచేస్తున్నాయి. మొదట్లో నాలుగు రంగాలే అనుకున్నామని, ఆ తర్వాత ఎలక్ట్రానిక్స్, ఫిన్‌టెక్ రంగాలనూ జత చేశామని ఏపీఈడీబీ సీఈఓ జాస్తి కృష్ణకిశోర్ వివరించారు. ప్రతి రంగానికీ ప్రత్యేకంగా ఒక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ కృషిలో భాగంగానే... ఆంధ్రప్రదేశ్‌లో 150 కోట్లతో రొయ్యల మేత పరిశ్రమ ఏర్పాటుకి ఒక సంస్థ ముందుకు వచ్చిందని, ఇక్కడ రొయ్యల మేతను ఉత్పత్తి చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తామని ప్రతిపాదించిందని వివరించారు. పౌల్ట్రీ రంగంలో రూ.250 కోట్ల పెట్టుబడులకు మరో సంస్థ ముందుకు వచ్చిందని, ప్రస్తుతం ఈ రెండు ప్రతిపాదనలూ పరిశీలనలో ఉన్నాయని కృష్ణ కిశోర్ వెల్లడించారు.

26న సింగపూర్ బృందం రాక..!

పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించి ఈ నెల 26న సింగపూర్‌కి చెందిన ఉన్నతస్థాయి బృందం ఆంధ్రప్రదేశ్‌కు వస్తోంది. పారిశ్రామిక పార్కులు, ఎకనమిక్ సిటీస్‌కి సంబంధించి స్థానిక వ్యాపార, పారిశ్రామికవేత్తలతో ఈ బృందం సమావేశమవుతుంది. నిర్మాణ రంగానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కి చెందిన బిల్డర్లు కొందర్ని ఏపీఈడీబీ ఇప్పటికే సింగపూర్ పంపించి, అక్కడ నిపుణులతో సమావేశాలు ఏర్పాటు చేసింది. వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌తో సహకరించేందుకు జర్మన్ అగ్రి బిజినెస్ అలయెన్స్, సింగపూర్ కన్సార్టియంలు ఒక ఒప్పందం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ఉత్పాదకత పెంచడం, విలువ ఆధారిత ఉత్పత్తులు వంటి రంగాల్లో ఈ సంస్థలు కృషి చేస్తాయి. సింగపూర్, ఆంధ్రప్రదేశ్ మధ్య పరస్పర సహకారానికి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ఛైర్మన్లుగా ఉన్న సంయుక్త కార్యాచరణ అమలు కమిటీ (జేఐఎస్‌సీ) పర్యవేక్షిస్తుంది.

బెంగళూరులో కార్యాలయాల నుంచి బయటకు వచ్చిన టెక్ ఉద్యోగులు

బాంబు భయంతో బెంగళూరులో కలకలం

ఈనాడు డిజిటల్, బెంగళూరు: బెంగళూరులోని బెళ్లందూరు ఎంబెస్సీ టెక్ ఆవరణలో శుక్రవారం బాంబు భయం వెంటాడింది. మధ్యాహ్నం సరిగ్గా 12:07 గంటల సమయంలో ఓ అపరిచితుడు కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా బాంబు ఉందన్న సమాచారం అందించాడు. 'టెక్ పార్కులో బాంబు పెట్టాను. మరో 15 నిమిషాల్లో అది పేలుతుంద'ంటూ బెదిరించడంతో అక్కడి సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకు గురై కార్యాలయాలను విడిచి బయటకు పరుగులు పెట్టారు. పోలీసులకు సమాచారం అందించగా అగ్నిమాపకదళం, బాంబు నిర్వీర్య దళం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. రెండు గంటల పాటు శోధించిన అనంతరం బాంబు లేనట్లు ధ్రువపడిందని వైట్‌ఫీల్డ్ ఉప విభాగం డీసీపీ అబ్దుల్ అహ్మద్ వెల్లడించారు. ఫోను చేసిన వ్యక్తి ఎవరన్నది విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

వక్ఫ్ ఆస్తులకు జియో ట్యాగింగ్

ఈనాడు డిజిటల్, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సర్వే భూ రికార్డుల శాఖ క్షేత్రస్థాయిలో రెండో విడత చేపట్టిన సర్వేలో గుర్తించని 10,769 సంస్థల వక్ఫ్ ఆస్తులను జియోట్యాగింగ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతోపాటు డిజిటల్ జియోగ్రాఫికల్ పొజిషన్ సిస్టమ్(డీజీపీఎస్) సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంస్థలు 2,423 ఎకరాల్లో ఉన్నట్లు గుర్తించి హద్దులను నిర్ధరించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో వక్ఫ్ పరిధిలో మొత్తం 3,502 సంస్థలు ఉన్నాయి. వీటి కింద 65,783 ఎకరాల భూములు ఉన్నట్లు సర్వే శాఖ వక్ఫ్ బోర్డుకు నివేదించింది. ఈ నెలాఖరుకు కృష్ణా జిల్లా నుంచి సర్వేను ప్రారంభించేందుకు వక్ఫ్ సర్వే కమిషనర్ చర్యలు తీసుకుంటున్నారు.

మహిళా వర్సిటీ పీజీ ప్రవేశాలకు 11 నుంచి కౌన్సెలింగ్

మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2018-19 విద్యాసంవత్సరానికి పీజీలో ప్రవేశాలకు తెర లేచింది. ఈ నెల 11 నుంచి సంబంధిత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ ఇన్‌ఛార్జి సంచాలకులు ఆచార్య సావిత్రి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీఎంవీవీ-18 పీజీసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులై కౌన్సెలింగ్‌కు అర్హత సాధించినట్లు చరవాణి ద్వారా సందేశం అందుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. ఉదయం 9గంటలకు వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రతిభా పరీక్షలు నిషేధం

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి పిల్లలకు ప్రతిభ పరీక్ష నిర్వహిస్తే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఉపకార వేతనాలకు, ప్రవేశానికి ముఖాముఖి నిర్వహిస్తే విద్యాహక్కు చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. మొదటిసారి నిబంధనలు అతిక్రమిస్తే రూ.25 వేలు, రెండో సారి అదే చర్యకు పాల్పడితే రూ.50 వేలు జరిమానా విధించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

అర్ధవేతన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని ఎయిడెడ్, పురపాలిక, పంచాయతీరాజ్ పరిధిలోని విద్యాసంస్థల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన బోధన, బోధనేతర సిబ్బందికి అర్ధవేతన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2010 మే 4 తర్వాత పదవీ విరమణ పొందిన వారికి ఈ ప్రయోజనం వర్తిస్తుంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఎలాంటి టర్మ్ పాలసీ ఎంచుకోవాలి?
తాజా బిజినెస్ వార్తలు, ప్రత్యేక కథనాలు, ఆర్థిక సందేహాల నివృత్తి, ఈ-బుక్స్‌కై
www.eenadusiri.net చూడండి.

ఈనాడు

విజయవాడ 10-6-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 301
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-00 పేజీలు 16+20+32 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

priya BUTTER CHICKEN MASALA
నోరూరించే రుచులు
ప్రియ బటర్ చికెన్ మసాలా
www.priyafoods.com

బండి బండి.. కొత్తదండి

■ సరికొత్త ప్రయాణ సాధనాలపై శాస్త్రవేత్తల కసరత్తు ■ ఎగిరే కార్లు.. గాల్లోకి మోసుకెళ్లే సూట్లు

ఏదైనా ఊరెళ్లాల్సివస్తే.. బస్సుల్లోనో లేక రైల్లోనో వెళ్లాలని ఆలోచిస్తాం. దూరం ఎక్కువగా ఉండి అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే విమానం టికెట్టు దొరుకుతుందా అని వెతుకుతాం. ఇప్పటికి అయితే అందుబాటులో ఉన్న రవాణా సాధనాలు ఇవే. కానీ భవిష్యత్తులో అత్యంత భిన్నమైన పద్ధతులు అందుబాటులోకి రాబోతున్నాయి. రేపటి తరం ప్రయాణ సాధనాలు ఊహించనంతటి వేగంతో ప్రయాణించేలా.. అద్భుతమైన సౌకర్యాలతో అందుబాటులోకి రానున్నాయి.. డ్రోన్ హెలీకాప్టర్లు, ఎగిరే కార్లు.. సూపర్‌మాన్‌లా ఎవరికివారే గాలిలో ఎగిరిపోగలిగే జెట్ ప్యాక్ సూట్లు.. తక్కువ పీడనం ఉన్న ట్యూబుల్లో గంటకు 700 కిలోమీటర్లకు పైగా వేగంతో గమ్యం చేరేలా హైపర్‌లూప్ వంటి ప్రయాణ సాధనాలు అందుబాటులోకి వస్తాయంటున్నారు శాస్త్రవేత్తలు. 'ఈనాడు' ప్రత్యేక కథనం.. 11లో

బంగారు కోడిముక్క.. సిద్ధమండి

స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం పొడి అద్ది సిద్ధంచేసిన కోడిమాంసం ముక్కలివి. కాస్త ఖరీదైన ఈ వంటకాన్ని న్యూయార్క్‌లోని మన్‌హట్టన్‌లో ఉన్న ఐన్స్‌వర్త్ రెస్టారెంట్ వినియోగదారులకు ప్రత్యేకంగా వండి వడ్డిస్తున్నారు. తినడానికి అనువుగా బంగారం పొడిని శుద్ధిచేసి ఇందులో వాడుతున్నారు.

ఆగస్టు 24 నుంచి డీఎస్సీ

పరీక్షలు ఆన్‌లైన్‌లో

- 10,351 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- జులై 6న నోటిఫికేషన్
- నేటి నుంచి 19 వరకు రెండో టెట్
- 113 కేంద్రాల్లో పరీక్ష
- వెంటనే మార్కుల వెల్లడి
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి

ఈనాడు డిజిటల్ – విశాఖపట్నం

రాష్ట్రంలో 10,351 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఆగస్టు 24 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ-2018 పరీక్షలు నిర్వహించడానికి సిద్ధమవుతున్నట్లు రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విశాఖలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసారి పరీక్షల నిర్వహణను ఏపీపీఎస్సీకి అప్పజెప్పినట్లు చెప్పారు. ఈ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం రాగానే ఏపీపీఎస్సీ అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటిస్తుందన్నారు. పరీక్షలు ఆన్‌లైన్‌లోనే ఉంటాయన్నారు. పిల్లలకు సంగీతం, నృత్యం నేర్పించడానికి వీలుగా ఆయా పోస్టులను తొలిసారిగా భర్తీచేస్తున్నట్లు గుర్తుచేశారు. ఈసారి ఉపాధ్యాయులుగా (మిగతా 11లో)

అవినీతిపరులందరిపై చర్యలు తీసుకోవాలన్న నిబంధన వైకాపా అధ్యక్షుడికి వర్తించదా? ఆయన సంపాదించినవి అవినీతి ఆస్తులు కాదా? ఆయనపై కేసుల విచారణ ఎందుకు వేగంగా జరగడం లేదు? కారణం ఎవరు? వాటి కోసమే కదా జగన్ కేంద్రంతో లాలూచీ పడింది. మీరు లాలూచీ పడి వేరేవాళ్లను విమర్శించడమేంటి?

జగన్ అక్రమాస్తులనూ వేలం వేయాలి

- అగ్రి గోల్డ్‌కు ఒక రూలు? ఆయనకో రూలా?
- నీరవ్, మాల్యాల కంటే ఆయనవే పెద్ద నేరాలు
- కేంద్రంతో లాలూచీ వల్లే విచారణలో జాప్యం
- చంద్రబాబు ధ్వజం
- అవినీతిపరులు, అసమర్థులను గెలిపిస్తే రాష్ట్రం మరో బిహార్ అవుతుందని హెచ్చరిక

ఈనాడు – అమరావతి

అగ్రి గోల్డ్, విజయ్ మాల్యా, నీరవ్ మోదీల నేరాల కంటే వైకాపా అధ్యక్షుడు జగన్ చేసిన ఆర్థిక నేరాలు తీవ్రమైనవని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అగ్రి గోల్డ్ ఆస్తుల్లానే జగన్ ఆస్తుల్నీ వేలం వేయాలని డిమాండు చేశారు. 'అగ్రి గోల్డ్‌కు ఒక రూలు? జగన్‌కు మరో రూలా?' అని ధ్వజమెత్తారు. ఐదు ఎంపీ పదవుల్ని చూపించి, రాష్ట్ర ప్రయోజనాల్ని కేంద్రానికి జగన్ తాకట్టు పెట్టారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు నమ్మక ద్రోహం చేసిన భాజపాకు, దానికి మద్దతిస్తున్న వైకాపాకు, ఇతర నాయకులకూ కాంగ్రెస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అసమర్థులు, అవినీతిపరులకు అధికారమిస్తే ఆంధ్రప్రదేశ్ కోలుకోలేని దెబ్బతింటుందని, మరో బీహార్‌లా మారుతుందని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు.

'విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, ప్రత్యేక హోదా సహా రాజ్యసభలో ఇచ్చిన హామీలన్నింటినీ కేంద్రం అమలు చేసినా రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని పూడ్చలేం. మరో పదేళ్లు తీవ్రంగా కష్టపడితే తప్ప మళ్లీ గాడిన పడలేం. మోదీని నమ్మి దేశ ప్రజలు భాజపాకు సంపూర్ణ మెజారిటీ కట్టబెడితే వారి ఆకాంక్షల్ని నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. తెదేపా మళ్లీ అధికారంలోకి రావడం చరిత్రాత్మక అవసరం. రాష్ట్ర హక్కుల్ని కాపాడుకునే విషయంలో రాజీలేని పోరాటం చేస్తాం. ఈసారి నవ నిర్మాణ దీక్షలు, మహా సంకల్పం చాలా సంతృప్తినిచ్చాయి. గ్రామదర్శిని కార్యక్రమం, (మిగతా 11లో)

కుట్రదారులెవరో ప్రజలకు చెప్పండి

- న్యాయవాదుల సమావేశంలో చంద్రబాబు
- భారీగా వరాల ప్రకటన

3లో

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

- ఉదయం 10 గంటలకు ర్యాంకుల వెల్లడి

5లో

విమాన విరామంతో కష్టమే!

- రోజూ 5 గంటలపాటు రాకపోకల నిషేధంతో కుంటుపడనున్న విశాఖ ప్రగతి

14లో

విస్తరించిన నైరుతి

కడప, ప్రకాశం మినహా రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు

24 గంటల్లో వాయుగుండం

ఈనాడు – అమరావతి, విశాఖపట్నం

ఈ ఏడాది ముందే కరుణించిన నైరుతి రాష్ట్రాన్ని చల్లబరచింది. శుక్రవారం దాకా మచిలీపట్నం వరకే పరిమితమైన రుతుపవనాలు..శనివారం నాటికి ఉత్తర కోస్తాలోని అన్ని జిల్లాల్లోకీ ప్రవేశించినట్లు వాతావరణశాఖ నిర్ధరించింది. వీటి ప్రభావంతో నాలుగైదు రోజులుగా రాష్ట్రమంతటా విస్తృతంగా వర్షాలు పడుతున్నాయి. కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండగా.. అధిక మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా కడప, ప్రకాశం మినహా.. మిగిలిన అన్నిచోట్లా వానలు ఆశాజనకంగానే ఉన్నాయి. కృష్ణా, గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో సాధారణానికి మించి నమోదవుతున్నాయి. శుక్ర, శనివారాల్లో.. శ్రీకాకుళంలో 91.5 మి.మీ, విశాఖ జిల్లా కొయ్యూరులో 75, విజయనగరం జిల్లా చీపురుపల్లిలో 73.5 గరిష్ఠ వర్షపాతం (మిగతా 11లో)

ముంబయిలోని ఓ వీధిలో మోకాళ్లలోతు వాన నీటిలో జనం పాట్లు

యూపీలో వాతావరణ బీభత్సం

- గాలి దుమారం, పిడుగులకు 26 మంది దుర్మరణం
- ముంబయిలో భారీ వర్షాలు.. జలమయమైన రోడ్లు
- విమానాల రాకపోకలు ఆలస్యం

14లో

శనివారం చింగ్‌డావ్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భారత ప్రధాని మోదీ

భారత్-చైనా సంబంధాలపై నూతన ప్రణాళిక

ప్రధాని మోదీ, జిన్‌పింగ్‌ల చర్చలు 16లో

సగం చోట్ల ఎదురుగాలే!

- భాజపాను కలవరపెడుతున్న అంతర్గత సర్వే
- 282లో 152 చోట్ల సిట్టింగులపై వ్యతిరేకత
- వారి స్థానంలో కొత్త ముఖాలకు అవకాశం
- లోటు భర్తీకి ఏపీ, తెలంగాణ, ఒడిశా, బెంగాల్‌లపై దృష్టి
- పూరీ నుంచి పోటీ చేయనున్న ప్రధాని మోదీ?

దిల్లీ

గత ఎన్నికల్లో దేశంలో 282 లోక్‌సభ స్థానాల్లో సునాయాసంగా విజయదుందుభి మోగించిన భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు వాటిలో కనీసం 152 చోట్ల ఎదురుగాలి వీస్తోంది. భాజపా నిర్వహించిన అంతర్గత సర్వేలోనే ఈ విషయం బయటపడడంతో కమలనాథుల్లో కలవరం వ్యక్తమవుతోంది. నిరుడు గెలిచిన అన్ని స్థానాలపైనా భాజపా ఈ సర్వే చేపట్టింది. గత ఏడాది గుజరాత్ శాసనసభ ఎన్నికలు పూర్తి కావడానికి కొద్దిరోజుల ముందు ఇది పూర్తయింది. ఈ నివేదికను 'దైనిక్ భాస్కర్' హిందీ దినపత్రిక సంపాదించింది. ఎక్కడెక్కడ చేదు అనుభవాలు ఎదురయ్యే అవకాశం ఉందో తెలినందువల్ల అక్కడ చేపట్టాల్సిన నష్టనివారణ చర్యలపై పార్టీ దృష్టి సారించింది. అభ్యర్థులను మారిస్తే వ్యతిరేకత పోతుందా, ఇతరత్రా ఏమైనా చర్యలు చేపట్టాలా అనేది తేల్చనున్నారు. పార్టీ సారథి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్రమోదీలు 'నవ భారతం- యువ భారతం' అనే నినాదాన్ని తదుపరి ఎన్నికల్లో తీసుకునే (మిగతా 11లో)

అంతర్గత సర్వే ఫలితాలు...

రాష్ట్రం	2014లో భాజపా గెలిచిన సీట్లు	వీటిలో కోల్పోయే అవకాశమున్నవి
ఉత్తర్‌ప్రదేశ్	71	48
రాజస్థాన్	25	13
మధ్యప్రదేశ్	26	16
మహారాష్ట్ర	23	17
బిహార్	22	12
ఝార్ఖండ్	12	05
హరియాణా	07	07
ఉత్తరాఖండ్	05	03
పంజాబ్	02	02
ఛత్తీస్‌గఢ్	01	01
ఇతర రాష్ట్రాలు	**87**	**28**

ఇదీ సంగతి!



హీరోయిన్లను నేను కలుస్తా, హీరోలను నువ్వు కలువు, ఇతను కమేడియన్లనూ అతను విలన్లనూ, ఆయన ఆటగాళ్లనూ, ఈయన డ్యాన్సర్లనూ...

ఆస్పత్రుల్లో సేవకులు

- త్వరలో నాలుగో తరగతి ఉద్యోగుల నియామకాలు
- పీపీపీ పద్ధతిలో 1950 మందిని తీసుకునేందుకు చర్యలు

ఈనాడు – అమరావతి

ప్రభుత్వాస్పత్రుల్లో నాలుగో తరగతి సిబ్బంది కొరత కొంతవరకు తీరబోతోంది. ఎలక్ట్రీషియన్లు, లిఫ్టుబాయ్‌లు, క్షురకులు, టెలిఫోన్ ఆపరేటర్లు, చెక్క పనిచేసే వారు కూడా రాబోతున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనూ అవసరాలకు అనుగుణంగా ల్యాబ్ అటెండర్ల తరహా ఉద్యోగులను సమకూర్చనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో సుమారు 1950 మందిని పీపీపీ(పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో తీసుకోబోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం అనే ఈ విధానంలో ఓ సంస్థను టెండరు ద్వారా ఎంపికచేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం ఏడాదికి రూ.30 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. బోధన, ఇతర ఆస్పత్రుల్లో 4వ తరగతి సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రోగుల రద్దీ కారణంగా వీరి అవసరాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా నడవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను స్ట్రెచర్, చక్రాల కుర్చీ ద్వారా ఆస్పత్రుల్లోకి తీసుకెళ్లేందుకు సిబ్బంది లేనందున సహాయకులు పడరానిపాట్లు పడుతున్నారు. శస్త్రచికిత్సలకు వెళ్లేముందు రోగులకు అందాల్సిన సేవల్లోనూ ఒక్కొక్కచోట సమస్యలు వస్తున్నాయి. పరిష్కారంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా తొలివిడత వైజాగ్ కేజీహెచ్, శ్రీకాకుళం, కాకినాడ, విజయవాడ కొత్త, పాత ఆస్పత్రి, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, కర్నూలు, కడప, విశాఖలోని విక్టోరియా, మానసిక వైద్యశాల వంటి 23 ఆస్పత్రుల్లో 4వ తరగతి ఉద్యోగులను నియమించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. ఈ (మిగతా 11లో)

తిరుమలపై రాజకీయ చర్చ ఆపండి

- శ్రీవారి నగలను ఐదేళ్లకోసారి మదించాలి
- పీఠాధిపతుల సదస్సులో తీర్మానం

5లో

ఈ ఏనుగు పేరు లాడెన్

- రెండేళ్లలో 37 మందిని చంపింది

16లో

ప్రభుత్వ అందిస్తున్న వివిధ ఆరోగ్య సేవలపై ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, అధికారులు

వైద్య ఆరోగ్య శాఖ పథకాల గోడపత్రికల ఆవిష్కరణ

ఈనాడు అమరావతి: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన నూతన సంస్కరణలపై విస్తృత స్థాయిలో ప్రచారాన్ని కల్పించబోతున్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, మహిళల మాస్టర్ హెల్త్ చెకప్, చంద్రన్న సంచార చికిత్స, ముఖ్యమంత్రి ఐ కేంద్రాలు, ఇతర పథకాల గురించి గోడపత్రికల ద్వారా ప్రభుత్వాసుపత్రులు, జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ముఖ్య ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో శనివారం ఆవిష్కరించారు.

సీఎంకు 'ఉద్దానం'పై నివేదించిన జార్జ్ సంస్థ ప్రతినిధులు!

శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో మూత్రపిండాల వ్యాధులు ప్రబలేందుకు దారితీస్తున్న కారణాలపై అధ్యయనం ప్రారంభించిన జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సీఈఓ వివేకానంద ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం కలిశారు. అధ్యయన ప్రారంభంలో భాగంగా ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో సలహాదారు జితేందర్‌శర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ అరుణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ఉపరాష్ట్రపతి అల్పాహార విందు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌కు ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు శనివారం ఉదయం అల్పాహార విందు ఇచ్చారు. ప్రత్యేక సందర్భం ఏమీ లేకపోయినా రాష్ట్రపతికోసం మర్యాదపూర్వకంగా వెంకయ్యనాయుడు ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఉపరాష్ట్రపతి ఇంటికి ఇలా రాష్ట్రపతి రావడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. ఉదయం 9 గంటలకు రామ్‌నాథ్‌కోవింద్ సకుటుంబ సపరివార సమేతంగా ఇక్కడి మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌రోడ్డులోని ఉపరాష్ట్రపతి నివాసానికి వచ్చారు. వారికి వెంకయ్యనాయుడు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. దక్షిణాదిలో సుపరిచితమైన ఇడ్లీ, దోశ, వడలాంటి వంటకాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి సుమారు గంటపాటు ఉపరాష్ట్రపతి నివాసంలో గడిపారు. ఇరు కుటుంబాలు చాలా సేపు కూర్చొని సరదాగా మాట్లాడుకున్నారు. దీనిపై వెంకయ్యనాయుడు ట్విట్టర్‌లో సంతోషం వ్యక్తంచేశారు. రాష్ట్రపతి కుటుంబసభ్యులతోపాటు తన ఇంటికి రావడంపట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే వెంకయ్యనాయుడు హైదరాబాద్ వెళ్లిపోయారు. ఆయనకు ఆదివారం అక్కడి ఎల్‌వీప్రసాద్ నేత్రవైద్యశాలలో కాటరాక్ట్ ఆపరేషన్ జరుగనుంది. 14వ తేదీవరకూ అక్కడే ఉంటారు. తర్వాత గ్యాంగ్‌టక్ వెళ్తారు.

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులతో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు, కుటుంబసభ్యులు

రాష్ట్రాన్ని పాతికేళ్లు వెనక్కి నెట్టారు

చంద్రబాబుపై వైకాపా

అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ధ్వజం

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాకం వల్ల ఏపీ ప్రజలకు రాజధాని లేకుండా పోయిందని, కనీసం ఉమ్మడి రాజధాని కూడా లేకుండా చేశారని వైకాపా అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ విమర్శించారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనపై శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. విడిపోయిన ఆంధ్రపదేశ్ రాష్ట్రాన్ని చంద్రబాబు పాతికేళ్లు వెనక్కి నెట్టారని మండిపడ్డారు. ఏపీకి అస్థిత్వం లేకుండా అన్యాయం చేశారన్నారు. నాలుగేళ్లు కేంద్రంతో జతకట్టి ఇద్దరు కేంద్ర మంత్రులను పెట్టుకుని రాష్ట్రానికి చేసిందేమిటని ప్రశ్నించారు. జగన్ గురించి చంద్రబాబు మాట్లాడడం అంటే పిల్లి వచ్చి పులి ముందు తొడగొట్టినట్లుగా ఉందంటూ ఎద్దేవాచేశారు.

13 కిలోల బంగారం స్వాధీనం

చెన్నై, న్యూస్‌టుడే: విమానం ద్వారా అక్రమంగా రవాణా అవుతున్న 13 కిలోల బంగారాన్ని చెన్నైలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి చెన్నైకి చేరుకున్న ఎయిరిండియా విమానంలో కర్ణాటకకు చెందిన పద్మ (52) వచ్చారు. కస్టమ్స్ అధికారుల తనిఖీలో ఆమె వద్ద 13 కిలోల బంగారం దొరికింది. వెంటనే అధికారులు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేశారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం

తెదేపా మట్టిదోపిడీ రూ.34 వేల కోట్లు

- **నిడదవోలు సభలో జగన్ ఆరోపణ**
- **వర్షం పడడంతో కుదించిన ప్రసంగం**

ఈనాడు డిజిటల్, ఏలూరు: ఈ నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ నాయకులు మట్టిపై చేసిన దోపిడీ రూ.34 వేల కోట్లని వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పరిధిలో శనివారం ప్రజాసంకల్పయాత్ర నిర్వహించారు. నిడదవోలు పట్టణంలో సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. చెరువుల్లో 20 నుంచి 30 అడుగుల లోతు వరకు మట్టి తవ్వేస్తున్నారని, మట్టి తవ్వినందుకు, అమ్మినందుకు డబ్బే అని అన్నారు. నదీ గర్భాల నుంచి ఇసుక అక్రమ దందా జరుగుతోందని.. దీనికి పెట్టిన పేరు ఉచితమని ఎద్దేవా చేశారు. శాసనసభ్యులకూ, గుత్తేదారులకు తప్ప ఎవరికీ ఉచితంగా లభ్యం కావడం లేదని విమర్శించారు. పోలీసులు దగ్గరుండీ మరీ రవాణా చేయిస్తున్నారని విమర్శించారు. నిడదవోలులో ఆర్వోబీ నిర్మిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, నాలుగేళ్లగా సినిమా చూపిస్తున్నారు తప్ప నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. గడ్డర్ వంతెనకు గత పుష్కరాల సమయంలో మరమ్మతులు చేశారని అయినా అది కూలిపోయిందని, దేవుని సొమ్మును తినేయడానికి కూడా ఈ నాయకులు వెనుకాడడం లేదని దుయ్యబట్టారు. పట్టణంలో ఉన్న ఆసుపత్రిలో ఇద్దరే వైద్యులు పనిచేస్తున్నారంటే ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుందన్నారు. ఈ నియోజకవర్గంలో పండిస్తున్న కూర అరటి గెలలకు గిట్టుబాటు ధర లేదని రైతులు వాపోయారని ఆయన చెప్పారు. గెల రూ.100 పలకడం లేదని, అదే హెరిటేజ్ దుకాణంలో రెండు కాయలు రూ.20లకు అమ్ముతున్నారని అన్నారు. జగన్ ప్రసంగం సాగుతుండగా వర్షం కురవడం మొదలైంది. ఈ సమయంలో జనం నీడకు చేరుకోడానికి ప్రయత్నించారు. 'నాలుగేళ్లుగా చంద్రబాబు పాలనతో యుద్ధం చేస్తున్నాం.. ఈ చిన్నపాటి వర్షం లెక్కా' అని ప్రశ్నించారు. కాసేపు వర్షంలోనే ప్రసంగం కొనసాగించారు.

నిడదవోలు ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

కొవ్వూరు వారధిపై జగన్ యాత్ర ప్రమాదకరం

పోలీసుల ముందస్తు నోటీసులు

రాజమహేంద్రవరం నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రతిపక్ష నేత జగన్ ప్రజాసంకల్పయాత్ర ఈ నెల 12న పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తూర్పుగోదావరిలోకి ప్రవేశించేందుకు కొవ్వూరు-రాజమహేంద్రవరం రోడ్డు, రైలు వంతెన మార్గాన్ని ఎంచుకోగా పోలీసులు అది ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ మేరకు అర్బన్ జిల్లా దక్షిణ మండల డీఎస్పీ నుంచి వైకాపా రాజమహేంద్రవరం కోఆర్డినేటర్ రౌతు సూర్యప్రకాశరావుకు నోటీసు అందింది. వేలాది మంది జనం, భారీ వాహనాలు ఒక్కసారిగా వంతెనపైకి చేరితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే రాజమహేంద్రవరంలోని కోటిపల్లి బస్టాండు వద్ద తలపెట్టిన భారీసభకు కూడా ఆప్రాంతం అనుకూలం కాదని, ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు. జాగ్రత్తలు తీసుకుంటామని పోలీసులకు హామీ ఇచ్చామని, సూర్యప్రకాశరావు తెలిపారు.

ఈడీ కస్టడీకి పాత్రికేయుడు రాయ్

దిల్లీ: అక్రమనగదు చలామణి కేసులో విచారణనిమిత్తం పాత్రికేయుడు ఉపేంద్ర రాయ్‌ను ఏడు రోజుల పాటు ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి పంపిస్తూ శనివారం ఇక్కడి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టు ఆదేశించింది. తన దగ్గర కీలకసమాచారం ఉందంటూ పలువుర్ని బెదిరించి రూ.వేలాది కోట్ల వసూలు చేసినట్టు ఈడీ ఆరోపించింది.

పోలవరం పరిహారం చెల్లింపులో అవినీతి

- **ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక ఆరోపణ**

ఈనాడు డిజిటల్, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పరిహారం, పునరావాస ప్రక్రియలో భారీ అవినీతి జరుగుతోందని ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక (నేషనల్ అలయెన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్) పేర్కొంది. అనర్హులకు పరిహారం అందిందని ఆరోపించింది. ఆసియా మౌలిక వసతులు పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) నుంచి రుణాలు తీసుకోవడంవల్ల భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేసింది. శనివారం విజయవాడలో ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక సభ్యులు 'ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి- పెట్టుబడి, ప్రజా ఉద్యమాలు, పర్యావరణం, ప్రజల జీవనోపాధిపై ప్రభావం' అనే అంశంపై విలేకరులతో మాట్లాడారు. ఏపీ వ్యవసాయ వృత్తిదారుల సంఘ సభ్యులు బాబ్జీ మాట్లాడుతూ.. పోలవరం పునరావాస ప్రక్రియలో అధికార పార్టీ, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, పలువురు రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వింజరం గ్రామంలో భూసేకరణ ముందు వరకూ 96 ఎకరాలుండగా, అనర్హులకు లబ్ధి చేకూర్చేందుకు 246 ఎకరాలుగా మార్చి పరిహారం పొందారన్నారు. 300 ఎకరాల రంగాపురం చెరువు భూమిని రికార్డుల్లో మార్చి ప్రైవేటు భూమిగా చూపించారని వివరించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రకారం 372 ముంపు ఆవాసాలుండగా, 14 ఆవాసాలను మాత్రమే పునరావాస కాలనీలకు తరలించారని తెలిపారు. పర్యావరణ వేత్త సౌమ్య దత్తా మాట్లాడుతూ.. 'దేశంలో విద్య, కనీస మౌలిక సదుపాయాల కొరత ఉంది. ఈ తరహా ప్రాజెక్టులకు రుణాలివ్వకుండా జల వనరులు, విద్యుత్ ప్రాజెక్టులు, భారీ రహదారుల నిర్మాణానికి చైనాకు చెందిన ఏఐఐబీ రుణాలిస్తోంది. ఈ నిర్మాణాలకు సంబంధించిన ముడి సరకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆ దేశానికి చెందిన సంస్థల నుంచే కొనుగోలు చేయాలని నిబంధనలు విధిస్తోంది. అమరావతి నిర్మాణానికి రుణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏఐఐబీని సంప్రదిస్తోంది. తక్కువ వడ్డీకే రుణాలిస్తున్నా రూపాయి మారకపు విలువలో తేడాలవల్ల తీసుకున్న దానికన్నా అధికంగా చెల్లించాల్సి రావొచ్చు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెను భారమౌతుంది' అని చెప్పారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ సభ్యులు ట్యాన్సీ అలెక్స్, ఎన్‌ఏపీఎమ్ ఏపీ సలహాదారు రామకృష్ణ, మీరా, భాగ్యరావు పాల్గొన్నారు.

గోదారి పరిరక్షణ బాధ్యత స్థానికులదే

- **'నన్నయ'లో ప్రారంభమైన జాతీయ సదస్సు**
- **హాజరైన డా.రాజేంద్రసింగ్**

రాజానగరం - న్యూస్‌టుడే

గోదావరి పరివాహక ప్రాంత ప్రజలంతా ఒక్కటై నదిని కాపాడుకోవాలని, దానిపై సర్వహక్కులు, బాధ్యతలు వారికే ఉన్నాయని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డా.రాజేంద్రసింగ్ స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గోదావరి నదీ పరిరక్షణ, పునరుజ్జీవంపై జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. జల్ బిరదిరి జలసంఘం ఆధ్వర్యంలో అద్దేపల్లి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజేంద్రసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్, రీసెర్చ్ ఛైర్మన్, ఆచార్య అల్లం అప్పారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.రాజేంద్రసింగ్ మాట్లాడుతూ గోదావరిని సంరక్షించాలన్న ఆసక్తితో వివిధ రాష్ట్రాల మేధావులంతా హాజరవ్వడం మంచి పరిణామమన్నారు. గోదావరి సముద్రంలో కలిసే వరకూ రకరకాలుగా కాలుష్యం బారిన పడుతోందన్నారు. కర్మాగారాల నుంచి వచ్చే విషరసాయనాలు నేరుగా నదిలోనే కలపడం దారుణమన్నారు. ప్రాణాంతక రోగాలకు స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడమే ప్రధాన కారణమని తెలిపారు. ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో నదుల ఉనికే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన ప్రకటించారు. మహారాష్ట్రకు చెందిన పర్యావరణ శాస్త్రవేత్త ఆచార్య విజయ్ పరాంజిపే మాట్లాడుతూ.. 2010-15లో గోదావరి నదీ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వం వేసిన అధ్యయన కమిటీలో సభ్యుడిగా ఉన్నానన్నారు. దానిపై సుదీర్ఘ అధ్యయనం తర్వాత నివేదికను రూపొందించినట్లు చెప్తూ, దాని ప్రతిని డా.రాజేంద్రసింగ్‌కు అందజేశారు. ఇలాంటి అధ్యయనం ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగాలని సూచించారు. అద్దేపల్లి శ్రీధర్ మాట్లాడుతూ గోదావరి పరిరక్షణకు ఇక్కడి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని ఆశాభావం ప్రకటించారు. సదస్సుకు హాజరైన ప్రముఖులంతా రెండు బృందాలుగా విడిపోయి యానం వైపు కొందరు, పోలవరం వైపు మరికొందరు వెళ్లి నదిని పరిశీలించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.ముత్యాలునాయుడు, చీఫ్ ఇంజినీర్ ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డా.రాజేంద్రసింగ్

మత్స్యకార బోట్ల డీజిల్ రాయితీ పెంచాలి

యజమానుల సంఘం నేతల డిమాండ్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇస్తున్న డీజిల్ రాయితీ(సబ్సిడీ)ని పెంచాలని, లేనిపక్షంలో తాము వేటకు వెళ్లమని రాష్ట్రానికి చెందిన పలువురు మత్స్యకార సంఘాల నాయకులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో..కాకినాడ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కాకినాడ న్యూ డాల్ఫిన్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ల ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా గల మత్స్యకార సంఘాల నాయకులు శనివారం అత్యవసరంగా సమావేశమయ్యారు. సమావేశానికి ఆయా సంఘాల అధ్యక్షులు బలసాడి రంగారావు, ఓలేటి గిరి నాయకత్వం వహించారు. సమావేశంలో పలు అంశాలు చర్చించారు. మత్స్యకార బోట్లకు డీజిల్ సబ్సిడీపై ఇచ్చే విధానాన్ని 2002 నుంచి అమలు చేస్తున్నారన్నారు. 2002లో లీటరు డీజిల్ ధర రూ.38 ఉండేదన్నారు. అప్పట్లో లీటరు డీజిల్‌పై రూ.8.03 సబ్సిడీని ఇచ్చేవారన్నారు. ఆ తరువాత డీజిల్ ధర పెరుగుతున్నా రాయితీలో ఎటువంటి మార్పు లేదని సంఘ నాయకులు వాపోయారు. ఇటీవల కాలంలో చేపల వేట లాభసాటిగా లేకపోవటంతో మత్స్యకారులు నష్టాలబారిన పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14 నుంచి వేట విరామం ముగిసినా బోట్లను వేటకు పంపరాదని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు.

తపాలా సేవకులు హుందాగా ఉద్యమించారు

- వారి సమస్యలను కేంద్రం పరిష్కరించింది
- కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : గ్రామీణ తపాలా సేవకులు (జీడీఎస్‌లు) తమ హక్కుల సాధనకు హుందాగా ఉద్యమించారని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ, ఏపీలకు చెందిన జీడీఎస్‌లతో శనివారం ఆమె సమావేశమై మాట్లాడారు. జీడీఎస్‌ల న్యాయపరమైన డిమాండ్లకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. బుధవారం మంత్రి వర్గ సమావేశం నిర్వహించి తపాలా సేవకుల సమస్యల పరిష్కారానికి కేంద్రం అంగీకరించిందని పేర్కొన్నారు. జీడీఎస్‌లను ఆదుకునేందుకు 56% ఇంక్రిమెంట్, మహిళా ఉద్యోగులకు పూర్తి వేతనంతో కూడిన ఆర్నెల్ల ప్రసూతి సెలవులు ఇస్తున్నామన్నారు. దీంతో పాటు ఏడాదికి 3% ఇంక్రిమెంట్ కల్పిస్తున్నామన్నారు. కమలేశ్‌చంద్ర కమిటీ సిఫార్సులను పూర్తిగా అమలుచేయాలని, స్వచ్ఛంద పదవీ విరమణ, పింఛను వంటి సౌకర్యాలు కల్పించాలని జీడీఎస్‌లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాని మోదీ, సమాచారశాఖ మంత్రి మనోజ్ సిన్హా దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీఇచ్చారు. కార్యక్రమంలో భాజపా ఎమ్మెల్యే కె.లక్ష్మణ్, తెలంగాణ, ఏపీల చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్స్ బి.చంద్రశేఖర్, కె.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ, లోక్‌సభల సెక్రటరీ జనరళ్లు, ఈసీఐ పేర్లను ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాల్సిందే

- **హైకోర్టు రిజిస్ట్రీకి స్పష్టీకరణ**
- **ప్రత్యేక హోదాపై వ్యాజ్యంలో తీర్పు**

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించడంతో పాటు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట నిబంధనల అమలుకు ఆదేశించాలంటూ దాఖలైన వ్యాజ్యంలో రాజ్యసభ, లోక్‌సభల సెక్రటరీ జనరళ్లు, భారత ఎన్నికల సంఘాన్ని ప్రతివాదులుగా చేర్చడంపై హైకోర్టు పరిపాలనా విభాగం(రిజిస్ట్రీ) అభ్యంతరం వ్యక్తంచేయడాన్ని ధర్మాసనం సమర్థించింది. వారి పేర్లను తొలగించాక వ్యాజ్యానికి నంబరు కేటాయించాలని స్పష్టంచేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ఏపీకి ప్రత్యేక హోదా, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అమలుచేసేలా ఆదేశాలు జారీచేయాలంటూ ప్రకాశం జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన పోలూరి శ్రీనివాసరావు అనే వ్యక్తి హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి, హోంశాఖ, న్యాయశాఖ కార్యదర్శులు, రాజ్యసభ, లోక్‌సభల సెక్రటరీ జనరళ్లు, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, భారత ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. రాజ్యసభ, లోక్‌సభల సెక్రటరీ జనరళ్లు, ఈసీఐను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆ వ్యాజ్యానికి నంబరు కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ నిరాకరించింది. ఈ అంశంపై గతంలో ధర్మాసనం విచారణ జరిపి తీర్పును వాయిదా వేసింది. తాజాగా నిర్ణయాన్ని వెల్లడించింది.

మక్కామసీదుపై నుంచి దూకి ఫ్రెంచ్ దేశస్థుడి ఆత్మహత్య

రియాద్: ముస్లింల పవిత్ర నగరమైన మక్కాలోని ప్రసిద్ధ మసీదుపై నుంచి దూకి ఓ ఫ్రెంచ్ దేశస్థుడు ఆత్మహత్య చేసుకున్నారు. సౌదీ, ఫ్రెంచ్ అధికారులు శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. పవిత్ర మక్కా మసీదుపై కప్పు మీద నుంచి ఆయన ఒక్కసారిగా కిందకు దూకేశారు. మసీదు ఆవరణలో పడిపోయిన ఆయన అక్కడిక్కడే మరణించినట్లు అధికారులు వెల్లడించారు. అతడు ఫ్రెంచ్ దేశస్థుడేననీ...అయితే, అంతకుమించిన వివరాలు వెంటనే తెలియరాలేదనీ ఫ్రాన్స్ విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు.

ENLIGHT IAS ACADEMY
+ Civil Services, Degree + IAS, Inter + IAS.
+ Experienced Faculty from Delhi & Hyderabad.
+ Morning & Evening Batches for employees & Final year graduates.
+ Limited Admissions + Daily Test series and analysis + Library Facility
Raghavaiah Park, Beside Help Hospital, M.G.Road, Vijayawada-2.
Contact : 7675879571, 89198323528, 7989995974

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
RANK హామీ
Degree + IAS (50 students) 3yrs Integrated Program
After Degree - Morning Batch (1 year) During Degree - Evening Batch(2 years)
Civil Services IAS Exam ఉచిత అవగాహనా సదస్సు on June 10th Sunday 10 am
Hostel facility
Beside Nagarjuna Hospital,Kanuru, VJA, Ph: 6300181832

శ్రీ భవిష్య ఎడ్యుకేషనల్ అకాడమి విజయవాడ
www.sribhavishya.com
NEET-2018 ఫలితాలలో కేవలం లాంగ్‌టర్మ్ నుండి
579 570 569 557 555 555 552
NEET-2019 LONG TERM అడ్మిషన్లు జరుగుచున్నవి.
1st Batch క్లాసులు 09-06-2018 నుండి ప్రారంభం.
Long Term 2018-19 Batch Concessions
NEET-18 Marks >420 400-419 375-399 350-374
% of Concession 90% 75% 50% 25%
*The above concessions are valid for first 100 Students only
95813 06030, 95819 44007
95819 44003, 85003 03037

జాతీయస్థాయిలో జిప్‌మర్ విజయాన్ని కూడా శాసించిన నారాయణ!
మెడికల్ అంటే ఎల్లప్పుడూ నారాయణే!
JIPMER-2018
ఆలిండియా అన్ని కేటగిరీలలో 100 లోపు నారాయణ ర్యాంకులు
16 21 26 29 34 39 57 81 87 99
2019 NEET LONG TERM అడ్మిషన్లు జరుగుచున్నవి
క్లాసులు ప్రారంభం 18-06-2018
నారాయణ విద్యాసంస్థలు

SI/కానిస్టేబుల్స్ RPF
అర్థమెటిక్ & రీజనింగ్ స్టేట్ నెం.1 ఫ్యాకల్టీ పువ్వాల శివాజి సార్ & జనరల్ స్టడీస్‌లో రాష్ట్ర స్థాయి ఫ్యాకల్టీలచే బ్యాచ్: 18-6-18
SICE శివాజి ఇన్‌స్టిట్యూట్ గుంటూరు 9346364702

కానిస్టేబుల్స్-SI
8th Batch Started
జైహింద్ డిఫెన్స్ అకాడమి
9985223681, 9390155454 - VJA

INTER / DEGREE + IAS
New Batch for CIVILS & Groups on 18-6-18
NANDHINI IAS ACADEMY
Ph. 9666474466, 8019988299

RPF S.I & కానిస్టేబుల్స్
RRB గ్రూప్ 1,2,3,4 VRO
DSC: స్టాండర్డ్ కోచింగ్
V-రాహుల్ 9866715363

PAVAN KUMAR'S IAS
Group II
ఉచిత అవగాహనా సదస్సు
And Demo Classes
On June 10th Sunday 10 am
Ph: 9966961027

RPF-SI, కానిస్టేబుల్స్
SI & కానిస్టేబుల్స్
శ్యామ్

S.I. కానిస్టేబుల్
హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్
9848262600, 9849771902

EXCELLENT COACHING FOR
BANKS SSC
RPF కానిస్టేబుల్స్ SIs
Online Exams + హాస్టల్ వసతి కలదు
ఆదిత్య
New Batch : 11th June'18
GNT 98490 03166, VJA 91105 88864

స్కాలర్స్ RRB గుంటూరు
Every Week New Batch RPF
Physical Events కు శిక్షణ
Batch Starts on 11-06-2018
ALP / Technician, GROUP-D
Online Exams మా ప్రత్యేకత
90003 36584

షైన్ ఇండియా అకాడమీ
APPSC GROUP-II
11th June కొత్త బ్యాచ్ ప్రారంభం
95731 93746

ఇతర శాఖల పనులు చెబుతూనే ఉన్నారు!

- రెవెన్యూ ఉద్యోగుల ఆవేదన
- ప్రత్యేక స్కేలు ఇవ్వాలని విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: రెవెన్యూ ఉద్యోగులకు ఇతర పనులను అప్పగించొద్దని ఉత్తర్వులు వెలువడినప్పటికీ కొన్ని జిల్లాల కలెక్టర్లు పట్టించుకోవడంలేదని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం ఆవేదన వ్యక్తంచేసింది. ఈ సంఘం కార్యవర్గ సమావేశం విజయవాడలో శనివారం జరిగింది. అనంతరం సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అంజిప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు ఎం.వి.రమణ, ఇతర నాయకులు కృష్ణమూర్తి, కేశవనాయుడు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ "రెవెన్యూ ఉద్యోగులుగా ఉన్నా...జిల్లాల్లో ఇతర శాఖల పనులకు తామే హాజరుకావాల్సి వస్తోంది. రెవెన్యూ శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భూదార్' విధులకు హాజరవుతున్నా, జిల్లాల కలెక్టర్లు ఇతర శాఖల పనులను అప్పగిస్తూనే ఉన్నారు. ఇలా చేయవద్దని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు జారీచేసినా ఫలితం కనిపించడంలేదు. వీడియో కాన్ఫరెన్సులు, టెలిఫోన్ సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల రెవెన్యూ శాఖ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. 35 నుంచి 40 శాఖల పనులను చేస్తోన్న రెవెన్యూ ఉద్యోగులకు ప్రత్యేక స్కేలు ఇవ్వాలని కోరుతూనే ఉన్నా పరిగణనలోనికి తీసుకోవడంలేదు. కనీసం 11వ పీఆర్సీ ద్వారానైనా తమ డిమాండ్‌కు సానుకూలత లభిస్తుంది' అని ఆశాభావం వ్యక్తంచేశారు.

జనసేన పోరాట యాత్రకు విరామం

విశాఖపట్నం(సాగర్‌నగర్), న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోరాట యాత్రకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కొద్దిరోజుల పాటు విరామం ప్రకటించారని ఆ పార్టీ మీడియా విభాగాధిపతి పి.హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి సభను ముగించుకుని విశాఖ నగరానికి చేరుకున్న ఆయన శుక్రవారం రాత్రి రుషికొండ ప్రాంతంలోని ఓ ప్రయివేటు రిసార్ట్స్‌లో బస చేశారన్నారు. శనివారం ఉదయం నుంచి విశాఖకు చెందిన పలువురు మేధావులతో సమావేశమయ్యారని తెలిపారు. ఆది, సోమవారాల్లో కూడా ఈ సమావేశాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో వెనుకబాటుతనంపై జనసైనికులకు అవగాహన కల్పించే విషయమై ఒక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా పవన్ కల్యాణ్ వ్యక్తిగత సిబ్బందిలో ముస్లిం సోదరులు ఉన్నందున రంజాన్ పండగ విరామాన్ని ప్రకటించారని వెల్లడించారు. రంజాన్ అనంతరం జనసేన పోరాట యాత్ర విశాఖ జిల్లాలో యథావిధిగా కొనసాగుతుందన్నారు. పవన్‌కల్యాణ్ సోమవారం సాయంత్రం విశాఖ నుంచి హైదరాబాద్ పయనమవుతారని పేర్కొన్నారు.

కుట్రదారులెవరో తెలియజేయండి

- రాష్ట్రం కోసం 10 నిమిషాలు పని చేయండి
- న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు
- భారీగా వరాల ప్రకటన

తెదేపా న్యాయవిభాగం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు – అమరావతి

'రాష్ట్రంలో జరుగుతున్న కుట్ర రాజకీయాలు.. ఇద్దరు కుట్రదారులు.. వారి వెనుక ఉన్న పాత్రధారులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని న్యాయవాదులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. 'కొంత మంది లాలూచీ పడి భాజపాతో చేతులు కలిపారు. శుక్రవారం కోర్టుకు వచ్చి బోనులో నిలబడే వ్యక్తి బయటకు వచ్చి నన్ను తిడతారు.. న్యాయవాదులుగా వీటన్నిటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కార్యాలయాలకే పరిమితం కాకుండా 10 నిమిషాలు రాష్ట్రాభివృద్ధికి కేటాయించాలి. మీ దగ్గరకు వచ్చే కక్షిదారులతోపాటు సొంత ఊళ్లకు వెళ్లినప్పుడు అసలేం జరుగుతుందో వివరించే బాధ్యత తీసుకోవాలి' అని పేర్కొన్నారు. త్వరలోనే హైకోర్టు న్యాయవాదులు అమరావతికి తరలి రావాల్సి ఉంటుందని చెప్పారు. ఉండవల్లిలోని ప్రజా దర్బారు హాలులో తెలుగుదేశం న్యాయ విభాగం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి నక్కా ఆనందబాబు, రాజ్యసభ సభ్యుడు, తెదేపా న్యాయ విభాగం అధ్యక్షుడు కనకమేడల రవీంద్రకుమార్ పాల్గొన్నారు. 'రాబోయే రోజుల్లో 100 శాతం ఆన్‌లైన్ చేస్తాం. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన పని లేకుండా చేస్తా. అక్టోబరు 2 నుంచి భూధార్ వస్తోంది. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్ తేలికవుతుంది. ఇది జరిగితే వివాదాలుండవు. మీరు వేరే కేసులు వెదుక్కోవాలి (నవ్వుతూ). రాబోయే రోజుల్లో విడాకుల కేసులు పెరిగే అవకాశం ఉంది. అలాంటివి రాకూడదని కోరుకుంటున్నా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

న్యాయవాదులకు వరాలు..

- న్యాయవాదులు చనిపోతే బార్ కౌన్సిల్ ఇచ్చే రూ.4 లక్షలు కాకుండా.. ప్రభుత్వం తరపున మరో రూ.4లక్షలు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ జూనియర్ న్యాయవాదులకిచ్చే స్టైపెండ్ రూ.1000 నుంచి రూ.5వేలకు పెంపు.

> '1995 – 2004 మధ్య రాష్ట్రంలో రెడ్‌అలర్ట్.. నేను హైదరాబాద్‌లో హెలికాప్టర్ ఎక్కానంటే.. నేరుగా ఏదో ఒక కార్యాయానికి వెళ్లేవాడిని. మొన్నీ మధ్య వచ్చిన సినిమా (భరత్ అనే నేను) 2004 లోనే నేను చూపించా.. కార్యాలయాలకు వెళ్లి దుమ్ము దులిపిస్తే.. వారి ముఖంపైనే పడేది. మురుగు కాల్వల్లో దింపి కష్టం ఎలా ఉంటుందో తెలియజేశా. సచివాలయంలో ఉమ్మి వేస్తే బకెట్లతో నీళ్లు తెప్పించి కడిగించా.. అన్నీ చేస్తే 2004లో అంతా కలిసి నాపై పడ్డారు. (నవ్వుతూ..)'
>
> *- ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు*

- ఎస్సీ, ఎస్టీ, బీసీ జూనియర్ న్యాయవాదుల పుస్తకాల కొనుగోలుకు రూ.20వేలు
- జర్నలిస్టుల తరహాలోనే ఆరోగ్య కార్డులు.
- అకాడమీ ఏర్పాటు చేసి కొత్తవారికి శిక్షణ.
- నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం, న్యాయ విజ్ఞాన పరిషత్తు ఏర్పాటు.
- అర్బన్ హౌసింగ్ కింద పట్టణాల్లో ఒకే చోట ఇళ్లు.
- అదనపు పీపీలకు రూ.30వేల నుంచి రూ.40వేలకు, ఏజీపీలకు రూ.20వేల నుంచి రూ.30వేలకు, జీపీలకు రూ.30వేల నుంచి రూ.50వేలకు వేతనం పెంపు.
- పార్ట్‌టైమ్ ఏపీపీలకు బయోమెట్రిక్ నుంచి మినహాయింపు.

న్యాయవాదుల సూచనలు

- చిన్న సమస్యలూ పరిష్కరించడం లేదు. కాకినాడలో కుక్కల సమస్య అలాంటిదే.
- ఎస్సై, సీఐలు స్టేషన్ బెయిలు ఇచ్చే విధానం రద్దు చేయాలి.

పర్యాటకానికి సరికొత్త కళ

ఈనాడు డిజిటల్, అమరావతి: పట్టిసీమ ప్రాజెక్టు వద్ద 5 జోన్లలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. విశాఖ, తిరుపతి, కాకినాడ, విజయవాడతోపాటు ఇతర ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన పలు ప్రాజెక్టులకు సూత్రప్రాయంగా అంగీకరించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ మండలి నాలుగో సమావేశం సీఎం అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగింది. పర్యాటక రంగ అభివృద్ధిలో సర్కారుపై భారం పడకుండా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)లో పెట్టుబడులుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి రెవెన్యూ వాటా ఉండేలా, లీజు పద్ధతిన ప్రభుత్వానికి చెల్లించేలా ఉండాలని సూచించారు.

ఆమోదం తెలిపిన ప్రతిపాదనలివి

- ★ పట్టిసీమ వద్ద 120 ఎకరాల్లో హోటళ్లు, గోల్ఫ్ కోర్టులు, నదీ తీరం ఒడ్డున పర్యాటకులు సేద తీరేలా (రివర్‌ఫ్రంట్) ప్రత్యేక ఏర్పాట్లు.
- ★ విశాఖపట్నం- తిరుపతి నగరాల్లో ప్రస్తుతమున్న శిల్పారామాల అభివృద్ధి.
- ★ గుంటూరులో కొత్తగా శిల్పారామం.
- ★ విశాఖ సముద్ర తీరానికి ఆనుకుని ఒకటిన్నర ఎకరాల్లో అమ్యూజ్‌మెంట్ పైర్. ఆంగ్ల అక్షరం 'వీ' ఆకారంలో గట్టు నుంచి సముద్రంలోకి ఉండేలా నిర్మాణం.
- ★ కృష్ణా జిల్లా ఆత్మకూరులోని సీ.కె.కన్వెన్షన్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో హోటల్.
- ★ కాకినాడలో జీ-సెంటర్.
- ★ ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద స్కైవాక్‌పై అధ్యయనం.

దిల్లీలో భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతం

ఈనాడు, దిల్లీ: అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని దిల్లీలో అంగరంగవైభవంగా నిర్వహించారు. శనివారమిక్కడ గోల్‌మార్కెట్‌లోని తితిదే శ్రీవారి ఆలయంలో అన్నవరం దేవస్థానం సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమానికి వందలాది మంది దంపతులు విచ్చేసి భక్తిశ్రద్ధలతో స్వామి వారి వ్రతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు అన్నవరం సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.

www.bfitdoon.com BFIT GROUP OF INSTITUTIONS DEHRADUN INDIA

BEST-IN-CLASS HIGHER EDUCATION WELL WITHIN YOUR REACH

SCHOOL OF POLYTECHNIC- SOP Diploma Engineering 10th PASS Fee/Annum

Civil • Mechanical • Electronics • Electrical • Computer Sc. ₹ 35,000

Lateral Entry in all Diploma Courses (10+2 PCM/ITI) ₹ 35,000

AFFILIATED TO UBTER & APPROVED BY AICTE, MINISTRY OF HRD, GOVT. OF INDIA

HNBGU CENTRAL GOVT. UNIVERSITY REGULAR DEGREE COURSES

(University Established since 1973, UGC Recognised, Ministry of HRD, NAAC 'A' Accredited University)

UG Courses	Fee/Annum	PG Courses	Fee/Annum
SCHOOL OF LIFE & ALLIED SCIENCES- SLAS			
B.Sc. (BioTech./Micro Bio)	₹ 40,000	M.Sc. (Micro Bio/Bio Tech)	₹ 55,000
B.Sc. (Geology)	₹ 40,000	M.Sc. (Geology)	₹ 49,500
B.Sc. (Eco/Statistics)	₹ 31,000	M.Sc. (Statistics)	₹ 39,500
B.Sc. (PCM/CBZ)	₹ 28,000	M.Sc. (Chem./Zoology)	₹ 45,000
B.Sc. (Home Sc.)	₹ 30,000	M.Sc. (Phys./Botany)	₹ 40,000
		M.Sc. (Bio Chemistry)	₹ 49,500
		M.Sc. (EVS/Math.)	₹ 35,000
SCHOOL OF AGRICULTURE SCIENCES- SAS			
B.Sc. (Agriculture)	₹ 59,500	M.Sc. (Agri./Agronomy)	₹ 59,500
B.Sc. (Forestry/Horticulture)	₹ 49,500	M.Sc. (Ag./Seed Sc.&Tech)	₹ 59,500
		M.Sc. (Horticulture/Forestry)	₹ 50,000
SCHOOL OF MANAGEMENT STUDIES- SMS			
BHM (Bachelor Hotel Mgmt.)	₹ 59,500	M.Com.	₹ 39,500
B.B.A.	₹ 45,000		
B.Com.	₹ 33,000		
B.Com (C.A.)	₹ 35,000		
SCHOOL OF TECHNOLOGY, INFORMATION & COMPUTER SCIENCE- STICS			
B.Sc. (IT)	₹ 31,000	M.Sc. (IT)	₹ 35,000
B.C.A.	₹ 33,000	MCA	₹ 65,000
SCHOOL OF ARTS & JOURNALISM- SAJ			
B.A. (Hons.) Mass Comm.	₹ 40,000	M.A. (Mass Comm.)	₹ 49,500
B.A. (Econ./English)	₹ 28,000	M.A. (Math.)	₹ 35,000
B.A. (Socio./Pol.Sc./Hindi)	₹ 28,000	M.A.(Geography)	₹ 35,000
		M.A.(Eco./Eng./Pol.Sc./Edu.)	₹ 35,000
SCHOOL OF FOOD TECHNOLOGY		BUSINESS SCHOOL	
B.Sc Food Technology	₹ 49,500	MBA (Including Foreign Tour)	₹ 97,500
M.Sc Food Technology	₹ 59,500	APPROVED BY AICTE, MINISTRY OF HRD GOVT. OF INDIA	

AFFILIATED TO UTTARAKHAND TECHNICAL UNIVERSITY- STATE GOVT. UNIVERSITY, GOVT. OF UTTARAKHAND

One Year Certified Course in Hotel Management : ₹ 30,000 Approved Institutions of AHLEI (U.S.A.)

Hostel Fee/Annum : ₹ 50,000 (Inclusive of food, Veg/Non-Veg)

HYDERABAD OFFICE Flat No. 201, 2nd Floor, Konark Tower, Above Konark Diagnostic Center, Dilsukhnagar, CALL- 7456000102

CAMPUS : BFIT GROUP OF INSTITUTIONS, DEHRADUN Sudhowala, Chakrata Road, Dehradun Uttarakhand 248007 Phone : 7300900900, 7300900909, 7300900919, 7300900929

జిప్‌మర్ 2018లో భాష్యం విజయభేరి

గుంటూరు, న్యూస్‌టుడే: జిప్‌మర్ 2018 ఫలితాల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సముద్రాల రిత్విక్ 14వ ర్యాంకు, కె.వినయ్ 42, దాసరి జయాంశు లేఖ 56 వంటి ఆలిండియా ర్యాంకులు సాధించి భాష్యం కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. ఇటీవల ప్రకటించిన నీట్‌లో ఆలిండియా 12, 26, 60 వంటి వందలోపు మూడు ర్యాంకులు సాధించడమే కాకుండా 53.8 శాతం సక్సెస్ రేటుతో భాష్యం ఆలిండియా ఆల్‌టైం బెస్ట్‌గా నిలిచిందన్నారు. భాష్యం మెడిఎయిమ్స్ ప్రోగ్రాం కరిక్యులమే విద్యార్థుల విజయానికి కారణమని పేర్కొన్నారు. ఈ అపూర్వ విజయాలకు కారకులైన భాష్యం మెడెక్స్ ప్రిన్సిపల్ హరిబాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని రామకృష్ణ అభినందించారు.

ప్రకాశంలో నకిలీ రిజిస్ట్రేషన్లతో గ్రానైట్ కంపెనీలు

- గుర్తించిన వాణిజ్యపన్నుల శాఖ

ఈనాడు అమరావతి: ప్రకాశం జిల్లా బల్లికురవలో నకిలీ రిజిస్ట్రేషన్లతో రెండు గ్రానైట్ కంపెనీలు నడుస్తుండడాన్ని వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. ఈ రెండు సంస్థలు తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని, రూ.3 కోట్లమేర లావాదేవీలు జరిపాయి. ప్రభుత్వానికి మాత్రం పన్ను కట్టడంలేదు. దీనిని గుర్తించిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు, విశాఖ జిల్లా పరవాడ మండలం ఈ.బోనంగి ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులోని తిరుపతి ఫ్యూయల్ కంపెనీని వాణిజ్య పన్నుల శాఖ బుధవారం మూసివేసింది. రూ.7.60 కోట్ల అమ్మకం పన్ను బకాయిలు చెల్లించనందుకు ఈ చర్య చేపట్టినట్లు వాణిజ్య పన్నుల శాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

WRITE YOUR SUCCESS STORY WITH INDIA'S LEADING AND MOST VIBRANT CAMPUS

Students from 32+ countries | 300+ Prime Recruiters | 32,000+ Success Stories | More than 13,000+ students in campus | 1300+ Dedicated Faculty | 5 Million sq. ft. built up area

MAHARISHI MARKANDESHWAR (DEEMED TO BE UNIVERSITY) Mullana-Ambala, Haryana

(Established under Section 3 of UGC Act, 1956) (Accredited by NAAC with Grade 'A')

COURSES OFFERED

ENGINEERING | MANAGEMENT | HOTEL MANAGEMENT | COMPUTER APPLICATIONS | BIOTECHNOLOGY | DENTAL | MEDICAL | PARAMEDICAL SCIENCES | PHARMACY | NURSING SCIENCES | COMMERCE | LAW | PHYSIOTHERAPY | AGRICULTURE* | JOURNALISM & MASS COMM* | ARCHITECTURE* | PERFORMING ARTS*

* Courses offered at MMU Sadopur Campus

ASSOCHAM INDIA The Best University of The Year North 2017

NIRF - 2017 & 2018 RANKING Ranked Amongst THE BEST 200 UNIVERSITIES for Two Years in a Row

STARS 1st University in North India to be Awarded QS FIVE STARS Global Rating for Employability, Teaching, Facilities & Social Responsibility

*Conditions Apply

SCHOLARSHIPS*

90% & above-60% of Tuition Fee | 80%-89.99%-40% of Tuition Fee | 70%-79.99%-30% of Tuition Fee

MM(DU) MULLANA, AMBALA - 133 207 (HARYANA) www.mmumullana.org | info@mmumullana.org ADMISSION HELPLINE 1800 274 2240

వైకాపాతో ఎంపీ సీఎం రమేష్ కుమ్మక్కు

- పార్టీని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు
- ప్రొద్దుటూరు తెదేపా బాధ్యుడు వరదరాజులరెడ్డి ఆరోపణలు

వైఎంఆర్ కాలనీ (ప్రొద్దుటూరు), న్యూస్‌టుడే: తెదేపాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ వైకాపాతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని కడప జిల్లా పార్టీలో ముఠాలు ప్రోత్సహిస్తున్నారని అదేపార్టీకి చెందిన ప్రొద్దుటూరు నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. శనివారమిక్కడ పురపాలిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడూ.. ఎంపీ సీఎం రమేష్ వైఖరి వల్ల జిల్లాలో తెదేపా నామరూపాలు లేకుండా పోయే పరిస్థితి తలెత్తిందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన రాజ్యసభ పదవిని అనుభవిస్తూ జిల్లా పార్టీలో గొడవలు సృష్టించటమేమిటని ప్రశ్నించారు. సీఎం రమేష్ పంచాయతీ బోర్డుకు ఎక్కువ... మండలానికి తక్కువ అని ఎద్దేవా చేశారు. నేరుగా ఎన్నికల్లో పాల్గొని గెలిచే సత్తా ఉందా అంటూ ప్రశ్నించారు. బద్వేలు, కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటి, కమలాపురం, రైల్వే కోడూరు నియోజకవర్గ పార్టీలో ముఠాలను ఏర్పాటు చేసి తెదేపాలో చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వంలో చేసిన కాంట్రాక్టులకు సంబంధించిన బిల్లులు ఆగిపోతే.. వై.ఎస్. హయాంలో జగన్‌కు ముడుపులిచ్చి రమేష్ బిల్లులు చేయించుకున్నారని పేర్కొన్నారు. కుందూ పెన్నా కాల్వ విషయంలో తనకు 5 శాతం కమీషన్లు ఇవ్వాలని సీఎం రమేష్ డిమాండు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బ్యాంకుల్లో తప్పుడు తనఖా పత్రాలు పెట్టి కోట్లాది రూపాయలు తెచ్చుకున్న విషయం అందరికీ తెలుసన్నారు. గ్రూపు రాజకీయాలతో పార్టీని దెబ్బతీస్తున్న రమేష్‌పై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తీర్మానం.. పార్టీ వ్యతిరేకం: ప్రొద్దుటూరు పురపాలిక పార్కులో నీళ్ల ట్యాంకు నిర్మాణానికి మూడు నెలల క్రితమే కమిషనర్ పబ్లిక్ హెల్త్‌శాఖకు లిఖిత పూర్వక ఉత్తర్వులిచ్చారని.. దీనికి వ్యతిరేకంగా తీర్మానం చేయించడంలో సీఎం రమేష్ కీలక పాత్ర పోషించారని వరదరాజులరెడ్డి ఆరోపించారు. వైకాపాకు చెందిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఈ ట్యాంకు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారని దీనికి సీఎం రమేష్ వర్గం మద్దతు పలకటమేంటని వరద ప్రశ్నించారు.

స్విమ్స్ వర్సిటీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి, న్యూస్‌టుడే: శ్రీ వేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) వర్సిటీలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ఆన్‌లైన్ సెంటర్లలో లభ్యమవుతాయని ఉపకులపతి డాక్టర్ టి.ఎస్.రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తిరుపతిలోని ఎస్వీ వర్సిటీ ప్రాంగణంలో ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఇంటర్ హాల్‌టికెట్, మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, స్పెషల్ కేటగిరి(ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్‌సీ) తదితర ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్లాలన్నారు. ఈ నెల 15 దరఖాస్తు సమర్పణకు ఆఖరు తేదీగా పేర్కొన్నారు.

13, 14 తేదీల్లో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఈ నెల 13, 14 తేదీల్లో వెల్లడించే అవకాశం ఉంది. ఇంటర్‌లో అనుత్తీర్ణులైన వారికి ఏడాది నష్టపోకుండా ఉండేందుకు ఇంటర్ విద్యామండలి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ నిర్వహిస్తోంది. దాదాపు 8వేల మంది విద్యార్థులు ఎంసెట్‌లో అర్హత సాధించినప్పటికీ ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఇలాంటివారు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఎంసెట్ ర్యాంకులు ప్రకటిస్తారు.

ఆగస్టు 4న ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం

వేంపల్లె, న్యూస్‌టుడే: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ నాలుగో స్నాతకోత్సవం ఆగస్టు 4న జరుగుతుందని పరిపాలనాధికారి అమరేంద్రకుమార్ శనివారం తెలిపారు. 2017-18 విద్యా సంవత్సరంలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసుకున్న అర్హులైన విద్యార్థులంతా ఈ నెల 10 నుంచి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీఆర్‌కేవీ.ఏసీ.ఇన్ వెబ్‌పేజీ లింకు ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి స్నాతకోత్సవంలో ఇంజినీరింగ్ పట్టాలు పంపిణీ చేస్తామన్నారు.

MBBS

Ministry Of Health Of Russia

SMOLENSK STATE MEDICAL UNIVERSITY

Invites Indian students for direct Government Admissions

Recognized by India, WHO, USA & UK, Min. Qual.-50% in XII in PCB

UNIVERSITY- Founded in 1920, Very high standards of education, English Medium in all years, 1050 Indian students (430 Girls) studying, 126 getting degree in 2018 Closed campus, 8 hospitals (6000 Beds).

MCI SCREENING TEST- Our graduates of 2008 to 2017 have given BEST results among graduates of all foreign medical colleges (Official web sites of Indian Embassy, Moscow and NBE, New Delhi who conducts Screening Test confirm this).

HOSTELS- 2 and 4 seated big rooms, separate blocks for boys and girls.

INDIAN MESS - Mess with Indian food cooked by Indian cooks.

Fee (Tuition+Hostel+Med.Ins.) - USD 6000/year (App. Rs. 4,00,000/-) and one time payment of Rs.1,50,000/- (By Bank Draft only) which includes – Admission, student visa fee, air ticket Delhi - Moscow.

Bank loans are available. Scholarship for topper students.

Contact: Dr. Aeron, Tel: Russia +79605805555

Official Internet Site:www.sgmu.info

Information Centers in A.P. (Parents of Students)

Vijayawada: Mr. Naga Babu Chennu – 9912061976

Vishakhapatnam: Mr. Paparao Bandi - 9441575976

Kakinada: Mr. Paparao Bandi – 9441575976

Tirupati: Mrs. M. Sujatha Naidu - 9491772471

ఒక్కో సీటుకు 14 మంది పోటీ!

- 4 వేల సీట్లకు 56,692 మంది ఆశావహులు
- ముగిసిన దరఖాస్తు గడువు
- ట్రిపుల్‌ఐటీల్లో అన్ని జిల్లాలకు సమన్యాయం

వేంపల్లె, నూజివీడు, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని 4ట్రిపుల్ ఐటీల్లో ఉన్న 4వేల సీట్ల కోసం 56,692 మంది విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ఒక్కో దాంట్లో 1000 సీట్లున్నాయి. మొత్తం 56,692 మందిలో 27,437 మంది బాలురు, 29,255 మంది బాలికలున్నారు. ఒక్కో సీటుకు 14 మందికి పైగా పోటీ పడుతున్నారు. గత ఏడాది 40,357 మంది దరఖాస్తు చేసుకున్నారు. 13 జిల్లాల విద్యార్థులకు సమానంగా సీట్లు ఇవ్వాలని వర్సిటీ అధికారులు నిర్ణయించారు. గత ఏడాది నుంచి ఈ విధానం అమల్లో ఉంది. 4వేల సీట్లలో ఓపెన్ మెరిట్ కింద 600 సీట్లను స్థానికేతరులు, తెలంగాణ, ఎన్‌ఆర్‌ఐలు, తదితరులకు కేటాయిస్తారు. మిగిలిన 3400 సీట్లను 13 జిల్లాల వారికి సమానంగా కేటాయిస్తారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారిలో 3,446 మంది పదికి పది జీపీఏ సాధించారు. తర్వాత 9.8, 9.7 జీపీఏ సాధించినవారు వేలల్లో ఉన్నారు. వీరు దరఖాస్తు చేసుకుంటే వెనుకబాటు సూచీగా 0.4 జీపీఏ అదనంగా కలుపుతారు. వర్గాలవారీ రిజర్వేషన్లు ఉన్నాయి.

నూజివీడులో ప్రవేశాల ఎంపిక జాబితా తయారీ

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాల కోసం ఎంపికయ్యే జాబితా తయారీలో ట్రిపుల ఐటీ అధికారులు తలమునకలయ్యారు. నాలుగు ట్రిపుల్ ఐటీల సిబ్బంది నూజివీడు ట్రిపుల్ ఐటీకి వెళ్లి అక్కడే దరఖాస్తులను వడపోస్తున్నారు.

26న తొలి ప్రవేశాల జాబితా

ఎంపికయ్యే మొదటి విడత విద్యార్థుల జాబితాను ఈ నెల 26న ప్రకటించనున్నారు. ఆరోజే ప్రవేశాల జాబితాను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఎన్‌సీసీ, దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, క్రీడా కోటా దరఖాస్తులను ఈ నెల 13 నుంచి 19 వరకూ నూజివీడు ట్రిపుల్ ఐటీకి విద్యార్థులను పిలిపించుకుని పరిశీలిస్తారు. ఈ నెల 13, 14, 16, 18 తేదీలలో ఎన్‌సీసీ కోటా విద్యార్థులు, 18, 19 తేదీలలో క్రీడల కోటా విద్యార్థులను, 19న దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లల దరఖాస్తులను పరిశీలించనున్నట్లు ఆర్జీయూకేటీ ప్రవేశాల విభాగం కన్వీనర్ గోపాల్‌రాజు తెలిపారు.

డీసెట్‌లో అర్హత మార్కుల తగ్గింపు..!

- ఫలితాల వెల్లడిలో జాప్యం

ఈనాడు, అమరావతి: డీసెట్‌లో అర్హుల సంఖ్య తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాదీ అర్హత మార్కులు తగ్గించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. గత రెండేళ్లుగా ప్రవేశ పరీక్షలో అర్హుల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో మార్కులను తగ్గిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది డీసెట్‌కు 62,907మంది దరఖాస్తు చేయగా వీరిలో 52,936 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 22 శాతం మేరకే అర్హత సాధించినట్లు సమాచారం. ప్రవేశ పరీక్షలో అర్హుల సంఖ్య తగ్గిన నేపథ్యంలో ఫలితాల్ని ఇంతవరకు వెల్లడించలేదు.

గత రెండేళ్లుగా అర్హుల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఓసీ, బీసీలకు 35మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి అర్హత మార్కులు లేకుండానే ప్రవేశాలు కల్పించేలా పాత ఉత్తర్వులకు సవరణ తీసుకొస్తున్నారు. దీని ప్రకారం సుమారు 45వేలు మంది అర్హత సాధించే అవకాశం ఉంది. రాష్ట్రంలో 200కుపైగా డీఈడీ కళాశాలలు ఉండగా వీటిల్లో 65వేలు సీట్లు అందుబాటులో ఉన్నాయి. అర్హత మార్కులు తగ్గించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటు యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

KALASALINGAM DEEMED TO BE UNIVERSITY

(Kalasalingam Academy of Research and Education)

HELP LINE NO : 98845 44005 Anand Nagar, Krishnankoil - 626126. Srivilliputtur, Madurai(Via), Tamil Nadu

EXCLUSIVE COUNSELLING & SPOT ADMISSIONS for JEE / EAMCET & NEET RANKERS @ OUR BRANCH OFFICES IN AP & TELANGANA STATE

B.E/ B.Tech. : Aeronautical | Agriculture | Automobile | Chemical | Civil | CSE | ECE | EEE | EIE | IT | Mechanical | B.Arch. |

NAAC A

JEE MAINS

RANK	SCHOLARSHIP
1 – 49,999	100 %
50,000 – 99,999	75 %
1,00,000 -1,99,999	50 %
2,00,000 – 2,99,999	25 %
3,00,000 – 3,99,999	10%

AP - EAMCET / TS - EAMCET

RANK	SCHOLARSHIP
1 – 50,000	50 %
50,001 – 1,00,000	25 %
ABOVE 1,00,000	10 %

NEET, BIPC ELIGIBLE COURSES

RANK	SCHOLARSHIP	
1 – 1,99,999	50 %	FOOD TECHNOLOGY, BIOTECHNOLOGY, BIOMEDICAL ENGINEERING
NEET QUALIFIED	25 %	

MEET OUR COUNCELLORS ON : 10, 11, 12 & 13th JUNE

VIJAYAWADA	GUNTUR	NELLORE	ONGOLE	BHIMAVARAM
Brundavan colony Labbipet	Arundel pet opp: South Indian shopping mall road	Akkaha vari veedhi Fathekhanpet	Near Sai Baba Tiles South Bypass Road	C/O.Surya skin care hospital, BJP Road
9985 351 112	8096 206 457	8374 968 823	90870 86089	9019 991 555

B.Tech - CSE For Speech & Hearing Impaired, First of its Kind in Asia

1524+ Placement Offers | 352+ Multiple Offers | 84 Company Visits

ఈనాడు

మనోవికాస మంత్రం

'నేనొక దేశానికి ప్రధానమంత్రిని మాత్రమే. కానీ మీరు సంగీత రసజగత్తుకే సామ్రాజ్ఞి' అన్నారు జవహర్‌లాల్ నెహ్రూ- గంధర్వ గాయని ఎం.ఎస్.సుబ్బులక్ష్మితో! చాచాజీ మాటలు సంగీతప్రియుల గుండెచప్పుళ్లకు ప్రతిధ్వనులు. 'సంగీత సాహిత్యాలు- సరస్వతీదేవి స్తనద్వయం నుంచి జాలువారే అమృతధారలు' అని పెద్దలు వివరించారు. సంగీతం ఆపాత మధురం, సాహిత్యం ఆలోచనామృతం అని తేల్చారు. వీటిలో సంగీతం మాత్రం 'గంధర్వవిద్య'గా గుర్తింపు పొందింది. 'గాంధర్వేచ భువిశ్రేష్ఠో బభూవ భరతాగ్రజః- గంధర్వ విద్యా ప్రవీణుల్లో రాముడు సర్వశ్రేష్ఠుడు' అన్నారు వాల్మీకి మహర్షి. అలాంటి సంగీత విద్వాంసులను స్మరిస్తూ 'సామగానలోల మనసిజ లావణ్య ధన్య మూర్ధన్యులైన వారెందరో మహానుభావులు' అంటూ త్యాగరాజస్వామివారు అంజలి ఘటించారు. అష్టదిగ్గజ కవుల్లో ఒకడిగా గుర్తింపు కలిగిన రామరాజ భూషణుడు 'సంగీత కళానిధి'గానూ పేరుపొందాడు. తన వసుచరిత్రలో 'వీనులవిందై అమృతపు సోనల పొందై అమంద సుమచల దళినీ గానము క్రిందై ఆ రవము(ధ్వని) ఆనంద బ్రహ్మమయిన అధిపతి దెలిపెన్' అంటూ సంగీతానుభవాన్ని- వేదాంతాల్లో వినవచ్చే 'ఆత్మానంద సబ్రహ్మచారి అయిన ఆనందం'తో పోల్చి చెప్పాడు. సమర్థుడైన విద్వాంసుడి సంగీత పాటవం 'శ్రుతి పుటాంతః ప్రీణనామందమై తనరున్ మంజులగానము...' చెవులను దాటివెళ్లి ఎక్కడో ఆత్మలోకాల్లో ఆనందానుభూతులను రేకెత్తిస్తుందని కవులు వెల్లడించారు. మన సంప్రదాయ సంగీతం ఈ దేశ సాంస్కృతిక సౌభాగ్యానికి దోహదకారి. పుష్పగిరి తిమ్మన తన సమీరకుమారవిజయంలో చెప్పినట్లు 'శ్రోతల దహరాకాశం(హృదయాకాశం)లో ఓంకార సృజన బ్రహ్మ స్వరూపం' ఆవిష్కరించగల సామర్థ్యం మన శాస్త్రీయ సంగీతానికి ఉంది. ఈ దేశం చేసుకొన్న పుణ్యాల్లో అదొకటి!

సంగీత మాధుర్యం కేవలం రసజ్ఞులకే పరిమితం కాదు- శిశువులను, పశువులను, పాములను సైతం ఆకట్టుకొంటుందని 'శిశుర్వేత్తి-పశుర్వేత్తి...' అనే ప్రసిద్ధ శ్లోకం వివరించింది. హిరణ్యకశిపుడి తపస్సును భగ్నం చేసేందుకై ఇంద్రుడు పంపించిన అప్సరస పాట పాడితే- అమృతపు జడివాన కురిసినట్లు అయి, ఎండిపోయిన చెట్ల మోడులు తిరిగి చివురించాయి... 'పాట చెన్నున(మాధుర్యానికి) మోరళ్ల చివురులొత్తె' అని నృసింహ పురాణంలో ఎర్రన వర్ణించాడు. సకల చరాచర జగత్తును సమ్మోహితం చేసే శక్తి సంగీతానికి ఉందనేది ఈ వర్ణనల సారాంశం. భట్టుమూర్తి ఆ మాటను బలపరుస్తూ 'అచేతనంబులు చేతన రీతిన్ తనరన్, చేతనంబులు అచేతన భాతిన్ ఒనరె' రాయిరప్పా వంటివి కరిగిపోతుంటే చైతన్యం కలిగిన శ్రోతలు దాని మాధుర్యంలో మునిగి నిశ్చేష్టులుగా మారిపోతున్నారని చమత్కరించాడు. 'అనురాగాంకుర కందమై... కృతమనోబ్జ ఆనందమై... నూతన సంజాత మరందమై' అలరారే సుమధుర సంగీతం నలుపు తెలుపు మనుగడకు ఇంద్రధనుస్సు రంగులను తెచ్చి అద్దుతుంది. ఏకాకితనాన్ని, వెలితిని దూరం చేస్తుంది. సంగీతం- చేదు బతుక్కి చక్కని సాంత్వన; మనిషికి గొప్ప ఆలంబన. పాశ్చాత్యులు సంగీతాన్ని ప్రపంచ భాషగా పేర్కొనడంలోని రహస్యం అదే! దానికి ప్రాంతీయ భాషాభేదాలు లేవు. పదిమందిలో ఉన్నా ఏకాంతంలోకి, ఏకాంతంలో ఉన్న మనిషిని తనలోకి ఆకర్షించే బలమైన అయస్కాంతం- సంగీతం! 'సంగీతం, ప్రార్థన... రెండూ నన్ను క్షణాల్లో తమ అధీనంలోకి తీసుకుంటాయి... ఇక ప్రపంచం నాకు పట్టదు' అన్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి మాటలకు అర్థం అదే. మనం సైతం అలాంటి అలౌకిక సంగీత అనుభూతులకు లోనుకావచ్చునని అనుభవజ్ఞులు చెబుతారు.

కృష్ణానదీ తీరాన ఒకానొక చల్లని సాయంసంధ్యలో పచార్లు చేస్తూ కవిసమ్రాట్ విశ్వనాథ, 'నా శరీరమందు అవతళించిన గాలి ఎంత పౌరాతన్య మేచుకొనెనో!' అని మురిసిపోయారు. దేహానికి తాకుతున్న గాలి ప్రాచీనత ఎంతటిదో మనసుకు మాత్రమే తెలుస్తుంది. అలా మనసును తాకే పురాతన అనుభూతి స్పర్శను 'అనురణన సౌందర్య స్పర్శ'గా చెబుతారు. 'శాంతము లేక సౌఖ్యము లేదు, సారస దళనయన' తరహా త్యాగరాజ కృతినో, 'వినరో భాగ్యము విష్ణుకథ' అన్న అన్నమయ్య కీర్తననో ఆలకిస్తుంటే- పురాతనం ప్రాచీనత లాంటి అపురూపమైన అనుభూతులు సంగీతం ద్వారా హృదయాన్ని ఆవరిస్తాయి. ఏవేవో తీపి జ్ఞాపకాలను పెళ్లగిస్తాయి. మధుర గాయాలను రేపుతాయి. చిన్నప్పుడు విన్న కొన్ని సినిమా పాటలు సైతం అప్పుడప్పుడూ గుండెపొరలను కదిలించడం మనందరికీ అనుభవమే! ఆ పాటతో ముడివడిన తీపి, చేదు జ్ఞాపకాలన్నీ పొరలు పొరలుగా తోసుకురావడాన్నే పెద్దలు అనురణన సౌందర్యంగానూ, విశ్వనాథ పౌరాతన్యంగానూ పేర్కొన్నారు. ఈ జ్ఞాపకాల సంగతి ఎలా ఉన్నా, పసితనంలో సంగీతం నేర్పించడం వల్ల పిల్లలకు జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుందని నెదర్లాండ్స్‌లోని వి.యు.అమెస్టర్ డాం విశ్వవిద్యాలయ పరిశోధనల్లో వెల్లడైంది. చదువుల్లో చురుకుదనం, మానవ నైపుణ్యాల పెరుగుదలను సంగీత సాధన మెరుగుపరుస్తోందట. 'సంగీత జ్ఞానము, భక్తి వినా సన్మార్గము కలదె ఓ మనసా!' అని త్యాగరాజస్వామి ఏనాడో చెప్పిన మాట ఇప్పుడు కొత్త అర్థాలను స్ఫురింపజేస్తోంది. విద్యారంగంలో పిల్లలు విజేతలుగా మారడానికి సంగీతం దోహదకారి కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మన పిల్లలు రేపెప్పుడో 'పెరిగెను స్వరశాస్త్రంబున, స్థిరమయ్యెను ధారణమ్ము చిత్తము నిలిచెన్ వరమైన విద్యలన్నియు కరతలమున చేరిపోయె, గానము తోడన్' అని చెప్పుకోవాలంటే- వారికి బాల్యంలోనే మనం సంగీతం నేర్పించాలి మరి!



పట్టాలకు ఎక్కని బినామీ చట్టం

నల్లధనాన్ని నిర్మూలిస్తానని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి పీఠం అధిష్ఠించాక అందుకు కీలక చర్యలు తీసుకున్నారు. 2016 నవంబరులో పెద్దనోట్లు రద్దు చేసి, అదే నెలలో బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టానికి కార్యరూపం ఇచ్చారు. నిజానికి నల్లధన నిరోధానికి 1988లోనే బినామీ లావాదేవీల చట్టం తెచ్చారు. 2015లో దానికి సవరణలు చేసి, 2016లో లాంఛనంగా అమలులోకి తీసుకొచ్చారు. బినామీ లావాదేవీలకు కొత్త నిర్వచనం ఇవ్వడం, బినామీ లావాదేవీల పని పట్టడానికి న్యాయ నిర్ణయాధికార సంస్థను, అప్పిలేట్ ట్రైబ్యునల్‌నూ నెలకొల్పడం, బినామీ లావాదేవీలకు పాల్పడినవారికి శిక్షలు నిర్ణయించడం- 2015నాటి సవరణల సారాంశం. బినామీ ఆస్తులను మొదట జప్తు చేసుకుని న్యాయనిర్ణయం తరవాత శాశ్వతంగా స్వాధీనం చేసుకునే అధికారాన్ని ప్రభుత్వానికి ఈ చట్టం దఖలుపరుస్తోంది. వాస్తవ లబ్ధిదారుడు, బినామీదారుడు, బినామీ లావాదేవీల సూత్రధారి- వీరందరికీ ఏడేళ్ల జైలుశిక్ష, బినామీ ఆస్తి మార్కెట్ విలువలో 25 శాతం మేరకు జరిమానా విధించే అధికారాన్నీ కల్పిస్తోంది. బాలారిష్టాలు దాటుకుని ఈ చట్టం 2016లో అమలులోకి వచ్చినా ఆచరణలో అది చతికిలబడింది. బినామీలను, నల్లధనాన్ని అరికడతానంటూ మోదీ ఇచ్చిన హామీ నీటి బుడగగా మిగిలే ప్రమాదం కనబడుతోంది. దీన్ని నివారించాలంటే ప్రభుత్వం తక్షణ కార్యాచరణకు దిగాలి.

నిర్ణయాల్లో ఆలస్యం

వాస్తవంలో ఆదాయ పన్ను శాఖ బినామీ ఆస్తుల స్వాధీనానికి దూకుడుగానే ముందుకెళ్లింది. ఇంతవరకు బినామీ చట్టం కింద దాదాపు 900 లోపు ఆస్తులను జప్తు చేసుకున్నట్లు గత జనవరిలో ప్రకటించింది. వాటి విలువ రూ.3,500 కోట్లు. ఈ ఆస్తుల్లో అపార్ట్‌మెంట్లు, దుకాణాలు, నగలు, వాహనాలు కూడా ఉన్నాయి. అయిదు కేసుల్లో రూ.150 కోట్ల విలువైన ఆస్తుల తాత్కాలిక జప్తునకు నల్ల ధన చలామణీ నిరోధ చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఏర్పరచిన న్యాయనిర్ణయాధికార సంస్థ అనుమతించింది. మరో కేసులో ఒక స్థిరాస్తి సంస్థ రూ.110 కోట్ల విలువైన 50 ఎకరాల భూమిని బినామీల పేర్ల మీద సేకరించింది. ఆ స్థిరాస్తి సంస్థ చట్టబద్ధంగా నమోదైనది కాదు. భూ విక్రేతలు, బ్రోకర్ల నుంచి వివరాలు తెలుసుకున్న మీదట ఆదాయ పన్ను శాఖ సదరు భూములను జప్తు చేసుకుంది. పెద్దనోట్లు రద్దయ్యాక ఇద్దరు పన్ను చెల్లింపుదారుల సంస్థలు తమ దగ్గరున్న రద్దయిన నోట్లను ఉద్యోగుల పేరిట, సహచరుల పేరిట వివిధ బ్యాంకుల్లో జమ చేయించాయి. తరవాత ఆ డబ్బును సొంత ఖాతాల్లోకి మార్చుకున్నాయి. ఇలా చేతులు మారిన మొత్తం రూ.39 కోట్లు. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ వంటి బడా వ్యాపారులు, అవినీతిపరులైన అధికారులు సంపాదించిన బినామీ ఆస్తులు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం వీటిని స్వాధీనం చేసుకోవాలన్నదే ప్రజల అభిమతం కూడా. అందుకు ఒక పద్ధతీ క్రమం ఉండాలని బినామీ చట్టాన్ని తెచ్చారు. దాని కింద ఆదాయ పన్ను శాఖ దేశమంతటా 24 బినామీ ఆస్తుల యూనిట్లను నెలకొల్పింది. గత ఏడాది చివరి వరకు 550 ఆస్తులను జప్తు చేసుకుని, 530 జప్తు నోటీసులు ఇచ్చింది.

కానీ, ప్రభుత్వ అలసత్వం వల్ల ఆదాయ పన్ను శాఖ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరయ్యేలా ఉంది. ఆదాయ పన్ను శాఖ సక్రమంగా ఆస్తులు జప్తు చేసిందో లేదో నిర్ధారించడానికి ప్రభుత్వం బినామీ చట్టం కింద స్వతంత్ర త్రిసభ్య న్యాయ నిర్ణయాధికార సంస్థను ఏర్పరచాల్సి ఉంది. చట్టం చేసి ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకు అలాంటి సంస్థ నెలకొనకపోవడంతో కోట్ల రూపాయల విలువైన 780 బినామీ ఆస్తుల జప్తు చెల్లుబాటు కాకుండా పోయే ప్రమాదం ఉంది. బినామీ చట్టం కింద న్యాయనిర్ణయాధికార సంస్థ ఏర్పాటు కాకపోవడంతో అది చేయాల్సిన పనులను నల్ల ధన చలామణీ నిరోధ చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఏర్పరచిన న్యాయ నిర్ణయాధికార సంస్థకు తాత్కాలిక ప్రాతిపదికన అప్పగించారు. పీఎంఎల్‌ఏను అమలు చేసే బాధ్యత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) భుజస్కంధాలపై ఉంది. బినామీ ఆస్తుల జప్తునకు సంబంధించిన 860 కేసులను

నిష్క్రియాపరత్వం ఎంత కాలం?

ఆదాయ పన్ను శాఖ పీఎంఎల్‌ఏ న్యాయ నిర్ణయాధికార సంస్థకు పంపగా, వాటిలో 80 కేసులు మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇంకా 780 కేసులు అపరిష్కృతంగా ఉండిపోయాయి. వీటిలో ఘరానా మనుషుల కేసులూ ఉన్నాయి. ఆదాయ పన్ను శాఖ బినామీ ఆస్తుల జప్తునకు నోటీసు ఇచ్చిన సంవత్సరంలోపే ఆ ఉత్తర్వు సక్రమమో కాదో నిర్ధారించాలి. బినామీ చట్టం కింద సొంత న్యాయ నిర్ణయాధికార సంస్థ లేకపోవడం, పీఎంఎల్‌ఏకు చెందిన సంస్థకు పని ఒత్తిడి ఎక్కువైపోవడం వల్ల ఏడాది లోపల జప్తుల నిర్ధారణ జరగడం లేదు. ఏడాది గడువు దాటిపోతే ఆస్తుల జప్తు చెల్లుబాటు కాకుండా పోవచ్చు. ఈ

లాలు కుటుంబ నిర్వాకం

ఆదాయ పన్ను శాఖ 2017లో రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలు ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు జప్తు చేయడానికి నోటీసు ఇచ్చింది. లాలు, ఆయన కుటుంబ సభ్యులు ఏబీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ మాటున బినామీ ఆస్తులు సంపాదించారన్నది ఆదాయ పన్ను శాఖ అభియోగం. దిల్లీ, బిహార్‌లలో లాలు కుటుంబానికి చెందిన డజను స్థలాలు, భవనాలను జప్తు చేసుకుంది. ఈ బినామీ ఆస్తుల విలువ రూ.9.32 కోట్లుగా చూపినా, వాటి మార్కెట్ విలువ రూ.180 కోట్లని అంచనా. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ పట్నాలో లాలు కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌కు చెందిన మరో బినామీ స్థలాన్ని ఆదాయ పన్ను శాఖ జప్తు చేసుకుంది. లాలు మాదిరిగా బినామీ ఆస్తులు కూడబెట్టిన రాజకీయ నాయకులు మరెందరో ఉన్నారు.

అసలు ఈ సంస్థ ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అధ్యక్షుడు లేకుండానే పనిచేస్తోంది. అంతకు ఒకరోజు ముందే సంస్థ అధ్యక్షుడు పదవీ విరమణ చేశారు. ఆయన స్థానాన్ని ఇంతవరకు భర్తీ చేయనేలేదు. ఇద్దరు సభ్యులతోనే పీఎంఎల్‌ఏ న్యాయ నిర్ణయాధికార సంస్థ నెట్టుకొస్తోంది. ఈ సంస్థ సభ్యులు, అధ్యక్షుడి సూచనలు, ఆదేశాలను రాసుకోవడానికి, న్యాయపరమైన ఉత్తర్వులను లిఖించడానికీ కోర్టు మాస్టర్లు కూడా లేరు. దిగువ శ్రేణి సిబ్బంది కనీసం తొమ్మిదిమందినైనా నియమించుకోవడానికి అనుమతించాలని కేంద్ర ఆర్థిక శాఖను కోరినా, ప్రయోజనం శూన్యం. బినామీ చట్టం అమలుకు ప్రత్యేక న్యాయ నిర్ణయాధికార సంస్థను నియమించాలని గత సంవత్సరమే సూచించినా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు కూర్చుంది. పీఎంఎల్‌ఏ, బినామీ చట్టాల పరిధిలోకి వచ్చే కేసులన్నింటినీ పరిష్కరించడం తన తలకుమించిన భారమని పీఎంఎల్‌ఏ న్యాయ నిర్ణయాధికార సంస్థ ప్రభుత్వానికి స్పష్టీకరించింది కూడా. పెద్దనోట్ల రద్దు తరవాత అటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇటు ఆదాయ పన్ను శాఖ నుంచి ఈ సంస్థకు కేసుల మీద కేసులు వచ్చి పడుతున్నాయి. ఒకే సంస్థ రెండు చట్టాల పరిధిలోని కేసులను పరిష్కరించడం సాధ్యమయ్యే పని కాదు. బినామీ చట్టం కింద ప్రతి కేసునూ ఇద్దరు సభ్యులు విచారించాలి. ఆ పని చేయడానికి పీఎంఎల్‌ఏ న్యాయ నిర్ణయాధికార సంస్థ నుంచి సభ్యులను మళ్లించాల్సి వస్తోంది. దీనివల్ల పీఎంఎల్‌ఏ సొంత పని దెబ్బతింటోంది. అసలు నల్లధన చలామణీకి ప్రయత్నించినవారి కేసులే పీఎంఎల్‌ఏ దగ్గర పేరుకుపోయి ఉన్నాయి. వీరి ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసుకున్నది కూడా. ఇలాంటి కేసులు 230కి పైగా పీఎంఎల్‌ఏ న్యాయ నిర్ణయాధికార సంస్థ విచారణలో ఉన్నా, వాటిని విచారించడం ఇంతవరకు వీలుపడటం లేదు. పీఎంఎల్‌ఏ కేసులకే మోక్షం కలిగించలేనప్పుడు, బినామీ ఆస్తుల కేసులను ఎలా విచారించగలమని ఆ సంస్థ ప్రశ్నిస్తోంది. కాబట్టి బినామీ కేసుల పరిష్కారానికి త్వరగా ప్రత్యేక న్యాయ నిర్ణయాధికార సంస్థను నియమించాలని, అది ఏర్పడే లోపు ఆదాయ పన్ను శాఖ నుంచి తాత్కాలిక ప్రాతిపదికపై కొందరు సభ్యులను ఈ పని మీద నియోగించాలని సూచించింది. బినామీ కేసుల న్యాయ నిర్ణయాధికార సంస్థ సభ్యుడిగా నియమితులు కావాలంటే సదరు వ్యక్తి ఆదాయ పన్ను శాఖలో కమిషనర్ హోదాలో పనిచేసి ఉండాలి. లేదా కేంద్ర న్యాయశాఖలో సంయుక్త కార్యదర్శిగానైనా పనిచేసినవారై ఉండాలి. భారత న్యాయ సర్వీసులకు చెందినవారై ఉండాలి. చట్టం ఇంత స్పష్టంగా మార్గదర్శక సూత్రాలను ప్రకటించినా, ప్రభుత్వం ఎందుకు నిష్క్రియగా ఉందో అంతుపట్టడం లేదు. బినామీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక న్యాయ నిర్ణయాధికార సంస్థను ఇప్పటికైనా నెలకొల్పకపోతే నల్లధన నిరోధం చెదరిన స్వప్నంలా మిగిలిపోతుంది!

ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని పీఎంఎల్‌ఏ ఇకపై జప్తు కేసులను తనకు పంపవద్దని, బినామీ చట్టం కింద కొత్త న్యాయనిర్ణయాధికార సంస్థ ఏర్పడే వరకు ఇలాంటి కేసులను ఆదాయ పన్ను శాఖ వద్దే అట్టిపెట్టాలని ఇటీవల కేంద్రాన్ని కోరింది. నిర్ణీత గడువులోగా జప్తు కేసుల చట్టబద్ధతను నిర్ధారించకపోతే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠకు మచ్చ ఏర్పడుతుందని ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు ఒప్పుకొన్నారు. బినామీ ఆస్తుల కేసులతో అనేకమంది ప్రఖ్యాత రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తల పేర్లు ముడివడి ఉన్నాయి. వీటి గురించి సమాచార సాధనాల్లో పెద్దయెత్తున ప్రచారం సాగి, సామాన్య ప్రజల్లో సైతం చర్చలు జరిగాయి. అలాంటప్పుడు ఈ కేసులను చప్పున తేల్చకపోతే, అది ప్రభుత్వ అసమర్థతగా తేలడమే కాదు, ప్రభుత్వాన్ని పరువు నష్టం దావాలు, ఇతర రకాల వ్యాజ్యాలు చుట్టుముట్టే అవకాశం ఉంది. నల్లధన నిరోధానికి కట్టుబడి ఉన్నామంటూ పలు సభల్లో చాటిన ప్రధాని మోదీ, తదనుగుణంగా బినామీ లావాదేవీల నిరోధ చట్టాన్ని తీసుకొచ్చి కూడా, దాన్ని సక్రమంగా అమలు చేయలేకపోవడం ప్రభుత్వానికే ఇబ్బందికరమవుతుంది.

అరకొర సౌకర్యాలు

పోనీ, ఇంతవరకు తాత్కాలిక ప్రాతిపదికపై బినామీ ఆస్తుల జప్తు కేసులను చూస్తున్న పీఎంఎల్‌ఏ న్యాయ నిర్ణయాధికార సంస్థకైనా పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారా అంటే అదీ లేదు.

– ఆర్య

కొరడా ఝళిపించకుంటే - అంతా మామూలే!

పోలీసు యంత్రాంగం అంటే, కొందరి దృష్టిలో- పాలక పక్షీయుల వర్గం. అదే ఆలోచనాపరుల దృక్కోణంలో- చట్టబద్ధ పాలనను పరిరక్షించే మహా దుర్గం! ధన భుజ మదబలుల దాష్టీకాలకు బలయ్యే సామాన్యులకు మాత్రం పోలీసు ఠాణా- ఓ అభయ హస్తం! విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల్ని సంస్మరించుకుంటూ ఏటా అమరవీరులకు జోహార్లు సమర్పించే జాతి మనది. ఖాకీ దుస్తులకున్న విలువ, టోపీపై మూడు సింహాల గుర్తుకు దక్కే మన్నన, సామాజిక భద్రతా సాధనంగా పోలీసుల విధి పట్ల భయభక్తులు పరిఢవిల్లాల్సి ఉండగా- తులసివనంలో గంజాయి మొక్కల్లాంటి కొందరి వల్ల మొత్తం వ్యవస్థే పరువు మాసిపోయే దుస్థితి దాపురించింది. రౌడీ మామూళ్లను తలదన్నేలా పోలీసు ఠాణాల్లో వసూల్ రాజాల విశ్వరూపం- అత్యంత సంఘటిత నేరగాళ్ల వర్గమంటూ ఒకనాడు సుప్రీంకోర్టు చేసిన సూత్రీకరణ ఎంత సత్యమో పదేపదే నిరూపిస్తోంది. తెలంగాణ పోలీసు శాఖలో మామూళ్ల బాగోతానికి ఇక తెరపడాలంటూ డీజీపీ మహేందర్ రెడ్డి జారీ చేసిన ఆదేశాలు, వసూళ్ల మత్తులో జోగుతున్నవారి పూర్తి వివరాలతో సహా వెలువడిన జాబితా పెను సంచలనం సృష్టిస్తున్నాయి. మామూళ్లు ఆపకపోతే చర్యలు తథ్యమంటూ పోలీసు పెద్దే గద్దించడాన్ని సహర్షంగా స్వాగతించాల్సిందే. జీతంకంటే 'గీతం'పైనే అధికంగా ఆధారపడుతున్న పరాన్నభుక్కుల మూతులకు పోలీసు దొర ఆదేశాలతోనే చిక్కాలు పడతాయా అంటే- సందేహించాల్సిందే!

ఎత్తు మరిగిన బిడ్డ మొత్తుకొన్నా దిగదని అచ్చ తెనుగు నానుడి. పోలీసు బాసులకు నెలవారీ మామూళ్లు సమర్పించకుంటే తమ వ్యాపారం పడకేస్తుందన్న భీతిని వ్యాప్తి చెయ్యడంలో సఫలమైన పోలీసులు, సక్రమంగా వసూళ్లు సాగించడానికి వీలుగా నమ్మకస్తులకు బాధ్యతలు అప్పగించి మామూళ్ల దందాను వ్యవస్థీకృతం చేసేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వసూల్ రాజాల అరాచకం తీరుతెన్నుల్ని 'ఈనాడు' బయట పెట్టడంతో- అంతర్గత విచారణ దరిమిలా మొన్న మార్చిలో 40 మందిపై బదిలీ వేటు వేశారు. హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డుల వంటి చిన్నచేపలపై బదిలీ వంటి పెద్ద చర్య తీసుకోవడంతో గొప్ప మార్పునకు శ్రీకారం చుట్టామని పోలీసు గణాధిపుల్లో ఎవరన్నా భావించి ఉంటే- అది వెర్రివెంగళాయితనమే! తాజాగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధుల్లో 48మంది నామధేయాలు కొత్త జాబితాలో కొలువుతీరడం- వ్యవస్థ ఎంతగా పుచ్చిపోయిందో వెల్లడించేదే! అధికార సిబ్బందిపై ఏమైనా చర్య తీసుకొన్నా మూడు నెలల్లో వాళ్లు మళ్ళీ పాత వ్యవహారాలు మొదలెట్టే బాగోతాలు ఎన్నో చూశామని సుప్రీంకోర్టు లోగడే తలంటేసింది.

పుణ్యభూమి

ఎన్నిసార్లు తెగనరికినా తిరిగి అతుక్కునే రావణాసురుడి తలల్లాంటి అవినీతి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా పోలీసు ఠాణాల్లో చిరంజీవత్వాన్ని సముపార్జించింది. పైనుంచి హెచ్చరికలతో మొత్తినా, బదిలీలతో మొట్టికాయ వేసినా, సస్పెన్షన్లతో తొడపాశం పెట్టినా- పోలీసు స్టేషన్లకు మామూళ్ల జాడ్యం వదులుతుందనుకొనే వెర్రివాజమ్మలెవరూ లేరు!

రాజకీయంగా, పాలన పరంగా పోలీసుల పనితీరుపై పెరుగుతున్న ఒత్తిళ్లను ఉపేక్షిస్తే పెడపోకడలు ఊడలు దిగి దేశ ప్రజాస్వామ్యం పునాదులే కదిలిపోతాయని పోలీసు పరిశోధన-అభివృద్ధి బ్యూరో హెచ్చరించి నాలుగు దశాబ్దాలు అవుతోంది. ఆ హితోక్తిని చెవిన పెట్టిన నాథుడు లేకపోబట్టే నానాటికీ తీసికట్టుగా పోలీసు వ్యవస్థ అవినీతి పంకిలమై పరువుమాస్తోంది. పోలీసు స్టేషన్లకు అవసరమైన నిర్వహణ ఖర్చులు ప్రభుత్వాలు సమకూర్చకపోవడంతో గతంలో మామూళ్ల దందా మొదలైంది. రాష్ట్ర విభజన దరిమిలా పోలీసు ఠాణాల ఔన్నత్యంతో రాజీపడరాదంటూ నిర్వహణ ఖర్చులకు తగు మొత్తాల్ని ప్రభుత్వాలే అందిస్తున్నా, పాత అలవాట్లు కొత్త పిలకలు వేస్తున్నాయంటే కారణం ఏమిటి? పోలీసు ఉద్యోగాలు, బదిలీల ప్రక్రియలోనే అనంతమైన అవినీతి మేట వేసింది. మామూళ్ల వరద పారే పోలీసుఠాణాలకు బదిలీ కావాలంటే స్థానిక ప్రజాప్రతినిధికో, మంత్రివర్యులకో రూ.10-15 లక్షల దాకా దక్షిణ సమర్పించుకోవాలి. అలా జేబులో తరుగుపడిన రొక్కాన్ని సాధ్యమైనంత తొందరగా భర్తీ చేసుకోవడం, మరింత లాభసాటి బదిలీకి పెట్టుబడి లంచం మొత్తాన్ని సమకూర్చుకోవడం ఠాణా పెద్దల విధివిహిత కర్తవ్యంగా మారింది. పోలీసు స్టేషన్లలో నెలవారీ నేర సమీక్ష నాటికి నిర్ణీత మొత్తం సిద్ధం చేసి, క్యాడర్లవారీగా పంపకాలు సాగించే పకడ్బందీ వ్యవస్థ ఏళ్ల తరబడి ప్రవర్ధమానమవుతోంది. పోలీసు నియామకాలు, బదిలీల్లో రాజకీయ లంచావతారుల అవినీతి దాహాన్ని అంతమొందించకుండా దిగువస్థాయి దందాను అరికట్టడం ఎలా సాధ్యపడుతుంది?

ఈ నెలవారీ మామూళ్ల మూలాల్ని గమనిస్తే- పోలీసులు, నేరగాళ్ల మిలాఖత్ విస్తుగొలుపుతోంది. సివిల్ గొడవల్లో పోలీసులు తలదూర్చరాదని కోర్టులే గట్టిగా హెచ్చరించినా, లాభసాటి బేరాల్ని వదులుకొనే సమస్యే లేదన్నట్లుగా ఖాకీల దుందుడుకుతనం ఎక్కడికక్కడ కళ్లకు కడుతోంది. సెటిల్మెంట్లతో సరిపుచ్చితే ఖాకీ పరివారానికే నామోషీ అనుకొంటూ- కేసులు కాకుండా ప్రైవేటు పంచాయతీలు, ఇసుక మద్యం మాఫియాకు వెన్నుదన్ను, గుట్కా మట్కాలకు ప్రోత్సాహం, అక్రమ రేషన్ బియ్యం సరఫరాల్ని చూసీచూడకుండా వదిలెయ్యడం, పెద్ద కేసులు వచ్చినప్పుడు తోచినంత గుంజెయ్యడం- ఇలా చేతివాటం ప్రదర్శనలో బహుముఖ శేముషీ విభవం చెప్పనలవి కాదు. మెదక్‌జిల్లా కుకునూర్ పల్లి ఠాణాలో ఎస్సైగా పనిచేస్తూ 2016 ఆగస్టులో రామకృష్ణారెడ్డి సర్వీస్ రివాల్వర్‌తోనే ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు ఆయన రాసిన లేఖ- డబ్బుల కోసం పై అధికారులు తనను ఎంతగా వేధిస్తున్నదీ, అప్పటికే ఎవరెవరికి ఎన్నెన్ని లక్షలు ఇచ్చిందీ మరణ వాంగ్మూలంగా నిలిచింది. పోలీసు శాఖలో మామూళ్ల మహమ్మారి సిబ్బంది ప్రాణాల్నీ బలిగొనేంత స్థాయిలో జడలు విరబోసుకొందని, సామాజిక విద్రోహులతో పోలీసు ఠాణాల అనుబంధాన్ని ఎవరూ ఊహించలేనంతగా ముడివేసిందనీ సాక్ష్యాధార సహితంగా రుజువైనా- ఇంకా ఇలాంటి అరకొర చర్యలేనా?

నయీం లాంటి కరడుగట్టిన నేరగాడి మోచేతి నీళ్లు తాగి తరించిపోయిన పోలీసు పెద్దలెందరో 'సిట్' నివేదికే లోగడ ఎండగట్టింది. అధికార దుర్వినియోగం, అక్రమాల స్థాయి దాటి హత్యలు చేయించేదాకా పోలీసులు బరితెగించిన వాస్తవం- నిరుడు అక్టోబరులో విశాఖపట్నం రౌడీషీటర్ గేదెల రాజు హత్యకేసులో డీఎస్పీ స్థాయి అధికారి ప్రధాన నిందితుడు కావడంతో బట్టబయలైంది. రాజకీయ నేతాగణాల ప్రాపులో, పైరవీలతో ఎదిగొస్తున్న పోలీసు సిబ్బంది, అధికారులు విధివిహిత బాధ్యతల్ని పూర్తిగా గాలికొదిలేసి- అసాంఘిక, అరాచక శక్తులుగా రూపాంతరం చెందుతున్నారు. సాదాసీదా సస్పెన్షన్లు బదిలీలతో ఇంతటి అవ్యవస్థను ఎవ్వరూ పరిమార్చలేరు. చట్టం ముందు అందరూ సమానమేనంటున్న మౌలిక ధర్మానికి ఎత్తుపీట వేసి, నెలవారీ మామూళ్ల వసూలు సహా ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డా ఉద్యోగాల నుంచి ఊడబెరికి కఠిన శిక్షల కొరడా ఝళిపిస్తే తప్ప, దారి తప్పిన బండి గాడిన పడదు. మామూళ్ల మూటల్లో క్రమంతప్పక వాటాలు అందుకొంటున్న అధికారులపైనా గట్టిచర్యలు లేకుంటే- సమన్యాయానికి అర్థమే లేదు. ఏమంటారు?

– పర్వతం మూర్తి

శ్రుతి-స్మృతి-పురాణం

శ్రుతి (వేదం), స్మృతి (ధర్మశాస్త్రం), పురాణం... ఒకదాన్ని మరొకటి అనుసరిస్తాయి. ఈ మూడింటిలోనూ చెప్పిన విషయం ఒకటే. కానీ తెలుసుకునేవారి స్థాయిని బట్టి చెప్పే తీరు మారుతుంది.

శ్రుతి చెప్పిన విషయాన్ని బాగా అర్థమయ్యేలా, అది చిరకాలం జ్ఞాపకం ఉండేట్లుగా భూతద్దంలో చూపించినట్లు విస్తారమైన వివరణ ఇస్తుంది స్మృతి.

స్మృతి చెప్పిన విషయాలను మరింత సరళతరం చేసి అందరికీ అర్థమయ్యే రీతిలో చెబుతాయి పురాణాలు. వేదవాఙ్మయం అత్యంత ప్రాచీనమైంది. వాటిని సృష్టించినవారు మానవులు కాదు (అపౌరుషేయాలు). కాబట్టి సంస్కృతి-ప్రవర్తన, నడక-నడత, జీవనవిధానం, విజ్ఞానం-వినాశనం, పురోగమనం-తిరోగమనం... లాంటి ఎన్నో విషయాలపట్ల కచ్చితమైన స్పృహ కలిగేటట్లు చేస్తాయవి. వాటిని చదవడానికి, అర్థం చేసుకోవడానికి విద్య, పరిజ్ఞానం, ఆసక్తి లాంటివి ఎక్కువ మోతాదులో ఉండాలి. చాలామందికి అవి సరిపోయినంత ఉండకపోవచ్చు. అందువల్ల వాటి ప్రయోజనం నెరవేరడానికి అవకాశం తక్కువ కావచ్చు.

ఆ పరిస్థితి నుంచి తప్పించడానికి వేదాల సారాన్నంతా ధర్మశాస్త్రాల రూపంలోకి మార్చి చెప్పారు మహర్షులు. ఆ విషయాలనే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రాసినవి పురాణాలు. పురాణం అంటే పూర్వం (ఇంతకుముందు) జరిగిన విషయం అని ఒక అర్థం.

పురుషార్థాలను సాధించడానికి, ఏది ధర్మం-ఏది అధర్మం... అనే స్పృహ కలిగించడానికి పురాణజ్ఞానం ఎంతైనా అవసరమని ఆర్యోక్తి.

'పురాపి నవం' (పాతదైనప్పటికీ కొత్తది) అని పురాణ పదానికి నిర్వచనం. అంటే ఎప్పుడో చెప్పినప్పటికీ ఇప్పటికీ ఉపయోగకరంగా ఉంటుందని భావం. అంటే ఏ కాలానికైనా సరిపోయే విషయాలు కలిగి ఉంటాయి అని అర్థం. అలాంటి పురాణాలు పద్దెనిమిది.

అవి- భాగవత, భవిష్య, మత్స్య, మార్కండేయ, బ్రహ్మ, బ్రహ్మ వైవర్త, బ్రహ్మాండ, విష్ణు, వరాహ, వామన, వాయు, అగ్ని,

అంతర్యామి

నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాంద పురాణాలు. వీటితోపాటు అదే సంఖ్యలో ఉపపురాణాలు ఉన్నాయి. ఇవన్నీ వ్యాసుడు రచించాడని ప్రసిద్ధి.

జీవుడు ఏ శరీరం పొందాడు, ఈ శరీరంతో ఏం చెయ్యాలి, ఏం

చేస్తున్నాడు? సన్మార్గంలో పయనిస్తే ఏం జరుగుతుంది లేకపోతే పరిణామాలు, వాటికి నివారణోపాయాలు ఏమిటి? ఏం చేస్తే ఈ శరీరం వదిలి ఇంకో శరీరంలోకి వెళ్తాడు? మళ్ళీ ఎలాంటి శరీరాన్ని పొందుతాడు? ఏం చేస్తే ఈ శరీర సంస్కారాలు (మంచి, చెడులు) అవతలి శరీరంలోకి వెళ్తాయి? మళ్ళీ ఆ సంస్కారం పోగొట్టుకోవడానికి లేదా నిలబెట్టుకోవడానికి ఎలాంటి సాధన చెయ్యాలి? చేసిన పాప పుణ్యాలకు వాళ్ళు ఉత్తర జన్మల్లో ఏ శరీరం పొందుతారు? ఆ జన్మలో తరించిపోతారా? లేక ఇంకా జన్మలు ఎత్తవలసి ఉందా? ఇప్పటికీ ఏదైనా జన్మ వాసనా బలం వారిని వెంటాడుతూ ఉందా? ఉంటే అది ఎలా తొలగిపోతుంది... చివరిగా పరమేశ్వరుడిలో లీనమైపోవడానికి ఎంత కష్టపడవలసి ఉంటుంది? ఇటువంటి విషయాలను పురాణాలు వివరిస్తాయి.

అలాంటి పురాణాల్లో భాగవతాన్ని మొదటిదానిగా పేర్కొన్నారు. దానికి గల కారణాన్ని పరిశీలిస్తే- ఇందులో చెప్పిన విషయాలు, కథలు, విశేషాలు మొదలైనవన్నీ భక్తి, జ్ఞాన, వైరాగ్యభరితాలే. వాటితోపాటు చతుర్విధ పురుషార్థాల్లోని ధర్మార్థకామాలను నిర్వర్తిస్తూ మోక్ష ప్రాప్తికి మార్గం చూపేవి. ఈ మూడింటినీ వివరించి ఎవరు ఏ మార్గంలో పయనించాలో నిర్ణయించుకునే స్వాతంత్ర్యాన్ని వారివారి బుద్ధికుశలతకే వదిలేసి స్వేచ్ఛనిచ్చింది భాగవతం. అందుకే అది ఎక్కువ మంది చదివే పురాణం, అందునా వాటిలో మొదటిదైంది!

– అయ్యగారి శ్రీనివాసరావు

తిరుమలపై రాజకీయ చర్చ ఆపండి

- శ్రీవారి నగలను ఐదేళ్లకోసారి మదించాలి
- ధార్మిక పరిరక్షణలో ప్రభుత్వ చర్యలు భేష్
- పీఠాధిపతుల సదస్సులో తీర్మానం

ఈనాడు, తిరుపతి – భవానీనగర్, న్యూస్‌టుడే

సమావేశంలో ప్రసంగిస్తున్న కమలానంద భారతి తీర్థ స్వామీజీ. పక్కన వివిధ పీఠాల అధిపతులు

తిరుమల శ్రీవారి ఆలయ వ్యవహారాలపై నడుస్తున్న రాజకీయ చర్చలను వెంటనే ఆపాలని, భక్తుల్లో విశ్వాసం నింపే చర్యలు చేపట్టాలని పీఠాధిపతుల సమావేశం కోరింది. శ్రీవారి ఆలయ వ్యవహారాలపై రమణ దీక్షితులు బహిరంగంగా ఇష్టానుసారం మాట్లాడటం, ఆయనను లక్ష్యంగా చేసుకుని ఇతరులు మాట్లాడటం రెండూ తప్పేనని అభిప్రాయపడింది. తిరుపతిలో శనివారం తిరుమల తిరుపతి సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పలు మఠాలు, పీఠాలకు చెందిన ధర్మాచార్యుల సమావేశం నిర్వహించారు. అందులో తీసుకున్న నిర్ణయాలను స్వామీజీలు విలేకరులకు వివరించారు. హంపి పీఠాధిపతి శ్రీశ్రీ విద్యారణ్యస్వామి మాట్లాడుతూ.. తితిదే విషయంలో రాజకీయ జోక్యం పెచ్చుమీరడం దురదృష్టకరమని, ఆలయ లోటుపాట్లను అంతా కలిసి చర్చించుకుని, సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. 'స్వామివారి ఆభరణాలపై అనేక అనుమానాలు తలెత్తాయి. కొత్తగా స్వామి వారికి అనేక నగలు వచ్చాయి. వీటిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు విచారణ కమిటీ వేయాలి. అలాగే, ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేసి అందులో మఠాధిపతులు, పీఠాధిపతులను నియమించాలి. ఎలాంటి వివాదం వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు ఈ పరిషత్తుకు అధికారాలివ్వాలి' అని సూచించారు. తితిదేతో పాటు రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లోనూ అనువంశిక అర్చకులకు పదవీ విరమణ లేదని, దీనిని కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. తితిదేతో పాటు, రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ఉన్న అన్య మతస్థులను ఇతర శాఖల్లోకి బదిలీ చేయాలని సూచించారు. హిందూ దేవాలయాల పరిరక్షణ, ప్రతిష్ఠాన పీఠాధిపతి శ్రీశ్రీ కమలానంద భారతీ తీర్థ స్వామి మాట్లాడుతూ... 'త్వరలోనే అమరావతిలో మరోసారి భేటీ అయి ధార్మిక విధానాలపై చర్చిస్తాం. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై వారంలోగా ఒక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తాం. ముగ్గురు సభ్యులతో ప్రతినిధుల కమిటీ వేస్తాం' అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవాలయాల పరిరక్షణ తీసుకుంటున్న చర్యలు ఎంతో బాగున్నాయని చెప్పారు. ఐదేళ్లకోసారి శ్రీవారి ఆభరణాలను మదింపు చేసి ప్రజలకు వివరించాలని సూచించారు. '2007లో ధార్మిక పరిషత్ ఏర్పాటుకు సంబంధించి చట్టం తీసుకొచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత విస్మరించారు. 2011లో ధార్మిక పరిషత్ కమిటీ వేసినా తర్వాత పట్టించుకోలేదు. వెంటనే ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలి. దీనికి దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఛైర్మన్‌గా, దేవాదాయశాఖ కమిషనర్ వైస్ ఛైర్మన్‌గా, మరో 20 మంది సభ్యులు ఉండాలి' అని సూచించారు. శైవ పీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ.. శ్రీవారి ఆలయంపై విమర్శలు చేయడమంటే స్వామివారికి అపచారం చేయడమేనని వ్యాఖ్యానించారు. సమావేశంలో శ్రీ పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి, లలిత పీఠాధిపతి స్వరూపానంద స్వామి, ఏర్పేడు మలయాళస్వామి, ప్రణవానంద స్వామి, గణేశానంద స్వామి, తిరుమల తిరుపతి పరిరక్షణ సమితి ప్రతినిధులు సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలనీలాల సమర్పణకు వర్షంలో బారులుతీరిన భక్తులు

తిరుమలకు పోటెత్తిన భక్తకోటి

- తలనీలాల సమర్పణకూ తప్పని నిరీక్షణ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలకు భక్తులు పోటెత్తారు. వేసవి సెలవుల ముగింపు తరుణం, వారాంతం కావడంతో లక్షలాదిగా యాత్రికులు తరలివచ్చారు. శనివారం తిరుమల గిరులు భక్తులతో కిటకిటలాడుతూ కన్పించాయి. ధర్మదర్శనం వరుస అమాంతం పెరిగిపోయి లేపాక్షి ఎంపోరియం వరకు చేరుకుంది. ఇటీవల ఎన్నడూలేని విధంగా తలనీలాల సమర్పణకు కూడా గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కల్యాణకట్టల పర్యవేక్షణ లోపంతో యాత్రికులు ఇబ్బంది పడ్డారు. జోరున కురుస్తున్న వర్షంలో తలనీలాల సమర్పణకు బారులుతీరి నిరీక్షించడం కనిపించింది. ఆర్టీసీ బస్సుల కొరత భక్తులను వేధించింది. శ్రీవారి ధర్మదర్శనానికి 24 గంటలు, టోకెన్లపై సమయ నిర్దేశిత సర్వదర్శనానికి, దివ్యదర్శనానికి 4 గంటలు, రూ.300 టిక్కెట్‌పై ప్రత్యేక ప్రవేశ దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.25 కోట్ల మేర వచ్చింది.

'లింగాయత' మత గుర్తింపు అసాధ్యం!

- ప్రతిపాదనకు కేంద్రం తిరస్కరణ

ఈనాడు– బెంగళూరు: కర్ణాటకలో రాజకీయ ప్రకంపనలకు కారణమైన లింగాయతులను అల్పసంఖ్యాక మతస్థులుగా గుర్తించాలన్న ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించింది. 12వ శతాబ్దపు సంఘ సంస్కర్త బసవేశ్వరుడి అసలు సిసలైన అనుయాయులం మేమేనని, మమ్మల్ని ప్రత్యేక మతస్తులుగా గుర్తించాలన్న లింగాయతుల వాదనల నేపథ్యంలో రాష్ట్ర సర్కారు పై సిఫార్సులను కేంద్రం ముందుంచింది. ఇటీవల శాసనసభ ఎన్నికలకు ముందు సిద్ధరామయ్య సర్కారు తీసుకున్న నిర్ణయానికి అప్పట్లో మిశ్రమ స్పందన లభించింది. దీనిపై కేంద్రంతో తదుపరి ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించరాదని, మరో మారు లింగాయతులకు అల్పసంఖ్యాక గుర్తింపు ఇవ్వాల్సిందిగా సిఫార్సు చేయరాదని కూడా రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జాతీయ అల్పసంఖ్యాకుల కమిషను 1992 సెక్షన్2(సి) ప్రకారం గత ప్రభుత్వం లింగాయతులు, బసవేశ్వరుడి సిద్ధాంతాల్ని అనుసరించే వీరశైవుల్ని అల్పసంఖ్యాకులుగా గుర్తించాల్సిందిగా కోరుతూ మార్చి 23న కేంద్ర హోంశాఖకు సిఫార్సు చేసింది. అంతకు ముందు రోజు రాష్ట్ర ప్రభుత్వం వారికి అల్పసంఖ్యాక హోదా కల్పించి అధికారిక రాజపత్రంలోనూ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించరాదని కేంద్ర హోంశాఖ ఆంతరంగిక నివేదికలో ఉన్నతాధికారులు తేల్చిచెప్పారు. 'విధానసభ ఎన్నికలు ప్రకటన వెలువడటానికి వారం రోజుల ముందు ఆ సిఫార్సు చేశారు. ఈ సిఫార్సును ఆమోదిస్తే హిందూ మతంలో బ్రాహ్మణ సంస్కృతికి కట్టుబడని ఆర్యసమాజ, రాధాస్వామి, వైష్ణవ్, అల్ఖా, మహిమ, ఆనంద్ మార్గి, వాల్మీకి, బ్రహ్మకుమారి, సనాతన ధర్మ తదితర హిందూ వర్గాలు ఇదే తరహా ప్రత్యేక మత హోదా కోరే అవకాశం ఉంటుంది. లింగాయతుల్ని అల్పసంఖ్యాకులు/ప్రత్యేక మతస్థులుగా గుర్తిస్తే వారిలో కొందరికి షెడ్యూల్డ్ కులాల హోదా లభించదు. వీరి జనసంఖ్యకు సంబంధించిన గణాంకాలూ లేవని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా పేర్కొంది' అని హోంశాఖ వర్గాలు విశదీకరించాయి. ఈ కారణంగానే ఆ సిఫార్సును తిరస్కరించినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది.

EDUCATION
★ GUIDENCE FOR: MBBS, VETERINARY., AG.BSc, Ph. 9666222217

B.Sc (Hons) Agri
Recog. by UGC, State Higher Education
Eligi : All Govt., Private Jobs
NO EAMCET, NO DONATION
www.sunagbsc.org
80198 15763

యూనివర్సల్ కేబుల్స్ అప్పీల్ కొట్టివేత

భూగర్భ విద్యుత్ కేబుల్ టెండర్‌పై తీర్పు వెల్లడించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: అమరావతి రాజధాని కేంద్ర ప్రాంతంలో (సీడ్ కేపిటల్) 220 కేవీ విద్యుత్తు కాపర్ కేబుల్ లైన్‌ను భూగర్భంలో ఏర్పాటు చేసే నిమిత్తం ఏపీ ట్రాన్స్‌కో గతేడాది జారీచేసిన టెండర్‌ను సవాలు చేస్తూ యూనివర్సల్ కేబుల్స్ లిమిటెడ్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ని హైకోర్టు సింగిల్ జడ్జి కొట్టివేయడాన్ని ధర్మాసనం సమర్థించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ యూనివర్సల్ సంస్థ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అమరావతి రాజధాని కేంద్ర ప్రాంతంలో రూ.544.24 కోట్ల అంచనాతో 245 కిలోమీటర్ల మేర 220 కేవీ భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం.. కేబుల్‌ను సరఫరా చేసి, భూగర్భంలో నిర్మాణం జరిపి, ఆచరణలోకి తీసుకొచ్చేందుకు ఏపీట్రాన్స్‌కో గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. కొరియా దేశపు ఎల్ఎస్ కేబుల్స్ సిస్టమ్స్ సంస్థతో కన్సార్టియం ఉన్న ఎల్ఎస్ కేబుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు టెండర్ దక్కేలా 'టెండర్ అర్హతలు' రూపొందించారని పేర్కొంటూ యూనివర్సల్ కేబుల్స్ ఇండియా సంస్థ గతేడాది అక్టోబర్‌లో హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. వ్యాజ్యాన్ని కొట్టేశారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ యూనివర్సల్ కేబుల్స్ ధర్మాసనం ముందు అప్పీలు దాఖలు చేసింది. ఏపీట్రాన్స్‌కో తరఫున ఏపీ అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఇరువైపు న్యాయవాదుల వాదనలు విన్న ధర్మాసనం.. ఏపీ ట్రాన్స్‌కో జారీచేసిన టెండర్ ప్రకటనలో పేర్కొన్న అర్హతల విషయమై అభ్యంతరం లేదని పేర్కొంది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరిస్తూ యూనివర్సల్ కేబుల్స్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది.

12 నుంచి భాజపా ప్రత్యేక కార్యక్రమాలు!

ఈనాడు, అమరావతి: ప్రధాని మోదీ నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి జులై 6 వరకు భాజపా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. ఇందులో భాగంగా మోదీ పాలన గురించి వివరించడం, దళితవాడల్లో పర్యటించడం, అక్కడే నిద్రించడం, అవగాహన ర్యాలీలు నిర్వహించడం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టడం, మేధావులతో సమావేశాలు, ఇతర కార్యక్రమాలు జులై 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్నాయి. ఈ క్రమంలోనే భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ జిల్లాల పర్యటనలకు సిద్ధమవుతున్నారు. ఆదివారం విజయవాడలో జరిగే రాష్ట్ర పథాధికారుల సమావేశంలో కార్యక్రమాల నిర్వహణ తీరుపై చర్చించనున్నారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం విజయవాడలో ధర్నా చేపడుతున్నట్లు భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిశోర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సత్వర న్యాయం అందకపోవడం వ్యవస్థాలోపమే

- తెలంగాణలో జడ్జీలపై ఏసీబీ దాడులు సరికాదు
- అఖిల భారత న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్రప్రసాద్

ఈనాడు – హైదరాబాద్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రాజేంద్రప్రసాద్, కె.రవీందర్‌రెడ్డి

'న్యాయవ్యవస్థ బ్రిటిష్ కాలంనాటిది.. ఇది న్యాయపాలిక కాదు.. అన్యాయ పాలిక' అని అఖిల భారత న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్రప్రసాద్ అభిప్రాయపడ్డారు. వ్యవస్థలో మార్పు అవసరమన్నారు. ఉద్దేశపూర్వకంగానే మార్పునకు ఉన్నత న్యాయస్థానాలు, ప్రభుత్వాలు ప్రయత్నించడంలేదని ఆరోపించారు. అఖిల భారత న్యాయాధికారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల న్యాయాధికారుల సంఘ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. అనంతరం తెలంగాణ న్యాయాధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి జస్టిస్ రాజేంద్రప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగంలోని అధికరణ 312 జ్యుడిషియల్ సర్వీసులకు సంబంధించి నిబంధనలను స్పష్టంగా పేర్కొన్నా అమలుకావడంలేదని ఆరోపించారు. కింది కోర్టుల్లోని న్యాయాధికారులపై ఆరోపణలు వచ్చినపుడు హైకోర్టు అంతర్గతంగా విచారణ చేపట్టి వివరణ కోరాల్సి ఉందన్నారు. ఏసీబీకి అప్పగించి హైకోర్టు తప్పు చేసిందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సుప్రీం కోర్టు, కేంద్ర ప్రభుత్వం మధ్య విభేదాలతో హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో స్తంభన ఏర్పడిందన్నారు. తెలంగాణలో న్యాయాధికారులు అదే కేడర్‌లో కొనసాగుతున్నారని, కేడర్ విభజనను ఎవరూ పట్టించుకోలేదన్నారు. జడ్జీలపై ఏసీబీ దాడులకు నిరసనగా రాజీనామా చేసినట్లు రవీందర్‌రెడ్డి చెప్పారు. సమావేశంలో తెలంగాణ న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడు వి.వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరప్రసాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన న్యాయాధికారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టుకు నివేదిస్తాం: వెంకట్‌రాంరెడ్డి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: దక్షిణాది రాష్ట్రాల న్యాయమూర్తులు వేతనాలు, అలవెన్సుల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై సుప్రీంకోర్టుకు త్వరలోనే సమగ్ర నివేదిక అందిస్తామని జాతీయ జ్యుడిషియల్ పే కమిషన్ ఛైర్మన్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల న్యాయమూర్తుల సంఘాల ప్రతినిధులు కార్యవర్గ సమావేశం అనంతరం సికింద్రాబాద్ జ్యుడిషియల్ అకాడమీలో జస్టిస్ పి.వెంకట్‌రామిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

పవన్ ఆరోపణలు అవాస్తవం: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: 'శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి దరఖాస్తు చేస్తే ఇవ్వకుండా...ఎక్కడో ఫ్రాంక్లిన్ టెన్ అనే వ్యక్తికి ఎకరా రూ.30 లక్షల ధరకు కేటాయించారు. ఈ స్థలాన్ని వాళ్లు ఎకరా రూ.15 కోట్లుకు అమ్ముకుంటున్నారు' అంటూ విశాఖ జిల్లా నర్సీపట్నం సభలో ప్రభుత్వంపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన విమర్శలను ట్విట్టర్‌లో శనివారం మంత్రి లోకేశ్ ఖండించారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ రియల్ ఎస్టేట్ కంపెనీ కాదని.. అది ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒకటని మంత్రి వివరించారు. రాష్ట్రంలో రూ.450 కోట్ల పెట్టుబడులు పెట్టి 2,500 మందికి ఉన్నతస్థాయి ఉద్యోగాలు అందించబోతుందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీనిబాబు సీఈవోగా ఉన్న పల్సస్ టెక్ కంపెనీకి విశాఖలో భూమి కేటాయించామని ప్రస్తావించారు. శ్రీకాకుళంలో వెయ్యి మంది స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేలా బీపీఓ కంపెనీ ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారిని 'రెడ్ కార్పెట్' వేసి ఆహ్వానిస్తున్నామన్నారు.

165 టీఎంసీల తరలింపు దేశంలోనే ప్రథమం

- అవగాహన లేకుండా వైకాపా ఆరోపణలు: మంత్రి దేవినేని

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: గోదావరి నుంచి కృష్ణా నదికి 165 టీఎంసీల నీటిని తరలించామని, ఇది పట్టిసీమ వల్లే సాధ్యమైందని, ఇంత అధిక మొత్తంలో నీటి తరలింపు ఏపీ మినహా దేశంలో ఎక్కడా లేదని జల వనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. నీరు - చెట్టు, నీరు - ప్రగతి పనులపై వైకాపా నాయకులు అవినీతి ఆరోపణలు చేయడం చూస్తుంటే వారికి నీటి పారుదలశాఖపై కనీస అవగాహన లేనట్లుగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు తరగతులు నిర్వహించాల్సిన అవసరంతోపాటు కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉందని స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. నీరు - ప్రగతి ద్వారా రూ.13,846 కోట్ల విలువైన జల సంరక్షణ పనులు జరగ్గా.. వీటిలో ఉపాధి హామీ పథకంలో రూ.9,862 కోట్లు, అటవీశాఖ కింద రూ.140 కోట్లు ఉన్నట్లు తెలిపారు. 2015 ఫిబ్రవరి నుంచి ఇరిగేషన్ శాఖ కింద రూ.3,664 కోట్ల చెల్లింపులు జరిగినట్లు వివరించారు. శాఖల వారీగా కేటాయింపులు స్పష్టంగా ఉంటే నీటి పారుదలశాఖలో అవినీతి జరిగిందని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. 2014-15 నుంచి 2017-18 వరకూ 5 శాతం నుంచి 34 శాతం వరకూ వర్షపాతం తక్కువగా ఉన్నా పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించగలిగామని వివరించారు. పంట దిగుబడుల్లో దేశంలో హర్యానా తర్వాత ఏపీ ఉండటానికి పట్టిసీమే కారణమని తెలిపారు. ఈనెల 18న పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను సీఎం చంద్రబాబు జాతికి అంకితం చేయనున్నట్లు వెల్లడించారు.

సహజ వాయువును జీఎస్టీలోకి తేవడం సరికాదు: యనమల

ఈనాడు, అమరావతి: సహజ వాయువు(నేచురల్ గ్యాస్)ను జీఎస్టీ పరిధిలోనికి తెస్తామంటూ జీఎస్టీ కౌన్సిల్ కార్యదర్శి పత్రికా ప్రకటనలు చేయడం సరికాదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. జీఎస్టీ కౌన్సిల్ ఆమోదంతో నిమిత్తం లేకుండా అన్ని రాష్ట్రాల సమ్మతితో నిర్ణయం తీసుకోబోతున్నట్లు కార్యదర్శి ఎలా చెబుతారని శనివారం ఆయన ఓ ప్రకటనలో ప్రశ్నించారు. '2017-18 ఆర్థిక సంవత్సరంలో సహజ వాయువు ద్వారా రాష్ట్రానికి రూ.523 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పటికే కేంద్రం తెచ్చిన జీఎస్టీ వల్ల రాష్ట్రాలు ఆదాయంపై స్వయంప్రతిపత్తిని కోల్పోయాయి. ఈ తరుణంలో సహజ వాయువును జీఎస్టీ పరిధిలోనికి తెస్తామని ప్రకటించడంవల్ల గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి' అని యనమల పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీతో రుద్రరాజు భేటీ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి పార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేయడానికి సిద్ధమవుతున్నామని ఏఐసీసీ కార్యదర్శి గిడుగు రుద్రరాజు తెలిపారు. శనివారమిక్కడ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. ఒడిశా వ్యవహారాల కార్యదర్శిగా నియమితులైన అనంతరం ఆ రాష్ట్రంలో పర్యటించి రాహుల్‌గాంధీతో భేటీ అయ్యానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా ప్రభుత్వం నాలుగేళ్లుగా ప్రజల్ని మోసం చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామన్నారు. 2019 ఎన్నికల్లో ఒడిశాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని రుద్రరాజు ధీమా వ్యక్తంచేశారు.

ఆర్టీసీ ఎన్నికలకు సిద్ధమవ్వండి

- సభ్యులకు నేషనల్ మజ్దూర్ యూనియన్ పిలుపు

ఈనాడు, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అందుకు సన్నద్ధంగా ఉండాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ముఖ్య ఉపాధ్యక్షుడు డీఎస్‌పీ రావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు సభ్యులకు పిలుపునిచ్చారు. సంఘం జోనల్, రీజినల్, డివిజనల్, ఎన్‌ఓయు ఛైర్మన్లు, కార్యనిర్వాహక అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం శనివారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా చల్లా చంద్రయ్య మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా సాధించిన విజయాలపై విస్తృత ప్రచారం చేయాలని దిశానిర్దేశం చేశారు.

ఆ తల్లీబిడ్డా క్షేమం!

- తక్షణమే రోడ్డు వేయాలని అణుకు గిరిజనులు ఆందోళన
- రూ.3 కోట్లతో గ్రామానికి రోడ్డు వేయిస్తామన్న ఎమ్మెల్యే

నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో బిడ్డతో లింగో

నర్సీపట్నం గ్రామీణం, కోటవురట్ల, న్యూస్‌టుడే: రహదారి సౌకర్యం లేక ఆరు కిలోమీటర్ల దూరం గర్భిణిని మోసుకుకొచ్చి ఆసుపత్రిలో చేర్చిన ఘటనలో గిరిజన యువతి మగ బిడ్డకు జన్మనిచ్చింది. విశాఖ జిల్లా కోటవురట్ల మండలం అణుకు గ్రామానికి చెందిన గమిల లింగోకు పురిటి నొప్పులు రావడంతో ఆరు కిలోమీటర్లు మోసుకొచ్చి.. ఆపై రోడ్డు మార్గాన కోటవురట్ల సామాజిక ఆసుపత్రికి తరలించారు. '6 కిలోమీటర్లు అష్టకష్టాలు' శీర్షికన 'ఈనాడు' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. కోటవురట్ల నుంచి ఆమెను నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ శస్త్ర చికిత్స చేసి బిడ్డని బయటకు తీశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

అణుకు గ్రామానికి రోడ్డు వేయాలని ఆందోళన: తమ గ్రామానికి తక్షణమే రోడ్డు వేయాలని సీపీఎం నాయకులు డేవిడ్‌రాజ్, వెంకటస్వామి ఆధ్వర్యంలో కోటవురట్లలో అణుకు గిరిజనులు ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టి ప్రధాన కూడలిపై బైఠాయించారు. మానవహారం నిర్వహించారు.

రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తాం: అణుకు గ్రామానికి రూ.3 కోట్లతో రోడ్డు సదుపాయం కల్పిస్తామని పాయకరావుపేట ఎమ్మెల్యే వి.అనిత హామీ ఇచ్చారు. 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. రెండు నెలల్లో పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

ఎంసెట్ రైతు కోటా విద్యార్థులకు శుభవార్త

తిరుపతి, న్యూస్‌టుడే: ఎంసెట్ రైతు కోటా విద్యార్థులకు ఊరటనిచ్చే ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం శనివారం జారీ చేసింది. వ్యవసాయం, పశువైద్యం, ఉద్యాన శాస్త్రాల్లో రైతుల కోటాలో దరఖాస్తు చేసుకునేందుకు ఎకరం భూమి ఉంటే చాలని సవరణలతో కూడిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సీట్లు భర్తీ చేసేందుకు రైతు కోటాలో 25 శాతం సీట్లు కేటాయిస్తారు. ఎకరం భూమితో పాటు నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థులు రైతు కోటాలో సీట్లు పొందేందుకు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థి పేరున లేదా తల్లిదండ్రుల పేరున భూమి ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ చంద్రశేఖరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఎంసెట్‌లో రైతుల కోటాలో దరఖాస్తు చేసుకునేందుకు మూడెకరాల భూమి ఉండాలన్న నిబంధన ఉండేది.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకులు ఆదివారం విడుదల కానున్నాయి. ఉదయం 10 గంటలకు ర్యాంకులు వెల్లడిస్తారని జేఈఈ వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా మే 20న అడ్వాన్స్‌డ్ జరగ్గా మొత్తం 1,55,091 మంది హాజరయ్యారు. వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి 25 వేలకుపైగా ఉన్నట్లు అంచనా. మార్గదర్శకాలకు విరుద్ధంగా జవాబులను రాసినా వాటికి కూడా మార్కులు ఇస్తున్నారని, దానివల్ల ర్యాంకులపై ప్రభావం పడుతుందని ఒక విద్యార్థి తండ్రి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం స్టే ఇవ్వనందున ముందుగా ప్రకటించిన ప్రకారమే ఆదివారం ఫలితాలు విడుదల చేస్తామని జేఈఈ అడ్వాన్స్‌డ్ అధికారులు తెలిపారు. ర్యాంకులను jeeadv.ac.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. కటాఫ్ మార్కులు సాధించిన వారు ఈనెల 15 నుంచి జరిగే జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు.

కొత్తగా తెలంగాణలో మరో రిపోర్టింగ్ కేంద్రం: గతేడాది వరకు ఐఐటీల్లో సీట్లు వచ్చిన వారు హైదరాబాద్‌లో, ఎన్ఐటీల్లో సీట్లు దక్కిన వారు వరంగల్ ఎన్ఐటీలో రిపోర్టింగ్ చేసేవారు. ఈసారి ఎన్ఐటీల్లో సీట్లు దక్కిన వారి కోసం దేశవ్యాప్తంగా కొత్తగా అయిదు రాష్ట్రాల్లో రిపోర్టింగ్ సెంటర్లు పెంచుతున్నారు. రాజస్థాన్, యూపీ, దిల్లీ, చండీఘర్‌తోపాటు తెలంగాణలోనూ ఏర్పాటు చేస్తున్నట్లు సెంట్రల్ సీట్ అలకేషన్ బోర్డు(సీశాబ్)-2018 ఛైర్మన్ ఆచార్య ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. జేఈఈ మెయిన్ మార్కులతో ప్రవేశాలు కల్పిస్తున్న రెండు సంస్థల్లో ఒకటి ఎన్ఐటీ వరంగల్ కాగా... మరొకటి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఇప్పటికే వరంగల్‌లో ఉన్నందున ఈసారి కొత్తగా హెచ్‌సీయూలో సౌకర్యం కల్పించనున్నట్లు సమాచారం. జోసా ద్వారా ఏడు విడతలు కౌన్సెలింగ్ జరిగినా ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఇతర సంస్థల్లో ఖాళీల భర్తీకి ప్రత్యేకంగా మరో రెండు విడతలు కౌన్సెలింగ్ జరగనుంది.

Rajiv Gandhi University of Knowledge Technologies
IIIT- NUZVID
Nuzvid, Krishna District, Andhra Pradesh- 521 202

E-Procurement Tender Notice

Online tenders are hereby invited for **Supply, installation, testing, and commissioning of 4 no. of 13 capacity passenger lifts for academic buildings(3) and central library(1) including all related civil, electrical & mechanical works finished item of work on lumpsum turnkey basis at institute campus of RGUKT, Nuzvid"** With Ecv ; **Rs. 80,00,000 /-.**

Interested bidders can download and submit the bids online from **11.06.2018 to 25.06.2018 up to 05:00PM** through **https://tender.apeprocurement.gov.in** (AP Portal). For further details please visit our website: **www.rguktn.ac.in** or **https://tender.apeprocurement.gov.in** (Andhra Pradesh Portal).

Sd/-
Date: 09.06.2018 Administrative Officer (i/c)

AMADALAVALASA MUNICIPALITY
(Vamsadara Quarters Road, Amadalavalasa, Srikakulam District)
Phone No. 08942 286208

E.Tender - Replacement of main water supply pumping with new Dia pipeline along the road berm instead of existing pipeline in the tank in Amadalavalasa Municipality.

Tender Notice No. 3/ AMDLV - 14th FC/E1, Estimate Contract Value: Rs.1,45,32,157/-

Bid Download Start Date and Time	11-06-2018 at 11.00 am
Bid Download end Date and Time	28-06-2018 at 01.00 pm
Bid submission Closing Date and Time	28-06-2018 at 03.00 pm
Date and Time for opening of Technical Bid	28-06-2018 at 04.00 pm

E.Tender Website: http//tender.apeprocurement.gov.in/
E.Mail ID for clarifications/Communication: mcadv_amadalavalasa@yahoo.co.in

Note: Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No separate press notification shall be issued.

Modalavalasa Jeevaratnam, Commissioner (F.A.C),
Amadalavalasa Municipality, AMADALAVALASA

Rajiv Gandhi University of Knowledge Technologies, IIIT RK Valley
Idupulapaya, Y.S.R. Kadapa District, A.P - 516330

4th CONVOCATION

The fourth Convocation of IIIT RK Valley, RGUKT-AP, is Scheduled to be held on 4th August, 2018 for the Students who have completed six year integrated B.Tech degree programme in the Academic Year 2017-18. The qualified students intending to attend the Convocation are required to register through online via web link www.rguktrkv.ac.in from 09.06.18 onwards.

Sd/- Administrative Officer (i/c)

ओएनजीसी ONGC

రాజమండ్రి అసెట్, రాజమండ్రి (A.P)
వాక్ ఇన్ ఇంటర్వ్యూ: కాంట్రాక్టు ప్రాతిపదికన డాక్టర్లు
నియామక ప్రకటన నెం. R&P-01/2018

14 రోజులు ఆన్/ఆఫ్ పద్ధతిలో తన డిస్పెన్సరీలు/డ్రిల్ సైట్లు/ప్రొడక్షన్ ఇన్‌స్టలేషన్ల వద్ద పనిచేయుటకు ONGC, రాజమండ్రి అసెట్ కొరకు 30-06-2020 వరకు కాంట్రాక్టు ప్రాతిపదికన దిగువ తెలిపిన డాక్టర్ల ఉద్యోగం నియామకం నిమిత్తం దరఖాస్తులు కోరబడుతున్నవి.

క్రమ సంఖ్య	ఉద్యోగం	ఉద్యోగాల సంఖ్య	రిజర్వేషన్	అర్హత	స్థిర గౌరవ భృతి (రూ.)
01	ఫీల్డ్ మెడికల్ ఆఫీసర్	26	15-UR, 06-OBC, 04-SC, 01-ST	MBBS	75,000/- నెలకు
02	జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (GDMO)	01	1-UR	MBBS	72,000/- నెలకు
03	జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (GDMO) పార్ట్ టైమ్	01	1-UR	MBBS	41,000/- నెలకు
04	మెడికల్ ఆఫీసర్ (ఆక్యుపేషనల్ హెల్త్)	01	1-UR	MBBS & సెంట్రల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్ లేదా ఏదేని గుర్తించబడిన ఇన్‌స్టిట్యూట్ నుండి కనీసం 3 నెలల సర్టిఫికెట్ కోర్సు అనగా AFIH (అసోసియేట్ ఫెలోషిప్ ఇన్ ఇండస్ట్రియల్ హెల్త్) లేదా DIH (డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ హెల్త్) లేదా తత్సమాన అర్హత. అలాంటి శిక్షితులైన డాక్టర్లు లభించనట్లైతే, MBBS అనుమతించబడును	72,000/- నెలకు

నియమ నిబంధనలు: (I) ఫీల్డు మెడికల్ ఆఫీసర్లు ONGC లో దీని డ్రిల్‌సైట్లు/ప్రొడక్షన్ ఇన్‌స్టలేషన్ల కొరకు 14 రోజుల ఆన్/ఆఫ్ పద్ధతిపై పనిచేయవల్సి ఉంటుంది. **(II)** నియామకమనేది కాంట్రాక్టు ప్రాతిపదికన పూర్తిగా తాత్కాలికం మరియు ఏ పక్షం నుండైనా ఒక నెల నోటీసు ఇచ్చి రద్దుపరచబడవచ్చును. **(III)** వారు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయడం మూలముగా ONGCలో రెగ్యులర్ నియామకం కొరకు ఎట్టి క్లయిమ్ ఉండదు. **(IV)** ఇంటర్వ్యూకు హాజరుగుటకు TA/DA చెల్లించబడదు. **(V)** భారత జాతీయులు మాత్రమే దరఖాస్తు చేయవలెను. **(VI)** పై ఉద్యోగం కొరకు అర్హత గుర్తించబడిన విశ్వవిద్యాలయం నుండి పొందినదైఉండి, స్టేట్ మెడికల్ కౌన్సిల్ లేదా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి శాశ్వత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అయి ఉండవలెను. **(VII)** నకిలీ సర్టిఫికెట్లు దాఖలు చేయడం లేదా తప్పుడు సమాచారాన్ని కప్పిపుచ్చుట/దాఖలు అనేది ఏదేని దశలో అభ్యర్థుల అభ్యర్థిత్వము అనర్హత/తిరస్కరణకు గురౌతుంది. **(VIII)** కాంట్రాక్టుపై నియామకం అనేది మెడికల్ ఫిట్‌నెస్‌కు లోబడి ఉంటుంది. **(IX)** ఎంపికైన అభ్యర్థి ONGC నియమ నిబంధనల ప్రకారం కాంట్రాక్టు ఒప్పందంపై సంతకం చేయవల్సి ఉంటుంది. **(X)** ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు అవసరమైతే, ఒక రోజుకు మించి ఉండుటకు తమ స్వంత ఏర్పాట్లు చేసుకోవలెను. **(XI)** పై నియమావళిని నెరవేర్చే ఆసక్తిగల అభ్యర్థులు **చీఫ్ మేనేజర్ (HR) - I/ C - R & P, ONGC, బేస్ కాంప్లెక్స్, రాజమండ్రి – 533106, తూర్పు గోదావరి జిల్లా (A.P. రాష్ట్రం)** వారికి దరఖాస్తులను **18–6–2018 (17.30 గం॥లు)** లోగా దాఖలు చేయవలెను. **(XII)** దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ ప్రదేశం మరియు తేది SMS ద్వారా తెలియజేయబడును.

గమనిక: అభ్యర్థులు స్వయంగా అటెస్ట్‌చేసిన ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్ (దరఖాస్తుపై కుడిమూలన అతికించవలెను)తో పాటు ఒక్కొక్కటి ఒక సెట్ ఫొటో కాపీలతో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకురావలెను. తదుపరి వివరాల కొరకు సంప్రదించండి: **R & P సెక్షన్, ఫోన్ నెం.0883–2494032** & దరఖాస్తు మరియు ఇతర వివరాల కొరకు చూడండి మా వెబ్‌సైట్: **www.ongcindia.com**

డిప్యూటీ జనరల్ మేనేజర్ (HR)

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

CA

వధువు కావలెను

Kapu 24 5'8" B.E(VIT) MS 120K 10 Cr ★ 25 5'7" B.E (BITS) MNC 24 L. P.A 40 Cr ★ 27 6' BE (IIT) M.Tech (IIT) MNC 18L P.A 10 Cr ★ 30 5'9" B.E (NIT) MBA (IIM) ★ 8790017711 (A)

బ్రాహ్మణ /27/B.Tech MBA (IIM) 14L ★ 25 B.Tech (BITS) 11L ★ 29 B.Tech, MS(US) $ 120K ★ 32/ BE MS / 16L ★ 29/ MBBS MS ★ 9492923492 (A)

పద్మశాలి: డైవర్సీ: 41 సం॥ ఒంటరి, ఎత్తు 5.5 నెలకి 10 వేలు ఎలాంటి స్థిర చరాస్తులు లేవు. ఇల్లరికం అయిన సరే. డైరెక్ట్: వాట్సప్: సంప్ర: 8919538690. (R)

కమ్మ కన్వర్టెడ్ క్రిస్టియన్ 32Y 6' B.Tech BITS ఫిలాని (సివిల్) జీ: 50వేలు. వెల్‌సెటిల్డ్ వరునికి తగిన Govt Job చేస్తున్న వధువు కావలెను. నో బ్రోకర్స్. ✆ 9346830137 (A)

Kamma/ B.Tech/ IIT/ 5'9"/ 26/ 18 LPA/ 20 Cr ★ B.Tech, BITS/ 5'10"/ 27/ 24 LPA/ 18 Cr ★ M.Tech, IIT/5'10"/ 27/ 12 LPA/ 15 Cr. తుమ్మల సుజాత. ✆ 81217 95786. (B)

Kamma/ MS, Genl/ 6'/ 26/ 50 Cr ★ MD Genl/ 5'8"/ 26/ 10 Cr ★ MD, Peadia/ 6'/ 28/ 20 Cr ★ MS, Ortho/ 5'10"/ 27/ 25 Cr ★ తుమ్మల సుజాత. ✆ 99632 32758, 0866-2431721. (B)

Kamma/ Group-1/ 5'9"/ 28/ 10 Cr ★ B.Tech/ 26/ AE Govt/ 5 Cr ★ M.Tech/ 5'9"/ 30/ AEE, Govt./ 30 Cr ★ B.Tech, IIT/ 5'10"/ 26/ Govt. Officer. తుమ్మల సుజాత. ✆ 98482 17771. (B)

రెడ్డి 1991/ 5'8" B.Tech/ MS/ US/ 180K./ H1B ★ 1989/ 5'8", B.Tech/ MS/ US/ 85k./ H1B/ Rich ✆ 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1987/ 5'10" B.Tech/ MBA/ 18L.P.A. ★ 1991/ 6', B.Tech/ MBA/ 12L.P.A/ 40Cr. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో. 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1987/ 5'9", B.Tech/ MS/ US/ 135K/ Rich ★ 1989/ 5'7", B.E/ IIIT/ MS/ US/ 100K/ Rich. 9848221166/ 9505551788 (A)

కమ్మ 27 5'10" Very Handsome B.B.M. 10L. P.M. Above 50 Crores వరునకు తగిన వధువు కావలెను. ✆ 95422 44627 (I).

కమ్మ, 36, 5'10" (UK/PR) 9L pm/ 4 Cr, ఆస్తి Fair వరుడికి Fair, కమ్మ వధువు కావలెను. (డైరెక్ట్) UK ✆ (Whatsapp) +44 7715919375 (A)

పద్మశాలి: B.Tech/ IIT/ C.Govt ఇన్‌స్పెక్టర్/ కస్టమ్స్ Dept/ 60,000/- PM, 5'11" ఎత్తు 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9908222406 (A)

గంగపుత్ర బెస్త: M.Sc/ Govt. ట్యాక్స్ ఆఫీసర్/ ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept/ 48,000/- PM, 6' ఎత్తు 29 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

వాల్మీకి బోయ: B.Tech/ Govt.Asst ఇంజనీర్/ ట్రాన్స్‌కో/ 60,000/-PM 5'11" ఎత్తు 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

యాదవ: B.Tech, MBA/ C.Govt Asst. ఇంజనీర్/ BHEL/ 80,000/-PM 5'11" ఎత్తు 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను ✆ 8008939651 (A)

రజక: B.Tech/ C.Govt. టెక్నీషియన్/ రైల్వేస్/ 45,000/-PM, 5'10" ఎత్తు 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను ✆ 9618008271 (A)

గమనిక

పెళ్లిపందిరి ప్రకటనలకు ప్రతి స్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కుమ్మరి : కట్నప్రసక్తి లేదు. B.Tech/ C.Govt క్యాషియర్/ సిండికేట్ బ్యాంక్/ 30,000/-PM, 5'10" ఎత్తు 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను ✆ 9618008271 (A)

క్రిష్టియన్ మాల కట్న ప్రసక్తిలేదు. M.Tech NIT/C.Govt ఇంజనీర్/ IOCL/ 1 Lakh PM, 6' ఎత్తు 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను ✆ 8297439565 (A)

పద్మశాలి/ B.Tech/ C.Govt. ఇండియన్ ఎయిర్‌పోర్ట్ అథారిటి ఆఫీసర్/ 62,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A)

పెరిక/ B.Tech/ Govt. Asst. మేనేజర్ (ఆంధ్రాబ్యాంక్)/ 55,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9052296834 (A)

రజక/ B.Tech/ C.Govt. Asst. మేనేజర్ (రిజర్వ్ బ్యాంక్)/ 65,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

మాదిగ/ ఏకైక కుమారుడు/ B.Tech/ C.Govt. ఇంజనీర్ (రైల్వే)/ 70,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. ✆ 9642459724 (A)

యాదవ/ B.Tech (IT)/ C.Govt సైంటిస్ట్ (ఇస్రో)/ 14 Lakhs. PA/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885055185 (A)

కుమ్మరి/ M.Tech, NIT/ Govt. A.E.E. (జెన్‌కో)/ 1 Lakh. PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9989450693 (A)

మాల, B.Tech, Govt A.E.E (జెన్‌కో), 10 Lakhs PA, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9703794175 (A).

క్రిష్టియన్ మాదిగ, B.Tech, BITS, MBA, C.Govt కస్టమ్స్ & ఎక్సైజ్ ఆఫీసర్, 11 Lakhs PA, 5'9" ఎత్తు, 28 సం॥ల వరుడికి వధువు కావలెను. ✆ 9985395014 (A).

బెస్త, M.Tech, NIT, Govt AEE (R&B), 85000/- PM, 5'8" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A).

రెడ్డి/ 30Y/ 5'11"/ V.f/ B.Tech, MBA/ Own Software Company/ 36 L PA/ 100 C ఉన్న వరుడుకి తగిన వధువు కావలెను. సంప్ర: 63031 15956 (D)

Wanted Naidu Doctor Bride from Upper Middle Class below 36, 1st or 2nd for very rich Groom ME.Phd Owner of Many Colleges Including Medical & Dental Ct: 9841026779 (A)

Kamma/ B.Tech, BITS, MS/ 5'.11"/ 27/ 120K/ 25 Cr ★ BE MS/ 6'/ 26/190K/ 15 Cr ★ BE MS / 5'.10"/ 25/ 100K/ 45 Cr ★ B.Tech/ IIT/ 5'.11"/ 26/ 20Cr. తుమ్మల సుజాత ✆ 99632 32758 (B).

రెడ్డి 1990 5'8" Qly: B.Tech సివిల్ ఇంజనీర్ Sal: 4,00,000/- PM స్వంత ఇల్లు ప్రాపర్టీ కల వరుడికి అందమైన వధువు కావలెను. డై॥ 9441583395 (A)

చౌదరి 1981 6' SWE in Banglore 2Lakhs PM BCA MBA వెల్‌సెటిల్డ్ గల వరుడికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. ✆ 8897453091 (A)

SC (CNB) మాదిగ (క్రిష్టియన్) 1980 5'7" MBA SWE 6 Lakhs PA వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. ✆ 7075825246 (A)

మున్నూరుకాపు 1987 5'10" MBA (ICWA) Pvt జాబ్ 50,000/- PM వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. ✆ 8897436027 (A)

శిష్టకరణం - 38/5.4/B.Com/బిజినెస్ వెల్‌సెటిల్డ్ వెజిటేరియన్ వరునికి FC / BC డిగ్రీ వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్ కాంటాక్ట్ సెల్: 9849627019. (O)

SC మాదిగ, 27 సం॥ డిగ్రీ/10Cr రియల్ ఎస్టేట్ కంపెనీ యజమాని, అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. కుల ప్రసక్తి, ఉద్యోగం అవసరం లేదు. నేరుగా సంప్రదించండి. ✆ 77990 88457 (I).

రెడ్డి 27/ 5'10" B.Tech IIT SWE IBM 95,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. (కట్న ప్రసక్తి లేదు) ✆ 9246333320. (A)

గంగపుత్ర (బెస్త): B.Tech/ Govt. Asst. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రాన్స్‌కో/ 80,000 PM/ 5'11" ఎత్తు/ 27 సం॥ల వరుడికి వధువు కావలెను. ✆ 8340841945. (A)

విశ్వబ్రాహ్మణ (కట్న ప్రసక్తి లేదు) 27/ 5'10"/ B.Tech/ SWE/ Dell 80,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246151501. (A)

కాపు 2nd మ్యారేజ్/ కుల పట్టింపు లేదు 28/ 5'10" B.Tech/ SWE/ Infosys 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246333320. (A)

SC/ లేట్ మ్యారేజ్/ వెల్‌సెటిల్డ్/ డాక్టర్ వరుడికి/ SC/ డాక్టర్ & B.Tech, MBA వధువు కావలెను/ కుల పట్టింపులేదు. 9494731201/ 8121107338 (A)

కలహాలతో పసి మనసులకు పెనుహాని

పిల్లల ఎదుట తల్లిదండ్రులు కొట్లాడుకోవడం, మానసికంగా ఒకరినొకరు హింసించుకోవడం చేస్తుంటే- పెద్దయ్యాక ఆ పిల్లల్లో చాలా మానసిక రుగ్మతలు తలెత్తే అవకాశాలున్నాయి. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వెర్మాంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అలైస్ షేర్మర్‌హార్న్ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. ఇద్దరు వ్యక్తులు కలిసి సాగించే సుదీర్ఘ ప్రయాణంలో చిన్నచిన్న గొడవలు సహజం. అయితే వాటినే పట్టుకుని వేళ్లాడడం క్షేమకరం కాదు. ఈ బంధంలో 'మంచి కుటుంబ నిర్మాణం' అనే పెద్ద బాధ్యత తమ మీద ఉందన్న విషయం నవదంపతులు మరచిపోరాదు. దాన్ని సక్రమంగా నిర్వర్తించినప్పుడే దాంపత్య బంధానికి సార్థకత. చిన్న చిన్న గొడవలు తలెత్తినప్పుడు సామరస్యంగా, ఓపికతో పరిష్కరించుకునే నేర్పు ఇద్దరిలో ఉండాలి. అవసరమనుకున్నచోట ఓ మెట్టు దిగడానికి కూడా సంకోచించాల్సిన అవసరం లేదు.

అనవసరపు అహాలకి, అపోహలకీ పోయి దంపతులు పిల్లల ఎదుటే గొడవపడటం తగదు. పొరపొచ్చాల్ని సులువుగా పరిష్కరించుకొని భార్యాభర్తలు అన్యోన్యంగా సంసారం సాగించాలి. పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలి. అది కుటుంబంలోని పిల్లలకి కొండంత నైతిక బలాన్నిస్తుంది. కుటుంబ గౌరవంపట్ల, విలువల పట్ల ఉన్నత ఆలోచనలు నింపుతుంది. వాళ్లని సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దుతుంది. నవదంపతులు ఈ విషయాలన్నీ గుర్తెరగాలి. తోడునీడగా, పాలూ తేనెల్లా కడదాకా కలిసి ప్రయాణం సాగించడం, పిల్లలకి జన్మనిచ్చి వాళ్లని మంచి పౌరులుగా తీర్చిదిద్ది ఆదర్శ సమాజాన్ని నిర్మించడమే పెళ్లి పరమార్థం. ఈ సత్యం నవదంపతులు ఒంటపట్టించుకోవాలి.

గొడవల ప్రభావం పిల్లలపై ఎలా ఉంటుందంటే..

- దంపతులు తరచూ పిల్లల ఎదుటే గొడవపడుతుంటే అది వాళ్ల మానసిక వికాసం మీద తీవ్ర ప్రభావం చూపుతుంది.
- వాళ్లని అర్థంకాని ఒత్తిడికి గురిచేస్తుంది. వారు ఒక రకమైన అభద్రతా భావానికి లోనవుతారు.
- వారిలో తెలియని భయం పెరుగుతుంది.
- వారి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది.
- తల్లిదండ్రులు గొడవపడేటప్పుడు ఆ సమయంలో పిల్లల ప్రస్తావన వస్తూ ఉంటుంది. దాంతో అమ్మానాన్నలు గొడవపడటానికి తామే కారణమని వారు భావించే ప్రమాదం ఉంది. దీనివల్ల కుంగుబాటుకు గురవుతారు.
- చదువులో వెనకబడతారు. స్నేహితుల ముందు చులకనకు గురవుతారు.
- నలుగురిలో కలవలేరు.
- దేనిమీదా దృష్టి కేంద్రీకరించలేరు.
- బంధువులుగానీ పిల్లల స్నేహితులుగానీ వచ్చినప్పుడు వాళ్లెదుటే తమతల్లిదండ్రులు గొడవపడితే పిల్లలకి చాలా చిన్నతనంగా అనిపిస్తుంది.
- వాళ్లు తీవ్ర మానసిక వేదనకు లోనవుతారు.
- గొడవపడేటప్పుడు కొందరు భర్తలు భార్యలను చులకనగా మాట్లాడుతుంటారు. ఆడవాళ్లందరినీ చేతగానివాళ్లుగా తిడుతుంటారు. ఇలాంటి మాటలు ఇంట్లో మగపిల్లల మీద స్త్రీల పట్ల లోకువభావం ఏర్పడేలా చేస్తాయి. వారి వ్యక్తిత్వాన్ని దిగజారుస్తాయి. ఇక ఇంట్లో ఆడపిల్లలుంటే ఈ మాటలు వాళ్లని లేనిపోని భయాందోళనల్లోకి నెట్టేస్తాయి. వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని మొదలంటా దెబ్బతీస్తాయి.
- కొందరు ఆడవాళ్లు భర్తలకు సంపాదించడం చేతకాదని అవమానిస్తుంటారు. దీనివల్ల ఇంట్లోని మగపిల్లల్లో భార్యంటే ప్రతికూల ఆలోచనలు స్థిరపడతాయి. అమ్మాయిలైతే భవిష్యత్తులో అమ్మలాగే ఉండాలనే ఆలోచనకు వచ్చే అవకాశాలు లేకపోలేదు.
- మరో ముఖ్య విషయం ఏంటంటే- పిల్లలు తల్లిదండ్రులను అనుకరిస్తారు. గొడవపడుతున్న సమయంలో ఇష్టారీతిగా మాట్లాడటం వల్ల పిల్లలు దాన్నే గొప్పగా భావించే అవకాశం ఉంది. తెలిసీ తెలియని వయసు కనుక ఆ మాటలను ఇంట్లోవాళ్లు లేదా బయటివ్యక్తుల మీద యథాతథంగా ప్రయోగిస్తూ చెడ్డపేరు తెచ్చుకుంటారు.
- మరికొందరు పిల్లల్లో ఒక రకమైన నిర్లక్ష్యధోరణి ప్రబలే అవకాశం ఉంది. దేన్నీ లెక్కచేయరు. పెద్దంతరం చిన్నంతరం లేకుండా ఏదనాలో ఏది అనకూడదో తెలియని పరిస్థితికి చేరుకుంటారు. ఇలాంటివారు బడిలో తోటి పిల్లలతో గొడవలకు దిగి రోజుకో తగాదా ఇంటికి మోసుకొచ్చే ప్రమాదమూ లేకపోలేదు.

- శాలిని గుడిపాటి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

కమ్మ/ 30Y/ 5'11"/ 50k/ Fair/ 1Cr/ B.Tech/ SWE/ IBM/ వరుడికి/ వధువు కావలెను./ G.P.Rao/ 9849006361

కాపు/ 29Y/ B.Sc/ 5'6"/ సొంతబిజినెస్/ 12L PA/ వెల్‌సెటిల్డ్/ వరుడికి Any/ డిగ్రీ/ వధువు కావలెను./ కాపు/ మ్యాచ్‌లకై/ సంప్ర:/ 9010432846 (A)

కమ్మ 51 సం॥, 6 HT, FCA, ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్ విడో పిల్లలు లేరు, తెలుపురంగు, సొంత ఇల్లు, 1,25,000 P/M, 27 ఎకరాలు వ్యవసాయ భూమి కల్గిన వరుడుకి వధువు కావలెను. 9581045947 (E)

MBBS డాక్టర్ స్వంత ప్రాక్టీస్, హిందు బి.సి 63Yకు పెండ్లికి సరిపడు వధువు కావలెను. కుల మత చదువు ప్రసక్తి లేదు. నో బ్రోకర్స్. సెల్ : 79931 67334 (J)

కమ్మ / Austrila/ డైవర్సి 33Y, 6', Fair BE (CSE) $ 84,000/- AUD ఓన్లీ సన్ 1Cr తగిన కమ్మ వధువు కావలెను. ✆ 73863 38574 (B).

క్షత్రియ రాజులు, కుల, కట్న ప్రసక్తి లేదు. Govt. ఉద్యోగం, సొంత ఇల్లు, 44Y, 5'.3", 2వ పెళ్లి గల వరుడికి మంచి గుణం, సాంప్రదాయం కల్గిన వధువు కావలెను. ✆ 96520 16569 (B).

HIV 48 yrs/ రెడ్డి / వరునకు వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. సంప్ర ✆ 99856 58151 (B).

Brahmin Niyogi 36/ 5'7" Fair M.Com 50K P/M Well Settled only Sonనకు వధువు కావలెను. SNB 040 - 23304784. (A)

బ్రాహ్మణ, 6000 N, శఠమర్షణ గోత్రం, 60,000 PM, బెంగుళూరు నందు లెక్చరర్‌గా పనిచేయు వరుడికి తగిన వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. నో బ్రో॥, డైరెక్ట్. Ph: 8333896284 (Wtsp No), 6281849361 (Q)

పద్మనాయక వెలమ/ 47 సం॥/ 6'/ బిజినెస్/ స్థిరపడిన (రెండవ పెళ్ళి/ ఇద్దరు పిల్లలు) గల వరుడికి అందమైన సాంప్రదాయమైన వధువు కావలెను. సం॥ 9441200678. (A)

రజక, 32, 5'8", MBBS, MEM, జీతం: 1.5 PM వరుడికి MBBS చదివిన తగిన వధువు కావలెను. హైదరాబాద్, ✆ 9100184590/ 9989688142. (A)

యాదవ: 28 Yrs/ B.Tech, M.Tech (IIT), S/W "MNC", 15 Lak P/A, 1 Cr. property గల వరునికి ఇంజనీర్ (or) Medicine వధువు కావలెను. 96767 88428 (No Dowry) (D)

క్రిష్టియన్/ మాల: 29Y/ 5'8"/ B.Tech (Aeronautical) S/W in Banglore/ 18 Lakhs P/A/ well settled వరునికి తగిన వధువు కావలెను. No Dowry. 94419 90408 (D)

కాపు/ 5'.7"/ USAలో ఉద్యోగం చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/ అదర్ ప్రొఫెషన్‌లో తగిన వధువు కావలెను. ✆ 9490014045/ 9492246236. (C)

కమ్మ 28/ 6'/ Fair/ B.Tech, MBA/ IBM, Hyd/ 15 Lakhs PA/ 20 Crores property క్రిష్ణాజిల్లా వరునికి వధువు కావలెను. సం॥ 92999 92602 (D)

ఆర్యవైశ్య 33/ 5'11"/ MS, USA/ SWE, 80K వరుడుకు తగిన వధువు కావలెను. సంప్రదించవలసిన నెంబర్: 9849367897. (A)

★ ★ ★

సాఫ్ట్‌వేర్ కంపెనీలో హైదరాబాద్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేయుచున్న SC మాల RCM B.Tech 34/5'.8" Rs. 100000 PM సంప్రదించండి:- ✆ 7659931433. (C)

S.C మాదిగ / M.Pharm/ C.Govt Officer 75,000/- P.M, 5.8" ఎత్తు / 29 సం॥లు అందమైన వరునికి తగిన వధువు కావలెను. ✆ 83744 33600, 099458 62010, 98661 11687 (డైరెక్ట్) (J)

బ్రాహ్మణ 49 సం॥ 2వ పెళ్ళి కులపట్టింపు లేదు. లెక్చరర్ మరియు బిజినెస్. అందంగా, ఆరోగ్యంగా వుండి ఎటువంటి బాధ్యతలు లేని వ్యక్తికి తగిన వధువు కావలెను. విడోస్, రెండవ పెళ్ళివారు సంప్రదించవచ్చును. పిల్లలు ఉన్న పరవాలేదు. నో బ్రోకర్స్ Photo మరియు ఫోన్ నెంబర్, పూర్తి బయోడెటాతో సంప్ర॥ Email : v.vikas3653@gmail.com (J)

★ ★ ★

కమ్మ/ 5'6"/34 సం॥/B.Com/తండ్రి లేడు/లేటు మ్యారేజ్/ప్రైవేట్ జాబ్ వరుడుకి. వధువు కావలెను. OCలకే ప్రాధాన్యత డైరెక్ట్ పార్టీ. 91607 46756 (I).

కాపు / 36/ 5'.4"/ 40,000 PM వరునకు సంప్రదాయ కుటుంబము నుండి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Any Caste, Second Marriage ఐనా OK. No Brokers, direct. ✆ 89780 85424 (B).

కులపట్టింపులేదు, ఆర్యవైశ్య 30 సంవ॥, 5'6", M.B.A, 65 వేలు, 1.5 Cr ఆస్తి అందమైన వరునకు చదువుకున్న అందమైన వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ 8790062402 (A)

వరుడు కావలెను

Kapu 23 5'2" B.E (NIT) MBA (IIM) 10 Cr ★ 26 5'4" MBBS MD (Dermatology) 15 Cr ★ 24 5'2" BE MS 130K ★ 26 5'4" B.E MNC 10 Cr ★ 22 5'5" BDS 3 Cr ★ 9989019945 (A)

Reddy/ B.Tech/ MBA/ 29/ 5'3"/ 50Cr + (Prop) Needs well settled boy/ Cont. Sunder Reddy/ Hyd- Ph: 7093051111/ (Whatsapp) Direct Person

బ్రాహ్మణ /25/5'3"/B.Com ★ 24/B.Tech/ SWE/ 3.6L ★ 25 5'4" BDS హరితస ★ 27/ 5'3"/ B.Tech MS (US)/ SWE/ 65K ★ 26/ MBBS ★ 9492923492 (A)

రెండోపెళ్ళి/ కుల పట్టింపులేదు/ 56/ 5'3"/ Govt/ 80వేలు/ ఒక కోటి/ 43/ 5'4"/ Govt/ 60వేలు/ ఒకకోటి/ 33/ 5'2"/ 40లక్షలు/ "మాసేవ" ✆ 9291503949 (A)

CNB Late Marriage 37, B.Com, 5.5, Pvt Emp Ph: 9849674862 Whatsapp Ph: 9177391463. (2nd Marriage, P.Exq.) (A)

Kamma/ B.Tech/ 5'5"/ 22/ MNC/ 25 Cr ★ B.Tech, IIT/ 5'5"/ 22/ 12 LPA/ 10 Cr ★ B.Tech, BITS/ 5'5"/ 24/ 12 LPA/ 15 Cr తుమ్మల సుజాత. ✆ 81217 95786, 0866-2438222. (B)

Kamma/ MS, Genl/ 5'5"/ 24/ 10 Cr ★ MD, Genl/ 5'5"/ 23/ 10 Cr ★ MD, Gynec/ 5'7"/ 25/ 25 Cr ★ BDS/ 5'5"/ 23/ 20 Cr ★ MS, ENT/ 5'5"/ 24/ 2 Cr. తుమ్మల సుజాత. ✆ 99632 32758. (B)

Kamma/ BEMS/ 5'5"/ 24/ 100 K/ 15 Cr ★ BEMS/ 5'7"/ 23/ 50 Cr ★ BEMS/ 5'7"/ 23/ 140 K/ 4 Cr ★ B.Tech BITS/ MS/ 5'8"/ 23/ 100K/ 2 Cr. తుమ్మల సుజాత. ✆ 98482 17771. (B)

రెడ్డి 1994/ 5'2", B.Tech/ Amazon/ 4.5L.PA/ 10Cr./ Fair ★ 1994/ 5'5", M.Pharma/ Chennai/ 3L.P.A/ Fair. 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1994/ 5'7" B.Tech/ MS/ US/ Fair & Rich ★ 1990/ 5'4", B.Arch/ MS/ US/ H1/ 40Cr. నవీన్‌రెడ్డి M.B. 9848221166/ 9505551788 (A)

రెడ్డి 1990/ 5'5", MBBS/ MS (Gynic) IInd year/ V.Fair ★ 1994/ 5'5" MBBS/ V.Fair/ 150Cr. నవీన్‌రెడ్డి M.B. 9848221166/ 9505551788 (A)

బ్రాహ్మణ, 28Y, 5'4", గార్గేయసా గోత్రం, డిగ్రీ, Pvt. Job, రిక్వైర్‌మెంట్ ఎనీ వెల్ సెటిల్ ఫ్యామిలీ, Govt/Pvt Job. పురోహితం అయినా OK. 7285997452, 7285998665 (A)

బ్రాహ్మణ, 22, 5'3", Degree ★ 28, 5'5", Inter ★ 32, 5'5", 9th గల వధువులకు పురోహితం/జాబ్/ బిజినెస్ వరుడు కావలెను. 7075024529, 9010133726 (A)

కులపట్టింపులేదు, కాపు, 21Y, 5'4", డిప్లొమా, Pvt. జాబ్, 15K (PM) ఫెయిర్, సొంత ఇల్లు, ల్యాండ్ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (తండ్రి Late) Ph: 8897587959 (A)

అగ్నికుల క్షత్రీయ: B.Tech/ Govt.Asst ఎగ్జి॥ ఇంజనీర్/ పంచాయితీరాజ్ Dept/ 40,000/- PM, 5'5" ఎత్తు 25 సం॥ల వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

వడ్డెర : B.Tech/ Govt.Asst ఇంజనీర్/ ఇరిగేషన్ Dept/ 45,000/-PM 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

ముదిరాజ్ : 20 లక్షల ఆస్థి, B.Tech. SWE/ 30,000/-PM, 5'4" ఎత్తు 24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను ✆ 9618008271 (A)

రజక : B.Tech/ Govt.Asst ఇంజనీర్/ R&B/ 50,000/-PM, 5'5" ఎత్తు 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను ✆ 9618008271 (A)

హిందుమాదిగ : B.Tech/ Govt.Asst ఇంజనీర్/ జన్‌కో/ 50,000/-PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8297439565 (A)

గౌడ/ B.Tech, C.Govt Asst మేనేజర్ (HAL)/ 38,000/- PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9989450693 (A).

కాపు/ B.Tech, C.Govt, బ్యాంక్ P.O (సిండికేట్ బ్యాంక్/ 35,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886512010 (A).

పద్మశాలి, B.Tech, Govt. అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ (ఆడిట్ & సబ్ రిజిస్ట్రార్ Dept), 32000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298 (A).

మున్నూరుకాపు, B.Tech, Govt A.E (T.S. ట్రాన్స్‌కో), 35,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9885050879 (A).

గౌడ, B.Sc (అగ్రికల్చర్), Govt అగ్రికల్చర్ ఆఫీసర్, 30,000/- PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9703978131 (A).

బ్రాహ్మణ 25, 5'3" 10th ★ 28, 5'4" 9th ★ 30, 5'3" 10th వధువులకు వరులు కావలెను. కట్నం ఇవ్వలేరు. జాబ్, పురోహితం OK. ✆ 7674078296/ 8106446865 (A).

బ్రాహ్మణ 21, 5'4" B.టెక్, SWE, 4L ★ 23, 5'4" B.టెక్ ★ 24, 5'5" MBA, 3L ★ 25, 5'2", B.టెక్, MBA, SWE ★ 26, 5'6" MBA, 2L ★ 27, 5'3", B.ఫార్మసి, 5L ✆ 9494096081 (A).

బ్రాహ్మణ, 38, 5'3" 10th వధువుకు తగిన పురోహితం, బిజినెస్, జాబ్ వరుడు కావలెను. ✆ 9030056547, 8309527614 (A).

గాండ్ల – 25, 5'4", Red, B.Tech, SWE, MNC, B'lr. 5 L.P.A వధువుకి వరుడు కావలెను. 73822 59832, 73822 59734 (D)

బ్రాహ్మణ, 26, 5'4", వైట్, B.Tech, SWE, Accenture, 10 L.P.A వధువుకి వరుడు కావలెను. 0877 2230289, 76610 24441 (D)

బలిజ/ 25Y/ 5'5"/ V.f/ B.Tech, IT/ SWE/ TCS, Dell/ Bangalore/ 12 L/ "5" C ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. సంప్ర: 63031 15976 (D)

CNB/ 23Y/ 5'4"/ V.f/ B.Tech/ TCS/ Hyd/ 5 L/ "7" C ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. సంప్ర: 63031 57289 (D)

బ్రాహ్మిణ్ 1994, 5'4" B.Sc Pvt జాబ్ శాఖభేదం లేని అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7386443656 (A)

CNB 1984 5'4" B.Sc B.Ed Govt జాబ్ 3500/- PM వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Pvt జాబ్‌వారు కూడా సంప్రదించవచ్చు. ✆ 7396883637 (A)

ఆర్య వైశ్య 1988 5'5" B.Com Pvt జాబ్ 10,000/- PM గల వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 7396676093 (A)

బ్రాహ్మిణ్ 1980 5'4" B.Sc Pvt జాబ్ 15,000/- PM గల వధువుకు Well Settled 1, 2 సంబంధములు గల వరుడు కావలెను. ✆ 7075787950 (A)

బ్రాహ్మిణ్ (CNB) 1984 5'4" ఇంటర్ Pvt జాబ్ 6,000/- PM గల వధువుకి Well Settled వరుడు కావలెను. ✆ 9959919675 (A)

బ్రాహ్మిణ్ 1982 5'4" ఇంటర్ మధ్యతరగతి కుటుంబం గల వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 8019161676 (Whats App) (A)

Christian - M.Tech (CS) - 5'.5"-42 Late Marriage slim- V.Fair - Sr. S/WE in USA well settled seeks S/WE in USA / India. ✆ 94414 19229 (B).

బ్రాహ్మిణ్ 1992 5'4" MBA Pvt జాబ్ 20,000/- PM గల వధువుకి Pvt జాబ్ వరుడు కావలెను. ✆ 9959303982 (whatsapp) (A)

బ్రాహ్మిణ్ 1986 5'3" B.Sc B.Ed Pvt టీచర్ 15,000/-PM గల వధువుకి వరుడు కావలెను. ✆ 9959305582 (A)

కమ్మ ఓన్లీ డాటర్ 24 5'6" Fr B.Tech SWE Wipro 30,000 PM సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9290022700 (A)

కాపు ఓన్లీ డాటర్ 26 5'5" Fr B.Tech SWE Infosys 40,000 PM అందమైన సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు వరుడు కావలెను. 9866158793 (A)

పద్మశాలి 24/5'5" B.Tech/SWE/ IBM 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246151501 (A)

గంగపుత్ర (బెస్త) : MBA/ Govt/ SBI బ్యాంక్/ అసిస్టెంట్ మేనేజర్ /40,000/-PM/ 5'5" ఎత్తు / 25 సం॥ల వధువుకి వరుడు కావలెను. ✆ 8340841945 (A)

కాపు/ కుల పట్టింపులేదు (2వ పెళ్ళి) 32/5'7" B.Tech 50,000/- PM 5Cr ప్రాపర్టీ గల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. అర్జెంట్ ✆ 9550296562 (A)

వెలమ 24/5'5" B.Tech/ SWE/ TCS 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246555529 (A)

SC మాదిగ హిందూ 29/5'4" MSc/ SBIలో డిప్యూటీమేనేజర్ / Hyd 60,000/- PM V.V.Fair వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8712865419 (A)

గౌడ 24/5'5"/B.Tech IIT/ SWE/ IBM 45,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246964555 (A)

చౌదరి / విడో /32/5'4"/ డిగ్రీ /Full Fair/ బిజినెస్ /20 కోట్ల ఆస్తి, ఏకైక కూతురు గల అందమైన వధువుకు 1,2వ వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. వాట్సాప్ ✆ 8096147626 (A)

రెడ్డి / డైవర్సీ / 30Y/5'5"/ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ /15 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ✆ 9908000566 (A)

చౌదరి/ విడో /35/5'5"/ డిగ్రీ / V.Fair / ఓన్ రైస్ మిల్లు/ పెళ్ళైన కొద్ది నెలలకే భర్తను కోల్పోయింది. 26కోట్ల ఆస్తి గల అందమైన వధువుకు 1, 2 వ వరుడు కా॥ కుల్, ఆస్తి ప్రసక్తి లేదు. వాట్సాప్ ✆ 9705344628 (A)

కమ్మ 23 5'6" ఫెయిర్ B.Tech SWE Wipro 35,000/-PM అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 9908220037 (A)

SC మాల 23, 5'5" ఫెయిర్ B.Tech (CBIT), ఆంధ్రాబ్యాంక్ P.O. 35 వేలు P/M. అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వరుడు కావలెను. ✆ 9948005247 అర్జెంటు. (A)

SC మాదిగ 23/ 5'5" M.Tech A.E.E. ఇరిగేషన్ Dept. 35,000/- PM అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వరుడు కావలెను. ✆ 9666148352 అర్జెంటు. (A)

వైశ్య 23, 5'6" ఫెయిర్ B.Tech SWE Oracle 35,000/- PM వెల్‌సెటిల్డ్ వధువుకి వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 9533855373. (A)

కాపు / విడో/ 26 Yrs/ B.Tech/ హైదరాబాద్‌లో 2 షాపింగ్ కాంప్లెక్సులు 2 అపార్ట్‌మెంట్స్ మంత్లీ 16 లక్షలు రెంట్స్ వస్తూ పేరెంట్ లేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (ఆస్తి , కుల ప్రసక్తి లేదు) Contact: whatsapp 90304 58459 (B).

కమ్మ50 సం॥ 5.3 HT M.com కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్. విడో పిల్లలు లేరు, సొంత ఇల్లు 18 ఎకరాలు వ్యవసాయ భూమి కలిగిన మహిళకు వరుడు కావలెను. 9581045947 (E)

మాల : MBBS, MD (Peadiatrics), / 5'.5"/ 26Y/ V.Fair/ 5 Cr/1 లక్ష జీతంతో జాబ్ చేస్తున్న వధువు కొరకు (అర్జంట్)గా సంప్రదించండి. ✆ 92484 94810, 81214 94810 (B).

బ్రాహ్మిణ్/ 26/ 5'5"/ డిగ్రీ/ అందమైన వధువుకి, వరుడు/ కావలెను. శాఖ పట్టింపులేదు/ బిజినెస్ & జాబ్ & పురోహితం OK/ 8978691424/ 040-48542181 (A)

మాల : B.Tech (IIT), MBA (IIM), / 5'.4"/ 28Y/ V.Fair 20Cr/ 1 లక్ష జీతంతో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్న వధువు కొరకు (అర్జంట్)గా సంప్రదించండి. ✆ 81065 01199, 90320 94810 (B).

2వపెళ్ళి/ కాపు/ 38Y/ Govt/ 50000PM/ సాంప్రదాయ/ వధువుకి/ తగిన/ వరుడు/ కావలెను/ కుల, పట్టింపులేదు. ఇల్లరికం Ok/ 6309593020 (A)

రెడ్డి డైవర్సీ/ 34/ Pvt జాబ్, 35K/ రెంట్స్ 30K/ వెల్‌సెటిల్డ్, ఒంటరి/ వధువుకు వరుడు/ కావలెను, కుల/ ఆస్తి పట్టింపులేదు/ 9052327622/ 9052327553 (A)

వైశ్య/ 23/ 5'3"/ V.ఫేర్/ డిగ్రీ/ Pvt జాబ్/ 20K PM/ అందమైన వధువుకి తగిన/ వరుడు/ కావలెను./ 9059158811 (A)

CNB/ Govt/ డాక్టర్/ MBBS/ MD/ పిల్లలులేని/ 2nd M/ 38/ తల్లితండ్రి డాక్టర్స్/ వధువుకి/ వెల్‌సెటిల్డ్ బిజినెస్ SWE, డాక్టర్స్ కావలెను. ✆ 9393939962 (A)

కమ్మ/ USA, 32Y, 5'.6", Fair, MS, H1B $ 70K P/A, 2 Cr USలో ఉన్న కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574 (B).

యాదవ 28/ 5'6"/ BA/ Pvt. Job ఒంటరికి ఇల్లరికం కావాల్సిన వారు మాత్రమే ఫొటో Whatsappలో send చేయండి. 9908221568 డైరెక్ట్. (A)

క్షత్రియ 24/ 5'5"/ V.Fair/ B.Tech, MS/ Manager, B'lore/ 15 Lakhs PA/ 30 Crores property ఉన్న వధువుకు వరుడు కావలెను. సం॥ 93944 66119 (D)

రెడ్డి 25/ 5'5"/ V.Fair/ M.Tech/ MNC, B'lore/ 12 Lakhs PA/ 25 Crores property ఉన్న వధువుకు వరుడు కావలెను. సం॥ 93966 55166 (D)

కాపు 22/ 5'6"/ V.Fair/ B.Tech/ Tech Mahindra, B'lore/ 8 Lakhs PA/ 5 Crores property ఉన్న వధువుకు వరుడు కావలెను. సం॥ 81061 68806 (D)

వెలమ 27/ 5'4"/ V.Fair/ MDS/ Own Hospital, Hyd/ 100 Crores property / Only Daughter వధువుకు వరుడు కావలెను. సం॥ 97045 21575 (D)

రెడ్డి/విడో/ 25Y/ 5'.5"/ ఫెయిర్/ B.Com/ కోట్ల ఆస్తి/ యాక్సిడెంట్‌లో భర్తను తండ్రిని కోల్పోయిన అందమైన వధువుకు వరుడు కావలెను. కులఆస్తి ప్రసక్తిలేదు. ✆ 7075605300. (C)

రెడ్డి/విడో 29 Yrs/ B.Tech/ 22 కోట్లు ప్రోపర్టీ కల్గి పిల్లలు లేని అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు) మీ ఫొటో Detals Whatsappలో Send చేయండి. ✆ 9030916673. (C)

★ ★ ★

బెంగళూరులో సా॥వే॥ ఇంజనీరుగా పనిచేయుచున్న SC మాల డైవోర్సీ RCM MCA 36/5'.3" Rs: 60,000/- PM వధువుకు వరుడు కావలెను. ✆ 9948449791కు ఫొటో & బయోడేటా వాట్సాప్ చేయగలరు. (C)

హిందూ, మాల, 27Y, 5'.3", Fair, Only Daughter, M.Tech, SBI (PO) చేస్తున్న వధువుకి స్టేట్ / సెంట్రల్ Govt. ఆఫీసర్స్ / సాఫ్ట్‌వేర్ IIT, IIM 12L P/A వరుడు కావలెను. నో బ్రోకర్స్ ✆ 98480 21963 (B).

★ ★ ★

పద్మశాలి లేటు మ్యారేజ్ 39 సం॥ 5'.1" BA, సెల్ఫ్ ఎంప్లాయి & 10 వేలు నెలకు Rent వస్తున్న వధువుకు వరుడు కావలెను. 1వ, 2వ అయిన ఫర్వాలేదు. డైరెక్టు వాట్సాప్ ✆ 9618311448. (C)

కాపు 29/ 5'.4", V.Fair (CA) 1 కోటి 50 లక్షలు ప్రాపర్టి గల అందమైన రూపవతికి Any SWE వారు డైరెక్ట్‌గా సంప్రదించగలరు. ✆ 78429 45655 (B).

వివాహ వేదిక

20సం॥ల అనుభవంగల బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహవేదిక ✆ 9849414098/ 040-66317515 satyasaivivahavedika.com (A)

JEELAKARRABELLAM.COM వెబ్‌సైట్‌లో ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసుకోండి Free Subscription పొందండి. Marriage Mediators కు Special Packages కలవు. వివరాలకు. ✆ 97016 59125. (I).

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

కులపట్టింపులేని వారికి అన్నికులాల 1వ/ 2వ/ లేటు/ విడో/ డైవర్సీ/ విడోయర్స్/ పెన్షనర్స్ వ॥ 20-70సం॥ స్త్రీలకు.. ఫ్రీ, పు॥ సర్వీస్‌చార్జ్ త్వరగా సంబంధం కుదుర్చబడును. 7893688248 (A)

P.Supriyareddy, Rich Reddy Boys & Girls India & Abroad Matches, All Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from all Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762. Email: palletisupriyareddy@gmail.com (A)

15 రో॥ అన్ని కులాలవారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతిపెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com ✆ 98490 58673, 94418 29644, W-94407 85888. (B)

పద్మశాలి వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865 / Blue Trend Matrimonia (P) Ltd (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com. Hyd: 9440831748, GNT: 9440759945, VSP: 9441735157 (A)

Whatsapp your Photo & Biodata to 9347262769. We will send the suitable matches. www.pellisandadi.com. Estd: 1991 (A)

మాల స్పెషల్: IAS, IPS, IRS, IRTS, MBBS, MD M.S, USA, Govt Jobs, SWE. 78930 13265 (N).

విశ్వబ్రాహ్మణ ఆంధ్ర, తెలంగాణ వధూవరులకు వివాహ సంబంధములు చూడబడును. లేట్ మ్యారేజ్/ 2 వ సంబంధములు కుదుర్చబడును. భాస్కర్రావు, Hyd. ✆ 9848486847/ 9493488853

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్‌క్యాస్ట్) MBBS/ MD/MS/ MCH/ OM/ BDS & బిజినెస్‌మ్యాన్స్‌కి 1వ/ 2వ/ విడో, దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9966808059 (A)

కుల పట్టింపులేని వారికి 2వ లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2PM- 5PM పరిచయవేదిక జరుగును. 1000 మంది వధువరుల లీస్ట్ ఇవ్వబడును. Hyd ✆ 9440937900 (A)

ఓన్లీ Govt. ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్ని మతాల, కులాల 1 వ, 2 వ, లేట్, వీడో/ డైవర్స్‌లకై వివాహాలు & Govt ఎంప్లాయిస్ సంబంధాలు కొరకు వెరిఫాస్ట్ సెటిల్‌కై ✆ 9000185415 (A).

యాదవ/ కాపు/ బ్రాహ్మణ/ S.W.E/ డాక్టర్/ U.S.A/ బిజినెస్/ 2nd/ కన్వర్ట్/ Govt. ఉన్న అమ్మాయి, అబ్బాయిలకు తగిన సంబంధాలు కుదర్చబడును. సాయిప్రసాద్, కాకినాడ, ✆ 97059 65155. (G)

Specially Doct. (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MDS & డా॥కి మాత్రమే. 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులముల వారికి కుదర్చబడును. ✆ 9866411588. (A)

అన్ని కులముల, కులాంతర దేశ, విదేశ 1వ, 2వ, డాక్టర్, Engr, Govt., P. Job వివాహ సంబంధాలకై హేమ ✆ 8497939432. (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి: S.N.శర్మ, Hyd. ✆ 9248600342, 8019207503, brahmininformationmatri@gmail.com (A)

అన్ని కులాల వారికి: డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, అబ్రాడ్స్, బిజినెస్, హైరిచర్స్ & ఆల్ గౌట్ ఎంప్లాయిస్ 1వ, 2వ, దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును. ✆ 9121010959. (A)

ఓన్లీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్: OC, BCలు మాత్రమే. డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, గౌట్ ఎంప్లాయిస్, అబ్రాడ్స్, బిజినెస్ మ్యాన్స్ & ఆల్ దేశ/ విదేశీ సంబంధాలకై ✆ 9959305599. (A)

గ్యారెంటి వారంలో పెళ్ళి ఫిక్స్, మా యూట్యూబ్ ఛానెల్‌లో ప్రతిరోజు వధూవరుల వివాహ పరిచయ వేదిక YouTube/ Briden Groom Matrimony లో అన్ని మ.కులాల వారికి. 9392489648/ 8341414287 (A)

Only Doctors Banglore based Hi-Profiles. WhatsApp - Photo/ Bio-Data. ✆ 7899166615. (A)

మాదిగ మాల వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Suresh ✆ 7702262508/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

Fairlinksmatrimony.comలో ఉచితంగా Login అవ్వండి మీకు తగిన సంబంధం ఎంపికచేసుకొని వివాహం కుదుర్చుకోండి. వైజాగ్ 93911 66116, నెల్లూరు 93944 66117, VJA 93955 66114

★ ★ ★

వాసవి – విజయవాడ (ర) వారి 55వ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక మరియు 11వ పునర్వివాహ పరిచయవేదిక 15.7.2018 తేదీన I.V. ప్యాలెస్, విజయవాడ నందు ఉ. 9 గంటలకు మరియు మధ్యాహ్నం 2 గంటలకు జరుగును. వివరాలకు: 99120 26286, 81064 54284. (B)

కమ్మ వారి వివాహ సంబంధముల కొరకు సంప్రదించండి. SVS కన్సల్టెన్సీ, నూజివీడు. ✆ 95050 42422. స్త్రీలకు రిజిస్ట్రేషన్ ఫ్రీ. డైరెక్ట్ somasekharsiripurapu@gmail.com (B).

హాయ్

నందమూరి వారసుడిగా వచ్చి.. 'తొలి చూపులోనే' భలే ఉన్నాడే అనిపించుకున్నాడు. గెలుపోటములతో సంబంధం లేకుండా వైవిధ్యభరితమైన చిత్రాలతో అలరిస్తున్నాడు. కొత్త తరహా సినిమాలు నిర్మించి 'అసాధ్యుడు' అని పేరు తెచ్చుకున్న కళ్యాణ్‌రామ్ 'హాయ్'కి చెప్పిన కబుర్లు..

నేనేం జూదమాడి పోగొట్టుకోలేదు!

■ కెరీర్ జోరు మీదున్నట్టుంది?

నిజానికి ఇలాంటి రోజుల కోసమే ఇన్నాళ్లూ ఎదురుచూశా. నా కెరీర్ ఎలా ఉండాలని అనుకున్నానో అలా ఉంది. ఒకప్పటి కంటే నేనిప్పుడు బాగా ఆలోచిస్తున్నానా? లేదంటే అప్పుడు తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు ప్రతిఫలాన్ని ఇవ్వడం మొదలెట్టాయా? అనేది మాత్రం నాకు తెలీదు. దేనికైనా టైమ్ రావాలి అంటారు కదా? ఇది వరకు ఒకే సినిమాపై దృష్టి పెట్టేవాణ్ని. కథ బాగుంటే చాలు.. నేను ఎలా ఉన్నా ఫర్వాలేదు అనుకునేవాణ్ని. కథే కాదు.. దాన్ని మోసే కథానాయకుడూ బాగుండాలి అనే విషయం మెల్లమెల్లగా అర్థమైంది. కొన్ని కథలు, పాత్రలు 'నేను చేయలేను' అనుకునేవాణ్ని. ఆ భయాలు మెల్లగా పోతున్నాయి.

■ ఏ సినిమాతో ఈ మార్పు మొదలైందనుకుంటున్నారు?

'ఇజం'తో కొంత నేర్చుకున్నా. చాలా కోణాల్లో ఓపెన్ అయ్యా. బాడీ, స్టైల్... ఇవన్నీ మారాయి. 'పటాస్' నన్ను మరో రకంగా మార్చింది.

■ 'ఓం' త్రీడీ.. మీ కెరీర్‌లో పెద్ద పొరపాటు అనుకుంటున్నారా?

ఆ సినిమా పోయింది కాబట్టి.. 'తప్పు చేశానేమో' అనే ఆలోచన వచ్చింది. బాగా ఆడితే.. 'కల్యాణ్‌రామ్ చేసింది కరెక్టే' అనుకునేవారు కదా! 'ఓం'తో కొత్తగా ఏదో చేయాలనుకున్నా. అప్పటికి మనకు త్రీడీ అంతగా తెలీదు. 'ఆ టెక్నాలజీ చూపిద్దాం' అనుకున్నా. ఏదైనా కొత్త టెక్నాలజీ ప్రవేశపెడుతున్నప్పుడు అందులో ఉన్న ఇబ్బందులు ముందు అర్థం కావు. రోజులు గడుస్తున్న కొద్దీ అనుభవంలోకి వస్తాయి. ఆ సినిమా విషయంలోనూ అదే అయ్యింది. కెమెరా అమర్చుకోవడానికే గంట పట్టేది. ఓసారి కెమెరా సెట్ చేస్తే.. ముందుకూ, వెనక్కి కదిపే అవకాశం ఉండేది కాదు. హాలీవుడ్ సాంకేతిక నిపుణుల్ని ఇక్కడికి తీసుకొచ్చి పనిచేయించడం భారమైపోయింది. వాళ్లు గంటకింత అని తీసుకునేవారు. దాంతో బడ్జెట్ నా చేయిదాటి పోయింది. మూడేళ్ల శ్రమ ఆ సినిమా. నా కష్టం, డబ్బు అన్నీ దాంట్లో పెట్టా. ఆ రిజల్ట్ చాలా పెద్ద షాక్ ఇచ్చింది. డబ్బులు బాగా పోయాయి. నేనేం జూదమాడి డబ్బులు పోగొట్టుకోలేదు కదా? సినిమాల్లోనే కదా పోయింది అని సరిపెట్టుకున్నా.

■ సినిమాల్లో కోట్లు కోట్లు పోగొడుతున్నప్పుడు నాన్న హరికృష్ణగారు అడ్డుచెప్పేవారు కాదా?

అడిగేవారు. అలాగని ప్రతీదాంట్లో కలుగజేసుకోరు. 'జాగ్రత్తపడు నాన్నా!' అని చెప్తారంతే. సినిమా అనేది చాలా కష్టమైన ప్రక్రియ. మా కష్టం ఎవరికీ తెలీదు. ఫలితం మాత్రమే చూస్తారు. ఏది హిట్టవుతుందో, ఏది పోతుందో చెప్పగల మొనగాడు ఇప్పటి వరకూ పుట్టలేదు. 'అనుకున్న బడ్జెట్‌లో సినిమా పూర్తిచేయడమే' సక్సెస్. ఈ విషయం మాత్రం నాన్నగారు చెబుతుంటారు. ఆయనా ఓ నిర్మాతే కదా.

■ చిన్నప్పుడు నాన్నగారు బాగా స్ట్రిక్ట్‌గా ఉండేవారా?

నాన్నగారితో కలిసి ఉన్నది చాలా తక్కువ. ఆయన ఎక్కువగా తాతగారితోనే గడిపేవారు. అటు సినిమాలు, ఇటు రాజకీయాలు అంటూ తాతయ్య ద్విపాత్రాభినయం చేసేవారు. తాతగారు ఎక్కడికి వెళ్లినా నాన్నగారు తోడుండేవారు. కాబట్టి మాతో గడిపే అవకాశం ఉండేది కాదు. కానీ ప్రతి ఆదివారం బయటకు తీసుకెళ్లేవారు. మా చదువులు పెంపకం అన్నీ అమ్మ చేతుల మీదుగానే. అమ్మ మాత్రం బాగా స్ట్రిక్టు. మార్కులు తక్కువ వచ్చినా, పెద్దవాళ్లతో గౌరవంగా మాట్లాడకపోయినా అస్సలు ఊరుకునేది కాదు.

■ మీ పిల్లల విషయంలో మీరు ఎలా ఉంటున్నారు?

నేనంత స్ట్రిక్ట్ ఫాదర్‌ని కాదు. నా స్టాఫ్ దగ్గరే కఠినంగా ఉండలేను. అలాంటిది పిల్లల దగ్గర ఎందుకు ఉంటాను? ఇది చేయకు, అలా ఉండకు అని పరిమితులు విధించను. వాళ్లది ఎదిగే వయసు. వాళ్లకు వాళ్లుగా కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ఇప్పటి నుంచే నా అభిప్రాయాల్ని వాళ్లపై రుద్దకూడదు. టైమ్, మనీ ఇలాంటి విషయాల గురించి వాళ్లకు అర్థమయ్యేలా చెబుతుంటా. మా అబ్బాయి స్టార్ వార్ కత్తి కావాలని అడిగాడు. 'సరే.. ఇస్తా.. కానీ దానికంటే లిగో ఫజిల్ బాగుంటుంది. కత్తిని ఒకేలా వాడతావు. అదే ఫజిల్ అంటే.. ముప్ఫయ్ రకాలుగా వాడుకోవొచ్చు.. నీ మెదడు కూడా చురుగ్గా ఉంటుంది' అని చెప్పా. నిర్ణయం వాడిదే.. కానీ ఏది మంచో, చెడో మనం చెప్పాలి. పిల్లలు ఏది కోరుకుంటే అది ఇస్తే పాడైపోతారు. వాళ్లకు కొన్ని వస్తువుల విలువ తెలియాలి. తల్లిదండ్రులంతా నాలానే ఆలోచిస్తారేమో.

■ మళ్లీ సినిమాల విషయానికి వస్తే.. 'ఎన్టీఆర్' బయోపిక్‌లో చైతన్యరథం నడిపేది మీరేనట కదా?

ఏమోనండీ..ఇప్పుడు సమీకరణాలన్నీ మారిపోయాయి కదా? ఇప్పుడేం జరుగుతుందో నాకు తెలీదు. నిజానికి ఇప్పటి వరకూ నన్నెవరూ అడగలేదు. ఓసారి తేజగారు 'బయోపిక్‌లో నువ్వొక రోల్ చేయాలి' అన్నారంతే. కానీ ఆ పాత్రేమిటి? అనేది తెలీదు. ఇప్పుడు ఆయన మారిపోయారు కదా!

■ ఎన్టీఆర్ ఆర్ట్స్‌లో సినిమా చేసినవాళ్లకు బయటి కంటే ఎక్కువ పారితోషికాలు ఇస్తారట కదా? నిజమేనా?

ఎక్కువ తక్కువలు తెలీదుగానీ, మేం ఎవరి కష్టాన్నీ ఉంచుకోం. అది మా పాలసీ. నేను కష్టపడతాను గానీ, పక్కవాళ్ల కష్టాన్ని ఉంచుకోను. 'ఇంత పని చేస్తే ఇంతే ఇచ్చాడేంటి' అని వాళ్లెప్పుడూ తిట్టుకోకూడదు.

– మహమ్మద్ అన్వర్
ఫొటో: మధు

రొమాన్స్ అంటే వెనుకడుగే..

■ 'నా నువ్వే'లో కొత్తగా కనిపిస్తున్నట్టున్నారు?

మీసం, గడ్డం తీసేస్తే నేనెలా ఉంటానో నాకే తెలీదు. 'ఈ లుక్ ఒక్కసారి ట్రై చేస్తే ఎలా ఉంటుంది' అనిపించింది. 'నా నువ్వే' ఓ ప్రేమకథ. పైగా సున్నితమైన మనస్తత్వం ఉన్న పాత్ర, బాగా చదువుకున్నవాడు, ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాడు.. అందుకే ఇలాంటి లుక్ అయితే బాగుంటుందనిపించింది.

■ ఈ సినిమాలో రొమాన్స్ బాగా చేశారట?

లవ్‌స్టోరీ కదండీ. రొమాన్స్ చేయాల్సిందే. లేకుంటే...జోడీ బాలేదంటారు. లిప్‌లాక్ అంటారా? కథ డిమాండ్ చేస్తే తప్ప అలాంటిసన్నివేశాలు నాకిష్టం ఉండదు. 'లిప్‌లాక్‌తోనే రొమాన్స్ పండుతుంద'న్నా నమ్మను. నిజానికి నాకు రొమాన్స్ అంటే భయమే. ఆ విషయంలో ఎప్పుడూ ఓ అడుగు వెనక్కే!

■ మ్యూజిక్.. మ్యాజిక్

మా పిల్లల దగ్గర సినిమాల గురించి అస్సలు మాట్లాడను. కానీ వాళ్లలో సినిమాలపై ఆసక్తి ఎక్కువే కనిపించింది. మా అమ్మాయికి మ్యూజిక్ ఇష్టం. టీవీలో పాటలు చూస్తుంటుంది. పొద్దుటే లేచి వరుసగా సినిమాలు చూసేస్తుంది. 'అదేంటి.. ఆ సినిమా చాలాసార్లు చూశావ్ కదా' అని అడిగితే 'బాగుంటుంది డాడీ.. మళ్లీ చూద్దాం' అంటూ నన్నూ కూర్చోబెట్టేస్తుంది. మా అబ్బాయి టాలీవుడ్ దాటేసి హాలీవుడ్ రేంజ్‌కి వెళ్లిపోయాడు. వాడికిప్పుడు 'ఎవేంజర్స్' పిచ్చి పట్టుకుంది. 'హ్యారీ పోర్టర్' సిరీస్ మొత్తం చూశాడు. వాడి కోసం నేను మళ్లీ చూడాల్సి వచ్చింది. పాపకి మ్యూజిక్ ఇష్టం.. బాబుకు మ్యాజిక్ ఇష్టం.

■ శ్రీమతే నా స్ఫూర్తి

నాకు స్ఫూర్తి.. మా ఆవిడే. తనే నాకు అన్నీ. కాస్త అలసటలో ఉంటే చాలు 'ఏంటి ఇలా ఉన్నావ్.. ఇలా ఉండకూడదు కదా' అని ఏవో కొన్ని మాటలు చెప్పి నాలో ఉత్సాహాన్ని రేపుతుంది. నాకు నటన ఒక్కటే పని. తనకు చాలా ఉన్నాయి. ఇల్లు, పిల్లలు, కుటుంబం.. ఇలా ఒక్క చేత్తో ఎన్ని పనులు చక్కబెడుతుందో? 'మీతో కలిసి నాకు ముగ్గురు పిల్లలు' అంటుంటుంది. తనపై నాకున్న ప్రేమని నేను వ్యక్తీకరించలేను.

■ అలా వాడుకోవడం నచ్చదు

నాన్నగారితో సినిమా చేయించాలని నాకుంది. కొన్ని కథలు రాయించా. కానీ వర్కవుట్ అవ్వలేదు. 'నాన్న కోసం అది చేశా, ఇది చేశా' అని చెప్పడం నాకు ఇష్టం లేదు. నా ఆఫీసులో ఆయన కోసం చాలా కథలున్నాయి. కానీ నాకు సంతృప్తినిచ్చే స్క్రిప్టు ఎక్కడా దొరకలేదు. నా సినిమాలో సీన్‌లోనో, పాటలోనో ఆయన్ని తీసుకొచ్చి.. వాడుకోవడం నాకు నచ్చదు. ఫ్యామిలీని ఓ పాట కోసం వాడేసుకోవడం నా పాలసీ కాదు.

■ చిరంజీవి..నాగార్జున..వెంకటేష్

అమెరికాలో మల్టీప్లెక్స్‌ల్లో 'పాస్' పద్ధతి ఉండేది. పాస్ తీసుకుంటే ఎన్ని సినిమాలైనా.. ఎన్నిసార్లయినా.. చూడొచ్చు. అప్పట్లో చిరంజీవిగారి సినిమాలు బాగా చూసేవాడ్ని. ఆయన డాన్సుల్లో ఓ గ్రేస్ ఉండేది. 'శివ' చూశాక 'అరె నాగ్ భలే ఉన్నాడే' అనిపించింది. 'సూర్య ఐపీఎస్', 'శత్రువు' సినిమాల్లో వెంకటేష్‌గారి కండలు చూసి ఫ్యాన్ అయిపోయాను. ఇప్పటికీ సినిమాల్ని బాగా ఆస్వాదిస్తుంటా.

ఆ పేరుతోనే పుస్తకం రాస్తా..

నా సావు నేను చస్తా, నీకెందుకు..? 'పెళ్ళిచూపులు'లోని ఈ మాటను అంత తొందరగా మరిచిపోలేం. ఆ సంభాషణని ప్రియదర్శి పలికిన విధానం, కౌశిక్ పాత్రలో ఆయన ఒదిగిపోయిన వైనం ప్రేక్షకులకు అంతగా నచ్చింది. ఆ చిత్రంతోనే ఆయన జీవితం మలుపు తిరిగింది. భిన్నమైన పాత్రలతో దూసుకెళుతున్న ప్రియదర్శి అంతరంగం..

● పుస్తకం రాయడం పూర్తయిందా?

ప్రస్తుతానికి ఆలోచనలతో నింపుతున్నానండీ. చిత్రసీమలో ఒక్కో అనుభవం ఒక్కో పేజీకి సరిపోయేలా ఉంది. ఇక వాటికి అక్షరరూపం ఇవ్వాలి. ఎప్పుడు పూర్తయ్యేది ఇప్పుడే చెప్పలేను.

● పుస్తకం పేరు అదేనా..?

'నా సావు నేను చస్తా.. నీకెందుకు?' ఆ డైలాగే కదా నాకు పేరు, గుర్తింపు తెచ్చింది. అందుకే ఆ పేరుతోనే పుస్తకం రాస్తాను. నిజానికి ఎమ్.ఎ చదివే రోజుల్లోనే నేను కూడా ఏదైనా పుస్తకం రాయాలనుకునేవాణ్ని. కానీ ఇప్పుడేం చేశామని పుస్తకం రాయడం అని ఆగిపోయా. భవిష్యత్తులో ఏదైనా సాధించాక మాత్రం తప్పకుండా పుస్తకం రాస్తాను.

● హాస్య ప్రధానమైన పాత్రలే కాకుండా... సీరియస్‌గా సాగే పాత్రలపై కూడా దృష్టిపెడుతున్నట్టున్నారు?

'పెళ్ళిచూపులు' కంటే ముందు చేసిన అన్ని సినిమాల్లోనూ నేను ప్రతినాయకుడి పాత్రలే వేశాను. వాటిలో కొన్ని విడుదల కాలేదు. కామెడీ చేస్తానని కలలో కూడా ఊహించలేదు. ఎలాగూ కథానాయకుడిని కాలేను. నటుడంటూ అయితే అది విలనే అవుతాననుకున్నా. అయితే దర్శన్ అని నాకొక తమిళ స్నేహితుడు ఉన్నాడు. వాడు తీసే షార్ట్‌ఫిల్మ్‌లో నాకో పాత్ర ఇచ్చాడు. అది చేశాక నేను కామెడి చేయగలనని ఓ నమ్మకం ఏర్పడింది. నా స్నేహితుడు తరుణ్‌భాస్కర్ 'పెళ్ళిచూపులు'లో కౌశిక్ పాత్ర ఇచ్చాడు. ప్రస్తుతం హాస్య ప్రధానమైన పాత్రలతో పాటు, అప్పుడప్పుడు సీరియస్‌గా సాగే పాత్రల్లోనూ కనిపిస్తున్నా. 'వైఫ్ ఆఫ్ రామ్'లో పోలీసు అధికారిగా కనిపిస్తా. నవ్వించను కానీ... ఆ పాత్ర బాగుంటుంది.

● నటుడవ్వాలనే కోరిక చిన్నప్పట్నుంచీ ఉందా?

చిన్నప్పట్నుంచి ఉన్న కోరికే అది. ఒక రకంగా నన్ను పెంచింది సినిమాలే. గొప్ప గొప్ప దర్శకులు, నటుల సినిమాల్ని చూసి ప్రభావితమయ్యా. దానికి తగ్గట్టే నా విద్య సాగింది. మాస్ కమ్యూనికేషన్‌లో పీజీ చేశా. నేను చదువుకున్న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నేర్చుకోవడానికి ఎంతో మేలు చేసింది. నా గురువు భిక్షుగారు నన్ను నేను తెలుసుకోవడానికి సహాయం చేశారు.

● ఇండస్ట్రీలోకి రావడానికి సినిమా కష్టాలు ఏమైనా ఎదుర్కొన్నారా?

పస్తులొక్కటే ఉండలేదు. మా నాన్న ప్రొఫెసర్ కాబట్టి తిండికి ఇబ్బందేమీ లేదు. బండి కొనిచ్చి, పెట్రోల్‌కి సరిపడా డబ్బులు ఇచ్చేవాళ్లు. పీజీ అయ్యాక కొన్నాళ్లు ఒక గ్రాఫిక్స్ కంపెనీలో ఉద్యోగం చేశా. ఆ తర్వాత సినిమాల్లో ఆసక్తి ఉండటంతో స్నేహితులతో కలిసి లఘు చిత్రాల్లో నటించడం, తీయడమే నా పని. ఆ ప్రక్రియలోనే తరుణ్ భాస్కర్, దర్శన్, ప్రణీత్, కిషోర్, అరుణ్ వీళ్లంతా కలిశారు. వాళ్లు నన్ను కొన్నిసార్లు నటన కోసం, మరికొన్నిసార్లు సాంకేతిక సహాయం కోసం పిలిచేవాళ్లు. నేను తీసే లఘు చిత్రాల కోసం వాళ్లూ వచ్చేవాళ్లు. మేం తీసిన లఘు చిత్రాలతో అవకాశాల కోసం సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగేవాణ్ని. ఇంట్లో కొడుకు సినిమాలంటూ ఇలా తిరిగితే తల్లిదండ్రులు ఎవరైనా భయపడతారు కదా. మా ఇంట్లోనూ అంతే. ఏదైనా ఉద్యోగం చూసుకో అనేవారు. 'టెర్రర్' సినిమా కోసం దర్శకుడు సతీష్ కాశెట్టి ఆడిషన్స్ నిర్వహిస్తే, అందులో నేను ఎంపికయ్యా. ఆ సినిమా తర్వాత ఇంట్లో వాళ్లకి ఓ నమ్మకం ఏర్పడింది.

● నటుడిగా స్థిరపడినట్టే అని మీకెప్పుడు నమ్మకం ఏర్పడింది?

'బొమ్మలరామారం', 'టెర్రర్' తర్వాత ఇక ఇక్కడే నేను, నా జీవితం అంతా ఇలాగే ఉంటుందనిపించింది. ఎన్ని కష్టాలొచ్చినా సినిమాల్లోనే ఉండాలని భావించా. 'పెళ్ళిచూపులు' తర్వాత చేతినిండా పని దొరికింది. వీడు నటుడు అని గుర్తించారంతా. అవకాశాల కోసం నేను ఏ ఆఫీసుల చుట్టూ తిరిగానో, వాళ్లే పిలిచి అవకాశం ఇచ్చారు.

● ఐదేళ్ల ప్రేమ... ఆ తర్వాత పెళ్ళి

ఈ మధ్యే పెళ్లి చేసుకొన్నా. నా భార్య పేరు రిచా. మాది ప్రేమ వివాహం. ఐదేళ్లు ప్రేమించుకున్నాం. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో చదువుకునేటప్పుడు రిచా నాకు సీనియర్. తనతో నాకు ఏమాత్రం పరిచయం లేదు. ఫేర్‌వెల్ పార్టీలో తొలిసారి కలిశాం. వాళ్లు వెళ్లిపోతున్నారు కాబట్టి.. కంగ్రాట్స్ చెప్పానంతే. ఆ తర్వాత మేం మళ్లీ కలిసింది లేదు. రెండేళ్ల తర్వాత అనుకుంటా, ఫేస్‌బుక్‌లో కలిశాం. ఒకరినొకరు పలకరించుకొన్నాం. ఆ తర్వాత మంచి స్నేహితులమయ్యాం. నా కంటే ముందు తనే సెటిల్ అయ్యింది. రిచా రైటర్. ఒక కంపెనీలో తను భాగస్వామి, అలాగే ఆ కంపెనీకి సోషల్ మీడియా మేనేజర్‌గా కూడా వ్యవహరిస్తోంది. మేం మంచి స్నేహితులం కాబట్టి ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసు.

● సినిమాల కోసం కథలేమైనా రాసుకొన్నారా?

రాసుకొన్నారా అంటారేంటి? స్క్రిప్టులు పట్టుకొని నిర్మాతల కోసం తెగ తిరిగామండీ. సినిమా కష్టాలంటే తెలిసింది అప్పుడే. కానీ కచ్చితంగా దర్శకత్వం చేస్తాను. ఆ విభాగం నుంచి వచ్చినవాణ్నే కదా.

– నర్సిమ్ ఎర్రకోట

● నా గొడవ

ప్రయాణాలంటే ఇష్టం. స్నేహితులతో కలిసి గడపడాన్ని, సినిమాలు చూడటాన్ని ఆస్వాదిస్తుంటా. పుస్తకాలు బాగా చదువుతుంటా. ప్రస్తుతం కాళోజీ 'నా గొడవ' చదువుతున్నా.

ఈనాడు సినిమా

కె.ఎస్.రామారావు, చిరంజీవి, సాయిధరమ్‌తేజ్, గోపీ సుందర్, కరుణాకరన్, బీవీఎస్ఎన్ ప్రసాద్, అనుపమ పరమేశ్వరన్, ఆండ్రూ

విజయాలు కాదు... క్రమశిక్షణ ప్రధానం

"మా కుటుంబం నుంచి వచ్చిన కథానాయకులందరికీ కష్టపడే మనస్తత్వం ఉంది. ఒళ్లు వంచి పనిచేస్తారు. వాళ్లంతా విజయాలు సాధిస్తున్నారా, లేదా? అనేదానికంటే క్రమశిక్షణతో ఉంటున్నారా లేదా? అనేదే నాకు ప్రధానం" అన్నారు చిరంజీవి. సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా నటించిన 'తేజ్ ఐ లవ్ యూ'. శనివారం హైదరాబాద్‌లో పాటల్ని విడుదల చేశారు. కరుణాకరన్ దర్శకుడు. కె.ఎస్. రామారావు నిర్మాత. తొలిసీడీని చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఇది తేజూ సినిమా అని ఈ కార్యక్రమానికి రాలేదు. నా ప్రియమైన నిర్మాత, మిత్రుడు కె.ఎస్.రామారావు సినిమా అని వచ్చా. 80వ దశకంలో నా ఖాతాలో ఎక్కువ శాతం సూపర్ హిట్లున్నాయన్నా, నవలా కథానాయకుడిగా పేరు తెచ్చుకున్నా, ఎవరికీ లేని సూపర్ హిట్ గీతాలు నాకొచ్చాయన్నా, 'మెగాస్టార్' అని ఈ రోజు ముద్దుగా పిలుచుకుంటున్నారన్నా.. వాటన్నింటికీ సమాధానం కె.ఎస్.రామారావు. అభిలాష, ఛాలెంజ్, రాక్షసుడు, మరణ మృదంగం.. ఇలా మంచి సినిమాలు చేశాం. వరుస విజయాలతో ఉన్న ఆయన సంస్థకు 'స్టువర్ట్‌పురం పోలీస్ స్టేషన్' అనే పరాజయం ఎదురైంది. అది నా తప్పిదం వల్లే. అంతకు ముందు యండమూరి వీరేంద్రనాథ్ 'అగ్ని ప్రవేశం' అనే సినిమా చేశారు. అది పరాజయం పాలైంది. 'మరో దర్శకుడ్ని తీసుకుందామా' అని రామారావుగారు అడిగారు. కానీ నేను ఒప్పుకోలేదు. రామారావుగారు భయపడినట్టే ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది. దానికి నేనే కారణమా? అనే బాధ ఇప్పటికీ నాలో ఉంది. ఇటీవల చరణ్‌తో మాట్లాడుతున్నప్పుడు 'కె.ఎస్.రామారావుగారితో ఓ సినిమా చేయాలనివుంది' అన్నాడు. దర్శకుడెవరైనా సరే.. రామారావుగారితో ఓ సినిమా ఉంటుంది. ప్రేమకథలు తెరకెక్కించడంలో కరుణాకరన్ తనకు తనే సాటి. 'తొలిప్రేమ' అంటే నాకు చాలా ఇష్టం. తాను కూడా కొంత గ్యాప్ తీసుకున్నాడు. యువ దర్శకులు ఇలా విరామం తీసుకుంటే పరిశ్రమకు అన్యాయం చేసినట్టే. ఈ సినిమాలో కొన్ని భాగాలు చూశాను. చాలా బాగున్నాయి" అన్నారు. సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ "మావయ్యే ప్రాణం. ప్రపంచం. పొద్దుటే లేచి సెల్‌ఫోన్‌లో ఉన్న ఆయన ఫొటోనే చూస్తా. ఆయన ఆశీర్వచనాలు లేకుండా ఏ రోజూ గడవదు. 'తేజ్' అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. పాటలన్నీ బాగా ఆస్వాదించాన"న్నారు. "ఈ వేదికపై చిరంజీవిగారిని చూస్తే ఆనందంగా ఉంది. ఆయన్ని చూస్తే మాటలు రావడం లేదు. మా అమ్మగారు ఆయనకు వీరాభిమాని. 'చుక్కల పల్లకిలో..' అనే పాట తరచూ పాడేది. ఈ చిత్రంలో నా సంగీతం మీ అందరికీ నచ్చుతుందనుకుంటా" అన్నారు సంగీత దర్శకుడు గోపీ సుందర్. అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ "కె.ఎస్. రామారావు గారు ఎన్ని సినిమాలు చేసినా నిర్మాతగా ఆయన అభిరుచి తగ్గలేదు. 'తొలిప్రేమ'లాంటి గొప్ప సినిమా ఇచ్చిన దర్శకుడితో పనిచేయడం నాకు గర్వంగా ఉంది. తేజ్ మంచి నటుడు, మంచి డాన్సర్" అన్నారు. నిర్మాత కె.ఎస్.రామారావు మాట్లాడుతూ "చిరంజీవిగారిని చూసి పరిశ్రమ ఇంకా చాలా విషయాలు నేర్చుకోవాలి. ఆయన ఇండియాలోనే మెగాస్టార్. కరుణాకరన్‌తో నాకు కొంచెం చనువు ఉంది. దాంతో నేను ఆయన్ని కాస్త కంగారు పెట్టి ఉంటాను. నా వల్ల ఇబ్బంది పడి ఉంటారు. అందుకు నన్ను క్షమించాలి. తొలిప్రేమలానే ఈ సినిమా గురించీ మాట్లాడుకుంటారు" అన్నారు. కరుణాకరన్ మాట్లాడుతూ "అన్నయ్య ముందు మాట్లాడాలంటే గుండె దడదడలాడుతోంది. సహాయ దర్శకుడిగా పనిచేసేటప్పుడు ఉదయం ఏడింటికి లేచి చెన్నైలోని కోడంబాకం బ్రిడ్జిపై నిలబడేవాడ్ని. కారులో వెళ్తున్న చిరంజీవి గారిని చూసేవాడ్ని. సినిమా అనే కల ఇచ్చింది పెద్దన్నయ్య చిరు అయితే, సినిమా అవకాశం ఇచ్చింది చిన్నన్నయ్య పవన్‌కల్యాణ్. ఇప్పుడు తమ్ముడు తేజ్‌తో సినిమా చేశా" అన్నారు. ఈ కార్యక్రమంలో ఆండ్రూ, సి.కల్యాణ్, అశోక్ కుమార్, మారుతి, కిషోర్ తిరుమల, గోపీచంద్ మలినేని, హరీష్ శంకర్, అనిల్ రావిపూడి, ఛాముండేశ్వరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్

వరుణ్‌తేజ్

నవ్వులకు శ్రీకారం

వెంకటేష్, వరుణ్‌తేజ్ కథానాయకులుగా ఓ చిత్రం రూపుదిద్దుకొంటోంది. దీనికి 'ఎఫ్ 2' అనే పేరు పెట్టారు. 'ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' అనేది ఉపశీర్షిక. అనిల్ రావిపూడి దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. తమన్నా, మెహరీన్ కథానాయికలు. అనసూయకు ఓ కీలకపాత్ర దక్కినట్టు సమాచారం. ఈనెల 23న లాంఛనంగా షూటింగ్ ప్రారంభిస్తారు. 30 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలెడతారు. లండన్‌లో కీలకభాగం తెరకెక్కించనున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్‌ని ఎంచుకున్నారు. ప్రస్తుతం సంగీత చర్చలు జరుగుతున్నాయి. వినోదాత్మకంగా సాగే కథ ఇదని టైటిల్ చూస్తేనే తెలుస్తోంది. వెంకీకి వినోదం పంచడం అలవాటే. మరి వరుణ్ ఏ రకంగా నవ్వులు పంచుతాడో చూడాలి.

కారుణ్య, శంకర్, హరీష్ శంకర్, శ్రీధర్, రమణారెడ్డి, సురేష్ కొండేటి

రెండేళ్లు సినిమా లేదు.. తిండి లేదు

షకలక శంకర్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'శంభో శంకర'. కారుణ్య కథానాయిక. శ్రీధర్ ఎన్ దర్శకుడు. రమణారెడ్డి, సురేష్ కొండేటి నిర్మాతలు. హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ టీజర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఆఫీసు బాయ్ నుంచి ఈ స్థాయికి ఎదిగిన శంకర్‌ని చూస్తుంటే గర్వంగా అనిపిస్తుంది. 'గబ్బర్‌సింగ్' విజయంలో తన పాత్ర కూడా ఉంది. ఎందుకంటే ఆ సినిమాకి సంబంధించి కొన్ని స్కెచ్చులు గీసి ఇచ్చాడు. కల్యాణ్‌గారి సినిమాల్ని చూడ్డానికి ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తానో.. ఈ 'శంభో శంకర' చిత్రం కోసం కూడా అంతే ఆశగా చూస్తున్నా" అన్నారు. శంకర్ మాట్లాడుతూ "పవన్ కల్యాణ్‌ని మనసులో పెట్టుకునే పనిచేశాను. అందుకే ఈ స్థాయికి ఎదిగాను. నేనేమీ వ్యాయామాలు చేసి బరువు తగ్గలేదు. రెండేళ్లు సినిమాల్లేక, తిండి లేక ఇలా తగ్గిపోయా" అన్నారు. "శంకర్ చాలా బాగా నటించాడు. కథానాయకుడిగా మరో పది చిత్రాలు చేస్తాడని నమ్మకం ఉంది. అందులో రెండు మూడు చిత్రాల్ని నేనే నిర్మిస్తా" అన్నారు సురేష్ కొండేటి. "శంకర్‌ని దృష్టిలో ఉంచుకునే ఈ కథ రాశా. తనతో మరో సినిమా చేస్తున్నా" అన్నారు దర్శకుడు.

పిచ్చిపట్టినట్టు చేసేస్తా!

కాజల్

'నీ బలహీనతను నువ్వు గుర్తించగలగడం కూడా ఓ బలమే' అంటుంటారు. ఈ విషయం కాజల్‌కీ తెలుసు. అందుకే.. తన లోపాల్ని తాను గమనించింది. "ఏదైనా ఓ పని మొదలెడితే పిచ్చిపట్టినట్టు చేసేస్తుంటా. నిజానికి ఆ పనికి అంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉండదు. నాకు ఆ సంగతి తెలుస్తూనే ఉంటుంది. కానీ.. అది పూర్తి చేసేవరకూ కాలు ఓ చోట కుదురుగా ఉండదు. రోజుకి పద్దెనిమిది గంటలు పనిచేస్తుంటా. నా కోసం కాసేపు సమయం కేటాయించుకోవడం కూడా మర్చిపోతుంటాను. ఇవన్నీ నా బలహీనతలే. కొత్త విషయాలు త్వరగా నేర్చుకుంటుంటా. ప్రతికూల పరిస్థితుల్ని కూడా నాకు అనుకూలంగా మలచుకుంటా. నా విషయంలో ఫలితం పెద్దగా ప్రభావం చూపించదు. ఇవన్నీ నా బలాలే. అనుభవం వస్తున్న కొద్దీ నాలోని లోపాల్ని సవరించుకోగలుగుతున్నా. కానీ.. కొత్తవేవో పుట్టుకొస్తున్నాయి" అంటూ నవ్వేస్తోంది.

గీతోపదేశం

బాధుండాలి హాయుండాలి
బాధల్లోనూ హాయిగ నవ్వే దమ్ముండాలి
ఏదున్నా బయటపెట్టరో దాచేది లేదురో
కొంతైనా పంచిపెట్టరో
లోకం ప్రపంచం గులామె అంటూ
వెంటే వచ్చునురో

గీతం: మారో మారో...
చిత్రం: బన్నీ
రచన: చంద్రబోస్
– పంపినవారు:
కె.నవీన్ గౌడ్, వరంగల్

మెయిల్ ఐడీ:
cinema@eenadu.net

సమయానికి వచ్చేది యముడు!

ఉదయ్‌శంకర్

బతకడం కోసం ఆరాటపడుతున్న ఖైదీ అతను. ఉరి శిక్ష నుంచి తప్పించుకొనేందుకు జైలు నుంచి పరారయ్యాడు. తననే ఉరి తీయాల్సిన తలారితో కలిశాడు. కానీ వాళ్లు ఒకరికొకరు తెలియదు. ఇద్దరూ కలిసి ప్రయాణం చేశారు? ఆ ప్రయాణంలో ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? వీళ్లని ఎవరెవరు కలిశారు? తదితర విషయాలు తెలియాలంటే మా చిత్రం చూడాల్సిందే అంటున్నారు ఉదయ్‌శంకర్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఆటగదరా శివ'. దొడ్డన్న, హైపర్ ఆది, చమ్మక్‌చంద్ర, చలాకీ చంటి, దీప్తి కీలక పాత్రలు పోషించారు. చంద్రసిద్ధార్థ్ దర్శకుడు. రాక్‌లైన్ వెంకటేష్ నిర్మాత. ఇటీవలే ట్రైలర్ విడుదలైంది. 'సమయానికి వచ్చేది దేవుడు కాదు... యముడు' అనే సంభాషణతో ఆసక్తికరంగా సాగుతుంది ట్రైలర్. ఈ నెలాఖరున కానీ, వచ్చే నెల మొదటివారంలో కానీ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు చంద్రసిద్ధార్థ్ మాట్లాడుతూ "జీవితంలో గ్యారెంటీ అంటూ ఉందంటే అది ఒక్క చావుకు మాత్రమే. అది తెలిసి కూడా చావంటే భయపడతుంటాం. దాన్నుంచి తప్పించుకెళ్లే ప్రయత్నం చేస్తాం. కొద్దిసేపట్లో ఉరికొయ్యకి వేలాడాల్సిన ఒక ఖైదీ కూడా జైలు నుంచి తప్పించుకొని పరారయ్యాడు. అతని నేపథ్యంలోనే ఈ కథ సాగుతుంది. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఒకరినొకరు కలిసినా, విడిపోయినా దాని వెనకున్నది శివుడి లీలే అని నమ్ముతాం. ఆ తాత్వికతని స్పృశిస్తూ సాగే చిత్రమిది. కన్నడలో విజయవంతమైన 'రామ రామ రే' చిత్రానికి అనుసృజనగా మన భావోద్వేగాలు, మన వాతావరణానికి అద్దం పట్టేలా తీర్చిదిద్దా. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. కొత్త కాన్సెప్ట్ కోసం మన ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారనే విషయం మరొకసారి అర్థమైంది" అన్నారు.

11 నెలలు గడ్డం పెంచా...

"కథానాయకుడిగా నా తొలి చిత్రమిది. చిన్నప్పట్నుంచి పుస్తక పఠనాన్ని ఇష్టపడే నా ఆలోచనలకి తగ్గ కథతో పరిచయమయ్యే అవకాశం లభించింది. దాంతో పాత్ర కోసం పలు జాగ్రత్తలు తీసుకొన్నా. ఖైదీగా కనిపించాలి కాబట్టి సహజత్వం కోసం 11 నెలలపాటు గడ్డం, మీసాలు పెంచా. అంతే సహజంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు దర్శకుడు చంద్రసిద్ధార్థ్. 'విహార యాత్రకి వచ్చినట్టే భావించు తప్ప, ఇది షూటింగ్ అని అస్సలు అనుకోవద్ద'ని చంద్రసిద్ధార్థ్ నాలో భయం, బెరుకు పోగొట్టి పాత్రలో లీనం చేశారు. 'లింగా', 'బజరంగీ భాయ్‌జాన్' వంటి చిత్రాలు నిర్మించిన 'రాక్‌లైన్' వెంకటేష్ 'నిన్నొక విభిన్నమైన సినిమాతో పరిచయం చేస్తాన'ని చెప్పి ఈ అవకాశాన్నిచ్చారు. దొడ్డన్న కన్నడలో అగ్ర నటుడు. ఆయనతో కలిసి తెరను పంచుకొనే అవకాశం రావడం ఎప్పటికీ మరిచిపోలేను. ఈ చిత్రంతో కథానాయకుడిగా నాకు మంచి పేరొస్తుంది. చిత్రం కూడా ప్రేక్షకుల్ని తప్పక అలరిస్తుంది. భావోద్వేగాల్ని పండించడంలో చంద్రసిద్ధార్థ్ శైలే వేరు. ఆయన తీర్చిదిద్దిన ఈ చిత్రం తెలుగులో ప్రత్యేకంగా నిలిచిపోతుంది" అని అన్నారు ఉదయ్‌శంకర్.

ప్రేమ చిగురించిందా..!



ఆలియా భట్

'ఏదో జరుగుతోంది.. వారిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తోంది..' అంటూ బాలీవుడ్ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. బాలీవుడ్ చాక్లెట్ బాయ్ రణ్‌బీర్ కపూర్, పాల బుగ్గల సుందరి ఆలియా భట్‌ల మధ్య అనుబంధం గురించే ఆ గుసగుసలన్నీ. వారిద్దరూ ప్రస్తుతం 'బ్రహ్మాస్త్ర'లో జోడీగా నటిస్తున్నారు. ఆ సినిమా మొదలైనప్పట్నుంచే వారిద్దరి మధ్య క్రమంగా చనువు పెరిగిందని, వీలు దొరికితే చాలు ఇద్దరూ చెట్టాపట్టాల్ వేసుకుని బయట డిన్నర్ చేయడానికి వెళ్లిపోతున్నారని చెప్పుకుంటున్నారు. అది చూశాకే వారి బంధం గురించి పుకార్లు మొదలయ్యాయి. కొద్దిరోజుల కిందటే సోనమ్ కపూర్ రిసెప్షన్ వేడుకకు ఆలియా, రణ్‌బీర్ కలిసి రావడంతో ఆ పుకార్లు మరింత బలపడ్డాయి. దీనికి తోడు రణ్‌బీర్ ఇంట్లో వారికి కూడా ఆలియాపై మంచి అభిప్రాయమే ఉన్నట్లు తెలుస్తోంది. రణ్‌బీర్ సోదరి రిద్ధిమా కపూర్‌కు ఆలియా ప్రవర్తన తెగ నచ్చేసిందని, అందుకే కొన్ని రోజుల క్రితం ఆమెకు బ్రాస్‌లెట్‌ను కానుకగా ఇచ్చిందని సమాచారం. ఇక రణ్‌బీర్ తల్లి నీతూ కపూర్‌తో ఆలియా చక్కగా కలిసిపోయిందట. ఇవన్నీ చూస్తే రణ్‌బీర్, ఆలియా ప్రేమలో ఉన్న మాట వాస్తవమే అని అర్థమవుతుందని వారి సన్నిహితులు అంటున్నారు. అయితే ఆలియా, రణ్‌బీర్ ఈ విషయాన్ని ఖండించకపోగా దానిపై నర్మగర్భంగా స్పందించడం గమనార్హం. ఆలియాతో బంధం గురించి రణ్‌బీర్ మాట్లాడుతూ "అది చాలా కొత్త విషయం" అంటూ, దాని గురించి మాట్లాడటానికి మరి కొంతకాలం అవసరం అనే అర్థంలో స్పందించాడు. అయితే ఆలియాకు రణ్‌బీర్‌పై మక్కువ ఈనాటిది కాదు. కొన్నేళ్ల కిందటే కాఫీ విత్ కరణ్ చాట్ షోలో రణ్‌బీర్‌పై తనకున్న ఇష్టాన్ని బయటపెట్టింది ఆలియా. "రణ్‌బీర్ అంటే మొదట్నుంచీ చాలా ఇష్టం. 'రాక్‌స్టార్' విడుదలైన సమయంలో అతనితో తొలిసారి ఫోన్‌లో మాట్లాడే అవకాశం వచ్చింది. ఆ ఆనందంలో ఏదేదో వాగేశాను. ఆ ఇష్టం ఇప్పటికీ ఉంది. అతణ్ని పెళ్లిచేసుకోవాలని ఇప్పటికీ ఉంద"ని ఆ షోలో చెప్పింది ఆలియా. మరి వీరి మధ్య చిగురించిన బంధం బలపడుతుందా? ఆ విషయాన్ని ఈ జంట ఎప్పుడు ప్రకటిస్తారు? అన్న విషయాల కోసం వేచిచూడాల్సిందే.

రణ్‌బీర్ కపూర్

'భానుమతి' అలక

అప్పటి ముచ్చట!

భానుమతి

ఘంటసాల

'మల్లీశ్వరి'(1951) పాటల రికార్డింగ్ తర్వాత వాటిని తన బృందంతో కలిసి వింటూ దర్శకుడు బి.ఎన్.రెడ్డి- "ఘంటసాల ఎంతో భావగర్భితంగా పాడారు. నువ్వు ఆయనంత బాగా పాడలేదు" అని భానుమతితో అన్నారట. బృందంలో వారంతా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారట. చిన్నబుచ్చుకున్న భానుమతి -'ఆయన చుట్ట తాగి పాడారు. అందుకే గొంతు సాఫ్ట్ అయింది' అని ఎత్తి పొడిచారట. (అప్పట్లో రికార్డింగ్‌కి ముందు గొంతు పదునెక్కాలని ఘంటసాల చుట్ట తాగేవారట). భానుమతి వ్యాఖ్య విన్న ఘంటసాల తడుముకోకుండా 'నా దగ్గర ఓ చుట్ట ఎక్స్‌ట్రా ఉంది. అడిగితే ఇచ్చేవాణ్ని కదా..' అని నవ్వుతూ అన్నారట. దాంతో అలకబూనిన భానుమతి 'చక్రపాణి'కి సంగీత దర్శకత్వం చేసిన సమయంలో బదులు తీర్చుకున్నారని చెబుతారు. అందులో 'ఓ ప్రియురాలా... ఓ జవరాలా' అనే పాటను ప్రాక్టీస్ చేయడానికి ఘంటసాలను పిలిచి ఆయన చేత చాలా సార్లు పాడించి, 'మీరు సరిగా పాడటం లేదు. ఇది విజయా సంస్థ కాదు. భరణీ సంస్థ' అని ఎత్తిపొడిచారట. మనసు నొచ్చుకున్న ఘంటసాల మౌనంగా అక్కడ నుంచి వెళ్లిపోయారట.

– శ్రీవత్స

'చదువు... చదువు... చదువు...!
టీవీ, ఆటలూ, పాటలూ... అన్నీ కట్!'
స్కూళ్లు తెరిచారుగా... ఇకపై పిల్లలకు తల్లిదండ్రులు చెప్పే మాటలు ఇవే.
పెద్దవాళ్ల కోణంలో అది కరెక్టే కావచ్చు...
కానీ పిల్లలకు మాత్రం అదే ఒత్తిడిగా మారొచ్చు.
అందుకే రకరకాల సాకులు చెప్పి ఎప్పుడు బడి మానేసే అవకాశం వస్తుందా అని ఎదురుచూస్తారు.
ఆ సమస్యలేవీ లేకుండా వాళ్ల విద్యాసంవత్సరం సాఫీగా సాగాలంటే...
దీనికి పరిష్కారం వెతకడం తల్లిదండ్రుల చేతుల్లోనే ఉంది.

ఆటలకు అరగంటేనా!

అసోచామ్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం... మన దేశంలో పిల్లలు ఇంటి నుంచి బడికి వెళ్లి రావడానికి గంట పడితే, పాఠశాలలో గడిపేది 8 - 10 గంటలు. ఆ తరువాత రెండు గంటలు హోంవర్క్, అదయ్యాక రెండు లేదా మూడు గంటలు ట్యూషన్‌తోనే వాళ్ల రోజు గడిచిపోతుంది. ఆశ్చర్యకరం ఏంటంటే పిల్లలకు రోజులో ఆడుకోవడానికి దొరికే సమయం ఇరవై నిమిషాల కన్నా తక్కువేనట. ఒక్కమాటలో చెప్పాలంటే చదువే ప్రపంచంగా మారిపోతోంది. ఇంకా పరిశీలిస్తే, మన పిల్లలు పాఠశాలలో గడిపే సమయంతో పోలిస్తే, పెద్దవాళ్లు ఆఫీసుల్లో పనిచేసే గంటలు తక్కువేనని ఈ అధ్యయనంలో తేలడం గమనార్హం. నిజమే మరి. నిద్రలేచింది మొదలు బడికి పంపే వరకూ తల్లిదండ్రులు పిల్లల వెంట పడుతూనే ఉంటారు. అలా పిల్లలకు ఇంటి నుంచే ఒత్తిడి మొదలవుతుంది. ఇక, స్కూల్లో హోంవర్క్‌లూ, పాఠాలు రాయడం, చదవడం, ప్రాజెక్టులు... వంటివి తప్పవు. ఈ రెండే పిల్లల్ని ఒత్తిడికి గురిచేస్తాయి. అందుకే స్కూల్‌కి వెళ్లాలంటే కొందరు ఉత్సాహాన్ని చూపించరు. ఆ కారణంతోనే అన్నింటినీ నిదానంగా చేయడం మొదలుపెడతారు. చదువుపైనా ఆసక్తీ తగ్గుతుంది. ఆ సమస్య ఎదురుకాకుండా ఉండాలంటే... తల్లిదండ్రులే వాళ్ల విద్యాసంవత్సరాన్ని ఆహ్లాదకరంగా, సరదాగా మార్చాలి అంటున్నారు మానసిక నిపుణురాలు డాక్టర్ పూర్ణిమా నాగరాజ.



ఆసక్తిగా చేయొచ్చు...

చదువు అంటూ ఒత్తిడి చేయకుండా... అవసరమైన సామర్థ్యాలను పిల్లలకు అందించాలి.

సరదాగా చదువు: చిన్నారుల్లో పదసంపదను పెంచే ప్రయత్నం చేయాలి. దానివల్ల భాషాపరిజ్ఞానం పెరుగుతుంది. అంటే చేతికి పుస్తకాలు ఇచ్చి కూర్చోబెట్టక్కర్లేదు. ఆంగ్లం లేదా మాతృభాషలో మాట్లాడుతూ కొత్త పదాలు వీలైనంత ఎక్కువగా వాడాలి. వాటికి అర్థాలూ, ఆ పదాలు వారినే తెలుసుకోమని చెప్పాలి. పదసంపద పెరగడం వల్ల వాళ్లకు చదువు సులువు అవుతుంది.

ఒత్తిడి వద్దు: 'ఇది చేయి, అది చేయి', 'ఇలా ఉండు, చదువుకో' అంటూ పదే పదే ఒత్తిడి తీసుకురాకూడదు. స్కూళ్లు ఇప్పుడిప్పుడే తెరుస్తున్నారు కాబట్టి... వాళ్లకో టైంటేబుల్ పెట్టండి. ఇందులో చదువుతోపాటూ, ఆటలూ, ఇతర వ్యాపకాలు ఉండేలా చూడండి. రోజంతా పాఠశాలలో గడిపి వచ్చాక.. మళ్లీ ట్యూషన్లూ, హోంవర్క్‌లతో గడిపే పిల్లలకు కాస్త ఒత్తిడిగా అనిపించడం సహజమే. అందుకే ఓ పని చేయొచ్చు. వాళ్లకు ఏ సబ్జెక్టు కష్టమో తెలుసుకుని దానిపై ఎక్కువ దృష్టిపెట్టేలా చూడాలి. రోజుకీ, ఒకటి రెండు సబ్జెక్టులు చదివించేలా చూడాలి. ట్యూషన్లకు వెళ్లకపోతే రోజులో రెండు గంటలు శ్రద్ధగా చదివిస్తే చాలు.

వ్యాపకాలు తప్పనిసరి: స్కూలు నుంచి రాగానే చదువు అంటూ కూర్చోబెట్టకుండా కాసేపు ఆడుకోనివ్వాలి. వాళ్లకు ఇష్టమైన అంశంలో శిక్షణ ఇప్పించే ఏర్పాటు కూడా చేయాలి. ఈ రోజుల్లో పిల్లల చదువులకు తగినట్లుగా శిక్షణా తరగతులు కూడా వారంలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉంటున్నాయి కాబట్టి చేర్పించొచ్చు.

ఇంటి వాతావరణం: చాలా ఆహ్లాదకరంగా ఉండాలి. హోంవర్క్‌లు తక్కువగా ఉన్నప్పుడూ, పరీక్షలు లేనప్పుడు పార్కులకు తీసుకెళ్లొచ్చు. విహారయాత్రలు కూడా ముఖ్యమేనని మరవకూడదు. కాబట్టి చదువుల ఒత్తిడి కాస్త తక్కువగా ఉన్నప్పుడు ఓ రోజు తీసుకెళ్లొచ్చు.

అవీ ముఖ్యమే...

- ఏకాగ్రతను పెంచే పజిల్స్, క్విజ్‌లాంటివి నేర్పాలి. వారిలో సృజనాత్మకత పెరుగుతుంది. సులువుగా చదువుకోగలుగుతారు.
- హోంవర్క్ ఎక్కువగా ఉందనే భావం వారికున్నప్పుడు దానిని రెండు భాగాలుగా చేయాలి. విరామాలు ఇస్తూ పూర్తి చేయించాలి.
- వాళ్లకు ఇష్టమైన అంశంలో దగ్గరుండి తర్ఫీదు ఇప్పిస్తే అమ్మానాన్నలు అన్నింట్లో ప్రోత్సహిస్తారనే నమ్మకం వారిలో కలుగుతుంది.
- పుస్తక పఠనం కూడా మంచిదే. దీనికి రాత్రి సమయాలే అనుకూలం.
- ఏకాగ్రతను పెంచే చిన్నచిన్న ఆసనాలు ఉంటాయి. వాటిని నేర్పించి వాళ్లంతట వాళ్లే వేసేలా చూడాలి.

అక్కడ ఆడుతూ నేర్చుకుంటారు...

మన దేశంతో పోలిస్తే... కొన్ని దేశాల విద్యావిధానాలు పిల్లలకు పూర్తిగా అనుకూలంగా ఉంటాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలోనే చదువు చెబుతున్నాయి.

- **ఫిన్‌ల్యాండ్:** ఏడేళ్లు వచ్చాకే వాళ్ల విద్యాభ్యాసం మొదలవుతుంది. పిల్లల మానసిక ఎదుగుదలపై ఎక్కువ దృష్టి పెడతారు. ఆలోచించడం, చెప్పింది అర్థంచేసుకోవడానికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. పిల్లల్లో వీలైనంత ఎక్కువగా స్ఫూర్తిపెంచేలా చూస్తారు. పరీక్షలు కూడా చాలా తక్కువగా ఉంటాయి. పరిజ్ఞానం ఉండాలి తప్ప మార్కులు ముఖ్యం కాదనేది వాళ్ల విధానం. ఆడుతూనే నేర్చుకుంటారు. హోంవర్క్ కూడా చాలా తక్కువే. వాళ్లు హోంవర్క్ చేసేది వారంలో మూడుగంటలేనట.
- **జపాన్:** ఇక్కడ ఇంకొంచెం ఆసక్తికరంగా ఉంటుంది. చదువుకోవడంతోపాటూ తరగతి గదులు మొదలు టాయిలెట్ల వరకూ పిల్లలు శుభ్రం చేసుకుంటారు. అందరూ కలిసి బృందాలుగా ఈ పనులన్నీ చేస్తారు. దీనివల్ల బృంద స్ఫూర్తి పెరుగుతుంది. పైగా పిల్లలకు భోజనం అక్కడి స్కూళ్లలోనే పెడతారు తప్ప వాళ్లు ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిన అవసరం ఉండదు. అదీ పోషకాహారమే. చదువుతోపాటూ ఇతర అంశాల్లో తర్ఫీదు ఇచ్చేందుకు అక్కడి తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇస్తారు.

వారానికి పదహారు గంటలా!

సుమారు 65 దేశాలకు చెందిన పిల్లలు హోంవర్క్ చేసే సమయ వివరాలను అంతర్జాతీయస్థాయిలో విద్యార్థుల పనితీరును అంచనా వేసింది 'పిసా' (ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఎస్సెస్‌మెంట్). షాంఘై-చైనాలో వారానికి సుమారు 14 గంటలు హోంవర్క్ చేస్తారట. రష్యా, సింగపూర్‌లో అయితే వారానికి 10 గంటలు, కజకిస్థాన్, ఇటలీ మూడో స్థానంలో ఉన్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, హాంకాంగ్, బల్గేరియా, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో అయితే వారానికి ఆరుగంటలేనట. మన దేశంలోని వారానికి దాదాపు 16 గంటలకు పైగా హోంవర్క్, 20 గంటలకు పైగా ట్యూషన్ కోసం కేటాయిస్తున్నారట.

డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

అన్నీ ఉండాల్సిందే...

ఇప్పుడు దాదాపు అన్ని స్కూళ్లలో చదువుతోపాటూ ఆటలూ, కరాటే, డాన్స్, పెయింటింగ్... ఇలా ఎన్నో ఉంటున్నాయి. వారంలో రెండుమూడు రోజులు ఆ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇదే విధానం పిల్లలకు ఇంట్లోనూ ఉండాలి. దీనివల్ల వాళ్లకు చదువు ఇతర వ్యాపకాలతో ఓ భాగమే అవుతుంది తప్ప.. అదే ప్రపంచం కాదు. ఇక, తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన విషయం... పిల్లలు సరిగ్గా చదవకపోయినా ఫరవా లేదు అనుకోవాలి. ఈ రోజుల్లో ఎన్నో కెరీర్ అవకాశాలు ఎప్పటికప్పుడు పుట్టుకొస్తున్నాయి కాబట్టి వాళ్లు డాక్టర్ లేదా ఇంజినీరే కావాలని కోరుకోకూడదు. ఒకవేళ పిల్లలు సరిగ్గా చదవడంలేదా... తోటివారితో పోల్చడం మానేయాలి. బదులుగా టీచర్లతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. పిల్లలు రోజులో ఎక్కువ సమయం గడిపేది స్కూల్లోనే కాబట్టి టీచర్లతో మాట్లాడి తమ చిన్నారుల బలాలూ, బలహీనతల్ని తెలుసుకుని తదనుగుణంగా చదివించాలి. వాళ్ల ఆసక్తి ఉన్న అంశంలో ప్రోత్సహిస్తూనే చదువుపైనా శ్రద్ధపెట్టేలా చేస్తే... చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం లోపించదు. కొందరు చిన్నారులు ఎక్కువ సమయం కూర్చోగలుగుతారు. మరికొందరు కూర్చోలేరు. అలా నిలకడగా కూర్చోలేనివారికి మధ్య మధ్య విరామం ఇస్తూనే చదివించాలి తప్ప ఒత్తిడి చేయకూడదు.

- అంజలీ గుప్తా, ప్రిన్సిపల్,
గ్లోబల్ ఎడ్జ్ స్కూల్, హైదరాబాద్

ఆపదలో ఆదుకుంటుంది

ఏదైనా పనిరీత్యా ఒంటరిగా వెళ్లాల్సి వచ్చినప్పుడు కాస్త బెరుకు అనిపించడం సహజం. మనం ఇంటికి చేరే వరకూ కుటుంబ సభ్యుల్లో కూడా ఆందోళనే. అలాంటప్పుడు 'బీసేఫ్' యాప్ వాడి చూడండి. దాంట్లో ఉన్న సదుపాయాలు మనల్ని ఆపద సమయాల్లో రక్షిస్తాయి. ఫాలోమీ, టైమర్ అలారం, ఫేక్ కాల్, ట్రాక్‌మీ... ఇలా చాలా ఆప్షన్లే ఉంటాయి. వాటిద్వారా మనం ఎక్కడికైనా వెళ్లేముందు యాప్‌లో మనం వివరాలు ఇచ్చిన వ్యక్తులకు ఈ సమాచారం వెళ్తుంది. మనం ఎక్కడున్నా సరే జీపీఎస్ ద్వారా తెలిసిపోతుంది. దీంట్లో ఉన్న ఎస్ఓఎస్ మీట నొక్కితే వెంటనే వాళ్లందరికీ మీరు ఆపదలో ఉన్నట్లు సమాచారం అందించొచ్చు. సమస్య ఎదురుకావచ్చనే భయం మీలో ఉంటే ముందుగానే ఒక అలారం కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

bsafe
Never walk alone

ఏ జీన్స్ వేసుకోను?

? నాకు పదహారేళ్లు. ఇంటర్మీడియట్‌లో చేరా. కాలేజీలో నా స్నేహితులంతా జీన్స్ వేసుకుంటున్నారు. నేను కాస్త ఎత్తు తక్కువ. నాకు నప్పుతుందో లేదో అనే భయంతో ఇప్పటివరకూ దాన్ని ప్రయత్నించలేదు. కానీ నాకు జీన్స్ వేసుకోవడం ఇష్టం. ఇకపై ప్రయత్నించాలనుకుంటున్నా. నాకు ఏవి బాగుంటాయి?

– నిత్య, విశాఖపట్నం

✔ మీరు ఎత్తు తక్కువ అంటున్నారు కానీ ఎంత ఎత్తో చెప్పనేలేదు. ఇప్పటి తరం జీన్స్‌ని ట్రెండీగా భావిస్తున్నారు. మీరు కూడా ఎంచుకోవచ్చు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. మీరు ఎత్తు తక్కువగా ఉండటమే కాకుండా లావుగానూ ఉంటే జీన్స్‌ని ఎంచుకోవడంతో పాటు దానికి మ్యాచింగ్‌గా వేసుకునే టాప్‌లపైనా దృష్టిపెట్టాలి. ట్యూనిక్స్, ఏ-లైన్, స్ట్రెయిట్‌కట్ కుర్తీలను మోకాళ్ల కిందవరకూ ఉండేలా చూసుకుని ఎంచుకోవాలి. ముఖ్యంగా పిరుదుల భాగం ఎక్కువగా ఉంటే హైవెయిస్టెడ్ జీన్స్ ప్రయత్నించొచ్చు. ముదురు రంగులు ముఖ్యంగా ముదురు నీలం, నలుపు మీకు నప్పుతాయి. తెలుపూ, గ్రే రంగుల్లో ఉండే జీన్స్‌ని వేసుకోకపోవడమే మేలు. అయితే షేడెడ్ రకాల్ని ఎంచుకున్నప్పుడు ముదురు రంగుల్లో ఉన్నవాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. మీకు పెన్సిల్ కట్, స్ట్రెచబుల్ జీన్స్ చక్కని ఎంపిక అవుతాయి.

డియర్ వసుంధర

ధన్యా గుత్తా
డిజైనర్

– మీ సందేహాలను vasufashion@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

09న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	32,000	32,000	31,700	31,750
ఆర్నమెంట్	29,900	29,900	29,400	29,450
వెండి (కిలో)	41,500	41,570	41,900	41,500

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,750	31,750	32,020	32,045
ఆర్నమెంట్	29,380	29,370	29,700	29,670
వెండి (కిలో)	41,400	41,200	41,600	41,400

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,880	31,770	-------	-------
ఆర్నమెంట్	29,650	29,550	2,970	2,967 గ్రా
వెండి (కిలో)	40,900	40,900	43.70	43.60 గ్రా

ఆసనం ఒకటి... లాభాలెన్నో

నడుము భాగం నుంచి పాదాల వరకూ బలంగా మారాలన్నా... కొన్నిరకాల అనారోగ్యాలు తగ్గి, కొవ్వు సమస్య అదుపులో ఉండాలన్నా ఏకపాద పశ్చిమోత్తానాసనం సరైన పరిష్కారం.

ఇవీ లాభాలు: ఈ ఆసనం ద్వారా తొడా, మోకాలి కిందిభాగం, హ్యామ్‌స్ట్రింగ్స్, నడుము, వెన్నెముకకు బలం చేకూరుతుంది. సయాటికా నొప్పి కూడా తగ్గుతుంది. ఈ ఆసనం ద్వారా మోకాళ్లూ, మడమల కండరాలు కూడా బలపడతాయి. పొట్ట దగ్గర పేరుకుపోయిన కొవ్వు కూడా కరిగిపోతుంది. జీర్ణవ్యవస్థ పనితీరు కూడా బాగుంటుంది. అన్ని అవయవాలపై ఒత్తిడి పడటం వల్ల శరీర భాగాలన్నింటికీ రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. రక్తంలో చక్కెరస్థాయులు కూడా అదుపులో ఉంటాయి.

డా॥ మణిపవిత్ర
ఫిట్‌నెస్ నిపుణురాలు

త్రయంగముఖ ఏకపాద పశ్చిమోత్తానాసనం: ముందుగా మ్యాట్‌పై కూర్చుని నిటారుగా కూర్చుని రెండుకాళ్లను చాపాలి. ఇప్పుడు కుడికాలికి బ్యాండ్ పెట్టి రెండు చేతులతో పట్టి లాగాలి. ఎడమకాలిని మోకాలి వరకూ వెనక్కి మడిచి నేలకు తాకించాలి.

ఇదే స్థితిలో ఉండి కుడికాలిని నెమ్మదిగా బ్యాండ్ సాయంతో లాగుతూ ముందుకు వంగాలి. తరువాత వెనక్కి వంగాలి.

ఏకపాద సుప్తవీర పశ్చిమోత్తానాసనం: పైన ఉన్న స్థితిలోనే ఉండి... నెమ్మదిగా వెనక్కి వంగుతూ నడుము, తలను మెల్లిగా నేలను ఆనించే ప్రయత్నం చేయాలి. అలాగే కాసేపు ఉండాలి.

- కాళ్లు మారుస్తూ ప్రతి ఆసనాన్ని ఎనిమిది సార్లు చేయాలి.
- **ఎవరు చేయకూడదంటే...** మోకాలి నొప్పులూ, నడుంనొప్పీ, మెడ నొప్పీ ఉన్నవారు చేయకూడదు.

రైనా అర్ధాంగి... ఆర్గేజా మారి...!

ఆమె ప్రముఖ భారత క్రికెటర్ సురేష్ రైనా భార్య. భర్త క్రికెట్ ఆడుతుంటే గ్యాలరీలో కూర్చుని మ్యాచ్ చూస్తూ, దేశవిదేశాలు చుట్టిరావడమే తన ప్రపంచం అనుకోలేదు. ఎంత తీరికలేని జీవితం అయినా సరే... నిస్సహాయ తల్లులకూ, పిల్లలకు తన వంతుగా సాయం అందిస్తోంది. ఆర్జేగా 'ది ప్రియాంకా రైనా షో' నిర్వహిస్తూ నిస్సహాయ మహిళల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇంతకీ ఆమేం చేస్తుందీ, సేవా రంగాన్ని ఎందుకు ఎంచుకుందో చూద్దామా...

■ ప్రియాంక స్వస్థలం ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్. తండ్రి తేజ్‌పాల్ సింగ్ కేంద్రప్రభుత్వ ఉద్యోగి. తల్లి సుశీలా సింగ్ గృహిణి. ఇద్దరు అన్నయ్యలు. ఉన్నత విలువలూ, ఇతరుల పట్ల సహానుభూతీ, సాయం చేసే తత్వాన్ని చిన్నతనంలోనే నేర్చుకుంది ప్రియాంక. చదువులో మంచి మార్కులు తెచ్చుకోవడంతోపాటూ భరతనాట్యంలోనూ ముందుండేది. ఎన్నో ప్రదర్శనలు కూడా ఇచ్చింది. బీటెక్ పూర్తిచేశాక బెంగళూరులోని విప్రోలో కొన్నాళ్లు పనిచేసింది. ఆ తరువాత కొన్నాళ్లు నెదర్లాండ్స్‌లోని ఐఎన్‌జీ బ్యాంకులోనూ చేసింది.

■ ఉద్యోగంలో తొమ్మిదేళ్లు గడిచాక చిన్ననాటి స్నేహితుడు సురేష్ రైనాతో పెళ్లయ్యింది. ఏడాదికి గ్రేసియా పుట్టినా నెదర్లాండ్స్‌లో ఉద్యోగం మానలేదు. తరచూ ప్రయాణాలు చేస్తుండేది. అయితే సురేష్‌కు మ్యాచ్‌లు ఉండటం, అతడు పదే పదే ప్రయాణాలు చేయడం కుదరకపోవడంతో ఉద్యోగం మానేసి భారత్‌కి వచ్చేసింది. ఇక్కడకు వచ్చాకే కనీస సౌకర్యాలు లేని మహిళలూ, పిల్లల కోసం ఏమైనా చేయాలని నిర్ణయించుకుంది. మొదట కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేసింది. అనాథల కోసం దిల్లీలో రెడ్ ఎఫ్ఎంతో కలిసి నిధుల సేకరణలో పాల్గొంది. అనాథ పిల్లల్ని చూశాక వాళ్లకు సాయం చేయాలనే ఉద్దేశంతో సొంతంగా ఫౌండేషన్‌ను పెట్టాలనుకుంది.

■ పాప గ్రేసియా మొదటి పుట్టిన రోజున నిరుపేదలైన తల్లులూ, పిల్లల కోసం జీఆర్ఎఫ్ (గ్రేసియా రైనా ఫౌండేషన్)ను భర్తతో కలిసి ప్రారంభించింది. మానసికంగా, శారీరకంగా ఆరోగ్య సమస్యలున్న మహిళలూ, పిల్లలకు సాయం అందించడం మొదలుపెట్టింది. అయిదుగురు అమ్మాయిలను దత్తత తీసుకోవడంతో ప్రియాంక మొదటి అడుగు ప్రారంభమైంది. ఒక స్కూలు ఫంక్షన్‌కు వెళ్లినప్పుడు అక్కడ బాలికల హాజరు శాతం తక్కువగా ఉండటాన్ని గమనించిందట. ఆరా తీస్తే ఆ పిల్లలు అనాథలని తెలిసింది. అందుకే వాళ్లను దత్తత తీసుకుని, చదివిస్తోంది.

■ ప్రియాంక అప్పుడప్పుడూ దిల్లీలోని అనేక మురికివాడలకు వెళ్లి అక్కడి మహిళలతో మాట్లాడుతుంది. వారి పిల్లల్ని బడికి పంపించడం వల్ల కలిగే లాభాల్ని చెబుతుంది. అలా వెళ్లినప్పుడు చాలా సవాళ్లనే ఎదుర్కొనేది. 'మీరు ఈ రోజు వస్తారు. రేపు కనిపించరు. మేం మీ మాట ఎందుకు వినాలి... మాకేం వస్తుంది' అనేవారట చాలామంది. వాటన్నింటికీ ఓపిగ్గా సమాధానాలు ఇస్తూ నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేసింది. స్థానికంగా ఉండే స్వచ్ఛంద సంస్థల సాయంతో ఆ పిల్లలకు చేయూతనందిస్తోంది. నిరుపేదలైన మహిళలూ, పిల్లల కోసం ఓపీడీ ఆన్ వీల్స్ పేరిట రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది. పేద పిల్లలకు ఉచితంగా చికిత్స అందించే ఏర్పాటు అది. దిల్లీ మురికివాడల్లోకి ఆ ఆసుపత్రి బస్సు వెళ్తుంది. పిల్లలకు అవసరమైన చికిత్సలతోపాటూ గర్భిణిగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలనీ వివరిస్తారు. మహిళలకు సంబంధించిన అన్ని రకాల సమస్యల్ని చర్చిస్తారు. చికిత్సకు అవసరమైన సాయాన్ని అందిస్తారు.

■ రెడ్ ఎఫ్ఎం బృందంతో కలిసి మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తోంది. 'ది ప్రియాంకా రైనా షో' పేరుతో ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గృహహింసా, యాసిడ్ దాడులూ, బాలికా విద్య, లైంగిక వేధింపులూ, లింగ వివక్షా, సమానత్వం, నెలసరి సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత శుభ్రత... ఇలా మహిళలకు సంబంధించిన విషయాలన్నింటిపై అవగాహన కల్పిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా చాలామంది మహిళలతో మాట్లాడుతుంది. వారి సమస్యల్ని తెలుసుకుని అవసరమైన సాయం చేస్తుంది. న్యాయపరమైన సాయం కూడా అందిస్తోంది. ప్రస్తుతం స్త్రీ ఆరోగ్యంపై ఓ పుస్తకం రాస్తోన్న ప్రియాంక... మరికొన్ని సేవా కార్యక్రమాలూ చేయడానికి సిద్ధమవుతోంది.

.. ఏమి రుచి

aha@eenadu.in

ఇది వానాకాలం అనే కంటే.. చేపలకాలం అంటే బాగుంటుందేమో! వేసవికాలం కాబట్టి చప్పని వాటితోనో, చలువ చేసే వాటితోనో సరిపుచ్చుకున్నాం కానీ...నదులు, సముద్రాలు, చెరువులు నిండుగా నీటితో కళకళ్లాడే ఈ రోజుల్లో రుచికరమైన చేపలకి లోటేంటి చెప్పండి? మెచ్చిన చేపని ఎంచుకుని... నచ్చిన కూర వండుకుని కుమ్మేయండి మరి..

సూపర్... మచ్ఛీ!

కొరమీను వేపుడు

కావాల్సినవి: కొరమీను చేపలు- కేజీ, కొబ్బరి పొడి- రెండు చెంచాలు, జీలకరపొడి- చెంచా, ధనియాలపొడి- రెండు చెంచాలు, మెంతిపొడి- పావుచెంచా, పసుపు- తగినంత, కారం- చెంచా, అల్లంవెల్లుల్లిముద్ద- చెంచా, చింతపండుపులుసు- మూడు చెంచాలు, నిమ్మకాయ- ఒకటి, నూనె- వేయించడానికి సరిపడా, కొత్తిమీర- కట్ట, ఉప్పు- తగినంత

తయారీ: ముందుగా చేప ముక్కల్ని శుభ్రం చేసుకుని నిమ్మరసం ముక్కలకి పట్టించాలి. ఒక గిన్నెలో అల్లంవెల్లుల్లి ముద్ద, కారం, పసుపు, జీలకరపొడి, మెంతిపొడి, కొబ్బరిపొడి, ఉప్పు, చింతపండుపులుసు, కొద్దిగా నూనె వేసి ఈ మిశ్రమాన్ని బాగా కలిపి చేపకు రెండు వైపులా పట్టించాలి. ఈ చేపముక్కలని అరగంటపాటు పక్కనపెట్టుకుని పెనంమీద నూనె వేసుకుని నిదానంగా రెండువైపులా కాల్చుకోవాలి. కొత్తిమీర, నిమ్మకాయముక్కలతో అలంకరించుకోవాలి.

ఇగురు...

కావాల్సినవి: కొరమీను- కేజీ, చింతపండు గుజ్జు- రెండు చెంచాలు, ఉల్లిపాయలు- రెండు, పచ్చిమిర్చి- ఆరు, అల్లంవెల్లుల్లి ముద్ద- చెంచా, టమాటా గుజ్జు- పావుకప్పు, ఉల్లిపాయ ముద్ద- చెంచా, కొత్తిమీర పేస్ట్- చెంచా, గరంమసాలా- అరచెంచా, పసుపు- కొద్దిగా, కారం- రెండు చెంచాలు, పెరుగు- చెంచా, నూనె- తగినంత, ఉప్పు- తగినంత

తయారీ: ముందుగా చేపముక్కలను కొద్దిపాటి నూనెలో దోరగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. కడాయిలో నూనె వేసి వేడయ్యాక తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసుకోవాలి. పసుపు, అల్లంవెల్లుల్లి ముద్ద, కొత్తిమీర పేస్ట్, ఉల్లిపాయ ముద్ద, టమాటా పేస్ట్ వేసి వేయించిన తర్వాత అందులో చింతపండు పులుసు పోసి పెరుగు, కారం, ఉప్పు వేసి కలిపి తగినన్ని నీళ్లు పోసుకోవాలి. చింతపండు పులుసు మరుగుతున్న సమయంలో వేయించుకున్న చేప ముక్కలని వేసి ఉడికించుకోవాలి. తర్వాత గరంమసాలా వేసి మూడు నిమిషాలు ఉడికించి చివరిగా కొత్తిమీర వేసుకుని వడ్డించుకోవాలి.

అపోలో

కావాల్సినవి: చందువా చేప- అరకేజి, నిమ్మకాయ- అరచెక్క, కొత్తిమీర తరుగు- అరకప్పు, పెరుగు- అరకప్పు, గుడ్డు- ఒకటి, మైదా- మూడోవంతు కప్పు, మొక్కజొన్నపిండి- మూడు చెంచాలు, మిరియాల పొడి- చెంచా, కరివేపాకు- 2రెబ్బలు, పచ్చిమిర్చి- ఆరు, క్యాప్సికం- సగం, ఫుడ్‌కలర్- చిటికెడు, నూనె- సరిపడా, ఉప్పు- తగినంత

తయారీ: ముందుగా చేపను రెండు అంగుళాల ముక్కలుగా కోసి వాటికి నిమ్మరసం, మిరియాలపొడి, ఉప్పు కలిపి ముక్కలను అరగంటసేపు మారినేట్ చేసి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో గుడ్డు గిలక్కొట్టి దానిలో మొక్కజొన్నపిండి, మైదా, రంగు కలిపి మారినేట్ చేసిన చేపముక్కల్ని పిండిలో ముంచి నూనెలో డీప్‌ఫ్రై చేసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఒక కడాయిలో రెండు చెంచాల నూనె వేసి అందులో నిలువుగా కోసిన పచ్చి మిరపకాయలు, క్యాప్సికం ముక్కలు, కరివేపాకు వేసి కొంచెం వేయించి పెరుగు, డీప్ ఫ్రై చేసిన చేపముక్కల్ని కూడా వేసి పెరుగు ఇగిరి పోయేంతవరకూ వేయించుకుని తీసుకోవాలి.

పత్రాని మచ్చి

కావల్సిన పదార్థాలు: చందువా చేపలు- రెండు చిన్నవి, కొబ్బరి తురుము- చెంచా, పచ్చిమిర్చి- మూడు, కొత్తిమీర తరుగు- పావుకప్పు, నిమ్మరసం- కొద్దిగా, వెల్లుల్లి- ఐదురెబ్బలు, జీలకర్రపొడి- చెంచా, అరిటాకులు- రెండు చిన్నవి,

తయారీ: ముందుగా చేపలపై నిమ్మరసం, ఉప్పు చల్లి పావుగంటసేపు పక్కన ఉంచాలి. కొబ్బరి తురుము, జీలకర్ర, కొత్తిమీర, వెల్లుల్లి, పచ్చిమిర్చి ముద్ద కలిపి ముద్దను పక్కన పెట్టుకోవాలి. ఒక్కో చేప ముక్కను ఒక్కో అరిటాకులో పెట్టి మసాలా పేస్టును ముక్కలకు రెండు వైపులా పట్టించాలి. అరిటాకుని పొట్లంలా మడిచి వాటిని దారంతో కట్టుకోవాలి. వాటిని ఆవిరిపై పది నిమిషాల పాటు ఉడికించి ప్లేట్‌లోకి తీసుకుని పొట్లం విప్పి సర్వ్ చేసుకోవాలి.

కబాబ్

కావాల్సినవి: కొరమేను చేపలు(ముళ్లు తీసేయాలి)- అరకేజి, అల్లంవెల్లుల్లి పేస్ట్- రెండు చెంచాలు, ఉల్లిపాయపేస్ట్- రెండు చెంచాలు, సెనగపిండి- ఆరు చెంచాలు, నూనె- మూడు చెంచాలు, కారం- అరచెంచా, ఉప్పు- తగినంత

తయారీ: ముందుగా చేపముక్కల్ని కాసిని నీళ్లు పోసుకుని ఉడికించుకోవాలి. ముక్కలు చల్లారాక చేత్తో మెత్తగా మెదిపి పెట్టుకోవాలి. ఇప్పుడు చేపలో ఉల్లిపాయ పేస్ట్, ఉప్పు, సరిపడా సెనగపిండి వేసి మొత్తం అన్నీ కలిసేలా బాగా చేత్తో కలుపుకోవాలి. చిన్నచిన్న ఉండలుగా చేసుకుని అరచేత్తో కబాబ్‌ల మాదిరిగా ఒత్తుకోవాలి. ఇప్పుడు పెనం మీద నూనె వేసి కబాబ్‌లను ముదురు గోధుమరంగులోకి వచ్చేంతవరకూ ఫ్రై చేసుకోవాలి. టమాట సాస్‌తో తింటే ఈ కబాబ్‌లు రుచిగా ఉంటాయి.

మెదడు పనితీరు చురుగ్గా ఉండాలన్నా...మతిమరుపు, ఒత్తిడి వంటివి మనల్ని వేధించకుండా ఉండాలన్నా ఆహారంలో ఒమెగా-3 ఆమ్లాలను మనం సమృద్ధిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఒమెగా-3 సమృద్ధిగా ఉండే చేపనూనెలు, చేపలతో చేసిన వంటకాలు అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకుంటాయి.

చెఫ్ సుస్మిత, హైదరాబాద్

సెలబ్రిటీ రుచి

ఆష్ కోసం క్యూ కట్టేవాళ్లం..

స్టార్‌హోటల్‌లో తిన్నాసరే... అమ్మవండిన వంట కంటే మధురమైన వంటకం మరొకటి ఉంటుందా? నవ్వుల రాజు అలీకి కూడా అమ్మ వంట అంటే ప్రాణమట. అమ్మ చేసే దాల్చా మటన్, గోంగూర మాంసం కూరతో పాటూ రంజాన్ మాసంలో చేసే 'ఆంధ్ర హలీమ్' ఆష్ అంటే మహా ఇష్టం అంటూ.. 'ఆహా'తో ఆ రుచుల అనుభవాలు పంచుకున్నాడు...

మా అమ్మ గోంగూరమాంసం వండితే ఆ రుచికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. సినిమాల కోసం చెన్నైకి వెళ్లిపోవడంతో అమ్మకు, ఆమె వంటకూ దూరమయ్యా. తిరిగి ఆ రుచిని ఆస్వాదించడానికి పదిహేను సంవత్సరాలు పట్టింది. ఇప్పుడైతే నా భార్య ఆ వంటలన్నింటినీ నేర్చుకుని, తిరిగి మా అమ్మకే రుచి చూపిస్తోంది.

ఆ సాయంత్రాల కోసం..

నా చిన్నవయసులో రంజాన్ నెల వచ్చిందంటే చాలు మాఊరంతా హడావుడిగా ఉండేది. ఊర్లో మసీదులన్నీ కళకళల్లాడేవి. సాయంత్రాల కోసం మా స్నేహితులందరం వేయి కళ్లతో ఎదురుచూసేవాళ్లం. అందరం మసీదుకు వెళ్లేవాళ్లం. ఆ వయసులో మాకు ఉపవాసాలుండవు. అక్కడిచ్చే 'ఆష్' అనే వంటకం కోసం పిల్లలంతా క్యూ కట్టేవాళ్లం. ఈ వంటకాన్ని పెద్ద గంగాళంలో వండి వేడివేడిగా ఇస్తారు. ఈ వంటకం రుచిని మాటల్లో చెప్పలేం. దీనిని తింటే చెప్పలేని శక్తి వస్తుంది. రంజాన్ నెలలో మాత్రమే ప్రత్యేకంగా చేసే వంట అది. కొన్నిచోట్ల మాత్రమే ఎప్పుడైనా మాంసం కలిపేవారు. ఆష్ రుచి ఇప్పటికీ నేను మర్చిపోలేదు.

స్నేహితులకు విందు..

ఈ రంజాన్ మాసం వచ్చిందంటే చాలు.. షూటింగ్ ఉన్నా బ్రేక్ తీసుకుని ప్రార్థనలు చేసుకుంటాను. అలాగే ఈ పండుగ రోజుల్లో ఒకరోజు స్నేహితుల్ని, బంధువుల్ని 200 మందిని ఇంటికి పిలిచి విందు ఇస్తా. ఈ అలవాటు చాలా సంవత్సరాల నుంచి పాటిస్తున్నా. నిరుపేదలకు సాయం చేస్తా. అప్పుడే భగవంతుడు మనల్ని చూసి సంతోషిస్తాడని నా నమ్మకం. మా ఇంట్లో రంజాన్ రోజున చేసే 'షీర్ ఖుర్మా' రుచి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒక కప్పు తింటే చాలు... ఆ రోజంతా ఇక ఆకలెయ్యదు. ఇక బిర్యానీలంటారా? మటన్, చికెన్, రొయ్యలు, చేప, మిక్స్‌డ్ వెజ్, పలావ్ వంటివన్నీ ఉంటాయి.

-సీహెచ్. వసుంధరాదేవి

పండగ ప్రత్యేకం

ఈ హలీం చాలా టేస్ట్ గురూ!

ప్యూర్ వెజ్

హైదరాబాద్ హలీం రుచిని ఎంత పొగిడినా.. ఇంకో వాక్యం మిగిలే ఉంటుంది! లేతపొట్టేలు మాంసం..నేతి ఘుమఘుమలతో అదిరిపోయే ఈ రుచిని చూడాలని ఉవ్విళ్లూరని వారుండరు. మరి మాంసాహారం ముట్టని వారి మాటేంటి? అలాంటి వారికోసం అద్భుతమైన రుచితో శాకాహార హలీం సిద్ధమయిపోయింది....

మాంసం వినియోగం ఏ మాత్రం లేకుండానే 'శాకాహార హలీం(వెజ్ హలీం)' డ్రైఫ్రూట్స్, వెజిటబుల్స్‌తో తయారై పసందైన రుచితో జనాన్ని ఆకట్టుకుంటోంది. చార్మినార్ శాలిబండ మార్గంలోని పిస్తాహౌజ్ హోటల్ నిర్వాహకుడు మహ్మద్ అబ్దుల్‌మాజిద్ ప్రయోగాత్మంగా వెజ్ హలీంను రెండుదశాబ్దాల క్రితమే సిద్ధం చేసి శాకాహార హలీం ప్రియులను ఆకట్టుకున్నారు. ఇప్పటికి ప్రతియేటా రంజాన్ సీజనులో శాకాహార హలీం తయారు చేసి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

రుచిలో రాజీలేదు..

ఖర్జురాతో రోజా విడిచిన తర్వాత ఇఫ్తార్ వేళ హలీంను తింటారు. అలా వచ్చిన వాళ్లలో శాకాహారులు కూడా ఉండటం పిస్తాహౌజ్ నిర్వాహకుడు మాజిద్‌ను ఆలోచింప చేసింది. ఆ ఆలోచనే వెజ్ హలీం తయారీకి ప్రాణం పోసింది. అబ్బే హలీం అంటేనే మటన్.. అది లేకపోతే ఇక దానికి రుచేంటి అనేవారు కాస్తా.. మారుమాట్లకుండా తినేలా వెజ్‌హలీంను తయారుచేశారు మాజిద్. 'ముస్లింల్లో కూడా కొందరు మాంసంతో తయారు చేసిన హలీం తినని వారుంటారు. అలాంటివారు కూడా వెజ్‌హలీంను ఇష్టంగా ఆరగిస్తున్నారని అంటున్నారు'మాజిద్. జంటనగరాల్లో హలీం విక్రయ కేంద్రాలు వందల్లో ఉన్నప్పటికి వెజ్‌హలీం మాత్రం చార్మినార్ శాలిబండ, టోలీచౌక్, అత్తాపూర్ హైదర్‌గూడ, పిస్తాహౌజ్ కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ఎండుపప్పులు, కాయగూరలతో..

వెజ్‌హలీం హలీం మూడునాలుగు గంటల్లోనే సిద్ధమవుతుంది. దేక్షి పాత్రలో నీటిని మరిగించి అందులో గోధుమ రవ్వ, క్యారెట్, బీన్స్‌తోపాటు సెనగ, కంది, మినపప్పులను ఉడకబెడతారు. దీనిలో నెయ్యి, జీడిపప్పు, బాదం, పిస్తా, అక్రోట్‌లనువేసి గోట్నా కర్రలతో కలియబెడుతారు. ఇందులో మసాల దినుసులు, సాజిరా, ఇలాచీ, దాల్చినచెక్క, నల్లమిరియాలు, గులాబీ రేకులు, పల్లీ, జీలకర కలిపి రుచికరమైన వెజ్‌హలీం సిద్ధం చేస్తారు. క్వింటాలు వెజ్‌హలీం తయారీ కోసం పదికిలోల నెయ్యి, అరవై కిలోల రవ్వ, పప్పులు, మరోనాలుగు కిలోల డ్రైఫ్రూట్స్‌తోపాటూ ఇరవై నాలుగు కిలోల కాయగూరలు వినియోగిస్తారు. వెజ్‌హలీం ప్లేట్ ధర 160 లభిస్తుంది.

– రమేష్ కుంబోజి, చార్మినార్, చిత్రం: ముత్యాల శ్రీనివాస్

పక్కాలోకల్

గూన పులుసు.. తింటేనే రుచి తెలుసు

ఉత్తరాంధ్ర పెళ్లిళ్లలో గూనపులుసు వండారని తెలిస్తే ఇక భోజనప్రియులను ఆపడం ఎవ్వరి తరం కాదు. పోషకాలు పోతపోసిన ఆ కూర రుచిలోనూ ఏమాత్రం రాజీపడదు....

పెళ్లి వేడుకల్లోనే ఎక్కువగా ఈ వంటకాన్ని తయారుచేస్తారు. ఉత్తరాంధ్ర ఉద్దానం ప్రాంతంలో జరిగే పెళ్లిపబ్బాలకు వెళ్తే ... విందులో గూనపులుసు వాసన కోసం ఆహారప్రియుల నాసికాపుటాలు తహతహలాడుతూ ఉంటాయి. గూన అంటే ఉద్దానం ప్రాంత పరిభాషలో పెద్ద పాత్ర అని అర్థం. పూర్వం రోజుల్లో పెద్ద కుండలో వండేవారట ఈ వంటకాన్ని. ప్రస్తుతం మాత్రం అందుబాటులో ఉన్న పెద్ద పాత్రలనే వాడుతున్నారు. ఈ వంటకంలో పనసకాయలతో పాటూ,మునగాకు, వరిపిండి.. ఇంకా అనేక రకాల కాయగూరలని వాడి తయారుచేస్తారు.

గూనపులుసు తయారీ: చింతపండు-3 కేజీలు, బెల్లం-3 కేజీలు, ఆవాలు- 50గ్రా, జీలకర్ర- 50గ్రా, ఎండు మిర్చి- 50గ్రా, వేయించిన వరి పిండి- కిలో, వంట నూనె- 2 లీటర్లు, మునగాకు- 2 కేజీలు, మునగ కాయలు- కేజీ, వంకాయలు-కేజీ, పనస కాయలు- 2 కేజీలు, గరం మసాలా పొడి- 25 గ్రా, ధనియాల పొడి- 25 గ్రా, కరివేపాకు: పావుకిలో, ఉల్లి- మూడు కేజీలు, ఉప్పు- తగినంత, కారం-100గ్రా

❏ పనస ముక్కలు, మునగాకు, వరిపిండి మేళవించి చేసే అద్భుత రుచి!

ఇలా చేస్తారు: పొయ్యిపై పెద్ద పాత్రని అమరుస్తారు. అందులో నూనె వేసి వేడెక్కాక ఆవాలు, జీలకర్ర, తురిమిన ఉల్లి, కరివేపాకు వేసి తాలింపు వేసుకుంటారు. అందులో బెల్లం వేసి పాకం తీసి... చింతపండు వేస్తారు. ఈ మిశ్రమం బాగా మరిగాక పనస ముక్కలు, మునగాకు, మునక్కాయలు, వంకాయ ముక్కలు వేస్తారు. బాగా ఉడికిన తరువాత అందులో వరి పిండి వేసి అడుగు పట్ట కుండా తెడ్డుతో కలపాలి. ఈ మిశ్రమం బాగా మరిగాక నీరు పోస్తారు. తగినంత ఉప్పు, వంద గ్రాముల కారం పొడి, పసుపు గుండ వేసి తెడ్డుతో కలిపితే గూన పులుసు రెడీ.

– గూన నీలకంఠం, న్యూస్‌టుడే, మందస

మేఘాలలో తేలిపొమ్మన్నది..

విస్తృత పరిశోధనలు, సాంకేతిక మార్పుల ఫలితంగా అనూహ్యమైన రవాణా సాధనాలు అందుబాటులోకి వచ్చే రోజు ఎంతో దూరంలో కనిపించటం లేదు. ఈ మార్పులతో ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాల తీరుతెన్నులు సమూలంగా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది. వాయువేగ మనోవేగాలతో ప్రయాణించే అవకాశం అందుబాటులోకి రాబోతోంది.

డ్రోన్ తరహా హెలికాప్టర్లు

తేలికపాటి హెలికాప్టర్లను పోలిన డ్రోన్లు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు కారణమవుతున్నాయి. సరిహద్దుల్లో శత్రుసైన్యం కదలికలపై నిఘా పెట్టటం నుంచి వ్యవసాయ రంగంలో క్రిమిసంహాకర మందులు చల్లటం, పంటల తీరుతెన్నులను విశ్లేషించటం వరకూ ఎన్నో పనులను డ్రోన్లు చక్కబెడుతున్నాయి. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయాణికులను తీసుకువెళ్లే హెలికాప్టర్ల తయారీకి వినియోగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన శాస్త్రవేత్తలకు వచ్చింది. దాని ఫలితమే డ్రోన్ హెలికాప్టర్. భవిష్యత్తులో రవాణా రంగంలో ఎంతో క్రియాశీలకమైన పాత్ర పోషించే అవకాశం దీనికి ఉన్నట్లు నిపుణులు భావిస్తున్నారు.

- స్వతంత్ర డ్రోన్ హెలికాప్టర్ ఆధారిత రవాణా సేవలను ప్రవేశపెట్టేందుకు ఉబెర్ ప్రయత్నాలు చేస్తోంది.
- పలు చైనా కంపెనీలు డ్రోన్ టెక్నాలజీ ఆధారిత డ్రోన్ హెలీకాప్టర్లను రూపొందించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి.
- విమానాల తయారీ సంస్థ అయిన ఎయిర్‌బస్, కొద్దికాలం క్రితం వాహన (ఎలక్ట్రిక్ వెర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్) ఎయిర్‌క్రాఫ్ట్‌ను ప్రయోగాత్మకంగా నడిపి చూసింది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే వచ్చే రెండేళ్లలో డ్రోన్ హెలికాప్టర్‌ను ఆవిష్కరించే అవకాశం కనిపిస్తోంది.

ఎగిరే కార్లు!

ఎగిరే కార్లను మనం కథల్లో, సినిమాల్లో చూస్తాం. అది ఎప్పటికీ నిజం కాకపోవచ్చని అనుకునే వారు ఉన్నారు. కానీ త్వరలో వచ్చేస్తోందని అంటున్నారు స్లోవేకియాకు చెందిన ఏరోమొబిల్ సంస్థ సీఈఓ జురాజ్ వాకులిక్.

- ఏరోమొబిల్ సంస్థ ఇప్పటికే ఎగిరే కారు నొకదాన్ని సిద్ధం చేసింది. రహదార్ల మీద రద్దీలో ప్రమాదాలను తప్పించుకుంటూ ప్రయాణించే బదులు ఈ ఎగిరే కారులో సుఖవంతమైన ప్రయాణం చేయవచ్చు.
- దాదాపు 500 నుంచి 700 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలనుకుంటే దీన్ని మించిన ప్రయాణ సాధనం లేదని ఈ సంస్థ ప్రతినిధులు వివరిస్తున్నారు.
- ఒక నమూనా కారును గత ఏడాదిలో పరీక్షించగా ఆసక్తికరమైన ఫలితాలు వచ్చినట్లు వారు స్పష్టం చేస్తున్నారు.

జెట్ ప్యాక్ సూట్

ఒక సమూహంగా విమానంలో ఆకాశయానం చేసే బదులు, ఎవరికి వాళ్లు ఒక సూట్ తగిలించుకొని గాల్లో సూపర్‌మాన్ మాదిరిగా ఎగిరిపోగలిగితే ఎంతో బాగుంటుంది కదా? అని ఎవరికైనా అనిపించవచ్చు. దాన్ని నిజం చేసేందుకు మార్టిన్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీ ప్రయత్నాలు చేస్తోంది.

- న్యూజీలాండ్‌కు చెందిన మార్టిన్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీకి ఆదేశానికి చెందిన పౌర విమానయాన శాఖ జెట్ ప్యాక్ సూట్‌తో ఆకాశంలో ఎగిరేందుకు అనుమతి ఇచ్చింది.
- ఆకాశంలో ప్రయాణం చేసేందుకు అనువైన ఒక సూట్‌ను ఆవిష్కరించటానికి ఈ కంపెనీ ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే కొన్ని నమూనాలు సిద్ధం చేసి ప్రయోగాలు నిర్వహిస్తోంది.
- ఇటువంటి సూట్ ఒకటి అందుబాటులోకి వచ్చేందుకు ఎంతో సమయం పట్టకపోవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అదే జరిగితే ఎవరికి వారు ఒక సూట్ తగిలించుకొని ఆకాశంలో ఎగిరిపోవచ్చు.

బుల్లెట్ రైలు కాదు, సూపర్ రైలు..

మనదేశంలో రైళ్లు మహా అయితే గరిష్ఠంగా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వెళ్తాయేమో. కానీ జపాన్, ఫ్రాన్స్, జర్మనీ, చైనా దేశాల్లో గంటకు 500 కిలోమీటర్లకు మించిన వేగంతో ప్రయాణించే బుల్లెట్ రైళ్లు ఉన్నాయి. బుల్లెట్ రైలే అద్భుతం అనుకుంటుంటే..., దాన్ని మించిన సూపర్ రైలు రాబోతోంది. మాగ్లెవ్ (మాగ్నటిక్ లెవిటేషన్ టెక్నాలజీ) సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గంటలకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రైలును ఆవిష్కరించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- మాగ్లెవ్ టెక్నాలజీని ఎన్నో ఏళ్ల క్రితమే కనుగొన్నారు. అదే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అత్యధిక వేగంతో వెళ్లే రైళ్లను తయారు చేయాలనేదే కొత్త ప్రయోగం.
- చైనా శాస్త్రవేత్తలు ఈ దిశగా ఎంతో ప్రగతి సాధించారు. ఈ ప్రయోగాలు పూర్తయితే విమానవేగంతో రైలు ప్రయాణం అందివస్తుంది.
- అమెరికాలో వాషింగ్టన్- న్యూయార్క్ నగరాల మధ్య భారీ బడ్జెట్‌తో మాగ్లెవ్ రైలు మార్గాన్ని నిర్మిస్తున్నారు. దీనివల్ల ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోతుంది. ఇంకా సూపర్- మాగ్లెవ్ రైళ్లు వస్తే అరగంట వ్యవధిలోనే న్యూయార్క్ నుంచి వాషింగ్టన్ చేరుకోవచ్చు!

స్మార్ట్ రహదార్లు...

రోడ్డెక్కాలంటే... ఏ ప్రమాదం ముంచుకొస్తుందోననే భయం ఎంతోమందిని వెంటాడుతుంటుంది. ఏటా ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో పది లక్షలమంది ప్రాణాలు కోల్పోతున్నారు. గాయపడే వారి సంఖ్య ఇంకా అధికం. ఈ సమస్యకు పరిష్కారంగా 'స్మార్ట్ రహదార్లను' ఆవిష్కరించేందుకు పోర్చుగీస్‌లో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రయోగాలు సఫలం అయితే ప్రపంచ వ్యాప్తంగా స్మార్ట్ రహదార్లు రూపుదిద్దుకోవచ్చు.

- ఐటీ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ రహదార్లలో నెలకొల్పే సెన్సార్లు పరస్పరం సంప్రదించుకుంటూ వాహనాల రాకపోకలు, పాదచారుల కదలికలపై నిఘా పెడతాయి. ప్రమాదం జరిగే పరిస్థితి ఉంటే వాహనాలు, పాదచారులను అప్రమత్తం చేయటం, వాహనాలు వాటికవే వేగం తగ్గి నిలిచిపోయే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరిస్తున్నారు.
- స్వీడన్‌లో రీఛార్జింగ్ రహదార్లను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నారు. సమీప భవిష్యత్తులో ఇటువంటి రహదార్లను స్మార్ట్ రహదార్లుగా విస్తరించే అవకాశం ఉంది.
- స్మార్ట్ రహదార్లతో ప్రమాదాలను, కాలుష్యాన్ని అరికట్టవచ్చు. చిక్కుల్లేని, సౌకర్యవంతమైన ప్రయాణానికి వీలుకలుగుతుంది.

హైపర్‌లూప్ పరిజ్ఞానం



టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల వ్యవస్థాపకుడైన ఎలాన్ ముస్క్ మానస పుత్రిక అయిన హైపర్‌లూప్ సాంకేతిక పరిజ్ఞానం కార్యరూపంలోకి వస్తే, ప్రయాణం రూపురేఖలు సమూలంగా మారిపోయినట్లే. తక్కువ పీడనం కల ట్యూబుల్లో గంటకు 700 కిలోమీటర్లకు పైగా వేగంగా ప్రయాణించేందుకు హైపర్‌లూప్ ప్రయాణం వీలుకల్పిస్తుందని అంచనా.

- 'హైపర్‌లూప్' ద్వారా శాన్ ఫ్రాన్సిస్కో- లాస్ ఏంజెలెస్ మధ్య ప్రయాణానికి పట్టే సమయం 35 నిమిషాలు మాత్రమే!
- వచ్చే అయిదారేళ్ల వ్యవధిలో 'హైపర్‌లూప్' పరిజ్ఞానం కార్యరూపం దాల్చుతుందనే అంచనాలు ఉన్నాయి.

సైకిళ్లకు ప్రత్యేకం?

వాహనాల వేగం పెరిగినకొద్దీ కాలుష్యం కూడా పెరగడం మామూలే. రహదార్లపై వాహన కాలుష్యానికి చెక్ పెట్టాలంటే, సైకిల్ ప్రయాణమే దిక్కు. కానీ వేగంగా దూసుకు వెళ్లే భారీ వాహనాలు, కార్లు, మోటార్ సైకిళ్ల మధ్యలో సైకిల్ ప్రయాణం ఎంతమాత్రం క్షేమకరం కాదు. దీన్ని పరిగణలోకి తీసుకొని సైకిల్ ప్రయాణికుల కోసం ప్రత్యేక రహదార్లను నిర్మించాలనే ఆలోచన కొన్ని దేశాల్లో రూపుదిద్దుకుంటోంది.

- ఆగ్నేయ చైనా నగరమైన గ్జియామెన్, ప్రత్యేకంగా సైక్లింగ్ రోడ్డును నిర్మిస్తోంది.
- షాంఘైలో ఇ-బైకులు, ఎలక్ట్రిక్ స్కూటర్ల కోసం సైకిల్ రోడ్డు నిర్మించాలని బీఎండబ్ల్యూ, చైనాలోని టింగ్యీ యూనివర్సిటీ ప్రతిపాదించాయి.
- ప్రత్యేక సైకిల్ రహదార్లు నిర్మించాలనే ప్రతిపాదనలు పలు ఐరోపా దేశాల్లోనూ ఉన్నాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఆగస్టు 24 నుంచి డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

ఎంపికైన వారితో ముఖ్యమంత్రి నేరుగా సమీక్షించి ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావాన్ని తెలియజేసేలా ప్రతిజ్ఞ చేయిస్తారని చెప్పారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి సర్కారు ఇప్పటికే జిల్లాల వారీగా ఖాళీల వివరాలను సేకరించింది. 2014 జూన్ 1 నుంచి 2018 మార్చి 31 వరకు ఉన్న ఖాళీలను ఆగస్టులో నిర్వహించబోయే డీఎస్సీ-2018 ద్వారా భర్తీ చేయనున్నారు. పురపాలిక, మోడల్ పాఠశాలల్లో ఖాళీలతో పాటు గతంలో కొన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఏర్పడిన కొత్త ఖాళీలను వేరుగా చూపించారు. వీటినీ జిల్లాల వారీగా విభజించి త్వరలోనే అధికారిక డీఎస్సీ ప్రకటనలో పూర్తిస్థాయిలో ఖాళీలను చూపించే అవకాశం ఉంది.

మొత్తం ఖాళీలు ఇలా..	
జడ్పీ/ప్రభుత్వ	: 4,626
పురపాలికల్లో	: 1,448
మోడల్ పాఠశాలలు	: 929
కొత్తగా సృష్టించిన ఖాళీలు	: 3,290
సంగీతం	: 58
మొత్తం	**: 10,351**

షెడ్యూల్ ఇదే..

నోటిఫికేషన్ విడుదల: 6.7.18
భర్తీ చేసే పోస్టులు: స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, లాంగ్వేజి పండిట్లు, సంగీత, నృత్య టీచర్లు, పీఈటీలు, మోడల్ స్కూల్ టీచర్లు.
ఫీజుల చెల్లింపు: 6.7.18 నుంచి 8.7.18 వరకు.
దరఖాస్తు సమర్పణ ఆన్‌లైన్‌లో: 7.7.18 నుంచి 9.8.18 వరకు
నమూనా పరీక్షలు: 1.8.18 నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.
హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్: 15.8.18 నుంచి
పరీక్ష: 24.8.18 నుంచి 26.8.18 **ప్రాథమిక కీ విడుదల:** 27.8.18
అభ్యంతరాలుంటే: 27.8.18 నుంచి 7.9.18 వరకు
తుది కీ విడుదల: 10.9.18 **ఫలితాల ప్రకటన:** 15.9.18

రెండో టెట్‌కు 3,97,957 మంది..

ఆదివారం నుంచి ఈనెల 19 వరకు జరగనున్న రెండో టెట్‌కు 3,97,957 మంది దరఖాస్తు చేసినట్టు మంత్రి గంటా తెలిపారు. రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, బెంగళూరు, చెన్నైలో మొత్తం 113 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 14,891 మంది కేంద్రాలు ఎక్కడ కావాలో ఆప్షన్ పెట్టుకోలేదు. వీరికి సమీప కేంద్రాల్లో పరీక్షలు రాసేందుకు అనుమతిస్తామని మంత్రి పేర్కొన్నారు. టెట్ పరీక్షను రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో విడతలో 27,495 మందికి అవకాశం ఉందని, ఇలా రోజుకు 54,990 మంది పరీక్షలు రాస్తారని గంటా వివరించారు. సందేహాల నివృత్తి కోసం 95056 19127, 95057 80616, 95058 53627 నంబర్లు హెల్ప్‌లైన్ కోసం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సారి టెట్ ఫలితాలను ఆన్‌లైన్‌లో వెంటనే తెలుసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పరీక్ష పూర్తయ్యాక సబ్‌మిట్ బటన్ నొక్కగానే ఎన్ని మార్కులు వచ్చాయో తెలుస్తుందన్నారు. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి మార్చి మూడో తేదీ వరకు మొదటిసారి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించిన సంగతి తెలిసిందే. దానికి 4.46 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 4.10 లక్షల మంది పరీక్షలు రాశారు. డీఎస్సీ 2018లో ఎక్కువ మందికి అవకాశం కల్పించాలని ప్రభుత్వం మరోసారి టెట్ నిర్వహించడానికి ముందుకొచ్చింది.

జిల్లాకు ఇద్దరు డీఈవోలు

విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు వీలుగా జిల్లాకు ఇద్దరు డీఈవోలను నియమించనున్నట్లు మంత్రి గంటా తెలిపారు. డీఎస్సీ- 2014 ద్వారా పది వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, ఈ ఏడాది మరో పది వేలు భర్తీ చేసి రాష్ట్రాన్ని విద్యా కూడలిగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని పాఠశాలలన్నింటిలో మౌలిక వసతుల కోసం ఈ ఏడాది రూ.4,850 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు చెప్పారు. ఇకపై ఏ పాఠశాలలోను చెట్ల కింద తరగతులు నిర్వహించే పరిస్థితి, నేలపై విద్యార్థులు కూర్చొనే దుస్థితి ఉండదని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

జిల్లాల వారీగా జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ పాఠశాలల విభాగాల్లో ఖాళీల వివరాలు... www.eenadu.net లో

సగం చోట్ల ఎదురుగాలే!

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలున్నాయి. దిల్లీ నగరపాలికల ఎన్నికల్లో ఇదే చేసి, సత్ఫలితాన్ని సాధించారు. కార్పొరేటర్లపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నచోట అభ్యర్థుల్ని మార్చారు. కొన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికల్లోనూ ఇదే ప్రయోగం చేసి, అక్కడా విజయం సాధించారు.

తృతీయ స్థాయి నాయకత్వం.. భాజపాలో తృతీయ స్థాయి నాయకత్వాన్ని అభివృద్ధి చెందించడానికి అవసరమైన దీర్ఘకాలిక వ్యూహంపై పార్టీ అధిష్ఠానం, సంఘ్ పరివార్ దృష్టి సారించాయి. ఇటీవల ఉజ్జయినిలో అమిత్ షా, ఆరెస్సెస్ అగ్రనేతలు- మోహన్ భగవత్, భయ్యాజీ జోషి సమావేశమైనప్పుడు ఈ వ్యూహాన్ని చర్చించారు. 2019 ఎన్నికల్లో టికెట్ల కేటాయింపునకు కఠినమైన నిబంధనల్ని పాటించాలని పార్టీ నిర్ణయించింది. 75 ఏళ్ల వయసు పైబడినవారి అభ్యర్థిత్వాన్ని పరిగణనలో తీసుకోవాలా వద్దా అన్న అంశంపై చర్చిస్తున్నారు.

ఒడిశా నుంచీ ప్రధాని పోటీ?.. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమబెంగాల్‌లలో ఉన్న 105 లోక్‌సభ స్థానాలపై భాజపా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. 2014లో మోదీ ప్రభంజనం వెల్లువెత్తినప్పుడు సయితం ఈ 105లో ఆరు చోట్ల మాత్రమే భాజపా గెలిచింది. ఇతర చోట్ల వాటిల్లే నష్టాన్ని భర్తీ చేసుకోవాలంటే ఈసారి వీటిలో కనీసం 80 స్థానాలను చేజిక్కించుకోవాలని కమలనాథులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నాలుగు చోట్లా అధికార పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనీ, దానిని సావకాశంగా వినియోగించుకోవాలనీ భాజపా ఆశపడుతోంది. వీటిలో ఒడిశాలో తప్పిస్తే మిగిలిన రాష్ట్రాల్లో సంస్థాపరంగా నిర్మాణం బలహీనంగానే ఉంది. అందుకే మోదీకున్న ప్రజాదరణను సొమ్ము చేసుకోవాలని షా యోచిస్తున్నారు. దీనిలో భాగంగా మోదీని వారణాసితో పాటు ఒడిశాలోని పూరీ లోక్‌సభ స్థానం నుంచి కూడా పోటీ చేయించే దిశగా పార్టీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల భాజపా జాతీయ కార్యవర్గ సమావేశంలో ఒడిశా శాఖ నాయకులు ప్రధానిని కలిసినప్పుడు ఈ ప్రస్తావన వచ్చింది. ఎన్డీఏ పాలనలో నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకను కటక్‌లో నిర్వహించడం ఇక్కడ ప్రస్తావనార్హం. మోదీ ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీ ఇంకా నిర్ణయించలేదనీ, ప్రధాని ఒక ప్రాంతాన్ని సందర్శించినంతమాత్రాన ఆయన అక్కడి నుంచి పోటీ చేస్తున్నట్లు భావించడం తగదనీ అమిత్ షా అంటున్నారు.

కవాతులో తలపాగాతో పాల్గొన్న మన్‌చరణ్‌ప్రీత్

తలపాగాతో బ్రిటన్ కవాతులో పాల్గొన్న తొలి సిక్కు యువ సైనికుడు

లండన్: బ్రిటన్ రాణి ఎలిజబెత్ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం ఇక్కడ నిర్వహించిన సైనిక కవాతులో సిక్కు సైనికుడొకరు తమదైన ప్రత్యేక తలపాగాను ధరించి పాల్గొన్నారు. ఇలా తలపాగాతో పాల్గొన్న తొలి సిక్కుగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు. మహారాణి పుట్టిన రోజును పురస్కరించుకుని ఏటా బ్రిటిష్, కామన్వెల్త్ సైనిక దళాలు ఓ ఉత్సవంలా నిర్వహించే ఈ విన్యాసాన్ని 'ట్రూపింగ్ ది కలర్' గా పేర్కొంటారు. 'ట్రూపింగ్ ది కలర్'లో పాల్గొనే సైనికులంతా కూడా సాధారణంగా ఎలుగుబంటి చర్మంతో తయారు చేసిన టోపీలను ధరించడం ఆనవాయితీ. అయితే, ఈ దఫా గురుదాస్ మన్‌చరణ్‌ప్రీత్ సింగ్ లాల్(23)అనే భారత సంతతి వ్యక్తి నల్లని తలపాగాతో కవాతులో పాల్గొన్నారు. ఇది నిజంగా తనకు ఓ గొప్ప గౌరవమని ఆయన ఆ తర్వాత బీబీసీతో మాట్లాడుతూ ఆనందం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ నియామక పరీక్షకు సిలబస్ ఖరారు

- డీఎస్సీ ప్రకటనతోపాటు విడుదల
- ఎస్జీటీలు, భాషాపండితులకు 8వ తరగతి సిలబస్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ నియామక పరీక్షకు పాఠశాల విద్యాశాఖ సిలబస్ ఖరారు చేసింది. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి దాదాపు 130పేజీలతో కూడిన సిలబస్‌ను సిద్ధం చేసింది. ఉపాధ్యాయ నియామక పరీక్ష ప్రకటనతో పాటు ఈ సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. వచ్చే నెల 6న ప్రకటన వెలువడనుంది. 2014లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్), ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్టీ)ని కలిపి నిర్వహించారు. ఈసారి రెండు పరీక్షలను విడివిడిగా నిర్వహిస్తున్నందున సిలబస్‌పై అభ్యర్థులలో ఆందోళన నెలకొంది. టెట్‌కు 20మార్కుల వెయిటేజీ ఉన్నందున మిగతా 80మార్కులకే టీఆర్టీ నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రం పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు అరమార్కు చొప్పున 160 మార్కులకు ప్రశ్నపత్రం ఇవ్వనున్నారు. వర్తమాన వ్యవహారాలు, జనరల్‌నాలెడ్జ్, సైకాలజీపై స్థాయిని అనుసరించి ఎస్జీటీలు, పాఠశాల సహాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రశ్నలు ఇస్తారు. ఎస్జీటీలకు గతంలో పదోతరగతి స్థాయి వరకు ప్రశ్నలు ఇచ్చేవారు. ఈసారి ఎనిమిదోతరగతి వరకే పరిమితం చేసినా పదోతరగతి వరకు చూసుకుంటే మంచిది. పాఠశాల సహాయకుల(ఎస్‌ఏ)కు ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు, భాషాపండితులకు మాత్రం పార్ట్‌బీ కంటెంట్‌లో 1-8తరగతి వరకు ప్రశ్నలు రానున్నాయి.

ఎవరెవరికి ఎలా... ఎస్జీటీలకు 80 మార్కులకు నిర్వహించే పరీక్షలో 10 మార్కులకు వర్తమాన వ్యవహారాలు(కరెంట్‌అఫైర్స్), జనరల్‌నాలెడ్జ్‌పై ప్రశ్నలు ఉంటాయి. మరో 10కి భారతీయ విద్యావిధానంలో వస్తున్న మార్పులు, చట్టాలు, సైకాలజీపై రానున్నాయి. మిగతా 60కి ఆంగ్లం, తెలుగు, గణితం, సాంఘిక, సామాన్యశాస్త్రం సబ్జెక్టుల్లో ఒక్కోదాని నుంచి 9 చొప్పున 45 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఈ సబ్జెక్టుల మెథడాలజీ(బోధన)పై 15 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.

- పాఠశాల సహాయకులకు వర్తమాన వ్యవహారాలు, జనరల్‌నాలెడ్జ్, భారతీయ విద్యావిధానంలో వస్తున్న మార్పులు, సైకాలజీపై 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. సబ్జెక్టులకు 44, బోధనకి 16 మార్కులకు ప్రశ్నలు రానున్నాయి.
- వ్యాయామ ఉపాధ్యాయులకు 80లో 50మార్కులకు పరీక్ష ఉంటుంది. మిగతా 30కి క్రీడలు, శారీరక ఆటల ద్వారా కేటాయిస్తారు. ఈ క్రీడల్లో ప్రతిభ ఆధారంగా మార్కులు ఉంటాయి.

ఆస్పత్రుల్లో సేవకులు

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రుల్లో 175 సహాయ కేంద్రాలు కూడా రాబోతున్నాయి. రోగులకు ఓపీ విభాగంలో, ఏయే వార్డుల్లో వైద్య సేవలు అందుతాయో రోగులకు తెలియజేసేందుకు సహాయ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం కేజీహెచ్‌లో 66 మంది 4వ తరగతి ఉద్యోగులు, కాకినాడలో 178, విజయవాడలో 88, గుంటూరులో 150, ఒంగోలులో 51, కడపలో 120, శ్రీకాకుళంలో 86, నెల్లూరులో 149, విశాఖ విక్టోరియాలో 57, టీబీ ఆస్పత్రిలో 40 మంది రాబోతున్నారు.

విస్తరించిన నైరుతి

(మొదటి పేజీ తరువాయి)

నమోదైంది. శనివారం సాయంత్రానికి కర్నూలు, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తూనే ఉంది. 12, 13, 14 తేదీల్లో ఉత్తరకోస్తా జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మరోవైపు తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. గాలులు గంటకు 40 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో వీస్తున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని సూచించింది. బంగ్లాదేశ్ తీరంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది ఉపరితల ఆవర్తనంతో కలిసి కదులుతోందని వివరించింది. ఇది ఆదివారం మరింత బలపడి ఆపై 24 గంటల్లో వాయుగుండంగా మారుతుందని తెలిపింది.

గ్రహం అనుగ్రహం

10-6-2018 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
ఏకాదశి: ఉ. 8-01 తదుపరి ద్వాదశి
అశ్విని నక్షత్రం: రా. 7-36 తదుపరి భరణి
అమృత ఘడియలు: మ. 12-23 నుంచి 1-59 వరకు
వర్జ్యం: మ. 3-35 నుంచి 5-12 వరకు
తిరిగి తె. 5-03 నుంచి
దుర్ముహూర్తం: సా. 4-46 నుంచి 5-38 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-30
మతత్రయ ఏకాదశి

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విజయవాడ	37.9	27.4
గుంటూరు	37.1	26.5
నెల్లూరు	37.0	29.0
ఒంగోలు	36.9	29.6
విశాఖపట్నం	36.0	26.4
రాజమహేంద్రవరం	36.0	26.0
కడప	35.0	26.0
నరసాపురం	34.6	27.7
శ్రీకాకుళం	34.0	28.0
తిరుపతి	34.0	27.2
కర్నూలు	32.6	27.2
అనంతపురం	29.4	24.5
తాడేపల్లిగూడెం	29.0	27.0

జగన్ అక్రమాస్తులనూ వేలం వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ సభలు ఈ ఏడాదంతా కొనసాగుతాయి.

అది మీకెందుకు వర్తించదు

'అగ్రి గోల్డ్ యజమానులు వ్యాపారం కోసం ప్రజల నుంచి డబ్బులు తీసుకుని ఆస్తులు కొన్నారు. వచ్చే ఆదాయానికి, చెల్లించాల్సిన బకాయిలకు పొంతన లేక దివాళా తీశారు. ప్రజల్ని మోసం చేశారు కాబట్టి వాళ్లను జైల్లో పెట్టి, వ్యక్తిగత ఆస్తులూ వేలం వేస్తున్నాం. అది మీకెందుకు (వైకాపాను ఉద్దేశించి) వర్తించదు? మీవి అవినీతి ఆస్తులు కాదా? ఇలాంటి అవినీతిపరులు సమాజానికి ఎంత ప్రమాదమో ప్రజలు అర్థం చేసుకోవాలి. తెదేపా గురించి, మా ఎమ్మెల్యేల గురించి మాట్లాడే వైకాపా నాయకుల చరిత్రేంటి? వోక్స్ వ్యాగన్ పారిపోయింది.. ఐఏఎస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు జైలుకెళ్లింది మీ వల్లే కదా? రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసింది, భ్రష్టు పట్టించిందీ మీరు కాదా? నీరవ్ మోదీ బ్యాంకుల్ని దోచేశాడు. విజయ్ మాల్యా, అగ్రి గోల్డ్ యజమానులు అప్పులు చేసి వ్యాపారంలో దివాళా తీశారు. వాళ్లకూ మీకూ తేడా ఏంటి? వాళ్ల కంటే జగన్‌వే పెద్ద నేరాలు.'

లగ్నం పెట్టుకుని రాజీనామాలు

'వైకాపా ఎంపీల రాజీనామాలు పెద్ద డ్రామా. ఆమోదించినా ఉప ఎన్నికలు రాకుండా లగ్నం పెట్టుకున్నారు. ఇదంతా లాలూచీలో భాగమే? అభివృద్ధిని అడ్డుకోవడం, సంక్షేమ కార్యక్రమాలు జరగకుండా చూడటం, కుట్రలు, కుతంత్రాలు, రౌడీయిజం, అక్రమ ఆస్తులు కూడగట్టడం వాళ్ల నిత్య కృత్యాలు. వాళ్ల ఎమ్మెల్యేలు బెట్టింగ్‌ల్లోనూ ఉన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లకు వాళ్ల అండదండలున్నాయి. రాజధానిలో పంటలు తగులబెట్టారు. పోలవరం కాలువలకు గండ్లు కొట్టారు. రైతుల్ని రెచ్చగొట్టారు. తూర్పుగోదావరిలో జిల్లాలో దివీస్ ఫార్మా పరిశ్రమ రాకుండా అడ్డుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మెగా ఫుడ్ పార్కుకు అడ్డుపడుతున్నారు. ఒక పక్క పరిశ్రమలు రావాలంటారు. మరోపక్క జల్లికట్టు స్ఫూర్తితో అడ్డుపడతామంటారు. దానికీ దీనికీ సంబంధం ఉందా?'

> 'ఏదో ఇసుక, మట్టి కుంభకోణాలు జరిగాయని అసత్య ఆరోపణలు చేస్తున్నవాళ్లు... జగన్‌కు సంబంధించిన రూ.43వేల కోట్ల నేరాల గురించి ఎందుకు మాట్లాడరు?'

కాఫర్ డ్యాం పనులు పూర్తి

'పోలవరం ప్రాజెక్టులో కాఫర్ డ్యాం పనులు పూర్తయ్యాయి. కొందరు ప్రతిపక్ష నాయకులు అక్కడికి వెళ్లి కాఫర్ డ్యాం కట్టామన్నారు? ఏదీ కనిపించడం లేదు? ఆ పేరు చెప్పి తినేశారు అంటూ మాట్లాడుతున్నారు. కాఫర్ డ్యాం భూమి లోపల ఉంటుందని వాళ్లకు తెలీదు. కాఫర్ డ్యాం, స్పిల్‌వే అంటే ఏంటో తెలియనివాళ్లూ ఆరోపణలు చేస్తున్నారు.'

ప్రజలు సంఘటితం కావాలి

'మేం నీతిమంతంగా ఉన్నాం. రాష్ట్రం కోసం పోరాడుతున్నాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే భాజపాతో విభేదించాం. వైకాపా నాయకులు ఆ రోజు భాజపాను కాదని ఎన్నికల్లో పోటీ చేసి ఇప్పుడు వాళ్లతో కలిసి కేసులు మాఫీ చేసుకుంటున్నారు. ఇది నాటకం. బూటకం. ఇది ఎన్నికల సంవత్సరం. కీలకమైన సంవత్సరం. ప్రజలంతా సంఘటితం కావాలి. వాళ్ల కుట్రలు కుతంత్రాల పట్ల అప్రమత్తంగా ఉండి న్యాయమైన కోర్కెల కోసం రాజీలేని పోరాటం చేయాలి. మన హక్కును ఎవరూ కాలరాయలేరు. మనం అడిగేవి గొంతెమ్మ కోర్కెలు కాదు. వాళ్లు కావాలనే నాపై బురద జల్లుతున్నారు. నన్ను విమర్శించే నైతిక హక్కు వాళ్లకు లేదు. జగన్ ఏం అనుభవం ఉందని మాట్లాడుతున్నాడు? అతనికి ఏం తెలుసు. బడ్జెట్ అంటే తెలుసా? ఎక్కడ నేర్చుకున్నాడు? అది చేస్తాం.. ఇది చేస్తాం అని జగన్ నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నాడు. కుడి ఎడమల తప్పుడు లెక్కలతో డబ్బులు సంపాదించడం తప్ప ఏమీ చేయలేడు. ఇంతవరకూ చేసిన దానికే 11 కేసుల్లో ప్రతి శుక్రవారం కోర్టుకు వెళుతున్నాడు. కేంద్రం దయాదాక్షిణ్యాలపై బతుకుతూ వేరొకరిపై విమర్శలు చేయడం తగదు.'

> 'అవినీతి కేసుల్లో జగన్, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, విజయసాయి రెడ్డి ముద్దాయిలే కదా? అవి నిరూపితమైన (ప్రూవ్డ్) కేసులే కదా? అలాంటి వాళ్లు మాపై ఆరోపణలు చేయడమేంటి?'

ఇదో కొత్త అనుభవం..

'నవ నిర్మాణ దీక్షల్లో రోజూ 30 లక్షల నుంచి 35 లక్షల మంది పాల్గొనడం ఒక చరిత్ర. ప్రభుత్వ యంత్రాంగం చాలా బాగా పని చేసింది. దీక్షలు జరిగిన రోజుల్లో చేసిన అభిప్రాయ సేకరణలో ప్రజల్లో సంతృప్త స్థాయి 80 శాతం నమోదైంది. ఇప్పుడది 77 శాతంగా ఉంది. వ్యవస్థలో ఒకరిద్దరివల్ల తప్పులు జరుగుతాయి. వాటిని నివారించేందుకే టెక్నాలజీని వినియోగిస్తున్నాం. గ్రామ దర్శినిలో భాగంగా ఈ వారం రోజుల్లో వివిధ గ్రామాలను సందర్శించడం గొప్ప అనుభూతినిచ్చింది. భర్త నుంచి వేరుగా ఉంటున్న మహిళలకు అమలు చేయనున్న పింఛను పథకాన్ని అసలు వివాహమే చేసుకోని మహిళలకూ వర్తింపజేసే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదు.'

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి..

'నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు దిల్లీ వెళుతున్నా. సమావేశం ఈ నెల 16, 17 తేదీల్లో ఏ రోజున ఉంటుందో ఇంకా స్పష్టత రాలేదు. సామాజిక మాధ్యమాల్లో ఎవరికివాళ్లు ఏ ప్రచారమైనా చేసుకోవచ్చు. ప్రధానితో ముఖాముఖి భేటీకి నాకేం ఆహ్వానం లేదు. సహజ వాయువును జీఎస్టీ పరిధిలోకి తేవాలని కేంద్రం భావించడం సరికాదు. మన ఆదాయానికి వాళ్లు గండి కొట్టడమేంటి? రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి. ఒక పక్క సహకార సమాఖ్య స్ఫూర్తితో దేశం మొత్తం ఒక టీంలా ఉండాలని చెబుతూ... మరో పక్క మా ఇష్టం వచ్చినట్టు మేం చేస్తామన్న కేంద్రం ధోరణి మంచిది కాదు. పరస్పర విశ్వాసం ఉండాలి. రాష్ట్రాల హక్కుల్ని మనం కాపాడుకోవాలి.'

రూ. 344 లక్షల కోట్లు
2017-18 నాటికి దేశంలోని వ్యక్తుల సంపద

రూ. 140 లక్షల కోట్లు
బంగారం, స్థిరాస్తి, భౌతిక ఆస్తుల విలువ

రూ. 639 లక్షల కోట్లు
వచ్చే 5 ఏళ్లలో వ్యక్తిగత ఆస్తుల విలువ అంచనా

ఈనాడు బిజినెస్ వారాంతం

సంపదకు సరికొత్త బాటలు

❖ కుటుంబ కార్యాలయాలతో సరికొత్త పోకడ
❖ కార్పొరేట్ రంగంలో ఊపందుకుంటున్న ధోరణి
❖ దిగ్గజాలు ఇప్పటికే ఈ దారిలో..

ఇది యువ భారతం. పరివర్తన క్రమంలో ఉంది.
ఒడుదొడుకులు ఎదురైనప్పటికీ..
వచ్చే పదేళ్లలో 10 శాతం వృద్ధిరేటు సాధ్యమేనని అంటున్నారు.
ఈ క్రమంలో ఇప్పటికే సంపన్నులుగా ఉన్న వారు మరింత సంపన్నులుగా మారితే..
యువ ఔత్సాహికులు కొత్త తరం సంపన్నులుగా ఆవిర్భవించనున్నారు.
వీరంతా ఏం కోరుకుంటున్నారు?

ఈనాడు – హైదరాబాద్

సంపాదించడమే కాదు..

ఆ సంపదను తమ ఆలోచనలు, అభిరుచులకు అనుగుణంగా ఖర్చు చేయడమూ ప్రధానమే..

ఆ సంపదను మరింత పెంచే సాధనాల్లో పెట్టుబడులు పెట్టడమూ అవసరమే...

ఆ సంపదతో సమాజానికి సేవ చేయడమూ ముఖ్యమే..

అంతేనా.. ఆ సంపదను వివాదాలు లేకుండా ముందు తరాల వారికి బదిలీ చేయడమూ అత్యంత ఆవశ్యకమే.

ఈ పనులన్నీ చేసిపెట్టేందుకు ఏకంగా కుటుంబ కార్యాలయాలు (ఫ్యామిలీ ఆఫీసులు) ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి ధోరణి భవిష్యత్తులో మరింత పెరిగే వీలుందని అంటున్నారు కార్వీ ప్రైవేట్ వెల్త్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అభిజిత్ భావే. గతంలో దేశంలోని వ్యాపార కుటుంబాలు తాము నిర్వహించే వ్యాపారాలు తమ ఆధీనంలోనే ఉండాలని కోరుకునేవి. విదేశీ ప్రభావంతో ఇటువంటి కుటుంబాల్లోని కొత్తతరం వారు ఇప్పుడు భిన్నంగా ఆలోచిస్తున్నారని, తొలి తరం ఔత్సాహికులు సైతం ప్రణాళిక బద్ధంగా పెట్టుబడులు పెట్టి సంపదను పెంచుకోవాలని కోరుకుంటున్నారని ఆయన వివరిస్తున్నారు.

ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి క్యాటమరన్ వెంచర్స్ పేరుతో దాదాపు ఏడేళ్ల క్రితమే ఓ కుటుంబ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

ఆర్ఎన్‌టీ అసోసియేట్స్ ద్వారా రతన్ టాటా వ్యక్తిగత పెట్టుబడులు పెడుతున్నారు.

విప్రో ఛైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీకి పెట్టుబడుల్లో 'ప్రేమ్‌జీ ఇన్వెస్ట్' అండగా నిలుస్తోంది.

ఇలా అనేక కార్పొరేట్ దిగ్గజాలు 'కుటుంబ కార్యాలయాల'ను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం దేశంలో దాదాపు 200 వరకూ ఏక కుటుంబ కార్యాలయాలు ఉన్నట్లు ఒక అంచనా.

రూ. 1,000-1,200 కోట్ల ఆస్తులు ఉన్నవారు ఎక్కువగా సొంత కుటుంబ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఇవి ఆస్తులు, సంపదను భద్రంగా కాపాడతాయని సంపన్నులు భావిస్తున్నారు.

ఏడాదికి కొత్తగా 500 మంది..

రూ. 200 కోట్ల (3 కోట్ల డాలర్లు పైనే) సంపద పైబడిన వారు దేశంలో ఏటా కొత్తగా దాదాపు 500 మంది పుట్టుకొస్తున్నారని నైట్‌ఫ్రాంక్ అంచనా వేసింది. రానున్న సంవత్సరాల్లో ఈ సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉంది. క్రెడిట్ సూయిజ్ ప్రపంచ సంపద నివేదిక 2016 ప్రకారం దేశంలోని సంపదలో 20 శాతం కుటుంబ కార్యాలయాలే నిర్వహిస్తున్నాయి. కార్వీ ప్రైవేట్ వెల్త్ నివేదిక ప్రకారం గత ఆర్థిక సంవత్సరానికి దేశంలో వ్యక్తుల సంపద 10.91 శాతం పెరిగి రూ. 344 లక్షల కోట్లకు చేరింది. ఇందులో షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లు వంటి ఆర్థిక ఆస్తుల వాటా రూ. 203 లక్షల కోట్లు ఉంటే.. బంగారం, స్థిరాస్తి భౌతిక ఆస్తుల విలువ రూ. 140 లక్షల కోట్లకు చేరింది. వచ్చే అయిదేళ్లలో వ్యక్తిగత ఆస్తుల సంపద ఏడాదికి 13.18 శాతం వృద్ధితో రూ. 639 లక్షల కోట్లకు చేరగలదని కార్వీ ప్రైవేట్ వెల్త్ అంచనా వేస్తోంది.

కుటుంబ కార్యాలయాలు ఏం చేస్తాయి..

- పెట్టుబడి కేటాయింపులు, రిస్క్‌ను తగ్గించుకోవడంపై సలహాలు ఇస్తాయి.
- బీమా, పన్ను చెల్లింపులపై ప్రణాళికను రూపొందిస్తాయి.
- కీలకమైన పత్రాలు, రికార్డులను భద్రపరచడం, కుటుంబ సంపద భద్రంగా ఉండే విధంగా ఆస్తులను నిర్వహిస్తాయి.
- షేర్లు, అంకురాలకు నిధుల సమకూర్చడం, కంపెనీలు, విదేశాల్లో ఆస్తుల కొనుగోలు.. ఏం చేసినా.. దీర్ఘకాలంలో సంపద పెరిగే విధంగా పరిశోధన చేసి పెట్టుబడి సలహాలు ఇస్తాయి.
- వారసత్వ తగాదాలు ఆస్తులను క్షీణింప చేస్తాయి. కుటుంబ కార్యాలయాల్లోని న్యాయ సలహాదారులు, పాలన (గవర్నెన్స్) నిపుణులు ఒక తరం నుంచి మరో తరానికి వివాదాలు లేకుండా ఆస్తులు, సంపద బదిలీ అయ్యే విధంగా ఎస్టేట్ ప్రణాళికలను తయారు చేస్తారు.
- కొత్త తరం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమకు అండగా నిలిచిన సమాజానికి మళ్లీ ఎంతో కొంత తిరిగి ఇవ్వాలని కోరుకుంటున్నారు. ఈ విధంగా సమాజానికి తిరిగి ఇవ్వడానికి సామాజిక అంకురాల్లో యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి కుటుంబ కార్యాలయాలు సాయపడతాయి.
- లాభాపేక్ష రహిత ట్రస్టులు, ఫౌండేషన్లు ఏర్పాటు చేయడానికి అండగా నిలుస్తాయి.
- తమ భవిష్యత్తు తరాలకు సంపదను బదిలీ చేయడం, సమాజ సేవకు వినియోగించడంలో అధిక నికర విలువ వ్యక్తుల ఆశలు, ఆశయాలను నేరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

మొదటిసారి..

తన వ్యక్తిగత ఆస్తులు, పెట్టుబడుల నిర్వహణ, దాతృత్వ కార్యక్రమాలను నిర్వహించడానికి 1882లో ప్రపంచంలోనే తొలిసారిగా జాన్ డి రాక్‌ఫెల్లర్ కుటుంబ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రాక్‌ఫెల్లర్ అమెరికా చమురు వ్యాపార దిగ్గజం.

అవసరానికి తగ్గట్టుగా..

కొంతమంది సంపన్నులు కంపెనీ తరహాలో సొంత కుటుంబ కార్యాలయాన్ని (సింగిల్ ఫ్యామిలీ ఆఫీస్) ఏర్పాటు చేసి అందులో న్యాయ సలహాదారులు, సంపద నిర్వహణ నిపుణులు, పాలన అధికారులను నియమిస్తున్నారు. మరికొంతమంది కుటుంబ కార్యాలయ నిర్వహణ సేవలు, సొల్యూషన్లను అందిస్తున్న వెల్త్ మేనేజిమెంట్ కంపెనీల నుంచి సేవలు పొందుతున్నారు. ఇంకొంతమంది సాధారణ సంపద నిర్వహణను సొంతంగా చేసుకుంటూ.. ప్రత్యేక సలహాలు, సూచనలకు వెల్త్ మేనేజిమెంట్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. కొన్ని కుటుంబాలు కలిసి ఒకే కుటుంబ కార్యాలయాన్ని (మల్టీ-ఫ్యామిలీ ఆఫీసు) ఏర్పాటు చేసుకుని సేవలు పొందుతున్న విధానం కూడా ఉంది.

నాలుగేళ్లలో తొలిసారి కీలక రేట్లు ఎందుకు పెరిగాయి?
ఇందుకు ఒకటే సమాధానం.. ద్రవ్యోల్బణం..
అవును ద్రవ్యోల్బణం పెరగొచ్చనే సంకేతాలతోనే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది.
మరి ద్రవ్యోల్బణానికి ముప్పు తెచ్చిపెట్టనున్న పరిణామాల్లో ముందుగా చెప్పుకోవాల్సింది..
కనీస మద్దతు ధర గురించే..
సాగు వ్యయం కంటే ఒకటిన్నర రెట్లు అధికంగా కనీస మద్దతు ధరను ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అటు దేశ ద్రవ్యోల్బణమే కాదు సామాన్య ప్రజల వ్యయ భారమూ పెరుగుతుందట.
ఉదయం మనం చేసే ఫలహారం నుంచే ఆ ప్రభావం మొదలవుతుందట.. బ్రోకరేజీ సంస్థ జేఎం ఫైనాన్షియల్ చేసిన ఆ విశ్లేషణేమిటో మీరే చూడండి..

పరోటా కంటే ఇడ్లీ ప్రియం!

★ దక్షిణాదివాసుల ఫలహారంపైనే మద్దతు ధర పెంపు ప్రభావం ఎక్కువ
★ టీ, కాఫీలూ చేదే

దక్షిణాదివాసులకు ఫలహారం అంటే ముందుగా గుర్తొచ్చేది..

ఇడ్లీ.. సాంబారు.. దోశ.. కొబ్బరి పచ్చడి.

ఉత్తరాది వాసులకైతే.. చపాతీ లేదా పరోటా, అంచుకు ఏదోక కూర.

కనీస మద్దతు ధరను (ఎంఎస్‌పీ) ఒకటిన్నర రెట్లు పెంచడం వల్ల ఉత్తరాదివాసుల కంటే దక్షిణాదివాసుల ఫలహారం మరింత ప్రియం అవుతుంది.

ఎంఎస్‌పీ పెంపుతో చపాతీలకు అవసరమైన గోధుమలతో పోలిస్తే ఇడ్లీ, దోశలో వాడే ఉప్పుడు బియ్యం, మినపప్పు, సాంబారులో ఉపయోగించే కందిపప్పు ధర ఎక్కువగా పెరుగుతుండటమే ఇందుకు కారణం.

అయితే అంతమాత్రానా ఉత్తరాదివాసులు ఊపిరి పీల్చుకొనే పరిస్థితి లేదు.

ఎందుకంటే చపాతీల్లోకి కూరకు వాడే బంగాళాదుంపలు, పరోటాలకు ఉపయోగించే ఉల్లిపాయల ధరల్లో హెచ్చుతగ్గులతో ఉత్తరాదివాసుల ఫలహారం ఎప్పుడు ప్రియమవుతుందో ఎప్పుడు చౌకవుతుందో తెలియకపోవడం వల్లే.

పైవే కాకుండా మరికొన్ని ఫలహారాలు ఉప్మా, పోహా, బ్రెడ్ ఆమ్లెట్‌పై ఎంఎస్‌పీ పెంపు ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు.

మరి టీ, కాఫీ, పాలు మాటేమిటి?

ఉదయాన్నే ఫలహారంతో పాటు తీసుకునే పాలు, టీ, కాఫీలో చక్కెర ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కనీస మద్దతు ధర పెంపు ప్రభావం ఇప్పటికే చక్కెరపై పడినందున టీ, కాఫీలకూ ఆ సెగ తాకొచ్చు. ఇతర పానీయాలైన బోర్న్‌విటా, హార్లిక్స్‌లపైనా గోధుమల కనీస మద్దతు ధర పెంపు ప్రభావం పడొచ్చు.

ద్రవ్యోల్బణానికి ఏమిటి సంబంధం..

ద్రవ్యోల్బణాన్ని టోకు ధరలు (డబ్ల్యూపీఐ), రిటైల్ ధరల (సీపీఐ) సూచీల ఆధారంగా ఆధారంగా లెక్కిస్తారు. అయితే కీలక రేట్ల నిర్ణయం సమయంలో సీపీఐను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. సీపీఐలో ఆహార పదార్థాలు కీలకం. పైన చెప్పిన బియ్యం, గోధుమలు, చక్కెర, పప్పులు లాంటివి ఈ విభాగం కిందకే వస్తాయి. కనీస మద్దతు ధర పెంపుతో వీటి ధర పెరిగితే ఆ ప్రభావం రిటైల్ ద్రవ్యోల్బణ సూచీపై పడుతుంది. గతేడాది జూన్ 1.46 శాతానికి పడిపోయిన సీపీఐ సూచీ ఆ తర్వాత క్రమక్రమంగా పెరుగుకుంటూ డిసెంబరులో 5.21 శాతానికి పెరిగింది. ఆ తర్వాత ఈ ఏడాదిలోనూ అదే స్థితిని కొనసాగించింది. ఏప్రిల్‌లో 4.58 శాతంగా నమోదైంది. అయితే ఇప్పటికీ ఆర్‌బీఐ, ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యంలోనే ద్రవ్యోల్బణం ఉండటం గమనార్హం. ఇప్పుడు కనీస మద్దతు ధర పెంపుతో ఇది ఏమాత్రం పెరిగినా ఆర్థిక వ్యవస్థకు ఇబ్బంది కలిగించే పరిణామమే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొనే ఇటీవలి సమీక్షలో ఆర్‌బీఐ కీలక రేట్ల పెంపునకు నిర్ణయం తీసుకుంది.

ఎస్‌టీపీఐ ఎక్సెలెన్స్ కేంద్రాలు

- దేశవ్యాప్తంగా 20 ఏర్పాటు
- అంకురాల అభివృద్ధికే
- ఒక్కోదానిపై రూ.10 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అంకుర కంపెనీలకు అండగా నిలిచి వాటికి అన్ని విధాలుగా సాయం చేయడానికి బ్లాక్‌చైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) ఎక్సెలెన్స్ కేంద్రాలను (సీఓఈ) ఏర్పాటు చేస్తోంది. ఆయా సాంకేతిక పరిజ్ఞానాల్లో ఆలోచనల ఆధారంగా నమూనా ఉత్పత్తులు, సొల్యూషన్లను తయారు చేయడానికి ఈ కేంద్రాలు దోహదం చేస్తాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ, ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తాయి. ఏడు సీఓఈలను ఏర్పాటు చేస్తున్నట్లు ఫిబ్రవరిలో ఐటీ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ ప్రకటించారు. ఇందులో మొదటిది చెన్నైలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రంలో ఫైనాన్షియల్ టెక్నాలజీస్, బ్లాక్‌చైన్ టెక్నాలజీపై దృష్టి కేంద్రీకరిస్తారని, ఈ సాంకేతిక పరిజ్ఞానంలో ఉత్పత్తులను అభివృద్ధి చేసే అంకురాలకు కేంద్రం అండగా నిలుస్తుందని ఎస్‌టీపీఐ, హైదరాబాద్ డైరెక్టర్ సి.వి.డి.రామ్‌ప్రసాద్ 'ఈనాడు'కు తెలిపారు. ఇప్పటికే ప్రకటించిన ఏడు సీఓఈలతో కలిసి దేశ వ్యాప్తంగా మొత్తం 15-20 ఎక్సెలెన్స్ కేంద్రాలను ఎస్‌టీపీఐ ఏర్పాటు చేస్తోంది. 'ప్రతి ఎస్‌టీపీఐ కేంద్రంలో ఒక ఎక్సెలెన్స్ కేంద్రం ఉంటుంది. రెండో తరం ఇంక్యుబేటర్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి వీటిని ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే 6-9 నెలల్లో మొత్తం కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. 3-5 ఏళ్లలో ఒక్కో కేంద్రంపై రూ. 9-10 కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నా'రు. ఈ కేంద్రాలకు నాస్కామ్, కంపెనీలు, పరిశ్రమ, విద్యా సంస్థలు వంటి భాగస్వాముల సహాయ సహకారాలు ఉంటాయి. ఏ సాంకేతిక పరిజ్ఞానంలో ఎక్సెలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న దానిపై పరిశ్రమ అభిప్రాయం తీసుకుంటారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడులు, ఇతర మార్గాల్లో సాయం చేస్తాయి. ఎక్సెలెన్స్ కేంద్రాల్లో పని చేసే అంకురాలకు వెంచర్ కేపిటలిస్టులు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌ల నుంచి నిధులు సమకూరతాయి. వీటిలో పని చేయడానికి హేకథాన్, ఫిచ్‌ఫెస్ట్‌ల వంటి కార్యక్రమాల ద్వారా అంకురాలను ఎంపిక చేస్తారు. చెన్నైలో అందుబాటులోకి వస్తున్న సీఓఈలో దాదాపు 100 సీట్లు ఉంటాయి. ఒక్కో అంకుర కంపెనీని దాదాపు ఆరు నెలలపాటు పరీక్షించి, ఏంజిల్ మదుపర్ల నుంచి నిధులు వచ్చే విధంగా చేస్తారు. ఆ తర్వాత అవి బయట నుంచి పని చేస్తాయి. అంకురాలకు ప్రారంభంలో మెంటర్‌షిప్ చాలా అవసరం. దాన్ని ఎక్సెలెన్స్ కేంద్రాలు అందిస్తాయని రాంప్రసాద్ అన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో..

రెండో దశలో ఏర్పాటు చేసే ఎక్సెలెన్స్ కేంద్రాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో సీఓఈలను ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే కేంద్రం ఫైనాన్షియల్ సేవల రంగంపై దృష్టి పెట్టే వీలుంది. తెలంగాణలో మెరిటైమ్ లేదా కృత్రిమ మేధకు సంబంధించిన కేంద్రాన్ని ఏర్పాటు చేయొచ్చు. ఇందుకు సంబంధించి ఐఐఐటీ, హైదరాబాద్‌తో చర్చలు జరుపుతున్నామని రాంప్రసాద్ తెలిపారు.

ఫ్యాబ్ ల్యాబ్‌లు ఏర్పాటు!

దేశ వ్యాప్తంగా ఫ్యాబ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని కూడా ఎస్‌టీపీఐ భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వీటిని నెలకొల్పుతారు. ఒక్కో దానికి రూ. 3-4 కోట్లు అవసరమవుతాయి. మ్యాచింగ్ పెట్టుబడి రాష్ట్రాల నుంచి వస్తే.. కేంద్రం తన వాటా పెట్టుబడి పెడుతుంది. ఫ్యాబ్ రంగంలో పరిశోధన, అభివృద్ధి, ప్రోటోటైప్ ఉత్పత్తుల అభివృద్ధి మొదలైనవి ఈ ల్యాబ్‌లలో చేస్తారు.

అంతర్జాలం తర్వాతి విప్లవం ఇదే

- బ్లాక్‌చైన్ టెక్నాలజీపై నిపుణులు
- వ్యాపార మోడళ్లను మార్చేస్తోంది

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా అన్ని కంపెనీలు, ప్రభుత్వాలు, దేశాలు బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానం పైనే చర్చిస్తున్నాయని, ఫైనాన్షియల్ సేవల నుంచి లాజిస్టిక్స్ వరకూ అన్ని రంగాల్లోని కంపెనీల వ్యయాలను తగ్గించడానికి, పారదర్శకతను పెంచడానికి బ్లాక్‌చైన్ టెక్నాలజీ దోహదం చేయనుందని నిపుణులు చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో గతంలో అంతర్జాలం తీసుకువచ్చిన మార్పును ఇప్పుడు బ్లాక్‌చైన్ టెక్నాలజీ తీసుకురానుందని అంటున్నారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీలో అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై ఎఫ్‌టాప్సీ ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం వ్యాపార మోడళ్లను మార్చివేయనుంది. కొత్త ఆదాయ మార్గాలను సృష్టించనుందని ట్యాలెంట్ స్ప్రింట్‌లో బ్లాక్‌చైన్ టెక్నాలజీ మెంటార్ రితీశ్ మోదీ అన్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్, ఫారెక్స్ మార్కెట్లు, కేపిటల్ మార్కెట్లలో ట్రేడింగ్ తర్వాత జరిగే ప్రాసెసింగ్‌లో ఈ సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని బ్రాడ్‌రిడ్జ్ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ గ్లోబల్ ఎక్సెలెన్స్ కేంద్రం అధిపతి కిషోర్ శేషగిరి తెలిపారు. వాస్తవ ప్రపంచ సమస్యలను బ్లాక్‌చైన్ టెక్నాలజీ పరిష్కరిస్తుందన్నారు. జెబీ డేటా ఇండియా సీఈఓ, ఎండీ బాబు మునగాల మాట్లాడుతూ.. డెవలపర్లకు బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానం గొప్ప అవకాశమని, ఈ సాంకేతిక పరిజ్ఞానంలో నిపుణుల కొరత బాగా ఉందని చెప్పారు. సాధారణ సాంకేతిక పరిజ్ఞానాలకు బదులు బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యాలను పెంచుకున్న వారికి ఉద్యోగావకాశాలు త్వరగా లభించగలవన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సెంటర్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నింజే, ఎస్‌టీపీఐ, హైదరాబాద్ డైరెక్టర్ సి.వి.డి.రామ్‌ప్రసాద్, ఎఫ్‌టాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానం ప్రాధాన్యాన్ని గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ఆగస్టులో అంతర్జాతీయ బ్లాక్‌చైన్ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించనుందని, దీనికి 40 దేశాల నుంచి దాదాపు 1000 మంది ప్రతినిధులు వచ్చే వీలుందని రాజేంద్ర నింజే తెలిపారు. గత నాలుగేళ్లలో దేశీయంగా ఐటీ సేవలు, ఉత్పత్తుల మార్కెట్ ఆకర్షణీయంగా పెరుగుతోందని, ప్రభుత్వం తీసుకున్న చర్యలే ఇందుకు కారణమని రామ్‌ప్రసాద్ అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశీయ మార్కెట్ విలువ 25 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీ సదస్సులో ఎస్‌టీపీఐ, హైదరాబాద్ డైరెక్టర్ రామ్‌ప్రసాద్, గౌర శ్రీనివాస్, సెంటర్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నింజే తదితరులు

9న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

కోడి గుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	371	వరంగల్	373
చిల్లరగా (ఒక గుడ్డు)	4.30	విశాఖపట్నం	372
బెంగళూరు	415	చెన్నై	445
10వ తేదీకి		చిత్తూరు	438
విజయవాడ/గోదావరి	366	నమక్కల్	430

సిరి
విజయవాడ
ఆదివారం జూన్ 10, 2018
siri@eenadu.net

గృహరుణం కావాలా?

తెలుసుకోండి ఇవన్నీ

ఇల్లు.. జీవితంలో తీసుకునే అతి పెద్ద పెట్టుబడి నిర్ణయం. ఎంతో ముఖ్యమైనది కూడా.. మన కుటుంబానికి సరిపోయే ఇల్లును ఎంపిక చేసుకోవడం దగ్గర్నుంచి.. దానికి అవసరమైన ఆర్థిక వనరులను చూసుకోవడం వరకూ ప్రతి విషయంలోనూ ఎన్నో అంశాలను చూసుకోవాలి. ప్రధానంగా అందుబాటు ధరల ఇల్లుకు బ్యాంకులు, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు పెరుగుతున్న నేపథ్యంలో గృహరుణాలు పొందేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలి.

తాజాగా సవరించిన నిబంధనల ప్రకారం అందుబాటు ఇళ్లకు ఇంటి రుణం తీసుకోవాలనుకుంటే.. పట్టణ ప్రాంతాల్లో రూ.45లక్షల లోపు విలువైన ఇల్లు.. దీనికోసం రూ.35లక్షల వరకూ రుణం తీసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.35లక్షల్లోపు ఇంటిని రూ.25లక్షల వరకూ రుణం తీసుకొని కొనొచ్చు. వీటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద వడ్డీలో రాయితీ లభిస్తుంది. గృహరుణం తీసుకునేప్పుడు తొందర పడకుండా.. కొన్ని కీలకమైన అంశాలను అర్థం చేసుకొని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.

వడ్డీ రేట్లు..

రుణం తీసుకునేప్పుడు వడ్డీ రేట్లను గమనించడం కూడా ముఖ్యమే. బ్యాంకులు, హెచ్ఎఫ్సీ (గృహ రుణ సంస్థ)లు వడ్డీ రేట్ల విషయంలో మంచి ఖాతాదారుడికి కొంత వెసులుబాటు ఇస్తున్నాయి. బ్యాంకులు ఎంసీఎల్ఆర్‌కన్నా తక్కువ శాతం వడ్డీకి రుణాలను ఇవ్వవు. కానీ, హెచ్ఎఫ్సీలు ఖాతాదారులను బట్టి, వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంటాయి. అయితే, ఇవి బ్యాంకుల వడ్డీ రేట్లతో పోల్చినప్పుడు కొన్నిసార్లు ఎక్కువ తక్కువలు ఉండవచ్చు. సాధారణంగానైతే.. బ్యాంకుల వడ్డీ రేట్లతో సమానంగానే ఉంటాయి. రుణం తీసుకునే ముందు ఈ వడ్డీ రేట్లను తప్పనిసరిగా గమనించాలి.

పరిశోధించండి

బ్యాంకులో రుణం తీసుకోవాలా.. హెచ్ఎఫ్సీ నుంచి అప్పు తీసుకోవాలా అనేది నిర్ణయించుకునే ముందు పలు అంశాలను పరిశీలించాలి. ఎంత వ్యవధికి రుణం ఇస్తున్నారు.. వడ్డీ రేటు ఎంత.. ప్రాసెసింగ్ ఫీజుల్లాంటివి ఎలా ఉన్నాయి అనేది చూసుకోవాలి. హెచ్ఎఫ్సీలు వివిధ వ్యవధులకు రుణాలను ఇస్తుంటాయి. ఈ విషయంలో బ్యాంకులతో పోలిస్తే వీటికే ప్రాధాన్యం ఇవ్వవచ్చు. రుణం తీసుకునే ముందు పూర్తి విషయాలను అర్థం చేసుకున్నాకే ఎక్కడ తీసుకోవాలన్నది నిర్ణయించుకోవాలి.

అర్హతలేమిటి?

సాధారణంగా ఎంత గృహరుణం ఇవ్వాలనే విషయంలో.. బ్యాంకులు.. హెచ్ఎఫ్సీలు కొన్ని నిబంధనలు పాటిస్తుంటాయి.

- ఆదాయపు పన్ను, ఇప్పటికే ఉన్న రుణాల వాయిదాలకు చెల్లించాల్సిన మొత్తం పోను మీ చేతిలో ఎంత నికరంగా ఎంత మిగులుతుంది అనేది రుణ మొత్తాన్ని నిర్ణయించడంలో ప్రధానం.
- గరిష్ఠంగా ఎంత వస్తుందని నిర్ణయించేందుకు ఆస్తి విలువను ప్రామాణికంగా తీసుకుంటారు. దీన్నే బ్యాంకింగ్ పరిభాషలో లోన్ టు వాల్యూ రేషియో (ఎల్‌టీవీ) అంటారు. బ్యాంకులు/హెచ్ఎఫ్సీలు ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు ఈ గరిష్ఠ రుణ పరిమితిని ఎలా నిర్ణయిస్తాయంటే..
- రూ.30లక్షల లోపు రుణాలకు... ఇంటి విలువలో 90శాతం వరకూ రుణం ఇస్తారు.
- రూ.30లక్షల నుంచి రూ.75 లక్షల వరకూ ఉన్న ఇంటి విలువపై 80శాతం వరకూ రుణం వస్తుంది.
- రూ.75లక్షలకు మించి ఇంటి విలువ ఉన్నప్పుడు 75శాతం వరకూ రుణం లభిస్తుంది.

రుణం తీసుకున్నప్పుడు ఏ బ్యాంకు/హెచ్ఎఫ్సీ ఎక్కువ రుణాన్ని అందిస్తుందనే విషయాన్ని చూసుకోవాలి. దీంతోపాటు రుణ చెల్లింపు వ్యవధి కూడా ముఖ్యమే.

తక్కువ ఆదాయం ఉండి, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి బ్యాంకుల నుంచి గృహరుణం లభించడం కొన్నిసార్లు కష్టమవుతుంది. ఇలాంటప్పుడు గృహ రుణ సంస్థలు వారికి కావాల్సిన అప్పును ఇవ్వడానికి ముందుకు వస్తుంటాయి. మీ ప్రాంతంలో ఈ తరహా రుణ సంస్థల సేవలు అందుబాటులో ఉన్నాయా చూసుకోండి. బ్యాంకుల నుంచి తీసుకోవాలా.. హెచ్ఎఫ్సీల నుంచి తీసుకోవాలా అన్నది నిర్ణయించుకునేందుకు మీకు కావాల్సిన రుణ మొత్తం వస్తోందా? వడ్డీ శాతం ఎంత? రుణ వ్యవధిలాంటివాటితో పాటు, నిబంధనలు, పరిశీలనా రుసుములను కూడా పరిశీలించండి.

- **డియో శంకర్ త్రిపాఠి**, ఎండీ-సీఈఓ, ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్

స్కోరు బాగుందా?

బ్యాంకులు.. గృహ రుణ సంస్థలు (హెచ్ఎఫ్సీ)లు ఒక వ్యక్తికి రుణం ఇవ్వాలా లేదా అనే విషయాన్ని గమనించేందుకు ముందుగా అతని/ఆమె క్రెడిట్ స్కోరును పరిశీలిస్తాయి. దీనికోసం అందుబాటులో ఉన్న క్రెడిట్ బ్యూరో ఏజెన్సీల నుంచి సమాచారాన్ని సేకరిస్తాయి. కొన్ని బ్యాంకులు, హెచ్ఎఫ్సీలు సొంతంగా క్రెడిట్ స్కోరును సేకరించే ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇది క్రెడిట్ బ్యూరోల సమాచారానికి అదనపు సమాచారం అన్న మాట. ఇప్పటివరకూ మీరు తీసుకున్న రుణాలకు సంబంధించిన చెల్లింపుల తీరు తెన్నులు ఇక్కడ ప్రధానం. ఇప్పటికే తీసుకున్న రుణాల వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించినప్పుడే క్రెడిట్ స్కోరు బాగుంటుంది. తక్కువ ఆదాయం ఉన్న ఖాతాదారుల విషయంలో క్రెడిట్ స్కోరు అందుబాటులో ఉండకపోవచ్చు. ఇలాంటప్పుడు గృహ రుణ సంస్థలు ప్రత్యేకంగా కొన్ని ప్రమాణాలను ఏర్పాటు చేసుకొని, రుణాలను అందిస్తుంటాయి. స్థూలంగా చెప్పాలంటే.. మంచి క్రెడిట్ స్కోరు ఉన్న ఖాతాదారులకు సులభంగా గృహరుణం లభించడంతోపాటు, వడ్డీ రేట్లలో కూడా కాస్త సడలింపు ఉంటుంది.

గ్రాఫిక్: సుధాకర్

మార్కెట్లో పెట్టుబడులు..

చేయొద్దు ఈ పొరపాట్లు!

ఒక లక్ష్యం అనుకుంటాం.. దాన్ని సాధించేందుకు మదుపు చేస్తాం. స్టాక్ మార్కెట్‌లా ప్రతి రోజూ హెచ్చుతగ్గులు ఉండే చోట పెట్టుబడి పెట్టడం అంటే మాటలు కాదు. భావోద్వేగాల నియంత్రణ ఇక్కడ ఎంతో అవసరం. అలా చేయకపోతే నష్టం వస్తుంది. అప్పుడు పెట్టుబడులే తప్పు అనే భావన ముద్రపడిపోతుంది. మరి, ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

మన ఇంట్లో ఒకసారిగా మంటలు చెలరేగాయనుకోండి.. అప్పుడు వీలైనంత వేగంగా అక్కడ నుంచి బయటపడటానికి మార్గాలను అన్వేషిస్తాం. మార్కెట్లో కూడా ఇలాంటి పరిస్థితే మనకు కన్పిస్తుంది. కొన్నిసార్లు మార్కెట్ పతనం అయిపోతుంది. అప్పుడు వెంటనే ఆందోళనతో అందులో నుంచి బయటపడేందుకు తొందరపడుతుంటాం. మన పెట్టుబడులన్నీ ఉపసంహరించుకుంటాం. మార్కెట్లో కాస్త ఉత్సాహం కనిపిస్తే చాలు.. మళ్లీ మదుపు చేసేందుకు ముందుకు ఉరుకుతాం. మార్కెట్ ఆడించినట్లు మనం మన పెట్టుబడి నిర్ణయాలను మార్చేసుకుంటాం..

దీర్ఘకాలిక పెట్టుబడి లక్ష్యం నెరవేరాలంటే.. మనం ముందుగా చేయాల్సింది మనస్సును స్వాధీనంలో ఉంచుకోవాలి. 'భావోద్వేగాలు' అదుపులో ఉంచుకోవాలి. ముందుగా మన పెట్టుబడులకు శత్రువుల్లాంటి భావోద్వేగాలు ఏమిటన్నది మనం అవగాహన చేసుకోవాలి.

అతివిశ్వాసం పనికిరాదు..

పెట్టుబడులు పెట్టేప్పుడు విశ్వాసం ఉండాలి. కానీ, మన మీద మనకు అతివిశ్వాసం పనికిరాదు. ఒక విషయం గురించి పూర్తిగా తెలుసుకోవడం మంచిదే. ఆ జ్ఞానం వల్ల మనకు సంపద పెరుగుతుంది. అయితే.. కేవలం మార్కెట్ గురించి వాళ్లూ.. వీళ్లూ చెప్పే కబుర్లను వినడం ద్వారా అన్నీ తమకు తెలిసిపోయాయి అనే అతినమ్మకం పనికిరాదు. కేవలం ఈ జ్ఞానం వల్ల తెలిసిన సమాచారంతో పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం ఆర్థికంగా క్షేమం కాదు. మార్కెట్లో రోజువారీ కదలికలను అంచనా వేసి, ధరల హెచ్చుతగ్గులను బేరీజు వేసుకొని మదుపు చేయగలం అని అనుకుంటాం. ఇలాంటి ఆలోచనవల్ల అధికంగా ట్రేడింగ్ చేసేందుకు కారణం అవుతుంది కానీ, సరైన పెట్టుబడులు పెట్టడం సాధ్యం కాదు. విజయవంతమైన మదుపరిగా మారాలంటే.. పెట్టుబడి నిర్ణయాల్లో ఎప్పుడూ నిర్మోహమాటంగా ఉండాలి. క్రమంగా ధరలు పెరుగుతున్న షేర్లను తొందరపడి అమ్మేయకూడదు. అలాగే.. ధరలు తగ్గుతున్నవాటిని దీర్ఘకాలంపాటు మన పోర్ట్‌ఫోలియోలో కొనసాగనివ్వకూడదు.

గుంపుతో పాటుగా..

పెట్టుబడుల విషయంలో చాలామంది చేసే పొరపాటు.. గుంపును అనుకరించడం. మార్కెట్లో పెట్టుబడులకు సంబంధించి వారెన్ బఫెట్ మాటల్లో చెప్పాలంటే.. 'ఇతరులు దూకుడుగా ఉన్నప్పుడు మనం భయంగా ఉండాలి.. ఇతరులు భయపడుతున్నప్పుడు మనం దూకుడుగా వ్యవహరించాలి' అప్పుడే మనం విజయం సాధిస్తాం. మార్కెట్ ధోరణులకు భిన్నంగా వ్యవహరించాలంటే.. మనం సొంతంగా నిర్ణయం తీసుకోగలగాలి. కానీ, గుంపును అనుకరించే ధోరణితో ఉన్నప్పుడు ఇది సొంతంగా ఆలోచించడం అంత తేలికేమీ కాదు. అయితే, ఈ అనుకరణను మనం విడనాడినప్పుడే.. పెట్టుబడులకు సంబంధించి ఒక మంచి నిర్ణయం తీసుకోగలం.

వీటిని పట్టించుకోండి..

పెట్టుబడులకు సంబంధించి సరైన నిర్ణయం తీసుకోకపోవడంతోనే దాదాపు 10-75శాతం వరకూ రాబడి అవకాశాలను కోల్పోతుంటారని పరిశోధనల్లో వెల్లడయ్యింది. మరి, ఇక్కడ సరైన నిర్ణయం తీసుకోవాలంటే.. మనకు కావాల్సింది ఆర్థిక క్రమశిక్షణ. 'ఎక్కువ తప్పులు చేయనంత కాలం.. తక్కువ ఒప్పులు చేసినా సరిపోతుంది' అనే వారెన్ బఫెట్ మాట ఇక్కడా గుర్తు చేసుకోవాలి. కాబట్టి, చిన్నచిన్న భావోద్వేగాలను నియంత్రించుకుంటూ ముందుకు వెళ్తే చాలు.. విజయవంతమైన మదుపరిగా మారడం పెద్ద కష్టమేమీకాదు.

- ప్రతి షేరు కొనాలన్నా.. అమ్మాలన్నా.. ఏం చూడాలన్న వాటికి ఒక 'చెక్‌లిస్ట్' పెట్టుకోండి. ఇది చిన్నగా, సహేతుకంగా ఉండాలి.
- పెట్టుబడి లక్ష్యం లాభం సంపాదించడం. అంతేకానీ, నష్టపోవడం కాదు. కాబట్టి, మదుపు చేసేప్పుడు ఒక మార్జిన్‌ను నిర్ణయించుకోవాలి.
- కొనడం.. అట్టిపెట్టుకోవడం అనే వ్యూహంలో మదుపు సాగాలి. అయితే, తరచూ ఈ పెట్టుబడులను సమీక్షించుకోవాలి. ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే.. మీ సమీక్షా వ్యవధి తక్కువగా ఉంటే.. కొన్నిసార్లు మార్కెట్‌లోని సహజ హెచ్చుతగ్గులు మిమ్మల్ని భయపెట్టే అవకాశం ఉంది. కాబట్టి, ఒక నిర్ణీత సమయం పెట్టుకొని, అప్పుడే పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకోవడం ఉత్తమం.
- దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయాలను తీసుకునేప్పుడు బాగా ఆలోచించుకోండి. 10ఏళ్లపాటు పెట్టుబడిని కొనసాగించాలనే లక్ష్యంతో ఉన్నప్పుడు ఒకటి రెండురోజుల నష్టం పెద్ద లెక్కలోకి రాదు. ఒక రోజు ఆ షేరులో అమ్మకాలు.. లేదా కొనుగోళ్ల ఒత్తిడి అధికంగా ఉంటే.. మరుసటి రోజు దాని పరిస్థితి ఏమిటో గమనించండి. సరైన షేరును ఎంచుకొని మదుపు చేసినప్పుడు.. భవిష్యత్తులో ఎప్పుడూ ఇబ్బంది రాదు.
- పెట్టుబడి అంతా ఒకే చోట వద్దు. కచ్చితంగా వైవిధ్యం పాటించాలి. సమయానుకూలంగా దాన్ని సమతౌల్యం చేసుకోవాలి.
- మీరు చేసిన తప్పుల నుంచి నేర్చుకోవడానికి మొహమాట పడకండి. మార్కెట్లో విజయం సాధించినప్పుడు.. మీరు చేసిన ఏ పనుల వల్ల ఆ విజయం సిద్ధించిందో చూసుకోండి. కొన్నిసార్లు అనుకోకుండా విజయం రావచ్చు. ఇలాంటప్పుడు దాన్ని మీ ఖాతాలో వేసుకోకండి. మీరు చేసిన పొరపాట్ల వల్ల నష్టం వచ్చినప్పుడు దాన్ని దురదృష్టం అని తిట్టుకోకండి. మీరు నష్టపోవడానికి గల కారణాలను తులనాత్మకంగా విశ్లేషించుకోండి.

ఆరోగ్యంగా ఉండాలంటే.. ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి. ఆర్థికారోగ్యంగా ఉండాలంటే.. చిన్న చిన్న సూత్రాలే పెద్ద మంత్రాలు. తాత్కాలిక లాభాలకు పొంగిపోకుండా.. దీర్ఘకాలిక ప్రయోజనాలనే లక్ష్యంగా చేసుకున్నప్పుడే విజయవంతమైన మదుపరిగా తయారవుతాం. ఇలాంటి వారందరికీ ఆర్థిక విజయోస్తు!

- **నీలేష్ షా**, మేనేజింగ్ డైరెక్టర్, కొటక్ మ్యూచువల్ ఫండ్

ఏ కార్డు.. ఎప్పుడు వాడాలి?

నగదు సరిగా అందుబాటులో లేకపోవడంతో.. నగదు రహిత ఆర్థిక లావాదేవీలు పెరిగాయి.. దీంతో ఇప్పుడు క్రెడిట్, డెబిట్ కార్డుల హవా నడుస్తోంది. చిన్న మొత్తమైనా కార్డులతో చెల్లించేస్తున్నారు. అయితే, ఏ సందర్భంలో ఏ కార్డు వాడాలన్న విషయంలో మాత్రం కొంచెం ఇబ్బందిపడుతున్నారనే చెప్పాలి.

క్రెడిట్ కార్డు గురించి, దాన్ని ఎలా వాడాలన్నదాని గురించి కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిందే. కొత్తగా కార్డు తీసుకున్న వారు మాత్రం.. దీని గురించి కొంచెం జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకులు మీ బిల్లింగ్ తేదీని బట్టి, ఒక వస్తువు/సేవను కొనుగోలు చేసిన 40-50రోజుల వరకూ గడువునిస్తాయి బ్యాంకులు. బిల్లింగ్ తేదీ సమీపించినప్పుడు కొంటే గడువు తక్కువే ఉంటుంది. మీ కార్డుపై ఉన్న రుణ పరిమితి మేరకే దీన్ని వాడుకోగలరు. ఒక రకంగా ఇది అప్పే.

డెబిట్ కార్డు విషయం వేరు. మీ సొంత డబ్బును నిరంభ్యంతరంగా వాడుకునే వెసులుబాటునిస్తుందిది. మీ ఖాతాలో ఎంత మొత్తం ఉంటే అంత వాడుకోవచ్చు.

ఏ సందర్భంలో...

- ఏదైనా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయాలనుకున్నప్పుడు క్రెడిట్ కార్డును వాడటం ఉత్తమం. తక్కువ పరిమితి ఉన్న కార్డునే దీనికోసం వినియోగించడం శ్రేయస్కరం.
- ఆర్థిక క్రమశిక్షణతో ఉండి.. వచ్చిన బిల్లును వచ్చినట్లుగా చెల్లిస్తామనుకున్నప్పుడు.. క్రెడిట్ కార్డును వాడాలి.
- పెద్దమొత్తంలో కొనుగోలు చేసి, నెలసరి వాయిదాల్లో చెల్లించాలని అనుకున్నప్పుడు క్రెడిట్ కార్డుతో బిల్లు చెల్లించవచ్చు.
- కొన్నిసార్లు క్రెడిట్ కార్డును ఉపయోగించినప్పుడు ప్రత్యేక రాయితీలు అంటూ ప్రకటనలు వస్తుంటాయి. ఉదాహరణకు మొబైల్ ఫోన్లను ఫలానా క్రెడిట్ కార్డుతో కొంటే.. 5శాతం వరకూ నగదు వెనక్కి అని అంటుంటారు. ఇలాంటప్పుడు వీటిని వినియోగించుకొని రాయితీలను సొంతం చేసుకోవచ్చు.
- రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరు సరిగా లేనప్పుడు.. క్రెడిట్ కార్డును ఉపయోగించుకొని, ఆ బిల్లులను సరైన సమయంలో చెల్లిస్తూ వెళ్లండి. దీనివల్ల క్రమంగా మీ రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరు మెరుగుపడుతుంది.
- డెబిట్ కార్డును మీ రోజువారీ ఖర్చుల కోసం వాడండి. ఉదాహరణకు నిత్యావసరాల కోసం, ఇతర రోజువారీ అవసరాలకోసం క్రెడిట్ కార్డును వాడొద్దు. వీటికి డెబిట్ కార్డును వాడటమే మంచిది. దీనివల్ల మన ఖర్చులు ఏమిటన్నవాటికి ఒక లెక్క దొరుకుతుంది. ప్రతి చిన్నదానికీ 'అప్పు' చేయడం అనే అలవాటు తప్పుతుంది.

నెలకు రూ.10వేలు.. ఎలా?

మార్గదర్శి

నేను నెలకు రూ.7,500 పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. ఇందులో రూ.4వేలను వీపీఎఫ్ లేదా పీపీఎఫ్ లోనూ.. మిగతా రూ.3,500లను కాస్త అధిక రాబడి వచ్చే పథకాలను ఎంచుకుందామనుకుంటున్నాను. మా పాప వయసు ఏడాది. తన భవిష్యత్తు అవసరాల కోసం ఈ మొత్తం ఉపయోగపడాలి. నాకు సరిపోయే మంచి ప్రణాళిక సూచించండి? - రాజు

మీరు పెట్టాలనుకుంటున్న పెట్టుబడిలో రూ.4వేలను వీపీఎఫ్‌లో కొనసాగించండి. ఇందులో ప్రస్తుతానికి 8.55 శాతం వార్షిక వడ్డీ లభిస్తోంది. ఇక రూ.3,500లను ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేయండి. ఇందులో దాదాపు 14శాతం వరకూ రాబడి వచ్చే అవకాశం ఉంది. ఈ రెండింటిని కలిపి చూస్తే.. దాదాపు 11శాతం సగటు వార్షిక రాబడి వచ్చే వీలుంది. దీనికి మీరు మిరే అసెట్ ఇండియా ఈక్విటీ ఫండ్, ఫ్రాంక్లిన్ ఇండియా ప్రైమా ఫండ్లను పరిశీలించవచ్చు. దీంతోపాటు మీ పాప భవిష్యత్తు ఆర్థిక అవసరాలకు రక్షణ కల్పించేందుకు వీలుగా మీ వార్షికాదాయానికి 10-12 రెట్ల వరకూ జీవిత బీమాను టర్మ్ పాలసీ ద్వారా తీసుకోండి. మీరు నెలకు రూ.7,500లను 18 ఏళ్ల వరకూ పెట్టుబడి పెడుతూ వెళ్తే.. 11శాతం రాబడి అంచనాతో రూ.44,35,634 అయ్యేందుకు అవకాశం ఉంది. మీ ఆదాయం పెరుగుతూ ఉంటే.. పెట్టుబడి మొత్తాన్ని కూడా పెంచుకోండి. ఏటా 10శాతం పెట్టుబడిని పెంచుకుంటూ వెళ్లండి. దీనివల్ల 18 ఏళ్లలో దాదాపు రూ.88,52,720వరకూ జమ అవుతాయి.

గత నెలలో పదవీ విరమణ చేశాను. సీనియర్ సిటిజన్ పొదుపు పథకంలో రూ.5లక్షలు జమ చేశాను. ఇంకా కొంత మొత్తాన్ని కనీసం 12 శాతం వరకూ రాబడి వచ్చేలా మదుపు చేద్దామనుకుంటున్నాను. ఇది సాధ్యమేనా? - సూర్యనారాయణ

మీకు 12శాతం రాబడి రావాలంటే.. నష్టభయంతో కూడుకున్న పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి. వీటిల్లో లాభాలతోపాటు, నష్టాలు వచ్చే అవకాశం ఉంటుంది. మీకు ఈ డబ్బుతో 5-7ఏళ్ల వరకూ అవసరం లేదనుకున్నప్పుడే ఇలాంటి వాటిని ఎంచుకోవాలి. మీరు బ్యాలెన్స్‌డ్ మ్యూచువల్ ఫండ్లను పరిశీలించవచ్చు. దీర్ఘకాలంలో వీటి నుంచి 11-12శాతం వరకూ రాబడిని ఆశించవచ్చు. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఈక్విటీ హైబ్రిడ్ 95 ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ, డెట్ ఫండ్, ఎల్అండ్‌టీ హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లను పరిశీలించవచ్చు. అధిక రాబడి ఆశతో మోసపూరిత పథకాల్లో.. ఉదాహరణకు రెట్టింపు ఇస్తామని చెప్పే వాటిల్లోనూ.. నియంత్రణ లేని పథకాల్లోనూ పెట్టుబడి పెట్టకండి.

నేను అమెరికాలో ఉంటున్నాను. మా అమ్మగారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. తన అవసరాల కోసం నెలకు రూ.10వేలు అందేలా ఒకేసారి ఏదేని పథకంలో జమ చేద్దామని ఆలోచన. ఇలాంటి ఏర్పాటు చేయడం సాధ్యమేనా? ఎంత పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది? ఇతర ప్రత్యామ్నాయ మార్గాలేమిటి? - ప్రకాశ్

మీ అమ్మగారి వయసు 60 ఏళ్లకు మించి ఉన్నప్పుడు పోస్టాఫీసు సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంను పరిశీలించవచ్చు. ఇందులో ప్రస్తుతానికి 8.3శాతం వడ్డీ లభిస్తోంది. వడ్డీని మూడు నెలలకోసారి చెల్లిస్తారు. ఇందులో రూ.15 లక్షలు జమ చేస్తే 3 నెలలకు రూ.31,125 వస్తుంది. ఇది కుదరకపోతే.. డెట్ మ్యూచువల్ ఫండ్లలో షార్ట్ టర్మ్ అక్రూవల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టండి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వీటిలో 7శాతం వరకూ రాబడి రావచ్చు. దాదాపు రూ.17,50,000 వరకూ మదుపు చేయాల్సి ఉంటుంది. ఇందులో సిస్టమేటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ద్వారా నెలకు రూ.10వేలు వచ్చే ఏర్పాటు చేసుకోవచ్చు.

నాలుగేళ్ల క్రితం ఎండోమెంట్ బీమా పాలసీ తీసుకున్నాను. ఏడాదికి రూ.62వేలు ప్రీమియం చెల్లిస్తున్నాను. దీన్ని కొనసాగించడం ఇష్టం లేదు. ఇప్పుడు దీన్ని రద్దు చేసుకోవడం సాధ్యమేనా? దీనివల్ల ఏదైనా నష్టం వస్తుందా? నా వయసు 37 ఏళ్లు. ఆదాయం ఏడాదికి రూ.5లక్షల వరకూ ఉంటుంది. రూ.50లక్షల బీమా తీసుకోవడానికి వీలవుతుందా? - సత్య

మీరు తీసుకున్న పాలసీని రద్దు చేసుకుంటే.. ఇప్పటివరకూ చెల్లించిన ప్రీమియంలో 40-60శాతం వరకూ వెనక్కి వస్తుంది. ఈ నష్టాన్ని మీరు భరించగలిగితే పాలసీని రద్దు చేసుకోవచ్చు. మీకు ఏడాదికి రూ.5లక్షల ఆదాయం ఉంది కాబట్టి, రూ.50 లక్షల బీమా తీసుకోవచ్చు. దీన్ని ఒకే కంపెనీద్వారా కాకుండా.. మంచి చెల్లింపుల చరిత్ర ఉన్న రెండు బీమా సంస్థల నుంచి సమాన మొత్తాలకు తీసుకోండి.

నేను రెండేళ్ల నుంచి గోల్డ్ ఈటీఎఫ్ లలో మదుపు చేస్తున్నాను. పెద్దగా లాభం ఏమీ రాలేదు. వీటిని రద్దు చేసుకొని, వచ్చిన డబ్బుతో బంగారం కొనాలనుకుంటున్నాను. నెలకు రూ.10వేలు మదుపు చేయడానికి ఏదైనా ఇతర పెట్టుబడి మార్గాలు సూచించండి? - సుధ

మీకు ఇప్పుడు బంగారం అవసరం ఉంటే.. ఆ డబ్బు వెనక్కి తీసుకొని, బంగారం కొనుక్కోండి. మీరు పెట్టాలనుకుంటున్న రూ.10వేలను 5-7ఏళ్ల వ్యవధి ఉంటే.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయండి.

- **తుమ్మ బాల్‌రాజ్**, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ముంబయిలో వరద నీటిలోనే రైలు ప్రయాణం

ఉత్తర్‌ప్రదేశ్‌లో బీభత్సం

దిల్లీ, ముంబయి, సుల్తాన్‌పూర్: గాలిదుమారంతో కూడిన భారీ వర్షాలు, పిడుగులు ఉత్తర్‌ప్రదేశ్‌ను అతలాకుతలం చేశాయి. శుక్రవారం రాత్రి 11 జిల్లాల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. నైరుతి రుతుపవనాలు ముంబయిని తాకడంతో అతిభారీ వర్షాలు కురిశాయి. 67 విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. ముంబయి నుంచి వెళ్లాల్సిన మూడు విమానాలను రద్దు చేశారు. కొంకణ్ ప్రాంతంలోని సింధుదుర్గ్ జిల్లా మల్వాన్ తాలూకాలో 491 మిమీ వర్షపాతం నమోదైంది. దిల్లీలో దిగాల్సిన 35 విమానాలను సమీప విమానాశ్రయాలకు దారి మళ్లించారు. అమృత్‌సర్‌లోని గురు రామ్‌దాస్‌జీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎక్కువగా మళ్లించారు. గంటకు 96 కిమీ వేగంతో వీచిన ఈదురుగాలుల ధాటికి జనజీవనం అస్తవ్యస్తమైంది. చెట్లు పడిపోయాయని 99 మంది, విద్యుత్తు స్తంభాలు కుప్పకూలాయని 39 మంది, ఇళ్లు, గోడలు ధ్వంసమయ్యాయని 13 మంది దిల్లీ పోలీసులకు సహాయంకోసం ఫోన్ చేశారు. దిల్లీ మెట్రో సేవలకు స్వల్ప అంతరాయం కలిగింది. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా దేశంలోని పశ్చిమతీరంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. గోవా, కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఉత్తర్‌కొంకణ్, గోవా, ముంబయిలో సోమవారం వరకు భారీవర్షాలు పడతాయని తెలిపింది. పశ్చిమబెంగాల్, ఒడిశాలో రాబోయే 24 గంటల్లో భారీవర్షాలు కురుస్తాయంది.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కనౌజ్ జిల్లాను గాలిదుమారం కమ్మేసింది. భారీ వర్షాలు, పిడుగులు పడటం వల్ల జౌన్‌పుర్, సుల్తాన్‌పుర్‌లో ఐదుగురేసి; ఉన్నావ్‌లో నలుగురు, చందౌలి, బహ్రాయిచ్‌లో ముగ్గురేసి చొప్పున; రాయ్‌బరేలిలో ఇద్దరు, మీర్జాపుర్, సీతాపుర్, అమేఠి, ప్రతాప్‌గఢ్‌లో ఒక్కరు దుర్మరణం చెందారు.

ముంబయిని ముంచెత్తిన వర్షాలు: నారిమన్‌పాయింట్ వద్ద వంద మిమీ, ములుండ్ వద్ద 60 మిమీ, శాంటాక్రజ్ వద్ద 37 మిమీ, కొలబా వద్ద 38 మిమీ వర్షపాతం రికార్డు అయ్యాయి. రైళ్ల రాకపోకలు పది నుంచి 12 నిమిషాలపాటు ఆలస్యమయ్యాయి. వీర్‌సావర్కర్ మార్గ్‌లో భవంతి శ్లాబ్ కుప్పకూలడంతో నలుగురు గాయపడ్డారు. హింద్‌మాత, ధారవి, పరేల్‌లో పది సెంమీ వర్షపాతం నమోదవడంతో రోడ్లు కాలువలను తలపించాయి. ఠానే జిల్లాలో పిడుగుపాటుకు గుర్రై స్టెని అద్మాని(66) అనే మత్స్యకారుడు అక్కడికక్కడే చనిపోయాడు. మరో ఆరుగురు గాయపడ్డారు. వర్షాలతో రోడ్డు జలమయం కావడంతో ద్విచక్రవాహనం గోతిలో పడి ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది.

శనివారం బికనేర్‌పై భారీస్థాయిలో ఆవరించిన దుమ్ము తుపాను

గాలి దుమారం.. కలవరం

గాలి దుమారాలు విజృంభిస్తున్నాయి. గత వంద రోజుల్లో ఇవి 44సార్లు విరుచుకుపడ్డాయి. పశ్చిమాన రాజస్థాన్ మొదలుకొని తూర్పునున్న పశ్చిమ బెంగాల్ వరకూ 16 రాష్ట్రాలు వీటి ధాటికి అల్లాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలనూ గత నెలలో ఇవి కుదిపేసిన సంగతి తెలిసిందే. మొత్తంగా గత వంద రోజుల్లో 425 మందిని ఇవి బలితీసుకున్నాయి. తాజాగా ఉత్తర్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను ఇవి అతలాకుతలం చేశాయి. ఈ నేపథ్యంలో "అసలు గాలి దుమారాలు ఎలా జనిస్తాయి? ఏ ఏ ప్రాంతాల్లో విజృంభిస్తాయి?" లాంటి అంశాలను పరిశీలిద్దాం..!

శనివారం దిల్లీ శివారులో దుమ్ము తుపాను బీభత్సం

భగభగ మండిన ప్రాంతాల్లోనే

తీవ్రమైన దుమ్ముతో కూడిన గాలి దుమారాలు పురుడు పోసుకోవడంలో ఉష్ణోగ్రత ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఉదాహరణకు రాజస్థాన్‌లోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గత వేసవిలో రికార్డు స్థాయిలో 45 నుంచి 50 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హరియాణా, హిమాచల్ ప్రదేశ్‌లలోనూ సాధారణం కంటే వరుసగా 4.8, 4.5 డిగ్రీలు ఎక్కువగా ఎండలు భగ్గుమన్నాయి. గంగా-సింధు మైదానాల్లో అయితే ఈ తేడా ఎనిమిది డిగ్రీల వరకూ కనిపించింది. ఉత్తర, వాయువ్య, మధ్య భారత దేశంలో అల్పపీడనానికి ఈ పరిస్థితులు దారితీస్తున్నాయి.

పశ్చిమ పవనాలే మూలం

ఈ విధ్వంసానికి మూలాలు పశ్చిమ పవనాల్లో దాగున్నాయి. మధ్యధరా సముద్రంపై జనించే ఇవి పశ్చిమ, మధ్య ఆసియాల మీదుగా పయనించి చివరగా పశ్చిమ హిమాలయాల గుండా భారత ఉపఖండంలోకి అడుగిడతాయి. ఉత్తరార్ధగోళంలోని ఇరాన్, ఇరాక్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్‌ల గుండా పయనించే ఇవి భారీ తేమను మోసుకొస్తాయి. పశ్చిమ హిమాలయాలు అడ్డగించడంతో అక్కడే వర్షాలు, హిమపాతాన్ని కురిపిస్తాయి. అయితే ఇటీవల కాలంలో ఉష్ణోగ్రతల మధ్య భేదం తగ్గిపోతోంది. ముఖ్యంగా ఆర్కిటిక్ వలయంలో వేడి పెరుగుతోంది. ఐరోపాలోని చాలా ప్రాంతాల్లో శీతకాలం నిడివి ఎక్కువవుతోంది. దీంతో తూర్పు ప్రాంతానికి తేమను మోసుకొచ్చే పవనాలు గతి తప్పుతున్నాయి. ఫలితంగా తిన్నని మార్గంలో పయనించాల్సిన ఇవి వంపులు తిరుగుతున్నాయి. వీటికి పశ్చిమ హిమాలయాలు, టిబెట్ పీఠభూమి ప్రాంతాల్లోని పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆజ్యం పోస్తున్నాయి.

భారత ఉపఖండంలోని వాతావరణాన్ని నియంత్రించడంలో పశ్చిమ హిమాలయాలతోపాటు టిబెట్ పీఠభూమి కీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడ 1951తో పోల్చుకుంటే 3.5 డిగ్రీల కంటే ఎక్కువే ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఇవి పశ్చిమ పవనాల గతి, వర్షపాతాన్ని ప్రభావితం చేస్తున్నాయి. రైతుల జీవనాధారమైన నైరుతి రుతుపవనాలు కేరళను తాకకుండా అడ్డుకుంటున్నాయి. గత జూన్‌లో ఇదే జరిగింది. రెండు వారాలపాటు కేరళను రుతుపవనాలు తాకకుండా ఇవి అడ్డుకొన్నాయి. అంతేకాదు దేశంలో వర్షపాతాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి.

ఉద్గారాలూ తక్కువేమీ కాదు

పశ్చిమ పవనాలు దీర్ఘకాలం భారత ఉపఖండంపై తిష్ఠ వేయడంలో ఉద్గారాలూ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వీటి వల్ల మొదటగా ఉష్ణోగ్రత పెరుగుతోంది. ఫలితంగా వాతారణంలోని పైపొరల నుంచి గాలి కిందకు వస్తోంది. ఇది పశ్చిమ పవనాలను మరింత బలపరుస్తోంది. తాజా గాలి దుమారాల్లో ఈ పరిణామం కీలకపాత్ర పోషిస్తోంది.

దుమ్ము లేపుతున్నాయి

అటు పశ్చిమ పవనాలతోపాటు ఇటు తూర్పు పవనాలు దుమ్ముధూళిని తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మరోవైపు ఎడారి నేలల్లా మారుతున్న గంగా-సింధూ మైదానాల్లోని భూములు వీటికి ఆజ్యం పోస్తున్నాయి. మన దేశంలోని 26 రాష్ట్రాల్లో ఇలాంటి భూములు గణనీయంగా పెరుగుతున్నట్లు తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. దాదాపు దేశంలోని 33 శాతం భూములు ఇలానే మారినట్లు వివరిస్తున్నాయి. వీటి వల్ల పర్యావరణంలో కలిసి ధూళికణాలకు సుడులు తిరుగుతున్న గాలి తోడవడంతో విపరీతమైన దుమ్ముతో గాలి దుమారం చెలరేగుతోంది.

చైనా నుంచి పాఠాలు

విధ్వంసకర గాలి దుమారాలను అడ్డుకునే దిశలో చైనా ఇప్పటికే పురోగతి సాధిస్తోంది. "గ్రేట్ గ్రీన్ వాల్" పేరిట మంగోలియాతో సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికే చైనా పాలకులు భారీగా మొక్కల పెంపకంపై దృష్టిసారించారు. ఇవి గాలి తీవ్రతను అడ్డుకోవడంతోపాటు ధూళికణాలు గాలిలో కలవకుండా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఈ వ్యూహాన్ని అనుసరించడంతోపాటు వాతావరణ అంచనాలనూ మెరుగు పరచడంతో నష్ట తీవ్రత తగ్గే అవకాశముంది.

అంచనాల్లో లోపాలు

ఈ గాలి దుమారాలను అంచనా వేయడంలో భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెనుకబడుతోంది. ముఖ్యంగా వీటి తీవ్రతను సరిగ్గా అంచనా వేయలేకపోతోంది. గత నెల 2న ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్‌లలో.. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, గాలి దుమారాలు విధ్వంసం సృష్టించాయి. వీటిపై ఐఎండీ కిమ్మనలేదని మీడియా కోడైకూసింది. ఐఎండీ అంచనాల్లో స్పష్టత కరవైందని సాక్షాత్తు మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శే వ్యాఖ్యానించడం శోచనీయం.

బంగాళాఖాతం నుంచీ...

శీతకాలంలో మార్పులు, ఉష్ణోగ్రతల్లో తేడా, ఉద్గారాల వేడితో బలపడుతున్న పశ్చిమ పవనాలకు బంగాళాఖాతం మీదుగా వీచే తూర్పుపవనాలు తోడవడంతో పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయి. గంగా-సింధూ మైదానాలపై అల్పపీడనం ఉన్నచోట సుడులు తిరిగే పశ్చిమ పవనాలకు... సముద్రం మీదుగా భారీ తేమను మోసుకొచ్చే పవనాలు తోడవడంతో ఉరుములు, మెరుపులతో భారీ తుపానులు, గాలి దుమారాలు చెలరేగుతున్నాయి. నిజానికి నైరుతి రుతుపవనాల రాకకు కాస్త ముందుగా తూర్పు, పశ్చిమ పవనాల కలయికతో వర్షాలు కురవడమనేది సాధారణమే. అయితే ప్రస్తుతం వీటి తీవ్రత, పరిధి కలవరపెడుతోంది. ముఖ్యంగా సాధారణం కంటే అతిగా తేమను మోసుకొస్తున్న తూర్పు పవనాలు, గతి తప్పుతున్న పశ్చిమ పవనాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

- ఈనాడు, ప్రత్యేక విభాగం

'నేను చదివింది 8వ తరగతి.. ఉన్నత విద్యామంత్రి పదవి వద్దు'

బెంగళూరు, న్యూస్‌టుడే: కర్ణాటక ఉన్నత విద్యాశాఖను జి.టి.దేవేగౌడకు కేటాయించగా తనకు వేరే శాఖ ఇవ్వాల్సిందిగా ఆయన ముఖ్యమంత్రి కుమారస్వామికి విన్నవించారు. మైసూరు జిల్లా చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి నాటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విజయం సాధించగా ఆయన్ను మంత్రి పదవి వరించింది. ఆయన చదివింది ఎనిమిదో తరగతే కావడంతో తనకు విద్యాశాఖ వద్దని, మరో ఉత్తమ శాఖ అప్పగించాలని ఆయన కోరారు. దీనిపై ముఖ్యమంత్రి కుమారస్వామి స్పందిస్తూ, విద్యాశాఖ కన్నా ఉత్తమ శాఖ ఏదైనా ఉంటుందాని ప్రశ్నించారు. తాను చదివింది ఎనిమిదో తరగతేనని మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. కుమరస్వామి అంతిమంగా స్పందిస్తూ 'నేను చదివింది బీఎస్సీ, అయినా ముఖ్యమంత్రిగా సేవలు అందించటం లేదా'ని సముదాయించారు. 'సంకీర్ణ ప్రభుత్వంలో మనకు కాంగ్రెస్ దయతో దక్కిన శాఖలు కొన్నే. ఉన్నవాటితో సంతృప్తి పడి, ఆ శాఖల్లో ఉత్తమ ప్రతిభను చూపించేందుకు చర్యలుతీసుకోండి. ఈ సమయంలో ఆశాఖ వద్దు.. ఇదే కావాలని పట్టుబట్టడం సరికాదు' అని అమాత్యులకు సందేశాన్ని పంపించారు. ఎన్.హెచ్.శివశంకరరెడ్డి వ్యవసాయ విద్య (బీఎస్సీ) పూర్తి చేసి.. ఆశాఖకే మంత్రిగా నిలిచారు. మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన జమీర్ అహ్మద్ ఖాన్, వెంకటరమణప్ప, హెచ్.డి.రేవణ్ణ, ఎం.సి.మనగోళి, ఆర్.శంకర్ చదువుకుంది కేవలం పదో తరగతే. సీనియరు మంత్రులు జార్జి, రాజశేఖర పాటిల్, సి.ఎస్.పుట్టరాజు ఇంటర్‌వరకుచదివారు.

జి.టి.దేవేగౌడ

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్, వరవరరావు, హరగోపాల్

దేశంలో నిర్బంధ పరిస్థితులు

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.గడ్డం లక్ష్మణ్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: దేశంలో నిర్బంధ పరిస్థితులు నెలకొన్నాయని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య గడ్డం లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ తర్వాత వచ్చిన ఆపరేషన్ సమాధాన్‌లో భాగంగానే బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో శనివారం పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గడ్చిరోలి ఆదివాసీల మారణకాండ, ప్రజాఉద్యమాలపై ప్రభుత్వ ఊచకోత, గడ్చిరోలి (మహారాష్ట్ర), తుత్తుకుడి(తమిళనాడు)లో ప్రభుత్వ హత్యాకాండకు నిరసనగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6న ప్రజాస్వామిక విద్యార్థి సంఘం నేతలు కంచర్ల బద్రి, మంద రంజిత్, జి.సుధీర్‌లను తెల్లటి దుస్తుల్లో వచ్చిన పోలీసులు అపహరించుకుపోయారని, ఇంతవరకు వారిని కోర్టులో హాజరు పరచలేదన్నారు. శనివారం తెల్లవారుజామున ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం చౌటపల్లి గ్రామంలో భీముడు అలియాస్ సుధాకర్ (న్యూడెమోక్రసీ దళ నేత), సానుభూతిపరుడు మచ్చు నాయక్‌లను సివిల్ దుస్తుల్లో వచ్చిన పోలీసులు తీసుకెళ్లారని చెప్పారు. వారిని కోర్టులో ప్రవేశపెట్టాలని తమ సంఘం పక్షాన హోంమంత్రి నాయినికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ.. మీడియా పోలీసుల వాదననే ముందుకు తీసుకువెళ్తోందన్నారు. పాలనలో వైఫల్యం చెందినపుడే ప్రజల దృష్టిని మరల్చేందుకు పాలకులపై హత్యాయత్నం మోపుకునే దిగజారుడు చర్యలకు పాల్పడుతారని ఆరోపించారు.

అక్రమ అరెస్టులతో ప్రజాఉద్యమాల అణచివేతకు కుట్ర: వరవరరావు

రాంనగర్, న్యూస్‌టుడే: అక్రమ అరెస్టులతో ప్రజాఉద్యమాలను అణచివేసేందుకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కుట్ర చేస్తోందని విప్లవ రచయితల సంఘం నేత వరవరరావు ఆరోపించారు. రోనా విల్సన్ ల్యాప్‌టాప్‌లో దొరికిన లేఖ అబద్ధమని, అందులో తన పేరు ఉన్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అక్రమంగా అరెస్టు చేసిన ప్రజాసంఘాల నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్‌లో ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు(తెలంగాణ, ఏపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోనా విల్సన్ ల్యాప్‌టాప్‌లో దొరికిన లేఖను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ రాజ్యాంగం రాయకుంటే నియంతృత్వమే: కంచె ఐలయ్య

ఏయూ ప్రాంగణం(విశాఖ), న్యూస్‌టుడే: అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాసి ఉండకపోతే భారత్‌లో నియంతృత్వం వచ్చి ఉండేదని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు కంచె ఐలయ్య పేర్కొన్నారు. దళిత ఆదివాసీ సమతా జాతర పేరుతో విశాఖ ఏయూ స్నాతకోత్సవ మందిరంలో శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య కె.ఎస్.చలం దీనికి అధ్యక్షత వహించారు. కంచె ఐలయ్య కీలకోపన్యాసం చేస్తూ.. గాంధీ, నెహ్రూ పీహెచ్‌డీలు చదవలేదని, అంబేడ్కర్ కొలంబియా వర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో రెండు పీహెచ్‌డీలు చేశారన్నారు. అంబేడ్కర్ భూమిగా భరత భూమిని పిలవాలన్నారు. విప్లవకారుడిగా తాను నాగిరెడ్డి గ్రూప్‌లో పనిచేసినట్లు ఐలయ్య పేర్కొన్నారు. మావోయిస్టులు నేపాల్‌లో మాదిరిగా ఆయుధాలను వదిలి రావాలన్నారు. వీరితో అంబేడ్కర్‌వాదులు కలిసి రావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఒకటి నుంచి 12వ తరగతి వరకు పిల్లలను ఆంగ్లంలోనే చదివించాలని, ప్రభుత్వం వీరికి ఆంగ్ల పాఠశాలలను ఏర్పాటుచేయాలని కోరారు.

దిల్లీకి కర్ణాటక 'అసమ్మతి' రగడ

- ఎంబీ పాటిల్‌తో రాహుల్ చర్చలు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటాడుతున్న అవిశ్వాస భయం!

ఈనాడు - బెంగళూరు, దిల్లీ

కన్నడనాట అసమ్మతీయులందరికీ పదవుల్ని కట్టబెడతామని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం బుజ్జగింపులకు దిగింది. ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన మంత్రులకు రెండేళ్ల తర్వాత ఉద్వాసనపలికి ఇతరుల్ని అందలమెక్కిస్తామని శుక్రవారం చేసిన ప్రతిపాదనను శనివారం కాస్త సవరించింది. ప్రతి రెండేళ్లకోమారు మంత్రిని బదిలీ చేస్తామని భరోసా ఇచ్చింది.

కాంగ్రెస్‌ను వీడేది లేదని ఎం.బి.పాటిల్ స్పష్టీకరణ

కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ తీరుపై అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీతో దిల్లీలో శనివారం భేటీ అయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(కేపీసీసీ) కార్యనిర్వాహక అధ్యక్షుడు దినేశ్ గుండూ రావ్, కర్ణాటక మంత్రి కృష్ణ బైరె గౌడ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అయితే, వారి చర్చలు అసంపూర్తిగానే ముగిశాయి. అసమ్మతి ఎమ్మెల్యేలకు నేతృత్వం వహించిన మాజీ మంత్రి ఎం.బి.పాటిల్ సమావేశానంతరం విలేకర్లతో మాట్లాడారు. తాను కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదన్నారు. ఇతర ఎమ్మెల్యేలతో చర్చించాక భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను రాహుల్‌కు వివరించానని.. ఎలాంటి డిమాండ్లు చేయలేదని అన్నారు.

రంగంలోకి సీనియర్లు

అసమ్మతీయ విధానసభ సభ్యుల్ని బుజ్జగించేందుకు వారికి ఆత్మీయులైన సీనియర్లను రంగంలోకి దించింది. భవిష్యత్తులో మంత్రి లేక కార్పొరేషన్, బోర్డుల పాలక మండలి అధ్యక్ష పదవులుంటాయన్న ఆశల్ని చూపించినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఏదేమైనప్పటికీ అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉందన్నది పరిశీలకుల మదింపు. మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విశ్వాసపాత్రుడైన బైరతి బసవరాజు వచ్చే సోమవారం నగరంలో కాంగ్రెస్ పార్టీ విధానసభ సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కనీసం 40 మంది హాజరు కానున్నట్లు సమాచారం. నాయకత్వం చేసిన తీర్మానానికి కట్టుబడి ఉంటామని తీర్మానం చేయనున్నట్లు బసవరాజు చెప్పారు.

దేవేగౌడ, కుమారస్వామి సంప్రదింపులు..

వచ్చే విధానసభ సమావేశాల్లో విపక్షం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడుతుందేమోనన్న భీతి ప్రభుత్వాన్ని పీడిస్తోంది. అందువల్లే దళపతి దేవేగౌడ, ముఖ్యమంత్రి కుమారస్వామి కూడా బరిలోకి దిగారు. అసమ్మతీయుల్లో తమకు తెలిసిన వారితో సంప్రదింపుల్ని జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా భాజపా నాయకత్వం దృష్టి లోక్‌సభ ఎన్నికలపై కేంద్రీకృతం కావటంతో కర్ణాటక రాజకీయాల గురించి పెద్దగా పట్టించుకోవటం లేదని తెలిసింది. తమంత తాము ఎవరైనా వస్తే తప్ప ఎవరినీ పార్టీలోకి ఆహ్వానించరాదని కూడా నాయకత్వం ఆదేశించటంతో రాష్ట్ర నేతలు గతంలో మాదిరి దూకుడుగా వ్యవహరించటం లేదు. భాజపా నుంచి గతంలో మాదిరి పదవులు, ఇతర తాయిలాల భరోసా రాకపోవటంతో రెండు పార్టీల్లోని అసమ్మతీయులు కూడా సొంత పార్టీల్లోనే కొనసాగుతూ అసమ్మతి జెండా ఎగరేస్తున్నారే తప్ప..మరో అడుగుముందుకేయటం లేదు.

విమాన విరామంతో కష్టమే!

ఈనాడు, విశాఖపట్నం: విశాఖపట్నంలో విమానాల రాకపోకలను తూర్పు నౌకాదళం నియంత్రించడం, రోజుకు 5 గంటలపాటు పౌర విమానాల రాకపోకలను నిషేధించడం ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక రాజధానిగా అవతరిస్తున్న విశాఖ ప్రగతికి తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించనుంది. ఏటా 24 లక్షల మందికి పైగా ప్రయాణికుల్ని దేశ, విదేశీ గమ్యస్థానాలకు చేరుస్తూ కీలక గుర్తింపు తెచ్చుకున్న ఈ విమానాశ్రయంలో రాకపోకలను నిషేధిస్తే ప్రయాణికులపై ఆర్థిక భారం పడటమే కాకుండా.. సమయం వృథా కానుంది.

విశాఖ విమానాశ్రయం రక్షణశాఖ పరిధిలో ఉండటంతో విమానాల రాకపోకలన్నీ తూర్పు నౌకాదళ అధికారుల పర్యవేక్షణలోనే ఉంటాయి. విమానాల రాకపోకలకు అత్యంత కీలకమైన 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్'ను (ఎ.టి.సి.) నౌకాదళ ఉద్యోగులే నిర్వహిస్తుంటారు. తాజాగా తూర్పు నౌకాదళం విమాన వాహక యుద్ధ నౌకలపై వినియోగించే అధునాతన మిగ్ 29కె రకం యుద్ధ విమానాలను నడిపే పైలట్లకు విస్తృత స్థాయిలో ఇక్కడే శిక్షణనిస్తోంది. చిన్న/తేలికపాటి మానవ రహిత యుద్ధ విమానాలనూ విశాఖ విమానాశ్రయం కేంద్రంగా ఉపయోగిస్తోంది. కొన్ని సందర్భాల్లో పౌర విమానాలు ఆలస్యమవుతుండటంతో శిక్షణ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. విమానాశ్రయ సమయాలు తగ్గిస్తే విమానాలు తగ్గి రాష్ట్ర ఆర్థిక ప్రగతి, నగర అభివృద్ధి దెబ్బతినే ప్రమాదం ఉన్నప్పటికీ అటు విమానాశ్రయ అధికారులుగానీ, ఇటు నౌకాదళ అధికారులుగానీ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను సంప్రదించ లేదు. నౌకాదళ అధికారుల నిర్ణయం కారణంగా సిల్క్ ఎయిర్‌వేస్ మినహా ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఏషియా, జెట్ ఎయిర్‌వేస్, శ్రీలంకన్ ఎయిర్‌వేస్ తమ సర్వీసులను మార్చుకోవాల్సి వస్తుంది. విమానయాన సంస్థలు ఒకే విమానాన్ని ఒకే రోజు వివిధ ప్రాంతాల మధ్య నడుపుతుంటాయి. ఒకచోట సమయం మార్చుకోవాల్సి వస్తే దాని ప్రభావం ఇతర ప్రాంతాల విమాన సమయాలపై పడుతుంది. ఫలితంగా విమాన సమయాల రీషెడ్యూలు లాభదాయకం కాకపోతే సర్వీసు రద్దయ్యే ముప్పు పొంచి ఉంది. విశాఖ విమానాశ్రయానికి సుమారు 35 విమానాలు రాకపోకలు సాగిస్తుండగా వాటిలో 16 విమానాలు సమయాల్ని మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఆర్థిక ప్రగతికి పెను విఘాతం

నౌకాదళ అధికారుల నిర్ణయం కారణంగా ఐటీ, ఫార్మా, పర్యాటక, ఆతిథ్య రంగాలపై తీవ్ర ప్రభావం పడి ఆర్థిక ప్రగతి దెబ్బతినడమే కాకుండా విశాఖ వచ్చే వారి సంఖ్య తగ్గి కొన్ని విమానాలు రద్దయ్యే ముప్పు ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయం మొత్తం పౌర విమానాలకే కేటాయించినప్పటికీ రాత్రి 9 గంటలు దాటిన తర్వాత సర్వీసులకు ఆదరణ అంతంత మాత్రమేనని వివరిస్తున్నారు. మారిన సమయాల కారణంగా విశాఖకు వచ్చి వెళ్లే ప్రయాణికులపై ఛార్జీల రూపంలోనే కాకుండా వసతికి అదనంగా ఖర్చు పెట్టాల్సి ఉంటుందని, అన్నింటికీ మించి రాత్రి వేళ్లలో ప్రయాణికులు రావడం, హోటళ్లకు వెళ్లడం ముఖ్యంగా మహిళా ప్రయాణికుల భద్రతకు ఇబ్బందికరమేనని పలువురు వివరిస్తున్నారు.

'కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన విషయం కావడంతో నౌకాదళ, పౌర విమానయానశాఖల అధికారులు, విమానయాన సంస్థల ప్రతినిధులు కూర్చుని మాట్లాడుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వలేదు. నిషేధిత సమయాల్ని ఎంతకాలం కొనసాగిస్తారన్న అంశంపై నౌకాదళం నుంచి స్పష్టత లేదు.'

– జి.ప్రకాశ్‌రెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టరు

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు

- ప్రధానికి రాసిన లేఖలో రఘువీరా డిమాండ్
- రేపు రాష్ట్రానికి ఉమెన్ చాందీ

ఈనాడు డిజిటల్, అమరావతి: జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. 2011 సామాజిక, ఆర్థిక, కుల గణన ప్రకారం సేకరించిన వివరాలను భాజపా ప్రభుత్వం 2015లో మతాల వారీగా వెల్లడించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబీసీలు ఎంత శాతం ఉన్నారో చెప్పకుండా ఆ వర్గానికి అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు వర్గాలవారీగా జనాభా లెక్కింపును సమర్థించిన భాజపా అధికారంలోకొచ్చాక బయటకు వెల్లడించడం లేదని వ్యాఖ్యానించారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండు చేస్తూ ప్రధాని మోదీకి రాసిన లేఖను రఘువీరారెడ్డి శనివారం విజయవాడలో విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశ జనాభాలో 18.46 శాతం, 10.97 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీలకు అంతకన్నా తక్కువగానే రిజర్వేషన్లు అమలవుతున్నాయని, జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండు చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం లోక్‌సభలో అవిశ్వాసం పెడితేనే ప్రధాన మంత్రికి కులం గుర్తొచ్చిందని ఎద్దేవా చేశారు. ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు ఉమెన్ చాందీ సోమవారం విజయవాడ రానున్నారని రఘువీరారెడ్డి వెల్లడించారు. 12వ తేదీన సీనియర్ నాయకులు, పార్టీ విభాగాల అధ్యక్షులతో విడివిడిగా భేటీ కానున్నారని వివరించారు. 13వ తేదీన ఏపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలోనూ పాల్గొంటారని చెప్పారు.

శస్త్రచికిత్సతో యువకుడిగా మారిన యువతి

- ఆపై ప్రేమ వివాహం
- నిజం తెలిసి భార్య దూరం
- మనస్తాపంతో నిప్పంటించుకుని 'భర్త' ఆత్మహత్యాయత్నం

చెన్నై, న్యూస్‌టుడే: ఓ యువతి శస్త్రచికిత్స చేయించుకుని యువకుడిగా మారింది. అనంతరం ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకుంది. నిజం తెలిసిన భార్య.. కలిసి ఉండేందుకు నిరాకరించింది. దీంతో యువకుడిగా మారి పెళ్లి చేసుకున్న యువతి మనస్తాపం చెంది నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లా వడలూరుకి చెందిన ఇళవరసి (26) పుదుచ్చేరిలో ప్రైవేటు ఉద్యోగి. ఆమెకు వైద్య కళాశాలలో స్టోర్ కీపర్‌గా పని చేస్తున్న తిరుచ్చెందూరుకి చెందిన యశ్వంతయ్య (28) పరిచయమయ్యాడు. అది కాస్తా ప్రేమగా మారింది. అనంతరం వారు రహస్యంగా వివాహం చేసుకొని కొన్ని నెలలుగా కలిసి జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో యశ్వంతయ్య ప్రవర్తనపై ఇళవరసికి అనుమానం వచ్చింది. ఆరా తీయగా యశ్వంతయ్య గతంలో యువతి అని, శస్త్రచికిత్స చేయించుకుని యువకుడిగా మారినట్లు తెలిసింది. దీంతో ఆమె వేరుగా ఉంటోంది. శుక్రవారం వారి పెళ్లిరోజు కావడంతో ఇళవరసి వద్దకు యశ్వంతయ్య వచ్చి తిరిగి కలిసి జీవిద్దామని బలవంతం చేయగా అందుకు ఇళవరసి నిరాకరించింది. విరక్తి చెందిన యశ్వంతయ్య ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోగా ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడింది. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఛాంపియన్

ఏక్తా బిష్త్ (3/14)

పాక్‌ను చిత్తు చేసి ఫైనల్‌కు

ఆసియాకప్‌లో అదరగొట్టిన భారత అమ్మాయిలు

కౌలాలంపూర్: భారత మహిళల క్రికెట్ జట్టు మరోసారి అదరగొట్టింది. ఆసియాకప్ టీ20 టోర్నీ చివరి రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో భారత్.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తు చేసి ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ భారత బౌలర్ల ధాటికి 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 72 పరుగులే చేయగలిగింది. ఏక్తా బిష్త్ (3/14)తో పాటు అనూజ పాటిల్ (1/18), పూనమ్ యాదవ్ (1/11), దీప్తి శర్మ (1/13) పాక్‌ను కట్టి పడేశారు. నచిదా ఖాన్ (18), సనా మిర్ (20 నాటౌట్) మినహా పాక్ జట్టులో ఎవరూ రెండంకెల స్కోరు చేయలేదు. అనంతరం ఛేదనలో భారత్ ఆరంభంలోనే మిథాలీ రాజ్ (0), దీప్తి శర్మ (0)ల వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఐతే ఓపెనర్ స్మృతి మంధాన (38; 40 బంతుల్లో 4×4), కెప్టెన్ హర్మన్ ప్రీత్ (34 నాటౌట్; 49 బంతుల్లో 3×4) నిలకడగా ఆడి జట్టుకు విజయాన్నందించారు. భారత్ 16.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గ్రూప్ దశలో బంగ్లాదేశ్ చేతిలో మాత్రమే భారత్ ఓడింది. మిగతా నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 8 పాయింట్లు, +2.446 నెట్‌రన్‌రేట్‌తో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్ చేరింది. 8 పాయింట్లు, +1.116 నెట్‌రన్‌రేట్‌తో రెండో స్థానం సాధించిన బంగ్లా కూడా ఫైనల్‌కు అర్హత సాధించింది. తుది పోరు ఆదివారం జరుగుతుంది. పాకిస్థాన్, శ్రీలంక థాయ్‌లాండ్, మలేషియా టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

పదకొండా.. ఒకటా!

నాదల్ × థీమ్ ఫైనల్ నేడు

సాయంత్రం 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. పదకొండో టైటిల్‌పై గురిపెట్టిన నాదల్.. ఆదివారం జరిగే ఫైనల్లో తొలి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ కోసం ఆరాటపడుతున్న డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)ను ఢీకొంటాడు. నాదల్ టైటిల్ గెలిస్తే.. ఒకే గ్రాండ్‌స్లామ్‌ను అత్యధిక సార్లు గెలిచిన ప్లేయర్‌గా మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్) రికార్డును సమం చేస్తాడు. నాదల్ కెరీర్‌లో ఇప్పటివరకు 16 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు. తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్న థీమ్ కూడా టైటిల్ గెలవాలనే పట్టుదలతో ఉన్నాడు. అతడు నిరుడు రోమ్‌లో, ఈ ఏడాది మాడ్రిడ్‌లో క్లేకోర్టుపై నాదల్‌ను ఓడించాడు. ఈ నేపథ్యంలో ఫైనల్ మరింత ఆసక్తి కలిగిస్తోంది.

- ఫలించిన హలెప్ నిరీక్షణ
- ఎట్టకేలకు తొలి గ్రాండ్‌స్లామ్ కైవసం
- ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో స్టీఫెన్స్‌పై విజయం

కల నిజమైంది ఇలా

హలెప్

స్టీఫెన్స్

పారిస్

ఆమెలో మంచి ఆట ఉంది. ఆమెలో ధాటి ఉంది.. కసి ఉంది. ఆమెలో పట్టుదల ఉంది. అయినా తొలి గ్రాండ్‌స్లామ్ కోసం ఏళ్లుగా శ్రమిస్తూనే ఉంది. అందినట్లే అంది చేజారినా నిరాశచెందక పోరాడుతూనే ఉంది. ఇప్పుడు ఎట్టకేలకు ఆమె కల ఫలించింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఆ రోజు రానే వచ్చింది. అద్భుతంగా పోరాడిన రొమేనియా అమ్మాయి సిమోనా హలెప్ తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో మురిసిపోయింది. ఫైనల్లో స్టీఫెన్స్‌ను ఓడించి ఫ్రెంచ్ ఓపెన్ ట్రోఫీని తనివితీరా ముద్దాడింది.

ప్రపంచ నంబర్‌వన్ సిమోనా హలెప్ సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. తిరుగులేని ఆటతో ఆమె కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆమె 3-6, 6-4, 6-1తో అమెరికా అమ్మాయి స్లోన్ స్టీఫెన్స్‌ను మట్టికరిపించింది. రెండు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్ సహా గతంలో మూడుసార్లు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ చేరిన హలెప్.. అన్నింట్లోనూ ఓడిపోయింది. ఈసారి మాత్రం అవకాశం వదల్లేదు. సుదీర్ఘ ర్యాలీల్లో హోరాహోరీగా తలపడింది. తొలి సెట్‌ను చేజార్చుకున్నా, రెండో సెట్లో 2-0తో వెనకబడ్డా బలంగా పుంజుకుంది. గొప్ప పోరాటంతో రెండుగంటలకుపైగా సాగిన పోరాటంలో విజేతగా నిలిచింది. వర్జినా రుజికి (1978) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన తొలి రొమేనియా ప్లేయర్‌గా 26 ఏళ్ల హలెప్ ఘనత సాధించింది.

> "14 ఏళ్ల వయసు నుంచి గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవాలనుకుంటున్నా. నా కల నెరవేరింది. అది పారిస్‌లో కావడం నా విజయానికి మరింత ప్రత్యేకతను చేకూరుస్తోంది. రెండో సెట్లో వెనుకబడ్డాక ప్రశాంతంగా ఉండి, ఆటను ఆస్వాదించడానికి ప్రయత్నించా"
> – హలెప్

ఫైనల్ ఆరంభంలో స్టీఫెన్స్‌దే ఆధిపత్యం. ఆమె జోరు చూస్తే వరుస సెట్లలో హలెప్‌కు ఓటమి ఖాయమనిపించింది. బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లు ఆడిన స్టీఫెన్స్ నాలుగో గేమ్‌లో హలెప్ సర్వీసును బ్రేక్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా సెట్‌ను చేజిక్కించుకుంది. అదే జోరు కొనసాగించిన స్టీఫెన్స్... రెండో సెట్లో తొలి గేమ్‌లోనే బ్రేక్ సాధించి, వెంటనే సర్వీసు నిలుపుకుని 2-0 ఆధిక్యం సంపాదించింది. ఆ దశలో స్టీఫెన్స్‌దే టైటిల్ అని అనిపించింది. కానీ హలెప్ పోరాట పటిమను ప్రదర్శించింది. నాలుగు, ఆరో గేముల్లో బ్రేక్‌తో 4-2 ఆధిక్యంలోకి వెళ్లింది. స్టీఫెన్స్ ఏడో గేమ్‌లో బ్రేక్ సాధించి, సర్వ్ నిలుపుకుని 4-4తో స్కోరు సమం చేసింది. కానీ వెంటనే హలెప్ పట్టువదల్లేదు. సర్వీసు నిలబెట్టుకుని 5-4తో ఆధిక్యం సంపాదించిన ఆమె... కీలకమైన పదో గేమ్‌లో స్టీఫెన్స్ సర్వీసును బ్రేక్ చేసి సెట్‌ను చేజిక్కించుకుంది. నిర్ణయాత్మక సెట్లో హలెప్ జోరు మరో స్థాయికి చేరింది. దూకుడైన ఆటతో రెండు, నాలుగో గేముల్లో బ్రేక్ సాధించిన ఆమె అలవోకగా సెట్‌ను, మ్యాచ్‌ను, ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. తీవ్ర భావోద్వేగంతో సంబరాల్లో మునిగిపోయింది. ఫైనల్లో హలెప్ 18 విన్నర్లు కొట్టగా.. స్టీఫెన్స్ 39 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. హలెప్ కెరీర్‌లో ఇది 32వ గ్రాండ్‌స్లామ్ టోర్నీ.

మహుత్-హెర్బర్ట్ జోడీకి డబుల్స్ టైటిల్

నికోలస్ మహుత్-హెర్బర్ట్ (ఫ్రాన్స్) జోడీ ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఫైనల్లో ఈ ద్వయం 6-2, 7-6 (7-4)తో ఒలివర్ మరాచ్ (ఆస్ట్రియా), మేట్ పవిచ్ (క్రొయేషియా) జంటపై విజయం సాధించింది. మహుత్ జోడీ ఏడు ఏస్‌లు కొట్టగా.. మరాచ్-పవిచ్ జంట మూడు ఏస్‌లే సంధించింది. జోడీగా మహుత్-హెర్బర్ట్‌లకు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్.

లంక లక్ష్యం 453

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: వెస్టిండీస్‌తో తొలి టెస్టులో శ్రీలంక ముందు 453 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. నాలుగో రోజు, శనివారం కడపటి వార్తలందేసరికి ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 14 ఓవర్లకు వికెట్ నష్టపోయి 57 పరుగులు చేసింది. కుశాల్ పెరీరా (12) ఔటయ్యాడు. కెప్టెన్ చండిమాల్ 15 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. కుశాల్ మెండిస్ (20), మాథ్యూస్ (5) క్రీజులో ఉన్నారు. అంతకుముందు వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌ను 223/7 వద్ద డిక్లేర్ చేసింది. కీరన్ పావెల్ (88) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. లంక బౌలర్లలో కుమార (3/40) రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌ను విండీస్ 414/8 వద్ద డిక్లేర్ చేయగా.. లంక 185 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

బ్రెజిల్ కోచ్ టైట్

ఫిఫా ప్రపంచకప్ మరో 4 రోజుల్లో

అతడు శాసిస్తాడు

ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతున్నపుడు ఆటనే కాక కెమెరాలు తరచుగా ఓ వ్యక్తిని పదే పదే చూపిస్తుంటాయి.

మైదానం హద్దుల్నే అనుకుని ఉన్న ఒక చోట ఒక గుంపునేసుకుని నిలబడి ఉంటాడా వ్యక్తి. సూటేసుకుని, టై కట్టుకుని హుందాగా కనిపించే అతడి ఆహార్యానికి.. అతడి చేష్టలకు సంబంధం ఉండదు. అరుస్తుంటాడు.. తిడుతుంటాడు.. కళ్లు ఉరుముతుంటాడు.. ఆనందంతో గంతులేస్తుంటాడు.. ఆగ్రహంతో ఊగిపోతుంటాడు.. ఆదేశాలిస్తుంటాడు.. అక్కడి నుంచే ఆటగాళ్లను నియంత్రిస్తుంటాడు.. తన చుట్టూ ఉన్నవాళ్లతో తెగ మంతనాలు జరుపుతుంటాడు. మైదానంలో ఉన్న ఆటగాడిని వెనక్కి రమ్మంటాడు. ఇక్కడి నుంచి మరో ఆటగాడిని లోనికి పంపిస్తాడు.

మ్యాచ్‌లో ఆటగాళ్ల హడావుడంతా ఒకెత్తయితే.. ఆ వ్యక్తి హంగామా మరో ఎత్తు!

ఇంతకీ ఎవరతను?

మేనేజర్.. కోచ్.. ఎలా అయినా పిలుచుకోవచ్చు! కంటిచూపుతో ఆటను శాసించే వ్యక్తి.. ఆటగాళ్లను తెరవెనుక నుంచి నడిపించే శక్తి! ఫుట్‌బాల్ ఆటలో ఈ కోచ్ లేదా మేనేజర్‌కుండే ప్రాధాన్యమే వేరు!


జర్మనీ కోచ్ జోకిమ్ లో

క్రికెట్ మ్యాచ్ జరుగుతుంటే.. కోచ్ ఏం చేస్తుంటాడు? డ్రెస్సింగ్ రూంకు దగ్గర ఒక మూలన కూర్చుని ఉంటాడు. అతడిలో పెద్దగా భావోద్వేగాలేమీ కనిపించవు. మైదానంలో అతడి పాత్ర నామమాత్రం! బ్యాడ్మింటన్ కోచ్ మ్యాచ్ మధ్యలో విరామం దొరికితే ఆటగాళ్లకు సలహాలిస్తుంటాడు. అతడిలోనూ పెద్దగా స్పందనలు కనిపించవు! మిగతా ఆటల్లోనూ కోచ్‌ల తీరు ఇలాగే ఉంటుంది. మైదానంలో, అవతల వారి పాత్ర ఒక స్థాయిని మించదు! కానీ ఫుట్‌బాల్ కోచ్ కథే వేరు. ఆటలో అతడి ప్రాధాన్యం అంతా ఇంతా కాదు! పెద్ద పెద్ద స్టార్లు సైతం కోచ్ అదుపులో ఉండాల్సిందే. అతడి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిందే. అతను కన్నెర్ర చేస్తే ఎవరైనా పక్కకు తప్పుకోవాల్సిందే. మిగతా ఆటల్లో మాదిరి ప్రాక్టీస్ సెషన్ల వరకే ఫుట్‌బాల్ కోచ్ పాత్ర పరిమితం కాదు. మ్యాచ్‌లు, టోర్నీలకు ముందు వ్యూహరచన అంతా కోచ్‌దే!

అందలం.. లేదంటే పాతాళం!

ఫుట్‌బాల్ కోచ్‌లకు దక్కే గౌరవం అంతా ఇంతా కాదు. జట్టుకు కప్పు అందిస్తే భారీ నజరానాలుంటాయి. ఉన్నత పురస్కారాలిస్తారు. ఐతే పదవిలో ఉన్నపుడు, విజయాలు సాధించినపుడు గొప్ప గౌరవాన్ని అందుకునే కోచ్‌లు.. వైఫల్యాలు ఎదురైనపుడు అదే స్థాయిలో అవమానాలు ఎదుర్కొంటారు. జట్టు విఫలమైతే ముందు వేటు పడేది కోచ్ మీదే. గెలిచినపుడు అందలమెక్కి.. ఓడినపుడు పాతాళానికి పడిపోయిన ఫుట్‌బాల్ కోచ్‌లకు లెక్కే లేదు.

జీతం భారీగానే..

ఫుట్‌బాల్ కోచ్‌లకు జీతాలు భారీగానే ఉంటాయి. క్లబ్ ఫుట్‌బాల్‌లో వంద కోట్లకు పైగా వార్షిక వేతనం అందుకునే కోచ్‌లు చాలామందే ఉన్నారు. చైనా ఫుట్‌బాల్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఆ దేశం నియమించుకున్న ప్రఖ్యాత కోచ్ సిప్పి ఏడాదికి రూ.163 కోట్లు జీతంగా అందుకుంటుండటం విశేషం. ప్రస్తుత ప్రపంచకప్‌లో అత్యధికంగా జర్మనీ కోచ్ రూ.30 కోట్ల వార్షిక వేతనం తీసుకుంటున్నాడు.

ఎన్నెన్ని బాధ్యతలో!

● ఫుట్‌బాల్ జట్టులో ప్రతి ఆటగాడి ఎంపికా కోచ్ ఇష్టమే. అతడికి అసిస్టెంట్ కోచ్ సహా పెద్ద సహాయక బృందం ఉంటుంది. తన బృందంతో కలిసి అతనే ఆటగాళ్లను ఎంచుకుంటాడు. దేశవాళీ, క్లబ్ మ్యాచ్‌లు చూసి ఆటగాళ్లను ఎంపిక చేసుకుంటాడు. వాళ్లను తన వ్యూహాలకు, జట్టు అవసరాలకు తగ్గట్లుగా తీర్చిదిద్దుకుంటాడు.

● ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీ కోసం నాలుగేళ్ల ముందే కోచ్ ప్రణాళిక మొదలవుతుంది. రెండేళ్ల పాటు క్వాలిఫయింగ్ టోర్నీ ఆడాల్సి ఉంటుంది కాబట్టి.. ఒక ప్రపంచకప్ అయిన వెంటనే తర్వాతి టోర్నీ కోసం జట్టును తీర్చిదిద్దుకునే ప్రక్రియ మొదలవుతుంది. కొత్త కోచ్ నియమితుడైతే.. జట్టు స్వరూపమే మారిపోతుంది. దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా జట్టును తయారు చేసుకుంటాడు కోచ్.

● నెదర్లాండ్స్ టోటల్ ఫుట్‌బాల్ అంటూ మెరుపులు మెరిపించినా.. స్పెయిన్ వన్ టచ్ ఫుట్‌బాల్ అంటూ ప్రత్యేకత చాటుకున్నా.. అదంతా ఆ జట్ల కోచ్‌ల ఆలోచనలకు అనుగుణంగా అలవరుచుకున్న శైలే. పరిస్థితులు, ప్రత్యర్థుల్ని బట్టి ఎంత వేగంతో ఆడాలన్నది కూడా కోచే నిర్ణయిస్తాడు. ప్రతి మ్యాచ్‌కు ముందు కోచ్ వ్యూహాలు రచిస్తాడు. ఆడుతున్నది ఎక్కడ, ఎవరితో అన్నదాన్ని బట్టి ప్రణాళిక సిద్ధమవుతుంది.

● మ్యాచ్‌కు తుది జట్టును నిర్ణయించేది కోచే. ఇక మ్యాచ్ గమనాన్ని బట్టి మధ్యలో ఏ ఆటగాడిని వెనక్కి పిలవాలి.. సబ్‌స్టిట్యూట్‌గా ఎవరిని పంపాలి అన్నదీ కోచే చూసుకుంటాడు. మ్యాచ్ ఫలితాల్ని మార్చేలా జట్టులోని తురుపుముక్కల్ని, రహస్య అస్త్రాల్ని ప్రయోగించడంలో కోచ్ ప్రత్యేకత బయటపడుతుంది.

● జట్టులో ఒకరిద్దరు స్టార్లున్నంత మాత్రాన ఆ జట్టు గెలిచేయదు. వాళ్ల నైపుణ్యాల్ని జట్టు సమర్థంగా ఉపయోగించుకోవడం కీలకం. ఇక్కడే కోచ్ సామర్థ్యం కూడా బయటపడుతుంది. జట్టులో ప్రతి ఆటగాడిపై ప్రత్యేకంగా దృష్టిసారించి.. అతడి బలాబలాల్ని గుర్తించి, జట్టు అవసరాలకు తగ్గట్లుగా అతడిని తీర్చిదిద్దడంపై కోచ్ దృష్టిసారిస్తాడు. జట్టులో సమష్టితత్వం పెంపొందించడం, ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టడం, మైదానంలో సమన్వయం సాధించేలా చేయడం కోచ్ కీలక బాధ్యతలు.

ఈ కప్పులో టాప్ వీళ్లే..

● 2014లో జర్మనీ ప్రపంచ విజేతగా నిలిచిందంటే అందుకు ప్రధాన కారణం కోచ్ జోకిమ్ లో. 2006లో జర్మనీ పూర్తి స్థాయి మేనేజర్‌గా బాధ్యతలు తీసుకున్న జోకిమ్.. తన వ్యూహాలతో జట్టును పటిష్ట పరుస్తూ గొప్ప స్థాయికి చేర్చాడు. ఆటగాడి కన్నా జట్టే ముఖ్యమని అతను నమ్ముతాడు. అందుకే జర్మనీ జట్టులో ఏ ఒక్కరో స్టార్ కాదు. అందరూ ఆధారపడదగ్గవాళ్లే. లో వచ్చాక 160 మ్యాచ్‌ల్లో జర్మనీ 106 విజయాలు సాధించింది.

● గత ప్రపంచకప్‌లో నెయ్‌మార్ మీద అతిగా ఆధారపడి ఇబ్బంది పడ్డ బ్రెజిల్.. ఈసారి ఆల్‌రౌండ్ నైపుణ్యంతో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోందంటే అందుక్కారణం టైట్. 2014 ప్రపంచకప్ తర్వాత దుంగా నుంచి బాధ్యతలందుకున్న టైట్.. జట్టును గొప్పగా తీర్చిదిద్దాడు. యువ ఆటగాళ్లను సానబెట్టాడు. టైట్ నేతృత్వంలో ప్రపంచకప్ అర్హత మ్యాచ్‌ల్లో వరుసగా ఏడు విజయాలు సాధించి రష్యాలో జరగనున్న మెగాటోర్నీకి అర్హత సాధించింది బ్రెజిల్.

● గతేడాదే అర్జెంటీనా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన జార్జ్ తక్కువ కాలంలోనే జట్టు మీద పట్టు సాధించాడు. గత ప్రపంచకప్ ఫైనల్లో జర్మనీ చేతిలో ఓడిన అర్జెంటీనా.. సంపోలి నేతృత్వంలో ఈసారి ఎలాగైనా కప్ కొట్టాలనే లక్ష్యంతో బరిలో దిగుతోంది. మెస్సితో కలిసి జార్జ్ ఎలాంటి వ్యూహాలు రచించి జట్టుకు విజయాలు అందిస్తాడన్నది ఆసక్తికరం.

– ఈనాడు క్రీడావిభాగం

ఛెత్రీసేన.. సాధించేనా!

నేడే కెన్యాతో ఫైనల్

రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ముంబయి: భారత ఫుట్‌బాల్ జట్టు తుదిపోరుకు సిద్ధమైంది. ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో భాగంగా ఆదివారం ఫైనల్లో కెన్యాతో తలపడనుంది. ఈ టోర్నీలో భారత్‌ను ఫైనల్ చేర్చడంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ సునీల్ ఛెత్రిపైనే జట్టు మరోసారి ఆశలు పెట్టుకుంది. లీగ్ దశలో కెన్యాను 3-0తో ఓడించడం భారత్‌కు సానుకూలాంశం. ఆ మ్యాచ్‌లో రెండు గోల్స్‌తో ఛెత్రి జట్టుకు విజయాన్ని అందించాడు. లీగ్ దశలో కెన్యాపై గెలిచినా కూడా ఆ జట్టును తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదని కోచ్ స్టీఫెన్ అంటున్నాడు. ఈ మ్యాచ్‌కు పూర్తిస్థాయి జట్టుతో బరిలో దిగనున్నామని అతను చెప్పాడు.

లాల్బియాకిమాకు కాంస్యం

దిల్లీ: ప్రెసిడెంట్స్ కప్ బాక్సింగ్ టోర్నీ క్వార్టర్స్‌లో ఒలింపిక్ ఛాంపియన్‌కు షాకిచ్చి సెమీస్ చేరిన భారత బాక్సర్ లాల్బియాకిమా (49 కేజీలు) కాంస్యం దక్కించుకున్నాడు. కజకిస్థాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీ సెమీస్‌లో లాల్బియాకిమా స్థానిక బాక్సర్ ఎర్జాన్ చేతిలో పరాజయం పాలై కాంస్యంతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. మరో బాక్సర్ సచిన్ సివాచ్ (52 కేజీలు) కూడా కాంస్యం సాధించాడు. సెమీస్‌లో సచిన్.. రోజెన్ (ఫిలిప్పైన్స్) చేతిలో ఓడాడు. మహిళల విభాగంలో ప్రియాంక కూడా కాంస్యంతోనే టోర్నీని ముగించింది.

రొనాల్డో వచ్చేశాడు..
ప్రపంచకప్ కోసం పోర్చుగల్ జట్టుతో కలిసి శనివారం మాస్కో చేరిన ఆ జట్టు కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో

ఫేస్‌బుక్‌కు కొన్ని సంస్థలతో రహస్య ఒప్పందాలు!

వాషింగ్టన్: ప్రముఖ సామాజిక మాధ్యమ సంస్థ ఫేస్‌బుక్ తమ వినియోగదారుల సమాచారాన్ని కొన్ని సంస్థలకు అందించేలా రహస్య ఒప్పందాలు చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఫేస్‌బుక్ అంతర్గత వర్గాల్లో ఈ ఒప్పందాలను 'వైట్‌లిస్ట్స్'గా పిలుస్తారని.. వినియోగదారుల స్నేహితులకు సంబంధించిన అదనపు సమాచారం పొందేందుకు వీటి ద్వారా సంస్థలకు వీలు కలుగుతుందని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రచురించింది. "వినియోగదారుల మధ్య బంధాన్ని 'ఫ్రెండ్ లింక్' అనే కొలమానంతో ఫేస్‌బుక్ లెక్కగడుతుంది. వారి స్నేహితుల ఫోన్‌నెంబర్లతోపాటు ఈ ఫ్రెండ్‌లింక్‌ల సమాచారం కొన్ని సంస్థలకు చేరుతోంది" అని ఇందులో పేర్కొంది. అయితే 2015లో వినియోగదారుల స్నేహితుల సమాచారం డెవెలపర్లు పొందే వీలులేకుండా చేశామని.. ఆ తర్వాత స్వల్ప సంఖ్యలో భాగస్వాములకు మాత్రమే కొన్ని వారాలు, నెలలపాటు వెసులుబాటు కల్పించామని ఫేస్‌బుక్ పేర్కొంది.

భారత్-చైనా

సంబంధాలపై నూతన ప్రణాళిక

- మోదీ, జిన్‌పింగ్‌ల చర్చలు

చింగ్‌డావ్: భారత్-చైనాల మధ్య సంబంధాలు బలోపేతం చేసేందుకు నూతన ప్రణాళికను రూపొందించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లు శనివారం ఇక్కడ సమావేశమయి సంబంధాలు మెరుగుపరచుకోవడంపై చర్చలు జరిపారు. షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ) సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన వారిరువురు విరామ సమయంలో ప్రత్యేకంగా 50 నిమిషాల పాటు సమావేశమయ్యారు. ఆరు వారాల క్రితం చైనాలోని వుహాన్ నగరంలో జరిగిన అనధికారిక భేటీ అనంతరం మళ్లీ సమావేశం కావడం విశేషం. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఈ చర్చలతో రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతమవుతాయని పేర్కొన్నారు. వుహాన్‌లో తాము జరిపిన చర్చలను రెండు దేశాలతో పాటు, అంతర్జాతీయ సమాజం స్వాగతించిందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. వుహాన్‌లో ఏప్రిల్ 27-28 తేదీల్లో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చలు జరిపారు. డోక్లాం తరహా వివాదాలు తలెత్తకుండా ఉండడం కోసం సమాచార వ్యవస్థను మెరుగుపరచుకోవాలంటూ రెండు దేశాల సైన్యాలకు 'వ్యూహాత్మక మార్గదర్శనం' చేయాలని నిర్ణయించారు.

చింగ్‌డావ్‌లో ద్వైపాక్షిక సమావేశంలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

రెండు ఒప్పందాలు: బ్రహ్మపుత్ర నదీ జలాల సమాచారం ఇవ్వడానికి చైనా అంగీకరించింది. చైనాకు బాస్మతియేతర బియ్యం ఎగుమతి చేయడంపై అవగాహన ఒప్పందం కుదిరింది. బ్రహ్మపుత్ర నదికి వచ్చే వరదల సమాచారాన్ని చైనా అందించాల్సి ఉండగా, కొంతకాలంగా దాన్ని నిలిపివేసింది. దేశంలో వరదలపై హెచ్చరికలు జారీ చేయడానికి వీలుగా సమాచారం ఇవ్వడానికి అంగీకరించింది. భారత దేశ ఔషధాలు, నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి కూడా అంగీకరించింది.

జిన్‌పింగ్ నోట బాహుబలి: చైనాలో భారతీయ సినిమాలకు ఆదరణ పెరుగుతోందని జిన్‌పింగ్ అన్నారు. ఈ సందర్భంగా బాహుబలి, దంగల్, హిందీ సినిమాల పేర్లను ప్రస్తావించారు.

వచ్చే ఏడాది భారత్‌లో అనధికారిక సమావేశం: ఇరువురు నేతల మధ్య భారత్‌లో అనధికారిక సమావేశం జరగనుందని విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే తెలిపారు. ఈ మేరకు మోదీ ఆహ్వానించగా, జిన్‌పింగ్ అంగీకరించారని తెలిపారు.

సెక్రటరీ జనరల్‌తో భేటీ: తొలుత మోదీ ఎస్‌సీవో సెక్రటరీ జనరల్ రషీద్ అలిమోవ్‌తో సమావేశయ్యారు. ఈ కూటమిని బలోపేతం చేయడంపై చర్చించారు. బీజింగ్‌లోని ఎస్‌సీఓ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 16న ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తామని ఈ సందర్భంగా అలిమోవ్ తెలిపారు. ఈ కూటమిలో శాశ్వత సభ్యత్వం వచ్చిన దగ్గర నుంచి భారత్ విశేషంగా సేవలు అందిస్తోందని ఆయన ప్రశంసించారు. ఈ సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ తోనూ మోదీ భేటీ అయ్యారు.

నీతి ఆయోగ్ సమావేశం 17కి వాయిదా

ఈనాడు, దిల్లీ: నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం ఒక రోజు వాయిదా పడింది. తొలుత ఈనెల 16 నిర్వహించడానికి నిర్ణయించగా.. రంజాన్ కారణంగా తాను హాజరు కావడం లేదంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలపడంతో 17వ తేదీకి వాయిదా వేశారు. దిల్లీలో జరిగే ఈ సమావేశానికి కేసీఆర్, చంద్రబాబు సహా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులూ హాజరయ్యే అవకాశం ఉంది. మొత్తం 6 అంశాలపై చర్చించనున్నారు. తొలి అంశంగా వ్యవసాయ రంగం ఉంటుంది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు, వాననీటి సంరక్షణకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడం తదితర కీలకాంశాలపై చర్చిస్తారు. తర్వాత వైద్యరంగంపై జరిగే చర్చలో ప్రధానమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టాలనుకుంటున్న ఆయుష్మాన్ భారత్ గురించి సమాలోచనలు చేస్తారు.

33 మంది ప్రవాస భారతీయులకు ఎలిజబెత్ జన్మదిన పురస్కారాలు

లండన్: బ్రిటన్‌లోని 33 మంది ప్రవాస భారతీయులకు మహారాణి ఎలిజబెత్-2 జన్మదిన పురస్కారాలు లభించాయి. వారిలో రాజకుటుంబ వైద్యుడు సత్యజిత్ భట్టాచార్య ఉన్నారు. ఆయనకు లెఫ్టినెంట్ ఆఫ్ ద రాయల్ విక్టోరియన్ ఆర్డర్ (వీఎల్‌ఓ) పురస్కారం లభించింది. మాంచెస్టర్‌కు చెందిన మానసిక వైద్యుడు జస్వేందర్ సింగ్ బామ్రాకు కమాండర్ ఆఫ్ ద మోస్ట్ ఎక్సెలెంట్ ఆర్డర్ ఆఫ్ ద బ్రిటిష్ అంపైర్ (సీబీఈ) అవార్డు ప్రకటించారు. మిగిలిన వారికి ఇతర శ్రేణుల్లోని బహుమతులు లభించాయి.

అఫ్గాన్ భద్రతా సిబ్బందిపై ఉగ్రదాడులు

- వేర్వేరుచోట్ల 19 మంది పోలీసులు, 17 మంది సైనికులు మృతి
- ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది తాలిబన్లు హతం

కాబుల్, కుందుజ్: అఫ్గానిస్థాన్‌లో భద్రతాసిబ్బందే లక్ష్యంగా తాలిబన్లు ఉగ్రదాడులకు పాల్పడ్డారు. శనివారం వేకువజామున కుందుజ్ ఉత్తరప్రావిన్స్‌లో పోలీసులపై దాడి చేశారు. 19 మందిని చంపేశారు. మరో ఐదుగుర్ని గాయపరిచారు. పోలీసుల ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది తాలిబన్లు హతమయ్యారు. శుక్రవారంఅర్ధరాత్రి సైతం హెరాత్ ప్రావిన్స్‌లో సైనికదళాలపై దాడి చేశారు. 17 మందిని పొట్టనపెట్టుకున్నారు. మరొకరు గాయపడ్డారు. కాల్పుల విరమణ ప్రకటించడానికి రెండు గంటల ముందు తాలిబన్లు కుందుజ్‌లో దాడికి పాల్పడటం శోచనీయం.

కాల్పుల విరమణ ప్రకటించిన తాలిబన్లు: పవిత్ర రంజాన్‌మాసం ముగింపును పురస్కరించుకుని ఈదుల్ ఫితర్ మొదటి మూడురోజులు కాల్పుల విరమణ పాటించనున్నట్లు తాలిబన్లు శనివారం ప్రకటించారు. అఫ్గాన్ భద్రతాదళాలతో మాత్రమే ఇది అమలులో ఉంటుందని, విదేశీ ఆక్రమణదారులతో మాత్రం పోరాటానికి విరామంలేదని స్పష్టం చేశారు.

ప్రసంగాలు ఆపకపోతే చంపేస్తామని బెదిరింపులు

- పోలీసులకు జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్ ఫిర్యాదు

దిల్లీ: తనను చంపేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ)-దిల్లీ విద్యార్థి నేత ఉమర్ ఖలీద్ శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. తనకు రక్షణ కల్పించాలని విన్నవించారు. ప్రసంగాలు చేయడం ఆపకపోతే గుజరాత్‌కు చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే జిగ్నేష్‌తోపాటు తనను చంపేస్తానని.. పరారీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ రవి పుజారీ బెదిరింపు ఫోన్‌కాల్స్ చేశారని ఖలీద్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాంగ్రెస్ లేని 'ఫ్రంట్' అసాధ్యం: జేడీఎస్

దిల్లీ: కాంగ్రెస్ లేకుండా భాజపాకు ప్రత్యామ్నాయ కూటమి(ఫ్రంట్) సాధ్యం కాదని జేడీఎస్ సెక్రటరీ జనరల్ దానిష్ అలీ అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల తర్వాతే ప్రతిపక్ష కూటమి ప్రధాని ఎవరన్న విషయమై నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇందుకు - గతంలో వీపీ సింగ్, హెచ్‌డీ దేవెగౌడ, మన్మోహన్‌సింగ్‌ల ఎంపికను ఉదహరించారు. దిల్లీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలో జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన ఆయన వివిధ అంశాలను వెల్లడించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ కూటమి కర్ణాటకలో 25కు పైగా సీట్లను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అసోంలో పిల్లల్ని ఎత్తుకెళ్లేవారని అనుమానించి.. ఇద్దర్ని కొట్టిచంపారు

దిఫూ: పిల్లల్ని ఎత్తుకెళ్లేవారిగా అనుమానించి ఇద్దరు వ్యక్తులను జనం దారుణంగా కొట్టిచంపిన ఘటన అసోంలో కలకలం సృష్టించింది. ముంబయిలో సౌండ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నీలోత్పల్ దాస్(29).. ప్రకృతిసిద్ధ ధ్వనులను రికార్డు చేసేందుకుగాను కార్బీ ఆంగలాంగ్ జిల్లాలోని విహార కేంద్రం 'కాంగ్‌థిలాంగ్సో'కు తన స్నేహితుడు-వ్యాపారవేత్త అభిజీత్ నాథ్(30)తో కలిసి శుక్రవారం రాత్రి వెళ్లారు. తిరుగుప్రయాణంలో పంజూరీ వద్ద వారిని కొంతమంది గ్రామస్థులు ఆపారు. పిల్లల్ని అపహరించుకుపోయే దుండగులుగా దాస్, అభిజీత్‌లను అనుమానించారు. కారు నుంచి బయటకు లాగి వారిపై దాడి చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను ఆస్పత్రికి తరలించగా.. మార్గమధ్యంలోనే ఇద్దరూ కన్నుమూశారు. దాడికి సంబంధించి ఇప్పటివరకు ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

దిల్లీలో ఎదురుకాల్పులు; నలుగురు నేరస్తులు హతం

- 8 మంది పోలీసులకూ గాయాలు

దిల్లీ: దక్షిణ దిల్లీలోని ఛాతర్‌పూర్ ప్రాంతంలో శనివారం చోటు చేసుకున్న భారీ ఎదురుకాల్పుల్లో నలుగురు కరడుగట్టిన నేరగాళ్లను పోలీసులు హతమార్చారు. అయిదో వ్యక్తి గాయపడ్డాడు. ఈ క్రమంలో గాయపడ్డ 8 మంది పోలీసులలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రాజేష్‌భారతి అనే గ్యాంగ్‌స్టర్, అతని సహచరుల కదలికలపై దిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం గత కొంతకాలంగా దృష్టి కేంద్రీకరించింది. శనివారం ఉదయం మూడు కార్లలో వచ్చిన ముఠాను గుర్తించి, లొంగిపోవాల్సిందిగా హెచ్చరించారు. నేరగాళ్లు ఏమాత్రం పట్టించుకోకుండా తమపైకి కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసు వర్గాలు తెలిపాయి.

'ప్రధాని హత్యకు కుట్ర'ను రాజకీయం చేయొద్దు: కాంగ్రెస్

దిల్లీ: ప్రధాని మోదీని హత్య చేసేందుకు మావోయిస్టులు కుట్ర పన్నినట్లు వార్తలొచ్చిన నేపథ్యంలో.. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ శనివారం డిమాండ్ చేసింది. దీన్ని 'రాజకీయం' చేయడం లేదన్న విషయం తేలాలని పేర్కొంది. ప్రధానికి హాని ఉన్నట్లు బయటకొచ్చిన అంశం.. అది ఉత్తిదే అయినా.. చివరకు వదంతే అయినా తీవ్రంగానే పరిగణించాలని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా విలేకరులతో పేర్కొన్నారు. భారత ప్రధానికి ముప్పు అంశాన్ని చవకబారు రాజకీయాలకు వాడుకోరాదన్నారు.

13న రాహుల్ ఇఫ్తార్ విందు

దిల్లీ: రెండేళ్ల విరామం తర్వాత ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ.. దిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్‌లో బుధవారం ఈ విందును ఇవ్వనున్నారు. కాంగ్రెస్‌లోని చాలా మంది నాయకులు దీనికి హాజరవుతారని సమాచారం. చివరగా 2015లో కాంగ్రెస్ ఇఫ్తార్‌ను నిర్వహించింది.

పాక్ సార్వత్రిక ఎన్నికల్లో 200 మంది సయీద్ మద్దతుదారులు పోటీ

లాహోర్: పాకిస్థాన్‌లో త్వరలో జరుగబోతున్న సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో... ముంబయి దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్ మద్దతుదారులు 200 మందికిపైగా పోటీచేయబోతున్నారు. అయితే సయీద్ మాత్రం బరిలోకి దిగడంలేదు. అల్లా-హు అక్బర్ తెహ్రీక్ (ఏఏటీ) పార్టీ తరపున ఈ 200 మందినీ జేయూడీ బరిలోకి దింపుతోంది. దీనిపై ఎంఎంఎల్, ఏఏటీ, జేయూడీల మధ్య ఇప్పటికే అంగీకారం కుదిరింది.

బరిలోకి ముషారఫ్! పాక్ మాజీ ప్రధాని, సైనిక పాలకుడు పర్వేజ్ ముషారఫ్ ఈ సారి ఎన్నికల్లో పోటీచేసే అవకాశముంది. ఆయనకు సుప్రీం కోర్టు షరతులతో కూడిన అనుమతి జారీచేయడంతో పోటీకి మార్గం సుగమమైనట్లు ఆయన పార్టీ ఆల్ పాకిస్థాన్ ముస్లిం లీగ్ (ఏపీఎంఎల్) తెలిపింది.

సర్దు'బాట'కొస్తే.. కమలంతో దోస్తీ!

- మాకు 152.. మీకు 136
- మహారాష్ట్రలో శివసేన వ్యూహరచన

ముంబయి: మహారాష్ట్ర తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాతో పొత్తు దిశగానే శివసేన అడుగులేస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే సీట్ల సర్దుబాటులో తమదే పైచేయిగా ఉండేలా పట్టుబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం 288 స్థానాలకు గాను ఆ పార్టీ 152 కోరుతోంది. మిగతా 136 భాజపాకు వదిలేయడంతో పాటు.. ఉద్ధవ్‌ఠాక్రే కలలను సాకారం చేసేలా పార్టీకి ముఖ్యమంత్రి పీఠం దక్కాలని వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో 2014 మాదిరి సర్దుబాటుతోనే ముందుకెళ్లడానికి అభ్యంతరాలేమీ ఉండకపోవచ్చని అంచనా. ఈమేరకు కొద్ది రోజుల క్రితం భాజపా అధ్యక్షుడు అమిత్ షాతో భేటీ సందర్భంగా ఉద్ధవ్ ఠాక్రే '152 స్థానాల' ప్రతిపాదన పెట్టినట్లు శివసేన నేత ఒకరు తెలిపారు. దీనిపై చర్చించేందుకు త్వరలోనే కలుద్దామని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. ఒకవేళ లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీచేసి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోరుకు వెళితే తాము నష్టపోతామన్న భావన శివసేన వర్గాల్లో వ్యక్తమవుతోంది. "అదే జరిగితే పెద్ద పొరపాటు అవుతుంది. భాజపా కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే.. మహారాష్ట్రలో ప్రజల దృష్టి చాలామేర అటువైపే పడుతుంది. అప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటి పోరుకు వెళితే ఇబ్బందులు పడతాం.." శివసేన నేత వ్యాఖ్యానించారు. అయితే తమ పార్టీ 130 కంటే ఎక్కువ స్థానాలను శివసేనకు ఇచ్చేందుకు సుముఖంగా ఉండకపోవచ్చని భాజపా వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు శివసేనతో చర్చలు విఫలమైతే ఒంటిపోరుకు సిద్ధం కావాలంటూ తమ పార్టీ నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలను అమిత్‌షా సిద్ధం చేస్తున్నారు. 2014 అక్టోబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలూ వేర్వేరుగానే తలపడ్డాయి. 282 చోట్ల పోటీకి దిగిన శివసేనకు 62 స్థానాలు దక్కగా.. 260 స్థానాల్లో తలపడిన భాజపాకు 122 సీట్లు వచ్చాయి. అప్పట్లో ఎన్‌సీపీ భాజపాతో చేతులు కలిపేందుకు సుముఖంగా ఉండటంతో అంతకుముందే శివసేన దేవేంద్ర ఫడణవిస్ ప్రభుత్వంలో కలిసింది. అంతకుముందు జరిగిన 2014 లోక్‌సభ ఎన్నికల్లో 48 స్థానాలకు గాను సీట్ల సర్దుబాటుతో భాజపా 26, శివసేన 22 చోట్ల బరిలోకి దిగాయి. అయితే 1995 నాటి పరిస్థితులు ఇప్పుడు లేవని.. అప్పట్లో శివసేనకు ఎక్కువ ప్రజాదరణ ఉండేదని భాజపా నేత ఒకరు పేర్కొన్నారు. సీట్ల సర్దుబాటు అనేది ప్రస్తుతం పార్టీల బలానికి తగ్గట్లుగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

ప్రణబ్‌కే అవకాశాలు..: శివసేన

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు తగిన ఆధిక్యం రాకపోతే ప్రధాని పదవిని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి కట్టబెట్టే విషయంలో ఏకాభిప్రాయం కుదరవచ్చని శివసేన అభిప్రాయపడింది. ఈమేరకు శనివారం తన పార్టీ పత్రిక సామ్నాలో సంపాదకీయం రాసింది. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఆర్‌ఎస్‌ఎస్ ప్రణబ్‌ను ఆహ్వానించినట్లు పేర్కొంది. తమ దివంగత నేత బాల్ ఠాక్రేను ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నడూ ఆహ్వానించలేదని.. ఇఫ్తార్ విందులతో ముస్లింలను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించింది. ప్రణబ్ పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్‌ను విమర్శిస్తూ.. అది పేలని టపాసు లాగా కనిపిస్తోందని ఎద్దేవా చేసింది. నెహ్రూ భావజాలాన్ని మది నిండా నింపుకొన్న ప్రణబ్‌ను ఆర్‌ఎస్‌ఎస్ ఆహ్వానించడం పట్ల శివసేన ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

ఆర్జేడీలో ముసలం!

- లాలూ కుమారుల మధ్య ఆధిపత్య పోరు
- తమ్ముడు తేజస్వీకి ప్రాధాన్యం ఇవ్వడంపై అన్న కినుక

పట్నా: ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంలో ముసలం పుట్టింది! తమ్ముడు తేజస్వీ యాదవ్ పార్టీలో క్రియాశీలకంగా మారుతుండటం; తండ్రి వారసత్వాన్ని ఆయనే అందిపుచ్చుకుంటాడన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటంతో... లాలూ పెద్దకుమారుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఆయన శనివారం తన తమ్ముడితో చర్చించారు. బయటి వ్యక్తులు ఇద్దరి మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారనీ, పార్టీ కార్యకలాపాల నుంచి తనను తప్పించేందుకు కుట్ర జరుగుతోందంటూ తేజస్వీతో ఆయన అన్నట్లు సమాచారం. అనంతరం ఓ వార్తా సంస్థతో తేజ్ ప్రతాప్ మాట్లాడుతూ- "మేమిద్దరం రాజకీయాల్లోనే ఉన్నాం. కానీ, ఆర్జేడీలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు విచారం కలిగిస్తున్నాయి. కొన్ని సంఘ విద్రోహశక్తులు పార్టీలోకి ప్రవేశించి, ఆర్జేడీని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొందరు భ్రష్టులను తేజస్వీ పార్టీలోకి తీసుకున్నాడు. ఇప్పుడు వారు మా ఇద్దరి మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అయినా... నా తమ్ముడిపై నాకు చాలా ప్రేమ ఉంది" అని అన్నారు. అయితే... తాను ఫోన్ చేస్తే తన కాల్స్‌ను తేజస్వీ స్వీకరించడంలేదని ఆయన పేర్కొనడం గమనార్హం. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉంటున్న తేజస్వీ- ఇటీవలి ఉపఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి వ్యూహరచన చేసి తన రాజకీయ ప్రతిభను చాటుకున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా కుమారస్వామి ప్రమాణ స్వీకారానికి హాజరైనప్పుడూ ఎంతో హుందాగా వ్యవహరించారు. అక్కడ సోనియాగాంధీ, మమతాబెనర్జీ, మాయావతి, రాహుల్‌గాంధీ తదితర జాతీయ స్థాయి నేతలతో సన్నిహితంగా మెలిగారు. తండ్రి లాలూ రాజకీయ వారసత్వాన్ని తేజస్వీ అందిపుచ్చుకుంటాడన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పార్టీలో తనకు ప్రాధాన్యం తగ్గుతోందంటూ తేజ్ ప్రతాప్ నొచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. బిహార్‌లో అతిపెద్ద పార్టీగా ఉన్న ఆర్జేడీలో అన్న'దమ్ము'ల మధ్య పోరు... 2019 ఎన్నికల్లో భాజపా, జేడీ(యూ)లకు అవకాశంగా మారవచ్చన్న అభిప్రాయాలు రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నాయి!

అజిత్‌జోగికి ఆమడ దూరం

- భాజపా, కాంగ్రెస్ నిర్ణయం

దిల్లీ: ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో అటు కాంగ్రెస్... ఇటు భాజపా కూడా అజిత్‌జోగి పార్టీ 'జనతా కాంగ్రెస్'కు దూరంగా ఉండబోతున్నాయి. ఇందుకు రకరకాల కారణాలున్నప్పటికీ దూరంగా ఉండాలన్న విషయాన్ని మాత్రం ఉభయ పార్టీల నాయకులూ విస్పష్టంగా ప్రకటించారు. ఇదిలా ఉంటే... అజిత్‌జోగి జనతా కాంగ్రెస్ ఇప్పటికే ఛత్తీస్‌గఢ్‌లోని 30 స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించేసింది. జనతాకాంగ్రెస్ కనుక విడిగా ఎన్నికల బరిలోకి దిగితే... అది కాంగ్రెస్ పార్టీ ఓట్లను చీల్చేయడం ఖాయమంటూ భాజపా లెక్కలేసుకుంటోంది. ఇక, అజిత్‌జోగితో దోస్తీ కంటే.... బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ), గోండ్వానా గణతంత్ర పార్టీ(జీజీపీ)లతో పొత్తు పెట్టుకుంటేనే శ్రేయస్కరమన్న యోచనలో కాంగ్రెస్ ఉంది. ఆ పార్టీ నాయకులే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ వ్యూహకర్తగా ఉన్న వినోద్ వర్మ విశ్లేషణ ప్రకారం.... అజిత్‌జోగి తమ పార్టీ ఓట్లను బాగా మింగేయడం ఖాయమైనప్పటికీ. ...అదే స్థాయిలో భాజపాను కూడా దెబ్బతీయగలరని వర్మ అంటున్నారు. భాజపా విశ్లేషణ ప్రకారం జోగి కేవలం కాంగ్రెస్ ఓట్లను మింగేయగలరనీ.... దాంతో, తమ పార్టీ గెలుపు మార్జిన్ బాగానే పెరుగుతుందని భాజపా ప్రతినిధి సచ్చిదానంద్ ఉపాసనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అఖిలేష్‌యాదవ్ ఇటీవల ఖాళీ చేసిన ప్రభుత్వభవనం ప్రాంగణంలో విధ్వంసం

అఖిలేష్ అసంతృప్తి బట్టబయలైంది

- ప్రభుత్వ భవనం విధ్వంసంపై భాజపా విమర్శ

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఇటీవల ఖాళీ చేసిన ప్రభుత్వభవనం విధ్వంసంపై భాజపా, ఎస్పీ పరస్పరం ఆరోపణలకు దిగాయి. ఖాళీ చేస్తూ ఇంటిని ధ్వంసం చేయడాన్ని బట్టి అఖిలేష్‌కు ఎంత అసంతృప్తి ఉందో బట్టబయలైందని భాజపా విమర్శించింది. ఖాళీ చేసిన మిగతా ముఖ్యమంత్రుల నివాసాల చిత్రాలు, వీడియోలను చూపించకుండా ఒక్క అఖిలేష్‌కు సంబంధించిన ఇంటివే చూపించడం ఏమిటని ఎస్పీ ఎదురు ప్రశ్నించింది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన వరుస ఉప ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించడంతో అఖిలేష్ పేరుప్రతిష్ఠలు మార్మోగిపోతున్నాయని ఎస్పీ ప్రతినిధి సునీల్‌సింగ్ పేర్కొన్నారు.

'అగ్ర'రాజ్య సూపర్ కంప్యూటర్

- అత్యంత శక్తిమంతమైన "సమిట్"ను ఆవిష్కరించిన అమెరికా

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ కంప్యూటర్‌ను అగ్రరాజ్యం అమెరికా ఆవిష్కరించింది. దీనికి "సమిట్"గా నామకరణం చేసింది. చైనాకు చెందిన "సన్‌వే తైహులైట్" రికార్డులను దీని సాయంతో బద్దలుకొట్టింది. సెకనుకు 93,000 ట్రిలియన్ల (ఒక ట్రిలియన్ అంటే లక్ష కోట్లు) గణనలు తైహులైట్ చేయగలదు. దీనికి రెట్టింపు వేగంతో పనిచేసేలా సమిట్‌ను అమెరికా అభివృద్ధిచేసింది. సెకనుకు రెండు లక్షల ట్రిలియన్ల గణనలు చేసేలా దీన్ని తీర్చిదిద్దింది. ఓక్‌రిడ్జ్ నేషనల్ ల్యాబ్‌లో ఏర్పాటుచేశారు.

విశేషాలివీ..: ఓ సాధారణ కంప్యూటర్ 30ఏళ్లు కష్టపడి చేసే గణనను సమిట్ ఓ గంటలోనే పూర్తిచేయగలదు.

★ 4608 సర్వర్లు, 9000 '22-కోర్ ఐబీఎం పవర్9 ప్రాసెసర్లు", 27,000 ఎన్‌విడియా టెస్లా వి100 జీపీయూల సాయంతో సమిట్ పనిచేస్తుంది. రెండు టెన్నిస్ కోర్టులకు సమానమైన స్థలంలో దీన్ని ఏర్పాటుచేశారు.

★ దీని వేడి చల్లారాలంటే నిమిషానికి 4,000 గ్యాలన్ల నీరు అవసరం. ఇది నడవాలంటే 8,100 ఇళ్లకు అవసరమయ్యేటంత విద్యుత్ కావాల్సిందే.

★ కృత్రిమ మేధస్సు ఆపరేషన్లు; ఆరోగ్యం, భౌతిక శాస్త్ర విభాగాల్లో పరిశోధనల కోసం దీన్ని తీర్చిదిద్దారు.

★ "సెకనుకు బిలియన్ బిలియన్ల (ఒక బిలియన్ అంటే వంద కోట్లు) గణనలుచేసే కంప్యూటర్ వ్యవస్థ" కలను అమెరికా సాకారంచేసుకునే దిశగా పడిన మొదటి అడుగుగా సమిట్‌ను అభివర్ణిస్తున్నారు.

పది లక్షల మంది విద్యార్థులకు పౌష్టికాహారం

- 'అక్షయపాత్ర'తో జెన్‌పాక్ట్ ఒప్పందం

కోల్‌కతా: సర్కారు బడుల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రముఖ అంతర్జాతీయ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' ముందుకొచ్చింది. ఇందుకోసం... 12 రాష్ట్రాల్లోని 14,173 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేస్తున్న సామాజిక సేవా సంస్థ 'అక్షయపాత్ర'తో చేయికలిపింది. దేశవ్యాప్తంగా పది లక్షలమంది విద్యార్థులకు సమతుల ఆహారం అందించనున్నట్లు జెన్‌పాక్ట్ ప్రతినిధి ఒకరు శనివారం వెల్లడించారు. దిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, కోల్‌కతా, జైపూర్ నగరాల్లో పనిచేస్తున్న సుమారు 2 వేల మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులు దీనిపై దృష్టి సారించారు.

రెండేళ్ల పసికందుపై 12 ఏళ్ల బాలుడి హత్యాచారం!

- సెల్‌ఫోన్‌లో అశ్లీల దృశ్యాలను చూసి దుశ్చర్య
- నేరం అంగీకరించిన నిందితుడు

నోయిడా: సెల్‌ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూడ్డానికి అలవాటుపడ్డ 12 ఏళ్ల బాలుడు... రెండేళ్ల పసికందుపై అత్యాచారానికి యత్నించాడు! ఏడుస్తోందని భయపడి, ఆ చిన్నారిని గొంతు నులిమి చంపేశాడు!! ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడా శివారు గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. బిస్రాఖ్ ఠాణా అధికారి అఖిలేష్ త్రిపాఠి శనివారమిక్కడ వివరాలను వెల్లడించారు. "నిందిత బాలుడు బుధవారం తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న రెండేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లాడు. తర్వాత గ్రామంలో జన సంచారంలేని ఓ ఆలయ పరిసరాల్లో ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. దీంతో చిన్నారి బిగ్గరగా ఏడవటం ప్రారంభించింది. ఆ అరుపులకు గ్రామస్థులు ఎవరైనా వస్తారని భయపడ్డ సదరు బాలుడు... కట్టెతో బాలికను కొట్టి, ఆపై గొంతు నులిమి చంపేశాడు. తమ కుమార్తె కనిపించట్లేదని చిన్నారి తల్లిదండ్రులు ఫిర్యాదు ఇవ్వడంతో దర్యాప్తు ప్రారంభించాం. ఘటనా స్థలంలో మృతదేహం లభించడంతో పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాం. దీంతో అసలు విషయం తెలిసింది. నిందితుడిని విచారించగా, అతడు జరిగిందంతా చెప్పి నేరం అంగీకరించాడు. చిన్నారిని పరీక్షించిన వైద్యులు కూడా ఆమెపై అత్యాచారయత్నం జరిగినట్లు ధ్రువీకరించారు. హత్యానేరం కింద నిందితుడిని బాల నేరస్థుల పరివర్తన గృహానికి పంపాం" అని త్రిపాఠి వివరించారు. తమ కుమారుడు సెల్‌ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూడ్డానికి బాగా అలవాటుపడ్డాడనీ, ఇంతపని చేస్తాడని అనుకోలేదని పెయింటరుగా పనిచేస్తున్న నిందితుడి తండ్రి తెలిపారు.

ఆ ఏనుగు పేరు లాడెన్.. రెండేళ్ల వ్యవధిలో 37 మంది హతం!

గువాహటి: మేఘాలయలోని గరోహిల్స్ నుంచి అసోంలోని గోల్‌పారకు తరలి వచ్చేసే క్రమంలో 'లాడెన్' అనే ఏనుగు ఏకంగా 37 మందిని చంపేసి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. 2016 నుంచి తన మార్గమధ్యంలో ఉన్న గ్రామాలు, చిన్నచిన్న జనావాసాలపై ఈ ఏనుగు చేసిన దాడులకే వీరంతా మరణించారు. అసలు అనూహ్య రీతిలో.... అతిభారీ కాయంతో చూడగానే భయం కలిగించేలా ఉండటంతో ఎవరైనా సరే ఒక్కడుగు వెనక్కి వేసేస్తారని అటవీ సంరక్షణ అధికారి ఒకరు వెల్లడించారు. తాజాగా ఈ నెల ఒకటో తేదీన అర్ధరాత్రి దాటిన తర్వాత 3.30 గంటల ప్రాంతంలో దిగువ అసోంలోని పట్‌పారా పహర్టోలీ గ్రామంలోని ఓ గిరిజనుడి ఇంటిపై 'లాడెన్' దాడికి తెగబడింది. వెలుపలికి వచ్చి ప్రతిఘటించబోయిన ఇంటియజమాని హాజోంగ్‌ను నిర్దాక్షిణ్యంగా తొక్కి చంపేసింది. అరుపులు, కేకలు విని తాము వచ్చి చూసేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని హాజోంగ్ సమీప బంధువు ఒకరు వెల్లడించారు. పొద్దు వాలిన తర్వాతే 'లాడెన్' దాడులకు తెగబడుతుందని తెలిపారు. ఇలా విచ్చలవిడిగా దాడులకు దిగుతున్న 'లాడెన్'ను వేటగాళ్లు కాల్చి చంపేలా ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా తాము అటవీశాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు ఓ అధికారి వెల్లడించారు.

లీటరు పెట్రోల్‌పై 40 పైసలు ధర తగ్గింపు

- డీజిల్‌పై 30 పైసలు

దిల్లీ: ఇంధన ధరలు మరోసారి తగ్గాయి. శనివారం లీటరు పెట్రోల్‌పై 40 నుంచి 42 పైసల మేర ధరను తగ్గిస్తూ చమురుసంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఇటు డీజిల్‌పైనా లీటర్‌పై 30 నుంచి 32 పైసలు దాకా తగ్గించాయి. ఇంధన ధరలు తగ్గడం వరుసగా ఇది 11వ రోజు. శనివారం లీటర్ పెట్రోల్ ధర దిల్లీలో రూ. 77.02గా, ముంబయిలో 84.84గా, కోల్‌కతాలో రూ. 79.68గా, చెన్నైలో రూ. 79.95గా ఉంది. ఇటు లీటర్ డీజిల్ ధర దిల్లీలో రూ. 68.28గా, కోల్‌కతాలో రూ. 70.83గా, ముంబయిలో రూ. 72.7గా, చెన్నైలో రూ. 72.08గా ఉంది.

పెట్రో ఉత్పత్తులు జీఎస్టీ పరిధిలోకి తెచ్చే యోచన లేదు: భాజపా

సిమ్లా: పెట్రో ఉత్పత్తులను వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న వార్తలను భాజపా జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఖండించారు. శనివారం ఇక్కడ జరిగిన భాజపా ఐటీ విభాగం సమావేశంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. పెట్రో ధరలను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే యోచన లేదని, అయితే వాటి ధరలను అదుపు చేయడానికి దీర్ఘకాలిక వ్యూహాన్ని అనుసరించనున్నట్లు చెప్పారు.

అమెరికా నావికాదళ సమాచారాన్ని తస్కరించిన చైనా ప్రభుత్వ హ్యాకర్లు

వాషింగ్టన్: అమెరికా నావికాదళానికి చెందిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని చైనా ప్రభుత్వ హ్యాకర్లు తస్కరించారు. జలాంతర్గామి నుంచి ప్రయోగించే నూతన తరహా సూపర్‌సోనిక్ నౌక విధ్వంసక క్షిపణి అభివృద్ధికి సంబంధించిన రహస్య ప్రణాళికలూ ఇందులో ఉన్నాయి. నావికాదళ గుత్తేదారు (కాంట్రాక్టర్) కంప్యూటర్ల నుంచి ఈ సమాచారం చోరీకి గురైనట్లు అమెరికా పత్రికలు కథనాలు ప్రచురించాయి. గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో మొత్తం 614 గిగాబైట్ల సమాచారాన్ని చైనా హ్యాకర్లు దోచుకున్నట్లు పేర్కొన్నాయి.

యువతి దారుణ హత్య!

- లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసిన నాలుగు రోజులకే..

బాందా: తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ పోలీసులను ఆశ్రయించిన నాలుగు రోజులకే... దారుణ హత్యకు గురైందో యువతి! ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాందా జిల్లా ఎస్పీ శనివారం ఈ వివరాలను వెల్లడించారు. మహోబా ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల యువతి... నర్సింగ్ విద్యను అభ్యసించేందుకని నెల కిందటే బాందాలోని నోయినా మహల్ ప్రాంతానికి వచ్చి, అద్దె ఇంట్లో దిగింది. స్థానికులైన నలుగురు కామాంధులు ఆమెను లైంగికంగా వేధించడం ప్రారంభించారు. ఇది తాళలేక సదరు యువతి బాల్హండి నాకా పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు ఇచ్చి వారం కూడా కాకముందే.. . శుక్రవారం రాత్రి ఆమె హత్యకు గురైంది. శనివారం తెల్లవారుజామున ఇంటి ద్వారం వద్ద ఆమె రక్తపుమడుగులో ఉండటాన్ని పొరుగువారు గమనించి, వెంటనే పోలీసులకు అప్రమత్తం చేశారు. దుండగులు ఆమెను తుపాకీతో కాల్చి చంపినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. నిందితుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

STATE & RAILWAY
సబ్ - ఇన్‌స్పెక్టర్స్ (SI's)
Exclusive SI's Batch (TM) on : 14th JUNE @ 10 AM
ప్రతిరోజూ On-line Exams మరియు Explanation
విజయసాధన స్టడీ సర్కిల్ 2/7 బ్రాడీపేట, గుంటూరు.
VICTORY INVITES YOU
☎: 2240433, 92931 77737

MBBS
Admission Guidance
Management Seats
With Low Package Available for
NEET
Qualified / Not Qualified
Students in India / Abroad
Contact : 90302 47474

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

JEE ADVANCED 2018 లో
అన్ని కేటగిరీలలో
10 లోపు 15 ఆలిండియా ర్యాంకులు
నారాయణ విద్యాసంస్థలు - ఇండియా

ఈనాడు

JEE ADVANCED 2018 లో
అన్ని కేటగిరీలలో
100 లోపు 96 ఆలిండియా ర్యాంకులు
నారాయణ విద్యాసంస్థలు - ఇండియా

విజయవాడ 11-6-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 302

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ప్రతిష్టాత్మకమైన N-120 & CO-SPARK ప్రోగ్రామ్‌ల ద్వారా
అన్ని కేటగిరీల్లో 100లోపు ఆల్‌ఇండియా ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులు

11 G V SRIVARDHAN H.T.No.6096129
11 S PRETHAM ROSHAN H.T.No.6039110
12 PANKAJ H.T.No.2065176
13 U REVANTH KUMAR H.T.No.6093114
14 A V PHANI VAMSINATH H.T.No.6126172
15 BASAVARAJU J H.T.No.6090133

జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ గ్రూప్ డైరెక్టర్స్ శరణి నారాయణ, డా॥ సింధూర నారాయణ

15 ABHINAV GOUD B H.T.No.6102134
16 PUSHPA RAJ I H.T.No.5003134

17 TEKURI SAI AKHIL H.T.No.6032230
18 TELU BARGAV SAI H.T.No.6033271
18 L NAGEESH NAIK H.T.No.6030237
20 VETI PAVAN SAI H.T.No.6038168
21 R SAI PHANINDRA H.T.No.6104194
21 NEELADRI DAS H.T.No.5030046
22 B.CHETANSAI H.T.No.6109079
22 K ARUN SHETTY H.T.No.6037121
23 R MANJUNATH H.T.No.6034240

23 SIRIPURAM RAHUL H.T.No.6107010
24 HRITHIK VIKAS S H.T.No.6115134
26 M ANMOL REDDY H.T.No.6118135
26 DORNA VINEETH H.T.No.6104110
27 RAAGHAV RAAJ K H.T.No.7013192
27 VINEETHA VENNELA H.T.No.5008029
28 K SIDDARDHA H.T.No.6030494
29 G R DATHATHREYA H.T.No.6030348
31 G SAI ABHISHEK H.T.No.6096138

32 D SANJAY BHARGAV H.T.No.6090177
32 D. RAJ MEENA H.T.No.2067131
35 AYUSH GARG H.T.No.2020072
35 JANJANAM ROHITH H.T.No.6119163
36 SAHIL SOOD H.T.No.7022040
36 A KUMAR GUPTA H.T.No.4050986
37 S SUMANTH BALAJI H.T.No.6109137
38 M SHAIK WAJID H.T.No.6119138
38 V DAAVAN TEJA NAIK H.T.No.6036092

39 ANUDEEP SADARLA H.T.No.5006136
40 P NAYAN AKARSH H.T.No.6097111
40 SHARIQUE SHAMIM H.T.No.4065029
41 G SAI KOUSHIK H.T.No.6093138
42 GUGULOTH VARUN H.T.No.6091120
43 UTSAV DEEP H.T.No.6094165
44 B SOWMYA H.T.No.6100019
45 AZMEERA GIRIDHAR H.T.No.6108137
47 HIMA VAMSI KUMAR P H.T.No.6020163

47 K SURESH ANIKETH H.T.No.6128140
48 SHANMUKH H.T.No.6103209
48 NIMAY GUPTA H.T.No.5010083
49 SURAJ KRISHNA H.T.No.6034220
54 YAGNESWAR H.T.No.6033135
55 PULI V S S E RAHUL H.T.No.6110112
57 GATTU MYTRAYA H.T.No.6125138
59 LOHIT B H.T.No.6108082
60 AAYUSH AGARWAL H.T.No.5026162

63 R. SAIKUMAR H.T.No.6110164
64 G SHYAM SUNDAR H.T.No.6039243
65 RAHUL M H.T.No.6105097
65 S ANANDA RAMARAO H.T.No.6119133
67 B ANAND NAYAK H.T.No.6101105
67 A SRIVATSA KRISHNAN H.T.No.6077183
68 LOKESWAR REDDY H.T.No.6031102
70 G V B KARTHIK H.T.No.5004208
70 A DAYAL SANTOSH H.T.No.5003314

73 B S B SOUMITH H.T.No.5002303
75 SUNIL KUMAR C H.T.No.6009125
76 PRASHASTH RAMESH.B H.T.No.6109123
78 AAYUSH KADAM H.T.No.4001134
79 M L SAI VARDHAN H.T.No.6031102
81 CHANDRUDU K H.T.No.6111080
81 P JASWANTH RAM H.T.No.6094158
84 TARUN VINJAMURU H.T.No.6113140
87 M SAI YASHWANTH H.T.No.6039253

89 G NITISH SAMANTH H.T.No.6033150
90 CHIKKULA LOKESH H.T.No.6128207
91 S S VARA PRAKASH H.T.No.5003272
93 P RAHUL TEJA H.T.No.6032100
94 V PRADEEP REDDY H.T.No.6034100
94 BHUKYA SIDDHU H.T.No.6126118
96 KEERTHI VARSITH K H.T.No.6110136
97 SANYAM AHUJA H.T.No.2017145
98 C KHAGENDRA SAI H.T.No.6107177
98 D SHRIEEVIWEK H.T.No.6126109

SUCCESS GROWTH OF NARAYANA IS BETTER THAN OTHER INSTITUTIONS, ALL CATS.,

RANKS RANGE	NARAYANA 2017-RANKS	NARAYANA 2018-RANKS	GROWTH %
< 10	8	15	88%
< 100	23	96	313%
< 1000	136	356	161%
< 5000	464	764	65%

పై ర్యాంకులన్నీ నారాయణలోని అన్ని ప్రోగ్రామ్స్ నుంచి కలిపి సాధించినవి.

JEE-ADV. 2018 లో మొత్తం సెలక్షన్స్ 1522

All Cat.

and many more...

లాంగ్‌టర్మ్ కోచింగ్ క్లాసులు ప్రారంభం 18-06-2018

Hyd Madhapur : 9912346469/3364/8179880171
Hyd Dilsukhnagar : 9912343515/3247
Vijayawada : 9912344832/2254
Visakhapatnam : 7337300867/8179880705
Nellore : 8179880613

బాలబాలికలకు వేరువేరుగా హాస్టల్ వసతికలదు.

నారాయణ విద్యాసంస్థలు

THE NARAYANA GROUP

www.narayanagroup.com

ఈనాడు

విజయవాడ 11-6-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 302

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

JEE-ADVANCEDలో శ్రీచైతన్య ఫలితాలను చూసి భారతదేశం గర్విస్తోంది!

విజయవాడ జోన్‌లోనూ శ్రీచైతన్య విద్యార్థులదే ఆధిపత్యం

టాప్ 10 లోపు ఆలిండియా ఆల్ కేటగిరీ ర్యాంకులు

All India 1 Rank — PRANAV GOYAL, H.T. No. 7022035

All-India 2 Rank — G NITISH SAMANTH, H.T. No. 6033150 *

All-India 5 Rank — MALOTH MAHEER, H.T. No. 6107163 •

All-India 6 Rank — S SUMANTH BALAJI, H.T. No. 6109137 *

All-India 7 Rank — CHODIPALLI HEMANTH, H.T. No. 5009144

All-India 9 Rank — M L SAI VARDHAN, H.T. No. 6031102 •

* OBC • ST • SC

JEE-ADVANCED ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1000 లోపు శ్రీచైతన్య ర్యాంకులు

102, 108, 129, 132, 136, 139, 140, 149, 153, 162, 186, 187, 194, 207, 208, 209, 214, 218, 222, 226, 229, 233, 242, 244, 249, 252, 256, 267, 270, 272, 313, 314, 319, 333, 380, 393, 403, 412, 419, 433, 441, 442, 444, 445, 449, 451, 454, 456, 464, 465, 471, 475, 480, 497, 503, 507, 511, 524, 525, 532, 553, 559, 560, 562, 584, 601, 602, 621, 655, 667, 678, 692, 708, 714, 721, 732, 740, 746, 758, 766, 769, 772, 777, 786, 789, 793, 802, 813, 825, 827, 828, 831, 839, 841, 847, 853, 854, 857, 892, 905, 919, 926, 938, 958

SUCCESS CELEBRATIONS

జేఈఈ-అడ్వాన్స్‌డ్ 2018లో ఆలిండియా టాప్ ర్యాంకులు సాధించిన తమ విద్యార్థులతో విజయానందాన్ని పంచుకుంటున్న శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డా॥ బి.ఎస్. రావు మరియు అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ

అప్లికేషను అందిన సమాచారం ప్రకారం పై ర్యాంకులను ప్రకటిస్తున్నాము

విద్యార్థుల మనోభావాలు

మోస్ట్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్...
శ్రీచైతన్య అందించే టెస్ట్ పేపర్స్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ నాకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఇంతటి అత్యుత్తమ ర్యాంక్ సాధించడానికి కారణం. థ్యాంక్స్ టు శ్రీచైతన్య.
-JEE-ADVANCED ఆలిండియా ర్యాంకర్, బి. మురళీ కృష్ణ

ఎప్పటికప్పుడు లోపాలు సరిదిద్దారు...
సబ్జెక్ట్‌లో వచ్చే డౌట్స్‌ని ఎప్పటికప్పుడు క్లారిఫై చేస్తూ వ్యక్తిగత శ్రద్ధతో మా లోపాలను సవరించి అత్యుత్తమ శిక్షణను అందించిన శ్రీచైతన్యకు నేనెంతగానో ఋణపడి ఉంటాను.
-JEE-ADVANCED ఆలిండియా ర్యాంకర్, బి. యశ్వేశ్

కాంప్రమైజ్ కాదు..
శ్రీచైతన్య దేనిలోనూ కాంప్రమైజ్ కాదు. మెటీరియల్స్, ఫ్యాకల్టీ, ప్రోగ్రామ్స్ అన్నీ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటాయి. అందుకే ఒక్క శ్రీచైతన్య నుండే ఇంతమంది టాప్ ర్యాంకర్లవుతున్నారు.
-JEE-ADVANCED ఆలిండియా ర్యాంకర్, లోకేశ్వర్ రెడ్డి

అనుకూల వాతావరణం
విద్యార్థులకు అనుకూలమైన వాతావరణంలో శిక్షణను అందించడం వల్ల ఎటువంటి ఒత్తిడి లేకుండా ఇంతటి టాప్ ర్యాంకును ఎంతో సులభంగా సాధించగలిగాను. శ్రీచైతన్యకు నా ధన్యవాదాలు.
-JEE-ADVANCED ఆలిండియా ర్యాంకర్, జశ్వంత్ సాయి

థ్యాంక్స్ టు శ్రీచైతన్య
నేను ర్యాంకర్‌గా నిలవడానికి శ్రీచైతన్య ప్రోగ్రామే కారణం. ఈ ర్యాంక్ సాధించడానికి నేను పడిన కష్టంకంటే శ్రీచైతన్య ఫ్యాకల్టీ అందించిన సపోర్టే ఎక్కువ. థ్యాంక్యూ శ్రీచైతన్య.
-JEE-ADVANCED ఆలిండియా ర్యాంకర్, నితీశ్ సుమంత్

ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాప్ ర్యాంక్ సాధించిన తమ బిడ్డతో ఆనందాన్ని పంచుకుంటున్న కుటుంబసభ్యులు

తల్లిదండ్రుల మనోభావాలు

మా వాడికి ఇంత మంచి ర్యాంక్ రావడానికి కారణం శ్రీచైతన్యయే. డెడికేషన్‌తో శిక్షణనందించి మంచి ఫలితాలు సాధించడం అందరికీ సాధ్యం కాదు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం ఒక్క శ్రీచైతన్య వల్లే అవుతుంది.
-JEE-ADVANCED ఆలిండియా ర్యాంకర్, నితీశ్ సుమంత్ తల్లిదండ్రులు

దశాబ్దాలనుండి ఇంజనీరింగ్, మెడికల్‌కు తిరుగులేని వేదిక శ్రీచైతన్యయే. మరో ఆలోచన లేకుండా మా అబ్బాయిని శ్రీచైతన్యలోనే చేర్పించాం. అందుకు ఈరోజు మా ఫ్యామిలీ అంతా చాలా సంతోషంతో ఉన్నాం. శ్రీచైతన్యకు కృతజ్ఞతలు.
-JEE-ADVANCED ఆలిండియా ర్యాంకర్, లోకేశ్వర్ రెడ్డి తల్లిదండ్రులు

LONG-TERM 2019 — 100% వరకు మెరిట్ స్కాలర్‌షిప్ అవకాశం*

JEE-MAIN ర్యాంక్ (AIR)	ఫీజు రాయితీ	JEE-ADVANCED ర్యాంక్ (AIR)	ఫీజు రాయితీ	AP/TS EAMCET State ర్యాంక్	ఫీజు రాయితీ
10వేల లోపు	100%	15వేల లోపు	100%	15వేల లోపు	90%
10001-15000	75%	15001-20000	75%	15001-20000	70%
15001-20000	60%	20001-25000	60%	20001-25000	60%
21001-30000	50%	25001-30000	50%	30000-40000	50%
30001-50000	25%	30వేల పైన	25%	40వేల పైన	15%

శ్రీచైతన్యలో చదివిన విద్యార్థులకు రూ. 10,000/- అదనపు ఫీజు రాయితీ

SC/ST/PH JEE-Main / Advanced లో అర్హత పొందిన విద్యార్థులకు 50% ఫీజు రాయితీ

*Conditions Apply

- ఏ విద్యార్థి అయినా JEE-Main, Advanced రెండింటిలో అర్హత సాధించినట్లయితే ఎక్కువ ఫీజు రాయితీ అవకాశాన్ని పరిగణించబడును.
- ఫ్రీ సీట్‌కు అర్హత పొందిన హాస్టల్ విద్యార్థులకు 25వేలు, డే-స్కాలర్స్ విద్యార్థులకు 10 వేలు నాన్ రిఫండబుల్ కాషన్ డిపాజిట్ తప్పనిసరి.

అడ్మిషన్లు జరుగుచున్నవి | **క్లాసులు ప్రారంభం: 20-06-2018**

Hyderabad (Rayadurgam & Kondapur) : 9177214167 (Boys), 9177046533 (Girls)
Nallakunta DD Colony : 9177557685, 9177549043
Dilsukhnagar : 9177207575,
Vijayawada : 9704065666 / 9177611538,
Vizag : 9177204719 / 9177536875

శ్రీచైతన్య IIT అకాడమి
www.srichaitanya.net

ఈనాడు

విజయవాడ 11-6-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 302 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 5-00 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

మావూరి శివకృష్ణ మనోహర్‌కు (5వ ర్యాంకు) మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

హేమంత్‌కుమార్ 7వ ర్యాంకు

తెలుగు బిడ్డల 'జేఈఈ'కేతనం

- మొదటి 10 ర్యాంకర్లలో ఇద్దరు ఏపీ విద్యార్థులు
- తొలి వందలో 25 వరకు మనవాళ్లే
- హరియాణా విద్యార్థి ప్రణవ్ గోయల్‌కు మొదటి ర్యాంకు
- అమ్మాయిల్లో రాజస్థాన్ బాలిక మీనల్ పారెఖ్‌కు అగ్రస్థానం

చండీగఢ్‌లో తమ కుటుంబసభ్యులతో ఆనందాన్ని పంచుకుంటున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ మొదటి ర్యాంకర్ ప్రణవ్ గోయల్

ఈనాడు - హైదరాబాద్

ప్రతిష్ఠాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల్లో తెలుగు విద్యార్థులు జయకేతనం ఎగరవేశారు. ఈసారి మొదటి 10 ర్యాంకుల్లో ఇద్దరు తెలుగు విద్యార్థులు. ఇద్దరూ ఏపీకి చెందిన వారే. అంతే కాదు.. వారిద్దరూ వేర్వేరు ప్రాంతాల్లో చదువుకున్నా సొంత జిల్లా మాత్రం విశాఖపట్నం కావడం విశేషం. గత సంవత్సరం తెలుగు రాష్ట్రాల్లో అగ్ర ర్యాంకు 17తో మొదలైంది. ఈసారి అది 5వ ర్యాంకుతో ప్రారంభమైంది. మొత్తం 360కి 317 మార్కులతో మావూరి శివ రామకృష్ణ మనోహర్ 5వ స్థానంలో నిలవగా 316 మార్కులతో కేవీఆర్ హేమంత్‌కుమార్ 7వ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలను ఐఐటీ కాన్పూర్ ఆదివారం ఉదయం విడుదల చేసింది. ఇక తెలంగాణకు చెందిన జాటోతు శివ తరుణ్ ఎస్టీ విభాగంలో ప్రథమ ర్యాంకు (మిగతా 2లో)

అసాధ్యం సుసాధ్యమైంది

- కీలకమైన 'పోలవరం' డయాఫ్రమ్‌వాల్ పూర్తి
- అందివచ్చిన ఆధునిక సాంకేతికత
- 412 రోజులు.. 1396.60 మీటర్ల పొడవునా నిర్మాణం
- నేడు పైలాన్ ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

పోలవరం - న్యూస్‌టుడే

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం పూర్తైంది. అసాధ్యం అనుకున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు చిత్తశుద్ధితో కృషి చేసి సుసాధ్యం చేశారు. మొత్తం రెండు సీజన్లలో దీన్ని పూర్తిచేయగలిగారు. 2017 ఫిబ్రవరి 1న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి 412 రోజులు బాగా శ్రమించి రూ.430 కోట్లతో ఈ పనిని పూర్తి చేశారు. సోమవారం ముఖ్యమంత్రి ప్రాజెక్టు హిల్‌వ్యూ కొండపై ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. గోదావరి నది గర్భంలో నిర్మించే డయాఫ్రమ్‌వాల్ ఇంటి నిర్మాణానికి పునాది ఎలాగో ప్రాజెక్టుకు (మిగతా 2లో)

ఉభయగోదావరి జిల్లాల పరిధిలో ఉన్న గోదావరి గట్టును ఆనుకుని నిర్మించే డయాఫ్రమ్‌వాల్‌లో ఒక భాగం ఇది. నిర్మాణం పొడవు మొత్తం 1396.60 మీటర్లు. వెడల్పు 1.5 మీటర్లు (ఐదు అడుగుల మందం). నదీ గర్భం లోతు 40 మీటర్ల నుంచి 93.50 మీటర్లు ఉంటుంది. లోపల రాయి తగిలే వరకు వెళ్లడంతో సరిపెట్టలేదు. రాయి తగిలిన తరువాత అందులోనే మరో రెండు మీటర్ల దిగువకు వెళ్లి అక్కడ నుంచి కాంక్రీట్ వేసుకుంటూ వచ్చారు. పనిపూర్తవడంతో ఆదివారం యంత్ర సామగ్రిని తరలించే పని చేపట్టారు. మరోవైపు పోలవరంలో అన్ని విభాగాల్లో కలిపి ఆదివారం ఒక్కరోజు రికార్డు స్థాయిలో 8,500 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని జరిగింది.

అందరి కళ్లూ సింగపూర్‌పైనే

- చర్చల కోసం అరుదెంచిన ట్రంప్, కిమ్
- అణ్వాయుధ పోరుపై అగ్రనేతల భేటీ రేపే
- ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఆసక్తి
- వివిధ దేశాల నుంచి 3 వేల మంది విలేకరుల రాక

5లో

ధాన్యం రైతుల దైన్యం

- అలంకారప్రాయంగా మారిన కొనుగోలు కేంద్రాలు
- తూ.గో.జిల్లాలో కేజీ పేరుతో బస్తాకు రూ.వంద కోత
- దోచేస్తున్న వ్యాపారులు, దళారులు
- నెలైనా డబ్బులందక రైతులు విలవిల

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో ధాన్యం రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. పౌరసరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రా(పీపీసీలు)లు ఉత్సవవిగ్రహాలుగా మారిపోయినా పట్టించుకునే వారే లేకపోయారు. ఎప్పటిలాగే ఈ రబీలోనూ పేట్రేగిన మిల్లర్లు, వ్యాపారులు రైతులను దోచేస్తున్నారు. మద్దతు ధర అందక..అమ్ముకున్న ధాన్యానికి సంబంధించిన డబ్బు నెలైనా అందక రైతులు విలవిల్లాడుతున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కృష్ణా జిల్లాలోనూ పీపీసీల్లో మెజార్టీ కేంద్రాలు కమీషన్ల కోసమే ఏర్పాటయ్యాయనేది సుస్పష్టం. నెల్లూరులో ప్రభుత్వం కలుగజేసుకున్నా రైతుకు పూర్తిస్థాయిలో న్యాయం జరగకపోవడం గమనార్హం. పశ్చిమగోదావరి జిల్లాలో ఈనాడు ప్రతినిధి క్షేత్రస్థాయిలో పరిశీలించగా రైతులు ఇబ్బందులు, ధాన్యం (మిగతా 2లో)

జిల్లాల వారీగా ధాన్యం కొనుగోలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	కొనుగోలు చేసిన ధాన్యం
చిత్తూరు	23502
తూర్పుగోదావరి	1,76,324
గుంటూరు	68,760
కృష్ణా	1,98,910
ప్రకాశం	17,994
నెల్లూరు	1,50,194
శ్రీకాకుళం	1,118
విశాఖపట్నం	2,280
విజయనగరం	1,109
పశ్చిమగోదావరి	7,42,916

ఈ చిత్రంలో కనిపిస్తున్నది పశ్చిమగోదావరి జిల్లాలోని ఓ ధాన్యం కొనుగోలు కేంద్రం (పీపీసీ). ఇక్కడ రైతులు ధాన్యం తీసుకువస్తే తేమ శాతం పరిశీలించేందుకు తేమశాతం కొలిచే పరికరం(మాయిశ్చర్ మిషన్), తర్వాత బస్తాలను తూకం వేసేందుకు కాటా కానీ లేవు. అలాగే ఏ రోజుకు ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొన్నారు? తదితర వివరాలు ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కంప్యూటర్ ఉండాలి కానీ, ఇక్కడ అలాంటివేమీ కనిపించవు. కానీ, ఈ కేంద్రంలో ఇప్పటికే సుమారు 2,200మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేశారు.

బీఆర్ఐ ఆమోదానికి భారత్ నిరాకరణ

- సార్వభౌమత్వాన్ని గౌరవించాలి
- భారీ అనుసంధాన ప్రాజెక్టులపై ప్రధాని మోదీ స్పష్టీకరణ
- షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల్లో ఆర్థికాభివృద్ధి ఉండాలని ఆకాంక్ష

చింగ్‌డావ్‌లో షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సులో పాకిస్థాన్ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్‌తో భారత ప్రధాని మోదీ కరచాలనం. చిత్రంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

చింగ్‌డావ్: చైనా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ)పై భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో బీఆర్ఐను ఆమోదించడానికి భారత్ నిరాకరించింది. మిగిలిన ఏడు సభ్యదేశాలు ఈ ప్రాజెక్టుకు మద్దతు తెలిపాయి. అంతకుముందు ప్రధాని మోదీ ప్రసంగిస్తూ భారీ అనుసంధాన ప్రాజెక్టులు తప్పనిసరిగా ఆయా దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని స్పష్టం చేశారు. అందరినీ సమ్మిళితం చేసే కార్యక్రమాలకు భారత్ మద్దతు ఉంటుందని చెప్పారు. బీఆర్ఐని ప్రధాని పరోక్షంగా ప్రస్తావిస్తూ "పొరుగు దేశాలతో అనుసంధానానికి భారత్ ప్రాధాన్యమిస్తుంది. ఆయా దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక (మిగతా 2లో)

ఉద్యోగాలున్నా ప్రకటనలేవీ?

సీఎంఓ పరిశీలనలోనే దస్త్రం 3లో

మోదీపై సంఘటిత పోరు

- ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై సుప్రీం తీర్పు తగదు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- ప్రభుత్వాలవి దళిత వ్యతిరేక విధానాలు
- లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్
- ఉద్యమం వెంటే ఉంటామన్న లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత ఖర్గే
- దళిత, గిరిజన సింహ గర్జనకు తరలివచ్చిన జనం

11లో

ఆదివారం వరంగల్‌లో జరిగిన దళిత, గిరిజన సింహ గర్జన సభకు భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఫ్రెంచ్ ఓపెన్ మళ్లీ నాదల్‌దే

పదకొండోసారి కైవసం

వివరాలు ఛాంపియన్‌లో

ఇదీ సంగతి!

భారత్‌లో ప్రతి ఇంట్లో యురేనియం నిలువలు ఉన్నాయిసార్, ఏం చేద్దాం!

జనం వద్ద రెట్టింపైన నగదు

- పెద్దనోట్ల రద్దు నాటితో పోలిస్తే రెండింతలైన సొమ్ము
- రికార్డు స్థాయిలో రూ.18 లక్షల కోట్లకు చేరిన మొత్తం
- ఆర్‌బీఐ గణాంకాల్లో వెల్లడి

దిల్లీ: జనం చేతిలోని కరెన్సీ.. రికార్డు స్థాయిలో రూ.18.5 లక్షల కోట్లకు చేరుకుందని రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) గణాంకాలు తేల్చాయి. పెద్ద నోట్ల రద్దు అనంతరం కనిష్ఠ స్థాయి నమోదైన నాటితో పోలిస్తే ఇది రెట్టింపు కన్నా ఎక్కువ కావడం గమనార్హం. అలాగే ఆర్‌బీఐ చలామణీలోకి తెచ్చిన మొత్తం నగదు విలువ కూడా రెట్టింపు కన్నా ఎక్కువై, రూ.19.3 లక్షల కోట్లకు చేరింది. చలామణీలో ఉన్న మొత్తం నగదు నుంచి బ్యాంకుల్లోని సొమ్మును మినహాయిస్తే వచ్చే విలువను ప్రజల వద్ద ఉన్న నగదుగా పరిగణిస్తారు. ప్రజల వద్ద ప్రస్తుతం అధిక స్థాయి నగదు ఉండగా.. కొద్ది నెలల కిందట (మిగతా 2లో)

‘బీఆర్‌ఐ’కి భారత్ నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

సమగ్రతను గౌరవించే సుస్థిర అనుసంధాన ప్రాజెక్టులను మేము స్వాగతిస్తాం.” అని చెప్పారు. పాక్ ఆక్రమిత కశ్మీరులోంచి వెళ్లే చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా భాగంగా ఉన్న బీఆర్‌ఐ పట్ల భారత్‌కు అభ్యంతరాలున్న సంగతి తెలిసిందే. అనుసంధానత అంటే భౌతిక అనుసంధానత మాత్రమే కాదని, ప్రజల మధ్య అనుసంధానానికి, ఆలోచలను పంచుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని అన్నారు. ఎస్‌సీవో దేశాల్లో ఆర్థికాభివృద్ధిని, అనుసంధానత, ఐక్యతలను మోదీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ‘సెక్యూర్ (శీనిదిగీళిన్మి అనే సంగ్రహీకృత పదాన్ని పరిచయం చేశారు. ఎస్ అంటే సెక్యూరిటీ ఫర్ సిటిజన్స్- పౌరులకు భద్రత, ఈ అంటే ఎకనమిక్ డెవలప్‌మెంట్- ఆర్థికాభివృద్ధి, సీ అంటే కనెక్టివిటీ ఇన్ ది రీజియన్- ఈ ప్రాంతంలో అనుసంధానత, యూ అంటే యూనిటీ- ఐక్యత, ఆర్ అంటే రెస్పెక్ట్ ఆఫ్ సావర్నిటీ అండ్ ఇంటెగ్రిటీ- సార్వభౌమత్వం, సమగ్రతకు గౌరవం, ఈ అంటే ఎన్విరాన్ మెంట్ ప్రొటెక్షన్- పర్యావరణ పరిరక్షణ అని వివరించారు.

ఉగ్రవాద సమస్య తీవ్రంగా ఉన్న అఫ్గానిస్థాన్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొనడానికి ఆ దేశాధ్యక్షుడు అష్రాఫ్ ఘని సాహసోపేత చర్యలు తీసుకుంటున్నారని ప్రధాని తన ప్రసంగంలో ప్రశంసించారు. ఎస్‌సీఓలో భారత్, పాకిస్థాన్‌లకు శాశ్వత సభ్యత్వం లభించాక ఈ కూటమి సదస్సుకు భారత ప్రధాని హాజరు కావడం ఇదే తొలిసారి. ఎస్‌సీఓలో భారత్, పాకిస్థాన్ ప్రవేశం వల్ల ఈ కూటమి బలం పెరుగుతుందని చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ అన్నారు. సభ్య దేశాలన్నీ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా గట్టిగా ఖండిస్తున్నట్లు చింగ్‌డావ్ ప్రకటన పేర్కొంది.

ఆదివారం చింగ్‌డావ్‌లో షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సు వేదికపై ప్రధాని మోదీ, కిర్గిజ్‌స్థాన్, తజకిస్థాన్, రష్యా, చైనా, కజఖ్‌స్థాన్, ఉజ్బెకిస్థాన్, పాకిస్థాన్ అధ్యక్షులు.. జీన్‌బెకోవ్, ఇమామలి రెహ్మాన్, పుతిన్, జిన్‌పింగ్, నూర్‌సుల్తాన్ నజర్‌బయేవ్, షౌకత్ మిర్జియొయేవ్, మమ్నూన్ హుస్సేన్

ద్వైపాక్షిక చర్చలు

ఎస్‌సీఓ సదస్సు నేపథ్యంలో ప్రధాని మోదీ.. కజఖ్‌స్థాన్, కిర్గిజ్‌స్థాన్, మంగోలియా అధ్యక్షులతో వేర్వేరుగా ద్వైపాక్షి చర్చలు జరిపారు. కజక్‌స్థాన్‌తో సంబంధాలకు భారత్ ప్రాధాన్యమిస్తోంది. అంతర్జాతీయ సౌర కూటమిలో చేరాల్సిందిగా ఆ దేశాధ్యక్షుడు నూర్‌సుల్తాన్ నజర్‌బయేవ్‌ను ప్రధాని ఆహ్వానించారు. ఎస్‌సీఓ సదస్సు ముగిసిన అనంతరం ప్రధాని మోదీ రెండు రోజుల చైనా పర్యటనను ముగించుకుని భారత్‌కు చేరుకున్నారు.

భారత ప్రధాని, పాక్ అధ్యక్షుడి కరచాలనం

ఎస్‌సీఓ నేతలు విలేకర్ల సమావేశంలో పాల్గొన్న అనంతరం భారత ప్రధాని మోదీ, పాకిస్థాన్ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ పరస్పరం కరచాలనం చేసుకుని పలకరించుకున్నారు. జమ్ముకశ్మీరులోని ఉరీ సైనిక శిబిరంపై 2016లో పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు సన్నగిల్లిన నేపథ్యంలో రెండు దేశాల అగ్రనేతలు కరచాలనం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్‌సీఓ దేశాలకు చెందిన ఇతర నేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నా పాక్ అధ్యక్షుడితో మాత్రం ద్వైపాక్షిక సమావేశం నిర్వహించలేదు.

తెలుగు బిడ్డల ‘జేఈఈ’కేతనం

(మొదటి పేజీ తరువాయి)

పొందాడు. మొదటి 100 ర్యాంకుల్లో 23-25 మంది వరకు తెలుగు విద్యార్థులే ఉండటం విశేషం.

హరియాణా బాలుడు ప్రణవ్ గోయల్ మొదటి ర్యాంకు (ఓపెన్ కేటగిరీలో) సాధించాడు. పంచకుల నగరానికి చెందిన ఇతడికి 360కి 337 మార్కులు వచ్చాయి. బాలికల విభాగంలో రాజస్థాన్‌లోని కోటకు చెందిన మీనల్ పారెఖ్ 318 మార్కులతో మొదటి స్థానం సంపాదించింది. ఐఐటీల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 1,65,656 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే 20న జరిగిన పరీక్షకు 1,55,158 మంది హాజరయ్యారు. తాజా ఫలితాల్లో కటాఫ్ మార్కులను సాధించి మొత్తం 18,138 మంది అర్హత సాధించారు. వారు మాత్రమే ఈనెల 15 నుంచి జరిగే జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొని సీటు కోసం పోటీ పడొచ్చు. దేశంలోని 23 ఐఐటీల్లో 11,279 సీట్లు ఉండగా, ఒక్కో సీటుకు 1.6 మంది పోటీపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 28 వేల మంది పరీక్ష రాశారు. వారిలో దాదాపు 3 వేల మంది అర్హత సాధిస్తారని అంచనా వేస్తున్నారు.

అర్హులైన విద్యార్థులు

- మొత్తం అర్హులైన వారు: 18,138
- బాలురు: 16,062
- బాలికలు: 2,076

కేటగిరీ	అర్హులైన వారి సంఖ్య
జనరల్	8,794
ఓబీసీ	3,140
ఎస్‌సీ	4,709
ఎస్‌టీ	1,495

విభాగాల వారీగా అర్హులు వీరే..

విభాగం	పరీక్ష రాసింది	కౌన్సెలింగ్‌కు అర్హత
జనరల్	60,443	8,664
జనరల్ దివ్యాంగ	937	130
ఓబీసీ-ఎన్‌సీఎల్	57,549	3,092
ఓబీసీ దివ్యాంగులు	703	48
ఎస్‌సీ	24,642	4,700
ఎస్‌సీ దివ్యాంగ	123	9
ఎస్‌టీ	10,706	1,493
ఎస్‌టీ దివ్యాంగ	66	2
మొత్తం	1,55,158	18,138

(గమనిక: ఓసీఐ విభాగంలో 55 మంది, పీఐఓ కింద 9 మంది, విదేశీ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు)

జాతీయస్థాయిలో విభాగాల వారీగా ర్యాంకర్లు వీరే...

విభాగం	ర్యాంకు	పేరు	ఊరు
జనరల్	1	ప్రణవ్ గోయల్	పంచ్‌కుల (హరియాణా)
జనరల్	2	షహిల్ జైన్	కోట (రాజస్థాన్)
జనరల్	3	కైలాష్ గుప్తా	దిల్లీ
జనరల్ మహిళ	1	మీనల్ పారెఖ్	కోట (రాజస్థాన్)
ఓబీసీ-సీఆర్‌ఎల్	1	మావూరి శివరామకృష్ణ	విశాఖపట్నం (ఏపీ)
ఎస్‌సీ	1	ఆయుష్ కదమ్	ఉదయ్‌పూర్ (రాజస్థాన్)
ఎస్‌టీ	1	జాటోత్	శివతరుణ్ హైదరాబాద్ (తెలంగాణ)
ఓపెన్ దివ్యాంగ	1	మనస్ గోయల్	పటియాలా (పంజాబ్)
ఓబీసీ-ఎన్‌సీఎల్-దివ్యాంగ	1	విజేంద్ర కుమార్	జెహనాబాద్ (బిహార్)
ఎస్‌సీ దివ్యాంగ	1	రౌషన్ కుమార్	వైశాలి (బిహార్)

అర్హత మార్కులు 126

జనరల్ విభాగానికి అర్హత మార్కులు (కటాఫ్) 126గా ఐఐటీ కాన్పూర్ నిర్ణయించింది. ఆ కేటగిరీలో 126, ఆపైన వచ్చిన వారికి మాత్రమే ర్యాంకులు ఇచ్చారు. గత ఏడాది 366 మార్కులకు పరీక్ష నిర్వహించగా కటాఫ్ మార్కులు 128గా నిర్ణయించారు. అయితే అర్హత మార్కులు 35 శాతమేనని, ఆ ప్రకారమే ఈసారి 126గా నిర్ణయించారని ఐఐటీ నిపుణుడు ఎం.ఉమాశంకర్ తెలిపారు. కొన్ని విభాగాల అర్హత మార్కులు ఈ విధంగా ఉన్నాయి.

విభాగం	అర్హత మార్కులు
జనరల్	126
ఓబీసీ	114
ఎస్‌సీ	63
ఎస్‌టీ	63
జనరల్ దివ్యాంగ	63
ఓబీసీ దివ్యాంగ	63
ఎస్‌సీ దివ్యాంగ	63
ఎస్‌టీ దివ్యాంగ	63

అత్యధికం ఐఐటీ ఢిల్లీ జోన్ నుంచే

దేశంలో ఏడు ఐఐటీ జోన్లు ఉన్నాయి. అంటే ఒక్కో జోన్ పరిధిలో కొన్ని రాష్ట్రాలు ఉంటాయి. ఉదాహరణకు మద్రాస్ జోన్‌లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి ఉన్నాయి. ఏపీలోని విశాఖపట్టణం పరీక్ష కేంద్రం మాత్రం ఖరగ్‌పూర్ జోన్ పరిధిలోకి వస్తుంది. తాజా ఫలితాల్లో ఢిల్లీ జోన్ నుంచి ఎక్కువ మంది కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు.

జోన్	టాప్10	100 ర్యాంకులు	500 ర్యాంకులు	మొత్తం అర్హత పొందిన వారు
ఐఐటీ బాంబే	1	16	84	2,936
ఢిల్లీ	5	33	152	5,072
గువహటి	0	0	6	839
కాన్పూర్	0	1	30	2,160
ఖరగ్‌పూర్	1	5	32	1,736
మద్రాస్	1	31	129	3,595
రూర్కీ	2	14	67	1,800
మొత్తం	10	100	500	18,138

కేరళలో కుంభవృష్టి

13కు చేరిన మృతుల సంఖ్య

దిల్లీ: నైరుతి రుతుపవనాల ప్రభావంతో కేరళలో కుంభవృష్టి కురుస్తోంది. భారీవర్షాల కారణంగా నదులన్నీ పొంగిపొర్లుతున్నాయి. ఈదురుగాలుల ప్రభావానికి చెట్లు భారీసంఖ్యలో కూలుతున్నాయి. తిరువనంతపురం, పతనంతిట్ట, అలప్పూజ జిల్లాల్లో నదిలో కొట్టుకుపోయి, చెట్లు మీదపడి ఆదివారం నలుగురు చనిపోయారు.

శుక్రవారం, శనివారం వర్షాల కారణంగా మరో 9 మంది చనిపోవడంతో మృతుల సంఖ్య 13కు చేరింది. ఇడుక్కి, కోజికోడ్, కన్నూరు జిల్లాల్లో పంటలు నీట మునిగాయి. బెంగళూరులో జరగాల్సిన భారత్-అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు ప్రాక్టీసు సెషన్‌కు వర్షం అడ్డంకిగా మారింది. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో జూన్ 14న జరగాల్సిన మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. అక్కడక్కడా వర్షాలు పడటంతో రాజస్థాన్, పంజాబ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, దిల్లీల్లో వాతావరణం చల్లబడింది. ఉక్కబోత తగ్గి ఉష్ణోగ్రతలు తగ్గడంతో ప్రజలకు ఉపశమనం కలిగింది. ఛత్తీస్‌గఢ్, విదర్భ ప్రాంతం, మధ్యప్రదేశ్‌లో భారీవర్షాలు పడుతున్నాయి.

PAVAN KUMAR'S IAS
Our Ranks Civils, Groups
3 7
11 13
Admissions Open
Ph: 9966961027

అసాధ్యం సుసాధ్యమైంది

(మొదటి పేజీ తరువాయి)

డయాఫ్రమ్‌వాల్ అలాంటిది. దీనిపై మట్టి, రాయితో 150 అడుగుల ఎత్తున ఎర్త్‌కమ్ రాక్ ఫిల్‌డ్యామ్‌ను నిర్మిస్తారు. ఇందులో 194 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ఈ నీరు దిగువన 93 మీటర్ల లోతువరకూ లీక్ కాకుండా ఈ వాల్ అడ్డుకుంటుంది. అందువల్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఇది అత్యంత కీలకమైనది. దీని నిర్మాణంలో ప్లాస్టిక్ కాంక్రీట్ వాడడం మరో ముఖ్యాంశం. సిమెంటు, ఇసుక అందులో తక్కువ మోతాదులో కంకర వేసి బెంటోనైట్ మిశ్రమాన్ని కలపడాన్ని ప్లాస్టిక్ కాంక్రీట్‌గా వ్యవహరిస్తారు. ఇది కాంక్రీట్ లాగే పూర్తిస్థాయిలో గట్టి పడుతుంది. నదీ గర్భంలో జరిగే మార్పులకు తట్టుకుంటుంది. విపత్తులు వచ్చి నదీ గర్భంలో దీనిపై ఒత్తిడి పెరిగినా అందుకనుగుణంగా రూపాంతరం సంతరించుకునే అవకాశం ఉంది.

ఆధునిక సాంకేతికతతో... ఏళ్ళ తరబడి కలగా మిగిలిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాన అడ్డంకి గోదావరి నదిపై అడ్డుకట్ట నిర్మాణమే. సాంకేతికత అంతగా లేని ఆ రోజుల్లో ఏటా విరుచుకుపడే గోదారమ్మను నిలువరించడం సాధ్యమా అన్న ప్రశ్న ఆనాడు ఎదురైంది. నదీగర్భంలో రాయి తగిలేవరకు వెళ్ళి అక్కడ నుంచి కాంక్రీట్ వేసుకురావడం జరగని పని అనుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ఇది సుసాధ్యమైంది. ఇందుకోసం ఎల్ అండ్‌టీ బావర్ కంపెనీతో ట్రాన్స్‌స్ట్రాయ్ గుత్తేదారు ఒప్పందం కుదుర్చుకున్నారు. పశ్చిమజర్మనీ నుంచి ఆధునిక యంత్ర పరికరాలు గ్రాబర్‌లు, కట్టర్‌లు, భారీ క్రేన్‌లు తెప్పించారు. ఆ దేశానికి చెందిన నిపుణులే పోలవరంలో మకాం వేసి పనులు చేపట్టారు. నదీగర్భంలో తీసిన ప్రతి ప్యానల్ వివరాలు జర్మనీ కంపెనీతో అనుసంధానించి వారు అనుమతి ఇచ్చిన తరువాతే కాంక్రీట్ పనులు ప్రారంభించేవారు. ఇక ప్రతి ప్యానల్‌లో వేసిన కాంక్రీట్ నమూనాలు తీసి చెన్నైలోని ఎల్‌అండ్‌టీ ప్రయోగశాలకు పంపి పరీక్షలు చేయించారు. దీనంతటికీ కారణం భవిష్యత్తులో 194 టీఎంసీల నీరు ఇక్కడ నిల్వ చేసినప్పుడు ఆ నీరు నదీగర్భం నుంచి సీపేజ్ (లీకు) కాకూడదని, భూకంపాలను తట్టుకోవాలని, డయాఫ్రమ్‌వాల్‌పై నిర్మించే మట్టి, రాయి కట్టడానికి ఎటువంటి అవరోధాలు కలగకూడదని. భూకంపం వచ్చి సంకోచ, వ్యాకోచాలు చెందినా గోడ యథాస్థితికి మారుతుందని నిపుణులు పేర్కొన్నారు. మొత్తం 1.18 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను వినియోగించారు.

- 2017 ఫిబ్రవరి ఒకటిన పనులు ప్రారంభించి తొలుత జులై 24 వరకు పని చేశారు. గోదావరిలో నీరు పెరగడం, వాతావరణం సహకరించక పోవడంతో పనులు నిలిపివేసి యంత్రాలను ఒడ్డుకు ఎక్కించారు. వరదలు తగ్గిన తరువాత 2017 అక్టోబరు 9న ప్రారంభించి నవంబరు 15 వరకు పని చేశారు. అనివార్య కారణాల వలన పనులు నిలిచిపోవడంతో నవంబరు 20న తిరిగి ప్రారంభించి 2018 జూన్ తొమ్మిది నాటికి మిగిలిన పనుల్ని పూర్తి చేశారు.

తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు 16% మధ్యంతర భృతి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కార్మికులకు 16 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. జులై మొదటి తేదీ నుంచి వేతనంలో కలిసి వీటిని విడుదల చేయాలని ఆదేశించారు. సకల జనుల సమ్మె కాలం నాటి బకాయిలను నగదు రూపంలో రెండు మూడు రోజుల్లో విడుదల చేయాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న డ్రైవర్, కండక్టర్ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశాలిచ్చారు. అశక్తులైన డ్రైవర్లు, కండక్టర్ల వారసుల్లో అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, చిన్నచిన్న కారణాలకే జరిగిన సస్పెన్షన్లు, బదిలీలను కమిటీ వేసి సమీక్షించాలని సూచించారు. ఆర్టీసీని బలోపేతం చేసేందుకు నిపుణుల కమిటీని వేయాలని నిర్దేశించారు. మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, కేటీఆర్, మహేందర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ సత్యనారాయణ ఆదివారం రాత్రి నిర్ణయాలను ప్రకటించారు. సీఎం నిర్ణయాలు, మంచి ఫిట్‌మెంట్ ఇస్తారనే విశ్వాసంతో సమ్మె నోటీసును ఉపసంహరించుకుంటున్నట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అశ్వత్థామరెడ్డి ప్రకటించారు.

జనం వద్ద రెట్టింపైన నగదు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని వివిధ ప్రాంతాల్లో కరెన్సీకి తీవ్ర కొరత ఏర్పడిన సంగతి తెలిసిందే. అక్రమంగా నగదును పోగు చేసుకోవడం వల్ల ఆ కృత్రిమ కొరత తలెత్తి ఉంటుందన్న విశ్లేషణలు ఉన్నాయి. 2016 నవంబర్ 8న రూ.500, వెయ్యి నోట్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. నాడు చలామణీలో ఉన్న 86 శాతం సొమ్ము రద్దయింది. ఈ నోట్లను బ్యాంకుల్లో జమ చేయడానికి గడువు ఇచ్చింది. 2017 జూన్ 30 నాటికి.. రద్దయిన నోట్లలో 98.96 శాతం నోట్లు జమైనట్లు తేలింది. ఆర్‌బీఐ వద్ద ఉన్న తాజాగా ఉన్న నగదు సరఫరా డేటా ప్రకారం..

- మే 25 నాటికి ప్రజల వద్ద ఉన్న నగదు విలువ రూ.18.5 లక్షల కోట్లు. ఏడాది కిందటితో పోలిస్తే ఇది 31 శాతం అధికం. పెద్దనోట్ల రద్దు తర్వాత 2016 డిసెంబర్ 9న జనం చేతిలో ఉన్న సొమ్ము కనిష్ఠ స్థాయిలో రూ.7.8లక్షల కోట్లుగా నమోదైంది. నాటితో పోలిస్తే ప్రస్తుత విలువ రెట్టింపు కన్నా ఎక్కువ. నోట్ల రద్దుకు ముందు ప్రజల వద్ద దాదాపు రూ.17లక్షల కోట్లు ఉండేది.
- చలామణీలో ఉన్న మొత్తం సొమ్ము విషయానికొస్తే. . జూన్ 1 నాటికి ఈ సొమ్ము రూ.19.3 లక్షల కోట్లుగా ఉంది. ఏడాది కిందటితో పోలిస్తే ఇది 30 శాతం అధికం. పెద్ద నోట్ల రద్దు తర్వాత 2017 జనవరి 6న ‘చలామణీలో ఉన్న సొమ్ము’ కనిష్ఠంగా రూ.8.9 లక్షల కోట్లుగా నమోదైంది. నాటితో పోలిస్తే ఇది రెట్టింపు కన్నా ఎక్కువైంది. పెద్ద నోట్ల రద్దుకు ముందు నవంబర్ 5న ఈ సొమ్ము రూ.17.9 లక్షల కోట్లుగా ఉంది.
- మోదీ ప్రభుత్వం 2014 మే నెలలో అధికారంలోకి రావడానికి ముందు.. ప్రజల వద్ద ఉన్న సొమ్ము విలువ రూ.13 లక్షల కోట్లుగా ఉంది. ఏడాదిలో అది రూ.14.5 లక్షల కోట్లకు పెరిగింది. 2016 మే నాటికి రూ.16.7 లక్షల కోట్లకు చేరింది. అక్టోబర్‌కు అది రూ.17 లక్షల కోట్లకు పెరిగింది. ఆ తర్వాత పెద్ద నోట్ల రద్దుతో అది తగ్గిపోయింది. 2017ఫిబ్రవరికి అది రూ.10లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది సెప్టెంబర్‌కు రూ.15లక్షల కోట్లకు పెరిగింది.
- చలామణీలో ఉన్న మొత్తం నగదు విషయంలోనూ ఇదే పోకడ కనిపించింది.

మహిళా రక్షణ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు

దిల్లీ: మహిళల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ‘జాతీయ మహిళా రక్షణ మిషన్’ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వివిధ మంత్రిత్వ శాఖల భాగస్వామ్యంతో నిర్ణీత కాలవ్యవధిలో నిర్దిష్ట చర్యలు తీసుకోనున్నట్టు హోం శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ మిషన్ ద్వారా మహిళల భద్రతపై పిల్లల్లో అవగాహన కలిగేలా పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేయడం, మీడియాలో ప్రచారం చేయడం, ఆన్‌లైన్‌లో అశ్లీల చిత్రాలను నిరోధించడం వంటి కార్యక్రమాలు చేపడుతామని వివరించారు. నేరగాళ్ల వివరాలతో ఇప్పటికే ప్రత్యేకంగా సమాచార నిధిని ఏర్పాటు చేసింది.

ధాన్యం రైతు దైన్యం

(మొదటి పేజీ తరువాయి)

సేకరణలో మోసాలు కళ్లకు కట్టాయి. ధర లేక ధాన్యాన్ని అమ్ముకోలేక ధర ఏమైనా పెరుగుతుందేమోనన్న ఆశతో ధాన్యాన్ని నిల్వ చేసుకున్న రైతుల దీనపరిస్థితి కనిపించింది.

తూర్పుగోదావరి జిల్లాలో ధాన్యం రైతుల పరిస్థితి మరీ దైన్యంగా మారింది. 75కేజీల బస్తాకు షావుకార్లు, మిల్లర్లు, దళారులు రూ.వేయిలోపు మాత్రమే ధర చెల్లిస్తున్నారు. స్వర్ణ రకం ధాన్యంలో కేలి(తాలు గింజలు) ఎక్కువగా ఉంటున్నాయంటూ ధరను తగ్గించేస్తున్నారు. క్వింటాలో 12శాతం వరకు ఈ కేలిని అనుమతించాలని నిబంధన ఉన్నప్పటికీ వ్యాపారులు పట్టించుకోవట్లేదన్నది బహిరంగ రహస్యం.

తేమశాతంతో.. తేమశాతం పేరుతో దోపిడీ భారీగా కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం వరకు మాత్రమే తేమను అనుమతిస్తున్నారు. దీనికి మించి ఒక్క శాతం ఎక్కువవున్నా ఒక్కోశాతానికి రూ.16 చొప్పున రైతుకు చెల్లించే ధరలో మిల్లర్లు/దళారులు కోత పెడుతున్నారు. ధాన్యాన్ని పీపీసీల్లో కాకుండా మిల్లర్లు/వ్యాపారులే రైతుల నుంచి నేరుగా కొంటున్నందున వారు తేమశాతాన్ని గణించేందుకు వినియోగిస్తున్న విధానం అశాస్త్రీయంగా ఉండడమే కాకుండా..90శాతం పొలం వద్ద కాకుండా మిల్లుకు ధాన్యాన్ని తీసుకువెళ్లాక అక్కడ చూసి తేమ ఇంత ఉందంటూ వారు రైతులకు చెబుతున్నారు. దీంతో చేసేది లేక వారిచ్చినంత రైతులు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

కల్లాల వద్దే కొనుగోళ్లు ఎక్కడ?.. వరి రైతు కష్టాలను తీర్చేందుకు.. ధాన్యం సేకరణలో అక్రమాలను నియంత్రించేందుకు కల్లం వద్దే ధాన్యం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారులు గత రెండు సీజన్ల నుంచి చెబుతున్నా ఆచరణలోకి రాలేదు. పీపీసీ నిర్వాహకులు కల్లంవద్దకువచ్చి ఆ పొలంలో ఎంతధాన్యం పండింది? ఎంత ధాన్యం కొంటున్నారు? తేమ శాతం ఎంత ఉంది? ఏ మిల్లుకు తరలిస్తున్నారు? వంటి వివరాలతోపాటు ఓ పత్రాన్ని అక్కడికక్కడే సంబంధిత రైతుకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారే తప్ప అమల్లోకిరాలేదు. పైగా ఇందుకోసం ప్రత్యేకంగాసాంకేతిక పరికరాల(ట్యాబ్ లాంటి ఎలక్ట్రానిక్ డివైస్)ను సిద్ధం చేస్తున్నామంటున్నారే తప్ప అందుబాటులోకి రాలేదు. వచ్చే సీజన్‌కైనా వీటిని అందుబాటులోకి తీసుకువచ్చి ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపడతారా లేదా అనేది సందేహాస్పదమే.



- ఈ చిత్రంలోని రైతు పేరు కొల్లా పెద్దిరాజు. వీరవాసరం మండలం, బాలేపల్లి గ్రామస్థుడు. ఈయన 5 ఎకరాలు కౌలుకు తీసుకుని ధాన్యం పండించాడు. పండిన ధాన్యాన్ని వ్యాపారి ద్వారా మిల్లుకు తరలించాడు. అయితే నెలదాటినా డబ్బు అందకపోవడంతో ఏం జరిగిందని అధికారుల చుట్టూ తిరిగితే ఆ రైతు చేసిన పంట సర్వే నెంబరుపై అప్పటికే ధాన్యం అమ్మేసి డబ్బు కూడా తీసేసుకున్నట్లు వెబ్‌ల్యాండ్‌లో చూపుతోందని అధికారులు స్పష్టం చేశారు. ధాన్యమూ పోయింది. డబ్బూ రాలేదు ఈ రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

- వీరవాసరం మండలం, బాలేపల్లి గ్రామానికి చెందిన పడవల నాని అనే ఈ రైతు మూడెకరాల్లో పండించిన ధాన్యాన్ని అమ్మేశాడు. అందులో కొంతమొత్తం అందింది. ఇంకా సుమారు రూ.60వేల మేర రావాల్సి ఉంది. ఈ డబ్బు కోసం నెలన్నర నుంచి వీఆర్వో, మండలాధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా ఇప్పటికీ డబ్బు అందలేదని వాపోతున్నాడు.

తేమ పేరుతో ధరకు కోత

ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసే పద్ధతిని కచ్చితంగా అమల్జేయాలి. అంతేకాదు ఆ కేంద్రాలకు రైతులు నేరుగా వెళ్లి ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితులనూ కల్పించాలి. బయట మిల్లర్లకు ధాన్యం అమ్మితే తేమశాతం ఎక్కువుందంటూ ధర కోసేస్తున్నారు.

–పరసా గంగాధర్‌రావు, నరసాపురం గ్రామీణం

అప్పు మీద అప్పు

4ఎకరాల్లో కౌలు చేస్తున్నా. ధాన్యం పండించి అమ్మితే నెలనన్నరైనా ఇప్పటివరకూ డబ్బు అందలేదు. ఇంకో పంటకు సిద్ధమవుతున్నా నిన్నటి పంటకు చేసిన అప్పే తీర్చలేదు. కానీ, ఆగలేం కదా ఇప్పుడు కొత్తపంటకు అప్పు చేశాం..అప్పు మీద అప్పు మోపెడవుతోందే తప్ప మాకు మాత్రం న్యాయం జరగట్లేదు.

–పెద్దిరాజు, లక్ష్మణేశ్వరం

గ్రహం అనుగ్రహం

11-6-2018 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
ద్వాదశి: ఉ. 7-07 తదుపరి త్రయోదశి
భరణి నక్షత్రం: రా. 7-14 తదుపరి కృత్తిక
అమృత ఘడియలు: మ. 2-30 నుంచి 4-04 వరకు
వర్జ్యం: ఉ.శే. 6-37 వరకు
దుర్ముహూర్తం: మ. 12-25 నుంచి 1-17 వరకు తిరిగి 3-01 నుంచి 3-54 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6-30

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	38.8	26.7
విజయవాడ	38.1	28.2
నెల్లూరు	38.0	27.0
ఒంగోలు	37.1	29.7
సూర్యాపేట	37.0	27.0
విశాఖపట్నం	37.0	26.2
రాజమహేంద్రవరం	37.0	26.0
హన్మకొండ	37.0	26.0
గుంటూరు	36.5	28.4
హైదరాబాద్	36.5	24.3
నరసాపురం	36.2	28.4
శ్రీకాకుళం	36.0	28.0
కరీంనగర్	36.0	23.0
కడప	35.0	28.0
ఖమ్మం	35.0	28.0
నల్గొండ	34.6	24.4
రామగుండం	34.6	23.9
కర్నూలు	34.3	24.1
అనంతపురం	33.8	25.4
తాడేపల్లిగూడెం	33.0	27.5

ఉద్యోగాలున్నా ప్రకటనలేవీ?

- సీఎంవో పరిశీలనలోనే దస్త్రం
- అక్కరకు రాకుండా పోతున్న 42 ఏళ్ల వయోపరిమితి పెంపు
- ఆందోళనలో నిరుద్యోగులు

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో వేలాది ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. వాటిని భర్తీచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ..నిర్ణయం తీసుకోవడంలో నాన్చుడి వైఖరి అవలంబిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేష్‌కుమార్ ఖాళీల వివరాలను సిద్ధం చేయాలని స్వయంగా ఆదేశాలు జారీచేసి పక్షాలు గడిచిపోతున్నా పురోగతి మాత్రం కనిపించడంలేదు. 2016 డిసెంబరులో జారీచేసిన 30కుపైగా ఉద్యోగ ప్రకటనలు అనుసరించి నియామకాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దాదాపుగా పూర్తిచేసింది. ఈలోగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు 42 ఏళ్లకు వయోపరిమితిని గత ఏడాది డిసెంబరులో పెంచినా నియామకాల జాడ మాత్రం కనిపించడమేలేదు. ఉద్యోగ ప్రకటనలు వెలువడడంలో జాప్యం జరిగికొద్దీ వయోపరిమితిపరంగా అనేకమంది అనర్హులైపోతున్నారు. ఈ పరిణామాలు నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రాథమిక అంచనాల ప్రకారం గ్రూపు-1-125, గ్రూపు-2-775, గ్రూపు-3-190, గ్రూపు-4- 500, పోలీసు శాఖలో 10,000, వైద్య ఆరోగ్య శాఖలో 6,300, ఇతర శాఖల్లో 5,000 వరకు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు తెలియవచ్చింది. ఈ పోస్టులు ఇంకా పెరగొచ్చు. తగ్గొచ్చు. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి భర్తీచేయాల్సిన సంఖ్య ఖరారు అవుతుంది. ఇందుకు సంబంధించిన దస్త్రం ముఖ్యమంత్రి కార్యాలయ(సీఎంవో) పరిశీలనలోనే గత కొద్దిరోజుల నుంచి ఉన్నట్లు తెలియవచ్చింది. వీటిపై అధికారంగా నిర్ణయం తీసుకునేందుకు ఇంకొంత కాలం వేచిచూద్దామన్న ధోరణిలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసిందని ఉద్యోగ సంఘ నేత ఒకరు పేర్కొన్నారు.

ఎప్పటికప్పుడు భర్తీ చేస్తుంటే...!

ఆయా శాఖల అవసరాల ప్రతిపాదికగా ప్రత్యక్షంగా... పదోన్నతుల ద్వారా భర్తీచేయాల్సిన పోస్టుల భర్తీపై విధివిధానాలు స్పష్టంగా ఉన్నాయి. యూపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ మాదిరిగా ప్రతి ఏడాది ఉద్యోగ ప్రకటనలు జారీచేస్తూ వస్తే నిరుద్యోగులకు అనుకూలంగా ఉంటుంది. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీకి ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా స్పందిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగాల భర్తీ ప్రకటనల జారీ గురించి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోందని సంబంధిత వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఉద్యోగ ఖాళీల భర్తీకి ఏకకాలంలో ప్రకటనలు జారీచేస్తున్నందువల్ల కూడా ఒకే అభ్యర్థి రెండు, మూడు ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. దీనివల్ల ఒక ఉద్యోగంలో చేరి మిగిలిన వాటిని వదలేస్తున్నాడు. దీనివల్ల వాటిని మరోకరితో భర్తీ చేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం గ్రూపు-2, గ్రూపు-3 పోస్టుల విషయంలో ఇదే జరుగుతోంది. ఏపీపీఎస్సీ 'వార్షిక క్యాలెండర్' ద్వారా భర్తీ చేసేందుకు కిందటేడు తాత్కాలికంగా తేదీలను సైతం ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

మరోవంక..ఉపాధ్యాయ నియామకాలను కూడా చేపట్టాలని విద్యాశాఖ యోచిస్తోంది. దీనివల్ల స్వల వ్యవధిలోనే అన్ని రకాల ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రకటనలు వెలువడితే అభ్యర్థులు హైరానా పడతారని, నియామకాలను చేపట్టేందుకు అధికారులకు ఇబ్బందులు ఎదురవుతాయని సంబంధిత వర్గాలు సూచిస్తున్నాయి. ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటనలు రానందున నిరుద్యోగులు సన్నద్ధత విషయంలో అంచనాకు రాలేకపోతున్నారు.

★ పాలిటెక్నిక్ కళాశాలల్లో 272 అధ్యాపక పోస్టులు, 45 వరకు వ్యాయామ అధ్యాపకులు, వ్యవసాయ శాఖలో 115 అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులు, అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ ఉద్యోగాలు 29, టెక్నికల్ ఆఫీసర్ 71, టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలు 300, పశు సంవర్ధక శాఖలో 205 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, 420 సహాయకుల పోస్టులు, డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌లో 321 టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీర్, గ్రామీణ నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ విభాగంలో 221 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-3 పోస్టులు 149 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు చెందిన ఆర్డీఓ, డిప్యూటీ తహశీల్దార్ పోస్టుల ఖాళీలపై ఇంకా సమాచారం అందలేదు.

వివిధ శాఖలలో ఖాళీల వివరాలు ఈనాడు.నెట్‌లో

కడుపులో 80 శాతం ఆక్రమించిన కణితి

రాజస్థాన్ రైతుకు ప్రాణం పోసిన వైద్యులు

దిల్లీ: దాదాపు పది గంటలు శ్రమించిన వైద్యబృందం, సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి రాజస్థాన్ రైతుకు పునర్జన్మను ప్రసాదించింది. బికనేరుకు చెందిన వ్యక్తి కడుపులో 80 శాతం ఆక్రమించిన కణితిని అతికష్టంమీద తొలగించగలిగారు. రెండు అడుగుల పొడవునా పెరిగిపోవడంతో కడుపులోని పేగులను సైతం ఎడమవైపునకు నెట్టేసిందని సర్ గంగారాం ఆసుపత్రి ప్రధాన వైద్యుడు ఉషస్ధీర్ చెప్పారు. కణితి కారణంగా కాలేయం, రెండు మూత్రపిండాలు, పొత్తికడుపు, ప్లీహం నొక్కుకుపోయాయన్నారు. మూత్రపిండ సిరలు, బృహద్ధమనుల నుంచి ఎలాంటి రక్తం పోకుండా కణితిని తొలగించడానికి చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. కణితి ఇలా పెరిగిపోవడాన్ని 'లిపోసర్కోమా' అంటారని, ఇది కూడా ఒక రకమైన క్యాన్సర్ అని చెప్పారు.

యువతి ప్రాణాలు తీసిన చరవాణి ఆట

యువకుడు అదృశ్యం ● మరో ఇద్దరు ఆసుపత్రిపాలు

ప్రేగ్: స్మార్ట్‌ఫోన్‌లో సరదాగా నిధుల కోసం అన్వేషణ(ట్రెజర్‌హంట్) అనే ఆట ఆడుతున్న నలుగురికి ఊహించని పరిణామం ఎదురైంది. భారీవర్షాల వల్ల భూగర్భంలోని డ్రైనేజీలు పొంగి పొర్లడంతో ఒక మహిళ(27) ప్రాణాలు కోల్పోయింది. మరో యువకుడు అదృశ్యమయ్యాడు. మిగిలిన ఇద్దరూ ఆసుపత్రిపాలయ్యారు. చెక్‌రిపబ్లిక్ రాజధాని ప్రేగ్‌లో శనివారం రాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు.



ఓఎన్జీసీ పైపులైన్ నుంచి ఎగసిపడుతున్న చమురు సహజ వాయువు

ఓఎన్జీసీ పైపులైన్ లీకేజీ

అంతర్వేది, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలంలోని కేశవదాసుపాలెం పంచాయతీ బెల్లంకొండవారి గ్రూపులో ఓఎన్జీసీ పైపులైన్ ఆదివారం లీకైంది. వాయువు బయటకు వచ్చి ఎగసిపడింది. దీనిని గమనించిన స్థానికులు గ్యాస్ కనెక్షన్ సెంటర్(జీసీఎస్)కు సమాచారం అందించారు. జీసీఎస్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని లీకేజీని అరికట్టారు. పైపులైన్లకు గతంలో తుప్పుపట్టడంతో తరచూ లీకయ్యేవి. ఇటీవల కొత్త పైపులైన్ వేసినప్పటికీ లీకులు పడటం పట్ల స్థానికులు కలవరం చెందుతున్నారు.

అర్ధరాత్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కార్తి

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తి ముందస్తు బెయిల్ కోరుతూ శనివారం రాత్రి 11.30గంటలకు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నల్లధనం చట్టం కింద నమోదైన కేసులో 3 సార్లు సమన్లు జారీ చేసినా ఆదాయపుపన్ను శాఖ అధికారుల ఎదుట కార్తి హాజరుకాలేదు. దీంతో ఆయనకు వారెంట్ జారీ అయింది. ఈ వ్యవహారంలో తనను అరెస్టు చేస్తారేమోనన్న అనుమానంతో కార్తి తన సీనియర్ న్యాయవాదులు సుందరేశన్, సతీశ్ పరాశరణ్‌ల ద్వారా మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధికారిక నివాసాన్ని శనివారం రాత్రి 11 గంటలకు ఆశ్రయించారు. పోర్ట్‌ఫోలియో జడ్జి ఏడీ జగదీశ్ చంద్రను సంప్రదించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ తెలిపారు. ఆ మేరకు వారు జస్టిస్ ఏడీ జగదీశ్ చంద్ర నివాసానికి రాత్రి 11.30 గంటలకు వెళ్లారు. తనకు ముందస్తు బెయిల్ జారీచేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఆదాయపు పన్నుశాఖ తరపు న్యాయవాది ఏపీ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. విదేశాలనుంచి వచ్చిన వెంటనే ఏ తేదీలోనైనా నేరుగా హాజరవుతానని కార్తి లిఖితపూర్వక హామీ ఇచ్చిన పక్షంలో తాము ఈ వారెంట్‌పై తదుపరి చర్యలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తామన్నారు.

అది అబద్ధపు సర్వే

'దైనిక్ భాస్కర్' కథనంపై జీవీఎల్ వివరణ

ఈనాడు, దిల్లీ: గత సాధారణ ఎన్నికల్లో గెలిచిన ఎంపీ స్థానాల్లో భాజపా సగంచోట్ల ఎదురుగాలి ఎదుర్కొంటున్నట్లు హిందీ దినపత్రిక 'దైనిక్ భాస్కర్'లో ప్రచురితమైన కథనం అబద్ధమని భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. భాజపా బలహీనపడినట్లు పార్టీ అంతర్గత సర్వేలో తేలిందని చెబుతూ ఆ పత్రిక ప్రచురించిన కథనం పూర్తి అబద్ధమన్నారు. దానిని ఆధారంగా చేసుకొని తెలుగు పత్రికలు, ఛానళ్లు కథనాలు ప్రచురించడం, ప్రసారం చేయడాన్ని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తప్పుబట్టారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, ఉద్దేశపూర్వకంగా కథనం ప్రచురించిన ఆ పత్రికపై ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. 152 స్థానాల్లో భాజపా ఎంపీలు ప్రజాభిమానం కోల్పోయారని, అందువల్ల ఆ స్థానాల్లో గెలుపుకోసం భాజపా నాయకత్వం వారిని మార్చే ప్రయత్నం చేస్తోందని చెప్పిందే తప్ప భాజపా వాటిల్లో ఓడిపోతుందని చెప్పలేదని గుర్తుచేశారు.

తమ సర్వే ప్రకారం కేంద్రంలో మోదీ నేతృత్వంలో భాజపా 2014 కంటే భారీ మెజార్టీతో వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారం చేజిక్కించుకుంటుందన్నారు.

కొత్త పార్టీ పెట్టిన శశికళ సోదరుడు

చెన్నై, న్యూస్‌టుడే: శశికళ సోదరుడు దివాకరన్ కొత్త పార్టీ పెట్టారు. అన్నాడీఎంకేలో 'అమ్మ' వర్గంగా కొనసాగుతామంటూ గతంలో 'అమ్మ అణి' ఏర్పాటు చేశారు. తిరువారూర్ జిల్లా మన్నార్గుడిలో కార్యాలయం కూడా ప్రారంభించారు. అయితే తన పేరు కాని, ఫొటో కాని వాడకూడదని హెచ్చరిస్తూ తన న్యాయవాది ద్వారా దివాకరన్‌కు శశికళ నోటీసు పంపారు. దీంతో దివాకరన్... 'అన్నా ద్రావిడర్ కళగం' పేరిట కొత్త పార్టీని ఆదివారం ప్రారంభించారు. తిరువారూర్‌లోని 'అమ్మ అణి' కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ పేరును అధికారికంగా ప్రకటించారు. జెండాను కూడా ఆవిష్కరించారు.

ఈనాడు

మంచినీటి కోసం మహోద్యమం

ప్రాణాధార నీటి వనరుల్ని కాలుష్య కాసారాలుగా మార్చేసుకొంటున్న ఇండియా, దశాబ్దాల స్వయంకృతాపరాధాలకు చెల్లించుకొంటున్న మూల్యం అంతా ఇంతా కాదు. దేశవ్యాప్తంగా జలవనరుల సక్రమ నిర్వహణ బాధ్యతను విస్మరించిన పాలకుల పాపం- దాహార్తితో దేశం ఇక్కట్ల పాలయ్యే దురవస్థను, అందుబాటులోని కలుషిత నీటినే తాగక తప్పని పరిస్థితుల్లో రోగాలూ రొష్టులపాలవుతున్న అభాగ్య భారతాన్నే సాక్షాత్కరింప చేసిందని చెప్పక తప్పదు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి 6042 ఘనపు మీటర్లుగా ఉన్న తలసరి నీటి లభ్యత 2011 నాటికి 1545 ఘ.మీటర్లకు పడిపోయిందని, 2021కి పరిస్థితి మరింతగా దిగజారి 1340 ఘ.మీటర్లే లభ్యమవుతాయని సర్కారీ గణాంకాలే సెలవిస్తున్నాయి. ఏటికేడు పడిపోతున్న లభ్యతకు జతపడి అంతకంతకు క్షీణిస్తున్న నీటినాణ్యత ఏ స్థాయిలో మృత్యుఘంటికలు మోగిస్తున్నదో డ్యూక్ విశ్వవిద్యాలయ తాజా అధ్యయనం వెల్లడిస్తోంది. దేశీయంగా 16 రాష్ట్రాల్లో లోగడ సేకరించిన భూగర్భ జల సమాచారాన్ని విశ్లేషించి కొత్తగా నిగ్గుతేల్చినదేమిటంటే- మోతాదుకు మించిన యురేనియంతో జలసిరులు మరింత ప్రాణాంతకంగా మారాయని! ఏయే ప్రమాదకర రసాయన అవశేషాలతో తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందో నిర్ధారించిన భారతీయ ప్రమాణాల సంస్థ- ఆ జాబితాలో యురేనియాన్ని చేర్చకపోవడమే వింత! ఇండియాలో నీటి నాణ్యత పర్యవేక్షణ తతంగాన్ని పునస్సమీక్షించాలని, యురేనియం ఆనవాళ్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అనారోగ్య ముప్పును జాగ్రత్తగా మదింపు వెయ్యాలని అధ్యయన బృందం సూచిస్తున్నా- ప్రభుత్వ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన కదులుతుందా అన్నదే ప్రశ్న! ప్రమాదకర స్థాయిలో ఆర్సెనిక్ కలగలిసిన నీటిని దేశీయంగా 19 శాతం భారతీయులు తాగుతున్నట్లు కేంద్రప్రభుత్వం మొన్న డిసెంబరులో లోక్‌సభాముఖంగా వెల్లడించింది. గుక్క తడుపుకోవడానికి, ప్రాణం నిలుపుకోవడానికి గత్యంతరం లేక కలుషిత నీటినే సేవిస్తున్న కోట్లాది జనావళి సాక్షిగా జాతి నుదిటిన రోగగ్రస్త జాతకాన్ని ప్రభుత్వాలే శాశ్వతీకరిస్తున్నాయి!

మనిషి ఆరోగ్యకర జీవనానికి అమృత తుల్యమైనది మంచి నీరు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల పురోగతికీ ప్రాణాధారం- నీటి వనరులు! మానవాళిలో 17 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇండియాలో అందుబాటులో ఉన్న జలరాశి పట్టుమని నాలుగు శాతమే అయినా, దాన్ని ప్రాణసమంగా పరిరక్షించుకోవాల్సిన కర్తవ్యాన్ని పాలకులు, ప్రజలు విస్మరించబట్టే పలు విధాలుగా జలసంక్షోభం జడలు విరబోసుకుంటోంది. చెరువులు, దొరువులు, నదుల వంటి ఉపరితల జలవనరుల్ని జాగ్రత్తగా వినియోగించుకుంటూ, భూగర్భ జలసంపదను కాపాడుకుంటూ ముందడుగేయడం దూరదృష్టిగల దేశాలకు కీలక అజెండాగా మారింది. అందుకు పూర్తి భిన్నంగా 1970ల నుంచే భూగర్భ జలాల్ని విచ్చలవిడిగా తోడేయడం, ఉపరితల నీటివనరుల్ని కనీసం స్నానానికి సైతం పనికిరానంతగా విషకలుషితం చేసెయ్యడంతో ఇండియా నేడు ప్రమాదకర పరిస్థితుల్ని ఎదుర్కొంటోంది. గ్రామాల్లో 80 శాతం, పట్టణాల్లో 50 శాతం గృహావసరాలకు, 60 శాతం సేద్యానికీ భూగర్భ జలాలే దిక్కు. దేశవ్యాప్తంగా మూడు కోట్ల బోరు బావులు జలరాశిని విచ్చలవిడిగా తోడేస్తుండటంతో- 160 జిల్లాల్లో భూగర్భ నీరు ఉప్పునీటిమయమైపోగా, రెండు తెలుగు రాష్ట్రాలు సహా యూపీ, బిహార్, తమిళనాడు, పశ్చిమ్ బంగ లాంటిచోట్ల 230 జిల్లాల్లో ఫ్లోరైడ్ భూతం గజ్జె కట్టింది. నీటిమట్టాలు అడుగంటే కొద్దీ సీసం, క్రోమియం, నైట్రేట్, ఆర్సెనిక్ వంటి విషకలుషితాలతో పాటు యురేనియం సైతం పైకి తేలుతోంది. ఇలా భూగర్భ జలాల తోడివేత, ఉపరితల నీటివనరుల్లో కాలుష్య విషవ్యర్థాల పారబోత విచ్చలవిడిగా సాగితే 2032 నాటికి ఇండియా పెను సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ప్రపంచ బ్యాంకు 2012లోనే హెచ్చరించింది. దాన్ని పెడచెవిన పెట్టిన ఇండియాకు- పర్యావరణాన్ని పరిరక్షించుకొంటూ ఆరోగ్యకర అభివృద్ధికి కంకణబద్ధమైన పలు దేశాల అనుభవాలన్నీ గుణపాఠాలు కావాలి!

మానవాళి చరిత్రలోనే అతిపెద్ద సామూహిక విషప్రయోగంగా కలుషిత జల సేవనాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ అభివర్ణిస్తోంది. పలు దేశాల్లో ఆర్సెనిక్ కలగలసిన నీటివాడకం ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతుండటంపై ఎన్నో ఏళ్లుగా హెచ్చరికలు చెవిన పడుతున్నాయి. అయిదు దశాబ్దాల క్రితం తీవ్ర జలసంక్షోభాన్ని ఎదుర్కొన్న సింగపూర్- వ్యర్థ జలాల శుద్ధి, నిర్లవణీకరణ, జలాశయాల పరిరక్షణ, నీటి వనరులకు కాలుష్యం కాటుపడనివ్వని పటిష్ఠ వ్యవస్థలతోనూ వాననీటిని భూగర్భంలోకి ఇంకేలా జాగ్రత్త పడే ముందుచూపుతోనూ పురోగమిస్తోంది. కనిష్ఠ నీటితో గరిష్ఠ ఉత్పాదనలు సాధిస్తున్న ఇజ్రాయెల్, ఉప్పునీటితో పండే వంగడాలపైనా దృష్టి సారించింది. అయిదేళ్లలో ఎయిర్ టెన్ (2013), వాటర్ టెన్ (2015), సాయిల్ టెన్ (2016) సంస్కరణలు తెచ్చిన జనచైనా ప్రకృతి వనరుల పరిరక్షణ ద్వారా సుస్థిరాభివృద్ధి వ్యూహాలకు సానపడుతోంది. ప్రభుత్వ విభాగాలు, కార్పొరేషన్లు, పర్యావరణ స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థాయి సంస్థలు, ప్రసార మాధ్యమాలు, ప్రజలు- ఇలా అందర్నీ భాగస్వాముల్ని చేసి జాతీయోద్యమ స్థాయిలో కాలుష్య కారకాలపై చైనా కదనకాహళి మోగిస్తోంది. ఇండియాలోనూ జరగాల్సింది అదే. జాతీయ స్థాయిలో జలవనరుల పరిరక్షణ కోసం ప్రాధికార సంస్థ ఏర్పాటుకు మోదీ ప్రభుత్వం నిరుడు రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టింది. సామాజిక తనిఖీలు, జలసంరక్షణ, వ్యర్థ జలాల శుద్ధి, పునర్వినియోగం వంటివాటిని లక్షిస్తున్న నయా చొరవ- సర్కారీ పథకంగా కాదు, జాగృత జనోద్యమంగా అమలైనప్పుడే, వెంటాడుతున్న నీటి వెతల నుంచి దేశం తెరిపిన పడుతుంది!

పెట్రో బిల్లు... జేబుకు చిల్లు

పెట్రోల్ ధరలు సామాన్యుల జేబుకు చిల్లులు పెడుతున్నాయి. ప్రజల నెత్తిన గుదిబండగా మారిన ఈ సమస్యకు అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న మార్పులు, దేశీయ పరిణామాలు కారణం. గిరాకీ-సరఫరాల్లో అసమతౌల్యత, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిణామాలు, దేశీయంగా పన్నుల విధింపుతో పాటు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఇతర విధానాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయి. పెట్రోలియం ఉత్పత్తులతో ముడివడిన అనేక అంశాలను సమగ్ర దృక్పథంతో అర్థం చేసుకుంటే తప్ప సమస్య మూలాలు బోధపడవు.

2050 నాటికి చైనాను అధిగమించి 140 కోట్ల మందితో ప్రపంచంలోనే అత్యధిక జనాభాగల దేశంగా భారత్ ఆవిర్భవించనుందన్న అంచనాల నేపథ్యంలో, ఇంతమంది ఇంధన అవసరాలను తీర్చేదెలా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం 82.8శాతం దిగుమతి చేసుకున్న చమురుపైనే భారత్ ఆధారపడుతోంది. దేశంలో చమురు గిరాకీ 20.49 కోట్ల మెట్రిక్ టన్నులుండగా, దేశీయ ఉత్పత్తి 3.568 కోట్ల మెట్రిక్ టన్నులే. 2016లో అంతర్జాతీయ విపణిలో 30 డాలర్లుగా ఉన్న ముడి చమురు పీపా (బ్యారెల్) ధర 2018 మే నాటికి 80 డాలర్లకు చేరింది. 2008 జులైలో ఆ ధర 148 డాలర్లకు ఎగబాకింది. తరవాత అంతే వేగంగా పడిపోయాయి. అంతర్జాతీయ విపణిలో ధరవరల మాటెలా ఉన్నా, దేశీయంగా సామాన్యుడు ఆలోచించేది తన జేబులోంచి ఎంత ఖర్చుపెట్టాల్సి వస్తోందనే! ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరుకు హైదరాబాదులో ఎనభై రూపాయల పైగానే ఉంది. 2008లో అంతర్జాతీయంగా ముడిచమురు ధర అంతెత్తున ఉన్నప్పుడూ ధరలు రూ.50 నుంచి రూ.55 మించలేదు. ఇప్పుడెందుకు ధర అత్యధికంగా ఉంటోందన్నదే చర్చనీయాంశం!

ఉత్పత్తి వ్యూహాలు

ప్రపంచ చమురు ఉత్పత్తిని చమురు ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్) ముఖ్యంగా సౌదీ అరేబియా, రష్యా, అమెరికా శాసిస్తుంటాయి. 'ఒపెక్', రష్యాలు ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ధరలు పెంచే ప్రయత్నాల్లో ఉన్నాయి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో చెల్లింపుల సమతూకం సాధించేందుకు రష్యా ప్రయత్నిస్తోంది. ఆ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ధరలు పెరిగితే తద్వారా తాను లబ్ధి పొంది చెల్లింపుల్లో సమతూకం సాధ్యం చేసుకోవాలన్నది రష్యా ఆలోచన. ప్రపంచవ్యాప్తంగా పీపా ముడి చమురు ధర 70 డాలర్లు దాటిన నేపథ్యంలో సంతృప్తి చెందిన రష్యా, 'ఒపెక్'లు ఉత్పత్తి పెంచేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఇరాన్‌తో అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలగడంతో ముందుందు చమురు సరఫరాకు సంబంధించి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం కనిపించింది. ఈ పరిస్థితుల్లో ముడిచమురుతోపాటు 'షేల్ గ్యాస్' ఉత్పత్తి పెంచడానికి అమెరికా చొరవ చూపడం చెప్పుకోదగిన పరిణామం.

దేశంలో చమురు, సహజవాయువు వెలికితీత కార్యక్రమం మొదటినుంచి ఓఎన్‌జీసీ, ఓఐఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతోంది. దేశీయంగా ముడిచమురు ఉత్పత్తి, శుద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని భావించిన భారత్ 1999లో కొత్త విధానం ప్రకటించింది. చమురు, సహజవాయువు వెలికితీత కంపెనీలకు (అప్‌స్ట్రీమ్); చమురు పంపిణీ, శుద్ధి సంస్థలకు (డౌన్‌స్ట్రీమ్) మరింత స్వేచ్ఛ ఇవ్వాలని నిర్ణయించింది. మరోవంక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షిస్తే తప్ప ఉత్పత్తి ఊపందుకోదని భావించింది. ఈ క్రమంలో చమురు వెలికితీతకు సంబంధించి నూతన ధ్రువీకరణ విధానం (ఎన్ఈఎల్‌పీ) ప్రవేశపెట్టింది. ఇది అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. చమురు ఉత్పత్తి నిర్దేశిత లక్ష్యాలకన్నా తక్కువగా ఉండటం, ప్రభుత్వం దఖలు పరచిన వెలికితీత హక్కులను కంపెనీలు సవ్యంగా ఉపయోగించుకోలేకపోవడం, వెలికితీతలో ఆలస్యం; కంపెనీల మధ్య, కంపెనీలు ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వాతావరణం వంటి సమస్యల వల్ల ఎన్ఈఎల్‌పీ ప్రభావశూన్యంగా మారిపోయింది. ఈ సమస్యలను పరిష్కరించి, అన్ని కంపెనీలకు సమాన అవకాశాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. హైడ్రోకార్బన్ వెలికితీత-లైసెన్సింగ్ విధానం (హెల్ప్) పేరిట 2016లో కొత్త పద్ధతి ప్రారంభించింది. ఇది అమలులోకి వచ్చి దాదాపు రెండేళ్లవుతున్నా దేశీయంగా ముడిచమురు ఉత్పత్తిలో ఆశించిన స్థాయి వృద్ధి కనిపించలేదు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా 'హెల్ప్'ను నవీకరించక తప్పని పరిస్థితి నెలకొంది. పెట్రో ఉత్పత్తుల ద్వారా వచ్చే పన్నులే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాన ఆదాయ వనరు. వీటిలో ఏ మాత్రం కోత పెట్టినా ప్రభుత్వ ఆదాయం పడిపోతుంది. ఆర్థిక క్రమశిక్షణ గాడితప్పుతుంది. విత్తలోటు 3.5 శాతంలోపే ఉంచాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. మరోవంక వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు కారణంగా రాష్ట్రాల పన్ను రెవిన్యూలో 14 శాతం వృద్ధిరే



ధరల నియంత్రణకు ముందున్న మార్గాలు

టును ప్రాతిపదికగా తీసుకొని వాటికి అయిదేళ్లపాటు పరిహారం చెల్లించేందుకు కేంద్రం కట్టుబాటు చాటుతోంది. జీఎస్‌టీ కారణంగా తలెత్తిన సమస్యలు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి. పన్ను ఆదాయమూ క్రమంగా పెరుగుతోంది. ఫలితంగా పెట్రో ఉత్పత్తులపై పన్నులను హేతుబద్ధీకరించేందుకు ప్రభుత్వాలకు వెసులుబాటు లభించే అవకాశాలు కొట్టిపారేయలేం. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలున్నాయి. ఈ పరిస్థితుల్లో సామాజిక పథకాలపై వ్యయానికి ప్రభుత్వం కోతపెట్టే పరిస్థితి లేదు.

జీఎస్‌టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులను తీసుకురావాలన్న మాటా కొంతకాలంగా వినిపిస్తోంది. అది ఎంతవరకు ఆచరణ సాధ్యమన్నది చర్చనీయాంశం. జీఎస్‌టీ అమలులోకి వచ్చాక రాష్ట్రాల పన్ను అధికారాలకు భారీగా కోత పడింది. ఈ పరిస్థితుల్లో పెట్రో ఉత్పత్తులపై పన్నులు విధించే అధికారాన్ని వదులుకునేందుకు రాష్ట్రాలు సిద్ధపడకపోవచ్చు. జీఎస్‌టీకి ముందు ఏ వస్తువుపై ఎంత పన్ను వేయాలన్న విషయాల్లో రాష్ట్రాలకు చాలావరకు నిర్ణయాధికారం ఉండేది. ఇప్పుడు ఆ నిర్ణయాలను జీఎస్‌టీ మండలి తీసుకుంటోంది. జీఎస్‌టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులను తీసుకువెళ్లడం ద్వారా రాష్ట్రాల ఆదాయానికి భారీ గండి పడుతుంది. ఆ మేరకు లోటును తీర్చుకోవడానికి ప్రత్యామ్నాయం కనిపిస్తే తప్ప రాష్ట్రాలు పెట్రో ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి చేర్చేందుకు అంగీకరించకపోవచ్చు. పెట్రోలియం ఉత్పత్తులపై అమ్మకం పన్ను, 'వ్యాట్' ద్వారా తమ మొత్తం పన్నుల ఆదాయంలో రెండు నుంచి 14 శాతం మేర రాష్ట్రాలకు సమకూరుతోంది. పెట్రో ఉత్పత్తులపై పన్నుల రూపంలో గుజరాత్ అత్యధికంగా 14 శాతం సమకూర్చుకుంటుండగా, మహారాష్ట్ర 11, ఆంధ్రప్రదేశ్ సుమారు ఎనిమిది, తెలంగాణ అటుఇటుగా తొమ్మిది శాతం పన్ను ఆదాయం సమకూర్చుకుంటున్నాయి. పెట్రో పన్నుల్లో ఏకరూపత లేదు. ఒక్కో రాష్ట్రం ఒక్కో రకంగా వాటిని అమలు చేస్తుండటంతో ఆ ప్రభావం వివిధ వస్తు సేవలపై ప్రతికూలంగా పడుతోంది. ఒకవేళ అద్భుతం జరిగి జీఎస్‌టీ పరిధిలోకి పెట్రోలియం ఉత్పత్తులను చేర్చేందుకు రాష్ట్రాలు అంగీకరించినా- పన్ను రేటు ఎంత నిర్ణయించాలన్న ప్రశ్న తలెత్తుతుంది. ప్రస్తుత జీఎస్‌టీ పన్నుల విధానంలో గరిష్ఠ శ్లాబు 28శాతం కాగా- ఇందుకు సెస్సులు, సర్‌ఛార్జీలు అదనం. కానీ పెట్రో ఉత్పత్తులకు ఈ గరిష్ఠ 'శ్లాబు'ను వర్తింపజేసినా- సమకూర్చుకోవాల్సిన 'రెవిన్యూ తటస్థ రేటు' (రెవిన్యూ న్యూట్రల్ రేట్)కు రాష్ట్రాలు చాలా దూరంలోనే ఉండిపోవాల్సి వస్తుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

రేటు పెరిగితే మరింత కష్టం

చమురు, సహజవాయు దిగుమతుల రూపంలో భారత్‌పై పడుతున్న భారం అంతా ఇంతా కాదు. దేశ చెల్లింపుల సమతూకాన్ని ప్రభావితం చేస్తున్న అంశమిది. దేశం మొత్తం దిగుమతుల్లో పెట్రో ఉత్పత్తులు 20 నుంచి 22 శాతం మేర ఉంటున్నాయి. ఇప్పటికే డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ బాగా కోసుకుపోయింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఇంకా పెరిగితే రూపాయి విలువ ప్రతికూలంగా ప్రభావితమవుతుంది. దానివల్ల ప్రస్తుత ఖాతా లోటు (కరెంట్ అకౌంట్ డెఫిసిట్) మరింత విస్తరిస్తుంది. రిజర్వు బ్యాంక్ వద్ద ఇప్పుడు 42 వేల కోట్ల డాలర్ల మేర విదేశ మారక నిల్వలున్నాయి. చమురు దిగుమతి బిల్లు పెరిగేకొద్దీ ఈ నిల్వ కరిగిపోతుంది. మరోవంక పెట్రో రేట్లు పెరిగితే ద్రవ్యోల్బణమూ కట్టుతప్పుతుంది. తయారీ పరిశ్రమలు చాలావరకు పెట్రో ఉత్పత్తులపైనే ఆధారపడి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కాబట్టి పెట్రో ధరలు పెరిగితే ఆ ప్రభావం ఇతర ఉత్పత్తులపైనా పడుతుంది. టోకు ధరల సూచీలో పెట్రోలియం ఉత్పత్తుల విలువ సుమారు ఎనిమిది శాతంగా ఉంది. పెట్రోలు, డీజిల్ రేటు రూపాయి పెరిగితే ద్రవ్యోల్బణం 0.03 శాతం, 0.08 శాతం (వరసగా)పైకి ఎగబాకుతుందని అధ్యయనాలు చాటుతున్నాయి. ఒకవేళ అదే జరిగితే ద్రవ్య విధానంలో ఆర్‌బీఐ మార్పులు తీసుకురావాల్సి ఉంటుంది. ఫలితంగా ఆర్థికాభివృద్ధి కొడిగడుతుంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ పన్ను సంస్కరణల నేపథ్యంలో భారీ కుదుపులకు లోనై ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థకు పెట్రో ధరలు దారితప్పితే కోలుకోవడం కష్టం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ముందున్న మార్గాలేమిటన్న ప్రశ్న తలెత్తడం సహజం. 2008లో మాదిరిగా ఓఎన్‌జీసీ వంటి 'అప్‌స్ట్రీమ్' కంపెనీలకు భారాన్ని సమానంగా బదలాయించడం ద్వారా పెట్రో ఉత్పత్తుల ధరలను తగ్గించడం ఒక మార్గం. ఆ క్రమంలో పరిమిత స్థాయిలో పెట్రో బాండ్లను జారీ చేయవచ్చు. అంతర్జాతీయ ముడిచమురుపై మితిమీరి ఆధారపడటం వల్ల తలెత్తుతున్న ఇబ్బందుల నేపథ్యంలో దేశీయ ఉత్పత్తిని పెంచుకోవడం మరో దారి. రాష్ట్రాలతో చర్చలు జరిపి పెట్రో ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి చేర్చించే విధంగా వాటిని ఒప్పించడం ఇంకో మార్గం. పెట్రో ఉత్పత్తుల గిరాకీని తగ్గించడం కోసం ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించడం మరో దారి. ప్రభుత్వం వివిధ ప్రత్యామ్నాయాలను అన్వేషించి, ఆచితూచి వ్యవహరిస్తే తప్ప- పెట్రో ధరల సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదు!

పెట్రో ఉత్పత్తి-వినియోగం; ఆర్థిక గణాంకాలు

సూచీ	2014-15	2015-16	2016-17	2017-18*
స్థూల ఆర్థిక లోటు (శాతం)	4.1	3.9	3.5	3.5
విదేశ మారక ద్రవ్యం (రూ.కోట్లలో)	34,140	35,560	37,000	42,440
మొత్తం దిగుమతుల్లో పెట్రో ఉత్పత్తుల వాటా (శాతం)	27.9	19.4	21	22
దేశంలో ముడిచమురు ఉత్పత్తి (ఎమ్ఎమ్‌టీ)	37.5	36.9	36	35.7
పెట్రో ఉత్పత్తుల వినియోగం (ఎమ్ఎమ్‌టీ)	165.5	184.7	194.6	204.9

ఎమ్ఎమ్‌టీ: మిలియన్ మెట్రిక్ టన్నులు, ఆధారం: పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వశాఖ

– ఎ.శ్రీహరి నాయుడు

(రచయిత– నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ సంస్థలో ఆర్థికవేత్త)

పల్లెకు చేరని డిజిటల్ వెలుగు

సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని దేశ ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం గాడి తప్పుతోంది. గ్రామీణ ప్రాంతాలు డిజిటల్ అక్షరాస్యతకు బహుదూరంలో ఉన్నాయి. పట్టణాలతో పోలిస్తే సమాచార సాంకేతిక వినియోగంలో పల్లెలు దారుణంగా వెనకబడి ఉన్నాయి. గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య ఈ అంతరాలను తొలగించకపోతే ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న వివిధ పథకాలను ప్రజల దరికి చేర్చడం కష్టమవుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాలు ఒక ప్రజాఉద్యమంలా ముందుకు సాగుతున్నాయని ప్రకటించిన సమాచార ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్- విస్తరిస్తున్న 'డిజిటల్ అగాధం'పై దృష్టిపెట్టకపోతే అనేక సమస్యలు పోటెత్తే ప్రమాదాన్నీ గుర్తించాల్సి ఉంది. సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని ప్రజానీకానికి సమర్థంగా చేరవేయడంలో కొంత తొట్రుపాటు ఉందని అంగీకరించిన మంత్రి- ఈ సమస్య పరిష్కారానికి ఏం చేస్తామన్న విషయాన్ని మాత్రం చెప్పలేదు. కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రకటించనున్న నూతన జాతీయ టెలికాం విధానం- డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించి, అసమానతలను తగ్గించడానికి అక్కరకు రావాలి!

గ్రామీణ మహిళల వెనకబాటు

దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు. భారత జనాభాలో సుమారు 70 శాతం గ్రామాల్లోనే ఉన్నారు. 90శాతం గ్రామీణులకు డిజిటల్ అక్షరాస్యత లేదు. ప్రస్తుత జనాభాలో పట్టణాల్లో 30 కోట్లకుపైగా, గ్రామాల్లో 19 కోట్ల మంది అంతర్జాల ఆధారిత సేవలు వాడుతున్నారు. ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్, ఇంటర్‌నెట్ సాథి వంటి కార్యక్రమాల ద్వారా పల్లెలకు అంతర్జాల సేవలను విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ- ఈ ప్రక్రియ మరింత వేగం పుంజుకోవాల్సి ఉంది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా మహిళాలోకం తమను తాము సాధికారికంగా తీర్చిదిద్దుకోవాలంటే వారికి డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి అని 'యునిసెఫ్' 2017 నివేదిక స్పష్టం చేసింది. నూతన సాంకేతిక విజ్ఞాన విస్తరణలో గ్రామీణ మహిళలకు ఆఖరి వాటా దక్కుతోంది. కలవరం కలిగిస్తున్న సమస్య ఇది. ఇటీవల జాతీయ నమూనా సర్వేలో వెల్లడించిన వివరాలు పల్లెలు, పట్టణాల మధ్య విస్తరిస్తున్న డిజిటల్ అసమానతలను బయటపెట్టాయి. అంతర్జాల సదుపాయం పట్టణాల్లో ప్రతి వెయ్యి ఇళ్లకుగాను 487కి, గ్రామాల్లో కేవలం 161 ఇళ్లకు పరిమితమైనట్లు గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. కంప్యూటర్ల వాడకం పట్టణాల్లో 29 శాతం, గ్రామాల్లో కేవలం ఆరు శాతంగా ఉంది. వయసులవారీగా కంప్యూటర్లకు సంబంధించిన అవగాహనలోనూ విపరీతమైన అసమానతలున్నాయి. 14-29 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి వెయ్యి మంది గ్రామీణుల్లో కేవలం 183మందికి, పట్టణాల్లో



జాతీయ విధానంలో దిద్దుబాట

489మందికి కంప్యూటర్‌కు సంబంధించిన అవగాహన ఉందని సర్వే వివరాలు వెల్లడిస్తున్నాయి. 30-45 ఏళ్లవారిలో పట్టణాల్లో 243మందికి, గ్రామాల్లో 41 మందికి మాత్రమే కంప్యూటర్ గురించిన అవగాహన ఉంది. అదేవిధంగా 46-60 ఏళ్లవారిలో పట్టణాల్లో 148 మందికి, గ్రామాల్లో కేవలం నలుగురికే కంప్యూటర్ గురించి తెలుసు. ఇక 60 ఏళ్లకు పైబడినవారిలో పట్టణాల్లో 68 మంది, పల్లెల్లో ముగ్గురికి మాత్రమే కంప్యూటర్‌పట్ల అవగాహన ఉంది.

అంతర్జాల వినియోగంలో దేశంలోనే మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది. ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ (పీఎమ్‌జీడీఎస్‌ఏ) కింద పల్లె ప్రజలకు 20 గంటలపాటు ఉచిత శిక్షణ అందించాలని తలపెట్టారు. అందుకోసం రూ.2,351 కోట్ల నిధులు కేటాయించారు. 2019లోపు దేశంలోని రెండున్నర లక్షల గ్రామపంచాయతీల్లో ప్రతి ఒక్కరినీ డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ లక్ష్యం సాకారమైతే జాతి ముఖచిత్రమే గుణాత్మకంగా మారిపోతుంది. ప్రతి ఒక్కరూ డిజిటల్ అక్షరాస్యులైతే దేశంలోకి పది వేల కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు ప్రవహిస్తాయని, సుమారు 40 లక్షలమందికి సమాచార సాంకేతిక రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అంచనా. పీఎమ్‌జీడీఎస్‌ఏ శిక్షణకు సంబంధించి దేశవ్యాప్తంగా అనేక లోటుపాట్లు జరుగుతున్నాయి. ఈ లోపాలను తక్షణం పరిహరించాల్సి ఉంది. ఆధార్‌లో ఉన్న వ్యక్తుల పేర్లు నమోదు చేసుకొని, శిక్షణ కేంద్రాల నిర్వాహకులు ఎడాపెడా ధ్రువీకృత పత్రాలు జారీ చేస్తున్నారన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

దళారీ వ్యవస్థే శాపం

వివిధ ప్రభుత్వ పథకాలకు ప్రధాన అడ్డంకి దళారీ వ్యవస్థ! ఫలాలు లబ్ధిదారులకు చేరేలోగా దళారులు మధ్యలోనే వాటిని భోంచేస్తున్నారు. 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని పట్టాలకు ఎక్కించడం ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో దళారుల ప్రమేయం లేకుండా సుమారు 90 వేలకోట్ల రూపాయల మొత్తాన్ని లబ్ధిదారులకు చేరవేసినట్లుగా ప్రభుత్వం చెప్పుకొంటోంది. ఈ క్రమంలో సేవల లభ్యతకు సంబంధించి పట్టణాలు, పల్లెల మధ్య విస్తరిస్తున్న అసమానతల నిర్మూలనపైనా ప్రభుత్వం గట్టి దృష్టి సారించాలి. పట్టణాల్లో ఏటీఎం యంత్రం పాడైతే 24 గంటల్లోనే వాటి మరమ్మతుకు హడావుడి ప్రదర్శించే అధికార యంత్రాంగం- గ్రామీణ ప్రాంతాలను మాత్రం చిన్నచూపు చూస్తోంది. అమెరికా, చైనా వంటి దేశాలు 'ఆప్టికల్ ఫైబర్ వ్యవస్థ'లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. డిజిటల్ అక్షరాస్యతకు సంబంధించి అసమానతలను సాధ్యమైనంత సత్వరం రూపుమాపి, నూతన సాంకేతికతను మూలమూలకూ విస్తరించినప్పుడే భారత్ సైతం పురోభివృద్ధి బాటలో ముందడుగు వేస్తుంది.

– ఎం.ఎస్.వి.ప్రసాద్

ఉన్నత క్రియ

ప్రస్తుత సమాజం ఒడుదొడుకులతో సాగుతున్నట్లు కనిపిస్తోంది. ఉరుకు పరుగుల జీవనంలో ప్రశాంతత, ఆనందం ఎండమావులవుతున్న వైనం... నిర్హేతుకమైన పోటీ, అనుబంధాలు ఆత్మీయతలు కరవైన సంఘజీవులుగా మారుతున్న పరిస్థితులు- ఇదీ ప్రస్తుత సమాజం. ఆధ్యాత్మిక ఆనందం కోసం వెంపర్లాడితే, ఆ అనుభూతి సైతం అంత సులువుగా లభించడం లేదు. మనం సృష్టించిన డబ్బే మనల్ని పాలిస్తోంది. అశాంతికి ఆవాసమైన ఈ సమాజంలో ఆత్మసంబంధమైన సాధన కష్టతరమైపోతోంది. అంతర్యామిని చేరుకోవాలన్న తృష్ణ తీరేదెలాగంటే- సాధన ఒక్కటే మార్గమని విజ్ఞులు చెబుతారు. పూర్వం లాగా ఇప్పుడు నైమిశారణ్యాలు, లుంబినీ వనాలు, కామ్యక వనాలు, ఋష్యాశ్రమాలు లేవు. ఎక్కడో కాస్త ఏకాంతం, ప్రశాంత పరిసరాలు దొరికినా- భౌతిక లక్ష్యాలు, ఆధ్యాత్మిక భావాల మధ్య మనసు డోలాయమానంగా మారిపోతోంది. అలాంటి పరిస్థితుల్లో, సాధన ఒక సవాలు అవుతుంది.

భారతదేశం కర్మ భూమి. ఈ నేలపై కర్మ సిద్ధాంతాన్ని నమ్మేవాళ్లే ఎక్కువ. పూర్వజన్మ సుకృతంవల్ల జ్ఞానం వికసిస్తుందని పురాణ వాంగ్మయాలు చెబుతున్నాయి. పూర్వ జ్ఞానం కలిగినవారికే కాక ఎవరికైనా సాధన సాధ్యమేనన్నది రుషి వాక్కు. ప్రాచ్యలిఖిత గ్రంథం హఠయోగ ప్రదీపిక ఇదే చెబుతోంది. గోరా కుంభార్ అనే కుండలు చేసే సాధారణ వ్యక్తి సాధన వల్ల ఆధ్యాత్మిక జ్ఞానంతో ఔన్నత్యం పొందాడు. నామ్ దేవుగా పూజలందుకొన్నాడు.

సాధన అనే క్రియ ఉన్నతమైంది. సాధారణ భక్తిని ఆత్మ స్వరూపత్వంగా మారుస్తుంది. ఎందరికో ఎప్పుడో ఒకసారి ప్రాపంచిక విషయాలపై కొంత నిర్లిప్తత కలుగుతుంటుంది. ఆసక్తి తగ్గుతుంది. ఇదొక విచిత్ర అనుభూతి. ఈ అనాసక్తిని పెంచుకోవాలని సాధకులు అంటారు. ఈ అనుభూతిని మనసులోనే దాచుకోవాలి. ఈ భావాన్ని సదా మననం చేసుకొంటూ



చైతన్యం పొందాలని యోగ శాస్త్రం వెల్లడిస్తోంది. ఆధ్యాత్మిక పరిణామానికి ఇదే తొలి మెట్టు.

మనం మన దైనందిన కార్యాలు పూర్తి చేసుకుంటూనే క్రమంగా భవ బంధాలకు దూరంగా ఉండాలి. బాధ్యతలను మాత్రం విస్మరించకూడదు. సాధకుడు పక్షిలా జీవితం గడపాలంటారు. గూడు కట్టుకోవాలి. దాంపత్యం నెరపాలి. పిల్లల్ని కనాలి. పసి పక్షులకు రెక్కలొచ్చేదాకా కష్టపడి ఆహారం సంపాదిస్తూ పోషణచేయాలి. రెక్కలొచ్చి పిల్ల పక్షులు ఎగరగలిగాయంటే, వాటిపై అవి పేగు బంధాలు విడనాడతాయి. వాటి దారి వాటిదే... వీటి దారి వీటిదే! అలా సాధకులు ఉండాలంటాడు యోగి వేమన. కారుణ్యం, సంవేదన సాధకుడి జీవితంలో అంతర్భాగం కావాలి. సహచరులను అర్థం చేసుకొనే గుణం సహజంగానే అలవడుతుంది. క్రమంగా మనలో ఏదో శుద్ధ చైతన్యం నడవడికలో, శరీరంలో వ్యక్తమవుతూ ఉంటుంది. సాధన మార్గంలో కంటకాలు తొలగిపోవడం గమనిస్తాం.

మనిషి మర్త్యుడు. ఏదో ఒకనాడు ఈ లోకం విడిచి వెళ్లక తప్పదు. అనివార్యమైన దాన్ని గురించి ఆలోచిస్తూ మనస్తాపం చెందనవసరం లేదు. పరిమితమైన జీవితం వల్ల బతుకెంత విలువైందో తెలుస్తుంది. అందుకే ఆ పరిమిత జీవితకాలాన్ని సార్థకం చేసుకోవాలి.

ప్రతికూల భావాలు కలుగుతూనే ఉంటాయి. నిజానికి ఇలాంటి భావాలు మనల్ని హెచ్చరిస్తుంటాయి. అనుకూల పరిస్థితులు రావటానికి సాధన చేయాలని విజ్ఞులు అంటారు. మనదంటూ ఈ ప్రపంచంలో ఏదీ లేదు. మనదైనది ఆత్మ ఒక్కటే. సాధన చేస్తే ఆత్మ ఉన్నతమై ఈ ప్రపంచానికి అతీతమైన అనుభూతులు కలుగుతాయి. ఇవే ఆధ్యాత్మిక మార్గాన్ని సరళం చేస్తాయి. శాశ్వతమైన స్థానం పొందేందుకు మాత్రమే ఈ భూమిపైకి వచ్చామని తెలుస్తుంది. అందుకోసమే ఈ మనుగడను వినియోగించుకోవాలి. ఏదైనా సాధించేందుకు సాధన అవసరం. ఈ సాధనే మనిషికి ఔన్నత్యం కలిగించే ఉన్నత క్రియ!

– అప్పరుసు రమాకాంతరావు

అంతర్యామి

అందరి కళ్లూ సింగపూర్‌పైనే

సింగపూర్ ప్రధాని లీ లూంగ్‌తో ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్

సింగపూర్: అణ్వాయుధాలపరమైన దూకుడు ధోరణిపై ఉత్తర కొరియాను నిలువరించడం ప్రధానోద్దేశంగా ఆ దేశ నేత కిమ్ జోంగ్ ఉన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సింగపూర్‌లో ప్రప్రథమంగా జరపనున్న చరిత్రాత్మక చర్చలకు రంగం సిద్ధమయింది. దీని కోసం ఇద్దరు అగ్రనేతలు ఆదివారం సింగపూర్‌కు చేరుకున్నారు. ముందుగా కిమ్, కొన్ని గంటల తర్వాత ట్రంప్ వచ్చారు. మంగళవారం వీరిద్దరి మధ్య ఓ హోటల్లో జరగబోయే చర్చలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి వ్యక్తమవుతుండడంతో ఆ విశేషాలను అందించడానికి వివిధ దేశాలకు చెందిన 3000 మంది పాత్రికేయులు సింగపూర్‌కు వచ్చారు. ఉన్ బస చేస్తున్న హోటల్ వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. అధికారంలో ఉన్న అమెరికా అధ్యక్షునితో ఉ.కొరియా నేత భేటీ కావడం ఇదే తొలిసారి. కిమ్.. అంతర్జాతీయ వేదికలపై కనిపించడం చాలా అరుదు. చైనా, దక్షిణ కొరియాలకు మాత్రమే ఇదివరకు ఆయన వెళ్లారు. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణి కార్యక్రమాలను ముమ్మరం చేసినందుకు దౌత్యపరమైన, ఆర్థిక ఆంక్షల్ని ఉ.కొరియా ఎదుర్కొంటోంది. అణ్వాయుధాలను విడనాడడంపై తాజా భేటీలో ప్రధానంగా చర్చ జరిగే అవకాశముంది. ఉత్తర-దక్షిణ కొరియాల మధ్య శత్రుత్వాలకు శాశ్వత చరమగీతం పాడే ప్రయత్నాలూ జరిగే సూచనలున్నాయి. తమకు నమ్మకం కలిగించేలా భద్రతపరమైన హామీని అమెరికా ఇచ్చి, ఇతర ప్రయోజనాలను కల్పిస్తే మొత్తం అణు కార్యక్రమాన్ని వదిలిపెట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు ఉ.కొరియా ప్రకటించింది. దీనికి అమెరికా సానుకూలంగా స్పందించే అవకాశాలున్నాయి.

18 నెలలుగా మాటల తూటాలు: ట్రంప్, కిమ్ మధ్య దాదాపు 18 నెలల నుంచి మాటల తూటాలు పేలుతూనే ఉన్నాయి. హుంకరింపులు, బెదిరింపులు, వ్యక్తిగత అవమానాల పర్వం పూర్తయ్యాక ఇరువురు నేతలూ చర్చించుకునేందుకు సిద్ధమయ్యారు. కిమ్ ఆహ్వానానికి అంగీకారం తెలిపి ట్రంప్ అందరినీ ఆశ్చర్యంలో పడేశారు. ఆ తర్వాత ఈ చర్చలకు సింగపూర్‌ను ఎంపిక చేసుకున్నారు. చర్చలు రద్దయ్యే వాతావరణం గత నెలలో కనిపించినా అంతలోనే ట్రంప్ పిల్లిమొగ్గ వేశారు. చర్చల తర్వాత అణ్వాయుధ కార్యక్రమాన్ని కిమ్ విడిచిపెడతారనీ, శాంతి నెలకొంటుందనీ ట్రంప్ నమ్మకంతో ఉన్నారు. తమ ప్రజల కోసం ఏదో చేయాలనే తపన ఉన్‌లో ఉందని ఆయన చెప్పారు. 'మంగళవారం కచ్చితంగా ఒక ఉత్తేజభరిత రోజుగా నిలిచిపోతుంది. ఇంతవరకు చేయనిదేదో చేయడానికి ఉన్ గట్టిగా ప్రయత్నిస్తారని నాకు తెలుసు. శాంతి, సుసంపన్నతలను కొరియావాసులకు ఆయన అందిస్తారు. ఆయన్ని కలవడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. ఇలాంటి ఏకకాల అవకాశం వృథా కాబోదని నేను భావిస్తున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. తరతరాలపాటు నిలిచిపోయే ఒప్పందం తమ మధ్య కుదురుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అవసరమైతే ఒకటి కంటే ఎక్కువసార్లు తాము సమావేశమవుతామని చెప్పారు. సమావేశంఎలా ఉండబోతుందో తొలి నిమిషంలోనే తనకు తెలిసిపోతుందని అన్నారు. తామిద్దరం కనీసం ఒకసారి కలియడానికైనా ఇది ఉపయోగపడుతుందని తనదైన శైలిలో పేర్కొన్నారు. మంగళవారం చర్చల సరళిని బట్టి అవసరమైతే బుధవారం కూడా వీటిని కొనసాగించడానికి అమెరికా అధికారులు సన్నద్ధమవుతున్నారు.

చర్చలకు ఖర్చు రూ.100 కోట్లు: ట్రంప్, ఉన్‌ల మధ్య చర్చల కోసం సింగపూర్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీని నిమిత్తం 2 కోట్ల సింగపూర్ డాలర్ల (సుమారు రూ.100 కోట్లు) మేర ఖర్చు చేస్తోంది. సింగపూర్ ప్రధానమంత్రి లీ సీన్ లూంగ్‌తో ఉన్ ఆదివారం భేటీ అయ్యారు. సొంత కుటుంబ వ్యవహారంగా భావించి రెండు దేశాల భేటీని ఏర్పాటు చేసినందుకు సింగపూర్‌కు ఉన్ కృతజ్ఞతలు తెలిపారు. చర్చలు ఫలప్రదమైతే సింగపూర్ ప్రభుత్వ చొరవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ట్రంప్ సోమవారం లూంగ్‌తో సమావేశమవుతారు. అమెరికా, ఉ.కొరియా దేశాలు రెండింటితోనూ సత్సంబంధాలున్న అతికొద్ది దేశాల్లో సింగపూర్ ఒకటి. 2015లో చైనా-తైవాన్ మధ్య చరిత్రాత్మక చర్చలూ ఇక్కడే జరిగాయి. 60 ఏళ్ల తర్వాత ఆ రెండు దేశాలూ సింగపూర్‌లో కలిశాయి.

విజయవంతం కావాలి: పోప్: అమెరికా-ఉ.కొరియా మధ్య చర్చలు... శాంతిస్థాపన దిశగా విజయవంతం కావాలని పోప్ ఫ్రాన్సిస్ ఆకాంక్షించారు. కొరియా ద్వీపకల్పానికే కాకుండా యావత్ ప్రపంచానికి ఈ చర్చలు ఉపయోగపడాలని చెప్పారు.

కొరియా ఘర్షణలకు తెర!

సియోల్: అమెరికా-ఉత్తర కొరియా మధ్య మంగళవారం జరగబోతున్న కీలకమైన చర్చలు చివరకు ఉభయ కొరియా దేశాల నడుమ ఘర్షణలకీ తెరదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 1950-53 మధ్య చోటు చేసుకున్న కొరియా యుద్ధానికి ఇన్నేళ్ల తర్వాత లాంఛనప్రాయంగా ముగింపు పలుకుతూ శాంతి ఒప్పందానికి మార్గం సుగమంకానుంది. కొరియా ఘర్షణలకు శాశ్వత పరిష్కారం సాధించడం తమ చరిత్రాత్మక సమావేశంలో ఒక ప్రధాన అంశమవుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధం ముగిసిపోయిందనే సత్వర ప్రకటన వెలువడడం కోసం ఉ.కొరియా, అమెరికాలతో చర్చించడానికి సిద్ధమని దక్షిణ కొరియా ఇటీవలే ప్రకటించింది. దాదాపు ఏడు దశాబ్దాల నుంచి ఉభయ కొరియాల మధ్య ఘర్షణ కొనసాగుతోంది. మొత్తం ద్వీపకల్పమంతా తమదేనని కమ్యూనిస్టు దేశమైన ఉత్తర కొరియా, పెట్టుబడిదారీ దేశమైన దక్షిణ కొరియా వాదించుకుంటూ వస్తున్నాయి. పరస్పర యుద్ధంలో సియోల్ నగరంపై ఆధిపత్యం నాలుగుసార్లు చేతులు మారింది. రెండేళ్లపాటు చర్చోపచర్చల తర్వాత 1953లో సంధి ఒప్పందంపై ఉత్తర కొరియా, చైనా సంతకాలు చేసినా దక్షిణ కొరియా మాత్రం నిరాకరించింది. ఘర్షణల్లో దాదాపు 3 లక్షల మంది కొరియావాసులు, 37వేల మంది అమెరికావాసులు ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్‌లో రెండు దేశాల నేతలూ సమావేశమై ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని తీర్మానించారు. ఉ.కొరియా నిర్వహించిన అణు పరీక్షలపై మాత్రం చిక్కుముడి వీడలేదు. మొత్తం భూభాగంపై ఇద్దరూ హక్కులను కోరేబదులు పరస్పరం అంగీకారయోగ్యమైన రీతిలో లాంఛనప్రాయ ఒప్పందాన్ని కుదుర్చుకుంటే సమస్య తీరిపోనుంది. దానికి ఇరు వర్గాలూ సుముఖంగా లేవు. తమ భాగస్వామ్యం లేకుండా కొరియా దేశాలు యుద్ధ ముగింపు ప్రకటన చేస్తే అది చెల్లుబాటు కాదని- గతంలో సంధి ఒప్పందంపై సంతకం చేసిన చైనా- హెచ్చరించింది. రెండో దేశం ఉనికినే ఒప్పుకొనేందుకు ఉభయ కొరియాలు ససేమిరా అంటుండడంతో యుద్ధం ముగింపుపై ఏ పక్షమూ లాంఛన ప్రకటన చేయలేదు. సింగపూర్‌లో జరిగే చర్చల తర్వాతైనా పరిస్థితిలో మార్పు వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

కేంద్ర ఉన్నతాధికారులుగా ప్రైవేటు రంగ నిపుణులు

దిల్లీ: ప్రైవేటు రంగంలోని వృత్తి నిపుణులు ఇకపై కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శుల స్థాయి అధికారులుగా నియమితులు కానున్నారు. 'పక్కదారి ప్రవేశం' (లేటరల్ ఎంట్రీ) విధానం పేరుతో ప్రైవేటు రంగ నిపుణులను పరిపాలనలో భాగస్వాములను చేయడంపై గత కొంతకాలంగా చర్చ జరుగుతోంది. తొలుత రెవెన్యూ, ఆర్థిక సేవలు, ఆర్థిక వ్యవహారాలు, వాణిజ్యం, పౌర విమానయానం సహా పది విభాగాల్లో పది మంది నియామకం జరగనుంది. దీనిపై సిబ్బంది శిక్షణ విభాగం నోటిఫికేషన్ విడుదల చేస్తూ ప్రైవేటు రంగ కంపెనీలు, సలహా సంస్థలు, అంతర్జాతీయ/బహుళ రంగ సంస్థలు, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులు; ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల్లో సరిపోల్చగల స్థాయిలో పనిచేస్తున్నవారు ఇందుకు అర్హులని పేర్కొంది. ఆ సంస్థల్లో కనీసం 15 ఏళ్ల అనుభవం ఉండాలని తెలిపింది. వీరి నియామకం మూడు/అయిదేళ్ల ఒప్పంద పద్ధతిలో ఉంటుంది.

సంఘ్ సభ్యులకు అవకాశం కల్పించడానికే: ఏచూరి

ప్రతిభావంతుల పేరుతో సంఘ్ పరివార్ సభ్యులకు అవకాశం కల్పించడానికే కేంద్రం ఈ విధానాన్ని తీసుకొచ్చిందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ఐఏఎస్‌లను ఎంపిక చేసే యూపీఎస్సీని తక్కువ చేసి చూపడమేమిటని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై కూడా చిన్నచూపు చూసినట్టయిందని తెలిపారు.

ఏకాభిప్రాయ ప్రకటనకు ట్రంప్ ససేమిరా

- ముగిసిన జి-7 సదస్సు
- ట్రూడోపై అమెరికా అధ్యక్షుడి ఆగ్రహం

క్విబెక్ సిటీ: జి-7 దేశాల శిఖరాగ్ర సమావేశంలో ఏకాభిప్రాయంతో రూపొందించిన ప్రకటనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ససేమిరా అన్నారు. దీంతో ఈ సమావేశం ఒక ప్రహసనంలా మారింది. వాణిజ్య యుద్ధం తప్పదని పునరుద్ఘాటించినట్లయింది. జి-7 దేశాధినేతలు ఆమోదించిన ప్రకటనను కొన్ని నిమిషాల్లోనే ట్రంప్ తన ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం నుంచే ట్విటర్ ద్వారా అర్ధంతరంగా తిరస్కరించారు. ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ యున్‌తో చర్చల నిమిత్తం సింగపూర్‌కు చేరుకునేందుకు ట్రంప్ ఆదివారం క్విబెక్ నుంచి బయల్దేరారు. వెళ్తూ వెళ్తూ జి-7 ఆతిథ్య దేశమైన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోపైనా విరుచుకుపడ్డారు. విలేకరుల సమావేశంలో ట్రూడో తప్పుడు సమాచారం చెప్పారనీ; అమెరికా రైతులు, కార్మికులు, కంపెనీలపై కెనడా భారీగా భారాన్ని మోపుతోందనీ విమర్శించారు. అమెరికా మార్కెట్టుకు వెల్లువెత్తుతున్న ఆటోమొబైల్స్ ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అందుకే ఉమ్మడి ప్రకటనను ఆమోదించవద్దంటూ తన ప్రతినిధులకు చెప్పినట్లు వెల్లడించారు. సదస్సులో ఏమీ ఎరుగనట్లు నటించిన ట్రూడో తాను అక్కడి నుంచి కదలగానే వేరే విధంగా మాట్లాడారని ఆక్షేపించారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతుల విషయంలో అమెరికా తీరు కెనడాను అవమానించే రీతిలో ఉందని ట్రూడో అంతకుముందు వ్యాఖ్యానించారు. తమ వినమ్రతను అలుసుగా తీసుకోరాదన్నారు. జి-7 సమావేశమైతే ముగిసినా, అమెరికా వాణిజ్య ఆంక్షలను సరళతరం చేయాలన్న ప్రయత్నాలు మాత్రం నెరవేరలేదు. వాణిజ్యంపై ఏకాభిప్రాయ సాధనకు కృషి కొనసాగుతుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ తెలిపారు. వచ్చే ఏడాది జి-7 సదస్సును ఫ్రాన్స్ ఆతిథ్యం ఇవ్వనుంది.

సంయుక్త ప్రకటనపై జి-7 దేశాల అధినేతల సమాలోచనలు

యూపీఎస్సీ తాత్కాలిక ఛైర్మన్‌గా అరవింద్ సక్సేనా

దిల్లీ: యూపీఎస్సీ తాత్కాలిక ఛైర్మన్‌గా అరవింద్ సక్సేనా నియమితులయ్యారు. జూన్ 20 నుంచి తదుపరి ఉత్తర్వులు అందేవరకు లేదా ఆగస్టు 7, 2020తో పూర్తి కానున్న ఆయన పదవీ కాలం వరకు బాధ్యతలు చేపడతారని కేంద్రప్రభుత్వం ఆదివారం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది. ప్రస్తుత ఛైర్మన్ వినయ్‌మిత్తల్ పదవీకాలం జూన్ 19తో పూర్తి కానుంది. 1978 బ్యాచ్ ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారి అయిన సక్సేనా మే, 2015లో యూపీఎస్సీలో చేరారు. 1988లో భారత అత్యున్నత నిఘా విభాగం 'పరిశోధన, విశ్లేషణ విభాగం-రా'లో 1988లో చేరి సేవలందించారు.

కొనసాగుతున్న పెట్రోలు ధర తగ్గుదల

దిల్లీ: పెట్రోలు, డీజిల్ ధరలు వరుసగా 12వ రోజైన ఆదివారం కూడా తగ్గాయి. లీటరు పెట్రోలుపై 24 పైసలు, డీజిల్‌పై 18 పైసలు తగ్గాయి. దిల్లీలో పెట్రోలు ధర రూ.76.78, డీజిల్ ధర రూ.68.10గా ఉంది. గత 12 రోజులుగా దిల్లీలో పెట్రోలు ధర రూ.1.65 మేర, డీజిల్ ధర రూ.1.21 మేర తగ్గింది.

ఆయుష్మాన్ భారత్ ప్యాకేజీ గిట్టుబాటు కాదు

- ప్రైవేటు ఆసుపత్రుల లేఖ

దిల్లీ: ఆయుష్మాన్ భారత్ (జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం-ఎన్‌హెచ్‌పీఎస్) కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ వైద్యసేవల ధరల ప్యాకేజీ తమకు గిట్టుబాటు కాదని ప్రైవేటు ఆసుపత్రులు తెలిపాయి. ఈ మేరకు దాదాపు మూడు వేల ప్రైవేటు ఆసుపత్రులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఇండియా (ఏహెచ్‌పీఐ).. ఆయుష్మాన్ భారత్ సీఈవోకు లేఖ రాసింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) కింద ప్రకటించిన ధరల కన్నా, ఈ ప్యాకేజీ ధరలు తక్కువగా ఉన్నాయని పేర్కొంది. సాధారణ స్టెంట్ వేయడానికి సీజీహెచ్ఎస్ కింద రూ.80,540 చెల్లిస్తుండగా, ఆయుష్మాన్ భారత్ కింద రూ.65 వేలు ఇస్తామని చెప్పడం తగదని తెలిపింది. ఈ స్టెంట్ వేయడానికి ప్రైవేటు ఆసుపత్రులకు రూ.85,818 ఖర్చవుతోందని పేర్కొంది. మోకీలు మార్పిడి చికిత్సలకు ప్రైవేటు ఆసుపత్రులకు రూ.2,05,615 ఖర్చవుతుందని తెలిపింది. దీనికి సీజీహెచ్ఎస్ కింద 1,49,100 ఇస్తుండగా, ఆయుష్మాన్ కింద రూ.80 వేలు మాత్రమే ఇవ్వాలని ప్రతిపాదించడం సబబు కాదని వివరించింది.

యోగాతో వీర్యం నాణ్యత మెరుగు

దిల్లీ: యోగా అలవాటుతో వీర్యం నాణ్యత మెరుగుపడుతుందని తాజా అధ్యయనంలో తేలింది. దిల్లీలోని ఎయిమ్స్ నిపుణులు దీన్ని చేపట్టారు. ఒక్కోసారి శుక్రకణాల్లోని డీఎన్ఏ దెబ్బతింటుంది. ఫలితంగా సంతాన సమస్యలు చుట్టుముడుతుంటాయి. శిశువుల్లో జన్యుపరమైన వ్యాధులు, అనారోగ్య సమస్యల ముప్పులకూ ఈ పరిణామాలు దారితీస్తాయి. డీఎన్ఏలు దెబ్బతినడానికి ఆక్సీకరణ ఒత్తిడే ప్రధాన కారణం. వాతావరణ కాలుష్యం, పురుగుల మందులు, విద్యుదయస్కాంత రేడియోధార్మికత, ధూమపానం, మద్యపానం లాంటివాటి వల్ల శరీరంలోని యాంటీ-ఆక్సిడెంట్లు, ఫ్రీ రాడికల్స్ మధ్య సమతౌల్యం దెబ్బతింటుంది. ఇదే ఆక్సీకరణ ఒత్తిడి స్థాయిలను పెంచుతుంటుంది. రోజూ యోగా చేయడంతోపాటు జీవన శైలిలో స్వల్ప మార్పులను చేసుకోవడంతో ఈ సమస్యను అధిగమించొచ్చని పరిశోధనలో శాస్త్రవేత్తలు రుజువుచేశారు. దీనిలో 200మంది పురుషులు పాల్గొన్నారు.

కోర్టులకెక్కిన విద్యా హక్కు

- చట్టాన్ని అమలుచేయాలని వేలల్లో కేసులు
- ప్రపంచ బ్యాంకు అధ్యయనం

దిల్లీ: విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) కల్పించే ప్రయోజనాలు ఇంకా లక్షిత వర్గాలకు అందలేదు. ఈ చట్టాన్ని అమలు చేయాలంటూ న్యాయస్థానాల్లో వేల సంఖ్యలో వ్యాజ్యాలు దాఖలవుతుండడమే ఇందుకు నిదర్శనం. ఈ చట్టం అమలు తీరుపై అధ్యయనం చేసిన ప్రపంచబ్యాంకు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 2010 నుంచి ఈ చట్టం అమల్లోకి రాగా, ఇంతవరకు ఏకంగా 41,343 కేసులు దాఖలు కావడం విశేషం. ఇందులో 2,477 కేసులు సుప్రీంకోర్టు పరిశీలనకు వెళ్లాయి. చట్టం ప్రకారం ప్రముఖ ప్రయివేటు పాఠశాలల్లో పేదలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంది. ఈ హక్కు అమలుపైనే అధికంగా కేసులు దాఖలయ్యాయి. ఉపాధ్యాయుల అర్హతలు, పాఠశాలల గుర్తింపుపై చట్టంలో పేర్కొన్న నిబంధనలను సవాలు చేస్తూ పలువురు కోర్టులను ఆశ్రయించారు. ఈ చట్టం ప్రకారం పిల్లల హక్కులను కాపాడాలంటూ దిల్లీకి చెందిన సామాజిక న్యాయవాదులు 500కుపైగా కేసులు వేయడం గమనార్హం. విద్యా హక్కు చట్టం అమలు కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిల బాలల హక్కుల పరిరక్షణ సంఘాలు ఉన్నప్పటికీ, వాటికి తగినంత మంది సిబ్బందిని నియమించలేదు. అందుకే చాలా మంది కోర్టులను ఆశ్రయిస్తున్నారు. చట్టంలోని నిబంధనలు సరళీకృతంగా ఉండడం వల్ల కూడా ఎక్కువ మంది న్యాయస్థానాల తలుపును తట్టగలుగుతున్నారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించినంత మాత్రాన ఆ సౌకర్యం పేదలకు అందడం లేదని అధ్యయనంలో తేలింది. బడుగువర్గాల్లోని స్థితిమంతులకే ఆ ప్రయోజనం అందుతోందని, సొమ్ములు ఖర్చు చేసి కోర్టుకు వెళ్లయినా సరే సీట్లు పొందుతున్నారని గుర్తించింది. పేదింటి పిల్లలకు ఈ విద్యా సంస్థల్లో సీట్లు ఇవ్వడంపై మధ్యతరగతి వారు అభ్యంతరం తెలుపుతున్నారు. తమ పిల్లలు పేదవారితో కలిసి ఉండడం వారికి ఇష్టం లేదు. రిజర్వేషన్ల కోటాలో ఇచ్చే సీట్లకు ప్రభుత్వం రాయితీలు ఇస్తున్నా, ఆ సొమ్ము పాఠశాలలు వసూలు చేసే బోధన రుసుముకు సరిపోవడం లేదు. ఏకరూప దుస్తులు, పుస్తకాలకు సొమ్ము ఎవరిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ అదనపు ఖర్చులను భరించడానికి పాఠశాలలు బోధన రుసుములను పెంచుతుండడంతో మధ్యతరగతి తల్లిదండ్రులు అభ్యంతరం తెలుపుతున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో రిజర్వేషన్ల వ్యవహారం వ్యక్తిగత సమస్యలా కనిపిస్తున్నా, అది పలు అంశాలపై కోర్టులు తీర్పులు ఇవ్వాల్సినంత సంక్లిష్టంగా మారిందని వ్యాఖ్యానించింది.

విజిలెన్స్ కమిషనరుగా శరద్‌కుమార్

దిల్లీ: సీనియర్ ఐపీఎస్ అధికారి, ఎన్ఐఏ మాజీ సారధి శరద్‌కుమార్(62)ను విజిలెన్స్ కమిషనరుగా కేంద్రం ఆదివారం నియమించింది. కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ)లో నాలుగేళ్ల కాలానికి ఆయనను విజిలెన్స్ కమిషనరుగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి నుంచీ ఈ పదవి ఖాళీగా ఉంది. శరద్‌కుమార్ 1979 హరియాణా కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి....కాగా ఆయన 2022 వరకూ విజిలెన్స్ కమిషనరుగా కొనసాగుతారు.

ఆదివారం స్పెయిన్‌లోని శాన్‌సెబాస్టియన్, విటోరియా నగరాల మధ్య 202 కిలోమీటర్ల మేర మానవహారంగా ఏర్పడ్డ ప్రజలు. బాస్క్‌కు స్వయంప్రతిపత్తి ఓటింగ్‌లో తమకూ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు

హింస.. భారీ మూల్యం చెల్లిస్తున్న భారత్

- గత ఏడాది రూ.80 లక్షల కోట్ల నష్టం
- సగటున రూ.40 వేలు కొనుగోలు శక్తి క్షీణత
- 163 దేశాలపై అంతర్జాతీయ సంస్థ-ఐఈపీ అధ్యయనం

దిల్లీ: దేశంలో నెలకొన్న హింస కారణంగా భారత్ భారీ మూల్యం చెల్లించుకుంటోంది. గత ఏడాది మనదేశం ఏకంగా రూ.80 లక్షల కోట్లు నష్టపోయిందట. స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో ఇది అక్షరాలా తొమ్మిదిశాతం. అంటే ప్రతివ్యక్తి సగటున రూ.40 వేలు కోల్పోయాడు. కొనుగోలు శక్తి క్షీణత(పీపీపీ) అనే నవ్య ప్రామాణికవాదం ప్రాతిపదికన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్(ఐఈపీ) అనే అంతర్జాతీయ సంస్థ పైమేరకు తేల్చింది. హింస వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 163 దేశాలపై పడిన ప్రభావాన్ని ఈ సంస్థ అంచనా వేసింది. దీనిప్రకారం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు కలిపి రూ.992 లక్షల కోట్లు కోల్పోయినట్లు వెల్లడించింది. ఉదాహరణకు భారత్-చైనాల మధ్య డోక్లాం ప్రతిష్టంభన సుమారు మూడునెలలు కొనసాగింది. భారత్ సైన్యాన్ని సరిహద్దులకు తరలించింది. యుద్ధం జరగకపోయినా ఆ భయం కారణంగా ఆర్థికవ్యవస్థపై దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రభావం చూపింది. కంపెనీల్లో పెట్టుబడులు వాయిదా పడటం, విరమించుకోవడం జరిగింది. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలి ఇన్వెస్టర్లు నష్టపోయారు. మరోవైపు ఇంటాబయటా ప్రతి మనిషి ఇతరులతో ఘర్షణ పడుతుంటాడు. దేశంలో భద్రతా సిబ్బందిపై అల్లరిమూకలు విరుచుకుపడుతుంటాయి. ఇలాంటివన్నీ 'ఐఈపీ' పరిగణనలోకి తీసుకుంటుంది. జీడీపీ ప్రాతిపదికన అత్యధికంగా సిరియా 68శాతం, అఫ్గానిస్థాన్ 63శాతం, ఇరాక్ 51శాతం నష్టపోయాయి. స్విట్జర్లాండ్, ఇండోనేషియా, బుర్కినాఫాసోలో శాంతియుత పరిస్థితుల కారణంగా అత్యల్పంగా నష్టపోయాయి. అమెరికా, బ్రిటన్‌లు సైతం వరుసగా 8, 7శాతం నష్టపోవడం గమనార్హం.

నన్ను లైంగికంగా వేధించారు

- సీనియర్ అధికారిపై మహిళా ఐఏఎస్ అధికారి ఆరోపణ
- ఫిర్యాదు చేయవద్దని బెదిరించారని వెల్లడి

చండీగఢ్: సీనియర్ ఐఏఎస్ అధికారి తనను లైంగికంగా వేధించారని హరియాణాకు చెందిన ఒక మహిళా ఐఏఎస్ అధికారి (28) ఆరోపించారు. ఆరోపణలతో ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ పెట్టారు. "గత నెల 22న ఆ అధికారి తన కార్యాలయానికి పిలిపించుకుని బెదిరించారు. ఆయా విభాగాలు చేసిన తప్పుల గురించి దస్త్రాలపై ఎందుకు రాస్తున్నానని అడిగారు. దస్త్రాలపై వ్యాఖ్యలు రాయడం ఆపకపోతే వార్షిక ఆంతరంగిక నివేదికను ప్రతికూలంగా రాస్తానని బెదిరించారు. గత నెల 31న మళ్లీ పిలిచారు. గదిలోకి ఇంకా మరెవరినీ పంపించొద్దని సిబ్బందిని ఆదేశించారు. నీకు నవ వధువులాగా అన్నీ వివరించాల్సి వస్తోంది అన్నారు. ఈ నెల 6న మళ్లీ ఆయన తన కార్యాలయానికి సాయంత్రం 5కు పిలిపించారు. రాత్రి 7.39 వరకు ఉండమన్నారు. నాకు దగ్గరగా రావడానికి ప్రయత్నించారు" అని ఆరోపించారు. మొత్తం వ్యవహారంపై రాష్ట్రపతి కార్యాలయానికి ఈమెయిల్ పంపానని వెల్లడించారు. ఈ వ్యవహారంపై సీనియర్ అధికారి స్పందిస్తూ తనపై ఆమె తప్పుడు ఆరోపణలు చేశారని చెప్పారు. ఆమె తన కార్యాలయంలో ఉన్నప్పుడు ఎవరో ఒకరు ఉండేలా ప్రయత్నించానని, ఒకటి రెండు సందర్భాల్లో కొన్ని నిమిషాలు తప్ప ఎప్పుడూ ఆమె తన కార్యాలయంలో ఒంటరిగా లేరని స్పష్టం చేశారు. అవసరమయిన అన్ని అనుమతులు వచ్చిన దస్త్రాల్లో తప్పులు వెదకడం సరికాదని తాను సలహా ఇచ్చానన్నారు.

EDUCATION
★ B.Sc-Veterinary Science-4Yrs -Elig: Bi.P.C, B.Sc-Agri-4Yrs-Elig: Bi.P.C/ M.P.C., UGC Recog-Elig. for Govt./ Pvt. Jobs. Placements assistance. For admissions Cont: ASIAN, VJA. ✆ 96664 18333/ 96668 56444.

కూటముల కోసం మా నేతల ప్రయోజనాలను విస్మరించం: కాంగ్రెస్

దిల్లీ: ప్రాంతీయంగా వివిధ పార్టీలతో భాగస్వామ్యాలు ఏర్పర్చుకునే పేరుతో ఆయా రాష్ట్రాల్లో తమ పార్టీ నేతలను విస్మరించబోమని కాంగ్రెస్ ఆదివారం స్పష్టం చేసింది. సైద్ధాంతికంగా సారూప్యం ఉన్న పార్టీలతో కలిసి పని చేసే విధానం పార్టీకి ఉన్నా తమ పార్టీకి చెందిన రాష్ట్రాల నేతల ప్రయోజనాలను, కార్యకర్తల ఆకాంక్షలను త్యాగం చేయబోమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి ఎ.కె.ఆంటోనీ నేతృత్వంలోని కమిటీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలతో, ఆయా రాష్ట్రాల పార్టీ పర్యవేక్షకులతో చర్చించిన తర్వాత కూటములపై తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్రాలవారీగా భాగస్వామ్య ఏర్పాట్లు ఉంటాయని సుర్జేవాలా చెప్పారు. ఎన్‌డీఏ వ్యతిరేక కూటమికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో సీట్ల పంపకంలో తమకు ఎక్కువ వాటా దక్కాలన్న ప్రాంతీయ పార్టీల డిమాండ్‌ను ఆ పార్టీ ఎదుర్కోవాల్సి ఉంటుంది. రాష్ట్రాల వారీ భాగస్వామ్యాలపై కొన్ని రాష్ట్రాల్లో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

మీరేం చేశారో ముందు చెప్పండి

- రాహుల్ వ్యాఖ్యలపై అమిత్‌షా అభ్యంతరం
- కాంగ్రెస్ పేలవ పాలనపై నిలదీయాలని పిలుపు
- ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ అధికారం తమదేనని ఉద్ఘాటన

అంబికాపూర్ (ఛత్తీస్‌గఢ్): ప్రజల వద్దకు ఓట్లు అడగడానికి వెళ్లినప్పుడు తాము చేసిన ప్రతీ పైసా ఖర్చుకూ లెక్కలు చెబుతామని భాజపా అధ్యక్షుడు అమిత్‌షా స్పష్టంచేశారు. నాలుగేళ్ల పాలనలో ఎన్డీఏ ఏం సాధించిందో చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ లెక్కలడగడంపై ఆక్షేపణ వ్యక్తంచేశారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం ఎందుకు అభివృద్ధి సాధించలేకపోయిందో ముందుగా వివరించాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో షా ప్రసంగించారు. 'రాహుల్ బాబా! నాలుగేళ్ల మా పాలనపై మీరెందుకు వివరాలు అడుగుతున్నారు? ఆ లెక్కలు మీకు చెప్పాల్సిన అవసరం మాకెంతమాత్రం లేదు. ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు ప్రతీ క్షణానికి, ప్రతీ పైసాకు లెక్క మేమే చెబుతాం. మీ కుటుంబం నాలుగు తరాల పాటు దేశాన్ని పాలించింది. అయినా ఎందుకు ఎలాంటి అభివృద్ధీ సాధించలేకపోయింది?' అని ప్రశ్నించారు. పేదలు, రైతులు, బడుగు వర్గాలవారి కోసం నరేంద్రమోదీ సర్కారు ప్రతీ 15 రోజులకు ఒకటి చొప్పున కొత్త పథకాలను ప్రారంభిస్తూ వస్తోందని చెప్పారు. భాజపా ప్రగతిని ప్రశ్నించేముందు రాహుల్‌గాంధీ ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.



వేసవి వస్తే విహారానికి వెళ్లిపోతారు...

'వేసవి వస్తే చాలు మీరు (రాహుల్) ఐరోపా, ఇటలీల్లో విహారానికి వెళ్లిపోతారు. ఓట్లు అడగడానికి రాహుల్ వచ్చినప్పుడు ఆ పార్టీ పేలవ పనితీరును గురించి మీరు అడగకుండా ఉంటారా?' అని ఓటర్లనుద్దేశించి ప్రశ్నించారు. తరచూ సరిహద్దు అవతలి నుంచి కాల్పులు జరుగుతూ వచ్చినా కాంగ్రెస్ పాలనలో ఎన్నడూ దీటైన సమాధానం చెప్పలేదనీ, మోదీ సర్కారు మాత్రం మెరుపుదాడులతో జవాబిచ్చి ప్రతీకారం తీర్చుకుందనీ గుర్తుచేశారు. ఛత్తీస్‌గఢ్‌లో 90కి గానూ 65 శాసనసభ స్థానాలను దక్కించుకోవాలని కమలం శ్రేణులకు పిలుపునిచ్చారు. పదిహేనేళ్లుగా అధికారంలో ఉన్న రమణ్‌సింగ్ సర్కారు మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు.

kotak Securities

ఫ్రీ ఇంట్రాడే ట్రేడింగ్

క్యాష్, ఫ్యూచర్స్ మరియు ఆప్షన్స్‌లో

మీ ఫ్రీ ఇంట్రాడే ట్రేడింగ్ అకౌంట్‌ని తెరవడానికి
FIT అని 56161కి SMS పంపండి
లేదా 70667 70667కి మిస్డ్ కాల్ ఇవ్వండి

Terms and Conditions apply.

#FIT

సాంవత్సరిక సబ్‌స్క్రిప్షన్ ఫీ ₹999 వర్తిస్తుంది.

Kotak Securities Limited. Registered Office: 27 BKC, C 27, G Block, Bandra Kurla Complex, Bandra (E), Mumbai 400051. CIN: U99999MH1994PLC134051, Telephone No.: +22 43360000, Fax No.: +22 67132430. Website: www.kotaksecurities.com. Correspondence Address: Infinity IT Park, Bldg. No 21, Opp. Film City Road, A K Vaidya Marg, Malad (East), Mumbai 400097. Telephone No: 42856825. SEBI Registration No: NSE INB/INF/INE 230808130, BSE INB 010808153/INF 011133230, MSE INE 260808130/INB 260808135/INF 260808135, AMFI ARN 0164, PMS INP000000258 and Research Analyst INH000000586. NSDL/CDSL: IN-DP-NSDL-23-97. Brokerage will not exceed the SEBI prescribed limit. To avail the benefits of Free Intraday Trading product, customers need to open an account with Kotak Securities. Terms and conditions apply. Investments in securities market are subject to market risks, read all the related documents carefully before investing. Disclaimer: http://bit.ly/TCfit

'బడి పిలుస్తోంది' గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు, కమిషనర్ సంధ్యారాణి, ఎస్పీడీ శ్రీనివాసరావు

2019 నాటికి సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచాలి
- మంత్రి గంటా శ్రీనివాసరావు

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: రాష్ట్రాన్ని 2019 నాటికి సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని విద్యాశాఖ సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి, ఎస్పీడీ శ్రీనివాసరావు, 13 జిల్లాల డీఈవోలు, సర్వశిక్ష అభియాన్ పీవోలతో విశాఖలోని పుడా కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక తగ్గుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విషయంలో 13 జిల్లాల మధ్య స్నేహపూర్వక పోటీ పెట్టాలని సూచించారు. నెల్లూరు జిల్లాలో పునాది కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని, ఇలాంటి విధానాలు ఎవరు అమలుచేసినా ఇతర అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల దోపిడీపై దృష్టి సారించడం లేదనే అపవాదును తొలగించుకోవాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనంలో ఇకపై వారానికి ఐదు రోజులు గుడ్డు ఇవ్వనున్నామని అన్నారు. గతేడాది తొమ్మిదో తరగతి విద్యార్థులకే 'బడికొస్తా' కింద సైకిళ్లు ఇచ్చామని, ఇప్పుడు ఎనిమిదో తరగతి విద్యార్థులకూ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ ఏడాది కేజీబీవీల్లో ఆన్‌లైన్ ద్వారా ఆరో తరగతి ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

'దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి'

గాంధీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: జనాభాలో సగభాగం ఉన్న బీసీలు, ఇతర కులాలకు రాజకీయపార్టీలు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సమాఖ్య సంక్షేమ సంఘం రాష్ట్ర సమన్వయ కమిటీ నూతన కన్వీనర్ గుండారి వెంకటేశ్వరరావు కోరారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ఆయా రాజకీయపార్టీలకు బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఆదివారం విజయవాడలోని గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో.. కమిటీ కన్వీనర్‌గా గుండారి వెంకటేశ్వరరావును ఎంపిక చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు అన్యాయం జరుగకుండా రాష్ట్రంలోని కాపులకు ఏ విధంగా రిజర్వేషన్లు కల్పిస్తారో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన 12 ఒక్క హామీనీ తెదేపా అమలు చేయలేదని విమర్శించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వారపు రామారావు, గొరవర్తస్వామి, బలాపురం వెంకయ్య మాట్లాడుతూ.. జనాభాలో 50శాతం పైగా ఉన్న బీసీలు, ఇతర కులాలను విస్మరించడం విచారకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు చట్టసభల్లో వెనుకబడిన కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విజయవాడ నగర డిప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణారావు, సంఘం నాయకులు నమ్మి అప్పారావు, ఎన్.వి.రావు, యానాదయ్య, వై.కోటేశ్వరరావు, రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుండారి వెంకటేశ్వరరావుని అభినందిస్తున్న సభ్యులు

పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అంతర్జాతీయ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ డిమాండ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: పద్మశాలీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతూ పద్మశాలి అంతర్జాతీయ సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ తీర్మానించింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆదివారం కేంద్ర కమిటీ సమావేశం సంఘం అధ్యక్షుడు స్వర్గం పుల్లారావు అధ్యక్షతన జరిగింది. ఏపీతో పాటు తెలంగాణకు చెందిన కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్న సమావేశంలో కీలక తీర్మానాలు ఆమోదించారు. రాష్ట్ర జనాభాలో 13 శాతం మంది చేనేత వర్గాలు ఉండగా అందులో తొమ్మిది శాతం పద్మశాలీలు ఉన్నారని కనుక తక్షణం పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని సమావేశం కోరింది. చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని మరో తీర్మానం ఆమోదించింది. చేనేత ఉత్పత్తుల ముడి సరుకులపై రాయితీలు ప్రకటించాలని, తమిళనాడు తరహాలో చేనేత కార్మికులకు వందయూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలని, బడ్జెట్‌లో చేనేతకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, కార్మికుల కుటుంబాలకు రూ.2లక్షల ఆరోగ్య బీమా వర్తింపజేయాలని సమావేశం కోరింది. కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కేంద్ర కమిటీ కోశాధికారి దుర్గాప్రసాద్, సహాయక కార్యదర్శి ముదునురు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు సింగరి ప్రభాకర్, కేంద్ర కమిటీ సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, వీరరాఘవయ్య, రామచంద్రరావు, గిరిధరరావు, సత్యపాల్‌ఠాగో తదితరులు పాల్గొన్నారు.

పుల్లారావు

ఎలిషింగ్ కాళ్లు, చేతులు ఉన్న 26 వేళ్లు

కాళ్లు, చేతులకు 26వేళ్లు

ప్రతి మనిషికి కాళ్లకు, చేతులకు కలిపి 20 వేళ్లు ఉండటం సర్వసాధారణం. కానీ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణానికి చెందిన ఎలిషింగ్‌కు కాళ్లకు 14, చేతులకు 12 వేళ్లు న్నాయి. మొత్తం కలిపి 26వేళ్లు. బీటెక్ చదువుతున్న ఇతనికి కాళ్లలో ప్రత్యేక గుర్తింపు ఉంది. బంధువులు మాత్రం ఇతనికి అధికంగా వేళ్లు ఉండటం అదృష్టమని భావిస్తున్నారు. ఎలిషింగ్‌కు 26వేళ్లు ఉండటం అరుదైన విషయమని ఖమ్మం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మదన్‌సింగ్ తెలిపారు.

– ఇల్లెందు, న్యూస్‌టుడే

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada - 520002 (A.P.)
NOTICE INVITING TENDERS (NIT) No: CRDA - 14024(34) 28/2018 Dt: 08.06.2018
Request for Proposal for Selection of Architect for providing Comprehensive Architectural Services for Development of Residential Towers in Amaravati, Andhra Pradesh
•APCRDA has embarked on development of Housing (residential towers) with common amenities to cater to the housing needs of Amaravati, the new capital city of Andhra Pradesh
•In this regard, APCRDA hereby invites proposals from reputed Architects for providing Comprehensive Architectural Services for Development of Residential Towers (about 1000 housing units) in Amaravati, Andhra Pradesh
•Request for Proposal document may be downloaded from APCRDA website (https://crda.ap.gov.in)
•Due date and time for receipt of proposals : 02/07/2018 at 15:00 hrs
For further details, Please Contact: Shri P.V.Ramana Rao, Sr. Urban Planner & Architect, Mobile: 9959358880, Email-id: pvr@apcrda.org
Sd/- Commissioner, APCRDA

ఘనమైన ఆశయం.. నిర్వహణ అధ్వానం

కొండవాలు ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలో ఇంకింపజేసి గ్రామాలకు తాగు నీరు అందించే పథకం ఇది. విద్యుత్తు అవసరం లేకుండానే గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా దేశంలోనే తొలిసారిగా (ఇలాంటి పద్ధతిని సైఫన్ అని పిలుస్తారు) చిత్తూరు జిల్లా సోమల మండలం ఉప్పరపల్లె గ్రామం పులికోన ప్రాంతంలో 2004లో ప్రారంభించారు. మూడు కొండలు కలిసే ప్రాంతం కావున అప్పట్లో ఈ ప్రదేశాన్ని ఎన్నుకున్నారు. ముందుగా కొండవాలులో చెక్‌డ్యాం ఏర్పాటు చేశారు. దానికి 50 అడుగుల దిగువన ఒక బావిని ఏర్పాటు చేశారు. ఈ బావిలో నీటిమట్టం పెరిగినప్పుడు బావి దిగువన పైపు లైన్ ఏర్పాటు చేసి గ్రామాలకు నీరందించారు. అప్పట్లో ఈ పథకం విజయవంతమైంది. కొన్నేళ్లపాటు శీలయ్యగారిపల్లి, గురికానివారిపల్లి, గట్టువారిపల్లి గ్రామాలకు నీరందించి శభాష్ అని పించుకున్నారు. దీన్ని పరిశీలించేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి ఇంజినీర్లు సైతం వచ్చారు. క్రమంగా దీని నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో పైపు లన్నీ పగిలిపోయి అస్తవ్యస్తంగా మారాయి. ప్రస్తుతం పూర్తిగా నిరుపయోగంగా మారి బావిలోని నీరంతా వృథాగా పోతోంది. ప్రతిసారీ బిల్లులు పొందుపుగా వాడాల్సిన ప్రస్తుత తరుణంలో ఈ పథకాన్ని వినియోగంలోకి తీసుకురావడం, ఇలాంటివి మరిన్ని ఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకం

– ఈనాడు, చిత్తూరు

'దారి'మార్చి.. ఏమార్చి

- 30 నిమిషాల్లో డబ్బులేస్తావా?
- జైలుకు పంపమంటావా?
- కేసుల పేరిట బెదిరింపులు
- ఫోన్ల ద్వారా నయా దోపిడీ
- సైబర్ నేరగాళ్ల దందా

ఈనాడు – అమరావతి

సైబర్ నేరగాడు: హలో! మాట్లాడేది ప్రశాంతేనా?

ప్రశాంత్: అవును నేనే... చెప్పండి! ఎవరు మీరు?

సై: నేను ఢిల్లీ న్యాయస్థానంలోని రిమాండు విభాగం నుంచి మాట్లాడుతున్నా.

ప్ర: ఏం కావాలి! నాకెందుకు ఫోన్ చేశారు?

సై: మీపై ఓ ప్రైవేటు సంస్థ ఇక్కడ వినియోగదారుల ఫోరంలో కేసు వేసింది. రేపు ఉదయానికల్లా ఢిల్లీకి రాకపోతే మీ ఇంటికే స్థానిక పోలీసులను పంపించి జైలుకు పంపిస్తాం. (స్వరం పెంచి సంభాషిస్తూ...)

ప్ర: నేనేమి చేశాను.. నేనెప్పుడూ ఢిల్లీ కూడా రాలేదే. నాపై కేసేమిటి?

సై: మీరు ఆ ప్రైవేటుసంస్థకు చెల్లించాల్సిన బిల్లులు కట్టకుండా ఎగవేశారు...మీపై 420 చీటింగ్ కేసు నమోదైంది. వచ్చారో సరే లేదంటే జైలే (భయపెట్టే ధోరణిలో...)

బ్యాంకుల నుంచి ఫోన్లు చేస్తున్నామని నమ్మించి... ఏటీఎం రహస్య సంకేతాలు, డెబిట్, క్రెడిట్ కార్డులపై ఉన్న అంకెలు చెప్పమని...నిన్నమొన్నటి వరకూ ఖాతాదారుల సొమ్ములు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు తాజాగా తమ 'దారి' మార్చారు. ఇప్పుడు తమను తాము పోలీసు అధికారులుగా, న్యాయవాదులుగా ఫోన్లలో పరిచయం చేసుకుంటూ..."మీ పై కేసులున్నాయ"ని భయపెడుతూ సైబర్ నేరస్థులు సరికొత్త తరహాలో కొత్త మోసాలకు తెరతీస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ గత రెండు, మూడు నెలల వ్యవధిలో ఈ తరహా సైబర్ నేరాలు విస్తృతంగా చోటు చేసుకుంటున్నాయి. రోజూ కొన్ని వేల మందికి ఇలాంటి ఫోన్ కాల్స్ వెల్లువెత్తుతున్నాయి. ఇవి నిజమేనని నమ్మి కొందరు, భయంతో మరికొందరు వారు అడిగిన బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ భారీగా నష్టపోతున్నారు. మూడుదశల్లో వారు ఈ దందాను కొనసాగిస్తున్నారు.

అది ఎలాగంటే...

దశ-1: బ్రాడ్‌బ్యాండ్ నెట్ కనెక్షన్, ఫోన్, ఇతరత్రా అనేక రకాల సేవలకు సంబంధించి సకాలంలో బిల్లులు చెల్లించని వారి ఫోన్ నెంబర్లను సైబర్ నేరాల ముఠాల సభ్యులు సేకరిస్తున్నారు. ఆ జాబితాలోని నెంబర్లు ఆధారంగా సంబంధిత వ్యక్తులకు ఫోన్లు చేసి పైన పేర్కొన్న సంభాషణల తరహాలో కేసులు, అరెస్టుల బూచీ చూపించి భయపెట్టే ప్రయత్నం చేస్తారు. ఆ మాటలు విని ఐవతలి వ్యక్తి "నిజమే! గతంలో ఫలానా బిల్లు చెల్లించలేదు కదా! అని పెండింగ్‌లో ఉంది కదా!" అని ఏ మాత్రమైనా ఆలోచనలో పడి అటు కేసు మిటో తెలుసుకుందామని వివరాలు అడిగేందుకు ప్రయత్నిస్తే మరింత భయపెడ్తారు.

దానికి సంబంధించిన సమాచారం తమ న్యాయవాది ద్వారా తెలుసుకోవాలని సూచిస్తారు. తమ ఫోన్ నెంబర్‌కి కాకుండా మరో నెంబరు (ఏవో కొన్ని అంకెలు) చెబుతారు. వారి ఫోన్లకు స్పందించకపోయినా తరచూ కాల్ చేస్తూ నిజంగానే కేసు ఉందేమోనని నమ్మేలా బెదిరిస్తారు.

దశ-2: ఈ దశలో మరో సైబర్ నేరగాడు ఫోన్ చేసి తనను తాను ఢిల్లీ న్యాయస్థానంలోని రిమాండ్ విభాగంలో సీనియర్ న్యాయవాదిగా పరిచయం చేసుకుంటాడు. కేసు పూర్వాపరాలంటూ ఏవో కొన్ని వివరాలు చెప్తి అవన్నీ నిజమేనని నమ్మేలా చేస్తాడు. అరగంటలోగా నాకు రూ.10 వేలు వేస్తే మీపైన ఉన్న కేసు తీయించేస్తా, అరెస్టు కూడా ఉండదు. ఆలస్యం చేశారో రూ.50 వేలు అపరాధరుసుం కట్టల్సి ఉంటుంది. ఎన్ని రోజులు జాప్యం చేస్తే అంత చెల్లించాలి. అరెస్టూ తప్పదని బెదిరిస్తారు. ఇప్పటికే స్థానిక పోలీసులతో మాట్లాడాను.. రేపే మీ ఇంటికి వారు వస్తారని చెప్పి భయపెడతారు. వాటికి లొంగితే ఆన్‌లైన్ లేదా పేటీఎంలో సొమ్ము చెల్లించమని డిమాండు చేస్తారు.

దశ-3: అతను చెప్పిన ఖాతాలో అరగంట వ్యవధిలో డబ్బులు జమ చేశారో సరే...లేదంటే ప్రతి రెండు నిమిషాలకొకసారి ఫోన్లు వస్తూనే ఉంటాయి. బెదిరింపులు తారాస్థాయికి చేరుతాయి. డబ్బులు చెల్లించేసిన మరుక్షణం వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ అయిపోయి మూగబోతాయి. ఇవతలి వ్యక్తి బాధితుడిగా మిగిలిపోతున్నాడు.

పోలీసు యంత్రాంగం విఫలం

ఎప్పటికప్పుడు సైబర్ నేరగాళ్లు తమ దారి మార్చేసి ఇలా కొత్తతరహా నేరాలకు పాల్పడుతుంటే వారిని గుర్తించి పట్టుకోవడంలో పోలీసు యంత్రాంగం విఫలమవుతోందన్న విమర్శలు వినవస్తున్నాయి. సైబర్ నేరాల దర్యాప్తు, వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో క్షేత్రస్థాయిలో సన్నద్ధత లేదు. పోలీసుల దర్యాప్తు మొదలయ్యేసరికే సైబర్ నేరగాళ్లు తమ ఉనికి తెలియకుండా ఆధారాలు లభించకుండా జాగ్రత్త పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారి బ్యాంకుఖాతాల వివరాలు, ఫోన్ నెంబర్లు తెలిసినా అవి ఇతర వ్యక్తుల పేరిట ఉంటున్నాయి. ఓ సైబర్ నేరగాడి ఆచూకీ పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని కాలానికి తగ్గట్టు దూసుకుపోతుంటే.. వాటిని నియంత్రించే సన్నద్ధత ఈ విభాగాలకు ఉండటం లేదు. దాంతో కేసుల సంఖ్య పెరుగుతోంది. పలువురు మోసపోతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సైబర్ నేరాల తీరు ఇలా..

సంవత్సరం	సంఖ్య
2016	762
2017	1228
2018	404 (ఏప్రిల్ వరకు)

కేంద్ర కారాగారం ఖైదీల విడుదల

నెల్లూరు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కొన్ని కేంద్ర కారాగారాలలో ఖైదీలు 49మంది విడుదలలో భాగంగా ఆదివారం నెల్లూరులో ముగ్గురికి విముక్తి లభించింది. విడుదలైన వారిలో వైఎస్ రాజారెడ్డి హత్య కేసులో ఎ13 ముద్దాయి రాగిపిండి సుధాకర్‌రెడ్డి ఉన్నారు. ఆయన 11 ఏళ్ల 10 నెలల జైలు జీవితం గడిపారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి 18 మంది ఖైదీలను విడుదల చేశారు. క్షమాభిక్షను హోంశాఖ రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఖైదీలను ఎంపికచేశారు.

'కియా'తో రాష్ట్రానికి కొరియా పర్యాటక శోభ

ఈనాడు, అమరావతి: కియా కార్ల కంపెనీ ఏర్పాటుతో రాష్ట్రానికి కొత్త పర్యాటకశోభ రానుంది. దక్షిణ కొరియా నుంచి వచ్చే సందర్శకుల సంఖ్య పెరగనుండడంతో వారికి అవసరమైన అన్ని హంగులు సమకూర్చడంపై పర్యాటకశాఖ దృష్టి సారించింది. కియా కార్ల ప్లాంటు నిర్మాణంలో భాగంగా కొరియా నుంచి ఉద్యోగులు పెద్దఎత్తున రాసుండడంతోపాటు...ఆ దేశం నుంచి వచ్చే సందర్శకుల సంఖ్య కూడా పెరగనుండడంతో రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో కొరియా పర్యాటకులను ఆకర్షించేందుకు ఉన్న అవకాశాలపై పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) దృష్టి సారించింది. వారి అభిరుచులను అధ్యయనం చేయడంతో పాటు ఏపీలో కొరియన్ హోటళ్ల ఏర్పాటుకోసం అక్కడి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు ఏపీటీడీసీ ఎండీ హిమాన్షుశుక్లా ఈ నెల 14 నుంచి కొరియాలో పర్యటించనున్నారు. అక్కడ జరుగుతున్న ప్రపంచ ట్రావెల్ టూర్-2018 పాల్గొంటారు. ఏపీలోని బుద్ధిజం ప్రత్యేకతలను చాటి ప్రదర్శనను ఇవ్వనున్నారు. ఈ సదస్సులో ప్రత్యేకంగా కొరియన్ నగరాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కొరియన్ పర్యాటకు...

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

సీపీఎస్ రద్దుకు పోరుబాట

- జులై 8న గుంటూరులో సభ
- దశలవారీగా ఉద్యమం
- ఏపీ జేఏసీ అమరావతి వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: సీపీఎస్(కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. జులై 8న 'గుంటూరు గర్జన' పేరుతో ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నిర్వహించనున్న ర్యాలీ, సభకు పూర్తి మద్దతునిస్తున్నట్లు వెల్లడించింది. దశల వారీగా ఉద్యమించి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని ప్రకటించింది. విజయవాడలో ఉన్న ఏపీ పీఆర్సీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని, 11వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలని విజ్ఞప్తి చేసింది. ప్రత్యేకహోదా, విభజన హామీల సాధనలో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతునిస్తూ, ఉద్యమంలో భాగస్వాములవుతామని ప్రకటించింది. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. జేఏసీలోని అన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడుతూ.. పదో పీఆర్సీ బకాయిలను తక్షణమే విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులకు వేతనాల బిల్లులు చేసే అధికారాన్ని(డ్రాయింగ్ అండ్ డిస్‌బర్స్‌మెంట్) తగ్గించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. 1993కు ముందు వివిధ శాఖల్లో తాత్కాలిక ప్రాతిపదికన తీసుకున్న ఉద్యోగులను ఆశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. 70 సంవత్సరాలు నిండిన పింఛనుదార్లకు 15 శాతం పెన్షన్ అదనంగా చెల్లించాలన్న సిఫార్సులను అమలు చేయాలని కోరారు. అద్దె వాహనాల వినియోగంలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, ఈ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ డ్రైవర్ల వ్యవస్థను కొనసాగించాలన్నారు. విశాఖపట్నం, విజయవాడ నగరపాలిక ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన 7 ఉద్యోగ సంఘాలు జేఏసీలో చేరినట్లు వివరించారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి సెక్రెటరీ జనరల్ పణితి రాజు, అఖిల భారత వాణిజ్య పన్నుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ

- జులై 8న 'గుంటూరు గర్జన' సభ
- జులై 14న 'కర్నూలు పోరుబాట' సభ
- ఆగస్టు 4న అన్ని కలెక్టరేట్ల ముందు సీపీఎస్ విధానంలోని ఉద్యోగుల కుటుంబాలతో ధర్నా
- సెప్టెంబర్ 1న 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమం

స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీకే మద్దతు

కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం

కాకినాడ, న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో కాపులకు న్యాయం చేస్తామని బలమైన హామీ ఇచ్చే పార్టీకే తమ మద్దతు ఉంటుందని, ఇప్పటికి ఆ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలం చెముడులంకలో కాపు నాయకుడు నైనాల హరిశ్చంద్రప్రసాద్ నివాసంలో ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 13 జిల్లాల కాపు నాయకులతో చర్చించి ఎన్నికల ముందు తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. తాను వేరే పార్టీకి వారికి మద్దతు ఇవ్వనున్నానని చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. కాపులను బీసీల్లో చేర్చుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో నెరవేర్చడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాను కాపులంతా ఓడించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కాపుల విషయంలో చిత్తశుద్ధిగా వ్యవహరించి, రిజర్వేషన్లు అమలు చేయాలని ముద్రగడ డిమాండ్ చేశారు. సమావేశంలో కాపు ఐకాస నాయకులు ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణు, గిరిజాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నల్లపాడు-బీబీనగర్ తుది సర్వే పూర్తి

ఈనాడు, హైదరాబాద్: బీబీనగర్-నల్లపాడు మధ్య రెండో లైను నిర్మాణానికి సంబంధించిన తుది సర్వే ఎట్టకేలకు పూర్తయ్యింది. ఈ మార్గంలో విద్యుదీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మార్గంలో విష్ణుపురం వద్ద బైపాస్ నిర్మించాలని ప్రతిపాదించారు. తెలుగు రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న రెండు ప్రధాన రైలు మార్గాల్లో ఈ బైపాస్‌తో అనుసంధానం చేసే అవకాశముంటుంది. తుది సర్వే నివేదిక రైల్వే బోర్డుకు చేరింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కీలక మార్గాల్లో ఒకటైన సికింద్రాబాద్-గుంటూరు లైనులో చాలావరకు సింగిల్ లైనే ఉంది. బీబీనగర్ నుంచి నల్లపాడు వరకు 243 కిమీ మేర డబ్లింగ్ చేయాల్సి ఉంది. చాలా ఏళ్లుగా ఈ డిమాండ్ ఉంది. 2016లో సర్వేకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. 2017 ఆఖరులో సర్వే ప్రక్రియ పూర్తయింది. విష్ణుపురం నుంచి జాన్ పహాడ్ మీదుగా జగ్గయ్యపేట వరకు రైలు మార్గం పూర్తిగా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఆ మార్గంతో అనుసంధానం అంశాన్ని చేర్చడంతో సర్వే నివేదిక రైల్వే బోర్డుకు పంపడం ఆలస్యమైంది. దీంతో 2017-18 బడ్జెట్లో నల్లపాడు-బీబీనగర్ రెండోలైను మార్గం ఆమోదంపై నిర్ణయం వెలువడలేదు. ఆ తర్వాత విష్ణుపురం వద్ద బైపాస్‌పై సర్వే చేశారు. అనంతరం తుది సర్వే నివేదికను రైల్వే బోర్డుకు దక్షిణ మధ్య రైల్వే పంపింది.

ఒప్పంద విధానం రద్దు చేయాలి

- ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు డిమాండ్

ఈనాడు డిజిటల్, అమరావతి-గాంధీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: ఒప్పంద విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాలని ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు డిమాండ్ చేశారు. ఒప్పంద ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని కోరారు. వైద్యారోగ్య శాఖ ఒప్పంద ఉద్యోగుల ఆధ్వర్యంలో విజయవాడలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. గాంధీనగర్‌లో నిర్వహించిన మరో కార్యక్రమంలో మహిళావిభాగం, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల ఆహ్వానను ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. ఈ నెల 14, 15వ తేదీల్లో విజయవాడలో అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగనున్నాయని తెలిపారు. ఐకాస ఎన్నికల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడిగా ఎ.సుబ్బరాజు, ఉపాధ్యక్షులుగా ఎం.విహారిక, జె.సత్యనారాయణ, వై.జయలక్ష్మి, కె.మంజువాణి, సెక్రటరీ జనరల్‌గా వి.లీలావతి, కోశాధికారిగా సి.హెచ్.శ్రీనివాస్, కార్యదర్శిగా పి.పద్మావతి, సహాయ కార్యదర్శిగా కె.లక్ష్మీనారాయణ, పి.భారతి, టి.లలితమ్మ ఎన్నికయ్యారు.

విద్యుత్తు సంస్థల్లో పెట్టుబడులకు సీఎం పచ్చజెండా

ఈనాడు, అమరావతి: విద్యుత్తు సంస్థల్లో రూ.4,200 కోట్ల పెట్టుబడులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చజెండా ఊపారని ఇంధనశాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో భూగర్భ కేబుల్ పనులకు రూ.720 కోట్లు వ్యయం చేయనున్నట్లు తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అంతరాయం లేని విద్యుత్తు సరఫరా అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారని అందులో పేర్కొంది. నిరంతర విద్యుత్తు, నీటి సరఫరా కారణంగానే కియా మోటార్స్ లాంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు వెల్లడించింది. వినియోగదారుల సంతృప్తిస్థాయి పెంచేలా పనిచేస్తున్న ఉద్యోగులను ప్రోత్సహించేందుకు అవార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఇంధనశాఖ మంత్రి కళా వెంకట్రావు, సీఆర్‌డీఏ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ ముఖ్యమంత్రికి వివరించినట్లు పేర్కొంది.

డీజిల్ ధరలు పెరిగినా.. అదే రాయితీ

- నేటికీ 16 ఏళ్ల క్రితం విధానమే అమలు
- సబ్సిడీ పెంపు కోరుతున్న మత్స్యకారులు

ఈనాడు – అమరావతి

డీజిల్ ధరలు గత కొన్నాళ్లుగా అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఇందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇవ్వకపోవడంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో డీజిల్ ధర లీటరు రూ.33 ఉన్నప్పుడు ప్రభుత్వం లీటరుకు రూ.6.03 చొప్పున రాయితీ ప్రకటించింది. గత పదహారేళ్లుగా ఇదే విధానాన్ని అమలు చేస్తోంది. నాటితో పోలిస్తే డీజిల్ ధర భారీగా పెరిగి ప్రస్తుతం లీటరు రూ.75 స్థాయికి చేరినా.. రాయితీ ధరలు ఇవ్వలేదే కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.60 లక్షల మంది మత్స్యకారులున్నారు. 32,750 పడవల ద్వారా చేపల వేట సాగిస్తున్నారు. ఇందులో రెండు వేలకు పైగా మెకనైజ్డ్(పెద్ద పడవలు), 16వేల వరకు మోటారైజ్డ్(చిన్న పడవలు) ఉన్నాయి. వీటికి అవసరమయ్యే డీజిల్‌పై రాష్ట్రం రూ.6.03 అందిస్తోంది. పెద్ద పడవలకు నెలకు 3 వేల లీటర్లు, చిన్న పడవలకు నెలకు 300 లీటర్ల చొప్పున రాయితీ అందిస్తోంది. ఇందుకు ఏటా రూ.30 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. దీనికి తోడు కేంద్రం కూడా మొదట్లో రాయితీ ఇచ్చేది. తర్వాత నిలిపేసింది.

కొత్త వెసులుబాటు

సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల పడవలకు రాయితీ ఇచ్చే విధానం 2002లో ప్రారంభమైంది. ఇందుకు అప్పటికలకు నమోదు చేసుకున్న పడవలను పరిగణనలోకి తీసుకున్నారు. తిరిగి ఇప్పటివరకు కొత్త పడవల నమోదు చేపట్టలేదు. వాస్తవానికి ఇన్నేళ్లపాటు వినియోగానికి పడవల జీవితకాలమే పూర్తవుతుంది. గత 16 ఏళ్లలో కొత్త పడవలు కొనుక్కున్న వారికి ప్రయోజనాలు అందడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి కొత్త పడవలను రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. నిరుడు దాకా ఉన్న రూ.30 కోట్ల బడ్జెటును రూ.52 కోట్లకు పెంచింది. దీనివల్ల పడవల నమోదు పెరగనుండడంతోపాటు ఎక్కువమందికి లబ్ధి కలుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

కొత్త రాయితీని ప్రకటించాలి..

కొత్త పడవల నమోదుతో ఊరట లభించినా.. ప్రస్తుత విధానం 16 ఏళ్ల కిందటిదే కొనసాగుతోంది. ప్రస్తుతం పెరిగిన ధరల ప్రకారం డీజిల్‌పై రాయితీ కనీసం రూ.13 వరకు పెంచాల్సిన అవసరముందని మత్స్యకారులు వాదన. గుజరాత్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ రాయితీ ఎక్కువగా ఇస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు, తమిళనాడులో రాయితీ సొమ్ము ముందే మినహాయించుకుంటారు.. రాష్ట్రంలో మాత్రం బిల్లులు సమర్పించిన తర్వాత నిధులివ్వడంతో జాప్యం జరుగుతుందని వారు పేర్కొంటున్నారు. ఒకసారి వేటకు వెళ్లి వచ్చే పెద్ద పడవలకైతే 2,500 లీటర్ల పైన, చిన్న పడవలకూ 200 లీటర్ల వరకు ఖర్చవుతుందని వారు వివరిస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నెలవారీగా ఇచ్చే డీజిల్ పరిమాణాన్ని రెట్టింపు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నారు.

రాజ్‌భవన్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలో ప్రేమభిమానాలే శాశ్వతంగా నిలుస్తాయని, ఎంతో చిన్నదైన జీవితంలో అందరితో కలిసి మెలిసి ఉండాలని గవర్నర్ నరసింహన్ సూచించారు. రంజాన్ పుణ్యదినాలను పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో ఆయన ముస్లింలకు ఇఫ్తార్ విందునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, సభాపతి మధుసూదనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, మంత్రి నాయిని, ఎంపీ మల్లారెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ సలీం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, రంజాన్ సోదరభావానికి ప్రతీక అని, ప్రేమను పంచుతుందన్నారు. రంజాన్ తర్వాత కూడా అదే స్ఫూర్తి కొనసాగాలన్నారు. ఈ సందర్భంగా మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఉపవాస విరమణ అనంతరం ఇఫ్తార్ విందు మొదలైంది. గవర్నర్, సీఎంలు పరస్పరం ఖర్జూరాలు తినిపించుకున్నారు.

దర్జీ కుమారుడికి ఐదో ర్యాంకు

- పదో తరగతి వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే
- ఐఐటీ బొంబాయిలో కంప్యూటర్ సైన్స్‌లో చేరతామంటున్న అడ్వాన్స్‌డ్ ర్యాంకర్లు

ఈనాడు, అమరావతి: నిరుపేద దర్జీ (టైలర్) కుమారుడు మావూరి శివకృష్ణ మనోహర్ ఆదివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో ఐదో ర్యాంకు సాధించాడు. మెయిన్స్‌లో 59వ స్థానంలో నిలిచిన శివకృష్ణ అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన ప్రతిభ చాటాడు. అడ్వాన్స్‌డ్‌లో 360మార్కులకుగాను 319 సాధించాడు. విశాఖపట్నం జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంకు చెందిన నాగేశ్వరరావు, పద్మావతి దంపతుల కుమారుడు శివకృష్ణ. ఐదోతరగతి వరకు గ్రామంలోనే ఉండి, ఆరోతరగతి నుంచి పదో తరగతి వరకు జవహర్ నవోదయలో చదివాడు. ఫిట్జీ నిర్వహించిన పరీక్షలో ప్రతిభ చాటడంతో ఆ సంస్థ ఉచిత వసతి సహా ఇంటర్మీడియట్ బోధించింది.

ఉదయం 8 నుంచి అర్ధరాత్రి 12 వరకూ

'చిన్నప్పటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివా. తల్లిదండ్రులు, కళాశాలలో అధ్యాపక బృందం ప్రోత్సాహం మరువలేనిది. ప్రతి రోజూ ఉదయం ఎనిమిదింటి నుంచి అర్ధరాత్రి 12 వరకూ చదివేవాణ్ని. ఐదో ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో చేరాలనుకుంటున్నా' – మావూరి శివకృష్ణ

జిష్ణు చక్రం..

పుత్తూరు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా పుత్తూరు పురపాలిక రాచపాళెం గ్రామానికి చెందిన బసవరాజు చెంగల్రాజు, భారతి దంపతుల కుమారుడు జిష్ణు 15వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి చెంగల్రాజు శ్రీకాళహస్తి మండలం తొండమనాడు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. తల్లి అదే మండలంలోని అల్లిమడుగు ప్రభుత్వ పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిష్ణు విద్యలో రాణించాడు. హైదరాబాద్‌లోని నారాయణశ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. జేఈఈ మెయిన్స్‌లో 79వ ర్యాంకు, ఏపీ ఎంసెట్‌లో ఆరో ర్యాంకునూ సాధించాడు.

తల్లిదండ్రులతో జిష్ణు

ఐఐటీ బొంబాయిలో చేరతా..

– హేమంత్‌కుమార్, 7వ ర్యాంకు, విశాఖ

పది ర్యాంకులలోపు సాధిస్తానని ముందే ఊహించా. 316 మార్కులొచ్చాయి. ఐఐటీ బొంబాయిలో కంప్యూటర్ సైన్స్‌లో చేరతా. అంతిమ లక్ష్యంపై తుది నిర్ణయానికి రాలేదు. మా అమ్మ కరుణాదేవి, ముంబయిలో సీపీడబ్ల్యూడీ విభాగంలో పనిచేసే నాన్న శ్రీనాగరాజు నన్ను ప్రోత్సహించారు.

శాస్త్రవేత్తగా సేవలందిస్తా..

చిన్నప్పటి నుంచి శాస్త్రవేత్త కావాలనే కోరిక ఉంది. తల్లిదండ్రులు ప్రోత్సహించారు. నిత్యం పుస్తకాలు చదవడం వల్ల పరీక్షలన్నింటిలో ప్రతిభ చాటేందుకు అవకాశమేర్పడింది. ముంబయి ఐఐటీలో చేరతా.

– బసవరాజు జిష్ణు, విద్యార్థి, పుత్తూరు

ఐఏఎస్ లక్ష్యం

– సాయి అభిషేక్, 31వ ర్యాంకు, విజయనగరం జిల్లా

అడ్వాన్స్‌డ్‌లో 296 మార్కులు సాధించా. 31వ ర్యాంకుతో ఐఐటీ బొంబాయిలో కంప్యూటర్ సైన్స్ చదువుతా. ఆ తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలన్నది లక్ష్యం. దీని వల్ల ఎక్కువ మందికి సేవ చేయవచ్చు. మాది విజయనగరం జిల్లా. నాన్న రైల్వే ఉద్యోగి.

కృత్రిమ మేధపై పరిశోధిస్తా

– వినాయక శ్రీవర్ధన్, 11వ ర్యాంకు

ఐఐటీ బొంబాయిలో కంప్యూటర్ సైన్స్‌లో చేరి ఆ తర్వాత కృత్రిమ మేధపై పరిశోధిస్తా. మాది సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బోడపల్లి గ్రామం. హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నాన్న లక్ష్మణ్‌రావు ముంబయిలో ఓ ప్రైవేట్ కంపెనీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. అమ్మ రుక్మిణి గృహిణి.

ఇండియన్ ఫారెన్ సర్వీసులో చేరుతా

- ఎస్టీ కేటగిరి మొదటి ర్యాంకర్ శివతరుణ్

డోర్నకల్, న్యూస్‌టుడే: ఐఐటీ ముంబయిలో చదువుకున్నాక ఇండియన్ ఫారెన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) చేయాలన్నదే తన ఆకాంక్ష అని ఎస్టీ విభాగంలో దేశంలోనే మొదటి ర్యాంకు సాధించిన జాటోతు శివతరుణ్ వెల్లడించాడు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం బొమ్మకల్‌కు చెందిన శివతరుణ్.. మెయిన్స్‌లోనూ ఎస్టీ విభాగంలో మొదటి ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 14వ ర్యాంకు సాధించాడు. సివిల్స్‌లో ఐఎఫ్ఎస్ సాధిస్తే విదేశీ రాయబారులుగా సేవలందించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డాడు. శివతరుణ్ హైదరాబాద్ మాదాపూర్‌లోని చైనా బ్యాచ్‌లో ఇంటర్మీడియట్ చదివాడు. తండ్రి డాక్టర్ జాటోతు రామచందర్‌నాయక్, తల్లి ప్రమీల సూర్యాపేటలో ప్రైవేటు వైద్యులు.

100 లోపు ర్యాంకులు సాధించిన తెలుగు తేజాలు

పేరు	ర్యాంకు	సొంతూరు/జిల్లా
మావూరి శివకృష్ణ మనోహర్	5	విశాఖపట్నం
కేవీఆర్ హేమంత్‌కుమార్	7	విశాఖపట్నం
గోసుల వినాయక శ్రీవర్ధన్	11	సంగారెడ్డి జిల్లా
అయ్యపు వెంకటఫణివంశీనాథ్	14	హైదరాబాద్
బసవరాజు జిష్ణు	15	తిరుపతి
మేకల అన్మోల్‌రెడ్డి	26	----------
జి.సాయి అభిషేక్	31	హైదరాబాద్
ఎస్.సుమంత్ బాలాజీ	37	శ్రీకాకుళం జిల్లా
ఎం. షేక్ వాజీద్	38	హైదరాబాద్
నైనా ఆకర్ష్	40	విజయవాడ
గుంతకంటి సాయి కౌశిక్	41	హైదరాబాద్
భోగి సూరజ్‌కృష్ణ	49	శ్రీకాకుళం
బొడ్డపాటి యగ్నేశ్వర్	54	గుంటూరు
గట్టు మైత్రేయ	57	హైదరాబాద్
ఎస్.ఆనంద్ రామారావు	65	హైదరాబాద్
శశాంక్ అచ్యుతుని	62	హైదరాబాద్
పి. లోకేశ్వర్‌రెడ్డి	68	కడప
ఎం. లక్ష్మీ సాయివర్ధన్	79	విజయవాడ
గద్దె నితీష్ సమంత్	89	విజయవాడ
కందూరు వెంకటప్రతాపరెడ్డి	94	విజయవాడ
చిమటా ఖగేంద్రసాయి	98	నరసరావుపేట

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 14వ ర్యాంకు సాధించిన హైదరాబాద్‌కు చెందిన అయ్యపు వెంకట ఫణివంశీనాథ్

నారాయణ విజయదుందుభి

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ -2018 ఫలితాల్లో తమ విద్యార్థులు రికార్డుస్థాయి ర్యాంకులతో విజయదుందుభి మోగించినట్లు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పి. సింధూర నారాయణ, డైరెక్టర్ పి. శరణి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరీలో 2, 9, 10 వంటి ర్యాంకులతో పాటు అన్నికేటగిరీల్లో ఆలిండియా మొదటి పదిలోపు 13 ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. అన్ని కేటగిరీల్లో కలిపి ఆలిండియా మొదటి 100లోపు 82 ర్యాంకులు సాధించిన నంబర్‌వన్ విద్యాసంస్థ తమదేనని పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయానికి తాము రూపొందించిన ప్రణాళిక, స్టడీ మెటీరియల్ కారణమన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య అగ్రస్థానం

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ -2018 ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక ర్యాంకులతో అగ్రగామిగా నిలిచినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 1, 2, 7, 9 ర్యాంకులతో పాటు 100 లోపు 22 ర్యాంకులతో అగ్రస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. అన్ని కేటగిరీల్లో ఆలిండియా 100లోపు 63 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు వెల్లడించారు. ఇంతటి ఘనతకు తాము అందిస్తున్న అనితరసాధ్యమైన శిక్షణ, ప్రణాళిక, యాజమాన్యం అంకితభావమే ప్రధానకారణాలని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డా. బీఎస్‌రావు అభినందించారు.

ఏకాగ్రతే రహస్యం: ప్రణవ్ గోయల్



చండీగఢ్: ప్రశాంతంగా చదివే అంశాలపై ఏకాగ్రత పెట్టడమే తన విజయ రహస్యమని ఐఐటీ-జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మొదటి ర్యాంకు సాధించిన ప్రణవ్ గోయల్ తెలిపాడు. 'ఏకాగ్రత పెట్టి చదివితే చాలు.. ఎన్ని గంటలు పుస్తకాల ముందు కూర్చున్నామన్నదానితో పనేలేదు. ఉపాధ్యాయులు, వారు ఇచ్చే సూచనలపై నమ్మకం ఉండాలి. ముఖ్యంగా చదివే అంశాల గురించి స్పష్టంగా తెలుసుకోవాలి'అంటూ విజయోత్సాహంతో ప్రణవ్.. విలేకరులతో మాట్లాడాడు. గత సంవత్సర ప్రశ్నపత్రాలను క్షుణ్నంగా పరిశీలించడంతో పరీక్షపై ఓ అవగాహన వచ్చిందని వివరించాడు. తానేమీ పుస్తకాల పురుగునుకాదనీ, వినోదానికి సమయం తప్పనిసరిగా కేటాయిస్తానని వెల్లడించారు. 'రోజూ ఏడు నుంచి పది గంటలు చదివేవాణ్ని. రాత్రి నిద్రపోయే ముందు ఒక 40 నిమిషాలపాటు వినోదానికి సమయం కేటాయించేవాణ్ని. ఒత్తిడి నివారణకు కార్టూన్లు చూసేవాణ్ని. కొన్ని పుస్తకాలూ చదివేవాణ్ని. బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదవాలని అనుకుంటున్నా. ఆ తర్వాత అంకుర పరిశ్రమను స్థాపించి పారిశ్రామికవేత్తనవుతా' అని ప్రణవ్ పేర్కొన్నాడు. 12వ తరగతి సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో 97.2 శాతం మార్కులు సాధించిన ప్రణవ్.. ఎప్పుడూ తరగతిలో ముందుండేవాడని తల్లిదండ్రులు చెప్పారు.

'భాష్యం' సంచలనం

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో భాష్యం ఐఐటీ అకాడమీ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించినట్లు ఆ విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఆలిండియా 36, 71, 92, 96, 135, 152, 171 ర్యాంకులతో మొత్తం 200లోపు 7 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. అదే విధంగా 500లోపు ఆలిండియా ర్యాంకులు 12, 1000లోపు 17, 2000లోపు 25, 5000లోపు 45 ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సంచలన విజయాలకు భాష్యం ఐఐటీ ఫౌండేషన్ పాఠ్యప్రణాళికే కారణమని వివరించారు.

డా.కేకేఆర్ గౌతమ్ కాన్సెప్ట్ స్కూల్స్ పూర్వవిద్యార్థుల అద్భుత విజయం

డా. కేకేఆర్ గౌతమ్ స్కూల్స్‌లో పదో తరగతి వరకు చదివి ఐఐటీ ఫౌండేషన్ తీసుకున్న విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ -2018 ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ విద్యాసంస్థల ఛైర్మన్ కె.కోటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. తమ పూర్వ విద్యార్థిని ఎన్. ఛాయా సాయి నిఖిత బాలికల విభాగంలో దక్షిణ భారతదేశంలో మొదటిస్థానంలో నిలిచిందని వెల్లడించారు. దీంతోపాటు ఆలిండియా మొదటి పదిలోపు 2, 9 ర్యాంకులతో పాటు 100లోపు 18 ర్యాకులు వివిధ కేటగిరీల్లో సాధించినట్లు చెప్పారు.

శశి హవా

ఈనాడు, హైదరాబాద్: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్-2018లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని శశి విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. వివిధ కేటగిరీల్లో పి.హృతిక్ మోహన్ అఖిల భారత స్థాయిలో 4వ ర్యాంకు, పి.అఖిల్‌రత్న 74వ ర్యాంకు, సీహెచ్ కృష్ణంనాయుడు 307వ ర్యాంకు, కె.హర్షిత 336వ ర్యాంకు, వి.ఆర్.ఎన్.ఎస్.భరద్వాజ్ 395 ర్యాంకు, కె.శశిసాకేష్ 515వ ర్యాంకు, టి.జి.హెప్సిబా 829వ ర్యాంకు, టి.బాలు 898వ ర్యాంకు, ఎ.వీరేంద్ర కుమార్ 952వ ర్యాంకు సాధించారని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రెండు వేల లోపు 17 ర్యాంకులు, 5 వేలలోపు 25 ర్యాంకులు, పది వేలలోపు 37 ర్యాంకులు సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ర్యాంకర్లను విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి రవి కుమార్, లక్ష్మీ సుప్రియ అభినందించారు.

తిరుమల ప్రభంజనం

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తమ విద్యార్థి జి.ఎస్.పుష్పరాజ్ జాతీయ స్థాయిలో 98వ ర్యాంకు సాధించారని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో పాటు వివిధ కేటగిరీల్లో తమ సంస్థకు జాతీయ స్థాయిలో వెయ్యి లోపు 7, 1500లోపు 14, 3వేలలోపు 26 ర్యాంకులు వచ్చాయని వివరించారు. మొత్తం 68మంది శిక్షణ తీసుకోగా 55మంది ర్యాంకులు సాధించి 80శాతం ఉత్తీర్ణత శాతం సాధించారని పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్స్ జి.సతీష్‌బాబు, సీహెచ్ శేషుబాబుతో కలిసి ఛైర్మన్ అభినందించారు.

ఆదిత్య విజయకేతనం

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కాకినాడ కేంద్రంగా నడిచే ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కుసుమ దీపాంకర్ శక్య అఖిల భారత స్థాయిలో 161వ ర్యాంకు సాధించగా.. నెలపాటి సంగీత్ 162, ఐబీ రాజవర్ధన్ 330, మురారి ఆదర్శదీప్ 375, పక్కుర్తి ఆకాశ్ 511, జువ్వాల బాలశ్రీ 574, జోగ హరి ప్రసాద్ 604, కిత్తపల్లి చంద్రప్రభాత్ 686, ఐటీఐ దీపక్ రాజ్ 744వ ర్యాంకులు సొంతం చేసుకున్నారని వివరించారు. ర్యాంకర్లను, అధ్యాపక బృందాన్ని విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.కృష్ణ దీపక్‌రెడ్డితో కలిసి ఛైర్మన్ అభినందించారు.

జిప్‌మర్ 2018 ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

ఈనాడు, హైదరాబాద్: జాతీయ స్థాయి జిప్‌మర్-2018 మెడికల్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయభేరి మోగించినట్లు ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మొదటి ర్యాంకును శ్రీచైతన్య టెక్నోస్కూల్ విద్యార్థి ఎ. అనిరుధ్ బాబు, 9 ర్యాంకును సిద్దార్థ్ రవి సాధించినట్లు తెలిపారు. వీటితోపాటు ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 16, 29, 35, 37, 42, 43, 47, 56, 60 సహా వంద లోపు మొత్తం 16 ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విజేతలను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డా. బీఎస్‌రావు అభినందించారు.

జిప్‌మర్ ఎస్టీ విభాగంలో హర్షవర్ధన్‌కు మొదటిర్యాంకు

హర్షవర్ధన్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లి హారిక

జన్నారం, న్యూస్‌టుడే: జిప్‌మర్ మెడికల్-2018 ఫలితాల్లో మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ధర్మారం తండాకు చెందిన లావుడియా హర్షవర్ధన్ ఎస్టీ విభాగంలో జాతీయస్థాయి మొదటి ర్యాంక్ సాధించాడు. నీట్-2018లోనూ ఈ విద్యార్థి ఎస్టీ విభాగం జాతీయస్థాయిలో ఐదో ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. తండాకు చెందిన లావుడియా హరిలాల్-హారిక దంపతుల కుమారుడు హర్షవర్ధన్ ఇంటర్‌లోనూ మంచి మార్కులతో రాణించాడు. వైద్యరంగంలో ప్రజలకు ఉన్నతమైన సేవలు అందించడమే లక్ష్యమని.. అందుకు నీట్‌కు బదులుగా జిప్‌మర్ మెడికల్‌లో చేరి విద్యను అభ్యసిస్తానని హర్షవర్ధన్ తెలిపాడు. నీట్, జిప్‌మర్‌లో చక్కని ప్రతిభ చూపినందుకు అతనిని తండావాసులు అభినందించారు.

కొందరు పైకి.. ఇంకొందరు కిందికి

- అడ్వాన్స్‌డ్‌లో మారిన ప్రతిభావంతుల స్థానాలు

ఈనాడు, అమరావతి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్, ఎంసెట్‌లలో మంచి ర్యాంకులు పొందిన కొందరు అడ్వాన్స్డ్‌లోనూ రాణించగా.. మరికొందరు తాజా ఫలితాల్లో ర్యాంకులను మెరుగుపరచుకోలేకపోయారు. ఎంసెట్‌లతో.. జేఈఈ మెయిన్స్‌తో పోలిస్తే అడ్వాన్స్‌డ్ పరీక్ష కఠినంగా ఉండటం కూడా విద్యార్థుల ర్యాంకుల్లో మార్పులకు కారణమైంది. ఒకటి, రెండు ప్రశ్నలకు తప్పు సమాధానాలు పేర్కొన్నా.. ర్యాంకుల్లో గణనీయమైన మార్పులొచ్చాయి. రసాయనశాస్త్రం నుంచి వచ్చిన ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని, దీంట్లో చాలామంది విద్యార్థులకు మార్కులు తగ్గాయని శారద విద్యాసంస్థల నిపుణుడు జీవీరావు పేర్కొన్నారు. పాఠ్యాంశంపై పూర్తిగా పట్టుంటేనే అడ్వాన్స్‌డ్‌లో ప్రశ్న ఎలా అడిగినా సమాధానం రాసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐచ్ఛికాల్లో సరైన సమాధానం అనిపించేవి రెండు లేదా మూడు ఉండటం కూడా విద్యార్థుల సామర్థ్యానికి పరీక్షేనని వెల్లడించారు. పరీక్ష సమయంలో చేసే చిన్న పొరపాట్లే ర్యాంకులపై ప్రభావం చూపుతాయన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 59వ ర్యాంకు సంపాదించిన విశాఖపట్నానికి చెందిన మావూరి శివరామకృష్ణ మనోహర్ అడ్వాన్స్‌డ్‌లో ఐదో ర్యాంకు సాధించడం విశేషం. అదే జిల్లాకు చెందిన కేవీఆర్ హేమంత్‌కుమార్ తెలంగాణ, ఏపీ ఎంసెట్‌లలో 4, 8 ర్యాంకులు సాధించగా.. జేఈఈ మెయిన్స్‌లో రెండో స్థానంలో నిలిచారు. అడ్వాన్స్‌డ్‌లో ఏడో ర్యాంకు లభించింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బి.సూరజ్ కృష్ణ ఏపీ ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌లో మొదటి ర్యాంకు సాధించగా.. అడ్వాన్స్‌డ్‌కు వచ్చే సరికి 49వ స్థానంలో నిలిచారు. వినాయక శ్రీవర్ధన్ తెలంగాణ, ఏపీ ఎంసెట్‌ల్లో 3, 4 ర్యాంకులు సాధించగా.. జేఈఈ మెయిన్స్‌లో 10వ ర్యాంకు సాధించారు. అడ్వాన్స్‌డ్‌లోనూ ఈయన 11 ర్యాంకు సాధించారు. కడప జిల్లాకు చెందిన పి.లోకేశ్వర్‌రెడ్డి ఏపీ ఎంసెట్‌లో మూడో స్థానంలో నిలవగా.. జేఈఈ మెయిన్స్‌లో 15 ర్యాంకు సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు వచ్చేసరి 68వ ర్యాంకు లభించింది. జేఈఈ మెయిన్, ఎంసెట్‌లలో మంచి ర్యాంకులు సాధించిన గట్టుమైత్రేయ, డి.భరత్‌లకు ప్రస్తుతం మొదటి 10 స్థానాల్లో చోటు దక్కలేదు. తెలంగాణ, ఏపీ ఎంసెట్‌లలో 1, 7 ర్యాంకులు సాధించిన హైదరాబాద్ వాసి అయ్యపు వెంకట ఫణివంశీనాథ్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 14వ ర్యాంకు సాధించారు.

అర్హులు 18,138 మంది సీట్లు 11,279..

- గత ఏడాది కంటే 64% తగ్గుదల

ఈనాడు, హైదరాబాద్: ఐఐటీ కౌన్సెలింగ్‌కు అర్హత పొందిన విద్యార్థుల సంఖ్య ఈసారి భారీగా తగ్గింది. తాజా ఫలితాల ప్రకారం అర్హుల సంఖ్య 18,138 మంది మాత్రమే. గత ఏడాది 50,455 మంది అర్హత సాధించారు. అంటే ఈసారి అర్హులు దాదాపు 64% తగ్గారు. ఈ సంవత్సరం ఐఐటీల్లో 11,279 సీట్లు ఉన్నాయి. ఒక్కో సీటుకు 1.6 మంది పోటీపడతారు. దానికితోడు ఈసారి అడ్వాన్స్డ్‌లో అర్హత సాధించిన బాలికలకు అదనంగా 800 సీట్లు సూపర్ న్యూమరీ కోటా కింద కేటాయించనున్నారు. దానివల్ల ఈసారి అడ్వాన్స్డ్‌లో అర్హత సాధించిన 2,076 మందిలో అత్యధికులకు సీట్లు దక్కే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

తగ్గని కటాఫ్ మార్కుల శాతం: జేఈఈ అడ్వాన్స్డ్‌కు హాజరయ్యే విద్యార్థులకు ర్యాంకు కేటాయించేందుకు సబ్జెక్టులు, కేటగిరీల వారీగా కనీస మార్కులను వరుసగా రెండో ఏడాదీ తగ్గించలేదు. ప్రకటన జారీ సమయంలో జనరల్ (కామన్ మెరిట్ లిస్టు) అభ్యర్థులు మొత్తం మార్కుల్లో 35% మార్కులు సాధిస్తేనే ర్యాంకు కేటాయిస్తామని ప్రకటించగా దాన్ని యథాతథంగా కొనసాగించారు. గత ఏడాది కూడా 35 శాతంగానే ఉంచారు. అంటే 366 మార్కులకు 128 మార్కులు వచ్చిన వారినే (జనరల్ విభాగం) అర్హులుగా ప్రకటించి ర్యాంకులు కేటాయించారు. అడ్వాన్స్డ్ పరీక్షలో ర్యాంకు సాధించాలంటే మొత్తం మార్కుల్లో కనీస మార్కులే కాకుండా ప్రతి సబ్జెక్టులో కనీసం మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ఐఐటీల్లో 9 రకాల కోర్సులు

ఈనాడు, హైదరాబాద్: ఐఐటీల్లో బీటెక్ నాలుగేళ్ల కోర్సులతో పాటూ అయిదేళ్ల కోర్సులూ ఉన్నాయి. జేఎన్‌టీయూహెచ్‌లో ఒక్క చోట మాత్రం అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఉంది. అంటే అయిదేళ్లలో బీటెక్ + ఎంటెక్ లేదా బీటెక్ + ఎంబీఏ డిగ్రీ పట్టాలు చేతికొస్తాయి. ఇక ఐఐటీల్లో మొత్తం 9 రకాల కోర్సులుంటాయి. బీటెక్, ఎంటెక్ రెండు డిగ్రీలు ఇచ్చే డ్యూయల్ డిగ్రీ కోర్సులు ఉంటాయి. వాటిల్లో రకరకాల బ్రాంచీలు ఉంటాయి. బీఎస్ అంటే రాష్ట్రంలో మాదిరిగా బీఎస్సీలా ఉండదని, ఇంజినీరింగ్‌తో సమాన విలువ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. బీఎస్‌లో ఆర్థికశాస్త్రం చదివిన వారికి బహుళజాతి కంపెనీలు భారీ ప్యాకేజీలు ఇచ్చి ప్రాంగణ నియామకాల్లో నియమించుకుంటున్నాయని వారు పేర్కొంటున్నారు.

రేపు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు జూన్ 12వ తేదీ(మంగళవారం) మధ్యాహ్నం 12 గంటలకు విడుదల కానున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మానవ వనరుల శాఖ మంత్రి గంటాశ్రీనివాసరావు ఈ ఫలితాలను విడుదల చేయనున్నారు.

అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తే కోర్టుకీడుస్తా

విద్యార్థి నేత ట్వీట్లపై గడ్కరీ

దిల్లీ: అసంబద్ధమైన వ్యాఖ్యలు చేసే సంఘ విద్రోహకశక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ స్పష్టం చేశారు. ప్రధాని మోదీని అంతమొందించేందుకు పన్నిన కుట్రలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, ఆర్ఎస్ఎస్‌లకు ప్రమేయం ఉందని జేఎన్‌యూ విద్యార్థుల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు షెహ్లా రషీద్ షోరా ట్విటర్‌లో ఆరోపించారు. 'మోదీని చంపి ఆ నేరాన్ని ముస్లింలు, కమ్యూనిస్టులపై మోపుతారు. ఆ తరువాత ముస్లింలపై దాడికి దిగాలనేది వారి(భాజపా) ప్రణాళిక' అని ఆమె ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన గడ్కరీ లేనిపోనివి ఆపాదిస్తే చర్యలు తప్పవని ట్వీట్ చేశారు. ప్రతిస్పందించిన రషీద్.. గడ్కరీ అతిగా స్పందిస్తున్నారని, నేనేదో సరదాగా ట్వీట్ చేశానని మరో ట్వీట్ చేశారు. మోదీని సైతం మాజీ ప్రధాని రాజీవ్‌ను హత్య చేసినట్లే రోడ్‌షోలో చంపాలని ప్రణాళిక రచిస్తున్నట్లు రోనా విల్సన్ అనే మావోయిస్టు ఇంట్లో లేఖ లభ్యమైందని పుణె పోలీసులు వెల్లడించిన సంగతి విదితమే.

'సూపర్-30' నుంచి 26 మంది

పట్నాలో ఆనంద్‌కుమార్‌తో కలిసి విజయ సంకేతం చూపుతున్న 'సూపర్-30' విద్యార్థులు

పట్నా: నిరుపేద విద్యార్థులను ప్రతిష్ఠాత్మక ఐఐటీలకు అర్హత సాధించేలా తీర్చిదిద్దుతున్న బిహార్‌లోని 'సూపర్-30' అకాడమీ మరోసారి అద్భుత ఫలితాలు సాధించింది. ఈసారి ఇందులో శిక్షణ పొందిన 30 మంది ప్రతిభావంతుల్లో 26 మంది ఐఐటీ-జేఈఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనంద్ కుమార్ అనే గణిత మేధావి 2002లో ఈ సంస్థను స్థాపించారు. ఆయన కుటుంబ సభ్యులూ దీని నిర్వహణలో తోడ్పడుతున్నారు. ఏటా మారుమూల ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలకు చెందిన 30 మందిని ఎంపిక చేసి ఉచితంగా ఆనంద్ శిక్షణనిస్తున్నారు. విద్యార్థులకు భోజనం, వసతి సదుపాయాలు కూడా ఆయనే ఉచితంగా కల్పిస్తున్నారు. ఫ్యాక్టరీ కార్మికుడి కుమారుడు, నిరక్షరాస్య కుటుంబం నుంచి వచ్చిన బాలుడు.. ఇలా ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులందరిదీ పేద నేపథ్యమే. గత 16 ఏళ్లలో ఈ సంస్థ నుంచి దాదాపు 500 మంది ఐఐటీలకు అర్హత సాధించారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ప్రయోజనం పొందేలా సూపర్-30ని మరింత విస్తరించాలనుకుంటున్నట్లు ఆనంద్ చెప్పారు. విద్యార్థుల ఎంపిక కోసం ఓ పరీక్షను నిర్వహిస్తామని.. దాని వివరాలు సంస్థ వెబ్‌సైట్‌లో పెడతామని పేర్కొన్నారు. 'సూపర్-30' విజయాలతో ఆనంద్ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందారు. ఆయన జీవిత చరిత్ర ఆధారంగా ఓ హిందీ చిత్రమూ తెరకెక్కుతోంది. ఇందులో ఆనంద్ పాత్రను ప్రముఖ నటుడు హృతిక్ రోషన్ పోషిస్తున్నారు.

దూరం.. కాదు భారం!

- నచ్చిన విద్యా సంస్థల్లో చదువే ముఖ్యం
- పొరుగు రాష్ట్రాలకు తరలుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు
- స్థానిక కళాశాలల్లో మిగులుతున్న సీట్లు

ఈనాడు, అమరావతి: దూరమైనా ఫర్వాలేదు... ప్రభుత్వమిచ్చే బోధనా రుసుమూ అక్కర్లేదు.. ఫీజులు కొంత ఎక్కువైనా ఇబ్బందేం లేదు.. ఇదీ ప్రస్తుతం ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తీరు... ఇతర రాష్ట్రాలకు గతంలో కంటే మరింతగా వారు క్యూ కడుతున్నారు. నచ్చిన కళాశాల, కోర్సులో చదివేందుకే మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు అందుబాటులో ఉన్నా వాటిలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. రాష్ట్రంలో స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలున్నా తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలకు వెళ్లి చదివేందుకు విద్యార్థులు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రథమ శ్రేణి కేటగిరీలో ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో డొనేషన్లు ఎక్కువగా ఉండటం కూడా మరో కారణమవుతోంది.

తక్కువ ఫీజు.. విషయ పరిజ్ఞానం

పొరుగు రాష్ట్రాల డీమ్డ్ వర్సిటీల్లో ఏడాదికి లక్షన్నర నుంచి రెండు లక్షల రూపాయలతో ఇంజినీరింగ్ విద్యను ముగించే అవకాశాలు ఉండటంతో అటువైపు విద్యార్థులు దృష్టి సారిస్తున్నారు. వీరిలో కొందరు బోధనా రుసుముల చెల్లింపు పథకం కింద ఫీజు మినహాయింపు పొందే అవకాశమున్నా రాష్ట్రంలో చదివేందుకు ఆసక్తి కనబరచడం లేదు. ఇంటరు మార్కులు, జేఈఈ మెయిన్, ఎంసెట్ ఇంజినీరింగ్‌లో సాధించిన ర్యాంకులను అనుసరించి ఫీజుల్లో కొంత మినహాయింపును పొరుగు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలు ఇస్తున్నాయి. ప్రస్తుతం ప్రైవేటు విశ్వవిద్యాలయాలు మౌలిక సౌకర్యాల పరంగా ముందుండటం, ఇతర రాష్ట్రాల్లో చదివితే హిందీతోపాటు ఆంగ్ల భాషలో నైపుణ్యం పెరుగుతుందన్న భావన వారిలో ఉంటోంది. వీరి ఆలోచనలకు తగినట్లు కొన్ని విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, మధ్యవర్తులు జిల్లాల వారీగా విద్యార్థులను కలుస్తూ ప్రవేశాలను పెంచుకుంటున్నారు. తమిళనాడులోని మదురై, చెన్నై, కంచి, పంజాబ్‌లోని జలంధర్, ఇతర చోట్లకు విద్యార్థులు వెళ్తున్నారు.

పెరగనున్న జేఈఈ సీట్లు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, కేంద్ర ఆర్థిక సహకారంతో నడిచే సాంకేతిక విద్యాసంస్థ(జీఎఫ్ఐటీ)ల్లో సీట్ల సంఖ్య పెరగనుంది. వాటిల్లో 2016లో మొత్తం 34,895 సీట్లుంటే 2017లో వాటి సంఖ్య 36,268కి చేరింది. గత ఏడాది 97 విద్యా సంస్థల్లో ప్రవేశాలు జరిగాయి. ఈసారి అవి 100కి చేరాయి. దేశంలోని 23 ఐఐటీల్లో గత ఏడాది 10,988 సీట్లుండగా ఈసారి వాటి సంఖ్య 11,279కి పెరిగింది. గత ఏడాది 31 ఎన్ఐటీల్లో 17,868 సీట్లు, 23 ట్రిపుల్‌ఐటీల్లో 3,433 సీట్లు, 20 జీఎఫ్‌టీఐల్లో 3,979 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు ఐఐటీల్లో మాత్రమే పెరిగిన సీట్లను వెల్లడించారు. ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీల్లో సీట్ల సంఖ్య మరో మూడు నాలుగు రోజుల్లో వెల్లడికానుంది. మొత్తానికి గత ఏడాది కంటే మరో 1,500 వరకు సీట్లు పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో అమ్మాయిలకు కేటాయించే సూపర్ న్యూమరీ సీట్లు అదనం.

తెలుగు రాష్ట్రాల్లో సంస్థలు, సీట్లు విభాగాల వారీగా(2017లో)

విద్యాసంస్థ	జనరల్	ఎస్సీ	ఎస్టీ	ఓబీసీ	మొత్తం
ఐఐటీ హెచ్	144	43	22	76	285
ఐఐటీ తిరుపతి	61	18	09	32	120
ఎన్ఐటీ వరంగల్	403	120	61	216	800
ఎన్ఐటీ ఏలూరు	242	72	36	130	480
ట్రిపుల్‌ఐటీ శ్రీసిటీ	136	41	20	73	270
ట్రిపుల్‌ఐటీ కర్నూలు	60	19	09	32	120

(గమనిక: ఆయా విభాగాల్లో దివ్యాంగుల సీట్లు కలిపి)

టెట్‌కు తొలి రోజు 39 వేల మంది హాజరు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష తొలి రోజు ప్రశాంతంగా జరిగింది. పేపర్-1 పరీక్షకు 42,684 మంది దరఖాస్తు చేసుకోగా 39,772 (93.18 శాతం) మంది హాజరయ్యారు. మొత్తం 98 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించినట్లు టెట్ కన్వీనర్ సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు గూగుల్ సెంటర్ లోకేషన్ అభ్యర్థులకు సహాయపడినట్లు పేర్కొన్నారు. టెట్ పరీక్ష ముగిసిన వెంటనే బటన్ నొక్కగానే అభ్యర్థులకు వారి మార్కులు కంప్యూటర్ తెరపై కనిపించాయన్నారు.

ఈనాడు బిజినెస్

35650 ఎగువన లాభాలు!



సమీక్ష : అంతర్జాతీయ, దేశీయ పరిణామాలు దన్నుగా నిలవడంతో గత వారం సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. నాలుగేళ్లలో తొలిసారిగా కీలక రేట్లను ఆర్‌బీఐ పెంచినప్పటికీ.. రేట్ల విషయంలో భవిష్యత్తులో తటస్థ వైఖరి అవలంబిస్తామని పేర్కొనడం మార్కెట్ సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. 2018-19 జీడీపీ వృద్ధి అంచనా అయిన 7.4 శాతాన్ని కొనసాగించడం తోడైంది. ఇటీవల కుదేలైన మధ్య, చిన్న తరహా షేర్లు, మూలాలు బాగున్న కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. 3.3 శాతం ద్రవ్యలోటు లక్ష్యానికి భారత్ కట్టుబడి ఉండాలని మూడీస్ సూచించడం, వచ్చే మూడేళ్ల పాటు ప్రపంచంలో వేగవంతమైన వృద్ధి భారత్‌దేనని ప్రపంచ బ్యాంక్ వెల్లడించడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గడం వంటి వాటిని మార్కెట్లు పరిగణనలోకి తీసుకున్నాయి. రక్షణాత్మక ధోరణుల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి. అమెరికా, అనుబంధ దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలతో అంతర్లీనంగా ఒత్తిడి ఎదుర్కొన్నాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.61 శాతం పెరిగి 35,443 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 0.67 శాతం లాభంతో 10,767 పాయింట్ల దగ్గర స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.1367 కోట్ల షేర్లను కొనుగోలు చేయగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.2131 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:5గా నమోదుకావడం..
షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగడాన్ని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో గత వారం మార్కెట్లు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. అధిక స్థాయిల వద్ద స్థిరీకరణ ఎదురైంది. 35,650 పాయింట్ల ఎగువకు చేరితే మాత్రం.. స్వల్ప కాలంలో మార్కెట్లకు లాభాలు కొనసాగొచ్చు. 34700- 35000 పాయింట్ల శ్రేణిలో మార్కెట్లకు మద్దతు లభించొచ్చు. ఈ స్థాయి కోల్పోతేనే బలహీనపడే అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, దేశీయ గణాంకాలు ఈ వారం మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. దేశీయంగా చూస్తే.. పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ), రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు రేపు, డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలు 14న వెలువడనున్నాయి. మార్కెట్లు వీటికి అనుగుణంగా కదలాడే అవకాశం ఉంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, ఎఫ్ఐఐ, డీఐఐల పెట్టుబడులు కూడా సమీపకాలంలో మార్కెట్‌కు దిశానిర్దేశం చేయొచ్చు. వెనెజులాలో సరఫరా సమస్యల కారణంగా ముడిచమురు ధరలు మళ్లీ పుంజుకున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే.. 13, 14 తేదీల్లో జరగనున్న అమెరికా ఫెడ్ పరపతి విధాన సమీక్ష కీలక పరిణామంగా చెప్పుకోవచ్చు. ఈ సారి ఫెడ్ కీలక రేట్లు పెంచొచ్చన్న అంచనాలు ఉన్నాయి. 15న బ్యాంక్ ఆఫ్ జపాన్ సమావేశం కానుంది. సింగపూర్‌లో 12న జరగనున్న అమెరికా- ఉత్తర కొరియా సమావేశంపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. ఈ సమావేశం నుంచి సానుకూల ప్రకటన వెలువడితే అంతర్జాతీయ మార్కెట్లు రాణించొచ్చు. అమెరికా, ఇతర దేశాల మధ్య వాణిజ్య పరిణామాల నుంచి మార్కెట్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 35,087, 34,784, 34,302; **తక్షణ నిరోధ స్థాయిలు:** 35,642, 36,000, 36,256

35650 పాయింట్ల ఎగువకు చేరితే.. సమీప కాలంలో లాభాలు కొనసాగొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

కోడిగుడ్లు

10న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)			
హైదరాబాద్	374	వరంగల్	376
చిల్లరగా (ఒక గుడ్డు)	4.35	విశాఖపట్నం	375
బెంగళూరు	418	చెన్నై	445
11వ తేదీకి...		చిత్తూరు	438
విజయవాడ/గోదావరి	368	నమక్కల్	430

అంతర్జాతీయ సంకేతాలే ఆధారం

● జీ-7 సదస్సుపై మదుపర్ల దృష్టి ● అమెరికా ఫెడ్, ఈసీబీ సమావేశాల నిర్ణయాలూ కీలకం
● ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాల ప్రభావం కూడా ● జోరు బాటలో ఔషధ షేర్లు

స్టాక్ మార్కెట్ ఈ వారం

స్టాక్ మార్కెట్‌కు ఈవారం అంతర్జాతీయ మార్కెట్లు దిశానిర్దేశం చేయనున్నాయి. కెనడాలో జరిగే జీ-7 దేశాల సదస్సుతో పాటు అమెరికా ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు (ఈసీబీ)ల పరపతి విధాన సమావేశాలను మదుపర్లు గమనించే అవకాశం ఉంది. వీటన్నింటి దృష్ట్యా జాగ్రత్తగా వ్యవహరించేందుకే ట్రేడర్లు మొగ్గు చూపుతుండటంతో సూచీలు స్వల్ప శ్రేణికి లోబడి చలించే అవకాశం ఉంది. విలువపరంగా ఆకర్షణీయంగా మారడంతో మధ్యతరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. దేశీయంగా ఈవారంలో వెలువడే రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ), టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ), పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) గణాంకాలు కూడా ప్రభావం చూపుతాయి. నిఫ్టీ 10680- 10850 శ్రేణిలో చలించొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఔషధ రంగ షేర్లకు లాభాలు కొనసాగే అవకాశం ఉంది. ఆయా రంగాలు, కంపెనీల షేర్లపై విశ్లేషకుల అంచనాలు ఇలా..

సిమెంట్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1315	1335	1295
అంబుజా సిమెంట్స్	206	209	203
ఇండియా సిమెంట్స్	119	121	116
శ్రీ సిమెంట్	16224	16475	15931
అల్ట్రాటెక్ సిమెంట్	3715	3767	3639
బ్యాంకింగ్	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
యాక్సిస్ బ్యాంక్	537	545	532
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2049	2075	2022
ఐసీఐసీఐ బ్యాంక్	288	294	283
ఎస్‌బీఐ	273	278	264
యెస్ బ్యాంక్	338	343	333
ఐటీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హెచ్‌సీఎల్ టెక్	929	946	910
ఇన్ఫోసిస్	1260	1272	1240
టీసీఎస్	1747	1769	1724
టెక్ మహీంద్రా	707	728	693
విప్రో	264	266	261
చమురు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బీపీసీఎల్	410	417	401
హెచ్‌పీసీఎల్	311	317	305
ఐఓసీ	175	178	171
ఓఎన్‌జీసీ	174	176	171
రిలయన్స్ ఇండస్ట్రీస్	984	1003	951
ఔషధ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అరబిందో ఫార్మా	572	599	530
కేడిలా హెల్త్‌కేర్	364	379	348
డాక్టర్ రెడ్డీస్	2063	2136	1937
లుపిన్	810	860	738
సిప్లా	560	577	530
వాహన	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
మారుతీ సుజుకీ	8932	8997	8839
ఎంఅండ్ఎం	912	925	896
బజాజ్ ఆటో	2874	2914	2847
టాటా మోటార్స్	310	323	296
టీవీఎస్ మోటార్	583	597	561

✦ **చమురు** మార్కెటింగ్ కంపెనీలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ షేర్లకు లాభాలు కొనసాగొచ్చు. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా షేర్లు స్థిరీకరణకు లోనయ్యే అవకాశం ఉంది. అంతర్జాతీయ చమురు ధరల కదలికలపై మదుపర్లు దృష్టి సారిస్తారు.

✦ **బ్యాంకింగ్** షేర్లు ఈవారం సానుకూలంగా చలించే అవకాశం ఉంది. బ్యాంకు నిఫ్టీ రికార్డు స్థాయిల దిశగా కదలాడొచ్చు. ప్రభుత్వ బాండ్లపై వాటిల్లిన నష్టాలకు సంబంధించి ఇటీవల సమీక్షలో బ్యాంకులకు ఆర్‌బీఐ ప్రకటించిన ఉపశమన చర్యలు ఇందుకు కారణం.

✦ **సిమెంటు** కంపెనీల షేర్లు ఈవారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. అల్ట్రాటెక్ కంపెనీ షేరు రూ.3,750 మించితే రూ.3,900 వరకు పెరిగే అవకాశం ఉంది. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ షేరు ప్రతికూల ధోరణిలో చలించొచ్చు.

✦ **లోహ** రంగ సూచీలోని దిగ్గజ కంపెనీలైన హిందాల్కో ఇండస్ట్రీస్, వేదాంతా షేర్లు ఈవారం బలహీనంగా కదలాడే అవకాశం ఉంది. మరో రెండు పెద్ద కంపెనీలైన జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ సానుకూలంగా చలించొచ్చు. సెయిల్ షేరుకు కూడా లాభాలు రావొచ్చు.

✦ **టెలికాం** షేర్లు ఏడాదికాలంగా బాగా దిద్దుబాటు అయిన నేపథ్యంలో ఈవారం సానుకూలంగా చలించే అవకాశం ఉంది. అయితే ఈ రంగంలో తీవ్ర పోటీ నేపథ్యంలో దీర్ఘకాలానికి ఈ షేర్లను కొనే విషయంలో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించే అవకాశం ఉంది.

✦ **ఐటీ** రంగ షేర్లు ఈవారం స్వల్ప శ్రేణికి లోబడి కదలాడే అవకాశం ఉంది. రూపాయి బలహీనత కొంత మేర కలిసిరావొచ్చు.

✦ **వాహన** విక్రయాలు మే నెలలో బాగుండటానికి తోడు వడ్డీరేట్లపై భవిష్యత్తులో తటస్థ వైఖరి అవలంబిస్తామన్న ఆర్‌బీఐ ప్రకటన, సానుకూల రుతుపవన అంచనాల నేపథ్యంలో, ఈ రంగ షేర్లు రాణించవచ్చు.

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	242	250	237
టాటా స్టీల్	601	616	584
వేదాంతా	246	251	240
హిందుస్థాన్ జింక్	296	301	292
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	343	348	337
భారీ యంత్రపరికరాలు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భెల్	78	80	74
సీజీ పవర్	60	64	55
ఎల్అండ్‌టీ	1344	1367	1320
థెర్మాక్స్	1157	1182	1129
సీమెన్స్	1010	1032	980
టెలికాం	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భారతీ ఎయిర్‌టెల్	378	389	367
ఐడియా సెల్యులార్	64	67	59
ఆర్‌కామ్	16	17	15
టాటా కమ్యూకేషన్స్	604	618	595
మహానగర్ టెలిఫోన్	17	18	16
ఎఫ్ఎమ్‌సీజీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
కోల్గేట్ పామోలివ్	1230	1255	1216
డాబర్ ఇండియా	382	387	379
గోద్రేజ్ కన్జూమర్	1169	1182	1149
హెచ్‌యూఎల్	1596	1612	1573
ఐటీసీ	268	273	264

✦ **భారీ యంత్ర పరికరాల** షేర్లు మార్కెట్‌కు అనుగుణంగా స్వల్పశ్రేణిలో రాణించవచ్చు. తక్కువ ధరల్లో ఉన్న భారత్ హెవీ ఎలక్ట్రికల్స్, సీమెన్స్ షేర్లు లాభపడొచ్చు.

✦ **ఎంఎఫ్‌సీజీ** షేర్లకు సాధారణ వర్షపాతం కలిసిరానుంది. గ్రామీణ వినియోగం పెరుగుతుండటం కలిసొచ్చే అంశం.

✦ **ఔషధ** షేర్లు రాణించవచ్చు. సన్ ఫార్మా యూనిట్‌కు యూఎస్ఎఫ్‌డీఏ అనుమతులు మంజూరు చేయడం వల్ల ఈ రంగంపై సెంటిమెంటు మెరుగవ్వచ్చు.

ప్రత్యేక నిధికి 5 ఖాయిలా సీపీఎస్ఈల షేర్లు!

ఆర్థిక శాఖ సన్నాహాలు

దిల్లీ: హెచ్ఎంటీ, ఆండ్రూ యూలే సహా ఖాయిలా పడ్డ అయిదు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈలు) షేర్లను ప్రత్యేక జాతీయ పెట్టుబడి సంస్థ (ఎస్ఎన్ఐఎఫ్)కు తరలించేందుకు ఆర్థిక శాఖ సన్నాహాలు చేస్తోంది. ఎస్ఎన్ఐఎఫ్ నిధికి తరలించే కంపెనీల్లో ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ (ఫ్యాక్ట్), హిందుస్థాన్ ఫోటో ఫిల్మ్స్, స్కూటర్స్ ఇండియా, హెచ్ఎంటీ, ఆండ్రూ యూలే వంటి కంపెనీలు ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. నమోదిత కంపెనీల్లో కనీసం 25 శాతం ప్రజా వాటా (పబ్లిక్ షేర్‌హోల్డింగ్) ఉండాలనే సెబీ నిబంధనను అందుకోవడంలో భాగంగా ఆర్థిక శాఖ ఈ దిశగా అడుగులు వేస్తోంది. ప్రత్యేక నిధికి షేర్లు బదిలీ చేయడానికి సెబీ అనుమతి కోసం ఆర్థిక శాఖ చర్చలు జరుపుతోంది. కంపెనీల్లో కనీసం 25 శాతం ప్రజా వాటా చేరుకోవడానికి ఈ కంపెనీలకు ఆగస్టు 21 వరకు గడువు ఉంది. ప్రస్తుతం ఆండ్రూ యూలేలో 89.25 శాతం, ఫ్యాక్ట్‌లో 90 శాతం, హిందుస్థాన్ ఫోటోలో 90 శాతం, హెచ్ఎంటీలో 93.69 శాతం, స్కూటర్స్ ఇండియాలో 93.74 శాతం చొప్పున ప్రభుత్వానికి వాటాలు ఉన్నాయి.

చందాకొచ్చర్ కేసుపై అమెరికా సెక్ పరిశీలన!

దిల్లీ: వీడియోకాన్ గ్రూప్‌నకు రుణం మంజూరు చేయడంలో అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ చందా కొచ్చర్, ఆమె కుటుంబ సభ్యులపై దేశీయంగా పలు సంస్థలు దర్యాప్తు చేస్తున్న సంగతి విదితమే. అమెరికాలో కూడా ఐసీఐసీఐ బ్యాంక్ నమోదైనందున, ఈ కేసును అమెరికా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (సెక్) పరిశీలిస్తోందని సమాచారం. ఈ కేసు విషయమై దేశీయ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి కొన్ని వివరాలను సెక్ కోరిందని సమాచారం. భారత్‌లోని నియంత్రణ, పరిశోధనా సంస్థలు కేసు విచారణలో మారిషస్ వంటి దేశాల్లోని దర్యాప్తు సంస్థల సాయం కోరేందుకు సిద్ధమవుతున్నాయని సమాచారం. అయితే ఈ కేసు విచారణపై సెక్ కార్యాలయంలోని ప్రజా వ్యవహారాల విభాగం, ఐసీఐసీఐ బ్యాంక్ స్పందించలేదు.

ప్రభుత్వమే జవాబుదారీ

● పీఎన్‌బీ వంటి మోసాలకు సమాధానమివ్వాలి ● ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి

కొల్హాపూర్: ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ) అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో చోటు చేసుకున్న భారీ మోసానికి ప్రభుత్వమే జవాబుదారీ వహించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ వైవీ రెడ్డి పేర్కొన్నారు. పీఎస్‌బీలకు యాజమాని కాబట్టి.. ఇటువంటి ఆర్థిక మోసాలకు ప్రభుత్వమే జవాబుదారీ అవుతుందని వైవీ రెడ్డి పేర్కొన్నారు. పీఎన్‌బీ జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఓయూ)ల దుర్వినియోగం ద్వారా వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీలు రూ.13,000 కోట్ల మేర మోసం చేసిన విషయం తెలిసిందే. 'ఇటీవల ఒక బ్యాంక్‌లో వేల కోట్ల రూపాయిల భారీ మోసం వెలుగుచూసింది. అది మోసంగా నిరూపితమైంది. ఈ మోసం గురించి ఎక్కువ ఆందోళన చెందాల్సింది ఎవరు? సొమ్ము పోగొట్టుకున్న బ్యాంక్ యాజమాని కదా. ఇక్కడ ప్రభుత్వమే యాజమాని' అని అన్నారు. 'బ్యాంక్‌ల రక్షణ' అంశంపై ఇక్కడి శివాజీ విశ్వవిద్యాలయంలో వైవీ రెడ్డి ప్రసంగించారు. ఇటువంటి బ్యాంక్ మోసాల వల్ల పన్నులు చెల్లించేవారు నష్టపోతున్నారని అన్నారు. పన్ను చెల్లింపుదార్ల సొమ్ముకు రక్షణగా ఉన్న ప్రభుత్వం.. ఇటువంటి మోసాలను అరికట్టడంలో ఎందుకు విఫలమైందో సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో తాము నియమించిన డైరెక్టర్లు ఏం చేస్తున్నారోనని ప్రభుత్వం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని వైవీ రెడ్డి చెప్పారు. సొంత పెట్టుబడులపై పర్యవేక్షణ, నియంత్రణ వ్యవస్థపై యాజమాని తప్పకుండా పరిశీలన చేస్తుండాలని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం, డిపాజిట్‌దార్లకు రక్షణ ఆర్‌బీఐ ప్రధాన బాధ్యతని, అయితే బ్యాంకింగ్ వ్యవస్థ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడం కూడా ప్రధాన బాధ్యతేనని పేర్కొన్నారు. పీఎన్‌బీ వంటి మోసాలు ఆర్‌బీఐ విశ్వసనీయతను దెబ్బతీస్తాయని తెలిపారు.

రుణాలు తీసుకున్న వారు అసలు, వడ్డీ చెల్లించకపోతే, డిపాజిటర్లపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. బ్యాంకుల వద్ద మూలధనం సరిపడా లేకపోతే, డిపాజిటర్లకు చెల్లింపులు చేయడం బ్యాంకులకు కష్టమవుతుందని వివరించారు.

రూ.87,300 కోట్ల నష్టాలు

2017-18లో 19 ప్రభుత్వ రంగ బ్యాంకుల తీరిదీ

దిల్లీ: దేశంలోని 19 ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.87,357 కోట్ల నష్టాల్ని మూటగట్టుకొన్నాయి. మొత్తం 21 పీఎస్‌బీల్లో 2 మాత్రమే లాభాల్ని నమోదు చేశాయి. నీరవ్‌మోదీ మోసపూరిత లావాదేవీల ఫలితంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ అత్యధికంగా రూ.12,283 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఇండియన్ బ్యాంకు రూ.1,258.99 కోట్లు, విజయా బ్యాంక్ రూ.727.02 కోట్ల నికర లాభం ఆర్జించాయి. 2016-17లో అన్ని బ్యాంకుల నికర లాభం రూ.473.72 కోట్లు కావడం గమనార్హం.

✦ గత ఆర్థిక సంవత్సరంలో 2 పీఎస్‌బీల లాభాలు తీసివేస్తే, మొత్తం పీఎస్‌బీల నష్టాలు రూ.85,370 కోట్లకు చేరాయి.

✦ పీఎన్‌బీ తరవాత ఐడీబీఐ బ్యాంక్ అధిక నష్టాన్ని నమోదు చేసింది. ఈ బ్యాంక్ నికర నష్టం రూ.8,237.93 కోట్లు.

✦ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.6,547.45 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. 2016-17లో ఈ బ్యాంక్ రూ.10,484.10 కోట్ల నికర లాభం ఆర్జించింది.

పబ్లిక్ ఇష్యూకు జీవీకే విమానాశ్రయాల విభాగం!

హైదరాబాద్: రుణ భారాన్ని తగ్గించుకోవడం కోసం ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు జీవీకే ఎయిర్‌పోర్ట్స్ విభాగం సిద్ధమవుతోంది. దీనికోసం వచ్చే నెలలో సెబీకి ప్రతిపాదనలు పంపించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. 'ఎయిర్‌పోర్ట్స్ విభాగంలో రుణ భారాన్ని తగ్గించుకోవాలనే ఆలోచనతో ఉన్నాం. అందుకే ఐపీఓకి వెళ్లాలనుకుంటున్నాం. దీనికి సంబంధించి ప్రతిపాదనలను జులైలో సెబీ ముందుకు తీసుకెళ్తాం. ఈ ఇష్యూ ద్వారా ఎంతమేరకు నిధులు సమీకరించాలనే విషయంలో ఇప్పుడే ఏమీ చెప్పలేం. తొలిసారిగా వాటాలు జారీ చేయబోతున్న నేపథ్యంలో అందరూ ఆయా నిష్పత్తిలో విక్రయించుకునేందుకు అవకాశం ఉంది' అని జీవీకే సీఎఫ్ఓ ఐజాక్ జార్జ్ తెలిపారు. జీవీకే ప్రస్తుతం ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తోంది. ఇందులో సంస్థకు 74శాతం వాటా ఉంది. 'ప్రస్తుతం విమానాశ్రయ విభాగానికి రూ.8వేల కోట్లు, జీవీకే పవర్ విభాగానికి రూ.11,000 కోట్ల అప్పులున్నాయ'ని జార్జ్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జీవీకే ఎయిర్‌పోర్ట్స్ విభాగం రూ.2,434 కోట్ల ఆదాయంపై రూ.594కోట్ల లాభాన్ని గడించింది. నవీ ముంబయి విమానాశ్రయానికి సంబంధించిన నిర్మాణం, నిర్వహణ పనులను కూడా జీవీకే సొంతం చేసుకుంది. దీని విలువ రూ.16వేల కోట్లు. ఈ నిధులను సమీకరించేందుకు రుణదాతలతో చర్చిస్తున్నట్లు.. డెట్-ఈక్విటీ నిష్పత్తి 65:35 ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.

టై-హైదరాబాద్ పోటీల విజేత మైఫో

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థి దశలోనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా నిరూపించుకోవాలనుకునే వారికోసం టై-హైదరాబాద్ నిర్వహించిన పోటీలో 'మైఫో' విజయం సాధించింది. 6వ 'టీవైఈ సమ్మర్ ఇన్నోవేషన్ 2018 ఛాలెంజ్' 6లో భాగంగా ఈ ఏడాది మేలో దీన్ని ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి 20కి పైగా ప్రముఖ పాఠశాలల నుంచి 9-12 తరగతులు చదివే 48 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఇందులో నుంచి 25మందిని ఎంపిక చేసి, వారికి పారిశ్రామికవేత్తలుగా మారేందుకు అవసరమైన అంశాల్లో శిక్షణ నిచ్చారు. ఆ తర్వాత వీరు 5 బృందాలుగా ఏర్పడి తమ ఆలోచనలను ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పంచుకున్నారు. ఇందులో నుంచి ఆహార సరఫరా సేవలను అందించే వివిధ సంస్థలకు అగ్రిగేటర్‌గా ఆలోచన, 'మై ఫుడ్, మై ఛాయిస్ - మైఫో' మొదటి అవార్డు గెలుచుకుంది. సేంద్రియ ఆహారానికి సంబంధించిన ఆలోచన 'ఓరోమీ'కి రెండో బహుమతి లభించింది. ఈ సందర్భంగా టై-హైదరాబాద్ ప్రెసిడెంట్ కాళీ ప్రసాద్ గాదిరాజు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న అనేక సమస్యలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలుగా మారతాయని పేర్కొన్నారు. వై-యాక్సిస్ ఓవర్సీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ గ్జేవియర్ ఆగస్టిన్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో పారిశ్రామికవేత్తల లక్షణాలను పెంపొందించేందుకు పాఠశాలలు, తల్లిదండ్రులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

జులై 10న ఐకియా స్టోర్ ప్రారంభం!

హైదరాబాద్: స్వీడన్‌కు చెందిన ఫర్నిచర్ దిగ్గజం ఐకియా భారత్‌లో తన తొలి విక్రయ కేంద్రాన్ని జులై 10న ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. 'ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు సంస్థ సీఈఓ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఐకియా దాదాపు రూ.800 కోట్ల పెట్టుబడి పెట్టింది. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక ఉద్యోగాలు వస్తాయని' తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. కంపెనీ వర్గాలు మాత్రం తేదీని తెలియజేయకుండా, వచ్చే నెలలో ప్రారంభం కానుందని సమాచారం ఇచ్చాయి. త్వరలోనే కచ్చితమైన తేదీ ప్రకటిస్తామని తెలిపాయి. హైటెక్ సిటీ సమీపంలో 13 ఎకరాల్లో, దాదాపు 4,00,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఫర్నిచర్ విక్రయ కేంద్రం ఏర్పాటైంది. ఇందులో 1,000 సీట్ల రెస్టారెంట్ ప్రత్యేకంగా నిలవనుంది. ఇందులో పనిచేసేందుకు దాదాపు 800 మంది వరకూ నియమించుకోనున్నట్లు సంస్థ పేర్కొంది. ఇప్పటివరకూ 400 మందిని తీసుకున్నట్లు.. ఇందులో 50శాతం మహిళలేనని తెలిపింది. హైదరాబాద్ తర్వాత 2019లో ముంబయిలోనూ, ఆ తర్వాత బెంగళూరు, దిల్లీలోనూ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఐకియా ప్రయత్నిస్తోంది. 2025నాటికి దేశంలో 25 స్టోర్లను ఏర్పాటు చేయాలనీ, దీనికోసం రూ.10,500కోట్ల వరకూ పెట్టుబడి పెట్టే లక్ష్యంతో ఉన్నట్లు గతంలో ప్రకటించింది.

అల్యూమినియం దిద్దుబాటు!

కమొడిటీస్ ఈ వారం

● పసిడి, వెండి

పసిడి ఆగస్టు కాంట్రాక్టు గతవారం రూ.30,700 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడితో రూ.30,540 వరకు దిద్దుబాటుకు లోనైంది. అనంతరం సానుకూలంగా చలించి రూ.31,334 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. ఆఖరుకు 1.68% లాభంతో రూ.31,215 వద్ద ముగిసింది. ఈవారం కాంట్రాక్టుకు అమెరికా ఫెడ్ సమావేశం దిశానిర్దేశం చేస్తుంది. దీంతో పాటు కీలక ఆర్థిక గణాంకాలు, ఇతర దేశాల సెంట్రల్ బ్యాంకుల సమావేశాల నిర్ణయాలను కూడా ట్రేడర్లు గమనించాల్సి ఉంటుంది. సాంకేతికంగా కాంట్రాక్టుకు లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే. కరెన్సీల ఒడుదొడుకులు కూడా పసిడి కాంట్రాక్టుకు కలిసిరావొచ్చు. ఈవారం రూ.31,351 స్థాయిని నిలబెట్టుకుంటే కాంట్రాక్టు మరింత ముందుకు వెళుతుందని భావించవచ్చు. గతవారం వెండి ఆగస్టు కాంట్రాక్టు రూ.39,543 ధరతో మొదలయ్యింది. ఆ తర్వాత స్వల్పంగా దిద్దుబాటుకు లోనై రూ.39,461 స్థాయికి దిగివచ్చింది. అనంతరం మళ్లీ పుంజుకొని రూ.40,714 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. వారం చివర్లో తిరిగి అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో లాభాన్ని 2.2 శాతానికి పరిమితం చేసుకొని రూ.40,412 వద్ద ముగిసింది. సాంకేతికంగా ఈవారం రూ.40,479 స్థాయిని నిలబెట్టుకుంటే, కాంట్రాక్టు సానుకూలంగా చలించే అవకాశం ఉంది. రూ.40,930 వరకు లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అదేవిధంగా రూ.40,490 స్థాయి నుంచి కొత్తగా లాంగ్ పొజిషన్లు కూడా తీసుకోవచ్చు. అయితే రూ.39,677 వద్ద స్టాప్‌లాస్ తప్పక పెట్టుకోవాలి.

● ప్రాథమిక లోహాలు

చిలీ గని వివాదం పరిష్కారం కాకుంటే రాగి కాంట్రాక్టు ఈవారం కూడా సానుకూలంగా చలించొచ్చు. అందువల్ల ట్రేడర్లు ఈ పరిణామంపై దృష్టి సారించాలి. అలాగే 2013 సెప్టెంబరు గరిష్ఠ స్థాయికి దరిదాపులో ప్రస్తుతం కాంట్రాక్టు కదలాడుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నష్టభయంతో ట్రేడ్ చేసే మదుపర్లు కాంట్రాక్టుకు దూరంగా ఉండటం మంచిది. ఎందుకంటే రానున్న వారాల్లో కాంట్రాక్టు మరింత కిందకైనా రావచ్చు, లేదంటే బాగా అయినా పెరగొచ్చు. సీసం జూన్ కాంట్రాక్టు ఈవారం రూ.164 స్థాయి కంటే దిగువకు వస్తే రూ.159 వరకు పడే అవకాశం ఉంది. అదే రూ.169 ఎగువకు వెళ్తే కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. జింక్ జూన్ కాంట్రాక్టు ఈవారం రూ.211 స్థాయి దిగువకు వస్తే ధర తగ్గినప్పుడల్లా కొనే వ్యూహంతో ముందుకెళ్లడం మంచిది. అల్యూమినియం మే కాంట్రాక్టు ఈవారం మరింత దిద్దుబాటయ్యే అవకాశం ఉంది. రూ.157.35 ఎగువన ట్రేడ్ కాకుంటే రూ.153.65 వరకు పడిపోవచ్చు. నికెల్ జూన్ కాంట్రాక్టుకు ఈవారం రూ.1,077.45 దరిదాపులో నిరోధం కనిపిస్తోంది. అందువల్ల ఈ స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకొని రూ.1,063 దిగువన కాంట్రాక్టుకు షార్ట్‌సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు.

● ఇంధన రంగం

ముడి చమురు జూన్ కాంట్రాక్టును రూ.4,235 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని స్వల్పకాలానికి కొనుగోలు చేయొచ్చు. అలాగే ఈ నెల సమావేశంలో ఉత్పత్తి పెంపుపై ఒపెక్ దేశాలు తీసుకునే నిర్ణయం కోసం ట్రేడర్లు ఎదురుచూసే అవకాశం ఉంది. తక్కువ నష్టభయంతో ట్రేడ్ చేసేవారు అమ్మకాల వైపు కాకుండా ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్ళడం మంచిది. సహజ వాయువు జూన్ కాంట్రాక్టుకు ఈవారం రూ.203 స్థాయి వద్ద నిరోధం కనిపిస్తోంది. లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.196- 197.60కు దరిదాపులో లాభాలు స్వీకరించడం మంచిది. సాంకేతికంగా కాంట్రాక్టు ఈవారం కిందకు దిగివచ్చే అవకాశం ఉన్నందున షార్ట్ పొజిషన్లు తీసుకునేందుకు మొగ్గు చూపొచ్చు. తక్కువ నష్టభయంతో ట్రేడ్ చేసే వాళ్లు రూ.203.60 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని రూ.200.85 కింద షార్ట్‌సెల్ చేయొచ్చు.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
రాగి (జూన్)	460	493	7%
సీసం (జూన్)	165	167	1.49
జింక్ (జూన్)	208	217	4.57
అల్యూమినియం (జూన్)	155	157	1.03
నికెల్ (జూన్)	1033	1,043	1
ముడి చమురు (జూన్)	4,409	4,445	0.82
సహజ వాయువు (మే)	199	196	(1.46)

–ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

ఖాకీల కాసుల వేట!

- లంచాల కోసం పీడిస్తూ.. వేధిస్తున్న కొంత మంది పోలీసులు
- ఏసీబీ దాడులతో వెలుగులోకి వచ్చేవి కొన్నే..

ఈనాడు – అమరావతి

కాసులు కొడితే కేసుల నుంచే తప్పించేస్తారు... జేబులు నింపితే నిందితుల జాబితాలో పేరే తొలగించేస్తారు... సొమ్ములు చెల్లిస్తే చిటికెలో స్టేషన్ బెయిల్ ఇచ్చేస్తారు. కాదు.. కూడదు.. ఎందుకివ్వాలని ప్రశ్నించారో.. మరిన్ని కేసుల్లో ఇరికించేస్తామంటూ బెదిరింపులకు దిగుతారు. అంత ఇవ్వలేం సారూ! అని బతిమాలుకున్నా సరే.. ముడుపు కట్టాల్సిందేనంటూ ముక్కు పిండి వసూలు చేస్తారు. లేదంటే జీవితాంతం కటాకటాలేనంటూ భయపెట్టి మరీ లంచాలు గుంజుతారు. ఇదీ ఆంధ్రప్రదేశ్‌లోని కొందరు పోలీసు అధికారుల తీరు.. క్షేత్ర స్థాయిలో బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసు ఠాణాలను వారు వసూళ్ల కేంద్రాలుగా మార్చేసి ఫిర్యాదుదారులను జలగల్లా పీడిస్తున్నారు. లంచాలు తీసుకుంటూ గత ఏడాది కాలంలో ఏసీబీకి పట్టుబడిన పలువురు పోలీసు అధికారుల కేసులను విశ్లేషిస్తే ఇదే విషయం వెల్లడవుతోంది.

రూ.2.50 లక్షలు ఇస్తావా.. కుటుంబ సభ్యులను అరెస్టు చేయమంటావా?

రూ.2.50 లక్షలు ఇచ్చావో.. సరే లేదంటే నీ భార్య, కుమార్తెలు, అల్లుళ్లు, బావ... అందరి పేర్లను కేసులో నిందితులుగా చేర్చి అరెస్టు చేస్తానంటూ సుబ్బారావు అనే వ్యక్తిని బెదిరించి తొలి విడతగా రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు పాత గుంటూరు స్టేషన్ ఎస్సై వెంకట నరసింహారావు. వివాదంలో ఉన్న ఓ భూమిని తనకు అంటగట్టి మోసగించారంటూ గుంటూరుకు చెందిన వైద్యుడు ఇచ్చిన ఫిర్యాదుపై ప్రకాశం జిల్లా వాసి అయిన డి.సుబ్బారావుపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. బెయిలుపై బయటకొచ్చిన అనంతరం ఎస్సై తరచూ ఫోన్లు చేసి డబ్బులు డిమాండు చేస్తుండటంతో అతడిని సుబ్బారావు ఏసీబీకి పట్టించాడు.

రూ.50 వేలు ఇస్తే సరే.. లేకుంటే 498 ఏ కేసులో ఇరికించేస్తా

'మా సీఐ గారికి రూ.50వేలు, నాకో రూ.3వేలు ఇచ్చేయ్.. క్షణాల్లో స్టేషన్ బెయిలు ఇప్పించేస్తా. ఇవ్వకపోతే గృహ హింస కింద 498 ఏ సెక్షన్‌నూ జతపరిచి ఇరికించేస్తా' అంటూ నిందితుడ్ని బెదిరించి అతని నుంచి రూ.20వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు కర్నూలు తాలూకా పోలీసు స్టేషన్ సీఐ షేక్ ఇస్మాయిల్, హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణరెడ్డి. తన భర్త సులేమాన్ జావేద్, ఆడపడుచు, మరిది, అతని స్నేహితుడు తనపై దాడి చేశారంటూ కర్నూలు జిల్లా వాసి నౌసిన్ ఖానుమ్ ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నలుగురికి స్టేషన్ బెయిల్ కోసం సులేమాన్ జావేద్ ప్రయత్నించగా.. లంచం కోసం ఒత్తిడి పెరగడంతో అతడు ఏసీబీని ఆశ్రయించాడు.

రాజీ కుదుర్చుకున్నా వదలకుండా..!

ఓ ఇంటి కొనుగోలు వివాదంలో ఒకరి పక్షం వహించి.. రాజీ చేసుకోవాలని మరొకర్ని బెదిరించారు రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ పి.నారాయణరావు. నిందితుడిగా ఉన్న వ్యక్తి రాజీ కుదుర్చుకున్నా వదలకుండా తనకు రూ.2 లక్షలు ఇస్తేనే అరెస్టు చేయకుండా ఉంటానని కానిస్టేబుల్‌తో బేరసారాలు చేయించాడు. చివరకు విసిగిపోయిన బాధితుడు రూ.55వేలు లంచమిస్తూ డీఎస్పీని ఏసీబీకి పట్టించాడు.

పోస్టింగుల కోసం ముడుపులు... ఫిర్యాదుదారుల నుంచి వసూళ్లు

ఠాణాలు వసూళ్ల కేంద్రాలుగా మారిపోతుండటానికి ప్రధాన కారణం... పోస్టింగుల్లో ముడుపుల ప్రమేయం పెరగడమేనన్న ఆరోపణలున్నాయి. లాభదాయకమైన ఠాణాల్లో స్టేషన్ హౌస్ అధికారులుగా చేరేందుకు కొందరు పోలీసులు స్థానికంగా పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు భారీగా ముట్టజెప్పి ఆ పోస్టుల్లో చేరుతున్నారన్న విమర్శలున్నాయి. అక్కడ కొలువుదీరిన తర్వాత వారి దృష్టంతా తాము ఇచ్చిన దానికి రెండు, మూడింతలు రాబట్టుకోవడం పైనే ఉంటోంది.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలే

అవినీతికి పాల్పడే పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. లంచాల కోసం ఫిర్యాదుదారులను వేధించేవారిని ఉపేక్షించేది లేదు. క్షేత్ర స్థాయిలో సిబ్బందిపై పర్యవేక్షణ పెంచాలని ఎస్పీలకు సూచించాం. గాడి తప్పుతున్న వారిని ప్రారంభంలోనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎస్పీలను ఆదేశించాం.

– ఎం.మాలకొండయ్య, డీజీపీ

లంచాల్లో.... వాటాలు

ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి మరీ వసూలు చేస్తున్న అవినీతి అధికారులు.. తమ ఉన్నతాధికారుల పేర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఎస్సై స్థాయి అధికారులైతే తాము ఇన్‌స్పెక్టర్‌కు, డీఎస్పీలకు వాటాలు ఇవ్వాల్సి ఉందంటూ మరింత వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవలి కాలంలో ఏసీబీకి పట్టుబడ్డ పోలీసు అధికారులు రూ.50 వేలు అంతకంటే ఎక్కువ మొత్తంలోనే లంచాలు తీసుకున్నారు. ఈ సొమ్ము తమకొక్కరికే కాదని ఉన్నతాధికారులకూ ఇవ్వాల్సి ఉంటుందంటూ రూ.లక్షల్లో డిమాండు చేసిన సందర్భాలూ వెలుగుచూశాయి. కొన్ని జిల్లాల్లో ఎస్పీల పర్యవేక్షణ కొరవడటమూ లంచావతారులకు ఊతమిస్తోంది.

గత ఏడాదిన్నరలో ఏసీబీకి చిక్కిన పోలీసు అధికారుల వివరాలివీ...

అభియోగ పత్రం దాఖలుకు: తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో అభియోగపత్రం దాఖలు చేసేందుకు ఆ ఠాణా ఎస్సై రెహమాన్ ఫజల్ రూ.5వేలు లంచం తీసుకున్నారు.

మద్యం దుకాణాల నుంచి: మద్యం దుకాణాల యజమానుల నుంచి నెలవారీ మామూళ్ల పేరిట రూ.26 వేలు లంచం తీసుకున్నారు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం ఠాణా ఎస్సై ఎల్.సుధాకర్‌రెడ్డి.

అభియోగ పత్రంలో పేరు చేర్చకుండా ఉండేందుకు: వరకట్న వేధింపుల కేసులో అభియోగ పత్రంలో పేరు చేర్చకుండా ఉండేందుకు రూ.25వేలు లంచం తీసుకున్నారు గుంటూరు జిల్లా రొంపిచర్ల ఎస్సై సమీర్ భాషా.

చెక్కులు, ప్రాంసరీ నోట్లు తిరిగిచ్చేందుకు: ఓ కేసులో స్వాధీనం చేసుకున్న చెక్కులు, ప్రాంసరీ నోట్లను తిరిగిచ్చేందుకు విజయవాడలోని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్సై అర్జున రాజు రూ.10 వేలు లంచం తీసుకున్నారు.

నిందితులను అరెస్టు చేసేందుకు: ఓ కిడ్నాప్ కేసులో నిందితులను అరెస్టు చేసేందుకు విజయనగరం పట్టణ సీఐ శోభన్ బాబు రూ.3 లక్షలు లంచం తీసుకున్నారు.

స్టేషన్ బెయిలుకు: ప్రమాదానికి కారణమైన వాహనాన్ని విడుదల చేయడానికి, డ్రైవరుకు స్టేషన్ బెయిలు ఇచ్చేందుకు రూ.20వేలు లంచం తీసుకున్నారు గుంటూరు జిల్లా మేడికొండూరు ఏఎస్సై వి.లింగమూర్తి.

గత ఏడాదిన్నరలో ఏసీబీకి పట్టుబడ్డ అధికారుల లెక్కలివే...

అంశం	2017లో	2018 జూన్ 6 వరకూ
ట్రాప్ కేసులు	11	7
అక్రమాస్తుల కేసులు	4	0
మొత్తం	15	7

శ్రీకాకుళం జిల్లాలో ఎలుగుబంటి బీభత్సం

- దాడిలో దంపతుల మృతి
- మరో తొమ్మిది మందికి తీవ్రగాయాలు

ఎలుగు దాడిలో గాయపడి మృతి చెందిన దంపతులు ఊర్మిళ, తిరుపతిరావు (దాచినచిత్రం)

సోంపేట, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామంలో ఎలుగుబంటి బీభత్సం సృష్టించింది. ఆదివారం ఉదయం ఆరింటి ప్రాంతంలో పలువురిపై దాడి చేసింది. ఎలుగుబంటి దాడిలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. తొలుత గ్రామ శివార్లలో చెత్త వేసేందుకు వెళ్లిన బైపల్లి ఊర్మిళ(40)పై దాడి చేసి ఈడ్చుకు వెళ్తుండగా ఆమెను కాపాడేందుకు వెళ్లిన భర్త తిరుపతిరావు(48)పైనా దాడి చేసింది. వారిద్దరిని కాపాడేందుకు వెళ్లిన గ్రామస్థులపై దొరికిన వారు దొరికినట్టుగా దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన దంపతులు ఊర్మిళ, తిరుపతిరావులను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. క్షతగాత్రుల్లో బైపల్లి అప్పలస్వామి, దుర్యోధనల పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖకు, బైపల్లి పాపారావు, రాజేష్, రట్టి అప్పన్నలను శ్రీకాకుళానికి తరలించారు. సోంపేట, పలాసల్లోని ప్రైవేటు ఆసుపత్రులలో మల్లెన పాపారావు, జుత్తు నారాయణ, బత్తిని గోపాల్, ఎం.ప్రసాద్ చికిత్స పొందుతున్నారు. ఎలుగుబంటిని గ్రామస్థులు హతమార్చారు.

తాతను గొంతుకోసి చంపిన మనవడు

చేతబడి నెపంతోనే హత్య

మాచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: చేతబడి చేస్తున్నాడనే నెపంతో సొంత తాతనే ఓ మనవడు హతమార్చిన ఘటన గుంటూరు జిల్లాలో జరిగింది. గుంటూరు జిల్లా మాచర్ల మండలం తాళ్లపల్లి శివారులోని ఏడోమైలు చెంచుకాలనీకి చెందిన శీలం నరసింహం(75) శనివారం రాత్రి ఇంట్లో ఉండగా, మనవడు అంజి వచ్చి అతనితో గొడవ పెట్టుకున్నాడు. అర్ధరాత్రి తన తండ్రి వెంకటేశ్వర్లుకు ఫోన్‌చేసి తాతను చంపుతున్నానని చెప్పాడు. తరువాత కూరగాయలు కోసే కత్తితో తాత గొంతుకోసి చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. బంధువులు పోలీసులకు సమాచారమివ్వడంతో విజయపురిసౌత్ ఎస్ఐ సురేశ్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. చేతబడిచేస్తున్నందునే తన తాతను చంపుతున్నట్లు కుటుంబీకులకు అంజి చెప్పినట్లు సమాచారం. మాచర్ల గ్రామీణ సీఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అరేబియాలో ఐబిస్ శకలాలు

మంగళూరు (కర్ణాటక), న్యూస్‌టుడే: అరేబియా సముద్రంలో ఆదివారం అల్లకల్లోల పరిస్థితులు తలెత్తాయి. నాలుగు నుంచి అయిదు మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడుతుండడంతో నిరుడు మునిగిన ఐబిస్ డ్రెడ్జింగ్ బార్జ్ శకలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. గత ఏడాది జూన్‌లో ఐబిస్ బార్జ్ ప్రమాదానికి గురై నీట మునిగిన విషయం తెలిసిందే. అప్పట్లో ఇందులోని 22 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తెచ్చారు.

విజయవాడ నుంచి సింగపూర్‌కు విమానం ఉండాలి

ప్రజాభిప్రాయంలో అత్యధికుల మొగ్గు

ఈనాడు, అమరావతి: విజయవాడ నుంచి సింగపూర్‌కు నేరుగా విమాన సర్వీసులు నడపాలన్న ప్రతిపాదనలపై ప్రజలు సానుకూలంగా స్పందించారు. తాజా సమాచారం ప్రకారం సింగపూర్‌కు విమాన సర్వీసు నడపాలని 78,775 మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి సింగపూర్‌కు విమాన ప్రయాణం వల్ల అదనపు వ్యయం అవుతున్నట్లు రాష్ట్ర ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన ప్రభుత్వం విజయవాడ నుంచి నేరుగా సింగపూర్‌కు విమాన సర్వీసుల ప్రారంభంపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది. సింగపూర్‌కు విమాన సేవల ప్రతిపాదనలకు అనుకూలంగా అత్యధికులు స్పందించడంతో ఆ దేశానికి విమానయాన సేవలు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సెలవులు ముగిసె... రైళ్లు కిక్కిరిసె!

రైలు ఎక్కడానికి కూడా స్థలం లేనంతగా రద్దీ

వేసవి సెలవులు ముగిశాయి. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడ తోపాటు కృష్ణా జిల్లాలోని బంధువుల ఇళ్లకు వచ్చిన వారంతా తమ స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో విజయవాడలోని రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఆదివారం ఒకటో ప్లాట్‌ఫాంలోకి వచ్చిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ప్రయాణికులు తోసుకోవాల్సి వచ్చింది. కనీసం ఎక్కడానికి చోటు లేక అవస్థలు పడ్డారు. – ఈనాడు, అమరావతి

వైద్యవిద్యలో కొత్త కోర్సుల ప్రారంభానికి నిబంధనల సవరణ

ఈనాడు, అమరావతి: భారతీయ వైద్యమండలి నుంచి ఇంకా గుర్తింపు పొందని వైద్య విద్య కళాశాలల్లో ప్రీ క్లినికల్, పారాక్లినికల్ కోర్సుల ప్రారంభానికి అనుమతులపై గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ కేంద్రం రాజపత్రం విడుదల చేసింది. ప్రీక్లినికల్ కోర్సులైన అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోడానికి మూడోసారి నవీకరణ (రెన్యువల్) సమయంలో అనుమతినిస్తారు. పారామెడికల్ కోర్సులైన అనెస్తీషియాలజీ, డెర్మటాలజీ, వెనెరియాలజీ, లెప్రసీ, జనరల్ మెడిసిన్; పీడియాట్రిక్స్, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్, రేడియేషన్ ఆంకాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్స్, ఒబెస్టిరిక్స్, గైనకాలజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోడానికి నాలుగో రెన్యువల్ సమయంలో అనుమతి లభిస్తుంది.

పడవ విహారం కొత్తకొత్తగా..

ఆధునిక సాంకేతికత మేళవించి రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ పడవ అందుబాటులోకి వచ్చింది. రూ. 1.19 కోట్లతో రూపొందించిన ఈ పడవను నెలరోజుల కిందటే విజయవాడ పున్నమిఘాట్‌కు తీసుకువచ్చినా ప్రారంభానికి నోచుకోలేదు. ఏడాదిపాటు ఈ పడవను నడిపేందుకు కావాల్సిన అనుమతుల కోసం ఇన్నాళ్లు ఇక్కడ ఆపారు. 28 మందిని తీసుకెళ్లగలిగే సామర్థ్యం ఉన్న ఈ బోటులో ప్రయాణించేందుకు ఒక్కొక్కరికి రూ. 150 వసూలు (15 నిమిషాలకు) చేస్తారు. వారం రోజుల్లో ఈ పడవ కృష్ణానదిలో విహారానికి పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి రానుందని పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ టి.వి. సుదర్శన్ పేర్కొన్నారు.

– ఈనాడు, అమరావతి

కృష్ణా నదిలో జలసవ్వడి

- ఏప్రిల్, మే నెలల్లో జూరాలకు 2.2 టీఎంసీల రాక
- తాజాగా ఎగువ నుంచి 2400 క్యూసెక్కుల ప్రవాహం

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా నది ఈఏడాది వేసవిలో తడారలేదు. ఎగువనుంచి స్వల్పంగా వరద ప్రవాహం కొనసాగడంతో ఏప్రిల్‌లో జూరాల జలాశయానికి 1.3 టీఎంసీల నీళ్లు చేరాయి. మే నెలలోనూ 0.9 టీఎంసీల ప్రవాహం వచ్చింది. కర్ణాటకలోని నారాయణపూర్, గూగల్ జలాశయాల నుంచి రాయచూర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం అవసరాలకు నిత్యం నీటిని వదులుతున్నారు. అక్కడి నుంచి జూరాల జలాశయానికి ప్రవాహం కొనసాగడంతో.. దీనికింద సాగులో ఉన్న రబీ పంట తడులు గట్టెక్కాయి. వాస్తవానికి తాగునీటికి, జలాశయం కింద సాగులో ఉన్న 40వేల ఎకరాల పంటను కాపాడేందుకు రెండు, మూడు తడులకు రెండు టీఎంసీల నీళ్లు అవసరమయ్యాయి. జలాశయం కనిష్ఠ నీటిమట్టానికి చేరుకున్న తరుణంలో నారాయణపూర్ నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వం వేసవిలో కర్ణాటక ప్రభుత్వాన్ని కోరింది. దీనికి సానుకూల స్పందన లభించినా నీటి విడుదలకు ఆదేశాలు రాలేదు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని సంగంబండ జలాశయం నుంచి 0.6 టీఎంసీల నీటిని జూరాలకు వదిలడంతో పంటలు గట్టెక్కాయి. ఎగువ నుంచి వచ్చిన ప్రవాహం, సంగంబండ నీళ్లు కలిపి మొత్తంగా 2.2 టీఎంసీల జలాలు ఈ వేసవిలో రావడం విశేషం.

జూరాలకు జలప్రవాహం: ఏటా జూన్ నెలాఖరులో జూరాలకు ప్రవాహం ప్రారంభమవుతుంది. నారాయణపూర్ దిగువన కృష్ణా పరివాహకంలో కురిసే వర్షాలకు నదిలో ప్రవాహం ప్రారంభమవుతుంది. గతేడాది జూన్ 19న ఒక్కసారి ఏడువేల క్యూసెక్కుల వరద జూరాలకు వచ్చింది. నారాయణపూర్ నుంచి మాత్రం జులై 25న ప్రవాహం వదిలారు. దీనికి భిన్నంగా ఈఏడాది ఏడో తేదీ నుంచే స్వల్పంగా నదిలో ప్రవాహం ప్రారంభమైంది. ఏడోతేదీ నుంచి రోజుకు 1500 క్యూసెక్కుల వరకూ ప్రవాహం వస్తుండగా పదోతేదీన 2800 క్యూసెక్కులకు చేరుకుంది. జూరాల జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 9.66 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 4.18 టీఎంసీలు ఉన్నాయి. కర్ణాటకలోని చిన్న ఆనకట్టలు, చెక్‌డ్యాంలు ఇప్పటికే నిండి ఉన్నాయి. నదిలోని మడుగుల్లోనూ నీటినిల్వ ఉంది. వర్షాలు కురిస్తే ప్రవాహమంతా దిగువకే రానుందని జూరాల అధికారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపరాష్ట్రపతి కంటికి 'ఎల్వీప్రసాద్'లో శస్త్రచికిత్స

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి కంటికి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో ఆదివారం శస్త్రచికిత్స జరిగింది. ఆయన కొద్ది రోజులుగా కాటరాక్ట్ సమస్యతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఉదయం డాక్టర్ ప్రవీణ్ కృష్ణ నేతృత్వంలో కంటికి శస్త్రచికిత్స నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు వచ్చిన ఆయనకు శస్త్రచికిత్స చేసి గంటన్నర తరువాత పంపించారు. విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. సోమవారం మరోసారి పరీక్షలకు రావాలని సూచించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

'గోదావరి కుటుంబం'తో నదీ పరిరక్షణ

- ఆరు రాష్ట్రాల ప్రతినిధులతో అయిదు కమిటీలు
- 'నన్నయ్య'లో ముగిసిన జాతీయ సదస్సు

రాజానగరం, న్యూస్‌టుడే: గోదావరి నది పరిక్షణకు ఆరు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో 'గోదావరి కుటుంబం' ఏర్పాటు చేసినట్లు రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డా.రాజేంద్రసింగ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన గోదావరి నది పరిరక్షణ జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. నదీ పరిరక్షణకు సంబంధించి సివిల్ సర్వీసెస్, ఎలక్టోరల్, అకడమిక్, డయాగ్నసిస్, ట్రీట్‌మెంట్ తదితర విభాగాలతో 5 కమిటీలను నియమించినట్లు తెలిపారు. ఇవి నదిపై శాస్త్రీయ పరిశోధనలు చేయడం, విశిష్టతను తెలియజేస్తూ పాఠ్యాంశాలను రూపొందించడంతో పాటు, నదీ కాలుష్యం ఏ విధంగా జరుగుతుందన్న అంశంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కాలుష్య నివారణకు తీసుకోవాల్సి చర్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ సదస్సు అధ్యక్షుడు అద్దేపల్లి శ్రీధర్ మాట్లాడుతూ.. నదీ కాలుష్య నివారణపై అందరికీ అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. నాసిక్ నుంచి స్వచ్ఛమైన గోదావరి నీటి కలశాన్ని రాజేష్‌పండిట్ నిర్వాహకులకు అందజేశారు. ఆచార్య విజయ్ పరాంజిపె మాట్లాడుతూ గోదావరి మహారాష్ట్రలో 60 శాతం ప్రవహిస్తోంది, అక్కడే అధిక శాతం కలుషితం అవుతుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎస్.సత్యనారాయణ, బలిశెట్టి సత్యనారాయణ, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ప్రతినిధులు వినోద్‌బోదంకర్, స్నేహల్‌దొండే తదితరులు పాల్గొన్నారు.

పురపాలనలో అవినీతి మేట

- అధికారుల అండతో చాలా చోట్ల చక్రం తిప్పుతున్నది సర్వేయర్... బిల్ కలెక్టర్‌లే
- రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాల్లో అక్రమ వసూళ్లు

ఈనాడు – అమరావతి

పురపాలనలో క్షేత్రస్థాయిలో అవినీతి పతాక స్థాయికి చేరుకుంటోంది. చిరుద్యోగులైనా కోట్లాది రూపాయల అక్రమాస్తులు కూడగడుతున్నారు. ఆ మధ్య విశాఖలో పట్టణ ప్రణాళిక విభాగంలో సర్వేయర్, ఇప్పుడు గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. అధికారులు కొందరు క్షేత్రస్థాయిలోని చిరుద్యోగులను అక్రమ వసూళ్లకు ఉపయోగించుకుంటున్నారు. ఇలా అధికారుల అండ పుష్కలంగా ఉన్నచోట వారు అక్రమ సంపాదనలో ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. వీరి పీడనలో ప్రజలు నలిగిపోతున్నారు. వ్యక్తిగతంగా లాభం కల్పిస్తున్నట్టు చెబుతూ వారిని ముందుగా ఈ ఊబిలోకి దింపుతున్నారు. తర్వాత నుంచి దీన్ని బూచిగా చూపి జేబులు నింపేసుకుంటున్నారు. రాష్ట్రంలోని 110 పురపాలక, నగరపాలక సంస్థల్లో పన్నుల వసూళ్లలో రెవెన్యూ, కొత్త భవనాలకు అనుమతుల్లో పట్టణ ప్రణాళిక విభాగం క్రియాశీలకం. వీటి నుంచే పురపాలక, నగరపాలక సంస్థలకు అత్యధికంగా ఆదాయం వస్తోంది. ఇదే ముసుగులో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.

రెవెన్యూ విభాగంలో ఇలా...

కొత్త ఇళ్లకు, భవనాలకు ఆస్తి పన్ను విధింపులో అక్రమాలకు బీజం పడుతోంది. భవన నిర్మాణ విస్తీర్ణం ఎక్కువ ఉంటే తక్కువ చూపించి పన్ను వేయడం, వాణిజ్య అవసరాలకు ఉపయోగించేవి నివాసమైనవిగా చూపించి పన్ను విధించడం వంటివి ప్రధానంగా చోటు చేసుకుంటాయి. ఇందులో భవన యజమానుల నుంచి భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సహాయ కమిషనర్, ఉప కమిషనర్, జోనల్ కమిషనర్/కమిషనర్ వరకు వాటాలు సర్దుబాటు చేయాలనేది క్షేత్ర స్థాయిలో సర్వేయర్లు, బిల్‌కలెక్టర్లు చెప్పేమాట. వాటాలు అందనిదే కొందరు అధికారులు పన్ను విధింపు దస్త్రాలపై సంతకాలు చేయరని భయపెడతారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ గ్రేడ్ పురపాలక సంఘాలలో, నగర పంచాయతీల్లో కొందరు కమిషనర్‌లు అక్రమ ఆదాయం కోసం క్షేత్ర స్థాయి సిబ్బందిపై గట్టిగా ఒత్తిడి తెస్తున్నారు.

పట్టణ ప్రణాళిక విభాగంలో...

కొత్త భవనాలకు అనుమతుల్లో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి క్షేత్రస్థాయిలోని సర్వేయర్ పాత్ర కీలకం. చాలాచోట్ల వీరికి ముడుపులు చెల్లించాల్సిందే. రెవెన్యూ విభాగంలోని బిల్‌కలెక్టర్లు చెప్పినట్టే వీరు కూడా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మొదలు సహాయ ప్రణాళిక అధికారి (ఏసీపీ), కమిషనర్/జోనల్ కమిషనర్ వరకు వాటాలుగా ఇవ్వాలని చెబుతూ ప్రజల్ని బెదిరించి దోచేస్తున్నారు. వీటిని నిరోధించేందుకు ఆన్‌లైన్ అనుమతుల విధానాన్ని తీసుకొచ్చినా వసూళ్లు ఆగడం లేదు. నిర్మాణాలు ఎక్కువగా జరిగే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, కర్నూలు, నెల్లూరు పట్టణాల్లో/గ్రామీణ జిల్లాల్లో ఇలాంటివి ఎక్కువ. అక్రమ వసూళ్లకు అలవాటుపడిన పట్టణ ప్రణాళిక అధికారులు ఇదే ప్రాంతంలో పని చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. వేరొక ప్రాంతానికి బదిలీపై వెళ్లకుండా అవసరమైతే ఎమ్మెల్యేలు, మంత్రుల వరకూ వెళ్తున్నారు. అన్ని ప్రధాన నగరపాలక సంస్థలతోపాటు మరో 25 పురపాలక సంఘాల్లో ఈ పరిస్థితి ఉంది.

అక్కడే అటూ ఇటూ...

విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, ఒంగోలు, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప నగరపాలక సంస్థల్లోని రెవెన్యూ విభాగాల్లో పని చేసే సహాయ కమిషనర్‌లు, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు అక్కడే ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారు. నాలుగైదేళ్లయ్యాక ఒక జోన్/డివిజన్ నుంచి అదే నగరపాలక సంస్థలోని మరో జోన్/డివిజన్‌కు బదిలీ తప్పితే వారికి వేరే మార్పు ఉండదు. దాంతో స్థానికంగా పాతుకుపోయి ఎమ్మెల్యే, మేయర్, కీలక కార్పొరేటర్ల మద్దతుతో వీరు చక్రం తిప్పుతున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైన గుంటూరు నగరపాలక సంస్థ బిల్ కలెక్టర్ ఇదే కోవకు చెందుతారు. 53 పురపాలక సంఘాల్లో కొందరు ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు ఐదేళ్లకుపైగా ఒకే చోట కొనసాగుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోకుండానే వందలాది మంది తిరుగు ప్రయాణమయ్యారు. వేసవి సెలవుల ముగింపు, వారాంతం ప్రభావంతో వేలాది మంది దివ్యక్షేత్రానికి చేరుకోవడంతో ఆదివారం తిరుమల కిక్కిరిసిపోయింది. సర్వదర్శనం క్యూలైను అమాంతం పెరిగిపోయింది. దివ్యదర్శనం, సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉండడంతో యాత్రికులకు అందరికీ దర్శనం లభ్యంకాని పరిస్థితి నెలకొంది. సర్వదర్శనానికి దాదాపు లక్ష మంది వరకు వరుస కట్టారు. దీంతో దాదాపు 30 గంటల సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.11 కోట్లు వచ్చింది.

దిల్లీలో సత్యదేవుని కల్యాణోత్సవం

ఈనాడు, దిల్లీ: దేశరాజధాని దిల్లీలో ఆదివారం రాత్రి అన్నవరం సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక గోల్‌మార్కెట్‌లోని తితిదే బాలాజీ మందిర్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. దిల్లీలో ఉన్న తెలుగు ప్రజల కోసం శనివారం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించిన అన్నవరం దేవస్థానం పురోహితులు ఆదివారం రాత్రి కల్యాణోత్సవం జరిపించారు. ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్ సహా దిల్లీలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగువారు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కల్యాణానంతరం భక్తులకు కల్యాణ అక్షింతలు, అన్నవరం ప్రసాదం అందించారు.

'కొలీజియం ప్రతిపాదన పునఃపరిశీలన'పై రాద్ధాంతం

కాంగ్రెస్‌పై జైట్లీ విమర్శలు

దిల్లీ: న్యాయవ్యవస్థ నియామకాలకు సంబంధించి కొలీజియం చేసిన ఓ ప్రతిపాదనను కేంద్రం పునఃపరిశీలనకు పంపడంపై కాంగ్రెస్ అనవసరంగా రాద్ధాంతం చేస్తోందంటూ కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ విమర్శలు గుప్పించారు. గతంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులను తొలగించిన ఘటనలను, సుప్రీం ప్రతిపాదనలను తిరస్కరించిన సందర్భాలను కాంగ్రెస్ నేతలకు జైట్లీ గుర్తుచేశారు. నెహ్రూ, ఇందిర హయాముల్లో చోటుచేసుకున్న పలు ఉదంతాలను, 'కేశవానంద భారతి' కేసును ప్రస్తావిస్తూ వాటిని వివరించారు. "తొలి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ హెచ్‌జే కానియా.. హైకోర్టు న్యాయమూర్తులకు పేర్లు సిఫార్సు చేసినప్పుడు కొంత అలజడి రేగింది. ఆ పదవికి కానియాకున్న అర్హతలను అప్పటి ప్రధాని నెహ్రూ ప్రశ్నించారు. అప్పుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ వ్యవహార జ్ఞానం కానియాను 'సమాళించేందుకు' ఆయనకు ఉపయోగపడింది. ఇందిర హయాంలో సీజేఐ జస్టిస్ హిదయతుల్లా ప్రతిపాదించిన కొన్ని పేర్లపైనా.. కేంద్రం మౌనం వహించింది. అసలు స్పందించలేదు. దాన్ని ఆయన ఎప్పుడూ ప్రశ్నించలేదు. 'కేశవానంద భారతి' కేసులో ఇందిర ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు మధ్య తీవ్ర ఘర్షణ ఏర్పడింది. న్యాయవ్యవస్థ స్వతంత్రతనే దెబ్బతీయాలని ఆమె ప్రయత్నించారు" అంటూ ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా జైట్లీ వివరించారు.

చొరబాటుయత్నం.. ఆరుగురు ఉగ్రవాదుల కాల్చివేత

శ్రీనగర్: పాక్ ఆక్రమిత కశ్మీరు నుంచి మనదేశంలోకి చొరబడటానికి ఉగ్రవాదులు చేసిన యత్నాన్ని భద్రతా దళాలు భగ్నం చేశాయి. ఆదివారం వేకువజామున ఆరుగురు తీవ్రవాదులను సైన్యం కాల్చి చంపింది. ఉత్తర కశ్మీరులోని నియంత్రణరేఖ వెంబడి కుప్వారాజిల్లా కెరన్ సెక్టార్ వద్ద ఈ కాల్పులు చోటు చేసుకున్నాయని కల్నల్ రాజేశ్ కాలియా తెలిపారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మన దేశం కాల్పుల విరమణ పాటిస్తున్న సంగతి తెలిసిందే. స్వయంనియంత్రణ పాటిస్తున్నా, ఉగ్రవాదులు ఖాతరు చేయడం లేదు. గత రెండువారాలుగా చొరబాట్లకు ప్రయత్నించి 21 మంది హతమయ్యారు.

చాంపియన్స్

ఛెత్రి డబుల్

- భారత్‌దే ఇంటర్‌కాంటినెంటల్ కప్
- ఫైనల్లో 2-0తో కెన్యాపై విజయం

ముంబయి: కెప్టెన్ సునీల్ ఛెత్రి మెరిసిన వేళ భారత జట్టు ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ కప్‌ను గెలుచుకుంది. సూపర్ ఫామ్‌లో ఉన్న ఛెత్రి రెండు గోల్స్ కొట్టడంతో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 2-0తో కెన్యాపై విజయం సాధించింది. కెరీర్‌లో 102వ అంతర్జాతీయ మ్యాచ్‌లో బరిలోకి దిగిన ఛెత్రి.. 8వ, 29వ నిమిషాల్లో గోల్స్ కొట్టాడు. ముంబయి ఫుట్‌బాల్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో ఆద్యంతం భారత్‌దే ఆధిపత్యం. ఎనిమిదో నిమిషంలో థాపా నుంచి పాస్‌ను అందుకున్న ఛెత్రి.. జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. చక్కని సమన్వయంతో సాగిన భారత ఆటగాళ్లు కెన్యా డిఫెన్స్‌పై ఒత్తిడి కొనసాగించారు. విరామానికి ముందే ఛెత్రి భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. అనాస్ ఎదాతొడిక నుంచి వచ్చిన బంతిని ఛాతితో చక్కగా నియంత్రించిన ఛెత్రి.. కెన్యా డిఫెండర్లు అటుడో, కిబ్వాగెలను బోల్తా కొట్టిస్తూ గోల్ కొట్టేశాడు. భారత్ ఆధిక్యం మరింత పెరిగేదే. ఐతే 43వ నిమిషంలో ఛెత్రి ఫ్రీకిక్ బార్‌పై నుంచి వెళ్లింది. గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు.. కెన్యా గోల్ ప్రయత్నాలను చక్కగా అడ్డుకున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత డిఫెండర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. ముఖ్యంగా నజారి, సందేశ్ ఆకట్టుకున్నారు.

మెస్సి సరసన మనోడు...

టోర్నమెంట్లో అద్భుత ప్రదర్శన కొనసాగించిన ఛెత్రి.. ప్రస్తుతం అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఆటగాళ్లలో అత్యధిక గోల్స్ కొట్టిన రెండో ఆటగాడిగా అర్జెంటీనా సూపర్‌స్టార్ లియోనల్ మెస్సి సరసన నిలిచాడు. 62 గోల్స్‌తో ఫైనల్లో అడుగుపెట్టిన మెస్సి.. మరో రెండు గోల్స్ కొట్టి మెస్సి (64 గోల్స్)తో సమమయ్యాడు. క్రిస్టియానో రొనాల్డో 81 గోల్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ కాంటినెంటల్ కప్‌లో భారత్ సాధించిన 11 గోల్స్‌లో ఎనిమిది ఛెత్రి చేసినవే కావడం విశేషం.

మట్టిలో మొనగాడు..

పట్టాడు 11

ఎలాంటి షాకూ లేదు. ఏమాత్రం ఆశ్చర్యం లేదు. పాత కథే పునరావృతం. మారింది ప్రత్యర్థే కాని.. విజేత కాదు. మళ్లీ మట్టి కోర్టు మహారాజుదే రోలాండ్‌గారోస్.

ప్రత్యర్థి తనకన్నా ఎనిమిదేళ్లు చిన్నవాడయితేనేం, సూపర్ ఫామ్‌లో ఉన్నవాడైతేనేం.. అది తన అడ్డా, తన సామ్రాజ్యం. ఎర్ర కోర్టులో నాదల్ చిరుతలా కదిలాడు. అలుపెరగని పరుగుతో, పదునైన షాట్లతో మ్యాచ్ సాగుతున్నకొద్దీ పట్టుబిగిస్తూ పోయాడు. వరస సెట్లలో తీయని విజయాన్ని సొంతం చేసుకున్నాడు.

తిరుగులేని ఆటతో థీమ్ 'తొలి' ఆశలను నిర్దాక్షిణ్యంగా చిదిమేసిన నాదల్.. పదకొండోసారి ఫ్రెంచ్ కిరీటాన్ని కొరికాడు. ఒకే గ్రాండ్‌స్లామ్‌ను అత్యధిక సార్లు గెలిచిన ప్లేయర్‌గా మార్గరెట్ కోర్ట్ రికార్డు(11)ను సమం చేశాడు.

ఫిఫా ప్రపంచకప్ మరో 3 రోజుల్లో

మనకేది కిక్కు!

ఒకరు బ్రెజిల్ అంటారు.. ఇంకొకరు అర్జెంటీనా అంటారు.. మరొకరు స్పెయిన్‌కు ఓటేస్తారు.. ఫుట్‌బాల్ ప్రపంచకప్ వస్తోందంటే చాలు మన అభిమానులు వర్గాలుగా విడిపోతారు! ఎవరిష్టం వాళ్లది! ఎవరి అభిమానం వాళ్లది! అందరూ కలిసి ఉమ్మడిగా ఓ జట్టును ఎంచుకుందామంటే మన జట్టు ఎక్కడ..?

మన కంటే చిన్నవైన.. బుల్లి బుల్లి దేశాలు కూడా ప్రపంచకప్‌లో పోటీ పడుతుంటే.. మనం మాత్రం అర్హత ప్రమాణాలకూ ఆమడ దూరంలో ఉన్నాం. ఇక్కడ ఈ ఆటకు ఆదరణ లేదా.. ఇక్కడ ప్రతిభ లేదా.. ఉత్సాహం లేదా.. అదేమీ కాదు! అన్నీ ఉన్నాయ్! ఈ ఆటలో మనకు ఘనమైన చరిత్ర ఉంది. కానీ చెప్పుకోవడానికి ఆ చరిత్రే మిగిలింది.

రష్యాలో ఇప్పుడు ప్రపంచకప్ సంబరం జరుగుతుంటే మనది ప్రేక్షక పాత్రే. మరి మనమెప్పుడు ఈ సంబరంలో భాగస్వాములవుతాం? ప్రపంచకప్ అర్హతకు మనమెంత దూరంలో ఉన్నాం?

ఈనాడు క్రీడావిభాగం

ప్రపంచవ్యాప్తంగా 200కు పైగా దేశాలు ఫుట్‌బాల్ ఆడతాయి. ప్రపంచంలో అత్యంత ఆదరణ ఉన్న క్రీడల్లో ఒకటి ఫుట్‌బాల్. ఈ ఆటలో ప్రపంచకప్ జరుగుతుంటే.. భారత్‌కు ప్రాతినిధ్యమే ఉండదు. నాలుగేళ్లకోమారు సాకర్ సంబరం వచ్చినపుడల్లా.. కోట్లాదిమంది భారతీయులు ఎగబడి చూస్తారు. అలా చూసే వాళ్లలో సామాన్య అభిమానులే కాదు.. ఆటగాళ్లూ ఉంటారు. మన దేశంలో కొన్ని నగరాల స్థాయిలో కూడా జనాభా లేని దేశాలు ప్రపంచకప్ ఆడేస్తుంటాయి. ఈసారి ప్రపంచకప్ ఆడుతున్న ఐస్‌లాండ్ జనాభా కేవలం 3 లక్షలు కావడం గమనార్హం. కానీ 125 కోట్ల జనాభా ఉన్న భారత్ మాత్రం ప్రపంచకప్ అర్హతకు చాలా దూరంలో ఉంది.

అలా ఉండేవాళ్లం..

ఇప్పుడు పరిస్థితి ఇలా ఉంది కానీ.. 50లు, 60ల్లో మనకూ ప్రపంచ స్థాయి క్రీడాకారులున్నారు. ఆ సమయంలో ఆసియాలో భారత్‌దే అత్యుత్తమ ఫుట్‌బాల్ జట్టు. 1950-70 మధ్య రెండు దశాబ్దాల పాటు భారత ఫుట్‌బాల్‌కు స్వర్ణయుగమనే చెప్పాలి. ఆసియా స్థాయి టోర్నీల్లో తిరుగులేని ఆధిపత్యం చలాయించి.. అనేక దేశాల్లో పర్యటించి.. 1950, 1956 ఒలింపిక్స్‌లోనూ పాల్గొంది మన ఫుట్‌బాల్ జట్టు. 1956 ఒలింపిక్స్‌లో అయితే భారత్ నాలుగో స్థానం కూడా సాధించింది. 1950 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో పాల్గొనేందుకు ఫిఫా నుంచి పిలుపు కూడా అందుకుంది భారత్. కానీ ఆర్థిక ఇబ్బందులతో ఆ టోర్నీకి వెళ్లలేకపోయింది. ఆ తర్వాత ఎప్పుడూ పిలుపూ రాలేదు. మన జట్టు ప్రపంచకప్‌కు అర్హతా సాధించలేదు. పశ్చిమ బెంగాల్, కేరళ, గోవా లాంటి కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ఫుట్‌బాల్‌కు ఆదరణ, ఆటలో ప్రమాణాలు కొనసాగాయి.

"దేశంలో బలమైన ఫుట్‌బాల్ సంస్కృతి రానంతవరకు ప్రపంచకప్ ఆడాలన్న భారత్ కల కలగానే ఉంటుంది. ఇటీవల మనం బాగానే రాణించాం. కానీ ప్రపంచ సంబరంలో పాలుపంచుకోవాలంటే చాలా దూరం ప్రయాణించాలి"
– బైచుంగ్ భుటియా, మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు

ఇలా అయ్యాం..

ఫిఫా ప్రపంచకప్‌కు అర్హత సాధించడమంటే మాటలు కాదు. ఇటలీ లాంటి ఛాంపియన్ జట్టు ఈసారి టోర్నీకి దూరమైందంటేనే అర్హత టోర్నీ ఎంత కఠినంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఖండాల స్థాయిలో జరిగే ప్రధాన క్వాలిఫయింగ్ టోర్నీ ఆడటం సంగతలా ఉంచితే.. అంతకంటే ముందు ఆసియా స్థాయిలో జట్లను వడబోసేందుకు నిర్వహించే టోర్నీని కూడా భారత్ దాటలేని స్థితిలో ఉంది. ప్రస్తుత భారత అత్యుత్తమ ఫుట్‌బాలర్ అయిన ఛెత్రికి.. ఒక ఐరోపా జట్టులోని ఆటగాడితో పోల్చుకుంటే అంతరం చాలా ఉంటుంది. అక్కడి ఆటగాళ్ల వేగం, గోల్ కొట్టే నైపుణ్యం, సమన్వయం.. ఎందులోనూ మన ఆటగాళ్లు సమీపంలో కూడా కనిపించకపోవచ్చు.

ఆ ప్రమాణాలను అందుకోవాలంటే..

ప్రపంచ స్థాయి ఫుట్‌బాలర్లతో మనం పోటీ పడలేమన్న ఆలోచన విధానమే మనోళ్లకు అతి పెద్ద అడ్డంకి. నిరుడు అండర్-17 ప్రపంచకప్‌లో మన కుర్రాళ్లు మిగతా ఆటగాళ్లతో దీటుగానే పోరాడారు. ప్రపంచకప్ ఆడటానికి ముందు దాదాపు 20 దేశాలు తిరిగి, 100కు పైగా మ్యాచ్‌లు ఆడింది భారత యువ జట్టు. ప్రపంచ స్థాయి కోచ్, సహాయ సిబ్బంది నేతృత్వంలో ఆటగాళ్లు శ్రమించారు. ప్రదర్శన మెరుగుపరుచుకున్నారు. ఈ టోర్నీ కోసమే దేశంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాల్నీ మెరుగుపరిచారు. దీంతో కుర్రాళ్ల ప్రదర్శన మెరుగైంది. ఈ ఉత్సాహాన్ని, ఊపును కొనసాగించడమే కీలకం. పాఠశాల స్థాయిలోనే ప్రతిభావంతుల్ని గుర్తించాలి. వారికి ప్రపంచ స్థాయి శిక్షణివ్వాలి. ఇందు కోసం దేశవ్యాప్తంగా అకాడమీలు ఏర్పాటు కావాలి. ప్రపంచ స్థాయి శిక్షకుల్ని తేవాలి. ఆటగాళ్లకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించడమే కాదు.. వారిని తరచుగా విదేశాల్లో ఆడించడం కూడా చాలా ముఖ్యమే. ఇదంతా ఏళ్ల తరబడి, ఒక క్రమ పద్ధతిలో జరిగితే ప్రపంచకప్‌లో మన జట్టునూ చూడొచ్చు.

"ఎప్పటికి ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తామో ఇప్పుడు చెప్పడం చాలా కష్టం. పదేళ్లలో కాకపోయినా.. కనీసం 20-25 ఏళ్లకైనా భారత్ ప్రపంచకప్‌లో ఆడుతుందని ఆశిస్తున్నా"
– విజయన్, మాజీ ఆటగాడు

17 నాదల్ గెలిచిన మొత్తం గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు

- నాదల్‌దే ఫ్రెంచ్ ఓపెన్
- ఫైనల్లో థీమ్ పరాజయం

11 నాదల్ సాధించిన ఫ్రెంచ్ టైటిళ్లు. ఒకే గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అత్యధిక సార్లు గెలిచిన ప్లేయర్‌గా మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్, 1960-1973) రికార్డును అతడు సమం చేశాడు.

పారిస్

ప్రపంచ నంబర్‌వన్ రఫెల్ నాదల్ పదకొండోసారి ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలుచుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ నాదల్ 6-4, 6-3, 6-2తో ఏడో సీడ్ థీమ్ (ఆస్ట్రియా)ను మట్టికరిపించాడు. తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన 24 ఏళ్ల థీమ్ ఆరంభంలో గట్టి పోటీనే ఇచ్చినా.. క్రమంగా నాదల్ జోరుకు దాసోహమన్నాడు. నాదల్ 26 విన్నర్లు కొట్టాడు. మరోవైపు థీమ్.. ఏడు ఏస్‌లు కొట్టినప్పటికీ సర్వీసులో బాగా ఇబ్బంది పడ్డాడు. ఐదు డబుల్ ఫాల్ట్‌లు, 42 అనవసర తప్పిదాలతో అతడు మూల్యం చెల్లించుకున్నాడు.

హోరాహోరీగా మొదలైనా..: థీమ్‌కు ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్. అయినా నాదల్‌పై గెలిచిన అనుభవం ఉంది. ఈ నేపథ్యంలో మ్యాచ్ ఎంతో ఆసక్తిరేపింది. ఐతే మ్యాచ్ హోరాహోరీగానే మొదలైనా.. క్రమంగా నాదలే శాసించాడు. తొలి సెట్లోనే ఆరంభంలోనే సర్వీసులు బ్రేకయ్యాయి. రెండో గేమ్‌లోనే బ్రేక్ సాధించి, నాదల్ 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. థీమ్ వెంటనే బ్రేక్ సాధించి, సర్వీసు నిలబెట్టుకుని స్కోరు సమం చేశాడు. ప్రతి పాయింటుకూ ఇద్దరూ హోరాహోరీగా తలపడడంతో ఆట రసవత్తరంగా సాగింది. ఐతే ఇద్దరిలో సర్వీసు నిలుపుకోవడానికి థీమ్ ఎక్కువగా కష్టపడ్డాడు. తొలి సర్వీసులో తడబడ్డ అతడు ఎక్కువగా అనవసర తప్పిదాలు చేశాడు. నాలుగో గేమ్‌లో ఏకంగా మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ఆరో గేమ్‌లోనూ థీమ్ శ్రమించాడు. రెండుసార్లు బ్రేక్ పాయింటు కాచుకుని మరీ గేమ్‌ను గెలుచుకుని 3-3తో స్కోరు సమం చేశాడు. నాదల్‌లాగే థీమ్ కూడా బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లు ఆడాడు. మొదటిసారి, ఎనిమిదో గేమ్‌లో సాధికారికంగా సర్వీస్ చేసి గెలిచాడు. ఐతే 9వ గేమ్‌లో అలవోకగా సర్వీసు నిలుపుకున్న నాదల్.. కీలకమైన పదో గేమ్‌లు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా బ్రేక్ సాధించి సెట్‌ను గెలుచుకున్నాడు. జోరు కొనసాగించిన నాదల్ రెండో సెట్లోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. ధనాధన్ షాట్లతో 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. రెండో గేమ్‌లో అతడు థీమ్ సర్వీసును బ్రేక్ చేశాడు. ఆ తర్వాత ఏ దశలోనూ థీమ్ కోలుకోలేకపోయాడు. సర్వీసులో అదే తడబాటు. అవే అనవసర తప్పిదాలు. ఓవైపు నాదల్ ఆటలో పదును, కచ్చితత్వంగా పెరుగుతుంటే.. మరోవైపు థీమ్ ఆటలో నియంత్రణ తగ్గుతూ వచ్చింది. బేస్‌లైన్‌పై మెరుపు వేగంతో పరుగులు పెట్టిన నాదల్.. ఎనిమిదో గేమ్‌లోనూ బ్రేక్ సాధించి సెట్‌ను చేజిక్కించుకున్నాడు. అత్యంత ఆత్మవిశ్వాసంతో, రెట్టించిన ఉత్సాహంతో నిర్ణయాత్మక సెట్లో అడుగుపెట్టాడు. ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన థీమ్‌లో పోరాటం కొరవడింది. ఈసారి మరింత తేలిగ్గా తలవంచాడు. మూడు, ఏడో గేముల్లో థీమ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన నాదల్ అలవోకగా సెట్‌ను, ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. ఐతే ఎప్పటిలా భావోద్వేగంతో కింద పడి సంబరాలు చేసుకోలేదు. గాల్లో చేతులెత్తి సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ట్రోఫీ అందుకున్నప్పుడు మాత్రం ఉద్వేగానికి గురయ్యాడు.



థీమ్

కోవా జోడీకి డబుల్స్ టైటిల్: బార్బరా క్రెసికోవా-కేథరినా సినియాకోవా (చెక్) జంట మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్లో ఈ ద్వయం 6-3, 6-3తో ఎరి హొజుమి-మకోటో నినోమియా (జపాన్) జోడీపై గెలిచింది.

వెస్టిండీస్ ఘనవిజయం

పోర్ట్‌ఆఫ్ స్పెయిన్: శ్రీలంకతో తొలి టెస్టులో ఆతిథ్య వెస్టిండీస్ 226 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆఖరిరోజు, ఆదివారం 453 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంక.. చేస్ (4/15), బిషూ (3/48) ధాటికి 226 పరుగులకే కుప్పకూలింది. కుశాల్ మెండిస్ శతకం (102) సాధించినా ఫలితం లేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 414/8 వద్ద డిక్లేర్ చేయగా.. శ్రీలంక 185 పరుగులకే ఆలౌటైంది.

స్కాట్లాండ్ సంచలనం

ఎడిన్‌బర్గ్: ఇంగ్లాండ్‌తో ఏకైక వన్డే మ్యాచ్‌లో స్కాట్లాండ్ 6 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. మెక్‌లాయిడ్ (140 నాటౌట్), కోయిజ్జర్ (58), ముస్నే (55) చెలరేగడంతో మొదట స్కాట్లాండ్ 5 వికెట్లకు 371 పరుగులు సాధించింది. ఛేదనలో ఇంగ్లాండ్ విజయానికి కొద్ది దూరంలో నిలిచింది. ఇంగ్లాండ్ 48.5 ఓవర్లలో 365 పరుగులకు ఆలౌటైంది. బెయిర్‌స్టో (105), ప్లంకెట్ (47 నాటౌట్), మొయిన్ అలీ (46) రాణించారు.

భారత్‌కు మూడో స్థానం

జిపు (జపాన్): ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ మూడో స్థానం సాధించింది. ఈ పోటీల్లో భారత్ 17 పతకాలతో పట్టికలో తృతీయ స్థానంలో నిలిచింది. అందులో 5 స్వర్ణాలు, 2 రజతాలు, 10 కాంస్య పతకాలున్నాయి. జపాన్ (42) ప్రథమ, చైనా (23) ద్వితీయ స్థానాలు సాధించాయి.

భారత్‌కు బంగ్లా షాక్

అమ్మాయిల చేజారిన ఆసియా కప్

కౌలాలంపూర్: ఏడోసారి ఆసియాకప్‌ను ముద్దాడాలన్న భారత మహిళల క్రికెట్ జట్టుకు భంగపాటు. ఆదివారం ఫైనల్లో భారత జట్టు బంగ్లాదేశ్ చేతిలో పరాజయం పాలైంది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 3 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఫైనల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (56; 42 బంతుల్లో 7×4; 2/19) ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసినా జట్టును గట్టెక్కించలేకపోయింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 112 పరుగులే చేయగలిగింది. బంగ్లా 7 వికెట్లు కోల్పోయి ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. భారత్ కాకుండా మహిళల ఆసియా కప్ క్రికెట్ టోర్నీ గెలిచిన జట్టు బంగ్లాదేశ్ మాత్రమే. ఈ టోర్నీకి ముందు ఒక్కసారి కూడా బంగ్లా చేతిలో ఓడని భారత అమ్మాయిల జట్టు.. ఒకే టోర్నీలో రెండుసార్లు పరాజయంపాలైంది. బ్యాటింగ్‌లో హర్మన్ మినహా అందరూ విఫలమవడం ఫైనల్లో జట్టును దెబ్బతీసింది. ఓపెనర్లు మిథాలీ (11), స్మృతి మంధన (7) నిరాశపరిచారు. ఛేదనలో బంగ్లాదేశ్ ఏడు వికెట్లు కోల్పోయి చివరి బంతికి విజయం అందుకుంది. గెలవాలంటే ఆఖరి బంతికి రెండు పరుగులు చేయాల్సిన స్థితిలో హర్మన్ బంతిని డీప్ మిడ్‌వికెట్‌వైపు తరలించి ఆలామ్ జట్టుకు కావాల్సిన పరుగులనందించింది. అంతకుముందు హర్మన్‌తో పాటు పూనమ్ యాదవ్ (4/9) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగులు చేయడంలో బంగ్లా తడబడింది. ఓ దశలో భారత్ గెలిచేలా కనిపించింది. కానీ సుల్తాన (27), రుమానా (23) కీలక భాగస్వామ్యంతో ఆ జట్టును విజయం దిశగా నడిపించారు. వారిద్దరూ ఔటైనా చివరి వరస బ్యాట్స్‌వుమెన్ విజయాన్ని వదిలిపెట్టలేదు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న బెజవాడ విల్సన్

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలి

- రామన్ మెగసెసె అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్

ఎం.వి.పి.కాలనీ(విశాఖపట్నం), న్యూస్‌టుడే: జీవించటం, ప్రశ్నించటం రాజ్యాంగం మనకిచ్చిన హక్కులని, వాటి పరిరక్షణ కోసం దళిత, ఆదివాసీ, వామపక్ష అభ్యుదయ వాదులంతా ఐక్యంగా ఉద్యమించాలని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్ అన్నారు. ఆదివారం విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన 'దళిత, ఆదివాసీ సమతా జాతర' కార్యక్రమానికి హాజరై 'దళితుల సంప్రదాయ వృత్తులు-వివక్షత' అనే అంశంపై విల్సన్ మాట్లాడారు. దేశంలో స్తబ్ధత నెలకొందని, ప్రభుత్వాల తప్పులను, వైఫల్యాలను ఎవరైనా బయటపెడితే వారిపై ప్రభుత్వ వ్యతిరేకత అనే ముద్ర వేస్తున్నారన్నారు. దీనివల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. వామపక్ష వాదులు, ప్రజాస్వామ్య వాదులు, తార్కికవాదులు, దళిత, ఆదివాసీలు ఒకే తాటిపైకి వచ్చి పోరాడే సమయం ఆసన్నమైందన్నారు. నటుడు, దర్శకుడు ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ.. దేశంలోకి విదేశీ సంస్కృతిని మళ్లీ తీసుకువచ్చి స్వదేశీ సంస్కృతిని నాశనం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ బహుజన్ లెఫ్ట్‌ఫ్రంట్ కన్వీనర్ తమ్మినేని వీరభద్రం, వంగపండు ప్రసాద్, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న దివ్యాంగుల నాయకులు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్వేశ్వరరావు

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని నిరుద్యోగ దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్వేశ్వరరావు కోరారు. ఆదివారం విజయవాడలో.. 13 జిల్లాలనుంచి తరలివచ్చిన దివ్యాంగుల సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక దివ్యాంగుల రోస్టర్‌ను 56 నుంచి 10లోకి తీసుకురావాలని, 2016లో దివ్యాంగుల హక్కుల గురించి జారీ చేసిన జీవోను అమలు చేయాలని, రాజకీయాల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానించినట్లు ఆయన తెలిపారు. వాటిని ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ జులై నెలాఖరున గుంటూరులో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో దివ్యాంగుల నాయకులు నీలా జోజిబాబు, పడుచూరి ఉదయలక్ష్మి, బి. రమేష్, జి.ఆదిశేషు, ఎం.సాంబశివరావు, పి.శ్రీనివాసులరెడ్డి, ఎం.మల్లికార్జున, కె ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్య పరిష్కరించండి

- రైతు, కౌలురైతు, వ్యవసాయకార్మిక సంఘాల సదస్సు డిమాండ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రిజిష్టర్ కాకుండా నిషేధించిన లక్ష ఎకరాల చుక్కల భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయకార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో జరిగిన సదస్సుకు కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య అధ్యక్షత వహించారు. చుక్కల భూముల సమస్య పరిష్కారానికి వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సదస్సు కోరింది. ఐదు ఎకరాల మెట్ట, 2.5 ఎకరాల మాగాణి భూములు కలిగిన రైతులకు ప్రభుత్వం ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. దశాబ్దాలుగా చుక్కల భూముల రిజిస్ట్రేషన్ నిషేధించినందున భూమి హక్కుదారులకు పంట రుణాలు సహా రాయితీలూ అందటంలేదని నల్సార్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఎం సునీల్‌కుమార్ అన్నారు. వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెవెన్యూ మంత్రి ప్రకటించిన లెక్కల ప్రకారం రాష్ట్రంలో 24 లక్షల ఎకరాల వరకు చుక్కల భూములు ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశవరావు మాట్లాడుతూ.. చుక్కల భూముల విలువలు పెరిగిన తర్వాత కార్పొరేట్ శక్తులు వాటిపై కన్నేశాయని ఆరోపించారు.

భాజపా, తెదేపాలకు నూకలు చెల్లాయి

- వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భాజపా, తెదేపాలకు నూకలు చెల్లిపోయాయని వైకాపా సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం విశాఖ నగర పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో అవినీతి, అక్రమాలు బిహార్‌ను మించిపోయావని ఆరోపించారు. అగ్రిగోల్డ్‌లో సుమారు 20 లక్షల కుటుంబాలు మోసపోయాయన్నారు. చంద్రబాబు తప్పులు చేసి పక్కవారిపై నెట్టడం అలవాటుగా మారిపోయిందన్నారు. భారత్‌లో విశాఖ రెండో ఆర్థిక రాజధానిగా నిలిచిందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారని.. స్థానికంగా మాత్రం భూకబ్జాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్షమాభిక్ష పేరుతో ఇటీవల 44 మంది కరుడుగట్టిన ఖైదీలను విడుదల చేయించారనని ఆయన ధ్వజమెత్తారు. వైఎస్ హయంలో విశాఖకు బ్రాండిక్స్, ఎస్ఈజెడ్‌లు తీసుకువచ్చామని, చంద్రబాబు పాలనలో ఇక్కడికి ఒక్కటైన పరిశ్రమ వచ్చిందా అని ఆయన ప్రశ్నించారు. వైకాపాతో రాష్ట్రంలో ఏ పార్టీలు కలిసివచ్చినా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తైనాల విజయ్‌కుమార్, వంశీకృష్ణ శ్రీనివాస్, కోలా గురువులు, సత్తి రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధేయవాది కోట సైదయ్య మృతి

మాచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, అమరావతి: గుంటూరు జిల్లా నరసరావుపేట మాజీ ఎంపీ, గాంధేయవాది కోట సైదయ్య ఆదివారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. మాచర్లలోని తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గాంధేయవాదిగా, కమ్యూనిస్టులతో సహచర్యం ఉన్ననేతగా ఆయనకు పేరుంది. 1996లో నరసరావుపేట ఎంపీగా ఎంపికైన ఆయన 1998లో వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో మళ్లీ నరసరావుపేట నుంచి ఎంపీగా పోటీ చేసి, కొణిజేటి రోశయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. ఆయనకు మృదుస్వభావిగా పేరుంది. ఎంపీగా పనిచేసినా మాచర్లలోని పలు ప్రాంతాలకు కాలినడకనే వచ్చేవారు. సొంత గ్రామం ఓబులేసుని పల్లెలో ఈ నెల 12న అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సైదయ్య మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ద్వారా ఆదివారం సైదయ్య కుటుంబ సభ్యులతో చరవాణిలో మాట్లాడి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సైదయ్య అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

సైదయ్య (పాతచిత్రం)

సభలో ప్రసంగిస్తున్న లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్, వేదికపై వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు

మోదీపై సంఘటిత పోరు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ఈనాడు, వరంగల్: దళిత గిరిజనుల రిజర్వేషన్లను తగ్గించి, రాజ్యాంగపరమైన హక్కులను కాలరాసే కుట్ర చేస్తోందని కేంద్ర ప్రభుత్వంపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం వరంగల్‌లో జరిగిన దళిత, గిరిజన సింహ గర్జన కార్యక్రమంలో ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. దళిత, గిరిజనుల రక్షణ కోసం రాజ్యాంగం కల్పించిన అత్యాచార నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు.. హక్కుల్ని హరించేదిగా ఉందని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. దళిత గిరిజనులు మొత్తం ఏకమై స్వతంత్ర ఓటు బ్యాంకును కాపాడుకుంటేనే రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కుల్ని పరిరక్షించుకోగలమని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ మార్చి 20న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఇప్పటికే ఉత్తారాది రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురైందని, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని, కానీ దక్షిణాది ప్రాంతంలో అలా కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాలు చేయాలని తాము నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు మార్చి 20న ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా నిర్వహించిన సభకు రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీలు, దళిత, గిరిజన, ఆదివాసీ నేతలు హాజరయ్యారు. వీరంతా సభకు హాజరై మద్దతు పలకడం హర్షణీయమని మంద కృష్ణ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉపాధి రంగాల్ని ప్రైవేటుపరం చేస్తుండటంతో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర నష్టం జరుగుతోందని, తమకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల హక్కు కోల్పోతున్నామని మందకృష్ణ మండిపడ్డారు. చివరకు విశ్వవిద్యాలయాలను కూడా ప్రయివేటుపరం చేసే కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు ఉంటేనే ఆర్థికంగా దళితులు, గిరిజనులు నిలదొక్కుకునే అవకాశం ఉందన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అంటారు కానీ మరి దళితులు, గిరిజనులను హత్య చేసిన వారికి ఎందుకు తగిన శిక్షలు పడడం లేదని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థలో కూడా రిజర్వేషన్లు రావాలని డిమాండ్ చేశారు. కేవలం 5శాతం ఓటు బ్యాంకు లేని సామాజిక వర్గాలు ముఖ్యమంత్రి పీఠం ఎక్కుతున్నారు.

వర్షంలో మీరాకుమార్, రాజాతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

. మరి 30 శాతం జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీలు ఊడిగం చేసే పరిస్థితి ఎందుకు ఉందని వాపోయారు. దళిత గిరిజన సమాజం మొత్తం స్వతంత్ర ఓటు బ్యాంకు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. అప్పుడే ఈ రాష్ట్రాన్ని. . దేశాన్ని పాలించే అధికారం మనకు దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో అగ్రకులాల నేతలు ఇచ్చే వందకో వెయ్యికో అమ్ముడుపోతే ఎన్నటికీ మనం పాలకులం కాలేమని ఆయన పేర్కొన్నారు. మార్చి 20 కన్నా ముందున్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలయ్యే వరకూ.. విభేదాలు పక్కనబెట్టి సంఘటితంగా కేంద్ర ప్రభుత్వం, మోదీపై యుద్ధం చేద్దామని మందకృష్ణ పిలుపునిచ్చారు.

దాడులు చేస్తున్న మోదీ ప్రభుత్వం: మీరాకుమార్

కేంద్ర, రాష్ట్రప్రభుత్వం రెండూ దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, మోదీ ప్రభుత్వం దళితులపై దాడులకు ఒడిగడుతోందని లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ అన్నారు. దళిత గర్జనకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె సోదర సోదరీమణులారా.. అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. తన తండ్రి బాబూ జగ్జీవన్‌రాం దళితుల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని, కానీ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని ధ్వజమెత్తారు. 1989లో అప్పట్లో బిహార్‌లో రెండు ఘటనలు జరిగాయని, ఒకదాంట్లో 18 మంది దళిత పిల్లలను హతమార్చారని, మరోఘటనలో అన్యాయంగా 9 మందిని చంపేశారని, దీనిపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధకచట్టం తీసుకొచ్చారని, అప్పుడు తాను ఎంపీగా ఉన్నానని మీరాకుమార్ వివరించారు. కానీ మార్చి 20న సుప్రీంకోర్టు ఈచట్టాన్ని నీరుగార్చేలా తీర్పు చెప్పడం శోచనీయమన్నారు. అయితే కేంద్రంలోని కొందరు పెద్దలు మళ్లీ పాత చట్టం అమలయ్యేలా పార్లమెంటులో ఆర్డినెన్స్ తీసుకొస్తామన్నారని, కానీ ఇప్పటివరకూ తీసుకురాకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ విధానాన్ని తొలగించాలని భాజపా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మీరాకుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో కూడా ప్రభుత్వం దళితులను మోసం చేస్తోందని విమర్శించారు. నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో.. రాష్ట్రం ఏర్పడ్డాక దళితుణ్నే ముఖ్యమంత్రిని చేస్తానని కేసీఆర్ చెప్పినపుడు తాను సంతోషించానని, కానీ ఆయన అన్నమాట నిలబెట్టుకోలేకపోవడంతో నిరాశ చెందానని వాపోయారు. ఏం తప్పు చేశారని మందకృష్ణను కేసీఆర్ రెండుసార్లు జైల్లో పెట్టారని ఆమె ప్రశ్నించారు. దళితుల హక్కుల కోసం పోరాటం చేయడమే ఆయన తప్పా అని మీరాకుమార్ అన్నారు.

గిరిజనులపై అరాచకాలు

లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ మోదీ సర్కారు వచ్చాక దళితులు, గిరిజనులపై అన్యాయాలు, అరాచకాలు విపరీతంగా పెరిగాయని, గిరిజన ప్రాంతాల్లో గిరిజన బాలికలపై అత్యాచారాలు దారుణంగా జరుగుతున్నాయని మండిపడ్డారు. భాజపా ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని, భాజపా ఇష్టారీతిన రాజ్యాంగాన్ని మారుస్తూ దళిత, గిరిజన హక్కులను కాలరాస్తోందన్నారు. రోజూ ఆరుగురు మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారని తెలిపారు. గత నాలుగేళ్లలో దళితులపై దాడులు 66 శాతం పెరిగాయని వివరించారు. ఉద్యమాల గడ్డ వరంగల్ నుంచే మంద కృష్ణ ఈ పోరును ప్రారంభించారని, కాంగ్రెస్ పార్టీ ఈ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉంటుందని ఖర్గే తెలిపారు.

రాజకీయ పార్టీ స్థాపించాలి

బాబాసాహెబ్ అంబేడ్కర్ మనవడు డాక్టర్ ప్రకాశ్ అంబేడ్కర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఏ రాజకీయ పార్టీ దళితుల కోసం పాటుపడలేదన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మోదీ మారుస్తామని కుట్ర పన్నితే చూస్తూ ఊరుకునేది లేదని చెప్పారు. అసలు దేశంలో ఉన్నది భాజపా ప్రభుత్వమా లేదా ఆర్ఎస్ఎస్ ప్రభుత్వమా అని ప్రశ్నించారు. భాజపా, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ అన్నీ కలిసి దళితులకు, గిరిజనుల కోసం కల్పించిన రిజర్వేషన్లను రూపుమాపాలని పన్నాగం పన్నాయని ప్రకాశ్ అన్నారు. మందకృష్ణ రాజకీయ పార్టీ స్థాపిస్తేనే అనుకున్న లక్ష్యం సాధిస్తారన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో దళితుల కుటుంబాలపై దాడులు చేసి ఇళ్లు తగులబెట్టారని, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ భారత్ బంద్‌కు పిలుపునిస్తే జైళ్లలో పెట్టడం దారుణమన్నారు. ఈచట్టాన్ని గతంలో ఉన్న విధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రసంగిస్తూ సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యతిరేకించారన్నారు. రాష్ట్రంలోనూ దళితులపై దాడులు పెరిగాయనడానికి నేరెళ్ల ఘటనే ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలంగాణ జనసమితి పార్టీ వ్యవస్థాపకుడు కోదండరాం మాట్లాడుతూ మాల, మాదిగ, గిరిజన, ఆదివాసీ వర్గాలన్నీ ఐక్యంగా పోరాడి సుప్రీంకోర్టులో చేసిన చట్టానికి విరుగుడుగా పార్లమెంటులో ఆర్డినెన్సు తీసుకువచ్చేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ నేత డి.రాజా మాట్లాడుతూ మోదీ తాను సేవకుడినని తరచూ అంటారని, కానీ ఆయన దళిత, గిరిజన ప్రజల సేవకుడు కాదని, కార్పొరేట్ సంస్థల సేవకుడని ధ్వజమెత్తారు. తెతెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల రాజు, కేంద్ర మాజీ మంత్రి భక్తచరణ్‌దాస్, బలరాంనాయక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ(ఎం.ఎల్) కార్యదర్శి పోటు రంగారావు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవాని, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి దయాకర్, బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగానే పోటీచేద్దాం!

- పొత్తుల గురించి అధిష్ఠానం చూసుకుంటుంది
- తెదేపా అవినీతిని ఎండగడదాం
- భాజపా వ్యూహరచన!

ఈనాడు అమరావతి, గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీచేయాలని భాజపా రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. ఇతర పార్టీలతో పొత్తుల గురించి పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని చెబుతోంది. ఈ క్రమంలో తొలుత రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సాయం, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమల్లో అవినీతి, అక్రమాలు, ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు, పార్టీ నేతలపట్ల అనుసరిస్తోన్న తీరును ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఆదివారం విజయవాడలో జరిగిన పార్టీ పదాధికారుల సమావేశంలో కార్యాచరణను సిద్ధంచేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా జరిగిన ఈ సమావేశంలో వివిధ

సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ. చిత్రంలో పురందేశ్వరి, ఎంపీ హరిబాబు తదితరులు

అంశాలపై కూలంకషంగా చర్చించారు. నాలుగేళ్లపాటు మిత్రులుగా ఉండి ఆ తరువాత బయటకువెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలు రాష్ట్ర మంత్రులు తెదేపా నేతలు చేస్తున్న విమర్శలను దీటుగా ఎదుర్కొనే విషయమై సమాలోచనలు జరిపారు. అవసరమైతే న్యాయపోరాటానికి కూడా సిద్ధం కావాలని నిర్ణయించారు. త్వరలో రాయలసీమలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొనేందుకు జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాబోతున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఈ సందర్భంగా నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. "పార్టీ నేతలు జిల్లాల పర్యటనల సమయంలో తెదేపా వైఖరిని తూర్పారబట్టాలి. సాధ్యంకానిది ఏమీలేదు. పొరుగు రాష్ట్రాల ఎన్నికల్లో అలాగే చేశాం" అని పార్టీ జాతీయ నేత సతీష్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తోన్న అభివృద్ధి గురించి ప్రచారం చేసుకోవడంలో వెనుకబడిన విషయాన్ని కూడా సమావేశంలో సీనియర్ నేత ఒకరు ప్రస్తావించారు. విశాఖకు రైల్వేజోన్, ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు కేంద్రం సానుకూలంగానే ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగానే పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ జిల్లాల పర్యటన తేదీలను ఖరారుచేశారు. పార్టీ పరంగా జాతీయ స్థాయిలో ప్రకటించిన 'విశేష సంపర్క అభియాన్' కింద చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా నిర్ణయాలు తీసుకున్నారు. పోలవరం నిర్మాణ పనులను ఈ నెల 24న పార్టీ నేతలు పరిశీలించనున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ శ్రీకాకుళం, 22, 23 తేదీల్లో విజయనగరం జిల్లాలో పర్యటిస్తారు.

దళిత హక్కులను కాలరాస్తున్న కేంద్రం: నక్కా

గుంటూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం దళిత, గిరిజనుల హక్కులను కాలరాస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు విమర్శించారు. ఆదివారమిక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బి.ఆర్.అంబేడ్కర్ దళితులు, గిరిజనులకు ఇచ్చిన భద్రతను అడ్డుకునే విధంగా ఉందని ఆరోపించారు. ఈ తీర్పు వెలువడ్డాక ఒక్క ఉత్తర భారతదేశంలోనే 12 మంది యువకులు మరణించారని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్రం సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో తీర్మానం చేసి పంపినా భాజపా ప్రభుత్వం నుంచి స్పందన కరవైందన్నారు. కోర్టులు సైతం ఈ చట్టాన్ని సవరించేందుకు వీల్లేకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చాలని రాష్ట్రపతిని కోరనున్నామని ఆనందబాబు చెప్పారు. ఈ విషయమై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను సోమవారం దళిత, గిరిజనుల ప్రతినిధుల బృందం దిల్లీలో కలవనున్నట్లు వెల్లడించారు. దళితులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న భాజపా ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించడానికి రణ నినాదం అందుకుంటున్నట్లు తెదేపా అధికార ప్రతినిధి, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్ హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

నట్టేట ముంచడం బాబు నైజం

- పశ్చిమగోదావరి జిల్లాలో బీసీల ఆత్మీయ సమ్మేళనంలో జగన్ విమర్శ

ఈనాడు డిజిటల్, ఏలూరు - తాళ్లపూడి, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచడం, నెపాన్ని మరొకరిపై నెట్టేయడం చంద్రబాబు నైజమని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం పరిధిలో ఆదివారం ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. ఇదే నియోజకవర్గ పరిధి చాగల్లు మండలం మల్లవరంలో సాయంత్రం బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచే కాకుండా పలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో జగన్ మాట్లాడుతూ.. 'గత ఎన్నికల్లో రజకులను ఎస్సీలుగా మార్చేందుకు చర్యలు చేపడతానని చంద్రబాబు హామీనిచ్చారు. కురమలు, వాల్మీకులు, బోయలను ఎస్టీలుగా మారుస్తామన్నారు. ఇవేమీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేని అంశాలు. ఓట్ల కోసం హామీలనిచ్చారు. తాను చేయాల్సింది చేశానని, కేంద్రం చేయలేదంటూ నెపం వారిపై నెట్టేశార'ని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజమహేంద్రవరం పార్లమెంటు సీటు బీసీలకు కేటాయిస్తానని జగన్ ప్రకటించారు. తాను అధికారంలోకి వచ్చాక బీసీ డిక్లరేషను పెట్టి వారి అభివృద్ధి కోసం అన్నీ చేస్తామని హామీనిచ్చారు. మెస్‌ఛార్జీలు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. అంతకుముందు ఆదివారం చాగల్లు మండలంలో జగన్ ప్రజా సంకల్పయాత్ర కొనసాగింది.

మల్లవరంలో నిర్వహించిన బీసీల ఆత్మీయ సదస్సులో ప్రసంగిస్తున్న వైకాపా అధ్యక్షుడు జగన్

హోదాపై విద్యార్థుల్లో చైతన్యం

- విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ వెల్లడి

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఈ నెల నుంచే ఆందోళనల పర్వానికి సన్నాహాలు చేస్తున్నామని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ తెలిపారు. విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆదివారం విజయవాడలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు సమావేశమై చర్చించారు. అనంతరం చలసాని శ్రీనివాస్ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. జూన్ 15 తర్వాత అన్ని విద్యార్థి సంఘాలు, రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో నెలకొకసారైనా ఊరేగింపులు, ప్రదర్శనలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. విద్యార్థుల్లో చైతన్యం తీసుకువస్తామని చెప్పారు. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు నెల రోజుల్లో 10 లక్షల కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. జులైలో విశ్వవిద్యాలయాలు పునఃప్రారంభమవుతాయని, అప్పుడు బస్సు యాత్రలు చేపడతామన్నారు.

సమావేశంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, చలసాని శ్రీనివాస్ తదితరులు

కన్నాతో చర్చకు సిద్ధం.. రామకృష్ణ: ఆంధ్రప్రదేశ్‌కు 85 శాతం వరకు హామీలు అమలు చేశామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చెబుతున్నారని, ఆయనకు ధైర్యం ఉంటే విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు తాము సిద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సవాలు విసిరారు.

ఈ చిత్రంలో తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న వ్యక్తి మావోయిస్టు నేత వట్టిగుంట వెంకటేశ్వరరెడ్డి. ప్రకాశం జిల్లా కారంచేడుకు చెందిన ఈయన 1983-84లో పాలిటెక్నిక్ చదువుతూ విప్లవోద్యమం పట్ల ఆకర్షితుడయ్యారు. 1985లో విద్యను పూర్తిచేసి ఉద్యమంలోకి పూర్తిస్థాయిలో వెళ్లిపోయారు. మొత్తం ఏడు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఈయన 2010లో కేరళలోని కాలికట్‌లో పోలీసులకు చిక్కారు. అనంతరం ఆయన్ను పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు జైలుకు తరలించారు. వెంకటేశ్వరరెడ్డి తండ్రి శేషరెడ్డి (94) శుక్రవారం మృతి చెందారు. దీంతో కుమారుడు ఆయన అంత్యక్రియలకు హాజరుకావాల్సి వచ్చింది. ఇందు కోసం వెంకటేశ్వరరెడ్డి ప్రయాణ సమయం మినహా ఆరు గంటల పెరోల్ మాత్రమే లభించింది. ఈ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య వెంకటేశ్వరరెడ్డి ఆదివారం స్వగ్రామానికి వచ్చి తండ్రి అంత్యక్రియలను పూర్తి చేశారు. సమయం ముగియడంతో వెంటనే తిరిగి వెళ్లిపోయారు. ఆయన తిరిగి వెళ్లే సమయంలో వృద్ధ తల్లి, బంధువులు శోకతప్తులయ్యారు. *-ఈనాడు డిజిటల్, ఒంగోలు*

ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు?

ఈనాడు- విశాఖపట్నం: తాజాగా కోస్తాంధ్ర మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఇది ఒడిశా నుంచి రాష్ట్రం మీదుగా దక్షిణ తమిళనాడు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రుతుపవనాల కారణంగా రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

BAJAJ Maxima
పవర్‌లో ఉత్తమం.
ఇప్పుడు సైజ్‌లో ఉత్తమం!
పరిచయంచేస్తున్నాం 'XWIDE'
BAJAJ Maxima
3 - వీలర్లలో ప్రపంచ లీడర్ నుండి.
POWER 3 YEARS WARRANTY
డౌన్ పేమెంట్ ₹ 20,999*
ఈ సుగుణాలు కలిగిన ఏకైక వాహనం
పవర్ సైజ్
పాసెంజర్ స్పేస్ కోసం పొడవు మరియు వెడల్పులో అత్యుత్తమం
పవర్ మెయింటెనెన్స్
పవర్ ఇంజన్, పవర్ క్లచ్ మరియు పవర్ కప్లింగ్‌లతో తక్కువ మెయింటెనెన్స్
పవర్ ఇంజన్
ఈ శ్రేణిలో అత్యుత్తమం – 470 సిసి
3 సంవత్సరాలు
పవర్ వారంటీ
3 వీలర్స్‌లో మొట్ట మొదటిసారి, 3 ఏళ్ళ వారంటీ లేదా 1 లక్ష km* వరకు
వరుణ్ మోటర్స్: విజయవాడ - 9885185543 • ఆదిత్య మోటర్స్: ఏలూరు - 8885586683 • సర్వా మోటర్స్: గుంటూరు - 9177729191
• బాలాజీ ఆటోమొబైల్స్: ఒంగోలు - 8886677869 • మేఘన ఆటోమొబైల్స్: నెల్లూరు - 9603999899
BAJAJ Maxima
ఎక్కువ సంపాదించేందుకు పవర్

TRUE VALUE
MARUTI SUZUKI
QUALITY PRE-OWNED కార్లకు
నమ్మకానికి నూతన చిహ్నం
TRUE VALUE
TRUE VALUE CERTIFIED
ఆన్లైన్ పై చూసుకోండి, షాపులో కొనుక్కోండి
వాహనపు పరీక్షించబడిన చరిత్ర
సులభమైన పేపర్ వర్క్
TRUE VALUE సర్టిఫైడ్ వాహనాలు
క్రొత్త True Value లో మేము ఏం చేసినా అది మేం అందించే నమ్మకానికి ప్రతీకగా నిలుస్తుంది, అంటే మా వ్యవహారాల తీరుతెన్నులు,
ప్రక్రియలు, షోరూం లో Technology ఉపయోగం ద్వారా మీకు లభించేది సంతృప్తినిచ్చే మరియు ఒక Quality Pre-Owned కార్.
App Store
Google play
For enquiry, SMS TRUE to 53636 | Call at 1800 102 1800
Visit www.marutisuzukitruevalue.com
TRUE VALUE CERTIFIED
Anantapur: True Value (Sri Durga): 9866600850; Guntur: True Value (Jayalakshmi Automotives): 9618599199; Hyderabad: True Value (RKS Motors): 9553395533; True Value (Varun Motors): 9052434999; True Value (Gem Motors): 9912343057; True Value (Adarsha Auto World): 9505536633; Mahabubnagar: True Value (Sri Jayarama): 8096990091; Tirupati: True Value (Bhargavi Automobiles): 9248722999, 9502042345; Vijayawada: True Value (Santosh): 7799787967; True Value (Varun Motors): 9885089333; Visakhapatnam: True Value (Varun Motors): 7799809992; Warangal: True Value (Adarsha Automotives): 8886196633

వయసు 64... పట్టాలు 55

జిజ్ఞాస ఉండాలనేగానీ విజ్ఞానం పెంచుకోడానికి వయసుతో సంబంధం ఏంటీ అంటారాయన. 64 ఏళ్ల వయసులో డిగ్రీల మీద డిగ్రీలు సాధిస్తూ కుర్రాళ్లతో కూడా ఔరా అనిపిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట గోగివారిపేట చెందిన గూడపాటి కుటుంబరావు ఉద్యోగం కోసమే చదువుకాదని అంటారు. ఆసక్తి ఉండాలే గానీ మలి వయసులోనూ అద్భుతంగా రాణించవచ్చని నిరూపిస్తున్నారు. వివిధ సబ్జెక్టుల్లో 55 పట్టాలను అందుకున్నారు. ఉపాధ్యాయునిగా పనిచేసిన తరువాత ఎక్సైజ్ డిపార్టుమెంట్లో ఉద్యోగం సాధించారు. అంచెలంచెలుగా ఎక్సైజ్ సూపరిండెంట్‌గా ఎదిగారు. ఓ వైపు విధులు నిర్వహిస్తూనే డిగ్రీలు, పీజీలు, పలు డిప్లొమా కోర్సులను పూర్తిచేశారు. అలాగని చదువులో పడి విధులను నిర్లక్ష్యం చేయలేదు. 2001, 2004, 2011లో ఉత్తమ అధికారిగా ప్రభుత్వ అవార్డులను అందుకున్నారు. చివరిగా 2018లో అన్నామలై యూనివర్శిటీలో ఎంబీఏ (హెచ్ఆర్)ను పూర్తిచేశారు. 'చదువడమంటే ఇష్టం. జీవించి ఉన్నంత కాలం విద్యాభ్యాసం చేస్తూనే ఉంటా. దీనిలో ఉన్న సంతృప్తి మరెక్కడా ఉండదని నా అభిప్రాయం' అంటారాయన.

–న్యూస్‌టుడే, కొత్తపేట

'మహానటి' చిత్రంలో దుల్కర్ వాడిన ఫీల్డ్ ఉడెన్ కెమెరా..
విజయ్ దేవరకొండ ఉపయోగించిన మీడియా కెమెరా..
సమంత వాడిన టైప్‌మిషన్..
ఇవన్నీ ప్రేక్షకులను ఆ కాలంలోకి తీసుకెళ్లాయి.
ఇలాంటి అరుదైన వస్తువులను సేకరించింది ఫైజల్ అలీఖాన్.
గతమెంతో ఘనం అంటారు...
ప్రతీ వస్తువుకూ ఓ నేపథ్యముంటుంది..
ఓ కథ ఉంటుంది. అలీ ఆ కథలను వింటాడు. వాటి వివరాలను ఆసక్తిగా తెలుసుకుంటాడు. విశిష్టమైన వాటిని సొంతం చేసుకుంటాడు.
అదీ వాటితో అతని అనుబంధం.
అలీకి సేకరణ ఓ అలవాటు..
కాదు కాదు అతని జీవితం.

మధుర జ్ఞాపకాల మహా నిధి!

జూబ్లీహిల్స్‌లోని ఓ అపార్ట్‌మెంట్... అందులోని రెండో ఫ్లోర్‌కి వెళ్లగానే.. అలనాటి అరుదైన దీపం ఒకటి దారి చూపుతుంది. కాస్త కుడివైపు తిరిగితే సంభ్రమాశ్చర్యాలకు గురికావాల్సిందే! వందల కెమెరాలు, టైప్‌మిషన్లు, రేడియోలు, గ్రామ్‌ఫోన్లు, ప్రొజెక్టర్లు కనిపిస్తాయి. అరుదైన వస్తువులతో నిండిన ఓ మ్యూజియంలా అనిపిస్తుందా ఇల్లు. 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అనే సామెతకు నిలువెత్తు రూపంగా నిలుస్తూ.. పాతజ్ఞాపకాలతో నిండి ఉన్న ఓ అందమైన చారిత్రక గని అది.

అలా ప్రేమ పుట్టింది...

హైదరాబాద్‌లో పుట్టిపెరిగాడు అలీ. తనకో అక్క, అన్నయ్య. పదోతరగతి చదువుతుండగా చార్మినార్ దగ్గర అతనికి ఓ బాక్స్ కనిపించింది. అది పెన్సిల్ బాక్స్ అనుకుని ఇరవై ఐదు రూపాయలకు కొన్నాడు. ఇంటికొచ్చి తన తండ్రికి చూపించాడు. 'ఇది కెమెరా. మంచి వస్తువు కొన్నావు.. భేష్' అన్నారాయన. దాని బరువు కేవలం 140 గ్రాములు. ఉపాధ్యాయులు, స్నేహితులంతా 'అరుదైన వస్తువు దొరికింద'ని పొగిడారు. అప్పుడు అతనికి కలిగిన ఆనందం అతని జీవితానికి చుక్కాని అయింది. ఎవరి దగ్గరా లేనిదీ.. ఎవరికీ దొరకనిది తన దగ్గర ఉండాలనే నిర్ణయం తీసుకున్నారాయన. ఫైజల్ అలీఖాన్ తాతయ్య చేతిగడియారాలను సేకరించేవారు. అతని నాన్నకు విభిన్నమైన పెన్నులు సేకరించే అలవాటుంది. అలా వారసత్వంగా కూడా అలీకి ఈ అలవాటు అబ్బింది.

కెమెరాలంటే పిచ్చి...

పదోతరగతి చదివాక అలీకి చరిత్రపై ఆసక్తి పెరిగింది. గతించిపోయిన రోజుల్లో ఎలాంటి వస్తువులు ఉండేవి, ఎవరు వాడేవారు.. లాంటి ప్రశ్నలు అతన్ని ఓ పట్టాన ఉండనిచ్చేవి కావు. దీంతో అదే వ్యాపకంగా చేసుకున్నాడు. 'మీ నాన్న పెన్నులు సేకరించి డబ్బు ఖర్చు పెట్టాడు. డబ్బులు వెనక్కిరావని తెలుసు. అయినా ఎందుకిలా చేస్తావ్' అని అలీ అమ్మ వాపోయేది. అయినా వస్తువులపై ప్రేమ అతన్ని ఊరికే ఉండనివ్వలేదతన్ని. ఇందుకోసం డబ్బు సంపాదించాలనుకున్నాడు. గ్రాఫిక్స్ కోర్సు చేశాడు. ఆ తర్వాత పదిహేను రకాల సాఫ్ట్‌వేర్లు నేర్చుకున్నాడు. వెబ్‌సైట్స్ తయారు చేసి డబ్బులు సంపాదించేవాడు. ఆపై లండన్ వెళ్లాడు. ఇంటీరియర్ డిజైనర్‌గా డిప్లమో కోర్సు చేసి దానిపై పట్టు సాధించాడు. ఐదారు ఒకేషనల్ కోర్సులు చదివాడు. 'కెమెరాలంటే పిచ్చి ప్రేమతో టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్ క్యాప్చర్ చేశా. కెమెరా పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ దాదాపు అరుదైన 750 కెమెరాలు నా దగ్గర ఉన్నాయి. వాటికోసం చెన్నై, ముంబైలతో పాటు యూకేలోని లండన్, బర్మింగ్‌హోమ్, స్కాట్లాండ్, గ్లాస్గో, కాడెఫ్ లాంటి ఇతర ప్రాంతాలకూ వెళ్లాను. ఇప్పటి చైనాలా అప్పట్లో ఆర్థిక, పారిశ్రామిక విప్లవాలు ఇంగ్లండ్‌లో వచ్చాయి కాబట్టి బర్మింగ్ హోమ్‌కి వెళ్లాను. ఎక్కువ కలెక్షన్ అక్కడే కొన్నా. ఫలానా చోట ఓ వస్తువు ఉందని నా నెట్‌వర్క్ ద్వారా కాల్ వస్తుంది. అలా అక్కడికెళ్లి కొంటుంటా'నంటారు అలీ.

'మహానటి'కి అలా...

ఓరోజు అలీ స్నేహితురాలు వోల్గా ఇన్‌స్టాగ్రమ్‌లో పురాతన గ్రామ్‌ఫోన్‌ను పోస్ట్ చేశారు. దాన్ని చూసి మహానటి చిత్రం నిర్మాత ప్రియాంకదత్ వచ్చి అలీని కలిశారు. ఆయన దగ్గరున్న సేకరణలను చూసి ఆశ్చర్యపడ్డారు. "బయోపిక్ తీస్తున్నాం. మహానటి సావిత్రి జీవితమిది. మీరూ భాగం అవ్వండ'ని

చెప్పారు. నిజానికి అప్పుడు అలీ సినిమాపై పెద్దగా ఆసక్తి చూపలేదు. 'ఆ సమయంలో మా అమ్మ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆసుపత్రిలో ఉన్నప్పుడు.. తెలుగు సినిమా హీరోయిన్ సావిత్రి లైఫ్ మీద సినిమా చేస్తున్నారంట. మన వస్తువులు వాడుకుంటారంట' అన్నానంతే. ఆ క్షణంలో.. మా అమ్మ ముఖంలో ఓ వెలుగు. 'ఆ..సావిత్రి జీవితంపై సినిమానా? నేను వీరాభిమానిని. బలమైన సంకల్పమున్న మనిషి' అంటూ చెప్పుకొచ్చింది. అమ్మ మోములో వెలుగు చూసి.. సినిమాకు సహకరించడానికి సరేనన్నా" అంటాడు అలీ. అలా తన దగ్గరున్న కెమెరాలు, టైప్‌మిషన్లు, గ్రామఫోన్లు, ల్యాండ్‌ఫోన్లు, మేకప్‌కిట్, డాక్టర్స్ కిట్.. ఇలా అన్ని వస్తువులూ సినిమాలో భాగమయ్యాయి.

'వస్తువులు గీతలు పడతాయనేది నా బాధ. ఒకసారి పగిలిపోతే దాన్ని రిపేరు చేయలేం. తిరిగి తేలేం. అందుకే నేను సెట్స్‌లో ఉన్నప్పుడే నా వస్తువులతో షూట్ చేసేవారు. 'మహానటి'లో దుల్కర్ వాడే కెమెరా చూసుకోవటానికి నలుగురు బౌన్సర్లను ఇచ్చారు నిర్మాతలు. వస్తువులకు విలువ ఇచ్చిన ఆ విధానం చూసి చాలా ఆనందపడ్డా. ఒక్క ఇన్‌స్టాగ్రామ్‌తో 'మహానటి' సినిమాకి పని చేసే అవకాశం రావటమేంటీ.. సావిత్రమ్మకి మా అమ్మ వీరాభిమాని కావటమేంటీ.. మహానటికోసమే ఇలా పద్దెనిమిది ఏళ్ల నుంచీ వస్తువులను సేకరిస్తున్నానేమో అనిపించింది. సావిత్రమ్మ ఆత్మ ఇలా నన్ను ఎంపిక చేసుకుందేమో' అంటాడు ఫైజల్ అలీ. ఈ చిత్రంకోసం అలీ తొమ్మిది నెలలు పనిచేశాడు. 'సినిమా విడుదలకి ముందే మా అమ్మ(ఫిబ్రవరి 2018) చనిపోయింద'ంటూ ఉద్వేగానికి గురయ్యారు.

అదే అతని కల..

ప్రస్తుతం అలీ క్రియేటివ్ ట్రాన్స్‌లేటర్‌గా పనిచేస్తున్నాడు. అంటే ఎవరైనా ఇల్లు కట్టించుకునేప్పుడు ఫలానా 1960నాటి కాలంలోలాగా, ఫలానా సినిమాలోని ఇంటిలా.. ఇలా కొన్ని ఆలోచనలు చెబితే చాలు.. అచ్చు అలాగే ఇంటిని డిజైన్ చేస్తాడు అలీ. అలా ఓ అందమైన కలను వాస్తవంలోకి తెస్తారాయన. అలీకి వస్తువులతో ఉన్న అనుబంధం భిన్నమైంది. 'అందరిలా ఓ టైప్ రైటర్‌ను టైప్‌రైటర్‌లా చూడను.. దాన్ని ఎంత మంది కవులు వాడారో. ఎన్ని కవితల్ని రాస్తూ.. చదువుకుందో.. ఇలా ఆలోచిస్తుంటా. వస్తువును వ్యక్తిత్వం ఉన్నట్లుగా చూడడం వల్లే ఇలా సేకరించగలుగుతున్నా.. అంతే యాదృచ్ఛికంగా ఆ వస్తువులు నాకు దొరుకుతున్నాయి కూడా. అవి నన్ను వెతుక్కుంటూ నా దరికి వస్తున్నాయి. అరుదైన వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేయటం నాకో కల. దీంతో పాటు ఓ కాఫీ షాప్‌ను ప్రారంభించాలి. డిఫరెంట్ సిగ్నేచర్ వర్క్స్ అక్కడ ఉంచాలి. పాతకాలం గ్రామఫోన్‌లో పాట వస్తుంటే.. అక్కడికొచ్చిన వారంతా ఎంజాయ్‌చేయాలి. చరిత్రతో మమేకం కావాలి అంటాడాయన.

- రాళ్లపల్లి రాజావలి

"ముంబైలో రెండు కెమెరాలు ఒకాయన దగ్గర ఉన్నాయని అలీకి తెల్సింది. అక్కడికి వెళ్లాడు. నికాన్ ఎస్3హెచ్‌పీ కెమెరాలవి. అవి బాక్స్ పీస్‌లు. ధర మూడు లక్షలు చెప్పాడు. చేతిలో డబ్బులు సరిపడినంత లేకపోవటంతో.. వెంటనే హైదరాబాద్‌కి వచ్చాడు. ఇష్టపడికొన్న కారును అమ్మాడు. కెమెరాలు కొన్నాడు.

'మహానటి' చిత్రంలో దుల్కర్ తొలిసారిగా ఫీల్డ్ ఉడెన్ కెమెరాలో కీర్తి సురేష్‌ను చూస్తాడు. జెమినీగణేషన్ సావిత్రమ్మను చూసిందందులోనే. ఆ కెమెరా 1890లో లండన్‌లో తయారయింది. హెచ్‌పార్క్ అనే సంస్థ తయారు చేసింది. లెన్స్ లండన్‌లో తయారయ్యాయి. ఈ కెమెరాను పదుల ఏళ్లు అక్కడ వాడారు. అక్కడి నుంచి మన దేశానికి చాలా ఆలస్యంగా (1930)లో చెన్నైకి వచ్చింది. 2010లో అది చెన్నైలోని జెమినీ స్టూడియోకి దగ్గరలో ఉండే ఓ గ్యారేజీలో ఉందని ఫైజల్ అలీ తెలుసుకున్నారు. అక్కడికెళ్లి చెప్పిన ధర పాతికవేలతో కొనేశారు. 'అంతవరకూ ఈ కెమెరా ఎన్ని వేల కిలోమీటర్లు తిరిగిందో తెలీదు.. అది నా చెంతకే చేరింది. దాన్నే దుల్కర్ మహానటిలో ఉపయోగించారు. అదే విధి' అంటూ మురిసిపోయాడు అలీ

'మహానటి'లో ఉపయోగించిన రెమింగ్టన్ ఫోర్టబుల్ టైప్‌రైటర్ కూడా అలీ సేకరణే. అది 1920 నాటిది. ఇలాంటి 60 రకాల టైప్‌రైటర్లు అలీ దగ్గర ఉన్నాయి. రేడియోలు, గ్రామ్‌ఫోన్లు, సూయింగ్ మిషన్లు, బాత్‌టబ్స్, ఫ్యాన్లు, ప్రొజెక్టర్లు, ల్యాండ్‌లైన్ ఫోన్లు, గ్లోబ్స్, మెడికల్ కిట్స్, మేకప్ కిట్స్, ల్యాంప్స్, స్విచ్‌లు, కుర్చీలు.. ఇలా పలురకాల వస్తువులు వేలాదిగా ఉన్నాయి. 'ఈ వస్తువులన్నీ నా పిల్లలు. ఇలాంటి పాత వస్తువులను నాలుగు గోడౌన్లలో జాగ్రత్త పరిచాను' అంటూ చెప్పుకొచ్చాడు అలీ. ఆయన సేకరించడంతో పాటు ఆ వస్తువులపై పరిశోధన చేస్తారు. అది దేనితో చేశారు. ఎక్కడ, ఎప్పుడు తయారయింది. కంపెనీ పేరేంటి? టెక్నాలజీ గురించి.. గతంలో ఎవరు ఉపయోగించారనే విషయాలన్నీ కూలంకషంగా తెలుసుకుంటాడు. అలీ దగ్గర ఉండే వస్తువుల్లో కెల్లా పాత వస్తువు రేడియో. దాన్ని 'పై రేడియో' అంటారు. లండన్‌లో తయారైందది. ఆధునికంగా జీవించే ఈ యువకుడు తన ప్రాణం మాత్రం పాత వస్తువులే అంటాడు. చరిత్ర లేకుంటే మనమెక్కడ అంటూ ప్రశ్నిస్తాడు."

మల్లన్నకిచ్చిన మాట!

ఆ ఊర్లో ఆదివారం మద్యం, మాంసం బంద్

ఆదివారం వచ్చిదంటే మాంసం దుకాణాల ముందు జన సందోహాలు కనిపిస్తాయి. కానీ జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని పెద్దపూర్ గ్రామంలో మాత్రం పరిస్థితి పూర్తిభిన్నంగా ఉంటుంది. ఆదివారం ఆ ఊర్లో మద్యం, మాంసం దుకాణాలు బంద్. ఇదేంటీ అనుకుంటున్నారా? 20 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ ఆచారానికి కారణం ఆ ఊరు దేవుడికిచ్చిన మాట. పెద్దాపూర్ గ్రామంలో 412 కుటుంబాలున్నాయి. సుమారు రెండు వేలమంది వరకూ జనాభా ఉంటారు. ఆ ఊరి ఇలవేల్పు, భక్తుల కొంగుబంగారం మల్లన్న దేవుడు.. ఈ గ్రామం మధ్యలో 100 సంవత్సరాల క్రితం మల్లన్న స్వామి కొలువుతీరాడని ప్రజల నమ్మకం. ఆదివారాన్ని ఆ దేవుడి రోజుగా భావించి ఇరవై సంవత్సరాలుగా మద్యం తాగడం, మాంసం తినడం, కల్లుతాగడం వంటి వాటికి ఆ ఊరి ప్రజలు దూరంగా ఉంటూ వచ్చారు. ఇవి అమ్మే దుకాణాలు కూడా మూసేస్తారు. వేరే ఊరివాళ్లు ఆ ఊరి వచ్చినా, ఆ ఊరి వాళ్లు వేరే ప్రాంతాలకు వెళ్లినా కూడా ఈ ఆచారం పాటించాల్సిందే. ఒక వేళ ఆ రోజున దావత్‌లు ఇవ్వాల్సి వచ్చినా కూడా వీటికి పూర్తి దూరంగా విందులు ఏర్పాటు చేయడం విశేషం. అలాగే ఏటా హోలీ పండగ తర్వాత వచ్చే ఆదివారం మల్లన్న జాతర మహా వైభవంగా జరుగుతుంది. గోదావరి ఒడ్డున అందంగా ముస్తాబైన మల్లన్న వివాహ వేడుక చూడ్డానికి అదిలాబాద్, నిజామాబాద్, కరీంగర్ ప్రాంతాల ప్రజలే కాకుండా మహారాష్ట్ర, ముంబయి నుంచి కూడా రావడం విశేషం. ఒగ్గు కథలు, అగ్నిగుండంలో నడకలు ఈ జాతర ప్రత్యేకత.

–న్యూస్‌టుడే, కోరుట్ల గ్రామీణం

వెండింగ్ మిషన్‌లో డబ్బులేస్తే ఏం వస్తాయ్...
నీళ్ల సీసాలు... కూల్‌డ్రింక్‌లు... మహా అయితే ఆహార పదార్థాలు...
అంతేనా? కానీ ఇక్కడ మాత్రం కథలొస్తాయ్..!
అవును మీరు విన్నది నిజమే... కథలు వస్తాయి.

ఈ కథే వేరులెండి!

ఫ్రాన్స్‌కి చెందిన షార్ట్ ఎడిషన్ అనే ఓ కంపెనీకి వచ్చిన ఆలోచన ఇది. ప్రజల్లో పఠనాసక్తిని పెంచడమే ఈ స్టార్టప్ ప్రధానోద్దేశం. చదవడం ద్వారా రాయాలనే ఆలోచన వస్తుందని సంస్థ బలంగా నమ్ముతోంది. ఇప్పటికే షార్ట్ ఎడిషన్ కమ్యూనిటీలో 5000 మంది రచయితలు చేరారు. వీళ్ల కథలు వెండింగ్ మిషన్లలో లభ్యమవుతాయి. 2016లో ప్రారంభమైన ఈ సంస్థ ఫ్రాన్స్‌లోని విమానాశ్రయాలు, ప్రభుత్వకార్యాలయాలు, రైల్వేస్టేషన్లు, షాపింగ్‌మాల్స్, విశ్వవిద్యాలయాల్లోని కేఫ్స్.. ఇలా దాదాపు 150 ప్రాంతాల్లో కథలను ఇచ్చే మిషన్లుంచింది. ఎదురుచూసే సమయాల్లో, ఖాళీగా కూర్చున్న వేళల్లో కొందరు ఈ పొట్టి కథలను చదువుతూ సంతోషిస్తున్నారట. ఈ ఉత్సాహంతో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో, కొలంబస్ సిటీ స్కూల్స్‌తో పాటు పబ్లిక్ లైబ్రరీల్లో కూడా వీటిని ఏర్పాటుచేశారు. థ్రిల్లర్లు, సరదా కథలతో పాటు చిన్నపిల్లల కోసం కూడా కొన్ని కథలు వీటిలో లభ్యమవుతాయి. అక్షరబంధాన్నిచ్చే ఈ సంస్థకు హ్యాట్సాఫ్!

ఈ వెండింగ్ మిషన్ పైన ఆరెంజ్, కింద భాగం అంతా నలుపు రంగు ఉంటుంది. ఆరెంజ్‌రంగు పైన 1,3,5 అనే అంకెలు కనిపిస్తాయి. డబ్బును వేసి కావాల్సిన అంకెను నొక్కాలి. ఉదాహరణకు మూడు అంకెపై బటన్ నొక్కగానే.. మూడు నిమిషాల పాటు చదివే షార్ట్ స్టోరీ ప్రింట్ వస్తుంది. ఏటీఎంలో డబ్బులు తీసుకున్నాక వచ్చే స్లిప్ మాదిరే ఉంటుంది. కాకపోతే ఇందులో ఎంచక్కా ఓ కథ ఉంటుంది.

ఈనాడు సినిమా

ఎన్టీఆర్

సన్నాహాలు మొదలయ్యాయా?

కథానాయకులు తరచుగా కలుస్తున్నారు. కథ గురించి చిత్రసీమలో చర్చ సాగుతోంది. ముందస్తు నిర్మాణ కార్యక్రమాలు కూడా షురూ అయినట్టు తెలుస్తోంది. కొబ్బరికాయ ఎప్పుడు కొడతారో తెలియదు కానీ... ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ల సినిమా కోసం సన్నాహాలు మాత్రం జోరుగా సాగుతున్నట్టు సమాచారం. 'బాహుబలి' చిత్రాల తర్వాత ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇదే కావడంతో జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. కథ గురించి రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. 'ఈగ' సినిమా తీస్తున్న సమయంలోనే 'బాహుబలి' చిత్రాన్ని, ఆ కథా నేపథ్యాన్ని ప్రకటించిన రాజమౌళి... ఈసారి మాత్రం ఏ విషయాన్నీ బయటికి పొక్కనివ్వడం లేదు. తన చిత్రాల గురించి ఎప్పుడు ఏ విషయాన్ని బయటపెట్టాలో పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తుంటారాయన. అయితే కొత్త చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ... కథానాయకులు రామ్‌చరణ్, ఎన్టీఆర్ తరచుగా కలుస్తున్నారు. ఈ చిత్రం కోసం సన్నద్ధమవడంలో భాగంగానే వాళ్లు కలుస్తున్నట్టు సమాచారం. ఇద్దరూ కలిసి ఇదివరకు అమెరికా వెళ్లొచ్చిన విషయం తెలిసిందే.

రామ్ చరణ్

ప్రతిదీ మనం రాసుకొన్నదే!

రాశీ ఖన్నా

పుస్తకాల పురుగు రాశీ ఖన్నా. ఎప్పుడు ఖాళీ దొరికినా ఏదో ఒక పుస్తకం చేతిలో ఉండాల్సిందే. చిన్నప్పట్నుంచీ ఉన్న ఆ అలవాటుకి తగ్గట్టుగానే తన జీవితం కూడా ఒక మంచి పుస్తకంలా ఉండాలని చెబుతోంది. ఒకొక్క పేజీని తిరగేసినట్టుగా... జీవితంలో ఒకొక్క జ్ఞాపకాన్ని గుర్తు చేసుకొన్నప్పుడు తియ్యటి అనుభూతి కలగాలంటోంది. "నా జీవిత పుస్తకంలో ప్రతి పేజీ అందంగా కనిపించాలనే ఆశ నాకు లేదు. కాకపోతే ప్రతి అక్షరం, ప్రతి పేజీ మనం రాసుకొన్నదే అనే భావన కలగాలి. అందుకే వృత్తి పరంగా ఎంత బిజీ ఉన్నా... వ్యక్తిగతానికీ కావల్సినంత సమయాన్ని కేటాయిస్తా. ఆటుపోట్లు ఎదురైనా... ప్రతి క్షణాన్ని నాకు నచ్చినట్టుగా నేను గడిపాననే ఓ సంతృప్తి ఉండాలి. అందుకే కుటుంబం, స్నేహితులు, వ్యక్తిగత అభిరుచుల్లో ఉండే చిన్న చిన్న ఆనందాల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ దూరం చేసుకోను. వృత్తిపరంగానూ మనసు చెప్పిన మాటకే కట్టుబడి నిర్ణయాలు తీసుకొంటాన"ని చెబుతోంది రాశి. ఇటీవలే విహారం కోసం సింగపూర్ వెళ్లిన ఆమె ఆ వెంటనే అమలాపురంలో దిగిపోయింది. అక్కడ 'శ్రీనివాస కళ్యాణం' చిత్రీకరణలో పాల్గొంది.

సుధీర్‌ని చూస్తే గర్వంగా ఉంది!

మహేష్‌బాబు, సుధీర్‌బాబు, వివేక్‌సాగర్, శివలెంక కృష్ణప్రసాద్, ఇంద్రగంటి మోహనకృష్ణ, అదితిరావు హైదరీ

"మా పనుల్లో మేం బిజీగా ఉంటాం. సుధీర్‌కి ఎప్పుడూ ఏ విషయంలోనూ సహకారం అందించలేదు. ఇలా పాటల విడుదల వేడుకలకి రావడం తప్ప. తనని చూస్తే గర్వంగా ఉంది" అన్నారు మహేష్‌బాబు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'సమ్మోహనం' ముందస్తు విడుదల వేడుకకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రమిది. అదితిరావు హైదరీ కథానాయిక. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహించారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. వివేక్ సాగర్ స్వరకర్త. ఈ నెల 15న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. విడుదల తేదీ పోస్టర్‌ని ఆవిష్కరించిన అనంతరం మహేష్‌బాబు మాట్లాడుతూ "ఈయేడాది గొప్ప విజయం సాధించే చిత్రం 'సమ్మోహనం' అని నరేష్, దిల్‌రాజు చెప్పారు. నిజంగా ఆనందంగా ఉంది. ఇక సుధీర్ గురించి చెప్పాలి. నా సినిమాల వేడుకలకి వచ్చి బాగా మాట్లాడుతుంటాడు. కానీ ఈ వేడుకలో భావోద్వేగానికి గురయ్యాడు. మోహనకృష్ణ ఇంద్రగంటి తీసిన 'అష్టాచమ్మా', 'జెంటిల్‌మేన్' చిత్రాలు నాకు బాగా నచ్చాయి. 'అష్టాచమ్మా' ఇష్టం. అందులో నా పేరు వాడారని కాదు. నిజంగా ఆ సినిమా నాకు చాలా బాగా నచ్చింది. అదితి 'పద్మావత్'లో బాగా నటించింది. 'భరత్ అనే నేను' సినిమా తర్వాత అభిమానుల్ని కలవడం ఇప్పుడే. అభిమానుల ఆశీస్సులు, అభిమానం ఇలాగే ఉండాలని కోరుకొంటున్నా" అన్నారు. "ఒక మంచి సినిమా చేశాం. మా అందరికీ పేరొస్తుంది" అన్నారు నిర్మాత. మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ "2008లో నేనొక రోజు రైల్లో వెళుతుంటే ఒక చిన్నమ్మాయి 'పోకిరి' సంభాషణ చెబుతుంది. అదే 'అష్టాచమ్మా' కథ రాసుకోవడానికి కారణమైంది. ఆ కథ రాస్తున్నప్పుడు సినిమాలో మహేష్‌బాబు వీడియో వాడదామా అన్నారు. పేరు చాలన్నాను, ఆ పేరే మేజిక్ చేసింది. ఆ పేరులో మత్తుంది, స్టైల్ ఉంది, వైబ్రేషన్స్ ఉన్నాయి. ఆ సినిమా తర్వాత మహేష్‌బాబుతో ఎప్పుడు సినిమా చేస్తారని అభిమానులు అడిగారు. 'లేదండీ, అప్పుడే చేసేశాను. 'అష్టాచమ్మా' ఆయన సినిమానే అని చెప్పా. నేను ఇష్టంగా రాసుకొని చేసిన సినిమా 'సమ్మోహనం'. సుధీర్ మాత్రమే ఈ సినిమా చేయగలడు. అదితితో పనిచేయడం గౌరవంగా ఉంది. వివేక్‌సాగర్ సంగీతం సమ్మోహనంగా ఉంది. రామజోగయ్యశాస్త్రితో పాటు, మా నాన్నగారు కూడా ఇందులో పాట రాశారు. అందరికీ నచ్చుతుందీ చిత్రం" అన్నారు. అదితిరావు హైదరీ మాట్లడుతూ "ఇందులో సమీర పాత్రలో నటించడం చాలా మంచి అనుభవం. సుధీర్ మంచి సహనటుడు" అన్నారు. "విశ్వనాథ్‌గారితో తెలుగుదనం, జంధ్యాలలోని హాస్యరసంలా తన కంటూ ఒక బ్రాండ్‌ని సృష్టించుకొన్నారు మోహనకృష్ణ. ఇందులో మంచి పాత్ర పోషించాను" అన్నారు నరేష్. కథానాయకుడు సుధీర్‌బాబు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల భరణి, దిల్ రాజు, హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, పవిత్ర లోకేష్, అమిత్ పురోహిత్, కాదంబరి కిరణ్, రామజోగయ్య శాస్త్రి, రమేష్‌రెడ్డి, విందా, అబ్బూరి రవి, విజయ్, తరుణ్‌భాస్కర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త లుక్‌లో...: తన 25వ చిత్రం కోసం సిద్ధమవుతున్న మహేష్‌బాబు కొత్త గెటప్‌లో ఈ వేడుకకి హాజరయ్యారు. ఆయన లుక్ అభిమానుల్ని అలరించింది.

వర్మ 'వైరస్'

రామ్‌గోపాల్ వర్మ

రామ్‌గోపాల్ వర్మ కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. ముంబై నేపథ్యంలో 'వైరస్' పేరుతో ఆ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు శనివారం ప్రకటించారు. పరాగ్ సంఘ్వీ నిర్మాత. ఇదివరకు వర్మతో 'సర్కార్', 'ది ఎటాక్స్ ఆఫ్ 26/11' చిత్రాల్ని తీసిన నిర్మాత ఆయన. 'వైరస్' కథా నేపథ్యాన్ని ఓ ప్రకటనలో వెల్లడించారు వర్మ. "ముంబైకి చెందిన ఓ విద్యార్థి సెంట్రల్ ఆఫ్రికాకి వెళ్లి అక్కడ అరుదైన వైరస్ బారిన పడతాడు. తిరిగి ముంబైకి రావడంతో అతని నుంచి ఆ వైరస్ ఇతరులకూ వ్యాపించి మొత్తం ముంబై నగరానికి ముప్పుగా మారుతుంది. దాంతో ప్రభుత్వం వైరస్ వ్యాప్తి చెందకుండా ఒకరికొకరు 20 అడుగుల దూరంలో ఉండాలనే ఓ నిబంధనని విధిస్తుంది. కానీ 2 కోట్ల జనాభా ఉన్న ముంబై నగరంలో అలా నడుచుకోవడం సాధ్యం కాని పని. దాంతో లక్షల మంది మరణిస్తారు. దేశంలోని ఇతర ప్రాంతాలకి ఆ వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండాలంటే, నగరాన్ని వదిలి ఎవ్వరూ బయటికి వెళ్లకూడదని, అక్రమంగా వెళ్లాలని ప్రయత్నించేవాళ్లని కాల్చేయాలని కూడా అదేశాలు జారీ చేస్తుంది ప్రభుత్వం. ఆ వైరస్‌ని ముంబైకే పరిమితం చేసి, నిర్మూలించాలనుకొన్న యంత్రాంగం ప్రయత్నాలు.. భయభ్రాంతులకి గురైన ప్రజల నేపథ్యంలోనే ఈ చిత్రం సాగుతుంది. భయం, బాధ, ప్రేమ, త్యాగం, ఆశ తదితర అంశాల నేపథ్యంలో మానవీయ కోణంలో ఈ చిత్రం సాగుతుంద"ని పేర్కొన్నారు వర్మ. "విస్తృతమైన పరిశోధన తర్వాత రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న ఓ కల్పిత కథ ఇది. త్వరలోనే నటీనటుల, సాంకేతిక బృందం వివరాల్ని ప్రకటిస్తామ"న్నారు పరాగ్ సంఘ్వీ.

అమితాబ్‌తో రెండోసారి!

తాప్సి

ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్‌తో కలిసి నటించడం చాలా గొప్పగా భావిస్తారు నటీనటులు. తెలుగులో గుర్తింపు తెచ్చుకొని బాలీవుడ్‌కెళ్లిన తాప్సి ఆయనతో కలిసి 'పింక్'లో నటించే అవకాశాన్ని కెరీర్ తొలినాళ్లలోనే దక్కించుకొంది. ఆ సినిమా విజయం సాధించడమే కాదు తాప్సి నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఆ సినిమా తర్వాత తాప్సి అవకాశాలు పెరిగాయి. ఇప్పుడు మరోసారి అమితాబ్‌తో కలిసి నటించే ఛాన్స్ కొట్టేసింది ఈ భామ. అమితాబ్ ప్రధాన పాత్రలో సుజయ్ ఘోష్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. స్పానిష్ చిత్రం 'కాంట్రటియెంపో'కు రీమేక్ ఇది. ఈ విషయంపై తాప్సి స్పందిస్తూ "అందరూ అమితాబ్‌తో నటించాలని ఎంతగానో కోరుకుంటారు. నాకు ఆ అవకాశం రెండోసారి వచ్చింది. నాకు ఎంత ఆనందంగా ఉందో. ఈ నెల 14 నుంచి ఈ సినిమా ప్రారంభం కానుంది" అని చెప్పింది.

రైతులకి సాయం చేస్తేనే సంతోషం

మిత్రన్, అర్జున్, విశాల్, జి.హరి, శ్రీనాథ్

"సినిమాల్లో ఊరికే సంభాషణలు చెప్పడం కాదు. వసూళ్లలో ఎంతో కొంత రైతులకిస్తేనే సంతోషంగా ఉంటుంది. అందుకే తమిళనాడులో ఒక్కో టికెట్టుపైన ఒక రూపాయి చొప్పున రైతులకి అందజేయాలని నిర్ణయించుకొన్నా. తెలుగులోనూ నా 'అభిమన్యుడు'కి మంచి ఆదరణ లభిస్తోంది కాబట్టి తెలుగు రాష్ట్రాల్లోని రైతులకూ ఎంతో కొంత ఆర్థిక సహాయం చేయాలని మా పంపిణీదారుల్ని కోరుతున్నా" అన్నారు విశాల్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'అభిమన్యుడు'. మిత్రన్ దర్శకత్వం వహించారు. జి.హరి నిర్మాత. హైదరాబాద్‌లో చిత్ర విజయోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ "నా మార్కెట్టు ఎప్పుడూ రూ.15 కోట్లు ఉండాలని నిర్మాత హరి చెబుతుంటాడు. ఈ చిత్రంతో మరోసారి అది నెరవేరినందుకు ఆనందంగా ఉంది. ఉత్తరాదిలోనూ సినిమాకి ఆదరణ లభిస్తోంది. చాలా రోజుల తర్వాత నాకు ఇంత పెద్ద విజయం లభించడం ఆనందంగా ఉంది. 'పందెం కోడి 2'తో అక్టోబరు 18న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నామ"న్నారు. "వారం రోజుల్లోనే రూ.12 కోట్లు వసూళ్లు సాధించిందీ చిత్రం. మా కథానాయకుడు చెప్పినట్టుగానే త్వరలోనే రైతులకి ఆర్థిక సహాయం చేస్తామ"న్నారు జి.హరి. అర్జున్ మాట్లాడుతూ "విశాల్ ఈ చిత్రంతో నిజమైన విజయాన్ని అందుకొన్నాడు" అన్నారు. కార్యక్రమంలో చిత్రబృందంతో పాటు పంపిణీదారులు పాల్గొన్నారు.

హరికృష్ణ, రవితేజ, జొన్నలగడ్డ శ్రీనివాసరావు

ప్రేమెంత పనిచేసే...

హరికృష్ణ జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ప్రేమెంత పనిచేసే నారాయణ'. అక్షిత కథానాయిక. జొన్నలగడ్డ శ్రీనివాసరావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని కథానాయకుడు రవితేజ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "దర్శకుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావుతో మంచి అనుబంధం ఉంది. అతనికి ఈ చిత్రంతో మంచి విజయం లభిస్తుందనే నమ్మకం నాకుంది. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాల్ని చూశా. కథానాయకుడు హరి చేసిన నృత్యాలతో పాటు సంభాషణలు పలికిన విధానం బాగుంది" అన్నారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ "మా అబ్బాయి హరి కథానాయకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమా ప్రచార చిత్రాన్ని రవితేజ విడుదల చేయడం ఆనందంగా ఉంది. సినిమా పూర్తయింది. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తాం. ఈ నెలాఖరుకి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నాం" అన్నారు. మా ప్రయత్నం ప్రేక్షకుల్ని తప్పక మెప్పిస్తుందన్నారు కథానాయకుడు.

ట్రెండ్‌కి తగిన కథ

ఆండ్రియా

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'తారామణి'. రామ్ దర్శకుడు. డి.వెంకటేష్ నిర్మాత. గుడ్ సినిమా గ్రూప్ సంస్థ తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ "నేటి ట్రెండ్‌కి తగిన చిత్రమిది. నిజాయతీతో చేసిన ప్రయత్నం. యువన్ శంకర్ రాజా అందించిన పాటలు చాలా బాగున్నాయ"న్నారు. "వీరె ది వెడ్డింగ్' అనే బాలీవుడ్ సినిమా వచ్చింది. ఇప్పుడు అందరూ దాని గురించి మాట్లాడుకుంటున్నారు. 'తారామణి' కూడా అలాంటి సినిమానే" అన్నారు ఎస్.కె.ఎన్. "పాటలు ఇప్పటికే మంచి ఆదరణ పొందాయి. మారుతిగారి రాకతో ఈ సినిమా మరో స్థాయికి వెళ్లింద"న్నారు డి.వెంకటేష్.

పంచ్ డైలాగ్

నమ్మకాన్ని మించిన దేవుడు లేదు. సంకల్పాన్ని మించిన ధైర్యం లేదు. చిత్రం: ద్వారక

– పంపినవారు: కె.చక్రవర్తి, కర్నూలు

ఆ ఇద్దరి కంటే కత్రినాకే ఎక్కువ!

జాక్వెలైన్ ఫెర్నాండెజ్

కత్రినాకైఫ్

సోనాక్షి సిన్హా

సల్మాన్‌ఖాన్ దబాంగ్ టూర్‌కు రంగం సిద్ధమవుతోంది. 'దబాంగ్: ది టూర్ రీలోడెడ్' పేరుతో షో జరగనుంది. 'రేస్ 3' విడుదల తర్వాత ఈ టూర్ మొదలు కానుంది. ఈ దబాంగ్ ప్రపంచ యాత్రలో సల్మాన్‌తో పాటు అందాల భామలు కత్రినాకైఫ్, సోనాక్షి సిన్హా, జాక్వెలైన్ ఫెర్నాండెజ్, డైసీషా ఆడిపాడనున్నారు. ఈ షోలో కత్రినాకైఫ్‌కు అగ్రతాంబూలం దక్కిందట. అందరి కంటే ఆమెకే ఎక్కువ మొత్తం ఇస్తున్నారట. కత్రినాకు సుమారు రూ.12 కోట్లు ఇవ్వనున్నారని సమాచారం. "సల్మాన్ తర్వాత ఈ షోలో కత్రినాయే కీలకం. పైగా చాలా గొప్ప డ్యాన్సర్. ఈ టూర్‌లో మొత్తం ఆమె పాల్గొనే ఎనిమిది షోలకు రూ.12 కోట్లు పారితోషికం అందుకోనుంది. జాక్వెలైన్, సోనాక్షిలకు రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్లు ఇచ్చే అవకాశం ఉంది. సోనాక్షి కంటే జాక్వెలైన్‌కు కొంచెం ఎక్కువ మొత్తమే ఉంటుంది" అని టూర్ నిర్వాహకులు చెప్పినట్టు సమాచారం. "టూర్ కోసం రిహార్సల్స్ వేగంగా జరుగుతున్నాయి. వేదికపై ప్రత్యేకమైన నటనతో కత్రినా అలరించనుంది. జాక్వెలైన్ పోల్ డ్యాన్స్‌తో సందడి చేయనుంది. తన చిత్రాల్లోని బ్లాక్‌బస్టర్ పాటలకు స్టెప్పులు వేయనున్నాడు సల్మాన్. 'స్వాగ్స్ సే...', 'హీరియే...' లాంటి పాటలకు సల్మాన్‌తో కలిసి కాలు కదపనున్నారు కత్రిన, జాక్వెలైన్" అని చెబుతున్నారు నిర్వాహకులు. రెండు వారాల పాటు సాగే ఈ టూర్ కోసం సల్మాన్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.

నరేష్, శ్రావ్య

ఆకాశంలో హరివిల్లులా...

సత్యశ్రీ, సుబ్బారెడ్డి, చరణ్, శ్రావణి ముఖేష్, నరేష్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఆకాశంలో ఆశల హరివిల్లు'. క్రాంతి కిరణ్ దర్శకుడు. బి.సత్యశ్రీ నిర్మాత. శ్రీనివాస్ మాలపాటి సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. "అచ్చమైన తెలుగు టైటిల్ ఇది. మంచి కథ, కథనాలతో సినిమాల్ని రూపొందిస్తే తప్పకుండా ఆదరణ లభిస్తుందని చాలా చిత్రాలు నిరూపించాయి. ఆ జాబితాలో ఈ చిత్రం చేరాల"ని అతిథులు సాయి వెంకట్, ఎస్‌వీఎన్ రావు ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ "ఆశల హరివిల్లులాంటిదే జీవితం. దాన్ని రంగులమయం చేసేది ప్రేమ. ఆ విషయాన్ని ఈ చిత్రంద్వారా చెబుతున్నామ"న్నారు.

నిద్ర పట్టడం లేదా!

11... 12... 12.30...

ఇలా గడియారం గంటలు దాటిపోతుంటాయి కానీ... కునుకు మాత్రం పట్టదు. ఏ ఒంటిగంటకో మెల్లగా నిద్ర పడుతోంది... అని చెప్పేవారి సంఖ్య ఈ రోజుల్లో పెరుగుతోంటే... ఆ సంఖ్యలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉండటం గమనార్హం అంటున్నాయి అధ్యయనాలు. దానికి కారణాలేంటీ... హాయిగా నిద్రపట్టాలంటే ఏం చేయాలి... తెలుసుకుందామా!

నిద్ర పట్టకపోవడం అనేది స్త్రీ, పురుషులిద్దరికీ ఎదురయ్యే సమస్యే అయినా... మహిళల్లో దాని ప్రభావం కాస్త ఎక్కువగా ఉంటుందని చెబుతారు నిపుణులు. అమెరికాలో దీనిపై ఓ అధ్యయనం నిర్వహించారు. మొదటిరోజు ఎనిమిది గంటలు హాయిగా నిద్రపోయిన అమ్మాయిలకూ, అబ్బాయిలకు ఎనిమిది అంకెలున్న సంఖ్యనూ, ఇంకొన్ని విషయాలనూ చెప్పి, గుర్తుపెట్టుకోమన్నారు. సరిగ్గా నిద్రపోని మరో రోజు కూడా ఇదే పరీక్ష పెట్టారు. అప్పుడు అబ్బాయిల జ్ఞాపకశక్తిలో ఎలాంటి మార్పు లేదు కానీ అమ్మాయిల్లో ఎక్కువ మంది ఆ అంకెను గుర్తుంచుకోలేకపోయారట. దానికి కారణం నిద్రలేమేనని ఈ అధ్యయనం తేల్చింది. ఈ సమస్య యుక్తవయసులో మొదలై మెనోపాజ్ చేరేటప్పటికి ఇంకాస్త తీవ్రంగా మారుతుందట. హార్మోన్ల స్థాయుల్లో మార్పులు రావడం, ఒత్తిడీ, జీవనశైలీ, గర్భం దాల్చడం, నెలసరి సమస్యలు... ఇవన్నీ శారీరకంగా ఎదురయ్యే కారణాలు. ఇక చదువూ, ప్రేమా, వైవాహికజీవితంలో సమస్యలూ, ఉద్యోగంలో ఇబ్బందులూ, పిల్లల పెంపకం... వీటన్నింటి ప్రభావం కూడా నిద్రపై పడుతోంది. నిద్ర లేకపోతే ఉన్న సమస్యలు తగ్గకపోగా కొత్తగా ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్య ఉందని గుర్తిస్తే వెంటనే దానికి పరిష్కార మార్గాలు వెతకడం తప్పనిసరి.

నిద్రపోకపోతే ఏమవుతుంది...

- సరిగ్గా నిద్రలేకపోవడం వల్ల రక్తంలోని గ్లూకోజ్ స్థాయుల్లో హెచ్చుతగ్గులు వచ్చి టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువవుతుంది.
- ఆకలి పెరుగుతుంది. ఏది పడితే అది తినడం వల్ల తొందరగా బరువు పెరుగుతారు.
- జ్ఞాపకశక్తి తగ్గుతుంది. మెదడు త్వరగా నిర్ణయాలు తీసుకునే చురుకుతనం కోల్పోతుంది. ఆలోచనా తీరు మందగిస్తుంది.
- కోపం, ఒత్తిడీ, ఆందోళన, ఓపిక లేకపోవడం... లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక రక్తపోటు తప్పదు.
- గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ.
- చిన్న వయసులోనే ముఖంపై ముడతలూ, నల్లటి వలయాలు మొదలవుతాయి...
- రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుంది.

ఉద్యోగినులా...

ఉద్యోగం చేస్తున్నప్పుడు తరచూ పనివేళల్లో మార్పులు రావొచ్చు. అలాంటప్పుడు నిద్ర విషయంలో ప్రణాళిక తప్పనిసరి. షిఫ్ట్ మారాల్సి వచ్చినప్పుడు నిద్రవేళల్లో మార్పు చేసుకోవడం సులువేం కాదు. కానీ షిఫ్ట్ మారబోతుందనగా కనీసం మూడు రోజుల నుంచే మన మెదడుకు ఆ వేళల్ని అలవాటు చేయాలి. ఉదాహరణకు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 1 గంట వరకు మీ సాధారణ పనివేళలనుకోండి. మీరు అటూఇటుగా రాత్రి 3 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు నిద్రపోతారనుకుందాం. తరువాత షిఫ్ట్ రాత్రి నుంచి మొదలైతే దానికి అనుకూలంగా వెంటనే నిద్రలో మార్పు చేసుకోవడం సాధ్యం కాదు. అందుకే కొత్త షిఫ్ట్ మొదలయ్యేందుకు మూడు రోజుల ముందే ఓ గంట ఆలస్యంగా పడుకుని గంట ఆలస్యంగా లేవడం అలవాటు చేసుకోవాలి. అలా క్రమంగా గంట చొప్పున మార్పు చేసుకుంటూ ఉంటే తరువాతి షిఫ్ట్ సాఫీగా సాగిపోతుంది.

పవర్‌న్యాప్: సరిపడా నిద్రలేనప్పుడు సొంత వాహనాలు కంటే బస్సులో వెళ్లండి. మీ ప్రయాణంలో ఓ పది నిమిషాలైనా కునుకుతీయండి. దీనివల్ల ఉత్పాదకత పెరగడమే కాదు, ఒత్తిడి కూడా తగ్గుతుంది. పనిలోనూ చురుగ్గా ఉంటారు. ఏకాగ్రతా కుదురుతుంది. ఇలా పవర్‌న్యాప్ వల్ల గుండె ఆరోగ్యం కూడా బాగుంటుంది. రోగనిరోధకశక్తి కూడా పెరుగుతుంది. కాబట్టి ప్రయత్నించి చూడండి.

– రమాదేవి గొరినేని, మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ అమరరాజా ఇన్‌ఫ్రా అండ్ అమర స్లీప్ క్లినిక్

హాయిగా నిద్రపట్టాలంటే...

- పడకగది వీలైనంత చీకటిగా ఉండాలి. అలా వీలుకాకపోతే రాత్రి పడుకునే ముందు కళ్లకు ఐమాస్క్‌లూ, బ్లైండ్ ఫోల్డ్‌లు పెట్టుకోవచ్చు. వాటితో పాటే 'స్లీపింగ్ మ్యూజిక్' పేరుతో ప్రత్యేక సంగీతం ఉంటుంది. దాన్ని నిద్రపోయే గదిలో చిన్న శబ్దంతో పెట్టుకున్నా ఫలితం ఉంటుంది.
- కంప్యూటర్లూ, ఫోన్లూ, టీవీలు లాంటి ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి వచ్చే కాంతి నిద్రను దూరం చేస్తుంది. అందుకే నిద్రపోయేందుకు కనీసం రెండు గంటల ముందు వాటన్నింటినీ దూరంగా పెట్టాలి.
- మంచం మీదే కూర్చుని తినడం, పుస్తకాలు చదవడం, టీవీ చూడటం... లాంటివి చేయకూడదు. ఆ గదిని కేవలం నిద్రపోవడానికి మాత్రమే ఉపయోగించడం అలవాటుగా మార్చుకోవాలి.
- పరుపూ, దిండూ, దుప్పటి వంటివి కూడా నిద్ర పట్టకపోవడానికి కారణం కావచ్చు. వాటిని సంవత్సరాల తరబడి వాడుతోంటే మార్చడం మంచిది. అలానే ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉంచుకోవడమూ తప్పనిసరి.

జీవనశైలిలో మార్పులు...

- పూర్తిగా నిద్రలోకి జారుకోడానికి ఎవరికైనా సరాసరిగా పట్టే సమయం దాదాపు 15 నిమిషాలు. నిద్రలేమి సమస్య ఉన్నవాళ్లలో అది కాస్త ఎక్కువగా ఉండొచ్చు. అలాంటప్పుడు నిద్రకోసం ఎనిమిది గంటలకన్నా కాస్త ఎక్కువ సమయం కేటాయించుకుంటే సరిపోతుంది.
- నిద్రపోయేందుకు కనీసం గంటన్నర ముందు ఎలాంటి ఆహారం తీసుకోకూడదు. ఒకవేళ తప్పనిసరైతే త్వరగా జీర్ణమయ్యే కూరగాయలూ, పండ్లు లాంటివి తినాలి. టీ, కాఫీ, శీతలపానీయాలకు దూరంగా ఉండాలి.
- మధ్యాహ్నం నిద్రపోయే అలవాటుంటే దాన్ని కేవలం అరగంటకే పరిమితం చేయాలి. లేదంటే ఆ ప్రభావం రాత్రినిద్రపై పడుతుంది.
- వ్యాయామాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రోజులో కనీసం గంటైనా ధ్యానం, యోగా, ఇతర వ్యాయామాలు చేస్తే ఒత్తిడి అదుపులో ఉంటుంది. నిద్రపోయే ముందు మాత్రం కసరత్తులకు దూరంగా ఉండాలి.
- మర్నాటి పనులు ఎలా పూర్తవుతాయో అనే ఆందోళన ఉంటే సరిగ్గా నిద్రపోలేం. అందుకే వాటికి సంబంధించిన ప్రణాళిక ముందురోజే సిద్ధం చేసుకోవాలి.
- ఇవన్నీ పాటించినా ఎలాంటి ఫలితం లేక, దీర్ఘకాలికంగా నిద్రలేమి సమస్య వెంటాడితే వైద్యుల్ని తప్పకుండా సంప్రదించాలి. వైద్యుల సూచన లేనిదే నిద్రకోసం ఎలాంటి మాత్రల్ని వాడకూడదు.

అందరిలో ఒకేలా ఉండదు...

మెనోపాజ్ మొదలైనప్పటి నుంచి మహిళల్లో నిద్రలేమి సమస్య కాస్త ఎక్కువవుతుంది. హార్మోన్ల స్థాయిల్లో హెచ్చుతగ్గులే దానికి కారణం. ఆ ప్రభావం వల్ల అతిగా తినడం మొదలుపెడతారు. దాంతోపాటే షార్ట్‌టర్మ్ మెమొరీ లాస్ అవుతాం. అంటే ఉన్నట్టుండి ఏ పని చేస్తున్నామో మర్చిపోవడం, ఏదైనా వస్తువు ఎక్కడ పెట్టామో గుర్తుకు రాకపోవడం, అప్పుడే చెప్పిన విషయం మర్చిపోవడం... ఇలాంటి లక్షణాలన్నీ కనిపిస్తుంటాయి. మహిళల్లో కనీసం ఎనిమిది గంటల నిద్ర మాత్రం తప్పనిసరి. అయితే మనకు నిద్ర సరిపోయిందా లేదా అని నిర్ధరించుకోవాలంటే... మనం పని చేసేటప్పుడు చురుగ్గా ఉంటున్నామా లేదా? పగటి పూట చుట్టుపక్కలా ప్రశాంతంగా ఉన్నప్పుడు నిద్ర వస్తోందా? అనే విషయాలు గమనించుకోవాలి. ఎలాంటి ఇబ్బందీ లేకపోతే సరిగ్గా నిద్రపోతున్నారనే అర్థం. కానీ దీర్ఘకాలికంగా నిద్రలేమితో బాధ పడుతుంటే వైద్యుల్ని సంప్రదిస్తే సమస్య సులువుగానే పరిష్కారం అవుతుంది. సరైన సమయంలో ఈ సమస్య గుర్తించకపోతే ఆరోగ్యంపై దీర్ఘకాలికంగా ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

ఆఫీసుకు ఆ రంగులొద్దు!

హుందాగా కనిపించాలంటే ఉద్యోగానికి వెళ్లే మహిళలు ఆహార్యం విషయంలో కొన్ని జాగ్రత్తలు తప్పకుండా పాటించాల్సిందే. అవేంటంటే...

- దుస్తుల విషయంలో వాటి ఖరీదు కన్నా నాణ్యతా, అవి మనకు నప్పుతాయా లేదా అనేది గమనించుకోవడం తప్పనిసరి. అలానే వదులుగానో, మరీ బిగుతుగానో ఉన్నవి వేసుకుంటే చూడటానికి ఎబ్బెట్టుగా అనిపిస్తుంది. ఏ డ్రెస్సు అయినా సరే మనకు సరిపోయే కొలతల్లో కుట్టించుకుంటే చూడటానికి బాగుంటుంది.
- రోజూ జడ వేసుకోవడం ఇష్టం లేకపోతే జుట్టును వదిలేసుకోవచ్చు. కానీ మన జుట్టు ఆరోగ్యంగా ఉంటేనే అది చూడటానికి బాగుంటుంది. అందుకే జుట్టు చిట్లకుండా, చుండ్రూ, పొడిబారడం వంటి సమస్యలు లేకుండా చూసుకోవాలి. అప్పుడే మీరెలాంటి కేశాలంకరణని ప్రయత్నించినా ఆకట్టుకోవచ్చు.
- ఎత్తు చెప్పులు వేసుకుంటే నలుపూ, బ్రౌన్, క్రీం లాంటి సాదా రంగులకే ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రింట్లూ, ఫంకీ డిజైన్లూ, కొట్టొచ్చినట్లు కనిపించే వర్ణాలూ మన హుందాతనాన్ని తగ్గిస్తాయి.

మేకప్ చెక్కు చెదరకుండా...

తొలకరి వానలు మొదలయ్యాయి. ఇప్పటివరకూ మేకప్ విషయంలో ఎలా ఉన్నా ఇప్పుడు మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. అలాంటివే ఈ చిట్కాలు.

- నీళ్లలో తడిచినా చెక్కుచెదరకుండా ఉండే జెల్, క్రీమ్ తరహా ఉత్పత్తులకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఫౌండేషన్, బ్లష్... క్రీం తరహావి వాడితే చెక్కు చెదరకుండా ఉంటాయి. ఐలైనర్, మస్కారా కూడా లిక్విడ్‌కు బదులు జెల్ తరహావి ఎన్నుకోవాలి. ఇలాంటివి ఇప్పుడు మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. వీటిని పెట్టుకోవడం కూడా సులువవుతుంది.
- ఈ కాలంలో చర్మం కాస్త పొడిబారినట్లు అవుతుంది. కాబట్టి ఫౌండేషన్ రాసుకునే కన్నా ముందు మాయిశ్చరైజర్ రాసుకోవడం తప్పనిసరి. ఇది ముఖం మీద నీళ్లు పడినా కూడా మేకప్ త్వరగా పాడవకుండా కాపాడుతుంది. జిడ్డు చర్మతత్వం ఉన్నవాళ్లు మాత్రం వాటర్ బేస్డ్ మాయిశ్చరైజర్‌ను వాడొచ్చు.
- ఈ కాలంలో ప్రైమర్ మీద కూడా కాస్త శ్రద్ధ పెట్టాలి. అది సరిగ్గా ఉంటే ఫౌండేషన్, సెట్టింగ్ పౌడర్‌పై నీళ్ల ప్రభావం ఎక్కువగా ఉండదు. వీలైతే ఈ కాలంలో ఫౌండేషన్ వాడకపోవడమే మంచిది. దానికి బదులు పౌడర్, అది కూడా మ్యాటీ రకాన్ని ఎంచుకోవాలి.
- మేకప్ పూర్తయ్యాక చివరగా వాటర్‌ప్రూఫ్ స్ప్రేను ముఖంపై చల్లండి. దీనివల్ల మనం నీళ్లలో తడిసినా కూడా మేకప్ ఏ మాత్రం పాడవ్వదు.

పీచు మిఠాయి ఐస్‌క్రీమ్ తిందామా!



ఐస్‌క్రీమ్‌లూ, కుకీలూ, కప్‌కేక్‌లూ, డోనట్స్, మిల్క్‌షేక్‌లూ... ఇలా మనకు నచ్చే డిజర్ట్‌లు చాలానే ఉంటాయి. వాటిని యథాతథంగా కాకుండా పీచుమిఠాయితో ప్రత్యేక ఆకృతుల్లో తయారు చేయడమే మా ప్రత్యేకత అంటోంది హైదరాబాద్‌కి చెందిన నిహారిక. "పీచు మిఠాయి... చూస్తే చాలు బాల్యం గుర్తొస్తుంది. అందుకే అదంటే నాకు చాలా ఇష్టం. ఎక్కడికి వెళ్లినా దానికోసం వెతికేదాన్ని. ఆ ఇష్టమే ఇప్పుడు నన్నో వ్యాపార వేత్తను చేసింది. పీచుమిఠాయి రుచులూ, దాని అలంకరణతో ప్రత్యేకంగా 'ఈట్ కాన్‌ఫెట్టీ' పేరుతో ఓ డిజర్ట్‌బార్‌ని ప్రారంభించేలా చేసింది. నా ఆలోచనకు అమెరికాలో ఉంటున్న ఓ స్నేహితుడు తోడయ్యాడు. ఇద్దరం కలిసి నేను ఇంజినీరింగ్ నాలుగో ఏడాది చదువుతున్నప్పుడు దీన్ని మొదలుపెట్టాం. ప్రస్తుతం బీటెక్ పూర్తయ్యింది. ఎంబీఏ పూర్తిచేసి నా వ్యాపారాన్ని మరింత విస్తరించాలనుకుంటున్నా."

అందుకే విడాకులు ఇవ్వనంటున్నాడు

ప్ర **పెళ్లయిన రెండేళ్లకు నా భర్తతో విభేదాలు వచ్చి విడిపోయా. ఆయనకున్న విపరీతమైన అనుమానమే దానికి కారణం. మేం విడిపోయినప్పుడు మా ఇద్దరికీ ఒకరిమీద మరొకరికి పెద్దగా ఇష్టమేమీ లేదు. ప్రస్తుతం మా విడాకుల కేసు కోర్టులో ఉంది. ఇప్పుడేమో ఆయన నాతో కాపురం చేయడానికి సిద్ధమనీ, విడాకులు ఇష్టం లేదని చెబుతున్నాడు. దీనికి వాళ్లు తీసుకున్న కట్నకానుకలు మాకు వెనక్కి ఇవ్వాల్సివస్తుందనే భయమే కారణం అని అర్థమవుతోంది. కానీ నాకిష్టంలేని వ్యక్తితో కాపురం చేయడానికి నేను సిద్ధంగా లేను. ఏం చేయాలి?**

– ఓ సోదరి

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి
న్యాయవాది

vasulegal@eenadu.net

జ మీరు విడిపోయి ఎన్నాళ్లు అయ్యిందో రాయలేదు. విడిపోయిన ఎన్ని సంవత్సరాలకి విడాకుల కోసం కోర్టులో దాఖలు చేసుకున్నారు. హిందూ వివాహచట్టం సెక్షన్ 13(1)(ఎ) ప్రకారం వివాహం జరిగిన తరువాత దంపతుల్లో ఎవరైనా రెండోవారిని శారీరకంగా లేదా మానసికంగా హింసించినప్పుడూ, 1(బి) ప్రకారం విడాకులకు దరఖాస్తు చేసే నాటికి దంపతుల్లో ఎవరైనా రెండోవారిని రెండు సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా వదిలిపెట్టినప్పుడు రెండోవారు విడాకుల కోసం దాఖలు చేసుకోవచ్చు. సెక్షన్ 13 కింద పొందుపరిచిన 11 కారణాల్లో ఏ ఒక్క కారణమైనా నిరూపించగలిగితే వారికి విడాకులు పొందే అవకాశం ఉంది. మీ భర్త మిమ్మల్ని వదిలిపెట్టినప్పుడు లేని ఇష్టం ఇప్పుడు చూపిస్తున్నారని మీరు చెబుతున్నారు. దానిలో నిజం లేదని నమ్ముతున్నారు. ఏది ఏమైనా మీకు ఇకపై అతనితో కలిసి ఉండటం ఇష్టంలేదంటున్నారు కాబట్టి మీరు మానసికంగా అనుభవించిన క్షోభనూ, ఆయన కాపురం చేసినప్పుడు పెట్టిన కష్టాల్ని కోర్టుకి నిరూపించాల్సి ఉంటుంది. అందుకు తగిన సాక్ష్యాధారాలు కూడా కావాలి. లేదా మీరు విడిపోయి రెండు సంవత్సరాలు అయ్యిందనీ, ఈ మధ్యకాలంలో మిమ్మల్ని కలవడానికి మీ వారు కోర్టు ద్వారా కానీ, మధ్యవర్తుల ద్వారా కానీ ఏ ప్రయత్నాలు చేయలేదనే విషయం స్పష్టం చేయాలి. అందుకే మీరు విడాకులు కోరుతున్నట్లు కోర్టుకు తెలియజేయాలి. మీరు ఇచ్చిన కట్నానికి సంబంధించిన సాక్ష్యాలు ఉంటే వాటిని తిరిగి తీసుకోవడానికి కోర్టులో మరో పిటిషన్ వేయాల్సి ఉంటుంది. దీనికీ తగిన సాక్ష్యాధారాలు కావాలి. మీకు ఆయన జీవనభృతి కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అతను మీతో కలిసి ఉండేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నాడో నిరూపించగలిగితే మీకు న్యాయం జరుగుతుంది.

అలాంటప్పుడు మాట్లాడకండి

- సమస్య ఎప్పుడూ ఎదుటివారిలో ఉందని ఆలోచించే కంటే మనలో ఏం మార్చుకోవాలనే విషయం మీదే ఎక్కువగా దృష్టిపెట్టాలి. ఏ చిక్కు వచ్చినా సరే దాంట్లో మన తప్పు ఏమైనా ఉందా అనేది ముందుగా ఆలోచించాల్సిన విషయం. ఎదుటి వాళ్లలో తప్పుందనిపిస్తే వాళ్ల స్థానంలో ఉండి ఆలోచించి చూడండి. మన ఆలోచనలో కాస్త మార్పు రావొచ్చు.
- మనం ఎవరితో మాట్లాడుతున్నా సరే... మర్యాదగా మాట్లాడాలి. మనకెన్ని సమస్యలున్నా సరే ఎవరినైనా పలకరించేటప్పుడు చిరునవ్వు చెరగనీయకూడదు. దీనివల్ల మీ చుట్టూ ఉన్న పరిస్థితులు సానుకూలంగా మారిపోతాయి. మీమీద గౌరవమూ పెరుగుతుంది.
- కొందరు ఎదుటి వ్యక్తులకు చిన్న అవకాశం కూడా ఇవ్వకుండా మాట్లాడేస్తుంటారు. దానికన్నా వాళ్లేం మాట్లాడుతున్నారో విని మనం సరిగ్గా స్పందిస్తేనే మనతో మాట్లాడటానికి ఎవరైనా ఆసక్తి చూపిస్తారు. మనమూ అవసరానికి తగ్గట్లు మాట్లాడటం నేర్చుకోగలుగుతాం.
- ఒత్తిడీ, ఆందోళన ప్రభావం మెదడుపై తీవ్రంగా ఉంటుంది. ఎదుటి వ్యక్తి సానుకూలంగా మాట్లాడినా సరే మనకు ప్రతికూలంగానే అనిపిస్తుంటుంది. అలాంటప్పుడు వేరేవాళ్లతో వీలైనంత తక్కువగానే మాట్లాడండి. లేదంటే అనవసరమైన మాటలు అని ఆ తరువాత మనమే బాధపడాల్సి వస్తుంది.

> మాటను మించిన ఆయుధం లేదు. ఒక్క క్షణంలో పరిస్థితులన్నీ తారుమారు చేసే శక్తి మన మాటతీరుకూ, ప్రవర్తనకు ఉంటుంది. అందుకే మన ప్రవర్తన గురించి ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవడం ముఖ్యం.

కాళ్లతో కవిత్వం రాస్తోంది

> ఆమె పేరు భూర రాజేశ్వరి. ఊరు సిరిసిల్ల. పుట్టుకతోనే చేతుల్లేవు. చదివింది ఏడో తరగతే కానీ... ఇప్పటివరకూ 350 కవితలూ, నాలుగు జీవిత చరిత్రలు రాసింది. నేతన్నల కష్టాలూ, సమస్యలూ, ఆత్మహత్యలు చేసుకోవద్దంటూ చెప్పే అంశాలే ఆ కవితల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఇంతకీ ఆమెకీ ఆలోచన ఎలావచ్చిందంటే...

రాజేశ్వరిది నేత కుటుంబం. తల్లిదండ్రులిద్దరూ మగ్గంపని చేసేవారు. ఇద్దరు అన్నల తరువాత రాజేశ్వరి పుట్టింది. పుట్టుకతోనే చేతులు లేవు. మాటలు కూడా వచ్చేవి కావు. పేదరికంతో మెరుగైన వైద్యం చేయించలేకపోయారు ఆ తల్లిదండ్రులు. చేతులు లేక, మాట రాక నానా ఇబ్బందులు పడేది. కానీ తల్లి కష్టం ఫలించి రాజేశ్వరి కాళ్లలో కొంత సత్తువ వచ్చింది. అప్పుడు చదువుకుంటానని పట్టుబట్టింది. బడికి వెళ్లింది. కానీ అక్షరాలు ఎలా దిద్దాలో అర్థం కాలేదు. ఇంట్లో అమ్మా, టీచర్ల సాయంతో మెల్లిమెల్లిగా కాళ్లతో రాయడం మొదలుపెట్టింది. ఏడో తరగతి అయ్యాక ఇంకా చదువుకోవాలని ఉన్నా శరీరం పూర్తిగా సహకరించకపోవడంతో ఆపేసింది.

ఆ సంఘటనలు చూశాకే: సిరిసిల్ల జిల్లాలో ఉపాధి లేక, అప్పులు తీర్చలేక నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ వరుస మరణాలు రాజేశ్వరిని కదిలించాయి. తనవంతుగా వాటిని ఆపాలనుకుంది. అందుకే కవిత్వం రాయడం మొదలుపెట్టింది. ఇప్పటి దాకా దాదాపు 350 కవితలూ, నాలుగు జీవిత చరిత్రలు రాసింది. వాటిని చదివిన సుద్దాల అశోక్‌తేజ దంపతులు ఆమెను చూడటానికి సిరిసిల్లలోని రాజేశ్వరి ఇంటికి వచ్చారు. ఆమె పరిస్థితి చూసి చలించిపోయారు. ఏటా సుద్దాల హనుమంతు పేరిట అందించే రాష్ట్ర అవార్డునూ ఆమెకి అందించారు. ఆమె కవితల్ని పుస్తకాలుగా ప్రచురించడానికి ముందుకొచ్చారు.

– **జయంత్, న్యూస్‌టుడే,** సిరిసిల్ల పట్టణం

దేశవ్యాప్తంగా గ్రామీణ బ్యాంకుల్లో ఆఫీసర్, ఆఫీసు అసిస్టెంట్ల పోస్టులకు ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 10,190 పోస్టులుండగా, తెలుగు రాష్ట్రాల్లో 1470 ఖాళీలున్నాయి. నియామకాల సమయానికి వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. బ్యాంకుల్లో, సొంత ప్రాంతంలో కొలువు సంపాదించాలనుకునేవారికి ఇదో మంచి అవకాశం. పోటీ ఎక్కువే ఉంటుంది. అందుకే పకడ్బందీ ప్రణాళికతో, సన్నద్ధతలో ముందుకు దూసుకువెళ్లాలి!

ఐబీపీఎస్ ఆర్ఆర్‌బీల్లో 10,190 ఖాళీలు

పల్లె బ్యాంకుల కొలువు పిలుపు!

బ్యాంకింగ్ కార్యకలాపాలు, సదుపాయాలు గ్రామీణ ప్రాంతవాసులకు అందించే ముఖ్య ఉద్దేశంతో ఏర్పడినవే గ్రామీణ బ్యాంకులు (రీజనల్ రూరల్ బ్యాంకులు). గ్రామాల్లో సేవలు అందించే ఆలోచన, తమ ప్రాంతాల్లోనే బ్యాంకు ఉద్యోగం చేయాలనుకునే వారికి గ్రామీణ బ్యాంకుల్లో తాజా నియామక ప్రకటన ఆ అవకాశాన్ని కలుగజేస్తుంది.

డా. జి.ఎస్. గిరిధర్
డైరెక్టర్, RACE

ప్రభుత్వరంగ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగాల భర్తీకి ఐబీపీఎస్ ఉమ్మడి రాతపరీక్ష కోసం ఏటా విడుదల చేసే నోటిఫికేషన్లలో ఇది మొదటిది. ఈ అన్ని రాతపరీక్షల్లోని సబ్జెక్టులు దాదాపుగా ఒకటే. కాబట్టి ఈ ఆర్ఆర్‌బీ పరీక్షలకు (స్కేల్-1, ఆఫీసర్ అసిస్టెంట్) సరిగా సన్నద్ధమైతే ఆ తరువాత నిర్వహించే పీఓ, క్లర్క్, స్పెషలిస్ట్ ఆఫీసర్ల పరీక్షలను కూడా బాగా రాసే అవకాశం ఉంటుంది.

ఉన్నత అవకాశాలు

ఆఫీస్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరినా పదోన్నతుల ద్వారా ఉన్నతస్థానానికి చేరుకునే అవకాశముంది. ముందుగా ఆఫీసర్ స్థాయికి ఆపై అంచెలంచెలుగా మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్/ రీజనల్ మేనేజర్, జనరల్ మేనేజర్ స్థాయులకు చేరుకోవచ్చు. ఆఫీసర్‌గా చేరిన అభ్యర్థి బ్యాంకులోని అత్యున్నత స్థాయి అయిన ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ స్థానానికి చేరుకునే అవకాశముంది.

ఎంపిక విధానం

ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించే రెండంచెల రాతపరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దీనిలో మొదటి అంచెలో నిర్వహించే ప్రిలిమినరీ పరీక్ష కేవలం అర్హత పరీక్ష కాగా రెండో అంచెలో నిర్వహించే ప్రధాన పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.

స్కేల్-1 ఆఫీసర్ పోస్టులకు రెండంచెల రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ఉంటుంది. అభ్యర్థులకు ప్రధాన పరీక్ష, ఇంటర్వ్యూల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా పోస్టులను భర్తీ చేస్తారు. స్కేల్-2, 3 పోస్టులకు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించే ఒకే రాతపరీక్ష, ఇంటర్వ్యూల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

ఒకే రకమైన సబ్జెక్టులు

ఈ పరీక్షలన్నింటిలో దాదాపుగా ఒకేవిధమైన సబ్జెక్టులు ఉన్నాయి. అసిస్టెంట్, ఆఫీసర్ పరీక్షల స్థాయిలో మాత్రం భేదముంటుంది. అసిస్టెంట్ పరీక్షలో రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్/ హిందీ లాంగ్వేజ్, కంప్యూటర్ నాలెడ్జ్ సబ్జెక్టులు ఉండగా, స్కేల్-1 పరీక్షలో మాత్రం న్యూమరికల్ ఎబిలిటీ బదులుగా క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ఉంది. మిగిలిన వాటిలో మార్పు లేదు.

ఆఫీసర్ స్కేల్-2 (జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్), స్కేల్-3 పరీక్షల్లో రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్/ హిందీ లాంగ్వేజ్, కంప్యూటర్ నాలెడ్జ్‌లు ఉండగా, స్పెషలిస్ట్ ఆఫీసర్ (స్కేల్-2) పరీక్షలో వీటికి అదనంగా ప్రొఫెషనల్ నాలెడ్జ్ సబ్జెక్టు ఉంది. అభ్యర్థులు ఈ పరీక్షలన్నింటిలో ఇంగ్లిష్ లేదా హిందీ లాంగ్వేజ్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్/న్యూమరికల్ ఎబిలిటీ: మ్యాథ్స్, నాన్ మ్యాథ్స్ అనే భేదం లేకుండా అభ్యర్థులందరూ ఇబ్బందిపడే సబ్జెక్టు- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్/ న్యూమరికల్ ఎబిలిటీ. అందుకు కారణం దీనికి ఎక్కువ సమయం పట్టడమే. సాధ్యమైనంత మేరకు నేరుగా జవాబును రాబట్టే షార్ట్‌కట్ మెథడ్స్ ప్రాక్టీస్ చేయాలి.

కొన్ని ప్రశ్నలను సాధించాల్సిన అవసరం లేకుండా ఆప్షన్లను జాగ్రత్తగా గమనించి సరైన జవాబును గుర్తించవచ్చు. అదేవిధంగా మరికొన్ని ప్రశ్నలను ఇచ్చిన ఆప్షన్లలో జవాబు వచ్చే అవకాశం లేనివాటిని వదిలేస్తూపోతే చివరికి జవాబు మాత్రమే మిగిలేలా కూడా సాధించవచ్చు. అయితే ఇలాంటి పద్ధతులకు అంశాల పట్ల అవగాహన, మంచి సాధన ఉండాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్/ న్యూమరికల్ ఎబిలిటీలో సింప్లిఫికేషన్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలుంటాయి. అసిస్టెంట్ పరీక్షలో దాదాపు 15-20 ప్రశ్నలు, ఆఫీసర్ పరీక్షలో దాదాపు 10 ప్రశ్నలు వీటి నుంచే ఉంటాయి. సాధారణంగా వీటికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల కాల్‌క్యులేషన్స్ వేగంగా చేయగలిగేలా సాధన చేయాలి. వీటికి ఎక్కాలు (25-30 వరకు) బాగా ఉపయోగపడతాయి. అలాగే కాల్‌క్యులేషన్స్ వేగంగా చేయడానికి వేదగణిత, స్పీడ్ మ్యాథ్స్ పద్ధతులు ఉపయోగపడతాయి. వీలైతే వాటిని నేర్చుకుని బాగా సాధన చేయాలి.

అంకగణితంలో గణనకు ఎక్కువ సమయం తీసుకునే చక్రవడ్డీ లాంటి ప్రశ్నలను అదనపు సమయం అందుబాటులో ఉంటేనే చేయాలి. లేదంటే వదిలేయడం ఉత్తమం. అదేవిధంగా నంబర్ సిరీస్ ప్రశ్నల్లో సంఖ్యలమధ్య సంబంధం వెంటనే తెలిస్తే ప్రశ్నను సాధించాలి. లేదంటే కాలయాపన లేకుండా ఆ ప్రశ్నను వదిలేయడం మంచిది.

జనరల్ అవేర్‌నెస్: జనరల్ అవేర్‌నెస్‌లో బ్యాంకింగ్, ఆర్థికాంశాలకు ప్రాధాన్యమిస్తూ వర్తమానాంశాల నుంచి ప్రశ్నలుంటాయి. కాబట్టి అభ్యర్థులు పరీక్షకు 5, 6 నెలల ముందు వరకూ ఉన్న ఈ అంశాలను నోట్ చేసుకోవాలి. అయితే వీటన్నింటినీ యథాతథంగా కాకుండా విభాగాలవారీగా (బ్యాంకింగ్, ఎకానమీ, ప్రభుత్వ అధికారాలు, క్రీడలు, జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు మొదలైనవి) విభజించుకుని ఒకచోట రాసుకోవాలి. వాటిని ప్రతిరోజూ కనీసం ఒక్కసారైనా చూసుకోవాలి.

రీజనింగ్: రీజనింగ్‌ను సులువైనదిగా భావించి చాలామంది తేలికగా తీసుకుంటున్నారు. దీంతో కొందరు ఇందులో ఉత్తీర్ణులు కాలేకపోయిన సందర్భాలూ ఉన్నాయి. ఇది తేలికగా కనిపించే సబ్జెక్టు అయినప్పటికీ సరైన అవగాహన, సాధన లేకపోతే తప్పు చేయడానికి అవకాశముంది. మానసికంగా చురుకుదనం, తార్కికమైన ఆలోచనా విధానం చాలా అవసరం. ఆసక్తికరమైనదీ, నాన్-మ్యాథ్స్ అభ్యర్థులు కూడా బాగా చేయగలిగే సబ్జెక్టు కాబట్టి చక్కని సాధనతో మంచి మార్కులు సాధించవచ్చు.

ఇంగ్లిష్: గ్రామీణ అభ్యర్థులు ఎక్కువగా భయపడే విభాగం- ఇంగ్లిష్. కానీ భయం అవసరం లేదు. అభ్యర్థుల స్థాయిని దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తారు. ప్రతిసారీ కొత్త తరహాలో ప్రశ్నలను ఇస్తున్నారు. ఫిల్ ఇన్ ద బ్లాంక్స్‌లో పదాలకు బదులుగా వాక్యాలను ఇవ్వడం, అయిదు ఆప్షన్లలో వాక్యాలను ఇచ్చి వాటిలో ఏయే ఆప్షన్ల ద్వారా అర్థవంతమైన వ్యాసం తయారవుతుందో కనుక్కోవడం మొదలైన తరహా ప్రశ్నలను ఇటీవలి పరీక్షల్లో గమనించొచ్చు. అందువల్ల పూర్వ ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నల సరళి గమనించి సిద్ధమవ్వాలి.

స్థాయి పెరిగింది

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో డేటా ఇంటర్‌ప్రిటేషన్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా సఫిషియన్సీల్లో ప్రశ్నల స్థాయి బాగా పెరిగింది. రీజనింగ్‌లో సీటింగ్ అరేంజ్‌మెంట్, పజిల్ టెస్ట్‌ల స్థాయి కూడా పెరిగింది. చాలా సందర్భాల్లో ఈ రెండింటినీ కలిపి ప్రశ్నలను ఇస్తారు. కాబట్టి అభ్యర్థులు ఇవి బాగా గమనించాలి.

స్కేల్-1 ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్ల ప్రిలిమినరీ పరీక్షకు 60-75 రోజుల సమయం, మెయిన్స్‌కు దాదాపుగా మూడున్నర నెలలకుపైగా సమయం ఉంది. అయితే అభ్యర్థులు మెయిన్స్‌కు సిద్ధమైతే సహజంగానే ప్రిలిమినరీ పరీక్షకూ సన్నద్ధత పూర్తవుతుంది. ప్రిలిమ్స్‌లో కేవలం రెండు సబ్జెక్టులే ఉన్నాయి. కాబట్టి కొద్దిగా కష్టపడితే తేలికగానే దీనిలో ఉత్తీర్ణత సాధించొచ్చు.

ఏ పరీక్ష ఏ తీరు?

ఆఫీస్ అసిస్టెంట్/ ఆఫీసర్ స్కేల్-I (ప్రిలిమినరీ)

విభాగం	ప్రశ్నలు	మార్కులు
రీజనింగ్	40	40
న్యూమరికల్ ఎబిలిటీ/ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	40	40
మొత్తం	**80**	**80**
వ్యవధి 45 నిమిషాలు		

ఆఫీస్ అసిస్టెంట్/ ఆఫీసర్ స్కేల్-I (మెయిన్)

విభాగం	ప్రశ్నలు	మార్కులు
రీజనింగ్	40	50
న్యూమరికల్ ఎబిలిటీ/ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	40	50
జనరల్ అవేర్‌నెస్	40	40
ఇంగ్లిష్/ హిందీ లాంగ్వేజ్	40	40
కంప్యూటర్ నాలెడ్జ్	40	20
మొత్తం	**200**	**200**
వ్యవధి 2 గంటలు		

* స్కేల్ -1 ఆఫీసర్స్ పరీక్షలో న్యూమరికల్ ఎబిలిటీ స్థానంలో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ఉంటుంది.

ఆఫీసర్స్ స్కేల్ 2 (జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్) / ఆఫీసర్ స్కేల్ 3 / స్పెషల్ ఆఫీసర్స్ (సింగిల్ ఎగ్జామ్)

విభాగం	ప్రశ్నలు	మార్కులు
రీజనింగ్	40	----
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్	40	----
ఫైనాన్షియల్ అవేర్‌నెస్	40	----
ఇంగ్లిష్/ హిందీ లాంగ్వేజ్	40	----
కంప్యూటర్ నాలెడ్జ్	40	
	వ్యవధి 2 గంటలు	
ప్రొఫెషనల్ నాలెడ్జ్ (స్పెషల్ ఆఫీసర్స్‌కు మాత్రమే)	40	----
వ్యవధి 2.30 గంటలు		

మరికొన్ని ముఖ్యాంశాలు

★ అన్ని పరీక్షల్లోని అన్ని విభాగాల్లో కనీస మార్కులతో అభ్యర్థులు విడివిడిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

★ అభ్యర్థులు గుర్తించే ప్రతి తప్పు సమాధానానికీ ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో నాలుగోవంతు మార్కులు తీసివేస్తారు.

★ ఆఫీస్ అసిస్టెంట్‌కు మెయిన్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా మాత్రమే ఎంపిక జరుగుతుంది. ప్రిలిమ్స్ మార్కులను మెరిట్‌లోకి తీసుకోరు.

★ ఆఫీసర్ స్కేల్-1కి మెయిన్ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు. స్కేల్-2, 3 ఉద్యోగాలకు ఒక పరీక్ష మాత్రమే ఉంటుంది. అందులో సాధించిన మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూలకు పిలుస్తారు.

★ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, పీడబ్ల్యూబీడీ వర్గాల అభ్యర్థులకు ఆయా ఆర్ఆర్‌బీల పరిధిలోని నిర్ణీత సెంటర్లలో ప్రీ-ఎగ్జామినేషన్ ట్రెయినింగ్ ఇస్తారు. భోజనం, వసతి సౌకర్యాల ఖర్చులను అభ్యర్థులే భరించాల్సి ఉంటుంది. ఈ ప్రీ-ఎగ్జామినేషన్ ట్రెయినింగ్‌ను తెలంగాణలో హైదరాబాద్, వరంగల్‌ల్లోనూ, ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, అనంతపురాల్లో అందిస్తారు.

★ ఆఫీసర్ ఉద్యోగాలకు జరిగే ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయించారు. అభ్యర్థులు నిర్ణీత క్వాలిఫైయింగ్ మార్కులను పొందాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 2 జులై, 2018; **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: ఆఫీసర్ స్కేల్–1 ప్రిలిమ్స్:** 11 ఆగస్టు, 2018; **ఆఫీస్ అసిస్టెంట్ ప్రిలిమ్స్:** 19 ఆగస్టు, 2018; **ఆఫీసర్ (స్కేల్ 1, 2, 3) మెయిన్/సింగిల్ పరీక్ష:** 30 సెప్టెంబరు, 2018;

ఆఫీస్ అసిస్టెంట్ మెయిన్ పరీక్ష: 7 అక్టోబరు, 2018.

తెలుగు రాష్ట్రాల్లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో అయిదు గ్రామీణ బ్యాంకులు ఉన్నాయి. ప్రస్తుత నోటిఫికేషన్‌లో ఈ అయిదు బ్యాంకుల్లో 687 ఆఫీస్ అసిస్టెంట్, 783 స్కేల్-1, 2, 3 ఆఫీసర్ ఖాళీలు (స్కేల్-1: 468, స్కేల్-2: 283, స్కేల్-3: 32) ఉన్నాయి.

ఖాళీలు, అర్హతల వివరాలు

ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్)

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్	212
తెలంగాణ గ్రామీణ బ్యాంక్	84
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్	202
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్	129
సప్తగిరి గ్రామీణ బ్యాంక్	60

అర్హతలు: ఏ విభాగంలోనైనా డిగ్రీ. ఏ ఆర్ఆర్‌బీ అప్లై చేస్తే అక్కడి స్థానిక భాష తెలిసి ఉండాలి. కంప్యూటర్‌పై పనిచేయగలగాలి.

అసిస్టెంట్ మేనేజర్ (ఆఫీసర్ స్కేల్–1)

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్	120
తెలంగాణ గ్రామీణ బ్యాంక్	55
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్	200
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్	53
సప్తగిరి గ్రామీణ బ్యాంక్	40

అర్హతలు: ఏ విభాగంలోనైనా డిగ్రీ. ఏ ఆర్ఆర్‌బీ అప్లై చేస్తే అక్కడి స్థానిక భాష తెలిసి ఉండాలి. కంప్యూటర్‌పై పనిచేయగలగాలి. అగ్రికల్చర్, హార్టీకల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హజ్బెండ్రీ, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, పిసికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, ఐటీ, మేనేజ్‌మెంట్, లా, ఎకనామిక్స్ లేదా అకౌంటెన్సీలో డిగ్రీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.

(ఇతర ఉద్యోగాలు ఆఫీసర్ స్కేల్-2 (మేనేజర్ విభాగంలో జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్), ఆఫీసర్ స్కేల్-3 సీనియర్ మేనేజర్ అర్హతల, పని అనుభవం వివరాల కోసం www.eenadupratibha.net, www.ibps.in చూడవచ్చు)

★ తెలుగు తెలిసిన వారు పుదుచ్చేరిలోని పడువాయ్ గ్రామీణ బ్యాంక్‌కు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రిలిమ్స్‌లోగా మెయిన్స్ సన్నద్ధత!

ప్రిలిమినరీ పరీక్ష తేదీలోగా మెయిన్స్ సన్నద్ధత పూర్తయ్యేలా ప్రణాళిక వేసుకోవాలి. ఆ ప్రకారం సాధన చేయాలి. రోజుకు ఎన్ని గంటలు చదివారన్నదానికంటే ఎంత నేర్చుకున్నారు, ఎంత వేగంగా ప్రశ్నను సాధించగలుగుతున్నారనేది ముఖ్యం. ప్రతిరోజూ ఒక పూర్తిస్థాయి మోడల్ పేపర్‌ను సాధిస్తూ నిర్దేశిత సమయంలో ఎన్ని ప్రశ్నలు సాధించగలుగుతున్నారో తప్పనిసరిగా గమనించాలి.

ముఖ్యంగా అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిందేమిటంటే.. బ్యాంకు పరీక్షల్లోని ప్రశ్నలన్నింటినీ అందరూ సాధించగలుగుతారు. నిర్దేశిత సమయంలో ఎక్కువ సాధించినవారే విజేతలుగా నిలుస్తారు!

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

యూపీఎస్సీ-కేంద్ర సర్వీసుల్లో 72 ఖాళీలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వివిధ కేంద్ర సర్వీసుల్లో ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

పోస్టులు: సీనియర్ ఇన్‌స్ట్రక్టర్, డైరెక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తదితరాలు.

ఖాళీలు: 72 **అర్హత, అనుభవం, వయసు, ఎంపిక:** నిబంధనల ప్రకారం.

దరఖాస్తు: ఆన్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ. 25. **చివరి తేది:** 28.06.2018.

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

ఎన్ఎఫ్‌సీ, హైదరాబాద్‌లో 36 పోస్టులు

సంస్థ: భారత అణుశక్తి విభాగానికి చెందిన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ), హైదరాబాద్.

పోస్టులు: నర్సు, స్టెనోగ్రాఫర్, డ్రైవర్ తదితరాలు. **ఖాళీలు:** 36 **అర్హత:** పదో తరగతి, ఇంటర్, నర్సింగ్‌లో డిప్లొమా/ డిగ్రీ, అనుభవం, నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్.

చివరి తేది: 29.06.2018

వెబ్‌సైట్: www.nfc.gov.in

ప్రవేశాలు

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో పీజీ డిప్లొమా

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్), హైదరాబాద్.

కోర్సు: పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ (పీజీడీఆర్‌డీఎం)

కాలవ్యవధి: ఒక ఏడాది

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.

ఎంపిక: రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్

చివరి తేది: 03.07.2018

వెబ్‌సైట్: http://nird.org.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఎన్ఎఫ్‌డీబీ, హైదరాబాద్

పోస్టులు: రిసెప్షనిస్ట్, ఆఫీస్ అసిస్టెంట్ (కాంట్రాక్టు)

ఖాళీలు: 08

అర్హత: గ్రాడ్యుయేషన్, షార్ట్‌హ్యాండ్ లోయర్, కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం. **ఇంటర్వ్యూ తేది:** 11.06.2018 **వేదిక:** నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్ఎఫ్‌డీబీ), పిల్లర్ నెం.235, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే, ఎస్‌వీపీఎన్‌పీఏ పోస్ట్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** http://nfdb.gov.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

మెయిన్స్ నేర్పిన పాఠంతో అడ్వాన్స్‌డ్‌లో ఐదో ర్యాంకు!

జేఈఈ మెయిన్స్‌లో 59వ ర్యాంకు. దానిలో చేసిన చిన్నచిన్న తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకొని అడ్వాన్స్‌డ్‌లో ఆ పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్త పడడంతో అడ్వాన్స్‌డ్‌లో అఖిలభారతీయ ఓపెన్ కేటగిరిలో ఐదో ర్యాంకు సాధించాడు మావూరి శివ కృష్ణ మనోహర్. తన ప్రిపరేషన్, పరీక్ష రాయడంలో తీసుకున్న జాగ్రత్తలు అతడి మాటల్లోనే..!

జేఈఈ-2018

ఐఐటీ బాంబేలో ఇంజినీరింగ్ చేయాలన్నది నా కల. జేఈఈలో మంచి ర్యాంకు వస్తుందనే నమ్మకంతో ఏపీ ఎంసెట్ రాయలేదు. జేఈఈ మెయిన్స్‌లో చేసిన చిన్న చిన్న పొరపాట్ల కారణంగా 59వ ర్యాంకు వచ్చింది. జేఈఈ మెయిన్స్ వరకు ఇంటర్ విద్యతో పాటే జేఈఈ సిలబస్‌ను చదువుతూ వచ్చాను. మెయిన్స్ పూర్తయిన తర్వాత అడ్వాన్స్‌డ్‌కు వచ్చేసరికి సుమారు 40 రోజులపాటు ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం, చదవడంపై పూర్తిగా దృష్టిసారించాను. ఉదయం 8.30 గంటలకు తరగతులకు వెళ్తే భోజనం, ఇతరాత్ర చిన్నచిన్న విరామాలు మినహా రాత్రి 12.30 గంటల వరకు కళాశాలలో ఇచ్చే ప్రశ్నపత్రాలను రాయడం, వాటిల్లో చేసిన తప్పిదాలను గుర్తించడం, చదవడం చేసేవాడిని.

▌ జేఈఈ మెయిన్స్‌లో 360మార్కులకు జరిగిన పరీక్షలో గణితంలో ఎక్కువగా సుదీర్ఘ ప్రశ్నలు రావడంతో సమయం ఎక్కువగా తీసుకుంది. పరీక్ష రాసే ఒత్తిడిలో హడావుడిగా జవాబులు గుర్తించడంతో నాలుగు ప్రశ్నలకు తప్పుడు సమాధానాలు రాశాను. రసాయన శాస్త్రంలో రెండు ప్రశ్నలకు సమాధానాలు తెలిసినా తొందరగా రాయాలనే ఒత్తిడిలో తప్పుగా రాశాను. దీంతో మార్కులు కోల్పోయాను. మొత్తం 325 మార్కులు రాగా.. 59వ ర్యాంకు లభించింది.

▌ జేఈఈ మెయిన్స్‌లో ఒత్తిడికి గురికావడం, తొందరగా రాయాలనే ఉద్దేశంతో చేసిన తప్పులను గుర్తించి అడ్వాన్స్‌డ్‌లో వాటి నుంచి బయటపడ్డాను. 360 మార్కులకు గాను 319 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌కు సిద్ధమయ్యే సమయంలో అటు ఇంటర్‌తోపాటు దానికి ప్రిపేర్ కావాల్సి వచ్చింది. మెయిన్స్ తర్వాత సమయం ఉండడంతో రివిజన్, ప్రశ్నపత్రాల ప్రాక్టీస్ ఎక్కువ చేశాను. కఠినంగా అనిపించేవాటిని ఒకటికి రెండు పర్యాయాలు చదవడం, రాయడం, ప్రాక్టీస్ చేయడం చేశాను. నమూనా ప్రశ్నపత్రాలను ఎక్కువగా చేయడం వల్ల అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఇబ్బందులు ఎదురు కాలేదు. రసాయనశాస్త్రంలో ఎక్కువగా గుర్తుపెట్టుకోవాల్సి వచ్చేది. గణితంలో సమయం ఎక్కువ తీసుకునే ప్రశ్నలు రావడంతో సమయాన్ని ఆదా చేసుకునేందుకు ప్రయత్నించాల్సి వచ్చింది. భౌతికశాస్త్రంలో కొన్ని తేలికైన జవాబులు రావడంతో కొంత సమయం కలిసొచ్చింది. కళాశాలలో వారానికి రెండు పరీక్షలు పెట్టేవారు. వీటిల్లో చేసిన తప్పిదాలను అధ్యాపకులు వివరించేవారు.

జేఈఈ పరీక్ష రాసేటప్పుడు ఒకసారి పైపైన ప్రశ్నపత్రం మొత్తాన్ని చూడాలి. ఇందుకు రెండు, మూడు నిమిషాలు సమయం పడుతుంది. ఆ తర్వాత తేలికగా ఉన్నవాటికీ, ఏ సబ్జెక్టుపై ఎక్కువ పట్టు ఉంటుందో ఆ ప్రశ్నలకూ సమాధానాలు రాస్తే మంచిది. ఎక్కువ సమయం తినే ప్రశ్నలు, రానివాటికి చివరిలో సమాధానాలు రాయడం వల్ల సమయం ఆదా కావడంతోపాటు మార్కులు ఎక్కువ తెచ్చుకోవడానికి, ఒత్తిడిని కొంతవరకు తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. పోటీపరీక్షకు ముందు ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల మనం చేస్తున్న తప్పిదాలు, సమయం ఆదా అనేవి గుర్తించే వీలుంటుంది.

- ఎం.శ్రీనివాసరావు, ఈనాడు, అమరావతి



ఈనాడు

విజయవాడ 13-6-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 304

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

"ముమ్ముందు సవాళ్లు ఉంటాయి. అయినా మేం ట్రంప్‌తో కలిసి పని చేస్తాం. ఈ భేటీపై ఉన్న అప నమ్మకాలు, అనుమానాలను మేం పటాపంచలు చేశాం. శాంతికి ఇదెంతో మంచిదని నేను విశ్వసిస్తున్నా.

- కిమ్

ట్రంప్ (72) కంటే వయసులో చాలా చిన్నవాడైన కిమ్ (35) తమ చర్చల వేదిక వద్దకు ఏడు నిమిషాలు ముందుగానే వచ్చారు. వయసులో చిన్నవారు ముందుగా రావాలనేది కొరియావాసుల సంప్రదాయం. ఆ విధంగా ట్రంప్‌పై తన గౌరవాన్ని ఆయన చాటుకున్నారు. అటు ట్రంప్ సయితం... ఉ.కొరియావాసులకు ఇష్టమైన రీతిలో ఎరుపు రంగు టై ధరించి భేటీకి వచ్చారు. మొదటిసారి ముఖాముఖి చూసుకోవడంలోనే ఇద్దరి నడుమ సుహృద్భావం వ్యక్తమయింది.

దక్షిణ కొరియాతో కలిసి చేస్తున్న సంయుక్త సైనిక విన్యాసాలకు స్వస్తి పలికేందుకు ట్రంప్ అంగీకరించారు. ఎంతో రెచ్చగొట్టేలా ఉన్న యుద్ధ విన్యాసాలను ఆపేయడం వల్ల తమకు భారీ మొత్తం ఆదా అవుతుందని చెప్పారు. ఆ విన్యాసాలు తమపై దురాక్రమణకు దాయాది దేశం చేస్తున్న కసరత్తేనని ఉ.కొరియా ఇన్నాళ్లూ చెబుతూ వస్తోంది. దక్షిణ కొరియాలో కేంద్రీకృతమై ఉన్న అమెరికా దళాలను ఉపసంహరించుకోవాలని అనుకుంటున్నట్లు ట్రంప్ చెప్పారు.

"ఈ చర్చల తర్వాత నిజమైన మార్పు సాధ్యమవుతుంది. అద్భుతమైన దేశంగా మారే శక్తిసామర్థ్యాలున్న ఉత్తర కొరియాతో కొత్త చరిత్ర ప్రారంభించడానికి అమెరికా సిద్ధంగా ఉంది. క్షిపణి ఇంజిన్ పరీక్షకు ఉద్దేశించిన భారీ కేంద్రాన్ని ఇప్పటికే నాశనం చేసినట్లు కిమ్ నాతో చెప్పారు.

- ట్రంప్

అణుమానం లేదు అడుగు పడింది

సంయుక్త ప్రకటనలోని నాలుగు అంశాలు

1 శాంతి, సుస్థిరత కోసం ఇరు దేశాల ప్రజలు వాంఛిస్తున్న రీతిలో అమెరికా, డీపీఆర్‌కేలు సరికొత్త సంబంధాల ఏర్పాటుకు కట్టుబడ్డాయి.

2 కొరియన్ ద్వీపకల్పంలో సుస్థిర శాంతి స్థాపనకు అమెరికా, డీపీఆర్‌కేలు చేతులు కలుపుతాయి.

3 ఈ ఏడాది ఏప్రిల్ 27న చేసిన పాన్ముంజోమ్ ప్రకటనకు అనుగుణంగా కొరియన్ ద్వీపకల్పంలో పూర్తిస్థాయి అణునిరాయుధీకరణకు డీపీఆర్‌కే కట్టుబడుతోంది.

4 యుద్ధఖైదీలు, పోరులో ఆచూకీ లేకుండా పోయిన వారిని గుర్తించడానికి అమెరికా, డీపీఆర్‌కేలు కట్టుబడి ఉన్నాయి. ఇప్పటికే గుర్తించిన వారిని తక్షణం వెనక్కి పంపుతాయి.

- పూర్తిస్థాయి అణు నిరాయుధీకరణకు ఉ.కొరియా అంగీకారం
- ఫలించిన అమెరికా అధ్యక్షుడు, ఉ.కొరియా నేతల చర్చలు
- ఆశించినదాని కంటే ఎక్కువ ఫలితమే వచ్చింది: ట్రంప్-కిమ్

సింగపూర్: హమ్మయ్య! కథ సుఖాంతమయింది. గత కొన్ని నెలలుగా మలుపులు తిరుగుతూ వచ్చిన దౌత్యం విజయవంతమయింది. వరసపెట్టి అణు పరీక్షలు నిర్వహిస్తూ ప్రపంచాన్ని కలవరపెట్టిన ఉత్తర కొరియా ఎట్టకేలకు పూర్తిస్థాయి అణు నిరాయుధీకరణకు సరేనంది. పెద్దన్న అమెరికా చేసిన విజ్ఞప్తిని మన్నించింది. గతం గతః అంటూ పాత రోజుల్ని మరిచిపోదామని ఉ. కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ చాచిన స్నేహ హస్తాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అందుకున్నారు. దానికి ప్రతిఫలంగా ఉ.కొరియాకు కావాల్సిన పూర్తి భద్రతకు తమది పూచీ అని ఆయన భరోసా ఇచ్చారు. యావత్ ప్రపంచానికి ఆసక్తి కలిగించిన అగ్రనేతల భేటీ మంగళవారం సింగపూర్‌లోని కెపెల్లా హోటల్లో విజయవంతంగా పూర్తయింది. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వాయుధ రహితం చేయడానికి కిమ్ (మిగతా 2లో)

కిమ్-ట్రంప్ భేటీపై ప్రత్యేక కథనాలు, వివరాలు 2, 11 పేజీల్లో

కృష్ణానదిపై వంతెనకు టెండర్లు ఖరారు

- పవిత్ర సంగమం నుంచి అమరావతికి అనుసంధానం
- ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణ వ్యయం రూ.1387 కోట్లు
- ఎల్ అండ్ టీ సంస్థకు దక్కిన పనులు 3లో

రాహుల్ గాంధీపై అభియోగాలు నమోదు

- పరువునష్టం కేసులో విచారణ ఎదుర్కోనున్న కాంగ్రెస్ అధ్యక్షుడు 11లో

రూ. 2,954 కోట్లతో 4 భారీ పరిశ్రమలు

- విశాఖ, అనంతపురం, చిత్తూరులో ఏర్పాటు
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించిన అధికారులు 3లో

తగ్గిన తుంగభద్రత!

- బోర్డు వేసిన తక్కువ అంచనాలతో ఇక్కట్లు
- ఆంధ్రప్రదేశ్‌పై ఎక్కువ ప్రభావం

ఈనాడు, హైదరాబాద్: నీటి లభ్యత, కేటాయింపులపై తుంగభద్ర బోర్డు తీసుకున్న నిర్ణయం తెలుగు రాష్ట్రాలపై ప్రభావం చూపనుంది. ఈ నీటి సంవత్సరంలో ఎక్కువ కేటాయించాల్సి ఉండగా.. బోర్డు తక్కువ అంచనాలు వేసినట్లు తెలిసింది. దీనివల్ల రెండు రాష్ట్రాలకు కేటాయింపు తగ్గింది. ఈ ప్రభావం ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌పై ఎక్కువగా ఉంది. ప్రాజెక్టు కింద మొత్తం నీటి వినియోగం 212 టీఎంసీలు కాగా.. కర్ణాటకకు 138.990, ఆంధ్రప్రదేశ్‌కు 66.50, తెలంగాణకు 6.510 టీఎంసీల కేటాయింపు ఉంది. తుంగభద్రలో పూడిక పెరగడం, నీటిని నిల్వ చేసుకోలేక దిగువన శ్రీశైలానికి వదిలేయడం.. ఇలా పలు కారణాల వల్ల ఏళ్లుగా పూర్తి స్థాయిలో నీటి కేటాయింపు, వినియోగం లేదు. సరాసరిన 150 నుంచి 160 టీఎంసీల వరకే ఉంది. 12 ఏళ్లలో 75 శాతం కింద నీటి లభ్యత, 90 శాతం నీటి లభ్యత, సరాసరి నీటి లభ్యతను లెక్కగట్టి ఈ ఏడాది ఎంత నీటి లభ్యత ఉంటుందన్న దానిపై బోర్డు అంచనాకు వస్తుంది. దీని ప్రకారం మూడు రాష్ట్రాలకు కేటాయింపులు నిర్ణయిస్తుంది. డిసెంబరులో (మిగతా 2లో)

మీరు జాగ్రత్త పడాలి



"సార్ పట్టించుకోడు మన పని మనం చేసుకోవచ్చులే అనుకోవద్దు. పార్టీ గెలవడం చరిత్రాత్మక అవసరం. విపక్షాలు తప్పులు చేసినా ఎండగట్టలేక పోతున్నాం. దొంగసారా, తప్పుడు అఫిడవిట్లతో ఆస్తుల స్వాధీనం, ఇప్పుడు బెట్టింగ్‌లు... ఇలా పలు నేరాల్లో విపక్ష ఎమ్మెల్యేల ప్రమేయం ఉంటోంది. వాటిని బయట పెట్టాలి"

- ఇకపై మీకు నా నుంచి ఎప్పుడైనా ఫోన్ రావొచ్చు
- మీ తప్పులుంటే చెబుతా
- గెలవలేరనుకుంటే వేరేవాళ్లను పెట్టడానికి వెనుకాడను
- పార్టీ నాయకులకు చంద్రబాబు స్పష్టీకరణ
- 8 నెలల్లో 75 కార్యక్రమాలు
- రాజమహేంద్రవరంలో మూడో ధర్మ పోరాట సభ
- తెదేపా కార్యాచరణ ప్రకటన

ఈనాడు - అమరావతి

ఎన్నికల నాటికి పార్టీని మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు అవసరమైన కార్యాచరణను తెలుగుదేశం సిద్ధం చేసింది. పార్టీ భవిష్యత్ కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నేతలకు కూడా కాస్త ఘాటు హెచ్చరికలు చేశారు. "పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల పనితీరుపై ప్రతి 45 రోజులకు 70 లక్షల మంది పార్టీ కార్యకర్తల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నాం. వివిధ మార్గాల్లో నివేదికలు రూపొందిస్తున్నాం. చర్యలూ మొదలు పెట్టాను. మీరు ఇంకా బుకాయిస్తే... మీరూ, నేనూ కూడా దెబ్బతింటాం. అవసరమైతే కఠిన నిర్ణయాలూ తప్పవు. గెలవలేరనుకుంటే వేరేవాళ్లను పెట్టడానికి వెనుకాడను. రోజు పార్టీకి నాలుగు గంటల సమయం కేటాయించి, లోతుగా పరిశీలిస్తున్నా. మీరు జాగ్రత్త పడాలి. ఇకపై మీకు నా నుంచి ఎప్పుడైనా ఫోన్ రావొచ్చు. మీరు ఇబ్బంది పడినా.. రాష్ట్రం, పార్టీ, మీ ప్రయోజనాల కోసం చేయక తప్పదు. మీ తప్పులుంటే నిర్మొహమాటంగా చెబుతా. నన్ను అపార్థం చేసుకోవద్దు. ఒకటికి నాలుగుసార్లు మీకు వ్యక్తిగతంగా చెబుతా. మీరు మారకపోతే ప్రజల ముందే చెబుతా. నేను ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజల విశ్వాసం పొందాలి" అని ఆయన పార్టీ నాయకులకు కాస్త గట్టిగానే హెచ్చరికలు జారీ చేశారు. ఇసుక విషయంలో పార్టీ నాయకులు ఎవరూ తప్పు చేయడానికి వీల్లేదని, కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేశానని ముఖ్యమంత్రి హెచ్చరించారు. మంగళవారం ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాల్‌లో చంద్రబాబు అధ్యక్షతన తెదేపా సమన్వయ సమావేశం జరిగింది. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీల అధ్యక్షులు, ఇతర నాయకులు జిల్లాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సమావేశంలో పాల్గొన్నారు. ఒకపక్క ప్రత్యేక హోదా సహా విభజన హామీల అమలుకి కేంద్రంపై పోరాడుతూనే, మరోపక్క ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్ని గట్టిగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన స్పష్టంచేశారు. పార్టీ నాయకులంతా ఇకపై కేడర్‌తో మమేకం కావాలని, తాను కూడా ఎక్కువగా ప్రజల దగ్గరకు వెళతానని పేర్కొన్నారు. పార్టీకి బీసీలు కీలకమైన ఓటుబ్యాంకని వారిలో సంతృప్తస్థాయి పెరగాలని అన్నారు. వారికి కావలసిన పనులు చేయాలని, అచ్చెన్నాయుడు వంటివారు ఇంకా చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ (మిగతా 2లో)

ఇక రాకండోయ్.. ఖాళీల్లేవ్..

సర్కారు బడికి దరఖాస్తుల వెల్లువ 2లో

దరఖాస్తులు అందించేందుకు పిల్లలతో కలిసి వచ్చిన తల్లిదండ్రులు

ఇదీ సంగతి!

ఇంటి పట్టు ఇంజినీర్లు!

- రాజకీయ అండతో బదిలీలకు దూరం
- గుత్తేదారుల నుంచి ముక్కుపిండి కమీషన్లు
- పుర, నగరపాలకాల్లో అవినీతి తిష్ట

ఈనాడు - అమరావతి

పర్యవేక్షణ లోపం, రాజకీయ జోక్యంతో పురపాలక, నగరపాలక సంస్థల్లో కొందరు ఇంజినీర్లు వేసినవే అంచనాలు, సిఫార్సు చేసిందే బిల్లు అన్నట్లుగా తయారైంది. ప్రతి బిల్లుపైనా గుత్తేదారు వర్క్ ఇన్‌స్పెక్టర్ నుంచి పర్యవేక్షక ఇంజినీర్ వరకు 8 నుంచి 10 శాతం కమీషన్ చెల్లించాల్సిందే. బినామీలు, సన్నిహిత గుత్తేదారులతో మళ్లీ పనులు జరిపించి సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి. మూడేళ్లకోసారి బదిలీ చేయాలన్న నిబంధనలేవీ వీరికి వర్తించవు. ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల అండతో ఒకేచోట తిష్ట వేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇందుకో ఉదాహరణ అవినీతి నిరోధకశాఖ(అనిశా) ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన శ్రీకాకుళం నగరపాలిక ఉప కార్యనిర్వాహక ఇంజినీర్(డీఈఈ) శ్రీనివాసరాజు. ఈయన 20 ఏళ్లకు పైబడి మహా విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ)లోనే పనిచేశారు.



అసలేం జరుగుతోంది?

★ జోనల్ స్థాయి ఇంజినీర్లు రాజకీయ నేతల అండతో ఒకేచోట ఎన్నో ఏళ్లుగా పాతుకుపోతున్నారు. బదిలీల పరంగా ఉన్నతాధికారులు చొరవ తీసుకున్నా.. ఎమ్మెల్యేలు నిలిపివేయిస్తున్న పరిస్థితి. జోన్-1లోని సహాయ ఇంజినీర్ల నుంచి ఉప ఇంజినీర్లలో ఎక్కువ మంది మహా విశాఖ నగరపాలక (మిగతా 2లో)

నిన్నటి స్వేచ్ఛకు నేడు సంకెళ్లు!

'ట్రంప్' వర్తక విధానాలపై ఇతర దేశాల గుర్రు 14లో

సింగపూర్‌లోని కెపెల్లా హోటల్లో సమావేశమైన ట్రంప్, కిమ్ జోంగ్ ఉన్

ఒప్పంద పత్రాన్ని చూపుతున్న ట్రంప్

కొత్త భవితకు ద్వారాలు

- ట్రంప్, కిమ్ సంయుక్త ప్రకటన

సింగపూర్: చరిత్రాత్మక సమావేశం తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనపై సంతకం చేశారు. ఆ ప్రకటన పాఠమిదీ..

"అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ జె ట్రంప్, డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే-ఉత్తర కొరియా) ప్రభుత్వ వ్యవహారాల కమిషన్ ఛైర్మన్ కిమ్ జోంగ్ ఉన్ మధ్య 2018 జూన్ 12న సింగపూర్‌లో తొలిసారిగా చరిత్రాత్మక శిఖరాగ్ర సదస్సు జరిగింది. అమెరికా-డీపీఆర్‌కే మధ్య సరికొత్తగా సంబంధాల స్థాపన, కొరియన్ ద్వీపకల్పంలో సుస్థిర శాంతిని నెలకొల్పే అంశంపై అధ్యక్షుడు ట్రంప్, ఛైర్మన్ కిమ్ జోంగ్ ఉన్‌లు సమగ్రంగా, లోతుగా, నిబద్ధతతో తమ అభిప్రాయాలను పరస్పరం వెలిబుచ్చుకున్నారు. డీపీఆర్‌కేకు భద్రతా పూచీకత్తు ఇవ్వడానికి కట్టుబడినట్లు ట్రంప్ చెప్పారు. కొరియన్ ద్వీపకల్పంలో పూర్తి అణు నిరాయుధీకరణకు తాను దృఢంగా కట్టుబడినట్లు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించారు. అమెరికా-డీపీఆర్‌కే మధ్య చిగురించిన ఈ కొత్త మైత్రి.. కొరియన్ ద్వీపకల్పం లోను, ప్రపంచవ్యాప్తంగాను శాంతి, సుస్థిరతకు దోహదపడుతుందని, పరస్పరం విశ్వాసం పాదుగొల్పే చర్యల వల్ల కొరియన్ ద్వీపకల్పంలో అణు నిరాయుధీకరణకు ఊతమిస్తుందని నమ్ముతూ.. ట్రంప్, కిమ్ జోంగ్ ఉన్ ప్రకటన చేశారు.

దశాబ్దాల ఉద్రిక్తతలు, వైషమ్యాలను అధిగమిస్తూ.. తొలిసారిగా జరిగిన అమెరికా-డీపీఆర్‌కే శిఖరాగ్ర సదస్సు చరిత్రాత్మకమైనది, చాలా ముఖ్యమైనదని, కొత్త భవితకు ద్వారాలు తెరుస్తుందని గుర్తిస్తూ ఉమ్మడి ప్రకటనలోని అంశాలన్నింటినీ పూర్తిగా, వేగంగా అమలు చేయడానికి ట్రంప్, కిమ్ కట్టుబడ్డారు. శిఖరాగ్ర సదస్సు నిర్ణయాల అమలుకు అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, డీపీఆర్‌కేకు చెందిన తత్సమాన స్థాయి అధికారి నేతృత్వంలో సాధ్యమైనంత త్వరగా తదనంతర చర్చలు జరుగుతాయి. రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి; కొరియన్ ద్వీపకల్పంలోను, ప్రపంచ వ్యాప్తంగాను శాంతి, సుసంపన్నత, భద్రతకు దోహదపడాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ జె ట్రంప్, డీపీఆర్‌కే ప్రభుత్వ వ్యవహారాల కమిషన్ ఛైర్మన్ కిమ్ జోంగ్ ఉన్ నిర్ణయించారు."

అడుగు పడింది

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించారు. అవసరమైతే రెండో రోజు కూడా చర్చించేందుకు సింగపూర్‌లోనే ఉండాలనుకున్న అమెరికా అధ్యక్షుడు... ఆ అవసరం లేకపోవడంతో మంగళవారం సాయంత్రమే అమెరికాకు ప్రయాణమయ్యారు. దక్షిణ కొరియాతో కలిసి చేస్తున్న సంయుక్త సైనిక విన్యాసాలకు స్వస్తి పలికేందుకు ట్రంప్ అంగీకరించారు. ప్రస్తుత సమీకరణంలో అది భాగం కాదనీ, సందర్భోచితంగా అదీ చేస్తామనీ తెలిపారు. అణు పరీక్షలు నిర్వహించినందుకు ఉ.కొరియాపై తాము విధించిన ఆంక్షలు ప్రస్తుతానికి కొనసాగుతాయని చెప్పారు. అధికారంలో ఉన్న అమెరికా అధ్యక్షుడితో ఉ.కొరియా అధినేత భేటీ కావడం ఇదే ప్రథమం. తొలుత ఇద్దరు నేతలూ కేవలం దుబాసీలను వెంటబెట్టుకుని ముప్పావుగంట సేపు మనసువిప్పి నిజాయతీగా మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ప్రతినిధి బృందం స్థాయిలో చర్చలు జరిగాయి. అణు నిరాయుధీకరణకు అంగీకరిస్తూ ఉమ్మడి ప్రకటనపై సంతకాలు పూర్తయ్యాక భేటీ గురించి ట్రంప్, కిమ్ ఒక సంయుక్త ప్రకటన వెలువరించారు.

విలాసవంతమైన హోటల్‌లో భేటీ జరిగే ప్రదేశానికి విడివిడిగా వచ్చిన ఇద్దరు నేతలూ ఒకరికి అభిముఖంగా ఒకరు నడిచారు. వెనుకభాగాన రెండు దేశాల జెండాలు రెపరెపలాడుతుండగా... ఒకరినొకరు చూసుకుని, 12 సెకెన్ల పాటు కరచాలనం చేసుకున్నారు. భేటీకి వెళ్తూ విలేకరులతో ట్రంప్ క్లుప్తంగా మాట్లాడారు. ఇది భారీస్థాయిలో విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎన్నో అడ్డంకుల్ని అధిగమించి ఈ భేటీ జరుపుతున్నామని కిమ్ చెప్పారు. ఆయన అలా అనగానే ట్రంప్ కలగజేసుకుని 'థాంక్యూ వెరీమచ్' అని చెప్పారు. అణ్వాయుధాలను విడిచిపెడతారా అని కిమ్‌ను కనీసం మూడుసార్లు ప్రశ్నించగా చిరునవ్వే ఆయన సమాధానమయింది.

శ్వేతసౌధానికి ఆహ్వానిస్తా... నేనూ కొరియా వెళ్తా...

ఉ.కొరియా ప్రజలకు సరికొత్త భవితను అందించడానికి తొలి సాహసోపేత అడుగు వేసినందుకు కిమ్‌ను తాను అభినందిస్తున్నానని ట్రంప్ చెప్పారు. అణు నిరాయుధీకరణ ప్రక్రియ చాలా త్వరగానే మొదలవుతుందని చెప్పారు. ఈ ఒప్పందం అమలుకు దక్షిణ కొరియా, జపాన్‌లతో పాటు కొంతవరకు చైనాతో కలిసి పనిచేస్తామన్నారు. ఉ.కొరియాలో పురోగతిని తాము చూసేవరకు కొన్ని ఆంక్షలు కొనసాగుతాయని చెప్పారు. అమెరికా అందించబోయే ఉ.కొరియా భవిష్యత్ ఆర్థిక నమూనా ఎలా ఉండబోతోందని విలేకరులు ప్రశ్నించినప్పుడు అమెరికా అధ్యక్షుడు బదులిస్తూ- ఈ విషయాన్ని ఆ దేశం, అక్కడి ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. తమ భేటీ ఆశించినదాని కంటే మంచి ఫలితాన్నే ఇచ్చిందని చెప్పారు. శిఖరాగ్ర భేటీపై తానెంతో గర్విస్తున్నాననీ, ప్రపంచానికి అత్యంత ముప్పుగా మారిన సమస్య పరిష్కారానికి ఇద్దరం కృషి చేస్తున్నామనీ తెలిపారు. కిమ్‌తో తనకో ప్రత్యేక బంధం ఏర్పడిందని చెప్పారు. 'కిమ్ చాలా ప్రతిభావంతుడు. తగిన సమయంలో ఆయన్ని నేను శ్వేత సౌధానికి ఆహ్వానిస్తా. నేను కూడా వీలు చూసుకుని ఉ.కొరియాకు వెళ్తా'నని ప్రకటించారు.

గతాన్ని విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నాం

కిమ్ మాట్లాడుతూ- గతాన్ని విడిచిపెట్టాలని తాము నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రపంచం ఒక పెను మార్పును చూడబోతోందన్నారు. చర్చల అనంతరం షడ్రసోపేతమైన దేశవిదేశీ వంటకాలతో విందు ఆరగించాక నేతలిద్దరూ హోటల్ ఆవరణలో కాసేపు కలిసి నడిచారు. అనంతరం ట్రంప్ అమెరికాకు బయల్దేరారు.

ట్రంప్ కోసం...

సింగపూర్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటే పిచ్చ ఇష్టమట! ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌తో భేటీకి ఆయన సింగపూర్ వస్తున్నారని తెలుసుకున్నాడు. అంతే. మలేసియా నుంచి 'ఎగిరి' వచ్చేశాడు... పాతికేళ్ల మోహన్! ట్రంప్ బసచేసిన షాంగ్రి-లా హోటల్‌లోనే దిగాడు. అదీ ఆయనకు కేటాయించిన గది సమీపంలోని గదిలోనే! ఒక్కరోజు కోసం సుమారు రూ.38,000 వెచ్చించాడు. అమెరికా అధ్యక్షుడంటే మాటలా? కట్టుదిట్టమైన భద్రత...మందీ మార్బలం హంగామా ఉంటాయి. హోటల్‌లో ఇవేవీ భారత సంతతి మోహన్‌కు అడ్డురాలేదు. అక్కడి లాబీలో తన అభిమాన నేత కోసం మంగళవారం సాయంత్రం ఐదు గంటలపాటు ఎదురుచూశాడు. తనకెంతో ఇష్టమైన 'ట్రంప్: ది ఆర్ట్ ఆఫ్ ద డీల్' పుస్తకంపై ఆయన సంతకం తీసుకోవాలనుకున్నాడు. కానీ.. కుదర్లేదు. రాత్రి నిద్రపోయాడో లేదోగాని బుధవారం ఉదయాన్నే మళ్లీ లాబీలో వాలిపోయాడు. సరిగ్గా 8 గంటలకు ట్రంప్ తన గది నుంచి బయటకొచ్చారు. వెళ్తూవెళ్తూ... మోహన్ కళ్లలోకి ఓ చూపు విసిరారు. "అది చాలు! అసలు ట్రంప్‌ను సమీపించడమే కష్టమన్నారు. ఆయన్ను కలవడానికి ఒక్కశాతం ఛాన్సయినా ఉండదన్నారు. నేను ఆయన వీరాభిమానిని అని చెప్తే నన్ను ద్వేషించేవారెందరో!" అని చెప్పాడు మోహన్. తన తండ్రి సంస్థలోనే కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడీ యువకుడు.

విడుదలకు ముందే విహారం!

కెపెల్లా సింగపూర్ హోటల్‌లో బుధవారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ల సమావేశం ముగిసింది. అనంతరం సంయుక్త ప్రకటనపై ఇద్దరు నేతలు సంతకాలు చేశారు. సంతకం చేసిన అనంతరం ట్రంప్ యథాలాపంగా ఆ పత్రాన్ని అక్కడున్న మీడియా ప్రతినిధులకు చూపించారు. కెమెరా కళ్లు ఆగుతాయా? ఠక్కున క్లిక్ మనిపించాయి. ఆ ప్రకటన సారాంశం అధికారికంగా విడుదల కాక ముందే... ప్రపంచ వ్యాప్తంగా అది సామాజిక మాధ్యమాల్లో విహరించింది. "ఉత్తర కొరియాకు భద్రతాపరమైన భరోసా ఇవ్వడానికి అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారు. ఉత్తర కొరియాను సంపూర్ణ అణ్వస్త్ర రహితంగా తీర్చిదిద్దేందుకు కిమ్ పునరుద్ఘాటించారు" అని అందులో పేర్కొన్నారు.

చరిత్రాత్మక భేటీలో చారిత్రక బల్ల

ట్రంప్-కిమ్ చరిత్రాత్మక భేటీ నిమిత్తం... సింగపూర్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు వినియోగించిన 80 ఏళ్ల నాటి టేకు బల్లను ఏర్పాటుచేశారు. పొడవు 4.3 మీటర్లు. కెపెల్లా సింగపూర్ హోటల్‌లో ఉభయ పక్షాలవారు దౌత్యస్థాయి చర్చలకు దీనినే వినియోగించారు. 1939లో స్థానిక కళాకారులు తయారుచేసిన ఈ టేబుల్‌ను 2005 వరకూ అత్యున్నత న్యాయస్థానం ఉపయోగించింది. అప్పట్నుంచి సింగపూర్ జాతీయ ప్రదర్శనశాలలో ఉన్న ఈ బల్లను... అమెరికా రాయబార కార్యాలయం ఏరికోరి ఈ సదస్సులో వినియోగించడం విశేషం.

నోరూరించిన 'ట్రంప్-కిమ్' బర్గరోత్సవం!

అమెరికా, ఉత్తర కొరియా అధ్యక్షుల నడుమ చరిత్రాత్మక సమావేశం బర్గర్‌లా మధురంగా సాగాలని ఆకాంక్షిస్తూ... స్కాట్స్ హోటల్‌లోని ది రాయల్ ప్లాజా ప్రత్యేకంగా 'ట్రంప్-కిమ్ బుల్లి బర్గర్'లను తయారుచేసింది. ఉచితంగానే తినండి... ఉత్సాహంగా స్నేహించండంటూ 250 బర్గర్లను దారినపోయేవాళ్లకు తినిపించింది. అమెరికా, కొరియా రుచులను మేళవించి చేసిన ఈ బర్గర్ భలే ఉందంటూ పలువురు వ్యాఖ్యానించారు.

కారు చూడు... చిన్నవాడా...

సమావేశం ముగిసిన అనంతరం ట్రంప్-కిమ్‌లు కెపెల్లా హోటల్ పచ్చికలో కాసేపు వ్యాహ్యాళికి వెళ్లారు. ఏమనుకున్నారో ఏమో... ట్రంప్ కిమ్‌ను తోడుకుని 'ద బీస్ట్'గా పిలిచే తన లిమోజీన్ కారు దగ్గరకు తీసుకొచ్చారు. అక్కడికి వస్తూనే... కారు తలుపు తెరవమంటూ కనుసైగతో ట్రంప్ తన భద్రతాధికారిని ఆదేశించారు. కిమ్‌కు దాని ప్రత్యేకతలను వివరిస్తూ కారులోపలి భాగాలను దగ్గరుండి చూపించారు. నేతలిద్దరూ కొద్దిసేపు అక్కడే నుంచుని మాట్లాడుకున్నారు. ఆ సమయంలో కిమ్ చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు.

ఆసియా వంటలు... పడమటి ఘుమఘుమలు...

కెపెల్లాలో సమావేశానంతరం ట్రంప్, కిమ్‌లు తమ పరివారంతో కలిసి పసందైన విందును ఆరగించారు. పసందైన పడమటి (వెస్టర్న్), ఆసియా వంటకాలను వారి కోసం సిద్ధం చేశారు. కొరియా ప్రజలు ఇష్టంగా తినే దోసకాయ వంటకాలు మొదలు... రకరకాల మాంసం రుచులు, మిఠాయిలు, ఐస్‌క్రీంలు నోరూరించాయి. కిమ్‌తో కలిసి అక్కడికి వస్తూనే...' 'చూడండి! మాకు అందమైన ఫొటో కావాలి సుమీ" అంటూ కెమెరాలకు పోజులిచ్చారు ట్రంప్. ఉభయ పక్షాలవారు ఎదురెదురుగా కూర్చుని భోజనం చేసేందుకు వీలుగా తెలుపు, ఆకుపచ్చ పువ్వులతో అలంకరించిన భారీ టేబుల్‌ను ఏర్పాటుచేశారు.

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
13 సం॥ల అనుభవం కలిగిన ఎస్. విజయ్ కుమార్ రెడ్డి సార్ చే స్థాపించబడిన...
RANK హామీ ఇవ్వగలిగే APలో IAS సంస్థ
Degree + IAS (50 students) 3yrs Integrated Program
After Degree - Morning Batch (1 year)
During Degree - Evening Batch(2 years)
ఇంటిని మరిపించే Hostel facility
Civil Services IAS Exam పై ఉచిత అవగాహనా సదస్సు on June 17th Sunday 10 am
IAS Coaching సొంత పుస్తకాలు గల ఏకైక సంస్థ
విద్యార్థులు / తల్లిదండ్రులు అందరూ ఆహ్వానితులే
Beside Nagarjuna Hospital,Kanuru, VIJAYAWADA. Ph: 6300181832

మీరు జాగ్రత్త పడాలి

తెదేపా సమన్వయకమిటీ సమావేశంలో ఎంపీలు, మంత్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు ఇప్పటి నుంచి మూడు నాలుగు నెలల పాటు ప్రతి రోజూ గ్రామాలకు వెళ్లాలన్నారు. గ్రామ దర్శిని, గ్రామ సభ నిర్వహించాలన్నారు.

పార్టీ కార్యాచరణ ఇదీ..!

- వచ్చే ఎనిమిది తొమ్మిది నెలల్లో వివిధ వర్గాలకు చెందినవారితో సుమారు 75 సభలు, సమావేశాలు నిర్వహించనుంది. వీటన్నిటిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు.
- విభజన హామీల అమలు కోసం చేస్తున్న ధర్మపోరాట దీక్షల్లో భాగంగా మూడో బహిరంగ సభ ఈ నెలలో రాజమహేంద్రవరంలోని గోదావరి తీరంలో జరుగుతుంది.
- ఆ తర్వాత సభను అనంతపురం లేదా కర్నూలులో నిర్వహిస్తారు. 11 జిల్లాల్లో సభలు పూర్తయ్యాక, చివరి సభను గుంటూరు, కృష్ణా జిల్లాలకు కలిపి భారీ ఎత్తున నిర్వహిస్తారు.
- విభజన చట్టంలోని అంశాలు, కేంద్రం ఇచ్చిన హామీల్లో ఏ ప్రాంతానికి చెందినవి నెరవేరలేదో ఎంపీలంతా అక్కడికి వెళ్లి ధర్నాలు చేస్తారు.
- ప్రతివారం పార్టీ పరంగా రెండు మూడు కార్యక్రమాల చొప్పున వచ్చే ఎనిమిది తొమ్మిది నెలల్లో 70-75 కార్యక్రమాలు చేపడతారు.
- విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థపై 10 యూనివర్సిటీల్లో సమావేశాలు జరుగుతాయి. జరుగుతున్న పరిణామాలపై వారికి అవగాహన కల్పిస్తారు.
- దళితతేజం విజయోత్సవ సభ నెల్లూరు జిల్లాలో జరుగుతుంది. రంజాన్ తర్వాత ముస్లిం మైనారిటీలకూ సభ నిర్వహిస్తారు. గిరిజనుల కోసం ఏజెన్సీ ప్రాంతంలో సభ పెడతారు.

వాళ్లకి సింగపూర్‌పై నమ్మకం... సింగపూర్‌కి మనపై నమ్మకం

"ప్రపంచంలో అత్యంత వివాదాస్పద నాయకులైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ తమ శిఖరాగ్ర సమావేశానికి సింగపూర్‌ని వేదికగా ఎంచుకున్నారు. ఇద్దరు అగ్రనేతలకు ఆతిథ్యమిస్తోందంటే సింగపూర్ గొప్పతనాన్ని అర్థం చేసుకోవాలి. ట్రంప్, కిమ్‌కి సింగపూర్‌పై నమ్మకం ఉంటే, సింగపూర్‌కి ఆంధ్రప్రదేశ్‌పై చాలా నమ్మకం ఉంది. అమరావతిలో స్టార్టప్ ప్రాంత అభివృద్ధి తమ ప్రాధాన్య కార్యక్రమం అని సింగపూర్ ప్రధానే... స్వయంగా భారత ప్రధాని నరేంద్రమోదీకి చెప్పారు" అని ముఖ్యమంత్రి వివరించారు.

ఎమ్మెల్యేల గైర్హాజరుపై మండిపాటు..!

గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆంజనేయులు ఏవో కొన్ని పనుల గురించి ప్రస్తావించగా... ఎంత సేపు అవి చేయండి, ఇవి చేయండని చెప్పడం తప్ప నాయకులు రాజకీయంగా కుదురుకోవడం లేదని సీఎం అసహనం వ్యక్తంచేశారు. గుంటూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఎవరూ సమావేశానికి రాకపోవడం పట్ల తీవ్రంగా మండిపడ్డారు. "వాళ్లంతా బిజీగా ఉన్నట్టున్నారు. మేమే ఫ్రీగా ఉన్నాం. రెండు మూడు గంటల పాటు సమావేశానికి హాజరయ్యే తీరికా లేదా? నాకు సెక్రటేరియేట్‌లో వేరే సమావేశాల్లేవా? పార్టీ అంటే లెక్కలేనితనం పెరిగిపోతోంది. గుంటూరు జిల్లా నాయకులైతే మేం అందరికీ అతీతం అనుకుంటున్నారు" అని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఈవీఎంలపై అప్రమత్తం..!

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలోను క్యాడర్‌ను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొనగా ముఖ్యమంత్రి బదులిస్తూ 'ప్రతి ఎలక్ట్రానిక్ పరికరాన్ని ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈవీఎంల విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై కొంత కసరత్తు చేస్తాం' అన్నారు.

ఇంటి పట్టు ఇంజినీర్లు!

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ(జీవీఎంసీ), శ్రీకాకుళం, విజయనగరం పురపాలికల్లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్నారు. ఇప్పటికీ నలుగురైదుగురు ఏఈలు, డీఈలు జీవీఎంసీలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారు.

- ★ జోన్-2లోని విజయవాడ(వీఎంసీ), రాజమహేంద్రవరం, కాకినాడ నగరపాలికల్లో నలుగురు సహాయ ఇంజినీర్లు, ముగ్గురు ఉప ఇంజినీర్లు సుమారు ఐదేళ్లుగా సేవలందిస్తున్నారు. జోన్ పరిధిలో అనేక పురపాలికలున్నా వీరు నగరపాలికల చుట్టే తిరుగుతున్నారు.
- ★ జోన్-3లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలున్నా ఎక్కువ మంది ఏఈలు, డీఈలు గుంటూరు, నెల్లూరు, ఒంగోలు నగరపాలికలకే ప్రాధాన్యమిస్తున్నారు. మూడు చోట్లా ముగ్గురు ఏఈలు, మరో ఇద్దరు డీఈలు దీర్ఘకాలికంగా పనిచేస్తున్నారు.
- ★ జోన్-4లో కర్నూలు, అనంతపురం, కడప నగరపాలికల్లో మాత్రమే పనిచేసిన ఏఈలు, డీఈలు ఎనిమది మందికిపైగా ఉన్నారు. వీరు సర్వీసులో పురపాలికలకు వెళ్లిన దాఖలాల్లేవు.

కీలక స్థానాల్లోనూ అదే పరిస్థితి..

వివిధ నగరపాలక సంస్థల్లో ఈఈ, ఎస్ఈ, సీఈలుగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారిలో 60 శాతానికి పైగా ఒకటి, రెండు జిల్లాల్లోనే సేవలు అందించిన పరిస్థితి. ప్రత్యేకించి విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం నగరపాలికల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో ఎక్కువ మంది ఇదే కోవకు చెందుతారు. విశాఖలో ఇద్దరు ఈఈలు, విజయవాడలో కీలక స్థానాల్లో ఉన్న మరో ఇద్దరు ఇంజినీర్లు, గుంటూరులో ఒకరు, నెల్లూరు, తిరుపతి, అనంతపురంలో కీలక స్థానాల్లో ఉన్న మరో ముగ్గురు ఇంజినీర్లు అక్కడే ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయిన పరిస్థితి. బదిలీ చేసినా పక్క జిల్లాలు మినహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లింది లేదు.

తగ్గిన తుంగభద్రత!

రాష్ట్రం	మొత్తం కేటాయింపు (టీఎంసీలలో)	ఈ ఏడాది కేటాయింపు (టీఎంసీలలో)
కర్ణాటక	138.990	85.230
ఆంధ్రప్రదేశ్	66.50	40.778
తెలంగాణ	6.510	3.992
మొత్తం	212	130

(మొదటి పేజీ తరువాయి)

మళ్లీ నీటి లభ్యతపై అంచనా వేస్తారు. అప్పటికి తెలుగు రాష్ట్రాల నీటి వినియోగం దాదాపు పూర్తవుతుంది. మూడేళ్లుగా తుంగభద్రలో నీటి లభ్యత తక్కువగా ఉంది. ఈ నీటి సంవత్సరంలో మెరుగ్గా ఉండొచ్చని అంచనా. 12 ఏళ్లలో 75 శాతం నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది 160 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని బోర్డు అంచనా వేసినట్లు తెలిసింది. సరాసరి నీటి లభ్యత కింద 272 టీఎంసీలు ఉండగా, సాగునీటికి వినియోగించేవి 162.354 టీఎంసీలు. ఇటీవల ఎస్ఈల స్థాయిలో జరిగిన సమావేశంలో 130 టీఎంసీల లభ్యత ఆధారంగానే కేటాయించాలని బోర్డు నిర్ణయించింది. దీని వల్ల రాష్ట్రాలకు నీటి కేటాయింపు తగ్గింది. అనంతపురం, కడప జిల్లాల్లో ఆయకట్టుకు నీళ్లందించే హెచ్చెల్సీకి 32.5 టీఎంసీల కేటాయింపు ఉండగా ఈసారి ఇచ్చేది 19.929 టీఎంసీలే. కర్నూలు జిల్లాలోని ఎల్లెల్సీకి 24 టీఎంసీలకుగాను 14.717 టీఎంసీలు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్డీఎస్‌కు 6.510 టీఎంసీలకుగాను 3.992 టీఎంసీలు వస్తాయి. నీటి కేటాయింపును తగ్గించడం వల్ల రాష్ట్రాల కోరిక మేరకు ఇచ్చే రోజువారీ తీసుకునే నీరు కూడా తగ్గుతుంది. ఎక్కువ లభ్యత ఉందని చెబితే రైతులు ఎక్కువ ఆయకట్టు సాగు చేస్తారని, ముందుగానే తక్కువ లభ్యత చూపితే సమస్యలు ఉండవనే అభిప్రాయంలో ఇలా చేసినట్లు తెలిసింది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. డిసెంబరు తర్వాత కూడా కర్ణాటక నీటిని వినియోగించుకోనున్నందున ఆ రాష్ట్రానికి నష్టం లేదు.

తెలుగు రాష్ట్రాల్లోని పాఠశాలలకు 448 ఏటీ ల్యాబ్స్

ఈనాడు, దిల్లీ: ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు నైపుణ్యాలను అభివృద్ధి చేసే అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను తెలుగు రాష్ట్రాల్లోని 448 పాఠశాలలకు కేంద్రం మంజూరు చేసింది. ఇందులో ఏపీలోని 13 జిల్లాలకు 269 ల్యాబ్‌లు, తెలంగాణలోని పాత జిల్లాలకు 179 ల్యాబ్‌లను మంజూరు చేసినట్లు నీతిఆయోగ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

రూ.300 కోట్ల ఉపాధినిధుల విడుదల

ఆంధ్రప్రదేశ్‌కు రూ.300 కోట్ల ఉపాధి నిధులను కేంద్రం విడుదల చేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో కేంద్ర సాయంగా ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ పేర్కొంది.

సర్కారు బడికి దరఖాస్తుల వెల్లువ

- చీరాలలో త్వరలో ప్రారంభం కానున్న ఉన్నత పాఠశాల

ఈనాడు డిజిటల్- ఒంగోలు: అదో సాధారణ సర్కారు పాఠశాల. అయితేనేం.. ప్రవేశ దరఖాస్తుల కోసం పోటెత్తారు. బడి పరిమితి వెయ్యి సీట్లు కాగా.. ఇప్పటికే 1472 దరఖాస్తులు చేరాయి. దీంతో ఇక దరఖాస్తులు తీసుకోవడం ఆపేశారు. ఆదర్శవంతమైన ప్రణాళికలు, వినూత్న ప్రచారం ఆ బడిని తల్లిదండ్రులకు చేరువ చేశాయి. స్థానికంగా ఉన్న దాదాపు తొమ్మిది ప్రైవేటు పాఠశాలల్లోని పలువురు విద్యార్థులు ఇక్కడ చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారు. చీరాల పట్టణం సమీపంలోని కొత్తపేటలో నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రానున్న వైభవం ఇది.

లోకేష్ చేతుల మీదుగా...

ఇప్పటివరకూ ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న దీన్ని ఉన్నత పాఠశాలగా రూపుదిద్దుకుంటోంది. ఎకరానికి పైగా విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఈ పాఠశాల భవన నిర్మాణం ఆరంభమై 40 రోజులు గడిచింది. రూ.2.20 కోట్ల అంచనాతో దీన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 18న మంత్రి నారా లోకేష్ దీన్ని ప్రారంభించనున్నారు. నిర్మాణ ప్రక్రియను కలెక్టర్ వినయ్‌చంద్, ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పర్యవేక్షిస్తున్నారు. ఎక్కువ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చనున్నామని డీఈవో సుబ్బారావు తెలిపారు.

నిర్మాణ దశలో ఉన్న పాఠశాల భవనం

ప్రత్యేకతలెన్నో..

- పాఠశాలకు అనుబంధంగా ఒక ట్రస్టుని ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్ ఈ ట్రస్టు ద్వారా బడిలో చదివే వందమంది విద్యార్థినిలకు సైకిళ్లు అందిస్తారు.
- విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యావంతులు ట్రస్టులో సభ్యులుగా ఉంటూ దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించనున్నారు.
- విద్యార్థుల భోజనానికి వీలుగా డైనింగ్‌హాలు, పది రకాల ఆటలు ఆడేలా క్రీడామైదానం ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనానికి అదనంగా పెరుగు, ఒక కూర ఇస్తారు.
- నెలకోసారి విద్యార్థులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి నివేదికలను తల్లిదండ్రులకు పంపిస్తారు.

గ్రహం అనుగ్రహం

13-6-2018 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; అధిక జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
అమావాస్య: రా. 1-58 తదుపరి శుక్లపక్ష పాడ్యమి
రోహిణి నక్షత్రం: సా. 5-21 తదుపరి మృగశిర
అమృత ఘడియలు: మ. 2-18 నుంచి 3-49 వరకు
వర్జ్యం: ఉ. 9-43 నుంచి 11-15 వరకు
తిరిగి రా. 10-30 నుంచి 12-09 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-33 నుంచి 12-26 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5-29; **సూర్యాస్తమయం:** సా.6-30

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఒంగోలు	39.0	30.8
తిరుపతి	38.1	28.9
నెల్లూరు	38.0	30.0
అనంతపురం	37.5	28.0
కడప	37.0	28.0
సూర్యాపేట	37.0	27.0
కర్నూలు	36.2	25.9
శ్రీకాకుళం	36.0	28.0
గుంటూరు	35.5	25.1
విజయవాడ	34.8	23.8
హైదరాబాద్	33.6	23.0
ఖమ్మం	33.0	27.0
తాడేపల్లిగూడెం	32.0	25.5
రాజమహేంద్రవరం	32.0	25.0
విశాఖపట్నం	31.4	28.0
నరసాపురం	31.4	25.2

కియా మోటర్స్ సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పనుల పురోగతిపై వీడియో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

జనవరి 1 కల్లా కియా కారు!

- కంపెనీ ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన

ఈనాడు, ఈనాడు డిజిటల్, అమరావతి: జనవరి ఒకటి నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ కియా తొలి కారును బయటకు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం కియా మోటార్స్ భారత్ ప్రతినిధులకు సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధుల బృందం అనంతపురం జిల్లాలో కియా మోటార్స్ ప్లాంట్ పనులను వివరించి, వీడియో చిత్రాన్ని ప్రదర్శించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తన వేగాన్ని కియా అందుకుంటుందని వ్యాఖ్యానించారు. పనుల నిర్వహణపై సంతృప్తి ప్రకటించారు. కొత్త సంవత్సరంలో భారత్‌లో తయారయ్యే మొదటి కియా కారును దేశానికి అందించాలని కోరారు. కియాకు సంబంధించి భూసేకరణ అంశాలను వెంటనే పరిష్కరించాలని అనంతపురం కలెక్టర్‌ను ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. అనంతపురం జిల్లాలోని యువతకు ఆటోమొబైల్ విభాగంలో నైపుణ్యం కల్పించేందుకు కియా, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కలిసి ఈనెల 20 నుంచి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

స్థానికులకే 'కియా'లో ఉద్యోగాలు

మంత్రి అమర్‌నాథ్

కియా కార్ల తయారీ పరిశ్రమలో స్థానికులకే 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ ఎండీ హ్యూన్ షిమ్ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డికి హామీ ఇచ్చారు. సచివాలయంలో మంగళవారం కియా సంస్థ ప్రతినిధులు మంత్రిని కలిశారు. స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని తొలుత చేసుకున్న ఒప్పందాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఈ సందర్భంగా మంత్రి కియా ప్రతినిధుల దృష్టికి తెచ్చారు. సంస్థలో పనిచేసే ఉద్యోగుల కోసం నిర్మించే టౌన్‌షిప్, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, ప్లాంట్‌లో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులు తదితర అంశాలను కియా ప్రతినిధులు మంత్రికి వివరించారు.

2,954 కోట్లతో భారీ పరిశ్రమలు

- విశాఖ, అనంతపురం, చిత్తూరులో నాలుగు ఏర్పాటు
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించిన అధికారులు

ఈనాడు - అమరావతి

రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

రాష్ట్రంలో రూ.2,954 కోట్ల పెట్టుబడులతో మరో నాలుగు పరిశ్రమలు రానున్నాయి. సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. విశాఖలో సెయింట్ గోబోయిన్ ఇండియా రూ.2వేల కోట్లతో ప్లాస్టర్ బోర్డు, గ్లాస్ తయారీ యూనిట్లు (450 మందికి ఉపాధి), అనంతపురం జిల్లాలో గ్రాబ్ మెషిన్ టూల్స్ ఇండియా రూ.304 కోట్లతో (400 మందికి) 'మెషిన్ టూల్స్' తయారీ కర్మాగారం, చిత్తూరులో రూ.150 కోట్లతో (1200 మందికి) ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ సెల్‌కాన్ ఇంపెక్స్, రూ.500 కోట్లతో (430 మందికి) స్మార్ట్ ఫుడ్ లిమిటెడ్ 'రెడీ టు ఈట్' ప్యాకేజ్డ్ ఆహార తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలో రూ.16,12,316 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 2,721 పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయని, ఇవి పూర్తిగా అందుబాటులోకి వస్తే 36,40,068 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పరిశ్రమలశాఖ కార్యదర్శి సోల్మాన్ ఆరోఖ్యరాజ్ వివరించారు. ఉత్పత్తి దశలో ఉన్న 706 పరిశ్రమలతో 2,99,078 మందికి ఉద్యోగ, ఉపాధి లభించిందని చెప్పారు. 1,041 పరిశ్రమలు ఆకుపచ్చ కేటగిరి దశకు చేరుకున్నాయని, మరో 1680 యూనిట్లు ఎరుపు రంగు కేటగిరిలో ఉన్నాయని తెలిపారు.

అవసరమైతే నిబంధనలు సడలించాలి: ముఖ్యమంత్రి

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైతే నిబంధనలు సడలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఇతర రాష్ట్రాల కంటే ప్రోత్సాహకాలు బాగా ఇవ్వడం, సులభతర వ్యాపార నిర్వహణకు అనువైన వాతావరణం కల్పించినప్పుడు పెట్టుబడులు వస్తాయన్నారు. విశాఖలో భూముల విలువ ఎక్కువగా ఉన్నందున, చిత్తూరు ప్రాంతంలో పరిశ్రమలను ప్రోత్సహించేలా చూడాలని సూచించారు. తిరుపతి నుంచి నెల్లూరు వరకు ఉన్న ప్రాంతం ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పరిశ్రమలతో కళకళలాడాలని చెప్పారు. 400 మిలియన్ యూఎస్ డాలర్ల మేర ఎగుమతులకు ఈ రంగంలో అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వచ్చే నెల 10న కొరియన్ అధ్యక్షుడు భారత్ పర్యటనకు వస్తున్నారని, ఆయనతో పాటు హాజరయ్యే శాంసంగ్, హ్యూండాయ్, ఎల్జీ, సీజే కొరియా ఫిలిప్స్, ఏజీఎల్, తోషిబా వంటి సంస్థలకు చెందిన వ్యాపార దిగ్గజాలతో చర్చించి రాష్ట్రంలో పారిశ్రామిక సానుకూలతలను వివరించి పెట్టుబడులు పెట్టించేందుకు ప్రయత్నిస్తామని అధికారులు వివరించారు. విశాఖ, శ్రీకాళహస్తి-ఏర్పేడు పేరుతో రెండు ప్రాంతాలను, ప్రాథమికంగా 5,815 ఎకరాల్లో స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ఏషియా డెవలప్‌మెంట్ బ్యాంకు ఒక బిలియన్ డాలర్ల సహాయాన్ని అందిస్తోందని చెప్పారు. మచిలీపట్నం, దొనకొండలో మరో రెండు పారిశ్రామిక ప్రాంతాలు ఏర్పాటవుతాయన్నారు. మంత్రులు యనమల రామకృష్ణుడు, లోకేశ్, అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిపై వంతెనకు టెండర్లు ఖరారు

- పవిత్ర సంగమం నుంచి అమరావతికి అనుసంధానం
- ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణ వ్యయం రూ.1387 కోట్లు
- ఎల్ అండ్ టీ సంస్థకు దక్కిన పనులు

ఈనాడు - అమరావతి



రాజధాని అమరావతిని విజయవాడతో అనుసంధానం చేస్తూ కృష్ణా నదిపై నిర్మించే ఐకానిక్ బ్రిడ్జి టెండర్లు ఎట్టకేలకు ఖరారయ్యాయి. ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర సంగమం నుంచి అమరావతిలోని ఎన్10 రహదారిని అనుసంధానిస్తూ దీనిని నిర్మిస్తారు. నిర్మాణ వ్యయం రూ.1387 కోట్లు. ఒప్పందం జరిగినప్పటి నుంచి రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలి. ఈ వంతెన ప్రతిపాదన దాదాపు రెండేళ్లుగా నలుగుతోంది. యోగముద్ర, కూచిపూడి నాట్య భంగిమ, కొండపల్లి బొమ్మ... ఇలా వివిధ నమూనాల్లో ఆకృతులు సిద్ధం చేశారు. ఒక దఫా టెండర్లు పిలిచి రద్దు చేశారు. మళ్లీ ఈపీసీ విధానంలో తాజాగా టెండర్లు పిలిచి ఎల్ అండ్ టీ సంస్థను ఎంపిక చేశారు. ఆ సంస్థ ఆకృతుల్ని మళ్లీ సిద్ధం చేయాల్సి ఉంది. అనంతరం మెరుగైన దాన్ని ఎంపిక చేసి స్ట్రక్చరల్ డిజైన్లు రూపొందిస్తారు. స్థానిక కళలు, సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) షరతు పెట్టింది. ఈ ప్రక్రియ రెండు నెలల్లోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు ఎల్ అండ్ టీ, ఎస్‌పీ సింగ్లా, గామన్ సంస్థలు పోటీపడ్డాయి.

నిర్మాణం సంక్లిష్టం..!

3.2 కి.మీ. పొడవైన ఈ వంతెన మధ్యలో 480 మీటర్ల భాగం తీగలతో (కేబుల్ స్టేడ్) స్ట్రక్చర్ ఉంటుంది. మధ్యలో నిర్మించే పైలాన్ నుంచి బలమైన ఇనుప తీగల్ని కడతారు. అక్కడ వంతెన కింద నిర్మించే పిల్లర్ల దూరం ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా ఈ ఇనుప తీగల బలంపైనే ఇది ఆధారపడుతుంది. మిగతా ప్రాంతంలో కూడా స్తంభాల మధ్య దూరం 125 మీటర్ల వరకు ఉంటుంది. కృష్ణా నదిలో ఎప్పుడూ 5 మీటర్ల ఎత్తున నీరు ఉంటుంది. ఆ మేరకు నీరు ఉండగానే... వంతెన నిర్మించడం సంక్లిష్టమైన ప్రక్రియని, భారీ పరికరాలు, సామగ్రి కావాలని ఏడీసీ అధికారులు వివరించారు. ఈ బలమైన తీగల్ని స్విట్జర్లాండ్, అమెరికాల్లో మాత్రమే తయారు చేస్తారని, వాటికే రూ.150 కోట్ల వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఐదేళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఎల్ అండ్ టీదే. తాము ఐకానిక్ బ్రిడ్జి కాంట్రాక్టు దక్కించుకున్న విషయాన్ని బాంబే స్టాక్ ఎక్ఛేంజికి అందజేసిన వివరాల్లో ఆ సంస్థ ప్రస్తావించింది.

ఓ పూట అన్నప్రసాదానికీ విరాళాలు

దాతలకు మరింత వెసులుబాటు: తితిదే జేఈవో

తిరుమల, న్యూస్‌టుడే: ఏడు కొండలపై భక్తులకు అన్నప్రసాద వితరణకు ఓ పూటకయ్యే మొత్తాన్ని కూడా విరాళంగా స్వీకరిస్తున్నట్లు తిరుమల సంయుక్త కార్యనిర్వహణాధికారి (జేఈవో) శ్రీనివాసరాజు తెలిపారు. శ్రీవేంకటేశ్వర నిత్య అన్నప్రసాదం ట్రస్టులో దాతల సౌకర్యార్థం ఈమేరకు కొన్ని నిర్ణయాలు తీసుకుని ఆచరణలో పెట్టినట్లు మంగళవారం మీడియాకు వెల్లడించారు. 'తిరుమలలో భక్తకోటికి అన్నప్రసాద వితరణకు రోజుకు రూ.26 లక్షల వ్యయం అవుతోంది. ఉదయం అల్పాహారానికి రూ.6 లక్షలు, మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు రూ.10 లక్షల చొప్పున ఖర్చు చేస్తున్నాం. ఏదైనా ఒక పూటను ఎంచుకొని విరాళం ఇచ్చే దాతల పేర్లను మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్య అన్నప్రసాద వితరణశాలలో ప్రదర్శించడంతో పాటు, ఇక్కడ ఒక రోజు సేవ చేసుకునే అవకాశం కల్పిస్తాం. ప్రత్యేక సందర్భాల్లోనూ దాతలు విరాళాలు ఇవ్వవచ్చు. వారికి ఉచితంగా శ్రీవారి దర్శనం, బస తదితర ప్రయోజనాలు కల్పిస్తాం' అని వివరించారు. తిరుమల సంగ్రహాలయాన్ని (మ్యూజియం) మరింత ఎక్కువ మంది భక్తులు సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జేఈవో తెలిపారు. ప్రస్తుతం రోజుకు 4 వేల మంది సందర్శిస్తున్నారన్నారు. మ్యూజియంలోని సమావేశ మందిరంలో 200 మంది భక్తులు కూర్చుని 20 నిమిషాల నిడివిగల 'తిరుమల క్షేత్ర ప్రాశస్త్యం- శ్రీవారి వైభవం' వీడియోను తిలకించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీనివాసరాజు వెల్లడించారు.

స్వర్ణ పంజరంలో వెంకయ్యనాయుడు

- విభజన హామీలపై 24 గంటలపాటు జాతీయ రహదారుల దిగ్బంధం
- ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు

ఒంగోలు సంతపేట, న్యూస్‌టుడే: వెంకయ్యనాయుడును భాజపాకు దూరం చేస్తూ, స్వర్ణ పంజరంలో పెట్టి ఆయన కన్నీరు పెట్టుకునేలా ప్రధాని మోదీ చేశారని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు విమర్శించారు. బలహీనవర్గానికి చెందిన దత్తాత్రేయకు పొగపెట్టి పంపారని, తెలుగు ప్రజలకు కేంద్ర మంత్రివర్గంలో కనీస అవకాశం కల్పించలేదని ఆరోపించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లోని జాతీయ రహదారులన్నిటినీ 24 గంటలపాటు దిగ్బంధించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సినీనటుడు, నిర్మాత మాదల రవి, సినీ సంగీత దర్శకుడు హుద్దూస్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

చుక్కలు-నిషిద్ధ భూముల సమస్యల పరిష్కారానికి 20 నుంచి ప్రత్యేక కార్యాచరణ

ఈనాడు అమరావతి: చుక్కల భూములు, 22ఏ నిషిద్ధ భూముల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ అమలును ఈ నెల 13 నుంచి 20వ తేదీకి వాయిదావేశారు. ఇందుకు తీసుకోవాల్సిన ముందుస్తు జాగ్రత్త చర్యలు అనేకం ఉన్నందున ఈ నెల 20వ తేదీ నుంచి కార్యాచరణను ప్రారంభించాలని నిర్ణయించారు. ఎక్కడైతే చుక్కల భూములు, 22ఏ నిషిద్ధ భూముల సమస్యలు ఉన్నాయో అక్కడ మాత్రమే గ్రామసభలు నిర్వహిస్తారు. వీటి నిర్వహణ గురించి దూర ప్రాంతాల్లో ఉండే రైతులకు కూడా సమాచారం అందే విధంగా చర్యలు తీసుకోనున్నారు. కార్యాచరణ ప్రారంభం, మార్గదర్శకాలు ఎలా ఉండాలన్న దానిపై సచివాలయంలో మంగళవారం సంయుక్త కలెక్టర్లు, జిల్లా అధికారులతో భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా, సీనియర్ ఐఏఎస్ అధికారి జగన్నాథం, సర్వే అండ్ సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంచాలకుడు ప్రభాకరరెడ్డి, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. జిల్లా అధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్న సీసీఎల్ఏ అధికారులు త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనున్నారు. 20 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక కార్యాచరణ ఆయా జిల్లాల్లో ఉండే సమస్యలను అనుసరించి వచ్చే నెల 15వ తేదీ వరకు జరుగుతుందని సర్వే శాఖ సంచాలకులు ప్రభాకరరెడ్డి తెలిపారు.

130 మంది డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతి

రాష్ట్రవ్యాప్తంగా 130 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన వారికి స్థానాలను కేటాయిస్తూ త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

పశువైద్య వర్సిటీకి యూజీసీ-12 (బీ) గుర్తింపు

తిరుపతి, న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయా (ఎస్వీవీయూ)నికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి 12 (బీ) గుర్తింపు లభించింది. దీనిద్వారా వర్సిటీలో బోధన, పరిశోధనలకు యూజీసీ, భారత ప్రభుత్వ సంస్థల నుంచి ఆర్థిక వనరులు పొందే అర్హత పొందింది. దేశంలోని పశువైద్య విశ్వవిద్యాలయాల్లో యూజీసీ 12(బీ) జాబితాలో మూడో వర్సిటీగా ఎస్వీవీయూ చేరడాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నట్లు ఉపకులపతి వై.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జగన్ మిగిల్చింది ఏమైనా ఉందా?: లోకేశ్

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో జగన్ దోచుకోకుండా మిగిల్చింది ఏమైనా ఉందా.. అని మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు. సహజ వనరులను దోచుకుంటున్నారన్న ప్రతిపక్ష నేత జగన్ వ్యాఖ్యలపై ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనం భుజించినట్లు బాక్సైట్, లైమ్ స్టోన్ వంటివి జగన్ తిన్నారని ఎద్దేవా చేశారు.

అమెరికాలో ప్రకాశం యువకుడి ఆత్మహత్య

దీపక్(పాత చిత్రం)

పామూరు, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన దుగ్గినేని దీపక్ కుమార్(26) అమెరికాలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పామూరు పట్టణానికి చెందిన దుగ్గినేని వెంకట్రావు, రమాదేవిల కుమారుడు దీపక్. ఎంఎస్ పూర్తిచేసి అమెరికాలో ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ఇటీవల ఒంటరితనంతో కుంగుబాటుకు లోనవుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం టెక్సాస్ (అమెరికా)లోని బిమౌంటులో రైలు కింద పడి దీపక్ ఆత్మహత్య చేసుకున్నట్లు కనిగిరి ఎమ్మెల్యే కదిరి బాబురావు తెలిపారు.

పోలవరం, అమరావతి సినిమాలు చూపుతున్నారు..

- వైకాపా అధ్యక్షుడు జగన్ విమర్శ
- తూర్పుగోదావరి జిల్లాలో పాదయాత్ర ప్రారంభం

గోదావరిపై రోడ్డు - రైలు వంతెన వద్ద జగన్ పాదయాత్రకు తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు

ఈనాడు, కాకినాడ: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు పోలవరం, అమరావతి అనే రెండు సినిమాలు చూపిస్తున్నారని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన పాదయాత్ర మంగళవారం సాయంత్రం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చేరింది. రైల్‌కంరోడ్డు వంతెన మీదుగా కోటిపల్లి బస్టాండుకు చేరిన వైకాపా అధ్యక్షుడు అక్కడి బహిరంగ సభలో మాట్లాడారు. నాలుగేళ్లు గడిచినా అమరావతి సినిమాలో శాశ్వత ఇటుక ఒక్కటీ పడలేదని అన్నారు. పోలవరం పునాదులు దాటి ముందుకు పోలేదని, డయాఫ్రంవాల్ అంటే పునాది గోడ అని.. ఆ గోడను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాడట అని వివరించారు. పోలవరం కలల ప్రాజెక్టు అయినప్పుడు 1994 నుంచి దీర్ఘకాలం ముఖ్యమంత్రిగా కొనసాగిన చంద్రబాబుకు అప్పట్లో ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. పోలవరం అంచనాలు పెంచుతూ వచ్చే ఏడాదికల్లా ప్రాజెక్టు పూర్తి చేస్తానంటూ చెవిలో పూలు పెడుతున్నారని అన్నారు. చంద్రబాబుకు దేవుడంటే భయమూ భక్తీ లేవని తెలిపారు. గోదావరి పుష్కరాల పేరుతో రూ.రెండు వేల కోట్లు నామినేషన్ల కింద పంచి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తన షూటింగ్ కోసం పుష్కర స్నానాలకు వచ్చిన వారిని ఆపేసి ఒకేసారి వదలడం వల్ల తొక్కిసలాట జరిగి 29 మంది అమాయకులను బలి తీసుకున్నారని విమర్శించారు. చంద్రబాబుకు తూ.గో. జిల్లా నుంచి 15 మంది ఎమ్మెల్యేలను ఇస్తే జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. అబద్ధాలు చెబుతూ మోసం చేసే వ్యక్తిని పొరపాటున కూడా క్షమించవద్దని అన్నారు. జిల్లాలో వైకాపా నేత 30 రోజులపాటు 16 నియోజకవర్గాల్లో 268 కి.మీ.మేర పాదయాత్ర చేయనున్నారు. రైల్‌కం రోడ్డు వంతెనపై పాదయాత్ర సమయంలో జనం రద్దీ పెరగడంతో వంతెన కదులుతుందేమోనని కార్యకర్తలు ఆందోళన చెందారు.

పోలవరం సొమ్ము మాది... సోకు చంద్రబాబుది

- రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ హామీ: కన్నా

ప్రధాని మోదీతో ఏపీ భాజపా అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సొమ్ము మాది... సోకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుది అన్నట్లుగా ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. మంగళవారమిక్కడ ఆయన ప్రధాని నరేంద్రమోదీతో సుమారు అరగంటసేపు భేటీ అయ్యారు. అనంతరం భాజపా ఏపీ సమన్వయకర్త పి.రఘురాంతో కలిసి మీడియాతో మాట్లాడారు. పోలవరం నిర్మాణానికి కేంద్రం సొమ్ములిస్తుంటే చంద్రబాబు కల నెరవేరింది అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గాలేరు-నగరి, హంద్రీనీవా పూర్తి చేస్తే అప్పుడు ఆయనను మెచ్చుకుంటామని వివరించారు. ఏపీ భాజపా అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు చెప్పానన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తన మాటగా రాష్ట్ర ప్రజలకు చెప్పాలని మోదీ అన్నారని, 'ఆర్థిక సాయం చేశాం... చేస్తున్నాం... చేస్తూనే ఉంటాం'... అని చెప్పారని వెల్లడించారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారం, గిరిజన విశ్వవిద్యాలయం, రామాయపట్నం పోర్టు, తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లానని వివరించారు. రామాయపట్నం పోర్టుపై రాష్ట్రమే ముందుకు రావడం లేదని ప్రధాని వ్యాఖ్యానించారన్నారు. రాష్ట్ర పర్యటనకు రావాలని ప్రధాని మోదీని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మబలం చూశాను

ట్విట్టర్ వేదికగా పవన్‌కల్యాణ్ ట్వీట్

ఈనాడు-అమరావతి: ఉత్తరాంధ్ర గడ్డపై వీర తెలంగాణ పోరాట స్ఫూర్తిని చూశానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. భారతీయ ఆత్మ దోపిడీశక్తులకు, వారి పన్నాగాలకు ఎన్నడూ లొంగదని, అలాంటి ఆత్మబలం ఉత్తరాంధ్ర ప్రజల్లో కనిపించిందని ఆయన పేర్కొన్నారు. ట్విట్టర్ వేదికగా జనసేనాధిపతి మంగళవారం స్పందించారు. రంజాన్ కారణంగా జనపోరాట యాత్రకు కొన్నాళ్లు విరామం ప్రకటించిన పవన్ హైదరాబాద్ వెళ్లారు. వివిధ అంశాలపై ట్విట్టర్‌లో ఆయన తన వ్యాఖ్యలు పోస్టు చేశారు. మెకాలే చనిపోయినా దేశీయ సంస్కృతిని దెబ్బతీస్తూ వనరుల విధ్వంసానికి పాల్పడ్డ ఆయన సిద్ధాంతాన్ని ఇప్పటికీ ముందుకు తీసుకువెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పని చేస్తున్నది ఇక్కడి ప్రముఖ నాయకులేనని అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాతో పాటు అరకులోను 30రోజుల పాటు పర్యటించాక ఇది తనకు కలిగిన అభిప్రాయంగా అభివర్ణించారు. ఉత్తరాంధ్రపై మన నాయకుల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం, దోపిడీని తాను గమనించినట్లు ట్విట్టర్‌లో ఆయన వ్యాఖ్యానించారు. కొంపల్లి హెచ్ఎస్ఎస్ సుందర్ పుస్తకంలోని ఒక పేజీని ఆయన పోస్టు చేశారు.

పీఎంఏవై ఇళ్లలో అవినీతి: ఎమ్మెల్సీ మాధవ్

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణం అంచనా విలువను రెండింతలు పెంచి రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని భాజపా ఎమ్మెల్సీ మాధవ్ ఆరోపించారు. మంగళవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చదరపు అడుగును రూ.1200కు నిర్మించాల్సి ఉంటే రూ.2500 వరకు పెంచారని ఆరోపించారు. కమీషన్లకు కక్కుర్తిపడి గుత్తేదారులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇంటి నిర్మాణ అంచనా మూడింతలు పెరిగి పేదలకు భారమవుతోందని మాధవ్ పేర్కొన్నారు. తెదేపా పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు భాజపాను బూచీగా చూపిస్తూ అవాస్తవాలతో విషప్రచారం చేస్తున్నారని యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

'ఒప్పంద కార్మికులకు నేరుగా వేతనాలివ్వాలి'

ఈనాడు డిజిటల్, అమరావతి: విద్యుత్తు ఒప్పంద కార్మికులకు వేతనాలను నేరుగా చెల్లించాలని ఐక్యవేదిక సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. సమాన పనికి సమాన వేతనం, పీస్ రేట్ రద్దు చేయాలని విన్నవించారు. మంగళవారం సచివాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు.

కన్నా కరడుకట్టిన వైకాపా అభిమాని

- మంత్రి కాలవ శ్రీనివాసులు ధ్వజం

ఈనాడు, అమరావతి: కన్నా లక్ష్మీనారాయణ కరడు కట్టిన వైకాపా అభిమాని... జగన్మోహన్‌రెడ్డికి రాజకీయ పెద్దన్న అని అందరూ అంటారని, అలాంటి వ్యక్తిని తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం ద్వారా భాజపా ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందో అర్థమవుతోందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళవారం ఉండవల్లిలో తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశం తర్వాత మంత్రితో పాటు ఎస్సీ, కాపు కార్పొరేషన్ల ఛైర్మన్లు జూపూడి ప్రభాకరరావు, కొత్తపల్లి సుబ్బారాయుడు విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా జగన్మోహన్‌రెడ్డి, పవన్‌కల్యాణ్ వ్యవహరిస్తున్నారని చెప్పారు.

ఈనాడు

ముందున్నది ముళ్లదారి

దశాబ్దాల ద్వైపాక్షిక విద్వేషాల్ని పక్కనపెట్టి అమెరికా ఉత్తర కొరియా అధినేతలు ముఖాముఖి భేటీ కావడం, చారిత్రక అద్భుతం. 1972లో అధ్యక్షుడు నిక్సన్ చైనా పర్యటనకు దీటైన మలుపుగా విశ్లేషకులు అభివర్ణిస్తున్న తాజా పరిణామం ద్వారా- 'ప్రపంచం గొప్ప మార్పును చూడబోతోంది' అంటూ ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించడం, నిజంగా అబ్బురం. అగ్రరాజ్యం దృష్టిలో అత్యంత దుర్మార్గంగా పేరుమోసిన ఉత్తర కొరియా రెచ్చగొట్టే ధోరణి మానుకోకపోతే దాన్ని సర్వనాశనం చేస్తామని ఐక్యరాజ్య సమితి వేదిక నుంచే డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం తెలిసిందే. తన ఎదురుగా టేబుల్ మీదే అణుమీట ఉంటుందని, ఒక్కసారి నొక్కితే అమెరికా మొత్తం బుగ్గిపాలవుతుందని ఈ ఏడాది తొలివేకువలో కిమ్ నిప్పులు చెరగడమూ తాజా జ్ఞాపకమే! అటువంటిది శీతకాల ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియాతో కలిసి ఒకే జట్టుగా పోటీల్లో పాల్గొంచుకున్న కిమ్ సౌహార్దం, తెర వెనక దౌత్యంతో మరింత విస్తరించి- ఏప్రిల్ చివరివారంలో ఉభయ కొరియాల స్నేహగీతాలాపనకు బాటలు కట్టించింది. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వాయుధ రహితంగా మార్చాలన్న శుభసంకల్పం ఉత్తర, దక్షిణ కొరియా అధినేతల భేటీలో వ్యక్తమైంది. నాటి పన్ముంజోమ్ ప్రకటనే నిన్నటి ట్రంప్-కిమ్‌ల చరిత్రాత్మక సమావేశానికి మేలుబాటలు పరిచింది. ఏ మాత్రం తేడా అనిపించినా తొలి నిమిషంలోనే లేచి వచ్చేస్తానని నిష్కర్షగా ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్- తన వయసులో సగం కూడా లేని కిమ్‌తో సౌహార్దాన్ని, అంతకుమించి గట్టి బాంధవ్యాన్ని ముడివేసుకోవడం అచ్చెరువు గొలుపుతోంది. ప్యాంగ్‌యాంగ్‌పై కత్తులు నూరినప్పుడల్లా దాని అణుకోరలు పీకడమే లక్ష్యమన్న ట్రంప్ సర్కారు- పన్ముంజోమ్ ప్రకటనను సరిపోలిన సంయుక్త సందేశాన్నే వెలువరించింది. ఉత్తర కొరియాకు భద్రతాపరమైన హామీలు ఇవ్వడానికి ట్రంప్ నిబద్ధత చాటినా- అవేమిటన్నది అగమ్యం. ప్యాంగ్‌యాంగ్ అణ్వస్త్ర సన్యాసం ఎప్పటికి పూర్తి అవుతుందన్నదీ అనూహ్యం. అయినా చీకటి గతానికి పాతరేసే కొత్త వేకువ కోసం సాగించే ప్రస్థానంలో తొలి అడుగుగా తాజా భేటీ ప్రాధాన్యం నిరుపమానం!

రెండో ప్రపంచయుద్ధం జర్మనీ విభజనకు, తూర్పు పశ్చిమాల నడుమ బెర్లిన్ కుడ్యం నిర్మాణానికే కాదు- కొరియా వేర్పాటుకు, ఉత్తర దక్షిణాల మధ్య పూడ్చలేనంత వైమనస్యాల అగాధాల సృష్టికీ కారణభూతమైంది. సోవియట్ యూనియన్ ప్రాపులో నియంతృత్వ దేశంగా ఎదిగిన ఉత్తర కొరియా- అణ్వస్త్ర సముపార్జనతోనే తన అస్తిత్వం ముడివడి ఉందని గట్టిగా తీర్మానించుకోవడానికి అమెరికా అగ్రవాదమూ కారణమైంది. ఆర్థిక ఆంక్షల చట్రంలో బిగించి ఉక్కిరిబిక్కిరి చెయ్యడం ద్వారా ప్యాంగ్‌యాంగ్‌ను రెండుసార్లు దారికి తేగలిగినా, ఒప్పందాల్ని ఉల్లంఘించి అది అణ్వస్త్ర సముపార్జన మార్గంలోనే కదం తొక్కింది. తొమ్మిది నెలల క్రితం ఉత్తర కొరియా ఆవిర్భావ వేడుకలకు ముందస్తు సన్నాహకంగా కిమ్ నిర్వహింపజేసిన ఉదజని బాంబు పరీక్ష- ప్రపంచ దేశాలన్నింటినీ కలవరపరిచింది. దాని వెన్నంటి ఖండాంతర క్షిపణి పరీక్షలతో అగ్రరాజ్యమూ తమ అగ్నివృష్టి పరిధిలోనే ఉందన్న కిమ్ హెచ్చరికలతో వాతావరణం ఉద్రిక్తంగా వేడెక్కగా, ఉత్తర కొరియా వినాశాన్ని ట్రంప్ ప్రస్తావించడంతో మరో ప్రపంచ యుద్ధంపై భయసందేహాలు దట్టంగా ముసురుకొన్న వేళ అది. అవన్నీ తేలిపోయి, కొరియాల మధ్య సరికొత్త సాన్నిహిత్యం పెనవేసుకొని, అగ్రరాజ్యంతో కిమ్ తాజా జుగల్‌బందీ సాగడానికి తెరవెనక చైనా ప్రోద్బలం ఎంతో ఉంది. సింగపూర్ సమావేశానికి కిమ్, చైనా ప్రధాని అధికారిక విమానంలో రావడమే- భౌగోళిక రాజకీయాల్లో గాలిమార్పును సూచిస్తోంది. అగ్రరాజ్యం ముక్కుపిండి అణ్వస్త్ర దేశంగా తాను కోరుకున్నవన్నీ సాధించుకోగలననుకొన్న కిమ్, ఉత్తర కొరియా మెడలు వంచి తన దారికి తెచ్చుకోవాలనుకొన్న ట్రంప్- ఇద్దరూ మధ్యేమార్గంలో శుభ సంకల్పాల వల్లెవేతకే పరిమితం కావడం, మున్ముందు సాగే చర్చలు ఎంత సంక్లిష్టభరితం కానున్నాయో వెల్లడిస్తోంది!

లాభసాటిగా బేరమాడే సామర్థ్యం పుట్టుకతోనే వస్తుందనే ట్రంప్- 1987లో ఓ పాత్రికేయుడితో కలిసి 'ది ఆర్ట్ ఆఫ్ ది డీల్' (ఒప్పందం కుదుర్చుకునే కళ) పేరిట ఓ పుస్తకమే రచించారు. ఎంతో దురుసుగా, మరెంతో కఠినంగా వ్యవహరించనిదే సరైన ఒడంబడిక రూపుదాల్చదని చెప్పిన ట్రంప్ వ్యాపార సూత్రం- తాజా సంయుక్త ప్రకటనలో కనబడటం లేదు. ఉత్తర కొరియా తన అణ్వస్త్రాలను పూర్తిగా, పర్యవేక్షణకు లోబడి, మళ్ళీ అభివృద్ధి చేసే ఆస్కారం లేకుండా ధ్వంసం చేసెయ్యాలన్నది అమెరికా ప్రభుత్వ ప్రకటిత విధానం. దాని స్థానంలో- కొరియా ద్వీపకల్పాన్ని అణ్వాయుధ రహితం చెయ్యాలన్న పన్ముంజోమ్ సంకల్పం వచ్చి చేరడం గమనార్హం. దక్షిణ కొరియాతో సంయుక్త యుద్ధ విన్యాసాలకు సిద్ధపడి ప్యాంగ్‌యాంగ్‌పై వైరాన్ని అమెరికా బహిరంగపరచిన నేపథ్యంలో, ఆత్మరక్షణ కోసం కఠిన వర్తనతో స్పందించే హక్కు తమకు ఉందని ఉత్తర కొరియా లోగడ పలుమార్లు స్పష్టీకరించింది. తాజాగా ట్రంప్ ప్రకటన అనుసారం- ఉద్రిక్తతల్ని పెంచే యుద్ధ విన్యాసాలకు అమెరికా చరమగీతం పాడనుంది. ఉభయ దేశాల ప్రజల శాంతి సౌభాగ్య ఆకాంక్షలకు దీటుగా కొత్త బాంధవ్యాన్ని ముడివేసుకోవాలని, కొరియా ద్వీపకల్పంలో సుస్థిర చిరశాంతి నెలకొనేలా చూడాలని, అణు నిరాయుధీకరణకు నిబద్ధం కావాలని తాజా ఒడంబడిక చాటుతోంది. దక్షిణ కొరియా, జపాన్లకు అమెరికా సమకూర్చిన అణ్వస్త్ర రక్షణ ఛత్రంపైనా, దక్షిణ కొరియాలో ఉన్న 28 వేల పైచిలుకు అమెరికా సైనికుల ఉపసంహరణ మీదా మునుముందు ఉత్తర కొరియా పట్టుబట్టే అవకాశం ఉంది. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ మాటల్లో చెప్పాలంటే- అధినేతలిద్దరూ ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో అరమరికల్లేకుండా ముందడుగేసినా తుది పరిష్కారానికి ఎన్నేళ్లు పడుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది!

సమాఖ్య స్ఫూర్తే ప్రగతి మంత్రం

కేంద్ర రాష్ట్ర సంబంధాలు

ఆచార్య కోదాటి వియ్యన్నరావు

స్వాతంత్ర్యానంతరం కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఎలా ఉండాలన్న విషయంలో ఎడతెగని చర్చ జరుగుతూనే ఉంది. ఒక దశలో 'కేంద్రం' అన్న భావనే 'మిథ్య' అనే స్థాయికీ చర్చల తీవ్రత వెళ్ళింది. వివిధ అధికరణలను లోతుగా అధ్యయనం చేస్తే, రాజ్యాంగ నిర్మాతలు ఒక ప్రత్యేక లక్ష్యాన్ని ఆశించే కేంద్రానికి ఎక్కువ అధికారాలు కట్టబెట్టినట్లు అర్థమవుతుంది. కేంద్రంలో, రాష్ట్రాల్లో వేర్వేరు రాజకీయ పార్టీలు అధికారంలో ఉంటే ఈ సమస్య జటిలమవుతోంది. గవర్నర్ల నియామకం మొదలు పన్ను ఆదాయ పంపిణీ వరకు అనేక అంశాలపై దిల్లీకి, రాష్ట్రాలకు మధ్య వివాదాలు ముదురుతున్నాయి. సంకీర్ణ ప్రభుత్వాల శకం మొదలైనప్పటినుంచీ సమస్యలు మరింత ఉద్ధృతమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను నిర్దేశించే ప్రతి రాజ్యాంగ అధికరణపైనా సుదీర్ఘ చర్చ జరుగుతోంది. ఇరుపక్షాల మధ్య సయోధ్య పాదుగొల్పేందుకు, రాష్ట్రాలకు సమన్యాయం అందించేందుకు అనువుగా కేంద్ర సర్కారు వివిధ సంఘాలను నియమించింది. వాటిలో సర్కారియా, పూంఛీ కమిషన్లు ముఖ్యమైనవి. ఈ కమిటీలు వివిధ అంశాలను కూలంకషంగా అధ్యయనం చేసి విలువైన సూచనలు చేశాయి. నిపుణుల కమిటీలు అందించిన సూచనల అమలుకు కేంద్రం ముందుకు రాకపోవడమే అసలు సమస్య.

సిఫార్సులు బుట్టదాఖలు

సహకార సమాఖ్య విధానమే భారత్ నిర్దేశించుకున్న పంథా. ఆ క్రమంలో దిల్లీకి, రాష్ట్రాలకు మధ్య తలెత్తే సంక్లిష్ట సమస్యలను ఆచరణాత్మకంగా పరిష్కరించుకునే విధానంపై సర్కారియా, పూంఛీ కమిటీలు ఎన్నో విలువైన సూచనలు చేశాయి. 1983లో నాటి భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జస్టిస్ సర్కారియా నేతృత్వంలో సంఘాన్ని నియమించింది. అంతకు మునుపు పరిపాలన సంస్కరణల సంఘం (1969), డాక్టర్ పీవీ రాజమన్నార్ కమిటీ (1971)లు సైతం కేంద్ర రాష్ట్ర సంబంధాలపై తమ అభిప్రాయాలు వినిపించాయి. అయినప్పటికీ ఈ విషయంలో సర్కారియా కమిషన్‌నే సాధికార సంఘంగా పరిగణిస్తుంటారు. వివిధ సంక్లిష్ట అంశాలను లోతుగా విశ్లేషించి, సూచనలు, సలహాలతో 1,600 పేజీల సమగ్ర నివేదికను ఆ కమిటీ 1988లో కేంద్రానికి అందజేసింది. ఆ నివేదికలో 247 ప్రత్యేక సూచనలున్నాయి. జాతీయ ప్రాముఖ్యం ఉన్న అంశంపై కేంద్ర ప్రభుత్వం చట్టం చేసేటప్పుడు రాష్ట్రాలను తప్పనిసరిగా రాష్ట్రాలను సంప్రతించాలని, అందుకోసం అంతర్ ప్రభుత్వ మండలిని (ఇంటర్ గవర్నమెంటల్ కౌన్సిల్) ఉపయోగించుకోవాలని కమిషన్ సూచించింది. పన్నులు విధించడానికి సంబంధించిన అవశేష (రెసిడ్యూరి) అధికారాలు కేంద్రానికే దఖలు పడతాయి. రాష్ట్రాలు శాసనమండళ్లను ఏర్పాటు చేయదలచుకొన్నప్పుడుగాని, రద్దుపరచదలచుకొన్నప్పుడుగాని ఆ విషయాన్ని నిర్దిష్ట కాలపరిమితిలోగా పార్లమెంటు పరిగణనకు పంపాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని 256, 257, 365 అధికరణల ద్వారా కేంద్రం తనకు సంక్రమించిన అధికారాలను, అత్యంత జాగరూకతతో ఉపయోగించాలని, ముఖ్యంగా తప్పిదాలకుగాను ఏదైనా రాష్ట్రంపై కొరడా ఝుళిపించాల్సి వస్తే అన్ని రకాల ప్రక్రియలూ పూర్తయ్యాక దాన్ని ఆఖరి అస్త్రంగానే ప్రయోగించాలని కమిషన్ సూచించింది. గవర్నర్ల నియామకంలో ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌లను సంప్రతించేందుకు అనువుగా రాజ్యాంగంలోని 155వ అధికరణను సవరించవలసిందిగా సూచించింది. గవర్నరుగా నియమితులయ్యే వ్యక్తికి ఉండవలసిన అర్హతలు, ముఖ్యమంత్రిని నియమించే సందర్భంలో అనుసరించవలసిన విధానాలనూ ఆ సంఘం స్పష్టీకరించింది. అఖిల భారత సర్వీసులకు సంబంధించి నియామకం, సర్వీసు నిబంధనలు కేంద్రం పరిధిలోనే ఉండాలని; ఆ అధికారులపై రాష్ట్రాలు విచక్షణరహితంగా తమ అధికారాలు ఉపయోగించరాదని సూచించింది. ఇక రాజ్యాంగంలోని 263 అధికరణను ఉపయోగించి అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి. మరోవంక జాతీయ అభివృద్ధి మండలి (ఎన్‌డీసీ)కి- జాతీయ ఆర్థిక, అభివృద్ధి మండలి (ఎన్‌ఈడీసీ)గా నామకరణం చేయాలి. పార్లమెంటుగాని, రాష్ట్ర చట్టసభలుగాని పంపిన బిల్లులను ప్రభుత్వం దీర్ఘకాలం నాన్చరాదు.

గడచిన మూడు దశాబ్దాల్లో కేంద్రంలో అధికారం చేపట్టిన ఏ ప్రభుత్వమూ సర్కారియా కమిషన్ సూచనల అమలుపై శ్రద్ధ వహించలేదు. రాష్ట్రాల్లో తలెత్తిన అనిశ్చితిని కేంద్రంలోని ప్రభుత్వాలు అవకాశంగా మలచుకొన్న సందర్భాలే ఎక్కువ. నిధుల పంపిణీలో, గ్రాంట్ల మంజూరులో కేంద్రం పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని దీర్ఘకాలంగా రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలైన బిహార్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలకు ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా విడుదల చేస్తున్న నిధులతో పోలిస్తే- మిగిలిన రాష్ట్రాలకు విదిలిస్తున్నది అత్తెసరు! కేంద్ర ప్రభుత్వ వైఖరిపట్ల రాష్ట్రాల్లో భయానుమానాలు మొలకెత్తడానికి ఇలాంటి పరిణామాలే కారణమవుతాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలూ నిధుల మంజూరులో కేంద్ర ధోరణిపట్ల అసంతృప్తిగానే ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకొనే విషయంలో కేంద్రం దారుణ వైఫల్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గట్టిగా ఎండగడుతోంది. రాజధాని నిర్మాణం, ఇతర వసతుల కల్పనలో ఏపీ వెనకబాటుకు కేంద్రం ఉదాసీన వైఖరే కారణమన్నది రాష్ట్రప్రభుత్వ వాదన. గవర్నర్ల నియామకం, కొనసాగింపు, వారి పాలనశైలిపట్ల సైతం వివాదాలు రాజుకొంటున్నాయి. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో గవర్నర్ల తీరుతెన్నులు కొత్త చర్చలకు అంటుకడుతున్నాయి. సర్కారియా కమిషన్ సూచనలు దాదాపుగా బుట్ట దాఖలయ్యాయన్న విషయాన్ని రుజువు చేస్తున్న పరిణామాలివి. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అందివచ్చిన అవకాశాలను రాజకీయంగా తమకు అనుకూలంగా మలచుకోవడంపై చూపుతున్న శ్రద్ధ- ప్రజాస్వామ్య మూల విలువలను నిలబెట్టడంపై కనబరచడం లేదు. దశాబ్దాలు గడచినా, ప్రభుత్వాలు మారినా- కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలు మెరుగుపడకపోవడానికి ఇదే కారణం. ఐక్య ప్రగతిశీల కూటమి ప్రభుత్వం 2004లో ప్రకటించిన కనీస ఉమ్మడి కార్యక్రమం (కామన్ మినిమమ్ ప్రోగ్రామ్)లో కేంద్ర రాష్ట్ర సంబంధాలను పునర్నిర్వచించాల్సిన అవసరాన్ని వెల్లడించింది. ఆ క్రమంలోనే 2007 ఏప్రిల్‌లో జస్టిస్ ఎం.ఎం. పూంఛీ ఆధ్వర్యంలో సంఘాన్ని నియమించింది. ఇరుపక్షాలతో ముడివడిన అనేక అంశాలను సాకల్యంగా అధ్యయనం చేసిన పూంఛీ కమిటీ ఏడు భాగాలు, 273 సూచనలతో విస్తృత నివేదికను అందించింది.

అరకొరగా నిర్ణయాల అమలు

రాజ్యాంగంలోని 355, 356 అధికరణల ప్రకారం రాష్ట్రపతి పాలనను, విధింపును కేవలం సమస్యాత్మక ప్రాంతానికి లేదా జిల్లాకు మాత్రమే పరిమితం చేయాలని కమిషన్ సూచించింది. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వ సూచనలకు కట్టుబడకుండా వ్యవహరించే మంత్రులపై కేంద్రం విచారణకు ఆదేశించవచ్చు. రాష్ట్రాల్లో శాంతిభద్రతలు అదుపు తప్పితే కేంద్ర బలగాలను దిల్లీ స్వేచ్ఛగా ఉపయోగించవచ్చు. గవర్నర్ల వ్యవస్థకు తగిన గౌరవాన్ని కల్పించడంతోపాటు, వారి నియామకం తొలగింపునకు సంబంధించి నిర్దిష్ట నిబంధనలు పాటించాలని, ముఖ్యమంత్రుల మాటకు విలువ ఇవ్వాలని సూచించింది. గవర్నర్ల విచక్షణాధికారాలు తగ్గిస్తూ 163 (2) అధికరణకు తగిన సవరణలు చేయాలని స్పష్టం చేసింది. జాతీయ సమగ్రత మండలి (నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్) ఏడాదికి కనీసం ఒకసారైనా సమావేశం జరపాలని సూచించింది. కేంద్ర, రాష్ట్ర సంబంధాల మెరుగుదలకు నిర్మాణాత్మక సూచనలు చేసిన పూంఛీ కమిషన్ నివేదిక సైతం దాదాపుగా బుట్ట దాఖలే అయింది. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకొని, మెరుగుపరచేందుకు వీలుగా ఏర్పడిన అంతర్రాష్ట్ర మండలి ఆశించిన ప్రగతి సాధించలేదు. అయితే అంతర్ రాష్ట్రమండలి స్థాయీసంఘం సమావేశాలు తరచూ జరగడం గుడ్డిలో మెల్ల. కేంద్రంతోపాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సభ్యత్వం కలిగిన అంతర్రాష్ట్ర మండలి ఇప్పటివరకూ పదకొండు సమావేశాలు జరుపుకొంది. ఎన్డీయే ప్రభుత్వ చొరవతో పదేళ్ల విరామం తరవాత (2006 అనంతరం) 2016 జులైలో అంతర్రాష్ట్ర మండలి పదకొండో సమావేశం జరిగింది. అంతర్రాష్ట్ర మండలి స్థాయీసంఘమూ ఇప్పటివరకు పదమూడుసార్లు సమావేశమైంది. ఈ సమావేశాల్లో పూంఛీ కమిషన్ సిఫార్సులపైనే ప్రధానంగా చర్చ జరపడం విశేషం.

కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై తొలిసారిగా ప్రత్యేక దృష్టి సారించి, విలువైన సూచనలు చేసిన సర్కారియా కమిషన్ నివేదికలోని అంశాలనూ చర్చల్లో అంతర్భాగంగా మార్చి సమగ్ర పరిష్కారాలను అన్వేషిస్తే బాగుంటుంది. రాజకీయ అవసరాలే కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు ఆధారభూతంగా మారుతున్న ప్రస్తుత వాతావరణం ఏమాత్రం వాంఛనీయం కాదు. రాజకీయ లక్ష్యాలకు భిన్నంగా సమగ్ర దృక్పథంతో సమాఖ్య స్ఫూర్తికి పట్టం కట్టినప్పుడే సిసలైన దేశాభివృద్ధి సాధ్యపడుతుంది. ఆ క్రమంలో సర్కారియా, పూంఛీ కమిషన్ల నివేదికలను సాకల్యంగా విశ్లేషించి కేంద్ర, రాష్ట్ర సంబంధాల విషయంలో దిద్దు'బాట' పట్టాలి!

(రచయిత- పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

మన్నన దక్కని మేలిమి సూచనలు

1.రాజమన్నార్ కమిటీ (1969)

అంతర్రాష్ట్ర మండలిని తక్షణం ఏర్పాటు చేయాలని ఈ కమిటీ ప్రతిపాదించింది. ఈ 'మండలి'ని సంప్రదించకుండా రాష్ట్రాలను ప్రభావితం చేసే ఏ నిర్ణయాలను కేంద్రం తీసుకోరాదని స్పష్టం చేసింది. రాష్ట్రాలతో ముడివడిన ఏ బిల్లునైనా తొలుత అంతర్రాష్ట్ర మండలికి పంపిన తరవాతే- పార్లమెంటులో ప్రవేశపెట్టాలని సూచించింది. శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పిన అత్యవసర పరిస్థితుల్లో తప్ప 356 అధికరణను రాష్ట్రాలపై ప్రయోగించరాదని సిఫార్సు చేసింది.

2.ఆనందపూర్ సాహిబ్ తీర్మానం (1973)



రక్షణ, విదేశ వ్యవహారాలు, టెలి కమ్యూనికేషన్లు, మారకం వంటి విషయాలకు మాత్రమే కేంద్ర నిర్ణయాధికార పరిధి ఉండాలని ఈ తీర్మానం స్పష్టం చేసింది. ఇతర అధికారాలన్నీ రాష్ట్రాల చేతుల్లోనే ఉండాలని సూచించింది. ప్రతి రాష్ట్రానికీ కేంద్రం వద్ద సమాన అధికారం ఉంటుందని స్పష్టం చేసింది.

3. పశ్చిమ్ బంగ మెమొరాండం (1977)

రాజ్యాంగంలో 'కేంద్రం' అన్న పదం స్థానే 'సమాఖ్య' (ఫెడరేషన్) పదాన్ని చేర్చాలి. రాజ్యాంగంలోని 356, 357, 360 అధికరణలను తొలగించాలి. కేంద్రం సముపార్జించే రెవెన్యూలో 75 శాతాన్ని రాష్ట్రాలకు కేటాయించాలి. లోక్‌సభతోపాటు రాజ్యసభకూ సమాన అధికారాలుండాలి.

4.సర్కారియా కమిషన్ (1983)

కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాల్లో సహకార సమాఖ్య స్ఫూర్తి ప్రతిఫలించాలి. జాతి ఐక్యత, సమగ్రతకు బలమైన కేంద్రం ఉండాలి. శాశ్వత అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి. ఉమ్మడి జాబితాకు సంబంధించిన ఏ అంశంలో చట్టం చేయాలన్నా కేంద్రం తొలుత రాష్ట్రాలను సంప్రదించాలి. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయాలి.

5.ఎం.ఎం.పూంఛీ కమిషన్ (2007)



ఉమ్మడి జాబితాకు సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకొనే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంతర్రాష్ట్ర మండలి వేదికగా నిరంతరం సంప్రదింపులు జరగాలి. ముఖ్యమంత్రుల నియామకంపై గవర్నరుకు నిర్దిష్టమైన సూచనలు చేయాలి. గవర్నర్ అధికారాలు ఎట్టి పరిస్థితుల్లోనూ దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలి. గవర్నర్లను విశ్వవిద్యాలయాల ఛాన్సెలర్లుగా నియమించే సంస్కృతికి చరమగీతం పాడాలి. 355, 356 అధికరణల్లో సవరణలు తీసుకురావాలి. జాతీయ సమగ్రత మండలికి కోరలు తొడగాలి.

జనసమ్మేళనంతోనే సుహృద్భావం

సందీప్ పాండే

భారత్-పాకిస్థాన్‌ల మధ్య మొదటి నుంచీ సంబంధాలు అంతంత మాత్రమే. కొన్ని సందర్భాల్లో పరిస్థితులు వికటించి యుద్ధాలకు సైతం దారితీశాయి. ప్రజలు మాత్రం శాంతిని కోరుకుంటున్నారు. ఘర్షణలు కొనసాగాలని, సైనికులు తూటాలకు బలి కావాలని వారు ఎంతమాత్రం కోరుకోవడం లేదు. రెండువైపులా పరస్పర కాల్పుల కారణంగా నేలకొరుగుతున్న సైనికుల్లో ఎక్కువమంది మధ్యతరగతి, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినవారే కావడం గమనార్హం. తాము కావాలనుకున్నప్పుడు ఉభయ దేశాల అధినేతలు కలుసుకుంటున్నారు. అదే అవకాశం ప్రజలకు మాత్రం లభించడం లేదు. 2015 డిసెంబరులో ప్రధాని నరేంద్ర మోదీ అఫ్గానిస్థాన్ నుంచి తిరిగి వస్తూ మార్గమధ్యంలో ఆకస్మికంగా పాకిస్థాన్‌లో ఆగి అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంట్లో జరిగిన ఓ శుభ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్), భారత్‌కు చెందిన 'రా' (రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్) మాజీ అధిపతులు అసద్ దురానీ, అమర్జిత్ సింగ్ దులత్, ఇరుదేశాల జాతీయ భద్రతా సలహాదారులు లెఫ్టినెంట్ జనరల్ నసీర్‌ఖాన్ జంజువా, అజిత్ దోవల్ చర్చించుకునేందుకు మూడో దేశంలో సమావేశం అవుతున్నారు. భారత పారిశ్రామికవేత్త అదానీ నాలుగువేల మెగావాట్ల విద్యుత్తును పాకిస్థాన్‌కు విక్రయించేందుకు ఆసక్తిగా ఉన్నారు.

బహుళ ప్రయోజనాలు

పాకిస్థాన్‌తో గల సరిహద్దు రాష్ట్రాల్లో ఒక్క గుజరాత్‌లో పరిస్థితులు ఉన్నంతలో ప్రశాంతంగా ఉన్నాయి. అలాంటప్పుడు ఉత్తర సరిహద్దుల్లో సైనికులు ఒకరినొకరు చంపుకోవడం ఎందుకు? చైనా సరిహద్దుల్లో భారత సైనికులు మృతి చెందినట్లు ఎప్పుడూ వినలేదు. ఇదే పరిస్థితి పాకిస్థాన్ సరిహద్దులో ఎందుకు లేదు? ప్రభుత్వాధినేతలు, నిఘా సంస్థల అధిపతులు, భద్రతా సలహాదారులు పరస్పరం మాట్లాడుకుంటున్నప్పుడు ప్రజలకు మాత్రం అలాంటి అవకాశం ఎందుకు ఉండరాదన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. రెండు దేశాల మధ్య వివాదాన్ని ప్రభుత్వాలు పరిష్కరించలేనప్పుడు, ప్రజలు చొరవ తీసుకోవడం మంచిదే. ప్రజలను కలుసుకోవడానికి అనుమతిస్తే కొంతకాలానికి వారి మధ్య శాంతి సుహృద్భావాలు ఏర్పడతాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా పాస్‌పోర్టు, వీసా తదితర పత్రాల మంజూరు నిబంధనలను ప్రభుత్వాలు సులభతరం చేయాలి. ప్రజలు కలుసుకున్నప్పుడు తమ తమ సంస్కృతులు, సంప్రదాయాల గురించి చర్చించుకుంటారు. తద్వారా ప్రభుత్వాలు విఫలమైనచోట వారు కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది.

జమ్మూకశ్మీర్‌లో శ్రీనగర్-ముజఫరాబాద్; పంజాబ్‌లో అట్టారి-వాఘా; రాజస్థాన్‌లో మునాబో-ఖోక్రాపర్‌ల మధ్య రెండు దేశాల సరిహద్దులు విస్తరించి ఉన్నాయి. గుజరాత్ పరిస్థితి వేరు. ఇక్కడ సరిహద్దులో కొంతప్రాంతం సముద్రతీరం ఉంది. సముద్రంలో చేపలు పట్టడానికి వెళ్లిన మత్స్యకారులు పరిధులు దాటారంటూ ఉభయ దేశాలు వారిని అరెస్టు చేసి జైలులో పెడుతుంటాయి.

పాక్ సరిహద్దుల్లో ప్రశాంతతకు మార్గం

రాష్ట్రంలోని భుజ్, కచ్ సరిహద్దు ప్రాంతాల ప్రజలు పాక్‌తో సత్సంబంధాల కోసం ఎదురు చూస్తున్నారు. భారత్‌లోని గుజరాత్, పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్ మధ్యగల ఖవ్డా లేదా నాదాబెట్ వద్ద గల సరిహద్దు తెరిచినట్లయితే ప్రజలు కలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. పర్యాటకంగా, వ్యాపారపరంగా అభివృద్ధి చెందడానికి వీలుంటుంది. శాంతి, స్నేహం వికసిస్తాయి. ఇరుదేశాల జైళ్లలో ఉన్న జాలర్లను విడుదల చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా సరిహద్దులను తెరవాల్సిన అవసరం ఉంది. అన్ని సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలను కలుసుకోవడానికి అనుమతిస్తే వారి మధ్య శాంతి, స్నేహం, సామరస్యం వికసిస్తాయి. రెండు దేశాల మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న అపరిష్కృత సమస్యలు కొలిక్కిరావడానికీ అవకాశం ఉంటుంది. రక్షణ వ్యయమూ తగ్గుతుంది. తద్వారా ఆదా అయ్యే నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవచ్చు. దీనివల్ల రెండు రెండు పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.

మారుతున్న ప్రపంచం

సుదీర్ఘకాలంగా ఉప్పునిప్పుగా ఉన్న ఉత్తర, దక్షిణ కొరియాలు తమ శత్రుత్వానికి చరమగీతం పాడుతున్నప్పుడు, దక్షిణాసియా ఇరుగు పొరుగు దేశాలైన భారత్, పాకిస్థాన్‌లు ఆ పని ఎందుకు చేయలేవు? వాఘా-అట్టారీ మధ్య రోజూ సాయంత్రం వేళల్లో నిర్వహించే సైనిక కవాతుకు బదులు ప్రజలు కలుసుకునేందుకు అనుమతించాలి. దీనివల్ల ప్రజల్లో శాంతి, సామరస్యం, స్నేహం పెంపొందుతాయి. తమ సంస్కృతులను ఒకరికొకరు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఒక్క వాఘాలోనే కాకుండా అన్ని సరిహద్దు ప్రదేశాల్లో ఇలాంటి శాంతి కార్యక్రమాలను నిర్వహించాలి. ఇందుకు సంబంధించిన 'నమూనా శాంతి ఉత్సవాన్ని' 2016-17లో గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రూపొందించారు. సరిహద్దుల్లో ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు వీలుగా అన్ని నిబంధనలను తొలగించాలి. అది మానవత్వానికి మేలు చేయడమే అవుతుంది.

గుజరాత్‌లో ఈ నెల 19 నుంచి 30 వరకు భారత్-పాకిస్థాన్ శాంతి-స్నేహ ప్రదర్శన నిర్వహించనున్నారు. అహమ్మదాబాద్ నగరంలోని సబర్మతీ ఆశ్రమం నుంచి 290 కిలోమీటర్ల దూరంలో పాకిస్థాన్ సరిహద్దులోని నాడాబెట్ వరకు ఇది కొనసాగుతుంది. పాకిస్థాన్-భారత్ పీపుల్స్ ఫోరం ఫర్ పీస్ అండ్ డెమోక్రసీ, అఘజ్-ఇ-దోస్తీ, మైనారిటీ కోఆర్డినేషన్ కమిటీ (గుజరాత్), గుజరాత్ లోక్‌సమితి, బంధ్‌కామ్ మజ్దూర్ సంఘటన్, పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లేబర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (కరాచీ), నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్, ముంబయి సర్వోదయ మండల్, ఝార్ఖండ్ నాగ్రిక్ ప్రయాస్, హమారీ ఆవాజ్, ఇన్సాఫ్ ఫౌండేషన్, గుజరాత్ మజ్దూర్ పంచాయత్ తదితర సంస్థల ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరగనుంది. ఒకప్పుడు ఐరోపా దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. వాటి మధ్య గల శత్రుత్వం ప్రపంచ యుద్ధానికి దారితీసింది. ఆ తరవాత అవి అడ్డంకులను అధిగమించాయి. దేశాల మధ్య ప్రజల రాకపోకలపై నిషేధాన్ని తొలగించాయి. ఒక సంఘంగా ఏర్పడి కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాయి. దక్షిణాసియాలో సైతం అలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడకూడదు? ప్రపంచంలోని అయిదు ప్రాంతాల్లోని వంద దేశాలు అణ్వస్త్ర రహిత ఒప్పందంపై సంతకాలు చేసినప్పుడు, భారత్-పాకిస్థాన్‌లు ఆ పని ఎందుకు చేయలేవు?

(రచయిత- రామన్ మెగసెసె అవార్డు గ్రహీత)

ముందుచూపు

మనుషులు విధిచేతిలో కీలుబొమ్మలు. భావాలకు, కాలానికి వారు బందీలు. దగ్గర్లోని ప్రమాదాలను కూడా వారు పసిగట్టలేరు. జరగబోయేవి ఏమిటో అసలే తెలియదు.

శ్రీకృష్ణుడి లాంటి అవతార పురుషులు మానవరూపంలో ఉండి, వర్తమానాన్ని దాటి భవిష్యత్తుకు అవసరమయ్యే ప్రణాళికలు వేసుకోగలిగేవారు. మనకు దివ్యశక్తులు లేకపోవచ్చు. ముందు ఆలోచన, ముందుచూపు ఉండాలి. ఓపిగ్గా మన పనులు సాధించుకోవడానికి దేవతలకున్నంత శక్తి మనకూ ఉండాలని కోరుకోవాలి.

భవిష్యత్తు గురించి ముందుగా ప్రణాళికలు వేసుకుని పనిచేసే సామర్థ్యం చాలామందికి ఉండదు. ఎందుకంటే మనం వర్తమానానికి బందీలం. పక్కనేఉన్న ప్రమాదాలను, సంతోషాలను అధిగమించి పనిచెయ్యడం ఒక గొప్ప శక్తి. వెనక్కి తగ్గే స్వభావాన్ని విడిచిపెట్టాలి. కళ్లకు కనిపించేదానికన్నా భవిష్యత్తులో గొప్పవి జరగబోతున్నాయని ఊహించడం నేర్చుకోవాలి.

సాధారణంగా మనం తప్పులు చెయ్యడానికి కారణం- మన దగ్గరగా ఉన్న ప్రమాదాలకు భయపడటం, దూరంగాఉన్న ప్రమాదాలను పట్టించుకోకపోవడం! వాటినిగాని మనం ముందుగా ఊహించి అంచనా వెయ్యగలిగితే చాలా పొరపాట్లు నివారించవచ్చు.

ఒకవేళ అనుకోని ప్రమాదం ఏదైనా ఎదురైతే, దాన్ని తెలివిగా మనకు అనుకూలంగా మార్చుకోవాలి. ఆంజనేయుడి తోకకు రావణాసురుడు నిప్పు పెట్టాడు. లంకలో రాక్షసులంతా తెగ ఆనందపడిపోయారు, హనుమంతుడు కాలి బూడిదైపోతాడని. అలా జరగలేదు. లంకనే తన తోకతో తగలబెట్టాడు హనుమంతుడు. ప్రమాదాన్ని తనకు అవకాశంగా ఉపయోగించుకుని చరిత్రలో ఒక గొప్ప రసవత్తరమైన ఘట్టంగా మలిచాడు ఆయన.

అంతర్యామి

అసలైన శక్తి మనంచేసే పనుల్లోకన్నా ఇంకా చెయ్యవలసిన పనుల్లోనే ఉంటుంది. పని చేసేముందు వివరంగా ఒక ప్రణాళిక వేసుకోవాలి. అస్పష్టంగా వేసుకున్న ప్రణాళికలు ఉంటే గింటే అవి మనకు సమస్యలు తెచ్చి పెట్టకుండా చూసుకోవాలి. స్పష్టత ఉంటే ఆందోళన, భయం ఉండవు. అందుకే ప్రణాళికను చివరి దాకా వేసుకోవాలి.

వర్షకాలం వల్ల శ్రీరాముడు విరామం తీసుకున్నాడు. గుహలో గడిపాడు. వానకాలం దాటిన తరవాత లక్ష్మణుడు సుగ్రీవుడి వద్దకు వెళ్లాడు. చేసిన వాగ్దానం గుర్తుకు తెచ్చాడు. చేసిన మేలు మరచిపోవద్దని చెప్పాడు. సుగ్రీవుడు సుఖాల్లోంచి బయటకొచ్చాడు. హనుమంతుడు, అంగదుడు తదితర వీరులందరినీ సిద్ధంచేశాడు. అన్ని వైపుల నుంచి సీతాన్వేషణకు ప్రణాళికలు రచించారు. సీతమ్మ వారిని కనుగొని, చివరకు శ్రీరామపట్టాభిషేకం అనే అద్భుతమైన ముగింపు ఇచ్చాడు హనుమంతుడు. పనులు ప్రారంభించేటప్పుడు వ్యవహారం నడిపేది మనం. వాటిని ఒక పద్ధతిలో నడిపించేది మనమే. ఒకసారి అవి ప్రారంభమయ్యాక, చాలాసార్లు అవే మనకు దారి చూపిస్తాయి. మన లక్ష్యాన్ని నెరవేరుస్తాయి!

- ఆనందసాయి స్వామి

మధుమేహుల కోసం సహాయక కేంద్రం

హైదరాబాద్, న్యూస్‌టుడే: మధుమేహగ్రస్తుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హైదరాబాద్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబరు 1800 121 2096ను ఆరంభించింది. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ సందేహాలను ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చు. ది క్వీన్ ఎలిజబెత్ డైమండ్ జూబ్లీ ట్రస్టు సహకారంతో చేపట్టిన ఈ సేవలను మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ హైదరాబాద్‌లో ప్రారంభించారు.

भारतीय विमानपत्तन प्राधिकरण
AIRPORTS AUTHORITY OF INDIA
Southern Region, Chennai - 600 027.

ప్రకటన నం. SR/01/2018

సదరన్ రీజియన్‌లో వివిధ పోస్టుల కోసం ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్

సదరన్ రీజియన్‌లోని తమిళ నాడు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి లేదా లక్షద్వీప్ ద్వీపాల్లోని వివిధ విమానాశ్రయాల్లో కింద పేర్కొన్న నియామకాల కోసం సదరు రాష్ట్రాల్లో స్థిర నివాసం ఉంటున్న అభ్యర్థుల నుంచి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

వ.సం.	పోస్టు పేరు, గ్రేడ్ & పోస్టు స్వభావం	పోస్టుల సంఖ్య	రిజర్వేషన్				స్కేల్ ఆఫ్ పే (ప్రీ-రివైజ్డ్)
			UR	OBC (NCL)	SC	ST	
1	జూనియర్ అసిస్టెంట్ (ఫైర్ సర్వీస్)	147	92	11	23	21	12500-28500/-
2	సీనియర్ అసిస్టెంట్ (ఎలక్ట్రానిక్స్)	39	23	08	05	03	14500-33500/-

కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రాలు: చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిన్, విజయవాడ.

అవసరాలని బట్టి ఖాళీలు పెంచడం లేదా తగ్గించే హక్కుని AAI కలిగి ఉంటుంది. అవసరమైన పక్షంలో, ఎలాంటి కారణాలు చూపకుండానే నియామక ప్రక్రియని మార్చడం/నియంత్రించడం/రద్దు చేయడం లాంటి అధికారాలను కూడా AAI కలిగి ఉంటుంది. ఈ విషయంలో మేనేజ్‌మెంట్‌దే తుది నిర్ణయం. ఇతర ఎలాంటి అభ్యర్థనలు పరిశీలించబడవు.

అభ్యర్థులు AAI వెబ్‌సైట్ https://www.aai.aero/en/careers/recruitment ద్వారా 'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకోవాలి. సూచనలు జాగ్రత్తగా చదివిన తర్వాతే, దరఖాస్తు చేయాలి. ఏదైనా పోస్టుకి దరఖాస్తు చేసేముందు, అతను/ఆమె అవసరమైన అర్హతలు మరియు ఇతర ప్రమాణాలు కలిగి ఉన్నారా అని సరిచూసుకోవాలి. ఇతర రూపాల్లోని దరఖాస్తులు అంగీకరించబడవు. దరఖాస్తుకి సంబంధించిన ఏ పత్రాలు AAIకి పంపాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ మోడ్‌లో చేయని దరఖాస్తు మరియు ఫీజు అంగీకరించబడదు. జూనియర్ అసిస్టెంట్ (ఫైర్ సర్వీస్)కి దరఖాస్తు చేసే అభ్యర్థులు వెబ్‌సైట్‌లో లభించే ఫిజికల్ ఫిట్‌నెస్ అర్హతలు కూడా సరిచూసుకోవాలి.

రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
సదరన్ రీజియన్

JNTU Kakinada | SPMVV Tirupati | JNTU Anantapur | SVU Tirupati

In collaboration with
Blekinge Institute of Technology (BTH), Sweden
(Established by Government of Sweden)

ADMISSION NOTIFICATION*
STUDY IN INDIA AND SWEDEN, EUROPE
4 YEAR B.TECH PROGRAMME
(3 years study in India and 1 year study in Sweden)

Applications are invited for admission into 4-year B.Tech programme offered by Andhra Pradesh Universities (JNTU Anantapur, JNTU Kakinada, SPMVV- Tirupati, Sri Venkateswara University- Tirupati) in collaboration with BTH, Sweden for the academic year 2018-19. The admitted students should undergo three years mandatory education at constituent college of the universities and one year education at BTH, Sweden.

University	Offered Branches	Intake	Last date for application	Admission Counselling	For Brochure/ Application/ Tuition Fee/ other details
JNTU Kakinada	ECE	20	23-06-18	28-06-18	www.jntuk.edu.in
	CSE	20			
	MEC	20			
JNTU Anantapur	ECE	10	18-06-18	25-06-18	www.jntua.ac.in
	CSE	10			
	MEC	10			
Sri Padmavati Mahila Viswavidyalayam- Tirupati (Women's University)	ECE	10	10-07-18	12-07-18	www.spmvv.ac.in
	CSE	10			
	MEC	10			
Sri Venkateswara University-Tirupati	ECE	10	10-07-18	13-07-18	www.svuniversity.edu.in
	CSE	10			
	MEC	10			

Selection criteria: Selection is based on ranks obtained in IIT JEE (MAINS)/ AP EAMCET / TS EAMCET/ Marks in BIE or Equivalent in the order of preference indicated.
For details: BTH (+46-734405670, +91-9032011127), JNTUK (+ 08842340356, + 0884 2300914) JNTUA (+918008802558, 7702768080), SPMVV (Ph: +91 9441497897, +917995437397, +91-9704271015), SVU (+91-9985981917/+91-9989053632).
*Data compiled with reference to separate admission notifications issued by JNTUK/JNTUA/SVU/SPMVV

25 నుంచి దంతవైద్య సీట్ల భర్తీ కౌన్సెలింగ్

ఈనాడు - అమరావతి

ఎంబీబీఎస్‌లో ప్రవేశాలకు మాదిరిగానే రాష్ట్ర స్థాయిలో దంత వైద్య విద్య ప్రవేశాలకు తొలివిడత కౌన్సెలింగ్ ఈ నెల 25 నుంచి జులై 5వ తేదీ వరకు జరగనుంది. సీట్లు పొందిన విద్యార్థులు జులై 12వ తేదీలోగా కళాశాలల్లో చేరాలి. మలివిడత కౌన్సెలింగ్ జులై 15 నుంచి 26 వరకు జరుగుతుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు మూడో తేదీలోగా కళాశాలల్లో చేరాలి. మిగులు సీట్లను ప్రత్యక్ష విధానంలో ఆగస్టు 4 నుంచి ఎనిమిది మధ్య భర్తీ చేస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు అదే నెల 12వ తేదీలోగా చేరాలి. రెండో విడత కూడా మిగులు సీట్లను సెప్టెంబరు 1 నుంచి ఆరో తేదీ వరకు ప్రత్యక్ష విధానంలో భర్తీ చేస్తారు. సీట్లు పొందిన వారు సెప్టెంబరు 11వ తేదీలోగా కళాశాలల్లో చేరాలి. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటన జారీచేసింది. మరోవైపు, జాతీయ స్థాయిలో దంత వైద్య సీట్లకు మొదలైన తొలివిడత కౌన్సెలింగ్ ఈ నెల 24వ తేదీ వరకు జరగనుంది.

మిగిలిన నాన్ క్లినికల్ సీట్లు!

పీజీ వైద్య విద్య సీట్ల భర్తీకి జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా క్లినికల్ సీట్లన్నీ భర్తీ అయ్యాయి. యాజమాన్య కోటా సీట్లు కూడా భర్తీ అయ్యాయి. నాన్ క్లినికల్ సీట్లు మాత్రం 141 మిగిలాయి. మేనేజ్‌మెంట్ కోటాలో 69 సీట్లు మిగిలినట్లు ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ సీవీ రావు తెలిపారు. దంత వైద్య విద్యలో అన్ని రకాలుగా కలిపి 328కి గాను 320 సీట్లు భర్తీ అయినట్లు చెప్పారు.

ఏపీ ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఏపీ ఎంసెట్-2018 రెండో విడత కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ప్రకటించారు. జులై ఒకటో తేదీ నుంచి ఐదో తేదీవరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, ఆప్షన్ల నమోదుకు అవకాశమిచ్చారు. ఒకటో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, నాలుగు, ఐదు తేదీల్లో ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఏడో తేదీన సీట్లను కేటాయిస్తారు. క్రీడలు, ఎన్‌సీసీ, క్యాప్, విభిన్న ప్రతిభావంతులకు రెండో విడతలో సీట్లను కేటాయించనున్నారు. వీరి కోసం ఆంధ్రా లయోలా కళాశాల, విజయవాడ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కంచరపాలెం, విశాఖపట్నం, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతిలో సహాయ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారికి కళాశాలల్లో చేరేందుకు ఈనెల 15వరకు గడువు పొడిగించారు. మొత్తం 60,943 మందికి సీట్లు కేటాయించగా వీరిలో 50,797 మంది విద్యార్థులు ప్రవేశాలపై ఆసక్తి చూపారు. ఇప్పటివరకు కళాశాలల్లో చేరింది 35,773మంది మాత్రమే. సీట్లు పొందినవారిలోనూ ఎక్కువ మంది కళాశాలల్లో చేరనందున ఇంజినీరింగ్ సీట్లు భారీగా మిగిలే అవకాశం ఉంది. రెండో విడతలో వెనుక వరసలోని ర్యాంకుల వారికీ మంచి కళాశాలల్లో సీట్లు లభించే అవకాశం ఉంది.

37 వేల పాలిటెక్నిక్ సీట్లు మిగులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 2,333 సీట్లు, ప్రైవేటు కళాశాలల్లో 34,619 సీట్లు మిగిలాయి. పాలిసెట్-2018 తుది విడత కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారం 18,117 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈనెల 15లోపు కళాశాలల్లో ప్రవేశాలు కన్వీనర్ పొందాలన్నారు.

APSCHE: GUNTUR
ATTENTION OF MANAGEMENTS OF PRIVATE PROFESSIONAL COLLEGES

The instructions for filling up of Category B Seats and 15% Supernumerary quota in respect of Engineering / Pharmacy / B.E., B.Tech are placed in website: www.apsche.org Managements are informed to comply accordingly.

Date: 12.06.2018
Place: Tadepalli
Sd/-
Competent Authority

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
శ్రీ వేంకటేశ్వర సాంప్రదాయ ఆలయ శిల్ప కళాశాల
(ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ గుర్తింపు మరియు అనుమతి పొందిన సంస్థ)
ప్రవేశ ప్రకటన

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి వారిచే తెలుగు మాధ్యమములో నడుపబడుచున్న శ్రీ వేంకటేశ్వర సాంప్రదాయ ఆలయ శిల్పకళాశాల నందు డిప్లొమా మరియు సర్టిఫికేట్ కోర్సు (సంప్రదాయ కలంకారి కళ) నందు ప్రవేశం పొందగోరు విద్యార్థులకు ఈ విద్యా సం॥ 2018 - 19 నకు గాను దరఖాస్తు చేసుకోవడానికి 21-06-2018 నుండి 16-07-2018 వరకు పొడిగించబడినది. రాతపరీక్ష మరియు ఇంటర్వ్యూ 27-07-2018వ తేదీన కళాశాల యందు జరుపబడును. 10వ తరగతి పాసైన వారు / 10వ తరగతి సప్లిమెంటరీ ఫలితాల కోసం ఎదురుచూచువారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా కోర్సు చేరిన విద్యార్థినీ విద్యార్థులకు ఒక లక్ష రూపాయలు చొప్పున బ్యాంకు డిపాజిట్ చేసి ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు నిబంధనలకు లోబడి ఇవ్వబడును. కోర్సులు మరియు విద్యార్హతలు ఇతర వివరముల కొరకు www.tirumala.org నందు చూడగలరు. ఆఫీస్ ఫోన్ నెం. 0877-2264637

Roc.No.PR4/1090/Adv.No.106/PRO/2018, Dated: 12.06.2018
కార్యనిర్వహణాధికారి

బడి ఈడు పిల్లల్ని చదివించడమే లక్ష్యం

- 'బడి పిలుస్తోంది' వారోత్సవాల ప్రారంభ సభలో మంత్రి గంటా

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బడి ఈడు పిల్లల్ని పాఠశాలలకు తీసుకువచ్చి వారిని చదివించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విశాఖపట్నంలోని టీపీటీకాలనీ ఎన్ఎంసీ హెచ్ పాఠశాల మైదానంలో నిర్వహించిన 'బడి పిలుస్తోంది' వారోత్సవాల్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర అధిక ఫీజులు వసూలు చేస్తున్న, అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

'బడి పిలుస్తోంది' వారోత్సవాల్ని ప్రారంభిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా, డీఈవో లింగేశ్వరరెడ్డి తదితరులు

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లైంగిక ఆరోగ్యంపై దేశవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారతీయ వైద్య సంఘం (ఐఎమ్ఏ) ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

EDUCATION
★ B.Sc-Veterinary Science-4Yrs -Elig: Bi.P.C, B.Sc-Agri-4Yrs-Elig: Bi.P.C/ M.P.C., UGC Recog-Elig. for Govt./ Pvt. Jobs. Placements assistance. For admissions Cont: ASIAN, VJA. ✆ 63094 93450 / 90322 33908.

MGM NANASAHEB KADAM COLLEGE OF AGRICULTURE
'A' Grade College (ISO 9001 : 2008), College Code 11273
Gandheli Campus, Aurangabad - 431007 (M.S.)
ADMISSION 2018-19
B.SC. AGRICULTURE
For Admission Enquiry, please contact Dr. G. R. Reddy
Cell No. 7796165990 / 7028196050 (Off.) www.mgmnkca.org

మాతా శిశు మరణాల రేటు సున్నాకు తగ్గాలి: సీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: మాతా శిశు మరణాల రేటులో కేరళను అధిగమించి రాష్ట్రాన్ని అగ్రస్థానాన నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ రేటును సున్నా శాతానికి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘ సభ్యులు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఖాళీగా ఉన్న ఏంపీహెచ్ఏ పోస్టులు భర్తీ చేయాలని, ఏఎన్ఎంలకు ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని వర్తింపజేయాలని, విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు విన్నవించారు. వీటిపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్
(రాష్ట్ర చట్టం క్రింద ఏర్పాటు చేయబడిన విశ్వవిద్యాలయము) పంజాగుట్ట:: హైదరాబాద్

R.C. No.AC2/123/2018/MHM ప్రకటన తేది: 4-6-2018

2018 సంవత్సరానికి మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (MHM) - 20 సీట్లలో ప్రవేశానికి తెలంగాణా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్ మరియు ఏదేని తాజా సమాచారానికి వెబ్‌సైట్ www.nims.edu.in ను సందర్శించవలసినదిగా అభ్యర్థులను కోరడమైనది. పూరించిన దరఖాస్తు ఫారాలను డైరెక్టర్, NIMS పేరిట డిమాండ్ డ్రాఫ్టుతోపాటు లేదా NIMS నగదు రశీదు మరియు ప్రాస్పెక్టస్ (అనుబంధం 1) నందు వివరించినట్లు సపోర్టింగ్ డాక్యుమెంట్లుతోపాటు వ్యక్తిగతంగా లేదా తపాలా ద్వారా (ఇండియా పోస్ట్ సర్వీసెస్‌కు ప్రాధాన్యత) అసోసియేట్ డీన్ అకడమిక్-2, 2వ అంతస్తు, ఓల్డ్ OPD బ్లాక్, NIMS, పంజాగుట్ట, హైదరాబాద్- 500 082, తెలంగాణాకు ది. 30-6-2018 సా. గం. 5.00 లోగా అందునట్లు దాఖలు చేయవలెను.

సం/- డీన్, నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్- 500 082
DIPR No. 741/CL/Advt/1/1/2018-19

kotak Securities

ఫ్రీ ఇంట్రాడే ట్రేడింగ్
క్యాష్, ఫ్యూచర్స్ మరియు ఆప్షన్స్‌లో

మీ ఫ్రీ ఇంట్రాడే ట్రేడింగ్ అకౌంట్‌ని తెరవడానికి
FIT అని 56161కి SMS పంపండి
లేదా 70667 70667కి మిస్డ్ కాల్ ఇవ్వండి

#FIT
సాంవత్సరిక సబ్‌స్క్రిప్షన్ ఫీ ₹999 వర్తిస్తుంది.
Terms and Conditions apply.

Kotak Securities Limited. Registered Office: 27 BKC, C 27, G Block, Bandra Kurla Complex, Bandra (E), Mumbai 400051. CIN: U99999MH1994PLC134051, Telephone No.: +22 43360000, Fax No.: +22 67132430. Website: www.kotaksecurities.com. Correspondence Address: Infinity IT Park, Bldg. No 21, Opp. Film City Road, A K Vaidya Marg, Malad (East), Mumbai 400097. Telephone No: 42856825. SEBI Registration No: NSE INB/INF/INE 230808130, BSE INB 010808153/INF 011133230, MSE INE 260808130/INB 260808135/INF 260808135, AMFI ARN 0164, PMS INP000000258 and Research Analyst INH000000586. NSDL/CDSL: IN-DP-NSDL-23-97. Brokerage will not exceed the SEBI prescribed limit. To avail the benefits of Free Intraday Trading product, customers need to open an account with Kotak Securities. Terms and conditions apply. Investments in securities market are subject to market risks, read all the related documents carefully before investing. Disclaimer: http://bit.ly/TCfit

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ప్రధాని

ఎంపీ ముత్తంశెట్టి ధ్వజం

నిరాహార దీక్షలో కూర్చున్న అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అనకాపల్లి, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయానికి నిరసనగా ఆయన మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. విశాఖ జిల్లా అనకాపల్లిలో తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉంటూ.. ఎంపీ చేసిన ఈ దీక్షకు అన్ని సంఘాల నుంచి మద్దతు లభించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నెలరోజులు పార్లమెంట్ బయట, లోపల ఆందోళన చేసినా భాజపాకి కనీసం చీమకుట్టినట్లైనా లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన ఉత్తరాంధ్రకి ప్రత్యేక నిధులు ఇచ్చేవరకు పోరాడతామని స్పష్టంచేశారు. మోదీ దేశానికి ప్రధానిలా కాకుండా గుజరాత్‌కి ముఖ్యమంత్రిలాగానే వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంఎల్‌సీ ఎంవీఎస్ మూర్తి, విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి తులసీరావు, శాసనసభ్యులు పీలాగోవింద సత్యనారాయణ, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, అనిత, గణబాబు, కేవీఎస్ఎన్ రాజు తదితరులు ఎంపీ దీక్షకు సంఘీభావం తెలిపారు.

డా॥ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ, శ్రీకాకుళం
ఎచ్చెర్ల - 532410, శ్రీకాకుళం జిల్లా
ఇ - ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 08/06/2018
NIT No. 1, 2 & 3 UE/E-PTN/Dr.B.R.A.U.SKLM 2018-19
డా॥ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్శిటీ, శ్రీకాకుళంలో 3 పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్లు స్వీకరణకు ఆఖరి తేది: 25.06.2018 మ. 4.30 గం. వరకు టెండరుదారులు టెండర్ షెడ్యూళ్లు మరియు ఇతర వివరములకు ఇ - మార్కెట్ ప్లేస్ నుండి www.tender.apeprocurement.gov.in డౌన్లోడ్ చేసుకోవచ్చును.
సం/- రిజిస్ట్రార్, డా॥బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ, శ్రీకాకుళం

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Roc.No.TTD-34022(31)/10/2018 తేది: 12-06-2018.
తి.తి.దే., తిరుపతి మార్కెటింగ్ విభాగం వారిచే కొన్ని రకాల వస్త్రాల సేకరణ నిమిత్తం ఈ-టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు లాగాన్ అవ్వవలసిన వెబ్‌సైట్: http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in. కరెంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి ఆపై "మోర్" మరియు "తిరుమల తిరుపతి దేవస్థానములు- మార్కెటింగ్"ను ఎంపిక చేసుకోవాలి. తదుపరి వివరాలకుగాను సంప్రదించవలసిన ఫోన్ నెం: 0877- 2264079, 2264555. ఫ్యాక్స్ నెం.0877-2264554.

క్ర.మ సంఖ్య	ఐటమ్ పేరు	ధరావతు (రూ.లు)	టెండరు కాలము	టెండరు తేది టెక్నికల్ బిడ్	ఫైనాన్షియల్ బిడ్
1.	30 సంఖ్యల మేల్చాట్ మరియు ఉత్తరీయం వస్త్రం జతలు	53,300 (యాభై మూడువేల మూడువందల రూపాయలు మాత్రమే)	ఆరు నెలలు	28-06-2018	28-06-2018
2.	1,30,000 సంఖ్యల కాటన్ అప్పర్స్	2,85,300 (రెండు లక్షల ఎనభైఐదు వేల మూడు వందల రూపాయలు మాత్రమే)	ఆరు నెలలు	28-06-2018	28-06-2018

Roc.No.PR4/1090/Adv.No.108/PRO/2018, Dated: 12.06.2018. - కార్యనిర్వహణాధికారి

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
I.G.M.C STADIUM, LABBIPET, BUNDAR ROAD, VIJAYAWADA
TENDER NOTICE Dated: 12-06-2018
Tenders are hereby invited from reputed and experienced companies for the following tenders:

S. No.	Name of Work	Bid start date	Bid end date	Bids Opening Date
1	Providing diet to inmates at Dr. YSR Sports School, Kadapa. 2nd Call	13-06-2018	21-06-2018	21-06-2018
2	Providing amenities to State Sports Academies.	13-06-2018	28-06-2018	28-06-2018
3	Procurement of Sports Science equipment to SAAP.	13-06-2018	02-07-2018	02-07-2018

Tender documents are available on e-procurement platfom tender.apeprocurement.gov.in. Tenders will be opened in the presence of company owners or their representatives who attend the evaluation. For futher details contact : 0866-2499699.
Sd/- Vice Chairman and Managing Director

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Regd.Office:10-152/1, Ashoknagar, Bandar Road, Vijayawada-520007
Tender No: PDS 1/31/Sugar Tender/July-2018 Dated: 12.06.2018
TENDER NOTICE
EMPANELMENT AND APPOINTMENT OF SUPPLIERS FOR SUPPLY OF 15145 MTS. OF ISS GRADE S-30/S-31 CANE SUGAR UNDER PDS FOR JULY & AUGUST 2018 THROUGH NCDEX e MARKETS LIMITED
All interested Sugar manufacturers are invited for registration as suppliers eligible to participate in the e reverse auction to be conducted by NCDEX e Markets Ltd on behalf of APSCSC Ltd for supply of sugar to the MLS Points of Districts in Andhra Pradesh State.
For Registration, interested parties may visit www.apscsc.gov.in & www.neml.in for application form and detailed terms & condition.
Last date for registration and completion of formalities for the e-auction shall be up to 5.00pm of 18.06.2018. The duly filled in application form should be submitted to: Customer Service Group, NCDEX e-Markets Limited, Ackruti Corporate Park, 1st Floor, Near GE Garden, LBS Marg, Kanjurmarg(West), Mumbai - 400078 Tel:9642332994/8309214263 or 022-66473153/54. Email: askus@neml.in
The tentative date of online e-auction through NCDEX e Markets Ltd would be 19.06.2018 for 15145 MTs. in 50 Kg PP bag. Delivery should be completed within 10 working days at all MLS Points of (13) districts in AP State. Auction will be held District wise. The details are available on the website www.apscsc.gov.in.
Sd/- A.Surya Kumari
VC & Managing Director

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ
(స్టేట్ గవర్నమెంట్ అండర్ టేకింగ్)
డోర్ నెం. 11-97/1, కె. శంకరరావు వీధి, జాయింట్ కేర్ ప్రక్కన, టైమ్ హాస్పిటల్ & మోర్ సూపర్ మార్కెట్ ప్రక్కన, అశోక్ నగర్, కానూరు, విజయవాడ-520 007. ఎ.పి.
ఫోన్ : (0866) 2556244, ఫ్యాక్స్ : (0866) 2556344
నం. యన్.డబ్లు.సి./యం2/00378/బి.మ్యాట్స్/16-17 తేది : 12-06-2018
టెండరు నోటీసు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వారు బ్యాంబు మ్యాట్స్ (వెదురు చాపలు) సప్లయి గురించి ఉత్పత్తి/స్టాకిస్టుల నుండి సీల్డు టెండర్లు కోరడమైనది
1. టెండరు షెడ్యూలు ఖరీదు : రూ. 3000/- + 12% GST (వాపసు ఇవ్వబడదు)
2. టెండరు అమ్మకపు చివరి తేది : 26-06-2018, 1 గంటవరకు
3. టెండరు దాఖలు చివరి తేది : 10-07-2018, 3 గంటల వరకు
4. టెండరు తెరుచు తేది : 10-07-2018, 3.30 గంటలకు
5. ఇ.యం.డి. (EMD) : రూ. 10,000/- (రూ॥ పదివేలు)
(మేనేజింగ్ డైరెక్టరు, APSWC పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించవలెను)
బ్యాంబు మ్యాట్స్ (వెదురు చాపలు) వివరములు :
బెస్ట్ క్వాలిటీ ఆఫ్ రెక్టాంగులర్ షేప్ ఆఫ్ 1.524 మీటర్స్ × 0.914 మీటర్స్ (5'×3') సైజ్ టాలరెన్స్ లిమిట్ + 15.24 సెంటీమీటర్స్ (6") మరియు 2.54 సెంటీమీటర్స్ (1") పొడవు మరియు వెడల్పులో మ్యాట్స్‌లో పగుళ్ళు, బూజు మరియు పురుగులదాడి ఉండకూడదు. మ్యాట్స్ సాధ్యమైనంత వరకు గట్టిగా మరియు వంచుటకు వీలు కలిగి ఉండవలెను. పది మ్యాట్స్ కలిపి ఒక బండెలుగా సప్లయి చేయవలెను.
టెండర్లు కొనుటకు మరియు ఇతర వివరములు తెలుసుకొనుటకు ఆఫీసు పనివేళల్లో ఈ క్రింది సంతకందారుని సంప్రదించగలరు. సం/- ఒ.యస్.డి. (యం & క్యూసి) ఫోన్ నం. 98490 57693

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్
డి. అంచనాల విలువ రూ. 5,00,000/- అంతకు మించిన పనులు
టెండరు నోటీసు నెం. 105, 106 మరియు 107/2018-19 తేది: 08-06-2018
పని పేరు: 1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 4 జిల్లాలలో ప్రపంచ బ్యాంకు సహాయ నిధులతో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు మరియు వ్యవసాయ పరివర్తన పథకము క్రింద 21 గొలుసుకట్టు (51 చెరువులు) చెరువులు మరియు 57 స్వతంత్ర చెరువులు యొక్క ఆయకట్టు 16182 ఎకరములు (6549 హెక్టారులు)కు డి.పి.ఆర్. తయారుచేయు పని. 2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 4 జిల్లాలలో ప్రపంచ బ్యాంకు సహాయ నిధులతో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు మరియు వ్యవసాయ పరివర్తన పథకము క్రింద 16 గొలుసు కట్టు (35 చెరువులు) చెరువులు మరియు 64 స్వతంత్ర చెరువులు యొక్క ఆయకట్టు 21097 ఎకరములు (8538 హెక్టారులు)కు డి.పి.ఆర్. తయారుచేయు పని. 3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 4 జిల్లాలలో ప్రపంచ బ్యాంకు సహాయ నిధులతో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు మరియు వ్యవసాయ పరివర్తన పథకము క్రింద 12 గొలుసు కట్టు (30 చెరువులు) చెరువులు మరియు 56 స్వతంత్ర చెరువులు యొక్క ఆయకట్టు 14204 ఎకరములు (5748 హెక్టారులు)కు డి.పి.ఆర్. తయారుచేయు పని. ప్రైజ్‌బిడ్ తెరుచు తేది: 29-06-2018 ఉదయం 11.00 గంటలకు. 2. అంచనా విలువ లక్షలలో: (1) రూ. 90.28 లక్షలు (2) రూ. 94.92 లక్షలు, (3) రూ. 74.30 లక్షలు. 3. ధరావత్తు రుసుము: (1) రూ. 90,300/- (2) రూ. 95,000/- (3) రూ. 74,300/- 4. పని పూర్తిచేయు కాలము: 01 నెల. 5. టెండరు డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో లభ్యమగు కాలము: 11-06-2018 ఉదయం 11.00 గంటల నుండి 25-06-2018 సాయంత్రం 5.00 గంటల వరకు. 6. ఆన్‌లైన్‌లో టెండరు స్వీకరించుటకు ఆఖరి తేది/సమయము: 26-06-2018 సాయంత్రం 5.00 గంటల వరకు 7. సాంకేతిక బిడ్ తెరుచు తేది/సమయము: 27-06-2018 ఉదయం 11.00 గంటలకు. 8. ఫైనాన్స్ బిడ్ తెరుచు తేది/సమయము: 29-06-2018 ఉదయం 11.00 గంటలకు 9. సంబంధిత శాఖ అధికారి పేరు మరియు చిరునామా: శ్రీ యల్. మక్బుల్ సాహెబ్, బి.టెక్, పర్యవేక్షక ఇంజినీరు, నీటిపారుదల శాఖ, సాయినగర్, అనంతపురము. ఫోన్ నెం. 08554 - 240279, ఫ్యాక్స్ నెం. 08554 - 274082. తదుపరి వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.e-procurement.gov.in 1. ధరావత్తు రుసుము ఇ-పేమెంట్ రూపములో యన్.టి.పి.ఎ. టు యస్.ఇ. అనంతపురము వారి పేరున మాత్రమే తీయవలయును. 2. జి.ఓ.యం.యస్.నెం. 94 మరియు జి.ఓ.యం.యస్.నెం. 130 ప్రకారము తరగతి 3 సివిల్ ఆపై తరగతులు అర్హులు.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీరు, ఇరిగేషన్ సర్కిల్, అనంతపురము
DIPR No. 163PP/CL/Advt/1/1/2018-19

కర్ణాటకలో భారీ వర్షాలు

- చార్మడి దారిలో విరిగిపడిన కొండ చరియలు
- బెంగళూరు- మంగళూరు మధ్య రాకపోకలకు తీవ్ర ఆటంకం

చిక్కమగళూరు జిల్లా చార్మడి ఘాట్‌లో విరిగి పడిన కొండచరియలు, భారీ వృక్షాలు

ఈనాడు, బెంగళూరు: నైరుతి రుతుపవనాల తాకిడికి కర్ణాటక ఉక్కిరిబిక్కిరవుతోంది. చిక్కమగళూరు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చార్మడి కనుమదారిలో కొండ చరియలు విరిగి పడ్డాయి. దీంతో బెంగళూరు- మంగళూరు మధ్య మోటారు వాహనాల రాకపోకలకు అవరోధం ఏర్పడింది. వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చార్మడి కనుమ దారి మట్టిదిబ్బలతో నిండిపోయింది. భారీ వానలకు తోడుగా గాలి తోడుకావడంతో పెద్ద పెద్ద చెట్లు కూడా దారికి అడ్డంగా పడ్డాయి. కిలోమీటర్ల మేర మోటారు వాహనాలు ముందుకు, వెనక్కు వెళ్లలేక నిలిచిపోయాయి. దాదాపు 20 గంటలుగా చార్మడి కనుమ దారిలో రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులకు స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద కార్యకర్తలు ఆహార పొట్లాల్ని వితరణ చేస్తున్నారు. మార్గం పునరుద్ధరణకు మరో రెండు రోజులు పడుతుందని అంచనా వేస్తున్నారు. గురువారం ఉదయం వరకూ ఈ మార్గంలో వాహన రాకపోకలను నిషేధించినట్లు చిక్కమగళూరు జిల్లా పోలీసులు వెల్లడించారు. మట్టి పెళ్లలు విరిగి పడటం వల్ల హాసన రైలు మార్గం కూడా సోమవారం నుంచి నిలిచి పోగా.. మంగళవారం రాత్రి ప్రయాణానికి సిద్ధం చేశారు. చార్మడి కనుమ దారిలో ఇరుక్కు పోయిన వారందరికీ సహాయ చర్యల్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి కుమారస్వామి బెంగళూరులో వెల్లడించారు. మంగళూరు నుంచి వచ్చే వాహనాల్ని ధర్మస్థళ, ఉజిరి వైపు మళ్లించారు. మంగళూరుకు వెళ్లే వాహనాల్ని కుదురుముఖ కనుమ, కార్కళ దారికి, చిక్కమగళూరు దిశగా సాగడానికి కొట్టిగెహార మార్గానికి మళ్లించినట్లు అధికారులు వివరించారు.

రాయలసీమలో బలహీనంగా నైరుతి

- కోస్తాలో అక్కడక్కడా వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం, అమరావతి: రాయలసీమ జిల్లాల్లో నైరుతి రుతుపవన ప్రభావం కాస్త బలహీనంగా ఉందని వాతావరణశాఖ తెలిపింది. దీనివల్లనే వర్షాలు తగ్గాయని పేర్కొంది. కోస్తాంధ్రలో సాధారణ స్థితిలోనే ఉన్నట్లు వివరించింది. కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమబంగ, ఒడిశా, ఉత్తర కోస్తా వ్యాప్తంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. మరో పక్క రాయలసీమ, కోస్తా మీదుగా మరో ద్రోణి ఉంది. వీటి ప్రభావంతో రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు మెరుపులతో తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతోంది. తీరం వెంబడి గాలుల ప్రభావం కొనసాగుతోంది. సముద్రం చురుగ్గా ఉండటంతో పాటు అలలు సుమారు 4 మీటర్ల వరకు ఎగిసిపడే అవకాశం ఉన్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. గురువారం అర్ధరాత్రి వరకూ దుగరాజపట్నం నుంచి బారువ దాకా ఈ అలల ప్రభావం ఉంటుందని ఇన్‌కాయిస్ వెల్లడించింది.

కటిక చీకట్లో కంటి బిందు

- క్యాన్సర్‌తో చిన్నారి చూపు దూరం
- సాయం కోసం అభ్యర్థన

నానమ్మతో చిత్తూరు కలెక్టరేట్‌కు వచ్చిన బిందు

ఈ చిత్రంలో ఉన్న ఐదేళ్ల బాలిక పేరు బిందు. చిత్తూరు జిల్లా మదనపల్లె పట్టణం బసినికొండ ప్రాంతానికి చెందిన ఈమెను అమ్మ కడుపులో ఉండగానే విధి చిన్నచూపు చూసింది. క్యాన్సర్ మహమ్మారి సోకడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పుట్టిన రెండు నెలలకే కుడి కంటిని తొలగించాల్సి వచ్చింది. పాప పెరిగి పెద్దదవుతున్న తరుణంలో నాలుగో సంవత్సరం మొదట్లోనే ఎడమ కన్నును పొర కమ్మేసింది. ఇంతలో కన్నపేగు బంధాన్ని తెంచుకున్నారు తల్లిదండ్రులు. బాలికను అవ్వతాతల వద్ద వదిలేసి చెరోదారి చూసుకున్నారు. కట్టెలు కొట్టి జీవనం సాగించే ఈ వృద్ధులే పాపను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. పాపను హైదరాబాదులోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చూపించగా ఎడమ కంటికి క్యాన్సర్ సోకిందని, దాన్ని తొలగించాలని చెప్పారు. పాప ప్రాణమే ముఖ్యమని భావించి ఉన్న ఒక కన్ను తొలగించారు. లోకం చూడలేని ఈ చిన్నారికి సర్వస్వం అవ్వాతాతలే. ఐదేళ్లు నిండటంతో ఆమెను తిరుపతిలోని నవజీవన్ అంధుల ఆశ్రమంలో చేర్పించారు. ఇటీవల మదనపల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును.. నానమ్మ ఉత్తమ్మతో వెళ్లి పాప కలిసింది. రూ.2లక్షలు ఆర్థిక సాయం చేయాలని సీఎం.. జిల్లా పాలనాధికారిని ఆదేశించారు. ఆ సాయం కోసం ఇరువురూ మంగళవారం ఉదయమే జిల్లా సచివాలయానికి చేరుకున్నారు. తమకే జీవనం కష్టమైన పరిస్థితుల్లో పాపకు సాయం చేసే దాతల కోసం ఎదురుచూస్తున్నారు ఈ వృద్ధ దంపతులు.

– న్యూస్‌టుడే, చిత్తూరు(జిల్లా సచివాలయం)

లాలూ కుటుంబంపై ఈడీ కొరడా

రూ.44.75కోట్ల విలువైన స్థలాలు జప్తు

పట్నా, దిల్లీ: ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కొరడా ఝుళిపించింది. లాలూ కుటుంబానికి చెందిన 11 స్థలాలను జప్తు చేసింది. ఈ స్థలాల విలువ రూ.44.75 కోట్లు. రైల్వేమంత్రిగా ఉన్నప్పుడు లాలూ ఐఆర్‌సీటీసీకి చెందిన రెండు హోటళ్ల నిర్వహణను ఓ సంస్థకు అనుచితంగా కట్టబెట్టారని.. ప్రతిఫలంగా భూములను ముడుపులుగా స్వీకరించారని లోగడ కేసు నమోదైంది.

జిల్లాకో వాటర్‌షెడ్ ఏపీడీ పోస్టు: మంత్రి లోకేశ్

ఈనాడు డిజిటల్, అమరావతి: వాటర్‌షెడ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకో సహాయ పథక సంచాలకుడి(ఏపీడీ) పోస్టు మంజూరు చేస్తున్నట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి లోకేశ్ వెల్లడించారు. సచివాలయంలో ఆయన గ్రామీణాభివృద్ధి సేవా సంస్థ సమావేశంలో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పథక సంచాలకుల(పీడీ)కు సహాయంగా సాంకేతిక నిపుణుల పోస్టులు కూడా మంజూరు చేస్తున్నామని అన్నారు. వాటర్ షెడ్ సహాయకుల జీతం రూ.2,500 నుంచి రూ.3,000కు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు.

హోదా ప్రస్తావన ఏదీ?: భాజపా రాష్ట్ర నాయకులు ప్రధాని నరేంద్రమోదీకి సమర్పించిన లేఖలో ప్రత్యేక హోదా ప్రస్తావన ఎక్కడుందని మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. ఏపీకి ఇచ్చిన హామీల్లో కేంద్రం 90 శాతం నెరవేర్చిందంటున్న ఆంధ్రా భాజపా నాయకులు.. ప్రధానికి అంత పెద్ద జాబితా ఎందుకు ఇచ్చారో చెప్పాలన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

- 1,11,642 మంది ఉత్తీర్ణత
- ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి

ఈనాడు, విశాఖపట్నం: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మొత్తం 1,11,642 మంది ఉత్తీర్ణత సాధించినట్లు మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రవిశ్వవిద్యాలయ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ఆయన ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ సాధారణ(జనరల్), వృత్తివిద్య కోర్సుల రెండు సంవత్సరాలకు సంబంధించి మొత్తం 4,35,764 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను రాసినట్లు తెలిపారు. గతంలో ఉత్తీర్ణులు కానివారు 2,89,085 మంది పరీక్షలు రాయగా, మిగిలిన వారు అదనపు మార్కులు(బెటర్‌మెంట్) కోసం రాసినట్లు వెల్లడించారు. 18 రోజుల రికార్డు సమయంలో ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. తాజా ఫలితాల కారణంగా పలువురి ఎంసెట్ ర్యాంకులు మెరుగుపడే అవకాశం ఉందని, వారు రెండో విడత కౌన్సెలింగ్‌లో మంచి కళాశాలల్లో చేరవచ్చని తెలిపారు. పునఃగణన(రీకౌంటింగ్), పునఃపరిశీలన(రీవెరిఫికేషన్) చేయించుకోవాలంటే ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడానికి ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 50 జూనియర్ కళాశాలలు, 15 డిగ్రీ కళాశాలలు కూడా ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి మొదలుపెట్టేలా చర్యలు చేపడుతున్నామన్నారు. 31 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఈ ఏడాది నుంచి ఇంటర్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఇంటర్ విద్య కమిషనర్ ఉదయలక్ష్మి, ఎ.యు. రిజిస్ట్రార్ ఆచార్య ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య రఘుబాబు, విశాఖ జిల్లా ఆర్.ఐ.ఒ. నగేశ్‌కుమార్, విశాఖ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ-అడ్వాన్స్‌డ్ మూల్యాంకన నిబంధనల్లో మార్పులు చేయలేదు

గుజరాత్ హైకోర్టుకు ఐఐటీ-కాన్పూర్ వివరణ

అహ్మదాబాద్: ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ-అడ్వాన్స్డ్ పరీక్ష మూల్యాంకనానికి సంబంధించిన నిబంధనల్లో ఎలాంటి మార్పులూ చేయలేదని ఐఐటీ-కాన్పూర్ గుజరాత్ హైకోర్టుకు వివరించింది. కోర్టులో దాఖలైన ఓ పిటిషన్‌కు స్పందనగా పరీక్ష నిర్వాహక ఛైర్మన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మే 20న జేఈఈ-అడ్వాన్స్డ్ పరీక్ష జరిగింది. రెండు పేపర్లలోని సెక్షన్-2 ప్రశ్నలకు సంబంధించి ఆ మరుసటి రోజు 'వివరణ (క్లారిఫికేషన్)'లు నిర్వాహకులు జారీ చేశారని.. అయితే ఈ ముసుగులో పరీక్షకు ముందు పేర్కొన్న మూల్యాంకన నిబంధనలకు నిర్హేతుకమైన మార్పులు చేశారని ఆరోపిస్తూ ముగ్గురు విద్యార్థులు గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు.

ప్రతి జిల్లాలో ఆహార పదార్థాల పరీక్ష కేంద్రం

- వినియోగదారుల రక్షణ మండలి సమావేశంలో మంత్రి ప్రత్తిపాటి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో త్వరలోనే జిల్లాకు ఒకటి చొప్పున ఆహార పదార్థాల పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయనున్నామని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో జరిగిన వినియోగదారుల రక్షణ మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 13 జిల్లాల నుంచి ప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు విభిన్న సమస్యలను ప్రస్తావించారు. ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాలనే నిబంధన కచ్చితంగా అమలయ్యేలా చూడాలని కోరగా... ఇలాంటి నిబంధన ఉన్న విషయం తన దృష్టికి రాలేదని, సంబంధిత అధికారులతో మాట్లాడతానని మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్డికి వెళ్లాలంటే రుసుముగా ఒక్క రూపాయి వసూలయ్యేలా చూడాలని, పండగ సందర్భాల్లో ఛార్జీల పెంపు, టోలు రుసుముల పేరుతో అధిక వసూళ్ల అంశాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అన్ని అంశాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మచిలీపట్నంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు విద్యుత్తు కోత విధించడంపై సంబంధిత ఎస్ఈతో మంత్రి పుల్లారావు మాట్లాడారు. అక్షయపాత్ర ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం అందించే చోట ఒక్కో విద్యార్థికి రూ.1 చొప్పున అందించి గుడ్డు ఇచ్చే ఏర్పాటు చేస్తున్నామని విద్యాశాఖ అధికారులు వివరించారు. వినియోగదారుల ఫోరంలో ఇచ్చే తీర్పులు అమలు చేయడానికి ఒక హెడ్ కానిస్టేబుల్‌ను కేటాయించాలని, జిల్లాల్లో ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. విజయవాడలోని కొన్ని మాల్స్‌లో లీటరు తాగునీటిని రూ.100 చొప్పున విక్రయిస్తున్నారని, చంద్రన్న మాల్స్‌లో ప్రత్యేక ప్యాకేజి పేరుతో అధిక ధర, పెట్రోలు బంకుల్లో క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులపై అధికంగా 2 శాతం, మీ-సేవల్లో నిర్ణీత రుసుములను మించి వసూళ్లు చేస్తున్నారని, నర్సరీల్లో నాణ్యత లేని నారు విక్రయించడంతో రైతులు నష్టపోతున్నారని పలువురు వివరించారు.

గ్రీన్‌కార్డు సరెండర్ చేశాక బీ1/బీ2 వీసాకు అర్హుడినేనా?

ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు... హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

గడిచిన నాలుగేళ్లుగా నా భర్త హెచ్1బి వీసాపై అమెరికాలో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు నా పిల్లలు, నేనూ డిపెండెంట్ వీసా కోసం దరఖాస్తు చేయలేదు. దరఖాస్తు విధానం ఏమిటి? వీసా జారీకి ఎంత కాలం పడుతుంది? - రాధికా శివకృష్ణన్

మీ భర్తను చేరుకునేందుకు మీరు హెచ్-4 వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. హెచ్-4 వీసా విభాగానికి సంబంధించిన సమాచారం, దరఖాస్తుకు అనుబంధంగా జతచేయాల్సిన పత్రాల వివరాల కోసం www.ustraveldocs.comnn-niv-typework.asp#dependents పరిశీలించండి. వీసా ప్రక్రియ సమయం నిర్దిష్టంగా ఉండదు. పాస్‌పోర్టు, వీసా వచ్చేంత వరకు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవద్దన్నది మా సూచన.

ఈ ఏడాది సెప్టెంబరు వరకు నా బి1/బి2 వీసా చెల్లుబాటులో ఉంది. వారం రోజుల కోసం జులైలో అమెరికా వెళ్లాలనుకుంటున్నాను. ఏమైనా ఇబ్బందులొస్తాయా? - రవిరాజ్

మీ వీసా చెల్లుబాటులో ఉన్నంత కాలంలో మీరు ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చు. మీ వీసాలో నమోదు గడువు వరకు మీరు అమెరికా ప్రవేశ ప్రాంతం వరకు వెళ్లేందుకు మాత్రమే అనుమతిస్తుందన్న అంశాన్ని గమనంలో ఉంచుకోవాలి. మీ ప్రవేశం, గరిష్ఠంగా అక్కడ ఎంత కాలం వరకు మీరు ఉండవచ్చు అన్న అంశాన్ని ప్రవేశ ప్రాంతంలోని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారు.

కెమికల్ ఇంజినీరింగుకు సంబంధించి పీహెచ్‌డీ అమెరికాలో చేద్దామనుకుంటున్నాను. ఫెలోషిప్ లభించే అవకాశం ఉంటుందా? ఉంటే దాని విధానం ఏమిటి? - ప్రకాష్ పరిమి

అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాలు గ్రాడ్యుయేట్స్‌కు స్కాలర్‌షిప్స్, ఫెలోషిప్స్ ఇస్తుంటాయి. ఆయా విధానాలు ప్రతి విశ్వవిద్యాలయానికి వేర్వేరుగా ఉంటాయి. మీరు ఏ విశ్వవిద్యాలయంలో చదవాలనుకుంటున్నారో ఎంచుకున్న తరువాత ఆ వర్సిటీలోని అర్థిక సహాయ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించటం ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చు. అమెరికాలో చదువుకునే వారికి లభించే స్కాలర్‌షిప్స్, ఫెలోషిప్స్‌కు సంబంధించిన సమాచారం కోసం www.usief.org.in ను చూడండి.

నాకు గ్రీన్‌కార్డు ఉంది. నేను భారతదేశంలోనే ఉండాలని నిర్ణయించుకున్నాను. గ్రీన్‌కార్డును సరెండర్ చేసే విధానం ఏమిటి? అవసరం అనుకుంటే బి1/బి2 వీసాకు అర్హుడనేనా? - కృష్ణప్రసాద్ సీవీ

గ్రీన్‌కార్డును సరెండర్ చేసేందుకు మీరు తప్పనిసరిగా ఐ-407 దరఖాస్తును పూర్తి చేయాలి. దరఖాస్తుతోపాటు సరెండర్ చేసే నియమావళి కోసం www.uscis.gov-407 ను పరిశీలించండి. గ్రీన్‌కార్డు సరెండర్ చేసినట్లు ధ్రువపత్రం పొందిన తరవాత మీరు బి1/బి2 వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీసా కోసం ఎలా దరఖాస్తు చేయాలో తెలుసుకునేందుకు www.ustraveldocs.com ని సంప్రదించండి.

- ★ వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.com కు ఈ-మెయిల్ చేయండి.
- ★ మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- ★ హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు.

వరవరరావుపై కేసు యోచన విరమించాలి

- మహారాష్ట్ర ప్రభుత్వానికి కవులు, కళాకారుల విన్నపం

ఈనాడు, హైదరాబాద్: అక్రమ కేసులో వరవరరావును ఇరికించే ప్రయత్నాన్ని మానుకోవాలని రచయితలు, కవులు, కళాకారులు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఒక వ్యక్తి వద్ద దొరికిన లేఖను ఆధారంగా చేసుకొని ఆయనను వేధించడం సరికాదన్నారు. గత 60ఏళ్లుగా వరవరరావు కవిగా, రచయితగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా తెలుగు సాహిత్యంలో ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ విమోచనోద్యమ నవలపై విలువైన పరిశోధనలు చేశారన్నారు. వరంగల్ సి.కె.ఎం. కళాశాలలో సుదీర్ఘకాలం తెలుగు అధ్యాపకులుగా, కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారని, ఆయనకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని పేర్కొన్నారు. తెలుగు సమాజంలో శాంతి నెలకొల్పడానికి ఆయన నక్సలైట్లకు, ప్రభుత్వానికి మధ్య జరిగిన చర్చల్లో ప్రతినిధిగా పాల్గొని సామాజిక బాధ్యత నిర్వర్తించారని వెల్లడించారు. భావాలను ఆధారంగా చేసుకొని రచయితలపై కేసులు మోపాలనే ప్రయత్నం రాజ్యాంగ విరుద్ధమవుతుందని, కాబట్టి ఆయనను కేసులో ఇరికించాలనే ఆలోచనను విరమించుకోవాలని వారు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ రచయితలు, కవులు, కళాకారుల తరఫున నిఖిలేశ్వర్, నందిని సిధారెడ్డి, పొత్తూరి వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, ఎ.కె.ప్రభాకర్, కె.రామచంద్రమూర్తి, గద్దర్, అంపశయ్య నవీన్, పాశం యాదగిరి, వాసిరెడ్డి నవీన్, ఓల్గా, మదిగంటి సుజాతరెడ్డి, విమలక్క, దేవీప్రియ తదితరులు ఈప్రకటన విడుదల చేశారు.

రైలుకొక కెప్టెన్.. సమస్యలకు ఇక చెల్లు!

- కొత్త వ్యవస్థ అందుబాటులోకి

ఈనాడు, హైదరాబాద్: రైలులో నీళ్లు రావడంలేదా? మీ కోచ్ అపరిశుభ్రంగా ఉందా? మీకు సమకూర్చే భోజనం సరిగా లేదా? మీ కోచ్‌లో ఫ్యాను తిరగడంలేదా? పోకిరీలు మిమ్మల్ని ఇబ్బందిపెడుతున్నారా? ఇలా సమస్య ఏదైనా పరిష్కారానికి మీ వెంట ఓ రైల్వే ప్రతినిధి ఉంటారు. మీ ప్రయాణం సాఫీగా సాగేలా రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. సమస్యను బట్టి వేర్వేరు ప్రయత్నాలు చేయకుండా ఒకే వ్యక్తికి అన్ని సమస్యలు చెబితే పరిష్కారమైపోతాయి. ఈ కొత్త వ్యవస్థను భారతీయ రైల్వే అందుబాటులోకి తీసుకొస్తోంది. దూరప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నిటిలోనూ ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే బోర్డు అన్ని జోన్లకు ఈనెల 8న ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం రాజధాని, శతాబ్ది, దురంతో రైళ్లలో ట్రైన్ సూపరింటెండెంట్ పేరుతో సేవలందుతున్నాయి. ఇప్పుడీ పేరును ట్రైన్ కెప్టెన్‌గా మారుస్తున్నారు. ఈ ట్రైన్ కెప్టెన్ మీ ప్రయాణం మొదలైనప్పటి నుంచి చివరివరకూ మీతో అదే రైలులో ప్రయాణిస్తారు. రైల్వే రిజర్వేషన్ ఛార్టు మీద అతని పేరు, ఫోన్‌నంబరు అందుబాటులో ఉంటుంది. రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ట్రాఫిక్) నీరజ్‌సహాయ్ పేరుమీద ఈ ఉత్తర్వులు అన్ని జోన్ల జనరల్ మేనేజర్లకు విడుదలయ్యాయి. ఈ ఉత్తర్వులు ప్రకారం.. ప్రయాణికులకు వివిధ సేవలందిస్తున్న సంస్థలన్నీ.. ఈ ట్రైన్ కెప్టెన్‌నే సంప్రదించాల్సి ఉంది. ఆహారం అందిస్తున్నవారు గుర్తింపు ఉన్న సంస్థనా లేదా? శీతల పానీయాలు, అల్పాహారం ఇలా అన్ని సేవలందించేవారు ముందుగా కెప్టెన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. రైలులో ప్రయాణికుడికి ఏ అసౌకర్యం కలిగినా దానిని పరిష్కరించాల్సిన బాధ్యత కెప్టెన్‌కే ఉంటుంది.

గౌరీలంకేశ్ హత్య కేసులో నిందితుడి అరెస్టు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య కేసులో మరో నిందితుడు, విజయపుర జిల్లా సింధగికి చెందిన పరశురామ్ వాగ్మోరే(26)ను మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలో తలదాచుకున్న అతడిని అరెస్టు చేసి బెంగళూరులోని మూడో ఏసీఎంఎం న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. అతని నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఈ నెల 24 వరకు సిట్ నిర్బంధానికి అప్పగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఇతనితో కలిపి ఇప్పటివరకు అరెస్టయిన నిందితుల సంఖ్య ఆరుకు చేరుకుంది. గౌరీ లంకేశ్ హత్యకు పరశురామ్ పథకాన్ని రూపొందించాడని సిట్ పేర్కొంటోంది. గౌరీపై నేరుగా కాల్పులు జరిపిన వ్యక్తిని ఇంకా సిట్ గుర్తించలేదు. తొమ్మిది నెలల కిందట గౌరీ లంకేశ్ తన నివాసం వద్ద దుండగుడి కాల్పులకు బలయ్యారు. ఆమె ఇంటి నివాసం వెలుపల ఉన్న నిఘా కెమేరాలలో హంతకుల చిత్రాలు అస్పష్టంగా నిక్షిప్తమయ్యాయి. నిందితుడి పోలికలు, పరశురామ్ వాగ్మోరేకు సరిపోవటంతో అతనే కాల్పులు జరిపి ఉంటాడని ఇపుడు అనుమానిస్తూ ఆ దిశగానూ దర్యాప్తు చేస్తున్నారు.

తానా ఫౌండేషన్ ఛైర్మన్‌గా ప్రసాద్ నల్లూరి

ఈనాడు, అమరావతి: తానా ఫౌండేషన్ ఛైర్మన్‌గా డాక్టర్ ప్రసాద్ నల్లూరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమెరికాలో 11న వెబ్ ఆధారంగా ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రసాద్ అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా పేరు పొందారు. గతంలో తెలుగు వైద్యుల సంఘానికి అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. తానా ఫౌండేషన్ తరఫున ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తొలకరి యాపిల్లు

యాపిల్ మహావృక్షానికి.. కొత్త చిగురులు... కొమ్మలు... నోరూరిస్తూ కొత్తగా కనిపిస్తున్నాయ్.. ఇంతకీ ఏంటవి?

@ డబ్ల్యుడబ్ల్యుడీసీ-2018

ఎప్పుడో స్టీవ్‌జాబ్స్ నాటిన చెట్టది. ఏళ్ల తరబడి వేళ్లు పెంచుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది టెక్నాలజీ ప్రియులకు దగ్గరైంది. ఈ నేపథ్యంలో ఏటా జరిగే ఓ పండగ. **డబ్ల్యుడబ్ల్యుడీసీ (వరల్డ్‌వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్)**. ఈ యేడూ జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా 77 దేశాల నుంచి వచ్చిన డెవలపర్లు. ఒకటే సందడి. బీటా వెర్షన్లు... భలే ప్రయోజనాలు... అన్నీ 'యాపిల్' రుచిని మరింత పెంచేవే. ఏటా వెర్షన్లు మార్చుకుంటూ వస్తున్న సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ వెనక రెండు కోట్ల మంది డెవలపర్లు ఉన్నారనీ... వారంలో 50 కోట్ల మంది యాప్ స్టోర్‌ని సందర్శిస్తున్నారనీ... నేటి యాపిల్ సంరక్షకుడు టిమ్ కుక్ చెబుతున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద 'యాప్ మార్కెట్ ప్లేస్' విస్తరించామని చెబుతూ 'యాపిల్ బృందం' కొత్త విశేషాల్ని వివరించింది.

వేగం పుంజుకుని... ఐఓఎస్ 12

కొత్త వెర్షన్‌తో ఫోన్, ప్యాడ్‌లకు మరిన్ని హంగులు వచ్చాయి. **ఫేస్‌టైమ్‌**తో ఒకేసారి 32 మందితో వీడియో, ఆడియో కాల్స్ మాట్లాడొచ్చు. సంభాషించేటప్పుడు ఎవరైతే మాట్లాడుతున్నారో వారు ఆటోమాటిక్‌గా పెద్దగా కనిపిస్తారు.

- ఫోన్‌లకు బానిసైపోతున్నామా? లేదా? అనే స్వీయ పరిశీలనకూ ఓటేస్తూ **స్క్రీన్ టైమ్** ముందుకొచ్చింది. రోజులో... వారంలో మీరెంత సమయం దేనికి కేటాయిస్తున్నారో సవివరంగా గ్రాఫ్‌లతో చెబుతుంది. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టేందుకు సరైన ఆప్షన్.
- తాళాలు పోతే ట్రాకింగ్ యాప్‌ల్లోకి వెళ్లి ఎక్కడుందో వెతకక్కర్లేదు. 'లాస్ట్ మై కీస్' అని సిరీకి చెప్పి **షార్ట్‌కట్** క్రియేట్ చేస్తే చాలు. ఇక ఎప్పుడైనా తాళాలు పోతే ఆటోమాటిక్‌గా సిరీనే సంబంధిత యాప్‌ని ఓపెన్ చేసి ఎక్కడుందో వెతికేస్తుంది. 'కమింగ్ హోం' షార్ట్‌కట్‌తో భార్యకి మేసేజ్ వెళ్లేలా... ఇంట్లో గీజర్ ఆన్ అయ్యేలా... గదిలో ఏసీ కావాల్సిన డిగ్రీల్లో సెట్ అయ్యేలా చేసుకోవచ్చు. ఎప్పుడైనా సిరీతో 'కమింగ్ హోమ్' అని చెబితే చాలు. షార్ట్‌కట్ పెట్టుకున్న అన్నింటికీ సమాచారం చేరిపోతుంది.
- అగ్మెంటెడ్ రియాలిటీ మరింత దగ్గరవుతోంది. ఫోన్, ఫ్యాడ్‌తో ఏఆర్ వీడియోలు చిత్రీకరించొచ్చు. వెంటనే వాటిని సోషల్ మీడియాలో పంచుకోవచ్చు. ఉన్న చోటునే గేమింగ్ అడ్డాగా మార్చేయవచ్చు. **ఏఆర్ లెగో సిటీ** పేరుతో గేమ్ వచ్చేసింది. ఇద్దరు కలిసి ఆడేయొచ్చు. అంటే..అందరూ ఏఆర్ యాక్షన్‌లోకి దిగేందుకు సమయం దగ్గరకొచ్చింది.

- సమావేశాల్లో ఉన్నప్పుడు **డు నాట్ డిస్ట్రబ్** పెట్టి మర్చిపోతుంటాం. అలాంటి ఇబ్బంది లేకుండా మీటింగ్ పూర్తై హాలు నుంచి బయటికి రాగానే ఫోన్ సాధారణ స్థితికి వచ్చేలా డు నాట్ డిస్ట్రబ్ అప్‌డేట్ అయింది.
- **ఫర్ యూ**... మొత్తం ఫొటో గ్యాలరీని జల్లెడ పట్టి మధుర జ్ఞాపకాల్ని ముందుకు తెస్తుంది. ఆల్బమ్‌లో ఉన్నవారికీ వీటిని షేర్ చేయమని చెబుతుంది కూడా.
- మీ రూపానికి తగినట్టుగా **మెమొజీ**లు... పలు రకాల యానిమేషన్స్‌తో **యానిమోజీ**లను సంభాషణల్లో జత చేయొచ్చు.
- బ్రౌజింగ్‌లో ప్రైవసీని కొల్లగొట్టేందుకు వీలు లేకుండా **ప్రైవసీ** మరింత మెరుగయింది. షేరింగ్ బటన్లు, కామెంట్ ఆప్షన్స్ లాంటి వాటిని సఫారీ బ్రౌజర్ బ్లాక్ చేస్తుంది. అనుమతితోనే ఆప్షన్లు డిసేబుల్ అవుతాయి.

మోజావే మరికొన్ని మాయలు

యాపిల్ మ్యాక్ వాడకంలో మాజానే వేరు. ఆ కిక్‌ని మరింత పెంచుతూ మోజావేలో మరికొన్ని ముందుకొచ్చాయి.

- మ్యాక్‌లు అంటేనే ఎడిటింగ్‌కి అనువైనవి. అయితే, కంప్యూటర్ స్క్రీన్ మొత్తాన్ని నలుపు రంగులోకి మార్చేసి ఎడిటింగ్ చేస్తే. నాణ్యమైన విజువల్స్‌ని చూడడం సులభం అవుతుంది. అంతేకాదు... ఎక్కువ సమయం సిస్టం ముందు పని చేయాల్సివచ్చినప్పుడు కళ్లకూ పెద్దగా ఒత్తిడి అనిపించదు. అందుకే మ్యాక్ ఓఎస్‌లో **డార్క్‌మోడ్‌**ని పరిచయం చేస్తోంది. అందుకు తగిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌ని యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉంచారు. అవసరం మేరకు నలుపు, తెలుపుల్లో 'మోడ్'లను పెట్టుకుని పని చేసుకోవచ్చు.

- **డైనమిక్ డెస్క్‌టాప్...** ఆహ్లాదకరమైన వాల్‌పేపర్‌ని డెస్క్‌టాప్‌కి పెట్టుకుంటాం. అయితే, వాల్‌పేపర్ ఎప్పుడూ ఒకేలా కనిపించకుండా సమయానుగుణంగా మారిపోతుంది. ఎలాగంటే... ఉదయం సూర్యోదయం వెలుతురుతో మొదలై... ఎండ... సూర్యాస్తమయం... చీకట్లో పెట్టుకున్న వాల్‌పేపర్ కనిపిస్తుంది. వెలుతురు (బ్రైట్‌నెస్) మారుతుండడంతో కళ్లకూ ఎక్కువ ఒత్తిడి అనిపించదు.
- డెస్క్‌టాప్‌పై పలు రకాల ఫార్మెట్‌ల్లో ఫైళ్లని చిందర వందరగా సేవ్ చేస్తుంటాం. తెరపై క్రమం లేకుండా ఉన్నవాటిని **స్టాక్స్** ఆప్షన్‌ని వాడి చక్కగా సర్దేయవచ్చు. ఫైళ్ల ఫార్మెట్ ఆధారంగా క్రమ పద్ధతిలో అన్నీ సర్దుకుంటాయి. ఉదాహరణకు నెట్ నుంచి ఏదైనా ఇమేజ్‌ను డౌన్‌లోడ్ చేస్తే అన్నీ ఫోల్డర్ (స్టాక్) ఒకే దాంట్లో సేవ్ అవుతాయి. వాటన్నింటినీ తిరిగి చూడాలనుకుంటే 'స్టాక్'ని సెలెక్ట్ చేస్తే చాలు. ఫొటోలన్నీ విచ్చుకుంటాయి.
- తెరపై ఉన్నవాటిని స్క్రీన్‌షాట్స్, స్క్రీన్ రికార్డింగ్ చేస్తుంటాం. ఈ పనిని మరింత సులభం చేస్తూ **స్క్రీన్‌షాట్స్** ఆప్షన్స్ ముందుకొచ్చాయి. పలు రకాల పద్ధతుల్లో స్క్రీన్‌షాట్స్ తీసుకోవచ్చు. అదే మాదిరిగా రికార్డింగ్ కూడా.
- ఫైల్స్‌ని వెతికి పట్టుకొచ్చే **ఫైండర్** అదనపు సౌకర్యాల్ని జత చేసుకుంది. ఫైల్‌ని ఓపెన్ చేకుండానే అన్ని వివరాలు (ప్రాపర్టీస్) చూడొచ్చు.
- **ఫేస్‌టైమ్‌**తో మ్యాక్‌లోనూ 32 మందితో వీడియో ఛాటింగ్ చేయొచ్చు.

టీవీలోనూ ఠీవిగా...

4కే వీడియోలకే మనం ఫిదా. అంతకుమించిన క్వాలిటీతో యాపిల్ టీవీ ముందుకొస్తోంది. అదే **4కే హెచ్‌డీఆర్**. అంతేకాదు... **డాల్బీ ఆట్మోస్** సౌండ్ సిస్టమ్ ఇముడ్చుకుంది. దీంతో వీడియోనే కాకుండా వాటి వెనకున్న మ్యూజిక్ కూడా 360 డిగ్రీల కోణంలో మాయ చేస్తుంది. 100పైనే టీవీ ఛానళ్లనూ టీవీలో ట్యూన్ చేసి చూడొచ్చు. టీవీ ఓఎస్‌తో ఇతర ఐఓఎస్ పరికరాలు (ఫోన్, ప్యాడ్) కనెక్ట్ చేసి వాడొచ్చు. రిమోట్‌ని ముట్టకుండానే 'సిరీ'కి చెప్పి కావాల్సిన ఛానల్‌ని చూడొచ్చు. ఐఫోన్ రిమోట్‌లా మారిపోతుంది.

మణికట్టుపై మది దోచేవి

ఇప్పటికే ఈ-సిమ్‌లతో ఆకట్టుకుంటున్న యాపిల్ వాచ్ 'ఓఎస్5'తో మరింత స్మార్ట్‌గా ముస్తాబవుతోంది.

- ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లకు **యాక్టివిటీ కాంపిటేషన్స్** పరిచయం చేస్తోంది. వ్యాయామంలో... పనిలో... దోస్తులతో ఎప్పటికప్పుడు పోటీపడుతూ వాచ్ నుంచే సవాల్ విసరొచ్చు. పాయింట్స్ కూడా ఉన్నాయి.

- వ్యాయామం చేస్తున్న విషయాన్ని గ్రహించి తగిన సమాచారాన్ని (**వర్క్అవుట్ అప్‌డేట్స్**) అందిస్తుంది. ఎన్ని కేలరీలు ఖర్చు అయ్యాయో చెబుతూనే 'ఇక ఆపొచ్చని' హెచ్చరిస్తుంది. యోగాసనాల్ని ట్రాక్ చేస్తూ మీరెంత పద్ధతిగా సాధన చేస్తున్నారో చెబుతుంది.
- నడకుండా పరుగు అందుకుంటే అందుకు తగినట్టుగా మారిపోయి వేగాన్ని, గుండెలయని ట్రాక్ చేస్తూ అలర్ట్ చేస్తుంది.
- వ్యాయామం చేస్తున్నప్పుడో... బోర్ అనిపించినప్పుడో వినేందుకు **యాపిల్ పాడ్‌క్యాస్ట్‌**లను పరిచయం చేస్తోంది.
- ఫోన్ లేకపోయినా యాపిల్ వాచ్‌తో కాల్స్ మాట్లాడేస్తాం. మెసేజ్‌లు పంపేస్తున్నాం. ఇకపై మరో కొత్త పద్ధతిలో వాచ్‌లతో మాట్లాడొచ్చు. ఎందుకంటే వాచ్‌లు **వాకీ-టాకీ**లు అవుతున్నాయ్. రెండు యాపిల్ వాచ్‌ల మధ్య సెల్యులర్, వై-ఫై నెట్‌వర్క్‌లతో వాయిస్ ఛాట్‌లు చేయొచ్చు.

వెరైటీ!

స్మార్ట్ లాంతర్

చిన్నప్పుడు ఎప్పుడో చూసిన లాంతర్‌లా కనిపిస్తోంది కదూ! నిజమేగానీ ఇది ఇప్పటి జనరేషన్ లాంతర్. 36 ఎల్ఈడీ లైట్‌లతో వెలుగుతుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే రోజంతా వెలుగుతుంది. అంతేకాదు... యూఎస్‌బీ పోర్టుతో ఫోన్, ఇతర గ్యాడ్జెట్‌లనూ ఛార్జ్ చేయొచ్చు. దీంట్లోని పవర్ బ్యాంకు సామర్థ్యం 4,500ఎంఏహెచ్. ఎస్‌డీ కార్డుని పెట్టుకుని పాటలు వినొచ్చు. ఎఫ్ఎం కూడా ఉంది. కరెంటు పోతే ఆటోమాటిక్‌గా లైట్ వెలుగుతుంది.

■ ధర రూ.3,000

మిమ్మల్ని పోషించలేం మహాప్రభో!

మొక్కలు చేతులెత్తేస్తున్నాయి. పంటలు పడకేస్తున్నాయి. 'మిమ్మల్ని పోషించటం మావల్ల కావటం లేదు' అని మొరపెట్టుకుంటున్నాయి. అంతా మన స్వయంకృతాపరాధమే. వాతావరణంలో ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్న కార్బన్‌డయాక్సైడ్ (సీవో2).. దీని మూలంగా విజృంభిస్తున్న ఉష్ణోగ్రతలు పంటల జీవసారాన్ని పీల్చేసి పిప్పి చేస్తున్నాయి. పోషకాల స్థాయులు దిగజారేలా చేస్తున్నాయి. ఇదిలాగే కొనసాగితే మనం తీవ్ర పోషణలోపంలోకి జారిపోవటం ఇంకెంతో దూరంలో లేదు. అందుకే మొక్కలు తమ గోడును ఇలా వెలిబుచ్చుకోవటానికి మన ముందుకు వచ్చాయి.

సరిపడినంత ఆహారం ఉన్నప్పటికీ..

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా ప్రపంచంలో మీ అందరికీ సరిపడినంత ఆహారం ఉన్నా కోట్లాది మంది తగినంత ఆహారం లభించక.. ఆకలితో నకనకలాడుతుండిపోతున్నారు. ఇది నిజంగా విచారకరమే కదూ. ఇలా అర్ధాకలితో అలమటించేవారి సంఖ్య 2015లో సుమారు 77.7 కోట్లు ఉండగా.. ఇదిప్పుడు 81.5 కోట్లకు చేరుకుందని మీ పరిశోధకులే చెబుతున్నారు. ఆహారం అందుబాటులో లేకపోవటం, సరఫరాలో ఇబ్బందుల వంటివి ఒక ఎత్తయితే.. వాతావరణ మార్పులు సైతం దీనికి ఆజ్యం పోస్తున్నాయి. అంతేకాదు, ఈ వాతావరణ మార్పులు మేం ఉత్పత్తిచేసే ధాన్యాలు, పండ్ల వంటి వాటిల్లో పోషక విలువలు తగ్గిపోయేలా చేస్తున్నాయి కూడా. ఇది మున్ముందు మీకే పెద్ద నష్టం. ఇలాంటి ఉత్పత్తులను మీరు తీసుకుంటే కడుపు నిండినా తగినన్ని పోషకాలు లభించక మీరు పోషణ లోపం బారినపడే ప్రమాదం పొంచి ఉందని గుర్తించండి.

మాకూ ఉంది నిర్ణీత ఉష్ణోగ్రత

మా ఎదుగుదల, అభివృద్ధి మీద వాతావరణ ఉష్ణోగ్రత గణనీయ ప్రభావాన్ని చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ డయాక్సైడ్ స్థాయులు పెరగటం మూలంగా వాతావరణంలో ఉష్ణోగ్రతలూ పెరుగుతూ వస్తున్నాయి. వీటి మూలంగా మాపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. మా మొక్కలన్నింటికీ ప్రతిదానికీ జన్యుపరంగా ఒక నిర్దిష్టమైన ఉష్ణోగ్రత పరిమితి ఉంటుంది. అంటే ఆయా ఉష్ణోగ్రతల్లో మేం ఎలాంటి చిక్కులు లేకుండా, హాయిగా ఎదుగుతామన్నమాట. వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతే మా జీవనచక్రం కూడా అస్తవ్యస్తమవుతుంది. దీంతో మా దిగుబడి తగ్గిపోతుంది. ఈ శతాబ్దం చివరికి వరి, మొక్కజొన్న దిగుబడి 20% నుంచి 40% మేరకు పడిపోతుందని మీ పరిశోధకులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు.

సీవో2 పెరగటం పెద్ద ముప్పు

మేం మట్టి ద్వారా పోషకాలను, మూలధాతువులను గ్రహిస్తుంటాం కదా. అంతేకాదు, కర్బనంతో నిండిన చక్కరలు, ఇతర పిండి పదార్థాలను తయారుచేసుకోవటానికి వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను కూడా ఉపయోగించుకుంటాం. వచ్చిన చిక్కేంటంటే- కార్బన్ డయాక్సైడ్ స్థాయులు పెరిగితే మా ఉత్పత్తుల్లో పోషకాల స్థాయులు కూడా మారిపోతాయి. మీరు తీసుకునే వరి, జొన్న, మొక్కజొన్న వంటి ప్రధాన ఆహార పంటల్లో పిండి పదార్థాల నిష్పత్తితో పోలిస్తే జింక్, ఐరన్ వంటి పలు పోషకాల స్థాయులు ఇప్పటికే తగ్గుముఖం పట్టాయి. ఇక ప్రొటీన్ల ఘనులైన సోయాబీన్స్, బఠానీల్లో ఈ మాంసకృత్తుల మోతాదులకూ గండి పడుతోంది.

మీకే ప్రమాదం?

మీ శరీరాలు ఖనిజ లవణాలను తయారుచేసుకోలేవు. వీటిని మీరు ఆహారం ద్వారానే తీసుకోవాలి. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పెరగటం వల్ల మాలో పోషకాలు లోపిస్తే మీలో పోషణ లోపం తలెత్తే ప్రమాదం పొంచి ఉందనే సంగతిని గుర్తించండి. పోషణ లోపం మూలంగా ఎన్నో ఆరోగ్య సమస్యలు దాడి చేస్తాయన్న విషయాన్ని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అదొక్కటే కాదు.. సీవో2 పెరగటం వల్ల కొన్ని ఆహార పంటల్లో విషతుల్యాలు మరింత ఎక్కువగానూ ఉత్పత్తి అవుతున్నాయి. సుమారు 60% పంట జాతులు సయానోజెనిక్ గ్లైకోసైడ్లనే అణువులను ఉత్పత్తి చేస్తుంటాయి. ఈ అణువులు సైనైడ్‌గా మారిపోతుంటాయి. నిజానికి మాలో సయానోజెనిక్ గ్లైకోసైడ్లు తక్కువ మోతాదులోనే తయారవుతుంటాయి. కానీ వాతావరణ మార్పుల వల్ల ఇప్పుడు మాలో కొన్ని దీన్ని పెద్దమొత్తంలోనూ తయారుచేసు కుంటున్నాయి. సైనైడ్ విషమని, ఇది వెంటనే ప్రాణాలను హరిస్తుందనే విషయం మీకు తెలిసిందే. స్వల్ప మోతాదులో అయినా ఆహారం ద్వారా దీన్ని దీర్ఘకాలంగా తీసుకుంటూ వస్తుంటే భవిష్యత్తులో మీకు ఎన్నో చిక్కులు తెచ్చిపెడుతుంది.

వరికి మరింత హాని

మీరు ప్రధానంగా పండించే ఆహార పంట వరిలో ఇప్పుడు ఐరన్, జింక్‌తో పాటు విటమిన్ బి1 (థయామిన్), బి2 (రైబోఫ్లావిన్), బి5 (పాంటోథెనిక్ యాసిడ్), బి9 (ఫోలేట్) కూడా తగ్గుముఖం పడుతున్నాయి. అయితే విటమిన్ ఇ స్థాయులు పెరుగుతుండటం విచిత్రం. కార్బన్ డయాక్సైడ్ మోతాదులు పెరగటం వల్ల నత్రజనితో కూడిన అణువుల నిర్మాణానికి అవసరమైన సామర్థ్యం మాలో కొరవడుతుండటమే దీనికి కారణం. కాబట్టి ఇకనైనా కళ్లు తెరవండి. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ స్థాయులు తగ్గించి.. మమ్మల్ని జవజీవాలతో బతికించుకోండి.

ఇది విన్నారా?

నక్కి.. నక్కి.. గుట్టురట్టు!

ఒకప్పుడు బయట తిరిగొస్తే.. ఎక్కడెక్కడ తిరిగొచ్చావ్? ఇంత ఆలస్యం దేనికి? ఊరి మీద పడి తిరగడమే ఓ పనైపోయింది అంటూ ఇంటికెళ్లాక ట్రాకింగ్ దండకాలు. మరి, ఇప్పుడు ఆధునిక టెక్నాలజీతో పొద్దుగూకే వరకూ అక్కర్లేదు. గడప దాటింది మొదలు లైవ్‌లో ట్రాకింగ్ చేస్తూ ఎక్కడెక్క తిరుగుతున్నదీ ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ లైవ్‌లోనే 'రా.. త్వరగా' అంటూ పిలుస్తున్న పరిస్థితి. అయితే, భద్రత నిమిత్తం ప్రవేశించిన ట్రాకింగ్ టెక్నాలజీ రోజు రోజుకీ వినియోగదారుల ప్రైవసీకి పరీక్షగా మారుతోంది. సుమారు 200పైనే అప్లికేషన్లు విరివిగా స్మార్ట్‌ఫోన్లు, ఇతర గ్యాడ్జెట్‌ల్లో నక్కి యూజర్ల గుట్టుని రట్టు చేస్తున్నాయని ఓ సర్వేలో తేలింది. కేవలం ట్రాకింగ్‌తో ఆగకుండా టెక్స్ట్ మెసేజ్‌లు, లైవ్ వీడియోలను చిత్రీకరిస్తూ పరిధి దాటేస్తున్నాయి. అంతేకాదు... ప్రేమికులు, భార్యభర్తలు ఒకరిపై మరొకరు 'స్పై'లుగా యాప్‌లను ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుని గుట్టుగా వ్యక్తిగత వివరాల్ని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

పలకరించనున్న 'రాడా'

కొత్తగా విమానం ఎక్కేందుకు ఎయిర్‌పోర్టుకు వెళ్తే. ఎవరి సాయం తీసుకోవాలా అని కంగారు పడక్కర్లేదు. ఎయిర్‌పోర్టులో అడుగుపెట్టగానే రోబోనే మీ దగ్గరకి వస్తుంది. సాయం కావాలా అని అడుగుతుంది. బోర్ కొడితే కంపెనీ ఇస్తుంది. అడిగితే వాతావరణ వివరాలు చెబుతుంది. ఎక్కడో ఇతర దేశాల్లోనేమో అనుకునేరు. మన దగ్గరే. దిల్లీలోని ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టులో. వచ్చేనెల్లోనే ప్రయాణికుల ముందుకు రానుంది. విస్తారా ఎయిర్‌లైన్ పరిచయం చేయనున్న దీని పేరెంటో తెలుసా? రాడా. చిన్నగా చేతులు కదిలిస్తూ అటు ఇటు తిరుగుతూ అన్ని రకాలుగా సాయం అందించనుంది. అన్నట్టు... రాడా పేరుకి మూలం రాధ అట!

గ్యాడ్జెట్ గురూ

ఇంకు బాటిళ్లతో

పెన్నులో ఇంకు అయిపోతే నింపుకొని వాడుకోవడం గుర్తుందా? అదే మాదిరిగా వాడుతున్న ప్రింటర్‌లోనూ ఇంకుని నింపుకొని వాడుకుంటే? కెనాన్ 'పిక్స్‌మా సీ3010' ప్రింటర్ అలాంటిదే. 'హైబ్రిడ్ ఇంక్ సిస్టమ్'తో ఇది పని చేస్తుంది. ప్రింటర్‌కి ముందు భాగంలో ఏర్పాటు చేసిన 'ఇంక్ ట్యాంకు'లో కావాల్సిన రంగులు నింపుకోవచ్చు. ఎప్పటికప్పుడు ఇంకు ఎంత ఉందో చెక్ చేసుకోవడం సులభం. వైర్‌లెస్ పద్ధతిలో పరికరాలకు (ఫోన్, ట్యాబ్లెట్, పీసీ) అనుసంధానమై పని చేస్తుంది. ప్రింట్, కాపీ, స్కాన్ చేయొచ్చు. 1.2 అంగుళాల ఎస్‌సీడీ డిస్‌ప్లేతో కంప్యూటర్ అవసరం లేకుండానే ప్రింట్స్‌ని మేనేజ్ చేయడం సులభం. నాలుగు ఇంకు బాటిళ్లతో 6,000 నలుపు, తెలుపు ప్రింట్‌లు లేదంటే 7,000 రంగుల డాక్యుమెంట్‌లను ప్రింట్ తీసుకోవచ్చు.

■ ధర రూ.13,995

నాలుగు కెమెరాలు

వెనక రెండు... ముందు రెండు కెమెరాలు. మొత్తం నాలుగు. వైడ్ యాంగిల్ లెన్స్‌తో ఫొటోలు. ఫోన్ ఏంటో తెలుసా? 'జెన్‌ఫోన్ 5క్యూ'. ముందు 20 మెగాపిక్సల్ కెమెరాతో పాటు 120 డిగ్రీల వైడ్ యాంగిల్ లెన్స్. వెనక కూడా 16 మెగాపిక్సల్ కెమెరాతో పాటు లెన్స్ కెమెరాలు ఉన్నాయి. తాకేతెర పరిమాణం 6 అంగుళాలు. రిజల్యూషన్ 2160 x 1080 పిక్సల్స్. 18:9 నిష్పత్తిలో పొడవైన తెరతో ఆకట్టుకుంటుంది. క్వాల్‌కామ్ శ్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్‌ని వాడారు. ర్యామ్ 4జీ. ఇంటర్నల్ మెమొరీ 64జీబీ. బ్యాటరీ సామర్థ్యం 3,300 ఎంఏహెచ్. దేశీయ మార్కెట్‌లోకి త్వరలోనే రానుంది.

ఈనాడు సినిమా

'సైరా' కోసం హాలీవుడ్ నుంచి...

చిరంజీవి

చిరంజీవి 151వ చిత్రం 'సైరా నరసింహా రెడ్డి'. సురేందర్‌రెడ్డి దర్శకుడు. అమితాబ్ బచ్చన్, నయనతార, తమన్నా, ప్రగ్యా జైస్వాల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. రామ్‌చరణ్ నిర్మాత. హైదరాబాద్ శివార్లలో తీర్చిదిద్దిన ఓ ప్రత్యేకమైన సెట్‌లో 'సైరా' చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో కొన్ని యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. అందుకోసం హాలీవుడ్ నిపుణుల్ని తీసుకొచ్చారు. అందులో గ్రేగ్ పావెల్ కూడా ఉన్నారు. 'స్కై ఫాల్', 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్', 'హ్యారీ పోటర్'లాంటి చిత్రాలకు సాంకేతిక సహాయం అందించారీయన. 'సైరా'లో యుద్ధ నేపథ్యంలో సాగే సన్నివేశాలకు ప్రాముఖ్యత ఉంది. వాటిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని దర్శక నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు.

పంతం సిద్ధం

గోపీచంద్ కథానాయకుడిగా శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'పంతం'. మెహరీన్ కథానాయిక. కె.చక్రవర్తి దర్శకత్వం వహిస్తున్నారు. కె.కె. రాధామోహన్ నిర్మాత. ఇటీవల ఇంగ్లండ్‌లో కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు పాటల్ని తెరకెక్కించారు. దాంతో చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. చిత్రాన్ని జులై 5న విడుదల చేయాలని నిర్ణయించారు. నిర్మాత మాట్లాడుతూ "మంచి సందేశంతో పాటు ప్రేమ, హాస్యానికి పెద్దపీట వేస్తూ తెరకెక్కించిన చిత్రమిది. గోపీచంద్ ఇప్పటివరకు చేయని ఒక విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కి మంచి స్పందన లభించింది. ఓటును అమ్ముకొని అవినీతి లేని సమాజం కావాలంటే ఎక్కడి నుంచి వస్తుందని కథానాయకుడు వేసే ప్రశ్నతో సాగే టీజర్ చిత్రంపై ఆసక్తిని, అంచనాల్ని రేకెత్తించింది" అన్నారు. పృథ్వీరాజ్, జయప్రకాష్‌రెడ్డి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్. ప్రకాష్, మాటలు: రమేష్‌రెడ్డి, స్క్రీన్‌ప్లే: కె.చక్రవర్తి, బాబీ, సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల.

గోపీచంద్

ఆ విషయంలో సిగ్గు వదిలేస్తా

"డ్యాన్స్ అనేది అద్భుతమైన కళ. మన భావాల్ని వ్యక్తీకరించుకోవడానికి దొరికిన సాధనం" అంటోంది పూజా హెగ్డే. నవతరం కథానాయికల్లో పూజా జోరుమీద ఉంది. వరుసగా మంచి అవకాశాల్ని చేజిక్కించుకుంటోంది. డ్యాన్స్ గురించి పూజా మాట్లాడుతూ "నాకు డ్యాన్స్ అంటే ప్రాణం. స్వతహాగా కాస్త సిగ్గరిని. కానీ.. డ్యాన్స్ విషయంలో మాత్రం సిగ్గు వదిలేస్తా. సంగీతం వింటే చాలు.. నాలోని ఓపిక నశించేవరకూ, నీరసించి కిందపడిపోయేంత వరకూ డ్యాన్స్ చేస్తూనే ఉంటా. ఇప్పటి వరకూ నేను చేసిన సినిమాల్లో ఎక్కువ డ్యాన్స్ చేసే అవకాశం 'డీజే'తోనే దక్కింది. ఇక ముందూ... మంచి డ్యాన్స్ నెంబర్లలో కనిపించాలని ఉంది" అంటోంది. తెలుగు చిత్ర సీమలో ఉన్న కథానాయకుల్లో మంచి డ్యాన్సర్ల గురించి మాట్లాడుతూ "టాలీవుడ్‌లో స్టెప్పులు ఇరగదీసే కథానాయకులకు కొదవే లేదు. ఎన్టీఆర్, అల్లు అర్జున్ ఇద్దరూ గొప్ప డ్యాన్సర్లే. బన్నీతో నటించా. ఇప్పుడు ఎన్టీఆర్‌తో చేస్తున్నా కదా.." అంటోంది పూజ.

పూజా హెగ్డే

ప్రతిసారీ కండలు చూపిస్తానంటే కుదరదు

ఏదైనా సరే, కొత్తగా ఉండాల్సిందే. అలాంటి ప్రయత్నాలనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అందుకే యువ కథానాయకుల నుంచి స్టార్స్ వరకూ ఈ మంత్రాన్నే జపిస్తున్నారు. సుధీర్‌బాబూ అంతే. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలకు కట్టుబడకుండా.. వైవిధ్యాన్ని చూపిస్తున్నాడు. అందుకే ఆయన ఖాతాలో 'ప్రేమకథాచిత్రమ్', 'భలే మంచి రోజు', 'శమంతకమణి'లాంటి విజయాలు చేరాయి. ఇప్పుడు 'సమ్మోహనం' అంటూ ఓ ప్రేమకథతో మాయ చేయడానికి సిద్ధమయ్యాడు. మరోవైపు నిర్మాతగానూ తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. ఈ శుక్రవారం 'సమ్మోహనం' విడుదల కానుంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు చెప్పుకొచ్చిన కబుర్లు...

- "వాస్తవ కోణంలో సాగే ప్రేమకథ ఇది. నిజ జీవితాలకు దగ్గరగా ఉంటుంది. ఇది వరకు కొన్ని ప్రేమ కథలు చేశాను. కానీ వాటితో పోలిస్తే.. 'సమ్మోహనం' చాలా భిన్నంగా కనిపించింది. అందుకే ఇంద్రగంటి కథ చెప్పగానే ఒక్క నిమిషం ఆలోచించకుండా ఒప్పుకున్నాను. సన్నివేశాలు, సంభాషణలు... ఇవన్నీ ఓ కొత్త అనుభూతిని పంచుతాయి. ఇందులో నా పేరు విజయ్. చిన్న పిల్లల పుస్తకాలకు బొమ్మలు వేస్తుంటాను. కళాకారుడిగా పేరు తెచ్చుకోవాలన్నది నా ఆశ. అలాంటి కుర్రాడికి ఓ కథానాయిక పరిచయం అవుతుంది. వాళ్లిద్దరి మధ్య ఏం జరిగింది? అనేదే కథ.
- "సినిమా పరిశ్రమకు సంబంధించిన కొన్ని సన్నివేశాలున్నాయి. వాళ్లను చులకన చేసి ఏం మాట్లాడడం లేదు. సినిమా పరిశ్రమలో కళ్లకు కనిపించేదంతా నిజం కాదు. తారల జీవితాలు వాస్తవంలో వేరేలా ఉంటాయి. వాటన్నింటినీ 'సమ్మోహనం'లో చూపిస్తున్నాం. సినిమా పరిశ్రమ పట్ల వ్యక్తులకు ఉన్న అభిప్రాయాల్ని నా పాత్ర ద్వారా చెప్పించారు. తప్పకుండా ఆయా సన్నివేశాలు ఆలోచనలో పడేస్తాయి"
- "మంచి నటుడ్ని అవ్వాలనే పరిశ్రమకొచ్చాను. కొత్త తరహా పాత్రలు చేస్తుంటేనే.. విభిన్నమైన కోణాలు బయటకు వస్తాయి. అలా చేయాలంటే కొత్త కథల్ని ఎంచుకోవాలి. ప్రతిసారీ కండలు చూపించి నెట్టుకొద్దామనుకుంటే కుదరదు. కథల విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నా. కొత్తదనం ఉంటేనే ఒప్పుకుంటున్నా. 'సమ్మోహనం' విషయానికొస్తే ఇప్పటి వరకూ నేను చేసిన చిత్రాల్లో ఇదే అత్యుత్తమం. ఇది వరకు నా సినిమాలు కొన్ని బాగా ఆడాయి. అయినా సరే.. 'ఇక్కడ ఇంకొంచెం బాగా చేయాల్సింది' అనిపించేది. అలాంటి అనుమానాలేం లేకుండా.. నా అత్యుత్తమ నటన ఈ చిత్రం ద్వారా కనబరిచా"
- "ఇంద్రగంటి లాంటి అనుభవం ఉన్న దర్శకుడితో పనిచేయడం ఆనందంగా ఉంది. ఆయన నన్ను నమ్మి ఈ కథ నా దగ్గరకు తీసుకొచ్చారు. అదే గొప్ప గౌరవం. ఆయనతో ఇది వరకే చేయాల్సింది. 'ఎస్.ఎమ్.ఎస్'కి ముందే అవసరాల శ్రీనివాస్ సిద్ధం చేసిన కథని నా దగ్గరకు తీసుకొచ్చి వినిపించారు. కానీ అప్పట్లో కుదరలేదు. 'సమ్మోహనం'తో ఆ అవకాశం మళ్లీ వచ్చింది. ఆయనతో వంద సినిమాలు చేయడానికైనా సిద్ధమే"
- "పరిశ్రమలో అవకాశమే చాలా గొప్పది. ఆ అవకాశం దొరక్క చాలామంది వెనక్కి వెళ్లిపోతున్నారు. వాళ్లలో కొంతమందికైనా వేదిక కల్పించడానికి నిర్మాతగా మారాను. తొలి ప్రయత్నంగా ఆర్.ఎస్.నాయుడు అనే కొత్త దర్శకుడితో ఓ సినిమా మొదలెట్టాం. దాదాపు చిత్రీకరణ పూర్తయింది. మరో రెండు నెలల్లో సిద్ధం అవుతుంది. మంచి కథ దొరికితే మహేష్‌బాబుతోనూ సినిమా చేస్తా. పుల్లెల గోపీచంద్ బయోపిక్ సెప్టెంబరులో మొదలవుతుంది. తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి తెరకెక్కిస్తాం"

ఏదో ఒక కొత్తదనాన్ని చూపించాల్సిందే!

విజయ్, దివ్య, కావ్య, నాగచైతన్య, రాహుల్, రాము

"కొత్తవాళ్లని పరిచయం చేయడమనేది సంతోషాన్నిచ్చే విషయం. 'రారండోయ్ వేడుక చూద్దాం'లో కబడ్డీ ఫైట్‌ని విజయ్ మాస్టర్ చేశారు. అక్కడే వాళ్లబ్బాయి రాహుల్‌ని చూశా. బాగున్నాడనిపించింది. తను చేసిన పాటలు చూశాక మంచి ప్రతిభ ఉందనిపించింది. చిత్ర పరిశ్రమలో పేరు తెచ్చుకొంటాడని ఆశిస్తున్నా" అన్నారు కథానాయకుడు నాగచైతన్య. ఆయన మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన 'ఈమాయ పేరేమిటో' టీజర్ విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైట్ మాస్టర్ విజయ్ తనయుడు రాహుల్ విజయ్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రమిది. కావ్య థాపర్ కథానాయిక. రాము కొప్పుల దర్శకుడు. దివ్య విజయ్ నిర్మాత. టీజర్‌ని విడుదల చేసిన అనంతరం నాగచైతన్య మాట్లాడుతూ "ఈ వేడుకకి పిలవడానికి వచ్చినప్పుడు రెండు పాటలు చూపించారు. నాకు బాగా నచ్చాయి. చిత్ర పరిశ్రమలో ఎదగడం అంత సులభం కాదు. ప్రతి సినిమాలోనూ ఏదో ఒక కొత్తదనాన్ని, ప్రతిభని చూపించాల"న్నారు. విజయ్ మాస్టర్ మాట్లాడుతూ "నాది సింగిల్ క్రాఫ్ట్. అప్పుడప్పుడు మిగతా 23 విభాగాల్ని సంతృప్తి పరచలేకపోతున్నా. కథానాయకుడు కావాలంటే 24 విభాగాల్ని మెప్పించాల్సి ఉంటుందని చెప్పి మా అబ్బాయిని కథానాయకుడిని చేశా. తను శిక్షణ పొంది నటుడయ్యాడ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నాగచైతన్య నటించిన '100% లవ్'కి దర్శకత్వ విభాగంలో పనిచేశా. ఆయనే నా సినిమా టీజర్‌ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. మా గురువు సుకుమార్, విజయ్ మాస్టర్ నన్ను నమ్మారు. ఆ నమ్మకమే నన్ను ఇక్కడిదాకా తీసుకొచ్చింద"న్నారు. రాహుల్ మాట్లాడుతూ "నాగచైతన్య చేతులమీదుగా టీజర్ విడుదల కావడం సంతృప్తినిచ్చింది" అన్నారు.

టైటిల్‌తోనే హిట్ కొట్టేశారు

శ్రీనివాసరెడ్డి, రవితేజ, సిద్ధి ఇద్నాని

శ్రీనివాసరెడ్డి కథానాయకుడిగా నటించిన చిత్రం 'జంబలకిడిపంబ'. సిద్ధి ఇద్నాని కథానాయిక. మను దర్శకత్వం వహించారు. రవి, జోజో జోస్, శ్రీనివాసరెడ్డి నిర్మాతలు. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని ప్రముఖ కథానాయకుడు రవితేజ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ "టైటిల్‌తోనే హిట్ కొట్టేశారు నిర్మాతలు. ఈవీవీ సత్యనారాయణగారు దర్శకత్వం వహించిన సినిమా టైటిల్‌ని మాత్రమే వాడుకుని, కొత్త కథ రాసుకున్నారు దర్శకుడు. ప్రచార చిత్రం బాగుంద"న్నారు. "ఈనెల 14న చిత్రాన్ని విడుదల చేద్దామనుకున్నాం. కానీ.. ఇంకా ఎక్కువ థియేటర్లు ఉండాలని 22కి మార్చామ"న్నారు శ్రీనివాసరెడ్డి. "ఈవీవీగారి సినిమాతో పోల్చుకోవద్దు. కేవలం మా కథకు బాగుంటుందనే ఆ టైటిల్ పెట్టాం. ప్రతి సన్నివేశంలోనూ నవ్వించడం ఖాయం. ఇదో కుటుంబ కథా చిత్రం. శ్రీనివాసరెడ్డి పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంద"న్నారు నిర్మాతలు.

పంచ్ డైలాగ్

రావి చెట్టుకు పూజ చేస్తాం.. దేవుడు అంటాం.
కానీ అదే రావి చెట్టు మన గోడల దగ్గర మొలిస్తే పీకేస్తాం.
చిత్రం: అత్తారింటికి దారేది
– పంపినవారు: కొణతాల ప్రియాంక, ఈమెయిల్

పెళ్లికి సంకేతమా?

బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా, హాలీవుడ్ గాయకుడు, నటుడు నిక్ జోనాస్ మధ్య ప్రేమ కథ నడుస్తుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. దానికి తగ్గట్టే ఈ జంట పలు కార్యక్రమాల్లో సందడి చేస్తున్నారు. వీళ్ల మధ్య ప్రేమ చిగురించి పెళ్లి పీటలెక్కనుందని పలు అంతర్జాతీయ పత్రికలు కథనాలు ప్రచురిస్తున్నాయి. వీటిలో ఏ ఒక్కదాన్నీ ప్రియాంకగానీ, నిక్‌గానీ ఖండించడం లేదు. తాజాగా ఈ ఇద్దరూ కలిసి న్యూజెర్సీలో ఓ పెళ్లికి హాజరయ్యారు. కలిసి వెళ్లడంలో విషయం ఏమీ లేకపోవచ్చు కానీ కలిసి వెళ్లిన తీరు కచ్చితంగా ఈ ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు అనడానికి బలం చేకూర్చేలానే ఉంది. పెళ్లి కార్యక్రమానికి హాజరయ్యేటప్పుడు నిక్ జోనాస్ చేతిని ప్రియాంక పట్టుకున్న తీరు ఈ జంట త్వరలోనే ఒకటి కాబోతున్నారనేలా ఉంది. ఆ జంట అధికారికంగా చెప్పకపోయినా అనధికారికంగా మేమిద్దరం పెళ్లితో ఒకటి కాబోతున్నామని ఈ వివాహ వేడుకలో పాల్గొనడం ద్వారా చెబుతున్నారని హాలీవుడ్ వర్గాలు అంటున్నాయి.

'స్కెచ్' వేస్తే

సోఫియా

రవి చావలి దర్శకత్వం వహించిన చిత్రం 'సూపర్ స్కెచ్'. నర్సింగ్, ఇంద్ర, సమీర్ దత్, కార్తీక్, సుభాంగీ, సోఫియా ప్రధాన పాత్రలు పోషించారు. బలరామ్ ముక్కల నిర్మాత. ఈనెల 29న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "మైండ్ గేమ్ నేపథ్యంలో సాగే కథ ఇది. అనుక్షణం ఉత్కంఠకు గురి చేస్తుంది. స్కెచ్ ఎవరు వేశారు, ఎందుకు వేశారు, అందులో చిక్కుకున్నది ఎవరు? అనే విషయాలు ఆసక్తికరం. 'సామాన్యుడు'లాంటి చిత్రాలతో ఆకట్టుకున్న రవి చావలి మరోసారి వైవిధ్యభరితమైన ప్రయత్నం చేశార"న్నారు. సంగీతం: కార్తీక్ కొడకండ్ల

స్నేహమంటే ఇదేరా..!

సల్మాన్ ఖాన్

బాబీ డియోల్

సల్మాన్ ఖాన్ ఎవరికైనా స్నేహ హస్తం చాచాడంటే చాలు.. వారి రొట్టె విరిగి నేతిలో పడ్డట్లే అని బాలీవుడ్ జనాలు చెబుతుంటారు. తన స్నేహితుల బాగు కోసం సల్మాన్ పడే తపన, ఆయన చేసే సాయం అలాంటివి మరి. సల్మాన్ ఆశీస్సులతో కెరీర్‌లో నిలదొక్కుకుని అగ్రస్థాయి నటులుగా వెలుగొందుతున్నవారు చాలా మందే ఉన్నారు. ప్రస్తుతం 'రేస్ 3'లో తనతో కలిసి నటిస్తున్న బాబీ డియోల్ కెరీర్ పుంజుకోవడానికి సల్మాన్ కొండంత అండగా నిలుస్తున్నాడు. ఆయనకు బాబీతో ముందు నుంచి మంచి స్నేహమే ఉంది. అయితే కొంతకాలంగా బాబీ కెరీర్ ఆశాజనకంగా లేదు. దీంతో సల్మానే స్వయంగా బాబీకి 'రేస్ 3'లో కీలక అవకాశమిచ్చాడు. దాంతో పాటు తను నిర్మాతగా బాబీతో ఓ చిత్రం నిర్మిస్తానని కూడా హామీ ఇచ్చాడు. అక్కడితో ఆగిపోలేదు. బాబీ కథానాయకుడిగా నటించబోతున్న 'యమ్లా పాగ్లా దివానా 3' చిత్రం కోసం కూడా తన వంతు సాయం చేయడానికి ముందుకొచ్చాడట. సల్మాన్ తన తదుపరి చిత్రం కోసం సిద్ధం చేసుకున్న ఓ రొమాంటిక్ గీతాన్ని 'యమ్లా పాగ్లా..'లో వాడుకోమని ఇచ్చేశాడని సమాచారం. దాంతోపాటు ఆ గీతాన్ని తన స్నేహితురాలు లులియా వంతుర్‌తో కలసి స్వయంగా ఆలపించడానికి సల్మాన్ సిద్ధమయ్యాడట. అంతేకాదు.. ఆ పాటలో సల్మాన్ అతిథిగా తళుక్కున మెరవనున్నాడట. ఆ పాటలో లులియా తన భాగాన్ని ఇప్పటికే పాడేసిందని, త్వరలోనే సల్మాన్ గాత్రంతో మిగిలిన భాగాన్ని రికార్డింగ్ చేయనున్నారని చిత్ర బృందానికి చెందిన సన్నిహితుల సమాచారం. ఆ పాటను 'రేస్ 3' దర్శకుడు రెమో డిసౌజా ఆధ్వర్యంలో తెరకెక్కించనున్నారు. ఈ విషయం తెలిసినవారు స్నేహానికి విలువివ్వడంలో సల్మాన్‌కు ఎవరూ సాటిలేరని చెప్పుకుంటున్నారు. అన్నట్లు 'రేస్ 3'లో కూడా లులియా ఓ పాట పాడింది. ఈ చిత్రం 15న విడుదలవుతోంది.

గేటెడ్ కమ్యూనిటీ ప్రేమ

సోనాక్షి సింగ్, మహిధర్

మహిధర్, సోనాక్షి సింగ్ జంటగా నటించిన చిత్రం 'నా లవ్‌స్టోరీ'. శివ గంగాధర్ దర్శకుడు. లక్ష్మి నిర్మాత. వేదనివాస్ స్వరకర్త. ప్రముఖ రచయితలు శివశక్తి దత్త, భువనచంద్ర తొలి సీడీని ఆవిష్కరించారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన దర్శకులు ప్రవీణ్ సత్తారు, అనిల్ రావిపూడి, సి.ఉమా మహేశ్వరరావు స్వీకరించారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ "'గేటెడ్ కమ్యూనిటీ నేపథ్యంలో సాగే ఒక అందమైన ప్రేమకథా చిత్రమిది. వేదనివాస్ స్వరాలు, శివశక్తి దత్తా, భువనచంద్ర సాహిత్యం చిత్రానికి ప్రధాన బలం" అన్నారు. "శివశక్తి దత్తా, భువనచంద్రలతో కలిసి పనిచేయడం ఒక మంచి అనుభూతి" అన్నారు సంగీత దర్శకుడు.

వసుంధర

email: vasundhara@eenadu.net

ఈనాడు

బుధవారం జూన్ 13, 2018
విజయవాడ

సేఫర్ ప్రోతో బహుమతి కొట్టేశారు!

■ **సేఫర్ ప్రో అంటే...**

ఇదో చిన్న పరికరం.

■ **ఎవరి కోసం...**

మహిళలకోసమే. వాళ్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని దీన్ని రూపొందించారు.

■ **ఎలా ఉపయోగపడుతుంది....**

దీన్ని బ్యాగులో, చేతిగడియారం, జేబు, ఆభరణం...ఇలా దేనికైనా అమర్చుకోవచ్చు. మహిళలు తాము విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు దీనికి ఉన్న ఎరుపు రంగు బటన్ నొక్కితే చాలు. తాము ఎక్కడ ఉన్నదీ అవతలివాళ్లకు చెప్పేస్తుందీ పరికరం. అలా ఇందులో ఐదుఫోన్‌నెంబర్ల దాకా పెట్టుకునే సౌలభ్యం ఉంటుంది. చూడ్డానికి చాలా చిన్న ఆభరణంలా ఉంటుంది.

■ **అదెలా సాధ్యం...**

సాధ్యమే... ఎందుకంటే ఇది మినీ సిమ్‌కార్డు సాయంతో పనిచేస్తుంది. ఒకసారి ఛార్జింగ్ చేసుకుంటే చాలు... ఏడు రోజులవరకూ వాడుకోవచ్చు.

■ **ఎవరు ఆవిష్కరించారు...**

భారతదేశానికి చెందిన ఓ యువ బృందం దీన్ని రూపొందించింది. ఇందులో నిహారికా రాజీవ్ సోషియాలజీ విద్యార్థిని అయితే... మిగిలినవారంతా దిల్లీలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చేసిన విద్యార్థులు. అంతా కలిసి మూడేళ్లు కష్టపడి దీని రూపొందించారు.

■ **మార్కెట్లో ఉందా...**

ఇప్పటికే దాదాపు 25,000 పరికరాలు అమ్మేశారు. అలాగే అమెరికాలో ఎక్స్‌ప్రైజ్ పేరుతో నిర్వహించిన పోటీలో కూడా ఈ బృందం సేఫర్ ప్రో గురించి వివరించింది. బదులుగా మిలియన్‌డాలర్ల బహుమతిగానూ అందుకుంది. రిలయెన్స్ సంస్థతోనూ అనుసంధానం అయ్యింది బృందం.

పాలవెల్లువకే పురస్కారం!

దాదాపు 73 వేలమంది మహిళా సభ్యులు... వాళ్ల వార్షికాదాయం ఏడాదికి 360 కోట్ల రూపాయల పైమాటే... అంటే... వీళ్లేదో పెద్ద వ్యాపారమే చేస్తూండాలే అనుకుంటున్నారా... ఆగండి. అక్కడికే వస్తున్నాం. వీళ్లంతా శ్రీజ పాల ఉత్పత్తి సంఘం సభ్యులు. ఇక్కడ తన వంతుగా బాధ్యతల్ని నిర్వర్తించిన నిరోషా చెంది గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆమె కృషికి గుర్తింపుగా జాతీయ పాడి అభివృద్ధి సంస్థ నుంచి అవార్డు అందుకుంది. ఇంతకీ ఆ సభ్యులేం చేస్తారూ... ఈ పాల ఉత్పత్తి సంఘంలో ఆమె పాత్ర ఏంటో చూద్దామా...

ఒకప్పుడు పల్లెలంటే పాడికి ప్రసిద్ధి.. ఇప్పుడు అక్కడా పాల ప్యాకెట్ల మీద ఆధారపడాల్సిన పరిస్థితి. అది గుర్తించిన జాతీయ పాడి అభివృద్ధి సంస్థ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు-ఎన్‌డీడీబీ) ఆ దిశగా మార్పులు చేయాలనుకుంది. పల్లెల్లో పాల వెల్లువ కోసం రైతులకు అండగా నిలబడుతోంది. అందులో భాగంగా ఏర్పాటైందే శ్రీజ పాల ఉత్పత్తి సంఘం. ఇందులో అంతా మహిళా రైతులే. అందుకే ఇది దేశంలోనే తొలి మహిళా పాల ఉత్పత్తి దారుల సంస్థగా గుర్తింపు తెచ్చుకుంది. ఇది కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఏడాదిలో రెండొందల రోజులకు తగ్గకుండా.. ఐదొందల లీటర్ల పాలు పోసిన వారికే ఈ సంఘంలో సభ్యత్వం ఉంటుంది. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ఈ సంస్థలో ఇప్పుడు డెబ్భై మూడు వేల మంది సభ్యులుగా ఉన్నారు. ఏడాదికి మూడొందల అరవై కోట్ల వార్షికాదాయం వస్తోంది. ఈ సంస్థలో నేను నాలుగేళ్లుగా పనిచేస్తున్నా. నా పని తీరు ఆధారంగానే ఈ అవార్డు వచ్చింది.

గ్రామాల బాధ్యత...

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌డీడీబీ పరిధిలో ఎన్నో పాల ఉత్పత్తి సంఘాలు పని చేస్తున్నాయి. ఎంతో మంది ఉద్యోగులూ ఉన్నారు. గ్రామీణ మహిళల ఆదాయ వనరులు పెంచే శిక్షణా కార్యక్రమంలో నా వంతుగా కష్టపడినందుకే నాకు ఉత్తమ అధికారిణిగా అవార్డు వచ్చింది. ఈ నెల ఒకటో తేదీన గుజరాత్‌లో కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి నుంచి ఈ అవార్డు అందుకున్నా. మేమేం చేస్తామంటే...

గ్రామాల్లో సేకరించిన పాలను మండల పరిధిలోని ఒక చోటకు తీసుకొస్తారు. దాన్ని బీఎంసీయూ అంటారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచీ పాలు వచ్చే వరకూ ఇక్కడ చల్లని ప్రదేశంలో నిల్వ చేస్తారు. తరువాత ఆ పాలన్నీ తిరుపతిలోని బాలాజీ డెయిరీ ప్రాంగణానికి తరలిస్తారు. ఆ తరువాత పాల ప్యాకెట్లూ, ఇతర పాల పదార్థాలను తయారుచేస్తారు. అలా తయారుచేసిన వాటిని ఇతర ప్రాంతాలకు అమ్మకానికి పంపించేస్తారు. నేను పాకాల, పోలిరెడ్డిపల్లి, పెనుమూరు, దామలచెర్వు, కొమ్మిరెడ్డివారిపల్లి, పొలకల, వైఎస్‌గేట్.. అనే ఏడు బీఎంసీయూలు చూడాలి. మొత్తంగా 120 గ్రామాల్ని చూడాలి. అక్కడ ఉదయం, సాయంత్రం రైతులు పాలు తీసే సమయానికి అక్కడికి వెళ్లాలి. పాల కేంద్రానికి రైతులు ఎలాంటి పాత్రల్లో పాలు తెస్తున్నారూ, పశువుల్ని పాలు తీసే ముందు శుభ్రం చేస్తున్నారా, తీసేవారు చేతులు కడుక్కుంటున్నారా, పాత్రలు సరిగా ఉంటున్నాయా. . వాటికి వేసే మేత... ఇలా అన్నీ గమనించాల్సి ఉంటుంది. లోపం ఉంటే సరిదిద్దాల్సిన బాధ్యతా నాదే. పశువుల్ని కట్టేయడం, కడగడం, పాలు పితకడంలో మెలకువలు, ఎలాంటి పోషకాహారం అందించాలి... టీకాలు.. ఇలాంటివన్నీ వివరించాలి. అలానే మా కేంద్రాలకు తీసుకొచ్చే పాలలో కొవ్వు శాతం 3.0 కంటే ఎక్కువ ఉంటేనే తీసుకుంటాం. అలాగని రైతుల్ని నిరుత్సాహ పరచకుండా కొవ్వు శాతం పెంచుకునే మార్గాలు వివరిస్తాం. ప్రత్యేకంగా ఎలాంటి దాణా తీసుకోవాలో వారికి అవగాహన కల్పించాలి.

అప్పుడు అబద్ధం చెప్పా...

మాది తిరుపతికి నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకాల పరిధిలోని మొద్దలపల్లి గ్రామం. మా నాన్న సన్నకారు రైతు. నేను పద్మావతి మహిళా యూనివర్సిటీలో 2013లో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ పూర్తి చేశా. ఆ తరవాత ఓ స్వచ్ఛంద సంస్థలో కార్యకర్తగా చేరి ఎనిమిది నెలలు కౌన్సెలర్‌గా పని చేశా. అప్పుడే శ్రీజ పాల ఉత్పత్తి సంస్థలో ఉద్యోగం కోసం పరీక్ష పెడుతున్నారని తెలిసి దరఖాస్తు చేశా. ఈ ఉద్యోగానికి ఎస్కే, ఎస్వీ, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని వందలమంది ప్రయత్నించారు. రకరకాల వడపోతల అనంతరం పదహారు మందిని తీసుకున్నారు. వారిలో నేనూ ఉన్నా. అయితే ఇంటర్వ్యూ సమయానికి నాకు శ్రీజ గురించి తెలిసింది. మహిళాసాధికారతకు పెద్ద పీట వేస్తూ దీన్ని ఏర్పాటు చేసిందని తెలుసుకున్నా. అప్పుడే అనిపించింది కష్టమైనా ఈ ఉద్యోగం చేయాలని. ముఖాముఖి సమయంలో అన్ని సమాధానాలు సరిగా చెప్పా. చివర్లో 'స్కూటీ నడపడం వచ్చా' అని అడిగితే వచ్చు అని చెప్పా. కానీ నాకు రాదు. ఉద్యోగం వచ్చాకైనా నేర్చుకోవచ్చనే ధైర్యంతో అలా చెప్పా. అదే చేశా కూడా. మొదట్లో దూరప్రాంతాలకు తెల్లవారుజామునే లేచి వెళ్లడం కష్టంగా, భయంగా అనిపించేది. చలీ, వానకి తట్టుకోలేకపోయేదాన్ని. కానీ రైతుల ఇళ్లలో పాల ఉత్పత్తి చూశాక అవన్నీ మర్చిపోయా. వారి కోసమే పని చేయాలని నిర్ణయించుకున్నా. ఇప్పుడవన్నీ ఇబ్బందిగానూ అనిపించట్లేదు.

విమానం ఎక్కా

చాలా గ్రామాల్లో చదువుకుని కూలి పనులు చేస్తుంటారు. అలాంటి వారిని గుర్తించి పశువుల పెంపకం, పాల ఉత్పత్తి గురించి శిక్షణ కార్యక్రమాలు ఉచితంగా ఏర్పాటు చేస్తుంటా. స్కూళ్లలో పిల్లలకి పాలు తాగడం వల్ల కలిగే ఫలితాలు వివరిస్తుంటా. రోజుకు రెండు గ్రామాలకు వెళుతుంటా. సభ్యులకు నేరుగా డబ్బులు ఖాతాల్లోకే వస్తాయి. అవి సక్రమంగా వస్తున్నాయా అన్నది గమనించాలి. ఇలా ఫీల్డు అధికారిణిగా అన్ని గ్రామాలకు వెళ్లి మా పై అధికారులకు ఎప్పటికప్పుడు నివేదిక అందించాలి. నేను ఈ సంస్థలో చేరే నాటికి నా పరిధిలో పద్నాలుగు వందలమంది మహిళా సభ్యులే ఉన్నారు. ఇప్పుడా సంఖ్య రెండు వేలకు పైమాటే. అలానే రోజుకి రెండు మూడు వేల లీటర్ల పాల ఉత్పత్తీ పెరిగింది. ఒకప్పుడు మా నాన్నకి ఒకటే పశువు ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్యను పెంచా. ఇక అవార్డు గురించి నాకు మే చివరి వారంలో తెలిసింది. గుజరాత్‌లో అవార్డు కార్యక్రమానికి రమ్మని ఆహ్వానం వచ్చింది. ఆ ఆనందం కంటే... మొదటిసారి విమానం ఎక్కినప్పుడు కలిగిన సంతోషం అంతా ఇంతాకాదు.

-పి. వేణుగోపాల్ తిరుపతి, న్యూస్‌టుడే

స్కర్టుపై చీరకట్టు

చీరకట్టులో ఇప్పుడు ఎన్నో ట్రెండ్స్ అమ్మాయిల్ని కట్టిపడేస్తున్నాయి. అలాంటిదే ఈ కాన్‌కాన్ శారీ స్టైల్. దీన్ని కనిపెట్టింది టియా భువ. ఇంతకీ ఆమెవరు అంటారా... భారతీయ మూలాలు ఉన్న ఎన్‌ఆర్‌ఐ. ఆహార రంగంలో పనిచేసే టియాకు ఫ్యాషన్ అంటే ఇష్టం. అందుకే ఉదయం ఉద్యోగానికి వెళ్లి రాత్రుళ్లు... రకరకాల దుస్తులూ, చీరల్ని విభిన్నంగా ఎలా వేసుకోవచ్చో తెలుసుకునేందుకు అద్దం ముందు నిల్చుని ప్రయోగాలు చేసేదట. ఓసారి సరదాగా ఎరుపు రంగు చీరని తన కాన్‌కాన్ స్కర్ట్‌పై కట్టుకుని వాలెంటైన్స్ డే నాడు ప్రత్యేకంగా తన ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేసింది. అంతే...బోలెడు ప్రశంసలొచ్చాయి. దాంతో వాళ్లమ్మ చీరలన్నీ తన కాన్‌కాన్ స్కర్టులపై వేర్వేరు తరహాలో ప్రయోగాలు చేయడం మొదలుపెట్టింది. ఇంకేముంది... ఆమెను ఫాలో అయ్యేవారి సంఖ్యా పెరిగిపోయింది. ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, పింటరెస్ట్... ఇలా ఎక్కడ చూసినా ఈ చీరకట్టు ఫొటోలే. మీరూ ఓ లుక్కేయండి.

నజరానా

రెండు చెంచాల నారింజ తొక్కల పొడిలో చెంచా చొప్పున ఓట్స్‌పొడీ, తేనె కలిపి నీళ్లతో ముద్దలా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికీ, మెడకీ పూతలా వేసి పావుగంట య్యాక కడిగేసుకుంటే చర్మానికి తేమ అంది.. నిగనిగలాడుతుంది.

వాళ్లు అమ్మను రక్షిస్తారు!

ఒకప్పుడు ఉత్తరప్రదేశ్, అమేథీ జిల్లా ఎలాపుర బ్‌గావ్‌లో మాతృత్వ మరణాలు ఎక్కువ. కానీ ఇప్పుడా శాతం పూర్తిగా తగ్గిపోయింది. కాబోయే ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉంటూనే పండంటి పాపాయికి జన్మనిస్తోంది. ఇదంతా సాధ్యమయ్యింది 'సేవ్ మదర్' కార్యక్రమంతోనే. 'అమ్మను రక్షించండి' పేరుతో చేపట్టిన అవగాహన కార్యక్రమాలే అందుకు కారణం.

ఇరవై గ్రామాల్లో... దశాబ్దం క్రితం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఓ అధ్యయనంలో... ప్రసవ సమయంలో కాబోయే తల్లులు మృతి చెందుతున్న శాతంలో అమేథీ మొదటిస్థానంలో ఉందని తేలింది. దీనికి ప్రధాన కారణం రక్తహీనతేననీ నిర్ధారణ అయ్యింది. ఆ తరువాత చికాగోకు చెందిన ఓ వైద్యుడు ఉత్తరప్రదేశ్ రావడం, అక్కడ మాతృత్వ మరణాల గురించి తెలుసుకున్నాకే 'సేవ్ మదర్' ప్రాజెక్టును ప్రారంభించాడు. చుట్టుపక్కల గ్రామాల్లోని గర్భిణుల్లో మార్పు తీసుకువచ్చే దిశగా మొదలైన ఈ ప్రాజెక్టులో స్థానిక మహిళలదే కీలక పాత్ర. మొదట్లో 20 గ్రామాల్లో ప్రారంభమైన ఈ అవగాహనా కార్యక్రమాలు ప్రస్తుతం 1100 గ్రామాలకు విస్తరించాయి. ఇప్పుడు కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల్లోనూ ప్రారంభమయ్యాయి. అమేథీలో అయితే మాతృత్వ మరణాల సంఖ్య అసలు లేదనే చెప్పొచ్చు.

వీళ్లేం చేస్తారంటే... ఒకప్పుడు కొన్ని గ్రామాల్లో పోషకాహారం నుంచీ ఆసుపత్రి సౌకర్యాలు కూడా ఉండేవి కావు. నిపుణులూ లేకపోవడం వల్ల

ప్రసవ సమయాల్లో గర్భిణులు ప్రాణాలు పోగొట్టుకొనేవారు. కానీ 'సేవ్ మదర్'లో భాగంగా గర్భం దాల్చినప్పటినుంచీ పోషకాహారం మొదలు తొమ్మిదినెలలూ తీసుకోవాల్సిన జాగ్రత్తల వరకూ స్థానిక మహిళలే గర్భిణులకు అవగాహన కల్పిస్తారు. తరచూ పర్యవేక్షిస్తూ ఎన్నో సూచనలు చేస్తారు. ప్రసవం అయ్యేదాకా వెన్నంటే ఉంటారు. అక్కడ ఉండే వైద్యులసూచనల మేరకే అవగాహన కల్పిస్తున్నారీ మహిళలు.

స్నేహితుడే కదా అనుకుంటే...

లావణ్యకి(పేరుమార్చాం) ఐదేళ్ల క్రితం పెళ్లయ్యింది. ఇన్నాళ్లూ హాయిగా గడిచిపోయిన ఆమె జీవితంలో ఇప్పుడో కుదుపు. ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియదు కానీ ఆమె ఫోనుకి రోజూ అసభ్యకరమైన సందేశాలు. తనతో గడపకపోతే ఆమె ఫొటోలు పోర్న్ వెబ్ సైట్‌లో పెడతామంటూ బెదిరింపులు. భర్తకి తెలిస్తే ఏమవుతుందోననే భయంతో చాన్నాళ్లు తనలోనే దాచుకుంది. రోజురోజుకీ ఆ బెదిరింపులు ఎక్కువవడంతో ధైర్యం చేసి పోలీసులని సంప్రదించింది. తన సమస్యని తీర్చి తన కాపురాన్ని నిలబెట్టమని కోరింది. మరి దీన్నెలా పరిష్కరించారో చెబుతున్నారు సైబరాబాద్ డీసీపీ జానకి షర్మిల.

పారాహుషార్



ఫిర్యాదు అందుకున్న మా పోలీసు బృందం రంగంలోకి దిగింది. తనకి మెసేజ్‌లు ఏ మార్గంలో వస్తున్నాయో పరిశీలించింది. అవి ఫేస్‌బుక్ ద్వారా వస్తున్నాయని తెలుసుకుని ఆ అకౌంట్‌ని బ్లాక్ చేయమని ఫేస్‌బుక్‌కి మెయిల్ పెట్టాం. మరో పక్క ఆ ఖాతా ఏ ఐపీ నుంచి వాడుతున్నారో తెలుసుకునే ప్రయత్నం చేశాం. ఆమె స్నేహితుల జాబితాపై కూడా నిఘా పెట్టాం. సరిగ్గా పదిహేను రోజులకే అతనెవరో తెలిసింది. అతను కరీంనగర్ జిల్లాకు చెందిన అభిరామ్. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ హైదరాబాద్ కూకట్‌పల్లిలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. అతను ఆమెతో పదోతరగతివరకూ కలిసి చదువుకున్న వ్యక్తి. ఇప్పుడు పాత స్నేహితుడిగా ఆమెను ఫేస్‌బుక్‌లో పలకరించాడు. లావణ్య కూడా ఒకప్పుడు కలిసి చదువుకున్నామనే ఉద్దేశంతోనే అతడితో మాట్లాడటం మొదలుపెట్టింది. స్నేహానికి ఓకే చెప్పింది. ఫేస్‌బుక్ ఛాటింగ్‌తో మొదలైన వాళ్ల స్నేహం క్రమంగా వాట్సాప్ ఛాటింగ్, ఆ తరువాత నేరుగా ఫోన్లు చేసేవరకూ వచ్చింది. అయితే అతను ఇవన్నీ చేస్తూనే ఓ కొత్త ఫేక్ ఖాతాను సృష్టించి ఆమెను లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. ఆమె తన స్నేహితుల ఫేస్‌బుక్ ఖాతాలకు ట్యాగ్ చేసిన పలు ఫొటోలను సేకరించేవాడు. వాటన్నింటినీ నగ్నచిత్రాలో కలిపి మార్ఫింగ్ చేశాడు. చివరకు వాటిని ఆమెకు చూపించి పోర్న్ సైట్‌లలో పెడతానని బెదిరించాడు. విచ్చలవిడిగా అంతర్జాలాన్ని ఉపయోగించుకునే అవకాశం, టెక్నాలజీపై పట్టు, నీలిచిత్రాలపై వ్యామోహం వంటివన్నీ అతడిని అడ్డదారి తొక్కేలా చేశాయి. చివరకు ఐపీ అడ్రస్ ఆధారంగా అతడిని గుర్తించగలిగింది మా బృందం. మందలించేసరికి నిజాన్ని ఒప్పుకున్నాడు. అతను ఉపయోగించిన మొబైల్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుంది. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచింది. పాత స్నేహితులే అయినా మితిమీరిన కబుర్లు చేటు చేస్తాయనడానికి ఈ సంఘటనే నిదర్శనం. అలానే ఫేస్‌బుక్‌లలో ఫొటోలు ఉంచడం, ట్యాగ్‌లు చేయడం వంటివన్నీ కూడా కొన్నిసార్లు తెలియకుండానే చిక్కుల్లో పడేస్తాయడానికి లావణ్య సంఘటన ఓ ఉదాహరణ. ఎదుటివారు బెదిరిస్తున్నారు అనే సందేహం వస్తే ఆలస్యం చేయకుండా పోలీసుల్ని ఆశ్రయించడమే పరిష్కారం. లేదంటే సమస్యలు పెరగొచ్చు. అలాగే సైబర్ నేరాలపై ఫిర్యాదులుంటే ఈ కింది...

sho_cybercrimes@cyb.tspolice.gov.in కి సంప్రదించొచ్చు.

బంగారం వెండి

12న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,900	31,940	31,700	31,750
ఆర్నమెంట్	29,800	29,800	29,400	29,450
వెండి (కిలో)	41,630	41,700	42,000	41,900
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,600	31,650	31,945	31,910
ఆర్నమెంట్	29,300	29,340	29,520	29,520
వెండి (కిలో)	41,700	41,700	41,700	40,500
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,700	31,800	-------	-------
ఆర్నమెంట్	29,480	29,570	2,952	2,952 గ్రా
వెండి (కిలో)	41,900	41,900	43.90	43.70 గ్రా

నీట్-2018 యూజీ ఫలితాలు వెలువడి, కొత్త విద్యా సంవత్సరంలో మెడికల్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. తెలుగు విద్యార్థులు తొలిసారిగా అఖిల భారత వైద్యవిద్య కూటమి (నేషనల్ పూల్)లోకి వెళ్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ విధానాన్ని విద్యార్థులూ, తల్లిదండ్రులూ సమగ్రంగా అవగాహన చేసుకోవటం, గత ఏడాది ఆలిండియా కోటా ర్యాంకుల కటాఫ్‌ను పరిశీలించటం వల్ల సీట్ల లభ్యతపై కొంత అంచనా వస్తుంది. ఇందుకు ఉపకరించే వివరాల విశ్లేషణ... ఇదిగో!

మెడికల్ సీట్లకు ముందడుగు ఎలా?

గత సంవత్సరంతో పోలిస్తే నీట్ కటాఫ్ మార్కు బాగా తగ్గింది. విద్యార్థుల సంఖ్య దాదాపు 16 శాతం పెరిగింది. కేటగిరీ వారీగా కటాఫ్ మార్కు, విద్యార్థుల సంఖ్య కింది విధంగా ఉంది.

కేటగిరి	కటాఫ్ పర్సంటైల్	కటాఫ్ మార్కు	విద్యార్థుల సంఖ్య
అన్ రిజర్వ్‌డ్	50	119	6,34,897
అన్ రిజర్వ్‌డ్ పీహెచ్	45	107	205
ఎస్‌సీ	40	96	17,209
ఎస్‌టీ	40	96	7446
ఓబీసీ	40	96	54,653
ఎస్‌సీ-పీహెచ్	40	96	36
ఎస్‌టీ-పీహెచ్	40	96	12
ఓబీసీ-పీహెచ్	40	96	104

ఈ పట్టిక చూడగానే చాలామంది రిజర్వేషన్లో చాలా తక్కువమంది ఉన్నారని భావిస్తారు. కానీ ఆ సంఖ్య 50వ పర్సంటైల్ నుంచి 40వ పర్సంటైల్ లోపు ఉన్న విద్యార్థులు. అంటే ఓబీసీలో మొత్తం విద్యార్థులు 54,653 కాదు. మొదట 50వ పర్సంటైల్‌లో దాదాపు 3 లక్షలమంది వరకూ ఉంటారు.

పి.వి.ఆర్.కె. మూర్తి
చైర్మన్, శ్రీ గాయత్రి విద్యాసంస్థలు

అర్హత పొందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ నుంచి 35,732 మంది, తెలంగాణ నుంచి 30,912 మంది. అంటే.. తెలుగు రాష్ట్రాల నుంచి అర్హులైనవారు మొత్తం 66,644 మంది విద్యార్థులు. వీరిందరికీ ఇది తొలిసారి కాబట్టి కౌన్సెలింగ్ ఏ విధంగా జరుగుతుందో చూడాలి.

ఈ కౌన్సెలింగ్‌ని నాలుగు భాగాలుగా అవగాహన చేసుకోవడం మేలు. 1) ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) 2) స్టేట్ కోటా 3) మేనేజ్‌మెంట్ లేదా ఎన్ఆర్ఐ సీట్ల కోటా 4) డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల కోటా.

వీటిలో ఆలిండియా కోటా, డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల్లో అడ్మిషన్ల ప్రక్రియను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) తరపున డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (డీజీహెచ్ఎస్) నిర్వహిస్తుంది. దీనిద్వారా ఆలిండియా కోటాలోని ప్రభుత్వ మెడికల్, డెంటల్ కళాశాలల్లోని 15 శాతం సీట్లు, డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 100 శాతం సీట్లు, ఈఎస్ఐ మెడికల్ కళాశాలలోని ఇన్సూర్డ్ పర్సన్స్ కోటా, ఏఎఫ్ఎంసీ- పుణెలోని సీట్లు నింపుతారు.

నీట్- 2017 కౌన్సెలింగ్ (ఆలిండియా కోటా)

- మొదటి రౌండ్‌లో అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలో కటాఫ్ ర్యాంకు 5779, రెండో రౌండ్‌లో 8317.
- బీడీఎస్‌లో తొలిరౌండ్‌లో కటాఫ్ ర్యాంకు 10,920, రెండో రౌండ్‌లో కటాఫ్ ర్యాంకు 12,419.

కౌన్సెలింగ్ దరఖాస్తు విధానం

కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి పత్రాలు ఏమీ అవసరం లేదు. కానీ, విద్యార్థి కొంత డేటా తనతో ఉంచుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇది మొత్తం నాలుగు అంచెల్లో జరుగుతుందని చెప్పొచ్చు.

మొదటి అంచె: mcc.nic.in వెబ్‌సైట్‌లో ముందుగా విద్యార్థి లాగిన్ అవ్వాలి. దానిలో కింద Already signed in, New Registration, Forgot Password అని మూడు బాక్సులు ఉంటాయి. ఇంతకు ముందే రిజిస్ట్రేషన్ చేసుంటే దానిలోకి వెళ్లొచ్చు. అదే తొలిసారిగా అయితే New Registration పై క్లిక్ చేయాలి. తరువాతి పేజీలో రోల్ నంబరు, రిజిస్ట్రేషన్ నంబరు, విద్యార్థి పేరు, తల్లిపేరు, పుట్టిన తేదీ, మొబైల్ నంబరు, ఈ-మెయిల్‌ను అడుగుతుంది. అవి నింపిన తరువాత కింద ఒక సెక్యూరిటీ కోడ్ కనిపిస్తుంది. దాన్ని బాక్సులో టైప్ చేస్తే కింద Submit, Reset అనే రెండు బటన్లు ఉంటాయి. ఏవైనా మార్పులు చేయదలచుకుంటే Reset నొక్కి మళ్లీ మొదటి నుంచి ప్రక్రియ చేయాలి. పూర్తిగా సరిగా ఉంటే Submit నొక్కితే ఓటీపీ (వన్ టైం పాస్‌వర్డ్) జెనరేట్ అవుతుంది. దానిని ఎంటర్ చేస్తే తరువాతి విండోకి వెళుతుంది. దానిలో Terms and conditions ఉంటాయి. వాటిని చదివి కింద I agree అని ఉన్న చోట క్లిక్ చేస్తే తరువాతి విండోకి వెళుతుంది. దానిలో మెయిలింగ్ అడ్రస్, పిన్‌కోడ్ వివరాలు నింపిన తరువాత సెక్యూరిటీ ప్రశ్న, దాని సమాధానాన్ని కూడా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. దాని తరువాత పాస్‌వర్డ్ జెనరేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

పాస్‌వర్డ్: పాస్‌వర్డ్ 8-13 అక్షరాల్లో ఉండాలి. వీటిలో ఒక కాపిటల్ లెటర్, ఒక స్మాల్ లెటర్, 0-9 వరకు ఒక సంఖ్య, ఒక స్పెషల్ క్యారెక్టర్ (*, !) లాంటివి ఉండాలి. ఈ పాస్‌వర్డ్‌ను ఏర్పరచుకుని Submit నొక్కితే కన్ఫర్మేషన్ అడుగుతుంది. దీనిలో Back నొక్కితే మళ్లీ చేయాలి లేదా Confirm registration అంటే ప్రక్రియ పూర్తై రిజిస్ట్రేషన్ స్లిప్ వస్తుంది. దీన్ని తొలి అంచెగా చెప్పొచ్చు.

రెండో అంచె: కళాశాల ఎంపిక రెండో అంచె అవుతుంది. దీనిని ఓపెన్ చేయగానే విద్యార్థికి లభ్యమయ్యే కళాశాలల వివరాలు వస్తాయి. వాటిలో 5 చాయిస్‌లు తీసుకుని నింపాలి. ఈ ఎంపికలో ఏ కళాశాలనైనా విద్యార్థి ఎంపిక చేసుకోవచ్చు. AIQ లో తెలుగు విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వ కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చో లేదో అనే సంశయంతో ఉన్నారు. ఏఐక్యూలో ఏ రాష్ట్ర విద్యార్థి అయినా ఏ రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అంటే తెలుగు విద్యార్థులు ఏఐక్యూలో తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూడా ఎంచుకోవచ్చు.

మూడో అంచె: కళాశాలలు ఎంపిక చేసుకున్న తరువాత ఎన్ని కళాశాలలనైనా మార్చుకోవచ్చు. వాటి వరుసక్రమాలు కూడా విద్యార్థి అనుకున్న రీతిలో మార్చుకోవడానికి అవకాశాలున్నాయి. ఎంపిక చేసుకున్న తరువాత లాకింగ్ చేయొచ్చు. ఒకసారి లాక్ చేసుకున్న తరువాత రెండో రౌండ్ కౌన్సెలింగ్ వరకు మార్పు చేసుకోవడానికి అవకాశం లేదు. కాబట్టి ముందుగానే సరిగా సరిచూసుకుని లాక్ చేసుకుంటే దాని ప్రింట్ అవుట్ విద్యార్థికి వస్తుంది. దీంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.

నాలుగో అంచె: జూన్ 22న సీట్ల కేటాయింపు ప్రకటిస్తారు. కాబట్టి, జూన్ 23- జులై 3లోపు కేటాయింపు జరిగిన కళాశాలలో రిపోర్టింగ్ చేయాలి. ఆ సమయంలో విద్యార్థి తనతో పాటు సర్టిఫికెట్లు, నిర్ణీత ఫీజు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

కావాల్సిన సర్టిఫికెట్లు: ✦ పరీక్ష అడ్మిట్ కార్డు (సీబీఎస్ఈ జారీ చేసింది) ✦ ర్యాంకు కార్డు (సీబీఎస్ఈ జారీ చేసింది) ✦ జనన ధ్రువీకరణ పత్రం ✦ పదో తరగతి సర్టిఫికెట్ ✦ 10+2/ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ ✦ 10+2/ ఇంటర్మీడియట్ మార్కుల జాబితా ✦ పాస్‌పోర్ట్ సైజు ఫొటోగ్రాఫ్‌లు- 8 ✦ ప్రింటెడ్ అలాట్‌మెంట్ లెటర్- జనరేటెడ్ ఆన్‌లైన్ ✦ ఆధార్ కార్డు ✦ ఎస్‌సీ/ ఎస్‌టీ/ ఓబీసీ/ పీహెచ్ సర్టిఫికెట్లు సంబంధిత సర్టిఫికెట్లతో కేటాయించిన కళాశాలలో జులై 3 లోపు చేరాల్సి ఉంటుంది.

ఐదో అంచె: మొదటి రౌండ్‌లో సీటు కేటాయింపు జరగకపోయినా లేదా వదిలేసుకున్నా పై విధానంలోనే రెండో కౌన్సెలింగ్‌కు వెళ్లడం. దీనికి చాయిస్ ఫిల్లింగ్ జులై 6-8 వరకు, పేమెంట్ ఫర్ రిజిస్ట్రేషన్ జులై 9 మధ్యాహ్నం 12 గం.లోపు పూర్తిచేసి తొలి రౌండ్ లాగానే సీట్లు కేటాయిస్తారు. సంబంధిత కళాశాలల్లో జులై 13 నుంచి జులై 22లోపు రిపోర్టు చేయాలి. జులై 23న ఏఐక్యూలో మిగిలిన సీట్లను సంబంధిత రాష్ట్రాలకు బదిలీ చేస్తారు.

ఆరో అంచె: ఏఐక్యూ విద్యార్థులకు ఐదో అంచె ఆఖరుగా చెప్పొచ్చు. ఆరో అంచెను Mop up round అంటారు. ఇది కేవలం డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు మాత్రమే వర్తిస్తుంది. సెంట్రల్ యూనివర్సిటీల్లో చాలావరకు సీట్లు రెండో రౌండ్‌లోనే భర్తీ అవుతున్నాయి. కానీ డీమ్డ్ యూనివర్సిటీల్లో ఎక్కువ భాగం Mop up round లోనే నింపడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రక్రియ తొలి రెండు రౌండ్లలాగానే నిర్ణీత తేదీల్లో జరుగుతుంది. ఇక్కడ సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 18-26లోపు నిర్ణీత కళాశాలలో చేరాలి. మిగిలిన సీట్లను ఆగస్టు 27కు సంబంధిత డీమ్డ్ యూనివర్సిటీకి బదిలీ చేస్తారు. ఈ సీట్ల సంఖ్య కూడా బాగా ఎక్కువగానే ఉంటోంది. వీటిని ఆగస్టు 27 తరువాత, 30లోపు యూనివర్సిటీ వారు నీట్-2018లో క్వాలిఫై అయిన విద్యార్థులతో నింపుతారు.

ఆల్ఇండియా కోటాలో నీట్-2017 కటాఫ్ ర్యాంకులు; ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నీట్ మాక్ కౌన్సెలింగ్ కోసం https://goo.gl/HaiUWz లేదా www.eenadupratibha.net చూడవచ్చు.

నీట్-2018 కౌన్సెలింగ్

ముఖ్యమైన తేదీలు

- విద్యార్థులు జూన్ 13 నుంచి జూన్ 18వ తేదీ లోపు రిజిస్ట్రేషన్, చాయిస్ ఫిల్లింగ్ చేసుకోవచ్చు.
- రిజిస్ట్రేషన్‌కు నిర్ణీత ఫీజును జూన్ 19వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు చెల్లించవచ్చు.
- సీట్ల కేటాయింపు ప్రక్రియ ఎంసీసీ సర్వర్‌లో జూన్ 20, 21 తేదీల్లో జరుగుతుంది.
- మొదటి రౌండు సీట్ల కేటాయింపు ఫలితాలను జూన్ 22న ప్రకటిస్తారు.
- సంబంధిత కళాశాలలో విద్యార్థి జూన్ 23 నుంచి జులై 3 వరకూ రిపోర్ట్ చేయాల్సివుంటుంది.
- మొదటి రౌండులో సీటు పొందకపోయినా, స్కిప్ అయినా తర్వాత రౌండు ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలకు జులై 6 నుంచి పై విధంగానే జరుగుతుంది.
- జులై 23న ఆలిండియా కోటాలో మిగిలిన సీట్లను సంబంధిత రాష్ట్రాలకు రాష్ట్రస్థాయి కౌన్సెలింగుకు కేటాయిస్తారు.

డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు మాత్రమే మూడో రౌండు మాప్ అప్ అనేది నిర్వహిస్తారు. డీమ్డ్ యూనివర్సిటీల్లో ఫీజు చాలా ఎక్కువగా ఉంటుంది కాబట్టి తొలిరౌండులో 10 శాతం లోపు సీట్లు మాత్రమే భర్తీ అవుతున్నాయి. రెండో రౌండు పూర్తయ్యేటప్పటికి కూడా 75 శాతం వరకూ ఖాళీగా ఉంటున్నాయి. ఆ సీట్లన్నీ మాప్ అప్ రౌండులో పిలుస్తున్నారు.

మాప్ అప్ రౌండుకి రిజిస్ట్రేషన్ ఆగస్టు 12 నుంచి ఆగస్టు 14 వరకూ జరుగుతుంది. ఆగస్టు 15 మధ్యాహ్నం 12 గంటల వరకూ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవచ్చు. ఆగస్టు 16 నుంచి సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆగస్టు 18 నుంచి ఆగస్టు 26లోపు నిర్ణీత కళాశాలల్లో జాయిన్ కావాలి.

ఇంకా మిగిలిన సీట్లను ఆగస్టు 27న సంబంధిత డీమ్డ్ యూనివర్సిటీకి బదిలీ చేస్తారు.

మిగిలిన సీట్లకు నీట్‌లో క్వాలిఫై అయిన ఏదో ఒక విద్యార్థితో ఆగస్టు 27- 30 లోపు యూనివర్సిటీ ఆ సీట్లను నింపుకోవచ్చు.

నేషనల్ పూల్.. ప్రభుత్వ కళాశాలలకేనా?

మన దగ్గర బి-కేటగిరీ సీట్లు ఉన్నట్లే వేరే రాష్ట్రాల్లోని బి-కేటగిరీలో అడ్మిషన్లను మనం తీసుకోవచ్చా? దీనికి మార్గదర్శకాలేంటి?

జ: ప్రతి రాష్ట్రంలోని ప్రైవేటు కళాశాలల్లో బి, సి కేటగిరీ సీట్లున్నాయి. ఈ సీట్లను ప్రతి రాష్ట్రంలోనూ వారి నిబంధనలకు అనుగుణంగా నింపుతారు. వీటిలో రాష్ట్రానికి కానీ, సామాజిక వర్గానికి కానీ సంబంధించి ఎలాంటి రిజర్వేషన్ వర్తించదు. దేశంలోని ఏ విద్యార్థి అయినా నీట్-2018లో క్వాలిఫై అయితే మెరిట్ ప్రకారం చేరవచ్చు. అయితే వివిధ రాష్ట్రాల్లో ఫీజులు లేదా, సీట్లు నింపే పద్ధతులు బి, సి కోటా సీట్ల పర్సంటేజీ వేర్వేరుగా ఉన్నాయి.

15% నేషనల్ పూల్ అనేది ప్రభుత్వ కళాశాలలకేనా? ప్రైవేటు కళాశాలలకు కూడానా?

జ: ఆలిండియా కోటా (ఏఐక్యూ) అనేది ప్రభుత్వ కళాశాలలకు మాత్రమే వర్తిస్తోంది. ప్రైవేటు కళాశాలలకు వర్తించడం లేదు. జమ్మూ కశ్మీర్ తప్ప మిగిలిన ఏ రాష్ట్ర విద్యార్థి అయినా ఏ రాష్ట్రంలో అయినా ఏఐక్యూ కింది 15% సీట్లకు (ప్రభుత్వ కళాశాలలకు) దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేటు కళాశాలల్లోనూ కోటాలో 50% కన్వీనర్, 35% కేటగిరీ బి లేదా మేనేజ్‌మెంట్ సీట్లు, 15% కేటగిరీ సి లేదా ఎన్ఆర్ఐ సీట్లు ఉన్నాయి కదా! ఇదే నిష్పత్తి అన్ని రాష్ట్రాల్లోనూ అమలవుతుందా?

జ: కాదు. ప్రతి రాష్ట్రంలోని ఈ సీట్ల శాతాలు వేర్వేరుగా ఉన్నాయి. విడిగా ఆ రాష్ట్ర ప్రవేశపరీక్ష కన్వీనర్ వెబ్‌సైట్‌లోకి వెళితే ఆ వివరాలు సులభంగా లభ్యమవుతాయి.

గుజరాత్, ఎంపీ, పంజాబ్, మహారాష్ట్రల్లో మేనేజ్‌మెంట్ సీట్లు (బి కేటగిరీ) ఆ రాష్ట్రంలోని విద్యార్థులకే ఇస్తారని అంటున్నారు. ఇది కరక్టేనా?

జ: ఇంతవరకు ఎంసీఐ వెబ్‌సైట్ లేదా ఆ రాష్ట్రాల్లోని కౌన్సెలింగ్ వెబ్‌సైట్లలో అలాంటిదేదీ పొందుపరచలేదు. దానిపై స్పష్టత జూన్ 22 లోపు వచ్చే అవకాశం ఉంది. గత ఏడాది ఇతర రాష్ట్రాల్లాగానే ఇక్కడ కూడా నిబంధనలకు అనుగుణంగా భర్తీ చేశారు. రాష్ట్రానికి గానీ, సామాజిక వర్గానికి గానీ ఎలాంటి రిజర్వేషన్ వర్తించలేదు.

తమిళనాడు కేటగిరీ బి కౌన్సెలింగ్ నోటిఫికేషన్లు, ఫీజు వివరాలు బయటకు రావడం లేదెందుకు? ఎప్పుడు జరుగుతాయి? ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

జ: తమిళనాడులో ప్రైవేటు కళాశాలల్లో ప్రముఖమైనవన్నీ స్వయం ప్రతిపత్తి గల విశ్వవిద్యాలయాలు అయ్యాయి. గతంలో నీట్ క్వాలిఫై అయినవారికి వారి హెచ్ఎస్‌సీ మార్కుల ప్రాతిపదికగా అడ్మిషన్ల ప్రక్రియ జరిగేది. అందువల్ల మనకు అవగాహన ఏర్పడేది కాదు. కానీ ఈ ఏడాది పైన చెప్పిన విధంగా జూన్ 22లోపు దానిపై సరైన ప్రకటన వెలువడాల్సి ఉంది.

త్రివిధ దళాల్లోకి తిరుగులేని దారి

రక్షణ రంగాల్లో చేరాలనుకునే వారికి యూపీఎస్సీ ఏటా రెండుసార్లు ఎన్డీఏతో అవకాశాన్ని కల్పిస్తుంది. దీని కోసం జరిగే పరీక్షలో నెగ్గితే అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యతోపాటు, సమాజంలో గౌరవనీయ హోదా కలిగిన ఉద్యోగం లభిస్తుంది. ప్రతిభ మాత్రమే ప్రామాణికమైన ఈ పరీక్ష విద్యార్థులకు వరమే.

ఎన్డీఏ-2 ప్రకటన విడుదల

యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ & నేవల్ అకాడమీ (ఎన్డీఏ & ఎన్ఏ) పరీక్షలో ఎంపికైనవారు మూడేళ్లపాటు పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో బీఏ, బీఎస్సీ కోర్సులు చదువుతారు. నేవల్ అకాడమీకి ఎంపికైనవారు నాలుగేళ్లపాటు కేరళలోని ఎజిమాలలో బీటెక్ విద్యను అభ్యసిస్తారు. రెండు చోట్లా విద్యార్థులకు అన్ని వసతులు ఉచితంగా సమకూరుస్తారు. డిగ్రీలను న్యూదిల్లీలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రదానం చేస్తుంది.

అర్హతలు

ఆర్మీ వింగ్ (ఎన్డీఏ)కు బాలురు మాత్రమే దరఖాస్తు చేయాలి. వీరు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవల్ వింగ్స్ (ఎన్డీఏ), 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నేవల్ అకాడమీ)లకు దరఖాస్తు చేయాలనుకుంటే ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ పాసై ఉండాలి. రెండో సంవత్సరం కోర్సులు చదువుతున్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: జనవరి 2, 2000 తర్వాత; జనవరి 1, 2003 కంటే ముందు జన్మించినవారు అర్హులు.

శారీరక ప్రమాణాలు: ఎయిర్‌ఫోర్స్‌కి కనీసం 162.5 సెం.మీ. ఎత్తు ఉండాలి. మిగిలిన వాటికి కనీస ఎత్తు 157 సెం.మీ.ఎత్తుకు తగిన బరువు అవసరం.

రెండు దశల్లో ఎంపిక

అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. అవి- రాతపరీక్ష (ఆబ్జెక్టివ్ తరహా), ఇంటెలిజెన్స్ - పర్సనాలిటీ టెస్ట్. రాతపరీక్షలో మొత్తం 900 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో మ్యాథ్స్ నుంచి 300 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. పేపర్-2లో 600 మార్కులకు జనరల్ ఎబిలిటీ విభాగం నుంచి ప్రశ్నలు ఉంటాయి. దీనికి వ్యవధి రెండున్నర గంటలు. రాతపరీక్షలో అర్హత పొందిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో యూపీఎస్సీ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు నిర్వహిస్తుంది. ఇది 900 మార్కులకు జరుగుతుంది. ఇందులో భాగంగా గ్రూప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్, అవుట్‌డోర్ గ్రూప్ టాస్క్ ఉంటాయి. స్టేజ్-1లో అర్హత సాధించినవారినే స్టేజ్-2కి అనుమతిస్తారు. రాతపరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.

ఖాళీల వివరాలు: మొత్తం 383. అందులో నేషనల్ డిఫెన్స్ అకాడమీ- 339 (ఆర్మీ-208, నేవీ-39, ఎయిర్‌ఫోర్స్- 92) నేవల్ అకాడమీ -44.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జులై 2 సాయంత్రం 6 గంటలు. **పరీక్ష తేదీ:** సెప్టెంబరు 9 **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి

వెబ్‌సైట్: www.upsc.gov.in

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 600 పీవో పోస్టులు

ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా పీవో పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది. ఎంపికైనవాళ్లు ముందుగా మణిపాల్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్‌లో 9 నెలల పోస్టు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సు చదవాల్సి ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకున్నవాళ్లు ప్రొబేషనరీ ఆఫీసర్ హోదాతో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖల్లో విధుల్లో చేరుతారు.

పోస్టు-ఖాళీలు: ప్రొబేషనరీ ఆఫీసర్ ఇన్ జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్/ స్కేల్ 1- 600

అర్హత: 55% మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.

వయసు: 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ ఎగ్జామ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ పరీక్ష తేది: 28.07.2018.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 12.06.2018 నుంచి 02.07.2018 వరకు.

వెబ్‌సైట్: www.bankofbaroda.co.in

నౌకాదళంలో ఖాళీలు

ఇండియన్ నేవీలో స్టివార్డ్, చెఫ్, హైజీనిస్ట్ పోస్టుల భర్తీకి అవివాహితులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు.

అర్హత: మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతోపాటు నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి.

వయసు: 01.04.1998 నుంచి 31.03.2002 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, శారీరక దృఢత్వం, వైద్య, దృష్టి సంబంధ ప్రామాణిక పరీక్షల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 18.06.2018 నుంచి 01.07.2018 వరకు.

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

వైజాగ్ స్టీల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

విశాఖపట్నంలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్(ఆర్ఐఎన్ఎల్)లో మేనేజ్‌మెంట్ ట్రెయినీల భర్తీకి దరఖాస్తులు.

పోస్టు-ఖాళీలు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హెచ్ఆర్/ మార్కెటింగ్)- 14

అర్హత: ఎంబీఏ/ పీజీ డిగ్రీ/ పీజీ డిప్లొమా(హెచ్ఆర్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్ & ఇండస్ట్రియల్ రిలేషన్స్/ లేబర్ వెల్ఫేర్/ సోషల్ వర్క్/ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణత.

వయసు: 27 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: యూజీసీ-నెట్ జులై 2018 స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 25.06.2018 నుంచి 16.07.2018 వరకు.

వెబ్‌సైట్: www.vizagsteel.com

ఐవోసీఎల్ ఈస్ట్రన్ రీజియన్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఈస్ట్రన్ రీజియన్‌లో ఖాళీలు- జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్) గ్రేడ్ 1: 50

అర్హత: 45 శాతం మార్కులతో హయ్యర్ సెకండరీ ఉత్తీర్ణతతో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఏడాది పని అనుభవం తప్పనిసరి.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 16.06.2018 నుంచి 07.07.2018 వరకు.

www.iocl.com

మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు

పచ్చిక మధ్య మచ్చిక..

మంగళవారం భోజనం అనంతరం కెపెల్లా హోటల్ ప్రాంగణంలో ట్రంప్, కిమ్‌ల వ్యాహ్యాళి

అడుగులు పడ్డాయిలా..

ఉప్పు నిప్పులా చిర్రుబుర్రులాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ ఎట్టకేలకు "చరిత్రాత్మక చర్చ"ల్లో పాల్గొన్నారు. విపరీత వ్యాఖ్యల నుంచి శాంతి వైపుగా వీరు వేసిన అడుగుల క్రమమిదీ.

మార్చి 7, 2017 జపాన్ వైపుగా ఉత్తర కొరియా నాలుగు బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించడంపై ట్రంప్ ఆగ్రహం.

ఏప్రిల్ 26 ఆంక్షలతో ఉత్తర కొరియాపై ఒత్తిడి పెంచిన అమెరికా.

ఏప్రిల్ 27 దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించాలని భావిస్తున్నట్లు ట్రంప్ వెల్లడి.

మే 24 కిమ్ "అణ్వాయుధాలున్న మతిచెడిన వ్యక్తి"అంటూ ట్రంప్ వ్యాఖ్యలు.

జూన్ 1 ఉత్తర కొరియాతో సంబంధాలున్న సంస్థలపైనా అమెరికా ఆంక్షలు.

జులై 4 జపాన్ మీదుగా దీర్ఘ శ్రేణి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన ఉత్తర కొరియా. ఈ క్షిపణి అమెరికాలోని అలస్కానూ తాకగలదంటూ నిపుణుల అంచనాలు.

ఆగస్టు 9 అమెరికాకు చెందిన గువామ్ దీవులపై బాలిస్టిక్ క్షిపణి ప్రయోగిస్తామని ఉత్తర కొరియా హెచ్చరికలు.

సెప్టెంబరు 19 ఉత్తర కొరియాను పూర్తిగా నాశనం చేస్తామంటూ ఐరాస సర్వ ప్రతినిధి సభ వేదికగా ట్రంప్ హెచ్చరికలు.

సెప్టెంబరు 21 ట్రంప్ మతిస్థిమితంలేని వ్యక్తని కిమ్ వ్యాఖ్యలు.

నవంబరు 21 ఉత్తర కొరియాను ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంగా ప్రకటించిన ట్రంప్.

డిసెంబరు 22 ఉత్తర కొరియాపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ ఐరాస భద్రతా మండలి తీర్మానం.

జనవరి 1, 2018 అమెరికా అణు ముప్పును సమర్థంగా ఎదుర్కొనగలమని కిమ్ ప్రకటన.

ఫిబ్రవరి 23 ఉత్తర కొరియా నౌకాయానం, వాణిజ్య సంస్థలే లక్ష్యంగా మళ్లీ కొత్త ఆంక్షలు విధించిన ట్రంప్.

మార్చి 8 అణు నిరాయుధీకరణపై చర్చించేందుకు జూన్‌లో సమావేశం కావాలని ప్రణాళికలు రచిస్తున్నట్లు ఉత్తర కొరియా, అమెరికా ప్రకటన.

ఏప్రిల్ 18 కిమ్‌తో భేటీ అయ్యేందుకు ప్యాంగ్యాంగ్ వెళ్లిన అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ అధిపతి మైక్ పాంపియో.

మే 9 ముగ్గురు అమెరికన్ ఖైదీలను విడుదలచేసిన ఉత్తర కొరియా. ట్రంప్-కిమ్‌ల భేటీ జరిగే అవకాశముందని సంకేతాలు.

మే 10 మే 10: అణు నిరాయుధీకరణపై చర్చించేందుకు జూన్ 12న సింగపూర్‌లో కిమ్‌తో భేటీ అవుతానని ట్రంప్ ప్రకటన.

మే 15 అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలు, అమెరికా వ్యాఖ్యల నేపథ్యంలో భేటీ రద్దుచేస్తామని ఉత్తర కొరియా హెచ్చరికలు.

మే 24 అణు పరీక్షల స్థలిని నాశనం చేసినట్లు ఉత్తర కొరియా ప్రకటన. మరోవైపు కిమ్ బహిరంగంగానే శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారని వ్యాఖ్యానిస్తూ భేటీని రద్దు చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడి.

జూన్ 1 ముందుగా అనుకున్నట్లే భేటీ జరుగుతుందని ట్రంప్ ప్రకటన.

జూన్ 12 చరిత్రాత్మక చర్చల్లో పాలుపంచుకున్న ట్రంప్, కిమ్. కొరియా ద్వీపకల్పంలో సంపూర్ణ అణు నిరాయుధీకరణకు కృషి చేస్తామని సంయుక్త ప్రకటన విడుదల.

– సింగపూర్

ఇప్పుడేం చేయాలి?

- ఉ.కొరియా, అమెరికా ముందున్న లక్ష్యాలేమిటి?
- అణు నిరాయుధీకరణను కిమ్ సర్కారు పాటిస్తుందా?
- ఉత్తర కొరియా ఆయుధ సామర్థ్యం ఎంత?

శిఖరాగ్ర భేటీలో కిమ్, ట్రంప్

అణు నిరాయుధీకరణకు ఉత్తర కొరియా సంసిద్ధత వ్యక్తంచేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటిస్తున్నారు. రెండు దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనా అదే విషయాన్ని ఉద్ఘాటించింది. అమెరికాతో సంబంధాలతో పాటు, కొరియా ద్వీపకల్పంలో శాంతి దిశగా ఇదో కీలక ముందడుగు. అయితే ఉత్తర కొరియా అణు నిరాయుధీకరణ పాటించినంత మాత్రానే.. అమెరికా, దక్షిణ కొరియాలతో సంబంధాలు మెరుగుపడతాయా? అంతకుమించి ఉత్తర కొరియా చేయాల్సిన పనులు ఏమున్నాయి? అసలు అణు కార్యక్రమాన్ని వదులుకోవడానికి ఉత్తర కొరియా సంసిద్ధంగా ఉందా? అనేవి ఇప్పుడు కీలక ప్రశ్నలు.

చేయాల్సింది చాలా ఉంది

అణు నిరాయుధీకరణ పాటిస్తే ఉత్తరకొరియాకు తగిన రక్షణలు కల్పిస్తామని అమెరికా చెబుతోంది. ఆ ఒక్క భరోసాతోనే ఉత్తర కొరియా బాగుపడిపోదు. ఈ చర్చల ప్రక్రియకు సానుకూల ముగింపు పలకాలంటే అటు అమెరికా, ఇటు ఉత్తర కొరియా పలు చర్యలు చేపట్టాల్సి ఉంది.

1. కొరియా ద్వీపకల్పంలో సంపూర్ణ అణు నిరాయుధీకరణ సాధనకు ఉత్తర కొరియా చిత్తశుద్ధితో పనిచేయాలి. కష్టమనిపించినా.. దేశ సంక్షేమం దృష్ట్యా ఉత్తర కొరియాకు మరో మార్గం లేదు.
2. ఉ.కొరియాపై ఆంక్షల్ని అమెరికా ఎత్తేయాలి. కొరియా ద్వీపకల్పంలో సైనిక బలగాల్ని ఉపసంహరించి.. ఉద్రిక్తతలు సడలడానికి ట్రంప్ సర్కారు కృషిచేయాల్సి ఉంది. యుద్ధ ఖైదీల విడుదలకు ఇరు దేశాలూ చర్యలు చేపట్టాలి.
3. ఉత్తర కొరియా తన మార్కెట్‌ను ప్రపంచానికి బార్లా తెరవాలి. దేశంలో భారీ ఎత్తున పాలన, ఆర్థిక సంస్కరణలు చేపట్టాలి.

ఉత్తర కొరియా ఏం చేయాలి?

అనేక ఏళ్లుగా ఆంక్షల చట్రంలో మగ్గుతున్న ఉత్తర కొరియాకు ఈ చర్చలు కొత్త ద్వారాలు తీశాయి. వీటిని సోపానంగా మలచకుని.. దేశాన్ని సరికొత్త పథంలో నడిపించడానికి కొరియా నాయకత్వానికి చక్కటి అవకాశం లభించింది. ముఖ్యంగా సైన్యంపై వెచ్చిస్తున్న మొత్తాల్ని తగ్గించాలి. దేశంలో రాజకీయ ప్రక్రియను సరళీకరించాలి. ఇతర దేశాలకు మార్కెట్‌ను బార్లా తెరవాలి. దేశంలో ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగు పరచడం ఉత్తర కొరియాకు చాలా ముఖ్యం. ఎందుకంటే పొరుగునున్న దక్షిణ కొరియాతో పోల్చుకుంటే ఉత్తర కొరియా అనేక విషయాల్లో చాలా వెనుకబడి ఉంది. దక్షిణ కొరియా జీడీపీ వృద్ధిరేటు 2.7 శాతం అయితే.. ఉత్తర కొరియా వృద్ధిరేటు 0.8 శాతం మాత్రమే. ఉత్తర కొరియా ఎగుమతులు 470 కోట్ల డాలర్లు అయితే.. దక్షిణ కొరియా ఎగుమతులు 55,200 కోట్ల డాలర్లు. దిగుమతులదీ దాదాపు ఇదే స్థాయి. మరోవైపు సైన్యంపై ఉత్తరకొరియా ఏటా 2200 కోట్ల డాలర్లను వెచ్చిస్తోంది. దక్షిణ కొరియాలో ఇది 280 కోట్ల డాలర్లే. సాంకేతికాభివృద్ధిలో ఉత్తర కొరియాతో పోల్చుకుంటే దక్షిణ కొరియా ఎన్నో రెట్లు ముందంజలో ఉంది. ఉత్తర కొరియాలో ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నవారు 1.8 కోట్ల మంది. ఉత్తరకొరియాలో తలసరి ఆదాయం 1,800 డాలర్లు అయితే దక్షిణ కొరియాలో 32,400 డాలర్లు. మానవాభివృద్ధి సూచీలోనూ ఉత్తర కొరియా చాలా వెనుకబడి ఉంది. ఈ గణాంకాలు ఉత్తర కొరియాలో సమూల సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతున్నాయి.

ఆయుధ కార్యక్రమాన్ని ఉ.కొరియా వీడుతుందా?

పాశ్చాత్య దేశాలను బెదిరించడానికి, బేరసారాలకు తన ఆయుధ కార్యక్రమాన్ని బలంగా వాడుతున్న ఉత్తరకొరియా నిజంగా అణ్వస్త్ర కార్యక్రమాన్ని వదులుకుంటుందా? అనేది ఇప్పుడు కీలక ప్రశ్న. ఉత్తర కొరియాను అమెరికా మొదట్నుంచీ శత్రుదేశంగా చూస్తోంది. దానిపై ఆంక్షలు విధించడంలో ముందు వరుసలో ఉంటోంది. గతంలో అణు బూచి చూపి.. అటు ఇరాక్‌ను, ఇటు లిబియాను దారుణంగా దెబ్బతీసిన, ఆ దేశాల నేతలు సద్దాం హుస్సేన్, గడాఫీల మరణాల్ని కళ్లచూసిన అమెరికా- తన అంతాన్నీ అలాగే చూడొచ్చని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ భయపడుతున్నారు. అమెరికా తానిచ్చిన హామీని రాత్రికి రాత్రి వెనక్కి తీసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని, కానీ తాను ఒకసారి అణు, క్షిపణి కార్యక్రమాన్ని వదిలేస్తే.. తిరిగి మొదలుపెట్టడానికి అనేక ఏళ్లు పడుతుందని కిమ్ భయపడుతున్నారు. పైపెచ్చు కేవలం ఆయుధ కార్యక్రమాల అభివృద్ధే అండగా ఉత్తరకొరియాను అనేక ఏళ్లుగా పాలిస్తున్న కిమ్ కుటుంబం ఏకఛత్రాధిపత్యానికి- అణు కార్యక్రమాల్ని వదులుకోవడం ద్వారా గండిపడుతుంది. దీనికి ఆయన ఎంతవరకు మానసికంగా సిద్ధపడతారు, అణు నిరాయుధీకరణకు ఎంత వరకు సహకరిస్తారు అనేవి కీలక ప్రశ్నలు

ఉత్తర కొరియా ఆయుధ సామర్థ్యం ఎంత?

అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో కొనసాగిన 2017లో ఉత్తర కొరియా వరుసగా క్షిపణి, అణు పరీక్షలు జరిపింది. అమెరికాను తాకగల అణ్వస్త్ర క్షిపణుల్ని పరీక్షించామని ఆ దేశం అప్పట్లో ప్రకటించింది. ఉత్తర కొరియా అణు, క్షిపణి సామర్థ్యం, సైనిక శక్తి ఎంత అన్నవి ఆసక్తికర అంశాలు.



- 2107 మే నెలలో ఉత్తర కొరియా పరీక్షించిన హ్వాసాంగ్ 12(4500 కి.మీ.లు)కు గువామ్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని తాకే సామర్థ్యం ఉంది.
- అదే ఏడాది జులై పరీక్షించిన హ్వాసాంగ్ 14(8 వేల కి.మీ.లు) ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. ఇది అమెరికాలోని న్యూయార్క్ నగరాన్ని సైతం తాకగలదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
- ఇక గత ఏడాది నవంబరులో పరీక్షించిన హ్వాసాంగ్ 15 అమెరికా ఖండంలోని ఏ ప్రాంతాన్ని అయినా తాకగలదని అంచనా.

ఎక్కడిది ఈ సామర్థ్యం

చైనా, రష్యా, ఉక్రెయిన్‌ల నుంచి దిగుమతి చేసుకున్న సామగ్రి, సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తర కొరియా అణు, క్షిపణి కార్యక్రమాన్ని అభివృద్ధి చేసిందన్నది జగమెరిగిన సత్యం. అత్యంత సామర్థ్యం కలిగిన లిక్విడ్ ప్రొపెల్లెంట్ ఇంజిన్లను రష్యా, ఉక్రెయిన్ నుంచి అక్రమ మార్గాల ద్వారా ఉత్తర కొరియా సంపాదించింది.

అతిపెద్ద అణు పరీక్ష

గత ఏడాది సెప్టెంబరు 3వ తేదీన ఉత్తర కొరియా తన పంగీరీ కేంద్రం వద్ద అతిపెద్ద అణు పరీక్ష జరిపింది. ఇది 6.3 భూకంప తీవ్రతతో సమానం. గతంలో జరిపిన ఐదు అణుపరీక్షల కన్నా ఇది అత్యంత అక్తిమంతమైనది. ఇది 100 నుంచి 370 కిలో టన్నుల శక్తిని విడుదల చేసిందంటున్నారు. వంద కిలోటన్నులు అంటే.. 1945లో హిరోషిమాపై ప్రయోగించిన అణు బాంబుకన్నా ఆరు రెట్ల శక్తి ఎక్కువ. మొట్టమొదటి థర్మోన్యూక్లియర్ ఆయుధాన్ని పరీక్షించినట్లు ఉత్తర కొరియా ప్రకటించింది. క్షిపణి లోపల అమర్చగలిగిన అణు వార్‌హెడ్‌ను ఉత్తర కొరియా తయారుచేసిందని అమెరికా విశ్వసిస్తోంది. తగిన సామర్థ్యాలు సంపాదించాం కాబట్టి అణు పరీక్షల్ని నిలిపేస్తున్నట్లు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఉత్తర కొరియా ప్రకటించింది.

సైనిక శక్తి ఎంత?

ప్రపంచంలో అతిపెద్ద స్టాండింగ్ ఆర్మీలు కలిగిన దేశాల్లో ఉత్తర కొరియా ఒకటి. యుద్ధం వస్తే దక్షిణ కొరియాకు తీవ్రం నష్టం కలిగించేంతటి సంప్రదాయ బలగాలు ఉత్తర కొరియా వద్ద ఉన్నాయి.

రెండు కొరియాల మధ్య పోలిక ఇలా..

సైనిక సామర్థ్యం	ఉ.కొరియా	ద.కొరియా
	1,190,000	630,000
సైన్యం	1,020,000	495,000
నౌకాదళం	60,000	70,000
వైమానిక దళం	110,000	65,000
పారామిలిటరీ	189,000	4,500
రిజర్వ్ బలగాలు	5,700,000	4,500,000
యుద్ధ ట్యాంకులు	3,500	2,434
యుద్ధ విమానాలు	545	567
జలాంతర్గాములు	73	23
సాయుధ శకటాలు	21,100	11,000

ఉత్తర కొరియా చుట్టూ అమెరికా మోహరించిన సైనిక బలగాలు ఇవీ...

దక్షిణ కొరియాలో	28500 మంది
జపాన్‌లో	47,040 మంది
గువామ్‌లో	5150 మంది

- ఈనాడు ప్రత్యేక విభాగం

సానుకూల పరిణామమిది: భారత్

దిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మధ్య చరిత్రాత్మక భేటీని భారత్ స్వాగతించింది. సానుకూల పరిణామంగా ఈ సమావేశాన్ని అభివర్ణించింది. 'చర్చలు, దౌత్య మార్గాల్లో కొరియా ద్వీపకల్పంలో శాంతి, స్థిరత్వాలను నెలకొల్పే ప్రయత్నాలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తూనే ఉంది. అమెరికా-ఉత్తర కొరియా తాజా చర్చల్లో తీసుకున్న నిర్ణయాలు సంపూర్ణంగా అమలవుతాయని ఆశిస్తున్నాం'' అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. భారత పొరుగు దేశాలతో ఉత్తర కొరియా అణ్వస్త్ర వ్యాప్తి సంబంధాలు కలిగి ఉందంటూ నెలకొన్న ఆందోళనలకు 'కొరియా ద్వీపకల్పం' అంశంపై తీర్మానం తెరదించుతుందని కూడా విదేశాంగశాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. పాకిస్థాన్‌తో ఉత్తర కొరియా సంబంధాలను దృష్టిలో పెట్టుకొనే ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

ప్రచ్ఛన్న సంఘర్షణకు తెర: ద. కొరియా

సియోల్, బీజింగ్, వియన్నా: ట్రంప్-కిమ్ భేటీపై దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే-ఇన్ ప్రశంసల వర్షం కురిపించారు. ద్వైపాక్షిక సమావేశంలో వారి మధ్య కుదిరిన ఒప్పందాన్ని చరిత్రాత్మక అంశంగా అభివర్ణించారు. ప్రచ్ఛన్న యుద్ధానికి సంబంధించి ఇప్పటికీ మిగిలిఉన్న సంఘర్షణకు తాజా ఒప్పందం పూర్తిగా తెరదించిందని వ్యాఖ్యానించారు. పాతకాలపు విధానాలకు అతుక్కుపోకుండా.. మార్పు దిశగా ట్రంప్, కిమ్ ధైర్యంగా అడుగులు ముందుకు వేశారంటూ మూన్ ప్రశంసించారు. "యుద్ధం నాటి చీకటి రోజులు, సంక్షోభాన్ని గతానికి వదిలేసి.. శాంతి, సహకార రంగాల్లో మేం కొత్త అధ్యాయాన్ని లిఖిస్తాం. ఉత్తర కొరియాకు సదా తోడుగా ఉంటాం'' అని ఆయన అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని.. మున్ముందు చాలా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని మూన్ హెచ్చరించారు. అయితే, ఈ కఠిన ప్రయాణంలో తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఆంక్షల ఎత్తివేతకు చైనా పిలుపు

కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్రరహితంగా మార్చే దిశగా ప్రయత్నాలు ప్రారంభించేందుకు ట్రంప్‌తో భేటీలో కిమ్ అంగీకరించిన నేపథ్యంలో.. ఉత్తర కొరియాపై ఐరాస ఆంక్షల ఎత్తివేతకు చైనా పిలుపునిచ్చింది. కొరియా ద్వీపకల్పంలో శాంతిస్థాపన దిశగా తాము నిర్విరామ కృషి చేశామని చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి తెలిపారు. చర్చల ద్వారానే కొరియా సంక్షోభానికి ముగింపు పలకొచ్చని తాము ముందు నుంచీ చెబుతున్న సంగతిని గుర్తుచేశారు.

ట్రంప్–కిమ్‌ల సమావేశం వార్తలు సియోల్ రైల్వే స్టేషన్‌లోని టీవీల్లో ప్రసారమవుతున్న సమయంలో దక్షిణకొరియా వాసుల సంతోషం

ఇది సింగపూర్‌కు దక్కిన గౌరవం: లూంగ్

సింగపూర్: అమెరికా, ఉత్తర కొరియాల మధ్య కీలకమైన చరిత్రాత్మక చర్చలు విజయవంతంగా ముగియడం... ఆతిథ్య దేశంగా తమకు దక్కిన గౌరవమని సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్ పేర్కొన్నారు. ఈ చర్చల ద్వారా మేలు మలుపు దిశగా అడుగులు పడ్డాయని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్‌లకు ఈ మేరకు ఒకే విధమైన లేఖల్ని ఆయన రాశారు. 'అణ్వస్త్ర రహిత కొరియా ద్వీపకల్పంలో సుస్థిరతకు, దీర్ఘకాల శాంతికి ఇదో కీలకమైన తొలి అడుగు' అని దానిలో పేర్కొన్నారు. ఆ ఇద్దరు నేతలతో మళ్లీ కలిసే రోజు కోసం తాను ఎదురుచూస్తుంటానని చెప్పారు.

సాయానికి మేం సిద్ధం: ఐఏఈఏ

కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్రరహితంగా మార్చే దిశగా ట్రంప్-కిమ్ భేటీలో కుదిరిన ఒప్పందాలు కార్యరూపం దాల్చడంలో సహాయం చేసేందుకు తాము సిద్ధమని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) డైరెక్టర్ జనరల్ యుకియా అమనో ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తర కొరియాలో అణ్వాయుధాలకు సంబంధించి తనిఖీలు చేపట్టేందుకు తాము సంసిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

నీరవ్, మాల్యా అప్పగింతపై బ్రిటన్ మెలిక!

అక్రమ వలస ఒప్పందంతో లంకె?

దిల్లీ: బ్యాంకులకు రుణాలు ఎగవేసి పరారైన వ్యాపారవేత్తలు నీరవ్ మోదీ, విజయ్ మాల్యాలను భారత్‌కు అప్పగించే అంశంపై బ్రిటన్ ప్రభుత్వం మెలికపెట్టే అవకాశం కనపడుతోంది. వీరి అప్పగింతను.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అక్రమ వలసదారుల ఒప్పందంతో ముడిపెట్టొచ్చు. బ్రిటన్‌లో అక్రమంగా నివసిస్తున్న 75వేల మందికిపైగా భారతీయులను వెనక్కి పంపడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. అక్రమ వలసదారులపై అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై తుది సంతకం చేసే అంశాన్ని బ్రిటన్ మంత్రి బారోనెస్ విలియమ్స్.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు వద్ద లేవనెత్తినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్‌కు చెందిన అక్రమ వలసదారులను గుర్తించిన నెలరోజుల్లోనే స్వదేశానికి తిప్పిపంపడానికి బ్రిటన్ అధికారులకు దీనివల్ల వీలు కలుగుతుందని పేర్కొన్నాయి. విలియమ్స్, రిజిజు మధ్య సోమవారం చర్చలు సాగాయి. నీరవ్ మోదీ, మాల్యా తదితరుల అప్పగింత అంశాన్ని భారత బృందం లేవనెత్తింది. నీరవ్ తమ దేశంలోనే ఉన్నారని బ్రిటన్ అధికారులు ఈ సందర్భంగా నిర్ధరించారు. "వీరి అప్పగింతను.. ఎంవోయూపై సంతకంతో బ్రిటన్ ముడిపెడుతుందని ఆందోళన చెందుతున్నాం'' అని ఓ అధికారి పేర్కొన్నారు. నిజానికి ఒప్పందం ముసాయిదాపై ఈ ఏడాది జనవరిలో రిజిజు సంతకం చేశారు. ప్రధాని మోదీ ఏప్రిల్‌లో బ్రిటన్‌లో పర్యటించినప్పుడు లాంఛనప్రాయంగా తుది ఎంవోయూపై సంతకం చేయాల్సింది. ప్రభుత్వంలోని కొన్ని వర్గాలు లేవనెత్తిన ఆందోళనల వల్ల భారత్ ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంది.

రాహుల్ గాంధీపై అభియోగాలు

ఠాణే: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్)పై నిందాపూర్వక వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విచారణ ఎదుర్కొనున్నారు. ఈ కేసులో ఆయనపై తాజాగా అభియోగాలు నమోదయ్యాయి. పరువునష్టం కేసుకు సంబంధించి మహారాష్ట్రలోని భివండీలో గల మేజిస్ట్రేట్ కోర్టుకు రాహుల్ మంగళవారం హాజరయ్యారు. అభియోగాలతోపాటు ఫిర్యాదుదారుడి వాంగ్మూలాన్ని ఆయనకు జడ్జి చదివి వినిపించారు. 'అభియోగాలను మీరు అంగీకరిస్తున్నారా?' అని ప్రశ్నించారు. రాహుల్ స్పందిస్తూ.. 'నేను నేరాన్ని అంగీకరించడం లేదు' అని అన్నారు. దీంతో భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 499(పరువునష్టం), సెక్షన్ 500(పరువునష్టానికి శిక్ష) కింద ఆయనపై కోర్టు అభియోగాలు నమోదుచేసింది. తదుపరి విచారణను ఈ ఏడాది ఆగస్టు 10కి వాయిదా వేసింది. ఈ కేసులో సాక్ష్యాధారాల సమగ్ర పరిశీలన, నమోదుకు అనుమతించాలంటూ రాహుల్ చేసిన అభ్యర్థనను కోర్టు మన్నించింది. తదుపరి విచారణ రోజున రాహుల్ కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం ఉండబోదని ఆయన తరఫు న్యాయవాదులు తెలిపారు. 2014 మార్చి 6న భివండీలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. మహాత్మా గాంధీ హత్య వెనుక ఆరెస్సెస్ హస్తముందని నాటి ప్రసంగంలో రాహుల్ ఆరోపించారని.. తద్వారా సంస్థ పరువుకు నష్టం కలిగించారని ఆరెస్సెస్ కార్యకర్త రాజేశ్ కుంతే పరువునష్టం కేసు వేశారు.

మంగళవారం ముంబయిలో ఆటోరిక్షా కార్మికులతో ముచ్చటిస్తున్న రాహుల్‌గాంధీ. కార్యకర్తలు, పార్టీ అధిష్ఠానం మధ్య సమన్వయం కోసం చేపట్టిన 'శక్తి' కార్యక్రమంలో భాగంగా ఆయన ముంబయిలో పర్యటించారు

వాజ్‌పేయీ, ఆడ్వాణీలను మోదీ అవమానిస్తున్నారు

దిల్లీ, ముంబయి: భాజపా దిగ్గజాలు వాజ్‌పేయీ, ఎల్‌కేఆడ్వాణీ, జశ్వంత్‌సింగ్‌లతో పాటు వారి కుటుంబాలను ప్రధాని మోదీ అవమానిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీని ఇటీవల ఆసుపత్రిలో చేరిస్తే, మొదటగా ఆయనను పరామర్శించింది తానేనని చెప్పారు. మోదీ మార్గదర్శకుడు, గురువు అయిన ఆడ్వాణీని అధికారిక కార్యక్రమాల్లో సైతం అవమానించారన్నారు. 2004, 2009 పార్లమెంటరీ ఎన్నికల్లో ఆడ్వాణీ నేతృత్వాన పోరాడిన భాజపాను తమ పార్టీ ఓడించిందని గుర్తు చేశారు. అయినా ఆయన పెద్దరికాన్ని గౌరవించి, అనేక అధికారిక కార్యక్రమాల్లో ఆయనకు ప్రోటోకాల్ ప్రకారం గౌరవించానని రాహుల్ చెప్పారు. ఈ మేరకు ఆడ్వాణీని పట్టించుకోని మోదీ వీడియోను ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ముంబయిలో జరిగిన పార్టీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో రాహుల్ మాట్లాడారు. మహాభారతంలో గురువు అడిగాడని అప్పట్లో ఏకలవ్యుడు బొటనవేలు కోసి ఇచ్చాడని గుర్తుచేశారు. తరచూ హిందూత్వం, నాగరికత గురించి మాట్లాడే మోదీ.. ఆయన గురువును ఎంతగా అవమానిస్తున్నారో అందరూ చూశారని ఎద్దేవా చేశారు. సామాన్యుడికి ఏమీ చేయని ప్రధాని, పారిశ్రామికవేత్తలకు మాత్రం వాచ్‌మ్యాన్‌లా పనిచేస్తున్నారని వ్యాఖ్యానించారు. కులం, మతం పేరిట దేశ ప్రజలను విభజిస్తున్నారని, వారిలో విద్వేషం రగుల్చొతున్నారని ఆరోపించారు. రైతుల పంటలకు మంచి మద్దతు ధర, ప్రతి వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఎక్కడో నిలదీయాలని పిలుపు ఇచ్చారు.

రాహుల్‌వి దిగజారుడు రాజకీయాలు: భాజపా: ఆడ్వాణీని మోదీ అవమానిస్తున్నారన్న రాహుల్‌గాంధీ విమర్శలపై భాజపా అధికార ప్రతినిధి అనిల్ బలూని స్పందించారు. దేశంలోనే అతి పురాతన పార్టీ అధ్యక్షుడు ఈ స్థాయికి దిగజారి వ్యాఖ్యలు చేస్తారనుకోలేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ మాజీ నాయకులు సీతారాం కేసరి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావులను ఎంత గౌరవించారో అందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు.

మారన్ సోదరులకు ఝలక్

- అక్రమ టెలిఫోన్ ఎక్స్ఛేంజీ కేసులో నిర్దోషులుగా తేల్చడంపై హైకోర్టులో సీబీఐ సవాల్

చెన్నై(లీగల్), న్యూస్‌టుడే: అక్రమ టెలిఫోన్ ఎక్స్ఛేంజీ కేసులో కేంద్ర మాజీ మంత్రి దయానిధి మారన్, ఆయన సోదరుడు కళానిధి మారన్‌లను నిర్దోషులుగా తేలుస్తూ ప్రత్యేక న్యాయస్థానం వెలువరించిన తీర్పును మద్రాసు హైకోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) మంగళవారం సవాలు చేసింది. సీబీఐ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. మారన్ సోదరులు సహా ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురికి తాఖీదులు జారీ చేసింది. ఈ నెల 20లోగా స్పందన తెలియజేయాల్సిందిగా వారిని ఆదేశించింది. 2004-06 మధ్య కేంద్ర టెలికాంశాఖ మంత్రిగా ఉన్న సమయంలో దయానిధి మారన్ చెన్నైలోని తన నివాసంలో అక్రమంగా ప్రైవేటు టెలిఫోన్ ఎక్స్ఛేంజీని ఏర్పాటు చేశారని.. కళానిధి మారన్‌కు చెందిన సన్ నెట్‌వర్క్ వ్యాపార కార్యకలాపాల కోసం దాన్ని వినియోగించడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.1.78 కోట్ల నష్టం వాటిల్లిందని సీబీఐ కేసు నమోదు చేసిన సంగతి గమనార్హం. అయితే, తగిన సాక్ష్యాధారాలు లేవంటూ మారన్ సోదరులు సహా మరో ఐదుగురు నిందితులను నిర్దోషులుగా విడుదల చేస్తూ ప్రత్యేక న్యాయస్థానం ఈ ఏడాది మార్చి 14న తీర్పు వెలువరించింది.

చిదంబరాన్ని మళ్లీ ప్రశ్నించిన ఈడీ

దిల్లీ: ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ నగదు అక్రమ చెలామణి కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం 6 గంటలపాటు ప్రశ్నించింది. ఈనెల 5న తొలివిడతగా ఆయనను ప్రశ్నించిన ఈడీ తాజాగా మరోసారి విచారించింది. ఉదయం 11 గంటలకు ఈడీ కార్యాలయానికి చేరుకున్న చిదంబరం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బయటకు వచ్చారు. తనపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని.. ఎలాంటి ఆరోపణలు కూడా లేవని మరోసారి గుర్తు చేస్తున్నట్లు అనంతరం చిదంబరం ట్వీట్ చేశారు.

ట్రంప్ కుమార్తె, అల్లుడి ఆదాయం రూ.570 కోట్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా, అల్లుడు జేర్డ్ కుష్నెర్ గత ఏడాది 8.2 కోట్ల డాలర్ల (సుమారు రూ.570 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించారు. వారిద్దరూ శ్వేతసౌధ సీనియర్ సలహాదారులుగా ఉన్న విషయం తెలిసిందే. గతంలో చేసిన పెట్టుబడులపై ఈ మేరకు ఆదాయం వచ్చినట్లు వారు ఆర్థిక పత్రాల్లో పేర్కొన్నారని 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక తెలిపింది. కుటుంబ స్థిరాస్తి కంపెనీతో సంబంధం ఉన్న అనేక కంపెనీల నుంచి తనకు 7 కోట్ల డాలర్లు లభించినట్లు జేర్డ్ పేర్కొన్నారు. శ్వేతసౌధంలో సేవలందిస్తున్నందువల్ల తమ కంపెనీల రోజువారీ వ్యవహారాలను తాత్కాలికంగా పక్కనపెడుతున్నట్లు ఇవాంక దంపతులు గతంలో ప్రకటించారు.

బీఎండబ్ల్యూ ఎక్స్ 3

ధర రూ.56.9 లక్షలు

దిల్లీ: జర్మనీ విలాసవంత కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ కొత్తగా ఎక్స్ 3 పెట్రోల్ వేరియంట్ స్పోర్ట్స్ వినియోగ వాహనాన్ని (ఎస్‌యూవీ) దేశీయ విపణిలో విడుదల చేసింది. దీని ధర రూ.56.9 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా నిర్ణయించారు. ఈ వాహనాన్ని చెన్నై ప్లాంటులో తయారు చేసినట్లు బీఎండబ్ల్యూ తెలిపింది. 'కొత్త బీఎండబ్ల్యూ ఎక్స్ 3 కారుకు మెరుగుపరచిన పెట్రోల్ ఇంజిన్ అమర్చినందున, వినియోగదారులు నిర్మలమైన చోదక ఆనందాన్ని పొందుతారని బీఎండబ్ల్యూ గ్రూపు భారత అధ్యక్షుడు విక్రమ్ పవాహ్ తెలిపారు. 2 లీటర్ 4 సిలిండర్ పెట్రోల్ ఇంజిన్, 252 హెచ్‌పీ సామర్థ్యంతో 6.3 సెకన్లలో 100 కి.మీ వేగాన్ని అందుకోవడం, 8 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఇంజిన్ దీని ప్రత్యేకతలు. ఆధునిక భద్రతా సదుపాయాలూ అమర్చారు. చోదకుడు అప్రమత్తతో వాహనాన్ని నడిపేలా ఈ కారు సాయం చేస్తుంది.

పాతది ఇవ్వండి.. కొత్త ఇల్లు తీసుకోండి

- పూర్వాంకర ఎక్స్ఛేంజ్ ఆఫర్
- దేశంలోనే తొలి సారి ఇది

బెంగళూరు: సాధారణంగా పాత కారు/మొబైల్ ఇచ్చి కొత్త కారు/సెల్‌ఫోన్ కొనుక్కోండి అనే మార్పిడి (ఎక్స్ఛేంజీ) ఆఫర్లు చూస్తుంటాం. కానీ స్థిరాస్తి దిగ్గజం పూర్వాంకర లిమిటెడ్ సరికొత్త 'పాత ఇల్లు ఇచ్చి, కొత్త ఇల్లు తీసుకునే' పథకాన్ని ప్రకటించింది. 'బిగ్ 72 అవర్స్' పేరుతో 'హోమ్ ఎక్స్ఛేంజ్ ప్లాన్'ను సంస్థ ప్రారంభించింది. ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ జరగనున్న ప్రదర్శనలో ఈ అవకాశం కల్పించనుంది. 'డెవలపర్లు తమ ఇళ్లను విక్రయించుకోవడానికి కష్టపడుతున్నారు. అదే సమయంలో కొంత మంది తమ పాత ఇంటి నుంచి కొత్త ఇంటికి మారాలని భావిస్తుంటారు. ఈ రెండింటి సమస్యలనూ ఈ పథకంతో తీర్చేయవచ్చ'ని పూర్వాంకర చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆనంద్ నారాయణన్ పేర్కొన్నారు. 'అయితే దీనిని వాహన మార్పిడి అంత సులభంగా చూడలేం. ఎందుకంటే ఒక ఇల్లు లేదా ఫ్లాట్ విక్రయించాలంటే శ్రమకోర్చాల్సిన అవసరం ఉంటుంది. మేం ఇంటిని కొనుగోలు చేయం కానీ.. మంచి ధరకు అది విక్రయం అయ్యేలా సహాయం చేస్తామ'ని ఆయన వివరించారు. ఇంటి ధరను నిర్ణయించడానికి థర్డ్ పార్టీగా ఉంటామని తెలిపారు. గృహ కొనుగోలుదార్లకు చెందిన పాత ఇళ్ల విక్రయం కోసం 99ఏకర్స్.కామ్; హౌసింగ్.కామ్‌తో కంపెనీ ఒప్పందాలు చేసుకుంది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ పథకం కింద దేశంలో ఎక్కడి ఇంటినైనా విక్రయించి.. దేశంలోని ఏ పూర్వాంకరా ఫ్లాట్ లేదా ఇంటిని కొనుగోలు చేయవచ్చని నారాయణన్ తెలిపారు. త్వరలో చెన్నైలోనూ ఇటువంటి 'హోమ్ మేళా'ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత మరో అయిదు నగరాల్లోనూ ఇదే తరహా పథకాన్ని తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

రోజూ అదనంగా 1.5 జీబీ డేటా

- ప్రీపెయిడ్ వినియోగదారులకు జియో కానుక
- 30 వరకు చేసుకునే రీచార్జులపై

దిల్లీ: రిలయన్స్ జియో ప్రీ-పెయిడ్ వినియోగదారులకు శుభవార్త. రోజూ అదనంగా 1.5 జీబీ 4జీ డేటాను పొందే సదుపాయాన్ని జియో కల్పిస్తోంది. మంగళవారం నుంచి ఈనెల 30 లోగా రూ.149- 499 మధ్య రీఛార్జీలు చేసుకునే వినియోగదారులు ఈ సదుపాయాన్ని పొందొచ్చు. 'రూ.149, రూ.399 రీచార్జి చేసుకున్న వినియోగదారులకు మాత్రమే ఎయిర్‌టెల్ అదనంగా 1 జీబీ డేటా ఇస్తోంది. అదే జియో ప్రతి ఒక్క ప్రీ-పెయిడ్ వినియోగదారునికి అదనంగా రోజూ 1.5 జీబీ డేటా ఇవ్వనుంద'ని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. రూ.300, ఆ పై రీచార్జులమీద రూ.100, రూ.300 లోపు రీచార్జులపై 20 శాతం తగ్గింపును ఇస్తున్నట్లు జియో తెలిపింది. ఈ తగ్గింపును పొందాలంటే మై జియో యాప్, ఫోన్‌పే వ్యాలెట్ ద్వారా రీచార్జి చేసుకోవాలని తెలిపింది.

100% వాటా అమ్మేద్దాం!

- ఎయిరిండియాపై ప్రభుత్వాలోచన
- 76 శాతానికి ఎవరూ రాకపోవడం వల్లే

ఎయిరిండియా విక్రయానికి ప్రభుత్వం త్వరలోనే కొత్త మార్గదర్శకాలు తీసుకురానుందని సమాచారం. ఈ విమానయాన సంస్థలో 76 శాతం వాటా విక్రయించాలని తలపెట్టినా, ఒక్క బిడ్ కూడా దాఖలు కాని సంగతి విదితమే. తొలివిడత బిడ్ ప్రతిపాదిత నిబంధనలే ఇందుకు కారణమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎయిరిండియా ప్రైవేటీకరణ ప్రక్రియను పునః పరిశీలించడానికి సిద్ధమైంది.

ఎయిరిండియాలో మైనారిటీ వాటాను అట్టేపెట్టుకోవాలన్న నిబంధననూ తొలగించాలని పరిశీలించనున్నట్లు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాశ్ చంద్ర గార్గ్ పేర్కొన్నారు. ప్రభుత్వం వివిధ అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలో 24 శాతం వాటాను కొనసాగించాలన్న షరతును పక్కనపెట్టాలని భావిస్తోందని ఆయన అన్నారు. 'ఇప్పటిదాకా ఉన్న వ్యూహం ఎక్కువ మంది కొనుగోలుదార్లను ఆకర్షించలేకపోయింది. కాబట్టి మరో వ్యూహానికి మారాల్సిన అవసరం ఉంద'ని గార్గ్ పేర్కొన్నారు.

ఎయిరిండియాను ప్రైవేటీకరణ పథకానికి గడువు తేదీ(మే 31) ముగిసినా ఎవరి నుంచీ బిడ్‌లు రాకపోవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. దాదాపు 8 బిలియన్ డాలర్ల రుణాలున్న ఈ ఎయిరిండియాపై ఇండిగో ఆసక్తిని ప్రదర్శించింది. అయితే ఎయిరిండియా అంతర్జాతీయ కార్యకలాపాలను విడిగా విక్రయించడం లేదని ప్రభుత్వం స్పష్టం చేసిన తర్వాత ఇండిగో వెనకడుగు వేసింది.

హైదరాబాద్‌లో విలాసవంత ఫర్నిచర్ విక్రయ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: విలాసవంత ఫర్నిచర్‌ను విక్రయించే 'ఎలివేట్ ఎక్స్' హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఖజానా గ్రూపు-ఇండియాకు చెందిన ఈ విక్రయశాలలో 20 దేశాల నుంచి దాదాపు 100కు పైగా ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులు లభించనున్నాయి. వీటి ప్రారంభ ధర రూ.20 వేలని నిర్వాహకులు తెలిపారు. దేశంలో ఫర్నిచర్ వ్యాపారం రూ.35వేల కోట్ల వరకు ఉందనీ, ఇందులో విలాసవంత ఫర్నిచర్ వాటా రూ.5వేల కోట్లని, ఖజానా గ్రూపు- ఇండియా వ్యవస్థాపకుడు భవంత్ ఆనంద్ తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుండటంతో విలాసవంత ఫర్నిచర్‌కు గిరాకీ పెరుగుతోందన్నారు. అయిదేళ్లలో దేశవ్యాప్తంగా 50 విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని, ఇందులో 10 విలాసవంత విభాగం ఉంటాయన్నారు. విశాఖపట్నంలో కూడా విక్రయకేంద్రాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. చిన్న షోరూంలను ఫ్రాంఛైజీల కింద ఇస్తామనీ, దీనికోసం రూ.2కోట్ల వరకూ ఖర్చవుతుందన్నారు. పెద్దవాటి ఏర్పాటు కోసం రూ.5కోట్ల నుంచి రూ.15కోట్ల వరకూ ఖర్చవుతుందన్నారు. గ్రూపు డైరెక్టర్ శివాని ఆనంద్ మాట్లాడుతూ.. 300 రకాల విభిన్న గదుల అలంకరణతో, దాదాపు 5వేలకు పైగా ఉత్పత్తులు ఇక్కడ లభిస్తాయని పేర్కొన్నారు.

నోట్ల రద్దు వల్లే మాకీ దుస్థితి!

- టెలికాం లైసెన్సుల రద్దు, బ్రెజిల్ ప్రభుత్వాల వల్లా
- ఎక్స్ఛేంజీలకు వీడియోకాన్ సమాచారం

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, సుప్రీం కోర్టు, బ్రెజిల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల తమకు రూ.3900 కోట్ల రుణభారం (57.9 కోట్ల డాలర్లు) పేరుకుపోయిందని వీడియోకాన్ ఇండస్ట్రీస్ పేర్కొంది. వీడియోకాన్‌పై ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకులు దాఖలు చేసిన దివాలా పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు.. కంపెనీ యాజమాన్య నియంత్రణను చేతిలోకి తీసుకోవాల్సిందిగా బ్యాంకులకు ఆదేశించింది. దీంతో యాజమాన్య నియంత్రణను కాపాడుకునేందుకు తిరిగి కోర్టును ఆశ్రయించే ఉద్దేశంలో కంపెనీ ఉంది. ఇదే విషయాన్ని ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. ఇందులోనే రుణభారం పేరుకుపోవడానికి దారితీసిన కారణాలను కంపెనీ ప్రస్తావించింది. 2016 నవంబరులో ప్రధాని నరేంద్ర మోదీ పెద్దనోట్ల రద్దుకు నిర్ణయం తీసుకోవడం వల్ల కాథోడ్ రే ట్యూబ్ టెలివిజన్ల తయారీ వ్యాపారాన్ని మూసేయాల్సి వచ్చిందని పేర్కొంది. టెలికాం లైసెన్సులను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో తమ టెలికమ్యూనికేషన్ల సంస్థ నష్టాల పాలయ్యిందని వెల్లడించింది. 2012 ఫిబ్రవరిలో వివిధ టెలికాం ఆపరేటర్లకు సంబంధించి 156 లైసెన్సులను సుప్రీం కోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. బ్రెజిల్‌లో చమురు సంస్థ ఏర్పాటుకు ఆ దేశ ప్రభుత్వం లైసెన్సులు ఇవ్వకపోవడం కూడా తమ పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడిందని పేర్కొంది.

ఆర్‌బీఐకి మరిన్ని అధికారాలు అవసరం

- అపుడే బ్యాంకులను పర్యవేక్షించగలం
- పార్లమెంటరీ సంఘంతో ఉర్జిత్ పటేల్

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)లను పర్యవేక్షించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)కు మరిన్ని అధికారాలు కావాలని ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అభిప్రాయపడ్డారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (ఫైనాన్స్) ముందు మంగళవారం హాజరైన ఉర్జిత్‌కు సభ్యుల నుంచి కఠిన ప్రశ్నలు ఎదురైనట్లు సమాచారం. మొండి బకాయిలు, బ్యాంకుల్లో చేటుచేసుకుంటున్న మోసాలు, నగదు సంక్షోభం, ఇతర సమస్యలపై సభ్యులు ప్రశ్నలు సంధించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వ్యవస్థను బలోపేతం చేయడానికి పలు చర్యలు తీసుకుంటున్నట్లు సభ్యులకు ఉర్జిత్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. పీఎస్‌బీలను నియంత్రించేందుకు ప్రస్తుతమున్న అధికారాలు సరిపోవని ఉర్జిత్ వారికి తెలియపరచారు. పీఎస్‌బీలను మరింత సమర్థంగా నియంత్రించడానికి మరిన్ని అధికారాలు కావాలని కోరినట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓలను తొలగించడానికి; పీఎస్‌బీ బోర్డుల్లో సాధారణ డైరెక్టర్లపై షరతులను విధించడానికి అధికారం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆర్‌బీఐకి అదనంగా అధికారాలు అవసరమని తాము భావించట్లేదని కమిటీ సభ్యుడు నిశికాంత్ దూబే పేర్కొనడం గమనార్హం. సీఈఓ, ఎండీ హోదా నుంచి ఛైర్మన్ పదవిని విడదీయడం ద్వారా బోర్డు స్వతంత్రతను బలోపేతం చేస్తున్నామని ఆయన వివరించారు.

ప్రతి బ్యాంక్ శాఖను పరిశీలించలేం: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో చోటుచేసుకున్న 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.13,000 కోట్ల) కుంభకోణంపై సభ్యులు అడిగిన ప్రశ్నలన్నిటికీ పటేల్ సమాధానం ఇచ్చారని తెలిసింది. ప్రతి బ్యాంకు శాఖను పరిశీలించడం అసాధ్యమని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో ఏటీఎంలలో నగదు లేకపోవడం, బ్యాంకింగ్ మోసాలపై తగిన చర్యలు తీసుకోకపోవడంపైనా ప్రశ్నలు ఎదురుకాగా.. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి కావల్సిన చర్యలన్నిటినీ తీసుకోగలమన్న ధీమాను ఉర్జిత్ వ్యక్తం చేశారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్యానెల్ ఆయన సమాధానాలపై సంతృప్తి చెందలేదని వారు అంటున్నారు. దివాలా స్మృతి(ఐబీసీ)ని అమల్లోకి తీసుకువచ్చాక మొండి బకాయిల విషయంలో కొంత మెరుగుదల కనిపించిందని ఆయన కమిటీకి తెలిపినట్లు సమాచారం.

బ్యాంకు బోర్డుల్లో ఆర్‌బీఐ నామినీ ఉండకూడదు: పీఎస్‌బీల బోర్డుల్లో ఆర్‌బీఐ నామినీ ఉండకూడదని కమిటీ సమావేశంలో ఉర్జిత్ తెలిపారు. 'రుణ నిర్ణయాలు తీసుకునే యాజమాన్య కమిటీ నుంచి ఆర్‌బీఐ నామినీ డైరెక్టర్లు దూరంగా ఉండాలి. ప్రయోజన వివాదాలు రాకుండా ఉండాలంటే.. ఆర్‌బీఐ నామినీలు అసలు పీఎస్‌బీల బోర్డుల్లోనే ఉండకూడద'ని కమిటీకి తన అభిప్రాయం వెల్లడించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

అబ్బో.. అబ్బే

వృద్ధి దిశగా పరుగుపెట్టి పారిశ్రామికోత్పత్తి 'అబ్బో' అనిపిస్తే.. నాలుగు నెలల గరిష్ఠాన్ని చేరి రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు 'అబ్బే' అంటూ నిరాశపరిచాయి. పారిశ్రామిక ప్రగతిలో తయారీ, గనుల రంగాలు కీలక పాత్ర పోషించాయి. భారీ యంత్రపరికరాల రంగం కూడా అండగా నిలిచింది. అటు ఆహార పదార్థాలు ప్రియమవ్వడంతో రిటైల్ ద్రవ్యోల్బణం కొండెక్కి కూర్చోక తప్పలేదు.

పారిశ్రామికం.. పరుగులు

దిల్లీ: తయారీ, గనులు భారీ యంత్రపరికరాల రంగాల రాణింపుతో ఏప్రిల్‌లో పారిశ్రామిక ప్రగతి పరుగుపెట్టింది. పారిశ్రామికోత్పత్తిలో 4.9 శాతం వృద్ధి నమోదైంది. పారిశ్రామిక వృద్ధిని పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారంగా లెక్కిస్తారనే విషయం తెలిసిందే. గతేడాది ఏప్రిల్‌లో ఇది 3.2 శాతం వద్ద ఉంది. అలాగే ఈ ఏడాది మార్చిలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి 4.4 శాతంగా నమోదైంది. ఏప్రిల్‌కు కేంద్రీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన నివేదిక ప్రకారం పారిశ్రామికోత్పత్తి వివరాలు ఇలా..

ఏప్రిల్‌లో వృద్ధి 4.9%

- పారిశ్రామికోత్పత్తిలో 77 శాతం వాటా ఉండే తయారీ రంగ ఉత్పత్తి 5.2 శాతం పెరిగింది. కిందటేడాది ఏప్రిల్‌లో 2.9 శాతం మాత్రమే వృద్ధి నమోదైంది.
- గనుల రంగ ఉత్పత్తి వృద్ధి కూడా 3 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగింది.
- పెట్టుబడుల గిరాకీకి ప్రామాణికంగా భావించే భారీ యంత్రపరికరాల రంగ ఉత్పత్తి వృద్ధి గణనీయంగా 13 శాతం పెరిగింది. ఏడాదిక్రితం ఇదే నెలలో వృద్ధి 4.8 శాతం తగ్గడం గమనార్హం.
- విద్యుదుత్పత్తిలో వృద్ధి తగ్గింది. కిందటేడాది ఏప్రిల్‌లో 5.4 శాతంగా నమోదైన వృద్ధి ఈ ఏప్రిల్‌లో 2.1 శాతానికి పరిమితమైంది.
- మన్నికైన వినియోగ వస్తువులు, స్వల్పకాల వినియోగ వస్తువుల రంగాల ఉత్పత్తిలోనూ వార్షిక ప్రాతిపదికన గణనీయ వృద్ధి నమోదైంది.
- ఏడాదిక్రితంతో పోలిస్తే ఏప్రిల్‌లో తయారీ రంగంలోని 23 విభాగాల్లో 16 విభాగాలు సానుకూల వృద్ధిని నమోదుచేశాయి.

కూరగాయలు, పండ్లు.. ప్రియం

గత నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ఠానికి చేరింది. పండ్లు, కూరగాయలు, పప్పుల లాంటి ఆహార పదార్థాలు ప్రియమవ్వడమే ఇందుకు కారణం. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కించే వినియోగ ధరల ఆధారిత సూచీ (సీపీఐ) మేలో 4.87 శాతం వద్ద ఉంది. ఈ ఏడాది జనవరిలో నమోదైన 5.7 శాతం తర్వాత మళ్లీ ఇదే ఎక్కువ. అలాగే కిందటేడాది మేలో సీపీఐ 2.18 శాతంగా నమోదైంది. కీలక రేట్లపై నిర్ణయం తీసుకునే ముందు సీపీఐ గణాంకాలను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. ఇటీవలి సమీక్షలో కూడా ద్రవ్యోల్బణం పెరుగుతుందనే అంచనాలతోనే కీలక రేట్లను పావు శాతం పెంచింది. మే నెలకు కేంద్రీయ గణక కార్యాలయం విడుదల చేసిన ద్రవ్యోల్బణం వివరాలు ఇలా..

4 నెలల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం

- ఆహార ధరల ద్రవ్యోల్బణ రేటు ఏప్రిల్‌లో 2.8 శాతంగా ఉండగా.. మేలో 3.1 శాతానికి పెరిగింది.
- కిందటి నెలలో పండ్లు 12.33%, కూరగాయలు 8.04 శాతం ప్రియమయ్యాయి. ఏప్రిల్‌లో పండ్లు, కూరగాయల ద్రవ్యోల్బణాలు వరుసగా 9.65%, 7.29% చొప్పున నమోదయ్యాయి. పప్పుల ధరల్లోనూ 2.78 శాతం పెరుగుదల నమోదైంది.
- చమురు, కొవ్వుల ద్రవ్యోల్బణ రేటు 2.11 శాతం నుంచి 2.46 శాతానికి పెరిగింది. ఇంధనం, విద్యుత్ విభాగం ధరల్లోనూ 5.24 శాతం పెరుగుదల ఉంది.
- ప్రొటీన్ ఆధారిత ఉత్పత్తులైన మాంసం, చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు గత నెలలో చౌక అయ్యాయి.



అటల్ పింఛన్ పరిమితి రూ.10000 వరకు!

ప్రభుత్వ ప్రతిపాదన

దిల్లీ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) కింద ఇచ్చే పింఛన్ పరిమితిని రూ.10000 వరకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం ఈ పథకం కింద గరిష్ఠ పింఛన్ పరిమితి రూ.5000గా ఉంది. అటల్ పెన్షన్ యోజన కింద ఇచ్చే పింఛన్ మొత్తాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఆర్థిక సేవల విభాగం సంయుక్త కార్యదర్శి మద్నేశ్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. పింఛను నిధి నియంత్రణ ప్రాధికార సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏపీవై పింఛన్ పరిమితిని రూ.10000కు పెంచాలని పీఎఫ్ఆర్‌డీఏ పంపిన ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మిశ్రా తెలిపారు. చందాదారుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనను ఆర్థిక శాఖకు పంపినట్లు పీఎఫ్ఆర్‌డీఏ ఛైర్మన్ హేమంత్ కాంట్రాక్టర్ వెల్లడించారు. 'ప్రస్తుతం నెలకు రూ.1000- 5000 వరకు అయిదు పింఛన్ శ్లాబులు ఉన్నాయి. ఇప్పటి నుంచి 20-30 ఏళ్ల తర్వాత.. 60 ఏళ్ల వయసులో రూ.5000 పింఛన్ సరిపోదని చాలా మంది అభిప్రాయపడ్డారు. అందుకనే రూ.10000 వరకు పింఛన్ మొత్తాన్ని పెంచాలని ప్రతిపాదించాం' అని కాంట్రాక్టర్ పేర్కొన్నారు. దీంతో పాటు మరో రెండు ప్రతిపాదనలను సైతం పీఎఫ్ఆర్‌డీఏ ఆర్థిక శాఖ పంపింది. ఏపీవైకు గరిష్ఠ వయో పరిమితిని 50 ఏళ్లకు పెంచాల్సిందిగా కోరింది. ప్రస్తుతం 18-40 ఏళ్ల వారే అటల్ పెన్షన్ యోజనకు అర్హులు. ఈ పథకం కింద 1.02 కోట్ల మంది చందాదారులు ఉన్నారు.

ప్రభుత్వాన్ని తప్పుపట్టలేం కదా!

ఈవీ విధానంపై ఆనంద్ మహీంద్రా

గురుగ్రామ్: విద్యుత్ వాహనాల(ఈవీ)కు 'సంసిద్ధంగా ఉండే' ఒక విధానం లేకపోవడం ప్రభుత్వ తప్పు కాదని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా అభిప్రాయపడ్డారు. ఈవీ అనేది ఇంకా ఒక కొత్త రంగమేనని, పరిస్థితులు క్రమంగా మెరుగుపడతాయని మంగళవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన అన్నారు. 'ప్రభుత్వం ఈవీల ప్రాధాన్యాన్ని గుర్తించింది. అయితే పరిస్థితులు చక్కపడడానికి సమయం పడుతుంది. ప్రతి ఒక్కరూ ఆ దిశగా పయనిస్తున్నారు. విధానాల రూపకల్పనలో ప్రైవేటు రంగంతోనూ కలిసి ప్రభుత్వం ముందుకెళుతోందని నేను భావిస్తున్నా'నన్నారు. 'ఈవీ రంగంలో దిగ్గజాలుగా ఉన్న మమ్మల్ని తొలుత సమయం వృధా చేస్తున్నామని అందరూ అన్నారు. కానీ ఈ రంగం మాకు కలిసి రానుంది. వ్యాపారం వేగంగా వృద్ధి చెందుతోంది. అందరి కంటే ముందుండాలనే కోరుకుంటున్నామ'ని ఆనంద్ మహీంద్రా చెప్పుకొచ్చారు.

15 బ్యాంకులకు మూడీస్ రేటింగ్

ముంబయి: ఇటీవల భారీ మోసానికి గురైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)తో పాటు అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సహా మరో 13 భారతీయ బ్యాంకులకు అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ కౌంటర్‌పార్టీ రిస్క్ రేటింగ్ (సీఆర్ఆర్) ఇచ్చింది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటివీ సీఆర్ఆర్ పొందిన జాబితాలో ఉన్నాయి. రుణ రహిత ఆర్థిక బాధ్యతల్లో పూచీకత్తు లేని భాగాన్ని అంగీకరించే సామర్థ్యం, ఒకవేళ ఆ బాధ్యతలను అంగీకరించకపోతే ఏర్పడే ఆర్థిక నష్టాలపై అభిప్రాయాన్ని ప్రతిబింబించేలా సీఆర్ఆర్ ఉంటుంది.

వేతనం తగ్గించినా ఫర్వాలేదు

- తక్కువ సమయం ప్రయాణాలకే ఉద్యోగుల ఓటు : లింక్డ్ఇన్ నివేదిక

ముంబయి: కార్యాలయాలకు వెళ్లడానికి ఉద్యోగులు చేసే ప్రయాణం రోజురోజుకూ కష్టతరంగా మారుతోంది. నగరాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. వాహనాలతో కిటకిటలాడే రహదారులు, ప్రజా రవాణా సదుపాయాలు కొరవడం ఇందుకు ప్రధాన కారణం. అందుకే 78% భారతీయులు తక్కువ సమయం ప్రయాణానికే ఓటు వేస్తున్నారని సామాజిక మాధ్యమం లింక్డ్ ఇన్ సర్వే అభిప్రాయపడింది. తక్కువ సమయం ప్రయాణానికి వేతన కోతకైనా సిద్ధమేనని 26% మంది వెల్లడించారని తెలిపింది. సరైన రవాణా సదుపాయాలు లేనందున, ప్రపంచవ్యాప్తంగా 11 దేశాల్లో తక్కువ ప్రయాణ దూరాన్ని భారతీయులే ఎక్కువగా కోరుకుంటున్నట్లు పేర్కొంది. 'భారత్‌లో ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లడం అనేది కష్టంతో కూడుకున్న వ్యవహారంగా మారింది.



నైపుణ్యాలు, రిఫరెల్స్, ఉద్యోగ దరఖాస్తులు, ప్రయాణ సమయం వంటివవి కొత్త అవకాశాలకు అడ్డంకిగా మారాయి' అని లింక్డ్ఇన్ ఇండియా కమ్యూనికేషన్స్ హెడ్ దీపా సపాట్నేకర్ వెల్లడించారు. నివేదికలో మరిన్ని అంశాలు ఇలా..

- గతేడాది కాలంలో కార్యాలయానికి వెళ్లే ప్రయాణ సమయం పెరిగిందని దాదాపు సగం మంది భారతీయులు (48 శాతం) పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థల వల్ల కార్యాలయాలకు చేరుకోవడం ఆలస్యం అవుతోందని దాదాపు 60 శాతం మంది అభిప్రాయపడ్డారు. వివిధ దేశాల్లో చేసిన సర్వేలో ఈ రెండు కారణాలనే ఉద్యోగులు ఎక్కువగా వెలిబుచ్చారు.
- తక్కువ ప్రయాణ సమయం ద్వారా మరింత మెరుగ్గా పనిచేయగలమని 47%మంది వెల్లడించారు. ఇక తక్కువ సమయం ప్రయాణించడం ద్వారా ఎక్కువగా అలసిపోవాల్సిన అవసరం ఉండదని 48% మంది పేర్కొన్నారు.
- మరోవైపు ఆదాయంలో 20 శాతం కంటే ఎక్కువ వృద్ధి ఉంటే.. ఎక్కువ దూరం ప్రయాణించడానికైనా సిద్ధమేనని 42 శాతం మంది చెప్పడం గమనార్హం. ప్రయాణ సదుపాయం, పదోన్నతి, ప్రోత్సాహకాలు ఇస్తే కూడా ఎక్కువ దూరాలకు మొగ్గుచూపుతామని 33%మంది అన్నారు.
- సరైన ఉద్యోగం ఉంటే ఎంత దూర ప్రయాణమైన చేస్తామని 40 శాతం మంది చెప్పగా.. కోరుకున్న సంస్థలో ఉద్యోగం లభిస్తే ఎక్కువ దూరం ప్రయాణించడానికి సిద్ధమని 31 శాతం చెప్పుకొచ్చారు.

సెన్సెక్స్ ▲ 209
35693

నిఫ్టీ ▲ 56
10843

డోజోన్స్ 25310 ▼ 12 | నాస్‌డాక్ 7705 ▲ 45

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 67.49 ▼ 07 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 76.65 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+)

నిఫ్టీ	12న	మార్పు %
LUPIN	855.00	5.62
DR. REDDYS LAB	2190.65	5.16
SBI	282.85	3.23
INDUSIND BANK	1954.75	2.62
HUL	1638.45	2.31
HERO MOTOCORP	3687.85	2.09
TCS	1781.00	1.79

గ్రహణం (-)

నిఫ్టీ	12న	మార్పు %
BHARTI AIRTEL	380.65	-2.10
HINDALCO	240.65	-1.66
EICHER MOTORS	29208.40	-1.58
UPL	688.70	-1.52
COAL INDIA	283.55	-1.51
TATA STEEL	580.00	-1.47
ONGC	171.40	-1.10

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.36	71.16
పౌండ్ స్టెర్లింగ్	81.97	95.08
యూరో	72.19	83.74
జపనీస్ యెన్/100	55.66	64.56
ఆస్ట్రేలియా డాలరు	46.73	54.08
సింగపూర్ డాలరు	45.95	54.44
థాయ్ బాత్/100	191.22	228.72
బహ్రెయిన్ దీనార్	165.95	190.05
కువైట్ దీనార్	184.69	229.94
ఒమన్ రియాల్	162.09	186.19
సౌదీ రియాల్	16.27	19.34
యూఏఈ దిర్హమ్	16.66	19.51
మలేషియా రింగిట్	15.06	18.52
చైనీస్ యువాన్	7.44	12.09



మంగళవారం నిఫ్టీ కదలికలు

ఆర్ఐటీఈఎస్ ఇష్యూ 20 నుంచి

ధరల శ్రేణి రూ.180-185

దిల్లీ: రైల్వే కన్సల్టెన్సీ సంస్థ ఆర్ఐటీఈఎస్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 20న ప్రారంభమై 22న ముగియనుంది. ఇష్యూలో భాగంగా సంస్థలోని 12 శాతం వాటాకు సమానమైన 2.52 కోట్ల షేర్లను ప్రభుత్వం విక్రయించనుంది. ఉద్యోగులకు చెందిన 12 లక్షల షేర్లను కూడా జారీ చేస్తారు. ఒక్కో షేరుకు ధరల శ్రేణిగా రూ.180-185గా నిర్ణయించారు. ఇందులోని గరిష్ఠ ధర ప్రకారం చూస్తే జారీ చేసిన షేర్ల ద్వారా ప్రభుత్వానికి రూ.460 కోట్ల వరకు వచ్చే అవకాశం ఉంది. ఆర్ఐటీఈఎస్‌లో ప్రభుత్వానికి 100 శాతం వాటా ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకు వస్తున్న తొలి ప్రభుత్వ రంగ సంస్థ ఇదే కావడం గమనార్హం.

స్పైస్‌జెట్ ఆన్‌లైన్ బీబీఏ కోర్సు

సంస్థలోనే ఉద్యోగావకాశం

ముంబయి: విమానయాన సంస్థ స్పైస్‌జెట్ మూడేళ్ల బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) ఆన్‌లైన్ కోర్సును ప్రారంభించింది. ఇందులోనే విమాన నిర్వహణకు సంబంధించి ఆరు నెలల సర్టిఫికెట్ ప్రోగామ్‌ను కూడా జత చేసింది. ఇందుకోసం 'అమిటీ' విశ్వవిద్యాలయంతో చేతులు కలిపింది. స్పైస్ స్టార్ అకాడమీ ఈ కోర్సును నిర్వహిస్తుంది. 'ఔత్సాహికులైన వారికి నైపుణ్యాలు అందించి క్యాబిన్ సిబ్బందిగా తయారుచేయడమే కాకుండా భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దేలా కోర్సు రూపకల్పన చేశామ'ని స్పైస్‌జెట్ తెలిపింది. కోర్సు పూర్తి కాగానే రూ.8 లక్షల వార్షిక వేతనంతో సంస్థలోనే ఉద్యోగావకాశం కూడా కల్పిస్తామని భరోసా ఇస్తోంది. 'స్పైస్ స్టార్ అకాడమీలో శిక్షణ కార్యక్రమాలతో యువతీ యువకుల్లోని ప్రతిభను వెలికితీస్తామ'ని స్పైస్‌జెట్ ఛైర్మన్ అజయ్ సింగ్ తెలిపారు. రాబోయే కొన్నేళ్లలో 205 బోయింగ్, 50 బొంబాడియర్ క్యూ400 ఎస్ విమానాలు స్పైస్‌జెట్ కొనుగోలు చేయబోతోంది. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో సర్వీసుల్ని పెంచడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం 6,000 మంది సిబ్బంది (క్రూ మెంబర్స్) అవసరమవుతారు. ఈ నేపథ్యంలోనే స్పైస్‌జెట్ ఈ కొత్త కోర్సుకు శ్రీకారం చుట్టింది.

12న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	380	వరంగల్	382
చిల్లరగా(ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	380
బెంగళూరు	423	చెన్నై	452
13వ తేదీకి...		చిత్తూరు	445
విజయవాడ/గోదావరి	372	నమక్కల్	435

నాలుగు నెలల గరిష్ఠానికి సూచీలు

- కొనసాగిన లాభాలు
- ట్రంప్- కిమ్ భేటీతో సానుకూలతలు

సమీక్ష

అంతర్జాతీయ సానుకూలతలతో మార్కెట్లు నాలుగు నెలల గరిష్ఠానికి చేరాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ల భేటీ నేపథ్యంలో ఆసియా మార్కెట్లు పరుగులు తీశాయి. అణ్వాయుధాల ఉపసంహరణ దిశగా అడుగులు పడటంతో ఉద్రిక్తతలు సమసిపోతాయనే భావనతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఫలితంగా నిఫ్టీ కీలకమైన 10,800 పాయింట్ల స్థాయిని అధిగమించింది. ఔషధ షేర్లు రాణించాయి. ఐరోపా మార్కెట్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,525.30 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 35,743.08 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 209.05 పాయింట్ల లాభంతో 35,692.52 పాయింట్ల వద్ద ముగిసింది. ఫిబ్రవరి 1 తర్వాత సూచీకిదే గరిష్ఠ ముగింపు కావడం గమనార్హం. నిఫ్టీ సైతం 55.90 పాయింట్లు పెరిగి 10,842.85 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో సూచీ 10,856.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది.

- ఉక్కు వ్యాపారాన్ని విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించడంతో ఉషా మార్టిన్ షేరు పరుగులు తీసింది. ఇంట్రాడేలో రూ.11.86 శాతం పెరిగిన షేరు రూ.33 వద్ద 52 వారాల గరిష్ఠానికి చేరింది. చివరకు 5.93 శాతం లాభంతో రూ.31.25 వద్ద ముగిసింది.
- ఒసెల్టామివిర్ ఫాస్ఫేట్ క్యాప్సుల్స్ జనరిక్ వెర్షన్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ తుది అనుమతి ఇవ్వడంతో స్ట్రైడ్స్ షాసున్ షేరు రాణించింది. ఇంట్రాడేలో 5.53 శాతం పెరిగిన షేరు.. చివరకు 3.83 శాతం లాభంతో రూ.363.05 వద్ద ముగిసింది.
- త్రైమాసిక నష్టం పెరగడంతో యునిటెక్ షేరు కుదేలైంది. ఇంట్రాడేలో 6.55 శాతం కోల్పోయిన షేరు.. చివరకు 5.97 శాతం నష్టంతో రూ.4.88 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 16 లాభాలతో ముగిశాయి. డాక్టర్ రెడ్డీస్ 5.23%, ఎస్‌బీఐ 3.36%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.71%, హిందుస్థాన్ యునిలీవర్ 2.41%, హీరో మోటోకార్ప్ 2.11%, టీసీఎస్ 1.74%, అదానీ పోర్ట్స్ 1.65%, ఎల్ అండ్ టీ 1.58%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.32%, సన్‌ఫార్మా 1.03% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. భారతీ ఎయిర్‌టెల్ (1.98%), టాటా స్టీల్ (1.52%), కోల్ ఇండియా (1.49%), ఓఎన్‌జీసీ (1.10%), యెస్ బ్యాంక్ (0.98%)లు మాత్రం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో ఆరోగ్య సంరక్షణ 1.94 శాతం లాభపడింది. యంత్ర పరికరాలు, ఎఫ్ఎమ్‌సీజీ, పీఎస్‌యూ, బ్యాంకింగ్, ఐటీ, మౌలిక, టెక్, స్థిరాస్తి షేర్లు అదే బాటలో నడిచాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ పరపతి సమీక్షా సమావేశాల నిర్ణయం వెలువడనున్నందున మదుపర్లు ఆచితూచి వ్యవహరించొచ్చు. రేట్ల పెంపు త్వరితగతిన ఉండొచ్చన్న సంకేతాలు వెలువడితే.. విదేశీ మదుపర్ల అమ్మకాలు ఇక్కడ వెల్లువెత్తొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నేడు నిఫ్టీ 10740- 10870 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ల భేటీ నుంచి సానుకూల సంకేతాలు వెలువడటంతో మంగళవారం సూచీలు కళకళలాడాయి. నిన్న మార్కెట్లు ముగిశాక వెలువడిన పారిశ్రామికోత్పత్తి, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు మార్కెట్లపై ప్రభావం చూపొచ్చు. నిఫ్టీ 10930 పాయింట్లు అధిగమించే వరకు.. ప్రస్తుత స్థాయిల వద్ద స్థిరీకరించుకోవచ్చని అంటున్నారు. ఎఫ్ఎమ్‌సీజీ, ఐటీ, ఔషధ వంటి రక్షణాత్మక రంగాల షేర్లు కొనుగోలు చేయొచ్చని బ్రోకరేజీ సంస్థలు సిఫారసు చేస్తున్నాయి.

టెలికాం కొత్త విధానానికి వచ్చే నెలలో ఆమోదం!

సమాచార మంత్రి మనోజ్ సిన్హా

దిల్లీ: టెలికాం నూతన విధానానికి కేంద్ర మంత్రివర్గం జులై ఆఖరులో ఆమోదం తెలిపే అవకాశం ఉందని కేంద్ర సమాచార మంత్రి మనోజ్ సిన్హా పేర్కొన్నారు. జాతీయ డిజిటల్ సమాచార విధానం-2018 (ఎన్‌డీసీపీ) ముసాయిదాను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ప్రతి ఇంటికీ 50 ఎంబీపీఎస్ డౌన్‌లోడ్ వేగంతో ఇంటర్నెట్ కనెక్షన్, టెలికాం రంగంలోకి రూ. 6.5 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించడం, వచ్చే కొన్నేళ్లలో 40 లక్షల ఉద్యోగావకాశాలు సృష్టించడం వంటివి ఈ ముసాయిదాలో పొందుపరిచారు. 'ఈనెల 29న జరిగే సమావేశంలో టెలికాం కమిషన్ ముందు కొత్త విధాన ముసాయిదాను ఉంచుతామ'ని టెలికాం కార్యదర్శి అరుణా సుందర్‌రాజన్ తెలిపారు. 'మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో టెలికాం రంగం సవాళ్లను ఎదుర్కొంటోంది. విశ్వాస లోటుతో, సంక్షోభంలో కూరుకుపోయి ఉంది. పారదర్శకతను పెంపొందించి, మంచి పాలన తీసుకొచ్చామ'ని మనోజ్ సిన్హా తెలిపారు.

విమానంలో మొబైల్ సేవలు ఏడాదిలోపే!

భారత గగనతలంలో ప్రయాణిస్తున్న విమానాల్లో కూడా మొబైల్ కాల్స్, ఇంటర్నెట్ సేవలు ఏడాదిలోగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని టెలికాం మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. టెలికాం విభాగం, పౌర విమానయాన అధికారులతో పది రోజుల్లో సమావేశం నిర్వహించి కార్యాచరణపై చర్చిస్తామన్నారు.

మార్కెట్ కబుర్లు

- గుజరాత్‌లో సౌర ఫొటోవోల్టిక్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు నిమిత్తం **భెల్**కు రూ.125 కోట్ల విలువైన ఆర్డరు లభించింది.
- ఎంఅండ్‌జీ ప్రుడెన్షియల్‌తో కుదుర్చుకున్న ఒప్పంద విలువను 120 కోట్ల డాలర్లకు **టీసీఎస్** పెంచుకుంది.
- పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు సెబీకి సంబంధిత పత్రాలను **సెంచురీ మెటల్ రీసైక్లింగ్** సమర్పించింది.
- బైండింగ్ బిడ్‌ల దాఖలు గడువును జూన్ 28కి **ఫోర్టిస్ హెల్త్‌కేర్** పొడిగించింది. ఇంతకుముందు ఈ గడువు జూన్ 14గా ఉండేది.
- గుజరాత్‌లోని హలోల్ ప్లాంటుకు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి ఈఐఆర్ (ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్) వచ్చిందని **సన్ ఫార్మా** వెల్లడించింది.

నిన్నటి స్వేచ్ఛకు నేడు సంకెళ్లు!



- స్వప్రయోజనాల కోసం నాడు ప్రపంచీకరణ
- నష్టపోతున్నామంటూ ఇప్పుడు కొత్త పల్లవి
- 'ట్రంప్' వర్తక విధానాలపై ఇతర దేశాలు గుర్రు

దేశాల మధ్య వ్యాపారానికి అడ్డుగోడలు ఏమిటని ఒకప్పుడు ఆ దేశం ప్రశ్నించింది. అభివృద్ధి చెందాలంటే ఆంక్షలు లేని ప్రపంచం కావాలని ఆశపెట్టింది. ఒప్పుకోని దేశాలను నయానో, భయానో లొంగదీసుకుంది. ఉత్తర అట్లాంటిక్ అని, ట్రాన్స్- పసిఫిక్ అని... ప్రాంతీయ ఒప్పందాలు చేసుకుంది. ప్రపంచ వాణిజ్య సంస్థకు సూత్రధారిగా వ్యవహరించింది. తద్వారా తన వస్తువులకు ప్రపంచాన్ని విపణిగా మార్చుకుంది. ఆ దేశం మరేదో కాదు. అగ్రరాజ్యమైన అమెరికానే. కానీ ఆదే ఇప్పుడు ప్రపంచీకరణ పెద్ద ముప్పు అన్నట్లుగా, ఇతరదేశాల వస్తువులకు అమెరికాలో స్థానం లేదంటూ అడ్డుగోడలు కట్టుకుంటోంది. చైనాతో మొదలు పెట్టి, కెనడా, మెక్సికో, ఐరోపా దేశాలు.. దేనికీ మినహాయింపు లేనట్లు కత్తులు నూరుతోంది.

వర్తక యుద్ధాలే మంచివి, వాటిని గెలవటం ఎంతో సులువు- అనేది ట్రంప్ విశ్వాసం. 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో ఎన్నికల్లో గెలిచి అధ్యక్షుడు అయ్యాక దాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందుకు ఎంచుకున్న మార్గం వర్తక సుంకాల విధింపు. వివిధ దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై అదనపు సుంకాలు వడ్డిస్తూ అడ్డుగోడలు కట్టడం మొదలు పెట్టారు. వాస్తవానికి ఎన్నో దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తూ వచ్చిన స్వేచ్ఛా వాణిజ్య విధానాలకు ఇది పూర్తి విరుద్ధం. అసలు ప్రపంచీకరణ ఛాంపియన్ అమెరికానే. అటువంటి దేశం ఇప్పుడు రక్షణాత్మక వాణిజ్య విధానాలను అవలంబించటం ఇతర దేశాలకు మింగుడు పడటం లేదు.

జీ-7 సదస్సులో చిచ్చు!

ఇటీవల కాలంలో ఇష్టానుసారం అమెరికా విధిస్తున్న వర్తక సుంకాల అంశం కెనడాలో గత వారంలో జీ-7 దేశాల సదస్సులో చర్చకు వచ్చింది. సదస్సు చివరి రోజున సంయుక్త ప్రకటన విడుదల చేయాలి. అతికష్టం మీద అందరి అంగీకారంతో ఒక సంయుక్త ప్రకటన సిద్ధం చేశారు. దాన్ని విడుదల చేసే సమయానికి డోనాల్డ్ ట్రంప్ అడ్డుపుల్ల వేశారు. సంయుక్త ప్రకటనకు తమ మద్దతు లేదని స్పష్టం చేశారు. పైగా కెనడా అధ్యక్షుడు జస్టిన్ ట్రూడెవ్‌పై పదునైన విమర్శలతో విరుచుకుపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాల కూటమి అయిన జీ-7 కు అమెరికానే వెనుదన్ను. ఈ బలమైన కూటమి ద్వారా అమెరికా ఎన్నో ఏళ్లుగా తన వ్యాపార ప్రయోజనాలు నెరవేర్చుకుంది. కానీ ఇప్పుడు అదే కూటమిలో చిచ్చు పెట్టే విధంగా వ్యవహరించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అడ్డుగోడలు వద్దన్నది వారే...

అమెరికా తన అవసరాలకు తగ్గట్లుగా వర్తక నిబంధనలను మార్చుకుంటూ వస్తోందనేది చరిత్రాత్మక సత్యం. ఐరోపా దేశాల నుంచి దిగుమతులు వెల్లువెత్తకుండా నియంత్రించటానికి అమెరికాలో మొదట్లో కట్టుదిట్టమైన చట్టాలు ఉన్నాయి. స్మూత్- హాలే టారిఫ్ చట్టం, 1930 ఇటువంటిదే. భారీ ఆర్థిక మాంద్యం (గ్రేట్ డిప్రెషన్) తర్వాత పరిస్థితుల్లో మార్పు వచ్చింది. శాస్త్రసాంకేతిక ఆవిష్కరణలతో అమెరికా పారిశ్రామికంగా పురోగమించింది. అక్కడి కంపెనీలకు ప్రపంచవ్యాప్త మార్కెట్ కావలసి వచ్చింది. దేశాల మధ్య వర్తక ఆంక్షలు ఏమిటంటూ... ఆ దేశం కొత్త పల్లవి అందుకుంది. ఈ క్రమంలో ఎన్నో వర్తక ఒప్పందాలను ప్రపంచ దేశాలపై రుద్దింది.

రెసిప్రోకల్ ట్రేడ్ అగ్రిమెంట్స్ యాక్ట్

అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 1934లో ఈ చట్టం తీసుకువచ్చారు. దీని ప్రకారం ఇతర దేశాలతో అమెరికా వర్తక ఒప్పందాలు కుదుర్చుకోవటానికి, సుంకాలు తగ్గించటానికి వీలుకలిగింది. స్వేచ్ఛా వాణిజ్యాన్ని అమెరికా విస్తృతంగా ప్రాచుర్యంలోకి తీసుకురావటానికి ఈ చట్టమే పునాది వేసింది.

గాట్

1947లో రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత అమెరికా, 22 ఇతర దేశాలతో కుదుర్చుకున్న అతిపెద్ద వర్తక ఒప్పందం జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్ (గాట్). ఎన్నో దశాబ్దాల పాటు ప్రపంచ వాణిజ్యానికి ఇది ప్రధాన ప్రాతిపదిక అయింది.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

సోవియన్ రష్యా కుప్పకూలిపోవటంతో అప్పటి వరకూ అమెరికా- యూఎస్ఎస్ఆర్ మధ్య ఉన్న ప్రచ్ఛన్న యుద్ధం తొలగిపోయింది. ప్రపంచ వాణిజ్యంపై గుత్తాధిపత్యాన్ని సాధించే యత్నాలను అమెరికా వేగవంతం చేసింది. ఈ క్రమంలో పలు ద్వైపాక్షిక వర్తక ఒప్పందాలు కుదుర్చుకుంది. యూఎస్- కెనడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, నాఫ్టా (నార్త్ అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్), దక్షిణ కొరియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, ట్రాన్స్- పసిఫిక్ పార్టనర్‌షిప్ (టీపీపీ), సీఏఎఫ్‌టీఏ (సెంట్రల్ అమెరికన్- డొమినకన్ రిపబ్లిక్ ఫ్రీ టేడ్ అగ్రిమెంట్) ఈ కోవలోని ఒప్పందాలే.

ఉరుగ్వే చర్చలు

1947 నుంచి 1986 మధ్యకాలంలో ఎనిమిది దఫాలుగా గాట్ (జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్) సమావేశాలు జరిగాయి. కానీ 1986లో మొదలైన ఉరుగ్వే రౌండ్ చర్చలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. 1994 వరకూ జరిగిన ఈ చర్చలే డబ్ల్యూటీఓ ఏర్పాటుకు వీలుకల్పించాయి. అంతేగాక పలు కొత్త రంగాలకు ప్రపంచ వాణిజ్యం విస్తరించేందుకు అవకాశం కలిగింది. అంతకు ముందు దఫా చర్చల్లో వ్యవసాయం అంతర్జాతీయ వర్తకంలో భాగంగా లేదు. కానీ ఉరుగ్వే రౌండ్ లో వ్యవసాయంతో పాటు, టెక్స్‌టైల్స్, సేవలు, మూలధనం, మేధో సంపత్తి హక్కులు (ఐపీఆర్) తదితర అంశాలపై ప్రపంచ దేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా వ్యవసాయంపై కుదిరిన ఒప్పందం ఉరుగ్వే రౌండ్‌లో అత్యంత ప్రధానమైనది.

డబ్ల్యూటీఓ

ఉరుగ్వే చర్చల ఫలితంగా 'గాట్' స్థానంలో 1995లో డబ్ల్యూటీఓ (ప్రపంచ వాణిజ్య సంస్థ) వచ్చింది. దీంతో ప్రపంచ వాణిజ్యంలో అడ్డుగోడలు చాలా వరకూ తొలగిపోయినట్లయింది. స్వేచ్ఛా వాణిజ్యం బహుముఖంగా విస్తరించింది. డబ్ల్యూటీఓ ఫలితంగా తొలిదశలో అగ్రరాజ్యాలు తమ వ్యాపారాన్ని బాగా విస్తరించుకోగలిగాయి. కానీ మలిదశలో వర్ధమాన దేశాల నుంచి పోటీ పెరిగింది. చైనా, భారత్, మెక్సికో తదితర దేశాలు ప్రపంచ వాణిజ్యంలో కీలకమైన పాత్ర పోషించే స్థితికి ఎదిగాయి.

ఆలోచన మారిందిలా...

21వ శతాబ్దం ఆరంభం వరకూ వివిధ వర్తక ఒప్పందాల ద్వారా అమెరికా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించింది. కానీ నెమ్మదిగా వర్ధమాన దేశాలు అమెరికా కంటే తక్కువ ఖర్చులో వస్తు, సేవలు అందించే పరిస్థితి వచ్చింది. దీంతో అమెరికా విధాన నిర్ణేతల్లో ఆలోచన మొదలైంది. ట్రంప్ వచ్చాక వర్తక సుంకాలను వడ్డించటం మొదలు పెట్టారు. దీనివల్ల దీర్ఘకాలంలో అమెరికా ప్రయోజనాలకు నష్టం కలుగుతుందని, చైనా ప్రాబల్యం విస్తరిస్తుందని నిపుణులు మొత్తుకుంటున్నా, ట్రంప్ వినటం లేదు.

ఎంతో వ్యతిరేకత

ట్రంప్ సుంకాలపై చైనా, కెనడా, ఐరోపా దేశాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అమెరికా సుంకాలకు బదులుగా చైనా 120 అమెరికా వస్తువులపై 25 % వరకూ అదనపు సుంకాలు విధించింది. స్టీలు, అల్యూమినియంపై అమెరికా విధించిన సుంకాలు కెనడాకు ఎంతో నష్టదాయకం. అమెరికాకు అవసరమైన స్టీలు ఉత్పత్తుల్లో 16 % కెనడా నుంచి దిగుమతి అవుతున్నాయి. కెనడా నుంచి అల్యూమినియం దిగుమతులు కూడా అధికమే. అమెరికా విధించిన వర్తక సుంకాలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కావని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడెవ్ అన్నారు. అమెరికా ప్రపంచ వాణిజ్య సంస్థలో కేసును ఎదుర్కోనాల్సి ఉంటుందని ఐరోపా యూనియన్ ఛైర్మన్ జీన్ క్లాడ్ జంకర్ స్పష్టం చేశారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

భారత్‌పై కన్నెర్ర...

అమెరికా 'ఐకానిక్' మోటార్ సైకిల్ అయిన హార్లీ డేవిడ్సన్‌ను మనదేశం దిగుమతి చేసుకుంటే 100 % దిగుమతి సుంకం చెల్లించాలి. దీన్ని ఉదహరిస్తూ, అమెరికా వస్తువులను దిగుమతి చేసుకోవటానికి భారతదేశం భారీగా పన్నులు విధిస్తోంది, ఇది అమెరికా ప్రయోజనాలకు విరుద్ధం..., మేం కూడా భారత వస్తువులపై పన్నులు విధిస్తాం- అని నిన్నటికి నిన్న ట్రంప్ హెచ్చరించారు. మనదేశం నుంచి అమెరికాకు ఏటా 47.9 బిలియన్ డాలర్ల (1 బిలియన్= రూ. 6,700 కోట్లు) ఎగుమతులు నమోదవుతున్నాయి. అమెరికా నుంచి మనదేశానికి 26.6 బిలియన్ డాలర్ల దిగుమతులు అవుతున్నావు. ఈ నేపథ్యంలో ట్రంప్ వైఖరి మనదేశానికి కూడా ఇబ్బందులు తెచ్చిపెట్టవచ్చు.

ఇవీ ట్రంప్ టారిఫ్‌లు...

- డోనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది ప్రారంభంలో సౌర విద్యుత్తు పలకలు, వాషింగ్ మెషీన్లపై దిగుమతి సుంకాలు విధించారు..
- మూడు నెలల క్రితం చైనాపై 50 బిలియన్ డాలర్ల వర్తక సుంకాలతో విరుచుకుపడ్డారు.
- 'మేధో సంపత్తి హక్కులను ఉల్లంఘిస్తున్న' చైనాపై డబ్ల్యూటీఓ లో కేసు పెట్టే అంశాన్ని పరిశీలించాలని ట్రంప్ తన అధికార్లకు సూచించారు.
- జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చే విధంగా ఐరోపా యూనియన్, కెనడా, మెక్సికో నుంచి స్టీలు దిగుమతులపై 25 %, అల్యూమినియం వస్తువులపై 10 % అదనపు సుంకాలు విధించారు.

వ్యవహారశైలి నైపుణ్యాలపై పోలీసులకు శిక్షణ

- కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్

దిల్లీ: దేశంలో పోలీసులందరికీ.. వ్యవహార్శైలి సంబంధిత నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోలీసు పరిశోధన, అభివృద్ధి బ్యూరో (బీపీఆర్‌డీ)ని కోరారు. జైపుర్, చండీగఢ్‌లలో కేంద్ర శోధన శిక్షణ సంస్థల(సీడీటీఐ) ఏర్పాటు ప్రక్రియ పురోగతిని ఆయన మంగళవారం సమీక్షించారు. జిల్లాస్థాయిలో అందరికీ ఆదర్శంగా నిలుస్తూ.. అసామాన్యంగా పనిచేస్తున్న అధికారులను గుర్తించాలని ఈ సందర్భంగా బీపీఆర్‌డీకి సూచించారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు తగిన నైపుణ్యాలపై కూడా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బీపీఆర్‌డీ కార్యకలాపాలు, భవిష్యత్తు ప్రణాళికలను సంస్థ డైరెక్టర్ జనరల్ ఏపీ మహేశ్వరి మంత్రికి వివరించారు. భోపాల్‌లోని పోలీసు శిక్షణ కేంద్ర అకాడమీ (సీఏపీటీ) వద్ద - నేరస్థుల్లో పరివర్తన తేవడం, ట్రాఫిక్ సాంకేతిక పరిజ్ఞానం, ప్రాసిక్యూషన్ అంశాలపై శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ఈ సందర్భంగా నిర్ణయించారు. అన్ని రకాల శిక్షణలకు ఉద్దేశించి బీపీఆర్‌డీ వెబ్‌పోర్టల్ (ఈ-ఉస్తాద్)ను రూపొందించడం పట్ల హోంమంత్రి అభినందనలు తెలిపారు.

వడ్డీ రాయితీకి వీలుగా ఇళ్ల విస్తీర్ణం 33% పెంపు

దిల్లీ: పట్టణ ప్రాంతాల్లో నిర్మించే ఇళ్లు 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' (పీఎంఏవై) కింద వడ్డీ రాయితీ పొందడానికి అర్హమైన విస్తీర్ణాన్ని 33 % మేర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఎంఐజీ-1 విభాగంలో 120 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేవారికే వడ్డీలో రాయితీ వర్తిస్తుండగా దీనిని 160 చ.మీ.కి పెంచారు. ఎం.ఐ.జి-2 విభాగంలో 150 చ.మీ. నుంచి 200 చ.మీ.కి పెంచారు. 2017 జనవరి 1 నుంచి పథకం అమల్లోకి వచ్చినందువల్ల ఆ తేదీ నుంచి ఈ మార్పులూ వర్తిస్తాయి. పీఎంఏవై కింద ఇంటిని కొనుగోలు చేసినవారు రూ.2.35 లక్షల వరకు రాయితీని పొందేందుకు వీలుంది.

దివ్యాంగులైన మహిళలకు గర్భం రావడం చాలా కష్టం!

హైదరాబాద్: దివ్యాంగులైన మహిళలకు సాధారణ స్త్రీలతో పోలిస్తే గర్భం ధరించే అవకాశాలు చాలా తక్కువ. అంతేకాదు, కుంగుబాటు, మధుమేహం సమస్యలూ వారికి ఎక్కువేనని ఇక్కడి 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్'(ఐఐపీహెచ్) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. సర్వే నివేదికను మంగళవారం నాడిక్కడ విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి (మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, వయోవృద్ధుల విభాగం) ఇక్కడ జరిగిన ఒక వర్క్‌షాపులో ఈ నివేదికను విడుదల చేశారు. ఐఐపీహెచ్, మెల్‌బోర్న్‌లోని 'నొస్సాల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్'లు సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి.

రాష్ట్రపతిగా ప్రణబ్ అనుభవాలను కళ్లకు కట్టనున్న నాలుగో పుస్తకం

దిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో ఉన్న కాలంలో ప్రణబ్ రాజకీయ జీవితాన్ని, అనుభవాలను.... తీసుకున్న నిర్ణయాలను... సంభవించిన పరిణామాలను ఆయన నాలుగో పుస్తకం 'ది ప్రెసిడెన్షియల్ ఇయర్స్' కళ్లకు కట్టనుంది. రాష్ట్రపతిగా ఉన్న రోజుల్లో అరుణాచల్ ప్రదేశ్‌లో అత్యాయక పరిస్థితిని విధింపు, పెద్దనోట్ల రద్దు, మెరుపుదాడులు, ఎన్‌డీఏ సర్కారుతో కొనసాగించిన సంబంధ బాంధవ్యాలను ఈ పుస్తకం సుస్పష్టం చేస్తుంది. పుస్తకాన్ని ప్రచురించిన 'రూప' పబ్లిషర్స్ మంగళవారం ఈ వివరాలను వెల్లడించింది.

పేరుమోసిన మావోయిస్టు అరెస్టు

రాయపూర్: బెంగళూరుకు చెందిన పేరుమోసిన మావోయిస్టు అభయ్‌దేవదాస్ నాయక్ అలియాస్ లోదా(34)ను చత్తీస్‌గఢ్ పోలీసులు పట్టుకున్నారు. నిషిద్ధ మావోయిస్టు సంస్థకు తనను తాను ప్రతినిధిగా ప్రకటించుకున్న అభయ్ దేవదాస్‌ను ఈనెల ఒకటోతేదీన దిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేసినట్లు ఓ అధికారి మంగళవారం నాడిక్కడ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన తమ సిద్ధాంతాల గురించి ప్రచారం చేశారన్న ఆరోపణలున్నాయి.

వాజ్‌పేయీ కోలుకోవాలి: జగన్

ఈనాడు డిజిటల్, అమరావతి: దిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ప్రధాని వాజ్‌పేయీ త్వరగా కోలుకోవాలని ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. 'వాజ్‌పేయీ పూర్తి స్థాయిలో కోలుకోవాలని దేశ ప్రజలతో పాటు నేను కోరుకుంటున్నా..' అని ట్వీట్ చేశారు.

తీవ్రవాదుల దాడుల్లో ఇద్దరు పోలీసుల మృతి

శ్రీనగర్: పుల్వామా, అనంత్‌నాగ్ జిల్లాల్లో తీవ్రవాదులు మంగళవారం తెల్లవారు జామున నిర్వహించిన రెండు వేర్వేరు దాడుల్లో ఇద్దరు పోలీసు సిబ్బంది మరణించారు. 11 మంది గాయపడ్డారు. పుల్వామా జిల్లా కోర్టుల సముదాయం వద్ద ఉన్న పోలీసు పికెట్‌పై తీవ్రవాదులు దాడికి తెగబడి కాల్పులు జరిపారని ఓ అధికారి వెల్లడించారు.

కాంగ్రెస్ ఇఫ్తార్ విందుకు ప్రణబ్, ప్రతిభా పాటిల్

చంద్రబాబు, కేసీఆర్‌లకు అందని ఆహ్వానం!

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దిల్లీలో బుధవారం ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు. ఈ విందుకు మాజీ రాష్ట్రపతులు ప్రణబ్ ముఖర్జీ, ప్రతిభా పాటిల్, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజరయ్యే అవకాశాలున్నాయి. రాహుల్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక కాంగ్రెస్ ఇవ్వనున్న తొలి ఇఫ్తార్ విందు ఇదే కావడం గమనార్హం. భావసారూప్యంగల- భాజపాయేతర పార్టీలన్నింటినీ విందుకు కాంగ్రెస్ ఆహ్వానించినట్లు సమాచారం. తెలంగాణ సీఎం- తెరాస అధినేత కె.చంద్రశేఖర్ రావు, ఆంధ్రప్రదేశ్ సీఎం-తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు, దిల్లీ ముఖ్యమంత్రి-ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌లకు మాత్రం కాంగ్రెస్ నుంచి విందుకు ఆహ్వానం అందలేదని తెలుస్తోంది.

తూనికలు కొలతల శాఖలోకి ఆహార భద్రత విభాగం!

- ఒకటిరెండ్రోజుల్లో ఉత్తర్వులు

ఈనాడు అమరావతి: ఆహారభద్రత(ఫుడ్‌సేఫ్టీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్‌మెడిసిన్(ఐపీఎం)ను వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ(పౌరసరఫరాల) శాఖలో విలీనం దాదాపు ఖరారైంది. ఇందుకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఒకటి రెండ్రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి. పౌరసరఫరాల విభాగమైన తూనికలు కొలతల శాఖలో దీన్ని అనుసంధానం చేయనున్నారు. ఐపీఎంకు ప్రత్యేకాధికారిని నియమించేంతవరకు తూనికలు కొలతల శాఖ నియంత్రణాధికారి(కంట్రోలర్) విభాగాధిపతి(హెచ్ఓడీ)గా వ్యవహరించనున్నారు. ఇప్పటి వరకూ ఐపీఎం వైద్యఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తోంది. ఆహార భద్రతతో పాటు ఆహార నాణ్యత తనిఖీ కూడా ఒకే గొడుకు కింద ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ విలీనం చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రకటించారు. మంగళవారం ఆయన వెలగపూడిలోని సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.

శాటిలైట్ విధానంలో పర్యాటకుల లెక్కింపు

- పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ హిమాన్షుశుక్లా

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రానికొచ్చే పర్యాటకులను లెక్కించేందుకు అనుసరిస్తున్న సంప్రదాయ విధానాలకు రాష్ట్ర పర్యాటక శాఖ ముగింపు పలకనుంది. శాటిలైట్ విధానంలో గణించే సరికొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ హిమాన్షు శుక్లా తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టనున్న శాటిలైట్ అకౌంటింగ్ విధానంపై మంగళవారం విజయవాడలోని పున్నమి రిసార్టులో కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. ఏ కాలంలో ఎక్కువ మంది పర్యాటకులు వస్తున్నారు? వారు ఏం కోరుకుంటున్నారన్న దానిపై తాజా విధానం ద్వారా స్పష్టత వచ్చే అవకాశముందన్నారు. నిర్వహణ లోపాలు గుర్తించి, నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ విధానం తోడ్పడుతుందని చెప్పారు. శాంపిల్ సర్వే ద్వారా స్పష్టమైన గణాంకాలు తెలుసుకోవచ్చని, రాష్ట్ర జీడీపీ వృద్ధికి అవకాశం లభిస్తుందని వివరించారు. నిధుల వినియోగంలో పారదర్శకత, వృథా వ్యయానికి అడ్డుకట్ట పడుతుందన్నారు.

స్వచ్ఛ ఐకానిక్ కేంద్రంగా మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆలయం

ఈనాడు, దిల్లీ: కర్నూలు జిల్లా మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి ఆలయాన్ని స్వచ్ఛ ఐకానిక్ కేంద్రంగా కేంద్రం గుర్తించింది. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా పది నూతన స్వచ్ఛ ఐకానిక్ కేంద్రాలను కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. దీంట్లో ఆంధ్రప్రదేశ్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయం ఒకటి. గత రెండు దశల్లో 20 స్వచ్ఛ ఐకానిక్ కేంద్రాలను ప్రకటించిన కేంద్రం తొలి దశలో తిరుమల శ్రీవారి ఆలయాన్ని ఇలా గుర్తించిన విషయం విదితమే.

రష్యాకు చెందిన ట్రక్కుల తయారీ సంస్థ కమాజ్ రూపొందించిన డ్రైవర్ రహిత ఎలక్ట్రిక్ బస్సు ఇది. మంగళవారం ప్రయోగాత్మకంగా దీన్ని నడిపారు

రెండో రాత్రీ కేజ్రీవాల్ ధర్నా

- దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయంలో కొనసాగుతున్న నిరసన
- ప్రభుత్వ డిమాండ్లను ఆమోదించేవరకూ కదలబోమని పట్టు

దిల్లీ: లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కార్యాలయంలో సోమవారం సాయంత్రం మెరుపు ధర్నాకు దిగిన దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, మంత్రులు... కేంద్రంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధపడ్డారు! ఆయనతో పాటు ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, మంత్రులు గోపాల్‌రాయ్, సత్యేందర్ జైన్‌లు మంగళవారం రాత్రీ ధర్నాను కొనసాగిస్తూనే ఉన్నారు. తమ ప్రభుత్వ డిమాండ్లను ఆమోదించేవరకూ అక్కడి నుంచి కదిలేది లేదని వారు ఎల్జీకి తేల్చిచెప్పారు.

నిరశన వీడేది లేదు..: తమ ప్రభుత్వ డిమాండ్లను కేంద్రం, ఎల్జీలు ఆమోదించాలంటూ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేంద్ర జైన్ మంగళవారం ఉదయం నుంచి ఆమరణ దీక్ష చేపట్టారు. సమ్మె విరమించేలా ఐఏఎస్ అధికారులను ఆదేశించాలనీ; పాలనను అడ్డుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలనీ; రేషన్ సరకులను లబ్ధిదారుల ఇళ్ల వద్ద పంపిణీచేసే ప్రతిపాదనను ఆమోదించాలని సర్కారు డిమాండ్ చేస్తోంది. సోమవారం సాయంత్రం 5.30కు ఎల్జీ కార్యాలయానికి వెళ్లిన కేజ్రీవాల్ బృందం- డిమాండ్లను అంగీకరించాలంటూ అక్కడే మెరుపు సమ్మెకు దిగింది. రాత్రంతా వారు అక్కడే నిద్రచేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను కేజ్రీ విడుదల చేశారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా తమ డిమాండ్లను ఎల్జీ అంగీకరించలేదనీ, అందుకే బైఠాయించాల్సి వచ్చిందని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఎల్జీ కార్యాలయం సమీపంలో పెద్దసంఖ్యలో ఆప్ కార్యకర్తలూ నిరసన క్యాంప్‌ను ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంతంలో పోలీసులు బారికేడ్లను ఏర్పాటుచేశారు. గత ఫిబ్రవరి 19వ తేదీ రాత్రి కేజ్రీవాల్ నివాసంలో దిల్లీ ప్రధాన కార్యదర్శి అన్షుప్రకాశ్‌పై ఆప్ నేతలు దాడి చేశారని ఆరోపణలు వచ్చినప్పట్నుంచి... పలువురు ఐఏఎస్ అధికారులు పాక్షిక సమ్మెను పాటిస్తున్నారు. అయితే, ఎలాంటి కారణం లేకుండానే కేజ్రీవాల్ బైఠాయిస్తున్నారంటూ ఎల్జీ అనిల్‌బైజల్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు... అధికారులెవరూ సమ్మెలో లేరనీ, ప్రభుత్వ కార్యకలాపాలకు ఆటంకమేదీ లేదని అధికారుల సంఘం పేర్కొంది.

లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న దిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితరులు

టెట్ అభ్యర్థులు క్రీడా ప్రతిభా పత్రాలు అప్‌లోడ్ చేయాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: టెట్ వ్యాయామ విద్య అభ్యర్థులు క్రీడల్లో తాము సాధించిన ప్రతిభా పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన ఫార్మాట్‌ను టెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని టెట్ కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి తెలిపారు. అనుబంధ పత్రం 1, 2, 3 గా ఉంటుందని, ఒకటో పత్రానికి 30, రెండో ఫార్మట్‌కు 25, మూడో ఫార్మాట్‌కు 20 మార్కులు ఉంటాయని వివరించారు. వీటిని సంబంధిత సమాఖ్యలు, యూనివర్సిటీల వద్ద ధ్రువీకరణ చేయించుకొని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణకు పోరాటం

- ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక ప్రాతిపదికన 1993 నవంబర్ 25వ తేదీకి ముందు నియమించిన ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసే వరకు పోరాటం ఆగదని ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోరాటంలో భాగంగా ఈ నెల 18న అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులకు 2015 పీఆర్సీ వర్తింప చేస్తూ మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకున్నందుకు, వీఆర్ఏల వేతనాలు పెంచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర వీఆర్ఏల సంఘం అధ్యక్షులు గోపాలరావు, ప్రధాన కార్యదర్శి సుధాకర్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక పారిశ్రామిక రాయితీలివ్వాలి

పారిశ్రామిక విధానంలో వెనుకబడిన వర్గాల వారికి ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని కలిసి విజ్ఞప్తి చేశారు. స్థాపించబోయే పరిశ్రమలకు ఎస్సీ, ఎస్టీల తరహాలోనే విధానాలు ఉండాలి, ప్రత్యేక ఉపప్రణాళిక ద్వారా జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి, పారిశ్రామికవాడల్లో ప్లాట్ల కేటాయింపులో రాయితీలివ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షులు కేసన శంకర్ రావు, ఇతర ప్రతినిధులు ఉన్నారు.

ఆధ్యాత్మిక గురు భయ్యూ మహారాజ్ ఆత్మహత్య

- ఇండోర్‌లో తుపాకీతో కాల్చుకుని మృతి

ఇండోర్: ఆధ్యాత్మిక గురుగా పేరొందిన భయ్యూ మహారాజ్ (50) మంగళవారం ఇండోర్ (మధ్యప్రదేశ్)లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన నివాసంలోని ఓ గదిలో ఆయన తుపాకీతో కాల్చుకున్నట్లు డీఐజీ హెచ్‌సీ మిశ్రా తెలిపారు. భయ్యూ ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందీ.. సమగ్ర దర్యాప్తు అనంతరమే తెలుతుందని ఇండోర్ కలెక్టర్ నిషాంత్ వార్వేడ్ పేర్కొన్నారు. "ఎవరో ఒకరు నా కుటుంబ బాధ్యతలను చేపట్టాలి. తీవ్ర ఒత్తిడి వల్లే నేను వెళ్లిపోతున్నాను.." అని భయ్యూ పేర్కొన్నట్లుగా ఉన్న ఓ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భయ్యూ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో విశేష ప్రజాదరణ పొందారు. ఆయన అసలు పేరు ఉదయ్ సింగ్ దేశ్‌ముఖ్. ఏప్రిల్‌లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఐదుగురు సాధువులకు సహాయ మంత్రి హోదాను ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిలో భయ్యూ ఒకరు కాగా.. ఆ హోదాను ఆయన తిరస్కరించారు. గతంలో అవినీతికి వ్యతిరేకంగా అన్నాహజారే చేపట్టిన నిరాహార దీక్షను విరమింపజేసేందుకు నాటి యూపీయే ప్రభుత్వం భయ్యూనే పంపించింది. ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్వహించిన సద్భావన ఉపవాస దీక్షకు కూడా ఆయనను ఆహ్వానించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవిస్, శరద్ పవార్, ఉద్ధవ్‌ఠాక్రే, రాజ్‌ఠాక్రే, మాజీ రాష్ట్రపతి ప్రతిభాపాటిల్, ప్రముఖ గాయనీమణులు లతా మంగేష్కర్, ఆశా భోంస్లే తదితరులెందరో ఆయనను ఆధ్యాత్మిక గురుగా గౌరవిస్తుంటారు. ఆధ్యాత్మిక గురు కాకముందు భయ్యూ మోడలింగ్‌లో ఉండేవారు. ఆయన మొదటి భార్య మాధవి 2015 నవంబరులో చనిపోగా.. గతేడాది ఏప్రిల్‌లో డాక్టర్ ఆయుషి శర్మను మళ్లీ వివాహం చేసుకున్నారు. ఆ సమయంలోనే నటిగా చెప్పుకొనే ఓ మహిళ తనను భయ్యూ మోసం చేశారంటూ ఆరోపించారు. భయ్యూకు మొదటి భార్యకు పుట్టిన కుమార్తె ఉన్నారు. 2016లో ఆయన రోడ్డు ప్రమాదానికి గురికాగా.. ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్‌భగవత్, ఆనందీబెన్ పటేల్ తదితరులు అప్పట్లో పరామర్శించారు. భయ్యూ మహారాజ్ ఎప్పుడూ మెర్సిడెస్‌లోనే ప్రయాణించేవారు. రోలెక్స్ వాచీ లేకుండా ఆయనను చూడటం అరుదు. ఇండోర్‌లో ఆయనకు విశాలమైన బంగ్లా ఉంది. భయ్యూ ఆత్మహత్యకు పాల్పడటం పట్ల రెండు రాష్ట్రాల్లోని ఆయన అనుచరులంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సంతాపం తెలిపారు.

ప్రపంచకప్ షెడ్యూల్

మ్యాచ్	గ్రూప్	సమయం
జూన్–14		
రష్యా × సౌదీ అరేబియా	ఏ	రా॥ 8.30
జూన్ 15		
ఈజిప్ట్ × ఉరుగ్వే	బి	సా॥ 5.30
మొరాకో × ఇరాన్	బి	రా॥ 8.30
పోర్చుగల్ × స్పెయిన్	బి	రా॥ 11.30
జూన్ 16		
ఫ్రాన్స్ × ఆస్ట్రేలియా	సి	మ॥ 3.30
అర్జెంటీనా × ఐస్‌లాండ్	డి	సా॥ 6.30
పెరూ × డెన్మార్క్	సి	రా॥ 9.30
క్రొయేషియా × నైజీరియా	డి	రా॥ 12.30
జూన్ 17		
కోస్టారికా × సెర్బియా	ఈ	సా॥ 5.30
జర్మనీ × మెక్సికో	ఎఫ్	రా॥ 8.30
బ్రెజిల్ × స్విట్జర్లాండ్	ఈ	రా॥ 11.30
జూన్ 18		
స్వీడన్ × దక్షిణ కొరియా	ఎఫ్	సా॥ 5.30
బెల్జియం × పనామా	జి	రా॥ 8.30
టునీషియా × ఇంగ్లాండ్	జి	రా॥ 11.30
జూన్ 19		
కొలంబియా × జపాన్	హెచ్	సా॥ 5.30
పోలెండ్ × సెనగల్	హెచ్	రా॥ 8.30
రష్యా × ఈజిప్ట్	ఏ	రా॥ 11.30
జూన్ 20		
పోర్చుగల్ × మొరాకో	బి	సా॥ 5.30
ఉరుగ్వే × సౌదీ అరేబియా	ఏ	రా॥ 8.30
ఇరాన్ × స్పెయిన్	బి	రా॥ 7.30
జూన్ 21		
డెన్మార్క్ × ఆస్ట్రేలియా	సి	సా॥ 5.30
ఫ్రాన్స్ × పెరూ	సి	రా॥ 8.30
అర్జెంటీనా × క్రొయేషియా	డి	రా॥ 11.30
జూన్ 22		
బ్రెజిల్ × కోస్టారియా	ఈ	సా॥ 5.30
నైజీరియా × ఐస్‌లాండ్	డి	రా॥ 8.30
సెర్బియా × స్విట్జర్లాండ్	ఈ	రా॥ 11.30
జూన్ 23		
బెల్జియం × టునీషియా	జి	సా॥ 5.30
దక్షిణ కొరియా × మెక్సికో	ఎఫ్	రా॥ 8.30
జర్మనీ × స్వీడన్	ఎఫ్	రా॥ 11.30
జూన్ 24		
ఇంగ్లాండ్ × పనామా	జి	సా॥ 5.30
జపాన్ × సెనగల్	హెచ్	రా॥ 8.30
పోలెండ్ × కొలంబియా	హెచ్	రా॥ 11.30
జూన్ 25		
ఉరుగ్వే × రష్యా	ఏ	రా॥ 7.30
సౌదీ అరేబియా × ఈజిప్ట్	ఏ	రా॥ 7.30
స్పెయిన్ × మొరాకో	బి	రా॥ 11.30
ఇరాన్ × పోర్చుగల్	బి	రా॥ 11.30
జూన్ 26		
ఆస్ట్రేలియా × పెరూ	సి	రా॥ 7.30
డెన్మార్క్ × ఫ్రాన్స్	సి	రా॥ 7.30
నైజీరియా × అర్జెంటీనా	డి	రా॥ 11.30
ఐస్‌లాండ్ × క్రొయేసియా	డి	రా॥ 11.30
జూన్ 27		
దక్షిణ కొరియా × జర్మనీ	ఎఫ్	రా॥ 7.30
మెక్సికో × స్వీడన్	ఎఫ్	రా॥ 7.30
సెర్బియా × బ్రెజిల్	ఈ	రా॥ 11.30
స్విట్జర్లాండ్ × కోస్టారికా	ఈ	రా॥ 11.30
జూన్ 28		
జపాన్ × పోలెండ్	హెచ్	రా॥ 7.30
సెనగల్ × కొలంబియా	హెచ్	రా॥ 7.30
పనామా × టునీషియా	జి	రా॥ 11.30
ఇంగ్లాండ్ × బెల్జియం	జి	రా॥ 11.30

గమనిక: **ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ముందంజ వేస్తాయి. జూన్ 30 నుంచి ప్రి క్వార్టర్‌ఫైనల్స్ (16 జట్ల రౌండ్), జులై 6 నుంచి క్వార్టర్‌ఫైనల్స్ జరుగుతాయి. జులై 10, 11వ తేదీల్లో సెమీఫైనల్స్, 14న మూడో స్థానం కోసం మ్యాచ్ ఉంటాయి. జులై 15న ఫైనల్ జరుగుతుంది.**

ఏ గ్రూప్‌లో ఎవరు

గ్రూప్–ఏ
రష్యా, సౌదీ అరేబియా, ఈజిప్ట్, ఉరుగ్వే
గ్రూప్–బి
పోర్చుగల్, స్పెయిన్, మొరాకో, ఇరాన్
గ్రూప్–సి
ఫ్రాన్స్, పెరూ, డెన్మార్క్, ఆస్ట్రేలియా
డ్రూప్–డి
అర్జెంటీనా, ఐస్‌లాండ్, క్రొయేషియా, నైజీరియా
గ్రూప్–ఈ
బ్రెజిల్, స్విట్జర్లాండ్, కోస్టారికా, సెర్బియా
గ్రూప్–ఎఫ్
జర్మనీ, మెక్సికో, స్వీడన్, దక్షిణ కొరియా
గ్రూప్–జి
బెల్జియం, పనామా, టునీషియా, ఇంగ్లాండ్
గ్రూప్–హెచ్
పోలెండ్, సెనగల్, కొలంబియా, జపాన్

చాంపియన్స్

ఇక గంటలే..

మాస్కో: ఇళ్లల్లో.. వీధుల్లో.. ఎక్కడ చూసినా ఫుట్‌బాల్ సందడే. స్టేడియాలు ముస్తాబయ్యాయి. రష్యా రెడీ అయిపోయింది. జట్లు దిగిపోతున్నాయి.. ప్రపంచం నలువైపుల నుంచి అభిమానులు వాలిపోతున్నారు. ప్రపంచ ఫుట్‌బాల్ సంరంభానికి కౌంట్‌డౌన్ ఇక గంటల్లోనే. ఉత్కంఠతలూగించాలని సూపర్‌స్టార్లు.. గరిష్ఠ వినోదం పొందాలని ప్రేక్షకులు తహతహలాడుతున్నారు. "ఫిఫా ప్రపంచకప్ అంటే.. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు మా దేశానికి వస్తారు. కొంత కాలం ఇక్కడ ఉంటారు. ఈ దేశంపై కొత్త అభిప్రాయంతో వెళ్తారు. రష్యాపై వారి అభిప్రాయం తప్పక మారుతుంది" అని ఓ స్థానికుడు వ్యాఖ్యానించాడు.

భద్రత కట్టుదిట్టం..: ఎలాంటి ఆటంకాలు, అపశ్రుతులు లేకుండా ఫుట్‌బాల్ ప్రపంచకప్‌ను ఘనంగా నిర్వహించి శెభాష్ అనిపించుకోవాలని తహతహలాడుతోంది రష్యా. కానీ ఉగ్రవాదం, గుండాయిజంతో పొంచి ఉన్న ముప్పు ప్రపంచకప్‌పై నీలినీడలను కమ్మేసింది. ఈ నేపథ్యంలో రష్యా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసింది. గగనతల రక్షణ వ్యవస్థను మోహరించింది. ప్రపంచకప్‌కు వస్తున్న అభిమానుల నేపథ్యాన్ని కూడా గట్టిగా తనిఖీ చేస్తోంది. దాడుల భయంతో ప్రమాదకర పదార్థాల శుద్ధి చేసే పరిశ్రమలను వాటి యజమానులు మూసివేశారు. ప్రపంచకప్ మ్యాచ్‌ల చూసేందుకు వచ్చే వివిధ దేశాల అభిమానులు 12 ఆతిథ్య నగరాల్లో ఎక్కడో ఒక చోట పోలీసుల వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. గత ఎనిమిదేళ్లలో రష్యాలో ప్రజా రవాణా వ్యవస్థపై అనేక మానవబాంబు దాడులు జరిగాయి. అనేక ప్రయత్నాలను భగ్నం చేశారు కూడా. ఈ నేపథ్యంలో అత్యంత జాగ్రత్తతో వ్యవహరిస్తోంది.

పెళ్లిపీటలెక్కనున్న హారిక

ఆగస్టు 19న కార్తీక్ చంద్రతో వివాహం

ఈనాడు, హైదరాబాద్: గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక పెళ్ళిపీటలెక్కనుంది. సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి కుటుంబ వ్యాపారం చూసుకుంటున్న కార్తీక్ చంద్రను వివాహం చేసుకోనుంది. ఆగస్టు 19న హారిక, కార్తీక్‌ల వివాహం జరుగనుంది. ఈనెల 18న హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తమ నిశ్చితార్థం జరుగనున్నట్లు హారిక మంగళవారం 'ఈనాడు'తో తెలిపింది.

రష్యన్లకు నవ్వడం నేర్పిస్తున్నారు

మాస్కో: ప్రతిష్ఠాత్మక ఫిఫా ప్రపంచకప్ సంబరాన్ని గొప్పగా నిర్వహించి ప్రపంచానికి తమ సత్తా చాటాలని పట్టుదలతో ఉంది రష్యా. ఇందుకోసం కొన్నేళ్లుగా సన్నద్ధమవుతోంది ఆ దేశం. స్టేడియాల నిర్మాణంతో పాటు ఇతర ఏర్పాట్ల కోసం వేల కోట్లు ఖర్చు చేశారు. ఆటగాళ్లు, అభిమానులకు ఏమాత్రం ఇబ్బంది తలెత్తకుండా అత్యున్నత స్థాయి వసతులు కల్పించడంపై దృష్టిపెట్టారు. అంతటితో ఆగకుండా ప్రపంచకప్ కోసం పని చేసే కార్మికులు, వాలంటీర్లలో సానుకూల దృక్పథాన్ని అలవరిచే ప్రయత్నం చేస్తున్నారు అధికారులు. అతిథులతో మర్యాదపూర్వకంగా ఎలా ప్రవర్తించాలో చెబుతూ.. ఇంగ్లిష్‌లో చక్కటి పదాలు అలవాటు చేస్తున్నారు. ఆహ్లాదకరంగా నవ్వడమూ నేర్పిస్తున్నారు. రష్యా పట్ల ప్రపంచానికి ఉన్న ప్రతికూల అభిప్రాయాన్ని మార్చాలన్న ఉద్దేశం రష్యా అధికారుల్లో బలంగా ఉన్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

బ్రెజిల్ జనాలకు అంత పిచ్చేమీ లేదట

జూరిచ్: బ్రెజిల్ అనగానే ఫుట్‌బాల్ అంటే పడి చచ్చే దేశంగా గుర్తింపుంది. ఫిఫా ప్రపంచకప్ వచ్చిందంటే దేశమంతా సాకర్ జ్వరంతో ఊగిపోతుందంటారు. కానీ ఓ అధ్యయనం ప్రకారం బ్రెజిల్ జనాల్లో ఫుట్‌బాల్ పట్ల ఆసక్తి తగ్గిపోయినట్లు వెల్లడైంది. ప్రపంచకప్ ఆరంభం కాబోతున్న నేపథ్యంలో నీల్సన్ స్పోర్ట్స్ అనే ఓ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో ఫుట్‌బాల్‌పై ఆసక్తి ఎక్కువ ఉందో తెలుసుకునేందుకు అధ్యయనం నిర్వహించింది. ఇందులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అగ్రస్థానంలో నిలవడం విశేషం. ఆ దేశంలో 80 శాతం మంది ఫుట్‌బాల్‌పై ఆసక్తి ఉందని, ప్రపంచకప్ చూస్తామని చెప్పారు. థాయ్‌లాండ్ (78 శాతం) రెండో స్థానంలో ఉంది. చిలీ, పోర్చుగల్, టర్కీ 75 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. బ్రెజిల్‌లో 60 శాతం మంది మాత్రమే ఫుట్‌బాల్ పట్ల ఆసక్తి ఉన్నట్లు చెప్పారు. ఆ దేశం 13వ స్థానంలో ఉంది. 2013 సర్వేలో 72 శాతం బ్రెజిలియన్లు ఈ ఆట పట్ల ఆసక్తిని ప్రదర్శించారు. భారతీయుల్లో ఇంతకు ముందు 30 శాతం మంది మాత్రమే ఆసక్తిని ప్రదర్శించగా.. ఇప్పుడది 45 శాతానికి పెరిగింది.

పీలె, మరడోనా లాంటి దిగ్గజాలు ప్రపంచానికి తామేంటో చాటిచెప్పింది 20 ఏళ్ల లోపే.. అది కూడా తామాడిన తొలి ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లోనే! ఫిఫా మెగా టోర్నీ వచ్చిన ప్రతిసారీ అందరూ అప్పటికే పేరుమోసిన స్టార్ల మీద దృష్టి పెడతారు. ఐతే ప్రతి కప్పులోనూ కొందరు కొత్త కుర్రాళ్లు కూడా తెరమీదికి వస్తాడరు. అద్భుత ప్రదర్శనతో ఆశ్చర్యపరుస్తారు. ఈసారి అలా హీరోలుగా నిలవగలరంటూ విశ్లేషకులు కొందరు కుర్రాళ్ల వైపు చూపిస్తున్నారు. అలాంటి నయా కెరటాలేవో చూద్దామా..

ఇక్కడే పుడతారు

ప్రపంచకప్ కోసం అమెరికన్ల పరుగు!

బెర్లిన్: అమెరికా ఫుట్‌బాల్ జట్టు ఈసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించలేదు. దీనికి తోడు ఆ దేశానికి రష్యాతో ఉన్న వైరం దృష్ట్యా ఆ దేశం ఆతిథ్యమిస్తున్న ప్రపంచకప్ పట్ల అమెరికన్లు ఏమాత్రం ఆసక్తి ప్రదర్శిస్తారో అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ ప్రపంచకప్ చూసేందుకు రష్యా వెళ్తున్న అభిమానుల్లో అమెరికన్లు పెద్ద ఎత్తునే ఉన్నట్లు వెల్లడైంది. అమెరికా నుంచి రష్యాకు వెళ్తున్న ప్రయాణికుల్లో 66 శాతం మంది సాకర్ ప్రపంచకప్ కోసమే బయల్దేరుతున్నట్లు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా ఒక దేశం నుంచి రష్యాకు వెళ్తున్న వారిలో ప్రపంచకప్ వీక్షకుల శాతం అధికంగా ఉన్నది అమెరికాలోనే కావడం విశేషం. ప్రపంచకప్ మొదలయ్యే జూన్ 14 నుంచి ముగిసే జులై 15 మధ్య అమెరికా నుంచి 1,36,503 మంది రష్యాకు వెళ్తున్నారు. ప్రపంచకప్ కారణంగా ఆ దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య 34 శాతం పెరిగినట్లు తేలింది. జర్మనీ నుంచి కూడా రష్యా వెళ్లే ప్రయాణికుల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఇటలీ ప్రపంచకప్‌కు అర్హత సాధించని నేపథ్యంలో ఆ దేశం నుంచి విదేశీ ప్రయాణికుల సంఖ్య 16 శాతం తగ్గినట్లు వెల్లడైంది.

జివా నన్ను మార్చింది

ముంబయి: తన కుమార్తె జివా వ్యక్తిగా తనలో చాలా మార్పులు తీసుకొచ్చిందని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని చెప్పాడు. "తండ్రి అయ్యాక క్రికెటర్‌గా నాలో ఏమైనా మార్పులొచ్చాయో ఏమో తెలియదు. కానీ వ్యక్తిగా మాత్రం మారాను. ఎందుకంటే అమ్మాయిలతో తండ్రులకు సాన్నిహిత్యం చాలా ఎక్కువ" అని ధోని అన్నాడు. జివా పుట్టినపుడు, తర్వాతి రోజుల్లో తనతో ఎక్కువ సమయం గడపలేకపోవడం పట్ల మహి విచారం వ్యక్తం చేశాడు. "సమస్యేంటంటే జివా పుట్టినపుడు నేను తన దగ్గర లేను. తర్వాత కూడా ఎక్కువగా క్రికెట్ ఆడుతూ గడిపాను. దీంతో తను తిండి తిననపుడల్లా 'నువ్వు తినేస్తే నాన్న వస్తాడు' అనడం.. అల్లరి చేస్తుంటే 'నాన్నొస్తాడు ఊరుకో' అని బెదిరించడం చేశారు. దీంతో నన్ను చూడగానే జివా కొంచెం భయపడటం అలవాటు చేసుకుంది' అని చెప్పాడు. ఈసారి ఐపీఎల్ సందర్భంగా జివాతో సమయాన్ని చాలా ఆస్వాదించినట్లు ధోని తెలిపాడు. "ఈ సీజన్ మొత్తం జివా మ్యాచ్‌లకు హాజరైంది. తనను మైదానంలోకి తీసుకెళ్లాలన్నది పెద్ద కోరిక. అది తనకు ఆట స్థలం. జట్టులోని మిగతా సహచరుల పిల్లలూ వచ్చేవాళ్లు. నేను మధ్యాహ్నం 1.30-3 గంటల మధ్య లేచేవాడిని. అప్పటికి పిల్లలతో కలిసి జివా బాగా ఆడుతూ కనిపించేది. వాళ్లను చూస్తూ మేం సేదదీరేవాళ్లం" అని ధోని అన్నాడు.

క్లోజ్ వారసుడు

2017 కాన్ఫెడరేషన్స్ కప్ చూసిన వాళ్లకు టిమో వెర్నర్ గురించి పరిచయం చేయక్కర్లేదు. మైదానంలో పాదరసంలా కదిలే ఈ కుర్రాడు మూడు మెరుపు గోల్స్ సాధించాడు. లీగ్ దశలో రెండు, సెమీఫైనల్లో ఒక కీలక గోల్ కొట్టిన వెర్నర్.. గోల్డెన్ బూట్ అవార్డు కూడా గెలుచుకున్నాడు. జర్మనీ తొలిసారి ఈ కప్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. 21 ఏళ్ల ఈ ఫార్వర్డ్ ప్రపంచకప్‌లోనూ సత్తా చాటుతాడని జర్మనీ ఆశిస్తోంది. అతను జర్మనీ తరపున ఇప్పటిదాకా 12 మ్యాచ్‌ల్లో 7 గోల్స్ సాధించాడు. ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక గోల్స్ కొట్టిన మిరొస్లావ్ క్లోజ్‌కు ఇతనే వారసుడని పండితులు చెబుతున్నారు.

బ్రెజిల్ చమక్

ప్రపంచకప్‌లో ఫేవరెట్ జట్లలో ఒకటిగా బరిలో దిగుతున్న బ్రెజిల్ జట్టులో గాబ్రియెల్ జీసెస్ కీలక ఆటగాడు. 20 ఏళ్ల ఈ ఫార్వర్డ్.. ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్‌లో మాంచెస్టర్ సిటీ జట్టు తరఫున అద్భుతమైన గోల్స్ కొట్టాడు. మొత్తంగా 28 మ్యాచ్‌ల్లో 15 గోల్స్ చేశాడు. బ్రెజిల్ తరఫున 13 మ్యాచ్‌లు ఆడి 8 గోల్స్ సాధించాడు. మైదానంలో అతడి వేగం ఆశ్చర్యపరుస్తుంది. బంతిని నియంత్రించడంలో నైపుణ్యం, సూపర్ ఫినిషింగ్ గాబ్రియెల్‌ను అందరిలో ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

మెస్సికి అతను తోడైతే..

మెస్సి లాంటి ఆల్‌టైం గ్రేట్ ఉన్న జట్టులో మరో ఆటగాడు వెలుగులోకి రావడం కష్టమే. ఐతే 23 ఏళ్ల పాలో దిబాలా.. మెస్సికి దీటైన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. ఈ సీజన్లో ఏడు మ్యాచ్‌లు ఆడి పది గోల్స్ కొట్టి మెస్సిని మించాడు. గోల్స్ కొట్టడంలో అతడిది ప్రత్యేక నైపుణ్యం. మెస్సితో అతడికి చక్కటి సమన్వయం ఉంది. ప్రపంచకప్‌లో ఈ సమన్వయం కొనసాగి.. ఈ స్ట్రైకర్ కూడా అంచనాలకు తగ్గట్లు రాణిస్తే ప్రపంచకప్‌లో అర్జెంటీనా నుంచి ప్రత్యర్థులకు సవాల్ తప్పదు.

ఏడాదిలోనే ఎదిగాడు

ఈసారి ఫ్రాన్స్‌ను ఫేవరెట్లలో ఒకటిగా పరిగణించడానికి కిలియన్ ఎంబాప్ కూడా ఒక కారణం. అతడి వయసు 19 ఏళ్లే. కానీ ఇప్పటికే చాలా పేరు సంపాదించాడు. గత ఏడాది కాలంలో అతను వేగంగా ఎదిగాడు. నిరుడు ఛాంపియన్స్ లీగ్‌లో ఆరు గోల్స్ కొట్టడంతో అతడి పేరు మార్మోగింది. అతడి జోరు చూసి పారిస్ సెయింట్-జర్మన్ క్లబ్ ఏకంగా 180 మిలియన్ల యూరోల బదిలీ ఫీజుతో అతడిని తన క్లబ్బులోకి తీసుకుంది. దీన్ని బట్టే కిలియన్ సామర్థ్యాన్ని అంచనా వేయొచ్చు. తొలి ప్రపంచకప్‌లో ఇతడి విన్యాసాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

క్లబ్‌ల చూపు అతడి వైపు..



ప్రస్తుతం ప్రపంచకప్ ఆడుతున్న కుర్రాళ్లలో అభిమానుల దృష్టిని బాగా ఆకర్షించగలడని భావిస్తున్న ఆటగాడు హిర్వింగ్ లొజానో. 22 ఏళ్ల ఈ మెక్సికో కెరటం.. ఐరోపా ఎరెడ్‌వైజ్ మ్యాచ్‌ల్లో 12 గోల్స్ కొట్టాడు. అంతేకాదు ఏడు సహచరులు సాధించిన ఏడు గోల్స్‌లో తన వంతు పాత్ర పోషించాడు. అతడి ప్రదర్శన చూసి ఐరోపాలోని పెద్ద క్లబ్‌లు చేర్చుకోవడానికి ఆసక్తిని చూపిస్తున్నాయి. ఈసారి ప్రపంచకప్‌లో ఈ కుర్రాడే మెక్సికోను నడిపించగలడని పండితులు భావిస్తున్నారు.

మంగళవారం బెంగళూరులో జరిగిన బీసీసీఐ అవార్డుల కార్యక్రమంలో సతీమణులతో విరాట్ కోహ్లి, దినేశ్ కార్తీక్. 2016-17, 2017-18 సీజన్లకు కోహ్లి ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్‌గా పాలి ఉమ్రిగర్ పురస్కారం అందుకోగా.. మహిళల్లో హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన గత రెండు సీజన్లకు ఉత్తమ క్రికెటర్ల అవార్డుల్ని అందుకున్నారు.

నిలకడగా వాజ్‌పేయీ ఆరోగ్యం

దిల్లీ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఎయిమ్స్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆయన చికిత్సకు స్పందిస్తున్నట్లు వెల్లడించింది. మూత్రనాళం, ఛాతి ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్న ఆయనను సోమవారం ఎయిమ్స్‌కు తరలించిన సంగతి తెలిసిందే. యాంటీబయోటిక్స్ అందిస్తున్నామని.. ఇన్‌ఫెక్షన్లు తగ్గేంతవరకూ ఆయన ఆసుపత్రిలో ఉండాల్సి ఉంటుందని ఎయిమ్స్ పేర్కొంది. కాగా మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, హెచ్‌డీ దేవెగౌడ, ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్, పలువురు కేంద్ర మంత్రులు మంగళవారం పరామర్శించారు. వాజ్‌పేయీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆసుపత్రి గేటు బయట దిల్లీ భాజపా యువమోర్చా హోమం నిర్వహించింది.

'పద్మ' పురస్కారాల కోసం ఇప్పటిదాకా 12 వందల నామినేషన్లు

దిల్లీ: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'పద్మ' పురస్కారాల కోసం ఇప్పటిదాకా 12 వందలకు పైగా నామినేషన్లు అందినట్లు కేంద్ర హోంశాఖ మంగళవారం నాడిక్కడ తెలిపింది. సంబంధిత వెబ్‌సైట్‌లో ఇప్పటిదాకా ఈ దిశగా 1654 రిజిస్ట్రేషన్‌లు నమోదైనాయి. అందులో నుంచి 1207 నామినేషన్లు/సిఫారసుల ప్రక్రియ సంపూర్ణస్థాయిలో పూర్తయినట్లు పేర్కొంది. భారత పౌరులెవరైనా సరే వీటిని దాఖలు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో నామినేషన్ల దాఖలుకు ఈ ఏడాది సెప్టెంబరు 15వ తేదీని తుది గడువుగా నిర్ధారించారు.

మూడు దేశాల్లో పర్యటించనున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

దిల్లీ: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ త్వరలో మూడు దేశాల్లో ఏడు రోజుల పర్యటన నిమిత్తం బైలుదేరనున్నారు. ఈ నెల 16-19 తేదీల్లో ఆయన గ్రీస్‌లో పర్యటిస్తారు. 17వ తేదీన ఆయన అక్కడి చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తారు. అక్కడి భారతీయులు ఇచ్చే విందు కార్యక్రమంలో పాల్గొని వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 18వ తేదీన గ్రీస్ అధ్యక్షుడు ప్రోకోపిస్ పావ్‌లోపోలోస్‌ను కలుసుకుంటారు. 19న ఇక్కడి వివిధ కంపెనీల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న భారత-గ్రీస్ సీఈవోలతో కలిసి ఉదయపు అల్పాహార విందును స్వీకరిస్తారు. జూన్ 19-21 తేదీల్లో కోవింద్ సురినామే (దక్షిణ అమెరికాలోని ఈశాన్య తీర దేశం)లో పర్యటిస్తారు. సురినామేలో భారతీయులు తొలిసారిగా అడుగిడి 145 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కోవింద్ పర్యటనకు రావడం గమనార్హం. 21-22 తేదీల్లో రామ్‌నాథ్ కోవింద్ క్యూబాలో పర్యటిస్తారు.

కొండచరియలు విరిగిపడి 14 మంది రోహింగ్యాల మృతి

ఢాకా: బంగ్లాదేశ్‌లో రోహింగ్యా ముస్లిం శరణార్థుల నివాస శిబిరాలున్న ప్రాంతాల్లో కుండపోత వర్షాల ధాటికి కొండచరియలు విరిగిపడ్డాయి. మంగళవారం ఈ ఘటనల్లో 14 మంది మృత్యువాతపడ్డారు. మరి కొందరు గల్లంతయ్యారు. మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రానికి చెందిన రోహింగ్యా ముస్లింలు అక్కడి ప్రభుత్వ సైనిక చర్యకు భయపడి.. బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్, రంగమతీ జిల్లాలకు పారిపోయి వచ్చిన సంగతి తెలిసిందే. దాదాపు 7లక్షల మంది ఈ జిల్లాల్లో ఆశ్రయం పొందుతున్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

- 'ఈనాడు-ఈటీవీ'తో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి ఊమెన్ చాందీ

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో మూడు నెలల్లో పార్టీని బూత్ స్థాయి వరకు బలోపేతం చేయడం, పార్టీని విడిచి వెళ్లిన నాయకులను, కార్యకర్తలను వెనక్కు తీసుకురావడమే తమ తక్షణ కర్తవ్యమని కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌ఛార్జి, కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ వెల్లడించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడం కష్టమైన పనే అయినా... దీన్ని ఓ సవాల్‌గా స్వీకరించినట్లు తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేకహోదా సహా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్ని, విభజన చట్టంలోని అంశాల్ని తూచ తప్పక అమలు చేస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఆయన మంగళవారం విజయవాడలో 'ఈనాడు-ఈటీవీ'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. భాజపా, నరేంద్రమోదీ కబంధహస్తాల నుంచి లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో భావసారూప్యం గల పార్టీలతో కలిసి పనిచేయాలని కాంగ్రెస్ ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకుందన్నారు. మీరు అనుకుంటున్న భావసారూప్య పార్టీల్లో తెదేపా కూడా ఉందా? ఆ పార్టీతో పొత్తుకి అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు... రాష్ట్రాల్లో పొత్తులపై స్థానిక నాయకులతో చర్చించి నిర్ణయిస్తామని సమాధానమిచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం

ఊమెన్ చాందీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బాలరాజు, రుద్రరాజు, కొండ్రు మురళి, సి.రామచంద్రయ్య, జేడీశీలం తదితరులు

పనితీరుపై ప్రజలు సంతృప్తిగా లేరన్నది వాస్తవమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పుడూ కాంగ్రెస్‌తోనే ఉన్నారని పేర్కొంటూ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి మృతి, రాష్ట్ర విభజన దురదృష్టకర సంఘటనలు అని ఆయన పేర్కొన్నారు.

ఊమెన్ చాందీ ఇంటర్వ్యూ పూర్తి భాగం ఈనాడు.నెట్‌లో

మన ఓట్‌బ్యాంక్‌ను మనం రాబట్టుకోవాలి: కాంగ్రెస్ సంప్రదాయ ఓటుబ్యాంకును తిరిగి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని పలువురు కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడగా కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఊమెన్ చాందీ ఏకీభవించారు. రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీలోని నేతలతో ఆయన మంగళవారం ఆంధ్రరత్న భవన్‌లో ముఖాముఖి నిర్వహించారు. ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డిని బయటకు పంపి ఆయన నేతలతో మాట్లాడారు. 'కాంగ్రెస్ ఓట్లను తీసుకున్న వైకాపా ఇప్పుడు భాజపాతో కలిసి వెళుతోంది...బడుగు బలహీనవర్గాలు కాంగ్రెస్ కుటుంబం...మతతత్వ పార్టీతో వెళుతున్న వైకాపాను వీడి తిరిగివచ్చేలా ఆ వర్గాలు, పార్టీ శ్రేణులకు భరోసా ఇవ్వాలి..' అన్న అభిప్రాయం కూడా వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీకి ఇద్దరు, ముగ్గురు కార్యనిర్వాహక అధ్యక్షులను నియమించడంతో పాటు మూడు జిల్లాలకు ఒకరు చొప్పున ఏఐసీసీ కార్యదర్శులను బాధ్యులుగా నియమించి పార్టీ పునర్నిర్మాణంపై లక్ష్యాలను నిర్దేశించనున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 50-60స్థానాల్లో పోటీ చేయగలమని, అందులో 18 స్థానాల్లో గట్టిపోటీ ఇవ్వగలమని నేతలు చెప్పారు.

కేంద్ర సర్వీసుల్లో ప్రైవేటు వ్యక్తుల నియామకం.. రాజ్యాంగబద్ధ సంస్థ యూపీఎస్సీని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఏపీసీసీ ఆరోపించింది. సంఘ్ పరివార్ భావజాలమున్న వ్యక్తులను కీలకమైన కేంద్ర సంయుక్త కార్యదర్శుల హోదాలో నియమించేందుకు యత్నిస్తోందని మండిపడింది. అఖిల భారత సర్వీసుల అధికారుల స్థానంలో ప్రైవేటు వ్యక్తులను నియమించాలనుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకే ముప్పు అని ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యక్షులు తులసిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు మాట్లాడారు. దేశంలో మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే పరిస్థితి ఉండడం శోచనీయమని ఏపీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రఘువీరా మాట్లాడగా.. రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు ఊమెన్‌చాందీ, ఎంపీ కేవీపీ రామచంద్రరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంచు పర్వతం ఎక్కుతున్న నౌకాదళ బృందం

మెంటాక్ కాంగ్రీ శిఖరంపై నేవీ బృందం

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: తూర్పు నౌకాదళ సాహస బృందం తూర్పు కనుమల్లో 6,250 మీటర్ల ఎత్తులో ఉన్న మెంటాక్ కాంగ్రీ శిఖర అధిరోహణను విజయవంతంగా పూర్తిచేసింది. ఇద్దరు మహిళా అధికారిణులు సహా 11 మంది సభ్యులతో కూడిన ఈ బృందం మే నెలాఖరులో పర్వతారోహణ ప్రారంభించి ఈ నెల 10న శిఖరాన్ని చేరుకుంది.

అదనపు మొత్తాలు ఎలా ఇచ్చారు

హంద్రీనీవా, డెల్టాల ఆధునికీకరణపై ప్రజాపద్దుల కమిటీలో చర్చ

ఈనాడు, అమరావతి: హంద్రీనీవా సుజల స్రవంతి పథకం రెండో దశలో 420వ కిలోమీటరు నుంచి 436వ కిలోమీటరు వరకు చేపట్టిన కాలువ పనుల్లో అదనంగా చెల్లించిన మొత్తాలను ఎందుకు రికవరీ చేయలేదని ప్రజాపద్దుల కమిటీ అధికారులను ప్రశ్నించింది. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశమయింది. భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఆదిమూలపు సురేష్, తదితరులు హాజరయ్యారు. హంద్రీనీవాలో కాలువ మొత్తం పొడవు పని తగ్గినా రూ.55 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులో మొత్తం నిధులు ఎందుకు చెల్లించారని ప్రశ్నించారు. ఈ అంశంపై దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ఆయా ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లు హాజరయ్యారు. హంద్రీనీవా చెల్లింపులపై పలు ప్రశ్నలు కురిపించారు. కృష్ణా డెల్టా ఆధునికీకరణలో రూ.423 కోట్లతో చేపట్టిన పనుల్లో వ్యాట్ కింద రూ.9.27 కోట్లు వసూలు చేయాల్సి ఉన్నా.. ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తేదీల వారీగా వివరాలు కోరగా ప్రస్తుతం ఆ సమాచారమంతా తమవద్ద లేదని, తదుపరి సమావేశానికి తీసుకువస్తామని అధికారులు పేర్కొన్నారు. గోదావరి కరకట్టల నిర్మాణంలో రూ.4.17 కోట్ల అదనపు చెల్లింపులపైనా కమిటీ ప్రశ్నించింది. ఈ అంశంపైనా పూర్తి స్థాయి వివరాలు తర్వాత తెలియజేస్తామని అధికారులు వివరించారు.

శరవేగ '5జీ'కి జపాన్‌లో బాటలు!

- సరికొత్త ట్రాన్సీవర్‌కు రూపకల్పన

టోక్యో: అత్యంత వేగవంతమైన 5జీ కమ్యూనికేషన్ల సాకారానికి జపాన్ శాస్త్రవేత్తలు ఒక కీలక ఆవిష్కారాన్ని చేశారు. అసాధారణ వేగాన్ని, అత్యంత కచ్చితత్వాన్ని సాధించే బుల్లి 28-గిగాహెర్జ్ ట్రాన్సీవర్ (ట్రాన్స్‌మిటర్, రిసీవర్)ను రూపొందించారు.

ఆధునిక సమాజాల్లో వైర్‌లెస్ కమ్యూనికేషన్లకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కొత్తగా రాబోతున్న ఐదో తరం (5జీ) కమ్యూనికేషన్లే ఇందులో సరికొత్త ముందడుగు. ఇందులో 4జీ కన్నా చాలా వేగంగా డేటా ప్రసార రేటు ఉంటుంది. 5జీ కోసం రూపొందించిన అధునాతన ట్రాన్సీవర్లలో చాలావరకూ ఆర్‌ఎఫ్ ఫేజ్ షిఫ్టర్లు ఉన్నాయి. యాంటెన్నాను నిర్దిష్ట దిశకు కేంద్రీకృతం చేయడానికి అవి అవసరం. ఫలితంగా ట్రాన్స్‌మిటర్, రిసీవర్ల మధ్య సంకేతాల మార్పిడి గరిష్ఠ శక్తితో సాగుతుంది. అత్యంత కచ్చితత్వంతో ఫేజ్ షిఫ్టింగ్ జరగడం చాలా ముఖ్యం. అయితే ఆర్‌ఎఫ్ ఫేజ్ షిఫ్టర్లలోని ఇబ్బందుల వల్ల అవి 5జీకి సరిగా ఉపయోగపడవు. దీంతో కెనిచీ ఒకాడా నేతృత్వంలో జపాన్ శాస్త్రవేత్తలు 28-గిగా హెర్జ్ ట్రాన్సీవర్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో లోకల్ ఆసిలేటర్ (ఎల్‌వో) ఫేజ్ షిఫ్టింగ్ ప్రక్రియను అనుసరించారు. బహుళ ఆర్‌ఎఫ్ షిఫ్టర్లను ఉపయోగించడానికి బదులు వారు ఒకే సర్క్యూట్‌ను అభివృద్ధి చేశారు. ఫలితంగా షిఫ్టింగ్ ప్రక్రియలో చాలా నామమాత్రపు తేడాలు ఉంటాయి. ఇది సెకనుకు 10 గిగాబిట్ వేగాన్ని అందుకుందని పరీక్షల్లో తేలింది. 5జీ కోసం రూపొందించిన ఇతర ట్రాన్సీవర్ల సాధించిన వేగం కన్నా ఇది చాలా ఎక్కువ.

బంగ్లాదేశ్‌లో ప్రముఖ రచయిత హత్య

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో లౌకికవాద రచయిత ప్రాణాలను ముష్కరులు బలితీసుకున్నారు. ప్రముఖ రచయిత, పుస్తక ప్రచురణ కర్త షాజహాన్ బచ్చూను గుర్తు తెలియని దుండగులు తుపాకులతో కాల్చిచంపారు. లౌకికవాద సిద్ధాంతాలను షాజహాన్ ప్రచారం చేసేవారు. కవిత్వ ప్రచురణకు పేరుగాంచిన 'బిశాక ప్రొకాషోనీ' అనే సంస్థను ఆయన నడిపేవారు. సోమవారం తన స్వగ్రామంలో స్నేహితులను కలిసేందుకు ఓ ఔషధ దుకాణం వద్దకు ఆయన వెళ్లారు. అక్కడికి నిందితులు రెండు మోటార్ సైకిళ్లపై వచ్చి.. దుకాణం బయట చమురు బాంబును పేల్చి గందరగోళం సృష్టించారు. ఆ తర్వాత షాజహాన్‌ను బయటకు ఈడ్చుకువచ్చి.. కాల్చిచంపారు.

రైల్వే పుస్తక ముఖచిత్రంగా బంట్రోతు గీసిన బొమ్మ

దిల్లీ: నాలుగేళ్లలో సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ రైల్వేశాఖ విడుదల చేసిన ఓ పుస్తకానికి.. ఓ బంట్రోతు గీసిన బొమ్మ ముఖచిత్రంగా ఎంపికైంది. భువనేశ్వర్‌లోని తూర్పు తీర రైల్వే ప్రధాన కార్యాలయంలో బంట్రోతుగా పనిచేస్తున్న 35 ఏళ్ల శ్యామ్‌సుందర్ దీన్ని రూపొందించారు. రైల్వేశాఖలో అంతర్గతంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలతో సుందర్ ప్రతిభ వెలుగులోకి వచ్చింది. రైల్వే సాధించిన విజయాలను నొక్కిచెబుతూ ఆ శాఖ తాజాగా ఓ చిన్న పుస్తకాన్ని ప్రచురించింది. దీని ముఖచిత్రం రూపొందించే బాధ్యతను సుందర్‌కు అప్పగించింది. మహాత్మ గాంధీ 150వ జయంతి స్మారకంగా దీన్ని ఆయన గీశారు. గాంధీ రైలు దిగుతుండగా.. ద్వారం వద్ద కొందరు వ్యక్తులు ఆయనకు స్వాగతం పలుకుతున్నట్లుగా ఈ చిత్రాన్ని వేశారు.

బాబోయ్ లెక్కలు!

దిల్లీ: తమ పిల్లలకు గణితం అత్యంత కష్టమైన సబ్జెక్ట్ అని తలిదండ్రుల్లో కనీసం 89 శాతం మంది అభిప్రాయపడుతున్నారు. అసలు లెక్కల సబ్జెక్ట్‌ను పాఠశాలల్లో సరిగ్గా బోధించడమే లేదన్నది 77 శాతం మంది తలిదండ్రుల అభిప్రాయంగా ఉంది. దాంతో. ఇంటి దగ్గర తామే ట్యూషన్లు పెట్టించాల్సి వస్తోందని పేర్కొన్నారు. 'క్యూ మ్యాథ్' ఈ సర్వేను నిర్వహించింది. ఈ అధ్యయనంలో భాగంగా వెయ్యిమంది తలిదండ్రులను ఇంటర్వ్యూ చేశారు. ఇందులో 81 శాతం తలిదండ్రులు లెక్కల్లో పిల్లల ప్రతిభ అనేది అత్యంత కీలకమైనదని అభిప్రాయపడ్డారు. ప్రాధాన్యతా క్రమంలో సైన్సుది ఆ తర్వాతి స్థానమేనని వారు స్పష్టం చేశారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00



ఈనాడు

విజయవాడ 14-6-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 305 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

సవాళ్లకు సమాధానం

పోలవరం డయాఫ్రం వాల్

పోలవరం ప్రాజెక్టు తొలి ఆలోచన 200 ఏళ్ల కిందటిదే. కరవును తరిమికొట్టడానికి కాటన్ హయాంలోనే ఇక్కడ ప్రాజెక్టు నిర్మించవచ్చనే ప్రతిపాదన ఆయన ఆలోచనల్లో మెరిసింది. క్రమేణా పేర్లు మార్చుకుంటూ పోలవరంగా మారింది. ఇంత చరిత్ర ఉన్న ఈ ఆధునిక దేవాలయానికి 1980లో శంకుస్థాపన జరిగినా ఎన్నో అభ్యంతరాలు... మరెన్నో అడ్డంకులు... లెక్కలేనన్ని సమస్యలు. ఇలాంటి పరిస్థితుల్లో దశాబ్దాల కల సాకారమవుతున్న క్రమంలో పోలవరం ఇటీవల ఒక ముఖ్య మైలురాయిని దాటింది. అది ఇలాంటి, అలాంటి మైలురాయి కానేకాదు. పోలవరం వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి సాంకేతికంగా ఏ సమస్య ఉందని గుర్తించి 1940 దశకంలో 'అబ్బే సాధ్యం కాదు' అని చెప్పారో ఆ సవాల్‌ను డయాఫ్రం వాల్ (నీటి ఊట నియంత్రణ గోడ) రూపంలో అధిగమించినట్లయింది. ఇంత కీలకమైన నిర్మాణం ఎన్ని రోజుల్లో.. ఎలా నిర్మించారు? ఇందులో ఏది సవాల్? ఈ నిర్మాణం ఎక్కడుంటుంది? దాని ఫలితం ఏమిటి అన్న సమగ్ర కథనం 11లో

రమ్మంటోంది రష్యా

నేటి నుంచే ప్రపంచ ఫుట్‌బాల్ సంబరం

నిరీక్షణిక ఎంతో సేపు లేదు. విశ్వవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులు ఉత్కంఠగా, ఉత్సాహంగా ఎదురు చూస్తున్న ఆ రోజు రానే వచ్చింది.

32 రోజులు.. 32 జట్లు.. 64 మ్యాచ్‌లు. రసవత్తర పోరాటాలతో రక్తికట్టేంచేందుకు, నరాలు ఉత్కంఠతో ఉర్రూతలూగించేందుకు అతి పెద్ద గోల్స్ పండగ వచ్చేసింది. అంతులేని వినోదాన్ని హామీ ఇస్తూ రష్యా రమ్మంటోంది. నేటి నుంచే కిక్కిచ్చే ఫుట్‌బాల్ ప్రపంచకప్. ఓ రొనాల్డో.. ఓ మెస్సి.. ఓ నెయ్‌మార్.. ఇలా ఎందరో స్టార్లు మంత్రముగ్ధమైన ఆటతో మైదానంలో మంటలు పుట్టించేందుకు సిద్ధమైపోయారు. ఆ అద్భుతమైన విన్యాసాలను వీక్షించేందుకు, అసాధారణ నైపుణ్యాన్ని ఆస్వాదించేందుకు మీరూ సిద్ధమైపోండి. ఐదుసార్లు జగజ్జేత బ్రెజిల్, సూపర్ ఫామ్‌లో ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ, మాజీ విజేతలు స్పెయిన్, అర్జెంటీనా ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నాయి. గురువారం ఆతిథ్య రష్యా, సౌదీ అరేబియా మధ్య గ్రూప్-ఏ మ్యాచ్‌తో ప్రపంచ సమరం ఆరంభమవుతుంది.

- వివరాలు ఛాంపియన్‌లో

కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నెలకొల్పాలనుకున్న ప్రాంతం

కడప ఉక్కు సాధ్యం కాదు

బయ్యారంలోనూ కర్మాగారం ఏర్పాటు కుదరదు

- ఆ విషయం ఎప్పుడో చెప్పాం
- సాధ్యాసాధ్యాలు పరిశీలించాలనే చట్టంలో ఉంది
- వెనకబడిన జిల్లాకు పన్ను మినహాయింపులు చేర్చాం
- సుప్రీంలో కేంద్రం అఫిడవిట్

ఈనాడు, దిల్లీ: తెలుగురాష్ట్రాల ఆశలపై కేంద్రం నీళ్లు చల్లింది. కడప, ఖమ్మం జిల్లాల్లో ఉక్కు కర్మాగారాలు సాధ్యం కాదని ఎప్పుడో చెప్పామని స్పష్టం చేసింది. విభజన చట్టంలోని హామీల అమలు జాప్యం అవుతోందని తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌కు కేంద్ర ఉక్కు, ఆదాయపన్ను శాఖలు ఇటీవల కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాయి. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని షెడ్యూలు 13లో ఆంధ్రప్రదేశ్‌లోని కడప, తెలంగాణలోని బయ్యారంలో ఉక్కు కర్మాగారాల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిశీలించాలని ఉందని పేర్కొంది. అపాయింటెడ్ డేట్ 2.6.2014 నుంచి 6 నెలలులోగా నివేదిక ఇవ్వాల్సి ఉందని తెలిపింది. 2.12.2014న సెయిల్ ఇచ్చిన నివేదికలో ఆయా ప్రాంతాల్లో ఉక్కు కర్మాగారాల ఏర్పాటు ఆర్థికంగా సాధ్యం కాదని వెల్లడించింది. అనంతరం 19.10.2016లో కేంద్ర (మిగతా 2లో)

ఇక రియల్ అభివృద్ధి!

- రాజధానిలో స్థిరాస్తి, నిర్మాణ కంపెనీలకు భూములు
- స్థలాల కేటాయింపు, రాయితీలపై ప్రత్యేక విధానం
- అగ్రశ్రేణి సంస్థల యజమానులు, ప్రతినిధులతో సీఎం సమావేశం
- ప్రతి సంస్థా కనీసం ఒక ఐకానిక్ ప్రాజెక్టు చేపట్టాలని సూచన
- పారదర్శకంగా కేటాయింపులు ఉంటాయని స్పష్టీకరణ

ఈనాడు అమరావతి: దేశంలోని అగ్రశ్రేణి స్థిరాస్తి, నిర్మాణ సంస్థలు రాజధాని అమరావతిలో వివిధ ప్రాజెక్టులు చేపట్టేందుకు అవసరమైన ఒక విధానాన్ని ప్రభుత్వం రూపొందించనుంది. ఆయా సంస్థలకు భూముల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన, రాయితీల వంటి అంశాలన్నీ ఇందులో ఉంటాయి. ఈ విధానంలోనే రాజధానిలో పెద్ద ఎత్తున ప్రైవేటు గృహ నిర్మాణం, కార్యాలయాలు, ఇతర నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆయా సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయించనుంది. భూములు ఎంత ధరకు, ఏ ప్రాతిపదికన ఇవ్వాలి వంటి అంశాలపై ఆయా సంస్థల నుంచి సలహాలు తీసుకుని మార్గదర్శకాలను రూపొందించనుంది. వాటిపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాక విధాన ప్రకటన విడుదలవుతుంది. దేశంలోని ప్రముఖ (మిగతా 2లో)

సచివాలయంలో నిర్వహించిన సీఆర్‌డీఏ సమావేశంలో ప్రముఖ స్థిరాస్తి, నిర్మాణ రంగ సంస్థల యజమానులు, ప్రతినిధులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గోదావరి, పెన్నా తొలిదశకు శ్రీకారం

- రూ.6020.15 కోట్లకు పాలనామోదం
- గుంటూరు, ప్రకాశం జిల్లాలకు మేలు
- త్వరలో టెండర్ల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: గోదావరి, పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలి దశ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రూ. 6020.15 కోట్ల పనులకు పాలానామోదం తెలుపుతూ జల వనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. వెంటనే టెండర్లు పిలిచి పనులను గుత్తేదారుకు అప్పగించనున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా గోదావరిలో వరద (మిగతా 2లో)

ఆశలు సమాధులైతే!

- కడప ఉక్కుపై కేంద్రం నీళ్లు చల్లడంతో సర్వత్రా అసంతృప్తి

'ఉక్కు' సాధనకు ఆమరణ నిరాహార దీక్ష

రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ప్రకటన 2లో

పెద్దలకు మనోవర్తిపై పరిమితి తొలగింపు

- కుటుంబ సభ్యుల నిర్వచనంలో కోడళ్లు, అల్లుళ్లు
- సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ ప్రతిపాదన 16లో

పాక్ కాల్పులకు నలుగురు జవాన్లు బలి

మృతుల్లో బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ హోదా అధికారి 16లో

కుమారస్వామికి మోదీ ఫిట్‌నెస్ సవాల్

ప్రధాని వ్యాయామాల వీడియో విడుదల 2లో

ఇదీ సంగతి!




విరాట్ కోహ్లీ విసిరిన ఫిట్‌నెస్ ఛాలెంజ్‌కు స్పందిస్తూ ప్రధాని మోదీ ట్వీట్ చేసిన వీడియోలోని చిత్రాలు

కుమారస్వామికి మోదీ ఫిట్‌నెస్ సవాల్

● ప్రధాని వ్యాయామాల వీడియో విడుదల

దిల్లీ/ బెంగళూరు: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామికి దేహదారుఢ్య (ఫిట్‌నెస్) సవాల్ చేశారు. భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ నెల రోజుల క్రితం ప్రధానికి ఈ సవాల్ చేసిన సంగతి తెలిసిందే. దాన్ని అంగీకరిస్తూ.. త్వరలోనే తన ఫిట్‌నెస్ వీడియోను పోస్టు చేస్తానంటూ మోదీ జవాబిచ్చారు. ఈమేరకు బుధవారం ఉదయం వీడియోను ట్విట్టర్‌లో ఉంచారు. గంటన్నర నిడివి ఉన్న వీడియోలో ప్రధాని నల్లటి జాగింగ్ దుస్తులతో యోగా, కసరత్తులు చేస్తూ ఉల్లాసంగా కనిపించారు. చెట్టు చుట్టూ వలయాకారపు బాటపైన, మైదానంలోనూ వివిధ రీతుల్లో నడుస్తూ.. ఓ రాయిపై కూర్చుని ధ్యానం చేస్తూ వీడియోలో కనిపించారు. ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రితో పాటు టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి మణికా బత్రాలతో పాటు 40 ఏళ్లు పైబడిన ఐపీఎస్ అధికారులందరికీ ప్రధాని దేహ దారుఢ్య సవాల్‌ను విసిరారు. "నేను యోగా చేయడంతో పాటు.. పంచ భూతాలైన నేల, నీరు, అగ్ని, గాలి, ఆకాశం నుంచి స్ఫూర్తి పొందుతూ ట్రాక్‌పై నడుస్తున్నాను. దీంతో నేను ఎంతో ఉత్తేజాన్ని, ఆహ్లాదాన్ని పొందుతున్నాను.." అని ప్రధాని పేర్కొన్నారు.

రాష్ట్ర ఫిట్‌నెస్ నాకు ముఖ్యం: కుమారస్వామి

ప్రధాని చేసిన దేహదారుఢ్య సవాల్‌కు కర్ణాటక ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. "నా ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తున్నందుకు కృతజ్ఞతలు. దేహదారుఢ్యం చాలా ముఖ్యమని నేను నమ్ముతున్నాను. యోగా, ట్రెడ్‌మిల్ నా దైనందిన కార్యక్రమాల్లో భాగం. అయితే నా రాష్ట్ర ఫిట్‌నెస్ అభివృద్ధి గురించే ఎక్కువ ఆలోచిస్తున్నాను. ఇందుకు మీ సహకారం కోరుతున్నాను." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

గోదావరి, పెన్నా తొలిదశకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రవాహాలుండే 120 రోజుల్లో దాదాపు 73 టీఎంసీల నీళ్లను కృష్ణా నదికి తెచ్చి అక్కడి నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువకు అందిస్తారు. ఈ పథకం 9.61 లక్షల ఎకరాల ప్రస్తుత ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడుతుంది. మరో లక్ష ఎకరాల ఆయకట్టుకు కొత్తగా నీరందిస్తుంది. గుంటూరు, ప్రకాశం జిల్లాల తాగు, పారిశ్రామిక నీటి అవసరాలనూ తీరుస్తుంది.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా...

● ప్రస్తుతం గోదావరిపై చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో ఉంది. ఆ చెంతనే పట్టిసీమ ఎత్తిపోతల నిర్మించారు. ఈ రెండింటి నుంచి 7000 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను అదనంగా ఎత్తిపోస్తారు. ఆ నీటిని పట్టిసీమ నీటితో కలిపి పోలవరం కుడి ప్రధాన కాలువ మీదుగా మళ్లిస్తారు. పోలవరం కుడి కాలువ సామర్థ్యం ఇందుకు సరిపోతుంది. ఈ నీటిని కృష్ణా నదికి మళ్లిస్తారు.

● ప్రకాశం బ్యారేజీకి ఎగువన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురం నుంచి ఈ నీటిని ఎత్తిపోతల ద్వారా మళ్లిస్తారు. కృష్ణా నది కుడిగట్టుపై నుంచి ఈ ఎత్తిపోతల ప్రారంభమవుతుంది.

● అక్కడి నుంచి నాగార్జున సాగర్ జవహర్ కాలువ (కుడి కాలువ) 80వ కిలోమీటరు వరకూ మొత్తం 5చోట్ల నీటిని ఎత్తిపోసేలా పంపుహౌస్‌లు నిర్మించి నీటిని తీసుకువెళ్తారు. దాదాపు 148.68 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసి కాలువలోకి వదులుతారు.

● 10.09 కిలోమీటర్ల మేర పైపులైను ద్వారా నీరు మళ్లిస్తారు. వివిధ దశల్లో 56.5 కిలోమీటర్ల మేర గ్రావిటీ కాలువ తవ్వుతారు.

ఆశలు సమాధులైతే!

● కడప ఉక్కుపై కేంద్రం నీళ్లు చల్లడంతో సర్వత్రా అసంతృప్తి

ఈనాడు, అమరావతి, కడప: కడప జిల్లా హక్కుగా పేరొందిన ఉక్కు పరిశ్రమపై ఆశలు ఆవిరయ్యాయి. కేంద్రం నిర్ణయంపై అన్ని వర్గాల ప్రజల నుంచీ తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. విభజన చట్టంలో పేర్కొన్న హామీని అమలు చేస్తామని ఏళ్ల తరబడి కాలయాపన చేసి, ఎట్టకేలకు దానిని పాడె క్కించారంటూ కడప జిల్లా వాసులు మండిపడుతున్నారు. ఒకానొక దశలో ఉక్కు పరిశ్రమ సాధిస్తున్నామంటూ తెదేపా చెప్పగా.. చివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పొత్తు కొండెక్కడం సమస్యగా మారింది. ఈ విషయమై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 'ఈనాడు'తో మాట్లాడుతూ.. కమిటీలతో కాలయాపన చేసి చివరకు కేంద్రం కడపకు మొండి చెయ్యి చూపిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రం నిర్ణయం దగా చేయడమేనని, తెదేపా దీనిపై పోరాటానికి దిగుతుందని స్పష్టం చేశారు.

తొలుత కాదన్నారు!

ఏడాదికి 3 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అనుకూలం (వయబుల్) కాదని పేర్కొంటూ సెయిల్ 2015 జూన్ 17న కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు సాధ్యాసాధ్యాల నివేదిక ఇచ్చింది. దీన్ని పునఃపరిశీలించేందుకు.. 2015 ఆగస్టు 4న కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యదళ బృందాన్ని పునఃనియమించింది. మార్కెట్ పరిణామాలు ఎంత మాత్రమూ అనుకూలంగా లేవని, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు నిర్ణయం ఏ కోణంలోనూ సరైనది కాదని పునరుద్ఘాటిస్తూ 2016 మే, జూన్ నెలల్లో ఈ బృందం కేంద్రానికి నివేదిక సమర్పించింది. ఇదే విషయాన్ని జులై 19న కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలిపింది.

మరో కార్యదళం ఏర్పాటు!

సాధ్యాసాధ్యాల పునఃపరిశీలనకు 2016 డిసెంబరు 7న కేంద్రం మరోమారు కార్యదళ బృందాన్ని పునః నియమించింది. కేపీఎంజీ సహకారంతో మెకాన్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపైన అధ్యయనం చేయాలని, రాష్ట్రంలోని ఇనుప ఖనిజ నిక్షేపాల లభ్యత వివరాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్ధరించాలని కార్యదళ బృందం సమావేశంలో నిర్ణయించారు. పరిశ్రమ ఏర్పాటు అనుకూలమయ్యేందుకు (వయబుల్) వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిశ్రమకు పలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని తీర్మానించారు. 2017 డిసెంబరు 27న జరిగిన సమావేశంలో చర్చించిన దాని ప్రకారం నలుగురు సభ్యుల కార్యదళ బృందం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించింది. మెకాన్ సంస్థ ప్రతినిధుల బృందం అనంతపురం జిల్లాలో ఇనుప ఖనిజాలున్న ప్రాంతాల్ని, పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించిన కడప జిల్లాలో కంబలదిన్నె, కోపర్తి ప్రాంతాల్ని సందర్శించింది.

మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చినా!

ఈ ఏడాది జనవరి 6న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారుల బృందంతో మెకాన్ సంస్థ ప్రతినిధులు మరోమారు భేటీ అయి పరిశ్రమ ఏర్పాటుపై పలు అంచనాలతో కూడిన ప్రతిపాదనలను వివరించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వమూ అంగీకారం తెలిపింది. ఆ వివరాలను జనవరి 12న మెకాన్‌కు పంపించింది. వాటిని పరిగణనలోకి తీసుకుని ఫిబ్రవరి 14న మెకాన్ సంస్థ కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు పరిశ్రమ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాల నివేదికను సమర్పించింది. మార్చి 15న పార్లమెంటులోని తన కార్యాలయంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నిర్వహించిన సమావేశంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి బీరేంద్రసింగ్ మాట్లాడుతూ.. మెకాన్ సంస్థ నివేదిక ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు.

2017 డిసెంబరు 27న జరిగిన చివరి సమావేశంలో మెకాన్ సంస్థ ఇచ్చిన సాధ్యాసాధ్యాల ప్రాథమిక నివేదికలోని ప్రధానాంశాలు..

● అనంతపురం జిల్లాలో లభ్యమయ్యే 110 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిక్షేపాలు ఉక్కు పరిశ్రమను 15 ఏళ్ల నుంచి 20 ఏళ్ల పాటు నిర్వహించేందుకు సరిపోతాయి.

● ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఆ ఖనిజ నిక్షేపాలను పూర్తిగా ఆ సంస్థకే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలి.

● ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేస్తే ఖనిజ నిక్షేపాల కేటాయింపునకు నిర్దుష్టమైన విధానాన్ని అవలంభించాలి. గనులు, ఖనిజ నిక్షేపాల చట్టం ప్రకారం ఎక్కువ శాతం ఖనిజ నిక్షేపాలను వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకే కేటాయించాలి.

● ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో కూడిన ఉమ్మడి సంస్థ (జాయింట్ వెంచర్ కంపెనీ) ద్వారా ఏర్పాటు చేస్తే అందులో 74 శాతం వాటా ప్రభుత్వ రంగ సంస్థకే ఉండేలా చూడాలి

● లభ్యమయ్యే ఇనుప ఖనిజం నాణ్యత (ఎఫ్‌ఈ కంటెంట్) 58.5 శాతం ఉందని మెకాన్ నివేదిక చెప్పగా.. అది 60 శాతంపైనే ఉంటుందని పునః పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం మెకాన్‌ను కోరింది.

'కడప ఉక్కు' సాధనకు ఆమరణ నిరాహార దీక్ష

● తెదేపా రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ప్రకటన

● ఉనికి చాటుకునేందుకే కన్నా విమర్శలని మండిపాటు

ఈనాడు, దిల్లీ: కడప ఉక్కు కర్మాగారం సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెదేపా రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ప్రకటించారు. దిల్లీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం ఉక్కు కర్మాగారం విషయమై ఆ శాఖ పరిధిలో సమావేశం నిర్వహించారని, ఆ భేటీలో సానుకూలత వ్యక్తం కానట్లు రాష్ట్ర అధికారులు తెలిపారని పేర్కొన్నారు. ఈ అంశంపై ఈ నెల 17, 18 తేదీల్లో ప్రధాని మోదీని సమయం కోరానని చెప్పారు. ఆయన అవకాశం ఇస్తే.. ఉక్కు కర్మాగారం నెలకొల్పాల్సిన అవసరాన్ని తెలియజేస్తానన్నారు. ఆశించిన స్పందన లేకపోతే కడప జిల్లాలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ఎంపీ రమేశ్ చెప్పారు. కర్ణాటకకు చెందిన ముగ్గురు ఎంపీల రాజీనామాలు స్థానికంగా లేకున్నా వెంటనే ఆమోదించిన స్పీకర్.. వైకాపా ఎంపీలు ఏప్రిల్ ఆరున చేసిన రాజీనామాలను ఆమోదించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనిని బట్టే వైకాపా ఎంపీల రాజీనామాలు డ్రామాలని అందరికీ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. త్వరలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ఎన్నిక ఉందని అందులో తెదేపా సత్తా చూపిస్తామన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణకు రాష్ట్రంలో పనులు కావట్లేదని బాధ ఉన్నా.. ఆ పార్టీ అధ్యక్షుడిగా ఉనికి చాటుకునేందుకు విమర్శలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మేలు జరిగితే చంద్రబాబుకు పేరు వస్తుందన్న భయంతో కేంద్రం పనులు చేయడం లేదని సీఎం రమేశ్ ఆరోపించారు.

కడప ఉక్కు సాధ్యం కాదు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రతినిధులు, సెయిల్, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మెకాన్ లిమిటెడ్ కలిసి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని, సాధ్యాసాధ్యాలపై మరోసారి పరిశీలించి ఆయా రాష్ట్రాల్లో ఉక్కు పరిశ్రమల ఏర్పాటుకు రోడ్ మ్యాప్ రూపొందించాలని సూచించామని వివరించింది. 27.12.2017న చివరి సమావేశం నిర్వహించగా మెకాన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వాలు సాధ్యాసాధ్యాలపై సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని సూచించాం. ఇంతకుమించి అదనంగా కోర్టుకు అందించడానికి ఎలాంటి సమాచారం లేదని ఉక్కుశాఖ స్పష్టం చేసింది.

పన్ను మినహాయింపులు 35 శాతానికి పెంచాం

ఆదాయ పన్ను చట్టం, 1961 (43 ఆఫ్ 1961)లోని సెక్షన్ 32 సవరించి సెక్షన్ 32 డీ చేర్చామని అఫిడవిట్‌లో పేర్కొంది. దీంట్లో తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలు... ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు పన్ను మినహాయింపులు చేర్చామని వివరించింది. ఏప్రిల్ 1, 2015 నుంచి మార్చి 31, 2020 వరకు ఆయా రాష్ట్రాల్లో గుర్తించిన వెనకబడిన జిల్లాల్లో పన్ను మినహాయింపు 20 నుంచి 35 శాతానికి పెంచామని తెలిపింది. అదనపు పెట్టుబడి భత్యం 15శాతం ప్రకటించామని ఆదాయపన్ను శాఖ పేర్కొంది.

ఇప్పుడేమంటారు?

మంత్రి అమర్‌నాథరెడ్డి

ఈనాడు, అమరావతి: గత సార్వత్రిక ఎన్నికల్లో విభజన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన భాజపా ఇప్పుడు రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయలేమని కేంద్రం సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేయడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. విభజన హామీల్లో ఉక్కు ఫ్యాక్టరీ ఒకటైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని దెబ్బ తీసేందుకే కేంద్రం ఈ నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని చెబుతున్న రాష్ట్ర భాజపా నాయకులు దీనికి ఏం సమాధానం చెబుతారని మంత్రి ప్రశ్నించారు.

నేటి నుంచి కడప జిల్లాలో నిరసనలు: మంత్రి సోమిరెడ్డి

ఈనాడు డిజిటల్, అమరావతి: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని సుప్రీం కోర్టులో కేంద్ర ప్రభుత్వం ప్రమాణపత్రం దాఖలు చేయడాన్ని నిరసిస్తూ కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తెదేపా నిర్ణయించింది. గురువారం జిల్లావ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఉండవల్లిలోని సీఎం నివాసం సమీపంలో విలేకరులతో మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని వెల్లడించడం దుర్మార్గమన్నారు. కడప జిల్లాకు అన్యాయం జరుగుతుంటే వైకాపా అధినేత కనీసం నోరుమెదపడం లేదని మండిపడ్డారు.

(మొదటి పేజీ తరువాయి)

ఇక రియల్ అభివృద్ధి!

స్థిరాస్తి, నిర్మాణ రంగ సంస్థల యజమానులు, ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం సచివాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొదట సీఆర్‌డీఏ కమిషనరు చెరుకూరి శ్రీధర్ రాజధానిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి మాట్లాడారు. 'దేశంలోని అగ్రశ్రేణి సంస్థలన్నీ రాజధానిలో కనీసం ఒక్కో ప్రాజెక్టు చేపట్టాలి. మీరు చేపట్టే ప్రాజెక్టు రాజధానికి తలమానికంగా ఉండాలి. వాటిని చూసేందుకే ప్రజలు రాజధానికి వచ్చేలా ఉండాలి. అమరావతిని అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు మీ సలహాలు, సూచనలివ్వండి. మహానగర నిర్మాణంలో మీరూ పాలుపంచుకోండి' అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారితో పేర్కొన్నారు. భూముల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని, ఎవరూ తప్పు పట్టకుండా, కోర్టుల జోక్యానికి అవకాశం లేకుండా... అందరికీ ఏకరూప విధానాన్ని అనుసరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కువ అర్హతలు ఎవరికి ఉంటే వారికే భూములు కేటాయిస్తామని తెలిపారు. 'అమరావతికి 20 నుంచి 22 కి.మీ. నదీతీరం ఉంది. వైకుంఠపురం వద్ద మరో బ్యారేజీ నిర్మిస్తున్నాం. స్వచ్ఛమైన నీటికి కొరత లేదు. కృష్ణా నదిలో 2వేల ఎకరాల విస్తీర్ణం కలిగిన ఏడు దీవులున్నాయి. వాటినీ పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేయవచ్చు. దేశంలోని 10 అగ్ర శ్రేణి స్థిరాస్తి, నిర్మాణ సంస్థలు వచ్చి ఇక్కడ మొదట ప్రాజెక్టులు చేపట్టాలన్నది నా అభిమతం. మీ ఆలోచనలు చెప్పండి. నేను అమలు చేస్తా' అని తెలిపారు. 'గతంలో హైదరాబాద్‌లో రహేజా మైండ్ స్పేస్ ప్రాజెక్టుకు 100 ఎకరాలు కేటాయించినప్పుడు ఎకరానికి వెయ్యి ఉద్యోగాల చొప్పున రావాలని షరతు పెట్టా. అమరావతిలోనూ మా లక్ష్యం అదే' అని ముఖ్యమంత్రి వివరించారు.

● 'మేం 2 లక్షల చ.అడుగుల ఐటీ స్పేస్ నిర్మిస్తాం. ఐటీ కంపెనీలను ప్రోత్సహించడానికి ప్రస్తుతం మీరు అద్దెలో 50 శాతం రాయితీ ఇస్తున్నారు. దానికి బదులు ఐదేళ్లపాటు ఉచితంగా ఐటీ కంపెనీలకు ఆఫీస్ స్పేస్ ఇవ్వండి. అది ఆకర్షణీయంగా ఉంటుంది. 25వేల నుంచి 30వేల ఐటీ ఉద్యోగులు వస్తే నగరం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది' అని ఒక నిర్మాణ సంస్థ ప్రతినిధి సూచించగా... పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

'రాజధాని రైతులకు సీఆర్‌డీఏ స్థలాలిచ్చింది. కొందరు రైతుల నుంచి ఆ స్థలాలను సమీకరించి ఒక పెద్ద ప్రాజెక్టు చేపట్టవచ్చు. ఈ సమీకరణలో సీఆర్‌డీఏ తోడ్పాటునందించాలి' అని మరొకరు ప్రతిపాదించారు. ఈ మైక్రోపూలింగ్ ఆలోచన బాగానే ఉందని సీఎం పేర్కొన్నారు.

● ఐటీ ఉద్యోగాలు రావాలంటే సామాజిక మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, గృహ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టాలని, అమరావతికి అనుసంధానత పెరగాలని కొందరు ప్రతినిధులు పేర్కొన్నారు. విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలకు సమాన దూరంలో ఉండటం అమరావతికి కలిసి వచ్చే అంశమని, ఆయా నగరాలతో అమరావతిని అనుసంధానించేందుకు అవసరమైన ప్రాజెక్టులు చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు.

● 50 నుంచి 100 ఎకరాల్లో బహుళ ప్రయోజనకర ప్రాజెక్టులు (మల్టీ యూజ్) చేపట్టేందుకు బిల్డర్లకు అవకాశమివ్వాలన్న సూచన వచ్చింది. ఒక భారీ భవనం నిర్మిస్తే... అందులో కింద కమర్షియల్, మధ్యలో కార్యాలయాలు, పైన నివాస అవసరాలకు వినియోగించుకునేందుకు అవకాశమివ్వాలని, అప్పుడు ఎలాంటి నిబంధనలు వర్తిస్తాయన్న విషయంలో స్పష్టత ఇవ్వాలని కొందరు కోరారు.

● తమకు కేటాయించే భూముల ధరను వాయిదాల విధానంలో చెల్లించే అవకాశమివ్వాలని ఒక ప్రతినిధి సూచించారు.

పర్యావరణవేత్తలు అభివృద్ధినే అడ్డుకుంటారు..

కృష్ణా నదీతీరంలో పెద్ద ఎత్తున గృహ సముదాయాలు నిర్మించడం ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షించవచ్చని ఆర్కిటెక్ట్ హఫీజ్ కాంట్రాక్టర్ సూచించారు. 'పర్యావరణ అంశాల్నీ ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలి. మన దేశంలో పర్యావరణం పేరుతో అభివృద్ధిని అడ్డుకోవడానికి ఎప్పుడూ కొందరు సిద్ధంగా ఉంటారు. కాలుష్యాన్ని మాత్రం ఎవరూ అడ్డుకోరు. మూసీనది పూర్తిగా కాలుష్య కాసారంగా మారింది. అయినా ఎవరికీ పట్టదు' అని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. సమావేశంలో డీఎల్‌ఎఫ్, శోభా, ప్రెస్టీజ్, మై హోం, రహేజా, మహీంద్రా, ఈవీపీ, షాపూర్జీ పల్లోంజీ, ఎల్‌అండ్‌టీ, అపర్ణ, సాలపురి సత్తావ, జీవీకే, ఎన్‌ఎస్‌ఎల్, గార్డెన్ సిటీ, సైబర్ సిటీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హెలికాప్టర్‌లో అమరావతి సందర్శన..

ముఖ్యమంత్రితో సమావేశమయ్యేందుకు వచ్చిన వివిధ సంస్థల యజమానులు, ప్రతినిధులు హెలికాప్టర్‌లో రాజధాని ప్రాంతాన్ని, జరుగుతున్న పనుల్ని పరిశీలించే ఏర్పాటు చేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు హెలికాప్టర్‌లో బృందాలుగావెళ్లి రాజధానిని వీక్షించారు.

'స్టాప్ వర్క్ ఆర్డర్' సస్పెన్షన్‌ను కొనసాగించండి

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ సస్పెన్షన్‌ను కొనసాగించాలని కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి చేసింది. దీనిపై రాష్ట్ర నీటి పారుదలశాఖ అధికారులు ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారు. స్టాప్ వర్క్ ఆర్డర్ సస్పెన్షన్ గడువు జులై 3తో ముగియనున్న నేపథ్యంలో.. రాష్ట్ర అధికారులు దిల్లీ వచ్చి కేంద్ర అధికారులతో భేటీ అయ్యారు. సస్పెన్షన్ గడువు పొడగించాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు అంచనాల సవరణపై కేంద్ర జలవనరుల సంఘం అధికారులతోనూ రాష్ట్ర అధికారులు భేటీ అయ్యారు. పరిహారం, భూసేకరణ ధరల పెరుగుదలపై కేంద్ర అధికారుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

విభజన సమస్యలతో బకాయిల్ని ముడిపెట్టొద్దు

● తెలంగాణ డిస్కంల నుంచి రూ.5732 కోట్లు రావాల్సి ఉంది

● బకాయిలు రాకపోతే బొగ్గు సరఫరాకు చెల్లించలేం

● ఎన్‌సీఎల్‌టీలో ఆంధ్రప్రదేశ్ జెన్‌కో వివరణ

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్తు సరఫరా చేసినందుకుగాను చెల్లించాల్సిన బకాయిలను టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్(విద్యుత్తు పంపిణీ సంస్థ)లు విభజన సమస్యలతో ముడిపెట్టడం సరికాదని ఆంధ్రప్రదేశ్ జెన్‌కో జాతీయ కంపెనీలా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌కు నివేదించింది. విద్యుదుత్పత్తి సంస్థల మధ్య వివాదాలను పంపిణీ సంస్థల మధ్యకు తీసుకురావడానికి యత్నిస్తోందని, ఇది సరికాదని పేర్కొంది. వాస్తవాలు దాచిపెట్టి ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేసిందంటూ తెలంగాణ విద్యుత్తు సంస్థలు ఇటీవల కౌంటరు దాఖలు చేసిన విషయం విదితమే. ఈ కౌంటరులోని అంశాలకు ఏపీ జెన్‌కో సమాధానమిస్తూ..2003 మార్చిలో ఏపీఈఆర్‌సీ ఇచ్చిన ఆదేశాల మేరకు జెన్‌కో విద్యుత్తు పంపిణీ సంస్థలకు విద్యుత్తు సరఫరా చేస్తుందని తెలిపింది. విద్యుత్తు సరఫరా పొందినట్లు తెలంగాణ సంస్థలు అంగీకరిస్తున్నాయని, అలాంటప్పుడు సొమ్ము చెల్లించడంలో వివాదం తలెత్తరాదని పేర్కొంది. 2015 నవంబరులో తెలంగాణ సంస్థలు ఇచ్చిన పత్రికా ప్రకటనలో ఏపీ జెన్‌కోకు బకాయిలు నెలకు రూ.150కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. తెలంగాణ జెన్‌కోకు ఏపీ డిస్కంలు చెల్లించాల్సిన సొమ్మును సర్దుబాటు చేశాక చెల్లించాలని బకాయిల వివరాలను ప్రకటించిందని తెలిపింది. ఎన్టీపీసీకి చెల్లించాల్సిన బకాయిలు రెండు రాష్ట్రాల డిస్కంలకు చెందిన అంశమని, ఇందులోకి ఏపీ జెన్‌కోను తీసుకోరాకూడదదంది. నిపుణుల కమిటీ ముందున్న విభజన సమస్యలు పరిష్కారం కావాల్సిఉందని, వాటితో తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన సొమ్ముకు సంబంధంలేదంది. చెల్లించాల్సిన రుణాలుపోను తెలంగాణ జెన్‌కో నుంచే ఇంకా రూ.550కోట్లు రావాల్సి ఉన్నట్లు తేలిందని, దీని వివరాలను కమిటీకి సమర్పించినట్లు తెలిపింది.

ట్రస్ట్‌ల్లో ఉన్న సొమ్ము రెండు రాష్ట్రాల ట్రస్ట్‌ల మధ్య పంపిణీ జరుగుతుందని, ఇది ఉద్యోగుల అంశమని, జెన్‌కోతో అనుబంధంలేదంది. జెన్‌కో ఆస్తులు, అప్పులతో విద్యుత్తు విక్రయానికి చెందిన సొమ్ముతో తెలంగాణ డిస్కంలు ముడిపెట్టరాదని పేర్కొంది. దివాలా కోడ్‌లోని సెక్షన్ 2(బి) ప్రత్యేక చట్టం కింద నిర్వహించే ఏ కంపెనీకి అయినా వర్తిస్తుందని తెలిపింది. దివాలా కోడ్ చట్టం ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల మధ్య వివక్ష చూపడంలేదంది. తెలంగాణ డిస్కంల నుంచి రూ.5732కోట్లకు పైగా సొమ్ము రావాల్సి ఉందని, వాటి దివాలా పరిష్కార ప్రక్రియ ప్రారంభించాలంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతించాలని అభ్యర్థించింది. తాము బొగ్గు సరఫరా నిమిత్తం సొమ్ము చెల్లించాల్సి ఉందని, సొమ్ము చెల్లించకపోతే బొగ్గు సరఫరా నిలిచిపోతుందని తెలిపింది. అదే జరిగితే విద్యుదుత్పత్తి నిలిచిపోయి రెండు రాష్ట్రాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేసింది. ఏపీ జెన్‌కో తరపున వాసిరెడ్డి విమల్ ఈ కౌంటర్లను ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేశారు. ఏపీ తరపున వాదనలు వినిపించడానికి అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హాజరుకానున్నారు.

భద్రత కోసమే '3 గంటల నిషేధం'

విశాఖలో పౌర విమానాల రాకపోకలకు సమయ నిర్దేశంపై నౌకాదళం వివరణ

ఈనాడు, విశాఖపట్నం: విశాఖలో 'రక్షణ' అవసరాల కోసం విమానాల్ని నడుపుతున్నప్పుడు, ఇతర ఆపరేషన్లు నిర్వహిస్తున్నప్పుడు పౌరవిమానాల్ని కొద్దిసమయం పాటు ఆపాల్సి వస్తోందని తూర్పునౌకాదళ కమాండ్ ఏవియేషన్ అధికారి కమొడోర్ సత్యేన్ వర్తక్ తెలిపారు. పౌర విమానాల రాకపోకల్లో జాప్యాన్ని నిరోధించేందుకే.. తూర్పు నౌకాదళం రక్షణ అవసరాలకు ప్రత్యేక సమయాల్ని ప్రకటించిందని స్పష్టం చేశారు. ఒక్కోసారి పౌరవిమానాల రాకపోకల్లో ఆలస్యం కారణంగా రక్షణ అవసరాలను కూడా వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోందని పేర్కొన్నారు. ఇవన్నీ పరిగణించే నవంబరు 1 నుంచి రోజుకు 3 గంటల పాటు పౌర విమానాలపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

కాళ్లు విరిగినా.. సడలని ధైర్యం

33 మంది ప్రాణాలు కాపాడిన గరుడ బస్సు చోదకుడు

కోదాడ, న్యూస్‌టుడే: ప్రమాదంలో కాళ్లు విరిగినా ధైర్యం కోల్పోని బస్సు చోదకుడు..చాకచక్యంగా వ్యవహరించి 33 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన ఘటన ఇది. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం ఈ ఘటనకు వేదికైంది. ప్రయాణికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీఎస్ ఆర్టీసీ ఆటోనగర్ డిపో గరుడ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తోంది. కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం సమీపంలో రోడ్డు దాటే క్రమంలో ఉన్నట్టుండి రహదారి మధ్యలోకి దూసుకొచ్చిన ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు కుడి భాగం నుజ్జయింది. చోదకుడు ఎన్.ఎ.శేషు రెండు కాళ్లు విరిగిపోయాయి. ఆ పరిస్థితిలోనూ ఆయన ధైర్యం సడల లేదు. నియంత్రణ కోల్పోలేదు. బస్సును జాతీయ రహదారి నుంచి దించి 70 మీటర్ల దూరంలోని చదునైన ప్రాంతంలో సురక్షితంగా నిలిపాడు. శేషును, గాయపడినవారిని ఆస్పత్రికి తరలించారు.

గ్రహం అనుగ్రహం

14-6-2018 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
పాడ్యమి: రా. 11-44 తదుపరి విదియ
మృగశిర నక్షత్రం: సా. 4-01 తదుపరి ఆర్ద్ర
అమృత ఘడియలు: ఉ. 7-42 నుంచి 9-12 వరకు
తిరిగి తె. 5-06 నుంచి
వర్జ్యం: రా. 11-53 నుంచి 1-23 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-50 నుంచి 10-42 వరకు
తిరిగి మ. 3-02 నుంచి 3-55 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5-29; సూర్యాస్తమయం: సా.6-31

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఒంగోలు	39.3	30.6
గుంటూరు	38.1	25.5
రాజమహేంద్రవరం	38.0	26.0
విజయవాడ	38.0	25.1
అనంతపురం	37.9	28.3
శ్రీకాకుళం	37.0	28.0
కడప	37.0	27.0
కర్నూలు	36.9	25.8
తిరుపతి	36.3	28.5
తాడేపల్లిగూడెం	36.0	26.5
నరసాపురం	35.5	26.0
హైదరాబాద్	35.2	23.5
నెల్లూరు	35.0	30.0
విశాఖపట్నం	33.0	26.4

DSC-SGT, SA బ్యాచ్ ప్రా॥: 20-06-18
SGT స్పెషల్ ఎగ్జామ్ బ్యాచ్ కలదు
టెట్‌లో 130పై మార్కులు వచ్చిన వారికి ఫీజు రాయితీ
టీచర్స్ అకాడమి కనిగిరి, ప్రకాశం జిల్లా 98486 61318

SI & కానిస్టేబుల్, VRO/Gr-IV/RPF
New Batches 15-6-18 ప్రారంభం
భాగ్యకిరణ్ 9603290758

స్ఫూర్తి DSC నెల్లూరు
TET లో స్టేట్ సంచలన ఫలితాలు
SGT, SA, TPT FREE DEMO: 17-6-18
9440009134, 8985005173

VISION IAS
Anthropology by Mrs. Sosin
Admissions Open Limited Seats
అశోక్‌నగర్, హైదరాబాద్.
9000104133, 9515487979

IAS/IPS-2019
II Batch @ Hyderabad
From 15-7-2018
Last Date of Admission 20-6-18
Gr 1 & 2 EM & TM New Batch 24-6-2018
MAINS TEST SERIES From: 16-6-18
Krishna Pradeep's 21st Century IAS
www.kpias.com
Opp. Sub Registrar Office, Ashok Nagar, Hyderabad.
Ph: 040 - 6678 7733, 8686 233 879

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
RANK హామీ ఇవ్వగలిగే APలో IAS సంస్థ
Degree + IAS (50 students) 3yrs Integrated Program
After Degree - Morning Batch (1 year)
During Degree - Evening Batch(2 years)
Civil Services IAS Exam
on June 17th Sunday 10 am
Hostel facility
Beside Nagarjuna Hospital,Kanuru, VIJAYAWADA. Ph: 6300181832

దీపికా పదుకొణె నివాసముండే భవన సముదాయంలో అగ్నిప్రమాదం

ముంబయి, న్యూస్‌టుడే: ముంబయిలోని ప్రభాదేవి ప్రాంతంలో బాలీవుడ్ నటి దీపికా పదుకొణె, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ సహా పలువురు ప్రముఖులు నివాసముండే భవన సముదాయంలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. భవన సముదాయంలో మొత్తం 33 అంతస్థులున్నాయి. 33వ అంతస్థులో చెలరేగిన మంటలు.. 32వ అంతస్థుకు వ్యాపించాయి. వెంటనే స్పందించిన అగ్నిమాపక దళం సిబ్బంది.. ఐదు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. దీపికా పదుకొణే కార్యాలయ సిబ్బంది సహా దాదాపు 100 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రమాదంలో 32, 33వ అంతస్థులు ధ్వంసమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన భవన సముదాయంలో దీపిక కార్యాలయం కూడా ఉన్న సంగతి గమనార్హం. ప్రమాద సమయంలో దీపిక తన నివాసంలోగానీ, కార్యాలయంలోగానీ లేరని అధికారులు వెల్లడించారు. తాను క్షేమంగా ఉన్నానని దీపిక ట్విటర్ ద్వారా అభిమానులకు తెలియజేశారు.

పదోన్నతుల్లో కోటా రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలకూ వర్తిస్తుంది

త్వరలోనే ఆదేశాలు వెలువడతాయి: పాస్వాన్

దిల్లీ: పదోన్నతుల్లోనూ రిజర్వేషన్లు కల్పించడానికి సుప్రీంకోర్టు తెలిపిన సమ్మతి... కేంద్ర ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకూ వర్తిస్తుందని కేంద్రమంత్రి రాంవిలాస్ పాస్వాన్ స్పష్టంచేశారు. దీనికి సంబంధించి కేంద్ర 'సిబ్బంది-శిక్షణ విభాగం' (డీవోపీటీ) త్వరలోనే ఆదేశాలు వెలువరిస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలు కేంద్ర ఉద్యోగాలకే వర్తిస్తాయా అనే అనుమానాలను కొందరు వ్యక్తం చేస్తుండడంతో ఆయన స్పష్టతనిచ్చారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లపై చర్చించడానికి పాస్వాన్‌తో పాటు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, సామాజిక న్యాయం-సాధికారత శాఖ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ తదితరులు బుధవారం సమావేశమయ్యారు. దళితులు, గిరిజనుల అంశాలను చర్చించడానికి ఈ మంత్రుల బృందాన్ని ప్రభుత్వం నియమించిందని సమావేశానంతరం పాస్వాన్ విలేకరులకు చెప్పారు. ఎస్సీ-ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంలో మునుపటి నిబంధనల పునరుద్ధరణకు అత్యవసరాదేశాన్ని ప్రభుత్వం సిద్ధం చేసిందనీ, పునఃసమీక్ష అర్జీపై సుప్రీంకోర్టు ఇచ్చే తుది ఆదేశాల కోసం ఎదురు చూస్తోందనీ తెలిపారు.

మెరుగవుతున్న వాజ్‌పేయీ ఆరోగ్యం

ఎయిమ్స్ డైరెక్టర్ రణ్‌దీప్

దిల్లీ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆరోగ్యం గత 48 గంటల్లో గణనీయంగా మెరుగు పడినట్లు అఖిల భారత వైద్య విజ్ఞానసంస్థ (ఎయిమ్స్) డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా బుధవారం తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఆయన కోలుకుంటారన్న ఆశాభావంతో వైద్యబృందం ఉన్నట్లు వెల్లడించారు. మూత్రనాళ ఇన్‌ఫెక్షన్, ఛాతి సంబంధిత అనారోగ్య సమస్యలతో మూడు రోజుల క్రితం వాజ్‌పేయీని ఎయిమ్స్‌లో చేర్పించిన సంగతి తెలిసిందే. మూత్రం విడుదల తగ్గిపోవడంతో ఆసుపత్రిలో చేర్చిన వెంటనే డయాలసిస్ ప్రారంభించినట్లు రణ్‌దీప్ తెలిపారు. బుధవారం నాటికి మూత్రపిండ పనితీరు మెరుగైందని.. ఇన్‌ఫెక్షన్ కూడా నియంత్రణలో ఉన్నట్లు వివరించారు. వాజ్‌పేయీకి రక్తపోటు, శ్వాస వ్యవస్థ, హృదయ స్పందనలు, మూత్రం విడుదల సాధారణస్థాయిలోనే ఉన్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వెల్లడించారు. కాగా మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ; యూపీ, హరియాణా ముఖ్యమంత్రులతో పాటు పలువురు కేంద్ర మంత్రులు బుధవారం పరామర్శించారు. వాజ్‌పేయీ చికిత్సకు చక్కగా స్పందిస్తున్నట్లు ఎయిమ్స్ మంగళవారం పేర్కొన్న సంగతి విదితమే.



ఎన్నాళ్లింకా ప్రేక్షక పాత్ర?

మొట్టమొదటిసారి రష్యా ఆతిథ్యంలో వివిధ ఖండాలకు చెందిన 32 దేశాలు సుమారు నెల్లాళ్లపాటు హోరాహోరీగా తలపడే ప్రపంచ ఫుట్‌బాల్ మహా సంగ్రామానికి, నేడే తెర లేవనుంది. ఎన్నో దేశాల్లో విస్తృత జనాదరణ కలిగిన కాల్బంతి పోటీల్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికయ్యే వ్యయం రమారమి రూ.80 వేలకోట్లుగా లెక్కతేలింది. ఒక్క ఐరోపా నుంచే పద్నాలుగు దేశాలు సత్తా చాటనున్న 'ఫిఫా' (అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘం) ప్రపంచకప్ సమరంలో ఆసియా ప్రాతినిధ్యం ఇరాన్, జపాన్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియాలకే పరిమితమైంది. జనాభా ప్రాతిపదికన ప్రపంచంలో తొలి నాలుగు పెద్ద దేశాలైన చైనా, ఇండియా, అమెరికా, ఇండొనేసియాలు ఈ పోటీలకు అర్హత సాధించడంలో విఫలమయ్యాయి. మునుపటి విజేత (డిఫెండింగ్ ఛాంపియన్) హోదాతో బరిలోకి దిగుతున్న జర్మనీకి అర్జెంటీనా, స్పెయిన్, బెల్జియం, ఫ్రాన్స్, పోర్చుగల్, ఇంగ్లాండ్ ప్రభృత జట్ల నుంచి తీవ్ర ప్రతిఘటన తథ్యమన్నది క్రీడాపండితుల విశ్లేషణ. విజయావకాశాల్లో బ్రెజిల్ (21 శాతం), స్పెయిన్ (10), జర్మనీ (8) ముందున్నాయంటున్నా, క్షణాల్లో గెలుపోటములు తారుమారయ్యే అవకాశాల దృష్ట్యా ఫ్రాన్స్, కొలంబియా తదితరాల్నీ తేలిగ్గా తోసిపుచ్చే వీల్లేదు. క్రితంసారి సొంతగడ్డపై ఎదురే లేదనుకున్న బ్రెజిల్ సెమీస్ దశలో జర్మనీ చేతిలో దారుణ ఓటమి చవిచూసి పరాజయభారంతో నిష్క్రమించాల్సి వచ్చింది. గ్రూప్ దశలో ఈసారి పోలెండ్, బెల్జియం, జర్మనీ, అర్జెంటీనా, స్పెయిన్, ఉరుగ్వే ఆకాశమే హద్దుగా చెలరేగుతాయన్న ముందస్తు అంచనాల వెలుగులో ఏ పోటీ ఎటువంటి అనూహ్య మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ అశేష క్రీడాభిమానుల్ని పట్టి ఊపేస్తోంది. జులై పదిహేనో తేదీన అంతిమ విజేత ఎవరో ఇదమిత్థంగా వెల్లడయ్యేవరకు ఈ సాకర్ జ్వరం ఉపశమించదు!

ఫుట్‌బాల్ పోటీలంటేనే పెను సంచలనాలకు మారుపేరు. అద్భుత క్రీడాప్రావీణ్యం కలిగినవారుగా ప్రతీతులవుతున్న నెయ్‌మార్ (బ్రెజిల్), లియానో మెస్సీ (అర్జెంటీనా), మహమ్మద్ సాలా (ఈజిప్ట్), హ్యారీ కేన్ (ఇంగ్లాండ్), కెవిన్ డెబ్రాన్ (బెల్జియం), కిలియానా ఎంబపి (ఫ్రాన్స్) ప్రభృతులు ఈసారి తమదైన ముద్ర వేస్తారంటూ కొన్నాళ్లుగా ప్రసార మాధ్యమాల విశేష కథనాలు మోతెక్కిస్తున్నాయి. అవి ఏ మేరకు నిజమవుతాయో చూడాలి! సాకర్ పోటీలకు ఆతిథ్యమిచ్చి ప్రపంచకప్ గెలిచిన ఘనతను గతంలో ఉరుగ్వే, ఇటలీ, ఇంగ్లాండ్, జర్మనీ, అర్జెంటీనా, ఫ్రాన్స్ లాంటివి దక్కించుకున్నాయి. తాజాగా ఆ జాబితాలో రష్యా ప్రవేశించగల అవకాశం ఏ కోశానా కానరావడం లేదు. గ్రూప్ దశ నుంచే చావో రేవో అనేంత విపరీత స్పర్ధతో తీవ్ర ఉద్వేగం ప్రజ్వరిల్లజేసే పోటీలివి. లోగడ నాలుగు పర్యాయాలు ప్రపంచకప్ నెగ్గి, 1952 దరిమిలా పోటీలకు ఎన్నడూ దూరంకాని ఇటలీ- ఈసారి అర్హత పోటీల్లోనే చతికిలపడింది. ట్రినిడాడ్ టొబాగో చేతిలో కంగుతిన్న అమెరికా, మేటి జట్టుగా గుర్తింపున్న నెదర్లాండ్స్, ఆఫ్రికా దిగ్గజశక్తి అనిపించుకున్న కామెరూన్ వంటివీ విశ్వసంబరానికి నోచుకోలేకపోయాయి. అసలు పోటీల్లో సకల శక్తియుక్తులూ ఒడ్డి ఆడే జట్ల మూలాన ఇక అనుదిన వినోదం తారస్థాయికి చేరడం తథ్యం. ముఖ్యంగా ఢీ అంటే ఢీ అనే అర్జెంటీనా, నైజీరియా, క్రొయేషియా, సంచలనాల ఐస్‌లాండ్‌లతో కూడిన గ్రూప్ 'డి'లో ప్రతి పోటీ అమితాసక్తిదాయకం కానుందన్న అంచనాలున్నాయి. 'ద్వితీయ స్థానంలో నిలిచే ప్రసక్తే లేదు... మేం ప్రపంచకప్ సాధించి తీరాల్సిందే'నంటున్న దిగ్గజ ఆటగాడు మెస్సీ అర్జెంటీనా కల గురించి చెబుతున్నా- ఇతర ప్రధాన జట్ల అప్రకటిత అజెండా సైతం అదే!

దేశదేశాల్లో ఫుట్‌బాల్ పట్ల జనాదరణ ఏ తీరుగా ఉన్నదో తెలుసుకోవడానికి నిర్వహించిన ప్రత్యేక అధ్యయనం ప్రకారం, ఈ అయిదేళ్లలో క్రీడాసక్తి కలిగిన భారతీయుల సంఖ్య 30 నుంచి 45 శాతానికి విస్తరించింది. 'ఫిఫా' ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధించడంలో యోజనాల అంతరం నేటికీ ఇండియాను వెక్కిరిస్తోంది. యాభై, అరవై దశకాల్లో ఫుట్‌బాల్ రంగాన భారత్ ఆసియా దిగ్గజాల్లో ఒకటిగా తళుకులీనేది. 1951, 1962 ఆసియా క్రీడల్లో స్వర్ణం కొల్లగొట్టి, 1956 నాటి మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో నాలుగోస్థానాన నిలిచిన ఇండియా అనంతర కాలంలో ప్రాభవం కోల్పోయింది. కోస్టారికా, ఐస్‌లాండ్ వంటి చిన్న దేశాలూ 'ఫిఫా' వేదికపై తలపడుతుండగా- ఆసియా స్థాయి వడపోత పోటీల్లోనూ రాణించలేకపోతున్న భారత్ నేడు 97వ ర్యాంకుకు పరిమితమైంది. ఎన్నో దేశాలు ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహాలతో రాటుతేలుతుండగా శిక్షకుల కొరత, మౌలిక వసతులకు నిరంతర క్షామం ఇక్కడి ఫుట్‌బాల్ రంగ ప్రగతిని దిగలాగుతున్నాయి. ఏళ్ల తరబడి కాల్బంతి క్రీడతో మమేకమైన భూటియా, ఐ.ఎమ్.విజయన్ వంటివారు సహజసిద్ధ ప్రతిభను ఎదగనివ్వని విషవాతావరణ సంస్కృతిని సూటిగా ప్రశ్నిస్తున్నారు. పశ్చిమ్ బంగ, కేరళ, గోవా లాంటిచోట్ల ఫుట్‌బాల్ పట్ల విశేష జనాదరణ వ్యక్తమవుతున్నా- మరో రెండు దశాబ్దాలకైనా ప్రపంచకప్ పోటీల్లో భారత్ అడుగిడుతుందన్న ధీమా నిపుణుల్లో కొరవడుతోంది. కేవలం మూడు లక్షల జనాభా కలిగిన ఐస్‌ల్యాండ్ ఇండోర్ మైదానాల సాయంతో ఆటకు పదునుపెట్టుకొని రష్యాలో సువర్ణావకాశం దక్కించుకుంది. తమ గడ్డమీద ఫుట్‌బాల్ ప్రమాణాల్ని ప్రపంచస్థాయికి ఇనుమడింపజేసే లక్ష్యంతో రూ.160 కోట్లకు పైగా వార్షిక వేతనంతో ప్రఖ్యాత శిక్షకుడు సిప్పి సేవల్ని చైనా వినియోగించుకుంటోంది. 'భారత్‌లో క్రికెట్ ఒక్కటే కాదు... మరెన్నో క్రీడలున్నాయి... వాటినీ సమధికంగా ప్రోత్సహించా'లన్న ప్రధాని మోదీ సంకల్పానికి అనుగుణంగా పకడ్బందీ కార్యాచరణ పట్టాలకు ఎక్కాలి. జిల్లాలవారీగా క్రీడా మైదానాల ఏర్పాటు, సమాఖ్యల్లో పారదర్శకత జవాబుదారీతనం సాకారమైతేనే, ఇండియా ఎప్పటికైనా 'గోల్' కొట్టగలిగేది!

కుట్రల చట్రంలో కశ్మీర్



కె.రామకోటేశ్వరరావు

అంతర్జాతీయ న్యాయ సూత్రాలను అతిక్రమించి, కశ్మీర్ అస్తిత్వాన్ని కబళించేందుకు చైనా దర్శకత్వంలో పాక్ ప్రయత్నాలది దశాబ్దాల చరిత్ర. కశ్మీరీల మనోభావాల పేరిట నానా హంగామా చేసే వేర్పాటు సంస్థలు- బీజింగ్ దురాక్రమణ వైఖరిపై మాత్రం నోరు మెదపడం లేదు. జమ్మూకశ్మీర్ చారిత్రక పరిణామ క్రమాలను పరిశీలిస్తే దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలెన్నో దర్శనమిస్తాయి. పాకిస్థాన్‌లో పంజాబ్, సింధ్, బలూచిస్థాన్, ఖైబర్ ఫక్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లతో పాటు మూడు ప్రత్యక్ష పాలన ప్రాంతాలు ఉన్నాయి. అఫ్గానిస్థాన్ సరిహద్దులోని ఏడు ఆదివాసీ ఏజెన్సీలు, ఆజాద్ కశ్మీర్‌గా పిలిచే మీర్‌పూర్-ముజఫరాబాదు ప్రాంతం, ఉత్తరాన చైనా సరిహద్దున అత్యంత ఎత్తైన పర్వతాల మధ్య గల గిల్గిత్-బాల్టిస్థాన్ ప్రత్యక్ష పాలన ప్రాంతాలు. వీటిల్లో ఉగ్రవాదులకు స్థావరంగా భావించే ఆదివాసీ ప్రాంతాలను ఖైబర్‌ఫక్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో విలీనం చేసేందుకు ఇటీవల రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదించారు. భారత్‌కు ప్రత్యక్ష సంబంధం గల అంశం గిల్గిత్-బాల్టిస్థాన్. దీనికి సంబంధించి సైతం పాక్ సర్కారు కొత్త ఆదేశాన్ని జారీచేసింది. గిల్గిత్-బాల్టిస్థాన్ వాస్తవానికి జమ్ము-కశ్మీర్‌లో భాగం. కశ్మీర్ మహారాజు హరిసింగ్, భారత్‌తో చేసుకున్న ఒప్పందం ఫలితంగా ఈ ప్రాంతం మన దేశంలో అంతర్భాగమైంది. షాక్స్‌గామ్... ఇది పాకిస్థాన్ అధీనంలోకి వెళ్లిన బాల్టిస్థాన్ ప్రాంతంలో భాగం. బాల్టిస్థాన్ తూర్పున షాక్స్‌గామ్ నదికి రెండు వైపులా గల లోయ ప్రాంతం చైనా సరిహద్దులో ఉంది. 1962 భారత్- చైనా యుద్ధం తరవాత చైనాకు పాకిస్థాన్ దగ్గరైంది. దాన్ని అవకాశంగా తీసుకుని 1963లో పాకిస్థాన్‌తో చైనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం పేరుతో 5,180 చ.కి.బాల్టిస్థాన్‌కు చెందిన షాక్స్‌గామ్ ప్రాంతాన్ని చైనా సొంతం చేసుకుంది. దీన్ని భారత్ గుర్తించలేదు.

అనాదిగా అన్యాయం

పూర్వపు కశ్మీర్‌లోని 43 శాతం భూభాగం మాత్రమే ప్రస్తుతం భారత్‌లో ఉంది. ఈ విధంగా జమ్ము-కశ్మీర్ సంస్థానం ముక్కచెక్కలైంది. కశ్మీర్‌లో కశ్మీరీల స్వాతంత్ర్యం కోసం గొంతు చించుకునే హురియత్ గాని, జమ్ము-కశ్మీరు లిబరేషన్ ఫ్రంట్‌గాని- గిల్గిత్-బాల్టిస్థాన్‌ను ఆజాద్ కశ్మీర్ నుంచి విడదీసినందుకు, షాక్స్‌గామ్ ప్రాంతాన్ని చైనాకు ధారాదత్తం చేసినందుకు పాకిస్థాన్‌ను పల్లెత్తు మాట అనలేదు. దీన్ని బట్టి చూస్తే వీరి మాటల్లోని కశ్మీరీ స్వాతంత్ర్యం నేతి బీరకాయలోని నేతి చందమని అర్థమవుతుంది. గిల్గిత్-బాల్టిస్థాన్ ప్రాంతాన్ని కశ్మీర్ నుంచి విడదీసే కుట్ర 1947లో రహస్యంగా జరిగింది. ఆజాద్ కశ్మీర్ ఒప్పందం పేరుతో కరాచీలో పాకిస్థాన్ ప్రభుత్వం, ఆజాద్ కశ్మీర్ ప్రభుత్వం, అఖిల జమ్ము-కశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్‌లు సంతకాలు చేశాయి. దీని ప్రకారం గిల్గిత్-బాల్టిస్థాన్‌ను ఆజాద్ కశ్మీర్ నుంచి పాకిస్థాన్ ప్రభుత్వానికి బదలాయించారు. కానీ దీన్ని కశ్మీరీ ప్రజలకు తెలియకుండా రహస్యంగా ఉంచారు. అదే సమయంలో ఐక్యరాజ్య సమితిలో కశ్మీరీ స్వాతంత్ర్యం కోసం తీర్మానాలు ప్రవేశపెడుతూ, మరోపక్క భారత వ్యతిరేక కార్యకలాపాలను రెచ్చగొడుతూ కశ్మీర్ విచ్ఛిన్నానికి పాకిస్థాన్ పాల్పడింది. ఇలా కశ్మీర్ నుంచి విడదీసిన తరవాత ఈ ప్రాంతాన్ని పూర్తిగా స్వతంత్రం చేసే కార్యక్రమాలు మొదలుపెట్టారు. 1970లో ఈ ప్రాంతం మొత్తాన్ని కలిపి ఒక పాలన కేంద్రంగా మార్చారు. గిల్గిత్ ఏజెన్సీ, బాల్టిస్థాన్‌తో పాటు మిగతా ప్రాంతాలను కలిపి 'ఉత్తర ప్రాంతాలు'గా వ్యవహరించడం ప్రారంభించారు. 1990 వరకు ఈ ప్రాంతంలో బ్రిటీషువారి మాదిరిగానే ఫెడరల్ క్రైమ్ రెగ్యులేషన్ (ఎఫ్‌సీఆర్) చట్టాన్ని అమలు చేశారు. దీని ప్రకారం ప్రజలకు ప్రాథమిక హక్కులు ఉండవు. ఏకపక్షంగా శిక్షలు, అపరాధ రుసుములు విధిస్తారు. ఉత్తర ప్రాంతాల పాలన వ్యవస్థకు వ్యతిరేకంగా 1972లో ఆజాద్ కశ్మీర్ అసెంబ్లీ తీర్మానం సైతం చేసింది. ఉత్తర ప్రాంత పాలన వ్యవస్థ ఏర్పాటులో చైనా పాత్ర ఉందన్న విషయం తరవాత బహిర్గతమైంది. 1962 భారత-చైనా యుద్ధం తరవాత 1963లో చైనాకు ధారాదత్తం చేసిన భూభాగంతో పాకిస్థాన్-చైనా మైత్రి బలపడసాగింది. అందులో భాగంగానే చైనా తన ప్రయోజనాల కోసం ఎప్పుడో మూతపడిన ప్రాచీన సిల్క్ రహదారిని తిరిగి నిర్మించింది. ఎత్తయిన పర్వతాలు, మంచుతో కప్పబడిన భూభాగాలు, మొనతేలిన కొండభాగాల మధ్య ఈ నిర్మాణం జరిగింది. దీని మొత్తం దూరం 1,300 కి.మీ. ఇది పాకిస్థాన్‌లో 887 కి.మీ, చైనాలో 413 కి.మీ.ఉంది. చైనా జింగ్జియాంగ్ ప్రావిన్సులోని దక్షిణ ప్రాంతం కష్గర్ పట్టణం నుంచి పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్సులోని హసన్ అబ్దలీ వరకు నిర్మించారు. ఇది చైనా నుంచి ఖుజెరబు కనుమ దగ్గర గిల్గిత్ ప్రాంతంలోకి ప్రవేశిస్తుంది. ప్రపంచంలోనే ఎత్తయిన ప్రాంతాల్లో ఇది ఒకటి. ఎవరెస్టు తరవాత అత్యంత ఎత్తయిన పర్వతం



చైనాది ఆధ్వర్యం... పాక్‌ది ఆచరణ

సైతం ఇక్కడే ఉంది. హిమాలయాలు, కారకోరం శ్రేణులు, హిందూకుష్ పర్వతాలు కలిసేచోటుగా దీన్ని చెప్పవచ్చు. ప్రపంచంలో పొడవైన మూడు 'గ్లేసియర్లు' ఇక్కడే ఉన్నాయి. భారత్‌లోని సియాచిన్ గ్లేసియర్ సైతం దీనికి దగ్గర్లోనే ఉంది. ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. భారతదేశం నుంచి బౌద్ధమత ప్రచారకులు ఈ మార్గం ద్వారానే చైనాకు వెళ్ళారు. మూడువందల సంవత్సరాలకు పైగా ఇది బౌద్ధ భిక్షువులకు మార్గంగా ఉండేది. భారతదేశానికి వచ్చిన చైనా చరిత్రకారులు ఈ మార్గాన్ని ఉపయోగించారు. తరవాత ఈ దారిలో ప్రయాణం కష్టం కావడంతో ఖైబర్ కనుమ, అఫ్గాన్ ద్వారా చైనాకు వెళ్ళటంతో ఈ దారి వాడుకలో లేకుండాపోయింది.

వాస్తవానికి మొదట్లో భారత్ దీనిపై పెద్దగా దృష్టిసారించలేదు. నామమాత్రంగా నిరసన వ్యక్తం చేయడం మినహా చైనా, పాకిస్థాన్‌తో గిల్గిత్ ప్రాంతం కోసం ఘర్షణకు దిగిన సంఘటనలు పెద్దగా లేవు. కారకోరం హైవే నిర్మించిన తరవాత దీని ప్రాముఖ్యం పెరిగింది. ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాయి. పాకిస్థాన్ అవసరాలకు సరిపడే జల విద్యుదుత్పత్తికి ఈ ప్రాంతంలో అవకాశం ఉంది. మంచినీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. సరస్సులు, సుందర ప్రదేశాలు, పర్వతారోహణలతో పర్యాటక రంగం అభివృద్ధికీ అవకాశం ఉంది. అన్నింటికన్నా చైనా పాకిస్థాన్ ఆర్థిక నడవా (సీపీఈసీ)కు కీలకం గిల్గిత్ ప్రాంతం. చైనా జింగ్జియాంగ్ ప్రావిన్సు నుంచి పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో గల గ్వదర్ ఓడరేవుకు రహదారి నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగానే 2006 జూన్‌లో రెండు దేశాలు దీనిపై సంతకం చేశాయి. ప్రస్తుత రహదారిని వెడల్పు చేసి అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం పెద్దమొత్తాన్ని చైనా ఖర్చు పెడుతోంది. ఈ ప్రాజెక్టు రక్షణ కోసం సైన్యాన్ని, పోలీసులను పాకిస్థాన్ సమకూరుస్తోంది. చైనా నుంచి సిమెంటుతో సహా అన్ని వస్తువులు సరఫరా అవుతున్నాయి. ఇది ఓ విధంగా చైనా ఆర్థిక వ్యవస్థకు ఊతంగా పనిచేస్తుంది. దీంతో పాకిస్థాన్ అప్పుల ఊబిలో కూరుకుపోతుందన్నది విమర్శకుల భావన. చైనా అక్రమంగా కశ్మీర్‌లోని 20 శాతం భూభాగాన్ని ఆక్రమించడమే కాకుండా భారత్-పాకిస్థాన్ వివాదంలో ఉన్న గిల్గిత్ భూభాగం నుంచి ఈ రహదారిని నిర్మిస్తుంది. దీనిపై భారత్ నిరసనను అది ఖాతరు చేయలేదు. అదే సమయంలో ఈ ప్రాజెక్టు నిరాటంకంగా కొనసాగడానికి గిల్గిత్-బాల్టిస్థాన్‌ని పాకిస్థాన్‌లో అయిదో ప్రావిన్సుగా ప్రకటించమని పాకిస్థాన్‌పై చైనా ఒత్తిడి తెస్తోంది. అలా చేస్తే ఇది వివాదాస్పద ప్రాంతంగా ఉండదని దాని ఆలోచన.

కళ్లు తెరవాలి...

గిల్గిత్-బాల్టిస్థాన్ షియాల మెజారిటీ ప్రాంతం. 1974లో నిబంధనలు మార్చి ఎవరైనా ఇక్కడ నివాసం ఉండొచ్చని ప్రభుత్వం ప్రకటించింది. పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు జియావుల్ హక్ దీన్ని సున్నీ మెజారిటీ ప్రాంతంగా మార్చడానికి నిబంధనలు సవరించి, మిగతా ప్రాంతాల నుంచి ఇక్కడకు వలసలను ప్రోత్సహించారు. 2009లో స్వయంపాలన పేరుతో కొన్ని పాలన మార్పులను ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం విదేశాంగ సలహాదారు సర్తాజ్ అజీజ్ అధ్యక్షతన ఇటీవల ఓ కమిటీని నియమించింది. అది గిల్గిత్-బాల్టిస్థాన్‌ను అయిదో ప్రావిన్సుగా ప్రకటించమని సిఫార్సు చేసింది. అయినా మన దేశంలోని కశ్మీర్‌వాదులుగాని, పాకిస్థాన్‌లోని ఆజాద్ కశ్మీర్ వాదులుగాని దాన్ని ఖండిస్తూ ప్రకటన చేసిన పాపాన పోలేదు. దీనికి రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంది. ఎన్నికలకు ముందు అంత సాహసం చేయడానికి ప్రభుత్వం తర్జన భర్జనలు పడుతోంది. ఓ వైపు చైనా ఒత్తిడి, రెండో వైపు అంతర్జాతీయంగా కశ్మీర్ సమస్య బలహీన పడుతుందనే భయం మధ్య ప్రస్తుతానికి ఆ సిఫార్సును ముందుకు తీసుకెళ్ళే సాహసం చేయలేకపోయింది. రాజీమార్గంగా గిల్గిత్-బాల్టిస్థాన్ ఆదేశం-2018 పేరుతో ఇటీవల పాలన పరమైన మార్పులు తీసుకొచ్చింది. అది అక్కడి ప్రజల్లో తీవ్ర నిరసనకు దారితీసింది. ఎన్నికల తరవాత ఎప్పుడైనా గిల్గిత్-బాల్టిస్థాన్‌ను అయిదో ప్రావిన్సుగా ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే అక్సాయ్‌చిన్, షాక్స్‌గామ్‌ను కశ్మీర్ నుంచి వేరు చేశారు. చైనా అండతో గిల్గిత్-బాల్టిస్థాన్‌ని పూర్తిగా కశ్మీర్ నుంచి విడగొట్టే కుట్ర పాకిస్థాన్ చేస్తోంది. భారత ప్రభుత్వం ఇటీవల పాకిస్థాన్ రాయబారిని పిలిచి దీనిపై తన నిరసన తెలియజేసింది. బ్రిటన్ పార్లమెంట్ ఏకంగా 2017లో పార్లమెంటులో దీనిపై స్పష్టమైన తీర్మానం చేసింది. గిల్గిత్-బాల్టిస్థాన్ భారత్‌లో చట్టబద్ధ భాగమని పాకిస్థాన్ దీన్ని ఆక్రమించిందని అది తీర్మానించింది. చైనా విస్తరణ కాంక్షతో- అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధంగా, వివాదస్పద భూభాగం మీదుగా చైనా పాకిస్థాన్ ఆర్థిక నడవా (సీపీఈసీ) నిర్మించడమే కాకుండా పాకిస్థాన్‌పై ఒత్తిడి తెచ్చి గిల్గిత్-బాల్టిస్థాన్‌ను కశ్మీర్ నుంచి శాశ్వతంగా దూరం చేసేందుకు కుట్ర పన్నుతోంది. కశ్మీరు అస్తిత్వంపై ఏ మాత్రం అభిమానం ఉన్నా భారత్‌లోని కశ్మీర్ ప్రజలు, పాకిస్థాన్ అధీనంలోని ఆజాద్ కశ్మీర్ ప్రజలు చైనా, పాకిస్థాన్ కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది!

మంత్రుల కోసం మరో సృష్టి

'సాలెపురుగు ఏ వేదం చదువుకుంది, పాము ఏ శాస్త్రాలు నేర్చుకుంది, ఏనుగు ఏ విద్యాభ్యాసం చేసింది? ఇవేమీ లేకపోయినా వాటికి మోక్షం రాలేదా?' అని అష్టదిగ్గజాల్లో ఒకరైన ధూర్జటి మహాకవి నిలదీశాడు. ఇది నిజమే! చచ్చి సాధించే మోక్షానికే ఏ విద్యార్హతలూ అవసరం లేనప్పుడు- 'నానా చావులు చచ్చే' రాజకీయ మోక్షానికి మాత్రం నాయకులకు విద్యార్హతలు ఎందుకు? అవసరమే లేదు. 'చదువులలో సారమెల్ల చదివితి తండ్రీ' అని ప్రహ్లాదుడు అమాయకంగా చెబితే తండ్రి హిరణ్యకశిపుడు అమాయకంగా నమ్మాడు. హరి, హరి అన్న మాటలతో హిరణ్యకశిపుడు 'హరీ' అయిపోయాడు. అది కృతయుగం సంగతి.

కలియుగంలో చదువులకు అర్థం మారిపోయింది. చదువులలో సారం రాజకీయాలేనన్న తత్వం 'ఇంట పడితే' చాలు అన్నీ వాటంతట అవే వచ్చేస్తాయి. ఇది కలియుగం ప్రత్యేకత!

రాజకీయ నాయకులు తయారు కారు... 'పుడతారు'! గొప్ప నాయకుల ఇంట్లో పుడితే చాలు... గొప్ప నాయకులైపోతారు. ఇది వంశపారంపర్య రాజకీయం. పుట్టగానే రాజకీయ పుష్పమూ పరిమళించేస్తుంది. ఒకప్పుడు చదువుల్లో అద్భుతంగా రాణించేవాళ్లు రాజకీయాల్లోకి వచ్చేవారు. ఇప్పుడు చదువుల్లో మొద్దబ్బాయిలు రాజకీయాల్లోనూ చక్రం తిప్పే రోజులొచ్చేశాయ్. కార్యాలయాల్లో బంట్రోతు ఉద్యోగం కావాలన్నా ఏదో ఒక అర్హత ఉంటే కానీ కుదరదు. కానీ రాజకీయ నాయకులు అదృష్టవంతులు. వారికి ఏ అర్హతా అవసరం లేదు! అయినా ఈ మధ్య రాజకీయాల్లో కొంతమంది మంత్రుల విద్యార్హతల మీద చర్చ జరుగుతుండటం బాధాకరం.

ఆ మధ్య కర్ణాటక శాసనసభ ఎన్నికల తరవాత గద్దెనెక్కిన కుమారస్వామి మంత్రివర్గంలో జీటీ దేవెగౌడ ఉన్నత విద్యాశాఖమంత్రి అయ్యారు. ఆయన గత ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను చాముండేశ్వరి నియోజకవర్గంలో ఓడించేశారు. నిజానికి అంతకుమించిన అర్హత ఏముందసలు? కేవలం ఎనిమిదో తరగతి చదువుకున్న దేవెగౌడను ఉన్నత విద్యాశాఖమంత్రి చేయడమేమిటన్న వ్యాఖ్యలు వినిపించేశాయి. వేరేవాళ్ల సంగతి ఏముంది? తక్కువ చదువుకున్న తనకు ఉన్నత విద్యామంత్రి పదవి ఇవ్వడమేమిటని దేవెగౌడ బాధపడ్డట్లూ వార్తలు వచ్చాయి. ఎటొచ్చీ అంతకన్నా ముఖ్యమైన శాఖను ఆయన కోరుకుంటున్నట్లు భోగట్టా. ఇది తెలిసిన ముఖ్యమంత్రి కుమారస్వామి దొందూ దొందే సామెత తను గుర్తు తెచ్చి జవాబు చెప్పారు. 'నేను బీఎస్సీ మాత్రమే చదువుకుని ముఖ్యమంత్రిగా పనిచేయడం లేదా?' అన్నారు. పని చేయాలేగాని ప్రతి శాఖలోనూ ప్రతిభ చూపించే అవకాశం ఉంటుందని నొక్కి వక్కాణించారు.

హోం మంత్రి కావాలంటే ఐపీఎస్ అయ్యే ఉండాలా? ఆ మాటకొస్తే ఆ శాఖ చేసే పని దొంగల్ని పట్టుకోవడమే. నేటి దొంగ ఎలా ఉంటాడో, ఏం చేస్తాడో, సాటి దొంగకన్నా తెలిసినవాళ్లు ఎవరుంటారు? అంతమాత్రాన దొంగల్ని హోం మంత్రుల్ని చేసేస్తారా అంటున్నారు. ఆర్థికమంత్రి కావాలంటే అర్థశాస్త్రంలో పీహెచ్‌డీ చేసి ఉండాలా? ఏమిటీ బడాయి? నీరవ్ మోదీ, విజయ్ మాల్యా లాంటివాళ్లకు తెలిసినన్ని 'ఆర్థిక వ్యవహారాలు' ఇతరులకు ఎలా తెలుస్తాయి? అంతమాత్రాన వారిని పిలిచి, అందలాలు ఎక్కిస్తారా అంటున్నారు. అలాగే ఐఏఎస్ అయినవాళ్లనే రెవిన్యూ మంత్రిని చేస్తారా? రెవిన్యూశాఖ అంటే భూముల లోతుపాతులకు సంబంధించిన వ్యవహారాలేగా. కబ్జాదారుల కన్నా భూముల 'నోటు పాట్లు' తెలిసినవాళ్లు ఇంకెవ్వరుంటారు? 'కబ్జాల అనుభవాలనుబట్టి రెవిన్యూ శాఖ మంత్రిగా మీరే అర్హులు' అని మెళ్లో దండ వేసి మంత్రి దండం వేస్తారా? వరసబెట్టి చెబితే అన్ని విషయాల్లోనూ 'ఆరితేరినవాళ్లు' అన్ని జైళ్లలోనూ దొరుకుతారు! వెతకాల్సిన అవ



సరమే లేదు. వారిని పట్టుకొచ్చి పట్టుబట్టి 'మంత్రి దండం' చేతికిస్తారా? మంత్రుల ఎంపికకే ఇన్ని సమస్యలుంటే ముఖ్యమంత్రి, ప్రధానమంత్రుల ఎంపికకు ఇంకెన్ని ఇబ్బందులు, అన్ని రంగాల్లో అత్యున్నత విద్యార్హతలున్న మహానుభావులు ఎక్కడ దొరుకుతారు?

అన్నీ విద్యార్హతలు ఉన్నవాళ్లు ఎన్నికల్లో నిలబడగలరా? పొరపాటున నిలబడితే వాళ్లను ఓడగొట్టకుండా ఇప్పటి నాయకులు ఊరుకుంటారా, బతకనిస్తారా? మంత్రి పదవులు ఇవ్వదలచినవాళ్లందరికీ తగిన విద్యార్హతలు నిర్ణయించే రాత పరీక్షలు, ముఖాముఖి వంటివన్నీ పెట్టి ఎంపిక చేయాలంటే ఎలా సాధ్యం? గెలిచినవాళ్లనే మంత్రులుగా ఎంపిక చేసుకోవాలంటే తలపట్టుకోవాలిగా! దొరక్కపోతే తల ఎక్కడ పెట్టుకోవాలి? విద్యారంగంలో వీరాధివీరులు ఎంతమంది ఎన్నికల్లో నిలబడతారు? ఎంతమంది గెలవగలరు? పుస్తక పరిజ్ఞానం తప్ప 'మస్తక పరిజ్ఞానం' ఉన్నవాళ్లు ఎంతమంది? ఆచరణాత్మక అనుభవం ఉన్నవాళ్లు ఎక్కడ దొరుకుతారు? ఇదంతా అమలుపరిస్తే వేలిముద్రల మీద ఆధారపడ్డ ప్రజల్లో నుంచి నాయకులు ఎలా పుట్టుకొస్తారు? వాళ్లను నిరాకరిస్తే ఆ వర్గానికీ ప్రాతినిధ్యం లేనట్టేగా! అప్పుడు వాళ్ల ముద్ర ఏం కనిపిస్తుంది? ఇవన్నీ తెలుసుకుంటే కళ్లకు కాదు, ఓట్లకు బైర్లు కమ్ముతాయి.

అందరికీ అధికారంలో వాటా దక్కాలన్నదే గదా అందరి కోరిక. ఏ వర్గానికి అధికారం దక్కకపోయినా గొడవే. కానీ రాజకీయనాయకుల వాస్తవిక ధోరణి చూస్తుంటే ఏ 'వర్గమూ' రాజకీయాల్లోకి రావడం వాళ్లకు 'స్వ'సేమిరా ఇష్టం ఉండదు.

'కార్మికులారా... మీకు రాజకీయాలు ఎందుకు? చక్కగా కర్మాగారాల్లో పని చేసుకోండి. మీరు కష్టపడి పనిచేస్తే ఉత్పత్తి పెరుగుతుంది. దేశం సౌభాగ్యవంతమవుతుంది.

రైతులారా... మీరు అన్నదాతలు! మీకు రాజకీయాలు వృథా! చక్కగా పొలం పనులు చేసుకోండి. దేశానికి ఇంత అన్నం పెట్టినవాళ్లవుతారు!

విద్యార్థులారా... మీకు రాజకీయాలు అనవసరం. కష్టపడి చదివి విజ్ఞాన సంపద పెంచుకోండి. దేశాన్ని మరింత విజ్ఞాన ఖనిగా తీర్చిదిద్దండి. రాజకీయాల్లోకి వచ్చి మీ భవిష్యత్తును చెడగొట్టుకోకండి!

ఉపాధ్యాయులారా... మీరు అపర సరస్వతీమూర్తులు. మీరు విద్యాలయాల్లో చక్కగా పాఠాలు చెప్పండి. దేశానికి గొప్ప విద్యావేత్తలను అందించండి.

మేధావులారా... మీరు రాజకీయాలకు దూరంగా ఉండండి. మీ మేధను దేశ సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగించండి. రాజకీయాభివృద్ధికి కాదు.

కళాకారులారా... మీకు రాజకీయాలు వద్దు! మీ కళలతో దేశం కళకళలాడేట్టు చేయండి.

న్యాయవాదులారా... న్యాయదేవత మీ మీద ఆధారపడి ఉంది. దేశానికి న్యాయం చేయండి. రాజకీయాలకు కాదు.

వైద్యులారా... మీరు రోగులకు సేవ చేస్తే ఆరోగ్య భారతం అల్లంత దూరంలో ఉంటుంది!

ఇలా... ఏ ప్రత్యేక వర్గానికీ రాజకీయాలు అవసరం లేదన్నది రాజకీయ నాయకుల నిశ్చితాభిప్రాయంలా కనిపిస్తుంది.

ఇవన్నీ తెలిసిన ఒకాయన 'నిజమే! ఎవరి పనులు వాళ్లకుంటాయి. ఆ పనులను వాళ్లు చేయాల్సిందే. మరి రాజకీయాలంటే ఏ పనీ లేనివాళ్లు చేయాల్సిన పనా!' అని పళ్లికిలించాడు.

దేశం ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు ఏం చేయాలి?

'భగవాన్! పూర్తిగా మంత్రులుగా పనికొచ్చే నేతలను 'మంత్రి'ంచి భూమ్మీదికి 'పంపించు' అని సామూహిక, సర్వమత ప్రార్థనలు చేయడం తప్ప గత్యంతరం లేదు!

ఇక దేవుడి దయ... జనం ప్రాప్తం!

– శంకరనారాయణ

చదువు-సంస్కారం

'వ్యక్తి తన ఆత్మ స్వరూపాన్ని గ్రహించేట్లు చేయడమే విద్య ముఖ్య లక్ష్యం' అన్నారు వివేకానందస్వామి. ఆత్మ స్వరూపం తెలిసినవారు స్వపర భేదం పాటించరు. వారి ప్రవర్తనలో సంస్కారం ఉట్టిపడుతూ ఉంటుంది. సత్యం, సమానత, అహింస... ఇలాంటి సుగుణాలన్నీ సంస్కారానికి సంబంధించినవి. 'విద్యాబుద్ధులు', 'చదువు సంధ్యలు' అనేవి జంట పదాలుగా మన భాషలో ఇమిడిపోయాయి. బుద్ధి, సంధ్య అనేవి సంస్కారానికి సంబంధించిన పదాలు. విద్యాభ్యాసంలో ఈ రెండింటికీ స్థానం కల్పించారు. నేటి విద్యలో అవి లుప్తమైపోయాయి. ఉన్నత విద్య అభ్యసించినా అధికారులు ఎందరో అవినీతి పంకిలం అంటించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి! నిరక్షర కుక్షులు సైతం వారిని ఆక్షేపిస్తూ 'చదువుకున్నారు ఎందుకూ... దండగ' అంటున్నారు.

'సంస్కారం' అకృత్యాలకు అడ్డుకట్ట వేస్తుంది. సంస్కారవంతులు హీనులుగా, దీనులుగా ఉండటానికి ఇష్టపడరు. ఒకరి వద్దకు వెళ్లి చేయి చాచరు. శ్రీకృష్ణ కుచేలురు ఇద్దరూ సాందీపని ఆశ్రమంలో విద్యనభ్యసించారు. కలిసిమెలిసి చదువుకున్నారు. విద్యాభ్యాసానంతరం కృష్ణుడు ద్వారకాధిపతి అయ్యాడు. కుచేలుడికి బోలెడుమంది సంతానం. పిల్లలకు కడుపునిండా అన్నం కూడా పెట్టలేని దౌర్భాగ్యం. 'శ్రీకృష్ణుడు మీ బాల్య స్నేహితుడు కదా! మీరు వెళ్లి అడిగితే తప్పక సాయం చేస్తాడు!' అని ఆ ఇల్లాలు భర్తతో చెప్పింది. భార్య కండువాలో కట్టి ఇచ్చిన గుప్పెడు అటుకుల్ని తీసుకుని కుచేలుడు ద్వారకకు వెళ్లాడు. అక్కడ శ్రీకృష్ణుడు కుచేలుణ్ని కౌగలించుకొని, పాదాలు కడిగాడు. చిన్ననాటి ముచ్చట్లు గుర్తుకుతెచ్చాడు. అతడు తెచ్చిన అటుకుల్ని పుచ్చుకొన్నాడు. కుచేలుడు మాత్రం తాను వచ్చిన పని చెప్పలేకపోయాడు. చేయి చాచి అర్థించడానికి కుచేలుడి సంస్కారం అడ్డు వచ్చింది. అడక్కుండా ఇవ్వడం గొప్ప సంస్కారం! బాల్యమిత్రుడు కోరకపోయినా, అతడికి సర్వసంపదలూ ప్రసాదించాడు శ్రీకృష్ణ భగవానుడు. ఆ మిత్రులు చదువు ద్వారా పొందిన సంస్కారం అటువంటిది.

సంస్కార హీనత ఎలాంటి విపరీత పరిణామాలకు దారి తీస్తుందో కర్ణ, కీచక, దుర్యోధనుల జీవితాలను పరిశీలిస్తే తెలుస్తుంది. కర్ణుడికి విద్యాతృష్ణ ఎక్కువ. కానీ, మోసం చేసైనా విద్యనభ్యసించాలనుకోవడం సంస్కారహీనత. అబద్ధం ఆడి పరశురాముడి వద్ద విద్యార్థిగా స్థానం సంపాదించాడు. తరవాత సత్యం వెల్లడై, శాపానికి గురయ్యాడు. నేర్చిన విద్య అంతా వృథా అయింది. సంస్కారహీనుడి విద్య

మిథ్యగా నిరూపితమైంది. కీచకుడు దుర్బుద్ధితో ద్రౌపదిని వెంటాడి వేధించి, చివరకు నిండుసభలోకి ప్రవేశించడానికీ వెనకాడలేదు. మృత్యువు భీముడి రూపంలో అతణ్ని వెతుక్కుంటూ వచ్చి కీచకుడి పీచమణచింది. 'కురు' రాజు ఉత్తముడు. ఆ వంశంలో అందరూ విద్యావంతులే! కౌరవ పాండవులు భీష్మ ద్రోణాదుల వద్ద విద్యనభ్యసించారు. కానీ దుష్టత్వానికి మారుపేరుగా దుర్యోధనాదులు ఇతిహాసంలో స్థానం సంపాదించారు. సంస్కారవంతులుగా పాండవులు మన గుండెల్లో నిలిచిపోయారు. దుర్యోధనుడు మాయాజూదంలో ధర్మరాజును ఓడించాడు. నిండు సభలోకి ద్రౌపదీని జుట్టుపట్టుకొని దుశ్శాసనుడు ఈడ్చుకువచ్చాడు. తన తొడపై కూర్చోమని దుర్యోధనుడు ద్రౌపదికి నిండు సభలో సైగచేశాడు. చివరికి ద్రౌపది వస్త్రాపహరణకు తెగబడ్డారు. ఇవన్నీ కౌరవుల కుసంస్కారాన్ని చాటుతున్నాయి. ద్రౌపది జుట్టు పట్టి ఈడ్చుకు వచ్చిన దుశ్శాసనుడి రొమ్ము చీల్చి, తొడపై కూర్చోమన్న దుర్యోధనుడి తొడలు విరగ్గొట్టిన భీమసేనుడు, సంస్కారహీనులు ఎలాంటి దుర్గతి పాలవుతారో లోకానికి చాటాడు.

పైన పేర్కొన్నవారు విద్యావిహీనులు కాదు. చదువుతోపాటు సంస్కారం అబ్బకపోవడంవల్ల వారికి ఆ దుర్గతి ప్రాప్తించింది. 'విద్యలేనివాడు వింతపశువు' అంటారు. సంస్కారం లేని విద్యావంతుణ్ని ఏమనాలి? అలాంటి హీన పశువుల్ని ఉత్పత్తి చేసే కేంద్రాలుగా మన విద్యాలయాలు ఉండకూడదు. సంస్కారాన్ని నేర్పే విద్యాప్రణాళిక ఇప్పుడు మన దేశానికి అత్యవసరం!

– డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు

అనంతపురం జిల్లా మడకశిర సభలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేష్

చక్రం తిప్పేది చంద్రబాబే..
అనంత పర్యటనలో లోకేష్

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దేశ రాజకీయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చక్రం తిప్పబోతున్నారని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా మడకశిరలో బుధవారం పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. వైకాపా డ్రామా కంపెనీలా తయారైందన్నారు. మోదీ దర్శకత్వంలో అమిత్‌షా నిర్మాణంలో జగన్ కమెడియన్ పాత్ర పోషిస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ తన సొంత పత్రికలో ఏనాడైనా ప్రధాని మోదీపై వ్యతిరేకంగా వార్తలు రాశారా అని ప్రశ్నించారు. ఆనాడు కాంగ్రెస్‌తో లోపాయికారీ పొత్తు పెట్టుకుని రాష్ట్రాన్ని విభజించారనీ. . నేడు మోదీతో కలిసి హోదా రాకుండా అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. జగన్, పవన్ ఇద్దరు భాజపా ఆడించినట్లు ఆడుతున్నారని విమర్శించారు. కేంద్రంతో లాలూచీ పడి తనపై ఆరోపణలు చేయడం తగదనీ, ఏమైనా ఆధారాలు ఉంటే ప్రజల ముందుంచాలని సవాల్ విసిరారు. ప్రత్యేక హోదా కావాలంటే ప్రధాని మోదీని నిలదీయాలే తప్ప..రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న చంద్రబాబుపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అగ్రిగోల్డ్ కుంభకోణం కాంగ్రెస్ పుణ్యమేనని విమర్శించారు. బాధితులు అందరికీ ముఖ్యమంత్రి న్యాయం చేస్తారన్నారు. కార్యక్రమాల్లో మంత్రులు పరిటాల సునీత, దేవినేని ఉమ, కాలవ శ్రీనివాసులు, ఎంపీ నిమ్మల కిష్టప్ప, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

తుంగభద్రకు పెరిగిన వరద

కర్ణాటక, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయానికి వరదనీటి ప్రవాహం పెరిగింది. జలాశయం ఎగువ భాగమైన మలెనాడు ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే తుంగా జలాశయం నుంచి దిగువకు సుమారు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో రెండు రోజుల్లో వరదనీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శివమొగ్గలో 15.80 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, తీర్థహళ్లి తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. తుంగభద్ర పూర్తి స్థాయి నీటిమట్టం 1,633 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 1,582.55 అడుగులుగా ఉంది. జలాశయానికి 6,878 క్యూసెక్కుల వరద వస్తుంటే, దిగువకు 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 5.310 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి తుంగభద్ర జలాశయం నీటిమట్టం 0.903 టీఎంసీలు మాత్రమే.

మృత్యువై దూసుకొచ్చిన లారీ

- బొగ్గు లారీ ఢీకొని బోల్తా పడిన యాత్ర బస్సు
- ముగ్గురు యాత్రికుల మృతి
- మరో అయిదుగురికి తీవ్ర గాయాలు
- విజయనగరం జిల్లాలో జాతీయ రహదారిపై ఘటన

ఈనాడు - విజయనగరం

బస్సును ఢీకొన్న లారీ

బస్సులో ఇరుక్కుపోయిన ప్రయాణికులు

విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు వ్యక్తులను బలితీసుకుంది. భోగాపురం మండలం పోలిపల్లి కూడలి సమీపంలో బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఇందులో విశాఖపట్టణం జిల్లా యలమంచిలి మండలానికి చెందిన కరణం వెంకన్న(60), భీశెట్టి అచ్చియ్యమ్మ(50), అప్పలనర్సి(60) మృతిచెందారు. అయిదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 33 మంది క్షతగాత్రులయ్యారు.

జాతీయ రహదారి-16పై శ్రీకాకుళం వైపు వెళ్తున్న బొగ్గు లారీ పోలిపల్లి సమీపానికి వచ్చేసరికి ఇంజినులో సమస్య తలెత్తింది. చోదకుడు వాహనాన్ని సుమారు 61 మీటర్లు ఈడ్చుకుంటూ వెళ్లడంతో ముందు చక్రాల్లోని ఓ టైరు పేలిపోయింది. లారీని ఆపేందుకు ప్రయత్నిస్తుండగానే ఇంతలో వెనక నుంచి వేగంగా వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టడంతో బొగ్గులారీ పూర్తిగా అదుపు తప్పి అవతలి రోడ్డులో విశాఖ దిశగా వెళ్తున్న యాత్ర బస్సుని ఢీకొంది. దీంతో బస్సు మూడు పల్టీలు కొట్టి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు యాత్రికులు అక్కడికక్కడే మరణించారు. బస్సు సీట్ల మధ్యలో ఇరుక్కుపోయి క్షతగాత్రులంతా ఆర్తనాదాలు చేశారు. అధికారులు వేగంగా స్పందించి వెంటనే రెండు క్రేన్‌లు తెప్పించి బొగ్గు లారీ నుంచి బస్సుని విడదీశారు. బస్సులో ఇరుక్కున్న బాధితులందరినీ బయటకు తీసి విశాఖపట్టణం కేజీహెచ్, తగరపువలస అనిల్ నీరుకొండ, విజయనగరం పెద్దాసుపత్రులకు పంపించి చికిత్స అందించారు.

కాశీ యాత్ర చివరిరోజు..

విశాఖ జిల్లా యలమంచిలి, జి.కోడూరు, నర్సీపట్నం, కృష్ణాపురం, లింగరాజుపాలెం, పోతిరెడ్డిపాలెం, ఎర్రవానిపాలెం గ్రామాలకు చెందిన దాదాపు 40 మంది యాత్రికులు ఈ నెల 2న కాశీయాత్రకు బయలుదేరారు. మార్గమధ్యంలో వారణాసి, అయోధ్య, బుద్ధగయ, కోల్‌కతా, హౌరా ప్రాంతాల్ని సందర్శించి బుధవారం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం గోవిందపురం దేవాలయానికి చేరుకున్నారు. అక్కడే భోజనాలు చేసి మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. అక్కడి నుంచి సింహాచలం అప్పన్నని దర్శించుకుని రాత్రి 10 గంటలకే ఎవరిళ్లకు వారు చేరుకోవాలన్నది వారి ప్రణాళిక. అయితే మధ్యాహ్నం 2.20 గంటలకు పోలిపల్లి కూడలికి చేరుకునేసరికి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

బస్సు ప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈనాడు డిజిటల్, అమరావతి: విజయనగరం జిల్లాలో బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

బార్ కౌన్సిళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా హైకోర్టు న్యాయమూర్తులు

ఈనాడు, హైదరాబాద్: సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఈ నెల 29న తెలుగు రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు నిర్వహించనున్న ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులుగా ఇద్దరు ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జస్టిస్ పి.కేశవరావు, తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జస్టిస్ శంకరనారాయణలు వ్యవహరిస్తారంటూ కార్యదర్శి ఎన్.రేణుక బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీకి 107, తెలంగాణకు 86 నామపత్రాలు(నామినేషన్‌లు) దాఖలయ్యాయన్నారు. ఏపీలో 146, తెలంగాణలో 88 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నామని, తెలంగాణలో 27676 మంది, ఏపీలో 20,072 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఒక్కో బార్ కౌన్సిల్‌కు 25 మంది సభ్యుల ఎంపిక జరుగుతుందని, ఒక్కో న్యాయవాది ప్రాధాన్య క్రమంలో అయిదుగురికి ఓటు వేయవచ్చన్నారు. బార్ కౌన్సిల్, అసోసియేషన్‌ల గుర్తింపు కార్డులు చూపినవారికి బ్యాలెట్‌పత్రం అందజేస్తామన్నారు. ఏపీలో జులై 11న, తెలంగాణలో 23న కౌంటింగ్ జరుగుతుందని ఆమె వెల్లడించారు.

ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ కౌన్సెలింగ్ నేడు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం కింద విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ సంచాలకుడు రామారావు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కౌన్సెలింగ్ జరుగుతుందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఈ-మెయిల్‌కు పూర్తి వివరాలు పంపినట్లు వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్య కార్యదర్శి బి.ఉదయలక్ష్మి పాల్గొంటారని ఆయన చెప్పారు. విదేశీ విద్యాలయాల్లో చదవాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులు www.apepass.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి విజయసంకేతం చూపుతున్న సౌమ్యరెడ్డి

కర్ణాటకలో కాంగ్రెస్‌కు మరో విజయం

- జయనగర్ నియోజకవర్గంలో సౌమ్యరెడ్డి గెలుపు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరు నగర పరిధిలోని జయనగర విధానసభ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సౌమ్యరెడ్డి విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, భాజపాకు చెందిన ప్రహ్లాదబాబుపై 2889 ఓట్ల తేడాతో ఆమె గెలిచారు. ఎన్నికల ప్రచారంతో పాటు ఓట్ల లెక్కింపు సందర్భంగానూ ఇద్దరి మధ్య హోరాహోరీగా పోరుసాగింది. రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి, ప్రస్తుత బీటీఎం లేఅవుట్ విధానసభ సభ్యుడు రామలింగారెడ్డి కుమార్తె సౌమ్య రెడ్డికి 54,457 ఓట్లు లభించాయి. ప్రహ్లాద బాబుకు 51,568 ఓట్లు దాఖలయ్యాయి. జయనగర భాజపా అభ్యర్థి విజయకుమార్ హఠాన్మరణంతో గత నెల 12న జరగాల్సిన ఎన్నికను ఈ నెల 11న నిర్వహించారు. దీంతో ఆ పార్టీ తరపున విజయకుమార్ సోదరుడు ప్రహ్లాదబాబు బరిలోకి దిగారు. సౌమ్యరెడ్డి గెలుపుతో విధానసభలో కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య 80కి పెరిగింది. స్వతంత్ర సభ్యుడు నాగేశ్, కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీ సభ్యుడు శంకర్‌లు కాంగ్రెస్ పార్టీ మద్దతుదార్లు కావటంతో దిగువ సభలో ఆ పార్టీ బలం 82కు చేరుకుంది. కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య ఎన్నికల పొత్తు కుదరటంతోనే తమ పార్టీ అభ్యర్థి ప్రహ్లాదబాబు ఓటమి పాలైనట్లు ఫలితాల అనంతరం భాజపా అధ్యక్షుడు యడ్యూరప్ప వ్యాఖ్యానించారు.

30వరకు మధ్యాహ్న భోజనంలో మూడు గుడ్లే

ఈనాడు, అమరావతి: ఈ విద్యా సంవత్సరం నుంచి సర్కారు పాఠశాలల్లో మధ్యాహ్నభోజనంలోభాగంగా వారానికి ఐదు కోడిగుడ్లు ఇచ్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ.. ప్రభుత్వ అనుమతి లభించనందున పాతవిధానాన్నే అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ నెల 30 వరకు వారానికి మూడు కోడిగుడ్లు చొప్పున అందించాలని సరఫరా ఏజెన్సీలను ఆదేశించింది. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు కోడిగుడ్ల నిల్వకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని, వీటిని డిప్యూటీ డీఈవోలు, మండల విద్యాధికారులు తనిఖీలు చేయాలని సూచించింది. కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యార్థులకు బ్లూవేల్‌గేమ్‌పై అవగాహన కల్పించాలని సర్వశిక్షా అభియాన్ ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసింది.

గ్రానైట్ రంగానికి పరిశ్రమ హోదా కల్పించాలి: ఫ్యాప్జి

ఈనాడు, దిల్లీ: గ్రానైట్ రంగానికి పరిశ్రమ హోదా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గ్రానైట్ పరిశ్రమ సమాఖ్య (ఫ్యాప్జి) ప్రతినిధులు కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ (పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం) సంయుక్త కార్యదర్శి రవీంద్ర, గనుల శాఖ సంచాలకురాలు వీణాకుమారిలకు విజ్ఞప్తి చేశారు. దిల్లీలో బుధవారం అధికారులతో సమావేశమైన సమాఖ్య ప్రతినిధులు పరిశ్రమలలో పని విధానం మార్పు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందేందుకు వెసులుబాటు, విద్యుత్తు ఛార్జీల్లో రాయితీ వంటివి పొందేందుకు పరిశ్రమ హోదా ఉపయోగపడుతుందని వివరించారు. స్పందించిన అధికారులు పరిశ్రమ హోదా కల్పిస్తే కలిగే లాభాలు..ఇతర అంశాలపై సవివరమైన నివేదిక సమర్పించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విప్ కూన రవికుమార్, ఫ్యాప్జి ఛైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడిన బస్సు

- ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- 17 మంది మృత్యువాత, 25 మందికి గాయాలు

మైన్‌పురీ: ఉత్తర్ ప్రదేశ్‌లో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. వేగంగా వస్తున్న ఓ ప్రైవేటు బస్సు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో 17 మంది మృత్యువాతపడ్డారు. మరో 25 మందికి గాయాలయ్యాయి. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. 70 మందితో బస్సు రాజస్థాన్‌లోని జైపుర్ నుంచి ఫరూఖాబాద్ వెళ్తుండగా... తీరథ్‌పుర్ గ్రామ పరిసరాల్లో ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఘటన స్థలంలోనే ఓ మహిళ సహా 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృత్యువాతపడ్డారు. బాధితుల్లో ఎక్కువ మంది కూలీలే ఉన్నారని, వీరంతా ఉత్తర్ ప్రదేశ్‌కు చెందినవారేనని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ ఎడమ కాలు తెగిపడిందని, ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. మరోముగ్గురిని అత్యవసర చికిత్స అందించేందుకు ఆగ్రాలోని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మృతులు ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు చొప్పున పరిహారం ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. తీవ్ర గాయాలపాలైన వారికి రూ.50 వేలు ఇస్తామని వెల్లడించారు.

యూపీలోని తీరథ్‌పుర్ గ్రామ పరిసరాల్లో బోల్తా పడ్డ బస్సు

మృతులకు మోదీ సంతాపం

బస్సు ప్రమాదంలో 17 మంది మృతిచెందడంపై మోదీ సంతాపం ప్రకటించారు. 'మైన్‌పురి ప్రమాదంలో మృత్యువాతపడిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి'అని ప్రధాన మంత్రి కార్యాలయం ట్వీట్‌చేసింది.

నాగవైష్ణవి కేసు తీర్పు నేడే

ఈనాడు, అమరావతి: విజయవాడ నగరంలో ఎనిమిదేళ్ల కిందట సంచలనం సృష్టించిన చిన్నారి నాగవైష్ణవి కేసు తుది తీర్పు గురువారం వెలువడనుంది. 2010 జనవరి 30న కుటుంబ తగాదాలు, ఆస్తి గొడవల నేపథ్యంలో నాగవైష్ణవిని సొంత బంధువులే చంపారు. ఆ రోజు పాఠశాలకు కారులో వెళ్తున్న ఆ చిన్నారిని నిందితులు శ్రీనివాసరావు, జగదీష్, వెంకటరావులు అటకాయించి డ్రైవర్‌ను చంపి అపహరించారు. అనంతరం విజయవాడ నుంచి గుంటూరులో కారులో తీసుకెళ్తూ గొంతు నులిమి చంపేశారు. గుంటూరు ఆటోనగర్‌లోని కొలిమిలో వేసి బూడిద చేశారు. ఈ సమాచారం విన్న ఆమె తండ్రి ప్రభాకరరావు గుండెపోటుతో చనిపోయారు. తల్లి నర్మదాదేవి కూడా ఇటీవల మరణించింది. విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. పలువురు సాక్షులను విచారించారు. ఇటీవల ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. తుది తీర్పును న్యాయమూర్తి గురువారం వెలువరించనున్నారు.

ఈ-రవాణా పర్మిట్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలి
మార్కెటింగ్ కమిషనర్ శామ్యూల్ ఆనంద్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో ఈ-రవాణా పర్మిట్ విధానాన్ని జులై1 నుంచి పక్కాగా అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్ సూచించారు. అన్ని ఏర్పాట్లను నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఆ శాఖకు చెందిన వివిధ స్థాయిలోని ఉన్నతాధికారులు, యార్డుల కార్యదర్శులతో గుంటూరులో సమావేశమయ్యారు. 13 జిల్లాల నుంచి ముగ్గురు అధికారులను ఎంపిక చేసి ఈ-ప్రగతి ద్వారా వారికి శిక్షణ ఇప్పించారు. ఇక్కడ శిక్షణ పొందిన అధికారులు సంబంధిత యార్డుల పరిధిలో ఉన్న వ్యాపారులు, సిబ్బందికి 25లోగా శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. యార్డుల్లో 30లోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవ్వాలని ఆదేశించారు. ఈ-రవాణా పర్మిట్ లేకపోతే రెండు రెట్లు మార్కెట్ ఫీజుతో పాటు రూ.5000లు వరకు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

25 నుంచి సీఎస్‌ఎస్ ఉపకారవేతనాల నమోదు

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సెంట్రల్ సెక్టర్ స్కీమ్(సీఎస్ఎస్) ఉపకారవేతనానికి ఎంపికైన విద్యార్థులు www.scholarships.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి బి.ఉదయలక్ష్మి తెలిపారు. జూన్ 25 నుంచి నమోదు ప్రారంభమవుతుందని.. తుది జాబితా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నిర్ణయిస్తుందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితా సంబంధిత జూనియర్ కళాశాల లాగిన్‌లో ఉంచినట్లు వివరించారు.

వేరే పార్టీతో పొత్తు ప్రశ్నే లేదు

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ

ఈనాడు - అమరావతి

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వేరే పార్టీతో పొత్తు ప్రశ్నే లేదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ స్పష్టం చేశారు. 'పార్టీలతో కాదు ప్రజలతోనే మా పొత్తు... అదే 2019లో మా ఎన్నికల నినాదం..' అని వెల్లడించారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని పార్లమెంట్‌లో... బయటా యూపీఏ హయాంలో మేం హామీనిస్తే మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదని విమర్శించారు. దాదాపు నాలుగేళ్లపాటు భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీయే ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదన్నారు. తన తప్పును కప్పి పుచ్చుకునేందుకే కాంగ్రెస్సే దోషి, ఆ పార్టీ వల్లే రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బుధవారం ఆయన ఆంధ్రరత్నభవన్‌లో ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఇతర సీనియర్ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'భాజపా అన్ని విషయాల్లోనూ మోసం చేస్తోంది. ప్రజల్లో ఎంతో అసంతృప్తి నెలకొంది. వారు మార్పు కోసం చూస్తున్నారు...' అని వెల్లడించారు.

ఆంధ్రరత్నభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఊమెన్ చాందీ. చిత్రంలో కొప్పుల రాజు, రఘువీరారెడ్డి, కేవీపీ, పనబాక లక్ష్మి తదితరులు

వాడివేడిగా ఏపీసీసీ కార్యవర్గ సమావేశం

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన ఏపీసీసీ కార్యవర్గ సమావేశం వాడివేడిగా కొనసాగింది. పార్టీ బలోపేతానికి సహకరించని వారిపై కఠినంగా వ్యవహరిస్తానని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి చెప్పారు. మాజీ సభాపతి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టాలన్నారు. మాజీ ఎంపీ చింతమోహన్ మాట్లాడుతూ పార్టీలో దళితులకు నాయకత్వం ఇవ్వాలన్నారు. పలువురు రఘువీరా పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నాయకులందరికీ లక్ష్యాలను నిర్దేశించాలని పలువురు కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, జిల్లా, మండల, బూత్ స్థాయిల్లో కమిటీలను బలోపేతం చేయాలని... అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేయాలని... ఇవన్నీ జూన్ 15 నుంచి సెప్టెంబరు 30 లోగా పూర్తి చేయాలంటూ చాందీ నేతలకు కార్యాచరణను నిర్దేశించారు. రాహుల్‌గాంధీ 48వ జన్మదినాన్ని పురస్కరించుకుని 'ఏపీకి ప్రత్యేకహోదా రావాలన్నా.. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్నా రాహుల్‌తోనే సాధ్యం...' అన్న నినాదంతో 19న రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు.

విద్యుత్తు కారు (పాతచిత్రం)

త్వరలో తితిదేకు విద్యుత్తు వాహనాలు
తొలివిడతగా 50 కేటాయింపు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల, తిరుపతి దేవస్థానం ప్రపంచంలోనే విద్యుత్తు వాహనాలను వినియోగించనున్న తొలి దివ్యక్షేత్రంగా గుర్తింపు పొందనుంది. విద్యుత్తు వాహనాల విధానం కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరుకు 350 వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. వీటిలో 50 వాహనాలను తితిదేకు కేటాయించాలని సంకల్పించింది. దేవస్థానంలో వివిధ వాహనాలు 320 వరకు ఉన్నాయి. మరో 60 అద్దె కార్లు వినియోగిస్తోంది. వీటి స్థానంలో విద్యుత్తు వాహనాలను సమకూర్చుకోవాలని తితిదే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇలాంటి వాహనాలకు కేంద్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది.

19న ఉత్సవమూర్తికి స్వర్ణ కవచం తొలగింపు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఉత్సవ మూర్తి అయిన శ్రీమలయప్ప స్వామివారికి స్వర్ణ కవచాన్ని ఈనెల 19న తొలగించనున్నట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 24 నుంచి 26 వరకు జ్యేష్ఠాభిషేకం ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ క్రతువును నిర్వహించనుంది.

మగబిడ్డ పుట్టాలని వేధింపులు

- ఇద్దరు ఆడబిడ్డలు సహా గర్భిణి ఆత్మహత్య
- చిత్తూరు జిల్లాలో విషాదం

చిత్తూరు, న్యూస్‌టుడే: మూడో కాన్పులోనైనా మగబిడ్డ పుట్టాలని అత్తింటి వారు పెట్టే వేధింపులు భరించలేక ఇద్దరు ఆడబిడ్డలతో సహా గర్భిణి బావిలో దూకి ఆత్మహత్యకు ఒడిగట్టింది. చిత్తూరు గ్రామీణ మండలం పేయన కండిగ గ్రామంలో బుధవారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. యాదమరి మండలం ఎగువపాతపాలెం గ్రామానికి చెందిన జగన్నాథం, చిన్నమ్మ దంపతుల రెండో కుమార్తె సరళకు.. పేయని కండిగలోని రాజేంద్ర, కృష్ణవేణి కుమారుడు గురునాథన్‌కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి పిల్లలు జాహ్నవి(4), దేవిశ్రీ(2) ఉన్నారు. ప్రస్తుతం సరళ ఐదునెలల గర్భిణి. రెండుసార్లు ఆడపిల్లలే పుట్టడంతో అత్త, మామ, భర్త ఆమెను వేధించేవారు. మూడో కాన్పులో మగబిడ్డ పుట్టాలని పూజలు, నాటువైద్యం చేయించారు. చివరకు బిడ్డ ఎవరనేది తెలుసుకోవడానికి స్కానింగ్ చేయించారు. కడుపులో ఉన్నది ఆడబిడ్డ అనే అనుమానంతో తరచూ దాడి చేసేవారు. మంగళవారం రాత్రి ఆమెపై మామ..దాడి చేశాడని స్థానికులు తెలిపారు. దీంతో వేధింపులు భరించలేక.. అర్ధరాత్రి సమయంలో పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు మృతదేహాలను వెలికితీశారు. పలువురు గ్రామస్థులు సైతం మృతులను చూసి విలపించారు. చిత్తూరు డీఎస్పీ సుబ్బారావు, గంగాధరనెల్లూరు ఎస్సై రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్య వివరాలు సేకరించారు. ఆత్మహత్యకు కారకులుగా భావిస్తున్న మృతురాలి అత్త, మామ, భర్తను అదుపులోకి తీసుకున్నారు.

బిడ్డలతో సహా ఆత్మహత్య చేసుకున్న సరళ

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం నిరుద్యోగులకు ముందస్తు శిక్షణ

ఈనాడు డిజిటల్, అమరావతి: ఈ ఏడాది జులైలో తూర్పు గోదావరి జిల్లా కాకినాడ, అక్టోబరులో కర్నూలు నగరంలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే నిరుద్యోగ యువతకు అవసరమైన శిక్షణను యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ శాఖకు అనుమతిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో అభ్యర్థులు సులభంగా ఎంపికయ్యేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలోభాగంగా 13 జిల్లాలకు చెందిన అర్హులైన నిరుద్యోగులకు కాకినాడ, కర్నూలు నగరాల్లోనే 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

గౌరీ లంకేశ్‌ను నేనే కాల్చేశా

- విచారణలో వాగ్మోరే నేరాంగీకారం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: హిందువులు, హిందూ సంస్థలను కించపరుస్తూ ప్రసంగాలు చేస్తున్నందునే పాత్రికేయురాలు గౌరీ లంకేశ్‌ను తుపాకీతో కాల్చి హత్య చేశానని కీలక నిందితుడు పరశురామ్ వాగ్మోరే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారుల వద్ద తన నేరాన్ని అంగీకరించాడు. ఆరు రౌండ్లు కాల్చినట్లు వెల్లడించాడు. హత్య తరువాత తుపాకీని తన సహచరుల్లో ఒకరికి ఇచ్చేశానని బుధవారం విచారణ సందర్భంగా చెప్పాడని అధికారులు వెల్లడించారు. ఆ తుపాకీ ఎవరికి ఇచ్చిందీ గుర్తుకు రావడం లేదన్నారు. దీంతో ఆ సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు. హత్య చేశాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో నిందితుడు తలదాచుకున్నాడని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే సిట్ అదుపులో ఉన్న నవీన్ కుమార్ అలియాస్ హొట్టె నవీన్ పాత్రనూ కీలకంగా భావిస్తున్నారు. హత్య తరువాత పరశురామ్ వాగ్మోరే, ఇతర నిందితులకు నవీన్ ఆశ్రయం ఇచ్చాడని గుర్తించారు. శుక్ర, శనివారాల్లో దర్యాప్తుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఐపీఎస్ అధికారి అనుచేత్ బుధవారం బెంగళూరులో విలేకరులకు తెలిపారు.

గౌరీ లంకేశ్ (దాచిన చిత్రం)

ASIAN COLLEGE
హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు
ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ.
10th, Inter /Degree పాస్/ ఫెయిల్
కోర్సు చదువుతున్నప్పుడే నెలకు
7-10 వేల వరకు సంపాదించుకునే అవకాశం
SC, ST, BC, EBC లకు స్కాలర్‌షిప్ సౌకర్యం
Vijayawada, Cell: 9490002031

SIDDHARTHA INSTITUTE OF HOTEL MANAGEMENT & CATERING TECHNOLOGY
(Sponsors : Siddhartha Academy of General & Technical Education)
Affiliated to Krishna University, Machilipatnam.
Pinnamaneni Policlinic Road, VIJAYAWADA-10. Ph.0866-2493042. www.siddharthaihmct.com
COURSES
B.Sc HOSPITALITY & HOTEL ADMINISTRATION.
Eligibility: Inter Pass / Equivalent
FOOD PRODUCTION 1 1/2 years, Elg.10th Pass.
PLACEMENT 100% ASSISTANCE
FOR FURTHER DETAILS CONTACT 9948136382

DR.Y.S.R. HORTICULTURAL UNIVERSITY
VENKATARAMANNAGUDEM, WEST GODAVARI DISTRICT-534 101, AP
CONVOCATION NOTIFICATION
No.1485/COE/Academic/2018 Date.14.06.2018
The 3rd Convocation of Dr. Y.S.R. Horticultural University is proposed to be held during last week of August, 2018. All the UG/PG candidates who have qualified during the period from 11-08-2016 to 25-07-2018 are eligible for admission into this convocation. All details (Including fee) along with separate application forms for award of degrees 'In-person / In-Absentia, are available in the University website : www.drysrhu.edu.in.
Dr.B.SRINIVASULU
REGISTRAR

INDIAN INSTITUTE OF PETROLEUM & ENERGY (IIPE)
VISAKHAPATNAM, A.P. INDIA
ADMISSION NOTIFICATION 2018-19
Indian Institute of Petroleum & Energy (IIPE) - Visakhapatnam, Andhra Pradesh, an Institute of National importance at par with IITs, IIM under Ministry of Petroleum & Natural Gas, Govt. of India calls for admissions for the academic year 2018-19 for four year B.Tech (Petroleum Engineering) and B.Tech (Chemical Engineering.) programs. Aspirant students can go through the admission notification in the web site of IIPE www.iipe.ac.in for the admission criterion and other details from 15th June, 2018 onwards for applying online.
Advertisement Release date: 14th June, 2018 DIRECTOR

aptdc ANDHRA PRADESH TOURISM DEVELOPMENT CORPORATION LIMITED
D.No.55-17-2 to 4, Stalin Corporate 5th Floor,
Near CGO Complex, Industrial Estates, Autonagar, Vijayawada - 520007.
"e"Procurement Notice
Tender Notice No.08/APTDC/2018-19 , dt: 13.06.2018

Sl.No.	Name of the work
1	The APTDC invites tenders the following Developmental works at varoius Buddhist Destinations in Andhra Pradesh. Works Cost Rs. 25.54 Crores The details can be seen at 'e'procurement market place i.e www. apeprocurement.gov.in

Sri. D. Gangadhar Reddy
Superintending Engineer, APTDC Ltd, VJA

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం **ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**
Roc.No.TTD-34022(31)/114/2018-Procurement Sec-TTD. తేది: 12-06-2018.
తి.తి.దే., తిరుపతి మార్కెటింగ్ విభాగం వారిచే 6 నెలల కాలానికి గాను దిగువ పేర్కొన్న ఐటమ్ సేకరణ నిమిత్తం ఈ-టెండర్లు కోరడమైనది.

క్రమ సంఖ్య	ఐటమ్ పేరు	డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేదీలు
1.	1,00,000 బండిల్స్ (ప్రతి బండిల్‌కు 100 చొప్పున) ప్లేట్ లీఫ్స్	15-06-2018 29-06-2018

టెండరు డాక్యుమెంట్లను వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి వివరాలకుగాను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 0877- 2264079, 2264555. ఫ్యాక్స్: 2264554 మరియు మెయిల్ ఐడి: gmpttd@gmail.com
Roc.No.PR4/1090/Adv.No.109/PRO/2018, Dated: 13.06.2018. - కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
2వ అంతస్తు, ప్లాట్ నెం.9, సర్వే నెం. 49, ఐ.టి.పార్క్, మంగళగిరి-522 503.
ఫోన్ నెం. 89786 22966, ఫాక్స్: e-మెయిల్: aphmhidc@gmail.com
టెండరు నోటీసు నెం. 5/APMSIDC/Equipment/2018-19 తేది: 11-6-2018
పరీక్ష ప్రాతిపదికపై TB మరియు రిఫామ్‌పిసిన్ రెసిస్టెన్స్‌ను కనుగొనుట కొరకు 225 DMCల వద్ద RT PCR సర్వీసు ఏర్పాటుకొరకు రెంటల్ బేస్డ్ రేట్ కాంట్రాక్ట్ నిమిత్తం e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా APMSIDC టెండర్లను కోరుతున్నది.
1. మొత్తం పనుల సంఖ్య : 1 నెం.
2. వివరమైన ప్రకటన మరియు తదుపరి వివరాలకు వెబ్‌సైట్ http://msidc.ap.nic.in & www.tenders.apeprocurement.gov.inను దర్శించగలరు. సంప్రదించండి. EE (ఎక్విప్‌మెంట్) మొబైల్ నెం. 89786 22966. ఎట్టి కారణాలు చూపకుండా ఏ సమయములోనైనా టెండరును రద్దుచేయుటకు APMSIDCకి హక్కు కలదు.
DIPR No. 169PP/CL/Advt/1/1/2018-19 సం/- మేనేజింగ్ డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఏ.పి.గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్
ప్లాట్ నెం. 30, రోడ్ నెం.: 4, సెక్టర్ నెం. 4, లోటస్‌ల్యాండ్ మార్క్, కేదారేశ్వరిపేట, విజయవాడ. www.urbangreening.ap.gov.in,
e-మెయిల్: apurbangreening@gmail.com ఫోన్ నెం: 0866-2530833
e- టెండరు ప్రకటన
దిగువ పేర్కొన్న పనులకు వేర్వేరుగా e-టెండర్లు (3వ పిలుపు) కోరబడుచున్నవి.

టెండరు నోటీసు నెం.	పని పేరు	అంచనా విలువ రూ.లలో
1. 483/APUG&BC/ AMRUT 2016-17/ Tenders/2018-19/02(10) తేది: 13-6-2018	AMRUT 2016-17 క్రింద, కర్నూలు జిల్లా ఆదోని పురపాలక సంఘం, ఇందిరానగర్ పార్క్ వద్ద హార్డ్‌స్కేప్ (సివిల్) పనుల అభివృద్ధి.	29,20,234/-
2. 1103/APUG&BC/ AMRUT 2017-20/ Tenders/2018-19/02(9) తేది: 13-6-2018	AMRUT 2017-20 క్రింద, ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది (9) ULBల వద్ద వేర్వేరుగా హార్డ్‌స్కేప్ (సివిల్) పనుల అభివృద్ధి.	5,35,18,305/-

బిడ్ డాక్యుమెంట్ల పూర్తి సెట్‌ను ఏపి ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ http://www.apeprocurement.gov.in/ మరియు ఏ.పి.గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ వెబ్‌సైట్ http://urbangreening.ap.gov.in వద్ద ది. 14-6-2018 ఉ.గం. 10.00ల నుండి చూడవచ్చును.
సం/- చంద్రమోహన్‌రెడ్డి. N, MD (NCMR),
DIPR No. 167PP/CL/Advt/1/1/2018-19 O/o మేనేజింగ్ డైరెక్టర్-APUG&BC

సాధారణ టికెట్ల కోసం రైల్వే యాప్

దిల్లీ: రిజర్వేషన్ అవసరం లేని టికెట్ల జారీ కోసం రైల్వేశాఖ ప్రత్యేక మొబైల్ యాప్‌ని అందుబాటులోకి తెచ్చింది. టికెట్లు తీసుకోవడం, కావాలంటే వాటిని రద్దు చేసుకోవడంతోపాటు నెలవారీ టికెట్లు, ప్లాట్‌ఫాం టికెట్లు దీని ద్వారా పొందవచ్చు. నగదును రైల్వే వాలెట్‌లో జమ చేసుకుంటే దాని ద్వారా చెల్లింపులు జరుగుతాయి. 'అన్ రిజర్వ్‌డ్ టికెట్ వ్యవస్థ'ను రైల్వే వర్గాలు యూటీఎస్‌గా పిలుస్తాయి. అదే సంక్షిప్త పదం కలిసివచ్చేలా 'యూటీఎస్‌ఆన్‌మొబైల్' పేరుతో 'రైల్వే సమాచార వ్యవస్థ కేంద్రం' (క్రిస్) ఈ యాప్‌ని తీర్చిదిద్దింది. గూగుల్ ప్లేస్టోర్ లేదా విండోస్ స్టోర్ నుంచి దీనిని ఉచితంగా పొందవచ్చని రైల్వే శాఖ తెలిపింది. 'పేరు, నగరం, చరవాణి సంఖ్యవంటి కొన్ని వివరాలు సమర్పించి మొదటగా ప్రయాణికులు దీనిలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అది విజయవంతంగా పూర్తికాగానే రైల్వే వాలెట్ దానంతట అదే సున్నా నిల్వతో వచ్చేస్తుంది' అని వివరించింది.

भारतीय विमानपत्तन प्राधिकरण AIRPORTS AUTHORITY OF INDIA
E-టెండర్ ప్రకటన
(టెండర్ ID No: 2018_AAI_11225_1)
ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, దక్షిణ మండలం 05 సంవత్సరాల కాలానికి ఈ క్రింది దక్షిణ మండల ఎయిర్‌పోర్ట్‌లలో "Wellness Centre" నిర్వహించడానికి లైసెన్స్ మంజూరు చేయడానికి E-టెండర్ ఆహ్వానిస్తోంది.
క్లస్టర్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్స్ - క్లస్టర్- II (తిరుచ్చి, కోయంబత్తూరు, మదురై మరియు తిరుపతి). కనీస నెలసరి గ్యారంటీ (MMG) రూ. 7,21,600/- మరియు టెండర్ అమ్మకానికి మరియు e-బిడ్స్ దాఖలు చేయడానికి ఆఖరి రోజు 27.06.2018 e-టెండర్ కోసం పోర్టల్ చిరునామా www.etenders.gov.in ఇంకా వివరాల కోసం మా వెబ్‌సైట్ www.aai.aero లోని www.airportsindia.org.in దర్శించండి.
సంప్రదించండి: జాయింట్ జనరల్ మేనేజర్ (Comml)/ SR ఫోన్: 044-2256 0418. E-మెయిల్ id: gmcommlsr@aai.aero పై టెండర్లకి సంబంధించి ఏ విధమైన పొడిగింపు / సవరణ AAI / CPP పోర్టల్‌లో మాత్రమే ప్రకటించబడును. అప్‌డేట్స్ కోసం మా వెబ్‌సైట్ చూడమని అందరినీ కోరుతున్నాము.
రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
దక్షిణ మండలం, చెన్నై

నీట్‌లో రాష్ట్ర విద్యార్థులే ముందంజ

- జాతీయ స్థాయిలో 48%, రాష్ట్రంలో 72% అర్హత
- తొలి 200లోపు ర్యాంకుల్లో 13 మంది రాష్ట్ర విద్యార్థులే
- 20న ప్రవేశాల ప్రకటన జారీ
- 25 నుంచి తొలివిడత కౌన్సెలింగ్
- ఆగస్టు మూడో వారం నుంచి తరగతులు
- ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన వర్సిటీ ఉపకులపతి సీవీరావు

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఉపకులపతి సీవీరావు

ఈనాడు - అమరావతి

జాతీయ వైద్య విద్య అర్హత ప్రవేశ్ పరీక్ష (నీట్)లో రాష్ట్ర విద్యార్థులు 72% మంది అర్హత సాధించారని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి సీవీ రావు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 13,26,775 మంది నీట్ రాయగా 6,34,899(48%) మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 54,246 మంది నీట్ రాయగా 39,051(72%) మంది అర్హత సాధించినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా తొలి 200 ర్యాంకుల్లో 13 రాష్ట్ర విద్యార్థులకు దక్కినట్లు చెప్పారు. వీరిలో అమ్మాయిల కంటే అబ్బాయిలు ఎక్కువగా ఉన్నారన్నారు. 2018-19 విద్యా సంవత్సరంలో ప్రవేశాలను కేంద్ర మార్గదర్శకాలు అనుసరించి చేబడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఎంబీబీఎస్, దంతవైద్య సీట్ల భర్తీ కోసం ప్రకటన జారీచేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంగళవారం తెలిపారు. ఆయన చెప్పిన ప్రధాన అంశాలు..

- ఈ కొత్త విద్యా సంవత్సరం నుంచి తొలిసారిగా జాతీయ స్థాయిలో 15% సీట్ల భర్తీ జరగబోతుంది. ఇవిపోగా మిగిలిన సీట్లలో 15% ఆన్ రిజర్వుడులో భర్తీ చేస్తాం. ఇవిపోగా మిగిలిన సీట్లను ఏయూ, ఎస్వీయూ ప్రాంతాల వారీగా భర్తీచేస్తాం.
- ఎంబీబీఎస్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో కలిపి మంగళవారం నాటికి 3,950 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన సీట్లలో 283 సీట్లను జాతీయ స్థాయిలో కేంద్రం భర్తీచేస్తోంది. ఇవి పోగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మిగిలిన 1594 సీట్లు, 13 ప్రైవేట్ కళాశాలల్లోని 1025 సీట్లకు కన్వీనర్ కోటాలో భర్తీ జరుగుతుంది. యాజమాన్య కోటా కింద గుర్తించిన సీట్లలో 35% బి, 15% సి కేటగిరి కింద భర్తీచేస్తాం. ఏ కేటగిరి కింద రూ.12 వేలు, బీ కేటగిరి కింద 12,73,388 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. సీ కేటగిరి సీట్ల కింద ఒక్కొక్క దానికి రూ. 12,73,388 రూపాయలపై ఐదింతల వరకు వసూలు చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కానీ.. 2017-18 విద్యా సంవత్సరంలో యాజమాన్యాలు రూ.30,00,000 ఫీజును నిర్ణయించాయి. దీనిపై రెండురోజుల్లో యాజమాన్యాలతో సమావేశం కాబోతున్నాం.
- దంత వైద్య విద్యలో కన్వీనర్ కోటా కింద ప్రభుత్వ వైద్య కళాశాలలో 119, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 700 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ దంత వైద్య కళాశాలలకు చెందిన 21 సీట్లు జాతీయ కోటాలోకి వెళ్లాయి. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 700 సీట్లను బి, సి కేటగిరి కింద భర్తీచేస్తాం.
- ఈ నెల 25వ తేదీ నుంచి తొలివిడత కౌన్సెలింగును ప్రారంభిస్తాం. రెండు విడతలుగా కౌన్సెలింగ్ ఉంటుంది.
- యాజమాన్య కోటా కింద బీ, సీ కేటగిరి సీట్ల భర్తీ విశ్వవిద్యాలయం ద్వారానే జరుగుతుంది. నిర్దేశిత గడువు తరువాత కూడా సీట్లు భర్తీకాకుంటే వాటిని యాజమాన్యాలకు అప్పగిస్తాం. ఆగస్టు 18వ తేదీనాటికి ప్రవేశాలను ముగిస్తాం. మూడో వారంలో తరగతులు ప్రారంభించాలన్నది ఆలోచన.
- జాతీయ స్థాయిలో మూడువేల ర్యాంకులలోపు 181, ఐదు వేలలోపు 278, ఏడు వేలలోపు 365, ఎనిమిది వేలలోపు 422 మంది రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఉన్నారు.
- జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ర్యాంకులు గత వారం వెలువడ్డాయి. రాష్ట్రాల వారీగా విద్యార్థుల సాధించిన ర్యాంకుల జాబితా కేంద్రం నుంచి ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి మంగళవారం అందింది. దీనిని విశ్వవిద్యాలయం విశ్లేషించి తొలి 200 ర్యాంకుల్లో ఉన్న విద్యార్థుల జాబితాను ప్రకటించింది.

సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి, చిత్రంలో తులసిరెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు వెల్లంపల్లి తదితరులు

మద్యంపై ఐక్యంగా పోరాడాలి

- రాజకీయ పార్టీలకు వక్తల సూచన

కృష్ణలంక, న్యూస్‌టుడే: రాజకీయ పార్టీలన్నీ ఐక్యంగా పోరాడినప్పుడే మద్యం సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జన చైతన్య వేదిక, వావిలాల సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మద్య వ్యతిరేక ఉద్యమ రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ. . ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూస్తుండటంతో గత నాలుగేళ్లల్లో అమ్మకాలు 35శాతం, ఎక్సైజ్ ఆదాయం 100శాతం పెరిగిందన్నారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పలు రాష్ట్రాల్లో సంపూర్ణ మద్య నిషేధం అమలులో ఉందని, గుజరాత్‌లో ఎక్సైజ్ ఆదాయం లేనప్పటికీ గణనీయంగా అభివృద్ధి సాధించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ. . మద్యం కారణంగా లక్షలాది కుటుంబాలు విచ్ఛినమవుతుండటం బాధాకరమన్నారు. సీపీఎం నాయకులు వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకుల్లో అధికులు మద్యం వ్యాపారస్తులే కావడం ఆందోళన కలిగించే అంశమన్నారు. వైకాపా నాయకులు వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఐ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానిలు మాట్లాడుతూ ప్రభుత్వం గుట్కా, పొగాకు ఉత్పత్తులపై సాగిస్తున్న ప్రచారం తరహాలో మద్యం దుష్ఫలితాలపై కూడా ప్రచారాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు రాగి గంగాభవాని, వావిలాల సంస్థ కార్యదర్శి మన్నవ షోడేకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

మొదటి రోజు 335 మంది హాజరు

నూజివీడు, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ 2018 సంవత్సర ప్రవేశాల ప్రక్రియ బుధవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ప్రారంభమైంది. ఈ నెల 13, 14, 16, 18 తేదీల్లో ఎన్‌సీసీ కోటా కింద నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఇక్కడ పరిశీలిస్తారు. రోజుకు 400 మంది విద్యార్థులు చొప్పున 1,600 మందిని పిలిచారు. బుధవారం 400 మందికిగాను 335 మంది హాజరైనట్లు ఆర్జీయూకేటీ ప్రవేశాల కన్వీనర్ గోపాలరాజు తెలిపారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య వీరంకి వెంకటదాసు పత్రాల పరిశీలన ప్రక్రియను ప్రారంభించారు. ఆంధ్రా ఈఎంఈ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎం.టి.స్వామి పర్యవేక్షణలో ఎన్‌సీసీ అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్ గోపాలరాజు మాట్లాడుతూ.. ఎన్‌సీసీ అధికారులే ఆ కోటా విద్యార్థులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో క్రీడా కోటా, 19న దివ్యాంగులు, సైనిక సంతతి(క్యాప్) కోటాల విద్యార్థుల పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. సాధారణ విద్యార్థుల ఎంపిక జాబితాను జూన్ నెల ఆఖరి వారంలో మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రకటిస్తారని వివరించారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ డీన్ అకడమిక్ ఐ.రమాకాంత్, పీడీలు సూర్య, సుబ్బలక్ష్మి పర్యవేక్షించారు.

వారధి దాటిన ప్రజాసంకల్ప యాత్ర

- అభివాదాలతో ముందుకు సాగిన జగన్

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లాలో కొనసాగుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర బుధవారం ధవళేశ్వరం వద్ద కాటన్ వారధిని దాటి కొత్తపేట నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఉదయం రాజమహేంద్రవరం ఆల్కట్ తోటలోని గ్లోరిడియో లూథరన్ చర్చి నుంచి విపక్ష నేత నడక ప్రారంభించారు. వేదపండితుల ఆశీస్సుల అనంతరం పాదయాత్ర ధవళేశ్వరం వైపు సాగింది. జగన్‌ను చూసేందుకు స్థానికులు, సమీప గ్రామస్థులు పెద్ద ఎత్తున రావడంతో రహదారులు కిక్కిరిశాయి. మధ్యాహ్నం 12.55 గంటలకు పాదయాత్ర కాటన్ వారధి వద్దకు చేరుకుంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత తిరిగి ప్రారంభమైన యాత్ర వారధి దాటి ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక మీదుగా పేరవరం చేరుకుంది. కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక వద్ద ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నేతలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి 5 కిలోమీటర్లు పాదయాత్ర చేసి పేరవరం గ్రామంలో జగన్ రాత్రి బస చేశారు. యాత్రలో ఎక్కడా వైకాపా అధ్యక్షుడు ప్రసంగించలేదు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. చిన్నారులు, యువతతో సెల్ఫీలు దిగారు. మహిళలు, వృద్ధులతో మాట్లాడేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. దారిపొడవునా ప్రజలు, వివిధ సంఘాల నేతలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు.

ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న విపక్ష నేత

భారత్‌కు ఆరు అపాచె యుద్ధ హెలికాప్టర్లు

- విక్రయించేందుకు అమెరికా ఆమోదం

వాషింగ్టన్: భారత రక్షణ సామర్థ్యాలను మరింత పదును పెట్టే ఒప్పందానికి అమెరికా పచ్చజెండా ఊపింది. ఆరు అపాచె యుద్ధ హెలికాప్టర్లను భారత్‌కు విక్రయించేందుకు అంగీకారం తెలిపింది. వీటితో పాటు హెల్‌ఫైర్ లాంగ్ బ్లో, స్టింగర్ బ్లాక్ ఐ-92 హెచ్ క్షిపణులను విక్రయించేందుకూ ట్రంప్ యంత్రాంగం సమ్మతి తెలిపింది. వీటిని విక్రయించేందుకు అమెరికా విదేశాంగ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేస్తూ అమెరికా కాంగ్రెస్‌కు పెంటగాన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. చట్టసభ సభ్యుడెవరూ వ్యతిరేకించకపోతే విక్రయ ప్రక్రియ ముందుకు కదులుతుంది. ఫైర్ కంట్రోల్ రాడార్లు, నైట్ విజన్ సెన్సార్లు, ఇనర్షియల్ నావిగేషన్ వ్యవస్థలను కూడా అమెరికా విక్రయించనుంది. భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్. . త్వరలో అమెరికా మంత్రులు మైక్ పాంపేయో, జేమ్స్ మాటిస్‌తో భేటీ కానున్న నేపథ్యంలో పెంటగాన్ ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఆక్రమణదారులకే అదనంగా కేటాయింపా?

- రెవెన్యూ అంశాలపై సమీక్షలో పీఏసీ ఆగ్రహం

ఈనాడు, అమరావతి: 'చట్టంలోని చిన్న లోపాన్ని ఆధారం చేసుకుని అడ్డగోలుగా భూములు కేటాయించేస్తారా? ఆక్రమణలు తొలగించకపోగా అదే ఆక్రమణదారులకు ఇంకా అదనంగా భూమిని కేటాయిస్తారా? ఇదేం న్యాయం' అని రెవెన్యూ అధికారులపై అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. 'భూములను కేటాయించేటప్పుడు కనీస విచారణ లేకుండా ఇచ్చేస్తారా? ఇలాంటి కేటాయింపులవల్ల ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని భూములు పొందిన సంస్థల నుంచి గానీ, ఆ భూములను ధారాదత్తం చేసిన అధికారుల నుంచి గానీ ఎందుకు రికవరీ చేయలేదు' అని నిలదీసింది. బుధవారం అసెంబ్లీలోని కమిటీ హాలులో పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ అధ్యక్షతన కమిటీ సమావేశమైంది. సభ్యులు తోట త్రిమూర్తులు, ఆదిమూలపు సురేష్, కేఏ నాయుడు, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్, సీసీఎల్ఏ కార్యదర్శి జగన్నాథం ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ, ప్రభుత్వ భూములు కేటాయింపులపై ఉన్న అభ్యంతరాలన్నింటికీ సంబంధించిన సమాచారాన్ని వచ్చే నెలలోగా తమ ముందుంచాలని కమిటీ ఆదేశించింది.

విశ్వసనీయ సమాచారం మేరకు సమావేశంలో **చర్చించిన, అధికారులను నిలదీసిన అంశాల్లో కొన్ని:** చిత్తూరు జిల్లాలో ఒక క్రిస్టియన్ సంస్థకు 600 ఎకరాలు కేటాయించారు ఆ లెక్కలు ఇంకా తేలలేదు.

- పూతలపట్టు మండలంలో ఒక విద్యా సంస్థ 17.84 ఎకరాలు కేటాయించాలని 2009లో ప్రతిపాదన పంపితే ప్రభుత్వం తిరస్కరించింది. ఈ ప్రక్రియ ఒకవైపు జరుగుతుండగానే ఆ సంస్థ కోరిన చోటే 14.98 ఎకరాలను ఆక్రమించుకుని అక్కడ భవన నిర్మాణాలు చేపట్టింది. ఈ ఆక్రమణలను తొలగించాలని జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. వాటిని తొలగించకపోగా అదే ఆక్రమణ సంస్థకు అదనంగా మరో 34.34 ఎకరాలు కేటాయించారు. దీనిపై ఆడిట్ సమాచారం అడిగినా ఇప్పటివరకూ అధికారుల నుంచి జవాబు రాలేదు.
- తూ.గో.జిల్లా అమలాపురంలో రూ.87.12 లక్షల విలువజేసే 40 సెంట్ల స్థలాన్ని లాభాపేక్ష లేని సంస్థ అంటూ ఒక సంస్థకు రూ.2 లక్షలకే ఇచ్చేశారు.
- విశాఖ గ్రామీణంలో ఒక ఆధ్యాత్మిక సంస్థకు 3.71ఎకరాలను ఎకరా రూ.30వేల చొప్పునే ఇచ్చేశారు. ఇదే స్థలం ఎకరా ధర రూ.7.2 కోట్లనిసీసీఎల్ఏ సిఫార్సు చేసింది.

ఆ పార్టీలవి విధ్వంస రాజకీయాలు

మంత్రి యనమల ధ్వజం

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా, జనసేన, భాజపాలు వేర్పాటు విధానాలు అనుసరిస్తూ విధ్వంస రాజకీయాలు చేస్తున్నాయని మంత్రి యనమల రామకృష్ణుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రధాని మోదీకి ఇచ్చిన వినతిపత్రంలో కాపు రిజర్వేషన్లు, ప్రత్యేకహోదా అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న కాపు రిజర్వేషన్ల అంశాన్ని ఆమోదించాలని కన్నా ఎందుకు కోరలేదని ప్రశ్నించారు. పోలవరం, అమరావతి రెండు సినిమాలని వైకాపా అధినేత జగన్ వ్యాఖ్యానించి తన అవివేకాన్ని బయటపెట్టుకున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవిపై ఆశ తప్ప రాష్ట్ర సమస్యలపై ప్రతిపక్ష నేతకు కనీస అవగాహన లేదన్న విషయం స్పష్టమైందన్నారు. బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేసిన జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని భాజపా నేతలు ఒంటెద్దు పోకడ మానుకోవాలని హితవు పలికారు.

విజయసాయి జీవితం అబద్ధాలమయం: జవహర్

ఈనాడు, అమరావతి: వైకాపా నాయకుడు విజయసాయిరెడ్డి జీవితమే అబద్ధాలమయమని ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్.జవహర్ విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుంటే దాన్ని గుర్తించకుండా అవహేళనగా మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైకాపా, భాజపా, జనసేనలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని చెప్పారు. కొవ్వూరు నియోజకవర్గంలో జగన్ సంకల్ప యాత్ర జనం లేక వెలవెలబోయిందన్నారు. పదవులు లభించకపోవడంతోనే మోత్కుపల్లి నర్సింహులు చంద్రబాబును విమర్శిస్తున్నారని చెప్పారు.

ఉరితీయాలన్న నోటితో నిప్పు అనడమే నైతికతా: వర్ల

కాంగ్రెస్ పార్టీలో ఉన్నపుడు అవినీతిపరుడైన జగన్‌ను ఉరితీయాలని విమర్శించిన నోటితో ఇప్పుడు అదే వ్యక్తిని దేవుడు, నిప్పు అనడం ద్వారా బొత్స సత్యనారాయణ నైతికత ఏ పాటిదో తెలియజేస్తోందని ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య అన్నారు. సచివాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి వ్యక్తులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శిస్తున్నారని చెప్పారు. వైకాపాకు కార్యనిర్వాహక అధ్యక్షుడు అమిత్‌షాయే అని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులపై ప్రధాని మోదీని వైకాపా నేతలు గట్టిగా విమర్శించడం లేదన్నారు.

విద్యారంగంపై జగన్ వ్యాఖ్యలు అవగాహనా రాహిత్యం

తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కంభంపాటి

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో విద్యారంగం అధ్వానంగా ఉందని ప్రతిపక్ష నాయకుడు జగన్ ఆరోపణలు చేయడం ఆయన అవగాహనారాహిత్యానికి నిదర్శనమని తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కంభంపాటి రామ్మోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఈ రంగానికి రూ.25 వేల కోట్లు వెచ్చిస్తూ ఇతర రాష్ట్రాలకు దీటుగా ఆంధ్రప్రదేశ్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తోందని వివరించారు. అంతర్జాతీయ గుర్తింపు ఉన్న విద్యాసంస్థలు అమరావతిలో కార్యకలాపాలు మొదలుపెట్టాయని గుర్తుచేశారు. 2018-19 విద్యా సంవత్సరానికి శ్రీసిటీ నుంచి గ్రేట్ లేక్స్ విశ్వవిద్యాలయం తరగతులు ప్రారంభించనుందని తెలిపారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను, గురుకులాలను నాణ్యమైన విద్య, నైపుణ్యాలకు నిలయంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.

ఎస్‌బిఐ ఇన్‌ఫ్రా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్
(ఎస్‌బిఐ పూర్తి స్వంతమైన అనుబంధ సంస్థ)
3వ అంతస్తు, ఎస్‌బిఐ, ఎల్‌హెచ్‌ఓ బిల్డింగ్, కోఠి, హైదరాబాద్-95, ఫోన్:040-23466310/23466346
హౌస్‌కీపింగ్ & మెయింటెనెన్స్ సర్వీస్ కాంట్రాక్టుల కొరకు టెండరు
ఎస్‌బిఐ ఇన్‌ఫ్రా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ దిగువ తెలిపిన ప్రదేశాలలో:
హౌస్‌కీపింగ్ & మెయింటెనెన్స్ సర్వీస్‌ల కొరకు దరఖాస్తులను కోరుతున్నది:

ఎ)	టెండరు-1:	అడ్మిన్ ఆఫీస్ బిల్డింగ్, ఆర్‌బిఒలు, బ్రాంచ్‌లు (ఎన్‌ఐటి నెం.70/18)
బి)	టెండరు-2:	సికింద్రాబాద్, ప్యాట్నీ సెంటర్ వద్ద AO - హైదరాబాద్ పరిధిలోని ఆర్‌బిఒలు మరియు బ్రాంచ్‌లు (ఎన్‌ఐటి నెం.71/18)
సి)	టెండరు-3:	అడ్మిన్ ఆఫీస్ బిల్డింగ్, ఆర్‌బిఒలు మరియు బ్రాంచ్‌లు (ఎన్‌ఐటి నెం.72/18)
డి)	టెండరు-4:	సికింద్రాబాద్, ప్యాట్నీ సెంటర్ వద్ద AO - సికింద్రాబాద్ పరిధిలోని ఆర్‌బిఒలు మరియు బ్రాంచ్‌లు (ఎన్‌ఐటి నెం.73/18)

ఆసక్తిగల పార్టీలు బ్యాంక్ వెబ్‌సైట్ www.sbi.co.in వద్ద 'procurement news' నుండి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. భర్తీ చేసిన దరఖాస్తును సీల్డు కవరులో ఉంచి 04/07/2018న లేదా ఆలోగా ఇ-టెండరింగ్ ప్రక్రియ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయవలెను.
ప్రదేశం: హైదరాబాద్, తేది: 14/06/2018 సీనియర్ వైస్ ప్రెసిడెంట్, SBIIMS, హైదరాబాద్.

కలెక్టరు వారి కార్యాలయము, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఫారం నెం. VII
ఆర్సీ.నెం. జి2/483/2017 తేది: 15.04.2018
(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలోని సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను ఎ. 6.18 సెంట్లు ప్రజా ప్రయోజనములకై అనగా స్వర్ణముఖి నది కుడివైపున వరద పొర్లుకట్ట నిర్మాణము కొరకు నెల్లూరు జిల్లా వాకాడు మండలం పామంజి గ్రామమునకు సంబంధించిన భూములు కావలయునని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున శ్రీయుత జిల్లా కలెక్టరు, నెల్లూరు వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగమునుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టరు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలుదారుల భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగమున అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1)వ విభాగమునుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణమును ప్రయోజనములకై అనగా స్వర్ణముఖి నది కుడివైపున వరద పొర్లుకట్ట నిర్మాణము కొరకు భూమి అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేయుచున్నారు.

షెడ్యూలు

మండలం : వాకాడు గ్రామం : పామంజి

వ. నెం.	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ. సెం.	తరగతి	ఆసక్తిగల వారి పేరు చిరునామా	సరిహద్దులు				చెట్లు, కట్టడములు పంట వివరములు
					ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1.	50-2	1.60	మెట్ట	పేర్నాటి దుష్యంత్‌రెడ్డి	49-1ఎ	51-1	50-3	50-1	లేవు
2.	49-1ఎ	0.10	మెట్ట	పేర్నాటి దుష్యంత్‌రెడ్డి	49-3బి	49-1బి	49-1బి	50-2	లేవు
3.	49-3బి	0.20	మెట్ట	స్వర్ణముఖి ఆక్వా ఫామ్స్	48-2ఎ	49-1ఎ	49-3సి	50-2	లేవు
4.	48-2ఎ	0.46	మెట్ట	స్వర్ణముఖి ఆక్వా ఫామ్స్	47-1బి	49-3బి	48-2బి	48-1బి	లేవు
5.	47-1బి	0.43	మెట్ట	స్వర్ణముఖి ఆక్వా ఫామ్స్	15-5బి	48-2ఎ	48-2బి	48-2ఎ	లేవు
6.	47-4బి	0.05	మెట్ట	స్వర్ణముఖి ఆక్వా ఫామ్స్	47-4ఎ	48-1బి	47-1బి	47-4ఎ	లేవు
7.	10-1బి	0.37	మెట్ట	స్వర్ణముఖి ఆక్వా ఫామ్స్	11-2	13-2బి	10-2	10-1ఎ	లేవు
8.	11-2	1.28	మెట్ట	పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి	3-1బి	10-1 బి-1ఎ	10-2	11-1	ప్రతిపాదించబడిన ఈ సర్వే నెంబర్‌లోని ఎ. 1.28 సెంట్లు భూమిలో ఎ.1.22 సెంట్లు భూమి గతంలోనే స్వర్ణముఖి నదిలో కలిసి పోయివున్నది.
9.	3-2బి	0.91	మెట్ట	స్వర్ణముఖి ఆక్వా ఫామ్స్	4	3-18	3-2సి	3-2ఎ	ప్రతిపాదించబడిన ఈ సర్వే నెంబర్‌లోని ఎ.0.91 సెంట్లు భూమిలో ఎ.0.72 సెంట్లు భూమి గతంలోనే స్వర్ణముఖి నదిలో కలిసిపోయివున్నది
10.	13-1బి	0.06	మెట్ట	ఆమంచర్ల చంద్రమోహన్	10-1ఎ -1బి	13-2బి	13-2బి	13-1ఎ	లేవు
11.	13-2బి	0.72	మెట్ట	కొండూరు వెంకటరెడ్డి	13-13, 9-1ఎ	14-1బి	13-2సి	13-1బి, 2ఎ	లేవు
మొత్తము		6.18							

ఈ భూముల ప్లాను భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, గూడూరు వారి కార్యాలయములో ఉంచడమైనది. దానిని కార్యాలయపు పనివేళలలో ఏ సమయములో అయినా తనిఖీ చేసుకొనవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులయిన కుటుంబములు ఏమియునూ లేవు.
బొగ్గు గనులు, ఇసుకరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలోగాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్ట్ నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.
సం/- ముత్యాలరాజు రేవు, IAS.,
జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

శాంతి, సహనం, సౌభ్రాతృత్వం... ప్రతి మతానికి, అది ప్రవచించే ధర్మానికి గమ్యాలివి. మొహమ్మద్ ప్రవక్త (స) ఈ విషయాలను ప్రతి సందర్భంలో నిరూపిస్తూ వచ్చారు. తన జీవితాన్ని ఒక సందేశంగా మార్చారు. పవిత్ర రంజాన్ సందర్భంగా ఒకసారి మననం చేసుకుందాం.

... ఎప్పుడూ ఇలాగే!

రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించాం. దైవారాధనలు చేశాం. నెలరోజులూ పవిత్ర జీవితం గడిపాం. ఏడాదంతా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి. అప్పుడే రంజాన్ నెల రోజుల శిక్షణకు సార్థకత దక్కుతుంది.

- రంజాన్ మాసంలో నమాజులు చేసినవారు మిగతా 11 నెలలూ రోజూ ఐదు పూటల నమాజులు చేస్తామని సంకల్పించుకోవాలి. బతికి ఉన్నంత కాలం నమాజ్ వీడనని ప్రతిజ్ఞ చేసుకోవాలి.
- జకాత్ దానాలు చేసినవారు.. మిగతా రోజుల్లోనూ ఉన్నదాంట్లో ఎంతో కొంత పేదలకు దానం చేస్తుండాలి.
- ఈ నెల రోజులూ ఎలాగైతే మోసం, దగా, వాగ్దానభంగం, చాడీలు చెప్పడం, అవినీతికి పాల్పడటం వంటి దుర్గుణాలకు దూరంగా ఉన్నారో.. మిగతా రోజులూ అలాగే ఉండాలి.

పావన చరిత్ర...

జీవితమే సందేశం!



సహనం

ప్రవక్త (స) కాలంలో ఒక అరబ్బు పల్లెవాసి మసీదుకు వచ్చాడు. మసీదులో ఓ మూలన మూత్ర విసర్జన చేయసాగాడు. అక్కడున్నవారికి అది చూసి కోపం వచ్చింది. అతణ్ని కొట్టడానికి వెళ్లారు. ప్రవక్త వారిని అడ్డుకుని, అతడిని వదిలేయమన్నారు. మూత్రవిసర్జన చేసిన చోట నీళ్లతో శుభ్రం చేయమని ఆదేశించారు. "మీరు ప్రజలకు సదుపాయాలు, సౌలభ్యాలు కలిగించడానికి ఉన్నారే కానీ, వారికి ఇబ్బందులు, కష్టాలు కలగజేయడానికి కాద"న్నారు ప్రవక్త.

క్షమ

మరో సందర్భంలో ఒక యూద స్త్రీ ఆహారంలో విషం కలిపి ప్రవక్త(స) ముందు ఉంచింది. ఆహారంలో విషం ఉందని వారికి తెలిసింది. ఆ మహిళను దగ్గరికి పిలిచి ఎందుకిలా చేశావన్నారు ప్రవక్త. 'మిమ్మల్ని చంపడానికి' అని స్పష్టంగా సమాధానం ఇచ్చిందామె. అప్పుడు ప్రవక్త (స) "అల్లాహ్ నాపై నీకు అదుపు ఇవ్వడం అసంభవం' అన్నారు. ఆ మహిళను క్షమించి అక్కడి నుంచి పంపించారు. ప్రవక్తపై ఒకసారి కాదు, రెండుసార్లు కాదు 17 సార్లు హత్యాయత్నాలు జరిగాయి. ప్రతిసారీ హత్యాయత్నానికి పాల్పడినవారిని ఆయన క్షమించారు. అన్నిటినీ మించి మక్కా విజయం తర్వాత శత్రువులందరికీ క్షమాభిక్ష ప్రసాదించి తనలోని క్షమాగుణాన్ని చాటుకున్నారు.

ప్రతీకారం తీర్చుకునే శక్తి ఉన్నా.. తన కోపాన్ని అదుపుచేసుకునే వ్యక్తికి అల్లా స్వర్గం ప్రసాదిస్తాడని చెబుతారు ప్రవక్త. 'ఇతరులను చిత్తు చేసేవాడు బలవైనవాడు కాదు.. కోపం వచ్చినప్పుడుతనను తాను అదుపు చేసుకున్నవాడే బలవంతుడ'ని ప్రవక్త బోధ.

పశ్చాత్తాపం సుగుణం

ప్రవక్త కాలంలో ఒక మహిళ తన అందచందాలతో యువతను ఆకర్షించేది. వారిని వలలో వేసుకునేది. కడుపున పుట్టిన బిడ్డను కూడా చంపేసింది. కొన్నాళ్లకు చేసిన పాడు పనులు ఆమెను వెంటాడసాగాయి. సిగ్గుతో కుమిలిపోయింది. తన పాపాలకు ప్రాయశ్చిత్తం లేదని నిరాశతో గడపసాగింది. ప్రవక్త శిష్యుడైన అబూహురైరా దగ్గరికి వెళ్లి తాను చేసిన పాపాలను ఏకరువు పెట్టింది. 'అల్లాహ్ నన్ను మన్నిస్తాడా?' అని భోరుమంది. అప్పుడు అబూహురైరా 'నీ పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు. అల్లాహ్ నిన్ను క్షమించడు' అని మందలించి ఆమెను పంపించేశారు. ఈ వృత్తాంతం తెలిసిన ప్రవక్త తన శిష్యుడిని మందలించి ఖురాన్‌లోని ఈ వచనాలు తెలియజేశారు.. "పశ్చాత్తాపపడి, విశ్వసించి మంచి పనులు చేయడం ప్రారంభించిన వ్యక్తి చెడులను అల్లా శుభాలుగా మారుస్తారు. ఆయన క్షమించే దైవం. కరుణ ప్రదాత. పశ్చాత్తాపం చెంది మంచిమార్గంలో నడిచే వ్యక్తి అల్లావైపు మరలివస్తాడు" (దివ్య ఖురాన్ 25:73) ప్రవక్త బోధనతో మనసు మార్చుకున్న అబూహురైరా హుటాహుటిన ఆ మహిళను వెతుక్కుంటూ వెళ్లారు. అప్పటికే తనకు పశ్చాత్తాపం లేదనే ఆవేదనతో ఆత్మహత్యకు యత్నిస్తున్న మహిళను వారించారు. 'సద్బుద్ధితో, సత్సంకల్పంతో, చిత్తశుద్ధితో చేసే పశ్చాత్తాపాన్ని అల్లా తప్పక స్వీకరిస్తార'ని ప్రవక్త చెప్పిన శుభవార్తను తెలిపి ఆమెకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు.

ప్రేమను పంచు

అది పండగ రోజు. మొహమ్మద్ ప్రవక్త ఈద్ నమాజ్ కోసం బయల్దేరారు. మార్గమధ్యంలో ఒక బాలుడు కనిపించాడు. రెండు కళ్లను చేతులతో నలుపుకొంటూ ఏడుస్తూ నిల్చున్నాడా కుర్రాడు. దీన్ని గమనించిన ప్రవక్త ఆ బాలుడి దగ్గరికి వెళ్లారు. ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. దానికా బాలుడు "నాకు అమ్మానాన్న ఇద్దరూ లేరు. పండగ పూట తొడుక్కోవడానికి కొత్త దుస్తులు కూడా లేవు" అని రోదిస్తూ చెప్పాడు. దానికి ప్రవక్త "ఏడవకు నాయనా! అమ్మానాన్న లేరని బాధపడకు. నీకు నేనున్నాను" అంటూ తన వెంట ఇంటికి తీసుకెళ్లారు. తనను తండ్రిగా భావించమన్నారు. తన భార్య ఆయెషాను చూపించి 'ఇక నుంచి ఆమె నీ తల్లి' అని చెప్పారు. పిల్లాడికి అమ్మానాన్నలు లేని లోటు తీర్చారు. ప్రేమతో ఓదార్చారు. కొత్తదుస్తులు తొడిగారు. ఆ పసివాడిలో దుఃఖాన్ని దూరం చేసి నవ్వులు పూయించారు. తన వెంట ఈద్ నమాజ్‌కు తీసుకెళ్లారు. ఈ కథ ప్రవక్తలోని ప్రేమతత్వాన్ని తెలియజేస్తుంది. లేనివారికి ఆదరణ కల్పించమని సమాజానికి చెబుతుంది. లోకానికి ప్రేమను పంచమని చాటి చెబుతుంది.

– ఖైరున్నీసా బేగం

...అను నేను తపస్సు చేస్తున్నాను

తపస్సంటే ఏంటి? తపస్సు చేసేందుకు ఇల్లు, బంధాలు విడిచిపెట్టాలా... కాషాయ వస్త్రాలు, దండ కమండలాలు ధరించాలా... అడవుల్లోకి వెళ్లి, కందమూలాలు తింటూ, ఏదో చెట్టుకింద కూర్చుని ధ్యానం చేసుకోవడం తపస్సా? నిజంగా... ఇలా చేస్తేనే భగవదనుగ్రహం కలుగుతుందా?

నిజానికి తపస్సు అనేది ఒక జీవన విధానం. అదో క్రమశిక్షణ. మనిషి నియమబద్ధంగా జీవితాన్ని గడపడానికి పెద్దలు సూచించిన సర్వోన్నత సాధన మార్గం అది.

సాధారణ అర్థంలో మనం అనుకునే తపస్సు కూడా తపస్సే. కానీ, అదొక్కటే కాదు. దైనందిన జీవితంలో ఉంటూ, తన ధర్మాన్ని ఏమాత్రం విడిచిపెట్టకుండా, నూరుశాతం ఆచారాన్ని పాటించడమే తపస్సు అని శాస్త్రాలు చెబుతున్నాయి. అన్నీ విడిచి ఎక్కడికో వెళ్లాలనుకోవడం పలాయన వాదమే కానీ, ఆధ్యాత్మికమార్గం కాదు. బాధ్యతల్ని విస్మరించిన వారికి ముక్తిద్వారాలు తెరుచుకోవు. కాబట్టి స్వధర్మ కర్మాచరణే సిసలైన తపస్సవుతుంది. మహాభారతం అరణ్యపర్వంలో 'యక్ష ప్రశ్నలు'గా ప్రసిద్ధి పొందిన ఘట్టంలో ధర్మరాజును యక్షుడు అడిగిన 72 ప్రశ్నల్లో 'తపస్సు అంటే ఏమిటి?' అనే ప్రశ్న కూడా ఉంది. ఇందుకు ధర్మరాజు - 'తన వృత్తి, కుల ధర్మాన్ని ఆచరించటమే తపస్సు' అని చెబుతాడు.

తపస్సు అంటే తపించడం. ఒక పని సాధించటం కోసం మనం పడే ఆరాటం, ఆ పని తప్ప లోకంలో మరొకటి లేదన్నంతగా లక్ష్యాన్ని సాధించడం కోసం చేసే శ్రమ. భగీరథుడు సరిగ్గా ఇదే చేశాడు. దేవలోకంలో ఉండే గంగానదిని భూమి మీదకు తీసుకురావాలని ఎన్నో యుగాల నాడు ఆయన చేసిన ప్రయత్నరూప తపస్సు ఫలితాన్ని ఇప్పటికీ మనం అనుభవిస్తున్నాం కదా. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి బాహ్యశుద్ధి, అంతఃశుద్ధి కలిగి ఉండి నమ్మిన లక్ష్యం మీద మనస్సు నిలిపి ధ్యానం చేయడమే తపస్సు. ఇదే విషయాన్ని అని సనత్కుమారుడు వ్యాసుడికి చెప్పాడు. సనత్కుమారుడు చెప్పిన తపో మార్గాలలో సామాజిక శ్రేయస్సుకు పనికి వచ్చే అనేక విషయాలున్నాయి. చెరువులను తవ్వించడం, బావులను నిర్మించడం వంటివి లోక కల్యాణం కోసం నిరంతరం సద్బుద్ధితో, నిస్వార్థభావనతో చేసే వ్యక్తి కూడా చక్కటి తపస్సు చేస్తున్న వాడికిందే లెక్క. ధ్యానం చేసుకుంటూ భగవంతుడిని గురించి తపస్సు చేసే వ్యక్తి పొందే ఫలితాలను సామాజిక శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తులు కూడా పొందగలరని వివరించారు. కేవలం తనకోసం కాక పదిమంది మేలు కోసం చేసే ఏ పనైనా ఉత్తమమైన తపస్సేనని చెప్పడమే శివ పురాణం నొక్కి వక్కాణించింది.

ఆదిశంకరాచార్యులు కూడా ఈవిషయాన్నే చెబుతూ. 'యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్' అంటారు. చిత్తశుద్ధితో చేసే ప్రతి పనీ పరమేశ్వర ఆరాధనే అవుతుందన్నారు శంకరులు. మనస్సు, వాక్కు, ఆచరణ - ఈ మూడింటిలో ఏకత్వభావన (త్రికరణశుద్ధి) సాధించాలి. అదే తపస్సు అవుతుంది. **నిజానికి శ్రద్ధతో చేసే ప్రతి పనీ తపస్సే. దేన్నైనా సరే అంతఃకరణ శుద్ధితో, దీక్షతో చేస్తున్నప్పుడు నాణ్యమైన ఫలితాలు వస్తాయి. అలా చేసే ప్రతి పనీ తపస్సే. అందుకే తపస్సు ఇచ్చే ముఖ్యమైన ఫలితాల్లో నాణ్యతను ముఖ్యమైందిగా చెప్పొచ్చు.**

సమాజమే తపోభూమి...

తపస్సు చేసుకోవటానికి ఇల్లు విడిచి అరణ్యాలు పట్టాల్సిన అవసరం లేదు. ఇంటినే తపోభూమిగా మార్చుకోవాలి. ఇందుకోసం మొదటగా మనిషి తాను మారాలి. తన కర్తవ్యం ఏమిటో స్పష్టంగా తెలుసుకోవాలి. మానవ జన్మను సార్థకం చేసుకునే పనులు చెయ్యాలి. స్వామి వివేకానంద ఈ విషయంలో ఆదర్శంగా నిలుస్తారు. వివేకానందుడు రామకృష్ణ పరమహంస శిష్యరికం చేశాడే కానీ అడవులకు వెళ్లి ముక్కుమూసుకుని, తపస్సు చెయ్యలేదు. జాతి సముద్ధరణే జీవిత సర్వస్వం అనుకున్నారు. కొన్ని వందల సంవత్సరాల తర్వాత కూడా తన పేరు చెబితేనే ధైర్యం కలిగేంతగా జాతిని చైతన్యపరిచారు. యుగాల పాటు తపస్సు చేస్తే వచ్చే ఫలితాన్ని ప్రజాజీవితంలో ఉంటూనే పొందారు. ఇంకా ఎందరెందరో... వీరి మార్గం అనుసరణీయం.

నీ పని మానొద్దు!

స్వధర్మాన్ని పాటించడం, చిత్తశుద్ధితో ఆచరించడం తపస్సు అవుతుంది. మహాభారతంలోని 'ధర్మవ్యాధుడి' వృత్తాంతం ఇందుకు ఉదాహరణ. మార్కండేయ మహర్షి ధర్మరాజుకు ఈ కథ చెబుతాడు.

కౌశికుడనే బ్రహ్మచారి అరణ్యంలో తీవ్రమైన తపస్సు చేస్తుంటాడు. ఒక రోజున చెట్టు మీద ఉన్న పిట్ట వేసిన రెట్ట అతడి మీద పడుతుంది. ఆగ్రహంతో తలెత్తి పైకి చూస్తాడు కౌశికుడు. తపశ్శక్తితో కూడిన అతడి నేత్రదృష్టికి ఆ పక్షి ప్రాణాలు కోల్పోతుంది. భిక్షాటన చేస్తూ ఓ గృహిణి ఇంటి ముందు ఆగి 'భవతీ భిక్షాందేహి' అని అడుగుతాడు. భర్తకు పరిచర్యలు చేస్తూ ఆలస్యంగా భిక్షను ఇవ్వబోయిన ఆ ఇల్లాలిని కౌశికుడు అతడు కోపంగా చూస్తాడు. 'నీ కోపానికి మాడిపోవటానికి నేను పిట్టను కాదు' అంటుందామె. అడవిలో జరిగిన సంఘటన ఆమెకు ఎలా తెలిసిందని, సాధారణ ఇల్లాలికి అంత శక్తి ఎలా వచ్చిందని ఆశ్చర్యపోతాడు. అందుకామె 'ఇల్లాలిగా నా ధర్మ నిర్వహణ తప్ప నాకు మరొకటి తెలియదు. మిథిలానగరంలో ధర్మవ్యాధుడనే వ్యక్తి దగ్గరకు వెళ్లు. అతడు నీకు బోధ చేస్తా'డని చెబుతుంది. మిథిలకు వెళ్లిన కౌశికుడు మాంసం విక్రయిస్తూ జీవించే ధర్మవ్యాధుడిని చూసి 'నీకు ఇంత శక్తి ఎలా వచ్చింది? ఏ తపస్సు చేశావని' ప్రశ్నించాడు.

'నాయనా! నాకు ఏ తపస్సూ తెలియదు. నా కర్తవ్యం నేను నిర్వహిస్తాను. నా తల్లిదండ్రులను ఏమాత్రం కష్టపెట్టను. వారికి సేవ చేస్తాను. ఎవరినీ బాధ పెట్టను. పెద్దలను, జ్ఞానులను, గురువులను గౌరవిస్తాను. అసత్యం పలకను. భార్యను తప్ప పరస్త్రీల వైపు కన్నెత్తి చూడను. ఆశ, అసూయలను మనసులోకి రానివ్వను. నిందలను, పొగడ్తలను సమంగా స్వీకరిస్తాను. ఇదే నేను చేసే తపస్సు' అని చెబుతాడు. మహాసాధ్వి అయిన ఇల్లాలు పంపించిన కారణంగా నీతో మాట్లాడాను తప్ప, నాతో మాట్లాడే అర్హత కూడా నీకు లేదంటాడు.

'ఒకే ఒక్క బిడ్డవు కదా! తల్లిదండ్రుల్ని వదిలేసి, అడవులకు వెళ్లి ముక్కుమూసుకోవటం వల్ల మోక్షం రాదయ్యా. నీ తల్లిదండ్రులకు సేవ చెయ్యాల్సిన కర్తవ్యం విడిచిపెట్టావు. ఇలాగైతే, నీ తపస్సు ఫలించదు. కన్నవారిని సేవించుకో. నీ ధర్మాన్ని పాటించు. అదే తపస్సు చేసిన ఫలితాన్నిస్తుంద'ని బోధ చేస్తాడు.

3 భగవద్గీత శ్రద్ధాత్రయ విభాగయోగంలో శ్రీకృష్ణపరమాత్మ తపస్సు మూడురకాలుగా ఉంటుందని చెప్పాడు.

శారీరక తపస్సు : దేవతలను, గురువులను, జ్ఞానులను, మహాత్ములను పూజించటం, త్రికరణశుద్ధిగా ఉండడం, ఇతర ప్రాణులను హింసించకుండా ఉండడం.

వాచక తపస్సు : ఉద్వేగపూరితంగా మాట్లాడకుండా ఉండడం, సత్యం మాట్లాడడం, ఇతరులకు ప్రియం కలిగించేలా మాట్లాడడం, తన ధర్మాన్ని అనుసరిస్తూ స్తోత్రాలు, మంత్రాలు పఠించడం.

మానసిక తపస్సు : మనస్సును నిర్మలంగా ఉంచుకోవడం, ప్రసన్నమైన వదనం, ఆత్మనిగ్రహం, పరిశుద్ధమైన భావాలు కలిగిఉండడం.

– డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

మొక్కండి

బోధి వృక్షం... జ్ఞాన ఛత్రం!

త్రిమూర్తి స్వరూపంగా, సంతాన ప్రదాయనిగా భారతీయులు పిలుచుకునే వృక్షం రావిచెట్టు. బృహత్సంహిత, బ్రహ్మపురాణం, పద్మపురాణం, తైత్తరీయ వంటి ఉపనిషత్తులతో పాటు బౌద్ధ రచనల్లోనూ ఈ వృక్షం ప్రస్తావన ఉంది. బుద్ధగయలోని ఈ చెట్టుకిందే గౌతముడు ధ్యానినిమగ్నుడై జ్ఞానాన్ని పొందాడు. అందువల్లే ఇది బోధి వృక్షం అయింది.

రావిచెట్టుకు సంస్కృతంలో 'అశ్వత్థవృక్షం' అని పేరు. పూర్వం దేవతలందరికీ దూరంగా ఉండదలచిన అగ్నిదేవుడు అశ్వ రూపాన్ని ధరించి ఒక సంవత్సరంపాటు రావిచెట్టులో దాగి ఉండడం వల్ల 'అశ్వత్థవృక్షం' అన్న పేరు వచ్చినట్టు చెబుతారు. అశ్వత్థనారాయణ వృక్షం, పిప్పల వృక్షం, చలదల, గుహ్యపుష్ప, క్షీరద్రుమ, దేవాత్మ, గురు, కేశవాలయ, గజభక్షక, శ్రావృక్ష, శుభద, విప్ర, పవిత్రత, మహాద్రుమ ఇలా ఎన్నెన్నో పేర్లు ఉన్నాయి.

"మూలతో బ్రహ్మరూపాయ
మధ్యతో విష్ణురూపిణే
అగ్రతః శివరూపాయ
వృక్షరాజయతే నమః"

రావి చెట్టు మూలంలో బ్రహ్మదేవుడు, మధ్యలో శ్రీమన్నారాయణుడు, అగ్రభాగంలో శివుడు కొలువుదీరి ఉంటాడని చెబుతారు. అందుకే ఆలయాల్లో ఈ చెట్టు ఎక్కువగా కనిపిస్తుంది. రావిని, వేపచెట్టుతో కలిపి నాటుతారు. ఈ రెండు చెట్లకు కల్యాణం జరిపిస్తారు. దీనిని

లక్ష్మీనారాయణుల వివాహంగా వ్యవహరిస్తారు. రావిచెట్టు నాటిన 8 లేదా 12 సంవత్సరాలకు కల్యాణం చేయడం సంప్రదాయం. సంతానం లేనివారు ఈ విధంగా జరిపిస్తే పిల్లలు కలుగుతారని విశ్వాసం. శాస్త్రపరంగా పరిశీలిస్తే.. రావిచెట్టు గాలి స్త్రీ, పురుషుల్లో ఉత్తేజన, ఉత్పాదక శక్తిని పెంపొందించి సంతాన సిద్ధికి దోహదం చేస్తుంది. రావి అగ్ని తేజస్సుకు ప్రతీక. అందుకే హోమంలో రావి సమిధలను ఉపయోగిస్తారు. హోమాలు, వ్రతాలు, పూజలు చేసేటప్పుడు ఉపయోగించే 'పంచపల్లవం'లో రావి కూడా ఒకటి. జువ్వి, మేడి, మర్రి, మామిడి మిగతావి.

రావి ఆకులు, బెరడు, మొగ్గలు, పండ్లు వంటివన్నీ ఆయుర్వేదంలో వినియోగిస్తారు. చర్మ, జీర్ణకోశ, లైంగిక వ్యాధి నివారణలో వీటిని ఉపయోగిస్తున్నారు. వీటన్నింటికీ మించి తరచూ రావిచెట్టు కిందికి వెళ్లి గాలిని పీల్చడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంది. ఇన్ని సుగుణాలు కలిగి ఉన్నందునే మహర్షులు దీనిని 'పూజావృక్షం' చేశారు.

– ఐఎల్ఎన్ చంద్రశేఖరరావు

దర్శనీయం

సామరస్య సౌధం!

మతసామరస్యతకు తెలుగునేల ఎంత ఆలవాలమో కొత్తగా చెప్పక్కర్లేదు. అటు దేవాలయాలతో పాటు, పెద్దపెద్ద మసీదులు విరాజిల్లుతున్నాయి. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని షాహి జామీయ మసీదు ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద మసీదు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదులోని మక్కా మసీదు తర్వాతి స్థానం ఆదోని షాహి జామీయ మసీదుదే. 30 ఎకరాల విస్తీర్ణంలో 1667లో దీన్ని నిర్మించారు. నాటి బీజాపూర్ సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా రాజు, ఆయన సంస్థానంలో ఆదోని గవర్నర్‌గా ఉన్న సిద్ధి మసూద్‌ఖాన్ ఆధ్వర్యంలో దీనికి రూపకల్పన చేశారు. అప్పటి ఆధ్యాత్మిక గురువులు.. ఎల్లార్తి షేక్షావలి..షాషావలి, తాహెర్ షా ఖాద్రి, షేక్ ఫరిబ్‌సాహెబ్, గుట్‌పల్లి

ఇద్రుస్‌సాహెబ్ తదితరుల మార్గదర్శనంలో మసీదు నిర్మాణం చేపట్టారు. ఇందుకు అప్పట్లోనే రూ.2లక్షల వరకూ ఖర్చు చేశారని తెలుస్తోంది. అంతా రాతి కట్టడమే కావడం విశేషం. 80 అడుగుల ఎత్తులోని దీని శిఖరాలు పట్టణంలోని ఏ ప్రదేశంలోంచి అయినా కన్పిస్తాయి. 2500 మంది ఒకేసారి ప్రార్థనలు చేయొచ్చు.తాగునీటికోసం తవ్విన బావి ఎలాంటి కరవు పరిస్థితుల్లోనూ ఎండకపోవడం విశేషం. ఈ మసీదు ట్రస్టీల ఆధ్వర్యంలో సాగుతోంది.

– న్యూస్‌టుడే, ఆదోని మార్కెట్

ఆ గోల... నాకేల!

గురుతత్వం

ప్రపంచానికి అతీతంగా ఉండడాన్ని ప్రమించిన కష్టమైన పని లోకంలోనే ఉండదు. అలా ఉండగలిగిన మహాత్ములు ఎక్కడోగానీ ఉండరు. వారే దైవాంశసంభూతులు. వీరికి ఏ తాపత్రయమూ ఉండదు. అటువంటి వారిలో ఎర్రిస్వామి ఒకరు. ఆయన్ను ఎర్రితాత అని కూడా అనేవారు. ఆయన్ను అవధూత అనేవారు. ఆయన కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాలోని చెల్లదురికి ప్రాంతంలో నివసించేవారు. ఇప్పుడు ఆ ప్రాంతంలో ఒక ఆశ్రమం ఉంది. ఆయన దగ్గరికి రోజూ అనేకమంది భక్తులు వస్తుండేవారు. ఒకరోజున చిత్రమైన సంఘటన జరిగింది. వందలమంది భక్తుల ముందు ఆయన ఉండగా, అకస్మాత్తుగా ఒక భక్తుడొచ్చి ఆయన నెత్తిన బంగారు కిరీటం పెట్టాడట! బంగారు కిరీటం నెత్తిన పెట్టినా ఆ స్వామి ఆ భక్తుణ్నేమీ ప్రత్యేకంగా ప్రశంసించలేదు. కనీసం ఆశీర్వదించలేదు. ఆయన ముఖంలో



ఎటువంటి సంతోషమూ కనిపించలేదు. నిరామయంగా, నిర్వికారంగా నిశ్చలంగా ఉండిపోయాడు. కొన్నాళ్ల తర్వాత ఆ కిరీటాన్ని ఎవరో దొంగిలించుకుపోయారట! అయినా ఆ స్వామి బాధపడలేదు. చిరాకుపడలేదు. అసలు ఆ ఛాయలే కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. బంగారు కిరీటం వచ్చినప్పుడున్నట్టే నిరామయంగా, నిర్వికారంగా ఉండిపోయాడు.

ఈ విషయం తెలిసిన ఒక భక్తుడికి తెగ అనుమానం వచ్చేసింది. ఉండబట్టలేక సందేహ నివృత్తి కోసం స్వామిని అడిగేశాడు. "స్వామీ! బంగారు కిరీటం వచ్చినప్పుడు మీ ముఖంలో సంతోషం కనబడలేదు. ఇచ్చిన భక్తుణ్నీ ఆశీర్వదించలేదు. మీరు సంతోషపడ్డా, ఆ భక్తుణ్ని ఆశీర్వదించినా మీరు డబ్బో, బంగారమో, ఇచ్చిన భక్తుల్ని మాత్రమే బాగా చూస్తారని మేము అపార్థం చేసుకుంటామేమోనని మీరు మీ మనోభావాలను అదుపు చేసుకున్నారనుకున్నాను. కనీసం బంగారు కిరీటం పోయినప్పుడయినా మీకు బాధ కలగాలి కదా! బంగారు కిరీటం వచ్చినప్పుడూ అలాగే ఉన్నారు. పోయినప్పుడూ అలాగే ఉన్నారు. మీ ముఖంలో బాధ ఎందుకు లేదు?" అని అడిగాడు. అప్పుడు ఆ స్వామి "నాయనా! బంగారు కిరీటాన్ని ఉన్నవాడు ఇచ్చాడు. లేనివాడు తీసుకుపోయాడు. మధ్యలో నాకేంటి బాధ?" అన్నాడు. మనం నిమిత్తమాత్రులమని చెప్పడానికి ఈ మాటలు ఎంత మహత్తరంగా ఉన్నాయి! అప్పు లేనివాడు అధిక సంపన్నుడంటారు. అయితే ఆశలేనివాడు అంతకన్నా అధికసంపన్నుడు. ఏ తాపత్రయమూ లేనివాడికన్నా విజేత ఎవరుంటారు? నిస్సంగత్వం, నిర్మోహత్వం కన్నా ఆభరణాలు ఏముంటాయి? కాదనగలమా?

– శంకర నారాయణ

అల్లు అర్జున్

ఈనాడు సినిమా

ముగ్గురు దర్శకులతో...

కొత్త చిత్రాల్ని ముందుగానే ప్రకటిస్తుంటారు అల్లు అర్జున్. కానీ 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' తర్వాత ఆయన ఎవరితో సినిమా చేస్తారనేది స్పష్టం కాలేదు. ప్రస్తుతం విహార యాత్రలో ఉన్న అల్లు అర్జున్ ఒకేసారి మూడు చిత్రాల్ని ఖాయం చేసినట్టు సమాచారం. విక్రమ్ కె.కుమార్, త్రివిక్రమ్, సురేందర్‌రెడ్డిలతో వరుసగా సినిమాలు చేయబోతున్నట్టు తెలిసింది. విక్రమ్ కె.కుమార్‌తో సినిమా ఉంటుందనే విషయం ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. ఆ కలయికలోనే తదుపరి చిత్రం తెరకెక్కబోతోందని సమాచారం. ప్రస్తుతం అల్లు అర్జున్‌తో చిత్రం కోసమే విక్రమ్ కె.కుమార్ కథని సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. 'అరవింద సమేత' పూర్తయ్యాక త్రివిక్రమ్ దర్శకత్వంలోనూ, 'సైరా' తర్వాత సురేందర్‌రెడ్డితోనూ అల్లు అర్జున్ చిత్రాలు చేయబోతున్నట్టు సమాచారం. ఈ ముగ్గురు దర్శకులు చెప్పిన కథలు నచ్చడంతో అల్లు అర్జున్ ఇటీవలే పచ్చజెండా ఊపినట్టు తెలిసింది.

సురేందర్‌రెడ్డి

విక్రమ్

త్రివిక్రమ్

"దక్షిణాదిలో నేను కలిసి పనిచేయాలనుకొనే దర్శకుల జాబితా చాలా పెద్దదే. అంత మంది దర్శకుల్ని ఇష్టపడతా. వారిలో మణిరత్నంతో సినిమా చేయాలనేది నా కల. ఆయనతో రెండో సినిమా కూడా చేస్తుండడం ఓ గొప్ప అనుభూతి" అన్నారు **అదితి రావు హైదరీ**. వనపర్తి అమ్మాయైన అదితి బాలీవుడ్‌లో తన ప్రయాణం మొదలుపెట్టి, అక్కడ మంచి గుర్తింపును సాధించింది. తెలుగులో చేసిన తొలి చిత్రం 'సమ్మోహనం' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. సుధీర్‌బాబు కథానాయకుడిగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహించిన చిత్రమిది. అదితి హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

కథానాయికనే కాదు... నటిని కూడా!

✦ "నిజ జీవితంలో నేను కథానాయికనే. ఈ చిత్రంతో తెరపై కూడా కథానాయిక పాత్రని పోషించడం మంచి అనుభవం. చిన్నప్పట్నుంచి హాలీవుడ్‌లో ఇలా కథానాయికల సినిమాల్ని చూసేదాన్ని. నేను కథానాయికను అయినప్పటికీ సెట్లో నేనెలా ఉంటున్నాననే విషయాన్ని ఎప్పుడూ పట్టించుకోలేదు. ఈ చిత్రంలో నటిస్తున్నప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకొని నటించా".

✦ "కథానాయికలనే కాదు... నటుల జీవితాల వెనక చాలా కష్టాలు ఉంటాయి. బయట నుంచి చూస్తున్నంత సులభంగా ఏదీ ఉండదు. వాళ్లవి కాని జీవితాల్ని, వాటిలోని భావోద్వేగాల్ని తెరపై చూపిస్తూ ప్రేక్షకులకి వినోదం పంచాలి. కథానాయిక అంతరంగాన్ని ఆవిష్కరించేలా ఉంటుంది నా పాత్ర. ఇందులోని ప్రేమకథ చాలా ప్రత్యేకతతో కూడుకొన్నది. అదేంటన్నది తెరపైనే చూడాలి".

✦ "దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ ఫోన్ చేసి కథ చెప్పారు. మొదట ఐదారు లైన్లలో వినేద్దాం అనుకొన్నా. కానీ కథ ప్రారంభించాక చిన్నపిల్లలు ఎంత ఆసక్తిగా వింటారో అలా విన్నా. అంత బాగా నచ్చింది. కానీ నా దగ్గర కాల్షీట్లు లేవు. కష్టం అనిపించినా సరే ఈ సినిమా కోసం కాల్షీట్లు సర్దుబాటు చేశా. ఈ చిత్రం కోసం తెలుగు నేర్చుకొని డబ్బింగ్ చెప్పుకోవడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉంటున్నానని కాదు, ఎప్పుడు ఎవరు అడిగినా నేను హైదరాబాద్ అమ్మాయినే అని చెప్పుకొంటా".

✦ "నటుల్లోని ప్రతిభని బయటికి తీసుకురావడంలో మణిరత్నంని మించినవాళ్లు ఉండరు. ఆయన నాకు మార్గదర్శకులు. ఆయన దర్శకత్వంలో చేసిన 'చెలియా' సంతృప్తినిచ్చింది. అలాగే తెలుగులో శేఖర్ కమ్ముల, తమిళంలో గౌతమ్ మేనన్, మిస్కిన్ ఇలా పలువురు దర్శకులతో కలిసి పనిచేయాలనే కోరిక ఉంది. నేను కథానాయికనే కాదు, నటిని కూడా. దర్శకుడు చెప్పిన కథ నచ్చితే చాలు. పాత్రల గురించి పెద్దగా ఆలోచించను. ప్రస్తుతం సంకల్ప్ రెడ్డి, మణిరత్నం చిత్రాల్లో నటిస్తున్నా".

కల్యాణ్‌రామ్ ప్రయత్నాలు బలంగా ఉంటాయి. కథానాయకుడిగానైనా, నిర్మాతగా అయినా, నమ్మింది వంద శాతం చేయడం ఆయన శైలి. తొలి నుంచీ మాస్ కథల్లోనే నటిస్తూ వచ్చిన ఆయన... కెరీర్‌లో తొలిసారి రొమాంటిక్ ప్రేమకథని ఎంచుకొని 'నా నువ్వే' చేశాడు. జయేంద్ర దర్శకత్వం వహించిన ఆ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా కల్యాణ్‌రామ్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

ఎప్పుడు ఏ కథ వస్తుందో ఊహించలేం!

కథానాయకులు 'నా నువ్వే' తరహా కథల్ని కెరీర్ తొలినాళ్లల్లో చేస్తుంటారు. మీరు ఇప్పుడు చేయడానికి కారణం?

మా దర్శకుడిని కూడా అదే అడిగాను (నవ్వుతూ). అయినా ఇక్కడ ఏ కథ ఎప్పుడు వస్తుందో ఊహించలేం.

రొమాంటిక్ ప్రేమకథ కదా, సులభంగానే ఒదిగిపోయారా?

చిత్రీకరణ ఆరంభమైన రెండు మూడు రోజులు కష్టంగానే అనిపించింది. వరుసగా మాస్ కథల్లో నటిస్తూ వచ్చాను కదా... వాటిలో హావభావాలు, మాట్లాడే విధానం వేగంగా ఉంటుంది. 'నా నువ్వే' తరహా సినిమాలకి అలా ఉండకూడదు. కళ్లు పెద్దవి చేసి చూడకూడదు, సంభాషణలు కూడా చాలా పరిమితంగా ఉంటాయి. పలికేటప్పుడు మాటకీ మాటకీ మధ్య విరామం ఉండాలి. ఇదంతా నటుడిగా నాకు కొత్త అనుభవాన్నిచ్చింది.

సగటు వాణిజ్య ప్రధానమైన కథలకీ, ఇలాంటి రొమాంటిక్ కథలకీ మధ్య మీరు గమనించిన తేడాలేమిటి?

వాణిజ్యాంశాలతో కూడిన మాస్ కథల్లో నటిస్తున్నప్పుడు శారీరకంగా ఎక్కువ శ్రమ పడాల్సి ఉంటుంది. దూకాలి, అరవాలి. రొమాంటిక్ సినిమాకి అవన్నీ అవసరం లేకపోవచ్చు కానీ మైండ్ సెట్ చాలా కీలకం. చాలా విషయాల్ని మనకు మనమే ఊహించుకొని నటించాల్సొస్తుంది.

ఈ సినిమాకి ఛాయాగ్రాహకుడు పి.సి. శ్రీరామ్. ఆయనతో పనిచేయడం ఎలాంటి అనుభవాన్నిచ్చింది?

ప్రేమకథల్లో 'గీతాంజలి' అంటే నాకు చాలా ఇష్టం. అప్పుడే పి.సి.శ్రీరామ్ గురించి తెలుసుకొన్నా. అలాంటి సాంకేతిక నిపుణుడితో సినిమా చేయగలుగుతానా అనుకొనేవాణ్ని. 'నా నువ్వే'తో ఆ కల నిజమైంది. తొలిరోజు సెట్లో కాస్త బెరుగ్గా ఉండడం చూసి పి.సి. శ్రీరామ్‌గారు 'ఈ తరహా సినిమాల్లో నటిస్తున్నప్పుడు చూసే కళ్లే కాదు... దేహం మొత్తం రొమాంటిక్ ఫీల్‌తో కనిపించాల'ని చెప్పారు. మొదట నా కెమెరాతో రొమాన్స్‌లో ఉండు అని చెప్పారు.

ఇందులో మీరు కనిపించే విధానం చూసి మీ ఇంట్లోవాళ్లు ఏమన్నారు?

మొదట మా అబ్బాయి 'ఇదివరకటి సినిమాల్లో కంటే ఇందులో అందంగా ఉన్నావు నాన్నా' అన్నాడు. నా భార్య కూడా మెచ్చుకొంది. ఇందులో కల్యాణ్‌రామ్ కొత్తగా కనిపించాడంటే సినిమా విజయవంతమైనట్టే అని మొదట్నుంచీ చెబుతూ వచ్చారు దర్శకుడు. పీహెచ్‌డీ పూర్తి చేసి, ఉద్యోగం కోసం అమెరికా వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న ఓ యువకుడిగా నేను తెరపై కనిపిస్తా.

రొమాంటిక్ ప్రేమకథల్లో నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ కీలకం అంటారు. అందుకోసం మీరేం చేశారు?

ఇద్దరి మధ్య కెమిస్ట్రీ పండాలంటే ముందు ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. తమన్నా, నేను సెట్లో చాలా స్నేహంగా మెలిగేవాళ్లం. మధ్య మధ్యలో రిహార్సల్స్ చేసేవాళ్లం. ఒక పాటలో ట్యాంగో డ్యాన్స్ చేశాం. ఎనిమిది రోజులు శిక్షణ తీసుకొని... ఆ తర్వాత స్టెప్పులు నేర్చుకొని నటించాం.

ఇకపైన కల్యాణ్‌రామ్‌ను రొమాంటిక్ కథానాయకుడు అని పిలుస్తారేమో కదా...

అలాంటి పిలుపులు నాలో భయం పెంచుతుంటాయి. కానీ నాకు నేను పరిధులు విధించుకోవడం ఇష్టం లేదు. 'పటాస్' సమయంలోనే ఆ విషయం నాకు అర్థమైంది. అప్పటి దాకా నేను అలాంటి హాస్య ప్రధానమైన సినిమా చేయలేదు. నాకు తెలియకుండానే ఆ సినిమాతో నాలోని కొత్త కోణాన్ని చూసుకొన్నా. 'పటాస్' తర్వాత నా ఆలోచనలు మారిపోయాయి. ప్రస్తుతం గుహన్ దర్శకత్వంలో చేస్తున్న సినిమా కూడా చాలా కొత్తగా ఉంటుంది.

కొత్త కథల్ని ఎంపిక చేసుకోవడం రిస్క్ అనిపించలేదా?

ప్రతి సినిమా రిస్కే. 'బృందావనం' వరకూ తారక్ ఆ తరహా సినిమాలు చేయలేదు. 'నాన్నకు ప్రేమతో' తనని మరింత కొత్తగా చూపించింది. కొన్నిసార్లు కొత్తగా ప్రయత్నించడం మంచిదే. 'నా నువ్వే'లో నటించడం నాకు చాలా తృప్తినిచ్చింది.

గుహన్ సినిమాతో పాటు, రెండు కొత్త సినిమాలు కూడా ఒప్పుకొన్నారు కదా.?

గుహన్ దర్శకత్వం వహిస్తున్న సినిమా జులైలో పూర్తవుతుంది. ఆగస్టు నుంచి విరించి వర్మ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నాం. ఆ తర్వాత పవన్ సాదినేని దర్శకత్వంలో ఓ సినిమా ఉంటుంది. అదొక మల్టీస్టారర్ చిత్రం.

మీ నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ నుంచి మళ్లీ ఎన్టీఆర్‌తో సినిమా ఎప్పుడు ఉంటుంది?

2019లో చేయాలనుకొంటున్నా. నేను కూడా ఓ సినిమా చేయబోతున్నా. అందు కోసం కథ వింటున్నా.

పెళ్లి ఇటలీలోనా?

రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొణె

విరుష్క బాటలోనే దీప్‌వీర్ వెళ్లబోతున్నారట. విరుష్క అంటే విరాట్ కోహ్లి, అనుష్క శర్మ అని తెలుసు. దీప్‌వీర్ అంటే దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్. ఈ జంట త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని సమాచారం. అధికారికంగా ప్రకటించకపోయినా పెళ్లి ఏర్పాట్లు జరిగిపోతున్నాయట. దీప్‌వీర్ జంట డెస్టినేషన్ వెడ్డింగ్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. "రణ్‌వీర్- దీపికా వివాహం ఈ నవంబరులో జరగనుంది. పెళ్లి పనులు జోరుగా సాగుతున్నాయి. బహుశా పెళ్లి ఇటలీలో జరిగే అవకాశాలున్నాయి"అని దీపిక సన్నిహిత వర్గాలు చెప్పినట్టు సమాచారం. ఇక్కడ మరో మాట కూడా వినిపిస్తుంది. "తమ పెళ్లికి భారీ స్థాయిలో మీడియా కవరేజ్ ఉండటం దీప్‌వీర్‌కు ఇష్టం లేదు. అందుకే మొదట స్విట్జర్లాండ్‌లో పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఎలాగూ రణ్‌వీర్ సింగ్ స్విస్ టూరిజమ్‌కు బ్రాండ్ అంబాసిడర్ కాబట్టి అక్కడి ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తుందని భావించారు. కానీ ఈ జంట ఇటలీలోని అందమైన లోకేషన్‌లో పెళ్లి చేసుకోవాలని ఆశ పడుతున్నారు. ఇటలీ ప్రభుత్వం దీప్‌వీర్ పెళ్లిపై ఆసక్తి ప్రదర్శిస్తుంది" అంటూ రణ్‌వీర్, దీపిక స్నేహితులు చెప్పినట్టు వార్తలొస్తున్నాయి.

కబడ్డీ ప్లేయర్ కంగన

బాలీవుడ్ అందాల భామ కంగనా రనౌత్ కబడ్డీ ఆటలో సత్తా చాటబోతుంది. అశ్వినీ అయ్యర్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతుంది. ఇందులో కంగనా నటించనుంది. ఈ చిత్రంలో కంగన కబడ్డీ ప్లేయర్‌గా కనిపించనుంది. ప్రస్తుతం కంగనా నటిస్తున్న 'మెంటల్ హై క్యా' చిత్రీకరణ జులై 11కు పూర్తయిపోతుంది. ఆ తర్వాత 'మణికర్ణిక'కు సంబంధించిన ప్యాచ్‌వర్క్ పూర్తిచేసుకొని ఈ కొత్త చిత్రం కోసం సిద్ధమవుతుంది. కంగనాది కబడ్డీ ప్లేయర్ పాత్ర కాబట్టి అందుకు తగ్గట్టు ఆమెను తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు అశ్వినీ. దీని కోసం జాతీయస్థాయి అత్యుత్తమ కబడ్డీ ఆటగాళ్లకు సంబంధించిన డేటా సేకరించి వాళ్లతో మాట్లాడి కంగనాకు శిక్షణ ఇప్పించే పనిలో ఉన్నారు దర్శకురాలు. శిక్షణకు ముందే ప్రత్యేక వ్యాయామాలు చేసి శరీరం మరింత ఫిట్‌గా ఉండటానికి కష్టపడుతోంది కంగన.

'అవతార్' తర్వాత స్థానంలో 'అవెంజర్స్..'!

సూపర్ హీరోల నేపథ్యంలో 'అవెంజర్స్'కు సీక్వెల్‌గా ఇటీవలే విడుదలైన 'అవెంజర్స్: ఇన్ఫినిటీ వార్' సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇండియాలోనే రూ. 200 కోట్లు వసూళ్లు అందుకున్న తొలి హాలీవుడ్ సినిమాగా రికార్డు సృష్టించిన 'అవెంజర్స్..', మరో అరుదైన ఘనత సొంతం చేసుకుంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా రెండు బిలియన్ డాలర్ల వసూళ్లు (సుమారు రూ.13,526 కోట్లకు పైగా) సాధించిన రెండో చిత్రంగా నిలిచి సత్తా చాటింది. ఈ విషయంలో తొలి స్థానంలో ఉన్న 'అవతార్' 47 రోజుల్లో రెండు బిలియన్ డాలర్ల మార్కు అందుకోగా, 'అవెంజర్స్..' 48 రోజుల్లో ఆ మైలురాయి చేరుకోవడం గమనార్హం. ఇప్పటివరకూ రెండు బిలియన్ డాలర్ల క్లబ్‌లో అవతార్‌తో పాటు 'టైటానిక్', 'స్టార్‌వార్స్: ది ఫోర్స్ అవేకెన్స్' మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు వాటి సరసన నాలుగో చిత్రంగా 'అవెంజర్స్..'. స్థానం దక్కించుకుందని ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్నీ సంస్థ ప్రకటించింది. ఇప్పటికీ ఈ చిత్రం ప్రేక్షకాదరణతో దూసుకెళ్తోంది.


'అవెంజర్స్: ఇన్ఫినిటీ వార్'

తమ్ముడూ నేను జంగిల్‌బుక్ సినిమా చూడలా.
కానీ అందులో పులి నాలాగే ఉంటుందని
చాలా మంది చెప్పారు. అది నిజమో కాదో మీరే చెప్పాలి.
చిత్రం: పైసా వసూల్
పంపినవారు: వి.గుణశేఖర్, పులివెందుల
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

పంచ్ డైలాగ్

రాగిణి

నిజమైన దండుపాళ్యం

రాగిణి ద్వివేది, మేఘనరాజ్, దీప్తి, ప్రథమ ప్రసాద్, సంయుక్త హొర్నాడ్ నటించిన చిత్రం 'రియల్ దండుపాళ్యం'. మహేష్ దర్శకుడు. సి.పుట్టుస్వామి నిర్మాత. ఇటీవలే ట్రైలర్‌ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "కర్ణాటకలో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. ఇదివరకు వచ్చిన 'దండుపాళ్యం' చిత్రాలకి, మా చిత్రానికీ చాలా వ్యత్యాసం ఉంటుంది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "తెలుగులో ఇదివరకే మూడు సినిమాలు చేశా. ఒక విభిన్నమైన కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. సమాజానికి ఉపయోగపడే సినిమా ఇది. అందుకే కన్నడతో పాటు, తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ఈ నెలాఖరున విడుదల చేస్తాం" అన్నారు.

అసాధ్యమే అనుకుంటే
పనులేవీ జరగవురా
తెగించే గుణమే
నీ బలమంటూ తలపడరా
బతుకంటే భయమంటే
వెనకడుగై ఉంటామంతే
ఎదురీతే తెలిసుంటే
ప్రతి గెలుపూ ఇక నీ వెనకే

గీతం: మీసమున్న మన్మథుడా...
చిత్రం: రగడ
రచన: రామజోగయ్యశాస్త్రి
– పంపినవారు: జె.కె.రెడ్డి, కర్నూలు

గీతోపదేశం

చిరునామా:
సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512

అశ్విని

'యమ్ 6' కథేమిటి?

ధృవ, శ్రావణి, అశ్విని ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'యమ్ 6'. జైరామ్ దర్శకుడు. విశ్వనాథ్ తన్నీరు, సురేష్ నిర్మాతలు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో విడుదల చేస్తారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "సస్పెన్స్ థ్రిల్లర్ ఈ చిత్రం. 'యమ్ 6' అనే టైటిల్ చుట్టూనే కథ నడుస్తుంది. అదేమిటన్నది ఆసక్తికరం. అరకు, మంగళూరులలో తెరకెక్కించిన 'ఈక్షణం' అనే పాట, యాక్షన్ దృశ్యాలు తప్పకుండా నచ్చుతాయి. సాంకేతికంగా ఉన్నతంగా తీర్చిదిద్దామ"న్నారు.

వ్యాయామం క్యాంపస్‌లోనే

కాలేజీలో చేరాక స్నేహితులతో కలిసి క్యాంటీన్‌లో చిట్ చాట్ చేస్తూ చిప్స్ లాగిస్తూ, కూల్ డ్రింక్స్ తాగడమే సరదా! అయితే ఇవి మీ ఆరోగ్యాన్ని, మీ శరీరాకృతినీ దెబ్బతీయొచ్చు. అందుకే ఎంత తీరిక లేకపోయినా సరే... చదువుకుంటూనే వ్యాయామానికి కనీసం ఓ గంటైనా కేటాయించుకునేలా చూడండి.

☛ స్నేహితులతో కలిసి కబుర్లు చెబుతుంటే సమయమే తెలియదు. కానీ ఈసారి అలా ఒక్కచోటే కూర్చుని కబుర్లు చెప్పుకోవద్దు. వీలైతే క్యాంపస్ అంతా అలా నడుచుకుంటూ రెండు రౌండ్లు తిరిగి రండి. మీకు సరదాతో పాటు శరీరానికి అవసరమైన శ్రమ అందుతుంది.

☛ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లు...అసలు వ్యాయామం చేసే తీరికెక్కడిది అంటారా... అదేం కుదరదు. రోజూ ఓ అర గంట ముందే నిద్రలేవండి. ఓ పదిహేను నిమిషాలయినా సరే! వ్యాయామానికి కేటాయించుకోండి. మీకు నచ్చిన మ్యూజిక్‌ని పెట్టుకుని హాయిగా డ్యాన్స్ చేసేయండి. ఇది శరీరానికి తగిన శ్రమ అందిస్తుంది. మెదడునీ, శరీరాన్నీ సమన్వయం చేస్తుంది. దీనివల్ల ఏకాగ్రత పెరుగుతుంది. మీ బరువు కూడా మీ అదుపులో ఉంటుంది.

☛ కాలేజీ వయసులో ముచ్చట్లు మురిపెంగా ఉంటాయి. కానీ అలా ఎంతసేపని కబుర్లు...మరింత మజా రావాలంటే రోజూ సాయంత్రం ఓ గంట సరదాగా కబడ్డీ ఆడండి. లేదంటే మీ స్నేహబృందం అంతా కలిసి ఆడే ఆటలు మరేమైనా ఉంటే వాటిని ఎంచుకోండి. ఇవి మీకు బృంద స్ఫూర్తిని అందిస్తాయి. పనిలో పని వ్యాయామం చేసినట్లూ ఉంటుంది.

పూలకుండీలకూ గోళ్లరంగు!

గోళ్లరంగుతో గోళ్ల అందం పెరుగుతుందనేది తెలిసిందే. అదే గోళ్లరంగును మరికొన్ని రకాలుగానూ ఉపయోగించుకోవచ్చు తెలుసా...

① సగం వాడి వదిలేసిన గోళ్లరంగుల్ని పారేయాల్సిన అవసరం లేదు. పూల కుండీలూ, దీపాలూ, బూట్లకు అదనపు అలంకరణలు చేయడానికి వాడొచ్చు.

② ట్రాఫిక్‌లో వెళుతున్నప్పుడో, పార్కింగ్ చేసినప్పుడో బండికి గీతలు పడుతుంటాయి. వాటిని అలానే వదిలేయకండి. బండి రంగులో ఉండే గోళ్లరంగును ఆ గీతలున్న చోట రాసి చూడండి.

③ రకరకాల తాళాలు ఒక్కోసారి అయోమయానికి గురిచేస్తుంటాయి. అందుకే వాటిని గుర్తుంచుకోవడానికి వాట పైభాగంలో కలర్ కోడ్ ఇవ్వండి. దాంతో సులువుగా గుర్తుపట్టొచ్చు.

④ ఫోనుకవరు ఏ డిజైను లేకుండా ఉందా... దానిపై రకరకాల గోళ్లరంగుల్ని అక్కడక్కడా అద్ది... పైన కవరు ఉంచి నొక్కినట్లు చేయండి. రంగులన్నీ కలిసిపోతాయి కానీ.. చూడ్డానికి బాగుంటుంది.

⑤ సాధారణ నగలకు ఉండే రాళ్లు కొన్నిరోజులకు ఊడిపోతుంటాయి. అలా ఊడిపోయిన చోట గోళ్లరంగు రాసి ఆ రాళ్లను అతికించండి. అలాగే మెటల్ నగలు తుప్పు పడితే... కనిపించకుండా పారదర్శకంగా ఉండే గోళ్లరంగును ప్రయత్నించొచ్చు.

⑥ అగ్గిపుల్లలు తేమకి ఓ పట్టాన వెలగవు. అలా కాకుండా ఉండాలంటే ఆ చివర్లను గోళ్లరంగులో ముంచి తీసి ఆరనివ్వండి. ఎంత కాలం తరవాతైనా వాడుకోవచ్చు.

కుర్తీలకు కొత్త పిన్ను

చీరకట్టుకునే వారందరికీ కుచ్చిళ్లకు పెట్టుకునే పిన్ను గురించి తెలుసు. వీటిని మ్యాచింగ్‌గా ఎంచుకోవడం అంతా చేసేదే. చీరకే కాదు... కుర్తీలకూ, గౌనులకూ, మాక్సీలకూ కూడా పిన్నులు పెట్టుకోవచ్చు తెలుసా! అవి అలాంటి ఇలాంటి పిన్నులు కాదు. జిగేల్‌మనే రాళ్లూ, పూలూ, పక్షులూ...ఇతర ఫంకీ ఆకృతుల్లో కనువిందు చేస్తున్నాయి ఈ నయాతరం బ్రూచ్‌లు. పార్టీలకూ, కాలేజీలకూ స్టేట్‌మెంట్ యాక్సెసరీలా వీటిని ఎంచుకోవచ్చు. మరెందుకు ఆలస్యం మీరూ ఓ లుక్కేయండి.

● **ప్రమాదం ముంచుకొస్తే.. తెలిసిందొకటే పరుగు!**

కానీ, ఆమె పరిగెత్తలేదు.. నిలబడింది. ఐదుగురు చిన్నారుల ప్రాణాలను నిలబెట్టింది. బడిలో ఆయా కాస్తా.. వారికి పునర్జన్మనిచ్చిన అమ్మ అయింది. ప్రాణాలు లెక్కచేయకుండా పోరాడింది.

● **ఇళ్లల్లో పనిచేసే సహాయకురాలు! ఆమెకు పనితో పాటు పరుగూ తెలుసు! నిన్నటి దాకా ఇరుగు పొరుగుకు కూడా తెలియదేమో ఆ పరుగు గురించి! ప్రపంచానికి తెలిసే రోజు దగ్గర్లోనే ఉంది. అంతర్జాతీయ పరుగు పందేనికి ఎంపికై అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.**

- తాజాగా జరిగిన రెండు సంఘటనలివి. ఒక దానితో ఒకటి సంబంధం లేదు. కానీ, రెండింట్లో త్యాగం ఉంది. స్ఫూర్తి ఉంది. ఆదర్శం ఉంది.

ఆ త్యాగం... ఆ సాహసం... పిల్లల కోసమే

నేటి మహిళ

ఐదుగురిని కాపాడింది!

ఆమె పేరు లత. వయసు 35 అయిదేళ్లు. కేరళ మరడులోని కట్టిథారా రోడ్డులో 'కిడ్జ్ వరల్డ్ ప్లే స్కూల్'లో ఐదేళ్లుగా ఆయాగా పనిచేస్తోంది. ఆమె పని స్కూల్లో పిల్లల అవసరాలు చూడాలి. సాయంత్రం స్కూలు వ్యానులో ఎక్కి పిల్లల్ని ఇంటిదగ్గర భద్రంగా దింపాలి. సోమవారం కూడా అలాగే 3.45 నిమిషాలకు స్కూలు అయిపోయాక వ్యానులో ఎనిమిది మంది పిల్లలతో బయలుదేరింది. ఆ వ్యాను వెళ్లే దారిలో చిన్న నీటికుంట ఉంది. డ్రైవరు చాలా నేర్పుగా ఆ నీటికుంట పక్క నుంచి తీసుకెళ్లే ప్రయత్నంలో వ్యాను చక్రం బురదలో ఇరుక్కుపోయి చివరకు నీటిలో పడిపోయింది. బయటకు రాలేని పరిస్థితి. మరోవైపు పిల్లలు. లతకు ఒక్కక్షణం ఏం చేయాలో తోచలేదు. తాను చనిపోతానని తెలుసు. అయినా ఆ క్షణంలో అమెలో అమ్మ మేల్కొంది. పిల్లల్ని ఒక్కొక్కరిగా చాలా నేర్పుగా వ్యాను వెనక కిటికీలోంచి బయటకు పంపే ప్రయత్నం చేసింది. అదే సమయంలో విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న స్థానికులు ఆ పిల్లల్ని బయటి నుంచి అందుకున్నారు. ఇంకో ఇద్దరు పిల్లల్ని కాపాడాల్సిన సమయంలో ఆమె కిటికీ మధ్యలో ఇరుక్కుపోయి స్పృహ కోల్పోయింది. బయట ఉన్న వారు ఆమెను ఇవతలకు తీసి ఆసుపత్రికి తరలించేసరికే లత ప్రాణాలు కోల్పోయింది. మరో ఇద్దరు చిన్నారులు కూడా దక్కలేదు. తీవ్ర గాయాలపాలైన వ్యాను డ్రైవరు స్థానిక మెడికల్ ట్రస్టు ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. మరో విద్యార్థి పరిస్థితీ విషమంగా ఉంది. ఈ ప్రమాదం నుంచి బయటపడిన ఐదుగురు పిల్లలు మాత్రం సురక్షితంగానే ఉన్నారు.

లతది చాలా సాధారణ కుటుంబమే. ఆమె భర్త దినసరి కూలీ. వాళ్లకు ఇద్దరు కవల పిల్లలు. ఇద్దరూ అమ్మాయిలే. నీటి కొలనంతా బురదా, గుర్రపు డెక్కతో నిండి ఉండటంతో కష్టమైనా పిల్లల్ని రక్షించగలిగింది లత. సొంత పిల్లలకు తాను భౌతికంగా లేకపోవచ్చు. కానీ ఐదుగురు పిల్లల్ని కాపాడి... ఒక స్త్రీగా, ఒక అమ్మగా ఆమె చేసిన త్యాగానికి జోహార్లు చెప్పాల్సిందే.

ఇళ్లల్లో పనిచేస్తూ... అంతర్జాతీయస్థాయికి!

ఆమె పేరు వాసంతి. వయసు 36 సంవత్సరాలు. భర్తకు చేదోడువాదోడుగా ఉండేందుకు ఇళ్లల్లో పనిచేయడం మొదలుపెట్టిందామె. మరోవైపు ఓ చిన్న హోటల్‌లోనూ వంటకు కుదిరింది. ఇది ఆమె వృత్తి. ప్రవృత్తి ఏంటో తెలుసా... పరుగు. ఇప్పుడామె మనదేశం తరపున 'వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్'లో పాల్గొనబోతోంది. తమిళనాడు, కోయంబత్తూరుకు చెందిన ఈ సాధారణ మహిళ ఆ అవకాశాన్ని ఎలా అందుకుందంటే...

వాసంతిది తిరుచ్చికి దగ్గర్లోని చిన్న ఊరు. ఆమెకు కోవైకి చెందిన ఓ ప్రైవేటు బస్సు డ్రైవరు ఆనంద్‌తో పెళ్లయ్యింది. అతడి జీతం అంతంత మాత్రమే. పైగా ఇద్దరు పిల్లలు. ఇంటి అవసరాలు పెరగడంతో ఏడోతరగతి వరకూ చదివిన వాసంతి ఏదో ఒకటి చేయాలనుకుంది. ఆమె లక్ష్యం పిల్లల్ని బాగా చదివించడం. అందుకే రెండిళ్లల్లో పనికి కుదిరింది. కొన్నాళ్లకు ఓ చిన్న హోటల్‌లో వంట చేయడానికీ ఒప్పుకొంది. అలా పిల్లల చదువుకు అవసరమయ్యే డబ్బు కూడగట్టడం మొదలుపెట్టింది. ఒక రోజు ఫోన్‌లో వచ్చిన ఓ సందేశాన్ని వాసంతికి చూపించాడామె భర్త. పరుగుపందెం పోటీ అది. ఆసక్తి ఉన్నవాళ్లెవరైనా పాల్గొనొచ్చు అనేది దాని సారాంశం. అలా పోటీకి వెళ్లడానికి సిద్ధమైంది. దానివల్ల మరికొంత ఆదాయం వస్తుందనుకుంది.

● **వంట చేస్తూనే శిక్షణ:** కోవైలో జెనిసిస్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌కు చెందిన వైరవ్‌నాథన్ నేతృత్వంలో కూనూరులో ఏటా వేసవిలో రన్నింగ్ క్యాంప్ శిక్షణ జరుగుతుంది. దానికి వాసంతి పిల్లలిద్దరు వెళతారు. అలా తనకీ శిక్షణ ఇవ్వమంటూ వైరవ్‌నాథన్‌ను కోరిందామె. శిక్షణకు ఇచ్చే డబ్బు లేకపోవడం వల్ల అక్కడికి వచ్చేవారికి వంటచేసి పెడతానని చెప్పింది. అలా శిక్షణ తీసుకున్న ఆమె చివరకు పోటీలో పాల్గొనగలిగింది. ఆ తరువాత పొల్లాచ్చిలో జరిగిన 10 కి.మీ దూరం పరుగు పోటీలో పాల్గొని, మూడోస్థానాన్ని దక్కించుకుంది. ఆ ఆత్మవిశ్వాసంతో రాష్ట్రస్థాయిలో పలు పరుగుపోటీల్లో పాల్గొని, పతకాలు గెలుచుకునేది. కరూరులో జరిగిన 800, 1500, 5000 మీటర్ల దూరం పరుగుపోటీల్లోనూ వరుసగా మూడు బంగారు పతకాలు సాధించింది.

జాతీయస్థాయిలో... బెంగళూరులో గత ఫిబ్రవరిలో వాసంతి పాల్గొన్న జాతీయస్థాయి పోటీలు ఆమెను అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్తాయని అనుకోలేదు. 'మాస్టర్స్ అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' నిర్వహించిన 800, 1500, 5000 మీటర్ల పరుగు పోటీల్లో పాల్గొన్న ఆమె ఒండో స్థానాన్ని, రెండువేల మీటర్ల స్టీపిల్ ఛేజ్‌లో మొదటి స్థానాన్ని గెలుచుకుంది. అలా సెప్టెంబరులో స్పెయిన్‌లో జరగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశాన్ని అందుకుందామె. 'ఎప్పటిలానే ఇంటిపనులు చేస్తూ, హోటల్‌లో వంటచేస్తూనే సాధన చేయాలి. తెల్లవారుజామున రెండు గంటలు, సాయంత్రాల్లో మరో రెండుగంటలు సాధన చేస్తున్నా. అక్కడా విజయం సాధించాలనుకుంటున్నా..' అని చెబుతుందామె.

అందరితోనూ పొగరుగా మాట్లాడుతోంది!

డియర్ వసుంధర

డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

ప్ర: మాకు ఒక్కగానొక్క కూతురు. దాంతో చిన్నప్పటి నుంచి గారాబంగా పెంచాం. ఇప్పుడు తనకు 22 ఏళ్లు. మా పెంపకంలో ఉన్న తప్పు ఏంటో తెలీదు కానీ తను అన్ని విషయాలకూ పొగరుగా స్పందిస్తుంది. చుట్టాలతో, స్నేహితులతో... ఇలా ఎవరితో మాట్లాడినా ఆ తీరు స్పష్టంగా కనిపిస్తుంది. బయటి వ్యక్తి మాటలు అస్సలు లెక్కచేయదు. ఎవరినీ పలకరించదు. అన్నీ తనకే తెలుసనుకుంటుంది. అందుకే ఆమెకుండే స్నేహితులు కూడా తక్కువే. కానీ వీటన్నింటి గురించి ఆమెకసలు బాధ ఉండదు. మేమేమైనా మందలిస్తే కొన్ని రోజులు సరిగ్గా ఉంటుందంతే. తనలో పూర్తిస్థాయిలో మార్పు తీసుకురావాలంటే ఏం చేయాలి? మేం మారాలంటారా? - ఓ సోదరి

జ: ఒక్కగానొక్క పాప అయ్యేసరికి గారాబంగా పెంచామన్నారు. తల్లిదండ్రులన్నాక పిల్లల విషయంలో గారాబం చూపించడం సహజమే. అయితే దాని ప్రభావం వాళ్లకు నేర్పించాల్సిన విలువల మీద పడకూడదు. పెద్దవాళ్లతో ఎలా మాట్లాడాలీ, తోటి వాళ్లతో ఎలా ప్రవర్తించాలి... ఇలాంటి విషయాలన్నీ ఎప్పటికప్పుడు చెబుతుండాలి. పిల్లలు చిన్నవయసులో ఉన్నప్పుడు దురుసుగా మాట్లాడుతుంటే చిన్నపిల్లలే కదా అని మౌనంగా ఉండిపోకూడదు. ఎప్పటికప్పుడు వాళ్ల మాట తీరును సరిదిద్దాలి. లేదంటే పెద్దయ్యాక వాళ్లను మార్చడం కష్టం అవుతుంది. ఇక, పొగరుగా ఉండే వాళ్లు చూడటానికి ధైర్యంగా, దురుసుగా కనిపించినా వాళ్లలో ఏదో ఒక విషయంలో అభద్రతా భావం ఉంటుంది. అదే వాళ్ల తీరుకు ముఖ్య కారణం కావచ్చు. ముందు దానికి అసలైన కారణం కనుక్కుంటే వాళ్లలో సులువుగానే మార్పు తీసుకురావచ్చు. అయితే అలా ఉండే అందరిలోనూ అదే కారణమని చెప్పలేం. కొంతమందిలో నార్సిసిస్టిక్ డిజార్డర్ ఉంటుంది. అంటే నేనే గొప్ప అనే భావన కలిగి ఉండటం. అందుకే ముందు సరైన కారణం కనుక్కోవడం ముఖ్యం. మీ అమ్మాయికి ఇష్టమైన వాళ్లెవరైనా తనతో మాట్లాడి చూస్తే కారణం సులువుగానే కనుక్కోవచ్చు. ఇలా కుదరకపోతే సైకాలజీ కౌన్సెలింగ్ ఇప్పించాల్సి ఉంటుంది. మీరు కూడా కౌన్సెలింగ్ తీసుకుంటే ఇంకా మంచిది. దానివల్ల తన ప్రవర్తనను మీరు కూడా ఎప్పటికప్పుడు బేరీజు వేయొచ్చు. లేదంటే వ్యక్తిత్వ వికాస తరగతులకు పంపించండి. ఇప్పుడు ఫినిషింగ్ స్కూల్స్ కూడా వస్తున్నాయి. వాటిలో చీర ఎలా కట్టుకోవాలీ, మనం తినే టేబుల్‌ను ఎలా అలంకరించాలీ, ఎలా కూర్చోవాలీ, ఎలా నడవాలీ... ఇలా చిన్న చిన్న విషయాలతో పాటూ వాళ్ల ప్రవర్తన తీరు గురించి కూడా శిక్షణ ఇస్తారు. వాటివల్ల మార్పు తీసుకురావచ్చు. ప్రయత్నించి చూడండి.

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.

email: vasundhara@eenadu.net

రోగనిరోధకశక్తికి మిరియాలు

ఇంటి వైద్యం

తొలకరి మొదలైంది. అడపాదడపా చినుకులు పడుతూనే ఉన్నాయి. ఈ సమయంలో అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలంటే... వ్యాధినిరోధకశక్తి తగ్గకుండా చూసుకోవాలి. అందుకేం చేయాలంటే...

ఈ సమయంలో రోగనిరోధకశక్తి తగ్గడంతో పాటూ ఆకలి కూడా తగ్గుతుంది. జీర్ణశక్తి పనితీరు కూడా మందగిస్తుంది. ఈ రెండే అనారోగ్యాలకు దారితీస్తాయి. అతిసారం, కామెర్లూ, జ్వరాలు త్వరగా వ్యాపిస్తాయి. అందుకే ఆహార పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతారు. ఈ సమయంలో తేలిగ్గా జీర్ణమయ్యే పదార్థాలను మాత్రమే ఎంచుకోవాలి. ఏ పూటకా పూట వండినవీ, వేడిగా ఉన్న పదార్థాలను మాత్రమే తీసుకునేందుకు ప్రయత్నించాలి. చల్లారి, నిల్వ ఉన్నవాటిలో హానికరమైన సూక్ష్మజీవులు పెరిగి ఇన్‌ఫెక్షన్లకు దారితీస్తాయి. మాంసాహారం అయితే చాలా త్వరగా కలుషితం అవుతుంది. అందుకే వానాకాలంలో వీలైనంత తక్కువగా మాంసాహారాన్ని ఎంచుకోవాలి. దుంపలూ, ఆకుకూరల్ని కూడా మితంగా తీసుకుంటేనే మంచిది.

మిరియాలు ఎక్కువగా... మంచినీళ్లు దాదాపు 10 నిమిషాలపాటు మరిగించాలి. ఆ తరువాత వడకట్టి చల్లార్చి తాగాలి. లేదంటే గోరువెచ్చగా అయినా తీసుకోవచ్చు. పదార్థాల్లో మిరియాలూ, శొంఠీ, లవంగాలు వీలైనంత ఎక్కువగా వాడాలి. ఇవి జీర్ణశక్తిని పెంచడమే కాకుండా, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా చేస్తాయి.

ఇలా చేయొచ్చు...

● కప్పు పాలల్లో పావుచెంచా శొంఠి పొడీ, కొద్దిగా పటికబెల్లం కలపాలి. దీన్ని తరచూ తీసుకుంటే దగ్గూ, జ్వరం, అజీర్తి బాధించవు. కొందరికి పాలు నచ్చకపోవచ్చు. అలాంటివాళ్లు కప్పు నీళ్లను మరిగించి, అందులో చెంచా శొంఠి పొడి వేసి మరొకసారి బాగా మరగనివ్వాలి. ఈ నీళ్లు గోరువెచ్చగా అయ్యాక కాస్త బెల్లం కలిపి తాగాలి. ఇలా రోజుకోసారి తీసుకోవాలి. అలాగే కప్పు వేడిపాలల్లో చెంచా పసుపు కలిపి తాగితే ఎలర్జీ సమస్య కూడా బాధించదు.

● శొంఠీ, పిప్పళ్లు, మిరియాలు, తిప్పతీగ - ఈ నాలుగింటినీ సమానపాళ్లలో తీసుకుని విడివిడిగా చూర్ణాలు చేసుకోవాలి. అన్నింటినీ తెల్లని, పల్చని వస్త్రంలో జల్లించాలి. వీటన్నింటినీ కలిపి ఓ సీసాలోకి తీసుకోవాలి. ప్రతీరోజూ అరచెంచా పొడిలో కొద్దిగా తేనె, నెయ్యి కలిపి తీసుకోవాలి. అయితే తేనె కన్నా నెయ్యి మోతాదు ఎక్కువగా ఉండాలి. దీనివల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది. లేదంటే కప్పు నీళ్లలో ఇదే మిశ్రమాన్ని చెంచా కలిపి పొయ్యిమీద పెట్టాలి. నీళ్లు సగం అయ్యాక దింపేసి సరిపడా బెల్లం కలిపి గోరువెచ్చగా తాగినా మంచిదే. ఈ జాగ్రత్తలు తీసుకుంటే అనారోగ్యాలు దరిచేరవు.

డాక్టర్ గాయత్రీదేవి,
ఆరోగ్యపీఠం

నజరానా

మస్కారా అందుబాటులో లేకపోతే... నలుపురంగు ఐషాడోలో కాస్త మాయిశ్చరైజర్ కలిపి వాడి చూడండి. చక్కగా వస్తుంది.

బంగారం వెండి

13న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,954	2,952
వెండి (గ్రా)	44.10	43.90



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,900	31,900	31,700	31,700	31,600	31,600	31,910	31,945	31,700	31,700
ఆర్నమెంట్	29,800	29,800	29,400	29,400	29,260	29,300	29,540	29,520	29,480	29,480
వెండి(కిలో)	41,650	41,630	42,000	42,000	41,600	41,700	40,800	41,700	41,900	41,900

ఏ మాత్రం నలతగా ఉన్నా అందరం ఆసుపత్రికి వెళ్లిపోతాం. వైద్యుడు వివరాలడిగి చిన్న చీటి మన చేతిలో పెడతాడు. ఆ బ్రహ్మరాతని సునాయాసంగా చదివేసి ఎలాంటి పొరపాటు లేకుండా మందులిచ్చే వాళ్లే ఫార్మసిస్టులు. అందరి ఆరోగ్యరక్షణే పరమావధిగా పనిచేసే ఈ ఫార్మసీ రంగంలోకి ప్రవేశించాలంటే కొన్ని కోర్సులు చేయాలి. హెల్త్‌కేర్‌కి సంబంధించి వివిధ విభాగాల్లో ఈ నిపుణులకు ఎప్పటికీ తరగని డిమాండ్ ఉంటోంది.

డీ-ఫార్మసీ

ఇది రెండు సంవత్సరాల వ్యవధి ఉన్న కోర్సు. ఇందులో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ఫార్మాస్యూటిక్స్, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్ ఫార్మసీ, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, డ్రగ్‌స్టోర్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాలపై మౌలిక అవగాహన కల్పిస్తారు. కోర్సు పూర్తి అయిన తర్వాత 500 గంటలు హాస్పిటల్‌లోని డిస్పెన్సరీల్లో శిక్షణను తీసుకోవాలి. తర్వాత రాష్ట్ర ఔషధ సంఘంలో పేరును నమోదు చేసుకొని రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్‌గా అర్హత పొందవచ్చు. దీంతో వీరికి హాస్పిటల్ ఫార్మసిస్ట్, రిటైల్ ఫార్మసిస్ట్, మెడికల్ రిప్రజెంటేటివ్, హోల్‌సేల్ డీలర్; మాన్యుఫ్యాక్చరింగ్ కెమిస్ట్ ఫర్ కాస్మటిక్స్, రీ ప్యాకింగ్ ఆఫ్ డ్రగ్స్, కమ్యూనిటీ ఫార్మసిస్ట్ లాంటి ఉద్యోగాలు ఉంటాయి. దేశం మొత్తం మీద 564 కళాశాలల్లో ఈ కోర్సు ఉంది. వీటిలో 42 కళాశాలలు ఆంధ్రప్రదేశ్‌లో, 26 తెలంగాణలో ఉన్నాయి.

డీ ఫార్మసీ పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే ఈసీఈటీ (ఈసెట్) పరీక్షలో ఉత్తీర్ణత పొంది రెండో సంవత్సరం బీ-ఫార్మసీ కోర్సులో లేదా ఫార్మా-డీలో చేరవచ్చు. వీరికి 10 శాతం సీట్లను కేటాయిస్తారు.

రమ్మంటోంది.. ఔషధరంగం!

అత్యంత ప్రాచీనమైన ఔషధ శాస్త్రాన్ని ఉపయోగించి పూర్వ కాలంలో వైద్యులు తమ సొంత మందు చీటీలను తయారు చేసుకునేవారు. తర్వాత కాలక్రమేణా దీన్ని వైద్య శాస్త్రానికి అనుసంధానించడంతో ఔషధ నిపుణుల (ఫార్మసిస్ట్) అవసరం ఏర్పడింది. తయారుచేసిన ఔషధాలను ఫార్మసిస్ట్ ద్వారా వైద్యులకు, రోగులకు చేర్చాలనేది తప్పనిసరి నిబంధన. ఈ నేపథ్యంలో ఫార్మసిస్ట్‌లకు డిమాండ్ పెరిగింది.

డాక్టర్ కె. పద్మలత
విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫర్ ఉమెన్, విజయవాడ.

ఫార్మసీ విద్యను అభ్యసించడానికి మొదటగా కళాశాల ఎంపిక అత్యంత ప్రధానం. ఈ విద్యనందించే కళాశాలలు ఏఐసీటీఈ, పీసీఐ ద్వారా గుర్తింపు పొంది ఉండాలి. ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌లతో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఫార్మసీ విద్యలో చేరడానికి అర్హులు. కళాశాలల్లో 50 శాతం సీట్లు మొదట ఎంపీసీ చదివిన విద్యార్థులకు, మిగిలిన 50 శాతం బైపీసీవారికి కేటాయిస్తారు. ఇంటర్‌లో పొందిన మార్కుల ఆధారంగా డీఫార్మసీ అడ్మిషన్లు నిర్వహిస్తారు. ఇందుకోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఈ ప్రకటన సాధారణంగా జూన్ చివరి వారంలో వస్తుంది. మిగిలిన రెండు కోర్సులకు ఇంటర్‌తోపాటు ఎంసెట్‌లో అర్హత పొంది ఉండాలి.

విద్యార్థి తన ఆసక్తిని బట్టి ఫార్మసీలో ఈ కింది మూడు కోర్సుల్లో ఎందులోనైనా చేరవచ్చు.

- డిప్లొమా ఇన్ ఫార్మసీ - 2 సంవత్సరాలు
- బ్యాచిలర్ ఇన్ ఫార్మసీ - 4 సంవత్సరాలు
- డాక్టర్ ఇన్ ఫార్మసీ - 6 సంవత్సరాలు

కెరియర్ గైడెన్స్ - ఫార్మసీ

ఉపాధినిచ్చే రంగాలు

ప్రొడక్షన్, మ్యానుఫ్యాక్చరింగ్: బల్క్ డ్రగ్స్ తయారీ, ఔషధాలు, టీకాల తయారీ, జీవ ఔషధ ఉత్పత్తుల తయారీ, వైద్య పరికరాల తయారీ, పశు సంబంధిత ఔషధాల తయారీ.

ప్యాకేజింగ్: ఔషధ ఉత్పత్తిలో పలు దశలు, వాటి ప్యాకింగ్.

క్వాలిటీ కంట్రోల్: ఔషధాల తయారీలో ఉత్పత్తయిన ఔషధాల నాణ్యతా ప్రమాణాలను పాటించడం, ప్రొడక్ట్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్, ప్రొడక్షన్ మేనేజర్, డైరెక్టర్ - ఈ విధులను ఫార్మసీ నిపుణులే నిర్వహిస్తారు.

క్వాలిటీ అస్యూరెన్స్: ఔషధాలకు, వాటి తయారీకి సంబంధించిన డాక్యుమెంట్లను తయారుచేయడం, పరిశీలన, తర్వాత సంబంధిత శాఖలకు సమర్పించడం, ఔషధాల నాణ్యతను పాటించడానికి తగిన శిక్షణ, ఇంటర్నల్ ఆడిటింగ్ వంటివి ఈ శాఖకు సంబంధించినవి.

సేల్స్, మార్కెటింగ్: ప్లానింగ్, టీమ్ మేనేజ్‌మెంట్, ఔషధాల మార్కెటింగ్, ఎంట్రీ లెవల్, రిప్రజెంటేటివ్, టెరిటరీ మేనేజర్, ఏరియా మేనేజర్, జోనల్ మేనేజర్, రీజనల్ మేనేజర్, నేషనల్ సేల్స్ మేనేజర్, జనరల్ మేనేజర్ (సేల్స్, మార్కెటింగ్) వంటి వివిధ శాఖల్లో ఉద్యోగాలను ఎంచుకోవచ్చు.

ఎగ్జిక్యూటివ్: ఎంట్రీలెవల్, మేనేజ్‌మెంట్ ట్రెయినీ, అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్, ప్రోడక్ట్ మేనేజర్, గ్రూప్ ప్రోడక్ట్ మేనేజర్ వంటి స్థాయుల్లో పలు బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

రెగ్యులేటరీ అఫైర్స్ (మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్): మేనేజ్‌మెంట్ ట్రెయినీ, అసిస్టెంట్ మేనేజర్, కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్, రీ-ప్యాకింగ్ మాన్యుఫ్యాక్చరర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ప్రభుత్వ అనలిస్ట్, అనలిటికల్ కెమిస్ట్, మాన్యుఫ్యాక్చరింగ్ కెమిస్ట్ వంటి అవకాశాలు ఉన్నాయి.

విద్యా రంగం, క్లినికల్ రిసెర్చ్ (స్పెషలైజేషన్‌తో కూడినవి) వంటి వాటిలో కూడా ఆకర్షణీయమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

ఫార్మా - డీ

ఇది 6 సంవత్సరాల కోర్సు. ఇంటర్మీడియట్ ఎంపీసీ లేదా బైపీసీలో 50 శాతం మార్కులు కనీస విద్యార్హత. ప్రతి కళాశాలలో దీనికి 30 సీట్లు మాత్రమే ఉంటాయి. ఈ విద్యార్థులకు హాస్పిటల్, క్లినికల్, రోగ సంబంధిత విషయాలపై అవగాహన కల్పిస్తారు. వీరికి విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి. 2008 నుంచి విదేశీ ఉద్యోగాలకు అనుగుణంగా ఈ కోర్సును మన దేశంలో ప్రారంభించారు. ఇది ఉన్న ప్రతి కళాశాల టీచింగ్ హాస్పిటల్‌కు గానీ, ప్రాక్టీస్ సంబంధిత హాస్పిటల్‌కు గానీ అనుసంధానమై ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 58, తెలంగాణలో దాదాపు 63 కళాశాలల్లో ఈ కోర్సు అందిస్తున్నారు.

ఈ కోర్సు విద్యార్థులకు అనాటమీ, ఫిజియోలజీ, పాథోఫిజియోలజీ, ఫార్మాకో-థెరప్యూటిక్స్ వంటి సబ్జెక్టులపై మంచి పట్టును పెంచుతుంది. వీరు రెండో సంవత్సరం నుంచే హాస్పిటల్‌ను సందర్శిస్తారు. రోగుల సమస్యలపై అవగాహన పొందుతారు. తర్వాత ఆరో సంవత్సరంలో పూర్తిగా హాస్పిటల్‌లో ఉండి మెడికల్ డాక్టర్స్‌గా ఇంటర్న్‌షిప్ చేస్తారు. రెగ్యులేటరీ సంస్థల్లో కూడా ఈ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. కమ్యూనిటీ ఫార్మసీ, హాస్పిటల్ ఫార్మసీ, క్లినికల్ ఫార్మసీ విభాగాల్లో కూడా ఉద్యోగాలు ఉంటాయి.

ఉద్యోగాలు: ఈ కోర్సు చేసిన విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేసిన విభాగాన్ని బట్టి న్యూక్లియర్ ఫార్మసిస్ట్, పిడియాట్రిక్ ఫార్మసిస్ట్, అంకాలజీ ఫార్మసిస్ట్, జీరియాట్రిక్ ఫార్మసిస్ట్, వెటర్నరీ ఫార్మసిస్ట్, న్యూట్రిషనల్ సపోర్ట్ ఫార్మసిస్ట్, సైకియాట్రిక్ ఫార్మసిస్ట్, హైపర్‌టెన్షన్ ఫార్మసిస్ట్, డయాబెటిక్ ఫార్మసిస్ట్, డ్రగ్ ఇన్ఫర్మేషన్ ఫార్మసిస్ట్‌గా ఉద్యోగాలు పొందుతారు.

క్లినికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌వో)లో క్లినికల్ ట్రైల్స్ ఆర్గనైజర్, ఫీజిబిలిటీ స్టడీస్ ప్రోటోకాల్ డెవలప్‌మెంట్, కేస్ రిపోర్ట్ ఫామ్ రివ్యూ అండ్ డిజైనింగ్, ఏడీఆర్ రిపోర్టింగ్, పేషంట్

మానిటరింగ్, బయో అనలిటికల్ స్టడీస్, బయో అవైలబిలిటీ స్టడీస్, డేటా మేనేజ్‌మెంట్ ఫర్ గ్లోబల్ ట్రైల్స్, క్లినికల్ టాక్సీకాలజీ, ఫార్మాథెరాప్యుటిక్స్ వంటి విభాగాల్లో అవకాశాలు ఉంటాయి.

ఈ కోర్సు పూర్తి చేసి ఉన్నత విద్య, పరిశోధనపై ఆసక్తి ఉన్న విద్యార్థులు పీహెచ్‌డీ వైపు తమ దృష్టిని సారించవచ్చు.

బీ-ఫార్మసీ

ఇది నాలుగు సంవత్సరాల వ్యవధి ఉన్న కోర్సు. ఇంటర్మీడియట్, (ఎంపీసీ, బైపీసీ), డీ-ఫార్మసీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు ఈ కోర్సుకు అర్హులు. ఆంధ్రప్రదేశ్‌లో 128, తెలంగాణలో 175 కాలేజీలు బీ-ఫార్మసీ అందిస్తున్నాయి. ఇందులో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ ఫార్మకాలజీ, పాథోఫిజియోలజీ, ఫార్మాస్యూటిక్స్, హెల్త్ ఎడ్యుకేషన్, ఫార్మకాగ్నసీ, బయోకెమిస్ట్రీ, ఫార్మా మేనేజ్‌మెంట్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మా ఇంజినీరింగ్, ఫార్మా జూరిస్, ఫార్మా ప్రాక్టీస్, హాస్పిటల్, ఫార్మసీ కమ్యూనిటీ ఫార్మసీ, క్లినికల్ ఫార్మసీ లాంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తారు. వీరు మూడో సంవత్సరం నుంచి నాలుగో సంవత్సరం మధ్యకాలంలో సుమారు 250 గంటలు ఔషధ తయారీ కర్మాగారాల్లో శిక్షణ పొందాలి. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ, ప్రాక్టీస్ సెట్టింగ్, ఇతర ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీలో ఉద్యోగం సంపాదించినవారికి రోగులతోకానీ, డాక్టర్లతో గానీ ప్రత్యక్ష సంబంధాలు ఉండవు. వీటిలో రిసెర్చ్, డెవలప్‌మెంట్ కింద డ్రగ్ డిస్కవరీ, ఫార్ములేషన్ ప్రాసెస్, డెవలప్‌మెంట్ స్టెబిలిటీ టెస్టింగ్, ప్యాకేజింగ్ డెవలప్‌మెంట్ వంటి విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. రిసెర్చ్ అసోసియేట్, రిసెర్చ్ ఎగ్జిక్యూటివ్, రిసెర్చ్ సైంటిస్టు, రిసెర్చ్ డైరెక్టర్, రిసెర్చ్ డెవలప్‌మెంట్ మేనేజర్ వంటి ఉన్నతమైన ఉద్యోగాల్లోనూ స్థిరపడవచ్చు.

ఉన్నత విద్య: బీ-ఫార్మసీ తర్వాత భారతదేశంలో ఎం-ఫార్మసీ, ఫార్మా-డీ (పీబీ), ఎంబీఏ వంటి ఉన్నత విద్య కోర్సులను చేయవచ్చు. జీఆర్‌ఈ, జీమాట్, ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ తదితర ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణులవడం ద్వారా విదేశాల్లో ఉన్నత శ్రేణి ఫార్మసీ విద్యను అభ్యసించవచ్చు. ఆసక్తి ఉన్నవారు ఫార్మా-డీ కూడా చేయవచ్చు. క్లినికల్ విభాగంపై అవగాహన, పట్టు ఉన్న విద్యార్థులు బీ-ఫార్మసీ అయిన తర్వాత 3 సంవత్సరాల ఫార్మా-డీ (పోస్ట్ బ్యాచ్‌లరేట్ కోర్స్)ను చేయవచ్చు. కళాశాలకు 10 సీట్లు చొప్పున ఔషధ మండలి వీరికి సీట్లను కేటాయిస్తుంది.

ఎం-ఫార్మసీ: బీ-ఫార్మసీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు గ్యాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ జీప్యాట్ ద్వారా దేశంలోని ఏదైనా ఫార్మసీ కళాశాలలో ఎం-ఫార్మసీలో ప్రవేశం పొందవచ్చు. లేదా రాష్ట్రస్థాయి పీజీఈసీఈటీ ద్వారా రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల్లో ఎం-ఫార్మసీలో చేరవచ్చు జాతీయస్థాయి ఎన్ఐపీఈఆర్ అర్హత పరీక్ష ద్వారా, దేశంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్, రిసెర్చ్ (ఎన్ఐపీఈఆర్) విద్యాసంస్థల్లో ప్రవేశం పొందవచ్చు. జీఆర్‌ఈ, ఐఈఎల్‌టీఎస్, ఎన్ఏపీఎల్ఈఎక్స్, టోఫెల్ వంటి అర్హత పరీక్షల ద్వారా విదేశాల్లో ఎంఎస్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కోర్సును పూర్తి చేయవచ్చు. క్యాట్, ఐసెట్ అర్హత పరీక్షల ద్వారా ఎంబీఏను కూడా అభ్యసించవచ్చు. వీరు ఎంచుకునే ప్రత్యేక విభాగాలను బట్టి ఆయా విభాగాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మన దేశంలో భారత ఔషధ మండలి ప్రకారం 12 విభాగాల్లో ఎం-ఫార్మసీలో ప్రవేశం లభిస్తుంది. ఫార్మాస్యూటిక్స్, ఫార్మాకెమిస్ట్రీ, ఫార్మాఅనాలిసిస్, ఫార్మకాలజీ, ఫార్మకాగ్నసీ విభాగాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

ఉద్యోగావకాశాలు

భారతదేశంలో ఫార్మసీ విద్య చదివినవారికి ఉద్యోగ భద్రతతో కూడిన ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫార్మసీ పూర్తి చేసినవారికి ఉద్యోగ భద్రతతో పాటు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఆకర్షణీయమైన వార్షికాదాయంతో ఉద్యోగాలు ఎక్కువగానే ఉన్నాయని చెప్పాలి. వీరి వార్షికాదాయం కూడా ఆకర్షణీయంగా ఉంటుంది.

సైన్స్, హెల్త్‌కేర్, కంప్యూటర్ టెక్నాలజీ, మ్యాథ్స్, కౌన్సెలింగ్ రంగాల అనుసంధానమైన కొత్త సర్టిఫికెట్ కోర్సులతో ఫార్మసీ విద్యకు ఉపాధి అవకాశాలు ప్రపంచమంతటా విస్తరిస్తున్నాయి. విద్యార్హత, అనుభవం, ప్రతిభను బట్టి అర్హులైనవారికి మంచి ఉద్యోగస్థాయి, తగిన వేతనం లభిస్తున్నాయి.

కొన్ని ప్రధాన విభాగాలు: ■ ఫార్మసిస్ట్ (పరిశ్రమలు/ ఆసుపత్రులు/ క్లినికల్/ కమ్యూనిటీ) ■ ఫార్మకో ఎపిడిమియోలాజిస్ట్/ డేటా అనలిస్ట్ (ప్రస్తుతం బాగా ప్రాధాన్యం కలిగింది) ■ రిటైల్/ హోల్‌సేల్ కెమిస్ట్/ డ్రగ్గిస్ట్ (వ్యాపారం) ■ రోగులకు ప్రిస్క్రిప్షన్ తయారు చేయడం (విదేశాల్లో దీనికి అత్యంత ప్రాధాన్యం ఉంది) ■ డ్రగ్ థెరపిస్ట్ ■ డ్రగ్ ఇన్‌స్పెక్టర్, అనలిస్ట్ (ప్రభుత్వ ఉద్యోగాలు) ■ ఎకడమీషియన్స్ (ఫార్మసీ టీచర్స్) ■ కెమికల్/ డ్రగ్ టెక్నీషియన్ ■ పాథోలాజికల్ లాబ్ ■ ఆర్ అండ్ డీ (బేసిక్, అప్లైడ్) ■ బయో-టెక్ పరిశ్రమలు ■ సేల్స్, మార్కెటింగ్ ■ ఫార్మాస్యూటికల్, బయో-టెక్ ఆర్ అండ్ డీ ■ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు (ప్రొడక్షన్/ క్యూఏ-క్యూసీ/ డాక్యుమెంటేషన్) ■ క్లినికల్ రిసెర్చ్ సంస్థలు ■ రెగ్యులేటరీ సంస్థలైన ఎఫ్‌డీఏ, డబ్ల్యూహెచ్‌ఓ, సీడీఎస్‌సీఓ ■ ప్రభుత్వ రంగ ఆర్ అండ్ డీ సంస్థలు - సీఎస్ఐఆర్, ఎన్ఐఎన్, సీసీఎమ్‌బీ, ఐసీఎమ్ఆర్, డీటీఏబీ, సీడీఎల్, ఏఐసీటీఈ, పీసీఐ, ఫార్మాస్యూటికల్ అసోసియేషన్స్ (ఐపీఏ, ఐపీజీఏ, ఎఫ్ఐపీ, ఏపీటీఐ మొదలైనవి).

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

1) 480 కాంట్రాక్టు ఇంజినీర్ ఖాళీలు

అర్హత: సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఒక ఏడాది ఇండస్ట్రియల్ అనుభవం తప్పనిసరి. **వయసు:** 26 ఏళ్లు మించకూడదు. ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 23.06.2018

2) బెంగళూరు యూనిట్‌లో డిప్లొమా అప్రెంటిస్‌లు

స్టైపెండ్: నెలకు రూ.10,400 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత. 01.08.2015 తర్వాత డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులు. **వయసు:** 22 సంవత్సరాలకు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా.

రాతపరీక్ష/ ఇంటర్వ్యూ తేది: 2018 జులై 13, 14

దరఖాస్తు: ఈమెయిల్ **చివరి తేది:** 03.07.2018

ఈమెయిల్: hrcld@bel.co.in

వెబ్‌సైట్: http://bel-india.in/

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

సంస్థ: ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సదరన్ రీజియన్, చెన్నై

పోస్టులు: జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్

ఖాళీలు: 186 **అర్హత, వయసు:** ఏఏఐ నిబంధనల ప్రకారం. **ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

వెబ్‌సైట్: https://www.aai.aero/en

ప్రవేశాలు

నవోదయ విద్యాలయ సమితి

నవోదయ విద్యాలయ సమితి 2018-19 విద్యా సంవత్సరానికిగానూ దేశంలోని వివిధ జవహర్ నవోదయ విద్యాలయాల్లో పదకొండో తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **విభాగాలు:** సైన్స్, హ్యుమానిటీస్, కామర్స్, ఒకేషనల్. **అర్హత:** 2017-18 విద్యా సంవత్సరంలో పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు.

వయసు: 01.06.2000 నుంచి 31.05.2004 మధ్య జన్మించి ఉండాలి. **ఎంపిక:** పదోతరగతి మార్కుల ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్

చివరి తేది: 05.07.2018

వెబ్‌సైట్: http://navodayahyd.gov.in/

ఏపీ వర్సిటీల్లో ఇండో-స్వీడిష్ బీటెక్ ప్రోగ్రామ్

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ వర్సిటీలు స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) భాగస్వామ్యంతో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి. **కోర్సు ప్రత్యేకత:** నాలుగేళ్ల బీటెక్ కోర్సులో భాగంగా 3 సంవత్సరాలు ఇండియాలో, ఒక సంవత్సరం స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. **అందిస్తున్న ఏపీ వర్సిటీలు:** జేఎన్‌టీయూ కాకినాడ (60 సీట్లు), శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (30), జేఎన్‌టీయూ అనంతపురం (30), శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (30 సీట్లు). **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. **ఎంపిక:** ఐఐటీ జేఈఈ మెయిన్/ ఏపీ ఎంసెట్/ టీఎస్ ఎంసెట్/ ఇంటర్ మార్కుల ఆధారంగా.

దరఖాస్తు విధానం, చివరి తేదీ, ఇతర వివరాలు ఆయా యూనివర్సిటీల అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయి.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఎన్‌సీపీఓఆర్, గోవా

సంస్థ: నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ అండ్ ఓషన్ రిసెర్చ్ (ఎన్‌సీఏఓఆర్), గోవా. **పోస్టులు:** మెడికల్ ఆఫీసర్, ఎంటీఎస్, కుక్, వెల్డర్, మెకానిక్ తదితరాలు. **ఖాళీలు:** 32

అర్హత, వయసు: ఎన్‌సీఏఓఆర్ నిబంధనల ప్రకారం. **ఎంపిక:** స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా. **ఇంటర్వ్యూ తేది:** మెడికల్ ఆఫీసర్ పోస్టులకు జులై 4, మిగిలినవాటికి జులై 10 నుంచి 13 వరకు.

వేదిక: మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఎన్‌సీఏఓఆర్, వాస్కోడగామా, గోవా. మిగిలినవాటికి మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, ఐఎండీ క్యాంపస్, లోధి రోడ్, న్యూదిల్లీ.

వెబ్‌సైట్: http://ncaor.gov.in/recruitment

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సు చేయాలంటే..?

Q ఇంటర్ తరువాత ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ చదవాలంటే ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకుంటే మంచిది? ఈ కోర్సు గురించిన పూర్తి సమాచారాన్ని అందించండి.

- రాజు.పి, జై, వైవీఎన్ఎం సత్యనారాయణ

A పర్యావరణ భౌతిక, రసాయన, జీవ సంబంధిత భాగాలను పరస్పరం అధ్యయనం చేసే విజ్ఞానశాస్త్రమే ఎన్విరాన్‌మెంటల్ సైన్స్. ఇది జీవ, రసాయనిక, భూగోళశాస్త్రాల కలయిక. అందుకే దీన్ని ఇంటర్ డిసిప్లినరీ ఫీల్డ్‌గా పరిగణిస్తారు. ఈ శాస్త్రం సాంఘిక, మానవీయ శాస్త్రాలతో కూడా సంబంధం కలిగి ఉంటుంది. బీఎస్‌సీ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) మాత్రమే కాకుండా ఈ రంగంలో బీటెక్ (ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్)ను కూడా ఇంటర్ తరువాత ఎంచుకోవచ్చు.

ఇంటర్‌లో ఎంపీసీ/ బైపీసీ ఏదైనా ఎంపిక చేసుకోవచ్చు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్/ టెక్నాలజీ కోర్సుల్లో చేరాలంటే ఎంపీసీ ఎంచుకోవడం మంచిది. జీవశాస్త్ర కలయిక కోసం బైపీసీ ఎంచుకోవడం శ్రేయస్కరం. బీఎస్‌సీ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) లేదా బీటెక్ (ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్) రెండింటికీ కూడా చక్కని భవిష్యత్తు ఉంది. ప్రతిష్ఠాత్మక ఐఐటీ- ఖరగ్‌పూర్, ఐఐటీ-ఖాన్‌పూర్, ఐఐటీ-దిల్లీ, ఐఐటీ-రూర్కీ, ఐఐటీ-బాంబేల్లో బీటెక్‌లో ఈ కోర్సును అందిస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆధారంగా ప్రవేశాన్ని కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో బీఎస్‌సీ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌ను ఆల్ అమీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- రాజమండ్రి, శ్రీ గ్రంధి చిన సన్యాసి రాజు కాలేజ్- శ్రీకాకుళం, హోమ్‌సైన్స్ కాలేజ్- హైదరాబాద్, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ విమెన్- హైదరాబాద్, ఆంధ్రా, కాకతీయ విశ్వవిద్యాలయాలు అందిస్తున్నాయి.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఏమిటీ డయాఫ్రం వాల్?

బొమ్మరాజు దుర్గాప్రసాద్
ఈనాడు, అమరావతి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం... ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు కలల రూపం. సాగునీటికి మరింత భరోసాతో రైతన్న మోములో కనిపించే చిరునవ్వు. దానిని సాకారం చేసేందుకు కంకణబద్ధమైనట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. నిర్మాణంలో ఎదురవుతున్న పెను సవాళ్లకు అందివచ్చిన అత్యాధునిక సాంకేతికతతో సమాధానమిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకేస్తోంది. ఈ ప్రయాణంలో ఓ మేలి మలుపు.. పూర్తయిన డయాఫ్రం వాల్ నిర్మాణం. దీన్ని పూర్తి చేయడానికి అంతర్జాతీయ నిర్మాణ సంస్థ అనుభవం అవసరమైందంటే ఇది ఎంతటి ఉత్కృష్టమైనదో అర్థం చేసుకోవచ్చు. కానీ చూద్దామంటే పైకి అంతగా ఏమీ కనిపించదు. ఎందుకంటే నిర్మాణమంతా జరిగేది భూఅంతర్భాగంలో. ఉపరితలంలో చిన్న సిమెంటు కాలిబాట లాంటి ఆనవాళ్లు మాత్రమే కనిపిస్తాయి. కానీ ఇది ప్రాజెక్టులో ముఖ్యమైన ఒక పెద్ద రాయి, మట్టి కట్ట నిర్మాణానికి కీలక భూమిక. అందుకే ప్రశ్నలు ఎన్నో. దీని పూర్వాపరాలు తెలుసుకోవడంపై సర్వత్రా ఆసక్తి ఉన్న నేపథ్యంలో సాంకేతికాంశాలతో ముడిపడిన అంశాలను వీలుమేరకు సరళంగా వివరించే ప్రయత్నమిది.

● నీటిపారుదల ప్రాజెక్టు అంటే ఏమిటి?
డయాఫ్రం వాల్ గురించి తెలుసుకోవాలంటే అంతకంటే ముందుగా నీటిపారుదల ప్రాజెక్టు.. అందులో ఏమేమి భాగాలుంటాయో తెలుసుకోవాలి. ఏ ప్రాజెక్టునైనా నదిపై నిర్మిస్తారు. నీటిని నిల్వ చేసుకునేందుకు జలాశయం నిర్మిస్తారు. దీనికి కాలువలతో అనుసంధానం ఉంటుంది. ఈ జలాశయానికి స్పిల్ వే, మట్టికట్ట లేదా రాతి, మట్టికట్ట కూడా నిర్మిస్తారు.

● స్పిల్ వే అంటే ఏమిటి?
నదిలో వరద వచ్చినప్పుడు జలాశయం పూర్తిగా నిండిపోయిన తర్వాత ఆ ప్రవాహాన్ని ఒక క్రమపద్ధతిలో పొర్లిపోయేలా (స్పిల్ వే) బయటకు వదిలేసేందుకు నిర్మించే కట్టడమే ఇది. దీనికి తలుపులు ఏర్పాటు చేస్తారు. ప్రతి ప్రాజెక్టులో వరదలు వచ్చినప్పుడు తలుపులు ఎత్తి నీళ్లు వదలడం మనం చూస్తుంటాం. ఆ కట్టడమే స్పిల్ వే.

● ఏ స్థాయిలో నిర్మిస్తారు?
స్పిల్ వే నిర్మించే ముందు వందల ఏళ్ల నది వరద ప్రవాహ చరిత్రను పరిశీలిస్తారు. ఒక్క రోజులో ఎంత పెద్ద వరద రావచ్చో అంచనా వేస్తారు. హఠాత్తుగా అంత వరద వస్తే ఆ కట్టడానికి ఏ ఇబ్బంది రాకుండా తలుపులు తెరిచి ఆ నీటిని సులభంగా దిగవకు వదిలేసే స్థాయిలో, అంత పటిష్ఠంగా ఈ స్పిల్ వే నిర్మిస్తారు.



● స్పిల్ వే విషయంలో పోలవరం ప్రత్యేకతలేమిటి?
పోలవరం ప్రాజెక్టులో ఒక్క రోజులో 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ఏ ఇబ్బంది లేకుండా గేట్లు ఎత్తి దిగువకు వరద వదిలేసేటంత సామర్థ్యంతో స్పిల్ వే నిర్మిస్తున్నారు. సాధారణంగా ఏ ప్రాజెక్టులోనైనా జలాశయానికి స్పిల్ వే నది ప్రవహించే మార్గంలోనే, నది మధ్యలోకి వచ్చేలా నిర్మిస్తారు. కానీ పోలవరంలో అలా నిర్మించడం లేదు.

● ఎందుకని?
ఎందుకంటే చాలా లోతువరకు ఇసుక ఉన్న పరిస్థితుల్లో అక్కడ స్పిల్‌వే నిర్మాణం సరికాదని నిపుణులు పేర్కొన్నారు. గోదావరిలో పోలవరం వద్ద ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పుడో బ్రిటిష్ హయాం నుంచే ఉంది. ప్రాజెక్టు నిర్మించే క్షేత్రం చాలా సవాల్‌తో కూడినది. నదీ ప్రవాహాలపై అధ్యయనం చేసే అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ బ్యూరో ఆఫ్ రిక్లమేషన్ సంస్థ(యుఎస్‌ఆర్‌ఆర్) ఇక్కడ పరిశీలించి 1940కు ముందే ఇక్కడ స్పిల్ వే నిర్మాణం సరికాదని పేర్కొంది.

● కారణాలు ఏం చెప్పింది?
యుఎస్‌ఆర్‌ఆర్ అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన కీలకమైన సంస్థ. నదీ ప్రవాహ మార్గాలు... వాటిపై నిర్మాణాలకు సంబంధించి మంచి నైపుణ్యం ఉన్న సంస్థగా పేరుంది. పోలవరం వద్ద గోదావరిలో దాదాపు 100 అడుగుల నుంచి 300 అడుగుల వరకు దాదాపు కిలోమీటరు మేర మేటలు మేటలుగా ఉన్న ఇసుకను పరిశీలించారు. ఆ దిగువ ఎక్కడో రాతిపొరలు ఉన్న అంశాన్ని పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి గుర్తించిన క్షేత్రం కాంక్రీటు కట్టడం నిర్మాణానికి సరైనది కాదని, అక్కడ స్పిల్ వే నిర్మాణం సాధ్యం కాదని పేర్కొన్నారు. పైగా గోదావరి మహా నది. అనేక నెలల పాటు వేల, లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు ఉంటాయి. ఇంత మహా ప్రవాహాల నేపథ్యంలో ఒక కట్టడం నిర్మించడం అంత సులభమేమీ కాదని అభిప్రాయపడ్డారు. ఇంతగా పూడుకుపోయిన ఇసుకలో స్పిల్ వేకు పునాదిగా నిర్మించే కాంక్రీటు నిర్మాణం సాధ్యం కాదని తేల్చింది. ఆ సమయంలో ఈ ప్రాజెక్టును ఎలా నిర్మించాలా అనే నిపుణుల తర్జనభర్జనలతో గోదావరిని మళ్లించి స్పిల్ వే స్థలాన్ని కూడా మార్చాలని నిర్ణయించారు.

● శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ఏం చేశారు?
అక్కడ ఇలాంటి సమస్య రాలేదు. నది మధ్యలోనే స్పిల్ వే నిర్మించారు. అక్కడ నదిలో ఉన్న రాతి నేలల్లో నుంచి కాంక్రీటు నిర్మాణం చేసుకుంటూ వచ్చారు.

● మరిప్పుడు ఏం చేస్తున్నారు?
గోదావరి నది ఇప్పుడు ప్రవహిస్తున్న మార్గాన్ని మళ్లిస్తున్నారు. గోదావరి కుడి గట్టుపై గతంలో ఏడు గ్రామాలు ఉండేవి. పెద్ద పెద్ద కొండల మీద ఈ ఊళ్లు ఉండేవి. ఆ కొండల్లో రాతి నేలలు ఉన్నాయి. ఇప్పుడు ఆ కొండలను ఒక స్థాయి వరకు తవ్వేసి నదిని ఆ ఊళ్ల మీదకు మళ్లించేలే ప్రవాహ మార్గాన్ని మార్చారు. ఆ కొండల్లో ఉన్న రాయి ఆధారంగా నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా స్పిల్ వే నిర్మిస్తున్నారు.

● గోదావరి ఇప్పుడు ప్రవహిస్తున్న మార్గంలో ఏం కడుతున్నారంటే...
రాతి, మట్టి కట్టతో డ్యాం కడుతున్నారు. దానిని ఆంగ్లంలో ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం అంటున్నారు. గోదావరి నది ప్రవాహాన్ని జలాశయంగా నిలబెట్టేందుకు ఇది దోహదపడుతుంది. స్పిల్ వే నిర్మిస్తే ఇబ్బంది అనుకున్నారు కదా... రాతి, మట్టి కట్ట నిర్మించేందుకు ఏం జాగ్రత్తలు తీసుకున్నారు అని సందేహం రావచ్చు. అలాంటి ఇబ్బంది రాకుండా నిర్మించిందే డయా ఫ్రం వాల్.

పోలవరం ఏ రకంగా ప్రత్యేకం?

పోలవరం ప్రాజెక్టు 50 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు మళ్లించేందుకు అనువుగా నిర్మిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు 13.56 లక్షల క్యూసెక్కుల సామర్థ్యానికి అనువుగా నిర్మించారు. అదే నాగార్జునసాగర్ 15.60 లక్షల క్యూసెక్కుల వరద మళ్లించేందుకు వీలుగా నిర్మించారు. పులిచింతల ప్రాజెక్టు 20 లక్షల క్యూసెక్కుల వరదను మళ్లించగలదు. ప్రకాశం బ్యారేజిని 12.12 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేయగలిగే సామర్థ్యంతో నిర్మించారు.

● ఇసుక పొరల్లో కట్టిందిలా..
గోదావరి గర్భంలో ఇసుక పొరల్లో నిర్మించేదే డయాఫ్రంవాల్. ఆ గోడ అంతా ఏకమొత్తంగా నిర్మించుకుంటూ రావడం సాధ్యం కాదు. అందుకని యంత్రాల సాయంతో తొలుత 7 మీటర్ల మేర తవ్వుతూ బెంటినైట్ ద్రావణం నింపుతూ వెళ్లారు. తవ్విన ప్రదేశంలోని ఇసుక, మట్టి, రాళ్లను అదే యంత్రం సాయంతో బయటకు తీసుకొచ్చేశారు. తిరిగి ప్లాస్టిక్ కాంక్రీటును ఆ ఖాళీ ప్రదేశంలో నింపారు. ఇలా ఏడేసి మీటర్ల చొప్పున నిర్మించడమే ఒక ప్యానల్. దాని పక్కన మళ్లీ 2.8 మీటర్లు వదిలేసి మళ్లీ మరో 7 మీటర్ల మేర తవ్వుకుంటూ గోడ నిర్మించారు. తర్వాత ఇలా మధ్యమధ్యలో 2.8 మీటర్ల మేర వదిలేసిన వాటిని తవ్వి అక్కడ గోడ కడతారు.

డయాఫ్రం వాల్ అంటే...?

నదిలో అడ్డుకట్టగా పెద్ద రాతి, మట్టి కట్ట కడుతున్న సమయంలో పునాది ఎలా నిర్మించాలి అనేది కీలకాంశం. ఊట నీరు అటు నుంచి ఇటు వైపునకు రాకుండా పకడ్బందీ ఏర్పాటు ఉండాలి. మన ఇంటికి పునాది ఎలాగో కరకట్టకు పునాది కూడా అంత పటిష్ఠంగా ఉండాలి. ఇందుకు అనేక విధానాలున్నాయి. పోలవరంలో డయాఫ్రం వాల్ పద్ధతి సరైంది అని తేల్చారు. ఇక్కడ చాలా లోతు వరకు ఇసుక ఉన్నందున ఆ ఇసుక గుండా నీటి ఊట అడ్డుకట్ట దాటుకుని వచ్చేసే ప్రమాదం ఉంది. అందుకే రాతిపొర తగిలే వరకు కూడా ఊట నియంత్రణ గోడ నిర్మించాల్సి వచ్చింది. ఆ గోడే డయాఫ్రం వాల్.

● గొప్పతనం ఏమిటి?
పోలవరంలో గోదావరి నదికి అడ్డంగా ఏకంగా 1.5 మీటర్ల మందం(వెడల్పు)తో 1.38 కిలోమీటర్ల మేర నిర్మించినంత డయాఫ్రం వాల్ భారతదేశంలోనే లేదు. అంతే కాదు... నదిలో ఏకంగా దాదాపు 90 నుంచి 300 అడుగుల లోతుకు వెళ్లి రాయిని పట్టుకుని ఆ రాయిలో నుంచి ఇలాంటి ఊటనీటి నియంత్రణ గోడ నిర్మించింది దేశంలోనే ఎక్కడా లేదు. విదేశాల్లో కూడా ఇంత లోతు నుంచి ఎక్కడా నిర్మించింది లేదని ఈ నిర్మాణాల్లో అనుభవం ఉన్న బావర్ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

● నిర్మాణంలో అసలు సవాల్ ఏమిటి?
ఊట నియంత్రణ గోడ నిర్మాణంలో దాదాపు 300 అడుగుల లోతు నుంచి కూడా నిటారుగా గోడ నిర్మించుకుంటూ రావాలి. అంటే 90 డిగ్రీల లంబకోణంలోనే ఆ నిర్మాణం ఉండాలి. ఎక్కడా చిన్నపాటి తేడా కూడా ఉండకూడదు. అది సరిగ్గా చేయడమే అసలు సవాల్. ఇందుకు ఉపయోగించిన యంత్రపరికరాలు, పని చేసిన వారి నైపుణ్యం, అనుభవమే ఇందులో కీలకమైంది.

దాదాపు 90 అడుగుల ఎత్తైన గేట్లు

స్పిల్ వే 1.12 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్నారు. వీటికి అమర్చే 48 గేట్లు ఒక్కోటి దాదాపు 90 అడుగుల ఎత్తు ఉంటుంది. ఇంత పెద్ద తలుపులు దేశంలో ఏ ప్రాజెక్టులోనూ ఇంతవరకు ఏర్పాటు చేయలేదని చెబుతున్నారు. ఈ స్పిల్ వే నిర్మాణం తలుపులతో సహా 2019 మార్చి నాటికి పూర్తి కావాలనేది లక్ష్యం.

● నిర్మాణ ప్రక్రియ ఎలా సాగింది?
హైడ్రాలిక్ గ్రాబర్లు, బ్లాచింగ్ ప్లాంట్లు, ఎంసీ128 వంటి కట్టర్లు....ఇలా పెద్ద పెద్ద యంత్రపరికాలు వినియోగించారు. ఇక్కడ ఉన్నదంతా ఇసుకే. తవ్విన చోట ఆ ఇసుక పెచ్చులుగా ఊడితే నిర్మాణం కష్టం. అందుకే ఈ యంత్రాల సాయంతో తవ్వుతూ ఆ తవ్విన ప్రాంతంలో బెంటినైట్ ద్రావణం పోస్తూ రాయి తగిలే వరకు తవ్వుకుంటూ వెళ్లారు. ఆ తవ్విన ఇసుక, మట్టి తదితరాలు పైకి తీసుకొచ్చేందుకు ఒక పంపు ఉంటుంది. ఆ ఖాళీ ఏర్పడ్డ ప్రదేశంలో ప్లాస్టిక్ కాంక్రీట్ నింపుతూ వెళ్లారు. ఇలా రాయి తగిలే వరకు వెళ్లారు. ఈ క్రమంలో ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. దేశంలో ఈ స్థాయి నిర్మాణం చేసిన గుత్తేదారు ఏజన్సీ లేకపోవడంతో జర్మన్ కంపెనీ బావర్‌ను రంగంలోకి దించి పనులు చేయించారు.

● బెంటినైట్ ద్రావణం ఎందుకు?
లోతుకు తవ్వుకుంటూ వెళ్తున్నప్పుడు ఇసుకతో మళ్లీ పూడుకుపోయే అవకాశం ఉంటుంది. అలా పెచ్చులూడి పడకుండా ఒకపక్క చుట్టూ బెంటినైట్ ద్రావణ నింపుతూ లోతుకు తవ్వుకుంటూ వెళ్తారు.

● ప్లాస్టిక్ కాంక్రీటు అంటే ఏమిటి?
డయాఫ్రం వాల్ నిర్మాణంలో ప్లాస్టిక్ కాంక్రీట్ వాడారు అంటే ప్లాస్టిక్ వాడారని కాదు. సిమెంట్, ఇసుక, కంకరతో పాటు బెంటినైట్ పొడిని నీళ్లతో కలిపి జత చేస్తారు. దీని వల్ల కట్టడం గట్టిగా ఉంటుంది. భూకంపాలు వచ్చినప్పుడు ఆ ప్రభావాలను తట్టుకుంటుంది. ఉదాహరణకు ఒక కర్ర స్కేలు గట్టిగా వంచితే విరిగిపోతుంది. అదే ప్లాస్టిక్ స్కేలును గట్టిగా వంచినా ఏ ప్రభావమూ పడదు. అంటే ఈ కాంక్రీటు వల్ల కాస్త సంకోచ, వ్యాకోచ గుణం ఉండి నిర్మాణం పటిష్ఠంగా ఉంటుంది.

స్థూలంగా పోలవరం ఊహా రూపం

● ఎన్ని రోజుల్లో, ఎలా నిర్మించారు?
గోదావరిలో లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు ఉంటాయి. ఫిబ్రవరి నుంచి మే నెలాఖరు వరకే ప్రవాహాలు తగ్గుతాయి. ఈ సవాళ్లను తట్టుకుంటూ 412 రోజుల్లో డయా ఫ్రం వాల్ నిర్మించారు.

● ఎంత ఖర్చయింది?
రూ.430 కోట్లు ఖర్చు చేశారు. జర్మనీ నిర్మాణ సంస్థ బావర్‌కు ఈ పనిలో అనుభవం ఉంది. వారు ఎల్‌అండ్‌టి జియోతో కలిసి ఈ నిర్మాణ పనులు చేశారు.

● వరదలు వస్తే డయాఫ్రం వాల్‌కు ఇబ్బంది ఉండదా?
ఏ ఇబ్బంది ఉండదు. సాధారణంగా నదిపై ఉండే ఇసుక ఎప్పుడూ కోసుకుపోదు. వరద మరింత పూడికను తీసుకువచ్చి మేట వేసేలా చేస్తుంది. కాబట్టి ఏమీ ఇబ్బంది ఉండదని ఇంజినీర్లు చెబుతున్నారు.

● ఇక రాతి, మట్టి కట్ట నిర్మాణమే!
పూర్తయిన డయాఫ్రం వాల్‌పై ఇక 1.47 కిలోమీటర్ల పొడవునా రాతి, మట్టి కట్ట నిర్మాణం చేపడతారు. ఈ డ్యాం దిగువ భాగంలో దాదాపు వెయ్యి అడుగుల వెడల్పు ఉంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు. అలా క్రమంగా తగ్గుతూ పైకి వచ్చేసరికి 50 అడుగుల వెడల్పుతో ఉంటుంది. ఈ నిర్మాణం 2019 డిసెంబర్‌కు పూర్తి చేయాలని లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్నారు. ఇంకా ఆకృతులు ఖరారు కావాల్సి ఉంది.

రాహుల్‌గాంధీ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ

రాహుల్ ఇఫ్తార్ విందుకు హాజరైన ప్రణబ్

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆ హోదాలో తొలిసారిగా బుధవారం ఇచ్చిన ఇఫ్తార్ విందుకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సహా పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఇటీవల ఆరెస్సెస్ కార్యక్రమానికి ప్రణబ్ హాజరుపై కాంగ్రెస్ నేతలు తొలుత పెద్దఎత్తున అభ్యంతరం వ్యక్తం చేసి, తర్వాత ఆయన ప్రసంగాన్ని కొనియాడిన విషయం తెలిసిందే. విందులో రాహుల్, ఇతర నేతలతో ప్రణబ్ మాట్లాడుతూ కనిపించారు. హాజరైనవారిలో మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, జేడీ(యు) తిరుగుబాటునేత శరద్‌యాదవ్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, కాంగ్రెస్ నేతలు మల్లికార్జున్ ఖర్గే, గులాంనబీ ఆజాద్, పి.చిదంబరం, ఆంటోనీ తదితరులు ఉన్నారు. దేహదారుఢ్యంపై ప్రధాని నరేంద్రమోదీ ట్విటర్లో విడుదల చేసిన వీడియో హాస్యాస్పదంగా, అసహజంగా ఉందని రాహుల్ ఈ విందులో వ్యాఖ్యానించారు.

సైంధవుడిలా చంద్రబాబు: కన్నా

ఈనాడు, దిల్లీ : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైంధవుడిలా అడ్డుపడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎందుకు యూటర్న్ తీసుకున్నారో అర్థం కాలేదని, చాలా గౌరవం ఇచ్చాం కదాని ప్రధాని నరేంద్రమోదీ అడిగారని... నమ్మిన వారిని వెన్నుపోటు పొడవడం ఆయన సహజగుణమని చెప్పానని వెల్లడించారు. బుధవారమిక్కడ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో కన్నా లక్ష్మీనారాయణ, హరిబాబు, పురందేశ్వరి, విష్ణుకుమార్‌రాజు, జీవీఎల్ నరసింహారావు, రాంమాధవ్, మురళీధర్‌రావు, రాంలాల్, వి.సతీశ్‌లు భేటీ అయ్యారు. సుమారు గంటన్నర సేపు రాష్ట్రంలో పార్టీ కార్యాచరణ, రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణ, ఇతర నేతలు మీడియాతో మట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిపై అమిత్‌షా చిత్తశుద్ధితో ఉన్నారని, విభజన చట్టం ప్రకారం చేసినవి, చేయాల్సిన అంశాలంపై చర్చించామని చెప్పారు. ఈ సమావేశంలో విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని అమిత్‌షా అనడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని జీవీఎల్ నరసింహారావు తెలిపారు.

భాజపా, వైకాపాలపై ప్రజల్లో వ్యతిరేకత

- ‘తిరుపతి’ సమీక్షలో చంద్రబాబు

ఈనాడు అమరావతి: వైకాపా ఎంపీలు రాజీనామాలు చేసిన అయిదు పార్లమెంటు స్థానాలకు ఉపఎన్నికలు జరిగి ఉంటే ఆ పార్టీ అభ్యర్థులు చిత్తుగా ఓడిపోయేవారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన బుధవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. “భాజపా, ఆ పార్టీతో కుమ్మక్కైన వైకాపాపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కుట్ర రాజకీయాలపై కార్యకర్తల్లో అవగాహన పెంచాలి. ప్రజల్ని చైతన్యపరచాలి. గతంలో కన్నా క్రైస్తవ, ముస్లిం మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలలో తెదేపా బలం పెరగడం సానుకూల పరిణామం. దీన్ని పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల్ని మెప్పించడంలోనే ప్రతి నాయకుడి సామర్థ్యం బయటపడుతుంది. కార్యకర్తలకు పూర్తి సమయం కేటాయించాలి...” అని పేర్కొన్నారు. తిరుపతి పార్లమెంటు సీటును చివరి నిమిషంలో భాజపాకి ఇవ్వడం వల్ల 2014 ఎన్నికల్లో దెబ్బతిన్నామని, నాలుగు అసెంబ్లీ స్థానాల్లో తెదేపా గెలిచినా, ఎంపీ సీటు కోల్పోవడానికి అభ్యర్థి ఖరారులో జరిగిన జాప్యమే కారణమని వివరించారు. ఐక్యంగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో తిరుపతి ఎంపీ సీటుతో పాటు, ఏడు శాసనసభ స్థానాలను గెలుస్తామని చెప్పారు. తిరుపతికి అద్భుతమైన భవిష్యత్తు ఉందని, దేశంలోనే నెం.1 నియోజకవర్గంగా రూపొందుతోందని తెలిపారు. మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల పార్టీ అధ్యక్షులు పులివర్తి నాని, బీదా రవిచంద్ర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి నియోజకవర్గానికి చెందిన తెదేపా ప్రతినిధులతో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు

నిషిద్ధ, చుక్కల భూములపై ప్రత్యేక కార్యాచరణ

- 20 నుంచి జులై 5 వరకూ గ్రామసభలు
- విధివిధానాలు విడుదల చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నిషిద్ధ 22ఏ, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి జులై 5 వరకు గ్రామ సభలు నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (ఇన్‌ఛార్జి), భూపరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠా బుధవారం విడుదల చేశారు.

■ గ్రామ సభల నిర్వహణకు ప్రతి మండలంలో తహశీల్దార్, ఉప తహశీల్దార్ నేతృత్వంలో రెండు బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి బృందంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్‌ఓ, వీఆర్‌ఏ తదితర అధికారులు ఉంటారు.

■ గ్రామ సభల నిర్వహణ సందర్భంగా గ్రామాల రెవెన్యూ మ్యాపులను ప్రకటించాలి. 22ఏ కింద గుర్తించిన భూముల వివరాలను బహిర్గతం చేయాలి. అడంగల్ 1బి, రీసర్వే రిజిస్టర్లను అందుబాటులో ఉంచాలి. రైతుల సందేహాలపై వారికి అర్థమయ్యేలా వివరించాలి.

■ పెండింగులో ఉన్న 22ఏ, చుక్కల భూముల సమస్యలను తగిన ఆధారాలు చూసిన అనంతరమే పరిష్కరించాలి. దరఖాస్తులను తిరస్కరిస్తే.. కారణాలను వివరించాలి.

■ సంబంధిత వ్యక్తుల నుంచి వివరణ తీసుకునే వరకు కొత్త సర్వే నెంబర్లను నిషిద్ధ భూముల జాబితాలో నమోదు చేయకూడదు.

■ కొత్త దరఖాస్తులను స్వీకరిస్తే రసీదు ఇవ్వాలి.

■ దేవాదాయ, వక్ఫ్‌భూములకు సంబంధించిన దస్త్రాలను ఆయా శాఖల వద్ద ఉన్న సమాచారంతో సరి చూడాలి. వీఆర్వో, సర్వేయర్ సహకారంతో సర్వే నెంబర్లను సబ్‌డివిజన్ చేసి, మ్యాపింగ్ చేయాలి.

■ భూముల సమస్యల పరిష్కారం అనంతరం పూర్తి జాబితాలను నెలలోగా జిల్లా రిజిస్ట్రారుకు అందజేయాలి. గ్రామ అడంగళ్‌లోనూ నమోదు చేయాలి.

అణు విపత్తు నుంచి ప్రపంచం బయటపడింది: ట్రంప్

వాషింగ్టన్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో తాను జరిపిన అనూహ్య భేటీతో ప్రపంచం ఒక అణు విపత్తు నుంచి బయటపడినట్లయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఉ.కొరియా ప్రజలకు సరికొత్త, ఉజ్వల భవితవ్యాన్ని అందించడానికి తొలి సాహసోపేత అడుగు వేసిన కిమ్‌కు కృతజ్ఞతలు చెబుతున్నానని ఆయనన్నారు. నిజమైన మార్పు సాధ్యమేననేది తమ మధ్య తొలిసారిగా జరిగిన భేటీతో రుజువయిందన్నారు. చర్చల తర్వాత సింగపూర్ నుంచి వాషింగ్టన్‌కు వస్తూ ట్విటర్లో ఈ మేరకు స్పందించారు. ‘ఇకపై రాకెట్ ప్రయోగాలు, అణు పరీక్షలు, అణు పరిశోధనలు ఉండవు. బందీలుగా ఉన్నవారంతా తిరిగి తమ కుటుంబాలను చేరుకుంటారు. ధన్యవాదాలు కిమ్...! మనం కలిసిన రోజు చరిత్రలో నిలిచిపోతుంది’ అని పేర్కొన్నారు.

దిల్లీలో గాలి దుమారం.. ఈశాన్యంలో వరదలు..

దిల్లీ: ఉత్తరాదిన వేడిగాలులతో కొన్ని.. భారీ వర్షాలతో మరికొన్ని రాష్ట్రాలు అల్లాడుతున్నాయి. మంగళవారం నుంచి 24 గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఈశాన్య రాష్ట్రాలను వరదలు ముంచెత్తాయి. దేశ రాజధాని దిల్లీలో వేడిగాలులతో కూడిన దుమారం ఉక్కిరిబిక్కిరి చేసింది. నగరంలో వరుసగా 41.2, 34 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పంజాబ్, రాజస్థాన్‌లలోనూ ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. పాటియాలాలో 46.2, చురులో 42.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అసోం, మణిపుర్, మిజోరామ్, త్రిపుర రాష్ట్రాల్లో వరదలకు వేలాది మంది నిరాశ్రయులైనట్లు అధికారులు బుధవారం తెలిపారు. అగర్తలా మీదుగా ప్రవహించే హౌరా నది ప్రమాదస్థాయికి కొంచెం దిగువన ప్రవహిస్తోంది. మిజోరామ్‌లో వరదలతో పాటు బురద ప్రవహించడంతో పలుచోట్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మణిపుర్‌లోని ఇంఫాల్ సహా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

19న మంత్రివర్గ సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 19న జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. దీనికి ముందు సీఎం నివాసంలో తెదేపా సమన్వయ కమిటీ సమావేశం ఉంటుంది.

చంద్రన్న గ్రామీణ మాల్స్ నిబంధనలకు ఆమోదం

ఈనాడు అమరావతి: చౌకధరల దుకాణాలను చంద్రన్న గ్రామీణ మాల్స్‌గా మార్చేందుకు సరకుల సరఫరా సంస్థతో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకునేందుకు సిద్ధం చేసిన నియమనిబంధనలను (టర్మ్స్ అండ్ కండీషన్స్) ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (పౌర సరఫరాల శాఖ) బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మాల్స్‌కు సరకులను సరఫరా చేసే రిలయన్స్ రీటైల్ లిమిటెడ్‌తో ఎంవోయూ చేసుకునేటప్పుడు ఒక క్లాజును అందులో పొందుపరచాలని పౌరసరఫరాల సంస్థ ఎండీకి సూచించారు. గ్రామీణ మాల్స్ ఏర్పాటు చేసేటపుడు అవసరమైన స్థలాన్ని భూసేకరణ ద్వారా లేదా, ప్రభుత్వ భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా మాత్రమే వ్యవహరిస్తుంది. ఆ భూముల పూర్తి విలువను రిలయన్స్ సంస్థే భరించాలని ఆ క్లాజులో ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న ముఖ్య నిబంధనలు..

★ 10 జిల్లాల్లో ఒక్కో జిల్లాలో 500 చొప్పున మొత్తం 5వేల మాల్స్‌ను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ★ ప్రతీ జిల్లాకు ఒక కార్యక్రమ సమన్వయకర్తను ఆ సంస్థ నియమించాలి. ★ మాల్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో 50శాతం రిలయన్స్ సంస్థ వెచ్చిస్తుంది. మిగిలిన 50శాతం సొమ్మును సంబంధిత రేషన్ డీలర్‌కు రిలయన్స్ సంస్థ రుణంగా ఇస్తుంది. ఈ మొత్తాన్ని 8శాతం వడ్డీతో వాయిదాల పద్ధతిలో డీలరు చెల్లించాల్సి ఉంటుంది.★ వేగంగా అమ్ముడుపోయే 300కుపైగా రకాల సరకులను ఈ మాల్స్‌కు రిలయన్స్ సరఫరా చేయాలి. రూ.2లక్షల వరకు సరకును అరువుపై డీలరుకు సరఫరా చేయాలి.★ డీలరు ఆర్డరు పెట్టిన 48 గంటల్లోగా సరకులు సరఫరా చేయాలి.

ఉపాధి పనులకు జియో ట్యాగింగ్ తప్పనిసరి

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులకు జియో ట్యాగింగ్ చేసి గడువులోగా బిల్లులు చెల్లింపులు జరిగేలా చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి, సంచాలకులు రంజిత్‌భాషా జిల్లా నీటియాజమాన్య సంస్థల పథక సంచాలకులకు సూచించారు. సచివాలయంలో బుధవారం రాష్ట్ర స్థాయి పథక సంచాలకుల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి ఉపాధి హామీ, వాటర్ షెడ్ కార్యక్రమాలు, పనుల అమలుపై సమీక్షించారు. 15 రోజుల్లో బిల్లులు చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. పనుల్లో పారదర్శకత అత్యంత అవశ్యమని, సామాజిక తనిఖీల్లో గుర్తించిన లోపాలపై సమగ్ర పరిశీలన చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని రంజిత్‌భాషా పేర్కొన్నారు. జిల్లాల్లో బోరు బావులు తీయించే పనులు గడువులోగా పూర్తి చేయించాలని సంయుక్త కమిషనర్ వరప్రసాద్ చెప్పారు.

పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా చల్లా రామకృష్ణారెడ్డి

ఈనాడు అమరావతి: రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా చల్లా రామకృష్ణారెడ్డి నియామకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు ఒకటి రెండు రోజుల్లో వెలువడనున్నాయి. కర్నూలు జిల్లాకు చెందిన చల్లా రామకృష్ణారెడ్డిని ఇంతకుముందు ఆర్టీసీ కడప ప్రాంతీయ ఛైర్మన్‌గా నియమించారు. ఆయన ఆ పదవిని స్వీకరించలేదు.

‘మునుపెన్నడూ లేనంతగా ముస్లింల అభ్యున్నతికి కృషి’

దిల్లీ: మునుపెన్నడూ లేనంతగా తమ ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతి కోసం కృషిచేస్తోందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ ఉద్ఘాటించారు. దిల్లీలో బుధవారం ఆయన ఆతిథ్యమిచ్చిన ఇఫ్తార్ విందుకు కేంద్రమంత్రులు రవిశంకర్ ప్రసాద్, ప్రకాశ్ జావడేకర్, స్మృతి ఇరానీ, జితేంద్ర సింగ్, ఎంజే అక్బర్ సహా 300 మందికిపైగా ముస్లిం మహిళలు హాజరయ్యారు.

భాండాగారం మారు తాళం చెవి దొరికింది: పూరీ కలెక్టర్

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలోని స్వామివారి ఆభరణాలున్న భాండాగారం మారు తాళం చెవి (డూప్లికేట్) దొరికిందని పూరీ కలెక్టర్ అరవింద అగ్రవాల్ బుధవారం రాత్రి ప్రకటించారు. కలెక్టరేట్ రికార్డు గదిలోని అల్మారాలో లక్కతో సీల్ చేసిన కవర్‌లో ఇది దొరికిందన్నారు. కవర్‌పై ‘డూప్లికేట్’ అని ఉందని కలెక్టర్ విలేకరులకు వివరించారు.

సెన్సెక్స్ ▲ 47	నిఫ్టీ ▲ 14	డోజోన్స్ 25311 ▼ 09	నాస్‌డాక్ 7730 ▲ 26	రూపాయి 67.65 ▼ 16 పైసలు	ముడి చమురు 76.73 ▲
35739	10857			(ఒక అమెరికా డాలరుకు)	(బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	13న	మార్పు %
DR. REDDYS LAB	2256.30	3.00
CIPLA	582.10	2.65
TCS	1824.10	2.42
LUPIN	871.90	1.98
HINDALCO	245.00	1.81
SBI	287.70	1.71
POWER GRID CORP.	198.15	1.59

గ్రహణం (-)

నిఫ్టీ	13న	మార్పు %
TATA STEEL	567.60	-2.14
ADANI PORT	382.85	-1.56
ZEE ENTERTAINMENT	557.10	-1.43
BAJAJ FINANCE	2231.05	-1.34
BHARTI AIRTEL	375.65	-1.31
HPCL	313.90	-0.95
HUL	1621.20	-1.05

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.52	71.33	బహ్రెయిన్ దీనార్	166.37	190.50
పౌండ్ స్టెర్లింగ్	82.19	95.32	కువైట్ దీనార్	185.03	230.33
యూరో	72.24	83.78	ఒమన్ రియాల్	162.50	186.63
జపనీస్ యెన్/100	56.00	64.00	సౌదీ రియాల్	16.31	19.38
ఆస్ట్రేలియా డాలరు	46.51	53.81	యూఏఈ దిర్హమ్	16.70	19.56
సింగపూర్ డాలరు	46.00	54.50	మలేషియా రింగిట్	15.08	18.54
థాయ్ బాత్/100	192.00	229.00	చైనీస్ యువాన్	7.46	12.11

బుధవారం నిఫ్టీ కదలికలు



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రూ.24,000 కోట్ల ఎఫ్‌డీఐ

ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం

దిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ వ్యాపార వృద్ధికి రూ.24,000 కోట్ల అదనపు మూలధనాన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) ద్వారా సమీకరించేందుకు కేంద్రం నుంచి అనుమతి లభించింది. 2015లోనే రూ.10,000 కోట్లు సేకరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనికి అదనంగా మరింత ఎఫ్‌డీఐ సేకరించేందుకు ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపింది. 'వాటా విక్రయం ద్వారా మొత్తం రూ.24,000 కోట్ల మూలధన సేకరణతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఎఫ్‌డీఐ వాటా 74 శాతానికి (గరిష్ఠం) చేరుతుంద'ని ఆర్థిక మంత్రి పియూష్ గోయెల్ తెలిపారు. ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఎఫ్‌డీఐ వాటా 72.62 శాతంగా ఉంది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం, ప్రైవేటు రంగ బ్యాంకుల్లో విదేశీ పెట్టుబడుల వాటా 74 శాతానికి మించి ఉండకూడదు. ఇందులో భాగంగానే ఆ మేరకు నిధుల సమీకరణకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తాజాగా సేకరించబోయే రూ.24,000 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిలో రూ.8,500 కోట్లు, బ్యాంక్ ప్రమోటరు అయిన హెచ్‌డీఎఫ్‌సీకి ప్రిఫరెన్షియల్ పద్ధతిలో కేటాయించనున్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ధమాకా

● అతిపెద్ద ఆర్థిక సేవల సంస్థల్లో 5వ స్థానం ● అగ్రస్థానంలో అమెరికన్ ఎక్స్‌ప్రెస్ ● ఫోర్బ్స్ జాబితా

దిల్లీ: గృహ రుణాల దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీకి అరుదైన గౌరవం దక్కింది. 'వినియోగదారుల ఆర్థిక సేవల విభాగం'లో అంతర్జాతీయంగా అతిపెద్ద నమోదిత కంపెనీల్లో 5వ స్థానంలో సంస్థ నిలిచింది. ఫోర్బ్స్ మ్యాగజీన్ రూపొందించిన ఈ జాబితాలో అమెరికన్ ఎక్స్‌ప్రెస్ అగ్రస్థానంలో నిలిచింది. మన దేశానికే చెందిన ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ 13వ స్థానం దక్కించుకుంది. ఇదే జాబితాలో గతేడాది 7వ స్థానంలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ. ఈ ఏడాది 2 స్థానాలు ఎగబాకింది. జాబితాలో మరిన్ని అంశాలు ఇలా..

- ✦ జాబితాలో చోటు దక్కించుకున్న ఆర్థిక సేవల కంపెనీల్లో క్యాపిటల్ వన్ ఫైనాన్షియల్ (159వ స్థానం), వీసా (164), ఒరిక్స్ (254), పేపాల్ (337), సింక్రనీ ఫైనాన్షియల్ (340), డిస్కవర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (356), మాస్టర్‌కార్డ్ (367)లు ఉన్నాయి.
- ✦ మొత్తం జాబితా చూస్తే (అన్ని విభాగాలు కలిపి).. చైనా బ్యాంకింగ్ దిగ్గజం ఐసీబీసీ మొదటి స్థానంలో ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ స్థానం 404 నుంచి 321 స్థానానికి మెరుగుపడింది.
- ✦ అగ్రగామి 100 కంపెనీల్లో భారత్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒక్కటే 83వ స్థానంలో నిలిచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (202), ఓఎన్‌జీసీ (266), ఇండియన్ ఆయిల్ (270), ఐసీఐసీఐ బ్యాంక్ 320వ స్థానాల్లో ఉన్నాయి. టాటా మోటార్స్ (385), టీసీఎస్ (404), ఎల్ అండ్ టీ (471), ఎస్‌బీఐ (489) స్థానాలు దక్కించుకున్నాయి. ఫోర్బ్స్ గ్లోబల్ 2000 జాబితాలో 60 దేశాలకు చెందిన నమోదిత కంపెనీలు ఉన్నాయి.
- ✦ జాబితాలోని అన్ని కంపెనీల మొత్తం అమ్మకాలు 39.1 లక్షల కోట్ల డాలర్లుగా, లాభం 3.2 లక్షల కోట్ల డాలర్లుగా, ఆస్తులు 189 లక్షల కోట్ల డాలర్లుగా, మార్కెట్ విలువ 56.8 లక్షల కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

విజయవాడలో ఐటీ సెజ్

కేంద్ర అనుమతి కోరిన హెచ్‌సీఎల్ టెక్

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఐటీ/ఐటీఈఎస్ సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి) ఏర్పాటు నిమిత్తం కేంద్ర ప్రభుత్వ అనుమతిని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కోరింది. మొత్తం 10.43 హెక్టార్ల స్థలంలో ఈ సెజ్‌ను అభివృద్ధి చేసేందుకు కంపెనీ రూ.408.48 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఈ నెల 19న జరిగే సమావేశంలో వాణిజ్య కార్యదర్శి రీటా టియోటియా నేతృత్వంలోని మంత్రివర్గ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ ప్రతిపాదనను పరిశీలించనుంది. అలాగే నోయిడాలోని ఐటీ ప్రాజెక్టుకు సంబంధించి ఓఎస్ఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఇచ్చిన సూత్రప్రాయ అనుమతులు రద్దు చేసే అంశాన్ని కూడా బోర్డు చర్చించనుంది. ప్రాజెక్టు పనుల్లో పురోగతి లేకపోవడమే ఇందుకు కారణం. దేశీయ ఎగుమతులు, తయారీ రంగానికి ఊతమిచ్చే ఉద్దేశంతో 2005లో సెజ్ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రస్తుతం దేశం మొత్తం ఎగుమతుల్లో సెజ్‌ల ద్వారా అయ్యే ఎగుమతులు 25% వరకు ఉంటాయి.

పబ్లిక్ ఇష్యూకు ఎయిరిండియా?

దిల్లీ: ఎయిరిండియాను పబ్లిక్ ఇష్యూకు తీసుకెళ్లాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. రుణ ఊబిలో చిక్కుకున్న ఎయిరిండియాలో 76 శాతం వాటా కొనేందుకు కొనుగోలుదార్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో, వాటా విక్రయానికి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తున్న సంగతి తెలిసిందే. ఎయిరిండియాను ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే ప్రతిపాదన కూడా వీటిల్లో ఒకటని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇలా చేయడం వల్ల సంస్థలో యాజమాన్య నియంత్రణను అట్టే పెట్టుకోవడమే కాకుండా, ఆదాయాన్ని పెంచుకునే వీలుంటుందనీ ప్రభుత్వం భావిస్తోందట. మరోవైపు 24 శాతం వాటాను అట్టే పెట్టుకోవాలనే నిర్ణయం వల్లే, ఎయిరిండియా వాటా కొనేందుకు కొనుగోలుదార్లు ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తుండటంతో, పూర్తిగా 100 శాతం వాటా విక్రయించే అంశాన్నీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఎయిరిండియా వాటా విక్రయానికి సంబంధించి ఏ నిర్ణయమైనా మంత్రుల బృందమే తీసుకుంటుందని కేంద్ర పౌర విమానయాన మంత్రి సురేశ్ ప్రభు స్పష్టం చేశారు.

న్యూపవర్ రెన్యూవబుల్స్‌పై కార్పొరేట్ వ్యవహారాల శాఖ తనిఖీ

ఐసీఐసీఐ బ్యాంక్ వివాదం నేపథ్యం

దిల్లీ: ఐసీఐసీఐ బ్యాంకు వివాదంతో సంబంధమున్న న్యూపవర్ రెన్యూవబుల్స్, మరో అయిదు ఇతర కంపెనీలను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తనిఖీ చేయడం ప్రారంభించింది. ఈ విషయాన్ని బుధవారమిక్కడ కేంద్ర మంత్రి పి.పి. చౌధరి వెల్లడించారు. ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓ చందాకొచ్చర్, ఆమె కుటుంబసభ్యులపై వచ్చిన ఆరోపణలపై పలు దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. కొన్ని కంపెనీలకు రుణం ఇచ్చే విషయంలో కొచ్చర్ 'నీకిది-నాకది'కి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఐసీఐసీఐ బ్యాంకు కూడా స్వతంత్ర దర్యాప్తు చేపట్టిన సంగతి విదితమే. ఐసీఐసీఐ బ్యాంక్ వివాదంతో సంబంధమున్న ఆరు కంపెనీలపై కంపెనీల చట్టం-2013లోని సెక్షన్ 206(5) కింద దర్యాప్తు చేట్టాల్సిందిగా ఏప్రిల్ 23, 2018న మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు చౌధరి తెలిపారు. ఆ ఆరు కంపెనీల్లో న్యూపవర్ రెన్యూవబుల్స్ కూడా ఉందని స్పష్టం చేశారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిధిలోని ప్రాంతీయ డైరెక్టర్(పశ్చిమ ప్రాంతం) దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సెక్షన్ 206 కింద పుస్తకాల తనిఖీ, సమాచారాన్ని కోరడం తదితరాలను చేయడానికి అధికారం ఉంటుంది. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాలిచ్చే విషయంలో కొచ్చర్, కుటుంబ సభ్యులు లబ్ధి పొందారన్న ఆరోపణలున్నాయి. కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్‌కు చెందని న్యూపవర్ రెన్యూవబుల్స్‌లోకి వీడియోకాన్ పెట్టుబడులు పెట్టిందనీ అంటున్నారు. ఆర్‌బీఐ, సీబీఐ, సెబీలు ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.

భారత్-22 ఈటీఎఫ్ మలివిడత ఇష్యూ 19 నుంచి

దిల్లీ: భారత్-22 ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్) మలివిడత ఇష్యూను ఈ నెల 19న ప్రభుత్వం ప్రారంభించనుంది. మొదటి రోజు యాంకర్ ఇన్వెస్టర్లు, ఆ తర్వాతి రోజు నుంచి చిన్న మదుపర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. 22 వరకు ఇష్యూ అందుబాటులో ఉంటుంది. మదుపర్లకు ఇష్యూ ధరపై 2.5 శాతం తగ్గింపు ఉంటుంది. భారత్-22 ఈటీఎఫ్ మలివిడత ఇష్యూ ద్వారా రూ.6,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మదుపర్ల నుంచి స్పందన బాగా ఉంటే అదనంగా మరో రూ.2,400 కోట్లకు ఇష్యూ పరిమాణాన్ని పెంచుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం అట్టేపెట్టుకుంది. కోల్ ఇండియా తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో కనీస ప్రజల వాటా నిబంధనకు అనుగుణంగా వాటాను తగ్గించుకునేందుకు ఈ ఇష్యూ ప్రభుత్వానికి ఉపయోగపడనుంది. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ బ్యాంకులు, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్‌టీతో కలిపి మొత్తం 22 సంస్థల షేర్లు భారత్-22 ఈటీఎఫ్‌లో ఉంటాయి. తొలివిడత ఇష్యూను గతేడాది నవంబరులో ప్రభుత్వం నిర్వహించింది. ఆ సమయంలో రూ.32,000 కోట్లకు బిడ్‌లు దాఖలు కాగా.. రూ.14,500 కోట్లకు మాత్రమే ఇష్యూను పరిమితం చేసుకుంది.

బేయర్ రూ.1,300 కోట్ల ఓపెన్ ఆఫర్

మోన్‌శాంటో ఇండియాలో 26% వాటా కొనుగోలు

దిల్లీ: మోన్‌శాంటో ఇండియాలో 26% వాటా కొనుగోలు నిమిత్తం రూ.1300 కోట్ల ఓపెన్ ఆఫర్ ప్రక్రియను బేయర్ గ్రూపు ప్రారంభించనుంది. ఇప్పటికే 6300 కోట్ల డాలర్లతో మోన్‌శాంటో అంతర్జాతీయ వ్యాపారం కొనుగోలును ఈ జర్మనీ ఔషధ దిగ్గజం పూర్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ కొనుగోలు ద్వారా మోన్‌శాంటో ఇండియాలో, పరోక్షంగా 72.14 శాతం వాటా బేయర్ గ్రూపు చేతికి వచ్చినట్లయ్యింది. దీంతో ఇప్పుడు 26 శాతం వాటా కొనుగోలుకు ఓపెన్ ఆఫర్ ప్రక్రియను నిర్వహిస్తోంది. జులై 27న ప్రారంభమయ్యే ఈ ఓపెన్ ఆఫర్‌లో ఒక్కో షేరుకు రూ.2,926.87 చొప్పున మొత్తం 44,88,315 షేర్లను కొనుగోలు చేసేందుకు బేయర్ గ్రూపు ప్రతిపాదించింది. గరిష్ఠంగా చూస్తే ఈ ఓపెన్ ఆఫర్ విలువ రూ.1,313.67 కోట్ల వరకు ఉంటుంది. భారత్‌లో బేయర్ గ్రూపు 1896 నుంచి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనికి ఇక్కడ మొత్తం రెండు వ్యాపార విభాగాలు ఉన్నాయి. ఒకటి బేయర్ క్రాప్‌సైన్స్, రెండోది బేయర్ ఇండియా. ఇందులో బేయర్ సైన్స్ ఒక్కటే ఎక్స్ఛేంజీలో నమోదైంది. మోన్‌శాంటో ఇండియా ఓపెన్ ఆఫర్ ప్రక్రియను కూడా బేయర్ క్రాప్‌సైన్స్ ద్వారానే బేయర్ గ్రూపు నిర్వహిస్తోంది.

మార్కెట్ కబుర్లు

- ✦ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దగ్గర ముసాయిదా పత్రాలను వాహన విడిభాగాల తయారీ సంస్థ **క్రాఫ్ట్‌మన్ ఆటోమేషన్** దాఖలు చేసింది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 43,83,320 వరకు షేర్లను విక్రయించడం ద్వారా రూ.400 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.
- ✦ రేపు జరగనున్న బోర్డు సమావేశంలో ఐటీ దిగ్గజం **టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)** షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను పరిశీలించనుంది. గతేడాది కంపెనీ రూ.16000 కోట్ల విలువైన భారీ షేర్ల బైబ్యాక్ చేపట్టిన విషయం తెలిసిందే.
- ✦ జై బాలాజీ ఇండస్ట్రీస్‌పై **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)** దివాలా పిటిషన్ దాఖలు చేసింది. ఎస్‌బీఐకి కంపెనీ దాదాపు రూ.900 కోట్లు చెల్లించాల్సి ఉంది. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) కోల్‌కతా బెంచ్‌ను బ్యాంక్ ఆశ్రయించింది. మార్చి 31 నాటికి కంపెనీకి రూ.3713 కోట్ల బకాయిలు ఉన్నాయి.
- ✦ రుణ ఊబిలో చిక్కుకున్న రిలయన్స్ కమ్యూనికేషన్స్ అధిక సంఖ్యలో తమ ఉద్యోగులను ఇంటికి సాగనంపింది. ఒకదశలో గరిష్ఠంగా 52,000 మంది ఉద్యోగులుండగా, దాదాపు 94 శాతం మందికి ఉద్వాసన పలికినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఆర్‌కామ్ పేర్కొంది. ప్రస్తుతం సంస్థలో 3,400 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారని తెలిపింది.

లక్ష ఆధార్ ఏటీఎంలు

మహాగ్రామ్

దిల్లీ: ఆర్థిక సేవల సంస్థ మహాగ్రామ్ ఆధార్‌తో వినియోగించుకునే లక్షకు పైగా ఏటీఎంలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు నగదు ఉపసంహరణ సదుపాయాన్ని అందించడం కోసం కంపెనీ కృషి చేస్తోందని సంస్థ తెలిపింది. ఈ ఏటీఎంల ద్వారా నగదు ఉపసంహరణ, డిపాజిట్, బ్యాలెన్స్ విచారణ, మినీ స్టేట్‌మెంట్, రుణ మొత్తం చెల్లింపు, రుణ పంపిణీ, విదేశాల నుంచి వచ్చే సొమ్ము సేవలు, ఖాతాదారు నమోదు, ఇ-గవర్నెన్స్, పాన్ కార్డ్, ఇ-కేవైసీ వంటి సేవలు పొందవచ్చని సంస్థ చెబుతోంది. జాతీయ చెల్లింపుల కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) ఆధార్‌తో పని చేసే చెల్లింపు వ్యవస్థను అభివృద్ధి చేసింది.

మార్చి ఆఖరుకు 150 విక్రయశాలలు

సెల్‌పాయింట్ సీఎండీ పి.మోహన్‌ప్రసాద్

విశాఖపట్నం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమ విక్రయశాలల సంఖ్యను 150కి చేరుస్తామని, ఇందుకోసం రూ.60-70 కోట్ల పెట్టుబడులు పెడతామని సెల్‌పాయింట్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.మోహన్‌ప్రసాద్ తెలిపారు. 2001లో ఒక విక్రయశాలతో ప్రారంభించి, ఇప్పటికి 87 నెలకొల్పినట్లు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు, కర్నూల్, అనంతపూర్ జిల్లాల్లో ప్రస్తుతం విక్రయశాలలున్నాయని, మిగిలిన జిల్లాలకూ విస్తరిస్తామని తెలిపారు. ఇదికాక తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో 30, పరిసర ప్రాంతాల్లో మరో 20 విక్రయశాలలు నెలకొల్పుతామని వెల్లడించారు. తమ దగ్గర 1,000 మంది ఉద్యోగులున్నారని, ఈ సంఖ్య 2,000కు చేర్చడమే లక్ష్యమన్నారు. అన్ని కంపెనీల మొబైల్స్‌లో సాంకేతికతను ప్రత్యక్షంగా వివరిస్తూ, విక్రయిస్తున్నామని చెప్పారు. యువతకు వీటిపై నైపుణ్యం కోసం విశాఖపట్నం, అనంతపూర్, కృష్ణాజిల్లాల్లో శిక్షణ కేంద్రాలు నెలకొల్పుతామన్నారు. వడ్డీలేని సులభ వాయిదాల్లో మొబైల్స్ కొనుగోలు చేసుకునే అవకాశం తమ వద్ద ఉందని తెలిపారు.

స్వల్ప లాభాలతో సరి

● మూడో రోజూ సూచీల ముందంజ ● చివర్లో అమ్మకాల ఒత్తిడి ● ఫెడ్ సమావేశాల నేపథ్యం

మార్కెట్ల ఆరంభ జోరుకు మరోసారి కళ్లెం పడింది. పారిశ్రామికోత్పత్తి గణాంకాలు మెప్పించడంతో సూచీలు వరుసగా మూడో రోజూ ముందంజ వేశాయి. అయితే అమెరికా ఫెడ్ సమావేశాల నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు చివర్లో అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా సూచీలు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా.. ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,835.44 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 35,877.41 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. అయితే ఆఖరి గంటన్నర ట్రేడింగ్‌లో అమ్మకాల ఒత్తిడితో డీలాపడిన సూచీ 35,715.96 పాయింట్లకు పడిపోయింది. చివరకు 46.64 పాయింట్ల లాభంతో 35,739.16 పాయింట్ల దగ్గర స్థిరపడింది. గత మూడు సెషన్లలో సూచీ 295.49 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. నిఫ్టీ సైతం 13.85 పాయింట్లు పెరిగి 10,856.70 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,842.65- 10,893.25 పాయింట్ల మధ్య కదలాడింది.

టీసీఎస్ మెరిసింది: ఈ వారం చివర్లో జరగనున్న బోర్డు సమావేశంలో షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను పరిశీలించనున్న నేపథ్యంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) షేరు రాణించింది. ఇంట్రాడేలో 2.86 శాతం పెరిగిన షేరు.. చివరకు 2.43 శాతం లాభంతో రూ.1,824.20 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.16,539.68 కోట్లు పెరిగి రూ.6,98,408.68 కోట్లకు చేరింది.

- ✦ గుజరాత్‌లోని హలోల్ ప్లాంట్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ ఈఐఆర్ జారీ చేయడంతో సన్‌ఫార్మా షేరు ఇంట్రాడేలో 3.74 శాతం లాభపడింది. చివరకు 0.95 శాతం లాభంతో రూ.545.65 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 16 లాభాలతో ముగిశాయి. డాక్టర్ రెడ్డీస్ 2.82%, టీసీఎస్ 2.43%, ఎస్‌బీఐ 1.70%, పవర్‌గ్రిడ్ 1.43%, ఇన్ఫోసిస్ 1.41%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.24%, విప్రో 0.98%, సన్‌ఫార్మా 0.95%, బజాజ్ ఆటో 0.74% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా స్టీల్ (2.12%), అదానీ పోర్ట్స్ (1.48%), భారతీ ఎయిర్‌టెల్ (1.30%), హిందుస్థాన్ యునిలీవర్ (1.23%), హెచ్‌డీఎఫ్‌సీ (0.95%)లు మాత్రం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ 1.29 శాతం లాభపడింది. టెక్, ఆరోగ్య సంరక్షణ, మన్నికైన వినిమయ వస్తువులు, బ్యాంకింగ్, పీఎస్‌యూ, స్థిరాస్తి షేర్లు అదే బాటలో నడిచాయి. మౌలిక, యంత్ర పరికరాల స్క్రిప్‌లు మాత్రం డీలాపడ్డాయి.

నేటి మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలను సూచీలు అందిపుచ్చుకోవచ్చు. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్ల నిర్ణయం మార్కెట్లపై ప్రభావం చూపనుంది. భవిష్యత్ రేట్ల పెంపుపై ఫెడ్ వ్యాఖ్యలను మదుపర్లు పరిగణనలోకి తీసుకుంటారు. నేడు ఐరోపా కేంద్ర బ్యాంక్, రేపు బ్యాంక్ ఆఫ్ జపాన్ పరపతి సమీక్షా సమావేశాల నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి అడుగేయొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నేడు నిఫ్టీ 10750- 10890 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఫెడ్ సమావేశం నేపథ్యంలో బుధవారం ఒడుదొడుకులు ఎదుర్కొన్న మార్కెట్లకు.. ఐటీ, ఫార్మా రంగాల నుంచి మద్దతు లభించింది. ఫెడ్ సానుకూల వ్యాఖ్యలు చేస్తే.. నిఫ్టీ 10930- 10950 పాయింట్ల నిరోధ స్థాయి అధిగమించొచ్చని బ్రోకరేజీ సంస్థలు భావిస్తున్నాయి. రేపు జరగనున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) బోర్డు సమావేశంలో షేర్ల బైబ్యాక్ ప్రతిపాదన పరిశీలనకు రానుండటంతో ఐటీ షేర్ల జోరు కొనసాగొచ్చు. ప్రస్తుతమార్కెట్ ధరతో పోలిస్తే బైబ్యాక్ ధరను టీసీఎస్ ఆకర్షణీయంగా ప్రకటించొచ్చన్న అంచనాలు ఉన్నాయి.

13న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	382	వరంగల్	384
చిల్లరగా(ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	380
బెంగళూరు	425	చెన్నై	452
14వ తేదీకి...		చిత్తూరు	445
విజయవాడ/గోదావరి	374	నమక్కల్	435

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 382.85 (388.90) 2529140
ASIAN PAINTS 1286.40 (1287.70) 566241
AXIS BANK LT 540.65 (537.15) 5924906
BAJAJ AUTO L 2907.95 (2887.25) 362419
BAJAJ FINANC 2231.05 (2261.25) 1095372
BAJAJ FINSER 6074.80 (6078.55) 93790
BHARTI AIRTE 375.65 (380.65) 6698891
BHARTI INFRA 300.50 (299.75) 5147453
BPCL 419.90 (415.10) 5181852
CIPLA 582.10 (567.10) 4657712
COAL INDIA L 284.00 (283.55) 2546696
DR. REDDYS 2256.30 (2190.65) 2580254
EICHER MOTOR 29448.60 (29208.40) 26927
GAIL 344.85 (343.30) 2329127
GRASIM IND 1037.00 (1038.80) 421332
HCL TECH 923.70 (914.80) 1056853
HDFC 1832.30 (1847.70) 1792766
HDFC BANK 2031.45 (2043.85) 1974490
HERO MOTOCOR 3696.80 (3687.85) 209724
HINDALCO IND 245.00 (240.65) 5976795
HINDUSTAN UN 1621.20 (1638.45) 845842
HPCL 313.90 (316.90) 3638665
ICICI BANK 290.75 (287.40) 10927770
INDIABULLS H 1210.05 (1220.75) 5494074
INDIAN OIL 175.10 (174.15) 4976427
INDUSINDBANK 1945.45 (1954.75) 1169830
INFOSYS LTD 1274.80 (1258.50) 2883464
ITC 267.85 (270.25) 7817856
KOTAK MAHIND 1325.65 (1329.30) 1495398
LARSEN & TOU 1358.75 (1366.40) 1253808
LUPIN 871.90 (855.00) 6576519
M&M 917.65 (917.60) 1353228
MARUTI SUZIK 8967.35 (9016.75) 369407
NTPC LTD 160.25 (161.30) 5439996
ONGC 170.00 (171.40) 5321172
POWER GRID C 198.15 (195.05) 6112507
RELIANCE IND 1002.50 (997.15) 5926020
SBI 287.70 (282.85) 26748300
SUN PHARMA 546.30 (540.45) 20167822
TATA CONSULT 1824.10 (1781.00) 5370983
TATA MOTORS 308.40 (307.80) 7280886
TATA STEEL L 567.60 (580.00) 9060032
TECH MAHINDR 713.80 (709.10) 2429450
TITAN IND 918.15 (904.70) 2933810
ULTRATECH 3800.60 (3766.20) 239285
UPL LIMITED 687.55 (688.70) 794416
VEDANTA LIMI 243.10 (245.50) 11470921
WIPRO 268.80 (266.45) 1537840
YES BANK LTD 333.20 (332.20) 7530350
ZEE ENTERTAI 557.10 (565.20) 1664214

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1262.45 (1284.30) 60804
ACC 1330.95 (1315.70) 514188
ADITYA BIRLA 139.55 (139.25) 1290457
AMBUJA CEMEN 210.00 (206.90) 4884946
ASHOK LEYLAN 142.65 (144.15) 12471403
AUROBIND PHA 584.90 (595.55) 3225344
AVENUE SUPER 1595.85 (1607.95) 377920
BANK OFBAROD 136.75 (133.35) 16382863
BEL 119.20 (121.40) 2926629
BHEL 78.05 (78.30) 5538985
BOSCH LTD 17965.60 (18018.20) 9621
BRITANNIA 6017.15 (5946.60) 99138
CADILA HEALT 393.80 (380.20) 3551639
COLGATE PALM 1239.00 (1225.55) 408747
CONTAINER 1319.25 (1336.05) 277581
CUMMINS INDI 684.25 (683.70) 166683
DABUR INDIA 388.15 (387.00) 1387211
DLF LIMITED 205.00 (205.10) 4609134
EMAMI LIMITE 1104.15 (1087.15) 276898
GENERAL INS 726.50 (732.50) 112104
GODREJ CONSU 1169.10 (1171.95) 239379
HAVELLS INDI 559.45 (557.75) 1557465
HINDUSTAN ZI 301.40 (303.75) 2494135
IDEA CELLULR 61.50 (65.25) 22298778
INTERGLOBE A 1218.95 (1196.50) 595904
JSW STEEL LT 343.00 (341.35) 3827972
L&TFIN.HOLD 165.60 (167.95) 1845397
LIC HOUS.FIN 497.00 (500.80) 1360063
MARICO LIMIT 337.05 (342.30) 718879
MCDOWELL 3432.85 (3428.05) 205533
MOTHERSON 309.40 (311.70) 2534577
MRF 75048.05 (75580.70) 2476
NHPC LTD 26.35 (26.75) 4511038
NMDC LTD 115.65 (116.95) 1215110
OIL INDIA 223.65 (224.70) 796412
ORACLE FIN S 4000.40 (3988.80) 17459
P&G HYG&HEAL 9648.15 (9587.55) 2703
PETRONET LNG 217.30 (220.55) 2090162
PIDILITE IND 1083.40 (1058.60) 747149
PIRAMAL ENTE 2443.05 (2450.05) 175157
PNB 91.30 (91.75) 19488548
POWER FIN CO 84.10 (84.10) 8638005
RURAL ELEC C 117.80 (116.45) 4282189
SAIL 87.90 (89.30) 26560260
SBI LIFE INS 702.25 (719.90) 584484
SHREE CEMENT 16382.25 (16255.00) 21520
SHRIRAM TRAN 1507.30 (1505.15) 1106929
SIEMENS 1023.00 (1043.05) 84222
SUN TV LTD 932.75 (938.10) 1125687

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.50 (6.30) 390
AISHWARYA TE 4.03 (3.84) 3873
ALPHAGEO 666.90 (662.90) 2156
AMAR RAJA BA 774.30 (779.30) 5648
ANDHRA BANK 36.95 (36.85) 219230
ANDHRA CEMEN 9.28 (9.46) 29216
ANDHRA PAPER 330.10 (326.55) 687
ANDHRA PETRO 48.20 (48.05) 43446
ANDHRA SUGAR 360.80 (359.85) 3063
ANJANI PORTL 176 (178) 461
ASTRA MICROW 101.20 (101.05) 66011
AUROBINDO PH 584.90 (594.50) 158743
AVANTEL SOFT 428.15 (425.05) 2412
AVANTI FEEDS 1873.80 (1842) 52082
AVON ORG 9.07 (9.51) 600
BALAJI AMIN 600.45 (617.40) 1792
BARTRONICS 10.81 (11.09) 25643
BHAGIRA CHEM 283.95 (274) 305
BHAGYA NAG 42.15 (42.65) 937
BN RATHI SEC 40 (39.75) 4360
BRILLIANT SE 4.30 (4.10) 19358
CAMBRIDGE TE 55.15 (56.25) 100
CIL SECURI 23.15 (22.45) 3262
COMBAT DRUGS 26 (25.15) 1413
CONT COFFEE 284.10 (284.20) 1989
COROMAN FERT 437.60 (445.90) 10947
CUBEX TUB 17.75 (17.90) 600
CYBERMATE 2.01 (2.08) 56602
CYIENT LIMIT 748.75 (761.40) 11605
DECCAN CEMEN 431.10 (421.85) 297
DIVI'S LAB 1039.80 (1064.65) 21589
DIVYA GRANIT 82.50 (79.15) 54
DR REDDY 2252 (2190.25) 222893
FOUR SOFT 62.90 (62.15) 1631
GATI CORPN 94.60 (92.60) 111636
GAYATRI PROJ 177.15 (175.80) 2884
GMR INFRASTR 16.25 (16.55) 1262397
GOLDST INFRA 185.35 (176.55) 4668
GOLDSTONE EN 15.76 (15.94) 9100
GRANULES (I) 85.70 (84.45) 696665
GSS AMERICA 87.50 (86.65) 52063
GVK POWER 11.68 (11.98) 431381
HBL NIFE POW 37.25 (37.20) 98795
HERITAGE FOO 685.20 (688.85) 853
HIL LTD 1948.90 (1966.75) 745
IDL INDUSTRS 410.30 (404) 1097
IKF SOFT 0.49 (0.48) 104650
ILFS ENGINEE 31.25 (29.85) 34192
INCAP 68.25 (65) 195
INNAREDY COM 1.82 (1.85) 2135
IVRCL INFRAS 1.31 (1.25) 4750337
JEEVAN SCIEN 34.35 (36.70) 454
KAKATIYA CEM 266.15 (273.35) 3414
KALLAM SPG 26.75 (27.50) 26911
KARAN WOO-SN 2.20 (2.10) 100
KAVERI SEED 563.20 (530.75) 183977
KCP LTD 108.35 (108.45) 5652
KERNEX MICRO 27.10 (26.80) 5355
KNR CONSTRUC 278.30 (275.95) 21256
KREBS BIO 128.50 (132.15) 840
LANCO INDUS 300.05 (307.45) 9167
LANCO INFRAT 0.90 (0.87) 452477
LASER DOT 6.79 (7.14) 50
LAURUS LABS 490.15 (497.50) 3566
LOKESH MACH 66.35 (66.70) 5149
MADHUCON PRO 13.45 (13.80) 6447
MEGA SOFT 9.93 (9.88) 2806
MIC ELECTRON 3.93 (3.94) 29012
MOLDTK PLA 302.80 (303.05) 4830
MSR INDIA LT 28.90 (31.75) 6115
NAGARJAGRICH 30.45 (31.30) 43272
NATCO PHARMA 797.60 (791.95) 168590
NAVA BH VENT 137.60 (136.50) 183294
NCC 108.70 (112.85) 1210967
NCL IND 180 (184.45) 6448
NEHA INTER 5.57 (5.53) 6771
NETTLINX 58.85 (59.20) 6652
NEULAND LAB 704.65 (722.05) 1131
NIHAR INFO 10.80 (10.30) 7754
NILE 588.50 (585.35) 2833
OIL COUNTRY 20.55 (21.40) 3638
PANKAJ POLY 6.21 (6.21) 500
PANYAM CEMEN 26.30 (26.20) 6592
PENNER IND 55.65 (54.85) 57388
PHYTOCHEM I 51.40 (52.30) 1378
PIONEER DIST 271.30 (274) 5036
PITTI LAMIN 92.20 (95.25) 29504
POKARNA 159.45 (161.10) 6510
PRAJAY ENGS 10.69 (10.87) 30763
PREMIER EXPL 285 (282) 399
PRISM CEMENT 110.35 (112.35) 20351
PRUDENTL PHA 3.49 (3.26) 184171
RAASI REFRAC 3.25 (3.10) 9
RAGSAN PETRO 63.10 (63) 300
RAIN INDUSTR 227.45 (229.35) 109621
RAJ PACKAGIN 27.70 (28.20) 612
RAJVIR INDUS 36.10 (38) 2
RAM INFORMAT 42.70 (41.40) 1092
REG.CERAMIC 3.85 (4.05) 4507
SAGAR CEM 834.90 (850.60) 1590
SAMKRG PIST 241.85 (237.40) 5035
SAMPRE NUTRI 49 (48) 35
SATVAH. ISPA 14.65 (15.05) 4214
SMS PHARMA 78.60 (70.50) 43487
SOUTH BIO TE 1.40 (1.47) 500
SPHERE GLOBA 30.85 (26.75) 50212
SREE RAYAL A 36.65 (37.40) 32600
SRI KPR INDU 26 (25.65) 850
SRINIVASA SH 41.80 (40.10) 1161
SS ORGANICS 5.32 (5.32) 100
STARCHIK SP 29.90 (28.50) 1840
STEEL EXCHAN 24.40 (25.35) 15820
SUJANA METAL 0.84 (0.86) 31352
SUJANA TOWER 2.80 (2.80) 6122
SUJANA UNIVE 0.50 (0.52) 103536
SURANA TELE 4.54 (4.75) 6992
SURYALAKSH.C 56 (55.65) 542
SURYALATA SP 131.80 (128.40) 2425
SURYAVA SPIN 6.32 (6.65) 50
SUVEN PHARMA 228.75 (230.75) 181288
TAJ GVK HOTE 232.75 (237) 8351
TANLA 30.90 (31.45) 9705
TERA SOFTWAR 44.35 (42.25) 3714
TRANS BIOTEK 2.02 (2.12) 23259
TRENDY KNIT 0.19 (0.19) 102
VAMSHI RUBB 48.40 (46.80) 361
VBC FERRO 39.25 (37.40) 765
VICEROY HOTE 8.75 (8.37) 32867
VIJAY TEXTIL 55.85 (56.55) 7718
VIMTA LABS 218.60 (213.55) 4502
VISAKA IND 645 (643.45) 3370
VISTA PHARMA 37.35 (37.35) 22077
VIVIMED LABS 61.40 (59.75) 443089
VJIL CONSULT 19.55 (18.65) 1100
VST INDUS 3030 (3010) 2
XL TELENE 1.45 (1.51) 4081
YBRANT DIGIT 4.33 (4.30) 55537
ZENOTECH LAB 41.95 (42.45) 12852
ZENTECH 86.50 (87.55) 10540

CA

మా వాహనాలు 'అందరి' కోసం!

వినియోగదార్లందరి అవసరాలను తీర్చేలా మహీంద్రా గ్రూప్ ఉత్పత్తులు ఉంటాయి. సాంకేతిక, సమాచార పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో పట్టణాల్లోని ప్రజల్లాగే గ్రామీణులూ ఆలోచిస్తున్నారు. వారి కొనుగోలు శక్తి కూడా పెరిగింది. చాలా కాలంగా పట్టణ, గ్రామీణ భారతాల మధ్య గీత ఉన్నప్పటికీ.. దాన్ని మేం ఒక కృత్రిమ విభజనగానే భావిస్తున్నాం. అందుకే పట్టణ వినియోగదార్లకు ఏవైతే అందిస్తామో.. వాటినే గ్రామీణ వినియోగదార్లకూ అందజేస్తాం.

- ఆనంద్ మహీంద్రా , ఎం&ఎం ఛైర్మన్

దశాబ్ద కాలమే మిగిలి ఉంది

- **అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు**
- **లేకుంటే అసాధ్యమే: ఎస్‌బీఐ**

ముంబయి

అభివృద్ధి చెందిన దేశం హోదా పొందేందుకు భారత్‌కు పదేళ్ల సమయమే మిగిలి ఉందని ఎస్‌బీఐ నివేదిక వెల్లడించింది. విద్యపై దృష్టి పెట్టకుంటే యువ జనాభాపరంగా ఉన్న భారత్‌కున్న ప్రయోజనం నిరూపయోగం అవుతుందని పేర్కొంది. దీనిని దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టకుంటే, ఇంకెప్పుడూ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగలేదని హెచ్చరించింది. 'అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే భారత్‌కు పదేళ్ల సమయమే ఉంది. లేకపోతే ఎప్పటికీ వర్ధమాన దేశాల జాబితాలో ఉండిపోవాల్సిందే. అందువల్ల విధానకర్తలు మేల్కొని, తగువిధంగా విధానాలు రూపొందించాల'ని నివేదిక పేర్కొంది.

యువత విద్యకు అధిక ప్రాధాన్యం..: ప్రభుత్వం, విధానకర్తలు యువతపై దృష్టి సారించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. యువత ఎక్కువగా ఉన్నందున, ఈ ప్రయోజనాన్ని వాస్తవ రూపంలోకి తెచ్చేందుకు విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి పెట్టుబడులు పెంచాలని తెలిపింది. ప్రస్తుతం భారత్‌కు యువ జనాభాపరంగా ఉన్న ప్రయోజనం 2030 కల్లా కనుమరుగు అవుతుందని వెల్లడించింది. జనాభా పెరుగుదల ధోరణుల్లో మార్పులే ఇందుకు నిదర్శనమని పేర్కొంది. గత రెండు దశాబ్దాలుగా జనాభాలో వృద్ధి సుమారు 18 కోట్ల వద్ద స్థిరంగా ఉండగా.. జనన రేటు ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉందని తెలిపింది. ఉదాహరణకు కర్ణాటకనే చూస్తే ఆ రాష్ట్రంలో గత కొన్ని దశాబ్దాలుగా జనన రేటు తగ్గుతూ వస్తోందని వెల్లడించింది. దీంతో మొత్తం జనాభాల్లో 60 సంవత్సరాలకు పైబడిన వాళ్లు 1971లో 6.1 శాతంగా ఉండగా.. 2011లో 9.5 శాతానికి పెరిగారని పేర్కొంది. విద్యకు ప్రాధ్యానం పెంచాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నాయని తెలిపింది.

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు మెరుగుపర్చాలి: ఓవైపు జనాభా వృద్ధి స్తబ్దుగా సాగుతుండగా.. మరోవైపు ప్రజలు తమ పిల్లలను చదివించేందుకు ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేట్ పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపింది. అయితే జనాభాలో ఇప్పటికీ చాలా మంది ప్రభుత్వ పాఠశాలలపైనే ఆధారపడుతున్నందున దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వీటి పరిస్థితిని మెరుగుపర్చాల్సిన తరుణం వచ్చిందని వెల్లడించింది. ప్రభుత్వ బడుల పనితీరును మెరుగుపర్చేందుకు వివిధ మార్పులు తీసుకొని రావాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇందులో భాగంగా విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలలకు గ్రాంట్లు ఇవ్వడం ఆపేసి ఆ నిధులను ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వెచ్చించాలని ఎస్‌బీఐ ఆర్థికవేత్తలు సూచించారు. తరగతి గదులను ఆకర్షణీయంగా మార్చడం, ఇంగ్లీషు మాధ్యమంలో బోధన, మంచి పారితోషికంతో అర్హులైన ఉపాధ్యాయులను నియమించుకోవడం, జనాభా లెక్కలు లాంటి సర్వేలకు వాళ్లను పంపించకుండా చూడటం తదితరాలపై దృష్టి పెట్టాలని నివేదిక వెల్లడించింది.

322 కిలోమీటర్ల వేగంతో..

దిల్లీ: జాగ్వార్ ఎఫ్-టైప్ ఎస్‌వీఆర్ స్పోర్ట్స్ కారును దేశీయ విపణిలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్‌ఆర్) ఇండియా తెలిపింది. దీని ప్రారంభ ధరను రూ.2.65 కోట్లుగా (ఎక్స్‌షోరూమ్, ఇండియా) నిర్ణయించారు. 5-లీటర్ సూపర్‌ఛార్జ్‌డ్ వీ8 ఇంజిన్‌తో ఈ కారును తయారు చేశారు. 3.7 సెకన్లలో 100 కి.మీ.ల వేగాన్ని అందుకోవడం, గంటకు 322 కి.మీ. గరిష్ఠ వేగం దీని ప్రత్యేకతలు. 'ప్రత్యేక వాహన కార్యకలాపాల్లో భాగంగా ఎఫ్-టైప్ ఎస్‌వీఆర్‌ను జాగ్వార్ తొలిసారిగా రూపొందించింది. ఇంజినీరింగ్ విభాగం చేసిన విలువైన ఆలోచనలు ఈ కారులో గొప్పగా ప్రతిబింబిస్తాయ'ని జేఎల్‌ఆర్ ఇండియా అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) రోహిత్ సూరి తెలిపారు. ఈ స్పోర్ట్స్ కారుకు బుకింగ్‌లు మొదలుపెట్టామని కంపెనీ పేర్కొంది. కూపే, కన్వర్టబుల్ రకాల్లో జాగ్వార్ ఎఫ్-టైప్ ఎస్‌వీఆర్ అందుబాటులో ఉంది.

వృద్ధి రేటు

ఈ ఏడాది 7.4%

- భారత్‌పై అంచనాలు పెంచిన ఫిచ్
- ముడి చమురు ధరలపై హెచ్చరిక

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.4 శాతం వృద్ధి సాధిస్తుందని ఫిచ్ రేటింగ్స్ అంచనాలను పెంచింది. గత అంచనా 7.3 శాతం కావడం గమనార్హం. అయితే అధిక వ్యయాలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు మాత్రం ఇబ్బందులు సృష్టించవచ్చని అంటోంది. ఆసియా కరెన్సీలతో పోలిస్తే ఈ ఏడాది రూపాయిదే అధ్వాన ప్రదర్శన అని పేర్కొంది. 2019-20 ఏడాదికి వృద్ధిని 7.5 శాతంగా అంచనా వేసింది.

వచ్చే ఏడాది 65 డాలర్లకు ముడిచమురు

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఈ ఏడాది బ్యారెల్‌కు 70 బారెళ్ల దరిదాపుల్లో ఉండొచ్చని ఫిచ్ అంచనా వేస్తోంది. గత ఏడాది ఈ ధర 54.9 డాలర్లుగా ఉన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది చమురు ధర చల్లబడి 65 డాలర్లకు చేరొచ్చని అంటోంది. భారత ఆర్థిక వ్యవస్థ గత ఆర్థిక సంవత్సరంలో 6.7 శాతం వృద్ధిని నమోదు చేసిన సంగతి తెలిసిందే.

రూపాయి డీలా

2013 సంక్షోభంతో పోలిస్తే భారత్ స్థూల ఆర్థిక మూలాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రస్తుతం ముడి చమురు ధరలు పెరుగుతుండడం వల్ల కరెంట్ ఖాతా లోటు కూడా పెరగడం ఆందోళనకరమని వెల్లడించింది. గత నెలలో అమెరికాకు చెందిన మూడీస్ భారత వృద్ధి రేటు అంచనా(2018-19)లను 7.5 శాతం నుంచి 7.3 శాతానికి సవరించిన విషయం విదితమే. 2018 చివరకు రిటైల్ ద్రవ్యోల్బణం 5 శాతానికి చేరొచ్చని ఫిచ్ అంచనా వేసింది.

అంతర్జాతీయ వృద్ధి 3.3%, 3.2%

అంతర్జాతీయ వృద్ధి 2018లో 3.3 శాతం; 2019లో 3.2 శాతంగా ఉండొచ్చన అంచనాలను ఫిచ్ కొనసాగించింది. ముడి చమురు ధరలు పెరిగినా.. రాజకీయ అనిశ్చితులున్నా కూడా స్వల్పకాలంలో అంతర్జాతీయ వృద్ధి అంచనాలు బలంగానే ఉండొచ్చని ఫిచ్ తెలిపింది.

కరెంట్ ఖాతా లోటు మూడింతలు

ముంబయి: గత ఆర్థిక సంవత్సరం(2018-19)లో కరెంట్ ఖాతా లోటు(సీఏడీ) మూడింతలు పెరిగి 48.7 బిలియన్ డాలర్లకు లేదా జీడీపీలో 1.9 శాతానికి చేరింది. వాణిజ్య లోటు పెరగడం ఇందుకు నేపథ్యం. అంతక్రితం ఏడాది ఇది 14.4 బిలియన్ డాలర్లు లేదా 0.6 శాతంగానే ఉండడం గమనార్హం. మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు 13 బిలియన్ డాలర్లు(1.9%)గా నమోదైంది. అంతక్రితం ఏడాది 2.6 బి. డాలర్లు(0.9%)గా మాత్రమే ఉందని ఆర్‌బీఐ తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో లోటు అధికంగా 2.1 శాతంగా ఉన్న విషయం విదితమే.

డాక్టర్ రెడ్డీస్ కష్టాలకు చెల్లు!

- **తయారీ యూనిట్లకు యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతులు**
- **కొత్త ఔషధాలపై కంపెనీ దృష్టి** • **జూన్‌లో 16% పెరిగిన షేరు**

ఈనాడు - హైదరాబాద్

ఒకటి, రెండేళ్లుగా అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) తనిఖీలు, అమెరికాలో ఔషధాల ధరల క్షీణత, కొత్త ఔషధాలను అనుకున్న విధంగా ఆ విపణిలోకి ప్రవేశపెట్టలేకపోవడం వంటి ఇబ్బందులతో సతమతమవుతున్న డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆశావహంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియంత్రణ పరమైన ఇబ్బందులు తొలగిపోతుండడంతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10-15 వరకు కొత్త ఔషధాలను అమెరికాలోకి విడుదల చేయాలని కంపెనీ భావిస్తుండడంతో మార్కెట్‌లో డాక్టర్ రెడ్డీస్ షేరు మదుపర్లను ఆకర్షిస్తోంది. జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ బీఎస్‌ఈలో ఈ షేరు ధర 16 శాతం పెరిగింది. జూన్ ఒకటిన షేరు రూ.1,941.45 వద్ద ముగియగా.. బుధవారం రూ.2,252 వద్ద స్థిరపడింది. బుధవారం బీఎస్‌ఈలో 2.82 శాతం లాభపడింది. పరిస్థితులు కంపెనీకి అనుకూలంగా మారుతున్నాయని, షేరు ధర మరింత పెరగడానికి అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



యూనిట్లకు అనుమతులు

మంచి తయారీ విధానాల (జీఎంపీ) నిబంధనలకు అనుగుణంగా తయారీ ప్రక్రియ లేదంటూ.. 2015, నవంబరులో డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన మిర్యాలగూడలోని యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్ (ఏపీఐ) ప్లాంటు, విశాఖపట్నం దువ్వాడలోని కేన్సర్ ఫార్ములేషన్ల ప్లాంటు, శ్రీకాకుళంలోని యూనిట్‌కు యూఎస్‌ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖలను జారీ చేసింది. అప్పటి నుంచి అమెరికా నియంత్రణ సంస్థ అనుమతులు పొందడానికి, నిబంధనలకు అనుగుణంగా యూనిట్లను తీర్చిదిద్దడానికి కంపెనీ కసరత్తు చేస్తోంది. గత కొద్ది త్రైమాసికాలుగా నిబంధనలకు అనుగుణంగా యూనిట్లను తీర్చిదిద్దడమే ప్రథమ ప్రాధామ్యమని కంపెనీ చెబుతూ వచ్చింది. శ్రీకాకుళంలోని ఏపీఐ ప్లాంట్ (సెజ్) తనిఖీ చేసిన యూఎస్‌ఎఫ్‌డీఏ ఈనెల ప్రారంభంలో పచ్చజెండా ఊపింది. యూనిట్‌లో ఎటువంటి లోపాలు లేవని పేర్కొంది. 2017, జూన్‌లో మిర్యాలగూడాలోని ప్లాంటుకు యూఎస్‌ఎఫ్‌డీఏ ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ నివేదికను జారీ చేసి ఔషధాల ఉత్పత్తికి మార్గం సుగమం చేసింది. ఈ ప్లాంటులో సొంత వినియోగానికి, ఖాతాదారు కంపెనీల కోసం ముడి ఔషధాలను డాక్టర్ రెడ్డీస్ తయారు చేస్తోంది. హెచ్చరిక లేఖలు పొందిన మూడు యూనిట్లలో రెండు యూనిట్లు గట్టెక్కగా, విశాఖపట్నం సమీపంలోని దువ్వాడ యూనిట్‌కు కూడా యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతి లభించే అవకాశాలు ఉన్నాయి.

యూఎస్‌లో డాక్టర్ రెడ్డీస్ చేసే ఔషధ విక్రయాల్లో 50 శాతానికి పైగా హైదరాబాద్‌లోని బాచుపల్లి ఫార్ములేషన్ల ప్లాంటులో తయారవుతున్నాయి. 2017, ఏప్రిల్‌లో ఈ యూనిట్‌కు యూఎస్‌ఎఫ్‌డీఏ 483 ఫారమ్ జారీ చేసింది. దీనికి కూడా హెచ్చరిక లేఖ జారీ చేయవచ్చన్న భయాలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. అయితే.. 2017 చివర్లో ఈ ప్లాంటుకు యూఎస్‌ఎఫ్‌డీఏ పచ్చజెండా ఊపింది. ఈ పరిణామాలు కంపెనీపై సానుకూల ప్రభావాన్ని చూపుతున్నాయి.

క్లిష్టమైన ఔషధాలపై దృష్టి..

మార్కెట్‌లో పోటీ తక్కువ ఉండే క్లిష్టమైన, అందరికి ప్రవేశం సాధ్యం కాని ఔషధాలపై దృష్టి పెట్టాలని డాక్టర్ రెడ్డీస్ భావిస్తోంది. మల్టీపుల్ స్క్లెరోసిస్ చికిత్సకు వినియోగించే కోపాగ్జాన్ జనరిక్‌ను అమెరికాలో విడుదల చేయడానికి కృషి చేస్తోంది. కోపాగ్జాన్ జనరిక్ బిళ్లలను (40 ఎంజీ మోతాదు) అమెరికాలో విడుదల చేయడానికి యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతి ఇస్తే.. కంపెనీకి ఆకర్షణీయ ప్రతిఫలాలు రావడానికి అవకాశం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీన్ని ప్రవేశపెట్టాలని భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నొప్పి నివారణ ఔషధం సుబాక్సాన్‌ను త్వరలోనే కంపెనీ విడుదల చేయగలదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2021 నాటికి ఉత్తర అమెరికా మార్కెట్ నుంచి వచ్చే ఆదాయంలో 50 శాతానికి పైగా ఇంజెక్షన్లు, టాపికల్స్, కాంప్లెక్స్ డోసేజీ ఔషధాల నుంచి రావాలని డాక్టర్ రెడ్డీస్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం నోటి ద్వారా తీసుకునే ఔషధాల నుంచే దాదాపు 80 శాతం ఆదాయం లభిస్తోంది. భారత అకౌంటింగ్ ప్రమాణాల ప్రకారం ఏకీకృత ప్రాతిపదికన అంతక్రితం ఏడాదితో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరానికి డాక్టర్ రెడ్డీస్ ఆదాయం స్వల్పంగా పెరిగి రూ.14,196 కోట్ల నుంచి రూ.14,281 కోట్లకు చేరింది. నికర లాభం రూ.1,292 కోట్ల నుంచి రూ.947 కోట్లకు తగ్గింది. కాగా 2018, మే నెలకు డాక్టర్ రెడ్డీస్ విక్రయాలు 12.9 శాతం వృద్ధితో రూ.235 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది.

వడ్డీ రేట్లు

ఆగస్టులో పెంచొచ్చు

- అధిక ద్రవ్యోల్బణమే కారణం
- ఆర్‌బీఐ సమీక్షపై విశ్లేషకుల అంచనాలు

ముంబయి: మేలో రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ఠ స్థాయి అయిన 4.87 శాతానికి చేరడంతో ఆర్‌బీఐ తన ఆగస్టు పరపతి విధాన సమీక్షలో కీలక రేట్లను పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కఠిన పరపతి విధాన సమీక్ష వల్ల వ్యాపారాలు చేయడానికి అధిక వ్యయాలు అవుతాయని, దీంతో కార్పొరేట్లు పెట్టుబడులు పెట్టడానికి వెనకాడతారని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) వ్యాఖ్యానించాక, విశ్లేషకులూ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- 'వచ్చే కొద్ది నెలల్లో జంట ద్రవ్యోల్బణాలపై ఒత్తిడి ఉండొచ్చు. దీని వల్ల ఆర్‌బీఐ మరో పావు శాతం మేర రేట్లను పెంచే అవకాశం ఉంది. జులై 31, ఆగస్టు 1 తేదీల్లో జరిగే సమావేశాల్లో ఈ నిర్ణయం వెలువడవచ్చ'ని ఫ్రెంచ్ బ్రోకరేజీ సంస్థ బీఎన్‌పీ పరిబాస్ ఒక నివేదికలో పేర్కొంది.
- యూబీఎస్ సెక్యూరిటీస్ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ 'ఆగస్టులో రేట్ల పెంపు ఉండొచ్చ'ని అంచనా వేసింది. 'అంతర్జాతీయ ముడి చమురు ధరలు ప్రస్తుత స్థాయిల వద్దే కొనసాగి; ద్రవ్యోల్బణం ఇలాగే పెరుగుతూ ఉంటే తదుపరి రేట్ల పెంపు త్వరలోనే ఉండొచ్చ'ని పేర్కొంది.
- జర్మనీ బ్రోకరేజీ సంస్థ డాయిష్ బ్యాంక్ సైతం ఆగస్టు సమీక్షలు పావు శాతం పెంపు ఉండొచ్చని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం నుంచి వస్తున్న సంకేతాలను అందుకుని ఆర్‌బీఐ ఆ పనిచేయవచ్చని అంటోంది.
- బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ మాత్రం ప్రాతిపదిక సంవత్సరం కారణంగా ద్రవ్యోల్బణ గణాంకాలు పెరిగాయి కాబట్టి ఆర్‌బీఐ యథాతథ స్థితిని ఎక్కువ కాలం పాటే కొనసాగించొచ్చని చెబుతోంది.

ట్రూ కాలర్ చేతికి 'చిల్లర్' యాప్

చెల్లింపుల విభాగంలోకి తొలి అడుగు

బెంగళూరు: ఫోన్ నంబర్ల సెర్చ్ ఇంజిన్ ట్రూ కాలర్, చెల్లింపుల విభాగంలోకి (పేమెంట్స్ స్పేస్) అడుగుపెట్టేందుకు వీలుగా 'చిల్లర్' పేమెంట్స్ యాప్‌ను కొనుగోలు చేసింది. దేశంలోనే తొలిసారిగా 2014లో ప్రారంభించిన మల్టీ-బ్యాంక్ పేమెంట్ యాప్ ఇది. దీని కొనుగోలుకు సంబంధించిన నియమ నిబంధనలు, చెల్లించిన మొత్తం ఎంతనేది ట్రూ కాలర్ వెల్లడించలేదు. డిజిటల్ చెల్లింపుల విభాగంలోకి అడుగుపెట్టి యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) ఆధారిత లావాదేవీలు ప్రారంభించాలని ఏడాదిగా అనుకుంటున్న ట్రూ కాలర్, ఈ క్రమంలో తొలి అడుగు వేసినట్లయింది. చిల్లర్ యాప్ వ్యవస్థాపకులు సోనీ జాయ్, అనూప్ శంకర్, మొహమ్మద్ గలీబ్, లిసోయ్ భాస్కరన్‌తోపాటు పలువురు ట్రూ కాలర్‌లో కొనసాగుతారని సంస్థ సహ వ్యవస్థాపకులు, ముఖ్య వ్యూహాత్మక అధికారి (సీఎస్‌ఓ) నమి జర్రింగళం తెలిపారు. 'ట్రూ కాలర్ పే' ఉపాధ్యక్షుడిగా సోనీ జాయ్ కొనసాగనున్నారు. '15 కోట్ల మంది భారతీయులకు చేరువయ్యేలా ట్రూ కాలర్ ప్లాట్‌ఫామ్‌ను చిల్లర్ యాప్ ఇంజినీర్లు, రూపకర్తలు తీర్చిదిద్దుతారన్న నమ్మకం ఉంద'ని నమి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆధార్ 'ముఖ గుర్తింపు' మరింత ఆలస్యం

- **ఆగస్టు 1 వరకు ఉండకపోవచ్చు**
- **యూఐడీఏఐ సీఈఓ అజయ్ భూషణ్**

దిల్లీ: ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నిషన్) సదుపాయం అమలును ఆధార్ జారీ సంస్థ యూఐడీఏఐ ఒక నెల పాటు ఆలస్యం చేయనుంది. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ పథకం అమలును జులై 1 నుంచి ఆగస్టు 1 కి వాయిదా వేసినట్లు విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సీఈఓ అజయ్ భూషణ్ పాండే పేర్కొన్నారు. ఆధార్ కోసం ప్రస్తుతం కను పాపలు (ఐరిస్), వేలి ముద్రల (ఫింగర్‌ప్రింట్స్)ను స్కాన్ చేస్తుండగా, ముఖ గుర్తింపును కూడా జత చేయాలని గతేడాది యూఐడీఏఐ నిర్ణయించిన సంగతి తెలిసిందే. 'మేం ఆ పనిమీదే ఉన్నాం. సాంకేతికత పరిజ్ఞానంతో ముడిపడి ఉన్న విషయాలు కాబట్టి కొంత సమయం పడుతుంది. పూర్తి స్థాయిలో సిద్ధమవ్వాలని మేం భావిస్తున్నాం. ఒక కొత్త దిశ వైపు వేస్తున్న అడుగు ఇది. కాబట్టి ముందస్తు అంచనాలు ఉండవు. కచ్చితమైన సమయాన్నీ చెప్పలేం. అయితే ఆగస్టు 1 నుంచి అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నామ'ని అజయ్ వివరించారు. ఒక వేళ దీనిని మరి కొద్ది నెలలు ఆలస్యం చేస్తే.. ఆ ప్రయోజనాలను ప్రజలు అందుకోలేకపోవచ్చని ఆయన అన్నారు.

టెలికాం కనెక్షన్లకు పరిమిత కేవైసీ

టెలికాం కనెక్షన్ల కోసం పూర్తిస్థాయి ఆధార్ వివరాలను ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఆధార్ సంఖ్యకు అనుసంధానమై ఉండే వర్చువల్ ఐడీలను వినియోగించడానికి తగ్గ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని టెలికాం ఆపరేటర్లకు టెలికమ్యూనికేషన్ల విభాగం (డాట్) సూచించింది. మొబైల్ వినియోగదార్ల కోసం 'పరిమిత కేవైసీ' వ్యవస్థకు మారడానికి సిద్ధంగా ఉండాలని కోరింది. జులై 1 నుంచి కొత్త వర్చువల్ ఐడీ వ్యవస్థ అమలుకు వస్తున్న నేపథ్యంలో, డాట్ ఈ సూచన చేసింది. వ్యక్తిగత ఆధార్ సంఖ్యకు అనుసంధానించిన 16 అంకెల సంఖ్యను వర్చువల్ ఐడీగా పరిగణిస్తారు. ఇది వచ్చే నెల నుంచి పూర్తిగా అమల్లోకి వస్తుంది. వ్యక్తుల సమాచారం(ఆధార్) గోప్యత, భద్రతను ఇది మరింత బలోపేతం చేస్తుంది.

విశాఖకు అరుదైన అవకాశం

ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ ప్రాజెక్టులో భాగం

ఈనాడు - విశాఖపట్నం

దేశ ఆర్థిక వ్యవస్థను ఐదు ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.325 లక్షల కోట్లు) స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్న కేంద్ర ప్రభుత్వం, ఇందుకు క్షేత్రస్థాయిలో చర్యలు ముఖ్యమని భావిస్తోంది. జిల్లా స్థాయిలోనే సమగ్ర ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తే అధిక వృద్ధి సాధించవచ్చనే భావనతో, ప్రయోగాత్మకంగా 6 జిల్లాలను ఎంపిక చేసింది. ఇందులో విశాఖపట్నం ఒకటి. జిల్లా జీడీపీ ప్రస్తుతం కంటే 2025 నాటికి మరో మూడుశాతం వృద్ధి చేయడం లక్ష్యంగా కార్యక్రమాలు చేపడతారు. ప్రాజెక్టు అమలు కోసం ఎన్.ఐ.ఆర్.డి., ఐ.ఐ.ఎం.(కటక్) నుంచి పలువురు నిపుణులతో కమిటీ వేస్తారు. జిల్లాలో వివిధ రంగాల్లో ప్రగతి ఎలా ఉంది, మరింత పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలను అధ్యయనం చేస్తారు. పారిశ్రామికంగా ఇప్పటికే అభివృద్ధి చెందినందున, ఎలాంటి ప్రోత్సాహం ఇస్తే, మరింత ఉత్పత్తి సాధించగలవన్న అంశాలపై నిపుణులు అధ్యయనం చేస్తారు. సంస్థలు తమ సామర్థ్యాన్ని, మానవ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోగలుగుతున్నాయా, ఉత్పత్తులను అంతర్జాతీయ విపణిలో విక్రయిస్తున్నాయా, అవరోధాలుగా నిలుస్తున్న అంశాలేమిటి.. అన్న విషయాలను అధ్యయనం చేస్తారు. ఇంకా ఏ తరహా పరిశ్రమలు ఏర్పాటుచేస్తే లాభదాయకంగా ఉంటుందన్న అంశాన్నీ పరిశీలించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటే వివిధ రంగాలు విశేష ప్రగతి సాధిస్తాయన్న విషయాల్ని నిర్ధరిస్తారు.

కీలకరంగాలపై ప్రత్యేక దృష్టి

వ్యవసాయం, తయారీ, సేవా, ఐ.టి. రంగాలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. వ్యవసాయ దిగుబడులు పెంచేందుకు కార్పొరేట్ వ్యవసాయం దోహద పడుతుందని భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా వెయ్యి ప్రాంతాల్లో, ఒక్కోచోట 200 చదరపు కి.మీ.ల విస్తీర్ణంలోని భూభాగంలో వ్యవసాయ భూములను ఒక 'వ్యవసాయ అభివృద్ధి ప్రాంతం' (ఎ.డి.ఆర్.) గుర్తించి కార్పొరేట్ సంస్థలతో వ్యవసాయం చేయిస్తారు. తయారీరంగ అభివృద్ధికి విస్తృత మౌలిక వసతులు కల్పిస్తారు. ఐ.టి.రంగానికి వస్తే యాంత్రీకరణ, కృత్రిమమేధ వల్ల ఉద్యోగాలు పోకుండా, మరిన్ని వచ్చేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారిస్తారు. పలు అధునాతన సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతారు.

మూడునెలల్లో వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక

కేంద్రం వివిధ రాష్ట్రప్రభుత్వాల సహకారంతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దక్షిణ భారతదేశం నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా వాటిలో విశాఖ ఒకటి. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అమలు కానున్న ఈ ప్రాజెక్టు తొలిసమావేశం దిల్లీలో గతవారంలో జరిగింది. ఏపీ ప్రతినిధిగా నేను హాజరయ్యాను. జీడీపీ మరో మూడుశాతం పెరగడానికి తీసుకునే చర్యల కారణంగా కొత్త పరిశ్రమలు, వ్యాపారాలు ఏర్పడి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వివిధ పరిశ్రమల సామర్థ్యం పెరగడంతో పాటు, ఉత్పత్తి, ఎగుమతులు కూడా వృద్ధి చెందుతాయి. మరో మూడు నెలల్లో ఆ ప్రాజెక్టుకు సంబంధించిన వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమావేశంలో వెల్లడించారు.

- రామలింగేశ్వరరాజు, జి.ఎం., పరిశ్రమలశాఖ, విశాఖపట్నం

ఛాంపియన్స్

భూగోళమంతా బంతిలా

● నేటి నుంచే ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ సంబరం
● 32 రోజులు.. 32 జట్ల మహా సమరం

● తొలి మ్యాచ్‌లో రష్యా × సౌదీ అరేబియా
● రాత్రి 8.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

అది రెండొందలకు పైగా దేశాలు ఆడే ఆటట..

ఈ ఆటను మూడొందల కోట్ల మంది చూస్తారట..

ప్రపంచంలో మరే ఆటకూ అంతటి ఆదరణ లేదట..

ఆ ఆటలో స్టార్ అయితే వేల కోట్ల ఆదాయమట..

అయితే ఏంటట..? గణాంకాలు ఘనంగా ఉంటే గొప్పేనా? అయినా మాటల్లో చెబితే ఏం తెలుస్తుంది..?

ఒక్కసారి యూట్యూబ్‌లోకి మారడోనా హ్యాండ్ ఆఫ్ గాడ్ అని కొట్టి అతడి గోల్ చూడండి. పీలే మ్యాజిక్ అని వెతికి అతడి విన్యాసాల్ని కనండి. మెస్సి మాయాజాలాన్నీ వీక్షించండి. రొనాల్డో మెరుపులపైనా ఓ లుక్కేయండి. అప్పటిక్కానీ అర్థం కాదు.. ఫుట్‌బాల్ మహత్తేంటో!

మైదానంలో ఒక వైపు బంతి అందుకుని..ప్రత్యర్థులెవరికీ చిక్కకుండా బంతిని నియంత్రించుకుంటూ అవతలి వైపెళ్లి గోల్ కొట్టేసే వాడొకడు. మైదానం మధ్య నుంచి ఒకే ఒక్క తన్నుతో బంతిని గోల్ పోస్టులోకి పంపించేవాడు మరొకడు. ఒక మూల నుంచి వంపు తిప్పుతూ బంతిని గోల్‌గా మలుస్తాడొకడు. తలనే ఆయుధంగా గోల్ పోస్టును ఛేదించేవాడొకడైతే.. గాల్లోనే పల్టీ కొట్టి బైసికల్ కిక్‌తో గోల్ సాధించేవాడు ఇంకొకడు. ఇలా 'గోల్' విన్యాసాలు ఎన్నెన్నో..! ఈ ఆట అందాన్ని గోల్స్‌తోనే కొలుస్తామా! చుట్టూ ప్రత్యర్థులు మూగి ఉన్నా.. వాళ్లకు దొరకనివ్వకుండా బంతిని అదుపులో ఉంచుకునే తీరుకు ఫిదా కావాల్సిందే. గంటన్నర పాటు క్షణం విశ్రాంతి లేకుండా చేసే పోరాటానికి సలాం కొట్టాల్సిందే! పాదంతో ఆడే ఆట అయినా.. శరీరాన్నే ఒక ఆట స్థలంలా మార్చి.. తలతో, భుజాలతో, ఛాతీతో, మోకాళ్లతో బంతిని నియంత్రించే వైనానికి చప్పట్లు కొట్టాల్సిందే!

వారెవా అనిపించే సొగసు.. అబ్బురపరిచే నైపుణ్యం.. నమ్మశక్యం కాని వేగం.. నరాలు తెగే ఉత్కంఠ.. నాటకీయత.. ఇలా 90 నిమిషాల పాటు కళ్లు తిప్పుకోనివ్వకుండా వినోదంలో ముంచెత్తే ఆట ఇది!

అసాధారణ శక్తి సామర్థ్యాలు, అద్భుత నైపుణ్యాలు కలయిక అంతర్జాతీయ ఫుట్‌బాలర్. అలాంటోళ్లు 22 మంది కలిసి ఒక్క బంతి కోసం పోరాడుతుంటే వినోదానికి కొదవేముంది? రెండేళ్ల పాటు మహా క్రతువులా సాగే అర్హత టోర్నీని దాటి ప్రపంచకప్‌కు అర్హత సాధించే జట్ల మధ్య పోటీ అంటే మజాకు హద్దులేముంటాయి?

ప్రపంచమంతా ఇష్టపడే బ్రెజిల్.. దుర్భేధ్య జర్మనీ.. అద్భుతాల కొలువు స్పెయిన్.. నైపుణ్యాల నెలవు అర్జెంటీనా.. ఇంకా ఫ్రాన్స్, బెల్జియం.. ఫేవరెట్లు చాలానే! చూద్దాం.. కప్పుని 'తన్నుకు'పోయేదెవరో! రొనాల్డో, మెస్సి ఆల్ టైం గ్రేట్‌లు.. నెయ్‌మార్, డిబ్రుయిన్ లాంటి మధ్య తరం తారలు.. సలా, వెర్నర్ లాంటి ఈతరం మాంత్రికులు.. చూద్దాం ఎవరి 'పాద' మహిమ ఫలిస్తుందో!

ఇక 32 రోజుల పాటు ప్రపంచం చూపంతా రష్యా వైపే. 32 జట్లు అస్త్రశస్త్రాలతో సిద్ధం! ప్రతి పోరూ సమరమే! ఇదో మహా సంగ్రామమే! నేటి నుంచే ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్.. ఇక పదండి.. పడిపోదాం.. కాల్బంతి ప్రేమలో!



మాస్కో (రష్యా)

ప్రపంచకప్‌కు సర్వం సన్నద్ధమైంది. గురువారం లుజ్నికి స్టేడియంలో జరిగే ఆరంభ వేడుకతో టోర్నీ ఆరంభమవుతుంది. అక్కడే తొలి మ్యాచ్. ఈ ప్రపంచకప్‌లో అత్యంత తక్కువ ర్యాంకు జట్లు రష్యా, సౌదీ ఆరేబియాలు తలపడతాయి. టైటిల్ కోసం అనేక జట్లు గట్టిగా పోటీలో ఉన్నాయి. స్వీన్‌స్టీజర్, క్లోజ్ వంటి స్టార్లు లేకున్నా డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. కుర్రాళ్లు టిమో వెర్నర్, జోషువా కిమిచ్, డ్రాక్స్లర్, రుడిజెర్.. అనుభవజ్ఞులైన ఓజిల్, గోమెజ్, హమెల్స్, ర్యూస్, న్యూర్ వంటి ఆటగాళ్లతో జర్మనీ దుర్భేధ్యంగా కనిపిస్తోంది. ఇక బ్రెజిల్ ఫేవరెట్‌గా లేని ప్రపంచకప్పును ఊహించలేం. ఈసారి కూడా అంతే. గత ప్రపంచకప్ పరాభవం తర్వాత రూపాంతరం చెందిన బ్రెజిల్ నెయ్‌మార్, జీసస్, ఫిర్మినో వంటి స్టార్ ఆటగాళ్లతో కదనోత్సాహంతో ఉంది. కనీసం సెమీఫైనల్ వరకైనా ఈ జట్లకు ఎదురుండకపోవచ్చు. అర్జెంటీనా, ఫ్రాన్స్, స్పెయిన్, బెల్జియం కూడా ఎన్నో ఆశలతో టోర్నీలో అడుగుపెడుతున్నాయి.

రష్యాకు సవాలే..: తొలి మ్యాచ్‌లో సౌదీ అరేబియాతో ఎదుర్కోవడం రష్యాకు పెను సవాలే. రెండూ పెద్ద ర్యాంకు జట్లేమీ కానప్పటికీ సౌదీదే కాస్త పైచేయిగా కనిపిస్తోంది. సొంత అభిమానుల నుంచి భారీ అంచనాలున్న నేపథ్యంలో రష్యాపైనే ఒత్తిడి. అది ఈ టోర్నీలో అత్యంత తక్కువ ర్యాంకు (70వ) జట్టు. రష్యా గత 15 మ్యాచ్‌ల్లో ఆ జట్టు కేవలం మూడు మ్యాచ్‌లో నెగ్గింది. అలన్ జగోవ్, డెనిస్ చెరిషెవ్, స్మోలోవ్‌లు ఆ జట్టుకు కీలక ఆటగాళ్లు. 2006 తర్వాత తొలిసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న సౌదీ అరేబియా ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగుతోంది. అంచనాలు లేకపోవడం తమకు లాభించే అంశమని సౌదీ భావిస్తోంది.

ఒక కప్పు.. 41,153 కోట్ల ఆదాయం

ఆదరణ, ఆదాయం విషయంలో ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్‌ను మించిన టోర్నీ ప్రపంచంలో మరొకటి లేదని మరోసారి రుజువైంది. ఒలింపిక్స్‌ను ఎంత ప్రతిష్టాత్మకంగా భావించినా.. దానికి అయ్యే ఖర్చుతో పోలిస్తే ఆదాయం చాలా తక్కువ. కానీ ఫుట్‌బాల్ ప్రపంచకప్ అలా కాదు. ఈ టోర్నీ నిర్వహణతో ఫిఫాపై కాసుల వర్షం మామూలుగా కురవదు. రష్యాలో జరగబోయే ప్రస్తుత ప్రపంచకప్ ద్వారా ఫిఫా పొందే ఆదాయమెంతో తెలిస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. ఏకంగా 6.1 బిలియన్ డాలర్లు.. అంటే సుమారు రూ. 41,153 కోట్ల ఆదాయం ఫిఫా ఖాతాలో పడబోతోంది. ఫిఫా అంచనా వేసిందానికంటే 10 శాతం అధికం.

ఎక్కడ చూడొచ్చు

సోని టెన్-3, సోని టెన్2, సోనీ ఈఎస్‌పీఎన్‌ల్లో ఆరంభోత్సవాన్ని, మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. మ్యాచ్ ఆరంభానికి అరగంట ముందు.. అంటే భారత్ కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు ప్రారంభ వేడుక మొదలవుతుంది.

2026 ప్రపంచకప్ 3 దేశాల్లో

2026 ఫిఫా ప్రపంచకప్‌నకు మూడు దేశాలు ఉమ్మడిగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఆతిథ్య హక్కుల కోసం యుఎస్, మెక్సికో, కెనడా ఉమ్మడిగా వేసిన బిడ్‌కు పూర్తి ఆధిక్యం దక్కినట్లు ఫిఫా కాంగ్రెస్ తెలిపింది. ప్రపంచకప్ నిర్వహించాలనుకున్న మొరాకోకు ఐదోసారి నిరాశే ఎదురైంది. మొత్తం 203 ఓట్లకు గాను.. ఉత్తర అమెరికా (యుఎస్, మెక్సికో, కెనడా) బిడ్‌కు 134 ఓట్లు రాగా, మొరాకోకు కేవలం 65 ఓట్లు మాత్రమే వచ్చాయి.

12 వేదికలు.. 64 మ్యాచ్‌లు: ప్రపంచకప్‌లో మొత్తం మ్యాచ్‌ల సంఖ్య 64. 11 నగరాల్లో 12 స్టేడియాలు మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తాయి.

2 ప్రపంచకప్‌లో అరంగేట్రం చేస్తున్న దేశాలు. అవి.. ఐస్‌లాండ్, పనామా.

5 బ్రెజిల్ గెలిచిన ప్రపంచకప్‌లు. అత్యధికసార్లు విజేతగా నిలిచిన జట్టు అదే.

21 ప్రస్తుత ప్రపంచకప్ సంఖ్య. 1930 నుంచి ఇప్పటిదాకా 20 ప్రపంచకప్‌లు జరిగాయి.

2707 కోట్లు

ఈ ప్రపంచకప్ ప్రైజ్ మనీ. విజేతకు రూ.258 కోట్లు అందుకుంటుంది. గ్రూప్ దశలో నిష్క్రమించిన జట్టుకు కూడా రూ. 58 కోట్లు దక్కుతాయి.

ప్రారంభోత్సవం..

రాబీ విలియమ్స్

ప్రపంచకప్ తొలి మ్యాచ్‌కు ముందు రష్యా ఘన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఆరంభోత్సవం ఘనంగా జరగనుంది. 80 వేల ప్రేక్షక సామర్థ్యమున్న లుజ్నికి స్టేడియం దీనికి వేదిక. పాటలు, నృత్యాలతో అభిమానులను అలరించనున్నారు. దాదాపు 500 మంది నృత్యకారులు, జిమ్నాస్టులు, ట్రాంపోలినిస్టులు కూడా ఈ కార్యక్రమంలో ప్రదర్శన ఇవ్వనున్నారు. బ్రిటిష్ పాప్‌స్టార్ రాబీ విలియమ్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. ప్రారంభోత్సవానికి సమాంతరంగా మాస్కో నగరంలోని ప్రఖ్యాత రెడ్ స్క్వేర్‌లో సంగీత విభావరి జరగనుంది.

పిల్లి రష్యా అంటోంది

మాస్కో: గత ఎనిమిది నెలలుగా ఒక్క విజయం కూడా సాధించని రష్యా ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో గెలుపు బాట పట్టబోతుందంటా! ఈ మాట చెప్పింది రష్యా చెవిటి పిల్లి అచిల్లీస్. ప్రపంచకప్ మ్యాచ్ ఫలితాలను అంచనా వేయడానికి అచిల్లీస్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన విషయం తెలిసిందే. గురువారం ఆరంభం కానున్న ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో రష్యా.. సౌదీ అరేబియాతో తలపడనుంది. అచిల్లీస్ అంచనా ఎంతవరకు నిజమౌతుందో తెలియాలంటే మ్యాచ్ అయ్యేవరకు వేచి చూడాల్సిందే. 2010 ప్రపంచకప్ సమయంలో ఆక్టోపస్ పాల్ ఇలాగే మ్యాచ్ ఫలితాలను అంచనా వేసింది. ఫైనల్ విజేతతో పాటు అది చెప్పిన ఫలితాలన్నీ సరిగానే వచ్చాయి.

అతిథులతో అది వద్దు..

మాస్కో: అతిథులను అతిథులుగానే చూడండి తప్ప వారితో శృంగారం వద్దని రష్యా మహిళలను ఆ దేశ ఎంపీ ఒకామె హెచ్చరించింది. ప్రపంచకప్ చూసేందుకు వచ్చే అభిమానులతో సెక్స్‌లో పాల్గొంటే ఒంటరిగా పిల్లలను పెంచాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలని ఆమె చెప్పింది. తమారా ప్లెత్నెవా అనే ఆ 70 ఏళ్ల ఎంపీ పార్లమెంట్ కుటుంబ కమిటీకి నాయకత్వం వహిస్తోంది. "ప్రపంచకప్ సందర్భంగా రష్యా యువతులకు విదేశీయులతో పరిచయం ఏర్పడి, ఆ తర్వాత వారు తల్లులుగా మారొచ్చు. అలాంటి పరిస్థితి రాదని ఆశిస్తున్నా" అని ఆమె చెప్పింది. "మనం మన పిల్లలకే జన్మనివ్వాలి" అంది. భిన్న వర్ణాలకు జన్మించిన పిల్లలు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి దగ్గరే పెరిగే అవకాశముందని ఆమె వ్యాఖ్యానించింది. "అదృష్టంకొద్దీ ఆ పిల్లలు తల్లుల వర్ణంతో పుడితే ఫర్వాలేదు. మరో వర్ణంలో పుడితే మాత్రం ఇబ్బందే. వాళ్లు చాలా బాధపడాల్సివస్తుంది" అని చెప్పింది. "ఆ పిల్లలను తల్లుల దగ్గరే వదిలేయొచ్చు లేదా తండ్రులు వారిని తమ వెంట తీసుకెళ్లొచ్చు. ఎలాగైనా వాళ్లు ఒంటరే అవుతారు" అని ఆమె అంది. రష్యా మహిళలు రష్యా పురుషులనే పెళ్లి చేసుకోవాలని ఆమె కోరింది. ప్లెత్నెవా వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్పెయిన్ కోచ్ లోపెటెగికి ఉద్వాసన

క్రస్నోదర్ (రష్యా): ప్రపంచకప్ తమ తొలి మ్యాచ్ ఆడడానికి రెండు రోజుల ముందు స్పెయిన్ జట్టుకు పెద్ద షాక్! ఆ జట్టు కోచ్ జులెన్ లోపెటెగి ఉద్వాసనకు గురయ్యాడు. ప్రపంచకప్ తర్వాత లోపెటెగి తమ కోచ్‌గా పగ్గాలు అందుకోనున్నట్లు రియల్ మాడ్రిడ్ ప్రకటించిన నేపథ్యంలో స్పెయిన్ ఫుట్‌బాల్ సమాఖ్య ఈ నిర్ణయం తీసుకుంది. తమకు మాట మాత్రమైనా చెప్పకుండా అతడు మాడ్రిడ్‌తో చర్చలు జరపడంపై సమాఖ్య ఆగ్రహంతో ఉంది.

వన్డేల్లో, టీ20ల్లో అదరగొట్టేస్తోంది అఫ్గానిస్థాన్. పేరుకే పసికూన కాని బరిలో మాత్రం కసికూనే. జోరు మీదున్న అఫ్గాన్ బృందం... సిసలు సవాల్‌కు సిద్ధమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌కు రంగం సిద్ధం చేసుకుంది. ఆ దేశ క్రికెట్ చరిత్రలోనే తొట్ట తొలి టెస్టు మ్యాచ్ ఆడేందుకు అఫ్గాన్‌కు అవకాశం వచ్చింది. గురువారం నుంచి బెంగళూరు వేదికగా భారత్‌తో ఆ జట్టు ఏకైక టెస్టు మ్యాచ్ ఆడబోతోంది. మరి బలమైన టీమ్‌ఇండియాను అఫ్గాన్ ఎలా ఎదుర్కొంటుందన్నది ఆసక్తికరం. కెప్టెన్ విరాట్ కోహ్లికి విశ్రాంతినివ్వడంతో అజింక్య రహానె భారత్‌కు సారథ్యం వహించనున్నాడు.

అటు కొండ.. ఇటు కూన

ఉదయం 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌-1లో



భారత్‌తో నేటి నుంచే అఫ్గాన్ అరంగేట్ర టెస్టు

బెంగళూరు

ఆసక్తికర టెస్టుకు రంగం సిద్ధం. టెస్టుల్లో నంబర్‌వన్ భారత్.. ర్యాంకింగ్స్‌లో ఇప్పటిదాకా ఖాతానే తెరవని అఫ్గాన్! రికార్డులు, స్టార్ల లెక్కలు పరిగణనలోకి తీసుకుంటే రెండింటికి పొంతనే లేదు. కానీ ఏకైక టెస్టు ఆసక్తిని రేపుతోంది. కారణం ఇటీవల అఫ్గాన్ ప్రదర్శనే! స్టార్ ఆటగాళ్లు లేకున్నా.. కలిసికట్టుగా ఆడుతూ వన్డేలు, టీ20ల్లో సంచలన విజయాలు సాధించిన అఫ్గాన్. ఇప్పుడు భారత్‌తో మ్యాచ్ ద్వారా సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ కాలు మోపబోతోంది. కెప్టెన్ అస్గర్ స్తానిక్‌జాయ్ నేతృత్వంలోని ఆ జట్టు జోరు మీద కనిపిస్తోంది.

కరుణ్ × రాహుల్

మరోవైపు టీమ్‌ఇండియాకు తుది జట్టు ఎంపికే సమస్యగా మారబోతోంది. కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్‌లలో ఎవరికి తుది జట్టులోకి తీసుకోవాలో తెలియని స్థితి. రెగ్యులర్ ఓపెనర్లు మురళీ విజయ్, శిఖర్ ధావన్ జట్టులో ఉండడంతో రాహుల్ లేదా కరుణ్‌లకు మిడిల్‌ఆర్డర్‌లో చోటు దక్కే అవకాశాలున్నాయి. దక్షిణాఫ్రికా పర్యటనలో ఆకట్టుకోలేకపోయిన విజయ్‌కు తుది జట్టులో చోటు దొరుకుందా లేదా అనేది కూడా అనుమానమే. మరోవైపు రాహుల్, కరుణ్ సూపర్ ఫామ్‌లో ఉండడంతో టీమ్ మేనేజ్‌మెంట్ ఎవరిని తుది జట్టులోకి తీసుకొస్తుందో చూడాలి. ఒకవేళ ధావన్ గాయం కారణంగా తుది జట్టుకు దూరమైతే మాత్రం రాహుల్, నాయర్‌లు ఇద్దరూ జట్టులో ఉండే అవకాశముంది. బుధవారం భారత్ ప్రాక్టీస్ సెషన్లో ధావన్ పాల్గొనకపోవడంతో అతడికి గాయమైందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. అయితే అతనికి గాయం అయిన విషయాన్ని అధికారికంగా ఎవరూ ధ్రువీకరించలేదు. ప్రాక్టీస్‌కు విజయ్‌ను పక్కనపెట్టగా.. ప్రాక్టీస్‌కు సిద్ధమైన ధావన్ చివర్లో తప్పుకున్నాడు. మొదట వికెట్ల మధ్య పరుగెత్తిన అతను.. కాసేపటికే అసౌకర్యంగా కనిపించాడు.

అదనపు స్పిన్నర్! సీనియర్ స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు తుది జట్టులో ఆడడం దాదాపు ఖాయం. అయితే చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను మూడోస్పిన్నర్‌గా జట్టులో చేర్చుతారా లేదా చూడాలి. రాబోయో ఇంగ్లాండ్ పర్యటనలో కచ్చితంగా ఆడతాడని భావిస్తున్న కుల్‌దీప్‌కు మ్యాచ్ ప్రాక్టీస్ కోసం అఫ్గాన్‌తో టెస్టులో ఆడడం అవసరం. చిన్నస్వామి పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశాలు ఉండడంతో పరిస్థితిని బట్టి కుల్‌దీప్ జట్టులోకి రావొచ్చు. వీరిలో పాటు ఇషాంత్‌శర్మ, ఉమేశ్ యాదవ్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పేస్ బౌలింగ్ బాధ్యతలు పంచుకోనున్నారు.

రషీద్.. రషీద్

రషీద్‌ఖాన్.. అంతర్జాతీయ క్రికెట్లో మార్మోగిపోతోంది ఈ పేరు. అఫ్గానిస్థాన్ ఈ స్థాయికి చేరడంలో ఈ యువ స్పిన్నర్ పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా ఇటీవల ఐపీఎల్‌లో రషీద్ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టేశాడు. ఈ నేపథ్యంలో అతనికి అసలు సవాల్ ఎదురు కానుంది. ఇన్నాళ్లు టీ20, వన్డేల్లో మాయ చేసిన రషీద్.. ఇప్పుడు టెస్టుల్లో తొలిసారి సత్తా చూపించే అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని అతనెలా ఉపయోగించుకుంటాడో చూడాలి. అతనితో పాటు ఆఫ్‌స్పిన్నర్ ముజీబ్ కూడా బ్యాట్స్‌మెన్‌ను బుట్టలో వేయగల సమర్థుడే. బౌలింగ్‌లో బలంగా ఉన్న అఫ్గాన్‌కు నిలకడలేని బ్యాటింగే పెద్ద బలహీనత. మరి టెస్టు మ్యాచ్‌లో భారత బౌలర్లను ఎదుర్కొని ఆ జట్టు బ్యాట్స్‌మెన్ ఎంతవరకు నిలుస్తారో చూడాలి. మహ్మద్ షెజాద్, మహ్మద్ నబి, అస్గర్ లాంటి బ్యాట్స్‌మెన్ నిలదొక్కుకుని ఆడాల్సి ఉంది.

వర్ష సూచన

చిన్నస్వామి స్టేడియంలో బుధవారం చిరుజల్లులు పడ్డాయి. గురువారం కూడా వర్షం కురిసే అవకాశాలు లేకపోలేదు. పిచ్‌పై పచ్చిక ఉన్నా.. మొత్తం మీద గోధుమ రంగులో కనిపిస్తోంది. ఆరంభంలో పిచ్‌పై తేమ బౌలర్లకు సాయపడొచ్చు.

జట్లు (అంచనా) **భారత్:** రహానె (కెప్టెన్), విజయ్/రాహుల్, ధావన్, పుజారా, నాయర్, దినేశ్ కార్తీక్, హార్దిక్ పాండ్య, అశ్విన్, జడేజా, ఇషాంత్, ఉమేశ్

అఫ్గానిస్థాన్: అస్గర్ స్తానిక్‌జాయ్ (కెప్టెన్), షెజాద్, జావెద్ అహ్మది, రహ్మత్‌షా, నాసిర్ జమాల్/షాహిది, మహ్మద్ నబి, అఫ్సర్ జజాయ్, రషీద్‌ఖాన్, అమీర్ హంజా/జహీర్‌ఖాన్, ఎమిన్ అహ్మద్‌జాయ్, వఫాదర్/ముజీబ్

అమెలియా 232 నాటౌట్

- ప్రపంచ రికార్డు తిరగరాసిన కివీస్ అమ్మాయి

డబ్లిన్: న్యూజిలాండ్ టీనేజర్ అమెలియా కేర్ (232 నాటౌట్; 145 బంతుల్లో 31×4, 2×6) బ్యాటింగ్‌లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. బుధవారం ఐర్లాండ్‌తో వన్డే మ్యాచ్‌లో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన 17 ఏళ్ల అమెలియా.. 21 ఏళ్ల నాటి బెలిండా క్లార్క్ (229, ఆస్ట్రేలియా, 1997లో) రికార్డును బద్దలు కొట్టింది. ఈ ఇన్నింగ్స్‌లో ఆమె 31 ఫోర్లతో పాటు 2 సిక్స్‌లు కొట్టింది. అమెలియా తో పాటు కాస్పెరిక్ (113) సెంచరీ చేయడంతో కివీస్ 50 ఓవర్లలో 3 వికెట్లకు 440 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇప్పటిదాకా 19 వన్డేలు ఆడిన ఈ ఆల్‌రౌండర్ అత్యధిక స్కోరు 81 పరుగులు మాత్రమే. బౌలింగ్‌లో ఆమె 31 వికెట్లు కూడా పడగొట్టింది.

షపవాలొవ్‌కు ప్రజ్నేశ్ షాక్

దిల్లీ: భారత యువ ఆటగాడు ప్రజ్నేశ్ గుణ్ణేశ్వరన్ సంచలన విజయం సాధించాడు. స్టుట్‌గార్ట్‌లో జరుగుతున్న ఏటీపీ మెర్సిడెస్ కప్‌లో అతను ప్రపంచ 23వ ర్యాంకర్ డెన్నిస్ షపవాలోవ్ (కెనడా)కు షాకిచ్చాడు. బుధవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రజ్నేశ్ 7-6 (6), 2-6, 6-3తో షపవాలోవ్‌ను ఓడించాడు. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో గెలిచి.. రెండో సెట్‌ను 2-6తో చేజార్చుకున్న ప్రజ్నేశ్.. మూడో సెట్లో విజృంభించాడు. రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిను అతను 6-3తో సెట్‌తో పాటు మ్యాచ్ గెలుచుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రజ్నేశ్ 365వ ర్యాంకులో ఉన్నాడు.

హ్యాడ్లీకి క్యాన్సర్

వెలింగ్టన్: న్యూజిలాండ్ దిగ్గజ ఫాస్ట్‌బౌలర్ రిచర్డ్ హ్యాడ్లీ క్యాన్సర్ బారిన పడ్డాడు. గత నెలలో హ్యాడ్లీ ఎప్పట్లాగే సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోగా.. అతడికి పేగు క్యాన్సర్ ఉందని తేలింది. తాజాగా హ్యాడ్లీకి వైద్యులు శస్త్రచికిత్స చేసి, క్యాన్సర్ కణితిని తొలగించారు. శస్త్రచికిత్స బాగా జరిగిందని.. తన భర్త బాగానే కోలుకుంటున్నాడని, మళ్లీ సంపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడని ఆశిస్తున్నట్లు హ్యాడ్లీ భార్య డయానె తెలిపింది. 66 ఏళ్ల హ్యాడ్లీకి త్వరలోనే కీమోథెరపీ కూడా నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించింది. 1973-90 మధ్య 86 టెస్టులాడిన 431 వికెట్లతో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. టెస్టుల్లో 400 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్ అతనే. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యంత గొప్ప ఫాస్ట్‌బౌలర్లలో ఒకడిగా హ్యాడ్లీకి పేరుంది.

ఇదో.. చరిత్రాత్మక సందర్భం

సౌరభ్ గంగూలీ

అఫ్గానిస్తాన్ క్రికెటర్లు ఇప్పటికే కొన్ని ఫార్మాట్లలో ఆడారు. ఇప్పుడు ఆడబోయేది మాత్రం క్రికెట్లో అత్యుత్తమమైన ఫార్మాట్. అఫ్గాన్‌లో ప్రతిభకు కొదవలేదు. రషీద్‌ఖాన్ ఇప్పటికే ప్రపంచ క్రికెట్లో చర్చనీయాంశమయ్యాడు. టెస్టులపైనా తమదైన ముద్ర వేసేందుకు అఫ్గాన్ ఆటగాళ్ళు సిద్ధంగా ఉన్నారు. అఫ్గాన్‌కు ఇదో చరిత్రాత్మక సందర్భం. అత్యుత్తమ జట్టుతో టెస్టుల్లో అరంగేట్రం చేస్తున్నందుకు ఆనందించాల్సిన సమయం. విరాట్ కోహ్లి లేకపోయినా టీమ్‌ఇండియా పటిష్ఠంగానే ఉంది. తమ నైపుణ్యాన్ని పరీక్షించుకునేందుకు అఫ్గాన్ ఆటగాళ్ళకు ఇదో అవకాశం. నేనే అఫ్గాన్ ఆటగాడినైతే దీన్నో అవకాశంగా తీసుకుంటా. ఒత్తిడి.. అవకాశానికి మధ్య స్పష్టమైన తేడా ఉంది. అఫ్గాన్ ఆటగాళ్ళు అవకాశంగా భావించి అత్యున్నత వేదికపై తమను తాము పరీక్షించుకోవాలి. ఏకైక టెస్టులో ముమ్మాటికీ టీమ్‌ఇండియానే ఫేవరెట్. ఐతే ఆతిథ్య జట్టును స్పిన్ ఆయుధంతో కట్టడి చేయాలని అఫ్గాన్ భావిస్తోంది. ఆ జట్టు అతిపెద్ద బలం నాణ్యమైన స్పిన్నే.

సమగ్ర నివేదిక రూపొందించండి

- 'నీతి ఆయోగ్' సమావేశం నేపథ్యంలో అధికారులకు చంద్రబాబు ఆదేశం
- విభజన హామీల అమలు తీరును ప్రస్తావించాలని సూచన
- కీలక అంశాలనూ జోడించాలని సలహా

ఈనాడు - అమరావతి

త్వరలో దిల్లీలో జరగనున్న నీతి ఆయోగ్ పాలక మండలి(గవర్నింగ్ కౌన్సిల్) సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రత్యేక హోదా సహా విభజన హామీల అమలు తీరు, 15వ ఆర్థిక సంఘం విధివిధానాలపై అభ్యంతరాలు, కేంద్ర పథకాల అమలుకు ఆ ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం తదితర అంశాలను పరిగణనలోకి దీన్ని రూపొందించాలని సూచించారు. అలాగే నాలుగేళ్లల్లో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, జీఎస్టీ అమలులో సమస్యలు, పెట్రో ధరల పెరుగుదల, రైతులకు గిట్టుబాటు ధర కల్పన తదితర అంశాలను కూడా నివేదికలో పొందుపరచాలని పేర్కొన్నారు.

నీతి ఆయోగ్ సమావేశంలో మాట్లాడాల్సిన అంశాలపై చర్చించేందుకు వెలగపూడి సచివాలయంలో బుధవారం చంద్రబాబు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీతి ఆయోగ్ సమావేశ అజెండాలోని అంశాల వారీగా దీన్ని సిద్ధం చేయాలన్నారు. వీటిపై మరింత చర్చించేందుకు గురు, శుక్రవారాల్లోనూ సమావేశం కావాలని నిర్ణయించారు. "వ్యవసాయ, అనుబంధ రంగాలకు, జల సంరక్షణ, నదుల అనుసంధానానికి నరేగా నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఎంత మేర వినియోగించుకుంది? ఇంకా కేంద్రం నుంచి ఎంత మేర రావాలి? తదితర అంశాలను నివేదికలో పొందుపరచాలి. మెరుగైన ఫలితాల సాధనకు నరేగా నిధులను ఎలా ఉపయోగించొచ్చనేదానిపైన అందులో ప్రస్తావించాలి. వ్యవసాయ రంగంలో రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడం, ఈ-నామ్, వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణలు, భూసార స్థితి కార్డులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి రాష్ట్రీయ స్వస్థ సురక్షా మిషన్, పోషణ్ మిషన్, మిషన్ ఇంద్రధనుష్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్న తీరు తెలియజేయాలి. మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాలకు రాష్ట్రంలో ఏం చేయొచ్చో, సూచనలివ్వాలి'' అని అధికారులను కోరారు. సమావేశంలో మంత్రులు యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావ్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, ముఖ్యమంత్రి కార్యదర్శులు ఏవీ రాజమౌళి, గిరిజా శంకర్, సీసీఎల్ఏ అనిల్‌చంద్ర పునేతా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ విభజన కారణంగా తలెత్తుతున్న సమస్యలపై మంత్రులు యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, అధికారులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నీతి ఆయోగ్ సమావేశాన్ని వాయిదా వేయండి

నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ నాలుగో సమావేశాన్ని వాయిదా వేయాలని కోరుతూ నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం లేఖ రాశారు. ఈ నెల 16న రంజాన్, 17న ఈద్ మిలాప్ పండుగల నేపథ్యంలో తన ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని లేఖలో కోరారు. "పైన పేర్కొన్న రెండూ పండుగలు ముస్లింలకు అతి ముఖ్యమైన పండగలు. ఆ రోజుల్లో రాజధాని అమరావతిలో నేను ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే ఈ నెల 18కి లేదా 17వ తేదీ మధ్యాహ్నానికి సమావేశాన్ని వాయిదా వేయాలి' ' అని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై సానుకూల సమాధానం ఆశిస్తున్నట్లు వివరించారు. అంతకు ముందు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోన్లో సంభాషించారు. అనంతరం లేఖ రాయాలని నిర్ణయించుకున్నారు.

నిర్మాణ ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన జెండాలు

ఎన్ఆర్‌టీ ఐకాన్ భవనానికి 22న శంకుస్థాపన

40 దేశాల జెండాలతో పెవిలియన్ ఏర్పాటు

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతిలోని పరిపాలనా నగరంలో ఐదెకరాల విస్తీర్ణంలో నిర్మించే 'ఎన్ఆర్‌టీ ఐకాన్ టవర్' నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 22న శంకుస్థాపన చేయనున్నారు. 33 అంతస్తుల ఈ టవర్‌ను ఏపీఎన్ఆర్‌టీ సంస్థ నిర్మిస్తోంది. పూర్తిగా ప్రవాసాంధ్రుల పెట్టుబడితో, వారి కోసమే నిర్మిస్తున్న టవర్ ఇది. రాయపూడి సమీపంలో నిర్మించే ఈ భవనం ముందు ఏపీఎన్ఆర్‌టీ సంస్థ 40 దేశాలకు చెందిన జాతీయ పతాకాలతో ఒక పెవిలియన్‌ను ఏర్పాటు చేసింది. ఈ పెవిలియన్ శాశ్వతంగా ఉంటుంది. 9 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పుతో 50 అడుగుల ఎత్తున ఏర్పాటు చేసిన జెండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ భవనం ఆకృతుల్ని కొరియాకు చెందిన స్పేస్ గ్రూప్ సంస్థ ఇప్పటికే రూపొందించింది. అమరావతిని ప్రతిబింబించేలా ఆంగ్ల అక్షరం 'ఎ' ఆకారంలో ఆకృతి ఉంటుంది. రెండు టవర్ల మధ్యలో ఏర్పాటు చేసిన గ్లోబ్‌లో రివాల్వింగ్ రెస్టారెంట్ ఉంటుంది. 120 దేశాల్లోని ప్రవాసాంధ్రుల ఉనికికి చిహ్నంగా గ్లోబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ఎన్ఆర్‌టీ అధ్యక్షుడు రవికుమార్ వేమూరు తెలిపారు. ఈ భవనంలో 8 లక్షల చ.అడుగుల నిర్మిత ప్రాంతం ఉంటుందని, 100 కంపెనీల ఏర్పాటుకు వీలుంటుందని వెల్లడించారు. 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

ఇనుప ఖనిజ నిల్వలపై అధ్యయనం

ఓబుళాపురంలోని కొత్త ప్రాంతాలపై జీఎస్ఐ దృష్టి

ఈనాడు, అనంతపురం: జిల్లా పరిధిలోని డి.హీరేహాళ్ మండలంలో ఉన్న ఓబుళాపురంలో మరిన్ని ఇనుప ఖనిజ నిక్షేపాలను కనుగొనేందుకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) రంగంలోకి దిగింది. ఓబుళాపురంలో 8 ఇనుప ఖనిజ లీజులు ఉండగా.. వీటిలో గాలి జనార్దన్‌రెడ్డి అక్రమ తవ్వకాల నేపథ్యంలో 6 లీజులను 2009లో గనులశాఖ రద్దు చేసింది. మిగిలిన రెండింటిలోనూ ప్రస్తుతం తవ్వకాలులేవు. ఈ లీజులు ఉన్న ప్రాంతమే కాకుండా, చుట్టుపక్కల మరిన్ని ఇనుప ఖనిజ నిల్వలు ఉన్నట్లు గతంలో ప్రాథమిక అంచనా వేశారు. ఈ నేపథ్యంలో సర్వే చేసేందుకు అధికారుల బృందం గత శుక్రవారం అనంతపురం జిల్లాకు వచ్చింది. రాష్ట్రంలో ప్రతిపాదిత కొత్త ఉక్కు కర్మాగారం కోసం ఇక్కడ ఇనుప ఖనిజం అందుబాటుపై కేంద్ర ప్రభుత్వం ఈ అధ్యయనం చేయిస్తోందని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రాథమిక పరిశీలన అనంతరం అటవీశాఖ అనుమతులు తీసుకొని డ్రిల్లింగ్ చేపట్టనున్నారు. తద్వారా భూగర్భంలో ఎంత మేర ఇనుప ఖనిజం ఉంది? దాని నాణ్యత? తదితర వివరాలు తెలుసుకోనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కొన్ని నెలలు పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

విజయసాయి, రమణదీక్షితులకు నోటీసులు

- పరువు నష్టం దావా ద్వారా న్యాయ పోరాటానికి తితిదే సన్నాహాలు

తిరుమల - న్యూస్‌టుడే

వైకాపా ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, తిరుమల శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు ఎ.వి.రమణదీక్షితులకు తితిదే బుధవారం నోటీసులు జారీచేసింది. దేవస్థానం పరువుప్రతిష్ఠలకు భంగం కలిగించేలా చేసిన వ్యాఖ్యలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొంది. దీనిపై 15 రోజుల వ్యవధిలో సంజాయిషీ ఇవ్వాలని కోరింది. గత నెల 15న చెన్నై వేదికగా రమణదీక్షితులు తితిదేతో పాటు ఏపీ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. అనంతరం విజయసాయిరెడ్డి విశాఖపట్నంలో ఓ సమావేశంలో మాట్లాడుతూ.. శ్రీవారి ఆలయ పోటులో తవ్వకాలు జరిగాయని, నేలమాళిగల్లో దాచిన సంపదను ముఖ్యమంత్రి నివాసంలో దాచారని ఆరోపించారు. చంద్రబాబు ఇంటిపై దాడులు నిర్వహిస్తే స్వర్ణాభరణాలు బయటపడతాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆలయ పవిత్రతకు, తితిదే ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందున ఈ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని ఇటీవలి సమావేశంలో ధర్మకర్తల మండలి తీర్మానించింది. వివిధ ఛానళ్లు, పత్రికలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని న్యాయ విభాగాన్ని ఆదేశించింది. అది రికార్డులను పరిశీలించగా రమణదీక్షితులు, విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి అర్హమైనవిగా భావించి. . నోటీసులు జారీచేసింది. తితిదే పూర్వపు ఈవో ఐవైఆర్ కృష్ణారావు వ్యాఖ్యల్ని పరిశీలించగా రమణదీక్షితులకు మద్దతుగా మాట్లాడడం మినహా భక్తుల మనోభావాలు దెబ్బతినేలా లేవనే అభిప్రాయానికి వచ్చింది. రమణదీక్షితులు, విజయసాయిరెడ్డిపై చట్టపరమైన చర్యలతో పాటు రూ.100 కోట్లు వంతున పరిహారం చెల్లించేలా దావా వేయాలని సంకల్పించింది. సంజాయిషీ ఇవ్వడానికి సమయం ఉన్నందున ఈనెల 26న జరిగే ధర్మకర్తల మండలి సమావేశంలోనూ కేసు విషయమై మరింత కఠినంగా చర్యలు తీసుకునేలా చర్చించాలని భావిస్తోంది.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన నూతన ప్రధాన అర్చకులు

శ్రీవారి ఆలయన నూతన ప్రధాన అర్చకులుగా నియమితులైన వేణుగోపాల దీక్షితులు, గోవిందరాజుల దీక్షితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఉద్యోగ విరమణ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు పూర్వపు ప్రధాన అర్చకులు రమణదీక్షితులు ప్రకటించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా వీరు న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. రమణదీక్షితులు పిటిషన్ దాఖలు చేసిన పక్షంలో తమను విచారించాలని కేవియెట్ పిటిషన్ వేశారు.

ఎలాంటి నోటీసులు అందలేదు: విజయసాయిరెడ్డి

తితిదే నుంచి తనకు ఎలాంటి నోటీసులు అందలేదని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడించారు. తితిదే న్యాయవ్యవస్థ (జ్యుడిషియల్ బాడీ) కానందున నోటీసులు ఇచ్చే అధికారంలేదన్నారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడారు. తితిదేలో జరిగిన అక్రమాల విషయంలో మంత్రి లోకేష్, సీఎం చంద్రబాబుపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో చంద్రబాబు నిర్దోషి అని తేలితే ఎంపీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. విశాఖ, దిల్లీలో మాట్లాడినపుడు 13 గంటల్లో స్పందించాలని చెబితే... 240 గంటల తర్వాత ముఖ్యమంత్రి స్పందించి తితిదే ద్వారా నోటీసులు జారీ చేయించారని విమర్శించారు. భాజపాతో మిత్రపక్షంగా ఉన్నన్నాళ్లూ చంద్రబాబుకు గుర్తుకురాని ఈవీఎం టాంపరింగ్ బయటికొచ్చాక గుర్తొచ్చిందాఅని ప్రశ్నించారు.

డైరెక్టర్ల ఎన్నికల ప్రకటన మోసపూరితం!

డీసీవో ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఏపీఎన్జీవో(గచ్చిబౌలి) మ్యూచివల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ హౌజింగ్ సొసైటీ లిమిటెడ్‌కు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, కార్యవర్గాన్ని ఎన్నుకొనేందుకు హైదరాబాద్ జిల్లా సహకార అధికారి(డీసీవో), సహకార సంఘాల సంయుక్త రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. మోసపూరితంగా ఎన్నికల ప్రకటన జారీ చేశారని ఘాటుగా వ్యాఖ్యానించింది. హౌజింగ్ సొసైటీకి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినప్పుడు తగినంత మంది సభ్యులు(కోరం) హాజరుకాకపోతే మరో రోజుకు సమావేశాన్ని వాయిదా వేయాల్సి ఉండగా.. గంటల వ్యవధిలోనే మళ్లీ సమావేశం నిర్వహించి తీర్మానాలు ఎలా చేస్తారని ప్రశ్నించింది. డైరెక్టర్‌ల ఎన్నికల కోసం డీసీవో ఈ ఏడాది మే 18, జూన్ 1న జారీచేసిన వేర్వేరు ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. పూర్తి వివరాలు సమర్పించేందుకు విచారణను గురువారానికి(నేడు) వాయిదా వేయాలని ప్రతివాదుల తరపు న్యాయవాదులు చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు బుధవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. అశోక్‌బాబు అధ్యక్షుడిగా ఉన్న ఏపీఎన్జీవో కోపరేటివ్ హౌజింగ్ సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ఎన్నికలు సక్రమంగా జరగలేదని కొంతమంది సొసైటీ సభ్యులు డీసీవోకు వినతి పత్రం సమర్పించారు. మే 31న హౌజింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించాలని డీసీవో.. మే 18న ఉత్తర్వులిచ్చారు. జూన్ 1న మరో ఉత్తర్వులిస్తూ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న కొంతమందితో తాత్కాలిక బోర్డు ఏర్పాటు చేసి.. డైరెక్టర్ల ఎన్నికల ప్రక్రియను 30 రోజుల్లో పూర్తిచేయాలని పేర్కొన్నారు. డీసీవో ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు, ఉపాధ్యక్షుడు బాపూజీ, డైరెక్టర్లు బుధవారం హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.

పెద్దలకు మనోవర్తిపై పరిమితి తొలగింపు

- కుటుంబ సభ్యుల నిర్వచనంలో కోడళ్లు, అల్లుళ్లు
- సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ ప్రతిపాదన
- నిరాదరణకు గురయ్యే పండుటాకులకు ఊరటనిచ్చే ప్రయత్నం

దిల్లీ: మలిసంధ్యలోని పండుటాకులు తమ బిడ్డల నుంచి ఆదరణ పొందలేని పరిస్థితిలో ఉన్నప్పుడు చట్టపరంగా చేయూతనిచ్చే దిశగా కేంద్ర సామాజిక న్యాయం-సాధికారత మంత్రిత్వ శాఖ కొన్ని ప్రతిపాదనలు చేస్తోంది. కుమారులు, కుమార్తెలే కాకుండా కోడలు, అల్లుడు, దత్తత తీసుకున్న పిల్లలు, సవతి పిల్లలు, చట్టపరమైన సంరక్షకులు ప్రతినిధులుగా ఉన్న మైనర్లు కూడా కుటుంబ సభ్యుల కిందికే వస్తారనేది దీనిలో ఒకటి. నెలవారీ మనోవర్తి చెల్లింపునకు ఉన్న రూ.10,000 పరిమితిని ఎత్తివేయాలనేది రెండోది. తల్లితండ్రుల, వారి పిల్లల ఆదాయం ప్రాతిపదికన ఈ మొత్తాన్ని నిర్ణయించాలని మంత్రిత్వశాఖ భావిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండింటిలోనూ 60 ఏళ్లు పైబడిన వారిని వయోవృద్ధులుగా నిర్వచించాలని మంత్రిత్వశాఖ ప్రతిపాదించింది. తల్లిదండ్రుల్ని పట్టించుకోనివారికి సంబంధిత చట్టం కింద విధించే మూడు నెలల కారాగార శిక్షను ఆరు నెలలకు పెంచాలని కూడా పేర్కొంది. బుధవారం 'జాతీయ వయోవృద్ధుల మండలి' సమావేశంలో ఈ సవరణల్ని చర్చించారు. రైల్వే, కార్మిక-ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధి, న్యాయ మంత్రిత్వశాఖలతో పాటు రాష్ట్రాల ప్రతినిధులు దీనిలో పాల్గొన్నారు. తరాల మధ్య అంతరాన్ని భర్తీ చేయడానికి వీలుగా పాఠశాల విద్య స్థాయిలో తప్పనిసరిగా కౌన్సెలింగ్‌ను చేర్చాలని మానవ వనరుల అభివృద్ధి శాఖకు ఈ సమావేశం సిఫార్సు చేసింది. సామాజిక న్యాయ శాఖ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్, భాజపా అగ్రనేత ఎల్.కె.ఆడ్వాణీలు అధ్యక్షత వహించారు.

నేడు ఛత్తీస్‌గఢ్‌లో ప్రధాని మోదీ పర్యటన!

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ఛత్తీస్‌గఢ్‌కు వెళతారు. అక్కడ జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఎన్నికలు జరగాల్సి ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో రెండునెలల వ్యవధిలో ఆయన పర్యటనకు రావడం ఇది రెండోసారి. ఆధునికీకరించిన భిలాయ్ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేస్తారు. ఐఐటీ-భిలాయ్‌కి శాశ్వత ప్రాంగణం, భవనాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తారు. గురువారం రాత్రికే ఆయన తిరిగి దిల్లీకి బైలుదేరుతారు. ఈ నెల 24వ తేదీన ప్రసారం కావలసి ఉన్న 'మన్ కీ బాత్' కోసం ఆలోచనలు, సూచనలను పంపాల్సిందిగా ప్రధాని మోదీ బుధవారం ప్రజలను కోరారు.

నేడు గోవాకు వస్తున్న పారికర్

పనాజీ: వైద్యచికిత్స నిమిత్తం అమెరికా వెళ్లిన గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ గురువారం తిరిగి వచ్చేస్తున్నారు. ఆయన అమెరికా నుంచి నేరుగా ముంబయి వస్తారు. అక్కడి నుంచి బైలుదేరి గురువారం గోవా చేరుకుంటారని సీనియర్ అధికారి ఒకరు బుధవారం వెల్లడించారు. మార్చి నుంచీ ఆయన క్లోమగ్రంధి సంబంధ అనారోగ్యానికి అమెరికాలో చికిత్స పొందారు.

సల్మాన్‌కు భద్రత పెంపు!

ముంబయి: బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు బుధవారం నగర పోలీసులు భద్రతను మరింత పెంచారు. ఆయన ఇంటివద్ద సాయుధ పోలీసు భద్రతను పెంచడంతో పాటూ వ్యక్తిగతంగా అంగరక్షకులనూ నియమించారు. ఆయన ప్రాణాలకు ప్రమాదం ఉన్నట్లు హరియాణా పోలీసు 'స్పెషల్ టాస్క్ ఫోర్స్' హెచ్చరించిన దరిమిలా ఈ చర్యను చేపట్టారు. కృష్ణజింకల కేసులో సల్మాన్ ఖాన్ జోక్యం ఆరోపణల నేపథ్యంలో రాజస్థాన్‌కు చెందిన కరడుగట్టిన ముఠా నాయకుడు లారెన్స్ బిష్ణోయి నుంచి ముప్పు వాటిల్ల వచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

భాజపా సభ్యత్వ నమోదును అనుకరిస్తున్న ప్రతిపక్షాలు!

- అమిత్ షా వ్యాఖ్య

దిల్లీ: కొత్త సభ్యులను నమోదు చేసుకుని... వారికి శిక్షణ నిచ్చేందుకు తమ పార్టీ చేపట్టిన కార్యక్రమంపై భాజపా అధ్యక్షుడు అమిత్ షా బుధవారం ప్రశంసలు కురిపించారు. భాజపాను చూసి...ఇప్పుడు కొన్ని ప్రతిపక్షాలూ ఇదే పద్ధతిని అనుకరిస్తున్నాయని అమిత్ షా వ్యాఖ్యానించారు. పార్టీ కార్యకర్తలనుద్దేశించి ఆయన బుధవారం నాడిక్కడ ప్రసంగించారు. శిక్షణకు సంబంధించిన వివరాలు, మార్గదర్శకాలతో కూడిన చిన్న పుస్తకాలను ఆయన విడుదల చేశారు.

'సులభ్' పాఠక్‌కు ప్రతిష్ఠాత్మక జపాన్ పురస్కారం

టోక్యో: ప్రముఖ భారత సామాజిక సేవకుడు, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'నిక్కీ ఏసియా ప్రైజ్'ను బుధవారం ప్రదానం చేశారు. ప్రతిష్ఠాత్మకంగా పరిగణించే ఈ జపాన్ అవార్డును అందుకున్న అనంతరం పాఠక్ మాట్లాడుతూ.....దీనిని సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

అగ్నిప్రమాదానికి గురైన నౌక

- సహాయక చర్యలు మొదలుపెట్టిన నావికా దళం

కోచి: కేరళ తీరంలో ఓ వాణిజ్య నౌక బుధవారం అగ్ని ప్రమాదానికి గురైంది. దీనిలో ప్రయాణిస్తున్న 22 మందిని కాపాడేందుకు నావికా దళం సహాయక చర్యలను మొదలుపెట్టింది. "ఎంవీ నళిని"గా పిలుస్తున్న ఈ నౌకకు కోచికి వాయువ్య దిశగా 14.5 నాటికల్ మైళ్ల దూరంలో లంగరువేశారు. అగ్నిప్రమాదం కారణంగా విద్యుత్ సరఫరాతోపాటు చోదక శక్తి వ్యవస్థా దెబ్బతింది. దీంతో సిబ్బందిని కాపాడాలంటూ రక్షణ బలగాలకు అత్యవసర సందేశం అందింది.

ఓ శునకం రోడ్డుపై నిద్రిస్తుండగా గమనించకుండా తారు రోడ్డు వేయడంతో అది మరణించింది. ఆగ్రాలో ఈ దారుణం చోటు చేసుకుందంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియో చక్కర్లు కొడుతోంది. రోడ్డు వేసిన యంత్రాంగంపై జంతుప్రేమికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు

ఆనకట్టల భద్రత బిల్లుకు ఆమోదం

- జాతీయ కమిటీ ఏర్పాటుకు వీలు
- ఆనకట్టల భద్రతకు నిబంధనలు, మార్గదర్శకాల రూపకల్పన బాధ్యత ఈ కమిటీదే
- రాష్ట్రాల స్థాయిలోనూ కమిటీల ఏర్పాటు
- కేంద్ర మంత్రి వర్గం నిర్ణయాలు

దిల్లీ

ఆనకట్టల భద్రత బిల్లు-2018కు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. జలాశయాల భద్రతకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఏకీకృత ప్రక్రియను అవలంబించడానికి ఈ బిల్లు ఉపకరిస్తుంది. ఆనకట్టల భద్రత జాతీయ కమిటీ ఏర్పాటుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఆనకట్టల భద్రతకు అనుసరించాల్సిన విధానాలను, నిబంధనలను ఈ కమిటీ సిఫార్సు చేస్తుందని ఆర్థిక మంత్రి

పీయూష్ గోయెల్ విలేకర్లతో చెప్పారు. దేశంలో దాదాపు 5,200 పెద్ద ఆనకట్టలున్నాయి. 450 నిర్మాణంలో ఉన్నాయి. వీటికి తోడు మధ్యస్థాయి, చిన్న ఆనకట్టలు వేల సంఖ్యలో ఉన్నాయి. వీటన్నింటి భద్రతకు చట్టపరమైన, వ్యవస్థాగతమైన ఏర్పాట్లు లేకపోవడం ఆందోళనకరంగా ఉంది.

ఈ బిల్లు చట్టరూపం దాల్చిన తర్వాత ఏర్పాటయ్యే జాతీయ కమిటీ.. నియంత్రణ సంస్థగా వ్యవహరిస్తుంది. ఆనకట్టల భద్రతకు తగిన మార్గదర్శకాలు, ప్రమాణాలను రూపొందిస్తుంది. ఒక రాష్ట్రానికి చెందిన ఆనకట్ట మరో రాష్ట్రానికి చెందిన ప్రాంతంలో ఉంటే అంతర్రాష్ట్ర విభేదాలు తలెత్తకుండా చూస్తుంది.

వ్యవసాయ రంగంలో ఉన్నత విద్యాభివృద్ధికి రూ.2,225 కోట్లతో నిధి: వ్యవసాయరంగంలో ఉన్నత విద్యాభివృద్ధికి ఉద్దేశించిన రూ.2,225.46 కోట్ల నిధికి ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ బృందం (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఈ నిధులను 2010 వరకు ఉపయోగించుకోవచ్చు. ప్రతిభావంతులైన విద్యార్థులన ఆకర్షించడానికి, నైపుణ్యవంతులైన మానవ వనరుల అభివృద్ధికి, బోధకుల కొరతను అధిగమించడానికి, నవ్యావిష్కరణలను ప్రోత్సహించడానికి ఈ పథకాన్ని ఉద్దేశించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది.

ఓబీసీ కమిషన్ గడువు పెంపు: కేంద్ర జాబితాలోని ఓబీసీల ఉపవర్గీకరణ అంశాన్ని పరిశీలిస్తున్న కమిషన్ గడువు పెంపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇదే తుది పెంపు కానుంది. ప్రస్తుతం ఈ కమిషన్ పదవీకాలం ఈ నెల 20 వరకే ఉండగా జులై 31 వరకు పెంచడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఈశాన్య రాష్ట్రాల మండలి అధ్యక్షుడిగా కేంద్ర హోం మంత్రి: ఈశాన్య రాష్ట్రాల మండలికి ఇక నుంచి కేంద్ర హోం మంత్రి అధ్యక్షత వహిస్తారు. ఇప్పటి వరకు ఈ మండలికి ఈశాన్యప్రాంతాభివృద్ధి మంత్రి అధ్యక్షత వహిస్తున్నారు. ఇక నుంచి ఈ మంత్రి ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.

ప్రాధాన్య పథకాలపై కేంద్ర మంత్రి మండలి సమీక్ష

దిల్లీ: ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్య పథకాల పురోగతిని ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రిమండలి బుధవారం సమీక్షించింది. లబ్ధిదారుల ఫిర్యాదులను త్వరతగతిన పరిష్కరించాలని అభిప్రాయపడింది. ముద్ర యోజన, జన్‌ధన్ యోజన, ఉజ్వల యోజన, డిజిటల్ ఇండియా, గ్రామ్ స్వరాజ్ అభియాన్ తదితర పథకాల గురించి మంత్రి మండలి సమీక్షించింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం చేపట్టే వివిధ పథకాల గురించి అవగాహన కలిగించాలని ప్రధాని సూచించినట్లు తెలిసింది.

విశ్వవిద్యాలయాల్లో ఆచార్య పోస్టులకు పీహెచ్‌డీ తప్పనిసరి

- 2021–22 విద్యా సంవత్సరం నుంచి అమలు: కేంద్ర మంత్రి జావడేకర్ వెల్లడి

దిల్లీ: విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల నియామకానికి ఇక నుంచి పీహెచ్‌డీ పట్టా ఉన్నవారే అర్హులని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి ఇది అమలులోకి వస్తుందన్నారు. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) రూపొందించిన నూతన నిబంధనలను బుధవారమిక్కడ మంత్రి వెల్లడించారు. వర్సిటీల్లో సహాయ ఆచార్యులుగా చేరడానికి ఇప్పటివరకూ మాస్టర్ డిగ్రీతో పాటు పీహెచ్‌డీ లేదా జాతీయ అర్హత పరీక్ష (నెట్)లో యోగ్యమైన మార్కులు సాధించి ఉంటే సరిపోయేది. ఇకపై ఈ పోస్టులకు పీహెచ్‌డీ ఉన్నవారు మాత్రమే అర్హులని జావడేకర్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 500 అగ్రశ్రేణి వర్సిటీల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి కూడా ఇక నుంచి భారతీయ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

కళాశాలల్లో నియామకాలకు వర్తించదు: నేరుగా కళాశాల అధ్యాపకులుగా చేరగోరే వారికి మాత్రం మాస్టర్ డిగ్రీతో పాటు పీహెచ్‌డీ లేదా నెట్ అర్హత ఉంటే సరిపోతుందని సీనియర్ అధికారులు తెలిపారు.

విద్యా ప్రతిభా సూచీ (ఏపీఐ)కి వెల్లు

కళాశాల అధ్యాపకులు తప్పనిసరిగా పరిశోధన చేపట్టాలన్న నిబంధనను తొలగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. తద్వారా వారు బోధనపై మరింత దృష్టి పెట్టే అవకాశముంటుందన్నారు. కొత్తగా నియమితులయ్యే కళాశాల, విశ్వవిద్యాలయాల బోధకులకు నెల రోజుల ప్రవేశిక శిక్షణ (ఇండక్షన్ ప్రోగ్రాం) ఇక తప్పనిసరిగా ఉంటుందని ఆయన తెలిపారు.

పాకిస్థాన్ దళాల కాల్పుల్లో మరణించిన జవాన్ల పార్థివదేహాలకు జమ్ములో నివాళి అర్పిస్తున్న సహచరులు. అంతరచిత్రంలో.. అసువులు బాసిన జవాన్లు జితేంద్రసింగ్, రజనీశ్‌కుమార్, రాంనివాస్, హన్స్‌రాజ్

పాక్ కాల్పులకు నలుగురు జవాన్లు బలి

జమ్ము: కాల్పుల విరమణను ఉల్లంఘించి పాకిస్థాన్.. మరో నలుగురు భారత జవాన్లను పొట్టనపెట్టుకుంది. జమ్ము కశ్మీర్‌లోని సాంబా జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి మంగళవారం రాత్రి పాక్ రేంజర్లు జరిపిన కాల్పుల్లో.. బీఎస్ఎఫ్ (సరిహద్దు భద్రత దళం)కు చెందిన నలుగురు సిబ్బంది అమరులైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో అసిస్టెంట్ కమాండెంట్ హోదా అధికారి కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. మరో ముగ్గురు సిబ్బంది గాయపడ్డట్లు వెల్లడించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తూచా తప్పకుండా అమలుచేయాలని మే 29న భారత్, పాక్‌ల డైరెక్టర్ జనరల్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎమ్ఓ)ల మధ్య అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. దీన్ని తాము గౌరవించినప్పటికీ.. పాకిస్థాన్ మాత్రం ఉల్లంఘించిందని బీఎస్ఎఫ్ వెస్టర్న్ కమాండ్ ఏడీజీ కేఎన్ చౌబే వ్యాఖ్యానించారు. రామ్‌గఢ్ సెక్టార్‌లో రక్షణ సామగ్రితో తమ దళానికి చెందిన ఓ బృందం వెళ్తున్నప్పుడు.. పాక్ కాల్పులకు తెగబడిందని, మోర్టార్లతో విరుచుకుపడిందని పేర్కొన్నారు. గాయపడ్డ జవాన్లను తరలించేందుకు అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్‌సింగ్ నేతృత్వంలోని మరో బృందం రాగా.. పాక్ ప్రయోగించిన మరో మోర్టార్ పేలిందని చెప్పారు. పాక్ ద్రోహానికి తగిన రీతిలో స్పందించడం తమ పని అని ఆయన వ్యాఖ్యానించారు. తాజా ఘటనతో కలిపి.. ఈ ఏడాది పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘనల వల్ల మృతిచెందినవారి సంఖ్య 51కు చేరింది. వీరిలో 25 మంది భద్రత సిబ్బంది ఉన్నారు. తాజా ఘటనల నేపథ్యంలో జమ్ములో కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు పాక్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి.

'మహాకూటమి'ని ప్రజలు కోరుకుంటున్నారు

- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

ముంబయి: ప్రధాని మోదీ, భాజపా, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ 'మహాకూటమి'గా ఏర్పడాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. రాజ్యాంగాన్నీ, దేశ వ్యవస్థలపై మోదీ, భాజపాలు దాడులు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. వీటికి చరమగీతం పాడే గొంతులను ఏకంచేసే పనిలో కాంగ్రెస్ నిమగ్నమైందన్నారు. రెండు రోజుల మహారాష్ట్ర పర్యటనలో ఉన్న ఆయన- బుధవారం మీడియాతో మాట్లాడారు. పెట్రోలు, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి, వాటి ధరలను తగ్గించాలని ప్రధాని మోదీని ప్రతిపక్షాలు అడుగుతూనే ఉన్నాయి. కానీ, సామాన్యుడికి మేలు చేయాలన్న ఆసక్తి ఆయనకు లేదన్నారు.

ఆ డబ్బులన్నీ ఎక్కడికి పోతున్నాయి?: యూపీఏ పాలనలో బ్యారెల్ ముడిచమురు ధర 130 డాలర్లు ఉన్నా, ప్రజలకు తక్కువకే పెట్రోలు, డీజిల్ అందించాం. ఇప్పుడు బ్యారెల్ ముడిచమురు 70 డాలర్లకే వస్తోంది. కానీ, ప్రజలకు ఆ ప్రయోజనం అందించకుండా, వారిపై పెట్రో భారాన్ని అంతకంతకూ పెంచుకుపోతున్నారు. ఈ డబ్బులన్నీ 15-20 మంది కోటీశ్వరుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి" అని ఆయన అన్నారు. మంగళవారం సాయంత్రం బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో రాహుల్ మాట్లాడారు.

దాదాజీ ఖోబ్రాగడే నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

వరి వంగడాల సృష్టికర్త దాదాజీ కుటుంబానికి క్షమాపణలు: పర్యటనలో భాగంగా విదర్భ ప్రాంతంలోని చంద్రాపూర్ జిల్లా నాందేడ్‌కు రాహుల్‌గాంధీ విచ్చేశారు. హెచ్ఎంటీ రకానికి చెందిన 11 వరి వంగడాలను సృష్టించిన దివంగత రైతు-పరిశోధకుడు దాదాజీ ఖోబ్రాగడే కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కృషిని జాతి నిర్లక్ష్యం చేసిందనీ, చివరి రోజుల్లో పేదరికంతో ఆయన చనిపోవడం బాధాకరమని రాహుల్ విచారం వ్యక్తం చేశారు. ఇందుకు దాదాజీ కుటుంబ సభ్యులకు క్షమాపణలు చెప్పారు. తర్వాత వారితో ఆయన కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాడారు. దాదాజీ సృష్టించిన వంగడాలకు పేటెంట్ హక్కులు పొందే విషయాన్ని చూడాలని రాహుల్ తన సిబ్బందిని ఆదేశించారు.

జ్ఞానం వంశపారంపర్యంగా రాదు

- రాహుల్‌గాంధీపై జైట్లీ చెణుకులు

దిల్లీ: బుద్ధి, జ్ఞానం వంశపారంపర్యంగా సిద్ధించవనీ, వాటిని సొంతంగా ఆర్జించాల్సి ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి కేంద్రం మంత్రి అరుణ్ జైట్లీ పరిహాసమాడారు. మోదీ వ్యతిరేక మనస్థితిలో పడి కాంగ్రెస్ సిద్ధాంతరహిత పార్టీగా మారిపోయిందని పేర్కొన్నారు. బుధవారం ఆయన తన ఫేస్‌బుక్ ఖాతాలో ఈ వ్యాఖ్యలను టపా (పోస్ట్) చేశారు. కార్పొరేట్ దిగ్గజాలకు రూ.2.5 లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేశారంటూ రాహుల్ సంధించిన విమర్శలనూ జైట్లీ తిప్పికొట్టారు. 2008-14 మధ్య 15 మంది ఎగవేతదారులకు యూపీఏ సర్కారు బ్యాంకుల నుంచి భారీగా రుణాలిచ్చిందని ఆయన పేర్కొన్నారు. "బ్యాంకు ప్రక్రియలపై ఓ జాతీయ పార్టీ అధ్యక్షునికి కనీస అవగాహన లేకపోతే... మొత్తం ఆ పార్టీకీ, దేశానికి కష్టమే. రాజకీయ హోదా అన్నది వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. కానీ, జ్ఞానం మాత్రం ఎవరికి వారే ఆర్జించుకోవాలి" అని జైట్లీ ఫేస్‌బుక్‌లో వ్యాఖ్యానించారు.

దిల్లీ ఎల్జీ కార్యాలయంలో కొనసాగుతున్న కేజ్రీవాల్ బృందం ధర్నా

దిల్లీ: తమ ప్రభుత్వ డిమాండ్ల సాధనకు... దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కార్యాలయంలో సీఎం కేజ్రీవాల్ బృందం చేపట్టిన ధర్నా బుధవారం మూడోరోజుకు చేరింది. ఐఏఎస్‌లను పావుగా వాడుకుని, తమ ప్రభుత్వంపై వ్యతిరేకతను సృష్టించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందంటూ కేజ్రీవాల్ తాజాగా ట్వీట్ చేశారు. దిల్లీ అభివృద్ధిలో ఆటంకాలను తొలగించేందుకే ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. మరోవైపు- ఆప్ శాసనసభ్యులతో పాటు వేలాదిమంది కార్యకర్తలు కేజ్రీ నివాసం నుంచి ఎల్జీ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ కేంద్రమంత్రి, భాజపా మాజీ సీనియర్ నేత యశ్వంత్ సిన్హా ర్యాలీలో పాల్గొన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యేందర్ జైన్ ఇప్పటికే ఎల్జీ కార్యాలయంలో ఆమరణ దీక్ష కొనసాగిస్తున్నారు. ఆయనకు మద్దతుగా ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా కూడా బుధవారం నిరశన చేపట్టారు.



సరిహద్దుల రక్షణలో మోదీ ప్రభుత్వం విఫలమైంది: కాంగ్రెస్

దిల్లీ: నాలుగేళ్లుగా దేశ సరిహద్దులను రక్షించడంలో మోదీ ప్రభుత్వం విఫలమవుతూనే ఉందని కాంగ్రెస్ విమర్శించింది. పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో నలుగురు బీఎస్ఎఫ్ జవాన్లు మృతిచెందడంపై విచారం వ్యక్తం చేసింది. ఆ పార్టీ నేత ప్రమోద్ తివారీ ఈ మేరకు స్పందించారు. సరిహద్దుల రక్షణలో కేంద్రం బలహీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

CA

బిజినెస్ వార్తలు, ఆర్థిక సందేహాల నివృత్తికై
సిరి
www.eenadusiri.net

ఈనాడు

రియల్ ఎస్టేట్ రియల్ వివరాలకై
ఈనాడు స్థిరాస్తి
ప్రతి శనివారం
www.eenadu.net

విజయవాడ 15-6-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 306
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

నాగవైష్ణవి (పాత చిత్రం)

నాగవైష్ణవి హత్య కేసులో

ముగ్గురికి జీవిత ఖైదు

- తీర్పు వెలువరించిన మహిళా సెషన్స్ కోర్టు
- ఎనిమిదేళ్లపాటు సాగిన విచారణ
- అప్పీలు చేసుకునేందుకు నిందితులకు అవకాశం ఇచ్చిన న్యాయమూర్తి
- తీర్పుపై హతురాలి బంధువులు హర్షం

ఈనాడు - అమరావతి, విజయవాడ న్యాయవిభాగం-న్యూస్‌టుడే

రాష్ట్రంలో ఎనిమిదేళ్ల క్రితం తీవ్ర సంచలనం సృష్టించిన నాగవైష్ణవి అపహరణ, హత్యకేసులో తుది తీర్పు వెలువడింది. సుదీర్ఘకాలం పాటు విచారణ సాగిన ఈ కేసులో నిందితులు ముగ్గురికి గురువారం విజయవాడలోని మహిళా సెషన్స్ న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ తీర్పుపై నిందితులు ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకునే అవకాశం కల్పించింది. నాగవైష్ణవి అపహరణ, హత్య అతి నీచమైన, హేయమైన చర్యగా కేసులో తీర్పు వెలువరించిన న్యాయమూర్తి బబిత పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పుపై నాగవైష్ణవి బంధువులు విద్యార్థి, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

కోర్టుకు హాజరవుతున్న నిందితులు ఎంపరాల జగదీష్, మోర్ల శ్రీనివాసరావు, పందిరి వెంకట్రావు

నిందితులకు శిక్షలు ఇలా...

కేసులో ప్రధాన నిందితుడు మోర్ల శ్రీనివాసరావు(ఏ-1)కు జీవితఖైదు, రూ. 4,500ల జరిమానా, జగదీష్(ఏ-2)కు (మిగతా 2లో)

రష్యా అదరహో

- తొలి పోరులో సౌదీపై ఘనవిజయం
- ఆరంభమైన ఫుట్‌బాల్ ప్రపంచకప్

ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఆరంభోత్సవ సమయాన రష్యా పేరు మార్మోగిపోయింది. ఆరంభ వేడుకల్ని ఘనంగా నిర్వహించడమే కాదు.. తొలి మ్యాచ్‌లో అంచనాల్ని మించి రాణిస్తూ భారీ విజయాన్నందుకుంది రష్యా. గురువారం రాత్రి మాస్కోలోని లిజ్నికి స్టేడియంలో అర గంట పాటు సాగిన ఆరంభ వేడుకలు ఆకట్టుకున్నాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రపంచకప్ ఆరంభమైనట్లు ప్రకటించిన కొన్ని నిమిషాల తర్వాత.. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుతో సౌదీ అరేబియా తలపడి 5-0తో భారీ విజయం సాధించింది. - వివరాలు ఛాంపియన్‌లో

ఆర్టీసీ కార్మికులకు 16 శాతం మధ్యంతర భృతి!

- పదవీ విరమణ వయోపరిమితి పెంపు లేనట్లే
- ఆర్టీసీ అధికారులతో సమీక్షించిన మంత్రి అచ్చెన్న

ఈనాడు, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికులకు 16 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని యాజమాన్యం యోచిస్తోంది. వెలగపూడి సచివాలయంలో రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో గురువారం సంస్థ ఎండీ సురేంద్రబాబు, ఇతర అధికారులు సమావేశమై చర్చించారు. ఆర్టీసీ నియమించిన వేతన సవరణ కమిటీ సూచించిన పలు సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఈ మేరకు ఐఆర్ ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబుతో దీనిపై చర్చించిన అనంతరం (మిగతా 2లో)

కొల్లేరులో 'మినహాయింపు'

- 20,600 ఎకరాలను డీనోటిపై చేయించేందుకు చర్యలు
- ముఖ్యమంత్రి ఆదేశం

ఈనాడు - అమరావతి

కొల్లేరు వన్యప్రాణి అభయారణ్య ప్రాంతం నుంచి 20,600 ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములను మినహాయించేందుకు అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డుకు చెందిన స్థాయీ సంఘం ఇప్పటికే ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో తదనుగుణంగా కొత్త సరిహద్దులను గుర్తించనుంది. అభయారణ్య ప్రాంతం నుంచి మినహాయించాల్సిన భూములను డీనోటిపై చేయించే ప్రక్రియను ప్రారంభించనుంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం కొల్లేరుపై జరిగిన సమీక్షా (మిగతా 2లో)


కొల్లేరుపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు భూముల వివరాలను తెలియజేస్తున్న అధికారి

సేవా రంగం దయనీయం

- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావిస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- పెట్రోలు, డీజిల్ ధరలపై నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- 17నే నీతి ఆయోగ్ సమావేశం
- చంద్రబాబు విజ్ఞప్తికి అంగీకారం
- కడప ఉక్కుపై కేంద్రానికి లేఖ రాయనున్న సీఎం 15లో

జీఎం వెలుగు 'దివ్య'

అమెరికా దిగ్గజ కంపెనీ తొలి మహిళా సీఎఫ్‌ఓగా తెలుగు మహిళ

- వివరాలు బిజినెస్ పేజీలో

ఉక్కు ఉద్యమ జ్వాల

- కడప జిల్లాలో పరిశ్రమ సాధ్యంకాదన్న కేంద్ర నిర్ణయంతో అసంతృప్తి
- పోరుబాట పట్టిన అఖిలపక్ష నాయకులు, సంఘాలు
- కడప నగరంలో భాజపా నేతల ఇళ్ల ముట్టడి
- నిరసనకారులను అరెస్టుచేసిన పోలీసులు

ఈనాడు - కడప

కడపలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెదేపా నాయకులు

ఉక్కు ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. కేంద్ర ప్రభుత్వం నమ్మించి నయవంచన చేయడాన్ని పార్టీల నేతలు, కార్మిక సంఘాలు, కడప ప్రజానీకం జీర్ణించుకోలేకపోతున్నారు. అఖిలపక్ష నేతల ఆధ్వర్యంలో గురువారం కడప జిల్లాలో నిరసన కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. ఎక్కడికక్కడ రోడ్డెక్కిన ఉద్యమకారులు కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరసనలకు దిగారు. కడప నగరంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) నేతల ఆధ్వర్యంలో భాజపా నాయకుల ఇళ్ల ముట్టడి కార్యక్రమం జరిగింది. భాజపా నేత కందుల రాజమోహన్‌రెడ్డి ఇంటి ముట్టడికి ఆర్‌సీపీ నాయకులు ప్రయత్నించగా.. పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేశారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో సీపీఐ, సీపీఎం పార్టీల నేతలు ప్రధాని మోదీ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. కోటిరెడ్డి కూడలిలో విద్యార్థి సంఘాల నేతలు మానవహారం జరిపగా.. ఉద్యమకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అధికారపార్టీకి చెందిన తెదేపా నాయకులు కళాక్షేత్రం నుంచి పొట్టిశ్రీరాముల విగ్రహం వరకు ర్యాలీ జరిపి ఆందోళన నిర్వహించారు. వైకాపా నాయకులు అంబేడ్కర్ కూడలి వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తప్పుబట్టారు. మైదుకూరులో ఉద్యమం ఉద్ధృతంగా సాగింది. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. నాలుగు రోడ్ల కూడలిలో ధర్నా చేపట్టారు. జమ్మలమడుగు పట్టణంలో స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ తులసమ్మ ఆధ్వర్యంలో (మిగతా 2లో)

కశ్మీర్‌లో హక్కుల ఉల్లంఘన

- ఐరాస నివేదిక
- ఘాటుగా తిప్పికొట్టిన భారత్
- అన్నీ అవాస్తవాలు.. ప్రేరేపిత అంశాలే..
- ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు

జెనీవా/ దిల్లీ: కశ్మీర్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ.. ఐక్యరాజ్య సమితి నివేదిక విడుదల చేయడంతో భారత్ ఘాటుగా స్పందించింది. ఐరాస గురువారం విడుదల చేసిన ఈ నివేదికలో అక్కడి పరిస్థితులపై అంతర్జాతీయ విచారణకు కూడా డిమాండ్ చేసింది. ఐరాసతో తీవ్రంగా విభేదించిన భారత్- అది 'అవాస్తవమైన.. వివాదాస్పద.. ప్రేరేపిత..' నివేదికగా పేర్కొంది. విశ్వసనీయతను దిగజార్చుకునేలా.. ఐరాస వ్యక్తిగత దురుద్దేశాలను ఆపాదిస్తోందంటూ మండిపడింది. "నివేదిక భారత సార్వభౌమాధికారాన్ని,ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉంది. జమ్మూ-కశ్మీర్ రాష్ట్రం మొత్తం భారత్‌లో అంతర్భాగం. భారత రాష్ట్రంలోని ఓ ప్రాంతంపై పాకిస్థాన్ అక్రమంగా, బలవంతంగా దురాక్రమణకు పాల్పడింది.." అని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. 'జమ్మూ-కశ్మీర్ (కశ్మీర్ లోయ, జమ్మూ, లద్దాఖ్ ప్రాంతాలు), పాక్-పరిపాలనలోని (మిగతా 2లో)

జల నిర్వహణలో జయకేతనం

- ఏపీకి మూడో స్థానం... తెలంగాణకు 8
- అగ్రస్థానంలో గుజరాత్
- నీతి ఆయోగ్ వెల్లడి

5లో

శ్రీనగర్‌లో పత్రికా సంపాదకుడి హత్య

- కాల్చి చంపిన దుండగులు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రముఖులు

అత్తాకోడళ్లను నిర్బంధించి

భారీ చోరీ

రూ.78లక్షల నగదు, 40 సవర్ల బంగారం దోపిడీ

గుంటూరు జిల్లా పెనుమాక గ్రామంలో పట్ట పగలే సినీ పక్కీలో భారీ చోరీ జరిగింది. ముగ్గురు గుర్తుతెలియని దుండగులు ఇంట్లో ఉన్న అత్తాకోడళ్లను తాళ్లతో నిర్బంధించి రూ. 78 లక్షల నగదు, 40 సవర్ల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బీరువాలో మరో బ్యాగులో ఉన్న రూ. 68లక్షల నగదును దుండగులు గుర్తించకపోవడం బాధితులకు కాస్త ఊరట.

- పూర్తి వివరాలు 6లో

ఇదీ సంగతి!



అనుమతులు లేకుండా మేం ప్రాజెక్టు కట్టుకోలేదు సార్. వరదలకు మీవైపు నుంచి కొట్టుకొచ్చింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ కటాఫ్ భారీగా తగ్గింపు

- జనరల్ కేటగిరీలో 35 నుంచి 25 శాతానికి కుదింపు
- జోసా కౌన్సెలింగ్‌కు అర్హుల సంఖ్య 18,138 నుంచి 31,988కి పెంపు
- నేటి నుంచి ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: జాతీయ స్థాయి సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాల నిమిత్తం ఐఐటీ-కాన్పూర్ నిర్వహించిన 'సంయుక్త ప్రవేశ పరీక్ష (జేఈఈ) అడ్వాన్స్‌డ్'లో ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల సందర్భంగా ప్రకటించిన కటాఫ్ మార్కులను గణనీయంగా తగ్గించింది. దీంతో ఐఐటీల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ మేరకు విస్తృత ప్రతిభావంతుల జాబితా (ఎక్స్‌టెండెడ్ మెరిట్ లిస్ట్)ను ఐఐటీల సంయుక్త ప్రవేశాల మండలి (జేఏబీ) గురువారం విడుదల చేసింది. దీని ప్రకారం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన వారి సంఖ్య 31,988 మందికి (మిగతా 2లో)

అమెరికాలో తెలుగు నిర్మాత

వ్యభిచార దందా!

- వర్ధమాన తెలుగు నటీమణులకు అవకాశాల ఎర చూపి వ్యాపారం
- సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలే వేదికలు
- మోదుగుమూడి కిషన్, చంద్ర దంపతుల అరెస్టు
- అభియోగపత్రం దాఖలు చేసిన ఫెడరల్ పోలీసులు

షికాగో: అమెరికాలో భారీ సెక్స్‌రాకెట్ నడిపిస్తున్న ఇద్దరు తెలుగు దంపతులను అక్కడి ఫెడరల్ పోలీసులు అరెస్టు చేశారు. మోదుగుమూడి కిషన్ (34) అనే వ్యాపారవేత్త తెలుగు చలనచిత్రాలను కూడా నిర్మిస్తుంటాడు. పలు సినిమాలకు అతను ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించాడు. అతను తన భార్య చంద్ర (31)తో కలిసి వర్ధమాన నటీమణులకు అవకాశాల ఎర చూపి వ్యభిచారంలోకి దింపుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. ఈ ఇద్దరినీ ఏప్రిల్ చివరి వారంలోనే అరెస్టు చేసినా బుధవారమే స్థానిక మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. షికాగోలోని డిస్ట్రిక్ట్ కోర్టులో పోలీసులు 42 పేజీల అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన వర్ధమాన నటీమణులకు అవకాశాల ఎర చూపి వీరిద్దరూ పెద్దస్థాయి వ్యభిచార వ్యాపారం మొదలుపెట్టారు. భారత్‌కు చెందిన సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారితో వ్యభిచారం గురించి ప్రచారం చేసుకునేవారు. విటుల వద్ద నుంచి తడవకు దాదాపు రూ. 2లక్షలు వసూలు చేసేవారు.

తాత్కాలిక వీసాలపై వచ్చిన కనీసం ఐదుగురు వర్ధమాన నటీమణులను షికాగోలోని బెల్‌మోంట్ క్రాగిన్ నైబర్‌హుడ్‌లోని రెండంతస్తుల అపార్ట్‌మెంట్‌లో తదుపరి 'డేట్' కోసం కొన్నిసార్లు బలవంతంగా ఉంచినట్లు అభియోగపత్రంలో పోలీసులు ఆరోపించారు. డాలస్, న్యూజెర్సీ, వాషింగ్టన్‌లో సదస్సులు నిర్వహించే హోటళ్లలోనూ వారు వ్యభిచారం నడిపినట్లు పోలీసులు (మిగతా 2లో)



ఈ వారమంతా ఎండలే

రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం సాధారణంకన్నా 1 నుంచి 3 డిగ్రీలు అదనంగా నమోదవుతున్నాయి. వారం రోజులపాటు ఈ పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావం రాయలసీమలో బాగా బలహీనమవడం, కోస్తాంధ్రలోనూ పెద్దగా లేకపోవటంతో వర్షాలు బాగా తగ్గుముఖం పట్టాయి.

- వివరాలు 2లో

హత్య జరగడానికి 9 రోజులు ముందు వైష్ణవి జన్మదిన వేడుకలో తండ్రి ప్రభాకరరావు, తల్లి నర్మదాదేవి (ఫైల్‌ఫొటో)

ముగ్గురికి జీవిత ఖైదు

(మొదటి పేజీ తరువాయి)

జీవితఖైదు, రూ.4,500ల జరిమానా, పంది వెంకటరావు అలియాస్ కృష్ణ(ఏ-3)కు జీవిత ఖైదు, రూ. 4 వేలు జరిమానాను విధించారు. ముగ్గురు నిందితులపై కారు డ్రైవర్ హత్య, నేరపూరిత కుట్ర, నాగవైష్ణవి హత్య, సాక్ష్యాల తారుమారు, కారు దొంగిలించడం, దానిని వినియోగించడం తదితర నేరారోపణలు రుజువు కావడంతో అన్నింట్లో వివిధ రకాల జైలు శిక్షలతోబాటు జీవితఖైదునూ విధిస్తూ..వాటన్నింటిని నిందితులకు ఏకకాలంలో అమలు చేయాలని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక ఏపీపీ బ్రహ్మానందరెడ్డి వాదనలను వినిపించారు. మొత్తం 80 మంది సాక్షులను, డిఫెన్స్ తరపున 30 మందిని విచారించారు. మహిళా సెషన్స్ కోర్టు తీర్పుపై హైకోర్టుకు వెళ్తామని నిందితుల తరపు న్యాయవాదులు విలేకరులకు తెలిపారు.

ఇదీ కేసు.. విజయవాడ నగరానికి చెందిన పలగాని ప్రభాకరరావు తన మేనకోడలు వెంకటరామమ్మను పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఆరుగురు మగపిల్లలు అంగవైకల్యంతో పుట్టి... ఏడాదిలోపే చనిపోతున్నారు. దీనికి మేనరికమే కారణమని వైద్యులు తెలిపారు. దీంతో నిజామాబాద్‌కు చెందిన నర్మదాదేవిని రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె నాగవైష్ణవి పుట్టారు. నాగవైష్ణవి జన్మించిన తర్వాత ప్రభాకరరావు వ్యాపారం బాగా వృద్ధి చెందింది. దీంతో ఆయన ఆ చిన్నారిపై మమకారం పెంచుకున్నాడు. ఇది మొదటి భార్య కుటుంబంలో విభేదాలు సృష్టించింది. ఆమె సోదరుడు పంది వెంకటరావు బావ ప్రభాకరరావుపై కక్ష పెంచుకున్నాడు. ఆస్తి అంతా రెండో భార్య, పిల్లల పేరున పెడతారని అనుమానించారు. నాగవైష్ణవిని చంపితే కానీ అక్క కాపురం బాగుపడదని భావించాడు. ఇందులో భాగంగా హత్యకు కుట్ర పన్నాడు. దీనికి తన బంధువైన మోర్ల శ్రీనివాసరావుతో రూ. 50 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. శ్రీనివాసరావు.. తన వద్ద పనిచేసే యంపర్ల జగదీష్ సాయం తీసుకున్నాడు. పథకంలో భాగంగా 2010, జనవరిలో పలుమార్లు రెక్కీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో జనవరి 30న ఉదయం 8 గంటల సమయంలో ఇంటి నుంచి సోదరుడు తేజేష్ గౌడ్‌తో కలసి నాగవైష్ణవి కారులో బయలుదేరింది. ఇది గమనించిన శ్రీనివాసరావు, జగదీష్ రైల్వేకాలనీ వద్ద వీరి కారుపై వెనుక నుంచి రాళ్లతో దాడి చేశారు. దీంతో డ్రైవర్ లక్ష్మణరావు కారు దిగి పరిశీలిస్తుండగా నిందితులు అతడిని కత్తులతో పొడిచారు. ఇది చూసిన తేజేష్ గౌడ్ కారు నుంచి దూకి పారిపోయి విషయాన్ని తన తల్లికి ఫోన్‌లో తెలిపాడు. కత్తిపోట్లకు గురైన డ్రైవర్‌ను స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. మరోపక్క నిందితులు నాగవైష్ణవిని అపహరించి, గుంటూరు వైపు వెళ్లారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో మరో కారులోకి మారారు. చిన్నారి కేకలు వేస్తుండడంతో వీరు ఆమె నోరు గట్టిగా నొక్కారు. దీంతో నాగవైష్ణవి కారులోనే చనిపోయింది. అనంతరం వారు ఓ ప్లాస్టిక్ డ్రమ్ము కొని అందులో శవాన్ని వేసి.. గుంటూరు శివారు ఆటోనగర్‌లోని వెంకటరావుకు చెందిన శారదా ఇండస్ట్రీస్‌కు తీసుకెళ్లారు. అక్కడ విద్యుత్తు కొలిమిలో డ్రమ్మును వేసి అధిక ఉష్ణోగ్రతలో బూడిద చేశారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సత్యనారాయణపురం పోలీసులు సెల్‌టవర్ పరిధిలో వారి ఫోన్ కాల్స్ వివరాలను పరిశీలించగా.. ప్రభాకరరావు బావమరిది వెంకటరావు పాత్ర; విచారణలో కుట్ర వెలుగులోకి వచ్చాయి. నిందితులు ఇచ్చిన సమాచారంతో కొలిమిలో బూడిదను, ఎముకలను పోలీసులు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. అలాగే బాలిక అభరణాల్లోని వజ్రం దొరికింది. ఈ ఆధారాలను బట్టి కేసును ఛేదించారు. తన కుమార్తె హత్య విషయం తెలిసిన ప్రభాకరరావు గుండెపోటుతో మరణించారు. విచారణ కాలంలో నాగవైష్ణవి తల్లి, బాబాయి కూడా మరణించడం ఈ కేసులో అత్యంత విషాదకరం.

నేటి నుంచి సూరజ్‌కుండ్‌లో భాజపా, ఆరెస్సెస్ అగ్రనేతల చర్చలు

దిల్లీ: హరియాణాలోని సూరజ్‌కుండ్‌లో భాజపా, ఆరెస్సెస్ అగ్రనేతలు శుక్ర, శని వారాల్లో చర్చలు జరుపనున్నారు. కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలూ సమీపిస్తుండటంతో.. ఈ సమావేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వీటిలో తొలిరోజు ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి సురేశ్ భయ్యాజీ జోషి ప్రసంగించనున్నారు. రెండో రోజు కార్యక్రమాలకు భాజపా అధ్యక్షుడు అమిత్ షా హాజరయ్యే అవకాశముంది. రాష్ట్ర భాజపా నాయకులు, కీలక సంఘ్ ప్రచారక్‌లూ ఈ సమావేశాల్లో పాల్గొంటారు. ఆరెస్సెస్ అనుబంధ సంఘాల నేతలూ వీటికి హాజరుకానున్నారు. ఇవి వార్షిక సమావేశాల్లో భాగమేనని, ఇతర సంస్థలతో సమన్వయం, వ్యూహ రచనపై వీటిలో చర్చలు జరుపుతామని ఆరెస్సెస్ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికలపై మంతనాలు జరిపేఅవకాశముందని సంకేతాలిచ్చాయి.

గచ్చిబౌలిలో హౌసింగ్ బోర్డు స్థలానికి రెట్టింపు ధర

- వేలంలో 348 గజాలను రూ3.7 కోట్లకు విక్రయం

నాంపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ గృహ నిర్మాణ మండలి ఓ స్థలం వేలంలో అత్యధిక బిడ్ సాధించింది. ప్రభుత్వ ధరకు దాదాపు రెట్టింపు స్థాయిలో స్థలం విక్రయం కావడం విశేషం. తెలంగాణ గృహనిర్మాణ మండలి గచ్చిబౌలిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఖాళీగా ఉన్న ఓపెన్ ప్లాట్ 348.33 చదరపు గజాల స్థలానికి గురువారం వేలం నిర్వహించింది. మండలి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేలంలో ఈ ప్లాట్‌కు ప్రభుత్వ ధర చదరపు గజానికి రూ.55వేలుగా నిర్ణయించగా, వేలంలో పాల్గొన్న అయిదుగురు బిల్డర్లు పోటీపడ్డారు. గజం స్థలానికి అత్యధికంగా రూ.1,06,000 ధర ఇవ్వజూపిన బిల్డరు చివరకు ఆ స్థలాన్ని దక్కించుకున్నారు. హౌసింగ్ బోర్డు చరిత్రలోనే ఈ ప్రాంతంలో వేలంలో గజం స్థలానికి ఇంత పెద్ద ధర తొలి సారిగా వచ్చిందని, తద్వారా బోర్డుకు రూ.3.70 కోట్ల ఆదాయం సమకూరిందని భూసేకరణ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్టేట్ అధికారిణి విమల తెలిపారు.

యూజీసీ ఏడో పీఆర్‌సీ పేస్కేళ్లు వర్తింపజేయాలి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 11 వేల మంది లెక్చరర్లు, సహాయ, అసోసియేట్ ఆచార్యులకు కేంద్ర ఏడో వేతన సవరణ కమిషన్ పేస్కేళ్లను వెంటనే వర్తింపజేయాలని అధ్యాపక సంఘాలు గురువారం ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు.

జాతీయ అవార్డులకు ఎన్‌సీఈఆర్‌టీ దరఖాస్తుల ఆహ్వానం: విద్యలో వినూత్న విధానాలు, ప్రయోగాలకు శ్రీకారం చుట్టే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు, డైట్ లెక్చరర్లు, శిక్షణసంస్థల నుంచి జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ(ఎన్‌సీఈఆర్‌టీ) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం 60 అవార్డుల్ని(40 పాఠశాల ఉపాధ్యాయులకు, 20 ఉపాధ్యాయ శిక్షకులకు) అందజేయనున్నారు.

కశ్మీర్‌లో హక్కుల ఉల్లంఘన

(మొదటి పేజీ తరువాయి)

కశ్మీర్ (ఆజాద్ జమ్మూ, కశ్మీర్; గిల్‌గిత్-బాల్టిస్థాన్)లలో మానవ హక్కుల పరిస్థితి' అని పేర్కొంటూ ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం 49 పేజీల నివేదికను విడుదల చేసింది. ఇలాంటి నివేదిక విడుదల చేయడం ఇదే తొలిసారి. ఇందులో ఐరాస 'ఆజాద్ జమ్మూ, కశ్మీర్; గిల్‌గిత్-బాల్టిస్థాన్' అని ప్రస్తావించడాన్ని భారత్ ఆక్షేపించింది. భారత ప్రాదేశిక భాగాన్ని తప్పుగా వివరించడం ఆమోదయోగ్యం కాదని, ఇది హానికరమని.. తప్పుదోవ పట్టించడమేనని ఖండించింది. ఉగ్రవాదమే అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన కాగా నివేదిక రచయితలు పాక్‌లోనూ, ఆ దేశ దురాక్రమిత ప్రాంతాల్లోనూ పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడింది. ఉగ్రవాద ముఠాలను 'సైనిక బృందాలు'గాను, ఉగ్రవాదులను నాయకులుగాను ఐరాస పేర్కొందని ఆక్షేపించింది. జమ్మూ-కశ్మీర్ సహా భారత్‌లోని ప్రతి పౌరుడికీ రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛను కాపాడాలనే పట్టించుకోలేదంటూ నిరసన వ్యక్తం చేసింది.

ఐరాస నివేదికలో.. "భారత రాష్ట్రమైన జమ్మూ-కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలకు తగిన శిక్షలు లేకపోవడం.. తగిన న్యాయం కొరవడటం ప్రధాన సవాళ్లు. సైనిక దళాల (జమ్మూ-కశ్మీర్) ప్రత్యేక అధికారాల చట్టం-1990, జమ్మూ-కశ్మీర్ ప్రజా భద్రత చట్టం-1978 (పీఎస్ఏ) వంటివి సాధారణ న్యాయ పరిస్థితులకు ఆటంకం కలిగిస్తున్నాయి. జవాబుదారీతనం లేకపోవడం, బాధితులు పరిహారం పొందే హక్కు ప్రమాదంలో పడటం వంటివి మానవ హక్కుల ఉల్లంఘనే. కశ్మీర్‌లో తగిన శిక్షలులేకపోవడంతో నేరం చేసిన వాళ్లు తప్పించుకు తిరుగుతున్నారు." అని ఐరాస నివేదికలో పేర్కొంది. 2016 నుంచి భద్రత దళాలు హద్దులు దాటి ప్రవర్తించిన సంఘటనలు, ఆందోళనలు, కశ్మీర్‌లోని పరిస్థితులను నివేదికలో ప్రస్తావిస్తూ సూచనలు చేసింది. అలాగే 'పాక్-పాలనలోని కశ్మీర్'లో అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాల నిబంధనలను పూర్తిగా పాటించాలని ఐరాస పాక్‌కు కూడా సూచించింది. ఉగ్రవాద నిరోధక చట్టాన్ని దుర్వినియోగపరచవద్దని, అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలకు అనుగుణంగా దీనికి సవరణలు చేయాలని పాక్‌కు తెలిపింది.

ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు.. ఐరాస నివేదికను ప్రభుత్వం గట్టిగా తిప్పికొట్టడాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సమర్థించింది. జమ్మూ-కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా.. ఎలాంటి అవగాహన లేకుండా ఐరాస నివేదిక రూపొందించిందని కాంగ్రెస్ సమాచార ఇన్‌ఛార్జి రణదీప్ సూర్జేవాలా మండిపడ్డారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నేతలు అహ్మద్ పటేల్, రాజీవ్ శుక్లాలు ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించారు. కాగా అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందాలకు లోబడి భారత్, పాక్‌లు తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా సూచించింది.

'ఐరాస'కు పాక్ వంతపాట..

ఇస్లామాబాద్: ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ జమ్మూ-కశ్మీర్‌కు సంబంధించి రాజకీయ పరిష్కారానికి సరైన సూచనలే చేసిందని పాక్ విదేశీ కార్యాలయం పేర్కొంది. తగిన చర్చలు అవసరమని సూచించిందంటూ.. పాక్ తనదైన శైలిలో స్పందించింది. దక్షిణాసియాలో శాంతి, భద్రతలు, స్థిరత్వానికి జమ్మూ-కశ్మీర్ వివాద పరిష్కారం తప్పనిసరిగా పేర్కొంటూ ముడిపెట్టింది. ఈ కీలకాంశాన్ని భారత్ ఖండిస్తూ వస్తోందని.. చర్చల ప్రక్రియకు అయిష్టత చూపుతోందంటూ భారత్‌పై ఆరోపణలకు దిగింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ కటాఫ్ భారీగా తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

పెరిగింది. ఈ నెల 10న అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడించినప్పుడు పేర్కొన్న కటాఫ్ మార్కుల ప్రకారం 18,138 మంది మాత్రమే జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) ఆధ్వర్యంలో జరిగే కౌన్సెలింగ్‌కు అర్హులయ్యారు. ఓపెన్ కేటగిరీ విద్యార్థులకు 360కు 126 మార్కులు కటాఫ్‌గా ఉండేవి. దేశవ్యాప్తంగా 23 ఐఐటీల్లో 11,279 సీట్లు ఉండగా 18,138 మందిని మాత్రమే కౌన్సెలింగ్ ద్వారా పోటీ పడేందుకు అవకాశం కల్పించారు. అంటే ఒక్కో సీటుకు 1.6 మంది విద్యార్థులు పోటీపడతారు. దీని వల్ల కొన్ని సామాజిక కేటగిరీల్లో అర్హులు లేక సీట్లు ఖాళీగా ఉండి పోతాయన్న అభిప్రాయాలు వెలువడ్డాయి.

తాజా అర్హత మార్కులు ఇవీ..

విభాగం	మార్కులు
జనరల్	90
ఓబీసీ	81
ఎస్సీ	45
ఎస్టీ	45
జనరల్ దివ్యాంగ	45
ఓబీసీ దివ్యాంగ	45
ఎస్సీ దివ్యాంగ	45
ఎస్టీ దివ్యాంగ	45
ప్రిపరేటరీ విభాగం	23

విభాగాల వారీగా కౌన్సెలింగ్‌కు అర్హుల సంఖ్య

విభాగం	సంఖ్య
జనరల్	17597
జనరల్ దివ్యాంగ	159
ఓబీసీ-ఎన్‌సీఎల్	6,900
ఓబీసీ దివ్యాంగులు	64
ఎస్సీ	5,471
ఎస్సీ దివ్యాంగ	9
ఎస్టీ	1,786
ఎస్టీ దివ్యాంగ	2
మొత్తం	31,988

జేఏబీ అత్యవసర సమావేశం

ఐఐటీలో ప్రతి కేటగిరీలో ఒక్కో సీటుకు కనీసం ఇద్దరు అర్హులు పోటీపడేలా మార్చేందుకు కేంద్ర మానవ వనరుల శాఖ సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో ఐఐటీ కాన్పూర్ అధికారులు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంయుక్త ప్రవేశాల మండలి(జేఏబీ) అత్యవసర సమావేశం నిర్వహించారు. కటాఫ్ మార్కులు తగ్గించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం ఓపెన్ కేటగిరీకి 25 శాతం మార్కులు, ఓబీసీకి 22.5 శాతం, ఎస్సీలు, ఎస్టీలు, అన్ని కేటగిరీల్లో దివ్యాంగులకు 12.5 శాతం కనీస మార్కులకు తగ్గించారు. కొన్ని కేటగిరీల్లో సీట్ల సంఖ్యకు తగినంత మంది లేనందున వారికి ఒక ఏడాది ప్రిపరేటరీ కోర్సు నడుపుతారు. ఆ తర్వాత వారిని బీటెక్‌లో చేర్చుకుంటారు. వారికి మాత్రం 6.25 శాతం మార్కులే నిర్ణయించారు. అంటే మొత్తం 360కి 23 మార్కులు వస్తే చాలు. తాజా మార్పుల వల్ల గతంలో కేటాయించిన ర్యాంకులపై ప్రభావం పడదని, కొత్తగా కొందరు అభ్యర్థులు కలుస్తారని ప్రకటించారు. తగ్గిన కటాఫ్ మార్కులు, విభాగాల వారీగా కౌన్సెలింగ్‌కు అర్హుల సంఖ్యను ప్రకటించారు. ఫలితాలు ప్రకటించిన తర్వాత కటాఫ్ మార్కులు తగ్గించడం ఇదే తొలిసారని నిపుణులు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది.

ఐఐటీ కమ్యూనిటీ వినతి మేరకే

"అన్ని ఐఐటీ బ్రాంచీల్లో, సామాజికవర్గాల వారీగా సీట్లన్నీ భర్తీ అయ్యేలా చూడాలని ఐఐటీ కమ్యూనిటీ నుంచి వినతులు అందాయి. అందుకే ఒక సీటుకు ఇద్దరు అభ్యర్థుల చొప్పున ఉండేలా 'విస్తృత ప్రతిభావంతుల జాబితా'ను విడుదల చేయాలని జేఈఈ-అడ్వాన్స్‌డ్‌ను నిర్వహించిన ఐఐటీ-కాన్పూర్‌ను ఆదేశించా."

– ప్రకాశ్ జావడేకర్, కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి

అమెరికాలో తెలుగు నిర్మాత వ్యభిచార దందా!

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని, విషయం బయటకు పొక్కితే ప్రాణాలు మిగలవని ఒక నటిని, ఆమె కుటుంబాన్ని కిషన్ బెదిరించినట్లు అభియోగపత్రంలో ఆరోపించారు. ''నువ్వొక మామూలు నటివి. నీ గురించి ఎవరికీ తెలియదు. నీకు హాని కలిగించినా నాకేమీ అవదు.'' అని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు.

కిషన్ భార్య చంద్ర.. వ్యభిచార వ్యాపారానికి సంబంధించి పూర్తి వివరాలను పుస్తకాల్లో నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎక్కడెక్కడ ఎవరితో వ్యభిచారం చేయించిందీ, ఎంత వసూలయిందీ తదితర వివరాలన్నీ నమోదు చేసింది. వెస్ట్ బెల్డెన్ అవెన్యూలోని 5700 బ్లాక్‌లో ఈ దంపతులుండే అపార్ట్‌మెంట్‌ను ఫిబ్రవరిలో సోదా చేయగా ఈ పుస్తకాలు బయటపడ్డాయి. 70కిపైగా కండోమ్‌లూ అక్కడ దొరికాయి.

ఆ తర్వాత పోలీసులు కిషన్ ఈమెయిల్ ఖాతాల సోదాకు వారెంట్ తీసుకుని పరిశీలించారు. అందులో ఒక బాధితురాలు డిసెంబరులో రాసిన లేఖ ఒకటి ఉంది. తనను వేధించవద్దని, బెదిరించవద్దని ఆ ఈమెయిల్‌లో ప్రాధేయపడింది. విటులతో బేరసారాలకు సంబంధించిన సందేశాలను చంద్ర ఫోన్ నుంచి పోలీసులు సేకరించారు. ఏ అమ్మాయి అందుబాటులో ఉంది? ఎవరి ధర ఎంత? వంటి వివరాలన్నీ వాటిల్లో ఉన్నాయి. అందుబాటులో ఉన్న నటీమణుల ఫొటోలను కూడా చంద్ర పంపించేది. వ్యభిచారం జరిగినట్లు నిర్ధారించిన సందేశాలూ ఈ ఫోన్‌లో బయటపడ్డాయి. కొద్ది నెలల క్రితమే పోలీసులు కేసు నమోదు చేసినా కిషన్ దంపతులు పరారీలో ఉన్నారు. చివరకు ఏప్రిల్‌లో అరెస్టు చేశారు. అప్పటి నుంచి వాషింగ్టన్ డీసీ శివారులో ఫెడరల్ కస్టడీలో ఉన్నారు. ఈ దంపతులకు పాఠశాలకు వెళ్లే ఇద్దరు పిల్లలున్నారు. ఈ పిల్లలిద్దరినీ వర్జీనియాలోని పిల్లల సంక్షేమ అధికారుల కస్టడీలో ఉంచారు.

ఆర్టీసీ కార్మికులకు మధ్యంతర భృతి!

(మొదటి పేజీ తరువాయి)

తుది ప్రకటన చేయాలని భావిస్తున్నారు. కార్మికుల పదవీ విరమణ వయో పరిమితిని 58 నుంచి 60 ఏళ్లకు పెంచే ప్రతిపాదనను సమావేశంలో తిరస్కరించారు. దీన్ని అమలు చేస్తే ఆర్టీసీపై రూ.600 కోట్ల మేర అదనపు భారం పడనున్న నేపథ్యంలో వద్దనుకున్నారు. మరోవైపు విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ఎండీ సురేంద్రబాబు ఈడీలు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదాయార్జన లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను నిర్దేశించారు.

వేతన సవరణ అమలు చేయాలి: ఆర్టీసీ కార్మికులకు తక్షణమే వేతన సవరణ అమలు చేయాలని ఎన్ఎంయూ ప్రతినిధులు డిమాండు చేశారు. రవాణా శాఖా మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్యలకు వినతిపత్రం సమర్పించినట్లు ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. వేతన సవరణ గడువు ముగిసి 15 నెలలు పూర్తయినప్పటికీ అమలు చేయకపోవడం పట్ల కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పల్లె వెలుగు బస్సులపై వచ్చే నష్టాలను ప్రభుత్వం భరించాలని, డీజిల్‌పై పన్నులు మినహాయించాలని, ఆర్టీసీ నష్టాలు తగ్గేవరకూ మోటారు వాహనాల పన్ను విరామాన్ని ఇవ్వాలని కోరినట్లు వివరించారు.

వడివడిగా జాతీయ రహదారుల నిర్మాణం

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశం

ఈనాడు, దిల్లీ: జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), జాతీయ రహదారుల మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌హెచ్ఐడీసీఎల్) పరిధిలో దేశవ్యాప్తంగా నిర్మిస్తున్న రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల పురోగతిపై గురువారం సమీక్షించిన ఆయన పలు లక్ష్యాలను అధికారుల ముందుంచారు. ప్రస్తుతం నిర్మాణం, అభివృద్ధిలో ఉన్న 300 జాతీయ రహదారుల పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ 2019, మార్చి నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకోవాలని స్పష్టంచేశారు. వీటిలో ఏపీలో 22, తెలంగాణలో 16 రహదారులున్నాయి. రూ.వంద కోట్లపైగా వ్యయ అంచనాలతో పనులు సాగుతున్న రహదారులు ఆంధ్రప్రదేశ్‌లో 18, తెలంగాణలో 16 ఉన్నాయి. జాతీయ రహదారుల పనులకు భూ సేకరణ, చెట్ల తొలగింపు, నిర్మాణాల తరలింపు, పర్యావరణ అనుమతులు ఆటంకాలుగా మారాయని.. వీటిని అధిగమించడంలో ఏపీ, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు బాగా సహకరిస్తున్నాయని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రాజెక్టుల వారీగా వ్యయ అంచనాలు, పూర్తి చేయాల్సిన గడువు తేదీల వివరాలు.. www.eenadu.net లో చూడొచ్చు.

ఉక్కు ఉద్యమ జ్వాల

(మొదటి పేజీ తరువాయి)

ర్యాలీ జరిగింది. సాయంత్రం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. రాజంపేటలో సీపీఎం నాయకులు.. చెవిలో పువ్వులు, పండ్లు పెట్టుకుని కేంద్రం నమ్మించి మోసం చేసిందంటూ నినదించారు. తీరని అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. బద్వేలు, పోరుమామిళ్లలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో ఉక్కు పోరాటం జరిగింది. పట్టణంలో నిరసన ర్యాలీ అనంతరం శివాలయం కూడలిలో మానవహారం చేపట్టారు. సీపీఎం ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మకు శవయాత్ర జరిపారు. పులివెందులలో మాజీ శాసనసమండలి ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి తదితరుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. పులివెందుల తెదేపా కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులు పూలంగళ్లకూడలికి చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌ను నమ్మించి గొంతు కోసిందని సతీష్‌రెడ్డి దుయ్యబట్టారు.

కడపలో వామపక్ష నాయకులు, కార్యకర్తల రాస్తారోకో

రైల్వేకోడూరులో స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలు జరిగాయి. సీఐటీయూ నాయకులు టోల్‌గేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో జరిపారు. మొత్తంగా కడపలో గురువారం నాటి ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది.

కొల్లేరులో 'మినహాయింపు'

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. సరస్సులో మూడో కాంటూరు నుంచి అయిదో కాంటూరు వరకూ ఉన్న 20,600 ఎకరాల డీ పట్టా, జిరాయితీ భూములను మినహాయించగా మిగిలిన 58 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సరస్సును కాపాడేందుకు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కొల్లేరు సరస్సు మేనేజ్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా జిరాయితీ, డీ పట్టా భూములు కలిగిన యజమానులకు ఒకే ప్రాంతంలో భూములు ఉండేలా చూడాలన్నారు.

సీఎం ఇంకా ఏమన్నారంటే!

- కొల్లేరు ఎప్పుడూ నీటితో సమృద్ధిగా ఉండాలి. పట్టిసీమ నుంచి గోదావరి జలాలను తరలించాలి. కొల్లేరుకు నీటిని తరలించే కాలువలు, అంతర్గత మురుగు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరిచి ఆధునికీకరించాలి. కొట్టాడ దగ్గర తక్షణం రెగ్యులేటర్ నిర్మించాలి. చిన్న గొల్లపాలెం వద్ద తలపెట్టిన రెగ్యులేటర్‌పై అధ్యయనాన్ని త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించాలి.
- ఇకపై ప్రతి 15 రోజులకోసారి కొల్లేరుపై సమీక్షిస్తా. కొల్లేరు అభివృద్ధికి ప్రత్యేక వాహక సంస్థ ఏర్పాటుతో పాటు పనుల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా ఆర్డీవోను నియమించాలి.
- పర్యాటకాభివృద్ధికి రహదారి మార్గాలను పటిష్ఠపరిచి.. శాశ్వత ప్రాతిపదికన బృహత్ ప్రణాళిక రూపొందించాలి. అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలి.
- సమీక్ష అనంతరం కొల్లేరు రైతులు ముఖ్యమంత్రిని కలిసి ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రుణం తీర్చుకుంటామన్నారు.

గ్రహం అనుగ్రహం

15–6–2018 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
విదియ: రా. 9-22 తదుపరి తదియ
ఆర్ద్ర నక్షత్రం: మ. 2-28 తదుపరి పునర్వసు
అమృత ఘడియలు: ఉ. 6-36 వరకు
వర్జ్యం: రా. 1-39 నుంచి 3-08 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-05 నుంచి 8-58 వరకు
తిరిగి మ. 12-26 నుంచి 1-18 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-29; సూర్యాస్తమయం: సా.6-31
చంద్రదర్శనం, బుద్ధజయంతి

కడప ఉక్కు.. న్యాయమైన ఆకాంక్ష

- జగన్ వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: కడపలో ఉక్కు పరిశ్రమ అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల న్యాయమైన ఆకాంక్ష అని వైకాపా అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయడమనేది ఆంధ్రప్రదేశ్ సంక్షేమం పట్ల కేంద్రం చిత్తశుద్ధినే ప్రశ్నార్థకం చేస్తోందని వ్యాఖ్యానించారు. ఈ విషయం తెదేపాకు ముందే తెలుసని, కానీ ఇప్పుడు అవకాశవాదంతో ఆందోళన వ్యక్తం చేస్తోందని విమర్శించారు. కేంద్రం ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని గురువారం చేసిన ట్వీట్‌లో జగన్ పేర్కొన్నారు.

ఈ వారమంతా ఎండలే

- 1–3 డిగ్రీలు అదనంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- సముద్రంమీదుగా అల్పపీడన ద్రోణి

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా 1 నుంచి 3 డిగ్రీలు అదనంగా నమోదవుతున్నాయి. వారం రోజులపాటు ఈ పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. వర్షాలు బాగా తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో కోస్తాంధ్రకు సమీపంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా అల్పపీడన ద్రోణి ఏర్పడింది. ఇది తీరానికి ఆవల సముద్రం మీదుగా ఉండటంతో.. ఉత్తర భారతం నుంచి వేడిగాలులు ద్రోణి వైపుగా ప్రయాణిస్తున్నాయని వాతావరణ శాఖ విశ్రాంత శాస్త్రవేత్త మురళీకృష్ణ తెలిపారు. ఈ ద్రోణి తీరం దాటి రాకుండా.. సముద్రం మీదుగా ఉన్నన్ని రోజులూ రాష్ట్రంలో ఎండ తీవ్రత సాధారణం కన్నా ఎక్కువగానే ఉంటుందని వివరించారు. ఈ ద్రోణి తీరం దాటి భూమి మీదుగా ప్రయాణించినపుడు సముద్రపు గాలులు తీరం దాటి పయనిస్తాయని, ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని చెప్పారు. గురువారం కోస్తాంధ్రలో పలుచోట్ల 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవొచ్చు.

తగ్గని గాలుల తీవ్రత

కోస్తా తీర ప్రాంతం మీదుగా గాలుల తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. పశ్చిమ దిశ నుంచి గంటకు 45 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. సముద్రంలో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉందని పేర్కొంది. అలలు సుమారు 3 మీటర్ల నుంచి 3.6 మీటర్ల వరకు ఎగిసిపడుతున్నట్లు ఇన్‌కాయిస్ నివేదిక ఇచ్చింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
గుంటూరు	40.8	28.5
ఒంగోలు	40.7	31.7
రాజమహేంద్రవరం	40.0	27.0
విశాఖపట్నం	39.8	26.4
తిరుపతి	39.0	29.3
సూర్యాపేట	39.0	28.0
కడప	39.0	28.0
విజయవాడ	38.6	28.0
అనంతపురం	38.2	28.1
ఖమ్మం	38.0	33.0
నెల్లూరు	38.0	30.0
రామగుండం	37.6	29.6
కర్నూలు	37.5	26.4
తాడేపల్లిగూడెం	37.5	26.0
హన్మకొండ	37.5	22.5
నరసాపురం	37.1	28.0
శ్రీకాకుళం	37.0	29.0
నల్గొండ	37.0	26.0
హైదరాబాద్	35.4	25.7

SI & కానిస్టేబుల్స్ VRO/Gr-IV/RPF
22 సం.లుగా వేలాది విద్యార్థులను SI కానిస్టేబుల్స్‌గా తీర్చిదిద్దిన భాగ్యకిరణ్ సార్ గైడెన్స్‌లో
New Batches 15-6-18 ప్రారంభం
భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్ DSNR 9603290758

DSC-SGT, SA బ్యాచ్ ప్రా॥: 20-06-18
SGT స్పెషల్ ఎగ్జామ్ బ్యాచ్ కలదు
టెట్‌లో 130పై మార్కులు వచ్చిన వారికి ఫీజు రాయితీ
టీచర్స్ అకాడమి కనిగిరి, ప్రకాశం జిల్లా 98486 61318

2018 TETలో 142, 140, 140, 140 మార్కులతో ప్రభంజనం
2014 DSCలో స్టేట్ 2, 3, 4, 5 ర్యాంకులు 7 జిల్లా ఫస్టులు
అవనిగడ్డ విద్యానికేతన్ కృష్ణాజిల్లా DSC
SGT & SA (Mat, Soc, Bio, Eng)
బ్యాచ్ ప్రారంభం : 22-06-2018
94401 04963, 99499 33838

విజేతకాంపిటీషన్స్® vijetacompetitions.net
పక్షపత్రిక రూ. 25 సం॥ చందా రూ.600
RRB ALP TM Rs.349, Rs.139, EM Rs.399, Rs.149 | Group-D TM Rs.449, Rs.149, EM Rs.439, Rs.159
Postman/Mail Guard TM Rs. 379 MP Rs. 149
Current Affairs Rs.159 EM Rs. 399 MP Rs. 159
TSPSC బుక్స్ విడుదల
VRO GROUP-IV TS RTC
TSపోలీస్ కానిస్టేబుల్స్ రూ. 499
మోడల్ పేపర్స్ రూ. 179, ప్రీవియస్ పేపర్స్ రూ. 129
9963293399 | 9963511135

2016 AP DSC - SGT, TPT, SA-All సబ్జెక్ట్స్‌లలో కలిపి
స్టేట్ 1st, 2nd, 3rd, 4th, 5th, 6th, 7th, 8th, 9th, 10th ర్యాంకులే గాక
యిచ్చిన టీచర్స్ పోస్టులలో 70% పైగా పోస్టులు సాధించిన
కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-MAT, SOC, TEL, BIO
కొత్త బ్యాచ్ ప్రారంభం : 22-6-2018 సా॥ 4 గం॥లకు
8106268482, 9885272474

ఏపీ శాసనసభాపతికి ఉపశమనం

ఈనాడు, హైదరాబాద్: ఈనెల 18న జరిగే విచారణకు న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి కోడెల శివప్రసాదరావును ఆదేశిస్తూ గత నెల్లో కరీంనగర్ ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్(స్పెషల్ మొబైల్)కోర్టు జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి గురువారం ఈమేరకు ఆదేశాలు జారీచేశారు. దీంతో శాసనసభాపతికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లయింది. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గత ఎన్నికల్లో తనకు రూ.11.50 కోట్లు ఖర్చయినట్లు కోడెల తెలిపారని, ఇది ఎన్నికల నియమావళిని ఉలంఘించడమేనని కరీంనగర్ వావిలాలపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి 2017లో ఫిర్యాదు చేశారు. కరీంనగర్ న్యాయస్థానం స్పీకర్ హాజరుకు ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ద్వారా సభాపతి హాజరునుంచి మినహాయింపు పొందారు. మే 28న కరీంనగర్ కోర్టులో కేసు విచారణకు రాగా.. పిటిషనర్ తరపు న్యాయవాది మెమో దాఖలు చేశారు. దీంతో కరీంనగర్ ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఈనెల 18న విచారణకు హాజరు కావాలని కోడెలను ఆదేశించారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ కోడెల మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం విచారణలో వాదనలు విన్న న్యాయమూర్తి.. కరీంనగర్ ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్(స్పెషల్ మొబైల్)కోర్టు జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేశారు.

ఖాయిలా పరిశ్రమలకు తాయిలాలు!

సిద్ధమవుతున్న 'పునరుద్ధరణ' ముసాయిదా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఖాయిలాపడిన పరిశ్రమల పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి పరిశ్రమలశాఖ రూపొందించిన ముసాయిదాపై ఇతర శాఖల అభిప్రాయాలు తెలుసుకుంటోంది. అందరి నుంచి సమాచారం సేకరించి మరోసారి మదింపు చేశాక మంత్రి మండలి సమావేశంలో పెట్టనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న వారందరికీ అనేక రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. ఖాయిలాపడిన 5 వేల పరిశ్రమల పునరుద్ధరణపైనా దృష్టి సారించింది. ఇందుకోసం ముసాయిదా రూపకల్పనకు పరిశ్రమలశాఖను ఆదేశించింది. ఇది వారం పది రోజుల్లో కొలిక్కి రానుంది.

తొలి దశలో 32 ఎంఎస్‌ఎంఈ పార్కులు: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) కోసం మొదటి దశలో 32 పార్కుల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. అసెంబ్లీ నియోజకవర్గానికో పార్కును ఏర్పాటు చేయాలని భావించినా ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న చోట తొలుత వీటిని ప్రారంభించాలని నిర్ణయించారు. పార్కుల్లో సదుపాయాల కల్పనకు చేపట్టాల్సిన పనులపై నాలుగైదు రోజుల్లో పరిశ్రమల శాఖ పరిపాలన అనుమతులు ఇవ్వనుంది.

శివకృష్ణ మనోహర్‌ను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఐఐటీ ర్యాంకర్ శివకృష్ణకు సీఎం అభినందన

ఈనాడు డిజిటల్, అమరావతి: విశాఖపట్నం జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన శివకృష్ణ మనోహర్ ఐఐటీలో ఆల్ ఇండియా 5వ ర్యాంకు సాధించడం అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శివకృష్ణ ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో గురువారం సీఎంను కలిశారు. అతన్ని ముఖ్యమంత్రి అభినందించారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని శివకృష్ణ నిరూపించాడన్నారు. తండ్రి నాగేశ్వరరావు టైలరింగ్ వృత్తి చేసుకుంటూ తన కుమారుడిని ఉన్నత చదువులకు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. సీఎంను కలిసిన వారిలో ప్రిన్సిపల్ రామకృష్ణ, డైరెక్టర్ రమేశ్‌బాబు తదితరులు ఉన్నారు.

హెల్త్ వర్సిటీ నీట్ జాబితాలో శ్రీచైతన్య హవా

ఈనాడు, హైదరాబాద్: ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన నీట్-2018 మెరిట్ లిస్టులో..రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంతో పాటు తొలి పది స్థానాలు శ్రీ చైతన్య విద్యార్థులకే దక్కాయని విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. 20లోపు 18, 100లోపు 78 స్థానాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీచైతన్య తిరుగులేని విజయం సొంతం చేసుకుందని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విజేతలను, అధ్యాపకబృందాన్ని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బీ ఎస్ రావు అభినందించారు.

నెల్లూరులో ప్రొఫెసర్‌కు దేహశుద్ధి

వైద్య విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తన

ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్

నెల్లూరు(వైద్యం), న్యూస్‌టుడే: శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్‌కి ఆమె సోదరుడు దేహశుద్ధి చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. చంద్రశేఖర్ అదే కళాశాలలో ఎంబీబీఎస్ చివరి ఏడాది చదువుతున్న వైద్య విద్యార్థినితో వికృత చేష్టలకు పాల్పడ్డాడు. ఆమె విషయాన్ని కుటుంబసభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. ఆమెను తీసుకొని సోదరుడు కళాశాలకు వచ్చారు. ఆ సమయంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్ సమీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థిని లోపలికి వెళ్లి తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రొఫెసర్‌ను తన అన్నయ్యకు చూపించింది. ఆయన ప్రొఫెసర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం బాధిత విద్యార్థిని వైద్య కళాశాల ప్రిన్సిపల్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. పోలీసులు విద్యార్థిని సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు.

కంటెయినర్ల రవాణా నౌకలో మంటలు

22 మంది సిబ్బందిని కాపాడిన తీరగస్తీ దళం

నౌకపై మంటల్లో కాలిపోతున్న కంటెయినర్లు

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: హల్దియా (పశ్చిమ్ బంగా), పారాదీప్ (ఒడిశా) మధ్య సముద్రంలో ప్రయాణిస్తున్న కంటెయినర్ల రవాణా నౌక 'ఎంవీ ఎస్ఎస్ఎల్ కోల్‌కతా'లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గురువారం ఉదయం ఈ సమాచారం అందడంతో తీరగస్తీ (ఐసీజీ) దళానికి చెందిన డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్, ఐసీజీ రాజకిరణ్ నౌక.. ప్రమాదంలో చిక్కుకున్న నౌక వద్దకు చేరి సహాయక చర్యలు చేపట్టాయి. అనంతరం కోల్‌కతా పోర్టు, హల్దియా డాక్ కాంప్లెక్సు, ధర్మ పోర్టు, నౌక యాజమాన్య వర్గాలు రంగంలోకి దిగాయి. సకాలంలో స్పందించడంతో నౌకలోని 22 మంది భారతీయ సిబ్బందిని సురక్షితంగా కాపాడగలిగామని ఐసీజీ వర్గాలు తెలిపాయి. నౌకలో మొత్తం 464 కంటెయినర్లు ఉండగా.. 60 కంటెయినర్లకు మంటలు వ్యాపించాయని వెల్లడించాయి.

ఐరోపాలో ఏపీ పర్యాటక ప్రచారం

ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ నియామకం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక విశేషాలను ఐరోపాలో ప్రచారం(ప్రమోట్) చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా జయకుమార్ గుంటుపల్లి నియమితులయ్యారు. ఏడాది వ్యవధి కోసం జయకుమార్‌ను గౌరవ ప్రాతిపదికన నియమించినట్లు ప్రభుత్వ కార్యదర్శి(పర్యాటకశాఖ) ముకేష్‌కుమార్ మీనా గురువారం జారీచేసిన ఉత్తర్వుల్లో తెలిపారు. అంతర్జాతీయస్థాయి కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఏపీలోని ప్రపంచస్థాయి పర్యాటక హబ్, అత్యున్నత సంస్కృతిని విదేశాల్లో ప్రచారం చేయాలని ఏపీ సర్కారు నిర్ణయించింది. వీటిని చేపట్టేందుకు ఐరోపాలోని స్థానిక ప్రభుత్వాలు, పర్యాటక సంస్థలు, ఎంబసీలను సమన్వయం చేయడం, ఎక్కువమందిని భాగస్వాములు చేయడం సహా సామాజిక మాధ్యమాల ద్వారా ఏపీని ప్రపంచశ్రేణి రాష్ట్రంగా ప్రమోట్ చేసేందుకు జయకుమార్‌ను ప్రత్యేక ప్రతినిధిగా నియమించినట్లు సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధికి 76 మంది ఎంపిక

ఈనాడు డిజిటల్, అమరావతి: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి(ఏఓవిఎన్) పథకం కింద విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదివేందుకు 76 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు రామారావు తెలిపారు. ఎస్సీ-34, మైనార్టీ-39, ఎస్టీ-03 చొప్పున విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. గురువారం తాడేపల్లిగూడెంలోని సాంఘిక సంక్షేమ కార్యాలయంలో అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి రాష్ట్ర స్థాయి కమిటీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ జరిగింది. ఈ పథకం ద్వారా ఎంపికైన ఒక్కో విద్యార్థికి విదేశాల్లో చదివేందుకు ప్రభుత్వం రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు.

ఈనాడు

సర్కారీ వైద్యసేవలకు సుస్తీ

ఔషధ రంగాన ఉజ్జ్వల భవిష్యత్తు కలిగిన దేశంగా కొత్త ఆశలు రేకెత్తిస్తున్న భారత్‌లో- దీపస్తంభాలకింద దాగిన చీకట్లను తలపిస్తూ క్షేత్రస్థాయి దుస్థితిగతులు నివ్వెరపరుస్తున్నాయి. వైద్య చికిత్సకయ్యే వ్యయభారాన్ని నిభాయించలేక దేశంలో ఏటా అయిదున్నర కోట్లమంది పేదరికంలోకి జారిపోతున్నారంటూ 'బ్రిటిష్ మెడికల్ జర్నల్'లో ప్రచురితమైన అధ్యయనాంశాలు- ఆరోగ్యం ఎందరికో అందని మానిపండేనని స్పష్టీకరిస్తున్నాయి. మరే దారీ లేక సొంతంగా మందుల ఖర్చు భరించాల్సి రావడం మూలాన ప్రతి సంవత్సరం దారిద్ర్యరేఖ దిగువకు చేరి విలవిల్లాడుతున్నవారి సంఖ్య మూడుకోట్ల ఎనభై లక్షలుగా ఆ అధ్యయనం నిర్ధారించింది. 1993-94 లగాయతు 2011-12 వరకు దేశవ్యాప్తంగా వినియోగదారుల వ్యయ సర్వేలను, 2014నాటి ఎన్ఎస్ఎస్ఓ(జాతీయ నమూనా అధ్యయన సంస్థ) విశ్లేషణాత్మక నివేదికాంశాలను లోతుగా పరిశీలించి భారతీయ ప్రజారోగ్య ఫౌండేషన్ (పీహెచ్ఎఫ్ఐ) నిగ్గుతేల్చిన చేదునిజాలివి. ముఖ్యంగా క్యాన్సర్, గుండె జబ్బులు, గాయాలతోపాటు మధుమేహ చికిత్సా భారం అసంఖ్యాక కుటుంబాల ఆర్థిక సత్తువను ఖర్చు రాసేస్తుండటం ఆందోళనకర పరిణామం. అంతర్జాతీయంగా ఎవరికి వారు సొంతంగా వైద్యఖర్చులు పెట్టుకునే సగటు జనాభా 18శాతమైతే, ఇండియాలో అది 63శాతం. ఈ భారీ వ్యత్యాసమే ఏటికేడాది కోట్ల సంఖ్యలో భారతీయుల్ని దుర్భర పేదరికంలోకి ఈడ్చుకుపోతోంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది రోగులకు ఉపశమనం కలిగించేలా చౌకధరల్లో జనరిక్ ఔషధాల ఉత్పత్తి ఊపందుకోవాలని ఆ మధ్య ఐక్యరాజ్యసమితి ఉద్బోధించింది. జన్ ఔషధి దుకాణాల సరఫరా వ్యవస్థను పటిష్ఠీకరిస్తామంటున్న కేంద్రప్రభుత్వం సర్కారీ చికిత్సాలయాలన్నింటా జనశ్రేయానికి పెద్దపీట వేసే చర్యల్నీ చురుగ్గా చేపట్టాలి!

గాలి, నేల, నీరు, ఆహారం... దేనికదే విష కలుషితమై ప్రజారోగ్యానికి పోటాపోటీగా తూట్లు పొడిచే వాతావరణం పుణ్యమా అని- సుమారు రెండున్నర దశాబ్దాల్లో మధుమేహం కేసులు దేశంలో 174 శాతం 'వృద్ధి' నమోదు చేశాయి. గుండెజబ్బులు రెట్టింపయ్యాయి. భారత్‌లో ఏటా 29 లక్షల దాకా క్షయ కేసులు వెలుగు చూస్తున్నాయని ఇటీవల ప్రధానమంత్రే లెక్క చెప్పారు. ప్రతి సంవత్సరం కొత్తగా పది లక్షలమంది క్యాన్సర్ బారినపడుతున్న దేశం మనది. వచ్చే రెండు దశాబ్దాల్లో ఈ మానవ మహా విషాదం రెండింతలు కానుందన్న అంచనాలు బెంబేలెత్తించేవే. స్థూలకాయం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి సంబంధ వ్యాధులూ దేశంలో పెచ్చరిల్లుతున్నాయి. ఎనభై శాతానికిపైగా జనాభాకు ఎటువంటి ఆరోగ్య బీమా రక్షణా లేదన్న జాతీయ నమూనా అధ్యయన నివేదిక నిర్ధారణ, కోట్లమంది అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి మూల కారణమేమిటో కళ్లకు కడుతోంది. పల్లెల్లో 72శాతం, పట్టణాల్లో 79శాతం పౌరులు స్థోమత చాలకపోయినా వైద్యావసరాలకోసం ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయించాల్సి వస్తున్నదంటున్న గణాంకాలు- సర్కారీ ఆరోగ్య సేవలకు ఎంతగా సుస్తీ చేసిందో ప్రస్ఫుటీకరిస్తున్నాయి. అందరికీ ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో తెలంగాణ, గ్రామీణులకు టెలీ వైద్య సేవలతో ఆంధ్రప్రదేశ్, పేద రోగులకు తక్షణ వైద్య సేవలతో కేరళ వంటివి కొన్ని మినహా చాలా చోట్ల- కుటుంబంలో ఎవరు అస్వస్థులైనా ఎన్నో బతుకులు గుల్లబారిపోతున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఆరోగ్య సేవలు అడుగంటుతున్నాయని ఇటీవలి 'లాన్సెట్' నివేదిక సోదాహరణంగా వెల్లడించింది. ఆరోగ్య సేవల లభ్యత, నాణ్యతల ప్రాతిపదికన శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్‌ల సరసనా వెలాతెలాపోతున్న ఇండియా 195 దేశాల జాబితాలో 145వ స్థానానికి పరిమితం కావడం సిగ్గుచేటు.

జనారోగ్యమే జాతికి మహా సౌభాగ్యమని విశ్వసించి వైద్యసేవల్ని ప్రామాణీకరించిన దక్షిణ కొరియా, టర్కీ, పెరూ, చైనా, మాల్దీవులు వంటివి రెండున్నర దశాబ్దాల కాలావధిలో ఆరోగ్య రంగాన అద్భుత ప్రగతి సాధించాయి. భారత్ తలసరి ఆరోగ్య వ్యయం 63 డాలర్ల (రూ. 4256)తో పోలిస్తే చైనా అంతకు ఏడింతలు వెచ్చిస్తోంది. థాయ్‌లాండ్, మలేసియా, ఫిలిప్పీన్స్, ఇండొనేసియా వంటి దేశాల పక్కనా ఇండియా తలసరి ఆరోగ్య వ్యయం చిన్నగీతేనని డబ్ల్యూహెచ్ఓ గణాంకాలు చాటుతున్నాయి. 'ఆయుష్మాన్ భారత్' పేరిట ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ యోజనను త్వరలో పట్టాలకు ఎక్కిస్తామంటున్న కేంద్రం, 2025నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో రెండున్నర శాతం మేర నిధుల్ని ఆరోగ్య సేవలకు మళ్ళిస్తామని ప్రతిన పూనడం తెలిసిందే. రాష్ట్రాల క్రియాశీల భాగస్వామ్యం కూడగట్టి ప్రభుత్వాసుపత్రుల స్థాయీ ప్రమాణాలు ఇనుమడింపజేయాల్సిన కేంద్రం, జాతీయ ఆరోగ్య విధానంలో పేర్కొన్న విధంగా కేటాయించడానికి ఎంతవరకు కట్టుబాటు చాటగలదో చూడాలి. 2025నాటికి దేశ జీడీపీ రూ. 423 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. ఆ లెక్కన అప్పటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య వ్యయీకరణ పద్దు రూ. 10.5 లక్షల కోట్లకు విస్తరించాలి. ఈ తొమ్మిదేళ్లలో కనీసం 19శాతం మేర కేటాయింపుల్లో వార్షిక వృద్ధి నమోదైతే తప్ప ఆ కల నెరవేరదంటున్న నిపుణుల విశ్లేషణలు ఒకవంక; పెరుగుదల మాట అలా ఉంచి ఈ ఏడాది తెగ్గోసుకుపోయిన పద్దులు మరోవంక- లక్ష్య సాధన ఎంత క్లిష్టతరమో సూచిస్తున్నాయి. మేలిమి వైద్య సేవలకు నేరుగా పూచీపడే జాతీయ స్వస్థ వ్యూహాన్ని పకడ్బందీగా అమలు పరచడం నేటి తక్షణావసరం. స్వస్థ రాష్ట్రాలతోనే పురోగామి భారత్ సాక్షాత్కరిస్తుందన్న ప్రాప్తకాలజ్ఞతే జాతికి జీవన సౌభాగ్యం!

దిద్దుబాటులో తడబాటు

తుమ్మల కిశోర్

దేశ బ్యాంకింగ్ చరిత్రలో 2017-18 ఆర్థిక సంవత్సరం అత్యంత సంక్లిష్టమయంగా నిలిచిపోనుంది. ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు భారీనష్టాలు, నిరర్థక ఆస్తులతో ఆందోళన కలిగిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకులతో పాటు పలు అంతర్జాతీయ సంస్థలు బ్యాంకింగ్ సంక్షోభంపై ప్రభుత్వానికి సూచనలు చేశాయి. దేశంలో మొత్తం 21 పీఎస్‌బీలుండగా వాటిలో 19 భారీనష్టాలతో సతమతమవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌బీల నష్టాలు రూ. 87,356 కోట్లకు చేరాయి. ఇండియన్ బ్యాంకు, విజయాబ్యాంకు మినహా మిగిలినవన్నీ నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు తొమ్మిది లక్షల కోట్ల రూపాయలకు చేరువలో ఉన్నాయి. పెరుగుతున్న మొండిబాకీలు, గత నాలుగు నెలల్లో చోటుచేసుకున్న కుంభకోణాలు, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు ఉదంతాలు బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వసనీయతకు విఘాతం కలిగించాయి. రిజర్వుబ్యాంకు- గణాంకాల ప్రకారం 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 32,300 కోట్ల మేర కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి.

ఫలితమివ్వని ప్రయత్నాలు

నాలుగేళ్లుగా ప్రభుత్వం, రిజర్వుబ్యాంకు బ్యాంకుల మొండిబాకీల సమస్య తీవ్రతను తగ్గించే దిశలో పలుచర్యలు చేపట్టాయి. ప్రభుత్వం పీఎస్‌బీలకు మూలధనాన్ని సమకూర్చుతూ వాటి రుణవితరణ సామర్థ్యం పెంచే ప్రయత్నం చేస్తోంది. గడచిన ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 88వేల కోట్ల దాకా మూలధనాన్ని సమకూర్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రూ. 65 వేల కోట్లు అందించేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. మూలధనంలో అధికశాతం మొండిబాకీల కేటాయింపులకే సరిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఊహించినదానికంటే అధికమొత్తంలో పీఎస్‌బీలకు మూలధనాన్ని అందించాల్సి వస్తుంది. పెరుగుతున్న మొండిబకాయిలు, వరస నష్టాలు, ప్రతికూల ఆర్ఓఏ (రిటర్న్ ఆన్ అసెట్) వంటి కారణాలతో ఇప్పటికే 11 దాకా పీఎస్‌బీలు తక్షణ దిద్దుబాటు చర్య (పీసీఏ) జాబితాలో చేరాయి. భవిష్యత్తులో మరిన్ని బ్యాంకుల ఆర్థిక పరిస్థితి దిగజారి పీసీఏ జాబితాలో చేరే ప్రమాదం లేకపోలేదు.

పీఎస్‌బీలు - నికర నష్టాలు- నిరర్థక ఆస్తులు (31 మార్చి 2018 నాటికి)

బ్యాంకు	నికరనష్టం (రూ.కోట్లలో)	స్థూల ఎన్‌పీఏలు (రూ.కోట్లలో)
అలహాబాద్ బ్యాంక్	4,674	26,563
ఆంధ్రాబ్యాంక్	3,413	28,124
బ్యాంక్ ఆఫ్ బరోడా	2,432	56,480
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6,044	62,328
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	1,146	18,433
కెనరా బ్యాంక్	4,222	47,468
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	5,105	38,130
కార్పొరేషన్ బ్యాంక్	4,054	22,213
దేనాబ్యాంక్	1,923	16,361
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్	6,299	38,180
ఐడీబీఐ బ్యాంక్	8,238	55,588
ఓబీసీ	5,872	26,134
పీఎన్‌బీ	12,283	86,620
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్	744	7,802
ఎస్‌బీఐ	6,547	2,23,427
సిండికేట్ బ్యాంక్	3,223	25,758
యూకో బ్యాంక్	4,436	30,550
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	5,247	49,370
యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	1,454	16,552
విజయా బ్యాంక్	---	7,526
ఇండియన్ బ్యాంక్	---	11,990
మొత్తం	87,356	8,95,597

మొండిబాకీలతో బ్యాంకులు కుదేలు

ఈ నేపథ్యంలో ఇటీవల ఆర్థికమంత్రి పీయూష్ గోయెల్ ఏఆర్‌సీ (అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ), ఏఎంసీ (అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ) ఏర్పాటుపై సూచనలు చేసేందుకు కమిటీని నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ సునీల్ మెహతా నేతృత్వంలో ఈ కమిటీ రెండు వారాల్లో నివేదిక సమర్పించాల్సి ఉంది. మరోవైపు పీఎస్‌బీలను సమర్థంగా పర్యవేక్షించడానికి తమకు మరిన్ని అధికారాలు అవసరమని ఇటీవల పార్లమెంటరీ స్థాయి సంఘం(ఫైనాన్స్) ముందు ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ పేర్కొనడం గమనార్హం. ఈ దశలో మొండిబకాయిల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది.



బకాయిల చరిత్ర

త్రైమాసికాల వారీగా	స్థూల నిరర్థక ఆస్తులు (రూ.కోట్లలో)
జూన్ 2016	5,60,841
సెప్టెంబరు 2016	5,81,983
డిసెంబరు 2016	5,96,749
మార్చి 2017	6,25,210
జూన్ 2017	7,38,776

మొండి బకాయిల సమస్య పరిష్కారానికి రెండు దశాబ్దాలుగా ప్రభుత్వం పలుచట్టాలు తెచ్చింది. కొన్ని సంస్థలను స్థాపించింది. మొండిబాకీలను అరికట్టే దిశలో ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 1998లో నరసింహం కమిటీ ఏఆర్‌సీ (అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ)లను స్థాపించాలని సిఫారసు చేసింది. ఫలితంగా 2002లో తొలి ఏఆర్‌సీని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంకు, ఐడీబీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వం స్థాపించింది. ప్రస్తుతం దేశంలో 24దాకా ప్రైవేటు ఏఆర్‌సీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అప్పట్లో మొండి బాకీల వసూళ్లకు న్యాయస్థానాల్లో దశాబ్దాల కాలం పడుతుండటంతో ప్రభుత్వం 1993లో డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డీఆర్‌టీ)కి శ్రీకారం చుట్టింది. 2002లో సెక్యూరిటైజేషన్ చట్టాన్ని ప్రభుత్వం తెచ్చింది. మరోవైపు రిజర్వు బ్యాంకు కొన్నేళ్ళుగా సీడీఆర్ (కార్పొరేట్ డెట్ రీస్ట్రక్చరింగ్), ఎస్‌డీఆర్ (స్ట్రాటజిక్ డెట్ రీస్ట్రక్చరింగ్), ఎస్4ఏ (స్కీమ్ ఫర్ సస్టెయినబుల్ స్ట్రక్చరింగ్ ఆఫ్ స్ట్రెస్డ్ అసెట్) వంటి రుణ పునర్వ్యవస్థీకరణ పథకాలను ప్రవేశపెట్టింది. మొండి బాకీలను సమష్టిగా, మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు జాయింట్ వెండర్స్ ఫోరం (జెఎల్ఎఫ్) రూపొందించింది. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న ఆర్థిక సంస్కరణల్లో ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్- ఐబీసీ (దివాలాస్మృతి) కీలకమైంది. కార్పొరేట్ సంస్థల దివాలా ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు బ్యాంకుల మొండిబాకీల వసూళ్లలో కొత్త ఒరవడి సృష్టించే లక్ష్యంతో రూపొందించిన ఐబీసీ ఇప్పుడిప్పుడే ఫలితాలనిస్తోంది.

లక్ష్యసాధనలో 'ఏఆర్‌సీ'లు విఫలం

ఇప్పటిదాకా మొండిబాకీలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకొన్న చర్యలు మిశ్రమ ఫలితాలనిచ్చాయి. ఏఆర్‌సీల వల్ల బ్యాంకులకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. అలాగని ఇది పూర్తిగా విఫలమైందని అనలేం. అవి నిర్దేశిత లక్ష్యాలను సాధించలేకపోయాయి. వాటిని బలోపేతం చేసి, మొండిబాకీలను తగ్గించే దిశలో క్రియాశీల పాత్ర పోషించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. అయినప్పటికీ చాలీచాలని మూలధనంతో నియంత్రణపరమైన ఇబ్బందులతో దేశంలో ఉన్న ఏఆర్‌సీలు లక్ష్యాలను సాధించలేకపోయాయన్నది నిర్వివాదాంశం. ఈ తరుణంలో ఆర్థిక మంత్రి మరో ఏఆర్‌సీ ఏర్పాటుకు కమిటీని నియమించి ఇంకో ప్రయోగానికి తెరతీశారు. గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ 'బ్యాడ్ బ్యాంకు' ప్రస్తావన తెచ్చారు. దీనిపై కొంత మేధోమథనం జరిగింది. చివరికి ఆ ప్రతిపాదనను అటకెక్కించారు. పీఎస్‌బీల నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, డైరెక్టర్ల నియామకాలు, మొండిబాకీల సమస్య పరిష్కారానికి నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించే లక్ష్యాలతో పి.జె.నాయక్ సిఫారసుల మేరకు 2015లో ప్రభుత్వం బోనిక్స్ బోర్డు బ్యూరో (బీబీబీ)కు శ్రీకారం చుట్టింది. ఇది బ్యాంకుల విలీనాలపై సైతం సూచనలు చేయడంతోపాటు పనితీరు మెరుగుపరచుకొనేందుకు దిశానిర్దేశాలను ఇవ్వాల్సి ఉంది. బీబీబీ లక్ష్యం గొప్పదే. అయితే ఆచరణలో ఆ సంస్థకు తగినంత ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో లక్ష్యసాధనలో పురోగతి లేకుండాపోయింది. గతంలో వినోద్‌రాయ్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు పీఎస్‌బీల పనితీరు మెరుగుపరచి వాటిని గాడిలో పెట్టేందుకు బీబీబీ కీలక సిఫార్సులు చేసింది. వాటిపై ప్రభుత్వం ఇప్పటిదాకా స్పందించలేదు.

మొండిబాకీల సమస్యను పరిష్కరించే దిశలో వ్యవస్థాపరమైన లోపాలను సరిచేసి సత్వర దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. బీబీబీకి మరింత స్వతంత్ర ప్రతిపత్తినిచ్చి స్వేచ్ఛగా పనిచేసేందుకు దోహదపడాలి. దివాలాస్మృతి కింద ఇప్పుడిప్పుడే పరిష్కార ప్రణాళికలు అమలవుతున్నందువల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొండి బాకీలు తగ్గడంతోపాటు కొన్ని బ్యాంకులు లాభాలబాట పట్టే అవకాశం ఉంది. బ్యాంకుల ఆస్తిఅప్పుల పట్టికల ప్రక్షాళన దాదాపు పూర్తయిన దృష్ట్యా ప్రభుత్వం పీఎస్‌బీల విలీనాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. విలీనాలపై గతంలో ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినప్పటికీ నిర్దిష్ట ప్రణాళికను రూపొందించలేదు. విలీన ప్రతిపాదనలు బ్యాంకుల నుంచి వచ్చినట్లయితే సానుకూలంగా పరిశీలిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇలాంటి ప్రతిపాదనలు బ్యాంకుల నుంచి ఎప్పుడూ రావన్న సంగతి ప్రభుత్వానికి తెలియనిది కాదు. పీఎస్‌బీల మధ్య విలీనాలపై ప్రభుత్వం మరింత స్పష్టత ఇవ్వాలి. నిరర్థక ఆస్తుల సమస్య పరిష్కారానికి వ్యవస్థలను బలోపేతం చేసి అవి కట్టుదిట్టంగా పనిచేసేలా చర్యలు చేపట్టడం తక్షణావసరం. పర్యవేక్షణ, నియంత్రణల విషయంలో రిజర్వ్‌బ్యాంకుకు పూర్తి అధికారాలనిచ్చే దిశలో అడుగులు పడాలి!

(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

అణచివేతకు అంతమెన్నడు?

పీవీ రావు

భారత్‌లో మహిళలపై పెరుగుతున్న హింస కారణంగా సామాజిక సంక్షోభం విస్తరించడంతోపాటు, స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటుపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని ప్రపంచ బ్యాంకు నిర్వహించిన అధ్యయనంలో ఇటీవల వెల్లడైంది. సొంత వ్యక్తిత్వం కలిగిన మనిషిగా ఎదిగే క్రమంలో మహిళలకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆ అధ్యయనం ఏకరవుపెట్టింది. పురుషులతో పోలిస్తే మహిళల నిష్పత్తి అంతకంతకూ కోసుకుపోతుండటం, బాలికా శిశు మరణాల రేటు ఆందోళనకర స్థాయికి చేరడం వంటి పరిణామాలు దేశంలో స్త్రీల దురవస్థకు అద్దంపడుతున్నాయి. భారత రాజ్యాంగం మహిళలకు పురుషులతో సమాన హక్కులు కల్పిస్తోంది. క్షేత్రస్థాయిలో రాజ్యాంగ ప్రవచనం ఎంతవరకు అమల్లోకి వచ్చిందన్న విషయాన్ని నిగ్గుతేల్చేందుకు 1971లో ఏర్పాటైన జాతీయ కమిటీ 1975లో పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. కులం, వర్గం, విద్య, ఆదాయ అసమానతలు వంటి కారణాలతోపాటు అనాదిగా అమలవుతున్న అమానవీయ ఆచారాలవల్ల భారత్‌లో మహిళాలోకం కుంగిపోతోందని ఆ నివేదిక నిగ్గుతేల్చింది. నాటికీ నేటికీ దేశంలో మహిళల పరిస్థితిలో పెద్దగా మార్పురాకపోవడమే బాధాకరం.

పెరుగుతున్న హింస

జాతీయ నేర గణాంక నమోదు సంస్థ(ఎన్‌సీఆర్‌బీ) ఇటీవల విడుదల చేసిన వివరాల ప్రకారం- దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒక మహిళపై హింస, 29 నిమిషాలకు ఓ మహిళపై అత్యాచారం, 77 నిమిషాలకు ఓ వరకట్న హత్య జరుగుతున్నాయి. ప్రతి తొమ్మిది నిమిషాలకు ఓసారి భర్తో లేదా భర్త తరఫు వారో మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నట్లు ఎన్‌సీఆర్‌బీ వెల్లడించింది. దేశంలో ఒకవైపు గృహ హింస నిరోధక చట్టం ప్రకారం మహిళలకు చట్టబద్ధ రక్షణలు ఉన్నప్పటికీ- వారిపై ఈ స్థాయిలో దారుణాలూ, అన్యాయాలూ చోటుచేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. మహిళలపట్ల సామాజిక దృక్పథంలో మార్పు రావలసిన అవసరాన్ని సూచిస్తున్న పరిణామాలివి. విద్యాపరంగా, ఆర్థికంగా మహిళల సాధికారతే అనేక సమస్యలకు పరిష్కారమన్నది నిర్వివాదాంశం. ఆడపిల్లకు చదువు ఎందుకు అన్న మధ్యయుగ ధోరణులనుంచి బయటపడి- విద్యావకాశాలపరంగా మహిళలూ చెప్పుకోదగ్గ ముందడుగు వేస్తున్న కాలమిది. అయితే ఈ పురోభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదు. పేదరికమే అందుకు ప్రధాన కారణం. ఇంటిపనుల్లో సాయంగా ఉంటారన్న ఉద్దేశంతో ఆడపిల్లలను నాలుగు గోడల మధ్యే ఉంచి- కేవలం బాలురను మాత్రమే స్కూళ్లకు పంపించే ఆలోచన ధోరణి ఇప్పటికీ పల్లెల్లో విస్తృతంగా కనిపిస్తోంది. మరోవంక చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడం, వారిపై వివిధ

అసమానతల సుడిలో అబల

రకాల సామాజిక నియంత్రణల కారణంగా మధ్యలోనే బడిమానేస్తున్న ఆడపిల్లల సంఖ్య దేశంలో చాలా ఎక్కువగా ఉంది. ఇంటికి దగ్గరలో స్కూలు లేకపోవడం, మహిళా టీచర్లకు కొరత ఉండటం వంటివీ బాలికలు మధ్యలోనే స్కూలు మానేయడానికి కారణమవుతున్నాయి. ఉన్నత విద్యారంగంలో మాత్రం మహిళల పరిస్థితి కొంతలో కొంత మెరుగ్గా ఉంది. ఇంజినీరింగ్, వైద్యం, ఐటీ వంటి కోర్సుల్లో చేరుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. గొప్ప చదువులు చదివినా ఉద్యోగం, ఉపాధి వంటివి పక్కనపెట్టి పెళ్ళి చేసుకొని ఇంటిపట్టున మిగిలిపోతున్న మహిళల సంఖ్య కూడా ఎక్కువే ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

మహిళలపై నేరాలు

అసభ్య ప్రవర్తన		సైబర్	
2016	12,281	2016	513
2017	14,528	2017	1,136
పెరుగుదల శాతం	18.30		
గొలుసు దొంగతనాలు		**ఆర్థికం**	
2016	705	2016	7,987
2017	958	2017	9,418

ఆర్థిక కార్యకలాపాల్లో మహిళలు నిర్వహిస్తున్న పాత్రకు గుర్తింపు కొరవడటం మన సామాజిక దృష్టికోణంలోని మరో పెద్ద లోపం. ఇంటి పనులు చక్కబెడుతూ, వ్యవసాయ పనుల్లో భర్తలకు తగిన మద్దతును అందిస్తూ, పశువుల కాపరులుగా బాధ్యతలు నిర్వహిస్తూ మహిళలు చేస్తున్న పనులను పురుషస్వామ్య సమాజం విలువలేనివన్నట్లుగా చూడటం అత్యంత బాధాకరం. అసంఘటిత రంగంలో మహిళల ఉపాధికి ఏమాత్రం భరోసాలేని వాతావరణం నెలకొంది. భర్త చనిపోయి వితంతువులుగా మారిన, విడాకులు తీసుకున్న ఒంటరి మహిళల పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఆడపిల్లకు పెళ్ళి చేయాలంటే ఇప్పటికీ లక్షలకు లక్షలు కట్నం చెల్లించక తప్పని వాతావరణమే దేశవ్యాప్తంగా నెలకొంది. పెళ్ళయిన తరవాత పుట్టింటినుంచి మరింత డబ్బు తీసుకురావాలని భర్తతోపాటు అత్తామామలు వేధిస్తున్న ఉదంతాలు అనేకం బయటపడుతున్నాయి. మెట్టినింటిలో హింసను తట్టుకోలేక తల్లిదండ్రుల వద్దకు వచ్చిన బిడ్డకు 'గౌరవం' పేరిట పుట్టినింట్లో కూడా ఆశ్రయం దక్కని వాతావరణం నెలకొంది. ఇలాంటి దిక్కుతోచని పరిస్థితుల్లోనే కొంతమంది మహిళలు దురదృష్టవశాత్తు బలవన్మరణాలకూ పాల్పడుతున్నారు.

దృక్పథం మారాలి

ఆర్థికంగా దేశం అభివృద్ధి పథంలో పరుగులిడుతున్నా ఆ ఫలితాలు మహిళలకు చేరడం లేదు. సామాజిక, ఆర్థిక అసమానతల సుడిలో పడి మహిళలు ఇప్పటికీ కొట్టుమిట్టాడుతూనే ఉన్నారు. సాంకేతిక విజ్ఞాన ఫలాలూ వారికి పూర్తిగా చేరలేదు. దేశంలో సుదీర్ఘకాలంగా శ్రమ సాంద్ర (లేబర్ ఇంటెన్సివ్) విధానాలకే పరిమితమైన మహిళలు- ఆధునిక సాంకేతిక విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థలో అంత సులభంగా ఇమడలేకపోతున్నారు. దీనివల్ల వారు తీవ్రంగా నష్టపోతున్నారు. చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయం చాలావరకు ఆయా కుటుంబాల్లోని మగవారికే చేరుతోంది. ఇంటి అవసరాలను పక్కనపెట్టి వచ్చిన డబ్బును మగవారు విలాసాలు, ఆడంబరాలకు ఖర్చు పెడుతున్న పరిస్థితుల్లో చివరికి మహిళలే బాధితులుగా మిగులుతున్నారు. బాల్యవివాహాలను నిరోధిస్తూ, మహిళలకు ఆస్తిలో సమాన వాటా కల్పిస్తూ, బహుభార్యాత్వాన్ని కట్టడి చేస్తూ అనేక చట్టాలు ఈ దేశంలో తీసుకువచ్చినప్పటికీ వాటి అమలు సక్రమంగా లేకపోవడంవల్ల నారీలోకం దరవస్థలోనే మగ్గుతోంది. 1976లో ఒకే తరహా పని చేస్తున్న స్త్రీ పురుషులకు సమాన వేతనం చెల్లించాలన్న చట్టం తీసుకువచ్చారు. ఫ్యాక్టరీ చట్టం(సవరణ)-1976 ప్రకారం 30మంది మహిళలకు మించి పని చేస్తున్న చోట తప్పనిసరిగా పిల్లల సంరక్షణాలయాలు ఏర్పాటు చేయాలి. ఎంత మంచి చట్టం తీసుకువచ్చినా చుట్టూ వ్యాపించిన సామాజిక వాతావరణమే దాని అమలును శాసిస్తుంది. మహిళలపట్ల కుటుంబాల దృక్పథాన్ని మార్చకుండా కేవలం చట్టాలతోనే సామాజిక మార్పును తీసుకురావడం సాధ్యమయ్యే పనికాదు.

(అ)గణితం

గణనకు అవకాశం ఉన్నవాటిని గణించి విలువను నిర్ధారించేది గణితశాస్త్రం. మనోభావనలను స్వానుభవంతో గుర్తించడమే గాని గణించి వ్యక్తపరచడం సాధ్యంకాదు. గణనకు అందనివాటిని అనంతం, అమూల్యం వంటి పదాలతో విశదీకరించడం జరుగుతుంటుంది.

'శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణిః'- చిన్నపిల్లలు, పశువులు, పాములు మొదలైన జీవజాలాన్నంతటినీ రంజింపచేయగలిగే ధ్వనే సంగీతమని ఉత్తమ విలువను ఆపాదించారు అనుభవజ్ఞులు. ఆ స్పృహ ఏ మాత్రం లేనప్పుడు దాని విలువ శూన్యం అనిపిస్తుంది.

మానవుడి స్పృహననుసరించే అతడు పొందే అనుభవాల విలువ ఉంటుంది. ఆహార్యం అంటే రూపురేఖలను దిద్దే వేషధారణ. ఆహార్యం, ఆహారాలే ప్రధానమనే స్పృహతో జీవించేవారికి వాటి విలువ గణనీయమైనది.

వయస్సుతో నిమిత్తం లేకపోయినా, వ్యక్తి ప్రతి క్రియకీ పొందే ప్రతిక్రియలో, భగవంతుడి ప్రమేయాన్ని గుర్తించే స్థితికి చేరేకొద్దీ ఆయన భక్తి, జ్ఞానం పరిగణనలోకి వస్తాయి. భక్తి మార్గంలో ముందుగా భగవంతుడికి ఏవో కొన్ని గుణాలను, రూపాలను, నామాలను ఆపాదించి కీర్తించడం జరుగుతుంది. అది బీజ గణితంలో సమీకరణాల సహాయంతో చేసే సాధనలో, విలువ తెలియని ప్రమేయాన్ని ముందుగా 'ఎక్స్' అని ఊహించడం లాంటిది.

గణనకు అందనిది అగణితం. నామ రామాయణంలో 'అగణిత గుణగణ భూషిత రామ' అని శ్రీరాముడి స్తుతిలో, వర్ణమాలా స్తోత్రంలో 'అద్భుత విగ్రహ అమరాదీశ్వర అగణిత గుణగణ అమృతశివ సాంబసదాశివ...' అనే శివుడి స్తుతిలో అగణితమైన వారి గుణగణాల ప్రస్తావన ఉంటుంది. సర్వేశ్వరుని సహస్రశీర్షపురుషః సహస్రాక్ష సహస్రపాత్ అని కొలిచే పదాలు భావనాత్మకమే కాని- వేలు, లక్షలు, కోట్ల విలువతో కొలిచే సంఖ్యా గణితంలోవి కావు.

అంతర్యామి

అగణితం అంటే అనంతం. అనంతలక్ష్మి సత్యదేవుడి ఇల్లాలు. శుభప్రదమైన సత్యవ్రతాన్ని జీవితంలో ఒక భాగంలాగ భావించి సత్యమార్గంలో పయనించేవారికి సత్యదేవుడి అభయం ప్రాప్తిస్తుందంటారు. ధనమే కాదు- ధాన్యం, గృహం, సంతానం, విద్య, ధైర్యం, పశువులు, రాజ్యం వంటి సకల సంపదలూ అనంతలక్ష్మీ మాత అనుగ్రహాలే.

తపోలోకానికి పైన ఉన్నది, ఆఖరి సత్యలోకం. నిర్గుణ నిరాకార పరబ్రహ్మ స్థానంగా, సృష్టికి మూలంగా భావించే లోకమది. అందుకే భారతీయ జీవనశైలిలో, అనేక సందర్భాల్లో తలచిన కార్య సఫలతకు సత్యదేవ వ్రతాన్ని ఆచరించే ఉత్తమ సంప్రదాయం కనిపిస్తుంది. ఆ పూజావిధానంలో, విశాలవిశ్వంలో స్వల్పమైన మన ఉనికిని గుర్తుచేసే విభిన్న మండలాలు, గ్రహాలు, దిక్పాలకులు, అధిదేవతలు, ప్రత్యధిదేవతల వివరణ ఉంటుంది. ఆ కథలో మాటకు కట్టుబడటంలో వ్యక్తుల్లోని అంతరాలు వాటి పర్యవసానాల గురించిన ప్రస్తావన ఉంటుంది.

సత్యాన్వేషణకు శ్రద్ధ, ఓర్పు, సహనం అనేవి అత్యవసరమైన లక్షణాలు. అందుకోసం పనికిరాని విషయాలను లెక్కకట్టకపోతే పనికివచ్చే వాటిని పట్టించుకునే అవకాశం, సమయం సమకూరుతాయి. ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ లెక్కించ సాధ్యమైనవన్నీ లెక్కలోకి రావు, లెక్కించవలసినవన్నీ లెక్కించ సాధ్యంకాదు అన్నట్లు ప్రతీతి.

సంపదల్లో ప్రధానమైనది ఆరోగ్యం. ధనధాన్యాలను దోచుకోవచ్చేమో కాని అందుకు అలవికానిది ఆరోగ్యం. శరీరంలో ప్రతీ అవయవం అమూల్యమే. దేనిలో లోపం కలిగితే, దాని విలువ తెలుస్తుంది. కోట్లకు అధిపతులైనా, ఎంతమంది పరిచారకులున్నా, ఆరోగ్యానికి సాటిరావు. ఆరోగ్యప్రదమైన విజయ సాధనకు అగణితమైన సత్యమార్గమే సరైనది. సత్యమేవ జయతే!

- దువ్వూరి రామకృష్ణ వరప్రసాదు

హింసకు సమాధానం అభివృద్ధి

- మౌలిక సదుపాయాలను యూపీఏ విస్మరించింది
- విశ్వాస వాతావరణం సృష్టికి ఎన్డీఏ కృషి: మోదీ
- భిలాయ్ ఉక్కు కర్మాగారం జాతికి అంకితం

గురువారం భిలాయ్‌లో ఆధునీకరించిన భిలాయ్ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

భిలాయ్ (ఛత్తీస్‌గఢ్)

హింసకు సమాధానం అభివృద్ధి పనులేనని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. అభివృద్ధి ద్వారా ఉద్భవించే విశ్వాసం... అన్ని రకాల హింసను రూపుమాపుతుందని చెప్పారు. రూ.18,800 కోట్లతో విస్తరణ, ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకున్న భిలాయ్ ఉక్కు కర్మాగారాన్ని గురువారం ఆయన జాతికి అంకితం చేశారు. దీంతో కలిపి ఛత్తీస్‌గఢ్‌లో రూ.22,000 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం 'వికాస్ యాత్ర' బహిరంగ సభలో ప్రసంగిస్తూ- అభివృద్ధి ద్వారా 'విశ్వాస వాతావరణా'న్ని సృష్టించేందుకు తమ సర్కారు పాటుపడుతోందని చెప్పారు. ఆ దిశగా కేంద్రం, ఛత్తీస్‌గఢ్ సర్కారు సాధించిన విజయాలను వివరించారు. మావోయిస్టు కార్యకలాపాల బాధిత రాష్ట్రంలో ప్రధాని చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ప్రకృతి ప్రసాదించిన గనులు వంటి సహజ వనరుల ద్వారా లభించే ఆదాయంలో కొంత భాగాన్ని స్థానికుల సంక్షేమానికి ఖర్చు చేసేలా మా ప్రభుత్వం చూస్తోంది. దీని కింద ఛత్తీస్‌గఢ్‌కు రూ.3000 కోట్ల నిధులు అదనంగా లభించాయి. గిరిజనులు, వెనుకబడిన ప్రాంతాల్లో నివసిస్తున్నవారి ఆదాయాన్ని పెంచడానికి కేంద్రం కృషి చేస్తోంది' అని మోదీ తెలిపారు.

ఆకర్షణీయ నగరాలకు ఆదర్శం నయా రాయ్‌పూర్

గతంలో అడవులు, గిరిజనులకు పేరొందిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇప్పుడు ఆకర్షణీయ నగరాలు రూపుదిద్దుకుంటున్నాయనీ, రాజధాని నయా రాయ్‌పూర్ దేశంలోనే తొలి 'గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ'గా రూపొందుతోందని ప్రధాని చెప్పారు. ఇక్కడ తాను ప్రారంభించిన 'సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం' దేశంలోని ఇతర ఆకర్షణీయ నగరాలకు ఆదర్శంగా ఉంటుందని కొనియాడారు. నవ భారతావనికి ఈ నగరం దారి చూపిస్తుందన్నారు. శాంతి భద్రతలకు ప్రాధాన్యమిస్తూ మాజీ ప్రధాని వాజ్‌పేయి దార్శనికతను సీఎం రమణ్‌సింగ్ అమలుచేస్తున్నారని కితాబిచ్చారు. మధ్యప్రదేశ్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్ ఉన్నప్పుడు తాను ద్విచక్ర వాహనంపై ఇక్కడ తిరిగేవాడిననీ, రాష్ట్రంలో అన్ని జిల్లాలూ తనకు తెలుసుననీ మోదీ చెప్పారు. కచ్ నుంచి కటక్ వరకు, కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు దేశమంతటికీ కావాల్సిన రైలు పట్టాలను అందిస్తున్న ఘనత భిలాయ్ ఉక్కు కర్మాగారానికే దక్కుతుందన్నారు. నవ భారత్‌కు ఉక్కు కంటే బలమైన పునాదిని ఈ కర్మాగారం వేస్తుందని చెప్పారు. ఆధునికీకరించిన కర్మాగారాన్ని జాతికి అంకితం చేసే అవకాశం లభించడం తన అదృష్టమన్నారు. గత రెండేళ్లలో ఉక్కు దిగుమతుల్ని పూర్తిగా తగ్గించుకోవడంతో పాటు నికర ఎగుమతిదారుగా భారత్ నిలిచిందని ఉక్కు శాఖ మంత్రి బీరేంద్రసింగ్ చెప్పారు. ఈ ఏడాది చివర్లో ఎన్నికలకు వెళ్లబోతున్న ఛత్తీస్‌గఢ్‌కు ప్రధాని రావడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి.

హవాయి చెప్పులు వేసుకునేవారూ విమానాల్లో ప్రయాణించాలి

జగదల్‌పూర్ నుంచి తొలి విమాన సర్వీసును ప్రారంభించిన మోదీ ఆ అంశంపై మాట్లాడుతూ- హవాయి చెప్పులు వేసుకునేవారు సయితం 'హవాయి జహాజ్' (విమానం)లో ప్రయాణించేలా చూడాలనేది తన కల అని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే చిన్నచిన్న పట్టణాలు, నగరాలను అనుసంధానం చేసే ఉడాన్ పథకాన్ని తీసుకువచ్చామన్నారు. ఇప్పుడు రైళ్లలో ఏసీ పెట్టెల్లో కంటే విమానాల్లో ప్రయాణానికే ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. నింగి, నేల, నీరు ద్వారా దేశాన్ని అనుసంధానించే బృహత్తర యత్నం జరుగుతోందన్నారు. మునుపటి ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిన మౌలిక సదుపాయాలను తాము కల్పిస్తున్నామనీ, వారు రహదారులనైనా వేయని చోట తాము విమానాశ్రయాలు నిర్మిస్తున్నామనీ చెప్పారు. యూపీఏ సర్కారు ఛత్తీస్‌గఢ్‌ను విస్మరించిందనీ, ఎంతో కాలం నుంచి ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ డిమాండ్ చేస్తున్న ఐ.ఐ.టి.కి తానిప్పుడు శంకుస్థాపన చేశానని చెప్పారు. జగదల్‌పూర్ నుంచి రాయ్‌పూర్‌కు విమాన సేవల్ని ప్రారంభించడం ద్వారా బస్తర్ ప్రాంతానికి దేశ విమానయాన పటంలో చోటు కల్పించినట్లయిందన్నారు.

అమర జవాన్ల కుటుంబాలు, రైతులకు.. అమితాబ్ రూ.2 కోట్ల సాయం



ముంబయి: అమర జవాన్ల కుటుంబాలతోపాటు రైతులకూ తాను రూ.2 కోట్లు వితరణ చేయబోతున్నారంటూ వస్తున్న వార్తలను బాలీవుడ్ ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ ధ్రువీకరించారు. ఈ విషయంపై గురువారం ట్విటర్‌లో ఆయన స్పందించారు. 'అవును నేను చేయగలను. చేస్తున్నా'అంటూ ఆయన ట్వీట్‌చేశారు. పలు వెబ్‌సైట్లు రాసిన కథనాలనూ ఆయన ట్యాగ్‌చేశారు. అమర జవాన్ల కుటుంబాలకు రూ.కోటి, రైతులకు రుణాల నుంచి విముక్తి కల్పించేందుకు మరో రూ.కోటి ఆయన వితరణ చేయబోతున్నట్లు వెబ్‌సైట్లు పేర్కొన్నాయి.

ఎన్నారై వివాహాలను వారంలో నమోదు చేయాల్సిందే

దిల్లీ: భారత్‌లో జరిగే ప్రవాస భారతీయుల (ఎన్నారైల) వివాహాలను వారం రోజుల్లోగానే తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కేంద్ర మహిళా-శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ గురువారం తెలిపింది. అలా చేయనివారికి పాస్‌పోర్టులు, వీసాలు జారీ కావని స్పష్టంచేసింది. ఎన్నారై వివాహాలను 48 గంటల్లోపే నమోదు చేసుకోవాలని ఈ శాఖ మంత్రి మేనకాగాంధీ గత వారం పేర్కొన్నారు. ఎన్నారై వివాహాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి బుధవారం మంత్రుల బృందం సమావేశమయింది. దీనిలో ఈ వివాహ నమోదు గడువును వారం రోజులుగా నిర్ణయించారు.

రంజాన్ పండుగ రేపే

దిల్లీ: రంజాన్ నెల ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా నిర్వహించే ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగ శనివారం జరగనుంది. గురువారం దిల్లీలో నెలవంక కనిపించకపోవడంతో పండుగను శనివారం నిర్వహించాలని నిర్ణయించినట్లు దిల్లీలోని జామా మసీదు షాహి ఇమామ్ సయ్యద్ అహ్మద్ బుఖారీ ప్రకటించారు.

గోవాకు చేరుకున్న పారికర్

పనాజీ: అమెరికాలో మూడు నెలలపాటు వైద్య చికిత్సలు తీసుకున్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్.. గురువారం తిరిగి తన స్వగృహానికి చేరుకున్నారు. అగ్రరాజ్యం నుంచి ముంబయికి చేరుకున్న ఆయన.. అక్కడి నుంచి మరో విమానంలో పనాజీకి వచ్చారు. గత ఫిబ్రవరిలో క్లోమ గ్రంథి సంబంధిత సమస్యతో పారికర్.. ముంబయిలోని ఆసుపత్రిలో చేరికయ్యారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలు తీసుకునేందుకు మార్చిలో అమెరికాకు వెళ్లారు.

వయోవృద్ధులను క్షోభ పెడుతోంది కుమారులే

దిల్లీ: వయోవృద్ధులను కన్నకుమారులే ఎక్కువగా రాచి రంపాన పెడుతున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడయింది. ఆ తర్వాత స్థానంలో కోడళ్లు ఉన్నారు. హెల్ప్‌ఏజ్ ఇండియా అనే సంస్థ 23 నగరాల్లో అధ్యయనం చేయగా వయోవృద్ధులను బాగా రాచిరంపాన పెడుతున్న నగరాల జాబితాలో తొలి ఐదు స్థానాల్లో మంగళూరు, అహ్మదాబాద్, భోపాల్, అమృత్‌సర్, దిల్లీ ఉన్నట్లు తేలింది. వయోవృద్ధులను క్షోభకు గురి చేస్తున్నది ప్రధానంగా కుమారులు (52 శాతం), కోడళ్లు (34శాతం) అని ఈ అధ్యయనంలో వెల్లడయింది. సాధారణంగా కోడళ్లే వయోవృద్ధులను రాచి రంపాన పెడతారనే భావన గత అధ్యయనాలను బట్టి అనుకుంటుండగా కుమారులే ప్రధానంగా క్షోభకారకులని ఈ ఏడాది అధ్యయనాన్ని బట్టి తేలిందని హెల్ప్‌ఏజ్ సీఈఓ మ్యాథ్యూ చెరియన్ చెప్పారు.

గుజరాత్ ముఖ్యమంత్రి రాజీనామా చేశారు

● హార్దిక్ పటేల్ వెల్లడి ● ఖండించిన విజయ్ రూపాని

అహ్మదాబాద్: గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపాని రాజీనామా చేశారంటూ పాటిదార్ కోటా ఉద్యమ నేత హార్దిక్ పటేల్ గురువారం చెప్పడం వివాదాస్పదమయింది. విజయ్‌రూపానీ ఈ ప్రచారాన్ని ఖండించారు. హార్దిక్ పటేల్ చెప్పింది అబద్ధమని, తప్పుడు వదంతులని పేర్కొన్నారు. రాజకోట్‌కు వెళ్లిన హార్దిక్ పటేల్ అక్కడ మాట్లాడుతూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో రూపాని రాజీనామా చేశారని, పరిపాలన సరిగా చేయకపోవడంతో ఆయన్ను రాజీనామా చేయాలని కోరారని చెప్పారు. తాను ఈ విషయాన్ని పూర్తి విశ్వాసంతో చెబుతున్నానన్నారు. కొత్త ముఖ్యమంత్రిని పది రోజుల్లో నియమిస్తారని, ఆ పదవికి పాటిదార్‌ను లేదా రాజ్‌పుట్‌ను భాజపా ఎంపిక చేస్తుందని పేర్కొన్నారు. తాను రాజీనామా చేయలేదని, ఆ ప్రసక్తే లేదని, ప్రజలకు ఐదేళ్ల పాటు సేవ చేసేందుకు వారు తీర్పు ఇచ్చారని ముఖ్యమంత్రి విజయ్ రూపాని స్పష్టం చేశారు.

వృత్తి నిపుణుల వీసా పరిమితిని ఎత్తివేయనున్న యూకే

లండన్: వైద్యులు వంటి వృత్తి నిపుణులపై విధించిన వీసా ఆంక్షల్ని యూకే ప్రభుత్వం ఎత్తివేయనుంది. ఐరోపా యూనియన్ వెలుపలి దేశాల నుంచి వైద్యుల్ని, నర్సుల్ని తీసుకునేందుకు ఉన్న పరిమితిని తొలగిస్తున్నట్లు శుక్రవారం అధికారిక ప్రకటన వెలువడనుంది. నెలకు గరిష్ఠంగా 1600 మందినే తీసుకునేందుకు ప్రస్తుతం వీలుంది. ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య సేవ (ఎన్‌హెచ్‌ఎస్) కోసం వైద్య నిపుణుల కొరత ఉండడంతో భారత్ నుంచి వైద్యుల్ని, నర్సుల్ని తీసుకునేందుకు ఈ సడలింపు ఉపయోగపడనుంది.

హెచ్-4 నిబంధనలపై వెనక్కి తగ్గేది లేదు: అమెరికా

వాషింగ్టన్: హెచ్-1బి వీసాలపై వచ్చినవారి జీవిత భాగస్వాములకు ఉద్యోగాన్ని అధీకృతం చేయడానికి ఉద్దేశించిన హెచ్-4 వీసా నిబంధనను రద్దు చేయాలన్న ఉద్దేశాన్ని అమెరికా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది. ఇది భారతీయ అమెరికన్ మహిళలపై పెద్ద ప్రభావం చూపించే పరిణామం. ఉద్యోగ ఆధారిత వలసల కార్యక్రమాన్ని సంస్కరించి, అమెరికా ప్రజలకు ఎక్కువగా లబ్ధి కలిగేలా చేయడమే తమ ఉద్దేశమని వలస సేవల విభాగం అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు హెచ్-4 నిబంధనను రద్దు చేయవద్దంటూ అనేకమంది భారతీయ అమెరికన్లు న్యూయార్క్‌లో చట్టసభ సభ్యులను కలిసి విన్నవించారు.

ఐఏఎస్‌ల సమ్మె విరమణకు ప్రధాని జోక్యం చేసుకోవాలి

దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ డిమాండ్

దిల్లీ: రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల సమ్మె విరమణకు ప్రధాని జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) కార్యాలయంలో ఆయన బృందం సోమవారం చేపట్టిన ధర్నా నాలుగోరోజు గురువారమూ కొనసాగింది. ముఖ్యమంత్రి, మంత్రులతో మాట్లాడ్డానికి ఎల్జీ అనిల్ బైజల్‌కు నాలుగు నిమిషాల సమయం కూడా చిక్కలేదా అని ఆప్ ప్రశ్నించింది. కేజ్రీవాల్‌ను కలిసేందుకు ఎవర్నీ అనుమతించట్లేదనీ... బహుశా ఆయనను అరెస్టు చేశారేమోనని ఆ పార్టీ నేతలు అనుమానం వ్యక్తం చేశారు.

భార్య, కుమార్తెలపై సామూహిక అత్యాచారం

భర్తను చెట్టుకు కట్టేసి దుశ్చర్య

పట్నా: బిహార్‌లో ఓ దారి దోపిడీ ముఠా దారుణానికి పాల్పడింది. గయా జిల్లాలో ఓ వ్యక్తిని చెట్టుకు కట్టేసి.. అతడి భార్య, కుమార్తెలపై సామూహిక అత్యాచారానికి పాల్పడింది. మొత్తం ఇరవై మంది దుండగులతో కూడిన సాయుధ ముఠా ఈ అకృత్యానికి ఒడిగట్టింది. బుధవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు పట్నా ప్రాంత ఐజీ హస్నైన్ ఖాన్ తెలిపారు. గురారు బజార్‌లో చిన్నపాటి వైద్యుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన భార్య, 15 ఏళ్ల కుమార్తెతో కలిసి మోటార్ సైకిల్‌పై పయనమయ్యాడని.. సోందిహా గ్రామం గుండా నిర్మానుష్య రహదారిలో వెళ్తున్న సమయంలో దారి దోపిడీ ముఠా వారిని అటకాయించిందని పేర్కొన్నారు. భార్య, కుమార్తెలపై దాడిని నిలువరించేందుకు అతడు పోరాడినా.. దుండగులు ఎక్కువ మంది ఉండటంతో ఫలితం లేకపోయిందని తెలిపారు. వైద్యుడిని నిందితులు చెట్టుకు కట్టేశారని.. తుపాకులతో బెదిరించి అతడి భార్య, కుమార్తెలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. నిందితుల్లో ఇద్దరిని బాధితురాళ్లు గుర్తించారని.. గురువారం ఉదయం వరకూ మొత్తం ఇరవై మంది దుండగులనూ అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

రాజధానిపై ధూళిమేఘం!

● ప్రజలు బయటకు రావొద్దని కేంద్రీయ కాలుష్య నియంత్రణ మండలి విజ్ఞప్తి

దిల్లీ, తిరువనంతపురం, లఖ్‌నవూ, అగర్తల, ఇంఫాల్, గువాహటి: దేశరాజధాని దిల్లీని దుమ్ము-ధూళి మేఘం కమ్మేసింది. గాలినాణ్యత ప్రమాదకరమైన స్థాయికి చేరింది. రాజస్థాన్‌లో చెలరేగుతున్న గాలిదుమారంతో కూడిన తుపాన్ల కారణంగా దిల్లీ గాలి నాణ్యత దిగజారిపోతోంది. వచ్చే మూడు,నాలుగు రోజులపాటు గాలిలో దుమ్ము ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. అత్యవసర చర్యల్లో భాగంగా రాజధానిప్రాంతంలో అన్ని నిర్మాణాలను ఆదివారం వరకు నిలిపివేయాలని లెఫ్టినెంట్ గవర్నరు అనిల్ బైజాల్ ఆదేశించారు. మూడురోజులుగా దిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతాన్ని(ఎన్‌సీఆర్) పొగమంచు కమ్మేసింది. పంజాబ్, రాజస్థాన్ నుంచి వీస్తున్న బలమైన గాలుల కారణంగా పొగమంచుతో కూడిన దుమ్ముకణాలు దిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌పై దుష్ప్రభావం చూపిస్తున్నాయని ఎంఈటీ సంచాలకుడు విక్రంసింగ్ డెహ్రాడూన్‌లో తెలిపారు. దిల్లీలో గాలినాణ్యత 'తీవ్రం'గా లోపించినందు వల్ల ప్రజలు వీలైనంత వరకు బయట తిరగవద్దని కేంద్రీయ కాలుష్య నియంత్రణ బోర్డు(సీపీసీబీ) సూచించింది.

కేరళలో 43కు చేరిన మృతుల సంఖ్య

కోజికోడ్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో కుండపోతగా కురుస్తున్న వర్షాలతో కేరళలోని నదులన్నీ పొంగి పొర్లుతున్నాయి. బుధవారం నుంచి గురువారం వరకు 19 మంది ప్రాణాలు కోల్పోవడంతో మొత్తం మృతుల సంఖ్య 43కు పెరిగింది. కేరళజిల్లా తమరాస్సెరికి సమీపాన కట్టిప్పర కరించోలమల వద్ద కొండచరియలు విరిగిపడి ఐదుగురు దుర్మరణం చెందారు. వీరిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. మరో 10 మంది కనిపించకుండా పోయారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో రాబోయే 48 గంటలపాటు గాలిదుమారాలు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో 42.6 మిమీ, నెహ్రిలో 31 మిమీ వర్షపాతం నమోదైంది.

గుండె జబ్బులకు ప్రధాన కారణం జన్యువులే

● నిపుణుల వెల్లడి

దిల్లీ: పొగతాగడం, మద్యపానం వల్లే ప్రధానంగా గుండె జబ్బులు వస్తాయన్న భావన ఉంది. అయితే జన్యు కారణాలే ఇందుకు ప్రధానంగా దోహదపడుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. భారత్‌లో దాదాపు మూడు కోట్ల మంది హృద్రోగులు ఉన్నారు. ఏటా 2లక్షల శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక హృద్రోగ కేసులతో 'ప్రపంచ హృద్రోగ రాజధాని'గా మన దేశం మారింది. ఈ గుండె జబ్బు ముప్పును పెంచే 67 ప్రాంతాలను మానవ డీఎన్‌ఏలో గుర్తించారు. ఒక్కోదాన్లో ఒకటి లేదా రెండు జన్యు ప్రతులను.. వంశపారంపర్యంగా ఒక వ్యక్తి పొందే వీలుంది. ఒక్కదాన్ని కూడా పొందని సందర్భాలూ ఉంటాయి. ఈ జన్యువుల ప్రతులు పెరిగేకొద్దీ.. గుండె జబ్బుల ముప్పు కూడా పెరుగుతుంది. "జీవితానికి ఎలాంటి పూచీకత్తు ఉండదు. ఇబ్బందికర జన్యువులతో మీరు జన్మించి ఉంటే.. ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని అనుసరించినప్పటికీ గుండె జబ్బుల ముప్పు తప్పిపోదు. హృద్రోగ ముప్పు నిర్ధారణలో జన్యువులదే కీలక పాత్ర. అందువల్ల కుటుంబ ఆరోగ్య చరిత్రను వైద్యులతో పంచుకోవడం చాలా ముఖ్యం. తల్లిదండ్రులకు హృద్రోగ సమస్యలు, గుండెపోటు, పక్షవాతం వంటివి తెలియజేయాలి. తండ్రికి 50లలో, తల్లికి 60లలో గుండెపోటు వచ్చి ఉంటే.. వారి సంతానానికి ముప్పు రెట్టింపు స్థాయిలో ఉన్నట్లే" అని గుండె జబ్బుల నిపుణురాలు వనితా అరోరా పేర్కొన్నారు. ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ జన్యు మార్పుల వల్ల గుండె కండరాలు, ఎలక్ట్రికల్ రిథమ్స్‌లో వైరుధ్యాలు, రక్తంలో అధిక కొలెస్ట్రాల్ వల్ల పూడిక ఏర్పడటం వంటివి తలెత్తుతున్నాయని వివరించారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం, పరిష్కార మార్గాలు అనుసరించడం, శారీరక శ్రమను పెంచడం; కొలెస్ట్రాల్, అధికరక్తపోటుకు మందులు వాడటం వంటివాటి ద్వారా భవిష్యత్‌లో హృద్రోగ ముప్పును కొంతమేర తగ్గించుకోవచ్చున్నారు.

ఐఫోన్ నుంచి డేటా తస్కరణ ఇక అసాధ్యం!

కొత్త సాఫ్ట్‌వేర్‌లో అదనపు భద్రతాంశాలు

శాన్ ఫ్రాన్సిస్కో: లాక్ అయిన ఐఫోన్ల నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేందుకు వీలు కల్పిస్తున్న ఒక భద్రతా లోపాన్ని సరిదిద్దేందుకు ఆపిల్ సంస్థ చర్యలు చేపట్టింది. ఈ లోపాన్ని ఉపయోగించుకొని భద్రతా సంస్థలు.. నిందితుల ఫోన్లను తెరుస్తున్నాయి. త్వరలో విడుదల కాబోయే ఆపిల్ ఐఓఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఈ ఇబ్బందిని అధిగమించబోతున్నారు. ఫోన్‌ను లాక్ చేసిన గంట తర్వాత ఈ పోర్ట్ స్తంభించిపోతుంది. దీన్ని ఉపయోగించాలంటే పాస్‌వర్డ్‌ను నొక్కాలి. పాస్‌వర్డ్ లేకుండా ఛార్జింగ్ వరకూ చేసుకోవచ్చు. శాన్ బెర్నార్డినో అనే హంతకుడి ఐఫోన్‌ను అన్‌లాక్ చేయడానికి 2016లో అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ.. ఆపిల్ సాయాన్ని కోరింది. వినియోగదారుల హక్కులకు భంగం కలుగుతుందంటూ ఆ సంస్థ దీనికి నిరాకరించింది. దీంతో ఎఫ్‌బీఐ.. తృతీయ పక్షం ద్వారా ఐఫోన్‌ను అన్‌లాక్ చేయించింది. ఈ నేపథ్యంలో ఆపిల్ సంస్థ తాజా భద్రతాంశాన్ని జోడించింది.

ద్విచక్రవాహనాల కడుపునింపిన రాజ్ ఠాక్రే జన్మదినం

ముంబయి: మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) అధినాయకుడు రాజ్ ఠాక్రే జన్మదినం.. ముంబయిలోని ద్విచక్రవాహనాల కడుపు నింపింది. పెట్రోలుపై రూ.4 నుంచి రూ.9 వరకూ పార్టీ గురువారం రాయితీ ఇవ్వడంతో.. బంకుల ఎదుట ద్విచక్ర వాహనదారులు బారులుతీరారు. ఠాక్రేకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ వీరిలో చాలామంది ట్యాంకుల నిండా పెట్రోలు పోయించుకున్నారు. ఠాక్రే 50వ పుట్టినరోజును పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ఎంపికచేసిన బంకుల్లో ఈ రాయితీని ఎంఎన్‌ఎస్ అందించింది.

ఐసీయూలోనే వాజ్‌పేయీ..

దిల్లీ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీకి ఎయిమ్స్‌లోని అత్యవసర విభాగం (ఐసీయూ)లోనే వైద్యులు చికిత్స కొనసాగిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఛాతి, మూత్రనాళ ఇనెఫెక్షన్లు తదితర సమస్యలతో ఈనెల 11న వాజ్‌పేయీని ఎయిమ్స్‌లో చేర్పించగా.. ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమేపీ మెరుగుపడుతున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ రణ్‌దీప్ గులేరియా బుధవారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

కశ్మీర్‌లో ఇద్దరు ముష్కరుల హతం

ఇద్దరు జవాన్ల మృత్యువాత

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ఇద్దరు ముష్కరులను భద్రతా బలగాలు గురువారం మట్టుపెట్టాయి. ఈ ఆపరేషన్‌లో ఓ జవాన్ మృత్యువాతపడ్డారు. బందీపొరా జిల్లాలోని పనార్ అటవీ ప్రాంతంలో ఈ కాల్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు దక్షిణ కశ్మీర్‌లో ఓ సైనికుణ్ని ఉగ్రవాదులు అపహరించుకుపోయి దారుణంగా హతమార్చారు. ఈద్ సెలవులకు స్వస్థలమైన రాజౌరీకి వస్తుండగా ముష్కరులు ఈ దారుణానికి తెగబడ్డారు. 'షోపియాన్‌లో ఓ వాహనంలో ఔరంగజేబ్‌ను ఎక్కించి రాజౌరీలో దింపమని చెప్పాం. అయితే కలాంపొరా ప్రాంతంలో అడ్డగించిన ముష్కరులు ఆయన్ను అపహరించుకుపోయారు. గూసు గ్రామ పరిసరాల్లో అతడి మృతదేహం తూటా గాయాలతో కనిపించింది'అని అధికారులు తెలిపారు.

జల నిర్వహణలో జయకేతనం

- ఏపీకి మూడో స్థానం... తెలంగాణకు ఎనిమిది
- ఉమ్మడి నీటి నిర్వహణ సూచీని విడుదల చేసిన నీతి ఆయోగ్

ఈనాడు - దిల్లీ



నివేదికను విడుదల చేస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్(ఎడమ), నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్

రాష్ట్రాలకు 'ఉమ్మడి జల యాజమాన్య సూచీ (సీడబ్ల్యూఎంఐ)'లను కేటాయిస్తూ నీతి ఆయోగ్ రూపొందించిన నివేదికను కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారమిక్కడ విడుదల చేశారు. భూగర్భ జలనిర్వహణ, జలవనరుల పరిరక్షణ, వ్యవసాయం, తాగునీరు, విధానాల రూపకల్పన-అమలు తదితర 28 అంశాల ప్రాతిపదికన రాష్ట్రాలకు ఈ ర్యాంకుల్ని కేటాయించారు. ఈశాన్య-హిమాలయ; ఇతరాలుగా రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకుని వివిధ అంశలను మదింపు చేశారు. అయితే, వివిధ కారణాలతో పశ్చిమ బెంగాల్, అరుణాచల్‌ప్రదేశ్, జమ్ము-కశ్మీర్, మణిపూర్, మిజోరాంలను మినహాయించారు. ఇతర రాష్ట్రాల విభాగంలో అత్యంత సమర్థంగా నీటి నిర్వహణ చేపట్టి గుజరాత్ ప్రథమ స్థానం దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ మూడోస్థానంలో, తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచాయి. నీటి నిర్వహణలో ప్రతిభ చూపిన రాష్ట్రాలు వ్యవసాయ రంగంలోనూ ముందున్నాయని గడ్కరీ చెప్పారు.

గుజరాత్ ముందు: పరిశుభ్రమైన తాగునీటిని అందించడంలో గుజరాత్ దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్ రెండోస్థానాన్ని దక్కించుకుంది.

నీటి వనరుల సమాచారంలో ఏపీ ముందు

నీటి వనరుల సమాచార సేకరణ, పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రమాదకర స్థితిలోకి భూగర్భ జలాలున్న ప్రాంతాలను గుర్తించడంతో పాటూ... వాటిని మ్యాపింగ్‌చేసి, అందులో 96% జలవృద్ధికి నిర్మాణాత్మక చర్యలు చేపట్టినట్లు నీతి ఆయోగ్ పేర్కొంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆన్‌లైన్ డ్యాష్ బోర్డు ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. రైతులకు పంటల సాగుపై సూచనలు, నీటి సంరక్షణ చర్యలు, వర్షపాతం, చెరువులు/కుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, జలవనరుల సమాచార సేకరణ... సమస్యలను అధిగమించడం, విస్తృత నీటి పర్యావరణ వ్యవస్థలో కొత్త విధానాలను అనుసరించడం... జలవనరుల గణనలో అనుభవమున్న ప్రైవేటు సంస్థల సహకారం తీసుకోవడం వంటి చర్యలను ఏపీ నుంచి ఇతర రాష్ట్రాలు తెలుసుకోవాలని ఆ సంస్థ సూచించింది. అయితే- రాష్ట్రంలోని మూడోవంతు గ్రామీణ ఆవాసాలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా లేదనీ, పట్టణ మురుగునీటిశుద్ధి 26 శాతమే జరుగుతోందని, పట్టణాల్లో సగం ఇళ్లకే ఉచితంగా నీరు సరఫరా అవుతోందని నీతి ఆయోగ్ పేర్కొంది.

తొలి పది రాష్ట్రాల సూచీ ఇలా..

రాష్ట్రం	పాయింట్లు (వందకు)
గుజరాత్	76
మధ్యప్రదేశ్	69
ఆంధ్రప్రదేశ్	68
కర్ణాటక	56
మహారాష్ట్ర	55
పంజాబ్	53
తమిళనాడు	51
తెలంగాణ	50
ఛత్తీస్‌గఢ్	49
రాజస్థాన్	48

వనరుల పునరుద్ధరణలో తెలంగాణ అదుర్స్: ఉపరితల, భూగర్భ జలనిర్వహణలో తెలంగాణ మంచి పనితీరు కనపర్చుతోందని నీతి ఆయోగ్ ప్రశంసించింది.

2030 నాటికి సగం నీరే లభ్యం!

"ప్రస్తుతం 60 కోట్ల మంది భారతీయులు తీవ్ర నీటి కొరతతో సతమతమవుతున్నారు. పరిశుభ్రమైన తాగునీరు అందక ఏటా 2 లక్షల మంది తనువు చాలిస్తున్నారు. 2030 నాటికి దేశంలో అందుబాటులో ఉండే నీటి కంటే డిమాండ్ రెండింతలు ఎక్కువగా ఉండనుంది" అని నివేదికలో హెచ్చరించింది.

శ్రీనగర్‌లో పత్రికా సంపాదకుడి హత్య

● కాల్చి చంపిన దుండగులు
● దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రముఖులు

దుండగుల చేతిలో హతమైన రైజింగ్ కశ్మీర్ సంపాదకుడు సుజాత్ బుఖారీ

శ్రీనగర్: సీనియర్ పాత్రికేయుడు, రైజింగ్ కశ్మీర్ సంపాదకుడు సుజాత్ బుఖారీ(50)ని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఆయన వ్యక్తిగత భద్రత అధికారిని కూడా వారు కాల్చి చంపారు. శ్రీనగర్‌లోని ప్రెస్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న తన కార్యాలయం నుంచి ఇఫ్తార్ విందుకు హాజరయ్యేందుకు ఆయన బయటకు రాగానే గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మరొక పోలీసు, ఒక పౌరుడు గాయపడ్డారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు చెప్పారు. బుఖారి గతంలో హిందూ వార్తా పత్రికకు కశ్మీరులో కరస్పాండెంట్‌గా పని చేశారు. కశ్మీరు లోయలో శాంతి కోసం పలు సదస్సులు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్‌తో ప్రత్యామ్నాయ చర్చల ప్రక్రియలోనూ భాగంగా ఉన్నారు. 2000 సంవత్సరంలోనూ ఆయనపై దాడి జరిగింది. అప్పటి నుంచి ఆయనకు పోలీసు భద్రత కల్పించారు. బుఖారి హత్య పట్ల కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జమ్ముకశ్మీరు ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుఖారీ హత్యపై ఆవేదన వ్యక్తం చేస్తూ మెహబూబా ముఫ్తీ ఏడ్చేశారు.

జైట్లీ, రణ్‌దీప్‌ల మధ్య మాటకు మాట

● రాహుల్‌పై మంత్రి విమర్శలతో ప్రారంభమైన రగడ

దిల్లీ: కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగ బాధ్యుడు రణ్‌దీప్ సూర్జేవాలాల నడుమ గురువారం ట్వీట్ల యుద్ధం నడిచింది! 'ఆర్థిక దుర్నిర్వహణ' అంశం కేంద్రంగా ఇద్దరి మధ్య మాటకు మాట అన్నట్టుగా సంవాదం నడిచింది. "రాజకీయ హోదా వంశపారంపర్యంగా రావచ్చు. జ్ఞానం మాత్రం ఎవరికివారే ఆర్జించాలి' ' అని రాహుల్‌ని ఉద్దేశించి బుధవారం జైట్లీ తన ఫేస్‌బుక్ ఖాతాలో వ్యాఖ్యలు రాశారు. దీనికి సూర్జేవాలా స్పందిస్తూ- కేంద్ర మంత్రి సందర్భశుద్ధి లేకుండా సామాజిక మాధ్యమాల్లో నిష్ప్రయోజన, వృథా రాతలు రాస్తున్నారని ట్వీట్ చేశారు. గురువారం దీనికి స్పందించిన జైట్లీ- "ఇది రాజకీయ చర్చ. దూషణ దీనికి సమాధానం కాదు. ' అంటూ బదులిచ్చారు. వెంటనే సూర్జేవాలా "మీరు కాంగ్రెస్ నాయకత్వాన్ని దూషించినప్పుడూ, సుప్రీంకోర్టు వ్యాఖ్యలను వక్రీకరించినప్పుడూ రాజకీయ చర్చ అవుతుందా? గణాంకాలతో సహా మీ ఆర్థిక దుర్నిర్వహణపై నిజాలను చెబితే అది దూషణ అవుతుందా? ఇదేమరి... అవకాశవాద రాజకీయాలంటే" అని వ్యాఖ్యానించారు.

దక్షిణ కొరియాలో అమెరికా సైనిక విన్యాసాలు నిరవధిక నిలిపివేత

వాషింగ్టన్: దక్షిణ కొరియాతో జరిగే సంయుక్త సైనిక విన్యాసాలను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చల సందర్భంగా ఈ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అమెరికాకు చెందిన 28,500 మంది సైనికులు ద.కొరియాలో మోహరించి ఉంటారు. సాధారణంగా ప్రతిఏటా ఆగస్టులో కంప్యూటరీకృత ఆదేశాలతో రెండువారాల పాటు సంయుక్త విన్యాసాలు చేస్తుంటారు. తమపై దండెత్తడానికి ఇదో సన్నాహమని ఉత్తర కొరియా ఆరోపిస్తూ వస్తోంది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ
లెనిన్‌సెంటర్, గవర్నరుపేట్, విజయవాడ - 520002

నోటీసు

ఫైల్ నెంబర్. CLU/JPO/104/2015

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం 2014 నందు సెక్షన్ 41(3) గల అధికారముల ప్రకారం జి.ఓ.ఎం. ఎస్ నెం. 680 ఎం.ఏ, తేది 29/12/2006 ద్వారా ఆమోదించిన నంబూరు జోనల్ అభివృద్ధి ప్రణాళికలో డీ.నెం.2/1B/2, 30/4B(P), 31/3,32(P) & 33(P) కొప్పురావూరు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా పరిధి లోని 40,792.23 చ.మీ విస్తీర్ణమును పబ్లిక్ & సెమి పబ్లిక్ భూవినియోగం మరియు వినోద భూవినియోగం నుండి నివాసిత భూవినియోగం కొరకు మార్పు చేయుటకు ప్రతిపాదించటం జరిగింది.

ఏ వ్యక్తి అయినా లేదా ఏ స్థానిక సంస్థ అయినా పైన ప్రతిపాదించిన మార్పు ద్వారా ప్రత్యక్షముగా లేదా పరోక్షముగా ప్రభావితం అయితే గెజెట్ నందు ప్రచురించిన తేది నుండి 15 రోజుల లోపు తమ అభ్యంతరములను లేదా సలహాలను కమీషనర్, ఏ.పి. సి.ఆర్.డీ.ఏ వారికి అందచేయవచ్చును. తదుపరి వివరాలను సి.ఆర్.డీ.ఏ వెబ్‌సైట్ https://crda.ap.gov.in లోను, సి.ఆర్.డీ.ఏ విజయవాడ కార్యాలయంలో, కొప్పురావూరు గ్రామపంచాయితి కార్యలయంలో పని దినములలో చూడ వచ్చును.

సం/- కమీషనర్, ఏ.పి.సి.ఆర్.డీ.ఏ

సదస్సులో మాట్లాడుతున్న నన్నపనేని రాజకుమారి

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని

గుంటూరు, న్యూస్‌టుడే: మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలంటే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి సూచించారు. మహిళల సంబంధిత చట్టాలపై గుంటూరులో ఏర్పాటు చేసిన సదస్సులో గురువారం ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ ఈ తరహా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి విడతగా అయిదు జిల్లాల్లో ఈ తరహా సదస్సులు జరుగుతాయన్నారు. వీటికి జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం సహాయ, సహకారాలు అందజేస్తున్నాయన్నారు. ఇటీవల బాలికలపై జరిగిన అత్యాచారాలను దృష్టిలో పెట్టుకుని అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, వివిధ రంగాలకు చెందిన మహిళలు చట్టాల గురించి వివరిస్తారన్నారు. ఈ సదస్సుల ద్వారా విషయాలు తెలుసుకున్న ఎన్జీవోలు, అంగన్‌వాడీ టీచర్లు నియోజకవర్గ, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు తెలియజేసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు.

ఉద్యోగుల శాఖాపరమైన పరీక్షల 'కీ' విడుదల

ఈనాడు, అమరావతి: ఉద్యోగులకు నిర్వహించిన శాఖాపరమైన పరీక్షల 'కీ'ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురువారం విడుదల చేసింది. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు ఆయా పరీక్షలు జరిగాయని.. సంబంధిత 'కీ'ను ప్రస్తుతం వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కమిషన్ గురువారం తెలిపింది. ఈ నెల 19వ తేదీ నుంచి వెబ్‌సైట్ ద్వారా రెస్పాన్స్ షీటును డౌన్‌లోడు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తామని వెల్లడించింది. 'కీ'లపై అభ్యంతరాలను ఈ నెల 28లోగా రాతపూర్వకంగా తెలియచేయాలని పేర్కొంది.

రివైజ్డ్ 'కీ' విడుదల: రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల నియామకాల కోసం నిర్వహించిన పరీక్షల్లో 13 ప్రశ్నపత్రాల జవాబులకు సంబంధించిన రివైజ్డ్ 'కీ'ను ఏపీపీఎస్సీ వెల్లడించింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, ఇంగ్లిష్, గణితం, మెకానికల్ ఇంజినీరింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్, యోగా తదితర సబ్జెక్టులు ఈ జాబితాలో ఉన్నాయి.

18న విజయవాడలో ప్రజాసంఘాల ర్యాలీ

విజయవాడ, న్యూస్‌టుడే: సహజవనరుల దోపిడీ గురించి ప్రశ్నిస్తే కాల్పులు, దేశద్రోహం కేసులు నమోదు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ఈ నెల 18న విజయవాడలో భారీ ర్యాలీ, ప్రెస్ క్లబ్‌లో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఆంజనేయులు తెలిపారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఆ రోజు మధ్యాహ్నం 3.30కి ప్రదర్శన.. ఐదు గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విరసం నేత వరవరరావు, ఇఫ్టూ జాతీయ కార్యదర్శి పి.ప్రసాద్, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి వి.హనుమంతరావు తదితరులు హాజరవుతారని తెలిపారు.

రాజస్థాన్‌లో ఫ్రాన్స్ యువతి గల్లంతు

జైపుర్: పర్యటన కోసం భారత్ వచ్చిన 20ఏళ్ల ఫ్రాన్స్ యువతి ఆచూకీ గల్లంతైంది. 2 వారాల నుంచీ ఆమె కనిపించడంలేదని రాజస్థాన్‌పోలీసులు గురువారం వెల్లడించారు. మే 30న గయెల్లే చౌట్యూ అజ్‌మేర్‌కు వచ్చారు. పుష్కర్‌లోని ఓ హోటల్‌లో ఆమె దిగారు. ఆ మరుసటి రోజు ఓ బస్టాండ్‌లో ఆమె నిలబడినట్లు సీసీటీవీ కెమెరాల్లో కనిపిస్తోంది. అనంతరం ఆమె ఎటు వెళ్లారో తెలియడంలేదు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

Box Tender Notice

NIT No. 194/CRDA-13022(32)/2/2018-ASSOCIATE PLAN3-T&T-APCRDA/2nd Call Dt. 13/06/2018

Name of Work : "REQUEST FOR PROPOSAL Selection of Consultants for Project Preparation Consultancy Services for Integrated Public Transport System (BRTS along with feeder system) in Andhra Pradesh Capital Region (APCR)".

The bid can be downloaded on AP CRDA Website from **15.06.2018 to 06.07.2018 up to 14.00 Hrs.** Due date for submission of Bid **06.07.2018 up to 15.00 Hrs,** Technical bid opening **06.07.2018 @16.00Hrs.** For further details Please refer www.crda.ap.gov.in.

Sd/- Commissioner, APCRDA

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED
1-G, Anand Heights, Beside Prabhas College, Kedareswarpet, Vijayawada - 520003 (A.P.). CIN Number : U93000AP2015SGC105535

E-PROCUREMENT TENDER NOTICE Dated: 14.06.2018

NIT No.	Name of Work	Estimated Contract Value (Rs. Crore)
10/CE/ADC/ENG/2018-19	Amaravati Flood Mitigation works : Construction of Neerukonda Reservoir (Approx. capacity of 0.4 TMC) on BOQ Basis through International Competitive Bidding Process (ICB) in Amaravati, New Capital City of Andhra Pradesh (Package - XXI).	366.97

Tender Documents can be downloaded on NIC e-procurement portal from **dt. 18-06-2018, 15.00 Hrs onwards.** Due date for submission of Bids dt. **02-08-2018 @ 16:00 Hrs.** For further details, please refer to **https://eprocure.gov.in.** For any further clarifications contact **Dr. K.V. Ganesh Babu, +91-7095599572, email: ganeshbabu.adc@ap.gov.in**

Sd/- Chairperson & Managing Director, ADCL, Vijayawada.

SALE OF BY-PRODUCTS

Tobacco By-products FCV and NON FCV - LS, LS2, AVR/ Short Stems/ Stem Bits, A2 Stems / Medium Stems, Stem Bits, Long / Medium Stems (A1,A2), UR Scrap / Redried Scrap, UR Stems, Damage, C3 (Short Stem Burley/ Stem Bits) CGT (C Stem), B3 Stems (HDBRG Short Stem), and Dust produced while threshing / processing / handling of our tobaccos in Andhra Pradesh & Karnataka are for sale for the period July to September 2018. And Damaged Gunny Pattas & Damaged Bengal Twine Bits at M/s. Aruna Tobacco Company, Ganapavaram and in other locations at Prakasam and Guntur Districts are for sale. Sealed tenders are invited from the interested parties for purchase of the above by-products. The tender forms and the terms and conditions of the sale can be obtained from the office of Management Accountant. The filled up tender forms should reach Management Accountant by 22nd June, 2018. Company's decision is final to take any action with regard to the above tenders.

MANAGEMENT ACCOUNTANT
ITC LIMITED - AGRI BUSINESS DIVISION,
P.B.No.317, G.T. Road, Guntur-522004. Phone No. 0863 - 2348000

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)
REQUEST FOR PROPOSAL (RFP)

Rc.CE-123869/2018 Dt: 13.06.2018

VMC invites Request for Proposal for "Appointment of Consultant for Preparetion of Detailed Project Report (DPR) to clean up Three Canals of Vijayawada City by regulating sullage outlets into the canal in Vijayawada.

Interested agencies who are having experience in the similar nature of work including experience, having latest technical competency to perform this assignment can obtain the details and the RFP documents from the office of the Commissioner, VMC, Vijayawada by paying Rs. 20,000/- (Rupees Twenty Thousand only) Non-refundable in the form of D.D. drawn in favour of the Commissioner, Municipal Corporation, Vijayawada payable at any Nationalized Bank in Vijayawada. The RFP can also be downloaded from the VMC web site i.e., https://www.ourvmc.org/engg/gentenders.asp and payment of Rs. 20,000/- can be made through DD while submission of RFP.

- **Available/Issue of Tender Schedules.. 14-06-2018 to 28-06-2018 11.00 A.M**
- **Pre Bid meeting date .. 21-06-2018 at 11.00 A.M**
- **Last date for Receipt of Bids .. Upto 28-06-2018, 3.00 P.M**
- **Opening of Technical Bids .. 02-07-2018 at 5.00 P.M.**
- **Opening of Financial Bids .. After Evaluation of technical bids**

If the office happens to be closed on the date of receipt of the bids as specified, the bids will be received and opened on the next working day at the same time and venue.

The Commissioner, VMC reserves the right to reject or cancel any or all the bids without assigning any reason thereof.

Any addendum/corrigendem/bid clarifications/time extension shall be issued on the website only. No spare press notification shall be issued.

Address for Correspondence:
The Chief Engineer, Municipal Corporation, Jawaharlal Nehru Buildings, Canal Road, Vijayawada-520 001, Andhra Pradesh, Cell No.: 98665 14183, 98665 14141 and 97003 21545.

Sd/- Commissioner

అత్తాకోడళ్లను నిర్బంధించి భారీ చోరీ

- గుంటూరు జిల్లా పెనుమాకలో పట్టపగలే దారుణం

తాడేపల్లి - న్యూస్‌టుడే

రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో పట్ట పగలే సినీ పక్కీలో చోరీ జరిగింది. ముగ్గురు గుర్తుతెలియని దుండగులు ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలను నిర్బంధించి రూ.78లక్షల నగదు, 40 సవర్ల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. గుంటూరు అర్బన్ ఎస్పీ విజయారావు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుమాక గ్రామానికి చెందిన మేకా వేమారెడ్డి, అతని కుమారుడు మేకా బ్రహ్మారెడ్డి ఇంట్లో లేని సమయంలో చోరీ జరిగింది. వేమారెడ్డి భార్య కమల, కోడలు పార్వతిని తాళ్లతో నిర్బంధించి బీరువా తాళాలు తీసుకున్న దుండగులు నగదు, నగలను దోచుకుపోయారు. అయితే బీరువాలో మరో బ్యాగులో ఉన్న రూ.68లక్షల నగదును దుండగులు గుర్తించపోవడంతో వదిలేసి పోయారు. కమల తల్లి గొర్ల రాములమ్మకు చెందిన ఎకరం 15 సెంట్ల భూమిని ఏడునెలల కిందట రూ.3కోట్లకు విక్రయించారు. ఈ సొమ్ముతో కృష్ణా జిల్లా ఉయ్యూరు సమీపంలోని దేవరపల్లి వద్ద 3.30 ఎకరాల భూమిని కొనుగోలు చేసేందుకు సొమ్ము ఇంట్లో పెట్టు

చోరీ జరిగిన ప్రదేశాన్ని చూపుతున్న కమల

కున్నారు. గురువారం వేమారెడ్డి, బ్రహ్మారెడ్డి దేవరపల్లి వెళ్లారు. వారు వెళ్లిన అరగంటకే చోరీ జరిగింది.

చోరీ చేశారిలా...

గురువారం ఉదయం 11గంటలకు ఇంట్లో మేకా కమల, మేకా పార్వతి ఉన్నారు. రెండు వేర్వేరు భాగాలుగా ఉన్న ఇంట్లో పార్వతి ఒక గదిలో ఉండగా ఆమె అత్త కమల మరో గదిలో ఉన్నారు. తలుపులు తెరచి కమల ఇంట్లో టీవీ చూస్తుండగా ..గుర్తు తెలియని వ్యక్తి ఒకరు నేరుగా ఇంట్లోకి ప్రవేశించి చిరునామా అడుగుతున్నట్లుగా నటించి కమలపై దాడిచేసి తాళ్లతో కట్టేశాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం అప్పటికే బయట ద్విచక్రవాహనంపై ఉన్న మరో ఇద్దరిలో ఒకరు ఇంటి లోపలికి వచ్చి పక్క గదిలో ఉన్న పార్వతిపై దాడిచేశాడు. తర్వాత మూడో వ్యక్తి కూడా లోపలకి ప్రవేశించాడు. ఆ ముగ్గురూ ఇద్దరి మహిళలపై దాడి చేసి నిర్బంధించారు. దాడిలో పార్వతి చేతిపై గాయం కాగా కమల తీవ్ర అస్వస్థతకు గురైంది. కమల చనిపోయినట్లుగా నటించటంతో ఆమె వద్ద ఉన్న తాళాలను తీసుకుని బీరువాలోఉన్న రెండు నగదు బ్యాగుల్లో ఒక దాన్ని, నగలు ఉన్న మరోసంచిని తీసుకున్న దుండగులు పార్వతి వద్ద ఉన్న బంగారు నగలు లాక్కున్నారు. ఇదే సమయంలో పార్వతి మెడలో తాడు లాక్కునే క్రమంలో తెగిపడిపోయింది. అనంతరం ముగ్గురు దుండగులు ఒకే వాహనంపై వెళ్లిపోయారు. ముగ్గురు దుండగులు ఆ వీధిలోకి ప్రవేశించటం తిరిగి వెళ్లిపోవటం ఆ ప్రాంతవాసులంతా చూసినప్పటికీ తెలిసిన వ్యక్తులు వచ్చారని భావించారు. సంఘటన స్థలానికి వచ్చిన అర్బన్ ఎస్పీ విజయారావు దుండగుల ఆచూకీ తెలుసుకోవడానికి ప్రత్యేకచర్యలు చేపట్టామన్నారు. గొర్లరాములమ్మ భూమి కొనుగోలు చేసిన వారిని, మధ్యవర్తిత్వం వహించినవారితో పాటు కొంత మంది అనుమానితులను విచారిస్తున్నట్లు తెలిపారు. కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయని ఎస్పీ చెప్పారు.

శిల్పారామం సొసైటీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ప్రభుత్వ ఆదేశం

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిల్పారామం సొసైటీ పూర్తి స్థాయిలో విధుల నిర్వహణకు మరో అడుగుపడింది. తెలంగాణ-ఏపీ మధ్య ఈ సొసైటీ విభజన ప్రక్రియ పూర్తవడంతో ఏపీకి సంబంధించిన సొసైటీ సాధారణ కార్యకలాపాలను కొనసాగిస్తోంది. అయితే సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం-2001 కింద రిజిస్టర్ అయితే బైలా వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో వెంటనే రాష్ట్ర శిల్పారామం సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం గురువారం శిల్పారామం ప్రత్యేకాధికారిని ఆదేశించింది. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయితే సొసైటీకి పాలక మండలి, కార్యనిర్వాహక మండలి బాధ్యతలు తీసుకుంటాయి. పాలకమండలి ఏడాదిలో మూడు, నాలుగు సార్లు సమావేశమై సొసైటీ కార్యకలాపాలు, విస్తరణ గురించి నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయాలను కార్యనిర్వాహక మండలి అమలు చేయనుంది. ఈ పనుల పురోగతిని ప్రతీ మూడు నెలలకోసారి కార్యనిర్వాహక మండలి సమావేశమై సమీక్షిస్తుంది.

వర్షాభావం నుంచి పంటలకు రక్షణ

రాష్ట్రంలో 50 వేల ఎకరాల్లో 'జెబా' ప్రాజెక్టు

ఈనాడు, అమరావతి: వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు తేమను అందించే 'జెబా' ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ఉద్యానశాఖ ఆమోదం తెలిపింది. రూ.15.25 కోట్లతో 50 వేల ఎకరాల్లో దీన్ని అమలు చేయనున్నారు. ప్రాజెక్టును ప్రతిపాదించిన యూపీఎల్ సంస్థ రూ.8.33 కోట్లు, రైతులు రూ.1.38 కోట్లు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. జెబా ఉత్పత్తికి రూ.5.50 కోట్లు, శిక్షణ కార్యక్రమాలకు రూ.5 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా 50 శాతం రాయితీపై జెబాను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఉద్యానశాఖ ఉత్తర్వులు ఇచ్చింది.

జెబా అంటే: మొక్కజొన్న పదార్థం నుంచి 'గింజల' రూపంలో దీన్ని తయారు చేస్తారు. తన పరిమాణానికి 400 రెట్లు ఎక్కువ నీటిని నిల్వ చేసుకుంటుంది. గంటలో 90 శాతం నీటిని గ్రహిస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో తనలోని నీటి నిల్వలను మొక్కలకు విడుదల చేస్తుంది.

విజయవాడ-సింగపూర్ విమాన సేవలకు వేళాయె!

అనుమతుల సాధనకు దిల్లీకి అధికారి

ఈనాడు, అమరావతి: విజయవాడ-సింగపూర్ మధ్య విమానయాన సేవలను వచ్చే నెలలో ప్రారంభించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ సేవల ప్రారంభానికి భారత విమానయాన సంస్థ, ఇతర కేంద్ర ప్రభుత్వ శాఖల అనుమతుల కోసం రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) ముఖ్య కార్యనిర్వహణాధికారి గురువారం దిల్లీ వెళ్లారు. విజయవాడ (గన్నవరం)- సింగపూర్ మధ్య విమాన సేవలపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో దాదాపు 80 వేల మంది (సంస్థ వెబ్‌సైట్, ఈమెయిల్ ద్వారా) సానుకూలంగా స్పందించారు. విజయవాడ నుంచి ప్రత్యేక సర్వీసులు నడపాల్సిన అవసరం ఉందని, హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి బయలుదేరాలంటే పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనేకమంది ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల సమీక్షలో నెలాఖరులోగా సింగపూర్‌కు విమానాలు నడిపేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అయితే కేంద్రం నుంచి అనుమతుల జారీలో జాప్యమయ్యే అవకాశం ఉండడంతో వచ్చే నెలలో విమానయాన సేవలు ప్రారంభం కావొచ్చని అధికార వర్గాలు తెలిపాయి. సిల్క్ ఎయిర్, ఇండిగో, స్పైస్ జెట్ తదితర సంస్థలు విజయవాడ- సింగపూర్ మధ్య విమానాలు నడిపేందుకు సిద్ధంగా ఉన్నాయి.

సాగర్, పుట్టపర్తికి..: విజయవాడ- నాగార్జునసాగర్, విజయవాడ- పుట్టపర్తి మధ్య కూడా విమాన సేవలను ప్రవేశపెట్టేందుకు ఏపీఏడీసీఎల్ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోంది. ఈ రెండు ప్రాంతాలకు 9 సీట్ల ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడపాలనేది సంస్థ యోచన.

మోత్కుపల్లితో విజయసాయిరెడ్డి సమావేశం

ఈనాడు, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ బహిష్కృత నేత మోత్కుపల్లి నర్సింహులుతో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి గురువారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించినట్లు సమాచారం. మోత్కుపల్లిని తెదేపా నుంచి బహిష్కరించిన తరువాత ఏపీలో కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం, తాజాగా వైకాపా నేత విజయసాయిరెడ్డి సమావేశం కావడం చర్చనీయాంశమైంది. మోత్కుపల్లి బహిష్కరణతో దళితుల పట్ల చంద్రబాబుకు ఉన్న వివక్ష బయటపడిందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం మోత్కుపల్లి మాట్లాడుతూ.. మరోసారి చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. తెదేపా పగ్గాలను ఎన్టీఆర్ కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పతనం కోసం అన్ని పార్టీలు ఏకం కావాలని, అవసరమైతే జగన్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొంటానని, జనసేన పవన్ కళ్యాణ్‌ను కలుస్తానని ప్రకటించారు. లోకేష్, చంద్రబాబునాయుడు అక్రమ సంపాదనపై సీబీఐతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

అర్హత కలిగిన ప్రతి విద్యార్థికీ విదేశీ విద్యాదీవెన

- మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విదేశీ విద్య కేవలం ధనికులకే కాకుండా పేదవారికీ చెందాలనే ఉన్నత ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ విద్యాదీవెన పథకానికి శ్రీకారం చుట్టారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కాపు, బీసీ కార్పొరేషన్ల ద్వారా విదేశీ విద్యకు నమోదు చేసుకున్న విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన బీసీ, కాపు, ఈబీసీ విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు రూ.పది లక్షల సాయంతోపాటు వీసా, ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. విద్యార్థులు మంచి విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేసుకుని, ఉన్నత గమ్యాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఈ ఏడాది 2,500 మంది విద్యార్థులను విదేశీ విద్యకు పంపాలనేది లక్ష్యమని, అయితే, అర్హులైన విద్యార్థులు ఎంతమంది ఉన్నా అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్.. బీసీలకు రూ.7,500 కోట్లు ఖర్చు పెడితే తెదేపా ప్రభుత్వం నాలుగేళ్లలోనే రూ.16,000 కోట్లు వ్యయం చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడు వై.ఎస్. జగన్ కొత్తగా బీసీ పాట పడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఆయన తండ్రి బీసీలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని జగన్‌కు సవాల్ విసిరారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి రాష్ట్రానికి సేవ చేయలన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు 536 మంది విద్యార్థులు హాజరయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బి.ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

మూడేళ్లుగా చర్చలతోనే కాలయాపన

- నదీ యాజమాన్య బోర్డు పరిధిపై తేలని నిర్ణయం
- అతీగతీ లేని అపెక్స్ కౌన్సిల్ సమావేశం
- కార్యాచరణకు దిగని కేంద్రం

ఈనాడు - హైదరాబాద్

ప్రాజెక్టుల వారీ నీటి కేటాయింపులు పెండింగ్‌లో పెట్టి కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు పరిధిని నోటిఫై చేద్దామనీ.. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తుది తీర్పు ఇచ్చిన తర్వాత అవసరమైతే సవరణ చేద్దామనీ.. అపెక్స్ కౌన్సిల్ నిర్వహించి దీనిపై తుది నిర్ణయం తీసుకొందామని.. ఈ ఏడాది ఫిబ్రవరిలో జలవనరుల మంత్రిత్వశాఖ రెండు తెలుగు రాష్ట్రాలతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకొంది. ఈ సమావేశం జరిగి నాలుగు నెలలైనా ఇప్పటికీ అపెక్స్ కౌన్సిల్ సమావేశం లేదు, బోర్డు పరిధి లేదు. గత మూడేళ్లుగా కేంద్రం ఇలాంటి చర్చలతో కాలయాపన చేయడం తప్ప కార్యాచరణ మాత్రం ఉండటం లేదు. మళ్లీ వర్షాకాలం ప్రారంభమై ప్రాజెక్టుల్లోకి నీళ్లొస్తున్నాయి. నీటి కేటాయింపు, విడుదలపై బోర్డు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నీటి విడుదలపై ఆదేశాలు అమలయ్యేలా చూడాల్సి ఉంది. కానీ ఇప్పటిదాకా బోర్డు పరిధి కానీ, వర్కింగు మాన్యువల్ కానీ ఖరారు కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న దిల్లీలో సమావేశం జరిగితే, ఇందులో చర్చించిన అంశాలు, తీసుకొన్న నిర్ణయాలకు సంబంధించిన మినిట్స్ జూన్ మొదటి వారంలో పంపింది. మినిట్స్ రావడానికే నాలుగు నెలలు పడితే, ఇక తీసుకొన్న నిర్ణయాలు అమలు జరిగేదెప్పుడన్నది చర్చనీయాంశంగా మారింది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు సంబంధించిన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకొనేందుకు కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఫిబ్రవరి 15న రెండు రాష్ట్రాలు, బోర్డు అధికారులు, జలసంఘం ఛైర్మన్ తదితరులతో సమావేశం జరిగింది. జలవనరుల మంత్రి, ఇద్దరు ముఖ్యమంత్రులతో కూడిన అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి ముందుగా వివిధ అంశాల పరిష్కారానికి దీనిని ఏర్పాటు చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేసిన తర్వాత పరిధిని నోటిఫై చేయాలని తెలంగాణ కోరగా, దాంతో సంబంధం లేకుండా చేయాలని ఏపీ కోరింది. చర్చల తర్వాత పరిధి లేకుండా కృష్ణా, గోదావరి బోర్డులు పని చేయడం కష్టంగా ఉందని, తమ అధికారాలను పటిష్ఠంగా అమలు చేయలేకపోతున్నారని, ముందుగా పరిధిని నోటిఫై చేసి ట్రైబ్యునల్ తీర్పు తర్వాత అవసరమైతే సవరణలు చేద్దామని జలవనరుల శాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల్లో తమ పరిధిలోని ప్రాజెక్టులను కృష్ణా, గోదావరి బోర్డులు నిర్వహిస్తాయన్నారు. అపెక్స్ కౌన్సిల్ తర్వాత తుది నిర్ణయం తీసుకొంటామని పేర్కొనడం తప్ప ఇంతవరకు అతీగతీలేదు. రెండు బేసిన్ల పరిధిలోని ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, చిన్ననీటి వనరుల కింద నీటి వినియోగాన్ని లెక్కగట్టడం ఇలా అన్ని అంశాలపైన చర్చించారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల ద్వారా నీటి వినియోగంపై చర్చ జరిగింది. బచావత్ ట్రైబ్యునల్, తర్వాత జల సంఘం అనుమతించిన ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యం, మిగులు/వరద జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులకు తర్వాత నీటి వినియోగం ఉండాలన్న ప్రతిపాదనపై చర్చించి కేంద్ర జలసంఘం, రెండు రాష్ట్రాల సహకారంతో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిర్వహణ ప్రోటోకాల్ తయారు చేయాలని నిర్ణయం జరిగినా.. ఇప్పటి వరకు లేదు. మళ్లీ కొత్త నీటి సంవత్సరం మొదలైంది. గోదావరి నుంచి మళ్లించే నీటిలో వాటా, ఇందుకోసం ఏర్పాటు చేసిన బజాజ్ కమిటీపై చర్చించారు. రెండు రాష్ట్రాలు పరస్పర అంగీకారంతో ఓ ప్రతిపాదనతో రావాలని, లేకుంటే గోదావరి నీరు, విద్యుత్తు పంపిణీపై ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తామని కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి ప్రకటించారు. ఇదీ ముందుకు పడలేదు. ఇలా అన్ని అంశాలు చర్చలకే పరిమితమవుతున్నాయి.

కొత్త పింఛను పథకాన్ని రద్దు చేయాల్సిందే

రైల్వే కార్మికులపై తీవ్ర పని భారం: మర్రి రాఘవయ్య

ఈనాడు, హైదరాబాద్: కొత్త పింఛను పథకంతో రైల్వే ఉద్యోగులకు నష్టం జరుగుతోందని.. ఈ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను పథకాన్ని పునరుద్ధరించాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమన్(ఎన్ఎఫ్ఐఆర్), సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్(ఎస్‌సీఆర్ఈఎస్) డిమాండ్ చేశాయి. రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ స్పందించి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో భారీఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆ సంఘాల ప్రధానకార్యదర్శి మర్రి రాఘవయ్య ప్రకటించారు. ఎస్‌సీఆర్ఈఎస్ 30వ జనరల్ బాడీ సమావేశాల సందర్భంగా గురువారమిక్కడ ఆయన మాట్లాడారు. కార్మికులపై పనిభారం పెరుగుతోందని, దీనివల్ల రైళ్ల భద్రతపై ప్రభావం పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేశారు. "ఛార్జీలు పెంచకపోయినా రైల్వేలకు గతేడాది రూ.16 వేల కోట్ల ఆదాయం అధికంగా వచ్చింది. రైల్వేల ప్రైవేటీకరణ, పొరుగుసేవల సిబ్బంది నియామకం వంటి చర్యల్ని రైల్వే యాజమాన్యం ఉపసంహరించుకోవాలి. 2.50 లక్షలమంది కార్మికులతో నిబంధనలకు విరుద్ధంగా నిత్యం 12 గంటలు పనిచేయిస్తుండటంతో ఆరోగ్యం దెబ్బతింటోంది. దీన్ని 8 గంటలకు తగ్గించాల్సిందే. 7వ ఆర్థికసంఘం 13.16 లక్షల రైల్వే ఉద్యోగులకు ద్రోహం చేసింది. కనీస వేతనం రూ.26 వేలు ఉండాలి.. తగ్గించిన హెచ్‌ఆర్ఏను 24 నుంచి 30 శాతానికి పెంచాలి" అని రాఘవయ్య డిమాండ్ చేశారు.

పింఛన్ సొమ్ము కాజేస్తున్నారు..

- చనిపోయినా బతికున్నట్లు లెక్కలు
- సామాజిక తనిఖీ నివేదికలో బహిర్గతం

ఈనాడు డిజిటల్ - అమరావతి

ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో అక్రమాలు అరికట్టేందుకు ఎంత ప్రయత్నిస్తున్నా అక్రమార్కులు స్వాహాపర్వాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, డయాలసిస్ చేయించుకుంటున్న వారు, హిజ్రాలు, ఒంటరి మహిళలకు రూ. 1000 నుంచి రూ.2,500 వరకు అందిస్తోంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా అరకోటి(50 లక్షలు)పైగా పింఛన్లను పంపిణీ చేస్తూ ప్రతి నెలా రూ. 522 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. వీటిపై సామాజిక తనిఖీ బృందం అధికారులు ప్రతి ఏటా తనిఖీ నిర్వహిస్తున్నారు. 2017-18 ఏడాదికి సంబంధించి నిర్వహించిన తనిఖీలో 8,413 మందికి చనిపోయిన తర్వాత కూడా పింఛన్లు మంజూరైనట్లు తేల్చారు. ఇలా రూ.3 కోట్లు దుర్వినియోగం అయింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలో 2017-18 ఏడాదికి సంబంధించి పింఛన్ల పంపిణీలో రూ.28.51 లక్షల దుర్వినియోగం అయినట్లు ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీలో వెల్లడైంది. విజయనగరం జిల్లా కురుపాం మండలం, కొమరాడ మండలాల్లో మృతిచెందిన 38 మంది పేర్లపై పింఛన్లు పొందినట్లు తనిఖీలో నిర్ధారణ అయింది. జరిగిన అక్రమాలకు దృష్టాంతాలివి.

వక్రమార్గాలను అన్వేషిస్తూ...

అక్రమాలకు పాల్పడుతూపథకంలోని అవినీతికి అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానంలో వేలిముద్రలు పడిని వారికి పంపిణీ చేసే అధికారే సొంత ధ్రువీకరణతో పింఛను ఇవ్వాలని చెప్పింది. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకుని కొంత మంది అక్రమార్కులు సర్కారీ సొమ్మును కాజేస్తున్నట్లు గుర్తించి 2018 నుంచి సొంత ధ్రువీకరణకు ఫొటో గుర్తింపు తప్పనిసరి చేశారు. ఇక్కడ కూడా పింఛనుదారుల పింఛను పుస్తకాన్ని, గోడ చిత్రం.. ఇలా ఏదో ఒక చిత్రాన్ని ఫొటో తీసి దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. మార్చి నుంచి పింఛనుదారుల ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నిషన్) తప్పనిసరి చేశారు. ముఖ గుర్తింపు అప్‌లోడ్ చేయడం తప్పనిసరని చెబుతున్నా ఇప్పటికీ చాలా గ్రామాల్లో చేయడం లేదు. పింఛను పంపిణీ చేసే సమయంలో జాబితాను ప్రదర్శించాల్సి ఉన్నా కొన్ని గ్రామాల్లో అది జరగడం లేదు. దీంతో చనిపోయిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించకుండా బతికి ఉన్నట్టే చూపిస్తూ ప్రభుత్వ సాయాన్ని నొక్కేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో జబ్బు చేసిన వారికి, కొండపైన ఉన్న గ్రామాల్లో ఉంటూ కిందికి దిగడానికి ఇబ్బంది పడే వారికి వీలుగా నామినీ ద్వారా పింఛను సాయం అందించాలన్న నిబంధనను అవకాశంగా తీసుకుని వాస్తవ లబ్ధిదారులు చనిపోయిన తర్వాత కూడా బతికి ఉన్నట్లే చూపిస్తూ సొమ్ము కాజేస్తున్నారు.

చీనీ ధర పడిపోయె.. రైతుకు కునుకేలేదాయె..

ధరలో హెచ్చుతగ్గుల కారణంగా చీనీ రైతులకు కంటిమీద కునుకులేకుండాపోతోంది. 20 రోజుల క్రితం క్వింటా ధర రూ. 60వేలు ఉన్నప్పుడు కొద్దోగొప్పో పండించిన రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ రేటు మారుతూ తీవ్ర ఒడిదుడుకులు ఉండటంతో రైతులు పంట తీయాలా వద్దా అని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నాడు. మంచి రేటు వస్తోందని కాయలు కోసిన రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చి ఉసూరంటున్నారు. కారణం అక్కడ ధర క్వింటా రూ. 31 వేలు పలకడమే. గతంలో కాయలకు సూట్ ఉండేది. (అంటే 10 క్వింటాళ్లు తీసుకువస్తే తరుగు కింద 8 క్వింటాళ్లకే వ్యాపారులు డబ్బులు చెల్లించేవారు) ఇప్పుడు దాన్ని ఎత్తివేసినా వ్యాపారులంతా కుమ్మక్కై తక్కువ ధరలు నిర్ణయించి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. అనంతపురం జిల్లా మార్కెట్‌కు 4రోజుల కింద చీనీ కాయలను తీసుకువచ్చిన రైతులు ధరలోహెచ్చుతగ్గుల కారణంగా అటు అమ్ముకోలేక.. ఇటు ఇంటికి తీసుకెళ్లలేక తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. - ఈనాడు, అనంతపురం

రయ్ రయ్

ఈనాడు
విజయవాడ
శుక్రవారం జూన్ 15, 2018

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
హైదరాబాద్ - 501512

autopage@eenadu.in

రెండింటి కలయిక

లోగో'ట్టు

ఆటోమొబైల్ కంపెనీల్లో అత్యధికసార్లు మార్పులకు గురైన లోగో నిస్సాన్. కానీ ఆ కంపెనీకి, లోగోకి పెద్ద చరిత్రే ఉంది. 1920ల్లోనే ఖ్వైషిన్హా మోటార్‌వర్క్స్ డాట్ (డీఏటీ) అనే జపాన్ కంపెనీ ప్రయాణికుల కార్లను ఉత్పత్తి చేయడం మొదలుపెట్టింది. ఇదే దాట్సున్. 1930ల్లో సోషిసుకే నిప్పాన్ సాంగ్యో అనే మరో కంపెనీ మొదలైంది. దీన్నే సంక్షిప్తంగా ని-సాన్ అనేవాళ్లు. తర్వాత ఈ రెండూ విలీనమయ్యాయి. అంతకుముందు దాట్సున్‌కి నీలం రంగుతో, దీర్ఘచతురస్రాకారపు బాక్స్‌లో దానిపై తెలుపు రంగులో దాట్సున్ అనే అక్షరాల లోగో ఉండేది. ఆ దీర్ఘచతురస్రాకారపు బాక్స్ వెనకాల ఎరుపు రంగు వృత్తం ఉండేది. ఇది ఉదయించే సూర్యునికి సంకేతం. 1984వరకు ఇదే కొనసాగించారు. 1988లో నీలం రంగు స్థానంలో బూడిద రంగు మార్చారు. ఎరుపురంగు వృత్తం వెండి వర్ణంలోకి మారింది. ఇంకొన్నాళ్లకు నిస్సాన్ అనే అక్షరాలు నలుపురంగులోకి మార్చారు. ఆపై వృత్తానికి సమాంతరంగా మరో వృత్తం వచ్చేలా చేసి వెనక బ్యాక్‌గ్రౌండ్‌ని పూర్తి నలుపురంగులోకి మార్చారు. 2012లో నిస్సాన్ లోగో చివరిసారిగా మార్పులకు గురైంది. మొత్తం లోగోకి గ్రేడియెంట్ షేడ్స్ ఇవ్వడంతో తళతళలాడుతూ నేటి రూపం సంతరించుకుంది.

బజాజ్ బాక్సర్.. భారత్‌లో కనపడదు.. విదేశాల్లో దుమ్ము రేపుతుంది...
ఫోర్డ్ ఎకోస్పోర్ట్‌ది ఇక్కడే కాదు.. ఎగుమతుల్లోనూ దూకుడే...
మన రాయల్‌ఎన్‌ఫీల్డ్.. ఇంగ్లండ్‌లో ఫేవరిట్ మోటార్‌సైకిల్...
నిస్సాన్ మైక్రా.. ఇండియాలో అరుదేగానీ సరిహద్దులు దాటడంలో ముందుంది...
ఇలా విదేశాల్లో అమ్మకాల జెండా ఎగరేస్తున్న మేడ్ ఇన్ ఇండియా వాహనాల వివరాలు.

భారత్‌లో తయారీ.. జగమంతా సవారీ!

ముప్పై ఏళ్ల కిందట కారు, మోటార్‌సైకిల్ మోడళ్లు మహా అయితే పదికి మించి కనిపించేవి కావు. 'ఫారిన్ మేడ్' వాహనం రోడ్డుపై కనిపిస్తే పండగే. ఇప్పుడు రోజుకో విదేశీ కంపెనీ భారత మార్కెట్‌లో కొత్త మోడల్ దించేస్తోంది. మేటి ఆటోమొబైల్ కంపెనీల చూపంతా ఇక్కడే. ఇంకా చెప్పుకోదగ్గ విశేషం ఏంటంటే.. ఎన్నో విదేశీ కంపెనీలు ఇండియాను తయారీకేంద్రంగా ఎంచుకుంటున్నాయి. ఇక్కణ్నుంచే ఎగుమతి చేస్తున్నాయి. దేశీయ దిగ్గజాలూ పోటీలో ముందున్నాయి. ఈ జోరు ఎంతలా ఉందంటే 2020 నాటికి ఇండియా అత్యధికంగా కార్లను ఎగుమతి చేసే దేశంగా నిలవబోతోందంటోంది స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్ అధ్యయనం. ఆ జోరుకు సాక్ష్యమా అన్నట్టు ఒక్క నెలలోనే ఇండియా నుంచి రెండు లక్షల బైక్‌లు సరిహద్దులు దాటుతున్నాయి. ఒక్క హ్యుందాయ్ కంపెనీనే ఇప్పటివరకు 27లక్షల వాహనాలను ఎగుమతి చేసింది. అలా మేడిన్ ఇండియా ముద్ర వేసుకొని బయటి దేశాల్లో హల్‌చల్ చేస్తున్న కొన్ని టాప్ కార్లు, బైక్‌లు.

రెండుచోట్లా టాప్

మోడల్: ఫోర్డ్ ఎకోస్పోర్ట్ **తయారీకేంద్రం:** చెన్నై
ఎన్నిదేశాలకు: అరవైకిపైగా **యూనిట్లు:** 91వేలు

భారత్‌లో అత్యధికంగా అమ్ముడవుతున్న స్పోర్ట్ యుటిలిటీ వాహనాల్లో ఒకటి ఫోర్డ్ ఎకోస్పోర్ట్. ఇంట గెల్చిన ఈ వాహనం విదేశాల్లోనూ రచ్చ చేస్తోంది. ఏడాదికి యాభైశాతం చొప్పున ఎగుమతులు వృద్ధి చెందుతున్నాయి. ఈ అమెరికా కంపెనీ అమ్మకాలు లాటిన్ అమెరికా, యూరోప్‌ల్లో ఎక్కువగా ఉన్నాయి. 2017లో భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతైన మోడల్ ఇది.

జోరుకు కారణం

- వ్యాపార నిర్వహణ, విస్తరణకు సానుకూల వాతావరణం
- తయారీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు. మేక్ ఇన్ ఇండియాలాంటి కార్యక్రమాలు
- దేశం నలుమూలలా ఉన్న నౌకాశ్రయాలు. చకన్, గురుగ్రామ్, సనంద్, ఒరగడంలాంటి ఆటోమొబైల్ హబ్‌లతో అనుసంధానమైన రవాణా వ్యవస్థ
- సాంకేతిక పరిజ్ఞానానికి కొదవ లేదు. తక్కువ వేతనాలకే పనిచేసే సుశిక్షితులైన మానవ వనరులు
- మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త మోడళ్లను తయారు చేస్తున్న పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు
- ఆటోమొబైల్ తయారీ కేంద్రాలైన థాయ్‌లాండ్, దక్షిణామెరికాల్లో వాహన తయారీ ఖర్చులు పెరుగుతుండటం.

ఆరేళ్ల కింద మొదలైన హవా

మోడల్: ఫోక్స్‌వాగన్ వెంటో
తయారీ కేంద్రం: చకన్ (మహారాష్ట్ర)
ఎన్ని దేశాలకు ఎగుమతి: 80కి పైగా **యూనిట్లు:** 77వేలు

వెంటో మోడల్ ఇక్కడ పెద్దగా అమ్ముడుకాకపోవచ్చుగాక.. మెక్సికోలో అత్యధికంగా ఉపయోగిస్తున్న కార్లలో దీనిది మూడోస్థానం. ఆ ఒక్క దేశానికే ఇప్పటికి రెండులక్షల ఎనభైవేల కార్లు ఎగుమతయ్యాయి. ఆరేళ్ల కిందట తొలిసారి దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టింది. అప్పట్నుంచి అమ్మకాలు ఏడాదికి పదమూడుశాతం చొప్పున పెరుగుతున్నాయి.

ఇదే నెంబర్‌వన్

మోడల్: బజాజ్ బాక్సర్ 100 **తయారీ కేంద్రం:** ఔరంగాబాద్
ఎగుమతయ్యే దేశాలు: యాభైకిపైగా

బజాజ్ బాక్సర్.. ఈ బైక్ పేరు వినుండొచ్చుగానీ మన దగ్గర కనిపించడం అరుదే. కానీ హోండా యాక్టివా, హీరో స్ప్లెండర్‌లాంటి అత్యధిక అమ్మకాల వాహనాల్ని తోసిరాజని విదేశాల్లో గిరాకీ సంపాదించుకుంది. ముఖ్యంగా లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఇది హాట్‌కేక్‌లా అమ్ముడవుతోంది. ఇప్పటివరకు మూడున్నర లక్షలు దేశం దాటాయి.

ఐరోపాలో మేటి

మోడల్: నిస్సాన్ మైక్రా **తయారీ కేంద్రం:** చెన్నై
ఎన్నిదేశాలకు ఎగుమతి?: వందకుపైగా **యూనిట్లు:** 52వేలు

దేశంలో మైక్రా పెద్దగా కనపడకపోవచ్చుగానీ ఈ మేడ్ ఇన్ చెన్నై కార్లు విదేశాల్లో దుమ్ము దులుపుతున్నాయి. ఐరోపాలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఆసియా కారుగా దీనికి రికార్డు ఉంది. ఇప్పటికి ఏడున్నర లక్షల కార్లు ఇక్కడినుంచి బయటికి వెళ్లాయి. 2016లో ఇండియా నుంచి అత్యధికంగా విదేశాలకు ఎగుమతి అయినా మోడల్‌గా రికార్డు సృష్టించింది.

హీరోలా దూసుకెళ్తోంది

మోడల్: హీరో మోటోకార్ప్ స్ప్లెండర్
తయారీ: హరిద్వార్, సత్యవేడు, గురుగ్రామ్
ఎగుమతయ్యే దేశాలు: శ్రీలంక, బంగ్లాదేశ్, కొలంబియా, నేపాల్, లాటిన్ అమెరికా, మధ్యప్రాశ్చ్యం

మంచి మైలేజీ, ఆకట్టుకునే రూపం స్ప్లెండర్ సొంతం. సరిగ్గా ఈ ఫీచర్లే పొరుగుదేశాలను ఆకర్షించాయి. హీరో కంపెనీ ఎగుమతులు పరుగులు తీస్తున్నాయి. తయారీ కేంద్రాలు దేశమంతా ఉండటంతో రవాణాకు అనుకూలంగా ఉంది.

విదేశాల్లో హవా

మోడల్: రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్
తయారీ: చెన్నై
ఎగుమతయ్యే దేశాలు: 62

రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల్లో ఐదారేళ్లలో టాప్‌గేర్‌లో దూసుకెళ్తోంది. ఈ జోరు దేశీయంగానే కాదు ఎగుమతుల్లోనూ కనిపిస్తోంది. బ్రిటన్‌లో చాలామంది మెచ్చిన బైక్ ఇది. మొత్తానికి అరవైరెండు దేశాల్లో పరుగులు పెడుతోంది. ఈశాన్య ఆసియా, ఉత్తర అమెరికాల్లోనూ గిరాకీ ఎక్కువే.

బీట్ చేసేదెవరు?

మోడల్: షెవర్లే బీట్ **తయారీ కేంద్రం:** పుణె,
ఎగుమతి యూనిట్లు: 84వేలు **ఎగుమతయ్యే దేశాలు:** చిలీ, పెరూ, అర్జెంటీనా, మధ్య అమెరికాలతోపాటు యాభైకి పైగా

ఈమధ్యే షెవర్లే ఇండియాలో అమ్మకాలు నిలిపేసింది. ఉత్పత్తి మాత్రం ఆపలేదు. పుణె దగ్గర్లోని టాలెగావ్‌లో తయారవుతున్న బీట్ కార్లు మారుతీ, హ్యుందాయ్, హోండాలాంటి దేశీయంగా అత్యధికంగా అమ్ముడవుతున్న కార్లను వెనక్కి తోసి మరీ ఎక్కువగా ఎగుమతి చేస్తోంది.

భారత్ ప్రపంచ కేంద్రం

ఆటోమొబైల్ తయారీ, ఎగుమతులకు భారత్ త్వరలోనే ప్రపంచకేంద్రం కాబోతోంది. హ్యుందాయ్‌తోపాటు నిస్సాన్, ఫోర్డ్‌లాంటి ప్రపంచస్థాయి విదేశీ కంపెనీలు ఇండియాను తయారీ కేంద్రంగా ఎంచుకున్నాయి. పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. మారుతీ, టాటా మోటార్స్, టీవీఎస్‌లాంటి దేశీయ కంపెనీలూ పెద్దస్థాయిలో వాహనాల్ని ఎగుమతి చేస్తున్నాయి. తక్కువ వేతనాలకే పని చేసే నిపుణులు, మంచి మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం ప్రోత్సాహం, ప్రపంచంలో ఏ మూలకైనా చేరగల రవాణా సౌకర్యాలు.. విదేశీ కంపెనీలు ఇక్కడ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కారణం. మన దగ్గర ఉత్పత్తయ్యే వాహనాలకు పొరుగుదేశాలతోపాటు మధ్యప్రాశ్చ్యం, దక్షిణ అమెరికా, యూరోప్‌ల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. అక్కడికి ఎగుమతి చేయడానికి దేశంలో చాలావరకు నౌకాశ్రయాలు అందుబాటులో ఉన్నాయి. ఇయాన్, గ్రాండ్ ఐ10, ఐ20, యాక్సెంట్, క్రెటా, వెర్నా.. మోడళ్లను ఇక్కడినుంచే 88 దేశాలకు ఎగుమతి చేస్తున్నాం.

- రాకేశ్ శ్రీవాత్సవ, డైరెక్టర్: సేల్స్ అండ్ మార్కెటింగ్ హ్యుందాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్

అక్కడా.. ఇక్కడా

మోడల్: హ్యుందాయ్ క్రెటా **తయారీ కేంద్రం:** చెన్నై
యూనిట్లు: 51వేలు **ఎగుమతయ్యే దేశాలు:**

భారత్‌లో అత్యధికంగా అమ్ముడయ్యే రెండో కార్ల కంపెనీ హ్యుందాయ్. ఇక్కడ అత్యధికంగా అమ్ముడవడమే కాదు.. భారత్‌లో తయారై అత్యధికంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్న కంపెనీల్లో ముందుంది. ఇక్కడే గిరాకీ ఎక్కువగా ఉండటంతో గతేడాది అమ్మకాల్లో కొంచెం వృద్ధి తగ్గింది.

(గణాంకాలు: ఏప్రిల్ 2017 నుంచి మార్చి 2018)

మొదటి సవారీ

హీరో అయ్యాకే కారు

రోల్స్‌రాయిస్‌లు, బీఎండబ్ల్యూలు, ఫెరారీలు, ఆడీలు, బెంజ్‌లు.. అన్నీ కలిపి ఇరవై అయిదు. బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ గ్యారేజీలో కొలువైన కార్ల లెక్కలివి. కానీ అమితాబ్ కొన్న మొదటి కారు ఏంటో తెలుసా? ఫియట్. అదీ తన మొదటి సినిమా 'సాత్ హిందుస్థానీ' విడుదలయ్యాకే సెకండ్‌హ్యాండ్‌లో కొన్నాడు. అప్పటిదాకా బచ్చన్‌సాబ్ ప్రయాణం ఆటోలు, బస్సుల్లోనే సాగేది. నాన్న హరివంశ్‌రాయ్‌బచ్చన్ గొప్ప రచయిత, కలిగిన కుటుంబం అయినా కొడుకు తన సంపాదనతోనే వాహనం కొనుక్కోవాలనే షరతు పెట్టడంతో తన కోరిక నెరవేర్చుకోవడానికి అమితాబ్‌కి చాన్నాళ్లు వేచిచూడక తప్పలేదు.

మెకానిక్ గురూ

వెనక టైరు వేడెక్కుతోంది

■ ఎనిమిది నెలల కిందట సుజుకీ ఆల్ న్యూ యాక్సెస్ 125 స్కూటీ కొన్నాను. నాలుగు నెలల్లో నాలుగుసార్లు పంక్చర్ అయింది. ట్యూబ్‌లెస్ టైర్లు వేయించాను. అప్పట్నుంచి పది కిలోమీటర్లు ప్రయాణించినా వెనక టైరు వేడెక్కుతోంది. బీడింగ్, పీఎస్ఐ, బ్రేక్ డంపర్, నెక్.. అన్నీ బాగానే ఉన్నాయి. సర్వీస్ సెంటర్ వాళ్లు టైరు మార్చమంటున్నారు. టైరు కంపెనీవాళ్లు అక్కర్లేదంటున్నారు. సమస్యేంటి? పరిష్కారమేంటి?

- ఎల్.సిద్దేశ్వర్, అమలాపురం

మీరు చెప్పిన వివరాలను బట్టి

1) మీ టైరు గాలి ఒత్తిడి (టైరు ప్రెషర్)ను చల్లని వాతావరణం, వేడెక్కిన వాతావరణంలో ఓసారి చెక్ చేయండి. రెండు పరిస్థితుల్లో ఇది ఒకేలా ఉండాలి.
2) వెనక చక్రం బేరింగ్ గ్రీజింగ్, హబ్‌లను పరిశీలించాలి. దీని అమరికలో ఏదైనా తేడా వచ్చి ఉండొచ్చు.
3) ఒకవేళ బ్రేక్ డ్రమ్ వంగిపోయి ఉండొచ్చు.

■ నా బైక్ ఇప్పటికి 9,500కిమీలు తిరిగింది. ఇంజిన్ ఫ్లషింగ్ చేయిస్తే ఇంజిన్ జీవితకాలం పెరుగుతుందని మెకానిక్ చెప్పాడు. దీంతో మార్కెట్లో దొరికే ఫ్లషింగ్ ద్రావకాలు ఉపయోగించి ఫ్లషింగ్ చేయించాను. కానీ ఈమధ్య నా స్నేహితుడొకరు ఈ ప్రక్రియ ఇంజిన్‌కి హాని చేస్తుందని చెప్పాడు. ఏది నిజం?

- ఎం.వి.రఘునాథ్, విశాఖపట్నం

ఇంజిన్ గేర్‌బాక్స్‌లోని గ్రీజు అవక్షేపాలు, వ్యర్థాలు తొలగించే ఉద్దేశంతో ఇంజిన్ ఫ్లష్ చేస్తారు. ఈ క్రమంలో కొన్ని కర్బన వ్యర్థాలు సైతం బయటికొస్తాయి. కానీ ఇది లోపల ఉండే వాల్వ్ సీటింగ్‌పై ప్రభావం చూపిస్తుంది. లోపల్నుంచి ఒకరకమైన శబ్దం వస్తుంది. తొమ్మిదిన్నరవేల కిలోమీటర్లు తిరిగిన ద్విచక్రవాహనానికి ఈ ప్రక్రియ అవసరం లేదు. పనితీరుపై పెద్దగా పడే ప్రయోజనం కూడా ఏమీ ఉండదు. దీంతో ఒనగూరే ప్రయోజనం ఏంటంటే.. ఆయిల్ చురుగ్గా కదలడానికి పనికొస్తుంది. మీ బైక్‌కి రెండున్నర వేల కిలోమీటర్లకు ఓసారి ఆయిల్ మార్పిడి చేస్తే సరిపోతుంది.

■ బీటెక్ విద్యార్థిని. మంచి స్టైల్, పవర్ ఉన్న బైక్ రూ. రెండులక్షల్లో సూచించండి.

- మనోహర్, ఈమెయిల్

రాయల్ ఎన్‌ఫీల్డ్ థండర్‌బర్డ్ 350ఎక్స్, హోండా సీబీఆర్ 250ఆర్, కేటీఎం ఆర్సీ 200 మీ బడ్జెట్‌లో దొరుకుతాయి. మైలేజీ, పికప్, ఫీచర్లు.. వీటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఇంకా తక్కువ ధరలోనే మంచి మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. నచ్చింది ఎంచుకోండి.

- సాయిభరత్ బొప్పరాజు, www.motofix.in

ఈనాడు సినిమా

ఎన్టీఆర్

ఎన్టీఆర్‌కి మరో అబ్బాయి

కథానాయకుడు ఎన్టీఆర్ ఇంట మరో చిన్నారి సందడి మొదలైంది. అభయ్‌రామ్ ఇకపై తమ్ముడితో కలిసి ఆడుకోనున్నాడు. ఎన్టీఆర్ భార్య లక్ష్మీప్రణతి గురువారం మధ్యాహ్నం 1.00 గంటకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పండంటి మగబిడ్డకి జన్మనిచ్చారు. ఆ విషయాన్ని ఎన్టీఆర్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. 'నా కుటుంబం మరింత పెద్దదైంది. అబ్బాయి పుట్టాడు' అని ట్వీట్ చేశారు. ఎన్టీఆర్, లక్ష్మీప్రణతి దంపతులకి 2014లో అభయ్‌రామ్ పుట్టాడు. రెండోసారీ అబ్బాయే పుట్టడంతో 'తారకరాముడికి లవకుశలు' అంటూ అభిమానులు, సన్నిహితులు అభినందించారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్టీఆర్ దంపతులకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 'జై లవకుశ'తో విజయాన్ని అందుకొన్న ఎన్టీఆర్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'అరవింద సమేత'లో నటిస్తున్నారు.

హైదరాబాద్‌లో చరణ్ చిత్రం

రామ్‌చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. కైరా అడ్వాణీ కథానాయిక. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. రామ్‌చరణ్, ఇతర చిత్రబృందంపై కుటుంబ నేపథ్యంలో సాగే కొన్ని సన్నివేశాలతో పాటు, యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్ నటిస్తున్న చిత్రమిది. ఇందులో రామ్‌చరణ్ మళ్లీ ట్రెండీ లుక్‌లో కనిపించబోతున్నారు. ఇటీవలే బ్యాంకాక్‌లో చిత్రీకరణ జరిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్ అనంతరం విదేశాల్లో కొన్ని పాటల్ని తెరకెక్కించబోతున్నట్టు తెలిసింది. ఈ చిత్రంలో వివేక్ ఒబెరాయ్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రశాంత్, స్నేహ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.


రామ్‌చరణ్

అది కూడా ఓ కారణమే!

మరిన్ని అర్థవంతమైన పాత్రలు చేయడమే తన ముందున్న కర్తవ్యం అంటోంది సమంత. వరుస విజయాలతో దూసుకెళుతున్న ఆమె, భవిష్యత్తులో మరిన్ని బలమైన కథానాయిక పాత్రలు తెరపై సందడి చేస్తాయనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తోంది. "ఇలాంటి పాత్రల్ని రాస్తే చేయడానికి ఇప్పుడెవరున్నారు? అనే ప్రశ్నకి ఇప్పుడు ఆస్కారమే లేదు. అవకాశమిస్తే, నిరూపించుకొనేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారు. ఆ ప్రతిభ దర్శకులకి కనిపిస్తోంది కాబట్టే, వాళ్లు మరింత ధైర్యంగా పాత్రల్ని సృష్టిస్తున్నారు. నటులు చూపించే ప్రతిభ కూడా దర్శకుల్ని చాలా వరకు ప్రభావితం చేస్తుంటుంది. నేనొక బలమైన పాత్రలో నటించాక, ఏ దర్శకుడైనా ఆ స్థాయి పాత్రనే నా కోసం సిద్ధం చేయాలని భావిస్తాడు. అలా నేను ప్రదర్శించిన ప్రతిభ, నేను ఎంపిక చేసుకొన్న కథలు కూడా నటిగా నా ఎదుగుదలకి కారణం అయ్యాయ"ని సెలవిచ్చింది సమంత. ప్రస్తుతం ఆమె 'యుటర్న్' చిత్రంలో నటిస్తూ బిజీగా గడుపుతోంది.

సమంత

'తేజ్' విడుదల ఖరారు

సాయిధరమ్ తేజ్, అనుపమ పరమేశ్వరన్

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'తేజ్'. ఐ లవ్ యు అనేది ఉపశీర్షిక. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఎ.కరుణాకరన్ దర్శకత్వం వహిస్తున్నారు. కె.ఎస్.రామారావు, వల్లభ నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జులై 6న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. నిర్మాతలు మాట్లాడుతూ "మంచి అనుభూతిని పంచే ఓ ప్రేమకథా చిత్రమిది. సాయిధరమ్ తేజ్, అనుపమ జంట ఆకట్టుకుంటుంది. ఈ నెల 16న విజయవాడలో పాటల విజయోత్సవాన్ని నిర్వహిస్తున్నామ"ని తెలిపారు. జయప్రకాష్, పవిత్ర లోకేశ్, పృథ్వీ, సురేఖావాణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: ఆండ్రూ, మాటలు: డార్లింగ్ స్వామి.

సల్మాన్ చంకెక్కి ముద్దిచ్చిన షారుఖ్

షారుఖ్‌ఖాన్ మరుగుజ్జు పాత్రలో నటిస్తున్న చిత్రం 'జీరో'. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రత్యేక టీజర్‌ను రంజాన్ సందర్భంగా విడుదల చేశారు. ఇందులో షారుఖ్‌ఖాన్‌తో పాటు సల్మాన్‌ఖాన్ కూడా సందడి చేశాడు. సల్మాన్, షారుఖ్ మధ్య సాగే సంభాషణలు, సన్నివేశాలు చాలా సరదాగా ఉన్నాయి. ఇద్దరూ కలిసి డ్యాన్స్ చేసే సీన్ అయితే ఇద్దరి హీరోల అభిమానులకు తెగ నచ్చేసింది. కొసమెరుపు ఏంటంటే పాటలో డ్యాన్స్ చేస్తూ సల్మాన్‌ఖాన్ చంకెక్కి బుగ్గపై గట్టిగా ఓ ముద్దు పెట్టేస్తాడు షారుఖ్. ఈ ఒక్క షాట్ అభిమానుల్ని ఫిదా చేసేసింది. ఈ చిత్రంలో షారుఖ్ సరసన కత్రినా కైఫ్, అనుష్క శర్మ నటిస్తున్నారు. డిసెంబరు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈసారి ఇంకొంచెం మసాలా..!

'రేస్ 3'



సైఫ్ అలీఖాన్ కథానాయకుడిగా వచ్చిన 'రేస్', 'రేస్ 2' చిత్రాలు చక్కటి విజయాన్నందుకున్నాయి. ఇప్పుడు ఆ సిరీస్‌లో 'రేస్ 3' వస్తోంది. సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా నటించాడు. జాక్వెలైన్ ఫెర్నాండెజ్ కథానాయికగా కనిపించనుంది. బాబీ డియోల్, అనిల్ కపూర్, డైసీ షా, సఖీబ్ సలీమ్ కీలక పాత్రల్లో నటించారు. నృత్యదర్శకుడి నుంచి దర్శకుడిగా మారిన రెమో డిసౌజా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సల్మాన్ సహ నిర్మాతగా వ్యవహరించాడు. ఈద్ కానుకగా ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ప్రచార చిత్రాలకు వచ్చిన స్పందనకు తోడు విడుదలకు ముందే అత్యధిక ధరకు శాటిలైట్ హక్కులు అమ్ముడుపోవడం, టికెట్ల ముందస్తు బుకింగ్‌లోనూ సత్తా చాటుతుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'రేస్ 3' విశేషాలివీ.

ఊహించని మలుపులతో, భారీ యాక్షన్ సన్నివేశాలతో, అనుక్షణం ఉత్కంఠ రేకెత్తించే చిత్రాలతో 'రేస్' సిరీస్ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. దీనితోడు మల్టీస్టారర్ తారాగణంతో ప్రేక్షకులకు కనువిందు చేసింది. ఈ సిరీస్‌లో వచ్చిన గత రెండు చిత్రాలను మించిన రీతిలో సరికొత్త హంగులతో 'రేస్ 3' తెరకెక్కింది. సైఫ్ స్థానంలో సల్మాన్ ప్రధాన పాత్రలో నటించడంతో చిత్రంపై క్రేజ్ పెరిగిపోయింది. 'కిక్' లాంటి విజయవంతమైన చిత్రం తర్వాత మళ్లీ ఈ సినిమా ద్వారా రెండో సారి సల్మాన్‌తో జోడీ కట్టింది జాక్వెలైన్. 'రేస్' సిరీస్ చిత్రంలో తొలిసారి నటిస్తున్న బాబీ డియోల్ కూడా మరో ఆకర్షణగా నిలిచాడు. గత రెండు 'రేస్' చిత్రాల్లో నటించిన అనిల్ కపూర్ మూడోసారీ అలరించనున్నాడు. కథానాయకుడితో పాటు దర్శకుడు కూడా మారిన ఈ కొత్త 'రేస్' చిత్రం గత చిత్రాల కన్నా ఇంకొంచెం ఎక్కువ మసాలాతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని చిత్రబృందం చెబుతోంది. ముఖ్యంగా సల్మాన్‌పై తెరకెక్కించిన భారీ ఛేజింగ్‌లు, పోరాట సన్నివేశాలు మెప్పిస్తాయని చెబుతున్నారు. కథానాయకుడి కుటుంబ సభ్యుల మధ్య జరిగే ఎత్తులు, పై ఎత్తులతో ఓ నేరం నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కినట్లు తెలుస్తోంది.

విడుదలకు సిద్ధం

విడుదలకు ముందే అన్ని రూ.కోట్లా..:

'రేస్ 3' విడుదల ముందస్తు వ్యాపారం బాలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యింది. ఇప్పటి వరకూ ఏ చిత్రానికీ పలకని ధరకు ఈ చిత్ర హక్కులు అమ్ముడుపోయాయని వినిపిస్తోంది. శాటిలైట్, డిజిటల్ హక్కుల రూపంలోనే ఈ చిత్రానికి సుమారు రూ.130 కోట్లు లభించాయని సమాచారం. సల్మాన్ గత చిత్రం 'టైగర్ జిందా హై' (రూ.65 కోట్లు)తో పోలిస్తే ఇది రెట్టింపు కావడం విశేషం. ఇక ఈ చిత్రానికి వచ్చిన క్రేజ్ దృష్ట్యా భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. దీంతో తొలి వారాంతం వసూళ్లపై కూడా అదే స్థాయిలో ఆసక్తి నెలకొంది. సుమారు 4,200 తెరల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారని, ఆ లెక్కన తొలి వారాంతంలో దాదాపు రూ.100 కోట్లు రావొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. జోరుగా సాగుతున్న టికెట్ల ముందస్తు బుకింగ్ ఈ చిత్రంపై నెలకొన్న ఆసక్తికి అద్దం పడుతోంది.

- సల్మాన్, రెమో డిసౌజా కలయికలో వస్తున్న తొలి చిత్రమిది.
- 'రేస్' సిరీస్‌లో మూడు చిత్రాల్లోనూ నటించిన ఒకే ఒక్క నటుడు అనిల్ కపూర్
- ఈ చిత్రంలో జాక్వెలైన్ పోలీస్ పాత్రలో కనిపించనుందని సమాచారం.

పెళ్లి రోజు వరకు...

నిహారిక, సుమంత్ అశ్విన్

సుమంత్ అశ్విన్, నిహారిక కొణిదెల నాయకానాయికలుగా నటించిన చిత్రం 'హ్యాపీ వెడ్డింగ్'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహిస్తున్నారు. యు.వి.క్రియేషన్స్ సమర్పణలో పాకెట్ సినిమా నిర్మిస్తోంది. చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకి ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. "ప్రేమ, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో సాగే చిత్రమిది. పెళ్లి కుదిరిన రోజు నుంచి పెళ్లి జరిగే రోజు వరకు రెండు కుటుంబాల మధ్య... రెండు మనసుల మధ్య ఏం జరిగిందనేది తెరపైనే చూడాలి. ప్రతి ఒక్కరి జీవితంలోని అనుభవాల్ని గుర్తు చేస్తుందీ చిత్రం. సుమంత్ అశ్విన్, నిహారిక జంట ఆకట్టుకునేలా ఉంటుంది. శక్తికాంత్ కార్తిక్ స్వరాలు సమకూర్చగా, తమన్ నేపథ్య సంగీతంతో చిత్రానికి మరింత బలాన్ని చేకూరుస్తార"ని చిత్రవర్గాలు తెలిపాయి. నరేష్, మురళిశర్మ, పవిత్ర లోకేష్, తులసి, ఇంద్రజ, మధుమణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: బాల్‌రెడ్డి.

గీతోపదేశం

తెల్ల కాగితం మనిషి జీవితం
ఒకో అక్షరం ప్రతి నిమిషం
చెయ్యి మారితే రాత మారుతుంది
చెయ్యి జారితే మచ్చ మిగులుతుంది

గీతం: తెల్ల కాగితం మనిషి జీవితం...
చిత్రం: దీపారాధన
రచన: దాసరి నారాయణరావు
– పంపినవారు: కె.కోటేశ్వర్రావు, అత్తిలి

పల్లెటూరిలో మొదలై

కొవెర కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'యు'. హిమాన్షి కాత్రగడ్డ కథానాయిక. విజయలక్ష్మి కొండా, నాగానిక చాగంరెడ్డి నిర్మాతలు. జులైలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కొవెర మాట్లాడుతూ "రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దగ్గర నాలుగేళ్లు పనిచేశా. ఆ అనుభవంతోనే ఈ కథ రాసుకొన్నా. ఈ చిత్రానికి కథే కథానాయకుడు. పల్లెటూరిలో మొదలై వండర్ వరల్డ్‌లో ముగుస్తుందీ చిత్రం. కథ చెప్పగానే శుభలేఖ సుధాకర్, తనికెళ్ల భరణి నటించేందుకు ముందుకొచ్చారు. కథానాయిక హిమాన్షి చక్కటి అభినయాన్ని ప్రదర్శించారు. సాంకేతికంగా ఉన్నతమైన హంగులతో, ప్రాజెక్ట్ యు అనే అంశం ఆధారంగా తీశాం. ఈ సినిమా హిందీ హక్కులు ఇప్పటికే అమ్ముడయ్యాయి" అన్నారు. "డిజిటలైజేషన్‌కి సంబంధించిన కథ ఇది. దర్శకుడు నా పాత్ర మీద ప్రేమ పెంచుకొని, నా దగ్గరికే వచ్చి ఈ కథ చెప్పాడు" అన్నారు శుభలేఖ సుధాకర్. తనికెళ్ల భరణి మాట్లాడుతూ "శుభలేఖ సుధాకర్ చెప్పడంతో నా దగ్గరికి వచ్చారు కొవెర. తను ఈ సినిమాని ప్రాణం పెట్టి చేశాడు. ఆ కృషికి తగ్గట్టుగా చిత్రం విజయం సాధించాలని కోరుకొంటున్నా" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఈ చిత్ర కథానాయకుడు, దర్శకుడు మా అబ్బాయే. తన కోసమే మేం ఈ చిత్రం నిర్మించాం. విజయం అందుకొంటామో లేదో తెలియదు కానీ.. మా అబ్బాయి పడిన కష్టానికి మాత్రం గుర్తింపు రావాలనేది నా కోరిక" అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాయాగ్రాహకుడు రాకేశ్ గౌడ్‌తో పాటు రాఘవ, నాగి, రోహిణి, సంధ్య, స్వప్న రావ్, లహరి, దొరబాబు, కోయ కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

శుభలేఖ సుధాకర్, కొవెర, హిమాన్షి, తనికెళ్ల భరణి

రైతుగా కార్తి

కార్తి కథానాయకుడిగా నటించిన చిత్రం 'చినబాబు'. సయేషా కథానాయిక. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. సూర్య, మిరియాల రవీందర్‌రెడ్డి నిర్మాతలు. కార్తి రైతు పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని జులై 13న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 23న పాటల్ని విడుదల చేస్తారు. "రైతు సమస్యల్ని చర్చిస్తూనే, వినోదం పంచే చిత్రమిది. యాక్షన్ అంశాలతో పాటు, హాస్యానికి ప్రాధాన్యముంది. రైతు పాత్రలో కార్తి చేసే సందడి ఆకట్టుకుంటుంది. 23వ తేదీన జరిగే పాటల వేడుకలో కార్తితో పాటు, సూర్య కూడా పాల్గొంటార"ని తెలిపాయి చిత్రవర్గాలు. ఈ చిత్రానికి సంగీతం: డి.ఇమాన్, ఛాయాగ్రహణం: వేల్ రాజ్.

కార్తి, సయేషా

ఈనాడు
వసుంధర
శుక్రవారం ● జూన్ 15, 2018 ● విజయవాడ

ఫ్యాషన్ ఫ్యాషన్

కిట్టీ పార్టీలు కావచ్చు.. చిన్నపాటి వేడుకలూ... పండగలు... ఎప్పుడైనా సరే అందంగా హుందాగా ఉండే చీరలు ధరిస్తేనే కదా నిండుదనం. అలాంటివే ఈ చీరలు. అన్ని వయసులవారికీ నప్పడమే కాదు.. చూపు తిప్పుకోనివ్వకుండా ఆకట్టుకుంటాయి.

చీర కడితే కనికట్టు

నగలు, దుస్తులు:
KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
సైఫాబాద్: 040-23231147/23423440
జూబ్లీహిల్స్: 040-23540862,
కూకట్‌పల్లి: 040-23152323
విజయవాడ: 0866-2496464
తిరుపతి: 0877-2238820
వైజాగ్: 0891-2577905

నీలం రంగు కాటన్ చీరపై పరుచుకున్న బ్లాక్ ప్రింట్ హంగులు అద్భుతం.

రంజితమైన సీకో చీరకు.. ఖాదీ మెరుపు అదనపు ఆకర్షణ.

పసుపు వర్ణం సీకో చీరకు స్కర్టు అంచూ.. పూల బుటీలు ప్రత్యేకం.



భిన్న వర్ణంలో ఆకట్టుకునేలా రూపొందిన మంగళగిరి కాటన్ చీర.

మోడల్: అమీక్షా పవార్, గీతిక
ఫొటోలు: పద్మావతి పాతూరి

నజరానా

బిర్యానీ తయారీలో పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి కలిపి ముద్ద చేసి వేయండి. రుచి బాగుండటమే కాదు... బిర్యానీ కమ్మటి వాసన కూడా వస్తుంది.

అడవి గుర్రాలు మమ్మల్ని వెంబడించాయి!

భార్యభర్తలు కష్టసుఖాల్లో కలిసి ప్రయాణిస్తే.. అది జీవితం అవుతుంది! అదే దంపతులు ఒకే కారులో మంచు పర్వతాలనీ, అభేద్యమైన అడవులనీ, ఆకాశ అంచులనీ, ఎడారులనీ, లోయలని పలకరిస్తే ఏమవుతుంది? ఔరా అనిపించే సాహసమవుతుంది! అమెరికాలో ప్రముఖ పల్మనాలజిస్టుగా సేవలనందించిన డాక్టర్ దర్శన 62 రోజుల పాటు భర్తతో కారులో 19 దేశాలు(37,000 కిలోమీటర్లు) ప్రయాణించి సికింద్రాబాద్ లోని తన మెట్టినింటికి చేరుకున్నారు. ఆ సందర్భంగా ఆమెని వసుంధర పలకరించింది...

ఇంటి ముందు... రెండు చిన్నపాటి డీజిల్ ట్యాంకర్లు అమర్చి హుందాగా కనిపించే పెద్ద టయోటా లాండ్ క్రూజర్ వాహనాన్ని చూడగానే ఎవర్కైనా తెలిగ్గానే అర్థమయిపోతుంది. డాక్టర్ దర్శన దంపతులు ప్రయాణించి వచ్చిన కారు అదేనని. కారు ఓకే. ఇలాంటి సాహసోపేతమైన ప్రయాణాలు చేసే వారి ఇల్లు ఎలా ఉంటుందో అని ఆసక్తిగా ఆ ఇంట్లో అడుగు పెట్టేవారికి భిన్నమైన వాతావరణమే కనిపిస్తుందక్కడ. ఓ వైపు పచ్చని తులసి తోటలూ, మరో వైపు అణువణువు ఆధ్యాత్మిక శోభ. ప్రాంతాలు వేరుకావచ్చు, మనుషులు, ఆచారాలు వేరుకావచ్చు. కానీ నిజమైన ఆధ్యాత్మికత ఎక్కడైనా ఒకేలా ఉంటుంది అంటారు డాక్టర్ దర్శన. ఇంతకీ మీకీ ఆలోచన ఎలా వచ్చింది అని అడిగినప్పుడు...

'పెళ్లీ, పిల్లలూ, కెరీర్ ఇవన్నీ మా జీవితంలో చకచకా అయిపోయాయి. ఇద్దరం వైద్యులమే. ఇప్పుడు మాకోసం మేం ఏదైనా చేయాలనుకున్నాం. నాది ముంబయి. రాజేష్‌ది సికింద్రాబాద్. ఉద్యోగరీత్యా మేం అమెరికాలోనే స్థిరపడ్డాం. ఇప్పుడు స్వదేశానికి రావాలనిపించింది. అది కూడా విమానం ఎక్కి కొన్ని గంటల్లో ఇంటికి వచ్చేయడం నాకిష్టం లేదు. మావారు రాజేష్ కార్ రేసుల్లో జాతీయ ఛాంపియన్. ఇందిరాగాంధీ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. అందుకే అమెరికా నుంచి హైదరాబాద్‌కి కారులో రోడ్డుమార్గంలో వెళదామా అన్నా. ఆయన డబుల్ ఓకే అన్నారు' అంటూ తన ఆలోచన వెనుక కారణాన్ని వివరించారామె.

ఈ సాహసం వెనుక వాళ్లు... దాదాపు 62 రోజుల ప్రయాణం. అది కూడా అడవుల్లోంచి, కొండల్లోంచి, మంచు పర్వతాల్లోంచి... ఇంట్లోవాళ్లు ఒప్పుకున్నారా? అదే ప్రశ్న ఆమెని అడిగితే... 'మా ఇద్దరికీ యాభైలు దాటాయి. ఇంట్లో మా అమ్మ ఉంది. నా ఆలోచన ఆమెతో చెప్పగానే.. 'మరేం ఆలోచించకు వెళ్లు' అంటూ ప్రోత్సహించింది. పిల్లలు కూడా సరేనన్నారు. సాంకేతిక విషయాలు తెలియజేస్తూ, వివిధ దేశాలకు సంబంధించిన సమాచారం అందించారు. నాకూ డ్రైవింగ్ వచ్చు. కానీ ఆయన అంత వేగంగా రాదు. మా కారుకి తగినవిధంగా మార్పులు చేసుకున్నాం. గేర్ బాక్సు, ఇంజిన్, చక్రాలు సరిచూసుకుని ఎటువంటి దుర్భేద్యమైన భౌగోళిక పరిస్థితులు ఎదురైనా మా కారు పరుగులు పెట్టేలా మార్పులు చేయించుకున్నాం. అన్నింటికంటే ముఖ్యంగా అమెరికాలో ఉన్నా మేమెవ్వరం మాంసాహారం ముట్టుకోం. పాలపదార్థాలకు దూరం. రోజువారీ ఆహారం మా ముందున్న పెద్ద సవాల్. ఆయన బయట తినరు. అందుకు తగిన విధంగా పప్పులూ, ఉప్పూ, మసాలాలూ, కుక్కర్, ఫ్రిజ్‌తోపాటు అత్యవసరాలు ప్యాక్ చేసి పెట్టుకున్నా' . అని చెబుతారామె.

ఆ రోడ్డుపై మేం మాత్రమే... ప్యారిస్, కెనడా, ఫిన్‌లాండ్, బ్రెజిల్, రష్యా, కజికిస్థాన్, కిర్గిస్థాన్, చైనా, మంగోలియా, నేపాల్ దేశాలు దాటుకుంటూ వచ్చిన డాక్టర్ రాజేష్ దంపతులకు ఈ ప్రయాణంలో కొన్ని అవాంతరాలూ తప్పలేదు. 'కారులో మేమిద్దరమే. ఇక్కడ మాట్లాడుకోవడానికి చాలా సమయం దొరికింది.

చక్కగా కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం హాయిగా సాగిపోయింది అనుకుంటున్నారేమో! నేను తెచ్చిన కుక్కర్ కొన్ని రోజులకే పనిచేయడం మానేసింది. ముందే చెప్పాగా. మాకు ఇంటి భోజనం తప్పనిసరి అని. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో ఆ ప్రెజర్ కుక్కర్‌లో కందిపప్పుని ఉడికించడానికి చాలా కష్టపడాల్సి వచ్చేది. అది కూడా వండుతూ కూర్చుంటే ప్రయాణం మాటేంటి? చకచకా వండాలి. అందుకే తేలిగ్గా తయారుచేసుకునే వంటలు గూగుల్‌లో చూసి చేసేదాన్ని. శక్తి కోసం మొలకలు ఎక్కువగా వాడేవాళ్లం. కొన్ని దేశాల్లో ట్రాఫిక్ నిబంధనలు వేరేగా ఉండేవి. అంతా అయోమయం. గూగుల్‌లో నేర్చుకుని అప్పటికప్పుడు ఆ విషయాలు ఆయనకి చెప్పి ఆ దేశం దాటేవాళ్లం. మంగోల్‌లో అయితే భాష పెద్ద సమస్య. భద్రతా అంతంత మాత్రమే. అలాంటి చోట నేను అమ్మాయినని గుర్తుపట్టకుండా తలకు స్కార్ఫ్ చుట్టుకునేదాన్ని. కొన్ని దేశాల్లో రోడ్లమీద కనుచూపు మేర మేమూ, మా కారు తప్ప ఎవరూ ఉండేవాళ్లు కాదు. మంగోలియాలో అయితే అడవి గుర్రాలు వెంబడించాయి. వాటి నుంచి తప్పించుకురావడం ఎప్పటికీ మర్చిపోలేను. కొన్ని దేశాల్లో ఫోనుల్లో నెట్‌వర్క్ అస్సలు ఉండేది కాదు. అలాంటి చోట్ల పేపర్ మ్యాపులే మాకు ఆధారం. ఆయనకు అలసటగా అనిపిస్తే నేను కారు డ్రైవ్ చేసేదాన్ని. ఇన్ని ఇబ్బందులు దాటుకుని భారత్‌లో అడుగుపెట్టినప్పుడు నాకు కలిగిన ఆనందం గురించి ఒక్కమాటలో ఏం చెబుతాం లెండి' అని అంటారు దర్శన.

– శ్రీసత్యవాణి, ఈనాడు హైదరాబాద్

మౌనం వద్దు... మాట్లాడండి

భార్యాభర్తలన్నాక అప్పుడప్పుడూ రుసరుసలూ, వాదనలూ ఉండనే ఉంటాయి. ఒకరిని మరొకరు ఎత్తి చూపడం, అరుచుకోవడం లాంటివన్నీ వారిలో కుంగుబాటుకు కారణం కావొచ్చు. ఈ పరిస్థితి ఎదురుకాకుండా ఉండాలంటే ఇద్దరూ కొన్ని సర్దుబాట్లు చేసుకోవాలి.

- భాగస్వామితో ఏదైనా మనస్పర్థ వచ్చినా, తీరు నచ్చకపోయినా ఏదో ఒకటి అనేసేవారు కొందరైతే... మనసులో పెట్టుకుని పరోక్షంగా విమర్శించేవారు మరికొందరు. ఈ రెండూ సరికాదు. సమస్యను మాత్రమే ప్రస్తావించాలి. ఎంత సామరస్యంగా పరిష్కరించుకోవచ్చో చూసుకోవాలి. తరువాత ఆ ప్రస్తావన వీలైనంతవరకూ తీసుకురాకపోవడమే మంచిది.
- మీ భాగస్వామి ప్రవర్తన మిమ్మల్ని బాగా నొప్పించి ఉండొచ్చు. ఆ సమస్య తరచూ ఎదురవుతూ ఉండొచ్చు. అలాంటప్పుడు మౌనంగా సర్దుకుపోవాలని లేదు. ఇద్దరి మధ్య గొడవలు ఎంత చేటు చేస్తాయో, మౌనం కూడా అంతే. గట్టిగా అరిచి చెప్పే ప్రయత్నం చేయకుండా ఎదుటివారి తీరును ఓ కాగితంలో రాయండి. దాన్ని భాగస్వామి చూసేలా పెడితే చాలు. లేదా ఓ ఫిర్యాదు బాక్సు ఏర్పాటు చేసుకుని అందులో వేయండి.
- కొందరు భాగస్వామి గురించి మూడో వ్యక్తి దగ్గర సరదాగా ప్రస్తావిస్తుంటారు. అలా చేయడం వల్ల ఎదుటివారు నొచ్చుకోవచ్చు. తక్కువ చూస్తున్నారనే భావనా కలగొచ్చు. అందుకే భాగస్వామికి సంబంధించిన ఎంత చిన్న విషయాన్నైనా సరే మూడో వ్యక్తి దగ్గర చెప్పకపోవడమే మేలు.

పాప జుట్టు పెరిగేదెలా?

డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

మా పాపకి ఆరేళ్లు. తనకి జుట్టు సరిగా పెరగట్లేదు. చుండ్రు కూడా ఉంది. ఎన్ని సార్లు జుట్టు పూర్తిగా తీయించినా కొంచెం కొంచెం వస్తోంది తప్ప సరిగా ఎదగట్లేదు. ఎందుకిలా అవుతోందో అర్థం కావట్లేదు.

- ఓ సోదరి

మీ ఉత్తరం చూస్తోంటే చుండ్రు ప్రధాన సమస్యగా కనిపిస్తోంది. చిన్నపిల్లలకు చుండ్రు వచ్చినా దానంతట అదే పోతుంది. పెద్దవారికి వస్తే మాత్రం ఇబ్బంది పడాల్సి ఉంటుంది. జిడ్డు చర్మతత్వం, చల్లని ప్రదేశాల్లో ఉన్నప్పుడూ, వంశపారంపర్యంగా, సరిగా తినకపోయినా, ఈస్ట్ ఉత్పత్తి ఎక్కువగా ఉన్నా, ఎగ్జిమా, రకరకాల షాంపూలు వాడటం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. ఈ సమస్య ఉన్నప్పుడు పాపకి తరచూ గాఢత తక్కువ ఉన్న షాంపూతో తలస్నానం చేయించాలి. ఒకవేళ తగ్గకపోతే మాత్రం యాంటీ ఫంగల్ క్రీమ్ వాడాల్సి ఉంటుంది. అయినా ఫలితం లేదంటే వైద్యుల సూచనలతో షాంపూ ఎంచుకుని దాన్ని వాడాలి. కొందరికి యాంటీ ఫంగల్ మాత్రల్ని కూడా ఇవ్వాల్సి రావచ్చు. మరీ తప్పదనిపిస్తే



షాంపూతోపాటూ శాలిసిలిక్ యాసిడ్ లోషన్ వాడటం వల్ల చుండ్రు వల్ల వచ్చిన పెచ్చులు కూడా పోతాయి. సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు కార్టికోస్టెరాయిడ్, శాలిసిలిక్ యాసిడ్ ఉన్న లోషన్ రాత్రి పూట తలకు రాసి.. మర్నాడు మాడును శుభ్రం చేయాలి. అలానే పాపకి రోజులో రెండు మూడు సార్లు తల దువ్వాలి. ఆహారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. జింక్, విటమిన్ బి, ఒమెగా ఫ్యాటీ యాసిడ్లు ఉన్న ఆహారం ఎక్కువగా పెట్టాలి.

జుట్టు విషయానికొస్తే ఎలాంటి మందులు వాడాల్సిన పనిలేదు. ఆహారంతోనే ఈ సమస్యని దూరం చేయొచ్చు. పాపకి వారంలో మూడు సార్లు చేపలు ఇవ్వండి. శాకాహారులైతే నట్స్, సీడ్స్ అన్నీ కలిపి ఓ గుప్పెడు పెట్టాల్సి ఉంటుంది. వాటిలో ఒమెగా 3, 6 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. క్రమం తప్పకుండా ఆరునెలలపాటు ఇవ్వాలి. నువ్వుల ఉండలు చేసి రోజుకొకటి తినిపించాలి. ఆకుకూరలు పెడితే ఇనుము, విటమిన్ డి లోపం దూరమవుతాయి. రోజ్‌మేరీ, కొబ్బరినూనె.. వీటిలో ఏదో ఒక నూనెతో వంట చేసి పెట్టాలి. ప్రస్తుతం మార్కెట్‌లో సీవీడ్ అనే చైనీస్ మొక్క అందుబాటులో ఉంది. దీన్ని రోజుకో చెంచా ఇవ్వాలి. క్యారెట్, గుడ్డు ఇస్తుంటే విటమిన్ సి, బి12 అంది జుట్టు పెరుగుతుంది. నీళ్లు ఎక్కువగా తాగించాలి. తేనెలో కాసిని నీళ్లు కలిపి మాడుకు మర్దన చేసి పదినిమిషాలయ్యాక కడిగేయాలి. ఇలా నాలుగు వారాలపాటు రోజు విడిచి రోజు చేయాలి. రోజ్‌మేరీ, లావెండర్ నూనెలతో బాగా మర్దన చేస్తుంటే రక్తప్రసరణ సరిగ్గా జరిగి జుట్టు ఆరోగ్యంగా ఎదుగుతుంది.

– మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

14న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	32,000	31,900	31,750	31,700
ఆర్నమెంట్	29,960	29,800	29,450	29,400
వెండి (కిలో)	42,180	41,650	42,000	42,000
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,750	31,600	32,160	31,910
ఆర్నమెంట్	29,290	29,260	29,700	29,540
వెండి (కిలో)	42,000	41,600	42,400	40,800
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,700	31,700	-------	-------
ఆర్నమెంట్	29,480	29,480	2,970	2,954 గ్రా
వెండి (కిలో)	41,900	41,900	44.50	44.10 గ్రా

విహారి

ఈనాడు
విజయవాడ

శుక్రవారం జూన్ 15, 2018

vihari@eenadu.in

ఆకాశంలో కారుమబ్బులు..
కింద కారునలుపులో తారురోడ్డు..
దానిపై ఓవైపు నుంచి పల్లెవెలుగు బస్సు వెళ్తోంది.
మరోవైపు నుంచి కారు దూసుకొస్తోంది.
ఇటు నుంచి వెళ్లే వారి కళ్లు.. అటు నుంచి వచ్చే వారి చూపులు ఒకేవైపున్నాయ్!
సంద్రమంత సరస్సు.. తీరమంత ఒడ్డు..
కన్ను రెప్ప వాల్చితే ఒట్టు!
అయ్యో! ఆ అందమంతా అందనంత దూరం వెళ్లిపోతోందా! బస్సు ఆపమనండి.. కారు దిగేయండి.. మనిషి కష్టపడి ప్రకృతికిచ్చిన కానుక ఆ సరస్సు. గట్టు వెంట గంతులేయండి.. పక్కనే చిక్కగా విస్తరించిన అడవిలో పరుగులు తీయండి. అక్కడి కుటీరాల్లో సేదతీరండి. చిరుజల్లులు మొదలైతే మీరు అదృష్టవంతులే! ఇంతకీ ఎక్కడంటారా? వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలం పాకాల అభయారణ్యంలో ఉన్న పాకాల సరస్సు ముచ్చట్లివి.

అక్కడికి చాలారకాల పక్షులు వచ్చేవి. జంతువులూ ఉండేవి. పక్షుల వలస.. జంతువుల బస ఎప్పుడు మొదలైందంటే ఎనిమిది శతాబ్దాలు వెనక్కి వెళ్లాలి. అంతకుముందు సంగతి పక్కన పెడితే.. క్రీస్తుశకం 1213 నుంచి ఆ ప్రాంతం మరింత సుందరంగా తయారైంది. రకరకాల విహంగాలకు ఆలవాలమైంది. వివిధ జంతువులకు ఆవాస యోగ్యమైంది. ఎందుకంటే..? అక్కడో పెద్ద చెరువు రూపుదిద్దుకుంది. ఊరూరా చెరువులు నిర్మించి తెలంగాణను సస్యశ్యామలం చేసిన కాకతీయరాజులు తవ్వించిన భారీ చెరువు పాకాల సరస్సు. విస్తీర్ణం 30 చదరపు కిలోమీటర్లు. యాసంగిలోనూ సునాయాసంగా వేల ఎకరాలకు నీరందిస్తుంది. చారిత్రక సంపదగా, రైతన్నల పెన్నిధిగా నిలిచిన ఈ నిండుకుండ.. పర్యాటక కేంద్రంగానూ ప్రసిద్ధి చెందింది. ప్రకృతి ఆరాధకులు, పర్యాటక ప్రియులు పాకాల సోయగాలు చూసేందుకు క్యూ కడుతున్నారు.

ప్రపంచంలో నెం.8

పాకాల సరస్సుకు మరో ప్రత్యేకత కూడా ఉంది. కాలుష్య రహిత సరస్సుల్లో ప్రపంచంలోనే ఎనిమిదో స్థానంలో ఉంది. భారతదేశంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇక్కడి పర్యావరణ సౌందర్యాన్ని కాపాడేందుకు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాకాల కట్టపై విహరించడానికి బ్యాటరీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇక ఉద్యానవనం సమీపంలోని పాకాల గుట్ట సందర్శనీయ స్థలం. గుట్టపైకి ట్రెక్కింగ్ అవకాశం కూడా ఉంది. ఈ మార్గంలో సరస్సు అందాలను ఆస్వాదించడానికి వ్యూ పాయింట్లున్నాయి. ఇక్కడి అభయారణ్యంలో ఒకప్పుడు పులులు కూడా సంచరించేవి. ఇప్పుడు లేవనుకోండి. ఎక్కువగా కొండ గొర్రెలు, దుప్పులు, కృష్ణజింకలు, కుందేళ్లు, కొన్ని ఎలుగుబంట్లను చూడొచ్చు.

ఆహ్లాదాల పాకాల

మనసిక్కడ ఆగాల

ఘనమైన వసతి

పాకాల సరస్సుకు ఒకవైపు అందమైన ఉద్యానవనం ఉంది. ఇందులో అనేక రకాల పూల మొక్కలు, అరుదైన ఔషధ మొక్కలు ఎన్నో ఉన్నాయి. అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పక్షుల చిత్తరువులను చూస్తూ ఎంతసేపయినా అలా ఉండిపోవచ్చు. ఉద్యానవనంలోని క్రీడా ప్రాంగణంలో పిల్లలూ, పెద్దలూ ఎంచక్కా ఆడుకోవచ్చు. యాత్రికులు బస చేయడానికి టెంట్ గదులు, సాధారణ, ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి. పర్యాటక శాఖ హరిత హోటల్ నిర్వహిస్తోంది.

గదుల అద్దె రూ.1,500–రూ.1,800 (ఒక రోజు)

సరస్సులో సరదాగా..

పాకాల సరస్సు వానాకాలంలో సముద్రాన్ని తలపిస్తుంది. ఈ చెరువు కింద సుమారు 15,000 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఈ సరస్సులో బోటు విహారం భలేగా ఉంటుంది. బోట్లపై సరస్సు మధ్యలో ఉన్న దీవి వరకు వెళ్లొచ్చు. దీవిలోని ప్రతి చెట్టు, పుట్ట, కొమ్మ పక్షులతో కళకళలాడుతూ కనిపిస్తాయి. రంగురంగుల పక్షులు, బారెడు ముక్కున్న విహంగాలు, పోట్లాడుకునే చిలకలు, ఇచ్చికాలడునే పిచ్చుకలు.. ఎక్కడెక్కడి నుంచో వలస వచ్చిన పక్షులు అతిథులను కువకువరాగాలతో స్వాగతిస్తాయి. ఇక్కడ చెరువులో మొసళ్లు ఉంటాయి. అందుకే సరస్సులోకి దిగడంపై నిషేధం విధించారు. అంతదాకా వెళ్లి జలకాలాటలు లేవని నిరుత్సాహం వద్దు. సందర్శకులు తుంగబంధం, సంగెం పంటకాలువల నీటిలో ఎంచక్కా ఆడుకోవచ్చు. సరస్సుకు అవతలివైపు చిలకలగుట్టపై కాకతీయుల కాలంలో నిర్మించిన విడిది మందిరం ఇప్పటికీ కనిపిస్తుంది.

బోటింగ్ పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30
స్పీడ్ బోట్ విహారానికి రూ.300 (నలుగురికి)

సులభంగా చేరుకోవచ్చు..

వరంగల్ నుంచి పాకాల 45 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నర్సంపేట నుంచి సుమారు 18 కిలోమీటర్లు. హైదరాబాద్ నుంచి వరంగల్, నర్సంపేటకు బోలెడన్ని బస్సు సర్వీసులు ఉన్నాయి. ఈ రెండు చోట్ల నుంచి పాకాలకు బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో చేరుకోవచ్చు. నర్సంపేట నుంచి పాకాలకు అరగంటకో బస్సు అందుబాటులో ఉంది. జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం నుంచి నర్సంపేటకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి.

సమీపంలో..

పాకాల చెరువుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో భీముని పాదం జలపాతం ఉంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కొమ్ములవంచ వద్ద దట్టమైన అడవిలో జాలువారే ఈ జలపాతం చాలా అందంగా ఉంటుంది. మహాభారత కాలంలో భీముడు ఇక్కడి కొండల నడుమ పాదం మోపాడట. దాంతో ఇక్కడ జలపాతం ఏర్పడిందని చెబుతారు. వానాకాలం మొదలవ్వడంతో భీమునిపాదం జలకళతో అలరిస్తోంది. అయితే ఇక్కడ వసతులు అంతగా ఉండవు.

పాకాల నుంచి కొత్తగూడ, భూపతిపేట, కొమ్ములవంచ మీదుగా భీముని పాదం చేరుకోవచ్చు

– **జి.పాండురంగ శర్మ**, ఈనాడు, వరంగల్, **ఫొటోలు: కొమురయ్య**, ఖానాపురం

కోరింగ.. పిలవంగ

చుట్టూ దట్టమైన చెట్లు.. మధ్యలో చిత్తడి నేలపై నిర్మించిన చెక్కల వంతెన.. ఓ పక్క సముద్రంలో కలుస్తున్న గోదావరి సోయగాలు.. చెట్టు కింద ఆహారం కోసం తచ్చాడుతున్న నీటి పిల్లి.. చెట్టుపైన పొందికగా కట్టుకున్న గూడులో నుంచి తొంగి చూసే ఎలుక... ఇవన్నీ చూడాలంటే తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సమీపంలో ఉన్న కోరింగ అభయారణ్యానికి వెళ్లాలి.

ఒకప్పుడు సముద్ర వాణిజ్య కార్యకలాపాల్లో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కోరింగ.. ఇప్పుడు ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో కనుమరుగైన ఈ పోర్టు తిరిగి కోరింగ అభయారణ్యంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 235.7 చదరపు కిలోమీటర్లు విస్తరించిన మడ అడవులు.. కోరింగను ప్రకృతి సౌందర్యానికి పట్టుగొమ్మగా నిలబెట్టాయి. పక్షులు, జంతువులు, జలచరాలు.. ఈ వనాన్ని జీవవైవిధ్యానికి ఆవాసంగా మార్చాయి. 1998లో అభయారణ్యంగా ప్రకటించిన తర్వాత కోరింగ పర్యాటకంగానూ అభివృద్ధి చెందుతూ వస్తోంది. చిరుజల్లుల వేళ.. సుందరవనాలు (మడ అడవులు) మరింత మనోహరంగా కనిపిస్తాయి.

పక్షుల విడిది

వలస పక్షుల విడిదిగా కోరింగ విలసిల్లుతోంది. శీతాకాలంలో 239 జాతులకు చెందిన సుమారు 88 వేల పక్షులు సంతానోత్పత్తి కోసం ఇక్కడికి వస్తుంటాయి. గౌరు కాకులు, హిమాలయాల్లో ఉండే బ్రాహ్మణి కైట్, స్టార్క్ కొంగలు, కింగ్‌ఫిషర్ పక్షులు ఎక్కువగా వలస వస్తాయి. గోదావరి, సముద్రం సంగమించే ఈ ప్రాంతమవ్వడంతో ఇక్కడి తీపి, ఉప్పు కలయికతో మిశ్రమ లవణ సాంద్రత ఉంటాయి. అందుకే ఈ నీటిలో విభిన్న జాతులకు చెందిన జలచరాలు మనుగడ సాగిస్తున్నాయి. 575 రకాల చేప జాతులను గుర్తించారు. చిత్తడి నేలలో మండపీతలు, పాములు అధికంగా ఉంటాయి. అంతేకాదు ఇక్కడ ఎలుకలు కూడా పక్షులతో పోటీగా చెట్లపై గూళ్లు కట్టుకోవడం విశేషం. కోరింగ పరిధిలో ఉన్న 32వ నీటిపాయ లోనికి వెళ్తే చెట్లపై ఎలుకలు కట్టుకున్న గూళ్లు కనిపిస్తాయి.

చిక్కటి అడవిలో చెక్క వంతెన

కోరింగ వనాల్లో.. 35 రకాల మడజాతి వృక్షాలు ఉన్నాయి. నల్లమడ, తెల్లమడ, బిల్లమడ వృక్షాలు కనిపిస్తాయి. వనంలో నీటి కుక్కలు, నీటి పిల్లులు, బంగారురంగులో ఉండే నక్కలను చూడొచ్చు. చొల్లంగి గ్రామం దగ్గర అభయారణ్యానికి ప్రవేశం ఉంటుంది. కోరింగ గ్రామంలో మ్యూజియం, వసతి సముదాయాలు ఉన్నాయి. మడ అడవుల్లోని 32వ క్రీకు (నీటిపాయ)లో వివిధ రకాల పక్షి జాతులను వీక్షించే ఏర్పాట్లు ఉన్నాయి. కిందంతా చిత్తడి నేల ఉండటంతో నడవడం సాధ్యం కాదు. అందుకే అడవిలో విహరించడానికి చెక్క వంతెన ఏర్పాటు చేశారు. నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించిన వంతెనపై కాలినడకన విహరిస్తూ.. వన సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. క్రీకులో ప్రయాణించడానికి జెట్టీలు ఏర్పాటు చేశారు. 200 ఏళ్ల కిందటి పాతలైట్ హౌస్‌ను ఇటీవలే అభివృద్ధి చేశారు. యాత్రికులు బోట్‌లో వెళ్తారు. హోప్ ఐలాండ్ ఇక్కడ మరో ఆకర్షణ. నిండైన పచ్చదనంతో అలరించే ఈ ద్వీపానికి బోట్లలో చేరుకోవచ్చు.

ఎలావెళ్లాలి?

కాకినాడ నుంచి చొల్లంగి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కాకినాడ, సామర్లకోట నుంచి చొల్లంగికి బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లొచ్చు.

వినోదంతో పాటు..

కోరింగ వచ్చే పర్యాటకులకు వినోదంతో పాటు విజ్ఞానం అందించే ఏర్పాట్లు చేశారు అధికారులు. అభయారణ్యం ప్రత్యేకతలను తెలిపేందుకు ఆడియో విజువల్ థియేటర్‌ను నిర్మించారు. 25 మంది ఒకేసారి ఇందులో కూర్చొని ఈ వీడియోలు, పర్యావరణ ప్రాధాన్యం వివరించే చిత్రాలు, పర్యాటక విశేషాలు తెలిపే డాక్యుమెంటరీ వీక్షించవచ్చు.

ఎన్. తిరుపతయ్య, కాకినాడ

రైల్ way

ఆ టికెట్‌పై మరొకరు!

కన్‌ఫర్మ్ అయిన టికెట్‌ను మరొకరి పేరుపై బదిలీ చేయవచ్చా?

ప్రణాళికలో మార్పు, అనివార్య కారణాల వల్ల ఒక్కోసారి కన్‌ఫర్మ్ టికెట్ ఉన్నా.. ప్రయాణం రద్దు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. ఇలాంటి సమయంలో కన్‌ఫర్మ్ టికెట్‌పై కుటుంబ సభ్యులకో, ఇంకెవరికో ఇచ్చేస్తుంటారు. రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఒకరి పేరిట బుక్ అయిన టికెట్‌ను మరొకరికి ఇవ్వడం వల్ల చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతాయి. కన్‌ఫర్మ్ టికెట్‌ను మరొకరి పేరు మీదికి మార్చుకునే అవకాశం రైల్వే కల్పిస్తోంది. కుటుంబ సభ్యుల (తల్లిదండ్రులు, అన్నాచెల్లెళ్లు, కొడుకు, కూతురు, భార్య, భర్త) పేరిట టికెట్‌ను మార్చుకోవచ్చు. కానీ, రైలు బయల్దేరడానికి కనీసం 24 గంటల ముందు రైల్వే బుకింగ్ కౌంటర్‌కు వెళ్లి ప్రయాణిస్తున్న వ్యక్తి వివరాలు, ధ్రువీకరణ పత్రం చూపించి టికెట్‌పై పేరు మార్చుకోవాలి. కుటుంబ సభ్యులే కాకుండా బయట వ్యక్తులకు కూడా టికెట్ బదిలీ చేయవచ్చు.

- ప్రయాణికుడు పనిచేస్తున్న ఉద్యోగ సంస్థలోని సహోద్యోగుల పేరిట (విధి నిర్వహణలో ప్రయాణిస్తుంటే) టికెట్ బదిలీ చేయవచ్చు. ఈ విషయాన్ని 24 గంటల ముందు రైల్వే అధికారులకు తెలియజేయాలి.
- గ్రూప్ బుకింగ్స్‌లోనూ కన్‌ఫర్మ్ టికెట్ల బదిలీకి అవకాశం ఉంది. అయితే, ఇది గ్రూప్‌లో ఉన్న ప్రయాణికుల సంఖ్యలో 10 శాతానికి మించకూడదు.
- టికెట్‌పై పేరు మార్పునకు ఒకేసారి అవకాశం ఉంటుంది.

మాటల్లో విహరించకండి!

విహారం ప్రశాంతంగా సాగాలంటే ముందస్తుగా సన్నద్ధం అవ్వాలి. సొంతంగా వెళ్లే పనైతే వెళ్లదలచిన ప్రాంతం గురించి పూర్తిగా తెలుసుకోవాలి. అంతర్జాలంలో శోధించాలి. ట్రావెల్ ఆపరేటర్‌ను కలుసుకొని ఆ ప్రాంతం గురించి మరింత సమాచారం తెలుసుకోవాలి. ట్రావెల్ ఆపరేటర్‌ను ఎంపిక చేసుకోవడంలోనూ జాగ్రత్త పాటించాలి. సంస్థ గుర్తింపు, నిర్వాహకుల గురించి వాకబు చేయాలి. వాళ్లు ఏదైనా పర్యాటక సంస్థల్లో సభ్యులుగా ఉన్నారో, లేదో కూడా తెలుసుకోవాలి. వీలైతే నేరుగా వెళ్లి సంస్థ ప్రతినిధులను కలుసుకోవాలి. దాంతో పర్యాటకంపై వారికేమాత్రం పట్టుందో తెలుసుకునే అవకాశం ఉంటుంది.

షరతులు వర్తిస్తాయ్..

చాలామంది ట్రావెల్ ఆపరేటర్లు ఊరించే తగ్గింపులతో ఆకర్షిస్తుంటారు. వాటిని గుడ్డిగా నమ్మొయొద్దు. షరతులు ఏమున్నాయో అడిగి మరీ తెలుసుకోవాలి. ప్యాకేజీలో ఇన్‌క్లూజన్ (ప్యాకేజీ పరిధిలోనివి), ఎక్స్‌క్లూజన్ (ప్యాకేజీకి వర్తించని) ఖర్చులు ఏమిటో అడగాలి. ట్రావెల్ సంస్థ నుంచి ప్యాకేజీలో ఉన్న పర్యటన వివరాలను నోటిమాటగా కాకుండా పత్రం రూపంలో ఇవ్వమనాలి. పర్యాటక ప్రాంతానికి వెళ్లాక అక్కడ ట్రావెల్ సంస్థ ఏజెంట్ దగ్గర కూడా ప్యాకేజీ వివరాలు తీసుకోవాలి. రెండు పత్రాల్లో వివరాలు ఒకేలా ఉన్నాయా, మార్పులున్నాయా బేరీజు వేసుకోవాలి. అందులో ఏమైనా తేడాలుంటే ఆ పర్యాటక సంస్థపై ఫిర్యాదు చేసేటప్పుడు ఈ పత్రాలే కీలకం అవుతాయి.

అందరూ విహారంలో వినోదం కావాలనుకునేవారే. కానీ, ప్యాకేజీలు బుక్ చేసుకునేటప్పుడు దానిపై వసూలు చేస్తున్న పన్ను మొత్తం చూసి ముఖం చిట్లిస్తారు. పన్ను తప్పించుకోవడానికి రసీదు తీసుకోకుండా ప్యాకేజీలు బుక్ చేసుకుంటారు. దీన్ని అవకాశంగా తీసుకుని ఇబ్బందిపెట్టే ట్రావెల్ ఏజెంట్లూ ఉంటారు. మన నిబద్ధతే మనకు రక్ష అని గుర్తెరగాలి. పన్నులు తప్పించుకునే ప్రయత్నం చేయకూడదు.

బీమా తోడుంటే..

ప్రకృతి వైపరీత్యాలు, అనివార్య కారణాల వల్ల విహారంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రయాణ బీమా ఎంతగానో సాయపడుతుంది. విమానం అందుకోకపోయినా, పాస్‌పోర్ట్ కోల్పోయినా, డెబిట్, క్రెడిట్ కార్డులు పోగొట్టుకున్నా, వైద్య సేవలు అవసరమైనా.. బీమా ఉంటే ధీమాగా ఉండొచ్చు. అందుకే ప్యాకేజీ ఎంచుకునే ముందు అందులో ఇన్సూరెన్స్ ఉందో, లేదో ట్రావెల్ ఆపరేటర్లను అడిగి తెలుసుకోవాలి.

వెనుకడుగు వేయొద్దు..

ప్యాకేజీలో చెప్పిన సేవలు అందించకుంటే తొలుత ఆవేశపడటం, పర్యటన ముగించి స్వస్థలానికి తిరిగి వచ్చేశాక 'జరిగిందేదో జరిగిపోయింది' అనుకోవడం తప్పు. ఆ ట్రావెల్ సంస్థపై న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేయొద్దు. ఈ విషయాన్ని ట్రావెల్ ఆపరేటర్లు సభ్యులుగా ఉన్న పర్యాటక సంస్థల దృష్టికి తీసుకెళ్లాలి. రుజువులతో ఫిర్యాదు చేయాలి. దీంతో ఆ సంస్థలు.. వారి సభ్యత్వం రద్దు చేయవచ్చు. నష్టపరిహారం కూడా ఇప్పించవచ్చు. వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయడం ద్వారా కూడా మీకు జరిగిన నష్టాన్ని ట్రావెల్ ఆపరేటర్ నుంచి రాబట్టుకోవచ్చు. కోర్టును ఆశ్రయించవచ్చు.

– **వాల్మీకి హరికిషన్**, పర్యాటకరంగ నిపుణుడు

వానల్లో వెళ్తున్నారా..

ట్రిప్‌కోటిప్

వానాకాలం విహారం మనసుకు ఆహ్లాదాన్నిస్తుంది. ప్రయాణంలో కొన్ని చికాకులు ఉన్నా.. చల్లటి వాతావరణం, పచ్చదనంతో పులకించే పుడమి, జలకళ సంతరించుకున్న నదీనదాలు ఇవన్నీ మాన్‌సూన్ పర్యాటకానికి కిక్ ఇచ్చేవే. వానకాలం ప్రయాణాల్లో ఈ జాగ్రత్తలు పాటిస్తే సాధారణ సమస్యల నుంచి సులభంగా బయటపడొచ్చు.

- వర్షాకాలం దోమల బెడద నుంచి తప్పించుకోవాలంటే రెప్పలెంట్ దగ్గరుంచుకోవాలి. రెప్పలెంట్ బాండ్స్ కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి.
- ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగడం మంచిది కాదు. మినరల్ వాటర్ తాగండి. అవకాశం ఉంటే నీటిని కాచి వడగట్టండి.
- రెయిన్ కోట్, గొడుగు వెంట తీసుకెళ్లండి.
- వర్షాకాలం విహారంలో ఎక్కువగా ఆకర్షించేవి చిరుతిళ్లు. చిరుజల్లుల వేళ.. వేడివేడిగా ఏది కనిపించినా తినకుండా ఉండలేం. శుభ్రత పాటించని ఫుడ్‌కోర్టుల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చిరుతిళ్లు తింటే.. ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.
- వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. వర్షపాతం వివరాలు, పర్యటించదలచిన ప్రాంతంలో పరిస్థితులు వీటి గురించి అంతర్జాలంలో సమాచారం సేకరించి అందుకు తగ్గట్టుగా ప్రయాణ ప్రణాళిక మార్చుకోవాలి.

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కేంద్రం వైఖరికి నిరసనగా జమ్మలమడుగులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, స్థానికులు

కోర్టుకు పాత నివేదిక ఎందుకిచ్చారు

- కేంద్రాన్ని నిలదీసిన ఎంపీ గల్లా జయదేవ్

ఈనాడు, దిల్లీ: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి పాత నివేదికనే ఎందుకు కోర్టుకు ఇచ్చారో కేంద్రం చెప్పాలని తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ డిమాండ్ చేశారు. గురువారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని 2014 డిసెంబరులో సెయిల్ నివేదిక ఇచ్చిందని, ఆ తర్వాత 2016లో కార్యదళ బృందం ఏర్పాటు చేశారన్నారు. ఒక సమావేశంలో అయితే.. పరిశ్రమ వద్దు అప్పుల్లో పడిపోతారంటూ రాష్ట్ర అధికారులను సముదాయించాలని ప్రయత్నించారని జయదేవ్ తెలిపారు. ఈ క్రమంలో ఆర్థికంగా సాధ్యం కావడం లేదంటూ రాష్ట్రాన్ని కొన్ని రాయితీలు అడిగారని, అన్నింటికీ రాష్ట్రం అంగీకరించిందన్నారు. అయినప్పటికీ కోర్టుకు సమర్పించిన ప్రమాణపత్రంలో ఆర్థికంగా సాధ్యం కాదన్న పాత విషయాన్నే పేర్కొన్నారని జయదేవ్ చెప్పారు. కేంద్ర ఉక్కు శాఖ అర్థం కాని విధంగా ఉక్కు పరిశ్రమపై గురువారం ఓ ప్రకటన విడుదల చేసిందన్నారు. ప్రకాశం జిల్లాలోనూ ఇనుప ఖనిజం (ఐరన్ ఓర్) లభ్యమయ్యే పరిస్థితి ఉందని, రవాణా, అనుసంధాన సదుపాయాన్ని (కనెక్టివిటీ) భరిస్తామని చెప్పామన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు.

మోదీకి చంద్రబాబు నుంచి పోటీ

దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయమని, ఆయన నుంచి తీవ్ర పోటీ ఎదురవుతుందని తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ గురువారం ఇక్కడ పేర్కొన్నారు. రాష్ట్రానికి ఎలాంటి సాయం అందించరాదన్న ఉద్దేశంతో మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షా ఉన్నారని తెలిపారు. ఏదైనా అభివృద్ధి పనులు జరిగితే రాష్ట్రంలో చంద్రబాబు విశ్వసనీయత మరింత పెరుగుతుందన్న భావనలో వారు ఉన్నారని పేర్కొన్నారు.

హొసపేటె వద్ద తుంగభద్ర జలాశయంలో జలకళ

మల్నాడు ప్రాంతంలో కుంభవృష్టి

పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న తుంగ-భద్ర

శివమొగ్గ, న్యూస్‌టుడే: కర్ణాటకలోని మల్నాడు ప్రాంతంలో కుంభవృష్టి కారణంగా తుంగ-భద్ర నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఫలితంగా బళ్లారి జిల్లా హొసపేట సమీపంలోని తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. బుధవారం ఉదయానికి డ్యాంకు 28,367 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు జలవనరులశాఖ అధికారులు అంచనా వేశారు. ఫలితంగా డ్యాం నీటిమట్టం 1,586.95 (గరిష్ఠం 1,633) అడుగులకు చేరుకుంది. మరోవైపు కేరళలో భారీ వర్షాలకు కబిని జలాశయం నిండనుంది. ప్రస్తుతం ఈ డ్యాంకు 22,098 క్యూసెక్కుల నీరు చేరుతోంది. డ్యాంలో నీటిమట్టం 2,276.55 (గరిష్ఠం 2,284) అడుగులకు చేరింది. ఏ క్షణంలోనైనా గేట్ల నుంచి వరద నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కారణంగానే నదీ పరీవాహక ప్రాంతానికి ఇరువైపులా గ్రామాల్లో హెచ్చరికలు జారీచేశారు.

డీఏపీ బస్తాపై రూ.215 పెంపు

ఈనాడు, అమరావతి: డీఏపీ బస్తాపై ఏకంగా రూ.215 పెరిగింది. 50 కిలోల బస్తా మార్చి ఆఖరులో రూ.1,081 ఉంటే క్రమంగా పెరుగుతూ ఇప్పుడు రూ.1,290 అయింది. ఇది ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువ, అంతర్జాతీయంగానూ ఎరువుల ధరల పెంపు ప్రభావమే దీనికి కారణమని అధికారులు పేర్కొంటున్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరనూ రూ.100పైనే పెంచారు. 28-28 రకం రూ.1,123 నుంచి రూ.1,275 అయింది. 14.35.14 రకం బస్తా రూ.1,123 నుంచి రూ.1,275కు చేరింది. 20-20 రకం బస్తా రూ.872 నుంచి రూ.950కి చేరింది. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ధర ప్రస్తుతానికి రూ.700 ఉన్నా రానున్న రోజుల్లో పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు వివరిస్తున్నారు. సూపర్‌ఫాస్ఫేట్ తయారీలో పారిశ్రామిక అవసరాలకు వినియోగించే సల్ఫ్యూరిక్ ఆమ్లమైతే టన్ను రూ.4,500 నుంచి రూ.12వేలకు భారీగా పెరిగింది. ముడి ఫాస్ఫేట్‌తో దీన్ని కలిపి ప్రాసెస్ చేయడం ద్వారా సూపర్‌ఫాస్ఫేట్ తయారవుతుంది. ఈ నేపథ్యంలో బస్తా రూ.380 నుంచి రూ.460 అయింది. గతంలో 50 కిలోలుండే యూరియా బస్తా 45 కిలోలు చేయడంతో ధర రూ.295 నుంచి రూ.265కు తగ్గింది.

వ్యవసాయశాఖ ప్రచారమేదీ?: ఎరువుల ధరల పెంపుపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. డీఏపీ బస్తాపై ఏకంగా రూ.215, మిగిలిన వాటిపై రూ.వంద పైనే ఉంటే ఎకరాకు రూ.800పైనే భారం పడుతుందని వారు వివరిస్తున్నారు. కనీసం వ్యవసాయశాఖ కూడా దీనిపై రైతుల్లో అవగాహన కల్పించడం లేదు. దీంతో వాస్తవంగా పెరిగిందెంత? అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

వ్యవసాయ ఉన్నత విద్యకు రూ.25 కోట్లు

జాతీయ వ్యవసాయ ఉన్నత విద్య పథకంలో భాగంగా రాష్ట్రానికి రూ.25 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, పీహెచ్‌డీ విద్యార్థులతో పరిశోధనలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నారు. గుంటూరుకు సమీపంలోని లాం వర్సిటీ పరిపాలన భవన్‌లో జరిగిన అధ్యాపకుల మండలి సమావేశంలో దీనిపై చర్చ జరిగింది.

ఉక్కు పరిశ్రమలు కార్యదళం పరిశీలనలో

- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కడప, తెలంగాణలోని బయ్యారంలో ఉక్కు పరిశ్రమల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఏర్పాటు చేసిన కార్యదళం(టాస్క్‌ఫోర్స్) ఆ అంశంపై పరిశీలన చేస్తోందని కేంద్ర ప్రభుత్వం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆయా ప్రాంతాల్లో ఉక్కు పరిశ్రమల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు పరిశీలించి, పరిశ్రమల ఏర్పాటుకి మార్గసూచి(రోడ్‌మ్యాప్) రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఉక్కుశాఖ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థలతో కలిసి 19.10.2016న కార్యదళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలే కాకుండా దేశవ్యాప్తంగా స్థిరమైన అభివృద్ధి కోసం ఉక్కుశాఖ నిరంతరంగా కృషి చేస్తోందని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో, తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో ఉక్కు పరిశ్రమల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను సెయిల్ పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 13లో పొందుపరిచారని, అది ప్రాథమికంగా 2.12.2014న ఆర్థికంగా సాధ్యం కాదని నివేదిక ఇచ్చిందని కేంద్రం పేర్కొంది. కాగా ఈ నెల 12న కార్యదళం ఆరో సమావేశం నిర్వహించిందని అందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు సైతం పాల్గొన్నారని తెలిపింది. లక్ష్యం నెరవేరడానికి సాధ్యాసాధ్యాల నివేదికలకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మెకాన్ సంస్థతో ఇచ్చిపుచ్చుకోవాలని సూచించినట్లు వెల్లడించింది.

ఏపీ ప్రభుత్వం వల్లే ఆలస్యం: కన్నా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాధ్యతారాహిత్యం వల్లే కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఆలస్యం అవుతోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మెకాన్ సంస్థతో కలిపి సంయుక్తంగా ఉక్కు పరిశ్రమకు సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదిక ఇస్తే పరిశ్రమ ఏర్పాటు వేగవంతం అవుతుందన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రం కోర్టుకు ఇచ్చిన ప్రమాణపత్రాన్ని తప్పుగా అర్థం చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తెదేపా నాటకాలు కట్టిపెట్టాలని, పరిశ్రమ కోసం ఎవరూ ప్రాణత్యాగాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ఉక్కు పరిశ్రమను తాము తీసుకొస్తామన్నారు. ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాల్లో చేర్చాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేస్తామని కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు.

భాజపా స్పష్టత ఇవ్వాలి: సీపీఐ రామకృష్ణ

హిందూపురం అర్బన్,న్యూస్‌టుడే: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 86 శాతం నెరవేర్చామని భాజపా నాయకులు చేసిన ప్రకటనలపై స్పష్టత ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన అనంతపురం జిల్లా హిందూపురంలో విలేకరులతో మట్లాడుతూ హామీలు ఎక్కడ, ఎప్పుడు నెరవేర్చారన్న విషయాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై బహిరంగచర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కడప, బయ్యారంలో ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు సాధ్యంకాదని కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కడపలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయాలని 16న కడప బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఇన్ని రోజులు ఉక్కుపరిశ్రమ గురించి పట్టించుకోని ఎంపీ సీఎం రమేష్ ఇప్పుడు ఆమరణదీక్ష చేస్తామని చెప్పటం ప్రజలను మోసగించటమేనని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల కిట్ల కొనుగోళ్ల అనుమతికి ప్రతిపాదన

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న బాలలకు ఆట, పాటలతో విద్యా బోధన చేసేందుకు కిట్లను పంపిణీ చేసేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రణాళిక రూపొందించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు బోధించిన పాఠ్యాంశాలను చిన్నారులు సులభంగా గ్రహించేందుకు రంగు, రంగుల చిత్రాలతో పుస్తకాలను ముద్రించనున్నారు. విరామ సమయంలో ఆడుకోవటానికి బొమ్మలను కూడా పంపిణీ చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 55,006 అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో కిట్‌ని రూ.4 వేలతో సరఫరా చేసేందుకు ఆ శాఖ ప్రత్యేక కమిషనర్ అరుణ్‌కుమార్ ప్రతిపాదన పంపారు.

ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదనడం ద్రోహం: సీపీఎం

విజయవాడ, న్యూస్‌టుడే: కడపలో ఉక్కు కర్మాగారం నిర్మించడం సాధ్యం కాదంటూ కేంద్రం సుప్రీం కోర్టులో ప్రమాణపత్రం దాఖలు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ తీవ్రంగా తప్పు పట్టింది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు గురువారమిక్కడ ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఈ చర్య రాష్ట్రానికి మరోసారి ద్రోహం చేయడమేనన్నారు. ఎన్నికల్లో విభజన హామీల అమలుతోపాటు ప్రత్యేకహోదా ఇస్తామని వాగ్దానం చేసిన నరేంద్రమోదీ పాలనలో రాష్ట్రానికి అడుగడుగునా అన్యాయం జరుగుతోందన్నారు.

దొడ్డిదారిన మంత్రి అయి జగన్‌పై విమర్శలా?: అంబటి

ఈనాడు అమరావతి: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యపడదని 2014 డిసెంబరులోనే సెయిల్ నివేదికనిస్తే అప్పుడు కేంద్రంలో భాగస్వామిని ఉన్న చంద్రబాబు, తెదేపా ఎందుకు మాట్లాడలేదని వైకాపా అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'ప్రతిపక్ష నేత సొంత జిల్లాలో ఉక్కు పరిశ్రమ పెట్టడం కుదరదని కేంద్రం చెబితే ఒక్కమాట కూడా జగన్ మాట్లాడడం లేదని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శిస్తున్నారు. దొడ్డిదారిన ఎమ్మెల్సీ, మంత్రి అయిన ఆయనకు జగన్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు' అని అన్నారు.

కొత్తగా 65 బీసీ గురుకులాలు!

ఈనాడు డిజిటల్, అమరావతి: ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా 65 బీసీ గురుకుల విద్యాలయాలు ప్రారంభం కానున్నాయి! వీటి ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి అనుమతులు లభించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలను దశలవారీగా గురుకులాలుగా మార్చాలన్న నిర్ణయంలో భాగంగా వీటిని ఏర్పాటు చేయబోతున్నారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని సెప్టెంబరులోగా వీటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎస్ఐహెచ్ఎంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జీవకోన(తిరుపతి), న్యూస్‌టుడే: భారత్, ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖల సంయుక్త ఆధ్వర్యంలోని తిరుపతి స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్(ఎస్ఐహెచ్ఎం)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపల్ గిరి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో భాగంగా బీఎస్సీ చేయడానికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం ప్రాంగణ ఎంపికల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జేఈఈ ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ఒకవేళ సీట్లు మిగిలితే ఇంటర్‌లో 50 శాతం మార్కులు వచ్చిన విద్యార్థులతో భర్తీ చేస్తామన్నారు.

★ పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 25 సంవత్సరాల లోపు వయసున్న వారి కోసం క్రాఫ్ట్‌కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ కోర్సులను అందిస్తున్నట్లు వెల్లడించారు. వివరాల కోసం 97004 40604, 97013 43846 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గ్రామీణ యువకులకు 'బీఐఆర్ఈడీ' ఉచిత శిక్షణ

ఈనాడు డిజిటల్, అమరావతి: గ్రామీణ యువకులకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని వచ్చే నెల 13 నుంచి 40 రోజుల పాటు నిర్వహించనున్నట్లు బ్యాంకర్ల గ్రామీణ, పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ (బీఐఆర్ఈడీ) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. రెండు రాష్ట్రాలకు చెంది, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 18 నుంచి జులై 2 లోపు సంస్థ అధికారిక వెబ్‌సైట్ www.bired.org నుంచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని డైరెక్టర్ ఏ.ఏసేపు వెల్లడించారు. విద్యార్హతలను బట్టి మొబైల్ సర్వీసింగ్, ఎంఎస్ ఆఫీస్, పీసీ హార్డ్‌వేర్, ల్యాప్‌టాప్ సర్వీసింగ్, వ్యవసాయ పంపుసెట్ మరమ్మతులతోపాటు బీకాం పాసైన వారికి అకౌంటింగ్ ప్యాకేజీ తదితర అంశాలపై హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ బీఐఆర్ఈడీ ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 40 రోజుల శిక్షణ కాలంలో వసతి, భోజన సౌకర్యంతోపాటు రానుపోను ఖర్చులు ఇస్తామని చెప్పారు. నిబంధనలు, ఇతర వివరాలకు బీఐఆర్ఈడీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

ఎన్టీఆర్ విద్యోన్నతి ప్రోత్సాహకం పెంపు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎన్టీఆర్ విద్యోన్నతి పథకంలోభాగంగా సివిల్స్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకిచ్చే నెలవారీ ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలకు పెంచింది. హైదరాబాద్ సహా ఇతర మెట్రో నగరాల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకూ ఇది వర్తిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దిల్లీలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు మాత్రం రూ.12 వేలు ప్రోత్సాహకంగా అందిస్తారు.

బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం

- పూతరేకుల పరిశ్రమకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెస్తాం
- ప్రజా సంకల్ప యాత్రలో స్పష్టం చేసిన జగన్

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇస్తామని వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్ అన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా గురువారం ఆయన పాదయాత్ర తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలంలో కొనసాగింది. పేరవరం నుంచి ఆత్రేయపురం సమీపంలోని లొల్లలాకుల వరకు 12 కిలోమీటర్లు కొనసాగింది. ఈ సందర్భంగా మార్గమధ్యంలో వెలిచేరు వద్ద ఆయనను కల్లుగీత కార్మికులు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కలిసి వినతి పత్రాలు అందజేశారు. కల్లు గీత కార్మికులకు గుర్తింపు కార్డులతోపాటు పింఛన్లు ఇప్పించాలని కోరారు. విశ్వబ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆత్రేయపురంలో పూతరేకుల తయారీ విధానాన్ని పరిశీలించారు. వాటిని రుచి చూసి మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ పూతరేకుల పరిశ్రమకు రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చేందుకు కృషిచేస్తామన్నారు. తదుపరి లొల్లలాకుల వద్ద ఉన్న పీఎస్‌రాజు విశ్రాంతి మందిరంలో బసచేశారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, పార్టీ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్రేయపురంలో పూతరేకుల తయారీ గురించి తెలుసుకుంటున్న జగన్

'పోలవరం' సినిమా అంటారా?

- ఇంజినీర్లు, కార్మికులను అవమానించేలా జగన్ వ్యాఖ్యలు
- మంత్రి దేవినేని ఉమా విమర్శ

కృష్ణలంక, న్యూస్‌టుడే: పోలవరాన్ని సినిమాగా పేర్కొనడం ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని రాష్ట్ర జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్రానికి జీవనాడిలాంటి ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి 9 వేల మంది ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, కార్మికులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారని, జగన్ వ్యాఖ్యలు వారందరినీ అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. విజయవాడలోని జలవనరుల కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ పోలవరం డ్యాంసైట్లో రూ.8,619 కోట్లు ఖర్చుపెట్టిందని వెల్లడించారు. ప్రకాశం బ్యారేజీకి 23 కిలోమీటర్ల ఎగువన వైకుంఠపురం వద్ద 10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే బ్యారేజీ ద్వారా నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలోని లక్షలాది ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని మంత్రి చెప్పారు. బ్యారేజీకి 11 కిలోమీటర్ల దిగువన చోడవరం వద్ద 2.3 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. జూన్ 1న గోదావరి పరీవాహక ప్రాంతంలోని రైతులకు 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, కృష్ణా డెల్టాకు త్వరలోనే నీరు విడుదల చేస్తామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 53.33 మి.మీ. కాగా.. కృష్ణా జిల్లాలో 91 మి.మీ, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో 96 మి.మీ. చొప్పున నమోదైందని తెలిపారు.

ఉక్కు పరిశ్రమపై వైకాపా పోరాటమేది?: జూపూడి

ఈనాడు, అమరావతి: విభజన హామీలన్నీ కేంద్రం తుంగలో తొక్కిందని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్ ఆరోపించారు. సచివాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు కడప అనుకూలమైన ప్రదేశమని, ఇనుప ఖనిజం అందుబాటులో ఉన్నట్లు నివేదికలు వెల్లడించినా పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడమేమిటని ప్రశ్నించారు. కర్మాగారం సాధన కోసం రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ దీక్షకు సిద్ధమవుతున్నారని, కడప వైకాపా నేతలు ఏం చేస్తున్నారని నిలదీశారు. జగన్ పాదయాత్రకు ఇతర జిల్లాల నుంచి జనాన్ని తరలిస్తున్నారని, దీనికి రాజమహేంద్రవరం వంతెనపై జనమే నిదర్శనమని అన్నారు. రాష్ట్ర భాజపా అధ్యక్షుడిగా ఉంటూ, వైకాపా ప్రతినిధిగా పనిచేయడం కన్నా లక్ష్మీనారాయణకే చెల్లిందని ఆరోపించారు.

అటవీ శాఖకు 140 మంది పోలీసు సిబ్బంది

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణా నియంత్రణకోసం అటవీశాఖకు 140 మంది పోలీసు సిబ్బందిని డిప్యూటేషన్‌పై ప్రభుత్వం కేటాయించిందని పీసీసీఎఫ్ మహ్మద్ ఇలియాస్ రిజ్వీ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు, తిరుపతి, కడప, రాజంపేట, ప్రొద్దుటూరు, నెల్లూరు, గిద్దలూరు ప్రాంతాల్లో ఈ పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ఎర్రచందనం పరిరక్షణకు కార్యక్రమాన్ని రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అమలు చేసేందుకు రూ.25 కోట్లు మంజూరు చేసిందన్నారు. మూడేళ్లలో 6,429 మంది ఎర్రచందనం అక్రమరవాణాదారులను అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఆర్జీయూకేటీ ప్రవేశాలకు పోటీ తీవ్రం

నూజివీడు, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ)లో ఈ ఏడాది ప్రవేశాలకు పోటీ తీవ్రంగా ఉంది. మొత్తం నాలుగు వేల సీట్లలో ఒక్కో సీటుకు 14 మంది పోటీ పడుతున్నారు. ఎన్‌సీసీ కోటా విద్యార్థులు ఒక్కో సీటుకు 40 మంది పోటీ పడుతున్నారు. ఎన్‌సీసీ కోటా ఒక శాతం అంటే నాలుగు ట్రిపుల్‌ఐటీలకు 40 సీట్లున్నాయి. దీనికి నాలుగు రోజుల పాటు రోజుకు 400 మంది చొప్పున 1,600 మందిని పత్రాల పరిశీలనకు పిలిచారు. పత్రాల పరిశీలనలో భాగంగా గురువారం రెండోరోజు 400మంది విద్యార్థులకుగాను 328 మంది హాజరయ్యారు.

భాజపా మైనారిటీ మోర్చా జాతీయ కార్యదర్శిగా షేక్ బాజీ

ఈనాడు, దిల్లీ: భాజపా మైనారిటీ మోర్చా జాతీయ కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ బాజీ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారమిక్కడ భాజపా మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు అబ్దుల్‌అన్సారీని కలిసి షేక్‌బాజీ కృతజ్ఞతలు తెలిపారు.

తేలని తమిళ 'ఎమ్మెల్యేల అనర్హత'

- మూడో న్యాయమూర్తికి విచారణ బాధ్యత అప్పగించాలని మద్రాసు హైకోర్టు నిర్ణయం

ఈనాడు డిజిటల్, చెన్నై: తమిళనాడులో దినకరన్ వర్గానికి చెందిన పద్దెనిమిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత విషయం హైకోర్టులో కొలిక్కి రాలేదు. ఈ ఎమ్మెల్యేల వ్యవహారంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు ఇద్దరు గురువారం విభిన్న తీర్పులు వెలువరించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పర్యవసానంగా ప్రస్తుతానికి పళనిస్వామి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ తీర్పును వెల్లడిస్తూ...అనర్హత వేటు వేస్తూ శాసనసభ స్పీకర్ ధనపాల్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించారు. స్పీకర్ నిర్ణయాల్లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. అదే సమయంలో మరో న్యాయమూర్తి జస్టిస్ ఎం.సుందర్ మాత్రం ప్రధాన న్యాయమూర్తి తీర్పును వ్యతిరేకించారు. సదరు ఎమ్మెల్యేలపై స్పీకర్ వేటు వేయడం సరికాదని తన తీర్పులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణను మూడో న్యాయమూర్తికి బదలాయించాలని కోర్టు నిర్ణయించింది. ఆ న్యాయమూర్తి ఎవరన్నది హైకోర్టులో రెండో సీనియర్ న్యాయమూర్తి నిర్ధరించనున్నారు. తుది తీర్పు వెల్లడించేవరకు శాసనసభలో బలపరీక్షగానీ, 18 నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించడంగానీ చేయకూడదని కోర్టు స్పష్టం చేసింది. దీంతో ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వానికి ప్రస్తుతానికి ముప్పు తప్పినట్లైంది. టీటీవీ దినకరన్ వర్గానికి మాత్రం నిరాశ తప్పలేదు. తీర్పు అనంతరం టీటీవీ దినకరన్ మాట్లాడుతూ...తమకు ఇక్కడ న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోయిందని, ఈ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. తీర్పు నేపథ్యంలో కోర్టు ఆవరణలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొమ్మపై చిక్కుకున్న బాలిక

చెట్టు కొమ్మల్లో చిక్కిన 'పారా మోటరింగ్'

సురక్షితంగా కిందికి చేరిన ఇద్దరు

సీతంపేట, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలోని సీతంపేట ఐటీడీఏ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సాహస ఉద్యానవనం(ఎడ్వంచర్ పార్క్) వద్ద గురువారం సాయంత్రం 'పారా మోటరింగ్'లో పర్యాటకురాలు గాల్లో విహరిస్తున్న సమయంలో అదుపు తప్పింది. తగినంత గాలి వేగం లేకపోవటంతో పైలట్ సమయస్ఫూర్తితో దింపేందుకు యత్నించాడు. చివరకు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న చెట్టు కొమ్మల్లో పారా మోటరింగ్ యంత్రం చిక్కుకుంది. దీంతో బాలిక, పైలట్ కొద్దిసేపు కొమ్మల్లో చిక్కుకున్నారు. అటుగా వచ్చిన ఓ వాహనం పైనుంచి తాళ్లు విసిరి వాటి సహకారంతో స్థానికులు వారిద్దరినీ కిందికి దించారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు నేడు ఎంసెట్ ర్యాంకులు

కాకినాడ, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ర్యాంకులను శుక్రవారం వెల్లడించనున్నట్లు ఏపీ ఎంసెట్-18 కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సప్లిమెంటరీ ఫలితాల ద్వారా ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణులైన 5,137, అగ్రికల్చర్ అండ్ మెడిసిన్ విభాగంలో 1,600 మంది మొత్తం 6,737 మంది అభ్యర్థులకు ర్యాంకులను కేటాయించామని వివరించారు. వీటిని శుక్రవారం సాయంత్రం విద్యార్థుల చరవాణి నంబర్లకు సంక్షిప్త సందేశాల ద్వారా పంపుతామని పేర్కొన్నారు. ర్యాంకు కార్డులను ఎంసెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

ఉద్యోగ అవకాశాలు

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్
APTRANSCO
ప్రకటన
సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో రెగ్యులర్ ప్రాతిపదిక మీద సబ్ ఇంజినీర్లు మరియు జూనియర్ అసిస్టెంట్ల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కొరకు జారీచేయబడిన **15–12–2011, 16–1–2012, 26–2–2012**వ తేదీనాటి ప్రకటన ఇందుమూలముగా రద్దుచేయబడినది. ఏపిట్రాన్స్‌కో ఆర్డర్ (T.O.O.)ని **www.aptransco.gov.in** నందు చూడవచ్చును.
RO No.: 16/18 — సం/- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, HRD & PLG

DERAZ ENGINEERS
#Plot no. 19, Star House, Road no. 12, IDA Nacharam, Hyd - 76
Cont : 040-29802645, 9948353621, 9948353602
Email: deraz@deraz.in, www. derazengineers.com
WANTED FOR OUR BRANCH OFFICES IN VIJAYAWADA / NELLORE
SR. MANAGER/MANAGER / SR. ENGINEER:
With 3 to 5 years of Experience in Managing Sales Team and Selling Experience in Rotating Equipments / Centrifugal Pumps/ Air Compressors/ Lubricants /Water Treatment Plant / Capital Goods Sales to Industries.
QUALIFICATION: Any Engineering Degree/Diploma/BSC.

VIGNAN'S
Foundation for Science, Technology & Research
(Deemed to be UNIVERSITY)
-Estd. u/s 3 of UGC Act 1956
NAAC Accredited A
Vadlamudi, Guntur - 522 213. A.P. | Tel : 0863-2344700 Ext. 286, 361
Applications are invited for the post of PROGRAMMER, TECHNICAL ASSISTANT, LAB ASSISTANT & JR. ASSISTANT
Eligibility : Experienced Candidates with minimum qualification of Diploma or above in relevant discipline.
For details visit : www.vignanuniversity.org
Contact person - Asst. Registrar (8500444991)
Send your resumes to recruitment@vignanuniversity.org on or before 22.06.2018 (Friday).
Only Short Listed Candidates will be intimated about Interview

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
పటమటలంక, విజయవాడ
Cell: 80080 03297, 9959021300

సెన్సెక్స్ ▼ 139	నిఫ్టీ ▼ 49	డోజోన్స్ 25195 ▼06	నాస్‌డాక్ 7763 ▲ 67	రూపాయి 67.62 ▲	ముడి చమురు 76.09 ▼
35600	10808			(ఒక అమెరికా డాలరుకు) 3 పైసలు	(బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	14న	మార్పు%
LUPIN	899.60	3.18
SUN PHARMA	559.25	2.37
HCL TECHNOLOGIES	936.95	1.43
YES BANK	337.20	1.20
CIPLA	588.05	1.02
INDUSIND BANK	1963.40	0.92
DR. REDDYS LAB	2269.40	0.58

గ్రహణం (-)

నిఫ్టీ	14న	మార్పు%
INFOSYS	1239.70	-2.75
ADANI P&S	374.45	-2.19
TECH MAHINDRA	698.80	-2.10
ICICI BANK	284.75	-2.06
IOC	171.55	-2.03
TATA CONSULTANCY	1787.55	-2.00
INDIABULLS HSG FIN	1186.20	-1.97

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.51	71.32	బహ్రెయిన్ దీనార్	166.35	190.48
పౌండ్ స్టెర్లింగ్	82.34	95.51	కువైట్ దీనార్	184.95	230.31
యూరో	72.59	84.18	ఒమన్ రియాల్	162.49	186.62
జపనీస్ యెన్/100	55.80	64.70	సౌదీ రియాల్	16.31	19.38
ఆస్ట్రేలియా డాలరు	46.51	53.81	యూఏఈ దిర్హమ్	16.70	19.56
సింగపూర్ డాలరు	46.03	54.52	మలేషియా రింగిట్	15.09	18.56
థాయ్ బాత్/100	191.26	228.76	చైనీస్ యువాన్	7.47	12.12

గురువారం నిఫ్టీ కదలికలు



మీ డబ్బులు ఎక్కడికీ పోవు!

- మదుపర్ల నగదు రికవరీకి నిబంధనల సవరణ
- సెబీ ప్రతిపాదన

దిల్లీ

చట్టవ్యతిరేక సామూహిక మదుపు పథకాల ద్వారా ప్రజల నుంచి సేకరించిన నగదును వెనక్కి తెప్పించడం (రికవరీ చేయడం) కోసం నిబంధనలను సవరించాలని మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ భావిస్తోంది. మోసపూరిత పథకాలు ప్రవేశపెట్టిన కంపెనీ ఆస్తులను విక్రయించడానికి ఒక నమోదిత దివాలా నిపుణుడిని పాలనాధికారిగా నియమించనున్నారు. ఏదైనా కంపెనీ సెబీ ఆదేశాలను పాటించకపోతే.. అటాచ్ అయిన ఆస్తులు విక్రయించడం కోసం సదరు నిపుణుడు ఒక పాలనాధికారిని నియమించుకోవచ్చని సెబీకి చెందిన సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. భారత దివాలా బోర్డు(ఐబీబీఐ)లో దివాలా పరిష్కార నిపుణుడిగా నమోదైన కంపెనీని మాత్రమే పాలనాధికారిగా నియమించడానికి అర్హత ఉంటుంది. దివాలా స్మృతిని అమలు చేస్తున్న సంస్థే ఐబీబీఐ. అయితే పాలనాధికారి నియామకానికి ముందు సదరు సంస్థకు మోసపూరిత పథకం తెచ్చిన కంపెనీకి, డైరెక్టర్లకు, ప్రమోటర్లకు, గ్రూప్ సంస్థలకు మధ్య ఎటువంటి ప్రయోజనాలు కలిగే పరిస్థితులు లేవని నిర్ధరించుకోవాలి.

ఆ అధికారి చెప్పినదాని ప్రకారం.. ఈనెల 21న జరిగే సెబీ బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనను పరిశీలించే అవకాశం ఉంది. కాగా, పాలనాధికారికి ఒక స్వతంత్ర చార్టర్డ్ అకౌంటెంట్‌ను నియమించుకునే అవకాశం ఉంది. సమీకరించిన నిధులు, మదుపర్లకు చెల్లించిన నగదు వివరాలను తనిఖీ చేసుకునే అవకాశం ఉంది. పాలనాధికారికి అయ్యే ఖర్చులు ఆ సంస్థ భరించాలి. లేదా ఆ సంస్థ విక్రయాల ద్వారా వచ్చే నిధులను ఉపయోగించుకోవచ్చు.

ఎక్స్ఛేంజీ సీఈఓల పదవీ కాలంపై పరిమితి!

స్టాక్ ఎక్స్ఛేంజీల సీఈఓల పదవీకాలానికి పరిమితి పెట్టాలని సెబీ భావిస్తోంది. మార్కెట్ మౌలిక వసతుల సంస్థల యాజమాన్య, పాలన నిబంధనల్లో పూర్తి మార్పు తీసుకురావడంలో భాగంగా గరిష్ఠంగా అయిదేళ్ల చొప్పున రెండు సార్లు మాత్రమే పదవీ బాధ్యతలను చేపట్టేలా లేదా 65 ఏళ్ల వయసు వరకు.. ఏది తక్కువ అయితే అది వర్తించేలా నిబంధనలు తీసుకురావాలని సెబీ అనుకుంటోంది. ప్రస్తుతం ఎన్ని సార్లయినా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. అదే సమయంలో స్టాక్ ఎక్స్ఛేంజీల ఏర్పాటుకు కొత్త నియమాలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. కొత్త సంస్థల రాక వల్ల మదుపర్లకు ప్రయోజనాలు అందుతాయి. వారికి ఉత్పత్తుల ఎంపికకు ఎక్కువ అవకాశాలు రావడంతో పాటు.. తక్కువ వ్యయాలయ్యే నమూనాలకు వీలు చిక్కవచ్చని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. జూన్ 21న జరిగే తదుపరి బోర్డు సమావేశంలో ఒక చర్చాపత్రంతో సెబీ ముందుకు రావొచ్చని తెలుస్తోంది.

ఫోర్టిస్ మలార్, ఎస్ఆర్ఎల్ విలీనం లేదు

- వెనక్కి తగ్గిన ఫోర్టిస్ హెల్త్‌కేర్

దిల్లీ: ఫోర్టిస్ మలార్ హాస్పిటల్స్, ఎస్ఆర్ఎల్‌ల విలీన పథకం నుంచి ఫోర్టిస్ హెల్త్‌కేర్ వెనక్కి తగ్గింది. ఫార్మా రంగంలోని అడ్డంకులతో పాటు.. విలీన ప్రక్రియ ఆలస్యమవుతూ ఉండడం ఇందుకు నేపథ్యం. 'మొత్తం ప్రక్రియ 6-8 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశాం. కానీ కంపెనీ నియంత్రణలో లేని కారణాల వల్ల 19 నెలలు గడిచిపోయాయి. ఇప్పటికీ ప్రక్రియ పూర్తి కాలేద'ని ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ఈ విలీన పథకం నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ), చండీగఢ్ ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉందని తెలిపింది. ఈ 19 నెలల కాలంలో ఆరోగ్య సంరక్షణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంది. డయాగ్నస్టిక్స్ వ్యాపారం అనుకున్నంతగా రాణించలేదని ఫోర్టిస్ హెల్త్‌కేర్ తెలిపింది. ఈ పరిస్థితుల్లో విలీనానికి ముందుకెళ్లడం వల్ల ఫోర్టిస్ వాటాదార్లకు మంచి విలువ వస్తుందని మేం భావించడం లేదని వివరించింది. తన డయాగ్నస్టిక్స్ వ్యాపారాన్ని విడదీసి, ఎస్ఆర్ఎల్‌లో విలీనం చేయడానికి ఫోర్టిస్ బోర్డు ఆగస్టు 19, 2016న అంగీకరించిన విషయం విదితమే.

క్లిష్టమైన ఔషధాలపై భారత కంపెనీల దృష్టి: డాట్‌వైలర్

ఈనాడు, హైదరాబాద్: వినూత్న, క్లిష్టమైన ఔషధాల అభివృద్ధిపై భారత ఔషధ కంపెనీలు దృష్టి సారిస్తున్నాయని.. వివిధ దేశాల నియంత్రణ ప్రాధికార సంస్థలు కఠిన నిబంధనలు అమల్లోకి తెస్తున్నందున దేశీయ కంపెనీలు అధిక నాణ్యత ప్రమాణాలతో ఔషధాలను తయారు చేయడానికి మొగ్గు చూపుతున్నాయని డాట్‌వైలర్ అమ్మకాల అధిపతి (కంటైనర్ క్లోజర్లు) రోలెంట్ స్ట్రాప్స్ తెలిపారు. ఔషధాల ప్యాకింగ్ సీలింగ్‌లు, ఇంజెక్టబుల్ ప్యాకేజింగ్, డ్రగ్ డెలివరీ వ్యవస్థలకు వినూత్న సొల్యూషన్లను కంపెనీ తయారు చేస్తోంది. పుణెలోని తయారీ ప్లాంట్లను విస్తరిస్తున్నామని, ప్రస్తుతం ఇక్కడ తయారయ్యే ఉత్పత్తుల్లో 90 శాతాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని విలేకరుల సమావేశంలో తెలిపారు. స్విట్జర్లాండ్‌కు చెందిన డాట్‌వైలర్‌కు భారత మార్కెట్ కీలకమని 2021 నాటికి పుణెలో తయారయ్యే ఉత్పత్తుల్లో సగం దేశీయంగా విక్రయిస్తామన్నారు. భారత్‌లో 7 ఔషధ కంపెనీలు డాట్‌వైలర్‌కు ఖాతాదారులుగా ఉన్నాయి.

ఏపీలో ఎస్సెల్ ఇన్‌ఫ్రాకు మూడు ప్రాజెక్టులు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వ్యర్థాల నుంచి విద్యుత్ తయారు చేయడానికి మూడు ప్రాజెక్టులు దక్కించుకున్నట్లు ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రకటించింది. కడప, అనంతపురం, తాడేపల్లిగూడెంలలో వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపింది. ప్రతి ప్లాంట్‌లో వ్యర్థాల కంబస్టర్, ఫ్లూ గ్యాస్ ట్రీట్‌మెంట్ సిస్టమ్స్ ఉంటాయి. వీటిలో రోజుకు 330 టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయడం ద్వారా దాదాపు 6000 కిలో వాట్‌ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి హిటాచీ జోసెన్ ఇండియాతో సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో వ్యర్థాల నుంచి విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఈ రెండు సంస్థలు ఇప్పటికే కలిసి పనిచేశాయి.

ఇ-మెయిల్, మొబైల్ నెంబరు మార్పులకు అవకాశం

- జీఎస్‌టీ చెల్లింపుదార్లకు ఆర్థిక శాఖ వెసులుబాటు

దిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) కింద నమోదైన సమయంలో ఇచ్చిన మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ వివరాల్లో ఏమైనా సవరణలు ఉంటే, మార్చుకునే అవకాశాన్ని ఆర్థిక శాఖ కల్పించింది. ఇందుకోసం తమ పరిధిలోని జీఎస్‌టీ అధికారి వద్దకు సంబంధిత పత్రాలతో చెల్లింపుదార్లు వెళ్లాలి. చెల్లింపుదారు జీఎస్‌టీ నెంబరుకు కేటాయించిన యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌ను ఆ అధికారి ఇస్తారు. ఆ తర్వాత జీఎస్‌టీ పోర్టల్‌లోని 'సెర్చ్ ట్యాక్స్‌పేయర్' సాయంతో మనం ఎంపిక చేసుకున్న పరిధి సరైనదేనా, కాదా గుర్తించాలి. అనంతరం జీఎస్‌టీఐఎన్‌కు సంబంధించి వ్యాపార వివరాల రుజువు నిమిత్తం అవసరమైన పత్రాలను జీఎస్‌టీ అధికారికి సమర్పించాలి. వాటిని పరిశీలించాక కొత్త మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాను అందులో పొందుపరుస్తారు. పత్రాల అప్‌లోడింగ్ పూర్తయ్యాక, జీఎస్‌టీఐఎన్‌కు కేటాయించిన పాస్‌వర్డ్‌ను అధికారి రీసెట్ చేస్తారు. ఆ తర్వాత మార్పు చేసిన ఇ-మెయిల్ చిరునామాకు యూజర్‌నేమ్, తాత్కాలిక పాస్‌వర్డ్ వస్తాయి. వాటిని ఉపయోగించి, జీఎస్‌టీ పోర్టల్‌కు లాగిన్ అయ్యాక పాస్‌వర్డ్, యూజర్‌నేమ్‌ను మనకు నచ్చినట్లుగా మార్చుకోవాలి.

సవరించిన ధర స్టిక్కర్‌తో జులై 31 వరకు విక్రయించొచ్చు

జీఎస్‌టీ అమలుకు ముందు తయారైన ఉత్పత్తుల ప్యాకింగ్‌పై, సవరించిన ధర ముద్ర (స్టిక్కర్)తో జులై 31 వరకు విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. గతేడాది జులై 1 నుంచి జీఎస్‌టీ విధానం అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అంతకుముందే ఎంఆర్‌పీతో ప్యాకింగ్ అయిన ఉత్పత్తులపై సవరించిన ధర ముద్రించి విక్రయించేందుకు గత సెప్టెంబరు 30 వరకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.

ధరలకు ఇంధన సెగ

- 14 నెలల గరిష్ఠానికి డబ్ల్యూపీఐ

దిల్లీ: ద్రవ్యోల్బణానికి పెట్రోలు, డీజిల్ ధరల సెగ తాకింది. మేలో టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణ సూచీ (డబ్ల్యూపీఐ) 4.43 శాతానికి పెరిగింది. గత 14 నెలల్లోనే ఇది అత్యధికం. 2017 మార్చిలో నమోదైన 5.11 శాతం తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. కిందటేడాది మేలో డబ్ల్యూపీఐ 2.26 శాతం వద్ద ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో 3.18 శాతంగా నమోదైంది. మే నెలకు కేంద్రీయ గణక కార్యాలయం విడుదల చేసిన డబ్ల్యూపీఐ వివరాలు ఇలా..

- మేలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణ రేటు 1.6 శాతంగా నమోదైంది. ఏప్రిల్‌లో ఇది 0.87% మాత్రమే.
- ఇంధనం, విద్యుత్ విభాగం ద్రవ్యోల్బణం గణనీయంగా 11.22 శాతానికి పెరిగింది. ఏప్రిల్‌లో వీటి ధరల్లో పెరుగుదల 7.85 శాతం. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వల్ల దేశీయ పెట్రోలియ ఉత్పత్తుల ధరలూ అధికమయ్యాయి.
- కూరగాయలు 2.51 శాతం, పండ్లు 15.40%, పప్పు ధాన్యాలు 21.13% చొప్పున ప్రియమయ్యాయి.
- మార్చి నెల డబ్ల్యూపీఐను ఇంతకుముందు ప్రకటించిన 2.47 శాతాన్ని సవరించి 2.74 శాతానికి పెంచారు.

ఇంధన ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలి

పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడం కొనసాగితే దిగుమతుల వ్యయ భారం పెరుగుతుందని, ఈ ప్రభావం రూపాయి మారకం విలువపై పడుతుందని అసోచామ్ అభిప్రాయపడింది. ముడి సరుకు ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపింది. లాభదాయకతపై ఆ ఒత్తిడి ప్రభావం ఇప్పటికే కనిపించడం మొదలైందని పేర్కొంది. వీటన్నింటి దృష్ట్యా ఇంధన ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అసోచామ్ సెక్రటరీ జనరల్ డి.ఎస్.రావత్ తెలిపారు.



మార్కెట్ కబుర్లు

- తాము రూపొందించిన గర్భ నిరోధక జనరిక్ ఔషధం అమెరికాలో విక్రయించేందుకు యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి లభించినట్లు **లుపిన్** తెలిపింది.
- **రిలయన్స్ ఇన్‌ఫ్రా**కు చెందిన ముంబయి విద్యుత్ పంపిణీ వ్యాపారాన్ని అదానీ ట్రాన్స్‌మిషన్‌కు విక్రయించే అంశానికి సంబంధించి మహారాష్ట్ర విద్యుత్ నియంత్రణసంస్థ వాదనలు విని, ఉత్తర్వుల్ని రిజర్వ్‌లో ఉంచింది.
- తమ సంస్థకు రూ.1,391 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కినట్లు **ఎల్ అండ్ టీ** వెల్లడించింది.
- పబ్లిక్ ఇష్యూకు వచ్చిన **అదానీ గ్రీన్ ఎనర్జీ** లిమిటెడ్ షేర్లను సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనున్నారు.
- **గుజరాత్ అంబుజా ఎక్స్‌పోర్ట్స్**కు చెందిన సితార్‌గంజ్ యూనిట్‌ను మూసేయాల్సిందిగా జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులపై ఉత్తరాఖండ్ హైకోర్టు తాజాగా తాత్కాలిక స్టే ఇచ్చింది.
- **పంజ్‌లాయిడ్**పై ఎన్‌సీఎల్‌టీ వద్ద ఐసీఐసీఐ బ్యాంక్ దివాలా పిటిషన్ దాఖలు చేసింది. అయితే దీన్ని ఎన్‌సీఎల్‌టీ పరిగణనలోకి తీసుకోకపోవచ్చని పంజ్‌లాయిడ్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.
- **ఫైన్ ఆర్గానిక్ ఇండస్ట్రీస్** జూన్ 20-22 తేదీల మధ్య పబ్లిక్ ఇష్యూకు రాబోతోంది. ఒక్కో షేరు ధరను రూ.780-783 మధ్య నిర్ణయించారు.
- **విస్తారా** గూటికి 21వ విమానం వచ్చి చేరింది. దీంతో అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించేందుకు ఈ సంస్థకు అర్హత లభించింది.

14న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) — కోడి గుడ్లు

(100కు రూపాయలలో)

హైదరాబాద్	384	వరంగల్	386
చిల్లరగా (ఒక గుడ్డు)	4.45	విశాఖపట్నం	380
బెంగళూరు	425	చెన్నై	452
15వ తేదీకి...		చిత్తూరు	445
విజయవాడ/గోదావరి	376	నమక్కల్	435

2018-19లోనే ఎన్‌ఎస్‌ఈ ఇష్యూ

ఎక్స్ఛేంజీ ఎండీ విక్రమ్ లిమాయే

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) పబ్లిక్ ఇష్యూ ఉంటుందని అనుకుంటున్నామని ఎన్‌ఎస్‌ఈ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ విక్రమ్ లిమాయే అన్నారు. 'కో-లొకేషన్ కేసు పరిష్కారం అయిపోతుంది. అయినా అదేమీ అడ్డంకి కాదు. అందుకే ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఎన్‌ఎస్‌ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తవుతుందని భావిస్తున్నామ'ని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శాశ్వత్ గోయెంకాతో జరిగిన చర్చా కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతూ లిమాయే చెప్పారు. కోలొకేషన్ కేసు వ్యవహారంపై సెబీ, సీబీఐల దర్యాప్తు జరుగుతుండటంతో ఎన్‌ఎస్‌ఈ ఇష్యూ ఆలస్యమవుతూ వచ్చింది. అయితే ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఫోరెన్సిక్ రిపోర్టులను డెలాయిట్, ఈఅండ్‌వై, ఐఎస్‌బీలు సమర్పించాయని లిమాయే తెలిపారు.

నేటి మార్కెట్

అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. ఐరోపా కేంద్ర బ్యాంక్ (ఈసీబీ) పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు మార్కెట్లపై ప్రభావం చూపొచ్చని విశ్లేషకులు అంటున్నారు. బాండ్ల కొనుగోళ్ల ప్రక్రియను ఆపివేస్తున్నట్లు ఈసీబీ ప్రకటించడం మదుపర్లు పరిగణనలోకి తీసుకోనున్నారు. నేడు నిఫ్టీ 10740- 10860 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిఫ్టీ 10930 నిరోధ స్థాయి అధిగమిస్తే.. మరింత ముందుకెళ్లే అవకాశం ఉందని బ్రోకరేజీ సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ఐటీ, బ్యాంకింగ్ రంగాల్లో కొన్ని షేర్లు లాభపడటం, కొన్ని నష్టపోవడంతో ప్రస్తుత ధోరణిపై అనిశ్చితి నెలకొందని డీలర్లు చెబుతున్నారు. నేటి కంపెనీ బోర్డు సమావేశంలో షేర్ల బైబ్యాక్ ప్రతిపాదన పరిశీలనకు రానుండటంతో, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) షేరు వెలుగులోకి రావొచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు టీసీఎస్ షేరు 32 శాతం లాభపడింది.

మార్కెట్లకు ఫెడ్ కుదుపు

- ఆగిన లాభాల పరుగు
- నిరాశపరచిన డబ్ల్యూపీఐ గణాంకాలు
- 139 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

సమీక్ష

అమెరికాలో వడ్డీరేట్లు పెంచడం వల్ల దేశీయంగా సూచీల లాభాల పరుగుకు అడ్డుకట్ట పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ పావు శాతం మేర వడ్డీ రేట్లు పెంచడంతో పాటు.. ఈ ఏడాదిలో మరో రెండు సార్లు రేట్ల పెంపునకు సంకేతాలివ్వడంతో, దేశీయంగా మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 14 నెలల గరిష్ఠానికి చేరడం, కరెంట్ ఖాతా లోటు పెరగడం కూడా మదుపర్ల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఐరోపా కేంద్ర బ్యాంక్ పరపతి విధానంపై మదుపర్లు దృష్టి పెట్టారు. ఔషధ షేర్లు రాణించడంతో సూచీల నష్టాలు పరిమితమయ్యాయి. ఆసియా మార్కెట్లు బలహీనపడగా.. ఐరోపా మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35743.10 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. కొద్దిసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏదశలోనూ కోలుకోలేకపోయింది. ఒకానొకదశలో 35,488.55 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సూచీ.. చివరకు 139.34 పాయింట్ల నష్టంతో 35,599.82 దగ్గర స్థిరపడింది. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 295.49 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. నిఫ్టీ సైతం 48.65 పాయింట్లు కోల్పోయి 10,808.05 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,773.55- 10,833.70 పాయింట్ల మధ్య కదలాడింది.

- ఇన్ఫెక్షన్‌ల నివారణకు వినియోగించే యాంటీబయోటిక్ డాక్సీసైక్లిన్ హైక్లేట్ ఔషధానికి అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం ఇవ్వడంతో అలెంబిక్ ఫార్మా షేరు రాణించింది. ఇంట్రాడేలో 8 శాతం దూసుకెళ్లిన షేరు.. చివరకు 3.32 శాతం లాభంతో రూ.506.55 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 నష్టాలు చవిచూశాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 2.11%, అదానీ పోర్ట్స్ 1.75%, టీసీఎస్ 1.75%, ఎస్‌బీఐ 1.72%, యాక్సిస్ బ్యాంక్ 1.48%, ఎన్‌టీపీసీ 1.22%, ఓఎన్‌జీసీ 0.88%, ఎల్ అండ్ టీ 0.87% చొప్పున డీలాపడ్డాయి. సన్‌ఫార్మా 2.57%, యెస్ బ్యాంక్ 1.17%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.08%, డాక్టర్ రెడ్డీస్ 0.73%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.55%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ 1.40% కోల్పోయింది. టెక్, పీఎస్‌యూ, మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలు, చమురు-గ్యాస్, మౌలిక, విద్యుత్ షేర్లు అదే బాటలో నడిచాయి. ఆరోగ్య సంరక్షణ, వాహన షేర్లు మాత్రం రాణించాయి.

ఎన్‌ఎస్‌ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 374.45 (382.85) 2398168
ASIAN PAINTS 1286.10 (1286.40) 507824
AXIS BANK LT 532.00 (540.65) 3736633
BAJAJ AUTO L 2890.70 (2907.95) 333925
BAJAJ FINANC 2243.25 (2231.05) 1321341
BAJAJ FINSER 6028.00 (6074.80) 65910
BHARTI AIRTE 376.50 (375.65) 4703619
BHARTI INFRA 296.50 (300.50) 1055622
BPCL 416.35 (419.90) 3748520
CIPLA 588.05 (582.10) 3244655
COAL INDIA L 283.20 (284.00) 1535853
DR. REDDYS 2269.40 (2256.30) 1588963
EICHER MOTOR 29536.70 (29448.60) 32023
GAIL 339.00 (344.85) 3653980
GRASIM IND 1036.20 (1037.00) 598053
HCL TECH 936.95 (923.70) 1877540
HDFC 1833.75 (1832.30) 2035114
HDFC BANK 2037.40 (2031.45) 4231894
HERO MOTOCOR 3695.60 (3696.80) 155159
HINDALCO IND 244.75 (245.00) 6799990
HINDUSTAN UN 1609.60 (1621.20) 1348038
HPCL 309.75 (313.90) 3422003
ICICI BANK 284.75 (290.75) 11400592
INDIABULLS H 1186.20 (1210.05) 4098739
INDIAN OIL 171.55 (175.10) 6988054
INDUSINDBANK 1963.40 (1945.45) 917199
INFOSYS LTD 1239.70 (1274.80) 3799424
ITC 267.25 (267.85) 9169601
KOTAK MAHIND 1332.65 (1325.65) 1584229
LARSEN & TOU 1343.00 (1358.75) 1325652
LUPIN 899.60 (871.90) 6617748
M&M 922.05 (917.65) 1385264
MARUTI SUZIK 8958.00 (8967.35) 269078
NTPC LTD 158.40 (160.25) 5166879
ONGC 168.50 (170.00) 4188442
POWER GRID C 198.85 (198.15) 4052919
RELIANCE IND 1007.95 (1002.50) 5484867
SBI 282.60 (287.70) 18513730
SUN PHARMA 559.25 (546.30) 12154425
TATA CONSULT 1787.55 (1824.10) 3819998
TATA MOTORS 305.90 (308.40) 6532693
TATA STEEL L 569.55 (567.60) 7482514
TECH MAHINDR 698.80 (713.80) 4483300
TITAN IND 905.25 (918.15) 2004165
ULTRATECH 3767.00 (3800.60) 235397
UPL LIMITED 684.90 (687.55) 854417
VEDANTA LIMI 240.05 (243.10) 8930060
WIPRO 266.40 (268.80) 2336679
YES BANK LTD 337.20 (333.20) 6819965
ZEE ENTERTAI 554.20 (557.10) 1020807

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1252.85 (1262.45) 13351
ACC 1307.20 (1330.95) 250892
ADITYA BIRLA 140.65 (139.55) 1998499
AMBUJA CEMEN 206.05 (210.00) 4024884
ASHOK LEYLAN 144.95 (142.65) 14625441
AUROBIND PHA 609.45 (584.90) 4975616
AVENUE SUPER 1568.50 (1595.85) 600354
BANK OFBAROD 135.15 (136.75) 12368015
BEL 116.15 (119.20) 3940657
BHEL 76.00 (78.05) 6087770
BOSCH LTD 18236.15 (17965.60) 13516
BRITANNIA 6001.75 (6017.15) 76768
CADILA HEALT 398.70 (393.80) 2696573
COLGATE PALM 1231.90 (1239.00) 461262
CONTAINER 1304.15 (1319.25) 339336
CUMMINS INDI 688.90 (684.25) 122285
DABUR INDIA 386.90 (388.15) 655966
DLF LIMITED 205.90 (205.00) 3560475
EMAMI LIMITE 1095.40 (1104.15) 240343
GENERAL INS 721.75 (726.50) 96526
GODREJ CONSU 1170.60 (1169.10) 315003
HAVELLS INDI 548.20 (559.45) 1050698
HINDUSTAN ZI 301.45 (301.40) 2775323
ICICI PRU LI 403.00 (410.35) 5895186
IDEA CELLULR 62.80 (61.50) 9864682
INTERGLOBE A 1224.15 (1218.95) 434519
JSW STEEL LT 339.05 (343.00) 2262462
L&TFIN.HOLD 167.75 (165.60) 2261670
LIC HOUS.FIN 495.20 (497.00) 803113
MARICO LIMIT 344.15 (337.05) 1294847
MCDOWELL 3455.30 (3432.85) 381056
MOTHERSON 313.70 (309.40) 1702447
MRF 75349.60 (75048.05) 3518
NHPC LTD 26.00 (26.35) 5162065
NMDC LTD 115.50 (115.65) 908960
OIL INDIA 222.45 (223.65) 744404
ORACLE FIN S 4008.70 (4000.40) 13091
P&G HYG&HEAL 9722.95 (9648.15) 1156
PETRONET LNG 217.65 (217.30) 1774770
PIDILITE IND 1083.00 (1083.40) 649820
PIRAMAL ENTE 2427.40 (2443.05) 194923
PNB 91.70 (91.30) 19136052
POWER FIN CO 84.15 (84.10) 5850541
RURAL ELEC C 116.50 (117.80) 2862243
SAIL 86.35 (87.90) 25258386
SBI LIFE INS 689.90 (702.25) 463811
SHREE CEMENT 16319.35 (16382.25) 14546
SHRIRAM TRAN 1485.10 (1507.30) 569624
SIEMENS 1009.40 (1023.00) 94667
SUN TV LTD 912.25 (932.75) 1054505

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 4.19 (4.03) 62
ALPHAGEO 666.85 (666.90) 1185
AMAR RAJA BA 772.90 (774.30) 10153
ANDHRA BANK 36.80 (36.95) 153634
ANDHRA CEMEN 9.36 (9.28) 16057
ANDHRA PAPER 325.40 (330.10) 2799
ANDHRA PETRO 47.95 (48.20) 27784
ANDHRA SUGAR 360.10 (360.80) 658
ANJANI PORTL 170 (176) 449
ASTRA MICROW 101.55 (101.20) 42613
AUROBINDO PH 609.90 (584.90) 244800
AVANTEL SOFT 406.75 (428.15) 11321
AVANTI FEEDS 1865.20 (1873.80) 34115
AVON ORG 9.50 (9.07) 1378
BALAJI AMIN 610.70 (600.45) 5580
BARTRONICS 10.78 (10.81) 9694
BHAGIRA CHEM 289.20 (283.95) 960
BHAGYA NAG 41.65 (42.15) 6000
BN RATHI SEC 38.35 (40) 511
BRILLIANT SE 4.51 (4.30) 100606
CAMBRIDGE TE 54.10 (55.15) 10870
CIL SECURI 23.45 (23.15) 101
COMBAT DRUGS 26.70 (26) 44
CONT COFFEE 279.20 (284.10) 2596
COROMAN FERT 425.60 (437.60) 9606
CUBEX TUB 18.50 (17.75) 979
CYBERMATE 2.11 (2.01) 21525
CYIENT LIMIT 739.60 (748.75) 7841
DECCAN CEMEN 429.85 (431.10) 39031
DIVI'S LAB 1084.30 (1039.80) 63753
DIVYA GRANIT 84.90 (82.50) 3
DR REDDY 2268.40 (2252) 159374
FOUR SOFT 62.05 (62.90) 811
GATI CORPN 92.90 (94.60) 68593
GAYATRI PROJ 177.20 (177.15) 3311
GMR INFRASTR 16.15 (16.25) 744274
GOLDST INFRA 176.45 (185.35) 127282
GOLDSTONE EN 16.01 (15.76) 7767
GRANULES (I) 87.75 (85.70) 350915
GSS AMERICA 89.50 (87.50) 13945
GVK POWER 11.56 (11.68) 257564
HBL NIFE POW 36.85 (37.25) 35528
HERITAGE FOO 688.15 (685.20) 1298
HIL LTD 2006.75 (1948.90) 502
HIND FLUROCA 11 (11.70) 675
IDL INDUSTRS 406.05 (410.30) 34
IKF SOFT 0.51 (0.49) 208999
ILFS ENGINEE 30.90 (31.25) 5700
INCAP 68.50 (68.25) 125
INNAREDY COM 1.90 (1.82) 4951
IVRCL INFRAS 1.37 (1.31) 6267485
JEEVAN SCIEN 36.35 (34.35) 1436
KAKATIYA CEM 256.40 (266.15) 2961
KALLAM SPG 27 (26.75) 12748
KARAN WOO-SN 2.30 (2.20) 230
KAVERI SEED 561.30 (563.20) 83349
KCP LTD 107.20 (108.35) 3870
KERNEX MICRO 28.45 (27.10) 4354
KNR CONSTRUC 268.60 (278.30) 11597
KREBS BIO 129.10 (128.50) 1343
LANCO INDUS 298.90 (300.05) 2896
LANCO INFRAT 0.86 (0.90) 260683
LASER DOT 6.46 (6.79) 50
LAURUS LABS 487.95 (490.15) 2888
LOKESH MACH 66.50 (66.35) 2523
MADHUCON PRO 13.35 (13.45) 5719
MEGA SOFT 9.95 (9.93) 6692
MIC ELECTRON 3.84 (3.93) 34845
MOLD-TEK.TEC 41.65 (41.70) 300
MOLDTK PLA 304.25 (302.80) 4272
MSR INDIA LT 30.05 (28.90) 19208
NAGARJAGRICH 30.05 (30.45) 19672
NATCO PHARMA 810.30 (797.60) 300112
NAVA BH VENT 138.90 (137.60) 57831
NCC 108.05 (108.70) 660546
NCL IND 175 (180) 4753
NEHA INTER 5.73 (5.57) 4247
NETTLINX 58.85 (58.85) 7853
NEULAND LAB 701.20 (704.65) 1027
NIHAR INFO 10.65 (10.80) 50
NILE 595.15 (588.50) 1159
OIL COUNTRY 21.85 (20.55) 8416
PANYAM CEMEN 25.85 (26.30) 4580
PENNER IND 55.10 (55.65) 57502
PHYTOCHEM I 52.75 (51.40) 1457
PIONEER DIST 274.35 (271.30) 2049
PITTI LAMIN 90.15 (92.20) 16101
POKARNA 177.65 (159.45) 34944
PRAJAY ENGS 10.96 (10.69) 9624
PREMIER EXPL 280.20 (285) 25
PRISM CEMENT 108.70 (110.35) 13474
PRUDENTL PHA 4.18 (3.49) 1512059
RAIN INDUSTR 225 (227.45) 131552
RAJ PACKAGIN 29.70 (27.70) 153
RAM INFORMAT 43 (42.70) 5843
SAGAR CEM 820 (834.90) 676
SAMKRG PIST 240.65 (241.85) 1813
SAMPRE NUTRI 47.05 (49) 3708
SATVAH. ISPA 14.45 (14.65) 2742
SMS PHARMA 80.40 (78.60) 27806
SPHERE GLOBA 30.60 (30.85) 98667
SREE RAYAL A 36.30 (36.65) 54414
SRI KPR INDU 27.25 (26) 1897
SRINIVASA SH 43.40 (41.80) 3731
SS ORGANICS 5.58 (5.32) 8000
STARCHIK SP 31.35 (29.90) 1688
STEEL EXCHAN 23.40 (24.40) 13109
SUJANA METAL 0.88 (0.84) 20801
SUJANA TOWER 2.66 (2.80) 7
SUJANA UNIVE 0.51 (0.50) 65690
SURANA TELE 4.51 (4.54) 933
SURYALAKSH.C 55.45 (56) 550
SURYALATA SP 128.30 (131.80) 48
SURYAVA SPIN 6.01 (6.32) 50
SUVEN PHARMA 233.45 (228.75) 119515
TAJ GVK HOTE 233.65 (232.75) 7437
TANLA 30.55 (30.90) 15054
TERA SOFTWAR 43.50 (44.35) 2250
TRANS BIOTEK 2.10 (2.02) 1951
TRENDY KNIT 0.19 (0.19) 2000
VAMSHI RUBB 48 (48.40) 505
VBC FERRO 41.20 (39.25) 1255
VICEROY HOTE 8.73 (8.75) 25892
VIJAY TEXTIL 57.50 (55.85) 4217
VIMTA LABS 213.15 (218.60) 1101
VISAKA IND 648.55 (645) 7127
VISTA PHARMA 37.95 (37.35) 8604
VIVIMED LABS 61.85 (61.40) 64787
VST INDUS 3021.50 (3030) 1096
XL TELENE 1.38 (1.45) 3737
YBRANT DIGIT 4.37 (4.33) 114459
ZENOTECH LAB 40 (41.95) 1927
ZENTECH 86.35 (86.50) 12640

ఈనాడు బిజినెస్

జీఎం తెలుగు 'దివ్య'

యాక్సెంచర్ సెక్యూరిటీ ఎండీగా అనూప్ ఘోశ్

భారత సంతతి వ్యక్తికి ఉన్నత పదవి

న్యూయార్క్: అంతర్జాతీయ ప్రొఫెషనల్ సేవల కంపెనీ యాక్సెంచర్.. తమ సెక్యూరిటీ విభాగానికి మేనేజింగ్ డైరెక్టర్‌గా భారత సంతతికి చెందిన సైబర్ భద్రత నిపుణుడు అనూప్ ఘోశ్‌ను నియమించింది. సెక్యూరిటీ సేవల వ్యాపారంలో వృద్ధికి ఆయన నియామకం తోడ్పననున్నట్లు కంపెనీ వెల్లడించింది. సైబర్ సెక్యూరిటీ రంగంలో గణనీయమైన వృద్ధి నమోదవుతున్న సమయంలో యాక్సెంచర్‌లో చేరడం చాలా ఆనందంగా ఉందని అనూప్ తెలిపారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో దీర్ఘ కాలం పాటు పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. వర్జీనియా కేంద్రంగా మెషీన్ లెర్నింగ్ సైబర్ సెక్యూరిటీ కంపెనీ ఇన్విన్సియాను ఆయన ప్రారంభించారు. 2017 మార్చిలో దాన్ని సోఫోస్‌కు విక్రయించే వరకు ఇన్విన్సియా సీఈఓగా సైతం పనిచేశారు. అంతకంటే ముందు డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఏజెన్సీలో ప్రోగామ్ మేనేజర్‌గా సైతం పనిచేశారు.

రోల్స్ రాయిస్‌లో భారీగా ఉద్యోగాల కోత

లండన్: బ్రిటన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే విమాన ఇంజిన్ల తయారీ సంస్థ రోల్స్ రాయిస్ 2020 నాటికి 4600 మంది ఉద్యోగులపై వేటు వేయనుంది. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా కంపెనీ ఇప్పటికే వేలమంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. లాభాలు మెరుగు పడటానికి, మార్జిన్లు, నగదు నిల్వలు పెంచుకోవడం కోసం పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు రోల్స్ రాయిస్ వెల్లడించింది. లండన్‌లో నమోదిత కంపెనీ అయిన రోల్స్ రాయిస్ తయారు చేసే ఇంజిన్‌లు.. ఎయిర్‌బస్, బోయింగ్ విమానాల్లో వినియోగిస్తారు. తాజా ఉద్యోగాల కోత ద్వారా 2020 చివరికి ఏటా 400 మిలియన్ పౌండ్లు (దాదాపు రూ.3500 కోట్లు) ఖర్చు తగ్గుతుందని కంపెనీ అంచనా వేస్తోంది. విమాన ఇంజిన్‌లు, మెరైన్ పవర్ సిస్టమ్స్‌కు గిరాకీ తగ్గడంతో.. గత కొన్నేళ్లుగా రోల్స్ రాయిస్ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. గతేడాది లాభాల్లోకి వచ్చినప్పటికీ.. పౌండు విలువ పెరగడమే దానికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. లాభం వృద్ధి చెందడానికి కంపెనీ దగ్గర ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం ఉందని కంపెనీ సీఈఓ వారెన్ ఈస్ట్ అన్నారు. తాజా పునర్వ్యవస్థీకరణ కోసం దాదాపు 500 మిలియన్ పౌండ్లు ఖర్చు అవుతాయని తెలిపారు.

అమెరికా దిగ్గజ కంపెనీ తొలి మహిళా సీఎఫ్‌ఓగా మన అమ్మాయి

అగ్రరాజ్యం అమెరికాలో తెలుగు మహిళ తన ప్రతిభా పాటవాలతో ఉన్నతస్థాయికి చేరారు. పురుషుల ఆధిక్యత అధికంగా ఉండే, వాహన రంగంలో అందునా అగ్రగామి సంస్థ అయిన జనరల్ మోటార్స్ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ)గా ప్రవాస భారతీయురాలు (ఇండియన్- అమెరికన్) దివ్యా సూర్యదేవర (39) నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ ఫైనాన్స్)గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత సీఎఫ్ఓ చక్ స్టీవెన్స్ స్థానాన్ని దివ్యా సూర్యదేవర భర్తీ చేయనున్నారు. సెప్టెంబరు 1న ఆమె సీఎఫ్ఓ బాధ్యతలు చేపట్టనున్నారు. చెన్నైలో పుట్టిన దివ్యా సూర్యదేవర.. 2017 జులై నుంచి జనరల్ మోటార్స్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జనరల్ మోటార్స్ ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ) మేరీ బర్రా కూడా మహిళే కావడం విశేషం. వాహన తయారీ సంస్థలో సీఈఓ, సీఎఫ్ఓ వంటి సారథ్య బాధ్యతల్లో మహిళలు పనిచేయడం ఇదే ప్రథమం. మరే ఇతర వాహన సంస్థలోనూ ఈ పరిస్థితి లేదు. ఎస్ అండ్ పీ 500 కంపెనీల్లో సీఈఓ, సీఎఫ్‌లుగా మహిళలు పనిచేస్తున్న కంపెనీల్లో జనరల్ మోటార్స్ చేరింది. హెర్షే కో, అమెరికన్ వాటర్ వర్క్స్ వంటి కొన్ని దిగ్గజ కంపెనీల్లోనే మహిళలు ఈ విధంగా అత్యున్నత స్థానాల్లో ఉన్నారు. గత నలభై ఏళ్లుగా జనరల్ మోటార్స్‌లో పనిచేస్తున్న చక్ స్టీవెన్స్.. వచ్చే ఏడాది మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి కంపెనీ సలహాదారుగా కొనసాగనున్నారు.

యావత్ మహిళా ప్రపంచం గర్వించే విజయమిది

ప్రపంచ వాహన దిగ్గజ సంస్థల్లో జనరల్ మోటార్స్ ఒకటి. అలాంటి సంస్థలో కీలక అధికారిణిగా తెలుగమ్మాయి ఎంపిక కావడం గర్వకారణం. పదమూడేళ్లుగా ఆ సంస్థలో విధులు నిర్వహిస్తూ, ఇప్పుడు సీఎఫ్‌వోగా ఎంపికైన దివ్యది తెలుగు కుటుంబం. ఎప్పుడో చెన్నైలో స్థిరపడ్డారు. ఆమెకు చదువంటే ఆసక్తి. బాగా చదువుకుని ఉన్నత స్థానంలో నిలబడాలని ఆశించేవారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి ఆమెని పెంచిపెద్ద చేసింది. ఒంటరిగా తల్లిపడే కష్టాలను చూసిన దివ్య బాగా చదువుకుని ఆమె కష్టాలు తీర్చాలని చిన్నతనంలోనే నిర్ణయించుకున్నారట. మద్రాసు యూనివర్సిటీలో కామర్స్‌లో మాస్టర్స్ చేశాక, ఇరవై రెండేళ్ల వయసులో దివ్య అమెరికా వెళ్లారు. అక్కడ హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ చేశాక, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు యూబీఎస్‌లో విధులు నిర్వర్తించారు. అనంతరం వాహన తయారీ సంస్థ జనరల్ మోటార్స్‌లో ఉద్యోగం లభించింది. అప్పుడు ఆమె వయసు ఇరవై ఐదేళ్లు. అనంతరం కెరీర్‌లో వెనక్కి తిరిగి చూసుకోలేదు. సంస్థ ఆర్థిక వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తోన్న దివ్య 2016లో ఆటోమోటివ్ రైజింగ్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నారు. నలభై మంది విజేతల్లో మొదటిస్థానంలో నిలిచారు. అతి తక్కువకాలంలోనే జనరల్ మోటార్స్‌లో రకరకాల కీలక పాత్రల్లో బాధ్యతలు నిర్వర్తించిన ఘనతా దక్కించుకున్నారు. 2017లో సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి పొంది, కొనసాగుతున్నారు.

సంస్థ ఆర్థిక వ్యూహాల్లో కీలకపాత్ర

జనరల్ మోటార్స్ కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణలో దివ్య కీలక పాత్ర పోషించారు. సంస్థకు చెందిన ఐరోపా అనుబంధ సంస్థ ఓపెల్ విక్రయంలో, స్వీయచోదక వాహన అంకుర సంస్థ క్రూజ్ స్వాధీనతలో ముఖ్య పాత్ర వహించారు. జపాన్ సంస్థ సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్ కార్పొరేషన్ నుంచి జీఎం క్రూజ్‌లోకి 2.25 బిలియన్ డాలర్ల (సుమారు రూ.15,000 కోట్లు) పెట్టుబడులు ఆకర్షించారని జీఎం తెలిపింది. 3 క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల నుంచి జనరల్ మోటార్స్ రేటింగ్స్ మెరుగుపరచేందుకు దివ్య కృషి చేశారు.

కుటుంబం

దివ్య కుటుంబం న్యూయార్క్‌లో స్థిరపడింది. భర్త రాజ్ సూర్యదేవర వ్యాపారి. వీరికి ఒక కుమార్తె ఉంది.. ఉద్యోగం రీత్యా దివ్య డెట్రాయిట్‌లో ఉంటూ.. వారాంతాల్లో కుటుంబానికి సమయం కేటాయించడానికి న్యూయార్క్ వెళ్తుంటారు.

25 ఏళ్లు.. 25 షేర్లు = రూ. కోటిపైనే

'ఆలోచించి షేర్లు కొను.. దీర్ఘకాలానికి అట్టేపెట్టుకో... మంచి ప్రతిఫలాన్ని పొందు'

- మదుపర్లకు వారెన్ బఫెట్ ఇచ్చిన ఒక అమూల్యమైన సలహా

ఈ సలహాను తు.చ. తప్పక పాటిస్తే ఎవరైనా కోటీశ్వరులు అవ్వకుండా ఉండరేమో. ఇందుకు మన ఇన్ఫోసిస్ షేర్లే నిదర్శనం. సరిగ్గా పాతికేళ్ల క్రితం 1993 జూన్ 14న ఈ ఐటీ దిగ్గజం షేర్లు స్టాక్ మార్కెట్లో నమోదయ్యాయి. అప్పట్లో ఓ పాతిక షేర్లు కొని అట్టేపెట్టుకుని ఉంటే, ఈపాటికి మీరు కోటీశ్వరుల జాబితాలో చేరి ఉండేవారే. 'ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. కంపెనీకున్న బలమైన మూలాలు, ఐటీ రంగ భవితను దృష్టిలో ఉంచుకొని, దీర్ఘకాల దృక్పథంతో ఇప్పుడు కొన్నా, మున్ముందు మంచి ప్రతిఫలం అందుకోవచ్చ'నే మాట విశ్లేషకుల నుంచి వస్తోంది.

రూ.145 ప్రారంభ ధరతో స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన ఇన్ఫీ షేరు ప్రస్తుతం రూ.1238 ధర వద్ద ఉంది. అంటే పాతికేళ్లలో 750% పెరిగింది. అంతేకాకుండా మధ్యమధ్యలో బోనస్ షేర్ల రూపేణా మదుపర్లకు కంపెనీ ప్రతిఫలాలను పంచి ఇచ్చింది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటే 1993 సమయంలో ఓ పాతిక షేర్లు కొన్న ఓ మదుపరి సంపద ఎంత మేర పెరుగుతుందో ఓ సారి చూద్దాం..

లాభం ఎంత వచ్చేదంటే..

1993లో రూ.150 ధర వద్ద పాతిక షేర్లు కొన్నాడని అనుకుందాం. పెట్టుబడి విలువ రూ.3,750.

1994లో 1:1 బోనస్ ఇవ్వడంతో షేర్ల సంఖ్య 50కి పెరిగింది

1997లో 1:1 బోనస్‌తో షేర్లు 100కి చేరాయి

1999లో మరో 1:1 బోనస్.. షేర్లు 200 అయ్యాయి.

1999లో రూ.10 ముఖ విలువ షేరు రూ.5 షేరుగా విభజించడంతో మొత్తం షేర్ల సంఖ్య 400కి పెరిగింది.

2004లో 3:1 బోనస్‌తో షేర్ల సంఖ్య 1600 అయ్యింది.

2006లో 1:1 బోనస్ వల్ల షేర్ల సంఖ్య 3200కి చేరింది

2014లో 1:1 బోనస్‌తో 6,400 షేర్లు అయ్యాయి

2015లో 1:1 బోనస్ ఇవ్వడంతో మొత్తం షేర్ల సంఖ్య 12800కి చేరింది.

మొత్తం సంపద= మొత్తం షేర్ల సంఖ్య X ప్రస్తుత షేరు ధర

= 12800X 1258 = రూ.1.6 కోట్లు

అంటే పాతికేళ్ల క్రితం రూ.3,750 పెట్టుబడి విలువ రూ.1.6 కోట్లు అయ్యిందన్నమాట.

పెట్టుబడి 250 డాలర్లు

1981 జులై 7.. ఇన్ఫోసిస్ పుట్టిన రోజు ఇది. ఎన్.ఆర్.నారాయణ మూర్తి, మరో ఆరుగురు ఇంజినీర్లు కలిసి దీనిని పుణెలో స్థాపించారు. అప్పుడు వాళ్ల పెట్టుబడి 250 డాలర్లు. అప్పుడు డాలర్ విలువ ప్రకారం దాదాపు రూ.10,000 ఉండొచ్చు. ఇలా ఓ 12 ఏళ్ల గడిచాక 1993లో కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఇష్యూ ధర రూ.95. పబ్లిక్ ఇష్యూ ముగిశాక జూన్ 14న షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదయ్యాయి. ఇష్యూ ధరకు 50 శాతానికి పైగా రూ.145 ప్రారంభ ధరతో షేరు అడుగుపెట్టింది. మరికొన్నేళ్లకు అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీ నాస్‌డాక్‌లోనూ ఇన్ఫీ షేర్లు నమోదయ్యాయి. ప్రస్తుతం రూ.2.7 లక్షల కోట్ల మార్కెట్ విలువతో అత్యధిక మార్కెట్ విలువున్న 10 కంపెనీల జాబితాలో ఉంది.

ఆగని దూకుడు..

స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టాక ఇన్ఫోసిస్ వెనుదిరిగి చూడలేదు. ఖాతాదార్లను సంపాదించే విషయంలోనే కాదు.. లాభాదాయాల ఆర్జనలోనూ సత్తా చాటింది. దేశీయ సాఫ్ట్‌వేర్ రంగంలో కొన్నేళ్ల పాటు అగ్రపీఠాన నిలిచింది. పటిష్ఠ యాజమాన్యం, నాణ్యమైన పనితీరు, ఆకర్షణయ త్రైమాసిక, వార్షిక ఫలితాలతో మదుపర్లకు ఎంతో ఇష్టమైన షేరుగా ఇన్ఫీ పేరు తెచ్చుకుంది. ఉద్యోగ కల్పన విషయంలోనూ ముందుంది. 2018 మార్చి 31 నాటికి ఈ ఐటీ దిగ్గజం, దాని అనుబంధ సంస్థలో సుమారు 2 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తుండటమే ఇందుకు నిదర్శనం.

భవిష్యత్ పయనం ఎటు?

రానున్న సంవత్సరాల్లోనూ ఇన్ఫీ షేరు నుంచి ఇదే విధంగా ప్రతిఫలాలను ఆశించవచ్చా అంటే చాలా మంది విశ్లేషకుల నుంచి వస్తోన్న ఒకే సమాధానం.. దీర్ఘకాలానికి ఇన్ఫీ షేరును అట్టేపెట్టుకోవడం మేలనే. కొన్ని నెలల క్రితం చోటుచేసుకున్న పరిణామాలు ఇన్ఫీ పనితీరుపై కొంత ప్రతికూల ప్రభావం చూపాయి. విశాల్ సిక్కా హయాంలో, కంపెనీ వ్యవస్థాపకులతో ఏర్పడిన వివాదంతో, వాటాదార్లు తీవ్రంగా కలత చెందారు. తిరిగి నందన్ నీలేకనిని ఛైర్మన్ పదవిలో కూర్చొబెట్టి, వాటాదార్లలో మళ్లీ భరోసా నింపే ప్రయత్నం కంపెనీ చేసింది. 2018లో షేరు 20% పెరగడమే ఇందుకు నిదర్శనం.

వంట నూనెలపై 5-10% దిగుమతి సుంకం పెంపు



దిల్లీ: పామాయిలేతర వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని కేంద్రం 5-10 శాతం పెంచింది. దేశీయ నూనె గింజల పెంపకందారులు, ముడి నూనెను శుద్ధి చేసే వారి ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకొని ముడి, శుద్ధి చేసిన పామాయిలేతర నూనెలపై సుంకాల్ని పెంచారు. గత మార్చిలో ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 30 నుంచి 44 శాతానికి పెంచింది. శుద్ధి చేసిన పామాయిల్‌పై కూడా సుంకాన్ని 40 నుంచి 54 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అదే సమయంలో సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ (ఎస్ఈఏ) పామాయిలేతర వంట నూనెలపై కూడా సుంకాన్ని పెంచమని ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు దిగుమతి సుంకం పెంచుతూ కేంద్రీయ పరోక్ష పన్నులు, సుంకాల బోర్డు (సీబీఐటీసీ) ఓ ప్రకటన విడుదల చేసింది. అందులోని సుంకాల వివరాలు ఇలా..

- సోయాబీన్ ముడి నూనెపై సుంకాన్ని 30 నుంచి 35 శాతానికి, శుద్ధి చేసిన నూనెపై 35 నుంచి 45 శాతానికి పెంచారు.
- పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) ముడి నూనెపై సుంకాన్ని 25 నుంచి 35 శాతానికి, శుద్ధి చేసిన నూనెపై 35 నుంచి 45 శాతానికి పెంచింది.
- వేరుసెనగ ముడి నూనెపై 30 నుంచి 35 శాతానికి, శుద్ధి చేసిన నూనెపై 35 నుంచి 45 శాతానికి దిగుమతి సుంకాన్ని పెంచింది.
- ఆవ నూనెపై 25 నుంచి 35 శాతానికి చేర్చారు.
- దేశీయ గిరాకీని దృష్టిలో ఉంచుకొని ఏడాదికి 14 మిలియన్ టన్నులకు పైగా నూనెల్ని భారత్ దిగుమతి చేసుకుంటోంది.

మారుతీ ఇగ్నిస్ డీజిల్ కార్ల ఉత్పత్తి నిలిపివేత

దిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ కారు ఇగ్నిస్‌లో డీజిల్ రకం ఉత్పత్తి నిలిపివేసింది. ఈ కార్లకు డిమాండ్ బాగా తగ్గిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుందని సమాచారం. 2017 జనవరిలో ఈ మోడల్‌ను ఎంఎస్ఐ విపణిలోకి విడుదల చేసి, ఇప్పటిదాకా 72,000కు పైగా కార్లను విక్రయించింది. జనవరి-మార్చి 2018 కాలంలో నెలవారీ సరాసరి అమ్మకాలు 4,500కు పైగా ఉన్నాయి. ఇగ్నిస్ మోడల్‌లో పెట్రోల్ వేరియంట్ కార్లు యథావిధిగా విపణిలో లభ్యమవుతున్నాయి. ధరలు రూ.4.66-7.04 లక్షల (ఎక్స్‌షోరూమ్, దిల్లీ) మధ్య ఉన్నాయి.

విద్యుత్ కంపెనీలకు మహర్దశ

అదనంగా 11 బి. డాలర్ల ఆదాయం

- ఈవీల వినియోగంపై లభించే వీలు
- అసోచామ్, ఈవై సంయుక్త నివేదిక

దిల్లీ: విద్యుత్ వాహనాల(ఈవీ) వినియోగం భారీగా పెరగనున్న నేపథ్యంలో, విద్యుత్ కంపెనీలకు 2030 కల్లా అదనంగా 11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.71,500 కోట్లు) ఆదాయం సమకూరవచ్చని ఓ నివేదిక అంచనా వేస్తోంది. ఈవీల కారణంగా 2030 కల్లా 69.6 టెరావాట్ అవర్స్ మేర విద్యుత్‌కు గిరాకీ ఏర్పడవచ్చనే అంచనాలు ఇందుకు నేపథ్యం. అసోచామ్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఎల్ఎల్‌పీలు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం మేరకు రూపొందిన నివేదిక ప్రకారం..

- దేశీయంగా ఈవీలను అందిపుచ్చుకోవడం పెరుగుతోంది. దీని వల్ల దేశ విద్యుత్ రంగంలో పెను మార్పులు రానున్నాయి. కాలుష్య ఉద్గారాలు 40-50 శాతం వరకు తగ్గవచ్చు. కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యం చేరడానికి ఇది దోహదం చేస్తుంది.
- విద్యుత్ వాహనాల వాడకం భారీగా పెరగనున్న నేపథ్యంలో విద్యుత్, వినిమయ రంగాలకు వచ్చే గిరాకీ వల్ల, పెరిగే సరఫరా వల్ల ఆయా రంగాల్లోని కంపెనీలకు నికర వ్యయాలు తగ్గి, ఆదాయం పెరుగుతుంది. దిగుమతి బొగ్గుపై ఆధారపడటం తగ్గుతుంది. పునరుత్పాదక విద్యుత్ వల్ల ఇంధన స్వతంత్రత పెరుగుతుంది. వీటి వల్ల భారత విద్యుత్, వినిమయ రంగాల్లో భారీ స్థాయిలో సానుకూల మార్పులు కనిపించనున్నాయి.
- ఈవీల కోసం విధానాలను తీసుకురావడంతో పాటు.. నియంత్రణపరమైన సవాళ్లను తొలగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.
- దేశీయ తయారీ వ్యవస్థ అభివృద్ధిపై భారత ఈవీల విజయం ఆధారపడి ఉంది. ప్రస్తుతం సత్వరం పరిశోధన - అభివృద్ధి(ఆర్ అండ్ డీ)పై; స్థానిక తయారీ సామర్థ్యాల పెంపుపై పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది.
- ఈవీల మార్కెట్‌లో భారీ పెట్టుబడులు రావాలన్నా.. ఆ రంగం పుంజుకోవాలన్నా స్పష్టమైన విధాన మార్గదర్శకాలు తీసుకురావాల్సి ఉంది.

రూ.2100 కోట్ల బ్యాంకు హామీ ఇవ్వండి

ఐడియాను కోరనున్న టెలికాం విభాగం

దిల్లీ: వొడాఫోన్ ఇండియాతో ప్రతిపాదిత విలీన అనుమతి కోసం రూ.2100 కోట్ల బ్యాంకు హామీ ఇవ్వాల్సిందిగా టెలికాం విభాగం(డాట్) ఐడియా సెల్యులార్‌ను కోరనుందని విశ్వసనీయ సమాచారం. 'వొడాఫోన్ ఇండియాతో విలీనానికి ముందే ఐడియాను బ్యాంకు హామీని కోరే అవకాశం ఉంద'ని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే వారం ఆ మేరకు డాట్ అడిగే అవకాశం ఉంది. వివిధ కోర్టుల ఆదేశాల ప్రకారం.. వొడాఫోన్, ఐడియాలు తమ బకాయిలన్నీ తీరుస్తున్నట్లు హామీని ఇవ్వాల్సి ఉంటుందని కూడా వారు చెబుతున్నారు. 23 బిలియన్ డాలర్లకు పైగా నికర విలువ; 35 శాతం మార్కెట్ వాటాతో దేశంలోనే అతిపెద్ద టెలికాం సంస్థను ఏర్పాటు చేయడం కోసం తమ కార్యకలాపాలను విలీనం చేయాలని ఐడియా, వొడాఫోన్‌లు నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. విలీన సంస్థ పేరు వొడాఫోన్ ఐడియా లిమిటెడ్‌గా ఉంటుంది.

ఎయిర్‌సెల్‌పై ఎస్ఎఫ్ఐఓ దర్యాప్తు

దిల్లీ: రుణ ఊబిలో చిక్కుకున్న ఎయిర్‌సెల్‌తో పాటు గ్రూపు సంస్థలైన ఎయిర్‌సెల్ సెల్యులార్, డిష్‌నెట్ వైర్‌లెస్‌పై తీవ్ర నేరాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐఓ) విచారణ జరుపుతోంది. సంస్థలో చోటు చేసుకున్న ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఎఫ్ఐఓ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ మూడు కంపెనీల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాల్సిందిగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే దర్యాప్తు చేపట్టామని ఆయన వెల్లడించారు. ఆర్థికంగా ఒత్తిడికి గురవుతున్న ఎయిర్‌సెల్‌ను ఫిబ్రవరిలో దివాలా స్మృతి (ఐబీసీ) కింద నమోదు చేశారు. ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లు ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసును విచారిస్తున్న సంగతి తెలిసిందే.

కార్పొరేషన్ బ్యాంక్ రుణ రేట్ల పెంపు

ముంబయి: కార్పొరేషన్ బ్యాంక్ ఎంసీఎల్ఆర్‌ను (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్) 10 బేసిస్ పాయింట్లు పెంచింది. శుక్రవారం నుంచి ఈ రేట్ల పెంపు అమల్లోకి వస్తుందని ఎక్స్ఛేంజీలకు బ్యాంకు సమాచారం ఇచ్చింది. ఎంసీఎల్ఆర్ పెంపు అనంతరం కార్పొరేషన్ బ్యాంకు రుణ రేట్లు 8- 8.85 శాతం మధ్య ఉండనున్నాయి. ఆర్‌బీఐ కీలక రేట్ల పెంపును దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే చాలా బ్యాంకులు ఎంసీఎల్ఆర్‌ను పెంచిన సంగతి విదితమే.

ఐదా

కిక్ 2018

ఛాంపియన్స్

సంబరం అదిరింది

మాస్కో

ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఆరంభ వేడుకలు సందడిగా సాగాయి. గురువారం రష్యా రాజధాని మాస్కోలోని లుజ్నికి స్టేడియంలో ఆరంభ మ్యాచ్‌కు ముందు ఫుట్‌బాల్ ఆకారంలో తీర్చిదిద్దిన మైదానంలో అరగంట పాటు వేడుకలు నిర్వహించారు. ముందుగా 2010 ప్రపంచకప్ విజేత స్పెయిన్ జట్టు సారథి కాసిలాస్, మోడల్ నటాలియా ఒడియనోవా కలిసి పెట్టెలో ఉన్న ప్రపంచకప్ ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చారు. తర్వాత దాన్ని తెరిచి స్టేడియంలోని అభిమానులకు కప్పును చూపారు. అనంతరం బ్రిటిష్ పాప్ గాయకుడు రాబీ విలియమ్స్ స్టేడియంలోకి అడుగుపెట్టాడు. వేదిక దగ్గరికి వచ్చే ముందే అతను గట్టిగా అరుస్తూ అభిమానుల్ని ఉత్సాహ పరిచాడు. తర్వాత కళాకారులతో కలిసి అతను సంగీత ప్రదర్శన ఇచ్చాడు. అతడికి రష్యా గాయని ఐదా కూడా తోడైంది. రష్యా సంప్రదాయ నృత్యాలతో కళాకారులు అలరించారు. బ్రెజిల్ దిగ్గజ ఆటగాడు రొనాల్డో ఓ పిల్లాడితో కలిసి మైదానంలోకి విచ్చేశాడు. అదే సమయానికి మోడల్ లోపిరెవా ప్రపంచకప్ అధికారిక బంతిని మైదానంలోకి తీసుకొచ్చింది. ఆ బంతిని పిచ్‌పై ఉంచగా.. రొనాల్డో దాన్ని తన్నేందుకు ముందుకు ఉరికాడు. కానీ దాన్ని తాకకుండా పక్కకు వెళ్లిపోయాడు. రొనాల్డో తోడుగా వచ్చిన పిల్లాడు.. ప్రపంచకప్ మస్కట్ రూపంలో ఉన్న వ్యక్తి వైపు దాన్ని తన్నాడు. అతడితో రొనాల్డో కరచాలనం చేశాడు. 'స్నేహం కోసం ఫుట్‌బాల్' కార్యక్రమంలో భాగంగా 211 మంది చిన్నారులు మైదానంలోకి వచ్చి వేడుకల్లో భాగస్వాములయ్యారు. 32 జట్ల తరఫున ఇద్దరేసి చొప్పున ప్రతినిధులు ఆయా దేశాల దుస్తుల్లో మైదానంలోకి వచ్చారు. వారిలో కొందరు నృత్యాలు చేశారు. అనంతరం రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రసంగం మొదలైంది. ప్రపంచకప్ మొదలైనట్లు ఆయన అధికారికంగా ప్రకటించాడు. ఆరంభ వేడుకలకు హాజరైన 80 వేలమంది అభిమానుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. "ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన ఛాంపియన్‌షిప్ ఆరంభమవుతున్న తరుణాన మీ అందరికీ అభినందనలు" అని పుతిన్ పేర్కొన్నాడు. ఆ సమయంలో బాణసంచా వెలుగులతో స్టేడియం కళకళలాడింది. ఆపై ఫిఫా అధ్యక్షుడు లియాని ఇన్ఫాంటినో ప్రసంగించాడు. కొన్ని నిమిషాలకే ఆరంభ మ్యాచ్ మొదలైంది.

వారెవ్వా రష్యా! ఆతిథ్య జట్టు అదరగొట్టింది. సొంతగడ్డపై, సొంత ప్రేక్షకుల మధ్య చెలరేగిపోయింది. తిరుగులేని ఆధిపత్యంతో గోల్స్ వర్షం కురిపిస్తూ ఫిఫా ప్రపంచకప్‌లో ఘనంగా బోణీ కొట్టింది. లిజ్నికి స్టేడియంలో సమవుజ్జీగా దిగిన జట్టుకు దిమ్మదిరిగే షాచ్చింది. కళ్లు చెదిరే ప్రదర్శన చేసిన రష్యా.. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో 5-0తో సౌదీ అరేబియాను చిత్తు చిత్తుగా ఓడించింది.



చెరిషెవ్ డబుల్

గర్జించిన రష్యా

5–0తో సౌదీ అరేబియాపై ఘనవిజయం

ఆరంభ మ్యాచ్‌లో గోల్స్ మోత

ప్రపంచకప్‌లో ఈనాడు

ఈజిప్ట్	సా॥ 5.30	ఉరుగ్వే
మొరాకో	రాత్రి 8.30	ఇరాన్
పోర్చుగల్	రాత్రి 11.30	స్పెయిన్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం



① గజిన్‌స్కి (12వ నిమిషం)

② చెరిషెవ్ (43వ)

③ జుబా (71వ)

④ చెరిషెవ్ (90+1)

⑤ గోలోవిన్ (90+4)

88 వేల కోట్లు

ఫిఫా ప్రపంచకప్ నిర్వహణ కోసం రష్యా ఖర్చు చేసిన మొత్తం (రూపాయల్లో). 1980 ఒలింపిక్స్ తర్వాత ఆ దేశం నిర్వహిస్తున్న అది పెద్ద క్రీడా ఈవెంట్ ఇదే.

మాస్కో

ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న రష్యా ఆనందం తొలి రోజే రెట్టింపయింది. టోర్నీలో ఆ జట్టు శుభారంభం చేసింది. సొంత అభిమానులు ఉత్సాహపరుస్తుండగా మైదానంలో హవా సాగించిన ఆ జట్టు గ్రూప్-ఏ మ్యాచ్‌లో సౌదీ అరేబియాను అలవోకగా మట్టికరిపించింది. ఎటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థిని ఉక్కిరి బిక్కిరి చేసిన రష్యా.. ఆద్యంతమూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రష్యా తరఫున చెరిషెవ్ (43వ, 90+1) రెండు గోల్స్ కొట్టగా.. గజిన్‌స్కి (12వ), జుబా (71వ), గోలోవిన్ (90+4) తలో గోల్ సాధించారు. ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఆతిథ్య జట్టూ తన ఆరంభ మ్యాచ్‌లో ఓడిపోలేదు. తాజా విజయంతో రష్యా ఆ రికార్డు కొనసాగించినట్లయింది.

తొలి గోల్ వీరుడు గజిన్‌స్కి: టోర్నీలోనే అతి తక్కువ ర్యాంకు (70) జట్టు రష్యా. ఇటీవల పెద్దగా ఫామ్‌లో లేదు. గత ఎనిమిది నెలల్లో విజయమే లేదు. సరైన ఎటాకింగ్ లేకపోవడమే పెద్ద లోపం. రష్యా అభిమానుల్లో ఏదో ఆందోళన. కానీ వారి భయం మ్యాచ్ ఆరంభమైన కొద్దిసేపటికే పటాపంచలైంది. ఆటను తన నియంత్రణలోకి తెచ్చుకోవడానికి ఆతిథ్య జట్టుకు ఎంతో సమయం పట్టలేదు. స్టేడియమంతా ఉగ్గబట్టి చూస్తున్న ఆ క్షణం త్వరగానే వచ్చింది. 12వ నిమిషంలో ప్రపంచకప్ తొలి గోల్ నమోదైంది. ఓ కార్నర్‌ను దూరంగా పంపడంతో సౌదీ (ర్యాంకు 67) విఫలంకాగా.. ఆ జట్టు డిఫెన్స్ లోపాలను సొమ్ము చేసుకుంటూ మిడ్‌ఫీల్డర్ గజిన్‌స్కి హెడర్ గోల్‌తో ఆతిథ్య రష్యాను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. గోలోవిన్ చక్కని క్రాస్ ఇవ్వగా.. సౌదీ అరేబియా గోల్‌కీపర్ మయూఫ్‌ను గజిన్‌స్కి అలవోకగా బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత రష్యా జోరుకు ఎదురేలేకుండా పోయింది. దూకుడు పెంచిన ఆ జట్టు పదేపదే సౌదీ గోల్ వద్దకు దూసుకెళ్తూ.. ఆ జట్టు రక్షణశ్రేణిపై ఒత్తిడి పెంచింది. సౌదీ పూర్తిగా తేలిపోయింది. బంతి ఎక్కువగా ఆ జట్టు అర్ధభాగంలోనే ఉంది. విరామానికి కొద్దిసేపు ముందు సూపర్ గోల్‌తో చెరిషెవ్ రష్యా ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. జగోవ్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన అతడు.. చక్కని నైపుణ్యంతో బంతిని నియంత్రణలో ఉంచుకుంటూ, అడ్డుపడుతూ ఉన్న ఇద్దరు సౌదీ డిఫెండర్లను ఛేదించుకుంటూ బంతిని ఎడమకాలితో నెట్లోకి కొట్టేశాడు. విరామానికే 2-0తో ఆధిక్యంలో నిలిచిన రష్యా.. విజయాన్ని దాదాపుగా ఖాయం చేసుకుంది. ద్వితీయార్ధంలో ఆరంభంలో సౌదీ కాస్త భయపెట్టినా తిరిగి పట్టుబిగించడానికి రష్యాకు ఎంతో సమయం పట్టలేదు. పదేపదే దాడులు చేస్తూ పోయింది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన జుబా దాదాపు వస్తూనే గోల్ సాధించాడు. గోలోవిన్ క్రాస్‌ను తలతో నెట్లోకి కొట్టాడు. దాడులు కొనసాగించిన రష్యా ఇంజురీ సమయంలో మరో రెండు గోల్స్ కొట్టి సౌదీ పరాభవాన్ని పరిపూర్ణం చేసింది. చెరిషెవ్ తన రెండో గోల్‌తో రష్యా ఆధిక్యాన్ని 4-0కు పెంచగా..గోలోవిన్ ఓ కళ్లు చెదిరే ఫ్రీకిక్‌తో దాన్ని 5-0కు చేర్చాడు. చెరిషెవ్ కిక్ వంపులు తిరుగుతూ వెళ్లి నెట్లో పడ్డ తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. రష్యా తన తర్వాతి మ్యాచ్‌లో జూన్ 19న ఈజిప్ట్‌తో తలపడుతుంది.

సలా వస్తున్నాడు

మాస్కో: ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఈజిప్ట్ సూపర్ స్టార్ మహ్మద్ సలా మెరుపుల కోసం ఎదురు చూస్తున్న అభిమానులకు శుభవార్త. భుజం గాయం నుంచి కోలుకున్న అతను.. ఉరుగ్వేతో శుక్రవారం తమ జట్టు తొలి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడు. ఈ విషయాన్ని ఈజిప్ట్ కోచ్ హెక్టార్ క్యూపర్ ధ్రువీకరించాడు. "ఈ రోజు సాధన ఎలా సాగుతుందో చూడాలి. సలా ఆడతాడని దాదాపు వంద శాతం హామీ ఇవ్వగలను. మ్యాచ్ రోజు అతను మైదానంలో ఉంటాడని ఆశిస్తున్నా" అని క్యూపర్ తెలిపాడు. ఈజిప్ట్ 28 ఏళ్ల తర్వాత ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించిన సలా.. గత నెల లివర్‌పూల్ తరఫున ఛాంపియన్స్ లీగ్ ఫైనల్ ఆడుతూ గాయపడ్డాడు. ప్రత్యర్థి ఆటగాడు ఢీకొట్టడంతో అతడి భుజానికి గాయమై, ప్రపంచకప్‌లో ఆడటం అనుమానంగా మారింది. అయితే సలా త్వరగానే కోలుకుని ఈజిప్ట్ తొలి మ్యాచ్‌కు అందుబాటులోకి వస్తుండటంతో ఆ దేశ అభిమానుల ఆనందానికి అవధుల్లేవు. గత కొన్నేళ్లలో యూరోపియన్ లీగ్‌ల్లో అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ప్రపంచ మేటి ఫుట్‌బాలర్లలో ఒకడిగా ఎదిగిన సలా.. ఈ ప్రపంచకప్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాడని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పంది.. పిల్లీ పండితులే

ప్రపంచకప్ వచ్చిందంటే ఫుట్‌బాల్ పండితులు తెగ విశ్లేషణలు చేస్తుంటారు. లెక్కలు వేసి అంచనాలు చెబుతుంటారు. కానీ తామేం తక్కువంటూ ఈ మధ్య కాలంలో జంతువులూ జోస్యం చెబుతున్నాయి. సరైన అంచనాలతో ఆశ్చర్యపరుస్తున్నాయి కూడా. కొన్నేళ్లుగా ప్రతి ప్రపంచకప్‌కు ఏదో ఓ జంతువు జనాలకు ఇలా తన అంచనాలతో 'కిక్' ఇస్తూనే ఉంది. ఈసారి కూడా కొన్ని తయారయ్యాయి. అలాంటి జంతువుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

పాల్ అనే అక్టోపస్

ఈ సముద్ర జంతువు పాల్‌ను ఎవరు మరిచిపోగలరు. 2010 ప్రపంచకప్ సందర్భంగా తన అంచనాలతో ఫుట్‌బాల్ అభిమానుల మతులు పోగొట్టింది. అందరికీ ఇష్టురాలైంది. జర్మనీలోని సీలైఫ్ సెంటర్ నిర్వాహకులు.. ఆహారంతో పాటు వెలుపలి వైపు రెండు దేశాల జెండాలు ఉన్న పెట్టెలను పాల్‌కు అందుబాటులో ఉంచేవాళ్లు. అది ఏ పెట్టెను పట్టుకుంటే ఆ జట్టు గెలుస్తుందని అర్థమన్నమాట. అలా జర్మనీ ఆడిన ఏడు మ్యాచ్‌ల ఫలితాలను కూడా అది సరిగ్గా ఊహించింది. అలాగే ఫైనల్లో స్పెయిన్ విజయాన్ని కూడా సరిగ్గా చెప్పింది.

అచిలీస్ అనే పిల్లి

ప్రస్తుతం ప్రపంచకప్‌లో విశేషంగా ఆకర్షిస్తున్న జంతువు పిల్లి. ఇది చెవిటిది. ఆరంభ మ్యాచ్‌లో సౌదీ అరేబియాను రష్యా ఓడిస్తుందన్న అచిలీస్ అంచనా నిజమైంది. దీని రికార్డు బాగానే ఉంది. 2017 కాన్ఫెడరేషన్స్ కప్ విజేతను ఇది సరిగ్గా ఊహించింది.

షహీన్ అనే ఒంటె

దుబాయ్‌లో ఉండే ఈ ఒంటెకు చాలా తెలివైందనే పేరు. ఈ ప్రపంచకప్‌లో ఏ మ్యాచ్‌లో ఏ జట్టు గెలుస్తుందో అంచనా వేసేందుకు సన్నద్ధమైపోయింది. తొలి మ్యాచ్‌లో రష్యా గెలుస్తుందన్నది దీని తాజా అంచనా. 2014 ప్రపంచకప్‌లో ఈ ఒంటె రికార్డు అంత ఘనంగా ఏమీ లేదు. మరి ఈసారి ఏం చేస్తుందో చూడాలి.

మార్కస్ అనే పంది

నేనేం తక్కువంటూ రష్యా ప్రపంచకప్ సందర్భంగా జోస్యం చెప్పేందుకు ఓ పంది కూడా ముందుకొచ్చింది. ఫలితాలు ఊహించడంలో మార్కస్‌ది 100 శాతం రికార్డు అని దాని బ్రిటిష్ యజమాని చెబుతున్నాడు. నైజీరియా, బెల్జియం, ఉరుగ్వే, అర్జెంటీనా సెమీఫైనల్ వెళ్తాయని అంచనా. ఆయా దేశాల జెండాలు గుచ్చి ఉన్న యాపిల్‌లను తినడం ద్వారా ఇది ఫలితాలను అంచనా వేస్తుంది. చూద్దాం... దీని జోస్యం ఎంత వరకు నిజమవుతుందో?

సిట్టా అనే ఏనుగు

పోలెండ్‌లోని క్రకో జంతు ప్రదర్శనశాలలో ఉందిది. ఈ ప్రపంచకప్‌లో తన దేశం ఆడే మ్యాచ్‌ల ఫలితాలను ఇది అంచనా వేస్తుందట. పండును ఎంచుకోవడం ద్వారా సిట్టా విజేతను ఊహిస్తుంది. బుధవారం జరిగిన స్నేహపూర్వక మ్యాచ్‌లో లిథువేనియాపై పోలెండ్ గెలుస్తుందని ఇది సరిగ్గా చెప్పింది.

బుజ్జి పాండాలు

2014 ప్రపంచకప్ సందర్భంగా ఈ పిల్ల పాండాలు అభిమానులను విపరీతంగా ఆకర్షించాయి. దేశాల పేర్లతో ఉన్న బుట్టలను ఎంచుకోవడం ద్వారా లేదా చెట్లు ఎక్కడం ద్వారా ఇవి విజేతలను అంచనా వేస్తాయి. చైనాలోని ఓ సంరక్షణ కేంద్రంలో ఈ పాండాలు ఉన్నాయి.

చాంపియన్

శిఖర్ ధావన్ (107)

విజయ్ (105)

ఆరంభంలో మనం.. ఆఖర్లో అఫ్ఘనం

ధావన్, విజయ్ శతకాలు • భారత్ 347/6 • అరంగేట్ర టెస్టులో ఆకట్టుకున్న అఫ్ఘానిస్థాన్

శిఖర్ ధావన్ (107; 96 బంతుల్లో 19×4, 3×6) లంచ్‌కు ముందే సెంచరీ చేసేశాడు. విజయ్ (105; 153 బంతుల్లో 15×4, 1×6) పాతుకుపోయాడు. స్కోరేమో 168/0.. రన్‌రేట్ 5 పైన ఉంది. తొలి రెండు సెషన్లలో తిరుగులేని ఆట. ఈ లెక్కన కొడితే భారత్ స్కోరు ఎక్కడికో వెళ్లిపోవడం ఖాయంగా అనిపించింది. కానీ ఆఖరికి వచ్చేసరికే కథ మారిపోయింది. సెంచరీ వీరులు ధావన్, విజయ్‌తో పాటు మరో నాలుగు వికెట్లు వడివడిగా పడిపోయాయి. స్కోరు 280/1 నుంచి 334/6 గా మారింది. కారణం... అఫ్ఘానిస్థాన్ పట్టుదల! అరంగేట్ర టెస్టులోనే ఎంతో సంయమనాన్ని ప్రదర్శిస్తూ.. దొరికిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆ జట్టు బౌలర్లు విజృంభించడంతో తొలి రోజు ఆటలో సంపూర్ణ ఆధిపత్యం సాధించాలనుకున్న టీమ్‌ఇండియా ఆశలు నెరవేరలేదు. క్రీజులో పాండ్య (10), అశ్విన్ (7) ఉన్నా.. రెండోరోజు వాళ్లెంత వరకు నిలబడి స్కోరు పెంచుతారో చూడాలి.

బెంగళూరు

అరంగేట్ర టెస్టులో అఫ్ఘానిస్థాన్ ఆకట్టుకుంది. భారీ స్కోరుపై కన్నేసిన భారత్‌కు పగ్గాలు వేసి సత్తా చాటుకుంది. ఓపెనర్లు శిఖర్ ధావన్, మురళీ విజయ్ శతకాలతో చెలరేగినా.. గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో టీమ్‌ఇండియా తొలి రోజు ఆటను సంతృప్తికరంగా ముగించలేకపోయింది. తొలి రెండు సెషన్లలో భారత బ్యాట్స్‌మెన్ ఆధిపత్యం సాగితే.. ఆఖరి సెషన్లో అఫ్ఘాన్ జట్టు కలిసికట్టుగా ప్రత్యర్థిని నిలువరించింది. క్రమం తప్పకుండా వికెట్లు తీసి భారత్ మరింత భారీ స్కోరు చేయకుండా ఆపింది.

లంచ్‌లోపే లాగించేశాడు

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ధావన్, విజయ్ జోడీ శుభారంభం అందించింది. ముఖ్యంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై చెలరేగి ఆడిన ధావన్ అఫ్ఘాన్ బౌలర్లకు ఊపిరాడనీయలేదు. ఆఫ్‌సైడ్ చక్కటి కవర్‌డ్రైవ్‌లు ఆడిన శిఖర్.. క్రీజు వదిలి ముందుకొచ్చి లాంగ్‌ఆన్ దిశగా చూడచక్కని సిక్స్‌లు కొట్టాడు. అఫ్ఘాన్ ప్రధాన బౌలర్ రషీద్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకున్న శిఖర్. . పరుగుల వరద పారించాడు. వన్డే శైలిలో ఆడిన అతను 47 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. రషీద్ వేసిన ఇన్నింగ్స్ 20వ ఓవర్లో వరుసగా 4, 6, 4 బాదిన శిఖర్.. మరో స్పిన్నర్ ముజీబ్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టి 90ల్లోకి వెళ్లాడు. ఆ తర్వాత రషీద్ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్స్ మీదగా ఫోర్ కొట్టి 87 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారత టెస్టు చరిత్రలో లంచ్‌కు ముందే శతకం సాధించిన తొలి ఆటగాడిగా గబ్బర్ రికార్డు సృష్టించాడు.

అటు వర్షం.. ఇటు విజయ్ శతకం

లంచ్ నుంచి రాగానే ధావన్.. అహ్మద్‌జాయ్ బౌలింగ్‌లో నబికి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో శిఖర్-విజయ్‌ల తొలి వికెట్ భాగస్వామ్యానికి 168 పరుగుల వద్ద తెరపడింది. ధావన్ ఔటైనా. . విజయ్ జోరు కొనసాగించాడు. రషీద్ బౌలింగ్‌లో మూడు బౌండరీలు బాదిన అతను సెంచరీ దిశగా సాగాడు. రాహుల్ (54; 64 బంతుల్లో 8×4) నుంచి అతడికి చక్కటి సహకారం అందింది. విజయ్ 99పై ఉండగా.. 40 నిమిషాల పాటు వర్షం ఆటకు అడ్డు తగిలింది. మళ్లీ ఆట మొదలయ్యాక వఫాదార్ బౌలింగ్‌లో బౌండరీ బాదిన విజయ్.. టెస్టుల్లో 12వ సెంచరీని ఘనంగా పూర్తి చేసుకున్నాడు.

ఒక సెషన్.. ఐదు వికెట్లు

విజయ్‌తో పాటు, అర్ధసెంచరీ చేసిన రాహుల్ జోరు మీద ఉండడంతో భారత్ భారీ స్కోరు దిశగా సాగింది. కానీ ఓవర్ తేడాతో విజయ్, రాహుల్‌లను ఔట్ చేసిన అఫ్ఘాన్.. భారత్‌ను దెబ్బ కొట్టింది. పుజారా (35), రహానె (10) క్రీజులో పాతుకుపోవడానికే ప్రాధాన్యత ఇవ్వడంతో పరుగుల వేగం కూడా తగ్గింది. వీళ్లిద్దరూ స్వల్ప విరామంలో ఔట్ కావడంతో భారత్ 328/5తో నిలిచింది. ఆఖర్లో కార్తీక్ (4)ను రనౌట్ చేసిన అఫ్ఘాన్.. మూడో సెషన్లో పూర్తి పైచేయి సాధించింది. ఆల్‌రౌండర్ పాండ్య, అశ్విన్‌తో కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డాడు. భారత బ్యాట్స్‌మెన్‌పై ప్రభావం చూపిస్తాడని అనుకున్న లెగ్‌స్పిన్నర్ రషీద్‌ఖాన్ (26-2-120-1) భారీగా పరుగులిచ్చుకుని ఒకే వికెట్ తీయగలిగాడు. పేసర్ అహ్మద్‌జాయ్ (2/32) చక్కటి ప్రదర్శన చేశాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ ఎల్బీ (బి) వఫాదార్ 105; ధావన్ (సి) నబి (బి) అహ్మద్‌జాయ్ 107; రాహుల్ (బి) అహ్మద్‌జాయ్ 54; పుజారా (సి) నబి (బి) ముజీబ్ 35; రహానె ఎల్బీ (బి) రషీద్ ఖాన్ 10; కార్తీక్ రనౌట్ 4; పాండ్య బ్యాటింగ్ 10; అశ్విన్ బ్యాటింగ్ 7; మొత్తం: (78 ఓవర్లలో 6 వికెట్లకు) 347

వికెట్ల పతనం: 1-168, 2-280, 3-284, 4-318, 5-328, 6-334

బౌలింగ్: అహ్మద్‌జాయ్ 13-6-32-2; వఫాదార్ 15-4-53-1; మహ్మద్ నబి 8-0-45-0; రషీద్‌ఖాన్ 26-2-120-1; ముజీబ్ 14-1-69-1; అస్గర్ 2-0-16-0

ధావన్ రికార్డు

టీమ్‌ఇండియా ఓపెనర్ శిఖర్ ధావన్ అరుదైన రికార్డు సృష్టించాడు. భారత టెస్టు క్రికెట్ చరిత్రలో లంచ్ విరామంలోపే శతకం సాధించిన తొలి బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. మొత్తంగా లంచ్‌లోపే సెంచరీ చేసిన ఆటగాళ్లలో శిఖర్‌ది ఆరో స్థానం. గతంలో వీరేంద్ర సెహ్వాగ్ (2006లో వెస్టిండీస్‌పై 99 పరుగులు) కొద్దిలో ఈ ఘనత సాధించే అవకాశాన్ని కోల్పోయాడు. 30వ టెస్టు ఆడుతున్న శిఖర్‌కు ఇది ఏడో శతకం.

ఈ కోచ్ మాకొద్దు!

• బీసీసీఐకి మహిళా క్రికెటర్ల ఫిర్యాదు

ముంబయి: కోచ్ తుషార్ ఆరొథె తమకొద్దని భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యులు బీసీసీఐకి ఫిర్యాదు చేశారు. జట్టు వ్యవహారాల్లో అతను అతిగా జోక్యం చేసుకోవడమే దీనికి కారణమని వారు చెప్పారు. మైదానంలో తీసుకునే నిర్ణయాల్లో తుషార్ అనవసరంగా కలగజేసుకుంటున్నట్లు జట్టు సభ్యులు ఆరోపించారు. తాజాగా ఆసియా కప్ ఫైనల్లో బంగ్లాదేశ్ చేతిలో భారత్ అనూహ్యంగా ఓడిపోవడానికి కారణం జట్టు ఎంపికలో లోపాలే అంటున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు ఇష్టం లేకుండా తుషారే తుది జట్టును ఎంపిక చేసినట్లు వారు చెబుతున్నారు. అంతేకాదు తన సూచనల మేరకే బౌలర్లు నడుచుకోవాలని అతను చెప్పినట్లు సమాచారం. బంగ్లా బ్యాట్స్‌మెన్ బంతిని స్వీపింగ్ చేస్తున్నా కూడా లెగ్‌సైడ్‌లోనే అతను బౌలింగ్ చేయమని చెప్పినట్లు తెలిసింది. అంతేకాదు ప్రతిరోజూ జరిగే ప్రాక్టీస్‌లోనూ సరైన నియమావళే లేదని క్రీడాకారిణులు ఆరోపించారు. "ఇప్పుడు పరిస్థితి చేదాటి పోయింది. తుషార్‌పై చాలామంది అమ్మాయిలు ఫిర్యాదు చేశారు. వీటిలో కొన్ని తీవ్రమైన ఆరోపణలు కూడా ఉన్నాయి. సీనియర్ సెలక్షన్ కమిటీని కూడా అమ్మాయిలు కలిశారు. తుషార్ అంశంపై పూర్తి విచారణ జరిపించాల్సి ఉంది" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

మొదటి క్రికెటర్ స్మృతీనే

దిల్లీ: భారత క్రికెట్ మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధానా ఇంగ్లాండ్‌లోని కియా సూపర్ లీగ్‌లో ఆడనున్న మొదటి భారత క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. వచ్చేనెల 22 నుంచి ఆరంభం కానున్న ఈ లీగ్‌లో స్మృతి వెస్టర్న్ స్టార్మ్ తరఫున ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. స్మృతి ఇదివరకు బిగ్‌బాష్ లీగ్‌లో ఆడిన సంగతి తెలిసిందే. "కియా లీగ్‌లో ఆడనున్న మొదటి భారత క్రికెటర్‌గా నిలిచినందుకు గర్వంగా ఉంది. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తా" అని స్మృతి చెప్పింది. "స్మృతి మా జట్టులో భాగమైనందుకు సంతోషంగా ఉంది. ప్రస్తుతం మహిళా క్రికెట్లోని అద్భుతమైన యువ క్రికెటర్లలో ఆమె ఒకరు. వయసు తక్కువే అయినా కూడా ఆమెకు అత్యున్నత స్థాయిలో ఆడిన అనుభవం ఉంది. ఆమె తన సత్తామేరకు రాణిస్తుందనే నమ్మకం ఉంది" అని వెస్టర్న్ స్టార్మ్ కోచ్ ట్రేవర్ గ్రిఫిన్ తెలిపాడు.

మెరిసిన మోర్గాన్, అలీ

• తొలి వన్డేలో ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ విజయం

లండన్: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ శుభారంభం చేసింది. కెప్టెన్ మోర్గాన్ (69), మొయిన్ అలీ (3/43) రాణించడంతో తొలి వన్డేలో 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ తడబడింది. మొయిన్ అలీతోపాటు ప్లంకెట్ (3/42), రషీద్ (2/36) విజృంభించడంతో 47 ఓవర్లలో 214 పరుగులకే ఆలౌటైంది. మాక్స్‌వెల్ (62), అగర్ (40) మెరుగైన ప్రదర్శన చేశారు. మోర్గాన్‌తో పాటు రూట్ (50), విల్లే (35 నాటౌట్) రాణించడంతో లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 44 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యం సంపాదించింది. అలీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

వర్చువల్ తనిఖీలు.. సస్పెన్షన్లు

- సక్రమంగా పనిచేయని ఇద్దరు అధికారులపై చర్యలకు చంద్రబాబు ఆదేశం
- రహదారులపై చెత్త కనిపిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక

రియల్ టైం గవర్నెన్స్‌లో అధికారులను నిలదీస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - అమరావతి

సచివాలయం నుంచి గురువారం నిర్వహించిన వర్చువల్ తనిఖీల సందర్భంగా క్షేత్ర స్థాయిలో యంత్రాంగం పనితీరు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆగ్రహం తెప్పించింది. అక్కడికక్కడే ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో కూడా ఈ తనిఖీలుంటాయని ముఖ్యమంత్రి చెప్పారు. గుంటూరు జిల్లాలో వల్లభాపురం-చిన్నపాలెం రోడ్డు, విజయవాడలో స్వరాజ్యమైదానం, రైతుబజారు వద్ద చెత్త డంపింగ్‌పైనా తొలిసారిగా వర్చువల్ తనిఖీలు నిర్వహించారు. వల్లభాపురం రహదారిలో కల్వర్టు నిర్మించడంలో అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ పరిశుభ్ర నగరమని తెలిసినా పారిశుద్ధ్య పరిస్థితులను ఎందుకు నిరంతరం పర్యవేక్షించడం లేదని ప్రశ్నించారు. "పనులు మంజూరు చేయడమే కాదు.. క్షేత్రస్థాయిలో ఎట్లా జరుగుతున్నాయో తనిఖీ చేస్తాను. ప్రభుత్వం చేస్తున్న పనులతో మంచి పేరు వస్తోంది. ఒకరిద్దరు సక్రమంగా పని చేయకపోతే చెడ్డ పేరు వస్తుంది. అలాంటి అధికారులపై చర్యలు తప్పవు. రహదారులపై ఎక్కడ చెత్త కనిపించినా సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటాం. బాధ్యతలేకుండా పని చేస్తే ఉపేక్షించేది లేదు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలి. వరదలు వచ్చే అవకాశం ఉంటే అన్ని శాఖలు సంయుక్తగా ముందుగానే సిద్ధం కావాలి. పత్రికల్లో తప్పుడు వార్తలు వస్తే చర్యలు తీసుకోవాలి. వాస్తవాలు ఉంటే పరిష్కరించండి" అని సీఎం సూచించారు.

సాంకేతికతపై విమర్శలా..!

"సాంకేతికతతో ఏం లాభం లేదని కొందరు విమర్శిస్తున్నారు. వర్చువల్ తనిఖీ కారణంగా సచివాలయం నుంచే పరిశీలించే అవకాశం ఉంది. నేను క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తే అధికారులు అందరూ నా చుట్టూ తిరగాల్సి వస్తుంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో సంతృప్తి 75శాతానికి చేరింది. చౌకధరల దుకాణాలపై గుంటూరు జిల్లాలో 28శాతం, విశాఖపట్నంలో 21శాతం, శ్రీకాకుళంలో 24శాతం సంతృప్తి ఉంది. ఇక్కడ సంతృప్తిస్థాయి తక్కువగా ఉండడంపై విచారణ చేయిస్తాను. కాంగ్రెస్ హయాంలో దెయ్యాలు పింఛన్లు తీసుకున్నాయి. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. కొన్ని చోట్ల పింఛన్ల పంపిణీలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై విచారణ జరిపిస్తున్నాం. డిసెంబరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 20వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. జులై నుంచి ప్రజలతో నేరుగా వీడియోకాన్ఫరెన్సులు నిర్వహిస్తాం. ఫైబర్‌నెట్ కనెక్షన్ ఉన్న ఇళ్లల్లోని వారితోనూ నేరుగా మాట్లాడతాం. ఇప్పటికే 3.12లక్షల కనెక్షన్లు ఇచ్చాం. ఇసుక రీచ్‌ల వద్ద అధికారులను పెడతాం. రీచ్‌ల వద్దకు వెళ్లే రహదారుల నిర్వహణ ప్రభుత్వమే చేపడుతుంది" అని చంద్రబాబు వివరించారు.

ముఖ్యమంత్రి వర్చువల్ తనిఖీ సాగిందిలా..

గుంటూరు జిల్లా వల్లభాపురం-చిన్నపాలెం రోడ్డులో కల్వర్టు నిర్మించకుండా మొదట రోడ్డు వేశారు. అనంతరం కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డును తవ్వేశారు. దీనిపై 'డెల్టా రోడ్డు ఉల్టా' శీర్షికతో 'ఈనాడు- అమరావతి'లో కథనం రావడంతో స్పందించిన సీఎం ఈ రోడ్డు పరిస్థితిని వర్చువల్ తనిఖీ చేశారు. అధికారులు, సీఎం మధ్య సంభాషణ ఇలా సాగింది..

సీఎం: ఈ రోడ్డు పంచాయతీరాజ్‌దా.. రోడ్లు భవనాల శాఖదా?

అధికారులు: పంచాయతీరాజ్ శాఖది సర్.

సీఎం: ఏఈ, డీఈలను లైన్‌లోకి తీసుకోండి.

అధికారులు: క్షేత్రస్థాయిలో అందుబాటులో లేరు సర్.

సీఎం: ఉదయమే సమాచారం ఇచ్చారు కదా.. ఏఈని సస్పెండ్ చేయండి. ఇంతవరకు మెత్తగా చెప్పాను. ఒకరిద్దరు అధికారులపై చర్యలు తీసుకుంటే మొత్తం సర్దుకుంటుంది. పనులు సరిగా చేయకపోతే గుత్తేదార్లపైనా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే బ్లాక్ లిస్టులో పెడతాం.

★ **ఈలోపు పంచాయతీరాజ్ ఈఈ సుబ్రహ్మణ్యంకు ఇంజినీర్‌ఇన్‌చీఫ్ ఫోన్ చేసి ముఖ్యమంత్రికి ఇచ్చారు.**

సీఎం: ఒక రోడ్డుకు పైపులు వేయనందుకు ప్రభుత్వం పరువుపోతోంది. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు? మీకు బాధ్యతలేదా? ఎందుకు పూర్తి చేయరు? ఈఈగా ఉన్నావ్.. ఏఈ ఎవరు? రోడ్డు 2016లో మంజూరైతే ఇప్పటి వరకు ఎందుకు కల్వర్టు పూర్తి చేయలేదు. వర్షాలు వస్తాయని తెలిసి మేలోనే ఎందుకు పూర్తి చేయలేదు?

విజయవాడలోని స్వరాజ్‌మైదానం దగ్గర చెత్త డంపింగ్‌పై..

అధికారులు: రైతు బజార్ వద్ద నిత్యం చెత్త వేస్తారు సర్..!

సీఎం: నిత్యం ఉండేదేనా! అక్కడ చెత్త వేయడానికి ఆదేశాలు ఏమైనా ఇచ్చారా? (ఆగ్రహం వ్యక్తం చేస్తూ...)

అధికారులు: ఉదయం పత్రికలో రావడంతో చాలావరకు శుభ్రం చేశారు సర్..

సీఎం: కమిషనర్ నివాస్ ఎవరు దీనికి బాధ్యులు? మైదానం పరిశుభ్రత బాధ్యతలు ఎవరివి?

కమిషనర్: అదనపు వైద్య, ఆరోగ్య అధికారి(ఏఎంహెచ్‌వో)సర్..

సీఎం: ఆయన్ని వెంటనే సస్పెండ్ చేయండి. విచారణ జరిపించండి.

సేవా రంగం దయనీయం

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సేవా రంగం దుస్థితిని నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ప్రస్తావిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో సేవా రంగం బలహీనపడిందని, ఇది ఆర్థికాభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతోందని తెలిపారు. నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించి లేవనెత్తాల్సిన అంశాలపై ఆయన గురువారం ఉదయం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. పెట్రోలు, డీజిలు ధరల పెంపుపై లోతుగా అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఈ సందర్భంగా ఆదేశించారు. ప్రత్యేక హోదా సహా రాజ్యసభలో ఇచ్చిన హామీలు, విభజన చట్టంలోని అంశాలను అమలు చేసేదాకా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. 'రాష్ట్రాభివృద్ధి అంటే దేశాభివృద్ధిలో భాగమే. కేంద్రం సహకార సమాఖ్య స్ఫూర్తిని గౌరవించి ఎదుగుతున్న రాష్ట్రాలకు అండగా నిలవాలి. అవరోధాలు, ఆటంకాలు తట్టుకుని సుస్థిరాభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాల విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరించాలే తప్ప కక్ష సాధింపు ధోరణితో ఉండటం సరికాదు. విభజన చట్టంలో రాష్ట్రానికి రావాల్సినవే అడుగుతున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

17నే సమావేశం: నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం ఈ నెల 17న జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి మేరకు ఒక రోజు సమావేశాన్ని వెనక్కి జరిపామని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ తెలిపారు.

కడపపై ఉక్కు సంకల్పం: కడపలో ఉక్కు కర్మాగారం సాధ్యం కాదని సుప్రీం కోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయడంపట్ల నిరసన వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం కేంద్రానికి లేఖ రాయనున్నారు. అఫిడవిట్‌ను ఉపసంహరించుకోవాలని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండు చేయనున్నారు. మరోపక్క ఉక్కు కర్మాగారం సాధన కోసం తెదేపా ఎంపీలు కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధమవుతున్నారు. దిల్లీలో నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం ముగిసిన మర్నాడు ఎంపీల ధర్నా ఉంటుంది. మరోవైపు కడప ఉక్కు కర్మాగారం సహా విభజన చట్టంలోని అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీల్ని సాధించుకునేందుకు అవసరమైన పోరాట కార్యాచరణపై చర్చించేందుకు చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహిస్తున్నారు.

ప్రైవేటు వైద్య విద్యార్థులకేదీ భరోసా?

ఈనాడు-అమరావతి, చిత్తూరు: ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు భరోసా కరవవుతోంది. కళాశాలల మౌలిక వసతులను పరిశీలించి భారతీయ వైద్యమండలి అనుమతులను పునరుద్ధరించే ప్రక్రియలో కొన్ని విద్యాలయాలు అర్హత కోల్పోతున్నాయి. దీని ప్రభావం ఆయా కళాశాలల్లో అప్పటికే చదువుతున్న విద్యార్థులపై కనిపిస్తోంది. తాజాగా చిత్తూరు జిల్లా ఆర్వీఎస్ వైద్య కళాశాల విద్యార్థులు రోడ్డున పడడమే దీనికి నిదర్శనం. ఎంబీబీఎస్‌లో ఒక ఏడాది ప్రవేశాలు జరగకుంటే సుమారు రూ.25 కోట్ల వరకు సంబంధిత ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు భారాన్ని మోయాల్సి వస్తోంది. దీన్ని తట్టుకోలేక కళాశాలల యాజమాన్యాలు అప్పటికే చేరిన విద్యార్థులకు బోధన, మౌలిక వసతుల కల్పన విషయంలో రాజీ పడుతున్నాయి. దీని వల్ల వైద్య విద్య ప్రమాణాలు దెబ్బతింటున్నాయి.

కాగితాలపైనే అన్నీ..: ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పరిధిలో 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి విశ్వభారతి(కర్నూలు), నిమ్రా(జూపూడి), గాయత్రీ (విశాఖ), ఆర్వీఎస్(చిత్తూరు) వైద్య కళాశాలల్లో ప్రవేశాలను నిర్వహించేందుకు అనుమతులను ఎంసీఐ పునరుద్ధరించలేదు. వీటిల్లో 150 చొప్పున ఉన్న సీట్లను భర్తీ చేసే అవకాశం దూరమైంది. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఆస్పత్రుల నిర్వహణ, అర్హులైన బోధన సిబ్బంది, ప్రయోగశాలల ఏర్పాటు, ఇతర మౌలిక వసతుల కల్పన చాలాచోట్ల కాగితాలకే పరిమితమవుతోంది. పలువురికి కళాశాలల నిర్వహణపై తగిన అనుభవం లేక సమస్యలు పుట్టుకొస్తున్నాయి.

ఏడాది నుంచి ప్రవేశాల్లేవు!: చిత్తూరు శివార్లోని ఆర్వీఎస్ వైద్య కళాశాలలో 2016లో 150 సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. 2017-18లో సీట్ల భర్తీకి అనుమతి లభించలేదు. ఈ కొత్త విద్యా సంవత్సరానికి కూడా సీట్ల భర్తీకి ఎంసీఐ అనుమతి లేదు. బోధన ప్రమాణాలకు అనుగుణంగా విద్యాలయం లేదని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ సీవీరావుకు బుధవారం లిఖితపూర్వకంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదుచేశారు.

వివరణ తీసుకుంటాం.. ఉపకులపతి: కళాశాల నిర్వహణలో లోపాలున్నాయని, యాజమాన్యం వివరణ తీసుకుంటామని, విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటామని విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ సీవీరావు అన్నారు. విద్యార్థులకు నష్టం జరగబోదని, సమస్య పరిష్కారమవుతుందని ఆర్‌వీఎస్ వైద్య కళాశాల డీన్ ఓబులేశు తెలిపారు.

భాజపా పెద్దలతో బుగ్గన భేటీ!

- ఆ రెండు పార్టీలూ కలిసే నడుస్తున్నాయ్
- మంత్రులు అచ్చెన్నాయుడు, అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపణ

ఈనాడు డిజిటల్, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి మీద భాజపా, వైకాపా కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని, ఇందులో భాగంగానే తాజాగా దిల్లీలో భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భేటీ అయ్యారని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ను నమ్మించి మోసం చేసిన భాజపాతో వైకాపా చేతులు కలిపి సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోందనడానికి ఇదే నిదర్శనమని ధ్వజమెత్తారు. గురువారం అమరావతిలో మరో మంత్రి అమరనాథ్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరుగుతుంటే కేంద్రంపై పోరాటం చేయకుండా ఎందుకీ కుట్రలు చేస్తున్నారు? ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో సొంత జిల్లాకే అన్యాయం జరిగింది. దీనిపై ప్రధానిని ఒక్క మాటా అనలేని ప్రతి పక్షనేత, ఆయన పార్టీ ఈ రాష్ట్రానికి అవసరమా? పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదన్న తర్వాత పల్లెత్తు మాట మాట్లాడకుండా మీ పార్టీ నేతను దిల్లీకి ఎందుకు పంపించారు? తెదేపా నుంచి బహిష్కరించిన మోత్కుపల్లి నర్సింహులును విజయసాయిరెడ్డి కలవాల్సిన అవసరం ఏముంది? దిల్లీలో జరిగిన సమావేశంపై బుగ్గన ఏమంటారు? భాజపా, వైకాపాలో ఎందులో ఉన్నా ఒకటే అని అమిత్‌షా మాట్లాడింది నిజం కాదా?' అని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. 'వైకాపా ఎంపీలు రాజీనామా చేసినా భాజపాతో చేతులు కలిపి ఎన్నికలు రాకుండా చూసుకున్నారు. చంద్రబాబును విమర్శించడమే పనిగా పెట్టుకున్న జగన్ ప్రధానిని విమర్శించే ధైర్యం చేయడం లేదు' అని అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

అది అబద్ధం: దిల్లీలో తాము భేటీ అయినట్లు వచ్చిన వార్తలను వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్, భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ఖండించారు. 'నేను, బుగ్గన ఎక్కడికో కలిసి వెళ్లామన్న వార్తలు సరికాదు. ఆయనా, నేను బాల్యమిత్రులం. ఏపీ భవన్‌లో కలిసినప్పుడు మాట్లాడుకున్నాం. రాజకీయంగా మేం మాట్లాడుకోవాలనుకుంటే హైదరాబాద్‌లో, విజయవాడలో ఎక్కడైనా ఎవరికీ తెలియకుండా కలుసుకుంటాం కదా?' అని ఆకుల సత్యనారాయణ స్పష్టం చేశారు.

ఇది కుమ్మక్కు కాదా: చంద్రబాబు

భాజపా అడుగుల్లోనే వైకాపా అడుగులేస్తోందని, ఆ రెండు పార్టీలూ కలిసే సాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. వైకాపా నాయకుడు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భాజపా పెద్దలతో దిల్లీలో సమావేశం కావడం ఆ రెండు పార్టీల మైత్రికి నిదర్శనమని పేర్కొన్నారు. చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ముఖ్యమంత్రి గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 'భాజపా, వైకాపా కుట్ర రాజకీయాల్ని మొదట మనమే బయటపెట్టాం. దీన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. నమ్మక ద్రోహం, కుట్ర రాజకీయాల్ని ఎండగట్టాలి' అని పేర్కొన్నారు. '5 పార్లమెంటు స్థానాలకు ఉప ఎన్నికలు వస్తే బాగుండేది. నంద్యాల, కాకినాడ తరహాలో స్వీప్ చేసేవాళ్లం. అది తెలిసే ఉప ఎన్నికలు రాకుండా జాగ్రత్తపడ్డారు' అని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు.

మత కలహాలకూ కారకుడు వాగ్మోరే

- మరొకరి హత్యకూ కుట్ర
- గౌరీ హత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి..
- కొనసాగుతున్న విచారణ

బెంగళూరు (మల్లేశ్వరం) - న్యూస్‌టుడే

ప్రముఖ జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అదుపులో ఉన్న కీలక నిందితుడు పరశురామ్ వాగ్మోరే (26) విచారణ సందర్భంగా కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. ఆరు సంవత్సరాల కిందట సింధగి తహసీల్దారు కార్యాలయంపై పాకిస్థాన్ జెండా ఎగురవేసి పథకం ప్రకారం మత కలహాల సృష్టికి అతడే కారణమని వెల్లడైంది. కలబురిగి జిల్లా సొన్న, విజయపుర జిల్లా దేవణగావ్ సరిహద్దులో అక్రమంగా తుపాకుల విక్రయాన్నీ అతడు కొనసాగించాడు. ఈ విషయంలో నిందితుడికి సహకారం అందిస్తున్న సునీల్ మడివాళప్ప అగసర (25) అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సిట్ అధికారి అనుచేత్ గురువారం ప్రకటించారు. కేసులో మరో నిందితుడు సునీల్‌తో పాటు పరశురామ్ శ్రీరామ సేనలో కార్యకర్తలుగా ఉన్నారని ప్రాథమిక విచారణలో తేలింది. మరో నిందితుడు మనోహర్ దుండప్ప యడవె అలియాస్ మనోజ్ (29) నివాసంలో డైరీ, 22 సెల్‌ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులోని రహస్య సంకేతాలతో గౌరీ లంకేశ్ హత్యకు సంబంధించిన వివరాలను గుర్తించారు. హత్య చేసింది తానేనని, అమోల్ కాళే తనకు తుపాకీ ఇచ్చాడని అంగీకరించినా.. ఆ పై తుపాకీని ఎవరికి ఇచ్చాననే విషయాన్ని మర్చిపోయానని పరశురామ్ చెబుతున్నాడు. సిట్ అదుపులో ఉన్న సుజిత్ అలియాస్ ప్రవీణ్, మనోహర దుండప్ప యడవె, అమిత్ దిగ్వేకర్, అమోల్ కాళేను అధికారులు గురువారం న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. మరోమారు విచారణకు అప్పగించాలని సిట్ కోరకపోవటంతో వారిని 14 రోజుల పాటు న్యాయనిర్బంధానికి పంపుతూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

గౌరీ లంకేశ్ హత్య అనంతరం మండ్య బస్టాండులో నవీన్ కుమార్, రెండో నిందితుడు ప్రవీణ్ కలుసుకున్నారు. 'గౌరీ విషయాన్ని ముగించాం. ఇప్పుడు మైసూరులో ఉన్న ప్రొఫెసర్ కె.ఎస్.భగవాన్‌ను మట్టుపెడదాం' అని వారిద్దరూ ప్రణాళిక రూపొందించుకున్నా ఆ పని చేయడంలో విఫలమయ్యారు.

'ఉమ్రా' యాత్ర పేరుతో మోసంలో ముగ్గురి అరెస్టు

- 50 పాసుపోర్టుల స్వాధీనం
- రూ.20 కోట్లు వసూలు చేశారు..

ఉమ్రా యాత్ర మోసం ఉదంతంలో పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితులు బర్కత్‌అలీ, అల్తాఫ్ హుస్సేన్, షేక్ మహమ్మద్ అలీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: తక్కువ డబ్బుతోనే ఉమ్రా యాత్రకు పంపిస్తామంటూ ముస్లింలను మోసం చేసిన ముగ్గురు నిర్వాహకులను కడప పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 50 పాసుపోర్టులను స్వాధీనపరచుకున్నామని సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మరో నాలుగు వేల పాసుపోర్టులు వారి వద్ద ఉన్నాయన్నారు. కడపలోని అగాడివీధికి చెందిన సయ్యద్ అల్తాఫ్‌హుస్సేన్, షేక్ మహమ్మద్ అలీ, బర్కత్‌అలీలు అల్మాస్‌పేటలో కేఎస్ఎస్ ట్రావెల్ ఏజెన్సీని ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో తక్కువ డబ్బుతో ఉమ్రా యాత్రకు పంపిస్తామంటూ నమ్మించారు. 20 మందిని ఉమ్రాకు పంపించి వారి దృశ్యాలను చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లోని ముస్లిం సోదరులు కూడా ఒక్కొక్కరు రూ.18 వేల నుంచి నుంచి రూ.45 వేల వరకు చెల్లించారు. ఆరు వేల మంది నుంచి సుమారు రూ.20 కోట్లు వసూలు చేశారు. సాధారణంగా ఉమ్రాకు ఒక్కొక్కరిని పంపించాలంటే రూ.75 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చవుతుంది. వసూలు చేసిన సొమ్మును నిర్వాహకులు తమ సొంత అవసరాలకు వినియోగించుకున్నారు. వీరు ఆస్తులు ఎక్కడెక్కడ కొన్నారో విచారిస్తామని సీసీఎస్ డీఎస్పీ తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన విజయవాడ ముస్లిం ఈద్గా కమిటీ సభ్యులు

రంజాన్ నమాజ్‌కు ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: రంజాన్ పండుగ సందర్భంగా ఈ నెల 16వ తేదీ(శనివారం) ఉదయం విజయవాడ ఇందిరాగాంధీ పురపాలక మైదానంలో నిర్వహించనున్న నమాజ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు విజయవాడ ముస్లిం ఈద్గా కమిటీ సభ్యులు గురువారం ఆయన్ను కలిసి ఆహ్వానించగా.. సీఎం సానుకూలత వ్యక్తం చేశారు.

పవన్ కల్యాణ్ రంజాన్ శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: ముస్లిం సోదరులకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. "పవిత్ర రంజాన్ నెల చివరికొచ్చింది. ఈద్ ఉల్ ఫితర్ చంద్రుని దర్శనం కోసం ముస్లిం సోదరులంతా ఎదురు చూస్తున్నారు" అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఆగస్టు 15 రాష్ట్రస్థాయి వేడుకలు శ్రీకాకుళంలో

శ్రీకాకుళం, న్యూస్‌టుడే: ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలకు శ్రీకాకుళం వేదిక కానుంది. ఈమేరకు రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొనే రాష్ట్రస్థాయి ఆగస్టు 15 వేడుకలను రాష్ట్ర విభజన తరువాత ఒక్కో సంవత్సరం ఒక్కో జిల్లాలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

ప్రభుత్వ పథకాల అమలుపై 75 శాతం సంతృప్తి

రియల్‌టైమ్ గవర్నెన్స్ సంస్థ వెల్లడి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో 75 శాతం సంతృప్తి వ్యక్తం అయిందని రియల్‌టైమ్ గవర్నెన్స్ సంస్థ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. జిల్లాల వారీగా చూస్తే గుంటూరు (79 శాతం), కృష్ణా (77 శాతం) జిల్లాల్లో అత్యధికంగా, కర్నూలులో (68 శాతం) అత్యల్పంగా సంతృప్తి శాతం నమోదైందని పేర్కొంది. రేషన్, తాగునీటి సరఫరాపై 75 శాతం సంతృప్తి వ్యక్తమైందని వెల్లడించింది. "శాఖల వారీగా చూస్తే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పనితీరుపై అత్యధికంగా 91 శాతం, విద్యా శాఖపై 86 శాతం, పరిశ్రమల శాఖపై 81 శాతం సంతృప్తి నమోదైంది. అత్యల్పంగా పోలీసు శాఖ పనితీరు పట్ల 59 శాతం సంతృప్తి మాత్రమే నమోదైంది. పథకాల వారీగా చూస్తే చంద్రన్న సంచార చికిత్సకు సంబంధించి 97 శాతం, అన్న అమృత హస్తం పథకంపై 92 శాతం, ఎన్టీఆర్ వైద్య సేవపై 89 శాతం సంతృప్తి నమోదైంది" అని పేర్కొంది.

రాజధాని భూసమీకరణ విధానం భేష్

సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఉపమా చౌదరి ప్రశంస

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి రైతుల నుంచి స్వచ్ఛందంగా భూసమీకరణ విధానంలో భూములు తీసుకోవడం ప్రశంసనీయమని ముస్సోరిలోని లాల్ బహదూర్‌శాస్త్రి జాతీయ పరిపాలన సంస్థ డైరెక్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఉపమా చౌదరి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న వివిధ పథకాల పరిశీలనకు మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆమె ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. గురువారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో రాజధాని పురోగతిపై ఇంధన శాఖ, సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అమరావతి నిర్మాణంలో రైతుల్ని భాగస్వాముల్ని చేయడంలో భూసమీకరణ పథకం ప్రధాన పాత్ర నిర్వహిస్తుందని ఉపమా చౌదరి అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రత్యేక పథకాలు విజయవంతమవ్వాలంటే దార్శనికత ఉన్న నాయకత్వం అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలనలోను, సంక్షేమ కార్యక్రమాల అమల్లోను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని వినియోగిస్తున్న తీరుని ఆమె ప్రశంసించారు.

13 ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

ఈనాడు, అమరావతి: గుంటూరు, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాల్లోగల 13 ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రత్యేక కేసులుగా పరిగణించి ప్రోత్సాహకాల విడుదల కోసం తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక విధానాన్ని (2015-20) ఇప్పటికే విడుదల చేసింది. చాలామంది జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ల వద్ద చేసుకున్న దరఖాస్తులు అపరిష్కృతంగా నిలిచిపోవడంతో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను కోల్పోయారు. ఈ విషయాన్ని బాధితులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2015-20 విధానం వచ్చిన తరువాతే దరఖాస్తులు చేసినందున ప్రత్యేక కేసులుగా పరిగణించి న్యాయం చేయాలని కోరారు.

45 రోజుల్లో భూసేకరణ పూర్తి కావాలి

మచిలీపట్నం పోర్టుపై మంత్రి కొల్లు సమీక్ష

ఈనాడు డిజిటల్, అమరావతి: మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను 45 రోజుల్లో పూర్తి చేయాలని యువజన, క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. జులైలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగేలా పనుల తీరు ఉండాలన్నారు. ఈ అంశంపై సచివాలయంలో గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, మౌలిక వసతుల అవసరాలకు మచిలీపట్నం పట్టణాభివృద్ధి సంస్థ రూ.1092 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వం మార్గం సుగుమం చేసిందన్నారు. కార్యక్రమంలో ఇంధనం, పెట్టుబడులు, మౌలిక వసతులశాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, రాష్ట్ర ఓడరేవుల సంచాలకులు కోయ ప్రవీణ్, మచిలీపట్నం పట్టణాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు విల్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఊటీలో ఘోర రోడ్డు ప్రమాదం

లోయలో పడిన ప్రభుత్వ బస్సు ● 8 మంది దుర్మరణం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: తమిళనాడులో ఓ ప్రభుత్వ బస్సు అదుపుతప్పి లోయలో పడడంతో ఎనిమిది మంది మరణించారు. మరో 30 మంది గాయపడ్డారు. ఊటీ నుంచి కూనూరుకి 40 మంది ప్రయాణికులతో ప్రభుత్వ బస్సు ఒకటి గురువారం బయలుదేరింది. బస్సును రాజ్‌కుమార్ (38) నడుపుతున్నాడు. స్టీరింగ్ పని చేయకపోవడంతో అదుపు తప్పిన వాహనం 100 అడుగుల లోయలో పడిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పేలితలావైకి చెందిన ధర్మన్ (64), కునూరుకు చెందిన దినేష్ (30), ఊటీకి చెందిన నందకుమార్ (36), ప్రభాకరన్ (50), శాంత కుమార్ (55), బెంగళూరుకు చెందిన జయశ్రీ (45), కాందల్‌కు చెందిన అల్మాస్ (29), శివకుమార్ మరణించారు. క్షతగాత్రుల్లో 19 మందిని కోవై, 11 మందిని ఊటీ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నీలగిరి కలెక్టరు దివ్య సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధితుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వెల్లడించారు.

సామాజిక చైతన్యం రావాలి

- మునివాహన ఉత్సవంలో ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్

చిన నరసింహులును భుజాలపై మోసుకొని ఆలయంలోకి తీసుకెళ్తున్న అర్చకస్వామి విజయకుమార్. చిత్రంలో మాణిక్యవరప్రసాద్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అస్పృశ్యత నివారణలో సామాజికంగా ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని శ్రీమోహన రంగనాయక స్వామి ఆలయంలో సామాజిక సమరసత వేదిక గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో గురువారం మునివాహన ఉత్సవం నిర్వహించారు. దీనిలోభాగంగా కుల్లాయి చిన్న నరసింహులు అనే దళిత భక్తుడిని ఆలయ అర్చకస్వామి కళ్యాణపురం విజయకుమార్ తన భుజాలమీద మోసుకుంటూ మంగళ వాయిద్యాలతో ఆలయంలోకి తీసుకొచ్చారు. అనంతరం గర్భాలయంలో నిర్వహించిన అర్చనలో చిన్న నరసింహులు పాల్గొన్నారు. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా కులపరమైన అసమానతలు ఇంకా కొనసాగడం విచారకరమన్నారు. దళితుల్లోనూ ఆగమశాస్త్రంలో ఉన్నత విద్యావంతులున్నారని, అలాంటి వారిని దేవాలయాల్లో పూజారులుగా నియమించాలన్నారు. కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ సుమారు 2700 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనను మునివాహనుడు పేరిట నాటకంగా రాశానని వివరించారు. హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకులు రంగరాజన్ మునివాహన సేవ నిర్వహించారని మళ్లీ ఆయన ఆధ్వర్యంలోనే నేడు అటువంటి మునివాహన ఉత్సవాన్ని నిర్వహించి సామాజికంగా అస్పృశ్యతను నిర్మూలించడానికి నడుం బిగించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సోషలిస్టు పార్టీ నాయకుడు మోదుగుల పాపిరెడ్డి, సామాజిక సమరసత వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి తాళ్లూరి విష్ణు, ఆలయ కార్యనిర్వహణాధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై 12 లక్షల ఫిర్యాదులు

- పరిష్కరించింది 4 లక్షలే
- ముఖ్యమంత్రి సమీక్షలో వెల్లడి

ఈనాడు, అమరావతి: చౌక ధర దుకాణాల ద్వారా రేషన్ పంపిణీపై ఆర్టీజీకి (రియల్‌టైమ్ గవర్నెన్స్) 12 లక్షల ఫిర్యాదులు అందాయని, వాటిలో 4 లక్షల ఫిర్యాదులనే పరిష్కరించినట్లు పౌర సరఫరాలశాఖ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. మరో 3 లక్షల ఫిర్యాదులు చేసిన వారి సమాచారం ప్రజా సాధికార సర్వే డేటాలో లేకపోవడంతో పరిష్కరించలేకపోయామని, వారంతా ఆ సర్వేలో వివరాలు నమోదు చేయించుకుంటే పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్టీజీకి వచ్చిన ఫిర్యాదులు, ఇతర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్షించారు. పౌర సరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రేషన్ పంపిణీపై ప్రజల్లో సంతృప్త స్థాయి ఇప్పటికీ 60 శాతానికి పరిమితం కావడంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. లోపాలను సవరించి జులై నెలాఖరులోగా ప్రజల్లో సంతృప్త స్థాయిని 100శాతానికి తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. తాను 5వేల దుకాణాలపై ఆర్టీజీ ద్వారా సర్వే చేయించానని అందులో పలు లోపాలు వెల్లడయ్యాయని వివరించారు.

- కార్డుదారులకు ఇస్తున్న సరకులకు సంబంధించి డీలర్లు రసీదులు ఇవ్వడం లేదు.
- తూకాల్లో అవకతవకలుంటున్నాయి.
- వేలాది మంది కార్డుదారుల వేలిముద్ర సరిపోలడం లేదు.
- సరకుల కోసం వస్తున్న కార్డుదారులతో డీలర్లు వ్యవహరించేతీరు సక్రమంగా ఉండటం లేదు. నిర్దేశిత సమయాల్లో దుకాణాలు తెరచి ఉంచడం లేదు.

కొన్ని దుకాణాలను బినామీలు నడుపుతున్నారని, దీనివల్లా సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి చెప్పడంతో ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే సోమవారమే డీలర్లందరితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వెంటనే మార్చుకోకపోతే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేయండని మంత్రికి, అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 16-6-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 307
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

సమష్టిగా నిరసన!

- నీతి ఆయోగ్ సమావేశంలో మన ఆందోళన తెలిపేదెలా?
- వాకౌట్ చేయాలన్నది ఒక ఆలోచన
- వ్యూహం రూపొందిస్తున్న ప్రభుత్వం
- భాజపాయేతర రాష్ట్రాల సీఎంలతో చంద్రబాబు మంతనాలు
- ఎంపీల సమావేశంలోనూ చర్చ

అజ్మీర్ దర్గాకు ప్రభుత్వం తరపున ఛాదర్‌ను సమర్పిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు – అమరావతి

విభజన చట్టంలోని అంశాలు, ప్రత్యేకహోదా సహా రాజ్యసభలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చేస్తున్న అన్యాయంపై ఆందోళన, ఆవేదన, నిరసనను శనివారం దిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో ఎలా తెలియజేయాలన్న అంశంపై ప్రభుత్వంలో చర్చ జరుగుతోంది. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించి... కేంద్ర ఉదాసీన వైఖరికి నిరసనగా సమావేశం నుంచి వాకౌట్ చేస్తే ఎలా ఉంటుందన్నది ఒక ఆలోచన. కేంద్రం వైఖరిపై ఆగ్రహంగా ఉన్న, భావసారూప్యం కలిగిన భాజపాయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల్నీ కూడగట్టి నిరసన తెలియజేయాలన్నది మరో ప్రతిపాదన. ఈ అంశంపై భాజపాయేతర రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులతో చంద్రబాబు చర్చిస్తున్నారు. ఆయన శుక్రవారం పశ్చిమ బంగ, కేరళ, కర్ణాటక ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, పినరయి విజయన్, కుమారస్వామిలతో ఫోన్లో మాట్లాడారు. దిల్లీ, పుదుచ్చేరి, పంజాబ్ ముఖ్యమంత్రులతోను మాట్లాడనున్నట్లు సమాచారం. వారందరితో సంప్రదించిన మీదట ఒక వ్యూహాన్ని రూపొందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో... మన నిరసన ఎలా తెలియజేస్తే బాగుంటుందన్న విషయంలో ఎంపీల అభిప్రాయాల్ని ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. సమావేశంలో మాట్లాడే అవకాశం అక్షర క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు మొదటే

(మిగతా 2లో)

వైకాపావి లాలూచీ రాజకీయాలు

- రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీని జగన్ ప్రశ్నించరేం?
- దిల్లీలో రాంమాధవ్‌ను కలిసిన బుగ్గన
- ఆయనో కోవర్టు
- ఇది భాజపా, వైకాపాల రాజకీయ కుట్రకు పరాకాష్ఠ
- గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధం
- ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో

ఉద్ధృత పోరు

- వారానికి ఒక చోట రాష్ట్రంలో నిరసన
- కేంద్రంపై అవిశ్వాస తీర్మానం
- తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలు

14లో

హోంగార్డులపై వరాల జల్లు

- రోజువారీ వేతనం రూ.400 నుంచి రూ.600కు పెంపు
- మహిళా హోంగార్డులకు మూడు నెలల పాటు ప్రసూతి సెలవులు
- ప్రమాద, సహజ మరణానికి రూ.5 లక్షలు
- ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హోంగార్డులపై వరాల జల్లు కురిపించింది. రోజువారీ వేతనాన్ని రూ.400 నుంచి రూ.600కు పెంచింది. ఫలితంగా వారికి నెలకు రూ.18 వేల వేతనం లభించనుంది. రాష్ట్రంలోని 15,616 మందికి ప్రయోజనం చేకూరనుంది. దీంతో పాటు వారికి ప్రయోజనం కలిగించే అనేక నిర్ణయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఏపీ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జె.శ్రీనివాసరావు, ఏపీ హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.గోవింద్ తదితరుల ఆధ్వర్యంలో హోంగార్డులు శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబును కలిసి తమ సమస్యలను విన్నవించారు. వాటన్నింటినీ విన్న అనంతరం చంద్రబాబు ఈ నిర్ణయాలను

(మిగతా 2లో)

పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయండి

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

దిల్లీ: ఎస్టీ, ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లను అమలుచేయాలని తన ప్రభుత్వ విభాగాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. చట్ట నిబంధనలకు లోబడి ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో కోటా కల్పించాలని ఈనెల 5న సుప్రీంకోర్టు చేసిన సూచనను అనుసరించి కేంద్ర సిబ్బంది శాఖ శుక్రవారం ఈ ఆదేశాలిచ్చింది. అయితే- 'అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తదుపరి ఆదేశాలను అనుసరించి ఈ పదోన్నతి వర్తిస్తుంది' అని ప్రతి పదోన్నతి లేఖలోనూ తప్పనిసరిగా పేర్కొనాలని సూచించింది.

జీఎస్టీతో రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం

- స్థానిక అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పన్నులు విధించే వెసులుబాటేది?
- నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో వివరించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రస్తావించే అంశాలతో సమగ్ర నివేదిక సిద్ధం

6లో



పదో తరగతిలో అంతర్గత మార్కుల తొలగింపు?

ఇక వంద మార్కులకూ పరీక్షలే

ఈనాడు, అమరావతి: పదోతరగతిలో అంతర్గత మార్కుల తొలగింపునకు పాఠశాల విద్యాశాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. అధ్యయనానికి నియమించిన కమిటీ ఈ మేరకు సిఫార్సు చేసింది. దాంతో ఈ ఏడాది నుంచి 100మార్కులకు నేరుగా పరీక్ష నిర్వహించాలని భావిస్తోంది. ఈ దస్త్రంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పాఠశాల విద్యలో ప్రస్తుతం నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఏ) విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పదోతరగతి విద్యార్థులకు అంతర్గతంగా 20, పరీక్ష ద్వారా 80మార్కులు ఇస్తున్నారు. ప్రాజెక్టు వర్కు, నిర్మాణాత్మక మూల్యాంకనం (ఎఫ్ఏ)-4, సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ఏ)-1 పరీక్షల్లో వచ్చిన మార్కులను ఆధారంగా 20 (అంతర్గత)మార్కులను ఇస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎఫ్ఏ-4 పరీక్ష వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోవడంతో తమ విద్యార్థులకు మార్కులు తగ్గాయంటూ పలు ప్రైవేటు పాఠశాలలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదులు చేశారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు జీపీఏ (గ్రేడ్ పాయింట్ సగటు)కోసం అంతర్గత మార్కులను ఎక్కువగా వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలో వీటి తొలగింపును పరిశీలించాలని గతంలో మంత్రి గంటా శ్రీనివాసరావు అధికారులను

(మిగతా 2లో)

పేరు సాంస్కృతికం.. చేయించేది వ్యభిచారం

- విమాన టిక్కెట్లు, హోటల్ గదులకే ఏడాదికి రూ.కోటి చెల్లించిన మోదుగుముడి దంపతులు
- తెలుగు సంఘాల తప్పుడు లేఖలతో నటీమణులకు వీసాలు
- ఆ ఐదుగురు కథానాయికలు ఎవరన్నది చర్చనీయాంశం

ఈనాడు – హైదరాబాద్

తెలుగు సినీ నటులతో అమెరికాలో వ్యభిచారం నిర్వహిస్తూ అక్కడి పోలీసులకు చిక్కిన కిషన్ మోదుగుముడి దంపతులు పూర్తి ఆధారాలతో అడ్డంగా దొరికిపోయారు. తెలుగుసినీ పరిశ్రమకు చెందిన నటీమణులను అమెరికా రప్పించడంతో పాటు.. విటులను ఆకట్టుకునేందుకు వారి ఫొటోలను చరవాణుల ద్వారా పంపిణీ చేసి మరీ వారితో వ్యభిచారం చేయించారన్న ఆరోపణలపై హోంలాండ్ సెక్యూరిటీ ఇన్వెస్టిగేషన్ స్పెషల్ ఏజెంట్ బ్రియాన్ గిన్ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. వారిపై ఆరోపణలకు సంబంధించి బ్రియాన్ గిన్ దాఖలు చేసిన అభియోగపత్రాలను 'ఈనాడు' సేకరించింది. ఇందులో అనేక ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి.

తెలుగు సినీ పరిశ్రమతో ఉన్న అనుబంధం ద్వారా కొంత మంది నటీమణులతో పరిచయాలు పెంచుకున్న కిషన్.. వ్యభిచారం నిర్వహించేందుకు వారిని అమెరికా రప్పించేవాడు. వీసా ఇప్పించడానికి అమెరికాలోని రకరకాల తెలుగు సంఘాల పేర్లు వాడుకునేవాడు. తమ సంఘం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వారిని ఆహ్వానిస్తున్నట్లు

(మిగతా 2లో)

అదో పెద్ద ముఠా

- గౌరీ లంకేశ్ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి
- కనీసం ఐదు రాష్ట్రాల్లో 60 మందితో ముఠా విస్తరణ
- హిట్ లిస్ట్‌లో గిరీశ్ కర్నాడ్, మరో ముగ్గురు

6లో

తీరు మార్చుకోకపోతే డీలర్‌షిప్ రద్దు

- చనిపోయినవారి పేర్లతోనూ బియ్యం తీసేసుకుంటే ఎలా?
- ప్రజా పంపిణీ వ్యవస్థపై సమీక్షలో మంత్రి పుల్లారావు ఆగ్రహం
- ప్రజల సంతృప్తి స్థాయి పెంచాలని ఆదేశం

16లో

కొంప ముంచింది కోడలే

- అత్త పెత్తనం సహించలేక చోరీ చేయించిన వైనం
- పెనుమాక దోపిడీ కేసులో ఏడుగురు అరెస్టు
- రూ. 55 లక్షల నగదు, 210 గ్రాముల బంగారం స్వాధీనం

2లో

ఇదీ సంగతి!



'వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ తీవ్రవాద సంస్థలు!'

- అమెరికా నిఘా సంస్థ సీఐఏ విశ్లేషణ
- వార్షిక పుస్తకంలో ప్రస్తావన
- నోట్ల రద్దు, జీఎస్టీతో ఆర్థిక వ్యవస్థ మందగించిందని వ్యాఖ్య

15లో

వైకాపావి లాలూచీ రాజకీయాలు

ఈనాడు, అమరావతి: బయట పోజులు కొడుతూ...లోపల లాలూచీ రాజకీయాలను వైకాపా నడుపుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. "వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దిల్లీ వెళ్లి భాజపా పెద్దలతో సమావేశమవడం రెండు పార్టీల కుట్రలకు పరాకాష్ఠ. ప్రధానమంత్రి కార్యాలయంలో విజయసాయిరెడ్డి తిష్ఠ వేయడంపై గతంలో ఫొటోలు వచ్చాయి. బుగ్గన, ఆకుల సత్యనారాయణతో కలసి వెళ్లడంపై వీడియోలు వచ్చాయి. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన భాజపాను, ప్రధాని నరేంద్ర మోదీని జగన్ ఎందుకు ప్రశ్నించడం లేదు? రెండు పార్టీల కుట్ర రాజకీయాలకు ఇంతకన్నా రుజువులేం కావాలి?" అని చంద్రబాబు మండిపడ్డారు. శుక్రవారం జరిగిన తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రసంగిస్తూ.. అనంతరం సచివాలయంలో రాత్రి 'రియల్ టైమ్ గవర్నెన్స్' ద్వారా ప్రకాశం బ్యారేజీ ప్రాంతాన్ని వర్చువల్ తనిఖీ చేసిన తరువాత విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు వైకాపా, భాజపాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. "అవినీతిపరుడైన గాలి జనార్ధన్ రెడ్డి అనుచరులకు కర్ణాటక ఎన్నికల్లో తొమ్మిది సీట్లిచ్చిన భాజపాది అవినీతిపై పోరాటం అంటే ఎవరైనా నమ్ముతారా? జగన్‌పై అవినీతి కేసుల్ని నాలుగేళ్లుగా నాన్చుడాన్ని ఏమనాలి? కేసులు బలహీనపర్చాలని చూడటం కుట్ర రాజకీయం కాదా? ఒకవైపు కడప స్టీల్‌ప్లాంట్ అసాధ్యమని మొన్న కోర్టులో కేంద్రం అఫిడవిట్ వేస్తే, నిన్న బుగ్గన దిల్లీ వెళ్లి రాంమాధవ్‌ను కలవడమేంటి? ఇదేనా రాష్ట్ర ప్రయోజనాల పట్ల మీకున్న చిత్తశుద్ధి? వైకాపా నేతలు ఇలాగే వ్యవహరిస్తే వారు రాష్ట్ర ద్రోహులుగా మిగిలిపోతారు" అని ఆయన మండిపడ్డారు. కేంద్రంపై తెదేపా చేస్తున్న పోరాటాన్ని నిర్వీర్యం చేయడానికే భాజపాతో వైకాపా అంటకాగుతోందన్నారు. తెదేపాను అప్రతిష్ఠ పాలుచేసేందుకు భాజపా, వైకాపా కుట్ర పన్నాయని, రాంమాధవ్‌తో బుగ్గన భేటీ దానిలో భాగమేనని ఎంపీలు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. బుగ్గన, ఆకుల కలిసే రాంమాధవ్ దగ్గరకు వెళ్లారనడానికి అన్ని ఆధారాలున్నాయని తెలిపారు.

"వైకాపా ఎమ్మెల్యే బుగ్గన ప్రజాపద్దుల సంఘంకు ఛైర్మన్‌గా నివేదికను సభాపతికి నివేదించాలి. దీనికి భిన్నంగా ఆయన కేంద్రానికి చెప్పడం ఏమిటి? బుగ్గన కోవర్టుగా వ్యవహరిస్తున్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ ఇష్టమొచ్చిన విధంగా హామీలను గుప్పిస్తున్నారు. 40 ఏళ్ల వారికి పింఛను ఇస్తామని చెబుతున్నారు. అందుకు ఏడాదికి 20వేల కోట్ల రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ఆర్థిక వ్యవస్థ గురించి పట్టించుకోకుండా, ఓ ప్రణాళిక లేకుండా జగన్ కక్కుర్తి రాజకీయాలకు పాల్పడుతున్నారు. లోక్‌సభ సభ్యులతో రాజీనామా చేయిస్తానని ఎప్పుడో ప్రకటించి ఇప్పుడు ముందుకొచ్చారు. ఎన్నికలకు రండి. తేలిపోతుంది. లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు వచ్చినా తెదేపా సిద్ధంగానే ఉంది. కడపలో ఉక్కు కర్మాగారం సొంత జిల్లాకు రాకపోతుంటే జగన్ ఏమీ మాట్లాడడంలేదు. వైజాగ్ రైల్వేజోన్ విషయంలోనూ కేంద్రం మొండి వైఖరిని అవలంబిస్తూనే ఉంది. కేసుల మాఫీ కోసం జగన్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. దిల్లీ రాజకీయాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. ఈ నెల 17వ తేదీన జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి హాజరవుతున్నా. రంజాన్ దృష్ట్యా సమావేశ తేదీని వాయిదా వేయాలని కోరినప్పటికీ జరుపుతున్నారు"అని చంద్రబాబు పేర్కొన్నారు.

పెత్తనం కాదు.. పనులు జరగాలి

రాష్ట్రంలో నీటిపారుదలకు సంబంధించిన అన్ని కాల్వలను వర్చువల్ విధానంలో ఆకస్మికంగా తనిఖీలను నిర్వహిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సచివాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్ స్టేట్ కమాండ్ కేంద్రం' నుంచి ప్రకాశం బ్యారేజజీ, పవిత్ర సంగమం (హారతి ఇచ్చే ప్రదేశం), దుర్గఘాట్ పరిసర ప్రాంతాలను డ్రోన్ కెమెరాల సాయంతో వర్చువల్ తనిఖీచేశారు. ప్రకాశం బ్యారేజీలో గుర్రపుడెక్క పేరుకుపోయి ఉండడం, నీరు నిల్వ ఉండడంపై చీఫ్ ఇంజినీరును ప్రశ్నించారు. పెత్తనం చేయడం కాదు పనులు జరగాలని మండిపడ్డారు.

పింఛన్ల పంపిణీ తీరుపై సమీక్ష!

ఈ కేంద్రంలోనే రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. వృద్ధులకు పింఛన్లు ఎంతో ముఖ్యమని, అవినీతికి అవకాశం ఇవ్వకూడదని అధికారులకు సూచించారు. కొన్నిచోట్ల వేలిముద్రలు పడని సమస్యలు వస్తున్నందున ముఖగుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) విధానం అమలు చేస్తామని పేర్కొన్నారు.



బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఆకుల సత్యనారాయణలు కలిసి దిల్లీలో రాంమాధవ్ ఇంటికి ఒకే కారులో వెళ్లారంటూ.. తెదేపా ఎంపీలు మీడియాకు విడుదల చేసిన డ్రైవర్ లాగ్‌బుక్‌లో నమోదైన వివరాలు

రాంమాధవ్‌తో బుగ్గన భేటీకి ఆధారాలున్నాయ్

- తెదేపా ఎంపీల ధ్వజం

ఈనాడు అమరావతి: వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణతో కలసి దిల్లీలో భాజపా నాయకుడు రాంమాధవ్ ఇంటికి వెళ్లి మంతనాలు జరిపారనడానికి తమ దగ్గర స్పష్టమైన ఆధారాలున్నాయని తెదేపా ఎంపీలు తెలిపారు. బుగ్గన ఈ నెల 13న ఏపీ భవన్‌లో దిగారని, ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్ హోదాలో ప్రభుత్వ వాహనాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. ఆయన ఆకుల సత్యనారాయణతో కలసి ఏపీ భవన్ నుంచి ఒకే కారులో వెళ్లిన దృశ్యాలన్నీ సీసీ కెమేరాలో రికార్డయ్యాయన్నారు. బుగ్గన 8132 నెంబరు వాహనాన్ని వినియోగించారని, ఆయన ఎక్కడెక్కడికి వెళ్లిందీ ఆ వాహనం డ్రైవర్ వద్ద ఉన్న లాగ్‌బుక్‌లో నమోదైందన్నారు. రాంమాధవ్ నివాసం ఉంటున్న 27 సౌత్ అవెన్యూకి ఆ వాహనంలో బుగ్గన వెళ్లినట్టుగా డ్రైవర్ లాగ్‌బుక్‌లో రాశారని, బుగ్గన సంతకం కూడా చేశారని తెలిపారు. బుగ్గన ఏపీ భవన్‌లో బస చేసినట్టుగా ఏపీ భవన్ రికార్డుల్లో నమోదైన వివరాల్ని, ఆయన ప్రయాణించిన కారు లాగ్ బుక్‌లోని పేజీల ఫొటోలను తెదేపా రాష్ట్ర మీడియా వ్యవహారాల సమన్వయకర్త దారపనేని నరేంద్ర పత్రికలకు విడుదల చేశారు. కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రం ప్రకటిస్తే... మరోపక్క వైకాపా నాయకులు వెళ్లి ఆ పార్టీ నేతలతో మంతనాలు సాగించడం వారి లాలూచీ రాజకీయాలకు అద్దం పడుతోందని ఎంపీలు కొనకళ్ల నారాయణ, కేశినేని నాని తదితరులు శుక్రవారం ఉండవల్లిలో సీఎం నివాసం వద్ద విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు. బుగ్గన, తాను కలసి షాంగ్రిలా హోటల్లో భోజనానికి మాత్రమే వెళ్లామని ఆకుల సత్యనారాయణ సవాల్ చేస్తున్నారు కదా? అన్న ప్రశ్నకు... "మా దగ్గర అన్ని ఆధారాలు, ఫొటోలు ఉన్నాయి. మేం కూడా ఏ ఛాలెంజ్‌కైనా సిద్ధం" అని కొనకళ్ల బదులిచ్చారు. "రాం మాధవ్ నివసిస్తున్న 27 సౌత్ అవెన్యూ... నేను ఉండే ఇంటికి మూడిళ్ల అవతలే ఉంటుంది. బుగ్గన, ఆకుల కలసి రాం మాధవ్ ఇంటికి వెళ్లారు. వైకాపా నాయకులు ఇక్కడేమో రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ప్రగల్భాలు పలుకుతారు. దిల్లీ వెళ్లి భాజపా నాయకులతో కుమ్మక్కవుతూ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు. బుగ్గన, రాంమాధవ్ సమావేశం జరిగినంత సేపు...భాజపా అధ్యక్షుడు అమిత్‌షా వారితో టచ్‌లో ఉన్నారని, సమావేశం వివరాలు తెలుసుకున్నారని ఎంపీ నిమ్మల కిష్టప్ప తెలిపారు.

సమావేశం అబద్ధం: బుగ్గన

హైదరాబాద్, న్యూస్‌టుడే: భాజపా నేతలతో తాను సమావేశమైనట్టు వస్తున్న వార్తలు అబద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. వైకాపా ప్రధాన కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత పనుల మీద తాను దిల్లీకి వెళ్లానన్నారు.

ఆధారాలుంటే నిరూపించండి

- ముఖ్యమంత్రి, మంత్రులకు ఆకుల సత్యనారాయణ సవాల్
- బుగ్గనతో కలసి హోటల్‌కే వెళ్లా..

ఈనాడు, దిల్లీ: భాజపా అగ్రనేతల వద్దకు వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని తీసుకెళ్లినట్లు ఆధారాలుంటే నిరూపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, అమర్‌నాథ్‌రెడ్డిలకు భాజపా ఎమ్మెల్యే సవాల్ విసిరారు. శుక్రవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. ఎవరు కుట్ర రాజకీయాలు చేస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు. సుపరిపాలన, సమర్థపాలన అందిస్తారని చంద్రబాబుకి అధికారమిస్తే దానికి విరుద్ధంగా పనిచేస్తున్నారని విమర్శించారు. పీఏసీలో భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సభ్యుడని కాగితాలు అవసరమైతే విష్ణుకుమార్‌రాజు తీసుకురాలేడా అని ప్రశ్నించారు. బుగ్గనతో కలిసి ఒకే కారులో ఏపీ భవన్ సమీప హోటల్‌లో భోజనానికి వెళ్లానని, దానికి రాజకీయాలు ఆపాదించడం సరికాదన్నారు. ఒకవేళ బుగ్గనతో సమావేశం కావాలనుకుంటే దిల్లీ వరకు రావాల్సిన అవసరం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే 21 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి ఎన్నికలు వెళ్లాలని ఆకుల సూచించారు. తాను దిల్లీకి వచ్చి రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణను తప్ప భాజపా అగ్రనేతలు ఎవరినీ కలవలేదని స్పష్టం చేశారు.

హోంగార్డులపై వరాల జల్లు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. "విభజన కష్టాలు ఇప్పటికీ వెంటాడుతున్నప్పటికీ...హోంగార్డుల కష్టాలు చూసిన తర్వాత ఆదుకోవాలని నిర్ణయించా. శాంతిభద్రతల పరిరక్షణలో మీ విధులు సక్రమంగా నిర్వర్తించండి. ప్రభుత్వానికి మీ సహకారం ఉండాలి. రాత్రింబవళ్లూ కష్టపడి పనిచేయాలి. ప్రజల్లో సంతృప్తి పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. హోంగార్డులకు మేలు చేకూర్చేలా తీసుకున్న నిర్ణయం పట్ల ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ పోలీసు అధికారులు, ఏపీ హోంగార్డుల సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం తెలిపారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉండవల్లిలోని ప్రజావేదికలో హోంగార్డు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వరాలివే

- మహిళా హోంగార్డులకు ప్రస్తుతం 15 రోజుల ప్రసూతి సెలవులు ఇస్తున్నారు. వీటిని మూడు నెలలకు పెంచారు.
- హోంగార్డులు ప్రమాదాల్లో మరణించినా, సహజంగా మృతిచెందినా రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తారు.
- ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఒక్కొక్కరికీ గరిష్ఠంగా రూ.2.50 లక్షల వరకూ వైద్యసాయం అందిస్తారు.
- హోంగార్డులు అకాల మరణం చెందితే కుటుంబానికి అంత్యక్రియల కోసం తక్షణ సాయం కింద రూ.10 వేలు చెల్లిస్తారు. (ప్రస్తుతం రూ. వెయ్యి ఇస్తున్నారు)
- ప్రభుత్వ గృహ నిర్మాణ పథకంలో లబ్ధి చేకూర్చే అంశాన్ని పరిశీలిస్తారు.
- ప్రస్తుతం హోంగార్డులకు తమిళనాడు, పాండిచ్చేరిలో నెలకు రూ.15 వేలు, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్‌ల్లో రూ.9 వేలు, కర్ణాటకలోని గ్రామీణ ప్రాంతాల్లో రూ.9 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లో రూ.14 వేలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆయా రాష్ట్రాల కంటే ఏపీలో ఎక్కువ వేతనం చెల్లిస్తున్నట్లయ్యింది.

కోడలే కొంప ముంచింది

గుంటూరు, న్యూస్‌టుడే: రాజధాని తాడేపల్లి ప్రాంతంలో సంచలనం సృష్టించిన చోరీ ఘటనలో బాధితురాలి కోడలే కీలక సూత్రధారి అని పోలీసులు గుర్తించారు. ఏడుగురు నిందితులను 24 గంటల్లోనే పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం గుంటూరులో విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను అర్బన్ ఎస్పీ విజయారావు వెల్లడించారు. పెనుమాకకు చెందిన మేకా కమల ఆమె కోడలు మేకా శివపార్వతిలు ఇంట్లో ఉండగా ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని 78 లక్షల నగదు, 26 సవర్ల బంగారు వస్తువులు చోరీ చేసినట్లు బాధితురాలు కమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ విజయారావుతో పాటు ఏఎస్పీలు వైటీ నాయుడు, తిరుపాల్, ముగ్గురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 8 మంది ఎస్సైలు సుమారు 50 మంది పోలీసులు కలిపి మొత్తం 10 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ఇంటికి సమీపంలోని సీసీ కెమేరాలు పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు నగదు బ్యాగ్‌ను తీసుకువెళుతున్న దృశ్యాలు లభించాయి. ఈ వ్యక్తులతోపాటు కోడలు శివపార్వతి తీరుపై అనుమానం వచ్చి పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. పొలం అమ్మిన డబ్బులను కోడలకు ఇవ్వకుండా అత్త ఆ మొత్తాన్ని తన వద్దే ఉంచుకొని పెత్తనం చేస్తుండటంతో ఆ నగదును కాజేయాలని శివపార్వతి పథకం రచించింది. ఆమె సోదరి వెనిగండ్లకు చెందిన కొండమడుగుల లక్ష్మీప్రసన్న, బంధువులైన జొన్నలగడ్డకు చెందిన వంగా సీతారామిరెడ్డి అతని కుమారుడు వంగా వెంకటరెడ్డి వారి స్నేహితులు గుంటూరు విద్యానగర్‌కు చెందిన చింతలచెరువు రాజు, నరసరావుపేట మండలం బరంపేటకు చెందిన చెంబేటి మల్లికార్జునరావు, లింగంగుంట్లకాలనీకి చెందిన తోట గోపీచంద్, సాయితో కలిసి ఆ నగదు దోచుకెళ్లడానికి కుట్రపన్నారు. గురువారం ఉదయం శివపార్వతి మిగిలిన వారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు సీతారామిరెడ్డి.. మల్లికార్జునరావు, సాయి, గోపీచంద్‌లను బైక్‌పై ఇంటికి పంపించి వృద్ధురాలు కమలమ్మపై దాడిచేసి నగదు దోచుకెళ్లారు. కోడలు పెన్నుతో గాయపరుచుకుని దొంగలు దాడిచేశారని నమ్మించే ప్రయత్నం చేసిందని ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రూ.55 లక్షల నగదు, 210 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

సోదరి లక్ష్మీప్రసన్నతో శివపార్వతి

సమష్టిగా నిరసన!

(మొదటి పేజీ తరువాయి)

వస్తుందని, మన వాదన వినిపించాక ముఖ్యమంత్రి బయటకు వచ్చేస్తే బాగుంటుందని కొందరు ఎంపీలు చెప్పారు. మనతో కలిసి వచ్చే ముఖ్యమంత్రులంతా మాట్లాడిన తర్వాత... ప్రధాని ముగింపు ఉపన్యాసం చేయడానికి ముందుగా అందరూ బయటకు వచ్చేస్తే బాగుంటుందని మరికొందరు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ సారి అజెండా క్లుప్తంగా ఉందని, గత సమావేశంలో చర్చించిన స్వచ్ఛభారత్, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి అంశాలు ఈసారి లేవన్నారు.

పొత్తుతో సాధించలేనిది పోరాటంతో సాధించాలి

కేంద్రంపై ఎంపీలు చేయాల్సిన పోరాట కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. కడప ఉక్కు కర్మాగారం కోసం ఎంపీ సీఎం రమేష్ చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని, ఎంపీలంతా కడప వెళ్లి సంఘీభావం చెప్పాలని చంద్రబాబు ఆదేశించారు. సీఎం రమేష్ ఆది, సోమవారాల్లో దీక్ష ప్రారంభిస్తారని, ఎంపీలు బుధవారం కడప వెళ్లి నిరసనలో పాల్గొనాలని నిర్ణయించారు. ఎంపీలు ఎక్కడ నిరసన చేసినా స్థానిక అంశంతో పాటు, పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదా గురించి గట్టిగా మాట్లాడాలని సమావేశంలో నిర్ణయించారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వకపోవడంపై అనంతపురంలో ఎంపీలు నిరసన తెలిపే రోజునే, మిగతా ఆరు వెనుకబడిన జిల్లాల్లోను నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. "పోరాటంలో ప్రతి నిమిషం అమూల్యం. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. పొత్తుతో సాధించలేనిది పోరాటంతో సాధించాలి. కడప తర్వాత విశాఖ రైల్వే జోన్‌పై ఆందోళన ఉద్ధృతం చేయాలి. చట్టంలోని 18 అంశాలు, కేంద్రం ఇచ్చిన ఆరు హామీలు నెరవేరేదాకా పోరాడాలి. ఒక ప్రజా ఉద్యమంగా ఎంపీలు దీన్ని ముందుకు తీసుకెళ్లాలి. ఈ ఉద్యమంలో ప్రతి పౌరుడు సైనికుడే..." అని పేర్కొన్నారు. "గతంలో ఎన్టీఆర్‌ను గద్దె దించినప్పుడు జరిగిన ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకోండి. అప్పట్లో కేరళలో నంబూద్రిపాద్‌ను, కశ్మీర్‌లో షేక్ అబ్దుల్లాను దిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు అనేక ఇబ్బందులు పెట్టారు. ఎన్టీఆర్‌తో పెట్టుకుని ఇందిరాగాంధీ చేతులు కాల్చుకున్నారు. కుట్ర రాజకీయాల్ని ఎదుర్కోవడం తెదేపాకి కొత్త కాదు. ఏడాది బిడ్డగా ఉన్నప్పుడే ఇందిరాగాంధీ కుట్రల్ని సమర్థంగా ఎదుర్కొన్నాం. భాజపా, వైకాపా కుట్రల్నీ అదే స్ఫూర్తితో అధిగమిస్తాం..." అని చంద్రబాబు వివరించారు. ముఖ్యమంత్రి రాసిన లేఖకు స్పందించిన నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్ శుక్రవారం చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడుతూ ఈ నెల 16న నిర్వహించాలనుకున్న సమావేశాన్ని.. రంజాన్ నేపథ్యంలోనే 17కి వాయిదా వేశామని, మళ్లీ వాయిదా వేయడం కష్టమని పేర్కొన్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో పాల్గొనేందుకు చంద్రబాబు శనివారం సాయంత్రం 4 గంటలకు బయల్దేరి దిల్లీ వెళ్లనున్నారు. తనతో పాటు దిల్లీకి రావాలని ముఖ్యమంత్రి సూచించడంతో తెదేపా ఎంపీలందరూ కూడా పయనమవుతున్నారు.

పదోతరగతిలో అంతర్గత మార్కుల తొలగింపు?

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. సీసీఈ విధానాన్ని ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు అమలు చేస్తున్నారు. అందువల్ల ఒక్క పదోతరగతికి మాత్రమే తొలగించి... మిగతా వాటిలో కొనసాగించడం వల్ల ప్రయోజనం ఏమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది 8,9 తరగతులకు ఎస్ఏ-1ను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించారు. ఇందుకు రూ.23 కోట్లు వరకు ఖర్చు చేశారు. ఈ ఏడాది 6 నుంచి 9వ తరగతి వరకు ఈ విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తామని గతంలోనే విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఆరోపణలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేసినా ఇంతవరకు నిర్ణయం వెల్లడించలేదు. పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తారో ప్రకటించకపోతే విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలని పలువురు ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

పేరు సాంస్కృతికం.. చేయించేది వ్యభిచారం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొనేవాడు. వీసా మంజూరయిన తర్వాత తన డబ్బుతోనే విమాన టిక్కెట్లు, హోటల్ గదులు బుక్ చేసేవాడు. priceline.com వెబ్‌సైట్ ద్వారా విమాన టిక్కెట్లు బుక్ చేసినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ఏజెంటు దర్యాప్తులో తేలింది. 2016 నవంబరు 8వ తేదీ నుంచి 2017 నవంబరు 29వ తేదీ మధ్య 76 విమాన టిక్కెట్లు కొనుగోలు చేసినట్లు తేలిందని దర్యాప్తు అధికారి అభియోగపత్రంలో పేర్కొన్నారు. తన ఇంటి చిరునామాతో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఖాతా ద్వారానే ఈ టిక్కెట్లు కొన్నట్లు, అందులోని చరవాణి నెంబరు కూడా కిషన్‌దే (చివరి నాలుగు సంఖ్యలు 6887) అని, మెయిల్ ఐడీ (mkishan3456@gmail.com) కూడా ఆయనదేనని గుర్తించారు. అలానే 2016 నవంబరు 9 నుంచి 2018 జనవరి 3వ తేదీ మధ్యలో అమెరికాలో 42 హోటళ్లలో గదులను కూడా ఇదే ఖాతా ద్వారా బుక్ చేసినట్లు వెల్లడయింది. వాటి కోసం మొత్తంగా ఏడాదిలో రూ.కోటి వరకు ఖర్చు చేసినట్టు తేలింది. ''అమెరికాకు వస్తున్న నటీమణులతో సంప్రదింపులకు వాడిన చరవాణి నెంబర్లు, ఈమెయిల్ చిరునామాల్లోనూ ఇవే ఉన్నాయి. దీన్నిబట్టి కిషన్ మోదుగుముడి అయన భార్య చంద్రకళ ఇద్దరూ తెలుగు సినీ పరిశ్రమ నుంచి నటులను అమెరికా రప్పించి, వారి ఫొటోలు పంపిణీ చేసి, వారితో వ్యభిచారం నిర్వహించినట్లు అర్థమవుతుందని' దర్యాప్తు అధికారి అభియోగపత్రంలో వివరించారు.

అడ్డగోలుగా తెలుగు సంఘాల పేర్లు

మోదుగుముడి దంపతులు ఇద్దరూ వ్యభిచారం కోసం నటీమణులను రప్పించే క్రమంలో వీసాలు ఇప్పించేందుకు రకరకాల తెలుగు సంఘాల పేర్లు వాడుకున్నారు. ఇందుకోసం దొంగ పత్రాలను సృష్టించారు. ఉదాహరణకు అభియోగపత్రంలో పేర్కొనట్లుగా బాధితురాలు 'ఎ' కోసం.. 'ఆమె ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) 2017 నవంబరు 25వ తేదీన ఇల్లినాయిస్‌లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు' లేఖ తయారు చేసి వీసా వచ్చేలా చూశారు. దర్యాప్తు అధికారి నాట్స్ ప్రతినిధులను సంప్రదించినప్పుడు ఆ తేదీలో తాము ఎలాంటి సమావేశం నిర్వహించలేదని, సదరు నటీమణి ఎవరో తమకు తెలియదని వారు వెల్లడించారు. అలానే అక్కడి అనేక తెలుగు సంఘాల పేర్లనూ, వాటి అధికారిక ఉత్తర్వు ప్రతి(లెటర్ హెడ్)లు కూడా ఫోర్జరీ చేసి కిషన్ వాడుకున్నట్లు దర్యాప్తులో తేలింది.

తర్జుమాతో చెల్లింపులు వెలుగులోకి

దర్యాప్తులో భాగంగా కిషన్ ఇంట్లో తనిఖీలు నిర్వహించిన పోలీసు అధికారులు ఐదు డైరీలు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో విటులు ఎప్పుడెప్పుడు? ఎంత మొత్తం చెల్లించారు? అన్న వివరాలు ఉన్నాయి. 'అవన్నీ తెలుగులో ఉండటంతో వాటిని తెలుగు-ఆంగ్లంలో ప్రావీణ్యం ఉన్న అధికారులతో తర్జుమా చేయించినట్లు అభియోగపత్రంలో' దర్యాప్తు సంస్థ స్పష్టం చేసింది.

పకడ్బందీ దర్యాప్తు

సంచలనం సృష్టిస్తున్న ఈ కేసు దర్యాప్తు అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. ఉదాహరణకు అమెరికా వచ్చిన నటీమణులతో మాట్లాడిన చరవాణి నంబర్లు, వారితో సంప్రదింపులు జరిపేందుకు వాడిన ఈమెయిల్ చిరునామా మోదుగుముడివేనని ఆయా సంస్థల నుంచి (సర్వీస్ ప్రొవైడర్స్) అధికారిక లేఖ తెప్పించారు. విమాన టిక్కెట్లు, హోటల్ గదులు బుక్ చేయడానికి ఇచ్చిన చిరునామాలోనూ వీటినే వాడినట్లు గుర్తించారు. అలాగే బాధితులను(నటీమణులు) ఎ.బి.సి.డి.ఇ.లుగా పేర్కొన్న దర్యాప్తు అధికారి..వారు వాడిన చరవాణి నెంబర్లనూ సేకరించారు. సంకేతాల ఆధారంగా ఆ నంబరు వినియోగించే చరవాణి ఏరోజు? ఏ సమయంలో షికాగోలోని మోదుగుముడి ఇంట్లో ఉన్నాయో కూడా గుర్తించారు. నటీమణులు, విటులతో సంప్రదింపులు జరిపేందుకు ఈ నెంబర్లు, మెయిల్ ఐడీలే వాడినట్లు నిర్ధారించడంతోపాటు.. ఇందుకోసం ఉపయోగించిన అంతర్జాల సదుపాయం కూడా కిషన్ పేరుతోనే ఉన్నట్లు తెలుసుకోగలిగారు. కిషన్, అతని భార్య చంద్రకళల చరవాణుల నుంచి నటీమణులు, విటులతో జరిపిన చాటింగ్ తాలూకూ పూర్తి వివరాలను కూడా సేకరించారు. 'అందులో నటీమణుల ఫొటోలు విటులకు పంపడం, వారికి ఎంత చెల్లించాల్సి ఉంటుందో చెప్పడం వంటివి కూడా ఉన్నాయి. దీన్నిబట్టి వ్యభిచారంలో భాగంగానే ఈ సంభాషణ జరిగినట్లు నిర్ధారించడానికి అవకాశం ఉంటుందని' దర్యాప్తు అధికారుల అభిప్రాయం.

'యదవ'గా నామకరణం?

కిషన్ జిమెయిల్ వివరాలను దర్యాప్తు అధికారి విశ్లేషించినప్పుడు ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. కిషన్‌కు..ఒక విటుడికి మధ్య జరిగిన సంభాషణ ఆధారంగా సదరు విటుడి ఫోన్ వివరాలను దర్యాప్తు సంస్థ సేకరించింది. 'జి'గా పేర్కొన్న ఆ విటుడు తన చరవాణిలో.. కిషన్ పేరును 'షికాగో యదవ'గా నమోదు చేసి ఉండటం గమనార్హం.

ఏబీసీడీఈ ఎవరు?

ఇదిలా ఉంటే అమెరికా అధికారి దాఖలు చేసిన అభియోగపత్రంలో వ్యభిచారం కోసం రప్పించిన నటీమణుల పేర్లు గోప్యంగా ఉంచారు. వారి పేర్లకు బదులుగా బాధితురాలు ఎ, బాధితురాలు బి ఇలా పేర్కొన్నారు. ఈ ఏబీసీడీఈలు ఎవరన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తెలుగు, కన్నడ సినిమాల్లో నటించి ఒకప్పుడు కాస్త గుర్తింపు ఉన్న నటీమణితోపాటు.. తెలుగులో వరుస సినిమాలు చేసినప్పటికీ పెద్దగా విజయవంతం కాని నటీమణి ఉన్నట్లు భావిస్తున్నారు.

విదేశీ ఆహ్వానం అందితే సమాచారం ఇవ్వండి: మా

అమెరికాలో తెలుగు సినిమా తారలతో వ్యభిచారం నిర్వహించారన్న అభియోగంపై మోదుగుముడి దంపతులను అమెరికా పోలీసులు అరెస్టు చేయడం తెలుగు చిత్ర పరిశ్రమని ఉలికిపాటుకు గురిచేసింది. అక్కడ వ్యభిచార దందా నడిపించిన మోదుగుమూడి కిషన్‌కి చిత్ర పరిశ్రమతో సంబంధం లేదని, కిషన్ నిర్మాతే కాదని సినిమా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అతని వలలో పడి కొద్దిమంది కథానాయికలు ఇబ్బందులు పడ్డారన్న దిశగానూ ఇప్పుడు చర్చ నడుస్తోంది. ఈ విషయం వెలుగులోకి రాగానే మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) స్పందించింది. ఇకపైన పరిశ్రమకి చెందిన వ్యక్తులకు విదేశాల నుంచి ఆహ్వానం అందితే ఆ విషయాన్ని 'మా' దృష్టికి తీసుకురావాలని నటీనటులకి సందేశాలు పంపుతున్నట్టు 'మా' అధ్యక్షుడు శివాజీరాజా 'ఈనాడు'తో తెలిపారు. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు జెమినీ కిరణ్ మాట్లాడుతూ.. 'ఇది తెలుగు చిత్ర పరిశ్రమతో సంబంధం లేని వ్యక్తులు చేసిన పని. పరిశ్రమ తరపున వెళ్లేవాళ్లు మాత్రం 'మా'కో, చలన చిత్ర వాణిజ్య మండలి దృష్టికో తీసుకువస్తే మేలు' అని చెప్పారు. చలన చిత్ర వాణిజ్య మండలి ప్రధాన కార్యదర్శి ముత్యాల రాందాస్, పరిశ్రమ అధికార ప్రతినిధి తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. ''విదేశాలకు వెళ్లే సినిమా వ్యక్తులందరిపైనా పరిశ్రమ నియంత్రణ కష్టతరమే. పరిశ్రమ తరపున వెళ్లే వాళ్లకు మాత్రం తగిన రక్షణ కల్పించడానికి సాధ్యమవుతుంది. మధ్యవర్తుల ద్వారా వెళ్లడం మాత్రం శ్రేయస్కరం కాదు' అని తెలిపారు.

గ్రహం అనుగ్రహం

16-6-2018 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
తదియ: సా. 6-55 తదుపరి చవితి
పునర్వసు నక్షత్రం: మ. 12-50 తదుపరి పుష్యమి
అమృత ఘడియలు: ఉ. 10-36 నుంచి 12-05 వరకు తిరిగి తె. 5-12 నుంచి
వర్జ్యం: రా. 8-16 నుంచి 9-46 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-29 నుంచి 7-13 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5-29; సూర్యాస్తమయం: సా.6-32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	44.0	28.0
ఒంగోలు	41.9	31.4
రాజమహేంద్రవరం	41.5	27.5
గుంటూరు	41.1	28.8
నెల్లూరు	41.0	30.0
విజయవాడ	40.2	27.9
శ్రీకాకుళం	40.0	30.0
కరీంనగర్	40.0	25.0
సూర్యాపేట	39.0	28.0
తిరుపతి	39.0	28.0
కడప	39.0	28.0
అనంతపురం	38.8	28.6
నరసాపురం	38.3	28.6
విశాఖపట్నం	38.0	28.6
తాడేపల్లిగూడెం	38.0	28.5
హైదరాబాద్	37.7	26.1
కర్నూలు	36.0	26.4

DSC-SGT, SA బ్యాచ్ ప్రా॥: 20-06-18
SGT స్పెషల్ ఎగ్జామ్ బ్యాచ్ కలదు
టెట్‌లో 130పై మార్కులు వచ్చిన వారికి ఫీజు రాయితీ
టీచర్స్ అకాడమీ కనిగిరి, ప్రకాశం జిల్లా 98486 61318

PAVAN KUMAR'S IAS
Our Ranks 3 7 12 13 Civils, Groups Admissions Open
Ph: 9966961027

2018 TETలో 142, 140, 140, 140 మార్కులతో ప్రభంజనం
2014 DSCలో స్టేట్ 2, 3, 4, 5 ర్యాంకులు 7 జిల్లా ఫస్ట్‌లు
అవనిగడ్డ విద్యానికేతన్ DSC కృష్ణాజిల్లా
SGT & SA (Mat, Soc, Bio, Eng) బ్యాచ్ ప్రారంభం : 22-06-2018
94401 04963, 99499 33838

వాల్మీకి DSC (తెలుగు పండిట్స్ అకాడమి) L.P. & SA (తెలుగు) 40 - 45 రోజులలో సిలబస్ పూర్తి
వెంకటరావు, శ్రీనివాసరావుల అధ్వర్యంలో
తేది : 20/6/18 ఉ॥ 9 గం॥ల నుండి తరగతులు ప్రారంభం.
డా॥ మోసెస్ (Hyd) గారిచే సైకాలజీ & PIE లపై
స్థలం : కుట్టి కాలేజి, V.R.C. సెంటర్, నెల్లూరు.
Cell: 62812 29244, 63033 41854

DSC SGT, TPT, PET SA (Maths/Phy.Sci./Bio/Social)
బ్యాచ్‌లు ప్రారంభం : 22-6-18@9AM
TS గురుకుల్ & TRT (DSC) ఫలితాలలో బాసర ప్రభంజనం
అదే ఫ్యాకల్టీచే విజయవాడలో AP DSC బ్యాచ్‌లు ప్రారంభమగును.
PGT Maths State 1st Rank: S.Santhosh Kumar (214/300)
PGT Phy.Sci State 1st Rank : R. Anil Kumar (234/300)
TRT Bio.Sci. State 1st Rank : K. Yadagiri (82.087)
TRT Telugu State 1st Rank : K. Rajkumar (75.117)
PGT Telugu State 2nd Rank : Ravinder (248/300)
PGT Social State 1st Rank (Women) : Zobeda Begum (212/300)
బాసర ఇన్‌స్టిట్యూట్ గవర్నర్‌పేట, విజయవాడ 9030140123 8374022333

VISION IAS
ప్రత్యేకించి ఢిల్లీ ఫాకల్టీతో సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ & ఇంటర్వ్యూ 2019
Admissions Open Limited Seats
TOPPER'S talk on 17th June @ 5pm
Anthropology by Mrs. Sosin
టిఎస్‌పిఎస్‌సి/ఎపిపిఎస్‌సి గ్రూప్ I, II Admissions Open Limited Seats
అశోక్‌నగర్, హైదరాబాద్.
9000104133, 9515487979

2016 AP DSC - SGT, TPT, SA-All సబ్జెక్ట్సులలో కలిపి
స్టేట్ 1st, 2nd, 3rd, 4th, 5th, 6th, 7th, 8th, 9th, 10th ర్యాంకులే గాక యిచ్చిన టీచర్స్ పోస్టులలో 70% పైగా పోస్టులు సాధించిన
కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-MAT, SOC, TEL, BIO
కొత్త బ్యాచ్ ప్రారంభం : 22-6-2018 సా॥ 4 గం॥లకు
8106268482, 9885272474

ప్రధాని, రాజ్‌నాథ్‌లతో గవర్నర్ భేటీ

ఈనాడు, దిల్లీ: ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లతో గవర్నర్ నరసింహన్ శుక్రవారం దిల్లీలో భేటీ అయ్యారు. తెలుగు రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిణామాలు, శాంతి భద్రతలపై ప్రధాని, హోంమంత్రికి వివరించారు. అనంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రితో భేటీ సాధారణమేనని, ఇటీవల జరిగిన గవర్నర్ల సదస్సుపై చర్చించామని తెలిపారు. ప్రధాని మోదీతో సుమారు 30 నిమిషాలు గవర్నర్ భేటీ అయ్యారు. ఈ భేటీపై మాట్లాడడానికి నరసింహన్ నిరాకరించారు. శుక్రవారం రాత్రి తెలంగాణ భవన్‌లో బస చేసి శనివారం ఉదయం ఆయన హైదరాబాద్ వెళ్లనున్నారు.

కిలో రూపాయికే ముడిబియ్యం పంపిణీ

- రెండోవిడత మరికొన్ని మండలాల్లో చౌకదుకాణాల ఎంపిక
- పేదలు చక్కెరవ్యాధి బారిన పడకుండా ఉండాలన్నదే లక్ష్యం

ఈనాడు అమరావతి: ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా పేదలకు బలవర్ధక ఆహారం అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్తృతం చేయనుంది. ఈ నెల మొదటి వారం నుంచి ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన చౌకదుకాణాల ద్వారా ఒక్క రూపాయికే ఒక కిలో ముడిబియ్యాన్ని పంపిణీ చేస్తోంది. దీని కోసం మూడు జిల్లాల పరిధిలో మొత్తం 27 మండలాలను ఎంపిక చేసింది. దీనిని సమగ్రంగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రెండోవిడతలో మరిన్ని ప్రాంతాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనుంది. ఇటీవల వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్వహించిన సర్వేలో పోషకాహారలోపం వల్ల పలువురు చక్కెర వ్యాధికి గురవుతున్నట్లు గుర్తించింది. దీనికి కొంత మేర అడ్డుకట్ట వేసేందుకు ఎంపిక చేసిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ముడిబియ్యాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ నివేదిక ఆధారంగా తెలుపురంగు కార్డుదారులకు పోషక విలువలు కలిగిన ముడిబియ్యాన్ని (బ్రౌన్‌రైస్) ఇస్తోంది. సాధారణ బియ్యం కోటా స్థానంలో వీటిని తీసుకునే వెసులుబాటు కల్పించింది. కృష్ణా జిల్లా గూడూరు, పెడన, మచిలీపట్నం మండలాల్లో... ప్రకాశం జిల్లా పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు... పశ్చిమ గోదావరిలో 21 మండలాల్లో అందిస్తోంది. సర్వేలో వెల్లడైన అంశాలను ప్రాతిపదికగా తీసుకుని తాజాగా చక్కెర బాధితులు ఎక్కువగా ఉన్న ఇతర జిల్లాల్లోని మరికొన్ని మండలాల్లోనూ ఇవ్వడానికి పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. రెండోవిడతలో బంటుమిల్లి (కృష్ణా), కావలి (నెల్లూరు), తిరుపతి, చిత్తూరు (చిత్తూరు), రాజమహేంద్రవరం (తూర్పుగోదావరి), గుంటూరు, బాపట్ల, రేపల్లె (గుంటూరు), విజయనగరం, కడప జిల్లా ప్రొద్దుటూరును ఎంపిక చేసింది. త్వరలో అక్కడ కూడా పంపిణీ చేయనుంది. ఈ ముడిబియ్యంలో తౌడు శాతం ఎక్కువగా ఉంటున్నందున ఎక్కువ రోజులు నిల్వ చేయకూడదని, నెల రోజుల్లోగానే వినియోగించాలని సంబంధిత శాఖ అధికారులు సూచిస్తున్నారు.

పిల్లలు, మహిళలకు కూడా... పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపాన్ని సరిదిద్దేందుకు... వారికి అందించే ఆహారంలో అదనపు పోషక విలువలను జత చేసేందుకు మరో కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు ఇచ్చే ఆహారంలో పోషకవిలువలు కలిగిన (ఫోర్టిఫైడ్) బియ్యాన్ని కలపనుంది. పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి నిర్ణయించింది. ఈ బియ్యాన్ని టాటా ట్రస్టు అందించనుందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రతీ క్వింటాలో ఈ బియ్యాన్ని (ఫోర్టిఫైడ్) 10కిలోలు కలిపి... తిరిగి సంచుల్లో నింపి సరఫరా చేస్తారు.

ఆర్‌ఎంపీ వైద్యుడి అఘాయిత్యం

కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చిన గర్భిణిపై అత్యాచారం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: కడుపు నొప్పితో వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన 7 నెలల గర్భిణిపై ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు అత్యాచారం చేశాడు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధ రాత్రి 1 గంట సమయంలో కడుపు నొప్పి రావడంతో బాధిత మహిళ.. భర్తను తీసుకుని సమీపంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు నిర్వహిస్తున్న ఆసుపత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యుడు మందులు తీసుకురావాలంటూ భర్తను దుకాణానికి పంపి గర్భిణిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో.. ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేంద్రం స్పష్టత ఇవ్వకుంటే ఉద్యమమే

- 24 నుంచి ఎంపీ సీఎం రమేష్ ఆమరణ దీక్ష
- 29 వరకు ఆందోళన కార్యక్రమాలు
- కడపలో నిర్వహించిన సమావేశాల్లో పార్టీల నిర్ణయం

తెదేపా నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదినారాయణరెడ్డి, వేదికపై రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, కేంద్ర మాజీ మంత్రి సాయిప్రతాప్ తదితరులు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లాలోని వివిధ పార్టీలు ఉద్యమాలకు శ్రీకారం చుట్టాయి. శుక్రవారం స్థానిక హరిత హోటల్‌లో తెదేపా ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో మంత్రి ఆదినారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, ప్రభుత్వ విప్‌లు మేడా మల్లికార్జునరెడ్డి, రామసుబ్బారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సాయిప్రతాప్, ఆర్పీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, పలు విద్యార్థి, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉక్కు కర్మాగారం సాధించే వరకు నిత్యం పోరాటాలు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఆమరణ నిరాహారదీక్ష చేయనున్న ఎంపీ సీఎం రమేష్‌కు తోడుగా దీక్షలు చేయాలని తీర్మానించారు. ఈ నెల 24 లోగా ప్రధాని కార్యాలయం నుంచి స్పష్టమైన సమాచారం రాకపోతే.. ఆ రోజు నుంచే ఆమరణ నిరాహారదీక్షకు వెళ్లాలని సమావేశం నిర్ణయించింది. దశల వారీగా ఉద్యమం తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వైకాపా, వామపక్షాలు, జనసేన తదితర పార్టీలన్నీ కలిసి ఉక్కు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించాయి. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, వైకాపా నేతలు ఆకేపాటి అమరనాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, కాంగ్రెస్ నేత నజీర్‌అహ్మద్, జనసేన చలపతి, బీఎస్పీ గురప్ప, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు విస్తృత ప్రచారం చేపట్టి 21 నుంచి 23వ తేదీ వరకు సంతకాల సేకరణ, అదే సమయంలో 21వ తేదీన విజయవాడలో అఖిలపక్షాలు, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులతో అఖిలపక్ష సమావేశం, 24వ తేదీ నుంచి 26 వరకు అన్ని నియోజకవర్గాల్లో నిరాహార దీక్షలు, 27న జాతీయ రహదారుల దిగ్బంధం, 29వ తేదీన కడప జిల్లా బంద్ చేపట్టాలని నిర్ణయించారు. కాగా రాజకీయ పార్టీలు రెండుగా విడిపోయి అఖిలపక్ష సమావేశాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

గ్రామాల్లో పట్టణ తరహా ఇళ్లు

ఉత్తర్వులు జారీ

ఈనాడు డిజిటల్, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ తరహా ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. గ్రామాల్లో స్థల సమస్య కారణంగా చాలా మంది ఇంటి నిర్మాణాలు చేపట్టలేక పోతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం ఎన్టీఆర్ ప్రత్యేక గ్రామీణ పథకం కింద జీ+2 విధానంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టుగా చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం పాలర్లపల్లె, కృష్ణా జిల్లాలోని కురుమద్దాలి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి ఇచ్చింది. పాలర్లపల్లె గ్రామంలో 2 వేల ఇళ్లు, కురుమద్దాలి గ్రామంలో 96 ఇళ్లను ఈ విధానంలో నిర్మించనున్నారు. యూనిట్ విలువ రూ.5 లక్షలుగా నిర్ధరించింది. ఇందులో ప్రభుత్వ రాయితీ రూ.3 లక్షలు, బ్యాంకు రుణం రూ..1.50 లక్షలు, అదనపు వసతుల ఏర్పాటు కోసం ప్రభుత్వం మరో రూ. 50 వేలు అందించనుంది. ఇందుకోసం రూ.104 కోట్లు వెచ్చించనుంది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మత్స్యకారులకు డీజిల్ రాయితీ పెంచుతాం: యనమల

ఈనాడు డిజిటల్, అమరావతి: మత్స్యకారులకు డీజిల్‌పై ఇచ్చే రాయితీని రూ.6.03 నుంచి రూ.12.93కు పెంచుతామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు హామీ ఇచ్చారు. తాజా నిర్ణయంతో రూ.20 కోట్ల భారం పెరుగుతున్నా, రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో 9 జిల్లాలకు చెందిన మత్స్యకార యూనియన్ నాయకులు శుక్రవారం విజయవాడలో మంత్రి యనమలను కలిశారు. మెకనైజ్డ్ షిప్పింగ్, మోటార్ బోట్లకు ఇచ్చే డీజిల్ రాయితీని పెంచాలని వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు రూ. వెయ్యి పింఛను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అప్కాబ్ ఛైర్మన్ పోలిశెట్టి గిరి, మత్స్యకార యూనియన్ నాయకులు పి.అప్పారావు, గిరి, సత్యనారాయణమూర్తి, రంగారావు ఉన్నారు.

క్షురకుల సమస్యలు పరిష్కరిస్తాం: రాష్ట్రంలోని దేవాలయాల్లో పనిచేస్తున్న క్షురకుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు హామీ ఇచ్చారు. శుక్రవారం విజయవాడలో రాష్ట్ర నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు మంత్రి యనమలను కలిసి తమ డిమాండ్లను తెలియచేశారు.

ఈనాడు

జాతీయ అజెండాగా జలసంరక్షణ

చరిత్రలో మునుపెన్నడూ ఎరుగనంతటి దారుణ జల సంక్షోభాన్ని భారత్ ఎదుర్కొంటున్నదంటూ 'నీతి ఆయోగ్' తాజాగా వెల్లడించిన గణాంక వివరాలు, కోట్లాది దాహార్తుల దుర్భర వేదనలకు దర్పణం పడుతున్నాయి. దేశంలో నేడు 60కోట్లమంది తీవ్ర నీటియెద్దడితో సతమతమవుతున్నారంటున్న నివేదిక, 2030 సంవత్సరంనాటికి అందుబాటులోని నీటికంటే గిరాకీ రెండింతలు అధికంగా ఉండనుందని భయానక దృశ్యం ఆవిష్కరిస్తోంది. తద్వారా కోట్లాది బతుకులు ఎండిపోయి స్థూల దేశీయోత్పత్తిలో ఆరుశాతం మేర నష్టం దాపురిస్తుందన్న 'నీతి ఆయోగ్' అంచనా భీతిల్లజేస్తోంది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంత ప్రజానీకంలో ఏకాయెకి 84 శాతం, కుళాయి నీటి సరఫరాలకు నోచుకోవడం లేదంటున్న అధ్యయనం- 70 శాతం జలాలు కలుషితమవుతున్నాయని, పర్యవసానంగా ఏటా రెండు లక్షలమంది ప్రాణాలు కోల్పోతున్నారని కఠోరసత్యాల్ని గుదిగుచ్చింది. భూగర్భ జల నిర్వహణ, నీటి వనరుల పరిరక్షణ, తాగునీటి సరఫరా తదితరాంశాల ప్రాతిపదికన మెరుగైన ర్యాంకులు సాధించిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సైతం క్షేత్రస్థాయి పరిస్థితులు సంతృప్తికరంగా లేవు. ఆంధ్రప్రదేశ్‌లోని మూడోవంతు గ్రామీణ ఆవాసాలకు పూర్తిస్థాయి సరఫరాలు లేవు; పట్టణ మురుగు నీటిశుద్ధి 26 శాతమే జరుగుతోంది. తెలంగాణ గ్రామాల్లో 55 శాతం ఆవాసాలకు నీరు అందుతున్నా నాణ్యత కరవేనంటున్న 'నీతి ఆయోగ్'- ఝార్ఖండ్, హరియాణా, యూపీ, బిహార్, ఒడిశాల పనితీరు అధమమని నిర్ధారించింది. జల యాజమాన్య సూచీ పరంగా రాష్ట్రాల మధ్య వైరుధ్యాల తీవ్రత తక్షణ దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను ప్రస్ఫుటీకరిస్తోంది. 122 దేశాల జలనాణ్యత సూచీలో భారత్ నూట ఇరవయ్యో స్థానానికి పరిమితం కావడం- సుజలాలతో సుఫలాలు సాకారమయ్యేలా అందరొక్కట్టై ఉద్యమించాల్సిన చారిత్రక అవసరాన్ని చాటుతోంది.

దేశదేశాల్లో స్థితిగతుల్ని లోతుగా పరిశీలించిన 'వాటర్ ఎయిడ్' సంస్థ, ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేని అభాగ్యులు అత్యధికంగా ఇండియాలోనే పోగుపడ్డట్లు లోగడ నిగ్గుతేల్చింది. ప్రమాద హెచ్చరికల్ని పట్టించుకోకపోతే వాటిల్లే దుష్పరిణామాలేమిటో ప్రపంచ వనరుల సంస్థ (డబ్ల్యూఆర్ఐ) రెండు నెలల క్రితం క్రోడీకరించింది. విచ్చలవిడిగా జలాల్ని వాడేస్తున్న కారణంగా భూగర్భ నిల్వలు అడుగంటి మున్ముందు జలాశయాలు బోసిపోయినాయని, కుళాయిల్లో నీటిరాని ఉద్రిక్త దృశ్యాల సాయంతో భీతావహ పరిస్థితిని కళ్లకు కట్టింది. ఉన్న నీటి వనరులూ వ్యర్థాలతో కలుషితమవుతున్నాయని హెచ్చరించింది. ఎడాపెడా తోడేస్తున్న కారణంగా ఇప్పటికే దేశవ్యాప్తంగా 160 జిల్లాల్లో భూగర్భజలాలు ఉప్పునీటిమయమైపోయాయి. 230 జిల్లాల్లో ఫ్లోరైడ్ ఉత్పాతం అసంఖ్యాక జీవితాల్ని కుంగదీస్తోంది. నీటిమట్టాలు క్షీణించే కొద్దీ సీసం, ఆర్సెనిక్, నైట్రేట్ల వంటివి జనారోగ్యాన్ని గుల్లబారుస్తున్నాయి. ఉపరితల నీటివనరులు సురక్షితంగా ఉండేలా కాచుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండళ్లు లంచాల మత్తులో జోగుతూ తరతమ భేదాలతో విధిద్రోహాలకు తెగబడుతున్నాయి. మురికినీరు, పారిశ్రామిక వ్యర్థాలు నదుల్లో జలాశయాల్లో జీవకళను హరించకుండా పరిరక్షించాల్సిన ప్రత్యేక యంత్రాంగం- అవినీతి మడుగులో ఈదులాడుతూ, జాతికి జలగండాన్ని ఖాయం చేస్తోంది. వివిధ హింసోన్మాదాల పాలబడి మరణిస్తున్నవారికన్నా ఎక్కువమంది కలుషిత జలాలు తాగి ప్రాణాలు కోల్పోతున్నారన్న 'కాగ్' ధ్రువీకరణ, పర్యవేక్షణ వ్యవస్థల్లో మేటవేసిన నిష్పూచీ పోకడలకు అద్దంపడుతోంది. జాతి నెత్తిన ఉరుముతున్న పెను జల సంక్షోభాన్ని దుర్బల యంత్రాంగం, అసంబద్ధ విధానాలతో ఎంతమాత్రం నిలువరించలేం. సమూల ప్రక్షాళనే తక్షణ కర్తవ్యం!

నాలుగంచెల జలశుద్ధి, సరఫరా వ్యవస్థల్ని పట్టాలకు ఎక్కించిన సింగపూర్ ప్రతి నీటిబొట్టు నుంచీ ప్రయోజనం పొందుతున్న తీరు స్ఫూర్తిమంతం. వృథా జలాల్నీ వదిలిపెట్టకుండా శుద్ధి చేసి సాగుకు మళ్లిస్తున్న ఇజ్రాయెల్ ఎడారి సీమలో పంటసిరుల్ని ఒడిసిపట్టేలా పాటిస్తున్న మెలకువలు అద్భుతం. వాననీటిని జాగ్రత్తగా పదిలపరచుకోవడం, భూగర్భ జలమట్టాలను కాపాడటం, వాడకాలలో పొదుపు పాటించడం, వృథాను నివారించడాల్ని ఆస్ట్రేలియా, యూకే, దక్షిణాఫ్రికా వంటివి 'జాతీయ అజెండా'గా అమలుపరుస్తున్నాయి. తద్వారా జల కాలుష్యాన్ని నియంత్రించి, నీటి కటకట ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. జలగండాన్ని అధిగమించడానికి ఏ దేశానికైనా అటువంటి వ్యూహం ఉండితీరాలి. ఇక్కడ నీటి వనరుల సమాచార సేకరణ, పర్యవేక్షణల్లో ఆంధ్రప్రదేశ్; భూగర్భ, ఉపరితల జల నిర్వహణలో తెలంగాణ మెరుగ్గా రాణిస్తున్నా- తక్కిన రాష్ట్రాల నడుమ ఆరోగ్యకర స్పర్ధ కొరవడుతోంది. జాతీయ స్థాయిలో నీటికరవును పారదోలే ఉద్యమస్ఫూర్తి సత్వరం వెల్లువెత్తాల్సి ఉంది. నీటి వృథాను అరికట్టే లక్ష్యంతో రైతులకు, సాధారణ ప్రజానీకానికి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. 'స్వచ్ఛ భారత్' తరహాలో నీటిపొదుపునూ ప్రోత్సహించాలి. వర్షకాలంలో ఇంకుడు గుంతల ద్వారా నీటిని భూగర్భాన పదిలపరచే ప్రక్రియ ఊరూవాడా ఊపందుకోవాలి. జల సంరక్షణను, దుబారా నివారణను పాఠ్యాంశాల్లో అంతర్భాగం చేసి రేపటి తరాల్లో సామాజిక స్పృహ రేకెత్తించాలి. చుక్క నీరూ వృథా పోనివ్వని రీతిలో నదుల అనుసంధానం, వాననీటి సంరక్షణ, శుద్ధీకరించిన జలాల పునర్వినియోగం చురుగ్గా అమలుకు నోచుకోవాలి. కుంటలు, జలాశయాల పరిరక్షణలో పౌరసమాజం కీలక భాగస్వామ్యమే గుణాత్మక పరివర్తనకు దోహదపడుతుంది. ప్రాణాలు నిలబెట్టే నీటిని ప్రాణసమానంగా పదిలపరచుకునే సంస్కృతి జాతి ఊపిరిగా మారితేనే- జలగండం నుంచి గట్టెక్కగలిగేది!

ఇదేమి చదువు... గుండె బరువు

దేశమంతటా వెలుగుచూస్తున్న విద్యార్థుల బలవన్మరణాలు సామాజిక రుగ్మతగా పరిణమిస్తున్నాయి. ఫలితంగా భావితరం వ్యవహార దక్షత ప్రశ్నార్థకమవుతోంది. పరీక్షల ఫలితాలు విడుదల కాగానే ఉత్తీర్ణత, ప్రవేశార్హత సాధించలేకపోయిన విద్యార్థుల ఆత్మహత్యలు ఏటేటా పెరుగుతున్నాయి. కోరి చావును ఆశ్రయిస్తున్న ఈ ధోరణి మన కుటుంబ, విద్యావ్యవస్థల పతనావస్థకు సాక్ష్యంగా నిలుస్తోంది. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు నేల విడిచిన సాముకు పసిహృదయాలపై మోపుతున్న భరించనలవికాని మానసిక ఒత్తిడి, సంఘర్షణలు వారిని మరణంలో ప్రశాంతతను వెతుక్కునేలా ప్రోత్సహిస్తున్నాయి. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే సమీప భవిష్యత్తులో చదువు జీవన వికాసానికి బదులు జీవన వినాశనానికి దారితీసేదిగా మారడం ఖాయం. విద్యాపరమైన లక్ష్యాలను సాధించలేకపోవడం జీవించే అర్హతను కోల్పోవడమే అనే సత్యదూరమైన ఉద్వేగాత్మక అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చాపకింద నీరులా విస్తరిస్తున్న ఈ ప్రమాదకర పోకడను గుర్తించడంలో పెద్దవారు విఫలమవుతున్నారు. ఒకవేళ గుర్తించినా తమ పిల్లలు తీవ్ర నిర్ణయాలు తీసుకోరనే విశ్వాసంతో వ్యవహరిస్తున్నారు. అతిజాగ్రత్త, అజాగ్రత్తల మధ్యగల తేడాను తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యతగా అవగాహన చేసుకోవాల్సిన అవసరాన్ని వర్తమాన పరిస్థితులు హెచ్చరిస్తున్నాయి.

అవధులు లేని అత్యాశ

చదువులో వైఫల్యాన్ని భరించలేని విద్యార్థులు మాత్రమే గతంలో ఆత్మహత్యకు పాల్పడేవారు. ప్రాణాలు తీసుకుంటున్న నేటి విద్యార్థుల కారణాలు ఊహాకందనివిగా ఉంటున్నాయి. ప్రతిభావంతులు సైతం మార్కులు తగ్గాయన్న కారణంతో ఉసురు తీసుకుంటున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. 2014-16 మధ్యకాలంలో దేశంలో 26,500 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నది అధికారిక సమాచారం. ప్రతి 55 నిమిషాలకు ఓ విద్యాకుసుమం నేలరాలుతోందని నివేదికలు చెబుతున్నాయి. 2017-18లో హైదరాబాద్‌లో 30 మంది, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 150 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు తెగబడ్డారు. కుంగుబాటు, వ్యాకులత (యాంగ్జయిటీ), ఒత్తిడి, తల్లిదండ్రుల మాటల తూటాలు, ఉపాధ్యాయుల అశాస్త్రీయ లక్ష్యాలు, ఇబ్బందులు పంచుకోగలిగే ఆత్మీయ సంబంధాల లేమి విద్యార్థులను తీవ్ర నిర్ణయాలవైపు మళ్లిస్తున్నాయి. తమను ర్యాంకులు తెచ్చిపెట్టే యంత్రాల్లా చూస్తున్న పెద్దవారి సంకుచిత ధోరణిపట్ల నిరసన తెలియజేయడానికి, తాము ఓడిపోయామని ప్రకటించడానికి విద్యార్థులు ఆత్మహత్యను మార్గంగా ఎంచుకుంటున్నారు. ర్యాంకులు, మార్కులే జీవితమన్నట్లు ఎప్పుడూ చదువుతూ ఉండాలని ఒత్తిడిచేసే ఒక హైదరాబాద్ కార్పొరేట్ కాలేజీని మూయించాలని సూచిస్తూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఒక ఇంటర్ అమ్మాయి, ఆచూకీ లభ్యమయ్యాక, తాను తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లనని న్యాయస్థానంలోనే తెగేసి చెప్పిన ఘటన- నేటి తరం చదువులు కుటుంబ బంధాలను సైతం కూల్చేస్తున్నాయనడానికి దృష్టాంతం. కౌమారప్రాయంలో ఉద్వేగం అధికంగా ఉంటుంది. నియంత్రణ తక్కువగా ఉంటుంది. ఇలాంటివారే కాక, ఉన్నత విద్య అభ్యసించినవారూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారిలో ఉండటం గమనార్హం. ఐఐటీ దిల్లీలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన 31ఏళ్ల పూర్వవిద్యార్థి తాను చదివిన కాలేజీ ఏడో అంతస్తు నుంచి దూకి చనిపోయిన సంఘటన పలువురిని ఉలిక్కిపడేలా చేసింది.

సౌఖ్యానికి బాటలు వేయాల్సిన చదువులు, విద్యార్థులను బలవంతంగా చావు మార్గాలవైపు నెట్టడానికిగల కారణాలనేకం. ఒకే బిడ్డ చాలనుకున్న తల్లిదండ్రులు గారాబం మాటున తమ సంతానానికి కష్టం, ఇబ్బంది, సర్దుబాటు, సహనం వంటి గుణాలు తెలియకుండా, అలవడకుండా పెంచుతున్నారు. ఒకరికంటే ఎక్కువమంది పిల్లలున్న తల్లిదండ్రులు మరో అడుగు ముందుకేసి చిన్నప్పటినుంచే వారి మధ్య ద్వేషాగ్ని, అసూయలను నూరిపోస్తున్నారు. పిల్లల



ఒత్తిడికి చిత్తవుతున్న విద్యార్థులు

పెంపకంలో నేడు 'ఎవరు ఫస్ట్' అనే నినాదం వినబడని కుటుంబాలు దాదాపుగా లేవు. కాలకృత్యాలు, దుస్తులు ధరించడం, చివరకు తినడం విషయంలోనూ ఎవరు ఫస్టో చూద్దామంటూ పిల్లల మధ్య అమానుష పోటీ సృష్టిస్తున్న తల్లిదండ్రులు పసిమనసులకు చేస్తున్న కీడు అనంతం. సంవత్సరాల తరబడి ఇలా విషపూరితమైన 'ఫస్ట్'మాయ ప్రభావంలో పెరిగిన పిల్లలు 'సెకండ్' అనే భావనను అంగీకరించడానికి సిద్ధంగా లేరు. ఈ ధోరణి విద్యారంగంలోనూ వేళ్లూనుకుంటోంది. పరిమిత అవకాశాలు, అసంఖ్యాక అభ్యర్థుల మధ్య కొనసాగే పోరులో విజయ సంభావ్యతకు సంబంధించిన అవగాహన కల్పించడం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కనీస బాధ్యత. స్వభావ సామర్థ్యాల్లో ఏ ఇద్దరూ ఒకే విధంగా ఉండరన్న విషయాన్ని గ్రహించక అదేపనిగా పోలికలు తేవడం తల్లిదండ్రులు చేస్తున్న నేరం. తాము ప్రత్యేకంగా ఉండాలనే తల్లిదండ్రుల అత్యాశ కూడా విద్యార్థులకు శాపమవుతోంది. పిల్లల స్వీయ సామర్థ్యాలను, శ్రద్ధాసక్తులను తల్లిదండ్రులు అనునిత్యం గమనిస్తుండాలి. పలు లోపాలతో కూడిన పెంపకంలో పిల్లలు జీవితంలో చొరవ, నాయకత్వ పటిమ, సాహసం వంటి గుణాల ప్రాధాన్యం ఏమిటో తెలియకుండానే పెద్దవారవుతున్నారు. వయసు పెరిగినా వారిలో విశిష్టత కొరవడుతోంది. ఇది ముమ్మాటికీ తల్లిదండ్రుల పెంపక లోపమే. పర్యవసానంగా కొరత, విమర్శ, వనరుల లోటు, మార్గదర్శక నియంత్రణలను నేటి తరం చిన్నారులు జీర్ణించుకోలేకపోతున్నారు. పిల్లల వ్యక్తిగత సామర్థ్యాలను పరిగణించకుండా తల్లిదండ్రుల అవాస్తవ ప్రాధాన్యాలకు తలొగ్గి వ్యవహరిస్తున్న విద్యాసంస్థలకూ విద్యార్థుల ఆత్మహత్యల పాపంలో భాగముంది. నేటి విద్యాప్రణాళిక పిల్లల వీపుల మీద మోయలేని భారం మోపుతోంది. ఆసక్తిని పక్కనపెట్టి అపరిమిత సమాచారాన్ని విద్యార్థుల మెదళ్లలోకి చొప్పించడమే నేటి బోధన అంతిమలక్ష్యం. అర్థం కాకపోయినా చెప్పిన అంశాలను పరీక్షలో వెళ్లగక్కడమే విద్యార్థుల కర్తవ్యం. కనీసం జ్ఞాపకశక్తిని పెంచే నైపుణ్యాలనైనా విద్యార్థులకు బోధిస్తున్నారా అంటే, అదీ లేదు. లక్ష్యాత్మక మూల్యాంకనానికి తిలోదకాలిచ్చిన మన పరీక్షల వ్యవస్థ పిల్లల ప్రాణాలతో ఆడుకుంటోంది. సమాధాన పత్రంలో సినిమాల పేర్లు రాసి, రాజనీతిశాస్త్రం వంటకు సంబంధించినదని జవాబిచ్చిన విద్యార్థిని రాష్ట్ర టాపర్‌ను చేయగల గొప్ప పరీక్షల వ్యవస్థ మనది. గరిష్ఠ మార్కులకన్నా ఎక్కువ వేయడమూ పరీక్షల వ్యవస్థకే చెల్లింది! ప్రశ్నపత్రాల బహిర్గతం, సామూహిక చూసిరాత లాంటి దుశ్చర్యలతో పరీక్షల వ్యవస్థ రోగగ్రస్తమైంది. పారదర్శకత పేరిట అధికారులు మానవీయ స్ఫూర్తి లోపించిన 'ఒక్క నిమిషం ఆలస్యం' వంటి నిబంధనలు అమలుచేస్తూ విద్యార్థులను మరింత హడలెత్తిస్తున్నారు.

మానవీయతే పరిష్కారం

ఆత్మహత్యల ఆలోచనలను అంతంచేసే ఆశావాద దృక్పథాన్ని విద్యార్థుల్లో కలగజేయడం మనందరి విధి. చేపట్టిన పనిని శ్రద్ధ, అంకితభావంతో పూర్తి చేయవలసిన అవసరాన్ని వివరించడం పెద్దల బాధ్యత. పోలికలు, అనుచిత లక్ష్యా నిర్దేశాలతో పసి మనసులను కలుషితం చేయకూడదు. పిల్లల వెతలు వినడానికి పెద్దలు సమయం కేటాయించాలి. సమస్యలను పరిష్కరించడం, నచ్చజెప్పడం మరీముఖ్యం. విద్యాసంస్థలు వికాసంవైపు విద్యార్థులను నడిపించే జ్ఞాన పెన్నిధులు కావాలి. విషయ పరిజ్ఞానంతోపాటు విలువల పరిజ్ఞానాన్ని అందజేయాలి. పుస్తక పాఠాలతోపాటు అరుదైన జీవితావకాశాన్ని అర్థవంతంగా ఆస్వాదించే మెలకువలను విద్యార్థులకు నేర్పించడాన్ని ఉపాధ్యాయులు తమ కర్తవ్యం అనుకోవాలే తప్ప, అదనపు భారంగా భావించకూడదు. పరీక్షల రకాలు, వాటి స్వభావాలు, లక్ష్యాలు, ప్రణాళికల రూపకల్పనలతోపాటు వెలకట్టలేనంతటి విలువైన జీవిత ప్రాధాన్యాన్నీ వివరిస్తే, ఓటమిని సైతం గెలుపుగా మలచుకునే విశ్వాసం చిన్నారుల్లో జనిస్తుంది. పాఠ్య ప్రణాళిక భారాన్ని సగానికి కుదించాలని స్వయానా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు అంగీకరించిన నేపథ్యంలో- ప్రభుత్వాలు తక్షణమే పిల్లల విద్యాప్రగతిపట్ల గుణాత్మక సంస్కరణలు చేపట్టాలి. ముఖ్యంగా నిబంధనల విషయంలో అధికారులు మానవీయ స్ఫూర్తితో వ్యవహరించాలి. మానసిక ఆరోగ్య నిపుణుల ప్రేరణాత్మక దార్శనికత, స్వచ్ఛంద సంస్థల చొరవ చదువుకునే బిడ్డల ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్రను పోషించాలి. విద్యాసంవత్సరం ఆరంభం నుంచే జీవితాన్ని ప్రేమించే స్వభావాన్ని అలవరిస్తే- తరగతి గదులు నేటి తరం బాలలను ఆత్మవిశ్వాసం తొణికిసలాడే ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే వేదికలవుతాయి!

- వంగీపురం శ్రీనివాసాచారి

(రచయిత- కౌన్సెలింగ్ సైకాలజిస్ట్)

వ్యధాభరితం

- దేశంలో ప్రతి 55 నిమిషాలకు ఓ విద్యార్థి ఆత్మహత్య నమోదవుతోంది.
- 2017-18 విద్యాసంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో 150 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.
- హైదరాబాద్‌లోనే 30 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారు.
- ప్రతి తరగతి గదిలో 20 శాతం విద్యార్థులు ఉద్వేగం, కుంగుబాటుతో బాధపడుతున్నారు.
- 14 ఏళ్లలోపు పిల్లలు ప్రతి లక్ష మందిలో 0.5 శాతం మేర ఆత్మహత్య చేసుకుంటున్నారు.
- అదే 14 ఏళ్లు పైబడినవారిలో ఈ శాతం 9.52గా ఉంది.

ప్రమాదకర లక్షణాలు

- కుటుంబం, స్నేహితులకు దూరంగా ఉంటారు.
- తమను తామే గాయపరచుకోవడం
- నిద్ర, ఆహార అలవాట్లలో మార్పులు
- మాదక ద్రవ్యాలు, మద్యపానానికి అలవాటు పడటం
- ప్రమాదకర ప్రవర్తన
- గతంలో ఉత్సాహంగా పాల్గొన్న కార్యక్రమాల్లో ఆసక్తి లోపించడం

కశ్మీర్‌పై విషప్రచారం

అనిశ్చితి, విభేదాలు, భయాందోళలను అస్త్రాలుగా మలచుకుని జనంపై ముష్కర మూకలు, ధూర్త దేశాలు సాగించే మానసిక యుద్ధమే ఉగ్రవాదం. ఈ బీభత్స కళలో పాకిస్థాన్, ఇరాన్‌లు ఆరితేరాయని ఐక్యరాజ్య సమితి, పాశ్చాత్య దేశాలు పదేపదే ఆరోపించాయి. ప్రజాస్వామ్య దేశాలకు పెనుముప్పుగా నిలిచిన అల్ ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయమిచ్చింది పాకిస్థానేనని అందరికీ తెలుసు. అది పొరుగు దేశాల్లోనేకాక దూర దేశాల్లోనూ ఉగ్రవాద గణాలను ప్రేరేపిస్తోందని భారత్, అఫ్గానిస్థాన్‌లతోపాటు అమెరికా, బ్రిటన్‌లూ పలుమార్లు ఆరోపించాయి. అఫ్గాన్‌లో తాలిబన్లను, కశ్మీర్‌లో ఉగ్రవాదులను పాక్ రెచ్చగొడుతోందని లోకం కోడై కూస్తోంది. 2004 నుంచి ఇప్పటివరకు పాక్, అఫ్గాన్‌లలో అమెరికా జరిపిన డ్రోన్ దాడుల్లో దాదాపు 2,500 మంది టెర్రరిస్టులు హతమయ్యారు. పాక్ కపట నాటకాలకు ఇంతకన్నా నిదర్శనమేం కావాలి?

అనుచిత వత్తాసు

ఉగ్రవాద సంస్థ జమాత్ ఉద్ దావా అధినేత హఫీజ్ సయీద్‌ను ఐక్యరాజ్య సమితి, అమెరికాలు అంతర్జాతీయ టెర్రరిస్టుగా ప్రకటించినా అతగాడి వర్గీయులు జులై పార్లమెంటు ఎన్నికల్లో నిక్షేపంగా పోటీ చేయనున్నారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించిన టెర్రరిస్టులు, ఉగ్రవాద సంస్థల జాబితాలో 139మంది పాక్ పౌరులు, సంస్థలు ఉన్నాయి. వారిలో హఫీజ్ సయీద్‌తోపాటు అఫ్గాన్‌లో ఆగడాలకు పాల్పడుతున్న హక్కానీలు, పాక్‌లో తలదాచుకుంటున్న మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం, పాక్-అఫ్గాన్ సరిహద్దులో నక్కిన అల్ ఖైదా ప్రస్తుత అధినాయకుడు ఐమాన్ అల్ జవాహరి కూడా ఉన్నారు. పాక్ సైన్యం ప్రాయోజకత్వంలో నేడు ఉగ్రవాదం వర్ధిల్లుతోంది. మానవ హక్కులు, న్యాయపాలనకు గోరీ కట్టి టెర్రరిస్టులను నెత్తిన పెట్టుకుని ఊరేగుతున్న పాకిస్థాన్‌నూ ప్రజాస్వామ్య దేశమైన భారత్‌నూ ఒకే గాటన కట్టడంకన్నా మించిన విడ్డూరం మరొకటి లేదు. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం తాజాగా విడుదల చేసిన 49 పేజీల నివేదికలో ఈ చోద్యం ఉంది. కశ్మీర్‌లో మానవహక్కుల స్థితిగతులపై సమితి మొట్టమొదటిసారిగా విడుదల చేసిన నివేదిక ఇది. కశ్మీర్‌లో భారత సైనిక బలగాలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయనే ఆరోపణలపై అంతర్జాతీయ దర్యాప్తు జరపాలని సమితి నివేదిక కోరింది. 2016 జులై నుంచి 2018 ఏప్రిల్ వరకు జమ్మూకశ్మీర్, పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిత్-బాల్టిస్థాన్‌లలో జరిగాయంటున్న ఉల్లంఘనలపై నివేదిక దృష్టి కేంద్రీకరించింది. పాక్ ప్రభుత్వం అసమ్మతీయులపై ఉగ్రవాద నిరోధ చట్టాలను ప్రయోగిస్తూ భావప్రకటన హక్కును, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కునూ కాలరాస్తోందని వ్యాఖ్యానించింది. 1989 నుంచి పాకిస్థాన్ ఆయుధాలు, నిధులు, ఉగ్రవాద శిక్షణ ఇచ్చి తిరుగుబాటుదారులను రెచ్చగొట్టడం వల్లే కశ్మీర్‌లో ఇంతవరకు 50 వేలమంది పౌరులు, పోలీసు, సైనిక సిబ్బంది మరణించారనే స్పృహ ఐరాసకూ లేకుండా పోయింది. పైగా, కశ్మీర్‌లో 'భారత దురంతాల' గురించి ఈ నివేదికలో ఏకరవు పెట్టిన సంగతులు స్వయంగా విచారించి నిగ్గు తేల్చినవి కావు. ఐరాస ప్రతినిధులెవరూ జమ్మూకశ్మీర్‌లో కాని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కాని పర్యటించలేదు. భారతదేశంలో ప్రచురితమైన వార్తలు, వ్యాసాలు, నివేదికల నుంచి సంగ్రహించిన అంశాలు, అభిప్రాయాల ఆధారంగా కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనను నిర్ధారించిందట! భావ ప్రకటన స్వేచ్ఛ లేని పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అలాంటి ప్రచురణలేవీ తమకు దొరకలేదని సెలవిచ్చింది. వాక్ స్వాతంత్ర్యం ఉన్న ప్రజాస్వామిక భారత దేశానికి, అసమ్మతిని ఏ మాత్రం సహించని పాకిస్థాన్‌కూ మధ్య ఉన్న తేడాను గమనించకపోవడం ఐరాసకే చెల్లింది. లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థల గురించి కాని, పాక్ ప్రారంభించిన కార్గిల్ యుద్ధం గురించి కాని ఐరాస నివేదికలో ఊసే లేదు.

అందుకే ఐరాస మానవ హక్కుల నివేదిక భ్రమాజనితమైనదని, దురుద్దేశ ప్రేరితం, పక్షపాతపూర్ణమైనదని, తమ సార్వభౌమత్వానికి, ప్రాదేశిక సమగ్రతకూ

భంగకరమని భారత విదేశాంగ శాఖ తెగేసి చెప్పింది. ధ్రువీకృతం కాని అంశాలను ఆసరాగా తీసుకుని, భారతదేశానికి వ్యతిరేకంగా అల్లిన ఈ కథనాన్ని తాము తోసిపుచ్చుతున్నామని స్పష్టం చేసింది. కాగా, జమ్మూకశ్మీర్‌లో భారతీయ దళాలు అతిగా బలప్రయోగానికి దిగుతూ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడటంపై స్వతంత్ర విచారణ జరపాలని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ జైద్ రాద్ అల్ హుసేన్ కోరారు. జోర్డాన్‌కు చెందిన జైద్ 2014 జూన్‌లో ఈ పదవికి ఎన్నిక కావడానికి ముందు అమెరికాకు చెందిన విదేశీ విధాన పత్రిక ఆయన ఈ పదవికి తగడని వ్యాఖ్యానించింది. మతపరమైన అంశాల్లో భావ ప్రకటన హక్కుపై జోర్డాన్, ఆ దేశ ప్రతినిధి జైద్‌లు అనుసరించే వైఖరి వివాదాస్పదమని ఆ పత్రిక ఉద్ఘాటించింది. ఆయన ఆధ్వర్యంలో వండివార్చిన నివేదికపట్ల సహజంగానే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నివేదిక వెనక ఉన్నవారు అంతర్జాతీయంగా ఉగ్రవాద సంస్థలుగా ప్రకటితమై, ఐక్యరాజ్య సమితి నిషేధించిన టెర్రరిస్టు గ్రూపులను సాయుధ బృందాలని, టెర్రరిస్టులను నాయకులని సంబోధించడం ఆందోళన కలిగిస్తోంది' అని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఉగ్రవాదం అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది. అయినా కూడా పాకిస్థాన్ నుంచి ఉత్పన్నమవుతున్న సీమాంతర ఉగ్రవాదాన్ని మానవ హక్కుల హైకమిషనర్ పట్టించుకోలేదు. ఉగ్రవాదాన్ని ఏ మాత్రం సహించకూడదన్న ఐరాస విధానాన్నీ ఈ నివేదిక నీరుగారుస్తోందని భారత్ ఫిర్యాదు చేసింది. యావత్ కశ్మీరం భారతదేశంలో అంతర్భాగమని, పాకిస్థాన్ అందులో కొన్ని భాగాలను ఆక్రమించిందనే వాస్తవాన్ని ఐరాస మానవ హక్కుల నివేదిక గుర్తించకపోవడాన్ని భారత్ నిరసించింది. నివేదికలో పేర్కొన్న ఆజాద్ కశ్మీర్, గిల్గిత్-బాల్టిస్థాన్ అనే ప్రాంతాలేవీ వాస్తవంలో లేవని, అవన్నీ భారతీయ కశ్మీర్‌లో పాకిస్థాన్ కబ్జా చేసిన భూభాగాలను మన విదేశాంగ శాఖ గుర్తుచేసింది. మానవ హక్కుల హైకమిషనర్ నివేదికను భారత్ తోసిపుచ్చగా, పాకిస్థాన్ దాన్ని స్వాగతించింది. జమ్మూకశ్మీర్ వివాద పరిష్కారంలో ఐక్యరాజ్య సమితి కీలక పాత్ర పోషించగలదని పేర్కొంది. 1990నాటి సాయుధ దళాల (జమ్మూకశ్మీర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని భారత్ వెంటనే రద్దు చేయాలని ఐరాస నివేదిక కోరడం పాక్‌కు, అది పెంచి పోషిస్తున్న తిరుగుబాటుదారులకూ ఎంతో ఇంపుగా ఉంది. కశ్మీరీ ప్రజలను భాగస్వాములుగా చేసి కశ్మీర్ సమస్యకు అర్థవంతమైన చర్చల ద్వారా అంతిమ రాజకీయ పరిష్కారం కనుగొనాలనడమూ పాక్ చిరకాల డిమాండ్‌కు అనుగుణంగానే ఉంది. అందుకే ఈ సిఫార్సును పాక్ స్వాగతించింది. ఉగ్రవాద నిరోధ చట్టాలతో శాంతియుత ఉద్యమకారులను, అసమ్మతిని అణచివేయకూడదని పాక్‌కు మానవ హక్కుల హైకమిషనర్ సుద్దులు చెప్పినా, ఉగ్రవాదమే ఊపిరిగా నడిచే పాకిస్థాన్ వాటిని దులిపేసుకోవడం ఖాయం.

ఇకనైనా దిద్దుబాటు

2016 జులైలో హిజ్బుల్ ముజాహిదీన్ నాయకుడు బుర్హాన్ వనీని భారతీయ భద్రతా బలగాలు హతమార్చిన దరిమిలా కశ్మీర్ లోయలో పెద్దయెత్తున నిరసనలు వ్యక్తం కావడాన్ని ఐరాస నివేదిక ప్రస్తావించడం పాక్‌కు, దాని అనుయాయ ఉగ్రవాదులకు మరింత ఊతమిచ్చేలా ఉంది. జమ్మూకశ్మీర్‌లో పాక్ ప్రేరిత విచ్ఛిన్నకర శక్తులతో భారతీయ దళాలు పోరాడుతున్నాయన్న వాస్తవాన్ని ఈ నివేదిక విస్మరించింది. పైగా అది ఓ స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జీఓ) తయారు చేసిన నివేదికలా ఉందే తప్ప వాస్తవాల ఆధారంగా రూపొందిన పత్రంలా లేదు. భారత్ ఈ నివేదికను కేవలం తోసిపుచ్చి సరిపెట్టుకోవడం కాకుండా, దాని వెనక ఉన్నవారి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసి ఏకాకిని చేయాలని విఖ్యాత వ్యాఖ్యాత బ్రహ్మ చెలానీ సూచించారు. భారత్ నిరసనను పురస్కరించుకుని తదుపరి కార్యాచరణను నిర్ణయించడానికి ఐక్యరాజ్య సమితి ఉన్నతస్థాయి సమావేశానికి పిలుపిచ్చింది. పాక్ ప్రేరిత ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ఆ సమావేశంలో అంతర్జాతీయ సమాజం నడుంకట్టాలి. స్వయంగా ఉగ్రవాద దాడులను చవిచూస్తున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఇందుకు చిత్తశుద్ధిగా ముందుకురావాలి.

- వరప్రసాద్

సర్వ సమ భావన

చెడును ప్రేమ నిండిన హృదయంతో వశపరచుకొని మంచికి మకుటం పెట్టడం మానవ ధర్మం. ధర్మచింత, పరహితం వంటి ఉత్తమగుణాలకది నవోన్మేష ఉషోదయం. కేవలం తమకోసం కాక, అందరికోసం బతకడం నేర్చుకొన్నప్పుడు అది భేదభావాల వ్యాధిసోకని శాంతి వర్ధిల్లే చోటు. ఉత్తమ ఆలోచనలకు లోటు కనిపించని విశ్వమానవ కల్యాణ వేదిక. ఈ దృష్టితోనే నిరంతరం త్యాగధనులై సత్యవర్తనులై జనులు ప్రవర్తించాలని రమజాన్ మాసం శిక్షణ అందిస్తుంది. వికాసం పంచే జీవశక్తులతో ధాత్రి శోభిల్లాలనే ఆకాంక్షతో విశ్వాసులు రమజాన్ పర్వదినం నిర్వహించుకుంటారు. రమజాన్ దివ్యఖురాన్ అవతరించిన నెల. ఈ గ్రంథం కేవలం ముస్లిముల కోసమే ఉద్దేశించింది కాదు. సమస్త మానవాళి హితం పరమలక్ష్యంగా వెలసింది. మస్జిద్‌లు అన్నీ ఈ నెల పర్యంతం అపురూప ఆధ్యాత్మిక నిలయాలై విలసిల్లాయి.

ఒకే దైవం, దానధర్మం, పరుల క్షేమం, పరమతసహన విభవం, చెడునుంచి విమోచనం... వీటిని అనుసరించి ప్రవర్తించేది ఇస్లామ్. ఇస్లామ్ ఒక ఉత్కృష్ట జీవన విధానం. అంతేకాని మతంకాదు. అల్లాహ్ కరుణ ప్రాప్తికి సిరిసంపదల వంటి బాహ్యవస్తువులతో పని లేదు. అంతఃకరణ శుద్ధి, సత్యసంధత- సేవాపరాయణత, విశ్వవిభునిపై అచంచల విశ్వాసం... ఇవి ప్రధానమైనవి. అత్యంత అవసరమైనవి.

రంజాన్ మాసంలో 'ఫిత్రా' పేరిట పేదలకు నిర్ణీత దానం ప్రతి ఒక్కరూ చెల్లిస్తారు. మరో దానం 'జకాత్' సంపన్నులు చేయడానికి ఉద్దేశించింది. దారిద్ర్యానికి మించిన నిస్సహాయత లోకంలో ఇంకొకటి లేదు. పేదలు అవసరమైన జీవనోపాధిని పొందే స్థోమత కలిగించి వారి దుఃఖపరంపరల్ని తొలగించండి- అని ఇస్లామ్ ప్రబోధించింది. ధనాన్ని మాత్రమే ఆరాధించే వారికి, డబ్బుకోసం దేన్నికైనా తెగించేవారికి, లోభులకు ఇస్లామ్‌లో చోటులేదు. ప్రతిఫలాన్ని ఆశించక లోక శ్రేయం కోసం పాటుపడేవారినే విశ్వప్రభువు ప్రేమిస్తాడు. కనుక జీవితానికి సార్థకత లభిస్తుందని మహత్తర శిక్షణవల్ల అందరూ తెలుసుకోగలిగారు.

రోజా (ఉపవాసవ్రతం) పాటిస్తున్నప్పుడు దుర్భాషలాడకూడదని గ్రహించారు. అసత్యాన్ని అశ్లీలాన్ని చేరనీయలేదు. ఇదంతా ఒకవిధంగా సహనమే. ఈ సహనగుణం కష్టసమయాల్లో మనిషికి నిలకడను, స్థైర్యాన్ని ప్రసాదిస్తుందని అవగాహన చేసుకొన్నారు. దౌర్జన్యం చేసినవారి పట్ల క్షమాభావాన్ని ప్రదర్శించారు. ఈ విధంగా మనిషి అన్నివిధాలా అన్నికోణాల్లో ధైర్యస్థైర్యాలకు, సహనగుణానికి సత్కార్యాలకు ప్రతిరూపంగా రూపొందగలడు. అందుకే మహా ప్రవక్త రమజాన్‌ను సహనమాసం అన్నారు. ఉపవాస వ్రతం పాటించడంతోపాటు ఫర్జ్, సున్నత్, నఫిల్, తరావీహ్ నమాజులు ఆచరించారు. ఇది ఒకరోజు పండుగ కాదు, నెలరోజులుగా ఆనందంగా ఆరాధనా భావతరంగాల్లో తేలియాడుతూ జరుపుకొంటున్న పండుగ.

రమజాన్ మాసంలో మహత్తర శిక్షణ పొంది కూడా కొందరు దైవభీతి లేనివారై స్వార్థపరులుగా దుర్మార్గులుగా ప్రవర్తిస్తారు. ప్రతిచోటా ప్రతివిషయంలోనూ వీరికి వక్రతే కనిపిస్తుంది. ఇది ఇస్లామ్ విధానంలోని లోపం కాదు. స్వయంగా వారి ఆంతర్యాల్లోనే బలమైన లోపం ఉంది. అలాంటివారి హృదయాల్లో మమతానురాగాలు, ధార్మికత్వం వెలసేలా అందరూ కృషిచేయాలి.

రమజాన్ మాసమంతా పుణ్యకార్యాలతో సర్వసమభావనకు జీవం పోశారు. నేడు పండుగ సందర్భంగా ఈద్‌గాహ్ (పండుగ నమాజ్ చేసే స్థలం) చేరుకొని సమస్త మానవాళి శాంతిసౌఖ్యాలు కోరుతూ నమాజ్ చేస్తారు. అందరినీ సన్మార్గంవైపు నడపాలంటూ సృష్టికర్తను ప్రార్థిస్తారు. క్రౌర్యం, మతదురహంకారం వంటి భయానక సంకుచిత ధోరణులు నశించి మానవాళిలో అవిరళ స్నేహం, సమభావం, సమధర్మం వర్ధిల్లాలని కాంక్షిస్తారు.

- డాక్టర్ షేక్ మహమ్మద్ ముస్తఫా

అంతర్యామి

తితిదే ధర్మకర్తల మండలికి ప్రత్యేక దర్శనం టిక్కెట్లు

అధ్యక్షుడికి 100, సభ్యులకు 30 చొప్పున కేటాయింపు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల, తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలికి ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు లభించనున్నాయి. ధర్మకర్తల మండలి అధ్యక్షుడికి నిత్యం 100, సభ్యులకు 30 చొప్పున కేటాయించడానికి దేవస్థానం ఉన్నతాధికారులు నిర్ణయించారు. మండలి అధ్యక్షుడితో పాటు 17 మంది సభ్యులున్నారు. వీరంతా తమ అనుచరులకు, తమ ప్రాంత భక్తుల కోసం నిత్యం వీఐపీ బ్రేక్ దర్శనంతో పాటు ఆర్జిత సేవా టిక్కెట్లు పొందుతున్నారు. గతంలో ఇస్తున్న తరహాలో ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు ఇవ్వాలని సభ్యులు అధికారులను కోరారు. ఈ మేరకు నిత్యం కోటాను నిర్దేశించారు. అయితే, ఆరు నెలలుగా జేఈవో కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు జారీ చేయడంలేదు. ఈ టిక్కెట్లపై సుపథం నుంచి ఆలయానికి చేరుకునే సౌలభ్యం ఉంటుంది. వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్ల కోసం వచ్చే ఒత్తిళ్లను తట్టుకోవడానికి ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు ప్రత్యామ్నాయంగా ఉంటాయని సభ్యులు కోరడంతో కోటా మంజూరైంది. ఈ కోటాకు అనుగుణంగా సిఫార్సు లేఖలు తెచ్చిన భక్తులు సుపథం వద్ద రూ.300 చెల్లించి.. టిక్కెట్ పొంది వరుసల్లోకి చేరుకోవచ్చు.

కేంద్రమంత్రి పీయూష్ గోయల్ దంపతులకు శ్రీవారి, పద్మావతి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న తిరుమల జేఈవో శ్రీనివాసరాజు

స్వచ్ఛతకు ప్రతీక తిరుమల క్షేత్రం

కేంద్రమంత్రి పీయూష్ గోయల్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల.. స్వచ్ఛతకు ప్రతీక అని, ఇతర ఆలయాన్నింటికీ ఆదర్శంగా నిలుస్తోందని రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ కొనియాడారు. శుక్రవారం ఉదయం శ్రీవారి అభిషేకం సేవలో మంత్రి సతీ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన ఆలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాసుని ఆలయం ఏకత్వానికి చిహ్నంగా నిలుస్తోందని, ఆలయ నిర్వహణ చక్కగా ఉందని, భక్తులందరికీ అద్భుతమైన సేవలందుతున్నాయన్నారు. అంతకు ముందు రంగనాయకుల మండపానికి చేరుకోగా పండితులు వేదాశీర్వచనం చేశారు. తిరుమల జేఈవో శ్రీనివాసరాజు శ్రీవారి తీర్థ ప్రసాదాలను, చిత్ర పటాన్ని అందచేసి సత్కరించారు.

శీతల గిడ్డంగిలో అగ్ని ప్రమాదం

- కాలిపోయిన 50 వేల బస్తాల పంట ఉత్పత్తులు
- రూ.కోట్లలో నష్టం ఉండొచ్చని అంచనా
- గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టినట్లు ఫిర్యాదు
- పరిశీలించి రైతులతో మాట్లాడిన మంత్రి ప్రత్తిపాటి

గుంటూరు జిల్లా బొప్పూడి వద్ద అగ్ని ప్రమాదానికి గురైన శీతల గిడ్డంగి

చిలకలూరిపేట గ్రామీణ - న్యూస్‌టుడే

గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడిలోని ఓ శీతల గిడ్డంగి శుక్రవారం తెల్లవారుజామున అగ్ని కీలల్లో చిక్కుకుంది. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి పక్కన బొప్పూడి కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నడుస్తున్న దీనిలో రెండు ఛాంబర్లు ఉండగా 1,10,887 బస్తాల పంట ఉత్పత్తులు నిల్వ ఉన్నాయి. వాటిలో ఎక్కువగా మిర్చి, శనగలు, కందులు, నువ్వులు, పసుపు, మినుములు ఉన్నాయి. ప్రమాదం ఉత్తరం వైపు ఛాంబరులో జరగడంతో అందులో ఉన్న సుమారు 50 వేల బస్తాలు కాలిపోయి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి పది అగ్నిమాపక యంత్రాలను రప్పించి సాయంత్రానికి మంటలను అదుపు చేశారు. అయినా పొగలు వస్తుండడంతో పూర్తి నష్టాన్ని అంచనా వేయలేమని, నష్టం రూ.కోట్లలోనే ఉంటుందని భావిస్తున్నామని అధికారులు తెలిపారు. దక్షిణం వైపు ఛాంబరు గోడను పొక్లెయినుతో పగులగొట్టించి అందులోని బస్తాలను బయటకు తెప్పిస్తున్నారు. ఇలా ఉండగా తెల్లవారుజామున రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు కారులో వచ్చి తనను కత్తితో బెదిరించి గదిలో బంధించారని కాపలాదారు షేక్ మాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత గిడ్డంగి తాళం పగులగొట్టి, పెట్రోలు పోసి నిప్పు అంటించారని చెప్పాడు. దాంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి అన్ని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు.

నిబంధనలు పాటించకనే ప్రమాదం

శీతల గిడ్డంగుల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాద తీవ్రత పెరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బొప్పూడి వద్ద అగ్ని ప్రమాదానికి గురైన శీతల గిడ్డంగిని ఆయన పరిశీలించి అక్కడ ఉన్న రైతులకు భరోసా కల్పించారు. ఈ ప్రమాదానికి గల కారణాలు విచారించిన అనంతరం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బీమా సంస్థలు వెంటనే రైతులకు పరిహారం చెల్లించేలా చూడాలని కోరారు.

స్త్రీ, శిశు సంక్షేమశాఖలో పదోన్నతులు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న అధికారుల పదోన్నతి కల ఎట్టకేలకు నెరవేరింది. ఉప సంచాలకులకు సంయుక్త సంచాలకులు (జేడీ)గా పదోన్నతులు కల్పిస్తూ ఆ శాఖ కార్యదర్శి కె.సునీత గురువారం రాత్రి జీవో జారీ చేశారు. ప్రస్తుతం కర్నూలు ఇన్‌ఛార్జి ఆర్జేడీగా పనిచేస్తున్న వి.శారద ఒంగోలు ఆర్జేడీగా బదిలీ అయ్యారు. ఒంగోలులో పనిచేస్తున్న టి.వి.శ్రీనివాస్‌ని ఏలూరుకు, గుంటూరులోని ప్రత్యేక కమిషనరు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కె.రాజ్యలక్ష్మిని స్థానికంగా ఐసీడీఎస్ సంయుక్త సంచాలకురాలుగా, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి కార్యాలయం ఓఎస్‌డీ ఇ.వి.స్వర్ణలతను ప్రత్యేక కమిషనరు కార్యాలయంలో ఎన్‌ఎన్‌ఎం జాయింట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఉండవల్లిలోని రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ కార్యనిర్వాహక సంచాలకురాలు (ఈడీ) వై.శైలజను ప్రత్యేక కమిషనరు కార్యాలయంలో పథకాల సంయుక్త సంచాలకురాలుగా బదిలీ చేశారు. మహిళా సహకార ఆర్థిక సంస్థ ఈడీగా కూడా ఆమె పూర్తి అదనపు బాధ్యతలతో కొనసాగనున్నారు. విజయనగరం జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు ఎ.ఇ.రాబర్ట్‌ని విశాఖపట్నం ఆర్జేడీగా బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఆర్జేడీగా విధులు నిర్వహించిన ఎస్.విద్యావతిని పోస్టింగ్ కోసం ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. ప్రత్యేక కమిషనరు కార్యాలయంలో ఇన్‌ఛార్జి జేడీగా విధులు నిర్వహిస్తున్న ఆర్.శివపార్వతి పదోన్నతిపై విజయవాడలోని బాలలహక్కుల రక్షణ కమిషన్ కార్యాదర్శిగా బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు కె.శ్యామసుందరిని కర్నూలు ఆర్జేడీగా బదిలీ చేశారు.

పాక్ తాలిబన్ అధినేత ఫజ్లుల్లా హతం

- డ్రోన్‌తో దాడిచేసిన అమెరికా

వాషింగ్టన్: అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో కరడుగట్టిన ఉగ్రవాది, పాకిస్థాన్ తాలిబన్ (తెహ్రీక్ ఏ తాలిబన్-టీటీపీ) అధినేత మౌలానా ఫజ్లుల్లా హతమయ్యాడు. అఫ్గానిస్థాన్‌లోని కునార్ ప్రావిన్సులో గురువారం ఈ దాడి జరిగింది. ఈ విషయాన్ని అఫ్గాన్ రక్షణశాఖ ధ్రువీకరించింది. పాక్‌లోని ఖైబర్ పంఖ్తూంఖ్వాలోనున్న స్వాత్ జిల్లా.. ఫజ్లుల్లా స్వస్థలం. 2013లో టీటీపీ అధినేతగా అతడు బాధ్యతలు చేపట్టాడు. డంగమ్ జిల్లాలోని ఓ గ్రామంలో గురువారం ఫజ్లుల్లా ఇఫ్తార్ విందులో పాల్గొంటుండగా.. అమెరికా డ్రోన్ దాడి చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఫజ్లుల్లాతోపాటు మరో నలుగురు టీటీపీ కమాండర్లూ హతమైనట్లు పేర్కొన్నాయి.

మౌలానా ఫజ్లుల్లా (పాతచిత్రం)

2012లో స్వాత్‌లో బాలికల హక్కుల కోసం పోరాడుతున్న మలాలా యూసుఫ్ జాయ్ తలలోకి తూటాను కాల్చింది ఫజ్లుల్లా అనుచరులే. ఘటన నుంచి ప్రాణాలతో బయటపడ్డ మలాలా.. అనంతరం నోబెల్ శాంతి పురస్కారం పొందిన సంగతి తెలిసిందే. 2014లో పాక్‌లో 151మంది బలైన.. 'పెషావర్ సైనిక పాఠశాలపై దాడి'కి ఫజ్లుల్లానే సూత్రధారి.

కర్ణాటకలో పదోన్నతుల్లోనూ రిజర్వేషన్లు

కీలక ముసాయిదాపై రాష్ట్రపతి సంతకం

ఈనాడు- బెంగళూరు: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించే శాసనానికి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ శుక్రవారం ఆమోద ముద్రవేశారు. ఇప్పటి వరకూ ఆ విషయంలో కర్ణాటక ఉద్యోగులు సాగించిన ఉద్యమం ఓ కొలిక్కి వచ్చింది. ఆ వర్గాల వారికి పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పిస్తూ నిరుడు సిద్ధరామయ్య నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం శాసనం చేసింది. దీన్ని రిజర్వేషన్ వర్గానికి చెందని అధికారులు అత్యున్నత న్యాయస్థానంలో సవాలు చేసి నెగ్గారు. ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ల వల్ల ఇతరులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్న అత్యున్నత న్యాయస్థానం ఆ శాసనాన్ని రద్దుచేసింది. దాని ప్రకారం పదోన్నతి పొందిన అధికార్లందరినీ అంతకుముందు విధులు నిర్వర్తించిన ఉద్యోగాలకే మళ్లించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి.. పదోన్నతులు పొందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, అధికార్లను పాత పదవులకు మళ్లించకుండా, ఇతర వర్గాల వారికి పదోన్నతుల్లో అన్యాయం జరగని రీతిలో సమాన హోదాతో రెండు పదవుల్ని సృష్టించింది. ఆ మేరకు నియమావళిని సవరించి అత్యవసర ఆదేశాన్ని జారీచేసింది. దీన్ని ఆమోదించేందుకు గవర్నర్ వజూభాయి వాలా తిరస్కరించారు. శాసనసభలో చర్చించి ఆమోదం పొందాలని కోరారు. ఆ క్రమంలో.. ప్రభుత్వం అప్పట్లో ఉభయ సభల్లో శాసనాన్ని ప్రవేశపెట్టి ఆమోదం పొందింది. తదుపరి రాజభవన్ ద్వారా అది రాష్ట్రపతి భవన్ చేరింది. చివరకు దానిపై శుక్రవారం రాష్ట్రపతి సంతకం చేశారు. ఇందువల్ల 20వేల మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, అధికారులకు ప్రయోజనం కలిగింది.

అలహాబాద్‌కు త్వరలో ప్రయాగ్‌గా పేరు మార్పు!

ఈనాడు, దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ నగరం పేరును త్వరలో ప్రయాగ్‌గా మార్చే అవకాశాలున్నాయి. రాష్ట్ర మంత్రివర్గం త్వరలోనే ఈ ప్రతిపాదనను పరిశీలించి ఆమోదించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. గంగ, యమున నదులు అలహాబాద్ నగరం వద్ద సంగమ ప్రవాహంగా మారతాయి. పురాణాల్లో పేర్కొనే సరస్వతి నది కూడా ఈ సంగమంలో ఉంటుందని భావిస్తారు. ప్రయాగ్ అంటే నదుల సంగమమని అర్థం. ఈ నేపథ్యంలో అలహాబాద్ నగరానికి ప్రయాగ్‌గా పేరు మార్చాలని సాధువులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ పార్టీగా భాజపా కూడా ఈ డిమాండ్‌కు మద్దతిస్తోంది. ఈ ఏడాది జూన్ 5న రాష్ట్రంలోని ముఘల్ సరాయ్ రైల్వే కూడలికి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ పేరు పెట్టిన సంగతి తెలిసిందే.

మెరుగుపడుతున్న వాజ్‌పేయీ ఆరోగ్యం: ఎయిమ్స్

దిల్లీ: ఎయిమ్స్‌లో నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆరోగ్య పరిస్థితి క్రమేపీ మెరుగవుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఆయన పరిస్థితి నిలకడగా ఉందని.. వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఎయిమ్స్ ఓ ప్రకటనలో తెలిపింది. కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్ సహా పలువురు రాజకీయ నేతలు శుక్రవారం పరామర్శించారు.

కేంద్రమంత్రి రిజిజుకు ఎయిమ్స్‌లో స్వల్ప శస్త్రచికిత్సలు

దిల్లీ: కేంద్ర మంత్రి కిరెన్ రిజిజుకు అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) వైద్యులు చిన్నపాటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. మూత్రపిండంలో రాళ్లు, సైనసైటిస్ సమస్యలతో గురువారం ఆయన దిల్లీలోని ఎయిమ్స్‌లో చేరికయ్యారు. రెండు సమస్యలకూ వైద్యులు అందించిన చికిత్సలు విజయవంతమయ్యాయని ట్విటర్ ద్వారా రిజిజు వెల్లడించారు. ఎయిమ్స్ వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో ఏడు పర్యావరణ పర్యాటక కేంద్రాలు ఏర్పాటు: మంత్రి శిద్ధా

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏడు పర్యావరణ పర్యాటక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అటవీ శాఖ మంత్రి శిద్ధారాఘవరావు తెలిపారు. వన విహారి కార్యక్రమం కింద ఇప్పటికే ఉన్న ఎనిమిది పర్యావరణ పర్యాటక కేంద్రాలను ఆధునీకరించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 12 నగర వనాలను ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హరిత తీరం కార్యక్రమంలో భాగంగా సముద్ర తీరానికి రక్షణగా 920 హెక్టార్లలో సరుగుడు, తాటి చెట్లు, 380 హెక్టార్లలో మడ అడవులను పెంచనున్నట్లు చెప్పారు. విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, కర్నూలు, అనంతపురం సర్కిళ్లలో రూ.17.52 కోట్లతో 876 కిలోమీటర్ల పొడవున రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. వనం-మనం కార్యక్రమానికి 25 కోట్ల మొక్కలను సిద్ధం చేశామని పేర్కొన్నారు.

రాజీవ్‌గాంధీ సద్భావనా అవార్డు ప్రతిపాదనలకు ఆహ్వానం

దిల్లీ: రాజీవ్‌గాంధీ సద్భావనా పురస్కారం(2016-17) కోసం ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నారు. పురస్కారం సలహా సంఘం సారథి కరణ్ సింగ్(మాజీఎంపీ) ఈ అవార్డు కోసం ప్రతిపాదనలను ఆహ్వానిస్తూ...నిర్దేశిత ఫారంలో జులై 7వ తేదీలోగా వాటిని సమర్పించాలని కోరారు. జాతీయ సద్భావన సాధన దిశగా విశేష, విశిష్ట సేవలను అందచేసిన వ్యక్తులు లేదా సంస్థలకు ఈ పురస్కారాన్ని అందచేస్తారు. కాగా, ఎంపికైన వ్యక్తులు/సంస్థలకు రాజీవ్‌గాంధీ జయంతిరోజైన ఆగస్టు 20న పురస్కారాలను ప్రదానం చేస్తారు. పురస్కార గ్రహీతకు రూ.10 లక్షల నగదు, ప్రశంసా పత్రాన్ని అందచేస్తారు. లోగడ మదర్ థెరిస్సా, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్, లతామంగేష్కర్, ఎస్.ఎన్.సుబ్బారావు, స్వామి అగ్నివేశ్, కె.ఆర్.నారాయణన్, ఉస్తాద్ అంజాద్ అలీఖాన్ తదితరులను ఈ పురస్కారంతో సత్కరించారు.

EDUCATION
★ Ag B.Sc (HORTY) BVSC. Ag M.Sc BHMS BAMS LOW PKG 8790207362
★ ADMISSION GUIDANCE MBBS & VETERINARY
www.medicaladmission.co.in Ph.9666222217

అదో పెద్ద ముఠా

- గౌరీలంకేశ్ హత్య కేసులో సంచలన విషయాలు
- కనీసం 5 రాష్ట్రాల్లో 60 మందితో ముఠా విస్తరణ
- హిందూ అతివాద సంస్థల నుంచి సభ్యుల నియామకం
- హిట్ లిస్ట్‌లో గిరీశ్ కర్నాడ్, మరో ముగ్గురు

గౌరీలంకేశ్ హంతకుడు పరశురామ్ వాగ్మారె

బెంగళూరు: పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ హత్య వెనక ఉన్న ముఠాకు కనీసం ఐదు రాష్ట్రాల్లో నెట్‌వర్క్ విస్తరించి ఉన్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందానికి చెందిన సీనియర్ పోలీస్ అధికారి ఒకరు శుక్రవారం చెప్పారు. ఈ కేసులో అరెస్టయిన ఆరుగురిలో చిట్టచివరి వాడైన పరశురామ్ వాగ్మారె.. గౌరీ లంకేశ్‌ను హతమార్చినట్లు వెల్లడించారు. ఆమెను హత్య చేసేందుకు ఉపయోగించిన తుపాకీనే హేతువాదులైన గోవింద్ పన్సారె, ఎం.ఎం.కలబుర్గిని హత్య చేసేందుకూ ఉపయోగించారని ఫోరెన్సిక్ నివేదిక తేల్చిందన్నారు. ఆయన కథనం ప్రకారం... ఈ ముఠా ఒక అండర్‌గ్రౌండ్ సంస్థకు చెందినది. దానికి ప్రత్యేకంగా వారు పేరేమీ పెట్టుకోలేదు.. ఈ సంస్థలో కనీసం ఐదు రాష్ట్రాలకు చెందిన 60 మంది సభ్యులున్నారు. వీరందరినీ వివిధ అతివాద హిందూసంస్థల నుంచి నియమించుకున్నారు. ఈ ముఠాకు మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటకలో నెట్‌వర్క్ ఉందని తేలింది. మహారాష్ట్రకు చెందిన హిందూ జాగృత సమితి, సనాతన్ సంస్థ వంటి కరడుగట్టిన హిందూ అతివాద సంస్థల నుంచి ఈ ముఠా సభ్యులను నియమించుకున్నా ఈ హత్యలతో ఈ సంస్థలకు నేరుగా సంబంధం ఉండకపోవచ్చు. సుజిత్ కుమార్ అలియాస్ ప్రవీణ్‌కుమార్.. కర్ణాటకలో తన ముఠా కోసం సభ్యులను నియమించుకునేవాడు. గౌరీ లంకేశ్ హత్య కేసులో ఇంకా కనీసం ముగ్గురి ప్రమేయముందని పోలీసులు అనుమానిస్తున్నారు. వారి కోసం గాలిస్తున్నారు. నిందితులు తమ పనిని దశలవారీగా అమలు చేసేవారని దర్యాప్తులో వెల్లడయింది. రెక్కీ నిర్వహించడం, లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తి బలహీనతలను కనిపెట్టడం, చివరిగా తమ ప్రణాళికను అమలు పర్చడం ఈ దశల్లో భాగం. నిందితులు తమ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి ఆరు నెలల నుంచి ఏడాది పాటు సమయం తీసుకుంటారని సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ ముఠా ఇదే విధంగా కన్నడ రచయిత ప్రొఫెసర్ కె.ఎస్.భగవాన్‌ను హతమార్చేందుకు చివరి దశ ప్రణాళిక వరకు వచ్చిందని ఆయన తెలిపారు. అయితే పోలీసులు ఇటీవల ఆ కుట్రను ఛేదించి నలుగురిని అరెస్టు చేశారు. గౌరీ లంకేశ్ హత్య కేసులో వారి ప్రమేయంపైనా దర్యాప్తు చేస్తున్నారు. జ్ఞానపీఠ్ పురస్కారం గ్రహీత, ప్రముఖ నటుడు అయిన గిరీశ్ కర్నాడ్ కూడా ఈ ముఠా హిట్‌లిస్ట్‌లో ఉన్నట్లు సీనియర్ అధికారి తెలిపారు. ఆ ముఠా హిట్‌లిస్ట్‌లో ఇంకా మాజీ మంత్రి బి.టి.లలితా నాయక్, హేతువాది సి.ఎస్.ద్వారకానాథ్, నిడుమామిడి మఠానికి చెందిన వీరభద్ర చన్నమలస్వామి కూడా ఉన్నట్లు వారి వద్ద లభ్యమైన డైరీలో ఉంది.

‘సర్కారు’ చదువుకు సై

పిల్లల్ని ప్రభుత్వ బడిలో చేర్చిన మాచర్ల సీఐ

తమ చిన్నారులు, ఉపాధ్యాయులతో సర్కారు బడిలో సీఐ సాంబశివరావు

మాచర్ల, న్యూస్‌టుడే: నేటి పోటీ ప్రపంచంలో రోజువారీ పనులు చేసుకునే తల్లిదండ్రులు సైతం పిల్లల చదువులకు పెద్దపీట వేస్తున్నారు. ప్రైవేటు బడుల పట్లే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం సౌకర్యాలన్నీ కల్పించి తమ పాఠశాలల్లో చదివించాలని కోరినా పెద్దగా పట్టించుకోవడం లేదు. కానీ గుంటూరు జిల్లా మాచర్ల పట్టణ సీఐ సాంబశివరావు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న తమ ఇద్దరు చిన్నారుల్ని.. శుక్రవారం ఆజాద్‌నగర్ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అక్కడి ఉపాధ్యాయుల్ని ఆశ్చర్యపరిచారు. ఈ బడిని ఆయన ఇప్పటికే దత్తత కూడా తీసుకొన్నారు. సీఐ కుమారుడు సింగిరేసు దీక్షాంత్ శివగణేష్ నాలుగు, కుమార్తె పూజిత ఐదో తరగతి చదవాలి. గత ఏడాది వీరిద్దరూ సెయింట్‌ఆన్స్ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో చదివారు. ఇటీవల ఆజాద్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఐతో పాటు, పిల్లలు పాల్గొన్నారు. అక్కడి వాతావరణం, తెలుగు బోధించే విధానంపై పిల్లలు మొగ్గుచూపటంతో సీఐ కుటుంబ సభ్యులు, సర్కారు బడిలోనే చదివించాలని నిర్ణయించుకున్నారు. ఆ ప్రకారం తాజాగా ప్రవేశాలు పొందారు. తాను ప్రభుత్వ బడిలోనే చదివానని, పోటీ పరీక్షలకు శిక్షణ సర్కారు సంస్థల నుంచే తీసుకున్నానని సీఐ చెప్పారు. ప్రభుత్వం ప్రతిభ కలవారినే ఉపాధ్యాయులుగా ఎంపిక చేస్తుందని, వారి వద్ద చదువుకుంటే పిల్లలు ప్రయోజకులు అవుతారన్నారు. ఉద్యోగులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివించేందుకు రావడం పట్ల ఆ బడి ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి సంతోషం ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రవాణా శాఖ
టెండరు ఆహ్వాన ప్రకటన
టెండరు నెం. 603/R/IT/2018 తేది: 14.6.2018
"ప్రయాణంలో మహిళలు & బాలిక శిశువులకు IOT ఆధారిత రక్షణ మరియు భద్రత సిస్టం యొక్క సరఫరా, స్థాపన, పనిచేయించుట, సమగ్రపరచుట మరియు నిర్వహణ సేవల" ప్రాజెక్ట్ కొరకు, దాని వెబ్‌సైట్ (http://www.aptransport.org/) మరియు GoAP e-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ (http://www.apeprocurement.gov.in) పై కూడా లభ్యమయ్యే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే జారీచేయబడిన, ఈ RFP లో మరియు ఇతర బిడ్డింగ్ డాక్యుమెంట్లలో నిర్దేశించిన రీతిలో మరియు నిబంధనల ప్రకారం ప్రి-క్వాలిఫికేషన్, టెక్నికల్ మరియు ఆర్థిక ప్రతిపాదనలను సమర్పించవలసినదిగా అర్హులైన మరియు సమర్థ బిడ్డర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తరపున (GoAP), ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, ఆంధ్రప్రదేశ్ కోరుతున్నారు. ఎట్టి కారణాలు చూపకుండా ఏదేని లేదా అన్ని ప్రతిపాదనలను తిరస్కరించుటకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు హక్కు కలదు.
సం/- ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్
DIPR No. 787/CL/Advt/1/1/2018-19

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VIZAG
T.N.No. 12/2018-19/SE(Mech)/EE(Mech)/DB/ Dt.14-06-2018
Sub:- GVMC - Mechanical - Empanelment of Advertising Agency/ Agencies to give advertisements from GVMC
1) Date of download starting date : 15-06-18 @ 02:00 PM
2) Date of download end date : 29-06-18 @ 04:00 PM
3) Date of bid submission end date : 29-06-18 @ 05:00 PM
4) Date of PQ stage : 29-06-18 @ 05:00 PM
5) Date of Commercial Stage : 02-07-18 @ 05:00 PM
Eligibility :-1) Indian News Paper Society Accreditation 2) DIPR Empanelment 3) Experience in publication of advertisements of Central / State / public Sectors 4) Local Infrastructure with office establishment and address 5) Creativity of Designing 6) Annual Turn Over in last 3 years (i.e. 2014-15 to 2016-17) 7) EMD of Rs.20000/-
Note: Further details at http://www.apeprocurement.gov.in
O/o the EE (Mech)..
Contact: 9912349476, 9885522645
Sd/xxxx
SE(Mechanical), GVMC
స్వచ్ఛ ఆంధ్ర
స్వచ్ఛ విశాఖ
స్వచ్ఛ విశాఖ మన లక్ష్యం - స్వచ్ఛ ఆంధ్ర మన గమ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ
ఇంజినీర్-ఇన్-చీఫ్, పి.ఆర్., PMGSY, అమరావతి @ విజయవాడ
ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన (PMGSY)
రోడ్ల పనుల నిమిత్తం బిడ్ల కొరకు ఆహ్వానం
జాతీయ పోటీ బిడ్డింగ్ (NCB)
PMGSY గ్రాంట్ క్రింద గ్రామీణ రహదారుల కొరకు IRC చే గుర్తింపు పొందిన సంప్రదాయమైన/నూతన టెక్నాలజీతో రోడ్డు మరియు వంతెన నిర్మాణం కొరకు అర్హులైన కాంట్రాక్టర్ల నుండి e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆంధ్రప్రదేశ్ గవర్నర్ తరఫున పర్సంటేజి రేటు టెండర్లను ఇంజినీర్-ఇన్-చీఫ్ (PR) PMGSY అమరావతి @ విజయవాడ ఆహ్వానిస్తున్నారు. కాగోరు బిడ్డరుదారులు టెండరు షెడ్యూళ్లను e-మార్కెట్ ప్రదేశం @ pmgsytendersap.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. వివరాలు దిగువ పేర్కొనబడినవి.

క్రమ సంఖ్య	జిల్లా	నిట్ నెం.	ప్యాకేజీల సంఖ్య	పిలుపు నెం.	టెండరు షెడ్యూళ్ల డౌన్‌లోడింగ్
1.	విజయనగరం	29/18-19 నుండి 33/18-19 వరకు	5	3వ పిలుపు	19-6-2018 నుండి 29-6-2018 వరకు
2.	విశాఖపట్నం	34/18-19 నుండి 35/18-19 వరకు	2	3వ పిలుపు	19-6-2018 నుండి 29-6-2018 వరకు
3.	విశాఖపట్నం	36/18-19	1	2వ పిలుపు	19-6-2018 నుండి 29-6-2018 వరకు
4.	విశాఖపట్నం	37/18-19 నుండి 56/18-19 వరకు	20	మొదటి పిలుపు	19-6-2018 నుండి 7-7-2018 వరకు
5.	విజయనగరం	57/18-19	1	మొదటి పిలుపు	19-6-2018 నుండి 7-7-2018 వరకు
		మొత్తం	29		

తదుపరి అన్ని వివరాలను ఇంటర్నెట్‌పై www.pred.ap.gov.in వద్ద చూడవచ్చును. మరియు రాష్ట్రంలోని సంబంధిత పర్యవేక్షక ఇంజినీరు, PR విజయనగరం & విశాఖపట్నం జిల్లాల నుండి కూడా పొందవచ్చును.
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్, PR, PMGSY
అమరావతి @ విజయవాడ
DIPR No. 175PP/CL/ADVT/1/1/2018-19

జీఎస్టీతో రాష్ట్రాల ప్రయోజనాలకు దెబ్బ

- స్థానిక అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పన్నులు విధించే వెసులుబాటేది?
- 15వ ఆర్థిక సంఘం విధివిధానాలకు సవరణలు చేపట్టాలి
- నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో వివరించనున్న సీఎం చంద్రబాబు
- ప్రస్తావన అంశాలతో సమగ్ర నివేదిక సిద్ధం

ఈనాడు, అమరావతి: వస్తుసేవల పన్ను (జీఎస్టీ) అమలు ఫలితంగా స్థానిక అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా స్థానికంగా పన్నులు విధించే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వాలకు లేకుండా పోయిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ నాలుగో సమావేశంలో వివరించనున్నారు. ఇది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోందని ఈ సమావేశం దృష్టికి తీసుకురానున్నారు. వీటితో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సిన నిధుల వాటాల్లో మార్పుల మూలంగా రాష్ట్ర ప్రభుత్వాలపై పడుతున్న అదనపు భారం, నోట్ల రద్దుతో ఏర్పడిన నగదు కొరత, బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో సన్నగిల్లుతున్న నమ్మకం తదితర అంశాలను ప్రస్తావించనున్నారు. ఈ నెల



17న దిల్లీలో ఈ సమావేశం జరగనుంది. ప్రస్తావించే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదిక రూపొందించింది. 15వ ఆర్థిక సంఘం విధివిధానాలపై అభ్యంతరాలు, ఎం.ఎస్.స్వామినాథన్ సిఫార్సుల అమలు ఆవశ్యకత, విభజన చట్టంలోని హామీల అమలులో కేంద్రం సహకరించకపోవడం వంటి అంశాలను పొందుపరిచారు. నాలుగేళ్లలో ప్రభుత్వ విజయాలను, గాంధీ 150వ జయంతోత్సవాల నేపథ్యంలో ఆయన ఆలోచనల అమలు ఆవశ్యకతను వివరించనున్నారు. ప్రస్తావించనున్న ప్రధాన అంశాలు..

జాతీయ స్థాయి

- 15వ ఆర్థిక సంఘం విధివిధానాలకు సవరణలు చేపట్టాలి. 2011వి కాకుండా 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలి. రెవెన్యూలోటు గ్రాంట్ ఇవ్వాలి. ముఖ్యమైనవి కాని విధివిధానాలను తొలగించాలి.
- కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి గతంలో 90:10 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉండగా... ఆ తర్వాత దాన్ని 60:40 నిష్పత్తికి మార్చారు. మరికొన్ని పథకాల అమలు బాధ్యతలను పూర్తిగా వైదొలగింది. ఈ మార్పుల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం పడుతోంది.
- నోట్లరద్దుతో దేశంలో నగదు కొరత తీవ్రమైంది. ఎఫ్ఆర్‌డీఐ బిల్లు లోపభూయిష్టంగా ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. వ్యవసాయం, పింఛన్ల పంపిణీ తదితర అవసరాలకు తగిన నగదు అందడం లేదు.

వ్యవసాయ రంగం

- భూ సంస్కరణలు, నీటిపారుదల, రుణ, బీమా సదుపాయం, ఆహార భద్రత, ఉపాధి, వ్యవసాయ దిగుబడులు, రైతుల్లో సామర్థ్యాల పెంపుపై స్వామినాథన్ సిఫార్సుల అమలుకు కార్యాచరణ రూపొందించాలి. పెట్టుబడి వ్యయం, రైతు శ్రమపై 50శాతం మొత్తాన్ని కలిపి కనీస మద్దతుధరగా నిర్ణయించి ఇవ్వాలి.
- పప్పుధాన్యాలకు కనీస మద్దతుధర ప్రకటించిన కేంద్రం.. వాటిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం లేదు. ఉత్పత్తిలో 40శాతం మేర కొంటోంది. ఈ పరిమితి మూలంగా మిగిలిన దానిని రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాల్సివస్తోంది. ఇది అదనపు భారంగా మారుతోంది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలి.
- ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానించాలి. దీని వల్ల సాగు ఖర్చులు తగ్గుతాయి.
- రుణాలు తీసుకోని రైతులకు కూడా పంటల బీమా వర్తించేలా చూడాలి.

ఆరోగ్య రంగం

- ఆయుష్మాన్ భారత్ పథకానికి సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను కాకుండా జనాభా గణనను పరిగణనలోకి తీసుకోవాలి. అలా చేయకపోవడంతో రాష్ట్రంలోని 56లక్షల కుటుంబాలకే మేలు కలుగుతోంది.
- మిషన్ పోషణ్ పరిధిలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించేందుకయ్యే వ్యయం మొత్తాన్ని, అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాన్ని కేంద్రం భరించాలి.
- మోడల్ స్కూల్ పథకం అమలు నుంచి కేంద్రం వైదొలగింది. దీన్ని పునఃపరిశీలించాలి.

విభజన అంశాలు

- విభజన చట్టాన్ని కేంద్రం అమలు చేయడం లేదు. హామీలను నెరవేర్చలేదు. మిగతా రాష్ట్రాలతో సమాన స్థాయికి వచ్చే వరకూ చేయూత ఇవ్వాలి.
- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని విభజన బిల్లుపై చర్చ సందర్భంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో ప్రకటించారు. పదేళ్ల పాటు హోదా ఇస్తామని భాజపా తన ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచింది. ఈ హామీని నెరవేర్చకుండా ఎన్డీయే ప్రభుత్వం ఏపీ ప్రజల్ని మోసం చేసింది.
- జాతీయ ప్రాధాన్యం కలిగిన విద్యా సంస్థలకు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు రూ.11,673 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకూ కేవలం రూ.638 కోట్లే ఇచ్చింది.
- పోలవరం ప్రాజెక్టు పనులు 56శాతం పూర్తయ్యాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించిన నిధుల్లో ఇంకా రూ.1,892 కోట్లు రావాలి. ఈ ప్రాజెక్టు రివైజ్డ్ డీపీఆర్‌ను ఇప్పటివరకూ కేంద్రం ఆమోదించలేదు.
- రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది రెవెన్యూ లోటు రూ.16,087 కోట్లు ఇవ్వాల్సి ఉండగా... ఇంకా రూ.13,000 కోట్లు ఇవ్వలేదు. ఆ లోటు భర్తీ చేయాలి.
- విభజన చట్టంలోని 9, 10 షెడ్యూళ్లలో ఉన్న సంస్థలతో పాటు ఏపీ భవన్ ఆస్తులను విభజించాలి.

ఇతర అంశాలు

- వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.350 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేసిన కేంద్రం.. మళ్లీ వెనక్కి తీసుకుంది. వినియోగపత్రాలు సమర్పించినా ఆ నిధులు తిరిగి జమ చేయలేదు.
- కేంద్రం సహకరించకపోవడం మూలంగా రాష్ట్ర ఫిస్కల్, ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపడటం లేదు. రాజధాని నిర్మాణానికి భారీగా నిధులు కావాలి.
- గత నాలుగేళ్లలో సగటున 10.5 శాతం వృద్ధి రేటు సాధించాం. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 11.22 శాతం వృద్ధి నమోదైంది.

ప్రైవేటు క్షౌరశాల వద్ద తలనీలాలు సమర్పించేందుకు వేచిఉన్న దుర్గమ్మ భక్తులు ★ భక్తుల ఆందోళనతో నిలిచిన వాహనాలు

దుర్గ గుడి క్షురకుల విధుల బహిష్కరణ

- భవానీ భక్తులకు తీవ్ర ఇక్కట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల నాయీబ్రాహ్మణ సంఘాల జేఏసీ పిలుపు మేరకు దుర్గగుడి కేశఖండనశాల క్షురకులు శుక్రవారం విధులు బహిష్కరించారు. దీంతో తలనీలాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన శుక్రవారం రోజు ఎక్కువమంది భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు తరలిరాగా.. క్షురకులు ఆందోళన చేయడంతో కేశఖండనశాల వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ప్రతి శుక్రవారం 3వేల మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుంటారు. అందుకు రెండు షిఫ్టుల్లో 100 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ఐదుగురు శాశ్వత ఉద్యోగులు మాత్రమే తలనీలాలు తీశారు. వారి వద్దకు కూడా భక్తులు వెళ్లకుండా జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. ప్రత్యామ్నాయం చూపని అధికారులపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన విరమింపజేశారు.

క్షురకుల సమస్యల పరిష్కారానికి 18న సమావేశం: కేఈ

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పనిచేసే క్షురకుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తెలిపారు. దీనిలోభాగంగా ఈ నెల 18న అధికారులు, క్షురకుల సంఘం ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలిగించకుండా వెంటనే సమ్మె విరమించాలని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన క్షురకులకు విజ్ఞప్తి చేశారు.

క్షురకులకు వేతనాలు పెంచాలి: రఘువీరా

ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ(6ఏ) పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న క్షురకులకు కనీస వేతనం రూ.15 వేలు చెల్లించాలని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం సహా ఏటా తలనీలాల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంలో కొంతభాగం కేటాయించాలని శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలో ఆయన కోరారు. ఇటీవల విజయవాడ కనకదుర్గ దేవస్థానంలో క్షురకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కూడా లేఖలో ఆయన పేర్కొన్నారు.

కక్షగట్టి కత్తిపట్టి.. ప్రేమోన్మాది ఘాతుకం

- యువతి మెడ కోసి దారుణ హత్య
- కరీంనగర్‌లో ఘోర ఘటన
- ప్రేమిస్తున్నానంటూ గోదావరిఖనిలో వెంటపడి వేధింపులు
- ఆ తర్వాత ఆమె జోలికి రానంటూ రాతపూర్వక హామీ
- ఆ ఊరు వదిలివచ్చినా నీడలా వెంటాడిన యువకుడు

నిందితుడు వంశీధర్ ★ రసజ్ఞ (పాతచిత్రం)

ఈనాడు, ఈనాడు డిజిటల్‌- కరీంనగర్: ఉన్మాది ప్రేమ ఓ యువతి నిండు ప్రాణాన్ని బలిగొంది. ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్న యువకుడి నుంచి తప్పించుకునేందుకు మరో ఊరికి వచ్చినా ఆ దుర్మార్గుడు వదిలిపెట్టలేదు. కక్షగట్టి కత్తిపట్టి వచ్చి కిరాతకానికి పాల్పడ్డాడు. ఉద్యోగం చేసుకుంటున్న యువతితో ఘర్షణకు దిగి ప్రాణాల్ని హరించాడు. ఈ ఘోర ఘటన శుక్రవారం కరీంనగర్‌లో తీవ్ర కలకలం సృష్టించింది. ఇకపై మీ అమ్మాయిని వేధించను.. బుద్ధిగా ఉంటానని పెద్దలకు చెప్పిన వ్యక్తే ఈ దారుణానికి తెగించాడు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఊట్ల రసజ్ఞ అలియాస్ రోషిణి(24) కరీంనగర్ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మీసేవా కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తుంది. ఎప్పటిమాదిరిగానే మీసేవా కేంద్రానికి ఆమె ఉదయం 10 గంటలకు వచ్చింది. ఆ తర్వాత కొద్ది సమయానికి అక్కడికి వచ్చిన వంశీధర్ అనే యువకుడు మీసేవా కేంద్రంలోకి వెళ్లి రసజ్ఞతో గొడవకు దిగాడు. కుర్చీలో నుంచి లేచి బయటకు వస్తున్న రసజ్ఞపై రెప్పపాటులో కత్తితో దాడి చేశాడు. ఆమె గొంతును కిరాతకంగా పదునైన కత్తితో కోయడంతో మెడ భాగం సగానికిపైగా తెగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. బాధితురాలు అక్కడికక్కడే కుప్పకూలింది. అనూహ్య ఘటన నుంచి దుకాణ యజమాని రాజు తేరుకుని వంశీధర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా నిందితుడు చేతి మణికట్టు భాగంలో కత్తితో కోసుకున్నాడు. రాజు అరుపులతో అప్రమత్తమైన స్థానికులు నిందితుడిని పట్టుకున్నారు. అపస్మారకస్థితిలో ఉన్న యువతిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. నిందితుడిని స్థానికులు చెట్టుకు కట్టేసి చితకబాదారు. వంశీధర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కొన్నాళ్లుగా వెంటపడుతూ...

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఊట్ల విష్ణువర్ధన్, విజయ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఉన్నారు. పెద్ద కుమార్తె రవళి ఇంజినీరింగ్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. రెండో కుమార్తె రసజ్ఞ గోదావరిఖనిలో డిగ్రీ పూర్తిచేసింది. స్థానికంగా ఉన్న మీసేవా కేంద్రంలో పని చేస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం శంకరంపల్లికి చెందిన వంశీధర్ గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీలోని మేనమామ, చిన్నమ్మ ఇళ్ల వద్ద ఉంటూ కొన్నాళ్లు మద్యం దుకాణంలో పనిచేశాడు. అతని చిన్నమ్మకు చెందిన మీసేవా కేంద్రంలో పనిచేస్తున్న రసజ్ఞను ప్రేమ పేరిట వేధించడంతో రసజ్ఞ సహా అతని కుటుంబీకులు పలుమార్లు వంశీధర్‌ను హెచ్చరించారు. అయినా వేధింపులు ఆగకపోగా ఇంకా పెరగడంతో రసజ్ఞ గోదావరిఖని నుంచి ఆరు నెలల కిందట కరీంనగర్‌కు వచ్చింది. కొన్నాళ్లు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో, రెండున్నర నెలలుగా స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మీసేవాలో పనిచేస్తుంది. గత నెల 28న వంశీధర్ ఇకపై రసజ్ఞను వేధించనని ఆమె తల్లిదండ్రుల సమక్షంలో ఒప్పంద లేఖ రాసిచ్చాడు. ఫోన్ చేయనని, ప్రేమ పేరిట ఇబ్బందులు పెట్టనని పేర్కొన్న అతను పక్షం రోజుల వ్యవధిలోనే ఆమెపై పథకం ప్రకారం దారుణానికి ఒడిగట్టాడు. నిందితుడు వంశీధర్ ప్రస్తుతం హైదరాబాద్‌లో పనిచేస్తున్నట్లు తెలిసింది.

పొరపాటు చేస్తే.. పోతుంది సీటు

- జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ఆప్షన్ల నమోదులో అప్రమత్తత తప్పదు
- నిట్ డైరెక్టర్ సీఎస్‌పీ రావు సూచన
- జోసా కౌన్సెలింగ్ విధానంపై అవగాహన కార్యక్రమం

మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ సీఎస్‌పీ రావు

ఈనాడు డిజిటల్, ఏలూరు, తాడేపల్లిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఆప్షన్ల నమోదు సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని.. తప్పులు దొర్లితే మంచి సంస్థను, కోర్సులను కోల్పోయే ప్రమాదం ఉందని ఏపీ నిట్ డైరెక్టర్ సీఎస్పీ రావు తెలిపారు. నిట్, ఐఐటీలకు సంబంధించిన జోసా కౌన్సెలింగ్ విధానంపై ఆయన ఏలూరులో ఈటీవీ-ఈనాడుతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకూ విద్యార్థులు ఎన్ని ఆప్షన్లు అయినా ఇచ్చుకోవచ్చని తెలిపారు. ఒక్కసారి లాక్ చేసిన తర్వాత మళ్లీ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉండదన్నారు. ఈనెల 27న మొదటి విడత సీట్లను కేటాయిస్తామని తెలిపారు. అనంతరం ఆయా రిపోర్టింగ్ సెంటర్లకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలని వివరించారు. రూ.లక్షలోపు ఆదాయం ఉన్నవారికి ట్యూషన్ ఫీజును తిరిగి చెల్లిస్తారని తెలిపారు. రూ.ఐదు లక్షలలోపు ఆదాయం ఉన్నవారికి 2/3 వంతు ఫీజును తిరిగి చెల్లిస్తారన్నారు. ఓబీసీ అభ్యర్థులు 1 ఏప్రిల్ 2018 తరువాత తీసుకున్న ధ్రువీకరణ పత్రాలై ఉండాలని తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ తాత్కాలిక ప్రాంగణంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఎస్పీ రావు మాట్లాడుతూ.. కౌన్సెలింగ్‌లో ఏ ఒక్క పొరపాటు జరిగినా సీటు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఏ సంస్థలో, ఏ కోర్సులో సీటు కావాలనుకుంటున్నామో కాగితంపై ముందుగానే రాసుకోవాలని సూచించారు. సీనియర్ ఆచార్యుడు రాధాకృష్ణమాచార్య మాట్లాడుతూ.. ఓబీసీ విద్యార్థులైతే నాన్ క్రిమిలేయర్ (ఎన్‌సీఎల్) ధ్రువపత్రాన్ని తప్పనిసరిగా దగ్గర పెట్టుకోవాలని, లేకుంటే ఓపెన్ కేటగిరిలోకి వెళ్తారని చెప్పారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆప్షన్ల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉత్తర కొరియా ‘అణు సమస్య’ను దాదాపు పరిష్కరించా: ట్రంప్

వాషింగ్టన్: ఉత్తర కొరియాతో ఏర్పడిన ‘అణు సమస్య’ను తాను దాదాపుగా పరిష్కరించేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. దక్షిణ కొరియాతో కలిసి ఆడే ‘యుద్ధ క్రీడ’లను ఆపేయడం ద్వారా పెద్ద మొత్తంలో ధనం ఆదా చేశానన్నారు. సింగపూర్‌లో ఇటీవల ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్‌తో ట్రంప్ భేటీ అయిన సంగతి తెలిసిందే. దక్షిణ కొరియాతో కలిసి నిర్వహించే సైనిక విన్యాసాలను ఈ సమావేశం తర్వాత ట్రంప్ నిలిపివేశారు. ఈ నిర్ణయంపై విమర్శలు వచ్చినప్పటికీ.. తన తీరును ట్రంప్ సమర్థించుకున్నారు. “ఈ యుద్ధ క్రీడలకు కోట్ల డాలర్ల ఖర్చవుతుంది. మనకెవరూ ఎందుకు చెల్లించరు? ఇది నా హయాం. వాటిని ఆపేయాలని నేను నిర్ణయించా. దీని వల్ల ఎంతో ధనం ఆదా అవుతుంది. ఓవైపు సంప్రదింపులు జరుపుతూనే.. మరోవైపు విన్యాసాలు నిర్వహించడం సరికాదు” అని ట్రంప్ అన్నారు.



మంత్రి నారాయణ జన్మదినం సందర్భంగా సచివాలయంలో ఆయనకు మిఠాయి తినిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మాజీ ఎమ్మెల్యే కుమారుడి ఆత్మహత్య

నాగార్జునరెడ్డి (పాతచిత్రం)

బనగానపల్లి, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా బనగానపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్ద కుమారుడు నాగార్జునరెడ్డి(28) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన గురువారం రాత్రి బనగానపల్లికి వచ్చారు. భోజనం అనంతరం తన గదిలోకి వెళ్లి పడుకున్నారు. ఉదయం సమయంలో అల్పాహారం కోసం పిలిచేందుకు పనిమనిషి వెళ్లగా గదిలోని పంకాకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన నాగార్జునరెడ్డి కనిపించారు. కుమారుడితో మృతితో కాటసాని నిశ్చేష్టులయ్యారు. బీటెక్ వరకు చదివిన నాగార్జునరెడ్డి కొంతకాలంగా రియల్ ఎస్టేట్ రంగంలో రాణిస్తున్నారు. రామిరెడ్డి 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి గెలుపొంది 2014 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. నాగార్జునకు కడుపునొప్పి ఉండేదని, భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుండెపోటు బాధితులకు శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసర వైద్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: గుండెపోటుకు గురైన బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యేక కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. శుక్రవారం వీటి సేవలను ప్రారంభించారు. ఇక్కడి విమానాశ్రయానికి నిత్యం లక్షమందికిపైగా రాకపోకలు సాగిస్తుంటారు. విమానంలోగానీ, విమానాశ్రయం ఆవరణలోగానీ గుండెపోటుకు గురైన వారిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు అత్యవసర సేవలు అందక ప్రాణాలు పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

అతనికి మైక్రోసాఫ్ట్ నుంచి ఇంటర్వ్యూకి ఆహ్వానం అందింది. ఉదయం 10కి ఇంటర్వ్యూ.. అయితే 7కే ఆఫీస్‌కి వెళ్లాడు. మొత్తం 12 రౌండ్స్ ఇంటర్వ్యూ. అన్నీ క్లియర్ చేశాడు. తర్వాత హెచ్‌ఆర్ నుంచి సర్టిఫికెట్లు కావాలని ఫోన్ వచ్చింది. పదో తరగతి ఒక్కటే ఉందని పంపాడు. కనీసం డిగ్రీ ఉండాలని ఇండియా హెడ్ నుంచి మళ్లీ ఫోన్. దానికి ఆ యువకుడు ఓ ప్రశ్న అడిగాడు. 'ఒక కాలేజీ డ్రాపవుట్ స్థాపించిన ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలో ప్రతిభ ఉన్న ఓ కుర్రాడికి అవకాశం ఇవ్వలేరా?' అని. అంతే ఇండియా హెడ్ ఫోన్ పెట్టేశారు. కొన్ని గంటల తర్వాత ఆ అబ్బాయికి ఉద్యోగం ఇస్తున్నామని చెప్పారు. భారత్ నుంచి పదో తరగతి చదువుతో మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగం సంపాదించిన మొదటి వ్యక్తి అతనే.

డీటీపీ ఆపరేటర్‌గా ప్రస్థానం ప్రారంభించిన అతను పదేళ్లు తిరిగే సరికి మైక్రోసాఫ్ట్‌లో 'చీఫ్ యాప్ ఆర్కిటెక్' స్థాయికి ఎదిగాడు. రూ.740తో మొదలైన సంపాదన ఈ రోజు రూ.750 కోట్ల టర్నోవర్‌కి చేరింది. మరి, ఆ యువకుడు ఎవరంటే కోటిరెడ్డి సరిపల్లి. ఊరు గుడివాడ దగ్గర్లోని జనార్దనపురం. అతని కథేంటి? తనెలా 'ఈతరం'కి ప్రేరణ?

పదో తరగతితోనే... మైక్రోసాఫ్ట్ వరకూ!

- నీకేం తెలియదమ్మా ఊరుకో... ఎప్పుడూ ఏదోటి చెప్పి విసిగిస్తుంటావ్
  - అనే కొడుకులు ఎందరో
- తాత ముత్తాల నుంచి ఇదే... మట్టి పిసుకుతూ ఏం సంపాదించారు?
  - అనే బిడ్డలూ ఉన్నారు
- ఎంతో కష్టపడ్డాను... ర్యాంకు రాకుంటే ఈ జీవితమెందుకు?
  - అని తనువు చాలిస్తున్నవారూ అనేకం
- ఏదో చదివాములే డిగ్రీలు.. నాలుక గీక్కోవడానికి కూడా పనికిరావు
  - అనే చదువర్లని చూశాం.

కానీ, కోటిరెడ్డి మాత్రం అలా కాదు. 'నువ్వు గొప్పోడివి అవుతావ్ నాన్నా..' అంటూ నిత్యం తలనిమిరి అమ్మ చెప్పిన వాక్కునే దైవవాక్కుగా నమ్మాడు. 'రెక్కలు ముక్కలు చేసుకుంటేగానీ నాలుగేళ్లు నోట్లోకి వెళ్లవు... మనకెందుకు కంప్యూటర్ చదువులు' అంటున్న నాన్న మాటలు విని సాగుబడిలో ఖరీఫ్... రబీలను చమటోడ్చి దిద్దాడు. 'పదో తరగతి ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యావ్ ఏదోక డిగ్రీ చేసుకోక నీకెందుకు పార పనులు...' అనే ఇరుగుపొరుగు మాటలు మదిలోని కలని మరింత దృఢంగా మార్చాయి. 'పాఠ్య పుస్తకాలతో పాటు... పలువురి జీవిత చరిత్రల్ని పరిచయం చేసిన గ్రామ గ్రంథాలయంతో సహచర్యం..' సంస్కారవంతమైన విద్యకి బాటలు వేసింది. అందుకేనేమో.. ఆ కొడుకు చదివింది పదో తరగతే... కంప్యూటర్ నేర్చుకోవడానికి కట్టింది వెయ్యి రూపాయలే. నేర్చుకున్న కోర్సు పీజీడీసీఏ. కానీ, వరించిన ఉద్యోగం మాత్రం మైక్రోసాఫ్ట్‌లో. కెరీర్‌లో ఉన్నత చదువులు అవసరమే. కానీ, డిగ్రీలు... పీజీలు లేకున్నా పట్టుదలుంటే ఉన్నత స్థాయికి వెళ్లొచ్చని నిరూపించాడు కోటిరెడ్డి. తర్వాత దూరవిద్య ద్వారా డిగ్రీలు అందుకున్నాడు.. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ నుంచి డాక్టరేట్ తీసుకున్నాడు. ఇవేం కిక్కివ్వలేదు. ఇంకేదో సాధించాలనుకున్నాడు. దేశానికి తిరుగు ప్రయాణం. రాగానే 'కోటి గ్రూప్ ఆఫ్ వెంచర్స్'తో కొత్త ప్రయాణం. విద్య, వైద్యం, వ్యవసాయం... ఇలా పలు రంగాల్లో సేవలందించేందుకు పది సంస్థలకుపైనే స్థాపించాడు. వాటిల్లో 70 శాతం వాటా కోటీ గ్రూపువే. తన ఉద్యోగులందరితో కలిసి 'మాదో వసుధైక కుటుంబం' అంటూ ఈతరంతో తన జర్నీని పంచుకున్నారిలా...

వాళ్లిద్దరే ముందు

మధ్య తరగతి కుటుంబం. పెట్టుబడి తిరిగొస్తే చాలనుకుని భూమిని నమ్ముకుని బతికే మనిషి నాన్న. ఇద్దరు అక్కల తర్వాత నేను. నాకు అమ్మే బెస్ట్ ఫ్రెండ్. తెలిసిందల్లా ఇల్లు.. ఊర్లో గ్రంథాలయం. చిన్న వయసులోనే చాలా మంది జీవిత చరిత్రలు చదివేశా. అందువల్లేమో దేంట్లోనైనా స్పష్టత ప్రదర్శించేవాడిని. చదివిన పుస్తకాల్లో బిల్‌గేట్స్ రాసిన 'ది రోడ్ ఎహెడ్' నాకు బాగా నచ్చిన పుస్తకం. అలాగే, కంప్యూటర్ అంటే ఇష్టం ఏర్పడడానికి కారణం సత్యం రామలింగరాజుగారు. అందుకు కారణం లేకపోలేదు. ఆరోజుల్లో తెలిసినవారింట్లో ఎవరైనా సత్యం కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారంటే గొప్పగా చెప్పుకునేవారు. అలా నాకూ 'ఎంసీఏ' చేసి కంప్యూటర్స్‌లో మాస్టర్ అవ్వాలని నిర్ణయించుకున్నా. కానీ, మనకంత శక్తి లేదని నాన్న తేల్చేశారు. నేనేమో అప్పటికే కంప్యూటర్‌తో ప్రేమలో పడిపోయా. దీంతో వేరే చదువులు నాకొద్దని పదో తరగతి తర్వాత నాన్నతోనే పొలానికెళ్లా. కానీ, ఎప్పుడూ కంప్యూటర్ కలలే.

ఆ 'వెయ్యే' మూలం...

సంక్రాంతికి కొత్త దుస్తులు కొనుక్కోమని అమ్మ ఓ వెయ్యి రూపాయలు ఇచ్చి గుడివాడ పంపారు. అమ్మ తోడు లేకుండా ఫ్రెండ్స్‌తో పట్టణానికి రావడం అదే మొదటిసారి. షాపింగ్‌కి వెళ్లే దార్లో 'రూ.1000కే పీజీడీసీఏ కోర్సు' అని కనిపించింది. తెచ్చిన డబ్బులు కట్టేశా. అలా కంప్యూటర్ విద్యాభ్యాసానికి బీజం పడింది. అదే ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాకల్టీగా... స్నేహితుడితో కలిసి నిర్వాహకుడిగా మారా. ఇంకేదో తపనతో హైదరాబాద్‌కి వచ్చేశా. 'సీ' లాంగ్వేజీ ఫ్యాకల్టీగా ఓ ఇన్‌స్టిట్యూట్‌లో చేరా. దాంట్లో తరగతులు తీసుకుంటూనే ఉద్యోగ ప్రయత్నాలు. అప్పటికే నా పేరుతో 'యంగెస్ట్ జావా సర్టిఫైడ్ ప్రొఫెషనల్ ఇన్ ఇండియా' రికార్డు ఉంది. అంటే... జావా సబ్జెక్ట్‌లో నైపుణ్యం సాధించిన వారిలో అత్యంత పిన్నవయస్కుడిని. ఓ మల్టీనేషనల్ కంపెనీ నుంచి సీటీవోగా ఆఫర్ వచ్చింది. అప్పుడే మైక్రోసాఫ్ట్‌కీ ఎంపికయ్యాడు. ఆ తర్వాత కంపెనీ 'యాప్ ఆర్కిటెక్ కోర్ టీమ్'లో స్థానం. లక్షల్లో జీతం. కానీ, ఏదో వెలితి.

- మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ కాలేజీ డ్రాప్‌అవుట్. కానీ, ఓ తరానికి ఆయన స్ఫూర్తిగా నిలిచారు. అదే స్ఫూర్తి నాలో ఎనలేని శక్తిని నింపింది.
- చదువు, సంపాదన కంటే చివరి వరకూ మనతో ఉండేది సరైన వైఖరే అనేది నేను నమ్మే సిద్ధాంతం.
- అంకురాలతో ముందుకు రావాలనుకునేవారు. ఐడియాకి ఆకారాన్ని ఇవ్వడం దగ్గరే అలిసిపోవద్దు. దాని అవసరం ఎంత? దానికున్న బిజినెస్ ఎంత? అనే విషయాలపైనా ఎక్కువ విశ్లేషణ చేయాలి. అప్పుడే చిగురించే అంకురం జీవితకాలం ఉంటుంది.

తిరిగి ఇచ్చేయాలనే...

అమెరికాలో ఉన్నప్పుడే దేశంలో నావైన ఆలోచనలతో కంపెనీని స్థాపించాలనుకున్నా. 2014లో అది నిజం అయింది. కోటీ గ్రూప్ ఆఫ్ వెంచర్స్‌తో. దేశానికి ప్రాథమిక అవసరాలుగా గుర్తించిన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో టెక్నాలజీ సేవలందించేందుకు కంపెనీలను స్థాపించా. వాటిల్లో భారత్ ఇన్నోవేషన్స్, భారత్ హెల్త్‌కేర్, డిజిటల్ ఎడ్యుకేషన్, డీజెడ్ పే, ఈ-గుడి, క్రౌడ్ బ్లడ్, సిట్రస్ క్లినిక్ కంపెనీలతో పాటు మరికొన్ని ఉన్నాయి. వైద్యం, విద్య... ఈ రెండు సరైన సమయంలో అందక ఎన్నో ఇబ్బందులు పడడం నాకు స్వీయ అనుభవం. అందుకే భారత్ హెల్త్ కేర్ టెక్నాలజీ లక్ష్యం ఒక్కటే. దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా 238 దేశాల్లోని 784 కోట్ల మంది ఆరోగ్య పరిరక్షణకు ఒనగూరే ఇన్నోవేషన్స్‌తో ముందుకు రానున్నాం. హెల్త్ మానిటరింగ్ సౌకర్యం కోట్ల ఆస్తులు, లక్షల్లో హెల్త్‌పాలసీలు ఉన్నవారికే కాదు. ఓ రిక్షావాలాకి కూడా తన ఆరోగ్యాన్ని డిజిటల్‌గా మానిటరింగ్ చేసుకున్ననాడే హెల్త్ టెక్నాలజీస్‌కి సార్థకత చేకూరుతుంది. సౌకర్యవంతమైన ఉద్యోగం వదిలి పారిశ్రామికవేత్తగా మారడం వెనక మరో కారణం ఉంది. దేశంలోని నిరుద్యోగ యువత. పలు లక్ష్యాలతో నేను స్థాపించే కంపెనీల్లో సామర్థ్యం ఉన్న యువతకి అవకాశాలు కల్పిస్తూ వారితో కలిసి పని చేయాలి. ఈ క్రమంలో 'అభివృద్ధి చెందిన దేశంగా భారత్'ని చూడాలనుకుంటున్నా. సంపాదనలో 33 శాతం సేవకే. 'సేవా ఫౌండేషన్'తో పేద విద్యార్థులు, గూడులేని వయోవృద్ధులకు సాయం చేస్తున్నాం. జనార్ధనపురం, నందివాడల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్ని దత్తత తీసుకున్నాం. డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేశాం. మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నాం. ప్రైవేటు పాఠశాలకు దీటుగా అన్ని సౌకర్యాల్ని కల్పిస్తున్నాం అంటూ కోటిరెడ్డి తన జర్నీని పంచుకున్నారు.

నాలా... మిగలొద్దు

ఇద్దరిదీ ఒకే ఊరు. కళాశాలకు బస్సులో వెళ్లే వాళ్లం. సాయంత్రం ఊరికి వచ్చేవాళ్లం. బస్సు దిగాక మా ఊరికి ఒకటిన్నర కిలోమీటరు నడవాలి. ఒక రోజు నేను నా ఫ్రెండ్స్‌తో కలిసి షాపింగ్‌కి వెళ్లి వచ్చే సరికి రాత్రైంది. బస్సులో సీట్లు లేవు. అది మిస్సైతే మరొక బస్సు లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో నేను, కళ నిల్చున్నాం. మా ఊరివాళ్లు ఎవరైనా ఉన్నారేమోనని చూశాం. ఎవరూ కన్పించలేదు. కొద్దిసేపటికి సీట్లోంచి లేచి కూర్చోండని నాకు, కళకు పిలుపు. ఎవరా? అని చూస్తుండగానే అర్థమైంది. శీను. పక్కన ఆయనతో ఏదో మాట్లాడి ఇద్దరు కలిసి లేచారు. నేను కళ్లతోనే థ్యాంక్స్ అన్నట్లు చూశాను. తనకు అర్థమైందనుకుంటా! పర్వాలేదన్నట్లు కళ్లు సైగ చేశాడు. అరగంటకు మా ఊరి క్రాస్ వద్ద బస్సు ఆగింది. ముగ్గురం దిగాం. 'ఏం భయం లేదు... నాతో రండి' అని ముందుకు కదిలాడు. శీను వెనకాలే నడిచాం. అరగంటకు ఊరు చేరాం. ఆ రోజు పరిచయం... తర్వాత నెల రోజులకే శీనుతో చనువు పెంచింది. ఒకరోజు మా ఊరికి నడిచి వెళ్లే దారిలోనే నాకు ప్రపోజ్ చేశాడు. నన్ను రెండేళ్లుగా ప్రేమిస్తున్నానని చెప్పాడు. అలా ఆరునెలలు రోజూ ప్రపోజ్ చేశాడు. తనమీద నాకున్న మంచి అభిప్రాయం... అతన్ని అడ్డుకోనివ్వలేదు. పైగా నా మనసులోనూ ప్రేమ ఉన్నట్లే అనిపించింది. అయితే మా ఇద్దరివీ వేర్వేరు కులాలు. మా పెద్దలే కాదు... ఊర్లో ఎవ్వరూ మేం కలిసి జీవించడానికి ఒప్పుకోరు. ఈ విషయం నన్ను వెనక్కి నెట్టేది. 2012, ఫిబ్రవరి 14న ఇక నువ్వు

లేకపోతే నేను బతకలేను అని చెప్పాడు. ఏమైనా సరే అనుకొని తన ప్రేమని ఓకే చేశాను. చెరువుగట్టు మా కబుర్లతో నిండింది. రోజూ ప్రయాణించే బస్సు మా చూపుల అలంకరణతో పుష్పక విమానంలా తోచేది. డిగ్రీ ఫైనలియర్లో మేం చెరువు గట్టున మాట్లాడుకుంటుంటే మా బావ చూశాడు. ఇక ఇంట్లో చెప్పేస్తాడేమోనని భయపడ్డాం. ఇంట్లోంచి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యాం. ఆ రోజు రాత్రే తిరుపతికి వెళ్లి పెళ్లి చేసుకున్నాం. చంద్రగిరిలో ఒక ఇల్లు తీసుకొని కొత్త కాపురం పెట్టాం. నేను ఓ కళాశాలలో లైబ్రరీలో పనికి కుదిరాను. తను ఏ పని చేసేవాడు కాదు. నేను తెచ్చిన డబ్బు, బంగారం రెండు నెలలకే అయిపోయాయి. కష్టాలు మొదలయ్యాయి. కంట్లో నీళ్లు రాకుండా చూసుకుంటానని చెప్పిన శీను.. కళ్లలో నీళ్లు తుడవడానికి ఇష్టపడటం లేదు. తాగుడు అలవాటు చేసుకున్నాడు. నేను నెల తప్పాను. వద్దని అబార్షన్ చేయించాడు. నా ఆరోగ్యం బాగాలేక నేను లైబ్రరీకి వెళ్లలేదు. ఆ నెల జీతమూ రాలేదు. నువ్వు ఏదైనా పనిచేస్తే బాగుంటుందని చెప్పాను. నీ వల్లే నాకు ఈ గతి పట్టిందని విసుక్కున్నాడు. రోజూ తాగడం, కొట్టడం ఇదే పనిగా పెట్టుకున్నాడు. నువ్వు లేకపోతే బతకలేను అన్నవాడు... నువ్వుంటే బతుకే లేదు... అన్నట్లు మారిపోయాడు. లైబ్రరీలోకి వేరేవాళ్లని తీసుకోవడంతో నాకు ఆసరా పోయింది. ఎన్ని రోజులని అప్పులు? ఆకలితో అలాగే పడుకునేదాన్ని... తను మాత్రం ఎక్కడో తాగి వచ్చేవాడు. ఆ రోజు రాత్రి నువ్వు నన్ను శనిలా పట్టుకున్నావ్? వదిలేసి పోతే నేనైనా ఇంటికెళ్లి బాగా బతుకుతాను అన్నాడు. నా మనసు విరిగిపోయింది. తెల్లారేసరికి ఇంట్లో ఉండకూడదని అనుకున్నాను. హైదరాబాద్ వచ్చేశాను. ఇక్కడ ఓ ఫ్రెండ్ సాయంతో పనిచేసుకుంటూ బతుకుతున్నాను. ఆరు నెలలు గడిచిపోయాయి. నా కోసం వెదుకుతాడనుకున్నాను. ఆ ఆశ లేకుండా పోయింది. ప్రేమంటేనే విరక్తి పుట్టింది. అమ్మాయిలందరికీ నా జీవితం ఒక పాఠం కావాలని చెబుతున్నా. అంతత్వరగా ఎవరినీ నమ్మొద్దు. ఇంట్లో వాళ్లందరనీ వదిలేసి వచ్చి... నాలా ఒంటరిగా మిగలొద్దు.

- మీ తోటి అమ్మాయి

ఫిఫాషన్

ట్రెండీగా ఉండటమంటే యువతకు ఎంత ఇష్టమో చెప్పక్కర్లేదు. ప్రపంచంలో ఏది నడుస్తుందో యువతకు ఇట్టే తెలిసిపోతుంది. ఫ్యాషన్‌వరల్డ్ ఆ నాడిని అట్టే పట్టేస్తుంది. మిలియనల్స్, జనరేషన్ నెక్ట్స్‌కు ఏం నచ్చుతాయో తెలుసుకొని మార్కెట్‌ని ముంచెత్తుతారు. ఇప్పుడు ప్రపంచం ఫిఫా ఫీవర్‌లో ఉంది. మరి యువత వాట్సప్‌లు, ఫేస్‌బుక్‌లు, ఇన్‌స్టాగ్రామ్‌లు వేటితో నింపుతారు? ఫుట్‌బాల్ విశేషాలతోనే కదా! అందుకే ఆ ఫ్యాషన్‌తోనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ షాపింగులకు కళతెస్తున్నారు ఫ్యాషన్ డిజైనర్లు, హ్యాట్, బెల్ట్, కీచైన్ దగ్గర నుంచి జీన్స్, టీషర్ట్ ఇలా... అన్నీ ఫిఫా ఫుట్‌బాల్ థీమ్‌తోనే రూపొందించి మార్కెట్లో వదిలారు. యువత ఈ నెల రోజులు వీటినే ఎక్కువగా ఇష్టపడతారని, కొంటారని, ధరిస్తారని భావిస్తోంది ఫ్యాషన్ ప్రపంచం. అందుబాటు ధరల్లోనే ఉంచి ఊరిస్తున్నారు.

ఛా'నల్ భీమపాకం'

వెరైటీ వంటల ఛానళ్లు చాలానే ఉన్నాయ్ 'నవాబ్స్ కిచెన్' వాటన్నిటికీ భిన్నం ఎందుకంటే... ఆ కిచెన్‌లో వంటలకి ఆకలి కేకలు తెలుసు! అందుకే ఘుమఘుమలు వెదజల్లుతూ గూడులేని చిన్నారుల్ని వెతుక్కుంటూ వెళ్తాయి ఆత్మీయ పలకరింపుతో ఆకలి తీరుస్తాయి. అదెలా?

శ్రీనాథ్‌రెడ్డి, భగత్‌రెడ్డి, కాజా మొయినుదీన్‌లే ఆ వంటలు వండే చేతులు.. 'నవాబ్స్ కిచెన్ ఫుడ్ ఫర్ ఆల్ ఆర్ఫాన్స్' పేరుతో యూట్యూబ్ ఛానల్ పెట్టి వినూత్నంగా ముందుకొచ్చారు

రెండులక్షల మందికి పైనే వీక్షకులకు చేరువయ్యారు. వీరిని ఈ-తరం పలకరించింది..

ఆత్మీయత వండే యూట్యూబ్ ఛానల్

ఆ ముగ్గురివీ వేర్వేరు ప్రాంతాలు.. భిన్న నేపథ్యాలు.. విభిన్న విద్యార్హతలు! లక్ష్యం, ఆసక్తీ, అభిరుచులు మాత్రం ఒకటే! అందుకే ఉద్యోగాలకు రాజీనామా చేశారు. యూట్యూబ్‌లో కొత్త వంటల్ని పరిచయం చేస్తూ.. ఆనాథలకి ఆకలి తీరుస్తున్నారు. 'నవాబ్స్ కిచెన్ ఫుడ్ ఫర్ ఆల్ ఆర్ఫాన్స్' పేరుతో యూట్యూబ్ ఛానల్ పెట్టి రెండులక్షల మందికి పైనే వీక్షకులకు చేరువయ్యారు. సరికొత్తగా సేవ చేస్తూ.. ఆదాయం పొందుతున్న వీరి గురించి మీకోసం..

సత్తెనపల్లికి చెందిన శ్రీనాథ్‌రెడ్డి, అనంతపురానికి చెందిన భగత్‌రెడ్డి, వరంగల్‌కి చెందిన మొయినుద్దీన్.. ఇంతకు ముందు ఎవరికి ఎవరు తెలియదు. వీళ్లు ముగ్గురు గ్రాడ్యుయేషన్ చేసి.. ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చారు. ఓ సంస్థలో ఎడిటింగ్, కెమెరా డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాల్లో చేరారు. అలా కలిసి పనిచేస్తున్నప్పుడు స్నేహితులయ్యారు. సమాజం కోసం మనం ఏం చేస్తున్నాం అన్నదానికీ వారికి సమాధానం దొరకలేదు. ఉద్యోగానికి రాజీనామా చేశారు.

వీరికి వంటలంటే ఆసక్తి. దాంతోపాటు అనాథాశ్రమాల్లో ఉండే వారికి రకరకాలు ఆహారపదార్థాలు, సరకులు ఇస్తుండేవారు. దాంతో ఈ రెండు అభిరుచులను కలగలిపితే బాగుంటుందని ఆలోచించారు. అలా 'నవాబ్స్ కిచెన్ ఫుడ్ ఫర్ ఆల్ ఆర్ఫాన్స్' యూట్యూబ్ ఛానల్. కొత్త వంటకాన్ని ఎక్కువ మొత్తంలో చేసి.. దాన్ని అనాథాశ్రమాల్లోని చిన్నారులకు పంచడమే లక్ష్యం. ఇలా వారికి కొత్త రుచులను పరిచయం చేసినట్టు ఉంటుందని భావించారు. దాదాపు లక్షరూపాయలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఖర్చులతో పాటు, పనినీ ముగ్గురూ పంచుకున్నారు.

ఆరుబయట వంట: నాలుగు గోడల మధ్య లైట్ల వెలుతురులో వంట చేస్తే ఏం ఉంటుంది. ఆరు బయట పల్లెటూరి నేపథ్యంలో చెట్టు కింద చేస్తే బాగుంటుందని ఆలోచించారు. హైదరాబాద్‌కు దగ్గరలోని నార్సింగ్ పచ్చని చెట్లూ, మొక్కలతో కళకళలాడుతుంటుంది. ఆ వాతావరణంలో వంటలు చేస్తే బాగుంటుందని అనుకున్నారు. ఈ ముగ్గురిలో మొయినుద్దీన్ వంటలు బాగా చేస్తాడు. దాంతో వీడియోలో వంటలు చేసే చెఫ్ బాధ్యతలు తనే తీసుకున్నాడు. భగత్ వీడియోలు తీస్తాడు. శ్రీనాథ్ ఎడిటింగ్ చేస్తాడు. 'ఎనిమిది నెలల క్రితం..ఎగ్ ఫ్రైడ్ చేసి ఇరవై అనాథాశ్రమాల్లో ఉండే చిన్నారులకు వడ్డించాం. ఆ రోజు ఆ పిల్లలు ఎంతో సంతృప్తిగా తిన్నారు. కన్నీళ్లతో నిండిన వాళ్ల కళ్లలో ఆనందం ఈరోజుకీ గుర్తుంది. మా నంబర్లు తీసుకుని తరచూ ఫోన్ చేస్తుంటారు. అన్నయ్యా అంటూ వరసలు కలిపి ఆప్యాయంగా ఆహ్వానిస్తుంటారు' అంటూ శ్రీనాథ్‌రెడ్డి ఆనందాన్ని పంచుకున్నారు. వంట వండే విధానం.. పిల్లలు తింటూ ఆస్వాదిస్తూ.. ఆనందిస్తున్న భావోద్వేగాలనూ కెమెరాలో బంధిస్తారు.

దాతల ఆసక్తి : ఇరవై వీడియోలను సొంత ఖర్చులతో చేశారు. వీటిని చూసి విదేశాల్లో ఉన్నవారు చాలామంది స్పందించారు. పుట్టిన రోజులూ, పెళ్లిరోజులూ, ఇతర సందర్భాలప్పుడు విరాళం ఇచ్చి తమ వంతుగా ఏదో ఒక ప్రత్యేక వంట వండి అనాథలకు పెట్టమని అడగడం మొదలుపెట్టారు. ప్రవాసులూ, విదేశీయులు సైతం స్పందించారు. అలా ఆరునెలల నుంచీ విరాళాలతోనే కొత్త వంటకాలను తయారు చేస్తున్నారు. ఖర్చు గురించి ఏ మాత్రం ఆలోచించరు. ఈ మధ్య లిచీతో జ్యూస్ చేశారు. అవి చాలా ఖరీదు అయినా పట్టించుకోలేదు. ఇప్పటి వరకూ 105 వీడియోలు చేశారు. వారంలో మూడు కచ్చితంగా చేస్తూ... నెలకు పన్నెండు నుంచి పదిహేను వీడియోలు పోస్ట్ చేస్తారు.

– పద్మ వడ్డె

"ఇది రంజాన్ నెల కాబట్టి దాతలు ఎక్కువగా వస్తున్నారు. ఇప్పటి వరకూ మా సబ్‌స్క్రైబర్స్ రెండు లక్షల ఏడు వేలు దాటారు. దాంతో మాకు గూగుల్ లక్షరూపాయలు అందిస్తుంది. ఆ డబ్బును మేం ముగ్గురం పంచుకుంటాం. అనాథాశ్రమాలకు ఆహారం అందించే ముందు వాళ్ల గురించి ఆరా తీస్తాం. వాళ్ల అభిరుచులూ కనుక్కుంటాం. అదే విధంగా వంటకం కొత్తగా ఉండేలా చేస్తాం. హైదరాబాద్‌లోనే కాదు.. గుంటూరు, హన్మకొండ, ఇతర ప్రాంతాల్లోనూ చేశాం. మొయినుద్దీన్ వంట చేయడానికి ముందే ఇంట్లో తక్కువ మొత్తంలో ఒకసారి ప్రయత్నిస్తాడు. తయారైన పదార్థాలను రాత్రిపూట పిల్లలకు వడ్డిస్తాం. ఈ మధ్య ఒక చిన్న కుర్రాడు టీ కొట్లో పని చేస్తున్నాడు. ఆ బాలుడితో మాట్లాడితే తండ్రికి పెరాలసిస్ వచ్చిందని, తల్లి పనులు చేయకపోతోందని బాధపడ్డాడు. మేం ముగ్గురం ఆ కుర్రాణ్ని బడికి పంపుతున్నాం. నలభై వేల రూపాయలతో వాళ్లమ్మ చేత ఓ చిన్న కిరాణా దుకాణం పెట్టించాం.

ఈనాడు సినిమా

అనుష్క

నా సామర్థ్యం అంతే!

"ముందు చూపు ముఖ్యమే కానీ... అదే పనిగా రేపటి గురించి ఆలోచించడం నాకు ఏమాత్రం ఇష్టం ఉండద"ని చెబుతోంది అనుష్క. అలా ఆలోచిస్తూ కూర్చుంటే ఈ రోజుని ఆస్వాదించలేనేమో అని నా భయం అంటోందామె. కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలకి కేరాఫ్‌గా నిలిచిన అనుష్క, 'భాగమతి' తర్వాత విరామం దొరకడంతో వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదిస్తోంది. భవిష్యత్తు గురించి ఏయే సందర్భాల్లో ఆలోచిస్తుంటారని అడిగితే... "అసలు దాని గురించి ఆలోచనే రాద"ని చెబుతోంది. "నా జీవితం రోజువారీ ప్రాతిపదికనే నడుస్తుంటుంది. ఈ రోజు ఏంటనేదే నాకు ముఖ్యం. మరీ ఎక్కువ ముందు చూపుతో ఆలోచిస్తే మనసులో తెలియని ఒత్తిడి మొదలైపోతుంటుంది. అందుకే నా సామర్థ్యం ఇంతే అనుకొని ఆ రోజు గురించే ఆలోచిస్తా. వృత్తి పరంగా కూడా 'ఫలానా సమయంలో అలాంటి కథని ఎంపిక చేసుకోవాలి, ఇన్నేళ్లకి ఇది చేయాల'ంటూ లెక్కలేసుకొని పనిచేయడం నాకు నచ్చదు. నేనెప్పుడు ఏం చేయాలో కాలానికే బాగా తెలుసని నమ్ముతాన"ని చెప్పింది అనుష్క.

డార్జిలింగ్ అందాలకు పరవశిస్తున్న రజనీ!

రజనీకాంత్

డార్జిలింగ్ అందాల్ని, అక్కడి కొండల్ని చూసి పరవశించిపోతున్నారు రజనీకాంత్. అంతేకాదు అక్కడ లోకేషన్లు పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదంటూ బాధపడుతున్నారు కూడా. ఆయన కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఓ కొత్త చిత్రం చిత్రీకరణ ఇటీవలే డార్జిలింగ్‌లో ప్రారంభమైంది. అక్కడే కీలక సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ "డార్జిలింగ్‌లోని అందమైన లోకేషన్లు నా చిత్రం ద్వారా దేశమంతా తెలుస్తాయి. మంచి మనసున్న ఎంతో మంది ప్రజల్ని ఇక్కడ కలిసినందుకు ఆనందంగా ఉంది. త్వరలోనే ఇక్కడ 30 రోజుల పాటు చిత్రీకరణ చేయనున్నాం" అని చెప్పారు. ఈ నెల 17 నుంచి జులై 5 వరకూ అక్కడ చిత్రీకరణ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పంచ్ డైలాగ్

జీవితంలో నటించొచ్చు. కానీ జీవితాన్ని నటించకూడదు.

చిత్రం: మహానటి

– పంపినవారు: రహంతుల్లా పఠాన్, ఈమెయిల్

నాని... 'జెర్సీ'

కథానాయకుడు నాని కొత్త సినిమాకి పచ్చజెండా ఊపారు. 'మళ్ళీ రావా'తో పరిశ్రమ దృష్టిని ఆకర్షించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో నాని తదుపరి సినిమా తెరకెక్కబోతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'జెర్సీ' అనే పేరును ఖరారు చేశారు. క్రికెట్ నేపథ్యంలో సాగే కథ ఇది. చిత్రబృందం శుక్రవారం పేరును ప్రకటించింది. పేరుతో పాటు విడుదలైన పోస్టర్‌లో అర్జున్ అని రాసి ఉన్న క్రికెటర్ జెర్సీ కనిపిస్తోంది. దీన్నిబట్టి నాని ఈ చిత్రంలో క్రికెటర్‌గా కనిపించనున్నట్టు తెలుస్తోంది. క్రికెట్, ప్రేమ మేళవింపుతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్టు సమాచారం. నాని ఇదివరకు క్రీడా నేపథ్యంలో 'భీమిలి కబడ్డీ జట్టు' చేసిన విషయం తెలిసిందే. 'భలే భలే మగాడివోయ్'లో వీడి పేరు నాని.. రెచ్చిపోతే ధోని అంటూ సందడి చేశాడు. మరి ఈ చిత్రంలో నిజంగానే ధోనిలా రెచ్చిపోతాడేమో చూడాలి. ప్రస్తుతం నాగార్జునతో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్నారు నాని.

కొత్త కబుర్లు

సాయిధరమ్

కల్యాణి

'హలో' అమ్మాయితో..?

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమాకి 'చిత్రలహరి' అనే పేరు ప్రచారంలో ఉంది. ఇందులో సాయిధరమ్ తేజ్ సరసన ఇద్దరు కథానాయికలకి చోటున్నట్టు తెలుస్తోంది. ఓ కథానాయికగా 'హలో' భామ కల్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్టు సమాచారం. మరో కథానాయిక స్థానంలో అనుపమ పరమేశ్వరన్ కానీ, రితికాసింగ్ కానీ కనిపించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. త్వరలోనే 'తేజ్'తో సందడి చేయబోతున్నాడు సాయిధరమ్ తేజ్.

కథ నచ్చింది

మరో రచయిత మెగాఫోన్ చేతపట్టబోతున్నారు. 'సీమశాస్త్రి', 'పిల్లా నువ్వు లేని జీవితం', 'పాండవులు పాండవులు తుమ్మెద', 'ఈడో రకం ఆడో రకం', 'గాయత్రి' తదితర చిత్రాలకి రచయితగా పనిచేసిన డైమండ్ రత్నం దర్శకుడిగా మారారు. ఆది సాయికుమార్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. దీపాల ఆర్ట్స్ సంస్థ నిర్మించనున్న ఆ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లబోతోంది. "విభిన్నమైన నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. డైమండ్ రత్నం చెప్పిన కథ ఆది సాయికుమార్‌కి చాలా బాగా నచ్చింది. దాంతో వెంటనే ఈ సినిమా చేయడానికి అంగీకారం తెలిపార"ని చిత్రవర్గాలు స్పష్టం చేశాయి. ఈ చిత్రంలోని నటులతో పాటు, సాంకేతిక నిపుణుల బృందం వివరాల్ని త్వరలోనే వెల్లడించనున్నట్టు చిత్రబృందం తెలిపింది.

ఆది

నాగచైతన్య

'సవ్యసాచి'కి హంగులు

నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సవ్యసాచి'. నిధి అగర్వాల్ కథానాయిక. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై. నవీన్, వై. రవిశంకర్, మోహన్ (సీవీఎం) నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకొంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నాగచైతన్య డబ్బింగ్ చెబుతున్నారు. అలాగే ఈ చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్‌తో సరికొత్త హంగుల్ని జోడిస్తున్నారు. 'బాహుబలి: ది కన్‌క్లూజన్'తో పాటు పలు ప్రతిష్ఠాత్మక చిత్రాలకి విజువల్ ఎఫెక్ట్స్ సమకూర్చిన మకుట సంస్థ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. రెండు చేతుల్ని సమర్థవంతంగా వినియోగించగల యువకుడి పాత్రలో నాగచైతన్య సందడి చేయబోతున్నారు. ఇందులో ప్రముఖ నటుడు మాధవన్ ఓ కీలక పాత్ర పోషించారు. ఎమ్.ఎమ్.కీరవాణి స్వరాలు సమకూరుస్తున్నారు.

'వీర దె వెడ్డింగ్'

'రాజీ'

నాయికలూ.... మీరు సూపరు!

సినిమా కథ ఎవరి చుట్టూ తిరుగుతుంది అంటే హీరో అని ఇట్టే చెప్పేస్తారు. ఎందుకంటే బాక్సాఫీసు వద్ద వసూళ్లు రాబట్టే మంత్రం వాళ్లకే తెలుసు అంటారు. మరి హీరోయిన్‌లు మాటేమిటి అంటే హీరో చుట్టూ తిరుగుతూ గ్లామర్ ఒలకబోయడం.. .నాలుగు స్టెప్పులేయడం...ఎప్పుడైనా నాలుగు సెంటిమెంటు సీన్లు పండించడమే కదా..! అదేంటి హీరోయిన్‌లను ప్రధాన పాత్రగా పెట్టి సినిమాలు తీస్తే ఎందుకు ఆడవు? అంటే 'సినిమాలు బాగుంటాయి...కానీ కమర్షియల్‌గా వర్కవుట్ కాదండి' అంటారు. బాక్సాఫీసుని వసూళ్లతో నింపేయడం కథానాయకులకే తెలుసు....నాయికలకు తెలియదు అనేస్తారు. మాకూ తెలుసంటూ 'డర్టీపిక్చర్'తో బాక్సాఫీసుకు హీరోయిన్ పవరేంటో చూపెట్టింది విద్యాబాలన్. ఈ చిత్రం రూ.117 కోట్లకు పైగానే వసూలు చేసింది. నిర్మాతలకు కనక వర్షం కురిసింది. విద్యాబాలన్‌ను జాతీయ ఉత్తమ నటిగా నిలబెట్టింది. తర్వాత ఆమె నటించిన 'కహానీ' కూడా మంచి హిట్ అయి రూ.వంద కోట్ల క్లబ్‌లో చేరిపోయింది. దాంతో కథలో దమ్ముండాలే కానీ నాయికలు బాక్సాఫీసుని షేక్ చేసేయగలరు అనే నమ్మకం కలిగింది. ఆ నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేసింది కంగనా రనౌత్ 'క్వీన్'. ఈ చిత్రం కూడా కలెక్షన్లతో దుమ్మురేపింది. అంతేకాదు కంగనాను జాతీయ స్థాయి ఉత్తమనటిని చేసింది. మళ్లీ ఈ ఏడాది నాయిక చిత్రాలు మెరిపించాయి. బాలీవుడ్‌కి కొత్త ఊపునిస్తున్నాయి. స్టార్ హీరోల చిత్రాలకు దీటుగా నిలబడ్డాయి. 'రాజీ', 'వీరె దె వెడ్డింగ్', 'హిచ్కీ' చిత్రాలు ఊహించని విధంగా వసూళ్లు అందుకొన్నాయి.

మరోసారి 'రాజీ' పడలేదు...!

రాజీ... ఈ ఏడాది ఇప్పటివరకూ బాలీవుడ్‌కి దక్కిన విజయాల్లో ముందువరసలోనే ఉంది. 'హైవే' లాంటి నాయికా ప్రాధాన్య చిత్రం తర్వాత ఆలియా భట్ నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.190 కోట్ల వరకూ వసూలు చేసింది. తండ్రి చాటు కూతురుగా ఉండే ఓ మామూలు అమ్మాయి దేశం కోసం గూఢచారిగా మారి చేసిన సాహసం ప్రేక్షకుల్ని ఫిదా చేసేసింది. విడుదలైన తొలి రోజు నుంచే మంచి టాక్‌తో నడిచిన ఈ చిత్రం బబ్లీ గర్ల్ పాత్రలు చేసే ఆలియాలోని నటిని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. హీరోయిన్ సత్తా ఏంటో ఇంకోసారి తెలియజెప్పింది.

చెంపపెట్టులా 'హిచ్కీ'

'హిచ్కీ'

'నో వన్ కిల్డ్ జెస్సికా', 'మర్దానీ' లాంటి నాయికా ప్రాధాన్య చిత్రాలతో సత్తా చాటిన రాణి ముఖర్జీ ఈ ఏడాది 'హిచ్కీ'తో మంచి హిట్ కొట్టింది. టీచర్ కావాలనే బలమైన లక్ష్యం...కానీ నోరు తెరచి ఏ మాట్లాడినా వింత శబ్దాలు చేసే జబ్బు...అన్ని అడ్డంకులు దాటుకొని లక్ష్యం చేరుకున్న తీరు...ఇలా సాగే నైనా మాథుర్ ఓ పాత్రలో రాణి నటనకు ప్రేక్షకులు కితాబులిచ్చారు. రాణి 'మర్దానీ' సుమారు రూ.56 కోట్లు సాధిస్తే 'హిచ్కీ' ఇండియాలో రూ.76 కోట్లుపైగానే వసూళ్లు అందుకొంది. ఈ విజయం గురించి చిత్ర దర్శకుడు సిద్ధార్థ్ పి మల్హోత్ర మాట్లాడుతూ "'హిచ్కీ'ని ప్రేక్షకులు ముందుకు తీసుకురావడానికి నాకు ఆరేళ్లు పట్టింది. నాయికా ప్రాధాన్య చిత్రాలంటే ఉన్న చిన్నచూపే అందుకు కారణం. కానీ 'హిచ్కీ' విజయం హీరోయిన్ ఒరియెంటెడ్ చిత్రాలను తక్కువగా చూసే వాళ్లకు ఓ చెంపపెట్టు"అని చెప్పారు.

'వీరె..' ది ప్రత్యేక విజయం!

బాలీవుడ్‌కు ఈ ఏడాది దక్కిన విజయాల్లో 'వీరె దె వెడ్డింగ్' ప్రత్యేకమైంది. హీరోలతో మల్టీస్టారర్ చిత్రాలొస్తున్న సమయంలో నలుగురు హీరోయిన్‌లతో మల్టీస్టారర్‌గా తెరకెక్కిందీ చిత్రం. అంతేకాదు బాక్సాఫీసు వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇండియాలో రూ.78కోట్ల వరకూ వసూలు చేసి ఇంకా విజయవంతంగా నడుస్తోంది. కరీనాకపూర్, సోనమ్ కపూర్, శిఖ తలసానియా, స్వరభాస్కర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం తొలి రోజు కలెక్షన్ల విషయంలో స్టార్ హీరోలు అక్షయ్‌కుమార్ ప్యాడ్‌మ్యాన్, అజయ్‌దేవగణ్ రైడ్ చిత్రాలను దాటేసింది. 'వీరె..'. చిత్ర నిర్మాతల్లో ఒకరైన రియాకపూర్ మాట్లాడుతూ "'వీరె...'కి ప్రేక్షకుల అందించిన ప్రోత్సాహం మర్చిపోలేనిది. వసూళ్లు చూస్తుంటే భవిష్యత్తు అంతా హీరోయిన్ చిత్రాలదే"అని చెప్పారు.

ఈ చిత్రాలు ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని నాయికా ప్రాధాన్య చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాయి. కాజోల్ ప్రధాన పాత్రలో నటించిన 'ఈలా', సోనాక్షి సిన్హా, దియా పెంటీ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న 'హ్యాపీ ఫిర్ బాగ్ జాయేగీ' చిత్రాలు ఈ ఏడాదే రానున్నాయి.

అడవి శేష్

'గూఢచారి' ఆగమనం

అడవి శేష్, శోభిత ధూళిపాళ్ల జంటగా నటించిన చిత్రం 'గూఢచారి'. శశికిరణ్ తిక్కా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అభిషేక్ నామా, టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆగస్టు 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. ఈ చిత్రానికి అడవి శేష్ కథని సమకూర్చారు. "ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించే కథ, కథనాలతో సాగే చిత్రమిది. యాక్షన్ అంశాలకి పెద్దపీట వేశాం. అమెరికా, హిమాచల్ ప్రదేశ్, పుణె, న్యూ దిల్లీ, చిట్టగ్యాంగ్, హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. ప్రకాష్ రాజ్ ముఖ్య పాత్రలో నటించడంతో పాటు, సుప్రియ ఈ చిత్రంతో పునరాగమనం చేస్తోంద"ని చిత్రవర్గాలు వెల్లడించాయి. వెన్నెల కిషోర్, అనీష్ కురువిల్లా, రాకేష్ వర్రీ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంభాషణలు: అబ్బూరి రవి, ఛాయాగ్రహణం: షనీల్ డియో

మంచి కిడ్నాపర్లు

అభిషేక్ కన్నెలూరు, మధుప్రియ, ప్రజ్వల్, మమతా శ్రీ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'శీను వేణు'. వీళ్లు మంచి కిడ్నాపర్లు... అనేది ఉపశీర్షిక. రవి ములకపల్లి స్వీయ నిర్మాణంలో తెలుగు, కన్నడలో తెరకెక్కిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి దర్శకనిర్మాత సానా యాదిరెడ్డి క్లాప్‌నిచ్చారు. నిర్మాత ముత్యాల రాందాస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు ప్రేమ్‌రాజ్ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ "కిడ్నాప్ డ్రామా నేపథ్యంలో సాగే కథ ఇది. పల్లెటూరికి చెందిన ఇద్దరమ్మాయిలు ముంబైకి చెందిన కిడ్నాప్ గ్యాంగ్ వలలో పడతారు. ఆ గ్యాంగ్ చెర నుంచి ఆ ఇద్దరూ ఎలా తప్పించుకొన్నారనేది తెరపైనే చూడాలి. హాస్య ప్రధానంగా సన్నివేశాల్ని తీర్చిదిద్దుతున్నాం" అన్నారు. "దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకొన్న రవి, మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. తనకి విజయం లభించాలని కోరుకొంటున్నా" అన్నారు సానా యాదిరెడ్డి. జీవా, చిత్ర శ్రీను, సుమన్ శెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జి.ఆర్యన్.

మధుప్రియ

నజియా, లక్కీ

'మోని'... ఓ ప్రేమకథ

లక్కీ ఏకారి, నజియా జంటగా నటిస్తున్న చిత్రం 'మోని'. సత్యనారాయణ ఏకారి దర్శకత్వం వహిస్తున్నారు. రంజిత్ కోడిప్యాక సమర్పిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం గోవాలో చిత్రీకరణ జరుపుకొంటోంది. నిర్మాతలు మాట్లాడుతూ "రొమాంటిక్ ప్రేమకథా చిత్రమిది. యాక్షన్‌కి ప్రాధాన్యముంది. 'షాలిని', 'నందికొండ వాగుల్లోనా..' చిత్రాల్లో నటించిన లక్కీతో పాటు, హిందీలో పలు సినిమాల్లో నటించిన నజియా చక్కటి అభినయాన్ని ప్రదర్శిస్తున్నారు. గోవా, ముంబై, హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుతున్నాం" అన్నారు. సుమన్ శెట్టి, దిల్‌రమేష్, సన్నీ టావో, వివేక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నవనీత్‌చారి, పాటలు: భాష్యశ్రీ.

వసుంధర

email: vasundhara@eenadu.net

ఈనాడు శనివారం జూన్ 16, 2018 విజయవాడ

రష్యాలో జరుగుతున్న ప్రపంచకప్‌లో తన్నులు తినే బంతి... గోల్ కొట్టగానే ఆటగాళ్లు ఉత్సాహంగా విప్పేసి గంతులేసి జెర్సీ.. చూస్తేనే అభిమానులు ఊగిపోయే ప్రపంచకప్ ట్రోఫీ! వీటన్నింటినీ తయారు చేసేది ఏ ఐరోపా దేశాలో కాదు. ఆసియా దేశాలు! అందులో ప్రపంచకప్‌లో ఎప్పుడూ పాల్గొనలేకపోయిన భారత్, పాకిస్థాన్‌లు. ఈ రెండే కాదు మన పక్క దేశం చైనా కూడా ప్రపంచకప్ క్రతువులో భాగమవుతోంది. మిగతా దేశాలన్నిటికీ ఇది ఫుట్‌బాల్ ప్రపంచకప్ అయితే.. ఆసియా దేశాలకు మాత్రం ఇది 'ఫుడ్' బాల్ ప్రపంచకప్! సాకర్ ప్రపంచకప్‌లో ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయినా.. పరోక్షంగా సేవలందిస్తున్నాయి ఈ మూడు దేశాలు. ఈ మెగా టోర్నీ పుణ్యమా అని ఈ దేశాల్లో చాలామంది మహిళలకు జీవనోపాధి దొరుకుతోంది.

వీరికిది ఫుడ్‌బాల్

ఈసారి రష్యా ప్రపంచకప్‌లో ఉపయోగిస్తున్న బంతులు తయారైంది పాకిస్థాన్‌లోని సియోల్‌కోట్‌లో. అడిదాస్ కంపెనీ సాయంతో ఫార్వర్డ్ స్పోర్ట్స్ కంపెనీ ఈ బంతులను రూపొందించింది. 2014లో బ్రెజిల్ ప్రపంచకప్‌లోనూ సియోల్‌కోట్ ఫుట్‌బాలే వాడారు. ప్రపంచ వ్యాప్తంగా తరలించేందుకు నెలకు 7 లక్షల బంతులను తయారు చేస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. 1990 నుంచి 2010 మధ్య జరిగిన ప్రపంచకప్‌లకు కూడా పాక్ నుంచే ఈ బంతులు వెళ్లాయి. చేతితో కుట్టడం ఈ బంతుల ప్రత్యేకత. అభిమానులను ఆకర్షించే టోపీలు కూడా ఇక్కడే తయారవుతున్నాయి. ఆ బంతులే ఎందరో మహిళలకు జీవనోపాధి.

ఒకప్పుడు కుట్టేవారు...

పాకిస్థాన్‌కి చెందిన గుల్షన్ బీబీకి భర్త లేడు. ఐదుగురు ఆడపిల్లలకు తల్లి. అయినా కుటుంబానికి కష్టం తెలియకుండా నెట్టుకొస్తోంది. ఎలానో తెలుసా... కేవలం ఫుట్‌బాల్ తయారుచేసి ఆదాయం పొందుతోందామె. నిజానికి పాకిస్థాన్ తన దేశం ఫుట్‌బాల్ ఆడుతుందా లేదా అన్నది పట్టించుకోదు. ఎప్పుడెప్పుడు వరల్డ్‌కప్ వస్తుందా అని మాత్రమే ఆలోచిస్తుంటుంది. ఎందుకంటే ఆ సమయంలోనే కదా భారీగా బంతులు తయారు చేయాల్సి వచ్చేది. గుల్షన్‌కి ఆట తెలియదు అనుకోనేరు. ఆట విధానం చక్కగా తెలుసు. ఎప్పుడూ మ్యాచ్‌లు వచ్చినా టీవీ ముందే ఉంటుంది. అంతేకాదు సావోపాల్‌లో జరిగిన కిక్ ఆఫ్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఉపయోగించిన బంతులు తయారుచేసింది కూడా గుల్షన్, ఆమె బృందమే. సియోల్‌కోట్‌లోని ఫార్వర్డ్ స్పోర్ట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తుందామె. 'ఈ బంతుల్ని మేం ఎంతో నిబద్ధతతో తయారు చేస్తాం. ఎందుకంటే అవి మాకు అన్నం పెడతాయి. ఇక మ్యాచ్‌లో క్రీడాకారులు మేం చేసిన బంతులతో ఆడుతుంటే కష్టం మర్చిపోతాం. చాలా గర్వంగా అనిపిస్తుంది' అని చెబుతుంది గుల్షన్. ఆమె పనిచేస్తోన్న ఫార్వర్డ్ స్పోర్ట్స్ సంస్థ 1995 నుంచి అడిదాస్‌తో భాగస్వామి అయింది. ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ పోటీలు ఎక్కడ ఏం జరిగినా... ఇక్కడి నుంచే బంతులు వెళతాయి. ప్రస్తుతం ఈ సంస్థలో 99 శాతం మంది మహిళలున్నారు. మగవారి కంటే వారే కచ్చితంగా, వేగంగా పనిచేస్తారని ఆ సంస్థ వారికే పెద్ద పీట వేసింది. అక్కడ బాలకార్మికులకు స్థానం ఉండదు. కేవలం పద్దెనిమిదేళ్లు దాటితేనే తీసుకుంటుంది సంస్థ. కొన్నాళ్లక్రితం వరకూ వాళ్లు బంతుల్ని చేత్తోనే కుట్టేవారు. ఇప్పుడు మెషీన్‌సాయంతో తయారుచేస్తున్నారు.

నలభై నిమిషాల్లో...

సియోల్‌కోట్‌లోని ఈ సంస్థలో చదువురాని వారు సైతం టెక్నాలజీని ఉపయోగిస్తారు. బంతి బరువూ, ఆడేటప్పుడు వేగం.. అన్నీ సాంకేతికంగానే పరీక్షిస్తారు. అయితే ఈ సంస్థ మహిళలందరికీ రాయడం, చదవడంతోపాటు, ఈ పరిజ్ఞానం కూడా నేర్పిస్తుంది. ఆ ఫ్యాక్టరీ మొత్తం బురఖాలు ధరించిన మహిళలే కనిస్తారు. వీళ్లంతా ముక్కలు ముక్కలుగా ఉన్న రబ్బరును చాలా చక్కగా బంతి ఆకారంలో మలుస్తారు. వీరికి ఒక బంతి చేయడానికి నలభై నిమిషాలు పడుతుంది.

వారానికి ఒక్కొక్కరు వందగంటలు పనిచేస్తారు. ఇక, మనదేశంలో పశ్చిమబంగాలో కూడా ఫుట్‌బాల్ తయారీకి పెట్టింది పేరు. 1950లో శరణార్థుల జీవనోపాధికోసం 'ది రిఫ్యూజీ హ్యాండీ క్రాఫ్ట్స్ డివిజన్' ఏర్పాటైంది. ఇప్పుడు దీని ద్వారా ఎంతోమంది మహిళలు ఫుట్‌బాల్ తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ విభాగం, ఎమ్‌ఎస్ఎమ్ఈతో కలిసి ఔత్సాహిక మహిళలకి బంతుల తయారీలో శిక్షణ ఇస్తోంది.

చైనాలో ప్రపంచకప్‌లు

ప్రపంచకప్ నమూనాలు తయారు చేయడంలో చైనాది ప్రత్యేక శైలి. అందుకోసం వేలాది మంది కష్టపడుతున్నారక్కడ. 2018 ప్రపంచకప్ నమూనాలు సిద్ధమైపోయాయి. అన్ని దేశాలకూ తరలిపోయాయి. చైనాలోని డాంగ్‌గున్ నగరం ఈ ప్రపంచకప్ నమూనాల తయారీకి ప్రసిద్ధి చెందింది. ఇవే కాదు ప్రపంచకప్ అధికారిక చిహ్నం జబివాక పేరు మీద కీ చెయిన్లూ కూడా తయారవుతున్నాయి. జబివాక నృత్యం చేస్తున్నట్లుగా ఉండే ఈ కీచెయిన్లు అభిమానులను బాగా ఆకర్షిస్తున్నాయి. ఇవే కాక స్టార్ ఆటగాళ్ల విగ్గులూ, క్రీడాభిమానులు వేసుకునే షాళ్లు కూడా తయారయ్యేది చైనాలోనే.

జెర్సీలు.. మేడిన్ ఇండియా

ఫుట్‌బాల్‌లో ఆటగాళ్లనైనా, అభిమానులనైనా వాళ్లు ఏ దేశానికి చెందిన వారో వెంటనే గుర్తుపట్టగలిగేది జెర్సీల ద్వారానే! ఈసారి ప్రపంచకప్‌నకు అలాంటి జెర్సీలను తయారు చేయడంలో భారత్ తన వంతు పాత్ర పోషిస్తోంది. సూరత్, జలంధర్, ముంబయి లాంటి చోట్ల ఈ జెర్సీలు తయారవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ ఫీవర్ ఉండడంతో అభిమానులు జెర్సీల కోసం ఎగబడుతున్నారు. భారత్‌లో తయారవుతున్న జెర్సీలు ప్రపంచ వ్యాప్తంగా అమ్ముడుపోతున్నాయి. జెర్సీల తయారీ కోసం కొన్ని వందల మంది కష్టపడుతున్నారు. ఇక్కడా ఎక్కువశాతం మహిళలే ఉండటం గమనార్హం. వాటితోపాటూ క్రీడాకారులు వేసుకునే బూట్లూ, టీషర్ట్‌లను కూడా భారత్ తయారు చేస్తోంది.

ఆన్‌లైన్‌లో కొనేముందు...

తలపిన్ను నుంచి హ్యాండ్ బ్యాగు వరకూ చాలామంది ఈ మధ్య ఆన్‌లైన్‌లోనే కొంటున్నారు. మరి అలా కొనుగోళ్లు చేసినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. అప్పుడే ఆ షాపింగ్ సంతోషాన్నిస్తుంది.



- ఎక్కడైనా ఏదైనా వస్తువు కొంటున్నప్పుడు.. రకరకాల సైట్లలో దాని ధరలు చూడాలి. ఒక్కో సైటులో ఒక్కో ధర ఉంటుంది. కొన్నిసార్లు కొన్ని సైట్లు ఆఫర్లు పెడుతుంటాయి. అందుకని ధరలు గమనించుకోవాలి. ఎక్కడ తక్కువ ఉందో చూసుకుని ఆ సైట్‌లో కొనుగోలు చేయాలి.
- కొన్నిసార్లు ధర తక్కువ కదాని కొనేటప్పుడు చూసుకోరు. తీరా డబ్బులు చెల్లించాక ఎక్కువ బిల్లు కనిపిస్తుంది. ఎందుకంటే చాలాసైట్లు షిప్పింగ్ ఛార్జీలు తీసుకుంటున్నాయి. అందుకే ఆ ఛార్జీలు లేనివి చూసి తీసుకోవాలి. లేదంటే స్నేహితులతో కలిసి కొనుక్కునేలా చూడాలి. అప్పుడు షిప్పింగ్ ఛార్జీ ఉండదు.
- చాలా సైట్లు.. రాయితీలూ, కూపన్లూ, బహుమతులూ అని రకరకాల ఆఫర్లు పెడుతుంటాయి. అలాంటివి తీసుకునే ముందు ఉత్పత్తి గురించి కింద రాసి ఉన్న వివరణలు పూర్తిగా చదవాలి.
- ఆన్‌లైన్‌లో ఏవైనా ఉత్పత్తులు కొన్నప్పుడు వస్తువు మన ఇంటికి వచ్చాక మార్చుకునే విధానం ఉందో లేదో చూసుకోవాలి.
- ఈ మధ్య చాలా సైట్లు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఇస్తున్నాయి. ఎప్పటికప్పుడు అలాంటి గమనించుకుని తీసుకుంటే లాభం ఉంటుంది. ఇలాంటి చాలా సైట్లు.. సభ్యత్వానికి అవకాశం ఇస్తున్నాయి. వాటినీ తెలుసుకోవాలి.

కలిసి తిరిగేయండి

టీనేజీ అమ్మాయిలకు కొత్త ప్రపంచం కాలేజీ. చదువులూ, ర్యాంకులూ, మార్కులే కాదు.. మిమ్మల్ని మీరు కొత్తగా మార్చుకునే ప్రయత్నం చేసుకోండి. అదెలా అంటే...

- ఒకే రకమైన అభిరుచులు కలవారంతా ఓ బృందంగా ఏర్పడండి. ఉదాహరణకి మీకు ఫొటోగ్రఫీ అంటే ఇష్టం అనుకోండి. మీలానే ఆలోచిస్తున్న స్నేహితులంతా కలిసి ఓ వాట్సాప్ బృందంగా ఏర్పడండి. ఇన్‌స్టాలో ఓ పేజీని ఏర్పాటు చేసుకుని మీరు తీసిన చిత్రాలన్నింటినీ షేర్ చేయండి. మీకు చక్కని సలహాలూ మీరు తీసిన ఫొటోలకు అభినందనలు అందుకుంటారు.
- మీరు రకరకాల వస్తువులు తయారు చేయగలరా... మీ తరగతిలోని మరో అమ్మాయిలోనూ ఇటువంటి సృజన ఉంటే ఇద్దరూ కలిసి దాన్ని చిన్నపాటి వ్యాపారమార్గంగా మార్చుకోవచ్చు. యూట్యూబ్, పింట్రెస్ట్ వంటివి ఉపయోగించుకోండి. బోలెడు ఆలోచనలు వస్తాయి. కాస్త పెద్ద మొత్తంలో తయారు చేయండి. వాటిని ఫేస్‌బుక్‌లో షేర్‌చేస్తే ఓ మంచి వ్యాపారంగా మలుచుకోవచ్చు.
- మీకు సరదాగా తిరగడం ఇష్టమా... మీకు తోడు చాలామందే ఉంటారు. మీ చుట్టుపక్కల ఉండే చారిత్రక ప్రదేశాలూ, మ్యూజియంలూ, షాపింగ్‌మాళ్లూ, రెస్టారంట్లు తిరిగేయండి. అక్కడ మీకెదురైన అనుభవాలు, సంఘటనలన్నింటినీ గుదిగుచ్చి చక్కగా బ్లాగులో రాయండి. మీకు బోలెడు మంది ఫాలోవర్లూ పెరుగుతారు. మీకో కొత్త అనుభూతి ఏర్పడుతుంది.

సూప్... ఎలా చేస్తున్నారు?

వానకాలం మొదలైంది. చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. వాతావరణం ఏ కాస్త చల్లగా ఉన్నా మనసు వేడివేడి సూప్ తాగాలని కోరుకోవడం సహజం. మరి ఈ సూపులు రుచిగా, త్వరగా ఎలా తయారుచేసుకోవాలో చూద్దామా!

- ✪ సూప్‌లను ఎక్కువ మంటపై మరిగించకూడదు. ఇలా చేయడం వల్ల కూరగాయల ముక్కలు మరీ మెత్తగా అయిపోతాయి. అదేవిధంగా చికెన్, మటన్ లాంటివయితే మరింత గట్టిగా మారతాయి. కాబట్టి చిన్న మంటపై ఉడికించాలి. ఇలా చేయడం వల్ల సూప్ నెమ్మదిగా చిక్కబడుతుంది. దాదాపు ఇరవై నిమిషాలు మరిగిస్తే మంచిది.
- ✪ సూప్‌లో వేసే పదార్థాల ద్వారానే దానికి రంగూ, రుచి, చిక్కదనం వస్తుంది. కాబట్టి తాజా కాయగూర ముక్కలూ, పుదీనా, కొత్తిమీరలతోపాటు అల్లం, వెల్లుల్లి తరుగు కూడా వేయడం మరవకూడదు. కొత్తిమీర పుదీనా తరుగు మాత్రం అఖరున వేయాలి. లేదంటే అవి ఎక్కువసేపు ఉడకడం వల్ల వాటి రుచి తగ్గుతుంది.
- ✪ పాలకూరా, బ్రకోలీ, ఉల్లికాడలను వేసి చేసిన సూప్‌లు రుచితోపాటు పోషకాలను అందిస్తాయి. క్యాబేజీ, క్యాలీఫ్లవర్ లాంటి సూప్‌లు చేస్తున్నప్పుడు క్యాలీఫ్లవర్ పువ్వులే కాదు ఆ కాడలు కూడా వేయొచ్చు. అదే విధంగా క్యాబేజీలో ఉండే గట్టిభాగాన్ని కూడా ముక్కల్లా తరిగి వేయడం మంచిది.
- ✪ సూప్ చిక్కగా రావాలంటే... ప్రతీసారి మొక్కజొన్న పిండే కలపాలని లేదు. బ్రెడ్, మెత్తగా ఉడికించి, మెదిపిన ఆలూ కూడా వేయొచ్చు. దీనివల్ల రుచి కూడా పెరుగుతుంది.
- ✪ పాస్తా లేదా నూడుల్స్‌తో సూప్ చేస్తుంటే... ముందు వాటిని విడిగా ఉడికించి పెట్టుకోవాలి. సూప్ అంతా తయారయ్యాక చివర్లో రెండు నిమిషాలముందు వేయడం మంచిది.

డియర్ వసుంధర

డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

ఆ పరీక్ష తప్పనిసరా...

ప్ర **నా వయసు 33 సంవత్సరాలు. ఇంకా పిల్లలు పుట్టలేదు. మా వారిలో వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉందని వైద్యులు చెప్పారు. మేం ఆలస్యం చేయకుండా ఐయూఐ పద్ధతికి వెళ్తే మంచిదనీ అన్నారు. అయితే అంతకన్నా ముందు హెచ్ఎస్‌జీ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. దానికి కారణం నాకు వెజైనల్ ఇన్‌ఫెక్షన్ ఉండటమే. వాస్తవానికి నేను ఇన్‌ఫెక్షన్‌ని తగ్గించుకోవడానికి రెండేళ్లు మందులు వాడాను. దానికి సంబంధించిన పరీక్షలు కూడా ఇప్పుడు మళ్లీ చేయించుకున్నా. ఒక రిపోర్టులో ఇన్‌ఫెక్షన్ లేదని వస్తే.. మరోదాంట్లో ఇంకా తగ్గలేదని వచ్చింది. నా సందేహం ఏంటంటే... నేను హెచ్ఎస్‌జీ పరీక్ష చేయించుకుంటే ఆ ఇన్‌ఫెక్షన్ ఇతర భాగాలకు వ్యాపిస్తుందని ఎక్కడో చదివా. అది నిజమేనా. అది నాకేదైనా ప్రమాదమా. నేరుగా ఐయూఐకి వెళ్లడం వల్ల ఆ ఇన్‌ఫెక్షన్ ఇతర భాగాలకు వ్యాపించకుండా జాగ్రత్తపడొచ్చు కదా అని నా అభిప్రాయం. ఎటూ తేల్చుకోలేకపోతున్నా.**

- ఓ సోదరి

జ వాస్తవానికి పెళ్లయిన స్త్రీకి వెజైనల్ ఇన్‌ఫెక్షన్ ఉంటే... భార్యాభర్తలిద్దరూ కలిసి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. అది పూర్తిగా తగ్గిందని నిర్ధారించుకున్నాకే హెచ్ఎస్‌జీ పరీక్ష చేస్తారు. ఆ పరీక్ష చేయడం వల్ల అండాశయం, గర్భాశయాన్ని కలిపే ఫెల్లోపియన్ ట్యూబుల్లో ఏవయినా సమస్యలున్నాయా అనేది తెలుస్తుంది. అవి సరిగ్గా తెరచుకుని ఉన్నాయా... ఇన్‌ఫెక్షన్ కారణంగా నీరు చేరి, మూసుకుపోయి ఉన్నాయా... అనేదీ అంచనా వేయొచ్చు. గర్భాశయంలో ఉన్న లోపాలు కూడా ఈ పరీక్ష ద్వారా తెలుస్తాయి. మీరు అడిగినట్లు నేరుగా ఐయూఐ చేయించుకుంటే ఈ సమస్యలన్నీ తెలియక ఆ పద్ధతి విఫలం అవుతుంది. అందుకే ముందు హెచ్ఎస్‌జీ చేయించుకోమని చెప్పారు. అది తప్పనిసరి కూడా. ఒకవేళ మీకు ఫెల్లోపియన్ ట్యూబులు మూసుకుపోయి ఉంటే... గర్భం రాదు. ఇక, మీరు అన్నట్లు ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు హెచ్ఎస్‌జీ చేయరు. అది పూర్తిగా తగ్గిందనుకున్నాకే చేస్తారు. ముందు మీరు వైద్యుల సలహాతో ట్యూబల్ పేటెన్సీ పరీక్ష చేయించుకోవడం మంచిది. దాంట్లో హెచ్ఎస్‌జీ అనేది ఒక రకమైన పరీక్ష. అది వద్దనుకుంటే లాపరోస్కోపీ ద్వారా ట్యూబల్ పేటెన్సీకి వెళ్లొచ్చు. ఆ పరీక్షలో ఏ ఇబ్బందీ లేదనుకుంటే అప్పుడు ఐయూఐ ద్వారా గర్భం దాల్చొచ్చు. సమస్యలుంటే మాత్రం టెస్ట్‌ట్యూబ్ బేబీకి వెళ్లడం మంచిది.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

15న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,976	2,970
వెండి (గ్రా)	45.20	44.50



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	32,200	32,000	31,750	31,750	31,800	31,750	32,173	32,160	32,020	31,700
ఆర్నమెంట్	30,050	29,960	29,450	29,450	29,470	29,290	29,760	29,700	29,780	29,48
వెండి(కిలో)	42,550	42,180	41,900	42,000	42,500	42,000	42,800	42,400	42,900	41,900

నజరానా

చర్మం పొడిబారుతోందా... బాగా పండిన అరటిపండును గుజ్జులా చేసి అందులో కాస్త తేనె, ఆలివ్‌నూనె కలిపి ముఖానికి పట్టించండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తుంటే మంచి ఫలితం ఉంటుంది.

ఏ కూర ఎలా పెంచాలంటే!

ఇంటి కూరగాయలు పెంచుకోవాలనుకున్నప్పుడు మనం వాటికి సంబంధించిన కొన్ని ప్రాథమిక విషయాలు తెలుసుకోవడం అవసరం. ఏం తింటున్నాం అనేది ముఖ్యం. అంటే మొక్కలోని ఏ భాగాన్ని మనం కూరగాయగా వాడతాం అనే అవగాహన ఉండాలి. ఉదాహరణకు టొమాటో, వంకాయ, మిరపా, బెండా, బఠానీ, సొర, బీర, పొట్ల, కాకర.... అన్నీ కాయలు. అలాగే క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి లాంటివి మొక్క వేర్లు. ఇక, కాలీఫ్లవర్, బ్రకోలి లాంటివి పూలు. ఆ క్యాబేజీ కూడా ఆకుకూరల్లో ఒకటి .బంగాళాదుంప, చిలగడదుంప, పెండలం, కంద లాంటివి వేర్ల నుంచి వచ్చే దుంపలు. ఉల్లి, వెల్లుల్లి, అల్లం... ఇవి మొక్క కాండం అన్నమాట. ఈ విషయ పరిజ్ఞానం వల్ల మన రోజువారీ ఆహారంలో సమతుల్యం ఉండేలా చూసుకోవచ్చు.

ఏ కాలంలో ఏ మొక్క...

అన్ని కూరగాయలూ అన్ని కాలాల్లోనూ పండించలేం. అందువల్ల ఏ కాలంలో ఏ మొక్కలు నాటుకోవాలనేది తెలుసుకోవడం చాలా అవసరం. వంకాయ, టొమాటో, మిరపా, బెండ తీగ జాతికి చెందిన కూరగాయలు. ఆకుకూరల వంటివి సంవత్సరం పొడవునా పండించుకోవచ్చు. శీతాకాలంలో క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీ, కాలీఫ్లవర్, బంగాళాదుంపా, క్యాప్సికమ్, అన్ని రకాల చిక్కుళ్లు, బఠానీలు పండించుకోవచ్చు. విదేశీ రకాలేవైనా పెంచుకోవాలనుకుంటే ఇప్పుడే అనుకూలం. ఎండాకాలంలో పుచ్చ, కర్బూజా, కీరదోసలను సాగుచేయొచ్చు. ఈ విషయాలు తెలుసుకోవడం వల్ల ఎక్కువ ఫలసాయం పొందగలుగుతాం. స్థలాన్ని మన అవసరాలకు తగినట్లుగా వాడుకోవచ్చు.

నీరే ఆధారం!

ఏ మొక్కలకు ఎంత నీరు అవసరం అనేదీ తెలియాలి. గోరుచిక్కుడూ, ఫ్రెంచ్‌బీన్స్, బీట్‌రూట్, సొర, బీర వంటి వాటికి తక్కువ నీళ్లు చాలు. టొమాటో, వంకాయ, మిరపా, ఉల్లీ, బంగాళాదుంపా, క్యారెట్, దోస లాంటి వాటికి నీటి సరఫరా మధ్యస్థంగా ఉండాలి. అలాగే ఆకుకూరలూ, క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రకోలీ, క్యాప్సికమ్ లాంటివాటికి క్రమం తప్పకుండా నీరు అందించాలి.

లోతూ, వెలుతురూ ముఖ్యమే...

మొక్క వేళ్లు ఎంత లోతు పెరుగుతాయన్న విషయం మీద కూడా మనకు కొంత అవగాహన ఉంటే కుండీలూ లేదా గ్రో బ్యాగులు ఎంచుకునేందుకు వీలుగా ఉంటుంది. ఉల్లితోపాటు, దాదాపు ఆకుకూరలన్నింటికీ ఆరు అంగుళాల లోతు చాలు. క్యాబేజీ, కాలిఫ్లవర్, ముల్లంగి లాంటి వాటికి తొమ్మిది నుంచి పది అంగుళాల లోతుండాలి. వంకాయ, టొమాటో, మిర్చీ, బీట్‌రూట్, క్యారెట్, ఫ్రెంచ్‌బీన్స్, సొర, బీర, కాకర, పొట్ల, చిక్కుడు, దోస లాంటి వాటికి అడుగు నుంచి అడుగున్నర ఉండాలి. రెండడుగుల లోతు, అడుగున్నర వ్యాసం ఉన్న వాటిలో బహువార్షికాలైన దొండ, కరివేపాకు, మునగ, నిమ్మ లాంటివి పెంచుకోవచ్చు. ఆకుకూరలూ, అల్లం, చేమ, చిలగడ దుంపలకు కొద్దిగా నీడపడే ప్రాంతం ఫరవాలేదు కానీ మిగిలిన వాటికి ఎండ సరిగా తగిలేలా చూసుకోవాలి. ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుని మనం ఎప్పుడు, ఏవి పండించదలచుకున్నామో చిన్న ప్రణాళిక వేసుకుని దాని ప్రకారం ముందుకు సాగడం మంచిది.

– బోడెంపూడి శ్రీదేవి, ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

ఈనాడు
10
విజయవాడ
శనివారం
జూన్ 16, 2018

విజేత

sports@eenadu.in

కాలిలో బలముండాలి.. తెలివైన బుర్ర కావాలి.. ఒంట్లో తరిగిపోని సత్తువ కావాలి.. ఫుట్‌బాల్‌లో ఓ ఆటగాడు విజయవంతం కావాలంటే.. అతడి శరీరం యంత్రంలా పనిచేయాలి. ప్రత్యర్థి వ్యూహాలను పసిగడుతూ.. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ.. చిరుతలా పరుగెడుతూ.. బంతిని బుల్లెట్‌లా పంపించేందుకు సంసిద్ధంగా ఉండాలి. మరి అందుకు అతడు ఏం చేయాలి.. ఎలాంటి శిక్షణ తీసుకోవాలి..! ఆడేటప్పుడు ఆటగాడిపై ఎలాంటి ఒత్తిడి ఉంటుంది.. నివారణకు ఏం చేస్తాడో చూద్దామా..!

కదిలే కరెంట్..!

వారి పరుగు 10 కిలోమీటర్లపైనే..

90 నుంచి 120 మీటర్ల పొడువు ఉండే మైదానంలో ఫుట్‌బాల్ ఆటగాళ్లు మ్యాచ్ ఆద్యంతం పరుగెత్తుతూనే ఉంటారు. గోల్‌కీపర్‌ను మినహాయిస్తే.. సాధారణంగా జట్టులోని ఆటగాళ్లు ఒక్కో మ్యాచ్‌లో 10 నుంచి 13 కిలోమీటర్లు పరుగెత్తుతారు.

చురుకైన బుర్రలే ..

పరుగెత్తుతూ బంతిని కాలితో తన్నడమే కదా.. ఫుట్‌బాల్‌ను చూస్తే ఇలాగే అనిపించొచ్చు. కానీ.. మ్యాచ్ జరుగుతున్నంతసేపు ఆటగాళ్లు ఎంతో ఒత్తిడిని అనుభవిస్తుంటారు. ఖాళీలు ఎక్కడున్నాయి.. బంతిని ఎవరికి అందించాలి.. ఎలాంటి వ్యూహం అనుసరించాలి.. పరుగెత్తుతున్నప్పుడే ఇలా ఎన్నో ఆలోచనలు మదిలో మెదులుతుంటాయి. ప్రత్యర్థి ఆటగాళ్లు బోల్తా కొట్టించేందుకు.. చాలా రకాలుగా ప్రయత్నిస్తుంటారు. ఎన్నో అడ్డంకులు సృష్టిస్తుంటారు. వాటన్నింటిని అధిగమించి.. క్షణ కాలంలో తీసుకునే నిర్ణయం అతడి జట్టు భవితవ్యాన్ని శాసిస్తుంది. అందుకే వేగంగా నిర్ణయాలు తీసుకోవడం చాలా ముఖ్యం. శక్తి, నైపుణ్యంతో పాటు తెలివి ఉన్న వారే ఫుట్‌బాల్‌లో విజయవంతమవుతారట. బ్రిటన్‌లో నిర్వహించిన ఓ పరిశోధన తేలింది ఇదే. తరుచుగా ఆటగాడి షాట్‌లు గురి తప్పుతున్నా.. పాస్‌లు సరిగ్గా అందుకోలేకున్నా అతడు మానసికంగా ఒత్తిడిలో ఉన్నట్టేనని ఆస్ట్రేలియాలో నిర్వహించిన ఓ సర్వేలో స్పష్టమైంది.

చేతులు మాయ చేస్తాయి..

చేత్తో బంతిని తాకితే ఫౌల్. అలాంటప్పుడు ఫుట్‌బాల్‌లో చేతుల్తో ఏం పని? నిజానికి ఆటలో వీటిది కీలక పాత్ర. చేతులను సరైన దిశలో కదపడం ద్వారా బంతిని బలంగా కొట్టొచ్చు. డ్రిబ్లింగ్ నైపుణ్యం మెరుగవుతుంది. డిఫెండర్లను వెనక్కినెట్టేందుకు కూడా చేతులను ఉపయోగించుకోవచ్చు.

హెడర్ కొట్టాలంటే..

బుర్ర చురుగ్గా ఉండటమే కాదు.. మెడ కూడా బలంగా ఉండటం ఆటగాళ్లకు చాలా అవసరం. గోల్స్ వాటాలో హెడర్లదే ప్రధాన భూమిక. కార్నర్ కిక్‌ల సమయంలో ఎక్కువ శాతం గోల్స్ హెడర్ల ద్వారానే అవుతుంటాయి. చాలా ఎత్తు నుంచి దూసుకొచ్చే బంతులను నియంత్రణలోకి తీసుకొచ్చే సమయంలో ఆటగాళ్లు ఆ ఒత్తిడిని తట్టుకోలేక పడిపోయే సందర్భాలు చూస్తుంటాం. అందుకే మెడ కండరాలు బలంగా తయారయ్యేందుకు ప్రత్యేక కసరత్తులు చేస్తారు.

కండరాలే కీలకం

కాళ్లు బలంగా ఉంటే సరిపోదు.. మొండేన్ని నిలబెట్టే కండరాలు బలంగా ఉన్నప్పుడే ఆటగాడు విజయవంతమయ్యే అవకాశాలు ఎక్కువ. ప్రధాన కండరాలుగా పిలిచే పొట్ట, వెన్ను, తుంటి కండరాలది ఇందులో కీలకపాత్ర. ఆటగాడు వేగంగా పరుగెత్తే విషయంలో, మలుపు తిరిగేటప్పుడు, డైవ్ చేసేందుకు సహకరించే కండరాలు అవే. ఆటగాడు ఎక్కువసేపు మైదానంలో ఉండాలంటే వెన్ను కండరాలు బలంగా ఉండటం ముఖ్యం. లేదంటే అలసిపోయి అది అతడు నిల్చునే తీరుపై ప్రభావం చూపుతుంది. దానివల్ల షాట్ ఆడే విధానంలో తేడా వస్తుంది. తరుచుగా గాయాల బారిన పడే ప్రమాదముంటుంది. అందుకే ప్రధాన కండరాలు పటిష్టం అయ్యేందుకు సిటప్స్, క్రంచెస్, బార్‌బెల్స్, కెటిల్ బెల్స్, డంబెల్స్ కసరత్తులు చేస్తుంటారు క్రీడాకారులు. శరీరం కింది, పైభాగం మధ్య సమన్వయంలో మూల కండరాలే కీలకం.

ఆహారంలో ఆ శక్తి..

సరైన ఇంధనం పోయకపోతే బండి మొరాయిస్తుంది.. ఆటగాడి పరిస్థితి ఇంతే..! సరైన ఆహారం తీసుకోకుంటే మైదానంలో వారి ప్రదర్శన దెబ్బతింటుంది. అందుకే ఆటగాళ్ల ఆహారం విషయంలో జట్లన్నీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాయి. ఓ మ్యాచ్ ఆడాలంటే ఆటగాడు గంటన్నరకంటే ఎక్కువసేపు శ్రమించాలి. అందుకు శక్తి చాలా అవసరం. ఎక్కువ శక్తినిచ్చే కార్బోహైడ్రేట్స్ ఆహారం 70 శాతం ఉండేలా ఆటగాళ్లు జాగ్రత్తపడతారు. మూడు పూటలని కాకుండా.. తరుచుగా ఆటగాళ్లు అరటి పండ్లతో పాటు ఎక్కువ కార్బోహైడ్రేట్లు ఉండే.. చిరుధాన్యాలతో చేసిన చాక్లెట్లు, పెరుగు, మిల్క్ షేక్‌లు తీసుకుంటారు. మ్యాచ్ మధ్యలో కూడా కార్బోహైడ్రేట్లు మిళితమైన పానీయాలను స్వీకరిస్తారు. మ్యాచ్‌కు ముందు ఆటగాళ్లు ప్రోటీన్‌లు ఉండే ఆహారాన్ని చాలా తక్కువ మోతాదులో తింటారు. లేదంటే మ్యాచ్ మధ్యలో వారికి అజీర్తి సమస్య తలెత్తొచ్చు.

మేటిగా నిలవాలంటే..

నియంత్రణ.. ఇది లేకుంటే ఫుట్‌బాల్‌లో రాణించడం అసాధ్యం. బంతిని డ్రిబ్లింగ్ చేసుకుంటూ.. అడ్డొచ్చే ఆటగాళ్లను తప్పించుకుంటూ ముందుకు దూసుకెళ్లాలంటే నియంత్రణ పాత్ర ముఖ్యమైంది. మెస్సిని ప్రపంచంలో మేటి ఆటగాడిగా చేసింది అదే! అతడి నుంచి బంతిని తీసుకునేందుకు ప్రత్యర్థి ఆటగాళ్లు మెస్సిపై పడే ప్రయత్నం చేస్తుంటారు. అలాంటి సమయాల్లో కూడా ఎగురుతూ, పక్కకు వంగుతూ బంతిపై పట్టు కోల్పోకుండా గోల్స్ చేయడంలో మెస్సి మేటి. పొట్టిగా ఉండటం కూడా అతడికి కలిసొచ్చే అంశం. గురుత్వాకర్షణ కారణంగా ఫుట్‌బాల్‌లో పొట్టి ఆటగాళ్లు ఎక్కువ నియంత్రణ కనబరుస్తారని శాస్త్రవేత్తలు తేల్చారు. పీలె, మారడోనా, గాజా.. ఇలా ఆటలో దిగ్గజ ఆటగాళ్లలో ఎక్కువ మంది పొట్టివారే..!

మహిమంతా కాళ్లలో..

నలుగురైదుగురు ఆటగాళ్ల రక్షణ కవచాన్ని ఛేదించుకుని ముందుకు దూసుకెళ్లాలి. ఎడమవైపు నుంచి అనూహ్యంగా కుడివైపుకు తిరగాలి.. డైవ్ చేయాలి.. అమాంతంగా గాల్లోకి ఎగరాలి.. మెరుపు వేగంతో దూసుకెళ్లాలి.. ఒక్కసారిగా నెమ్మదవ్వాలి. గోల్ చేసేందుకు ఇలా ఎన్నో విన్యాసాలు చేయాలి. వీటన్నింటికీ సహకరించే అవయవం కాలు. ఫుట్‌బాల్ క్రీడలో మాయ చేసేది కాళ్లే. అందుకే వీటి బలం కోసం తీవ్రంగా శ్రమిస్తారు ఆటగాళ్లు. సాధారణంగా రోజూ గంటసేపు పరుగెత్తుతారు. ఆ తర్వాత జిమ్‌లో కాళ్ల పిక్కలు బలంగా తయారవడం కోసం బరువులు మోస్తారు. గుంజీలు తీస్తారు.. ప్లాంకింగ్, లుంజెస్, బాక్స్ జంప్, సైడ్ జంప్ ఇలా రకరకాల కసరత్తులు చేస్తారు. మ్యాచ్ ఉన్నా లేకున్నా ఇవన్నీ వారి దినచర్యలో భాగం.

గంటకు 210.8 కిలోమీటర్లు..

బ్రెజిల్ ఆటగాడు రోనీ హెబర్సన్ షాట్ వేగం. గోల్ అయిన షాట్‌లలో వేగవంతమైన షాట్ రికార్డు అతడిదే. 2006లో పోర్చుగల్ క్లబ్ ఫుట్‌బాల్ టోర్నీలో స్పోర్టింగ్ లిస్బన్ తరపున ఈ రికార్డు నమోదు చేశాడు. 16.5 మీటర్ల దూరం నుంచి అతడు షాట్ కొట్టగా 0.28 సెకన్లలో బంతి గోల్‌లోకి దూసుకెళ్లింది.

బూట్లూ ప్రత్యేకం..

ఆటాకర్లు వేగంగా పరుగెత్తాలి.. వారి కాళ్లకు చాలా తేలిగ్గా ఉండే బూట్లు అవసరం. డిఫెండర్లు ప్రత్యర్థి ఆటగాడి లయను దెబ్బతీయాలి, వారికి బంతిపై పట్టు సంపాదించడం చాలా కీలకం... ఇక గోల్‌కీపర్లు తరుచూ డైవ్ చేస్తుంటారు. ఇలా అవసరాలు వేరు కాబట్టి.. ఆటగాడి నైపుణ్యానికి తగ్గట్టుగా ప్రత్యేకంగా బూట్లు రూపొందిస్తారు. మడమకు ఎక్కువ రక్షణ ఉండేలా.. ముందు భాగంలో రెండు పొరల తోలుతో.. షాట్‌లు కొట్టేందుకు వీలుగా.. తేలికపాటి పదార్థంతో సులభంగా పరుగెత్తేలా కంపెనీలు బూట్లు తయారుచేస్తాయి. ఫుట్‌బాలర్ల బూట్ల తయారీలో ప్రధాన వాటా అడిడాస్, నైకీలదే. స్టార్ ఆటగాళ్లు నిపుణులతో చర్చించి తమ అవసరానికి తగ్గట్టుగా బూట్లు తయారుచేయించుకుంటారు.

ప్రమాదమంతా అక్కడే..

కాల్బంతిలో ప్రధానం కాళ్లే..! అందుకే క్రీడాకారులకు ఎక్కువ గాయాలు అయ్యేది అక్కడే. మోకాలు, దాని కింద భాగంలో.. గాయాలు వారిని వేధిస్తుంటాయి. చీలమండ గాయం, పాదం ఎముకలో పగులు, మోకాలు కండరంలో చీలిక, తొడకండరాల గాయం, మోకాలు తొడను కలిపే కండరంలో చీలిక.. ఇలా ఆటగాడిని కొన్ని రోజుల నుంచి కొన్ని వారాలు లేదంటే కొన్ని నెలలు ఆటకు దూరం చేసే గాయాలు ఇవి. గాయం తీవ్రమైనప్పుడు మాత్రమే ఆటగాళ్లు శస్త్రచికిత్స చేయించుకుంటారు.

మెస్సి దిగుతున్నాడు..

లియొనెల్ మెస్సి అభిమానులు ఎదురు చూస్తున్న రానే వచ్చింది. ఈ అర్జెంటీనా సూపర్ స్టార్ 2018 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో అడుగుపెట్టేస్తున్నాడు. తొలిసారి ప్రపంచకప్ అవకాశం దక్కించుకున్న పసికూన ఐస్‌లాండ్‌తో శనివారం రాత్రి మెస్సి జట్టు తన తొలి మ్యాచ్ ఆడబోతోంది. గత పర్యాయం ప్రపంచకప్‌కు అత్యంత చేరువగా వెళ్లి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్న అర్జెంటీనా.. ఈసారి ఎలాగైనా కప్పు గెలవాలన్న పట్టుదలతో ఉంది. మెస్సీకిదే చివరి ప్రపంచకప్ అని భావిస్తున్న నేపథ్యంలో అతను అంచనాలకు తగ్గట్టు రాణించి జట్టును విజేతగా నిలుపుతాడేమో చూడాలి.

సచిన్ కొడుకేనా.. అర్జున్ ఎప్పుడు?



సునీల్ గావస్కర్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత గొప్ప బ్యాట్స్‌మెన్‌లో ఒకడు. ఆయన ఘన వారసత్వాన్ని రోహన్ గావస్కర్ అందిపుచ్చుకోలేకపోయాడు. ఇంకా పంకజ్ రాయ్, శ్రీకాంత్, రోజర్ బిన్నీల వారసులైన ప్రణబ్, అనిరుద్ధ, స్టువర్ట్‌ల పరిస్థితీ ఇంతే!

ఇప్పుడు సచిన్ తెందుల్కర్ కొడుకు అర్జున్ తెరమీదికి వచ్చాడు. శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత అండర్-19 జట్టుకు అతడిని ఎంపిక చేయడం వివాదాస్పదమైంది. సచిన్ కొడుకు కావడం వల్లే అతడిని అవకాశం దక్కిందన్న వ్యాఖ్యలు వినిపించాయి. మరి ఈ విమర్శల్లో నిజమెంత? అసలు అర్జున్ ప్రదర్శన ఎలా ఉంది? ఇప్పటిదాకా సచిన్ కొడుకుగానే గుర్తింపు పొందుతున్న ఈ కుర్రాడు.. మున్ముందైనా అర్జున్‌గా పేరు సంపాదిస్తాడా?

16 ఏళ్లకే భారత జట్టులో చోటు సంపాదించి.. కెరీర్ ఆరంభంలోనే అద్భుతాలు చేశాడు సచిన్. అతడి తనయుడు అర్జున్ 19 ఏళ్లకు చేరువవుతుండగా అండర్-19 జట్టులో చోటు సంపాదించాడు. దాని మీదా వివాదం చెలరేగుతోంది. ఐతే సచిన్‌తో అతడి కొడుకుని పోల్చి చూడటం సమంజసం కాదు. సచిన్ కొడుకనే సంగతి పక్కన పెడితే.. ఒక క్రికెటర్‌గా అర్జున్ ఇప్పటికైతే టీమ్ ఇండియాకు ఆడే స్థాయి ఉన్నవాడిగా కనిపించట్లేదన్నది వాస్తవం! సెలక్టర్లు అండర్-19 జట్టులోకి అర్జున్‌ను ఫాస్ట్ బౌలర్ స్థానానికి ఎంపిక చేశారు. కూచ్ బెహార్ టోర్నీలో అతను ఐదు మ్యాచ్‌ల్లో 18 వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్ మొత్తంలో అండర్-19 స్థాయిలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో అర్జున్ స్థానం 43. 2011లో ముంబయి దేశవాళీ టోర్నీ హారిస్ షీల్డ్‌లో అర్జున్ అరంగేట్రం చేశాడు. ఓ మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో సత్తా చాటిన ప్పటికీ.. తర్వాత ప్రదర్శన సాధారణమే. 2012లో ఆ టోర్నీలోని ఓ మ్యాచ్‌లో సెంచరీ సాధించాడు. ఆ తర్వాత బ్యాటుతో పెద్దగా రాణించింది లేదు.

తండ్రికి రివర్స్..

సచిన్ ప్రధానంగా బ్యాట్స్‌మన్. బౌలింగ్‌లో పార్ట్‌టైమర్. అతను స్పిన్ వేసేవాడు. సచిన్‌ది కుడిచేతి వాటం. అర్జున్ తండ్రికి పూర్తి భిన్నం. అతను ప్రధానంగా బౌలర్. వేసేది ఫాస్ట్‌బౌలింగ్. అర్జున్ పూర్తి స్థాయి బ్యాట్స్‌మన్ కాదు. అతడిది ఎడమచేతి వాటం. కెరీర్ ఆరంభంలో తండ్రి బాటలో బ్యాటింగ్ మీదే దృష్టిపెట్టాడతను. కానీ అందులో పెద్దగా సఫలం కాలేదు. బౌలింగ్‌లోనే పర్వాలేదనిపించి దాని మీదే శ్రద్ధ పెట్టాడు. ప్రస్తుతం ప్రధానంగా ఫాస్ట్‌బౌలర్‌గా ఉంటూ, మిడిలార్డర్లో బ్యాటింగ్ కూడా చేయగల ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

ఎక్కడెక్కడో.. ఎంతమందో..

సచిన్ కొడుకన్నాక అర్జున్‌కు శిక్షణ విషయంలో లోటేముంటుంది? చిన్నతనం నుంచి కొడుక్కి సచిన్ సలహాలు, సూచనలు అందుతూనే ఉన్నాయి. రిటైర్మెంట్ తర్వాత సచిన్ కొడుకు కోసం చాలా సమయం కేటాయిస్తున్నాడు. సచిన్‌తో పాటు అతడికి చాలామంది కోచ్‌లు తోడ్పాటు అందించారు. దేశ విదేశాల్లో అనేక అకాడమీల్లో, ప్రత్యేక శిబిరాల్లో అర్జున్ శిక్షణ తీసుకున్నాడు. జాతీయ క్రికెట్ అకాడమీలో లెవెల్-3 కోచ్‌గా ఉన్న అతుల్ గైక్వాడ్ అర్జున్‌కు ప్రధాన కోచ్. అతడి దగ్గరే చాలా ఏళ్లు శిక్షణ తీసుకున్నాడు. మాజీ ఫాస్ట్‌బౌలర్ సుబ్రతో బెనర్జీ దగ్గరా అర్జున్ మెలకువలు నేర్చుకున్నాడు. అర్జున్ కొన్నేళ్ల పాటు ఇంగ్లాండ్‌లోని ప్రముఖ క్లబ్‌లు, అకాడమీల్లో గడిపాడు. అక్కడే కొన్నాళ్లు వసీమ్ అక్రమ్ దగ్గరా బౌలింగ్ పాఠాలు నేర్చాడు. అంతర్జాతీయ క్రికెటర్లకు పలు సందర్భాల్లో నెట్స్ బౌలర్‌గా సేవలందించాడు అర్జున్. ఒకసారి కోహ్లికి సైతం బౌలింగ్ చేశాడు. ఐపీఎల్ సమయంలో ముంబయి ఇండియన్స్‌తో సాధన చేస్తుంటాడు. పలు ఎగ్జిబిషన్ మ్యాచ్‌ల్లో.. బీసీసీఐ శిబిరాల్లోనూ అర్జున్ పాల్గొన్నాడు.

భవిష్యతేంటి?

కొడుకు కోసం సచిన్ చేయాల్సిందల్లా చేసినా అర్జున్ ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఏదో అలా నెట్టుకొస్తున్నాడే తప్ప.. తన పేరు మార్మోగే ప్రదర్శనలేమీ చేయలేదు. అతడిలో నిలకడ కొరవడింది. అందుకే అండర్-19 జట్టులోకి అతడి ఎంపికపై చర్చ నడుస్తోంది. ఆ జట్టులోకి ఎంపికవడానికి అర్జున్ కంటే అర్హులు చాలామంది ఉన్నారన్న విమర్శలొచ్చాయి. ఐతే అర్జున్ ఎంపిక ముగిసిన వ్యవహారం. ఇప్పుడందరి దృష్టీ అతడి ప్రదర్శన మీదే ఉంది. అవకాశం అందుకోవడం కంటే.. దాన్ని సద్వినియోగం చేసుకోవడం కీలకం. తన ఎంపికపై ఇంత చర్చ జరిగిన నేపథ్యంలో అర్జున్ తప్పక సత్తా చాటాల్సిన స్థితిలో ఉన్నాడు. అతడింకా రంజీల్లోకే రాలేదు. ఈ ఏడాది రంజీల కోసం ముంబయి జట్టు శిబిరానికి ఎంపిక చేసిన వాళ్లలో అర్జున్ లేదు. ఇక భారత జట్టు సంగతి చెప్పాల్సిన పని లేదు. ఎంతోమంది కుర్రాళ్లు ఐపీఎల్‌లో అదరగొడుతున్నారు. దేశవాళీల్లో సత్తా చాటుతున్నారు. టీమ్‌ఇండియాలో చోటుకు విపరీతమైన పోటీ నెలకొంది. గతంతో పోలిస్తే భారత జట్టు సెలక్షన్‌లోనూ పారదర్శకత పెరిగింది. కాబట్టి అర్జున్ టీమ్‌ఇండియా తలుపు తట్టాలంటే గొప్ప ప్రదర్శనే చేయాలి. అతను అక్కడి దాకా వచ్చినా, సచిన్ కొడుకు అనే ముద్ర పోయి.. 'అర్జున్'గా గుర్తింపు తెచ్చుకున్నట్లే!

అప్పు తీసుకొని 'స్టేడియం' కట్టాడు..!

ఎవరైనా ఇల్లు కట్టుకోవడానికో, చదువు కోసమో లేదా వాహనం కొనుక్కోవడానికో బ్యాంకు నుంచి రుణం తీసుకుంటారు. కానీ అసోం రాష్ట్రానికి చెందిన పుతుల్ బోరా మాత్రం ఫుట్‌బాల్ మ్యాచ్‌లను చూసేందుకు వీలుగా ఇంట్లోనే ఓ ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు అప్పు చేశాడు రూ.13 లక్షల బ్యాంకు అప్పుతో రెండు అంతస్తుల్లో.. 1800 చదరపు అడుగుల్లో స్టేడియం తరహాలో నిర్మాణం చేపట్టాడు. బడికి వెళ్లే సమయంలో ఆటపై ప్రేమ పెంచుకుని.. పెద్దయ్యాక జర్మనీ జట్టుకు వీరాభిమానిగా మారిన 55 ఏళ్ల బోరాకు ఓ మినీ స్టేడియం కట్టుకోవాలన్నది కల. నాలుగేళ్ల కిందట 200 మంది కూర్చునేలా నిర్మాణం చేపట్టాడు. ఇప్పుడు 500 మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశాడు. జర్మనీపై అభిమానాన్ని చాటుతూ నిర్మాణానికి "ద జర్మన్ స్టేడియం" అన్న పేరు పెట్టాడు. "చివరకు నా కల నేరవేరింది. నాకు ఫుట్‌బాల్ అంటే పిచ్చి. అందరితో కలిసి చూడడం అంటే మరింత ఇష్టం. అందుకే బ్యాంక్ నుంచి రుణం తీసుకొని మరీ ఈ ఏర్పాటు చేసుకున్నా" అని బోరా చెబుతున్నాడు.

అంతా 'సాంబా' మయం

ఐదుసార్లు విజేత బ్రెజిల్‌కు ప్రపంచ వ్యాప్తంగా వీరాభిమానులున్నారు. అందులో కేరళకు చెందిన సుధీర్‌కు ప్రత్యేకంగా నిలుస్తున్నాడు. ప్రపంచకప్ నేపథ్యంలో తన రెండంతస్తుల ఇళ్లు, కారు, స్కూటర్‌ను సాంబ జట్టు రంగులతో నింపేశాడు. స్వతహాగా ఫుట్‌బాల్ ఆటగాడైన సుధీర్‌కు బ్రెజిల్ జట్టు అంటే ఎనలేని అభిమానం. "గత ఇరవై ఏళ్లుగా ప్రపంచకప్ వచ్చిన ప్రతిసారీ నా కారుకు బ్రెజిల్ జట్టు రంగులు వేస్తా. ఈ సారి కారుతో పాటు ఇళ్లు, స్కూటర్‌కు కూడా ఆ రంగులు వేశా. ఈ ప్రపంచకప్‌లో బ్రెజిల్ విజేతగా నిలుస్తుంది. ఆరోసారి కప్పును అందుకుంటుంది" అని సుధీర్ అంటున్నాడు.

కిక్ 2018 ఛాంపియన్స్

186 2014 ప్రపంచకప్‌లో భాగమై.. ప్రస్తుత ప్రపంచకప్‌కు ఎంపికైన క్రీడాకారుల సంఖ్య. రష్యా ప్రపంచకప్‌లో మొత్తం 32 జట్లలో 736 మంది ఆటగాళ్లు పోటీపడుతున్నారు.

వువుజెలాతో ఇరాన్ అభిమాని

వువుజెలా రష్యాకొచ్చింది..

సెయింట్ పీటర్స్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో 2010 ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఎంతో ప్రత్యేకమైంది. ఆఫ్రికా ఖండంలో అదే తొలి ప్రపంచకప్. ఆ టోర్నీ అంటే ఆటే కాదు.. వువుజెలా కూడా గుర్తొస్తోంది. వువుజెలా మోతతో దక్షిణాఫ్రికాలో స్టేడియాలు మార్మోగిపోయాయి. ఆ వువుజెలా ఇప్పుడు రష్యాకు కూడా వచ్చింది. శుక్రవారం ఇరాన్, మొరాకో మ్యాచ్ సందర్భంగా వువుజెలా మోత మోగింది. రెండు అడుగుల ప్లాస్టిక్ గొట్టం, చివరన ఓ హారన్ ఉండేదే వువుజెలా.

ప్రపంచకప్‌లో ఈనాడు

ఫ్రాన్స్	మ॥ 3.30	ఆస్ట్రేలియా
అర్జెంటీనా	సా॥ 6.30	ఐస్‌లాండ్
పెరూ	రాత్రి 9.30	డెన్మార్క్
క్రొయేషియా	రాత్రి 12.30	నైజీరియా

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

ఫిఫా ప్రపంచకప్‌లో అనూహ్య ఫలితం.. మొరాకోకు ఇరాన్ షాక్! సొంత ఆటగాడే ప్రత్యర్థికి గోల్ కొట్టేసిన వేళ మొరాకో షాకైపోయింది. సెల్ఫ్‌గోల్ చేసిన అజీజ్.. ఇరాన్‌ను పరోక్షంగా గెలిపించాడు. మ్యాచ్ మొత్తం మొరాకోదే పైచేయిగా కనిపించినా.. ఆఖరి నిమిషం గోల్‌తో తీవ్ర నిర్వేదానికి గురైంది ఆ జట్టు. గత 20 ఏళ్లలో తొలిసారి ప్రపంచకప్ మ్యాచ్ గెలిచిన ఇరాన్ సంబరాల్లో మునిగిపోయింది.

అజీజ్ నిర్వేదం



మొరాకో సెల్ఫ్‌గోల్

అజీజ్ సొంత గోల్‌తో ఓటమి • ఇరాన్ అనూహ్య విజయం

సెయింట్ పీటర్స్‌బర్గ్

ఇరాన్-మొరాకో మధ్య శుక్రవారం ఫిఫా ప్రపంచకప్ గ్రూప్-బి పోరు.. ఇంజురీ సమయం వరకు ఫలితం తేల లేదు.. గోల్స్ కోసం రెండూ గట్టిగానే ప్రయత్నించాయి. వాగ్వివాదాలు.. ఒకరిని ఒకరు తోసుకోవడాలు, ఎల్లో కార్డులు ఇలా ఉద్విగ్నంగా సాగింది మ్యాచ్! కానీ ఆఖరి కొన్ని సెకన్లు మ్యాచ్ ఫలితాన్నే మార్చేశాయి. అజీజ్ బొహాదూజ్ చేసిన సెల్ఫ్ గోల్.. మొరాకోకు పరాజయాన్ని మిగిలిస్తే.. ఇరాన్‌కు అనూహ్య విజయాన్ని అందించింది. 95వ నిమిషం (ఇంజురీ సమయం)లో ఇషాన్ హాజి కొట్టిన ఫ్రీకిక్‌ను.. సబ్‌స్టిట్యూట్ ఆటగాడు అజీజ్ తలతో బంతిని గోల్‌పోస్ట్ అవతలకి కొట్టబోయాడు. కానీ అనుకోకుండా అది గోల్‌లోకి వెళ్లిపోయింది. అంతే... మొరాకో షాక్‌లో ఉండిపోతే.. ఇరాన్ ఆటగాళ్లు గంతులు వేయడం మొదలు పెట్టారు. సెల్ఫ్‌గోల్ చేసిన అజీజ్ అయితే షాక్‌తో అలా ఉండిపోయాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కన్నీరు మున్నీరుగా విలపించాడు. మ్యాచ్ మొత్తం మీద ఇరాన్‌పై మొరాకోదే పైచేయిగా కనిపించింది. బంతిని ఎక్కువసేపు తమ నియంత్రణలో ఉంచుకున్న మొరాకో.. పదే పదే ఇరాన్ గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది. ఇరాన్ కూడా చక్కటి సమన్వయంతో ఆడడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగింది. గోల్స్ పడకపోయినా.. ఒకటికి రెండుసార్లు బంతి గోల్ పోస్ట్ పక్కగా వెళ్లిపోయింది. రెండు జట్ల గోల్‌కీపర్లు చాకచక్యంగా వ్యవహరించి గోల్ ప్రయత్నాలను అడ్డుకున్నారు. అయితే మ్యాచ్ ఇంజురీ సమయానికి వెళ్లడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. కానీ అజీజ్ తన గోల్‌పోస్ట్‌లోనే గోల్ కొట్టేయడంతో ఇరాన్ అనూహ్య విజయాన్ని అందుకుంది. 2006 ప్రపంచకప్‌లో పిటీట్ (పోర్చుగల్) తర్వాత సెల్ఫ్ గోల్ చేసిన సబ్‌స్టిట్యూట్ ఆటగాడు అజీజ్ మాత్రమే. గత 20 ఏళ్లలో ప్రపంచకప్‌లో ఇరాన్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. చివరిగా 1998లో ఆ జట్టుపై గెలిచింది. గత 18 మ్యాచ్‌ల్లో ఓటమి లేకుండా సాగుతున్న మొరాకోకు ఇదే తొలి ఓటమి.

ఇరాన్ ఆటగాళ్ల సంబరం

గిమెనెజ్

సలా లేని ఈజిప్ట్ గట్టిగానే పోరాడింది. తనకన్నా చాలా మెరుగైన ర్యాంకులో ఉన్న ఉరుగ్వేతో హోరాహోరీగా తలపడింది. మ్యాచ్ గోల్ లేని డ్రాగా ముగియడం ఖాయమనుకుంటున్న దశలో ఉరుగ్వే పుంజుకుంది. ఇంకొద్ది నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా జోస్ గిమెనెజ్ హెడర్ గోల్‌తో ప్రపంచకప్‌లో శుభారంభం చేసింది.

పోరాడి ఓడిన ఈజిప్ట్

ఉరుగ్వే శుభారంభం

ఎకతెరిన్‌బర్గ్ (రష్యా): ఆద్యంతం గట్టి పోటీ ఇచ్చిన ఈజిప్ట్‌కు తీవ్ర నిరాశ కలిగించే ఫలితం. శుక్రవారం గ్రూప్-ఏ మ్యాచ్‌లో ఉరుగ్వే 1-0తో ఈజిప్ట్‌పై గెలిచి ప్రపంచకప్‌లో బోణీ కొట్టింది. 89వ నిమిషంలో డిఫెండర్ గెమినెజ్ గోల్ కొట్టి ఉరుగ్వేను విజయపథంలో నడిపించాడు. ట్రెజెగ్వెట్, మహ్మద్ షెనావిల చక్కని ప్రదర్శనతో మ్యాచ్‌లో చాలా భాగం ఈజిప్ట్ ఆకట్టుకున్నా.. గాయం కారణంగా స్టార్ మో సలా అందుబాటులో లేకపోవడం ఆ జట్టుకు ప్రతికూలంగా మారింది.

డ్రా దిశగా సాగి...: మ్యాచ్‌లో చాలా భాగం ఈజిప్ట్ (45వ ర్యాంకు) చక్కని ప్రదర్శనే చేసింది. ఆ జట్టు డిఫెన్స్.. ఉరుగ్వే (14వ ర్యాంకు) స్టార్లు లూయిస్ సురెజ్, ఎడిసన్‌లను చక్కగా అడ్డుకుంది. ఆరంభంలో పేలవంగా ఆడిన ఉరుగ్వే తర్వాత చాల గోల్ ప్రయత్నాలే చేసింది. 24వ నిమిషంలో మంచి అవకాశాన్ని సురెజ్ వృథా చేశాడు. డీగో గోడిన్ కొట్టిన కార్నర్ సురెజ్ దగ్గరకు వచ్చింది. అతణ్ని అడ్డుకునేందుకు డిఫెండర్లు కూడా లేరు. గోల్ ఖాయమనిపించింది. కానీ ఆరు అడుగుల దూరం నుంచి కూడా అతడు బంతిని నెట్లోకి పంపలేకపోయాడు. విరామం తర్వాత తొలి నిమిషంలోనే ఉరుగ్వేకు గోల్ చేసే అవకాశం దక్కింది. సురెజ్ షాట్‌ను ఈజిప్ట్ గోల్‌కీపర్ మహ్మద్ షెనావి చక్కగా అడ్డుకున్నాడు. 83వ నిమిషంలో షెనావి ఉరుగ్వే గోల్ ప్రయత్నాన్ని మరింత అద్భుతంగా అడ్డుకున్నాడు. సురెజ్ నుంచి అందుకున్న బంతిని కవాని నెట్లోకి కొట్టాడు. నెట్లో పడబోతున్న బంతిని పక్కకు దూకుతూ షెనావి గొప్పగా అడ్డుకున్నాడు. మ్యాచ్ ముగింపునకు వస్తున్నా గోల్స్ రాకపోవడంతో మ్యాచ్ డ్రా కావడం ఖాయమనిపించింది. కానీ అనూహ్యంగా గిమినెజ్.. ఈజిప్ట్‌కు షాకిచ్చాడు. ఓ ఫ్రీ కిక్ ఈజిప్ట్ కొంప ముంచింది. షాంచెజ్ ఫ్రీకిక్ ఆడగా.. చాలా ఎత్తుకు ఎగిరిన గిమెనెజ్ తలతో బంతిని నెట్ కుడి వైపునకు పంపాడు. అంతే ఉరుగ్వే సంబరాల్లో మునిగిపోయింది. డగౌట్లో కూర్చుని ఆటను చూస్తున్న సలా సహా ఈజిప్ట్ ఆటగాళ్లంతా షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత ఈజిప్ట్ గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

యో యో పరీక్షలో రాయుడు విఫలం

జట్టులో చోటుకు ప్రమాదం

బెంగళూరు: ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో సిరీస్‌ల ముంగిట మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అంబటి రాయుడు యో యో ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమయ్యాడు. దీంతో రాయుడు జట్టులో స్థానం కోల్పోయే అవకాశం ఉంది. శుక్రవారం జరిగిన ఈ పరీక్షలో కనీస అర్హత మార్కును అతను చేరుకోలేకపోయాడు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన అంబటి 600పైన పరుగులు సాధించిన సంగతి తెలిసిందే. మరోవైపు భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. అతను యో యో పరీక్షను విజయవంతంగా పూర్తి చేశాడు. అతనితో పాటు ధోని, భువనేశ్వర్, కేదార్ జాదవ్, సురేశ్ రైనా కూడా యో యో పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. గతేడాది రైనా ఇదే పరీక్షలో విఫలమై జట్టులో చోటు కోల్పోయాడు. ఈనెల 27, 29 తేదీల్లో భారత్.. ఐర్లాండ్‌తో టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత జులై 3న ఇంగ్లాండ్‌తో మూడు టీ20, మూడు వన్డేలు, ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్ ప్రారంభం కానుంది.

రొనాల్డో హ్యాట్రిక్

స్పెయిన్‌తో పోర్చుగల్ మ్యాచ్ డ్రా

మాస్కో: క్రిస్టియానో రొనాల్డో అదరగొట్టాడు. ఒక్కడే మూడు గోల్స్‌తో చెలరేగాడు. స్పెయిన్ అద్భుతంగా ఆడినా ఆ జట్టుకు విజయం దక్కకుండా చేశాడు. రొనాల్డో (4వ, 44వ, 88వ నిమిషం) హ్యాట్రిక్‌తో మెరిసిన వేళ శుక్రవారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 3-3తో స్పెయిన్‌తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. 4వ నిమిషంలో లభించిన పెనాల్టీని గోల్ చేసిన రొనాల్డో ఆ తర్వాత ఫీల్డ్ గోల్ చేశాడు. 88వ నిమిషంలో పోర్చుగల్ 2-3తో వెనకబడిన దశలో లభించిన ఫ్రీకిక్‌ను అతడు అద్భుత రీతిలో గోల్ చేశాడు. స్పెయిన్ తరపున డిగో కోస్టా (24వ, 55వ), నాచో (58వ) గోల్స్ చేశారు.



కేవలం 27.5 ఓవర్లు.. ఒక సెషన్ కూడా పూర్తి కాలేదు. అంతలోనే పది వికెట్లు పడిపోయాయి. రెండో ఇన్నింగ్స్‌లో కొంచెం మెరుగు. కష్టపడి 38.4 ఓవర్లాడగలిగారు. మొత్తంగా 66.3 ఓవర్లలో 20 వికెట్లూ కూలిపోయాయి. పట్టిన సమయం ఐదున్నర గంటలే. రెండు ఇన్నింగ్స్‌లూ కలిపి చేసిన పరుగులు 212. అత్యధిక వ్యక్తిగత స్కోరు 36. రెండు ఇన్నింగ్స్‌ల స్కోర్లు కలిపినా ఫాలోఆన్ తప్పించుకునే స్కోరు చేయలేదు.

తన అరంగేట్ర టెస్టులో అఫ్గానిస్థాన్ దైన్యాన్ని తెలియజెప్పే గణాంకాలివి!

కొన్నేళ్ల శ్రమ, పోరాటం, నిలకడ కలిసి ఎట్టకేలకు టెస్టు క్రికెట్ ఆడే గౌరవాన్ని దక్కించుకుంది అఫ్గాన్. పొట్టి క్రికెట్లో అద్భుతాలు చేస్తున్న ఆ జట్టు.. సుదీర్ఘ ఫార్మాట్లోనూ సత్తా చాటుతుందనే ఆశించారంతా. తొలి రోజు వ్యతిరేక పవనాల్ని కాచుకుని, పుంజుకునే ప్రయత్నమూ చేశారు అఫ్ఘనులు. కానీ రెండో రోజు ఆ జట్టు నిలవలేకపోయింది. భారత బౌలింగ్‌కు బ్యాట్స్‌మెన్ దాసోహమన్న వేళ.. తన అరంగేట్ర టెస్టులో ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది అఫ్గాన్. కెప్టెన్ కోహ్లి, ప్రధాన పేసర్ భువనేశ్వర్ లేకున్నా భారత్ తిరుగులేని విజయంతో సత్తా చాటింది.

రెండే రోజుల్లో..

1 రెండు రోజుల్లో టెస్టు మ్యాచ్ గెలిచిన తొలి ఆసియా జట్టు భారతే.

4 ఒకే రోజు రెండుసార్లు ఆలౌటైన నాలుగో జట్టు అఫ్గాన్. ఈ జాబితాలో భారత్ (1952లో ఇంగ్లాండ్‌పై 58, 82) కూడా ఉంది. జింబాబ్వే రెండుసార్లు ఇలా ఆలౌటైంది.

24 రెండో రోజు పడ్డ వికెట్లు. 1902 తర్వాత టెస్టుల్లో ఒకే రోజు ఇన్ని వికెట్లు కూలడమిదే తొలిసారి.

262 భారత్ ఇన్నింగ్స్ గెలుపు తేడా. ఇన్నింగ్స్ విజయాల్లో ఇదే అతి పెద్దది.

• అఫ్గానిస్థాన్‌ను చుట్టేసిన టీమ్‌ఇండియా • ఒకే రోజు రెండుసార్లు ఆలౌట్ • ఇన్నింగ్స్ 262 పరుగులతో భారత్ భారీ విజయం

బెంగళూరు

అఫ్గానిస్థాన్ అరంగేట్ర టెస్టు ఆ జట్టుకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. కేవలం రెండు రోజుల్లోనే ఆ జట్టును చుట్టేసింది భారత్. శుక్రవారం అఫ్గాన్‌ను రెండుసార్లు ఆలౌట్ చేసిన భారత్.. ఇన్నింగ్స్ 262 పరుగుల తేడాతో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగుల భారీ స్కోరు చేసిన టీమ్‌ఇండియా.. తర్వాత అఫ్గాన్‌ను వరుసగా రెండో ఇన్నింగ్స్‌ల్లో 109, 103 పరుగులకు కుప్పకూల్చింది. తొలి ఇన్నింగ్స్‌లో అశ్విన్ (4/27), ఇషాంత్ (2/18) ప్రత్యర్థి పతనాన్ని శాసిస్తే.. రెండో ఇన్నింగ్స్‌లో జడేజా (4/17), ఉమేశ్ (3/26) విజృంభించారు. సెంచరీ వీరుడు ధావన్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

పాండ్య మెరుపులతో మొదలై..: తొలి రోజు చివరి ఇన్నింగ్స్‌లో అఫ్గాన్ బౌలర్లు పుంజుకున్న తీరు చూస్తే.. మ్యాచ్ రసవత్తరంగా సాగుతుందని, ప్రత్యర్థి అంత తేలిగ్గా ఏమీ లొంగదని అనుకున్నారంతా. కానీ రెండో రోజు కథ మారిపోయింది. ఉదయం హార్దిక్ పాండ్య (71; 94 బంతుల్లో 10×4) మెరుపులతో భారత్ జోరు మొదలైంది. ఓవర్‌నైట్ స్కోరు 347/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. అనూహ్యంగా 474 పరుగులు చేసింది. వన్డే తరహాలో చెలరేగి ఆడిన పాండ్య.. అఫ్గాన్ జట్టు నీరుగారిపోయేలా చేశాడు. 440 వద్ద పాండ్య వెనుదిరగ్గా.. ఉమేశ్ (26 నాటౌట్; 21 బంతుల్లో 2×4, 2×6) ధాటిగా ఆడి స్కోరు మరింత పెంచాడు.

భారత్ ఇన్నింగ్స్ అవ్వగానే లంచ్. విరామంలో భారత బౌలర్లకు కడుపు నిండలేదో ఏమో.. మైదానంలోకి రాగానే అఫ్గాన్‌ను నంజుకు తినేశారు. ఆరంభం నుంచి ఎప్పుడెప్పుడు ఔటవుదామా అన్నట్లు ఆడిన షెజాద్ (14) లేని పరుగుకు ప్రయత్నించి రనౌటైపోయాడు. తర్వాత ఇషాంత్.. అహ్మది (1), అఫ్సర్ (6)లను బౌల్డ్ చేశాడు. రహ్మత్ (14)ను ఉమేశ్ వికెట్ల ముందు బలిగొన్నాడు. ఆపై స్పిన్నర్లు అందుకున్నారు. అశ్విన్ రాకతో అఫ్గాన్ బ్యాట్స్‌మెన్ విలవిలలాడారు. అతడి బౌలింగ్‌ను ఎదుర్కోవడం శక్తికి మించిన పనే అయింది. నబి (24) మినహా వచ్చిన వాళ్లు వచ్చిన వచ్చినట్లే వెనుదిరిగారు. జడేజా (2/18) లోయరార్డర్ పని పట్టాడు. టీ విరామానికి కొన్ని నిమిషాల ముందే అఫ్గాన్ ఇన్నింగ్స్ ముగిసింది.

టీ తర్వాతా అదే కథ. ఫాలోఆన్‌లో పడ్డ అఫ్గాన్ మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చింది. ఆరంభంలో ఉమేశ్ యాదవ్ నిప్పులు చెరిగే బంతులతో అఫ్గాన్ బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో మాదిరే నాలుగో ఓవర్లో వెనుదిరిగాడు షెజాద్ (13). ఉమేశ్ అతడిని వికెట్ కీపర్ క్యాచ్ ద్వారా పెవిలియన్ చేర్చాడు. అహ్మది (3), రహ్మత్ (4) కూడా ఎంతోసేపు నిలవలేదు. తొలి ఇన్నింగ్స్‌లో బాగా ఆడాడని నబి (0)ని పైన పంపిస్తే అతను డకౌటై వెనుదిరిగాడు. స్కోరు 24/4. ఈ దశలో హస్మతుల్లా (36 నాటౌట్; 88 బంతుల్లో 6×4), స్తానిక్‌జాయ్ (25) జోడీ గంటకు పైగా వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. ఐతే స్తానిక్‌జాయ్‌ను ఔట్ చేయడం ద్వారా జడేజా ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాత అఫ్గాన్ పతనానికి అడ్డే లేకపోయింది. హస్మతుల్లా నిలబడ్డా.. అతడికి సహకరించేవారే కరవయ్యారు. కొన్ని ఓవర్లుండగానే అఫ్గాన్ పని పట్టేసి.. మూడో రోజు ఆడే అవసరం లేకుండా చేసుకుంది భారత్.

భారత్ తొలి ఇన్నింగ్స్: 474

అఫ్గానిస్థాన్ తొలి ఇన్నింగ్స్: షెజాద్ రనౌట్ 14; అహ్మది (బి) ఇషాంత్ 1; రహ్మద్ ఎల్బీ (బి) ఉమేశ్ 14; అఫ్సర్ (బి) ఇషాంత్ 6; హస్మతుల్లా ఎల్బీ (బి) అశ్విన్ 11; స్తానిక్‌జాయ్ (బి) అశ్విన్ 11; నబి (సి) ఇషాంత్ (బి) అశ్విన్ 24; రషీద్ (సి) ఉమేశ్ (బి) జడేజా 7; అహ్మద్‌జాయ్ (సి) జడేజా (బి) అశ్విన్ 0; ముజీబ్ (స్టంప్డ్) కార్తీక్ (బి) జడేజా 15; వఫాదర్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 0 **మొత్తం: (27.5 ఓవర్లలో ఆలౌట్) 109; వికెట్ల పతనం:** 1-15, 2-21, 3-35, 4-35, 5-50, 6-59, 7-78, 8-87, 9-88; **బౌలింగ్:** ఉమేశ్ 6-1-18-1; ఇషాంత్ 5-0-28-2; పాండ్య 5-0-18-0; అశ్విన్ 8-1-27-4; జడేజా 3.5-1-18-2

అఫ్గానిస్థాన్ రెండో ఇన్నింగ్స్: షెజాద్ (సి) కార్తీక్ (బి) ఉమేశ్ 13; అహ్మది (సి) ధావన్ (బి) ఉమేశ్ 3; రహ్మత్ (సి) రహానె (బి) ఇషాంత్ 4; నబి ఎల్బీ (బి) ఉమేశ్ 0; హస్మతుల్లా నాటౌట్ 36; స్తానిక్‌జాయ్ (సి) ధావన్ (బి) జడేజా 25; అఫ్సర్ (బి) జడేజా 1; రషీద్ (బి) జడేజా 12; అహ్మద్‌జాయ్ (బి) ఇషాంత్ 1; ముజీబ్ (సి) ఉమేశ్ (బి) జడేజా 3; వఫాదర్ (బి) అశ్విన్ 0; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం: (38.4 ఓవర్లలో ఆలౌట్) 103; వికెట్ల పతనం:** 1-19, 2-22, 3-22, 4-24, 5-61, 6-62, 7-82, 8-85, 9-98; **బౌలింగ్:** ఇషాంత్ 7-2-17-2; ఉమేశ్ 7-1-26-3; పాండ్య 4-2-6-0; అశ్విన్ 11.4-3-32-1; జడేజా 9-3-17-4

చందా కొచ్చర్‌పై బి.ఎన్. శ్రీకృష్ణ దర్యాప్తు!

ముంబయి: ఐసీఐసీఐ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ చందాకొచ్చర్‌పై వచ్చిన వివిధ ఆరోపణలపై సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ దర్యాప్తు చేపట్టనున్నారు. మే చివరికల్లా ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభిస్తామని బ్యాంకు పేర్కొన్న సంగతి తెలిసిందే. 'దర్యాప్తు చేయడానికి శ్రీకృష్ణ సరైన వ్యక్తి అని బోర్డు భావిస్తోంది. మా విజ్ఞప్తిని ఆయన అంగీకరించారు' అని ఈ పరిణామాలతో నేరుగా సంబంధమున్న ఒక వ్యక్తి పేర్కొన్నారు. 'జస్టిస్ శ్రీకృష్ణ.. విశ్వసనీయ పేరిది. ఆర్థిక మార్కెట్ల గురించి ఆయనకు పూర్తి అవగాహన ఉంద'ని ఆ వ్యక్తి అన్నారు. ఫైనాన్షియల్ సెక్టార్ లెజిస్లేటివ్ రిఫామ్స్ కమిషన్(ఎఫ్ఎస్ఎల్ఆర్‌సీ)కు ఛైర్మన్‌గా ఆయన పనిచేశారు. ప్రస్తుతం ఆయన డేటా భద్రత వ్యవస్థపై ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి అధిపతిగా ఉన్నారు. 77 ఏళ్ల శ్రీకృష్ణ 1992-93లో ముంబయిలో జరిగిన మత ఘర్షణలపై దర్యాప్తు చేసిన కమిషన్‌కు అధ్యక్షత వహించారు కూడా. సుప్రీం కోర్టు నుంచి పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన స్వతంత్ర మధ్యవర్తిగా పనిచేశారు కూడా. తాజా పరిణామంపై స్పందించడానికి శ్రీకృష్ణ నిరాకరించారు. కాగా, దర్యాప్తు పూర్తికి బోర్డు ఎటువంటి గడువును విధించలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

బ్యాంకులకు రూ.1.8 కోట్లు ఇవ్వండి

కోర్టు ఖర్చులపై విజయ్ మాల్యాకు యూకే హైకోర్టు ఆదేశం

లండన్: విజయ్ మాల్యా ఎగవేసిన బకాయిలు రాబట్టుకోవడానికి న్యాయ పోరాటం చేస్తున్న 13 భారతీయ బ్యాంకులకు ఖర్చుల కింద కనీసం 2,00,000 పౌండ్లు (దాదాపు రూ. 1.8 కోట్లు) చెల్లించాలంటూ యూకే హైకోర్టు, మాల్యాను ఆదేశించింది. తమ వద్ద భారీ మొత్తం రుణాలు తీసుకుని, చెల్లించకుండా లండన్‌కు పారిపోయిన మాల్యా నుంచి దాదాపు 1.145 బి.పౌండ్లు (దాదాపు రూ. 10,000 కోట్లు) రికవరీ చేయడానికి 13 భారతీయ బ్యాంకుల కన్సార్షియం పోరాడుతోంది. కన్సార్షియంలో ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కార్పొరేషన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, జమ్ము అండ్ కశ్మీర్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, పీఎన్‌బీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, యూకో బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జేఎం ఫైనాన్షియల్ అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ ఉన్నాయి. ఇదిలా ఉంటే, మాల్యాను తిరిగి భారత్‌కు పంపే విషయమై, కోర్టు విచారణ జులై 31న జరిగే అవకాశం ఉంది.

టీసీఎస్.. మెగా బైబ్యాక్

టీసీఎస్ 50వ ఏజీఎంలో మాట్లాడుతున్న ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్

రూ.16,000 కోట్ల షేర్ల తిరిగి కొనుగోలుకు బోర్డు ఆమోదం

దిల్లీ: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మరో మెగా బైబ్యాక్‌కు రంగం సిద్ధం చేసింది. రూ. 16,000 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేసే ప్రతిపాదనకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదముద్ర వేసింది. చెల్లింపు వాటా మూలధనంలో (పెయిడప్ ఈక్విటీ కేపిటల్) 1.99 శాతానికి సమానమైన 7.61 కోట్ల షేర్లను ఒక్కోటి రూ. 2,100 చొప్పున తిరిగి కొనుగోలు చేయనుంది. 'రూ. 16,000 కోట్ల విలువకు మించకుండా 7.61 కోట్ల ఈక్విటీ షేర్లను బైబ్యాక్ చేసే ప్రతిపాదనకు శుక్రవారం జరిగిన సమావేశంలో డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింద'ని ఎక్స్ఛేంజీలకు టీసీఎస్ వెల్లడించింది. ఈ ప్రతిపాదనకు వాటాదార్ల అనుమతి తీసుకోవాల్సి ఉందని పేర్కొంది. బైబ్యాక్ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందనే వివరాలతో పాటు ఇతరత్రా సమాచారాన్ని త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది. గతేడాది కూడా రూ. 16,000 కోట్లతో షేర్లను టీసీఎస్ బైబ్యాక్ చేసిన సంగతి విదితమే. ఆ సమయంలో ఒక్కోటి రూ. 2,850 చొప్పున 5.61 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేసింది.

రూ.7 లక్షల కోట్ల ఎగువకు టీసీఎస్ మార్కెట్ విలువ: మార్కెట్ విలువపరంగా టీసీఎస్ రికార్డు సృష్టించింది. రూ. 7 లక్షల కోట్లకు మించి మార్కెట్ విలువను నమోదు చేసిన తొలి భారతీయ కంపెనీగా ఘనత సాధించింది. బైబ్యాక్‌కు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలపడంతో షేర్లు ఉరకలెత్తాయి. గత నెల 25న కూడా టీసీఎస్ మార్కెట్ విలువ రూ. 7 లక్షల కోట్ల ఎగువకు వెళ్లి మళ్లీ తిరిగొచ్చింది.

వాటాదార్లకు అధిక ప్రతిఫలమే ధ్యేయం: రాజేశ్ గోపీనాథన్

'మూలధన కేటాయింపు విధానానికి కంపెనీ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. వాటాదార్లకు అత్యంత ఎక్కువ ప్రతిఫలాన్ని పంచాలన్నదే మా అభిమతం. వాటాదార్లకు ప్రయోజనాల చెల్లింపులను క్రమక్రమంగా పెంచుకుంటూ వస్తున్నాం. ఇప్పుడు మేం పంచుతున్న ప్రతిఫలం గరిష్ఠ స్థాయికి చేరింద'ని 50 వార్షిక సాధారణ సమావేశంలో టీసీఎస్ ఎండీ, సీఈఓ రాజేశ్ గోపీనాథన్ తెలిపారు. సంస్థ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ షేర్ల బైబ్యాక్ నిర్ణయాన్ని ప్రకటించగానే వాటాదార్లు హర్షాతిరేకాన్ని వ్యక్తం చేశారు. సెప్టెంబరు కల్లా షేర్ల తిరిగి కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నట్లు చంద్రశేఖరన్ చెప్పారు. షేరు ప్రస్తుత ధర కంటే 15 శాతం అధికంగా బైబ్యాక్‌కు షేరు ధర (రూ. 2100) నిర్ణయించడంపై గోపీనాథన్ స్పందిస్తూ ఇప్పటి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగానే బోర్డు నిర్ణయం తీసుకుందని చెప్పారు. వాటాదార్లకు ఓ వైపు ప్రతిఫలాలను పంచుతూనే, వ్యాపారపరంగా ప్రయోజనం ఉంటుందని భావిస్తే కంపెనీల కొనుగోళ్లకూ మొగ్గు చూపుతామని ఆయన స్పష్టం చేశారు.

ప్రపంచ సంపదలో సగం.. సంపన్నుల చేతిలోనే

మొత్తం విలువ 202 లక్షల కోట్ల డాలర్లకు: బోస్టన్ కన్సల్టింగ్

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కుబేరుల సంపద వేగంగా వృద్ధి చెందుతోంది. గతేడాది అంతర్జాతీయంగా వ్యక్తిగత సంపద 201.9 లక్షల కోట్ల డాలర్లుకు చేరింది. 2016తో పోలిస్తే ఇది 12 శాతం అధికం. గత అయిదేళ్లలోనే ఇది వేగవంతమైన వృద్ధి కావడం విశేషం. ఈక్విటీ మార్కెట్లు గణనీయంగా రాణించడం ఇందుకు ప్రధాన కారణమని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ నివేదిక వెల్లడించింది. డాలర్‌తో పోలిస్తే ఇతర ప్రధాన కరెన్సీలు బలపడటం సైతం వ్యక్తిగత సంపద పెరగడానికి తోడ్పడిందని పేర్కొంది. ప్రపంచ సంపదలో దాదాపు సగం సంపన్నుల చేతిలోనే ఉండటం గమనార్హం. 2012లో ఇది 45 శాతం కంటే తక్కువగానే ఉందని బోస్టన్ నివేదిక తెలిపింది. మొత్తం సంపదలో 86.1 లక్షల కోట్ల డాలర్లు ఉత్తర అమెరికాలోనే ఉన్నాయి. ప్రపంచ సంపదలో సంపన్నుల వాటా పెరుగుతోందని, అంత మాత్రాన పేదలు మరింత పేదవాళ్లు అవుతున్నారని కాదని నివేదిక పేర్కొంది.

ఆసియా వెలుగులు: ఆసియాలో వ్యక్తిగత సంపద వృద్ధి అధికంగా ఉంది. గతేడాది ఇక్కడ సంపన్నుల సంపద 19 శాతం అధికమై 36.5 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇందులో 57 శాతం వాటా చైనీయుల చేతిలోనే ఉంది. గతేడాది చైనాలో సంపద సృష్టి అధికంగా జరిగింది. అంతర్జాతీయంగా అత్యధిక వ్యక్తిగత సంపదలో చైనా రెండో స్థానంలో నిలిచింది. గత అయిదేళ్లలో జపాన్‌ను చైనా అధిగమించింది. సంపన్నుల సంఖ్యలో చైనా కంటే ముందు స్థానంలో అమెరికా ఉంది. వచ్చే అయిదేళ్లలో అమెరికాలో కంటే చైనాలో ఎక్కువ సంపద పోగవ్వొచ్చని నివేదిక అంచనా వేసింది.

పేటీఎం బ్యాంకింగ్ కేంద్రాలు

టీ బడ్డీలో అయిదు రూపాయల బిల్లు మొదలు.. ఎంతమొత్తమైనా చెల్లించే వీలును ఆన్‌లైన్ ద్వారా కల్పిస్తున్న పేటీఎం సంస్థ, కొత్తగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కేంద్రాలను నెలకొల్పనుంది. దేశవ్యాప్తంగా లక్ష కేంద్రాల ఏర్పాటు లక్ష్యమని, వీటిల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో 10,000 వరకు నెలకొల్పుతామని పేటీఎం బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) రేణు సత్తి తెలిపారు. పెద్దనోట్ల రద్దు సమయంలో, నగదు కొరత తీర్చేందుకు సాయపడిన సంస్థ, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకునే వీటిని నెలకొల్పుతోందని 'ఈనాడు' ఇంటర్వ్యూలో చెప్పారు. ముఖ్యాంశాలివీ..

- దేశవ్యాప్తంగా లక్ష ఏర్పాటు చేస్తాం
- తెలుగు రాష్ట్రాల్లో 10,000 కేంద్రాలు
- దుకాణదార్లతో ఒప్పందం చేసుకుంటాం
- కార్పొరేట్ ఖాతాదార్లకు ప్రత్యేక వాలెట్లు
- త్వరలో కరెంటు ఖాతాలూ ప్రారంభిస్తాం

పేటీఎం పేమెంట్స్‌బ్యాంక్ ఎండీ

ఇంటర్వ్యూ రేణు సత్తి

పేటీఎం కా ఏటీఎం పేరిట నెలకొల్పుతాం

దేశంలో ఇంకా బ్యాంక్ ఖాతా లేని వారు 50 కోట్ల మంది ఉన్నారని అంచనా. ప్రస్తుతం 18 కోట్ల మందికి పైగా పేటీఎం వాలెట్లను వినియోగిస్తున్నారు. ఈ వాలెట్‌ను వినియోగిస్తున్న వారంతా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ సేవలను వినియోగించుకుంటున్నట్లే లెక్క. ఖాతా ప్రారంభం, నగదు డిపాజిట్, ఉపసంహరణతో పాటు సంస్థ ఇతర ఆర్థిక సేవలు అందించేందుకు బ్యాంకింగ్ కేంద్రాలను కూడా 'పేటీఎం కా ఏటీఎం' పేరిట నెలకొల్పుతోంది. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోని వారు బ్యాంకింగ్ సేవలు పొందేందుకు పడుతున్న కష్టాలు నివారించేలా వీటిని ఏర్పాటు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా లక్ష కేంద్రాలు ఏర్పాటు లక్ష్యం. వీటిల్లో తెలుగు రాష్ట్రాల్లో 10,000 వరకు ఉంటాయి. స్థానిక దుకాణాల్లోనే ఇవి ఉంటాయి.

ఫుడ్ వాలెట్లను 550పైగా సంస్థలు వినియోగించుకుంటున్నాయ్

కార్పొరేట్ సంస్థల ఉద్యోగుల కోసం వేతన ఖాతాలూ ఆరంభించాం. కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగులకు భిన్న రకాల సేవలు అందిస్తున్నాయి. వీటిల్లో ఫుడ్ కూపన్లు ఒకటి. ముద్రించి ఇచ్చే కూపన్లను తీసుకెళ్లడం మరచిపోతే, వినియోగించుకోలేరు. గడువు దాటితే పనికిరావు. ఇందుకోసమే మేము డిజిటల్ ఫుడ్ వాలెట్లు ప్రవేశపెట్టాం. కూపన్లుగా ఇచ్చే మొత్తాన్ని ఈ వాలెట్‌లో కార్పొరేట్ సంస్థలు జమచేస్తాయి. హీరో మోటోకార్ప్, కేపీఐటీ, వీఐపీ ఇండస్ట్రీస్, లారెల్, షాపర్స్‌స్టాప్, బిగ్‌బాస్కెట్ వంటి 550కిపైగా కార్పొరేట్ సేవలు ఫుడ్‌వాలెట్‌కు ఖాతాదార్లుగా మారాయి. ఉద్యోగులకు ఇచ్చే రవాణా భత్యం, మొబైల్ భత్యానికి ప్రత్యామ్నాయంగా డిజిటల్ వాలెట్లు తేబోతున్నాం. ఇలాంటి వినూత్న ఉత్పత్తులు మరిన్ని ఆవిష్కరిస్తాం.

డిపాజిట్ మొత్తం రూ.లక్షకు మించితే..

పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారుల్లో ఏ రోజున అయినా రూ. లక్షకు మించి నగదు ఉండటానికి వీలు లేదు. అందుకే మా భాగస్వామి బ్యాంక్ ఇండస్ ఇండ్ బ్యాంక్ సహకారంతో, ఖాతాదార్లకు సహకరిస్తున్నాం. ఖాతాదారులు పేటీఎం బ్యాంక్ ఖాతాలో కనుక రూ. లక్షకు మించి నగదు కూడా డిపాజిట్ చేస్తే, అదనంగా ఉన్న నగదును ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేస్తాం. ఈ రూపేణ ఖాతాదార్లకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

ఎంపిక, శిక్షణ, సర్టిఫికేషన్ తరవాతే

సంప్రదాయ బ్యాంకులు కూడా బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించుకున్నాయి. మేము మాత్రం విశ్వసనీయత, స్థానికంగా నమ్మకం ఉన్న దుకాణదార్లను ఎంపిక చేశాక, శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ పొందాకే ఈ కేంద్రాల ప్రారంభానికి అనుమతిస్తాం. ముఖ్యంగా దుకాణం ఉన్న ప్రాంతం కూడా కీలకమే అవుతుంది. శిక్షణ కూడా పూర్తిగా మా ఆధ్వర్యంలోనే ఉంటుంది. వీరికి ఇచ్చే పీసీ యాప్ ద్వారా ఖాతాదార్లకు సేవలందిస్తారు. ప్రయోగాత్మకంగా దిల్లీ, హరియాణా, పంజాబ్‌లలో కొన్ని ప్రారంభించాం. అక్కడి ఫలితాలు, అనుభవాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరిస్తాం. రెండు, మూడు నెలల్లో తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. గ్రామాలు, చిన్న పట్టణాల్లో నివాసితులు 1-1.5 కిలోమీటర్ల పరిధిలోనే బ్యాంకింగ్ సేవలు పొందేలా ఈ కేంద్రాలుంటాయి.

ప్రత్యేకతలు ఉన్నాయ్

నగదు నిల్వ అవసరం లేని పొదుపు ఖాతాలను పేటీఎం బ్యాంక్ మాత్రమే అందిస్తోంది. ఇందుకు అపరాధరుసుము కూడా విధించడం లేదు. పొదుపు ఖాతాలో నగదు ఉంటే 4 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం. డిజిటల్ లావాదేవీలకు కూడా ఎటువంటి ఛార్జీలు వసూలు చేయడం లేదు. డిపాజిట్‌ను ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు. ఇందుకు రుసుము ఏమీ ఉండదు. బ్యాంక్‌లో ఖాతా తెరిచిన వారికి ఇతర బ్యాంకుల తరహాలోనే డెబిట్‌కార్డులు జారీ చేస్తున్నాం. దేశవ్యాప్తంగా 950కి పైగా పట్టణాల్లో డెబిట్‌కార్డులు జారీ చేశాం. ఆన్‌లైన్‌లో వినియోగానికి డిజిటల్ (వర్చువల్) డెబిట్‌కార్డులూ ఉన్నాయి. అత్యధిక వెబ్‌సైట్లు, ఇకామర్స్ సంస్థలు, వినియోగ సంస్థలు కూడా పేటీఎం చెల్లింపులను అంగీకరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 70 లక్షల మంది సాధారణ వ్యాపారులు కూడా పేటీఎం చెల్లింపులు స్వీకరిస్తున్నారు.

2020 నాటికి 50కోట్ల మంది ఖాతాదార్లు

2020 నాటికి 50 కోట్ల మంది ఖాతాదార్లకు సేవలందించాలన్నది మా లక్ష్యం. త్వరలో కరెంటు ఖాతాలు కూడా ప్రారంభించబోతున్నాం. రెండో, మూడు, నాలుగో అంచె పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి బ్యాంకింగ్ సేవలు అందించడమే మా తొలి ప్రాధాన్యం.

- ఈనాడు వాణిజ్య విభాగం

కియా మోటార్స్ పార్కులో ఫారేసియా యూనిట్

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని అమ్మవారుపల్లి వద్ద ఉన్న కియా మోటార్స్ సప్లైయర్ పార్కులో ఆటోమోటివ్ టెక్నాలజీ కంపెనీ ఫారేసియా యూనిట్ ఏర్పాటు చేస్తోంది. వాహనాల్లో అంతర్భాగాల (ఇంటీరియర్లు) కోసం ఈ కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వెల్లడించింది. ఈ ప్లాంటుపై కంపెనీ రూ. 50 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. దాదాపు 400 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. 2019 తొలి త్రైమాసికంలో ఉత్పత్తిని ప్రారంభించే అవకాశం ఉంది. కియా మోటార్స్ కోసం రోజుకు 1000కు పైగా ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెళ్లను తయారు చేస్తుంది. ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద వాహన మార్కెట్ అని, అభివృద్ధికి ఇది చక్కని ప్రదేశమని ఫారేసియా ఇంటీరియర్స్ ఇండియా డైరెక్టర్ విద్యాధర లిమయే తెలిపారు. భారత్‌లో ఫారేసియాకు 11 ఉత్పత్తి కేంద్రాలు, 2 సాంకేతిక కేంద్రాలు ఉన్నాయి. 3,600 మంది పని చేస్తున్నారు. భారత్‌లో ఫోర్డ్, హ్యుందాయ్, మారుతీ సుజుకీ వంటి కంపెనీలకు కావాల్సిన విడి భాగాలను అందిస్తోంది.

హైదరాబాద్ కంపెనీలో రూ.455 కోట్ల 'రైజ్ ఫండ్' పెట్టుబడులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఫోర్త్ పార్టనర్ ఎనర్జీ కంపెనీలో 'ద రైజ్ ఫండ్' 7 కోట్ల డాలర్ల (దాదాపు రూ. 455 కోట్లు) పెట్టుబడులు పెట్టింది. టీపీజీ గ్రోత్ రైజ్ ఫండ్‌ను నిర్వహిస్తోంది. సామాజిక, పర్యావరణ పరంగా సానుకూల ప్రభావాన్ని చూపే వ్యాపారాల్లో రైజ్ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. దేశంలో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టులకు సమగ్ర సొల్యూషన్లను అందిస్తున్న కంపెనీల్లో ఫోర్త్ పార్టనర్ ఎనర్జీ ప్రధాన కంపెనీ. దీన్ని 2010లో వివేక్ సుబ్రమణియన్, సఫి ధోరజివాలా, వికాస్ సాలుగూటి నెలకొల్పారు. డిస్ట్రిబ్యూటెడ్ ఎనర్జీ మేనేజిమెంట్ కంపెనీ అయిన ఫోర్త్ పార్టనర్ ఈ రంగంలో ప్రాజెక్టులను రూపొందించడం, నిర్మించడం, రుణాలు అందించే సంస్థలతో అనుసంధానం చేయడం వంటి సమగ్ర సేవలను అందిస్తోంది. తాజాగా లభించిన పెట్టుబడులను రూఫ్‌టాప్ సౌర విద్యుత్‌ప్రాజెక్టుల రంగంలో మరింత పట్టు సాధించడానికి వినియోగించనున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు వివేక్ సుబ్రమణియన్ తెలిపారు. కంపెనీకి కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలు తదితరాలు ఖాతాదారులుగా ఉన్నాయి. ఇప్పటి వరకూ 22 రాష్ట్రాల్లో 1,500 ప్రాజెక్టులను కంపెనీ పూర్తి చేసింది. 2022 నాటికి ఒక గిగావాట్ డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, తాజా నిధులతో ఈ లక్ష్యాన్ని అధిగమించగలమని సుబ్రమణియన్ చెప్పారు.

మళ్లీ.. సుంకాల సమరం

ట్రంప్

- 50 బి.డాలర్ల చైనా ఉత్పత్తులపై 20 శాతం విధించిన అమెరికా
- అదేరీతిలో స్పందిస్తామన్న డ్రాగన్

వాషింగ్టన్/బీజింగ్

వాణిజ్య యుద్ధానికి మళ్లీ తెర లేచింది. 50 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 3,25,000 కోట్లు) విలువైన చైనా ఉత్పత్తులపై 25 శాతం కొత్త సుంకం విధించాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించడమే ఇందుకు కారణం. చైనా మేధో సంపత్తి చౌర్యం చేస్తోందని, అందుకే ఆ దేశ ఉత్పత్తులపై సుంకాలు విధించినట్లు యూఎస్ ప్రభుత్వం వెల్లడించింది. 'రెండు దేశాల మధ్య వాణిజ్య విధానాలు సరిగా లేవు. ఇకపై ఇలాంటి పరిస్థితి ఉండదు. అందుకే కొత్త సుంకాల్ని విధించాం. దీనికి చైనా నుంచి ప్రతిఘటన ఎదురైతే, మరిన్ని ఉత్పత్తులపై సుంకాలు విధించేందుకూ వెనకాడమ'ని సుంకాల ప్రకటన తరవాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. "మేడ్ ఇన్ చైనా 2025'లో భాగంగా చైనా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. అభివృద్ధి చెందుతున్న హై-టెక్నాలజీ సంస్థలపై ఆధిపత్యం కొనసాగిస్తూ ఆర్థిక వృద్ధిని ఆశిస్తోంది. ఇది అమెరికాతో పాటు మిగతా దేశాల ఆర్థిక వృద్ధిని దెబ్బతీసేలా ఉంది. అన్యాయమైన ఆర్థిక విధానాలతో టెక్నాలజీ, మేధో సంపత్తిని ఎంతోకాలం కోల్పోవడానికి అమెరికా సిద్ధంగా లేదు. అమెరికా, చైనా మధ్య వాణిజ్య సంబంధాల్లో సమతౌల్యత తీసుకొచ్చేందుకు తొలి అడుగు వేశాం. చైనాతో వాణిజ్యం వల్ల అమెరికాకు ఏడాదికి 370 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఏర్పడుతోంది. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో స్నేహం, అలాగే చైనాతో అమెరికా సంబంధం రెండూ నాకు ముఖ్యమే' అని ట్రంప్ తెలిపారు.

స్పందించిన చైనా: ట్రంప్ తీసుకున్న తాజా చర్యకు ప్రతిగా చైనా వెంటనే స్పందించింది. తమ ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలకు సమానమైన మొత్తంలో యూఎస్ ఉత్పత్తులపై సుంకాలు విధిస్తామని తెలిపింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో ఓ ప్రకటన విడుదల చేసింది. 'అమెరికా తాజా చర్యపై, అన్ని దేశాలు కలిసి ఉమ్మడి చర్యకు దిగాల'ని చైనా పిలుపునిచ్చింది. 'అమెరికా ప్రభుత్వం ఏకపక్ష రక్షణాత్మక ధోరణిలో చర్యలు తీసుకొంటోంది. అవి చైనాకు ఏ మాత్రం ఇబ్బందులు కలిగించినా మా న్యాయబద్ధమైన హక్కుల్ని కాపాడుకొనేందుకు అవసరమైన చర్యలకు మేము కూడా ఉపక్రమించాల్సి ఉంటుంద'ని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జెంగ్ షువాంగ్ బీజింగ్‌లో పేర్కొన్నారు. దీంతో ప్రపంచంలోనే అతి పెద్దవైన రెండు ఆర్థిక వ్యవస్థలు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధానికి మరోసారి తెర లేచినట్లయింది.

మార్చిలో మొదలు..

ట్రంప్ తొలిసారిగా మార్చిలో చైనా ఉత్పత్తులపై 50 బిలియన్ డాలర్ల వాణిజ్య జరిమానాలు విధిస్తామని ప్రకటించారు. దీనికి ప్రతిగా చైనా గట్టిగానే స్పందించింది. అమెరికా తమ ఉత్పత్తులపై ఎంత మొత్తానికైతే సుంకాలు పెంచాలని చూస్తుందో, అంతే విలువైన అమెరికా ఉత్పత్తుల (కార్లు, విమానాలు, సోయాబీన్)పై తాము కూడా సుంకాలు విధిస్తామని స్పష్టం చేసింది. చైనా బెదిరింపుతో ట్రంప్ మరో ముందడుగు వేసి అదనంగా మరో 100 బి. డాలర్ల చైనా ఉత్పత్తులపై సుంకాలు పెంచుతామని హెచ్చరించడంతో వాణిజ్య ఉద్రిక్తతలు అధికమయ్యాయి.. దీంతో మే నెలలో ఇరు దేశాల మధ్య రెండు దఫాలుగా వాణిజ్య చర్చలు జరిగాయి. అయితే అవి ఫలించలేదు. పది రోజుల తరవాత అమెరికా సుంకాల పెంపుపై ముందుకు వెళుతున్నామని ప్రకటించింది. దీంతో ఈ నెల మొదట్లో మరో దఫా చర్చలు బీజింగ్‌లో జరిగాయి. కానీ ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో చైనా ఉత్పత్తులపై కొత్త సుంకాలను ఆమోదిస్తూ ట్రంప్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

జిన్ పింగ్

✦ ఇటీవలి జీ 7 దేశాల శిఖరాగ్ర సమావేశం తరవాత కెనడా, మెక్సికో, ఐరోపా సమాఖ్య నుంచి దిగుమతి చేసుకొనే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకం విధించాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు చైనా ఉత్పత్తులపై కొత్త సుంకాల ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. తాజా అమెరికా నిర్ణయంతో చైనా ఎలా స్పందిస్తుందో చూడాలి.

'ట్రంప్ తీసుకుంటున్న వాణిజ్య విధాన నిర్ణయాలు అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసేలా ఉన్నాయి. ఆయన ప్రపంచ వాణిజ్య వ్యవస్థను అణగదొక్కేలా వ్యవహరిస్తున్నారు. వాణిజ్య యుద్ధం వల్ల రెండు దేశాలూ నష్టపోతాయనే విషయాన్ని ట్రంప్ గుర్తుంచుకోవాల'ని అంతర్జాతీయ ద్రవ్య నిధి చీఫ్ క్రిస్టిన్ లగార్డే హెచ్చరించారు.

సోలార్ స్టోరేజీ బ్యాటరీ యూనిట్ ఏర్పాటు ప్రకటనలో ఎరెడా హోమ్స్ ఎండీ నాగార్జున రావు, ట్రైటన్ సోలార్ సీఈఓ హిమాంశు బి పటేల్ తదితరులు

ఏపీలో సౌర బ్యాటరీల యూనిట్

రూ.650 కోట్లతో ఎరెడా, ట్రైటాన్‌ల ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: ముంబయికి చెందిన ఎరెడా హోమ్స్ ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతి సమీపంలో సౌరశక్తి స్టోరేజీ బ్యాటరీల అసెంబ్లింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. విద్యుత్తు వాహనాలు, ఆసుపత్రులు, కంపెనీలు తదితర అన్ని రంగాల్లో ఈ బ్యాటరీలు ఉపయోగపడతాయి. ఈ యూనిట్ ఏర్పాటు చేయడానికి అమెరికాకు చెందిన ట్రైటాన్ సోలార్ కంపెనీతో చేతులు కలిపింది. రెండు కంపెనీలు కలిసి యూనిట్ ఏర్పాటు చేస్తాయని, ప్లాంట్ల ఏర్పాటు, మార్కెటింగ్‌కు 10 కోట్ల డాలర్లకు (దాదాపు రూ. 650 కోట్లు) పైగా పెట్టుబడులు అవసరమవుతాయని ఎరెడా హోమ్స్ ఎండీ జి.వి.నాగార్జున రావు తెలిపారు. 2018 సెప్టెంబరు నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి వస్తుందని, సౌర విద్యుత్ నిల్వ బ్యాటరీల తయారీకి అవసరమైన విడిభాగాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అమెరికా కంపెనీ అందిస్తుందని చెప్పారు. ట్రైటాన్ సోలార్‌కున్న నానో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తక్కువ బరువు, ఎక్కువ కాలం మన్నే బ్యాటరీలను తయారు చేస్తామని, ధర కూడా తక్కువగా ఉండగలదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసే యూనిట్‌కు లభించే స్పందనను బట్టి తెలంగాణలో కూడా మరో అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉందని, ఇందుకు అనుగుణంగా రెండు కంపెనీలు తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని ట్రైటన్ సోలార్ వ్యవస్థాపకుడు, సీఈఓ హిమాంశు పటేల్ తెలిపారు. భవిష్యత్తులో బ్యాటరీలు పూర్తి స్థాయిలో ఇక్కడే తయారు చేసే ఆలోచన ఉందన్నారు. వీటితోపాటు సోలార్ ప్యానెళ్లపై ఉండే ఫిల్మ్‌ను తయారు చేయనున్నట్లు వివరించారు.

సెన్సెక్స్ ▲ 22 **35622**

నిఫ్టీ ▲ 10 **10818**

డోజోన్స్ 24963 ▼ 212

నాస్‌డాక్ 7742 ▼ 19

రూపాయి 68.01 ▼ 39 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 73.33 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	15న	మార్పు %
CIPLA	611.60	4.00
DR. REDDYS LAB	2349.85	3.54
INFOSYS	1281.25	3.35
TCS	1840.05	2.94
UPL	700.70	2.31
SUN PHARMA	571.30	2.15
BAJAJ FINANCE	2283.60	1.80

గ్రహణం (-)

నిఫ్టీ	15న	మార్పు %
HINDALCO	237.40	-3.00
INDIAN OIL CORP	167.75	-2.22
ULTRATECH CEM	3691.65	-2.00
YES BANK	330.65	-1.94
SBI	277.45	-1.82
ONGC	165.45	-1.81
NTPC	156.05	-1.48

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.80	71.66
పౌండ్ స్టెర్లింగ్	81.88	94.97
యూరో	71.48	82.89
జపనీస్ యెన్/100	55.83	64.75
ఆస్ట్రేలియా డాలరు	46.11	53.35
సింగపూర్ డాలరు	45.92	54.41
థాయ్ బాత్/100	191.11	228.56
బహ్రెయిన్ దీనార్	167.15	191.39
కువైట్ దీనార్	185.90	231.41
ఒమన్ రియాల్	163.26	187.51
సౌదీ రియాల్	16.39	19.47
యూఏఈ దిర్హమ్	16.78	19.65
మలేషియా రింగిట్	15.18	18.67
చైనీస్ యువాన్	7.49	12.16



బజాజ్ ఎలక్ట్రికల్స్ చేతికి నిర్లెప్

ముంబయి: మన్నికైన వినిమయ వస్తువుల తయారీ సంస్థ బజాజ్ ఎలక్ట్రికల్స్ వంట సామాన్ల (నాన్‌స్టిక్ కుక్‌వేర్) తయారీ సంస్థ అయిన నిర్లెప్ అప్లియన్సెస్‌ను దాదాపు రూ.80 కోట్లకు కొనుగోలు చేసింది. ఔరంగదాబాద్‌కు చెందిన నిర్లెప్ సంస్థ 1968లో ప్రారంభమైంది. నాన్‌స్టిక్ సాంకేతికతను పరిచయం చేయడంతో పాటు ఐరోపాకు తమ ఉత్పత్తుల్ని తొలిసారిగా ఎగుమతి చేసిన దేశీయ సంస్థ కూడా ఇదే కావడం విశేషం. 'నిర్లెప్‌లోని మొత్తం వాటాల కొనుగోలుకు రూ.42.50 కోట్లు చెల్లించేందుకు ప్రతిపాదించామ'ని బీఎస్ఈకి ఇచ్చిన సమాచారంలో బజాజ్ ఎలక్ట్రికల్స్ తెలిపింది. 'మా సంస్థలోని మొత్తం వాటాను 42.50 కోట్లకు కొనుగోలు చేయడంతోపాటు మాకున్న అప్పు రూ.30 కోట్లను తీర్చేందుకు బజాజ్ ఎలక్ట్రికల్స్ అంగీకరించింది. కొంత వాయిదా చెల్లింపుల మొత్తం కూడా ఇచ్చేందుకు ఒప్పుకొంది. మొత్తం కలిపి దాదాపు రూ.80 కోట్లకు ఈ ఒప్పందం జరిగింద'ని నిర్లెప్ వ్యవస్థాపకుడు ముకుంద్ భోగలే తెలిపారు. ఈ ఒప్పందం రెండు దశల్లో పూర్తి చేయనున్నారు.

ఎంపెడాలో రొయ్య ధరల సమాచారం

ఈనాడు, అమరావతి: అమెరికా విపణిలో వనామీ(హెచ్ఎల్) రకానికి చెందిన 16-20 కౌంట్ కిలో రొయ్యలకు రూ.697 ధర లభిస్తున్నట్లు సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల సంస్థ(ఎంపెడా) జేడీ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశాల వారీగా వివిధ కౌంట్ల వనామీ రొయ్యలకు ధరల సమాచారం తాము అందిస్తున్నట్లు వివరించారు. మరింత సమాచారం కావాల్సిన రైతులు ఎంపెడా ఏడీని 9441087489 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

రూ.1.2 లక్షల కోట్ల మొండి బకాయిల రద్దు

● బ్యాంకుల నష్టాలతో పోలిస్తే ఇవే ఎక్కువ

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దు చేసిన మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) రూ.1.2 లక్షల కోట్లకు చేరాయి. ఇవి బ్యాంకులు నమోదు చేసిన మొత్తం నష్టాల కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. దీంతో అటు మొండి బకాయిలకు తోడు రద్దులు.. ఇటు నష్టాల వల్ల బ్యాంకులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. దశాబ్ద కాలంలోనే తొలిసారిగా బ్యాంకులు భారీ రద్దు(రైటాఫ్స్), భారీ నష్టాలను ప్రకటించడం గమనార్హం.

- ✦ 2016-17 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు మొత్తం మీద లాభాలనే నమోదు చేసినా.. 2017-18లో మాత్రం రూ.85,370 కోట్ల నష్టాలను నమోదు చేసినట్లు అధికారిక గణాంకాలే నివేదిస్తున్నాయి.
- ✦ 2016-17లో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.473.72 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయగా, రూ.81,683 కోట్ల విలువైన నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ)ను రద్దు చేశాయి.
- ✦ ఒక్క ఎస్‌బీఐయే 2017-18లో రూ.40,196 కోట్ల మొండి బకాయిలను రైటాఫ్ చేసింది. కెనరా బ్యాంకు(రూ.8,310 కోట్లు); పంజాబ్ నేషనల్ బ్యాంకు(రూ.7,407 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా(రూ.4,948 కోట్లు)లు కూడా ఎన్‌పీఏలను రద్దు చేశాయి.

ప్రభుత్వ రంగ బ్యాంకుల రైటాఫ్‌లు (రూ. కోట్లలో)

సంవత్సరం	రైటాఫ్
2013-14	34,409
2014-15	49,018
2015-16	57,585
2016-17	81,683
2017-18	1,20,000

- ✦ ఆర్‌బీఐ సత్వర దిద్దుబాటు ప్రణాళిక కింద ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(రూ.10,307 కోట్లు), బ్యాంక్ ఆఫ్ ఇండియా(రూ.90903 కోట్లు), ఐడీబీఐ బ్యాంక్(రూ.6632 కోట్లు), అలహాబాద్ బ్యాంక్(రూ.3,648 కోట్లు)లు కూడా రైటాఫ్ చేశాయి. (రైటాఫ్ అంటే సదరు ఖాతాకు 100 శాతం కేటాయింపు చేయడం. తద్వారా ఆ ఎన్‌పీఏ బ్యాలెన్స్ షీట్లలో కనిపించదు. సాంకేతికంగా రద్దు చేసినా, సదరు బకాయిదార్ల పేరిట ఖాతాలు కొనసాగుతాయి. అయితే నిర్వహణ లాభంపై ప్రభావం పడుతుంది కాబట్టి రైటాఫ్‌ల వల్ల బ్యాలెన్స్ షీట్లపైనా ఒత్తిడి ఉంటుంది.)
- ✦ డిసెంబరు 2017 నాటికి రూ.8.31 లక్షల కోట్ల ఎన్‌పీఏలున్నట్లు తెలుస్తోంది.

అండగా ఉంటాం

● గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కు ఆర్‌బీఐ ఉద్యోగుల సంఘం మద్దతు

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)లో ఆశ్చర్యకర పరిణామం చోటు చేసుకుంది. గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కు ఆర్‌బీఐ ఉద్యోగుల యూనియన్ మద్దతు ప్రకటించింది. మొండి బకాయిల సమస్యలను పరిష్కరించడం కోసం తీసుకుంటున్న కఠిన చర్యలకు అండగా నిలుస్తామని యూనియన్ పేర్కొంది. 'ఎక్కడో ఉండి పనిచేసే సర్వేయర్'గా కాకుండా.. 'ప్రమాదాలను హెచ్చరించే ఒక పరిశీలనాధికారి'గా గవర్నర్ ప్రభుత్వ రంగ బ్యాంకులను పర్యవేక్షించాలని ఒక లేఖలో సంఘం కోరింది. అఖిల భారత రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం ఆ మేరకు తమ లేఖలో గవర్నర్‌కు మద్దతు పలికింది. విచిత్రం ఏమిటంటే 40 అతిపెద్ద మొండి ఖాతాలను దివాలా కోర్టులకు సిఫారసు చేస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ బ్యాంకు అధికార్ల యూనియన్లు దిల్లీ హైకోర్టుకు వెళ్లిన కొద్ది రోజుల్లోనే, ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. ఈ 40 ఖాతాలు వ్యవస్థలోని మొత్తం మొండి బకాయిల్లో 40 శాతం వాటాను కలిగి ఉండడం గమనించదగ్గ విషయం. ప్రభుత్వ రంగ బ్యాంకులను సమర్థంగా నియంత్రించడానికి మరిన్ని అధికారాలు కావాల్సిన అవసరం ఉందని ఈ వారం మొదట్లో పార్లమెంటరీ కమిటీ ఎదుట ఆర్‌బీఐ గవర్నర్ అభిప్రాయం వెల్లడించిన సంగతి తెలిసిందే.

డాక్టర్ రెడ్డీస్ 'సుబాక్సాన్' జనరిక్‌కు ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: సుబాక్సాన్ బ్రాండ్‌తో విక్రయిస్తున్న బుప్రెనార్ఫిన్, నలాక్సాన్ సబ్‌లింగ్యువల్ ఫిల్మ్ ఔషధం జనరిక్‌ను అమెరికాలో విక్రయించడానికి డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు అనుమతి లభించింది. 2 ఎంజీ/0.5 ఎంజీ, 4 ఎంజీ/1 ఎంజీ, 8 ఎంజీ/2 ఎంజీ తదితర మోతాదుల్లో ఈ ఔషధాన్ని విడుదల చేయడానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి తుది అనుమతి లభించిందని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. కొన్ని నొప్పి నివారణ ఔషధాలపై ఆధారపడడాన్ని తగ్గించడం/మత్తు పదార్థాలకు బానిసలుగా మారడాన్ని నివారించడానికి 'సుబాక్సాన్'ను సిఫారసు చేస్తున్నారు. రిస్క్ ఎవల్యూషన్ అండ్ మిటిగేషన్ స్ట్రాటజీ (ఆర్ఈఎంఎస్) కింద ఆమోదం లభించిన తర్వాత దీన్ని విడుదల చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. బ్రిటన్‌కు చెందిన ఇండివియెర్ సుబాక్సాన్ బ్రాండ్‌తో బుప్రెనార్ఫిన్, నలాక్సాన్ సబ్‌లింగ్యువల్ ఫిల్మ్ ఔషధాన్ని విక్రయిస్తోంది. 2018, ఏప్రిల్‌తో ముగిసిన ఏడాది కాలానికి అమెరికాలో 'సుబాక్సాన్' విక్రయాలు 1.86 బిలియన్ డాలర్లు ఉన్నట్లు అంచనా. ఈ అనుమతి కంపెనీకి ఒక కీలక మలుపని, ఆమోదయోగ్యమైన ధరలకు జనరిక్ ఔషధాలను అందించడానికి కంపెనీ కట్టుబడి ఉందని డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీఈఓ (అభివృద్ధి చెందిన మార్కెట్లు) అలోక్ సోనిగ్ తెలిపారు. సుబాక్సాన్ అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్‌ను తెవా ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ నుంచి 2016 జూన్‌లో 7 కోట్ల డాలర్లకు డాక్టర్ రెడ్డీస్ కొనుగోలు చేసింది. ఈ ఔషధం విక్రయం వల్ల అమెరికా నుంచి వచ్చే లాభాలు ఆకర్షణీయంగా పెరగగలవని భావిస్తున్నారు. సుబాక్సాన్ ఔషధానికి జనరిక్‌ను విడుదల చేస్తున్న తొలి కంపెనీ డాక్టర్ రెడ్డీస్ అవుతుంది. అయితే.. మేధో సంపత్తి హక్కుల వివాదం ఉన్నందున న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవడానికి అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

మలేసియా బ్యాంక్‌లో వాటా విక్రయానికి మూడు ప్రభుత్వ రంగ బ్యాంకుల చర్చలు

ముంబయి: మలేసియాలోని సంయుక్త సంస్థ ఇండియన్ ఇంటర్నేషనల్ బ్యాంక్‌లో తమ వాటా విక్రయానికి దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకులైన బ్యాంక్ ఆఫ్ బరోడా (40 శాతం), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (35 శాతం), ఆంధ్రా బ్యాంక్ (25 శాతం) ప్రయత్నాలు చేస్తున్నాయి. గత మార్చి నుంచే ఈ పనిలో నిమగ్నమయ్యాయని సమాచారం. బ్యాంక్ ఆఫ్ బరోడా ఉన్నతాధికారులు మలేసియా వెళ్లి వాటా విక్రయానికి సంబంధించిన తదుపరి చర్చలు చేస్తున్నారని సమాచారం. ఈ మూడు పీఎస్‌బీలు మలేసియా బ్యాంక్ నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అక్కడి నియంత్రణ సంస్థకు ఇప్పటికే వెల్లడించాయి. గతంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తమ వాటాను భారతీయ భాగస్వాములకు అమ్మాలని ప్రయత్నించింది. కానీ కుదర్లేదు. ఇటీవల ఈ మూడు బ్యాంకులకు మొండి బకాయిలు పేరుకుపోయి నష్టాల బాట పట్టాయి. ఈ నేపథ్యంలో మలేసియా బ్యాంకులో తమ వాటా విక్రయించాలని నిర్ణయించుకొని ఆ బాధ్యతను బ్యాంక్ ఆఫ్ బరోడాకు అప్పగించాయి. ప్రస్తుతం ఆ పనిలోనే బ్యాంక్ ఆఫ్ బరోడా ఉంది.

4 నెలల గరిష్ఠానికి వాణిజ్యలోటు

దిగుమతులు పెరగడమే కారణం

దిల్లీ: దేశ వాణిజ్యలోటు 4 నెలల గరిష్ఠానికి చేరింది. మేలో 1462 కోట్ల డాలర్ల (రూ.95,000 కోట్లకు పైగా)కు పెరిగింది. కిందటేడాది ఇదే నెలలో వాణిజ్యలోటు 1384 కోట్ల డాలర్లుగా నమోదైంది. ఈసారి దిగుమతులు బాగా పెరగడం వాణిజ్యలోటు అధికమయ్యేందుకు కారణమైంది. గత నెలలో దిగుమతులు 14.85 శాతం పెరిగి 4348 కోట్ల డాలర్లకు చేరాయని కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు వెల్లడించారు. మరోవైపు ఎగుమతులు కూడా 20.18 శాతం వృద్ధితో 2886 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ఇది ఆరు నెలల గరిష్ఠ స్థాయి. పెట్రోలియం ఉత్పత్తులు, రసాయనాలు, ఔషధాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు పెరగడం ఇందుకు దోహదం చేసింది. జీడిపప్పు, ఇనుప ఖనిజం, వస్త్రాలు, రత్నాభరణాలు, చేనేత ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రతికూల వృద్ధి నమోదైంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడంతో, చమురు దిగుమతుల బిల్లు 49.46 శాతం అధికమై 1150 కోట్ల డాలర్లకు చేరింది. అటు పసిడి దిగుమతులు 29.85 శాతం తగ్గి 348 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. 2018-19 ఏప్రిల్-మేలో ఎగుమతులు 12.58% వృద్ధితో 5477 కోట్ల డాలర్లకు చేరగా.. దిగుమతులు 9.72 శాతం పెరిగి 8311 కోట్ల డాలర్లకు చేరింది. వాణిజ్యలోటు 2834 కోట్ల డాలర్లుగా నమోదైంది. కిందటేడాది ఏప్రిల్-మేలో వాణిజ్యలోటు 2709 కోట్ల డాలర్లుగా ఉంది. ఎగుమతిదార్లకు జీఎస్‌టీ రీఫండ్‌ల సమస్య త్వరలోనే సమసిపోతుందని అనుకుంటున్నామని మంత్రి సురేశ్ ప్రభు ఆశాభావం వ్యక్తం చేశారు.

అందువల్ల ఎగుమతుల పరంగా 2017-18తో పోలిస్తే 2018-19 అత్యుత్తమంగా ఉంటుందని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఎగుమతుల ప్రోత్సాహానికి సంబంధిత మంత్రులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు కూడా మంత్రి వెల్లడించారు.

యాక్సిస్ బ్యాంక్ ప్రతికూలం

- ● ఐసీఐసీఐ బ్యాంక్ రేటింగ్‌లోనూ కోత
- ● దర్యాప్తు వల్ల ప్రతిష్ఠకు భంగం: ఫిచ్

ముంబయి: ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌ల నష్టనివారణ వ్యవస్థల్లో లోటుపాట్లు ఉన్నాయని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ పేర్కొంది. 'ఐసీఐసీఐ బ్యాంకుపై ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు కారణంగా బ్యాంకు పాలనపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంద'ని ఫిచ్ ఒక నివేదికలో పేర్కొంది. అదే సమయంలో ఈ దర్యాప్తు వల్ల బ్యాంకు ప్రతిష్ఠ మసకబారే ప్రమాదం ఉందనీ తెలిపింది.

మరో పక్క, యాక్సిస్ బ్యాంక్ (ఇష్యూవర్ డిఫాల్ట్) రేటింగ్‌ను సైతం 'స్థిరత్వం' నుంచి 'ప్రతికూలాని'కి కోత వేసింది. మొండి బకాయిలు అధికంగా ఉండడం; మూలధనం పరిమితంగా ఉండడాన్ని ఇందుకు కారణంగా చూపించింది. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు), వాటికి కేటాయింపులు పెరగడం; కొత్త అధిపతి కోసం వెతకడానికి బోర్డు అంగీకరించడం; బ్యాంకు తొలిసారిగా త్రైమాసిక నష్టాన్ని(2017-18 జనవరి-మార్చి) ప్రకటించడం తదితరాలను ఫిచ్ గుర్తు చేసింది.

'యాక్సిస్ బ్యాంక్‌లా ఆర్థిక క్షీణత ఉన్నప్పటికీ.. ఐసీఐసీఐ బ్యాంక్ మూలధనం విషయంలో మెరుగ్గా ఉంద'ని ఫిచ్ పేర్కొంది. అయితే ఐసీఐసీఐ బ్యాంక్ 'సపోర్ట్ రేటింగ్'ను 2 నుంచి 3కు తగ్గించడంతో పాటు.. 'సపోర్ట్ రేటింగ్ ఫ్లోర్'ను బీబీబీ- నుంచి బీబీ+కు సవరించింది.

'రెండు ప్రైవేటు రంగ బ్యాంకులు గత కొద్ది నెలలుగా గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓ చందా కొచ్చర్‌పై రుణాల జారీకి సంబంధించి 'నీకిది నాకది' ఆరోపణలు రాగా.. యాక్సిస్ బ్యాంక్‌లోనూ అధిపతిని ఎందుకు మార్చరాదంటూ ఆర్‌బీఐ ప్రశ్నించడంతో సమస్యలు మొదలయ్యాయ'ని ఫిచ్ వివరించింది. ప్రైవేటు బ్యాంకుల రంగంలో అంతర్గత మూలధన సమీకరణను అంచనా వేస్తున్నామని ఫిచ్ పేర్కొంది.

పిల్లల పెంపకానికో యాప్

అభివృద్ధి చేసిన హైదరాబాద్ అంకురం

ఈనాడు, హైదరాబాద్: మొబైల్ ఫోన్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో ఎక్కువగా ఆడుతూ.. చదువుపై శ్రద్ధచూపని పిల్లలను, ఆటలాడేందుకు ప్రోత్సహిస్తూనే నియంత్రించడానికి, సరైన పద్ధతిలో పెంచడానికి హైదరాబాద్‌కు చెందిన అంకుర కంపెనీ ప్లే గో సొల్యూషన్స్ యాప్‌ను విడుదల చేసింది. తల్లిదండ్రులు, పిల్లల మధ్య సహకారానికి 'ఎల్ఆర్ ఎన్ ప్లే' యాప్ దోహదం చేస్తుందని, పిల్లలు ఏయే యాప్‌లపై ఎంతసేపు సమయాన్ని వెచ్చిస్తున్నారో కూడా తెలుసుకోవచ్చని అంకుర కంపెనీ వ్యవస్థాపకులు కిరణ్, శిల్పారావు తెలిపారు. దీన్ని అభివృద్ధి చేయడానికి రూ.2 కోట్లు వెచ్చించామని, 10 లక్షల మంది పిల్లలకు యాప్‌ను చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కిరణ్ వివరించారు. యాప్‌లో వర్క్ షీట్లు వంటివి ఉంటాయని, రిడీమ్ కూపన్లు, ప్రోత్సాహకాలు, బహుమతుల ద్వారా పిల్లలను ప్రోత్సహిస్తామన్నారు. పిల్లల సామర్థ్యాలను కూడా యాప్ అంచనా వేస్తుందన్నారు.

రిలయన్స్ ఇండస్ట్రీస్ కార్బన్ ఫైబర్ ప్లాంటు

దిల్లీ: దేశంలోనే మొట్టమొదటి కార్బన్ ఫైబర్ తయారీ యూనిట్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ఏర్పాటు చేస్తోంది. వైమానిక, రక్షణ రంగానికి కార్బన్ ఫైబర్ అవసరాలను తీర్చే ఉద్దేశంతో ఈ ప్లాంటు ఏర్పాటుకు పెట్టుబడులు పెడుతున్నట్లు వార్షిక నివేదికలో ఆర్ఐఎల్ వెల్లడించింది. వివిధ రూపాల్లో ప్లాస్టిక్, లోహ ఉత్పత్తుల 3డీ ప్రింటింగ్ అభివృద్ధి సామర్థ్యం తనకు ఉందని నివేదికలో ఆర్ఐఎల్ పేర్కొంది. కార్బన్ ఫైబర్‌తో మోడ్యులర్ మరుగుదొడ్లు, ఇళ్లు, విండ్ మిల్ బ్లేడ్లు, రోటార్ బ్లేడ్‌లు లాంటి కాంపోజిట్ ఉత్పత్తులను కూడా కంపెనీ తయారుచేయనుంది. రూ.30,000 కోట్ల కాంపోజిట్స్ విపణిలో వాటా పెంచుకునే ఉద్దేశంతో పెట్రోరసాయనాల వ్యాపారంలో కొత్త వ్యాపార విభాగాలపై ఆర్ఐఎల్ దృష్టి పెట్టింది.

ఆద్యంతం ఒడుదొడుకులు

- ● సూచీలకు స్వల్ప లాభం
- ● రాణించిన టీసీఎస్

సమీక్ష

ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో.. సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఐటీ, ఔషధ షేర్లకు చివర్లో కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. చైనా ఎగుమతులపై అమెరికా తాజా సుంకాలు విధించడంతో వాణిజ్య ఉద్రిక్తతలు మరోసారి తెరపైకి వచ్చాయి.

రూ.16000 కోట్ల విలువైన షేర్ల బైబ్యాక్‌కు టీసీఎస్ బోర్డు ఆమోదం తెలపడంతో ఐటీ షేర్లు రాణించాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా.. ఐరోపా షేర్లు నీరసంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,656.26 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఇంట్రాడేలో 35,419.68 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివర్లో ఐటీ, ఔషధ షేర్లకు మద్దతు లభించడంతో సెన్సెక్స్ కోలుకుంది. 22.32 పాయింట్ల లాభంతో 35,622.14 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 10,755.40 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 9.65 పాయింట్లు పెరిగి 10,817.70 దగ్గర స్థిరపడింది.

డాక్టర్ రెడ్డీస్ ధనాధన్: సుబాక్సాన్ జనరిక్ వెర్షన్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం ఇవ్వడంతో డాక్టర్ రెడ్డీస్ షేరు పరుగులు తీసింది. ఇంట్రాడేలో 5 శాతం లాభపడిన షేరు.. రూ.2,382.20 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 3.65 శాతం పెరిగి రూ.2,351.10 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టాలు చవిచూశాయి. యెస్ బ్యాంక్ 1.91%, ఎస్‌బీఐ 1.82%, ఓఎన్‌జీసీ 1.81%, కోల్ ఇండియా 1.59%, ఎన్‌టీపీసీ 1.45%, ఎం అండ్ ఎం 1.36%, ఎల్ అండ్ టీ 1.23%, ఐటీసీ 1.01%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.83%, టాటా మోటార్స్ 0.83% చొప్పున డీలాపడ్డాయి. ఇన్ఫోసిస్ 3.37%, టీసీఎస్ 2.75%, సన్‌ఫార్మా 2.04%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ 2.24% లాభపడింది. పీఎస్‌యూ, లోహ, మౌలిక, స్థిరాస్తి, విద్యుత్, చమురు-గ్యాస్, యంత్ర పరికరాలు, బ్యాంకింగ్ స్క్రిప్‌లు మాత్రం డీలాపడ్డాయి.

మార్కెట్ కబుర్లు

- ✦ ఔషధ సంస్థ **పానేసియా బయోటెక్** తన భాగస్వామి అపోటెక్స్‌తో కలిసి అమెరికాకు చెందిన సెల్‌జెన్ కార్పొరేషన్‌తో పేటెంట్ వివాదాన్ని పరిష్కరించుకొంది. రొమ్ము, ఊపిరితిత్తులతో పాటు పలు రకాల క్యాన్సర్ చికిత్సకు వాడే అబ్రాక్సేన్ ఔషధానికి సంబంధించిన పేటెంట్ విషయంలో వివాదం తలెత్తిన విషయం తెలిసిందే.
- ✦ ఫోర్టిస్ మలార్ హాస్పిటల్స్, ఎస్ఆర్ఎల్ విలీన పథకాన్ని వెనక్కు తీసుకొనేందుకు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) చండీగఢ్ ధర్మాసనం తమకు అనుమతి ఇచ్చిందని **ఫోర్టిస్ హెల్త్‌కేర్** తెలిపింది.

15న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	386	వరంగల్	388
చిల్లరగా(ఒక గుడ్డు)	4.45	విశాఖపట్నం	385
బెంగళూరు	425	చెన్నై	452
16వ తేదీకి...		చిత్తూరు	445
విజయవాడ/గోదావరి	378	నమక్కల్	435

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 372.95 (374.45) 7278768
ASIAN PAINTS 1282.20 (1286.10) 1048699
AXIS BANK LT 528.75 (532.00) 7854953
BAJAJ AUTO L 2877.15 (2890.70) 370164
BAJAJ FINANC 2283.60 (2243.25) 1637500
BAJAJ FINSER 5979.10 (6028.00) 251127
BHARTI AIRTE 378.25 (376.50) 5713581
BHARTI INFRA 293.60 (296.50) 3264270
BPCL 412.25 (416.35) 6200928
CIPLA 611.60 (588.05) 7125922
COAL INDIA L 279.05 (283.20) 4279134
DR. REDDYS 2349.85 (2269.40) 4456911
EICHER MOTOR 29573.75 (29536.70) 53984
GAIL 334.90 (339.00) 3496927
GRASIM IND 1031.80 (1036.20) 641700
HCL TECH 948.30 (936.95) 3093292
HDFC 1832.25 (1833.75) 3700695
HDFC BANK 2029.60 (2037.40) 2720204
HERO MOTOCOR 3693.70 (3695.60) 306688
HINDALCO IND 237.40 (244.75) 6786903
HINDUSTAN UN 1621.30 (1609.60) 2101892
HPCL 306.35 (309.75) 4694364
ICICI BANK 282.50 (284.75) 47186222
INDIABULLS H 1191.00 (1186.20) 3713637
INDIAN OIL 167.75 (171.55) 10962278
INDUSINDBANK 1967.35 (1963.40) 2274265
INFOSYS LTD 1281.25 (1239.70) 9978880
ITC 264.50 (267.25) 10814596
KOTAK MAHIND 1340.00 (1332.65) 1658235
LARSEN & TOU 1329.90 (1343.00) 2660969
LUPIN 913.20 (899.60) 8180351
M&M 909.45 (922.05) 2619109
MARUTI SUZIK 8951.60 (8958.00) 496572
NTPC LTD 156.05 (158.40) 9000541
ONGC 165.45 (168.50) 7589493
POWER GRID C 197.85 (198.85) 5359466
RELIANCE IND 1014.20 (1007.95) 11294702
SBI 277.45 (282.60) 16949917
SUN PHARMA 571.30 (559.25) 15166730
TATA CONSULT 1840.05 (1787.55) 9183574
TATA MOTORS 302.95 (305.90) 8224497
TATA STEEL L 566.00 (569.55) 6208764
TECH MAHINDR 707.25 (698.80) 3273882
TITAN IND 903.45 (905.25) 2364375
ULTRATECH 3691.65 (3767.00) 588115
UPL LIMITED 700.70 (684.90) 2743888
VEDANTA LIMI 238.60 (240.05) 24482557
WIPRO 266.90 (266.40) 4835437
YES BANK LTD 330.65 (337.20) 8518379
ZEE ENTERTAI 555.00 (554.20) 1356388

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1214.70 (1252.85) 79763
ACC 1302.10 (1307.20) 472050
ADITYA BIRLA 139.90 (140.65) 1119938
AMBUJA CEMEN 204.95 (206.05) 6832521
ASHOK LEYLAN 142.25 (144.95) 9644132
AUROBIND PHA 613.85 (609.45) 5963140
AVENUE SUPER 1535.35 (1568.50) 758011
BANK OFBAROD 131.30 (135.15) 11776063
BEL 116.85 (116.15) 7010040
BHEL 75.15 (76.00) 6690135
BOSCH LTD 18191.10 (18236.15) 24998
BRITANNIA 6136.60 (6001.75) 179270
CADILA HEALT 398.50 (398.70) 3087095
COLGATE PALM 1219.45 (1231.90) 291157
CONTAINER 1263.15 (1304.15) 402701
CUMMINS INDI 687.30 (688.90) 288011
DABUR INDIA 383.85 (386.90) 1370715
DLF LIMITED 199.85 (205.90) 5339537
EMAMI LIMITE 1097.85 (1095.40) 227625
GENERAL INS 719.20 (721.75) 88067
GODREJ CONSU 1162.90 (1170.60) 634853
HAVELLS INDI 555.45 (548.20) 1084885
HINDUSTAN ZI 304.30 (301.45) 2540672
IDEA CELLULR 60.65 (62.80) 27317317
INTERGLOBE A 1220.45 (1224.15) 634249
JSW STEEL LT 332.55 (339.05) 4407383
L&TFIN.HOLD 165.05 (167.75) 2457150
LIC HOUS.FIN 495.75 (495.20) 1359617
MARICO LIMIT 338.60 (344.15) 1366877
MCDOWELL 677.25 (3455.30) 1812392
MOTHERSON 307.95 (313.70) 1819516
MRF 75351.15 (75349.60) 3971
NHPC LTD 25.75 (26.00) 5806490
NMDC LTD 112.95 (115.50) 2240975
OIL INDIA 222.40 (222.45) 526496
ORACLE FIN S 4107.85 (4008.70) 25927
P&G HYG&HEAL 9738.75 (9722.95) 1059
PETRONET LNG 211.65 (217.65) 5242871
PIDILITE IND 1083.85 (1083.00) 465585
PIRAMAL ENTE 2501.45 (2427.40) 770456
PNB 89.85 (91.70) 21610044
POWER FIN CO 82.55 (84.15) 6475054
RURAL ELEC C 113.45 (116.50) 4685357
SAIL 85.55 (86.35) 18465060
SBI LIFE INS 671.80 (689.90) 4172714
SHREE CEMENT 16212.75 (16319.35) 22418
SHRIRAM TRAN 1465.30 (1485.10) 606081
SIEMENS 998.45 (1009.40) 266649
SUN TV LTD 908.25 (912.25) 959908

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.25 (6.50) 620
AISHWARYA TE 4 (4.19) 2350
ALPHAGEO 678.20 (666.85) 1321
AMAR RAJA BA 769.95 (772.90) 7631
ANDHRA BANK 35.35 (36.80) 284972
ANDHRA CEMEN 9.35 (9.36) 12283
ANDHRA PAPER 325.05 (325.40) 817
ANDHRA PETRO 47.60 (47.95) 19068
ANDHRA SUGAR 361.90 (360.10) 2156
ANJANI PORTL 169.80 (170) 890
ASTRA MICROW 100.65 (101.55) 79809
AUROBINDO PH 613.45 (609.90) 286574
AVANTEL SOFT 398.25 (406.75) 5747
AVANTI FEEDS 1841.35 (1865.20) 62590
AVON ORG 9.45 (9.50) 2088
BALAJI AMIN 602.60 (610.70) 7271
BARTRONICS 10.59 (10.78) 23991
BHAGIRA CHEM 288 (289.20) 827
BHAGYA NAG 40.95 (41.65) 5476
BN RATHI SEC 40 (38.35) 492
BRILLIANT SE 4.73 (4.51) 5110
CAMBRIDGE TE 54.70 (54.10) 4060
CIL SECURI 24 (23.45) 3
COMBAT DRUGS 27.50 (26.70) 4712
CONT COFFEE 279.95 (279.20) 3863
COROMAN FERT 420.65 (425.60) 7075
CYBERMATE 2.16 (2.11) 41268
CYIENT LIMIT 727.95 (739.60) 58945
DECCAN CEMEN 425.75 (429.85) 191
DIVI'S LAB 1101.05 (1084.30) 65999
DIVYA GRANIT 80.70 (84.90) 164
DR REDDY 2351.10 (2268.40) 303304
FOUR SOFT 64.70 (62.05) 262
GATI CORPN 89.60 (92.90) 201621
GAYATRI PROJ 175.25 (177.20) 1498
GMR INFRASTR 15.90 (16.15) 1073231
GOLDST INFRA 173.60 (176.45) 39962
GOLDSTONE EN 16 (16.01) 506
GRANULES (I) 89.05 (87.75) 573166
GSS AMERICA 89.80 (89.50) 14935
GVK POWER 11.54 (11.56) 191315
HBL NIFE POW 36.80 (36.85) 42961
HERITAGE FOO 691.95 (688.15) 1623
HIL LTD 1976 (2006.75) 514
HIND FLUROCA 11 (11) 8062
IDL INDUSTRS 402.50 (406.05) 477
IKF SOFT 0.53 (0.51) 60192
ILFS ENGINEE 30.15 (30.90) 4228
INCAP 70.90 (68.50) 206
INNAREDY COM 1.90 (1.90) 2921
IVRCL INFRAS 1.37 (1.37) 1705147
JEEVAN SCIEN 36.15 (36.35) 720
KAKATIYA CEM 257.65 (256.40) 3063
KALLAM SPG 27.35 (27) 3580
KARAN WOO-SN 2.41 (2.30) 1600
KAVERI SEED 559.55 (561.30) 19788
KCP LTD 105.90 (107.20) 52815
KERNEX MICRO 29.75 (28.45) 4831
KNR CONSTRUC 264 (268.60) 14166
KREBS BIO 127.10 (129.10) 875
LANCO INDUS 299 (298.90) 1415
LANCO INFRAT 0.85 (0.86) 388063
LASER DOT 6.14 (6.46) 100
LAURUS LABS 499 (487.95) 6780
LOKESH MACH 65.65 (66.50) 1158
MADHUCON PRO 13 (13.35) 14319
MEGA SOFT 9.75 (9.95) 525
MIC ELECTRON 3.85 (3.84) 10340
MOLD-TEK.TEC 42 (41.65) 410
MOLDTK PLA 309.60 (304.25) 937
MSR INDIA LT 31 (30.05) 31531
NAGARJAGRICH 30 (30.05) 44290
NATCO PHARMA 830 (810.30) 58766
NAVA BH VENT 145.95 (138.90) 255641
NCC 107.10 (108.05) 407340
NCL IND 172.95 (175) 12384
NEHA INTER 5.43 (5.73) 10407
NETTLINX 55.90 (58.85) 7771
NEULAND LAB 700.30 (701.20) 1906
NILE 581.60 (595.15) 3572
OIL COUNTRY 21.50 (21.85) 4249
PANYAM CEMEN 25.50 (25.85) 4550
PENNER IND 56.30 (55.10) 65763
PHYTOCHEM I 52.30 (52.75) 7500
PIONEER DIST 285.75 (274.35) 12652
PITTI LAMIN 89.80 (90.15) 5180
PL ENTERPRI 2.28 (2.32) 700
POKARNA 178.90 (177.65) 200586
PRAJAY ENGS 10.46 (10.96) 6601
PREMIER EXPL 279 (280.20) 1197
PRISM CEMENT 107.60 (108.70) 6031
PRUDENTL PHA 3.95 (4.18) 491938
RAGSAN PETRO 63.20 (63.10) 535
RAIN INDUSTR 213.90 (225) 149910
RAJ PACKAGIN 27.40 (29.70) 472
RAM INFORMAT 42.70 (43) 1757
SAGAR CEM 798.30 (820) 657
SAMKRG PIST 242.25 (240.65) 3253
SAMPRE NUTRI 47.85 (47.05) 1867
SATVAH. ISPA 14.40 (14.45) 1768
SMS PHARMA 81.30 (80.40) 23340
SOUTH BIO TE 1.40 (1.40) 898
SPHERE GLOBA 28.75 (30.60) 1671
SREE RAYAL A 36.50 (36.30) 155612
SRI KPR INDU 25.90 (27.25) 1930
SS ORGANICS 5.85 (5.58) 4300
STARCHIK SP 32.90 (31.35) 4136
STEEL EXCHAN 21.85 (23.40) 11178
SUJANA METAL 0.92 (0.88) 4305
SUJANA TOWER 2.70 (2.66) 2500
SUJANA UNIVE 0.53 (0.51) 31577
SURANA TELE 4.51 (4.51) 2002
SURYALATA SP 128.30 (128.30) 730
SURYAVA SPIN 5.71 (6.01) 501
SUVEN PHARMA 238.50 (233.45) 152997
TAJ GVK HOTE 233.30 (233.65) 8029
TANLA 29.95 (30.55) 16008
TERA SOFTWAR 42.10 (43.50) 933
TRANS BIOTEK 2.18 (2.10) 6821
TRENDY KNIT 0.19 (0.19) 18420
VAMSHI RUBB 47.05 (48) 2691
VBC FERRO 39.20 (41.20) 50
VICEROY HOTE 8.54 (8.73) 32061
VIJAY TEXTIL 55.70 (57.50) 2589
VIMTA LABS 216.75 (213.15) 31844
VISAKA IND 639.75 (648.55) 2385
VISTA PHARMA 39.30 (37.95) 20254
VIVIMED LABS 67 (61.85) 731527
VST INDUS 3014.60 (3021.50) 67
XL TELENE 1.35 (1.38) 2855
YBRANT DIGIT 4.26 (4.37) 48150
ZENOTECH LAB 39.55 (40) 10355
ZENTECH 84.10 (86.35) 14162

తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం సభలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న వై.ఎస్.జగన్

అలా చెప్పుకోవడం బాబుకే చెల్లింది

- దయాఫ్రం వాల్‌కు చైనా వాల్ నిర్మించినంత గొప్పలా?
- రావులపాలెం సభలో జగన్ విమర్శలు

ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం: రాష్ట్రంలో అవినీతి, మోసం, దగా, కుట్ర, అబద్ధాలతో కూడిన వ్యవస్థ నడుస్తోందని, దానిని రూపుమాపే సమయం ఆసన్నమైందని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. పోలవరం నిర్మాణం పూర్తి కాకుండానే చంద్రబాబు జాతికి అంకితం చేయడం ఏమిటని ఎద్దేవా చేశారు. "పునాది వంటి దయాఫ్రం వాల్ నిర్మించి.. చైనా వాల్‌ను నిర్మించినట్లు ఘనంగా చెప్పుకోవడం ఆయనకే చెల్లింది. పక్కన తెలంగాణ రాష్ట్రంలో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో 57 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు చేయాల్సి ఉండగా ఇప్పటికే 39 లక్షల క్యూ.మీ. పనులు చేశారు. ఈ నాలుగేళ్లలో పోలవరంలో 6 నుంచి 7 లక్షల క్యూ.మీ. కాంక్రీట్ పనులే జరిగాయి. గతంలో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.16 వేల కోట్లు ఉంటే దానిని రూ.53 వేల కోట్లకు పెంచి పనుల్లో పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారు. బినామీలతో రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడి వియ్యంకుడు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఉపగుత్తేదారుగా ఉన్నారు" అని జగన్ ఆరోపించారు. తమ ప్రభుత్వం వస్తే మద్యం దుకాణాలను రద్దు చేస్తామన్న చంద్రబాబు ప్రతి ఊరు మద్యం దుకాణంతో దర్శనమిచ్చేలా చేశారని ఎద్దేవా చేశారు.

కడపపై ఇప్పుడు అంత ప్రేమ ఎందుకో?

చంద్రబాబు నటనకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని జగన్ ఎద్దేవా చేశారు. కడపపై ఎప్పుడూ కలగని ప్రేమ.. ఇప్పుడు ఆయనకు ఎందుకు కలిగిందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. కొల్లేరుపైనా చంద్రబాబుకు ఈ మధ్య ప్రేమ పెరిగిందన్నారు. భాజపా, తెదేపా నాలుగేళ్లు కాపురం చేసి, ఇప్పుడు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. గత హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు కొత్త హామీలతో తెరపైకి వచ్చే అవకాశం ఉందని, ఆయన మాటలకు ఎవరూ లొంగవద్దని జగన్ సూచించారు. ఆయన రూ.3 వేలు ఇస్తే రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి వాటిని తీసుకుని మనస్సాక్షి ప్రకారం తగిన పార్టీకి ఓటు వేయాలని కోరారు. బహిరంగ సభలో కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైకాపా నేత కురసాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఎప్పటికవుతుంది?: ఎంపీ మేకపాటి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరాన్ని ఎప్పటిలోగా పూర్తిచేయిస్తారో చెప్పాలని వైకాపా ఎంపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఇంకా రూ. 44,500 కోట్లు కావాలని.. ఈ నిధులు కేంద్రం ఇస్తుందా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో చంద్రబాబు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు. పోలవరానికి పునాది వేసింది దివంగత నేత వైఎస్సార్ అని గుర్తు చేశారు. ఆయన ఉండి ఉంటే ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయ్యేదన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా ప్రకటించారు.

చంద్రబాబుకు సంబంధం లేదు: సోము

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపించారు. పోలవరంతో చంద్రబాబుకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లోనూ అవినీతి జరుగుతోందన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. గృహ నిర్మాణం, నీరు-చెట్టు పథకాల్లో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమను ఇచ్చి తీరుతుందన్నారు.

ఆదుకోకుండా అడ్డుకుంటారా

- అమరావతికి సహాయ నిరాకరణ సరికాదు
- కేంద్రం తీరు సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఈనాడు డిజిటల్, అమరావతి

"జల వనరుల నిర్వహణలో ఏపీ స్థానంపై అధికారులు మరింత పరిశోధనతో కచ్చితమైన గణాంకాలు తయారు చేయాలి. భూగర్భ జలవనరుల విషయంలో మన రాష్ట్రం అగ్రగామిగా ఉంది. విధానాలు, పరిపాలన విభాగంలో గుజరాత్ కంటే ఆంధ్రప్రదేశ్ 8 పాయింట్లు ముందుండి ప్రథమ సానంలో నిలిచింది. నాలుగేళ్లలో ఏమీ సాధించలేదని దుష్ప్రచారం చేసే వారికి ఇవే సమాధానాలు" –చంద్రబాబు

సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. దేశం గర్వించే సాయిలో రాజధాని అమరావతిని నిర్మిస్తుంటే... ఆదుకోవాల్సింది పోయి నిధులివ్వకుండా అడ్డుకోవడం ఎంతవరకూ సబబని ప్రశ్నించారు. నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలను, విభజన చట్టంలోని అంశాలు అమలు చేయకపోవడంతో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ నగరంపై వచ్చే ఆదాయంలో అధిక భాగం కేంద్రానికి వెళ్తుందని.. అయినా ఎందుకు సహాయ నిరాకరణ చేస్తుందో అర్థం కావడం లేదని చెప్పారు. కృష్ణపట్నం పోర్టు ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఉన్నప్పటికీ దాన్ని హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేయించడం వల్ల పన్నులు అక్కడకు వెళ్తున్నాయని ఇలాంటి అపసవ్య నిబంధనలు సరిచేయాలని కేంద్రాన్ని కోరుతామని అన్నారు.

వస్త్ర పరిశ్రమపై త్వరలో విధానం

వస్త్ర పరిశ్రమపై త్వరలో ఒక విధానం తీసుకొస్తామని చంద్రబాబు తెలిపారు. వస్త్ర పరిశ్రమ రంగంలో ప్రోసెసింగ్, గార్మెంట్ ఉత్పత్తుల్లో ముందుకెళ్లాలని సూచించారు. రైస్ మిల్లర్లు అదనపు ఆదాయంపై దృష్టి పెట్టాలన్నారు. రైస్ బ్రాన్ ఆయిల్ ఉత్పత్తి, తౌడు తదితర ఉప ఉత్పత్తులపై దృష్టి సారించాలని సూచించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను అనుసంధానం చేసుకోవాలన్నారు. రైతులకు చేదోడుగా ఉంటూ ధాన్యం, బియ్యం ఉత్పత్తుల ఎగుమతికి సదుపాయాలను పెంచుకోవాలని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు, రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధులు కలిసిన సందర్భంగా సీఎం మాట్లాడారు. ప్రతినిధులు మాట్లాడుతూ "మీ సమర్థ పాలనతో రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమ నిలదొక్కుకుంది. ఈ రంగానికి మీరందించిన ప్రోత్సాహం మరువలేనిది. చాలా కృతజ్ఞతలు. ప్రజలకు కల్పిస్తున్న ప్రయోజనాలు చాలా బాగున్నాయి. వస్త్ర పరిశ్రమకు విద్యుత్తు రాయితీలు ఇవ్వడంతోనే మనుగడ సాధిస్తున్నాం. పట్టిసీమ ద్వారా నీళ్లివ్వడం వలన వరి పుష్కలంగా పండింది. వరి రైతులు పంటలు వేయడం నుంచి గిట్టుబాటు ధరలు లభించే వరకూ అందరూ సంతృప్తితో ఉన్నారు" అని వివరించారు. తెదేపా అధికారం చేపట్టాక తీసుకున్న నిర్ణయాలు, ఒనగూరుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని దీనిపై ప్రజల్లో కూడా చైతన్యం తీసుకురావాలని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మీ వంతుగా తిప్పికొట్టాలని, ప్రభుత్వంపై విమర్శలను కూడా ఖండించాలని చెప్పారు. స్పందించిన రైస్ మిల్లర్లు, వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు ఇందుకు సానుకూలత తెలుపుతూ చంద్రబాబుకు హామీ ఇచ్చారు.

పరిశీలనలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. అమరావతిలో విశ్వబ్రాహ్మణ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలన్న ప్రతిపాదన ఉందని వెల్లడించారు. విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ ఐకాస ఛైర్మన్ పావులూరి హనుమంతరావు నేతృత్వంలో సభ్యులు శుక్రవారం సచివాలయంలో సీఎంను కలిశారు. ఆగస్టు 26న కడపలో జరిగే విశ్వబ్రాహ్మణ శంఖారావం సభకు హాజరవుతానని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతినిధులు సీఎంను సత్కరించారు.

గృహ నిర్మాణ నిబంధనల సరళీకరణ

అందరికీ ఇళ్లు ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి గృహ నిర్మాణ పథకంలోని కొన్ని నిబంధనలు అడ్డుగా ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కఠినంగా ఉన్న నిబంధనలు నిశితంగా పరిశీలించి అవసరమైతే మార్పులు చేయాలని, అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రూ.3 లక్షలలోపు ఆదాయం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర గృహ నిర్మాణ పథకంలో చేర్చాలని సూచించారు. నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం సచివాలయంలో పట్టణ గృహ నిర్మాణ పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. గృహ నిర్మాణానికి గతంలో రూ.75 వేల లోపు రుణం తీసుకున్న వారి విషయంలో ఉదారంగా వ్యవహరించాలన్నారు. వారి గృహాలు ఆవాసయోగ్యంగా లేనిపక్షంలో కొత్తవి మంజూరు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ గృహ నిర్మాణ పథకంలో భాగంగా రాష్ట్రంలోని పట్టణ, నగర ప్రాంతాల్లో 25,75,339 మంది ఉన్నారని తెలిపారు. ఈ సంఖ్యకు అనుగుణంగా ఇళ్లు మంజూరయ్యేందుకు అవసరమైన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు.

వచ్చే నెల 15లోపు ఏకరూప దుస్తులు

విద్యా శాఖ సమీక్షలో సీఎం

ఈనాడు, అమరావతి: జులై 15వ తేదీ లోగా పాఠశాలల్లో విద్యార్థులందరికీ ఏకరూపదుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రతి బడిలో అంతర్జాలం, తాగునీరు, మరుగుదొడ్ల వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని, ప్రహరీలు నిర్మించాలని స్పష్టం చేశారు. సాధికారమిత్రల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను వంద శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖపై శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రవేశపెట్టిన విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈసారి ప్రతిభ పురస్కారాల కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన వ్యక్తిని ఆహ్వానించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని సూచించారు.

దిల్లీ ప్రభుత్వానికి సీఎం సంఘీభావం

ఈనాడు, అమరావతి: రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా రాజకీయ లబ్ధి కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ గవర్నర్ కార్యాలయాన్ని వినియోగించుకుంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. దిల్లీ ప్రభుత్వానికి తమ సంఘీభావం తెలుపుతున్నట్లు ట్విట్టర్‌లో ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సాయిరేవతి, సాయిరాజుకు ప్రోత్సాహకాలు

ఈనాడు అమరావతి: పవర్‌లిఫ్టర్ జి.సాయి రేవతికి రూ.13.10 లక్షలు, రోయింగ్ ఛాంపియన్ డి.సాయిరాజుకు రూ.6 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(క్రీడలు) ఎల్వీ సుబ్రమణ్యం శుక్రవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. కామన్వెల్త్‌లో పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకాన్ని సాధించినందుకు సాయి రేవతికి, సీనియర్ ఏషియన్ రోయింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం, ఏషియన్ జూనియర్ రోయింగ్‌లో రజతంతో పాటు మరో రెండు పోటీల్లో పతకాలు సాధించినందుకు సాయిరాజుకు ప్రోత్సాహకం అందించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'నీట్' తెలంగాణ ర్యాంకులు విడుదల

- జాతీయ స్థాయిలో 2వ ర్యాంకర్ రోహన్‌కు రాష్ట్రస్థాయిలో మొదటిర్యాంకు

ఈనాడు, వరంగల్: నీట్ ర్యాంకుల రాష్ట్రస్థాయి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను శుక్రవారం సాయంత్రం కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన రాష్ట్రానికి చెందిన రోహన్ పురోహిత్‌కు రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు దక్కింది. జాతీయ స్థాయిలో 104వ ర్యాంకు సాధించిన అభ్యర్థికి రాష్ట్ర స్థాయిలో పదో ర్యాంకు దక్కింది. జాతీయ ర్యాంకు 2,025 సాధించిన అభ్యర్థికి రాష్ట్రస్థాయిలో 100 ర్యాంకు రాగా, జాతీయ స్థాయిలో 25,837 ర్యాంకు వారికి రాష్ట్రస్థాయిలో 1000 ర్యాంకు దక్కింది. రాష్ట్ర స్థాయిలో మొదటి 5 ర్యాంకులు అబ్బాయిలే కైవసం చేసుకున్నారు. మరో వారంలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

రాష్ట్రస్థాయిలో మొదటి పది ర్యాంకర్లు వీరే

రాష్ట్ర ర్యాంకు	అభ్యర్థి పేరు	నీట్ జాతీయ ర్యాంకు
1.	రోహన్ పురోహిత్	2
2.	వరుణ్ ముప్పిడి	6
3	సిద్ధార్థ రవి	25
4	తంతం మహేశ్	53
5	గంజికుంట శ్రీవాత్సవ్	57
6	అంతిరెడ్డి సాహిత్ రెడ్డి	68
7.	నిత్య బోరడ్	71
8	వై.సంజీవ్‌కుమార్‌రెడ్డి	73
9.	ఎం.శ్రేయుద్‌రెడ్డి	94
10.	ఎద్దుల శ్రీసాయిరెడ్డి	104

ఉపరాష్ట్రపతి సిక్కిం పర్యటన రద్దు

ఈనాడు, దిల్లీ: ప్రతికూల వాతావరణం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి ఈశాన్య రాష్ట్రాల పర్యటనపై ప్రభావం చూపింది. శుక్రవారం ఆయన సిక్కింలో పర్యటించాల్సి ఉంది. శుక్రవారం ఉదయం ఆయన హైదరాబాద్ నుంచి పశ్చిమ్‌బెంగాల్‌లోని బగ్‌డోగ్రా విమానాశ్రయానికి చేరుకున్నారు. వర్షాల కారణంగా సిక్కిం వెళ్లలేమని పైలెట్లు చెప్పడంతో ఈటానగర్‌కు బయల్దేరాలని ఉపరాష్ట్రపతి నిర్ణయించారు. బగ్‌డోగ్రా నుంచి అసోంలోని లీలాబరి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి విమానంలో 20నిమిషాల్లో ఈటానగర్‌కు చేరుకోవచ్చు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రహదారి మార్గంలో ఈటానగర్ వెళ్దామని ఉపరాష్ట్రపతి సూచించారు. రెండున్నర గంటలపాటు రహదారి మార్గంలో ప్రయాణించి ఈటానగర్ చేరుకున్నారు.

కేంద్రంపై పోరాటం ఉద్ధృతం

- తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నిర్ణయం

ఈనాడు డిజిటల్, అమరావతి

ప్రత్యేకహోదా సహా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, విభజన చట్టంలోని అంశాలను సాధించుకోవడానికి తెదేపా ఎంపీలు పోరాటం ఉద్ధృతం చేయనున్నారు. వచ్చే నెలలో పార్లమెంటు సమావేశాలు మొదలయ్యేలోగా రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ నెల 20న కడప జిల్లాలో మొదలు పెట్టి... ప్రతి బుధవారం ఒక్కో చోట ఈ కార్యక్రమాలు చేపడతారు. పార్లమెంటులోనూ గట్టిగా పోరాడాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని, సభా కార్యక్రమాలను స్తంభింపజేస్తామని తెదేపా ఎంపీలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాలులో జరిగిన తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో 12 మంది ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం వారు విలేఖరులతో మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ సాధనకు జూన్ 20న కడపలో, విశాఖ రైల్వే జోన్ కోసం జూన్ 27న విశాఖపట్నంలో, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఇచ్చిన రూ.350 కోట్లు వెనక్కు తీసుకున్నందుకు జులై 4న అనంతపురంలో, రాజధాని నిధుల కోసం జులై 11న అమరావతిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధనకు నిరాహార దీక్ష చేయనున్న ఎంపీ సీఎం రమేష్‌కు సంఘీభావంగా.. ఈ నెల 20న అక్కడ నిరసనలో పాల్గొంటామన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ సొంత జిల్లా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసినా ఆ పార్టీ కనీసం స్పందించలేదని మండిపడ్డారు. భాజపాతో వైకాపా కుమ్మక్కై రాష్ట్రానికి అన్యాయం చేస్తోందన్నారు. స్వార్థ ప్రయోజనాలకు రాష్ట్రానికి అన్యాయం చేయవద్దని హితవు పలికారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ వర్షాకాల సమావేశాల్లోనూ పోరాటం కొనసాగిస్తామన్నారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరుగుతున్న పోరాటమని, ఎంపీలందరం కలిసి కట్టుగా పనిచేస్తామని గల్లా జయదేవ్ చెప్పారు. సొంత జిల్లాకు అన్యాయం జరుగుతున్నా ప్రధానమంత్రిని నిలదీసే ధైర్యం ప్రతిపక్ష నేతకు లేదని కేశినేని నాని ధ్వజమెత్తారు. విభజన చట్టంలోని హామీలు, ప్రత్యేకహోదా అమలు చేయాలన్నదే తమ అజెండా అని, రాష్ట్ర అభివృద్ధికి ఎంతకైనా తెగిస్తామని మురళీమోహన్ తెలిపారు. కేంద్రం మెడలు వంచేందుకు పార్లమెంటు వేదికగా గళమెత్తుతామని నిమ్మల కిష్టప్ప తెలిపారు. ఎంపీలు అవంతి శ్రీనివాస్, బుట్టా రేణుక, తోట సీతారామలక్ష్మి, మాగంటి బాబు, రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నివాసంలో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎంపీలు కొనకళ్ల నారాయణ. చిత్రంలో రవీంద్ర, మురళీమోహన్, నిమ్మలకిష్టప్ప, గల్లా జయదేవ్, బుట్టారేణుక, తోట సీతారామలక్ష్మి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కేశినేని నాని తదితరులు

ప్రపంచ యోగా పోటీలో బంగారు పతకాన్ని సాధించిన జేడీ చక్రవర్తిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

యోగా చక్రవర్తికి ముఖ్యమంత్రి అభినందనలు

ఈనాడు, అమరావతి: ప్రపంచ యోగా పోటీల్లో బంగారం పతకం సాధించిన చక్రవర్తిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. విశాఖజిల్లా పెందుర్తి మండలంలో ఎస్జీటీగా పనిచేస్తున్న చక్రవర్తి.. గత నెల 6న అర్జెంటీనాలో జరిగిన యోగా ప్రపంచస్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు. చక్రవర్తి శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చక్రవర్తిని సీఎం వద్దకు తీసుకువచ్చారు.

సీఎంను కలిసిన జయకుమార్

యూరప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన గుంటుపల్లి జయకుమార్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర పర్యాటక ప్రాంతాలపై యూరప్‌లో వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ముఖ్యమంత్రి జయకుమార్‌కు సూచించారు.

27% మధ్యంతర భృతి ఇవ్వాలి

ఎంప్లాయీస్ యూనియన్

ఈనాడు, అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ కార్మికులకు 27 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని డిమాండు చేస్తూ ఎండీ సురేంద్రబాబుకు వినతి పత్రం సమర్పించినట్లు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు వై.వి.రావు, కె.పద్మాకర్, పలిశెట్టి దామోదర్‌రావులు శుక్రవారం తెలిపారు. గుర్తింపు కార్మిక సంఘం పదవీ కాల పరిమితి 2018తో ముగిసినందున తక్షణమే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు.

వేతన సవరణ చర్చల్లో జాప్యం తగదు: ఎన్ఎంయూ

ఆర్టీసీ కార్మికుల వేతన సవరణకు సంప్రదింపుల కమిటీని నియమించినా.. చర్చల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. వేతన సవరణకు కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు సి.చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు యాజమాన్యాన్ని డిమాండు చేశారు.

పీఏసీ ప్రతులు ఇతరులకా?

- ఇదే నిజమైతే బుగ్గనపై సభా హక్కుల ఉల్లంఘన: యనమల

ఈనాడు డిజిటల్, అమరావతి: సమగ్ర అధ్యయనం చేయడానికే ప్రజా పద్దుల సంఘానికి(తపీఏసీ) వివిధ శాఖలు ప్రతులను అందిస్తాయని, వాటిని శాసనసభలో ప్రాతినిధ్యం లేని వ్యక్తికి, రాజకీయ పార్టీ సభ్యుడికి ఇవ్వడం శాసనసభా ధిక్కారమే అవుతుందని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. దీన్ని శాసనసభా ప్రవర్తనా నియమావళి అతిక్రమణతో పాటు నేరంగా పరిగణించాల్సి ఉంటుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాసనసభ కమిటీలన్నీ రాజ్యాంగపరమైన సంస్థలన్నారు. వీటికి సంబంధించిన చర్చలు, ప్రతులు, నివేదికలు అత్యంత రహస్యమన్నారు. వీటిని ప్రసార మాధ్యమాలతో పాటు ఎవరికీ ఇవ్వకూడదన్నారు. పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన దిల్లీ పర్యటనలో కేంద్రంలోని భాజపా నేతలను కలిసి ఛైర్మన్ హోదాలో సేకరించిన పేపర్లను వారికి అందించినట్లు మీడియాలో ప్రసారమైందన్నారు. గతంలో పార్లమెంటులో ప్రశ్నలు అడగడానికి ఎంపీలను ప్రలోభాలకు గురిచేసిన అంశం కంటే ఇది తీవ్రమైనదన్నారు. ఇదే నిజమైతే బుగ్గనపై సభా హక్కుల ఉల్లంఘన(ప్రివిలేజ్ మోషన్) ఎందుకు పెట్టకూడదని ఆయన ప్రశ్నించారు.

జగన్‌పై కేసుల మాఫీకి కేంద్రం హామీ: డొక్కా

వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న కేసులను మాఫీ చేసి అనుకూలంగా తీర్పు వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటోందని శాసనమండలి విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆరోపించారు. దిల్లీలో వైకాపా, భాజపా నేతలు కలసి రహస్య మంతనాలు జరపడం కుట్ర రాజకీయాలకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి రాక్షస సైన్యానికి శుక్రాచార్యుడిలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

అభద్రత భావంలో మైనార్టీలు: వర్ల

ఎన్డీయే ప్రభుత్వ విధానాలతో దేశంలోని మైనార్టీలు, దళితులు, గిరిజనుల్లో తీవ్ర అభద్రత భావం నెలకొందని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చి కేంద్ర ప్రభుత్వం దళితుల హక్కులను కాలరాసిందన్నారు. భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా వైకాపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల మధ్యంతర భృతి గురించి ఈ నెల 19న జరిగే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

పరిశ్రమలను చూపిస్తాం రండి

- వైకాపా నేతలకు మంత్రి నారా లోకేష్ ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయని వైకాపా అడిగిన ప్రశ్నకు ఇదిగో సమాధానమంటూ మంత్రి నారా లోకేష్ ట్వీట్ చేశారు. లోక్‌సభలో వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గతంలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పరిశ్రమల శాఖ ఇచ్చిన సమాధానాన్ని ఈ మేరకు ట్విట్టర్‌లో ఉంచారు. ఇప్పటివరకు రాష్ట్రానికి 531 పరిశ్రమలు రాగా రూ.1,29,661 కోట్లు పెట్టుబడులు వచ్చాయని, 2,64,754 మందికి ఉద్యోగాలు వచ్చాయని కేంద్ర పరిశ్రమల శాఖ ఇచ్చిన సమాధానాన్ని ట్వీట్ చేశారు. సంబంధిత గణాంకాలను అబద్ధాలు అంటారా? అని వైకాపా నేతలను ప్రశ్నించారు. "అందుకే అసెంబ్లీని బహిష్కరించొద్దని మిమ్మల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వమే బస్సు ఏర్పాటు చేస్తుంది. పరిశ్రమల శాఖ మంత్రి స్వయంగా మిమ్మల్ని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు తీసుకువెళ్తారు. పరిశ్రమలు ఎక్కడ వచ్చాయో.. ఉద్యోగాలు ఎక్కడ కల్పించామో చూపిస్తారు. మీరు సిద్ధమా?" అని నారా లోకేష్ ట్వీట్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

విజయవాడ, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పరిరక్షించాలంటే, దానిని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి ఛైర్మన్ మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర కార్యవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణమాదిగ మాట్లాడుతూ దళిత, గిరిజన రిజర్వేషన్లను తగ్గించి హక్కులను కాలరాసేందుకు కేంద్రం యత్నిస్తోందన్నారు. ఐక్యంగా పోరాడి చట్టాన్ని సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జులై 17న దిల్లీలో తలపెట్టిన సభను విజయవంతం చేయాలని సూచించారు. పరిరక్షణ సమితి జాతీయ కోఆర్డినేటర్ మాదగాని గుర్నాథం మాట్లాడుతూ రెండు, మూడు వర్గాలుగా పనిచేస్తున్న మాల, మాదిగ సామాజిక వర్గాలన్నీ ఒకే అజెండాపై వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, 13 జిల్లాల నుంచి సభ్యులు హాజరయ్యారు.

‘డిజిటల్ ఇండియా’తో దళారులపై పోరు

- కమీషన్లు అందకే ఈ-చెల్లింపులపై వారు దుష్ప్రచారం చేస్తున్నారు
- పేదల కష్టం ‘భద్రం’గా వారికి చేరుతోంది
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
- సాధారణ సేవా కేంద్రాల (సీఎస్‌సీ) నిర్వాహకులతో దృశ్యాత్మక సమావేశం

దిల్లీ

‘డిజిటల్ ఇండియా’తో దళారులు, మధ్యవర్తులపై పోరాటం చేస్తున్నామనీ... నల్లధనం, బ్లాక్ మార్కెట్ల భరతం పట్టడంతో పాటూ; గ్రామాలు, చిన్నపట్టణాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు ఈ కార్యక్రమం ఇతోధికంగా తోడ్పడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో దృశ్యాత్మక విధానం (వీడియో కాన్ఫరెన్స్) ద్వారా సంభాషి

స్తున్న ఆయన- డిజిటల్ సేవలు అందించే సాధారణ సేవా కేంద్రాల (కామన్ సర్వీస్ సెంటర్- సీఎస్‌సీ) నిర్వాహకులతో శుక్రవారం ముచ్చటించారు. ‘డిజిటల్ ఇండియా’ కింద చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఫలితాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు.

“ప్రజలు దిండు కింద డబ్బులు దాచుకుని, దళారుల ద్వారా చౌకధరల దుకాణం నుంచి సరకులు తెచ్చుకునే రోజుల్లో... మొదట నేను డిజిటల్ చెల్లింపుల గురించి మాట్లాడాను. దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామంటే.. చాలామంది నాపై జోకులు వేశారు. ఇప్పుడు ఈ-చెల్లింపులకు జనం అలవాటుపడి, ప్రయోజనం పొందుతుండటమే... వారికి గట్టి సమాధానం. ఇప్పుడు దళారులతో పన్లేదు. పేదల కష్టాన్ని గుంజుకునే వీళ్లే కుండా పోయింది వాళ్లకి. కష్టార్జితమంతా ఇప్పుడు నేరుగా పేదల బ్యాంకు ఖాతాల్లోనే జమవుతోంది. బీద రైతులు, గ్రామీణులు కూడా డిజిటల్ చెల్లింపులు జరుపుతున్నారు. దీంతో కమీషన్లు అందక మధ్యవర్తులు విలవిల్లాడుతున్నారు. ఏంచేయాలో పాలుపోక... డిజిటల్ చెల్లింపులు సురక్షితం కాదంటూ వారిప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారు. వాళ్లు ఎంతగా ప్రయత్నించినా... ప్రపంచంలో భారత్‌ను ముందు నిలబెట్టే కృషి మాత్రం ఆగదు.

ప్రభుత్వం రూపొందించిన భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ (బీహెచ్ఐఎం) యాప్ ద్వారా 2016-17లో రూ.695 కోట్ల విలువైన 1.78 కోట్ల వ్యవహారాలు జరగ్గా... 2017-18లో రూ.10,983 కోట్ల విలువైన 91.5 కోట్ల వ్యవహారాలు నడిచాయి. వస్తువులు, సేవల అందజేతకు ఈ యాప్ ద్వారా చెల్లింపులు జరపాలని వ్యాపారులపై ఒత్తిడి తీసుకురండి.

1.25 కోట్ల మందికి శిక్షణ

‘గ్రామీణ డిజిటల్ సాక్షరతా అభియాన్’ కింద ఇప్పటి వరకూ 1.25 కోట్ల మంది శిక్షణ పొందారు. వీరిలో 70% మంది ఎస్సీ, ఎస్టీలే.

ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ పైపైకి...

దేశీయ ఎలక్ట్రానిక్ తయారీ రంగం ముందడుగు వేస్తోంది. ఇప్పటికే 15 రాష్ట్రాల్లో 23 ఉత్పత్తి కేంద్రాలు వెలిశాయి. మొబైల్ ఫోన్ల తయారీ యూనిట్లు 2014లో కేవలం రెండే ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 120కి చేరింది. వీటి ద్వారా సుమారు 4.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. రూ.550 కోట్లతో తీసుకొచ్చిన బీపీవో ప్రోత్సాహక పథకం ద్వారా 2 లక్షల మందికి ఉపాధి లభించింది. డిజిటల్ సాధికారతే కాదు... ఆవిష్కరణలకు అవసరమైన సాంకేతికతనూ మనం అందిపుచ్చుకోవాలి. గ్రామీణులకు సాంకేతిక ఫలాలనూ, డిజిటల్ సేవలను అందించేందుకు నెలకొల్పిన 3లక్షల సీఎస్‌సీల ద్వారా ఎంతోమందికి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు లభించాయి” అని మోదీ వివరించారు.

20న రైతులతో...

ఈనెల 20వ తేదీ ఉదయం 9.30 గంటలకు దృశ్యాత్మక విధానం ద్వారా రైతులతో సంభాషిస్తానని మోదీ తెలిపారు. వారి సమస్యలతో పాటు, వ్యవసాయరంగ సవాళ్లను తెలుసుకుంటానన్నారు.

‘రూపే’ కార్డును వినియోగించండి

కార్యకలాపాల ఛార్జీలు విదేశాలకు తరలిపోకుండా ఉండాలంటే... దేశీయంగా మనం తయారుచేసుకున్న ‘రూపే’ కార్డులను వినియోగించండి. దేశభక్తి గురించి మాట్లాడేవాళ్లంతా సరిహద్దులకు వెళ్లి పోరాడలేరు. రూపే కార్డులను వాడటం ద్వారా కూడా మనం దేశానికి సేవ చేయవచ్చు. ప్రస్తుతం 50 కోట్ల రూపే కార్డులున్నాయి. గతనెల వరకూ వీటి ద్వారా రూ.2,347 కోట్ల చెల్లింపులు జరిగాయి.

విధులకు హాజరైన గోవా సీఎం పారికర్

విధులకు హాజరైన సీఎం మనోహర్ పారికర్

పనాజీ: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ శుక్రవారం నుంచీ తన అధికార బాధ్యతల నిర్వహణను పునఃప్రారంభించారు. మూడు నెలల పాటు అమెరికాలో వైద్యచికిత్సలు చేయించుకున్న అనంతరం ఆయన గురువారం తిరిగి వచ్చిన విషయం తెలిసిందే. గురువారం గోవాకు చేరుకున్న ఆయన శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో విధులకు హాజరైనారు. అంతకుముందు.. ఉదయాన్నే ఆయన ఉత్తరగోవాలోని ఖండోలా గ్రామంలోని తమ కులదైవమైన దేవకి కృష్ణ ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా పనాజీకి చేరుకుని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సచివాలయంలోని తన కార్యాలయంలో అధికార బాధ్యతల నిర్వహణను పునఃప్రారంభించారని సీఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రైతుల ఆదాయం రెట్టింపే లక్ష్యం

- రేపు నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశం

ఈనాడు, దిల్లీ: అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై నీతి ఆయోగ్ పాలక మండలి చర్చించనుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన పాలక మండలి నాలుగో సమావేశం ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో జరుగనుంది. కేంద్ర మంత్రులు; ముఖ్యమంత్రులు; లెఫ్టినెంట్ గవర్నర్లు; సీనియర్ అధికారులు పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పథకాలు.. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్, జాతీయ పోషకాహార మండలి, మిషన్ ఇంద్రధనుష్, మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవాల నిర్వహణ తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశముంది.

భాజపా, ఆర్ఎస్ఎస్ ప్రముఖులకు ప్రధాని విందు

దిల్లీ: భాజపా, ఆర్ఎస్ఎస్ కీలక నేతలకు ప్రధాని మోదీ శుక్రవారం రాత్రి దిల్లీలోని తన అధికారిక నివాసంలో విందు ఇచ్చారు. పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, సంఘ్ ప్రధాన కార్యదర్శి సురేష్ భయ్యాజీ జోషి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతకుముందు.. హరియాణాలోని సూరజ్‌కుండ్‌లో జరుగుతున్న 3 రోజుల సదస్సుకు భాజపా, ఆర్ఎస్ఎస్‌లకు చెందిన దాదాపు 60 మంది ప్రముఖులు హాజరయ్యారు. తమనంతా ప్రధాని విందుకు పిలిచినట్లు సీనియర్ నేత ఒకరు తెలిపారు. కాగా పలు వ్యవస్థాగత అంశాలను చర్చించడంతో పాటు, వివిధ అనుబంధ సంస్థల మధ్య సమన్వయాన్ని పటిష్ఠపరిచేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై గురువారం ప్రారంభమైన సూరజ్‌కుండ్ సదస్సులో నేతలంతా మేధోమథనం చేపట్టారు. భాజపా, సంఘ్ ప్రముఖులు ఏటా సమావేశం కావడం సాధారణమే అయినా.. రానున్న లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల నేపథ్యంలో ఈసారి కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి అమిత్ షా శనివారం హాజరయ్యే అవకాశం ఉంది.

మోదీ విశ్వసనీయత తగ్గలేదు కానీ..

- 2014 నాటి ఆకర్షణ శక్తి భాజపాకు తగ్గింది
- కేంద్ర ప్రభుత్వ పనితీరుపై ఆరెస్సెస్ విశ్లేషణ

ఈనాడు, దిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశ్వసనీయత చెక్కుచెదరనప్పటికీ భాజపాకు 2014 నాటి ఆకర్షణశక్తిలో కొంత గండిపడిందని ఆరెస్సెస్ అగ్రనేతలు భాజపాకు తెలియజేశారు. ముఖ్యంగా దళితులు, బాగా వెనుకబడిన వర్గాల్లో ఇది ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. విపక్షాలు సాగిస్తున్న దుష్ప్రచారమే ఇందుకు కారణమన్నారు. సంప్రదాయబద్ధంగా భాజపా పక్షాన నిలిచే వైశ్యుల్లో ఒక వర్గం.. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల తమ లాభాలు తగ్గాయని ఆగ్రహంగా ఉందని చెప్పారు. అలాగే రైతుల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి సరైన ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని కూడా వివరించారు.

హరియాణలోని సూరజ్‌కుండ్‌లో ఆరెస్సెస్, భాజపా నేతల మధ్య జరుగుతున్న మూడు రోజుల అంతర్గత సమావేశంలోని తొలిరోజున సంఘ్ నుంచి ఈ సూచనలు వచ్చాయి. ఈ భేటీలో ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి సురేశ్ భయ్యాజీ జోషి, సంయుక్త ప్రధాన కార్యదర్శి కృష్ణ గోపాల్ పాల్గొన్నారు. భాజపా తరఫున రామ్ మాధవ్, పి.మురళీధర్‌రావు సహా ప్రధాన కార్యదర్శులందరూ హాజరయ్యారు. మోదీ ప్రభుత్వంపై సామాన్యుల భావనలను ఆరెస్సెస్ ద్వారా తెలుసుకునేందుకు ఈ భేటీని నిర్వహిస్తున్నారు. ఆరెస్సెస్ అనుబంధ సంస్థలైన భారతీయ మజ్దూర్ సంఘ్, సేవా భారతి, భారతీయ కిసాన్ సంఘ్, లఘు ఉద్యోగ్ భారతీ, స్వదేశీ జాగరణ్ మంచ్ ప్రతినిధులు కూడా ఈ మూడు రోజుల్లో వివిధ సందర్భాల్లో పాలుపంచుకుంటారు. 17న సమావేశాల చివరి రోజున భాజపా అధ్యక్షుడు అమిత్ షా హాజరవుతారు. ఆరెస్సెస్ ఇచ్చే సమాచారం.. 2019లో పార్టీ ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేయడానికి ఉపయోగపడుతుందని భాజపా ప్రధాన కార్యదర్శి ఒకరు చెప్పారు.

హెచ్ఐవీని తరిమేసే చికిత్స!

రూపొందించిన హాంకాంగ్ శాస్త్రవేత్తలు

న్యూయార్క్: హెచ్ఐవీ జాడ దొరకనంతగా... శరీరం నుంచి దాన్ని తరిమేసే సరికొత్త యాంటీబాడీలను హాంకాంగ్ శాస్త్రవేత్తలు రూపొందించారు. ఎయిడ్స్‌కు దారితీసే ఈ వైరస్ అసలు రాకుండా; వచ్చినా క్రమంగా దానిని అంతమొందించే చికిత్సను వీటి ద్వారా తయారు చేయవచ్చట. ఈ రోగులు ప్రస్తుతం యాంటీ-రిట్రోవైరల్ మందులను వాడుతున్నారు. వీటిని రోజూ వేసుకుంటేగాని వైరస్ నియంత్రణలో ఉండదు. పైగా ఇది కొన్ని దుష్ప్రభావాలూ, ఖర్చుతో కూడిన వ్యవహారం. అయితే... హాంకాంగ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎయిడ్స్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త చెన్ జీవై బృందం తాజాగా సరికొత్త యాంటీబాడీలను తయారుచేసింది. వీటిని మూడు నెలలకోసారి తీసుకుంటే సరిపోతుందట! వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడమే కాకుండా... శరీరం నుంచి దానిని తరిమేసే సామర్థ్యం ఈ యాంటీబాడీలకు ఉందని చెన్ వివరించారు. 3-5 ఏళ్లలో ఇది రోగులకు అందుబాటులోకి వస్తుందని పరిశోధకులు తెలిపారు.

జస్టిస్ కోదండరామయ్య కన్నుమూత

హైదరాబాద్: స్వల్పఅనారోగ్యం కారణంగా జస్టిస్ (పదవీ విరమణ) పమిడిఘంటం కోదండరామయ్య(92) శుక్రవారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. శనివారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు చెప్పారు. 1926లో జన్మించిన ఆయన, మద్రాస్ హైకోర్టులో 1952లో అడ్వొకేట్‌గా పేరు నమోదు చేసుకున్నారు. 1982లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా ఎంపికై, 1988 వరకు సేవలందించారు. ప్రచురణ సంస్థగా ప్రసిద్ధి పొందిన ‘ఆర్ష విజ్ఞాన ట్రస్టు’ను స్థాపించారు.

చత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు: ముగ్గురు నక్సలైట్ల మృతి

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో భద్రత దళాల ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు శుక్రవారం మృతి చెందారు. సుకుమా జిల్లా చింతగుఫా అటవీ ప్రాంతంలో జిల్లా రిజర్వ్ గార్డు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లకు చెందిన సంయుక్త బృందం ఉదయం గాలింపు చర్యలు చేపడుతుండగా.. నక్సలైట్లు కాల్పులకు దిగినట్లు ఎస్పీ అభిషేక్ మీనా తెలిపారు.

బిగ్ బ్యాంగ్ యంత్రానికి ఆధునికీకరణ

జెనీవా: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రొటాన్ ఢీ యంత్రం లార్జ్ హాడ్రన్ కొలైడర్ (ఎల్‌హెచ్‌సీ)కి ఆధునికీకరించే పని శుక్రవారం మొదలైంది. దీనివల్ల విశ్వం నిర్మాణానికి దోహదపడిన ప్రాథమిక స్థాయి రేణువుల గురించి మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. బిగ్ బ్యాంగ్ యంత్రంగా పేర్కొనే ఎల్‌హెచ్‌సీ. స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ సరిహద్దుల్లో నేలమాళిగలో 27 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అందులో జరిగే ఆధునికీకరణ వల్ల 2026 నుంచి ‘హై లూమినోసిటీ’ స్థితిలో ఈ యంత్రం పనిచేయడానికి వీలవుతుంది. దీని వల్ల భారీ ప్రయోగాల్లో రేణువుల ఢీ సంఖ్యను పెంచొచ్చు. తద్వారా భౌతికశాస్త్రానికి సంబంధించి కొత్త ఆవిష్కారాలకు మార్గం సుగమమవుతుంది.

త్రిపురలోని కైలాశహర్‌లో వరద తీవ్రత విహంగ వీక్షణం

‘సైన్యం కాల్పుల్లో యువకుడి మృతి’

- బాలికకు గాయాలు
- గాలిలోకి కాల్పులు జరిపామంటున్న సైన్యం

శ్రీనగర్: సైన్యం జరిపిన కాల్పుల్లో ఒక యువకుడు మృతి చెందగా, మరో బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని జమ్మూ కశ్మీరు పోలీసులు తెలిపారు. పుల్వామా జిల్లా నౌపోరా వద్ద శుక్రవారం ఈ ఘటన జరిగిందన్నారు. రాళ్లురువ్విన అల్లరిమూకలపై సైనికులు జరిపిన కాల్పుల్లో వకాస్ అహ్మద్ ప్రాణాలు కోల్పోగా, రుకయా బానో అనే బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోందన్నారు. సైన్యం అధికార ప్రతినిధి వాదన మరోలా ఉంది.

శుక్రవారం వాహనాల్లో గస్తీ కాస్తుండగా నౌపోరా వద్ద రోడ్డుకు అడ్డుగా మూడు,నాలుగుకార్లు ఉన్నాయన్నారు. వాటిని తీయాల్సిందిగా కోరగా, స్థానికులు కొందరు పోగై రాళ్లు రువ్వడం మొదలుపెట్టారన్నారు. గాలిలోకి కాల్పులు జరిపి, వారిని చెదరగొట్టామన్నారు.

వైకాపాను నడిపించేది భాజపా పెద్దలే: తెదేపా

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో వైకాపాను నడిపించేది దిల్లీలోని భాజపా పెద్దలేనని, ఆ పార్టీ నాయకులు కేవలం పాత్రధారులు మాత్రమేనని తెదేపా అధికార ప్రతినిధి లంక దినకర్ పేర్కొన్నారు. భాజపాలోకి వైకాపా అప్రకటిత విలీనం జరిగిందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సొంత జిల్లా కడపలో ఉక్కు పరిశ్రమ రాకపై నోరెత్తలేని పరిస్థితిలో జగన్ ఉన్నారని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం సాయం అందకుండా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, విజయసాయిరెడ్డిల ద్వారా జగన్ సైంధవుని పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు.

‘వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ తీవ్రవాద సంస్థలు!’

- అమెరికా నిఘా సంస్థ సీఐఏ విశ్లేషణ

న్యూయార్క్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ్‌దళ్‌ను ‘తీవ్రవాద మత సంస్థలు’గా అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ అభివర్ణించింది. ఏటా ప్రచురించే ‘వరల్డ్ ఫ్యాక్ట్ బుక్’లో ఈ మేరకు పేర్కొంది.

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్‌కు తోడు మరికొన్ని సంస్థలను కూడా ‘రాజకీయ ఒత్తిడి బృందాలు, నేతలు’ శీర్షిక కింద సీఐఏ ప్రస్తావించింది. హురియత్‌ను వేర్పాటువాద సంస్థగా, జామియత్ ఉలేమా హింద్‌ను మతసంస్థగా వర్గీకరించింది. ఆరెస్సెస్‌ను రాజకీయ ఒత్తిడి బృందంగా అభివర్ణించింది. రాజకీయాల్లో ఉంటూ, రాజకీయపరమైన ఒత్తిడిని కలిగిస్తూ, ఎన్నికల్లో పోటీ చేయని సంస్థలను ‘రాజకీయ ఒత్తిడి బృందాలు’గా సీఐఏ నిర్వచించింది.

ఆర్థిక అంశాలపైనా.. భారత స్థితిగతులపైనా సీఐఏ తన విశ్లేషణ చేసింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల 2017లో దేశ ఆర్థిక వ్యవస్థ నెమ్మదించిందని పేర్కొంది. అమెరికా నిఘా సంస్థ ప్రస్తావించిన మరికొన్ని అంశాలివీ.

- కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్కరణలు చాలావరకూ పాలనాపరమైన మార్పులకే పరిమితమయ్యాయి. రాజ్యసభలో మెజార్టీ లేకపోవడమే ఇందుకు కారణం.
- ఐటీ సేవలు, ఇతర అంశాల్లో ప్రధాన ఎగుమతిదారుగా భారత్ అవతరించినా.. తలసరి గణాంకాల విషయంలో ప్రపంచ సరాసరి కన్నా దిగువ స్థాయిలోనే ఉంది.
- 2016 వరకూ మిగతా దేశాలతో పోలిస్తే అధిక వృద్ధిరేటు ఉన్నా భారత ప్రభుత్వరంగ బ్యాంకులపై 2015, 2016లో మొండి బకాయిల భారం ఎక్కువగా ఉంది.
- భారత స్థూల ఆర్థికాంశాల్లో పెరుగుతున్న అసమానతలు, పాశ్చాత్య దేశాల్లో మెరుగుపడుతున్న ఆర్థిక పరిస్థితుల వల్ల వ్యాపారవేత్తలు.. తమ పెట్టుబడిని భారత్ నుంచి తరలించుకెళుతున్నారు.
- మహిళల పట్ల వివక్ష, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలో సమర్థత లేకపోవడం, నాణ్యమైన విద్య లభ్యత లేమి వంటి అనేక సవాళ్లు ఉన్నాయి.

వీహెచ్‌పీ ఆగ్రహం

తమను తీవ్రవాదులుగా అభివర్ణించిన సీఐఏ క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆ నిఘా సంస్థకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఉద్యమానికి దిగుతామని వీహెచ్‌పీ హెచ్చరించింది. అంతర్జాతీయ ఉగ్రవాది లాడెన్‌ను ‘సృష్టించిన’ సీఐఏకు నీతులు చెప్పే హక్కులేదని వ్యాఖ్యానించింది.

అక్బర్ కంటే మహారాణా ప్రతాప్‌యే గొప్ప..!

యూపీ ముఖ్యమంత్రి యోగి వ్యాఖ్యలు

లఖ్‌నవూ: మొఘల్ చక్రవర్తి అక్బర్ కంటే రాజ్‌పుత్ రాజు మహారాణా ప్రతాప్‌యే గొప్పవాడంటూ ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. మహారాణా ప్రతాప్ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ‘‘హల్దీఘాటీ (1576) యుద్ధంలో ఎవరు గెలిచారన్నది ముఖ్యం కాదు.. ఆ రోజుల్లో శక్తిమంతమైన మొఘల్ సైన్యాన్ని దీటుగా ఎదురు నిలవడంలో మహారాణా ప్రతాప్ ఆదర్శప్రాయమైన పరాక్రమాన్ని, ధైర్య సాహసాలను ప్రదర్శించారు. ఆరావళి పర్వతాల్లో ఏళ్ల తరబడి కొనసాగిన యుద్ధంలో కోటలను దక్కించుకుని గొప్పతనాన్ని నిరూపించుకోగలిగారు.’’ అని యోగి పేర్కొన్నారు.

రాజీవ్ హంతకుల విడుదలకు రాష్ట్రపతి తిరస్కృతి

దిల్లీ/ చెన్నై: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకేసులో జీవితఖైదు అనుభవిస్తున్న ఏడుగురిని విడుదల చేయాలంటూ తమిళనాడు ప్రభుత్వం చేసిన విజ్ఞాపనను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించారు. ఆయా ఖైదీల విడుదల విషయమై కేంద్రం ఏకీభవించడం లేదంటూ రాష్ట్రపతి తమిళనాడు ప్రభుత్వానికి తెలియజేశారు. ఆయా ఖైదీల విడుదలకు అన్నివిధాలుగా ప్రయత్నాలు కొనసాగించనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది.

ప్రొఫెసర్ శోమాసేన్‌పై నాగ్‌పుర్ విశ్వవిద్యాలయం చర్యలు

నాగ్‌పుర్: మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై అరెస్టైన ప్రొఫెసర్ శోమాసేన్‌ను.. నాగ్‌పుర్ విశ్వవిద్యాలయం (ఆర్‌టీఎమ్ఎన్‌యూ) విధుల నుంచి తాత్కాలికంగా తొలగించింది. ఆర్‌టీఎమ్ఎన్‌యూలోని ఆంగ్ల విభాగానికి శోమా.. అధిపతిగా ఉన్నారు. ‘బీమా కోరెగావ్ అల్లర్ల’ కేసును దర్యాప్తు చేసిన పుణె పోలీసులు.. ఆమెతోపాటు మరో నలుగురికి మావోయిస్టులతో సంబంధాలున్నట్లు గుర్తించారు. జూన్ 6న వారిని అరెస్టు చేశారు.

17న విజయవాడలో మహాధర్నా

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్రం ప్రతిభ గల ఉద్యోగులకు అన్యాయం చేసే విధంగా తీసుకువస్తున్న 117వ రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ నెల 17న విజయవాడలో ఆల్ ఇండియా ఈక్వాలిటీ ఫోరం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఓబీసీ, మైనార్టీ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సుజాత్ బుఖారి హత్య వెనక ఐఎస్ఐ

- కేంద్ర మంత్రి ఆర్.కె.సింగ్ స్పష్టీకరణ
- అనుమానితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- వేల మంది అశ్రునయనాల మధ్య బుఖారి అంతిమ సంస్కారాలు

క్రీరి(జమ్ముకశ్మీర్), దిల్లీ: రైజింగ్ కశ్మీర్ పత్రిక సంపాదకుడు సుజాత్ బుఖారి (50) హత్య వెనక పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఉందని ప్రభుత్వం, సైన్యం పేర్కొన్నాయి. కేంద్ర మంత్రి ఆర్.కె.సింగ్ శుక్రవారం ఒక వార్తాఛానెల్‌తో మాట్లాడుతూ బుఖారి హత్య స్పష్టంగా ఉగ్రవాదులు, వారికి మార్గనిర్దేశం చేసే పాకిస్థాన్ ఐఎస్ఐ పనే అని అన్నారు. ఐఎస్ఐ ఈ పని చేసిందన్నది తన అంచనా అని లెఫ్టినెంట్ జనరల్ ఎ.కె.భట్ (కోర్ కమాండర్, 15 కోర్) అన్నారు. దర్యాప్తులో మిగిలిన విషయాలు వెల్లడవుతాయని చెప్పారు. బుఖారి హత్య కేసులో పోలీసులు శుక్రవారం జుబైర్ ఖాద్రి అనే అనుమానితుడిని అరెస్టు చేశారు. గురువారం బుఖారితో పాటు దుండగులు మట్టుబెట్టిన వ్యక్తిగత భద్రత అధికారి వద్ద జుబైర్ ఖాద్రి తుపాకీని తస్కరిస్తున్నట్లు వీడియోలో కనిపించింది. కేసు దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. సుజాత్ బుఖారి అంతిమ సంస్కారాలు శుక్రవారం ఆయన పూర్వీకుల గ్రామంలో వేల మంది అశ్రునయనాల మధ్య జరిగాయి. రైజింగ్ కశ్మీర్ పత్రిక... మొదటి పేజీ మొత్తం బుఖారి నలుపు-తెలుపు ఫొటో, పత్రిక సందేశంతో వెలువడింది. “...మిమ్మల్ని మా నుంచి దూరం చేసిన పిరికిపందల చర్యకు మేము భయపడం. నిజం ఎంత చేదుగా ఉన్నా చెప్పి తీరాలన్న మీ విలువలను పాటించి తీరతాం...!” అని సందేశంలో ఉంది.

సుజాత్ బుఖారి హత్య కేసులో పోలీసులు విడుదల చేసిన నిందితుడి చిత్రాలు

హోంమంత్రితో ప్రధాని భేటీ: కశ్మీరు పరిస్థితిపై చర్చ!

జమ్ము-కశ్మీరులో భద్రతా పరిస్థితిపై ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం రాత్రి హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చించారు. సీనియర్ పాత్రికేయుడు షుజాత్ బుఖారీ హత్యతో సహా ఇటీవల కశ్మీరులోయలో జరిగిన ఘటనల గురించి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. అమర్‌నాథ్ యాత్రకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ప్రధానికి వివరించినట్లు తెలుస్తోంది.

కృష్ణబిలానికి స్టీఫెన్ హాకింగ్ స్వరం

- డార్విన్, న్యూటన్ సమాధుల మధ్య అస్థికల ఖననం

లండన్: జీవితాంతం కృష్ణబిలాల పరిశోధనలోనే గడిపిన బ్రిటిష్ ఖగోళ భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్‌కు శుక్రవారం అద్భుతమైన, అరుదైన నివాళి అర్పించారు. ఆయన స్వరానికి వినసొంపైన ఆరున్నర నిముషాల సంగీతాన్ని మేళవించి, దాన్ని స్పెయిన్‌లోని ఏంటెన్నా ద్వారా అంతరిక్షంలోని కృష్ణబిలానికి పంపించారు. ‘1ఎ 0620-00’గా పిలిచే ఈ కృష్ణబిలం భూమికి 3500 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. ప్రొఫెసర్ హాకింగ్‌కు అరుదైన నివాళి అర్పించే అవకాశం లభించినందుకు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తరఫున సీనియర్ శాస్త్రవేత్త మెక్రయిన్ కృతజ్ఞతలు చెప్పారు. మరోవైపు ఇదే సమయంలో ఇంగ్లాండ్‌లోని వెస్ట్‌మినిస్టర్ అబ్బేలో హాకింగ్ అస్థికలను ఖననం చేశారు. దివంగత ప్రఖ్యాత శాస్త్రవేత్తలు చార్లెస్ డార్విన్, సర్ ఐజాక్ న్యూటన్ సమాధుల మధ్య వాటిని పూడ్చిపెట్టారు.

తప్పతాగి.. కన్నవారినే కడతేర్చారు

- ఒడిశాలో ఇద్దరు వ్యక్తుల ఘాతుకాలు

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వ్యక్తి సుత్తితో మోది కన్న తల్లిదండ్రులనే హతమార్చిన ఘటన శుక్రవారం ఒడిశాలో చోటుచేసుకుంది. అనుగుల్ జిల్లా రాజ్‌కిశోర్ నగర్ ఠాణా పరిధిలోని బరపథర్ గ్రామానికి చెందిన దుఖిశ్యామ్ భాషా సారా తాగి ఇంట్లో భార్యతో గొడవపడ్డాడు. భార్యపై దాడి చేస్తుండగా దుఖిశ్యామ్ తల్లిదండ్రులు అడ్డుపడ్డారు. దీంతో అతడు ఇంట్లో ఉన్న పెద్ద సుత్తితో తల్లిదండ్రులను కొట్టాడు. దీంతో వారు సంఘటన స్థలంలో కుప్పకూలి మృతిచెందారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

తుపాకీతో కాల్చేశాడు.. దేవ్‌గఢ్ జిల్లా కుండొయిగోలా ఠాణా పరిధిలోని శృంగిపాల్ గ్రామానికి చెందిన తండ్రీకుమారులు భగీరథి ముండా, అజు ముండా గ్రామంలోని దుకాణంలో సారా తాగారు. అనంతరం గొడవ పడుతూ ఇంటికి చేరుకున్నారు. అజు ముండా ఇంట్లో ఉన్న నాటు పిస్తోల్‌తో తండ్రిపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. కుమారుడి చేతిలో ఉన్న పిస్తోల్‌ను స్వాధీనం చేసుకునేందుకు తండ్రి ప్రయత్నించగా ముండా కాల్పులు జరిపాడు. దీంతో ఓ బుల్లెట్ భగీరథి ముండా పొట్టలో దూసుకుపోగా మరోటి అజు ముండా తొడలోకి దూసుకుపోయింది. తండ్రి ఘటనాస్థలిలోనే మృతి చెందగా, నిందితుడు గాయపడ్డాడు. పోలీసులు అజును అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించారు.

తీరు మార్చుకోకపోతే డీలర్‌షిప్ రద్దు

- చనిపోయినవారి పేర్లతోనూ బియ్యం తీసేసుకుంటే ఎలా?
- ప్రజా పంపిణీ వ్యవస్థపై సమీక్షలో మంత్రి పుల్లారావు ఆగ్రహం

ఈనాడు అమరావతి: 'పది రోజులు సమయమిస్తున్నాం..ఆలోగా తీరు మార్చుకోకపోతే డీలర్‌షిప్ రద్దు చేసేస్తాం..కార్డుపై బియ్యం, సరకులు ఇచ్చినపుడు ఏం ఇచ్చారన్న వివరాలతో రసీదు ఎందుకు ఇవ్వరు? మీ వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)పై ప్రజల్లో సంతృప్తి స్థాయి తగ్గిపోతోంది..ఇకమీదట దీన్ని సహించేది లేదు'..అని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, పౌరసరఫరాల శాఖ అధికారులు డీలర్లకు స్పష్టం చేశారు. పీడీఎస్‌పై ప్రజల్లో సంతృప్తిస్థాయి 60 శాతానికి పరిమితమవడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి అధికారులతో కలిసి శుక్రవారం రేషన్ డీలర్ల సంఘ నేతలు, డీలర్ల ప్రతినిధులతో వెలగపూడిలోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. 1256 దుకాణాలపై సంతృప్తిస్థాయి 40శాతంలోపే ఉందని, ఆ దుకాణాల డీలర్లు పదిరోజుల్లో తీరు మార్చుకోకపోతే వెంటనే డీలర్‌షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. తర్వాత మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. తూకాల్లో అక్రమాలకు పాల్పడుతున్న మండలస్థాయి నిల్వ కేంద్రా(ఎంఎల్ఎస్ పాయింట్ల)ల బాధ్యుల్లో కొందరిని ఈ నెలాఖరులోగా సస్పెండ్ చేస్తామని ప్రకటించారు. చక్కెరపై డీలర్లకు ఇస్తున్న రూ.15 కమీషన్‌ను(క్వింటాకు) జులై నుంచి రూ.70కి పెంచుతున్నట్లు వెల్లడించారు. వచ్చే సోమవారం రేషన్ డీలర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల అసంతృప్తికి కారణాలు, సంతృప్తిస్థాయి పెంచేందుకు తీసుకోబోతున్న చర్యలను మంత్రి వివరించారు.

అసంతృప్తికి కారణాలు: కార్డుదారులకు డీలర్లు సరకుల వివరాలతో రసీదు ఇవ్వకపోవడం. ★ ఒక కుటుంబంలో ఎవరైనా చనిపోయినా, ఆ యూనిట్ ఇన్‌యాక్టివ్‌లో ఉన్నా, ఆ మేర కోటాను బియ్యాన్ని కార్డుదారుడికి తగ్గించి, వాటిని డీలర్లు తీసేసుకోవటం. ★ తూకం వేసి ఇవ్వకుండా ముందే తక్కువగా ప్యాక్ చేసిన వాటినే ఇవ్వటం. ★ సరకుల కోసం కార్డుదారులను పదేపదే తిప్పటం. ★ రేషన్ దుకాణాలు బినామీలు నడపటం.

సంతృప్తి పెంచేందుకు చర్యలు: 10 రోజులు సమయమిస్తున్నాం, ప్రజల సంతృప్తి స్థాయి 40శాతం ఉన్న వారు 90 శాతానికి పెరగకపోతే వారి డీలర్‌షిప్ రద్దు చేసి డ్వాక్రా సంఘాల మహిళలకు అప్పగింత. ★ బయోమెట్రిక్ పడని కార్డుదారులకు బియ్యం ఎగ్గొట్టేందుకు వీల్లేకుండా ఒకసారి ధ్రువీకరణ తీసుకున్నాక 6 నెలల వరకు మళ్లీ తీసుకునే అవసరం లేకుండా జులై నుంచి నిబంధనలు అమలు. ★ కొంతమంది కార్డుదారులు బియ్యం తీసుకోకుండా ఆ మేరకు డీలరు నుంచి డబ్బు తీసుకుంటున్నారు..అలాంటివాటిని నియంత్రించేందుకు ప్రత్యామ్నాయం ఏర్పాట్లు. ★ ఇన్‌యాక్టివ్‌లో ఉన్న 4.02లక్షల యూనిట్లను జులై నుంచి పునరుద్ధరణ. ★ కుటుంబం నుంచి విడిపోయి వేరే కార్డుకోరుతున్న వారు ప్రజాసాధికార సర్వే నమోదు చేయించుకుంటే నేరుగా కార్డు జారీ.

కందిపప్పు తగ్గించలేదు: కందులను మర ఆడించి క్వింటాకు 62 కేజీల పప్పునే ఇచ్చేందుకు అనుమతించాలని మిల్లర్లు కోరుతున్నా ప్రభుత్వం అంగీకరించలేదని మంత్రి తెలిపారు. వచ్చే 2 నెలల్లో పామోలిన్ ఆయిల్, ఉప్పు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు.



హైదరాబాద్‌లోని చారిత్రక మక్కామసీదు మినార్ వద్ద శుక్రవారం కనిపించిన నెలవంక

ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి

ఈనాడు, దిల్లీ: దేశ ప్రజలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాస ముగింపు ఘట్టం సంబరాలు చేసుకోవాల్సిన సందర్భమని కోవింద్ అన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వం పెరగడానికి ఈ పండుగ దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈద్ సందర్భంగా ముఖ్యంగా భారత్‌తో పాటు విదేశాల్లో ఉన్న ముస్లిం సోదరసోదరీమణులకూ శుభాకాంక్షలు తెలుపుతున్నానని ఆయన వ్యాఖ్యానించారు. సంప్రదాయ భావన, ప్రజల మధ్య అవగాహనను ఈద్ సూచిస్తుందని వెంకయ్యనాయుడు అన్నారు. దేశంలో శాంతి, సామరస్యం, శ్రేయస్సును పెంపొందిస్తుందని వ్యాఖ్యానించారు.

సత్ప్రవర్తనకు మార్గదర్శనం రంజాన్

ముస్లింలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

ఈనాడు డిజిటల్, అమరావతి: సత్ప్రవర్తనతోనే సామాజిక మార్పు సాధ్యమన్న మహ్మద్ ప్రవక్త మహితోక్తులు సదా స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రంజాన్ పురస్కరించుకుని ముస్లింలకు సీఎం శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలలో ప్రతి పేద కుటుంబం సంతోషంగా పండుగ చేసుకోవాలన్న ఆలోచనతోనే చంద్రన్న రంజాన్ తోఫాను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముస్లిం కుటుంబాల్లో అనాథలకు, ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛన్లు ఇస్తామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ పారితోషికం ఇస్తున్నది ఏపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. మరోవైపు.. రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఛాదర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్పించారు. 60మీటర్ల పొడవున్న ఛాదర్‌ను ఉండవల్లిలోని ప్రజాదర్బార్ హాలులో వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ జలీల్‌ఖాన్‌కు సీఎం శుక్రవారం అందించారు. ఈ నెల 16న విజయవాడ నుంచి అజ్మీర్‌కు 150 మంది ముస్లింలు యాత్రగా వెళ్లనున్నారు. వీరికి ఈ ఛాదర్‌ను ఇవ్వాలని జలీల్‌ఖాన్‌కు సీఎం చెప్పారు.

ANDHRA PRADESH: VIJAYAWADA - Turbo Automotives, Enikepadu - 92985 05555, 88866 26640

Disclaimer: Accessories shown and features mentioned may not be a part of the standard equipment, subject to change without prior notice. Actual colour of vehicle and upholstery might differ. Segments defined on the basis of size and price.*Price mentioned is Ex-showroom Delhi for Sport Petrol variant. Always drive responsibly and obey all traffic rules. ** Those who have booked limited 4x2 diesel variant can upgrade to limited 4x4 diesel variant. ^EMI calculated on loan amount of 11 lakh for 7 years with select banks. Loans at the sole discretion of the bank. All offers from FCA dealers. T&C apply. Offer ends on June 30th 2018. Jeep is a registered trademark of FCA US LLC.

*షరతులు వర్తిస్తాయి. స్టాక్ ఉన్నంత వరకే ఆఫర్ చెల్లుతుంది. ఎంపికచేసిన మర్చండైజ్‌పై ఆఫర్ చెల్లుతుంది. ఈ ఆఫర్ లేకుండా కూడా మర్చండైజ్ లభిస్తుంది. ఈ ఆఫర్‌లో 2 బిల్లులను కలపడం లేదా విభజించడం అనుమతించబడదు. వివరమైన షరతుల కోసం దయచేసి స్టోర్ సిబ్బందిని అడగండి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00



ఈనాడు

విజయవాడ 17-6-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 308

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-00 పేజీలు 16+20+32 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కేంద్రంపై గళమెత్తుదాం

- అవసరమైతే ప్రధాని ప్రసంగాన్ని బహిష్కరిద్దాం
- కేంద్రం తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం
- తక్షణమే దిల్లీ సమస్యను పరిష్కరించండి: చంద్రబాబు
- పశ్చిమబెంగాల్, కర్ణాటక, కేరళ సీఎంలతో భేటీ
- దిల్లీ సీఎంకు బాసట
- కేజ్రీవాల్‌ను కలిసేందుకు సీఎంలకు అనుమతి నిరాకరించిన ఎల్జీ

శనివారం రాత్రి దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నివాసానికి వెళ్లి ఆయన సతీమణి సునీతతో మాట్లాడుతున్న ఏపీ, కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు చంద్రబాబు, విజయన్, కుమారస్వామి, మమతాబెనర్జీ

ఈనాడు – దిల్లీ

దేశ రాజధానిలో రాజకీయం వేడెక్కింది. దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ చేస్తున్న ధర్నాకు నలుగురు భాజపాయేతర ముఖ్యమంత్రులు మద్దతు పలికారు. తామంతా ఐక్యంగా ఉండాలనీ, అప్పుడే కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష పోకడకు స్వస్తి పలకవచ్చని వీరు పేర్కొన్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, కేరళ ముఖ్యమంత్రులు- చంద్రబాబు, మమతా బెనర్జీ, కుమారస్వామి, పినరయి విజయన్ ఏకాభిప్రాయానికి వచ్చారు. ఆదివారం జరగబోయే నీతి ఆయోగ్ సమావేశం నిమిత్తం శనివారం దిల్లీకి వచ్చిన ఈ నలుగురు సుమారు గంటసేపు సమావేశమయ్యారు. వీరంతా వేర్వేరుగా ఏపీ భవన్‌కు చేరుకున్నారు. పరస్పర అవసరాల నిమిత్తం కలిసి చర్చించుకొని సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించారు. దిల్లీకి ప్రత్యేక ప్రతిపత్తి కోసం ధర్నా చేస్తున్న కేజ్రీవాల్‌కు మద్దతు తెలపాలని నిర్ణయించారు. ప్రధాని నివాసం ముట్టడి సమయంలో ఇటీవల అరెస్టయిన తెదేపా ఎంపీలకు కేజ్రీవాల్ సంఘీభావం తెలిపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో చంద్రబాబు చొరవ తీసుకొని ఐక్యంగా ఉండాల్సిన అవసరం గురించి సీఎంలు మమతా బెనర్జీ, కుమారస్వామి, పినరయి విజయన్‌లకు తెలిపారు. కేజ్రీవాల్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా రాష్ట్రాల ఐక్యతను కేంద్రానికి బలంగా వినిపించొచ్చని సూచించారు. సమష్టిగా పోరాడితేనే కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్ర అవసరాలకు తగిన నిధులు సాధించుకోవచ్చని వివరించారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే పథకాలకు కేంద్రం నిధులు ఇవ్వకపోవడంపైనా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపైనా ముగ్గురు ముఖ్యమంత్రులతో సీఎం చంద్రబాబు మాట్లాడినట్లు సమాచారం. ఏపీ ప్రజల (మిగతా 11లో)

ఐక్యత చాటుదాం

- రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ఎన్నికల్లో గట్టి పోటీనిద్దాం
- నలుగురు ముఖ్యమంత్రుల అభిప్రాయం
- అడుగులేస్తున్న భాజపా వ్యతిరేక ప్రాంతీయ పార్టీలు
- నీతి ఆయోగ్ సమావేశంలో వ్యూహంపైనా చర్చ

కేంద్రం తీరుని ఎండగట్టాల్సిందే

- ప్రత్యేక హోదా సహా విభజన హామీల అమలుకి డిమాండ్ చేద్దాం
- రాష్ట్రాలపై కేంద్రం ఆధిపత్య ధోరణిని నిరసిద్దాం
- నేటి నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావించబోయే అంశాలపై వ్యూహ కమిటీ సభ్యులతో ముఖ్యమంత్రి

11లో

ఉమ్మడి ప్రవేశ పరీక్షల్లో అర్హత మార్కుల తగ్గింపు!

- పాలిసెట్‌లో 5శాతం.. ఎంసెట్‌లో రెండు మార్కులు
- డీసెట్‌లో ఓసీ, బీసీలకు 35మార్కులొస్తే చాలు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: కళాశాలల్లో సీట్లు మిగిలిపోవడం.. ఉమ్మడి ప్రవేశ పరీక్షలో అర్హత సాధిస్తున్నవారు తగ్గిపోతుండటంతో ఈ ఏడాది మూడు ప్రవేశ పరీక్షల్లో అర్హత మార్కులు తగ్గించాలని విద్యాశాఖ భావిస్తోంది. అర్హత సాధించినవారిలోనూ ఎక్కువ మంది ఆయా కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపకపోవడంతో కళాశాలల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. మొదటిసారిగా ఎంసెట్, పాలిసెట్, మరోసారి డీసెట్‌లో మార్కులు తగ్గించనున్నారు. పాలిసెట్, డీసెట్‌కు సంబంధించి కసరత్తు చివరి దశకు చేరుకోగా.. ఎంసెట్ విషయంలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల (మిగతా 11లో)

చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

ఏడుగురి మృత్యువాత

- 20 మందికి తీవ్రగాయాలు
- లోయలో పడిన మామిడికాయల లారీ
- మృతులంతా తమిళనాడు కూలీలు

14లో

చిత్తూరు జిల్లా పెద్దపంక సమీపంలో మామిడికాయల లోడు లారీ లోయలో పడిన ప్రమాదంలో మృతిచెందిన మహిళ

హత్యకు గురైన విష్ణువర్ధన్‌రెడ్డి, సృజనారెడ్డి

కిరాతక మేనమామ

- అక్కాబావకు భారమని కవల దివ్యాంగుల హత్య
- మృతదేహాలను తరలిస్తుండగా పోలీసులకు సమాచారం
- బావమరిదిపై కేసు నమోదు చేయవద్దన్న బావ
- నిందితుడి అరెస్ట్
- హైదరాబాద్‌లో ఘోరం

14లో

సాంకేతిక విప్లవానికి సమస్యల వైరస్

11లో

- లక్ష్యం దిశగా సాగని ఫైబర్ నెట్ సేవలు
- ఇప్పటివరకూ ఇచ్చిన కనెక్షన్లు 2.70 లక్షలే
- సమస్యల పరిష్కారంలో విఫలం

రాష్ట్రాలు 'నీళ్లు' నములుతున్నాయ్!

- నీటి నిర్వహణ అంతంతమాత్రమే
- ఇప్పటికీ 14 రాష్ట్రాల్లో నిర్లక్ష్యం
- రాబోయే రోజుల్లో ఆహారభద్రతకు ముప్పు
- నీతి ఆయోగ్ నివేదిక సుస్పష్టం

16లో

గ్రీన్‌కార్డు కావాలంటే.. 151 ఏళ్లు ఎదురుచూడాల్సిందే!

- అమెరికాలో అడ్వాన్స్‌డ్ డిగ్రీలున్న భారతీయుల పరిస్థితి ఇదీ..
- తాజా నివేదికలో వెల్లడి

11లో

సాక్షర భారత్‌కు ముగింపు..!

- దాని పరిధి సిబ్బంది తొలగింపు
- ఉత్తర్వుల జారీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అక్షరాస్యతను పెంచేందుకు నిర్వహిస్తున్న సాక్షర భారత్ పథకం గడువు ఈ ఏడాది మార్చితో ముగిసింది. దీని స్థానంలో కేంద్ర సర్కారు కొత్తగా 'పఢనా లిఖనా అభియాన్' పథకాన్ని తీసుకురానుంది. ఇందుకు సంబంధించి విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలో సాక్షర భారత్ పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లు, సమన్వయకర్తలను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరికి అక్టోబరు నుంచి చెల్లించాల్సిన వేతనాలకు సంబంధించి వయోజన విద్యాశాఖ కేంద్రానికి దస్త్రాన్ని పంపింది. దాదాపు రూ.24.5కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. రాష్ట్రంలో 9,979 సాక్షర భారత్ కేంద్రాలు కొనసాగుతుండగా 19,958 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. మండల, జిల్లా స్థాయుల్లో 542 మంది సమన్వయకర్తలు పనిచేస్తున్నారు.

మొదటి రోజు నుండే క్లాసులు: 22-6-2018 DSC హిందీ
20 సం॥ల నుండి హిందీలో PERFECT కోచింగ్‌తో TOP RANKS సాధింపజేసిన స్టేట్ నెం. 1 ఫ్యాకల్టీ కలిగిన అత్యుత్తమ సంస్థ
Spl. Batch 5am to 10 pm, Daily 6 Tests, Also Digital Class
QUEST 4/18 Brodipet, Guntur 7893625174

HYD ఫ్యాకల్టీ గడవర్తి వెంకటేశ్వర్లుచే ఎకానమీ
IAS గ్రూప్-1&2 DSC SA సోషల్
SSC IBPS RPF SI కానిస్టేబుల్స్
కలామ్ IAS కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి 90596 29934 86391 55740

DSC-SGT, SA బ్యాచ్ ప్రా॥: 20-06-18
SGT స్పెషల్ ఎగ్జామ్ బ్యాచ్ కలదు
టీచర్స్ అకాడమీ 98486 61318

PAVAN KUMAR'S IAS
Our Ranks Civils, Groups 3 7 12 13
Admissions Open
Ph: 9966961027 Vijayawada

TET DSC: SGT/SA'S (ALL)
V.రాహుల్ 98667 15363 83416 29208

2018 TET DSC విద్యానికేతన్ DSC
SGT & SA (Mat, Soc, Bio, Eng)
94401 04963, 99499 33838

APDSC-HINDI
RANKERS HINDI ACADEMY

2018-TET DSC TPT, HPT SA (ALL)
ప్రతిభ బందరురోడ్ 93 92 91 75 84

RPF (కానిస్టేబుల్స్) అర్హత: 10th
RPF (SI) అర్హత: డిగ్రీ
వయస్సు: 18-30 / ఉద్యోగాలు: 9,500
కాపు విద్యార్థులకు ఉచిత కోచింగ్ కలదు
హార్వెస్ట్ 9160419854 9030450459

S.I. కానిస్టేబుల్
HIP హైదరాబాద్ ఇనిస్టిట్యూట్

స్వాతి DSC నెల్లూరు
8985005173, 9542543167

DSC SA TPT, PET, SGT
బాసర ఇన్‌స్టిట్యూట్ 9030140123 8374022333

DSC బ్రహ్మాస్ కాకినాడ 8019013199 9032686069

EXCELLENT COACHING FOR BANKS SSC RPF కానిస్టేబుల్స్ SIs
Online Exams + హాస్టల్ వసతి కలదు
ఆదిత్య కాంపిటీషన్స్ New Batch: 18th June '18
GNT 98490 03166, VJA 91105 88864

2016 AP DSC - SGT, TPT, SA-All సబ్జెక్ట్‌లలో కలిపి
కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-MAT, SOC, TEL, BIO
8106268482, 9885272474

VISION IAS
సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ & ఇంటర్వ్యూ 2019
TOPPER'S talk on 17th June @ 5pm
Anthropology by Mrs. Sosin
టీఎస్‌పీఎస్‌సీ/ఏపీపీఎస్‌సీ గ్రూప్ 1, II
9000104133, 9515487979

EXCELLENT PRE-TRAINING for
INTER + IAS, IPS, IFS... DEGREE + IAS, IPS, IFS...
CIVILS/GROUP - I&II, Prelims & Mains
హైదరాబాద్ అమరావతి రాజమండ్రి
9676413716 9492755270 8096951705 June 22
RANGARAYA IAS ACADEMY

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com
Degree + IAS (50 students) 3yrs Integrated Program
Civil Services IAS Exam పై ఉచిత అవగాహనా సదస్సు on June 17th SUN. 10 am & 5 pm
Beside Nagarjuna Hospital, Kanuru, VIJAYAWADA. Ph: 6300181832

శ్రీ భవిష్య ఎడ్యుకేషనల్ అకాడమీ విజయవాడ
www.sribhavishya.com
NEET-2018 ఫలితాలలో
1st STATE 579 MARKS MANIPUR BINITA NINGTHOUJAM
570 569 557 555 555 552
క్లాసులు 18-06-2018 నుండి ప్రారంభం
NEET-2019 LONG TERM అడ్మిషన్లు జరుగుచున్నవి.
Long Term 2018-19 Batch Concessions
NEET-18 Marks | >420 | 400-419 | 375-399 | 350-374
% of Concession | 90% | 75% | 50% | 25%
*The above concessions are valid for first 100 Students only
95813 06030, 95819 44007
95819 44003, 85003 03037

అవకాశమిస్తే.. ఆటాడిస్తాం!

- ఫిన్లాండ్ సహకారంతో 'గేమింగ్' శిక్షణ
- ప్రతిభ కనబరచిన వారికి ఆ దేశంలో ఇంటర్న్‌షిప్
- అంకుర సంస్థలకు ఆర్థిక సాయం

ఈనాడు - అమరావతి

సాంకేతికతే శ్వాసగా...తమ 'అంకుర' స్వప్నాన్ని సాకారం చేసుకునే అవకాశాన్ని వినియోగించుకునేందుకు యువత పోటీపడుతోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఫిన్లాండ్‌కు చెందిన కజాని విశ్వవిద్యాలయ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 'ఇండియన్ గేమ్ డెవలప్‌మెంట్ ఛాలెంజ్' శిక్షణ కార్యక్రమం యువతలో కొత్త ఆశల్ని చిగురింపజేస్తోంది.

రెండు నెలల శిక్షణలో..!

మార్కెట్‌లో రూ.లక్ష వరకు ఫీజు వసూలు చేసే శిక్షణను కేవలం రూ.1500కే వసతితో సహా అందిస్తోంది. రెండు నెలలపాటు ఈ శిక్షణ సాగుతోంది.

శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఫిన్లాండ్ కజాని విశ్వవిద్యాలయం అధ్యాపకులే 10 మంది స్థానికంగా ఉండి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. 10మంది విద్యార్థులను ఒక బృందంగా ఏర్పాటు చేసి, వారికి ఉన్న ఆసక్తిని అనుసరించి గ్రాఫిక్ డిజైన్, ఆర్టిస్ట్, ప్రోగ్రామర్, ప్రొడ్యూసింగ్ విభాగాలలో శిక్షణ ఇస్తున్నారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, సాధారణ డిగ్రీ చేసిన విద్యార్థులకు వారి అర్హతల ప్రకారం ఈ విభాగాల్లో శిక్షణ ఉంటోంది. మొత్తం 500మందికి శిక్షణ లక్ష్యం కాగా 370మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఆసక్తి ఉన్నవారు వెబ్‌సైట్ ద్వారా http://engineering.apssdc.in/igdc దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీఎస్‌ఎస్‌డీసీ సీఈవో కోగంటి సాంబశివరావు వెల్లడించారు.

రాణిస్తే వెంటనే ఉపాధి..

శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఫిన్లాండ్‌లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. కజాని వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఈ వర్సిటీతో దాదాపు 30 నుంచి 40 గేమింగ్ కంపెనీలకు ఒప్పందాలు ఉన్నాయి. ఒకవేళ విద్యార్థులే ఒక అంకుర సంస్థను ఏర్పాటు చేసుకుంటే ఆర్థిక సహాయం చేసేందుకు అవకాశం ఉంది. కాకినాడకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి మేఘన బృందం పొనెక్స్ స్టూడియో పేరుతో గేమింగ్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది.

వినూత్న ఆలోచనలకు వేదిక

గేమింగ్ విభాగం మీద ఉన్న ఆసక్తే ఇక్కడకు రప్పించింది. ఇంటర్న్‌షిప్‌కి ఎంపికకావడం చాలా ఆనందంగా ఉంది. బృందంలో ప్రోగ్రామర్‌గా వ్యవహరిస్తున్నాను. జట్టుగా కలిసి ఎలా పనిచేయాలనే విధానాన్ని బాగా నేర్పుతున్నారు. వినూత్న ఆలోచనలకు వేదికగా ఉంది.

– ఎం.హరిప్రియ, బీటెక్, తూర్పుగోదావరి జిల్లా

ఆత్మవిశ్వాసం నింపుతోంది

ఇక్కడి శిక్షణ ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. నేను శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఓ దీవిలో ఉన్న కారాగారంపై గేమ్‌ను తయారుచేస్తున్నా. బీటెక్ మూడో ఏడాది చదువుతూనే ఇంటర్న్‌షిప్‌కి ఎంపికయ్యా. చదువు పూర్తయ్యాక సంస్థలో చేరవచ్చని ఫిన్లాండ్ శిక్షకులు చెప్పటంతో సంతోషంగా ఉంది.

– మణిచందన, బీటెక్ మూడో ఏడాది, ప్రకాశం జిల్లా

భారతీయులు విషయాన్ని ఇట్టే పట్టేస్తారు

శిక్షణ ప్రారంభమై కేవలం రెండు వారాలే అయినా విద్యార్థులు అద్భుతంగా పనిచేస్తున్నారు. గేమింగ్ గురించి ఎటువంటి నేపథ్యం లేకపోయినా ఇంత తొందరగా నేర్చుకోవటం ప్రశంసనీయం. భారతీయులు ఏ విషయాన్నైనా వెంటనే నేర్చుకుంటారని నా అభిప్రాయం. విద్యార్థులు రాణిస్తే ప్రపంచవ్యాప్తంగా అవకాశాలున్నాయి.

– టిమో కొరేన్‌హన్, సీనియర్ లెక్చరర్, కజాని విశ్వవిద్యాలయం

ఆదాయ మార్గాలపై ఆర్టీసీ దృష్టి

- అభివృద్ధికి 300 ఎకరాల స్థలాల గుర్తింపు

ఈనాడు - అమరావతి

నష్టాల నుంచి గట్టెక్కడమే లక్ష్యంగా వాణిజ్య దాయం పెంచుకోవడంపై ఏపీఎస్‌ఆర్టీసీ దృష్టి సారించింది. ఏడాదికి కనీసం రూ.వెయ్యి కోట్లు ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి సంస్థ ఎండీ ఎన్.వి.సురేంద్రబాబు ఇటీవల కార్యాచరణ ఖరారు చేశారు. రాబోయే రెండేళ్లలోనే దీన్ని సాధించాలని నిర్దేశించుకున్నారు. అందులోభాగంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సంస్థకు సంబంధించిన విలువైన స్థలాలను ఆదాయవనరులుగా మార్చనున్నారు. బీవోటీ విధానం, ప్రైవేటు భాగస్వామ్యంతో వీటిని వాణిజ్య కేంద్రాలు, సముదాయాలుగా తీర్చిదిద్దనున్నారు. విశాఖపట్నంలోని ఓ స్థలానికి సంబంధించి ఈ తరహా ఒప్పందాన్ని ఇప్పటికే కుదుర్చుకున్నారు. వాణిజ్యవిలువ కలిగిన 300 ఎకరాల ఆర్టీసీ స్థలాలను అభివృద్ధి చేయడానికి గుర్తించారు. ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతాయి? వాటికనుగుణంగా ఆ స్థలాల్ని ఎలా తీర్చిదిద్దాలనే దానిపై అధ్యయనం చేస్తున్నారు. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ తరఫున ఏపీఎస్ ఆర్టీసీ నుంచి ప్రతినిధుల బృందం ఇటీవల ఇజ్రాయెల్, పోలెండ్ దేశాల్లో పర్యటించింది. ఆయా దేశాల్లో రోడ్డు రవాణా సంస్థల ఆదాయం, తీరుతెన్నులను అధ్యయనం చేసింది. చాలా సంస్థలకు టిక్కెట్ల ద్వారా పొందుతున్న ఆదాయంలో వాణిజ్యపరంగా 25 శాతం మేర ఉంటోందని గమనించింది. ఆ లెక్కన ఏపీఎస్‌ఆర్టీసీకి టిక్కెట్లపై ఏటా రూ.4,500 కోట్లు వస్తున్నందున అందులో వాణిజ్య ఆదాయం రూ.1,125 కోట్లైనా రావాలని అంచనా వేస్తోంది. ప్రస్తుతం వాణిజ్య కార్యకలాపాలు, కార్గో సేవల ద్వారా కేవలం రూ.400 కోట్లే వస్తోంది. దీన్ని పెంచాలని భావిస్తోంది.

కార్గో సేవల విస్తరణ

గతంలో కార్గో, కొరియర్ సేవలను ఆర్టీసీ ఏఎన్ఎల్ సంస్థకు అప్పగించింది. తద్వారా ఏడాదికి రూ.9 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చేది. గతేడాది నుంచి సొంతంగా ప్రారంభించగా ఒక్క ఏడాదిలోనే రూ.44 కోట్లు ఆదాయాన్ని ఆర్జించింది. ఈ సేవలు మరింత విస్తరించడం ద్వారా ఎక్కువ ఆదాయం లభించేందుకు అవకాశం ఉందని గుర్తించిన అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రఖ్యాత కొరియర్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని ప్రస్తుతానికి వారి ద్వారానే సేవలు అందించాలని భావిస్తున్నారు.

నష్టాలను అధిగమించొచ్చు

ప్రజలపై భారాలు వేయకుండా ఏపీఎస్‌ఆర్టీసీని నష్టాల నుంచి బయటకు తీసుకురావాలంటే వాణిజ్య ఆదాయం పెంచుకోవడం ఒక ప్రధాన మార్గం. ఆ దిశగా ఉన్న అవకాశాలన్నింటిపైన అధ్యయనం చేశాం. వాటిని సద్వినియోగం చేసుకుంటాం. ఏటా రూ.వెయ్యి కోట్లు వాణిజ్య ఆదాయాన్ని సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

–ఎన్.వి.సురేంద్రబాబు, ఎండీ, ఏపీఎస్‌ఆర్టీసీ

జాబితాలో 2 వైద్య కళాశాలల పేర్లు మాయం

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి సంబంధించిన జాతీయ కూటమి ప్రభుత్వ వైద్య కళాశాలల జాబితాలో రాష్ట్రానికి చెందిన రెండు కళాశాలల పేర్లు కనిపించడంలేదు. తొలిసారిగా జాతీయ కూటమి ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి 15% కోటాలో కేటాయించిన 283 సీట్లకు దేశవ్యాప్తంగా విద్యార్థులు పోటీపడుతున్నారు. సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ప్రక్రియ నేపథ్యంలో విద్యార్థులు ఆప్షన్లను నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఒంగోలు, అనంతపురం వైద్య కళాశాలల పేర్లు కనిపించడంలేదు. సాంకేతికపరమైన సమస్యవల్లే కళాశాలల పేర్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడు కాలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. రెండు, మూడురోజుల్లో కళాశాలల పేర్లు కౌన్సెలింగ్ జాబితాలో ఉంటాయని వెల్లడించాయి. ఈ సీట్ల భర్తీ ఏమైనా సమస్యలు తలెత్తినా రాష్ట్ర కౌన్సెలింగ్ ద్వారా అందుబాటులోనికి వస్తాయి.

రాయలసీమ వర్సిటీ ఘటనలో బాధ్యులపై చర్యలు

- ఎస్కేయూ అసోసియేట్ ప్రొఫెసర్ రత్నప్ప చౌదరి సస్పెన్షన్

ఈనాడు, అమరావతి: రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనపై మంత్రి గంటా శ్రీనివాసరావు శనివారమిక్కడ స్పందించారు. దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్‌పై దాడికి ప్రయత్నించిన శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్(అడహక్) రత్నప్ప చౌదరిని సస్పెండ్ చేయాలని ఇన్‌ఛార్జి ఉపకులపతిని మంత్రి ఆదేశించారు. ఘటనకు కారకులైన తిరుపతయ్యకు చెందిన కళాశాలల అనుబంధ గుర్తింపు రద్దు చేయాలని రాయలసీమ ఇన్‌ఛార్జి ఉపకులపతిని కోరారు. ఉన్నతాధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే సహించేదిలేదని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

ఆగస్టులో ఏపీ కేంద్రీయ వర్సిటీ తరగతులు

- ఈనెల 30 వరకు ప్రవేశ దరఖాస్తులకు అవకాశం
- జులై 8న ఏడు కేంద్రాల్లో పరీక్ష

ఈనాడు, అమరావతి: ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయం తరగతుల ప్రారంభానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభించేందుకు మెంటార్ వర్సిటీగా వ్యవహరిస్తున్న హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీ ఉపకులపతి అప్పారావు చర్యలు చేపట్టారు. అనంతపురం జేఎన్‌టీయూలో నిర్మించిన ఐటీ శాఖకు చెందిన భవనంలో తరగతులు నిర్వహించనున్నారు. అయితే, ఇంతవరకు ఈ భవనాన్ని కేంద్రీయ వర్సిటీకి అప్పగించేందుకు ఐటీ శాఖ నుంచి అనుమతి లభించలేదు. మొదటి ఏడాది 170 సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. డిగ్రీ కోర్సుల్లో భాగంగా బీఎస్సీ అర్థశాస్త్రం, బీఏ పొలిటికల్, పబ్లిక్ పాలసీ, వొకేషన్‌లో పర్యటక నిర్వహణ, రిటెయిల్ ఛేంజ్ మేనేజ్‌మెంట్, ఐటీ కోర్సులు ఉంటాయి. పీజీలో ఎంఏ తెలుగు, ఎంఏ ఆంగ్లం ఉంటుంది. ఈనెల 30వరకు హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. జులై 8న అనంతపురం, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, నాగపూర్, గువహటి, దిల్లీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. 20న ఫలితాలను వెల్లడించి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

ఎన్‌సీసీ కోటా ఎంపికపై సందిగ్ధం

ఆలస్యంగా ప్రారంభమైన పత్రాల పరిశీలన

నూజివీడు, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రవేశాలకు ఎన్‌సీసీ కోటా అభ్యర్థుల పరిశీలనకు 400 మంది విద్యార్థులను పిలవగా 317 మంది హాజరయ్యారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియను ఈఎంఈ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎం.టి.స్వామి పర్యవేక్షిస్తున్నారు. శనివారం అభ్యర్థుల ఎంపిక విధానంపై సందిగ్ధత నెలకొనడంతో కమాండింగ్ ఆఫీసర్ స్వామి అభ్యంతరం వ్యక్తంచేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన పత్రాల పరిశీలన ప్రక్రియ గంటన్నర ఆలస్యంగా ఆరంభమైంది. ఎన్‌సీసీ కోటా అభ్యర్థులందరూ 'ఎ' సర్టిఫికెట్ పొందిన వారే కావడంతో తాము ఎవరికి ప్రాధాన్యం ఇవ్వాలంటూ ఆర్జీయూకేటీ అధికారులను ఆయన ప్రశ్నించారు. దీనిపై ప్రవేశాల కన్వీనరు ఎస్‌ఎస్‌ఎస్.గోపాలరాజు, సభ్యుడు హనుమంతరావు, అకడమిక్ డీన్ రమాకాంత్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ అధికారులు ఎంపిక చేసిన జాబితాను తమకిస్తే, అకడమిక్ ఫలితాల ఆధారంగా ప్రతిభావంతులకు ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఓ అభ్యర్థి తప్పుడు ధ్రువపత్రం తెచ్చాడని కల్నల్ గుర్తించారు. కింది స్థాయి పోటీల ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉన్నత స్థాయి పోటీల్లో ఎలా పాల్గొన్నావని ప్రశ్నించగా.. సదరు అభ్యర్థి సమాధానం చెప్పలేకపోయాడు. దీంతో అతనిని అనర్హుడిగా ప్రకటించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డైరెక్టర్ హరశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో తుది ఓటర్ల జాబితా విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీల్లో ఓటర్ల తుది జాబితాలను జిల్లాల వారీగా అధికారులు ప్రకటించి ఎన్నికల సంఘానికి సమాచారాన్ని అందించారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు శనివారం ధ్రువీకరించారు. రాష్ట్రస్థాయి, జిల్లాల వారీగా మహిళల, పురుషుల ఓటర్ల సంఖ్య, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. పంచాయతీలకు 2013లో మూడు దశల్లో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. సర్పంచి, వార్డు సభ్యుల పదవీ కాలం ఆగస్టుతో ముగియనుండటంతో తదుపరి ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం కొద్ది నెలలుగా ఏర్పాట్లు చేస్తోంది. కీలకమైన ఓటర్ల తుది జాబితా ప్రకటన పూర్తి కావడంతో ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీల గణన చేపట్టి రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలెక్టర్లకు ఆదేశాలు వెలువడాల్సి ఉంది.

అంతర్జాతీయ విద్య అందించేలా..

- సింగపూర్ సంస్థ, మిలీనియం వర్సిటీతో జేఎన్‌టీయూకే ఒప్పందం
- విద్యార్థుల నైపుణ్యాల పెంపే లక్ష్యంగా అడుగులు

ఈనాడు, కాకినాడ: అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు విదేశీ సంస్థలతో జేఎన్‌టీయూ కాకినాడ ఒప్పందాలు చేసుకుంది. శనివారం సింగపూర్‌కి చెందిన టూపుల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో పాటు ఆఫ్రికా ఖండంలో ఉన్న మలావీ దేశంలోని మిలీనియం విశ్వవిద్యాలయంతో వేర్వేరుగా అవగాహన ఒప్పందం చేసుకుంది. కాకినాడ జేఎన్‌టీయూకే ఉపకులపతి సమావేశ మందిరంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా మిలీనియం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.సుబ్బారావు మాట్లాడుతూ.. సంప్రదాయ కోర్సులను అందించడమే కాకుండా మెరుగైన సాంకేతిక విద్యను అందించేందుకు జేఎన్‌టీయూ కాకినాడతో ఒప్పందం చేసుకున్నామన్నారు. మిలీనియం వర్సిటీ నుంచి అధ్యాపకులు, విద్యార్థులు జేఎన్‌టీయూకే సందర్శిస్తారన్నారు. మిలీనియం విద్యార్థులకు జేఎన్‌టీయూకేలో అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్య అభ్యసించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ.. రెండు విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా యూజీ, పీజీ ప్రోగ్రామ్‌లను నిర్వహించేలా, అధ్యాపకుల మార్పిడికి అవసరమైన విధివిధానాలను రూపొందించనున్నామన్నారు.

టూపుల్ సంస్థ సీఈవో వి.కృష్ణారావు, జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ సుబ్బారావు మధ్య ఒప్పంద పత్రాల మార్పిడి

టూపుల్ కంపెనీతో సాంకేతిక సహకారం

అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల నైపుణ్యాలు పెంచే లక్ష్యంగా సింగపూర్‌కి చెందిన టూపుల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో జేఎన్‌టీయూకే అవగాహనా ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా టూపుల్ సీఈవో వి.కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థకు, పరిశ్రమలకు మధ్య ఉన్న అంతరాన్ని తొలగించి.. పటిష్టమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాలు, కళాశాలలతో టూపుల్ అనుసంధానమై.. బిగ్‌డేటా అనాలసిస్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా మైనింగ్, స్టార్టప్ ప్రోగ్రాంలు, వ్యవస్థాపకత, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

ఎన్.జి.రంగా వర్సిటీలో వ్యవసాయ పీజీ కోర్సుల నిలిపివేత

ఈనాడు, అమరావతి: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్తగా ప్రవేశపెట్టిన వ్యవసాయ మెటీరియాలజీ, ఎం.టెక్ ఇరిగేషన్ మరియు డ్రైనేజీ, ఎం.టెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలను నిలిపేసింది. వ్యవసాయ కళాశాలల్లోని ప్రయోగశాలల్లో యంత్ర పరికరాలను అమర్చకపోవడం, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ అనుమతి రాకపోవడం తదితర కారణాలతో ప్రవేశాలు నిలిచిపోయాయి. సాంకేతిక కారణాలతో వ్యవసాయ విద్యకు సంబంధించిన నూతన కోర్సుల్లో విద్యార్థులకు సీట్లను కేటాయించడం లేదని రిజిస్ట్రార్ డి.భాస్కరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్ angrau.ac.in ని సందర్శించి వివరాలు పొందాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశమెలా?

- ఆన్‌లైన్‌లో సీట్లు కేటాయించే విధానంతో గందరగోళం
- ప్రైవేటు, అటానమస్ కళాశాలలకు వర్తించని వైనం
- ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాలయాల్లో నేటికీ ప్రారంభం కాని తరగతులు

ఈనాడు, గుంటూరు: ఇంటర్ ఫలితాలు రావటమే తరువాయి.. ఏటా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు తెరలేచేది. ఇపుడా పరిస్థితి లేదు! ఎలాంటి అధ్యయనమూ చేయకుండా, విద్యార్థులకు అవగాహన కల్పించకుండా కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌లైన్ ప్రవేశాల విధానంతో ప్రస్తుతం గందరగోళం నెలకొంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో నేరుగా ప్రవేశాలు చేసుకునే పరిస్థితి దూరమైంది. ఫలితంగా ఇప్పటి దాకా వాటిల్లో ప్రవేశాల ఊసే లేదు. మరోవైపు కార్పొరేట్, ప్రైవేటు, స్వయంప్రతిపత్తి(అటానమస్) హోదా కలిగిన కళాశాలలు ఎప్పటిలాగే ప్రవేశాలు చేసుకుని బోధనకు ఉపక్రమించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాల అధ్యాపకవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల మాదిరి డిగ్రీలోనూ ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు చేసుకునే నూతన విధానాన్ని ఈ ఏడాది కళాశాల విద్యాశాఖ తీసుకొచ్చింది. దాన్ని ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలుచేయాలని కమిషనర్ నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలకు ఆదేశాలు వెళ్లాయి. అయితే ఆన్‌లైన్ విధానంపై విద్యార్థులకు అవగాహన లేక చాలమంది ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ప్రవేశాలు లేక మూతపడే ప్రమాదం ఉందని అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు 300 వరకు ఉన్నాయి. వీటిల్లో ప్రవేశాలకు మాత్రమే ఆన్‌లైన్ విధానాన్ని అవలంబించాలని ప్రభుత్వం సూచించటంపై విమర్శలు రేగుతున్నాయి.

ప్రైవేటు కళాశాలలకు వర్తించదా!: ఆన్‌లైన్ విధానంలోనే ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలన్నీ ప్రవేశాలు చేసుకోవాలని సూచిస్తే అన్ని చోట్లా ఒకేసారి తరగతులు ప్రారంభించటానికి అవకాశం ఉండేది. అందరికీ ఒకే విధానాన్ని అవలంబిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. తెలంగాణలో 'దోస్త్' పేరిట అనుసరిస్తున్న ఈ విధానాన్ని ఎలాంటి అధ్యయనం చేయకుండా రాష్ట్రంలో ప్రవేశపెట్టాలనుకోవటం అధికారులకు సరికాదని అన్ని వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో చేరటానికి వచ్చేవారిలో అత్యధికులు గ్రామీణ నేపథ్యం కలిగిన పేద పిల్లలని.. వారికి ఆన్‌లైన్ విధానంపై అవగాహన లేక ప్రైవేటు కళాశాలల్లో చేరటానికి ఇష్టపడుతున్నారని గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు తెలిపారు.

అత్యధికం కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే..: రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు అత్యధికంగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే 70 వరకూ ఉన్నాయి. ఈ జిల్లాల్లోని కాలేజీల్లో చేరేందుకు ఇప్పటి దాకా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో కూడా ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం లేదు. దీంతో అధ్యాపకవర్గాలు, కళాశాల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. తొలి విడత సీట్ల కేటాయింపు ఈనెల 5న చేస్తామని కమిషనర్ కార్యాలయం పేర్కొంది. ఆ తర్వాత 10, 13 తేదీల్లో వెల్లడిస్తామని చెప్పింది. అయినా నేటికీ సీట్లు కేటాయింపు వివరాలు ఇవ్వకపోవటంతో తరగతులు ప్రారంభించలేకపోయామని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులు వివరించారు. సెమిస్టర్ విధానంలో పరీక్షలు కావటంతో అక్టోబరులో వాటిని నిర్వహించాలి. ప్రస్తుతం సీట్ల కేటాయింపే కొలిక్కిరాలేదు. ఈ నేపథ్యంలో కళాశాలలు ప్రారంభమయ్యేది ఎప్పుడు.. సిలబస్ పూర్తిచేసుకుని పరీక్షలకు తెరదీసేదెప్పుడని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యపై ప్రభుత్వం స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సౌహార్ద్రతను బలోపేతం చేసే రంజాన్

ప్రధాని మోదీ శుభాకాంక్షలు

దిల్లీ: పవిత్ర రంజాన్ పర్వదినం దేశంలో సౌహార్ద్ర బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఉద్ఘాటించారు. ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు అందచేస్తూ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రజలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శాంతిసౌఖ్యాలు, ఆనందోత్సాహాలు, ఆరోగ్యసంపదనిచ్చి భగవంతుడు ప్రజలను దీవించాలని ఆయన ట్విటర్‌లో ఆకాంక్షించారు.

రంజాన్ తోఫా పంపిణీ గడువు 20 వరకూ పెంపు

ఈనాడు డిజిటల్, అమరావతి: రంజాన్ సందర్భంగా రేషన్ దుకాణాల్లో ముస్లింలకిచ్చే తోఫాను ఈ నెల 20 వరకూ పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికీ సరకులు తీసుకోని వారి కోసం గడువు పెంచుతున్నట్లు పౌరసరఫరాల శాఖ సంచాలకులు రవిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెంచిన గడువు వరకూ తోఫా సరకులను మాత్రమే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

2019లో తానా 22వ మహాసభలు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 22వ ద్వైవార్షిక మహాసభలు 2019 జులై 4 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. వాషింగ్టన్‌లో ఈ మహాసభలు నిర్వహించేందుకు తానా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించి వాషింగ్టన్ కన్వెన్షన్ సెంటర్ అధికారులతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నామని తానా అధ్యక్షుడు సతీష్ వేమన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

'రేషన్ పంపిణీలో అక్రమాలొద్దు'

ఈనాడు డిజిటల్, అమరావతి: బియ్యం సహా ఇతరత్రా సరుకులను లబ్ధిదారులకు ఇచ్చినపుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఏపీ రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు దివిలీలా మాధవరావు రాష్ట్రంలోని రేషన్ దుకాణాదారులకు విజ్ఞప్తి చేశారు. రేషన్ డీలర్ల పనితీరుపై ప్రజల సంతృప్త స్థాయి 90 శాతానికి పెంచేందుకు పనితీరు మెరుగుపరుచుకోవాలని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీలర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నందున రేషన్ పంపిణీ విషయంలో అక్రమాలకు పాల్పడవద్దని ఆయన కోరారు.

Sri Balaji Educational Services, HYD & GUNTUR
Ag.B.Sc
ICAR Colleges in Maharastra
For Admissions Plz Meet in GUNTUR, RAJAMANDRY & VIJAYANAGARAM
L. Venkat Reddy (www.csmss.org)
6302378991, 88973 03067

Admission Guidance
MBBS, BDS
BAMS, BHMS, Agi.B.Sc.
All India & Nepal
8790511616-HYD

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

- విద్యార్థుల కోసం త్వరలో 25 గురుకుల పాఠశాలలు
- రంజాన్ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు డిజిటల్ - విజయవాడ

విజయవాడ ఐజీఎం మైదానంలో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రతి మనిషి ఆనందంగా జీవించేందుకు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, భద్రతకు తెదేపా ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ పురపాలక స్టేడియంలో ఏర్పాటుచేసిన రంజాన్ సామూహిక ప్రార్థనలలో ముఖ్యమంత్రి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. . రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో మైనారిటీల సంక్షేమానికి రూ.1100 కోట్లు బడ్జెట్‌లో కేటాయించామని వివరించారు. ప్రతి ముస్లిం కుటుంబం ఆనందంతో రంజాన్ జరుపుకోవాలనే ఉద్దేశంతో 12 లక్షల కుటుంబాలకు రంజాన్‌తోఫా అందించామని, దీని కోసం రూ.65 కోట్లు వెచ్చించామని వెల్లడించారు. మైనారిటీ యువతులకు పెళ్లి కానుకగా దుల్హన్ పథకం కింద రూ.50 వేల చొప్పున ఇస్తున్నామన్నారు. ముస్లిం విద్యార్థుల కోసం త్వరలో రాష్ట్రంలో 25 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయనున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇమాం, మౌజమ్‌లకు రూ.5వేలు, రూ.3వేల గౌరవ పారితోషకాన్ని అందిస్తున్నామన్నారు. పోస్టుమెట్రిక్, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలు, విదేశీ విద్య, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ముస్లిం సమాజానికి చేయూతనిస్తున్నామన్నారు.

కడపలో రూ.12 కోట్లు, విజయవాడలో రూ.80 కోట్లతో హజ్‌హౌజ్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో గన్నవరం విమానాశ్రయం నుంచే హజ్ యాత్రికులు మక్కా వెళ్లేలా చర్యలు చేపడతామన్నారు. షాదీఖానాలు, మసీదుల మరమ్మతుకు రాష్ట్రంలో ప్రాధాన్యమిస్తున్నామని వివరించారు. ట్రిపుల్ తలాక్ విషయంలో కొందరు ప్రాసిక్యూషన్ చేస్తామంటే మొదట తామే అభ్యంతరం చెప్పామని గుర్తుచేశారు. కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీలు కేశినేని నాని, మాగంటి బాబు, ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ నాగుల్‌మీరా, ముస్లిం పెద్దపెద్దలు, ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి హామీ

విజయవాడలోని రామవరప్పాడు రింగ్ సమీపంలో రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన మసీదును నిర్మించాలని కొందరు ముస్లిం సోదరులు ముఖ్యమంత్రిని కోరారు. దీనికి స్పందించిన ఆయన వచ్చే రంజాన్‌నాటికి మసీదును నిర్మిస్తామని హామీనిచ్చారు. కలెక్టర్ బి.లక్ష్మీకాంతంను పిలిచి నెలలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

రైతులతో కలిసి భోజనం చేస్తున్న లక్ష్మీనారాయణ

తుమ్మపాల కర్మాగారం తెరిపించేందుకు కృషి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి విశాఖ జిల్లా అనకాపల్లి మండలం తుమ్మపాల చక్కెర కర్మాగారాన్ని తెరిపించేందుకు కృషిచేస్తానని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. వీవీ.రమణ చక్కెర కర్మాగారానికి ఆయన శనివారం విచ్చేశారు. అనంతరం పౌర సమాచార వేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు పోతిన వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ కర్మాగారంతో 157 గ్రామాల రైతు కుటుంబాల జీవితాలు ముడిపడిఉన్నాయన్నారు. సహకార రంగంలో ఫ్యాక్టరీ బాగా నడిచిందని, ప్రభుత్వ జోక్యంతో పరిస్థితి దిగజారిందన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు 43 నెలల నుంచి జీతభత్యాలు లేవని, ఇప్పటికే 36మంది దినసరి కార్మికులు ఆకలితో మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 'ఈ సమస్యను సీఎం వద్దకు తీసుకువెళ్లి, వచ్చే సీజన్‌కల్లా కర్మాగారం ఆధునికీకరించి క్రషింగ్ జరిపేలా కృషిచేస్తా' అని పేర్కొన్నారు. అనంతరం ఫ్యాక్టరీ ప్రాంగణంలో రైతులతో కలిసి భోజనం చేశారు.

'ఉపాధి'కి భరోసా!

- 2 నెలల్లో రూ.1526.29 కోట్ల నిధుల వ్యయం
- జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో రాష్ట్రం

ఈనాడు, అమరావతి: కొత్త ఆర్థిక సంవత్సరం(2018-19)లో రెండు నెలల వ్యవధిలోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(నరేగా) అమలులో సత్ఫలితాలొస్తున్నాయి. ఐదు విభాగాల కింద కేంద్రం ఉపాధి హామీ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో విశ్లేషించినపుడు నాలుగింట ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. కూలీలు గత మూడేళ్ల కంటే అత్యధికంగా కనీస వేతనాలు అందుకుంటున్నారు. జాబ్‌కార్డుదారులలో ఎక్కువమంది పనులకు హాజరయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వేతన బడ్జెట్‌ను అధికంగా ఉపయోగించుకోగలుగుతున్నారు. 2/3 కింద రాష్ట్రానికి వచ్చే 'మెటీరియల్ కాంపోనెంట్' నిధులూ పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఏప్రిల్, మే మాసాలలో కూలీలకు 760 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలో రూ.1526.29 కోట్ల వేతన నిధులు ఖర్చు చేశారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 91.84 లక్షల పనిదినాలు, విజయనగరంలో 90.31 లక్షలు, శ్రీకాకుళంలో 87.16 లక్షలు, విశాఖ జిల్లాలో 72.44 లక్షల పనిదినాలను కల్పించారు. 'మెటీరియల్ కాంపోనెంట్' నిధుల్లో రూ.466.43 కోట్లు ఖర్చు చేశారు. మరోవైపు గత రెండు నెలల్లో ఉపాధి పనులకు హాజరైన కూలీలకు గరిష్ఠంగా రూ.200 కనీస వేతనం అందుతోంది. వంద రోజుల పనులపై ఒక్కో జాబ్‌కార్డుదారు రూ.20 వేలకుపైగా పొందగలిగే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో 70 లక్షలకుపైగా ఉన్న జాబ్‌కార్డుదారుల్లో రోజూ 26 లక్షల నుంచి 28 లక్షల మంది పనులకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపాధి పనుల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిన విభాగాలు..

విభాగం	ర్యాంకు
పనుల నిర్వహణలో	1
కూలీలకు పని దినాల కల్పనలో	1
జాబ్ కార్డులు పొందిన అన్ని కుటుంబాలకు పని కల్పించడంలో..	1
వ్యక్తిగత ఆస్తుల ఏర్పాటులో.. (ఉదా: ఇళ్లు, మరుగుదొడ్లు, రహదారుల వంటి నిర్మాణం)	1

కేశవరావ్ జాదవ్ కన్నుమూత

- తొలితరం తెలంగాణ ఉద్యమ నేతగా గుర్తింపు

కేశవరావ్ జాదవ్ (పాత చిత్రం)

హైదరాబాద్, న్యూస్‌టుడే: తొలితరం తెలంగాణ ఉద్యమ నేత, రామ్‌మనోహర్ లోహియా అనుచరుడు, ప్రముఖ సోషలిస్టు నాయకుడు ప్రొఫెసర్ కేశవరావ్ జాదవ్(85) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య ఇందిర, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన కొంతకాలంగా శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ విద్యానగర్‌లోని నివాసంలో అస్వస్థతకు గురవగా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం 11 గంటలకు చికిత్స పొందుతూ మరణించారు. హక్కుల పోరాటాలు, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా పనిచేశారు. కాల్పుల విరమణ కోసం ప్రభుత్వం, మావోయిస్టుల మధ్య చర్చలకు కృషి చేశారు. 2008లో కరీంనగర్ ఉప ఎన్నికలో కేసీఆర్‌పై పోటీ చేసి ఓడిపోయారు. కేశవరావ్ జాదవ్ హైదరాబాద్ పాతబస్తీ హుస్సేనీఆలంలో 1933 జనవరి 27న జన్మించారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమయంలో 'తెహజీబ్' అనే సంస్థను ఏర్పాటు చేశారు. 1947లో 'క్విట్ కాలేజీ' ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థిగా ఉంటూనే 'ముల్కి' ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. సాయుధ పోరాటం నాటి నుంచి తెలంగాణలో జరిగిన అనేక ఉద్యమాల్లో ముందు వరుసలో నిలిచారు. పౌర హక్కుల కార్యకర్తగా పలుసార్లు అరెస్టయి జైలు జీవితం గడిపారు. తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల ఆచార్యుడిగా సేవలు అందించారు. కేశవరావ్ జాదవ్ పార్థివ దేహానికి కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ, వరవరరావు, హరగోపాల్, గద్దర్ సహా వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం అంబర్‌పేట శ్మశాన వాటికలో కేశవరావ్ జాదవ్ చిన్న కుమార్తె నివేదిత తండ్రి చితికి నిప్పంటించి దహన సంస్కారాలు నిర్వహించారు.

అద్దెబస్సుల పెంపు యత్నాలు విరమించుకోవాలి

- 18న ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నా: ఈయూ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్‌ఆర్టీసీ)లో అద్దె బస్సులను 20 నుంచి 35 శాతానికి పెంచేందుకు జరుగుతున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.రావు, ప్రధాన కార్యదర్శి కె.పద్మాకర్, అదనపు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీలో సిబ్బందిని తగ్గించే చర్యల్లో భాగంగానే అద్దె బస్సుల శాతాన్ని పెంచేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఈ నెల 18వ తేదీన రాష్ట్రంలోని అన్ని డిపోల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మెయింట్‌నెన్సు ఉద్యోగులపై పనిభారాలు పెరిగేలా ఈ నెల 15న ఇచ్చిన ఆదేశాలను కూడా రద్దు చేయాలని డిమాండు చేశారు.

క్యూలైనులో బారులుతీరిన భక్తులు

తిరుమలలో అనూహ్యంగా పెరిగిన రద్దీ

వరుస సెలవులతో భారీగా తరలివచ్చిన భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. రంజాన్ పర్వదినం నేపథ్యంలో శనివారం, ఆదివారం సాధారణ సెలవు దినం కావడంతో భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో సప్తగిరులు పోటెత్తాయి. పాఠశాలలకు వేసవి సెలవులు ముగిశాక.. గత వారం రోజులుగా రద్దీ కాస్త తగ్గినట్లు కనిపించింది. తిరిగి శనివారం ఉదయం నుంచి యాత్రికులు క్రమంగా పెరుగుతూ.. రాత్రికల్లా తిరుమల వీధులు, క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. శ్రీవారి ధర్మదర్శనం యాత్రికుల క్యూలైను లేపాక్షి ఎంపోరియం వరకు.. 2 కిలోమీటర్ల పైగా చేరుకుంది. దివ్యదర్శనం, సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు పొందిన యాత్రికులతో నారాయణగిరి ఉద్యానవనం ఇసుకేస్తే రాలనంతగా కిటకిటలాడుతోంది. కల్యాణకట్టల వద్ద తలనీలాల సమర్పణకు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ధర్మదర్శనానికి 30 గంటల సమయం పడుతుంది. గదులు కేటాయింపు కార్యాలయాలు, లడ్డూ, అన్నప్రసాద వితరణశాలలు, ఉచిత వసతి కల్పించే యాత్రిసదన్లు కిక్కిరిసిపోతున్నాయి. చాలాచోట్ల యాత్రికుల తోపులాటలు కన్పించాయి. మరో రెండు రోజులపాటు రద్దీ ఇలాగే కొనసాగే అవకాశం ఉంది.

రెండు బ్రహ్మోత్సవాల పనులకు త్వరలో శ్రీకారం

కార్యాచరణపై 19న తిరుమలలో సమీక్ష

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక, నవరాత్రి బ్రహ్మోత్సవాల పనులకు త్వరలో తితిదే శ్రీకారం చుట్టనుంది. అధికమాసం నేపథ్యంలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలను నిర్వహించనుంది. వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 13 నుంచి 21 వరకు, నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 10 నుంచి 18 వరకు వైభవంగా జరగనున్నాయి. తొలి బ్రహ్మోత్సవాలకు సెప్టెంబరు 12న అంకురార్పణ జరుగుతుంది. గత అనుభవాలతో ఈసారి విస్తృత ఏర్పాట్లు చేయాలని తితిదే ఉన్నతాధికారులు సంకల్పించారు. ఈనెల 19న తిరుమల అన్నమయ్య భవనంలో వివిధ విభాగాధిపతులతో తిరుమల జేఈవో శ్రీనివాసరాజు సమావేశమై ఏర్పాట్లకు దిశానిర్దేశం చేయనున్నారు.

నేడు రెండు గంటల పాటు దర్శనానికి విరామం: తిరుమల శ్రీవారి ఆలయంలోని శ్రీభోగ శ్రీనివాసమూర్తికి ఆదివారం ప్రత్యేక సహస్ర కలశాభిషేకం జరగనున్నందున ఉదయం 6 నుంచి 8 గంటల వరకు దర్శనాన్ని నిలిపివేయనున్నారు. బంగారు వాకిలి చెంత ఈ క్రతువును నిర్వహించనున్నారు. ఆర్జిత సేవలన్నీ యథావిధిగా జరుగుతాయి.

డాక్టర్ కోర్సు
చైనా MBBS ADMISSIONS
₹.14 లక్షలలో 5 సం.MBBS
ఇంటర్నేషనల్ యూనివర్సిటి క్యాంపస్‌లో
Note : విదేశాలలో MBBS కి NEET తప్పనిసరి. www.mciindia.org
NEETలో క్వాలిఫై అవసరం లేదని చెప్పే కన్సల్టెన్సీ మాటలు విని మోసపోకండి
P.SITARAMAIAH, Rtd. Andhra Bank Manager © 94402 57535

MADE EASY
India's Best Institute for IES, GATE & PSUs*
ESE 2019
GATE 2019
Admission open in new batches
BATCHES COMMENCEMENT DATES
EC/IN 21st June'18 | ME/PI 21st June'18
CE 21st June'18 | EE 21st June'18
Hyderabad Centre : 5-1-744, Bank Street, Koti (Opp. Hotel Sitara Royal)
040-66774612, 040-24652324 www.madeeasy.in
*As per ASSOCHAM & Brands Academy

www.bfitdoon.com
BFIT GROUP OF INSTITUTIONS
DEHRADUN INDIA
BEST-IN-CLASS HIGHER EDUCATION WELL WITHIN YOUR REACH
SCHOOL OF POLYTECHNIC- SOP Diploma Engineering 10th PASS Fee/Annum
Civil • Mechanical • Electronics • Electrical • Computer Sc. ₹ 35,000
Lateral Entry in all Diploma Courses (10+2 PCM/ITI) ₹ 35,000
AFFILIATED TO UBTER & APPROVED BY AICTE, MINISTRY OF HRD, GOVT. OF INDIA
HNBGU CENTRAL GOVT. UNIVERSITY REGULAR DEGREE COURSES
(University Established since 1973, UGC Recognised, Ministry of HRD, NAAC 'A' Accredited University)

UG Courses	Fee/Annum	PG Courses	Fee/Annum
SCHOOL OF LIFE & ALLIED SCIENCES- SLAS			
B.Sc. (BioTech./Micro Bio)	₹ 40,000	M.Sc. (Micro Bio/Bio Tech)	₹ 55,000
B.Sc. (Geology)	₹ 40,000	M.Sc. (Geology)	₹ 49,500
B.Sc. (Eco/Statistics)	₹ 31,000	M.Sc. (Statistics)	₹ 39,500
B.Sc. (PCM/CBZ)	₹ 28,000	M.Sc. (Chem./Zoology)	₹ 45,000
B.Sc. (Home Sc.)	₹ 30,000	M.Sc. (Phys./Botany)	₹ 40,000
		M.Sc. (Bio Chemistry)	₹ 49,500
		M.Sc. (EVS/Math.)	₹ 35,000
SCHOOL OF AGRICULTURE SCIENCES- SAS			
B.Sc. (Agriculture)	₹ 59,500	M.Sc. (Agri./Agronomy)	₹ 59,500
B.Sc. (Forestry/Horticulture)	₹ 49,500	M.Sc. (Ag./Seed Sc.&Tech)	₹ 59,500
		M.Sc. (Horticulture/Forestry)	₹ 50,000
SCHOOL OF MANAGEMENT STUDIES- SMS			
BHM (Bachelor Hotel Mgmt.)	₹ 59,500	M.Com.	₹ 39,500
B.B.A.	₹ 45,000		
B.Com.	₹ 33,000		
B.Com (C.A.)	₹ 35,000		
SCHOOL OF TECHNOLOGY, INFORMATION & COMPUTER SCIENCE- STICS			
B.Sc. (IT)	₹ 31,000	M.Sc. (IT)	₹ 35,000
B.C.A.	₹ 33,000	MCA	₹ 65,000
SCHOOL OF ARTS & JOURNALISM- SAJ			
B.A. (Hons.) Mass Comm.	₹ 40,000	M.A. (Mass Comm.)	₹ 49,500
B.A. (Econ./English)	₹ 28,000	M.A. (Math.)	₹ 35,000
B.A. (Socio./Pol.Sc./Hindi)	₹ 28,000	M.A.(Geography)	₹ 35,000
		M.A.(Eco./Eng./Pol.Sc./Edu.)	₹ 35,000
SCHOOL OF FOOD TECHNOLOGY		BUSINESS SCHOOL	
B.Sc Food Technology	₹ 49,500	MBA (Including Foreign Tour)	₹ 97,500
M.Sc Food Technology	₹ 59,500	APPROVED BY AICTE, MINISTRY OF HRD GOVT. OF INDIA	

AFFILIATED TO UTTARAKHAND TECHNICAL UNIVERSITY- STATE GOVT. UNIVERSITY, GOVT. OF UTTARAKHAND
One Year Certified Course in Hotel Management : ₹ 30,000
Approved Institutions of AHLEI (U.S.A.)
Hostel Fee/Annum : ₹ 50,000 (Inclusive of food, Veg/Non-Veg)
HYDERABAD OFFICE Flat No. 201, 2nd Floor, Konark Tower, Above Konark Diagnostic Center, Dilsukhnagar, CALL- 7456000102
CAMPUS : BFIT GROUP OF INSTITUTION, DEHRADUN
Sudhowala, Chakrata Road, Dehradun Uttarakhand 248007
Phone : 9719460515, 9997777828, 7300900900, 7300900909, 7300900919, 7300900929
www.gncmh.com PHONE: 7302000156, 7302000157, 7302000158, 7302000159 KIPS JHAJRA DEHRADUN
APPROVED BY ALL INDIA COUNCIL FOR TECHNICAL EDUCATION, MINISTRY OF HRD, GOVT. OF INDIA
• D.PHARMA • B.PHARMA • B.PHARMA (Lateral Entry)

HINDUSTAN
INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
(DEEMED TO BE UNIVERSITY)
CHENNAI
Multi - Disciplinary Research & Innovation University
UG & PG ADMISSIONS

B.Tech. (4 Years)
Aeronautical Engineering
Aerospace Engineering
Automobile Engineering
Bio Technology
Chemical Engineering
Civil Engineering
Computer Science & Engineering
Electrical & Electronics Engineering
Electronics & Communication Engineering
Mechanical Engineering
Mechatronics Engineering
Information Technology
B.Des.
Interior Design
Fashion & Apparel Design
B.Arch.
Architecture
B.B.A.
Aviation
Travel & Tourism Management
B.Com. / B.C.A.
B.A. Economics
B.Sc.
Fashion Design
Food Technology
Visual Communication
MBA
Aviation Management
Media & Entertainment Management
Hospital & Healthcare Management
Logistics & Supply Chain Management
Hospitality Management
Defence Technology Management
Sports Management

M.Tech
M.Tech - Aero
Aeronautical Engineering
Avionics
Avionics (UAV)
M.Tech - Automobile
M.Tech - Mechanical
Computer Aided Design
Engineering Design
Refrigeration & Air - Conditioning
Thermal Engineering
M.Tech - Civil
Construction Engineering and Management
Environmental Engineering
Structural Engineering
M.Tech - CSE
Computer Science and Engineering
CSE (Internet / Data Science)
CSE with IBM
M.Tech - IT
Information Technology (Ethical Hacking)
M.Tech - EEE
Power Electronics and Drives
Robotics and Control
M.Arch / M.Plan / MCA
M.Sc. / M.A
Doctoral Programmes (Ph.D)
Full Time / Part Time (3Yrs)
M.Phil (Full Time / Part Time)

INTERNATIONAL RANKING
EXCELLENT PLACEMENTS
AVIATION | MANAGEMENT | ENGINEERING | APPLIED SCIENCES | ARCHITECTURE | HUMANITIES | FASHION DESIGN
www.hindustanuniv.ac.in | Toll Free: 1800 425 44 38
REGD. & ADMIN OFFICE: No 40. G.S.T Road, St. Thomas Mount, Chennai - 600 016, Tamilnadu
Ph: +9144 2234 2155 / 0968 / 1389 / 2508 Fax: +9144 2234 2170 Email: info@hindustanuniv.ac.in

KENT Mineral RO™ Water Purifiers
HOUSE of PURITY
2012 Best Domestic Water Purifier Award | Reader's Digest Trusted Brand Award 2012 | Admired Brand Asia 2014-2015 | Most Trusted Brand of Water Purifiers in India 2014-2015
అత్యంత ధృవీకరించబడి మరియు అవార్డులు పొందిన RO+UV ప్యూరిఫయర్లు
మీరు త్రాగే నీటిని చేసుకోండి
100% పరిశుద్ధం,
100% సురక్షితం, 100% రుచికరం
ఆపై పొందండి
4 సంవత్సరముల వరకు ఉచిత సర్వీసు*
ప్రపంచంలో అన్నిటికన్నా సర్వోత్తమమైన మరియు విశ్వసనీయమైన కెంట్ RO ప్యూరిఫయర్స్ ఇప్పుడు 4 ఏళ్లకు ఫ్రీ సర్వీస్ సహితంగా, ఇక మీరు పొందేది 100% పరిశుద్ధమైన నీరు మరియు మీరుంటారు మనశ్శాంతిగా. కెంట్ RO ప్యూరిఫయర్స్ బ్యాక్టీరియా మరియు వైరస్లేకాక, నీటిలో కరిగి ఉండే హానికారక అశుద్ధతలను కూడా తొలగించేస్తుంది. నీటిలో సహజమైన మినరల్స్ చెక్కుచెదరకుండా ఉంటాయి. నేడే ఇంటికి తెచ్చుకోండి కెంట్ RO ప్యూరిఫయర్ మరియు అన్నిటికన్నా పరిశుద్ధమైన దీని యొక్క నీటిని త్రాగండి, ఆపై వ్యాధుల నుంచి రక్షణ పొందండి.
4 YEARS FREE SERVICE* 1 Year Warranty + 3 Years No Service Charge
WORLD'S BEST QUALITY CERTIFICATES
NSF (USA) | WQA (USA)
RO + UV + TDS Controller
*T&C Apply.
శక్తిశాలి కెంట్ టెక్నాలజీ
• బెస్ట్ ప్యూరిఫికేషన్ RO+UV+UF+TDS కంట్రోలర్ ద్వారా నీటిని చేస్తుంది 100% పరిశుద్ధం.
• బెస్ట్ అవుట్‌పుట్ >20 లీ/1 గం.
• సర్వోత్తమమైన క్వాలిటీ సర్టిఫికెట్స్ NSF (USA) మరియు WQA (USA) నుండి.
• బెస్ట్ వాటర్ రికవరీ: 50% కన్నా అధికం.
మినరల్ RO™ టెక్నాలజీ RO + UV + UF +TDS Control
RO PURIFIERS WITH SAVE WATER TECHNOLOGY RO Recovery >50%
కెంట్ అందిస్తుంది అన్నిటికన్నా పరిశుద్ధమైన నీరు
LOK | SAATCHI & SAATCHI
సేల్స్ వివరాల కోసం కాల్ చేయండి 9582-123-456 | వెబ్‌సైట్: www.kent.co.in | సర్వీస్ కోసం కాల్ చేయండి 92-789-12345
•Vijayawada City / Krishna District: Smart Technologies;Sai Agencies •West Godavari(Tanuku): Sri Sai Harsha Agencies •Bhimavaram: Krystal Pure Water Technologies •Palakollu: Vasu Enterprises •Guntur: A R Enterprises •Prakasam: (Ongole) Sri Surya Marketing Agencies •Nellore: Raj Refrigerations; Maxima Retail India; Sri Vyjayanthi Agencies
BAJAJ ELECTRONICS | సోనోవిజన్ SONOVISION | Pai INTERNATIONAL | TIRUPATI ELECTRONICS
అన్ని ప్రధాన గృహోపకరణాల స్టోర్‌లలో లభిస్తుంది.

ఈనాడు

గాలి వార్తల దుమారం

పసిపిల్లలను 'కల్లాకపటం ఎరుగనివారు' అనడం పరిపాటి. కల్ల- అంటే మాటలో దాచిన అబద్ధం. కపటం- అంటే మనసులో దాక్కున్న అబద్ధం. మాటలోను, మనసులోను కల్మషం లేకపోవడమే కల్లాకపటం తెలియకపోవడమంటే! ఇది నిజానికి చాలా గొప్ప స్థితి. 'మనసులో, మాటలో మర్మమెరుంగని పసికూనలదె చూడ భాగ్యమనిన!' అని పెద్దలు అసూయపడే స్థితి వారిది. లోకంలో సత్యానికి గల గౌరవం అనంతమైనది. ఆ విషయాన్ని నన్నయభట్టు 'నుతజల పూరితంబులగు నూతులు నూరిటికంటె ఒక బావి మేలు... బావులు నూరిటికంటె ఒక్క సత్క్రతువు(యజ్ఞం) మేలు... క్రతుశతంబు కంటె (నూరు యాగాలకన్నా) సుతుండు మేలు... సుత శతకంబు కంటె ఒక సూనృత వాక్యము మేలు' అని శకుంతల నోట పలికించాడు. యాగాలన్నింటిలో అశ్వమేధం అత్యున్నతం అంటారు. అలాంటి వేయి అశ్వమేధాలు ఒకవైపు, సత్యాన్ని మరోవైపు ఉంచి తూచితే త్రాసు సత్యంవైపు మొగ్గు చూపిస్తుందని భారతంలోని ఆదిపర్వం స్పష్టీకరించింది. సత్యమైన స్థితిలోంచి జారిపోతే ఏం జరుగుతుందో శకుంతలా పరిణయంలో పినవీరభద్రుడు చెప్పాడు. 'సిరులు తొలంగు, శోభనము(గ్రహయోగం) చేరగరాదు, యశంబు గౌరవ స్ఫురణం అణంగు... సత్యము లేని పట్టులన్' అన్నాడు. 'చిరభక్తి తీర్థముల్ సేవించు పుణ్యంబు సత్యవాక్యమునకు సాటిరాదు' అన్నది కవుల తీర్మానం. 'మనుజుడగువాడు సత్యము మరువరాదు' అన్నది పెద్దల హితబోధ. నిజం అనే మాటకు యథార్థం అని అర్థం. 'నిజంగానే నిఖిల లోకం నిండు హర్షం వహిస్తుందా! మానవాళికి నిజంగానే మంచికాలం రహిస్తుందా!' అని మహాకవి శ్రీశ్రీ ఆశాభావం వ్యక్తం చేశారు. తాను కలలుగనే సామ్యవాదం ఈ లోకంలో నిజంగా ఆవిర్భవిస్తుందా, తన కల యథార్థం అవుతుందా అన్నది ఆయన సందేహం. సత్యం పట్ల ప్రతి మనిషికీ ఆసక్తో, భక్తో లేదా భయమో సర్వసహజం.

'సత్యం పట్ల జాగరూకుడవై ఉండు... సత్యాన్న ప్రమదితవ్యమ్' అని వేదం సూచించింది. వేదమంత్రాలను పూజా కుసుమాలుగా సమర్పించే 'మంత్రపుష్పం'లో సత్యాన్ని చేర్చి దైవస్వరూపాల్లో ఒకటిగా చేసింది. 'సత్యమే తపమును, యజ్ఞము, సత్యమే వేదంబు' కాబట్టి సత్యంనుంచి దూరమైతే 'నిత్యానుష్ఠానములను నిష్ఫలములగున్' అని శాంతిపర్వం తేల్చి చెప్పింది. సత్యవాక్పరిపాలనను నియమంగా పాటించిన హరిశ్చంద్ర చక్రవర్తిని షోడశ చక్రవర్తుల్లో ఒకడిగా లోకం సంభావించింది. సత్యం కారణంగా ఆయనను దేవతలు సైతం గౌరవించేవారని మల్లనకవి రుక్మాంగద చరిత్రలో వర్ణించాడు. 'మున్ హరిశ్చంద్ర భూపాల గ్రామణి ఎల్ల లోకములకున్ ప్రఖ్యాతిగా సత్యమున్ పాలింపడె! నిలింప వర్గము(దేవతా సమూహం) నుతింపన్' అన్నాడు. సూర్యుడి కారణంగా లోకం చీకట్లనుంచి తరిస్తోంది కాబట్టి సూర్యుణ్ని 'తరణి' అంటారు. అలాంటి సూర్యభగవానుడే సత్యమందు ప్రకాశిస్తున్నాడు... ఈ భూమికి సైతం సత్యమే ఆధారం... 'సత్యమున ఉన్నదీ ధర! సత్యమున వెలుంగు తరణి సత్యముననె తా నిత్యమై' అని మార్కండేయ పురాణంలో మారనకవి సత్యం ప్రాశస్త్యాన్ని గొప్పగా ప్రకటించాడు. 'కూపంబుల్, తగు తోటలుం, చెరువులుం, గుళ్లున్ ధరన్నిల్పగా... దిగుడుబావులు నెలకొల్పడం, తోటలు పెంచి ప్రజలకు మేలు చేయడం, చెరువులు తవ్వించడం, గుళ్లగోపురాలు నిర్మించడం మూలంగా... ఏ పుణ్యంబు ఒనగూరు మర్త్యులకు... ఎంతటి పుణ్యం లభిస్తుందో... సత్యభాషా పారీణులకున్... సత్య వాక్పరిపాలకులు సైతం అంతటి సుకృతులవుతారు' అని హరిశ్చంద్రోపాఖ్యానంలో గౌరన వెల్లడిం చాడు. సత్యం మనిషిని నమ్మకస్తుణ్ని చేస్తుంది. అలా నమ్మాడు కాబట్టే ద్రోణాచార్యుడు ధర్మజుడు ఆడిన 'అశ్వత్థామ హతః' అన్న అర్ధసత్యపు పలుకును వినగానే ప్రాణాలనే వదిలేశాడు. సత్యవ్రతులకు లోకం ఎంతటి విలువను ఆపాదిస్తుందో ఈ ఉదంతం నిరూపించింది.

అబద్ధాలు మరిగినవాడు ఎదుటి వారందరినీ అబద్ధాలకోరులనే అనుకుంటాడు అన్నాడు వేమన. 'తన మది కపటము కలిగిన తనవలెనే కపటముండు తగ జీవులకున్, తన మది కపటము విడిచిన తనకెవ్వరు కపటి లేడు ధరలో వేమా!' అంటూ ఎత్తిపొడిచాడు. సత్యవంతుడే జ్ఞానవంతుడు సుమా! సత్యజ్ఞానాలు రెండూ తోబుట్టువులు... 'సత్యమమరియుండ జ్ఞానము అమరియుండు, జ్ఞానమమరియుండ సత్యముండు' అనీ ఎలుగెత్తి చాటాడు. 'దొంగమాటలాడ దొరకదు మోక్షంబు' అని వేమన యోగి చేసిన హెచ్చరికను లోకం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు- అంటున్నారు మసాచుసెట్స్ సాంకేతిక విశ్వవిద్యాలయ పరిశోధకులు. సామాజిక మాధ్యమాల్లో వివిధ బృందాల మధ్య పంపిణీ అవుతున్న సమాచారాలను విశ్లేషించి, వారు తేల్చి చెప్పిందేమిటంటే- గాలి వార్తలు, అబద్ధాలు సత్యంకన్నా వేగంగాను అధికంగాను ప్రయాణిస్తున్నాయట. వాటినే ప్రజలు ఎక్కువగా నమ్ముతున్నారట. తన శిష్యుడి గురించి ఫిర్యాదు చేయబోయిన వ్యక్తిని వారిస్తూ 'నీవు విన్న సంగతి నిజమేనని నీకు రూఢి అయిందా?' అని సోక్రటీస్ ప్రశ్నించాడు. అలా తన చెవినపడ్డ వార్తలో నిజం ఉందో లేదో తేల్చుకోకుండానే మరో చెవిలో ఊదేయడం మానవ నైజం. 'బలిమి నిజములేని పలుకులేల' అని కవులు ప్రశ్నించేది దాన్నే! అయినా మనిషికి చాడీల బుద్ధి పోవడమే లేదు. తనకు దమ్మిడీ ఉపయోగం లేకున్నా అబద్ధాలను విరివిగాను, ఉచితంగాను ప్రచారం చేయడం మనిషికి అలవాటైపోయిందని సామాజిక వేత్తలు ఆందోళన చెందుతున్నారు. 'కలి లక్షణములందు కపటమొకటి' అని మన పెద్దలు ఊరికే అన్నారా!

ప్రథమ పౌరులకు పగ్గాలా?

ఎస్.అనంత్

రాష్ట్రాలకు ప్రథమ పౌరులుగా రాజ్యాంగబద్ధ బాధ్యతలు నిర్వహిస్తున్న గవర్నర్లపై కొంతకాలంగా రాజకీయ ఆరోపణలు ముసురుకుంటున్నాయి. కేంద్రంలో, రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ల వ్యవస్థను స్వార్థ రాజకీయ అవసరాలకు దుర్వినియోగం చేసే ప్రయత్నాలు జోరుగా జరిగాయి. రాజ్యాంగబద్ధ పదవులను దురుపయోగించడం ప్రజాస్వామ్య భారతావని మనుగడకు ప్రమాదకరం. రాజకీయ వ్యవస్థలో ప్రతి దానికీ చట్టబద్ధమైన మార్గాలు అందుబాటులో ఉండకపోవచ్చు... కొన్నిసార్లు సంప్రదాయాలను అనుసరించి అడుగు ముందుకు వెయ్యాల్సి ఉంటుంది. రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకొనే గవర్నర్ల నియామకాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో- గడచిన రెండేళ్లుగా దేశంలో సంప్రదాయాలను తోసిరాజంటూ కొందరు గవర్నర్లు తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. రాజ్యాంగబద్ధ పదవి ఔన్నత్యానికి మచ్చ తీసుకొస్తున్నాయి. కర్ణాటక శాసనసభ ఎన్నికల తరవాత ఆ రాష్ట్ర గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు భాజపా నాయకుడు యెడ్యూరప్పను ఆహ్వానిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రశ్నార్థకమైంది. ఏడాది క్రితం గోవా అసెంబ్లీ ఎన్నికల తరవాత అక్కడి గవర్నర్ నెలకొల్పిన సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ కర్ణాటక ప్రథమ పౌరుడు వెలువరించిన నిర్ణయం వివాదాల తుట్టెను రేపింది. సర్కారియా కమిషన్ చాలా స్పష్టంగా గవర్నర్ పాత్రను వివరించింది. పూంఛీ కమిషన్ నివేదిక సైతం ప్రథమ పౌరుడి బాధ్యతలపై కొంత మేర దిశానిర్దేశం చేసింది. మొదటి (1966), రెండో (2005) పాలన సంస్కరణల కమిషన్లు, జాతీయ రాజ్యాంగ సమీక్ష సంఘం (2002) సైతం గవర్నర్లు నిర్వహించాల్సిన పాత్ర, వారి పరిమితుల మీద చర్చించాయి. విపక్షంలో ఉన్నప్పుడు తరచూ ఈ నివేదికలను ప్రస్తావించి ప్రభుత్వానికి నీతులు చెప్పే పార్టీలు- అధికారంలోకి వచ్చాక ఆ ఊసే మరచిపోతుండటం దురదృష్టకరం. నేడు 'నీతి ఆయోగ్' పాలన మండలి సమావేశం జరగనుంది. కేంద్ర రాష్ట్ర సంబంధాలపై విస్తృత చర్చోపచర్చలకు ఆస్కారమున్న ఈ సమావేశంలో గవర్నర్ల పాత్ర పైనా సమాలోచన జరిగితే మేలు!

విధి విధానాలపై భిన్నాభిప్రాయాలు

గవర్నర్ల అధికారాలను 153, 163, 175, 176, 200, 201 రాజ్యాంగ అధికరణల్లో స్పష్టంగా వివరించారు. రాజ్యాంగబద్ధ అధికారాలతోపాటు రాష్ట్రాల్లోని వివిధ విశ్వవిద్యాలయాలకు కులపతులుగా సైతం వారు 'ఎక్స్ అఫీషియో' హోదాల్లో కొనసాగుతారు. రాష్ట్రాల్లో శాంతి భద్రతలు గతి తప్పి, పాలన స్తంభించినప్పుడు 356 అధికరణ ప్రకారం రాష్ట్రపతి పాలనను విధించే అధికారం గవర్నర్లకు దఖలుపడింది. స్వాతంత్ర్యానంతరం ఇప్పటివరకూ దేశంలో 124 సార్లు వివిధ రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించారు. అత్యధికంగా ఈశాన్య రాష్ట్రాల్లో ఇప్పటివరకూ 30 సార్లు, పంజాబ్‌లో తొమ్మిది, జమ్ము కశ్మీర్‌లో ఆరు పర్యాయాలు రాష్ట్రపతి పాలన విధించారు. రాష్ట్రపతి పాలన విధించిన ప్రతి సందర్భంలోనూ గవర్నర్ల పాత్ర వివాదాస్పదమవుతూనే ఉంది. గవర్నర్ల పాత్ర, వారు నిర్వహించాల్సిన విధివిధానాలపై స్వాతంత్ర్యానికి ముందు నుంచీ భిన్నాభిప్రాయాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే స్పష్టమైన తీర్పులు వెలువరించింది. గవర్నరుకు కనీస వయోపరిమితిని రాజ్యాంగం నిర్దేశించింది. ఆ పదవిలో నియమితులయ్యేవారు తమ రంగంలో 'ప్రముఖులు' అయి ఉండాలనీ చెబుతోంది. 'ప్రముఖులు' అన్న మాటకు స్పష్టమైన నిర్వచనం లేదు. కాబట్టి కేంద్రంలో ఉన్న ప్రభుత్వం తన అవసరాలకు అనుగుణంగా ఆ పదాన్ని అన్వయించుకొంటోంది. పార్టీలో కీలకంగా వ్యవహరించిన వారికి రాజకీయ 'పునరావాసం'గా గవర్నర్‌గిరీని కట్టబెడుతున్నాయి. ఈ పద్ధతిలో రాష్ట్రాల్లో ప్రథమ పౌరులుగా అధికారం నెరపుతున్న గవర్నర్ల వల్లే సమస్యలు పోటెత్తుతున్నాయి. నిజానికి వీరు ఏ రంగంలోనూ 'ప్రముఖులు' కారు. అసలు వారి నియామక ప్రక్రియే లోపభూయిష్ఠంగా ఉంది. రాజకీయంగా పార్టీలకు సేవ చేసి 'విశ్రాంతి' తీసుకుంటున్న వారికి పునరావాసంగా ఈ పదవులను అప్పగించే సంస్కృతికి తెరపడాలి. ఒకప్పుడు రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించే విషయంలో గవర్నర్ల వ్యవహార సరళిపై ఎక్కువగా విమర్శలు వినిపించేవి. సంకీర్ణయుగంలో పరిస్థితులు మారిపోయాయి. ఎన్నికల ఫలితాల తరవాత ప్రభుత్వ ఏర్పాటుకు ఏ పార్టీని ఆహ్వానించాలన్న విషయంలో కొంతకాలంగా ప్రథమ పౌరుల విచక్షణాధికారాలు వివాదాస్పదమవుతున్నాయి.



గవర్నర్ల అధికారాల్లో కోతపెట్టాల్సిందే

ఇటీవలి కాలంలో గవర్నర్లు అవసరమా అన్న అంశం చుట్టూ చర్చలు జరుగుతున్నాయి. ఈ ప్రశ్నకు జవాబును అన్వేషించడం అంత తేలిక కాదు. గవర్నరు పదవి చుట్టూ ఎన్ని వివాదాలు అలముకున్నా రాష్ట్రాల్లో పాలనను రాజ్యాంగబద్ధంగా నడిపించడంలో ఆయన నిర్వహించే పాత్ర కీలకమైనదనడంలో మరో మాట లేదు. వివిధ అంశాల్లో నిష్ణాతులుగా ముఖ్యమంత్రులకు గవర్నర్ల దిశానిర్దేశం ఎప్పుడూ అవసరమే. జాతి భద్రత, ఇతర రాజ్యాంగపరమైన అంశాల్లో ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి స్వతంత్రంగా, విశ్వసనీయమైన నివేదికలు అందజేస్తూ సమాఖ్య స్ఫూర్తికి పట్టం కట్టడంలో గవర్నర్లు నిర్వహించాల్సిన బాధ్యతలు ఎంతో ముఖ్యమైనవి. కొన్ని ప్రాంతీయ, ఉప ప్రాంతీయ శక్తులు జాతి ఐక్యతకు తూట్లు పొడిచేందుకు ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితుల్లో- కేంద్రం, రాష్ట్రాల మధ్య సమైక్యతా సారథిగా ప్రథమ పౌరుల పాత్ర అత్యంత కీలకమైనది. దేశంనుంచి వేర్పాటును కోరుకునే పార్టీలు ఎన్నికల్లో గెలిచి జాతి సమగ్రతకు తూట్లు పొడిచే పరిస్థితి తలెత్తకూడదన్నదే జాతీయవాదులందరి ఆకాంక్ష. రాజ్యాంగ సభలో ఈ విషయమై విస్తృత చర్చ జరిగింది. 1935 భారత ప్రభుత్వ చట్టంపై భిన్నాభిప్రాయాలు తలెత్తిన నేపథ్యంలో రాజ్యాంగ సభ గవర్నర్ల పాత్రను సవిస్తారంగా చర్చించింది. 1935 చట్టం ప్రకారం దేశవ్యాప్తంగా ఎన్నికైన ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు అప్పట్లో గవర్నర్ల జోక్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఆ పరిస్థితుల్లో రాష్ట్రానికి సంబంధించని వ్యక్తిని, మంత్రివర్గ సలహా తీసుకొని బాధ్యతలు నిర్వహించే వ్యక్తిని గవర్నరుగా నియమిస్తే బాగుంటుందన్న ప్రతిపాదన వెలుగులోకి వచ్చింది. ఈ కారణాలవల్లే ప్రతి రాష్ట్రంలోనూ నిబంధనల పరంగా గవర్నరు పేరు మీదే పాలన సాగుతుందని, వాస్తవ అధికారం మాత్రం ముఖ్యమంత్రి సారథ్యంలోని రాష్ట్ర మంత్రిమండలి చేతిలో ఉంటుందని రాజ్యాంగం పేర్కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ అంశాల్లో సలహా ఇచ్చి, వాటిని ముందుకు నడిపించాల్సిన వ్యక్తిగానే రాజ్యాంగంలోని వివిధ అధికరణలు గవర్నరును సంభావిస్తున్నాయిగానీ- నియంతలా మారి ప్రభుత్వాలపై పెత్తనం చేసే అధికారాన్ని ఆయనకు ఇవ్వలేదు. వారు ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసి, సూచనలు సలహాలు అందిస్తూ నడిపించేవారే గానీ... నడవాల్సింది మాత్రం ముఖ్యమంత్రి సారథ్యంలోని మంత్రి మండలే. దురదృష్టవశాత్తు కొందరు గవర్నర్లు రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతల్లోని స్ఫూర్తిని అర్థం చేసుకోవడం లేదు. అందువల్లే కొంతకాలంగా వివాదాలు ముసురుకుంటున్నాయి.

ఎవరి హయాములో ఎన్నిసార్లు...

ప్రధాని	పదవీకాలం	రాష్ట్రపతి పాలన విధింపు
జవహర్‌లాల్ నెహ్రూ	1947 ఆగస్టు - 1964 మే	8
లాల్‌బహదూర్ శాస్త్రి	జూన్ 1964 - జనవరి 1966	1
ఇందిరాగాంధీ	జనవరి 1966 - మార్చి 1977	35
మొరార్జీ దేశాయ్	మార్చి 1977 - జూన్ 1979	16
చరణ్ సింగ్	జులై 1979 - జనవరి 1980	4
ఇందిరాగాంధీ	జనవరి 1980 - అక్టోబరు 1984	15
రాజీవ్ గాంధీ	అక్టోబరు 1984 - డిసెంబరు 1989	6
వీపీ సింగ్	డిసెంబరు 1989 - నవంబరు 1990	2
చంద్రశేఖర్	నవంబరు 1990 - జూన్ 1991	5
పీవీ నరసింహారావు	జూన్ 1991 - మే 1996	11
దేవెగౌడ	జూన్ 1996 - ఏప్రిల్ 1997	1
వాజ్‌పేయి	మార్చి 1999 - మే 2004	5
మన్మోహన్ సింగ్	మే 2004 - మే 2014	12
నరేంద్ర మోదీ	మే 2014 - నుంచి ఇప్పటివరకు	3

సహేతుక వైఖరితో సమస్యలు దూరం

ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించే విషయంలో, రాష్ట్ర శాసనసభ నుంచి వచ్చిన బిల్లులను ఆమోదించకుండా కొంతకాలం తనదగ్గర అట్టిపెట్టుకునే లేదా వాటిని రాష్ట్రపతి ఆమోదానికి పంపే విషయాల్లో మాత్రమే గవర్నర్లకు విచక్షణాధికారాలు దఖలుపడ్డాయి. ఈ అధికారాలను నిర్వచించే విషయంలోనే కొంతకాలంగా వివాదాలు చెలరేగుతున్నాయి. సాధారణ పరిస్థితుల్లో రాష్ట్రపతికి 15 రోజులకు ఒకమారు గవర్నరు నివేదికలు పంపేటప్పుడు ముఖ్యమంత్రిని పూర్తిగా విశ్వాసంలోకి తీసుకోవాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రథమ పౌరులు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని సర్కారియా కమిషన్ స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. 163వ అధికరణ ప్రకారం కేంద్రానికి నివేదికలు సమర్పించే విషయంలో గవర్నరు విచక్షణాధికారాలకు పరిమితి ఉండాలని, అప్పుడే వివాదాలు తలెత్తవని పూంఛీ కమిషన్ తేల్చిచెప్పింది. మరోవంక గవర్నరు అధికారాలపై సమీక్షకు ఏర్పాటైన కమిటీలన్నీ అసెంబ్లీ ఆమోదించే బిల్లులను తొక్కిపెట్టేందుకు 200, 201 అధికరణల ప్రకారం దఖలుపడిన విచక్షణాధికారాలపై పెదవి విరిచాయి. గవర్నరు ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధి కాదు కాబట్టి- ఆ స్థాయి విచక్షణాధికారాలను వారికి కట్టబెట్టడం సహేతుకం కాదన్నది ఆయా కమిటీల అభిప్రాయం. ప్రజలచేత నేరుగా ఎన్నికైన ప్రతినిధుల నిర్ణయాలకు కేంద్రం చేత నియమితులైన వ్యక్తి మోకాలడ్డటమంటే అది ప్రజాస్వామ్య మూల సూత్రాలకు వ్యతిరేకంగా వ్యవహరించడమే అని ఆయా కమిటీలు అభిప్రాయపడ్డాయి. అత్యంత అరుదైన సందర్భాల్లో, అనివార్య పరిస్థితుల్లో తప్ప సాధారణ పరిస్థితుల్లో గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వ బిల్లులకు ఆమోదం తెలపాలని సర్కారియా కమిషన్ సూచించింది. బిల్లులను తొక్కిపట్టడానికి సంబంధించి దఖలుపడిన విచక్షణాధికారాలకు కొంతమేర కోతపెట్టాల్సిందే. తమకు పదవులు అప్పగించిన రాజకీయ పార్టీలకు మేలు చేయాలన్న కుట్రపూరిత మనస్తత్వంతో రాష్ట్రాల్లో పాలనకు మోకాలడ్డి, రాజ్యాంగ స్ఫూర్తిని కదలబార్చే ప్రథమ పౌరుల ధోరణికి ముకుతాడు వేయాల్సిందేనడంలో మరో మాట లేదు. రాష్ట్రాల ఉభయ సభల సంయుక్త సమావేశంలో మంత్రిమండలి రూపొందించిన ప్రసంగ ప్రతిని చదివేందుకు నిరాకరించిన గవర్నర్ల ఉదంతాలను గతంలో చూశాం. సర్కారియా కమిషన్ మార్గదర్శక సూత్రాలను గవర్నర్లు అక్షరాల అనుసరించి ఉంటే ఇన్ని వివాదాలు తలెత్తేవి కావు. సర్కారు ఏర్పాటుకు అతి పెద్ద పార్టీ లేదా కూటమి నాయకుడిని ఆహ్వానించాలి. ఎన్నికలకు ముందు, లేదా అనంతరం ఏర్పడిన కూటమి నాయకుడిని ఆహ్వానించవచ్చు. పార్టీల భాగస్వామ్యాన్ని (పార్టీలన్నీ ప్రభుత్వంలో భాగస్వాములుగా మారితే), ఒకవేళ ఏదైనా పార్టీకి బయటినుంచి మద్దతు ఇచ్చేందుకు పార్టీల కూటమి సిద్ధపడితే పరిస్థితులను అనుసరించి ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నరు ప్రయత్నించవచ్చు. సంప్రదాయాలను తొక్కిపట్టి ఇష్టానుసారం నిర్ణయాలు వెలువరించినప్పుడే సమస్యకు సంక్లిష్ట ముడులు పడుతున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడుతూ గవర్నర్లు సహేతుకంగా వ్యవహరించాల్సిన అవసరంపై నేటి 'నీతి ఆయోగ్' పాలన మండలి సమావేశంలో ఏ మేరకు వెలుగు ప్రసరిస్తుందో చూడాలి!

నిరసన స్వామ్యం

'అలజడి మా జీవితం ఆందోళన మా ఊపిరి' అంటూ మహాకవి శ్రీశ్రీ కార్మికుల స్వగతంగా చెప్పిన మాటలు రాజకీయ కార్మికులకు ఎక్కువగా వర్తిస్తున్నాయి. రాజకీయ పాఠశాలల్లో సైతం 'అ' అంటే అలజడి 'ఆ' అంటే ఆరోపణ అంటూ చెవినిల్లు కట్టుకుని పోరి చెప్పాల్సిన పరిస్థితులు వచ్చేశాయి. 'ఆప్'సోపాలు మొదలయ్యాక ఇందుకు దిల్లీ 'కేంద్ర'బిందువైంది. 'రాష్ట్రబిందువూ' అయింది.

'ఇండియాకు రాజధాని డిల్లీ

నా హృదయంలో ప్రేమరాణి లిల్లీ' అంటూ అప్పుడెప్పుడో 'ఆప్' పుట్టక ముందు ఆరుద్ర కవి అన్నాడు. కానీ ఇప్పుడైతేనా-

'నిరసనలకు రాజధాని దిల్లీ

ప్రతిధ్వనులు వినిపించును గల్లీ గల్లీ' అని చెప్పేవాడు. ఆమూలాగ్రం పరిశీలిస్తే ఇందుకు మూలకారకులు ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్. ప్రతిపక్షాలు మాత్రమే ఆందోళనలు చేస్తాయనే రాజకీయ మూఢనమ్మకాన్ని అరవింద్ కేజ్రీవాల్ పటాపంచలు చేశారు. కేజ్రీవాల్ గెలిచినా, ఓడినా ఆందోళనలేనా, ధర్నాలేనా అన్నమాట వినిపిస్తోంది. ఆయన రాజ్యంలో

'ముందు ధర్నా

వెనక ధర్నా

కుడి ఎడమల

ధర్నా ధర్నా' అయిపోయింది. అరవిందుడు 'ధర్నాయకుడు' అయిపోయాడు. ఇప్పుడు దిల్లీ తనచుట్టూ తాను తిరగడం మానుకుని నిరసనల చుట్టూ తిరుగుతోంది. ఏ రాష్ట్రంలో సమస్య వచ్చినా పరిష్కారం కోసం 'అయినను పోయి రావలె హస్తినకున్' అని దేశ రాజధానికి బయల్దేరతారు. ఇప్పుడెవ్వరైనా అలా దిల్లీకి వెళ్లాలన్నా ఏ 'ఆందోళన'లో చిక్కుకుంటామోనని భయపడుతున్నారు.

నిరసన తెలపడం ప్రజాస్వామ్యానికి ఆయువు, ప్రాణవాయువు. నిరసనకు చోటులేనిదే ప్రజాస్వామ్యం లేదు. నిరసన తెలియజెప్పడం అంటే ఏదో ఒక భిన్నస్వరాన్ని వినిపించడమే. నిరసన స్వరం ఎప్పుడు వినిపిస్తారు? ఎక్కడోచోట తప్పు జరిగితేనేగా. ఆ తప్పే లేకపోతే ప్రజాస్వామ్యం మూలాలే దెబ్బతింటాయి. అందువల్ల 'ఏదో ఒక (మరీ ఒక్కటనేకాదు, ఎన్ని అయినా) తప్పు జరగకపోతే ప్రజాస్వామ్యానికి 'అర్థం' ఉండదు.' అందువల్ల ప్రజాస్వామ్యం బతకడం కోసం తప్పులు జరగాలి. నిరసనలకు ప్రేరేపించాలి' అనే రాజకీయ గిరీశాలూ రోడ్ల మీద దుమ్ము దులుపుతున్నారు. వారికి రోజుకు 24 గంటలూ చాలడం లేదు.

ఆప్ పెద్దల కళ్లముందే దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మీద నాలుగు నెలల క్రితం దాడి జరగడంతో ఐఏఎస్ అధికారులకు మండింది. అంతే, 'దిల్లీ ప్రభుత్వ ఐఏఎస్ అధికారులారా! ఏకంకండి... పోరాడితే పోయేవి ఒంటి మీద దెబ్బలే' అని ఎవరూ పిలుపు ఇవ్వకపోయినప్పటికీ, పరిపాలన మీద 'సమ్మె'టదెబ్బ గట్టిగా పడింది. వాళ్ల ఆందోళనను సద్దుమణిగేట్లు చేయడానికి ఆప్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దెబ్బతిన్న ఐఏఎస్‌లు జబ్బ చరుస్తూనే ఉన్నారు. వాళ్ల వరస చూశాక 'నీవు నేర్పిన విద్యయే కేజ్రీవాలూ' అని ఐఏఎస్‌లు అంటున్నట్లు దిల్లీ ముఖ్యమంత్రికి అనిపిస్తుంటుంది.

ఆప్ మీద అధికారుల కోపం జనానికి శాపమైంది. ప్రత్యేకించి వాయుకాలుష్యంతో ముక్కులు పనిచేయని దిల్లీలో ఎక్కడి కంపు అక్కడే, కాదు కాదు ఎక్కడెక్కడికో తెగ విస్తరిస్తోంది. ఎంత కేజ్రీవాల్ అయినా సొంత ప్రభుత్వం కంపునైనా ఎంతకాలం భరించగలరు? దీన్ని ఎదుర్కోవడం కోసం తన సహజసిద్ధమైన మార్గంలో వీరంగంలోకి దిగారు. కేంద్రప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్



ద్వారా తమ మీద పెత్తనం చేస్తున్నదన్నది ఆయన ఆరోపణ. 'అనితర సాధ్యం నా మార్గం' అనిపించుకోవాలని ఆరాటపడే కేజ్రీవాల్, నిరసన చేపడితే 'నేనే ముఖ్యమంత్రి... నేనే ప్రతిపక్ష నాయకుణ్ని' అన్నట్లు ఉంటారు. 'ప్రజలకు ముఖ్యమంత్రిని, లెఫ్టినెంట్ గవర్నర్‌కు ప్రతిపక్ష నాయకుణ్ని' అని భావించుకుంటారు. చలో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్.జి) కార్యాలయం అనుకుంటూ కేజ్రీవాల్ తన నివాస గృహం నుంచి వేలమందితో ర్యాలీ నిర్వహించారు. ఎల్.జి. కార్యాలయంలో రోజులకొద్దీ బైఠాయించారు. దీనికితోడు కొంతమంది ఆమరణ నిరశన దీక్షలూ ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధులు తెల్లవారిని తరిమికొట్టడానికి 'క్విట్ ఇండియా' ఉద్యమం చేపట్టినట్లు, లెఫ్టినెంట్ గవర్నర్‌ను తరిమికొట్టడానికి 'ఎల్.జి. క్విట్ దిల్లీ' (లెఫ్టినెంట్ గవర్నర్, దిల్లీని వదిలేయండి) అంటూ సంచలన నినాదాలు చేశారు. తన కార్యాలయంలో ఈ గొడవ జరిగినప్పుడు ముందుజాగ్రత్తగా లెఫ్టినెంట్ గవర్నర్ అక్కడలేరు. ఈ వ్యవహారం మొత్తం వానకాలంలో ప్రజల మీద పిడుగులపర్వం లాగుంది! అటువైపు ఐఏఎస్ అధికారులు, ఇటువైపు అధికారపక్షం పోటాపోటీగా ఆందోళనలు నిర్వహిస్తుంటే- కేంద్రంలో అధికార పక్షమైన భాజపా పక్షీయులు చేతులు కట్టుకు, మూతులు కట్టుకు కూర్చుంటే ఏం బాగుంటుంది, రాజకీయం ఎలా పరిపూర్ణమవుతుంది?

అందుకేనేమో- 'మేము సైతం' అనేశారు. భాజపా శాసన సభ్యులు ఆప్ అసమ్మతి శాసన సభ్యుడు మంజీందర్ సింగ్‌ను వెంటపెట్టుకుని మరీ, సీఎం కార్యాలయం దగ్గరకు వెళ్లారు. పరిపాలన స్తంభించిపోయిందంటూ ధర్నా చేపట్టారు.

ఈ ఆందోళన కార్యక్రమాల్లోనూ నమ్మశక్యంగాని మెరుపులు ఉన్నాయి. దిల్లీకి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి ప్రసాదిస్తే వచ్చే ఎన్నికల్లో భాజపాకు అనుకూలంగా ప్రచారం చేస్తానని కేజ్రీవాల్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. 'తాము విన్నది నిజమేనా?' అని నిర్ధరించుకోవడానికి ఎంతోమంది భాజపేయులు తమను తాము గిచ్చి చూసుకున్నారు. కేజ్రీవాల్‌ది గిచ్చిపుచ్చుకొనే ధోరణే తప్ప ఇచ్చిపుచ్చుకొనే ధోరణి కాదు కదా అని అనుమానపడ్డారు. 'కేజ్రీవాల్ ఇలా ఎలా చేస్తారా?' అని అనుమానించడానికీ వీల్లేదు. ఆయనకు కొన్ని పట్టువిడుపులు, గుట్టువిడుపులు ఉన్నాయి. ఎన్నికల వేళ భయంకరమైన ఆరోపణలు చేసి, బాధితులు కోర్టుకీడ్వగానే వాళ్లకు క్షమాపణలు చెప్పి కేసుల నుంచి బయటపడ్డ చరిత్ర కేజ్రీవాల్‌కు ఉంది. 'అబ్బో! ఈ కేసుల్లో కోర్టులకు తిరుగుతుంటే ముఖ్యమంత్రిగా విధి నిర్వహణ ఎలా చేయగలను, అందువల్లే క్షమాపణలు కోరుతున్నా'ననీ అనగలరాయన!

కేసుల నుంచి బయటపడ్డారు. ఆ ఊసులను అటకెక్కించారు. వీధుల్లో ఆందోళనలు ఆరోపణలు చేయిస్తే, మనసులోని ఆందోళనలు తోకముడుచుకునేట్లు చేశాయని కేజ్రీవాల్ ప్రత్యర్థులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య విలువలు ఏ పాతాళానికి పతనమవుతున్నాయోనని ఆందోళన చెందుతున్నవారూ ఉన్నారు. ఇంతకూ రాజకీయాలను 'ఎక్స్‌రే' తీస్తే వివిధ పార్టీల వారిలో ఎవరి స్వార్థం వారికి ఉంది. ఎవరి ప్రయోజనాలు వారికి ఉన్నాయి. అదే పరమార్థం. ప్రజలకు వీరభక్తితో సేవ చేసి లబ్ధి పొందాలంటే ఎంతో కాలం పడుతుంది. అందువల్ల 'వైరభక్తి'ని ప్రదర్శిస్తే తక్కువ కాలంలో ఎక్కువ ఫలితం పొందవచ్చునని నమ్ముతున్నారు. ఇవన్నీ చూసి జనం దిక్కుతోచని మానసిక పరిస్థితిలో చిక్కుకుని, జుట్టు పీక్కుంటున్నారు.

సమస్యల పరిష్కారానికి ఎవరికి వ్యతిరేకంగా ఆందోళన చేయాలన్నదే వారి సమస్య. తమ సమస్య ప్రజాసమస్య అనుకునేవాళ్లు తప్ప, ప్రజాసమస్యే తమ సమస్య అనుకునే నాయకులు ఎప్పటికైనా కనబడతారా అన్నదే వారి సమస్య!

– శంభు

పితృదినోత్సవం

ప్రతి సంవత్సరం జూన్ మూడో ఆదివారం నాడు ఫాదర్స్ డే (పితృదినోత్సవం) జరుపుకోవడం పాశ్చాత్యుల సంప్రదాయం. ఆ సంప్రదాయానుసారం జూన్ 17న (ఇవాళ) ఆ వేడుక జరుపుకొంటున్నారు. భారతీయ సనాతన ధర్మం దీన్ని వేడుకగా భావించదు. ధర్మంగా సంభావిస్తుంది. అందుకే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అని సర్వదా స్మరించమంటుంది. ఆరాధించమంటుంది.

జన్మనిచ్చిన తొలిదైవం తల్లి, మలిదైవం తండ్రి. ఆయన- మనల్ని వేలుపట్టి నడిపించే వేలుపు. మన బరువును మోసే గురువు. తెరువు చూపే కల్పతరువు. దిశను, దశను బోధించే దేశికుడు. ఇంటి యజమాని తండ్రే. ఆయనే కుటుంబానికి పెద్దదిక్కు. 'ఆత్మావై పుత్రనామాసి' అని వేదం చెబుతోంది. ఆత్మే పుత్రుడి రూపంలో తండ్రికి కనిపిస్తుంది. తండ్రే కొడుకుగా జన్మిస్తాడని, కొడుక్కి తండ్రి తనతండ్రి పేరు అందుకే పెడతాడని చెబుతారు. కొడుకు భవిష్యత్తు కోసం బాధల పరిష్వంగంలో, బాధ్యతల ముళ్లమధ్యలో జీవితం గడుపుతాడు నాన్న.

తండ్రి త్యాగయాగ సోమయాజి. హవిస్సు వల్ల లభించే ఫలితమంతా తన సంతతి సంపద కోసం ధారబోస్తాడు. ఎవరివల్ల ఈ భౌతిక శరీరం జన్మించిందో, అలాంటి భగవత్ స్వరూపుడు అయిన తండ్రికి వినయ విధేయతలు కనబరుస్తూ నమస్సులు సమర్పిస్తే సరిపోదు. శ్రవణ కుమారుడు వయోవృద్ధులైన తల్లిదండ్రుల చేత తీర్థయాత్రా సందర్శనం చేయించి, సేవించాడు.

'తండ్రే దైవం' అని వాల్మీకి రామాయణం చెబుతోంది. 'పితృదేవోభవ' అని ఉపనిషత్తు చెబుతోంది. క్రమశిక్షణ, సమయపాలన నేర్పి బిడ్డల బతుకును పర్యవేక్షించేవాడే తండ్రి. బిడ్డల సంస్కారానికైనా, కుసంస్కారానికైనా తండ్రే బాధ్యుడు. దుర్యోధనుడి దుష్టబుద్ధికి ధృతరాష్ట్రుడు నిస్సహాయుడైనా, పశ్చాత్తాపాగ్నిలో దహించుకు పోయినట్లు భారతం చెబుతోంది. రావణుడు, హిరణ్యకశిపుడు శివభక్తులైనా మంచి



అంతర్యామి

తండ్రులు కాలేకపోయారు. యుగయుగాలుగా వారికి ఆ మచ్చ అలాగే ఉండిపోయింది.

ఏ దుష్టపుత్రుడి దుశ్చర్యలవల్ల తండ్రి మనోక్లేశాన్ని పొందుతాడో, వాడి పాపానికి ఏ జన్మలోనూ నిష్కృతి లభించదని దైవజ్ఞులు చెబుతున్నారు. అలాగే సుపుత్రుల పుత్రధర్మం వల్ల తండ్రులూ పుణ్యాత్ములవుతున్నారు. గణపతి, కుమారస్వామి తమ పితృభక్తి వల్ల పరమశివుడి కృపావాత్సల్యాలకు పాత్రులై ఆదర్శ పుత్రులనిపించుకున్నారు. పరశురాముడు తండ్రి జమదగ్ని ఆజ్ఞను శిరసావహించి, తల్లి శిరస్సును ఖండించాడు. అందుకు మెచ్చి జమదగ్ని పుత్రుణ్ని వరం కోరుకొమ్మన్నాడు. పరశురాముడు తన తల్లిని బతికించమని కోరుకున్నాడు. తల్లిదండ్రుల్ని తన నయనాలుగా భావించి, సేవించిన పరశురాముడి జీవితం ప్రాతఃస్మరణీయమైనది. భీష్మాచార్యుడు శంతనుడి కోసం ఆజన్మ బ్రహ్మచర్యం స్వీకరించాడు. ద్రోణాచార్యుడు తన పుత్రుడు అశ్వత్థామను దీర్ఘాయుష్కుడిగా చేసి తన పుత్రవాత్సల్యం నిరూపించుకున్నాడు.

కన్నతండ్రి, అన్నదాత, భయం పోగొట్టేవాడు, గురువు, ఉపనయనం చేసినవాడు- ఈ ఐదుగురూ తండ్రులేనని శాస్త్రకథనం. వీరిని సేవించడమంటే నూరుయజ్ఞాలు చేసిపొందే ఫలాన్ని మించినంత పుణ్యమని మనుధర్మశాస్త్ర వచనం. జీవించి ఉండగా సేవించడమే కాక, గతించిన పితృదేవతలకు శ్రాద్ధ కర్మలు చేసి తర్పణాలు వదిలి వారి ఆత్మకు శాంతి కలగజేయాలని తైత్తిరీయోపనిషత్తు చెబుతోంది.

సమష్టి వ్యవస్థనుంచి, వ్యష్టికుటుంబ వ్యవస్థ దిశగా ప్రయాణిస్తున్న కుటుంబాల్లో తండ్రుల్ని చిన్నచూపు చూస్తూ, వృద్ధాశ్రమాలకు వారిని పంపే దుష్ట సంప్రదాయం ఇవాళ వేళ్లతన్నుకోవడం ఎంతో శోచనీయం. కొడుకు నాన్న అయితేగాని, తండ్రి విలువ తెలియడంలేదు. పితృదేవుల వాత్సల్యానికి, అనురాగాభిమానాలకూ ఎవ్వరూ వెలకట్టలేరు. రుణమూ తీర్చుకోలేరు. ప్రతి పుత్రుడూ ప్రతి రోజూ తన తండ్రిని సేవించవలసిందేనన్న కనీస ధర్మాన్ని గుర్తుచేయడమే ఈ పితృదినోత్సవంలోని ఆంతర్యం!

– చిమ్మపూడి శ్రీరామమూర్తి

అవినీతిపై అంకుశం

- అందివచ్చిన ప్రత్యేక న్యాయస్థానాల చట్టం
- 6 నెలల్లోగా ఆస్తులన్నీ ప్రభుత్వపరం
- నిందితులు ఫలాలనూ అనుభవించలేరు
- ఏడాదిలోనే తేలనున్న కేసు
- తొలిసారిగా ప్రక్రియ ప్రారంభం
- ఆంధ్రప్రదేశ్ ఏసీబీ ముందడుగు

ఇప్పటిదాకా ఏం జరిగింది?

- అవినీతి అధికారిగానీ, ఉద్యోగిగానీ ఏసీబీకి చిక్కితే ఆస్తులను గుర్తించి జప్తు చేస్తున్నట్లు ప్రకటించి నిందితుడిని రిమాండుకు పంపేవారు.
- జప్తు చేసిన ఆస్తులపై వచ్చే ఫలాలను అవినీతికి పాల్పడిన వ్యక్తి, అతడి కుటుంబ సభ్యులే అనుభవించేవారు.
- కొన్ని రోజులు జైల్లో ఉండి వచ్చాక ఆ వ్యక్తి చేతిలోనే ఆస్తులు ఉండేవి. కేవలం ఆస్తుల క్రయవిక్రయాలకే అనుమతి ఉండేది కాదు.
- కేసు తేలడానికి ఏళ్లు పట్టేది. ఈలోగా తన వద్ద ఉన్న సంపదతో అవినీతికి పాల్పడిన వ్యక్తి ఎలాగోలా బయటపడేవాడు.

ఇప్పుడేం జరుగుతోంది

- ఏసీబీకి చిక్కిన వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతారు.
- కేసు నమోదు చేసిన 6 నెలల్లోగా అభియోగ పత్రం దాఖలు చేస్తారు. న్యాయమూర్తి అనుమతితో ఆస్తులు ప్రభుత్వపరమవుతాయి.
- అప్పటి నుంచి ఆస్తులపై వచ్చే అద్దెలుగానీ, కౌలుగానీ, మరే ఇతర ఫలాలుగానీ ప్రభుత్వానికే చెందుతాయి.
- మొత్తం కేసును ప్రత్యేక న్యాయ స్థానాల ద్వారా ఏడాదిలోగా పూర్తి చేయాలి.
- కేసులో దోషిగా తేలితే ఆస్తులన్నీ ప్రభుత్వపరమవుతాయి. నిర్దోషిగా తేలితే ఆస్తులను ప్రభుత్వం వెనక్కి ఇచ్చేస్తుంది.

ఈనాడు, అమరావతి: అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఓ చట్టం వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటిదాకా అవినీతి కేసులో చిక్కినప్పుడు.. మహా అయితే కొన్నాళ్లు జైల్లో ఉండి వస్తే సరిపోతుంది.. ఆ తర్వాత అక్రమంగా సంపాదించిన ఆస్తులతో హాయిగా గడిపేయొచ్చనుకున్న వారు ఇప్పుడు గడగడలాడుతున్నారు. అక్రమార్జనను వెంటనే స్వాధీనం చేసుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం ఇప్పుడో అంకుశంలా మారింది. అవినీతిపరుల ఆట కట్టించే వజ్రాయుధమైంది. అదే రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ప్రత్యేక న్యాయస్థానాల చట్టం. దాని ఆధారంగా రాష్ట్రంలోనే తొలిసారిగా సర్వే ఇన్‌స్పెక్టర్ గేదెల లక్ష్మీ గణేశ్వరరావు ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ ప్రారంభమైంది.

2016 మే 20 నుంచి ప్రత్యేక న్యాయస్థానాల చట్టం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఏసీబీ నమోదు చేసిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వాటిలో తీవ్రత అధికంగా ఉన్న పదింటిని ఎంపిక చేశారు. అందులో లక్ష్మీ గణేశ్వరరావుపై అభియోగపత్రం దాఖలు చేసిన ఏసీబీ... అతడి ఆస్తులను స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టింది. ఈ నెలాఖరులోగా ముఖ్యమైన మరో 3 కేసుల్లోనూ అభియోగ పత్రాలు దాఖలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఇకపై ప్రతి నెలా కనీసం రెండు, మూడు కేసుల్లో ప్రత్యేక న్యాయస్థానాల చట్టం కింద అభియోగ పత్రాలు దాఖలు చేయాలని ఏసీబీ డీజీ ఆర్.పి.ఠాకూర్ నిర్ణయించారు.

ఇప్పటిదాకా జప్తే.. ఇక స్వాధీనం

2016 నుంచి ఇప్పటివరకూ ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఏసీబీ 106 కేసులను నమోదు చేసింది. వాటిలో గుర్తించిన అక్రమాస్తుల మార్కెట్ విలువ దాదాపు రూ.2,800 కోట్లు ఉంటుందని అంచనా. అందులో అధిక శాతం వ్యవసాయ భూములు, ఫ్లాట్లు, ప్లాట్లు, భవనాలు, బంగారు, వజ్రాభరణాల రూపంలో ఉన్నవే. దర్యాప్తు అధికారులు వీటిని జప్తు చేస్తున్నప్పటికీ న్యాయస్థానాల్లో ఈ కేసుల విచారణ పూర్తి కావడానికి కనీసం 5 నుంచి పదేళ్లు పడుతుండటంతో ఈ కాల వ్యవధిలో అక్రమాస్తులను అవినీతి అధికారులే అనుభవిస్తున్నారు.

ప్రభుత్వపరం చేసేదిలా!

- కొత్త చట్టంలో భాగంగా అవినీతిపరుల అక్రమాస్తులను ప్రభుత్వపరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెషన్స్ జడ్జినిగానీ, అదనపు సెషన్స్ జడ్జినిగానీ అధీకృత అధికారిగా నియమిస్తుంది.
- ఏసీబీ నుంచి అందే నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అధీకృత అధికారి ఎదుట అక్రమాస్తులను ప్రభుత్వపరం చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేస్తుంది.
- నిందితుడు, ప్రభుత్వ వాదనలను విన్న అనంతరం అవి అక్రమాస్తులేనని అధీకృత అధికారి భావిస్తే అవి ప్రభుత్వపరమవుతాయి.
- ఆ అక్రమాస్తుల మార్కెట్ విలువకు తగిన నగదును నిందితుడు న్యాయస్థానంలో జమ చేస్తే వాటిని స్వాధీనం చేసుకోరు.
- అలా చేయని పక్షంలో స్వాధీన ఆదేశాలు జారీ చేసిన 30 రోజుల్లోగా ఆ అక్రమాస్తులను ప్రభుత్వపరం చేసుకుంటారు. ఈ ప్రక్రియంతా 6 నెలల వ్యవధిలోనే పూర్తయిపోతుంది.
- విచారణ పూర్తయిన అనంతరం న్యాయస్థానం కేసును కొట్టేస్తే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆస్తులను సదరు అధికారికి అప్పగిస్తారు.

అవినీతిపరులకు ఇది హెచ్చరిక

అవినీతిపరులకు ఇదో హెచ్చరిక. ప్రత్యేక న్యాయస్థానాల చట్టం కింద రాష్ట్రంలోనే తొలిసారిగా అభియోగ పత్రం ఇటీవల దాఖలు చేశాం. ఇప్పటివరకూ అక్రమార్జనను వెలికి తీసేందుకే పరిమితమయ్యాం. ఇకపై దాన్ని ప్రభుత్వపరం చేయడంలోనూ ముందడుగు వేస్తాం.

– ఆర్.పి.ఠాకూర్, ఏసీబీ, డీజీ

శాస్త్రీయ పరిశోధనల ఫలాలు ప్రజాప్రయోజనకరంగా ఉండాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య

ఈటానగర్: శాస్త్రీయ పరిశోధనల ఫలాలు ప్రజాప్రయోజనకర రీతిలో ఉండాలని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు చెప్పారు. అప్పుడే మానవాళికి వీటితో లబ్ధిచేకూరుతుందని వివరించారు. ఉత్పాదక వ్యయం తగ్గించడం, అదనపు విలువ జోడింపు, ఉపాధి కల్పనలపై పరిశోధక సంస్థలు దృష్టిసారించాలని ఆయన పిలుపునిచ్చారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని నిర్జులిలో నార్త్ ఈస్టర్న్ రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఈఆర్ఐఎస్‌టీ) అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులతో ఆయన శనివారం మాట్లాడారు. 50ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్న రైతులకు మేలిమి నైపుణ్యాలుంటాయని వీటికి అధునాతన పరిజ్ఞానం తోడైతే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. "సమాజానికి మేలుచేసే అంశాలపై దృష్టి సారించాలని పరిశోధక సంస్థలకు నేను ప్రజాప్రతినిధిగా ఎన్నికైనప్పటినుంచీ చెబుతూనేవున్నాను'అని ఆయన వ్యాఖ్యానించారు. ఈటానగర్‌లోని డోర్జీఖండూలో నీటి నిర్వహణ, తుపాను నీటి పారుదల సంస్థకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ బీడీ మిశ్ర, ముఖ్యమంత్రి పెమా ఖండూ తదితరులు హాజరయ్యారు.

విద్యార్థి వీసా సడలింపులో భారత్‌కు దక్కని చోటు

- యూకే పార్లమెంటు ముందుకు సవరణలు

లండన్: విద్యాభ్యాసం నిమిత్తం యూకే వచ్చేవారికి వీసాలు ఇచ్చే విషయంలో కొన్ని దేశాలవారికి సడలింపులు ఇవ్వాలని యూకే ప్రభుత్వం నిర్ణయించింది. 'తక్కువ ముప్పు' ఉన్నవిగా పేర్కొంటూ చైనా, బెహ్రైన్, సెర్బియా వంటి 25 దేశాలను జాబితాలో చేర్చి, భారత్‌ను మాత్రం పేర్కొనలేదు. ఈ మేరకు వలస విధానంలో మార్పుల్ని ప్రతిపాదిస్తూ ముసాయిదాను పార్లమెంటుకు సమర్పించింది. విద్య, ఆర్థిక స్థాయి, ఆంగ్ల భాషా నైపుణ్యం వంటి విషయాల్లో ఈ దేశాలవారికి తక్కువగా తనిఖీలు ఉంటాయి. జులై 6వ తేదీ నుంచి ఈ మార్పులు అమల్లోకి వస్తాయి. ఇతర దేశాల విద్యార్థులు యూకేలో చదువుకోవడాన్ని సులభతరం చేయడం ఉద్దేశంగా వీటిని ప్రతిపాదించారు. అయితే భారత్‌కు ఆ జాబితాలో చోటు కల్పించకపోవడం వల్ల ముమ్మర తనిఖీలు, పత్రాల సమర్పణ వంటివి భారతీయ విద్యార్థులకు మాత్రం కొనసాగుతాయి.

వీసాల పరిమితిపై నెలవారీ సమీక్ష: వృత్తి నిపుణుల వీసాల జారీ పరిమితిపై ఇకమీదట నెలవారీ సమీక్ష నిర్వహించాలని తాజా సవరణలో ప్రతిపాదించారు. దీనివల్ల భారతీయ ఐ.టి. రంగం లబ్ధి పొందే అవకాశం ఉంది. ఇప్పటికే వైద్యులు, నర్సులపై పరిమితిని ఎత్తివేశారు.

రైల్వే ఉద్యోగులు, పింఛనుదార్లకు కొత్త ఆరోగ్య కార్డులు

దిల్లీ: రైల్వే ఉద్యోగులకు, పదవీ విరమణ చేసినవారికి.. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్యకార్డుల స్థానంలో కొత్తగా ప్లాస్టిక్ ఆరోగ్య కార్డులను మంజూరు చేయడానికి రైల్వేశాఖ నిర్ణయించింది. ఇంతవరకు రేషన్ కార్డుల్లాంటి వైద్య కార్డులను రైల్వేశాఖ అందజేస్తుండగా.. కొత్తగా జారీచేసే వాటికి దేశవ్యాప్త విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. ఏకరూపత ఉండేలా.. పరిమాణం, రూపం వంటివాటిలో అచ్చంగా క్రెడిట్/డెబిట్ కార్డులను పోలి ఉండేలా కొత్త కార్డులను రూపొందించేందుకు రైల్వేబోర్డు ఆమోదించింది. ఈమేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి కార్డు పైభాగంలో ఓవైపున వర్ణపట్టీ (కలర్డ్ స్ట్రిప్) ఉంటుంది. ఆ పట్టీ రంగు ఆధారంగా కార్డుదారు కేటగిరీని సులువుగా గుర్తించగలిగేలా వీటిని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 లక్షల మంది రైల్వే ఉద్యోగులుండగా.. దాదాపు అంతేమంది పింఛనుదార్లున్నారు. నిబంధనల మేరకు వారందరి కుటుంబ సభ్యులు కూడా ఈ ఆరోగ్య కార్డులను వినియోగించుకోవచ్చు.

వెనిజ్‌వెలా క్లబ్‌లో తొక్కిసలాట 17 మంది దుర్మరణం

మృతుల్లో 8 మంది మైనర్లు

కారకాస్(వెనిజ్‌వెలా): ఇక్కడి ఓ క్లబ్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన తొక్కిసలాటలో 17 మంది మరణించారు. మృతుల్లో ఎనిమిది మంది మైనర్ విద్యార్థులున్నారు. ఈ గందరగోళంలో గాయపడిన కనీసం అయిదుగురిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కారకాస్ క్లబ్‌లో శనివారం పాఠశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ పార్టీని నిర్వహిస్తున్న సమయంలో అక్కడి ఓ భాష్పవాయు గోళం ఒక్కసారిగా పేలిపోయింది. ఆ సమయంలో క్లబ్ దాదాపు 5 వందల పై చిలుకు జనంతో కిక్కిరిసి ఉంది. ఈ పేలుడు సంభవించగానే వెలుపలికి వెళ్లేందుకు జనం కంగారుపడ్డారు. ఆ సందర్భంగా తొక్కిసలాట జరిగినట్లు అంతర్గత వ్యవహారాలు, న్యాయశాఖ మంత్రి నెస్టర్ రెవరాల్ తెలిపారు. పార్టీ చేసుకుంటున్న వారిలో ఓ మైనరు మూలంగానే అక్కడున్న భాష్పవాయు గోళం పేలినట్లు అధికార వర్గాలు అనుమానిస్తున్నాయి.

భారత నౌకాదళ అద్భుత సాహసం

- సరకు రవాణా నౌక కొట్టుకుపోకుండా ఆపిన సిబ్బంది

దిల్లీ: అగ్నికీలల్లో చిక్కుకున్న ఒక సరకు రవాణా నౌక బంగ్లాదేశ్‌తో ఉన్న అంతర్జాతీయ సముద్ర సరిహద్దు వైపు కొట్టుకుపోకుండా భారత నౌకా దళం నిలువరించింది. ఇందుకోసం ఒక సాహసోపేత, సంక్లిష్ట ఆపరేషన్‌ను నిర్వహించింది.

ఎంవీ ఎస్ఎస్ఎల్ కోల్‌కతా అనే ఈ నౌక.. ఈ నెల 14న బంగాళాఖాతంలో గంగా నది డెల్టా ప్రాంతానికి చేరువలో సాగర్ దీవి వద్దకు చేరుకోగానే అగ్నికీలల్లో చిక్కుకుంది. అందులోని 22 మంది సిబ్బంది తప్పించుకున్నారు. క్రమంగా అది బంగ్లాదేశ్‌తో ఉన్న సముద్ర సరిహద్దు వైపునకు కొట్టుకుపోతోంది. నౌక సుందర్‌బన్ డెల్టా వైపు కొట్టుకుపోకుండా ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపాల్సిందేనన్న తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ ఆదేశాల మేరకు నేవీ సిబ్బంది రంగంలోకి దిగింది. డెల్టాలోని ఇసుక తీరంలో ఆ నౌక బోల్తా పడి ఉంటే అందులోని చమురు ఒలికిపోయి, తీవ్ర పర్యావరణ విపత్తు తలెత్తేది. ఈ నేపథ్యంలో ఒక సీ కింగ్ హెలికాప్టర్‌ను, డోర్నియర్ విమానాన్ని, సిబ్బందిని విశాఖపట్నం నుంచి పంపారు. బంగాళాఖాతంలో విన్యాసాలు చేపడుతున్న యుద్ధనౌక ఐఎన్ఎస్ కద్మత్‌ను ఘటనా స్థలికి తరలివెళ్లాలని ఆదేశాలు అందాయి. ఇప్పటికే అక్కడ తీరరక్షణ దళ నౌకలు మోహరించాయి.

తొలుత పరిస్థితిని అంచనావేయడానికి.. సీ కింగ్ హెలికాప్టర్ నుంచి తాడు ద్వారా ఒక మెరైన్ కమాండోను నౌకపైకి జారవిడిచారు. ఆ తర్వాత.. ప్రమాదంలో చిక్కుకున్న నౌకకు సంబంధించిన ముగ్గురు సిబ్బందిని కూడా దించారు. నలుగురూ కలసి విజయవంతంగా లంగరు వేయగలిగారు. నౌక కొట్టుకుపోకుండా ఆపారు. మరో నౌక సాయంతో లాకెళ్లగలిగేలా ఏర్పాట్లు కూడా చేశారు.

అత్యాచారం గురించి చెప్పాలంటూ...

బలవంతపెట్టిన ఆర్జేడీ నేతలు

గయ: తనపై జరిగిన అత్యాచారం గురించి చెప్పమంటూ బాధిత బాలికను బలవంతపెట్టిన ఆర్జేడీ నేతలపై శనివారం కేసు నమోదైంది. నిందితుల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అలోక్ కుమార్ మెహ్తా పేరు కూడా ఉంది. ఘటనకు సంబంధించి బాధితురాలితో కొందరు ఫోటోలు తీసుకుంటున్న, ఆమెపై వీడియో చిత్రీకరిస్తున్న దృశ్యాలు ఆన్‌లైన్ స్వైరవిహారం చేశాయి. బిహార్‌లోని గయలో గత గురువారం ఓ వ్యక్తిని చెట్టుకు కట్టేసి... అతడి భార్య, 15ఏళ్ల కుమార్తెలపై 20 మందితో కూడిన ఓ సాయుధ ముఠా సామూహిక అత్యాచారానికి తెగబడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ ఓ నిజనిర్ధరణ కమిటీ ఏర్పాటుచేశారు. దీనిలోని సభ్యులుగానున్న మెహ్తా, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అభా లత, పార్టీ నాయకురాలు సరస్వతీ దేవి, ఎమ్మెల్యే సురేంద్ర యాదవ్‌లతోపాటు మరికొందరిపై ప్రస్తుతం బాధిత బాలికపై ఒత్తిడి తెచ్చినట్లు కేసునమోదైంది.

ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌కే నా ఓటు: తేజస్వి

పట్నా: ప్రతిపక్షాల ఉమ్మడి ప్రధానమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వి యాదవ్ సాదరంగా మద్దతు పలికారు. కొద్ది నెలలుగా రాహుల్‌తో అనేకసార్లు భేటీ అవుతున్న తేజస్వి ఆయనతో సత్సంబంధాలు నెరపుతూ వస్తున్నారు. అయితే ఇంతవరకు ఎప్పుడూ బయటపడని ఆయన తాజాగా ఓ వార్తాసంస్థ చర్చా కార్యక్రమంలో రాహుల్‌కు తొలిసారి బహిరంగంగా మద్దతు పలికారు.

అఫ్గాన్‌లో కారు బాంబు పేలి.. 26 మంది మృతి!

కాబూల్: తాలిబన్ మిలిటెంట్లపై కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు అఫ్గానిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ శనివారం ప్రకటించిన వెంటనే... కారు బాంబు పేలింది! నాంగర్‌హార్ ప్రావిన్స్‌లోని రోదత్‌జిల్లాలో ఓచోట తాలిబన్‌లు, సైనికులు, పౌరులు కలిసి రంజాన్ వేడుకలు జరుపుకొంటుండగా... ఈ ఆత్మాహుతి దాడి చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనీసం 26 మంది మృతిచెంది ఉంటారనీ, మరో పది మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. అయితే, ఈ దాడికి పాల్పడింది ఎవరన్నది మాత్రం తెలియరాలేదు. భద్రతా దళాలు మాత్రం ఇది ఇస్లామిక్ స్టేట్ పనేనని ఆరోపిస్తున్నాయి. మరోవైపు- రంజాన్ సందర్భంగా అఫ్గాన్‌లో శనివారం అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది! నిత్యం ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకొనే సైనికులు, తాలిబన్ మిలిటెంట్లు కలిసి సెల్ఫీలు దిగారు.

జననాంగాన్ని తెగ్గోసుకున్న మతగురువు

జైపుర్: మతాచార్యులపై కొందరు చేస్తున్న ఆరోపణల విషయంలో కలత చెందిన ఓ మతగురువు తన జననాంగాన్ని తెగ్గోసుకున్నారు. రాజస్థాన్‌లో శనివారం ఈ ఘటన వెలుగు చూసింది. సేవావలి సేవాగిరిధామ్‌కు చెందిన 40 ఏళ్ల మహంత్ అనిల్ పురోహిత్ ఈచర్యకు పాల్పడినట్లు మంధన్ పోలీస్‌స్టేషన్ అధికారులు తెలిపారు. 'శుక్రవారం రాత్రి అనిల్ తనగదిలో జననాంగాన్ని తెగ్గోసుకున్నారు. వెంటనే ఆయన్ను అనుచరులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స కోసం ఆయన్ను జైపుర్‌కు పంపించాం'అని పోలీసులు తెలిపారు.

విన్యాసం.. అబ్బురం..

హైదరాబాద్ దుండిగల్‌లోని వాయుసేన అకాడమీలో 113 మంది కేడెట్లు కంబైన్డ్ గ్రాడ్యుయేడ్ పరేడ్ సందర్భంగా నిర్వహించిన భారీ విన్యాసాలు అబ్బురపర్చాయి. పారాగ్లైడర్‌తో, హెలికాప్టర్‌లతో, విమానాలతో గాల్లో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కాడెట్ల నుంచి వాయుసేన ఎయిర్ చీఫ్ మార్షల్ బీరేందర్‌సింగ్ ధనోవా గౌరవవందనం స్వీకరించారు. – ఈనాడు, హైదరాబాద్

వాయు సేనలో మరో మహిళా తేజం

- దక్షిణాది మొదటి యుద్ధవిమాన పైలట్
- కర్ణాటకకు చెందిన మేఘనా షాన్‌బో

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: భారత వాయుసేనలో మరో మహిళాతేజం మెరిసింది. అత్యంత క్లిష్టమైన యుద్ధవిమాన పైలట్‌గా దక్షిణ భారతదేశానికి చెందిన మేఘనా షాన్‌బో నియమితులయ్యారు. వాయుసేనలో ఆరో మహిళా ఫైటర్ పైలట్‌గా ఎంపికయ్యారు. శనివారం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరేడ్ జరిగింది. కర్ణాటకలోని చిక్‌మంగుళూర్‌కు చెందిన మేఘనా ఫ్లయింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈమె తల్లిదండ్రులు ఇద్దరూ న్యాయవాద వృత్తిలో ఉన్నారు. తండ్రి ఎంకే రమేష్ లాయర్, తల్లి శోభ ఉడిపి జిల్లా వినియోగదారుల ఫోరంలో న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు. మేఘన పాఠశాల విద్యను ఉడిపిలోని రాక్ ఇండియన్ బోర్డింగ్ పాఠశాలలో పూర్తి చేశారు. 2011-15లో మైసూర్‌లో ఇన్‌ఫర్మేషన్ సైన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2017 జనవరిలో ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్ బ్రాంచిలో చేరారు. ఇప్పటి వరకు మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల నుంచి మహిళా ఫైటర్‌పైలట్‌లు ఎంపికయ్యారు. మొదటిసారి దక్షిణ భారతదేశం నుంచి మేఘనా ఫైటర్ పైలట్‌గా ఎంపికయ్యారు.

మతపరమైన తటస్థత అవసరం లేదు

- మైనారిటీలు మనకు వ్యతిరేకంగా ఏకమవుతున్నారు
- భాజపా నేతలకు స్పష్టం చేసిన ఆరెస్సెస్
- ప్రగతి నివేదికలు సిద్ధం చేయండి
- ప్రధాన కార్యదర్శులకు అమిత్ షా ఆదేశం
- ప్రభుత్వ పనితీరుపై నివేదికను అందించిన రాం మాధవ్

ఈనాడు – దిల్లీ

కేంద్ర సర్కారు మతపరమైన తటస్థత పాటించాల్సిన అవసరం లేదని భాజపాకి ఆరెస్సెస్ సూచించింది. 'మతపరమైన సున్నిత అభివృద్ధి పనుల'తో 2019 ఎన్నికలకు వెళ్లాలని అభిప్రాయపడింది. భాజపాని ఓడించాలనే ఉద్దేశంతో ఇతర ఏ పార్టీకైనా ఓటు వేయడానికి అల్పసంఖ్యాక వర్గాల వారు సిద్ధమవుతున్న దృష్ట్యా- అభివృద్ధి పనుల్ని మతాలకు అతీతంగా చేపట్టడంలో అర్థం లేదని గట్టిగానే పేర్కొన్నట్లు తెలిసింది. దిల్లీకి సమీపంలోని సూరజ్‌కుండ్‌లో జరుగుతున్న ఆరెస్సెస్-భాజపా నేతల 'చింతన్ శిబిరం' శనివారం ముగిసింది. దీనిలో ఆరెస్సెస్ కొన్ని కీలకాంశాలపై అభిప్రాయాలను పంచుకొంది.

సిద్ధాంత రీత్యా సాధ్యమేనా?

యూపీ భాజపా సంస్థాగత వ్యవహారాల ప్రధానకార్యదర్శిగా ఉన్న సునీల్‌బన్సల్- మతపరతటస్థతను ప్రస్తావిస్తూ.. ఇటీవల జరిగిన కైరానా ఉప ఎన్నిక ఫలితాన్ని గుర్తుచేశారని సమాచారం. 'ఉజ్వల్ యోజన, జన్‌ధన్ యోజన, సామాజిక భద్రత పథకం వంటివి ముస్లిం సమాజానికి మేలుచేసినా, కైరానాలో 35% ఉన్న ముస్లింలు మాత్రం భాజపా అభ్యర్థిని ఓడించడానికే ఒక్కటయ్యారు...' అని ఆయన తన నివేదికలో ప్రస్తావించారు. రాజకీయ కోణంలో చూస్తే ఆరెస్సెస్ సిఫార్సు ఎంత కీలకమైనదో భాజపాకి తెలుసునని పార్టీ అధ్యక్షుడికి సన్నిహితంగా ఉండే నేత ఒకరు 'ఈనాడు'కు చెప్పారు. అయితే దీనిని పాటించడం సిద్ధాంత రీత్యా సాధ్యం కాదన్నారు. అన్ని వర్గాలనూ కలుపుకొని వెళ్లేందుకు రూపొందించిన 'సబ్ కా సాథ్...సబ్ కా వికాస్' అనే నినాదం ఇకపైనా కొనసాగుతుందని చెప్పారు. సంఘ్ అగ్రనేతలు చేసిన సూచనను భాజపా అంగీకరించినా... మతపరమైన సున్నిత అంశాన్ని తెలివిగా దాచిపెట్టాలని నిర్ణయించింది. 2019లో మళ్లీ అధికారంలోకి రావాలంటే హిందువులపైనే సర్కారు ఆధారపడనుంది. మైనారిటీలతో సన్నిహితంగా ఉంటున్న కొన్ని హిందూ సామాజిక వర్గాలను మాత్రం దూరంగా ఉంచనుంది.

పనితీరు ప్రామాణికంగా టికెట్లు

దేశంలో సొంతంగా గానీ, మిత్ర పక్షాలతో కలిసి గానీ భాజపా అధికారంలో ఉన్న 20 రాష్ట్రాల్లో సాధించిన పురోగతిపై ప్రగతి నివేదికలు తయారు చేయాలని పార్టీ ప్రధాన కార్యదర్శులకు కమల దళపతి అమిత్‌షా ఆదేశించారు. దీంతోపాటు పార్టీకి చెందిన ప్రతి ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పనితీరుపైనా నివేదికలు రూపొందించాలని చెప్పారు. 2019 ఎన్నికల్లో పార్టీ టికెట్ల కేటాయింపులో ఈ సమాచారం కీలకం కానుంది. నరేంద్రమోదీ సర్కారు పనితీరుపై దేశవ్యాప్తంగా సేకరించిన ప్రజాభిప్రాయాన్ని ఆరెస్సెస్ నేతలు శుక్రవారం సమర్పించారు. వీటిని భాజపా ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ క్రోడీకరించి శనివారం పార్టీ అధ్యక్షుడికి అందజేశారు. దీనిని ఆయన పరిశీలించిన తర్వాత ప్రధానికి సమర్పిస్తారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలోనూ ఈనివేదికను చర్చించే అవకాశం ఉంది.

సహకారానికి కృతజ్ఞతలు... సాయానికి అభ్యర్థన

ముగింపు సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ పార్టీకి, ప్రధానికి ఆరెస్సెస్ ప్రచారక్‌లు, నేతలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోదీ సర్కారును మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు సాయపడాల్సిందిగా అభ్యర్థించారు.

పండగ రోజూ జమ్మూకశ్మీర్‌లో శాంతి లేదు!

- కశ్మీర్‌లో హింసాత్మక ఘటనలు.. ఒకరి మృతి
- పాక్ కాల్పుల్లో భారత సైనికుడి బలి

శ్రీనగర్: రంజాన్ పర్వదినం రోజున కూడా జమ్మూకశ్మీర్‌లో హింస ఆగలేదు. అనంత్‌నాగ్ జిల్లాలోని బ్రాక్‌పొర గ్రామంలో గ్రెనేడ్ దాడి జరిగి ఒక ఆందోళనకారుడు మరణించాడు. రాజౌరీ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి గస్తీ తిరుగుతున్న సైనిక బృందాన్ని లక్ష్యంగా చేసుకొని పాక్ సైనికులు కాల్పులకు దిగడంతో బికాస్ గురుంగ్ అనే సైనికుడు చనిపోయాడు. శ్రీనగర్ శివార్లలోని లాస్‌జాన్‌లో భద్రతా దళాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇందులో సీఆర్పీఎఫ్ జవాన్ గాయపడ్డాడు. పలుచోట్ల ఆందోళనకారులు, భద్రతా సంస్థల మధ్య ఘర్షణలు జరిగాయి. ప్రార్థనల అనంతరం శ్రీనగర్‌లోని సఫకదాల్ ప్రాంతంలో జరిగిన అల్లర్లలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. సోపోర్, కుప్వారా ప్రాంతాల్లోనూ ఆందోళనకారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

శనివారం శ్రీనగర్‌లో పోలీసులపై రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు

ఔరంగజేబుకు అంత్యక్రియలు: ఉగ్రవాదుల చేతిలో బలైన సైనిక జవాన్ ఔరంగజేబుకు శనివారం పూంచ్ జిల్లాలోని అతడి స్వగ్రామం సలానీలో అంత్యక్రియలు జరిగాయి. రంజాన్ జరుపుకొనేందుకు గురువారం స్వస్థలానికి వెళుతున్నప్పుడు రాజౌరి జిల్లాలో ఉగ్రవాదులు అతడిని అపహరించారు. శుక్రవారం పుల్వామా జిల్లాలో అతడి మృతదేహం కనిపించింది. హిజ్బుల్ ముజాహిదీన్ సభ్యులుగా భావిస్తున్న కొందరు ముష్కరులు ఔరంగజేబును విచారిస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. అతడు పనిచేసిన ప్రాంతాలు, చేపట్టిన ఎన్‌కౌంటర్ల వివరాలను వారు ఆరా తీయడం అందులో కనిపించింది. ఈ విచారణ అనంతరం అతడిని కాల్చిచంపి ఉంటారని భావిస్తున్నారు. తన కుమారుడి మరణానికి 32 గంటల్లోగా ప్రతీకారం తీర్చుకోవాలని ఔరంగజేబు తండ్రి హనీఫ్ ఒక సైనికుడిని డిమాండ్ చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

Website: www.nitandhra.ac.in Office No: 9492747280
Email: purchase@nitandhra.ac.in
राष्ट्रीय प्रौद्योगिकी संस्थान - आंध्र प्रदेश
NATIONAL INSTITUTE OF TECHNOLOGY ANDHRA PRADESH
Sri Vasavi Engineering College Campus, Pedatadepalli
TADEPALLIGUDEM – 534102, WEST GODAVARI DIST., ANDHRA PRADESH, INDIA
Advt. No. NIT AP/CS-02/2018-19 Date: 16-06-2018
TENDER NOTIFICATION FOR Hiring of Buses (On rental basis)
Sealed tenders are invited from reputed firms / agencies for Hiring of Buses (on rental basis)
Pre-bid meeting – 23.06.2018 (3:00 PM)
Sealed tenders are to be submitted to the Director, National Institute of Technology Andhra Pradesh, Sri Vasavi Engineering College Campus, Tadepalligudem - 534102 on or before 04-07-2018 at 11.00 AM. The details can be obtained from the Institute website: www.nitandhra.ac.in
DIRECTOR

MBBS
Ministry Of Health Of Russia
SMOLENSK STATE MEDICAL UNIVERSITY
Invites Indian students for direct Government Admissions
Recognized by India, WHO, USA & UK, Min. Qual.-50% in XII in PCB
UNIVERSITY- Founded in 1920, Very high standards of education, English Medium in all years, 1050 Indian students (430 Girls) studying, 125 got degree in 2018 Closed campus, 8 hospitals (6000 Beds).
MCI SCREENING TEST- Our graduates of 2008 to 2017 have given BEST results among graduates of all foreign medical colleges (Official web sites of Indian Embassy, Moscow and NBE, New Delhi who conducts Screening Test confirm this).
HOSTELS- 2 and 4 seated big rooms, separate blocks for boys and girls.
INDIAN MESS - Mess with Indian food cooked by Indian cooks.
Fee (Tuition+Hostel+Med.Ins.) - USD 6000/year (App. Rs. 4,00,000/-) and one time payment of Rs.1,50,000/- (By Bank Draft only) which includes – Admission, student visa fee, air ticket Delhi - Moscow.
Bank loans are available. Scholarship for topper students.
Contact: Dr. Aeron, Tel: Russia +79605805555
Official Internet Site:www.sgmu.info
Information Centers in A.P. (Parents of Students)
Vijayawada: Mr. Naga Babu Chennu – 9912061976
Vishakhapatnam: Mr. Paparao Bandi - 9441575976
Kakinada: Mr. Paparao Bandi – 9441575976
Tirupati: Mrs. M. Sujatha Naidu - 9491772471

హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ)
మార్కెటింగ్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయం: హిందుస్థాన్ భవన్, 8-షూర్జి వల్లభదాస్ మార్గ్, ముంబాయి - 400 001, CIN:L234201MH1952GO1008858
బహిరంగ ప్రకటన
హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ (హిందుస్థాన్ పెట్రోలియం) లేదా వాటి ఉత్పత్తులకు సంబంధించిన లోగోలుతో పాటు వ్యాపార చిహ్నం లేదా వ్యాపార నామములు (బ్రాండింగ్) ఏ వ్యక్తి లేదా కాంట్రాక్టర్ పెట్రోలియం రవాణా కాంట్రాక్టర్లతో పాటు ట్యాంకు ట్రక్కులపైన వాడకం, అట్టి ఏ వ్యక్తి మధ్య ఒప్పందం యొక్క పరిమిత కాలం వరకే అనుమతి ఉంటుంది. కాంట్రక్టు ముగిసిన/నిలిచిపోయిన తర్వాత, హిందుస్థాన్ పెట్రోలియం లేదా వాటి ఉత్పత్తులు యొక్క వ్యాపార చిహ్నం లేదా వ్యాపార నామములు లోగోలుతో పాటు ట్యాంకు ట్రక్కులపైన ఉపయోగించుటలో ఏదైన అతిక్రమణ, అనధికార వాడకం లేదా దుర్వినియోగం చేసినచో చట్ట విరుద్ధం అవుతుంది. అట్టి ఉల్లంఘన/అతిక్రమణ పైన చట్టం పరిధిలో క్రిమినల్ వ్యాజ్యంతో పాటు అన్ని ఉపయుక్తమైన చర్యలు చేపట్టుటకు హిందుస్థాన్ పెట్రోలియం హక్కు కలిగిఉన్నది. కాంట్రాక్టు ముగిసిన/నిలిచిపోయిన తర్వాత ఎలాంటి అనధికార రీతిలోను, హిందుస్థాన్ పెట్రోలియం లేదా వాటి ఉత్పత్తులు యొక్క వ్యాపార చిహ్నం లేదా వ్యాపార నామములు లోగోలుతోపాటు ట్యాంకు ట్రక్కులపైన వినియోగించటం తక్షణం నిలిపివేయుట మరియు మానుకోవటం చేయవలసినదిగా అట్టి వ్యక్తులు మరియు కాంట్రాక్టర్లకు సూచించడమైనది.
#GiveItUp
HPCL-INDIA'S LARGEST LUBE MARKETER

ఈనాడు పెళ్లిపందిరి.నెట్
మీకు నచ్చే పెళ్లి సంబంధాల కోసం ఉచితంగా రిజిష్టర్ చేసుకోండి...
www.eenadupellipandiri.net
గమనిక : రిజిస్ట్రేషన్ కోసం ID Proof తప్పనిసరి.
040-49051234, 8008928686, 8008938686

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

CA

వివాహ శుభ సమయంలో కొత్త జంట మెచ్చే పెళ్లి కానుక ఈనాడు లో ప్రకటన
వివరాలకు మీ సమీపంలోని 'ఈనాడు' కార్యాలయాన్ని సంప్రదించండి

వధువు కావలెను

KAPU 28, 5'11" BE, MBA MNC 15L.PA ★ 29, 6", BE (BITS) MS, 17 OK ★ 27, 5'10" MBBS, MS(G.S) 30Cr ★ 26 5'7" BE(BITS) MNC, 24L.PA ★ 29, 5'8" BE(IIT) 15L.PA ★ 9989019945 (A)

బ్రాహ్మణ 30 /5'4" కాశ్యపస గోత్రం ప్రభుత్వ ఉద్యోగి VRO కి వధువు కావలెను. సంప్రదించు నంబర్లు ✆ 9542954304 / 8639762616 (A)

Kapu 32/ 5'10" B.Tech MBA ERRICSON B'Lore Seeks Fair Good Looking Bride From Educated Family ✆ 8096600464/ 8088044082

కాపు డైవర్సీ /40/5'.8"/M.S./ రిచ్ U.S. వరునికి అందమైన కాపు B.Tech/MCA/ MBA/M.Sc/5'.3" ఎత్తుగల వధువు కావలెను. (డైరెక్ట్) ✆ 91005 84078. (M).

ఆర్యవైశ్య / లేట్ మ్యారేజ్ / బిజినెస్ స్వ॥గో॥ ఐనకుల, మే॥గో॥ మిధునకుల, న॥ శతభిష / ఫెయిర్ / 5.6" / 49y / వరునకు వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ ✆ 98853 90717 (M).

Reddy/ B.Te(IIT)/ MS/H1/ USA/ 25, 6', 120K, 30Cr ★ 30, 5'7", 150K, 70Cr ★ 32, 6', 300K ★ 32, 6', 150K, 30Cr ★ 28, 5'8", 50Cr 100K ★ Cont K.C.Reddy Hyd Ph: 9849321309 (A).

Reddy, MBBS, PG, DM ★ CAD, 30, 5'11", 30Cr ★ (Endocr) 30, 5'10", 50Cr ★ 31, 5'7", 50Cr ★ Cont K.C.Reddy - Mar - Bureau, B.Hills Hyd, Ph: 9849321309, 9347807015 (A).

Reddy, B.Te, MS, Business - Hyd ★ 27, 6', 200Cr ★ 27, 5'9", 75Cr ★ 25, 6', 150Cr ★ Cont K.C.Reddy - Mar - Bureau, B.Hills - Hyd, Ph: 9849321309/ 9347807015 (A).

కాపు, 34, 5.9, B.Tech దుబాయ్‌లో Flight Instructureగా చేస్తున్న వరునికి అందమైన చదువుకున్న అమ్మాయి కావలెను. Ph: 9440005055, 8885788653 (Q)

వెలమ, CA, చార్టర్డ్ అకౌంటెంట్, 80,000/- PM, 6' ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9908222406 (A)

రజక: B.Tech, Govt. Asst. ఇంజనీర్, ట్రాన్స్‌కో, 60,000/- pm, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

ముదిరాజ్, MBA, C.Govt. అకౌంటెంట్ ఆఫీసర్, FCI, 32,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

వడ్డెర: కట్నప్రసక్తిలేదు. B.Tech, C.Govt. Asst. మేనేజర్, బ్యాంక్ ఆఫ్ బరోడా, 65,000/- PM, 6' ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

అగ్నికుల క్షత్రియ: M.Tech, C.Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్, రైల్వేస్, 65,000/- PM, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

కమ్మ: B.Tech, C.Govt. JTO, BSNL, 62,000/- PM, 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

పద్మశాలి: 28/ 5'10"/ MBBS, MS. జనరల్ సర్జన్ గల వరుడికి డాక్టర్ లేదా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వధువు కావలెను. Ph: 7680962534 (A)

కాపు: 27/ 5'10"/ MBBS, MS జనరల్ సర్జన్ గల వరుడికి డాక్టర్ లేదా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వధువు కావలెను. Ph: 8790746702

గౌడ: 28/ 5'9"/ MBBS, MS జనరల్ సర్జన్ వరుడికి తగిన డాక్టర్ వధువు కావలెను కులపట్టింపు లేదు. (Only BC, OC వాళ్ళు మాత్రమే) Ph: 9848971730

కమ్మ కులపట్టింపు లేదు, 51 సం॥ M.R.O. తెలుపు రంగు విడో పిల్లలు లేరు. స్వంత ఇల్లు, 29 ఎకరాలు వ్యవసాయ భూమి కలిగిన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008158673 (E)

రెడ్డి డైవర్సీ 5'10" వయస్సు - 36 సం॥ బిజినెస్ 6 Cr. ప్రాపర్టి సంవత్సరానికి 24 లక్షలు ఆదాయం గల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర: ✆ 9603384074. (A)

కమ్మ: 27Y/ 5'11"/ B.Tech (CSE)/ S/W in Banglur/ 46 Lakhs P/A/ 10 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 93909 14215 (D)

బ్రాహ్మణ/ 29, B.Tech, MBA, 16L ★ 31, B.Tech (IIT) 20L ★ 24, 5'9", B.Tech/ SWE/9.5L ★ 28, B.Tech MSUS & 90K ★ 30, MD ★ 9494096081 (A)

కాపు- రెండోపెళ్లి: 38/6'/B.టెక్ (IIT) MBA, (IIM)/ US సిటిజెన్ ★ 35/ 5'8"/ MBBS, MS (O) ★ 35/ 5'9"/ B.టెక్, MS/ H1 వీసా ★ డా॥ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

SC మాల: 29/5'7"/ B.టెక్, MS/ H1 వీసా ★ 28/ 5'6"/ B.టెక్/ CTS/ 1L PM ★ 30/ 5'8"/ MBBS, MD (P). సంప్ర॥ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

కాపు: 27/5'8"/ MBBS, MS (GS) ★ 29/ 5'9"/ B.టెక్/ 18L/ 6Cr. ★ 28/ 6'/B.టెక్ (IIT), MS/ H1 వీసా. సంప్ర॥ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

కమ్మ-రెండో పెళ్లి: 45/5'10"/ B.టెక్, MS/ US సిటిజెన్/ 6 కోట్లు ★ 38/6'/ MBBS, MS/ USA/ డాక్టర్/ 15 కోట్లు ★ 35/5'9"/ M.టెక్/ విప్రో/ 2L PM/ 5 కోట్లు ✆ 9393276969 (A)

కమ్మ/ 28Y/ 5'10"/ ఫెయిర్/ బిజినెస్/ 100 కోట్లు + స్థిరపడ్డ వరునికి అందమైన వధువు కావలెను. Ph: 8790515999 (A)

SC మాల హిందు 30/ B.Tech/ Govt. Job/ 90 వేలు P.M. ★ 32/ B.Tech/ SWE/ 18L P.A. వరులకి తగిన వధువు కావలెను. కట్నం లేదు. Ph: 7780300068. (A)

కాపు/ CNB/ 34/ 5'5"/ MCA/ SWE/ 80,000/-PM మంచి వరునికి తగిన మంచి వధువు కావలెను. అర్జెంట్. ✆ 9063471025. వాట్సప్: 7386103012. (A)

Balija MBBS MS 26, 5'7" Banglore Based Doctors Seeks Alliance with Rich/ Affulent Medical Bride ✆ 7899166615 (Direct) (A)

ఎలైట్ మ్యాట్రిమోని.కామ్

వధువు కావలెను

కమ్మ, 25, 6', బి.టెక్, బిజినెస్‌మన్, విజయవాడ వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర: 7550038196.

బ్రాహ్మణ 28, 5'4" కార్డియో, డాక్టరు, ఒంగోలు వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7092511222.

ఆర్యవైశ్య, 27, 5'8" ఎం.టెక్, ఐటి ప్రొఫెషనల్, కెనడా వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7092344555.

కమ్మ 27, 5'10" ఎండి, జనరల్ మెడిసిన్, హైదరాబాద్ వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7550038192.

వైశ్య 27, 5'9" ఎంఎస్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యుఎస్ వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7092788999.

బ్రాహ్మణ, 32, 5'9" ఎంబిఎ, బిజినెస్ అనలిస్ట్, ఆస్ట్రియా వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7550038196.

రెడ్డి 29, 5'11" ఎంఎస్, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్, యుఎస్ఎ వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7092511222.

కాపు 33, 5'5" పిహెచ్‌డి, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్, బెంగళూరు వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7092344555.

ఆర్యవైశ్య 29, 6' బి.టెక్, ఐటి ప్రొఫెషనల్, ముంబాయి వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7550038192.

కాపు 27, 6'2" ఎంఎస్, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్, యుఎస్ఎ వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7092788999.

రెడ్డి 27, 5'7" ఎండి, డాక్టరు, కర్నూలు వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7550038196.

ఆర్యవైశ్య 27, 5'5" బి.టెక్, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 7092511222.

వరుడు కావలెను

రెడ్డి, 24,5'4", ఎం.ఎస్. ఎంటర్‌ప్రెన్యూర్, హైదరాబాద్ తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7550038192

కాపు, 27, 5'6" ఎం.ఆర్క్, సిఇఒ, హైదరాబాద్ తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7092788999

గౌడ్, 28, 5'4"., ఎం.డి. గైనకాలజీ డాక్టర్, హైదరాబాద్ తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7550038196

కాపు, 26, 5'3"., ఎం.ఎస్. ఎంటర్‌ప్రెన్యూర్, ఆంధ్ర తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7092511222

కమ్మ, 32, 5'4" ఎం.ఎస్. యుఎస్ఎలోని ఒక పేరొందిన బ్యాంకుకు సీనియర్ కన్సల్టెంట్, తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7092344555

కాపు, 26, 5'4", బి.టెక్, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్, హైదరాబాద్, విజయవాడ/గుంటూరులో మాత్రమే తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7550038192

ఆర్యవైశ్య, 27, 5'5" ఎంబిఎ, హెచ్‌ఆర్ మేనేజర్, హైదరాబాద్. హైదరాబాద్‌లో తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7092788999

తొగట వీర క్షత్రియ, 24, 5'5", ఎంబిఎ, ఐటి ప్రొఫెషనల్, హైదరాబాద్. తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7550038196

పద్మశాలి, 24, 5'6"., బి.టెక్., ఫ్యాషన్ డిజైనింగ్, హైదరాబాద్ తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7092511222

కాపు, 29, 5'7", ఎంఎస్, క్వాలిటీ ఎనలిస్ట్, యుఎస్ఎ తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7092344555

బ్రాహ్మణ, 29, 5'3"., ఎం.ఇ., సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్, యుఎస్ఎ తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7550038192

రెడ్డి, 24, 5'5", మాస్టర్స్, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్, యుఎస్ఎ. తగిన వరుడు కావలెను. సంప్రదించండి. 7092788999

స్వాగతం కోడలా.. స్వాగతం

నాన్న అంటే అర్థం ఏమిటి? నా అన్నవాడు. ఏ 'కుటుంబ నిఘంటువు' చూసినా ఇదే కనిపిస్తుంది. పెళ్లి వ్యవహారంలోనైనా ఇదే పరిస్థితి. అమ్మాయి తండ్రి అయినా, అబ్బాయి తండ్రి అయినా ఇంతే. పితృదేవో భవ! అనాల్సిందే! పెళ్లి తంతులో వధువు తండ్రిది తెర మీద పాత్ర అయితే, వరుడి తండ్రిది తెర వెనుక పాత్ర. 'వరాయ విష్ణురూపాయ' అంటారు అంటే వరుడు విష్ణువు లాంటివాడు అన్నమాట! మరి అతడి తండ్రి? 'అయ్య' బాబోయ్ ఎంత ఘనమైనవాడు. మన సమాజంలో ఎందుకూ కొరగాని కుర్రాణ్ని నీకెవరు పిల్లని స్తార్రా అని ఎగతాళి చేస్తారు. కొడుకు వరుడు కావడం వెనక ఘనతంతా అతడి తండ్రిదే. అతడి శ్రమ అంతా ఇంతా కాదు. అబ్బాయి తన జీవితాంతం ఎక్కడయినా ఫలానా వ్యక్తి కొడుకును అంటూ తండ్రి పేరు ప్రస్తావించాల్సిందే. అదే అమ్మాయి అయితే పెళ్లికి ముందు ఫలానా వ్యక్తికూతుర్నని, పెళ్లి తర్వాత ఫలానా వ్యక్తి భార్యనని రాసుకుంటుంది. కొందరి విషయం ఇందుకు భిన్నమయినా, ఎక్కువ మంది విషయం ఇదే.

పుత్రుడికి పేరు ప్రఖ్యాతులు కలగడం వెనుక తండ్రి కృషి అనన్య అసామాన్యం. తన పుత్రుడికి తగిన పెళ్లి సంబంధం కోసం తండ్రి పడే ఆరాటం, సాగించే పోరాటం విశేషమైనవి. ఎక్కడ మంచి సంబంధం ఉందన్నా అతడు వెయ్యి కళ్లతో చూస్తాడు. అవసరమైతే రెక్కలు కట్టుకుని వెళతాడు. ఒక్కోసారి 'లెక్కలు కట్టుకుంటాడన్న' పేరు వచ్చినా భరిస్తాడు. కొడుకు క్షేమమే తన క్షేమం మరి! మంచి అమ్మాయి దొరికేంత వరకు అలుపూ సొలుపూ ఉండవు. 'మంగళసూత్ర' పాత్ర ధారి పెళ్లి కొడుకైనా 'మంత్రాల వేళ'కు ముందూ వెనకా జరిగే మంతనాలన్నిటికీ సూత్రధారి అతడి తండ్రే. అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని అంటారు. కానీ అన్నదానం కన్నా కన్యాదానమే మిన్న. అన్నదానం ఒక్క పూట మాత్రమే కడుపు నింపుతుంది. మరి కన్యాదానమో ఇంటిల్లిపాదికీ జీవితాంతం కడుపు నింపుతుంది! కోడలే కుటుంబం మొత్తానికి అన్నదాత అవుతుంది. అమ్మాయి తండ్రి అనగానే కన్యాదానం గుర్తొస్తుంది. అబ్బాయి తండ్రి అనగానే ఏ దానమూ గుర్తుకురాదు. కానీ అబ్బాయి తండ్రి చేసే దానమూ తక్కువదేమీ కాదు పెళ్లికూతురికి తన వంశాన్నిచ్చేస్తాడు. తన ఇంటిపేరునిస్తాడు. తమ వంశాన్ని ఉద్ధరించే బాధ్యత అప్పగిస్తాడు. ఇది సామాన్యమైందా?

తమ పిల్లలకు మంచి చదువులు రావాలని, మంచి ఉద్యోగాలలో/ వ్యాపారాలలో కావాలని/ మంచి పెళ్లి సంబంధాలు కుదరాలని వధూవరుల తల్లిదండ్రులు కలలు కంటారు. తమ అమ్మాయి పెద్దగా చదువుకోకపోయినా ఫర్వాలేదు, పెద్ద ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు... పెళ్లి చేసి ఒక అయ్య చేతిలో పెడితే ఫర్వాలేదు అని రాజీపడే వధువు తండ్రి దొరకవచ్చు కానీ కుమారుణ్ని అన్ని విధాలా అభివృద్ధి చేయకపోయినా ఫర్వాలేదనుకునే తండ్రి మాత్రం దొరకడు.

సమాజంలో కొన్ని సామాజిక వర్గాల్లో పెళ్లి అమ్మాయి ఇంట్లో జరిగితే, మరికొన్ని ఇళ్లలో అబ్బాయి ఇంట్లో జరుగుతుంది. ఇది సంప్రదాయం. అబ్బాయి ఇంట్లో పెళ్లి జరిగితే ఆ భారం వరుడి తండ్రే మోయవలసి వస్తుంది. అమ్మాయి తండ్రి లాగానే అబ్బాయి తండ్రి కూడా అప్పులు చేసి పెళ్లి చేసే సందర్భాలు కనిపిస్తుంటాయి 'మాకు కట్నకానుకలు వద్దు.. పెళ్లి ఘనంగా జరిపిస్తే చాలు' అనే అబ్బాయి తండ్రులు చాలా చోట్ల కనిపిస్తుంటారు.

పెళ్లికి ముందు లగ్న పత్రిక రాసేటప్పుడూ, పెళ్లయ్యాక అప్పగింతల వేళలో అబ్బాయి తండ్రి పాత్ర కొంత కనిపిస్తుంది. లగ్నపత్రికను అబ్బాయి ఇంట్లో రాయడం పరిపాటి. అప్పుడు తమ ఇంటికి వచ్చే వారికి విందుకయ్యే ఖర్చు తనే భరిస్తాడు. అంతే కాదు. లగ్న పత్రిక రాసిన పంతులు గారికి ఇచ్చే పారితోషికంలో మూడింట రెండు వంతులు తానే భరిస్తాడు కూడా. అమ్మాయిని అత్తగారింటికి పంపే సమయంలోనూ అబ్బాయి కుటుంబ పెద్ద పాత్ర తప్పనిసరి. వధువును ఆమె తల్లిదండ్రులనూ ఓదార్చే బాధ్యత ఆయనదే.

ఇంతటి పెద్దవాడికి పెళ్లి వేదిక మీద జరిగే కీలకమైన ఘట్టంలో పాత్ర ఎందుకు లేదన్నదే ప్రశ్న. కాశీ యాత్ర నేపథ్యం తెలుసుకుంటే దీనికి జవాబు దొరుకుతుంది. వెనకటి రోజుల్లో గురుకులాల్లో విద్యాభ్యాసం చేసేవారు. వాళ్లు తమ చదువు పూర్తయాక కాశీయాత్ర చేసేవాళ్లు. కారణం- కాశీ పండితులు మెచ్చిందే విద్య. అలా కాశీ యాత్ర సంప్రదాయం మొదలైంది. ఆ రోజుల్లో ఎక్కడికైనా కాలి నడకన వెళ్లేవాళ్లు. దార్లో తమ కులస్థుల ఇళ్లలో ఆతిథ్యం పొందేవాళ్లు. అటువంటి సందర్భాల్లో పెళ్లి కావలసిన అమ్మాయిలున్న ఇళ్ల పెద్దలు ఈడు, జోడూ, కులం గోత్రం, అందం చందం కుదిరిన సందర్భాల్లో ఆ అబ్బాయికి పెళ్లి ప్రతిపాదనలు చేసేవాళ్లు. అబ్బాయేమో కాశీయాత్రకు వెళ్లాలనేవాడు. కాశీయాత్ర విరమించుకొమ్మని అమ్మాయి సోదరుడు ప్రార్థించేవాడు. అబ్బాయికి కూడా నచ్చితే కాశీయాత్ర విరమించుకుని, అమ్మాయిని పెళ్లి చేసుకునే వాడు. అమ్మాయి తరపున వాళ్లే తప్ప దూరాభారం కావడం వల్ల అబ్బాయి తరపు వాళ్లెవరూ అక్కడ, అప్పుడు ఉండే అవకాశం లేదు.

- శంకరనారాయణ

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

రెడ్డి 1989, 5'7" B.E, IIIT, MS, US, 100K, V.Rich ★ 1988, 5'10", B.Tech, MS, US బిజినెస్ Hyd, 100Cr ✆ 9848221166, 9505551788 (A).

రెడ్డి, 1985, 5'10", B.Tech, 6.7L PA, Hyd ★ 1991, 5'8" B.Tech, MS, US 180K, Rich నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో 9848221166, 9505551788 (A).

రెడ్డి (డైవర్సీ) 1985, 5'11", B.Tech, MBA (Australia) ★ 1986, 5'10" B.Tech, 7.5L PA, Hyd, Rich 9848221166, 9505551788 (A).

కమ్మ/బెల్జియం/ 30Y, 5'9", B.Tech, MS, V.Fair, 46 L P/A, 7 Cr. వరునికి తగిన కమ్మ వధువు కావలెను. ✆ 73863 38574. (B)

గౌడ 29/ 5'7" Fair B.Tech/ MS (USA) SWE/ H1B, 150 K.P.A వరునికి B.Tech/ MS/ PG/ డాక్టర్ వధువు కావలెను ✆ 9848041335/ 9848371924 (A)

కమ్మ 36/ 5'10" (UK/PR) 9 L.P.M/ 4Cr ఆస్తి Fair వరుడికి Fair కమ్మ వధువు కావలెను (డైరెక్ట్). UK ✆ (WhatsApp) + 44 7715919375 (A)

కమ్మ/ USA/ 30 Y, 5'10" MS (ECE), Software Engineer (IT) V.Fair $110K P/A H1B 30 Cr వరునికి తగిన కమ్మ వధువు కావలెను. ✆ 73960 13998. (B)

మాల/ M.Tech NIT/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్ (BEL)/ 12 Lakhs. P.A/ 5'11" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9703794175 (A)

కుమ్మరి/ B.Tech, MBA/ C.Govt. కస్టమ్స్ & ఎక్సైజ్ ఆఫీసర్/ 11 Lakhs P.A/ 5'9" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9989450693 (A)

పద్మశాలి/ M.Tech, NIT/ C.Govt. J.E (రైల్వే)/ 85000/-PM/ 5'9" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A)

క్రిష్టియన్ మాదిగ/ M.Tech/ C.Govt. Asst. Exq. ఇంజనీర్ (రైల్వే) 11 Lakhs P.A/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9985395014 (A)

ముదిరాజ్/ B.Tech/ Govt. A.E (ఇరిగేషన్ Dept) 68000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9052296834 (A)

విశ్వబ్రాహ్మణ/ M.Tech/ C.Govt. Asst. మేనేజర్ (IOCL)/ 90,000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8886512010 (A)

బెస్త/ B.Tech/ Govt. AE (RWS)/ 68000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678. (A)

మాల/ M.Tech/ C. Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 72000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506. (A)

నాయుడు B.Com 1979 5'6" 9 లక్షలు సం॥కి. Mediaలో పనిచేసే అబ్బాయికి అందమైన వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. సం॥ ✆ 8074820369. (A)

కాపు 30 "6" ఫెయిర్ MBA C.Govt. కెనరాబ్యాంక్ Hyd నెలకు 80 వేలు, 2 కోట్లు ఆస్తి వెల్‌సెటిల్డ్ వరునకు తగిన వధువు కావలెను. (డైరెక్ట్ No బ్రోకర్స్). ✆ 95426 44978. (B)

కాపు "ఓన్లీసన్" 28/ 5'10" B.Tech/ SWE/ Infosys/ 9 Lakhs PA వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. ✆ 9618483383 (A)

విశ్వబ్రాహ్మణ 28 5'9" B.Tech SWE MNC 80,000/-PM వరుడికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. ✆ 9866158793 (A)

SC మాదిగ హిందూ 29/ 5'8" M.Tech కంప్యూటర్ సైన్స్ NIT/ వరంగల్/ SWE/ Hyd 14 Lakhs PA వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8712865419 (A)

రెండోపెళ్లి/ Govt జాబ్/ కులపట్టింపులేదు/ 34/ 5'5"/ PG/ 40 వేలు/ వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు ఫోటో & బయోడేటా 9949595523 కు వాట్సాప్ మాత్రమే చెయ్యండి. (నో కాన్ఫరెన్స్ కాల్స్ ప్లీజ్) (A)

బ్రాహ్మణ వైదికి 1982 Nov 5'6" B.Tech కౌశికసగోత్రం మఖ వెల్‌సెటిల్డ్ వరునికి అందమైన వధువు కావలెను. శాఖపట్టింపులేదు. Contact: 9849543881 (A)

SC మాదిగ 29/ 5'11"/ B.Tech సివిల్ Asst కమీషనర్ ట్యాక్సీ ఆఫీసర్ 70 వేలు P/M వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన సాంప్ర॥ కుటుంబపు వధువు కావలెను. ✆ 9533855373 (A)

బ్రాహ్మిణ్ (N) శాఖాభేదం లేదు. భరద్వాజ, B.Tech, BBA, 5'6", Asst మేనేజర్, (సివిల్, సప్లయ్- స్టేట్), 35 సం॥ వరుడికి వధువు కావలెను. డైరెక్ట్: 040- 40180056/ 7981420849 (A)

కాపు: B.Tech/ మేనేజర్ (SBI) 85000PM/ 28 సం॥ వరుడికి వధువు & MSE/ Asst మేనేజర్/ FCI/ 40,000PM/ 26 సం॥ వధువుకి వరుడు కావలెను. ✆ 8340841945 (A)

బ్రాహ్మణ, శ్రీవైష్ణవ/ 43, 5'6"/ BE/ MBA/ 9L PA/ HR కన్సల్టెంట్/ సొంత ఇల్లు/ వధువు కావలెను./ శాఖ పట్టింపు లేదు. 9581599099/ 6309512250 (A)

రెడ్డి విడో/ 35Y/ 3Cr ఆస్తిగల వెల్ సెటిల్డ్/ వరుడుకు/ వధువు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. 9052327553/ 9052327622 (A)

Caste No Bar: 5'5"/ రిటైర్డ్ ఆర్మీ/ పెన్షనర్ వయస్సు: 60 సం॥లు, వరునకు తగిన 40-45 వయస్సు/ విధవ/ సింగిల్ వధువు కావలెను. ✆ 7732024251/ 7729985123 (A)

కాపు 29, 5'10" B.Tech, IIT SWE విప్రో Hyd నెలకు 1లక్ష జీతం గల వరుడుకు సాంప్రదాయమైన వధువు కావలెను. అర్జెంట్ ✆ 8978799956 (A)

Vysya/ B.Tech, MBA, IIM/ 5'8"/ 27/ 18 LPA/ 20 Cr ★ M.Tech/ 5'7"/ 26/ 8 LPA/ 15 Cr ★ B.Tech, IIT/ 5'7"/ 24/ 15 LPA/ 5 Cr కస్తూరి మ్యారేజెస్. ✆ 99632 32758, 0866-2431721. (B)

Padmasali/ B.Tech, IIT/ 5'7"/ 27/ 26 LPA ★ M.Tech, IIT/ 5'9"/ 28/ 18 LPA ★ B.Tech/ 5'7"/ 27/ ONGC ★ IRS/ 5'9"/ 26 B.Tech 5'10"/ 27/ Railway కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771. (B)

Velama/ M.Tech, IIT/ 6'/ 28/ AEE/ Govt/ 10 Cr ★ M.Tech, IIT/ 5'11"/ 28/ 12 LPA/ 6 Cr ★ B.Tech/ 5'10"/ 28/ Bank/ PO కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786, 0866-2438222. (B)

Mala/ M.Tech, IIT/ 5'8"/ 29/ 18 LPA ★ B.Tech, BITS/ 5'10"/ 28/ 24 LPA ★ Group-II/ 5'10"/ 30 ★ B.Tech/ 5'11"/ 26/ SBI ★ MBA/ 6'/ 28/ Customs కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786. (B)

Madiga/ B.Tech/ 5'11"/ 27/ Railway ★ M.Tech/ 30/ BELL ★ M.Tech/ 5'7"/ 27/ 26/ 15 LPA ★ M.Tech/ 5'7"/ 29/ DRDO ★ B.Tech, 5'11"/ 29/ HPCL కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771. (B)

Kapu/ M.Tech, IIT/ 6'/ 26/ 26 LPA/ 20 Cr ★ B.Tech, MBA, IIM/ 5'8"/ 26/ 16 LPA/ 2 Cr ★ B.Tech, IIT, MBA IIM/ 5'8"/ 26/ 24 LPA/ 10 Cr కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786. (B)

★ ★ ★

శెట్టిబలిజ/ డైవర్సీ/ 32y/ 5'.8"/ B.Tech, USAలో జాబ్ చేస్తున్న వరుడికి ఇంజినీరింగ్, డిగ్రీ చదివిన వధువు కావలెను. రాజమండ్రి, ✆ 89857 62237. (G)

రెడ్డి 38 yrs, 5' 10", 5 Cr Pro వరుడికి తగిన 1వ లేదా 2వ 30 సం॥లోపు వధువు కావలెను. నో బ్రోకర్. డైరెక్ట్. ✆ 8919006563. (o)

43 సం॥ కమ్మ 5'6" జీతం: 36,000/- ఆస్థి 15 కోట్లు కల్గిన 1st లేట్ మ్యాచ్ వరునికి 1st మ్యాచ్ కాని, 2nd మ్యాచ్ కల్గిన కమ్మ వధువు కావలెను. ✆ 98481 22354. (B)

★ ★ ★

Below 50 . Bride Wanted for IIT IIM BITS USA UK Educated Brahmin IT Job ✆ 8660499067. No Bars (A)

కాపు, కుజదోషం వున్న వధువు కావలెను. 28 Y, 5'7" ఆస్తి 2 కోట్లు, నెలకు 1,48,000 MBBS డిస్‌కంటిన్యూ వెల్‌సెటిల్డ్ వరుడు. ✆ 90322 41749 (డైరెక్ట్ పార్టీస్). (B)

కాపు 34/ 5'6" P.G. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నెలకు లక్ష జీతం కల వరుడుకు మొదటి/ రెండవ వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. డైరెక్టు: 8465841434. (A)

కమ్మ/డిగ్రీ/ వ. 28/ఎత్తు 5'6" ఫెయిర్ P.Job. A.Income: 4,20,000/- (ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్) వరునికి వధువు కావలెను. డైరెక్ట్. Ph: 95157 49400. (I)

కమ్మ- 34, 5'10" Fair B.Com ప్రైవేట్ జాబ్ చేస్తున్న వరుడికి సాంప్రదాయమైన వధువు కావలెను. సంప్ర: ✆ 99639 26293, 99084 08559. (B)

బ్రాహ్మణ 63, 5'6" రిటైర్డ్ ఉపాధ్యాయుడు, పెన్షన్ నెలకు - 30,000/- రెండు బిల్డింగ్స్ గల వరునకు తగిన వధువు కావలెను. ✆ 92962 58361, 94929 32194. (B)

రజక/ క్రిష్టియన్/ 33 Y/ 5'8"/ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ 7 Cr ప్రాపర్టీ, వెల్‌సెటిల్డ్ వరుడుకి అందమైన వధువు కావలెను. కులపట్టింపు లేదు. డైరెక్ట్. విజయవాడ. ✆ 98495 69958. (B)



వరుడు కావలెను

KAPU 24, 5'4" BE,MNC 10Cr. ★ 25, 5'6" MBBS, MS (GYNIC?) 2Cr. ★ 26, 5'5" BE(BITS) MBA, MNC 15L.PA ★ 23, 5'4", BE(IIT) MNC, 12L.PA ★ 26, 5'4" BE, MBA, 5Cr ★ 8790017711 (A)

Reddy/ B.Tech / MBA/ 29/ 5'3" 50Cr + (Prop) Needs Well Settled Boy/ Cont Sunder Reddy/ Hyd. ✆ 7093051111/ (Whats App) Direct Person (A)

ఆర్యవైశ్య / 24/ 5'4"/ 9 లక్షలు & 30/ 5'2"/ 18 లక్షలు/ రెండో పెళ్ళి/ 35/ 5'3"/ 40 లక్షలు/ 43/ 5'2"/ Govt/ 60 లక్షలు/ జి.సుప్రజాగుప్త "మా సేవ" ✆ 9291503949 (A)

Reddy, B.Te (IIT) (BITS) MS, H1, USA ★ 25, 5'7", 240K ★ 26, 5'6", 110K ★ 30, 5'5" 200K ★ 29, 5'3", 200K ★ 26, 5'2" 145K ★ Cont K.C.Reddy - Hyd Ph: 9347807015 (A).

Reddy, B.Te, MBA, Hyd, 26, 5'5", 50Cr ★ 27, 5'8", 50Cr ★ 26, 5' 3 1/2" 40Cr ★ 30, 5' 2 1/2", 50Cr ★ 28, 5'3" 40Cr ★ 27, 5'6" 50Cr ★ Cont K.C.Reddy Hyd. Ph: 9849321309/ 9347807015 (A).

Reddy, B.Te, MS, H1, USA, Rich ★ 26, 5'4" 50Cr ★ 25, 5'4" 25Cr ★ 26, 5'7", 30Cr ★ 28, 5'4", 30Cr ★ Cont K.C.Reddy Mar Bureau Hyd Ph: 9849321309, 9347807015 (A).

Reddy/ MBBS/ PG/ 30/ 5'8"/ 150 Cr ★ 28/ 5'7"/ 50 Cr ★ 31/ 5'5"/ 50 Cr. ★ 26/ 5'5"/ 10 Cr ★ 28/ 5'8"/ 10 Cr Cont. K.C. Reddy - Mar. Bureau - Hyd - Ph: 9849321309/ 9347807015. (A)

పద్మశాలి: 40 లక్షల ఆస్తి, B.Tech, SWE, 25,000/- PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9908222406 (A)

రజక: B.Tech, C.Govt. క్యాషియర్ & క్లర్క్, SBI బ్యాంక్, 25,000/- PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

పెరిక: B.Tech, Govt. Asst మేనేజర్, ఆంధ్రా బ్యాంక్, 45,000/- PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007652 (A)

యాదవ: B.Tech, Govt. Asst. ఇంజనీర్, ట్రాన్స్‌కో, 48,000/- PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8008939651 (A)

వడ్డెర: MSc, Govt ట్యాక్స్ ఆఫీసర్, ఇన్‌కమ్ ట్యాక్స్ Dept, 38,000/- PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

గంగపుత్ర బెస్త: B.Tech, C.Govt. PO, SBI బ్యాంక్, 40,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

పద్మశాలి: 24/ 5'4"/ MBBS, MD పిడియాట్రిక్స్ గల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను Contact : 9133992360

కాపు: 25/ 5'4"/ MBBS, MS గైనిక్ గల వధువుకి డాక్టర్ లేదా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వరుడు కావలెను Cont: 7288969679

గౌడ : 25/ 5'4"/ MBBS, MS గైనిక్ గల వధువుకి తగిన డాక్టర్ వరుడు కావలెను Cont: 9949753760

SC Mala 45/ 5'4"/ Govt. Job 7L P/A suitable any Govt./ Private Job Well Settled Person Good Communication ✆ 8008842992/ 9642994493. (A)

రెడ్డి, 25, 5'5", Red, B.Tech, SWE, TCS, 10 Cro. pro. వధువుకి వరుడు కావలెను. 0877 2230289, 93924 41433 (D)

బ్రాహ్మణ – 25, 5'4", వైట్, B.Tech, SWE, Doloitte, 5 LPA వధువుకి వరుడు కావలెను. 73822 59734, 73822 59832 (D)

కాపు/ బలిజ: 24Y/ 5'5"/ B.Tech (CSE)/ S/W in Banglur/ 4.5 Lakhs P/A/ 5 Crore property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97041 88499 (D)

పద్మశాలి: 24Y/ 5'3"/ B.Tech (IT)/ S/W in Banglur/ 35,000 P/M/ 80 Lakhs property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 93461 24845 (D)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

2nd Match: 35 Y/ 5'2"/ V.Fair/ B.Tech, MS/ S/W in Hyd. 12 Lakhs P/A, 30 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 83097 63574 (D)

బ్రాహ్మణ 23, BCA,WKG, 3L ★ 25, B.Tech/ SWE, 5L PA ★ 29, MSC, WKG ★ 27, B.Tech, MS(US) ★ 24, MBA, WKG ★ 26, MBBS ✆ 8555024711 (A)

విశ్వబ్రాహ్మణ/ 24/ 5'5"/ B.టెక్/ విప్రో/ 30K ★ 25/5'4"/ B.టెక్, MS/ H1 వీసా ★ 27/5'4"/ MBBS, MS (గై) సంప్ర॥ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి. ✆ 9393276969 (A)

SC మాదిగ/ 24/5'4"/ B.టెక్/ SBI ఆఫీసర్ ★ 25/ 5'5"/ B.టెక్, MS/ H1 వీసా ★ 27/ 5'4"/ MBBS, MD (P) సంప్ర॥ డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి ✆ 9393276969 (A)

కమ్మ, కుల పట్టింపులేదు. 52 సం॥ 5.3 Ht, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్, విడో పిల్లలు లేరు. స్వంత ఇల్లు, 34 ఎకరాలు వ్యవసాయ భూమి కల్గిన మహిళకు తగిన వరుడు కావలెను. Ph: 8008158673. (E)

బ్రాహ్మణ/ 25/ 5'3"/ 10th ★ 28/ 5'4"/ 9th ★ 30/ 5'3"/ 10th వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్, పూజారి అయిన O.K. కట్నాలు ఇవ్వలేరు. ✆ 7674078296/ 8106446865. (A)

బ్రాహ్మణ (మధ్వ) 2వ పెళ్లి 30 సం॥ MCA అమ్మాయికి బ్రాహ్మణ వరుడు కావలెను. బ్రాహ్మణ మొదటి, రెండవ వివాహ సంబంధాలకు కొరకు ✆ 9397925375. (A)

రెడ్డి 1990, 5'6" B.Tech, (CS), MBA, 10L PA, 10Cr ★ 1990, 5'4" B.Tech, 5L PA, Fair నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో 9848221166, 9505551788 (A).

రెడ్డి, 1993, 5'8" B.Tech, BITS, MBA, 16L PA ★ 1996, 5'4" B.Tech, V.Fair & Rich నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో 9848221166, 9505551788 (A).

రెడ్డి 1993, 5'4" B.Tech, MS (US) 10Cr ★ 1989, 5'3" B.Tech, MS, US, V.Fair నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 9848221166, 9505551788 (A).

Yadava 31/ 5'2" B.Sc (Comp) Pakanati 9440831748 ★ 30/ 5'7" B.Tech/ MS/ Ph.D/ 100K/ USA/ Pakanati 9441735157 ★ 32/ 5'5" MBA/ Musty ✆ 9440759945 (A)

బ్రాహ్మణ 27/ 5'4" పరాశర గోత్రం/ B.Sc (Comp)/ Pvt.Job/ రిక్వైర్‌మెంట్/ వెల్‌సెటిల్ ఫ్యామిలీ/ Govt & Pvt Job/ పురోహితం Ok. ✆ 8187000164/ 7997628107 (A)

క్రిష్టియన్ 25, 5'4" B.Tech, SWE, Infosys, Hyd. 70,000/- PM చాలా అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8919759359. (A)

పద్మశాలి/ ఏకైక కుమార్తె/ B.Tech/ Govt. బ్యాంక్ క్యాషియర్ (ఆంధ్రా బ్యాంక్)/ 22000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678. (A)

రజక/ B.Tech/ Govt. Jr. Asst. (ఇరిగేషన్ Dept.)/ 25000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506. (A)

గౌడ/ B.Tech/ Govt. Sr. Asst. (సబ్ రిజిస్ట్రార్ & ఆడిట్ Dept.)/ 28000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9989450693. (A)

రెడ్డి/ B.Tech/ C. Govt. క్యాషియర్ (SBI)/ 30,000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014. (A)

మాల/ B.Tech/ C. Govt. సైంటిస్ట్ (DRDO)/ 60,000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9703794175. (A)

బెస్త/ B.Tech/ Govt. A.E. (GHMC)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8886957298. (A)

మాదిగ/ B.Tech/ C. Govt. బ్యాంక్ మేనేజర్ (SBI)/ 70,000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9642459724. (A)

Reddy/ Divorce/ 30/ 5'3"/ M.Tech/ 1 Cr./ Beautiful Girl seeks suitable Groom. Send biodata to "asreddy2k9@gmail.com" ✆ 9160065919. (A)

కమ్మ/ విడో/ 29 సం॥లు /B.Tech/ 22 కోట్ల ప్రాపర్టీ మీద నెలకు 20 లక్షలు రెంట్స్ వస్తూ ప్రమాదంలో భర్తను మరియు పేరెంట్స్‌ను కోల్పోయిన అందమైన ఒంటరి వధువుకు వరుడు అర్జంటుగా కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు) Contact: Whatsapp Ph: 81211 13493. (B)

బ్రాహ్మిణ్, 26/Degree/ 5'4", 32/ ఇంటర్ 5'5" గల వధువులకు పురోహితం, Job (or) Business గల వరుడు కావలెను. సం॥ 7075024529, 9010133726 (A)

SC మాల, 23, 5'5" ఫెయిర్ B.Tech, NIT A.E.E, C.Govt Job 30 వేలు P/M అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 9666567123 (A)

కుల, ఆస్తి ప్రసక్తిలేదు/ చౌదరి/ విడో/ 36Y/ 5'5", V.ఫెయిర్/ MBBS, కార్డియాలజిస్ట్/ సొంత హాస్పిటల్/ 32 కోట్ల ఆస్తిగల ఒంటరి వధువుకు 1, 2వ వరుడు కావలెను. వాట్సప్: ✆ 7997143258 (A)

కుల, ఆస్తి ప్రసక్తిలేదు/ చౌదరి/ విడో/ 31Y/ 5'5", ఫెయిర్/ సొంత అపార్ట్‌మెంట్స్/ SWE/ 55K (PM) 22 కోట్ల ఆస్తిగల అందమైన వధువుకి 1, 2వ వరుడు కా॥ వాట్సప్: ✆ 9553689269 (A)

రెడ్డి/ లేట్ మ్యారేజ్/ 29Y/ 5'5"/ RTO ఆఫీస్/ Govt జాబ్/ 16 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9515060514 (A)

కులపట్టింపులేదు/ రెడ్డి/ 41Y/ 5'4"/ BA/ B.Ed/ Govt టీచర్/ 45K (PM) సొంత ఇల్లు కల్గిన అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (1వ, 2వ, ఇల్లరికం OK). ✆ 8897587959 (A)

క్షత్రియ డైవర్సీ/ 32/ సొంత బిజినెస్ 40k/ రెంట్స్ 30k/ వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను./ CNB/ OK/ 9052327553/ 9052327622 (A)

యాదవ/ MBBS/ MD/ 30/ 10Cr ఆస్తిగల వధువుకు/ డాక్టర్స్/ SWE/ మరియు బిజినెస్/ వరుడు కావలెను. 9393939962 (A)

కమ్మ ప్రత్యేకం/ 24 & 26/ 5'6" & 5'8"/ డాక్టర్/ లాయర్/ ఇంజనీర్ అందమైన వెల్ ఆఫ్ వధువులకు IND/ USA వరులు కావలెను. శారద : 9849413031 (A)

రాజులు/ 24Y/ 5'.5"/ ఫెయిర్/ B.Tech/ Hydలో వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ గల తండ్రిలేని అందమైన వధువుకు సాంప్రదాయం గల మధ్యతరగతి వరుడు కావలెను. ✆ 8522834317. (C)

రెడ్డి 24, 5'4", B.Tech, SWE విప్రో Hyd నెలకు 50,000/- జీతం గల చాలా అందమైన ఫేర్ ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. అర్జెంట్ ✆ 9059098156 (A)

కమ్మ: 29/5'3" V.Fair/ MBBS, MRCP, UK సెటిల్డ్ డాక్టర్స్ ఫ్యామిలీ వధువుకి USA, UK, ఆస్ట్రేలియా స్థిరపడిన డాక్టర్స్ (or) SWE, హై ఎడ్యుకేటెడ్ (Age Limit Max 8 Yrs) వరుడు కావలెను. ✆ 9346344474/ 9666984474 (A)

SC మాల 27 5'5" USAలో జాబ్ చేస్తున్న వధువుకి USAలో మాత్రమే జాబ్ చేస్తున్న వరుడు కావలెను. డైరెక్ట్ 9885754039/ 9666567123 (A)

SC మాదిగ క్రిష్టియన్ 1980 5'3" PG Govt జాబ్ 80,000/- PM వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి గల వధువుకు వరుడు కావలెను. ✆ 9121157609 (A)

బ్రాహ్మిణ్ 1984 5'4" B.Sc (Comp) Pvt జాబ్ 15,000/- PM శాఖ పట్టింపులేదు అందమైన వధువుకి వరుడు కావలెను. ✆ 9440184507 (A)

Kapu/ B.Tech/ 5'5"/ 23/ Accenture/ 10 Cr ★ MS, Gynac/ 5'6"/ 25/ 15 Cr ★ B.Tech/ 5'7"/ 22/ IBM/ 2 Cr ★ BEMS/ 5'6"/ 26/ 100K/ 2 Cr కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771. (B)

Vysya/ B.Tech/ 5'3"/ 22/ Techmahendra ★ MBA/ 5'5"/ 24/ MNC/ 20 Cr ★ MCA/ 5'6"/ 23/ TCS ★ B.Tech/ MBA, IIM/ 5'3"/ 24/ 14 LPA కస్తూరి మ్యారేజెస్. ✆ 99632 32758. (B)

Padmasali/ B.Tech/ 5'3"/ 23/ TCS/ 3 Cr ★ B.Tech/ 5'4"/ 21/ Infosis ★ B.Tech/ 5'4"/ 23/ IBM ★ B.Tech; NIT/ 5'3"/ 26/ 12 LPA కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771. (B)

Madiga/ B.Tech/ 5'4"/ 23/ Accenture ★ B.Tech/ 5'3"/ 24/ Andhra Bank ★ B.Tech/ 5'4"/ 26/ USA/ 90K ★ MBBS, DGO/ 5'5"/ 25 కస్తూరి మ్యారేజెస్. ✆ 99632 32758. (B)

Mala/ B.Tech/ 5'3"/ 23/ HPCL ★ BEMS/ 25/ 80K ★ B.Tech/ 5'6"/ 24/ Andhra Bank ★ B.Tech, NIT/ 5'3"/ 25/ IOCL కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786, 0866-2438222. (B)

Velama/ CA/ 5'4"/ 24/ 11 LPA ★ B.Tech/ 5'6"/ 23/ CTS ★ MBA/ 5'7"/ 23/ ICICI/ 3 Cr ★ BDS/ 5'3"/ 23/ 50 L ★ B.Tech, MBA, IIM/ 5'7"/ 25/ 5 Cr కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771. (B)

★ ★ ★

Hindu, SC-ML 32+ 5'.4" MBA. Traditional Family. Seeks Alliance. Whatsapp. ✆ 9553627809, R Ph 0891-2565670, M: 9440544041. (C)

SC మాల హిందూ 29 5'.2" MBBS MS Obgy Job చేస్తున్న వధువుకు MD/MS/ Civils/ Group-I గల వరుడు కావలెను. Direct Party. ✆ 8985617708/ 9866090570. (C)

★ ★ ★

విశ్వబ్రాహ్మణ 29 5'4" ఇంటర్ చదివిన విడోయర్ (8 సం॥ బాబు కలడు) వధువుకు విశ్వబ్రాహ్మణ వరుడు కావలెను. ✆ 80744 88197 (I).

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

అగ్నికుల క్షత్రియ/ 30 సం॥/ 5'2"/ M.Tech/ Govt. డిగ్రీ కాలేజ్ లెక్చరర్/ జీతం: 53,000/- PM గల వధువుకి తగిన గవర్నమెంట్ జాబ్ వరుడు కావలెను. ✆ 94406 61749. (B)

వివాహ వేదిక

అన్ని మతాలు మరియు అన్ని కులాల వివాహ సంబంధాలకు సంప్రదించండి. WWW.JEELAKARRABELLAM.COM రిజిస్ట్రేషన్ ఉచితం. 97016 59125 (I).

P.Supriyareddy, Rich Reddy Boys & Girls India & Abroad Matches, All EMP/ GOVT/ PVT/ SWE/ DOC'S/ Business Divorcees from all Regions, Contact: Srinagar Colony, Hyd. PH: 040-23544820, 23545762, Email: palletisupriyareddy@gmail.com (A)

మాల స్పెషల్: IAS, IPS, IRS, IRTS, MBBS, MD, MS, USA, Govt.Jobs, SWE. 789 301 3265 (N).

విశ్వ బ్రాహ్మణ పెళ్ళి సంబంధాల ప్రత్యేక సంస్థ గుంటూరు, బ్రహ్మముడి కమీషన్ డిమాండ్ లేదు. 0863-2261898, 94911 25725 (I).

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ క్యాస్ట్స్) MBBS/ MD/ MS/ MCH/ DM/ BDS & బిజినెస్ మ్యాన్స్‌కి 1వ/ 2వ/ విడో/ దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9966808059. (A)

కుల పట్టింపులేని వారికి 2వ/ లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2PM-5PM పరిచయ వేదిక జరుగును. 1000 మంది వధువరుల లిస్ట్ ఇవ్వబడును. Hyd. 9440937900. (A)

క్రిష్టియన్ వధువు, వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. 9885144375/ 8328388014. (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి: S.N.శర్మ, Hyd. ✆ 9248600342, 8019207503. brahmininformationmatri@gmail.com (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com Hyd ✆ 9440831748, Gunt ✆ 9440759945, VSP 9441735157 (A)

WhatsApp Your Photo & Biodata to 9347262769. We will Send the Suitable Matches. www.pellisandadi.com. ESTD.1991 (A)

Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, MDS & డా॥కి మాత్రమే 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులముల వారికి కుదర్చబడును. ✆ 9866411588 (A)

Since 1989 శ్రీకన్యవివాహవేదిక Hyd అన్ని కులాల & కులాంతర 1వ, 2వ, లేట్ మ్యారేజెస్ ఇండియా/ అబ్రాడ్ వేల్యుల బిక్షపతి. ✆ 27619998 వాట్సాప్ 9396617778/ 9347009998 (A)

ఓన్లీకన్వర్టెడ్ క్రిష్టియన్స్: OC, BC లు మాత్రమే డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, గౌట్ ఎంప్లాయిస్, అబ్రాడ్స్, బిజినెస్‌మ్యాన్స్ & ఆల్ దేశ/ విదేశీ సంబంధాలకై ✆ 9959305599 (A)

అన్నికులాల వారికి : డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, అబ్రాడ్స్, బిజినెస్, హెరిచర్స్ & ఆల్‌గౌట్ ఎంప్లాయిస్ 1వ, 2వ, దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

ప్రతిరోజు వధూవరుల వివాహ పరిచయ వేదిక. మా యూ ట్యూబ్ చానెల్‌లో Youtube/ Briden Groom Matrimony అన్ని మతాలు, కులాలకు 9392489648 (A)

20 సం॥లు అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహవేదిక ✆ 9849414098, 040-66317515 satyasaivivahavedika.com (A)

ఆర్యవైశ్య వధువు, వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Suresh ✆ 7702262508/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

వాసవి-విజయవాడ (రి) వారి 55వ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయవేదిక మరియు 11వ పునర్వివాహ పరిచయవేదిక 15-7-2018 తేదీన I.V. ప్యాలెస్, విజయవాడ నందు ఉ. 9 గంటలకు మరియు మధ్యాహ్నం 2 గంటలకు జరుగును. వివరాలకు: ✆ 99120 26286, 81064 54284. (B)

★ ★ ★

మారుమనువు రక్షణ ప్రార్థన అనుభవముకలిగిన అన్ని కులముల వధూవరులకై వెంటనే సంప్రదించండి. ది కార్నర్ స్టోన్. ✆ 83095 47432, 89777 70727. (B)

రాణి వివాహ వేదిక: అన్ని కులముల వారికి ప్రథమ, ద్వితీయ వివాహములకు సంప్ర. బేబీకేర్ సెంటర్ కూడా కలదు. ✆ 70758 20848, 86888 33434. (B)

హాయ్

లీలామహల్ నా సినిమా స్కూల్

వెండితెరపై గంటన్నర గ్రహణం చూసి.. ప్రయోగం అన్నారు! మరోసారి మాయాబజార్ చూపిస్తే.. ఫర్వాలేదనుకున్నారు! అష్టాచమ్మా చూసి ఇతగాడెవరో టేస్ట్ ఉన్నోడే అని కితాబిచ్చారు. ఇప్పుడు ఆయనగారి సినిమా వస్తుందంటే.. కొత్తదనం పక్కా అని ఎదురుచూస్తున్నారు! అంతకుముందెన్నడూ చూపించని కథావస్తువుతో అమీతుమీ తేల్చుకోవాలనుకునే తత్వం ఆయన సొంతం. చూడ్డానికి జెంటిల్‌మెన్. అయినా అందరి కన్నా భిన్నం. సంగీత, సాహిత్య నేపథ్యం ఉన్న కుటుంబంలో నుంచి వచ్చి తన చిత్రాలతో ప్రేక్షకులను సమ్మోహనం చేస్తున్న విలక్షణ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ హాయ్‌తో పంచుకున్న అనుభవాలు..

● సమ్మోహనంలో తేలిపోతున్నట్టున్నారు?

మంచి సినిమా తీశారని ఒకటే ప్రశంసలు వస్తున్నాయి. 'వాట్ ఏ సినిమా...' అని మహేశ్‌బాబుగారు ట్వీట్ చేశారు. చిరంజీవిగారు ఇంటికి పిలిచి మా బృందాన్ని అభినందించారు. మొత్తానికి చాలా సంతోషంగా ఉందండి.

● గ్రహణం ఇంద్రగంటికి ఇప్పటి ఇంద్రగంటికి తేడా ఏంటి?

గ్రహణం సమయంలో నేను తప్పటడుగులు వేస్తున్నా... ఇప్పుడు తప్పులు లేకుండా సినిమా చేయడానికి ప్రయత్నిస్తున్నా. అప్పుడు నేను సినిమా తీయగలనా? లేదా? అనే సందేహంలో ఉన్నా. ఇప్పుడు ఇంద్రగంటి సినిమాలు ఇలా ఉంటాయి... అని ప్రేక్షకుల్లో గుర్తింపు వచ్చింది. దీన్ని సంతృప్తి పరిచేలా తీయాలని తపిస్తుంటా.

● చిన్నతనంలో బాగా అల్లరి చేసేవారా?

అల్లరిపిల్లాణ్ని కాదు! పుట్టింది పశ్చిమగోదావరి జిల్లా తణుకులోనైనా... నా బాల్యం మొత్తం విజయవాడలోనే సాగింది. పదోతరగతి వరకూ తెలుగు మీడియంలోనే చదివాను. చిన్న, చిన్న తుంటరి పనులు చేసేవాణ్ని.. అంటే స్కూల్‌లో పక్క వాడు కూర్చొనేప్పుడు వాడి కింద క్యారియర్ పెట్టడం, జుట్టు పీకడం వంటివి చేసేవాణ్ని. అయితే బాగా చదువుతాను కాబట్టి టీచర్లు పెద్దగా పట్టించుకునే వారు కాదు. అలా ఒకసారి నేనేదో చేశానండి. ఒక పూటంత తరగతి గదిలో ఒక్కణ్నే పెట్టి తాళం వేశారు. సాయంత్రం దాకా ఏడుస్తూ కూర్చున్నా.

● మీరు సినిమాల్లోకి రావాలని ఎప్పుడు అనుకున్నారు?

విజయవాడ 'లీలా మహల్' నా సినిమాలకు పెద్ద స్కూల్. ఆ సినిమా హాల్ యజమానికి మీ ద్వారా థ్యాంక్స్ చెబుతున్నా. ఆ థియేటరే సినిమాకు సంబంధించి ఓనమాలు నేర్పించింది. థియేటర్ వెనకాల పెసరట్టు తిని, మంచి కాఫీ తాగి... అలా సినిమాకు వెళ్లే వాణ్ని. అక్కడ టికెట్లు ఇచ్చే అబ్బాయి కూడా సినిమాను రివ్యూ చేసేవాడు. సాయంత్రం అయితే తలుపులు అన్నీ తెరిచేవారు. చల్లని గాలి వస్తుంటే.. సినిమా చూసేవాణ్ని. టికెట్ రూ.4.50. ఆ హాల్‌లో 'జాస్' అనే ఇంగ్లీషు సినిమా చూసినప్పుడే నేనూ సినిమాల్లోకి రావాలని డిసైడ్ అయ్యాను.

❐ మా అమ్మమ్మ నాకు సినిమా గురువు. ఆమె కథలు చెప్పేటప్పుడు రంగులు, శబ్దాలు, పాత్రలు... ఇలా అన్నీ కళ్లకు కట్టేట్లు చెప్పేది. కథ ఎలా చెప్పాలో ఆమె దగ్గరే నేర్చుకున్నా.

❐ మా నాన్న ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారికి బాపు, రమణ గారు మంచి స్నేహితులు. ఒకసారి సంపూర్ణ రామాయణం సినిమాల్లోని కొన్ని రీళ్లు తెచ్చి మాకు ఇచ్చారు. వాటిని మా అక్కతో కలిసి ఇంట్లోనే ఒక డబ్బా తీసుకొని దానికి భూతద్దం పెట్టి, లైటింగ్ వేస్తూ... దూరంగా పంచెపై ఫోకస్ చేసి ఆ రీళ్లను బొమ్మలుగా చూశాం.

❐ మా అమ్మ ఇంద్రగంటి జానకి మంచి నవలా, కథా రచయిత్రి. నాన్నగారు మంచి కవి. అలా నాలో చిన్నప్పటి నుంచి కళలు జీర్ణించుకొని పోయి... ఈ రంగం వైపు నడిపించాయి.

● మీ సినిమాల్లో అమ్మాయిలను చాలా స్వతంత్రంగా చూపిస్తారు.. కదా?

మా అమ్మమ్మ, మా అమ్మ, అత్తయ్య, నా భార్య... ఇలా చాలా మంది నా జీవితంలో మహిళలు ప్రొఫెషనల్‌గా, ఇండిపెండెంట్‌గా ఉంటారు. తాతయ్య పోయాక అమ్మమ్మే పిల్లలను కష్టపడి చదివించి ప్రయోజకులను చేసింది. వీళ్లంతా నాకు స్ఫూర్తిమంతంగా కనిపిస్తారు. అందుకే నా సినిమాల్లో పాత్రలను బలంగా తీర్చిదిద్దుతాను.

● సినిమాల్లోకి రావాలంటే సినిమా చదువు అవసరమా?

కచ్చితంగా. ఈ రంగంలోకి రావాలంటే... సంస్కృతి, సాహిత్యం, సంగీతం, వ్యక్తులు.. వారి సంభాషణలు తెలుసుండాలి. అప్పుడే మంచి సినిమాలు తీయగలరు.

● సినిమా సమాజంలో మార్పు తెస్తుందని మీరు భావిస్తారా?

'కళ అనేది మనిషిలో మార్పు తేవాల్సిన అవసరం లేదు... మార్పునకు అవసరమైన ఆలోచనను రేకెత్తిస్తే చాలు' అని ఒక పెద్దాయన చెప్పారు. సినిమా అనేది అనేక కళల సమ్మిళితం. ఇదీ కచ్చితంగా వ్యక్తులపై ప్రభావం చూపుతుంది.

● మీరు సినిమాకు సినిమాకు మధ్య చాలా విరామం తీసుకుంటారెందుకు?

నేను పరిశ్రమలోకి వచ్చి 14 సంవత్సరాలు అవుతోంది. తొమ్మిది సినిమాలు చేశాను. ఇది ఆరోగ్యకరమైన విరామమే. గ్యాప్ రావడానికి కారణాలు చాలా ఉన్నాయండి. కథ నేను ఒక్కణ్నే రాసుకుంటాను. దానికి నిర్మాతలకు చెప్పడం, వారు ముందుకు రావడం వంటి పనులతో ఆలస్యమవుతుంది. 2016 నుంచి వేగంగా తీస్తున్నాను. ఇక ముందు మరింత పెంచుతాను. ఎందుకంటే రాసుకున్న కథలన్నీ తీశాయాలని నిర్ణయించుకున్నాను. సంవత్సరానికి ఒక్కటైనా తీస్తాను.

● బయోపిక్‌లు తీసే సంస్కృతి వచ్చింది. మీరు ఎవరి బయోపిక్ తీస్తారు?

నాకు సామాన్యుడి బయోపిక్ తీయాలనుంది. కారంచేడు కేసు వాదించిన లాయర్ గారి జీవితంపై తీయాలనుంది. అలాగే చలం, బొజ్జాతారకం..లాంటి వారి జీవితాలు తీస్తాను.

● ఇంట్లో సినిమాలపై చర్చ జరుగుతుందా?

బాగా జరుగుతుందండి. మా అమ్మ, నాన్న, నా భార్య అందరూ నా స్క్రిప్ట్‌పై తమ అభిప్రాయాలు చెబుతారు. కొన్ని సీన్లపై అభ్యంతరాలు చెబుతారు. ఒకసారి మా అమ్మ స్నేహితురాలు నా సినిమా చూసి... ఫోన్ చేసి... మీ అబ్బాయి బాగా తీశారండి. మీ పేరు నిలబెట్టారు అన్నారంట! అంతే అమ్మ ఆ రోజంతా ఎంతో ఆనందంగా ఉన్నారు.

● మీరు ఎక్కువగా బాధపడిన సంఘటనలు?

సినిమాల్లోకి రావడానికి నేను పెద్దగా బాధలు పడలేదు. కథలు చెప్పేటప్పుడు కూడా ఎవరూ నన్ను అవమానకరంగా మాట్లాడలేదు. ఎక్కడి వెళ్లినా బాగా చదువుకున్నానని గౌరవించారు. 'బందిపోటు' చిత్రం ఫెయిల్ అయినప్పుడు బాగా బాధపడ్డాను. నేను ఇంకొంచెం బాగా చేసి ఉంటే ఇలా అయ్యేది కాదని ఆలోచించాను. ఎంత బాధలో ఉన్నా.. సాహిత్యం చదివితే తేరుకుంటాను. అవే నన్ను ఉత్తేజితం చేస్తాయి. నా ఓటమికి కారణాలేంటి? అని రాసుకుంటాను. తర్వాతి ప్రాజెక్టులో ఆ తప్పులు జరగకుండా చూసుకుంటాను.

● కమర్షియల్ సినిమాలపై మీ అభిప్రాయం?

కమర్షియల్ సినిమా అంటే నాకు ఇంతవరకూ తెలియదు. సినిమా అంటే జనాదరణ పొందాలి అంతే.

– కోగటం వీరాంజనేయులు, ఫొటోలు: రాజమౌళి

తెలుగు తెలియదనిపించింది

బొజ్జాతారకం పంచతంత్రం, బండి నారాయణ సప్తభూమి, కల్యాణరావు అంటరాని వసంతం నన్ను ఎక్కువ ప్రభావితం చేసిన పుస్తకాలు. ఇస్మాయిల్ కవిత్వం బాగా నచ్చుతుంది. శిలాకోల అనే ఉత్తరాంధ్ర పుస్తకం చదివినప్పుడు నాకు చాలా తెలుగు తెలియదని అనుకున్నాను. ఇలాంటి పుస్తకాలు ప్రతి ఒక్కరూ చదవాలి. అప్పుడే మన సంస్కృతి తెలుస్తుంది.

టీ20లు.. యాక్షన్ మూవీలు

క్రికెట్ అంటే చాలా ఇష్టం. వన్‌డే, టెస్టులు ఎక్కువగా చూస్తాను. టీ20లు నాకు ఏదో యాక్షన్ సినిమాలు చూసినట్లు ఉంటుంది. అయితే సెమీఫైనల్ దశ నుంచి చూస్తాను. నేను చిన్నప్పుడు క్రికెట్ ప్లేయర్‌నే. స్కూల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాను కూడా. గోల్కొండ హై స్కూల్ సినిమా తీయడానికి నాకు దానిపై ఉన్న ఇష్టమూ ఓ కారణమే.

ఇష్టమైనవి

దర్శకుడు : సత్యజిత్‌రే
సినిమా : చారులత
ప్రదేశం : టొరంటో
ఆహారం : కొర్రల బిస్‌బేళేబాత్, పులిహోర

నువ్వు నాకు నచ్చావ్..

● నా భార్య పేరు ఉమ. మాది ప్రేమ వివాహం. మా ప్రేమలో ఐ లవ్‌యూ చెప్పడాలు, వెంటపడటాలు లేవు. ఇద్దరం ఇంగ్లిష్ విద్యార్థులమే. అప్పుడప్పుడూ సదస్సులు, సమావేశాల్లో కలిసేవాళ్లం. తను నా ఆపోజిట్ టీమ్‌లో ఉండేది. తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తను, నేను క్లాస్‌మేట్స్. మంచి ఫ్రెండ్స్. ఒకసారి తనే అడిగింది... 'ఏంటీ ఈ మధ్య నాతో ఎక్కువగా మాట్లాడుతున్నావ్? నీ పర్సనల్ విషయాలన్నీ చెబుతున్నావ్?' అంది. 'నువ్వు నాకు నచ్చావు... మనం కలిసుంటే బాగుంటుందనిపిస్తోంది. నీ అభిప్రాయం ఏంటి?' అన్నాను. తనకూ అలాగే ఉందంది. తర్వాత ఇద్దరం ఇంట్లో చెప్పాం. అందరూ ఒప్పుకున్నారు. అలా మా పెళ్లి పుస్తకం తెరిచాం. తను నన్నెప్పుడూ ప్రోత్సహిస్తుంది. తను ఇఫ్లూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తోంది. 'నీకు ఇష్టమైన దానిపై కష్టపడు... డబ్బు కోసం చూడకు. ఏదైనా కష్టమొస్తే నేను ఉన్నాగా' అంటుంది. పిల్లలు నీలిమ, నిషాంత్. అమ్మాయికి 13 ఏళ్లు. బాబుకు ఏడేళ్లు.

● పిల్లలను విచక్షణతో పెంచాలండి. మంచీ చెడూ రెండూ వివరిస్తాను. అంటే ఒక చాక్లెట్ కొనాలన్నా... వారిష్టమే. ఏది మంచో ఏది చెడో చెబుతానంతే. ఎంపిక వారిష్టం. ఎంపిక చేసుకున్న తర్వాత వారు దానికి కట్టుబడాలంతే. వారికి ఏ రంగం ఇష్టముంటే ఆ రంగంలో ప్రోత్సహిస్తాను. మా అమ్మాయి ఆర్కిటెక్ట్ కావాలని చెబుతుంది. మా అబ్బాయికి ఇంకా పూర్తిగా అవగాహన రాలేదు

మా అమ్మాయి సినిమాల్లోకి వస్తానంటే..!

పిల్లలు సినిమాల్లోకి వెళ్తాను అంటే ఇంట్లో ప్రోత్సహించే వాతావరణం రావాలి. ఇందుకు సినిమా పరిశ్రమలోనూ ఆత్మవిమర్శ జరగాలి. ఎక్కడ లోపం జరుగుతోందో తెలుసుకొని దిద్దుకోవాలి. ఇక్కడ రాణించాలంటే రాజీ పడాలనే కొద్దిమంది వల్ల మొత్తం పరిశ్రమకే చెడ్డపేరు వస్తోంది. దీన్ని పరిహరించాలి. ఏ మధ్యతరగతి అమ్మాయి అయినా సినిమాల్లోకి రావడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. మా అమ్మాయి సినిమాల్లోకి వస్తానంటే నేను కాదనను. ఎందుకంటే నాకు ఈ పరిశ్రమంటే ఎంతో గౌరవముంది. పరిశ్రమలో చెడ్డవాళ్లు ఎక్కడో ఉంటారు... అంతేగానీ అందరూ అలాంటి వాళ్లు కాదు.

అదే తొలి.. చివరి.. జీతం

ఒక్క రోజు సీఎంలా... నేను ఒక్క నెల జర్నలిస్టుని. ఈనాడు నడిపే ఆంగ్ల పత్రిక... న్యూస్‌టైంలో నెల రోజులు సబ్‌ఎడిటర్‌గా పనిచేశాను. నా జీవితంలో నేను అందుకున్న మొదటి నెల జీతం రూ.2200. నేను తీసుకున్న మొదటి, చివరి జీతం అదే. తర్వాత ఎక్కడా ఉద్యోగం చేయలేదు. ఆ డబ్బుతో అమ్మకు చీర, నా భార్యకు వాచీ కొన్నా. ఇంకా రూ.300 మిగిలింది. సాయంత్రం అందరమూ హోటల్‌కి వెళ్లి మంచి పార్టీ చేసుకున్నాం.

జబర్దస్త్ అనగానే ఆమె పేరు గుర్తొస్తుంది. ఆమె కనబడగానే బజర్దస్త్ అనిపిస్తుంది. కామెడీ షోలో ఆ పలుకు బంగారం డ్యాన్స్ పోటీలో అడుగేస్తే సింగారం గడసరి మాటలతో, ముచ్చటైన స్టెప్పులతో అదరగొడుతున్న రష్మీ చెప్పిన కబుర్లు..

నేనూ చాలామందికి చెప్పా!

◆ వైజాగ్‌లో పుట్టిపెరిగారు కానీ.. మీ తెలుగేంటి అలా..?

నాకు తెలుగు తెలుసు. కానీ ఆ యాసపై పట్టు చిక్కలేదు. దానికి కారణం.. మా అమ్మది ఒడిశా, నాన్నది యూపీ. దానికితోడు నేను సీబీఎస్‌సీ స్కూల్లో చదివాను. దాంతో ఎవరితో మాట్లాడాలన్నా ఇంగ్లిష్, హిందీనే మాధ్యమం. జబర్దస్త్‌కి వచ్చాక తెలుగు చాలా నేర్చుకున్నా. తెలుగు చక్కగా మాట్లాడుతున్నావని అంటుంటే ఎంతో పాజిటివ్‌గా అనిపిస్తుంది.

◆ మిమ్మల్ని కొందరు రష్మీ అనీ, రేష్మీ అనీ అంటుంటారు.. ఇంతకీ ఎలా పిలిస్తే పలుకుతారు?

నా అసలు పేరు రష్మీ. కొంతమంది రేష్మీ అంటారు. కొందరు లక్ష్మి అని కూడా అంటారు. పిలుపులో వెటకారం లేకపోతే.. ఎలా పిలిచినా పలుకుతా!

◆ డ్యాన్స్‌లో శిక్షణేమైనా తీసుకున్నారా?

లేదండీ! నేనసలు ఎప్పుడూ డ్యాన్స్ నేర్చుకోలేదు. చిన్నప్పుడు అద్దం ముందు నిలబడి శ్రీదేవిగారి 'మిస్టర్ ఇండియా' సినిమాలోని పాటకు స్టెప్‌లు వేసేదాన్ని. తరువాత మాధురీదీక్షిత్‌పై ఇష్టంతో ఆవిడ సినిమాలోని ప్రతి పాటనీ అనుకరించేదాన్ని. ఆ ఇష్టంతోనే నటన వైపు వచ్చాను. స్కూల్లో, మా కమ్యూనిటీలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా.. నేను డ్యాన్స్ చేసేదాన్ని.

◆ ఢీ ఫైనల్స్‌లో గెలుపెవరిదో చెప్పగలరా?

మా టీమ్ గెలవాలని కోరుకుంటున్నాను

◆ నటనలోకి వస్తానంటే.. ఇంట్లో వాళ్లు ఏమన్నారు?

సినిమాల్లోకి వెళ్తానంటే.. మధ్యతరగతి కుటుంబాల్లో ఎవరూ ఓ పట్టాన ఒప్పుకోరు కదండీ! మా ఇంట్లోనూ అంతే! మా కుటుంబంలో అందరూ బాగా చదువుకున్న వారే. అమ్మ ప్రిన్సిపల్.. పిన్ని వైస్ ప్రిన్సిపల్. మామయ్య లెక్కల్లో గోల్డ్‌మెడలిస్ట్... అందరూ విద్యాధికులే. అందుకే నా ఆలోచన చెప్పగానే అందరూ షాక్ అయ్యారు. అలాగని కండిషన్‌లు పెట్టే ఫ్యామిలీ కూడా కాదు. 'ఏం చేసినా ఆలోచించి అడుగు వెయ్' అని మాత్రం చెప్పారు.

◆ మరి మీరేం చదువుకున్నారు..?

నాకు చదువంటే అస్సలు ఇష్టం లేదు. లెక్కల్లో వీక్. నేను కోరుకున్న సబ్జెక్టులు అందుబాటులో లేకపోవడంతో.. ఇగ్నో నుంచి ఆర్ట్స్ (ఫుడ్ అండ్ న్యూట్రిషన్)లో డిగ్రీ పూర్తిచేశాను. అదీ ఇంట్లో వాళ్లు వెంటపడితే.

◆ సినిమా అవకాశాల కోసం ఇండస్ట్రీ చుట్టూ తిరిగారా?

లక్కీగా నాకు అటువంటి పరిస్థితి ఎదురుకాలేదు. కానీ, పన్నెండేళ్ల పాటు ఇండస్ట్రీలోనే ఉన్నా.. సరైన సక్సెస్ అందుకోలేకపోయాను. ఫిల్మ్ బ్యాక్‌గ్రౌండ్ లేకపోవడం, సరైన మార్గదర్శనం లేకపోవడం కారణం అనుకుంటా. మొదట ఓ డిజిటల్ సినిమా చేశాను. 'హోలీ' తర్వాత అలాంటి క్యారెక్టర్లే రావడంతో నేనే బ్రేక్ తీసుకున్నా. తర్వాత యువ సీరియల్‌లో అవకాశం వచ్చింది. 'లవ్' అనే సీరియల్‌లో నటించా. కొన్నాళ్లకు కరెంట్, బిందాస్, ప్రస్థానం.. ఇలా కొన్ని సినిమాలు చేశాను. అనుకున్నంత సంతృప్తిగా అనిపించలేదు. బుల్లితెర ప్రయాణమే బాగా ఉందనిపించింది. ఆ సమయంలోనే వ్యక్తిగత కారణాలతో ఏడాదిన్నర పాటు బ్రేక్ తీసుకున్నా. అప్పుడే 'జబర్దస్త్' టీమ్ నుంచి ఫోన్ వచ్చింది. 2013లో కొత్త ప్రయాణం మొదలైంది. ఈ షోతో మంచి విజయం అందుకున్నా. ప్రతి తెలుగింటికీ దగ్గరయ్యా.

◆ ఫ్యాన్స్ నుంచి ప్రేమలేఖలు, బహుమతులు ఏమైనా అందుకున్నారా?

ఇప్పుడు అన్నీ ఆన్‌లైన్ అయిపోయాయి. లెటర్స్ రాసేవాళ్లు, హ్యాండ్‌మేడ్ గిఫ్ట్ పంపేవాళ్లు ఎవరుంటారండి. ఏదైనా పంపాలనుకున్నా. ఫొటోనో, వీడియోనో తీసి పంపిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో చెబుతున్నారు.

◆ ఇంతకీ పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు?

ఇప్పటికైతే.. ఎలాంటి ఆలోచనా లేదు. మా తాతగారు 'దేన్నికైనా టైమ్ రావాల'ని అంటుంటారు. ఇదీ అంతే!

◆ లవ్ ప్రపోజల్స్ ఏమైనా ఉన్నాయి?

ఇవన్నీ లైఫ్‌లో భాగం. అలాంటివి చాలావచ్చాయి. నేనూ చాలామందికి ప్రపోజ్ చేశా. నాకూ చాలామంది చెప్పారు. ఈ ఐదేళ్ల నుంచి అలాంటివి ఏమీ లేవు. నా ప్రొఫెషన్‌కే కట్టుబడి ఉన్నాను.

– స్వాతి కొరపాటి

◆ ప్రస్తుతం టీవీ షోల్లో చాలా బిజీగా ఉంటున్నా. మంచి, కథ దొరికితే తప్పకుండా సినిమా చేస్తాను. రష్మీ అంటే గ్లామరస్ డాల్ అనుకుంటారు. ఎప్పటి నుంచో ఓణీ వేసుకుని సంప్రదాయబద్ధంగా చేయాలనే కోరిక 'గుంటూరు టాకీస్'తో తీరిపోయింది. ఆ పాత్రతో నేను ఇలాంటివి కూడా చేయగలననే నమ్మకం కుదిరింది.

అనూ బెస్ట్ ఫ్రెండ్

◆ జబర్దస్త్‌లో మొదట అనసూయ చేశారు కదా! ఆమె ప్రభావం మీపై ఎంత వరకూ ఉంది?

నేను జబర్దస్త్ ఒప్పుకునేటప్పటికి కేవలం పదమూడు ఎపిసోడ్‌లు పూర్తయ్యాయి. అప్పటి వరకు ఆ షో గురించి నాకేం తెలియదు. నాకిచ్చిన పనిని వంద శాతం ఇష్టంగా చేశాను. అయితే అనసూయకున్న ఫాలోయింగ్ ఆ తరువాతే తెలిసింది. కొన్ని ఎపిసోడ్‌లు పూర్తయ్యాక యూట్యూబ్‌లో పాత వీడియోలు చూస్తుంటే అనసూయ ఫ్యాన్స్ నన్ను అక్కడ తిట్టడం చూసి కొంత డిప్రెషన్‌కి గురయ్యా. కానీ తరువాత జబర్దస్త్ టీమ్ సపోర్ట్‌తో ముందుకెళ్లా. నాదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తూ వచ్చా.

◆ మీ మధ్య పోటీ ఎలా ఉంది?

కాంపిటేషన్ ఉంటుంది. కానీ, అసూయలు ఉండవు. ముఖ్యంగా అనూ (అనసూయతో) అందరూ అనుకున్నట్లు అస్సలు లేదు. మేమిద్దరం మంచి ఫ్రెండ్స్. నేను ఇంటికి దూరంగా ఉంటాను కాబట్టి ఎప్పుడైనా హోం ఫుడ్ కావాలనిపిస్తే అనూ వాళ్లింటికే వెళ్లిపోతా. పిల్లలతో చక్కగా ఆడుకుంటా. ఇక యాంకరింగ్‌లో ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రత్యేకత. ఆ ఐడెంటిటీ కోసం నేను ట్రై చేస్తాను.

ఈనాడు సినిమా

పొరుగింటి పుల్లకూరకి రుచెక్కువనే మాటని కథానాయికలు నిరూపిస్తున్నారు. మాతృభాషలో మంచి పునాదులే పడినప్పటికీ... పొరుగునే కెరీర్‌ని తీర్చిదిద్దుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఆ పోకడ తెలుగు చిత్ర పరిశ్రమలో ఎక్కువగా కనిపిస్తోంది. నిజానికి పరభాషా కథానాయికలు తెలుగు చిత్రసీమకి రావడం కొత్తేమీ కాదు. ఎప్పట్నుంచో ఉన్నదే! కొత్తందం కావాలనుకొన్న ప్రతిసారీ దర్శకనిర్మాతలు ముంబైకో, దిల్లీకో వెళ్లిపోతుంటారు. లేదంటే మలబారు తీరంవైపు దృష్టి పెడుతుంటారు. ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న కథానాయికల్లో ఆ రకంగా మన ఆహ్వానం అందుకొని వచ్చినవాళ్లే ఎక్కువ. కాకపోతే ఇదివరకు కొత్త తారలో, లేదంటే మాతృభాషలో సరైన అవకాశాలు, గుర్తింపు లేనివాళ్లో ఇటువైపు రావడానికి ఆసక్తి చూపేవారు. ఇప్పుడు మాత్రం సొంత భాషలో మంచి గుర్తింపుని తెచ్చుకొన్న కథానాయికలు సైతం... మాకు తెలుగు సినిమానే ముద్దు అంటూ ఇటువైపు వచ్చేస్తున్నారు. అచ్చమైన తెలుగు కథానాయికలుగా మారిపోయి, అందాల కొరతని తీర్చేస్తున్నారు.

మనసంతా తెలుగే!

పూజా హెగ్డే

అనుపమ

ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. చిత్రసీమలో మాత్రం అది అన్నిసార్లూ అందరికీ సాధ్యం కాదు. కొద్దిమందికి పొరుగూరు, పొరుగు భాషే బాగా కలిసొస్తుంటుంది. అక్కడ గెలిచాకే, తిరిగి ఇంట సత్తా చూపే ప్రయత్నం చేస్తుంటారు. కాజల్, సమంత, తమన్నా, శ్రుతిహాసన్... తదితర భామలంతా ఆ కోవకి చెందినవాళ్లే. వీళ్లకి తొలినాళ్లలో మాతృభాష కలిసిరాలేదు. దాంతో తెలుగు చిత్రసీమపై దృష్టిపెట్టారు. ఇక్కడ విజయాలు, గుర్తింపుని సొంతం చేసుకొని ఆ తర్వాత మాతృభాషలో అవకాశాల్ని అందుకొన్నారు. నవతరం కథానాయికలు మాత్రం వీళ్లకి భిన్నంగా ప్రయాణం చేస్తున్నారు.

అను ఇమ్మానుయేల్, అనుపమ పరమేశ్వరన్, పూజా హెగ్డే, కైరా అడ్వాణీ, నిధి అగర్వాల్, సాయిపల్లవి, నివేదా థామస్ తదితర నవతరం భామలందరికీ వాళ్ల సొంత భాషల్లో మంచి ఆరంభమే లభించింది. మలయాళ ముద్దుగుమ్మ అయిన అను ఇమ్మాన్యుయేల్ అక్కడ 'యాక్షన్ హీరో బిజు' అనే చిత్రంతో కథానాయికగా పరిచయమైంది. ఆ చిత్రం ఆమెకి మంచి గుర్తింపునే తీసుకొచ్చింది. తెలుగు చిత్రసీమ దృష్టిలో పడింది కూడా ఆ సినిమాతోనే. అలాగే అనుపమ పరమేశ్వరన్ పేరు కూడా ఆమె సొంత భాష మలయాళంలో చేసిన తొలి చిత్రం 'ప్రేమమ్'తోనే మంచి గుర్తింపుని సొంతం చేసుకొంది. సాయిపల్లవి మాతృభాష తమిళం అయినా, ఆమె మలయాళీ భామగానే అందరికీ పరిచయం. తొలి చిత్రం 'ప్రేమమ్' ఆమెకి ఆ గుర్తింపును తీసుకొచ్చింది. ఆయా చిత్రాలు విడుదలైన వెంటనే వాళ్లకి అవకాశాలు వెల్లువెత్తాయి. కానీ వాళ్లు మాత్రం సొంత భాష కంటే కూడా తెలుగు నుంచి వచ్చిన అవకాశాలపైనే మక్కువ ప్రదర్శించారు. ప్రస్తుతం సాయిపల్లవి తెలుగుతో పాటు తమిళంలోనూ సినిమాలు చేస్తోంది కానీ, అను ఇమ్మాన్యుయేల్, అనుపమ పరమేశ్వరన్‌లు మాత్రం పూర్తిస్థాయిలో తెలుగుపైనే దృష్టిపెట్టారు. ఈ మధ్యలో మలయాళం నుంచి చాలా అవకాశాలే వచ్చాయి కానీ... తెలుగులో చేస్తున్న సినిమాలవల్ల కాల్షీట్లు సర్దుబాటు చేయలేకపోయాం అంటున్నారు ఈ ఇద్దరూ. అలాగే పూజా హెగ్డే, నివేదా థామస్ కూడా తెలుగే కీలకంగా భావిస్తున్నారు. నివేదా థామస్‌కి మలయాళం, తమిళ భాషల్లో మంచి గుర్తింపు ఉన్నప్పటికీ.. ఆమె తెలుగు నుంచి వస్తున్న అవకాశాలపైనే మక్కువ ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం కల్యాణ్‌రామ్ సరసన ఓ చిత్రంలో నటిస్తోంది. తమిళంలో ప్రయాణం మొదలుపెట్టిన పూజాహెగ్డే ఆ తర్వాత తెలుగుకొచ్చి, మళ్లీ హిందీకి వెళ్లింది. ఇప్పుడు తెలుగు సినిమాలపైనే దృష్టిపెట్టింది. ఎన్టీఆర్, మహేష్‌బాబు చిత్రాల్లో నటిస్తున్న ఆమె తదుపరి ప్రభాస్‌తోనూ జోడీ కట్టనుంది.

అను ఇమ్మానుయేల్

సాయిపల్లవి

హిందీ భామలు కూడా...: 'భరత్ అనే నేను'తో తెలుగు తెరకు పరిచయమైన హిందీ భామ కైరా అడ్వాణీ. ఆమె కూడా తెలుగు చిత్రాలపై ప్రత్యేకమైన ప్రేమని ప్రదర్శిస్తోంది. 'ఫగ్లీ', 'ఎమ్.ఎస్.ధోని', 'మెషీన్' తదితర చిత్రాలతో హిందీలో మంచి పేరు సంపాదించినప్పటికీ, తెలుగులో కూడా కొత్త అవకాశాలకు పచ్చజెండా ఊపే ప్రయత్నంలో ఉంది. ప్రస్తుతం ఈమె రామ్‌చరణ్‌తో కలిసి ఓ చిత్రంలో నటిస్తోంది. 'సవ్యసాచి'లో నాగచైతన్యతో కలిసి నటించిన నిధి అగర్వాల్ హైదరాబాద్‌లో పుట్టింది కానీ, బాలీవుడ్ భామగానే అందరికీ పరిచయం. అక్కడ 'మున్నా మైఖేల్' అనే చిత్రంతో మంచి గుర్తింపుని తెచ్చుకొంది. మరిన్ని బాలీవుడ్ అవకాశాలు వస్తున్నప్పటికీ, అఖిల్ సరసన తెలుగులో నటించేందుకు ఒప్పుకుంది. 'సాహో'లో ప్రభాస్ సరసన శ్రద్ధాకపూర్ నటిస్తోంది. ఆమె హిందీలో అగ్ర కథానాయిక. తెలుగు సినిమాలతో లభించే గుర్తింపుతో పాటు, ఇక్కడ తారలకి లభించే పారితోషికం కూడా ఎక్కువ కాబట్టి కథానాయికలు ఇక్కడ కెరీర్‌ని నిర్మించుకొనే ప్రయత్నం చేస్తున్నారనేది పరిశ్రమ వర్గాల మాట. పైగా ఈమధ్య తెలుగులో మంచి కథలు, బలమైన పాత్రలు రూపుదిద్దుకొంటున్నాయి. దాంతో నటన పరంగా కూడా తారలకి సంతృప్తి లభిస్తోందనేది కథానాయికల మాట.

కైరా అడ్వాణీ

నిధి అగర్వాల్

నివేదా థామస్

రూ.5 కోట్లతో... ఫైటింగ్!

రామ్‌చరణ్

అరవై మంది నటులు... 500 మంది బాడీ బిల్డర్లు... రూ.5 కోట్లు... ఒక్క ఫైటు కోసం. రామ్‌చరణ్ చిత్రం కోసం ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో ఓ భారీ స్థాయి పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నారు. అందుకు సంబంధించిన హంగామానే ఇదంతా. బోయపాటి శ్రీను సినిమా అంటే మాస్ అంశాలకి పెద్దపీట వేస్తుంటారు. యాక్షన్ ఘట్టాల్ని మరింత ప్రత్యేకంగా తీర్చి దిద్దుతుంటారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కిస్తున్న చిత్రంలో కూడా భారీ హంగులతో కూడిన యాక్షన్ ఘట్టాల్ని తీర్చిదిద్దుతున్నారు. రామ్‌చరణ్‌ని కొత్త రకమైన యాక్షన్ ఘట్టంలో చూపించడంలో భాగంగానే ఈ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాని సంక్రాంతికి విడుదల చేయాలని నిర్ణయించారు. నిర్మాత మాట్లాడుతూ "కుటుంబ అనుబంధాలతో కూడిన కథకి.. మంచి వాణిజ్యాంశాల్ని జోడించి దర్శకుడు చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నాడు. రామ్‌చరణ్ నటనని కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమిది" అన్నారు. ప్రశాంత్, వివేక్ ఒబెరాయ్, స్నేహ, హిమజ, ప్రవీణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్.

కుటుంబం... ప్రణయం

నారా రోహిత్

నారా రోహిత్ కథానాయకుడిగా శ్రీ శంఖు చక్ర ఫిలింస్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. కృతిక, నీలమ్ ఉపాధ్యా కథానాయికలు. కార్తికేయ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కోటి తూముల నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. "ప్రేమ, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో సాగే చిత్రమిది. నారా రోహిత్ కొత్త లుక్‌లో కనిపిస్తాడు. అనూప్ రూబెన్స్ సంగీతం చిత్రానికి ప్రధాన బలం" అన్నారు నిర్మాత. నాగబాబు, రోహిణి, పోసాని కృష్ణమురళి, కాశీ విశ్వనాథ్, రఘుబాబు తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: శివేంద్ర.

భాగ్యనగరంలో మరో కథ

పరుచూరి వెంకటేశ్వరరావు, తమ్మారెడ్డి భరద్వాజ, అక్షత, హరికృష్ణ జొన్నలగడ్డ, శ్రీకాంత్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు

హరికృష్ణ జొన్నలగడ్డ, అక్షత జంటగా నటించిన చిత్రం 'ప్రేమెంత పనిచేసే నారాయణ'. జొన్నలగడ్డ శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్నారు. సావిత్రి జొన్నలగడ్డ నిర్మాత. శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. కథానాయకుడు శ్రీకాంత్‌తో పాటు సినీ ప్రముఖులు తమ్మారెడ్డి భరద్వాజ, పరుచూరి వెంకటేశ్వరరావు, డాలీ, కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'ఇది భాగ్యనగరం, ఇక్కడ ఎన్నో కథలు ఊపిరిపోసుకొన్నాయి...' అంటూ నటుడు జగపతిబాబు చెప్పిన వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ సాగుతుంది. దర్శకుడు మాట్లాడుతూ "నిజ జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా తీసిన సినిమా ఇది. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. కథానాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ "జొన్నలగడ్డ శ్రీనివాసరావు అబ్బాయి హరికృష్ణ కథానాయకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. ఈ చిత్రం అతనికి మంచి విజయాన్ని తెచ్చిపెట్టాలని కోరుకొంటున్నా" అన్నారు. చిత్ర కథానాయకుడు మాట్లాడుతూ "యాజమాన్య సంగీతం, ప్రేమ్‌రక్షిత్, విద్యాసాగర్ డ్యాన్సులు, రామసుంకర పోరాట ఘట్టాలు చాలా బాగుంటాయి" అన్నారు. "ప్రేమకథతో తెరకెక్కిన మంచి హాస్య ప్రధానమైన చిత్రమిది. మరుధూరి రాజా స్క్రీన్‌ప్లే చాలా బాగుంటుంది" అన్నారు పరుచూరి వెంకటేశ్వరరావు.

ప్రేమలో కొత్త కోణం

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా అనీశ్‌కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లవర్'. గాయత్రి సురేష్ కథానాయిక. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. శిరీష్ సమర్పకుడు. దిల్‌రాజు నిర్మాణ సారథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జులై రెండోవారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. "ప్రేమలోని కొత్త కోణాన్ని స్పృశిస్తూ సాగే చిత్రమిది. 'అలా ఎలా?'తో ప్రేక్షకుల్ని మెప్పించిన అనీశ్ కృష్ణ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్న విధానం చాలా బాగుంది. ఇటీవల విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన లభించింద"న్నాయి చిత్రవర్గాలు. ఛాయాగ్రహణం: సమీర్‌రెడ్డి, పాటలు: సిరివెన్నెల సీతారామశాస్త్రి, శ్రీమణి.

రాయితీలు ప్రకటిస్తాం

ముదస్సిర్ ఖాన్, ప్రియాంశా జంటగా సి.వి.ఎస్.పుల్లారావు దర్శకత్వంలో యం.శ్రీనివాస్, అమర్‌బాబు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఓ జంట కథ'. హైదరాబాద్‌లో ఏపీఎఫ్‌డీసీ ఛైర్మన్ అంబికాకృష్ణ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మంచి కథలతో తీసిన చిత్రాల్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఈ సినిమా కూడా మంచి కథతో తీశారని టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం తరఫున త్వరలోనే రాయితీల్ని ప్రకటిస్తామ"న్నారు. "కథ, కథనాలు కొత్తగా ఉంటాయి. నటీనటులు, సాంకేతిక నిపుణులు చక్కటి సహకారం అందించార"న్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ కార్యదర్శి జె.వి.మోహన్‌గౌడ్, ఛాయాగ్రాహకుడు మనోహర్ కొల్లి, సంగీత దర్శకుడు సందీప్, నిర్మాత రాందాసు తదితరులు పాల్గొన్నారు.

'పంచ్' వేసిన చందమామ రెడ్డి

నాగిరెడ్డి

అప్పటి ముచ్చట!

లాల్ బహదూర్ శాస్త్రి

విజయా అధినేత నాగిరెడ్డి అఖిల భారత చలన చిత్ర నిర్మాతల సంఘానికి అధ్యక్షుడిగా ఉన్న రోజులవి. ఓసారి ఢిల్లీ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ముడి ఫిలిం కొరత వల్ల భారతీయ చిత్రాల నిడివి పదకొండువేల అడుగులకు మించకూడదని. హిందీ చిత్రాల నిడివి ఆ లోపునే ఉండటంతో బొంబాయి నిర్మాతలు సరేనన్నారు. మూడు గంటలకు తక్కువ కాకుండా సినిమాలు తీసే దక్షిణాది చిత్ర నిర్మాతలకు మాత్రం ఈ పరిమితి రుచించలేదు. వారంతా నాగిరెడ్డిని ఢిల్లీ పంపించారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి అప్పట్లో కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రిగా ఉండేవారు. ఆయనతో నాగిరెడ్డికి సాన్నిహిత్యం ఉండేది. విజయా అధినేతను ఆయన 'చందమామరెడ్డి' అని పిలిచేవారట. నాగిరెడ్డి విన్నపాన్ని చూస్తూనే -'ఇతర భాషల వారు పదకొండు వేల అడుగుల్లో చిత్రాలు తీయగలిగినప్పుడు, మీకెందుకు సాధ్యం కాదు? మనదంతా ఒకే సంస్కృతి కదా?' అని లాల్ బహదూర్ అడిగారట. అప్పుడు నాగిరెడ్డి 'తమరు అన్యథా భావించకపోతే ఒక ప్రశ్న. మీరు పంచె కట్టుకునే తీరు చాలా బాగుంటుంది. దీనికి ఎన్ని మూరలు పడుతుంది?' అని అడిగారట. 'కనీసం ఆరు మూరలు. ఇంత నిడివి పంచెలు ధరించడం మా సంప్రదాయం' అన్నారట లాల్ బహదూర్ నవ్వుతూ. అది వింటూనే నాగిరెడ్డి 'మేమైతే నాలుగు మూరలే ధరిస్తాం. అలాగని ఆరు మూరల సంస్కృతిని నాలుగు మూరలకు కుదించమని అడగడం న్యాయంకాదు కదా?' అని నవ్వుతూనే అడిగారట. 'చందమామ రెడ్డి' మాటల్లోని శ్లేష లాల్‌బహదూర్‌కి అర్థమయింది. వెంటనే దక్షిణాది భాషా చిత్రాలపై పదకొండు వేల అడుగుల పరిమితిని సడలిస్తూ, ఢిల్లీ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. - శ్రీవత్స

ఆ పేరు పెట్టుకున్నందుకు తిట్టారు

రవి, అల్లరి నరేష్, సిద్ధి ఇద్నాని, శ్రీనివాస్‌రెడ్డి, మను, గోపీసుందర్, సురేష్‌రెడ్డి

శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధి ఇద్నాని జంటగా నటించిన చిత్రం 'జంబలకిడి పంబ'. జె.బి.మురళీకృష్ణ (మను) దర్శకుడు. రవి, జో జో జోస్, శ్రీనివాస్‌రెడ్డి.ఎన్ నిర్మిస్తున్నారు. గోపీసుందర్ స్వరకర్త. 22న చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక జరిగింది. ఎం.ఎల్.సి మాధవ్ ట్రైలర్‌ని విడుదల చేశారు. నిర్మాణ సంస్థ లోగోని బీరం సుధాకర్ రెడ్డి ఆవిష్కరించారు. అల్లరి నరేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ "మనస్ఫూర్తిగా పనిచేస్తే సమస్త విశ్వం నీకు తోడవుతుందనే మాటని నమ్మి చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టా. అల్లరి నరేష్ ఎంతో సహకారం అందించారు. గోపీసుందర్ మాపై నమ్మకంతో సంగీతం అందించడానికి ముందుకొచ్చారు. చూసిన ప్రతి ప్రేక్షకుడు నవ్వుకుంటాడు. ఈవీవీగారి 'జంబలకిడి పంబ' పేరు పెట్టుకున్నందుకు చాలా మంది తిట్టారు. మేం ఆ సినిమా దరిదాపులకు వెళ్లలేకపోయినా, ఆ పేరుని మాత్రం చెడగొట్టం" అన్నారు. చిత్ర కథానాయకుడు మాట్లాడుతూ "మంచి నిర్మాతలు దొరికారు. దర్శకుడు ఓపికతో తీశారు. ఛాయాగ్రాహకుడు సతీష్‌రెడ్డి విజువల్స్‌తో పాటు... సంగీత దర్శకుడు గోపీసుందర్, 'జంబలకిడి పంబ' అనే పేర్లు ఈ సినిమాకి బలంగా నిలిచాయి" అన్నారు. "మనుతో పనిచేయడం సంతోషంగా ఉంది. ఇందులో మంచి పాటలున్నాయి" అన్నారు గోపీసుందర్. అల్లరి నరేష్ మాట్లాడుతూ "అందరూ కలిసి కష్టపడి, ఒక కసితో చేసిన సినిమా ఇది" అన్నారు. "మా ప్రయత్నం ప్రేక్షకుల్ని తప్పక మెప్పిస్తుంది" అన్నారు నిర్మాతలు. కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, రాజ్ కందుకూరి, అనిల్ కుమార్, వెన్నెల కిషోర్, సునీల్, కృష్ణవంశీ తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

ఒకప్పుడు నాన్నంటే...
భయం.. ఏది చెబితే అదే చేయాలి...
ఇంటిపెద్ద.... కంటిచూపుతో శాసించే
పెద్దపులి! ఇప్పుడు నాన్నంటే...
సూపర్ హీరో... బెస్ట్‌ఫ్రెండ్... ఫిలాసఫర్...
చెప్పుకుంటూ పోతే ఆ జాబితా పెరుగుతుందే తప్ప
తగ్గదు. ఆ స్వేచ్ఛతోనే అమ్మాయిలు విజయాలు
సాధిస్తున్నారు. ఆకాశానికి నిచ్చెన వేసేస్తున్నారు.
తరాలు మారడం... ఆలోచనల్లో మార్పు
రావడం వల్లే ఇది సాధ్యమయ్యిందా... అసలు
ఆ తరం నాన్నకూ... ఈ తరానికీ
ఎంత తేడా వచ్చిందో
చూద్దామా!

నాన్న మారిపోయాడు!

80 ఏళ్ల క్రితం...

'మా నాన్న పేరు అప్పన్న. ఆయనకి తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామల దగ్గర పెరిగాడు. అమ్మ సూరమ్మతో పెళ్లయ్యాక... ఆయనకి మేం ఏడుగురం పిల్లలం. అప్పట్లో మాకు సామాజిక కట్టుబాట్లే ఎక్కువ. ఇది చెయ్యి అది చెయ్యి అని చెప్పకపోయినా..ప్రతిదీ ఓ పద్ధతి ప్రకారం జరిగిపోయేది. చదువూ, ఇతర విషయాలకన్నా శుచీ, శుభ్రత.. వేళకు పనులూ, క్రమశిక్షణకే ప్రాధాన్యం. ఎంత కష్టమైనా రోజూ పొద్దున్నే ఐదు గంటలకు నిద్రలేవాల్సిందే. ఆకలి వేసినా వేయకపోయినా రోజూ సాయంత్రం ఆరున్నర గంటలకల్లా అంతా కలిసి భోజనం కానిచ్చేయాలి. నాన్న మాతో ఏం మాట్లాడినా అప్పుడే. వీధి బళ్లో చేర్పించినా చదువు ముఖ్యం కాదు. అందుకేనేమో వారంలో మూడురోజులు బడి మానేసేవాళ్లం. ఒక్క మాటతోనే అన్నీ క్రమశిక్షణగా జరిగిపోవాలనేవారు. పెద్ద కుటుంబం కావడంతో ఆయన సంపాదించాలి. అమ్మ ఇంటిపనులు చేయాలి... అవసరం అయితే పిల్లలు సాయం చేయాలీ...తప్ప నేను కాదు అనుకునేవారు. మేం ఏ రోజూ నాన్నా ఇది కావాలి అని అడిగింది లేదు. ఏదయినా అమ్మద్వారానే. ఇక, ఆడపిల్లకు తొమ్మిదేళ్లు రావడం ఆలస్యం.. సంబంధాలు చూసేవారు. పెళ్లిలోనే అబ్బాయిని చూసేవాళ్లం. అబ్బాయి నాన్నకు నచ్చితే చాలు. బంగారం కొనాలన్నా నాన్నే. ఓ జత బట్టలు కొన్నాలన్నా నాన్నే. ఏది తెస్తే అదే తప్ప మరొకటి తెలియదు. మాకిది కావాలని అడిగిందీ లేదు. పెళ్లయి పిల్లలు పుట్టేవరకూ ఇంతే. నాన్న మాతో సరదాగా మాట్లాడితే ఓ పండగే. తనలోని ఆనందం, బాధ... ఇలా ఉద్వేగాలు మేం ఎప్పుడూ చూసిందే లేదు...' అని అంటారు తూర్పు గోదావరి జిల్లాకు రావులపాడుకు చెందిన 87 ఏళ్ల సరసమ్మ.

40 ఏళ్ల క్రితం...

'మా నాన్న రంగారావు నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ చాలా స్ట్రిక్ట్. అబ్బాయిలు ఇంజినీరింగ్.. అమ్మాయిలు మెడిసిన్ చేయాలనే ధోరణి. ఇంటరయ్యాక నాకూ, మా అక్కకి ఆయన చెప్పింది ఒకటే. మీకు మెడిసిన్‌లో సీటు రాకపోతే పెళ్లిళ్లు చేసేస్తా అని. ఎక్కడ పెళ్లిచేసి పంపిస్తారోనని భయపడి రాత్రింబవళ్లూ కష్టపడి మెడిసిన్‌లో సీటు తెచ్చుకున్నాం. మా ఇంట్లో అనే కాదు.. మా వీధి మొత్తం చూస్తే అబ్బాయిలు ఐఐటీ లేదా ఇంజినీరింగ్... అమ్మాయిలు వైద్యం చదివారు. మేం చదువుకుంటుంటే ఫ్లాస్కులో టీ పెట్టుకుని రాత్రంతా మా పక్కనే కూర్చునేవారాయన. పదో తరగతివరకూ పరికిణీ జాకెట్టు. ఆ తరువాత పరికిణీ ఓణీ. మెడికల్ కాలేజీలో అవి కుదరవు కాబట్టి.. చుడీదార్లు. దుపట్టా తప్పనిసరి. అబ్బాయిలతో అసలు మాట్లాడకూడదు. ట్యూషన్‌కి వెళ్తే పక్కన మనిషిని ఇచ్చి పంపించేవారు. ఆదివారం పార్కు, అప్పుడప్పుడూ సినిమా ఇదే మా ప్రపంచం. గుడికి వెళ్లినా, బంధువుల ఇళ్లకయినా నాన్న ఉండాల్సిందే. మీకేం తెలియదు. చిన్నపిల్లలు. నేను చెప్పేది మీ భవిష్యత్తు కోసమే అనేవారు. సంబంధాలు చూస్తుంటే కుటుంబం బాగుందా, డబ్బు ఉందా, అబ్బాయి చదువూ ఉద్యోగం అంతే. ప్రేమ పెళ్లిళ్లకు అసలు అవకాశమే లేదు. మా పక్కింటి అమ్మాయి ప్రేమించిన అబ్బాయిని పెళ్లిచేసుకుంటే వాళ్ల నాన్న ఆమెతో పాతికేళ్లు మాట్లాడలేదంటే నమ్మండి. ఆమె వెళ్లిపోయిన కొత్తల్లో అయితే కనబడితే చంపేయమని చెప్పారట. మా నాన్న మాత్రం చదువుకే ప్రాధాన్యం అనేవారు...' అని చెబుతారు 42 రెండేళ్ల డాక్టర్ కమల అనగాని.

ఇప్పుడు...

'నాకు ఏది కావాలన్నా.. మొదట గుర్తొచ్చేది మా నాన్న ఆదినారాయణ. అమ్మ స్నేహితురాలైతే నాన్న అంతకన్నా ఎక్కువే. మా ఇంట్లోనే కాదు.. నా స్నేహితురాళ్ల ఇళ్లలోనూ ఇదే ధోరణి కనిపిస్తోందిప్పుడు. మా అవసరాలు తెలుసుకుని వాటిని తీర్చడానికి ఆరాటపడుతున్నారు. పుట్టినరోజులు వస్తే 'ఖర్చు గురించి ఆలోచించకు.. నేను ఉన్నా' అనేస్తున్నారు. బోలెడు సర్‌ప్రైజులు. ఇవన్నీ చూసి మా అమ్మా, అత్తలు... 'మా కాలంలో ఇలా లేదమ్మా' అని అనడం ఎన్నోసార్లు విన్నా. ఆడపిల్లలు అబ్బాయిలా ఉండాలి. ధైర్యంగా మీ కాళ్లమీద మీరు బతకాలి... అనే ధోరణి. నలుగురితో కలిసి సరదాగా పార్టీలకు వెళ్లినా, స్నేహితులతో ఎక్కువసేపు గడిపినా ఒకే. కానీ చెప్పి వెళ్లాలీ, జాగ్రత్తగా ఉండాలి అనే తీరు. అలా వెళ్తేనే బయటి ప్రపంచం తెలుస్తుందని అంటారు. బయటకు వెళ్లినప్పుడు జాగ్రత్తలు కాదు.. సమస్య వచ్చినప్పుడు ఎలా స్పందించాలనేది వివరిస్తారు. ఏ సమస్యనైనా నాన్నతో ధైర్యంగా చెప్పుకొనే స్వేచ్ఛ కనిపిస్తోంది. తప్పు చేసినా అంతే. నాకు సంబంధించిన నిర్ణయాల్లో నా అభిప్రాయాల్నే ఏకీభవించినా సలహా మాత్రం కచ్చితంగా ఉంటుంది. ఆ సలహాలో ఇలా చేస్తే బాగుంటుందేమో అనేదే కనిపిస్తుంది. చదువూ, కెరీర్, స్నేహితులూ, ఆటలూ.. ఆఖరికి పెళ్లి విషయంలోనూ నాకు పూర్తి స్వేచ్ఛ. అలా సరైన నిర్ణయం తీసుకునేలానే మొదటినుంచీ పెంచారు. ఒకవేళ ఏదయినా చెప్పినా స్నేహంగానే తప్ప ఆజ్ఞాపిస్తున్నట్లుగా కాదు. ఈ కాలం అమ్మాయిలకు అనుగుణంగానే ఆలోచిస్తారు మానాన్న. అన్ని విషయాల్లో నాన్న ఇచ్చిన ధైర్యం, స్వేచ్ఛ, సపోర్టు.. ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పెళ్లి అంటే నచ్చిన రంగంలో స్థిరపడ్డాకే. అనేస్తారు. ఇంతకంటే ఇంకేం కావాలి...' అని చెబుతుంది బీటెక్ విద్యార్థిని మేఘన విరిగినేని.

నాన్న బాటలోనే నేనూ!

టఫే ట్రాక్టర్లూ, వ్యవసాయ పరికరాల గురించి రైతులకు పరిచయం అక్కర్లేదు. ఆ సంస్థను నడిపించే ఛైర్మన్, సీఈవో మల్లికా శ్రీనివాసన్ కూడా ఎప్పుడూ ఫోర్బ్స్ జాబితాలో ముందుంటారు. టఫే సంస్థ ఆమెకు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చింది. వార్టన్ యూనివర్సిటీలో ఎంబీఏ చేసిన ఆమె ఇరవై ఆరేళ్ల వయసులో అక్కడి నుంచి భారత్‌కి తిరిగి వచ్చింది. అప్పటికే టఫే సంస్థ లాభాల బాటలో నడుస్తూ, ఉన్నత స్థానంలో చేరింది. ఇక్కడికి వచ్చిన మల్లిక తండ్రి సంస్థలోనే పని చేయాలని నిర్ణయించుకుంది. కానీ ఓ స్పష్టత లేదు. ఆ సమయంలో తన తండ్రి మల్లికతో 'చూడమ్మా.. నువ్వు వార్టన్‌లో చదువుకుని రావచ్చు కానీ నా సంస్థను నడిపే వ్యక్తి నాకు ఇప్పుడు అవసరం లేదు...' అని నిర్మొహమాటంగా చెప్పారట. అంటే కూతురిని తక్కువ చేయాలని కాదు. 'మా నాన్న నా చదువుని తగ్గించాలని ఆ రోజు అలా మాట్లాడలేదు. ఎంత చదువుకున్నా సాధారణ ఉద్యోగినిలా అన్నీ

తెలుసుకోవాలనేదే ఆయన ఉద్దేశం. అందుకే నేను తొలినాళ్లలో చాలా సాధారణ ఉద్యోగినిలా పనిచేశా. నన్ను నేను నిరూపించుకునే ప్రయత్నం చేశా. మరో వైపు నాన్న సలహాతో వృత్తీ, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకునేందుకు ప్రయత్నించేదాన్ని. ఉద్యోగంతో పాటూ స్నేహితులూ, కుటుంబసభ్యులు ముఖ్యం అనుకుని వాళ్లకీ సమయం కేటాయించుకునేదాన్ని. ఆయనది కష్టపడి పనిచేసేతత్వం. పనితోపాటు కుటుంబానికీ సమయం కేటాయించమని నాకే కాదు.. ఉద్యోగులందరికీ చెప్పేవారు. ఇంటి అవసరాలకోసం ఎవరు సెలవు అడిగినా కాదనేవారు కాదు. నేనూ 2011 ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పట్నుంచీ నాన్న బాటలోనే నడుస్తున్నా అందుకే మా ఉద్యోగులు మా పట్ల అంత నిబద్ధతతో ఉంటారు. మా విజయరహస్యం వారేనని నమ్ముతాం...' అని అంటారు మల్లికా శ్రీనివాసన్.

పెళ్లి చీరలు... మళ్లీ కట్టుకునేదెలా?

? నేనో కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నా. రెండేళ్ల క్రితం పెళ్లయ్యింది. అప్పుడు కొన్న పట్టుచీరలు మరే సందర్భంలోనూ కట్టుకునే అవసరం పడలేదు. వేలు పోసి కొన్నవాటిని పక్కన పడేస్తుంటే బాధగా ఉంది. ఒక్క పెళ్లి పీటలమీద కట్టుకున్న చీర మినహా మిగిలిన వాటిని మరేవిధంగా అయినా ఉపయోగించే మార్గం ఉందా? **- శ్రీహిత,** హైదరాబాద్

✔ ఇది మీ ఒక్కరి సమస్య మాత్రమే కాదు. నేటితరం అమ్మాయిలందరిదీ అదే బాధ. పట్టు చీరలతో లెహెంగాలను కుట్టించుకోవచ్చు. అదీ లేదంటే ఇండోవెస్ట్రన్ తరహాలో పొడవాటి గౌన్‌లను కూడా ప్రయత్నించొచ్చు. ఈ గౌన్‌లకు కొంగు భాగాన్ని యోక్ పార్ట్‌లో వాడుకోవచ్చు. మిగిలిన చీరని స్కర్ట్‌లా కుట్టించుకోవచ్చు. పండగలూ, ఇతర వేడుకల్లో పార్టీవేర్‌గా వీటిని కట్టుకుంటే మీ లుక్కే మారిపోతుంది. అనార్కలీలూ, పొడవాటి స్ట్రెయిట్ కుర్తాలుగా కుట్టించుకునేందుకు కూడా ఆ చీరల్ని ఎంచుకోవచ్చు. హైవెయిస్టెడ్ స్కర్ట్‌లూ, క్రాప్‌టాప్‌లూ, పలాజోలూ, దుపట్టాలుగానూ వీటిని ఉపయోగిస్తే చీరలు పక్కన పెట్టేశామే అనే బాధ ఉండదు.

డియర్ వసుంధర

ధన్యా గుత్తా
డిజైనర్

– మీ సందేహాలను vasufashion@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

16న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,948	2,976
వెండి (గ్రా)	44.30	45.20



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	32,200	32,200	31,700	31,750	31,800	31,800	31,840	32,173	32,020	32,020
ఆర్నమెంట్	30,040	30,050	29,400	29,450	29,470	29,470	29,480	29,760	29,780	29,780
వెండి(కిలో)	42,550	42,550	41,900	41,900	42,500	42,500	43,000	42,800	42,900	42,900

నజరానా

కార్పెట్ మీద మరకలు
పడి వాసన వస్తోంటే...
కాస్త టీపొడి చల్లి పది
నిమిషాలయ్యాక
దులిపేయండి. తరువాత
ఎండలో ఉంచితే
సరిపోతుంది.

పొట్ట తగ్గించే తిరగలి ఆసనం

ఈ రోజుల్లో అధిక బరువు సర్వసాధారణమైన సమస్య. దాంతో కొందరికి పొట్ట పెరిగి చూడ్డానికి ఇబ్బందిగా కనిపిస్తుంది. దీన్ని తగ్గించుకోవాలంటే ఈ ఆసనాలు ప్రయత్నించి చూడండి. వీటితో శరీరం ఆరోగ్యంగా, అందంగా కూడా తయారవుతుంది. ఈ ఆసనాల వల్ల ఫలితాలు నిదానంగా వచ్చినప్పటికీ దుష్ప్రభావాలు ఏ మాత్రం ఉండవు. నిరంతరం సాధన చేయడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మీ సొంతమవుతుంది. ఇంతకీ అవేంటంటే...



చక్కిగుమానాసనం

చేసే విధానం: రెండుకాళ్లు చాపి కూర్చోవాలి. చేతులు ముందుకు పాదాల దగ్గరకు చాపి.. రెండింటినీ కలపాలి. ఆ తరువాత చేతి వేళ్లను మడిచి తిరగలిలో గింజలు విసురుతున్నట్లుగా కాస్త ముందుకు వంగి చేతుల్ని తిప్పాలి. ఇలా సవ్య, అపసవ్య దిశలో పదిసార్లు చొప్పున చేయాలి. చేయడం వచ్చాక ఆ సంఖ్య పెంచుతూ పోవాలి. త్వరగా ఫలితం కావాలంటే వీలైనంతె ఎక్కువసార్లు చేస్తే మంచిది.

జాగ్రత్తలు: గర్భిణులు చేయకూడదు. అలాగే నెలసరి సమయంలో కూడా ఈ ఆసనం వేయకూడదు.

నౌకాసనం

ముందు శవాసనంలో పడుకోవాలి. ఆ తరువాత చేతుల్ని ముందుకు చాపి, నెమ్మదిగా కాళ్లూ, తలను పైకెత్తాలి. అడుగున్నరకు మించి ఎత్తకూడదు. శ్వాస మామూలుగానే తీసుకుంటూ ఇదే స్థితిలో 15- 20 సెకన్ల వరకు చేయొచ్చు. చేయడం వచ్చాక ఇదే స్థితిలో రెండు నిమిషాలు కూడా ఉండొచ్చు.

జాగ్రత్తలు: ఈ ఆసనాన్ని నడుము నొప్పి ఉన్నవారు చేయకూడదు.

దానికి కారణం నువ్వే!

పిల్లలు పుట్టాక తల్లిలో వచ్చే మార్పే తండ్రిలోనూ కనిపిస్తుంది. అలా తన కూతురు అక్షత పుట్టిన తరువాత తనలో వచ్చిన మార్పునీ, ఆనందాన్నీ వివరిస్తూ కూతురికి ఒకానొక సందర్భంలో లేఖ రాశారట ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి. అదేంటో మనమూ చదివేద్దాం.

అక్షతా...

నువ్వు పుట్టాక నాలో ఇలాంటి మార్పు వస్తుందని నేనూహించలేదు. నీ రాక నాలో ఆనందంతో పాటే పెద్ద బాధ్యతల్నీ మోసుకొచ్చింది. అప్పటివరకూ నేనొక భర్తా, కొడుకూ, అభివృద్ధి పథాన వేగంగా సాగుతున్న ఒక కంపెనీలో ఉద్యోగి మాత్రమే. కానీ ఒక కూతురు ఎదిగేకొద్దీ... తన తండ్రి నుంచి ఏం ఆశిస్తుందో లెక్కలు వేసుకుంటూ తదనుగుణంగా నడుచుకోవాల్సిన తండ్రిని.

నువ్వు పుట్టాక నేనూ మారా. చేసే ప్రతి పని ముందు క్షుణ్నంగా, స్పష్టంగా ఆలోచించడం మొదలుపెట్టా. బయటి ప్రపంచంతో నేను మెలిగే తీరులోనూ పరిణతి. అందరితో నిదానంగా, సున్నితంగా మాట్లాడటం మొదలుపెట్టా. నా గతానికి సంబంధించిన ఆలోచనలు కూడా నాలో పెరిగాయి తెలుసా...!

అప్పుడింకా నేనూ, మీ అమ్మా మా కెరీర్‌లో స్థిరపడేందుకు పోరాడుతున్నాం. అప్పుడే నువ్వు పుట్టావ్. రెండు నెలల తరువాత నిన్ను హుబ్లీ నుంచి ముంబయికి తీసుకొచ్చేశాం. కానీ కొన్ని రోజులకే కెరీర్‌కోసం పోరాడుతూ మిమ్మల్ని పెంచడం కష్టమని తెలుసుకున్నాం. ఆ రెండింటినీ సమన్వయం చేయలేకపోయాం. అందుకే మళ్లీ మీ తాత ఊరికే పంపించాం. చాలా కష్టంగానే ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ప్రతి వారాంతంలో నేను బెల్‌గావ్ వరకూ విమానంలో... అక్కడినుంచి కారు అద్దెకు తీసుకుని హుబ్లీకి వచ్చేవాడిని. ఆ సమయంలో నాకు ఆ ప్రయాణం నిజంగా ఖరీదైందే. కానీ నిన్ను చూడకుండా ఉండలేకపోయేవాడిని. నువ్వేమో హుబ్లీలో ఉన్న బంధువులతో చిన్న ప్రపంచాన్నే ఏర్పర్చుకున్నావ్. అది నాకు ఇప్పటికీ ఆశ్చర్యమే.

నన్నెప్పుడూ చాలామంది నా పిల్లలకు నేను నేర్పిన విలువల గురించి అడుగుతుంటారు. కానీ వాటన్నింటి బాధ్యత మీ అమ్మదే. మిమ్మల్ని ఇంత చక్కగా తీర్చిదిద్దినందుకు నేనెప్పుడూ తనకి రుణపడి ఉంటా. ఏం చెప్పినా మాటలతో కాకుండా తను చేసే పనుల్లో చూపించేది. నిరాడంబరంగా ఎలా ఉండాలో చెప్పేది. మనం బెంగళూరులో ఉన్నప్పుడు ఒక సంఘటన జరిగింది. నువ్వోసారి మీ స్కూల్ నాటకంలో ఎంపికయ్యావ్. కాస్త ప్రత్యేకంగా ఉండే డ్రెస్ కావాల్సి వచ్చింది. కానీ అప్పుడు మేం ఆర్థికంగా ఇంకా స్థిరపడలేదు. తప్పనిసరి అనుకున్న వస్తువులను మాత్రమే కొనుక్కునే పరిస్థితి. ఇన్ఫోసిస్ కూడా అప్పుడే మొదలుపెట్టాం. అప్పుడు మీ అమ్మ నీతో ఆ డ్రెస్ కొనలేం అని చెప్పింది. దాంతో నువ్వు ఆ నాటకం వేయలేదు. కొన్ని రోజులు తరువాత నాతో...'నాకు ఏం జరిగిందో అర్థం కాలేదు' అన్నావ్ అంతే. అవును! అంత చిన్న వయసులో పరిస్థితులు అర్థం చేసుకోవడం పెద్ద విషయమే. కానీ దాన్నుంచి నువ్వు ఏదో ఒక పాఠం తప్పకుండా నేర్చుకొనే ఉంటావ్.

అప్పటికీ ఇప్పటికీ చాలా మార్పొచ్చింది. ఇప్పుడు మనకు సరిపోయేంత డబ్బుంది. అయినా మీ జీవనశైలి ఇంకా సాధారణంగానే ఉంటుందని మీకు తెలుసు. మేం కాస్త స్థిరపడ్డాక... రోహిత్‌నూ, నిన్ను కార్లో స్కూలుకి పంపిద్దాం అనుకున్నా. కానీ మీ అమ్మ మీ స్నేహితులతో పాటే మిమ్మల్ని ఆటోలో పంపించేది. ఆ తరువాత ఆ రిక్షా అంకుల్, తోటి పిల్లలు నీకు మంచి స్నేహితులయ్యారు కూడా. అప్పుడు మనింట్లో టీవీ కూడా లేదు. దానివల్ల మీ చదువులూ, స్నేహితులతో సంబంధాలు సరిగ్గా ఉండవని మీ అమ్మ వద్దనేది. మీరు చదువుకుంటుంటే మేం కూడా మీతోపాటూ పుస్తకాలు చదివేవాళ్లం.

ఇక నీ పెళ్లి... ఈ విషయంలో తండ్రికుండే భావోద్వేగాలు విభిన్నం. నేను కూడా నువ్వు నీ భాగస్వామిని వెతుక్కున్నానని చెప్పినప్పుడు కాస్త బాధపడ్డా. కానీ రిషిని కలిశాక అతనెంత తెలివైనవాడో, ఎంత నిజాయతీపరుడో అర్థమైంది. నీకొక మంచి భాగస్వామి దొరికాడన్న ధైర్యం వచ్చింది. ఇప్పుడు నన్ను నువ్వు తాతయ్యని కూడా చేశావ్. మొదటిసారిగా నిన్ను నేను ఎత్తుకున్నప్పుడు కలిగిన అనుభూతి, ఇప్పుడు నీ కూతురు కృష్ణని నా చేతుల్లోకి తీసుకున్న అనుభూతులు విభిన్నమైనవి, వర్ణించలేను. నా వయసు పెరిగిన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. నీకంటూ ఓ జీవితం, లక్ష్యం ఉంది. కానీ ఒక్క విషయం మర్చిపోకు. మనం బతకడానికి భూమి అనే గ్రహం ఒకటే ఉంది. ఇప్పుడది రోజురోజుకీ పాడైపోతోంది. అందుకే నీ కూతురు కృష్ణను మేం నిన్ను పెంచినదానికంటే జాగ్రత్తగా పెంచాల్సిన బాధ్యత కూడా నీదే. జాగ్రత్తగా ఉండు!

– ప్రేమతో మీ నాన్న

aha@eenadu.in

.. ఏమి రుచి

ఓ సూపు సూద్దాం!

తీరిగ్గా బాల్కనీలో కూర్చుని.. చిటపట చినుకులని ఆస్వాదిస్తూ నచ్చిన పుస్తకం చదువుతూ, గిలిగింతలు పెట్టే చలికి... వేడివేడి సూపుతో చెక్ పెడితే ఎలా ఉంటుంది? వాహ్ః అంత అదృష్టమా అంటారా? రాలే వాన చినుకులకు తోడుగా... కొంచెం తీరిక.. కొంచెం ఓపిక కూడా కలిస్తే రుచికరమైన సూపులు తయార్...

మటన్ యాక్నీ షోర్బా

కావాల్సినవి: నల్లి మటన్ బోన్స్(పెద్ద ఎముకలు)- అరకేజీ, కొత్తిమీర- కట్ట, పుదీనా- అర కట్ట, కారం- అరచెంచా, ఉప్పు- తగినంత, అల్లం- చిన్నముక్క, వెల్లుల్లి రేకలు- ఆరు, పసుపు- పావుచెంచా, బిర్యానీఆకులు- రెండు, తోక మిరియాలు(చీనికబాబ్), యాలకులు, లవంగాలు, దాల్చిని, షాజీరా అన్నీకలిపి కొట్టిన పొడి- రెండు చెంచాలు, నిమ్మకాయ- ఒకటి

తయారీ: అల్లంవెల్లుల్లిని చిన్న పలుకులుగా తరిగి పెట్టుకోవాలి. అలాగే కొత్తిమీర, పుదీనాలని కూడా. నల్లి బోన్స్‌ని శుభ్రం చేసి పెట్టుకోవాలి. ఒక మందపాటి గిన్నెలో నల్లీబోన్స్, కొత్తిమీర, పుదీనా, కారం, ఉప్పు, పసుపు, బిర్యానీ ఆకులు తగినన్ని నీళ్లు పోసుకుని కుక్కర్‌లో పన్నెండు విజిల్స్ వచ్చేంతవరకూ ఆగాలి. అందుకు తగిన విధంగా నీళ్లు ముందుగానే వేసుకోవాలి. ఉప్పు, కారం సరి చూసుకుని వేడివేడి నల్లీబోన్ సూపులో కొత్తిమీర చల్లి, నిమ్మకాయ పిండుకుని తాగితే జలుబూ, గిలుబూ బలాదూర్.

టమాటా ధనియా షోర్బా

కావాల్సినవి: టమాటాలు- రెండు, కొత్తిమీర- రెండు కట్టలు, ఉప్పు- తగినంత, మిరియాలు- చెంచా, వెల్లుల్లి- నాలుగు రేకలు, కరివేపాకు- రెమ్మ, పుదీనా- అరకట్ట, అల్లం- చిన్నముక్క, దాల్చినచెక్క- అంగుళం ముక్క, పచ్చిమిర్చి- నాలుగు, నూనె- తాలింపునకు సరిపడా

తయారీ: టమాటాలని నాలుగు ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. కొత్తిమీర, పుదీనా, పచ్చిమిర్చి, అల్లాన్ని వేటికవి సన్నగా తరిగి పెట్టుకోవాలి. మిరియాలని కచ్చాపచ్చాగా దంచుకోవాలి. ముందుగా ఒక మందపాటి గిన్నె తీసుకుని అందులో టమాటా ముక్కలు, పుదీనా, కొత్తిమీర, మిరియాలు, అల్లం, కరివేపాకు, తగినంత ఉప్పు, నీళ్లు వేసి మరిగించుకోవాలి. బాగా మరిగిన తర్వాత ఉప్పు, కారం సరిచూసుకుని వేరె గిన్నెలోకి వడకట్టుకోవాలి. నూనెలో వెల్లుల్లి వేసి తాలింపు పెట్టుకుని వడకట్టిన సూపులో కలుపుకుంటే రుచికరమైన టమాటా సూపు సిద్ధం.

పాయా...

కావాల్సినవి: పాయా(మేక కాళ్లు)- నాలుగు, పచ్చిమిర్చి- నాలుగు, కొత్తిమీర- కట్ట, పుదీనా- అరకట్ట, అల్లం- చిన్నముక్క, మిరియాలు- చెంచా, పసుపు- పావుచెంచా, ఉల్లిపాయ- ఒకటి, క్యారెట్- సగం ముక్క, వెన్న- తాలింపునకు సరిపడా, ఉప్పు- తగినంత, జీలకర్ర- పావుచెంచా, వెల్లుల్లి- నాలుగు రెబ్బలు, గరంమసాలా- అరచెంచా

తయారీ: పాయాని శుభ్రం చేసి పెట్టుకోవాలి. పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, పుదీనా, ఉల్లిపాయ, క్యారెట్ వీటిని వేటికవే చిన్నముక్కలుగా తరిగి సిద్ధం చేసి పెట్టుకోవాలి. అడుగు మందంగా ఉండే ఒక పాత్రలో శుభ్రం చేసుకున్న పాయా, పచ్చిమిర్చి, పుదీనా, కొత్తిమీర, అల్లం, క్యారెట్, ఉల్లిపాయ, మిరియాలు, ఉప్పు, పసుపు సరిపడా నీళ్లు వేసుకుని కుక్కర్‌లో అయితే పదికూతలు రానివ్వాలి. మామూలుగా అయితే పాయాని మెత్తగా అయ్యేంతవరకూ ఉంచాలి. పాయా ముక్కలని వేరు చేసుకుని వడకట్టుకోవాలి. వెన్నలో జీలకర్ర, వెల్లుల్లి పలుకులతో తాలింపు వేసి పాయాని ముక్కలతో సర్వ్ చేసుకోవడమే.

మిరియాల చేప...

కావాల్సినవి: టమాటాలు- మూడు, మిరియాలు- ఒకటిన్నర చెంచా, కొత్తిమీర- కట్ట, కరివేపాకు- రెమ్మ, పచ్చిమిర్చి- నాలుగు, పసుపు- పావుచెంచా, వెల్లుల్లి- నాలుగు రెమ్మలు, ముళ్లు లేని చేప ఏదైనా- 100గ్రా, పుదీనా- అరకట్ట, ఉప్పు- సరిపడా, జీలకర్ర- పావుచెంచా

తయారీ: చేపని చిన్నముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. మిరియాలని కచ్చాపచ్చాగా దంచుకోవాలి. టమాటాలని నాలుగు ముక్కలుగా తరిగిపెట్టుకోవాలి. పచ్చిమిర్చి, కొత్తిమీర, పుదీనాలని సన్నగా తరిగిపెట్టుకోవాలి. ఒక మందపాటి పాత్రలో టమాటా, పచ్చిమిర్చి, కొత్తిమీర, పుదీనా, మిరియాలపొడి, ఉప్పు, పసుపు, తగినన్ని నీళ్లు పోసి వేసి బాగా మరిగించుకోవాలి. టామటా బాగా ఉడికిన తర్వాత ఉప్పు, కారం సరిచూసుకుని వడకట్టుకోవాలి. ఒక పాన్‌లో లేదా కడాయిలో నూనె వేడి చేసుకుని దానిలో వెల్లుల్లి, జీలకర్ర, కరివేపాకు వేయించుకుని అందులో ముందుగా తరిగి పెట్టుకున్న చేప ముక్కల్ని బాగా వేయించుకోవాలి. దానిలో కడకట్టిన మిశ్రమాన్ని వేసి రెండు నిమిషాల పాటు మరిగించి దించుకోవాలి.

నాటుకోడి చారు...

కావాల్సినవి: నాటుకోడి మాంసం- అరకేజీ, కారం- చెంచా, ఉప్పు- తగినంత, పచ్చిమిర్చి- ఐదు, గరంమసాలాపొడి- పావుచెంచా, ధనియాలపొడి- అరచెంచా, జీలకర్రపొడి- పావుచెంచా, ఉల్లిపాయ- ఒకటి, టమాటాలు- రెండు, కరివేపాకు- రెండు రెబ్బలు, కొత్తిమీర- కట్ట, అల్లంవెల్లుల్లి ముద్ద- అరచెంచా, నూనె- రెండు చెంచాలు

తయారీ: నాటుకోడి మాంసాన్ని శుభ్రం చేసి పక్కన పెట్టుకోవాలి. ఉల్లిపాయ, టమాటాలు, పచ్చిమిర్చిని సన్నగా తరిగిపెట్టుకోవాలి.

కడాయిలో నూనె వేడిచేసుకుని అందులో ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి వేసి దోరగా వేయించి ఆపై అల్లంవెల్లుల్లి ముద్ద వేసి పచ్చివాసన పోయిన తర్వాత టమాటాలు కూడా వేసి ఉడికించుకోవాలి. ఇప్పుడు నాటుకోడి ముక్కలు వేసి అందులో కారం, ఉప్పు, పసుపు, జీలకర్రపొడి, ధనియాలపొడి వేసి రెండు నిమిషాల పాటు ఉంచి మూతపెట్టాలి. తర్వాత గరంమసాలా పొడి వేసి తగినన్ని నీళ్లు పోసి సన్నసెగమీద చికెన్ ఉడికేంతవరకూ ఉంచాలి. కుక్కర్‌లో అయితే పదివిజిల్స్ రావాలి. కుక్కర్ తెరిచి కొత్తిమీర వేసి రెండు నిమిషాల పాటూ మరగనిచ్చి వేడిగా సర్వ్ చేసుకోవాలి.

చెఫ్ యాదగిరి,
వివాహ భోజనంబు, జూబ్లీహిల్స్

అస్త్రం

నూనె చిందకుండా...

వడలు, గారెలు వంటివి చేసేటప్పుడు నూనె చిందడం సహజమే! అలా చిందినప్పుడు గోడంతా జిడ్డుగా మారి చూడ్డానికి బాగుండదు. దానిని శుభ్రం చేసుకోవడానికీ చాలా సమయం పడుతుంది. ఒక్కోసారి మీద తుళ్లిపడినా పడొచ్చు. అలా కాకుండా పాన్‌చుట్టూ నూనె చిందకుండా ఉండేందుకు ఏదైనా రక్షణ ఉంటే? ఉంటే కాదు ఉంది. దానిపేరే... ఫ్రైవాల్. సిలికాన్‌తో చేసిన ఈ వంటింటి పరికరం వేడికి తట్టుకుని పాన్ చుట్టూ అమర్చుకోవడానికి వీలుగా ఉంటుంది. దీనిని అమర్చడం వల్ల నూనె.. శరీరం మీదకూ, గోడలపైకి చిందకుండా ఉంటుంది. అమర్చుకోవడమూ తేలికే.

పక్కాలోకల్

పెద్దపల్లి పాలకేక్

కశ్మీరి కలాకంద్' లేదా 'దూద్‌కేక్'ది ఒక్కసారితో మరిచిపోయే రుచికాదు. మళ్లీమళ్లీ తినాలనిపించే, వెంటాడే ఘుమఘుమ అది! అంత గొప్ప రుచి చూడ్డానికి మీరు కశ్మీర్ వరకూ వెళ్లాల్సిన అవసరం లేదు. మన పెద్దపల్లి వరకూ వెళ్తేసరి!

'పాలు తినగలరా? అదేం ప్రశ్న.. తాగుతారు కానీ తింటారా అనేగా మీ సందేహం. నిజమే కానీ బాబూలాల్ ఖత్రీ చేసిన అద్భుతం అదే. ఈ దూద్‌కేక్(కశ్మీరి కలాకంద్)ని తింటే పాలను తింటున్నట్టు, ఎండు ఫలాలని తాగుతున్నట్టు ఉంటుంది అంటారు కశ్మీరి కలాకంద్ ప్రియులు. మనకి మామూలు కలాకంద్‌ల గురించి కొంతవరకూ తెలుసు. కానీ ఈ కశ్మీరి కలాకంద్‌కి వాటితో ఎంత మాత్రం పోలిక ఉండదు. మహారాష్ట్రలో 'దూద్‌కేక్'గా వ్యవహరించే ఈ కశ్మీరీ కలాకంద్‌కు మిగిలిన ప్రాంతాల్లోని కలాకంద్‌లకు పేరులో మినహా పోలికే ఉండదు.

దేశ, విదేశాల్లో గుర్తింపు..

బంధువులు, పెద్దవాళ్ల వద్దకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా ఈ కశ్మీరీ కలాకంద్‌ను కానుకగా తీసుకెళ్లడం పెద్దపల్లి వాసులకు అలవాటుగా మారిపోయింది. ఒక్క పెద్దపల్లి నుంచే కాదు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కూడా విదేశాలకు వెళ్లే వారందరూ వెళ్తూవెళ్తూ ఈ కశ్మీరీ కలాకంద్‌ను తీసుకెళ్లడం ఓ ఆచారంగా మారిపోవడం విశేషం. అలా దుబాయ్, సౌదీ, అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ దేశాల్లో ఈస్వీట్ సుపరిచితం అయిపోయింది. దీని తయారీకి ఎక్కువ సమయం పట్టడం, తక్కువ ఉత్పత్తి కావడంతో ఇతర దేశాలకు వెళ్లేవారు ముందస్తుగా ఆర్డర్ ఇస్తుంటారు. చిక్కని పాలలో జీడిపప్పు, బాదం, కిస్మిస్‌తో పాటూ ఏడు రకాల పండ్లని ఉపయోగించి చేయడం ఈ వంటకం ప్రత్యేకత. పాలతో చేసిన ఈ వంటకం మామూలు కలాకంద్ తరహాలో కాకుండా భిన్నమైన ఆకృతితో చూడగానే తినేయాలనిపిస్తుంది. 'పెద్దపల్లి వాసులకు కొత్తరుచి చూపించాలనే ఉద్దేశంతో మా తాతయ్య బాబు లాల్‌ఖత్రీ అజ్మీర్ కలాకంద్‌లో చేసిన ప్రయోగంతోనే కశ్మీరీ కలాకంద్ రూపొందింది. 55 యేళ్లుగా అదే నాణ్యత ప్రమాణాలను పాటించడంతో అదే రుచిని ఇప్పటికీ అందించగలుగుతున్నా. కల్తీలేని పాలు, నాణ్యమైన డ్రైఫ్రూట్స్, చక్కెరలను ప్రత్యేక నిష్పత్తిలో కలపడం వల్లనే నాణ్యత, రుచి ఆధారపడతాయి. దీని తయారీకి కూడ ఎక్కువ సమయం పడుతుంది. తెల్లవారుజామున చేయడం మొదలు పెడితే మధ్యాహ్నానికి మొదటి కేక్ వస్తుంది' అంటూ వివరిస్తున్నారు ప్రస్తుతం దుకాణం బాధ్యతలు చూస్తున్న శరత్‌ఖత్రీ.

55 సంవత్సరాలుగా నోట్లో పెట్టుకుంటే కరిగిపోయే పాలరుచితో బాబూలాల్‌ఖత్రీ చేసే ఘుమఘుమల మాయాజాలం చవి చూడాలంటే పెద్దపల్లే సరైన వేదిక...

– రాజేందర్,
న్యూస్‌టుడే, పెద్దపల్లి

భిన్న రుచి

దోసెల్లో.. సీమ దోసెలు వేరయా!

రాయలసీమ అనగానే అందరికీ కారం దోసె గుర్తుకు వస్తుంది. పండుమిరపకాయలు, ఉల్లిపాయి కలిపి రోట్లో దంచి చేసే కారం వేసి ఈ కారం దోసెలు తయారుచేస్తారు. సీమలో కారం దోసెలు మాత్రమే కాదు మరికొన్ని ప్రత్యేకమైన దోసెలూ ఉన్నాయి....

దోసెలు అనగానే ప్లెయిన్ దోసె(మినపట్టు), రవ్వ దోసె, ఉల్లిదోసె మాత్రమే మనకు తెలుసు. కానీ రాయలసీమ జిల్లాల్లో కొన్ని ప్రత్యేక దోసెలు లభిస్తుంటాయి. వాటిలో ఆకుకూర దోసె, ఉగ్గాని దోసె, ఎగ్ దోసె, ఉప్మాదోసె, చికెన్‌దోసె వంటివి ప్రత్యేకం.

తోటకూరతో..

దోసెపైన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, క్యారెట్ తదితరాలు వంటివి వేసి కాల్చి ఇచ్చిన దోసెలు చూస్తుంటాం. కానీ ఆకుకూరలు వేసి కాల్చే దోసెలు అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకం. తోటకూరని కడిగి సన్నముక్కలుగా తరిగి మినపట్టుపై వేసి రెండువైపులా కాల్చి ఇస్తారు. పచ్చివాసన తెలియకుండా తయారుచేయడం తయారీదారుల ప్రత్యేకత. అనంతపురం నగరంలోని ఐరన్ బ్రిడ్జి సమీపంలో ఆదిమూర్తి అనే హోటల్ యజమాని తొలుత వీటిని పాతికేళ్ల కిందట పరిచయం చేశారు. తర్వాత క్రమంగా వివిధ ప్రాంతాల్లో ఇతరులు కూడా ఈ ఆకుకూర దోసెలు విక్రయిస్తున్నారు.

ఉగ్గాని దోసె..

సీమజిల్లాల్లో ఉగ్గాని ఎక్కువ మంది తినే అల్పాహారం. పోపు పెట్టి, అందులో ఉల్లి, పచ్చిమిర్చి వేసి వేయించిన తర్వాత మరమరాలను కలుపుతారు. అవసరమైన మేరకు ఉప్పు, కారం వేస్తారు. దీనిని ఉగ్గానిగా పిలుస్తారు. ఉదయం అల్పాహారంగా ఉగ్గాని బజ్జి (పచ్చిమిర్చి బజ్జి) ఎక్కువగా తింటారు. ఇప్పుడు ఉగ్గాణి దోసెలు కూడా ట్రెండుగా మారాయి. దోసెల్లో ఉగ్గాణి ఉంచి వడ్డిస్తారు.

కీమా దోసెలు...

రాయలసీమ ఎర్ర కారం దోసెలు అందరికీ తెలిసినవే. కానీ పచ్చిమిర్చి కారం పూసిన దోసెలు కూడా ఇక్కడ ప్రత్యేకమే. పచ్చిమిర్చి కారం వేయాలని అడిగి మరీ వేయించుకుంటారు. ఇక్కడ ఎక్కువగా వేరుశెనగ చట్నీయే ఉంటుంది. అదనంగా ఎర్రకారం, పచ్చికారం ముద్ద కూడా వేస్తారు. నాన్‌వెజ్ దోసెలకున్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చికెన్ దోసె, మటన్‌దోసె, కైమా (కీమా) దోసెలు ఇక్కడ చాలా ఎక్కువగా విక్రయిస్తారు. ఆదివారం, మంగళవారాల్లో ఈ దోసెలు ఎక్కువగా దొరుకుతాయి.

– వడ్డాది మహేశ్, ఈనాడు, అనంతపురం

బయట వేడిగా లోపల చల్లగా ఎలా?

ఇంట్లోనే ఫ్రైడ్ ఐస్‌క్రీం....

ప్ర&జ

నిన్న ఒక పార్టీలో ఫ్రైడ్ ఐస్‌క్రీం తిన్నా. మొదట వినగానే చాలా ఆశ్చర్యం అనిపించింది. ఐస్‌క్రీంని నూనెలో ఫ్రై చేస్తారా అని. తిన్న తర్వాత నమ్మక తప్పలేదు. బయట వేడిగా కరకరలాడుతూ, లోపల చల్లచల్లగా భలే ఉంది. దాన్ని ఎలా చేస్తారో తెలుసుకోవాలని ఉంది. ఇంట్లో చేసుకోవడం సాధ్యం అవుతుందా?

– అనూష, కూకట్‌పల్లి

నిజమే ఫ్రైడ్ ఐస్‌క్రీం రుచి చాలా భిన్నంగా ఉంటుంది. అసలు ఐస్‌క్రీంని ఎలా డీప్ ఫ్రై చేస్తారో కూడా ఓ పట్టాన తెలియదు చాలామందికి. మనం ఇప్పుడు దానిని ఎలా చేస్తారో తెలుసుకుందాం. ఈ వంటకానికి ముఖ్యంగా కావాల్సినవి... మైదా లేదా మొక్కజొన్నపిండి, కార్న్‌ఫ్లేక్స్ లేదా బిస్కెట్లు, గుడ్డు, వేయించడానికి తగినంత నూనె, కొద్దిగా దాల్చిన చెక్కపొడి అవసరం అవుతాయి. వేయించిన కార్న్‌ఫ్లేక్స్ లేదా నచ్చిన బిస్కెట్లని మిక్సీలో పొడి కొట్టుకుని పెట్టుకోవాలి. ఈ రెండూ కాదంటే బ్రెడ్‌పొడిని కూడా వాడుకోవచ్చు. అరలీటరు ఐస్‌క్రీంకి పావుకప్పు మొక్కజొన్నపిండి లేదా మైదా సరిపోతుంది. ముందుగా స్కూప్‌తో కానీ గుండ్రని గరిటెతో కానీ ఐస్‌క్రీంని తీసుకుని ఒక ప్లాస్టిక్ షీట్ మీద దూరందూరంగా ఉంచాలి. ఈ గుండ్రని ముద్దలని ఫ్రీజర్‌లో మూడు గంటల పాటు ఉంచాలి. వీటిని ముందుగా మైదాపిండి(పొడి పిండి)లోనే ఉండలని పూర్తిగా దొర్లించుకోవాలి. ఆ తర్వాత గిలక్కొట్టిన గుడ్డులో ముంచి తీయాలి. ఇప్పుడు వాటిని మరపట్టించి పెట్టుకున్న బ్రెడ్‌పొడిలోకానీ, కార్న్‌ఫ్లేక్స్ పొడిలో కానీ దాల్చిని పొడి వేసి కలిపి మళ్లీ దొర్లించాలి. ఇలా రెండు సార్లు చేస్తే ఐస్‌క్రీం కోటింగ్ పూర్తవుతుంది. వీటిని ఫ్రిజ్‌లో మూడుగంటల పాటు ఉంచాలి. ఇవి 15 రోజుల పాటు నిల్వ ఉంటాయి. అంటే మీ ఇంట్లో కార్యక్రమం ఏదైనా ఉంటే వీటిని ముందుగానే సిద్ధం చేసి పెట్టుకోవచ్చు. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు తీసి నూనెలో వేయించుకోవడమే. దీన్ని మెల్టెడ్ చాక్లెట్‌తోకానీ, బాదం, పిస్తా తురుముతో కానీ అలకరించుకుంటే రుచి బ్రహ్మాండంగా ఉంటుంది.

–శ్రీదేవి, హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు

సాంకేతిక విప్లవానికి సమస్యల వైరస్

● లక్ష్యం దిశగా సాగని ఫైబర్ నెట్ సేవలు

ఈనాడు, అమరావతి: ఇంటింటా నెట్ విప్లవం నీరసించిపోతోంది. కోటి ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్ల లక్ష్యం ఆదిలోనే ఆపసోపాలు పడుతోంది. మొదటి దశ లక్ష్యమైన 10 లక్షల కనెక్షన్లలో ఇప్పటిదాకా కేవలం రూ. 2.70 లక్షలే ఇచ్చారు. దీంతో వచ్చే మార్చి నాటికి కోటికి చేరుకోవడమనేది అసాధ్యంగా మారింది. పరిమిత నిధులు, భారీ లక్ష్యం, క్షేత్ర స్థాయిలో ఆపరేటర్ల సహకారలేమి వంటి అనేక సమస్యలు సాంకేతిక విప్లవానికి అవరోధంలా నిలుస్తున్నాయి. దేశంలో మొదటిసారిగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నెలకు రూ.149కే కేబుల్ ప్రసారాలు, టెలిఫోన్, అంతర్జాల సదుపాయాన్ని కల్పించే ఫైబర్ నెట్ ప్రాజెక్టుకు మూడేళ్ల క్రితమే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విశాఖలో 'నెట్ వర్క్ ఆపరేషన్ సెంటర్'ను ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా 23,800 కిలో మీటర్ల పొడవునా ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు వేశారు. ప్రాజెక్టు కోసం ఇప్పటివరకూ రూ.300 కోట్లు ఖర్చు చేశారు. ఇళ్లకు వేసే ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లకు అనుసంధానించే జీపాన్, ఐపీటీవీ బాక్సుల కోసం మరో రూ.170 కోట్లకుపైగా వెచ్చించారు.

తూర్పుగోదావరి జిల్లా మోరిలో జీపాన్, ఐపీటీవీ బాక్సులు పాడై మూలకు చేరిన ఎల్‌ఈడీ

ఏం లాభం?

- రాష్ట్రంలో 15వేల మందికిపైగా ఉన్న ఆపరేటర్లు (ఎంఎస్‌వో/ఎల్‌సీవో) ఫైబర్ నెట్‌వర్క్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు. కానీ కేబుల్ ప్రసార రంగంలో పైచేయిగా ఉన్న ఆపరేటర్లు కొందరు ఫైబర్ నెట్‌వర్క్ పరిధిలోకి వచ్చేందుకు విముఖత చూపుతున్నారు.
- ఇంకొందరు ఆసక్తిగా ఉన్నా వీరి పరిధిలోని కనెక్షన్లకు తగ్గ కీలకమైన ఓఎల్‌టీలు సమకూర్చే పరిస్థితిలో ఫైబర్ నెట్ సంస్థ లేదు.
- కోటి ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇవ్వాలంటే అదనంగా ఓఎల్‌టీలు ఏర్పాటు చేయాలి. ఒక్కో పరికరం కోసం రూ.2 లక్షలకుపైగా ఖర్చవుతుందని, ఇందుకోసం మరో రూ.600 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.
- మూడు రకాల సేవలు అందించే జీపాన్, ఐపీటీవీ బాక్సుల కొరత చాలా చోట్ల ఉంది. 4.50 లక్షల బాక్సులను కాంట్రాక్టు సంస్థలు ఇంకా సరఫరా చేయాలి.

పాడైన బాక్సులకు పరిష్కారం ఏదీ?

'మరమ్మతులకు గురైన జీపాన్, ఐపీటీవీ బాక్సులను సరి చేయాలని ఏడాది కాలంగా చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కేబుల్ కనెక్షన్ ఇచ్చాక చాలా రోజులు సక్రమంగానే ప్రసారాలు వచ్చాయి. టెలిఫోన్, ఇంటర్నెట్ సదుపాయాన్నీ ఉపయోగించుకున్నాం. బాక్సులు పాడయ్యాక ఎవరూ పట్టించుకోకపోవడంతో టీవీని పక్కన పెట్టాం.'

– వీఎస్ఎస్ శైలజ, గృహిణి, మోరి, తూర్పు గోదావరి జిల్లా

సమస్యల మాటేమిటి?

- ఇప్పటికే ఇచ్చిన ఫైబర్ నెట్ కనెక్షన్లలో తలెత్తే సమస్యలకు పరిష్కారాన్ని చూపే వ్యవస్థ అందుబాటులో లేకపోవడం పెద్ద లోటు.
- సాంకేతికంగా తగిన అవగాహన లేని ఆపరేటర్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- ఫైబర్ నెట్ నుంచి రెండు రకాల ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. జీబీ వినియోగం ఆధారంగా వీటి ధరలు నిర్ణయించారు. ఒక ప్యాకేజీ నుంచి మరో ప్యాకేజీకి వినియోగదారులు వెళ్లాలంటే గ్రామ స్థాయిలో ఆపరేటర్లు చేతులెత్తేస్తున్నారు.
- ముఖ్యమంత్రి గత ఏడాది డిసెంబరు 29న తూర్పు గోదావరి జిల్లా మోరిలో ఫైబర్ నెట్ సేవలను ప్రారంభించగా చాలా ఇళ్లలో కేబుల్ ప్రసారాలు నిలిచిపోయాయి. సాంకేతిక సమస్యలకు తగిన పరిష్కారం చూపని కారణంగా చాలామంది విరమించుకుని ఇతర మార్గాలు చూసుకుంటున్నారు.

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఫైబర్ నెట్ ప్రసారాలను వీక్షిస్తున్న కుటుంబం

సాంకేతిక సమస్యలకు పరిష్కారం అవసరం

'ప్రసారాలు బాగానే ఉన్నా సాంకేతికంగా చిన్నాచితకా సమస్యలు తలెత్తుతున్నాయి. టీవీ ఆన్ చేసిన వెంటనే కనెక్ట్ కావడం లేదు. ప్రత్యేకించి వర్షాలు కురిస్తే అంతరాయం ఏర్పడుతోంది. సాంకేతికంగా తలెత్తే సమస్యల పరిష్కారం కోసం ఫైబర్ నెట్ పరంగా తగిన చొరవ అవసరం.'

– జి.కృష్ణమూర్తి, విశ్రాంత ఉద్యోగి, మురళీనగర్, విశాఖపట్నం

లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ

'గడువులోగా మొదట 10 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు జారీ చేసేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నాం. వచ్చే మార్చి నాటికి 1.20 కోట్ల ఇళ్లకు కనెక్షన్లు జారీ చేయాలన్నది లక్ష్యం. కొన్ని సమస్యలు ఎదురవుతున్నా పరిష్కరించుకుంటూ ముందుకెళుతున్నాం. అదనంగా ఓఎల్‌టీ పరికరాల అవసరమైతే ఉంది. ఇందుకోసం అదనపు నిధులు అవసరమని నివేదికలు సిద్ధం చేశాం. అవసరమైన జీపాన్, ఐపీటీవీ అదనపు బాక్సులు తెప్పిస్తున్నాం. సాంకేతికంగా క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారిస్తాం.'

– దినేశ్ కుమార్, ఏపీ ఫైబర్ నెట్ ఎండీ

గ్రీన్‌కార్డు కావాలంటే... 151 ఏళ్లు ఎదురుచూడాల్సిందే!

వాషింగ్టన్: మాస్టర్స్, డాక్టరేట్ లాంటి అడ్వాన్స్‌డ్ డిగ్రీ పట్టాదారులైన భారతీయులు గ్రీన్‌కార్డు పొందాలంటే గరిష్ఠంగా 151ఏళ్ల వరకూ ఎదురుచూడాలని తాజా నివేదిక తేల్చింది. మేధోమథన సంస్థ కెటో ఇన్‌స్టిట్యూట్ దీన్ని విడుదలచేసింది. అమెరికా పౌరసత్వం, వలసల విభాగం (యూఎస్‌సీఐఎస్) విడుదలచేసిన శాశ్వత నివాస దరఖాస్తుల వివరాలను సంస్థ విశ్లేషించింది. వీటి ప్రకారం...

- 2018, ఏప్రిల్ 20నాటికి గ్రీన్‌కార్డుల కోసం 6,32,219 మంది భారతీయులు దరఖాస్తులను సమర్పించారు. వీరిలో కార్మికులతోపాటు వారి జీవిత భాగస్వాములు, పిల్లలూ ఉన్నారు.
- మేలిమి నైపుణ్యాల విభాగం (హైయెస్ట్ స్కిల్డ్ కేటగిరీ)లోని అసాధారణ సామర్థ్యం (ఎక్స్‌ట్రాఆర్డినరీ) కేటగిరీ కింద అమెరికా వచ్చిన భారత కార్మికులు (ఈబీ-1)లు గ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూడాల్సిన సమయం తక్కువగా ఉంది. వీరు గరిష్ఠంగా ఆరేళ్లు ఓపిక పడితే గ్రీన్‌కార్డులు చేతికి అందే అవకాశముంది. ఈ కేటగిరీ కింద ప్రస్తుతం 34,824 మంది కార్మికుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరి జీవిత భాగస్వాములు, పిల్లల దరఖాస్తులనూ కలిపితే ఈ సంఖ్య 83,578 వరకూ ఉంది.
- బ్యాచిలర్ డిగ్రీ పట్టాలతో ఇక్కడకు వచ్చిన కార్మికులు (ఈబీ-3 కేటగిరీ) అయితే 17ఏళ్లు వేచిఉండాలి. ప్రస్తుతం ఈ కేటగిరీలో 54,892 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరి జీవిత భాగస్వాములు, పిల్లల దరఖాస్తులనూ కలిపితే ఈ సంఖ్య 1,15,273 వరకూ ఉంది.
- అడ్వాన్స్‌డ్ డిగ్రీ పట్టాదారుల (ఈబీ-2) విషయంలో ఈ ఎదురుచూపులు 150ఏళ్లకు పైమాటే. ప్రస్తుతం ఈ కేటగిరీలో 2,16,684 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరి జీవిత భాగస్వాములు, పిల్లల దరఖాస్తులు కలిపితే ఈ సంఖ్య 4,33,368గా ఉంది. పెండింగ్ దరఖాస్తుల్లో ఎక్కువ ఈబీ-2 (69 శాతం) కేటగిరీలోనే ఉన్నాయి. అయితే వీరికి దక్కే కార్డులు 13 శాతం మాత్రమే.

ఉమ్మడి ప్రవేశ పరీక్షల్లో అర్హత మార్కుల తగ్గింపు!

(మొదటి పేజీ తరువాయి)

ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన యాజమాన్యాలు మంత్రి గంటాను కలిసి అర్హత మార్కులు తగ్గించాలని కోరారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ తగ్గించారని.. ఎంసెట్‌లో తగ్గించాలని వారు విన్నవించారు. దీన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు.

పాలిసెట్‌లో ఇలా.. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్‌లో 30శాతం మార్కులు సాధిస్తేనే అర్హులు. దీన్ని 25శాతానికి తగ్గించాలని కోరుతూ సాంకేతిక విద్య ప్రత్యేక కార్యదర్శి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ఇటీవల పాలిసెట్‌లో 1,03,775మంది అర్హత సాధించగా ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు 43,871మంది మాత్రమే వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 74,312 సీట్లు ఉండగా 37,360 సీట్లు భర్తీ అయ్యాయి. సాంకేతిక విద్యాశాఖ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే కొత్తగా 19వేలు మంది అర్హత సాధిస్తారు.

డీసెట్‌లోనూ భారీగా తగ్గింపు.. రెండేళ్ల డీఈడీ కోర్సులు ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్‌లో అర్హత మార్కులు భారీగా తగ్గించనున్నారు. డీసెట్‌లో ఓసీ, బీసీలకు అర్హత మార్కులు 50కాగా.. ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులకు 45 మార్కులుగా ఉంది. ఇటీవల డీసెట్‌కు 52,935మంది హాజరుకాగా.. వీరిలో సుమారు 21%నుంచి 22% మంది మాత్రమే అర్హత సాధించినట్లు సమాచారం. అన్ని కళాశాలల్లో కలిపి 65వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈనేపథ్యంలో ఓసీ, బీసీలకు అర్హత మార్కులు 35గా.. ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులకు అర్హత మార్కులు అనేవి తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఎంసెట్‌పై కసరత్తు.. ఎంసెట్‌లో 25శాతం మార్కులు వస్తే అర్హత లభిస్తుంది. 160మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ ఏడాది ఎంపీసీస్ట్రీమ్‌కు 1,90,922మంది పరీక్షకు హాజరు కాగా.. వీరిలో 1,38,017మంది అర్హత సాధించారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఆప్షన్లు 65,909మంది ఇచ్చారు. వీరిలో 60,943మందికి సీట్లు కేటాయించారు. ఆన్‌లైన్‌లో ప్రవేశాలకు 51,846 ఆసక్తి చూపగా.. కళాశాలల్లో రిపోర్టు చేసింది 46,858మంది మాత్రమే. ఈ నేపథ్యంలో అర్హత మార్కులు రెండు తగ్గించాలని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు కోరుతున్నాయి. ఈ ప్రతిపాదనను ఆమోదిస్తే మరో 15వేలు మందికి అవకాశం లభిస్తుంది.

ఐక్యత చాటుదాం

రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ఎన్నికల్లో గట్టి పోటీనిద్దాం ● నలుగురు ముఖ్యమంత్రుల అభిప్రాయం

ఈనాడు అమరావతి: కేంద్రంలోని భాజపా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీలన్నీ తమ ఐక్యతను చాటేందుకు త్వరలో జరిగే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ఎన్నికను ఒక అవకాశంగా మార్చుకోవాలని నిర్ణయించాయి. దిల్లీలో శనివారం జరిగిన నలుగురు ముఖ్యమంత్రుల ఆంతరంగిక సమావేశంలో ఈ అభిప్రాయానికి వచ్చారు. ఆ ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ కలిస్తే గట్టి పోటీ ఇవ్వగలమని, అన్నీ కలిసొస్తే ఎన్డీయే అభ్యర్థిని ఓడించే అవకాశమూ ఉందన్న భావన వీరి సమావేశంలో వ్యక్తమైంది. ఆ ఎన్నికల్లో ప్రతిపక్షాల అభ్యర్థి గెలిచినా గెలవకపోయినా... భాజపాకి మాత్రం అంత తేలిగ్గా గెలుపు లభించకుండా చూడాలన్న నిశ్చయానికి వచ్చారు. ఎన్డీయే, యూపీయే కూటముల్లో లేని రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చే దిశగా శనివారం మరో కీలకమైన ముందడుగు పడింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిస్తున్న.... ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కేరళ, కర్ణాటక ముఖ్యమంత్రులు చంద్రబాబు, మమతా బెనర్జీ, పినరయి విజయన్, కుమారస్వామి శనివారం రాత్రి ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదివారం జరిగే నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై వీరు చర్చించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నివాసంలో ధర్నా చేస్తున్న ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కలసి సంఘీభావం చెప్పాలని అప్పటికప్పుడు నిర్ణయించుకున్నారు. భావసారూప్యం కలిగిన నాయకులంతా ఏకతాటిపైకి వచ్చామని, తమలో ఎవరికి ఇబ్బంది వచ్చినా సంఘటితంగా కదులుతామని ఈ సంఘటన ద్వారా వారు చెప్పకనే చెప్పారు. శనివారం దిల్లీలో చోటు చేసుకున్న ఈ పరిణామాలు ఎన్‌డీయే, యూపీయే కూటముల్లో లేని రాజకీయ పార్టీల ఏకీకరణ దిశగా మరో కీలక అడుగుగా భావిస్తున్నారు. గత నెలలో కర్ణాటక ముఖ్యమంత్రిగా కుమారస్వామి ప్రమాణ స్వీకారోత్సవంలో వీరంతా మొదటిసారి ఒక వేదికపైకి వచ్చి ఆయనకు మద్దతు తెలిపారు. ఇవన్నీ ప్రాంతీయ పార్టీల మధ్య బంధం బలోపేతమవుతోందనడానికి సంకేతం. కుమారస్వామి ప్రమాణ స్వీకారోత్సవ సందర్భంలో చంద్రబాబు బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతితోను, వామపక్ష పార్టీల నాయకులతోను ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్‌డీయే, యూపీయే కూటమిలో లేని ప్రాంతీయ పార్టీల మధ్య బంధం బలోపేతం చేసి, అందర్నీ ఒక తాటిపై నడిపించేందుకు చంద్రబాబు చొరవ తీసుకోవాలని ఆ సందర్భంగా ఇతర పార్టీల నాయకులు కోరారు. దానికి ఆయనా అంగీకరించారు. ఆ ప్రయత్నాల్లో భాగంగానే శనివారం ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది.

కేంద్రంతో ప్రత్యక్ష పోరాటం.. విభజన చట్టంలోని అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసిందని భావిస్తున్న చంద్రబాబు .. కేంద్రంతో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమయ్యారు. ఆ ప్రయత్నంలో భాగంగానే భావసారూప్యం గల పార్టీల్ని సంఘటితం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నీతి ఆయోగ్ సమావేశం రాజకీయాలకు అతీతంగా జరిగేదైనప్పటికీ... దానికో రాజకీయ ప్రాధాన్యం తెస్తున్నారు. దిల్లీ వెళ్లడానికి ముందే... తమతో కలసి వచ్చే ముఖ్యమంత్రులతో మాట్లాడారు. ఆయన ద్విముఖ వ్యూహంతో దిల్లీకి వెళ్లారు. విభజన హామీల అమలుపై రాష్ట్రానికి జరిగిన అన్యాయంతో పాటు, మోదీ ప్రభుత్వ వైఫల్యాలు, దేశవ్యాప్తంగా నెలకొన్న సమస్యల్ని నీతి ఆయోగ్‌సమావేశంలో ఎండగట్టడంమొదటి వ్యూహం. దీనికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంల మద్దతూ తీసుకోనున్నారు. రెండోది ఎన్‌డీయే, యూపీయే కూటమిలో లేని పార్టీల్ని సంఘటితం చేయడం. రెండో వ్యూహంలో భాగంగానే ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది.

కేంద్రంపై గళమెత్తుదాం

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్షలు నెరవేర్చడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని వారికి వివరించినట్లు తెలిసింది. కేజ్రీవాల్‌కు మద్దతు తెలిపే క్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ బైజల్‌ను కలసి వినతిపత్రం ఇవ్వడానికి అనుమతి కోరుతూ లేఖను ఎల్జీ నివాసానికి పంపారు. అనంతరం నలుగురు ముఖ్యమంత్రులు కలిసి నేరుగా దిల్లీ సీఎం కేజ్రీవాల్ నివాసానికి చేరుకున్నారు. అక్కడికి చేరువలో ఉన్న ఎల్జీ నివాసానికి వెళ్లడానికి అనుమతి కోసం వేచి చూశారు. అనుమతి రాకపోవడంతో కేజ్రీవాల్ సతీమణి సునీత, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం నలుగురు సీఎంలు మీడియాతో మాట్లాడారు. దిల్లీ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కోసం కేజ్రీవాల్ చేస్తున్న ధర్నా గురించి ఆదివారం నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో సమయం చూసుకొని ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్లాలని నలుగురు ముఖ్యమంత్రులు నిర్ణయించుకున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోగా విపక్ష ఐక్య కూటమిని ఏర్పాటుచేయాలని భాజపాయేతర పార్టీలు ప్రయత్నిస్తున్న తరుణంలో వీరి భేటీ జరగడం విశేషం.

కేంద్రం-రాష్ట్రం కలిసి పనిచేయాలి

రాజధాని దిల్లీలో సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం పనిచేస్తోందని చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాజకీయాలు వేరనీ, కేంద్రం- రాష్ట్రం కలిసి పనిచేయాలనీ ఆయన పేర్కొన్నారు. 'దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతు తెలపడానికి మేమంతా వచ్చాం. ప్రజాస్వామ్యయుతంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగించడానికి లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్రం సహకరించాలి. మేం నలుగురు ముఖ్యమంత్రులు కేజ్రీవాల్‌ను కలవడానికి అనుమతి కోరితే ఎల్జీ నిరాకరించారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని మేం డిమాండు చేస్తున్నాం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ, రాష్ట్ర పాలన సజావుగా సాగకుండా చేయడం శోచనీయం. ధర్నా విరమించాలని మేం కేజ్రీవాల్‌ను కోరబోం' అని చంద్రబాబు స్పష్టం చేశారు. సమస్యను పరిష్కరించాలనే తాము డిమాండు చేస్తున్నామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

పాలన నిలిచిపోయింది... ప్రజలెక్కడకు వెళ్లాలి: మమతాబెనర్జీ

ప్రజలెన్నుకొన్న ప్రభుత్వానికి కేంద్రం గౌరవమివ్వాలని మమతా బెనర్జీ అన్నారు. ప్రతిపక్షాలకు కూడా తగిన గౌరవం ఇవ్వాలని కేంద్రానికి సూచించారు. 'నాలుగు నెలలుగా దిల్లీలో పాలన నిలిచిపోయింది. ప్రజలు ఎక్కడికి వెళ్లాలి? రెండు కోట్ల మంది జనాభాకు సంబంధించిన సమస్యలు పట్టించుకోకపోవడం శోచనీయం. నాలుగు నెలలుగా దిల్లీ ముఖ్యమంత్రికి సమయం ఇవ్వడానికి ఎల్జీకి కుదరలేదంటే ఏమనుకోవాలి? ఆయన్ని కలవడానికి నలుగురు ముఖ్యమంత్రులు లేఖ రాస్తే ఇంట్లో లేరని చెప్పారు. మరి ఎల్జీ ఎక్కడికి వెళ్లారు?' అని ఆమె ప్రశ్నించారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వానిది తప్పు ఉంటే తప్పు అని చెప్పాలే గానీ నాలుగు నెలలుగా సమస్య అలాగే వదిలేయడం సరికాదన్నారు. ఇది రాజ్యాంగ సంక్షోభం అవుతుందన్నారు. కేజ్రీవాల్ ధర్నా చేస్తున్నట్లుగా రేపు అన్ని రాష్ట్రాల్లో చేస్తే పరిస్థితి ఏంటన్నారు. ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇలాంటి సమస్య తలెత్తినా తాము మద్దతిస్తామని ఆమె స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ సతీమణి సునీత స్వాగతం

అంతకుముందు, ఏపీ భవన్ నుంచి నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, మమత బెనర్జీ, కుమారస్వామి, విజయన్‌లు వేర్వేరుగా కేజ్రీవాల్ నివాసానికి చేరుకున్నారు. వారికి కేజ్రీవాల్ సతీమణి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కేజ్రీవాల్ కుమారుడు, కుమార్తెలు నలుగురు సీఎంలకు కృతజ్ఞతలు తెలిపారు. ధర్నా చేస్తున్న కేజ్రీవాల్‌ను కలవడానికి తొలుత మమతా బెనర్జీ ఎల్జీ కార్యాలయాన్ని ఫోనులో సంప్రదించగా అనుమతి రాలేదు. దీంతో నలుగురు సీఎంలు ఎల్జీకి లేఖ రాశారు. కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రులు కలిసేందుకు బైజాల్ అనుమతి నిరాకరించారని ఆప్ నేత రాఘవ చంద్ర ఆరోపించారు. అనుమతి నిరాకరించడంపై కేజ్రీవాల్ మండిపడ్డారు. 'లెఫ్టినెంట్ గవర్నర్ ఇలాంటి నిర్ణయాన్ని సొంతంగా తీసుకున్నారని నేను అనుకోను. అనుమతి నిరాకరించాల్సిందిగా పీఎంవో ఆదేశించి ఉంటుంది. ఐఏఎస్‌ల సమ్మె కూడా పీఎంవో ప్రమేయంతోనే జరిగింది. మనం ప్రజాస్వామ్యంలో నివసిస్తున్నాం. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడానికి ఇతర రాష్ట్రాల సీఎంలు వస్తే ప్రధాని దానిని తోసిపుచ్చుతారా? రాజ్ నివాస్ అనేది ఏ ఒక్కరి వ్యక్తిగత ఆస్తి కాదు. అది దేశ ప్రజలందరికీ చెందుతుంది' అని ఆయన ట్వీట్ చేశారు. రాజధాని దిల్లీలో సమస్యల్నే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనీ, ఇక దేశ సమస్యల్ని ఏ మేరకు పరిష్కరిస్తారని మమతా బెనర్జీ ప్రశ్నించారు.

శనివారం రాత్రి దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతతో సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో కేరళ, పశ్చిమబెంగాల్, కర్ణాటక ముఖ్యమంత్రులు విజయన్, మమతాబెనర్జీ, కుమారస్వామి

సమయం కోరినా ఇవ్వలేదు: ట్విట్టర్‌లో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కలిసేందుకు అనుమతివ్వమని తనతో సహా నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కోరినా దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ నుంచి ఎలాంటి స్పందన లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం రాత్రి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దిల్లీ రాష్ట్ర ప్రభుత్వం తన కార్యకలాపాలను సజావుగా నిర్వహించుకునేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ సహకరించాలని డిమాండ్ చేశారు. అరవింద్ కేజ్రీవాల్‌కు తమ మద్దతు తెలిపేందుకు దిల్లీ వచ్చామన్నారు. ఈ అంశాలపై వినతిపత్రం ఇవ్వాలనుకుంటున్నామని, రాత్రి 9 గంటల సమయంలో కలిసేందుకు అవకాశమివ్వాలని లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరినా ఫలితం లేదన్నారు. ఆయన్ను కలిసేందుకు సమయం కోరుతూ నలుగురు ముఖ్యమంత్రులు సంతకాలు చేసిన వినతిపత్రం ప్రతిని ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

గ్రహం అనుగ్రహం

17-6-2018 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
చవితి: సా. 4-27 తదుపరి పంచమి
పుష్యమి నక్షత్రం: ఉ. 11-10 తదుపరి ఆశ్లేష
అమృత ఘడియలు: ఉ.శే. 6-41 వరకు
వర్జ్యం: రా. 11-05 నుంచి 12-35 వరకు
దుర్ముహూర్తం: సా. 4-48 నుంచి 5-40 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5-29; సూర్యాస్తమయం: సా.6-32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	45.0	28.0
రాజమహేంద్రవరం	41.5	29.0
విశాఖపట్నం	40.2	28.8
ఒంగోలు	40.1	28.6
కరీంనగర్	40.0	28.5
సూర్యాపేట	40.0	28.0
తిరుపతి	39.9	24.4
విజయవాడ	39.8	27.4
శ్రీకాకుళం	39.5	26.5
గుంటూరు	39.1	29.1
నెల్లూరు	39.0	28.0
కడప	39.0	27.0
రామగుండం	38.8	28.4
అనంతపురం	38.7	28.2
తాడేపల్లిగూడెం	38.0	28.5
నల్గొండ	38.0	27.0
నరసాపురం	37.8	28.8
కర్నూలు	37.0	26.3
హైదరాబాద్	36.9	25.6

ఏపీ భవన్ మళ్లీ కళకళ..!

ఈనాడు అమరావతి: దిల్లీలోని ఏపీ భవన్ చాన్నాళ్ల తర్వాత కీలకమైన రాజకీయ పరిణామానికి వేదికైంది. యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీయే-1 ప్రభుత్వాల్లో తెదేపా క్రియాశీలక పాత్ర పోషించినప్పుడు ఏపీ భవన్ అనేక రాజకీయ పరిణామాలకు వేదికగా నిలిచేది. నిత్యం అగ్రనేతల సమావేశాలతో కళకళ్లాడేది. మళ్లీ ఇన్నాళ్లకు నలుగురు ముఖ్యమంత్రుల కీలక సమావేశానికి ఏపీ భవన్ వేదికైంది.

నేడు రాష్ట్రపతి భవన్‌లో..

దిల్లీ: ఆదివారం జరగనున్న నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశాన్ని రాష్ట్రపతి భవన్ వేదికగా నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన రోజంతా జరిగే భేటీలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. 'పాలకమండలి నాలుగో సమావేశం కోసం ఎదురు చూస్తున్నా. వివిధ రంగాల్లో కీలక విధానాల అమలు తీరును ఈ సమావేశంలో చర్చిస్తాం' అని మోదీ శనివారం ట్వీట్ చేశారు. రాష్ట్రాల భాగస్వామ్యంతో జాతీయ అభివృద్ధి ప్రాధాన్యతలపై దార్శనికతను పంచుకునేందుకు నీతిఆయోగ్ పాలకమండలి వేదికగా నిలుస్తుంది. గడిచిన ఏడాదిలో జరిగిన పనుల్ని సమీక్షించి, భవిష్యత్తు ప్రాధాన్యాల గురించి ఈ భేటీలో చర్చిస్తారు.

కేంద్రం తీరుని ఎండగట్టాల్సిందే..!

● నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావించబోయే అంశాలపై చర్చలో చంద్రబాబు

ఈనాడు అమరావతి: ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలు అమల్జేయడంలో రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయంపై ఆదివారం దిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశం వేదికగా గొంతెత్తాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రాష్ట్రాలపై కేంద్రం ఆధిపత్య ధోరణి, కేంద్ర, రాష్ట్ర సంబంధాలను పునః సమీక్షించుకోవలసిన అవసరం తదితర అంశాలను ఆయన గట్టిగా నొక్కి చెప్పనున్నారు. ప్రస్తావించాల్సిన అంశాలపై చంద్రబాబు నాలుగు రోజులుగా విస్తృత కసరత్తు చేశారు. అధికారులు, పార్టీ వ్యూహ కమిటీ సభ్యులతో వరుసగా నాలుగు రోజులు సమావేశాలు నిర్వహించారు. శుక్రవారం ఎంపీల సమావేశంలోను ఈ అంశంపై కూలంకషంగా చర్చించారు. శనివారం దిల్లీ బయల్దేరడానికి ముందు... మరోసారి అధికారులు, వ్యూహ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ప్రస్తావించాల్సిన అంశాలకు తుది రూపునిచ్చారు. జాతీయ ప్రాధాన్యంగల అంశాలు, విభజన చట్టంలోని అంశాలు-హామీల అమలు, వ్యవసాయరంగం-రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆరోగ్య రంగానికి సంబంధించిన పథకాల అమలు, ఇతర అంశాలన్నీ కలిపి ఒక విభాగం చేశారు. ఈ ప్రతిని నీతి ఆయోగ్ సమావేశానికి వచ్చే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అందజేస్తారు. సమావేశంలో మాట్లాడేందుకు లభించే సమయాన్ని బట్టి... ఎంపికచేసిన అంశాలను ప్రాధాన్య క్రమంలో ముఖ్యమంత్రి ప్రస్తావిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. విభజన చట్టంలోని అంశాలు, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి మరింత ద్రోహం చేస్తోందని శనివారం జరిగిన సమావేశంలో చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని, ప్రజల్ని ఇబ్బందులకు గురిచేసేలా కేంద్రం అనుసరిస్తున్న తీరుని జాతి దృష్టికి తీసుకెళ్లేందుకు నీతి ఆయోగ్ సమావేశాన్ని వేదికగా చేసుకోవాలని నిర్ణయించారు.

లోపభూయిష్టంగా ఎంఎస్‌పీ నిర్ణయించే విధానం.. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణయించే విధానం లోపభూయిష్టంగా ఉంటోందని ముఖ్యమంత్రి ధ్వజమెత్తనున్నారు. కేంద్రం ఎంఎస్‌పీ ప్రకటించి చేతులు దులిపేసుకుంటోందని, రైతుల నుంచి పంట ఉత్పత్తుల్ని కొనుగోలు చేసే ప్రక్రియలో ఎలాంటి సహకారం ఉండటం లేదని ప్రస్తావిస్తారు. రైతులకు మద్దతు ధరకు సంబంధించి స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల్ని తక్షణం అమలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతారు. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం రోజు రోజుకీ ఎక్కువవడంపై ఆయన నిరసన వ్యక్తం చేస్తారు. "రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధుల్ని కేంద్రం ఇస్తే... స్థానిక అవసరాలు, ప్రాధాన్యాల్ని బట్టి ఏ పనులు చేపట్టాలో, దేనికెంత ఖర్చు చేయాలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించుకుంటాయి. రాష్ట్రాలు ఏం చేయాలో కేంద్రమే చెప్పడం సరి కాదు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై గతంలో సర్కారియా కమిషన్ సిఫార్సులు చేసింది. ఇప్పుడు మరోసారి కేంద్ర, రాష్ట్ర సంబంధాల్ని సమీక్షించుకోవలసిన అవసరముంది. నీతి ఆయోగ్ సమావేశంలో ఈ అంశాన్నీ ప్రస్తావిస్తాను" అని ముఖ్యమంత్రి పేర్కొన్నట్టు తెలిసింది. 15వ ఆర్థిక సంఘానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 'టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్' వల్ల రాష్ట్రాలకు జరిగే నష్టం, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా నిర్ణయించడానికి 2011 జనాభా లెక్కల్ని ప్రామాణికంగా తీసుకోవడం వల్ల ఎదురయ్యే ఇబ్బందుల్ని చంద్రబాబు ప్రముఖంగా ప్రస్తావించనున్నారు. "కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా 42 శాతానికి పెంచినా, వాస్తవానికి రాష్ట్రాలకు వస్తోంది 36 శాతమేనని ఆర్‌బీఐ, కాగ్ లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పెట్రో ఉత్పత్తులపై సెస్‌ను 11 నుంచి 19 శాతానికి పెంచింది. దీని వల్ల కేంద్రానికి రూ.2 లక్షల కోట్లు అదనంగా సమకూరింది. దాన్ని కేంద్రం రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. తమకు కావలసిన రాష్ట్రాల్లో మాత్రమే ఆ నిధులు ఖర్చు చేస్తోంది. జీఎస్టీ వల్ల రాష్ట్రాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వాటన్నిటినీ ముఖ్యమంత్రి ప్రస్తావిస్తారు" అని పార్టీ వ్యూహ కమిటీ సభ్యుడొకరు తెలిపారు. ''ఎన్డీయే నుంచి తెదేపా బయటకు వచ్చాక, కర్ణాటక ఎన్నికల తర్వాత మొదటిసారి నీతి ఆయోగ్ సమావేశం జరుగుతోంది. కర్ణాటక ముఖ్యమంత్రిగా కుమారస్వామి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో భాజాయేతర రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు ఒక వేదికపైకి వచ్చిన నేపథ్యంలో ఈసారి నీతి ఆయోగ్ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది" అని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.

ఇదీ సంగతి!



మీ రూ.2000 నోటు చిరిగిందా?

పాత రూ.500, రూ.1000 నోట్ల రద్దు తర్వాత అంత కంటే పెద్దదైన రూ.2000 నోటును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొత్త రంగులు, కొత్త భద్రతలతో వచ్చిన ఆ నోటును చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

పెద్ద మొత్తాలను సైతం జేబులో పెట్టుకోవడానికి వీలుకల్పించింది ఆ నోటే. అదే సమయంలో చిల్లర కష్టాలను కొనితెచ్చిపెట్టింది. రూ.20తో ఏదైనా వస్తువు కొని రూ.2000 నోటు ఇస్తే బేరం సైతం వద్దనుకుని.. దండం పెట్టిన రోజులూ ఉన్నాయి.

ఆన్‌లైన్ మహిమో లేదా ఆఫ్‌లైన్‌లో నోట్లు ఎక్కువగా లభ్యం కావడమో తెలియదు కానీ ఆ తర్వాత పరిస్థితులు మెరుగై చిల్లర కష్టాలు తీరాయి. అయితే ఇపుడు కొత్త కష్టం వచ్చింది. రూ.2000 నోటు చినిగినా.. పాడైపోయినా ఇపుడు ఏం చేయాలన్నది అర్థం కావడం లేదు.

సాధారణంగా మన దగ్గర ఏవైనా నోట్లు చినిగినా.. పాడై పోయినా.. వాటిని మన దగ్గర్లోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోకి తీసుకెళ్లి ఇస్తే.. వాటి స్థానంలో చెల్లుబాటు అయ్యే నోట్లు ఇస్తారు. బ్యాంకులు కాకుండా ప్రైవేటు వ్యక్తులు కూడా చినిగిన నోట్లకు బదులుగా మంచి నోట్లు ఇస్తుంటారు. కాకపోతే కొంచెం కమీషను తీసుకుంటుంటారు. అది వేరే సంగతి. రూ.2000 నోటు వచ్చి అపుడే ఏడాదిన్నరకు పైగా అవడంతో ఆ నోటు కూడా పాత బడ్డాయి. కొన్ని సందర్భాల్లో అనుకోకుండా చినిగి పోతుంటాయి. అక్కడే వచ్చింది చిక్కంతా. ఇపుడు ఎవరైనా వినియోగదారు ఆ చినిగిన లేదా పాడైపోయిన రూ.2000 నోటును బ్యాంకుకు తీసుకెళ్తే.. చాలా వరకు బ్యాంకులు ఈ నోటును తీసుకుని దానికి సరిపడా నోటును లేదా నోట్లను ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి.

ఎందుకంటే..

బ్యాంకులు తిరస్కరించడానికి కారణం లేకపోలేదు. ఇప్పటిదాకా రూ.2000 నోట్లు చినిగితే ఏం చేయాలన్నదానిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నుంచి ఎటువంటి నిబంధనలూ బ్యాంకులకు రాలేదు. దీంతో ఆర్‌బీఐ నుంచి మార్గదర్శకాలు వచ్చేంత వరకు చినిగిన నోట్లను మీ వద్దే పెట్టుకోండని బ్యాంకు అధికారులు వినియోగదార్లకు సూచిస్తున్నారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

మరికొందరు అధికారులు మాత్రం నిబంధనలు అన్ని చినిగిన నోట్లకూ వర్తిస్తాయని.. కొత్త రూ.2000; రూ.200 నోటుకు వర్తించదనడం ఎంత వరకు సబబమని అంటున్నారు. 'ద రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(నోట్ రిఫండ్) రూల్స్-2009 ప్రకారం.

. రూ.50 పైన ఉన్న అన్ని చినిగిన, పాడైన నోట్లకు ఒకే నిబంధనలు వర్తిస్తాయి.

✦ నోట్లు చినిగి పోయినపక్షంలో ఆ చినిగిన నోటులోని పెద్ద భాగం ఎంత మేర ఉందన్నదాన్ని బట్టి ఇచ్చే విలువ ఉంటుంది.

✦ రూ.50 విషయానికొస్తే చినిగిన నోటులో అతిపెద్ద భాగం కనీసం 70 చ.సెం.మీ. ఉంటే పూర్తి మొత్తాన్ని బ్యాంకులు ఆ నోటు తెచ్చిన వ్యక్తికి ఇవ్వాల్సి ఉంటుంది. ఇక రూ.100, రూ.500; రూ.1000 నోట్లకు వరుసగా 75, 80, 84 చ.సెం.మీ. మేర ఉండాల్సి ఉంటుంది. అపుడే పూర్తి విలువ అందుతుంది.

✦ ఇక ఈ వైశాల్యాల కంటే తక్కువ ఉంటే కనుక ఆ నోటులో సగం విలువ మాత్రమే దక్కుతుంది.

ఈ నిబంధనలన్నీ నవంబరు 8, 2016 కంటే ముందు నాటివి. అయితే ఈ నిబంధనల్లో రూ.1000కు సంబంధించిన వాటిని రూ.2000కు అమలు చేయడానికి బ్యాంకులు వెనకడుగేస్తున్నాయి.

కొత్త నిబంధనలను పట్టించుకోరా..?

పెద్ద నోట్ల రద్దు అనంతరం ఆర్‌బీఐ కొన్ని నిబంధనలను సవరించింది. జులై 3, 2017న జారీ చేసిన ఆ నిబంధనల ప్రకారం.. పాడైపోయిన నోట్ల నిర్వచనాన్ని విస్తరించారు. 'పాడైపోయిన నోటు' అంటే.. సాధారణ వాడకం వల్ల నోటు పాత బడిపోయినా.. లేదా ఒక నోటు రెండుగా చినిగిపోయిన పక్షంలో అవసరమైన ఫీచర్లు ఉంటే మాత్రం.. వాటిని బ్యాంకులు అంగీకరించాలి. అంటే ఇక్కడ పాడైపోయిన నోటు అంటే అన్ని నోట్లూ అని అర్థమే కదా. అయితే బ్యాంకుల మాత్రం రూ.2000 తప్ప అని అన్వయించుకుంటున్నాయి. బ్యాంకులు ఇలా ప్రవర్తించడానికి కారణం.. ఆర్‌బీఐ తన కొత్త నిబంధనల్లో ఎక్కడా రూ.2000 నోటును ఉదహరించకపోవడం. మరో కారణం ఏమిటంటే.. పెద్ద నోట్ల రద్దు తర్వాత జారీ చేసిన కొత్త నోట్లను చూస్తే.. అవి పాత నోట్లతో పోలిస్తే చిన్నవిగా(రూ.100 తప్ప) ఉన్నాయి. పాత రూ.50 నోటుతో పోలిస్తే రూ.2000 నోటు ఇప్పుడు చిన్నదిగా ఉంది. నిబంధనల్లో ఏమో చినిగిన నోటు పరిమాణాన్ని బట్టి మార్పిడిని సూచించారు. ఈ కారణం వల్ల కూడా బ్యాంకులు వెనకడుగు వేస్తున్నాయి. రూ.200 నోటు విషయంలోనూ బ్యాంకులు ఇదే సందిగ్ధతతో ఉన్నాయి.

ఆర్థిక శాఖే చెప్పాలి..

ఆర్‌బీఐ కంటే ఆర్థిక శాఖే ఈ విషయంలో స్పష్టత నివ్వాలని ఓ ఆర్‌బీఐ అధికారి ఓ ఆంగ్ల పత్రికకు సమాధానమిచ్చారు. ఇదే విషయంపై ఆర్థిక వ్యవహారాల విభాగంలోని ఓ డైరెక్టర్ ఆ పత్రికతో మాట్లాడుతూ చినిగిన కొత్త నోట్ల మార్పిడి విషయంలో కొత్త నిబంధనలు తీసుకువచ్చే విషయంలో ముందస్తు దశలో ఉన్నట్లు వివరించారు. ఆ లెక్కన చినిగిన రూ.2000 నోట్లు మార్చుకోవాలంటే మరికొంత కాలం ఆగకతప్పదు.

ఈనాడు బిజినెస్ వారాంతం

అమెరికా సుంకానికి చైనా ప్రతిసుంకం

- **50 బి.డాలర్ల ఉత్పత్తులపై అదనంగా 25% విధింపు**
- **వాణిజ్య యుద్ధంపై ప్రపంచ దేశాల్లో మళ్లీ కలవరం**

షాంఘై

అమెరికా- చైనాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చింది. అమెరికా సుంకం విధింపునకు ప్రతిస్పందనగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై అదనపు సుంకానికి నిర్ణయం తీసుకుంది. చైనా మేధో సంపత్తి చౌర్యానికి పాల్పడుతోందని, అనైతిక వాణిజ్య మార్గాలను అవలంబిస్తోందని ఆరోపిస్తూ 50 బిలియన్ డాలర్ల విలువైన చైనా ఉత్పత్తులపై శుక్రవారం అమెరికా 25% సుంకం విధించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే అటు చైనా కూడా 50 బిలియన్ డాలర్ల విలువైన 659 అమెరికా ఉత్పత్తులపై అదనంగా 25 శాతం సుంకం విధించాలని నిర్ణయించింది. ఈ 659 ఉత్పత్తుల్లో 545 ఉత్పత్తులపై అదనపు సుంకం జులై 6 నుంచి అమల్లోకి వస్తుందని చైనా వాణిజ్య సుంకం విధింపు కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఉత్పత్తుల విలువ సుమారు 34 బి.డాలర్ల వరకు ఉంటుందని తెలిపింది. మిగిలిన 114 ఉత్పత్తులపై (విలువ 16 బి.డాలర్లు) అదనపు టారీఫ్‌ల అమలు తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొంది. చైనా విదేశీ వాణిజ్య చట్టాలు, ఎగుమతి- దిగుమతి టారీఫ్‌ల నిబంధనలు, అంతర్జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా అదనపు సుంకం పెంపునకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

అగ్రరాజ్యంపై డ్రాగన్ అధికారిక మీడియా ధ్వజం

అమెరికా సుంకాల విధింపు నిర్ణయంపై చైనా అధికారిక మీడియా విరుచుకుపడింది. 'తెలివైన మనిషి బంధాలకు వారధి నిర్మిస్తాడు. తెలివితక్కువ వ్యక్తి అడ్డుగోడలు కడతాడ'ని తన సంపాదకీయ వ్యాసంలో చైనా అధికారిక వార్తా ఏజెన్సీ జిన్‌వా పేర్కొంది. అయితే వాణిజ్య యుద్ధంలో తన ప్రయోజనాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చైనా ఎదుర్కొంటుందని గట్టిగా హెచ్చరించింది. చైనా దిగుమతులపై సుంకం విధింపు ద్వారా అంతర్జాతీయ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలతో పాటు ద్వైపాక్షిక ఒప్పందాల ఉల్లంఘనకు అమెరికా పాల్పడిందని ఆగ్రహించింది. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అంతర్జాతీయ ఆర్థిక వృద్ధికి అవరోధంగా నిలిచేలా ఉన్నాయని ధ్వజమెత్తింది. 'వాణిజ్య యుద్ధంలో ఎవరూ విజేతలు కాలేరు. అయితే అమెరికా తెరదీసిన ఈ వాణిజ్య యుద్ధం వల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక ప్రపంచీకరణ, బహుళపాక్షిక వాణిజ్యం, అంతర్జాతీయ ఉత్పత్తి సరఫరా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడుతుంద'ని పేర్కొంది. మరోవైపు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చడంపై ఇరు దేశాల్లోని వాణిజ్య సంఘాలు, పరిశ్రమ వర్గాలు కలత చెందుతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామంపై ప్రపంచ దేశాలు కూడా కలవరపాటుకు లోనవుతున్నాయి.

30 అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకం పెంపు

అమెరికా నుంచి ఎగుమతి అయ్యే 30 ఉత్పత్తులపై సుంకం రాయితీలను రద్దు చేసేందుకు భారత్ నిర్ణయించింది. ఇందులో భాగంగా 800 సీసీ కంటే అధిక ఇంజిన్ సామర్థ్యమున్న మోటర్ సైకిళ్లపై కస్టమ్స్ సుంకాన్ని 50 శాతం వరకు పెంచనుంది. పై 30 ఉత్పత్తుల జాబితాలో వాల్‌నట్స్, యాపిళ్లు కూడా ఉన్నాయి. భారత్ నుంచి ఎగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియంపై ఈ ఏడాది మార్చిలో అమెరికా సుంకాన్ని పెంచిన సంగతి తెలిసిందే. ఈ చర్యలకు ప్రతిచర్యగా భారత్ తాజా నిర్ణయాన్ని తీసుకుంది. అమెరికా సుంకం పెంపుతో తమ వాణిజ్యంపై ఎంత విలువ మేర ప్రభావం పడుతుందో అదే స్థాయిలోనే తాము కూడా సుంకం పెంచినట్లు అంతర్జాతీయ వాణిజ్య స్థాయి (డబ్ల్యూటీఓ)కి భారత్ లేఖ రాసింది.

'సుబాక్సాన్' జనరిక్ విక్రయాలు ఆపండి

- **డాక్టర్ రెడ్డీస్‌కు అమెరికా కోర్టు తాత్కాలిక ఆదేశాలు**
- **యూఎస్ఎఫ్‌డీ అనుమతి వచ్చిన ఒక రోజుకే**

ఈనాడు, హైదరాబాద్: సుబాక్సాన్ బ్రాండ్‌తో విక్రయిస్తున్న బుప్రెనార్ఫిన్, నలాక్సాన్ సబ్‌లిగ్యువల్ ఫిల్మ్ ఔషధం జనరిక్‌ను అమెరికా మార్కెట్‌లో విక్రయించకుండా డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌పై అమెరికాలోని న్యూజెర్సీ జిల్లా న్యాయస్థానం తాత్కాలిక నిషేధం విధించింది. అత్యవసర ఇన్‌జంక్షన్ పిటిషన్‌కు అనుగుణంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. కొన్ని రకాల ఔషధాలకు బానిసలుగా మారిన వారికి వాటి నుంచి రక్షించడానికి ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. అమెరికా విపణిలోకి సుబాక్సాన్ జనరిక్ ఔషధాన్ని విడుదల చేయడానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి తుది అనుమతి లభించినట్లు శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న మేధో సంపత్తి హక్కుల వివాదానికి సంబంధించి ప్రతివాదులు దాఖలు చేసిన అత్యవసర దరఖాస్తును పరిశీలించి, సమీక్షించిన న్యూజెర్సీ జిల్లా న్యాయస్థానం ఇన్‌జంక్షన్ ఆదేశాలు జారీ చేసిందని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. బుప్రెనార్ఫిన్, నలాక్సాన్ ఫిల్మ్ జనరిక్‌ను తాత్కాలికంగా విక్రయించరాదని న్యాయస్థానం తెలిపిందని, ఈ ఆదేశం వాణిజ్యపరమైన ఉత్పత్తికి వర్తించదని కంపెనీ స్పష్టం చేసింది. తాత్కాలిక నిషేధం వల్ల డాక్టర్ రెడ్డీస్‌కు నష్టం కలిగితే.. దాన్ని భర్తీ చేయడానికి 1.8 కోట్ల డాలర్ల విలువైన బాండ్‌ను దాఖలు చేయాలని ప్రతివాదులను న్యాయస్థానం కోరింది. ఇన్‌జంక్షన్ పిటిషన్‌పై జూన్ 28న విచారణ జరుపుతారు. యూఎస్ మేధో సంపత్తి హక్కు నెంబరు 9931305కు సంబంధించి వివాదం జరుగుతోంది. ఈ మేధో సంపత్తి హక్కుపై తీర్పు తమకు అనుకూలంగానే రాగలదని భావిస్తున్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది.

ఉక్కు ఉత్పత్తి లక్ష్యానికి రూ.10 లక్షల కోట్లు కావాలి

ఉక్కు శాఖ మంత్రి

అంగల్(ఒడిశా): 2030 కల్లా 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి భారత్‌కు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని ఉక్కు శాఖ మంత్రి చౌధరి బీరేందర్ సింగ్ పేర్కొన్నారు. శనివారమిక్కడ జేఎస్‌పీఎల్‌కు చెందిన నాలుగు ప్రధాన ప్లాంట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అందులో కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంటును ప్రారంభించగా.. మిగతా మూడింటిని సింగ్ ప్రారంభించారు. కాగా, ఒడిశాలో వచ్చే 12 ఏళ్లలో ఉక్కు ఉత్పత్తిని 100 మిలియన్ టన్నులను పెంచడానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని బీరేందర్ సింగ్ అభిప్రాయపడ్డారు. భారత ఉక్కు పరిశ్రమకు జేఎస్‌పీఎల్ కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంటు మద్దతుగా నిలవగలదని.. కోకింగ్ కోల్ దిగుమతిని గణనీయంగా తగ్గించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పటిదాకా తలపెట్టిన ఆర్థిక సంస్కరణల్లో రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన దివాలా స్మృతి (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్.... ఐబీసీ) ఒక ప్రధాన సంస్కరణ. కార్పొరేట్ సంస్థల దివాలా ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం, బ్యాంకుల మొండిబాకీల వసూళ్లలో వెన్నుదన్నుగా నిలవడం ఈ ఐబీసీ ప్రత్యేకత. ఈ రెండేళ్లలో దీన్ని రెండు సార్లు సవరించారు. రుణ పరిష్కార ప్రణాళికలను త్వరితగతిన అమలుచేసే దిశలో ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి బ్యాంకులకు బాసటగా నిలిచేందుకు ఐబీసీకి కొన్ని సవరణలు చేశారు. అంతేగాక, చిన్న-మధ్యతరహా సంస్థలకు కొన్ని వెసులుబాట్లు కల్పించడంతో పాటు ఇంటి రుణాలు తీసుకునేవాళ్ల ప్రయోజనాలను కాపాడే దిశలో ప్రభుత్వం ఇంకొన్ని సవరణలు చేసింది. దివాలా ప్రక్రియను వేగవంతం చేస్తూ, కార్పొరేట్ రుణ ఎగవేతదార్లు మధ్యలో ఎలాంటి అడ్డంకులు కల్పించకుండా ఈ సవరణలు చేపట్టారు. గతంలో బ్యాంకులు వాటి మొండి బాకీల వసూళ్లకోసం డీఆర్‌టీ (రుణ వసూలు ట్రైబ్యునళ్లు)లపై ఆధారపడేవి. ఫలితంగా మొండి బాకీల వసూలుకు బ్యాంకులు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. గత మూడు, నాలుగేళ్లలో బ్యాంకుల.. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తులు భారీగా పెరగడంతో ఈ సమస్య పరిష్కారానికి సమర్థవంతమైన, వేగవంతమైన చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది.

దివాలా స్మృతి కింద రుణ పరిష్కారానికి సిద్ధంగా ఉన్న మొండి బాకీలు (రూ.కోట్లలో)

సంస్థ పేరు	మొండి బాకీ	తాజా పరిస్థితి
భూషణ్ స్టీల్	44,478	ప్రక్రియ పూర్తి, టాటా స్టీల్ కొనుగోలు
ఎస్సార్ స్టీల్	49,000	ముగింపు దశ
భూషణ్ పవర్	47,000	బిడ్ల దాఖలు పూర్తి
అలోక్ ఇండస్ట్రీస్	29,500	ప్రక్రియ కొనసాగుతోంది
ఆమ్‌టెక్ ఆటో	12,722	ప్రక్రియ కొనసాగుతోంది
మోనెట్ ఇస్పాత్	10,237	బిడ్ల దాఖలు పూర్తి
ల్యాంకో ఇన్‌ఫ్రా	44,364	ప్రక్రియ కొనసాగుతోంది
ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్	14,177	ప్రక్రియ పూర్తి
టెరా ఇన్‌ఫ్రా	10,065	దివాలా ప్రక్రియ ప్రారంభం
జేపీ ఇన్‌ఫ్రాటెక్	8,635	ప్రక్రియపై సుప్రీంకోర్టు స్టే
జ్యోతి స్ట్రక్చర్	7,165	ముగింపు దశ
మొత్తం	2,96,588	

మొండి ఘటాల మెడపై కత్తి

తుమ్మల కిశోర్

గత మార్చి నాటికి మొత్తం 21 ప్రభుత్వరంగ బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.ఎనిమిది లక్షల కోట్లకు చేరాయి. మరో రెండు, మూడు త్రైమాసికాలకు ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఇటీవల రిజర్వు బ్యాంకు నిరర్థక ఆస్తుల నిబంధనలను మరింత కఠినతరం చేయడం, గతంలో మాదిరి బ్యాంకులకు రుణ పునర్ వ్యవస్థీకరణ పథకాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల బ్యాంకులు వాటి మొండి బాకీలను ఉన్నవి ఉన్నట్లుగా ప్రకటించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో తాజాగా సవరించిన ఐబీసీ బ్యాంకుల మొండి బాకీల సమస్యను పరిష్కరించి వాటికి కొంత ఊరట కలిగించడంలో కీలకపాత్ర పోషించనుంది.

అడ్డంకులు తొలగాలి

నిజానికి దివాలా స్మృతి అమల్లోకి వచ్చి రెండేళ్లు దాటినా నిరర్థక ఆస్తుల పరిష్కారంలో ఆశించిన ఫలితాలు సాధించలేక బ్యాంకులు భంగపడ్డాయి. దీనికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా బకాయిపడ్డ కార్పొరేట్ సంస్థలు పరిష్కార ప్రణాళికల అమలులో కొన్ని అడ్డంకులు సృష్టించి దొడ్డిదారిన ఆయా సంస్థలను తిరిగి హస్తగతం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. అంతేగాక దివాలా స్మృతి అమలులో పలు న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తత్ఫలితంగా పరిష్కార ప్రణాళికలు సకాలంలో అమలుకాక బ్యాంకులు మొండి బాకీల భారాన్ని ఇంకా మోయాల్సి వస్తోంది. ఐబీసీ కింద పరిష్కార ప్రణాళికలను అమలుచేసే దిశలో రిజర్వు బ్యాంకు 12 పెద్ద కార్పొరేట్ రుణ ఖాతాలను ఆయా బ్యాంకులకు పంపి దాదాపు సంవత్సరం కావస్తోంది. ఆ 12 సంస్థల మొండి బాకీలు దాదాపు రూ.3 లక్షల కోట్లు ఉన్నాయి. అన్నీ సజావుగా సాగి ఉన్నట్లయితే ఈపాటికి బ్యాంకుల నిరర్థక ఆస్తుల ఆమేరకు తగ్గడంతోపాటు గతంలో మొండి బాకీలపై చేసిన కేటాయింపులను తిరగ రాయడం (రైట్ బ్యాక్) వల్ల ఆమేరకు బ్యాంకుల ఆదాయం పెరిగి ఉండేది. గత ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఖాతా కూడా కొలిక్కి రాలేదు. గత నెలలో భూషణ్ స్టీల్‌ను టాటా స్టీల్ కొనుగోలు చేయడం మాత్రం ఈ దిశగా పడిన తొలి అడుగని చెప్పుకోవచ్చు. మిగిలినవి వేర్వేరు దశల్లో ఉన్నాయి. దివాలా స్మృతి నిబంధనల ప్రకారం 180-270 రోజుల్లో దివాలా ప్రక్రియ పూర్తి కావాలి. అయితే న్యాయపరమైన చిక్కులతో తీవ్ర జాప్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఉదాహరణకు ఎలక్ట్రోస్టీల్ కంపెనీని కొనుగోలుచేయడానికి వేదాంతా బిడ్ దాఖలు చేసింది. దీన్ని ఎన్‌సీఎల్‌టీ ఖరారు చేసింది కూడా. అయితే దీన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌తో దివాలా ప్రక్రియకు తాత్కాలిక ఆటంకం ఏర్పడింది. ఈ ఎలక్ట్రోస్టీల్ కేసు పరిష్కారమైతే దాదాపు రూ.14,177 కోట్ల నిరర్థక ఆస్తుల భారం నుంచి గట్టెక్కినట్లే అవుతుంది.

ఇక ఎస్సార్ స్టీల్‌ను కొనేందుకు ఆర్సెలర్ మిత్తల్, న్యూమెటల్ మారిషస్ కంపెనీలు బిడ్లు దాఖలు చేశాయి. అయితే వీటి అనుబంధ సంస్థలు కొన్ని బ్యాంకులకు బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో దివాలా స్మృతి సెక్షన్ 29ఏ ప్రకారం ఆ సంస్థలకు బిడ్లు దాఖలుచేసే అర్హత లేదు. కొత్త సవరణలతో ఈ రెండు సంస్థలకు అర్హత వస్తుంది. మరోపక్క భూషన్ పవర్ అండ్ స్టీల్ కొనుగోలుకు టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలు ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు సమర్పించాయి. త్వరలోనే దివాలా ప్రక్రియ వేగవంతమై బకాయిల వసూళ్లు జరగనున్నాయి.

దశ తిరిగేనా..

గత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నష్టాలు రూ.(-) 87,356 కోట్లకు చేరాయి. అదేవిధంగా వాటి మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లకు చేరువలో ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటిదాకా ఇచ్చిన మూలధనం పారు బాకీల కేటాయింపులకే సరిపోయింది. చాలా బ్యాంకులు బాసెల్-3 నిబంధనల మేరకు సీఏఆర్ (కనీస మూలధన నిష్పత్తి)ను చేరుకోవాలంటే మరింత మూలధనం అవసరమవుతుంది. చాలా బ్యాంకుల రుణవితరణ సామర్థ్యం తగ్గడంతో పాటు వృద్ధిరేటు అరకొరగా ఉంది. ఇది ప్రస్తుత ప్రభుత్వ రంగ బ్యాంకుల ముఖచిత్రం. ఈ తరుణంలో దివాలా స్మృతి-2018 బ్యాంకులకు ఒక కొత్త ఊపునివ్వనుంది. రుణ పరిష్కార ప్రణాళికల అమలును వేగవంతంచేసి మరిన్ని ఎక్కువ బిడ్లను (జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి) పొందేందుకు వీలు కల్పిస్తూ దివాలా స్మృతిలో పలు సవరణలు చేసిన నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంకుల మొండి బాకీలలో కనీసం నాలుగో వంతు దాకా తగ్గే అవకాశం ఉంది. తొలి విడతలో ఆర్‌బీఐ గుర్తించిన 12 సంస్థల మొండి బాకీలు తగ్గడంతో పాటు రెండో విడతలో ఉన్న మరిన్ని సంస్థల మొండి బాకీలు తగ్గనున్నాయి. తొలి విడతలోని ఆ పన్నెండు సంస్థల నుంచి దాదాపు రూ.49 వేల కోట్ల మొండి బకాయిలు రావాల్సి ఉండగా రెండో జాబితాలో ఉన్న సంస్థల నుంచి దాదాపు రూ.28 వేల కోట్లు రావాల్సి ఉంది. అదే విధంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎన్‌బీ, కెనరా బ్యాంకులతో పాటు మరిన్ని పీఎస్‌బీలకు దివాలా స్మృతి ద్వారా మొండి బాకీల సమస్యకు కొంత మేర పరిష్కారం దొరుకుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. మొత్తం మీద 2018-19 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొండి బాకీల వసూళ్లు గణనీయంగా పుంజుకొని కొన్ని బ్యాంకులు లాభాలబాట పట్టే అవకాశం ఉంది.



కోడిగుడ్లు

16న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	388	వరంగల్	390
చిల్లరగా (ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	390
బెంగళూరు	425	చెన్నై	452
17వ తేదీకి		చిత్తూరు	445
విజయవాడ/గోదావరి	381	నమక్కల్	435

నాన్నా! నా భరోసా నీవే ఇక!

విజయవాడ
ఆదివారం జూన్ 17, 2018
siri@eenadu.net

నాన్నగా మారిన వేళ ఆ సంతోషమే వేరు. బిడ్డను చేతుల్లోకి తీసుకున్న మరుక్షణం నుంచీ.. ఆ బిడ్డ చుట్టూనే తన ఆలోచనలన్నీ.. అన్నీ తానై.. అన్నింటికీ తానున్నాననే భరోసానిస్తాడు నాన్న.

సంతోషంతోపాటు కొన్ని బాధ్యతలూ వచ్చి చేరతాయి. బిడ్డకు కావాల్సిన అవసరాలను తీర్చడంతోపాటు.. ఆ బిడ్డకు తగిన ఆర్థిక భరోసా కల్పించడంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటివరకూ ఉన్న ఆర్థిక ప్రణాళికల్లో మార్పులు చోటు చేసుకోవాలి.

ధీమా పెరిగిందా?

బిడ్డ పుట్టగానే... తన కోసం ఏదో ఒక పెట్టుబడి ప్రారంభించాలని అనుకుంటారు చాలా మంది. పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు మీరు చేయాల్సిన పనేమిటో తెలుసా? కొత్త వ్యక్తి రాకతో పెరిగిన మీ కుటుంబానికి తగిన ఆర్థిక భద్రత కల్పించడం. దీనికోసం ఉన్న మార్గం బీమా పాలసీ తీసుకోవడం. ఇప్పటి వరకూ ఉన్న బీమా పాలసీలను ఒకసారి సమీక్షించుకోండి. మీ వార్షికాదాయానికి కనీసం 10-20 రెట్ల వరకూ జీవిత బీమా ఉందా లేదా చూసుకోండి. తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ కల్పించే టర్మ్ పాలసీలను ఎంచుకోండి. మీ వార్షికాదాయం రూ.5లక్షలు ఉంటే.. మీకు కనీసం రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకూ జీవిత బీమా రక్షణుండాలి. 30 ఏళ్ల వ్యక్తి, 30 ఏళ్ల వ్యవధితో.. రూ.కోటి బీమా తీసుకుంటే.. ఏడాదికి రూ.7,497వరకూ ప్రీమియం ఉంటుంది. అనుకోని ఆటంకాలు ఎదురైనప్పుడు.. కుటుంబానికి కావాల్సిన ఆదాయాన్ని ఏ అంతరాయం లేకుండా అందించేందుకు ఈ రక్షణ తప్పనిసరి. బిడ్డకు కొండంత ఆర్థిక భరోసానిచ్చే విషయంలో ఏమాత్రం ఆలస్యం తగదు.

◆ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఏ చిన్న వైద్యానికైనా రూ.వేలల్లో.. రూ.లక్షల్లో ఖర్చువుతోంది. ఆరోగ్య బీమా ఉంటే తప్ప ఈ ఖర్చులను తట్టుకునే పరిస్థితులు కన్పించడం లేదు. మీరు సొంతంగా లేదా మీ కార్యాలయంలో బృంద ఆరోగ్య బీమా తీసుకొని ఉంటే.. బిడ్డ పుట్టగానే తన పేరును ఆరోగ్య బీమా పాలసీలో చేర్పించండి. ఇప్పటి వరకూ మీరు ఈ పాలసీని తీసుకోకపోతే.. ఇక ఆలస్యం పనికిరాదు. మీరు ప్రేమించే మీ కుటుంబ సభ్యులకు ఏదైనా అనారోగ్యం వచ్చినప్పుడు ఆ ఆర్థిక భారం మీరు మోయలేక ఇబ్బంది పడే సందర్భాలు ఎదురుకాకూడదు. ముఖ్యంగా పొదుపు, పెట్టుబడులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఈ వయసులో ఖర్చులు అధికంగా ఉంటే భవిష్యత్తు ఆర్థిక పరిస్థితిపై ఆ ప్రభావం ప్రతికూలంగా ఉంటుంది. కాబట్టి, ఆరోగ్య బీమా పాలసీ మీ ఆర్థిక ప్రణాళికలో భాగం కావాల్సిందే. 30 ఏళ్ల వ్యక్తి.. తన జీవిత భాగస్వామి, ఒక బిడ్డకు కలిపి ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ తీసుకుంటే.. రూ.4,50,000 పాలసీకి ప్రీమియం దాదాపు రూ.8,209 నుంచి ప్రారంభం అవుతుంది.

చదువుల ఖర్చుకు తగ్గట్టుగా...

పిల్లలు పెరిగి పెద్దవుతున్న కొద్దీ వారికి సంబంధించిన ఖర్చులు కూడా పెరుగుతుంటాయి. ముఖ్యంగా చదువుల ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఉన్నత చదువులతోపాటు.. పిల్లల వివాహానికీ అవసరమైన డబ్బునూ సమకూర్చుకోవాలి. మరి, దీనికోసం మీరేం చేస్తున్నారు? బిడ్డ పుట్టగానే తన ఆర్థికావసరాలు తీర్చేందుకు మీరు పెట్టుబడులు ప్రారంభించాలి. పెట్టుబడులు పెద్ద మొత్తంలోనే ఉండక్కర్లేదు. నెలనెలా, క్రమశిక్షణతో చిన్న మొత్తాలను మదుపు చేసుకుంటూ వెళ్లినా చాలు. దీర్ఘకాలంలో మీరు అనుకుంటున్న నిధి సాధ్యమవుతుంది. మీ పాప/బాబు పుట్టగానే పెట్టుబడులూ ప్రారంభం కావాలి. వారు పెరుగుతూ వెళ్తుంటే.. వీలును బట్టి, మీ పెట్టుబడి మొత్తమూ అందుకు అనుగుణంగా పెరగాలి. ఎంత ఎక్కువ కాలం మన పెట్టుబడి కొనసాగితే.. చక్రవడ్డీ ప్రభావంతో అంత ఎక్కువ నిధి మన చేతిలో ఉంటుంది. ఉదాహరణకు.. మీ పాప/బాబు 18 ఏళ్ల వయసులో గ్రాడ్యుయేషన్ కోర్సుకు వెళ్తారనుకుందాం.. ప్రస్తుతం దీనికి రూ.20లక్షలు అవుతుందనుకుంటే.. ద్రవ్యోల్బణ రేటు 7శాతం అంచనాతో.. 18 ఏళ్ల తర్వాత దాదాపు రూ.67 లక్షల వరకూ అవసరం అవుతాయి. ఈ మొత్తాన్ని చూస్తే అంత ఖర్చా? భరించగలమా? అన్న అనుమానం వస్తుంది. కానీ, క్రమానుగుతంగా.. క్రమశిక్షణతో మదుపు చేస్తూ వెళ్తే.. దీన్ని సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. దీనికోసం మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడం ఒక మార్గం. కనీసం 12శాతం రాబడి వచ్చేలా చూసుకుంటూ.. నెలకు రూ.5వేలు మదుపు చేస్తూ.. ఏడాదికోసారి 10శాతం చొప్పున పెంచుకోవాలి. అంటే.. ఈ ఏడాది మొత్తం నెలకు రూ.5,000ల చొప్పున.. తర్వాత ఏడాది రూ.5,500 చొప్పున... ఆ తర్వాతి ఏడాది రూ.6050 చొప్పున ఇలా పెంచుకుంటూ వెళ్లాలి. ఇలా చేస్తూ ఉంటే.. 18 ఏళ్లనాటికి రూ.72లక్షలు సాధించడం కష్టమేమీ కాదు. ఇలాగే.. పిల్లల వివాహానికి అవసరమైన నిధిని సమకూర్చేందుకూ పెట్టుబడులు పెట్టుకుంటూ వెళ్లాలి.

బిడ్డ రాకతో.. ఖర్చులు పెరుగుతాయి.. కొన్ని చిన్నవి కావచ్చు.. మరికొన్ని పెద్దవి.. కొన్నింటిని ఊహించలేం. వీటన్నింటినీ అదుపులో ఉంచడమూ సాధ్యం కాకపోవచ్చు. కానీ.. బిడ్డ బంగారు భవిష్యత్తుకు ఆర్థిక ఇబ్బందులు ఎప్పుడూ కారణం కాకూడదు. ఈ ఒక్క విషయాన్నీ దృష్టిలో పెట్టుకొని, మీ నిర్ణయాలన్నీ ఉండాలి. అవసరమైతే ఆర్థిక సలహాదారుడిని సంప్రదించి ఏం చేయాలన్నది నిర్ణయించుకోండి.

నాన్నలందరికీ.... హ్యాపీ ఫాదర్స్ డే...

- **నవీన్ చందాని,** చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, బ్యాంక్‌బజార్.కాం

అత్యవసర నిధి ఎంతుంది?

జీవిత, ఆరోగ్య బీమా తర్వాత దృష్టి పెట్టాల్సిన మరో అంశం.. అత్యవసర నిధి. బిడ్డ పుట్టిన తర్వాత ఎప్పుడు ఏ ఖర్చులు వస్తాయో ఊహించడం కష్టం. నిజానికి ఎవరికైనా ఏ ఖర్చు ఎలా వచ్చి పలకరిస్తుందో తెలుసుకోవడం కష్టమే. నాన్నగా మారిన ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించాలంటే.. ఆర్థికంగా కొంత బలంగానే ఉండాలి. బిడ్డ పుట్టిన తర్వాత వచ్చే ఆర్థిక బాధ్యతలను తట్టుకునే స్థితిలో ఉండాలంటే.. ముందు నుంచీ తగిన ప్రణాళికలు ఉండాల్సిందే. నెలవారీ ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతుంటే.. ఎంత కష్టం చెప్పండి. ఏది ఏమైనా.. కనీసం 3 నుంచి 6నెలల ఖర్చులకు సరిపడా మొత్తం ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవడం ఎప్పుడూ అవసరమే. ఈ మొత్తాన్ని లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్ల రూపంలో పెట్టుకోవడం ఉత్తమం.

రెండో ఇల్లు కొనడం మంచిదేనా?

యూనిట్ ఆధారిత బీమా పాలసీ (యులిప్) తీసుకునేప్పుడు.. ఫండ్ విలువ లేదా బీమా కవరేజీ మొత్తంలో ఏది ఎక్కువైతే అది ఉండేలా చూసుకోవాలా? ఫండ్ విలువతోపాటు బీమా కవరేజీ కూడా వచ్చేలా ఎంచుకోవాలా? - వినాయక్

మీరు యులిప్‌లో రూ.20లక్షల బీమా కవరేజీ తీసుకొని పదేళ్లపాటు ప్రీమియం చెల్లించారనుకుందాం. అప్పటికి మీ యులిప్‌లో ఫండ్ విలువ రూ.15లక్షల వరకూ అయిందనుకుందాం. ఈ సమయంలో ఏదైనా అనుకోనిది జరిగితే.. మీ ఫండ్ విలువ చెల్లించడం మంచిదా? బీమా మొత్తాన్ని చెల్లిస్తే బాగుంటుందా? ఎప్పుడైనా.. బీమా పాలసీతోపాటు ఫండ్ విలువనూ కూడా కలిపి చెల్లించే పాలసీలను ఎంచుకోవడం మేలు. మీ వార్షికాదాయానికి 10-12 రెట్ల వరకూ జీవిత బీమా ఉండేలా చూసుకోవాలి. దీనికోసం టర్మ్ పాలసీ తీసుకోవడం ఉత్తమం. యులిప్‌ను ఎంచుకుంటే.. బీమా మొత్తం.. ఫండ్ విలువలో ఏది ఎక్కువగా ఉంటే అది చెల్లించేలా పాలసీని తీసుకోవాలి. బీమా మొత్తం, ఫండ్ విలువ కలిపి చెల్లించే పాలసీలకు రుసుములు కొంత అధికంగా ఉండవచ్చు. కానీ, దీనికి భయపడి కష్ట సమయంలో వచ్చే మొత్తం విషయంలో రాజీ పడకూడదు.

మాకు ఇద్దరు అబ్బాయిలు. పదేళ్ల క్రితం రుణం తీసుకొని, ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు ఇంటి రుణం దగ్గరపడుతోంది. కాబట్టి మరో ఇల్లు కొనుక్కొంటే.. ఇద్దరబ్బాయిలకు చెరొక ఇల్లు ఇచ్చినవాళ్లం అవుతాం అని ఆలోచిస్తున్నాం. ఇది మంచిదేనా? - రమణ

మీకు ఆదాయ వనరుగా ఉండేటట్లు అయితే రెండో ఇల్లు కొనుక్కోండి. మీ పిల్లలకు ఇవ్వడానికి కొనక్కర్లేదు. మీ పిల్లలు పెరిగిన తర్వాత వారు ఎక్కడ స్థిరపడతారో ఇప్పుడు ఊహించలేరు కదా! వాళ్లు ఉండటం కోసం ఇప్పుడే మీరు ఇల్లు కొనడం ఎందుకు? మీరు 30, 40 ఏళ్లలో సంపాదించే ఆస్తి నేటితరం పిల్లలు 10, 15 ఏళ్లలోనే సంపాదిస్తారు. కాబట్టి, మీరు వాళ్ల కోసం మీ అవసరాలను త్యాగం చేసుకుంటూ ఇంటి రుణ వాయిదాలు కట్టడం ఎందుకు? ఒకసారి ఆలోచించండి. రుణ వాయిదాలకు కట్టే మొత్తాన్ని దీర్ఘకాలిక లక్ష్యంతో మ్యూచువల్ ఫండ్లలో బ్యాలెన్స్‌డ్ ఫండ్లలో పెట్టుబడిగా పెట్టండి. రెండో ఇంటికి మంచి అద్దె వచ్చే వీలుంటే. ఆ అద్దెను మ్యూచువల్ ఫండ్లకు మళ్లించవచ్చు. వృద్ధాప్యంలో మీ దంపతులిద్దరికీ కావాల్సిన పదవీ విరమణ నిధిని సిద్ధం చేసుకున్నాక.. మీ వద్ద ఇంకా మిగులు మొత్తం ఉంటే.. అప్పుడు మీ పిల్లలకు ఆ మొత్తాన్ని పంచే విషయాన్ని ఆలోచించవచ్చు.

- **వంగా రాజేంద్ర ప్రసాద్,** సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

విద్యారుణం... తీసుకుంటున్నారా?

మెడిసిన్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లాంటి ఉన్నత చదువుల కోసం లక్షల్లో ఖర్చవుతోన్న రోజులివి. ఇంతింత ఫీజులు భరించడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. మరి, ఇలాంటివారిని ఆదుకునేవి విద్యారుణాలే. ఏ బ్యాంకు ఎంతెంత రుణం అందిస్తుంది? వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి అని తెలుసుకోవడం ఈ సమయంలో అందరికీ అవసరమే. ఈ నేపథ్యంలో మన దేశంలోనే చదువుకోవాలని భావించే వారికి బ్యాంకులు, బ్యాంకింగేతర రుణ సంస్థలు అందిస్తోన్న విద్యారుణాల సంగతులేమిటో చూద్దామా!

రుణ సంస్థ	కనీస మొత్తం	గరిష్ఠ మొత్తం	వడ్డీ రేటు%	మార్జిన్ మొత్తం	వ్యవధి	మారటోరియం వ్యవధి
ఎస్‌బీఐ	పరిమితి లేదు	ప్రముఖ విద్యా సంస్థలు: రూ.35లక్షలు. ఇతర సంస్థల్లో రూ.10లక్షలు	ప్రముఖ సంస్థలు: 8.50-10.15. ఇతర సంస్థలు: 10.15 - 10.90	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్ల వరకూ.	కోర్సు వ్యవధి + ఏడాది
పీఎన్‌బీ	పరిమితి లేదు	మార్జిన్ చెల్లింపుతో పాటు, తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని బట్టి	ప్రముఖ సంస్థల్లో 8.40 - 8.90; ఇతరాల్లో 8.5 - 11.00	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది
ఐడీబీఐ బ్యాంకు	పరిమితి లేదు	రూ.20లక్షలు. మేనేజ్‌మెంట్ కోటాలో రూ.10లక్షలు	8.50 - 10.10	రూ.4లక్షలపైన 5%, మేనేజ్‌మెంట్ కోటా: 15%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది
హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలా	రూ.1లక్ష	పరిమితి లేదు	11.85% నుంచి	100శాతం వరకూ	12 ఏళ్లు	కోర్సు వ్యవధి + 6 నెలలు
అవాన్స్	రూ.1లక్ష	పరిమితి లేదు	11.7% నుంచి	అవసరం లేదు	10 ఏళ్లు	కోర్సు వ్యవధి + 6 నెలలు
యాక్సిస్ బ్యాంక్	రూ.50,000	రూ.75లక్షలు	13.6 - 15.1	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది
బ్యాంక్ ఆఫ్ బరోడా	పరిమితి లేదు	రూ.80లక్షలు	8.45 - 10.45	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది
యూనియన్ బ్యాంక్	పరిమితి లేదు	రూ.20లక్షలు	8.45 - 11.6	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది
దేనా బ్యాంక్	పరిమితి లేదు	రూ.15లక్షలు	8.4 - 9.95	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది
ఫెడరల్ బ్యాంక్	పరిమితి లేదు	రూ.20లక్షలు	10.65 - 15.05	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది.
కెనరా బ్యాంక్	పరిమితి లేదు	రూ.36లక్షలు	8.7 - 10.5	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది.
సౌత్ ఇండియన్ బ్యాంక్	పరిమితి లేదు	రూ.25లక్షలు	9.5 - 12.5	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది.
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	పరిమితి లేదు	రూ.30లక్షలు	8.7 - 11.5	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది.
ఆంధ్రాబ్యాంక్	పరిమితి లేదు	పరిమితి లేదు	8.6 - 10.55	రూ.4లక్షలు దాటితే 5%	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది
అలహాబాద్ బ్యాంక్	పరిమితి లేదు	రూ.75లక్షలు	8.7 - 10.35	-----	15 ఏళ్లు	కోర్సు వ్యవధి + ఏడాది

(కొన్ని బ్యాంకులు కోర్సు వ్యవధి పూర్తయిన తర్వాత ఏడాది నుంచి లేదా ఉద్యోగంలో చేరిన తర్వాత 6 నెలల నుంచి రుణ వాయిదాలు చెల్లించాల్సిందిగా పేర్కొంటున్నాయి. నిర్వహణ రుసుముల కింద కొన్ని బ్యాంకులు రుణ మొత్తంలో 1-2 శాతం వరకూ తీసుకుంటున్నాయి. ఈ వివరాలు అవగాహన కోసం మాత్రమే. పూర్తి సమాచారం కోసం మీ బ్యాంకును సంప్రదించండి)

- www.paisabazaar.com

పదవీ విరమణ..

క్రమం తప్పని ఆదాయం కోసం..

ఉద్యోగం చేస్తున్నప్పుడు నెలనెలా ఆదాయం వస్తుంది. మరి, పదవీ విరమణ చేసిన తర్వాత కూడా క్రమం తప్పకుండా ఆదాయం రావాలంటే ఏం చేయాలి? యాన్యుటీ పథకాలను ఎంపిక చేసుకోవడమే. వాటి సంగతేమిటో చూద్దామా!

భారత దేశం.. పొదుపరుల దేశం. పొదుపు చేయడం మనకు తరతరాలుగా వస్తున్న ఆచారవ్యహారాల్లో ఒక భాగం. అయితే, జీవిత అవసరాలు తీరేందుకు ఎంత పొదుపు చేయాలన్న దానికి కచ్చితమైన కొలమానమేమీ లేదు. పెరుగుతున్న వైద్య పరిజ్ఞానం, ఆయుర్దాయంలో వృద్ధి తదితర కారణాలతో మనం కష్టపడి సంపాదించిన డబ్బు మన అవసరాలను ఎన్నాళ్లపాటు తీరుస్తుందనేది తెలియదు. అందుకే, పదవీ విరమణ ప్రణాళిక అనేది ఇప్పుడు ప్రతి ఒక్కరికీ కచ్చితంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

దేశంలో సాంఘిక భద్రత చాలా తక్కువ మందికే అందుబాటులో ఉంది. మిగతా వారందరూ పదవీ విరమణ తర్వాత తమకు కావాల్సిన నిధులను సొంతంగానే సమకూర్చుకోవాలి. ఇలాంటివారందరూ యాన్యుటీ పథకాలను ఎంచుకోవడమే ఒక మార్గం. తాను జీవించి ఉన్ననాళ్లూ యాన్యుటీల నుంచి ఆదాయం అందుకోవడంతోపాటు.. ఆ తర్వాత జీవిత భాగస్వామికీ ఆదాయం అందేలా చూడవచ్చు. ఇద్దరూ మరణిస్తే.. యాన్యుటీ కొనుగోలుకు వెచ్చించిన మొత్తం పిల్లలకు చేరేలా చేసేందుకూ అవకాశం ఉంది.



జీవిత కాలంపాటు క్రమం తప్పకుండా ఆదాయం పొందేందుకు యాన్యుటీ పథకాలు సహాయం చేస్తాయి. ఇవి మార్కెట్ ఆధారంగా పనిచేసే పథకాలు, బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే సంప్రదాయ పథకాల కన్నా భిన్నంగా ఉంటాయి. స్థూల ఆర్థిక వ్యవస్థ పనితీరుతో సంబంధం లేకుండా ఇవి క్రమం తప్పని ఆదాయాన్నిస్తాయి. మీ కష్టార్జితాన్ని కాపాడుతూనే.. జీవితకాలంపాటు పింఛను ఆదాయాన్నిస్తాయివి. ఒకసారి యాన్యుటీ పథకాలు కొనుగోలు చేస్తే.. మార్కెట్ పరిస్థితులు.. వడ్డీ రేట్లతో సంబంధం లేకుండా మీకు కొనుగోలు రోజున ఉన్న లెక్కల ప్రకారం వడ్డీ అందుతూనే ఉంటుంది.

జీవిత బీమా సంస్థలు అందించే యాన్యుటీల్లో కొన్ని ముఖ్యమైన వాటిని పరిశీలిస్తే...

- **జీవిత కాలం యాన్యుటీ:** ప్రస్తుతం ఉన్న వడ్డీ రేటు ప్రకారం జీవితాంతం వరకూ పింఛను పొందే అవకాశం.
- **జీవిత కాలం యాన్యుటీ, పెట్టుబడి తిరిగి చెల్లింపు:** యాన్యుటీ కొనుగోలుదారుడు జీవించి ఉన్నంత కాలం అతనికి పింఛను లభిస్తుంది. అతను/ఆమె మరణించిన తర్వాత ఆ పెట్టుబడి మొత్తాన్ని నామినీకి చెల్లిస్తారు.
- **ఉమ్మడిగా:** యాన్యుటీ కొనుగోలు చేసిన వ్యక్తి జీవితాంతం వరకూ పింఛను చెల్లిస్తారు. ఆ తర్వాత అతని/ఆమె జీవిత భాగస్వామికి పింఛను లభిస్తుంది. ఇక్కడ దీన్ని పై రెండు రకాలుగా కూడా ఎంచుకోవచ్చు.

పెట్టుబడి పెట్టిన వెంటనే పింఛను ఇచ్చే పాలసీలు పదవీ విరమణ చేసిన వారికి మంచి మార్గం. దీంతోపాటు.. ఇప్పుడు పెట్టుకుంటూ వెళ్లి.. మనం పదవీ విరమణ చేసిన తర్వాత పింఛను ఇచ్చేలా కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. వీటిని డిఫర్డ్ యాన్యుటీ పథకాలని పిలుస్తారు. ఇమ్మీడియట్ యాన్యుటీ పథకాలను కొనుగోలు చేసిన మరుసటి నెల నుంచే పింఛను ఇస్తే.. డిఫర్డ్ యాన్యుటీ పథకాలు.. మనం నిర్ణయించుకున్న తేదీ నుంచి పింఛను అందిస్తాయి.

వెంటనే పింఛను ఇచ్చే యాన్యుటీ పథకాలతో మనకు ఇప్పటికప్పుడు ఎంత రాబడి వస్తుందన్న సంగతి తెలిసిపోతుంది. ఇప్పుడు పెట్టుబడి పెట్టి, తర్వాత పింఛను ఇచ్చే డిఫర్డ్ యాన్యుటీ పథకాలను ఎంచుకున్నప్పుడు మాత్రం కొంచెం జాగ్రత్తగా ఉండాలి.

ఇక్కడ రెండు రకాల ఐచ్ఛికాలు ఉంటాయి. నిర్ణీత కాలంపాటు మదుపు చేసిన తర్వాత, పింఛను ఇచ్చే సమయానికి ఉన్న వడ్డీ రేట్లను బట్టి, ఆదాయం పొందే అవకాశం ఉంది. అయితే, ఇక్కడ ఒక చిక్కుముడి ఉంది.. భవిష్యత్తులో వడ్డీ రేట్లు ఎలా ఉంటాయో ఇప్పుడే ఊహించడం కష్టం. ఇక రెండో రకం, మనం పెట్టుబడి పెట్టేప్పుడే.. వడ్డీ రేటు ఎంత ఉంది, దాని ప్రకారం ఆదాయం ఎంత లభిస్తుందన్న విషయంలో కచ్చితత్వం ఉంటుంది. పింఛను భవిష్యత్తులో ప్రారంభమైనా.. అది ఎంత వస్తుందనే విషయం మాత్రం ఇప్పుడే తెలిసిపోతుంది.

దీర్ఘకాలానికి ప్రణాళిక వేసుకునేప్పుడు భవిష్యత్తులో ఎంత రాబడి వస్తుందనే విషయంలో ఒక అంచనా ఉండాలి. కాబట్టి, పదవీ విరమణ తర్వాత మనకు ఆదాయం ఎలా రావాలన్నది చూసుకునేందుకు చక్కని ఆర్థిక ప్రణాళిక ఉండాలి. అందుకు అనువైన పథకాల గురించి పూర్తిగా తెలుసుకొని ఉండాలి. ప్రస్తుతం వీటి గురించి సమాచారం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. మార్కెట్లో అందుబాటులో ఉన్న పథకాల గురించి పూర్తిగా అవగాహన పెంచుకోండి. అప్పుడే.. సరైన నిర్ణయం తీసుకోగలరు.

- **చిన్మయ్ బేడె,** వైస్ ప్రెసిడెంట్- ప్రొడక్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్

మేనమామే.. కాలయముడు

ఈనాడు- హైదరాబాద్, న్యూస్‌టుడే- చైతన్యపురి: అమ్మ అన్నం పెడితే కానీ తినలేని పన్నెండేళ్ల కవల దివ్యాంగులు వారు.. మదిలోని మాట చెప్పలేరు. ఆకలైనా నోరువిప్పి చెప్పలేరు. మానసిక, శారీరకలోపాలతో ఇబ్బంది పడుతున్న వీరి బాధ చూడలేక తల్లిదండ్రులు మనోవేదన చెందుతున్నారు. ఇవన్నీ చూస్తున్న మేనమామ.. దివ్యాంగులిద్దరూ కుటుంబానికి భారమని, వారిని అడ్డుతొలగిస్తే అక్కాబావలు సుఖంగా ఉంటారని భావించాడు. వెంటనే ప్రణాళికను సిద్ధం చేసుకుని శుక్రవారం అర్ధరాత్రి అమలుచేశాడు. పిల్లలిద్దరినీ అంతమొందించి మృతదేహాలను తరలిస్తుండగా.. ఇంటి యజమాని పోలీసులకు సమాచారమివ్వడంతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. రాజధాని నగరంలోని చైతన్యపురి ఠాణా పరిధిలో సంచలనం సృష్టించిన ఈ ఘటన వివరాలను ఎల్బీనగర్ ఏసీపీ పృథ్వీధర్ రావు, ఇన్‌స్పెక్టర్ సత్తెయ్యలు తెలిపారు.

నిందితుడు మల్లికార్జున్‌రెడ్డి

తల్లిదండ్రులతో సృజనారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, తల్లి చెంత చిన్నారి రోహన్‌రెడ్డి (పాత చిత్రం)

గుంటూరు జిల్లా గురజాల మండలం అబ్బాపురం గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి. . త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి రెడ్డిలాబ్స్ పరిశ్రమలో ప్లాంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మిర్యాలగూడలోని రెడ్డికాలనీలో శ్రీనివాసరెడ్డి, లక్ష్మి దంపతులు నివాసముంటున్నారు. వీరికి సృజనారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి కవలలు, వీరితోపాటు రోహన్‌రెడ్డి(4) సంతామున్నారు. కవలలిద్దరూ దివ్యాంగులు. చైతన్యపురిలో ఉంటున్న లక్ష్మి సోదరుడు మల్లికార్జునరెడ్డికి దివ్యాంగులంటే ఇష్టంలేదు. మనోవికాసం పెరిగేందుకు హైదరాబాద్‌లో ఏదైనా సంస్థలో చేర్పించండి అంటూ శ్రీనివాస్‌రెడ్డికి బంధువులు సలహా ఇచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఠాకూర్ హరిప్రసాద్ మానసిక వికలాంగుల సంస్థలో గతేడాది చేర్చారు. పిల్లలిద్దరినీ వేసవి సెలవులకు ఇటీవల తండ్రి మిర్యాలగూడ తీసుకువచ్చాడు.

ఈత కొలనుకు తీసుకువెళ్తానంటూ..

పిల్లల మేనమామ మల్లికార్జున్‌రెడ్డి ఇదే అదనుగా.. వారిద్దరినీ చంపాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారమంతా వారితో ఉన్నాడు. దివ్యాంగులైన సృజనారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డిలను సరదాగా ఈతకొలనుకు తీసుకువెళ్తానంటూ అక్కకు చెప్పాడు. సాయంత్రం ఇద్దరినీ తీసుకుని మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరాడు. బస్సులో ఎందుకు తీసుకెళ్తున్నాడో అర్థం చేసుకోలేని ఇద్దరు పిల్లలూ మేనమామతో బస్సులో వచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లో బస్సు దిగాక ఇద్దరినీ చైతన్యపురి సత్యనారాయణపురంలో తానుంటున్న అద్దె ఇంటికి తీసుకువచ్చాడు. అనంతరం అతడి స్నేహితుడు వివేక్ రెడ్డికి ఫోన్ చేసి కారు కావాలని కోరాడు. స్నేహితుడు కారు(ఫోక్స్ వ్యాగన్ టీఎస్08 ఈకే 3410) తీసుకువచ్చి ఇచ్చాడు. అనంతరం మల్లికార్జునరెడ్డి పిల్లలిద్దరికీ భోజనం తినిపించాడు. ఉదయం బయటకు వెళ్దామంటూ వారిద్దరినీ పడుకోబెట్టాడు. రాత్రి 11గంటల ప్రాంతంలో గాఢంగా నిద్రపోతున్నారని నిర్ధరించుకున్నాక దిండ్లు తీసుకుని వారి ముఖాలపై గట్టిగా అదిమేశాడు. శ్వాస ఆగిందని నిర్ధరించుకున్నాక మృతదేహాలను కారులో గుంటూరు జిల్లా గురజాలకు తరలించాలని అనుకున్నాడు. తన తల్లిదండ్రులు అక్కడ ఉండటం, వారు శవాలను మాయం చేసేందుకు సహకరిస్తారని భావించాడు. శవాలను కారులో తీసుకెళ్లేందుకు బయటకు తీసుకువస్తుండగా.. అదే సమయంలో ఇంటి యజమాని మహేశ్‌రెడ్డి ఓ వేడుకలో పాల్గొని ఇంటికి వచ్చాడు. అదేంటి పిల్లలను కారులో తీసుకెళ్తున్నావ్ అని ప్రశ్నించగా.. శీతలపానీయం అనుకుని హార్పిక్ తాగారు ఆసుపత్రికి తీసుకెళ్తున్నానని బదులిచ్చాడు. మహేశ్‌రెడ్డికి అనుమానం వచ్చి డయల్ 100కు సమాచారమిచ్చాడు. చైతన్యపురి పోలీసులు అర్ధరాత్రి సమయంలో అక్కడికి వచ్చారు. మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తీసుకెళ్లారు. నేరం అంగీకరించడంతో నిందితుడిని, మృతదేహాలను తరలించేందుకు సహకరించిన కారు డ్రైవర్ వివేక్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నిందితుడిపై కేసు నమోదు

పథకం ప్రకారం చిన్నారులను చంపాడని నిర్ధరించుకున్న పోలీసులు మల్లికార్జునరెడ్డిపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. శ్రీనివాసరెడ్డి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని విలేకరులు పోలీసులను ప్రశ్నించగా.. నిందితుడు, అతడి అక్కాబావల చరవాణుల కాల్‌డేటాను విశ్లేషించనున్నామని, వీటి ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. మరిన్ని సాక్ష్యాధారాల కోసం పోలీసులు మల్లికార్జునరెడ్డి ఉంటున్న గది వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను తీసుకున్నారు. కారు వద్దకు మృతదేహాలను నిందితుడు తరలిస్తున్న దృశ్యాలు.. అతనికి సహకరించిన కారుడ్రైవరు వివేక్‌రెడ్డికి సంబంధించిన, కారు వెనక సీట్లో ఒక మృతదేహం, డిక్కీలో మరో మృతదేహం పెట్టిన దృశ్యాలు అందులో ఉన్నాయని వివరించారు.

అక్కాబావల సంతోషానికి అడ్డని చంపేశా..

తన అక్కాబావల సంతోషానికి అడ్డుగా ఉండటంతోనే దివ్యాంగులిద్దరినీ చంపేశానని మల్లికార్జున్‌రెడ్డి పోలీసులకు తెలిపాడు. శుక్రవారం అర్ధరాత్రి బావ శ్రీనివాస్‌రెడ్డికి నిందితుడు ఫోన్ చేసి పిల్లలను హత్య చేసినట్లు సమాచారమిచ్చాడు. మిర్యాలగూడ నుంచి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మిలు శనివారం చైతన్యపురి ఠాణాకు చేరుకున్నారు. బావమరిదిపై కేసు నమోదు చేయవద్దని తాము ఫిర్యాదు చేయబోమని బావ పోలీసులను వేడుకున్నారు. నిందితుడు ఇంజినీరింగ్ పూర్తిచేసి హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్నాడు. కొద్దినెలల క్రితం పెళ్లి చేసుకున్న మల్లికార్జునరెడ్డి భార్యకు విడాకులిచ్చాడు.

బాలుడి మృతదేహం

కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడి మృతి

- కాకినాడలో విషాద ఘటన

కాకినాడ క్రైం, న్యూస్‌టుడే: కుక్కలు దాడి చేయడంతో ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. స్థానిక సాలిపేటకు చెందిన వాసంశెట్టి నాగేంద్ర(6) శనివారం మధ్యాహ్నం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఉండగా గోడ దూకి వచ్చిన కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. ఈ ఘటనలో బాలుడి ఎడమ భుజం పూర్తిగా తెగిపోయింది. శరీరంపై 90కి పైగా గాట్లు పడ్డాయి. దాడి సమయంలో ఎవరూ గమనించకపోవడంతో కాపాడే అవకాశం లేకుండా పోయింది. విగతజీవిగా పడి ఉన్న బాలుడ్ని చూసిన పొరుగువారు ఇంట్లోనే ఉన్న బాదితుడి సోదరి సాయిశారదకి సమాచారం అందించారు. బాలుడి తండ్రి శ్రీనివాస్ ఆటో మెకానిక్‌గా పనిచేస్తుండగా, తల్లి భూలక్ష్మి ఓ ఇంట్లో ఆయాగా పని చేస్తుంది. యూకేజీ పూర్తిచేసిన బాలుడిని సోమవారం ఒకటో తరగతిలో చేర్పించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. ముద్దు ముద్దు మాటలు, చిలిపి పనులతో కళ్ల ముందు తిరిగే కుమారుని మరణాన్ని తట్టుకోలేక కుటుంబ సభ్యులు విలపించిన తీరు అందర్నీ కన్నీరు పెట్టించింది. ఘటనపై కాకినాడ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

కోర్టు వద్దే భార్య గొంతు కోశాడు

- కుమార్తెపై అత్యాచారం చేయడంతో పాటు మరో దారుణం

గువాహటి: కుమార్తెపైనే అత్యాచారానికి ఒడిగట్టిన ఓ తండ్రి అక్కడితో ఆగకుండా ఏకంగా న్యాయస్థానం ప్రాంగణంలోనే భార్యను గొంతుకోసి హతమార్చాడు. .!! అసోంలోని డిబ్రూగఢ్ జిల్లా, సెషన్స్ న్యాయస్థానంలో ఈ ఘోరం చోటు చేసుకొంది. ప్రాంగణంలో ఉన్నవారు స్పందించి నిందితుడు పూర్ణ నహర్ దెకాను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అత్యాచార కేసులో కారాగారానికి వెళ్లిన నిందితుడు బెయిల్‌పై కొద్దిరోజుల క్రితం బయటకు వచ్చాడు. శుక్రవారం తదుపరి విచారణలో భాగంగా న్యాయస్థానానికి వచ్చిన భార్యపై పదునైన కత్తితో దాడికి దిగాడు.

ఒడిశాలో పదేళ్ల గిరిజన బాలికపై అత్యాచారం, హత్య

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో పదేళ్ల గిరిజన బాలికపై స్థానికుడొకరు అత్యాచారానికి పాల్పడి, ఆపై ఆమెను హతమార్చాడు. మృతదేహాన్ని శనివారం ఉదయం పోలీసులు స్వాధీనం చేసుకుని మరణోత్తర పరీక్షకు పంపించారు. బాలికను తన వాహనంపై తీసుకువెళ్తున్నప్పుడు నిందితుడిని కొందరు స్థానికులు చూశారు. దీంతో అతడిని గుర్తించి, చెట్టుకు కట్టేసి దేహశుద్ధి అనంతరం పోలీసులకు అప్పగించారు. అత్యాచార ఘటనపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం ప్రకటించారు. 30 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేయాలని పోలీసుల్ని ఆదేశించారు.

పుణెలో ఏడాది పసికందుపై ఘోరం

పుణె: మహారాష్ట్రలోని పుణె సమీపంలో ఏడాది వయసున్న పసికందుపై అత్యాచారానికి ఒడిగట్టి, హత్య చేసిన 22 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పాప తల్లిదండ్రులు తమిళనాడుకు చెందిన కూలీలు. గురువారం రాత్రి ఇంటి బయట తల్లిదండ్రుల పక్కనే నిద్రిస్తున్న పాపాయిని నిందితుడు ఎత్తుకుపోయి, ఘోరానికి పాల్పడ్డాడు. పాప కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కలంతా వెతికి, పోలీసులను ఆశ్రయించారు. తర్వాత పాపాయి మృతదేహం లభ్యమయింది.

మౌంట్ ఎల్‌బ్రస్‌ను అధిరోహించిన విశాఖ బాలిక

ఈనాడు, విశాఖపట్నం: రష్యాలోని అత్యంత ఎత్తయిన పర్వతం మౌంట్ ఎల్‌బ్రస్‌ను విశాఖ నగరానికి చెందిన పదేళ్ల బాలిక కామ్యా కార్తికేయన్, ఆమె తల్లి లావణ్య, తండ్రి కార్తికేయన్ ఈ నెల 14న అధిరోహించారు. విశాఖలోని తూర్పునౌకాదళ కమాండర్ కార్తికేయన్‌కు పర్వతారోహణ అంటే మక్కువ. తండ్రి స్ఫూర్తితో కామ్యా ఎవరెస్ట్ బేస్ క్యాంపుతోపాటు కిలిమంజారో తదితర ప్రముఖ పర్వతాలను అధిరోహించింది. తాజాగా ఈ నెల 9న రష్యాకు చేరుకుని అజు అనే ప్రాంతం నుంచి మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతారోహణకు శ్రీకారం చుట్టారు. బాలికతోపాటు తల్లిదండ్రులు లావణ్య, కార్తికేయన్.. తూర్పు నౌకాదళానికే చెందిన లెఫ్టినెంట్ కమాండర్ హరిప్రసాద్, లెఫ్టినెంట్ శశాంక్‌తివారీ ఒక బృందంగా వెళ్లారు. ఈ నెల 14న ఉదయం 18,510 అడుగుల ఎత్తులో ఉన్న పర్వత శిఖరానికి చేరుకుని రికార్డు సృష్టించారు.

మౌంట్ ఎల్‌బ్రస్‌పై కామ్యా కార్తికేయన్, తల్లి లావణ్య, తండ్రి కార్తికేయన్

యూపీలో విద్యార్థిపై అమానుషం!

గాజియాబాద్: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ 12వ తరగతి విద్యార్థి(17)పై ఐదుగురు యువకులు దారుణ అకృత్యానికి పాల్పడ్డారు. అతనిపై లైంగికదాడికి పాల్పడి.. మల ద్వారం గుండా ఇనుప కడ్డీని చొప్పించినట్లు పోలీసులు శనివారం తెలిపారు. గాజియాబాద్ జిల్లా మోదీనగర్‌లో రెండు రోజుల క్రితం ఆ విద్యార్థి తన ద్విచక్రవాహనాన్ని మరమ్మతులకు ఇచ్చి ఇంటికి తిరిగివస్తుండగా.. అటకాయించిన నిందితులు అతన్ని ఓ దుకాణంలోకి లాక్కెళ్లి అఘాయిత్యానికి పాల్పడినట్లు సీనియర్ ఎస్పీ తెలిపారు. ఈ దారుణాన్ని చరవాణిలో చిత్రీకరించి.. బాలుడి వద్ద ఉన్న రూ. 1600 నగదును దోచుకున్నట్లు వెల్లడించారు. నిందితులంతా తమ కుమారుడిని కొంతకాలంగా వేధిస్తున్నారని.. వారిలో ఒకరు పోలీసు హెడ్ కానిస్టేబుల్ కొడుకుగా బాధిత బాలుడి తండ్రి ఫిర్యాదు చేశారు. భారత శిక్షాస్మృతి, పోక్సో చట్టాల్లోని వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

గౌరీలంకేశ్ హత్యకు 'ఆపరేషన్ అమ్మ'!

- నిందితుల పథక రచన ఇలా..

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య కార్యాచరణను 'ఆపరేషన్ అమ్మ' పేరుతో నిర్వహించారని ప్రత్యేక దర్యాప్తు బృందం తేల్చింది. తుపాకీ కాల్చినట్లు పోలీసులు చెబుతున్న పరశురామ్‌ను విచారించడంలో భాగంగా ఆయనతో పాటు నిందితులు నగరంలో ఉన్న ఆయా ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. నిందితులున్న ఓ గదిలో లభించిన వెంట్రుక.. అమోల్‌కాళేదని అనుమానిస్తూ డీఎన్ఏ పరీక్షకు పంపాలని నిర్ణయించారు. హత్యకు ఒక రోజు ముందు వరకు తానేం చేయబోతున్నదో తెలియదని పరశురామ్ చెప్పాడని అధికారులు వివరించారు. అమోల్ కాళే, పరశురామ్, ప్రవీణ్ తదితరుల నుంచి స్వాధీనపరచుకున్న డైరీల్లో మరాఠీ, కన్నడ, తెలుగు, హిందీ మిశ్రిత భాషల్లో ఉన్న సంకేత నామాలున్నాయని అధికారులు తెలిపారు. వారు ఎక్కువగా కాయిన్‌బూత్‌లలోనే మాట్లాడేవారు. ఏడాది కిందట కర్ణాటక- మహారాష్ట్ర సరిహద్దుల్లో ఒక వ్యక్తి తనను కలుసుకున్నాడని, ధర్మాన్ని దూషిస్తున్న వారిని మట్టుపెట్టాలని నూరిపోశాడని పరశురామ్ దర్యాప్తు అధికారులకు వివరించాడు. హత్య చేయడానికి సిద్ధమని తాను ప్రకటించాక ఎయిర్‌గన్‌తో శిక్షణ ఇచ్చారని నిందితుడు వెల్లడించాడు. హత్యకు ఒక రోజు ముందు గౌరీ నివాసం వద్ద రెక్కీ నిర్వహించామన్నాడు. సెప్టెంబరు 5న కారులో వచ్చిన ముగ్గురు తనకు తుపాకీ అందించారని తెలిపారు. గౌరీ తన కారును హెడ్‌లైట్ వెలుగులో పోర్టికోలో పెట్టేందుకు గేటు తీసిన సమయంలో నిందితుడు కాల్పులు జరిపాడని దర్యాప్తు అధికారులు వివరించారు. హత్య తరువాత తన వద్ద ఉన్న తుపాకీని కారులో ఉన్నవాడు లాక్కొని వెళ్లిపోయాడని, తనతో పాటు వచ్చిన వ్యక్తితోపాటు ద్విచక్రవాహనంపై పరారయ్యానని పరశురామ్ వివరించాడు. తన వద్ద తుపాకీ తీసుకున్న వ్యక్తి, తుపాకీ ఇచ్చిన వ్యక్తుల గురించి పరశురామ్ చేసిన వర్ణన, వివరాలతో అధికారులు దర్యాప్తును వేగిరం చేశారు. పరశురామ్ తన తండ్రి అశోక్‌తో చరవాణిలో మాట్లాడేందుకు సిట్ అధికారులు శనివారం అవకాశం ఇచ్చారు.

శ్రీరామసేన జిల్లా అధ్యక్షుడి విచారణ

విజయపుర జిల్లా శ్రీరామసేన అధ్యక్షుడు రాకేశ్ మఠ్‌ను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. పరశురామ్ మృదుస్వభావి అని, అతనితో తనకు స్నేహం ఉందని, హత్య చేసి ఉంటే క్షమించరాని నేరమేనని ఆయన వివరించారు.

దర్యాప్తు సంతృప్తికరం

గౌరీ లంకేశ్ హత్య కేసు దర్యాప్తు సంతృప్తికరంగా ఉందని ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. సిట్‌ను ఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు గౌరీ సోదరి కవిత, తల్లి ఇందిర ఫోన్‌లో కృతజ్ఞతలు చెప్పారు.

మహిళను పొట్టనపెట్టుకున్న కొండచిలువ

మకస్సర్: తోటలో కూరగాయలు కోసుకురావడానికి వెళ్లిన 54 ఏళ్ల వాతిబా అనే మహిళను 23 అడుగుల పొడవైన కొండచిలువ మింగేసిన ఉదంతమిది. ఇండోనేషియాలోని సలువెసి తీరానికి దగ్గర మునా ద్వీపంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. కూరగాయలకు వెళ్లి ఎంతసేపటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెదికారు. ఓచోట ఆమె చెప్పులు, కత్తి కనిపించాయి. అక్కడికి 30 మీటర్ల దూరంలో ఓ కొండచిలువ కదల్లేక పడుకుని ఉంది. అనుమానం వచ్చి, పొట్ట చీల్చి చూడగా, మహిళ బయటపడింది. ఇదే సలువెసి ద్వీపంలో గత ఏడాది మార్చిలో ఓ రైతును సైతం కొండచిలువ మింగేయడం గమనార్హం.

మావోయిస్టుల నుంచి భారీగా నల్లధనం స్వాధీనం

కటక్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడి ద్వారా మావోయిస్టులు భారీగా పోగేసుకున్న నల్లధనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సుప్రీం కోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తెలిపింది. మావోయిస్టు నాయకులు కొనుగోలు చేసిన అక్రమ ఆస్తులనూ స్వాధీనం చేసుకున్నట్లు సిట్ ఉపాధ్యక్షుడు జస్టిస్ అరిజిత్ పసాయత్ శనివారం ఇక్కడ చెప్పారు. మావోయిస్టులు ఇంత భారీగా నల్లధనాన్ని పోగేసుకున్నట్లు వెలుగులోకి రావడం ఇదే మొదటిసారని తెలిపారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి కోల్‌కతా, లఖ్‌నవూ, దిల్లీకి రవాణా అవుతున్న కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దేశంలోని కనీసం ఆరు విద్యా సంస్థలు రూ. 700 కోట్ల మేర పన్నును ఎగవేసినట్లు తెలిపారు. దాన్ని ఇప్పుడు వసూలు చేశామన్నారు. కొన్ని వైద్య సంస్థలూ పన్నును ఎగువేస్తున్నాయని, దానిపై సిట్ దృష్టి పెట్టిందన్నారు.

చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే-ఈనాడు, అమరావతి: మామిడికాయల లోడుతో వెళుతున్న లారీ లోయలో పడి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ సరిహద్దుల్లో శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చిత్తూరు ఎస్పీ రాజశేఖర్‌బాబు వివరాల మేరకు.. కుప్పం మండలంలోని నాయనూరు నుంచి తమిళనాడులోని వానియంబాడికి మామిడికాయల లోడుతో లారీ శనివారం రాత్రి బయల్దేరింది. ఈ లారీలో సుమారు 30 మంది వరకు ప్రయాణిస్తున్నారు. లారీ పెద్దవంక సమీపానికి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పింది. ఘాట్‌రోడ్డు కావడంతో పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అయిదుగురు మహిళలు ఉన్నారు. మృతులు తమిళనాడుకు చెందిన కూలీలుగా గుర్తించారు. లారీ కింద చిక్కుకున్న వారిలో 20 మంది తీవ్రగాయాల పాలయ్యారు. అటవీ ప్రాంతం కావడంతో సహాయక చర్యలు కష్టతరమయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని వానియంబాడి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న నలుగురిని మెరుగైన వైద్యం కోసం వేలూరుకు తరలించారు.

కుప్పం ఆసుపత్రిలో మృతదేహాలు

ప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం ప్రమాద వివరాలను తెలుసుకుని తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. బాధితులకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎం ఆదేశాలతో రాత్రి పదిన్నర గంటలకు కలెక్టర్ ప్రద్యుమ్న, ఎస్పీ రాజశేఖరబాబు హుటాహుటిన సంఘటన స్థలానికి బయల్దేరారు. వేలూరు కలెక్టర్, ఎస్పీలతో.. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇద్దరు ఫోన్‌లో మాట్లాడి క్షతగాత్రుల వివరాలు, అందుతున్న వైద్య సహాయంపై ఆరాతీశారు.

'మతాన్ని దుర్వినియోగపరిచే పార్టీలపై చర్యలకు ఆదేశించండి'

దిల్లీ: ఎన్నికల ప్రయోజనం కోసం మతాన్ని దుర్వినియోగపరిచే రాజకీయ పార్టీలు, అభ్యర్థులపై చర్యలకు ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. భాజపా నేత, సుప్రీంకోర్టు న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ దీన్ని దాఖలు చేశారు. వచ్చేనెల 4న దీనిపై విచారణ జరుగనుంది. ఓట్ల కోసం మతాన్ని పావుగా వాడుకునే వారిపై చర్యలు తీసుకునేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని ఆయన అభ్యర్థించారు. మతాన్ని దుర్వినియోగం చేస్తుండటం వల్ల దేశ లౌకికతత్వం, ఐక్యత దెబ్బతింటోందని 127 పుటల వ్యాజ్యంలో ఉపాధ్యాయ పేర్కొన్నారు. "పారదర్శక, స్వేచ్ఛాయుత ఎన్నికల నిమిత్తం 1994లో నాటి లోక్‌సభ ఓ సవరణ బిల్లు తెచ్చింది. రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం మతాన్ని వాడుకోకుండా అందులో నిబంధన విధించారు. కానీ, ఆ బిల్లుకు 1996లోనే కాలం తీరింది.

కోస్తాంధ్ర భగభగ

ఈనాడు, విశాఖపట్నం: రాయలసీమలో బలహీనంగా ఉన్న నైరుతీ రుతుపవనాల ప్రభావం తాజాగా సాధారణ స్థితికి చేరుకుంది. కోస్తాంధ్రలో మాత్రం బలహీనపడింది. ఫలితంగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగింది. తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో వడగాల్పులు వీచినట్లు వాతావరణ శాఖ నివేదిక ఇచ్చింది. కోస్తాంధ్ర జిల్లాల్లో ఈ ప్రభావం మరిన్ని రోజులు ఉండొచ్చని అంచనా వేసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, గోదావరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులు, ఈదురుగాలుల ప్రభావం బాగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రానున్న నాలుగు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి, మోస్తరు వర్షాలకు అవకాశం ఉందన్నారు.

వడదెబ్బకు ఇద్దరు మృతి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ నగరంలో గడచిన మూడు రోజులుగా ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోతున్నారు. శనివారం వడదెబ్బకు గురై ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన ఉపాధి కూలీ కాపు వీర్రాజు (57), చినరుషికొండ ప్రాంతానికి చెందిన కారి నర్సింహులు(86) మృతి చెందారు.

5 కిలోల ఆడశిశువు

విశాఖపట్నం జిల్లా అనకాపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఒక మహిళ 5 కిలోల ఆడశిశువుకు జన్మనిచ్చింది. సాధారణంగా పుట్టిన బిడ్డ 3 నుంచి 3.5 కేజీల వరకే ఉంటుందని.. 5 కిలోల బరువుతో జన్మించడం అరుదుగా జరుగుతుందని వైద్యురాలు డాక్టర్ జ్యోతి తెలిపారు. ఎలమంచిలికి చెందిన కరణం శ్రావణలక్ష్మి అనే గర్భిణి ఈ నెల 14న ఆసుపత్రిలో చేరారు. శుక్రవారం రాత్రి ఆడశిశువుకు జన్మనిచ్చారు. ఆమెకు సాధారణ ప్రసవం జరిగినట్లు వైద్యురాలు తెలిపారు.

-న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

కోటి కుమ్మరించినా.. అమ్మ దక్కలేదు!

- ఐసీయూ చికిత్స పేరుతో వసూళ్లు
- హైదరాబాద్, దిల్లీ ఆసుపత్రుల్లో 100 రోజులు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషాదగాథ
- కార్పొరేట్ ఆసుపత్రుల దందాపై నెటిజన్ల ఆగ్రహం

ఈనాడు, హైదరాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని హైదరాబాద్, దిల్లీకి చెందిన రెండు కార్పొరేట్ ఆసుపత్రులు వైద్యపరంగా అపహరించి (మెడికల్ కిడ్నాపింగ్) రూ. కోట్లు దండుకొని చివరికి ప్రాణాలను కాపాడలేకపోయాయని దిల్లీ చెందిన బాసిన్ వర్మ అనే యువతి ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 100 రోజులపాటు రెండు ఆసుపత్రుల్లోని ఐసీయూల్లో ఉంచి చికిత్స చేసి రూ.1.2 కోట్లు వసూలు చేశారని, చివరికి మే 7న తన తల్లి మృతదేహాన్ని చేతిలో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకి సగటున రూ.లక్ష వసూలు చేశారని తెలిపారు. ఈ సంఘటన గురించి బిల్లులతో సహా సవివరంగా ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో అది వైరల్‌గా మారింది. ఫేస్‌బుక్‌లో ఇప్పటివరకు 40 వేల మంది షేర్ చేయగా.. 5 వేల మంది తమ స్పందన తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల దందాపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆ యువతికి బాసటగా నిలిచారు. హైదరాబాద్ పోలీసులు కూడా ట్విట్టర్ వేదికగా స్పందించారు. పూర్తి వివరాలు అందిస్తే. . చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఉదంతం వివరాలిలా ఉన్నాయి.. దిల్లీకి చెందిన యువతి బాసిన్ వర్మ తల్లి కాలేయవ్యాధితో బాధపడేవారు. జనవరి 2న దిల్లీలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ కాలేయ సిరోసిస్‌గా నిర్ధారించి వెంటనే కాలేయ మార్పిడి చేయాలని, ఇందుకు రూ.18-19 లక్షల వరకు ఖర్చు అవుతుందని తేల్చారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో లివర్ సిద్ధంగా ఉందని ఓ మధ్యవర్తి ద్వారా తెలుసుకున్న ఆమె. . ఇక్కడి వైద్యులను సంప్రదించారు. సమాచారం ఇచ్చినందుకు మధ్యవర్తికి రూ.లక్ష చెల్లించారు. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ఫిబ్రవరి 5 విజయవంతంగా లివర్ మార్పిడి చేశారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా మార్చి 10 వరకు వెంటిలేటర్‌పైనే ఉంచారు. నయమైనట్లు చెప్పి మార్చి 27న డిశ్చార్జి చేయడంతో తల్లీకూతుళ్లు దిల్లీ వెళ్లిపోయారు. మళ్లీ పరిస్థితి విషమించడంతో దిల్లీలో తొలుత చేర్పించిన ఆసుపత్రికి తరలించారు. అత్యవసరంగా కాలేయానికి స్టంట్ వేయాల్సి ఉన్నా.. వారాంతపు సెలవు కారణంగా వైద్యులు వాయిదా వేశారని, దీంతో పరిస్థితి విషమించిందని, చివరికి అవయవాల వైఫల్యంతో తన తల్లి మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తేల్చారని యువతి వాపోయారు. ఎన్నో ఏళ్లుగా తన తండ్రి ఇతర కుటుంబ సభ్యులంతా కష్టపడి కూడబెట్టి సొమ్ములన్నీ వ్యయమై.. అప్పులు మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాంటి మానసిక వేదన ఇంకొకరికి రాకూడదనే ఉద్దేశంతో సామాజిక మాధ్యమాలే వేదికగా అందరికి దృష్టికి తెచ్చినట్లు వివరించారు. ఈ విషయమై హైదరాబాద్‌లోని సదరు కార్పొరేట్ ఆసుపత్రి వర్గాలను 'ఈనాడు' సంప్రదించగా.. ఆమెకు నిబంధనల మేరకే కాలేయ మార్పిడి పూర్తి చేశామని, తమ వైపు నుంచి ఎలాంటి వైఫల్యం లేదని తెలిపారు. ఇక్కడ నయం కావడంతో డిశ్చార్జి చేశామని, దిల్లీ వెళ్లిపోయారని వివరించారు.

సామాజిక మాధ్యమంలో యువతి పోస్ట్ చేసిన చిత్రమిది..

ఎర్రచందనం మాఫియాతో బీట్ అధికారికి సంబంధాలు!

- విచారిస్తున్న పోలీసులు

ఈనాడు, నెల్లూరు: ఎర్రచందనం అక్రమ రవాణాకు సహకరిస్తున్న అటవీశాఖ బీట్ అధికారి రామరాజును నెల్లూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్న కొందరిని ఇటీవల నెల్లూరు టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారిస్తున్న సమయంలో చెన్నై, కడపలో ఉన్న మాఫియా వివరాలు అందాయి. మాఫియా దగ్గరున్న ఫోన్లలో ఉన్న నంబర్ల ఆధారంగా ప్రకాశం జిల్లా గిద్దలూరు రేంజ్‌లో బీట్ అధికారిగా పనిచేస్తున్న రామరాజు ప్రమేయం ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. శనివారం ఆయన్ను తీసుకువచ్చి పోలీసులు విచారించారు. ఎర్రచందనం మాఫియాకు సహకరిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలుస్తోంది. మాఫియాకు సహకరించినందుకు రూ. లక్షల్లో ముట్టచెబుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మొత్తం వ్యవహారంపై పోలీసులు నిశితంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా ఎవరి ప్రమేయం ఉందనే విషయమై ఆరా తీస్తున్నారు.

కిక్ 2018 ఛాంపియన్స్

➡ వరుసగా నాలుగు ప్రపంచకప్‌ల్లో గోల్ కొట్టిన నాలుగో ఆటగాడిగా క్రిస్టియానో చరిత్రకెక్కాడు. ఇంతకు ముందు బ్రెజిల్ దిగ్గజం పీలె.. జర్మనీ ఆటగాళ్లు సీలర్, మిరొస్లావ్ క్లోజ్ ఈ ఘనత సాధించారు.

➡ గత మూడు ప్రపంచకప్‌ల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తంగా మూడు గోల్స్ కొట్టిన రొనాల్డో.. ఈ ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లోనే మూడు గోల్స్ సాధించాడు.

➡ 2004 యూరో కప్‌తో మొదలుపెట్టి వరుసగా ఎనిమిది మేజర్ టోర్నీల్లో కనీసం ఒక గోల్ కొట్టిన తొలి ఆటగాడిగా రొనాల్డో రికార్డు సృష్టించాడు.

వాళ్లు గ్రహాంతరవాసులు

ప్రస్తుతం ప్రపంచ ఫుట్‌బాల్‌లో తానే నంబర్ ఆటగాడినని బ్రెజిల్ సూపర్‌స్టార్ నెయ్‌మార్ అన్నాడు. ఎందుకంటే మెస్సి, క్రిస్టియానో రొనాల్డోలు గ్రహాంతరవాసులని అతను సరదాగా వ్యాఖ్యానించాడు. ప్రపంచకప్ ఫేవరెట్లలో ఒకటైన బ్రెజిల్ ఆదివారం స్విట్జర్లాండ్‌తో తలపడబోతున్న నేపథ్యంలో అందరి దృష్టి నెయ్‌మార్ మీదే ఉంది. గాయం నుంచి కోలుకున్న అతను.. ఎలా రాణిస్తాడోనని అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ ఫిబ్రవరిలో గాయం అయిన తర్వాత అతను 129 నిమిషాలు మాత్రమే మైదానంలో గడిపాడు. వార్మప్ మ్యాచ్‌ల్లో క్రొయేషియాపై, ఆస్ట్రియాపై గోల్స్ కొట్టి ఫామ్ నిరూపించుకున్నాడు. ప్రస్తుతం మేటి ఆటగాడు ఎవరనే ప్రశ్నకు నెయ్‌మార్ సమాధానమిస్తూ.. "ప్రపంచ ఫుట్‌బాల్‌లో నేనే నంబర్‌వన్ ఆటగాడిని. ఎందుకంటే మెస్సి, రొనాల్డో వేరే గ్రహానికి చెందినవాళ్లు" అని నెయ్‌మార్ చెప్పాడు.

కార్లు అమ్ముకొని..

మాస్కో: కార్లు అమ్మేసుకున్నారు. ఉన్న ఉద్యోగాలనూ వదిలేసుకున్నారు. కావాలని మరీ బరువు పెంచుకున్నారు. ఎవరు వీరంతా.. అసలు ఎందుకు ఇలా చేస్తున్నారంటే? ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో తమ దేశ జట్టు ఆడుతుంటే చూడడం కోసమే. ఇలా చేస్తున్నది పెరూ దేశ అభిమానులు. 36 ఏళ్ల తర్వాత తొలిసారి ఫుట్‌బాల్ మహా సంగ్రామంలో పెరూ పాల్గొంటుంది. దాంతో ఆ దేశ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ప్రపంచకప్‌లో తమ జట్టుకు మద్దతు తెలిపేందుకు పెద్దఎత్తున పెరూ ప్రజలు రష్యాకు తరలివచ్చారు. మ్యాచ్‌లను చూడడం కోసం కొంతమంది కార్లు అమ్మేసుకుంటే.. మరికొందరేమో చేస్తున్న ఉద్యోగాలను వదిలేసి వచ్చిన డబ్బుతో రష్యాకు వచ్చేశారు. అధిక బరువున్న వారికి కేటాయించే ప్రత్యేక టికెట్లు దక్కించుకోవడం కోసం ఓ అభిమాని ఏకంగా 24 కిలోల బరువు పెరగడం విశేషం. కొద్దిపాటి డబ్బుతో వచ్చిన చాలామంది బయట పడుకుంటూ.. బిస్కెట్లు తింటూ గడుపుతున్నారు. 32 గంటలు రైల్లో ప్రయాణం చేసి మరీ స్టేడియాలకు చేరుకుంటున్నారు. ఎందుకంటే రైలు ప్రయాణం ఉచితం కదా.

రొనాల్డో, మెస్సి.. ఇద్దరూ దిగ్గజాలే. ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో తమకంటూ ప్రత్యేక అధ్యాయాలు లిఖించుకున్న ఆటగాళ్లే. ఇద్దరికీ ప్రస్తుత టోర్నీనే చివరి ప్రపంచకప్‌గా భావిస్తున్న నేపథ్యంలో వీరిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అత్యుత్తమ ప్రదర్శనతో తమ జట్లను ముందుకు తీసుకెళ్తారని అభిమానులు వీరిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఐతే ఈ ప్రపంచకప్‌లో వీళ్లిద్దరి అరంగేట్రం భిన్నంగా సాగింది. బలమైన స్పెయిన్‌తో పోరులో రొనాల్డో అద్భుత ప్రదర్శనతో పోర్చుగల్‌ను డ్రాతో గట్టెక్కిస్తే.. తొలిసారి ప్రపంచకప్ ఆడుతున్న పసికూన ఐస్‌లాండ్‌తో మ్యాచ్‌లో మెస్సి స్థాయికి తగ్గట్లు ఆడకపోవడంతో అర్జెంటీనా డ్రాతో సరిపెట్టుకుంది.

ఆహా రొనాల్డో

అయ్యో మెస్సి

ఆ ఫుట్‌బాలర్ మధుమేహ బాధితుడు!

నాచో.. స్పెయిన్ ఫుట్‌బాల్ జట్టులో కీలక ఆటగాడు. పోర్చుగల్‌తో మ్యాచ్ సందర్భంగా అతను ముందు విలన్ అయ్యాడు. తర్వాత హీరోగా మారాడు. మ్యాచ్ నాలుగో నిమిషంలోనే పోర్చుగల్‌కు పెనాల్టీ అవకాశం రావడానికి కారకుడితడే. ఐతే రెండో అర్ధంలో మెరుపు గోల్‌తో స్పెయిన్‌ను మ్యాచ్‌లో తొలిసారి ఆధిక్యంలోకి తీసుకొచ్చాడు. నాచో మధుమేహ బాధితుడు కావడం గమనార్హం. 12వ ఏటే ఈ జబ్బు బయటపడింది. అప్పటికే అతడికి ఫుట్‌బాల్ అంటే పిచ్చి. చికిత్స తీసుకుంటూనే ఆట కొనసాగించాడు. ఐతే ఒక దశలో అతను ఆట కొనసాగించడానికి వీల్లేదని ఓ వైద్యుడు చెప్పినా పట్టించుకోలేదు. వేరే వైద్యుడి సాయంతో మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకుంటూనే, ఫుట్‌బాల్‌లో రాణించడానికి అవసరమైన ఫిట్‌నెస్ సాధించాడు. రియల్ మాడ్రిడ్ లాంటి పెద్ద క్లబ్‌కు ఆడే అవకాశం దక్కించుకున్నాడు. ఇప్పుడు ప్రపంచకప్‌లోనూ మెరిశాడు.

అద్భుతం.. ఆ గోల్

సోచి

ప్రపంచ ఫుట్‌బాల్‌లో మేటి జట్లలో స్పెయిన్ ఒకటి. ఈ ప్రపంచకప్‌లో అదొక ఫేవరెట్ కూడా. ఆల్‌రౌండ్ నైపుణ్యంతో కళకళలాడుతున్న ఆ జట్టులో చాలామంది స్టార్లున్నారు. ఇటు పోర్చుగల్ చూస్తే.. ప్రధానంగా ఒక్క ఆటగాడిపై ఆధారపడే జట్టు. అతడే ఆ జట్టుకు ఆధారం. కానీ ఆ ఒక్కడే ప్రత్యర్థులకు ఎదురొడ్డి నిలిచాడు. అవతలి జట్టంతా కలిసి మూకుమ్మడిగా దాడికి దిగుతుంటే.. అతను వారికి దీటుగా ప్రతిదాడి చేశాడు. తన అద్భుత నైపుణ్యాల్ని ప్రదర్శిస్తూ.. కళ్లు చెదిరే గోల్స్ కొట్టాడు. జట్టును గట్టెక్కించాడు. ఈ ఉపోద్ఘాతం క్రిస్టియానో రొనాల్డో గురించే.

రొనాల్డో అదరగొట్టాడు. బలమైన స్పెయిన్‌తో పోరులో ఒంటి చేత్తో పోర్చుగల్‌ను గట్టెక్కించాడతను. అతను హ్యాట్రిక్ సాధించడంతో ఈ మ్యాచ్‌ను పోర్చుగల్ 3-3తో డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో మొత్తంగా చూస్తే స్పెయిన్‌దే ఆధిపత్యం. కానీ రొనాల్డో తన అత్యుత్తమ ఆటతీరును బయటికి తీయడంతో స్పెయిన్ గెలుపు రుచి చూడలేకపోయింది. రొనాల్డో 4, 44, 88 నిమిషాల్లో గోల్స్ కొట్టాడు. స్పెయిన్ తరఫున డీగో కోస్టా 24, 55 నిమిషాల్లో.. నాచో 58వ నిమిషంలో స్కోర్ చేశారు. మ్యాచ్ ఆరంభంలోనే పెనాల్టీ ఏరియాలో రొనాల్డోను కింద పడేసి అతడికి అవకాశమిచ్చాడు నాచో. క్రిస్టి గోల్‌కీపర్‌ను సులువుగా బోల్తా కొట్టించి పోర్చుగల్‌కు ఆధిక్యాన్నందించాడు. 20 నిమిషాల తర్వాత స్పెయిన్ ఖాతా తెరిచింది. డీగో కోస్టా ఇద్దరు డిఫెండర్లను అద్భుతంగా నిలువరిస్తూ లెఫ్ట్ కార్నర్‌తో గోల్ సాధించాడు. ఇంకో 20 నిమిషాలకు పోర్చుగల్‌ను మళ్లీ ఆధిక్యంలో నిలిపాడు క్రిస్టియానో. కాసేపటికే డీగో మరోసారి మెరవడంతో స్పెయిన్ మళ్లీ స్కోరు సమం చేయగలిగింది. మూడు నిమిషాల వ్యవధిలో నాచో 20 గజాల దూరం నుంచి అద్భుత రీతిలో గోల్ కొట్టి స్పెయిన్‌కు 3-2 ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత బంతి ఎక్కువగా స్పెయిన్ నియంత్రణలోనే ఉంది. పోర్చుగల్‌కు ఇక అవకాశం లేనట్లే కనిపించింది. ఐతే 88వ నిమిషంలో ఫ్రీ కిక్‌ను సద్వినియోగం చేస్తూ రొనాల్డో అద్భుత రీతిలో గోల్ కొట్టి జట్టును డ్రాతో గట్టెక్కించాడు.

పోర్చుగల్ 3 | స్పెయిన్ 3

ఏం కొట్టాడులే..: మ్యాచ్‌లో రొనాల్డో చేసిన మిగతా రెండు గోల్స్ సాధారణమైనవే. మూడో గోల్ మాత్రం ఆషామాషీది కాదు. అది చూస్తే రొనాల్డోను ఎందుకు ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత గొప్ప ఆటగాళ్లలో ఒకడిగా కీర్తిస్తారో అర్థమవుతుంది. అప్పటికి పోర్చుగల్ 2-3తో వెనుకబడి ఉంది. 88వ నిమిషంలో పోర్చుగల్‌కు ఫ్రీ కిక్ లభించింది. గోల్ పోస్టుకు 25 గజాల దూరంలో ఉన్నాడు రొనాల్డో. అప్పుడు అతడిపై అంచనాల ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో చెప్పేదేముంది? ఆ స్థితిలో అతను తన అద్భుత నైపుణ్యాన్ని చూపించాడు. కళ్లు చెదిరే రీతిలో గోల్ కొట్టాడు. ముందు ఆరుగురు డిఫెండర్లు, తర్వాత గోల్‌కీపర్.. వీళ్లందరికీ చిక్కకుండా బంతిని గోల్ పోస్టులోకి పంపిన వైనం అసాధారణం. బంతిని కుడి వైపు డిఫెండర్లకు దూరంగా కొట్టినట్లే కనిపించింది కానీ.. అది స్పిన్ అయి గోల్‌లోకి దూసుకెళ్లింది. గోల్‌కీపర్ కూడా ఏమీ చేయలేక నిశ్చేష్టుడై చూస్తుండిపోయాడు. ప్రత్యర్థులపై తిరుగులేని ఆధిపత్యం చలాయించే స్పెయిన్ ఆటగాళ్లలో ఈ గోల్ తర్వాత కనిపించిన నిర్వేదం చెప్పేస్తుంది రొనాల్డో వాళ్లను ఏ స్థాయిలో విస్మయపరిచాడో!

అదరగొట్టిన పోర్చుగల్ స్టార్

విఫలమైన అర్జెంటీనా కెప్టెన్ ● ఇద్దరి మ్యాచ్‌లూ డ్రానే

మాస్కో

అర్జెంటీనా రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్, ఇంకో రెండుసార్లు రన్నరప్. ఐస్‌లాండేమో తొలిసారి ప్రపంచకప్ ఆడుతోంది. ఈ రెండు జట్ల మధ్య పోరు అంటే అర్జెంటీనా గోల్స్ వర్షం కురిపించి భారీ విజయం సాధిస్తుందని అంతా అనుకుంటారు. కానీ శనివారం నాటి పోరులో ఊహించని ఫలితం వచ్చింది. అర్జెంటీనాను నిలువరించిన ఐస్‌లాండ్ 1-1తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. జట్ల మధ్య అంతరం ప్రకారం చూస్తే ఈ ఫలితం అర్జెంటీనాకు ఓటమితో, ఐస్‌లాండ్‌కు గెలుపుతో సమానం. కెప్టెన్ మెస్సి అంచనాలకు తగ్గట్లు రాణించకపోవడంతోనే అర్జెంటీనా గెలవలేకపోయింది.

పదిసార్లు ప్రయత్నించినా..

పదిసార్లు గోల్ ప్రయత్నాలు చేసినా ఒక్కసారి కూడా ఫలితం రాబట్టలేకపోయాడీ సూపర్ స్టార్. 1-1తో స్కోరు సమమైన దశలో 63వ నిమిషంలో అర్జెంటీనాకు పెనాల్టీ అవకాశం లభించింది. ఐతే మేటి గోల్‌కీపర్లెందరినో బోల్తా కొట్టించి గోల్స్ సాధించిన మెస్సి.. ఐస్‌లాండ్ గోల్‌కీపర్ హేన్స్ మాక్సిమిలియనానో డిఫెన్స్‌ను ఛేదించలేకపోయాడు. దానికి ముందు, తర్వాత మెస్సి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అంతకుముందు 19వ నిమిషంలో అగిరో గోల్‌తో అర్జెంటీనా ఖాతా తెరవగా.. ఇంకో 4 నిమిషాలకే ఆల్‌ఫ్రెయో గోల్‌తో ఐస్‌లాండ్ స్కోరు సమం చేసింది.

మెస్సీ పొరపాటు ఇలా...

అర్జెంటీనా 1 | ఐస్‌లాండ్ 1

డెన్మార్క్ 1 | పెరూ 0

గ్రూప్-సి మ్యాచ్‌లో డెన్మార్క్ 1-0తో పెరూని ఓడించింది. బంతి నియంత్రణలో, దాడులు చేయడంలో రెండూ సమ ఉజ్జీలుగానే ఉన్నా.. కీలక సమయంలో గోల్ చేసిన డెన్మార్క్‌నే విజయం వరించింది. 59వ నిమిషంలో యూసుఫ్ పౌల్‌సెన్ గోల్ కొట్టి డెన్మార్క్‌ను విజయపథంలో నడిపించాడు. తొలి అర్ధభాగానికి ముందు లభించిన పెనాల్టీని గోల్‌గా మలచడంలో క్రిస్టియన్ క్యువా విఫలం కావడం పెరూను దెబ్బతీసింది. డెన్మార్క్ డిఫెండర్ విలియమ్ క్విస్ట్ మ్యాచ్‌లో తీవ్రంగా గాయపడడంతో స్ట్రెచర్ మీద బయటకు తీసుకెళ్లాల్సి వచ్చింది.

పోగ్బా గోల్ అయ్యిందిలా..

ఫ్రాన్స్ బోణీ కొట్టింది

కజాన్: ఫిఫా ప్రపంచకప్‌లో మాజీ ఛాంపియన్ ఫ్రాన్స్ బోణీ కొట్టింది. శనివారం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 2-1 గోల్స్‌తో ఆస్ట్రేలియాను ఓడించింది. ప్రపంచకప్‌లో తొలిసారి వీడియో సమీక్షను ఈ మ్యాచ్‌లో ఉపయోగించడం విశేషం. దాని ద్వారా లభించిన పెనాల్టీతోనే ఫ్రాన్స్ తొలి గోల్ సాధించడం మరో విశేషం. ఫ్రాన్స్-ఆస్ట్రేలియా హోరాహోరీ తలపడడంతో తొలి అర్ధభాగంలో గోల్స్ నమోదు కాలేదు. ద్వితీయార్ధం నుంచి డ్రామా మొదలైంది. 55వ నిమిషంలో వీడియో సమీక్ష ద్వారా పెనాల్టీ పొందిన ఫ్రాన్స్.. గోల్ కొట్టి ఆధిక్యంలోకి వెళ్లింది. ప్రపంచకప్‌లో వీఏఆర్ ద్వారా గోల్ కొట్టిన తొలి ఆటగాడిగా గ్రీజ్‌మన్ చరిత్రలో నిలిచాడు. ఫ్రాన్స్ సంబరాలకు చెక్ పెడుతూ కాసేపటికే (59వ ని) ఆస్ట్రేలియా స్కోరు సమం చేసింది. ఫ్రాన్స్ డిఫెండర్ శామ్యూల్ ఫ్రీకిక్‌ను చేతితో అడ్డుకోవడంతో పెనాల్టీ దక్కించుకున్న ఆస్ట్రేలియా.. 1-1తో స్కోరు సమం చేసింది. ఈ గోల్‌ను జెడ్నెక్ కొట్టాడు. కానీ 81వ నిమిషంలో సాకరూస్ గోల్‌పోస్ట్ దగ్గరకు దూసుకొచ్చిన ఫ్రాన్స్ స్టార్ పోగ్బా.. లాఘవంగా ఆస్ట్రేలియా కీపర్ మథ్యూ ర్యాన్ తల మీదుగా బంతిని కొట్టాడు. గోల్ బార్‌కు తగిలిన ఆ బంతి గోల్ లైన్ లోపల పడడంతో ఫ్రాన్స్ 2-1తో విజయపథంలో నడిచింది.

ఫ్రాన్స్ 2 | ఆస్ట్రేలియా 1

తొలిసారి వీడియో సమీక్ష

ప్రపంచకప్‌లో తొలిసారి వీఏఆర్ (వీడియో సహాయక రిఫరీ)ను ఆస్ట్రేలియా-ఫ్రాన్స్ మ్యాచ్‌లో ఉపయోగించారు. 55వ నిమిషంలో పోగ్బా ఇచ్చిన పాస్‌ను గోల్‌పోస్ట్ సమీపంలో అందుకున్న గ్రీజ్‌మన్ గోల్ చేసే ఊపులో ముందుకెళ్లాడు. కానీ ఆస్ట్రేలియా డిఫెండర్ రిష్‌డన్ కాళ్లు అడ్డు తగలడంతో అతడు పడిపోయాడు. ఫ్రాన్స్ ఆటగాళ్లు నిరసన తెలపినా పట్టించుకోని రిఫరీ అండ్రెస్ కున్హా మ్యాచ్‌ను కొనసాగించాల్సిందిగా సూచించాడు. ఒక నిమిషం ఆట తర్వాత బంతి మైదానం దాటింది. ఆ సమయంలో వీఏఆర్ మౌరో విజ్లియానో సూచనతో మైదానం పక్కనున్న స్క్రీన్‌పై రిఫరీ అండ్రెస్ వీడియోను సమీక్షించాడు. ఉద్దేశపూర్వకంగా రిష్‌డన్ కాళ్లు అడ్డు పెట్టాడని భావించిన రిఫరీ.. ఫ్రాన్స్‌కు పెనాల్టీ ఇచ్చాడు. అప్పటికి ఆ ఘటన జరిగి రెండు నిమిషాలైపోయింది. అంది వచ్చిన అవకాశాన్ని గ్రీజ్‌మన్ సద్వినియోగం చేసుకున్నాడు.

రొనాల్డో గోల్ కొట్టాడిలా...

ప్రపంచకప్‌లో ఈనాడు

కోస్టారికా	సా॥ 5.30	సెర్బియా
జర్మనీ	రాత్రి 8.30	మెక్సికో
బ్రెజిల్	రాత్రి 11.30	స్విట్జర్లాండ్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

రాయుడు ఔట్ రైనాకు చోటు

బెంగళూరు: యోయో పరీక్షలో విఫలమైన అంబటి రాయుడిపై ఊహించినట్లే వేటు పడింది. ఇంగ్లాండ్ పర్యటనలో వన్డే జట్టుకు ఎంపికైన రాయుడు.. తాజాగా ఫిట్‌నెస్ నిరూపించుకోవడంలో విఫలం కావడంతో సెలక్టర్లు అతణ్ని జట్టు నుంచి తప్పించారు. ఐపీఎల్‌లో అంబటి 600కు పైగా పరుగులు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని సీనియర్ ఆటగాడు సురేశ్ రైనాకు చోటు కల్పించారు. రిషబ్ పంత్ పేరు పరిశీలనకు వచ్చినా.. అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రైనాను ఎంపిక చేశారు. రైనా టీ20 జట్టులోనూ సభ్యుడు. జట్టులో ధోని, దినేశ్ కార్తీక్ ఉండడంతో రిషబ్‌కు అవకాశం లేకుండాపోయింది. మరోవైపు ఆదివారం జాతీయ క్రికెట్ అకాడమీలో రోహిత్‌శర్మకు యోయో పరీక్ష నిర్వహించనున్నారు.

టాంపరింగ్ కలకలం!

రెండు గంటలు ఆలస్యంగా మైదానంలోకి లంక జట్టు

గ్రాస్ ఐలెట్: కొన్ని నెలల కిందట దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య టెస్టు మ్యాచ్‌లో బాల్‌టాంపరింగ్ ఉదంతం ఎంతటి కలకలం రేపిందో తెలిసిందే. తాజాగా వెస్టిండీస్-శ్రీలంక మధ్య రెండో టెస్టు సందర్భంగా 'టాంపరింగ్' మళ్లీ చర్చనీయాంశమైంది. శ్రీలంకపై బాల్‌టాంపరింగ్ ఆరోపణలు రావడంతో ఆ జట్టు ఆగ్రహంతో మూడో రోజు మైదానంలోకి దిగడానికి నిరాకరించింది. దీంతో ఆట రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. రెండో రోజు ఆట ముగిశాక బంతి ఆకారం దెబ్బ తిన్నట్లు భావించిన అంపైర్లు.. శనివారం బంతిని మార్చాలని నిర్ణయించారు. దీనిపై లంక ఆటగాళ్లు కినుక వహించారు. మైదానంలోకి రావడానికి నిరాకరించారు. దీంతో మ్యాచ్ రిఫరీ శ్రీనాథ్ రంగంలోకి దిగి లంకేయులతో చర్చలు జరిపాడు. కాసేపటికి ఆ జట్టు దిగి వచ్చింది. ఐతే లంక బౌలింగ్ సందర్భంగా బంతి ఆకారం దెబ్బ తిన్నందుకు అంపైర్లు విండీస్‌కు ఐదు పెనాల్టీ పరుగులిచ్చారు. దీంతో మైదానం మధ్యలోకి వచ్చాక లంకేయులు మరోసారి మొండికేశారు. శ్రీనాథ్ మళ్లీ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అతను మైదానంలోకి వచ్చి మళ్లీ ఇరు జట్ల ఆటగాళ్లు, సహాయ సిబ్బందితో చర్చలు జరిపాక గొడవ సద్దుమణిగి ఆట మొదలైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో లంక 253 పరుగులు చేయగా.. విండీస్ 183/4తో ఆడుతోంది.

ఫెదరర్ నంబర్‌వన్: ఫెదరర్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంకును చేజిక్కించుకున్నాడు. మెర్సిడెస్ కప్ సెమీస్‌లో 6-7 (2-7), 6-2, 7-6 (7-5)తో నిక్ కిర్గియోస్ (ఆస్ట్రేలియా)ను ఓడించిన ఫెదరర్ ర్యాంకింగ్స్‌లో నాదల్‌ను వెనక్కినెట్టాడు.

రెండో వన్డేలోనూ ఇంగ్లాండే..: ఆస్ట్రేలియాతో ఐదు వన్డేల సిరీస్‌లో ఇంగ్లాండ్ వరుసగా రెండో గెలుపు. రెండో వన్డేలో ఆ జట్టు 38 పరుగుల తేడాతో నెగ్గింది. రాయ్ (120), బట్లర్ (91 నాటౌట్)ల మెరుపులతో మొదట ఇంగ్లాండ్ 8 వికెట్లకు 342 పరుగులు చేసింది. ఆసీస్ 47.1 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటైంది. షాన్ మార్ష్ (131) పోరాటం వృథా అయింది.

ఒక్కసారిగా పెరిగిన గోదావరి

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఒకసారిగా నీరు పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ ద్వారా శనివారం 23,500 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళుతున్నట్లు పోలవరం ప్రాజెక్టు ఎస్‌ఈ వీఎస్ రమేష్‌బాబు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంపై నుంచి గోదారమ్మ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. శనివారం తెల్లవారేసరికి డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ ప్రాంతానికి రాకపోకల కోసం వేసిన రహదారి మునిగిపోయింది. గోదావరిని మళ్లించడానికి ఇసుక తిన్నెలపై 40 పైపులతో నిర్మించిన కల్వర్టు కూడా దెబ్బతింది. పనులన్నీ పూర్తయిన తర్వాత గోదావరి ప్రవాహం పెరగడంతో జలవనరుల శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటి వరకూ పనులు చేసిన భారీ యంత్రాలను ఒడ్డుకు చేర్చారు. అలాగే ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణం కోసం వేసిన రహదారిపై నుంచి నీరు పొంగి పొర్లుతోంది. తూర్పుగోదావరి జిల్లా అంగుళూరు సమీపంలో గట్టు ఎత్తుగా వేయడం వల్ల ఇంకా మునగలేదు. ప్రస్తుతం అక్కడ పనులు చేస్తున్న సిబ్బంది పోలవరం రేవులో లాంచీ ఎక్కి నది దాటి అవతలకు వెళ్తున్నారు.

పోలవరం డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ ప్రాంతం మీదుగా ప్రవహిస్తున్న గోదారమ్మ

పట్టిసీమ నీటి విడుదల

ఇటుకలకోట డెలివరీ సిస్టమ్ ద్వారా కుడి కాలువలోకి వెళుతున్న గోదారమ్మ

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరి నదికి ముందుగానే నీరు రావడంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కుడి కాలువకు నీరు విడుదల చేసినట్లు ప్రాజెక్టు సీఈ వి.శ్రీధర్ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలం పట్టిసీమ ఎత్తిపోతల పథకంలోని నాలుగు పంపులను శనివారం సాయంత్రం 4.14 గంటలకు ఆయన ప్రారంభించారు. వీటి ద్వారా సెకనుకు 1,400 క్యూసెక్కుల నీరు కుడి కాలువలోకి విడుదల అవుతున్నట్లు చెప్పారు. గత సంవత్సరం జూన్ 19న ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదల చేశామని, నవంబరు 28 వరకు 105.8 టీఎంసీల నీరు కృష్ణాకు తరలించినట్లు వివరించారు. మరోవైపు, గోదావరిలో నీరు పెరగడంతో రాత్రికి పంపుల సంఖ్యను పదికి పెంచి 3,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

భూగర్భజలాల వృద్ధి చర్యలు భేష్

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నీతి ఆయోగ్ కితాబు
- జలనిర్వహణపై నివేదిక విడుదల

	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ
జనాభా:	4.9 కోట్లు	3.5 కోట్లు
జాతీయ వర్షపాతంలోవాటా:	2.4 శాతం	3.2 శాతం
జాతీయ స్థాయిలో భూగర్భజలంలో వాటా:	4.9 శాతం	3.6 శాతం

ఈనాడు - అమరావతి

భూగర్భజలాల వృద్ధికి తీసుకుంటున్న చర్యలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బాగున్నాయని నీతి ఆయోగ్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా భూగర్భజలాలు వినియోగిస్తున్న బావులను గుర్తించడంతో పాటు రీఛార్జి చేసే సదుపాయాలు కల్పిస్తున్నారని పేర్కొంది. తెలంగాణలో ఉపరితల, భూగర్భజలాలను వృద్ధిచేస్తున్నారని వివరించింది. 'రాష్ట్రంలో గుర్తించిన నీటి వనరుల్లో 70శాతం మేర సామర్థ్యాన్ని మెరుగుపరిచారు. 90 శాతం బావులను పునరుద్ధరించారు' అని తెలిపింది. జలనిర్వహణపై విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు పేర్కొంది. అందులో ఏయే రాష్ట్రాలు ఏ స్థాయిలో ఉన్నాయో విశదీకరించడంతోపాటు ఆయా రాష్ట్రాలు ఏ అంశాల్లో మెరుగైన పద్ధతులు పాటిస్తున్నాయో, ఇంకా ఏయే అంశాల్లో మెరుగుపడాల్సి ఉందో కూడా ప్రస్తావించింది.

ఏపీలో ఇవి బాగున్నాయ్

- **భాగస్వామ్య నీటిపారుదల:** రాష్ట్రంలో సాగు నీటి వినియోగదారుల సంఘాలు పని చేస్తున్నాయి.
- **సరైన సమాచారం అందుబాటులో ఉండటం:** నీటి వనరులకు సంబంధించిన సమస్త సమాచారం ఆన్‌లైన్‌లో ఉంచడం, జీఐఎస్ మ్యాపింగ్ చేయడంతో పాటు ఎప్పటికప్పుడు నవీకరించడం.

ఇవి మెరుగుపడాలి

- గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత నీటి సరఫరా మెరుగుపడాలి. గ్రామీణ ఆవాసాల్లో ఇంకా మూడో వంతు ప్రాంతాలకు రక్షిత నీరు అందుబాటులోకి రావాల్సి ఉంది.
- వృథా నీటిని శుద్ధి చేసే విషయంలో ఇంకా ప్రయత్నాలు జరగాలి. కేవలం పట్టణ నీటి వాడకంలో 26శాతం మాత్రమే శుద్ధి చేయగలుగుతున్నారు.
- పట్టణ గృహవాసుల్లో 50 శాతం కన్నా ఎక్కువ మందికి ఉచితంగానే నీరు అందిస్తున్నారు. దీని వల్ల నీటి వృథా పెరిగిపోతోంది.

తెలంగాణలో...

- **పట్టణ నీటి సరఫరా తీరు భేష్:** పట్టణాల్లో 80శాతం మందికి నీరు అందుబాటులో ఉంది. ఇందులో 75 శాతం మంది నీటి వినియోగానికి పన్నులు చెల్లిస్తున్నారు.

ఇవి మెరుగుపడాలి

- **క్షేత్రస్థాయి వినియోగం:** ఇక్కడ ఫీడర్ వారీగా విద్యుత్తు సరఫరాకు సంబంధించి ఏర్పాట్లు ఇంకా జరగలేదు. వ్యవసాయ విద్యుత్తును ఉచితంగా అందిస్తున్న రాష్ట్రాల్లో ఇదొకటి. సూక్ష్మస్థాయి నీటి వినియోగంపై దృష్టి సారించాలి.
- **గ్రామీణ రక్షిత నీటి సరఫరా:** గ్రామీణ ఆవాసాల్లో కేవలం 55 శాతానికి మాత్రమే పూర్తిస్థాయిలో రక్షిత నీరు సరఫరా అవుతోంది. నీటి నాణ్యత ఇంకా మెరుగుపడాలి.

రాష్ట్రాలు 'నీళ్లు' నములుతున్నాయ్!

● నీటి నిర్వహణ అంతంత మాత్రమే ● నీతి ఆయోగ్ నివేదికలో సుస్పష్టం

ఈనాడు - అమరావతి

దేశంలో జలనిర్వహణ తీరు తెన్నులపై అధ్యయనం చేసి నీతి ఆయోగ్ వెలువరించిన నివేదిక ఆహారభద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదాన్ని కళ్లకు కట్టింది. జల ప్రమాద ఘంటికలు మోగుతున్నా.. రాష్ట్రాల్లో నీటి నిర్వహణ అంతంతమాత్రమేనని పేర్కొంది. దేశంలో మొత్తం సమాచారం అందుబాటులో ఉన్న 24 రాష్ట్రాలలో కొన్ని కీలక సూచీలను పరిగణనలోకి తీసుకుని జలనిర్వహణ ఎలా ఉందో అధ్యయనం చేసింది. ఇందులో కేవలం 10 రాష్ట్రాలు మాత్రమే ఆశించతగ్గ మార్కులు తెచ్చుకున్నట్లు పేర్కొంది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, గోవా, కేరళ, ఒడిశా, బిహార్, ఉత్తరప్రదేశ్, హరియాణ, జార్ఖండ్, సిక్కిం, అసోం, నాగాలాండ్, ఉత్తరాఖండ్, మేఘాలయ- ఈ 14 రాష్ట్రాల్లో సరిగా లేదని స్పష్టం చేసింది. 2015-16 సంవత్సరాన్ని ప్రాతిపదిక సంవత్సరంగా తీసుకుని 2016-17 ఆర్థిక సంవత్సరం తీరు తెన్నులను విశ్లేషించింది.

నేపథ్యం....

దేశంలో జలనిర్వహణ తీరు తెన్నులపై ఎందుకు అధ్యయనం చేయాల్సి వచ్చిందో ఈ నివేదిక ప్రారంభంలో పేర్కొంది.

- 'దేశం ఎన్నడూ చూడని జల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఏటా 60 కోట్ల మంది నీళ్ల కోసం విలవిల్లాడుతున్నారు. ఏడాదికి దాదాపు 2లక్షల మంది ప్రజలు రక్షిత తాగు నీరు అందక చనిపోతున్నార'ని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికను ప్రస్తావించింది.
- 'అతి సమీప భవిష్యత్తులోనే ఇంకా చెప్పాలంటే ఒక పుష్కరకాలంలోనే దేశంలో పెను జలసంక్షోభం ఏర్పడనుంది. ఇది దేశ స్థూల జాతీయోత్పత్తిపైనా ప్రభావం చూపనుంద'ని ప్రపంచబ్యాంకు పేర్కొనడాన్ని ఉటంకించింది.
- 2030లో ప్రస్తుత నీటి సరఫరాకు మించి రెట్టింపు అవసరాలు ఉంటాయని, దీని వల్ల దేశ స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం నష్టపోవాల్సి వస్తుందన్న వివిధ సంస్థల అంచనాలను ఉదహరించింది.
- '2050 నాటికి డిమాండ్‌తో పోలిస్తే చాలా తక్కువ నీరు అందుబాటులో ఉంటుంద'ని కేంద్ర జలవనరులశాఖకు చెందిన కమిషన్ అధ్యయనం స్పష్టం చేసిన వైనాన్ని పేర్కొంది.

జల నిర్వహణ సూచీల్లో వెనుకబాటు

- దేశంలో వ్యవసాయ ప్రధానమైన దాదాపు 50శాతం జనాభా ఉన్న ప్రాంతాల్లోనే నీటి నిర్వహణ సరిగా లేదు. ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, హరియాణ తదితర రాష్ట్రాలు ఈ కోవలోకి వస్తాయి. దేశంలోని 20 నుంచి 30 శాతం వ్యవసాయ ఉత్పత్తులకు ఈ రాష్ట్రాలే కీలకం.
- జలనిర్వహణ సూచీల్లో 14 రాష్ట్రాలు 50 పాయింట్ల కన్నా తక్కువే పొందడాన్ని నివేదిక ప్రస్తావించింది. ఉత్తరప్రదేశ్, హరియాణ, బిహార్ 38 పాయింట్లు సాధించగా రాజస్థాన్ 48 పాయింట్లు సాధించింది. ఈ రాష్ట్రాలు నిర్వహణపై దృష్టి సారించకపోవడాన్ని నివేదిక ప్రస్తావించింది.
- 65 పాయింట్ల కన్నా ఎక్కువ సాధించినవి మూడు రాష్ట్రాలే.
- ఆంధ్రప్రదేశ్ 2015-16లో రెండో స్థానంలో ఉండగా ఈ ఏడాదిమూడో స్థానానికి చేరింది.
- అదే సమయంలో తెలంగాణ అంతకు ముందు 11వ స్థానంలో ఉండగా ప్రస్తుతం 8వ స్థానానికి ఎగబాకింది.

కరవు ఎదుర్కొన్న రాష్ట్రాలే మేల్కొన్నాయి

తీవ్ర కరవు పరిస్థితులు ఎదుర్కొన్న రాష్ట్రాలే జలనిర్వహణలో మంచి, మధ్యస్థ ప్రయత్నాలు చేసినట్లు ఈ నివేదిక పేర్కొంది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణలను ప్రస్తావించింది.

ఇలా మదించారు!

1. జలాధారాలను బలోపేతం చేసుకోవడం, నీటి వనరుల పునరుద్ధరణ 2. భూగర్భజలాలు పెంచుకోవడం 3. భారీ, మధ్య తరహా జలవనరుల్లో నీటి సరఫరా వైపు నుంచి సరైన నిర్వహణ తీరు 4. వాటర్ షెడ్ అభివృద్ధి 5. నీటి వినియోగ వ్యవహారాల్లో నిర్వహణ తీరు మెరుగుపరచడం, రైతుల భాగస్వామ్యం 6. సుస్థిర సాగు నీటి వాడక విధానాలు 7. రక్షిత మంచినీరు 8. పట్టణ తాగునీటి సరఫరా-పారిశుద్ధ్యం 9. ప్రభుత్వ, పాలన విధానాలు.

నీతిఆయోగ్ సమావేశాల్లో చంద్రబాబు సాధించేది శూన్యం: రఘువీరా

నీలకంఠాపురం(మడకశిర గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నీతి ఆయోగ్ సమావేశంలో కేంద్రాన్ని నిలదీస్తానని డాంబికాలు పలుకుతున్నారని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరా విమర్శించారు. శనివారం ఆయన అనంతపురం జిల్లా నీలకంఠాపురంలో విలేకరులతో మాట్లాడారు. నీతి ఆయోగ్‌లో సాధించేది శూన్యమని, చేతకాని ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో భాజపాతో జట్టు కట్టి ప్రత్యేకహోదా కంటే ప్రత్యేక ప్యాకేజీకి జైకొట్టిన చంద్రబాబు ప్రస్తుతం ప్రధాని మోదీతో నీతి ఆయోగ్ సమావేశంలో మాట్లాడతారంటే ప్రజలు విశ్వసించరన్నారు. నాలుగేళ్లపాటు బడ్జెట్‌లు పూర్తయ్యేంత వరకు కేంద్రంతో అంటకాగి ప్రస్తుతం రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడానికే చూస్తున్నారని ఆయన ఆరోపించారు.

తుంగభద్రకు 52 వేల క్యూసెక్కుల ప్రవాహం

ఈనాడు, హైదరాబాద్: కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర, ఎగువ కృష్ణాలో ప్రవాహం మొదలైంది. తుంగభద్ర జలాశయంలోకి 52 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 100.86 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.38 టీఎంసీలు ఉన్నాయి. మరోవైపు కృష్ణానది పరీవాహకంలో కురిసిన వర్షాలతో ఆలమట్టిలోకి 2581 క్యూసెక్కుల స్వల్ప ప్రవాహం ప్రారంభమైంది. జూరాల ఎగువన కురిసిన వర్షాలతో 1911 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.41 టీఎంసీల నీరు ఉంది.

ఎన్డీఏ పాలనలో రాజ్యాంగానికి తూట్లు: నారాయణ

అల్లిపురం(విశాఖపట్నం), న్యూస్‌టుడే: ఎన్డీఏ పాలనలోనే దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్, భాజపా నాయకులు, కార్యకర్తలు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. విశాఖలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రజలకు శత్రుదేశాలతో కంటే భాజపా ప్రభుత్వం నుంచే ముప్పు పొంచి ఉందన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో దేశవ్యాప్తంగా 4 జాతాలతో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఏకరవుపెట్టినా స్పందన లేదన్నారు. ఆర్‌బీఐ, నీతి ఆయోగ్‌లను ప్రధాని నరేంద్రమోదీ తన చెప్పుచేతల్లో ఉంచుకుంటూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒకే పన్ను, ఒకే దేశం అని చెప్పిన ప్రధాని పెట్రోల్, డీజిల్‌ను ఎందుకు జీఎస్‌టీకి పరిధిలోనికి తీసుకురావడం లేదని ప్రశ్నించారు. దేవాలయాల్లో క్షౌర వృత్తిదారుల సమస్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

వాతావరణంలో మార్పుల కారణంగా సముద్ర కెరటాల ఉద్ధృతి పెరుగుతోంది. వారం రోజుల క్రితం విశాఖ ఆర్కేబీచ్ వద్ద ప్రశాంత వాతావరణం కనిపించగా.. ప్రస్తుతం సముద్రం ముందుకు వచ్చి అలల తాకిడి తీవ్రంగా కనిపిస్తోంది. -ఈనాడు విశాఖపట్నం

దిల్లీ కేంద్రంగా రాష్ట్రంపై భాజపా, వైకాపాల కుట్ర

- పీఏసీ ఛైర్మన్‌గా కొనసాగే అర్హత బుగ్గనకు లేదు
- ఎంపీ రవీంద్ర కుమార్ వ్యాఖ్యలు

కృష్ణలంక (విజయవాడ), న్యూస్‌టుడే

దిల్లీ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై వైకాపా, భాజపాలు కుట్రకు పాల్పడుతున్నాయని రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. శనివారం విజయవాడలోని తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. భాజపా మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైకాపా వ్యవహరిస్తోందన్నారు. ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) ఛైర్మన్ పదవిని అడ్డం పెట్టుకుని బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అక్రమంగా, శాసనసభ వ్యవహారాలకు సంబంధించిన కీలక పత్రాలను కేంద్రానికి చేరవేస్తున్నట్లు ఆరోపించారు. ఆయన ప్రవర్తన పీఏసీ వ్యవస్థకు భంగం కలిగించే రీతిలో ఉందన్నారు. ఇటీవల బుగ్గన, భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణలు దిల్లీలో భాజపా నాయకుడు రాంమాధవ్‌తో సమావేశమైన విషయం వాస్తవమని రవీంద్రకుమార్ తెలిపారు. కుట్రలో భాగంగానే భాజపా నాయకులు తెదేపా ప్రత్యర్థులను దిల్లీకి పిలిపిస్తున్నారని ఆయన ఆరోపించారు. బుగ్గన వెంటనే తన పదవి నుంచి వైదొలగాలని రవీంద్రకుమార్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వైకాపా ఎంపీల రాజీనామా వ్యవహారం మొత్తం బూటకమని ఆయన వ్యాఖ్యానించారు. భాజపా, వైకాపాల నాటకం మొత్తం ఇప్పటికే బట్టబయలైనందున వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నట్లు ఎంపీ రవీంద్ర కుమార్ చెప్పారు.

బుగ్గన రాజద్రోహి: యరపతినేని

ఈనాడు, అమరావతి: ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రాజద్రోహానికి పాల్పడ్డారని పీఏసీ సభ్యుడు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార పత్రాలను దొంగతనంగా దిల్లీలో భాజపా నాయకులకు అప్పగించిన ఆయన పీఏసీ ఛైర్మన్‌గా ఉండేందుకు ఏమాత్రం తగరని అన్నారు. గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో యరపతినేని శనివారం విలేకరులతో మాట్లాడారు. "చట్టరీత్యా అధికార పత్రాలను సభాపతికి, శాసనసభకు తప్పా ఇంకెవ్వరికీ ఇవ్వకూడదు. అలాంటిది సదరు పత్రాలను బుగ్గన భాజపా నేతలకు ఇచ్చి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. సభా, ప్రజాద్రోహానికి పాల్పడ్డారు. ఆయనపై శాసనసభాపతి సుమోటోగా చర్యలు తీసుకోవాలి. సభాహక్కుల తీర్మానం నోటీసు కూడా ఇస్తాం. రాజద్రోహానికి పాల్పడ్డ బుగ్గనపై రాజద్రోహం కేసు పెట్టాలి" అని యరపతినేని డిమాండు చేశారు.

43 వేల కోట్ల అవినీతికి జగన్ బదులివ్వాలి: చినరాజప్ప

కాకినాడ, న్యూస్‌టుడే: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మాటలు.. దొంగే దొంగ అంటున్నట్లుందని ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప అన్నారు. తూ.గో.జిల్లా కాకినాడలోని తెదేపా జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమాస్తుల కేసుల్లో ఈడీ రూ.43 వేల కోట్ల అవినీతిని గుర్తించిందని, ఆ సొమ్మెక్కడివో ప్రజలకు చెప్పాకే అవినీతి గురించి జగన్ మాట్లాడాలన్నారు. ముఖ్యమంత్రి సినిమాలు చూపిస్తున్నారంటూ వ్యాఖ్యలు చేయడంపై చినరాజప్ప మండిపడ్డారు. పోలవరం, రాజధాని పూర్తయితే వైకాపా అడ్రస్ గల్లంతవుతుందనే జగన్ ఈ రెండు అంశాలపై విమర్శలు చేస్తున్నారన్నారు. పోలవరం పనులు జరుగుతున్నాయని, రాజధాని నిర్మాణం కూడా సాకరమవుతుందని చెప్పారు. దిల్లీలో విజయసాయిరెడ్డిని పెట్టి భాజపాతో లాలూచీ రాజకీయాలు నడుపుతున్నారంటూ జగన్‌పై మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిలు కలిసి దిల్లీ ఎందుకెళ్లారని ప్రశ్నించారు.

వక్ఫ్ భూములు అన్యాక్రాంతం

- సర్వే పేరుతో కాలయాపన
- ఉదాసీనతను ఆసరాగా తీసుకుంటున్న అక్రమార్కులు

ఈనాడు డిజిటల్, అమరావతి: సర్వే పేరుతో చేస్తున్న కాలయాపన వక్ఫ్ ఆస్తులను కబ్జాల పాలు చేస్తోంది. ఆస్తుల రక్షణకు జియో ఫెన్సింగ్ చేయాలని అధికారులను ఇప్పటికే పలు మార్లు ముఖ్యమంత్రి ఆదేశించినా అడుగు ముందుకు పడలేదు. మరో వైపు వక్ఫ్ ఆస్తుల ఆక్రమణ చాపకింద నీరులా కొనసాగుతూనే ఉంది. పట్టణ, నగర ప్రాంతాల్లో ఇది మరింత ఎక్కువగా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన సర్వేలో ఏపీలోని 13 జిల్లాల్లో వక్ఫ్‌బోర్డుకు సంబంధించి 3,502 సంస్థలకు 65,783 ఎకరాల భూములున్నట్లు సర్వే భూరికార్డుల శాఖ క్షేత్ర స్థాయి సర్వేలో తేలింది. అప్పట్లో భౌతికంగా అందుబాటులో ఉన్న భూమి మాత్రమే 65,783 ఎకరాలని, ఆయా సంస్థల వద్దనున్న పత్రాల ఆధారంగా తనిఖీ చేయిస్తే వాస్తవ లెక్కలు తేలుతాయని అప్పట్లో ఆ శాఖ వక్ఫ్‌బోర్డుకు నివేదించింది. ఈ భూమిలోనూ 32 వేల ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నట్లు గుర్తించారు. అసలు రికార్డుల ఆధారంగా వాస్తవ లెక్కలు తేల్చేందుకంటూ వక్ఫ్‌బోర్డు నిర్వహించిన రెండో సర్వేలో 13,874 ఎకరాలే అన్యాక్రాంతమైనట్లు గుర్తించడం విమర్శలపాలయింది.

సిబ్బంది నియామకమేదీ?

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో వక్ఫ్ ఆస్తుల రక్షణకు రెండేళ్ల క్రితం సర్వే కమిషన్ ఏర్పాటుచేసినా ఇప్పటివరకు పూర్తి స్థాయి సిబ్బందిని నియమించలేదు. వక్ఫ్ అధికారులు అడపాదడపా చేపట్టే తనిఖీల్లో ఆక్రమణదారులను గుర్తించి వారికి జిల్లా కమిటీ నుంచి నోటీసులిస్తున్నారు. అవి అందిన వెంటనే వారు న్యాయస్థానానికి వెళుతున్నారు. అక్కడ వక్ఫ్‌బోర్డు తరపున పక్కా రికార్డులు చూపించి సమర్థమైన వాదనలు వినిపించి భూములను సాధించుకోవాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. ఆక్రమణదారులతో జిల్లాల్లోని వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు కుమ్మక్కవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతున్నట్లు విమర్శలున్నాయి. ఇలా వక్ఫ్ బోర్డు 969 ఎకరాల భూమిని కోల్పోయింది. కొందరు న్యాయస్థానం ద్వారా స్టే తెచ్చుకుని ఆక్రమణల్లో కొనసాగుతున్నారు. జిల్లా కమిటీల నుంచి నిర్మాణాత్మకమైన చర్యలు లేక భూముల స్వాధీనం నత్తనడకన సాగుతోంది. ఆక్రమణదారులకు రెండుసార్లు నోటీసులిచ్చాక వక్ఫ్ భూమిగా ధ్రువీకరించుకుని ఆర్డీవోకు వివరాలు పంపుతారు. ఆయన వారికి మరోసారి నోటీసులిచ్చి వాటిని స్వాధీనం చేసుకుని బోర్డుకు అప్పగించాలి. ట్రైబ్యునల్ ధ్రువీకరించిన ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం చేస్తోంది.

లీజులోనూ మతలబు

వక్ఫ్ భూములను లీజుకివ్వడంలోనూ అధికారులు నిబంధనలు పాటించడం లేదు. 2013 సవరణ చట్టం ప్రకారం వక్ఫ్‌భూముల విక్రయానికి వీలులేదు. కేవలం లీజుకే అవకాశం ఉంది. వ్యవసాయ భూములైతే కేవలం మూడున్నరేళ్లకే ఈ లీజు చెల్లుబాటవుతుంది. లీజుకిచ్చిన వక్ఫ్ ఆస్తి పరిధిలో లీజుదారు ఏదైనా నిర్మాణాలు చేపడితే వాటిని వక్ఫ్‌బోర్డు స్వాధీనం చేసుకునేలా ఉన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అమలవడం లేదు.

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ: బొత్స

హైదరాబాద్, న్యూస్‌టుడే: వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ఎవరితోను పొత్తు లేకుండానే అధికారంలోకి వచ్చి తీరుతామని ధీమా వ్యక్తంచేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా తెదేపా, భాజపాలు ఆంధ్రప్రదేశ్‌కు నష్టం కలిగించాయన్నారు. ఇప్పుడేమో భాజపాతో వైకాపాకు సంబంధాలున్నాయని తెదేపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం మెడలు వంచి రాష్ట్రాభివృద్ధికి కృషి చేసేది కేవలం వైకాపా మాత్రమేనని అన్నారు. ఏపీ ప్రజలు తెదేపాకు అధికారం ఇచ్చింది ఐదేళ్లు దోపిడీ చేయడానికా అని ప్రశ్నించారు. చంద్రబాబు అవినీతిలో పీకల్లోతు కూరుకుపోయారని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని పుస్తక రూపంలో తీసుకురాబోతున్నామన్నారు. ఆ పుస్తకాన్ని దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలకు అందజేస్తామన్నారు. తెదేపాలా ట్యాంపరింగ్ చేసే సంస్కృతి తమకు లేదని బహిరంగంగానే ప్రజల ముందుకు వచ్చి అన్ని విషయాలు చెబుతామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

INTER : MEC/CEC - 06 June
B.Com+CMA(ICWA) - 18 June
CMA(ICWA) INTER / FINAL - 20 June
MODERN ACADEMY
• MEC • CEC • B.Com (Hons, Tax, Comp) • BBA • CMA • CA
VIJAYAWADA. Cell : 94401 90494

STATE & RAILWAY
సబ్ - ఇన్‌స్పెక్టర్స్ (SI's)
Exclusive SI's Batch (TM)
అడ్మిషన్లు జరుగుచున్నవి ★ హాస్టలు వసతి కలదు
ప్రతిరోజూ On-line Exams మరియు Explanation
విజయసాధన స్టడీ సర్కిల్ 2/7 బ్రాడీపేట, గుంటూరు.
VICTORY INVITES YOU
☎: 2240433, 92931 77737

ACE Engineering Academy
VIJAYAWADA
Admissions are open
GATE + PSUs-2019
Daily Batch starts from 25th June 2018
GATE + PSUs-2020
Long Term Batch starts from 24th June 2018
All India 1st RANK 43 Times
Group Discounts are available
Opp. Stella College, Near Benzcircle, Vijayawada.
Ph: 0866- 2490001 Cell : 9676076001
H.O.: Hyderabad. Ph: 040 - 23234418/19
www.aceenggacademy.com

NR's బ్రిలియంట్ మెడికల్ అకాడమి
విజయవాడ
మెడికల్ ఎంట్రన్స్ ఫలితాలలో..
* NEET - 2018 లో A.P. 134 స్టేట్ ర్యాంక్
* A.P. EAMCET - 2018 లో 111 స్టేట్ ర్యాంక్
* T.S. EAMCET - 2018 లో 132 స్టేట్ ర్యాంక్
G. NAVEEN
NEET-18 లో 134 స్టేట్ ర్యాంక్
H.T. No.500805157
★ 133/270 మెడికల్ సీట్స్‌తో నవ్యాంధ్ర ది బెస్ట్ మెడికల్ అకాడమి
★ 2018 బ్యాచ్ లో కోచింగ్ తీసుకున్న ప్రతీ ఇద్దరిలో ఒకరికి మెడికల్ సీట్
నవ్యాంధ్రలో ఇన్ని బెస్ట్ ర్యాంకులు మా అకాడమీకి మాత్రమే ఉన్నాయి
మాకు మేమే సాటి... మాకెవరూ లేరు పోటీ....
NEET-2019 లాంగ్ టర్మ్ ఫీజు రాయితీలు
400 & above: 50% 350-399: 25% 300-349:10%
NEET-2019 లాంగ్ టర్మ్ అడ్మిషన్లకై సంప్రదించండి
9948942777 8184917777 8184927777
8501867777 9948120777 7285937777

భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న బిస్కట్ బ్రాండ్‌లో చేరండి
Yours Tastefully Anmol™
FMCG వ్యాపారంలో లీడరైన అన్‌మోల్ బ్రాండ్ భారతదేశంలోని తూర్పు మరియు ఉత్తర ప్రాంతంలో విస్తరించి అక్కడ గట్టి సామ్రాజ్యం ఏర్పాటు చేసుకుంది. ఇప్పుడు దక్షిణ భారతదేశం వైపు పెద్ద లక్ష్యంతో చిన్న చిన్న అడుగులు వేస్తోంది.
₹1200 కోట్ల టర్నోవర్, 2500కు పైగా డిస్ట్రిబ్యూటర్లతో భారతదేశంలో అత్యంత నమ్మకమైన, బాధ్యతాయుతమైన బ్రాండ్‌గా అన్‌మోల్ అవతరించింది. రండి, ఈ విజయాన్ని కలిసి ఆస్వాదిద్దాం.
ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలకు డిస్ట్రిబ్యూటర్లు, సూపర్ స్టాకిస్టులు కావలెను.
వివరాలకు: (91+) 9100943371 నెంబరుకు కాల్ చేయండి లేదా asmvij@anmolindustries.com కు ఈమెయిల్ చేయండి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 18-6-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 309

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

'భారత జట్టు (టీమ్ ఇండియా)గా సంక్లిష్ట సమస్యలకు పరిష్కారం చూపడంలో నీతి ఆయోగ్ కీలకపాత్ర పోషిస్తోంది. సహకార స్ఫూర్తి, పోటీతో కూడిన సమాఖ్య తత్వంతో ఒకే జట్టుగా ముందడుగు వేద్దాం. జీఎస్టీ సజావుగా అమల్లోకి రావడం దీనికొక ఉదాహరణ.

లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరగాలనే ప్రతిపాదనపై సమగ్ర చర్చ అవసరం. జమిలి ఎన్నికల వల్ల ఖర్చు తగ్గుతుంది. వనరుల సమర్థ వినియోగానికి వీలుంటుంది.

వ్యవసాయ రంగంలో కార్పొరేట్ పెట్టుబడులు చాలా తక్కువగా ఉంటున్నాయి. దీనిని మార్చడానికి రాష్ట్రాలు తగిన విధానాలను రూపొందించాలి. భారత దేశ ఆర్థిక రంగం అతి త్వరగా అయిదు ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలని ప్రపంచం ఆశిస్తోంది.'

- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ

ఆదివారం దిల్లీలో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం సందర్భంగా కేరళ, ఏపీ, పశ్చిమబెంగాల్, కర్ణాటక ముఖ్యమంత్రులు విజయన్, చంద్రబాబు, మమతా బెనర్జీ, కుమారస్వామిలను పలకరిస్తున్న ప్రధాని మోదీ

'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని ఐదు కోట్ల ప్రజల తరఫున డిమాండు చేస్తున్నా. కేంద్రం ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాలి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఆగ్రహంతో ఉన్న వారి మనసుల్ని మరింత గాయపడేలా చేయొద్దని కోరుతున్నా.

భాజపా ఎన్నికల ప్రణాళికలో ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు హోదా ఇస్తామని పేర్కొంది. ఆ తర్వాత 14వ ఆర్థిక సంఘం సాకుగా చూపిస్తూ ప్రత్యేక ఆర్థికసాయం చేస్తామంటూ కేంద్రం ప్రజలను తప్పుదోవపట్టించే యత్నం చేస్తోంది.

రాష్ట్రాల అవసరాలు కేంద్రం గుర్తించాలి. ప్రధాని మోదీ కూడా ఒకప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఎక్కువ ఆదాయం వచ్చే రాజధాని అమరావతికి కావల్సినంత ఆర్థిక సాయం దక్కడం లేదు. కేంద్రం రూ.1500 కోట్లు మాత్రమే అమరావతికి ఇచ్చింది.'

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

రెండంకెల వృద్ధి · హోదా ఇవ్వాల్సిందే

- అదే ఇప్పుడు మన ముందున్న సవాల్
- ఈ దిశగా ముఖ్యమైన చర్యలు చేపడతాం
- సమాఖ్య స్ఫూర్తితో సహకారాత్మక అడుగు
- రాష్ట్రాలకు ఈ ఏడాది రూ.11లక్షల కోట్లు
- జమిలి ఎన్నికలే ఉత్తమం
- నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ

దిల్లీ

దేశ ఆర్థిక వృద్ధి రేటును రెండంకెలకు తీసుకువెళ్లడమే ఇప్పుడు ప్రభుత్వం ముందున్న సవాల్ అనీ, దీని కోసం అనేక ముఖ్యమైన చర్యలు చేపట్టనున్నామనీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఆదివారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి నాలుగో సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 2017-18 ఆర్థిక సంవత్సర నాలుగో త్రైమాసికంలో భారత ఆర్థిక రంగం- ఆరోగ్యకరమైన రీతిలో 7.7% వృద్ధిని సాధించిందనీ, దీనిని ఇక రెండంకెలకు చేర్చడమే మిగిలిందని ప్రారంభోపన్యాసంలో ప్రధాని చెప్పారు. 2022 నాటికి సరికొత్త భారతావనిని తీర్చిదిద్దటానికి కొన్ని ముఖ్యమైన చర్యలు అవసరమవుతాయన్నారు. దేశాభివృద్ధిలో చరిత్రాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు పాలకమండలి ఒక వేదికగా నిలుస్తుందని చెప్పారు. వరద బాధిత రాష్ట్రాలకు కేంద్రం బాసటగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. స్వచ్ఛభారత్, డిజిటల్ లావాదేవీలు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో ముఖ్యమంత్రులతో వేసిన ఉప బృందాలు, ఉప సంఘాలు కీలక భూమిక పోషించి, విధానాల రూపకల్పనకు దోహదపడ్డాయని (మిగతా 2లో)

అంతా మంచిగానే ఉంది కదా?

- చంద్రబాబుకి మోదీ పలకరింపు
- బాగా లేదని ముఖ్యమంత్రి సమాధానం
- అప్పట్లో మహాత్ముడికి ఎదురైన అవమానమే ఆంధ్రప్రదేశ్‌కూ జరిగిందన్న సీఎం

2లో



- మాది ప్రత్యేక సమస్యలున్న ప్రత్యేక రాష్ట్రం
- పదేపదే నిర్లక్ష్యానికి గురవుతున్నాం
- విభజన హామీలన్నీ నెరవేర్చాలి
- నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- రాష్ట్రానికి ఏం చేశారో... ఏం చేయాలో స్పష్టీకరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. సమాఖ్యస్ఫూర్తిని అనుసరిస్తూ దేశాన్ని టీంఇండియాగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రాలు, ప్రజల ప్రత్యేక అవసరాలపై దృష్టి పెట్టాలని కేంద్రానికి సూచించారు. విభజన చట్టానికి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. దిల్లీలో ఆదివారం జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం వేదికగా రాష్ట్ర సమస్యలపై ఆయన కేంద్రంపై గళమెత్తారు. "ఏపీ ప్రజలు విభజన కోరుకోలేదు. అయినా అశాస్త్రీయంగా, అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించారు. హామీలు అమలవక ఇబ్బంది పడుతున్నారు. పదేపదే నిర్లక్ష్యానికి గురవుతుండడంతో సెంటిమెంట్ దెబ్బతిన్నట్లుగా భావిస్తున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నాడు రాజ్యసభలో ఇచ్చిన హామీలు, కాగ్ నివేదికలు, సుప్రీంకోర్టు సూచనలు వేటినీ కేంద్రం గౌరవించడం లేదు" అని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, ఉన్నతాధికారుల సమక్షంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు.

- పూర్తి వివరాలు 6లో

కష్టాల కౌలు!

- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు
- రెండేళ్లుగా పెట్టుబడి రాని పరిస్థితి
- అప్పుల భయంతో కూలీలుగా మారుతున్న అన్నదాత
- సాగుకు ముందుకు రాకపోవడంతో పడిపోయిన కౌలుధరలు
- 'ఈనాడు' క్షేత్రస్థాయి పరిశీలన

పశ్చిమ కృష్ణా నుంచి
'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి

కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రెండేళ్లుగా పంట నష్టాలు రావడంతో చెల్లించిన కౌలు కూడా మిగలడం లేదు. చేసిన అప్పులకు వడ్డీలు పెరగడంతో.. ఈసారి కౌలు అంటేనే భయపడిపోతున్నారు. ఖరీఫ్ మొదలై వర్షాలు కురుస్తున్నా.. ఇప్పటికీ దుక్కి వేయించని పరిస్థితి కనిపిస్తోంది. కౌలు తగ్గించి ఇస్తేగానీ.. రైతులు ముందుకు రావడం లేదు. మరికొందరైతే.. వ్యవసాయం మానుకుని కూలిపనులకు వెళ్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో కౌలు ధరలు దిగొస్తున్నాయి. మూడేళ్ల కిందట పశ్చిమ కృష్ణాలో ఎకరా రూ.30వేల నుంచి రూ.50వేల వరకు పలికిన భూములు ఇప్పుడు రూ.20వేల నుంచి రూ.30 వేల మధ్యకు పడిపోయాయి. కొన్నిచోట్ల తీసుకునేందుకే ముందుకు రావడం లేదు. కృష్ణా జిల్లా వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో 'ఈనాడు' ప్రతినిధి పర్యటించినప్పుడు పలువురు కౌలు రైతులు తమ గోడు వెల్లడించారు.

తెగుళ్లు.. ధరల పతనమే

మిర్చికి గతేడాది వైరస్ వచ్చి దిగుబడులు దెబ్బతీసింది. ఎకరాకు సగటున 15 నుంచి 18 క్వింటాళ్లకే పరిమితమైంది. పత్తికి గులాబీరంగు పురుగు దెబ్బతో ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్లే వచ్చింది. అదీ పుచ్చు పత్తి అంటూ ధరలు తగ్గించారు. ఫలితంగా కౌలుగా చెల్లించిన మొత్తం కూడా రైతులకు దక్కలేదు. ఎకరాకు రూ.20వేల నుంచి రూ.28వేల వరకు చెల్లించి పత్తి వేస్తే.. పంట మొత్తం (మిగతా 2లో)

అనవసర జోక్యం వద్దు

- కేంద్రంపై భాజపాయేతర రాష్ట్రాల దాడి
- సహకార సమాఖ్యతత్వం పాటించాలని సూచన
- నీతి ఆయోగ్‌లో గళం విప్పిన విపక్ష ముఖ్యమంత్రులు

6లో

తూకాల్లో తన్నుకుపోతున్నారు

- పౌరసరఫరాల సంస్థ గోదాముల్లో అక్రమాల పరంపర
- ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు వినియోగించని వైనం
- ఏడాదికి రూ.77 కోట్లు అక్రమార్కుల జేబుల్లోకి..!
- నెలాఖరులోగా కొందరి సస్పెన్షన్ అంటున్న మంత్రి..!

ఈనాడు - అమరావతి

పౌరసరఫరాల సంస్థ మండలస్థాయి నిల్వ(ఎంఎల్ఎస్ పాయింట్లు) కేంద్రాల్లో అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అక్రమాల నియంత్రణకు రూ.కోట్లు వెచ్చించి తీసుకువస్తున్న సాంకేతిక పరికరాలను పక్కన పడేస్తున్న పరిస్థితి. ఈ కేంద్రాల్లో తక్కువగా ఇస్తున్నారంటూ చౌకధర దుకాణాల్లో డీలర్లు కార్డుదారులకు తూకాల్లో కోతేస్తున్నారు..అటు సాంకేతిక పరికరాల కోసం రూ.కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం, ఇటు తూకాల్లో కార్డుదారులు నష్టపోతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల బాధ్యులు కొందరు డీలర్లతో, మరికొందరు మిల్లర్లతో మిలాఖత్ అయి ప్రతీనెలా లారీల్లో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. ఇటీవలే పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డి ప్రాంతంలో పీడీఎస్(ప్రజాపంపిణీ వ్యవస్థ) బియ్యంతో వెళుతున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఆ లారీలో తరచూ ఇలా బియ్యం తరలిస్తూనే ఉంటారని తర్వాత గుర్తించారు. మరోవైపు తూర్పుగోదావరి జిల్లాలోని ఒక ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీలర్లకు పంపుతున్న బియ్యంలో మంత్రి పుల్లారావు 13క్వింటాళ్ల బియ్యాన్ని తనిఖీ చేయించారు. అందులో 13కేజీల మేర బియ్యం తరుగును గుర్తించారు. అంటే క్వింటాకు కేజీ చొప్పున తగ్గింది. అంటే..ప్రతీనెలా రాష్ట్రవ్యాప్తంగా గల 268 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి 28,934 చౌకదుకాణాలకు చేరే 2.30లక్షల టన్నుల్లో ఇలా (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఏదైనా భారతీయ బ్యాంకు అప్పు ఇస్తే వెంటనే కోర్టు ఖర్చులు చెల్లిస్తాడట యువరానర్, మా క్లయింటు!

'నిరీక్షణ' శిక్ష!

- ఒక్కో రైల్లో 400 వెయిటింగ్ లిస్ట్
- 66 శాతం స్లీపర్ ప్రయాణికులే..
- తర్వాత థర్డ్ ఏసీలో అత్యధికం
- ఆఖరి నిమిషం వరకు ఎదురుచూపు
- ఖరారు కాక ప్రయాణికులకు కష్టాలు
- రద్దుకు కూడా భారీగా రుసుం
- దోపిడీలో రైల్వే కొత్త పుంతలు

రైల్వే దోపిడీలో మరో పర్వమిది. ఒకవైపు ప్రీమియం రైళ్లు.. తత్కాల్ టికెట్లు పేరుతో దోచుకుంటుండగా.. మరోవైపు వెయిటింగ్ లిస్టు టికెట్ల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతోంది. ఒక్కో రైల్లో పరిమితికి మించి మూడు, నాలుగు వందల వెయిటింగ్ లిస్టు టికెట్లను జారీ చేయడం.. చివరకు వాటిని రద్దు చేసుకుంటే దానికి కూడా భారీగా రుసుములు దండుకోవడం.. ఇలా ఏటా దక్షిణ మధ్య రైల్వేలో టికెట్టు ఖరారుకాని ప్రయాణికుల సంఖ్య పాతిక లక్షలు కాగా, వారి నుంచి రద్దు రుసుం పేరిట ఏటా కనీసం రూ. 20 కోట్లు ఊరికే లాగేస్తోంది దక్షిణ మధ్య రైల్వే. డబ్బు సంగతి ఎలా ఉన్నా చివరి నిమిషం వరకు టికెట్టు ఖరారు కాక ప్రయాణికులు పడే ఇబ్బందులు ఎన్నో! వీటికి ఎవరు జవాబుదారీ? ఊరికి వెళ్లాలంటే హైరానా పడాల్సిందేనా?

- పూర్తి వివరాలు 2లో

భౌభోయ్ శునకం!

- గ్రామ సింహాల దాడుల్లో చిన్నారుల మృత్యువాత
- వేసవి 4 నెలల్లో బీభత్సం
- ఐదు నెలల్లో 1.28 లక్షల మందికి గాయాలు

3లో

'నిరీక్షణ' శిక్ష!

- ఒక్కో రైల్లో 400 వెయిటింగ్ లిస్ట్
- రద్దుకు భారీగా రుసుం

సుతారపు సోమశేఖర్

ఈనాడు – హైదరాబాద్

కుటుంబంతో తిరుపతికి వెళ్లాలనుకున్న రవికిశోర్ టికెట్ల కోసం రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. వెయిటింగ్ లిస్టని చెప్పడంతో, ప్రయాణానికి ఇంకా 15 రోజుల సమయం ఉంది కదా.. ఆఖర్లోనైనా బెర్తు దొరుకుతుందని అనుకున్నాడు. బయల్దేరడానికి ముందురోజు తత్కాల్ టికెట్లుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఇటు టికెట్లు కన్ఫర్మ్ కాలేదు. దీంతో అప్పటికప్పుడు ప్రైవేటు వాహనం మాట్లాడుకుని వెళ్లాల్సి వచ్చింది. ఆ ఖర్చు భారంతో పాటు.. టికెట్ల రద్దు ఛార్జీల పేరుతో ఒక్కొక్కరికి రూ. 60 చొప్పున ఐదుగురికి రూ. 300.. బ్యాంకు, ఐఆర్‌సీటీసీ ఛార్జీల పేరుతో మరికొంత జేబుకు చిల్లు పడింది.

వెయిటింగ్ లిస్ట్ టికెట్లు ఖరారు కాని ప్రయాణికులు ఎదుర్కొనే ఇబ్బందులు ఎన్నెన్నో. 2017-18లో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో వివిధ తరగతి బోగీల్లో 23.86 లక్షలమందికి రిజర్వేషన్ ఖరారు కాక టికెట్లు రద్దయ్యాయి. ఆఖరి నిమిషంలో ప్రత్యామ్నాయ రవాణా చూసుకోలేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ధైర్యం చేసి రైలు ఎక్కినా బెర్తులు దొరక్క, జరిమానాలు చెల్లించాల్సి వస్తోంది. గోదావరి, గరీబ్‌రథ్, గౌతమి, తెలంగాణ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, శబరి, పట్నా వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ రద్దీ రోజుల్లో 400 దాటిపోతుంది. ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని రైల్వే చెబుతున్నా అవీ చాలట్లేదు. పైగా అవి ఏ రోజుల్లో ఉంటాయో కచ్చితత్వం ఉండదు.. గంటల తరబడి ఆలస్యం. దీంతో ఉన్న రైళ్లలోనే, నిరీక్షణ జాబితా వందల్లో ఉంటున్నా టికెట్లు తీసుకుంటున్నారు. ఒక రైల్లో రిజర్వేషన్ ఖరారు కాకపోతే ఆ తర్వాత రైల్లో రిజర్వేషన్ కల్పించేందుకు 'వికల్ప్' వెసులుబాటును కల్పించినా దాదాపు అన్ని రైళ్లు కిటకిటలాడుతుండటంతో ఉపయోగం నామమాత్రమే.

ప్రయాణికుడికి నష్టం.. రైల్వేకూ గండి

ఒక్కో రైల్లో మూడు, నాలుగు వందలు.. ఆపైనా వెయిటింగ్ లిస్ట్ టికెట్లు ఇస్తున్నారు. ఇది పరోక్షంగా డబ్బు దండుకోవడానికేననేది కొందరు నిపుణుల విమర్శ. ఆచరణలో సాధ్యమైనంత మేరకే వెయిటింగ్ లిస్ట్ టికెట్లు ఇచ్చి ఆపేయాలని వారు సూచిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో వెయిటింగ్ లిస్ట్ ఐదు వరకే ఇస్తున్నారు. రైల్లో ఓ 100 వరకు ఇవ్వచ్చేమో కాని ఏకంగా మూడు నాలుగు వందల వరకు ఇవ్వడమే అభ్యంతరకరంగా ఉంది. ఆర్ఏసీ పేరుతో ఒక్కో బెర్తులో ఇద్దరిని కూర్చోబెడుతున్నారు. అలా మరో 100 మంది నుంచి పూర్తి బెర్తుకు టికెట్ రుసుం వసూలు చేసి కేవలం సిటుతో సరిపెడుతోంది రైల్వే. ఇక టికెట్ల రద్దు రుసుంల రూపంలో ప్రయాణికుల జేబులనుంచి గతేడాది ద.మ. రైల్వేకు దాదాపు 15-20 కోట్ల ఆదాయం వెళ్లింది. మరో కోణంలో చూస్తే రైల్వే ఏటా దాదాపు పాతిక లక్షల మంది ప్రయాణికుల్ని క్షోభపెట్టడమే కాకుండా.. అన్ని టికెట్లను కోల్పోవడం వల్ల ఏటా రూ. 150 కోట్లకు పైగా ఆదాయాన్ని నష్టపోయినట్లవుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇంకెన్నాళ్లు ఈ కష్టాలు?

ప్రయాణికులకు సరిపడా రైళ్లు లేవు. బండి బయల్దేరే 3-4 గంటల ముందు వరకు టికెట్ ఖరారు అవుతుందో.. లేదో తెలీక ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి పోవాలి. ఒక రైలు రెండు, మూడు జోన్ల నుంచి ప్రయాణిస్తుంది. రిజర్వేషన్ కాకుండా ఎక్కువ టికెట్లు రద్దయ్యే మార్గాల్ని గుర్తించి అదనపు బోగీలు, అదనపు రైళ్లు నడపాలి. ప్రయాణికుల వ్యయప్రయాసలతో పాటు రైల్వే కూడా భారీ ఆదాయాన్ని కోల్పోతుంది.

– సూర్యప్రకాశ్, జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు

రద్దయితే మొత్తం డబ్బు ఇవ్వాలి

టికెట్ ఏదైనా ప్రయాణికుడి నుంచి డబ్బు తీసుకుంటే బెర్తు, సీటు ఖరారు చేయాల్సిన బాధ్యత రైల్వే తీసుకోవాలి. వెయిటింగ్ లిస్ట్ టికెట్లు వందల్లో జారీ చేయకూడదు. అధిక ఛార్జీలు తీసుకునే తత్కాల్ టికెట్లలోనూ వెయిటింగ్ లిస్ట్ పెట్టడం దారుణం. బోగీల సంఖ్య పెంచితే మరికొంతమంది ప్రయాణించొచ్చు. పగటి రైళ్లలో బెర్తులకు బదులు ఛైర్‌కార్‌లా మారిస్తే ఒక్కో బోగీలో 36 మంది అదనంగా ప్రయాణించవచ్చు. ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సంఖ్య పెంచాలి. టికెట్ రద్దు చేస్తే ప్రయాణికుడికి మొత్తం డబ్బులివ్వాలి.

– భాస్కర్, రైల్వే నిపుణుడు

మూడేళ్లలో రద్దయిన వెయిటింగ్ లిస్ట్ టికెట్లు	
ఏడాది	టికెట్ల సంఖ్య
2015-16	22,40,885
2016-17	19,92,711
2017-18	23,86,939

గత మూడేళ్లలో వివిధ తరగతుల్లో రద్దయిన రైల్వే టికెట్లు

తరగతి	2017–18	2016–17	2015–16
స్లీపర్‌లో	16.10	13.68	15.24
థర్డ్‌ఏసీలో	04.59	3.72	4.28
సెకండ్ ఏసీలో	1.71	1.48	1.77
మిగతాతరగతులు	1.28	1.04	1.11
మొత్తం	**23.86**	**19.92**	**22.40**

(టికెట్లు: లక్షల్లో.)

వనరుల మేరకు సర్దుతున్నాం

రద్దీని దృష్టిలో పెట్టుకుని కొన్నిసార్లు అదనపు బోగీలు జతచేస్తున్నాం. ప్రత్యేక రైళ్లు నడుపుతున్నాం. రైళ్లను బట్టి వెయిటింగ్ లిస్ట్ (నిరీక్షణ జాబితా)ను కొంతవరకు పరిమితం చేస్తున్నాం. ఆ తర్వాత బుకింగ్‌కు అవకాశం లేకుండా చేస్తున్నాం. నిరీక్షణ జాబితాలో ఉన్న అందరికీ టికెట్లు ఖరారు కావాలంటే ఆ సంఖ్యలో బోగీలు ఉండాలి. అందుబాటులో ఉన్న వనరులను బట్టి సర్దుబాటు చేస్తున్నాం.

– ఎం. ఉమాశంకర్‌కుమార్, సీపీఆర్వో, దక్షిణ మధ్య రైల్వే

కష్టాల కౌలు!

(మొదటి పేజీ తరువాయి)

అమ్మినా రూ. 25వేలు రాని పరిస్థితులున్నాయి. కౌలు రైతుల్లో 60శాతం మంది ఇలా నష్టాల పాలయ్యారు.

సింగవరం.. అప్పులభారం..

కృష్ణా జిల్లా వత్సవాయి మండలం సింగవరంలో కౌలు రైతుల్ని కదిలిస్తే కన్నీరే. ఇక్కడి 300 కుటుంబాల్లో 250 కుటుంబాలు కౌలు రైతులే. ఎకరం కౌలు రూ. 30వేల నుంచి రూ. 40 వేల వరకు చెల్లించిన సందర్భాలున్నాయి. రెండేళ్ల నుంచి సాగు అనుకూలించక వీరిలో 90శాతం మంది అప్పులపాలయ్యారు. ఎవరిని కదిలించినా రూ. 50వేల నుంచి రూ. 5లక్షలకు పైగా అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు తెలిపారు. దీంతో కొంతమంది మళ్లీ వ్యవసాయ కూలీలుగా మారారు. రైతుల ఆదాయం పెరగాలంటే కౌలు రేట్లు ఇంకా తగ్గాల్సిన అవసరం ఉంది. ఉపాధి హామీతో అనుసంధానించి ఎకరాకు 50 మందికైనా ఇస్తే.. కొంత వెసులుబాటు లభిస్తుంది. పంటరుణంతో పాటు రాయితీ విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, బీమా, పెట్టుబడి రాయితీ, మద్దతు ధరల కల్పన వంటి ప్రయోజనాలను నేరుగా చేరేలా చూడాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో పలుచోట్ల ఇదే పరిస్థితి..

గుంటూరు, కృష్ణాలో మిర్చి, పత్తి, ప్రకాశంలో శనగ సాగు అధికం. ఇక్కడ కౌలు పత్తికి రూ. 20వేలు, మిర్చికైతే రూ. 30వేలపై మాటే. ప్రకాశంలో గతేడాది శనగకూ పోటీ పడి రూ. 40వేల వరకు చెల్లించారు. 2016-17లో శనగ దిగుబడి ఎక్కువగా వచ్చింది. దీంతో ప్రకాశం జిల్లా కొండెపి, సంతనూతలపాడు, పర్చూరు నియోజకవర్గాల్లో గతేడాది కౌలు రూ. 25వేల నుంచి రూ. 40వేల వరకు చేరింది. కానీ దిగుబడులు ఎకరాకు సగటున 6 క్వింటాళ్లకు పడిపోయాయి. శనగలు మొత్తం అమ్మినా కౌలు కూడా రాని పరిస్థితి. దీంతో ఈ ఏడాది సాగు సందిగ్ధంగా మారింది. ఎకరా కౌలు రూ. 20వేల నుంచి రూ. 25వేలకు దిగిందని జమ్ములపాలెం రైతు కొత్తపల్లి వెంకటేశ్వర్లు వివరించారు. గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం తాళ్లచెరువులో మిర్చి సాగు అధికం. నీటి వసతి ఉన్న భూముల కౌలు ఎకరం రూ. 30వేల నుంచి రూ. 35వేల వరకు ఉండేది. మిర్చి దిగుబడులు తగ్గడంతో ఈ ఏడాది కౌలురైతులు వెనక్కు తగ్గుతున్నారు. 'బోరు నీరుంది.. పెట్టుబడి పెడతామన్నా.. ఎకరం రూ. 10వేలకిస్తారా? రూ. 15వేలకు ఇస్తారా?' అని అడుగుతున్నారని రైతు చిన్నపరెడ్డి వివరించారు.

వరిసాగుకు తగ్గిన కౌలు

గోదావరి జిల్లాల్లో వరి సాగుకు కౌలు తగ్గింది. రెండు పంటలకు కలిపి గతంలో ఎకరాకు 30 బస్తాల నుంచి 32 బస్తాల వరకు చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు 24 నుంచి 28 బస్తాలకు తగ్గిపోయింది. ఆక్వా సాగు పెరిగిన ప్రాంతాల్లోనూ కౌలు తగ్గిపోతోంది. రొయ్యల చెరువుల నుంచి వదిలే ఉప్పునీటితో పొలం చౌడుబారి దిగుబడి తగ్గిపోతోంది. దీంతో దిగుబడులు తగ్గుతాయని రైతులు ముందుకు రావడం లేదు.

- 'నాలుగేళ్ల క్రితం ఎకరం రూ. 25 వేల చొప్పున పదెకరాలు కౌలుకు తీసుకున్నాం. ఆ ఏడాది మిర్చి ధరలు క్వింటాలు రూ. 12వేలకు పైగా పలకడంతో తర్వాతి ఏడాది పోటీ పెరిగింది. అదే పొలానికి ఎకరాకు రూ. 30వేలు చెల్లించక తప్పలేదు. 2016-17లో మిర్చి ధరలు పడిపోవడంతో. . కౌలు రూ. 20వేలకు తగ్గించారు. గతేడాది పురుగు వచ్చి పెట్టుబడులూ రాలేదు. ఈ ఏడాది ఎకరా రూ. 15వేలకు తీసుకున్నారు'

– సైదులు, కృష్ణా జిల్లా వత్సవాయి మండలం సింగవరం

- '2016-17లో ఎకరం రూ. 36వేల లెక్కన మూడెకరాలు కౌలుకు తీసుకుని రూ. 1.08లక్షలు ముందే చెల్లించాం. మిర్చి వేస్తే రూ. 2.85లక్షల పెట్టుబడి అయింది. 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా ధర లేక శీతలగిడ్డంగికి తరలించాం. వాటిని ఇప్పటికీ అమ్మలేదు. కౌలు, పెట్టుబడి కలిపి రూ. 3.93లక్షలైంది. ఆ అప్పు అలాగే ఉంది. గతేడాది ఎకరా రూ. 20వేల చొప్పున రెండెకరాల్లో మిర్చివేస్తే.. అక్కడికక్కడే సరిపోయింది. ముందటేడాది అప్పు, వడ్డీ కలిపి రూ. 5లక్షలకు చేరింది. ఈ ఏడాది కౌలు ఎకరా రూ. 18వేలకు తగ్గించి తీసుకుని మిర్చి వేస్తున్నాం'

– అనుమోలు సతీశ్, వత్సవాయి మండలం సింగవరం

- ఎకరా రూ. 28 వేల చొప్పున నాలుగెకరాలు తీసుకుని పత్తి వేశాం. గులాబీ రంగు పురుగు కారణంగా ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాలు రూ. 4వేల చొప్పున అమ్మితే రూ. 24వేలే వచ్చాయి. కౌలు సొమ్ము కూడా చేతికి రాలేదు. పెట్టుబడిగా పెట్టిన రూ. 30వేలలో పైసా దక్కలేదు.

– పద్మాల నాగేశ్వరరావు, పెనుగంచిప్రోలు

రెండంకెల వృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

కొనియాడారు. ఈ బృందాలు చేసిన సిఫార్సుల్ని వివిధ మంత్రిత్వ శాఖలు అమల్లోకి తెస్తున్నాయని చెప్పారు.

వనరులకేమీ లోటు లేదు

ఆయుష్మాన్ భారత్ కింద దేశంలో 1.5 లక్షల ఆరోగ్య/ స్వస్థత (వెల్‌నెస్) కేంద్రాలను నిర్మిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. ఏటా రూ. 5 లక్షల పరిమితితో దాదాపు 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ పేరుతో విద్యారంగం కోసం ఒక దృక్పథంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. 'ముద్రా యోజన, జన్‌ధన్ యోజన, స్టాండప్ ఇండియా వంటి పథకాలు పెద్దస్థాయిలో ఆర్థిక సమ్మిళితానికి దోహదపడుతున్నాయి. ఆర్థిక అసమానతలను సరిచేయడానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. మానవ అభివృద్ధి ప్రామాణికాలను 115 ఆశావహ జిల్లాల్లో మెరుగుపరచాలి. పథకాల అమలుకు సరికొత్త ఆదర్శంగా గ్రామ స్వరాజ్ అభియాన్ నిలుస్తుండడంతో దీనిని ఆశావహ జిల్లాల్లోని 45 వేల గ్రామాలకు విస్తరించాం. దక్షత, సామర్థ్యం, వనరుల పరంగా మనకెంత మాత్రం లోటు లేదు. మునుపటి సర్కారు హయాంలో చివరి ఏడాది రాష్ట్రాలకు వచ్చిన మొత్తం కంటే రూ. 6 లక్షల కోట్లు ఎక్కువగా- రూ. 11 లక్షల కోట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు ఇవ్వబోతున్నాం' అని మోదీ వివరించారు.

ఏకకాల ఎన్నికలపై చర్చ జరగాలి

లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరగాలనే ప్రతిపాదనపై సమగ్ర చర్చ అవసరమని మోదీ మరోసారి అభిప్రాయపడ్డారు. జమిలి ఎన్నికల వల్ల ఖర్చు తగ్గుతుందనీ, వనరుల సమర్థ వినియోగానికి వీలుంటుందనీ చెప్పారు. సాయంత్రం సమావేశ ముగింపు సందర్భంగానూ మోదీ ప్రసంగించారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారిక నివాసాలు, వీధి దీపాల్లో ఎల్ఈడీ బల్బులను వాడాలని రాష్ట్రాలను కోరారు. ఫలితాలు ఆధారంగా కేటాయింపుల్ని ప్రోత్సహించడం, వ్యయ దిద్దుబాటు వంటి అంశాలపై ఆర్థిక కమిషన్‌కు కొత్తగా ఆలోచనలు పంపాల్సిందిగా ముఖ్యమంత్రులకు సూచించారు. ఈ సమావేశంలో వచ్చిన సూచనలను ముమ్మందు విధాన నిర్ణయాల సమయంలో తప్పకుండా దృష్టిలో పెట్టుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రాలు ప్రస్తావించిన అంశాలపై కార్యాచరణ గురించి మూడు నెలల్లో అనుశీలన చేయాలని నీతిఆయోగ్‌కు సూచించారు. జాతిపిత 150వ జయంతి నాటికి సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించాలని కూడా ప్రధాని పిలుపునిచ్చారు. సరళతర వ్యాపార నిర్వహణకు పెద్దపీట వేసేలా రాష్ట్రాలతో ఒక సమావేశాన్ని నిర్వహించాలని నీతి ఆయోగ్‌కు సూచించారు. 23 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఒక లెఫ్టినెంట్ గవర్నర్, పలువురు కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఒడిశా, జమ్ముకశ్మీర్, దిల్లీ వంటి రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకాలేదు.

ఏపీ విభజన హామీలను తు.చ. తప్పకుండా నెరవేరుస్తాం.. ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల విభజన సమయంలో ఇచ్చిన అన్ని హామీలను తు.చ. తప్పకుండా పాటిస్తామని ఈ సమావేశంలో ప్రధాని హామీ ఇచ్చినట్లు నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ తెలిపారు. సమావేశానంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022 నాటికి నవభారత్‌ను తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్రాల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని నాలుగు నుంచి ఆరు వారాల్లో ఒక పత్రాన్ని రూపొందిస్తామని చెప్పారు. ఇప్పటికే ఒక ముసాయిదా రూపొందినా, క్షేత్రస్థాయి వాస్తవాలు కూడా ప్రతిఫలించాలనే ఉద్దేశంతో దానిని ఈసారి సమావేశంలో సమర్పించలేదన్నారు.

ఆదివారం దిల్లీలో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్

ఉపాధి హామీపై ఏడుగురు సీఎంలతో కమిటీ

దిల్లీ: పంట కోతలకు ముందు, వెనుక దశల్లో ఉపాధి హామీ పథకాన్ని ఎంత సమర్థంగా వినియోగించుకోవచ్చో అధ్యయనం చేయడానికి ఏడుగురు ముఖ్యమంత్రులతో కూడిన కమిటీని కేంద్రం నియమించింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన కమిటీ పనిచేసేలా నీతి ఆయోగ్ సమావేశంలో నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు బిహార్, సిక్కిం, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల సీఎంలు దీనిలో సభ్యులుగా ఉంటారు. ఉపాధి హామీ పనుల్ని మెరుగ్గా వినియోగించుకోవడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా కమిటీ సిఫార్సులు చేస్తుంది. నాట్లు వేయడానికి ముందు నుంచి పంటకోత అనంతర దశ వరకు ఉపాధి హామీని ఎలా వినియోగించుకోవచ్చో చెబుతుంది. వ్యవసాయం, ఉపాధి హామీ అనే రెండు అంశాలపై అధ్యయనం చేసే కమిటీ ఏర్పాటుపై అధికారిక ప్రకటన సోమవారం వెలువడుతుందని నీతిఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ తెలిపారు.

అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా

అన్ని ఎన్నికలకూ ఉపయోగపడేలా ఒకే ఓటరు జాబితాను రూపొందించాల్సిందిగా ప్రధాని ఈ సమావేశంలో సూచించారని కుమార్ తెలిపారు. ప్రస్తుతం కొన్ని ఓటర్ల జాబితాలను కేంద్ర ఎన్నికల సంఘం, మరికొన్నింటిని రాష్ట్ర ఎన్నికల కమిషన్లు సిద్ధం చేస్తున్నాయి.

2018 TETలో 142, 140, 140, 140 మార్కులతో ప్రభంజనం
2014 DSCలో స్టేట్ 2, 3, 4, 5 ర్యాంకులు 7 జిల్లా ఫస్ట్‌లు
అవనిగడ్డ విద్యానికేతన్ DSC కృష్ణాజిల్లా
SGT & SA (Mat, Soc, Bio, Eng)
బ్యాచ్ ప్రారంభం : 22-06-2018
94401 04963, 99499 33838

2016 AP DSC - SGT, TPT, SA-All సబ్జెక్ట్సులలో కలిపి
స్టేట్ 1st, 2nd, 3rd, 4th, 5th, 6th, 7th, 8th, 9th, 10th ర్యాంకులే గాక
యిచ్చిన టీచర్స్ పోస్టులలో 70% పైగా పోస్టులు సాధించిన
కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-MAT, SOC, TEL, BIO
కొత్త బ్యాచ్ ప్రారంభం : 22-6-2018 సా॥ 4 గం॥లకు
8106268482, 9885272474

అంతా మంచిగానే ఉంది కదా?

- చంద్రబాబుకు మోదీ పలకరింపు

ఈనాడు – అమరావతి

"అంతా మంచిగానే ఉంది కదా? (ఎవ్రీ థింగ్ ఈజ్ ఆల్‌రైట్?)"

– ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుని పలకరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ అడిగిన ప్రశ్న ఇది.

"బాగా లేదు (నాట్ వెల్)"... ఇది ప్రధానికి చంద్రబాబు ఇచ్చిన సమాధానం.

ఆదివారం దిల్లీలో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం సందర్భంగా మోదీ, చంద్రబాబు మధ్య ఈ సంభాషణ చోటు చేసుకుంది. అందరూ సమావేశమందిరంలోకి వెళ్లే ముందు... చంద్రబాబు, పశ్చిమ బంగ, కర్ణాటక, కేరళ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, కుమారస్వామి, పినరై విజయన్ ముచ్చటించుకుంటూ ఉండగా ప్రధాని మోదీ వారి వద్దకు వచ్చి పలకరించారు. చంద్రబాబుతో ఆయన కరచాలనం చేశారు. వారిద్దరూ ముక్తసరిగానే పలకరించుకున్నారు.

అధిగమించి ముందడుగు వేస్తున్నాం

ప్రత్యేకహోదా సహా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, విభజన చట్టంలోని అంశాల్ని అమలు చేయాలన్న డిమాండ్‌ను నీతి ఆయోగ్ సమావేశంలో చంద్రబాబు తన ప్రసంగంలో బలంగా వినిపించారు. ఎన్డీయే నుంచి తెదేపా బయటకు వచ్చిన నేపథ్యంలో ఎలాంటి మొహమాటాలకు తావులేకుండా రాష్ట్ర సమస్యల్ని కుండబద్దలు కొట్టినట్టుగా వివరించారు. 75 ఏళ్ల క్రితం దక్షిణాఫ్రికాలో శ్వేతజాతీయుల నుంచి మహాత్మాగాంధీకి ఎదురైన అవమానాన్ని... రాష్ట్ర విభజన, ఇచ్చిన హామీల్ని అమలు చేయకపోవడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఎదురైన అవమానంతో ఆయన పోల్చి చెప్పారు. విభజన గాయాల్ని, అవమానాల్ని గాంధీజీ స్ఫూర్తితో అధిగమించి ముందడుగు వేస్తున్నామన్నారు. 20 నిమిషాలపాటు కొనసాగిన ఆయన ప్రసంగాన్ని అందరూ శ్రద్ధగా విన్నారు. మిగతా ముఖ్యమంత్రులెవరూ ఆరేడు నిమిషాలకు మించి మాట్లాడలేదు.

ఏకతాటిపైకి తెచ్చే దిశగా

ఎన్డీయే, యూపీయే కూటమిలో లేని భావసారూప్య పార్టీల్ని ఏకతాటిపైకి తెచ్చే దిశగా మరో అడుగు ముందుకు వేశారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా కుమారస్వామి ప్రమాణ స్వీకారం చేసినప్పుడు బెంగళూరులో సమావేశమైన ప్రాంతీయ పార్టీల నాయకులు... తమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు దిల్లీ పర్యటనను వేదికగా చేసుకున్నారు. చంద్రబాబు, మమతా బెనర్జీ, పినరై విజయన్, కుమారస్వామి ఏపీ భవన్‌లో సమావేశమై భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై చర్చించారు. తమతో కలిసి వచ్చే మరో నాయకుడు, మోదీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా దీక్ష చేస్తున్న దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు వారు సంఘీభావం ప్రకటించారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోగా ఇలాంటి సమావేశాలు మరిన్ని నిర్వహించనున్నట్టు తెదేపా వర్గాలు తెలిపాయి. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయానికి నిరసనగా నీతి ఆయోగ్ సమావేశం నుంచి వాకౌట్ చేయడం వంటి ప్రతిపాదనలు పార్టీ నాయకుల నుంచి వచ్చినా... చంద్రబాబు అలాంటి నిర్ణయాలేమీ తీసుకోలేదు.

ఇలా అయితే వ్యవసాయం ఏం బాగుపడుతుంది?

నరేగాను వ్యవసాయంతో అనుసంధానం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్‌ను చంద్రబాబు గట్టిగా ప్రస్తావించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే, దేశంలో వ్యవసాయరంగం వృద్ధి రేటు 12 శాతం ఉండాలని... గడిచిన నాలుగేళ్లలో వ్యవసాయరంగ సగటు వృద్ధి రేటు 2.42 శాతం మాత్రమే ఉందన్నారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగం సగటు వృద్ధి రేటు 11 శాతం ఉందని చెప్పారు. ఈ రంగంపై పెద్ద ఎత్తున నిధులు వెచ్చించినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని పేర్కొన్నారు. కేంద్రం ప్రస్తుతం అమలు చేస్తున్న పంటల బీమా పథకం లోపభూయిష్ఠంగా ఉందన్నారు. పంటలకు మద్దతు ధరల విషయంలోనే కేంద్ర విధానాన్ని తప్పుబట్టారు. ప్రపంచ మార్కెట్ల పరిస్థితులకు అనుగుణంగా విధానాల్ని రూపొందించడం, ఎగుమతులు, దిగుమతుల్ని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, ఇది స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు, స్థానిక రైతులకు నష్టాలు మిగులుస్తోందని వివరించారు.

అపరిష్కృత అంశాలపై కేంద్రాన్ని నిలదీశా

విభజన తర్వాత రాష్ట్రానికి జరిగిన అన్యాయం, పోలవరం ప్రాజెక్టుకు రావాల్సిన నిధులు, పెద్దనోట్ల రద్దు ప్రభావం, ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రాలకు నిధుల కేటాయింపు కోసం 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవద్దన్న కీలక అంశాలను కేంద్రానికి మరోసారి గట్టిగా వినిపించానని ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగంలో ...గత నాలుగేళ్లుగా రాష్ట్ర వృద్ధి 10.5 శాతంగా ఉందని, జాతీయ వృద్ధి 8 శాతం అవసరమని, అత్యధిక రాష్ట్రాలు 10-12 శాతం వృద్ధి సాధిస్తున్నాయని ప్రస్తావించారని నీతి అయోగ్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో) అమితాబ్ కాంత్ చేసిన ట్వీట్‌ను ముఖ్యమంత్రి తన ట్విట్టర్ ఖాతాలో ఈ సందర్భంగా 'రీ ట్వీట్' చేశారు.

ప్రచారం తప్ప పనులు లేవు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై జీవీఎల్ విమర్శ

ఈనాడు, దిల్లీ: ఆర్భాటాలు, ప్రచారాలు తప్ప ఏపీ సీఎం చంద్రబాబు అభివృద్ధి పనులు చేయడం లేదని భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు విమర్శించారు. నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో రాష్ట్ర సమస్యలను చంద్రబాబు విస్తృతంగా ప్రస్తావించారని తెదేపా నేతలు బాగానే ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఆదివారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నా ఏపీ ప్రభుత్వం ముందుకు రావడం లేదని, ప్రత్యేక వాహక సంస్థ ఏర్పాటుకి ఎందుకు అంగీకరించడం లేదో చెప్పాలన్నారు. ఒకప్పుడు ప్రత్యేకహోదా కంటే ఎక్కువ నిధులు వస్తున్నాయని చంద్రబాబు అన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయి కేంద్రం అందిస్తుందన్నారు. పోలవరానికి రావాల్సిన నిధులు త్వరలోనే నాబార్డు ద్వారా అందుతాయన్న సమాచారం ఉందన్నారు.

తూకాల్లో తన్నుకుపోతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

క్వింటాకు కేజీ చొప్పున తగ్గితే 23లక్షల కేజీలు పక్కదారి పడుతున్నట్లే. ఒక్క కేజీపై నెలకు రూ. 6.44 కోట్లు, సంవత్సరానికి రూ. 77.28 కోట్ల మేర పక్కదారి పడుతున్నట్లే. ఎంఎల్ఎస్ పాయింట్లలో అక్రమాలకు పాలడుతున్న ఆ పాయింట్ల బాధ్యుల్లో కొందరిని ఈ నెలాఖరులోగా సస్పెండ్ చేయనున్నట్లు మంత్రి పుల్లారావు రెండ్రోజుల కిందట అధికారికంగా ప్రకటించారు. ఇది ఎంతవరకు ఆచరణలోకి వస్తుందో వేచి చూడాలి.

ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిల సంగతేంటి?

ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద తూకాల్లో జరుగుతున్న అక్రమాలతోపాటు, బియ్యం పక్కదారి పట్టకుండా నిల్వలను సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా? అని తేల్చేందుకు ఉపయోగపడేలా ఈ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలను పౌరసరఫరాల సంస్థ ఏర్పాటు చేసింది. చౌకధర దుకాణాల్లోలాగే ఎంఎల్ఎస్ పాయింట్లలోనూ ఇ-పాస్ యంత్రాలకు ఎలక్ట్రానిక్ తూకాలను అనుసంధానం చేసి వాటిద్వారా తూకం చేశాకనే డీలర్లకు బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆచరణలో మాత్రం ఇది తూతూ మంత్రంగానే సాగుతోంది. ఈ కాటాలను పక్కనపడేస్తున్నారు. కొన్నిచోట్ల అయితే ఎఫ్‌సీఐ లారీల్లో వచ్చిన బియ్యం బస్తాలను అలాగే డీలర్లకు పంపే లారీల్లోకి మార్చేస్తున్నారు. వాస్తవంగా వీటిని ఎంఎల్ఎస్ పాయింట్‌లో దించి తూకం వేసి డీలర్లకు ఇవ్వాల్సి ఉంది.

గోదాముల్లో సంచులను లారీల నుంచి దించడం, ఎత్తడం, లోపల నిల్వ చేసే సమయంలో సంచుల నుంచి బియ్యం కిందకు రాలిపోతుంటాయి. అలాంటి బియ్యాన్ని పూర్తిగా ఎత్తి వాటిని శుభ్రం చేసి తిరిగి సంచుల్లో నింపాలి. ఇవి కూడా నికరంగా 50 కేజీల బరువుండాలి. కానీ, ఈ సంచులను 60/65/70 కేజీల చొప్పున రకరకాల బరువులతో సిద్ధం చేస్తున్నారు. వీటిని విడి బస్తాలుగా చెబుతుంటారు. డీలర్లకు ఇచ్చే 50 కేజీల బస్తాల్లో ఏవైనా తేడా ఉన్నాయని వారు అడిగితే నాలుగు విడి బస్తాలు తీసుకువెళ్లండంటూ ఇచ్చేస్తున్నారు. వాటిలో బియ్యం ఎక్కువగా ఉంటాయి కాబట్టి మిగిలిన బస్తాల్లో తక్కువ తూకాలున్నా సరిపోతాయని చెబుతున్నారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఎగువన కురిసిన వర్షాలతో వరద నీరు నదిలోకి భారీగా కలుస్తోంది.. ఇన్నాళ్లు నీలిరంగుతో కళకళలాడిన గోదావరి నీరు ఇప్పుడు కొత్తనీటి రాకతో రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ఇలా నీలం, తెలుపు వర్ణాల్లో కనువిందు చేస్తోంది. - ఈనాడు, రాజమహేంద్రవరం

ఈ నెల 26 నుంచి తెలుగు రాష్ట్రాల్లో మంచి వానలు

దిల్లీ: జూన్ నెల ప్రథమార్ధంలో చాలా చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాలు ఆ తర్వాత స్తబ్దుగా మారినా మరో అయిదారు రోజుల్లో మళ్లీ పరిస్థితి మారుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. రుతుపవనాల్లో ఇలాంటి స్తబ్దత సహజమేనని ఐ.ఎం.డి. అదనపు డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. రుతుపవనాలు పుంజుకోగానే ఒడిశా సహా తూర్పు భారతదేశంలో ఈ నెల 23-24 నుంచి; ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఇతర దక్షిణాది ప్రాంతాల్లో 26వ తేదీ నుంచి మంచి వానలు పడతాయని చెప్పారు. కొంకణ్, గోవా, కోస్తా కర్ణాటక వంటి చోట్ల సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

గ్రహం అనుగ్రహం

18–6–2018 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
పంచమి: మ. 2-05 తదుపరి షష్ఠి
ఆశ్లేష నక్షత్రం: ఉ. 9-34 తదుపరి మఖ
అమృత ఘడియలు: ఉ. 8-04 నుంచి 9-33 వరకు
వర్జ్యం: రా. 8-50 నుంచి 10-20 వరకు
దుర్ముహూర్తం: మ. 12-27 నుంచి 1-19 వరకు
తిరిగి మ. 3-03 నుంచి 3-56 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-30; సూర్యాస్తమయం: సా. 6-32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఖమ్మం	45.0	28.0
రాజమహేంద్రవరం	42.5	29.0
గుంటూరు	41.5	29.0
విశాఖపట్నం	41.4	29.2
ఒంగోలు	40.5	30.4
విజయవాడ	40.4	28.8
తిరుపతి	40.2	27.4
శ్రీకాకుళం	40.0	30.0
నెల్లూరు	39.0	29.0
నరసాపురం	39.0	28.8
తాడేపల్లిగూడెం	38.5	28.0
కడప	38.0	28.0
కర్నూలు	37.1	26.1
హైదరాబాద్	36.3	26.7
అనంతపురం	36.2	27.1

భౌబోయ్ శునకం!

- గ్రామ సింహాల దాడుల్లో చిన్నారుల మృత్యువాత

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు వీధి కుక్కల భయం పట్టుకుంది. పాఠశాలలు ప్రారంభమైన వేళ తమ కంటిపాపలు శునకాల దృష్టిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఖాళీ సమయంలో తోటి పిల్లలతో కలిసి వీధుల్లో ఆడుకోవడానికి సైతం పిల్లలను పంపేందుకు భయపడే పరిస్థితి. కాకినాడలోని శాలిపేటలో వీధి కుక్కల దాడిలో శనివారం ఆరేళ్ల బాలుడి మృతి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఏటా వేసవిలో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఇలాంటి ఘటనలు తల్లిదండ్రులకు తీరని వేదనను మిగుల్చుతున్నాయి. జనవరి నుంచి మే మధ్య ఐదు నెలల వ్యవధిలో కుక్క కాటుతో 13 జిల్లాల్లో 1.28 లక్షల మంది ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరి వైద్యం పొందారు. మరో 18 మంది తీవ్ర గాయాలతో ఇళ్ల వద్దే మృత్యువాత పడ్డారు. వీరిలో ఆరుగురు 3 నుంచి ఏడేళ్ల చిన్నారులు ఉండడం గమనార్హం.

అన్నీ కాకి లెక్కలే..

వీధి శునకాలను అదుపు చేసేందుకు పట్టణాల్లో ఏటా నిర్వహిస్తున్న కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలపైనా అనుమానాలున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప వంటి ముఖ్య నగరాల్లో నిర్వహణపై కొంత పర్యవేక్షణ, జవాబుదారితనం కనిపిస్తున్నా.. కొన్ని పట్టణాల్లో, ఇంకొన్ని నగర పంచాయతీల్లో కాకి లెక్కలు చూపిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఈ ఏడాది 110 పట్టణాల్లో ఇప్పటి వరకు 70,579 వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేశారు. మరో 42,263 శునకాలకు శస్త్రచికిత్సలు చేయాల్సిఉంది. తూర్పుగోదావరి, ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాలు శస్త్రచికిత్సల విషయంలో బాగా వెనుకన ఉన్నాయి. ఒక్కో శునకం శస్త్రచికిత్సకు రూ. 300 నుంచి రూ. 600 వరకు పురపాలక, నగరపాలక సంస్థలు ఖర్చు చేస్తున్నాయి. నాలుగైదు నగరాల్లో, మరో 35 పట్టణాల్లో శస్త్రచికిత్స చేసిన శునకాల చెవిపై గాట్లు వేస్తున్నారు. వీటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స నిర్వహించారడానికి సూచిక ఇది. మిగతా చోట్ల శస్త్రచికిత్స చేసిన శునకాలేవో, చేయనవి ఏవో కూడా గుర్తించలేని పరిస్థితి. నిధులు దుర్వినియోగానికి దీన్నో చక్కని మార్గంగా కొందరు ఉపయోగించుకుంటున్నారు.

గ్రామాల్లో పట్టించుకునేవారే కరవు.. :వీధి శునకాల నియంత్రణ కోసం ఇప్పటికీ గ్రామాల్లో ఎలాంటి వ్యవస్థ లేదు. పెద్ద పంచాయతీల్లో సైతం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు. శునకాలు కరవడంతో ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్న వారిలో గ్రామీణులు 38 శాతం ఉన్నారు. 12,918 పంచాయతీల్లో 89,164 వీధి శునకాలు ఉన్నట్లు తాజాగా అధికారులు గుర్తించారు. వీటిలో పది శాతానికి కూడా ఇప్పటికీ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయకపోవడంతో ఏటా సంతానోత్పత్తి పెరుగుతోంది. పురపాలక, నగరపాలక సంస్థల సిబ్బంది పట్టణాల్లోని శునకాలను గ్రామాల్లో విడిచి పెడుతున్నారని కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, విశాఖపట్నం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో పంచాయతీ అధికారులు ఫిర్యాదులు చేస్తున్నారు.

న్యూజిలాండ్, ఆస్ట్రేలియా విధానం అవసరం...

'శునకాల నియంత్రణ, పర్యవేక్షణ కోసం న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల తరహాలో ప్రత్యేక వ్యవస్థ అవసరం. ఆయా దేశాల్లో శునకాల కుటుంబ నియంత్రణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. శస్త్రచికిత్స అనంతరం బయటకు పంపే శునకాలపైనా పర్యవేక్షణ ఉంటుంది.

– ఎల్.నాగేశ్వరరావు, సహాయ సంచాలకుడు, పశుసంవర్ధకశాఖ, గుంటూరు

1 నుంచి ఈ-రవాణా పర్మిట్లు

ఈనాడు, అమరావతి: మార్కెట్ యార్డుల్లో ఈ-రవాణా పర్మిట్ విధానం అమల్లోకి రానుంది. వ్యాపారులు కొనుగోలు చేసిన ఉత్పత్తులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేసేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. పాత విధానం వల్ల సాంకేతికపరంగా సమస్యలు ఉత్పన్నం కావడం, ప్రస్తుతం కాగిత రహిత సేవలు అందుబాటులోకి వస్తున్నందున ప్రభుత్వం ఈ సరికొత్త విధానానికి రూపకల్పన చేసింది. ఈ-రవాణా పర్మిట్ల అమలుకు గాను జి.వో నెం.46 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. జులై1 నుంచి ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు మార్కెటింగ్‌శాఖ కసరత్తు చేస్తోంది.

ప్రయోజనాలెన్నో..

★ పర్మిట్ కోసం మార్కెట్ యార్డుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం ఉండదు. ఆన్‌లైన్ ద్వారా ఈ-పర్మిట్లు పొందే అవకాశం ఉంటుంది.

★ వ్యాపారులకు సమయం ఆదాతో పాటు లెక్కకు మించి రికార్డులు నిర్వహించాల్సిన అవసరం ఉండదు.

★ ఆన్‌లైన్ ద్వారానే రిటర్న్‌లు దాఖలు చేయవచ్చు. మార్కెట్ ఫీజు కూడా ఈ విధానంలోనే చెల్లించవచ్చు.

★ జీరో వ్యాపారాన్ని అరికట్టడంతో పాటు యార్డు సిబ్బంది పై పని భారం తగ్గుతుంది. వార్షిక అస్సెస్‌మెంట్స్ చేయడం కూడా సులభతరమవుతుంది.

సరకు తరలింపులో ఈ-రవాణా పర్మిట్లు తప్పనిసరి

వ్యాపారులు కొనుగోలు చేసిన ప్రకటిత ఉత్పత్తులను రవాణా చేసే వాహనం తప్పనిసరిగా ఈ-రవాణా పర్మిట్ కలిగి ఉండాలి. ఈ-ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ నుంచి ఈ-పర్మిట్లు పొందాల్సి ఉంటుంది. కొనుగోళ్లకు సంబంధించిన మార్కెట్ రుసుమును ఆన్‌లైన్‌లో చెల్లించి కేటాయించిన ఐడీ, పాస్‌వార్డు ద్వారా నిర్ణయించిన పోర్టల్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ-రవాణా పర్మిట్ పొందవచ్చు. ఈ-పర్మిట్ ఉంటే చెక్‌పోస్టుల్లో మార్కెట్ ఫీజు చెల్లించకుండానే సరుకు రవాణా చేసుకోవచ్చు. చెక్‌పోస్టు సిబ్బందికి, అధికారులకు ఈ-పర్మిట్ చూపితే సరిపోతుంది. ఇది లేకుండా సరుకు రవాణా చేయడం చట్టవిరుద్ధం. అనివార్య కారణాల వల్ల వాహనం ఆగిపోతే..సరుకు రవాణా చేసేందుకు అత్యవసర ఎస్.ఓ.ఎస్ పర్మిట్‌ను ఈ పోర్టల్ ద్వారా పొందే అవకాశం ఉంది. మార్కెట్ యార్డులో ఈ-రవాణా పర్మిట్లు విధానం అమలు చేసే విషయమై మార్కెటింగ్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఇటీవలే ఆశాఖ ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు.



ఊడల పరుపు

మొక్కల సంరక్షణ అనేది తిరుమల వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో ఓ పవిత్రకార్యం. తితిదే అధికారులు కూడా వాటి సంరక్షణలో నిరంతరం నిమగ్నమై కాపాడుతారు. అందువల్ల కొన్ని వందల సంవత్సరాల క్రితం నాటిన మొక్కలు నేడు మహావృక్షాలుగా దర్శనమిస్తున్నాయి. తిరుమలలోని ఎస్వీ వసతిగృహం వద్ద ఉన్న మర్రి చెట్టు మహావృక్షమైంది. ఈ చెట్టుకు పెద్ద సంఖ్యలో ఊడలు వచ్చాయి. అవి నేలపైకి దిగి.. పరుపులా పరుచుకోవడంతో ఈ దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

– ఈనాడు, తిరుపతి

8, 9 తరగతుల సమ్మేటివ్-1 ఫలితాలు అస్తవ్యస్తం

- ఇబ్బందిగా మారిన అంతర్గత మార్కుల లెక్కింపు

ఈనాడు, అమరావతి: గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 8,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన సమ్మేటివ్-1 పరీక్ష మార్కుల వెల్లడి అస్తవ్యస్తంగా మారింది. మొదటిసారిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఓఎంఆర్ షీట్‌తో వీటిని నిర్వహించారు. వీటికి సంబంధించిన గ్రేడ్‌లు, మార్కులు పాఠశాలలకు సక్రమంగా అందకపోవడంతో విద్యార్థుల మార్కులు ఏ విధంగా లెక్కించాలో అర్థం కావడం లేదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. సమగ్ర నిరంతర మూల్యాంకనం(సీసీఈ) విధానంలో 80మార్కులకు రాత పరీక్ష, 20 అంతర్గత మార్కులకు కేటాయించారు. విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఫార్మేటివ్ పరీక్షలు నాలుగు, సమ్మేటివ్-1లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు అంతర్గత మార్కులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు సమ్మేటివ్-1 మార్కులు రాకపోవడంతో అంతర్గత మార్కులపై సందిగ్ధత ఏర్పడింది.

సున్నా మార్కులు వచ్చినట్లుగా..

చిత్తూరు జిల్లాలో గణితం, హిందీలో చాలామందికి సున్నా మార్కులు వచ్చినట్లు గ్రేడ్లు ఇచ్చారు. గుంటూరు జిల్లాలో ఆంగ్లంలో ఎక్కువ మంది విద్యార్థులకు సున్నాలొచ్చాయని, కడప జిల్లాలో బయోలాజికల్ సైన్సులో చాలామందికి సున్నాలు వచ్చినట్లు పేర్కొన్నారు. పరీక్షల్లో సున్నా మార్కులు ఎట్లా వస్తాయని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరీక్షలకు ప్రశ్నపత్రాలను విమానాల్లో తరలించి, ఇతర రాష్ట్రాల్లో ముద్రించినందుకు దాదాపు రూ.23కోట్లు వ్యయం చేశారు. అయినా.. ఫలితాలు సక్రమంగా లేకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ ఏడాది ఆబ్జెక్టివ్ విధానంలో 6,7,8,9 తరగతులకు పరీక్షలు నిర్వహిస్తారా? లేదా దీంట్లో మార్పు చేస్తారా? అనేదానిపై ఇంతవరకు పాఠశాల విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు.

గన్నవరం విమానాశ్రయంలో కార్గో సేవలు

రేపటి నుంచి అందుబాటులోకి..

గన్నవరం విమానాశ్రయంలో నిర్మించిన కార్గో సేవల కేంద్రం

గన్నవరం, న్యూస్‌టుడే: గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం నుంచి కార్గో సేవలు ప్రారంభం కానున్నాయి. సరకు రవాణాకు సంబంధించిన ప్రత్యేక టెర్మినల్‌ను పాత టెర్మినల్ సమీపంలో నిర్మించారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున వ్యవసాయరంగ ఉత్పత్తులు, పారిశ్రామిక అవసరాలకు కావాల్సిన ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో అప్పుడప్పుడు సరకు రవాణా చేసినా.. ఈనెల 19వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో కార్గో సేవలను అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా కార్గో సేవలు ప్రారంభిస్తారు. కార్గో టెర్మినల్‌లో ఎగుమతి చేసే సరకును ప్యాకింగ్ చేసే యంత్రాలను ఆదివారం శ్రీపా లాజిస్టిక్స్ ఎండీ వెంకట రామారావు పరిశీలించారు. సరకు రవాణా విషయమై వివిధ విమానయాన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆరోగ్య రథాలతో అందుతున్న వైద్యసేవలు

ఈనాడు, అమరావతి: కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఏపీ ట్రాన్స్‌కో అందించిన ఆరోగ్య రథాలు శ్రీకాకుళం జిల్లాలోని 68 మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్నాయని ఇంధనశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అతి త్వరలోనే రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించింది. మే 4 నుంచి జూన్ 15 వరకూ సీతంపేట, ఎచ్చెర్ల తదితర ప్రాంతాల్లో 2,417 మంది రోగులుకు చికిత్స అందించినట్లు వెల్లడించింది. ఈ ఆరోగ్య రథాల కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

పదేళ్ల బాలికపై పాశవికం

అత్యాచారం చేసి హత్య చేసిన కామాంధుడు

సోన్, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని పదేళ్ల బాలికపై ఓ కామాంధుడు అత్యాచారం చేసి హత్య చేశాడు. ఈ అమానుష ఘటన తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ జిల్లా సోన్ మండలంలో జరిగింది. సోన్‌కు చెందిన బాలికను శనివారం తల్లిదండ్రులు నానమ్మ వద్ద ఉంచి పనిమీద వేరే గ్రామానికి వెళ్లారు. సాయంత్రం తిరిగొచ్చేసరికి ఇంట్లో చిన్నారి కనిపించలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించక పోవడంతో శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం విచారణ చేసిన పోలీసులకు సోన్‌కు చెందిన ప్రవీణ్(30) అనే వ్యక్తి బాలికను ద్విచక్ర వాహనంపై తీసికెళ్లినట్లు తెలిసింది. నిందితున్ని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించారు. కూచన్‌పల్లి గ్రామంలోని నిర్జన ప్రదేశంలో బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఒప్పుకుని పోలీసులకు సంఘటన స్థలాన్ని చూపించాడు. డీఎస్పీ మనోహర్‌రెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ దక్షిణామూర్తి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలంటూ స్థానికులు, కుటుంబ సభ్యులు రాస్తారోకో చేశారు. నిందితుడిని అప్పగించాలని ఆందోళన చేయడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఏఎస్పీ వారిని సముదాయించి నిందితుడిపై కేసు నమోదు చేశామని, కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

ఈనాడు

ఆరోగ్యకర అభివృద్ధి కోసం...

మంచి గాలి, నీరు వరసలో మనిషికి ఆహారం- ప్రాణాధారం. పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదిగి సమర్థ మానవ వనరుగా రాణించాలంటే సమతులాహారాన్ని తీసుకోవడం అత్యవసరం. అమెరికా తరవాత అత్యధికంగా సేద్య యోగ్య భూమి ఉన్న ఇండియా ఆహార ఉత్పాదనల దిగుబడులపరంగా ఎంతో వెనకబడి ఉంది. గత యూపీఏ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఆహార హక్కును చట్టబద్ధం చేసినా, ప్రపంచవ్యాప్తంగాగల అన్నార్తుల్లో 23.4శాతం ఇండియాలోనే పోగుపడ్డారని, 51శాతం మహిళలు రక్తహీనతతోనూ, 19 కోట్లపైబడిన జనావళి పౌష్టికాహార లోపంతోనూ కునారిల్లుతున్నారని నిరుడు ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. జాతికి జీవగర్రలాంటి సేద్యరంగాన్ని చిన్నచూపు చూసి బడుగు రైతుల ఉసురు పోసుకొంటున్న ప్రభుత్వాలు, ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేలా ఆహారోత్పత్తుల దిగుబడుల పెంపు, నాణ్యతలపై శీతకన్నేసిన దుష్ఫలితాలు దేశ ప్రగతినే కుంగదీస్తున్నాయి. గోరు చుట్టుపై రోకటి పోటులా వాతావరణ మార్పులు జనం తినే తిండిలోని పోషకాల్ని హరించి వేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 కోట్లమంది ప్రాథమిక ఆహారమైన బియ్యంలో సహజంగా ఉండే ప్రొటీన్లు, ఐరన్, జింక్ వంటివి క్రమంగా తగ్గిపోతున్నట్లు పలు శాస్త్రీయ అధ్యయనాలు ధ్రువీకరిస్తున్న వేళ ఇది. తిండి కలిగితే కండ కలదని ఈ వైపరీత్యాన్ని దీటుగా ఎదుర్కోవాలంటే ఆహార సాంకేతిక పరిజ్ఞానంలో ఎప్పటికప్పుడు నవ్య పరిశోధనలు ఊపందుకోవాలి. మొక్క జొన్న గింజలనుంచి వంటనూనెను సులభంగా తీయగలిగే కొత్త పరిజ్ఞానంతో యంత్రాల్ని అభివృద్ధి చేసిన కేంద్రీయ ఆహార సాంకేతిక పరిజ్ఞాన పరిశోధన సంస్థ (సీఎఫ్‌టీఆర్ఐ), బియ్యానికి జింక్ ఐరన్ వంటి పోషకాల్ని జోడించే విధానాన్నీ ఆవిష్కరించింది. అదేవిధంగా- టమాటా, వేరుసెనగ, పసుపు, అల్లం, వెల్లుల్లి... ఇత్యాది ఆహార పంటలకు అదనపు విలువ చేకూర్చే యంత్ర సామగ్రినీ అందుబాటులోకి తెస్తోంది. వ్యవసాయానికి అసలైన సాయంగా కొత్త సాంకేతికత పల్లె పట్టులదాకా విస్తరిస్తే రైతుకు ఆర్థిక భద్రత, వినియోగదారుడికి ఆరోగ్య భద్రత జమిలిగా చేకూరుతాయి!

'దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలన్నింటికీ పరిష్కారం సైన్స్... సైన్స్... సైన్స్' అని సీవీ రామన్ ఏనాడో స్పష్టీకరించారు. శాస్త్ర పరిశోధనల్ని ప్రోత్సహించి దాని ఫలసాయాన్ని పొలం గట్లకు చేర్చిన పాపాన దేశీయంగా వ్యవసాయ, ఆహార, ఆరోగ్య సంక్షోభాలకు అంటుకట్టిందని చెప్పక తప్పదు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో వివిధ నామధేయాలతో వందకుపైగా పరిశోధన సంస్థలు ఉన్నాయి. ఒక్కో పంటకు రెండు మూడు చొప్పున జాతీయ స్థాయి సంస్థలున్నాయన్న మాటేగాని, వాటి వల్ల వ్యవసాయ రంగానికి, రైతుకు నికరంగా ఒనగూడిన మేలు ఏపాటి? వంట నూనెల దిగుమతిపై భారీగా ఆధారపడిన ఇండియా ఆ పద్దుకింద ఏటా వ్యయంచేస్తున్నది రూ. 70వేల కోట్లు! ప్రపంచ ఆహార విపణిని ఏలే సత్తా మనకుందని జబ్బలు చరచు కొడుతున్నా- జాతీయ స్థాయిలో రైతు శ్రేయస్కర బహుముఖ వ్యవసాయ వ్యూహం నేటికీ పట్టాలెక్కనే లేదు! 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటూ (అది కూడా దిగువ తరగతి ప్రభుత్వోద్యోగి జీతంలో సగం కంటే తక్కువ) హడావుడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం- వ్యవసాయ పరిశోధన, విద్యపై వ్యయాలను మొత్తం వ్యవసాయ జీడీపీలో 0.54శాతం! ఇంత సంక్షుభిత స్థితిలోనూ విరుదిద్వగా భాసిస్తున్న బహుముఖ ప్రయోజనకర పరిశోధనల వెన్ను తట్టి సత్వరం ఆయా సాంకేతిక ఆవిష్కరణల్ని జన సామాన్యానికి చేరువ చెయ్యాలి. ఇథియోపియాలో లభ్యమయ్యే టెఫ్ ధాన్యాన్ని స్థానిక చిరు ధాన్యాలతో మేళవించి కొవ్వురహితంగా మెండుగా పోషకాలున్న చిరుతిళ్లనూ సీఎఫ్‌టీఆర్ఐ నిరుడు డిసెంబరులో అభివృద్ధి చేసింది. ఆఫ్రికా, దక్షిణ అమెరికాల్లో దొరికే చియా గింజల ఆధారంగా తీర్చిదిద్దిన రెండు దేశీయ వంగడాలు త్వరలో ధాన్యాలకన్నా బలవర్ధకమైనవంటున్నందున- జాతీయ, అంతర్జాతీయ అవసరాల మేరకు వాటి సాగుకు ప్రోత్సాహం దక్కాలి!

వచ్చే మూడు దశాబ్దాల్లో ప్రపంచ జనాభా 900 కోట్లకు చేరి ఆహార లభ్యత కోసుకుపోనుందన్న అంచనాల నేపథ్యంలో- తిన దానికి పనికి వచ్చే దాదాపు 1900 రకాల క్రిమికీటకాల్ని మనిషి భుజించే అవకాశాన్ని సమితి నివేదికే ప్రస్తావించింది. ప్రయోగశాలల్లో రూపొందే మాంసం, జన్యుపరివర్తిత ఆహారం, నాచు (ఆల్గే), కృత్రిమ చేపలు, రొయ్యలు వంటివి భవిష్యత్తులో మనిషి ఆహార అవసరాల్ని తీరుస్తాయని అధ్యయనాలు చాటుతున్నాయి. ఉన్న ప్రాకృతిక వనరుల్ని గరిష్ఠ ప్రయోజన సాధకంగా మలచుకొని, ఆర్థికంగా రైతు, ఆహారోత్పాదనలతో దేశం స్వావలంబన సాధించేలా సరైన వ్యూహ నిర్మాణంలో నేటికీ కిందుమీదులవుతున్న పాలక శ్రేణి- ఆ దీర్ఘకాలిక ముప్పును ఎలా ఎదుర్కొనగలుగుతుంది? 'అమూల్' నమూనాలో 'ఆపరేషన్ ఫ్లడ్' ద్వారా సృష్టించిన క్షీర విప్లవాన్ని కూరలు, పండ్ల విభాగాలలోనూ సాధించడానికి కేంద్రం మొన్నటి బడ్జెట్లో ప్రతిపాదించిన 'ఆపరేషన్ గ్రీన్' ఇంకా శైశవ దశలో ఉంది. దేశీయంగా ఆహార సేవల విపణి 2017 నాటికి మూడు లక్షల 37వేల కోట్ల రూపాయలకు పైబడిందని 'ఫిక్కీ' స్పష్టీకరిస్తున్నందున రైతుకు, వినియోగదారులకూ ఉభయ తారకంగా, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధతో సమతుల అభివృద్ధి వ్యూహాలు పదును తేలాలి. పరిశోధనలతో పంటలకు దిగుబడి, అదనపు విలువ జోడింపు, పంట చేతికి వచ్చాక నష్టానికి తెగనమ్ముకొనే అవసరం లేకుండా ఆహార పదార్థాలుగా మార్చే యంత్ర సామగ్రి అందుబాటు, గ్రామాల్లో చిన్న మధ్యతరగతి పారిశ్రామికవేత్తలకు తోడ్పాటు వంటివన్నీ పక్కాగా అమలుకు నోచుకొన్నప్పుడే ఆరోగ్యకర అభివృద్ధి సాధించగలిగేది!

పడగనీడలో ప్రజాతంత్రం

పెద్ద జనాభాను ఓ చిన్న వర్గం పరిపాలించడం సర్వసాధారణం. నియంతృత్వ దేశాల్లో ఇది మరీ సహజం. జనం తమపై తిరగబడకుండా అల్పసంఖ్యాక పాలక వర్గం రకరకాల ఎత్తుగడలు వేస్తుంటుంది. అయినా ప్రజలకు సమర్థుడైన నాయకుడు దొరికితే చాలు, వారు తిరగబడటం ఖాయం. దీన్ని నివారించడానికి జన నాయకుడిని తామే తెరవెనుక నుంచి నడిపించాలని పాలక వర్గం చూస్తుంది. ఇరవై కోట్ల జనాభా కలిగిన పాకిస్థాన్‌కు అసలు సిసలు పాలకులైన సేనానుల వర్గం సరిగ్గా ఈ వ్యూహమే అనుసరిస్తూ వచ్చింది. జూలై 25న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో తమ చెప్పుచేతల్లో ఉండే నాయకుడే నెగ్గాలని పావులు కదుపుతోంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇంతవరకు సగం కాలం దేశాన్ని పాలించింది సైన్యమే. మధ్యమధ్యలో ప్రజలెన్నుకున్న నాయకులు పగ్గాలు చేపట్టినా వారిని పూర్తి కాలం పదవిలో ఉండనివ్వలేదు. 1979లో పాక్ సుప్రీంకోర్టు ఉత్తర్వుపై జుల్ఫికర్ అలీ భుట్టోను ఉరితీయగా, ఆయన కుమార్తె బెనజీర్ 2007లో హత్యకు గురయ్యారు. ఇక నవాజ్ షరీఫ్‌ను మొదటి నుంచీ అవినీతి ఆరోపణలు చుట్టుముడుతూనే వచ్చాయి. ఆయన మొత్తం మూడు సార్లు ప్రధానమంత్రి పదవి నిర్వహించినా, ఆ మూడు సార్లూ సైన్యం, న్యాయవ్యవస్థ ఒత్తిళ్ల వల్ల పదవి నుంచి అర్ధంతరంగా దిగిపోవలసి వచ్చింది. ఒకప్పుడు సైనిక తిరుగుబాట్ల వల్ల కూలిపోయిన పౌర ప్రభుత్వాలు నేడు న్యాయవ్యవస్థ జోక్యం వల్ల పడిపోతున్నాయి. చీటికి మాటికి సైన్య జోక్యం వల్ల పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం వేళ్లూనుకోలేకపోయింది. చివరకు పాకిస్థాన్... ఇస్లామిక్ తీవ్రవాదుల అడ్డాగా మారడంతో ప్రపంచం అక్కడి పరిస్థితిపై దృష్టి సారించింది. నేడు మానవాభివృద్ధి సూచీలలో బంగ్లాదేశ్ కన్నా కూడా పాక్ వెనకబడిపోవడం ఇస్లామాబాద్ నిర్వాకానికి నిదర్శనం. తీవ్రవాదులను అదుపు చేయడంలో విఫలమైన పాక్‌పై అమెరికా ఆగ్రహించి ఆర్థిక సహాయంలో కోత విధిస్తోంది. మరోవైపు చైనా నుంచి తీసుకున్న అప్పులకు వాయిదాలూ కట్టాల్సి వస్తోంది. మొత్తానికి పాకిస్థాన్ అప్పులపాలై ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయింది. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల సైన్యం పాక్‌లో ప్రజాస్వామికంగా ఎన్నికలు జరగడానికి ఒప్పుకోక తప్పలేదు. 2008, 2013ల్లో సక్రమంగా ఎన్నికలు జరిగి, ఒక దశాబ్ద కాలంపాటు ప్రజలు ప్రజాస్వామ్య పాలనను చవిచూశారు. ఈ ఏడాది జూలైలో ఎన్నికలు జరిగాక మరో అర్ధ శతాబ్దిపాటు పౌర ప్రభుత్వమే పాలిస్తుందా అన్నది ప్రశ్న.

నవాజ్ షరీఫ్ ఇమ్రాన్ ఖాన్ బిలావల్ భుట్టో

వచ్చే నెలలో పాక్ ఎన్నికలు



పార్టీ	ఓట్ల శాతం	స్థానాలు
పీఎంఎల్(ఎన్)	45%	124
పీపీపీ	11%	32
పీటీఐ	10%	28
స్వతంత్రులు	10%	28
ఎంక్యూఎం	07%	18
జేయూఐ-ఎఫ్	04%	11
ఇతరులు	13%	31

మూడు పార్టీల మధ్యే పోటీ

ఈ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా పాకిస్థాన్ ముస్లిం లీగ్ (నవాజ్), బిలావల్ భుట్టో జర్దారీ నాయకత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ), మాజీ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ నేతృత్వంలోని పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీల మధ్యనే ఉండబోతోంది. ఈ మూడింటిలో పీటీఐకి పాక్ సైన్యం అండదండలు ఉన్నాయని వినికిడి. 2013 ఎన్నికల్లో నవాజ్ షరీఫ్ అధికారం చేపట్టినా పనామా పత్రాల కుంభకోణం మూలంగా 2017 జూలైలో సుప్రీంకోర్టు తీర్పుతో పదవి నుంచి వైదొలగవలసి వచ్చింది. ఆయన జీవితాంతం ఏ ప్రభుత్వ పదవీ చేపట్టకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది. నవాజ్‌ను మళ్ళీ అధికారంలోకి రానివ్వకూడదని సైన్యం పట్టుదలతో ఉండగా, దాని ఎత్తులు చిత్తు చేసి మళ్లీ పగ్గాలు చేపట్టేందుకు ఆయన వ్యూహరచన చేస్తున్నారు. నవాజ్ అవినీతి కేసుపై జూలై 10న తీర్పు వెలువరించాలని అవినీతి నిరోధక న్యాయస్థానాన్ని సుప్రీంకోర్టు ఆదేశించగా, దాన్ని నిరసిస్తూ ఆయన న్యాయవాదులు కేసు విచారణ నుంచి వైదొలిగారు. జూలై 10నే తీర్పు వెలువరించాలనడం, 25న జరిగే నేషనల్ అసెంబ్లీ (పార్లమెంటు) ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికేనన్నది వారి వాదన. పాక్ సైనిక-న్యాయ యంత్రాంగాలు నవాజ్‌పై అవినీతి అస్త్రం ప్రయోగిస్తుంటే, అదే అస్త్రం ఆసరాతో సింహాసనం ఎక్కాలని పీటీఐ అధినేత ఇమ్రాన్‌ఖాన్ ప్రయత్నిస్తున్నారు. నవాజ్‌నూ ఆయన పార్టీనీ బలహీన పరచి రాబోయే ఎన్నికల్లో ఓడించడానికి జరుగుతున్న పన్నాగాల్లో ఇమ్రాన్ సైతం భాగస్వామి అయినట్లే ఉంది. ఈ ఏడాది మార్చిలో పాక్ ఎగువసభ సెనెట్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలే అందుకు సాక్ష్యం. ఆ ఎన్నికలో పీటీఐ, పీపీపీతో కలసి నిలబెట్టిన అభ్యర్థి గెలుపొందారు. వాస్తవానికి ఎగువసభలో పాలక పక్షం పీఎంఎల్-(ఎన్)కే మెజారిటీ ఉన్నా పీటీఐ-పీపీపీల పొత్తుతో గెలుపు దాని చేజారిపోయింది. పాలక పీఎంఎల్-(ఎన్)కు చెందిన సెనెటర్ల క్రాస్ ఓటింగే దీనికి కారణం. వారు పార్టీ ద్రోహానికి పాల్పడటంలో సైన్యం పాత్ర ఉంది. ఈ పరిణామంతో వచ్చే ఎన్నికల్లో అవకాశవాద పొత్తులకు రంగం సిద్ధమైంది. ఈ క్రీడలో పీఎంఎల్-(ఎన్) ముందరికాళ్లకు బంధం వేయడానికి సైన్యం రకరకాల కుట్రలు చేస్తోంది. ఇమ్రాన్‌ఖాన్‌ను అడ్డుపెట్టుకుని నవాజ్‌ను దెబ్బతీసే కుతంత్రానికి భుట్టో కుటుంబ పార్టీ పీపీపీ లోపాయికారీగా సహకరిస్తోంది. ఈ ఎన్నికల్లో తాము ఒంటరిగా గెలవగలమని పీపీపీకి ఆశ లేకపోవడమే దీనికి కారణం. పాక్ జాతీయ అసెంబ్లీలో అత్యధిక స్థానాలకు పంజాబ్ నుంచే ప్రతినిధులు ఎన్నికవుతారు. అక్కడ నవాజ్ షరీఫ్ పార్టీదే పైచేయి కాబట్టి పీపీపీ పంజాబ్‌పై ఆశలు వదులుకొని సింధ్‌పై దృష్టి కేంద్రీకరించింది. ఇమ్రాన్‌ఖాన్ మాత్రం పంజాబ్‌లో పాగా వేయడానికి కృషిచేస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలిస్తాయని ఎవరూ నమ్మకంగా చెప్పలేకపోతున్నారు. ఒకవేళ ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాకపోతే ఇస్లామిక్ తీవ్రవాదుల మద్దతు తీసుకోవడానికి ప్రధాన పార్టీలు పోటీపడతాయి. దీని నుంచి లబ్ధి పొందడానికి ఉగ్రవాద సంస్థ జమాత్ ఉద్ దవా (జేయూడీ) ఈసారి 200 స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టనుంది. లష్కరే తోయిబా సంస్థకు అనుబంధమైన జేయూడీ 2008లో ముంబయిపై దాడికి పాల్పడింది. అమెరికా 2014లో దీనిని ఉగ్రవాద సంస్థగా ప్రకటించి, దాని అధినేత హాఫీజ్ సయీద్ తలపై కోటి డాలర్ల బహుమతి ప్రకటించింది. జేయూడీకి మిల్లి ముస్లిం లీగ్ (ఎంఎంఎల్) అనే సొంత రాజకీయ పార్టీ ఉన్నా ఐక్యరాజ్య సమితి తీర్మానం మూలంగా దాన్ని నమోదు చేయడానికి ఎన్నికల సంఘం నిరాకరించింది. దానితో ఇంతకుముందే రిజిస్టరైన అల్లాహు అక్బర్ తెహ్రీక్ అనే నిద్రాణ పార్టీ చిహ్నంతో జేయూడీ తన అభ్యర్థులను పోటీచేయించనుంది. ఈ ఎన్నికల్లో హాఫీజ్ సయీద్ స్వయంగా పోటీచేయడంలేదు కానీ, మాజీ సైనిక నియంత పర్వేజ్ ముషరఫ్ మాత్రం బరిలో దిగనున్నారు. క్రిమినల్ కేసు వల్ల దుబాయ్‌లో ప్రవాసముంటున్న ముషరఫ్ స్వదేశం రావడానికి కొన్ని షరతులతో సుప్రీంకోర్టు అనుమతించడం వల్ల ఆయన పోటీచేయగలుగుతున్నారు. ఈ విధంగా పాక్ సైన్య-న్యాయ వ్యవస్థలు నవాజ్‌కు అవరోధాలు సృష్టిస్తూ ఆయన ప్రత్యర్థులకు మార్గం సుగమం చేస్తున్నాయి.

పీఎంఎల్ నుంచి వలసలు

నేడు పాకిస్థాన్‌లో స్పష్టమైన రాజకీయ విభజన ఏర్పడింది. రాజకీయాల్లో సైన్యం పాత్రను గట్టిగా వ్యతిరేకించే పీఎంఎల్-(ఎన్) వంటి పార్టీలు ఒక పక్క, సైన్యం పాత్రను సవాలు చేయడానికి ఇష్టపడని పీటీఐ (ఇమ్రాన్), పీపీపీ (భుట్టో) పార్టీలు మరో పక్క మోహరించాయి. దిగువసభ అయిన జాతీయ అసెంబ్లీలో ప్రత్యక్ష ఎన్నికలు జరిగే స్థానాలు 272 కాగా, అందులో 148 పంజాబ్‌లో ఉన్నాయి. ఇక్కడ పీఎంఎల్ (ఎన్)ను ఓడించలేమని పీటీఐ, పీపీలకు తెలుసు. అందుకే నవాజ్ బద్ధ శత్రువైన సైన్యంతో చేతులు కలిపి ఆయన్ను దెబ్బతీయాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ సైన్యం పీఎంఎల్-నవాజ్ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికి అన్ని అడ్డతోవలూ తొక్కుతోంది. ఎన్నికల ప్రచారంలో ఇది కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రత్యర్థి పార్టీల్లోకి ఫిరాయించాలంటూ తమకు అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని నలుగురు పీఎంఎల్-(ఎన్) ఎంపీలు వార్తా సాధనాలకు చెప్పారు. ఇటీవలి కాలంలో నవాజ్ పార్టీకి చెందిన కనీసం 15 మంది ఎంపీలు పార్టీ నుంచి నిష్క్రమించారు. వీరిలో అత్యధికులు ఇమ్రాన్ పార్టీ అయిన పీటీఐ పార్టీలో చేరారు. మరింతమంది తమ పార్టీలోకి రానున్నారని ఇమ్రాన్ విదేశీ పాత్రికేయులకు చెప్పారు. ఈ ఫిరాయింపుదార్లతో పంజాబ్‌లో పాగా వేయాలన్నది ఆయన ప్రయత్నం. మరోవైపు సమాచార సాధనాలపై సైన్యం సెన్సార్‌షిప్ పెరిగిపోతోంది. దేశంలో అతిపెద్ద టీవీ ఛానల్ జియో నవాజ్ షరీఫ్ గురించి అతిగా ప్రసారాలు చేస్తోందని సైన్యం ఆగ్రహించింది. ఫలితంగా ఏప్రిల్‌లో కొన్ని వారాలపాటు దాని ప్రసారాలు నిలిచిపోయాయి. ఈ ప్రసారాల స్థాయిని తగ్గిస్తామని ఆ ఛానల్ ప్రతినిధులు సైన్యానికి హామీ ఇచ్చిన తరవాతనే జియో మళ్లీ పట్టాలకెక్కింది. అతిపెద్ద ఆంగ్ల పత్రిక డాన్ పంపిణీని పలు నగరాల్లోని సైనిక కంటోన్మెంట్లలో నిలిపివేయించారు. ఇలా సైన్యం రాజ్యాంగాన్ని తోసిపుచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. మొత్తంమీద ఎన్నికలు సజావుగా జరిగి పౌర ప్రభుత్వం ఏర్పడి, సైన్యం తన పరిధిలో తానుంటే పాకిస్థాన్ ఆర్థికంగా, రాజకీయంగా అంతర్జాతీయ స్రవంతిలో మమేకం కాగలుగుతుంది. అలాంటి తరుణం కోసమే భారతదేశమూ ఎదురుచూస్తోంది.

– కైజర్ అడపా

సైన్యానిదే పైచేయి

వాస్తవానికి నవాజ్ షరీఫ్ గతంలో సైన్యానికి ఇష్టుడే. కానీ, మారుతున్న పరిస్థితుల్లో దాని పెత్తనానికి బదులు పౌర పాలన నెలకొంటేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని గ్రహించి ప్రజాస్వామ్యం వెపు మొగ్గారు. గత పదేళ్లలో పాకిస్థాన్‌లో, నవాజ్ స్వరాష్ట్రమైన పంజాబ్‌లో మధ్యతరగతి జనాభా బాగా పెరిగింది. పంజాబ్‌లో మౌలిక వసతులు విస్తరించి పెద్ద మార్కెట్లతో అనుసంధానం ఏర్పడటం వల్ల అక్కడి గ్రామీణ ప్రజలకు ప్రగతి ఫలాలు అందాయి. వ్యాపార సామ్రాజ్యాధినేత అయిన నవాజ్ ఉపఖండ దేశాల మధ్య వ్యాపార సంబంధాలు పెరిగితే పాక్ ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని భావిస్తున్నారు. ఆయన పంథా సైన్యానికి రుచించడం లేదు. అందుకే ఉగ్రవాదాన్ని అది పెంచి పోషిస్తోంది. సైన్యాధిపతి జనరల్ బజ్వాకు ప్రజాస్వామ్య వాది అన్న పేరు ఉన్నప్పటికీ ఆచరణలో పరిస్థితి భిన్నంగా ఉంది. నేడు పాక్ వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటాయి. కరెంటు ఖాతా లోటు నానాటికీ పెరిగిపోతోంది. ఉత్పత్తి, వ్యాపారాలు విజృంభిస్తే ఈ సమస్యలను అధిగమించవచ్చు కానీ ఆ పరిస్థితి లేదు. పైగా పౌర వ్యాపారాలకూ సైన్యం నిర్వహించే వ్యాపారాలకూ మధ్య స్పర్థలు నెలకొన్నాయి. సైన్యం వ్యాపారాలకు బోలెడు రాయితీలు, వరాలూ లభించడంతో పౌర వ్యాపారాలు వాటితో పోటీ పడలేకున్నాయి. ప్రజాస్వామ్యంలో మాత్రమే అందరికీ సమానావకాశాలు లభిస్తాయి కాబట్టి వ్యాపార వర్గం నవాజ్‌ను సమర్థిస్తోంది.

సైన్యాధిపతి జనరల్ బజ్వా

కొత్త గాలి వీస్తోంది!

నియంతస్వామ్యంలో ప్రజాగళాలకు చోటు దొరకదు. ప్రజాభిప్రాయాలతో నిమిత్తం లేకుండా నిర్ణయాలు తీసుకునే పాలకులకు జనస్వామ్యంలో మన్నిక దక్కదు! సామాన్యుల అవసరాలను, ఆకాంక్షలను అర్థం చేసుకొని- ఆ మేరకు విధానాలను సరిదిద్దుకోవడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కొంతకాలంగా తొట్రుపాటు ప్రదర్శిస్తోంది. అందుకేనేమో- ప్రజాబాహుళ్యంలో ఆ పార్టీ పునాదులు క్రమంగా కోసుకుపోతున్నాయి. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లోనే భారతీయ జనతా పార్టీ కుంగుబాటు మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోనే ప్రభుత్వ స్థాపనకు అవసరమైన సీట్లు సాధించే క్రమంలో భాజపా నానా ఇబ్బందులూ ఎదుర్కొంది. అత్తెసరు సీట్లతో ఎలాగోలా గట్టెక్కిన తీరు దేశవ్యాప్తంగా భాజపా ప్రభ కొడిగడుతున్న వైనాన్నే చాటి చెప్పింది. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ కొత్త మిత్రులను వెదుక్కోగలదని, జాతీయ రాజకీయ సమీకరణల్లో గుణాత్మక మార్పు వస్తుందని అప్పట్లో ఎవరూ ఊహించలేదు. ఆ తరవాత అల్వార్, అజ్మీర్, గోరఖ్‌పూర్, ఫూల్పూర్, అరరియా పార్లమెంటు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో భాజపా అనూహ్య పరాజయాలను చవిచూసింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో భాజపా పట్ల ప్రజలకు ఉన్న సానుకూలత ఇప్పుడు క్రమంగా క్షీణముఖం పడుతోందనడానికి దాఖలాలివి!

ఇటీవలి కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. ఎన్నికలకు ఎంతో ముందునుంచే ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షా కర్ణాటకలో వ్యూహ రచన, కార్యాచరణకు దిగారు. కర్ణాటకను ఎట్టి పరిస్థితుల్లోనూ చేజిక్కించుకోవాలని ప్రధాని మోదీ రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. ఇంతా చేసి చివరికి భాజపా ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ కన్నా తక్కువ శాతం ఓట్లే గెలుచుకోగలిగింది. మోదీ ప్రచారం చేసిన సుమారు 20 నియోజకవర్గాల్లో ఆ పార్టీ కేవలం ఆరు సీట్లలో మాత్రమే విజయం దక్కించుకోగలిగింది. కర్ణాటక ఫలితాల నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో ఉప ఎన్నికలపైకి అందరి దృష్టి మరలింది. సుమారు 14 చోట్ల వివిధ అసెంబ్లీలకు, ఎంపీ సీట్లకు జరిగిన పోటీలో దాదాపుగా అన్ని చోట్లా భాజపా పరాజయాలనే మూటగట్టుకొంది. దేశవ్యాప్తంగా భిన్నమైన భౌగోళిక, సామాజిక, సాంస్కృతికతలు ఉన్న వివిధ రాష్ట్రాల్లో భాజపాకు తగిలిన ఎదురుదెబ్బ భవిష్యత్తు పరిణామాలకు సూచికగా నిలుస్తోంది. భిన్న రాష్ట్రాల్లోని చిన్న చిన్న పార్టీలన్నీ ఒక్కదరి చేరి, చేయీ చేయీ కలిపి, సంఘటిత పోరు జరిపితే తట్టుకోవడం కష్టమన్న పాఠాన్ని భాజపాకు నేర్పించిన ఉప ఎన్నికలివి. భాజపా గెలవని పక్షంలో కలగూరగంప పార్టీల సారథ్యంలో దేశ పాలన గాడితప్పుతుందన్న అభిప్రాయాన్ని వ్యాపింపజేసేందుకు కేంద్రంలోని పెద్దలు విశ్వ ప్రయత్నాలు చేశారు... చేస్తున్నారు. కానీ, జనం ఎంతమేరకు ఆ ప్రచారాన్ని విశ్వసించారన్న దానికి ఇటీవలి ఎన్నికల ఫలితాలే నిదర్శనం.

అమిత్ షా రాహుల్ గాంధీ

దేశంలోని ఒక శాతం ప్రజల చేతుల్లో 73శాతం జాతి సంపద కేంద్రీకృతమై ఉంది. ఈ అసమానతలు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. ఓటు వేసేందుకు ఎన్నికల కేంద్రానికి వెళ్ళే పౌరులంతా తమ ఓటు వల్ల ఈ దేశంలో ప్రజాస్వామ్యం మరింత బలపడాలనే ఆకాంక్షిస్తారు. కానీ, దురదృష్టవశాత్తూ వారి అభిలాషకు విరుద్ధంగా సర్వత్రా అసమానతలు విస్తరిస్తున్నాయి. దేశంలో కేంద్రీకృత పాలన స్థిరపడుతోంది. నియంత పాలనవైపు జాతి ప్రస్థానిస్తోంది. ప్రజాస్వామ్య హితైషులకు నిరాశ కలిగించే పరిణామాలివి. అయితే ఇందుకు ప్రతిగా అన్నట్లుగా దేశ రాజకీయ ముఖచిత్రంపై ఆసక్తికర మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాజకీయ లెక్కాడొక్కల ప్రకారం ఏనాడూ పెద్దగా మెట్టు దిగిన దాఖలాలు లేని కాంగ్రెస్- ఇప్పుడు ప్రతి చిన్న పార్టీనీ కలుస్తోంది. సంఘటితంగా నడవడానికి సిద్ధమన్న స్పష్టమైన సంకేతాలను అందిస్తోంది. దేశంలోని మిగిలిన విపక్షాలు సైతం ఇదే స్ఫూర్తిని అందిపుచ్చుకుని అడుగులు వేస్తున్నాయి. మార్పును కోరుతూ చాపకింద నీరులా ఈ దేశంలో ఇప్పుడు ఒక గొప్ప చైతన్యం ప్రవహిస్తోంది. చంద్రబాబు నాయుడు, కేసీఆర్, మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్ వంటి విపక్ష నాయకులెవరైనా సరే... చిన్నా చితకా విభేదాలను పక్కనపెట్టి మార్పుకోసం జరుగుతున్న ఈ మహా ప్రయత్నంలో భాగస్వాములు కావలసిన చారిత్రక సందర్భమిది!

– బద్రీ రైనా

(రచయిత– రాజకీయ, సామాజిక విశ్లేషకులు)

ఒక్కదరి చేరుతున్న విపక్షాలు

ఉత్తర్ ప్రదేశ్‌లోని కైరానా ఎంపీ స్థానానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో- తమకు ఏ మాత్రం పొసగని జాట్లతో కలిసికట్టుగా దళితులు ఓట్లు వేశారు. మరోవంక ఆ ఎన్నికల్లో జాట్లు తమకు కించిత్తు కూడా గిట్టని ముస్లిములతో కలిసి నడిచారు. పరస్పరం వ్యతిరేకించుకునే సామాజిక వర్గాలు ఒక్కదరి చేరుతున్నాయి. నిన్న మొన్నటివరకూ తిట్టుకున్న చిన్నాచితకా రాజకీయ పక్షాలన్నీ ఏక లక్ష్యంతో ఒక వేదిక మీదకు వస్తున్నాయి. కేవలం సీట్లు, ఓట్ల గణాంకాల ప్రాతిపదికగానే ఈ పరిణామాలను విశ్లేషించలేం!

ఈనాడు లేఖలు

ఆహార పదార్థాల్లో నాణ్యతేదీ?

రైల్వే ప్రయాణికులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. సమయ పాలన, స్టేషన్లు, బోగీల్లో శుభ్రత, భద్రతకు తోడు ఆహార పదార్థాల్లో నాణ్యతాలోపంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూరప్రాంత ప్రయాణికులు స్టేషన్లలో లభించే ఆహార పదార్థాలను తినలేక రైల్వేశాఖపై ఆధారపడుతున్నారు. కానీ అది సరఫరా చేసే పదార్థాల్లో శుచీ, శుభ్రత లోపిస్తున్నాయి. ఈ విషయమై ప్రయాణికుల ఫిర్యాదులకు స్పందన ఉండటం లేదు. అధికారులు పైపై తనిఖీలతోనే సరిపెడుతున్నారు తప్ప నిర్దిష్ట చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- జి. నాగవల్లి, బోయినపల్లి, హైదరాబాద్

వసతులు కొరవడిన పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కొరవడుతున్నాయి. తగినన్ని గదులు, ఉపాధ్యాయులు, మైదానాల లేమితో ఈసురోమంటున్నాయి. కొన్ని పాఠశాలల భవనాలు ఏళ్ల తరబడి మరమ్మతులు లేక దుస్థితిలో ఉన్నాయి. వర్షాకాలంలో వచ్చిందంటే వీటిల్లో బోధనకు ఇబ్బంది కలుగుతోంది. విద్యార్థులకు పుస్తకాల సరఫరా, దుస్తుల పంపిణీలో ఏటా విపరీత జాప్యం చోటుచేసుకుంటోంది. ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతున్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే ఆయా అంశాలపై దృష్టి సారిస్తే చదువులు సజావుగా సాగుతాయి.

- ఆర్. సాయినాథ్, విజయవాడ

దేవుడి తీర్పు

పరమేశ్వరుడి సృష్టిలో ఒక నియతి కనిపిస్తుంది. సూర్యుడు ఉదయించి సకల జీవకోటిని తమ తమ వ్యాపారాల్లో నిమగ్నమయ్యేటట్లు చేస్తాడు. చంద్రుడు సకల జనులకు ఆహ్లాదం కలిగించి వెన్నెల కురిపిస్తూ ఓషధుల్ని పెంచి జీవకోటికి ఆహారం ప్రసాదిస్తున్నాడు. నీరు మెరక నుంచి పల్లానికి ప్రవహిస్తుంది. నిప్పు మండుతూ తనను తాకినవారిని దహిస్తుంది. సముద్రం చెలియలికట్ట దాటకుండా ఉంటుంది. ప్రకృతిలో ఏ విషయం పరిశీలించినా ఒక న్యాయం, ఒక తత్వం గోచరిస్తాయి. నియతంగా పొందేది న్యాయమని అమరకోశం చెబుతోంది.

తెలిసిచేసినా తెలియకచేసినా తప్పునకు శిక్ష తప్పదు. నిప్పును తాకితే దహించివెయ్యడం దాని నిసర్గగుణం. అలాగే అపరాధి శిక్ష పొందకతప్పదు. పౌరులు దోషులైతే విచారించి దండన విధించడం రాజధర్మం. మనిషిని ధర్మమార్గంలో ప్రవర్తించేలా చెయ్యడానికి దండనం ఉత్తమ సాధనంగా ప్రాచీన రాజనీతి గ్రంథాలు చెబుతున్నాయి. దండనపట్ల ఉండే భయంవల్ల చాలామంది దుష్కార్యాలకు దూరంగా ఉంటారని ఒక ఆలోచన.

పాపభీతిలాగే శిక్ష అంటే ఉండే భయంకూడా మనుషుల్ని చెడు మార్గంలోకి వెళ్లకుండా ఆపగలుగుతుంది. సాధారణంగా లోకంలో నేరం చేసినట్లు బలమైన సాక్ష్యం ఉన్నపుడు దోషికి న్యాయమూర్తి శిక్ష విధిస్తాడు. నేరస్తుడు ధనవంతుడు, రాజకీయ ప్రాబల్యంగలవాడు అయినప్పుడు హత్యగావించినా సరే ధనమో, పలుకుబడో ఉపయోగించి శిక్ష నుంచి తప్పించుకొని సమాజంలో గౌరవనీయుడుగా చలామణీ కావడం గురించి వింటుంటాం. ఎక్కడైనా ఒక దోషి శిక్షపడకుండా తప్పించుకున్నా ప్రమాదంలేదు గాని, అమాయకుడికి శిక్ష పడకూడదన్నది న్యాయసూత్రాల ఆంతర్యం. ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ జయం కలుగుతుందని, అధర్మం నశిస్తుందని మన గ్రంథాలు చెబుతున్నాయి. సజ్జనులు, సత్యధర్మాలను నమ్ముకొన్నవారు తాత్కాలికంగా కష్టనష్టాలకు లోనైనా అంతిమంగా వారిని విజయం వరిస్తుందని వారి జీవితాలు సుఖమయమవుతాయని చెప్పడాన్ని 'కావ్య న్యాయ'మంటాం. తప్పుచేసినవాడు ఆలస్యంగానైనా దాని విషఫలితాన్ని అనుభవించక తప్పదనేది భారతీయ భావన.

అంతర్యామి

మహాభారతం ధర్మం జయిస్తుందనే భావనపైనే నడిచింది. దుర్యోధనుడు ధర్మాన్ని నిరాకరించి కామక్రోధాదులకు బానిసై అహంకారంతో ప్రవర్తించి సమూలంగా నాశనమయ్యాడు. పాండవులు కష్టాలను భరించినా అంతిమంగా విజయం వారిని వరించింది. కర్ణుడు గొప్పవీరుడు, దానశీలి. అయినా అధర్మపక్షం వహించినందుకు శిక్ష అనుభవించాడు. అధర్మాన్ని ఉపేక్షించిన దాని ఫలితంగా ధృతరాష్ట్రుడు దీర్ఘకాలం మానసిక వేదనతో జీవించాడు.

సాధారణంగా లోకంలో దుష్టులు అష్టైశ్వర్యాలతో తులతూగుతుండటం, నీతిని నమ్ముకొన్నవారు కష్టాలతో కుంగిపోతుండటం చూసినవారికి నైరాశ్యం ఆవరిస్తూ ఏమిటీ వైపరీత్యమనుకొంటారు. అధర్మం ఆచరించిన వెంటనే దాని ఫలితం కనబడకపోవచ్చు. కాలక్రమంలో పాపమూలాలతో వృద్ధి పొందిన అధర్మ వృక్షాన్ని ధర్మాగ్ని దహించివేస్తుంది. అవినీతి మార్గంలో ధనార్జన చేసినవారు, అక్రమంగా భోగాలు అనుభవిస్తున్నవారు గర్వంతో విర్రవీగవచ్చు. సజ్జనుల్ని పరిహసించవచ్చు. దుర్బలుల్ని పీడించవచ్చు. వారి ఘనత ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న దీపం మెరుపులాంటిది. 'పాపం పండాలి' అనే పెద్దల వాక్కు ఊరికేపోదు. దేవుడి తీర్పు ఎప్పుడూ కాచుకొని ఉంటుంది!

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు

ఆదివారం అహ్మదాబాద్‌లో కరాటే సాధనచేస్తున్న 700 మంది చిన్నారులు. ప్రపంచ కరాటే దినోత్సవాన్ని పురస్కరించుకొని రికార్డు సాధన కోసం ఈ కార్యక్రమం నిర్వహించారు

ఆదివారం పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్ వద్ద ఆసనాలు వేస్తున్న ఔత్సాహికులు. ప్రపంచ యోగా దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో వివిధ దేశాల్లోని చారిత్రక ప్రదేశాల వద్ద సామూహిక యోగా ఘనంగా నిర్వహించారు

ప్రపంచంలోనే 'చెత్త'యిన పర్వతం!

- ఎవరెస్టుపై పేరుకుపోతున్న టన్నులకొద్దీ వ్యర్థాలు

దిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన హిమశిఖరం.. అత్యంత ఎత్తయిన చెత్తకుప్పగా మారిపోతోంది. దశాబ్దాలుగా జరుగుతున్న వాణిజ్య పర్వతారోహణతో ఎవరెస్టు పర్వతం తన సౌందర్యాన్ని కోల్పోతోంది. నానాటికీ పెరిగిపోతున్న ధనిక పర్వతారోహకులు.. తాము వదిలేస్తున్న చెత్తపై ఏమాత్రం శ్రద్ధ లేకపోవడంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. 8848 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ పర్వత శిఖరాగ్రానికి చేరే దార్లో ఫ్లోరోసెంట్ గుడారాలు, పర్వతారోహణ సామగ్రి, ఖాళీ గ్యాస్ డబ్బాలు, మానవ విసర్జితాలు టన్నుల కొద్దీ పేరుకుపోయాయి. 65 ఏళ్ల కిందట ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్గేలు తొలిసారి ఎవరెస్టును అధిరోహించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ పర్వతంపై చెత్త భారీగా పెరిగిపోయింది. గత రెండు దశాబ్దాల్లో 'ఎవరెస్టు పరిశ్రమ' బాగా ఊపందుకుంది. పర్వతారోహకుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకూ దాదాపు 600 మంది ఈ పర్వతాన్ని అధిరోహించారు. దీంతో సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. భూతాపం కారణంగా హిమానీనదాలు కరుగుతుండటంతో ఎవరెస్టుపై దశాబ్దాలుగా వచ్చిచేరిన చెత్త ఇప్పుడు బయటపడుతోంది.

షెర్పాలపై భారం..

తక్కువ ఖర్చుతో పర్వతారోహణ కార్యక్రమాలను చేపడతామని చెప్పే సంస్థలు.. అనుభవం లేని పర్వతారోహకులనూ తీసుకొస్తున్నాయి. చెత్తకు ఇదీ కారణమవుతోంది. పర్వతారోహకులు స్థానిక షెర్పాలను గైడ్‌లుగా, కార్మికులుగా నియమించుకుంటుంటారు. వీరు గుడారాలు, మిగులు ఆక్సిజన్ సిలిండర్లు, తాళ్లు వంటి వాటిని మోసుకెళుతుంటారు. లోగడ పర్వతారోహకులు.. దుస్తులు, ఆహారం, నిద్రించేందుకు వాడే బ్యాగ్ వంటివాటితో కూడిన వ్యక్తిగత కిట్‌ను స్వయంగా మోసుకెళ్లేవారు. ఇప్పుడు అదంతా షెర్పాల భుజాలపైనే పెడుతున్నారు. అందువల్ల తిరిగొచ్చేటప్పుడు ఈ కార్మికులు చెత్తను తీసుకురాలేకపోతున్నారు.

కలుషిత నది

ఎవరెస్టుపై తలెత్తుతున్న కాలుష్యం.. లోయలోని నీటి వనరులపై ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం బేస్ క్యాంప్ నుంచి మురుగునీటిని సమీపంలోని గ్రామానికి తరలిస్తున్నారు. అక్కడ గోతుల్లో దాన్ని పూడ్చిపెడుతున్నారు. అది.. వర్షాకాలంలో పర్వత సానువుల్లోకి జారిపోయి, నదిలో కలుస్తోందని అమెరికాకు చెందిన ఇంజినీర్ గ్యారీ పోర్టర్ చెప్పారు. దీని పరిష్కారంగా బేస్ క్యాంప్ వద్ద బయోగ్యాస్ కర్మాగారాన్ని ఏర్పాటు చేసి మానవ విసర్జితాలను ఎరువుగా మార్చాలని గ్యారీ భావిస్తున్నారు. ప్రత్యేకంగా చెత్తను సేకరించే బృందాన్ని ఏర్పాటు చేయాలన్న సూచన ఇప్పటికే కొన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేకంగా చెత్త సేకరణకు పర్వతారోహణను చేపడుతున్నాయి. ఇలాంటి బృందాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని షెర్పాలు చెబుతున్నారు.

ఫలించని దిద్దుబాటు

- ఐదేళ్ల కిందట నేపాల్ ప్రభుత్వం ఒక పద్ధతిని ప్రవేశపెట్టింది. దీని కింద ఒక్కో పర్వతారోహక బృందం 4వేల డాలర్ల ధరావత్తు చెల్లించాలి. పర్వతం దిగి వచ్చేటప్పుడు బృందంలోని ఒక్కో సభ్యుడు 8 కిలోల చొప్పున చెత్తను తీసుకొస్తేనే ఈ సొమ్మును వాపస్ చేస్తారు.
- టిబెట్ వైపున ఉన్న భాగంలోనూ ఇలాంటి నిబంధనను అమలు చేస్తున్నారు.
- బృంద సభ్యులు 8కిలోల చెత్తను తీసుకురాకుంటే కిలోకు 100 డాలర్ల చొప్పున జరిమానా విధిస్తున్నారు.
- 2017లో నేపాల్ భూభాగం నుంచి వెళ్లిన పర్వతారోహకులు 25 టన్నుల చెత్తను, 15 టన్నుల మానవ వ్యర్థాలను తెచ్చారు. ఏటేటా కొత్తగా చేరుతున్న చెత్తతో పోలిస్తే ఇది చాలా స్వల్పమే.
- పర్వతారోహకుల్లో సగం మంది మాత్రమే ఆ మేరకు చెత్తను తెస్తున్నారు. మిగతావారు ధరావత్తును వదులుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. ఎవరెస్టు అధిరోహణకు తాము వెచ్చిస్తున్న 20వేలు- లక్ష డాలర్లతో పోలిస్తే ఇది పెద్ద మొత్తమేమీ కాదని వారు భావిస్తున్నారు.
- కొందరు అధికారులు లంచాలు తీసుకొని ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

దిల్లీ ఆరోగ్య మంత్రి ఆసుపత్రి పాలు

ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వెల్లడి

దిల్లీ: దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయంలో వారం రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న దిల్లీ ఆరోగ్య మంత్రి సత్యేంద్ర జైన్ ఆరోగ్యపరిస్థితి దిగజారడంతో ఆదివారం ఆయన్ను ఆసుపత్రికి తరలించినట్లు దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ట్విటర్‌లో వెల్లడించారు. ఆరోగ్యమంత్రి జైన్‌ను స్థానిక ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చేర్పించినట్టు అధికారులు తెలిపారు. జైన్ ఆరోగ్య పరిస్థితిపై ఆదివారం ఉదయం వెల్లడించిన ఆరోగ్య నివేదికలో ఆయన సుగర్ స్థాయిలు తక్కువగా నమోదయ్యాయి. మూత్రంలో కీటోన్లు హెచ్చుగా ఉన్నాయి. బీపీ స్థాయి కూడా సాధారణం కంటే తగ్గిపోయింది.

మద్య నిషేధం.. మంచి పరిణామం

బిహారులో సర్వే నివేదిక వెల్లడి

పట్నా: మద్యపాన నిషేధం విధించిన తర్వాత బిహారులో ఖరీదైన వస్త్రాల మీద ఖర్చుపెట్టడం ఎక్కువైంది. అంతేకాదు, తేనె.. జున్ను, స్వీట్ రింతే వారి సంఖ్య కూడా పెరిగింది. మద్యనిషేధం విధించిన తొలి ఆరు నెల కాలంలో ఖరీదైన చీరల కొనుగోళ్లు 1,751 శాతం, తేనె 380 శాతం, జున్ను 200 శాతం పెరిగినట్లు 'ఆసియా అభివృద్ధి పరిశోధనా సంస్థ (ఏడీఆర్‌ఐ) నిర్వహించిన అధ్యయనంలో స్పష్టమైంది. మద్యనిషేధ అనంతర పరిణామాలపై అధ్యయనానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా ఏడీఆర్‌ఐతో పాటూ.. ' అభివృద్ధి నిర్వహణ సంస్థ (డీఎంఐ)కి బాధ్యతలు అప్పగించింది. ఒకప్పుడు మద్యంపై ఎపెడా ఖర్చుచేసిన జనం ఇప్పుడు ఆ మొత్తాలతో తమ తమ స్థాయిలో కొత్తకొత్త వస్తువులను సమకూర్చుకుంటున్నారు. బిహారులో 2016లో మద్యనిషేధం విధించిన విషయం గమనార్హం. ముఖ్యంగా గ్రామీణ మహిళల నుంచి వచ్చిన ఒత్తిడి నేపథ్యంలో అక్కడ మద్యనిషేధం ప్రకటించారు. అనంతరం అక్కడ చోటు చేసుకున్న పరిణామాలపై నిర్వహించిన అధ్యయన నివేదికను ఆర్థిక సర్వే రిపోర్ట్‌కు అనుసంధానించి బిహారు శాసనసభలో ప్రవేశపెట్టిన విషయం గమనార్హం.

అతివల ప్రాతినిధ్యంతో అవినీతికి చరమగీతం!

వాషింగ్టన్: పార్లమెంటేరియన్లలో అత్యధికులు కనుక మహిళలే ఉంటే.. ..ప్రభుత్వస్థాయిలో అవినీతి బాగా తగ్గుముఖం పడుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా 125 దేశాల నుంచి సేకరించిన సమాచారాన్ని వీరంతా క్షుణ్ణంగా విశ్లేషించిన మీదట ఈ నిర్ణయానికి వచ్చారు. 'ఎకనామిక్ బిహేవియర్ అండ్ ఆర్గనైజేషన్ జర్నల్' లో ఈ అధ్యయన వివరాలను ప్రచురించారు. ఒక్క పార్లమెంటులో మాత్రమే కాదు.. స్థానిక రాజకీయాల్లోనూ మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల ఆయా స్థాయిలో అవినీతికి ఆస్కారం తగ్గుతుందని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే... మహిళా సాధికారత, నాయకత్వ హోదాల్లో అతివల సంఖ్య పెరగాలి. ప్రభుత్వంలో వారి ప్రాతినిధ్యం అధికం కావాలి అప్పుడు అవినీతి పరిస్థితి బలహీనపడుతుందని వర్జీనియాటెక్‌లో అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా ఉన్న సుదీప్ జా సారంగి విశ్లేషించారు. వాస్తవానికి విధాన నిర్ణేతలుగా మహిళలుంటే... ప్రభుత్వంపై వారి ప్రభావం అధికంగా ఉంటుంది. వారు ఎంపిక చేసుకునే విధానాలు, మార్గాలూ కూడా అవినీతికి ఒకరకంగా ప్రాణాంతకంగా ఉంటాయని అమెరికాలోని లీ మొయ్నె కళాశాల పరిశోధకులు చంద్రన్ ఝా అభిప్రాయపడ్డారు.

ఏటా స్నాతకోత్సవాలు తప్పనిసరి: కేంద్రం

దిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలన్నీ క్రమం తప్పకుండా ఏటా స్నాతకోత్సవాలను నిర్వహించి తీరాల్సిందేనంటూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. విభిన్నరంగాల్లో ఏఏ వర్సిటీలు ఎప్పుడెప్పుడు స్నాతకోత్సవాలను నిర్వహించాయన్న వివరాలను ఇవ్వాలని యూజీసీని ఆదేశించింది. ఈ మేరకు అన్ని వర్సిటీలకు లేఖలు రాసింది. కొన్ని విశ్వవిద్యాలయాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించకుండా అలా వదిలేసినట్లు దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఇలా ఆదేశించినట్లు తెలిపింది. అసలు స్నాతకోత్సవాల్లో విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయడం అటు విద్యార్థులు... ఇటు వారివారి కుటుంబసభ్యులకు అత్యంత గర్వకారణమైన విషయం అని మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. త్రిపురలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం నాలుగేళ్ల విరామం తర్వాత స్నాతకోత్సవాన్ని నిర్వహించి...విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేసింది. పశ్చిమ బెంగాల్‌లోని విశ్వభారతి విశ్వవిద్యాలయంలో అయిదేళ్ల విరామం తర్వాత మే నెలలో స్నాతకోత్సవం నిర్వహించిన విషయం గమనార్హం.

పది అడుగులకొకరు నాతో ఫొటో తీసుకుంటారు

- వాగ్మోరేతో ఛాయాచిత్రంపై ముతాలిక్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: "నేను బయటకు వెళితే, ప్రతి పది అడుగులకు ఒకరు ఫొటో, స్వీయచిత్రం తీయించుకునేందుకు ముందుకు వస్తుంటారు. అందులో పరశురామ్ వాగ్మోరే ఒకరు కావచ్చు" అని శ్రీరామసేన వ్యవస్థాపకుడు ప్రమోద్ ముతాలిక్ వ్యాఖ్యానించారు. ప్రఖ్యాత కన్నడ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య కేసులో ప్రత్యేక దర్యాప్తు దళం అదుపులో ఉన్న పరశురామ్ వాగ్మోరే గతంలో ప్రమోద్ ముతాలిక్‌తో కలిసి తీయించుకున్న ఛాయాచిత్రం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది. దీనిపై ఆయనను ఆదివారం బెంగళూరులో పాత్రికేయులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన పై వ్యాఖ్యలు చేశారు. ప్రజాదరణ ఉన్న నటులు, నాయకులు, ఆయా సంస్థల ప్రతినిధులతో ఇలా ఫొటోలు తీయించుకుని, సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు చేసే వారి సంఖ్య నానాటికీ ఎక్కువైపోతోందని గుర్తు చేశారు.

మోదీ ప్రభుత్వ వైఫల్యాల్లో కశ్మీర్ అంశం ఒకటి

- కాంగ్రెస్ ధ్వజం

దిల్లీ: మోదీ ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యాల్లో "కశ్మీర్ అంశం" ఒకటని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనపై ఐరాస "భయానక నివేదిక" అడ్డుకోలేనప్పుడు.. ఆ విదేశీ పర్యటనలు ఎందుకని విమర్శించింది. ఈ విషయంపై పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఆదివారం మాట్లాడారు. కశ్మీర్ లోయలో పరిస్థితులపై ఆందోళన వ్యక్తంచేశారు. అమర్‌నాథ్ యాత్రికుల భద్రతకు ఏం చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పండని అడిగారు. కశ్మీర్ అంశంపై అఖిల పక్ష సమావేశం కోసం నాలుగేళ్లుగా కాంగ్రెస్ ఎదురుచూస్తోందని చెప్పారు. "ఇలాంటి నివేదికను ఐరాస ఇదివరకెన్నడూ విడుదలచేయలేదు. దానిలోని అంశాలు భయానకంగా ఉన్నాయి. అవన్నీ ఏకపక్షంగా రాసినవే. ఇంకా అవాస్తవాలు కూడా. వాటిని చదివాక సిగ్గుతో ఉరి వేసుకోవాలని అనిపిస్తోంది. మోదీ ప్రభుత్వ విధానాలకు ధన్యవాదాలు'అని ఆయన వ్యాఖ్యానించారు.

భూపతిరాజు తనిష్క

16.50 నిమిషాల్లో 100 బాణాలు గురి

- అత్యంత వేగవంత ప్రదర్శనగా గుర్తింపు సాధించిన భీమవరం చిన్నారి

భీమవరం, న్యూస్‌టుడే: ఆ చిన్నారి చదివేది రెండో తరగతి.. ఆరేళ్ల ప్రాయంలోనే విల్లును ఎక్కుపెట్టి అత్యంత వేగంగా 100 బాణాలను ఏకబిగిన సంధించి రికార్డులను సొంతం చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన రికార్డు నమోదు పోటీలో భీమవరానికి చెందిన భూపతిరాజు తనిష్క కేవలం 16 నిమిషాల 50 సెకన్ల వ్యవధిలో 100 బాణాలను 40 సెంటీమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని తాకేలా ప్రతిభను చాటి అబ్బురపరిచింది. ఆసియాబుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. సెకన్‌కు 320 నాటికల్ మైళ్ల వేగంతో, తక్కువ సమయంలో ఎక్కువ బాణాలు సంధించిన క్రీడాకారిణిగా గుర్తింపు పొందినట్లు రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. అనంతరం తనిష్క ఆసియా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రాలను ఆయా సంస్థల ప్రతినిధుల చేతుల మీదుగా అందుకుంది.

గుర్రంపై దళిత వరుడి ఊరేగింపు అడ్డగింత

అహ్మదాబాద్: గుర్రంపై ఊరేగింపుగా పెళ్లి కుమార్తె ఇంటికి తరలి వెళుతున్న ఓ యువకుడిని...అతడి వెంట ఉన్న బంధు, మిత్ర బృందాన్ని స్థానికులు కొందరు అడ్డుకున్నారు. దళితుడు అసలు గుర్రంపై స్వారీ చేయడం ఏమిటి అంటూ మరోవర్గానికి చెందిన నలుగురైదుగురు వ్యక్తులు కొన్ని గంటలపాటు అతడిని ఆపేశారని పోలీసులు వెల్లడించారు. శనివారం ఇక్కడి పర్సా గ్రామంలో ఈ ఘటన జరిగినట్లు తెలిపారు.

రానున్న నాలుగేళ్లలో 40 రాకెట్ ప్రయోగాలు

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రానున్న నాలుగేళ్లలో శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి 40 రాకెట్ ప్రయోగాలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. కేంద్ర మంత్రిమండలి కూడా ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.10,900 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఇందులో 30 పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ), 10 జియో సింక్రనస్ లాంచ్ వెహికల్ ప్రయోగాలు ఉన్నాయి. రానున్న నాలుగేళ్లలో 30 పీఎస్ఎల్వీ ప్రయోగాలకు రూ.6,573 కోట్లు, పది జీఎస్ఎల్వీ ప్రయోగాలకు రూ.4,338 కోట్లు వ్యయం కాగలదని అంచనా వేశారు. ఇస్రో నెలకు ఓ రాకెట్ ప్రయోగం చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అందుకు తగ్గట్లు సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్- షార్‌లో వసతులు కల్పిస్తోంది. ఇప్పటికే రూ.630 కోట్లలో నిర్మిస్తున్న రెండో వాహన అనుసంధాన భవనం పనులు పూర్తి కావచ్చాయి. త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సాలిడ్ మోటార్ల తయారీ సామర్థ్యాన్ని రెండింతలు చేసేందుకు 29 కొత్త వసతులను ఏర్పాటు చేశారు. ఇవి భవిష్యత్‌లో ఎస్139, హెచ్‌పీఎస్3 మోటార్ల తయారీకి ఉపయోగపడనున్నాయి. దీనిని 2019లో వినియోగంలోకి తీసుకురావాలని లక్ష్యం పెట్టుకున్నారు. ప్రస్తుతం షార్‌లో ఏడాదికి ఆరు పీఎస్ఎల్వీ ప్రయోగాలు చేస్తున్నారు. ఈ సంఖ్యను 15కు పెంచాలని పీఎస్ఎల్వీ అనుసంధాన ఫెసిలిటీ ప్రాజెక్టును చేపట్టారు. సెమీ క్రయోస్టేజీ కలిగిన జీఎస్ఎల్వీ మార్క్-3 అవసరాల మేరకు సెకండ్ లాంచ్ ప్యాడ్ అగ్మెంటేషన్ ప్రాజెక్టును చేపట్టనున్నారు.

జీశాట్-II ప్రయోగానికి ఇస్రో పచ్చజెండా

దిల్లీ: కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-11 ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పచ్చజెండా ఊపింది. నిజానికి దీన్ని ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఏరియాన్ రాకెట్ ద్వారా మే 26నే ప్రయోగించాల్సింది. అయితే మార్చిలో దేశీయంగా ప్రయోగించిన జీశాట్-6ఏ ఉపగ్రహానికి భూకేంద్రంతో సంబంధాలు తెగిపోవడంతో ముందుజాగ్రత్త చర్యగా జీశాట్-11పై మరోసారి క్షుణ్ణంగా పరీక్షలు జరపాలని ఇస్రో నిర్ణయించింది. ఈ మేరకు దాన్ని కౌరు నుంచి వెనక్కి తీసుకొచ్చింది. ఈ ఉపగ్రహంపై మరోసారి తనిఖీలు చేసిన నిపుణులు.. అది ప్రయోగానికి అనువుగానే ఉందని నిర్ధరించారు. ఇప్పుడు ప్రయోగ తేదీపై ఏరియాన్ సంస్థ నుంచి ధ్రువీకరణ కోసం ఇస్రో ఎదురుచూస్తోంది.

కశ్మీర్‌లో కాల్పుల విరమణను ఎత్తివేసిన కేంద్రం

దిల్లీ: జమ్ముకశ్మీర్‌లో ముష్కర మూకలకు కళ్లెం వేసేందుకు అవసరమైన చర్యలు వీలైనంత త్వరగా తీసుకోవాలని భద్రతా సంస్థలకు కేంద్ర హోం శాఖ ఆదివారం సూచించింది. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని నెల రోజులపాటు కాల్పులపై విధించిన విరమణను ఎత్తివేసింది. రాష్ట్రంలో ఎలాంటి హింస, విధ్వంసకర వాతావరణం నెలకొనకుండా చూడటానికి తాముచేస్తున్న కృషిని కొనసాగిస్తామని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఓ ప్రకటన విడుదలచేశారు. 'శాంతి కోరుకునే ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదులను ఏకాకిని చేయాలి. దారితప్పిన వారిని శాంతి మార్గంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేయాలి'అని ఆయన వివరించారు. శాంతిని ప్రేమించే ప్రజల అభీష్టం మేరకే నెల రోజులపాటు కాల్పుల విరమణను విధించామని, దీన్ని భద్రతా బలగాలు తూచ తప్పకుండా పాటించాయని కొనియాడారు. పౌరులు, సైనిక సదుపాయాలపై ఉగ్రవాదులు దాడులుచేస్తున్నా.. జవాన్లు అసమాన నిగ్రహాన్ని ప్రదర్శించాయని ప్రశంసలు కురిపించారు.

ముస్లింల విశ్వాసాన్ని చూరగొనడానికి మోదీ సర్కారు మరెంతో కృషి చేయాల్సి ఉంది: నక్వీ

దిల్లీ: దేశంలోని ముస్లింల విశ్వాసాన్ని చూరగొనడానికి నరేంద్రమోదీ ప్రభుత్వం ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ అభిప్రాయపడ్డారు. కేవలం ముస్లింల కోసమే ప్రారంభించిన పథకాల గురించి కేంద్రంలోని భాజపా సర్కారు వారి మనసుకు మరింతగా హత్తుకునేలా తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం వీటన్నిటితో పాటూ ఇటీవల 'ముమ్మారు తలాక్'పై తీసుకున్న నిర్ణయాలను గురించి కూడా పునరుద్ఘాటించాల్సి ఉందని నక్వీ పేర్కొన్నారు. మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ ఇటీవల ముస్లిం ఆడపడుచులకు ఇఫ్తార్ విందునిచ్చారు. 'ముమ్మారు తలాక్' బాధితులు పలువురు ఈ విందుకు హాజరైన విషయం ఈ సందర్భంగా గమనార్హం. గత 70 ఏళ్లుగా ముస్లింల మనసులు, ఆలోచనలను కలుషితం చేసేశారని ఆయన పేర్కొంటూ...వారి మనసు చూరగొనడానికి చేయాల్సిన కృషి ఎంతో ఉందని పునరుద్ఘాటించారు. అయితే, నవతరం ముస్లిం మహిళలు భాజపా వల్ల ఉన్న ప్రయోజనాలను అంచనా వేస్తుండటం హర్షణీయ...సానుకూల పరిణామమన్నారు. ముస్లింల గౌరవప్రతిష్ఠలను పరిరక్షించేందుకు...మరింతగా పెంచేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం అనేకానేక చర్యలను చేపడుతోందని ఆయన వివరించారు.

రైళ్లలోనూ విమానాల తరహా మరుగుదొడ్లు: పీయూష్‌గోయల్

దిల్లీ: రైళ్లలో కూడా విమానాల్లో ఉపయోగిస్తున్న వాక్యూమ్ మరుగుదొడ్లు వాడనున్నట్లు రైల్వేమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇప్పటికే 500 తెప్పించామని, ప్రయోగం విజయవంతమైతే అన్ని రైళ్లల్లోని మొత్తం 2.5 లక్షల మరుగుదొడ్లలో ఇవే వాడతామన్నారు. ఒక్కొక్కటి రూ.2.5 లక్షల వ్యయమయ్యే వాక్యూమ్ మరుగుదొడ్ల వల్ల దుర్వాసన రాదని, నీటి వినియోగం 20వ వంతుకు తగ్గుతుందన్నారు. మే 31, 2018నాటికి 37,411 కోచ్‌లలో 1,36,965 జీవ మరుగుదొడ్లను రూ.లక్ష చొప్పున వ్యయంతో నిర్మించారు. మార్చి 2019నాటికి మరో 18,750 బిగించి, నూరుశాతం జీవ మరుగుదొడ్లు వాడుతున్న రైల్వేగా చరిత్ర సృష్టించాలని అధికారులు శ్రమిస్తున్నారు.

రాహుల్ సారథ్యం వహించాలి: షీలాదీక్షిత్

దిల్లీ: ప్రతిపక్షాల సంకీర్ణం ఏదైనప్పటికీ...దానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీయే సారథ్యం వహించాలని సీనియర్ నాయకురాలు షీలాదీక్షిత్ అభిప్రాయపడ్డారు. 2019లో భాజపాను దీటుగా ఎదుర్కోవాలంటే... గట్టి సవాలు విసరాలంటే ప్రతిపక్ష కూటమికి రాహుల్ నాయకత్వం తప్పనిసరన్నారు. విబేధాలన్నిటినీ విస్మరించి ప్రతిపక్షాలన్నీ ఒక్కటై... .ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించేయాలని ఆమె పేర్కొన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో షీలా దీక్షిత్ ఈ వ్యాఖ్యలు చేశారు.

EDUCATION
★ B.Sc-Veterinary Science-4Yrs -Elig: Bi.P.C, B.Sc-Ag-4Yrs-Elig: Bi.P.C/ M.P.C., UGC Recog-Elig. for Govt./ Pvt. Jobs. Placements assistance. For admissions Cont: ASIAN, Vijayawada. © 95817 20572/95817 14858.

SPOT ADMISSIONS for
B.B.A|M.B.A
BUSINESS ANALYTICS, DIGITAL MARKETING, AVIATION MGT, HOSPITAL ADMINISTRATION
MORE THAN 20Lakh JOBS | 100% JOB Assistance
Admissions are in Progress. Contact Immediately
LONDON INTERNATIONAL BUSINESS SCHOOOL
91332 34111, 88975 39356

ఊరును కమ్మిన విషాదం

- సామిడిమిట్ట ప్రమాదంలో తొమ్మిదికి చేరిన మృతుల సంఖ్య
- మరణించినవారంతా కల్నర్సంపట్టి గ్రామస్థులే

ఈనాడు డిజిటల్ - చిత్తూరు

చిత్తూరు జిల్లా కుప్పం సమీప పెద్దవంక అటవీ ప్రాంతంలోని సామిడిమిట్ట వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. తమిళనాడు రాష్ట్ర వేలూరు జిల్లా నాట్రాంపల్లె తాలూకా కల్నర్సంపట్టి గ్రామానికి చెందిన 28 మంది కూలీలు నాయనూరు గ్రామానికి మామిడి కాయలు కోసేందుకు వచ్చారు. శనివారం రాత్రి మామిడి కాయలను నింపిన వారు అదే వాహనంపై కూర్చొని తమ ప్రాంతాలకు బయల్దేరారు. సామిడిమిట్ట అటవీ ప్రాంతంలో అత్యంత ప్రమాదకర మలుపులు ఉండడంతో లారీ అదుపుతప్పింది. రక్షణ కవచాన్ని చీల్చుకుంటూ 30 అడుగుల లోతు లోయలో పడిపోయింది. చెంద్రాయన్(25), పునిత(33), శంభగం(40), కమలమాల్(72), శివగామి(45), ఉమాపతి(32) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతదేహాలను కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులందరిని సమీపంలోని వాణియంబాడి(తమిళనాడు రాష్ట్రం) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సలు అందించి మెరుగైన వైద్యం కోసం వేలూరు ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో ముత్తు(15) మరణించగా, తులసీధరన్(14), నారాయణన్(16)లు చికిత్స పొందుతూ చనిపోయారు. సంఘటనా స్థలంలో మరణించిన ఆరుగురి మృతదేహాలను ఆదివారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో పంచనామా నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు.

కల్నర్సంపట్టి గ్రామంలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

శోకసముద్రంలో గ్రామస్థులు

మృతులు, క్షతగాత్రులంతా వేలూరు జిల్లా కల్నర్సంపట్టికి చెందిన వారు కావడంతో గ్రామమంతా శోకసంద్రంలో నిండిపోయింది. మృతదేహాలన్నీ గ్రామానికి చేరుకోగానే చూసేందుకు స్థానికులతో పాటు పొరుగు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడారు.

- ★ మృతి చెందిన శివగామి(45) కుమారుడు దిలీపన్(25) కూడా వేలూరు ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఈమె భర్త దినకరన్ 20 ఏళ్ల క్రితం బావిలో పడి చనిపోతే కూలికెళ్లి కుటుంబాన్ని పోషిస్తోంది.
- ★ ప్రమాదంలో మృతి చెందిన ముత్తు(15) పదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో నోటు పుస్తకాల కోసం కూలి పనికి వచ్చి భవిష్యత్తును కోల్పోయాడు. అతని తల్లి కళైవాణి కూడా ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.
- ★ నారాయణన్(16) ప్రమాదంలో మృతి చెందగా, అతని తల్లి అంబిక(38) పరిస్థితి విషమంగా ఉంది.
- ★ మృతుడు ఉమాపతి(32)కి ముగ్గురు కుమార్తెలు. వీరందరూ 8 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వాళ్లే.

Dr.Y.S.R.HORTICULTURAL UNIVERSITY
ADMINISTRATIVE OFFICE, VENKATARAMANNAGUDEM
WEST GODAVARI DISTRICT, ANDHRA PRADESH-534101
Notification for Admission into M.Sc.(Hort.) and Ph.D. (Hort.) Courses - 2018-19
Advt.No.1(PGS)/Acad./2018 Dated:18-06-2018
Applications are invited for admission into M.Sc.(Horticulture) from candidates possessing B.Sc.(Hort.)/B.Sc.(Hons.) Horticulture degree from Andhra Pradesh and outside state and for Ph.D (Horticulture) from candidates of Andhra Pradesh and Telangana states only posessing M.Sc.(Hort.) degree in various specializations. Application form, Prospecuts, Schedule of exminations etc., may be downloaded from the University website : www.drysrhu.edu.in
DR.B.SRINIVASULU
REGISTRAR

భారతీయ రిజర్వు బ్యాంకు
RESERVE BANK OF INDIA
www.rbi.org.in
10 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ₹ 1,000.00 కోట్ల (ముఖ విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ప్రతిపాదించింది.
మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం భారతీయ రిజర్వు బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (E-Kuber) మీద జూన్ 19, 2018 (మంగళవారం)న నిర్వహించబడుతుంది. మరింత సమాచారం కొరకు జూన్ 15, 2018 (శుక్రవారం) తేదీ నాటి భారతీయ రిజర్వు బ్యాంకు వారి పత్రికా ప్రకటనను ఆర్‌బిఐ వెబ్‌సైట్ (www.rbi.org.in) ను చూడండి.
"మీకు డబ్బు ఆశచూపుతూ వచ్చే ఇమెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

ఆదివారం దిల్లీలో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశానికి హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, అధికారులు

హోదా ఇవ్వాల్సిందే

నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో చంద్రబాబునాయుడు

ఈనాడు - దిల్లీ

ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సంధానకర్తగా వ్యవహరించిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశాన్ని ఆదివారం రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, ఉన్నతాధికారుల సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. నీతిఆయోగ్ అజెండాలో భాగంగా దేశాభివృద్ధికి, అన్ని రాష్ట్రాలను సాధికార భాగస్వామ్యులుగా చేర్చుతూ మార్గసూచి రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉదయం 10.22 నిమిషాలకు ప్రారంభమైన చంద్రబాబు ప్రసంగం 10.42 నిమిషాలకు ముగిసింది. ఏడు నిమిషాల అనంతరం సంధానకర్త రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగం త్వరగా ముగించాలని సూచిస్తూ బెల్ కొట్టగా.. 'మాది ప్రత్యేక సమస్యలున్న ప్రత్యేక రాష్ట్రం. మరికొంత సమయం తీసుకుంటాం...' అని చంద్రబాబు పేర్కొన్నారు. 2022లో 75 వసంతాల స్వాతంత్ర్య సంబరాలు నిర్వహించుకోవడం ద్వారా మహాత్మాగాంధీకి వందకోట్ల మంది ప్రజలు ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుందని చెప్పారు.

చంద్రబాబు ప్రసంగంలోని ముఖ్యాంశాలు

రాజధానికి చేయూతనివ్వాలి

దేశం గర్వించేలా ఒక హరిత నగరాన్ని నిర్మించుకునే అవకాశం వచ్చింది. పర్యావరణహితమైన, పరిశోధనాభివృద్ధి, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు అమరావతిలో నిర్మించాల్సి ఉంది. దీనికి రానున్న 20 ఏళ్లలో రూ.5 లక్షల కోట్లు అవసరం. 27వేల మందికిపైగా రైతులు ల్యాండ్ పూలింగ్ విధానంలో తమ భూములు ఇచ్చారు. ఏపీలో వెనుకబడిన జిల్లాల్లో ఒక్కొక్కరికి రూ.428 చొప్పున ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారు. బుందేల్‌ఖండ్‌లో ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున ఇచ్చారు. యూసీలు ఇచ్చిన తర్వాత ఫిబ్రవరి 9, 2018న రూ.350 కోట్లు కేంద్రం విడుదల చేసింది. సమాఖ్యస్ఫూర్తి విరుద్ధంగా ఆ నిధులను ఫిబ్రవరి, 15న వెనక్కి తీసుకుంది. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం 9 విద్యా సంస్థలు ప్రారంభించింది. రూ.11,673 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.638 కోట్లు మాత్రమే ఇచ్చారు. రైల్వే జోన్ ఏర్పాటు, గ్రీన్‌ఫీల్డ్ క్రూడాయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్, విధానసభ సీట్ల పెంపు, పన్నుల మినహాయింపు, కడపలో ఉక్కు పరిశ్రమ, వైజాగ్ చెన్నై పారిశ్రామిక నడవా, విశాఖ, విజయవాడ మెట్రో, దుగరాజపట్నం రేవు, అమరావతికి వేగవంతమైన రహదారి, రైలు మార్గాల అనుసంధానం, గ్రేహౌండ్ శిక్షణ కేంద్రం స్థాపనలపై కేంద్రం దృష్టి సారించాలి. పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా పరిగణించారు. దీని భూసేకరణ, పునరావాసం, పరిహారం నిర్మాణానికి సంబంధించిన మొత్తం వ్యయాన్ని కేంద్రం భరించాలని కేంద్ర మంత్రివర్గం తీర్మానించింది. 50 శాతం పనులు పూర్తయ్యాయి. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక-2కు అనుమతి లభించింది. రూ.1,892 కోట్లు నిధులను ఇంకా కేంద్రం చెల్లించాల్సి ఉంది. విభజన అనంతరం తొలి ఏడాది బడ్జెట్ లోటు రూ.16,078 కోట్లు ఉన్నట్లు కాగ్ ధ్రువీకరించింది. మొదటి సంవత్సరంలోనే ఈ మొత్తం రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంది. రూ.4,117.89 కోట్లు ఇంకా విడుదల చేయాల్సి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013-14లో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వ్యవసాయరంగం వాటా 23 శాతం ఉండగా 2017-18లో నవ్యాంధ్రప్రదేశ్‌లో ఆ వాటా 34 శాతంగా ఉంది. 2013-14లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయం రూ.89,214. అదే కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో రూ.82,870... తెలంగాణలో రూ.1,12,162గా ఉంది. గత నాలుగేళ్లుగా ఏపీ తలసరి ఆదాయం రూ.1.42 లక్షలు. ఇతర దక్షిణాది రాష్ట్రాలది రూ.1.74 లక్షలుగా ఉంది. అంటే రూ.32 వేల లోటు ఏపీలో ఉంది.

జాతీయ సమస్యలు

15వ ఆర్థిక సంఘం పరిశీలనాంశాల(టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్-టీవోఆర్)ను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు వినతిపత్రం ఇచ్చాయి. 1971 జనాభా ఆధారంగా కాకుండా 2011 జనాభాను రెండుసార్లు సమీక్షించి మరీ టీవోఆర్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. దీని వల్ల ప్రతికూల పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కేంద్ర ఉమ్మడి నిధి నుంచి చిన్న చిన్న వాటాలు ఇవ్వడం ద్వారా జనాభాను విజయవంతంగా నియంత్రిస్తున్న రాష్ట్రాలను శిక్షిస్తున్నట్లవుతుంది. పెద్ద నోట్ల రద్దు భావజాలానికి మేం మద్దతిస్తున్నాం. అమలులో మరికొంత జాగ్రత్త తీసుకోవాల్సి ఉంది. ఈ రోజు వరకు చిన్న వ్యాపారులు, కార్మికులు తమ సొమ్ము తాము తీసుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఫైనాన్షియల్ రిజల్యూషన్, డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లు (ఎఫ్‌ఆర్‌డీఐ) ముసాయిదా సరిగా లేకపోవడంతో ప్రజల్లో భయాందోళనలు కలుగుతున్నాయి. దేశంలో నగదు కొరత తీవ్రంగా ఉంది. ఏటీఎంలలో నగదు దొరకడం లేదు. బ్యాంకుల్లోనూ నగదుకొరత కారణంగా రైతుల సాగు పనులకే కాకుండా పింఛన్లు సకాలంలో అందించడానికి లేకుండా పోయింది. ప్రజలు నిత్యావసరాలకు కూడా ఇబ్బందిగా ఉంది. జీఎస్టీతో సామాన్య ప్రజలే కాదు పన్ను చెల్లింపుదారులు, వ్యాపార వర్గాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గినా ఆ ఫలాలు ప్రజలకు చేరువవ్వడం లేదు. కేంద్రం స్థూల పన్ను ఆదాయం (జీటీఆర్)లో ప్రత్యేక లెవీ వాటాను క్రమక్రమంగా పెంచుకుంటూ పోయింది. 2012-13లో 8.8 శాతం ఉండగా 2016-17లో 15.2 శాతానికి చేరుకుంది. జీటీఆర్ నిష్పత్తిలో సెస్ వాటా కూడా 2013-14లో 6.7 శాతం ఉండగా 2016-17లో 10.8 శాతానికి చేరుకుంది.

నీతి ఆయోగ్ అజెండాలోని అంశాలు

వ్యవసాయరంగం

"మా పార్టీ ఎన్నికల ప్రణాళికలో రైతులు ఉత్పత్తి ధర కన్నా 50శాతం ఎక్కువగా మద్దతు ధర ఉండాలని పేర్కొన్నామని..." ఫిబ్రవరి 2018లో కేంద్ర ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర ప్రకటించాలి. వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి, దిగుమతుల నియంత్రణలో అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులతో కేంద్రం విధానాలు స్థానిక ధరలకు విఘాతం కల్గిస్తున్నాయి.

రైతులకు లాభం కలిగించడం లేదు. అపరాల విషయానికొస్తే మొత్తం ఉత్పత్తిలో సేకరించిన 40 శాతానికే కనీస మద్దతు ధర వర్తింపజేస్తున్నారు. గతేడాది అపరాల సేకరణకు ఏపీ ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించింది. పీడీఎస్ పరిధిలోకి రాదంటూ కేంద్రం ముతక ధాన్యాల సేకరణకు నిరాకరిస్తోంది. దీని వల్ల రూ.350 కోట్లు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం వాటిని సేకరించాల్సి వచ్చింది.

పంటల బీమా

ప్రస్తుతం అనుసరిస్తున్న పంటల బీమా విధానం రుణాలకే కానీ పంటకు వర్తించడం లేదు. దీన్ని పునఃసమీక్షించాల్సి ఉంది. 2017-18లో రాష్ట్ర రైతుల ఎగుమతుల విలువ రూ.24 వేల కోట్లు. మొత్తం దేశం నుంచి ఎగుమతుల్లో ఇది 60 శాతం. గడిచిన ఐదు నెలలుగా ఎగుమతులు తగ్గించడం వల్ల రొయ్యల ధరలు 50 శాతానికిపైగా పడిపోయాయి. ఆక్వా రంగానికి కూడా బీమా వర్తింపచేయడంపై కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలి. ఆక్వా ఉత్పత్తులకూ కనీస మద్దతు ధర ప్రకటించాలి. ఆక్వా, పౌల్ట్రీలను కూడా వ్యవసాయరంగంగానే పరిగణించాలి.

నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలు

రెండంకెల వృద్ధిరేటు

విభజన తర్వాత రాష్ట్రం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ గడిచిన నాలుగేళ్లుగా 10.5 శాతం వృద్ధి రేటు సాధించింది. 2015-16లో 10.60 శాతం, 2016-17లో 11.07 శాతం, 2017-18లో 11.22 శాతం వృద్ధిరేటు సాధించాం. గృహాల విద్యుదీకరణ, ఎల్‌పీజీ, ఓడీఎఫ్‌లో మెరుగైన ఫలితాలు సాధించాం. గ్రామీణ ప్రాంతాలకు రహదారుల అనుసంధానం, గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు సంతృప్తికరంగా చేశాం. మే 2014లో ఉన్నా... నేడు విద్యుత్తు కొరత లేని రాష్ట్రంగా ఉన్నాం. వచ్చే రెండేళ్లలో 100 శాతం ఫైబర్ నెట్ అనుసంధానం, తాగునీరు అందించనున్నాం. స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్రం ఒక్కో గృహం మరుగుదొడ్డికి రూ.4 వేలు ఇవ్వగా మెరుగ్గా నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.11వేలు అందించింది. 47 లక్షల మందికి రూ.1,000, రూ.1,500 చొప్పున పింఛన్లు అందజేస్తున్నాం. 2.46 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు బీమా వర్తింపజేస్తున్నాం. 1.44 కోట్ల కుటుంబాలకు పీడీఎస్ పరిధిలో ఆహారభద్రత కల్పిస్తున్నాం. 6 లక్షల మందికి పైగా గర్భిణులు, బాలింతలు, 24 లక్షలకుపైగా చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నాం. 86 లక్షల మంది స్వయం సహాయక బృందాల మహిళల కుటుంబాలు రూ.10 వేలు ఆదాయం పొందేలా జీవనోపాధి రక్షణ కల్పిస్తున్నాం. 7.25 లక్షల పంటకుంటలు, 19,355 నీటికుంటలు తవ్వకం ద్వారా రైతులకు నీరు అందిస్తున్నాం. తద్వారా భూగర్భ జలాలు పెంపొందిస్తున్నాం. గోదావరి-కృష్ణా నదులను అనుసంధానం చేశాం. గ్రామీణ ప్రాంతాల్లోని 14 లక్షల కుటుంబాలకు, పట్టణ పరిధిలోని 5 లక్షల కుటుంబాలకు ఇళ్లు నిర్మించాం. ఎస్సీ,ఎస్టీల ఇళ్లకు 75 ఉచిత యూనిట్ల విద్యుత్తు అందిస్తున్నాం.



నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

రైతుల ఆదాయం రెట్టింపు

రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే వ్యవసాయ రంగంలో కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) 12 శాతం ఉండాలి. జాతీయస్థాయిలో వృద్ధి రేటు 2.42 శాతం మాత్రమే. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో 11 శాతం ఉంది. నీటి పరిరక్షణ, సాగు, భూసార వివరాల కార్డు, భూసార నిర్వహణ, శాస్త్రీయ యాజమాన్యం, పశుపోషణ, చేపల పెంపకం, ప్రతికూలతలు అధిగమించే తీరు, నిర్మాణ సామర్థ్యం పెంపు, ఉద్యాన పంటల వైపు మళ్లింపు ద్వారా పర్యావరణ హితమైన ఆహారపు అలవాట్లను మార్చడంతో దీనిని మనం సాధించగలం.

ఆరోగ్యం

ప్రజలందరికీ రోగ నిరోధక, రోగ నిర్ధరణ, రోగ నిరోధక ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోంది. దీని వల్ల ఐఎంఆర్, ఎంఎంఆర్, పోషకాహారలోపం, ఎనిమియా, సాంక్రమిక, విస్తరించని రోగాల నియంత్రణలో మెరుగైన స్థితికి చేరాం. పీపీపీ పద్ధతిలో ఆరోగ్యసేవలు అందించడం ద్వారా నాణ్యమైన సేవలు అందించగలం.

ఆయుష్మాన్ భారత్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1.44 కోట్ల గృహాలకు ఎన్టీఆర్ వైద్యసేవ అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ) ప్రకారమైతే అది 56 లక్షల గృహాలకే పరిమితమయ్యేది. ఎస్ఈసీసీ సమాచారాన్ని ఇతర పథకాలకు వర్తింపజేయాలని కేంద్రం సూచిస్తోంది. దీని వల్ల అసమానతలు తలెత్తే అవకాశం ఉంది. దీన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది. మిషన్ పోషణ్‌కు కేంద్రం కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 115 వెనుకబడిన ఔత్సాహిక జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాలు ఉన్నాయి. అంతేకాదు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీలోనూ అవి భాగంగా ఉన్నాయి. కేంద్రం ప్రభుత్వం వెనక్కి తీసుకున్న రూ.350 కోట్లలో ఈ మూడు జిల్లాలకు చెందిన రూ.150 కోట్లు కూడా ఉన్నాయి.

రాష్ట్రాల భాగస్వామ్యంతోనే..

మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవాల సందర్భంగా సమాఖ్య, సహకార స్ఫూర్తి ప్రతిబింబించేలా కేంద్రం అనుకూల వాతావరణం కల్పించాలి. పథకాల అమలులో... నిధుల విడుదలలో కేంద్రం చిన్నచిన్న పద్ధతులతో కాకుండా స్థూలమైన విధానాలతో ఉదారంగా వ్యవహరించాలి. తూర్పు దేశాలతో పోల్చుకుంటే నిర్మాణ రంగంలో మనం పోటీ ఇవ్వడం లేదు. విస్తరించడం లేదు. ప్రపంచవ్యాప్త పోటీని తట్టుకునేలా కేంద్రం నిర్ణీత కాలపరిమితితో పోర్టులు, విమానాశ్రయాలు, రైలు, రహదారుల అనుసంధానం, తీర ప్రాంత ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నడవాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. దక్షిణాసియా దేశాలకు దీటుగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించేలా ఉండాలి. మెరుగైన జీవనోపాధి కల్పించే ఉద్యోగ అవకాశాలు పెంపొందించాలి. జాతి నిర్మాణంలోనూ, టీం ఇండియా స్ఫూర్తిలోనూ ఆంధ్రప్రదేశ్ సగర్వంగా భాగస్వామిగా మారేలా కేంద్రం సహకరించాలి. చివరగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని, ప్రత్యేకహోదా ఇవ్వాలని డిమాండు చేస్తున్నా. ఇతర రాష్ట్రాలతో సమానంగా పోటీ పడే స్థాయికి వచ్చే వరకు కేంద్రం రాష్ట్రానికి సహకారం అందించాలి.

అనవసర జోక్యం వద్దు

గళం విప్పిన విపక్ష ముఖ్యమంత్రులు

దిల్లీ: సహకార సమాఖ్య తత్వాన్ని కేంద్రం పాటించాలనీ, రాష్ట్రాల వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకోవద్దనీ భాజపాయేతర పార్టీల పాలిత రాష్ట్రాలు గట్టిగా సూచించాయి. 15వ ఆర్థిక సంఘం నివేదిక, కేంద్ర నిధుల పంపిణీ వంటి అంశాలపై ఆదివారం నీతి ఆయోగ్ సమావేశంలో ఇవన్నీ గళమెత్తాయి. రాజ్యాంగం ప్రసాదించిన సమాఖ్య నిర్మాణాన్ని కేంద్రం బలహీనపరుస్తోందని ఆరోపించాయి. ఆర్థిక సంఘం సిఫార్సులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, నిబంధనల్ని తిరిగి రూపొందించాలని కోరాయి. 'రాష్ట్రాల సమస్యలేమిటో తెలుసుకునేందుకు కేంద్రం ఎప్పుడైనా ప్రయత్నించిందా? ప్రతీ రాష్ట్రానికి వాటికంటూ సొంత సమస్యలున్నాయి. విధానాలను రూపొందించేది కేంద్ర ప్రభుత్వమే కావచ్చు. కానీ వాటిని అమలు చేసేది రాష్ట్రాలే. ఆ పని చేయాల్సింది మేం' అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. సమావేశానంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. సహకార సమాఖ్య నిర్మాణాన్ని కేంద్రం బలపరచాలన్నారు. రాష్ట్రాల కోసం నీతి ఆయోగ్ ఎలాంటి కృషి చేయడం లేదని విమర్శించారు. రైతు రుణాల మాఫీ గురించి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్.డి.కుమారస్వామి తదితరులు ప్రస్తావించారు. మాఫీని అమలు చేయడానికి కేంద్రం సగం భారాన్ని భరించాలని కుమారస్వామి కోరారు. రాష్ట్రాలకు వనరుల కేటాయింపులో నిజమైన నిష్పాక్షికతను పాటించడానికి వీలుగా చర్యలు చేపట్టాలని పినరయి విజయన్ కోరారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పోరాటానికి భాజపా వ్యతిరేక కూటమి ఏర్పాటు దిశగా ఈ సమావేశంలోనూ విపక్ష ముఖ్యమంత్రులు మాట్లాడారు.

చంద్రబాబు ప్రసంగంతో ఫిదా

ప్రత్యేకహోదాకు నితీశ్, నారాయణసామి బాసట

ఈనాడు - దిల్లీ

నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు ప్రసంగానికి పలువురు ముఖ్యమంత్రులు ఫిదా అయ్యారు. అనేక సూచనలపై హర్షం వ్యక్తం చేస్తూ మద్దతు పలికారు. సమావేశం సందర్భంగా విరామ సమయాల్లో చంద్రబాబుతో మాట్లాడడానికి పలువురు సీఎంలు ఆసక్తి చూపారు. ప్రారంభ సమయంలోనే చంద్రబాబు వద్దకు పలువురు ముఖ్యమంత్రులు రాగా మరికొంత మందిని ఆయన పలకరించారు. తెలంగాణ సీఎం కేసీఆర్, చంద్రబాబు రెండు నిమిషాలపాటు పైగా మాట్లాడుకున్నారు. సమావేశంలో బిహార్ సీఎం నితీశ్‌కుమార్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని పేర్కొంటూ తమ రాష్ట్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పుదుచ్చేరి సీఎం నారాయణసామి ఏపీకి ప్రత్యేకహోదాపై గట్టిగా తన వాణి వినిపించారు. విభజన తర్వాత ఏపీకి అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. వ్యసాయానికి ఉపాధి అనుసంధానం చేయాలన్న చంద్రబాబు సూచనకు తెలంగాణ సీఎం కేసీఆర్ మద్దతు పలికారు. ఈ అంశంపై ఏడుగురు సీఎంలతో ఓ కమిటీ కూడా ఏర్పాటైంది. అందులో చంద్రబాబుకు చోటు లభించింది. చంద్రబాబు 15 ఆర్థిక సంఘం పరిశీలనాంశాల సవరణపై ప్రసంగానికి పశ్చిమబెంగాల్ సీఎం మమత మద్దతు పలికారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దనే వాదననూ సమర్థించారు.

ఏపీలో విద్యుత్తు రంగంపై ప్రధాని ప్రశంస

ప్రధాని నరేంద్రమోదీ తన ప్రసంగంలో విద్యుత్తు రంగంలో ఏపీ మెరుగైన తీరు కనబరుస్తోందని ప్రశంసించారు. విశాఖపట్నంలో నూటికినూరు శాతం ఎల్ఈడీ బల్బుల వినియోగిస్తున్నారని, మిగిలిన రాష్ట్రాలు అధ్యయనం చేసి ఏపీని ఆదర్శంగా తీసుకోవాలని సూచన చేయడంతో చంద్రబాబుని పలువురు ముఖ్యమంత్రులు అభినందించారు. భోజన విరామ సమయంలో చంద్రబాబుతో ఈశాన్యరాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆయనతో కలిసి భోజనం చేశారు. 'సుపరిపాలన విషయంలో మీ నిర్ణయాలను మార్గదర్శనంగా తీసుకుంటున్నామ'ని తెలిపారు.

వాజ్‌పేయీకి పరామర్శ

ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న మాజీ ప్రధాని వాజ్‌పేయీని ఏపీ సీఎం చంద్రబాబు పరామర్శించారు. నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ఎయిమ్స్‌కు వెళ్లిన చంద్రబాబు వాజ్‌పేయీ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతోపాటు మాజీ ప్రధాని కుటుంబసభ్యుడు రంజన్ భట్టాచార్యను అడిగి తెలుసుకున్నారు. వాజ్‌పేయీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అక్కడి నుంచి నేరుగా విమానాశ్రయానికి వెళ్లిన చంద్రబాబు విజయవాడకు బయల్దేరారు.

హస్తినలో చంద్రుల మాటామంతీ

నీతి ఆయోగ్ నాలుగో పాలక మండలి సమావేశానికి హాజరైన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కేసీఆర్ పరస్పరం ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా రెండు నిమిషాల పాటు ఇద్దరూ మాట్లాడుకున్నారు. చంద్రబాబు నీతి ఆయోగ్ సమావేశంలో ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధానించాలని కోరగా.. కేసీఆర్ మద్దతు తెలిపారు.

అవరోధాలొద్దు.. అండగా నిలవండి

నీతి ఆయోగ్ సమావేశంలో కేసీఆర్

ఈనాడు, దిల్లీ: "విదేశీ వ్యవహారాలు, రక్షణ, ఆర్థిక వ్యవహారాలు, ప్రపంచీకరణ విషయంలో దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మారుతున్న ప్రపంచ పరిణామాలను పరిగణనలోకి తీసుకొని కేంద్రం ఆయా అంశాలపై మరింత దృష్టి సారించాలి. అదే సమయంలో ఆరోగ్యం, విద్య, పట్టణాభివృద్ధి, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో పథకాల అమలుకు రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలకు కత్తెర వేయాలి" అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు.. కేంద్రానికి పలు సూచనలు చేశారు. దేశాభివృద్ధి రాష్ట్రాల అభివృద్ధితో ముడిపడి ఉంది. ఈ క్రమంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు పన్ను ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు.

ప్రజా ప్రభుత్వాన్ని పనిచేయనివ్వండి

- ఐఏఎస్‌ల సమ్మెకు వ్యతిరేకంగా మెగా ర్యాలీ
- దిల్లీలో కదం తొక్కిన ఆప్, వామపక్షాలు
- ప్రధాని నివాసం ముట్టడికి విఫలయత్నం

దిల్లీ: ఐఏఎస్ అధికారుల సమ్మెను వ్యతిరేకంగా, కేజ్రీవాల్ ధర్నాకు సంఘీభావం తెలుపుతూ ఆప్, వామపక్షాల కార్యకర్తలు దేశరాజధానిలో మెగా ర్యాలీ నిర్వహించారు. మండి హౌస్ నుంచి ఆదివారంసాయంత్రం 4.45 గంటలకు ర్యాలీ మొదలైంది. ప్రధాని నివాసం ఉన్న లోక్ కళ్యాణ్‌మార్గ్‌ను ముట్టడించాలని ఆందోళనకారులు యోచించారు. ర్యాలీకి అనుమతి తీసుకోలేదని పేర్కొంటూ పార్లమెంటువీధి పోలీసుస్టేషన్ వద్ద 6గంటలకే వారిని పోలీసులు నిలువరించారు. 'ఐదు మెట్రో రైల్వేస్టేషన్లలో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. బస్సులను కదలనీయలేదు. ప్రజల్ని రాకుండా చేయడానికి రోడ్లపై ఎక్కడికక్కడ బ్యారికేడ్లు పెట్టారు. నాకు 2011-12 గుర్తుకొస్తోంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మమ్మల్ని నిలువరించాలని చూసింది. వీలు కాలేదు. మోదీ ప్రభుత్వం మమ్మల్ని చూసి భయపడుతోంది' అని ఆప్ ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. 'సర్, కేవలం దిల్లీ మాత్రమే కాదు. మొత్తం దేశం మీకు విజ్ఞప్తి చేస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పనిచేయనివ్వండి. ఐఏఎస్ అధికారుల సమ్మెను విరమింపజేయండి. తమను ఎంతో బాధపెడుతున్నారని, అవమానిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు' అని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని మోదీని ఉద్దేశించి ట్వీట్ చేశారు. 'భారత రాజ్యాంగం మౌలిక లక్షణమైన సమాఖ్యస్ఫూర్తిని భాజపా ప్రభుత్వం ఎలా దెబ్బ తీస్తుందో స్పష్టమైంది. మోదీ వైఖరిని తీవ్రంగా ఖండించడానికే ర్యాలీలో పాల్గొన్నాను' అని సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి సంఘీభావం తెలిపారు. తమ భద్రతపై దిల్లీ ఐఏఎస్ అధికారులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. మీ భద్రతకు నాదీ పూచీ అని, ఎన్నుకున్న ప్రభుత్వానికి సహకరించాలని, మంత్రులు నిర్వహించే సమావేశాలకు హాజరు కావాలని ట్వీట్ చేశారు. 'మీరంతా నా కుటుంబంలో సభ్యులే. వ్యక్తిగతంగా ఇంతకుముందు నన్ను కలిసిన ఎంతోమంది ఐఏఎస్‌లకు గతంలోనూ రక్షణగా నిలిచాను. రాజకీయపార్టీ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి భయం, ఒత్తిడికి గురవ్వకుండా పనిచేయండి' అని కోరారు.

కేజ్రీవాల్ ధర్నాకు మద్దతుగా దిల్లీలో ప్రధాని నివాసం వైపు ఆప్ కార్యకర్తల ర్యాలీ

దిల్లీ వివాదాన్ని పరిష్కరించండి

వివాదాన్ని పరిష్కరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు సహా నాలుగు రాష్ట్రాల సీఎంలు విజ్ఞప్తి చేశారు. ఇది రాజ్యాంగ సంక్షోభమని వారు అభివర్ణించారు. నీతి ఆయోగ్ సదస్సులో మోదీని ప్రత్యేకంగా కలిసిన చంద్రబాబు, మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్), కుమారస్వామి (కర్ణాటక), పినరయి విజయన్ (కేరళ) ఈ మేరకు ఒక లేఖను అందించారు. ప్రధాని తక్షణం జోక్యం చేసుకొని, సంక్షోభాన్ని పరిష్కరించి, ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. తద్వారా ఫెడరల్ స్ఫూర్తిని కాపాడాలని కోరారు. ఈ అంశంపై మోదీ తమకు ఎలాంటి హామీ ఇవ్వలేదని మమత చెప్పారు. "మేం మోదీతోపాటు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వద్ద కూడా దీన్ని ప్రస్తావించాం. మోదీ ఏమీ మాట్లాడలేదు. రాజ్‌నాథ్ మాత్రం ఈ అంశంపై తాను దృష్టిసారిస్తానని చెప్పారు. మేం చెప్పాల్సింది చెప్పాం. ఇప్పుడు వారే దీన్ని పరిష్కరించాలి" అని పేర్కొన్నారు.

ఈనాడు
varevva@eenadu.in
వారెవ్వా!
సోమవారం జూన్ 18, 2018 విజయవాడ 7

ఆగండక్కడ...
మీ చేతిలో ఏంటది?
నా చేతిలో ఏముందండీ బాబూ...
ప్లాస్టిక్ క్యారీబ్యాగే కదా?
ఈ బ్యాగులేం ఇక్కడ ఉడకవండోయ్...
మా టౌన్‌లో ప్లాస్టిక్ కనబడకూడదంతే...
ఇంద ఈ నార సంచి పట్టుకెళ్లండి...
లేదా రూ.5 వేల జరిమానా
కట్టి వెళ్లండి...

బాగా దాహంగా ఉంది
ఓ వాటర్ ప్యాకెట్ ఇస్తారా?
అస్సలు కుదరదండీ...
మీకో గ్లాసెడు నీళ్లిస్తాం... ఇంకెక్కడా
నీళ్ల ప్యాకెట్ మాట ఎత్తకండి...
ఇదేం ఊర్రా బాబూ ప్లాస్టిక్ మాటే
వినబడకూడదంటారు...
అదేనండి మరి...
బొబ్బిలి ప్రత్యేకత...

స్వచ్ఛతలో బొబ్బిలి పులి!

మహా సంకల్పం

విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో రోజుకి 18 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. దాన్ని చెత్తశుద్ధి పార్కు(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు)కి తీసుకొచ్చి తడిచెత్తతో వర్మీకంపోస్టు తయారుచేసి అమ్ముతున్నారు. దీనికి స్థానిక రైతుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉంది. అలాగే పొడిచెత్తని కాగితాలు, పాల కవర్లు, టీకప్పులు, అట్టముక్కలు, రబ్బరు, డబ్బాలు, సీసాలుగా వేరుచేసి వాటిని ఏ రకానికి ఆ రకం ప్రత్యేక బెయిలింగ్ యంత్రంతో దిమ్మలుగా చేసి అమ్మేస్తున్నారు. దీనివల్ల ఏటా మున్సిపాలిటీకి రూ.4 లక్షల వరకూ ఆదాయం రావడంతో పాటు చెత్త నిల్వ అన్న మాటే లేకుండాపోతుంది. అంతేకాదు వర్మీకంపోస్టు తయారీ యూనిట్ నుంచి వచ్చే వ్యర్థాల ద్వారా అక్కడే బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుచేసి దాన్నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. పార్కులో 40 విద్యుత్ దీపాలతో పాటు 16 ఫ్యాన్లు సైతం ఆ విద్యుత్తుతోనే పనిచేస్తున్నాయి.

? మొదట్నుంచీ ఈ ఊరింతేనా

లేదండీ... మా బొబ్బిలి చిన్న పట్టణం.. జనాభా 62,000.. ఎనిమిదేళ్ల క్రితం వరకూ ఇక్కడ కూడా మిగతా పట్టణాల్లానే వీధులు, డ్రైనేజీలు చెత్తతో నిండిపోయేవి. మున్సిపాలిటీ డంపింగ్‌యార్డులో కొండలా పేరుకుపోతున్న చెత్తను ఎలా నిర్వీర్యం చేయాలో అర్థం కాక పురపాలక అధికారులు తలలు పట్టుకునేవారు. 2010లో అప్పటి పాలకవర్గంతో పాటు అధికారులు కూడా కంకణం కట్టుకున్నారు. ఈ చెత్తను ఎలాగైనా ఏదో ఒకటి చేసేయాలని.

? అప్పుడేం చేశారేంటి..!

చెత్తపై సమరం ప్రారంభించారు. 8.5 ఎకరాల్లో చెత్తశుద్ధి(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) పార్కు ఏర్పాటుచేశారు. డంపింగ్‌యార్డుకి వచ్చాక వేరు చేయడం కష్టమైపోతుండడంతో రోజు ఇంటింటికీ వెళ్లి చెత్తని సేకరించడం మొదలుపెట్టారు. చెత్తని కాలువల్లో, ఇంటి ఆవరణల్లో పాడేయడం వల్ల కలిగే నష్టాల్ని వివరించి, తడి, పొడి చెత్త సేకరణకు వీలుగా ఆకుపచ్చ, నీలం రంగులతో వేరు వేరు చెత్తబుట్టల్ని ఇచ్చారు. బుర్రకథలు, కళాజాతాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు పెట్టడం మొదలుపెట్టారు. సినిమాహాళ్లలో, పాఠశాలల్లో బొబ్బిలిని స్వచ్ఛ పట్టణంగా మార్చుకుందామని, దానికి అందరి సహకారం కావాలంటూ వీడియోలు ప్రదర్శించారు.. స్వచ్ఛంద సంస్థలు, వృద్ధులు, పదవీవిరమణ పొందిన ఉద్యోగులు, యువత, పాఠశాలల యాజమాన్యాలు అందరి సహకారం తీసుకుని స్వచ్ఛ బొబ్బిలి స్ఫూర్తిని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు.

? ప్లాస్టిక్ కవర్లనూ వద్దంటున్నారే!

కొద్ది రోజులైంది... చెత్త నిర్వహణ బాగానే ఉన్నా మున్సిపాలిటీని ప్లాస్టిక్ భూతం మాత్రం వెంటాడుతూనే ఉందని గమనించారు. ఎవరి చేతిలో చూసినా ప్లాస్టిక్ సంచులే కనిపించేవి. వాటిని ఎక్కడపడితే అక్కడ పాడేయడం వల్ల అవి తిరిగి డ్రైనేజీల్లో చేరి రోడ్లపై మురుగుపారే పరిస్థితే ఉండేది కాదు. దీంతో 2010లోనే పట్టణంలో ప్లాస్టిక్‌ని నిషేధిస్తూ మున్సిపల్ కౌన్సిల్‌లో పార్టీలకతీతంగా తీర్మానం చేశారు. దాన్ని ఎవరు ఉల్లంఘించినా నేరంగా పరిగణించి స్థాయిని బట్టి రూ.100 నుంచి రూ.5,000 వరకూ జరిమానా విధించడం మొదలుపెట్టారు. ఆఖరికి ప్రజాప్రతినిధులైనా సరే ఎలాంటి మినహాయింపు లేదు.



? మరి వ్యతిరేకత రాలేదా...

అయినా సరే ఎక్కడా తగ్గలేదు. 2014లో పాలకవర్గం మారినా నిషేధాన్ని గతి తప్పనివ్వలేదు. వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, క్యారీ బ్యాగులు ఏదైనా సరే ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమే. దీంతో సాధారణంగానే దుకాణదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వాటర్ ప్యాకెట్ తమకు కేవలం 40 పైసలకు దొరుకుతుందని, కానీ వినియోగదారులకు రూ.1కి అమ్ముతాం కనుక ఆ లాభాన్ని వదులుకోలేమంటూ గొడవ చేశారు. అయినా మున్సిపల్ పెద్దలు దుకాణదారులతో సమావేశం ఏర్పాటుచేసి 'స్వచ్ఛ బొబ్బిలి' సాకారం కోసం నిషేధానికి సహకరించాలంటూ నచ్చజెప్పి ఒప్పించారు. దీంతో బొబ్బిలి పట్టణంలో ప్లాస్టిక్ కవరంటే కనిపించని పరిస్థితి వచ్చింది.

? పెళ్లిళ్లు, విందుల్లో నీళ్లకు గ్లాసులెలా...

గతంలో పట్టణంలో ఎవరింట్లో శుభకార్యం జరిగినా, ఉత్సవాలు జరిగినా అక్కడి భోజనాలకు వ్యాటర్ ప్యాకెట్లు తీసుకెళ్లడం ఆనవాయితీగా ఉండేది. అయితే నిషేధం విధించాక ప్రత్యామ్నాయమేమిటన్న ప్రశ్న ఉదయించింది. దీంతో పురపాలక కౌన్సిల్ సభ్యులు ఎక్కడ శుభకార్యం జరిగినా మున్సిపాలిటీ నుంచే ట్యాంకర్లతో శుద్ధి చేసిన తాగునీరు పంపిస్తామని ప్రకటించేసరికి అందరి నుంచి హర్షం మొదలైంది. చెప్పినట్లుగానే ఎవరింట్లో శుభకార్యం జరిగినా ముందురోజే చెబితే అనుకున్న సమయానికి ఉచితంగానే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని కార్యక్రమ నిర్వాహకులు కాగితపు గ్లాసుల్లో అందరికీ అందించుకుంటున్నారు.

? మీ ఊరోళ్లు సరకులెలా తీసుకెళ్తారబ్బా!

ప్లాస్టిక్ కవర్లని నిషేధించాక సరకులు తీసుకెళ్లడానికి సంచుల కొరత వేధించేది. దీంతో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా కాగితపు బ్యాగుల్ని ప్రోత్సహించడం మొదలుపెట్టారు. మహిళా సంఘాలతోను కాగితపు బ్యాగుల తయారీ యూనిట్లు పెట్టించారు. బొబ్బిలి గ్రోత్ సెంటరులో జ్యూట్ బ్యాగుల తయారీ పరిశ్రమతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సైతం కాగితపు బ్యాగులు, వస్త్ర(గుడ్డ) సంచుల్ని తీసుకొచ్చి వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. తాజాగా మహిళా సంఘాలతోనే స్థానికంగా జ్యూట్ బ్యాగుల ఉత్పత్తి పరిశ్రమ పెట్టించే ప్రయత్నాల్లో పాలకవర్గం ఉంది. బొబ్బిలిలో 16,500 కుటుంబాలు నివసిస్తున్నాయి. పట్టణంలో 1,151 మహిళా సంఘాలున్నాయి. ఒక్కో గ్రూపులో పది మంది వరకూ సభ్యులుంటారు. ఆ లెక్కన దాదాపు ప్రతీ కుటుంబం నుంచి మహిళా సంఘాల సభ్యులున్నట్లే.. అందుకే స్వచ్ఛ బొబ్బిలి కోసం మహిళా సంఘాల్ని భాగస్వాముల్ని చేశారు. ఇంట్లోనే కాదు వీధుల్లో చెత్త వేసినా మొదటగా మహిళలే ప్రశ్నించాలంటూ వారిలో స్ఫూర్తి నింపారు. ఇది మంచి ఫలితాలనిచ్చింది.

? గవర్నమెంటు ఏమందేంటి..!

మా బాగా గుర్తించారండీ... ఈ ఊళ్లో స్వచ్ఛత కోసం జరుగుతున్న కృషికి మెచ్చి 2010-11లో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా పర్యావరణ మిత్ర అవార్డు ఇచ్చారు. 2013-14లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా ప్లాస్టిక్ నిషేధం బాగా అమలవుతున్న కారణంగా గ్రీన్ రిలీఫ్ అవార్డు వచ్చింది. అదే ఏడాది కోల్‌కత్తాకు చెందిన దేవాపూర్ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో బొబ్బిలి మున్సిపాలిటీ స్వచ్ఛతకు పాటిస్తున్న విధానాల్ని మెచ్చుకుని ఐకాన్ అవార్డు ఇచ్చారు. 2016-17 సంవత్సరానికి గాను బెస్ట్ కంపోస్టు యార్డు అవార్డుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో జాతీయస్థాయిలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నుంచి 'త్రీ లీవ్స్' అవార్డు కూడా వచ్చింది. ఎన్ని అవార్డులు వచ్చినా అవి మా ఊరి ప్రజలవేనంటూ పెద్ద పెద్ద అధికారులందరూ అంటున్నారండీ!

పక్క ఊళ్ల నుంచి తెస్తే?

అక్కడే వచ్చింది గొడవ. మా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేసినా చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణానికి వచ్చేవారు మాత్రం యథావిధిగా ప్లాస్టిక్ సంచులు తీసుకొచ్చేవారు. అవి అక్కడే పాడేస్తుండడంతో కథ మళ్లీ మొదటికొచ్చేది. ఇక లాభం లేదని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు సైతం అప్పుడప్పుడూ ఆర్టీసీ కాంప్లెక్సుకి వెళ్లి బస్సు దిగేవారి నుంచి ప్లాస్టిక్ సంచులు తీసేసుకుని జ్యూట్ సంచులు ఇచ్చేవారు. వాళ్లకి దణ్ణం పెట్టి దయచేసి ఇంకెప్పుడూ ప్లాస్టిక్ సంచులు బొబ్బిలికి తేవొద్దంటూ వేడుకునేవారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సైతం స్వచ్ఛత కోసం చేస్తున్న ప్రయత్నం అర్థమవ్వసాగింది.

అదండీ మా బొబ్బిలి గొప్పదనం... ఇక మీరు ఆ ప్లాస్టిక్ గురించి మర్చిపోయి ఈ జ్యూట్ బ్యాగులు పట్టుకెళ్లండి... మీ ఊళ్లో కూడా ఈ ఊరి గురించి చెప్పండి... బొబ్బిలి వాళ్లు ఒకప్పుడు శత్రు సైన్యంతో... ఇప్పుడు ప్లాస్టిక్‌తో పోరాడుతున్నారని... ఏమంటారు..!

-**జి.వి.వి.సత్యనారాయణరెడ్డి**, విజయనగరం

బాల రైతు... భలే సాగు!

'రైతులు పంటలు పండక అప్పుల్లో మునిగిపోతున్నారు... అవి తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.' ఈ మాటలు విన్న ఏ చిన్నారులైనా ఇవన్నీ పెద్ద వాళ్ల విషయాలు అని వదిలేస్తారు. కానీ ఓ పిల్లాడు మాత్రం ఈ మాటల్ని బాగా పట్టించుకున్నాడు. వారి సమస్యల గురించి బోలెడు సమాచారం సేకరించాడు. పంటల్లో లాభాలు ఎలా పొందవచ్చనే సంగతి తెలుసుకున్నాడు. అంతేనా? వ్యవసాయమూ చేయడం మొదలుపెట్టాడు. ఈ సంగతులన్నీ విశాఖపట్నం జిల్లా పాయకరావు పేటకు చెందిన ఎలిపే వర్ధిష్ణ విభావాస్ రాజిత్ సంగతులు.

ఇప్పుడు పదో తరగతి చదువుతున్న రాజిత్ చదువుకుంటూనే సాగూ చేస్తున్నాడు. పంటలు పండిస్తూ ప్రయోగాలు చేస్తున్నాడు. సాగులో లాభాలు రావాలంటే మిశ్రమ పంటలతోనే సాధ్యమని ప్రాజెక్టు రూపొందించాడు. దీంతో 2017లో జరిగిన బాలల జాతీయ సైన్సు కాంగ్రెస్ పోటీల్లో అర్హత సాధించాడు. అందరి ప్రశంసలు అందుకున్నాడు.

ఇంతకీ రాజిత్‌కీ ఆసక్తి ఎలా వచ్చింది అంటే... రాజిత్ మూడో తరగతి చదువుతున్నప్పుడు ఓసారి రైతుల ఆత్మహత్యల గురించి అమ్మానాన్న మాట్లాడటం విన్నాడు. అప్పటి నుంచి రైతుల కష్టనష్టాల గురించి పదే పదే నాన్నని అడిగేవాడు. అలా రైతుల సమస్యల గురించీ, వ్యవసాయంలో ప్రత్యేక పద్ధతుల గురించి తెలుసుకుని మరింత ఆసక్తి పెంచుకున్నాడు. ఆరో తరగతికి వచ్చేసరికి ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. కూరగాయలు పండించాడు. ఒకే పంట వేయడంతో నష్టం వచ్చింది. దీంతో రెండో ఏడాది నిపుణుల సలహా తీసుకున్నాడు.

మల్చింగ్ పద్ధతి ప్రకారం... మొక్కల చుట్టూ నేల కనిపించకుండా ఎండిపోయిన ఆకులు, చెరుకు పిప్పి వంటి పదార్థాలతో కప్పేశాడు. దీంతో ఎండ వేడి నేరుగా భూమికి తగలకపోవడం వల్ల నేలలోని తేమ పెరుగుతుంది. ఇంకా ఆకులు, చెరుకు పిప్పి వంటి పదార్థాలు కుళ్లిపోయి నేలకు పోషకాలు అందుతాయి. భూ సారం పెరుగుతుంది. రెండోది మిశ్రమ పంట వేస్తే ఒక పంట నష్టపోతే ఒక పంట చేతికి వస్తుందని తెలుసుకున్నాడు. ఆకుకూరలు, కూరగాయలు, పూల మొక్కలు వేశాడు. సేంద్రియ విధానంతో సాగు చేశాడు.

రాజిత్‌లోని ఈ ఉత్సాహం గమనించి తను చదివే స్కూలు యజమాని 500 గజాల భూమిని రాజిత్ వ్యవసాయానికి ఇచ్చారు. మెలకువలు నేర్పేందుకు శిక్షకుడిని, సహాయకుడిని ఏర్పాటు చేశారు. స్కూలుకు వెళుతూనే రోజూ రెండు గంటలు వ్యవసాయం చేస్తూ... విత్తనాలు నాటడం దగ్గర్నించి పంట చేతికి వచ్చేవరకూ అన్ని పనులూ చేసుకొచ్చాడు.

అంతేకాదూ పర్యావరణం, సామాజిక అంశాలపై మిత్రులతో కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడీ బుడతడు. హెల్మెట్ ధరించాలి, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదు అంటూ ర్యాలీలు చేస్తున్నాడు. చిన్న వయసులోనే పెద్ద పనులు చేస్తూ మంచి పేరే తెచ్చేసుకున్నాడు. 2015లో పర్యావరణ మిత్ర అవార్డూ దక్కించుకున్నాడు. హెర్బల్ ల్యాబొరేటరీ స్థాపించడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్త అవ్వాలనేది తన లక్ష్యమంటూ చెబుతున్నాడు చిన్నారి రైతు!

తీర్థం ప్రసాదం వ్యాయామం

అదో దేవాలయం.... భక్తులు రాగానే భగవంతుణ్ని దర్శనం చేసుకుంటారు. తీర్థప్రసాదాలు తీసుకుంటారు. తర్వాత కాసేపు అక్కడి ఉద్యానవనంలో సేదదీరుతారు. ఇవన్నీ ఎక్కడైనా ఉండేదే కదా... కానీ హనుమకొండ టీచర్స్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పరిస్థితి వేరు. మరే దేవాలయంలోనూ లేని ఒక ప్రత్యేకత ఇక్కడ చూడొచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇక్కడో వ్యాయామశాల ఏర్పాటుచేశారు. భక్తులు దేవుణ్ణి దర్శనం చేసుకుని, తీర్థప్రసాదం తీసుకున్నాక కావాల్సినంత సేపు ఉచితంగా కసరత్తులు చేసుకొని వెళ్లొచ్చు. ఈ ఆలయాన్ని ఇటీవల సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం చుట్టూ ఆహ్లాదపరిచే పూల మొక్కలు, పిల్లలు ఆడుకునేందుకు రైడ్‌లతోపాటు, పెద్దలు కసరత్తులు చేసేందుకు ఇక్కడ ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటుచేశారు. వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జిమ్‌లో ఒకేసారి పదిమంది వరకు కసరత్తులు చేసే విధంగా ఏడు వ్యాయామ పరికరాలను అమర్చారు. దీంతో నిత్యం ఉదయం, సాయం వేళల్లో పెద్ద సంఖ్యలో జనం ఆలయంలో కసరత్తులు చేస్తూ ఆరోగ్యాన్ని వరంగా పొందుతున్నారు.

- చిత్ర కథనం: **సంపత్**, వరంగల్

పేరు : శ్రీమోజు సుదర్శన్
ఊరు : మంచిర్యాల
వృత్తి : ఉపాధ్యాయుడు
హా... అయితే ఏంటి..?

ఆగండాగండి...

ఆయన చేసిన పని గురించి తెలుసుకుంటే మీరూ ఔరా అంటారు...

మనం కూడా ఓ ప్రయత్నం చేద్దాం అంటూ పనిలో దిగుతారు...

ఎన్నెన్నో వ్యర్థాలు అన్నింట్లో అర్థాలు!

మంచిర్యాల పట్టణంలోని రాంగనగర్ కాలనీకి చెందిన సుదర్శన్ బడికి వెళ్తుండగా ఓ రోజు ఎవరో తాగి పడేసిన పాత నీళ్లబాటిల్ కంటపడింది. మరోరోజు మరెవరో వాడి వదిలేసిన పాత కూలర్ డబ్బా దృష్టిని ఆకర్షించింది. మున్సిపాల్టీ చెత్త కుప్పలో పడి ఉన్న పగిలిపోయిన పాత ప్లాస్టిక్ డ్రమ్ము ఆయనలో ఆలోచన రేకెత్తించింది. ఇంకా పాతచీరలు, ఇనుప చువ్వలు... పగిలిపోయిన పైపులు... కాదేదీ అనర్హం అని అనిపించింది. అనుకున్నదే తడవుగా ఆయన తన ఇంట్లోనే ఓ పర్యావరణ మిత్ర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. తాను చదివింది కూడా ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమెస్ట్రీ కావడం ఆయనకు కలిసివచ్చింది. తన ఇంటికి ఎకో ఫ్రెండ్లీ హోం అని పేరు కూడా పెట్టుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలే ఆయన భార్య నాగలక్ష్మి తోడ్పాటుతో 30 x 60 అడుగుల విస్తీర్ణంలో ఉన్న తన ఇంటి స్లాబ్‌పై 25 X 50 అడుగుల తోట ఏర్పాటుచేశారు. దొండకాయ, అల్చింత, నిమ్మకాయ, టమోటో, బీరకాయ, సొరకాయ, కాకరకాయలాంటి కూరగాయలతో కలిపి 200కుపైగా 35 రకాలపై మొక్కలను పెంచుతున్నారు. వీటన్నిటికీ పనికిరాని వస్తువులనే ఉపయోగిస్తారు.

ఎలాగంటే: ఇంట్లోని చెత్తాచెదారం, రాలిపడిన పూలు, ఎండిపోయిన ఆకులు, మిగిలిన అన్నం, పనికిరాని కాగితపు ముక్కలను.. ఓ డ్రమ్ములో వేసి తిప్పుతారు. ఆ తరువాత వేస్ట్ డీ కంపోజర్‌తో ద్రావణంగా తయారు చేసి మొక్కలకు ఎరువుగా వాడతారు. ప్లాస్టిక్ నీళ్లడబ్బాలు, పనికిరాని విద్యుత్తు పైపుల ద్వారా బిందుసేద్యంలా నీరు సరఫరా చేస్తారు. పగిలి ఉన్న ఒక్కో డ్రమ్ములో పదుల సంఖ్యలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ సీసాలను ఒకదానిపై ఒకటి వరసగా వేలాడదీసి నీటి పొదుపును చాటి చెబుతున్నారు. వాడిననీరు వృథాపోకుండా... మళ్లీ రీసైక్లింగ్‌ద్వారా తిరిగి అవే మొక్కలకు చేరేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొక్కలకు ఎండ నుంచి రక్షణగా పాత చీరలను వినియోగిస్తున్నారు. భార్యభర్తలిద్దరూ రోజూ ఉదయం అరగంట ఉదయం ఇంటిపైనే సేంద్రియ ఎరువు వాడడం, నీరుపట్టడడం, కలుపుతీయడంతో ఉషోదయపు వ్యాహాళి పూర్తవుతుంది. స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. కేవలం రూ. 20 వేల నుంచి 30వేల లోపు వ్యయంతో చేపట్టిన ఈ ప్రయోగశాల ప్రస్తుతం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ-పర్యావరణ పరిరక్షణ సదస్సులో సుదర్శన్‌కు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి లభించింది. శ్రీరామోజు అనే సుదర్శన్ ఇంటి పేరు ఇపుడు ఎకో ఫ్రెండ్ సుదర్శన్ అనీ, ఆయన నివాసం ఉండే రాంనగర్ కాలనీ...ఇపుడు ఎకో ఫ్రెండ్లీ కాలనీగా మారిపోయింది.

- **ఎం.మణికేశ్వర్**, ఆదిలాబాద్

CA

బాలకృష్ణ

ఈనాడు సినిమా

ప్రమాణస్వీకారం రోజునే...

తెలుగువారి ఆత్మ గౌరవ నినాదంతో ప్రజల మధ్యకి వెళ్లిన ఎన్టీఆర్... తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా తొలిసారి జనవరి 9న ప్రమాణస్వీకారం చేశారు. ఎన్టీఆర్ జీవితంలో ఆ రోజు ఎంతో ప్రాముఖ్యమైనది కాబట్టి... ఆయన జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న 'ఎన్టీఆర్' చిత్రాన్ని అదే రోజునే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ పాత్రలో ఆయన తనయుడు బాలకృష్ణ నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రమిది. వారాహి చలన చిత్రం, విబ్రి మీడియా సంస్థలు సమర్పిస్తున్నాయి. క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే నెలలో సెట్స్‌పైకి వెళ్లనుందీ చిత్రం. హైదరాబాద్‌లో అట్టహాసంగా ప్రారంభమైన ఈ చిత్రం, ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే విడుదల చేయనుండడం విశేషం. బాలకృష్ణకి అచ్చొచ్చిన సంక్రాంతి కూడా ఈ చిత్రానికి కలిసొస్తోంది. బాలకృష్ణ, క్రిష్ కలయికలో తెరకెక్కిన 'గౌతమిపుత్ర శాతకర్ణి' కూడా సంక్రాంతి సందర్భంగానే విడుదలై విజయం సాధించింది.

రానా, కె.ఎస్.రవి కుమార్

రాయ్‌లక్ష్మి, సాయి పల్లవి

మనం చెప్పుకునే కథే...

మెహరీన్, గోపీచంద్

ఒక బలమైన కారణం కోసం పంతం పట్టిన వ్యక్తి కథే మా చిత్రం అంటున్నారు కె.కె.రాధామోహన్. ఆయన నిర్మిస్తున్న చిత్రం 'పంతం'. గోపీచంద్, మెహరీన్ జంటగా నటించారు. కె.చక్రవర్తి దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. వచ్చే నెల 5న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. నిర్మాత మాట్లాడుతూ "గోపీచంద్‌కి 25వ సినిమా ఇది. ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నాం. సామాజికాంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుందీ చిత్రం. మంచి సాంకేతిక బృందం ఈ చిత్రం కోసం పనిచేసింది. ఇటీవలే లండన్, స్కాట్లాండ్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. చిత్రాన్ని వచ్చే నెల 5న విడుదల చేయాలని, పక్కా ప్రణాళికతోనే చిత్రీకరణ పూర్తి చేశాం. ఈ నెల 21న విజయవాడలో పాటల్ని విడుదల చేస్తాం. 24న విశాఖపట్నంలో ఒక వేడుకని నిర్వహిస్తామ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "మా ప్రయత్నం ప్రేక్షకులకు నచ్చుతుంద"న్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. 'దేశం పుట్టినప్పట్నుంచి మనం చెప్పుకునే కథే...' అంటూ టీజర్ సాగుతుంది. ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్.ప్రకాష్, మాటలు: రమేష్ రెడ్డి.

బాహుబలికి పురస్కారాల పంట

రకుల్

ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపించి... బాక్సాఫీసుని కళకళలాడించిన 'బాహుబలి: ది కన్‌క్లూజన్' పురస్కారాల విషయంలోనూ సత్తా చాటుతోంది. 65వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో ఉత్తమ చిత్రంతో సహా మొత్తం ఎనిమిది పురస్కారాల్ని సొంతం చేసుకొంది. 'అర్జున్ రెడ్డి'లో నటనకిగానూ విజయ్ దేవరకొండ ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని అందుకొన్నారు. సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణకి జీవిత సాఫల్య పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ - 2018 వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో దక్షిణాది చిత్రపరిశ్రమలకి చెందిన సినీ తారలు హాజరై ఆటపాటలతో అలరించారు. పలువురు విజేతలు పురస్కారాల్ని స్వీకరించారు. 'బాహుబలి: ది కన్‌క్లూజన్' చిత్రానికిగానూ ఉత్తమ దర్శకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి, ఉత్తమ సహనటుడుగా రానా దగ్గుబాటి, ఉత్తమ సహనటిగా రమ్యకృష్ణ, ఉత్తమ సంగీత దర్శకుడిగా, ఉత్తమ గీత రచయితగా ఎమ్.ఎమ్.కీరవాణి, ఉత్తమ ఛాయాగ్రాహకుడిగా కె.కె.సెంథిల్‌కుమార్, ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్‌గా సాబుసిరిల్‌లకి పురస్కారాలు లభించాయి. 'ఫిదా'లో నటనకిగానూ సాయిపల్లవి ఉత్తమ నటిగా నిలిచింది. అదే చిత్రంతో హేమచంద్ర, మధుప్రియలకి ఉత్తమ గాయకుడు, గాయని పురస్కారాలు లభించాయి. 'గురు'లో నటనకిగానూ వెంకటేష్, రితికాసింగ్ విమర్శకుల విభాగంలో ఉత్తమ నటుడు, ఉత్తమ నటిగా, 'హలో'తో పరిచయమైన కల్యాణి ప్రియదర్శన్ ఉత్తమ తొలి చిత్ర కథానాయికగా పురస్కారాలు సొంతం చేసుకొన్నారు. వేడుకలో కె.ఎస్.రవికుమార్, అల్లు అరవింద్, రాయ్‌లక్ష్మి, రకుల్ ప్రీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కైకాల సత్యనారాయణ, అల్లు అరవింద్

రితికా సింగ్

విజయ్ దేవరకొండ

గీతోపదేశం

గురువింద ఈ సమాజం
పరనింద దాని నైజం
తన కింద నలుపు తత్వం
కనిపెట్టలేదు సహజం
తన కళ్ల ముందు ఘోరం
కాదనదు పిరికి లోకం

గీతం: నువ్వేమి చేశావు నేరం...
చిత్రం: పెళ్లి చేసుకుందాం
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి
– పంపినవారు: వి.బసవపున్నయ్య, మంచిర్యాల

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

రెండో గీతాంజలి

అంజలి ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన 'గీతాంజలి' మంచి విజయం అందుకొంది. ఆ చిత్రానికి కొనసాగింపుగా 'గీతాంజలి 2' తెరకెక్కబోతోంది. ఇందులోనూ అంజలి ప్రధాన పాత్ర పోషిస్తుండగా, కోన ఫిలిమ్ కార్పొరేషన్ (కేఎఫ్‌సీ), ఎం.వి.వి.సినిమా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. భారతీయ సంతతికి చెందిన అమెరికా వ్యక్తి దర్శకత్వం వహించనున్నట్టు నిర్మాతల్లో ఒకరైన కోన వెంకట్ తెలిపారు.

అంజలి

ఈ సినిమా వివరాల్ని ప్రముఖ నటుడు, దర్శకుడు ప్రభుదేవా ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. కోన వెంకట్ మాట్లాడుతూ "మా సంస్థ నుంచి వచ్చిన 'అభినేత్రి', 'నిన్ను కోరి' చిత్రాలు ప్రేక్షకుల మెప్పు పొందాయి. త్వరలోనే ఆది పినిశెట్టి, తాప్సి, రితిక సింగ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన 'నీవెవరో' కూడా విడుదల కాబోతోంది. త్వరలోనే 'గీతాంజలి 2'ని సెట్స్‌పైకి తీసుకెళతాం. థ్రిల్లర్ కామెడీ కథతో ఈ చిత్రం రూపొందబోతోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని ప్రకటిస్తాం" అన్నారు.

పంచ్ డైలాగ్

జ్ఞాపకాలు మంచివైనా చెడ్డవైనా ఎప్పుడూ మనతోనే ఉంటాయి. మోయక తప్పదు.

చిత్రం: తొలిప్రేమ(2018)
– పంపినవారు: కరుణాకర్, గజ్వేల్

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

చాణక్యుడిగా అక్షయ్



చరిత్ర అంటే అక్షయ్ కుమార్‌కు బాగా మక్కువ ఏర్పడినట్లుంది. అందుకే ఇటీవలి కాలంలో చారిత్రక నేపథ్యమున్న చిత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. చరిత్ర పుటల్లో దాగున్న ఆసక్తికరమైన కథలను నేటి తరం ప్రేక్షకులకు తెలియజెప్పేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఆమధ్య ఆయన నుంచి వచ్చిన 'ఎయిర్‌లిఫ్ట్' ఆ తరహా చిత్రమే. ఇప్పుడు నటిస్తున్న 'గోల్డ్', 'కేసరి' కూడా చారిత్రక సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నవే కావడం గమనార్హం. 1948లో నిర్వహించిన ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు సాధించిన సువర్ణ విజయం ఆధారంగా 'గోల్డ్' రూపొందుతుండగా, 1897లో జరిగిన సారాగర్హి యుద్ధం నేపథ్యంలో 'కేసరి' తెరకెక్కుతోంది. కాగా అక్షయ్ ఈసారి ఓ చిత్రం కోసం మౌర్యుల కాలంలోకి వెళ్లటానికి సిద్ధమవుతున్నారట. ప్రసిద్ధిగాంచిన మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుడికి రాజకీయ సలహాదారుగా ఉంటూ రాజనీతిజ్ఞుడుగా చరిత్రకెక్కిన చాణక్యుడి పాత్రలో అక్షయ్ నటించబోతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిలింస్ భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించబోతోందని, దీన్ని చంద్రప్రకాష్ ద్వివేది తెరకెక్కించనున్నారని సమాచారం. ద్వివేది 1991లో చాణక్యుడి కథతోనే 'చాణక్య' అనే ధారావాహికను రూపొందించారు. కాగా ఈ చిత్రంలో కీలకమైన చంద్రగుప్తుడి పాత్రలో మరో ప్రముఖ నటుడు నటించే అవకాశముందని వినిపిస్తోంది. ప్రస్తుతం పూర్వనిర్మాణ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

నన్ను దోచుకుందువటే...

సుధీర్‌బాబు

కథానాయకుడు సుధీర్‌బాబు ఇటీవలే నిర్మాతగా మారాడు. సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పేరుతో సొంత నిర్మాణ సంస్థని ప్రారంభించాడు. శుక్రవారం విడుదలైన 'సమ్మోహనం'తో కథానాయకుడిగా మరొక విజయాన్ని సొంతం చేసుకొన్న ఆయన, ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తూనే తన నిర్మాణ సంస్థ నుంచి వస్తున్న తొలి సినిమా వివరాల్ని మోషన్ పోస్టర్‌తో పాటు ప్రకటించారు. 'నన్ను దోచుకుందువటే' పేరుతో, ఆర్.ఎస్.నాయుడు అనే కొత్త దర్శకుడు సినిమాని తెరకెక్కించనున్నట్టు ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఇందులో సుధీర్‌బాబు కథానాయకుడు కాగా, ఆయన సరసన నభానటేష్ కథానాయికగా నటిస్తోంది. ఛాయాగ్రహణం: సురేష్ రగుతు, కూర్పు: ఛోటా కె.నాయుడు, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

కళ్లు... నవ్వు చూసే నమ్మారు!

"భాష కంటే భావాలే ఎక్కువగా మాట్లాడతాయని నమ్ముతా. తెలుగు తెలియకపోయినా నేను ఇక్కడ సినిమా చేయడానికి కారణం అదే" అని చెప్పింది సిద్ధి ఇద్నానీ. శ్రీనివాసరెడ్డి కథానాయకుడిగా నటించిన 'జంబ లకిడి పంబ'తో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఆ చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సిద్ధి ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది.

"మా అమ్మ హిందీ ధారావాహికల్లోనూ, గుజరాతీ చిత్రాల్లోనూ నటించారు. నా చిన్నతనంలోనే అమ్మతో కలిసి సెట్‌కి వెళ్లేదాన్ని. కళాశాలలో ఉన్నప్పుడే ఒక నాటకానికి సహాయ దర్శకురాలిగా చేశా. ఆ తర్వాత నటనపై దృష్టిపెట్టా. గుజరాతీలో ఓ సినిమా చేశా. ధారావాహికలతో బిజీగా ఉన్న సమయంలో 'జంబలకిడి పంబ' అవకాశం వచ్చింది. ఆడిషన్స్ ద్వారా ఎంపికయ్యా. నా కళ్లు. ..నా నవ్వు చూసే పాత్రని రక్తికట్టించగలనని దర్శకనిర్మాతలు నమ్మారు".

◆ "సినిమాలో విరామం తర్వాత అబ్బాయి అమ్మాయిగా, అమ్మాయి అబ్బాయిగా మారిపోతారు. అదే ఈ సినిమా ప్రత్యేకత. అబ్బాయిగా నటించడం తేలికేం కాదు. అబ్బాయిలు మాట్లాడటం, నడవడం అన్నీ వేరుగా ఉంటాయి. దాంతో శ్రీనివాసరెడ్డి గత సినిమాల్లో ఎలా కనిపించాడో గమనించాకే ఆ సన్నివేశాల్లో నటించా. రంగస్థలం నుంచి వచ్చిన అమ్మాయిని కాబట్టి భావోద్వేగాలు కీలకం అనుకుంటాను. అందుకోసమని నేను మాటల వెనక, సన్నివేశాల వెనక భావాలు తెలుసుకొని అందుకు తగ్గట్టుగా నటించా".

◆ "హాస్యం పండించడం కష్టమైన పని. అందులోనూ భాష తెలియకపోతే మరింత సమస్య. అందుకే తెలుగుపై పట్టు పెంచుకోనేందుకు ప్రయత్నించా. శ్రీనివాసరెడ్డి కామిక్ టైమింగ్ చాలా బాగుంటుంది".

అప్పుడు బతకడానికే నటించాను!

రాధికా ఆప్టే

చిత్ర పరిశ్రమలో బ్యాక్‌గ్రౌండ్ అనేది చాలా విషయాల్లో ఉపయోగపడుతోంది. మనకు సంబంధించిన వాళ్లు చిత్ర పరిశ్రమలో ఉంటే అవకాశాలు రావడం కొంచెం సులువే. కానీ చివరగా సత్తా చాటితేనే నిలబడతారు. కానీ ఎలాంటి సినిమా నేపథ్యం లేకుండా వచ్చేవాళ్లకి కొన్ని కష్టాలు తప్పవు. బాలీవుడ్ నటి రాధికా ఆప్టేకు అలాంటివి తప్పలేదు.. మరి అప్పుడు ఏం చేసింది..."ఎప్పటికీ ఎలాంటి చిత్రాల్లో నటించకూడదనుకున్నానో అలాంటి వాటిలో కెరీర్ ప్రారంభంలోనే నటించాను. ఎందుకంటే బతకడానికి అవసరమైన డబ్బు కోసం తప్పలేదు" అని చెప్పింది. 'బద్లాపూర్', 'హంటర్', 'ప్యాడ్‌మ్యాన్' లాంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకొన్న ఆమె ఇప్పుడు తనకు నచ్చిన సినిమాల్ని ఎంచుకోగలుగుతోంది. "ఇప్పుడు మంచి అవకాశాలు లభిస్తున్నాయి. కొన్నిసార్లు తప్పకపోయినా ఎక్కువశాతం నచ్చిన కథల్నే అంగీకరిస్తున్నాను. యుద్ధం చేయాల్సిందే...ఒక్కరోజులోనే అన్నీ సాధ్యం కావు కదా!"అని చెప్పింది రాధిక.

బాలరాజు పాటలు

కరోణ్య కత్రిన్, రాఘవ్

"చిన్న సినిమాల్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తోంది. రూ.4 కోట్లలోపు నిర్మాణ వ్యయంతో... పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లో తీసే చిత్రాలకి రూ.10 లక్షల సబ్సిడీతోపాటు, పన్నులోనూ రాయితీ ఇస్తున్నాం" అన్నారు ఏపీఎఫ్‌డీసీ ఛైర్మన్ అంబికా కృష్ణ. ఆయన హైదరాబాద్‌లో జరిగిన 'బంగారి బాలరాజు' పాటలు, ట్రైలర్ విడుదల వేడుకకి ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని విడుదల చేశారు. రాఘవ్, కరోణ్య కత్రిన్ జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'బంగారి బాలరాజు'. కోటేంద్ర దుద్యాల దర్శకత్వం వహిస్తున్నారు. కె.యం.డి.రఫి, రెడ్డం రాఘవేంద్రరెడ్డి నిర్మాతలు. చిన్నికృష్ణ, చిట్టిబాబు రెడ్డిపోగు స్వరాలు సమకూర్చారు. వేడుకలో పద్మజ మానేపల్లి పాటల సీడీని విడుదల చేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రమిది. అందరికీ నచ్చుతుంది" అన్నారు. "సహజత్వానికి పెద్దపీట వేస్తూ తెరకెక్కించిన చిత్రమిది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు నిర్మాతలు. "పాటలు బాగున్నాయి. దర్శకుడు ఈ చిత్రం కోసం ఎంత కష్టపడ్డాడో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంద"న్నారు అంబికా కృష్ణ.

వసుంధర

email: vasundhara@eenadu.net

ఈనాడు

సోమవారం జూన్ 18, 2018

విజయవాడ

9

అమ్మో ఒకటో తారీఖు... అనుకుని భయపడే సగటు జీవులు మన మధ్య ఎందరో. జీతం చేతికి వస్తుందనే సంతోషం కంటే.. ఖర్చుల బాధే ఎక్కువగా ఉంటుంది. దాంతో మహిళలు పొదుపు గురించి ఆలోచించడం మానేస్తారు. కానీ చిరు ఉద్యోగులైనా సరే వచ్చిన తక్కువ జీతంలోనే పొదుపు చేసుకునే మార్గాలెన్నో ఉన్నాయి... తెలుసా!

కొంత కొంత దాచేద్దాం!

మన దగ్గర చాలా కుటుంబాల్లో ఆర్థిక వ్యవహారాలకు ఆడవారు దూరంగా ఉంటారు వాస్తవానికి వారిని మగవారే అలా ఉంచుతారు అనడమే బాగుంటుందేమో. నిజానికి ఆడవారు పక్కాగా, పొందిగ్గా పొదుపు చేసినట్టు మగవారు చేయలేరట. అందుకే నాకెందుకు ఆర్థిక వ్యవహారాలు... సంపాదిస్తున్నా నాకు నచ్చింది ఖర్చుపెట్టుకుంటున్నా అని కాకుండా పొదుపు గురించీ తెలుసుకోగలగాలి. పొదుపు పట్ల అవగాహన పెంచుకుని కొంతలో కొంత మదుపు చేయడం మొదలుపెడితే ఆర్థిక భద్రతా, భరోసా ఉంటుంది.

దాదాపు ప్రతి ఇంట్లో నెల మొదట్లో అద్దె, నిత్యావసరాలూ, విద్యుత్తూ, నీళ్లూ, పేపర్, పాలూ, కేబుల్.. ఇలా రకరకాల చెల్లింపులకోసం డబ్బు పక్కన పెట్టుకుంటారు. ఆ తరువాతే పొదుపు గురించి ఆలోచిస్తారు. కొన్ని కుటుంబాల్లో అయితే అలా కొంత డబ్బు తీసి పక్కన దాచడం కూడా కష్టమే. దాంతో ఏ సమస్యా లేకుండా నెల గడిచిపోతే చాల్లే అని సంతృప్తి చెందుతారు. అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు కొద్దిగానైనా పొదుపు చేసి ఉండాల్సిందని బాధపడతారు.

మహిళలు చేసే పొరబాట్లు...

- చాలామంది మహిళలు ఆర్థిక విషయాల పట్ల అవగాహన పెంచుకోరు. చాలామంది పట్టించుకోరు కానీ... ఎప్పటికప్పుడు ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో కొత్త కొత్త పొదుపు పథకాలు వస్తూనే ఉంటాయి. వాటిపై కాస్త విషయపరిజ్ఞానం పెంచుకుంటే ఏం చేయొచ్చనేది తెలుస్తుంది.
- మహిళలు దుస్తులూ, బంగారం కొనడానికి బోలెడు డబ్బులు వృథా చేస్తుంటారనే అపవాదు ఉంది. అది కొంతవరకూ నిజమే కూడా. ఈ రెండు మనకి ముఖ్యమే కావచ్చు. అయితే వాటిని అవసరం మేరకే కొనుక్కోవడం మంచిది.

- ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా షాపింగ్ ప్రమోషన్ జరుగుతోంది. ఆసక్తిగా, అందంగా ఉండే ఫొటోలతో వ్యాపారులు ఆకట్టుకుంటున్నారు. అవి ఇట్టే ఆకర్షించడంతో ఏ మాత్రం ఆలోచించకుండా కొనుగోళ్లు చేసేస్తుంటారు. అలాంటివాటికి వీలైనంత దూరంగా ఉండటం మంచిది.
- ఉద్యోగినులు క్రెడిట్‌కార్డు వాడేస్తుంటారు. డబ్బును ఈఎంఐ పద్ధతిలో చెల్లిస్తుంటారు. ఇది మంచిదే కానీ... అవసరం ఉన్నా లేకపోయినా ఏదో ఒక వస్తువును కొని వాయిదాల పద్ధతిలో డబ్బు చెల్లించడం ఎంతవరకూ సమంజసమో ఆలోచించాలి. మరీ అవసరం అనుకుంటేనే క్రెడిట్‌కార్డును వాడాలి.

- స్వప్న కంతేటి
ఆర్థిక రంగ నిపుణురాలు

పెట్టుబడి ఉండాలి...

నెలలో ఎంతో కొంత మదుపు చేసుకునే మార్గాలు చాలా ఉన్నాయి. అయితే 'అంత డబ్బు లేదు' అనే మాట చాలామంది దగ్గర వినిపిస్తుంది. అది మనసులోంచి తీసేయాలి. నెలకు ఐదు వేల రూపాయల చొప్పున పదేళ్ల పాటు పొదుపు చేయగలిగితే ఇరవై లక్షల రూపాయలు వస్తాయి. ఇరవై ఏళ్లలో ఇంకా పెద్దమొత్తంలో వస్తాయి. అంత దాచుకోవడం కష్టం అనుకుంటే వంద రూపాయలతో ప్రారంభించొచ్చు. మరుసటి ఏడాదికి పది రూపాయల వడ్డీ వస్తుంది. అది అసలులో జమ అవుతుంది. అలా కూడా డబ్బు పెరుగుతుంది. కాబట్టి మనకు వచ్చే ఆదాయం, ఇంటి అవసరాలు దృష్టిలో పెట్టుకుని నెలకు కచ్చితంగా కొంత పొదుపు ఎలా చేయాలనేదీ ఆలోచించాలి. ఇప్పుడు బోలెడు అవకాశాలు కూడా ఉన్నాయి కాబట్టి... మీకు అనువైందే ఎంచుకోవచ్చు.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్): ఇది సురక్షితమైన పొదుపు పథకం. ఆదాయపు పన్ను మినహాయింపు వస్తుంది. ఏడాదికి 500 నుంచి లక్షాయాభైవేల రూపాయల వరకూ పొదుపు చేసుకోవచ్చు. పదిహేనేళ్ల పాటు కట్టాల్సి ఉంటుంది. మధ్యలో రుణాలు కూడా తీసుకోవచ్చు. ఖాతా పొడిగించుకోవచ్చు కూడా. వడ్డీ 7.6 శాతం వస్తుంది. ఉదాహరణకు నెలకు ఐదొందలు దాచుకుంటే పదిహేనేళ్లకు తొంభైవేల రూపాయలు అవుతుంది. అందుకు వడ్డీగా 74,433 రూపాయలు వస్తాయి. అంటే మొత్తం 1,64,433 అవుతుందన్న మాట.

మహిళల పొదుపు ఖాతా: చాలా బ్యాంకుల్లో మహిళకోసం ప్రత్యేకం పొదుపు ఖాతా తెరిచే అవకాశం ఉంది. వీటివల్ల క్యాష్ బ్యాక్ ఆఫర్లు ఉన్నాయి. తక్కువ వడ్డీతో రుణాలు పొందొచ్చు. అదనపు ఛార్జీల భారం కూడా ఉండదు. సగటున తక్కువ బ్యాలెన్స్ ఉన్నా ఇబ్బంది ఉండదు. పైగా బీమా అవకాశమూ ఉంటోంది.

రికరింగ్ డిపాజిట్: ఇది పోస్టాఫీస్ పొదుపు పథకం. ఐదేళ్ల పాటు కట్టుకోవాలి. నెలవారీ, త్రైమాసికంగా కట్టుకునే అవకాశం ఉంటుంది. అది అప్పుడే ఉద్యోగంలో చేరిన అమ్మాయిలకు సూచించదగిన పథకం. నెలకు పది రూపాయలు కూడా దాచుకునే అవకాశం ఉంటుంది. వడ్డీ 6.9 శాతం వస్తుంది

మ్యూచువల్ ఫండ్: ఈరోజుల్లో మ్యూచువల్ ఫండ్ల ద్వారా స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టడం అనేది ఒక ట్రెండ్. ఇందులో చెప్పుకోదగింది సిప్. అంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్. దీని ద్వారా ఎంతైనా మదుపు చేసుకోవచ్చు. నిర్ణీత మొత్తంలో మదుపు చేయాలనేం లేదు. 500ల నుంచి పెట్టుబడి పెట్టుకోవడానికి సాధ్యమవుతుంది.

బంగారం మదుపు: బంగారం కొంటే ధరతోపాటూ, ఖర్చూ, మజూరీ ఎక్కువగా ఉంటుంది. దానికి బదులు బంగారం మీద మదుపు చేయడానికి ఇప్పుడు గోల్డ్ ఈటీఎఫ్, గోల్డ్ బార్, గోల్డ్ మ్యూచువల్ ఫండ్ వంటి సురక్షిత పథకాలెన్నో అందుబాటులో ఉన్నాయి. వాటిలో చెప్పుకోదగింది ఈటీఎఫ్. స్టాక్ మార్కెట్‌లో షేర్ కొనుక్కున్నట్టు.. ఈటీఎఫ్ ద్వారా బంగారం కొనుక్కోవచ్చు, అమ్మేయొచ్చు. బులియన్ మార్కెట్‌లో ధరను బట్టి ఈటీఎఫ్ మారుతుంటుంది. దీనివల్ల ఎలాంటి అదనపు రుసుము ఉండదు.

మచ్చలున్నా... మాకేం తక్కువ!

ఎత్తుగా ఉంటేనే అందంగా ఉన్నట్లు... కాస్త లావుగా ఉంటే ఇంక దేనికీ పనికిరారా... శారీరకంగా చిన్నలోపం వారిని సమాజం అసమర్థులుగా లెక్కేస్తుందా... ముఖంపై ముడతలూ, మచ్చలూ... అన్నీ సమస్యలేనా... ఇంతకీ అసలు అందం అంటే ఏమిటి... ఇలా బోలెడు సందేహాలు అనుష్క కేల్కర్‌ని చిన్నప్పటి నుంచీ వెంటాడాయి. కాస్త సన్నగా ఉంటే... లావు అవ్వడానికి ఇలా చేయి అంటూ సలహాలు ఇచ్చేవారిని చూసింది. కాస్త బొద్దుగా ఉంటే సన్నబడొచ్చు కదా! అంటూ ఉచిత సలహాలిచ్చే సన్నిహితుల మాటలు మానసికంగా ఎలా కుంగదీస్తాయో అర్థంచేసుకుంది. అందుకే 'బ్రౌన్‌గర్ల్ గాజిన్' పేరుతో ఇన్‌స్టాగ్రాంలో ఓ ఖాతాను మొదలుపెట్టింది. తమ శరీరం ఎలా ఉన్నా స్వీకరించి, ప్రేమించే మహిళల ఫొటోలూ, వారి కథల్నీ ప్రచురిస్తోంది. దీనిద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే తన లక్ష్యం అంటోంది. ఇంతకీ ఈ అనుష్క ఎవరు... ఆమెకు ఈ ఆలోచన ఎలా వచ్చింది అంటారా... అనుష్కది ముంబయి. వయసు ఇరవై ఒకటి. ప్రవృత్తి ఫొటోగ్రఫీ. ఈ మధ్యే దిల్లీలోని అశోకా యూనివర్శిటీలో లిటరేచర్, జర్నలిజం పూర్తిచేసింది. కాస్త లావు అవ్వొచ్చు కదా! అంటూ స్నేహితులూ, బంధువులు అడక్కుండానే సలహాలు ఇచ్చేయడం ఆమెకు నచ్చలేదు. అయితే ఈ సమస్య తనకే పరిమితం కాదనే విషయం ఆమె చదువుకోసం దిల్లీకి చేరుకున్నాక అర్థం చేసుకోగలిగింది. అయినా అందానికి కొలమానాలు చెప్పేది మనదేశంలోనే ఎక్కువనీ, దానికి అడ్డుకట్ట వేసేందుకే ఇన్‌స్టాగ్రాం సిరీస్‌ని ప్రారంభించినట్లు పేర్కొంది. తమ శరీరాన్ని ప్రేమించేవారెవరైనా ఆమె పేజీలో మాట్లాడొచ్చు. తాము చెప్పాలనుకున్న విషయాన్ని చిన్న నోట్‌లో చెబితే...ఫొటోషూట్‌కి సిద్ధం చేసుకుంటుంది. మొదట తుంటిపై స్ట్రెచ్ మార్క్స్ ఉన్న ఓ అమ్మాయి ఫొటోనీ, ఆమె కథనీ ప్రచురించింది. అది మొదలు మరెంతోమంది ఆమెని సంప్రదించడం మొదలుపెట్టారు. ముఖంపై మచ్చలూ, చేతిపై గాట్లూ, నలుపూ, మచ్చలూ...ఇలా తమలో ఏ లోపం ఉన్నా సరే! తమని తాము ప్రేమించుకుంటామని చెబుతున్నారు.

వదులైతే... వదిలేయండి

మనం దుస్తులూ, అలంకరణకు ఇచ్చే ప్రాధాన్యం లోదుస్తుల విషయంలో చూపించం. వాటిని ఎలా శుభ్రం చేయాలో, ఎన్ని రోజులు వాడాలో, ఎలాంటివి ఉపయోగించాలో కూడా తెలుసుకోకుండానే వాడేస్తుంటాం. కానీ ఆ వివరాలు తెలిసుండాలి.

ఎన్ని రోజులు వాడొచ్చు: మనం ఎంచుకున్న బ్రా రకం, వాడుతున్న తీరు బట్టి వాటిని మార్చాల్సి ఉంటుంది. రెండింటినీ రోజు మార్చి రోజు వాడుతున్నట్లయితే కనీసం అయిదునెలలకోసారి మార్చేయాలి. అదే ఐదారు ఉంటే మరికొన్ని నెలలు పొడిగించొచ్చు.

ఎప్పుడు మార్చాలి: వీలైనంత వరకు నాణ్యమైన లోదుస్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి. లేదంటే అవి తొందరగా పాడైపోతాయి. అయితే బ్రా పాడైపోయినట్లు గుర్తించడానికి కొన్ని సంకేతాలుంటాయి. తరచూ వాటిపట్టీలు భుజాలనుంచి జారిపోవడం, హుక్కులు ఊడిపోవడం లేదంటే మరీ వదులుగా ఉన్నట్లనిపిస్తే వాటిని మార్చేయడం మంచిది. హుక్కులు పెట్టుకున్న తరువాత కేవలం మూడు వేళ్లు పట్టేంత స్థలం కన్నా ఎక్కువగా ఉంటే అవి వదులైనట్లేనని అనుకోవాలి.

శుభ్రం చేయడానికి పద్ధతుంది: వీటిని వాషింగ్ మెషీన్లలో ఉతక్కపోవడమే మంచిది. ముఖ్యంగా ప్యాడెడ్, అండర్‌వైర్డ్ తరహా వాటిని శుభ్రం చేసేటప్పుడు ఇది గుర్తుంచుకోవాలి. ఇప్పుడు బజార్లో ప్రత్యేకంగా లింగరీ బ్యాగ్‌లు అని దొరుకుతున్నాయి. లోదుస్తులను వాటిలో ఉంచి శుభ్రం చేస్తే ఎక్కువకాలం మన్నుతాయి. లేదంటే బకెట్లో గోరువెచ్చని నీళ్లుపోసి అందులో కొంచెం షాంపూ కలపాలి. ఈ నీళ్లలో వాటిని పదిహేను నిమిషాలు నానబెట్టి తరువాత చేత్తో శుభ్రంచేసి ఆరేస్తే ఎక్కువ రోజులు మన్నుతాయి.

అప్పుడే రాలుతోందా...

జుట్టు రాలే సమస్య ఈ మధ్య పాతికేళ్ల వయస్సు దాటని అమ్మాయిల్లో కూడా ఎక్కువగా కనిపిస్తోంది. సమస్య గుర్తించి మొదట్లోనే కొన్ని మార్పులు చేసుకుంటే జుట్టు ఆరోగ్యంగా మారుతుంది.

- పోషకాహారలోపం, నిద్రలేమీ, నీళ్లు తక్కువగా తాగడం... ఇవన్నీ జుట్టు రాలిపోవడానికి కారణాలే. అయితే ఒత్తిడి ప్రభావం మాత్రం వీటన్నింటితో పోలిస్తే కాస్త ఎక్కువగా ఉంటుంది. దాన్నుంచి బయటపడటానికి మంచి సంగీతం వినడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం... వంటివి రోజువారీ దినచర్యలో భాగం కావాలి.
- విటమిన్ బి-3, బి-9, బి-5, విటమిన్ ఇ జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. బాదం, పాలూ, గుడ్లూ, సోయా, పాలకూరలో ఇవి పుష్కలంగా దొరుకుతాయి. వీటిని వీలైనంత ఎక్కువగా తీసుకోగలిగితే రాలే సమస్య తగ్గడంతోపాటూ జుట్టు పెరుగుతుంది.
- వారానికి కనీసం రెండు సార్లయినా జుట్టుకు కలబంద గుజ్జు రాస్తుండాలి. రెండు చెంచాల కలబంద గుజ్జులో కాస్త ఆలివ్‌నూనె కలిపి తలకు పట్టించాలి. పదినిమిషాలయ్యాక తలస్నానం చేయాలి. కలబందలోని ప్రొటియోలైటిక్ ఎంజైమ్‌లు మాడుపై పేరుకున్న మృతకణాలు తొలగించి కుదుళ్లు ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి.
- కుదుళ్లకు సరిగ్గా రక్తప్రసరణ లేకపోవడం కూడా ఓ కారణమే. అందుకే తలస్నానం చేసే ముందు కొబ్బరినూనెను కాస్త వేడి చేసి మాడుకు మర్దనా చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేసినా జుట్టు ఆరోగ్యంగా మారుతుంది.

అమ్మమ్మ ఆస్తి మాకు వర్తించదా?

ప్ర మా పెద్ద అమ్మమ్మ మా అమ్మని చిన్నప్పటి నుంచీ పెంచుకుంది. కానీ రాత పూర్వకంగా లేదు. అప్పటికే ఆవిడకి ఒక కూతురు(పెద్దమ్మ) ఉంది. ఆమెని తన తమ్ముడికిచ్చి పెళ్లిచేసింది. వాళ్లకి పిల్లలు లేరు. దాంతో మా పెద్దనాన్న తన అన్న కొడుకుని ఇరవై ఏళ్లకు తెచ్చి ఇంట్లో పెట్టుకున్నారు. అంతకుముందే అమ్మమ్మ మా అమ్మకి పెళ్లిచేసి తన ఆస్తిలో ఒక ఎకరం పొలం, కొంత బంగారం కానుకలుగా ఇచ్చింది. అప్పటి నుంచి ఆ భూమిని సుమారు అరవైఏళ్లుగా మేం సాగు చేస్తూ అనుభవిస్తున్నాం. అయితే అవేవీ రాతపూర్వకంగా లేవు. కానీ దానిలో డెబ్బై ఎనిమిది సెంట్ల భూమికి మా అమ్మపేరు మీద పాస్‌బుక్ ఉంది. మిగతా ఇరవై రెండు సెంట్లు మా పెద్దమ్మ పేరు మీద రెవిన్యూ రికార్డులో ఉంది. ఇప్పుడు మా పెద్దనాన్న, పెద్దమ్మ చనిపోయారు. పెంచుకున్న కొడుకు మా సాగులో ఉన్న పెద్దమ్మ పేరుమీద ఉన్న భూమిని బలవంతంగా తీసుకోవాలనుకుంటున్నాడు. పెద్దలు చెప్పినా అతడు ఒప్పుకోవడం లేదు. ఇప్పుడు మేము కోర్టుకు వెళ్లొచ్చా. మొత్తం ఆస్తి సుమారు పది ఎకరాల ఆస్తి మీద కేసు వేయొచ్చా. - ఓ సోదరి.

జ దత్తతను మనదేశంలో మూడు చట్టాలను అనుసరించి చేసుకోవచ్చు. హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ - 1956 హిందువులకు దతత్త నియమాలు గురించి చెబుతుంది. ద గార్డియన్స్ అండ్ వార్డ్స్ యాక్ట్ -1980 ప్రకారం హిందువులు కాని వారు దత్తత తీసుకునేందుకు సహకరిస్తుంది. ఇప్పుడు తాజాగా జువైనల్ జస్టిస్ యాక్ట్ మతంతో సంబంధం లేకుండా దత్తత గురించి చెబుతుంది. మీ సమస్యకు హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ వర్తిస్తుంది. ఈ చట్టం పదిహేనేళ్లలోపు పిల్లల్ని దత్తత తీసుకోవచ్చని చెబుతోంది. మీ పెద్ద అమ్మమ్మ మీ అమ్మని పదిహేనేళ్లలోపు కనుక పెంచుకుంటే రాతపూర్వకంగా లేకపోయినా చెల్లుతుంది. ఇరవై ఏళ్లు దాటిన వ్యక్తిని మీ పెదనాన్న దత్తత తీసుకోవడానికి వీలులేదు. అదీకాక మీ పెదనాన్నకి మీ పెద్ద అమ్మమ్మ ఆస్తిని తనకు ఇష్టం వచ్చినట్లు నచ్చినవారికి ఇవ్వడానికి ఎటువంటి హక్కులేదు. అది స్త్రీకి చెందిన ఆస్తి. ఆమె చనిపోయాక కూతురికే వస్తుంది. కూతురు లేనప్పుడు కొడుకుకి లభిస్తుంది. మీ పెద్దఅమ్మమ్మ తన తమ్ముడిపేరుమీద ఏదైనా విల్లు లేదా గిఫ్ట్‌డీడ్ రాసి ఉంటేనే అది సాధ్యమవుతుంది. అలా కానప్పుడు మీ ఆ ఆస్తి సొంత కూతురికీ, లేదా పెంచుకున్న కూతురికి మాత్రమే వర్తిస్తుంది. ఆ ఆస్తి వారి నుంచి వాళ్ల పిల్లలకీ వస్తుంది. వారెవరూ లేనప్పుడే ఆమె భర్త తరపు బంధువులకు చెందుతుంది. ముందు మీ అమ్మగారి దత్తత గురించి మీరు కోర్టులో నిరూపించుకోవలసి వస్తుంది. ఈలోగానే మీ పెద్దనాన్న పెంచుకున్న కొడుకు మీ ఆస్తి జోలికి వస్తుంటే మీరు కోర్టులో ఇంజక్షన్ సూట్ లేదా డిక్లరేషన్ ఆఫ్ టైటిల్ సూట్ వేయొచ్చు. మీ పెద్ద అమ్మమ్మ ఆస్తి పదెకరాలు మీ అమ్మగారి వారసత్వ హక్కు నిరూపించుకోవడానికి డిక్లరేషన్ ఆఫ్ లీగల్ హైర్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది.

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి
న్యాయవాది

vasulegal@eenadu.net

కార్క్ చెప్పులు... కోరుకున్న డిజైనులో

వెన్నూ, మోకాళ్ల సమస్యలొచ్చినప్పుడు డాక్టర్ కాస్త మృదువుగా ఉండే చెప్పులు వేసుకోమని సూచిస్తారు. కానీ వాటిని కేవలం ఇంటికే పరిమితం చేస్తాం. ఆ చెప్పులు మనం వేసుకునే దుస్తులకు సరిపోక పోవడమే దానికి అసలైన కారణం. అందుకే చూడటానికి హుందాగా, ఆరోగ్యానికి అండగా ఉండే కార్క్ చెప్పులను ప్రత్యేకంగా అమ్మాయిల కోసం తయారుచేస్తున్నారు ముంబయికి చెందిన త్రిశ్లా సురానా. తనకెందుకీ ఆలోచన వచ్చిందో ఆమె మాటల్లోనే!

నేను వృత్తిరీత్యా గ్రాఫిక్ డిజైనర్‌ని. ఏదైనా కాస్త సృజనాత్మకంగా ఆలోచించడం ముందునుంచీ అలవాటే. ఆ ప్రయోగాలన్నీ మా పిల్లలు వాడే వస్తువుల మీదా చేసేదాన్ని. ఒకసారి వాళ్లచెప్పులను వివిధ వస్తువులు వాడి చక్కగా అలంకరించా. అవి ఆకర్షణీయంగా ఉండటంతో ప్రశంసలొచ్చాయి. అప్పుడే దీన్నో వృత్తిగా మార్చుకుంటే ఎలా ఉంటుందని అనిపించింది. కొన్ని రోజులకే 'కలర్ మీ మ్యాడ్' పేరుతో ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించా. దానిద్వారా సాధారణ చెప్పులమీద వినియోగదారులు కోరిన డిజైన్లను ప్రింటు చేసి ఇచ్చేదాన్ని. అలా ఓ ఏడాది పాటూ చేశా. అప్పుడే చెప్పులకు సంబంధించిన వ్యాపారంపై ఇంకాస్త అవగాహన వచ్చింది. ఆ క్రమంలోనే విదేశాల్లో ప్రాముఖ్యం పొందిన కార్క్ చెప్పుల గురించి తెలుసుకున్నా. వాటికక్కడ శతాబ్దాల నుంచే ఆదరణ ఉంది. చూడటానికి కార్క్ కాస్త గట్టిగా ఉంటుంది. మరి దాంతో అసలు చెప్పులు ఎందుకు తయారు చేస్తున్నారనేది ఆలోచిస్తే...

ఆరోగ్యానికి మేలు...

మనకు కీళ్లనొప్పులూ, వెన్ను నొప్పులు వచ్చినప్పుడే మనం వేసుకున్న చెప్పులు సరైనవేనా అని ఆలోచిస్తాం. పైగా మనలో చాలామంది కాళ్ల నొప్పులు రాగానే మరీ మెత్తగా ఉండే రబ్బర్ చెప్పులను వాడుతుంటారు. దానివల్ల మన శరీరం బరువు రెండు పాదాలపై సమానంగా పడదు. మరీ గట్టిగా ఉన్న వాటిని వాడినా ఇదే సమస్య. కార్క్‌ను రబ్బర్‌తో కలిపి దాంతో చెప్పు సోల్‌ను తయారుచేయడం వల్ల అది మరీ మెత్తగా, మరీ గట్టిగా కాకుండా పాదాలకు కావాల్సిన ఆసరా అందుతుంది. పైగా ఇవి నీటిని పీల్చుకుంటాయి. ఎక్కువ రోజులు మన్నుతాయి. సౌకర్యంగానూ ఉంటాయి. ఇన్ని లాభాలున్నాయని తెలిశాక 2014 నుంచి మా వారు రాజీవ్ సురానాతో కలిసి వాటి తయారీ మొదలుపెట్టాం. చాలా మటుకూ వైద్యులు ఆరోగ్యం కోసం సూచించిన చెప్పుల్లో ఎక్కువ డిజైన్లూ, రంగులు ఉండవు. అందుకే వీటిని ఫ్యాన్సీ రకాల్లో రూపొందించాలని నిర్ణయించుకున్నా. ఆఫీసుకూ, వేడుకలకు కూడా వీటిని వేసుకెళ్లే విధంగా వీటిని రూపొందించా. ఫ్లిప్‌ఫ్లాప్స్ మొదలు షూలూ, ఎత్తుచెప్పులు కూడా తయారుచేస్తున్నాం. అయితే ఇవన్నీ అమ్మాయిలకోసమే. ప్రస్తుతం సంవత్సరానికి దాదాపు ఎనిమిది వేలకు పైగా ఆర్డర్లే అందుకుంటున్నాం.

దేశమంతా తిరిగా...

మొదట్లో తయారు చేసిన చెప్పులకు అంతగా ఆదరణ లభించలేదు. దానికి కారణం వాటిని వేసుకోగానే కాస్త గట్టిగా ఉన్నట్లు అనిపించడమే! దాంతో చెప్పులకు ఫోమ్ ప్యాడ్‌ను జతచేశాం. దీన్ని మార్చుకోవడంతో పాటూ, మురికిగా అనిపిస్తే ఉతుక్కోవచ్చు కూడా. ఆ తరువాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఇప్పుడు వేరే దేశాల్లో కూడా మా ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోంది. మొదట్లో వీటిపై అవగాహన పెంచేందుకు ఎక్కడ ప్రదర్శనలు ఉన్నా... అక్కడ మా స్టాల్ పెట్టేదాన్ని. అలా మన దేశంలోనే కాదు దుబాయ్‌కి కూడా వెళ్లా. క్రమంగా ఆర్డర్లూ పెరిగాయి. ముంబయిలో ఆఫ్‌లైన్ స్టోర్ ప్రారంభించా. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తోపాటూ ప్రముఖ చెప్పుల షాపుల్లోనూ మా ఉత్పత్తులు ఉంటాయి. ముంబయి, దిల్లీలాంటిచోట్లే కాదు... గుంటూరు, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లోనూ మా చెప్పులు అందుబాటులో ఉంటాయి. ఇప్పుడు మా ఉత్పత్తులు బాలీవుడ్ తారలనూ చేరుకున్నాయి. సోహాఅలీఖాన్, సోనమ్‌కపూర్ కూడా మా వినియోగదారుల జాబితాలో ఉన్నారు. త్వరలో పట్టీలూ, సోల్స్ దుస్తులకు తగినట్లుగా మార్చుకునేలా డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నాం.

ఆటను బట్టి ఆహారం!

అంతర్జాతీయ స్థాయి పోటీలు జరుగుతున్నప్పుడు పతకాల పట్టికలో భారత్ పేరు కనిపించటం అరుదు.. ఒకవేళ ఉన్నా.. కాంస్యం, రజతంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో యువజన సర్వీసులు, క్రీడామంత్రిత్వశాఖ క్రీడలకు సైన్సును జోడిస్తోంది. శాస్త్రీయమైన విధానంతో క్రీడాకారులను తయారు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే కొత్త కోర్సులను ప్రవేశపెడుతోంది.

శరీరతత్వాన్ని బట్టి.. ఎవరు ఏ క్రీడకు సరిపోతారో ముందుగానే నిర్ణయించటం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. క్రీడా మంత్రిత్వశాఖ ఇదే ఆలోచించింది. క్రీడాంశాన్ని దృష్టిలో పెట్టుకొని శిక్షణ ఎలా ఉండాలి.. ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. ఎప్పుడెప్పుడు తినాలి ఇలా అన్నిటికీ శాస్త్రీయ పద్ధతి ఉండాలని నిశ్చయించింది. ఫలితంగా.. మూడు కోర్సులను జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) రూపొందించడమే కాదు.. నిర్వహించే బాధ్యతలను కూడా తీసుకుంది.

కోర్సులు ఇవీ: 1. ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ 2. ఎమ్మెస్సీ స్పోర్ట్స్ ఫిజియాలజీ 3. ఎమ్మెస్సీ స్పోర్ట్స్ బయోకెమిస్ట్రీ

ఉద్యోగ అవకాశాలు ఇలా..

ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలాడాలి. ఎవరికి సరిపడే ఆట ఏది అనేది తెలుసుకోవాలి. ఆ ఆటకు సరిపోయే ఆహారం తీసుకోవాలి. ఇలా క్రీడా చైతన్యం పెరిగిన తర్వాత క్రీడా రంగం చాలా అభివృద్ధి చెందుతుంది. క్రీడా అకాడమీలు, క్రీడా సమాఖ్యలతోపాటు ప్రభుత్వ శిక్షణ సంస్థల్లో కూడా ఈ కోర్సులు పూర్తి చేసినవారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పెద్ద సంస్థలు వారి ఉద్యోగులు క్రీడల్లో ప్రావీణ్యం ఉంటే మంచి పనితనం సాధ్యమని భావిస్తాయి. మానవ అభివృద్ధి విభాగాల్లో స్పోర్ట్స్ సైన్సు కోర్సులు పూర్తి చేసినవారికి అవకాశం ఉంటుంది.

ప్రస్తుతానికి ఒకే కోర్సు

సరైన పోషకాహారంతో అందరికీ

స్పోర్ట్స్ సైన్స్‌లో పీజీ కోర్సులు

ఆరోగ్యం సాధ్యం. ఈ దిశగా ఇప్పటికే ఎమ్మెస్సీ అప్లైడ్ న్యూట్రిషన్ కోర్సును జాతీయ పోషకాహార సంస్థ నిర్వహిస్తోంది. ఇప్పుడు క్రీడాకారులకు ఎలాంటి ఆహారం అవసరం అనే అంశంలో కొత్తగా కోర్సును అందిస్తోంది. ఈ విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సును ప్రారంభిస్తోంది. మొత్తం రెండు సంవత్సరాల కోర్సు వ్యవధి. ముందుగా 15 మందితో ఈ కోర్సును ప్రారంభిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి 30 మంది ఉండేలా చూస్తున్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి అఖిలభారత స్థాయిలో ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఉంటుంది. ఇందులో మెరిట్ విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు.

మిగతా రెండు కోర్సులను వచ్చేఏడాది ప్రారంభిస్తారు.

ఎవరు అర్హులు?

న్యూట్రిషన్ విద్యలో డిగ్రీ చేసినవారు, హోంసైన్సులో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ డిగ్రీ పూర్తి చేసినవారు, ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీడీఎస్, బీపీటీ (బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ) కోర్సులు పూర్తి చేసినవారు ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సు చదివేందుకు అర్హులు. వైద్యవిద్య చదివినవారికి కూడా అవకాశం కల్పిస్తున్నారు. ఫీజు ఎంత వసూలు చేయాలనేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల 24వ తేదీన ఈ కోర్సు పూర్తి వివరాలు ప్రకటన ద్వారా వెల్లడి కానున్నాయి. ఏడాదికి రూ. లక్ష వరకూ ఫీజు ఉండవచ్చునని తెలుస్తోంది.

కోర్సు ముఖ్య ఉద్దేశం

భారత క్రీడాకారుల ప్రావీణ్యాన్ని పెంపొందించడమే ఈ కోర్సు లక్ష్యం. ఇప్పటివరకూ కోచ్‌ల సూచనలమేరకే క్రీడాకారులు ఆహారం తీసుకుంటున్నారు. క్రీడలో మెలకువల వరకూ కోచ్‌లను పరిమితం చేస్తారు. క్రీడకు తగ్గ ఆహారం అందించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ కోర్సులో ఉంటాయి. ఉదాహరణకు వంద మీటర్లు, 200 మీటర్లు ఇలా లక్ష్యాన్ని బట్టి ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. ఫుట్‌బాల్ క్రీడాకారులంతా ఒకే రకమైన ఆహారం తీసుకోరు.. గోల్ కీపర్ ఆహారం వేరు.. క్రీడలో ఏయే స్థానాల్లో నిలబడుతున్నారో.. దానిని బట్టి ఆహారం అందించాల్సినవసరం ఉంది. శరీరంలో కొవ్వు శాతం ఎంత ఉంది.. శరీరంలో హైడ్రేషన్ శాతాలు ఎంత ఉన్నాయనేదాన్ని బట్టి ఆహారం ఇవ్వాల్సి ఉంటుంది. శిక్షణ భారం ఎంత పడుతోంది.. ఎన్ని రోజుల్లో పోటీలుంటాయి.. ఆటకు ముందు.. తర్వాత ఎలాంటి ఆహారం తీసుకోవాలనేది ఈ కోర్సు ముఖ్య ఉద్దేశం. ఇలా ప్రతి అంశంలో శాస్త్రీయమైన విధానాలను అనుసరించి క్రీడాకారులను తయారుచేయడమే లక్ష్యం.

- లావేటి వేణుగోపాల నాయుడు, ఈనాడు, హైదరాబాద్.

ఆరోగ్య భారతమే లక్ష్యం

ఎవరు ఏ ఆటకు సరిపోతారో తెలియని పరిస్థితి దేశంలో ఉంది. ఒకరిని చూసి ఒకరు ప్రేరణ పొందొచ్చు కానీ.. వారికి ఆ క్రీడ సరిపోతుందా..? అనేది స్పోర్ట్స్ సైన్సు కోర్సులు నిర్ణయిస్తాయి. పెట్రోల్‌తో నడిచే కారులో.. డీజిల్ వేస్తే పని చేస్తుందా! అలాగే ఆ శరీరతత్వాన్ని బట్టి.. ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ ఆహారంతో రూపొందుతున్న శరీరం ఏ క్రీడకు సరిపోతుందో సరిచూడాలి. ఇది చిన్నప్పుడే నిర్ణయించాల్సి ఉంది. 8 ఏళ్ల వయసులో ఎవరు ఏ క్రీడకు సరిపోతారో.. ఎంత శ్రమకు ఆ శరీరం తట్టుకుంటుందో తెలుసుకుని శిక్షణ ఇవ్వడం ద్వారా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయవచ్చు. ఇలా క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చి.. ఆరోగ్య భారతాన్ని తయారు చేయడమే స్పోర్ట్స్ సైన్సు కోర్సుల ముఖ్య ఉద్దేశం.

- డా. వై. వెంకటరమణ, ఎన్ఐఎన్, స్పోర్ట్స్ సైన్సు శాఖాధిపతి

సీట్లు పరిమితం... పోటీ మాత్రం అత్యధికం. ఎయిమ్స్, జిప్మర్, నీట్‌ల ద్వారా కలల కోర్సులో సీటును అందుకోగలమా అనే అనుమానం! గత ఏడాది కౌన్సెలింగ్ సరళిని బట్టీ, సీట్ల లభ్యతను బట్టీ అంచనాలు కట్టటం... బేరీజు వేసుకోవటం! వైద్యవిద్య ప్రవేశాల ప్రస్తుత తరుణంలో విద్యార్థులకూ, వారి తల్లిదండ్రులకూ ఎన్నో ప్రశ్నలు.. నీట్ సెంట్రల్ కౌన్సెలింగ్‌లో డీమ్డ్ యూనివర్సిటీల్లో అడ్మిషన్ల ప్రక్రియ గురించీ, స్టేట్ కౌన్సెలింగ్‌లో అవకాశాల గురించీ వివిధ సందేహాలు వారిని సతమతం చేస్తున్నాయి. వాటిని నివృత్తి చేసే కథనమిది..!

ఏం చూడాలి? ఎలా సాగాలి?

దేశంలోని మొత్తం 492 మెడికల్ కళాశాలల్లో ఉన్న మొత్తం సీట్ల సంఖ్య 63,400. మూడు ప్రవేశపరీక్షల్లో మెరిట్ ఆధారంగా వీటిల్లో ప్రవేశాలు జరుగుతాయి. అవి: నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్), ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్), జిప్‌మర్ (జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్).

ఎయిమ్స్ ప్రవేశ ప్రక్రియ ఎలా ఉంటుంది?

ఎయిమ్స్ మొత్తం 9 కళాశాలలు ఉన్నాయి. ఇవి న్యూదిల్లీ, భోపాల్, పట్నా, జోధ్‌పుర్, రుషికేష్, రాయ్‌పుర్, భువనేశ్వర్, గుంటూరు, నాగ్‌పుర్‌ల్లో ఉన్నాయి. వీటిలో మొత్తం 807 సీట్లున్నాయి. న్యూదిల్లీ ఎయిమ్స్‌లో విదేశీయులకు 7 సీట్లున్నాయి. ఈ అన్ని కళాశాలల్లో ఎయిమ్స్ వారు నిర్వహించే ప్రవేశపరీక్ష ఆధారంగానే ప్రవేశాలు జరుగుతాయి. ప్రవేశపరీక్ష ఫలితాలు జూన్ 18న వెలువడతాయి. నూతనంగా ప్రారంభించిన గుంటూరు, నాగ్‌పుర్‌ల్లో మాత్రమే 50 సీట్ల చొప్పున ఉన్నాయి. మిగిలిన అన్ని కళాశాలల్లో 100 సీట్లు ఉన్నాయి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

పి.వి.ఆర్.కె. మూర్తి
శ్రీ గాయత్రి విద్యాసంస్థలు

జిప్‌మర్‌లో అడ్మిషన్ ప్రక్రియ ఎలా?

జిప్‌మర్‌లో మొత్తం రెండు కళాశాలలు ఉన్నాయి. అవి- జిప్‌మర్- పుదుచ్చేరి, జిప్‌మర్- కరేకల్. వీటిలో పుదుచ్చేరిలో 150 సీట్లు కరేకల్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లన్నింటినీ జిప్‌మర్ ప్రవేశపరీక్షలోని ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. జిప్‌మర్ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి.

ఎయిమ్స్, జిప్మర్‌లలో వివిధ కేటగిరీ సీట్ల వివరాలను ఈనాడుప్రతిభ.నెట్‌లో చూడవచ్చు.

నీట్ ద్వారా...

నీట్ ద్వారా 193 మెడికల్, 40 డెంటల్ కళాశాలల్లో ఆల్ ఇండియా కోటా (15%), స్టేట్ కోటాలోని (85%) మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటు మెడికల్ కళాశాలల్లోని ఎ, బి, సి కేటగిరీ సీట్లు, మైనారిటీ కళాశాలల్లోని, డీమ్డ్ యూనివర్సిటీల ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు, ఏఎఫ్ఎంసీ (ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్, పుణె), ఈఎస్ఐసీ మెడికల్ కళాశాలల సీట్లు, సెంట్రల్ యూనివర్సిటీలు అయిన అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ), బెనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ), దిల్లీ యూనివర్సిటీ, క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ (సీఎంసీ) తదితర సంస్థల్లోని సీట్లను నీట్ ర్యాంకు ఆధారంగా నింపుతారు. సి కేటగిరీ లేదా ఎన్ఆర్ఐ సీట్లను సంబంధిత కాలేజ్ మేనేజ్‌మెంట్ నింపుకున్నప్పటికీ విద్యార్థి నీట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

డీమ్డ్ యూనివర్సిటీల్లో సీట్ల రిజర్వేషన్ ప్రక్రియ ఎలా ఉంటుంది?

దేశంలో ఎంబీబీఎస్‌ను అందించే మొత్తం డీమ్డ్ యూనివర్సిటీల సంఖ్య- 40. వీటిలో 4 మైనారిటీవి. వాటిలో అత్యంత ప్రాచుర్యమున్న మణిపాల్ కూడా ఉంది. ఈ మొత్తం డీమ్డ్ యూనివర్సిటీల్లో 5109 సీట్లున్నాయి. వీటిల్లోని సీట్లకు రిజర్వేషన్లు వర్తించవు. అన్ని సీట్లూ జనరల్ లేదా ఎన్ఆర్ఐ విభాగంలోనే నింపుతారు. తెలుగు విద్యార్థులు ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాది ఫీజు రూ.10 లక్షల నుంచి రూ. 17 లక్షల వరకు ఉంది. దీనికి ఇప్పుడు దరఖాస్తు చేయాలన్నా మొదట రూ.2,05,000 కట్టి దరఖాస్తు చేసుకోవాలి. కచ్చితంగా చేరాలనుకునే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడం మంచిది. కొన్ని కళాశాలల్లో నీట్ మార్కులు 200లోపు ఉన్నా సీటు సాధించే అవకాశముంది.

తెలుగు విద్యార్థులు ఏయే కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది?

తెలుగు విద్యార్థులు ఏఐక్యూ, ఏపీ స్టేట్ సీట్లకు ఎన్‌టీఆర్ యూహెచ్‌ఎస్, టీఎస్ సీట్లకు కేఎన్ఆర్ యూహెచ్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి. వీటిద్వారా ప్రభుత్వ కళాశాలల్లోని మెడికల్ సీట్లు, ప్రైవేటు కళాశాలల్లోని కేటగిరీ-ఎ వరకు సీట్లు నింపుతారు. కేటగిరీ-బి, సి సీట్లకు సంబంధిత రాష్ట్రాలు నోటిఫికేషన్ ఇస్తాయి. వాటి ఆధారంగా ఇష్టమైనవాటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఉదాహరణకు- తమిళనాడులో ప్రైవేటు మెడికల్ కళాశాలలో చేరడానికి 19వ తేదీ తుదిగడువుగా నోటిఫికేషన్ జారీ అయ్యింది. అలాగే కర్ణాటకలోని ప్రైవేటు మెడికల్ కళాశాలలకు అయితే 21 ఆఖరితేదీ అవుతుంది.

స్టేట్ కౌన్సెలింగ్‌లో గత ఏడాది ఏ ర్యాంకులకు సీట్లు వచ్చాయి?

తెలుగు రాష్ట్రాల్లో గత ఏడాది యూనివర్సిటీ ప్రాతిపదికగా కటాఫ్ ర్యాంకులను www.eenadupratibha.net లో చూడండి. కొంత అవగాహన వస్తుంది.

ఎంబీబీఎస్- 2018 అడ్మిషన్లు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ఎలా ఉంటుంది?

ఏఎఫ్ఎంసీ- పుణెలో మొత్తం 145 సీట్లు ఉన్నాయి. వీటిలో 117 అబ్బాయిలకు, 28 సీట్లు అమ్మాయిలకు రిజర్వ్ చేసి ఉంటాయి. వీటిని ఆలిండియా కోటా(ఏఐక్యూ) ద్వారా నింపుతారు. మిలటరీలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు కేటాయించిన రిజర్వేషన్ సీట్లను నీట్ ర్యాంకు ఆధారంగా ఏఎఫ్ఎంసీ భర్తీ చేసుకుంటుంది. ఏఐక్యూ ద్వారా సీటు సాధించిన విద్యార్థి ఏఎఫ్ఎంసీలో మౌఖికపరీక్ష, దేహదార్ఢ్య పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంటుంది. గత ఏడాది కటాఫ్ మార్కు బాలికలకు 600 కాగా అబ్బాయిలకు 570.

ఈఎస్ఐసీ మెడికల్ కళాశాలలు ఎన్ని? వాటి అడ్మిషన్ ప్రక్రియ ఎలా ఉంటుంది?

ఇవి మొత్తం 9. బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ఫరిదాబాద్, గుల్బర్గా, హైదరాబాద్, కొల్లాం, కోయంబత్తూరు, మండిల్లో ఉన్నాయి. వీటిలో కొన్నింటిని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చారు. మొత్తం సీట్లను మూడు భాగాలుగా నింపుతారు. 1. ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) 2. స్టేట్ గవర్నమెంట్ కోటా 3. ఇన్స్యూర్‌డ్ పర్సన్స్ కోటా (337 సీట్లు). స్టేట్ గవర్నమెంట్ కోటా వివిధ రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉంది. అందువల్ల కళాశాల ప్రాతిపదికగా చేసుకోవాల్సి ఉంటుంది.

సెంట్రల్ యూనివర్సిటీల సంగతి?

సెంట్రల్ యూనివర్సిటీలు ముఖ్యంగా అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ), బెనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ), దిల్లీ యూనివర్సిటీ మొదలైనవి ఉన్నాయి. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో సీట్లను రెండు విధాలుగా నింపుతారు. 1) ఓపెన్ 2. ఇంటర్నల్. ఓపెన్‌లో 72 సీట్లున్నాయి. ఈ సీట్లను ఏఐక్యూ కౌన్సెలింగ్ ద్వారా నింపుతారు. ఇంటర్నల్‌లో 73 సీట్లున్నాయి. అక్కడ 3 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న వారికి నీట్ ర్యాంకు ఆధారంగా 73 సీట్లను యూనివర్సిటీ భర్తీ చేసుకుంటుంది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో మొత్తం 84 సీట్లున్నాయి. వీటిని కూడా ఏఐక్యూ ద్వారా నింపుతారు. ఇక్కడ ఇంటర్నల్ సీట్లు లేవు. దిల్లీ వర్సిటీకి దరఖాస్తు చేయడానికి అక్కడ ప్రాథమిక విద్యాభ్యాసం చేసినవారు మాత్రమే అర్హులు.

క్రిస్టియన్ మెడికల్ కాలేజ్, వెల్లూరు ఏఐక్యూ కళాశాలల్లో లేదు. ఎందుకని?

సీఎంసీ వెల్లూరులో అడ్మిషన్ పొందాలనుకునేవారికి గతంలోనే దరఖాస్తు చేసుకోమని నోటిఫికేషన్ వచ్చింది. అప్పుడు దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే అడ్మిషన్లలో పాల్గొనే అవకాశం ఉంటుంది. సీఎంసీలో సీటును నీట్ ర్యాంకు ద్వారానే ఇస్తారు. దీనిలో మొత్తం సీట్లు- 100. వీటిలో 42 సీట్లను బాలికలకు కేటాయిస్తారు. సీఎంసీ వెల్లూరు ఆల్ ఇండియా ఓపెన్ ఎంబీబీఎస్ సీట్లు- 16. ఎ) భారత ప్రభుత్వం ఒక అభ్యర్థిని ఎంపిక చేస్తుంది. బి) ఆల్ ఇండియా ఓపెన్ ఎంబీబీఎస్ సీట్లలోని 20% (3) సీట్లను ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు కేటాయిస్తారు. దీనిలోని మొత్తం స్పాన్సర్డ్ సీట్లు- 84.

ఏఐక్యూ దరఖాస్తు చేసుకునేవారికి గత ఏడాదికీ, ఇప్పటికీ తేడా ఉందా?

గత ఏడాది వరకూ ఏఐక్యూలో దరఖాస్తు చేసుకోవడానికి సీట్ల సంఖ్యకు 5 రెట్ల వరకు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశమిచ్చేవారు. కటాఫ్ ర్యాంకు ఇచ్చి ఆ ర్యాంకులోపు వారిని మాత్రమే దరఖాస్తు చేసుకోమనేవారు. కానీ ఈ ఏడాది నుంచి నీట్‌లో క్వాలిఫై అయిన ప్రతి విద్యార్థీ దరఖాస్తు చేసుకోవచ్చు. గత ఏడాది 5 కళాశాలల వరకే ఎంపికకు అవకాశం ఇచ్చేవారు. ఇప్పుడు 193 మెడికల్, 40 డెంటల్ కలిపి 233 కళాశాలలను కూడా ఎంచుకోవచ్చు. ఎంపికలో ఎన్ని కళాశాలలకు పరిమితం కావాలనే నిబంధన లేదు.

ఏపీ లేదా తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు అదే రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలకు ఏఐక్యూలో దరఖాస్తు చేసుకోవచ్చా?

జమ్మూ కశ్మీర్ విద్యార్థులు మినహా ఏఐక్యూలో ఏ రాష్ట్రంలోని సీటుకైనా ఏ రాష్ట్ర విద్యార్థి అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. అంటే తెలుగు విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లోని మెడికల్ కళాశాలలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే తెలుగు రాష్ట్రాల్లోన్ని కొన్ని మెడికల్ కళాశాలలను జాబితాలో చేర్చలేదు. అందువల్ల 18వ తేదీ చివరివరకూ చాయిస్‌లు చూసుకుని లాక్ చేసుకోవడం మేలు. ఒకవేళ లాక్ చేయకపోయినా సేవ్ అండ్ ప్రొసీడ్ ఆప్షన్ చేసుకుని ఉండుంటే 19 మధ్యాహ్నానికి ఆటోమేటిక్‌గా ఆప్షన్స్ లాక్ అయిపోతాయి.

ఏఐక్యూలో దరఖాస్తు చేసుకుంటే సీటు వదులుకోవచ్చా?

ఏఐక్యూలో దరఖాస్తు చేసుకున్నవారికి రౌండ్-1 తర్వాత ఎగ్జిట్ ఆప్షన్ ఉంది. తరువాత పాల్గొనకూడదనుకుంటే రౌండ్-1 తరువాత వదిలేయొచ్చు. అప్పుడు ఎలాంటి అపరాధ రుసుము లేదు. కాబట్టి రౌండ్-2కి వెళ్లేటపుడు జాగ్రత్త తీసుకోవాలి.

ఏఐక్యూలో ఒకవేళ 18వ తేదీలోపు దరఖాస్తు చేయలేకపోతే మళ్లీ చేయవచ్చా?

చేసుకోవచ్చు. మళ్లీ రౌండ్-2 ప్రారంభానికి చేయాలి. అయితే వారికి రౌండ్-2లో ఏర్పడిన అదనపు సీట్లకు మాత్రమే అర్హత లభిస్తుంది. అలాగే మాప్ అప్ రౌండ్‌లోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రౌండ్-2 తరువాత ఏఐక్యూలో మిగిలిపోయిన సీట్లను సంబంధిత రాష్ట్రాలకు బదిలీ చేస్తారు.

నీట్, ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ

అంశం	ఆలిండియా కోటా	డీమ్డ్+సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్స్	స్టేట్ కౌన్సెలింగ్
మొదటి రౌండు కౌన్సెలింగ్	12 జూన్ - 24 జూన్	12 జూన్ - 24 జూన్	25 జూన్- 5 జులై
జాయినింగ్ చివరి తేదీ	3 జులై	3 జులై	12 జులై
రెండో రౌండు కౌన్సెలింగ్	6 జులై- 12 జులై	6 జులై- 12 జులై	15 జులై- 26 జులై
జాయినింగ్ చివరి తేదీ	22 జులై	22 జులై	3 ఆగస్టు
మాప్ అప్ రౌండు		12 ఆగస్టు- 22 ఆగస్టు	4 ఆగస్టు- 8 ఆగస్టు
జాయినింగ్ చివరి తేదీ		26 ఆగస్టు	12 ఆగస్టు

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

తెలంగాణ కేజీబీవీల్లో 1050 ఖాళీలు

తెలంగాణ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది. కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే వీటికి అర్హులు. **పోస్టులు-ఖాళీలు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్ (పీజీసీఆర్‌టీ)-580, స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ)-49, కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్ (సీఆర్‌టీ)-359, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)-62.

అర్హత: ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీఈడీ, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా, బీపీఈడీ, టీఎస్ టెట్/ ఏపీ టెట్/ సీటెట్‌లో అర్హత. **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు: 20.06.2018 నుంచి 23.06.2018 వరకు.

http://ssa.telangana.gov.in/

డ్రెడ్జింగ్ కార్పొరేషన్, విశాఖపట్నం

సంస్థ: భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖకు చెందిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, విశాఖపట్నం.

పోస్టులు-ఖాళీలు: అప్రెంటిసెస్-20, డ్రెడ్జ్ కేడెట్-15, ట్రైనీ మెరైన్ ఇంజినీర్-15, ట్రైనీ ఎలక్ట్రికల్ ఆఫీసర్-15, ఎన్‌సీవీ (ట్రైనీస్)-15. **మొత్తం ఖాళీలు:** 80

అర్హత: పదోతరగతి, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ద్వారా గుర్తింపు పొందిన సంస్థల నుంచి ఆయా బ్రాంచుల్లో సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ కోర్సుల ఉత్తీర్ణత. **ఎంపిక:** అకడమిక్ మెరిట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరి తేది:** అప్రెంటిస్ ఖాళీలకు జులై 3, మిగిలినవాటికి జులై 1.

వెబ్‌సైట్: http://www.dredge-india.com/

ప్రవేశాలు

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

అనంతపురం జిల్లాలో కొత్తగా నెలకొల్పిన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 2018-19 విద్యా సంవత్సరానికిగానూ వివిధ యూజీ, పీజీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ దీనికి మెంటర్ వర్సిటీగా వ్యవహరిస్తోంది. **కోర్సులు:** బీఎస్సీ అర్థశాస్త్రం, బీఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిష్ తదితరాలు. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా. **పరీక్ష తేది:** 08.07.2018

పరీక్షా కేంద్రాలు: అనంతపురం, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, నాగ్‌పుర్, గువాహటి, దిల్లీ. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరి తేది:** 30.06.2018 **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నిట్, కాలికట్‌లో 125 పోస్టులు

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), కాలికట్ **పోస్టులు:** టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు (తాత్కాలిక) **ఖాళీలు:** 125 **అర్హత:** ఐటీఐ, డిప్లొమా, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంసీఏ, అనుభవం. **వయసు:** 27 సంవత్సరాలకు మించకూడదు. **ఇంటర్వ్యూ తేది:** 2018 జులై 2, 3, 4, 5. **వేదిక:** సంబంధిత విభాగాధిపతుల కార్యాలయాలు, నిట్ కాలికట్, కోజికోడ్, కేరళ. **వెబ్‌సైట్:** http://www.nitc.ac.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

స్వచ్ఛతకు 'పాత'ర!

- ఆధునికతకు అధికారుల అడ్డుపుల్లలు
- పారిశుద్ధ్యం మెరుగుకు రోడ్డెక్కని కొత్త వాహనాలు
- చక్కని లక్ష్యానికి నిర్లక్ష్యపు జబ్బు

ఈనాడు, అమరావతి: పట్టణాల్లో మెరుగైన పారిశుద్ధ్యం కోసం స్వచ్ఛాంధ్రప్రదేశ్ సంస్థ రూ. 2 కోట్లకుపైగా వెచ్చించి పురపాలక సంఘాలకు కేటాయించిన వాహనాలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగమవుతున్నాయి. రహదారుల శుభ్రత, కాలువల్లో పూడిక తొలగింపు, డంపింగ్ యార్డుకు వ్యర్థాల తరలింపు తదితరాలకు ఆధునిక వాహనాలు సమకూర్చారు. వీటి వినియోగంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణ ఖర్చు తగ్గే అవకాశమున్నా కొందరు అధికారులు.. కొత్త వాహనాలను పక్కన పెట్టి పాత పద్ధతిలోనే పనులు నడిపిస్తున్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

ఆలోచన మంచిదే.. ఏం లాభం?

రాష్ట్రంలోని నగరపాలికలు, పురపాలక సంఘాలను బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా ప్రకటించాక వాటిలో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారు. అక్కడ ఉత్పత్తయ్యే వ్యర్థాలను శివారుల్లోని డంపింగ్ యార్డులకు తరలించేందుకు అద్దె టిప్పర్లను వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో 471 కాంపాక్టర్లను స్వచ్ఛాంధ్రప్రదేశ్ సంస్థ ఏడాది క్రితం దశల వారీగా కేటాయించింది. వీటిలో ఇప్పటికీ 28 శాతం వాహనాలను ఉపయోగించడం లేదు. సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలు చూపించి 18 పట్టణాల్లో అద్దె వాహనాలనే వాడుతున్నారు. కాలువల్లోంచి మురుగు బయటకు తీసేందుకు, రహదారుల శుభ్రతకు పంపిన 115 ట్రక్ మౌంటెడ్, మినీ స్వీపర్లలో 44శాతం ఇప్పటికీ పురపాలక కార్యాలయాలకే పరిమితమయ్యాయి. వీటిని వినియోగిస్తే ఒప్పంద కార్మికుల, కాంట్రాక్టు పనుల కోసం చేస్తున్న ఖర్చులో సగానికిపైగా తగ్గే అవకాశం ఉంది. 22 నగరపాలక, పురపాలక సంఘాల్లో ఆధునిక హంగులతో కొత్త వాహనాలు అందుబాటులో ఉన్నా పాత తంతునే నడిపిస్తున్నారు.

డ్రైవర్లు లేరట...శిక్షణ అవసరమట!

కొత్త వాహనాలు వినియోగించి పారిశుద్ధ్య కార్యక్రమాల ఖర్చుని తగ్గించుకోవాలని ఉన్నత స్థాయిలో ఆదేశాలున్నా కొందరు కమిషనర్లు, అధికారులు పట్టించుకోవడం లేదు. కొత్త వాహనాలు నడిపే డ్రైవర్లు లేరని, ఉన్నా వారందరికీ శిక్షణ అవసరమని కొత్త పల్లవి అందుకుంటున్నారు. దీంతో ఖరీదైన యంత్రాలు తుప్పుపడుతున్నాయి. నగర, పురపాలికల బడ్జెట్‌లో అత్యధిక శాతం ఖర్చు చేస్తున్నది పారిశుద్ధ్య కార్యకలాపాల కోసమే. అదే స్థాయిలో ఈ విభాగంలో అక్రమాలు, అవకతకలకు కొదవ లేదు. ఒప్పంద కార్మికుల సేవల వినియోగం నుంచి పారిశుద్ధ్య పని ముట్ల కొనుగోళ్లు, ఇతర పనుల నిర్వహణ లోనూ కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఇలాంటి వారందరికీ కొత్తగా పంపిన ఆధునిక యంత్రాలు, వాహనాలు మింగుడుపడటం లేదు.

తిరుపతి నగరపాలికకు పంపిన వాహనాల దుస్థితి ఇది. చాలా వాహనాలను ఇప్పటికీ రోడ్లపైకి తీసుకొచ్చే ప్రయత్నమే మొదలు కాలేదు.

రహదారులపై మట్టి, దుమ్మును తొలగించి శుభ్రం చేసేందుకు పుట్టపర్తి నగర పంచాయతీకి మూడు నెలల క్రితం పంపిన మినీ స్వీపర్ ఇది. ఈ వాహనాన్ని నడిపే డ్రైవర్ లేరన్న కారణంతో ఇలా పక్కన పెట్టారు. ఇక్కడ అధికారుల చొరవ కరవైంది.

అన్ని చోట్లా వినియోగించేలా చూస్తాం...

పట్టణాల్లో పారిశుద్ధ్య పనుల కోసం స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కేటాయించిన వాహనాలన్నీ వినియోగించేలా కమిషనర్లకు ఆదేశాలిచ్చాం. తాజాగా వీటి వినియోగంపై 'వెహికల్ ట్రాకింగ్ సిస్టం' ఏర్పాటుచేస్తున్నాం. సదుద్దేశంతో ఆధునాతన వాహనాలను తెప్పించి ఇచ్చినందున వీటిని సమర్థంగా ఉపయోగించాల్సిన బాధ్యత పురపాలికలపై ఉంది. డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. ఇప్పటికీ వీటిని ఏ కారణంతో వినియోగించడం లేదో తెలుసుకుంటున్నాం.

–డి.మురళీధర్‌రెడ్డి, ఎండీ, స్వచ్ఛాంధ్ర సంస్థ

పట్టణాల్లో మెరుగైన పారిశుద్ధ్యం కోసం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వివిధ పురపాలక, నగరపాలక సంస్థలకు పంపిన వాహన వివరాలు...

- కాంపాక్టర్లు : 140 (14 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం)
- కాంపాక్టర్లు : 331 (6 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం)
- ట్రక్ మౌంటెడ్ స్వీపర్లు : 15
- మినీ స్వీపర్లు : 100 (1 క్యూబిక్ మీటర్ సామర్థ్యం)
- తోపుడు బళ్లు (పుష్‌కార్ట్స్) : 8,232
- తొట్టెలు (బిన్స్) : 81,887

అనంతపురం నగరపాలికకు కేటాయించిన కొత్త వాహనాల దుస్థితి ఇది. కాలువల్లో పూడికలు తొలగించేందుకు, ఇతర పారిశుద్ధ్య పనులకు ఉపయోగించాల్సిన వీటిని పక్కన పెట్టారు. వీటిపై అవగాహన కలిగిన డ్రైవర్లు లేనందునే పక్కన పెట్టినట్లు అధికారులు సెలవిస్తున్నారు.

'ఎన్‌ఏబీహెచ్' సాధన దిశగా అడుగులు

- ప్రారంభమైన బోధనాస్పత్రుల అభివృద్ధి పనులు
- సౌర విద్యుత్తు సమకూర్చుకునే దిశగా చర్యలు

ఈనాడు అమరావతి: ప్రభుత్వ బోధనాస్పత్రులు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు సాధించే దిశగా (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్) అడుగులు వేస్తున్నాయి. రూ.167 కోట్లతో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. సొంతంగా సౌర విద్యుత్తును సమకూర్చుకునే చర్యలూ మొదలయ్యాయి. వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టిన సంస్కరణలకు అనుగుణంగా బోధనాస్పత్రుల్లో రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడం ద్వారా లభించే ఎన్‌ఏబీహెచ్ గుర్తింపునకు అధిక ప్రాధాన్యం ఉంది. ఈ గుర్తింపు కలిగిన ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు సైతం రాష్ట్రంలో పరిమితంగానే ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులు దానిని పొందడం దేశంలో చాలా అరుదనే చెప్పాలి. రాష్ట్ర వైద్య విద్య సంచాలక కార్యాలయ పరిధిలోని 15 బోధన, ఇతర ప్రత్యేక ఆస్పత్రులకు ఎన్‌ఏబీహెచ్ వచ్చేలా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. ఈ గుర్తింపు వస్తే రోగుల్లో మరింత విశ్వాసం పెరుగుతుందన్నారు.

ప్రత్యేక సంస్థ ద్వారా అధ్యయనం: ఎన్‌ఏబీహెచ్ సాధించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి? ప్రస్తుతం ఆస్పత్రులు ఎలా ఉన్నాయన్న దానిపై ప్రత్యేక సంస్థ ద్వారా ఆరోగ్యశాఖ అధ్యయనం చేయించింది. దీని నివేదిక ప్రకారం ఆస్పత్రుల్లో అభివృద్ధికి గానూ అవసరమైన రూ.167 కోట్లను ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ద్వారా సమీకరిస్తున్నారు. ఈ విశ్వవిద్యాలయం తొలివిడతగా సగం నిధులను ప్రభుత్వానికి ఇప్పటికే మళ్లించింది. ఈ నిధులతో కేజీహెచ్, తిరుపతి, నెల్లూరు, కడప, కాకినాడ, గుంటూరు, కర్నూలు, ఒంగోలు, తిరుపతి, శ్రీకాకుళం, విశాఖలోని విక్టోరియా, మానసిక వైద్యశాల తదితరాలను అభివృద్ధి చేయనున్నట్లు ఆమె తెలిపారు.

తొలివిడతలో పెద్ద ఆసుపత్రులకు..: ఆధునిక అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయడం, మురుగునీటి వ్యవస్థను మెరుగుపరచడం, ఆపరేషన్ థియేటర్ల ఆధునికీకరణ వంటి పనులు మొదలవుతున్నాయి. ఇందుకోసం కేజీహెచ్‌కు రూ.22.6 కోట్లు, గుంటూరు ఆస్పత్రికి రూ.11.5 కోట్లు, కర్నూలు ఆస్పత్రికి రూ. 22 కోట్ల రూపాయల వంతున నిధులను కేటాయించారు. తొలివిడతలో మూడు వందలు, ఆపై పడకలు కలిగిన ఆస్పత్రులను మాత్రమే ఎన్‌ఏబీహెచ్ కోసం ఎంపికచేశారు. సౌర విద్యుత్తు ద్వారా ఆస్పత్రుల విద్యుత్తు అవసరాలను తీర్చుకునేలా నెడ్‌క్యాప్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పూనం మాలకొండయ్య పేర్కొన్నారు.

ఘనంగా ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీభోగ శ్రీనివాసమూర్తికి ఆదివారం ప్రత్యేక సహస్ర కలశాభిషేకం జరిగింది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల మధ్య బంగారు వాకిలి చెంత భోగ శ్రీనివాసమూర్తికి అర్చకస్వాములు ఏకాంతంగా సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. పల్లవరాణి సామవాయి పెరుందేవి క్రీ.శ.614వ సంవత్సరం జ్యేష్ఠమాసంలో 18 అంగుళాల ఎత్తుగల వెండి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని ఆలయానికి కానుకగా సమర్పించారు. పల్లవరాణి కానుకకు సంబంధించిన శాసనం ఆలయ మొదటి ప్రాకారంలోని విమాన వేంకటేశ్వరస్వామివారి విగ్రహానికి కింది భాగంలో గోడపైన కనిపిస్తుంది. రాణి కానుకను సమర్పించిన సందర్భంగా 12 ఏళ్లుగా ఏటా ప్రత్యేక సహస్ర కలశాభిషేకాన్ని తితిదే నిర్వహిస్తోంది. మరోవైపు తిరుమలలో యాత్రికుల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. శ్రీవారి ధర్మదర్శనానికి కిలోమీటరు పొడవున యాత్రికులు వరుసల్లో వేచి ఉన్నారు.

ప్రత్యేక సహస్రకలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ గణపతి ఈ సారి 'శ్రీ సప్తముఖ కాళసర్ప మహాగణపతి'గా కొలువుదీరనున్నాడు. విగ్రహం ఎత్తు 57 అడుగులు, వెడల్పు 24 అడుగులుగా ఉండనుంది. వినాయకుడు ఏడు తలలు, 14 చేతులతో ఉండనున్నాడు. తలపై ఏడు సర్పాలతో అలంకరణ కానుంది. – ఈనాడు, హైదరాబాద్

విశాఖ, కృష్ణా జిల్లాల్లో వడగాల్పులు

నేడూ భీకరమైన ఎండలు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖపట్నం, కృష్ణా జిల్లాల్లో ఆదివారం ఎండ మండిపోయింది. విశాఖలో ఆదివారం సాధారణం కన్నా 7.4 డిగ్రీలు అదనంగా 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. వడగాల్పులు వీచాయి. కాకినాడ, మచిలీపట్నంలోనూ సాధారణం కన్నా 5 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది. వీటి చుట్టుపక్కల జిల్లాల్లోనూ ఎండతీవ్రత ఎక్కువగా కనిపించింది. వాయువ్య దిశ నుంచి వస్తున్న వేడిగాలుల ప్రభావంతో ఈ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లో సోమవారం కూడా వడగాల్పులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు హెచ్చరించారు. చాలా ప్రాంతాల్లో 40 నుంచి 42 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాల్ని అనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో సముద్రపు గాలులు తీరం దిశగా రావడం లేదని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేకించి కోస్తాంధ్ర వ్యాప్తంగా సాధారణం కన్నా 3 నుంచి 7 డిగ్రీల అదనపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోపక్క ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో సోమవారం పలుచోట్ల వర్షాలకు అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

సముద్రంలో మునిగి ముగ్గురు మృతి, ఒకరు గల్లంతు

విశాఖపట్నం(పరవాడ), న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి తిక్కవానిపాలెంతీరంలో సముద్రంలో మునిగి ముగ్గురు యువకులు మృతిచెందగా మరొకరు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరవాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో (2007-08)బ్యాచ్‌లో పదోతరగతి పూర్తి చేసిన 90మంది.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటుచేసుకుని తిక్కవానిపాలెం తీరంలో సరదాగా గడపడానికి వచ్చారు. సాయంత్రం తీరంలో ఈత కొట్టడానికి దిగారు. ఈ క్రమంలో బలమైన కెరటం రావడంతో పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన పైలా మహేష్(26), మాసవరపు నరేష్(26), సిరపురపు రామకృష్ణ, లాలం నర్సింగరావు(26) లోపలికి కొట్టుకుపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న మహేశ్, నరేశ్, రామకృష్ణలను అతికష్టం మీద తోటివిద్యార్థులు బయటికి తీసుకొచ్చి గాజువాకలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధరించారు. గల్లంతైన నర్సింగరావు ఆచూకీ తెలియరాలేదు.

గ్రిడ్‌కు మేలు.. రైతుకు రొక్కం!

- సాగుకు ఉచితంగా సౌర పలకలు, అధునాతన పంపు సెట్లు
- గ్రిడ్‌కు మిగులు విద్యుత్తు అమ్మడంద్వారా అదనపు ఆదాయం
- 32 గ్రామాల్లో ఈపీడీసీఎల్ వినూత్న ప్రయోగం
- విజయనగరం జిల్లాలో ప్రారంభించిన ఈపీడీసీఎల్

భోగాపురం మండలం బసవపాలెంలో సౌర పంపుసెట్టును పవర్‌గ్రిడ్‌తో అనుసంధానించే ప్రక్రియను ప్రారంభించిన ఏపీఈపీడీసీఎల్ సీఎండీ హెచ్.వై.దొర తదితరులు

ఈనాడు, విశాఖపట్నం, భోగాపురం, న్యూస్‌టుడే: రైతులకు ఆదాయం పెంచడం, గ్రిడ్ మీద విద్యుత్తు భారాన్ని తగ్గించడం లక్ష్యాలుగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) వినూత్నంగా ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా గ్రామాల్లో 100 శాతం సౌర విద్యుత్తు వ్యవసాయాన్ని పరిచయం చేయడానికి విజయనగరం జిల్లా సవరవల్లి ఫీడర్‌ను ఎంచుకుంది. తొలి విడతగా అక్కడి 32 గ్రామాల్లోని 251 వ్యవసాయ కనెక్షన్లను పూర్తిగా సౌర విద్యుత్తును అందేలా చేస్తారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారిగా భోగాపురం మండలం బసవపాలెంలో రైతు చౌదరి పొలంలో సౌర పంపుసెట్టును పవర్‌గ్రిడ్‌కు అనుసంధానించే ప్రక్రియను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ హెచ్.వై.దొర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.64వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల సౌర పంపుసెట్లను ఏర్పాటు చేసి పవర్‌గ్రిడ్‌తో అనుసంధానించే ప్రణాళిక ఉన్నట్లు తెలిపారు. రైతులకు భారం లేకుండా ఒక్కో పంపుసెట్టుకు రూ.4లక్షల మేర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఇందులో చిన్నలోపం తలెత్తినా 24గంటల్లో కొత్తది అమర్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. సాధారణంగా విద్యుత్తు అందని ప్రాంతాల్లో మాత్రమే సౌర విధానాన్ని ఏపీఈపీడీసీఎల్ ఇప్పటి వరకు ప్రోత్సహిస్తూ వచ్చింది. కానీ గ్రిడ్‌పై భారం తగ్గిస్తూ ఈ పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది.

9 గంటలపాటు వినియోగం..

ప్రస్తుతం ఎంపిక చేసిన రైతులంతా 3హెచ్‌పీ, 5హెచ్‌పీ పాత మోటార్లతో వ్యవసాయం చేస్తున్నారు. పాత మోటార్ల (ఏసీ) స్థానంలో బ్రష్‌లెస్ డీసీ (బీఎల్‌డీసీ) మోటార్లను ఈపీడీసీఎల్ ఉచితంగా అందిస్తుంది. ఇలా 210 మందికి 3హెచ్‌పీ, 41 మందికి 5హెచ్‌పీ మోటార్లు ఇస్తున్నారు. వీటితో పాటు 3హెచ్‌పీ రైతులకు 3 కిలోవాట్ సౌర పలకలు, 5హెచ్‌పీ రైతులకు 4.8 కిలోవాట్ సౌర పలకల్ని ఉచితంగా అందిస్తున్నారు. ఏసీ మోటార్లతో పోల్చితే బీఎల్‌డీసీ మోటార్లు 20-25 శాతం సమర్థంగా పని చేస్తాయని, 20 శాతం అదనపు నీటిని తోడుతాయని అధికారులంటున్నారు. ఉదయం పూట వచ్చే సౌర విద్యుత్తు ద్వారా రోజుకు 8-9 గంటలు మోటార్లను వేసుకుని నీరు పట్టుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అన్నదాతకు ఆదాయం..

ఈ ప్రాజెక్టు ద్వారా రైతులు తాము తయారు చేస్తున్న సౌర విద్యుత్తును డిస్కంకు అమ్మేలా, ప్రతి నెలా ఆదాయం పొందేలా ఈపీడీసీఎల్ ఏర్పాట్లు చేస్తోంది. 1 కిలోవాట్ సౌర పలకలు నెలకు 144 యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. 5హెచ్‌పీకి ఉండే పలకలు నెలకు 3,732 యూనిట్లను, 3హెచ్‌పీకి ఉండే పలకలు 2,032 యూనిట్ల విద్యుత్తును తయారు చేస్తాయని అంచనా. రైతు వాడుకున్నదిపోను మిగిలింది గ్రిడ్‌కు వెళ్లేలా నెట్ మీటర్లను అమర్చనున్నారు. ఇదివరకు సౌర పలకల ద్వారా ఎన్ని యూనిట్లు విడుదలైనా.. అందులో కొంతవరకే రైతు వాడుకునేవారు. స్టోరేజీ లేకపోవడం వల్ల మిగిలింది వృథాగా పోయేది. ఇప్పుడు గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నందున వృథా మాటే లేదు. దీనివల్ల యూనిట్‌కు రూ.2 చొప్పున ఆదాయం వస్తుంది. ఎంత లేదన్నా.. ఏటా రూ.4 వేల చొప్పున ఆదాయం రైతుకు వస్తుందని అంచనా. నెలానెలా లెక్కలు కట్టి ఆ రైతు ఖాతాకే డబ్బులు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పేరును సార్థకం చేస్తారా..!

- మూడేళ్లయినా ముందుకు కదలని 'పీతల హేచరీ'
- రూ.40 కోట్లు నిధులున్నా నిష్ఫలం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పీతల హేచరీకి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. 2015లో ప్రారంభమైన ప్రాజెక్టుకు రూ. 40 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో 9 ఎకరాల విస్తీర్ణంలో పీతల హేచరీ ఏర్పాటుకు అన్ని అనుమతులు వచ్చాయి. 2017 ఫిబ్రవరి 9న సీఎం చంద్రబాబు నాయుడు చేత శంకుస్థాపనకు ఏర్పాట్లు సైతం చేశారు. అప్పట్లో శాసనమండలి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శంకుస్థాపన ఆగిపోయింది. అనంతరం హేచరీకి కేటాయించిన స్థలాన్ని పర్యటకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి పర్యటకశాఖకు కేటాయించారు. ప్రత్యామ్నాయంగా బాపట్ల మండలం పాండురంగాపురంలో 28 ఎకరాల అసైన్డు భూమిని కేటాయించారు. మే 2018న రెవెన్యూశాఖ మత్స్యశాఖకు భూమిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో మళ్లీ మొదటి నుంచి అనుమతులు పొందే ప్రయత్నాలు ప్రారంభించారు.

ఆదినుంచీ అడ్డంకులే..: సూర్యలంక తీరంలో పీతలహేచరీ ఏర్పాటుకు అనుకూలంగా గుర్తించిన ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దీనికి కేంద్రం 50శాతం నిధులిచ్చేందుకు అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం సూర్యలంక తీరంలో అటవీశాఖ నుంచి 9 ఎకరాల భూమి తీసుకుని మత్స్యశాఖకు బదిలీ చేసింది. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ బృందం పీతల హేచరీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి అనుకూలంగా ఉన్నట్లు నివేదిక ఇచ్చింది. ఎంపెడా ఆధ్వర్యంలోని రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వాకల్చర్(ఆర్‌జీసీఏ) పీతల హేచరీ ఏర్పాటుకు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ముందుకువచ్చింది. సీఎం సమక్షంలో మత్స్యశాఖ, ఎంపెడా ప్రతినిధుల నడుమ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. హేచరీ నిర్మాణాన్ని పర్యవేక్షించే బాధ్యతను వ్యాప్కోస్‌కు అప్పగించారు. అన్ని ప్రక్రియలు పూర్తయిన సమయంలో హేచరీని మరోచోటికి బదలాయించడంతో నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సూర్యలంక తీరంలో పీతల హేచరీ ఏర్పాటయితే సాగుకు సమస్యలు ఉండవని భావించిన రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. ప్రస్తుతం రైతులు పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం వద్ద మండపం ప్రాంతంలోని ప్రైవేటు హేచరీల నుంచి పీతపిల్లలను తెచ్చుకుంటున్నారు. నాణ్యమైన పిల్లల లభ్యత లేక సాగుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

మొదటికొచ్చిన ప్రక్రియ: కొత్తగా కేటాయించిన భూమిని కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ(సీఏఏ) అధికారులు పరిశీలించి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. ఆపై కొత్త డీపీఆర్ తయారుచేసి మళ్లీ అనుమతులు తీసుకోవాలి. ఈవిషయమై మత్స్యశాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ 28 ఎకరాల భూమిని పరిశీలించేందుకు ఈనెల చివరి వారంలో సీఏఏ వారు వస్తున్నారన్నారు.

నీట్ భర్తీలో నిర్లక్ష్యం!

- ఎంసీసీ జాబితాలో ప్రధాన కళాశాలలూ కనిపించని వైనం
- సాంకేతిక సమస్యలే కారణం!
- విద్యాలయాల ఎంపికకు 19 వరకే గడువు
- విద్యార్థుల్లో కొనసాగుతున్న ఆందోళన

ఈనాడు, విశాఖపట్నం: జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు దేశంలోని పలు ప్రముఖ వైద్యవిద్య కళాశాలలు ఆన్‌లైన్‌లో కనిపించక విస్మయానికి గురవుతున్నారు. నీట్‌లో అర్హత సాధించిన వారు చేరాలనుకున్న కళాశాలలను ఈ నెల 13 నుంచి 19 వరకు వెబ్‌ఆప్షన్లలో ఎంపిక చేసుకోవచ్చు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు జాతీయ కోటా పరిధిలోకి వెళ్లాయి. ఫలితంగా ఏపీ, తెలంగాణ విద్యార్థులు జమ్మూకశ్మీర్ మినహా అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలల పరిధిలో ఉండే 15 శాతం జాతీయ కోటా సీట్లకు పోటీ పడవచ్చు. జాతీయ కోటా సీట్లకు 222 ప్రభుత్వ వైద్య కళాశాలలను చూపించాల్సి ఉండగా మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) అంతర్జాల చిరునామాలో కేవలం 195 కళాశాలలే కనిపిస్తున్నాయి. 27 కళాశాలల పేర్లు లేవు. దీంతో ఆయా కళాశాలల్లో చేరాలనుకుంటున్న వారు నిరాశకు గురవుతున్నారు. జాతీయ కోటాలో భర్తీ కావాల్సిన 1715 ఎంబీబీఎస్, డెంటల్ సీట్లు ఆ వైద్య కళాశాలలున్న రాష్ట్రాల విద్యార్థులతోనే భర్తీ అయ్యే పరిస్థితి ఏర్పడిందనే వ్యాఖ్యలున్నాయి. ఈ కళాశాలల పేర్లు కనిపించకపోవడానికి సాంకేతిక లోపాలే ప్రధాన కారణమని భావిస్తున్నారు. లోపాలు, తప్పిదాలు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని టోల్‌ఫ్రీ నెంబరుతోపాటు పలు ఫోన్ నెంబర్లను అంతర్జాల చిరునామాలో పొందుపరిచినప్పటికీ ఒక్క ఫోనూ పనిచేయడం లేదు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఎంసీసీ అధికారులతో పాటు అధికారిక ఈమెయిల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదు. ప్రముఖ వైద్య కళాశాలలే అందుబాటులో లేనందున ఉత్తమ ర్యాంకు వచ్చిన విద్యార్థులు సైతం ప్రస్తుతం వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్న వైద్య కళాశాలల్లోనే చేరేలా వెబ్‌ఆప్షన్లను నమోదు చేస్తున్నారు. కావాల్సిన కళాశాల లేనప్పుడు మంచి ర్యాంకు సాధించి ప్రయోజనమేమిటని వారు వాపోతున్నారు. జాతీయ స్థాయిలో అత్యంత ప్రముఖ వైద్య కళాశాలగా గుర్తింపున్న ఉస్మానియా వైద్య కళాశాల కూడా జాబితాలో లేదు. తెలంగాణలోని ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలు ఎంసీసీ జాబితాలో లేకపోవడంతో అక్కడి స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా నిరాశనిస్పృహలో ఉన్నారు. ఏపీకి చెందిన అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల, ఒంగోలు రిమ్స్ కూడా జాబితాలో లేవు. నీట్‌లో మంచి ర్యాంకు వచ్చినవారు వారి సొంత రాష్ట్రంలోని కళాశాలల్లో చేరితే, ఒకింత పెద్ద ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు అసలు వైద్య విద్యకే దూరమయ్యే పరిస్థితి ఉందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

★ కీలకమైన ఆయా రిజర్వేషన్ల విధానాన్ని కూడా ఎంసీసీ అధికారులు విస్మరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఒ.బి.సి. కేటగిరీకి 27 శాతం రిజర్వేషన్ల కోటా కింద 895 సీట్లను జాతీయ కోటాలో చూపించాల్సి ఉన్నప్పటికీ కేవలం 64 సీట్లు మాత్రమే కన్పిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పులి గాండ్రిస్తోంది

- పెరుగుతున్న వ్యాఘ్రాల సంతతి
- నాలుగేళ్లతో పోలిస్తే పదివరకు పెరిగే అవకాశం
- నల్లమలలో ముగిసిన లెక్కింపు

ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నల్లమలలో పెద్ద పులుల సంఖ్య ఆశాజనకంగానే ఉంది. వీటి గణనను పక్షం కిందటే పూర్తిచేశారు. సంప్రదాయ విధానాలతోపాటు లెక్కింపునకు ఈసారి ఆధునిక సాంకేతికతను వినియోగించారు. అడవిలో 75నుంచి 80వరకు పులులు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వే సులభంగా నిర్వహించేందుకు నల్లమలను మూడు బ్లాకులుగా విభజించారు. బ్లాకు-1లో ఆత్మకూరు, నాగలూటి, శ్రీశైలం, 2లో బైర్లూటి, వెలుగోడు, జీబీఎం, 3లో మార్కాపురం డివిజన్లు ఉన్నాయి.

డిజిటల్ కెమెరాట్రాప్

గతంలో పాదముద్రల ఆధారంగా పులులను లెక్కించేవారు. పులి అరణ్యంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తుండటంతో కచ్చితమైన సంఖ్య తేలేది కాదు. ప్రస్తుతం పులి సంచరించే ప్రాంతాల్లో డిజిటల్ కెమెరాట్రాప్‌లను రహదారులకు ఇరువైపులా చెట్లకు అమర్చారు. కెమెరాల ఇన్‌ఫ్రారెడ్ బీమ్ పరిధిలో ఏవైనా జంతువులు వెళితే అవి చిత్రీకరిస్తాయి. చిత్రాల్లో పులిచారికల ఆధారంగా లెక్కిస్తారు. పాదముద్రలు (పగ్‌మార్క్), మలమూత్ర విసర్జన, పెంటికలు, చెట్లను గోకడం, నేలను గీరడంవంటి వాటి ఆధారంగానూ గుర్తిస్తున్నారు.

కెమెరా ట్రాప్‌నకు చిక్కిన పెద్దపులులు

ఎకలాజికల్ యాప్ సర్వే

పులి సంచరించే ప్రాంతాలను కచ్చితంగా గుర్తించేందుకు ఈ ఏడాది నుంచి ఎకలాజికల్ యాప్‌ను కొత్తగా అందుబాటులోకి తెచ్చారు. ఎందరు సర్వేలో పాల్గొన్నారు? ఎక్కడెక్కడ ఏమేం గుర్తించారు? ఇతర వివరాలు స్వయంచాలితం(ఆటోమేటిక్)గా యాప్‌లో నమోదవుతాయి. నమోదైన అంశాలను రేంజ్ కార్యాలయంలో ఉన్న మరో యాప్‌నకు అనుసంధానించి డివిజన్, సీసీఎఫ్‌కు పంపుతారు. లెక్కింపులో భాగంగా.. ఆయా కేంద్రాల్లోని బయోల్యాబ్‌లలో ఇప్పటిదాకా సేకరించిన పులుల చిత్రాల్లోని చారల ఆధారంగా విడివిడిగా గుర్తించనున్నారు. రెండుమూడు కెమెరాట్రాప్‌లలో చిక్కిన పులుల దృశ్యాలను విశ్లేషించి నిర్దిష్ట సంఖ్యను తేల్చనున్నారు. జులై మొదటివారంలో కేంద్రం పులుల వివరాలను వెల్లడించనుంది.

సంవత్సరం	సంఖ్య
2006	1,411
2010	1,706
2014	2,226
2018	లెక్కిస్తున్నారు.

పులుల సంతతి

- ప్రపంచవ్యాప్తంగా : 3,891
- మన దేశంలో : 2,226 (2014 గణన)
- నల్లమలలో : 68 (ఏపీ, తెలంగాణ)
- శ్రీశైలం-నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ప్రాజెక్టు పరిధిలో : 55

ఆవాసాలు కల్పించాం..

నల్లమలలో పులుల సంతతి పెరుగుతోంది. నాలుగేళ్లలో 10వరకు పెరగవచ్చు. పులులతో పాటు వాటి కూనలున్నాయి. పర్యావరణ పరిరక్షణ, భౌగోళిక వ్యవస్థలో సమతుల్యతను కాపాడడంలో పులి ప్రధానమైనది. పులి ఉంటే అడవి బాగుంటుంది. అడవి బాగుంటే మనం బాగుంటాం. వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత. పులుల సంతతి పెరిగేందుకు అనుకూలమైన ఆవాసాలు కల్పించాం.

– వెంకటేష్, డీఎఫ్‌వో

కోడిగుడ్లు

17న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)	(100కు రూపాయలలో)		
హైదరాబాద్	390	వరంగల్	392
చిల్లరగా (ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	392
బెంగళూరు	425	చెన్నై	452
18వ తేదీకి...		చిత్తూరు	445
విజయవాడ/గోదావరి	384	నమక్కల్	435

అధికస్థాయిల వద్ద నిరోధం!



సమీక్ష : అంతర్జాతీయ, దేశీయ పరిణామాలు సానుకూలంగా ఉండటంతో గత వారం సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. అణ్వాయుధాల నిరోధానికి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకోవడంతో, ప్రపంచ మార్కెట్లకు అనుగుణంగా, దేశీయంగానూ మదుపర్ల సెంటిమెంట్ సానుకూలంగా మారింది. దేశీయంగా మార్కెట్లకు గతవారం మిశ్రమ సంకేతాలందాయి. ఏప్రిల్‌లో పారిశ్రామికోత్పత్తి పెరిగి సంతోషపెడితే, మే నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ఠానికి, టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠానికి చేరి కలవరపెట్టింది. కరెంటు ఖాతా లోటు కూడా జీడీపీలో 1.9 శాతానికి పెరగడాన్ని మార్కెట్లు పరిగణనలోకి తీసుకున్నాయి. అమెరికాలో వడ్డీరేట్లు పెంచడానికి తోడు ఈ ఏడాదిలో మరో 2 విడతలుగా పెంపు ఉంటుందని ఫెడ్ ప్రకటించడం, బాండ్ల కొనుగోలును అక్టోబరు నుంచి సగానికి పరిమితం చేస్తామని ఐరోపా కేంద్ర బ్యాంక్ వెల్లడించడం, జపాన్‌లో పరపతి విధాన సమీక్ష స్థిరంగా కొనసాగించడం, చైనా గణాంకాలు నిరాశపరచడం నేపథ్యంలో, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి. ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.5 శాతం పెరిగి 35,622 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 0.5 శాతం లాభంతో 10,818 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఆరోగ్య సంరక్షణ, ఐటీ, మన్నికైన వినిమయ ఉత్పత్తుల షేర్లు లాభపడగా, లోహ, విద్యుత్, చమురు-సహజవాయువు రంగాల షేర్లు డీలాపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.5295 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐల కొనుగోళ్లు రూ.4014 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదుకావడం.. మార్కెట్‌లో ఒత్తిడి కొనసాగడాన్ని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } మార్కెట్లు వరుసగా నాలుగో వారమూ స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ 35650 పాయింట్ల ఎగువ స్థిరపడినా, అనంతరం లాభాల స్వీకరణ చోటుచేసుకుంది. ఇటీవలి గరిష్ఠస్థాయి అయిన 35994 పాయింట్ల వద్ద నిరోధం ఉంది. ఈ స్థాయి ఎగువన స్థిరపడితేనే, మార్కెట్లకు లాభాలు కొనసాగొచ్చు. 34700- 35000 పాయింట్ల స్థాయి కోల్పోతే బలహీనపడే అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు } దేశీయంగా ఎలాంటి ప్రధాన అంశాలు లేనందున, ఆయా రంగాలు, స్టాక్ ఆధారిత కదలికలు ఉండే అవకాశం ఉంది. డాలర్ మారకం విలువ రూ.68.02కు చేరింది. రూపాయి మరింత బలహీనపడితే, ఎఫ్ఐఐల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతుంది. ఇదే సమయంలో ఎగుమతి ఆధార రంగాలైన ఔషధ, ఐటీ షేర్లకు మద్దతు లభించవచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. ముడిచమురు ధరల్లో దిద్దుబాటు వస్తోంది. ఇది కొనసాగితే, దేశీయ సూచీలకు తక్కువస్థాయిల్లో మద్దతు లభించవచ్చు. వియన్నాలో ఈనెల 22-23 తేదీల్లో జరగనున్న ఒపెక్ సమావేశాలపై ముడిచమురు ధరలు ఆధారపడతాయి. అమెరికా, చైనాల మధ్య తాజాగా తలెత్తిన సుంకాల యుద్ధం కీలకమవుతుంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీరేటును ఈనెల 21న, బ్యాంక్ ఆఫ్ జపాన్ పరపతి సమీక్ష నిర్ణయాలు అదేరోజు వెల్లడి కానున్నాయి. వీటినీ మదుపర్లు గమనిస్తారు.

తక్షణ మద్దతు స్థాయిలు: 35,419, 35,000 34,735
తక్షణ నిరోధ స్థాయిలు: 35,993, 36,256, 36,444

సమీప కాలంలో అధికస్థాయిల వద్ద మార్కెట్లకు నిరోధం ఎదురుకావచ్చు.

– *సతీశ్ కంతేటి, జెన్ మనీ*

మార్కెట్‌కు టీసీ‘ఎస్’

స్టాక్ మార్కెట్ ఈ వారం

- కలిసిరానున్న ‘బైబ్యాక్’ పథకం
- సానుకూల ధోరణులకు అవకాశం
- 10710-10950 మధ్య నిఫ్టీ
- ఎఫ్ఎమ్‌సీజీ, ఐటీ షేర్లు రాణించొచ్చు

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	412.25	420.00	405.40
హెచ్‌పీసీఎల్	306.35	314.20	299.40
ఐఓసీఎల్	167.75	173.30	164.40
ఓఎన్‌జీసీ	165.45	169.90	162.40
రిలయన్స్ ఇండస్ట్రీస్	1014.20	1036.60	988.10

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	142.25	146.50	139.60
హీరో మోటోకార్ప్	3678.00	3738.50	3621.80
ఎం అండ్ ఎం	909.45	933.40	890.30
మారుతీ సుజుకీ	8951.60	9043.20	8855.20
టాటా మోటార్స్	302.95	310.80	296.60

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	6136.60	6287.90	5919.60
కోల్గేట్ పామోలివ్	1219.45	1245.00	1203.20
డాబర్ ఇండియా	383.85	391.10	377.40
హిందుస్థాన్ యునిలీవర్	1621.30	1652.30	1574.50
ఐటీసీ	264.50	269.40	261.10

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	75.15	77.80	73.20
సీజీ పవర్	56.25	59.20	54.50
ఎల్ అండ్ టీ	1329.90	1352.10	1312.60
సీమెన్స్	998.45	1026.80	981.80
థెర్మాక్స్	1129.45	1165.20	1106.60

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
యాక్సిస్ బ్యాంక్	528.75	545.10	508.00
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2029.60	2046.90	2013.70
ఐసీఐసీఐ బ్యాంక్	282.50	292.00	275.00
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	43.25	45.30	42.00
ఎస్‌బీఐ	277.45	286.00	272.30

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	378.25	386.30	366.20
ఐడియా సెల్యులార్	60.65	64.50	58.20
ఆర్‌కామ్	15.45	16.50	14.90
టాటా కమ్యూనికేషన్స్	610.60	624.70	601.90

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం సానుకూల ధోరణి కనబరుస్తాయని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇందుకు కారణం టీసీఎస్ తన షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్) పథకానికి షేరు ధరను మార్కెట్ ధరతో పోలిస్తే 14% అధికంగా నిర్ణయించడమే. దీని వల్ల ఐటీ షేర్లతో పాటు మార్కెట్ కూడా రాణిస్తుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. గత ఎనిమిది ట్రేడింగ్ రోజుల్లో మార్కెట్ లాభపడడానికి ఫార్మా షేర్లు చేయూతనివ్వగా, తాజాగా ఐటీ షేర్లు కూడా జతచేరనున్నాయని బ్రోకరేజీ సంస్థలు అంటున్నాయి. మార్చి నాటి 9951.90 పాయింట్ల కనిష్ఠ స్థాయి నుంచి నిఫ్టీ-50 800-900 పాయింట్ల లాభాన్ని పొందింది. ఈ ధోరణి కొనసాగొచ్చని పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు, దేశీయంగా వర్షపాతం నుంచి సానుకూలతలేమైనా కనిపిస్తే.. అవి సెంటిమెంటును మెరుగుపరచగలవని మార్కెట్ పండితులు చెబుతున్నారు. నిఫ్టీ 10895-10950 నిరోధాన్ని అధిగమిస్తే మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు ప్రభావం చూపుతాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- **చమురు:** ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు ఒత్తిడిలోనే కొనసాగొచ్చు. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలు మాత్రం స్థిరీకరణకు లోనుకావొచ్చు. అధిక ముడి చమురు ధరలను అదుపులో పెట్టడానికి ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటుందేమోనన్న కోణంలో మదుపర్లు పరిశీలించవచ్చు.
- **వాహన:** మారుతీ సుజుకీ, టాటా మోటార్స్‌లపై సానుకూల సెంటిమెంటు కనిపిస్తున్నందున ఈ వారం వాహన షేర్లు లాభాలందుకోవచ్చు. ఐషర్ మోటార్స్, హీరో మోటోకార్ప్‌లపై విశ్లేషకులు బులిష్ ధోరణితో ఉన్నారు.
- **ఎఫ్ఎమ్‌సీజీ:** ఈ రంగ భవితవ్యంపై సానుకూల అంచనాల నేపథ్యంలో ఈ వారం ఆయా కంపెనీల షేర్లు లాభాలను కొనసాగించవచ్చు. వరుసగా నాలుగో వారమూ నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీ సూచీ రాణించే అవకాశం ఉంది. ఈ ఏడాది చివర్లో టీ ధరలు తగ్గొచ్చని టాటా గ్లోబల్ అంచనా వేస్తోంది.
- **యంత్ర పరికరాలు:** చాలా తక్కువ శ్రేణికి లోబడి ప్రతికూల ధోరణితో కదలాడవచ్చు. భెల్ నష్టపోయే ధోరణిలో ఉంది. సమీప భవిష్యత్‌లో ఈ షేరు లాభపడే సూచనలు కనిపించడం లేదు.
- **బ్యాంకింగ్:** ప్రైవేట్ బ్యాంకులు ఈ వారం నష్టపోయే అవకాశం ఉంది. ఆరోపణలు, దర్యాప్తులు ఇందుకు కారణం. చందాకొచ్చర్‌పై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఐసీఐసీఐ బ్యాంక్ జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణను నియమించిన నేపథ్యంలో ఆ బ్యాంకు షేర్లు వెలుగులోకి రావొచ్చు.
- **టెలికాం:** టెలికాం కంపెనీల షేర్లు ఒత్తిడిలో కనిపించొచ్చు. ఈ రంగంలో పోటీ కొనసాగొచ్చని.. టారిఫ్‌ల రికవరీపై ఇది ప్రభావం చూపించొచ్చని భావిస్తున్నారు.

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	948.30	967.40	921.50
ఇన్ఫోసిస్	1281.25	1325.80	1212.80
టీసీఎస్	1840.05	1883.80	1766.80
టెక్ మహీంద్రా	707.25	721.60	688.00
విప్రో	266.90	270.60	263.10

సిమెంట్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1302.10	1323.90	1284.10
అంబుజా సిమెంట్స్	204.95	210.50	199.20
ఇండియా సిమెంట్స్	115.35	118.40	112.20
శ్రీ సిమెంట్	16203.15	16503.00	15939.20
అల్ట్రాటెక్ సిమెంట్	3691.65	3838.70	3598.40

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	237.40	248.90	229.80
జిందాల్ స్టీల్	234.00	250.20	223.10
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	332.55	345.20	325.40
సెయిల్	85.55	89.40	82.20
టాటా స్టీల్	566.00	580.40	554.80
వేదాంతా	238.60	244.90	230.90

- **ఐటీ:** రూపాయి బలహీనతల కారణంగా ఐటీ షేర్లు ఈ వారం రాణించే అవకాశం ఉంది. ముఖ్యంగా టీసీఎస్ బైబ్యాక్ వల్ల సానుకూల వాతావరణం ఏర్పడింది.
- **సిమెంటు:** ప్రతికూలతలు కనిపిస్తున్నాయి. ఈ రంగ షేర్లు నష్టపోయే అవకాశం ఉంది. ఒక వేళ ఏసీసీ రూ.1350 స్థాయిని అధిగమిస్తే రూ.1425 స్థాయికి వెళ్లొచ్చు.
- **లోహ:** గత వారం నష్టాల పాలైన లోహ, గనుల తవ్వక కంపెనీలు ఈ వారం రాణించే అవకాశం ఉంది. మధ్యకాలానికి ఉక్కు తయారీ కంపెనీలపై మంచి అంచనాలుండటం విశేషం. ఐరోపా కార్యకలాపాల కోసం థైసన్‌క్రప్‌తో ఏర్పాటు చేయబోతున్న ప్రతిపాదిత సంయుక్త సంస్థను పునర్నిర్మించొచ్చన్న అంచనాల మధ్య టాటా స్టీల్ షేర్లు వెలుగులోకి రావొచ్చు.

వ్యయాలు తగ్గించుకోకపోతే ద్రవ్యలోటుపై తీవ్ర ప్రభావం: మూడీస్

దిల్లీ: పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించడం వల్ల ద్రవ్యలోటుపై ప్రతికూల ప్రభావం పడుతుందని, దీన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం వ్యయాలు అదుపు చేయాల్సి ఉంటుందని రేటింగ్ ఏజెన్సీ మూడీస్ హెచ్చరిస్తోంది. అంతర్జాతీయ విపణిలో ముడిచమురు ధరలు పెరిగిపోతుండటంతో స్థానికంగా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా అమాంతం పెరిగిపోతున్నాయి. దేశీయంగా పెట్రో ధరల అదుపునకు పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రప్రభుత్వం తగ్గించాలని అన్ని వైపుల నుంచి ఒత్తిడి వస్తోంది. అయితే ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం, పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకంలో రూపాయి కోత విధిస్తే రూ.13,000 కోట్ల చొప్పున ఆదాయం నష్టపోవాల్సి ఉంటుంది. ‘ఇలా ఆదాయంలో కోత ఏర్పడితే, ద్రవ్యలోటు పెరగకుండా చూసుకునేందుకు, వ్యయాల్ని తగ్గించుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఆర్థిక స్థిరీకరణ జరుగుతుంద’ని మూడీస్ ఇన్వెస్టార్స్ సర్వీస్ వీపీ, సావరిన్ రిస్క్ గ్రూప్ సీనియర్ క్రెడిట్ ఆఫీసర్ విలియమ్ ఫోస్టర్ తెలిపారు. 2018-19లో ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి పరిమితం చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 3.53 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రేట్లను పావు శాతం పెంచడంపై స్పందిస్తూ ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడంతో పాటు మరింత స్థిరమైన వృద్ధికి దోహదం చేసేలా ఈ పెంపు ఉందని మూడీస్ పేర్కొంది.

వొడాఫోన్, ఐడియా విలీనానికి నేడు ఆమోదం!

- తుది దశలో

టెలికాం విభాగ ప్రక్రియ

దిల్లీ: వొడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యులార్ సంస్థల విలీనానికి టెలికాం విభాగం సోమవారం ఆమోద ముద్ర వేయొచ్చు. ఈ విలీనం ద్వారా దేశంలోనే అతిపెద్ద టెలికాం సంస్థ ఏర్పాటు కానుంది. విలీన సంస్థ పేరు వొడాఫోన్ ఐడియా లిమిటెడ్‌గా ఉంటుందని భావిస్తున్నారు. విలీన ప్రక్రియ ఆమోదానికి సంబంధించి ధ్రువకరణను సోమవారం ఆయా సంస్థలకు టెలికాం విభాగం అందిస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఐడియా సంస్థ ఒకసారి చెల్లించే స్పెక్ట్రమ్ రుసుము, ఇతర చార్జీల కింద రూ.2,100 కోట్ల బ్యాంక్ గ్యారెంటీ సమర్పిండంతో పాటు, వొడాఫోన్ ఇండియా భవిష్యత్తులో చెల్లించాల్సి వచ్చే మొత్తాలకు బాధ్యత వహిస్తామనే పూచీని ఇవ్వగానే, ఇరు సంస్థల విలీనం అధికారికంగా నమోదవుతుందని అధికారులు చెబుతున్నారు. స్పెక్ట్రమ్ చెల్లింపులకు సంబంధించి, వొడాఫోన్ ఇండియా ఇచ్చిన ఏడాది బ్యాంక్ గ్యారెంటీ స్థానంలో ఐడియా ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. చట్టపరమైన బకాయిలకు సంబంధించి చెల్లింపులన్నీ జరుపుతామని కూడా ఇరు సంస్థలూ హామీ సమర్పించాల్సి ఉంది.

రూ.1.5 లక్షల కోట్ల అతిపెద్ద సంస్థ ఆవిర్భావం

దేశీయంగా తమ కార్యకలాపాలను విలీనం చేయడం ద్వారా, రూ.1.5 లక్షల కోట్ల (23 బిలియన్ డాలర్ల) విలువైన అతిపెద్ద టెలికాం సంస్థను ఏర్పాటు చేయాలని ఐడియా, వొడాఫోన్ నిర్ణయించిన సంగతి విదితమే. 43 కోట్ల మంది చందాదార్లతో, దేశీయ విపణిలో 35 శాతం వాటా ఈ విలీన సంస్థకు ఉండనుంది. ఈ రెండు సంస్థలకు కలిపి రుణాలు రూ.1.15 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయి. రిలయన్స్ జియో ఆఫర్ల ధాటికి దేశీయ విపణిలో టెలికాం సంస్థలకు మార్జిన్లు గణనీయంగా తగ్గిపో



యాయి. ముఖ్యంగా డేటాకు అతి తక్కువ చార్జీలు నిర్ణయించడంతో పాటు కాల్స్‌కు చార్జీలే వసూలు చేయకపోవడంతో సంస్థల ఆదాయం, లాభదాయకత క్షీణించింది.

- విలీన సంస్థలో వొడాఫోన్‌కు 45.1%, ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు 26%, ఐడియా వాటాదార్లకు 28.9% వాటా ఉంటాయి.
- విలీన సంస్థకు నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బిర్లా వ్యవహరించవచ్చు. బాలేశ్ శర్మ సీఈఓగా ఉంటారు. ఐడియా ముఖ్య ఆర్థిక అధికారి అక్షయ మూంద్ర విలీన సంస్థ సీఎఫ్ఓగా నియమితులవుతారు.

26న ఐడియా ఈజీఎం: విలీనం తరవాత సంస్థ పేరును వొడాఫోన్ ఐడియా లిమిటెడ్‌గా మార్చేందుకు వాటాదార్ల ఆమోదం కోసం, ఈనెల 26న ఐడియా సెల్యులార్ అసాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనుంది.

5జీ సేవలకు 6000 మెగాహెర్ట్జ స్పెక్ట్రమ్!

దిల్లీ: ప్రస్తుతం అందుబాటులో ఉన్న మొబైల్ డేటా వేగంతో పోలిస్తే, 50 శాతం అధికంగా ఉండే 5జీ సేవల కోసం 6000 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్ అందుబాటులో ఉంటుందని టెలికాం శాఖ నియమించిన కమిటీ అంచనా వేసింది. ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందని కమిటీలో సభ్యుడైన ఆరోగ్యస్వామి పాల్‌రాజ్ తెలిపారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం గౌరవ ఆచార్యులుగా ఆరోగ్యస్వామి ఉన్నారు. ప్రస్తుతం మొబైల్ సేవలకు 800-2600 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను వినియోగిస్తున్నారు. 5జీ సేవల కోసం 11 రకాల ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రమ్‌ను కమిటీ గుర్తించింది. ఇందులో ఖరీదైన 700 మెగాహెర్ట్జ్, 3.5 గిగాహెర్ట్జ్, 24 గిగాహెర్ట్జ్, 28 గిగాహెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్‌ను వెంటనే 5జీ సేవలకు వినియోగించవచ్చని కమిటీ పేర్కొంది. అధిక ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లలో 5,250 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్, 3.5 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీలో 300 మెగాహెర్ట్జ్ మేర, 405 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీలో 1000 మెగాహెర్ట్జ్ మేర స్పెక్ట్రమ్ లభిస్తుందని కమిటీ నివేదించింది. స్పెక్ట్రమ్ అధికంగా ఉంటే, మొబైల్ టవర్ల సంఖ్యను తద్వారా మౌలిక వసతులకు అయ్యే వ్యయాన్ని పరిమితం చేయొచ్చని, ఫలితంగా తక్కువ చార్జీలతో ప్రజలకు సేవలందించవచ్చని వివరించారు. అయితే అధిక ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రమ్ వల్ల తక్కువ విస్తీర్ణ పరిమాణంలోనే సేవలందించవచ్చని, ఫలితంగా ప్రతి 50 చదరపు మీటర్లకు ఒక 5జీ టవర్ నిర్మించాల్సి వస్తుందన్నారు. 700 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రమ్‌తో అధిక విస్తీర్ణంలో సేవలందించేందుకు వీలవుతుంది.

నీరవ్‌మోదీకి 6 పాస్‌పోర్టులు!

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.13,000 కోట్ల మేర మోసగించిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోదీపై తాజాగా మరో ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్) సిద్ధమైంది. ఒకటికి మించిన పాస్‌పోర్టులు కలిగి ఉండటమే ఇందుకు కారణం. ప్రస్తుతం బెల్జియంలో నీరవ్ మోదీ తలదాచుకుంటున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అతని పాస్‌పోర్టును ఉపసంహరించినా, విదేశీ ప్రయాణం ఎలా చేయగలిగాడో దర్యాప్తు చేయగా, 6 పాస్‌పోర్టులు కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 2 అమల్లో ఉండగా, 4 పనిచేయడం లేదని తేలింది. పనిచేస్తున్న 2 పాస్టపోర్టులను ఉపసంహరించామని తెలుపుతూ ఇంటర్‌పోల్‌కు విదేశీ వ్యవహారాల శాఖ సమాచారం ఇచ్చింది.

మాల్యాపై తాజా ఛార్జిషీట్: ఇదిలాఉంటే, బ్యాంకులకు రూ.9000 కోట్లు ఎగవేసి లండన్ పారిపోయిన విజయ్‌మాల్యాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజా ఛార్జిషీట్ వేయనున్నట్లు తెలిసింది. పలాయనవాదిగా ధ్రువీకరించడం, మోసం, మనీ లాండరింగ్ తదితర కేసులు నమోదు చేయడంతో పాటు అతని ఆస్తులు వెంటనే జప్తు చేసేందుకు కోర్టు అనుమతి కోరనున్నట్లు తెలిసింది.

22 మంది జీఎంలకు ఈడీలుగా పదోన్నతి!

పీఎస్‌బీల్లో నియామకాలకు బీబీబీ సిఫారసులు

దిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల్లోని 22 మంది జనరల్ మేనేజర్లను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పదవుల్లో నియమించాలని బ్యాంక్స్ బోర్డ్ బ్యూరో (బీబీబీ) సిఫారసు చేసింది. బీబీబీకి కొత్త ఛైర్మన్‌గా బీపీ శర్మ నియమితులయ్యాక, తొలిసారిగా ఈ భారీ ప్రక్రియ చేపట్టారు. మానస్ రంజన్ బిశ్వాల్, గోపాల్ గుశైన్, వివేక్ ఝా, అలోక్ శ్రీవాస్తవ, హేమంత్‌కుమార్ తంతా, అజిత్‌కుమార్ దాస్, అగ్యేయ్ కుమార్ ఆజాద్, దినేశ్‌కుమార్ గార్గ్, సంజయ్ అగర్వాల్, శాంతిలాల్ జైన్‌లను ఈడీలుగా నియమించాలని సూచించింది. విజయ్ దూబే, అజయ్ కె ఖురానా, ఎ.మణిమేఖలై, విక్రమాదిత్య సింగ్ ఖిచి, ఉషారవి, పి.ఆర్.రాజగోపాల్, షెనాయ్ విశ్వనాధ్ విత్తల్, అతుల్‌కుమార్, కె.శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, కె.రామచంద్రన్, అజయ్ వ్యాస్‌లనూ ఈడీలుగా నియమించాలని సిఫారసు చేసింది. ప్రధాన మంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ నియామకాల కమిటీ తుదినిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఉన్నతస్థాయి పదవుల్లో నియామకాలకు బీబీబీ ప్రభుత్వానికి సలహామండలిగా వ్యవహరిస్తోంది.

12 సంస్థల్లో విదేశీ పెట్టుబడుల పరిమితిపై ఎక్స్ఛేంజీలకు డిపాజిటరీల సమాచారం

దిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో పాటు 12 దేశీయ కంపెనీల్లో విదేశీ పెట్టుబడుల పరిమితి మించిన నేపథ్యంలో, హెచ్చరించడంతో పాటు ఆ సమాచారాన్ని ఎక్స్ఛేంజీలకు (ఎన్ఎస్ఈ, బీఎస్ఈ) డిపాజిటరీలు (ఎన్ఎస్‌డీఎల్, సీడీఎస్ఎల్) అందించాయి. రెండు ఎక్స్ఛేంజీలు ప్రత్యేకంగా ఇచ్చిన నోటీసుల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, వండర్లా హాలిడేస్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఆశాపురా మైన్‌కెమ్, సైయెంట్, ఎస్‌హెచ్ కేల్కర్ అండ్ కంపెనీల్లో రెడ్ ఫ్లాగ్ యాక్టివేట్ అయ్యింది. అబాట్ ఇండియా, డెల్టా కార్ప్, శాంతి ఎడ్యుకేషనల్ ఇన్సియేటివ్స్, సాయిబాబా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కమర్షియల్ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్, జేవీఎల్ అగ్రో ఇండస్ట్రీస్ సంస్థల్లో విదేశీ పెట్టుబడుల పరిమితిని మించినట్లు తేలింది. రెడ్ ఫ్లాగ్ యాక్టివేషన్, విదేశీ పెట్టుబడుల పరిమితి మించడంపై ఎన్ఎస్‌డీఎల్, సీడీఎస్ఎల్ నుంచి వచ్చిన సమాచారం మేరకు పైన తెలిపిన 12 కంపెనీల్లో సంస్థాగత ట్రేడింగ్ సిరీస్ (6 లక్షల సిరీస్) జూన్ 18 నుంచి అందుబాటులో ఉంటుందని బీఎస్ఈ ఓ ప్రకటనలో తెలిపింది.

విద్యుత్ బస్సు బ్యాటరీ ఛార్జింగ్ 17 సెకన్లలోనే!

ఫ్లాష్ ఛార్జర్లు తెస్తున్న ఏబీబీ

దిల్లీ: విద్యుత్తు బస్సు బ్యాటరీలను 17 సెకన్లలోనే ఛార్జింగ్ చేసే ఫ్లాష్ ఛార్జర్లను భారత్‌లోనూ విడుదల చేయాలని భావిస్తున్నామని స్విట్జర్లాండ్‌కు చెందిన ఏబీబీ తెలిపింది. వీటి సాయంతో, విద్యుత్ బస్సు ప్రయాణిస్తున్నప్పుడే స్టాపుల్లో అతి తక్కువ సమయంలో ఛార్జింగ్ చేసుకొనే వెసులుబాటు ఉంటుందని పేర్కొంది. అయితే ఈ ఉత్పత్తిని ఎప్పుడు విపణిలోకి విడుదల చేస్తారో కచ్చితంగా తెలుపలేదు. ‘ఇ-మొబిలిటీ ఛార్జింగ్ సొల్యూషన్స్‌ను ఏబీబీ తీసుకురాబోతోంది. విద్యుత్ బస్సులకు ఫ్లాష్ ఛార్జర్లతోపాటు కార్లకు వినియోగించేలా ఫాస్ట్ ఛార్జర్స్ (200 కి.మీ దూరం ప్రయాణించేందుకు కేవలం 8 నిమిషాల ఛార్జింగ్)ను కూడా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామ’ని ఏబీబీ గ్రూప్ సీఈఓ, అధ్యక్షుడు ఉల్రిచ్ స్పీస్‌హోఫర్ తెలిపారు.

పసిడి కిందకే!

కమొడిటీస్ ఈ వారం

పసిడి, వెండి

పసిడి ఆగస్టు కాంట్రాక్టు గతవారం రూ.31,186 వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. అమెరికా ఫెడ్ సమావేశం రోజు వరకు జోరు కనబరుస్తూ రూ.31,424 వరకు పెరిగింది. అయితే వడ్డీ రేట్ల పెంపునకు ఫెడ్ నిర్ణయం తీసుకున్న తర్వాత నుంచి కాంట్రాక్టు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యింది. రూ.30,958 వరకు దిగివచ్చింది. డాలరు బలపడటం ఇందుకు కారణమైంది. చివరకు 0.56 శాతం నష్టంతో రూ.31,010 వద్ద ముగిసింది. ఈవారం పసిడి కాంట్రాక్టును సాంకేతికంగా రూ.31,143 దిగువన షార్ట్ సెల్ చేయడం మంచిది. అయితే రూ.31,424 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పకపెట్టుకోవాలి. ఎందుకంటే ఈ రోజు రూ.31,227 కంటే పైన ముగిస్తే కాంట్రాక్టు పుంజుకునే అవకాశాలు లేకపోలేదు. వెండి జులై కాంట్రాక్టు గత వారం రూ.41,530 ధర వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత కూడా పసిడి మాదిరే లాభాల్లో పయనించి రూ.41,698 వద్ద వారం గరిష్ఠాన్ని నమోదుచేసింది. అనంతరం లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో కాంట్రాక్టు తీవ్ర దిద్దుబాటుకు లోనైంది. రూ.40,141 వరకు పడిపోయింది. ఆఖరుకు 3.18% క్షీణతతో రూ.40,209 వద్ద స్థిరపడింది. సాంకేతికంగా వెండి కాంట్రాక్టు ఈవారం రూ.40,000 దిగువన చలిస్తే రూ.39,667; ఆ తర్వాత రూ.39,540 వరకు పడిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఈవారం కాంట్రాక్టును షార్ట్ సెల్ చేయడమే ఉత్తమం.

ప్రాథమిక లోహాలు

రాగి జూన్ కాంట్రాక్టుకు ఈవారం రూ.465 వరకు షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించడం మంచి వ్యూహమే అవుతుంది. రూ.478- 481.95 మధ్య కొత్తగా షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.485 వద్ద స్టాప్‌లాస్ తప్పక పెట్టుకోవాలి. సీసం జూన్ కాంట్రాక్టు సాంకేతికంగా ఈవారం రూ.160 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. కానీ ఈ స్థాయి వద్ద కాంట్రాక్టుకు మద్దతు దొరికే అవకాశం ఉన్నందున.. ఈ ధర దగ్గర నుంచి లాంగ్ పొజిషన్లకు మొగ్గు చూపొచ్చు. జింక్ జూన్ కాంట్రాక్టు ఈవారం రూ.211 స్థాయి దిగువకు వస్తే.. పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లడం మేలు. ఒకవేళ ఈ రోజు రూ.214.85 కంటే పైన ముగిస్తే.. కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. అదే రూ.214.85 పైకి వెళ్లకుంటే రూ.207.75 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవడం ఉత్తమం. అల్యూమినియం జూన్ కాంట్రాక్టు ఈవారం రూ.155.35 పైన చలించకుంటే మరింత దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం ఉంది. రూ.146.90 వరకు పడిపోవచ్చు. నికెల్ జూన్ కాంట్రాక్టు ఈవారం సాంకేతికంగా బలహీనంగా కనిపిస్తోంది. తక్కువ నష్టభయంతో ట్రేడ్ చేసే మదుపర్లు రూ.1045 దగ్గర నుంచి కాంట్రాక్టును షార్ట్ సెల్ చేయొచ్చు. అయితే రూ.1074కి దరిదాపులో స్టాప్‌లాస్‌ను తప్పక పరిగణించాలి.

ఇంధన రంగం

ముడి చమురు జూన్ కాంట్రాక్టు ఈరోజు రూ.4,375 దిగువన ముగిస్తే షార్ట్ సెల్ చేయడం మంచి వ్యూహం అవుతుంది. ప్రస్తుతం షార్ట్ పొజిషన్లుంటే వాటిని కొనసాగించొచ్చు. ఒకవేళ కాంట్రాక్టు కాస్త పుంజుకొని ముందుకెళ్లినా కూడా మరిన్ని షార్ట్ పొజిషన్లను జత చేసుకోవడమూ మంచిదే. అయితే రూ.4,505 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పెట్టుకోవాలి. సహజ వాయువు జూన్ కాంట్రాక్టుకు రూ.212 దరిదాపులో వద్ద నిరోధం కనిపిస్తోంది. అందువల్ల లాంగ్ పొజిషన్లున్నవారు రూ.210-212 స్థాయిలకు దరిదాపులో లాభాలు స్వీకరించడం మంచిది. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) జూన్ కాంట్రాక్టు ఈవారం రూ.635 దిగువన ట్రేడయితే.. రూ.629; ఆ తర్వాత రూ.621 వరకు పడిపోయే అవకాశం ఉంది. అందువల్ల రూ.639 దిగువన కాంట్రాక్టును షార్ట్ సెల్ చేయడం మంచిదే. అయితే రూ.649 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణించడం తప్పనిసరి.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
రాగి (జూన్)	489.90	473.90	(3.27)
సీసం (జూన్)	167	163.85	(2.09)
జింక్ (జూన్)	216.55	211.90	(2.15)
అల్యూమినియం (జూన్)	156.80	152	(3.06)
నికెల్ (జూన్)	1038.70	1032.50	(0.60)
ముడి చమురు (జూన్)	4,425	4,432	0.16
సహజ వాయువు (జూన్)	196.75	205.90	4.65
సీపీఓ (జూన్)	645.50	643.90	0.25

– *ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్*

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గ్రామాల్లో సమస్యలపై దృష్టిసారిస్తా

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

గురుద్వారా(విశాఖపట్నం), న్యూస్‌టుడే: దేశానికి మూలాలు గ్రామాలు అని.. అందుకే తొలుత గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారిస్తానని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని గురుద్వారా సమీపంలో వి.బి.వి.పాఠశాల పూర్వవిద్యార్థులు నిర్మించిన భవనం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, నీటిపారుదల వంటి ముఖ్యమైన సమస్యలపై ప్రభుత్వం నుంచి పరిష్కార మార్గాలు లభించేవిధంగా తనవంతు కృషిచేస్తున్నానని తెలిపారు.

1969లో బ్యాంకులను జాతీయం చేసిన తరహాలో విద్యనూ జాతీయంచేస్తే విలువలతో కూడిన చదువును అందించగలమని ఆయన అభిప్రాయపడ్డారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నేటిరోజుల్లో కనుమరుగైపోతున్నాయని, వాటి గురించి తల్లితండ్రులు పిల్లలకు తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వి.బి.వి. పాఠశాలలో సౌకర్యవంతంగా కూర్చునేందుకు వీలుగా చిన్నారులకు బల్లలు, కుర్చీలు అందజేసిన 1997 బ్యాచ్ పూర్వవిద్యార్థుల్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మావూరి వెంకటరమణ, పలువురు పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు నీడన చీకట్లు..

- ఏళ్లుగా అందని పరిహారం లెక్కలతో రైతన్న ఆవేదన
- కడపలో కీలక సౌరవిద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు వ్యవహారం
- డీకేటీ, ఇతరత్రా భూముల సాగుదారులకు దక్కని భరోసా
- రెవెన్యూ వర్గాల మాయతో నకిలీల సృష్టి

ఈనాడు – కడప

వెలుగుల ప్రాజెక్టుల వెనుక చీకట్లు అలుముకున్నాయి. కడప జిల్లాలో రెండు కీలక సౌరవిద్యుదుత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటు వెనుక కర్షకుల కన్నీటిచారిక కనిపిస్తోంది. ఇన్నాళ్లూ బతుకునిచ్చిన భూమికి ఏళ్లు గడుస్తున్నా పరిహారం రాకపోవడం అన్నదాతను ఆవేదనకు గురిచేస్తోంది. కడప జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం వద్ద మెగా సౌరపార్కును ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. రూ.ఆరువేల కోట్ల పెట్టుబడి వ్యయంతో ఆరు వేల ఎకరాల్లో నెలకొల్పాలన్నది లక్ష్యం. తలమంచిపట్నం, రామచంద్రాయపల్లి, దొడియం, వద్దిరాల, పొన్నంపల్లి, కోనఅనంతపురం గ్రామాల పరిధిలో 6075.24 ఎకరాలను ఇందుకోసం కేటాయించారు. ఇందులో ప్రభుత్వ భూమి 5732.47 ఎకరాలుకాగా, 342.77 ఎకరాలు పట్టా, డీకేటీ భూమి. ప్రస్తుతం పట్టా, డీకేటీ భూమిపరంగానే సమస్యలు ఏర్పడ్డాయి. రైతుల భూములకు సంబంధించిన పరిహారం లెక్కలు తేల్చాల్సిన రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. కొందరు రెవెన్యూ సిబ్బంది ఏకంగా నకిలీలకు పెద్దపీట వేస్తూ అడ్డగోలు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. డబ్బులు దిగమింగి ఒకరి పేరుతో ఉన్న భూములను మరొకరి పేరుపై రాసేయడంతో రైతులు నష్టపోయారు.

కడప-అనంతపురం సరిహద్దులోని రాయచోటి నియోజకవర్గ పరిధి గాలివీడు మండలం తూముకుంట వద్ద మరో సౌర విద్యుత్ ప్రాజెక్టుకు బీజం పడింది. ఇక్కడ 400 మెగావాట్ల

గాలివీడు మండలం తూముకుంట వద్ద 400మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిస్థితి ఇది

ఉత్పత్తి సామర్థ్యంతో రూ.3వేల కోట్ల నిర్మాణ వ్యయంతో మూడు వేల ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడా భూసేకరణదే ప్రధాన సమస్య. డీకేటీ, పాత పట్టా భూముల పరిహారం లెక్కలు ఇప్పటికీ తేల్చలేదు. అనేక వివాదాలు, రైతులపై కేసుల అనంతరం ప్రస్తుతం స్తబ్దత ఏర్పడింది. ప్రాజెక్టు పనులు మాత్రం చివరి దశకు చేరుకొని విద్యుదుత్పత్తి ప్రారంభించారు. రైతులకు న్యాయం జరగలేదు. ఇక్కడా రెవెన్యూ సిబ్బంది అక్రమాలను పెంచి పోషించారు. తప్పుడు పత్రాలు సృష్టించి ఇతరులకు పెద్దపీట వేశారు. దీంతో రాయలసీమను 'సౌర'హబ్‌గా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. అనంతపురం జిల్లా ఎన్పీకుంట వద్ద ఎన్టీపీసీ ఆధ్వర్యంలో వెయ్యి మెగావాట్లు, కర్నూలు జిల్లా గడివేముల వద్ద మరో వెయ్యి మెగావాట్ల ప్రాజెక్టులు ఏర్పాటుకాగా కడపలోని పవర్‌గ్రిడ్‌ను 400 కేవీ నుంచి 765 కేవీ సబ్‌స్టేషన్‌గా ఉన్నతీకరిస్తూ అమరావతికి విద్యుత్ సరఫరా కసరత్తు జరుగుతోంది. ఈ స్థితిలో కడప ప్రాజెక్టులకు పరిహారం, భూసేకరణలో కష్టాలు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

మైలవరం మండలంలో వెయ్యి మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టుకు కేటాయించిన భూములు నిరుపయోగంగా ఇలా..

భూములిచ్చి ఉపాధి కోల్పోయాం

నాకు చెందిన 1/22-4లో రెండెకరాల డీకేటీ భూమి మైలవరం సౌరపార్కుకు తీసుకున్నారు. జాబితాలో నా పేరుంది. నాలుగేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు ఏర్పాటు కాలేదు. పరిహారం సొమ్ములూ రాలేదు. నేను డిగ్రీ వరకు చదువుకున్నా. ప్రాజెక్టు పూర్తయితే కనీసం ఉద్యోగమైనా లభిస్తుందనుకుంటే ఆ ఆశ లేదు. శంకుస్థాపనే జరగకపోవడంతో వస్తుందా? రాదా? అనే అనుమానం ఉంది. భూములూ సాగుచేసుకోలేకపోతున్నాం.

- చంద్రశేఖర్, దొడియం, మైలవరం మండలం

సమస్యపై ప్రత్యేక దృష్టి

మైలవరం, తూముకుంటలలో సౌర భూముల వ్యవహారానికి సంబంధించి సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. అక్కడ ఏం జరుగుతుందన్న దానిపై అధ్యయనం చేస్తాం. అర్హులైన వారికి న్యాయం జరుగుతుంది. రెవెన్యూ పాత్రపైనా వాస్తవాలను విచారిస్తాం.

- హరికిరణ్, జిల్లా కలెక్టర్

తెదేపా సేవామిత్రలకు నేటి నుంచి శిక్షణ

- తొలి విడతలో 6 నియోజకవర్గాల్లో..

ఈనాడు, అమరావతి: వచ్చే సాధారణ ఎన్నికలకు పార్టీ శ్రేణుల్ని సిద్ధం చేసేందుకు తెదేపా కార్యాచరణ ప్రారంభిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 5 లక్షల మంది బూత్ కన్వీనర్లు, సేవామిత్రలకు సోమవారం నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలోను శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో శాసనసభ నియోజకవర్గాలవారీగా శిక్షణ ఇస్తారు. విశాఖ తూర్పు, కాకినాడ గ్రామీణం, గుంటూరు పశ్చిమ, కందుకూరు, తిరుపతి, బద్వేల్ నియోజకవర్గాలవారికి సోమవారం శిక్షణ తరగతులు మొదలవుతున్నాయి. ఒక్కో బృందంలో 250 మంది ఉంటారు. ప్రతి బృందానికీ రెండు రోజులు తరగతులు నిర్వహిస్తారు. అన్ని పార్లమెంటరీ నియోజకవర్గాల్లోను శిక్షణ కేంద్రాల్ని గుర్తించి, అవసరమైన వసతులన్నీ కల్పించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు శిక్షణ పొందుతున్న వారందరితో ఏకకాలంలో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో మాట్లాడేందుకు అవసరమైన వ్యవస్థల్ని ఏర్పాటు చేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు, రాజకీయ ఏకీకరణ సాధించే లక్ష్యంతో తెదేపా సేవామిత్రలను ఏర్పాటు చేసింది. మరికొన్ని నెలల్లోనే సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.... సేవామిత్రలు, బూత్ కన్వీనర్లను మరింత క్రియాశీలకంగా మార్చేందుకు వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఇటీవల తెదేపా సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా వారికి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారు. విభజన అంశాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమల్లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి వారికి వివరిస్తారు. పార్టీని మరింతగా ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరాన్ని, అందుకు చేపట్టాల్సిన చర్యల్ని వారికి వివరిస్తారు.

పేదలకు న్యాయ సహకారం అందిస్తాం: కన్నా

ఈనాడు డిజిటల్, అమరావతి: పేదలకు పార్టీ తరపున న్యాయపరమైన సహకారం, సలహాలు అందిస్తామని.. అవసరమైతే న్యాయవాదిని ఉచితంగా నియమిస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వెల్లడించారు. ఇందుకోసం పార్టీ కార్యాలయంలో న్యాయవాది అందుబాటులో ఉంటారని వివరించారు. రాష్ట్ర స్థాయి న్యాయవాదుల సంఘ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పత్రికల్లో పార్టీకి వ్యతిరేకంగా వస్తున్న వార్తలను సేకరించి దుష్ప్రచారాన్ని ఖండించేలా సమావేశంలో నిర్ణయించామని తెలిపారు. తప్పుడు వార్తలను ప్రెస్ కౌన్సిల్, ప్రసారభారతి దృష్టికి తీసుకెళ్లి న్యాయపోరాటం చేస్తామని వెల్లడించారు. వైకాపా నాయకులతో భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ భేటీ అవడంలో వింత ఏం ఉందని, వ్యక్తిగత కారణాలతో ఆయన దిల్లీ వెళ్లారని తెలిపారు.

అభివృద్ధికి సాధనాలుగా ఉండాలి: వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: ప్రచార కార్యక్రమాల ద్వారా అభివృద్ధికి సాధికార సాధనాలుగా మీడియా వ్యవహరించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. రాజ్యసభ ఛానల్ పది లక్షల మంది వీక్షిస్తున్న(సబ్‌స్క్రైబ్) సందర్భంగా రాజ్యసభ టీవీ నిపుణుల కోసం ఏర్పాటుచేసిన విందులో ఉపరాష్ట్రపతి మాట్లాడారు. ప్రజలకు బహిరంగంగా చెప్పే అంశాలు ప్రతికూలంగా ఉండకూడదని, వారిని ఐక్యపరిచేలా ఉండాలని ఉపరాష్ట్రపతి ఉద్బోధించారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను నిర్మాణాత్మకంగా ప్రజలకు చెప్పాలని వెంకయ్యనాయుడు తెలిపారు. పాలన, విధానపరమైన లోపాలు ఎత్తిచూపాల్సిన బాధ్యత మీడియాపై ఉందని తెలిపారు.

వైకాపా విమర్శలపై లోకేశ్ మండిపాటు

- ట్విటర్ వేదికగా నిజనిర్ధారణ పత్రం విడుదల

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్న ఆ పార్టీ నేతల ఆరోపణలపై మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. తన శాఖ ఆధ్వర్యంలో వైకాపా సభ్యుల నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనులపై నిజనిర్ధారణ పత్రాన్ని (ఫ్యాక్ట్ షీట్) ట్విటర్ వేదికగా విడుదల చేశారు. మొత్తం 36,469 అభివృద్ధి పనులను రూ.135.36 కోట్లతో చేశామని ఆయన వివరించారు. "మీ మీద నమ్మకంతో ప్రజలు మిమ్మల్ని కొన్ని నియోజకవర్గాల్లో గెలిపించారు. కానీ వారికి మీరేం తిరిగిచ్చారు? అసెంబ్లీ సమావేశాలకు డుమ్మా కొట్టారు. ఫలానా అభివృద్ధి పనులకు నిధులు కావాలని ఇప్పటివరకూ అడిగింది లేదు. కానీ, ఎమ్మెల్యేలు మాత్రం జీతాలు తీసుకొని అన్ని సౌకర్యాలు అనుభవిస్తున్నారు.

ప్రతిపక్ష సభ్యులు వారి నియోజకవర్గాల గురించి పట్టించుకోకపోయినా.. ప్రజలు ఇబ్బందులు పడకూడదని మేం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. నా శాఖ ద్వారా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, అందుకు కేటాయించిన నిధుల వివరాలు మీ ముందు ఉంచుతున్నాను" అని లోకేశ్ ఆదివారం ట్వీట్ చేశారు.

వచ్చే ఎన్నికల్లో తడాఖా చూపిస్తాం..

- పార్టీ పెట్టడం సులువే.. నడపడం కష్టం
- కాపు ఉద్యమనేత ముద్రగడ వ్యాఖ్యలు

అనంతపురం, న్యూస్‌టుడే: "మా జాతి ప్రయోజనాల కోసం ఇన్నాళ్లూ ఉద్యమించాం.. అసెంబ్లీలో కంటి తుడుపుగా బిల్లు పెట్టారు.. సింగపూర్ నుంచి మందార పూలు తెచ్చి మా చెవిలో పెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారు. వచ్చే ఎన్నికల్లో మా తడాఖా ఏమిటో చూపిస్తాం" అని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పేర్కొన్నారు. ఆదివారం ఆయన అనంతపురం వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కాపులను బీసీల్లో చేర్చాలని ఏనాడూ అడగలేదు. ఓట్ల కోసం చంద్రబాబే హామీ ఇచ్చారన్నారు. దాన్ని నెరవేర్చాలని రోడ్డు ఎక్కి ఆందోళన చేస్తే దాడి చేయించారని ఆరోపించారు. భాజపాతో సఖ్యత ఉన్నన్నాళ్లూ కాపులను బీసీల్లో చేర్చే బిల్లు పెట్టలేదు. ఆ పార్టీతో వైరం పెరగగానే బిల్లు పెట్టి కేంద్రానికి పంపించామంటూ తప్పించుకుంటున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలన్నదానిపై 13 జిల్లాల కుల పెద్దలను కూర్చోబెట్టి చర్చిస్తామని వెల్లడించారు. రాజకీయ పార్టీ పెట్టడం సులువే. దాన్ని నడపడం మాత్రం చాలా కష్టమన్నారు. అంతకు ముందు కాపునాయకుడు మునిరత్నం శ్రీనివాసులు ముద్రగడతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు.

ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న విపక్ష నేత జగన్

రాష్ట్ర సమస్యలు పరిష్కరిస్తాం

- ప్రజాసంకల్ప యాత్రలో విపక్ష నేత జగన్

రావులపాలెం, న్యూస్‌టుడే: తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం మండలం వెదిరేశ్వరంలో ప్రారంభమైంది. రంజాన్ సందర్భంగా శనివారం యాత్రకు విరామమిచ్చిన జగన్ తిరిగి ఆదివారం వెదిరేశ్వరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బయలుదేరారు. మండలంలోని కేతరాజుపల్లి, ఈతకోట, కొత్తపేట మండలం గంటి వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా యాత్రలో జగన్‌కు గోపాలమిత్ర సంఘాల సభ్యులు, కాపు సంఘ నాయకులు, ముస్లిం నాయకులు వినతులు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా కేంద్రానికి పంపిన శాసనసభ తీర్మానాన్ని గవర్నరు ఆమోదంతో అమలుచేసి కాపులను బీసీ(ఎఫ్)లో చేర్చాలని కాపు సంఘం నాయకులు జగన్‌ను కోరారు. చట్టసభల్లో తమకు రెండు ఎంపీ సీట్లు, ఆరు నుంచి పది శాసనసభ స్థానాలు, రెండు మంత్రి పదవులు కేటాయించాలని ముస్లిం సంఘ నాయకులు వినతిని అందించారు. వెదిరేశ్వరంలో తనను కలిసిన ఆటోడ్రైవర్లతో కలిసి జగన్ కొంత దూరం ఆటో నడిపారు. దారి పొడవునా మహిళలను కలుసుకుని సమస్యలు వింటూ పాదయాత్ర చేశారు. కొత్తపేట మండలం గంటి వరకు పాదయాత్ర కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో జగన్ ఆదివారం రాత్రి బస చేశారు. ఆయన వెంట కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, వైకాపా నాయకులు ఉన్నారు.

ఎంత ఎదిగినా నాన్ననే స్మరిస్తాం..

'మనం ఎంత ఎదిగినా నాన్ననే తలచుకుంటాం. నేనే కాకుండా యావత్ రాష్ట్రం స్మరించుకునే వ్యక్తి. నా తండ్రి కావడం నా అదృష్టం. ఫాదర్స్ డే శుభాకాంక్షలు' అని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

-తండ్రుల దినోత్సవంపై జగన్ ట్వీట్

ఏపీఎన్‌జీఓ హోంలో ఉద్రిక్తత

- పరస్పర దాడులకు పాల్పడిన ఇరువర్గాల నేతలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ గన్‌ఫౌండ్రిలోని ఏపీఎన్‌జీఓ హోంలో ఆదివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఏపీఎన్‌జీఓ, బీటీఎన్‌జీఓ నేతలు పరస్పరం భౌతిక దాడులకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే... ఏపీఎన్‌జీఓ (గచ్చిబౌలి) మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సమావేశాన్ని ఆదివారం గన్‌ఫౌండ్రిలోని ఏపీఎన్‌జీఓ హోంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో ఏపీఎన్‌జీఓ అధ్యక్షులు పి.అశోక్‌బాబు మాట్లాడుతుండగా భాగ్యనగర్ తెలంగాణ ఎన్‌జీఓ (బీటీఎన్‌జీఓ) నేతలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. దీంతో ఏపీఎన్‌జీఓ, బీటీఎన్‌జీఓ నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో కొంత మంది అశోక్‌బాబు, ఏపీఎన్‌జీఓ ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులపై చేయి చేసుకున్నారు. ఘర్షణలో హోంలోని ఫర్నిచర్, సీసీ కెమెరాలు, అద్దాలు ధ్వంసమయ్యాయి. అబిడ్స్ పోలీసుస్టేషన్ డీఐ మోహన్‌రావు, ఎస్‌ఐలు సైదులు, పురుషోత్తం, సంపత్‌లు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించి నేతలను బయటకు పంపించారు. అనంతరం అబిడ్స్ పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

గొడవలో చిరిగిన చొక్కాతో ఏపీఎన్‌జీఓ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

పథకం ప్రకారం దాడి చేశారు: అశోక్‌బాబు

ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న ఏపీఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీ ఇళ్ల స్థలాల కేటాయింపు సమస్యను పరిష్కరించేందుకు సమావేశాన్ని ఏర్పాటుచేశామని, బీటీఎన్‌జీఓ నేతలు తమను దూషిస్తూ భౌతిక దాడులకు పాల్పడ్డారన్నారు. ఇదంత పథకం ప్రకారం చేశారని ఆరోపించారు. ఏపీఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన స్థలాన్ని తెలంగాణ ఉద్యోగులకే ఇవ్వాలని కోరడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

సమస్యను తప్పుదారి పట్టించేందుకు డ్రామా: సత్యనారాయణగౌడ్

ఏపీఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా అడహక్ కమిటీని నియమించింది. దీంతో వివాదం కొలిక్కి వస్తున్న తరుణంలో అడ్డుకట్ట వేసేందుకే ఏపీఎన్‌జీఓ అధ్యక్షులు అశోక్‌బాబు దాడి నాటకం సృష్టించారని బీటీఎన్‌జీఓ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్ ఆరోపించారు. విజయవాడ, రాయలసీమ నుంచి కొంత మందిని వెంట తెచ్చుకుని దాడి చేయించుకుని బీటీఎన్‌జీఓ నేతలపై నెట్టి వేసే కుట్రకు పూనుకున్నారన్నారు. గత నాలుగేళ్లుగా నిర్వహించిన ఏపీఎన్‌జీఓ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని రహస్యంగా సమావేశం నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు.

ఏపీఎన్‌జీఓ హోంలో ఘర్షణ పడుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

దేశరాజధానిలో తెదేపా ప్రకంపనలేవీ..?

- ప్రధానితో చంద్రబాబు భేటీ ఆంతర్యమేంటో బయటపెట్టాలి: వైకాపా

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిల్లీకి వెళితే ప్రకంపనలన్నారే.. ఏవీ ఎక్కడ వచ్చాయి ప్రకంపనలు..? దేశరాజధానికి వెళ్లి ప్రధాని మోదీ ముందు సీఎం వంగివంగి దండాలు పెట్టుకుని బయటకొచ్చారు అని వైకాపా అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. ప్రధానిని చంద్రబాబు గడగడలాడిస్తారంటూ రాష్ట్రంలో ఊదరగొట్టి.. దిల్లీలో మాత్రం మోదీ ముందు మోకరిల్లుతారా? అని ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం వైకాపా కార్యాలయంలో అంబటి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. "నీతిఆయోగ్ సమావేశంలో కాకుండా ప్రధాని మోదీని చంద్రబాబు ప్రత్యేకంగా కలిశారా? కలిసి ఏం మాట్లాడారు? మీ అవినీతి బయటకు తీసి కేసులు పెట్టకుండా లాలూచీపడ్డారా? మీరో అవకాశవాది.. కేంద్రంలో ప్రకంపనలు పుట్టించే అవినీతికుంభకోణాన్ని బయటపెడతామని చెప్పిన తెదేపా.. మరెందుకు దాన్ని బయటపెట్టదు..?" అని అంబటి రాంబాబు ప్రశ్నించారు.

పంచభూతాలను పంచుకుంటున్న తెదేపా నేతలు: బొత్స

తిరుపతి గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని తెదేపా నాయకులు పంచభూతాలను సైతం పంచుకుంటున్నారని వైకాపా సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. తిరుపతి గ్రామీణ మండలం తుమ్మలగుంటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇసుక, మట్టిని తెదేపా నాయకులు అక్రమ రవాణా చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో తెదేపాలు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాయని అన్నారు. పేదల కష్టాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. తెదేపా పాలనలో లారీ ఇసుక రూ.20వేలు వెచ్చించి కొనుగోలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఆ సిట్ నివేదికను బయట పెట్టండి

- కొమ్మాదిలో పదెకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి: నారాయణ

కొమ్మాది (విశాఖపట్నం), న్యూస్‌టుడే: ''ముఖ్యమంత్రి ఇంట్లో దాచుకున్న సిట్ నివేదికను బయట పెట్టకుంటే మేమే బయటపెడతాం'' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం విశాఖ నగర పరిధిలోని మధురవాడ జోన్-1 కొమ్మాది సర్వే సంఖ్య 28/2లో పదెకరాల 18 సెంట్ల భూమి చుట్టూ ఉన్న ప్రహరీ, రేకుల షెడ్డును ధ్వంసం చేసి అందులోని పూరిపాకకు నిప్పు పెట్టారు. ఆ స్థలం ప్రజలదంటూ పార్టీ జెండాలు పాతారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుని పేరిట జి.శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి తప్పుడు పత్రాలతో ఈ భూమిని ఆక్రమించాడని గత ఏడాది జూన్ 25న ఇక్కడి ప్రహరీని కూల్చి ఆందోళన చేపట్టిన కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను విచారణకు నియమించిందన్నారు. ఆ బృందం విచారించిన వాటిలో ఈ స్థలం కూడా ఉందని, అసలు ఈ స్థల యజమానిగా చెప్పుకొంటున్న వ్యక్తి ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. లేని స్వాతంత్ర్య సమరయోధుని పేరిట జరిగిన ఈ భూ కుంభకోణంలో బడానేతలు, కొందరు మంత్రులు ఉన్నట్లు ఆరోపించారు. ప్రభుత్వమే తనకు తానుగా సిట్ నివేదికను బహిరంగ పరిచి తమ నిజాయతీని నిరూపించుకోకుంటే తామే ఆ భూభాగోతాన్ని, దాని వెనుకనున్న మంత్రులు తదితర పెద్దల పేర్లు బహిర్గతం చేసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఈ భూమిని స్వాధీనం చేసుకోకపోతే సీపీఐ పేద ప్రజలను సమీకరించి ఇళ్ల స్థలాలు కొలిచి ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని నారాయణ పేర్కొన్నారు.

కొమ్మాదిలో గల స్థలం ప్రహరీని ధ్వంసం చేస్తున్న నారాయణ

తాడేపల్లి ప్లాంటు తరలింపుపై పునరాలోచించాలి: రఘువీరా

ఈనాడు డిజిటల్, అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్మాల్ క్యాన్ ఫిల్లింగ్ ప్లాంటును చెన్నై నగరానికి తరలించాలన్న ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి కోరారు. లాభాల బాటలో నడుస్తున్న ప్లాంటును తరలించడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న 500 కుటుంబాలపై ప్రభావం పడుతుందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆదివారం రాసిన లేఖలో పేర్కొన్నారు. దేశంలోని ఇతర స్మాల్ క్యాన్ ఫిల్లింగ్ ప్లాంట్లతో పోలిస్తే తాడేపల్లిలో మాత్రమే ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటోందని అందులో వివరించారు. ప్లాంటును మరో ప్రాంతానికి తరలించాలన్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. కేంద్రం ఈ ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలని లేఖలో డిమాండ్ చేశారు.

పోలవరానికి అడ్డుపడుతున్న దుష్టశక్తులు: మంత్రి ఉమా

భవానీపురం, న్యూస్‌టుడే: 'పోలవరం' నిర్మాణం పూర్తయితే తమ చిరునామాలు గల్లంతవుతాయనే ఉద్దేశంతో కొన్ని దుష్టశక్తులు ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కేసులు కూడా వేయిస్తున్నాయని ఆక్షేపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సజావుగా సాగాలంటూ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు ఆదివారం మంత్రి బోనాలను సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దుష్టశక్తుల బారి నుంచి పోలవరం ప్రాజెక్టును కాపాడతామని, ఎన్ని అవరోధాలు ఎదురైనా పూర్తి చేసి తీరుతామని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతూ ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోయినా ముందుకు వెళ్తున్నారని చెప్పారు.

రైతాంగ వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

- ఏబీకేఎస్ అధ్యక్షుడు దవాలే

ఈనాడు, అమరావతి: కేంద్రంలోని రైతాంగ వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించేలా పోరాడాలని అఖిల భారత కిసాన్ సభ(ఏబీకేఎస్) జాతీయ అధ్యక్షుడు అశోక్‌దవాలే పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో జరిగిన ఒక రోజు కార్యశాలకు ఆయన హాజరయ్యారు. దున్నేవాడిది భూమి అనే నినాదానికి బదులు.. కార్పొరేట్లకే భూమి అని మోదీ ప్రభుత్వం పాలిస్తోందని ధ్వజమెత్తారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. 10కోట్ల సంతకాల సేకరణ ఉద్యమంతోపాటు ఆగస్టు 9న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, జైల్‌భరోలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 5న లక్షలాది మందితో దిల్లీలో మజ్దూర్ కిసాన్ ర్యాలీ చేపట్టి ప్రధానికి వినతిపత్రం ఇస్తామన్నారు. మహారాష్ట్రలో రైతాంగ ఉద్యమాలను ఆయన వివరించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏబీకేఎస్ రాష్ట్ర నాయకులు కేశవరావు, సూర్యనారాయణ, పెద్దిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దవాలే.. వేదికపై ఏబీకేఎస్ నాయకులు

క్షురకుల డిమాండ్లను పరిష్కరించాలి

- సీఎంకు లేఖ రాసిన బీసీ సంఘాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న క్షురకులకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈఎస్‌ఐ, పీఫ్ సౌకర్యంతో పాటు పదవీ విరమణ పొందిన వారికి రూ.5 వేలు పింఛన్‌గా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీసీ సంక్షేమ సంఘాలు ఆదివారం సంయుక్తంగా రాసిన లేఖలో పేర్కొన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది క్షురకులు చేస్తున్న సమ్మెతో ఆయా ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని బీసీ నాయకులు కొలనుకొండ శివాజీ పేర్కొన్నారు. అధికారులు క్షురకులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు.

కీటకాల్ని కరకరా నమిలేయండి

- నాచు, కృత్రిమ చేపలు, ప్రయోగశాల మాంసం
- కొత్త రకం ఆహార తయారీలో శాస్త్రవేత్తల నిమగ్నం
- ప్రపంచ జనాభా అవసరాలు తీర్చేందుకు కొంగొత్త ఆహారం

ప్రపంచ జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు అమలుచేస్తున్న ఈ రోజుల్లో కూడా- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహారాన్ని ఉత్పత్తి చేయలేని పరిస్థితి. 2050 నాటికి ప్రపంచ జనాభా 900 కోట్లకు చేరుకుంటుందని అంచనా. దానికి తగ్గట్టుగా ఆహార ఉత్పత్తి ప్రణాళి కల్ని వృద్ధి చేసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది. అందుకే ఆహార శాస్త్రవేత్తలు, పరిశోధకులు సరికొత్త ఆహార వనరుల కోసం అన్వేషిస్తున్నారు. ప్రస్తుతమున్న ఆహారానికి స్వల్ప మార్పులు చేయడంతో పాటు.. పూర్తిగా కొత్త ఆహారాన్ని కనిపెట్టే పనిలో నిమగ్నమై ఉన్నారు. రాబోయే 20-30 ఏళ్లలో మన భోజన ప్లేటులో ఎలాంటి ఆహారం ఉంటుందో శాస్త్రవేత్తల అంచనా(ప్రముఖ మీడియా సంస్థలు ఈ అంచనాల్ని ప్రచురించాయి) వేశారు.

రాబోయే 30 ఏళ్లలో మనం తినే తిండి ఇదే!

క్రిమి కీటకాలు

వినడానికి ఎబ్బెట్టుగా, తినడానికి ఇబ్బందిగా అనిపించినా.. ఇది నిజం. రాబోయే 30 ఏళ్లలో క్రిమి కీటకాలు ఒక ముఖ్యమైన ఆహారం కాబోతున్నాయి. ప్రపంచంలో దాదాపు 1900 రకాల తినడానికి పనికివచ్చే క్రిమి కీటకాలు ఉన్నట్లు 2013 నాటి ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ నివేదిక(ఎఫ్ఏఓ) స్పష్టంచేసింది. ఇలాంటి వాటిలో గొంగళి పురుగులు, మిడతలు, సీతాకోక చిలుకలు, తేనెటీగలు, చీమలు, చిన్న చిన్న పురుగులు తదితరాలున్నాయి. ప్రపంచంలో క్రిమి కీటకాలకు కొదవ లేదు. వాటిలో తక్కువ కొవ్వు కలిగిన మాంసకృత్తులు, పీచుపదార్థం ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రయోగశాల మాంసం

ప్రపంచంలో కార్ల నుంచి వెలువడుతున్న గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలతో సమానమైన స్థాయిలో పశువుల ద్వారానూ ఈ వాయువులు వెలువడుతున్నాయని ఒక అంచనా. దీనిని అరికట్టడానికి శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో కృత్రిమ మాంసాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించారు. ఆవుల మూల కణాలను ఉపయోగించి గొడ్డుమాంసాన్ని 2013లోనే ప్రయోగశాలలో కృత్రిమంగా అభివృద్ధిచేశారు. అయితే దీని తయారీకి ఖర్చు ఎక్కువ. రాబోయే కొన్నేళ్లలో చౌకగానే కృత్రిమ మాంసాన్ని అభివృద్ధి చేయొచ్చుని, అది అచ్చం మామూలు మాంసంలాగానే రంగు, రుచి, వాసన కలిగి ఉంటుందని శాస్త్రవేత్తలు ధీమాగా చెబుతున్నారు.

పెంచిన చేపలు

కాలుష్యం, భారీగా చేపల వేట, సముద్ర అంతర్భాగంలో మైనింగ్ కార్యకలాపాలు, వాతావరణ మార్పుల వల్ల పగడాల దీవులు అంతరించిపోవడం.. ఇత్యాది కారణాలతో సముద్ర జీవుల ఉనికి ప్రమాదంలో పడింది. దీనికి మనిషే కారణం. అయితే ఇప్పటికీ ప్రపంచంలోని దాదాపు 350 కోట్ల మందికి సముద్ర జీవులే ఆహారం. రాబోయే 30 ఏళ్లలో ఈ సంఖ్య రెట్టింపు కాబోతోంది. చేపల పెంపకం ప్రధాన జీవనోపాధిగా, అలా పెంచిన చేపలు కొన్ని కోట్ల మందికి ఆహారంగా మారబోతున్నాయి. వేట ద్వారా పట్టే చేపలకన్నా ఎక్కువగా పెంపకం ద్వారా ఉత్పత్తిచేయడానికి దాదాపు 35 దేశాల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జన్యు ఆహారం (జీఎంఓ)

జన్యు మార్పిడితో ఆహార పంటలను మనకు కొత్త కాదు. మొక్కల డీఎన్ఏను పునర్‌నిర్మించి 1980లలోనే చీడపీడల్ని తట్టుకునే పంటల్ని పండించారు. 90ల నాటికి జీఎం ఆహారం వాణిజ్య పరంగానూ అందుబాటులోకి వచ్చింది. అనేక రకాల పండ్లు, ఆహారధాన్యాలు, చేపలు ఇలా అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా జన్యు ఎడిటింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని(క్రిస్పర్/కాస్ 9) వినియోగించి జన్యువును మార్చడం ద్వారా ఆహార పదార్థాల్ని తయారుచేసే కసరత్తు చేస్తున్నారు. కొన్ని రకాల యాపిళ్లు, బంగాళాదుంపల్ని ఇప్పటికే ఇలా తయారుచేశారు.

నాచు(ఆల్గే)

ఆహార కొరత సమస్యకు నాచును ఒక ప్రముఖ ప్రత్యామ్నాయంగా శాస్త్రవేత్తలు గుర్తించారు. నాచు అత్యంత వేగంగా పెరుగుతుంది. ముఖ్యంగా ఆసియాలో ఇది మరీ ఎక్కువ. మున్ముందు నాచు అభివృద్ధి గొప్ప వ్యాపారంగా మారొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. పుష్కలంగా విటమిన్లు, మాంసకృత్తులు నాచులో ఉంటాయి కాబట్టి ఇది మంచి ఆహారం అవుతుందని అంటున్నారు. నాచును ఇప్పటికే బయో ఇంధనంగా వినియోగిస్తున్నారు.

కృత్రిమ చేపలు రొయ్యలు

కృత్రిమ మాంసం లాగానే కృతిమ చేపలూ, రొయ్యలు రాబోతున్నాయి. గర్భస్థ దూడల రక్తం నుంచి సేకరించిన సీరంలో గోల్డ్‌ఫిష్ కండరాల ముక్కల్ని ఉంచి ప్రయోగశాలలో అభివృద్ధిచేస్తారు. దీనివల్ల ఎముకలు, ముల్లులు లేని మాంసం, చేపలు అభివృద్ధి అవుతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది వ్యోమగాములకు ఆహారం అవుతుందని అంటున్నారు. సిలికాన్ వ్యాలీకి చెందిన ఒక బయోటెక్ స్టార్టప్ ప్రయోగశాలలో రొయ్యల్ని అభివృద్ధిచేసింది. అయితే ఆల్గేని ఉపయోగించి వాటిని తయారుచేసింది.

త్రీడీ ప్రింటెడ్ వంటకాలు

నేరుగా ప్రింటర్‌పై తయారై మన ప్లేటులోకి ఆహారం వచ్చిపడే సాంకేతిక పరిజ్ఞానం రాబోతోంది. ఉదాహరణకు ఒక చాక్లెట్‌ను మన అభిరుచులకు అనుగుణంగా రకరకాల రూపాలు, రుచుల్లో త్రీడీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేయించుకోవచ్చు.

-ఈనాడు ప్రత్యేక విభాగం

నాగాలాండ్‌లో అసోం రైఫిల్స్‌పై ముష్కర దాడి

నలుగురు జవాన్ల మృత్యువాత

గువాహటి: నాగాలాండ్‌లో అసోం రైఫిల్స్ వాహనంపై నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్-ఖప్లాంగ్ (ఎన్ఎస్‌సీఎన్-కే) ముష్కరులు ఆదివారం మధ్యాహ్నం దాడిచేశారు. దీంతో నలుగురు జవాన్లు మృత్యువాతపడ్డారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. మోన్ జిల్లాలో ఈ దాడి జరిగింది. సమీపంలోని ఓ నది నుంచి మంచినీటిని తీసుకువచ్చేందుకు జవాన్లు వెళ్తుండగా.. ముష్కరులు గ్రెనేడ్లతో దాడిచేసినట్లు అధికారులు తెలిపారు. నాగా వేర్పాటువాదులైన ఎన్ఎస్‌సీకే (ఐజాక్-మూవా) సహా పలు సంస్థలతో కేంద్రం చర్చలు జరుపుతున్న నేపథ్యంలో.. తాజా దాడి చోటుచేసుకుంది. మూడేళ్ల క్రితం ఇదే తరహాలో దాడిచేసి ఎనిమిది మంది అసోం రైఫిల్స్ జవాన్లను ఎన్ఎస్‌సీఎన్-కే బలితీసుకున్న సంగతి తెలిసిందే.

అమెరికాలో కాల్పులు

ఒకరు మృతి..

ట్రెంటన్: అమెరికాలోని ఓ కళాప్రదర్శనశాలలో ఆగంతకులు కాల్పులు జరపడంతో ఒకరు మృతి చెందారు. మరో 20మంది గాయపడ్డారు. వీరిలో 16 మందికి బుల్లెట్ గాయాలయ్యాయి. 13 ఏళ్లబాలుడు సహా నలుగురి పరిస్థితి విషమంగాఉందని పోలీసులు తెలిపారు. చనిపోయింది కాల్పులు జరిపిన వ్యక్తేనని వార్తలు వస్తున్నాయి. స్థానిక కళలు, సంగీతం, ఆహారంపై న్యూజెర్సీలోని ట్రెంటన్ వద్ద ప్రదర్శనశాలను శనివారం ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నానికి ప్రదర్శన ముగియాల్సి ఉంది.

నెలల చిన్నారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలన్న పట్టించుకోలేదు

- చెకింగ్ సమయానికి రాలేదని బోర్డింగ్ పాస్ నిరాకరణ

ఎన్జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: తాను సంవత్సరం కూడా నిండని పసిపాపను విజయవాడలోని ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి ఉందని చెప్పినా కడప విమానాశ్రయం అధికారులు పట్టించుకోలేదని, కొద్దిపాటి సమయం ఆలస్యానికే బోర్డింగ్‌పాస్ ఇవ్వలేదని ఓ ప్రయాణికురాలు వాపోయారు. ట్రూజెట్ విమానయాన సంస్థ నిర్వాహకుల తీరు బాధ కలిగించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటికి చెందిన శ్వేత ప్రవల్లిక ఆదివారం విజయవాడకు వెళ్లేందుకు ఉదయం 9.25 గంటల ట్రూజెట్ విమానానికి నాలుగు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. కడప విమానాశ్రయానికి చేరుకునే క్రమంలో చెకింగ్ సమయం గడిచిపోయింది. వారికి బోర్డింగ్ పాస్ అందలేదు. దీనిపై ప్రయాణికురాలు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. పసిపాపను ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి ఉందని చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తర్వాత ఆలస్యంగా వచ్చిన జిల్లా మంత్రి భార్యను అనుమతిచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై ట్రూజెట్ మేనేజర్ భవ్యన్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కడప నుంచి విజయవాడకు ఉదయం 9.25 విమానం బయలు దేరుతుందని ప్రయాణికులు ఎవరైనా 45 నిమిషాల ముందు చెకింగ్ కావాలన్నారు. లేదంటే ఉదయం 8.40 గంటలకు చెకింగ్ కౌంటరును మూసివేస్తామని చెప్పారు. ఆమె కుటుంబం 9.14 నిమిషాలకు రావడంతో అప్పటికే చెకింగ్ కౌంటర్ మూసివేశారని పేర్కొన్నారు. మంత్రిగారి భార్య ముందుగానే చెకింగ్ అయి బోర్డింగ్ పాస్ తీసుకున్నారని చెప్పారు.

ఉగ్రవాదుల చేతుల్లో కఠిన ఉక్కు తూటాలు

శ్రీనగర్: ఉక్కుతో తయారైన విధ్వంసకర తూటాలు ఉగ్రవాదుల చేతుల్లోకి చేరడంపై కశ్మీర్‌లో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా ఇవి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహ్మద్ ఉగ్రవాద ముఠా వద్ద ఇవి ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. తూటా రక్షక కవచంతో తయారైన బంకర్లను ఛేదించే సామర్థ్యం ఈ బుల్లెట్లకు ఉంది. గత ఏడాది డిసెంబర్ 31న జైషే మహ్మద్ ఉగ్రవాదులు దక్షిణ కశ్మీర్‌లో ఒక ఉగ్రవాద స్థావరంపై దాడి చేసినప్పుడు తొలిసారిగా ఇవి వెలుగు చూశాయి. తూటా రక్షక కవచం ధరించినప్పటికీ ఈ తూటాలు తగిలి ఐదుగురు జవాన్లు చనిపోయారు.

టెట్ ప్రశ్నపత్రం లీక్ అవాస్తవం

- అందుకు అవకాశమే లేదు
- స్పష్టం చేసిన మంత్రి గంటా శ్రీనివాసరావు

ఈనాడు డిజిటల్, అమరావతి, అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఈ నెల 19న జరిగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు సంబంధించి వ్యాయామ ప్రశ్నపత్రం లీకైనట్లు వస్తున్న ఆరోపణలు పూర్తి అవాస్తమని, అభ్యర్థులు అపోహలు నమ్మవద్దని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున లీకయ్యేందుకు అవకాశమే లేదని ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. పరీక్ష ప్రారంభమయ్యే ముందు నిర్ణీత సమయంలో మాత్రమే ప్రశ్నపత్రం అందుబాటులో ఉంటుందని వివరించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శికి డిప్యుటేషన్‌పై సహాయకుడిగా పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు తేళ్ల వంశీకృష్ణ ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో బోధిస్తున్నారని, ఉద్యోగం ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా టెట్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

చెన్నై అయితే నిఘా తక్కువనే..

వ్యాయామ ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసేందుకు రాష్ట్రంలో అనేక కేంద్రాలున్నప్పటికీ వంశీకృష్ణ చెన్నైలోని కేంద్రాన్ని ఎంపిక చేసుకున్నాడు. అక్కడ నిఘా తక్కువుంటుందనే అలా చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడు పనిచేస్తున్న కోచింగ్ సెంటర్‌కు చెందిన పలువురు అభ్యర్థులు సైతం దానినే ఎంపిక చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజులుగా వంశీకృష్ణ వ్యవహారంపై పాఠశాల విద్యాశాఖకు పలువురు ఫిర్యాదు చేసినా విచారణ చేయడంలో కొంత జాప్యం చేసింది. అవనిగడ్డలో కొందరు అభ్యర్థులు వాటర్ ట్యాంకుపైకి ఎక్కడంతో పాఠశాల విద్యాశాఖ వెంటనే చర్యలకు ఉపక్రమించింది.

అవనిగడ్డలో విద్యార్థుల ఆరోపణలివి...

వంశీకృష్ణ ఒంగోలులో సుమారు ఆరు మాసాల క్రితం డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొంత మందికి శిక్షణ ఇస్తున్నాడు. ఇటీవల విజయవాడలో బాసర పేరుతో మరో కేంద్రం ఏర్పాటు చేశాడు. తమిళనాడు పెరంబుదూర్ ధనలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తన సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులందరూ అక్కడే పరీక్ష రాసే విధంగా ఏర్పాట్లు చేశాడు. రూ.లక్షలు ఖర్చుపెట్టి చదువుకున్న తమకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లేకుండా చేశాడు.

కలెక్టర్ చొరవ

జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం చొరవ తీసుకుని పెరంబుదూర్ కేంద్రాన్ని రద్దుచేస్తామని హామీ ఇచ్చినట్లు తహసీల్దార్ బి. ఆశయ్య విద్యార్థులకు తెలియజేశారు. ఆ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్‌లో వేర్వేరు ప్రాంతాలలో కేంద్రాలు ఏర్పాటు చేసి, తేళ్ల వంశీకృష్ణపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పినట్లు తహసీల్దార్ చెప్పారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించి కిందకు దిగారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న నోబెల్ బహుమతి గ్రహీత ఫిన్ క్యిడ్‌ల్యాండ్

కర్బన ఉద్గారాల నియంత్రణలో ప్రజా భాగస్వామ్యం అవసరం

- నోబెల్ బహుమతి గ్రహీత ఫిన్ క్యిడ్‌ల్యాండ్

ఈనాడు, అమరావతి: కర్బన ఉద్గారాల నియంత్రణకు కేవలం ప్రభుత్వాలు మాత్రమే ఏమీ చేయలేవని, ప్రజలూ ఆ దిశగా స్వచ్ఛందంగా కదిలితేనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నోబెల్ బహుమతి గ్రహీత, ప్రఖ్యాత ఆర్థికవేత్త ఫిన్ క్యిడ్‌ల్యాండ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యం, ఇంధనం, వ్యాపార అనుకూల వాతావరణం, ముందస్తు వాతావరణ హెచ్చరికల వ్యవస్థ, వాయుకాలుష్యం, ప్రజారవాణా వ్యవస్థ తదితర అంశాల్లో ఎలాంటి విధానాలు అనుసరిస్తే ఫలితాలు ఉంటాయనే దానిపైన టాటాట్రస్టు, కోపెన్‌హెగెన్ కాన్‌సెన్సస్ సెంటర్ సంయుక్తంగా 'ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్య ప్రాజెక్టు' పేరిట పరిశోధన పత్రాలు వెలువరించాయి. వీటిని అధ్యయనం చేసే క్రమంలో భాగంగా శనివారం రాత్రి విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రఖ్యాత ఆర్థికవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫిన్ క్యిడ్‌ల్యాండ్ మాట్లాడుతూ.. ఏదైనా ఒక కార్యక్రమాన్ని చేపడితే అమలులో అనుసంధానత తెగిపోకుండా చూడాలని పేర్కొన్నారు. అంతకుముందు ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.టక్కర్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పలు విధాన నిర్ణయాలను వివరించారు. వచ్చే పదేళ్లలో క్రమం తప్పకుండా రెండంకెల వృద్ధిరేటు సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. ఈ పరిశోధన పత్రాలపైన సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ వరకూ ప్రఖ్యాత ఆర్థికవేత్తలు అధ్యయనం చేస్తారని ప్రాజెక్టు ముఖ్య సలహాదారు బీఎం నాయుడు తెలిపారు. తుది నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందిస్తామన్నారు.

మూర్ఖ మేధావులకు హిందూ పదమే గిట్టదు

కేంద్ర మంత్రి హెగ్డే వ్యాఖ్యలు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: హిందుత్వ వ్యతిరేకులపై కేంద్ర కౌశల్యాభివృద్ధి శాఖ మంత్రి అనంతకుమార్ హెగ్డే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులోని బనశంకరి సుచిత్ర ఫిలిం సొసైటీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమం ఇందుకు వేదికైంది. 'మూర్ఖ మేధావులు తమ మేధస్సును విక్రయానికి ఉంచారు. హిందూ అన్న పేరు వింటే వారికి ఒంటిపై గొంగళిపురుగు పాకినట్లు ఉంటుంది. మేము హిందువులం కాదని వాదిస్తుంటారు. నేను క్రైస్తవుడిని, నేను ముస్లింను అని చెప్పుకొనేవారిని ఆదర్శంగా తీసుకుంటారు. మేము హిందువులమని చెబితే మాత్రం వారికి ఇష్టం ఉండదు' అని వ్యాఖ్యానించారు. 'లౌకికవాది.. అంటే అతనికి తండ్రి ఎవరో తెలియదని అర్థం చేసుకోవాలి' అన్నారు. గొర్రెల తరహాలో అందరూ మేధావులు చెప్పిన అంశాన్నే అంగీకరించాలని కోరుకోవటం సరికాదన్నారు. 'వీర సావర్కర్‌ను ఆరాధిస్తే తప్పు పడతారు. సావర్కర్ ఆరాధించింది హిందుత్వాన్ని. ఇప్పుడు పీహెచ్‌డి చేస్తున్న వారు కాపీ, పేస్ట్ చేసినట్లు ఆయన ఏ గ్రంథ చౌర్యానికీ పాల్పడలేదు. పెద్ద సముద్రంలాంటి హిందుత్వ గురించి ఎవరం పూర్తిగా వివరించలేం. హిందుత్వపై అభ్యుదయ వాదుల ప్రశ్నలకు బదులు ఇవ్వటం మూర్ఖత్వమే' అన్నారు. ఇండియన్ షేక్స్‌పియర్ పేరిట పురస్కారాలు అందిస్తే సంతోషిస్తారని, కాళిదాస పురస్కారం అంటే ముఖం ముడుచుకుంటారని ధ్వజమెత్తారు. 'నేను విషకంఠుని(శివుడి) పరంపరను కొనసాగిస్తా. ప్రచారమాధ్యమాలు నన్ను తిడితే వెనుకంజ వేయను.సవాళ్లను ఎదుర్కొంటా'నని ప్రకటించారు.

పాలిచ్చి పెంచాను.. తండ్రిగా గుర్తిస్తాడా!

- కన్న కుమారుడి గురించి అమ్మ అయిన నాన్న ఆవేదన

అట్లాంటా: నవమాసాలు మోసి తాను కన్న కుమారుడు.. తనని నాన్నగా అంగీకరిస్తాడా? అని ఓ తండ్రి ఆవేదన పడుతున్న విచిత్రమిది. మీరు చదివింది నిజమే. నవమాసాలు మోసి కంటే అమ్మ అవుతుంది కానీ, తండ్రి అవడమేంటి? అని మీకు అనుమానం రావొచ్చు. అట్లాంటా ప్రాంతానికి చెందిన సెబాస్టియన్(24) జీవితమే ఓ విచిత్రం. జార్జియాలోని లోకస్ట్‌గ్రేవ్‌లో బాలికగా పుట్టాడు. ఐదేళ్ల క్రితం ట్రాన్స్‌జెండర్ల కోసం జరిగిన ఓ సమావేశంలో ఏంజెల్ స్పార్క్స్(33) అనే పురుషపుంగవుణ్ని కలవడంతో ఆమె జీవితంలో కీలక మలుపునకు కారణమైంది. ఇద్దరూ ఒకే ఇంట్లో జీవించారు. 2016లో వివాహం చేసుకున్నారు. మొదటిసారి గర్భస్రావం జరగడంతో హార్మోన్ ఔషధాలు వాడుతూ చాలా జాగ్రత్తపడ్డారు. ఫలితంగా సెబాస్టియన్ రెండోసారి గర్భం దాల్చింది. జక్సెన్ అనే బాబుకి జన్మనిచ్చింది. చిన్నప్పటి నుంచి వక్షోజాలంటే సెబాస్టియన్‌కు ఎంతో చిరాకు. బాగా సంపాదించాక శస్త్రచికిత్స చేయించుకుని వాటిని తొలగించుకోవాలని కలలు కనేవాడు. మగాడిలా మారాలని ఉబలాట పడ్డాడు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని మగాడిలా మారాడు. ఇప్పుడు అతనికి ఒక్కటే అనుమానం. నవమాసాలు మోసి, పాలిచ్చి పెంచాను కాబట్టి.. తనను కుమారుడు తల్లిగా చూస్తాడా లేక తండ్రిగా గౌరవిస్తాడా? అని.. మరోవైపు ఏంజెల్ పుట్టుకతో మగాడు. స్త్రీగా మారాలని అతని ఆరాటం. ఇటీవల అతని కల నిజం చేసుకున్నాడు. అంటే ఒక మగ, ఆడ పెళ్లి చేసుకుని.. బిడ్డ పుట్టాక, ఇద్దరూ అటుఇటుగా మారారన్నమాట. అదండీ సంగతి.

అరుదైన అలర్జీ.. కోట్ల మందిలో ఒక్కరికి!

- ఇంజెక్షన్ చేసినా, చేయకపోయినా మరణమే
- తొమ్మిదేళ్లుగా నరకయాతన పడుతున్న బాలిక

కొలంబియా, సౌత్ కరోలినా: అమెరికాలోని సౌత్‌కరోలినాకు చెందిన 13 ఏళ్ల ఎమ్మీ రీవ్స్‌ది విచిత్రమైన వ్యాధి. కోట్ల మందిలో ఒక్కరికి ఇలాంటి అరుదైన అలర్జీ ఉంటుంది. ఆమెకు నాలుగేళ్ల వయస్సు ఉన్నప్పుడే మధుమేహం టైప్-1 సోకిందని వైద్యులు నిర్ధారించారు. ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇచ్చారు. గిలగిలా కొట్టుకుని ఊపిరి ఆగిపోయింది. అప్పటి నుంచి ఎప్పుడు ఇంజెక్షన్ ఇచ్చినా అదే వరస. ఎందుకిలా జరుగుతోందో వైద్యులకు అంతుబట్టలేదు. చివరకు కోట్లమందిలో ఒకరికి వచ్చే అరుదైన అలర్జీగా తేల్చారు. ఏ ఇన్సులిన్ ఇంజెక్షన్ చేస్తేనే ఆమె బతుకుతుందో, అదే ఇన్సులిన్ ఆమె శరీరంలో ప్రవేశిస్తున్నది మొదలు కణకణాల్లో మంటలు పుట్టిస్తోందని తేల్చారు. ఇంజెక్షన్ చేస్తే రోజుకు 20 గంటలు నిద్రపోతుంది. ఇవ్వకపోతే మరణానికి చేరువవుతోంది. 'నేను మంచిగా ఉంటానమ్మా. అల్లరి చేయను. మీరు చెప్పినట్టే వింటాను. నాకు ఆ ఇంజెక్షన్ చేయవద్దు' అని కన్నీళ్లతో కన్నకూతురు వేడుకుంటుంటే... తల్లి టిఫ్ఫని రీవ్స్‌కు గుండె బద్దలైపోయేది. అయినా ఇంజెక్షన్ ఇవ్వక తప్పేది కాదు. చివరకు యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా హెల్త్‌కు చెందిన డాక్టర్ రాజా కందస్వామి ఆధ్వర్యంలో 12 మంది నిపుణుల బృందం ఆమె కేసుపై చర్చోపచర్చలు జరిపారు. క్లోమాన్ని పూర్తిగా తొలగించి కొత్తది పెట్టాలని నిర్ణయించారు. అదీ నూరుశాతం విజయవంతం అవుతుందని చెప్పలేని పరిస్థితి. ఎమ్మీ తల్లిదండ్రులకు వివరిస్తే, బతికితే బతుకుతుంది లేకపోతే లేదు, ఈ నరకం కంటే రిస్క్ తీసుకోవడమే మేలని భావించారు. ఎందుకంటే కందస్వామి మార్గదర్శకుడు డాక్టర్ డేవిడ్ సుదర్‌ల్యాండ్ 1994లో 11 ఏళ్ల బాబుకు ఇలాగే శస్త్రచికిత్స చేసినా ఆరునెలలకు మించి బతకలేదు. మొత్తానికి ఎమ్మీకి ఏడాదిక్రితం క్లోమంమార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం బాగానే ఉంది. కానీ ఏ క్షణాన ఏమవుతుందో వైద్యులు కూడా చెప్పలేని పరిస్థితి.

సూర్యుడికి రెండింతల నక్షత్రాన్ని మింగేస్తున్న కృష్ణబిలం

- తొలిసారిగా దూరదర్శినుల సాయంతో చిత్రీకరణ



లండన్: నక్షత్రాన్ని ముక్కలు ముక్కలు చేసి, తనలోకి లాగేస్తున్న కృష్ణబిలాన్ని శాస్త్రవేత్తలు తొలిసారిగా చిత్రీకరించగలిగారు. భూమికి సుమారు 15 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో 'ఏఆర్‌పీ 299' అనే పాలపుంతల కలయిక వద్ద ఈ అద్భుతం జరుగుతోంది. రేడియో, పరారుణ కాంతి టెలిస్కోపులతో పాటు జాతీయ సైన్స్ ఫౌండేషన్‌కు చెందిన అత్యాధునిక దూరదర్శిని సాయంతో దీన్ని చిత్రీకరించగలిగారు. మన సూర్యుడితో పోలిస్తే రెండురెట్లు ద్రవ్యరాశి గల నక్షత్రాన్ని, సూర్యుడి కంటే రెండు కోట్ల రెట్లు పెద్దదైన కృష్ణబిలం మింగేస్తోంది. కాంతి వేగంతో నక్షత్రం నుంచి వాయువులను తనవైపు లాగేస్తుండటంతో అవన్నీ కలసి కృష్ణబిలం చుట్టూ డిస్క్ ఆకారంలో తిరుగుతుండటాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. ఇంత వేగంతో వాయువులను తనలో లీనం చేసుకుంటుంటోంది కాబట్టి, తీవ్రప్రభావం గల ఎక్స్‌-కిరణాలు, కంటితో చూడటానికి కష్టమయ్యే కాంతి వెలువడుతున్నాయని చెబుతున్నారు.

చేతి రాతే.. తారల తలరాత మార్చింది

- అమెరికాలో చీకటి వ్యవహారాల గుట్టురట్టు చేసింది చిత్తు కాగితమే
- ఆ వివరాల ఆధారంగానే మోదుగుమూడి దంపతుల ఇంట్లో సోదాలు
- మరింత మంది బాధితులు వెలుగులోకి వచ్చే వీలు

ఈనాడు - హైదరాబాద్

సినీ తారలతో అమెరికాలో వ్యభిచారం చేయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కిషన్ మోదుగుమూడి, చంద్రకళ మోదుగుమూడి దంపతుల భవితవ్యం గురువారం తేలనుంది. వీసా గడువు ముగిసిన తర్వాతకూడా అమెరికాలోనే ఉన్న నేరంపై అరెస్టయిన కిషన్ దంపతులను గురువారం ఇల్లినాయిస్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా వ్యభిచారానికి సంబంధించి ఆయనపై మోపిన అభియోగాలపైనా విచారించనున్నారు. అప్పట్నుంచి నెలరోజుల వ్యవధిలో కేసు కొలిక్కి వస్తుందని ఈ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న అధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు.

42 పేజీల నేర ఫిర్యాదు: మోదుగుమూడి దంపతులు రకరకాల తెలుగు సంఘాల పేర్లతో నకిలీ లేఖలు సృష్టించి సినీ తారలను అమెరికా రప్పించి..వారితో వ్యభిచారం చేయిస్తున్నట్లు నార్తన్ డిస్ట్రిక్ ఆఫ్ ఇల్లినాయిస్, ఈస్ట్రన్ న్యాయస్థానంలో దర్యాప్తు అధికారి బ్రియాన్‌గిన్ ఏప్రిల్ 9వ తేదీన 42 పేజీల నేర ఫిర్యాదు (క్రిమినల్ కంప్లైంట్) దాఖలు చేశారు. ఈ కేసులో అరెస్టయిన వారిని గురువారం న్యాయస్థానంలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా వారిపై మోపిన అభియోగాలను న్యాయస్థానం వివరించనుంది. "ప్రాథమిక విచారణలో వారి నేరాలపై కీలకమైన ఆధారాలు లభించిన నేపథ్యంలో..నెల రోజుల వ్యవధిలోనే ఈ కేసు కొలిక్కి వస్తుందని, శిక్ష పడిన పక్షంలో అది పూర్తయిన తర్వాత ఇద్దర్నీ దేశం నుంచి పంపేస్తారని" ఓ అధికారి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా..వ్యభిచారం వ్యవహారంలో ఇప్పటివరకూ ఆరుగురు నటీమణుల పేర్లు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. కిషన్ దంపతుల చరవాణి సంభాషణల విశ్లేషణ కొనసాగుతున్న నేపథ్యంలో మరింత మంది బాధితుల పేర్లు అవకాశం ఉందని సమాచారం. అలాగే విటులను ఇప్పటికే విచారించిన దర్యాప్తు అధికారులు వీరందరినీ సాక్షులుగా పేర్కొనే అవకాశం ఉందని భావిస్తున్నారు. గురువారం జరగబోయే విచారణలో దీనిపై స్పష్టత రానుంది.

చిత్తు కాగితమే ..చిత్తు చేసింది

చిన్న చిత్తు కాగితం కిషన్ సాగిస్తున్న ఖరీదైన వ్యభిచార బాగోతాన్ని రట్టు చేసింది. అక్రమంగా నివసిస్తున్నారన్న ఆరోపణలపై అరెస్టయిన వీరిని విచారించినప్పుడు ఈ కేసు అనూహ్య మలుపు తిరిగింది. నిజానికి 2018 జనవరి 23వ తేదీన మోదుగుమూడి దంపతులను ఓహియోలో యునైటెడ్ స్టేట్స్ బోర్డర్ పెట్రోల్ (యు.ఎస్.బి.పి.) అధికారులు అడ్డగించారు. 2016 ఆగస్టు 8వ తేదీన వారి వీసా గడువు పూర్తయినట్లు గుర్తించి ఇద్దర్నీ అరెస్టు చేశారు. ఫిబ్రవరి 23వ తేదీన వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. దీనికి సంబంధించిన విచారణ ఈ ఏడాది నవంబరుకు వాయిదా పడింది. ఇదిలా ఉండగా..కిషన్ దంపతులను అరెస్టు చేసినప్పుడు వారి నుంచి యు.ఎస్.బి.పి. అధికారులు అనేక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అందులో మారియట్ హోటల్ పేరుతో ముద్రించి ఉన్న కాగితంలోని చేతిరాత అక్షరాలు అధికారుల దృష్టిని ఆకర్షించాయి. అందులో ఒకచోట "వాషింగ్టన్ డి.సి..దాని పక్కన ఓ సినీనటి పేరు, జనవరి 19న ఉదయం రూం.నెంబర్ 207 అని, మరోచోట జనవరి 19, వెంకట్, రూం. నెంబర్ 404 అని ఇలా..అనేక మంది పేర్లు, హోటల్ గదుల నెంబర్లు రాసి ఉండటాన్ని గుర్తించిన దర్యాప్తు అధికారులకు ఇదేదో వ్యభిచారానికి సంబంధించిన వ్యవహారమేనన్న" అనుమానం వచ్చింది. దాన్ని ఖరారు చేసుకునేందుకే ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన కిషన్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. కండోమ్స్‌తోపాటు..ఐదు డైరీలు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. డైరీల్లోనూ అనేక మంది పేర్లు, డబ్బు లావాదేవీలకు సంబంధించిన వివరాలు ఉండటంతో మరింత లోతుగా విచారించారు. వాటిలో ఉన్న పేర్లను బట్టి విటులు, నటీమణులను విచారించారు. దాంతో వారి చీకటి కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి.

అమెరికా పేరెత్తితే హడలిపోతున్న తారలు

తెలుగు చిత్రసీమలో కాస్టింగ్ కౌచ్ వివాదం ఇంకా సద్దుమణగలేదు. ఎప్పుడు ఎవరిపై ఎవరు ఎలాంటి ఆరోపణలు చేస్తారో తెలియని పరిస్థితి. ఆ విషయమై ఒకపక్క చర్చలు నడుస్తుండగానే...అమెరికాలో తెలుగు దంపతులు నడిపిస్తున్న వ్యభిచారం ఉదంతం వెలుగులోకి రావడంతో చిత్రసీమ మరోసారి కలవరపాటుకి గురైంది. ఇది వరకు అమెరికాలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు, చిత్రీకరణలకు ఉత్సాహంగా వెళ్లే తెలుగు తారలు ఇప్పుడు విదేశాల మాటెత్తితేనే హడలిపోతున్నారు. ముఖ్యంగా అమెరికాలో సెక్స్ రాకెట్ గుట్టు రట్టయినప్పట్నుంచి అక్కడి పోలీసులు సినిమా తారలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇటీవల ఓ యువ కథానాయిక ప్రయాణాలపై అనుమానం వ్యక్తంచేసిన అమెరికా పోలీసులు ఆమెని చాలాసేపు విచారించినట్టు, సదరు ప్రయాణాలన్నీ చిత్రీకరణల కోసమే అని తేలడంతో వదిలిపెట్టినట్టు సమాచారం. "ముఖ్యంగా అమెరికా చుట్టూ తిరిగే కథలు తెలుగులో ఎక్కువగా తెరకెక్కుతుంటాయి. వాటి కోసం చిత్ర బృందాలు అక్కడికి తరచుగా వెళ్తుంటాయి. కొన్నిసార్లు పరిమిత సంఖ్యలో నటీనటులతో వెళ్లి చిత్రీకరణ పూర్తి చేసుకొచ్చేవాళ్లం. ఇన్నాళ్లూ స్వేచ్ఛగా అమెరికా తదితర దేశాలకు వెళ్లి వచ్చే వాళ్లం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇకపై ఆ పరిస్థితి ఉండదేమో" అని పలువురు తారలు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

కిక్ 2018 ఛాంపియన్స్

3 ఈ ప్రపంచకప్‌లో డైరెక్ట్ ఫ్రీకిక్ ద్వారా గోల్ చేసిన మూడో ఆటగాడు కొలరోవ్. గొలోవిన్ (రష్యా), రొనాల్డో (పోర్చుగల్) అతడికంటే ముందున్నారు. గత ప్రపంచకప్‌లో ఫ్రీకిక్ ద్వారా మూడే గోల్స్ నమోదయ్యాయి.

బ్రెజిల్‌ను నిలువరించిన స్విట్జర్లాండ్

రొస్తోవ్: ఐదుసార్లు ఛాంపియన్ బ్రెజిల్ ప్రపంచకప్ వేటను పేలవంగా ఆరంభించింది. ఆదివారం జరిగిన గ్రూప్-ఈ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 1-1తో బ్రెజిల్‌ను నిలువరించింది. సాంబా జట్టు మ్యాచ్‌ను నెమ్మదిగానే ఆరంభించినా క్రమంగా వేగం పెంచింది. ఫిలిప్ కౌటినో 20వ నిమిషంలో అద్భుతమై గోల్‌తో బ్రెజిల్‌కు ఆధిక్యాన్ని అందించాడు. బాక్స్ బయటి నుంచి అతడు కళ్లు చెదిరే కిక్‌తో స్విస్ గోల్‌కీపర్ సోమర్‌ను బోల్తా కొట్టించాడు. వంపు తిరుగుతూ వెళ్లిన బంతి పై మూల నుంచి నెట్లో పడింది. రెండో అర్ధభాగంలో స్విస్ జట్టు పుంజుకుంది. 50వ నిమిషంలో స్టీవ్ జుబెర్ హెడర్ గోల్‌తో స్కోరు సమం చేసింది. బ్రెజిల్ డిఫెన్స్ వైఫల్యం జుబెర్‌కు కలిసొచ్చింది. షాకిరి కార్నర్‌ను కొట్టగా.. జుబెర్‌ను డిఫెండర్లు ఒంటరిగా వదిలేశారు. అవకాశాన్ని అతడు సద్వినియోగం చేసుకున్నాడు. తర్వాత రెండు జట్లూ గట్టిగా ప్రయత్నించినా మరో గోల్ కొట్టలేకపోయాయి.

మెక్సికో అభిమానుల ఆనందోత్సాహం

మెరిసిన కొలరోవ్

సెర్బియా విజయం

సమార: ప్రపంచకప్‌లో సెర్బియా శుభారంభం చేసింది. అలెగ్జాండర్ కొలరోవ్ సంచలన ఫ్రీకిక్ గోల్‌తో ఆదివారం జరిగిన గ్రూప్-ఈ మ్యాచ్‌లో 1-0తో కోస్టారికాపై విజయం సాధించింది. సెర్బియా మొదటి నుంచి మంచి నియంత్రణతోనే సాగినా.. కోస్టారికా డిఫెన్స్‌ను ఛేదించడం అంత తేలిక కాలేదు. తొలి అర్ధభాగంలో అత్యుత్తమ గోల్ అవకాశం కోస్టారికాకే వచ్చింది. కానీ ఆ జట్టు ఆటగాడు గియాన్‌కార్లో గొంజాలో అతడి సమీపం నుంచి కొట్టిన హెడర్ పై నుంచి వెళ్లిపోయింది. ఐతే రెండో అర్ధ భాగంలో కొలరోవ్ (56వ నిమిషం) కళ్లు చెదిరే ఫ్రీకిక్‌తో గోల్ సాధించి సెర్బియాను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. 25 గజాల దూరం నుంచి కొలరోవ్ ఎడమ కాలితో కొట్టిన కిక్ వంపు తిరుగుతూ వెళ్లి నెట్ పై మూలకు దూసుకెళ్లింది. కోస్టారికా గోల్‌కీపర్ కీలర్ నవాస్‌కు

సెర్బియా 1 | కోస్టారికా 0

గాల్లో పూర్తిగా డైవ్ చేసినా ఫలితం లేకపోయింది. తర్వాత ఆధిక్యాన్ని పెంచుకునే అవకాశాలు వచ్చినా సెర్బియా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఐతే కోస్టారికా .. ఆ జట్టు డిఫెన్స్‌ను పెద్దగా ఇబ్బంది పెట్టలేకపోయింది. ఈ టోర్నీకి ముదు సెర్బియా తాను ఆడిన గత ఆరు ప్రపంచకప్పుల్లో ఒకే విజయం సాధించడం విశేషం. ఈ విజయంతో గ్రూప్ నుంచి నాకౌట్ రేసులో ముందు నిలిచింది. ఈ జట్టు ఇంకా బ్రెజిల్, స్విట్జర్లాండ్‌లతో మ్యాచ్‌లు ఆడాల్సివుంది.

గొడవ గొడవ..: మ్యాచ్ సందర్భంగా గొడవ చోటు చేసుకుంది. ఇంజురీ సమయంలో సెర్బియా ఆటగాడు నెమాంజా మాటిచ్ .. కోస్టారికా సహాయ కోచ్ లూయిస్ మారిన్‌తో ఘర్షణ పడ్డాడు. బయటకు వెళ్లిన బంతిని మాటిచ్ తీసుకొచ్చే క్రమలో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. రెండు జట్ల ఆటగాళ్లు కూడా అక్కడికి దూసుకెళ్లారు. కానీ గొడవ త్వరగానే సద్దుమణిగింది.



లొజానో

జర్మనీకి షాక్..

3 డిఫెండింగ్ ఛాంపియన్ ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో గెలవకపోవడం ఇది వరుసగా మూడోసారి. 2010లో ఇటలీ.. పరాగ్వేతో డ్రా చేసుకోగా.. 2014లో స్పెయిన్ 1-5తో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. ఇప్పుడు జర్మనీ పరాజయం పాలైంది.

మెక్సికో 1 | జర్మనీ 0

లొజానో గెలుపు గోల్

నైజీరియానే గెలిపించింది

సెల్ఫ్‌గోల్, పెనాల్టీతో నెగ్గిన క్రొయేషియా

ప్రపంచకప్‌లో మరో సెల్ఫ్‌గోల్! మొరాకో చేసిన సొంత గోల్‌తో ఇరాన్ గెలిచి రెండు రోజులు అయిందో లేదో మరో సెల్ఫ్‌గోల్‌తో నైజీరియాపై క్రొయేషియా గెలిచింది. ఈ మ్యాచ్‌లో క్రొయేషియా గెలిచిందనడం కంటే ప్రత్యర్థే గెలిపించిందనడం సబబు! సెల్ఫ్‌గోల్ చేయడంతో పాటు పెనాల్టీ రావడానికి కారణమైన ఆఫ్రికన్ జట్టు ఓటమి కొని తెచ్చుకుంది.

క్రొయేషియా 2 | నైజీరియా 0

కాలినిన్‌గ్రాడ్: ప్రపంచకప్‌లో క్రొయేషియా బోణీ కొట్టింది. శనివారం రాత్రి జరిగిన గ్రూప్-డి సమరంలో ఆ జట్టు 2-0 గోల్స్‌తో నైజీరియాను ఓడించింది. అయితే క్రొయేషియా కొట్టిన రెండు గోల్సూ నైజీరియా స్వయంకృతమే. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి రెండు జట్లూ నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. క్రొయేషియా అటాకింగ్‌కు, నైజీరియా డిఫెన్స్‌కు మధ్య పోటీగా సాగింది మ్యాచ్. 32వ నిమిషంలో మోడ్రిచ్ కొట్టిన కార్నర్‌కిక్‌ను గోల్‌పోస్ట్ సమీపంలో ఉన్న స్ట్రైకర్ మారియో... తలతో బంతిని గోల్‌లోకి కొట్టేందుకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న నైజీరియా డిఫెండర్ ఎటిబొ బంతిని కాలితో ఆపేందుకు ప్రయత్నించగా అది గోల్‌లోకి వెళ్లిపోయింది. సెల్ఫ్‌గోల్‌తో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లిన క్రొయేషియా ఆ తర్వాత కూడా దాడులు కొనసాగించింది.

అదృష్టం కలిసొచ్చింది: ద్వితీయార్ధంలో నైజీరియా కూడా స్కోరు సమం చేయడానికి గట్టిగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. 69వ నిమిషంలో కార్నర్‌కిక్‌ను అందుకునేందుకు సిద్ధంగా ఉన్న మాంజుకిచ్‌ను నైజీరియా డిఫెండర్ విలియమ్ ట్రూస్ట్ రెండు చేతులతో వాటేసుకుని పడేయడంతో రిఫరీ క్రొయేషియాకు పెనాల్టీ ఇచ్చాడు. ఈ అవకాశాన్ని క్రొయేషియా కెప్టెన్ మోడ్రిచ్ గోల్‌గా మలచి 2-0తో జట్టును విజయపథంలో నడిపించాడు.

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ప్రకంపనలు. ఎదురేలేదనుకున్న డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీకి దిమ్మతిరిగే షాక్. గ్రూప్-ఎఫ్‌లో మెక్సికో పెను సంచలనం సృష్టించింది. బలమైన రక్షణశ్రేణితో ప్రత్యర్థిని అడ్డుకున్న ఆ జట్టు 1-0తో విజయం సాధించింది. జర్మనీ జట్టు బంతిని ఎక్కువ భాగం నియంత్రణలోనే ఉంచుకున్నా, విరామం లేకుండా దాడులు చేసినా.. గోడలా నిలిచిన మెక్సికో డిఫెన్స్‌ను ఛేదించలేక చతికిలపడింది. హిర్వింగ్ లొజానో సూపర్ గోల్‌తో మెక్సికో హీరోగా అవతరించాడు.

• తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌కు పరాభవం • లొజానో గోల్‌తో మెక్సికో సంచలనం

మాస్కో: ఫేవరెట్‌గా ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన ప్రపంచ నంబర్‌వన్ జర్మనీకి అనుకోని పరాభవం. తొలి మ్యాచ్‌లోనే ఆ జట్టుకు షాక్. ఆదివారం జరిగిన గ్రూప్-ఎఫ్ మ్యాచ్‌లో మెక్సికో 1-0తో జర్మనీని మట్టికరిపించింది. లొజానో.. 35వ నిమిషంలో చేసిన గోల్ మెక్సికోను విజయపథంలో నడిపించింది. దుర్భేద్యమైన డిఫెన్స్ ఆ జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించింది. మెక్సికో తాను ఆడిన గత ఆరు ప్రపంచకప్పుల్లోనూ నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఈసారి కూడా ముందంజ వేయడం దాదాపుగా ఖాయం. నాకౌట్ చేరాలంటే జర్మనీ ఆట తీరు మాత్రం చాలా మెరుగుపడాలి. ఇంకా స్వీడన్, దక్షిణ కొరియాలతో ఆ జట్టు తలపడాల్సి వుంది. గత రెండు ప్రపంచకప్‌లలో డిఫెండింగ్ ఛాంపియన్స్ గ్రూప్ దశలోనే నిష్క్రమించడం జర్మనీని కలవర పెట్టే అంశమే.

జర్మనీ దాడులు చేసినా..: జర్మనీ ఎంతో బలమైన జట్టు. డిఫెండింగ్ ఛాంపియన్. జట్టు నిండా స్టార్లే. గత ఏడు ప్రపంచకప్‌లనూ విజయంతో ఆరంభించింది. దాని ముందు మెక్సికో పెద్ద లెక్క కాదు అనిపించింది. కానీ మెక్సికో జోరుతో మ్యాచ్ అనూహ్యంగా సాగింది. బంతి ఎక్కువగా జర్మనీ నియంత్రణలోనే ఉన్నా, ఎటాకింగ్‌కు దిగినా.. మెక్సికో బలమైన రక్షణ శ్రేణిని ఛేదించలేకపోయింది. కచ్చితమైన పాసులు అందించుకోలేకపోయింది. అనేక అవకాశాలను వృథా చేసుకుంది. మెక్సికో కూడా దూకుడుగా ఆడింది. మెరుపు వేగంతో అనేక సార్లు జర్మనీ గోల్ దగ్గరకు దూసుకెళ్లింది. జర్మనీలాగే గోల్‌పై మెక్సికో షాట్లు కూడా గురి తప్పాయి. ఐతే మెక్సికో డిఫెన్స్ గోడలా నిలిస్తే.. ఆ జట్టు ఎదురుదాడికి జర్మనీ డిఫెన్స్ మాత్రం చెల్లాచెదురైంది. ఒత్తిడి పెంచుతూ పోయిన మెక్సికో.. ప్రత్యర్థిని దిగ్భ్రాంతికి గురి చేస్తూ 35వ నిమిషంలో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి అరగంటలో జర్మనీ డిఫెన్స్‌ను తీవ్రంగా పరీక్షించిన లొజానోకు ఎట్టకేలకు ఫలితం దక్కింది. ఎడమవైపు హెర్నాండెజ్ నుంచి బంతిని అందుకుని మెరుపు వేగంతో దూసుకెళ్లిన లొజానో.. 12 గజాల దూరం నుంచి జర్మనీ గోల్‌కీపర్ న్యూర్‌ను బోల్తా కొట్టించాడు. జర్మనీ వెంటనే స్కోరు సమం చేయడానికి ప్రయత్నించింది. 39వ నిమిషంలో దాదాపుగా గోల్ చేసినంత పని చేసింది. కానీ క్రూస్ ఫ్రీకిక్‌ను మెక్సికో గోల్‌కీపర్ ఒచావ్ అద్భుతంగా అడ్డుకున్నాడు. జర్మనీ ఎటాకింగ్‌ను కొనసాగించినా విరామానికి గోల్ కొట్టలేకపోయింది. విరామం తర్వాత కూడా అదే పరిస్థితి. షాట్లలో కచ్చితత్వం లోపించడం ఆ జట్టు అవకాశాలను దెబ్బతీసింది. జర్మనీ విరామం లేకుండా దాడులు చేసినా అత్యంత పటిష్టమైన మెక్సికో రక్షణశ్రేణిని దాటలేకపోయింది. కొద్దిలో గోల్స్ చేజారాయి. క్రూస్, ఓజిల్, ముల్లెర్ ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మ్యాచ్ ముగింపు దగ్గరపడుతున్నకొద్దీ దాదాపు జర్మనీ ఆటగాళ్లంతా ఎటాకింగ్‌కు వెళ్లారు. ఓ దశలో గోల్‌కీపర్ న్యూర్‌కు బోటెంగ్ మాత్రమే తోడుగా ఉన్నాడు. మరోవైపు మెక్సికో కూడా కొన్ని చక్కని గోల్ అవకాశాలను చేజార్చుకుంది. కానీ డిఫెన్స్‌లో మాత్రం ఏ దశలోనూ పట్టుసడలించలేదు. ఆ జట్టు గోల్‌కీపర్ ఒచావ్ ప్రదర్శన కూడా అద్భుతం. జర్మనీ ఆఖరి 20 నిమిషాల్లో దాదాపు మెక్సికో పెనాల్టీ ప్రాంతంలోనే ఉన్నా, మరింత ఉద్ధృతంగా దాడులు చేసినా ఓటమి తప్పించుకోలేకపోయింది.

అంకెల్లో ఆట

జర్మనీ		మెక్సికో
0	గోల్స్	1
25	గోల్ ప్రయత్నాలు	12
8	కార్నర్లు	1
60	బంతి నియంత్రణ	40
592	పాసులు	280
2	పసుపు కార్డులు	2

1 1982 తర్వాత జర్మనీ ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఓడటం ఇదే తొలిసారి.

2 జర్మనీపై మెక్సికోకు ఇది రెండో విజయం మాత్రమే. చివరగా ఆ జట్టు 1985లో గెలిచింది.

3 ఐదు ప్రపంచకప్‌లలో పోటీపడిన మూడో ఆటగాడిగా మార్కెజ్ (మెక్సికో) రికార్డు సాధించాడు.

ప్రపంచకప్‌లో ఈనాడు

స్వీడన్	సా॥ 5.30	దక్షిణ కొరియా
బెల్జియం	రాత్రి 8.30	పనామా
ట్యూనీసియా	రాత్రి 11.30	ఇంగ్లాండ్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

చండిమాల్‌పై టాంపరింగ్ అభియోగాలు నమోదు

గ్రాస్ ఐలెట్: శ్రీలంక సారథి దినేశ్ చండిమాల్‌పై ఐసీసీ బాల్ టాంపరింగ్ అభియోగాలు నమోదు చేసింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక ఉద్దేశపూర్వకంగా బంతి ఆకారాన్ని మార్చినట్లు ఐసీసీ తేల్చింది. శుక్రవారం ఆట ముగిశాక బంతి ఆకారం మారిందని భావించిన అంపైర్లు అలీం దార్, ఇయాన్ గౌల్డ్ బంతిని మార్చారు. శ్రీలంకకు 5 పరుగులు పెనాల్టీ విధించారు. దీంతో ఆగ్రహించిన లంక క్రికెటర్లు శనివారం మ్యాచ్ ఆడేందుకు నిరాకరించడంతో 2 గంటలు ఆలస్యంగా ఆట ఆరంభమైన సంగతి తెలిసిందే. ఐతే బాల్ టాంపరింగ్ జరిగినట్లు ఆదివారం ఐసీసీ స్పష్టం చేసింది. ఐసీసీ ప్రవర్తన నియమావళి ప్రకారం చండిమాల్‌పై టాంపరింగ్ అభియోగాలు నమోదు చేసినట్లు తెలిపింది. అభియోగాలను చండిమాల్ అంగీకరించకపోవడంతో ఐసీసీ విచారణ ఆరంభించనుంది.

ఫెదరర్.. టైటిల్ నంబర్ 98

స్టట్‌గార్ట్: స్విస్ మాస్టర్ రోజర్ ఫెదరర్ టైటిళ్ల సెంచరీకి చేరువయ్యాడు. తాజాగా స్టట్‌గార్ట్ ఓపెన్‌ను కైవసం చేసుకున్న అతను కెరీర్‌లో 98వ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో రోజర్ 6-4, 7-6 (7-3)తో రోనిచ్ (కెనడా)ను ఓడించాడు. రోనిచ్‌తో 14 మ్యాచ్‌లు ఆడిన ఫెదరర్‌కు ఇది 11వ విజయం. దీంతో టైటిళ్ల సంఖ్యను 98కు పెంచుకున్న స్విస్ దిగ్గజం.. రఫెల్ నాదల్ (స్పెయిన్)ను వెనక్కినెట్టి నంబర్‌వన్ ర్యాంకును కూడా సొంతం చేసుకున్నాడు.

శ్రీలంక 191/5

గ్రాస్ ఐలెట్: కుశాల్ మెండిస్ (82 బ్యాటింగ్; 108 బంతుల్లో 8×4, 2×6) రాణించడంతో వెస్టిండీస్‌తో రెండో టెస్టులో శ్రీలంక కుప్పకూలే ప్రమాదం నుంచి తప్పించుకుంది. ఆదివారం ఆట నాలుగోరోజు కడపటి వార్తలందే సమయానికి ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. మెండిస్‌తో పాటు రోషెన్ సిల్వ (10) క్రీజులో ఉన్నాడు. లంక తొలి ఇన్నింగ్స్‌లో 253 పరుగులు చేయగా.. విండీస్ 300 పరుగులు సాధించింది.

ఆ జట్లదీ ఇలాంటి అనుభవమే!

సౌరభ్ గంగూలీ

చిన్నస్వామి స్టేడియం ఫలితం ఆశ్చర్యకరమేమీ కాదు. ఐతే టీమ్‌ఇండియా, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య టెస్టు మ్యాచ్ కేవలం 2 రోజుల్లోనే ముగుస్తుందని అత్యధికులు ఊహించలేదు. మ్యాచ్ రెండ్రోజుల్లోనే ముగిసిందని అఫ్గాన్ ఆటగాళ్లు విచారించకుండా.. టెస్టులకు తగ్గట్లు తమ ఆటతీరును మెరుగుపర్చుకోడానికి ఏం చేయాలో తెలుసుకోవాలి. ఇలాంటి అనుభవం అఫ్గాన్ ఒక్క జట్టుదే కాదు. టెస్టుల్లో అరంగేట్రం చేసినప్పుడు శ్రీలంక, బంగ్లాదేశ్, జింబాబ్వేలకు

#WhatDrivesYou
EXIDE

సైతం ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. కాలక్రమేణా ఆటతీరు మెరుగైంది. టెస్టులకు అలవాటు పడేందుకు అఫ్గాన్, ఐర్లాండ్‌లకు మరికొంత సమయమివ్వాలి. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఐర్లాండ్‌లో ఆత్మవిశ్వాసం నింపింది. వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడటం ద్వారానే ఆటతీరు మెరుగవుతుంది.

గోల్ కొడితే భూకంపం!

మెక్సికో: మెక్సికో నగరంలో భూకంపం! కారణం ప్రపంచకప్! దీనికి దానికి ఏంటి సంబంధం అనుకుంటున్నారా? ప్రపంచ ఛాంపియన్ జర్మనీని మెక్సికో 1-0తో ఓడించడంతో ఆ దేశంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. ముఖ్యంగా హిర్వింగ్ లొజానొ గోల్ కొట్టినప్పుడు మెక్సికో నగరంలో జనాలు ఒక్కసారిగా ఎగిరి గంతులేశారు. ఈ దెబ్బకు కృత్రిమంగా భూ ప్రకంపనలు ఏర్పడినట్లు మెక్సికో భూకంప గుర్తింపు కేంద్ర అధికారులు తెలిపారు. ఈ మేరకు వాళ్లు అధికారికంగా ఒక ప్రకటన కూడా విడుదల చేశారు. రెండుసార్లు ఈ ప్రకంపనలు ఏర్పడినట్లు వారు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే దీని వల్ల ఎలాంటి నష్టం వాటిల్ల లేదు.

మిల్లి, జిల్లిలతో(ఎడమ వైపు) మరో బాలిక

బావిలోకి దూకి చెల్లెల్ని కాపాడిన తొమ్మిదేళ్ల బాలిక

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బావిలో పడిపోయిన రెండేళ్ల చెల్లెల్ని కాపాడేందుకు తొమ్మిదేళ్ల బాలిక జిల్లి చేసిన సాహసం ఒడిశాలోని సువర్ణపూర్ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. సువర్ణపూర్ జిల్లా తరభ ఠాణా పరిధి కెందుముండా గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ భాషా కుమార్తెలు మిల్లి(2), జిల్లి(9)లు తోటి స్నేహితురాలితో కలిసి ఊరు చివరున్న తోటలో ఆడుకుంటున్నారు. ఆడుతూ ఆడుతూ రెండేళ్ల మిల్లి అక్కడున్న బావిలో పడిపోయింది. జిల్లి తక్షణం స్పందించి తోడుగా ఉన్న స్నేహితురాలిని గ్రామస్థులకు విషయం తెలపాలని చెబుతూ బావిలోకి దూకేసింది. బావిలో తాను మునిగిపోనంత నీరే ఉండడంతో జిల్లి తన చెల్లిని కాపాడగలిగింది. ఈ లోగా సమాచారం అందుకున్న గ్రామస్థులు బావి వద్దకు చేరుకుని బావిలో నుంచి ఇద్దర్నీ బయటకు తీశారు.

చిల్కా సరస్సులో పడవ ప్రమాదం: ఆరుగురి మృతి

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: ఒడిశాలోని ఖుర్దా జిల్లా చిల్కా సరస్సులో శనివారం రాత్రి జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. నయాగఢ్ జిల్లాకు చెందిన 15మంది పర్యాటకులు పడవపై సరస్సు మధ్యలోనున్న కాళిజాయి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వస్తుండగా పెనుగాలులు వీచాయి. దీంతో పడవ మునిగింది. పర్యాటకులతో సహా ఇద్దరు పడవ నడిపేవారూ మునిగిపోయారు. సమీపంలోని మరో పడవ వారు స్పందించి 11 మందిని కాపాడారు. మిగిలిన ఆరుగురు గల్లంతయ్యారు. అధికారులు, సిబ్బంది శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు గాలించి ఆరు మృతదేహాలను వెలికితీశారు.

ఉప్పాడ తీరంలో ఇద్దరు నైజీరియా విద్యార్థుల గల్లంతు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లాలోని ఉప్పాడ సముద్ర తీరంలో ఆదివారం సాయంత్రం ఇద్దరు నైజీరియా విద్యార్థులు గల్లంతయ్యారు. వీరిలో ఒక విద్యార్థి మృతిచెందగా, మరో విద్యార్థి ఆచూకీ తెలియరాలేదు. కాకినాడకు సమీపంలోని సూరంపాలెం ఆదిత్య కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 8మంది నైజీరియా విద్యార్థులు ఆదివారం సాయంత్రం ఉప్పాడ తీరంలో స్నానం చేస్తుండగా కెరటాల ఉద్ధృతికి ఇద్దరు కొట్టుకుపోయారు. మిగిలిన మిత్రులు వెంటనే స్పందించి ఒకరిని బయటకు లాక్కొచ్చినా అప్పటికే అతను మృతిచెందాడు. మృతిచెందిన విద్యార్థి ఇమ్మానుయేల్ ఒబెరే(21), గల్లంతైన విద్యార్థి ఇబ్రహీం డ్యాంగూగో(19)గా గుర్తించారు. సంఘటన స్థలానికి కొత్తపల్లి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

అఫ్గాన్‌లో ఉగ్రదాడికి 18 మంది బలి

కాబూల్: తూర్పు అఫ్గానిస్థాన్‌లో ఈద్ వేడుకలు జరుపుకొంటున్న వారిపై ఉగ్రవాదులు దాడిచేశారు. దీంతో 18 మంది మృత్యువాతపడ్డారు. జలాలాబాద్‌లోని నంగర్హార్ ప్రావిన్స్ గవర్నర్ కార్యాలయం ఎదుట ఆదివారం ఈ దాడి జరిగింది. దీన్ని ఏ ఉగ్రవాద సంస్థ చేపట్టిందో తెలియరాలేదు. మరోవైపు ఆదివారం రాత్రితో ముగుస్తున్న కాల్పుల విరమణను పొడిగించబోమని తాలిబాన్లు ప్రకటించారు. ఈ ఒప్పందాన్ని పొడిగిస్తున్నామని దేశాధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ వెల్లడించిన మరుసటిరోజే వీరు స్పందించారు.

ప్రత్యామ్నాయ వాయు స్థావరం వచ్చేనా?

- **అన్ని వసతులున్నా చొరవ సున్నా**
- **పట్టించుకోని రక్షణ మంత్రిత్వశాఖ**

ఈనాడు - విశాఖపట్నం, బాడంగి - న్యూస్‌టుడే

విశాఖలో తూర్పు నౌకాదళానికి ప్రత్యామ్నాయ వాయు స్థావరం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఏళ్లుగా దస్త్రాల్లోనే మూలుగుతోంది. వాస్తవానికి బ్రిటిష్ హయాంలో విజయనగరానికి సుమారు 45 కి.మీ.ల దూరంలో ఉన్న బాడంగిలో వాయు స్థావరం ఉండేది. 250 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో దశాబ్దాల కిందటే 2 రన్‌వేలతో ఈ వైమానిక స్థావరాన్ని నిర్మించారు. స్వాతంత్ర్యానంతరం ఆ వాయు స్థావరాన్ని పూర్తిగా వదిలేశారు. దీంతో ఆ ప్రాంగణాన్ని పట్టించుకునే నాథుడే కరవయ్యారు. కానీ ప్రాంగణం, రన్‌వేలు కొంత శిథిలం కావడం మినహా నేటికీ అలాగే ఉండటం విశేషం. విశాఖలోని తూర్పు నౌకాదళ ఉన్నతాధికారులు తమ వైమానిక అవసరాల కోసం నగరంలో ఐ.ఎన్.ఎస్.డేగా పేరిట ప్రత్యేక వాయు స్థావరాన్ని అభివృద్ధి చేసుకున్నారు. అనంతర కాలంలో దీనినే పౌర విమానాల రాకపోకలకు అనుమతించారు. ఫలితంగా ముందువైపు విమానాశ్రయం, వెనుకవైపున నౌకాదళ వాయు స్థావరం కొనసాగుతున్నాయి. మరోవైపు నౌకాదళ వైమానిక అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మరో స్థావరం ఉండాలని భావించారు. స్వాతంత్ర్యానికి ముందే వైమానిక అవసరాల్ని తీర్చిన బాడంగిలోని వైమానిక స్థావరాన్ని మళ్లీ వినియోగంలోకి తేవాలని నిర్ణయించారు. ప్రస్తుతం అక్కడ 250 ఎకరాలు సిద్ధంగా ఉండటంతోపాటు మరో 150 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. తూర్పు నౌకాదళ అవసరాలకు ఆ భూములు సరిపోతాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ వాయు స్థావరం అభివృద్ధి చేయడం కీలకమని నౌకాదళ ఉన్నతాధికారులు భావించారు. ఆ మేరకు ప్రతిపాదనలు రూపొందించి రక్షణశాఖ ఉన్నతాధికారులకు పంపారు. అయితే ఆయా ప్రతిపాదనలకు రక్షణశాఖ నుంచి ఎలాంటి స్పందనా లేదు.

బాడంగి అనుకూలతలెన్నో....

- బాడంగి ఎయిర్‌ఫీల్డ్ రక్షణ రీత్యా అత్యంత అనుకూలంగా ఉంటుంది. సుమారు 21 లక్షల జనాభా ఉన్న విశాఖ నగరంతో పోల్చుకుంటే బాడంగిలో ఉన్న జనాభా చాలా తక్కువ. శిక్షణలో భాగంగా ఏమైనా చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకున్నా ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు తక్కువగానే ఉంటాయి.
- అక్కడి రన్‌వేలను రెండు దిశల్లోనూ ఉపయోగించుకోవచ్చు. విశాఖ విమానాశ్రయానికి ఒకవైపు కొండలు ఉండటంతో రాకపోకలన్నీ ఒకవైపే సాగించాల్సిన దుస్థితి.
- రహస్య వైమానిక కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి ఆ ప్రాంతం అత్యంత అనుకూలంగా ఉంటుంది.

ముంబయి-పుణె మధ్య హైపర్‌లూప్

మహారాష్ట్ర సర్కారు యోచన

ముంబయి: ప్రస్తుతం ముంబయి-పుణె మధ్య ప్రస్తుతం నాలుగు గంటలుగా ఉన్న ప్రయాణ సమయాన్ని 25 నిమిషాలకే పరిమితం చేసేందుకు అధునాతన హైపర్‌లూప్ రవాణా వ్యవస్థను తీసుకురావాలని మహారాష్ట్ర సర్కారు యోచిస్తోంది. ఇందుకోసం అమెరికాకు చెందిన వర్జిన్ హైపర్‌లూప్‌వన్ సంస్థను సంప్రదిస్తోంది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్.. నెవాడాలోని వర్జిన్ హైపర్‌లూప్‌వన్ పరీక్షా స్థలిని సందర్శించారు. కంపెనీ సీఈవో రాబ్ లాయిడ్‌తో చర్చలు జరిపారు.



AUTHORISED DEALERS- AP: Vijayawada: R.M. Hero, Ph: 2490701, 9100914968; Dasarath Hero, Ph: 7799766324; Machavaram, Ph: 9703218818; R.M.Motors (P) Ltd, Ph: 7799766343; **Gudivada:** Sri Lakshmi Hero, Ph: 7799766403; **Guntur:** Associated Hero, Ph: 7799766413; Gautham Hero, Ph: 7799766369; **Narasaraopeta:** Yerramsetty Hero, Ph: 7799766375; **Ongole:** Associated Hero, Ph: 7799766402; **Chirala:** Srinivasa Hero, Ph: 7799766423; **Nellore:** A.M Reddy Hero, Ph: 7799766418; Sarayu Hero: 8448389666; **Gudur:** Viswa Sai Hero, Ph: 7799766382; **Kavali:** Sree Devi Motors, Ph: 7799766359; **Tanuku:** V. Somasundara Rao Hero, Ph: 7799766363; **Bhimavaram:** Reddy and Reddy Hero, Ph: 7799766388; **Eluru:** Sai Swarna Hero, Ph: 7799766376; **Jangareddygudem:** Sai Satyan Hero, Ph: 8448994754; **Visakhapatnam:** Sree Siva Sankar Hero, Ph: 7799766367; Sri Harsha Hero, Ph: 7799766357; **Vizianagaram:** Varalakshmi Hero, Ph: 7799766353; **Anakapalli:** Lakshmi Srinivasa Hero, Ph: 7799766364; **Gajuwaka:** Siva Sankar Hero, Ph: 7799766344; **Srikakulam:** Varam Hero, Ph: 7799766414; **Rajahmundry:** Reddy Babu Hero, Ph: 7799766352; C.P Reddy Hero, Ph: 7799766389; **Kakinada:** Jayaram Hero, Ph: 7799766328; Jagadeeswari Hero, Ph: 7799766424; **Amalapuram:** Sri Jayaram Hero, Ph: 7799766406; **Anantapur:** C. Thippaiah Hero, Ph: 7799766395; Narasimha Hero, Ph: 7799766381; **Hindupur:** Sai Teja Motors, Ph: 7799766421; **Kurnool:** Shariff Hero, Ph: 7799766394; Sasya Hero, Ph: 7799766354; **Nandyal:** Sowjanya Hero, Ph: 7799766386; **Adoni:** Tarun Motors, Ph: 7799766349; **Tirupati:** Prudhvi Hero: 8448183643; Sri Gopal Hero, Ph: 7799766348; Sri Gopal Hero (Branch), Ph: 2261105; **Chitoor:** Sri Gopal Hero, Ph: 7799766399; **Cuddapah:** Sri Gopal Hero, Ph: 7799766411; **Proddutur:** Sri Gopal Hero, Ph: 7799766323.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 19-6-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 310
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

హోంగార్డుల వేతనం @ 600

ఆంధ్రప్రదేశ్‌లోని హోంగార్డుల రోజువారీ వేతనాన్ని రూ.400 నుంచి రూ.600కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు మరికొన్ని ప్రయోజనాలనూ కల్పించింది. 2లో

3 రోజులు కోడికూర

ఇదీ ఆహారపట్టిక

- ప్రతి రోజూ తప్పనిసరిగా పాలు, అల్పాహారం.
- పాఠశాలకు వెళ్లే ముందు వేరుశెనగ ఉండలు.
- రాత్రి ఆకుకూర పప్పు, కూరగాయల కూరతో భోజనం
- ఆదివారం మధ్యాహ్నం, మంగళవారం, శుక్ర వారం రాత్రి కోడికూర
- మాంసాహారం లేని రోజు ఉడకబెట్టిన గుడ్డు
- కళాశాల వసతిగృహాల్లోని విద్యార్థులకు ఉదయం, రాత్రి అరటిపండు.

- రోజూ పాలు, అల్పాహారం
- సంక్షేమ వసతిగృహాల్లో కొత్త ఆహార పట్టిక
- ప్రతిపాదనలు రూపొందించిన సాంఘిక సంక్షేమశాఖ
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలు!

ఈనాడు డిజిటల్ - అమరావతి

వారంలో మూడు రోజులు కోడికూర, రోజుకో రకం అల్పాహారం, ప్రతిరోజూ పాలు, అరటిపండు.. పాఠశాలకు వెళ్లే ముందు వేరుశెనగ ఉండలు, తిరిగొచ్చాక రాగిజావ, మాంసాహారం లేని రోజు ఉడకబెట్టిన గుడ్డు.. ఇదీ ఈ విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో అమలుకానున్న ఆహారపట్టిక(మెనూ). వసతి గృహాల్లోని విద్యార్థులకు మంచి పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో తాజా ఆహారపట్టికను అధికారులు సిద్ధం చేశారు. ఇటీవల వసతిగృహాల్లోని విద్యార్థుల ఆహార ఖర్చులను (డైట్ చార్జీలను) పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా కొత్త ఆహార పట్టికను అధికారులు రూపొందించారు. సాంఘిక సంక్షేమశాఖ ఈ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తోంది. దీనికి ప్రభుత్వం నుంచి అనుమతి లభించాల్సి ఉంది.

కొత్త మొత్తాలు ఇలా

3-7వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.750 నుంచి రూ.1,000

8-10వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.850 నుంచి రూ.1,250

ఇంటర్ ఆపై చదివే విద్యార్థులకు నెలకు రూ.1,050 నుంచి రూ.1,400

పాఠశాలలకు 3 రోజులు సెలవు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ పాఠశాలలకు మూడు రోజులు సెలవులు ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు మంగళవారం నుంచి 21వరకు సెలవులు ఇస్తున్నట్లు మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3 రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు సైతం విద్యార్థులకు సెలవులు ఇవ్వాల్సిందేనని, తరగతులు నిర్వహిస్తే వాటి గుర్తింపు రద్దు చేస్తామని మంత్రి హెచ్చరించారు.

చందా కొచ్చర్‌కు సెలవ్

వీడియోకాన్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లనున్నారు. ఆమె స్థానంలో బ్యాంక్ బాధ్యతలను సీఓఓగా నియమితులైన సందీప్ బక్షి చేపట్టనున్నారు. 13లో

రైతుకు ధరాభారం

- కేంద్రం బాదుడు రూ.1,765 కోట్లు
- ఒక్కో ఎకరాకు రూ.1,050 అదనపు వ్యయం
- డీజిల్‌పై మోత రూ.750
- ఎరువులపై రూ.300

ఈనాడు - అమరావతి

రైతుల ఆదాయం రెండింతలు చేస్తామంటున్న కేంద్రం ఆచరణకొచ్చేసరికి వారి నడ్డివిరిచే విధంగా వ్యవహరిస్తోంది. మద్దతు ధరల కల్పన మాట మరచి.. డీజిల్, ఎరువుల ధరలు భారీగా పెంచింది. ఏడాది వ్యవధిలోనే డీజిల్‌పై లీటరుకు రూ.20 వరకు పెరగ్గా, ఈ ఏడాది మార్చి తర్వాత డీఏపీపై బస్తాకు రూ.215 పెరుగుదల చోటు చేసుకుంది. ఏడాది కిందట లీటరు రూ.58 ఉండే డీజిల్ ఇప్పుడు రూ.75 పైనే అయింది. పెరిగిన డీజిల్, ఎరువుల ధరలతో ఖరీఫ్, రబీలో రైతుల పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. సుమారు ఒక్కో ఎకరా సాగుపై రూ.1,050 పైగా అదనపు భారం జతవుతోంది. రాష్ట్ర రైతాంగంపై ఏడాదికి రూ.1,765 కోట్ల భారం పడుతోంది.

ఎకరా సాగుకు పెరిగిన డీజిల్ ధరతో పడే అదనపు భారం (రూ.ల్లో)

వివరం	గతేడాది	ఈ ఏడాది	పెరిగింది
నాగలి/టిల్లర్	1,200	1,400	200
గొర్రు/గుంటక	500	600	100
దమ్ము(గంటకు)	900	1,000	100

రాష్ట్రంలో రైతులపై పడే భారం
ఖరీఫ్, రబీల్లో సాగు 1,69,45,000 ఎకరాలు
డీజిల్ భారం మొత్తం రూ1,270.87కోట్లు
ఎరువుల భారం రూ.495 కోట్లు

- ★ ట్రాక్టర్‌తో నాగళ్లు వేయించాలంటే ఎకరానికి 8 నుంచి 10 లీటర్లు, గొర్రు, గుంటకలకు 3 లీటర్లకు పైగా ఖర్చవుతుంది.
- ★ ఎకరానికి ఒకసారి నాగలి, రెండుసాళ్లు గొర్రు, ఒక సాలు గుంటక వేయిస్తారు. అంటే ఎకరానికి రూ.500 అదనంగా ఖర్చు పెడుతున్నారు.
- ★ పొలానికి ఎరువు తోలించాలన్నా.. పంట ఉత్పత్తులు ఇంటికి చేర్చాలన్నా.. ఎరువులను పొలానికి తీసుకెళ్లాలన్నా.. ట్రాక్టర్లే ఆధారం. ఇంజిన్లతో నీటి తడులు ఇవ్వాలన్నా డీజిల్ వాడాలి. పొలాలకు పురుగు మందులు చల్లాలంటే పెట్రోలు అవసరం.. ఇలా వేర్వేరు రూపాల్లో ఒక్కో ఎకరాపై రూ.250 వరకు అదనపు ఖర్చు భరిస్తున్నారు.
- ★ మొత్తంగా చూస్తే.. ఒక్కో ఎకరాకు రూ.750 చొప్పున రైతుపై భారం పడుతోంది.

ఎరువుల బాదుడు..

- ★ గతేడాదితో పోలిస్తే.. డీఏపీ బస్తాపై రూ.215, కాంప్లెక్స్, ఇతర రకాలపై రూ.90 నుంచి రూ.150 పైనే పెరిగాయి. సగటున ఒక్కో బస్తాపై రూ.100 పెంపుదల కన్పిస్తోంది.
- ★ పప్పుధాన్యాలు, ఇతర పంటలకు కాంప్లెక్స్, డీఏపీ 1 నుంచి 2 బస్తాల వరకు అవసరం.
- ★ పత్తి, వరికి సగటున 4 నుంచి 5 బస్తాల కాంప్లెక్స్, ఎంఓపీ, ఫాస్ఫేట్ అవసరం.
- ★ మిర్చి, పసుపు పంటలకు ఎకరాకు సగటున 8 బస్తాల వరకు కాంప్లెక్స్, డీఏపీ వేస్తారు. 2 డీఏపీ, 6 కాంప్లెక్స్ వేసినా.. ఎకరాకు రూ.1,000 పైనే అదనపు బరువు పడుతుంది.
- ★ రాష్ట్రంలో సగటున ఎకరాకు 3 బస్తాల వినియోగం ప్రకారం చూస్తే.. రూ.300 అదనంగా ఖర్చవుతోంది.

పరిశీలిస్తూనే ఉన్నాం

- రైల్వే జోన్‌పై విభజన చట్టంలోనూ అదే ఉంది
- పీయూష్ గోయెల్ స్పందన
- ఇతర రాష్ట్రాల కన్నా ఏపీకి ఎక్కువే ఇచ్చాం: జావడేకర్

ఈనాడు, దిల్లీ: మంత్రిత్వశాఖ ఏదైనా ఆంధ్రప్రదేశ్ విషయంలో విభజన హామీలపై కేంద్రం నుంచి ఒకే రకంగా సమాధానం వస్తోంది. 'పరిశీలిస్తున్నాం.. చాలా చేశాం' ఇలా ముక్తసరి సమాధానాలే కేంద్ర మంత్రుల నుంచి వస్తున్నాయి. విశాఖ రైల్వే జోన్ అంశం విభజన చట్టంలో పరిశీలించాలనే ఉందని రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ పేర్కొన్నారు. సోమవారం తమ నాలుగేళ్ల ప్రగతిపై రైల్వేశాఖ, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రులు పీయూష్ గోయెల్, ప్రకాశ్ జావడేకర్ వేర్వేరుగా మీడియా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమస్యలను ప్రస్తావిస్తే వారిద్దరూ ముక్తసరి సమాధానాలతో (మిగతా 2లో)

రవాణాశాఖ పల్లెబాట లైసెన్స్ మేళాలు

ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ పల్లెబాట పట్టనుంది. వాహన చోదక లైసెన్సుల కోసం వారి కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా నేరుగా గ్రామాల్లోనే ఎల్ఎల్ఆర్ మేళాలను నిర్వహించనుంది. 2లో

సీబీఐపై హ్యాకింగ్ పడగ

కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)పై హ్యాకర్లు పంజా విసిరారు. సంస్థలో బ్యాంకింగ్ మోసాల నిరోధక విభాగం సంయుక్త సంచాలకుడికి కేటాయించిన అధికారిక ఈ-మెయిల్ ఖాతాను తమ అధీనంలోకి తీసుకున్నారు. 14లో

పనులు చేయించలేకపోతే చర్యలే

ప్రాజెక్టుల అధికారులకు చంద్రబాబు హెచ్చరిక

ఈనాడు, అమరావతి: గుత్తేదారులతో పనులు చేయించలేకపోతే అధికారులపైనా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. పనులు జాప్యం చేసే సంబంధిత సంస్థలను బ్లాక్‌లిస్టులో పెడతామన్నారు. పోలవరం, ఇతర ప్రాజెక్టుల పురోగతిని సోమవారం ఆయన సమీక్షించారు. పనులు చేయించడంలో అధికారులు తమ అధికారాలను వినియోగించాలని సూచించారు. వంశధార రెండోదశ ఆలస్యంపై గుత్తేదారులను ప్రశ్నించారు. పోలవరంలో మొత్తం 53.38 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెప్పగా... కాఫర్ డ్యాంకు సంబంధించిన జెట్ గ్రౌటింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

21న కృష్ణా డెల్టాకు నీటి విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల కింద 16 పంపులతో 5664 క్యూసెక్కుల నీటిని పోలవరం కుడి కాలువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే 69కిలోమీటర్ల మేర ప్రవాహాలు వచ్చాయని.. మంగళవారం (మిగతా 2లో)

సోమవారం సచివాలయం ప్రాంగణంలో చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో.. ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి క్షమాపణ తెలుపుతున్న నాయీ బ్రాహ్మణుల సంఘాల ప్రతినిధులు

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయండి 6లో

- లేదంటే ఆమరణ దీక్ష చేస్తా
- మోదీ, బీరేంద్రసింగ్‌లకు ఎంపీ రమేశ్ లేఖ

నాయీ బ్రాహ్మణుల సమ్మె విరమణ

- టికెట్‌పై రూ.25 ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకారం
- గలాటా చేసిన వారెవరో తెలియదు
- చంద్రబాబుకు వివరణ ఇచ్చిన జేఏసీ నేతలు

ఈనాడు, అమరావతి: గత నాలుగు రోజులుగా చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ సంఘ జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు. కేశ ఖండన టికెట్‌పై ప్రస్తుతం ఇచ్చే రూ.12 మొత్తాన్ని రూ.25కు పెంచుతున్నట్లుగా ముఖ్యమంత్రి చేసిన ప్రకటనకు తాము అంగీకరించామని చెప్పారు. చర్చలకు వచ్చిన తమతో పాటు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుంపులో చేరి గలాటా చేశారని, వారెవరో కూడా తమకు తెలియదని స్పష్టం చేశారు. సోమవారం రాత్రి ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో నాయీ బ్రాహ్మణ సంఘాల జేఏసీ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. కేశ ఖండనశాల కార్మిక నేతలతో కలిసి 15 మందిని సచివాలయానికి ఆహ్వానించడంతో తాము వచ్చినట్లు జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాస్, గౌరవాధ్యక్షుడు అన్నవరపు బ్రహ్మయ్య తెలిపారు. "చర్చలు ముగించి కిందకు రాగానే కొంతమంది (మిగతా 2లో)

ఇదీ సంగతి!

బోగీలకు సుందరమైన రంగులు వేయించాం, విమానాల్లోలా ఉండే మరుగుదొడ్లు పెట్టించాం, కాని నీటి సప్లై, సదుపాయాల కల్పన మరిచిపోయాం సార్!

మృత్యువు రాక.. గూగుల్‌కు తెలుస్తుందా?



న్యూయార్క్: చివరిదశ రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతూ ఓ మహిళ ఆసుపత్రిలో చేరింది. అవసరమైన వైద్య పరీక్షలన్నీ చేసి.. వైద్యం పొందుతుండగానే ఆమె మరణించడానికి 9.3% అవకాశముందని వైద్యులు అంచనా వేశారు. తర్వాత... గూగుల్ రూపొందించిన అల్గారిథమ్ ఆమెకు సంబంధించిన ఆరోగ్య వివరాలన్నింటినీ పరిశీలించింది. ఒకటికాదు.. రెండుకాదు... మొత్తం 1,75,639 అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఆమె ఆసుపత్రిలో ఉండగానే మరణించేందుకు 19.9 శాతం అవకాశముందని లెక్కగట్టింది. చివరికి గూగుల్ సాఫ్ట్‌వేర్ చెప్పిందే నిజమైంది! ఆ సంస్థ హెల్త్ కేర్ విభాగం- కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతతో ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఆసుపత్రిలో చేరిన రోగి ఎంతకాలం అక్కడ ఉండాల్సి వస్తుంది? వ్యాధి తీవ్రత ఎలా ఉంది? మళ్లీ ఆసుపత్రికి రావాల్సి ఉంటుందా? మరణముప్పు ఉందా? వంటి ప్రశ్నలకు ఇది అత్యంత వేగంగా, దాదాపు కచ్చితమైన సమాధానాలు చెబుతుండటం విశేషం.

వ్యాధి నియంత్రణపై దృష్టి..: బాధితుల రోగ చరిత్రను తెలుసుకుని (మిగతా 2లో)

యోగా.. ఆరోగ్య పరిరక్షణకు 'పాస్‌పోర్ట్'!

ప్రధాని మోదీ వెల్లడి

దిల్లీ: యోగాతో చక్కని ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈనెల 21న నాలుగో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా యోగా సాధకులకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన ట్విట్టర్‌లో వీడియో సందేశాన్ని ఉంచారు. "ఆరోగ్యాన్ని కాపాడేందుకు యోగా 'పాస్‌పోర్ట్' వంటిది. ఆసనాలు దేహదారుఢ్యం కోసం మాత్రమే కాదు.. అనారోగ్యాలను దూరం చేసి.. ఆరోగ్యానికి బాటలు వేస్తాయి. ఆలోచన, కార్యాచరణ, విజ్ఞానం, అంకితభావాల్లో యోగా మనల్ని గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దుతుంది. మనల్ని మనం అర్థం (మిగతా 2లో)

నీటి ముప్పునకు చైనా మార్కు పరిష్కారం

భవనాలు ఆకాశమంత ఎత్తుకు దూసుకెళ్తుంటే... భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి! అత్యాధునిక హంగులతో మెరిసిపోతున్న నేటి నగరాలకు జలగండం ముప్పు ముంచుకొస్తోంది. నీటి చుక్క కోసం అల్లాడుతున్న కాంక్రీట్ కీకారణ్యాలు.. వాన చుక్క రాలగానే వరద భయంతో భీతిల్లి పోతున్నాయి. ఒక వైపు నీటి ఎద్దడి తరుముకొస్తుంటే మరో వైపు ఆకస్మిక వరదలు వాటిని భయపెడుతున్నాయి. ప్రపంచంలోని అత్యధిక నగరాల్లో నేడు ఇదే పరిస్థితి! ఈ సమస్యకు ఓ చక్కని పరిష్కారాన్ని అన్వేషించిన చైనా.. ఆ ప్రణాళికను పకడ్బందీగా అమలుచేస్తోంది. కాలుష్యంలో చిక్కి, నీటి ఎద్దడితో అల్లాడుతున్న తమ నగరాలను పచ్చని తోరణాలుగా.. జలవనరులకు కేంద్రాలుగా తీర్చిదిద్దుకుంటోంది. రూపురేఖలు మారుతున్న చైనా నగరాలపై... ప్రత్యేక కథనం 6లో

నేడు మంత్రిమండలి సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రి మండలి సమావేశం మంగళవారం సాయంత్రం 3గంటలకు సచివాలయంలో నిర్వహించనున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఇళ్ల స్థలాలు, చుక్కల భూములు, భూధార్, భూ రికార్డుల ప్రక్షాళన అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

DSC-SGT, SA 20-06-18 ... 98486 61318

ప్రగతి DSC SGT, TPT, SA-ALL సబ్జెక్ట్స్ ... 22-6-2018 ... 8106268482, 9885272474

DSC హిందీ ... QUEST ... 7893625174

AP-DSC SGT, SA (All Sub.), TPT, PET, HPT ... FREE DEMO: 24-6-2018 at 10.08 am RAMAIAH COMPETITIVE COACHING CENTRE ... 8885552502

SI & కానిస్టేబుల్స్ VRO/Gr-IV/RPF ... New Batches 20-6-18 ప్రారంభం భాగ్యకిరణ్ ఇన్‌స్టిట్యూట్ 9603290758

DSC SGT, SA (ALL) TPT, HPT ... ప్రతిభ ... 93 92 91 75 84

విద్యానికేతన్ DSC SGT & SA ... 94401 04963, 99499 33838

YES&YES PUBLICATIONS AP-DSC, SGT(All), SA (Maths) ... 90320 64822

APDSC-HINDI ... RANKERS ...

వాల్మీకి DSC ... Cell: 62812 29244, 63033 41854

DSC - HINDI ... 8985917075, 7893136573

EKALAVYA IAS ACADEMY RANK ASSISTANCE Oriented Program Degree+IAS, Prelims-cum-Mains ... Beside Nagarjuna Hospital, Kanuru, VJA

విజేత కాంపిటీషన్స్ vijetacompetitions.net APPSC TRT(DSC) ... RRB ... POSTMAN/MAIL GUARD TM Rs. 379 MP Rs. 149 CURRENT AFFAIRS Rs.159 EM Rs. 399 MP Rs. 159 TSPSC బుక్స్ విడుదల VRO GROUP-IV TS పోలీస్ కానిస్టేబుల్స్ 9963293399 | 9963511135

పల్లెబాటలో.. రవాణా శాఖ

- వారం రోజుల పాటు గ్రామాల్లో చోదక పరీక్షలు
- ఒక్కో జిల్లాలో రోజుకు సగటున 20 పంచాయతీలకు సేవలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ సోమవారం నుంచి 'మీ ముంగిట్లో రవాణా శాఖ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో జిల్లాలో రోజుకు సగటున 20 గ్రామాలకు సేవలందేలా వారం రోజుల పాటు ఎల్ఆర్ఎస్ మేళాలను నిర్వహించనుంది. ఈ నెల 25తో పూర్తి కానున్న ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,800కు పైగా పల్లెలకు ఈ సేవలందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 10 శాతం ప్రమాదాలు లైసెన్సులు లేని వాహన చోదకుల మూలంగానే చోటుచేసుకుంటున్నాయి. వీటిని అరికట్టడమే లక్ష్యం.. రవాణా శాఖ ఈ తరహా మేళాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి లైసెన్సు కలిగి ఉండేలా చూడాలని రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పది, ఇరవై గ్రామాలకు కేంద్రంగా ఉండే ప్రధాన పంచాయతీని ఎంపిక చేసుకుని అక్కడకు రవాణా శాఖ సిబ్బంది తమ కంప్యూటర్లు, ఇతర సామగ్రిని తీసుకుని వెళ్లి మేళాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంపై రాష్ట్ర స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకుగాను రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గుంటూరు జిల్లా మందడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఆయన.. రూ.8 కోట్ల విలువైన వేగ నిరోధక పరికరాలు, శ్వాస విశ్లేషణ పరికరాలను పోలీసు, రవాణా శాఖల అధికారులకు అందజేస్తారు. ఈ మేళాలకు హాజరయ్యే వారు తమతో పాటు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకెళ్లాలి. లైసెన్సు రుసుము చెల్లించాల్సి ఉంటుందని సంయుక్త రవాణా కమిషనర్ ప్రసాద్‌రావు తెలిపారు.



పనులు చేయించలేకపోతే చర్యలే

(మొదటి పేజీ తరువాయి)

తమ్మిలేరు, రామిలేరు కూడా దాటుతుందని చెప్పారు. 21న ముఖ్యమంత్రి చేతుల మీదుగా కృష్ణా డెల్టాకు నీటి విడుదలను ప్రారంభించాలని నిర్ణయించారు. వర్షాల తీరుతెన్నులను అధ్యయనం చేయాలని, ఎక్కడ రెయిన్‌గన్‌లు వాడాలి, ఎక్కడ జీబా వాడాలో కూడా తేల్చాలని చెప్పారు. భూగర్భజలాలు 35 మీటర్లకు వెళ్తే అక్కడ బోర్లు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పూడిక మట్టిని రైతుల పొలాలతో పాటు డొంక రోడ్లకు వినియోగించాలని చెప్పారు. నీతి ఆయోగ్ ఉమ్మడి నీటియాజమాన్య సూచీల్లో రాష్ట్రానికి మూడో ర్యాంకు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం అధికారులను అభినందించారు. రాబోయే రోజుల్లో ఇతర అన్ని అంశాల సూచీల్లోనూ ఏపీ మొదటిస్థానంలో ఉండేలా చూడాలన్నారు. గోదావరి పెన్నా అనుసంధానం తొలి దశ అయిదు ప్యాకేజీలకు త్వరగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. వైకుంఠపురం బ్యారేజి టెండర్ల ప్రక్రియ, కుప్పం కాలువ, మడకశిరకు త్వరగా నీళ్లు ఇచ్చేలా, వేణుగోపాలసాగర్, మల్లెమడుగు, బాలాజీ జలాశయం పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వెలిగొండ పనులపైనా చర్చించారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవసరమైతే ఇంటికెళ్లి రేషన్ అందించండి

రాష్ట్రంలో ఏ ఒక్కరి నుంచీ తమకు రేషన్ అందలేదన్న మాట వినిపించకూడదని ముఖ్యమంత్రి

సోమవారం ఉండవల్లిలోని ప్రజాదర్బారులో ప్రకాశం జిల్లా తెదేపా నేతలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

చంద్రబాబు డీలర్లను ఆదేశించారు. పౌరసరఫరాల్లో ప్రజా సంతృప్తి 90శాతానికి మించి సాధించాలని నిర్దేశించారు. సోమవారం 9 వేల మంది రేషన్ డీలర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం 75శాతం మంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, మిగిలిన 25 శాతం ఎందుకు అసంతృప్తిగా ఉన్నారన్నది విశ్లేషించామన్నారు. వారిలో 32శాతం మంది రశీదు ఇవ్వలేదని, 26శాతం మంది తూకం సరిగ్గా లేదని, 15 శాతం మంది ఎక్కువ సార్లు తిరగాల్సి వస్తోందని, 17శాతం మంది డీలర్ల ప్రవర్తన సరిగ్గా లేదని అభిప్రాయపడ్డారని వివరించారు. 70శాతం కంటే తక్కువ సంతృప్తి స్థాయి సాధించిన దుకాణాలన్నిటిపైనా విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలని, వారికి ఏమైనా సమస్యలుంటే పరిష్కరిస్తామన్నారు. మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, కమిషనర్ రాజశేఖర్ మాట్లాడారు.

పట్టణాల్లో ఇక ఆకస్మిక తనిఖీలు

ప్రజా సమస్యల పరిష్కారానికి ఇక ఆకస్మిక తనిఖీలు చేసి ప్రజాభిప్రాయాన్ని క్షేత్రస్థాయి నుంచి తెలుసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. సచివాలయం నుంచి పట్టణ, పురపాలక శాఖ మంత్రి నారాయణతో సోమవారం వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వర్షాలొస్తే నగరాల్లో, పట్టణాల్లో అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడకూడదని, నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. ప్రభుత్వంపై 70 శాతంగా ఉన్న సంతృప్తిని 90 శాతానికి తీసుకెళ్లాలని చెప్పారు. దోమల నివారణకు కొత్తగా వచ్చే సాంకేతికతను ఉపయోగించుకోవాలని, రెండేళ్లలో దోమలను నిర్మూలిద్దామన్నారు. మంచినీటి సరఫరా వ్యవస్థను ఆధునికీకరించి వాటర్ గ్రిడ్ సాయంతో సమీప భవిష్యత్తులో 24 గంటలూ నీళ్లిచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. మంచినీటి సరఫరాపై పట్టణాల్లో దాదాపు 37 శాతం మందిలో సంతృప్తి లేదని, మెరుగుపరచాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రహదారులపై చెత్త కనిపించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ నెలాఖరుకల్లా పెద్ద కాలువల్లో పూడికలు తొలగిస్తామని, చిన్న కాలువలను రోజూ శుభ్రం చేస్తున్నామని వివరించారు.

పంటమార్పిడిని ప్రోత్సహించాలి

వ్యవసాయోత్పత్తుల మద్దతు ధర, డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో పంటమార్పిడిని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. నీరు-ప్రగతి, వ్యవసాయాభివృద్ధిపై సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీతి అయోగ్ సమావేశంలో చర్చించిన అంశాలను వివరించారు. నీటి నిర్వహణలో గుజరాత్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తొలి మూడుస్థానాల్లో నిలిచాయని గుర్తు చేశారు. మొదటిస్థానం సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేసిన 500 గ్రామాల్లో ఇంజక్షన్ బోర్‌వెల్స్ ఏర్పాటు చేయాలని, వచ్చే ఏడాది తాగునీటి రవాణా అనేది ఉండకూడదని పేర్కొన్నారు. జూన్‌లోగా ఉపాధి హామీ పనులు రూ.1,000కోట్ల మేర పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి గ్రామం, వార్డుల్లో వృక్షమిత్రలను ప్రోత్సహించాలన్నారు.

హోంగార్డుల వేతనం పెంపు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని హోంగార్డుల రోజువారీ వేతనాన్ని రూ.400 నుంచి రూ.600కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన ప్రయోజనాలకు సంబంధించిన వివరాలను ఉత్తర్వుల్లో పొందుపరిచింది. వాటికి సంబంధించి అధికారిక ఉత్తర్వులను హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏ.ఆర్.అనూరాధ సోమవారం జారీ చేశారు. ఆ వివరాలు ఇలా..

- మహిళా హోంగార్డులకు మూడు నెలల ప్రసూతి సెలవులు (ఇద్దరు పిల్లల వరకూ)
- నెలకు రెండు వారంతపు సెలవులు (రోజువారీ వేతనం నష్టపోకుండా)
- అంత్యక్రియల ఖర్చులు కింద రూ.10 వేలు
- ప్రభుత్వ గృహనిర్మాణ పథకాల్లో లబ్ధిదారులుగా అవకాశం
- సహజ లేదా ప్రమాద మరణానికి గురైతే రూ.5 లక్షలు పరిహారం
- ఎన్టీఆర్ వైద్యసేవ కింద గరిష్ఠంగా రూ.2.50 లక్షల వరకూ వైద్యం పొందవచ్చు.

యోగా.. ఆరోగ్య పరిరక్షణకు 'పాస్‌పోర్ట్'!

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవడం ప్రారంభిస్తే.. ఇతరులను కూడా అర్థం చేసుకోవచ్చు. దీన్ని యోగా బోధిస్తుంది. ఆధునిక జీవనంలో ప్రజలు ఒత్తిళ్లతోను, జీవన శైలి సంబంధిత వ్యాధులతోనూ ఇబ్బందులు పడుతున్నారు. వాటితో సతమతమయ్యే వారికి యోగా సాంత్వన చేకూరుస్తుంది. శ్రద్ధ, ఆశావహ దృక్పథం, బలం, ధైర్యం వంటివాటిని పెంచుతుంది. ప్రాచీన భారతీయ మహర్షులు మనకందించిన వరాల్లో యోగా ఒకటిగా గీతలో పేర్కొన్నారు." అని ప్రధాని వివరించారు.

దేహ్రాదూన్ ముస్తాబు..

దేహ్రాదూన్: అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతున్న.. దేహ్రాదూన్ (ఉత్తరాఖండ్)లోని అటవీ పరిశోధ సంస్థ (ఎఫ్ఆర్ఐ) ప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. 500 హెక్టార్ల ప్రాంతాన్ని నిర్వాహకులు పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 20వ తేదీ రాత్రి సరికే ప్రధాని ఇక్కడకు చేరుకునే అవకాశం ఉంది.

ఆస్ట్రేలియన్ పార్లమెంటులో తొలిసారిగా..

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ పార్లమెంటులో తొలిసారిగా యోగా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మాజీ ప్రధాని టోనీ అబాట్ సహా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని వివిధ ఆసనాలు వేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి గుర్తుగా మెల్‌బోర్న్‌కు చెందిన వాసుదేవ క్రియా యోగ బృందం కాన్‌బెర్రాలోని పార్లమెంటు కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా - యోగాను ప్రపంచ దేశాలకు విస్తరింపజేస్తున్న భారత్‌ను అబాట్ ప్రశంసించారు. ఈనెల 21న యోగా కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు వాసుదేవ క్రియా యోగా వ్యవస్థాపకుడు రాజేంద్ర యెంకన్నమోలె తెలిపారు.

మృత్యువు రాక.. గూగుల్‌కు తెలుస్తుందా?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకూ వాడిన మందులేంటో చూసి... వారి ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడానికి వైద్యులు, నిపుణులకు చాలా సమయం పడుతోంది. అయితే, గూగుల్ రూపొందించిన ఈ సరికొత్త హెల్త్ టూల్ విశ్లేషణ పనులన్నింటినీ అత్యంత కచ్చితత్వంతో చేస్తున్నట్లు సంస్థ నిపుణులు చెబుతున్నారు. తద్వారా వైద్యులు చికిత్సపై దృష్టి సారించే వీలుంటుందని భావిస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి... సీనియర్ వైద్యుల్లా ఈ సాఫ్ట్‌వేర్ కూడా వ్యాధి తీవ్రతను అంచనా కట్టి, భవిష్యత్ పరిణామాలను ఊహించగలదట. ఈ అప్లికేషన్‌ను ఆసుపత్రులకు అందజేయడమే తదుపరి అంకమని గూగుల్ మెడికల్ బ్రెయిన్ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) చీఫ్ జెఫ్ డీన్ ఓ వార్త సంస్థకు వెల్లడించారు.

డీఈవో కార్యాలయాల్లో టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు పత్రాలు

ఈనాడు, అమరావతి: గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (లోయర్, హైయ్యర్) పరీక్షకు సంబంధించిన ఫలితాలు వెలువరించినందున, కోర్సు ధ్రువీకరణ పత్రాల్ని జిల్లా విద్యాధికారుల (డీఈవో)కు పంపించామని రాష్ట్ర పరీక్షల విభాగం సంచాలకుడు సుబ్బారెడ్డి తెలిపారు. అభ్యర్థులు డీఈవో కార్యాయలంలో హాల్‌టికెట్లు చూపించి ధ్రువీకరణ పత్రాల్ని పొందవచ్చని సూచించారు.

నాయీ బ్రాహ్మణుల సమ్మె విరమణ

(మొదటి పేజీ తరువాయి)

గలాటా చేయడం ప్రారంభించారు. గుంపుగా చేరి నినాదాలు చేశారు. వాళ్లను ఎప్పుడూ చూడలేదు. ఇదే సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సీఎం చంద్రబాబు కారు దిగి తమ వద్దకు వచ్చారు. ఏమిటని ఆయన వాకబు చేసే లోపే అక్కడ గుమికూడిన వారిలో కొంతమంది సీఎం డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగానే... 'సచివాలయం పవిత్రమైన కార్యాలయం, సమస్యలు పరిష్కరించే దేవాలయం.. అలాంటి చోట ఇలాంటి నినాదాలు చేయకూడదని ముఖ్యమంత్రి మందలించారు. దీనిపై మీడియాలో చిలవలు పలవలుగా రావడం బాధాకరం. ఈ సంఘటన మమ్మల్ని పశ్చాత్తాపానికి గురిచేసింది. అందుకే ముఖ్యమంత్రిని కలిసి క్షమాపణ కోరేందుకు వచ్చాం..." అని వారు వివరించారు. మిగిలిన సమస్యలపై కమిషనర్‌తో చర్చించి పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. నాయీ బ్రాహ్మణ వర్గానికి తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే న్యాయం జరిగిందని జేఏసీ నాయకుడు వినుకొండ సుబ్రమణ్యం చెప్పారు. ఎన్టీఆర్ హయాంలో తిరుమలలో 900 మంది క్షురకులను క్రమబద్ధీకరించగా... చంద్రబాబు తొలిసారిగా నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ పెట్టి రూ.20 కోట్లు కేటాయించారని చెప్పారు. 30వేల పక్కా గృహాల నిర్మాణంతో పాటు జడ్పీ ఛైర్మన్ అయ్యే అవకాశం కల్పించారన్నారు. తెదేపాకు వెన్నెముకగా ఉన్నారనే కక్షతోనే పార్టీకి దూరం చేసేందుకు కొంతమంది విద్రోహులు సచివాలయంలో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారని, వారి కుట్రలు నెరవేరవని ఆయన స్పష్టం చేశారు.

సచివాలయంలో సాయంత్రం ఏం జరిగిందంటే...

వెలగపూడి సచివాలయానికి సోమవారం సాయంత్రం తమ డిమాండ్ల సాధనలో భాగంగా నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు చర్చలకు వచ్చారు. తొలుత వారు దేవదాయశాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తితో మాట్లాడారు. నెలకు రూ.15 వేల వేతనం, నెలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిక్కెట్‌పై రూ.20 ఇస్తామని, ఇతర అంశాలను తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని కేఈ చెప్పారు. దీనికి అంగీకరించని వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వంతో చర్చలు విఫలమయ్యాయని ప్రకటించారు. తాము తెదేపా మద్దతుదారులమని, తమను ఇక్కడకు పిలిచి అవమానించారని, ఇది సరికాదని, ఉద్యమానికి దిగుతామని కొందరు సంఘ నాయకులు పేర్కొన్నారు. సచివాలయంలోని రెండో బ్లాకు ముందు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. అదే సమయంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ బయలుదేరింది. వీరందరినీ చూసి చంద్రబాబునాయుడు కిందకు దిగారు. భద్రతా సిబ్బంది నాయీ బ్రాహ్మణులను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారిని స్వేచ్ఛగా వదలమని చంద్రబాబు చెప్పారు. ప్రతి తలనీలాల టికెట్‌కు రూ.25 చొప్పున క్షురకులకు చెల్లిస్తామని చెప్పి ముఖ్యమంత్రి వారిని సంతృప్తి పరిచే ప్రయత్నం చేశారు. దానికి వారు అంగీకరించలేదు. కొందరు ఆగ్రహంగా మాట్లాడుతూ వాదనకు దిగారు. దాంతో సీఎం తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. 'ఏం తమాషా చేస్తున్నారా? మర్యాద ఇస్తే ఇలాగేనే వ్యవహరించేది. దేనికైనా పద్ధతి ఉంటుంది. మీరు ప్రభుత్వాన్ని శాసించకూడదు. నేనేదో మీకు మర్యాద ఇవ్వాలనుకున్నా. సచివాలయానికి వచ్చి ఇష్టమొచ్చినట్లు చేస్తారా? తోకజాడిస్తే కట్ చేస్తా. ఇంకోసారి ఇలా చేస్తే దేవాలయానికి కూడా రానివ్వను. ఇదేమైనా చేపల మార్కెట్ అనుకుంటున్నారా. నా ముందే అరుస్తారా? ఏం చేస్తారో చేసుకోండి. మీకు నమస్కారం పెట్టేస్తున్నా. ఇది మర్యాద కాదు. ఎవర్ని బెదిరిస్తారు మీరు? 9 ఏళ్లు పరిపాలించా. ఒక్కరు కూడా రోడ్డు మీదకు రాలేదు. న్యాయం ఉంటే నేనే వెదుక్కుంటూ వస్తా. అది గుర్తు పెట్టుకోవాలి. మిమ్మల్ని ఇంతమందిని లోపలికి రానియ్యడమే తప్పు. ఇది ప్రజల సమస్యలు పరిష్కరించే దేవాలయం. రౌడీలను తీసుకువచ్చి బెదిరించడం కాదు. దేవాలయాల్లో పని చేస్తూ ఈ మాదిరిగా పని చేయడం మంచిది కాదు...' అంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు.. 'మేం ఏ రోజైనా రోడ్డు మీదకొచ్చామా అయ్యా! మాపై దయ ఉంచాలి. కనీస వేతనం ఎంతో కొంత ఇవ్వండి. మాకు కూడా భద్రత ఉంటుంది..' అని విన్నవించారు. దీనిపై 'వేతనాలు ఇచ్చేది లేదు. అన్ని చోట్లా ఒక్కొక్కరు తలనీలాలు సమర్పించిన దానికి రూ.25 మీకే ఇస్తున్నాం. సంతోషంగా ఉండండి. బాగా పని చేస్తే రూ.20 వేల వరకు నెలకు వస్తుంది. ముందు విధుల్లో చేరండి. ఆ తర్వాత మాట్లాడుదాం...' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం సచివాలయం ప్రాంగణంలో నాయిబ్రాహ్మణుల ప్రతినిధులు అడ్డుకోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కాలం మారింది

- పెరిగిన వడగాల్పుల తీవ్రత
- నేడు కోస్తా జిల్లాలపైనా ప్రభావం
- మరో 5 రోజులూ ఎండలు

ఈనాడు, విశాఖపట్నం, అమరావతి: వడగాల్పుల తీవ్రత సోమవారం మూడోరోజూ కొనసాగింది. విశాఖ, కృష్ణా జిల్లాలు సహా తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో వేడిగాలులు వీచాయి. మంగళవారం కూడా కోస్తా జిల్లాల్లో వీటి ప్రభావం కొనసాగుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ పాఠశాలలకు మూడు రోజులు సెలవులు ప్రకటించింది. సోమవారం విశాఖలో 41.6, తునిలో 40.5, బాపట్ల, కాకినాడలో 40.2, కావలి, నెల్లూరు, జంగమహేశ్వరపురం, తిరుపతిల్లో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నుంచి వడగాల్పుల ప్రభావం కొంత తగ్గినా.. ఎండ తీవ్రత మాత్రం కొనసాగుతుందని వాతావరణశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు.

బలహీనంగా రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు అటు రాయలసీమలోనూ, ఇటు కోస్తాంధ్రలోనూ బలహీనంగా ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ పరిస్థితి ఈ నెల 22, 23 వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుందని, వాయువ్య, ఉత్తర గాలుల తీవ్రత వల్ల చాలాచోట్ల సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వివరించారు. 'ప్రస్తుతం ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాను ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉండటంతో ఎలాంటి ప్రభావం చూపట్లేదు. ఈ ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 3 కిలోమీటర్ల నుంచి 3.5 కిలోమీటర్ల ఎత్తుమేర ఉంటే మంచి వర్షాలకు అవకాశం ఉండేది. ఎండ తీవ్రత తగ్గేదని' అధికారులు చెప్పారు. మంగళవారం కోస్తాంధ్రలో, బుధవారం రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.



తల్లిదండ్రులతో విద్యార్థి సాగర్‌గుప్తా పాతచిత్రం

వడదెబ్బతో విద్యార్థి మృతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వడదెబ్బకు విద్యార్థి మృతిచెందిన సంఘటన విశాఖ నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి తండ్రి దినేష్‌కుమార్ గుప్తా అందించిన వివరాలు మేరకు.. విశాఖ చినవాల్తేరు నేతాజీవీధిలో నివాసముంటున్న సాగర్ గుప్తా (11) స్థానిక కొటక్ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్ద ఆడుకున్నాడు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటంతో సాయంత్రం 3 గంటల సమయంలో సొమ్మసిల్లిపోయాడు. వైద్యం కోసం స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. తన కుమారుడికి ఎటువంటి ఆరోగ్యసమస్యలు లేవని ఆయన తెలిపారు.

గ్రహం అనుగ్రహం

19-6-2018 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
షష్ఠి: ఉ. 11-52 తదుపరి సప్తమి
మఖ నక్షత్రం: ఉ. 8-06 తదుపరి పుబ్బ
అమృత ఘడియలు: ఉ. 5-51 నుంచి 7-21 వరకు
తిరిగి రా. 12-48 నుంచి 2-19 వరకు
వర్జ్యం: మ. 3-41 నుంచి 5-12 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-06 నుంచి 8-59 వరకు
తిరిగి రా. 10-55 నుంచి 11-39 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-30; సూర్యాస్తమయం: సా.6-32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విశాఖపట్నం	41.6	28.8
రాజమహేంద్రవరం	41.5	29.5
గుంటూరు	40.5	29.3
శ్రీకాకుళం	40.0	30.0
తిరుపతి	40.0	27.8
ఒంగోలు	39.9	31.0
విజయవాడ	39.6	29.4
తాడేపల్లిగూడెం	39.0	28.5
కడప	39.0	27.0
నెల్లూరు	39.0	26.0
అనంతపురం	38.6	25.7
నరసాపురం	38.1	29.2
కర్నూలు	38.0	26.8
హైదరాబాద్	34.6	24.6

పరిశీలిస్తూనే ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

సరిపెట్టారు. ఏపీలో ఐదుకోట్ల ప్రజలు చాలా రోజులుగా జోన్ ప్రకటనకు ఎదురు చూస్తున్నారంటూ విలేకరుల ప్రశ్నించగా.. విశాఖ రైల్వేజోన్ అంశం విభజన చట్టంలో పరిశీలించాలనే ఉందని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని పరిశీలిస్తూనే ఉన్నామని ఆయన తెలిపారు. తుది నిర్ణయం ఎప్పుడు తీసుకుంటారని ప్రశ్నించగా... రైల్వేజోన్ కావాలని అడిగే వారు విభజన చట్టంలో ఏముందో చూడాలని ఆయన పేర్కొన్నారు. "చట్టంలో ఎగ్జామిన్ అని ఉంది .. చేస్తున్నాం.. ఇదే అంశాన్ని పార్లమెంటులోనూ గతంలో చెప్పా"అని పీయూష్ గోయెల్ ముక్తాయింపు ఇచ్చారు. మరోవైపు, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు విషయంలో ఇతర రాష్ట్రాల కన్నా ఆంధ్రప్రదేశ్‌కే ఎక్కువిచ్చామని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. ఇదే అంశాన్ని విజయవాడలోనూ విలేకరుల సమావేశం పెట్టి చెప్తానని ఆయన పేర్కొన్నారు.

21న కలెక్టరేట్‌ల ఎదుట నిరసన దీక్షలు: ఎస్టీయూ

ఈనాడు, అమరావతి: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట నిరసన దీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) అధ్యక్షుడు సుధీర్‌బాబు సోమవారం తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యేక ఉపాధ్యాయుల నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు, డీఎస్సీ-2008 ఉపాధ్యాయులకు వేతన స్థిరీకరణ లోపాల సవరణ, ప్రధానోపాధ్యాయులకు జీతాల చెల్లింపు అధికారాలను కొనసాగించడం తదితర అంశాలను పరిష్కరించాలనే డిమాండ్‌తో చేపట్టనున్న ఈ దీక్షల్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TS POLYCET-2018 ADMISSIONS
SPOT ADMISSIONS NOTIFICATION

It is informed that the Spot Admissions for unfilled vacancies in Private Polytechnics will be conducted on 23-06-2018. The tentative vacancies, guidelines and schedule are placed in the website https://tspolycet.nic.in. Interested candidates shall approach Principals of Polytechnics concerned with all original certificates and fee.

Date: 18-06-2018 Sd/- Navin Mittal, IAS
Place: Hyderabad Convenor, TSPOLYCET-2018 & CTE
DIPR No. 834DP/CL/ADVT/1/2018-19

TELANGANA STATE COUNCIL
OF HIGHER EDUCATION HYDERABAD
DEPARTMENT OF TECHNICAL EDUCATION
TSE-CET- 2018
ADMISSION NOTIFICATION
PAYMENT OF PROCESSING FEE, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING.

The Qualified candidates of TSECET - 2018 (Diploma Holders including Pharmacy & B.Sc Mathematics candidates) desirous of seeking admission into University and Private Engineering & Pharmacy Colleges of Telangana State under lateral entry system are informed that the Admission Counselling process will commence on 24-06-2018. Minority candidates who have not qualified or not appeared in TSECET -2018, but passed and secured required percentage of marks in qualifying examination can also attend for counselling to consider them for admissions into minority colleges in leftover vacancies. Further details and counselling schedule, can be seen in the website: https://tsecet.nic.in on 24-06-2018.

Date: 17-06-2018 Sd/- Navin Mittal, IAS
Place: Hyderabad Convenor, TSECET -2018 & CTE
DIPR No. 835DP/ CL/ADVT/1/2018-19.

ముక్కలుగా అయినట్లు కనిపిస్తున్న నగదు

ఏటీఎంలో ఎలుకల కలకలం!

సామాజిక మాధ్యమాల్లో చిత్రాల హల్‌చల్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: నిత్యధన కేంద్రం(ఏటీఎం)లోని యంత్రంలో ఉంచిన రూ.లక్షల విలువైన నగదును ఎలుకలు కొట్టేశాయంటూ వెలువడిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం హల్‌చల్ చేస్తున్నాయి. రూ.2 వేలు, రూ.500 ముఖవిలువ కలిగిన నోట్లను ఎలుకలు చిత్తుచేశాయంటూ పేర్కొంటున్న చిత్రాలు ఈ నెల 14 నుంచి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అయితే, ఈ వార్తలను బెంగళూరు నగర పోలీసులు ఖండించారు. ఎలుకలు కొట్టేసినట్లు కనిపిస్తున్న నగదును ఫొటోషాప్ పరిజ్ఞానంతో ఎడిట్ చేసి పెట్టి ఉంటారని నిపుణులు భావిస్తున్నారు. ఏటీఎం కేంద్రంలో ఉన్న యంత్రంలోకి ఎలుకలు ప్రవేశించేందుకు అవకాశం ఉండదని, పొరపాటున అవి లోపలికివెళ్లినా నగదు పెట్టెలోకి ప్రవేశిస్తే హెచ్చరిక గంట మోగటం, విద్యుత్తు షాక్ కొట్టటం జరుగుతుందన్నారు. దీనిపై నగరంలో ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని నగర పోలీసు కమిషనర్ టి.సునీల్ కుమార్ స్పష్టీకరించారు.

ఉద్యానానికి వడ్డీ అడ్డు

- 11.50 నుంచి 12.95శాతం విధిస్తున్న బ్యాంకులు
- ఆస్తుల తనఖా, పట్టణాల్లో ఆస్తుల హామీ అదనం
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- నీరుగారుతున్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆధునిక పద్ధతుల్లో ఉద్యానసాగు రైతులకు భారమవుతోంది. ఈ రంగానికి రుణాలివ్వాలంటే.. ఆస్తుల తనఖాతోపాటు, పట్టణాల్లో ఆస్తులు హామీగా చూపాలని బ్యాంకులు స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చినా వడ్డీలు రైతుల నడ్డి విరిచేలా ఉన్నాయి. ఏకంగా 12.95శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి వడ్డీ రాయితీలు లేకపోవడంతో ఉద్యానపంటల వైపు మళ్లుతున్న రైతులు పునరాలోచనలో పడుతున్నారు. నిజానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం కంటే ఉద్యానానికే పెద్దపీట వేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 42.68లక్షల ఎకరాల్లో పూలు, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల పంటల సాగు జరుగుతోంది. ప్రభుత్వం దీన్ని కోటి ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించింది. భారీ ఎత్తున రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. అయితే బ్యాంకుల రుణాలపై వడ్డీలు అవరోధంగా నిలుస్తున్నాయి.

★ రాష్ట్రంలో రైతులు పందిరిసాగు, రక్షిత సేద్య విధానంపై దృష్టి సారిస్తున్నారు. పాలీహౌస్ విధానంలో పూలు ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. షేడ్‌నెట్‌లో మిర్చి, కూరగాయ పంటలనారుతోపాటు కాలీఫ్లవర్, క్యాప్సికం, టమోటా, కీరదోస తదితర పంటలు తీస్తున్నారు. రాయలసీమతోపాటు ప్రకాశం, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో రైతాంగం వీటిపై ఆసక్తి కనబరుస్తోంది.

★ పందిరిసాగు చేయాలంటే స్తంభాలు, వైర్లు, ఇతర ఖర్చుల రూపంలో ఎకరాకురూ.2లక్షల వరకు ఖర్చవుతోంది. ఇందులో 50శాతం రాయితీ లభిస్తోంది. మిగిలిన రూ.లక్ష సమకూర్చుకోవాలంటే చిన్నరైతులకు కష్టమే. అందుకే బ్యాంకు రుణం కోసం వేలాదిమంది రైతులు ఎదురు చూస్తున్నారు.

★ ఆధునిక పద్ధతిలో పాలీహౌస్‌కు ఎకరాకు రూ.27లక్షలు, షేడ్‌నెట్‌కు రూ.12లక్షల పైబడి ఖర్చవుతోంది. ఇందులోనూ 50శాతం రాయితీ ఉన్నా.. అంత మొత్తం సమకూర్చుకోవడం మధ్యతరగతి రైతుకు సాధ్యం కాదు. ఎక్కడైనా తెద్దామంటూ అప్పుల భారం పెరుగుతుందేమో అనే భయంతో వెనక్కు తగ్గుతున్నారు.

బ్యాంకుల మొండిచేయి.. ఇచ్చినా అధిక వడ్డీ: బ్యాంకులు ప్రాధాన్య రంగంలోని వ్యవసాయ, అనుబంధశాఖలకు 40శాతం రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఉద్యానశాఖ కూడా దీని పరిధిలోకే వస్తుంది. అయినా బ్యాంకులు రుణ మంజూరుకు మొండికేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ చిత్తూరు జిల్లాలో 120, గుంటూరు 65, తూర్పుగోదావరి 28, కర్నూలు 20 చొప్పున రుణాలిచ్చాయి.

★ రుణం పొందాలంటే రైతులు ఒకటికి ఇరవైసార్లు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొన్ని జిల్లాల్లో ఇచ్చినట్లు పత్రాలు చూపించిన తర్వాత ఆస్తులేం తనఖా పెడతారనే ప్రశ్న లేవనెత్తుతున్నారు. గుంటూరు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల్లో కొంతమంది బ్యాంకర్లు పొలంతోపాటు పట్టణాల్లో ఆస్తులు తనఖాగా పెట్టాలని స్పష్టం చేస్తున్నారు.

★ ఉద్యాన పంటలకు రుణం పొందాలంటే పరిశ్రమల విధానమే ఉంటోంది. ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకురావడంతోపాటు వేర్వేరు నిబంధనలు విధిస్తున్నారు.

★ ఒక ఎకరాలో షేడ్‌నెట్‌కు రూ.27లక్షలు ఖర్చవుతుంటే.. అందులో రూ.13.50లక్షలు రాయితీగా వస్తుంది. మిగిలిన మొత్తంపై 12.95శాతం వరకు వడ్డీ వేస్తున్నాయి.

ప్రత్యేక విధానం ప్రకటిస్తేనే.. వ్యవసాయ, పౌల్ట్రీ రంగాలకు ఇచ్చినట్టుగానే ఉద్యాన రంగానికి కూడా రాయితీలు వర్తింపజేయాలి.

- కనీసం 5శాతం వరకైనా వడ్డీ రాయితీ ఇవ్వాలి.
- భూముల విలువ భారీగా పెరిగిన నేపథ్యంలో ఇతరుల హామీలు, తనఖాలను కూడా తప్పించేలా నిబంధనలు సవరించాలి.

ఉద్యాన పంటలకిచ్చే రుణాలపై వడ్డీ

తీసుకునే రుణం	రూ.1 లక్ష నుంచి పైన..
తిరిగి చెల్లింపు సమయం	4 ఏళ్ల నుంచి ఏడేళ్లు
విధిస్తున్న వడ్డీ	11.50శాతం నుంచి 12.95శాతం.. ఇంకా పైన

మోదీని నిలదీసే ధైర్యం చంద్రబాబుకే ఉంది

మంత్రి ఆనందబాబు వ్యాఖ్య

తెనాలి(మారీస్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధాని మోదీని నిలదీసే ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబుకే ఉందని రాష్ట్ర మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి తెదేపా కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నీతి అయోగ్ సమావేశంలో చంద్రబాబు మోదీకి నమస్కరించడంపై వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ప్రతిపక్ష నాయకులు వ్యంగ్యంగా మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పుబట్టిన ఆనందబాబు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరితోనైనా పోరాటం చేసే చిత్తశుద్ధి చంద్రబాబుకు, ఆయన మంత్రివర్గానికి ఉందన్నారు. నీతి అయోగ్ సమావేశంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను అన్నింటిని అమలు చేయాలని ప్రధాని మోదీ ముందే చంద్రబాబు అడిగారన్న తెలుసుకోవాలన్నారు.

MADE EASY
India's Best Institute for IES, GATE & PSUs*
*As per ASSOCHAM & Brands Academy
ESE 2019
GATE 2019
Admission open in new batches
BATCHES COMMENCEMENT DATES
EC/IN 21st June'18 | ME/PI 21st June'18
CE 21st June'18 | EE 21st June'18
Hyderabad Centre : 5-1-744, Bank Street, Koti (Opp. Hotel Sitara Royal)
040-66774612, 040-24652324 www.madeeasy.in

వైకాపా అనైతిక రాజకీయాలకు స్వస్తి పలకాలి: వర్ల రామయ్య

విజయవాడ, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు అనైతిక రాజకీయాలకు పాల్పడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేస్తుండడం సరైనది కాదని ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య పేర్కొన్నారు. తెదేపా కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన చంద్రబాబు సంస్కారవంతమైన రీతిలో ప్రధాని మోదీని పలకరించారని చెప్పారు. మీరు బాగున్నారా? అని ప్రధాని అడిగిన ప్రశ్నకు "నేను బాగాలేను.. నా రాష్ట్రం అంతకంటే బాగా లేదంటూ" ఒక్క మాటలో ప్రతి ఘటనను వ్యక్తం చేసి రాష్ట్ర పరిస్థితులను చంద్రబాబు కళ్లకు కట్టినట్లుగా చూపారన్నారు. దీనిపై వైకాపా నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం వారి సంస్కారానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రజల వద్దకు భాజపా నాయకులు

- త్వరలో నలుగురు కేంద్ర మంత్రుల రాక
- రాయలసీమ సభకు అమిత్‌షా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి భాజపా అగ్రనేతలు, కేంద్ర మంత్రులు త్వరలో రాష్ట్ర పర్యటనకు రానున్నారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ప్రకాశ్ జావడేకర్, జగత్ ప్రసాద్ నడ్డా, పీయూష్ గోయల్ త్వరలో రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. త్వరలో నేతల రాక తేదీలు ఖరారు కానున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం వచ్చే నెల 13వ తేదీన కేంద్ర మంత్రి గడ్కరీ ఎయిమ్స్ నిర్మాణాలను స్వయంగా పర్యవేక్షించనున్నారు. ఈ లోగా రాష్ట్ర పార్టీ నేతలు జిల్లాల పర్యటనల ద్వారా కార్యకర్తలు, నేతలను, ప్రజలను నేరుగా కలుసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ఇటీవల పార్టీ అగ్రనేతల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించిన పార్టీ అధ్యక్షుడు కన్నా ఈ నెల 20 నుంచి జులై మొదటి వారం వరకు శ్రీకాకుళం, విజయనగరం, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పర్యటించేందుకు ప్రణాళికలను ఖరారు చేసుకున్నారు. ఈ నెల 24వ తేదీన పార్టీ రాష్ట్ర నేతలు పోలవరం నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం నిర్మాణాలకు కేంద్రం నిధులు ఇస్తున్న విషయాన్ని ప్రజలకు విడమర్చి చెప్పేందుకు పర్యటనను ఉపయోగించుకోవాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. మరోవంక.. భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాయలసీమలో జరిగే బహిరంగ సభలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ 48 నెలల పరిపాలన సందర్భంగా జాతీయస్థాయిలో చేపట్టిన 'విశేష సంపర్క్ అభియాన్' కింద పార్టీ నేతలు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా జిల్లాల పర్యటనలను ఈ నెల 22వ తేదీ వరకు జరిపేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం చేస్తున్న సాయం గురించి పార్టీ నేతలు చెబుతుండడాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారని పార్టీ అధ్యక్షుడు కన్నా పేర్కొన్నారు.

'గౌరీ హత్య'కు నాకిచ్చింది రూ.13 వేలే!

- సిట్ అధికారులకు తెలిపిన వాగ్మోరే

బెంగళూరు, న్యూస్‌టుడే : కన్నడనాట సీనియర్ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్‌ను హత్య చేసేందుకు 'బిగ్‌బాస్' నుంచి తనకు అందిన మొత్తం రూ.13 వేలు మాత్రమేనని ప్రత్యేక దర్యాప్తు దళం (సిట్) అదుపులో ఉన్న పరశురామ్ వాగ్మోరే తెలిపాడు. మొదట రూ.3వేలు ఇచ్చారని, హత్య తరువాత తనకు రూ.10వేలు అందాయని అన్నాడు. డబ్బు కోసం తాను ఈ హత్యను చేయలేదని, ఆమె హిందువులకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రసంగాలతోనే తుదముట్టించాలని నిర్ణయించానని తెలిపాడు. 'డబ్బు కోసం హత్య చేసే వ్యక్తిని కాదు. నా ధర్మాన్ని ఎవరైనా విమర్శిస్తే నేను అందుకు అంగీకరించను. గౌరీ వెనక నిలబడి తూటాను పేల్చేందుకు సిద్ధమయ్యాను. అంతలోనే వెనక్కు తిరిగారు. ఆమె కంగారు పడుతూ నువ్వు ఎవరు? అని ప్రశ్నించారు. నేను సమాధానం చెప్పకుండానే ఆమె తలకు గురిపెట్టి కాల్చాను. మొదటి తూటా గురి తప్పి గోడకు వెళ్లి తగిలింది. ఆ తరువాత తూటా తలలోకి దూసుకెళ్లటంతో ఆమె కింద పడింది. ఆ తరువాత మరో నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాను' అంటూ తాజా విచారణలో నిందితుడు తెలిపాడని సిట్ అధికారులు వివరించారు. హత్యకు సంబంధించిన 'బిగ్ బాస్' ఎవరో ఇప్పటి వరకు నిందితుడు నోరు విప్పలేదు.

మహారాష్ట్ర నుంచి ప్రత్యేక దర్యాప్తు దళం.. గౌరీ లంకేశ్‌ను తుపాకీతో కాల్చిన ఆరోపణలతో సిట్ అదుపులో ఉన్న పరశురామ్ వాగ్మోరే నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు మహారాష్ట్ర నుంచి ప్రత్యేక దర్యాప్తు దళం అధికారులు నగరానికి చేరుకున్నారు. మహారాష్ట్రలో నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే హత్య కేసులను దర్యాప్తు చేసేందుకు వారు ఇక్కడికి వచ్చారని సిట్ అధికారులు తెలిపారు. వారు కూడా పరశురామ్‌ను విచారణ చేసేందుకు అవకాశమిస్తామని సిట్ అధికారులు వెల్లడించారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY
KAKINADA
SRI VENKATESWARA UNIVERSITY
TIRUPATI
MSIT SPOT ADMISSIONS 2018
JNTU Kakinada: 22nd June, 2018 Contact: 7799834586 / 7799834583
SVU Tirupati: 25th June, 2018 Contact: 7799265000 / 7799834583
MSIT (Master of Science in Information Technology) is a **2 year post graduate program in Computer Science.**
Eligibility: B.Tech (All branches)
All eligible candidates can attend the spot admissions along with all original certificates and DD of Rs.10,000/- drawn in favour of "CIHL, Hyderabad" towards preparatory course fee.
For further details visit: **www.msitprogram.net**

ప్రైవేటు వ్యక్తులకు గదుల కేటాయింపు బాధ్యతలు!

సిబ్బంది సర్దుబాటు పేరిట తితిదే నిర్ణయం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే అధికారులు ముందూవెనకా ఆలోచించకుండా తీసుకున్న నిర్ణయాలు దేవస్థానానికి భవిష్యత్తులో సమస్యలు తెచ్చిపెట్టేలా కన్పిస్తున్నాయి. అదనంగా ఉన్న సిబ్బందిని సర్దుబాటు చేసే నెపంతో.. కీలక విభాగాల్లో ప్రైవేటు సిబ్బందిని నియమించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల ప్రవేశపెట్టిన స్వామివారి సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్ల జారీకి ఇబ్బడిముబ్బడిగా కేంద్రాలను తెరిచారు. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా భారీగా సిబ్బంది నియమకాలు చేపట్టారు. మొదట్లో 107 కేంద్రాలు అని చెబుతూ.. క్రమంగా పెంచుకుంటూ పోయారు. కేంద్రాల నిర్వహణ కోసం ఏపీ ఆన్‌లైన్ సంస్థ ద్వారా 200 మందిని నియమించారు. వేసవి సెలవుల రద్దీ కారణంగా ఇటీవలి వరకూ రోజూ ఇన్ని వేల మందికే అంటూ.. టోకెన్ల సంఖ్యపై ఆంక్షలు విధించారు. క్రమంగా టోకెన్ల జారీని కుదించాల్సి వచ్చింది. తిరుపతి, తిరుమలలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రాలను మూసివేయాల్సి వస్తోంది. ఫలితంగా పని లేకుండా మిగిలే సిబ్బందిని సర్దుబాటు చేయాలని తితిదే అధికారులు భావిస్తున్నారు.

ఇలా ఇతర విభాగాల్లోకి.. ప్రస్తుతం తిరుమలలో గదులు కేటాయించడానికి కేంద్రీయ విచారణ కార్యాలయం (సీఆర్వో)లో ప్రత్యేక యంత్రాంగం పని చేస్తుంది. ఇక్కడ సిబ్బంది కొరతను అధిగమించేందుకు.. టోకెన్ల జారీ వ్యవస్థలోని మిగులు సిబ్బందిని నియమించుకోవాలని భావిస్తున్నారు. వీరంతా ప్రైవేటు సిబ్బంది. అంటే.. గదుల కేటాయింపు వ్యవస్థ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే దేవస్థానంలో ప్రైవేటు సంస్థల పెత్తనం పెరిగిందన్న విమర్శలు వస్తున్నాయి. వీటి ద్వారా కొందరు విభాగాధిపతులు పెత్తనం చెలాయిస్తున్నారు. తాజాగా కీలకమైన గదుల కేటాయింపు ప్రైవేటు సంస్థ నియమించిన సిబ్బంది చేతుల్లో పెడితే.. తీవ్ర పర్యవసానాలు ఉత్పన్నమయ్యే ఆస్కారం ఉంది.

అమెరికాలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం శాఖ

త్వరలో ప్రారంభిస్తామన్న మంత్రి గంటా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం(ఎఎఎ) అమెరికా శాఖను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం పాలక వర్గ సమావేశం విశాఖలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎఎఎ శాఖను అమెరికాలో ప్రారంభించడం వల్ల ఏయూ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇథియోపియా, నేపాల్ దేశాల్లోనూ శాఖలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఎఎఎ వెబ్‌సైట్‌ను ప్రపంచస్థాయిలో ఆధునికంగా రూపొందించాలని నిర్ణయించారు. ఏయూలో రూ.10 కోట్లతో అయిదు అంతస్థుల భవనం నిర్మించాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్, పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది డిసెంబరు 10న జరగబోయే పూర్వ విద్యార్థుల సంఘం సమావేశానికి పారిశ్రామిక వేత్తలు రతన్‌టాటా, ఇన్ఫోసిస్ నారాయణరావు, హెచ్‌సిఎల్ శివనాడార్ వంటి ప్రముఖులను ఆహ్వానించామన్నారు. సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు, కోశాధికారి ఆచార్య ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆచార్య మోహన్ వెంకట్‌రామ్, సంయుక్త కార్యదర్శి కుమార్‌రాజా, ఆకుల చంద్రశేఖర్, మాజీ రెక్టార్ ఆచార్య ప్రసన్నకుమార్, విజయ్‌నిర్మాణ్ అధినేత డాక్టర్ విజయ్‌కుమార్, జీఎంఆర్ గ్రూప్ ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళీ జాతర బోనాలకు సీఎంకు ఆహ్వానం

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుతూ విజయవాడ కనకదుర్గకు వచ్చే నెల 22న బోనాలు సమర్పిస్తామని.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని భాగ్యనగర్ మహంకాళీ బోనాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

టీ మరియు కాఫీ పైన ప్రతి రోజు లోయెస్ట్ ప్రైస్

	ఎమ్ఆర్‌పి	బిగ్ బజార్ ధర*
ఫ్రెష్ & ప్యూర్ కడక్ టీ (1 కిలో)	₹240	₹199
తాజ్ మహల్ టీ (500 గ్రా./250 గ్రా.)	₹280/₹145	₹243/₹137
రెడ్ లెబెల్ టీ (500 గ్రా.)	₹185	₹150
రెడ్ లెబెల్ నేచురల్ కేర్ టీ (500 గ్రా./250 గ్రా.)	₹240/₹145	₹205/₹137
3 రొసెస్ డస్ట్ నేచురల్ కేర్ టీ (250 గ్రా.)	₹155	₹136
చక్రా గోల్డ్ టీ (500 గ్రా.)	₹250	₹220
నెస్‌కెఫె కాఫీ క్లాసిక్ జార్ (100 గ్రా.)	₹260	₹245

మేము 30000+ ఉత్పత్తుల ప్రైస్ మ్యాచ్* చేస్తాము ఫ్యూచర్ పేతో!
GUARANTEED ప్రతి రోజు LOWEST PRICE GUARANTEED
BIG BAZAAR
ఇండియాని చేస్తుంది బ్యూటిఫుల్
*నిబంధనలు వర్తిస్తాయి.
DDB Mudra 2590 Tel

ఈనాడు

సమాఖ్య పంథాలోనే సమగ్ర ప్రగతి

పటిష్ఠ సమన్వయం, నిరంతర పర్యవేక్షణలతోనే ఉత్కృష్ట లక్ష్యాల్ని సాధించగలమంటూ కడపటి పంక్తిలోని చిట్టచివరి వ్యక్తుల్ని గుర్తించినప్పుడే సర్కారీ సేవల ప్రయోజనాల్ని వారికి చేరువ చెయ్యగలమన్న ప్రధాని మోదీ ఉద్బోధ పూర్తిగా అర్థవంతం. రెండంకెల వృద్ధి రేటు సాధనకు మరెన్నో కీలక చర్యలు చేపట్టాల్సి ఉందంటూ నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని ప్రస్తావించిన 2022 నాటికి నయాభారత్ సాక్షాత్కారం అన్నది- ఓ సురుచిర స్వప్నం. రాష్ట్రాల సారథ్యంలోనే జాతీయాభివృద్ధి రథం జోరందుకొనే నమూనాను రూపొందిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసిన కమలనాథులు- ప్రణాళిక సంఘాన్ని, పంచవర్ష ప్రణాళికల సంప్రదాయాన్ని చాపచుట్టేశారు. రాష్ట్రాలపై కేంద్రం అత్తపెత్తనానికి అంటుకట్టిన 'యోజన ఆయోగ్' స్థానంలో 'నీతి ఆయోగ్'ను 2015 సంవత్సరం కొత్తవేకువలో ఆవిర్భవింపజేశారు. భారతావని ప్రగతికి పదిహేనేళ్ల మార్గసూచీ తయారీలో నిమగ్నమైన నీతి ఆయోగ్- మూడేళ్ల కార్యాచరణ అజెండాను సిద్ధం చేసింది; ఏడేళ్ల వ్యూహ పత్రానికి మెరుగులద్దుతోంది. ప్రాథమిక దశ నుంచి ప్రణాళికల కసరత్తులో ముఖ్యమంత్రులకూ భాగస్వామ్యం కల్పించి సమాఖ్య భావన స్ఫూర్తికి నీతి ఆయోగ్ గొడుగు పడుతుందన్న ఆదర్శవాదాన్ని- మొన్నటి భేటీలో కొందరు ముఖ్యమంత్రుల నిరసన స్వరాలు తెలిమబ్బులా కప్పేశాయి. రాష్ట్రాలే భారత జట్టు (టీమ్ ఇండియా)గా సంక్లిష్ట సమస్యలకు పరిష్కారం చూపడంలో నీతి ఆయోగ్ కీలకపాత్ర పోషిస్తోందని ప్రధాని మోదీ ఘనంగా సెలవిచ్చినా- వనరుల కేటాయింపులో నిజమైన నిష్పాక్షికతను పాటించేందుకు చర్యలు చేపట్టాలన్న హేతుబద్ధ డిమాండ్లను తోసిపుచ్చే వీల్లేదు. ఏకకాల ఎన్నికలపై సమగ్రచర్చకు మళ్ళీ పిలుపు ఇచ్చిన మోదీ, వ్యవసాయ రంగానికి ఉపాధి హామీని అనుసంధానించే అంశంపై ముఖ్యమంత్రుల కమిటీని కొలువుతీర్చడం నీతి ఆయోగ్ భేటీలో ఎన్నదగిన ముందడుగు. 'అందరి తోడుగా సమష్టి ప్రగతి' లక్ష్యాలు నెరవేరాలంటే, రాష్ట్రాల వాస్తవిక అవసరాలను ఆకాంక్షలను కేంద్రం చెవిన పెట్టక తప్పదు!

దేశ విభజన గాయాల నేపథ్యంలో రూపొందిన రాజ్యాంగం జాతి సమగ్రత సమైక్యతలకే పెద్దపీట వేసి బలమైన కేంద్రానికే తథాస్తు పలికింది. రాష్ట్రాల సమాహారంగా దేశాన్ని గుర్తించినా సమాఖ్య భావనకు తూట్లు పొడిచే దుర్విధానాలే దశాబ్దాలపాటు రాజ్యమేలాయి. కాసుల కామధేనువులన్నింటినీ కేంద్రం పెరట్లో కట్టేయడంతో, ప్రకృతి విపత్తుల వెతల నుంచి బయటపడటానికీ దిల్లీ సాయాన్ని దేబిరించక తప్పని పెద్దసైజు మున్సిపాలిటీలుగా రాష్ట్రాలు ఈసురోమంటున్నాయి. సమాఖ్య స్ఫూర్తిని ఏమాత్రం ఆకళించుకోని ఆర్థిక సంఘాల ఒంటెత్తు ధోరణులతో రాష్ట్రాల నుదిటిన నష్ట జాతకం తిష్ఠ వేసింది. వైవీ రెడ్డి సారథ్యంలోని పద్నాలుగో ఆర్థిక సంఘం 'రికార్డు స్థాయిలో' 42 శాతం నిధుల బదిలీకి పచ్చజెండా ఊపినా, 'దేవుడు వరమిచ్చినా...' సామెత చందంగా కేంద్రం నుంచి కేటాయింపులు 35 శాతం దగ్గరే తారట్లాడుతున్నట్లు సర్కారీ లెక్కలే చాటుతున్నాయి. స్థానిక జనావళి అభివృద్ధి ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు, తాము నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలకు అనుగుణంగా సమధిక వాటాలను కోరడం సమంజసమే. ఆర్థిక సంస్కరణల శకంలో విప్పారుతున్న కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవడానికి, అంతర్జాతీయాకరణ సవాళ్లను కాచుకోవడానికి రాష్ట్రాలకు విత్త సత్తువ ఎంతో కీలకం. ఆర్థిక సమాఖ్య భావన ఆచరణలో తేజరిల్లనంతకాలం- 'నీ ఎడమ చెయ్యి తియ్యి, నా పురచేయి పెడతాను' అన్నట్లుగా ఎన్ని కొత్త వ్యవస్థల్ని కొలువుతీర్చినా ప్రయోజనమేముంది? పదిహేనో ఆర్థిక సంఘం పరిశీలనాంశాలపై ఆందోళనకు జతపడి రాష్ట్రాలు మరింత కార్యనిర్వాహక స్వేచ్ఛ కోసం గళమెత్తడం- కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో సరికొత్త ప్రకరణం మొదలు కావాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతోంది!

'ప్రతి రాష్ట్రానికీ వాటికంటూ సొంత సమస్యలున్నాయి... విధానాలు రూపొందించేది కేంద్రమే అయినా వాటిని అమలు చేయాల్సింది రాష్ట్రాలే'నని పశ్చిమ్ బంగ ముఖ్యమంత్రి మమత కుండ బద్దలుకొట్టారు. ప్రభుత్వాల విధివిహిత బాధ్యతల్ని కేంద్రం, రాష్ట్రం, ఉమ్మడి జాబితాలుగా వర్గీకరించి రాజ్యాంగంలోని ఏడో షెడ్యూలులో చేర్చినా- రాష్ట్రాల అధికారాలకు సొడ్డుకొట్టేలా కేంద్రం, ఉమ్మడి జాబితాల్లోని అంశాలను పెంచేసిన వైపరీత్యం సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు! అది చాలదన్నట్లు రాజకీయ ఫలాపేక్షతో కేంద్ర స్థాయిలోనే లెక్కకు మిక్కిలి ప్రాయోజిత పథకాల్ని వండివార్చడం; రాష్ట్రాలూ తమ వంతు వాటా నిధుల్ని భరిస్తేనే వాటి అమలుకు సమకట్టడం- విధానాల రూపకల్పనలో రాష్ట్రాల స్వేచ్ఛకు సంకెళ్లు బిగిస్తోంది. రక్షణ, విదేశీ వ్యవహారాలు, స్థూల ఆర్థిక వ్యవస్థ, ప్రపంచీకరణ తదితర కీలక రంగాలకే కేంద్రం పరిమితమై; విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పట్టణ, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలన్నింటిలో రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛనివ్వాలన్న కేసీఆర్ అభిమతం- సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా ఉంది. రాష్ట్రాల అవసరాల్ని కేంద్రం గుర్తించాలంటూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం చంద్రబాబు గళమెత్తాల్సి రావడం- అత్యున్నత స్థాయిలో విధానపర లోపాల్నే పట్టిస్తోంది. ఉపాధి హామీ పథకానికి ఏటా పదుల వేలకోట్ల రూపాయలు వ్యయీకరిస్తున్నా, దాని ద్వారా సమకూరుతున్న సామాజిక ఆస్తులెన్ని అన్న సంగతి ఆరా తీస్తే- కేంద్ర ప్రాయోజిత పథకాల్లో అవినీతి విశ్వరూపం సాక్షాత్కరిస్తుంది. ఆ నిధుల్నే రాష్ట్రాలకు అందించి, స్థానిక అవసరాలకు తగ్గ అభివృద్ధి వ్యూహాలకు మళ్లించి, పారదర్శకత జవాబుదారీతనాలకు వీలుగా పటిష్ఠ యంత్రాంగాలు ఏర్పాటు చేస్తే- సమాఖ్య బాటలో జాతి ప్రగతి కళ్లెం విడిచిన రేసుగుర్రం అవుతుంది!

'ఆంధ్రప్రదేశ్‌లోని కడప, తెలంగాణలోని బయ్యారంలో ఉక్కు కర్మాగారాల ఏర్పాటు ఆర్థికంగా గిట్టుబాటు కాదని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) నివేదించింది. సాధ్యాసాధ్యాలను పరిశీలించి, మార్గనిర్దేశం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, సెయిల్, రాష్ట్రీయ ఇస్పాత్ నిగం, జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ, మెకాన్ లిమిటెడ్ సంస్థలతో కూడిన కార్య బృందం (టాస్క్‌ఫోర్స్) ఏర్పాటు చేశాం. ఈ కమిటీ సమావేశాలు కొనసాగుతున్నాయి'- ఉక్కు కర్మాగారాల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం తాజాగా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ప్రమాణపత్రంలో పేర్కొన్న ముఖ్యాంశమిది. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీల వైఫల్య జాబితాలో తాజాగా ఉక్కు కర్మాగారాలు చేరాయి. రెండు రాష్ట్రాల అభివృద్ధికి కర్మాగారాలు దోహదపడతాయని నాలుగేళ్ల క్రితం అంతా భావించారు. ఇప్పటివరకు ఈ కలలు నెరవేరకపోవడానికి కేంద్రానిదే పూర్తి బాధ్యత. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాల పరంగా ఒత్తిడి లోపమూ కారణభూతంగానే ఉంది.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు పేరిట ఏళ్లతరబడి జరిగిన ఉద్యమంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఫలితంగా 1970 ఏప్రిల్ 10న అప్పటి

తుక్కు అయిన ఉక్కు హామీ

దేశ ప్రధాని ఇందిరాగాంధీ విశాఖలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పుతున్నట్లు ప్రకటించారు. 1981 నాటికి అది పూర్తయింది. 33 వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభమైన ఈ కర్మాగారం 60 వేల మందికి ఉపాధి కల్పించింది. మొదట్లో 30 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ప్రారంభమై, ప్రస్తుతం 73 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచంలో అతి తక్కువ ధరకు ఉక్కును అందిస్తున్న నవరత్న సంస్థగా విశాఖ ఉక్కు ఖ్యాతి గాంచింది. విశాఖ ఉక్కు స్ఫూర్తితో మరిన్ని ఉక్కు కర్మాగారాలు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కావాల్సి ఉన్నా అది జరగలేదు. ప్రైవేటు రంగంలోనూ దాదాపు 17 ఉక్కు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వాటిలో ఉత్పత్తి అంతంత మాత్రమే. వాస్తవానికి రాష్ట్రంలో ఇనుప ఖనిజం సహా అనేక ఖనిజోత్పత్తులున్నా వాటిని సద్వినియోగం చేసుకునే యత్నం జరగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో బొగ్గునిల్వలు వెలికితీత అనంతరం వాటిని అందిపుచ్చుకొని 'సింగరేణి'ని ఏర్పాటు చేయగా, అదిప్పుడు విఖ్యాత సంస్థగా వెలుగులీనుతోంది. మిగిలిన పరిశ్రమల కోసం కృషి జరగాల్సి ఉన్నా ప్రభుత్వాలు చొరవ తీసుకోలేదు.

నీరుగారిన మరో విభజన వాగ్దానం

ఆరంభంలోనే అవినీతి

2007 మేలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కడపలో భారీ ఉక్కుపరిశ్రమ ఏర్పాటు కోసం కర్ణాటక పారిశ్రామికవేత్త గాలి జనార్దన్‌రెడ్డికి చెందిన బ్రహ్మణి స్టీల్స్ కంపెనీతో రాష్ట్రప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. పరిశ్రమ ఏర్పాటుకు ఎనిమిది వేల ఎకరాల భూమి కేటాయింపుతోపాటు ఇతర రాయితీలు కల్పించేందుకు అంగీకరించింది. గండికోట రిజర్వాయర్ నుంచి రెండు శతకోటి ఘనపుటడుగు(టీఎమ్‌సీ)ల నీటి సరఫరాకు అనుమతించింది. 18 నెలల్లో రూ.4,500 కోట్లతో 25 లక్షల టన్నుల సామర్థ్యంతో మొదటి దశ నిర్మాణాన్ని పూర్తిచేయాలి. విశాఖ ఉక్కు కోసం 24 వేల ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించారు. చాలామంది నిర్వాసితులయ్యారు. కడపలో పరిశ్రమ కోసం ఎనిమిది వేల నుంచి పదివేల ఎకరాల భూమినే అడిగారని, ఆయా ప్రాంతాల్లో రాళ్ల తప్ప ఏమీ లేని భూములు అయినందువల్ల నిర్వాసితుల సమస్యే ఉత్పన్నం కాదని అప్పటి సీఎం వైఎస్ ప్రకటించారు. రూ.20 వేలకోట్ల పెట్టుబడితో కోటి టన్నుల సామర్థ్యం గల పరిశ్రమ ఏర్పాటుకు పూనుకొన్నామని పారిశ్రామికవేత్త జనార్దన్‌రెడ్డి వివరించారు. 2007 జూన్ 10న దీనికి శంకుస్థాపన చేస్తున్నామని, మొదటి దశలో 20 లక్షల టన్నుల యూనిట్‌ను 18 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. తరవాత ఏడాదికి మరో రూ.2,500 కోట్లతో మరో 23 లక్షల టన్నుల యూనిట్‌ను నిర్మిస్తామని, ఆపై మరో మరో రెండు దశల్లో డెబ్బై లక్షల టన్నుల సామర్థ్యం గల యూనిట్లను నిర్మిస్తామని చెప్పారు. కడపలో మొత్తం పాతిక వేల మందికి ప్రత్యక్షంగా, రెండు లక్షల కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి కలుగుతుందన్నారు. ఒప్పందం తరవాత ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు మొదటి విడతగా ఎకరం రూ. 18,500 వంతున 10,766 ఎకరాల ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేశారు. విమానాల మరమ్మతు, పైలట్ శిక్షణ కేంద్రాలకు ఎకరా రూ.25వేల చొప్పున 3,161 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించారు. ఉత్పత్తి చేసిన ఉక్కు రవాణాకు వీలుగా రైలుమార్గ నిర్మాణానికి ఎకరా రూ.25 వేలకు 88 ఎకరాలు కట్టబెట్టారు. ఆ భూములను బ్రహ్మణి యాజమాన్యం తెలివిగా సొమ్ము చేసుకుంది. ప్రభుత్వ భూముల్ని తనఖా పెట్టింది. ప్రభుత్వం ఎకరా రూ.18,500లకు కేటాయిస్తే, ఆ కంపెనీ ఎకరాకు రూ.3.25 లక్షల చొప్పున బ్యాంకుల నుంచి 'లెటర్ ఆఫ్ క్రెడిట్' పొందింది. ఇలా ప్రభుత్వ భూముల్ని తనఖా పెట్టి రుణం తీసుకోవడం తప్పని 'కాగ్' తన 2009 సంవత్సర నివేదికలో స్పష్టీకరించింది. తానే కర్మాగారం పెడతానంటూ ఓబుళాపురం ఇనుప ఖనిజం గనుల్ని, కర్మాగారం కోసం ప్రభుత్వ భూముల్ని బ్రహ్మణి యాజమాన్యం తీసుకుంది. ఓబుళాపురం గనుల కోసం ఇతరులూ దరఖాస్తు చేసుకున్నా, ఓఎమ్‌సీకే లీజుకు ఇచ్చారు. కర్మాగారం పెట్టకపోయినా ఓఎమ్‌సీ ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేసేసి కోట్ల రూపాయలు ఆర్జించింది. బ్రహ్మణి ఒప్పందం తరవాత కడపజిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పేందుకు బీఎంఎం సంస్థ ముందుకొచ్చింది. 3,560 ఎకరాల భూమి, తగినంత నీరు, విద్యుత్, కాలుష్యనివారణ చర్యలు తదితరాల్ని కోరింది. ప్రభుత్వం దానికి సహకరించకపోవడంతో ఆ సంస్థ వెనక్కిపోయింది. బ్రహ్మణి ఒప్పందం మేరకు పనులు చేయకపోవడంతో చివరికి ప్రభుత్వం 2012 మేలో ఎమ్ఓయూను రద్దు చేసింది. వై.ఎస్. ప్రభుత్వ హయాములోనే బయ్యారం, గార్ల, నేలకొండపల్లి, గూడూరు మండలాల్లోని 56,690 ఎకరాల్లోని ఖనిజాల అన్వేషణ కోసం రక్షణ స్టీల్స్ సంస్థకు లీజుకు ఇచ్చారు. ఉక్కు కర్మాగారం నెలకొల్పాలనే ఒప్పందం మేరకు ఈ వ్యవహారం జరిగింది. దీనిపైనా పెద్దయెత్తున అభియోగాలు రావడంతో ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసింది. ఇలా అప్పట్లో కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల కథలు విషాదాంతమయ్యాయి.

కడపలో కర్మాగార స్థలం

కడప కరవు ప్రాంతం. బయ్యారాన్ని ఆనుకొని ఏజెన్సీ ప్రాంతాలు ఉన్నాయి. అక్కడ 80 శాతానికి పైగా గిరిజనులే నివసిస్తుంటారు. రాజకీయ కారణాలు ఏవైనా తమకు ఉక్కు కర్మాగారాలు వస్తాయని, స్థానికంగా ఉపాధి అవకాశాలతో పాటు ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు భావించారు.

కడప, బయ్యారాలకు జరిగిన అన్యాయాలను ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కేంద్రానికి నివేదించాయి. రాష్ట్ర విభజన సమయంలో ఈ అంశం చర్చకు వచ్చింది. చివరికి ఆయా ప్రాంతాల ప్రజల మనోభావాలను అనుసరించి ఈ రెండుచోట్ల ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. వీటి సాధ్యాసాధ్యాలను 'స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా' పరిశీలించి, ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలని నిర్దేశిస్తూ ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూలు 13లో పేర్కొంది. రెండు భారీ పరిశ్రమలకు సంబంధించిన కీలక అంశమైనందువల్ల దీనిపై కేంద్రం దృష్టి సారించి పరిష్కారం చూపాలి. సెయిల్ సంస్థ ఆది నుంచీ ఉక్కు కర్మాగారాల నిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదు. కేంద్రం విభజన చట్టంలో నిర్దేశించిన ప్రకారం సెయిల్ 2014 డిసెంబరు రెండో తేదీన నివేదిక ఇచ్చింది. కర్మాగారాల ఏర్పాటు ఆర్థికంగా సాధ్యం కాదని అది తేల్చింది. వాస్తవానికి ప్రభుత్వరంగంలో ఏర్పాటు చేసే ఏ పరిశ్రమ విషయంలోనైనా ముందుగా పారిశ్రామిక, సామాజిక మార్పులు, ఉపాధి కల్పన తదితర అంశాలను విశ్లేషించాలి. సెయిల్ ఇవేమీ అధ్యయనం చేయలేదు. కేవలం ఇనుప ఖనిజం లభ్యత గురించి మాత్రమే పరిశీలించి, నివేదిక ఇచ్చింది. నాణ్యత గురించీ లోతైన అధ్యయనం కొరవడింది. అధ్యయన సంస్థ మెకాన్‌తో రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని కేంద్రం నిర్దేశించింది. అయినా ఆశించిన ఫలితం రాలేదు. ఉక్కు కర్మాగారాలపై చర్చ వచ్చినప్పుడు కేంద్రం దాటవేత వైఖరిని అవలంబించింది. తెలంగాణ ప్రభుత్వం బయ్యారం కర్మాగారాన్ని అడిగితే పాల్వంచలో మూతబడిన చిన్నపాటి 'ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్' కర్మాగారాన్ని పునరుద్ధరిస్తామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి బీరేందర్ చౌదరి ప్రకటించారు. సుప్రీంకోర్టులో తాజా ప్రమాణపత్రం ఆధారంగా కేంద్రం సత్వరమే నిర్ణయం తీసుకునే దాఖలాలు కనిపించడం లేదు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ కడప, మహబూబాబాద్ జిల్లాలో ఆందోళనలు సాగుతున్నాయి.

కేంద్రం వైఖరి మారాలి

ఉక్కురంగం లాభాల బాటలో నడుస్తోంది. కేంద్రం ప్రకటించిన 2015 ఉక్కు విధానం కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకరంగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలకు కొత్త కర్మాగారాల అవసరం ఉంది. విశాఖ ఉక్కుకు తోడు మరో కర్మాగారం రాయలసీమలో రావడంవల్ల ప్రగతి సమతూకంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో ఉక్కు కర్మాగారాలు లేవు. బయ్యారం ద్వారా ఈ లోటు తీరుతుందని, పారిశ్రామిక రంగం మరో మెట్టు ఎక్కడానికి అవకాశం కలుగుతుందని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ తరుణంలో రెండు ఉక్కు కర్మాగారాల ఏర్పాటుకు కేంద్రం ముందుకు రావాలి. కొత్త కర్మాగారాల స్థాపనకు అవసరమైన సాయం అందిస్తామని ఇప్పటికే రెండు ప్రభుత్వాలు ప్రకటించాయి. కడప జిల్లాలో భూముల లభ్యత దృష్ట్యా, అక్కడ కర్మాగారం ఏర్పాటుకు అన్ని అనుకూలతలు ఉన్నాయి. బయ్యారంలోనూ కర్మాగారం నిర్మాణానికి సానుకూల వాతావరణం ఉంది. భూమి, నీరు, విద్యుత్ ఇతర మౌలిక వసతులపై రాష్ట్రాలూ స్పష్టమైన హామీ ఇచ్చాయి. బైలదిల్లా నుంచి ఖనిజాన్ని బయ్యారానికి తరలించేందుకు అవసరమైన రైలు మార్గ నిర్మాణ వ్యయంలో 50 శాతం భరించేందుకూ తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. కేంద్రం నుంచి సానుకూల స్పందన రాకపోతే రాష్ట్ర ప్రభుత్వాలు సాహసోపేత నిర్ణయాలు తీసుకునేందుకు ముందుకు రావాలి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే, సెయిల్ కాదంటే సింగరేణి లేదా మరో సంస్థ ద్వారా కర్మాగారం ఏర్పాటు చేయాలనే తలంపుతో ఉంది. అందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఏపీ ప్రభుత్వమూ ఇలాంటి ప్రత్యామ్నాయాన్ని రూపొందించుకోవాలి.

– ఆకారపు మల్లేశం

ఇరాన్‌పై అమెరికా దాష్టీకం

సంజయ్ పులిపాక

ఇరాన్ అణ్వస్త్ర ఉత్పత్తికి స్వస్తి చెప్పే షరతుపై ఆ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయడానికి 2015లో కుదిరిన అంతర్జాతీయ ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తుంగలో తొక్కి ప్రకంపనలు సృష్టించారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌లతోపాటు జర్మనీ (పి5+1)లు కలిసి ఇరాన్ అణ్వస్త్ర ఉత్పత్తిని పక్కనపెట్టేట్లు ఒప్పించాయి. 2015లో సంయుక్త సమగ్ర కార్యాచరణ ప్రణాళిక పేరిట కుదిరిన ఈ ఒప్పందాన్ని ఇరాన్ అణు ఒప్పందంగా వ్యవహరిస్తున్నారు. దీనికింద ఇరాన్ నిర్దిష్ట గడువులోపు అణ్వస్త్ర తయారీ కార్యక్రమానికి పూర్తిగా స్వస్తి చెప్పాలి. బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కుదిరిన ఈ ఒప్పందానికి ట్రంప్ ఇప్పుడు మంగళం పాడేశారు. ఒప్పందంలో ఇతర భాగస్వాములైన జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్‌లనూ ట్రంప్ బాటలోకి తీసుకురావడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యాహు త్వరలో ఆ దేశాలను సందర్శించనున్నారు.

కలిసిరాని మిత్రదేశాలు

అమెరికా, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలు కలిసికట్టుగా ఇరాన్‌పై కత్తికట్టాయి. ఒప్పందానికి జర్మనీ మద్దతు కొనసాగితే, ఆ దేశ కంపెనీలను బహిష్కరిస్తామని సౌదీ హెచ్చరించింది. పశ్చిమాసియాలో సంభవిస్తున్న ఈ పరిణామాలు భారత్‌ను ఇరుకున పెడుతున్నాయి. భారత్‌కు ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలతో పటిష్ఠ సంబంధాలు ఉన్నాయి. మరోవైపు ఇరాన్‌తో స్నేహమూ ఆర్థికంగా, వ్యూహపరంగా ఎంతో కీలకమైనది. అఫ్గానిస్థాన్, భారత్‌లను కలిపే దారి ఇరాన్ ద్వారానే వెళుతోంది. అఫ్గాన్, భారత్‌ల మధ్య రవాణా సంబంధాలు ఏర్పడకుండా పాకిస్థాన్ సైంధవ పాత్ర పోషిస్తున్నందువల్ల ఇరాన్ అవసరం దిల్లీకి ఎంతో ఉంది. అందుకే భారత్ ఐక్యరాజ్య సమితి విధించే ఆంక్షలను మాత్రమే గౌరవిస్తుంది తప్ప, మరే దేశ ఆంక్షలనూ పట్టించుకోదని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ వారం రోజుల క్రితం స్పష్టీకరించారు. దీన్ని బట్టి అమెరికా ఆంక్షలను భారత్ ఖాతరు చేయదని భావించడానికి ఆస్కారమేర్పడింది. ఇరాన్‌ను దారికి తీసుకురావడానికి పీ5+1 సుదీర్ఘ సంప్రతింపులు జరిపాయి. ఈ చర్చల్లో రెండు రకాల దృష్టి కోణాలు వ్యక్తమయ్యాయి. ఒకటి- ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదిలేయడంతోపాటు పశ్చిమాసియాలో ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఉపసంహరించాలి. ఈ ప్రాంత దేశాల్లో తన కార్యకలాపాలను తగ్గించుకోవాలి. ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలు ఈ పంథాను గట్టిగా సమర్థించాయి. షియా దేశమైన ఇరాన్ అణ్వస్త్రాలు సమకూర్చుకొని పశ్చిమాసియాలో తన ఆధిక్యానికి గండి కొడుతుందేమోనని సున్నీ సౌదీ అరేబియా భయం. పశ్చిమాసియాలో తనకు తప్ప మరే దేశానికీ అణ్వస్త్రాలు ఉండకూడదని ఇజ్రాయెల్ పంతం. ఈ కారణంతోనే సౌదీ, ఇజ్రాయెల్‌లు మొదటి పంథాను సమర్థించాయి.

టెహరాన్‌పై ట్రంప్ ఉక్కుపిడికిలి

అమెరికాలో కొన్ని వర్గాలు, రష్యా, జర్మనీ తదితర దేశాలు పట్టువిడుపులుగల రెండో పంథాను అనుసరించాయి. ఇరాన్‌తో అణ్వస్త్ర తయారీ యత్నాలను విరమింపజేయడమే ముఖ్యం కాబట్టి ఇతర అంశాలకు ప్రస్తుతం అతిగా ప్రాధాన్యం ఇవ్వకూడదన్నది ఈ పంథా సారాంశం. పశ్చిమాసియాకు అణ్వస్త్రాలు పెను ముప్పు తెస్తాయి కనుక వాటి నిర్మూలనే ధ్యేయం కావాలి తప్ప, ఇరాన్ ఆర్థిక, రాజకీయ విధానాల గురించి అనవసరంగా ఆందోళన చెందకూడదని ప్రధాన దేశాలు భావించాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తన హయాములో ఈ రెండో పంథానే అనుసరించారు. రష్యా, ఐరోపా సమాఖ్య కూడా ఇదే బాణీ వైపు మొగ్గు చూపాయి. ఫలితంగా ఇరాన్ అణ్వస్త్ర తయారీని నిలిపేయడానికి, తన అణు కేంద్రాలపై అంతర్జాతీయ తనిఖీకి ఒప్పుకొంది. ఒబామా పదవీ కాలం ముగియవస్తుండగా కుదిరిన ఈ ఒప్పందాన్ని ప్రపంచం హర్షించింది. డొనాల్డ్ ట్రంప్ అమెరికా పగ్గాలు చేపట్టగానే ఇరాన్ అణు ఒప్పందాన్ని రద్దు చేస్తానని ప్రకటించారు. ఇరాన్ విషయంలో మరీ మెతక వైఖరిని కట్టిపెట్టి, కఠిన ఆంక్షలు విధిస్తామన్నారు. ఇరాన్ అణ్వస్త్ర తయారీ ప్రయత్నాలను క్రమక్రమంగా విడనాడటం కాదు వెంటనే శాశ్వతంగా విరమించాలన్నారు. హెజ్బొల్లా వంటి ఉగ్రవాద సంస్థలను ఇరాన్ పెంచి పోషించరాదని, ఇతర పశ్చిమా దేశాల్లోనూ తన కార్యకలాపాలకు తెరదించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. క్షిపణి కార్యక్రమాన్ని కట్టిపెట్టి ఆర్థిక ద్వారాలను తెరవాలని ఒత్తిడి పెంచుతున్నారు. ఇరాన్ మీద కఠిన ఆర్థిక ఆంక్షలు విధిస్తే ఆ దేశం ఆర్థికంగా అస్థిరత్వంలోకి జారిపోతుంది, దాంతో ప్రస్తుత ఇస్లామిక్ ప్రభుత్వం కూలిపోయి కొత్త ప్రభుత్వం వస్తుందని ట్రంప్ లెక్కలు వేసుకుంటున్నారు.

ఇరాన్ పశ్చిమాసియాలో అతి పెద్ద జనాభా కలిగిన దేశమే కాదు, అత్యంత ప్రాచీన నాగరికతగల దేశం కూడా. ఇరాన్‌పై మళ్ళీ ఆంక్షలు విధించడం వల్ల ఆ దేశం ఆర్థికంగా కుంగిపోయే మాట నిజమే కానీ, దానికి విదేశీ శక్తులే బాధ్యులంటూ ఇరాన్ ప్రభుత్వం తన ప్రజల మద్దతు చూరగొనే అవకాశముంది. మరోవైపు ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు విధించేకన్నా యథాతథ స్థితి కొనసాగించడం మేలని ఐరోపా దేశాలు అంటున్నాయి. అమెరికాకు రెండేళ్లలో ట్రంప్ బదులు కొత్త అధ్యక్షుడు ఎన్నికవుతారేమో వేచి చూద్దామని ఐరోపా దేశాలు భావిస్తున్నట్లుంది. మరో ముఖ్యమైన అంశమేమంటే అణు ఒప్పందాన్ని రద్దు చేసుకొంటున్నట్లు ఇరాన్ ఇంతవరకు ప్రకటించకపోవడం. ఈ ఒప్పందానికి ఐరోపా దేశాలు అండగా నిలబడతాయని టెహరాన్ భావిస్తున్నట్లుంది. ఐరోపా ప్రభుత్వాలు అమెరికా ఆంక్షలను వ్యతిరేకిస్తున్నా, ఆయా దేశాల ప్రైవేటు కంపెనీలు అమెరికా బాణీని అనుసరించవచ్చు. ఇరాన్‌కన్నా అమెరికా ఎంతో భారీ మార్కెట్ కాబట్టి దాన్ని వదులుకోవడానికి ఏ ఐరోపా కంపెనీ ఇష్టపడదు. ఇక రష్యా, చైనాలు ఇరాన్ మీద మళ్ళీ ఆంక్షలు విధించడానికిససేమిరా అనడం ఖాయం. స్వయంగా అమెరికా ఆర్థిక ఆంక్షలకు గురైన రష్యా తన మిత్ర దేశం ఇరాన్ మీద ఆంక్షలను సమర్థించదు. ట్రంప్ మాట విని ఇరాన్‌ను వదులుకోవడానికి రష్యా తెలివితక్కువదేమీ కాదు. చైనా కూడా అంతే. 2015 ఒప్పందం తరవాత చైనా-ఇరాన్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోంది. ఇరాన్ వాణిజ్యంలో చైనా వాటా 2016లో 31 శాతానికి చేరుకుంది. అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించగానే చైనాతో ఇరాన్ వ్యాపారం మరెన్నో రెట్లు పెరగడం ఖాయం. పాశ్చాత్య దేశాల్లోని బ్యాంకులు ఇరాన్‌కు రుణాలివ్వకపోయినా, చైనా బ్యాంకులు ఆ లోటు తీరుస్తాయి. చైనా బ్యాంకులకు అమెరికాలో పెద్దగా వ్యాపారం లేదు కాబట్టి ట్రంప్ ఆంక్షలకు అవి జడవాల్సిన పని లేదు. ఏతావతా ఇరాన్‌కు వ్యతిరేకంగా ప్రపంచాన్ని ట్రంప్ కూడగట్టలేరని తేలిపోతోంది. అమెరికా మొండిగా ఇరాన్‌లో అస్థిరతకు తెగబడితే, పశ్చిమాసియా సంక్షుభితమై వేలాది శరణార్థులు ఐరోపాకు వలస వెళ్లే ప్రమాదం ఉంది. ఇది ఐరోపాలో అలజడి సృష్టిస్తుంది.

భారత్‌పై ప్రభావం

అమెరికా చర్యల వల్ల చమురు ధరలు పెరగవచ్చు. పీపా చమురు ధర 50 డాలర్లు మించితే (ప్రస్తుత ధర 65 డాలర్లకుపైగా) అమెరికన్ షేల్ కంపెనీలకు లాభసాటి అవుతుంది కానీ, భారత్ వంటి వర్ధమాన దేశాలు ఆర్థికంగా కడగండ్ల పాలవుతాయి. పశ్చిమాసియాలో పెద్ద సంఖ్యలో ఉన్న భారతీయ కార్మికులు, నిపుణులు స్వదేశానికి భారీయెత్తున డబ్బు పంపిస్తుంటారు. ఆ ప్రాంతంలో ఏ మాత్రం అస్థిరత రేగినా భారత్‌కు నష్టదాయకమవుతుంది. అఫ్గానిస్థాన్‌కు సరకులు పంపడానికి ఇరాన్‌లో భారత్ చాబహార్ రేవు నిర్మిస్తోంది. ట్రంప్ ఆంక్షలతో ఈ ప్రాజెక్టుకు సవాళ్లు తప్పవు. భారత్ ఈ జటిల స్థితిలో ఆచితూచి వ్యవహరిస్తూ తన ప్రయోజనాలకు భంగం కలగకుండా చూసుకోవాలి.

(రచయిత– దిల్లీలోని నెహ్రూ స్మారక మ్యూజియం అండ్ లైబ్రరీలో సీనియర్ ఫెలో)

ఆసనం

ఆధ్యాత్మిక సాధనలో ప్రతి అంశమూ ప్రధానమైందే. అది చిన్నదా పెద్దదా అన్నది సమస్యే కాదు. ఎంత గొప్ప గమ్యమైనా వేసే ప్రతి అడుగూ దూరాన్ని తగ్గించేదే. ప్రతి అడుగూ గమ్యాన్ని చేరువ చేసేదే. అష్టాంగయోగంలో ప్రతి అంగమూ, అంగంలోని ప్రతి అంశమూ చిట్టచివరి అంకమైన సమాధి స్థితిని సిద్ధింపజేసే ప్రయత్నంలో అవసరమైందే. అనుకూలించేదే. యమనియమ అంగాలను సాధన చేశాక తదుపరి అంగం ఆసనం. మృగచర్మం, దర్భచాప, వస్త్రం లాంటివి ఏర్పరచుకున్న తరవాత సాధకుడి ఆసన భంగిమ, ఆసన స్థితి మరింత ముఖ్యమైనవి.

విషయం ఏదైనా ప్రతి పనికి, ప్రతి సాధనకు ఒక భంగిమ అవసరమవుతుంది. అలాగే ధ్యానసాధనకూ. నిజానికి కొన్ని భంగిమలే మనం ఎన్నుకున్న అంశానికి తగిన అనుకూలతను, అవగాహనను కలిగిస్తాయి. అసలు అలా సహకరించే భంగిమల్నే మనం ఎన్నుకోవాలి. మన ధ్యానసాధనకు అత్యంత ఉపయుక్తమైనది పద్మాసనం. వెన్నుపూస నిటారుగా నిలిపేందుకైనా, అలా నిలబెట్టిన మేరుదండం (వెన్నుపూస) ఎక్కువసేపు నిలిచేందుకైనా ఈ ఆసనం తగినది.

భుజాలను పక్కలకు విరిచి, వదులుగా వదిలేసి, ఛాతీని విస్తరించి ముందుకు పొంగించి, అదే సమయంలో శరీరాన్ని వదులుగా, భారరహితంగా వదిలేసి, శరీరస్పృహను పూర్తిగా విస్మరించే ప్రయత్నానికి పద్మాసనం అన్నివిధాలా అనుకూలమైనది. కుడికాలును ఎడమ తొడమీద, ఎడమ కాలును కుడితొడమీద ఉంచుకుని అరచేతులను కలిపి ఒళ్లో పెట్టుకున్న ఆ భంగిమ సాధకుడి చుట్టూ ఒక ఆధ్యాత్మిక వలయాన్ని నిర్మించినట్లుగా ఉంటుంది. దుష్టశక్తుల్ని ప్రవేశించనివ్వని రక్షణవలయం అది. సాధకుణ్ని శక్తిసమన్వితం చేసే శక్తిమంతమైన ఆరా అది. ఆధ్యాత్మిక భావజాలానికి, సాధనల సంకలనానికి పరిమితమై ఉన్న ఆ స్వయం నిర్మిత వలయం సాధకుడి ధ్యాన సాధనకు ఒక కవచంలా పనిచేస్తుంది.

సాధనతో పరిణతి పెరిగేకొద్దీ అంతరిక్షం నుంచి పొందే చైతన్య కిరణాలను, చిత్‌శక్తి తరంగాలను మన వెన్నుపూసలోని చక్రాలే స్వీకరించి నిక్షిప్తం చేస్తాయంటారు. కుండలినీ శక్తి చలనంలో, ఊర్ధ్వగతి చోదకంలో యాంటెనాలా పనిచేసే వెన్నుపూస నిటారుగా లేకపోతే దివ్యచైతన్య తరంగాలను ఆకర్షించటంలో అది విఫలమవుతుంది. వెన్నుపూస అలా నిలబడాలంటే పద్మాసనాన్ని మించిన ఆసనం లేదు. వజ్రాసనం, సిద్ధాసనం కొంతమేరకు అలా పని చేసినా అవికూడా పద్మాసనం తరవాతివే. అందువల్లే సాధన ప్రారంభదశ నుంచే గురువులు తమ శిష్యులకు పద్మాసనంతోనే శిక్షణ మొదలు పెడతారు. తదనంతర కాలంలో వయోభారంవల్లో, అనారోగ్యంవల్లో, ధ్యానపారవశ్యంలోనో ఆసనాలు, భంగిమలు మారిపోయినా సాధకుడు ఒక స్థాయి వచ్చేవరకు పద్మాసనాన్ని అనుసరించక తప్పదు.

అంతర్యామి

ఆలయాల్లో చిత్రపటాల్లో దేవతల విగ్రహాలు చతుర్భుజులైనా, అష్టభుజులైనా ఆ భంగిమలు పిరమిడ్ ఆకారంలో ఒక వలయానికి లోబడినట్లుగా ఉంటాయి. ఆ విధానం అత్యున్నత స్థితికి, స్థాయికి సంకేతం. ఉత్కృష్టతకు పరాకాష్ఠ.

పద్మాసనంలోని శరీర భంగిమ, చేతుల అమరిక సహజంగానే సాధకుణ్ని ధ్యాన స్థితిలోకి తీసుకువెళతాయి. ఎక్కడా బిగువు ఏర్పడని దేహం, పూర్తిస్థాయిలో సడలించిఉన్న దేహం, దేహ స్పృహ నుంచి విడివడే దిశగా తనకు తాను సిద్ధమవుతుంది. కలిసిఉన్న హస్తాల్లోని సూక్ష్మనాడులు మెదడు ఎడమవైపున ఉండే ఆధ్యాత్మిక కేంద్రానికి అనుసంధానమై లౌకిక స్పృహనుంచి విడివడేలా చేస్తాయి. సహజంగానే ఖేచరీ ముద్ర ఏర్పడే అవకాశమూ ఉంటుంది. నిజానికి ఇదంతా పద్మాసనాన్ని వేసినంత మాత్రాన జరిగేపని కాదు. ఎంతో సాధన కావాలి. అది ఎన్ని సంవత్సరాలో ఎవరూ చెప్పలేరు. అది మన ఆర్తి మీదా, భగవంతుడి అనుగ్రహం మీదా ఆధారపడి ఉంటుంది. కాకపోతే స్థిర మానసంతో పనిచేసే సాధనలో మొదటి అడుగు ఆసనమే. అది పద్మాసనమే అయిఉండాలి. పద్మాసనాన్ని సాధనచేసి సాధనకు ఉపకరణగా మనం ఎంచుకుంటే మాయా తివాచీలా అది మనల్ని పరంధామానికి చేర్చే అవకాశం ఉంది!

– చక్కిలం విజయలక్ష్మి

చచ్చి.. మళ్లీ బతుకుతారా!

- భవిష్యత్తులో వైద్య విజ్ఞానం సాధ్యం చేస్తుందనే విశ్వాసం
- మృతదేహం అతి శీతలీకరణకు క్యూ కడుతున్న జనం
- ఇదే వ్యాపారంగా పుట్టుకొస్తున్న కంపెనీలు

జాతస్య మరణం ధ్రువం(పుట్టిన వాడు మరణించక తప్పదు). ఇది జగమెరిగిన సత్యం. కానీ తమకు చావులేదని నమ్మేవారికి ఈ ప్రపంచంలో కొదవలేదు. ఒకవేళ మరణించినా మళ్లీ బతికొస్తామని విశ్వసించేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది!! అందుకే ప్రాణం పోయిన శరీరాన్ని పదిలంగా భద్రపరచుకుంటున్నారు!! ఇలా భద్రపరచడం కోసమే ప్రపంచంలో కొన్ని కంపెనీలు పుట్టుకొస్తున్నాయి. కాల్పనిక సాహిత్యాలు, సైన్స్ ఫిక్షన్‌లలో వినిపించే ఇలాంటి మాటలకు వాస్తవరూపం ఇచ్చే ప్రయత్నాన్ని ఈ కంపెనీలు చేస్తున్నాయి. మృతదేహాన్ని అతి శీతలీకరించడం ద్వారా.. భవిష్యత్తులో వైద్య రంగంలో చోటుచేసుకోబోయే విప్లవాల సాయంతో మనిషిని తిరిగి బతికించొచ్చు అనే సూత్రం ఆధారంగా ఇవి పనిచేస్తున్నాయి. ప్రస్తుతానికైతే ఈ సూత్రం విశ్వసనీయతకు శాస్త్ర విజ్ఞానం చాలా దూరంగా ఉంది. కానీ మళ్లీ బతకడంపై నమ్మకం ఉన్న దాదాపు 350 మంది మృతదేహాల్ని ఇప్పటికే ఇలా అతి శీతలీకరణ(ఫ్రోజెన్) చేస్తున్నారు. మరణించాక తమ శరీరాల్ని కూడా శీతలీకరించాలంటూ మరో 3 వేల మంది కంపెనీల దగ్గర పేర్లు నమోదుచేసుకున్నారు. రాబోయే వందేళ్లు లేదా వెయ్యేళ్లయినా తిరిగి తమను బతికించే స్థాయికి వైద్య విజ్ఞానం ఎదుగుతుందన్న ఆశే వారి చేత ఈ పనిచేయిస్తోంది.

ఏమిటా కంపెనీలు

మృతదేహాల్ని శీతలీకరించే పనిలో ప్రపంచంలో ప్రస్తుతం 3 కంపెనీలు క్రియాశీలంగా ఉన్నాయి. అవి...

1. క్రయోనిక్స్ ఇన్‌స్టిట్యూట్(సీఐ)
2. అల్కార్ ఫౌండేషన్
3. క్రియోరస్

ప్రపంచంలో ఎవరు ఈ కంపెనీల్ని సంప్రదించి.. భవిష్యత్తులో తమ మృతదేహాల్ని అతి శీతలీకరణ స్థితిలో ఉంచాలని కోరినా.. అవి వెంటనే భారీ మొత్తాల్ని వసూలుచేసి పేర్లు నమోదుచేసుకుంటున్నాయి. కంపెనీల నిల్వ ప్రదేశాలకు మృతదేహాల్ని తరలించడం, అతి శీతలీకరణ నిర్వహణ పనుల్ని మరికొన్ని సంస్థలు చూస్తున్నాయి.



ఇది నిజం

అతి శీతలీకరణ ద్వారా ఒక మృత దేహాన్ని ఎన్ని రోజులైనా పాడవకుండా భద్రంగా ఉంచొచ్చు.

ఇది ఊహ

భవిష్యత్తులో... మానవ శరీరానికి కలిగే ఎలాంటి నష్టాల్ని అయినా బాగుచేసే స్థాయికి వైద్య విజ్ఞానం ఎదుగుతుంది. శీతలీకరణ సందర్భంగా కణజాలానికి నష్టం కలిగినా.. వృద్ధాప్యం లేదా ఇతర రత్రా కారణాల వల్ల మరణం సంభవించినా శాస్త్రవిజ్ఞానం మళ్లీ బతికిస్తుంది.



ఎలా మొదలైంది?

భౌతికశాస్త్ర బోధకుడు, రచయిత రాబర్ట్ ఎట్టింగర్ 1964లో శీతలీకరణ(క్రయోనిక్స్)పై 62 పేజీల మేనిఫెస్టోను వెలువరించారు. అమరత్వం అవకాశాల గురించి అందులో చర్చించారు. ఆ మేనిఫెస్టో ఇప్పుడు 200 పేజీలకు పెరిగింది. శాస్త్ర విజ్ఞానం, నైతికత, ఆర్థికాంశాలు, అతి శీతలీకరణ అంశాల్ని ఇది చర్చిస్తుంది. ఈ అంశాల ప్రాతిపదికగా మృతదేహాల శీతలీకరణ ప్రక్రియ 1980లలో పురుడు పోసుకుంది. 1990 నాటికి కనీసం 10 మృతదేహాల్ని ఇలా భద్రపరిచారు. 2010 నాటికి 200 ఉన్న ఈ సంఖ్య ప్రస్తుతం 350కి చేరుకుంది. రాబర్ట్ ఎట్టింగర్ తన తల్లి, ఇద్దరు భార్యల్ని 2011 నుంచి క్రయోనిక్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇలా అతి శీతలీకరణలో ఉంచారు.

ఎలా చేస్తారు?

1 ఒక వ్యక్తి చనిపోయిన వెంటనే మృతదేహాన్ని మంచు ముక్కల మధ్య ఉంచి శీతలీకరణ ప్రాంతానికి తరలిస్తారు.



2 నిల్వ ప్రాంతంలోకి మృతదేహం రాగానే.. శరీరంలోని రక్తాన్ని పూర్తిగా తొలగిస్తారు. శరీరం గడ్డకట్టి పోకుండా ఉండటం కోసం కొన్ని ద్రావకాల్ని ధమనుల్లోకి పంపిస్తారు. పుర్రెకు చిన్నచిన్న రంధ్రాలు చేస్తారు.



3 నిద్రకు పనికి వచ్చే ఒక సంచీలో శరీరాన్ని ఉంచి.. ద్రవపూరిత నైట్రోజన్‌లో ముంచుతారు. ఆ తర్వాత దానిని మైనస్ 196 డిగ్రీల సెంటీగ్రేడ్(మైనస్ 321 డిగ్రీల ఫారెన్‌హీట్) దాకా చల్లబరుస్తారు.

ఖర్చు తడిసి మోపెడు

మృతదేహాన్ని సుదీర్ఘకాలం భద్రపరచడం చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఒక్కో ద్రవరూప నైట్రోజన్ సిలిండర్ ఖరీదు కంపెనీని బట్టి రూ.2 లక్షల నుంచి(30వేల డాలర్లు) రూ.1.34 కోట్ల(2 లక్షల డాలర్లు)దాకా ఉంటోంది. అంత ఖరీదైన డబ్బాలో మృతదేహాన్ని భద్రపరచాల్సి ఉంటుంది.

మళ్లీ బతికొస్తామన్న ఆశ ఎందుకు పుట్టింది?

మరణించిన మనిషి తిరిగి బతికొస్తాడని నమ్మేవారు దానికి బలమైన ఉదాహరణల్నే చూపుతున్నారు. ఆర్కిటిక్ ప్రాంతంలో నివసించే పలు చిన్న జంతువులు తమ శరీరాల్ని అతి శీతలీకరణ స్థితిలోకి తీసుకెళ్లి.. వాతావరణం మారిపోయిన తర్వాత- అవి సుసుప్తావస్థ నుంచి తిరిగి బయటికి వస్తున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. **ఆ జంతువులు...**

ఆర్కిటిక్ ఉడతలు ● కొన్ని రకాల తాబేళ్లు ● చిమ్మటలు ● నీటి ఎలుగుబంట్లు

మళ్లీ బతకడం సాధ్యమేనా?

భవిష్యత్ వైద్యం మనిషిని మళ్లీ బతికిస్తుందని ఎలాంటి గ్యారంటీ లేదు. అంతేకాదు.. అత్యంత శీతలీకరణ విధానం మనిషి శరీరాన్ని చెడిపోకుండా పూర్తి భద్రంగా ఉంచుతుందన్న హామీలు కూడా ఇప్పటివరకు లేవు. అతి శీతలీకరించిన కణజాలం గుజ్జులాగా మారిపోయిన ఉదంతాలూ కొన్ని ఉన్నాయి. ఒకవేళ మృతదేహాన్ని జాగ్రత్తగా భద్రపరిచినా.. అతి శీతలీకరణకు గురైన శరీరం తిరిగి పూర్వస్థితిలోకి ప్రాణం పోసుకుని మునుపటిలాగానే పనిచేస్తుందన్న భరోసా ఎంతమాత్రం లేదు. తథ్యమైన చావుకు, మరో జన్మ వస్తుందన్న విశ్వాసానికి మధ్య సాగుతున్న ఈ వ్యాపారం మాత్రం నానాటికీ వర్ధిల్లుతోంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు.. ఎన్సీసీ కోటా కింద 1,193 మంది హాజరు

- ప్రారంభమైన క్రీడా కోటా అభ్యర్థుల పత్రాల పరిశీలన

నూజివీడు, న్యూస్‌టుడే: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల ప్రవేశాలకు ప్రత్యేక విభాగాల పత్రాల పరిశీలన కార్యక్రమం నూజివీడు ప్రాంగణంలో కొనసాగుతోంది. సోమవారం ఎన్సీసీ కోటా అభ్యర్థుల పత్రాల పరిశీలన పూర్తయింది. నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మొత్తం 1,600 మంది అభ్యర్థులకు గాను 1,193 మంది హాజరయ్యారు. సోమవారమే క్రీడా కోటా అభ్యర్థుల పత్రాల పరిశీలన సైతం ప్రారంభమైంది. 0.5 శాతం చొప్పున 20 మంది అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. 341 మందిని పిలవగా 330 మంది హాజరయ్యారు. వీరి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పత్రాలు పరిశీలించారు. ఈ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. మంగళవారమూ క్రీడా కోటా, దివ్యాంగులు, సైనిక సంతతి కోటా అభ్యర్థుల పత్రాల పరిశీలన కార్యక్రమం ఉంటుందని ఆర్జీయూకేటీ ప్రవేశాల కమిటీ సభ్యుడు ఆచార్య హనుమంతరావు, సహాయ రిజిస్ట్రార్ అర్జునరావు తెలిపారు.

నేటి నుంచి 5 రోజుల పాటు కవచ రహితంగా ఉత్సవమూర్తుల దర్శనం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి మంగళవారం(నేటి) నుంచి ఈనెల 23 వరకు భక్తులకు కవచ రహితంగా దర్శనం ఇవ్వనున్నారు. 24 నుంచి 26 వరకు శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం జరగనుంది. మంగళవారం మధ్యాహ్నం రెండో నైవేద్య ఘంట తర్వాత రంగనాయకుల మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు బంగారు కవచాలను తొలగించనున్నారు. ఏడాది పొడవునా అభిషేకాది క్రతువుల కారణంగా ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు కవచాలను తొలగించి శుద్ధిచేయడం, మెరుగు పెట్టడం ఆనవాయితీ. జ్యేష్ఠాభిషేకంలో భాగంగా మొదటి రోజు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వజ్రకవచం, రెండో రోజు ముత్యాల కవచం, మూడో రోజు తిరిగి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగిస్తారు. అప్పటి నుంచి ఏడాది పొడవునా ఈ కవచంతోనే దర్శనమిస్తారు. జ్యేష్ఠాభిషేకం కారణంగా శ్రీవారి ఆలయంలో 24న వసంతోత్సవం, 25న విశేషపూజ, వసంతోత్సవం, 26న అష్టదళ పాదపద్మారాధన సేవ, కల్యాణోత్సవం, ఊంజలసేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం సేవలను తితిదే రద్దుచేసింది.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మోదీ ఎడమ చేయి ఇస్తేనే సంతోషమా?

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నగరంపాలెం(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రధాని మోదీ ఎడమ చేయి ఇస్తేనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఒళ్లు తెలియని సంతోషాన్ని వ్యక్తం చేశారని, కుడి చేయి ఇస్తే ఆయన దిల్లీ వదిలి వచ్చేవారు కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఎద్దేవా చేశారు. గుంటూరులో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన సామూహిక ఇళ్ల దరఖాస్తుల సమర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నీతి ఆయోగ్ సమావేశానికి వెళితే భూమి కంపించిపోతుందని, మోదీని ఎండగడతారని తెలుగు తమ్ముళ్లు ఎంతో పొంగిపోయారని, కానీ దిల్లీలో కథ పూర్తిగా అడ్డం తిరిగిందన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు దెబ్బ తీశారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పోలవరానికి రూ.5 వేల కోట్లు, అమరావతికి రూ.2 వేల కోట్లు ఇస్తే దిల్లీ వదిలి రారని తెలిపారు. భాజపా ప్రభుత్వానికి లొంగిపోయి లాలూచీ రాజకీయాలు చేస్తున్నారని, ఆయన అలాంటి రాజకీయలు మానుకోవాలని హితవు పలికారు.

13 మందికి నాన్‌క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని 13 మంది అదనపు ఎస్పీలకు రాష్ట్ర ప్రభుత్వం నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి కల్పించడంతో పాటు ఆ హోదాలో పోస్టింగులు ఇచ్చింది. ఏ.ఆర్.దామోదర్ (అదనపు ఎస్పీ, పరిపాలన, తూర్పుగోదావరి), వి.హర్ష వర్ధన్‌రాజు (ఆర్‌వీఈవో), ఎల్.సుబ్బరాయుడు (అదనపు ఎస్పీ, నిఘా విభాగం), డి.నరసింహ కిషోర్ (అదనపు ఎస్పీ, నిఘా విభాగం), వై.రవిశంకర్ రెడ్డి (అదనపు ఎస్పీ ఆపరేషన్స్, తూర్పుగోదావరి), ఆర్.గంగాధర్‌రావు (ఆర్‌వీఈవో), టి.శ్రీనివాసరావు (అదనపు ఎస్పీ ఇంటెలిజెన్స్), వి.గీతాదేవి (అదనపు ఎస్పీ, ఇంటెలిజెన్స్), డి.మేరీ ప్రశాంతి (అదనపు ఎస్పీ, సీఐడీ), జీ.ఆర్.రాధిక (అదనపు ఎస్పీ పరిపాలన, చిత్తూరు), టి.రామప్రసాద్‌రావు (అదనపు డీసీపీ, ట్రాఫిక్, విజయవాడ), వి.రత్న (అదనపు ఎస్పీ, పరిపాలన, పశ్చిమగోదావరి), ఎస్ఎం రత్న (సీఐడీ)లు పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు. వీరిలో ఏఆర్.దామోదర్ విశాఖపట్నం నేరాల విభాగం డీసీపీగా, వి.రత్న సీఐడీలో నాన్ క్యాడర్ ఎస్పీగా, ఎస్.ఎం.రత్న ఏపీ జెన్‌కోలో ముఖ్య విజిలెన్స్ అండ్ భద్రతాధికారిగా నియమితులయ్యారు. మిగతా పది మంది మాత్రం ప్రస్తుతం వారు పనిచేస్తున్న స్థానాల్లోనే నాన్ క్యాడర్ ఎస్పీ హోదాలోనే పోస్టింగులు పొందారు. ఇప్పటి వరకూ విశాఖపట్నం నేరాల విభాగం డీసీపీగా ఉన్న ఐపీఎస్ అధికారిణి షిమూషిను ఆ స్థానం నుంచి బదిలీ చేశారు. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏ.ఆర్.అనూరాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీ క్యాడర్‌కు ఐపీఎస్ అధికారి

ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన 2015 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాహుల్ దేవ్ సింగ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు బదిలీ అయ్యారు. వివాహానికి సంబంధించిన కారాణాల రీత్యా ఆయన్ను ఏపీ క్యాడర్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు ఇన్‌ఛార్జీ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా కె.బేతపూడిలో స్థానికులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఫుడ్‌పార్క్ సమస్య పరిష్కారానికి కృషి

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

నరసాపురం, న్యూస్‌టుడే, అమలాపురం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రులో నిర్మిస్తున్న ఆక్వా మెగాఫుడ్ పార్కు విషయంలో స్థానికులు, యజమాన్యం మధ్య నెలకొన్న వివాద పరిష్కారానికి సంధానకర్తగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లా కె.బేతపూడిలో స్థానికులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, రైతులు మాట్లాడుతూ.. ఆక్వాఫుడ్ పార్కును వ్యతిరేకిస్తూ మూడేళ్లుగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతుండగా ప్రభుత్వం, ఫుడ్‌పార్కు యాజమాన్యం.. అక్రమ కేసులు బనాయిస్తున్నాయని ఆరోపించారు. దీంతో లక్ష్మీనారాయణ ఆక్వా ఫుడ్ పార్కు లోపలకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్కు యాజమాన్యాన్ని, స్థానికులను ఒకే వేదికపై తీసుకువచ్చి వారితో చర్చించి సామరస్యపూర్వక వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయదారుల సమస్యలకు సంబంధించిన జవాబుదారీతనం రాష్ట్ర ప్రభుత్వానిదేనని లక్ష్మీనారాయణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం బెండమూర్లంకలో సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రాష్ట్ర రైతు ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ హాజరయ్యారు.

తెలుగు సంఘాల మెడకు కిషన్ ఉచ్చు

- ఒకరు చేసిన పనికి మరొకరికి చిక్కు

ఈనాడు – హైదరాబాద్

ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్లు చికాగో కేంద్రంగా కిషన్ దంపతులు సాగించిన వ్యభిచార బాగోతం ఇప్పుడు అమెరికాలోని తెలుగు సంఘాల మెడకు చుట్టుకుంది. కొద్దిరోజులుగా ఎఫ్.బి.ఐ. ఏజెంట్లు ఆ సంఘాల ప్రతినిధులను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏటా నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యకలాపాలకు తెలుగు సినీపరిశ్రమ నుంచి నటులను రప్పించడం మామూలే. తాజా ఉదంతం నేపథ్యంలో అమెరికా పోలీసులు భూతద్దంతో చూస్తుండటం కలవరపాటుకు గురిచేస్తోంది. తెలుగు నటీమణులను రప్పించి వారితో అమెరికాలో వ్యభిచారం రాకెట్ నడుపుతున్న మోదుగుమూడి కిషన్ దంపతుల వ్యవహారాన్ని హోంల్యాండ్ సెక్యూరిటీ ఇన్వెస్టిగేషన్స్ ప్రత్యేక ఏజెంట్ బ్రియాన్ గిల్ బట్టబయలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికా వీసా కావాలంటే బలమైన కారణం చెప్పాలి. అందుకే వివిధ తెలుగు సంఘాలు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు వారిని ఆహ్వానిస్తున్నట్లు కిషన్ దంపతులు పత్రాలు పుట్టించారు. ఇతని ఇంట్లో సోదాలు నిర్వహించినప్పుడు ఇలాంటి పత్రాలే దొరికాయి. అలానే ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు నటీమణులు కూడా తెలుగు సంఘాల ఆహ్వానం మేరకే వీసాలు పొందారు. వారు వీసాలు పొందే సమయంలో అమెరికా కాన్సులేట్ కార్యాలయానికి తెలుగు సంఘాల నుంచి అందిన ఆహ్వాన లేఖలే సమర్పించారు. ఈలేఖలు నకిలీవేనని అమెరికా పోలీసుల దర్యాప్తులో తేలింది. వీసా పొందేందుకు తప్పుడు పత్రాలు సృష్టించడాన్ని అక్కడి పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. కొద్దిరోజులుగా వరుసపెట్టి తెలుగు సంఘాల ప్రతినిధులకు ఫోన్లు చేస్తూ, వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు నటీమణులను ఆహ్వానిస్తున్నదీ, లేనిదీ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. తాము నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు నటీమణులను తెప్పించేది నిజమేనని, అంతకుమించి వారి వ్యక్తిగత వ్యవహారాలతో తమకు సంబంధం లేదని ఆయా సంఘాల ప్రతినిధులు చెబుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ అమెరికా పోలీసులు వదలడంలేదని, సంఘాల్లో ఉన్న వివిధ ప్రతినిధులను మార్చిమార్చి ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఒకప్పుడు ఒకటి రెండు సంఘాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఇంచుమించు అమెరికాలోని ప్రతి రాష్ట్రానికి ఒక తెలుగు సంఘం ఉందని, తరచుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ వివిధ రంగాలకు చెందిన అతిథులను ఆహ్వానిస్తున్నారు. ఈ సంఘాలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఎవరో చేసిన తప్పునకు బోనులో నిలబడాల్సిన పరిస్థితి దాపురించింది.

మోదుగుమూడి కిషన్

వీసాల నిరాకరణ!: పరిస్థితి ఎంతవరకూ వచ్చిందంటే త్వరలో ఒక ప్రముఖ తెలుగు సంఘం నిర్వహించబోయే సాంస్కృతిక కార్యక్రమాలకు వచ్చేందుకు తెలుగు సినీతారలు పలువురు వీసాలకు దరఖాస్తు చేసుకోగా అమెరికా ప్రభుత్వం నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ సంఘటన తెలుగు సంఘాలను కుదిపేస్తోంది. త్వరలో నిర్వహించబోయే కార్యక్రమం పరిస్థితి ఏమిటో అర్థంకాక సదరు సంఘం ప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు.

2023 నాటికి 200 నౌకలతో గస్తీ

- ఐసీజీ అదనపు డైరెక్టర్ జనరల్ వి.ఎస్.ఆర్.మూర్తి
- 'రాణి రాష్మోణి' నౌక ప్రారంభం

రాణిరష్మోణి తీరగస్తీ నౌక, అంతర చిత్రంలో షిప్‌యార్డ్ సీఎండీ శరత్‌బాబుకు జ్ఞాపికను బహూకరించిన తీరగస్తీదళ ఏడీజీ వి.ఎస్.ఆర్.మూర్తి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: భారతీయ తీరగస్తీ దళ సేవలను 2023 నాటికి 200 నౌకలతో శక్తివంతం చేయనున్నామని ఐసీజీ అదనపు డైరెక్టర్ జనరల్ వి.ఎస్.ఆర్.మూర్తి పేర్కొన్నారు. సోమవారం విశాఖపట్నం కోస్టుగార్డు జెట్టీ వద్ద విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డు నిర్మించిన 'రాణి రాష్మోణి' నౌకను ఆయన ప్రారంభించారు. నౌక 51మీటర్ల పొడవుతో 34నాటికళ్ల వేగంతో సాగర జలాల్లో దూసుకుపోతుందన్నారు. తీరగస్తీ దళానికి ప్రస్తుతం 136 నౌకలు ఉండగా వీటిని 200లకు, 62 ఎయిర్‌క్రాఫ్ట్‌ను భవిష్యత్తులో వందకు పెంచేందుకు సన్నాహాలు చేపడుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ తీరరక్షక దళానికి మరో ఐదు నౌకలను దశలవారీగా కేటాయిస్తామన్నారు. విశాఖలో ఎయిర్ ఎన్‌క్లేవ్ నిర్మించే ప్రతిపాదన ఉందన్నారు. తీరరక్షక దళం, నౌకాదళం సంయుక్తంగా కాకినాడలో జెట్టీని నిర్మించేందుకు ప్రయత్నాలు ప్రారంభించామన్నారు. ఏపీలో ఆరు రాడార్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కోస్టుగార్డు ఏడీజీ నౌతియాల్, ఐజీ రాజన్‌బర్గోత్రా, డీఐజీ నవదీప్‌రాజ్, షిప్‌యార్డు సీఎండీ రియర్ అడ్మిరల్ ఎల్వీ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు ప్రత్యేక కార్యక్రమం

- 20 నుంచి ప్రతి గ్రామంలోనూ గ్రామసభ నిర్వహణ
- రెవెన్యూ అధికారుల నేతృత్వంలో బృందాలు ఏర్పాటు
- ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో చుక్కల భూములు, నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్య పరిష్కారం కోసం జూన్ 20 నుంచి జులై 5 వరకు రాష్ట్రంలో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి బాధితులు ఆధారాలు చూపిస్తే తక్షణం చర్యలు తీసుకునేలా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకోసం బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అవసరమైన దస్త్రాలతో గ్రామసభలకు రావాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. నిషేధిత భూముల జాబితాలను ఆయా పంచాయతీల్లో ప్రచురించారన్నారు. గ్రామసభల్లో గ్రామాల రెవెన్యూ పటాలు, ఆర్ఎస్ఆర్, అడంగల్, 1 బీ కాపీలు రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. దేవదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి వచ్చిన అర్జీలు ఆయా శాఖల వద్ద సమాచారంతో సరి పోల్చి చూస్తారన్నారు. ఈ గ్రామసభల అనంతరం తుది జాబితాను జిల్లా రిజిస్ట్రార్‌కు అందించే ఏర్పాటు చేస్తున్నామని, గ్రామ అడంగల్‌ను సయితం నవీకరిస్తామన్నారు. ఉత్తరాంధ్ర, పశ్చిమగోదావరి మినహా మిగిలిన 9 జిల్లాల్లో 24.17లక్షల ఎకరాల్లో చుక్కల భూమి ఉందని మంత్రి చెప్పారు.

నాకే ఫోను చేయండి: ఈ కార్యక్రమం కోసం 99898 44545, 08632442600 ఫోను నెంబర్లను ఇస్తున్నామని, ఫిర్యాదులను ఈ నెంబర్లకు తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఆ రెండు నెంబర్లలో ఒకటి తన ఫోను నెంబరే అని మంత్రి పేర్కొన్నారు.

డీజిల్ ధర పెంపును నిరసిస్తూ నిరవధిక సమ్మె

దిల్లీ, కోల్‌కతా: డీజిల్ ధర పెంపును నిరసిస్తూ అఖిల భారత రవాణా వాహనాల యజమానుల సంఘానికి(ఏఐఎంటీసీ) ఏసీ ఓజీఓఏ) చెందిన కొందరు సభ్యులు సోమవారం నిరవధిక సమ్మెకు దిగారు. ఫలితంగా పశ్చిమబెంగాల్‌లో 80శాతం వాహనాలు తిరగడం లేదు. కర్ణాటకలో సైతం సమ్మెప్రభావం కనిపిస్తోంది. సమ్మెలో సుమారు 40లక్షల రవాణా వాహనాలు ముఖ్యంగా ట్రక్కులు పాల్గొంటున్నాయని ఏసీఓజీఓఏ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.భాసిన్ తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో నిత్యావసర సరుకుల రవాణాకు మాత్రం మినహాయింపు ఇచ్చామన్నారు. సమ్మె విఫలం కావడం ఖాయమని అఖిలభారత మోటారు రవాణా సమావేశం ఛైర్మన్ బాల్ మల్కిత్‌సింగ్ అన్నారు.

తూకాల్లో తరుగుదల బట్టబయలు

- పౌరసరఫరాల శాఖ మంత్రి పుల్లారావు ఆకస్మిక తనిఖీ
- వేబ్రిడ్జిల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడి

గొల్లపూడి, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలకు సరఫరా చేసే సరకుల తూకాలు సరిగా ఉండటం లేదంటూ డీలర్ల నుంచి వస్తున్న ఆరోపణలు బట్టబయలయ్యాయి. 'తూకాల్లో తన్నుకుపోతున్నారు' అనే శీర్షికన 'ఈనాడు' ప్రధాన సంచికలో సోమవారం (18న) ప్రచురితమైన కథనానికి పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్పందించారు. గొల్లపూడిలో గల పౌరసరఫరాల శాఖ గోదాము నుంచి విజయవాడ నగరం, చుట్టుపక్కల కొన్ని మండలాల్లోని రేషన్ దుకాణాలకు సరకు సరఫరా చేసే ఎంఎల్ఎస్ పాయింట్‌ను సోమవారం ఉదయం తనిఖీ చేశారు. లారీ ఎక్కి జీపీఎస్ పరికరాన్ని పరిశీలించారు. పంచదార, బియ్యం, కందిపప్పు తూకంలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. కందిపప్పు బస్తాకు కిలో, పంచదార 200 గ్రాములు, బియ్యం సంచితో కలిపి 50 కేజీలు వస్తున్నట్లు వెల్లడించారు. గోదాముల్లోనే సరైన తూకాలు లేకపోతే డీలర్లకు ఏ విధంగా పంపిస్తారని ప్రశ్నించారు. ఇకపై గోదాములతో సహా అన్ని స్టేజీల్లోనూ తూకాలు సరిగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. గోదాముల వద్ద ప్రస్తుతం తూకం వేయడానికి మూడు టన్నుల కాటాలు ఉన్నాయని, వాటి స్థానంలో వేబ్రిడ్జిలను ఏర్పాటు చేయాలనుకుంటున్నామన్నారు. ప్రతి వాహనానికీ జీపీఎస్ ఉండేలా చూస్తామన్నారు. కార్డుదారుల్లో 95 శాతం సంతృప్తి కలిగించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని, ఆ దిశగా కృషి చేస్తామన్నారు. డీలర్లు చేసే ఆరోపణలను సరిదిద్దే బాధ్యత తమపై ఉందని, వారు కూడా సరిగా సేవలందించాలని కోరారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రవిబాబు మాట్లాడుతూ తూకాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 242 ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వేబ్రిడ్జిలను ఏర్పాటు చేస్తామని, ఒక్కో వేబ్రిడ్జి ఏర్పాటుకు రూ.8 నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వెల్లడించారు. పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గోదాములో తూకాలను పరిశీలిస్తున్న మంత్రి పుల్లారావు

అనర్హత ఎమ్మెల్యేలు వస్తే స్వాగతిస్తాం..

- మంత్రి పదవులు సాధ్యం కాదు: పళనిస్వామి

ఈనాడు డిజిటల్, చెన్నై: ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తొలిసారి అనర్హత వేటుపడిన 18 మంది ఎమ్మెల్యేల విషయంపై స్పందించారు. రెండు రోజుల దిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన ఆయన సోమవారం తిరుచ్చిలో మీడియాతో మాట్లాడారు. టీటీవీ దినకరన్ మద్దతుదారులు, అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలు తిరిగొస్తే పార్టీకి అదనపు బలం అవుతుందన్నారు. ఆ ఎమ్మెల్యేల గురించి మీడియా కథనాలను చూశానని, తంగతమిళసెల్వన్, ఇతర అనర్హత ఎమ్మెల్యేలు పార్టీలోకి తిరిగొస్తామంటే తప్పక స్వాగతిస్తామన్నారు. వారికి మంత్రి పదవులివ్వటం మాత్రం సాధ్యం కాదన్నారు. ఈ నెల 14న అనర్హత ఎమ్మెల్యేల వ్యవహారంలో వెలువడిన అస్పష్ట తీర్పుతో మద్రాసు హైకోర్టు.. మూడో న్యాయమూర్తికి విచారణ బాధ్యతను అప్పగించాలని నిర్ణయించింది. నిరాశ చెందిన టీటీవీ దినకరన్ మద్దతుదారుడు, అనర్హత ఎమ్మెల్యేల్లో ఒకరైన తంగతమిళ్ సెల్వన్ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించారు. మరో నలుగురూ అదే బాటన ఉన్నట్లు సమాచారం.

రాష్ట్ర సమస్యల ప్రస్తావనలో సీఎం సఫలం

- ఎంపీ రవీంద్రకుమార్

కృష్ణలంక, న్యూస్‌టుడే: రాష్ట్ర సమస్యలన్నింటినీ నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సఫలీకృతమయ్యారని ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని పలకరింపునకు సంస్కారంగా మాత్రమే చంద్రబాబు ప్రతిస్పందించగా ప్రతిపక్షాలు దానిని కూడా రాజకీయం చేస్తుండడం విచారకరమని పేర్కొన్నారు. విజయసాయిరెడ్డిలా చంద్రబాబు పాదాభివందనం చేయలేదన్నారు. భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఏమాత్రం విజ్ఞత లేకుండా చంద్రబాబుపై ఇష్టానుసారం వ్యాఖ్యానించడం సరికాదని అన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగంలో తప్పులుంటే చర్చకు సిద్ధమని.. అంతేకాని వ్యక్తిగతంగా విమర్శలు చేయడం అర్థరహితమని పేర్కొన్నారు. గుజరాత్‌లో నిర్మిస్తున్న దొలేరా సిటీకి పెద్దమొత్తంలో నిధులు కేటాయించి, అమరావతి నిర్మాణానికి నిధులు నిలుపుదల చేసి కక్ష్యసాధింపు ధోరణిని అవలంబిస్తోందన్నారు.

EDUCATION
★ ADMISSIONS Ag. B.Sc, ICAR APPROVED@7.5L. ✆ 7083847452.

ఉద్యోగుల ముసుగులో రౌడీయిజం

- అశోక్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాం
- తెలంగాణ ప్రభుత్వ జోక్యంతోనే ఘటన!
- ఏపీ ఎన్జీవోల సంఘం ఆరోపణ

ఈనాడు డిజిటల్, అమరావతి: ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నామని, ఉద్యోగుల ముసుగులో రౌడీయిజం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఏపీ ఎన్జీవోల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిలో భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవోల సంఘం(బీటీఎన్జీవో) నాయకులతో పాటు సంబంధం లేని వ్యక్తులు ఉన్నారని ఆరోపించారు. ఏపీ ఎన్జీవోల సంఘం నాయకులపై తెలంగాణ ప్రభుత్వం, అక్కడి ఉద్యోగ సంఘాలు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తెలంగాణ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఏపీ ఉద్యోగులకు, ప్రజలకు భద్రత కరవైందని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరేందుకు తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌ను కలవనున్నట్లు తెలిపారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీ ఎన్జీవోల సంఘం నాయకులు విద్యాసాగర్ మాట్లాడుతూ... ఏపీఎన్జీవో హౌసింగ్ సొసైటీకి కేటాయించిన 200 ఎకరాల భూమిలో వాటా కావాలని బీటీఎన్జీవో నాయకులు కోరడం ఎంతవరకు సమంజసమన్నారు. దీన్ని ప్రశ్నించినందుకే తమ నాయకులపై దాడికి పాల్పడ్డారన్నారు. ఒంగోలు, విశాఖపట్నం జిల్లాల అధ్యక్షులు బండి శ్రీనివాస్, ఈశ్వరరావు మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులని చూడకుండా దాడి చేయడం హేయమన్నారు. ఫిర్యాదు చేస్తే స్థానిక పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఏపీ ఎన్జీవో హౌసింగ్ సొసైటీ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కోర్టు కేసులు వేస్తూ జాప్యం జరిగేలా చేస్తోందని మండిపడ్డారు.

కేసుల నమోదు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీఓ హోంలో జరిగిన ఘటనకు సంబంధించి ఇరువర్గాల నేతలపై అబిడ్స్ పోలీసుస్టేషన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి.

भारतीय खाद्य निगम
ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
ఫోన్ నెం.: 040–23422330
ఫ్యాక్స్: 040–23235033
ఇ-మెయిల్: srmap-fci@nic-in
ప్రాంతీయ కార్యాలయము, 3వ అంతస్తు, హాకా భవన్, పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్–500 004
No. S&C 13(46)/2018-20/BSC ZNPL/KRL/CONTS తేది. 18–6–2018
ఇ-టెండర్ల కొరకు ఆహ్వానం
ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయము, హైదరాబాద్ వారు ఇ-టెండరింగ్/ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా BSC పెన్నాడ వద్ద ITC కాంట్రాక్ట్, BSC జంగలపల్లి వద్ద H&IT మరియు FSD ఒంగోలు వద్ద H&T యొక్క నియామకం కొరకు టెండర్లను ఆహ్వానిస్తున్నారు; టెండరు డాక్యుమెంట్‌ను www.fci.gov.in & www.eprocure.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఔత్సాహిక టెండరుదారులు తమ టెండరు డాక్యుమెంట్లను (PDF ఫార్మేట్) www.eprocure.gov.in మీద మాత్రమే దాఖలు చేయవచ్చును. ఈ కార్యాలయము 25–6–2018న మ. 3.00 గం.లకు FCI, R.O., హైదరాబాద్ వద్ద ప్రీ-బిడ్ సమావేశాన్ని నిర్వహిస్తున్నది.
* గమనిక: GST రిజిస్టర్డ్ డీలర్లు మాత్రమే టెండరులో పాల్గొనవచ్చును.
సం/- జనరల్ మేనేజర్ (రీజియన్) తరపున

AP CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada – 520002 (A.P.)
File No. CRDA-13021(31)/63/2018-AEE/UT Dated : 18-06-2018
E-PROCUREMENT TENDER NOTICE
Name of work : "APCRDA - Providing Temporary Fitness Center (Phase-I) in Amaravati Capital City, Andhra Pradesh." Estimate Amount : Rs. 170.00 lakhs.
Bid Submission Closing Date & Time on 04-07-2018 at 3.30 P.M.
Further, details can be obtained from the e-procurement market place, apeprocurement.gov.in and also APCRDA website. Any details can be contacted 7995084149, Dy Executive Engineer, (USI&Infra-II), APCRDA.
Sd/-CE (USI &Infra-II), APCRDA

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
e- ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT. No. 4&5/ PLAN 2018-19/ VJA/CE (R&B)/ MOR/EE(R)/DEE4/AE2/2018. తేది. 13-6-2018
[illegible]
... www.tender.apeprocurement.gov.in ...
సం/- చీఫ్ ఇంజనీర్ (ఆర్ & బి), MDR
DIPR No. 794/CL/Advt/1/1/2018-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
ఎన్ నెం. 107 నుండి 111 ... తేది: 18–6–18
[illegible] ... రూ. 845.00 లక్షలు ... 21-6-2018 ... 6-7-2018 ... http://www.apeprocurement.gov.in/ ... ఫోన్ నెం. 94906 45581.
సం/- ఉప ప్రధాన ఇంజనీరు, గిరిజన సంక్షేమ సర్కిల్, విజయవాడ, ...
DIPR No. 798/CL/Advt/1/1/2018-19

ANDHRA PRADESH TOURISM DEVELOPMENT CORPORATION LIMITED
D.No.17-55-2 to 4, 5th Floor, Industrial Estate, Auto Nagar, Vijayawada-520 007.
APTDC invites RFPs from eligible Agencies for Operation and Maintenance of its (i) Beachside restaurants at (a) Kothakodur and (b) Ramatheertham in Nellore Dist., (ii) Riverside restaurants at (a) Pasarlapudi and (b) Adurru in E.G.District.
The prospective bidders can download and participate in the online bids at "https://tender.apeprocurement.gov.in"
Important Dates : Downloading of RFPs: 20.06.2018 (11 AM) to 18.07.2018 (Upto 2 PM), Prebid meeting : 02.07.2018 (At 3 PM), Submission of DDs/BGs (Originals) : 18.07.2018 (Upto 4 PM), Submission of Bids (Online): 18.07.2018 (Upto 4 PM), Opening of Bids (Online) : 18.07.2018 (4.30 PM).
Tender Reference No. 4/APTDC/2018-19, Dt.19.06.2018.
For further details : Ph: 0866-2552969 (Office), 9542008882 (Srinivas), Fax : 0866-2552964
Sd/- Managing Director

RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES
Andhra Pradesh
Flat Number 202, Second Floor, NRI Block (C), Sri Mahendra Enclave, Opp: SBI, Highway Towers Back Side, Tadepalli, Guntur District.
Online Tenders are invited from reputed registered agencies/contractors for selection of Agencies for providing the Security and House Keeping Services at IIIT-NUZVID, IIIT-Srikakulam of RGUKT.
Interested bidders can download and submit individual bids for each tender from dt 19/06/2018 to dt.28/06/2018 up to 05:00PM through https://tender.apeprocurement.gov.in (AP Portal). For further details please visit our website: www.rgukt.in and www.rguktn.ac.in or https://tender.apeprocurement.gov.in (Andhra Pradesh Portal)
Sd/-
Date: 18.06.2018 Coordinator Academic Administration (i/c)

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్
బిడ్స్ ఆహ్వాన ప్రకటన
1. APTRANSCO (ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్) దిగువ తెలిపిన ఎక్విప్‌మెంట్ సరఫరా కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై బిడ్స్‌ను కోరుతున్నది:

క్రమ సంఖ్య	స్పెసిఫికేషన్ నెం.	ఎక్విప్‌మెంట్ పేరు	పరిమాణము నెం.లలో	టెండరు లభించు తేది
1	PMM21-25/2018	100MVA, 220/132/11kV ఆటో ట్రాన్స్‌ఫార్మర్లు	లాట్-I-7 లాట్-II-6	18-6-2018
2	PMM21-26/2018	31.5MVA, 132/33kV పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	లాట్-I-13 లాట్-II-13	
3	PMM21-27/2018	50MVA, 132/33kV పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	లాట్-I-11 లాట్-II-11	
4	PMM21-28/2018	80MVA, 220/33kV పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	లాట్-I-11 లాట్-II-11	

2. ఆసక్తిగల బిడ్డర్లు తమ పేర్లను www.tender.apeprocurement.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు నమోదు చేసుకోవలెను.
3. బిడ్డింగ్ డాక్యుమెంట్ల పూర్తి సెట్ www.tender.apeprocurement.gov.in నందు లభిస్తుంది.
ఫోన్/ఫ్యాక్స్ నెం. 0866–2429230
ఎక్స్‌టెన్షన్: 2014;2034;2086;2041
Ro.No:18/18
సం/– చీఫ్ ఇంజనీర్/ట్రాన్స్‌మిషన్, విద్యుత్ సౌధ, విజయవాడ, ఆం.ప్ర.

THE e-PRAGATI AUTHORITY
3rd Floor, NTR Administrative Block, Pandit Nehru Bus Station, Vijayawada - 520 001, India.
Request for Proposal - Call Notice for
"Cloud and Infrastructure Services for hosting IT applications and services developed by e-Pragati Authority for Government of Andhra Pradesh"
Time schedule of Proposal related various events:

Description	Date and Time
Tender ID	199481
Release of Request for Proposal (RFP)	Saturday, June 16th, 2018 11:00 HRS
Last date for submission of online questions by bidders	Friday, June 22nd, 2018 11:00 HRS at procurement@e-pragati.in
Pre- Bid Conference	Wednesday, June 27th, 2018 11:00 HRS
Date of Issue of Clarifications	Monday, July 02nd, 2018 11:00 HRS
Last date for Submission of bids	Monday, July 09th, 2018 11:00 HRS
Pre-Qualification Evaluation	Monday, July 09th, 2018 12:00 HRS
Commercial Bid Opening	Friday, July 13th, 2018 11:00 HRS
RFP Document Cost	Rs. 2,00,000 (in words Two Lacs only)

For further details please visit http://www.e-pragati.in/Proposals.aspx
Chief Executive Officer, The e-Pragati Authority, GoAP, 3rd Floor, NTR Administrative Block, Pandit Nehru Bus Station, Vijayawada - 520 001, India.

జల గండానికిదీ చైనా మార్గం

- పచ్చని పందిళ్లుగా ఆకాశ హర్మ్యాలు
- హరితహారాలుగా షాంఘై సహా 30 నగరాలు
- 2030 నాటికి 80 శాతం నగరాలకు విస్తరణ లక్ష్యం
- ప్రపంచ నగరాలకు సరికొత్త దిశానిర్దేశం

ఈనాడు, హైదరాబాద్: వేసవి కాలం మరో రెండు మూడు నెలల్లో వస్తుందనగానే పలు నగరాల్లో నీటి ఇక్కట్లు మొదలవుతాయి. ఇలాంటి తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న దేశాల్లో చైనా కూడా ఒకటి. వేగంగా జరుగుతున్న పారిశ్రామికీకరణ, శరవేగంగా జరుగుతున్న పట్టణాభివృద్ధి.. దీనికితోడు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న వాతావరణ మార్పులతో నగరాలకు నీటి లభ్యత అతి పెద్ద సమస్యగా మారింది. తాగునీటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. నగరాల్లో వాననీరు భూమిలో ఇంకడం అతితక్కువ. అదే సమయంలో భూగర్భజలాల వినియోగం విపరీతం. చెరువులు, నదులు కుచించుకుపోవడం, పచ్చదనం హరించుకుపోతున్న పరిస్థితుల్లో నగరాల్లో కురిసిన వర్షమంతా ప్రవాహంగా మారి వరదగా పోటెత్తి వృథాగా పోతుంది. 2008-10 మధ్య చైనాలో 351 నగరాలకు గాను 289 నగరాలు వరదలతో సతమతమైనవే. బీజింగ్‌లో 2012లో వరదల వల్ల 79 మంది మృత్యువాత పడ్డారు. 2016లో ఆ దేశంలోని 154 నగరాలు తీవ్ర వరద తాకిడికి గురయ్యాయి. ఇదే సమయంలో ఇంకో 400 నగరాలు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొన్నాయి.

ఇదీ లక్ష్యం..

- చైనాలో 2014 చివర్లో స్పాంజ్‌సిటీ ప్రయోగాత్మక ప్రాజెక్ట్ ప్రారంభమయ్యింది.
- 2020 నాటికి దేశంలోని 20 శాతం పట్టణ ప్రాంతాల్లో, 2030 నాటికి 80 శాతం పట్టణ ప్రాంతాల్లో స్పాంజ్‌సిటీ విధానాన్ని విస్తరించాలని ఆ దేశం లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- పట్టణాభివృద్ధి-గృహనిర్మాణశాఖ, జలవనరుల శాఖ, ఆర్థికశాఖలు స్పాంజ్‌సిటీ ప్రాజెక్టును అమలు చేస్తున్నాయి. 2015లో 16 నగరాలను, 2016లో బీజింగ్ సహా మరో 14 నగరాలను స్పాంజ్‌సిటీలుగా ఎంపిక చేశారు.

నూతన ఆలోచనకు అంకురార్పణ ఇక్కడే..

ఒకవైపు తాగునీరు లేని దుస్థితి.. మరోవైపు వరద పోటు ...ఈ రెండు వైపరీత్యాలకు శాశ్వత పరిష్కారం కోసం చైనా ప్రత్యేక అధ్యయనం చేసింది. అనేక ఏళ్ల కృషి అనంతరం స్పాంజ్‌సిటీ విధానానికి రూపకల్పన చేసింది. ఆధునికతకు సాంప్రదాయ విధానాల మేళవింపుతో దీని అమలుకు శ్రీకారం చుట్టింది.

స్పాంజ్ సిటీ అంటే..

నగరాన్ని స్పాంజ్‌లా మార్చడం. ఒత్తుగా ఉన్న స్పాంజ్‌పై నీరు పోస్తే ఏమవుతుంది? తొలుత తన సామర్థ్యం మేరకు ఆ స్పాంజ్ నీటిని గ్రహిస్తుంది. ఆ దశలో చుక్క నీరు కూడా బయటకు రాదు. నిల్వ సామర్థ్యం పూర్తయ్యాకే నీరు వెలుపలకు వస్తుంది. ఇదే మాదిరిగా ఒక నగరంలో కురిసిన వాన నీటి నంతటినీ సాధ్యమైనంత అధికంగా నిల్వ చేయటమే స్పాంజ్ సిటీ విధానం. అంటే వాననీరు అంతా నగర భూభాగంలోనే ఇంకేలా చేయడం. వివిధ పద్ధతుల ద్వారా నీరు భూమిలో ఇంకేలా చేసి లోపలి పొరలకు చేరేలా చేస్తారు. ఆ తర్వాత ఈ నీటిని నగర అవసరాలకు వినియోగించుకుంటారు.

షాంఘై మారుతోందిలా..

ప్రస్తుతం షాంఘై నగరంలో 20 నుంచి 30 శాతం మాత్రమే వాననీరు భూమిలో ఇంకుతోంది. స్పాంజ్‌సిటీగా ఎంపికైన ఈ నగరంలో ఏకంగా నాలుగు లక్షల చదరపు మీటర్ల మేర రూఫ్ గార్డెన్‌ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రహదారుల పక్కనున్న కాలి బాటలను పూర్తిగా మార్చనుంది. 2020 నాటికి కనీసం 70 శాతం వాననీరు భూమిలో ఇంకేలా 20 శాతం నిర్మాణాలు ఉండాలి. 2030 నాటికి 80 శాతం నగరం మారాలి. షాంఘై నగరం ప్రతి వీధి పచ్చదనంతో కళకళలాడుతుంది. కాంక్రీట్ కాలిబాటలు జలసంరక్షణ విధానాలతో వెట్‌ల్యాండ్‌లుగా మారుతున్నాయి. పచ్చదనంతో నిండిన పైకప్పులు, పార్కులు, తోటలు వాననీరు పూర్తిగా భూమిలో ఇంకేలా చేస్తున్నాయి.

జలాశయాలు, ఉద్యానవనాలతో తూర్పు చైనాలోని జిన్‌హువా

ప్రయోజనాలు అనేకం

- నగరాల నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం
- వరద ముప్పును తగ్గిస్తుంది
- నీటి లభ్యత పెరుగుతుంది
- నీటి శుద్ధిపై వ్యయం తగ్గుతుంది
- పచ్చదనం పెరగడంతో పర్యావరణంపై అనుకూల ప్రభావం
- పర్యావరణ సమతుల్యం
- భూగర్భజలాల కాలుష్యం తగ్గుముఖం
- ఆరోగ్యవంతమైన నగర ప్రాంతాలుగా రూపాంతరం

మొట్టమొదటి స్పాంజ్ సిటీ లియాన్ యున్‌గంగ్

స్పాంజ్ సిటీ విధానంలో ఏం చేస్తారు..



- ఖాళీ స్థలాలను పచ్చదనంతో నింపడం, పైకప్పులను పచ్చదనంతో కళకళలాడేలా చేయడం
- కుంటలు, చెరువులు, నదులు ఇతర జలవనరుల పరిరక్షణ
- నివాస, కార్యాలయ ప్రాంతాలను పూర్తిగా కాంక్రీట్‌తో నింపేయకుండా గరిష్ఠంగా నీరు భూమిలో ఇంకేలా నిర్మాణాలు చేయడం
- వాననీరు ప్రవాహంలా బయటకు వెళ్లిపోకుండా ఎక్కడికక్కడ ఇంకేలా చేయడం
- రహదారులు, కాలిబాటల్లోనూ నీరు భూమిలోకి వెళ్లేలా చేయడం
- భూగర్భజలాల సహజ నీటి ప్రవాహ విధానం పునరుజ్జీవం చేయడం
- పచ్చటి ప్రాంతాలకు వాననీరు చేరి అక్కడ నుంచి భూమిలో ఇంకేలా చేయడం
- నీటిని పొదుపుగా వాడటం, మురుగునీటిని శుద్ధిచేసి వినియోగించుకోవడం వంటి విధానాలకు ప్రాధాన్యం
- అన్ని రకాల పారిశ్రామిక వాడల్లో, అభివృద్ధి మండళ్లలో గృహసముదాయాల్లో స్పాంజ్‌సిటీ విధానాలకు అనుగుణంగా నిర్మాణాలను చేయటం
- అభివృద్ధిచెందుతున్న కొత్త ప్రాంతాల్లో తొలి నుంచే ఈ విధానం అమలు
- ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో క్రమక్రమంగా అమలు
- స్పాంజ్‌సిటీ విధానానికి అనుగుణంగా భూవినియోగం, పట్టణ ప్రణాళిక విధానాల ఖరారు.

కడపలో ఉక్కు పరిశ్రమ పెట్టండి

- లేదంటే ఆమరణ దీక్ష చేస్తా
- ప్రధాని మోదీ, కేంద్రమంత్రి బీరేంద్రలకు ఎంపీ రమేశ్ లేఖ

ఈనాడు – దిల్లీ

వెనకబడిన రాయలసీమలోని కడప జిల్లాలో తక్షణమే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెదేపా ఎంపీ సీఎం రమేశ్ డిమాండు చేశారు. లేదంటే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత ఆశలపై నీళ్లు చల్లొద్దని సోమవారం ప్రధాని మోదీ, ఉక్కు శాఖ మంత్రి చౌదరి బీరేంద్రసింగ్‌లకు వేర్వేరుగా లేఖలు రాశారు. "కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు 2.6.2014 నుంచి ఆరునెలల్లో సెయిల్ అధ్యయనం చేయాలని విభజన చట్టంలోని షెడ్యూలు 9-13లో మూడో అంశంగా పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరిలో ప్రధాని మోదీకి ఓ వినతిపత్రం అందజేశారు. సెయిల్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఇటీవల సుప్రీం కోర్టులో కేంద్ర ఉక్కుశాఖ ఆర్థికంగా పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని అఫిడవిట్ దాఖలు చేసింది. దీంతో ఏపీ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. విభజన చట్టంలో పేర్కొన్న హామీని అమలు చేయడం కేంద్రం బాధ్యత" అని లేఖలో పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాల నివేదిక రావాలి: బీరేంద్రసింగ్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఉక్కు పరిశ్రమల ఏర్పాటుపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నివేదికలు రావాల్సి ఉందని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి బీరేంద్రసింగ్ తెలిపారు. సోమవారం కేంద్రమంత్రితో ఎంపీ దత్తాత్రేయ భేటీ అయ్యారు. ఉక్కు పరిశ్రమల ఏర్పాటుపై వారిద్దరూ చర్చించారు. అనంతరం బీరేంద్రసింగ్ మీడియాతో మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమకు సంబంధించి నీరు, భూమి, విద్యుత్తు తక్కువ ధరకు ఇవ్వాలని రాష్ట్రాన్ని కోరామన్నారు. కనెక్టివిటీ సమస్య ఉన్నప్పటికీ సముద్ర తీరం ఉండడం లాభదాయకమని ఆయన తెలిపారు. ఉక్కు పరిశ్రమలు ఇవ్వబోమని కేంద్రం ఎక్కడా చెప్పలేదన్నారు. విశాఖపట్నంలో 1.5 మిలియన్ సామర్థ్యం ఉన్న హైక్వాలిటీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. తెలంగాణ ఇవ్వాల్సిన రాయితీలపై కమిటీ వేశామని.. ఆ ప్రభుత్వం నుంచి నివేదిక రాగానే ఆ రాష్ట్రంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణలోని పాల్వంచలో 1.5 మిలియన్ టన్నుల స్పాంజి ఐరన్ పరిశ్రమ పెట్టడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉక్కుపరిశ్రమల ఏర్పాటు ఆర్థిక పరంగా సాధ్యం కాదని సెయిల్ చెప్పిందని, ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని బీరేంద్రసింగ్ తెలిపారు. దత్తాత్రేయ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కడప, తెలంగాణలోని బయ్యారంలో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి బీరేంద్రసింగ్ చెప్పారన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

- భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్
- కడప ఉక్కు కర్మాగారం, నౌకాశ్రయం ఏర్పాటుకు భాజపా సిద్ధం

రాజోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ దృఢ సంకల్పంతో ఉన్నారని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి వారణాసి రాంమాధవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలు గ్రామీణం మండలం తాటిపాకలో కుచ్చర్లకోట రామరాజు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుప్రీం కోర్టు న్యాయవాది కుచ్చర్లకోట ప్రభాకర సుందరరావు దంపతులు నిర్మించిన షిర్డీసాయి మందిరాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ కోనసీమ రైల్వేలైను నిర్మాణమని, దానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించిందన్నారు. అమలాపురం ఎంపీ పండుల రవీంద్రబాబు ఈ ప్రాజెక్టు మంజూరుకు ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఏ నుంచి వైదొలగినా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కడప ఉక్కు కర్మాగారం, నౌకాశ్రయం ఏర్పాటుకు భాజపా సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కోనసీమ జేఏసీ ఛైర్మన్ వి.ఎస్.దివాకర్ ఆధ్వర్యంలో ఆసంఘం నాయకులు రాంమాధవ్‌ను కలిసి రైల్వే లైను పనులను వేగవంతం చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వేటుకూరి సత్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమ, నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జైలులో ఖైదీల నిరసన

ఆరిలోవ, న్యూస్‌టుడే: విశాఖ కేంద్ర కారాగారంలో మత్తు పదార్థాల వినియోగం, రవాణా తదితర కేసుల్లో నిందితులుగా రిమాండ్‌లో ఉన్న ఖైదీలు సోమవారం నిరసన గళం విప్పారు. సంవత్సరాల తరబడి కేసులు కొలిక్కి రాకపోవడం, నెలల తరబడి బెయిలు లభించకపోవడంతో రాష్ట్ర, అంతర్రాష్ట్ర ఖైదీలు నిరాహార దీక్ష చేస్తామంటూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. బెయిలు రావడం..రాకపోవడమన్నది న్యాయస్థానం పరిధిలో ఉన్న అంశమని, దీనిపై తాము స్పందించలేమని కారాగారం పర్యవేక్షణాధికారి రాహుల్ వివరించారు. ప్రస్తుతం ఇక్కడ 470 మంది మాదక ద్రవ్యాల కేసుల్లో విచారణ ఖైదీలుగా ఉన్నారు.

అల తీవ్రతకు సరంగు మృతి

సింధియా, న్యూస్‌టుడే: కెరటం తాకిన ఘటనలో ఓ సరంగు మృత్యువాత పడ్డాడు. విశాఖ పోర్టు ట్రస్టుకు చెందిన బోటు నలుగురు కమెండోలు, ఇద్దరు కాంట్రాక్టు కార్మికులను ఓఎస్‌టీటీ జెట్టీకి తీసుకొచ్చింది. సాయంత్రం జెట్టీ వద్ద భారీ గాలి వానతో బోటు సరంగు కొప్పాడ శ్రీనివాస్(45) జెట్టీ నుంచి సముద్రంలో పడి మృతిచెందాడు.

సమస్యలు పరిష్కరించండి..

- సహకార శాఖ ఉద్యోగుల నిరసన

శ్యామలనగర్(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1959 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీలు-పీఏసీఎస్‌లు)లోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ గుంటూరు కలెక్టర్ కార్యాలయం నుంచి శ్యామలనగర్‌లోని సహకార శాఖ కమిషనరేట్ కార్యాలయం వరకు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన పీఏసీఎస్ ఉద్యోగులు ఇందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. నాబార్డు మాజీ సీజీఎం మోహనయ్య నేతృత్వంలోని కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలోని సిఫార్సులను సవరించి వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ పీఏసీఎస్ ఉద్యోగుల గ్రాట్యుటీని రూ.5 లక్షలకు, వయో పరిమితి 60 సంవత్సరాలకు పెంచాలన్నారు. సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ ఏవీవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, అంజిబాబు, సత్యనారాయణరాజు, వెంకట్రామయ్య, సీఐటీయూ నేత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్ కార్యాలయానికి ప్రదర్శనగా తరలివెళ్తున్న సహకార శాఖ ఉద్యోగులు

ధర్నాలు విజయవంతం: ఈయూ

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలో అద్దె బస్సులను 20 నుంచి 35 శాతానికి పెంచాలన్న యోచనను విరమించుకోవాలని డిమాండు చేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం చేపట్టిన ధర్నా కార్యక్రమం విజయవంతమైందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు వై.వి.రావు, కె.పద్మాకర్, పలిశెట్టి దామోదర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు 27 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యమే ఉద్యోగుల పాలిట శాపం

- మహా ధర్నాలో ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కొందరు ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే తాత్కాలిక ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆరోపించారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో తాత్కాలిక ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మూడు దశాబ్దాలుగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులందరినీ పదో పీఆర్సీ సిఫార్సుల మేరకు వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వారంతా విధులు నిర్వర్తిస్తున్నా ఎలాంటి ప్రభుత్వ సౌకర్యాలు లభించడం లేదని ఆవేదన చెందారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శుల వద్ద తాత్కాలిక ఉద్యోగుల వివరాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయా శాఖల అధికారులు వీరి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంలో విఫలమయ్యారని బొప్పరాజు మండిపడ్డారు. వీరికి కనీసం గ్రాట్యుటీ, హెల్త్‌కార్డ్, చనిపోతే మట్టి ఖర్చులూ ఇవ్వడం లేదని, లాబీయింగ్ చేసిన వారికే టైం స్కేల్ కల్పించారని విమర్శించారు. సర్వీసు చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో సర్వీసులను క్రమబద్ధీకరించాలని, లేకుంటే పోరాటం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి ఫణి పేర్రాజు, అఖిల భారత వాణిజ్య పన్నుల ఉద్యోగుల సంఘం ఛైర్మన్ సూర్యనారాయణ, జిల్లా జేఏసీ ఛైర్మన్ ఈశ్వర్, కార్మిక శాఖ జేఏసీ ఛైర్మన్ రాజేష్, సంయుక్త కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బి.సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఉద్యోగులు పాల్గొన్నారు. తొలుత తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ధర్నాచౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

ధర్నాకు ప్రదర్శనగా వస్తున్న ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఇతర నేతలు

దోపిడీని ప్రశ్నిస్తే దేశద్రోహ కుట్ర కేసులా?

- విజయవాడలో ప్రజాసంఘాల ప్రదర్శన, బహిరంగ సభ

విజయవాడ, న్యూస్‌టుడే: దేశంలో సహజవనరులు, దోపిడీని ప్రశ్నిస్తే కాల్పులు, దేశద్రోహం కేసులు బనాయించడం దారుణమని (భారత కార్మిక సంఘాల సమాఖ్య) ఇఫ్టూ జాతీయ కార్యదర్శి పి.ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో వివిధ సంఘాల నాయకులు ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ.. దళిత, ఆదివాసీ హక్కుల మేధావులను చట్ట వ్యతిరేక కార్యాకాలాపాలు నిర్వహిస్తున్నారంటూ అరెస్టు చేయడం అమానుషమన్నారు. జనవరి ఒకటో తేదీన మహారాష్ట్రలోని భీమాకొరెగాంలో వేలాది మంది దళిత, ప్రజాస్వామ్యవాదులు చేపట్టిన కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు దాడి చేసి భగ్నం చేశాయని గుర్తు చేశారు. ఈ దాడిని దేశంలోని ప్రజాస్వామ్యవాదులు ఖండించి దళితులకు అండగా నిలిస్తే వారిని మహారాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి ఉపా చట్టం కింద అరెస్టు చేసిందన్నారు. వీరంతా మావోయిస్టు పార్టీ సానుభూతిపరులని తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. కేసులు బనాయించిన వారి వద్ద డాక్యుమెంట్లు దొరికాయని, అందులో ప్రధాని నరేంద్రమోదీని హత్య చేయడానికి ఆధారాలు లభించాయని.. విప్లవ రచయితల సంఘం నాయకుడు వరవరరావు పాత్ర ఉందని పేర్కొనడం చూస్తుంటే ఈ కుట్ర కేసులు ఎందుకు బనాయించారో ప్రతిఒక్కరికి అర్థమవుతుందన్నారు. వరవరరావుని శాశ్వతంగా జైల్లో నిర్బంధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్నాయని ఆరోపించారు. టి.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పోలారి, వి.హనుమంతరావు, డి.ప్రభాకర్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జి.రోహిత్, వి.రామకృష్ణ, బి.కొండారెడ్డి, ఎం.వెంకన్న, రాజేశ్వరి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న దళిత, ఆదివాసీ నాయకుల అరెస్టులను నిరసిస్తూ విజయవాడలో ప్రజాసంఘాల ప్రదర్శన

అడుగులు పాతవే. మార్గమూ ప్రాచీనమే. గమ్యమే కొత్తది. అనాదిగా భారతీయ జీవన విధానంలో అంతర్భాగమై సాగుతూ వస్తున్న యోగా.. ఆధునిక కాలంలో మనం ఎదుర్కొంటున్న ఎన్నెన్నో జటిల సమస్యలకు పరిష్కార మార్గం చూపుతోంది. ముఖ్యంగా రోజురోజుకీ పెరిగిపోతున్న ఒత్తిళ్ల భారాన్ని మోయలేక చతికిలపడిపోతున్న గుండెకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. అనుక్షణం గుండెను దెబ్బతీయటానికి కాచుకొని చూస్తున్న ముప్పు కారకాలను ఆదిలోనే తుదముట్టిస్తూ.. పెద్ద సమస్యలుగా మారకుండా మూలం నుంచే నరుక్కుంటూ వస్తోంది. కాబట్టే వైద్యరంగం ఇప్పుడు యోగా ప్రయోజనాలపై నిశితంగా దృష్టి సారించింది. గుండెపోటు, గుండె వైఫల్యం వంటి సమస్యల కారణంగా చేతులెత్తేసిన గుండెను గాడిలో పెట్టే 'కార్డియాక్ రిహాబిలిటేషన్' కార్యక్రమాల్లో యోగాకూ స్థానం కల్పిస్తోంది. అందుకే అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) నేపథ్యంలో యోగా మూలంగా గుండెకు ఒనగూడుతున్న ప్రయోజనాలపై ప్రత్యేక కథనం అందిస్తోంది ఈవారం సుఖీభవ.

గుండెకు యోగా మంచిదేగా!



గుండెజబ్బులు మనకు కొత్త కాదు. వృద్ధులు, యువకులు అన్న తేడా లేదు. పట్టణాలు, గ్రామాలు అన్న భేదం లేదు. అన్ని వయసుల వారినీ, అన్ని ప్రాంతాల వారినీ ఇవి ఒక మహమ్మారిలా చుట్టుముడుతున్నాయి. సాంక్రమికేతర జబ్బుల్లో 70% వరకూ గుండెజబ్బులు ఉంటుండటమే దీనికి నిదర్శనం. మారిపోతున్న ఆహార పద్ధతులు, తగ్గిపోతున్న శారీరక శ్రమ, పెరిగిపోతున్న ఉప్పు వాడకం, విస్తరిస్తున్న పొగ తాగే అలవాటు, మితిమీరుతున్న మద్యం, ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఒత్తిడి.. ఇవన్నీ పెద్ద ఉపద్రవాన్నే తెచ్చిపెడుతున్నాయి. క్రమంగా ఇవి మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం వంటి సమస్యలకు దారితీస్తూ.. చివరికి గుండెజబ్బుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. ఇలాంటి ఆపత్తరుణంలో మనకు యోగా కొత్త బాసటను అందిస్తోంది. నిజానికి గుండెజబ్బుల ముప్పు అధికంగా గలవారికి స్టాటిన్స్, ఆస్ప్రిన్.. అలాగే రక్తపోటును తగ్గించే బీటా బ్లాకర్లు, ఏసీఈ ఇన్‌హిబిటార్స్ వంటి మందులను ఇవ్వటం పరిపాటి. అయితే వీటితో పాటు జీవనశైలిని మార్చుకోవటమూ కీలకమే. ఇందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందనే అవగాహన ఇప్పుడు కొత్త ఆశలను చిగురింపజేస్తోంది. ఇది గుండెజబ్బులతో బాధపడేవారికే కాకుండా అసలు గుండెజబ్బుల బారినపడకుండా కాపాడుకోవటానికీ దోహదం చేస్తుండటం గమనార్హం. యోగా మానసిక ఒత్తిడిని తగ్గిస్తూనే ప్రతికూల ఆలోచనలకు, కోరికలకు కళ్లెం వేసి జీవన వాస్తవం బోధపడేలా చేస్తుంది. ఫలితంగా చెడు అలవాట్ల వైపు ధ్యాస మళ్లకుండా కాపాడుతుంది. ఇలా గుండెజబ్బుల నివారణకు, గుండెజబ్బుల నుంచి త్వరగా కోలుకోవటానికి తోడ్పడుతుంది.

డా॥ ఎన్.కృష్ణారెడ్డి
సీనియర్ కార్డియాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
బంజారాహిల్స్
హైదరాబాద్

మనో నిబ్బరం.. నైతిక విలువలు

పొగ తాగకూడదని, మద్యం జోలికి వెళ్లకూడదని.. ఆహారంలో కొవ్వులు, ఉప్పు తగ్గించుకోవాలని.. వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలని అందరికీ తెలుసు. అయినా ఎందుకు పాటించటం లేదు? లోతుగా ఆలోచిస్తే మనసును నియంత్రణలో లేకపోవటం కూడా దీనికి ఒక కారణమని అర్థమవుతుంది. మనసు నియంత్రణలో ఉంటే జిహ్వ చాపల్యం తగ్గుతుంది. వ్యాయామం మానకుండా ఉండటానికి అవసరమైన మనో నిబ్బరం అబ్బుతుంది. యోగాతో శరీరంతో పాటు మనసు మీదా పట్టు లభిస్తుంది. ఫలితంగా మనసు కుదురుగా ఉంటుంది. నైతిక విలువలూ పెరుగుతాయి. ఇవన్నీ వ్యక్తిగత ఆరోగ్యానికే కాదు, సమాజం ఆరోగ్యంగా ఉండటానికి కూడా తోడ్పడతాయి.

ఒక్క గుండె ఆరోగ్యమే కాదు..

ఆరోగ్యమంటే కేవలం జబ్బులు లేకపోవటమే కాదు. మానసికంగానూ చురుకుగా ఉండటం. ఆధ్యాత్మికంగా ఉన్నతిని సాధించటం. ఇలా అన్నికోణాల్లోనూ మనిషిని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా చేస్తుండటమే యోగా ప్రత్యేకత. ఇది మన శరీరాన్ని, మనసును ఒక గాడిలో పెట్టి.. వాటిని సమతౌల్యంలోకి తెచ్చే అమోఘమైన ప్రక్రియ. 'యుజ్' అంటే కలయిక, ఐక్యత, జత చేయటం అని అర్థం. ఈ సంస్కృత ధాతువు నుంచే యోగా అనే శబ్దం పుట్టుకొచ్చింది. వేదకాలం నుంచీ అనుసరిస్తున్న యోగ సూత్రాలను పతంజలి మహర్షి క్రోడీకరించి 'అష్టాంగ యోగా'ను సిద్ధం చేశారు. వీటిల్లో 'యమ, నియమాలు' మన విధులు, ఆహార విహారాలు, పరిశుభ్రత, నైతిక విలువలను నొక్కిచెబితే.. 'ఆసనాలు' శరీరంలోని ప్రతి కండరం మీదా, ప్రతి కీలు మీదా పట్టు సాధించుకోవటానికి దోహదం చేస్తాయి. శ్వాసను క్రమబద్ధీకరించటం, ఒక క్రమ పద్ధతిలో స్తంభింపజేసే పద్ధతులతో కూడిన 'ప్రాణాయామం' అసంకల్పిత వ్యవస్థలపై నియంత్రణ పొందటానికి తోడ్పడుతుంది. ఇక 'ప్రత్యాహార, ధారణ, ధ్యానం'.. మనసు గాడి తప్పకుండా చూస్తూ ఆలోచనలు కుదురుగా సాగేలా, ఏకాగ్రత సాధించేలా చేస్తాయి. ఇవన్నీ చివరికి నిశ్చలానంద 'సమాధి' స్థితికి చేరుస్తాయి. అంటే యోగా శరీర సామర్థ్యాన్ని పెంపొందించుకోవటానికే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవటానికీ తోడ్పడుతుందన్నమాట. ఇతరత్రా శారీరక వ్యాయామాలకు మించిన ప్రయోజనాలు దీంతో లభిస్తుండటం విశేషం. అందుకే పలురకాల ఒత్తిళ్లతో సతమతమవుతూ.. ఎన్నెన్నో సమస్యలను కొని తెచ్చుకుంటున్న ప్రస్తుత తరుణంలో దీని ఆవశ్యకత రోజురోజుకీ పెరుగుతోంది.

ఎల్లుండి అంతర్జాతీయ యోగా దినోత్సవం

జాగ్రత్త అవసరం

యోగా సురక్షితమైన పద్ధతే అయినా – గుండెజబ్బులతో బాధపడేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి. ఎందుకంటే రక్తపోటు అదుపులో లేనివారు, లేచి నిలబడితే కళ్లు తిరిగేవారు తల కిందికి వంచి చేసే శీర్షాసనం వంటివి వేయకూడదు. కొందరికి చాలా వేగంగా శ్వాస తీసుకోవటం.. శరీరాన్ని పూర్తిగా ఒకవైపు తిప్పే, వంచే ఆసనాల వంటివీ ప్రమాదకరంగా పరిణమించొచ్చు. కాబట్టి సుశిక్షితులైన, అనుభం గల నిపుణుల సలహా మేరకు, వారి పర్యవేక్షణలోనే యోగా సాధన చేయటం మంచిది.

ఏంటీ తేడా?

ఒకసారి గుండె పోటు, గుండె వైఫల్యం బారినపడ్డాక.. సర్జరీ, యాంజియోప్లాస్టీ వంటివి చేయించుకున్నాక.. చాలామంది తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతారు. దీన్నుంచి వీలైనంత త్వరగా బయటపడేయటం, తిరిగి తమ ఉద్యోగాలు, తమ పనులు తాము చేసుకునేలా చూడటం చాలా అవసరం. అలాగే మున్ముందు మళ్లీ ఇలాంటి సమస్యల బారినపడకుండా చూసుకోవాల్సి ఉంటుంది కూడా. ఇందుకు కార్డియాక్ రిహాబిలిటేషన్ పద్ధతులు తోడ్పడతాయి. ఇందులో ఆహారం దగ్గర్నుంచి.. శారీరక సామర్థ్యాన్ని పెంపొందించటం, తమ పనులు తాము చేసుకునేలా మనో నిబ్బరాన్ని కల్పించటం వరకూ అన్ని అంశాలు ఇమిడి ఉంటాయి. ఇందులో యోగాను కూడా చేర్చితే మరింత ప్రయోజనం పొందొచ్చు. సంప్రదాయ రిహాబ్ కార్యక్రమంలో గుండె ఫిట్‌నెస్ మీదే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తారు. ఆయా పనులు చేస్తున్నప్పుడు పడే భారాన్ని గుండె తట్టుకునేలా చూడటానికి అవసరమైన వ్యాయామాలను సూచిస్తుంటారు. అయితే గుండెజబ్బుల విషయంలో గుండె సామర్థ్యం ఒక్కటే సరిపోదు. ఉదాహరణకు- రక్తనాళాల్లో పూడికలు గలవారు హఠాత్తుగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనప్పుడు పూడికలు పెకిలిపోయి, రక్తనాళాలు చిట్లి గుండెపోటు తలెత్తొచ్చు. అలాగే వాతావరణ కాలుష్యం.. వైరల్ ఇన్‌ఫెక్షన్లతో తలెత్తే వాపు ప్రక్రియ వంటివీ ఇందుకు దారితీయొచ్చు. కొందరు గుండె లయ తప్పటం మూలంగానూ హఠాత్తుగా ప్రాణాలు కోల్పోతుంటారు. అందువల్ల మానసిక ఒత్తిడి తగ్గించుకోవటం, రోగనిరోధకశక్తి పెంపొందించుకోవటం కూడా ముఖ్యమే. ఈ విషయంలో యోగా చేసే మేలు అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ధ్యానం, ప్రాణాయామం మూలంగా ఒంట్లో ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం (వేగల్ టోన్) పెంపొందుతుంది. మన శరీరంలో వేగస్ నాడి అతి పెద్ద కపాల నాడి. శ్వాస ప్రక్రియ, గుండె వేగం, జీర్ణ క్రియ వంటివన్నీ దీంతో ముడిపడినవే. కాబట్టి ఇది మెరుగ్గా ఉంటే ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యమూ పెరుగుతుంది. ఫలితంగా ఒత్తిడి, ఆందోళన నుంచి తేలికగా బయటపడటానికి వీలవుతుంది. ముఖ్యంగా రక్తపోటు బాగా అదుపులోకి వస్తుంది. గుండె వేగం, శ్వాసవేగం తగ్గుతాయి. రక్తపోటు 3 ఎం.ఎం తగ్గినా గుండెజబ్బుల ముప్పు గణనీయంగా తగ్గుతుందని గుర్తుంచుకోవటం అవసరం. ధ్యానం చేయటం వల్ల మనసు పూర్తి ప్రశాంతమైన స్థితిలోకి వెళ్తుంది. దీంతో మెలటోనిన్ ఉత్పత్తి అవుతుంది. ఇవన్నీ పరోక్షంగా గుండె ఆరోగ్యానికి మేలు చేసేవే.

అధ్యయనాలూ చెబుతున్నాయి

మనం ఎక్కువకాలం జీవించాలని కోరుకోవటం సహజమే. అదొక్కటే కాదు.. బాధలేవీ లేకుండా ఎంత హాయిగా జీవిస్తున్నామన్నది కూడా ముఖ్యమే. నిజానికి రోగాలతో రొప్పుతూ బతకటమంటే ఒకరకంగా శాపమే. ఇలాంటి దుస్థితిని తప్పించటానికి యోగా చాలా బాగా ఉపయోగపడుతుంది. కార్డియాక్ రిహాబిలిటేషన్‌లో యోగాను చేర్చిన తర్వాత గణనీయమైన మార్పులు కనబడుతున్నట్టు మా పరిశీలనలో గుర్తించాం. సమస్యల నుంచి త్వరగా కోలుకుంటున్నట్టు, త్వరగా మామూలు జీవితం గడపుతున్నట్టు కనుగొన్నాం. దీని ప్రయోజనాలను శాస్త్రీయంగా నిరూపించటానికి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రయత్నాలూ సాగుతున్నాయి. మనదేశంలో ఐసీఎంఆర్ వివిధ ఆరోగ్యకేంద్రాల్లో విస్తృత అధ్యయనం నిర్వహిస్తోంది. సంప్రదాయ కార్డియాక్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్‌లో యోగాను చేర్చటం వల్ల కలిగే ప్రయోజనాలపై అధ్యయనం చేస్తోంది. ఇది పూర్తయితే శాస్త్రీయంగా యోగాతో ఎంతమేరకు ప్రయోజనం చేకూరుతోందో కచ్చితంగా నిరూపణ కాగలదు. అదలా ఉంచితే- అక్కడక్కడా చేసిన పరిశీలనాత్మక అధ్యయనాల్లో యోగా ప్రయోజనాలు విస్పష్టంగా బయటపడ్డాయి.

- ఇన్సులిన్ నిరోధక రుగ్మతలతో ముడిపడిన పలు గుండెజబ్బు ముప్పు కారకాలు యోగాతో తగ్గుముఖం పడుతున్నట్టు వర్జీనియా విశ్వవిద్యాలయ పరిశోధకులు అధ్యయనం పేర్కొంది.
- గుండెజబ్బు బాధితులకు గాఢంగా శ్వాస తీసుకోవటం ఎంతగానో ఉపయోగపడుతున్నట్టు.. ఇది ఒత్తిడి, ఆందోళనల నుంచి బయటపడటానికి తోడ్పడుతున్నట్టు అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌కు చెందిన సర్క్యులేషన్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది.
- ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం వల్ల శ్వాస వేగం తగ్గుముఖం పడుతున్నట్టు ఐజీబీఎంఆర్ పత్రికలో వెలువడిన అధ్యయనం పేర్కొంది. గుండె సామర్థ్యమూ గణనీయంగా పుంజుకోవటం విశేషం.
- హఠయోగ మూలంగా గుండె రక్తనాళాల్లో రక్తపోటును తట్టుకునే సామర్థ్యం మెరుగుపడినట్టు, గుండె కండరం బలోపేతం అవుతున్నట్టు హాంకాంగ్ పరిశోధకుల అధ్యయనం పేర్కొంది.
- గుండె వైఫల్యం బాధితుల్లో యోగా సాధనతో గుండె వేగం, రక్తపోటు తగ్గుముఖం పడుతున్నట్టు భారతీయ వైద్యుల పరిశోధనలు చెబుతున్నాయి.

శరీరమంతా నవోత్తేజం

మనం శ్వాస ద్వారా ఆక్సిజన్‌ను లోనికి తీసుకుంటుంటాం, కార్బన్ డయాక్సైడ్‌ను బయటకు వదులుతుంటాం కదా. అయితే వేగంగా, పైపైన శ్వాస తీసుకుంటుంటే అవసరమైనంత ఆక్సిజన్ అందదు. అదే ప్రాణాయామం వంటి శ్వాస పద్ధతులతో గాఢంగా శ్వాస తీసుకున్నట్టయితే ఒంట్లోని అన్ని కణాలకు తగినంత ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. గుండె వైఫల్యం, ఊపిరితిత్తుల జబ్బుల వంటి వాటిల్లో శ్వాస వేగం పెరుగుతుంది. దీన్నే మనం ఆయాసంగా భావిస్తుంటాం. ఇలాంటివారికి ప్రాణాయామం బాగా ఉపయోగపడుతుంది. దీని మూలంగా శ్వాస తీసుకోవటానికి సాయం చేసే కండరాలు బలోపేతమవుతాయి. ఆందోళన, ఉద్రేకం వంటి వాటిని తట్టుకునే సామర్థ్యం పెంపొందుతుంది. ఇది హఠాత్తుగా గుండె ఆగిపోయే ముప్పు తగ్గటానికి తోడ్పడుతుంది. ప్రాణాయామం మూలంగా మనసు ప్రశాంత స్థితిలోకి వెళ్లటం వల్ల దీర్ఘకాల ఒత్తిడి స్థాయులు తగ్గుముఖం పడతాయి. అంతేకాదు.. ఒంట్లోని విషతుల్యాలు, ప్రతికూల భావనలు బయటకు వెళ్లిపోతాయి. సానుకూల ధోరణి అలవడుతుంది. రక్తప్రసరణ మెరుగవుతుంది, నాడీ వ్యవస్థ పుంజుకుంటుంది. మొత్తంగా శరీరం మొత్తం నవోత్తేజంతో తొణికిసలాడుతుంది. అందువల్ల గుండెజబ్బులకు చికిత్స తీసుకునేవారు, శస్త్రచికిత్సల వంటివి చేయించుకున్నవారు కనీసం 3 నెలల పాటు యోగా సాధన చేసినా చాలు. త్వరగా కోలుకోవటానికి వీలవుతుంది. ఒకసారి సమస్యలు కుదురుకున్నాక.. క్రమంగా ఇతరత్రా ఆసనాలు వేయటం ఆరంభించొచ్చు. ఫలితంగా మున్ముందు ఇలాంటి సమస్యలు మళ్లీ దాడి చేయకుండా చూసుకోవచ్చు. కాకపోతే మధ్యలో మానెయ్యకుండా.. దీర్ఘకాలం సాధన చేయటం ముఖ్యం.

చిన్న వయసు నుంచే అలవడాలి

గుండెజబ్బులకు దారితీసే జన్యుపరమైన అంశాల విషయంలో మనమేమీ చేయలేకపోవచ్చు. కానీ మధుమేహం, అధిక రక్తపోటు వంటి ముప్పు కారకాలను మార్చుకోవటం మాత్రం మన చేతుల్లోనే ఉందనే సంగతిని విస్మరించలేం. ఈ ముప్పు కారకాల బారినపడకుండా చూసుకోగలిగితే.. ఒకవేళ ఏదైనా దాడిచేసినా దాన్ని నియంత్రణలో ఉంచుకోగలిగితే చాలావరకు గుండెజబ్బులను నివారించుకోవచ్చు. కాబట్టి సాంక్రమికేతర జబ్బుల నివారణకు పెద్దఎత్తున నివారణ చర్యలు (ప్రైమోడల్ ప్రివెన్షన్) తీసుకోవటం అవసరం. ముఖ్యంగా ఆహారం, శారీరక శ్రమ వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. కొవ్వులు తక్కువగానూ.. తాజా పండ్లు, కూరగాయలు, నట్స్, మంచి కొవ్వులతో కూడిన చేపల వంటివి ఎక్కువగానూ తీసుకోవాలి. ఉప్పు వాడకాన్ని ఎంత తగ్గిస్తే అంత మేలు. క్రమం తప్పకుండా రోజుకు కనీసం అరగంట సేపు వ్యాయామం, శారీరక శ్రమ చేయటం మంచిది. వీటికి యోగాను కూడా జతచేస్తే మరింత ప్రయోజనం పొందొచ్చు. యోగా సురక్షితమైన పద్ధతి. చాలా తేలికైంది, చవకైంది కూడా. దీనికి జిమ్‌లలో మాదిరిగా పెద్ద పెద్ద పరికరాల అవసరం లేదు. ఎవరైనా ఎక్కడైనా చేయొచ్చు. ఒక్కరు ఆరంభించినా కుటుంబ సభ్యులంతా చేయటానికి చేసే ప్రోత్సాహాన్ని అందిస్తుంది. కాబట్టి యోగాను చిన్న వయసు నుంచే సాధన చేయటం ఎంతో మంచిది. దీంతో భవిష్యత్ భారతం సంపూర్ణ ఆరోగ్యంతో కళకళలాడేలా చూసుకోవచ్చు.

నివారణ మార్గంగా..

గుండెజబ్బులతో బాధపడటం కన్నా వాటి బారినపడకుండా చూసుకోవటమే ఉత్తమం. ఇందుకు యోగా బాగా ఉపయోగపడుతుంది. ఆసనాలు వేసే సమయంలోనూ శ్వాస లయబద్ధంగా సాగుతుంది. కాబట్టి ముందు నుంచే కొన్ని ఆసనాలను సాధన చేయటం మంచిది.



కటి చక్రాసనం, అర్ధ కటి చక్రాసనం, త్రికోణాసనం, పాద హస్తాసనం, అర్ధచంద్రాసనం, జానుశిరాసనం, వక్రాసనం, గోముఖాసనం, నౌకాసనం, భుజంగాసనం, శలభాసనం, శవాసనం, పవన ముక్తాసనం, పాద ఉత్థానాసనం, సేతుబంధాసనం, మార్జారాసనం

ప్రశ్న: నా వయసు 34 ఏళ్లు. నాకు తరచుగా చర్మంపై రోజుకోసారి వేర్వేరు చోట్ల చారల మాదిరిగా దద్దుర్లు వస్తున్నాయి. గంట తర్వాత తగ్గిపోతున్నాయి. ఇలా గత ఆరు నెలలుగా వేధిస్తున్నాయి. నేను స్నానానికి కుళాయిలో వచ్చే నీటినే వాడుతున్నాను. అసలీ దద్దుర్లకు కారణమేంటి?

– రవి, హైదరాబాద్

ఒంటిపై దద్దుర్లు ఎందుకు?

సమస్య - సలహా

జవాబు: ఆరు నెలలుగా దద్దుర్లు వస్తున్నాయని చెబుతున్నారంటే మీరు క్రానిక్ అర్టికేరియాతో బాధపడుతున్నారని అనిపిస్తోంది. స్నానానికి వాడే నీళ్లు మారిపోతే ఇలాంటి దద్దుర్లు వస్తాయని కొందరు భావిస్తుంటారు గానీ కుళాయిల్లో వచ్చే రక్షిత మంచి నీటితో ఇలాంటి సమస్యలేవీ ఉండవనే చెప్పుకోవచ్చు. అర్టికేరియా చాలావరకు త్వరగానే తగ్గిపోతుంటుంది. అయితే కొందరిలో చాలాకాలం పాటు విడవకుండా వేధిస్తుంటుంది. దీన్నే క్రానిక్ అర్టికేరియా అంటారు. దీనికి బయటి కారణాల కన్నా శరీరం లోపలి అంశాలే దోహదం చేస్తుంటాయి. రక్తహీనత, కాలేయ సమస్యలు, కిడ్నీ జబ్బులు, మధుమేహం వంటి సమస్యలు దీనికి దోహదం చేస్తుండొచ్చు. థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవటం వల్ల తలెత్తే హైపోథైరాయిడిజమ్‌లోనూ ప్రాథమికంగా ఇలాంటి దద్దుర్లు కనబడుతుంటాయి. మన రోగనిరోధకశక్తి పొరపాటున మన మీదే దాడి చేయటం వల్ల వచ్చే కొన్ని సమస్యలూ అర్టికేరియాకు దారితీయొచ్చు. కొందరిలో పొట్టలో నులి పురుగులు, అమీబియాసిస్ వంటివీ దద్దుర్లకు దారితీయొచ్చు. ఇప్పుడు బయట తిండి తినే అలవాటు బాగా పెరిగింది. ఎక్కడ పరిశుభ్రత లోపించినా అమీబియాసిస్ పట్టుకోవచ్చు. కాబట్టి మీరు ఒకసారి చర్మ నిపుణుడిని సంప్రతించటం మంచిది. ఇవి మామూలు దద్దుర్లా? ఇతరత్రా కారణాలతో వస్తున్నాయా? అని డాక్టర్లు పరీక్షిస్తారు. తాత్కాలికంగా దద్దుర్లు తగ్గటానికి కొన్నిరకాల మందులు ఉన్నాయి గానీ వీటి ప్రభావం కొంతకాలమే. అందువల్ల కారణాన్ని స్పష్టంగా గుర్తించి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. మధుమేహం ఉంటే గ్లూకోజు నియంత్రణలో ఉంచుకోవాలి. థైరాయిడ్ సమస్యలుంటే మాత్రలు సరిగా వేసుకోవాలి. కాలేయ, కిడ్నీ సమస్యలకు తగు చికిత్సలు తీసుకోవాలి. దీంతో ఆయా సమస్యలతో పాటు దద్దుర్లు కూడా తగ్గుతాయి. లేకపోతే సమస్య మొండిగా మారుతుంది. మళ్లీ మళ్లీ దద్దుర్లు వేధిస్తుంటాయి.

– డా॥ పుట్టా శ్రీనివాస్
సీనియర్ డెర్మటాలజిస్ట్

'డీ'లా పడిపోవద్దు!

విటమిన్ డి తీరే వేరు. అవటానికిది విటమినే అయినా హార్మోన్ మాదిరిగా పనిచేస్తుంది. చర్మానికి ఎండ తగిలినపుడు కొలెస్ట్రాల్ నుంచి దీన్ని మన శరీరమే తయారుచేసుకుంటుంది. కొవ్వుతో కూడిన చేపల వంటి వాటిల్లోనూ విటమిన్ డి ఉన్నప్పటికీ ఆహారం ద్వారా దీన్ని తగినంత తీసుకోవటం చాలా కష్టం. శరీరంలోని పలు వ్యవస్థలపై గణనీయమైన ప్రభావం చూపే విటమిన్ డి లోపంతో ఎంతోమంది బాధపడుతున్నారు. పైకి ఎలాంటి లక్షణాలూ కనబడకపోవటం వల్ల చాలామంది దీన్ని పట్టించుకోవటం లేదు. నిజానికి విటమిన్ డి లోపం పలు సమస్యలకు దారితీయొచ్చు. కొన్ని కొన్ని లక్షణాల ఆధారంగా దీని లోపాన్ని గుర్తించొచ్చు.

- **తరచుగా జబ్బుపడటం:** రోగనిరోధక వ్యవస్థ బలంగా పనిచేయటంలో విటమిన్ డి కీలక పాత్ర పోషిస్తుంది. ఇన్‌ఫెక్షన్లతో పోరాడే కణాలతో ఇది నేరుగా చర్య జరుపుతుంది. అందువల్ల విటమిన్ డి లోపిస్తే జలుబు, ఫ్లూ వంటివి తరచుగా దాడిచేస్తుంటాయి.
- **నిస్సత్తువ:** అలసట, నిస్సత్తువకు దారితీసే అంశాల్లో విటమిన్ డి లోపం ఒకటి. దురదృష్టవశాత్తు చాలామందికి విటమిన్ డి లోపమన్నదే గుర్తుకురాదు. రక్తంలో దీని స్థాయిలు తగ్గితే తీవ్రమైన నిస్సత్తువకు దారితీస్తుంది.
- **వెన్నునొప్పి:** ఎముకల దృఢంగా, ఆరోగ్యంగా ఉండటానికి విటమిన్ డి ఎంతగానో తోడ్పడుతుంది. ఇది మనం తిన్న ఆహారం నుంచి శరీరం క్యాల్షియాన్ని మరింత ఎక్కువగా గ్రహించుకునేలా చేస్తుంది. అందువల్ల విటమిన్ డి లోపిస్తే వెన్నునొప్పి, ఎముకల నొప్పుల వంటివి బయలుదేరొచ్చు. దీని లోపంతో చిన్న చిన్న దెబ్బలకే ఎముకలు విరిగే ప్రమాదముంది.
- **కుంగుబాటు:** ఎప్పుడూ విచారంతో ఉంటున్నట్టు గమనిస్తే విటమిన్ డి లోపం కూడా కారణం కావొచ్చని అనుమానించాలి. రక్తంలో విటమిన్ డి స్థాయులు తగ్గటానికీ కుంగుబాటుకూ సంబంధం ఉంటున్నట్టు పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి.
- **పుండ్లు మానకపోవటం:** ఏదైనా దెబ్బ తగిలినపుడు, సర్జరీల వంటివి చేయించుకున్నప్పుడు గాయం, కోతలు త్వరగా మానకుండా వేధిస్తుంటే విటమిన్ డి లోపం ఉందేమో ఒకసారి పరీక్షించుకోవటం మంచిది. ఎందుకంటే పుండు మానే క్రమంలో కొత్త చర్మం ఏర్పడటంలో కీలక పాత్ర పోషించే రసాయనాల ఉత్పత్తికి విటమిన్ డి తోడ్పడుతుంది మరి. అంతేకాదు, వాపు నియంత్రణలోనూ ఇన్‌ఫెక్షన్‌తో పోరాడటంలోనూ ఇది పాలు పంచుకుంటుంది.
- **జుట్టు ఊడటం:** వెంట్రుకలు ఊడిపోతుంటే ముందుగా ఒత్తిడే గుర్తుకొస్తుంది. కానీ కొన్ని జబ్బులతో పాటు విటమిన్ డి లోపం సైతం జుట్టు ఊడిపోవటానికి దోహదం చేయొచ్చు.

మీ సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా

సమస్య – సలహా
సుఖీభవ
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
email:
sukhi@eenadu.in

కీర్తి సురేష్

ఈనాడు సినిమా

ఆ బరువు మోయలేను

'మహానటి'తో కీర్తి సురేష్ పేరు మార్మోగిపోతోంది. అగ్ర కథానాయికల జాబితాలో ఆమె పేరు కూడా చేరిపోయింది. స్టార్ కథానాయకుల చిత్రాలు కొన్ని ఆమె చేతికి చేరుతున్నాయి. "ఒకట్రెండు విజయాలతోనే స్టార్ నాయికని అయిపోయానని అనుకోవడం లేదు. అందుకు చాలా దూరం ప్రయాణించాల్సి వుంది. స్టార్ అనే మాట వినడానికి బాగానే ఉంటుంది. వాటితో పాటు బరువు బాధ్యతలు మోయాల్సి ఉంటుంది. అనవసరమైన ఒత్తిడి మోయడం నాకు ఇష్టం ఉండదు. నా పని నేను చేసుకుంటూ వెళ్లడంలోనే ఆనందం ఉంది. ముందు నేను నటిగా రాణించాలి. ప్రేక్షకులు నాకంటూ ఓ స్థానాన్ని ఇవ్వాలి. అందుకోసం ఎంత కష్టమైనా పడతా. కష్టపడితే విజయాలొస్తాయి. విజయాలే పేరు తీసుకొస్తాయి. అయితే అక్కడితో ఆగిపోకూడదు. మనపై పెట్టుకున్న నమ్మకాన్ని ప్రతిసారీ నిలబెట్టుకుంటూ ప్రయాణం చేయడం చాలా పెద్ద బాధ్యత. అది నన్నెప్పుడూ మేల్కొలుపుతూనే ఉంటుంది" అంటోంది కీర్తి.

ముఖ్యమంత్రులు కలిశారు

'భరత్ అనే నేను' అంటూ వెండితెరపై ముఖ్యమంత్రిగా సందడి చేశాడు మహేష్‌బాబు. 'ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే ఎంత బాగుణ్ణు' అని ఆయన అభిమానులు ముచ్చటపడ్డారు. ఈ రీలు సీఎమ్‌ని, రియల్ సీఎమ్ కలుసుకున్నారు. కాసేపు సరదాగా ముచ్చటించుకున్నారు. ఆయనెవరో కాదు.. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేదీ సింగ్ రావత్. మహేష్‌బాబు కథానాయకుడిగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ చిత్రం రూపుదిద్దుకొంటోంది. డెహ్రాడూన్‌లో చిత్రీకరణ మొదలైంది. సోమవారం నుంచి కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా త్రివేదీ సింగ్ సెట్లో అడుగుపెట్టారు. మహేష్, ఇతర చిత్రబృందంతో కాసేపు ముచ్చటించారు. దిల్‌రాజు, అశ్వనీదత్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తోంది. అల్లరి నరేష్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు.

నాన్న ముచ్చట

ఎన్టీఆర్ తన ముద్దుల తనయుడికి ఘనంగా స్వాగతం పలికారు. ఇక నుంచి ఇద్దరబ్బాయిలతో కలిసి ఆడుకోనున్న ఆయన ఆ ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సోమవారం అభిమానులతో పంచుకొన్నారు. తనకు పుట్టబోయే బిడ్డ ఫొటోతోనే ఆరంభించాలనుకొన్నారేమో, ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్‌లో చేరిన ఎన్టీఆర్... అందులో మొట్ట మొదట ఇలా తన వారసుల ఫొటోనే పంచుకోవడం విశేషం. ఎన్టీఆర్, లక్ష్మీప్రణతి దంపతులకి ఈ నెల 14న అబ్బాయి పుట్టిన సంగతి తెలిసిందే. తారక్ తన చిన్న తనయుడిని, పెద్దబ్బాయి అభయ్ చేతిలో పెట్టి స్వయంగా ఫొటో తీశారు. ఆ ముచ్చటని కెమెరాలో బంధించారు ఎన్టీఆర్ భార్య లక్ష్మీప్రణతి. ఆ ఫొటోనే ఇది. ప్రస్తుతం ఎన్టీఆర్ 'అరవింద సమేత'లో నటిస్తున్నారు.

శ్రియ + నిహారిక

శ్రియ, నిహారిక కొణిదెల ప్రధాన పాత్రధారులుగా క్రియా ఫిలిం కార్పొరేషన్, కాళీ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నాయి. సుజనా దర్శకత్వం వహిస్తున్నారు. 'కంచె', 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు', 'గౌతమిపుత్ర శాతకర్ణి' తదితర చిత్రాలకి కెమెరా బాధ్యతలు నిర్వర్తించిన ప్రముఖ ఛాయాగ్రాహకుడు జ్ఞానశేఖర్.. రమేష్‌కరుతూరితో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు వరుణ్ తేజ్ క్లాప్‌నిచ్చారు. ప్రముఖ దర్శకుడు క్రిష్ గౌరవ దర్శకత్వం వహించారు. రాజకీయ నేత గొట్టిముక్కల పద్మారావు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. నిర్మాతలు రాజీవ్‌రెడ్డి, సాయిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. "వాణిజ్యాంశాలతో కూడిన కథ ఇది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంద"ని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, కళ: జె. కె. మూర్తి, ఛాయాగ్రహణం: జ్ఞానశేఖర్.

శ్రియ

ఏబీసీడీ... మొదలైందండీ

మలయాళంలో మంచి విజయాన్ని అందుకున్న చిత్రం 'ఏబీసీడీ'. ఇప్పుడు అదే పేరుతో తెలుగులో రీమేక్ చేస్తున్నారు. అల్లు శిరీష్ కథానాయకుడు. రుక్సార్ ధిల్లాన్ కథానాయిక. సంజీవ్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. మధుర శ్రీధర్, యష్ రంగినేని నిర్మాతలు. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నిచ్చారు. సురేష్‌బాబు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. "తెలుగు వాతావరణానికి తగ్గట్టు కొన్ని కీలకమైన మార్పులు చేశాం. బాల నటుడిగా అలరించిన మాస్టర్ భరత్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. కన్నడలో విజయవంతమైన చిత్రాలకు సంగీతం అందించిన జుధా సాంధీ స్వరాలు సమకూరుస్తున్నార"ని చిత్రబృందం తెలిపింది.

అల్లు శిరీష్, రుక్సార్ ధిల్లాన్‌పై క్లాప్‌నిస్తున్న అల్లు అరవింద్

116 మందికి కథ చెప్పా!

"మా సినిమాకి ముందు 'కుడి ఎడమైతే..' అనే పేరు పెట్టాలనుకొన్నాం. కానీ ఆత్మలు మారే కథ కాబట్టి 'జంబలకిడి పంబ' అనే పేరు పెట్టమని సూచించారు శ్రేయోభిలాషులు. ఆ పేరు పెట్టినప్పుడూ.. ఇప్పుడూ భయంగానే ఉంది. ప్రేక్షకులు పాత చిత్రాన్ని ఊహించుకొని వస్తారేమో అనే ఆ భయం. కానీ మా సినిమా ఆ పేరుని మాత్రం చెడగొట్టదు. ఒక మంచి కుటుంబ కథగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంద"న్నారు జె.బి.మురళీకృష్ణ (మను). 'రైట్ రైట్'తో దర్శకుడిగా పరిచయమైన ఆయన, పలు చిత్రాలకి రచయితగా పనిచేశారు. ఇటీవల 'జంబలకిడి పంబ' తెరకెక్కించారు. శ్రీనివాసరెడ్డి, సిద్ధి ఇద్నాని జంటగా నటించారు. చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా జె.బి.మురళీకృష్ణ హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"యువతరం ఆలోచనలు, పెళ్ళి, కుటుంబం తదితర విషయాల్ని దృష్టిలో ఉంచుకొని ఈ కథ రాసుకున్నా. ప్రేమించుకొని పెళ్లి చేసుకొన్న ఓ జంటకి కొన్నాళ్లకి కలహాలు మొదలవుతాయి. ఆ తర్వాత ఎవరూ ఊహించని రీతిలో అబ్బాయి అమ్మాయిగా, అమ్మాయి అబ్బాయిగా మారిపోతారు. అలా ఎలా మారారు? ఆ తర్వాత ఏం జరిగిందనే విషయాలతో ఈ చిత్రం సాగుతుంది. ఈ సినిమాలో కథానాయకుడు శ్రీనివాసరెడ్డి అనగానే హాస్యం పరంగా చాలా మార్పులు చేశాం. సినిమా చేసేటప్పుడు ఆయన తప్ప మరొకరు ఇంతగా న్యాయం చేయలేరేమో అనిపించింది. శ్రీనివాసరెడ్డితో పాటు, సిద్ధి ఇద్నానీ కూడా చాలా బాగా నటించారు".

❑ "ఈ కథని మొత్తం 116 మందికి చెప్పా. అందరికీ నచ్చింది. కాకపోతే ఆత్మలు మారడం అనేది సవాల్‌తో కూడుకున్న విషయం కావడంతో ఈ సినిమా పట్టాలెక్కడానికి సమయం పట్టింది. సహనిర్మాత సురేష్‌రెడ్డి మొదట ఈ కథ విన్నారు. అయితే పూర్తి బడ్జెట్ పెట్టలేనని చెప్పారు. రవి, జోజోలకి ఈ కథ నచ్చడంతో సినిమా మొదలైంది. 'మేడ మీద అబ్బాయి' సమయంలోనే ఈ కథని అల్లరి నరేష్‌కి చెప్పి, 'జంబలకిడి పంబ' అనే పేరు గురించి ఆయన అనుమతి తీసుకున్నా. రేలంగిగారు అప్పట్లో వాళ్ల గ్రూప్‌కి పెట్టుకున్న పేరే 'జంబలకిడి పంబ' అని, అక్కడి నుంచే ఈవీవీగారు తీసుకొన్నారని నరేష్ నాతో చెప్పారు".

❑ "నేను పుట్టి పెరిగింది విజయనగరంలో. మా నాన్న మలయాళీ, అమ్మ తెలుగు కుటుంబానికి చెందినవారు. దాంతో నాకు రెండు భాషలపై పట్టుంది. 'దృశ్యం' సినిమాకి తెలుగుతో పాటు తమిళం, మలయాళం భాషల్లోనూ పనిచేశా. విక్రమ్ కె.కుమార్ దగ్గర 'మనం'కి రచయితగా పనిచేశా. మొదట నేను రీమేక్ చిత్రం చేస్తాననుకోలేదు. నిర్మాత ఎమ్మెస్ రాజుతో నాకు మంచి అనుబంధం ఉంది. ఆయన చెప్పడంతో 'రైట్ రైట్' తెరకెక్కించా. మలయాళంలో విజవయంతమైన చిత్రమది. మన ప్రేక్షకులకు నచ్చలేదు. తదుపరి చిత్రం గురించి ఇంకా ఆలోచించలేదు. నా దగ్గర ఇప్పటికే పూర్తిగా సిద్ధం చేసుకొన్న ఐదు స్క్రిప్టులు ఉన్నాయి".

సరదాల శంకరుడు

షకలక శంకర్

షకలక శంకర్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'శంభో శంకర'. కారుణ్య కథానాయిక. శ్రీధర్ ఎన్ దర్శకత్వం వహించారు. వై.రమణారెడ్డి, సురేష్ కొండేటి నిర్మాతలు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈనెల 29న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "ఓ పెద్ద కథానాయకుడి చిత్రం కోసం ఎంత కష్టపడతామో.. ఈ సినిమా కోసం అంతే కష్టపడ్డాం. శంకర్‌ని కొత్త కోణంలో చూపించే సినిమా ఇది. తను పంచే వినోదం, వేసే స్టెప్పులు, చేసే ఫైటింగులు ఇవన్నీ అందరికీ నచ్చుతాయి. టీజర్‌కి వస్తున్న స్పందన ఆనందాన్ని కలిగిస్తోంద"న్నారు. నాగినీడు, అజయ్ ఘోష్, రవి ప్రకాష్, ప్రభు, ఏడిద శ్రీరామ్ తదితరులు నటించారు. సంగీతం: సాయి కార్తిక్

సైనికుడి పోరాటం


మోహన్‌లాల్

భారత సరిహద్దుల్లో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా మలయాళంలో తెరకెక్కిన '1971 బియాండ్ బార్డర్స్' తెలుగులో 'యుద్ధ భూమి' పేరుతో విడుదలవుతోంది. మోహన్‌లాల్, అల్లు శిరీష్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మేజర్ రవి దర్శకత్వం వహించారు. శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ పతాకంపై ఎ.యన్.బాలాజీ ఈ నెల 29న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "సైనికుల పోరాటం నేపథ్యంలో సాగే చిత్రమిది. నిజ జీవితంలో మేజర్ అయిన దర్శకుడు పలు ఆపరేషన్లలో పాలుపంచుకొన్నారు. ఆ అనుభవాలతోనే చిత్రాల్ని తెరకెక్కిస్తున్నారు. ఆయన తీసిన చిత్రాలన్నీ దేశభక్తి ప్రధానంగా సాగుతూ విజయాన్ని సొంతం చేసుకున్నవే. ఇందులోనూ భావోద్వేగాలు మనసుకు హత్తుకొనేలా ఉంటాయి. మోహన్‌లాల్ మేజర్‌గా, అల్లు శిరీష్ సైనికుడిగా కనిపిస్తార"న్నారు. ఈ చిత్రానికి సంగీతం: సిద్ధార్థ్ విపిన్.

పిడుగు వంటి పిడికిలెత్తి
ఉరుము వల్లె హుంకరిస్తే
దిక్కులన్ని పిక్కటిల్లురా
ఆశయాల అశ్వమెక్కి
అదుపులేని కదను తొక్కి
అవధులన్ని అధిగమించురా

గీతం: ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి..., చిత్రం: పట్టుదల
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి

– పంపినవారు: కె.వీరేశ్, కందుకూరు

అమితాబ్ చిత్రానికి షారుఖ్ నిర్మాత


అమితాబ్‌బచ్చన్, షారుఖ్‌ఖాన్

అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'బద్లా'. సుజయ్ ఘోష్ దర్శకత్వంలో వస్తోన్న ఈ చిత్రంలో తాప్సి మరో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ చిత్ర కథ నచ్చడంతో షారుఖ్‌ఖాన్ ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామి అయ్యాడు. సుజయ్ మాట్లాడుతూ "అమితాబ్‌బచ్చన్ ఈ చిత్రంలో నటించడంతోనే సగం విజయం దక్కేసింది. షారుఖ్ ఈ సినిమాను నిర్మిస్తుండటం ఆనందంగా ఉంది. తాప్సితో గతంలోనూ పనిచేశాను. ఇంత మంచి టీమ్ దొరుకుతుందనుకోలేదు. మంచి బృందం కుదిరింది కాబట్టి జాగ్రత్తగా తెరకెక్కించాలి" అని చెప్పారు.

సెంచరీ ఖాన్... సల్మాన్!

బాక్సాఫీసు బరిలో సెంచరీ కొట్టడమన్నది సల్మాన్ ఖాన్‌కు నీళ్లు తాగినంత సులువైపోయింది. తాజాగా విడుదలైన సల్మాన్ చిత్రం 'రేస్ 3' కూడా ఇప్పటికే రూ.100 కోట్ల వసూళ్లు దాటేసింది. ఈమధ్య బాలీవుడ్‌లో అగ్ర కథానాయకుల చిత్రాలు రూ.100 కోట్లు వసూలు చేయడమన్నది చాలా మామూలు విషయంగా మారింది. అందుకే ఇప్పుడు విడుదలైన తొలి వారాంతంలో అంటే మొదటి మూడు రోజుల్లోనే రూ.100 కోట్ల మార్కు అందుకుంటుందా లేదా అన్నదే ఆసక్తికరంగా మారింది. ఆ విషయంలో సల్మాన్ ఏ హీరోకూ సాధ్యంకాని రీతిలో దూసుకెళ్తూ తన సత్తా చూపుతున్నాడు. తొలి వారాంతంలోనే రూ.100 కోట్ల మైలురాయి దాటిన చిత్రాలు ఇప్పటివరకూ తొమ్మిది ఉంటే అందులో ఐదు చిత్రాలు సల్మాన్‌వే కావడం విశేషం. 'రేస్ 3'తో పాటు టైగర్ జిందా హై, బజరంగీ భాయిజాన్, సుల్తాన్, ప్రేమ్‌రతన్ ధన్ పాయో చిత్రాలతో ఆ ఘనత సాధించాడు సల్మాన్. ఆయన తర్వాతి స్థానాల్లో రెండు చిత్రాలతో ఆమీర్ ఖాన్, ఒక చిత్రంతో షారుఖ్ ఖాన్ ఉన్నారు. ఆమీర్ నటించిన 'దంగల్', 'ధూమ్ 3'; షారుఖ్ నటించిన 'హ్యాపీ న్యూ ఇయర్' మూడు రోజుల్లో సెంచరీ కొట్టేశాయి. వీటితో పాటు 'బాహుబలి: కన్‌క్లూజన్' హిందీ అనువాద చిత్రం కూడా ఆ ఫీట్ సాధించింది.

మాయ, అజయ్‌పై క్లాప్‌నిస్తున్న ఆకాష్

కొత్త ప్రేమకథ

అజయ్ కత్రువా, మాయ జంటగా సిరి క్రియేటివ్ వర్క్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'ప్రేమదేశం'. శ్రీకాంత్ సిద్ధం దర్శకత్వం వహిస్తున్నారు. శిరీష నిర్మాత. నీలిమ తిరుమల శెట్టి నిర్మాణ సహకారం అందిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు ఆకాష్ పూరి క్లాప్‌నిచ్చారు. ఆనంద్ రంగ గౌరవ దర్శకత్వం వహించారు. కథానాయకుడు అజయ్ మాట్లాడుతూ "విభిన్నమైన ప్రేమకథ ఇది. ఇందులో కాన్సెప్ట్ చాలా బాగుంటుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నీలిమ తిరుమల శెట్టి ఈ కథ విని సహకారం అందించడానికి ముందుకొచ్చారు. మణిశర్మ సంగీతం చిత్రానికి ప్రధాన బలం. అందరినీ అలరించేలా చిత్రాన్ని తీర్చిదిద్దుతాం" అన్నారు. ఆకాష్ మాట్లాడుతూ "అజయ్ నాకు మంచి మిత్రుడు. మేం ఇద్దరం కలిసి సినిమాలు చేశాం. తనకి ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నా" అన్నారు. శివకుమార్, రామచంద్ర వరప, వ్యాసకి, తనికెళ్ల భరణి, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: శేఖర్ గగనమోని, సంగీతం: మణిశర్మ.

ఫోనులో మాట్లాడాలంటే భయం!

నేను ఇంట్రోవర్ట్. నాకు ఫోనులో మాట్లాడటం కూడా పెద్దగా ఇష్టం ఉండదు. నేను మాట్లాడలేను కూడా. అయితే దీని వల్ల కొత్త ఉద్యోగం వెతుక్కోవడంలో సమస్య ఎదురవుతోంది. ఫోన్ ఇంటర్వ్యూలు అంటే కంగారుగా అనిపిస్తుంది. దాన్నుంచి బయటపడాలనుకుంటున్నా. ఇక ముందు అలాంటి పరిస్థితి వస్తే ఎలా మాట్లాడాలో సలహా ఇవ్వండి!

- ఓ సోదరి

డియర్ వసుంధర

డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

ఇప్పుడు చాలా సంస్థలు అభ్యర్థులతో నేరుగా మాట్లాడటం కన్నా ఫోన్ ఇంటర్వ్యూలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. దానివల్ల వాళ్లకీ, మీకు కూడా సమయం ఆదా అవుతుంది. పైగా ఒక వ్యక్తి ఫలానా ఉద్యోగానికి సరిపోతాడా లేదా అని తెల్సుకోవడం అధికారులకు దీనిద్వారా ఇంకాస్త సులభం. దీనికి కూడా మామూలు ముఖాముఖీ (ఇన్ పర్సన్ ఇంటర్వ్యూ) లాగే సిద్ధమవ్వాల్సి ఉంటుంది. దాంతో పాటే మరికొన్ని మెలకువలు తెలుసుకుంటే చాలు.

- ముందు మీరు ఆ సంస్థకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడం ముఖ్యం. దానివల్ల మీకు ఆ సంస్థ మీదా, దాని పనితీరు మీదా ఓ అవగాహన వస్తుంది.
- ఆ ఉద్యోగానికి సంబంధించిన వివరణ పూర్తిగా చదవండి. దానికి మీకున్న అనుభవం, తెలివితేటలు సరిపోతాయో లేదో ఆలోచించుకోండి. అప్పుడే అడిగిన ప్రశ్నలకు సమాధానాలివ్వగలరు.
- 'ప్రస్తుతం మీరు చేస్తున్న ఉద్యోగం ఎందుకు మారాలనుకుంటున్నారు?', 'మీకు మా సంస్థలో ఆసక్తికరంగా అనిపించిన విషయాలేంటి?'... ఇలా కొన్ని సర్వసాధారణంగా అడిగే ప్రశ్నలుంటాయి. వాటికి పక్కాగా సమాధానాలు చెప్పేలా సిద్ధమవ్వండి. వేతనానికి సంబంధించిన ప్రశ్నలడిగితే ఎలా సమాధానం చెప్పాలో నిర్ణయించుకోండి. మీరెంత జీతం ఆశిస్తున్నారూ, ఇంతకుముందు మీరు అందుకున్న జీతం ఎంత అనేది సరిగ్గా చెప్పగలగాలి.
- 'మీకేమన్నా ప్రశ్నలున్నాయా?' అని వాళ్లు కూడా అడగొచ్చు. అందుకే వాటి గురించి కూడా ఆలోచించాలి. ఆఫీసులో మీ ఉద్యోగం ఎలా ఉంటుందీ, మీ ప్రాధాన్యం ఏంటీ, ఆఫీసు వాతావరణం... లాంటి ప్రశ్నల్ని మీరు అడగొచ్చు.
- వీటితో పాటే మీరు ఫోన్ ఇంటర్వ్యూలో ఉన్నప్పుడు మీ చుట్టూ వాతావరణం వల్ల ఎలాంటి ఇబ్బందీ, ఆటంకం లేకుండా చూసుకోవాలి. సరిగ్గా సిగ్నల్స్ ఉండే స్థలంలో కూర్చుని ప్రశాంతంగా మాట్లాడాలి. ఫోన్ ఇంటర్వ్యూలో మన హావభావాలూ, ప్రవర్తన అవతలి వ్యక్తికి కనిపించవు. గొంతే ప్రధానమైంది. అందుకే స్పష్టంగా, తడబడకుండా మాట్లాడాలి. మరీ చిన్నగా, నెమ్మదిగా మాట్లాడకూడదు. ముఖాముఖి మొదలవగానే మీకు చెప్పే సూచనలు కూడా గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు 'మీకు ఇరవై నిమిషాల సమయం ఉంది' అని చెప్పారనుకోండి. వాళ్లడిగిన మొదటిప్రశ్నకే పదినిమిషాలు తీసుకోకూడదు. వీలైనంత స్పష్టంగా, సూటిగా, తక్కువ పదాల్లో సమాధానం ఇచ్చేలా చూసుకోవాలి. ఈ సూత్రాల్ని పాటిస్తూ ముందుగానే సిద్ధమై ఉంటే సులువుగానే మాట్లాడేస్తారు.

మీ ప్రశ్నల్ని vasucareer@eenadu.net కు పంపించగలరు.

ఎమర్జెన్సీ పర్సు ఉందా?

మనం బయటకు వెళ్తున్నామంటే.. వెంట బ్యాగు కూడా తప్పనిసరిగానే ఉంటుందిగా. అందులో మీకు సంబంధించిన వస్తువులు ఎన్ని ఉన్నా సరే.. చిన్న ఎమర్జెన్సీ పర్సు కూడా పెట్టుకోండి. ఎందుకో చదివేయండి మరి.

- ఒక్కోసారి నెలసరి తేదీని ముందుగా అంచనా వేయలేకపోవచ్చు. అలాంటప్పుడు ఏ ఇబ్బందీ ఎదురు కాకుండా ఉండాలంటే.. కనీసం రెండు శానిటరీ న్యాప్‌కిన్లు అందులో తప్పనిసరిగా ఉండాల్సిందే.
- ఉద్యోగం చేయడానికి వెళ్తున్నా... కాలేజీకయినా సరే సాయంత్రం అయ్యేసరికి ముఖం జిడ్డుగారిపోతుంది. ఈ సమస్య నుంచి బయటపడి ముఖం తాజాగా మార్చుకోవాలంటే చిన్న ఫేస్‌వాష్ కూడా అందులో తప్పనిసరే. అదే విధంగా మాయిశ్చరైజర్ కూడా. అప్పుడే మీరు ఇంటికొచ్చే వరకూ చర్మం తేమగా కనిపిస్తుంది. జుట్టు చెదరకుండా ఉండాలంటే చిన్న దువ్వెన కూడా తప్పనిసరే.

- ముఖానికి పట్టిన జిడ్డును అప్పటికప్పుడు వదిలించేందుకూ తాజాగా మార్చేందుకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడతాయి టిష్యూలు. కనీసం నాలుగైదయినా సరే పర్సులో పెట్టేయండి.
- జత రబ్బరుబ్యాండ్లూ, ఓ క్లిప్పు కూడా పెట్టుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు. బస్సూ, ఆటో, బండి సీటుకు తగిలి డ్రెస్ చిన్నగా చిరిగిందా... ఆ చిన్న చిరుగు మీ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఆ సమస్య లేకుండా ఉండాలంటే... కొన్ని సేఫ్టీ పిన్నుల్ని కూడా ఆ పర్సులో పడేయండి.
- కనీసం రెండుమూడొందల రూపాయలూ, కాస్త చిల్లరడబ్బును కూడా ఉంటే మంచిది.

వసుంధర

విపత్కర పరిస్థితుల్లో... వెన్ను చూపని సైనికుల సేవల్ని చిన్నతనంలోనే చూసిందామె. అందుకే ఆడపిల్లలు సుకుమారంగా పెరగాలి అనే ఆలోచనను ఎప్పుడూ దరిచేరనివ్వలేదు. సాహస క్రీడల్లో రాణిస్తూ, సేవాస్ఫూర్తిని పెంచుకుంటోన్న ఆమెకు యుద్ధవిమానాలు నడిపే పైలట్ ప్రకటన వెలుగు చుక్కలా కనిపించింది. అనుకున్నది సాధించింది. ఇప్పుడు ఆమె దక్షిణాది రాష్ట్రాల నుంచి తొలి మహిళా యుద్ధ విమాన పైలట్‌గా ఎంపికైంది. ఆ విజేతే కర్ణాటకకు చెందిన మేఘనా షాన్‌బోగ్. ఆ వివరాలను వసుంధరతో ప్రత్యేకంగా ముచ్చటించింది.

అంబరాన 'మేఘనా'రి

మాది కర్ణాటక రాష్ట్రంలోని చిక్కమగళూరు జిల్లా మర్లె. పశ్చిమ కనుమల పరిసరాల్లో ఉండే మాకు కుండపోత వర్షాలూ, వరదలు కొత్తేమీ కాదు. కొండ చెరియలు విరిగిపడి, వరదల్లో కొట్టుకుపోయే వారి గురించి నిత్యం వార్తల్లో వినటం మాకు అలవాటే. వీరిని కాపాడేందుకు సైనిక బృందాలు చేసే రక్షణ చర్యలూ, వారి సాహసాలు వింటూనే పెరిగా. ప్రాణాలకు తెగించి ఎప్పటికప్పుడు వీరు చూపే చొరవ నాలో ఉత్తేజాన్ని పెంచేది. కానీ ఈ బృందాల్లో మహిళల సంఖ్య పేరుకే అని తెలిశాక ఈ రంగాన్నే ఎంచుకోవాలనుకున్నా. మహిళల గురించి అమ్మానాన్నలు చెబుతుంటే విని స్ఫూర్తి పొందా. కానీ రక్షణ రంగంలో ఆ స్థాయి మహిళా అధికారులు లేరు. అది తెలిశాకే సాధారణ పైలట్ కాకుండా... యుద్ధ విమాన పైలట్‌గా మారాలనుకున్నా. ఆ ఆలోచన నాకు అరుదైన గుర్తింపునే తెచ్చిపెట్టింది. వాయుసేనలో దక్షిణాది రాష్ట్రాల నుంచి తొలి మహిళా యుద్ధ పైలెట్‌గా అర్హత సాధించా.

అందుకే ఇంజినీరింగ్...

అమ్మా, నాన్నలిద్దరూ న్యాయవాదులు. నాన్నకేమో నేను ఐఏఎస్ చదవాలని ఉండేది. పదో తరగతి తరువాత నాకు కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగాల కన్నా ఏదైనా సాహసోపేతమైన వృత్తిలో స్థిరపడాలని అనిపించింది. బోర్డింగ్ స్కూల్లో చేరటంతో స్వతంత్రంగా ఆలోచించే అవకాశం కూడా పెరిగింది. అప్పట్లో చిక్కమగళూరు, హాసన్ జిల్లాల్లో వరదల గురించి ఎక్కువగా మాట్లాడుకునేవారు. అప్పుడు మా పాఠశాల ప్రిన్సిపల్ సైనికులు హెలికాప్టర్ల ద్వారా బాధితుల్ని రక్షించటం గురించి మాకు పాఠాలుగా చెప్పేవారు. అప్పుడే నేనూ పైలట్ కావాలని అనుకున్నా. స్కూల్లో ఉన్నప్పుడే పర్వతారోహణ, సైక్లింగ్ చేశా. ఇంటర్ అయ్యాక రక్షణ రంగంపై ఉన్న ఆసక్తితో ఎన్‌డీఏలో చేరాలనుకున్నా. కానీ ఎన్‌డీఏలో మహిళలకు ప్రవేశాలు లేవని తెలిసి బాధనిపించింది. అక్కడ చేరితే ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్... ఇలా ఏదో ఒక విభాగం ఎంచుకోవచ్చు. అయితే మ్యాథ్స్, ఫిజిక్స్ అంశాలుగా ప్లస్‌టూతో పాటు బీఈ, బీటెక్ అర్హత ఉంటే ఫ్లైయింగ్ రంగంలోకి వెళ్లడం సులువని తెలిసింది. అందుకే మరో ఆలోచన లేకుండా మైసూరు ఎస్‌జేసీఈలో ఇంజినీరింగ్‌లో చేరా. నా లక్ష్యాన్ని మరింత సులువు చేసుకునేందుకు చేరిన తక్కువ కాలంలోనే ఓ అడ్వెంచర్ క్లబ్ ప్రారంభించా. నా స్నేహితుల్ని పోగేసుకుని వేసవి సెలవుల్లో ట్రెక్కింగ్, రాఫ్టింగ్, మౌంటెనీరింగ్ చేసేదాన్ని. మలెనాడు ప్రాంతాల్లోని ముళ్లయ్యనగిరి, బాబాబుడన్‌గిరి వంటి పర్వత శ్రేణులను అధిరోహించటం అలవాటు చేసుకున్నా. బహుశా ఈ క్లబ్ కార్యక్రమాలే పారా గ్లైడింగ్, యుద్ధ విమాన కాక్‌పిట్‌కు నన్ను మరింత దగ్గర చేశాయని అనుకుంటున్నా.

గోవాలో చేసిన సాహసాలే...

ఇంజినీరింగ్ చివరి సెమిస్టర్‌లో ఉండగా గోవా బీచ్‌లో పారా గ్లైడర్ పోటీలు నిర్వహించారు. అప్పటికే పర్వతారోహణల్లో కళాశాల స్థాయిలో పలు పోటీల్లో పాల్గొన్న నేను వాటికి సిద్ధమయ్యా. ఎవరి సాయం లేకుండానే వేల అడుగుల ఎత్తులో పారా గ్లైడింగ్ సాహసాన్ని పూర్తి చేశా. వైమానిక రంగానికి చెందిన ఎందరో అధికారులు దాన్ని చూసి ఆశ్చర్యపోవటంతో నాకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. అప్పటి నుంచి వారితో తరచూ చర్చిస్తూ యుద్ధ పైలట్ శిక్షణకు సంబంధించిన సమాచారాన్ని సేకరించుకున్నా. ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న తర్వాత ఐఐటీ అర్హత పరీక్ష కూడా రాశా. కానీ నేను కోరుకున్న ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో సీటు రాకపోవటంతో అసంతృప్తిగా అనిపించింది. నాన్నేమో ఐఏఎస్ చదవమన్నారు. దాంతో నేను అనుకున్నది సాధించలేనేమోనని భయపడ్డా. ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. అంతలోనే యుద్ధ విమాన కాక్‌పిట్‌లో మహిళా పైలట్‌లకు అవకాశం అని ఐఏఎఫ్ ఓ ప్రకటన ఇవ్వడంతో దరఖాస్తు చేసుకున్నా. ఐఏఎఫ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాయటం, ఎంపిక కావటం, దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో చేరటం జరిగిపోయాయి. ఇప్పటి వరకు 50 సార్లు పైలటస్, 90 సార్లుకుపైగా కిరణ్ యుద్ధ విమానాల్ని నడిపా. మిరాగ్, ఎంజీలను ఎలాగూ సైనిక బృందంలో చేరాక నడుపుతా. ఎప్పటికైనా అత్యంత క్లిష్టమైన రాఫెల్‌ను నడపాలని ఉంది. ఈ కోర్సు చేయాలనుకున్నప్పుడు గానీ, శిక్షణ సమయంలో గానీ దక్షిణాది రాష్ట్రాల్లో తొలి మహిళా యుద్ధ విమాన పైలట్ నేనే అనే విషయం తెలియదు. కానీ అమ్మానాన్నలు ఈ విషయాన్ని తెలుసుకుని గర్వపడుతుంటే నాకూ చెప్పలేనంత ఆనందంగా ఉంది. ప్రస్తుతం మా రాష్ట్రంలోని బీదర్‌లోనే అడ్వాన్స్‌డ్ ట్రైనీగా పోస్టింగ్ వేశారు. కర్ణాటకలోని అడవుల్లో పర్వతారోహణ చేస్తూ, సైక్లింగ్ చేస్తూ దూసుకుపోయిన నేను ఇప్పుడు యుద్ధ పైలట్‌గా ఈ గడ్డపై విహరించడం నిజంగా గొప్ప అనుభూతే. చిక్కమగళూరు అంటే కాఫీ తోటలకే కాదు మహిళా యుద్ధ విమాన పైలట్‌కీ ప్రసిద్ధి చెందిందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి వ్యాఖ్యానించటం నాలో మరింత ఉత్తేజాన్ని నింపింది.

ఆరునెలల తరువాతే...

శిక్షణలో చేరీ చేరగానే విమానం ఇచ్చేస్తారనుకున్నా. కానీ నేను అనుకున్నట్లుగా జరగలేదు. ఆరునెలలు తరగతిలోనే శిక్షణ ఇచ్చారు. ఆ తరువాతే ప్రాక్టికల్ ట్రైనింగ్ అని చెప్పారు. పోనీ ఆ తరువాతైనా విమానం ఎక్కనిస్తారనుకున్నా. కానీ అదీ వెంటనే జరగలేదు. దానికి కారణం నేను అమ్మాయిని కావడమే. మా బృందంలో మొత్తం 23 మంది ఉంటే... అందులో ఇద్దరమే అమ్మాయిలం. ప్రాక్టికల్ ట్రైనింగ్ మూడు విభాగాల్లో ఉంటుందని చెప్పారు. మొదటిది ఫ్లైట్ అయితే రెండోది ట్రాన్స్‌పోర్టు మూడోది హెలికాప్టర్. ఇద్దరమే అమ్మాయిలం కావడంతో మమ్మల్ని ట్రాన్స్‌పోర్టుకి మార్చాలనుకున్నారు. అది నాకు ఇష్టంలేదు. చెప్పే ప్రయత్నం చేశా కానీ... వింటారని నమ్మకం లేదు. దాంతో భయపడ్డా. చివరకు ఏమనుకున్నారో ఏమో ఫ్లైయింగ్‌కే ఎంపికచేశారు. మరో అమ్మాయిని మాత్రం ట్రాన్స్‌పోర్టుకి మార్చారు. అలా ఆర్నెల్లు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూశాక మొదటిసారి విమానం నడిపా. ఆ రోజు ఎప్పటికీ మర్చిపోలేను.

అదీ సాధించా...

శిక్షణలో భాగంగా మాకు ప్రత్యేకంగా కేస్ స్టడీస్ అని ఉంటాయి. సాధారణంగా అయితే విమానం నడుపుతున్నప్పుడు ఓ శిక్షకుడు మా పక్కన ఉంటాడు. కానీ ఈ కేస్‌స్టడీస్‌లో మాత్రం ఎవరికి వారే విమానాన్ని నడపాలి. అలాగే ఒక ప్రదేశం లేదా వ్యక్తి గురించి చెప్పి, చూసి గుర్తించి రమ్మంటారు. ఒకవిధంగా అది సాహసమే. శిక్షణ తీసుకునేవారిలో ప్రతి ఒక్కరూ ఈ కేస్‌స్టడీస్ అంటే భయపడతారు. అలాంటి అవకాశమే రాకూడదనుకుంటారు. కానీ నేను మాత్రం ఆ అవకాశం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురుచూశా. నాకు అప్పగించిన పనిని విజయవంతంగా పూర్తిచేశా.

కె.ముకుంద, ఈనాడు డిజిటల్, బెంగళూరు

వాహ్... వాచీ!

ఏదో ఒక వాచీ పెట్టుకుంటే చాల్లే అనుకునే రోజులు కావివి. వంద నుంచి వేల రూపాయల్లో ఎన్నో వెరైటీల్లో వాచీలు లభిస్తున్నాయి ఇప్పుడు. అందుకే నేటి తరం అమ్మాయిలు వీటిని ఎంచుకోవడంలోనూ తమదైన ప్రత్యేకతను చూపిస్తున్నారు. సందర్భానికో వాచీతో, స్టైలిష్ లుక్‌తో సందడి చేస్తున్నారు.

కొత్త ఫ్యాషన్‌లని అనుసరించాలన్నా... ట్రెండ్ సృష్టించాలన్నా కూడా కాలేజీ క్యాంపస్‌లే వేదికలు. ఫ్యాషన్‌ల ప్రస్తావన వచ్చినప్పుడు వాచీల గురించీ చెప్పుకోవాల్సిందే. టైం చూసుకోవడానికే వాచీలనేది పాత మాట. నయా డిజైన్లతో, ఫంకీ లుక్‌తో అమ్మాయిల్ని స్టైలిష్‌గా కనిపించేలా చేయడంలో వీటిది కీలక పాత్ర. అందుకే ఇప్పుడివి యాక్సెసరీల్లో ఓ భాగం అయ్యాయి. మరి అల్మారాలో తప్పనిసరిగా ఉంచుకోవాల్సిన వాచీల్లో కొన్నింటి గురించి చూద్దాం.

స్మార్ట్‌గా: టెక్నాలజీ ప్రభావంతో స్మార్ట్ వాచీలు స్టైలిష్‌గా వస్తున్నాయి. ఇవి జీన్స్ వేసుకున్నప్పుడు పెట్టుకోవచ్చు. అలానే సమావేశాలూ, సెమినార్లూ, విహారయాత్రలకు వెళ్లేటప్పుడు ఎంచుకున్నా సౌకర్యంగా ఉంటాయి. ఆహార్యం, ఫిట్‌నెస్ వంటి మీ అభిరుచులకు తగ్గట్లుగా ఇప్పుడు కొత్తగా ఎన్నో డిజైన్లలో వస్తున్నాయివి. ఫంకీ స్టైల్‌లోనూ కనిపిస్తున్నాయి.

ఆడంబరంగా: ఇప్పుడు రోజ్‌గోల్డ్ వాచీలు హాటెస్ట్ ట్రెండ్. ఇవి ఏ సందర్భానికైనా సరే చక్కగా నప్పుతాయి. ముఖ్యంగా ఆడంబరంగా వేసుకునే దుస్తుల మీదకు అనువైనవి. వీటి బ్రేస్‌లెట్‌లూ, కేస్‌లూ, డయల్స్‌కి రాళ్లూ, పూలూ వంటివి పొదిగి ఉండటంతో మరింత కొత్తగా కనిపించేలా చేస్తాయి.

రోజువారీ: స్కెలిటెన్ వాచీలు ట్యూనిక్‌లూ, కాఫ్తాన్‌లూ, గౌన్‌లు... వంటి వాటిమీదకు నప్పుతాయి. వీటిని కాలేజీకీ, ఆఫీసుకి రోజువారీగా వాడుకోవచ్చు.

బాయ్‌ఫ్రెండ్: ఈ వాచీలు చూడ్డానికి కాస్త పెద్ద డయల్, బెల్ట్‌తో ఉంటాయి. వీటిల్లో మెటాలిక్ రకాలూ మెప్పిస్తాయి. ఒకప్పుడు కేవలం మగవారికే పరిమితం అయిన ఈ రకం ఇప్పుడు మహిళలకీ అందుబాటులో ఉంది. మహిళలు మెచ్చే డిజైన్‌లలో అయితే ఫెమినైన్ లుక్‌తో వస్తున్నాయి. చేతికి కొత్తందం తెచ్చిపెడుతున్నాయి. నీలెంగ్త్, కాఫ్‌లెంగ్త్ గౌన్‌లూ, మ్యాక్సీలూ, జీన్స్ ఇలా పాశ్చాత్య వస్త్రశ్రేణి మీదకు చక్కగా ఎంచుకోవచ్చు.

పార్టీలకు: పూలూ, జంతువుల ప్రింట్లతో కనికట్టు చేస్తాయి ప్రింటెడ్ వాచీలు. ఈ తరహా డిజైన్లు విహారయాత్రలూ, పార్టీలకు వెళ్లేటప్పుడు ఎంచుకుంటే మరింత ప్రత్యేకంగా కనిపిస్తారు. వీటిని సాదా దుస్తులమీదకూ జతగా ఎంచుకోవచ్చు.

మార్చుకునేలా: ఈ ఇంటర్‌ఛేంజబుల్ వాచీలు ప్రత్యేకంగా ఉండటమే కాదు..సందర్భాన్ని బట్టి మనకు నప్పేట్లుగానూ ఎంచుకోవచ్చు. పట్టీ మార్చుకుని ఎప్పటికప్పుడు కొత్తగా చేతికి పెట్టుకోవచ్చు.

చుట్టేస్తాయి: వ్రాప్‌వాచీలు చేతిని చుట్టేసినట్లు ఉంటాయి. లేయర్డ్ దుస్తుల మీదకీ ఇవి భలేగా ఉంటాయి. వస్త్రంతో తయారుచేసిన ఈ వాచీలు ఇప్పుడు కాలేజీ అమ్మాయిలు ఇష్టపడే హాట్ డిజైను.

చంకీగా: ప్రత్యేక స్టైల్ కనిపించాలంటే ఈ చంకీ వాచీలను ఎంచుకోవాలి. కేవలం డయల్ బెల్ట్‌తో పాటూ గొలుసులూ, చిన్న చిన్న బొమ్మలూ, పూసలూ వంటివన్నీ దీనిలో వేలాడుతుంటాయి. కాలేజీ అమ్మాయిలు ఏ తరహా దుస్తుల్ని ఎంచుకున్నా వీటిని పెట్టుకోవచ్చు.

చాయ్‌వాలీ అమ్మాయికి స్కాలర్‌షిప్ 3.8 కోట్లు!

చాయ్ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఓ పేద తండ్రి కలలను ఆ చిన్నారి నేరవేర్చింది. స్కూలు ఫీజు కట్టలేకపోవడంతో స్కూలు నుంచి బయటకు పంపించేసిన ఆ అమ్మాయే ప్రస్తుతం పన్నెండో తరగతిలో 98 శాతం మార్కుల్ని తెచ్చుకుని జిల్లాలోనే ప్రథమంగా నిలిచింది. ఆ కష్టమే ఆమెకు 3.8 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌ను తెచ్చిపెట్టింది. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక బాబ్సన్ కాలేజీ (మాసాచుసెట్స్)లో చదివే అవకాశాన్నీ అందించింది. ఆమే ఉత్తర్‌ప్రదేశ్ బులంద్‌షహర్‌కు చెందిన సుదీక్షా భాటి. నిరుపేద కుటుంబం. తండ్రి రోజంతా టీలు అమ్ముతూ... ఆ వచ్చిన ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించాలి. ఇదీ సుదీక్ష నేపథ్యం. ఆమెకు తొమ్మిదేళ్ల వయసున్నప్పుడు స్కూల్ ఫీజు కట్టకపోవడంతో ఆ స్కూలు యాజమాన్యం సుదీక్షను ఇంటికి పంపించేసింది. తరువాత తండ్రి ఆమెను ఊర్లోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాడు. దీంతో డబ్బు కట్టలేకే ఆ స్కూలుకి వెళ్తున్నావు అంటూ స్నేహితులూ, చుట్టుపక్కలవాళ్లు హేళనచేసేవారు. అసలు ఆడపిల్లలకు చదువెందుకూ అన్నవాళ్లూ లేకపోలేదు. ఈ అవమానాల్ని లెక్కచేయలేదు సుదీక్ష. ఇష్టంగా చదవడం మొదలుపెట్టింది. రాత్రీ, పగలూ తేడా లేకుండా కష్టపడింది. మంచి మార్కులతో అయిదో తరగతి పాసైంది. ఆ సమయంలోనే శివనాడార్ ఫౌండేషన్ సుదీక్షకు సాయం అందించింది. ఈ సంస్థ గ్రామీణ భారతంలో ఆర్థికంగా వెనుకబడి చదువుకోలేని తెలివైన విద్యార్థులకు సాయం చేస్తుంది. అలా ఆ సంస్థ సాయంతో విద్యాజ్ఞాన్ పాఠశాలలో చేరింది. 'ఎవరేం అన్నా నేను బాధపడలేదు. అనుకున్న లక్ష్యం సాధించినప్పుడు వీళ్లు నన్నేం చేయాలేరని నిర్ణయించుకున్నా. ఎవరైతే తమకు తాము సాయం చేసుకుంటారో వారికి దేవుడు కూడా తప్పక సాయం చేస్తాడని నమ్మా. స్కూలు టీచర్లు నాకు అండగా నిలబడ్డారు. నేనూ చదువునే నమ్ముకున్నా...' అంటుంది సుదీక్ష. అలా ఓ వైపు చదువుకుంటూనే వేసవిలో నిర్వహించే డ్యూక్ టిప్ (ఇండియా), పెన్సిల్వేనియా స్కూల్ ఫర్ గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (లెహెగ్, యూఎస్‌ఏ)ల్లో పాల్గొంది. స్కూల్లో చదువుతున్నప్పుడే అమ్మాయిలను స్కూల్‌కి పంపించమని 'వాయిస్ ఆఫ్ విమెన్' పేరిట ఒక అవగాహనా కార్యక్రమాన్నీ నిర్వహించింది. 'మా ప్రాంతంలో ఈవ్ టీజింగ్ ఎక్కువ. దాన్ని అరికట్టేందుకు కూడా పోరాడా. ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది....' అని చెబుతుంది. అలాగే ఇంటరు పూర్తి చేసింది. ఇప్పుడు స్కాలర్‌షిప్ సాయంతో అమెరికాలో చదవడానికి సిద్ధమవుతోంది.

బంగారం వెండి

18న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,850	32,200	31,750	31,700
ఆర్నమెంట్	29,750	30,040	29,450	29,400
వెండి (కిలో)	41,450	42,550	41,600	41,900
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,750	31,800	31,792	31,840
ఆర్నమెంట్	29,350	29,470	29,450	29,480
వెండి (కిలో)	41,300	42,500	41,300	43,000
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,610	32,020	-------	-------
ఆర్నమెంట్	29,400	29,780	2,945	2,948 గ్రా
వెండి (కిలో)	42,900	42,900	43.60	44.30 గ్రా

చదువు

10

ఈనాడు విజయవాడ మంగళవారం జూన్ 19, 2018 ■ e-mail: edc@eenadu.in

అప్పిచ్చి.. చదివించి.. కొలువిచ్చి!

బీవోబీ నుంచి 600 పీవోలు

పీజీ సర్టిఫికెట్ కోర్సుకి ఎంపిక చేసుకొని... దాన్ని పూర్తిచేయడానికి రుణం ఇచ్చి...ఆ తర్వాత ఉన్నత ఉద్యోగంలోకి తీసుకుంటాం అంటోంది బ్యాంక్ ఆఫ్ బరోడా. ఆరొందల పీవో పోస్టులకు ప్రకటన విడుదల చేసింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో అభ్యర్థులను మొదట కోర్సులోకి తీసుకుంటుంది. విజయవంతంగా ఉద్యోగంలో చేరి ఇదే బ్యాంకులో అయిదేళ్లు పూర్తి చేసుకుంటే తీసుకున్న రుణం మొత్తాన్ని లాయల్టీ బోనస్‌గా వెనక్కి ఇచ్చేస్తుంది.

ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా 600 పీవో పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. వీటికి ఎంపికైనవారు ముందుగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో పీజీ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేయాలి. ఆ తర్వాత స్కేల్ ఆఫీసర్ హోదాతో ఉద్యోగం లభిస్తుంది. ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పరీక్షలు, సైకోమెట్రిక్ అసెస్‌మెంట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో చూపిన ప్రతిభ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సిలబస్ అంతా ఐబీపీఎస్ పీవో పరీక్షల మాదిరిగానే ఉంటుంది. పరీక్షలో రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌లకు ప్రాధాన్యం కల్పించారు. తర్వాతి స్థానం క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌దే. ఈ రెండు విభాగాల్లో ఎక్కువ స్కోర్ సాధించినవాళ్లు లక్ష్యాన్ని అందుకోవడం తేలికవుతుంది. తాజా గ్రాడ్యుయేట్లు ఈ పోస్టుల కోసం ప్రయత్నించవచ్చు.

ఆన్‌లైన్ పరీక్ష

రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగంలో 75 మార్కులకు 50 ప్రశ్నలు ఉంటాయి. జనరల్ ఎకానమీ, బ్యాంకింగ్ అవేర్‌నెస్‌లో 40 ప్రశ్నలు వస్తాయి. వీటికి 40 మార్కులు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో 50 మార్కులకు 40 ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలకు 35 మార్కులు. మొత్తం 165 ప్రశ్నలతో 200 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. రుణాత్మక మార్కులు ఉన్నాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. దీంతోపాటు మరో యాభై మార్కులకు ఇంగ్లిష్‌లో డిస్క్రిప్టివ్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు 30 నిమిషాలు కేటాయించారు. లెటర్ రైటింగ్, ఎస్సేల నుంచి ఒక్కో ప్రశ్న చొప్పున వస్తాయి. అభ్యర్థులు ఆంగ్లంలో ఏ మేరకు రాయగలుగుతున్నారో పరిశీలిస్తారు. ఆబ్జెక్టివ్ పరీక్షలో అర్హత సాధిస్తేనే డిస్క్రిప్టివ్ ప్రశ్నపత్రం మూల్యాంకనం చేస్తారు.

ఏ విభాగానికి ఎంత ప్రాధాన్యం?

రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ విభాగంలో ప్రతి ప్రశ్నకు ఒకటిన్నర మార్కు కేటాయించారు కాబట్టి ఈ విభాగంపై ఎక్కువ దృష్టి సారించాలి. కంప్యూటర్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ ప్రశ్నలకు సూత్రాలు, ఎలాంటి గణన ప్రక్రియ అవసరం లేదు. జవాబు తెలిస్తే వెంటనే గుర్తించడం సాధ్యమవుతుంది. వీటిని వీలైనంత తక్కువ సమయంలో ముగించుకుని మిగిలిన సమయాన్ని రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లకు కేటాయించాలి. క్యూఏలో ప్రతి ప్రశ్నకు ఒకటింపావు మార్కు ఉంటుంది. అయితే ఈ విభాగంలో జవాబు గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టే కొన్ని ప్రశ్నలను చివర్లో సాధించాలి. రుణాత్మక మార్కులు ఉన్నాయి కాబట్టి తెలియని ప్రశ్నలను పూర్తిగా వదిలేయాలి. తర్వాత దశకు చేరుకోవాలంటే ప్రతి సెక్షన్‌లోనూ యాభై శాతం ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగేలా ఉండాలి. మొత్తం మీద అరవై శాతం మార్కులు సాధించినవారు విజేతలు కావడానికి అవకాశాలు ఉంటాయి. వీలైనంత వరకు అన్ని అంశాలనూ క్షుణ్ణంగా చదవాలి. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు ఎక్కువ సాధన చేయడం ద్వారా వేగం పెరుగుతుంది. పరీక్షకు పదిహేను రోజుల ముందు నుంచి రోజుకు కనీసం ఒక మాక్ టెస్టు రాయాలి. ఐబీపీఎస్ పీవో పాత ప్రశ్నపత్రాలు పరిశీలిస్తే ప్రశ్నల సరళిపై కొంత అవగాహన పెరుగుతుంది.

అర్హత సాధించాలంటే

ప్రతి విభాగంలోనూ సెక్షనల్ కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు రావాలి. పరీక్ష రాసిన అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఈ కటాఫ్ మార్కులను బరోడా బ్యాంకు నిర్ణయిస్తుంది. అలాగే మొత్తం అన్ని విభాగాల్లోనూ కలిపి నిర్ణయించిన కటాఫ్ మార్కులనూ సాధించాలి. ఇలా సాధించినవారి డిస్క్రిప్టివ్ పేపర్‌ను మూల్యాంకనం చేస్తారు. ఇందులోనూ అర్హత సాధించడం తప్పనిసరి. ఇలా అర్హత సాధించినవారి జాబితా నుంచి ప్రతి కేటగిరీలోనూ ఉన్న ఖాళీలకు నాలుగు రెట్ల సంఖ్యలో అభ్యర్థులను తర్వాతి దశ అయిన గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, సైకో మెట్రిక్ టెస్టుకు ఎంపికచేస్తారు. గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లోనూ కనీస అర్హత మార్కులు పొందితేనే తుది నియామకాలకు పరిగణనలోకి తీసుకుంటారు.

తుది నియామకం: ఆన్‌లైన్ రాతపరీక్ష (ఆబ్జెక్టివ్+డిస్క్రిప్టివ్), బృందచర్చ, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కులన్నింటినీ తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటారు. సైకోమెట్రిక్ పరీక్షలో అర్హత సాధిస్తే సరిపోతుంది.

పీజీ సర్టిఫికెట్ కోర్సు

కోర్సుకు ఎంపికైనవాళ్లు బోధన, భోజనం, వసతి అన్నింటికీ కలిపి రూ.3.45 లక్షలు ఫీజుగా చెల్లించాలి. ఈ ఫీజును 8 శాతం వడ్డీకి అందించేలా బరోడా బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుంది. పీవోగా విధుల్లో చేరిన తర్వాత 84 నెలల్లో (ఈఎంఐ విధానం) రుణాన్ని చెల్లించవచ్చు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో అయిదేళ్లు పూర్తిచేసుకున్న వారికి లాయల్టీ బోనస్‌గా ఈ ఫీజు మొత్తం (రూ.3.45 లక్షలు) తిరిగి చెల్లిస్తారు. కోర్సు వ్యవధి 9 నెలలు. మణిపాల్ క్యాంపస్ బెంగళూరులో తరగతులు నిర్వహిస్తారు. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్న వారికి మణిపాల్ యూనివర్సిటీ పోస్టు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది. అవసరం అనుకుంటే ల్యాప్‌టాప్ కోసం అదనంగా రూ.35,000 వరకు లోన్ సౌకర్యం కల్పిస్తారు.

ఖాళీలు, అర్హతలు

మొత్తం ఖాళీలు: 600

వర్గాల వారీ ఖాళీల వివరాలు: ఎస్సీ 90, ఎస్టీ 45, ఓబీసీ 162, జనరల్ 303. ప్రతి విభాగంలోనూ 4 శాతం ఖాళీలను దివ్యాంగులకు కేటాయించారు.

విద్యార్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 50 శాతం మార్కులు) జులై 2, 2018 నాటికి డిగ్రీ పూర్తిచేసినవాళ్లే అర్హులు.

వయసు: జులై 2, 2018 నాటికి 20 -28 ఏళ్లలోపు ఉండాలి. జులై 3, 1990 కంటే ముందు; జులై 2, 1998 తర్వాత జన్మించినవాళ్లు అనర్హులు. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు ఉన్నాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు: జులై 2

హాల్ టికెట్ల లభ్యం: జులై 18 నుంచి

ఆన్‌లైన్ పరీక్ష: జులై 28

పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.100; మిగిలిన అందరు అభ్యర్థులకు రూ.600

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: ఏపీలో అనంతపురం, చీరాల, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, పుత్తూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

విధుల్లో చేరిన తర్వాత!

విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్న అభ్యర్థులు మూడు నెలలపాటు ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో కొనసాగుతారు. అనంతరం జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ (స్కేల్-1 ఆఫీసర్) హోదా కేటాయిస్తారు. ఈ సమయంలో రూ.23,700 మూలవేతనంగా చెల్లిస్తారు. దీనికి అదనంగా డీఏ, హెచ్‌ఆర్‌ఏతోపాటు పలు ఇతర ప్రయోజనాలు ఉంటాయి. అన్ని రకాల ప్రోత్సాహకాలు కలిపి ముంబై లాంటి నగరాల్లో రూ.8 లక్షల వార్షిక వేతనాన్ని అందుకోవచ్చు. ఉద్యోగంలోకి చేరిన తర్వాత కనీసం మూడేళ్లపాటు విధుల్లో కొనసాగడం తప్పనిసరి. గడువులోగా వైదొలిగితే వడ్డీతోసహా చెల్లించాల్సిన ఫీజు బకాయి, శిక్షణ ఖర్చుల నిమిత్తం మరో లక్ష వసూలు చేస్తారు. మూడేళ్ల అనంతరం వైదొలిగితే ఫీజు బకాయి చెల్లిస్తే సరిపోతుంది. స్కేల్ -1 ఆఫీసర్‌గా విధుల్లో చేరినవాళ్లు ప్రతిభ, సీనియారిటీ ప్రాతిపదికన మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, ఆపై హోదాలకు చేరుకుంటారు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఈసీఐఎల్, హైదరాబాద్

సంస్థ: భారత అణుశక్తి విభాగానికి చెందిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్), హైదరాబాద్.

పోస్టులు: జనరల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అకౌంట్స్ ఆఫీసర్ తదితరాలు.

ఖాళీలు: 14 **అర్హత:** ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంబీఏ, పీజీ, సీఏ/ ఐసీడబ్ల్యూఏ, అనుభవం.

దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్

ఆన్‌లైన్ దరఖాస్తు: 20.06.2018 నుంచి 04.07.2018 వరకు. హార్డు కాపీలను పంపడానికి చివరి తేది: 16.07.2018.

వెబ్‌సైట్: http://www.ecil.co.in/

ప్రవేశాలు

ఐఐపీఈ, విశాఖపట్నంలో బీటెక్ ప్రోగ్రాములు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) 2018-19 విద్యా సంవత్సరానికిగాను బీటెక్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు: బీటెక్ **కాల వ్యవధి:** నాలుగేళ్లు

సీట్ల సంఖ్య: 100

విభాగాలు: పెట్రోలియం ఇంజినీరింగ్ (50), కెమికల్ ఇంజినీరింగ్ (50).

అర్హత: కనీసం 75శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత.

ఎంపిక: జేఈఈ (అడ్వాన్స్‌డ్)-2018 ర్యాంకు ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

దరఖాస్తు ఫీజు: రూ.1000.

చివరి తేది: 16.07.2018

వెబ్‌సైట్: http://iipe.ac.in/admissions/

వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం

సంస్థ: డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, వెంకటరామన్నగూడెం, తాడేపల్లిగూడెం దగ్గర, పశ్చిమ గోదావరి జిల్లా.

కోర్సులు: 1) ఎంఎస్సీ (హార్టికల్చర్) (48 సీట్లు)

అర్హత: హార్టికల్చర్‌లో బీఎస్సీ/ బీఎస్సీ (ఆనర్స్).

2) పీహెచ్‌డీ (హార్టికల్చర్) (12 సీట్లు)

అర్హత: హార్టికల్చర్‌లో ఎంఎస్సీ.

వయసు: 40 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

పరీక్ష తేది: 2018 ఆగస్టు 07, 08.

దరఖాస్తు: ఆఫ్‌లైన్.

చివరి తేది: 17.07.2018

వెబ్‌సైట్: https://www.drysrhu.edu.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

డైరెక్టరేట్ ఆఫ్ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్

సంస్థ: ఐకార్-డైరెక్టరేట్ ఆఫ్ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ (డీఎఫ్ఎండీ), ముక్తేశ్వర్ (ఉత్తరాఖండ్).

పోస్టులు: యంగ్ ప్రొఫెషనల్, ఎస్ఆర్ఎఫ్ తదితర ప్రాజెక్ట్ పర్సనల్. **ఖాళీలు:** 46

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ, నెట్, పీహెచ్‌డీ, అనుభవం. **ఇంటర్వ్యూ తేది:** 2018 జులై 16 నుంచి 18 వరకు.

వేదిక: ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఎఫ్ఎండీ, ఆర్గుల్ (ఐఐటీ క్యాంపస్ దగ్గర), జత్ని, ఖుర్దా, ఒడిశా-752050.

వెబ్‌సైట్: www.pdfmd.ernet.in

ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ

ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన కాలేజ్ ఆఫ్ హోమ్ సైన్స్‌లో తాత్కాలిక టీచింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ.

పోస్టు: టీచింగ్ అసోసియేట్(08 ఖాళీలు)

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ, బోధన అనుభవం.

ఇంటర్వ్యూ తేది: 20.06.2018

వేదిక: కాలేజ్ ఆఫ్ హోమ్ సైన్స్, చిన్మయ బాలనివాస్, ఎస్‌వీఎన్ కాలనీ, గుంటూరు. https://www.angrau.ac.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

డిప్లొమా బాటలో వ్యవసాయ డిగ్రీ!

ఎంసెట్‌లో 10 వేల లోపు ర్యాంకులు సాధించినా లభించని వ్యవసాయ, ఉద్యాన శాస్త్రాల సీట్లు తక్కువ పోటీతో సాధించుకునే సదవకాశం ఆయా కోర్సుల్లో డిప్లొమాల ద్వారా సాధ్యమవుతోంది. ఈ డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు ఎంసెట్‌తో సంబంధం లేకుండా వ్యవసాయ, ఉద్యాన శాస్త్రాల్లో నేరుగా డిగ్రీలోకి ప్రవేశించవచ్చు!

వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలు కళాశాలల్లో లభించే సీట్లలో 15 శాతాన్ని డిప్లొమా విద్యార్థుల కోసం కేటాయిస్తున్నాయి. గత ఏడాది నుంచి విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా అనుమతించిన ప్రైవేటు వ్యవసాయ కళాశాలల్లో సైతం సీట్లు కేటాయించడంతో విద్యార్థులకు అవకాశాలు పెరిగాయి. ఆయా విశ్వవిద్యాలయాలు ప్రత్యేక ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభావంతులను గుర్తించి వ్యవసాయ, ఉద్యాన శాస్త్ర డిగ్రీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిప్లొమా కోర్సులు పూర్తి చేసినవారి కోసం అగ్రిసెట్ ప్రకటన విడుదలయ్యింది. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన డిప్లొమా పూర్తిచేసినవారి కోసం హార్టీసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతోంది.

అగ్రి సెట్- 2018

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రిసెట్-2018 ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని వ్యవసాయ కళాశాలల్లో 112 సీట్లు అందుబాటులో ఉండగా (వ్యవసాయ డిప్లొమా 97, విత్తన పరిజ్ఞాన డిప్లొమాకు 13, సేంద్రియ వ్యవసాయం డిప్లొమాకు రెండు), వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 72 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు అవకాశం కల్పించారు.

తిరుపతి, బాపట్ల, నైరా వ్యవసాయ కళాశాలల్లో జులై 29న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు నిర్ణీత రుసుములు చెల్లించిన రశీదుతో కూడిన దరఖాస్తును కన్వీనర్, అగ్రిసెట్-2018, ఆఫీస్ ఆఫ్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి- 517502 అనే చిరునామాకు పంపాల్సి ఉంటుంది.

అగ్రిసెట్‌లో ఉత్తీర్ణులైన, అర్హులైన అభ్యర్థులకు నాలుగు సంవత్సరాల వ్యవసాయశాస్త్ర డిగ్రీలోకి ప్రవేశం కల్పిస్తారు. అగ్రిసెట్‌ను 120 మార్కులకు నిర్వహిస్తారు. ఓఎంఆర్ పత్రంలో గంటన్నర సమయంలో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఈ సెట్‌కు సిద్ధం అవుతున్న విద్యార్థులకు ప్రత్యేకించి సిలబస్ ఏమీ లేదు. డిప్లొమాలో ఉన్న కోర్సుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అన్ని సబ్జెక్టులనూ క్షుణ్ణంగా చదివితే చాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అగ్రానమీ, వృక్ష ప్రజనన శాస్త్రం, మృత్తికాశాస్త్రం, కీటకశాస్త్రం, తెగుళ్ల శాస్త్రం, ఉద్యాన శాస్త్రం వంటి కష్టమైన సబ్జెక్టులపై బాగా అవగాహన పెంపొందించుకుంటే మార్కులు సాధించవచ్చు. ఈ ఏడాది సుమారు ఐదు వేల మంది అగ్రిసెట్‌కు దరఖాస్తు చేసే అవకాశముంది.

హార్టీ సెట్- 2018

పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలో ఉన్న డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం హార్టీసెట్ 2018 ప్రకటనను విడుదల చేసింది. ఉద్యాన శాస్త్రంలో డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు, ప్రస్తుతం రెండో సంవత్సరం పరీక్ష రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

ఈనెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని నిర్ణీత రుసుములు చెల్లించి పూర్తిచేసిన దరఖాస్తును, రుసుము చెల్లింపు రశీదును జత చేసి రిజిస్ట్రార్, వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకట్రామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా- 534101 అనే చిరునామాకు పోస్టు ద్వారా, వ్యక్తిగతంగా చేర్చాల్సి ఉంటుంది.

జులై 18న విశ్వవిద్యాలయ కేంద్రమైన వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో మాత్రమే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. తెలుగు మాధ్యమంలో 200 బహుళైచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. రెండు గంటల సమయంలో ఓఎంఆర్ సమాధానం పత్రం ద్వారా సమాధానాలు గుర్తించాలి. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఉద్యానశాస్త్ర డిగ్రీలో డిప్లొమా అభ్యర్థుల కోసం 83 సీట్లు కేటాయించారు. డిప్లొమా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే పరీక్షలో ఉండడంతో అన్ని సబ్జెక్టులను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది రెండు నుంచి మూడు వేల దరఖాస్తులు అందవచ్చని అధికారులు భావిస్తున్నారు.

– పసుపులేటి వేణుగోపాల్, న్యూస్‌టుడే, తిరుపతి

ప్రత్యేక కోర్సుల్లోకి ప్రవేశ పరీక్ష

చెవిటి, మూగ, అంధత్వం ఉన్న దివ్యాంగులకూ, మానసిక వికాసం సరిగా లేని పిల్లలకు ప్రత్యేక అవసరాలు ఉంటాయి. వాటిని గుర్తించి తగిన మద్దతు ఇస్తే వారూ చదువుల్లో రాణించగలుగుతారు. అయితే ఆ దివ్యాంగులకు సేవలు, బోధన చేసేవారికి కొన్ని నైపుణ్యాలు ఉండాలి. వాటిని పొందాలంటే వారు కొన్ని కోర్సులు చేయాలి. ఆ కోర్సుల్లో చేరడానికి జాతీయస్థాయిలో ఒక ఉమ్మడి పరీక్ష ఉంది. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి పలు ఉద్యోగావకాశాలు ఉన్నాయి.

దివ్యాంగులకు ప్రత్యేకంగా బోధన, సేవలు అందించడానికి రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని పరిధిలో దేశవ్యాప్తంగా 450 సంస్థలు ఉన్నాయి. వీటిలో ఏడాది వ్యవధితో సర్టిఫికెట్ కోర్సులు, రెండేళ్ల డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. దాదాపు 17,500 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి అఖిల భారత స్థాయిలో పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్ విద్యార్హతతో ఈ కోర్సులకు పోటీ పడవచ్చు. డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ సహా పలు కోర్సుల్లో చేరవచ్చు. కోర్సులు పూర్తి చేసినవారు జాతీయ సంస్థలు, పాఠశాలలు, ఆసుపత్రులు, పునరావాస కేంద్రాలు, ఎన్జీవోలు మొదలైనవాటిలో ఉద్యోగాలు పొందవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో చాలా సంస్థల్లో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆ వివరాలు చూద్దాం...

ఇవీ కోర్సులు

- డిప్లొమా ఇన్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్
- డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపయిరిమెంట్)
- డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (మెంటల్ రిటార్డేషన్)
- డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్: ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్స్ / సెరిబ్రల్ పాల్సీ / డెఫ్ బ్లైండ్/ హియరింగ్ ఇంపయిరిమెంట్ / మల్టిపుల్ డిజెబిలిటీస్ / మెంటల్ రిటార్డేషన్/ విజువల్ ఇంపయిరిమెంట్ /
- డిప్లొమా ఇన్ హియరింగ్ ఎయిడ్ రిపయిర్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ
- డిప్లొమా ఇన్ హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్
- డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్
- డిప్లొమా ఇన్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్
- డిప్లొమా ఇన్ రిహాబిలిటేషన్ థెరపీ
- డిప్లొమా ఇన్ వొకేషనల్ రిహాబిలిటేషన్ (మెంటల్ రిటార్డేషన్)
- డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ (విజువల్ ఇంపయిరిమెంట్)

పరీక్ష ఇలా...

వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. అన్ని ప్రశ్నలూ ఆబ్జెక్టివ్ తరహాలోనే అడుగుతారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ ఒక్కో విభాగం నుంచి 25 చొప్పున ప్రశ్నలు వస్తాయి. హైస్కూల్ స్థాయిలో ప్రశ్నపత్రం ఉంటుంది.

అర్హత: 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత

ఆన్‌లైన్ దరఖాస్తులు: జూన్ 20 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు **దరఖాస్తు ఫీజు:** రూ. 500 **అడ్మిట్ కార్డులు:** జూన్ 25 నుంచి లభిస్తాయి. **పరీక్ష తేదీ:** జూన్ 30 **ఫలితాలు:** జులై 5న ప్రకటిస్తారు. www.rehabcouncil.nic.in

'సుగంధం' వెదజల్లని పార్కు!

- మౌలికవసతుల కల్పించి రెండేళ్లయినా ముందుకురాని ఔత్సాహికులు
- అటకెక్కిన అనుసంధాన రహదారి నిర్మాణం

ఈనాడు – గుంటూరు

దేశంలోనే అతిపెద్ద సుగంధ ద్రవ్యాల పార్కుకు శంకుస్థాపన చేసి దశాబ్దం గడిచినా ఇంకా అభివృద్ధి పట్టాలు ఎక్కలేదు. గుంటూరు జిల్లాలోని యడ్లపాడు మండలం మైదవోలు గ్రామంలో సుగంధ ద్రవ్యాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 124 ఎకరాల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటయ్యింది. 2008లో పార్కుకు శంకుస్థాపన చేసినప్పటి నుంచి నేటివరకు అడ్డంకులు కొనసాగుతూనే ఉన్నాయి. ఎట్టకేలకు 2015లో మౌలిక వసతుల కల్పన పూర్తికావడంతో అప్పటి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్కును ప్రారంభించారు. ఇక్కడ యూనిట్లు స్థాపించేవారికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని ఔత్సాహికులను ఆహ్వానించారు. 16వ నంబరు జాతీయరహదారి నుంచి సుగంధద్రవ్యాల పార్కుకు 2.5 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల అనుసంధాన రహదారి నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరుచేస్తామని ప్రకటించారు. రెండేళ్లయినా హామీ అమలు కాలేదు. అనుసంధాన రహదారి లేక పారిశ్రామికవేత్తలు ఇటువైపు చూడటం లేదన్న వాదన ఉంది. పార్కుకు మరోవైపు నాగార్జునసాగర్ కాలువ గట్టు వెంబడి రహదారిని ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేస్తామన్న హామీ ఆచరణలో అమలుకాలేదు. యూనిట్లు స్థాపనకు అన్ని అనుకూలతలు ఉన్నా అనుసంధాన రహదారి లేకపోవడం అభివృద్ధికి ప్రతిబంధకంగా మారింది.

రూ.25 కోట్లతో మౌలిక వసతులు కల్పించగా సుగంధద్రవ్యాలు ఎగుమతి చేసే ప్రముఖ కంపెనీలు ఇక్కడ యూనిట్లు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. మొత్తం 58 ప్లాట్లుగా విభజించి ఔత్సాహికులకు అవకాశం కల్పించారు. 42 మంది ఔత్సాహికులు ముందుకు రావడంతో వారికి 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన సుగంధద్రవ్యాల బోర్డు రిజిస్ట్రేషన్ చేసింది. ఇందుకు ఎకరా భూమికి 30ఏళ్లకు లీజు కింద రూ. 7.50లక్షలు సొమ్ము వసూలుచేశారు. రెండేళ్ల కిందట లీజు ఒప్పందాలు పూర్తిచేసుకున్న సంస్థలు ఇప్పటికీ యూనిట్ల స్థాపనకు చర్యలు చేపట్టలేదు. ఈ క్రమంలో సుగంధ ద్రవ్యాలబోర్డు ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ చేసుకోవడానికి వీలుగా యూనిట్‌ను మాత్రం స్థాపించారు. మిర్చితోపాటు పసుపు, ధనియాలు, వాము, సిమ్ తులసి తదితర 12 రకాల సుగంధాలు ఈ పరిసర ప్రాంతాల్లో సాగుచేస్తున్నారు. అటు వ్యాపారులకు... ఇటు రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని పార్కు ప్రారంభించినా అభివృద్ధి అడుగులు పడటంలేదు.

నిర్మాణాలు చేపట్టకపోతే లీజు రద్దు

సుగంధ ద్రవ్యాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మే నెల 11న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహిస్తున్నారు. ప్లాట్లు కేటాయించి రెండేళ్లయినా నిర్మాణాలు మొదలుపెట్టనందున వారందరికీ నోటీసులు ఇచ్చామని అధికారులు తెలిపారు.

మెగాసీడ్ పార్కుపై 20, 21 తేదీల్లో కార్యశాల

ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా తంగెడంచ మెగాసీడ్ పార్కుపై ఈ నెల 20, 21 తేదీల్లో విజయవాడలో కార్యశాల నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి చంద్రమోహన్‌రెడ్డి ఈ కార్యశాలను ప్రారంభిస్తారన్నారు. సోమవారం గుంటూరులోని వ్యవసాయ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీసీడ్స్ ఎండీ బాలకృష్ణతో కలిసి మురళీధర్‌రెడ్డి మాట్లాడారు. ఆయోవా రాష్ట్ర విశ్వవిద్యాలయానికి చెందిన సంచాలకుడు, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ఉప కులపతులు కార్యశాలకు హాజరతున్నట్లు వెల్లడించారు. సీడ్ పార్కులో మొదట విడతను రాబోయే రెండు సంవత్సరాల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

కౌన్సెలింగ్ జాబితాలో కళాశాలల పేర్లు గల్లంతు

● కేంద్రం నిర్వాకమే కారణం ● మలివిడత కౌన్సెలింగ్ నాటికి అవకాశం!

ఈనాడు – అమరావతి

కేంద్రం నిర్వాకంతో యూజీ తొలివిడత వైద్య ప్రవేశాల కౌన్సెలింగ్ వైద్య కళాశాలల జాబితాలో గల్లంతైన కళాశాలలకు మలివిడత కౌన్సెలింగ్‌లో స్థానం కల్పించనున్నారు. నీట్ ద్వారా దేశ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 15% సీట్లను జాతీయ కూటమి ద్వారా భర్తీ చేస్తున్నారు. రాష్ట్రానికి చెందిన ఒంగోలు, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలు, విజయవాడ దంత వైద్య కళాశాల పేర్లు, సీట్ల వివరాలు ఈ జాబితాలో లేవు. తెలంగాణకు చెందిన కళాశాలలతోపాటు దేశవ్యాప్తంగా 27 కళాశాలల వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించలేదు. మరోవైపు, తొలివిడత కౌన్సెలింగ్ మంగళవారంతో ముగియనుంది. దిల్లీలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ విజ్ఞాన సంస్థ మధ్య సమన్వయం లోపించడంతో తలెత్తిన సాంకేతిక సమస్య ఇప్పటివరకు పరిష్కారంకాక విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కళాశాలల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు సోమవారం ప్రయత్నించినా కుదరలేదు. దీనివల్ల మలివిడత కౌన్సెలింగ్ వైద్య కళాశాలల జాబితాలోకి చేరుస్తారని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ సీవీరావు తెలిపారు.

ఫాతిమా బాధిత విద్యార్థుల కోసం

కడప జిల్లా ఫాతిమా వైద్య కళాశాల బాధిత విద్యార్థులకు యాజమాన్యం నుంచి తిరిగి డబ్బు ఇప్పించే విషయమై తర్జనభర్జనలు సాగుతూనే ఉన్నాయి. 2018 నీట్ ద్వారా బాధిత విద్యార్థుల్లో కొందరికి మంచి ర్యాంకులు వచ్చాయి. తిరిగి ఎంబీబీఎస్ చదివేందుకు వీరిలో కొందరు ఆసక్తి కనబరుస్తున్నారు. వీరికి ఫాతిమా వైద్య కళాశాల యాజమాన్యం ఫీజును చెల్లించే విషయమై సంప్రదింపులు జరుగుతున్నాయి.

ఆర్వీఎస్ వైద్య కళాశాల సమస్యలను పరిష్కరించాలి!

చిత్తూరు జిల్లా ఆర్వీఎస్ వైద్య కళాశాల యాజమాన్యంతో ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి సీవీరావు, ఇతర అధికారులు సోమవారం విజయవాడలో చర్చించారు. తగిన బోధన జరగడంలేదని, మౌలిక సదుపాయాలు కల్పించడంలేదని, ఇతర సమస్యల్ని పరిష్కరించడంలేదని విద్యార్థులు విశ్వవిద్యాలయానికి ఫిర్యాదుచేశారు. తదుపరి చర్యల్లో భాగంగా యాజమాన్యం నుంచి వివరణ కోరిన ఉపకులపతి నెలాఖరులోగా సమస్యలను పరిష్కరించి విద్యార్థుల నుంచి సంతకాలతో కూడిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

ఎయిమ్స్ ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

పంజాబ్ విద్యార్థినికి మొదటి ర్యాంకు

ఎలీజా బన్సల్

దిల్లీ: ప్రతిష్ఠాత్మక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)లలోని ఎంబీబీఎస్ కోర్సు ప్రవేశ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. పంజాబ్‌లోని లహరాగాగా పట్టణానికి చెందిన ఎలీజా బన్సల్‌కు మొదటి ర్యాంకు దక్కింది. భటిండా విద్యార్థిని రామ్‌నీక్ కౌర్‌కు రెండో ర్యాంకు వచ్చింది. పంచకుల పట్టణానికి చెందిన మెహక్ అరోరాకు మూడో ర్యాంకు దక్కింది. రాజస్థాన్‌లో శిక్షణ తరగతులకు పేరున్న కోట పట్టణంలో అలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు మొదటి పది ర్యాంకుల్లో తొమ్మిది కైవసం చేసుకున్నారు. అఖిల భారత ర్యాంకుల్లో 2 నుంచి 10 వరకు ఈ సంస్థకు చెందిన విద్యార్థులు దక్కించుకున్నారు. దిల్లీ, మంగళగిరి, పట్నా, భోపాల్, జోధ్‌పూర్, భువనేశ్వర్, రిషికేశ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్‌లలోని ఎయిమ్స్‌లలో ప్రవేశాల కోసం గత నెల 26, 27 తేదీల్లో ఈ పరీక్ష జరిగింది. 3.74 లక్షల మందికిపైగా విద్యార్థులు దీనికి హాజరుకాగా. .7,617 మంది ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు. వీరికి తొలి దశ సీట్ల కేటాయింపు ప్రక్రియ ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే అవకాశముంది.

మెరిసిన సిక్కోలు విద్యార్థులు

రవికిరణ్

జయదీప్

అనిరుధ్‌బాబు

రాజాం, పాతపట్నం, పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: ఎయిమ్స్-2018 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లాకు విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలోని రాజాం నగర పంచాయతీ డోలపేటకు చెందిన వారాడ రవికిరణ్ 58వ ర్యాంకు సాధించాడు. శ్రీకాకుళం నగరానికి చెందిన మెండ జయదీప్ ఓపెన్ కేటగిరీలో 213వ ర్యాంకును, ఓబీసీ విభాగంలో 32వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. పాతపట్నం మేజరు పంచాయతీకి చెందిన అంకడాల అనిరుధ్‌బాబు 245వ ర్యాంకు సాధించాడు. ఎయిమ్స్ దిల్లీలో ఎంబీబీఎస్‌లో చేరుతానని రవికిరణ్ తెలిపాడు. హృద్రోగ నిపుణుడు కావాలన్నదే తన లక్ష్యమని తెలిపాడు. విజయవాడలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అనిరుధ్‌బాబు వైద్యవృత్తిని చేపట్టాలన్న లక్ష్యంతో ఈ పరీక్షలకు హాజరయ్యాడు.

శ్రీ చైతన్య ప్రభంజనం

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక ఎయిమ్స్ ఎంబీబీఎస్ 2018 ఫలితాల్లో తమ విద్యార్థులు విజయభేరి మోగించినట్లు శ్రీ చైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్‌తో పాటు అన్ని కేటగిరీల్లోనూ ఆలిండియా 4, 5, 5, 6, 7, 14, 23, 24, 26, 31 వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు 100లోపు 26ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు వెల్లడించారు. నీట్‌కు శిక్షణ ప్రారంభించిన తర్వాత తెలుగు రాష్ట్రాల నుంచి ఎయిమ్స్, జిప్‌మర్ వంటి సంస్థల్లో అత్యధిక సంఖ్యలో ప్రవేశాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఇంతటి ఘనతను సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని ఆమె అభినందించారు.

నారాయణ విద్యార్థుల హవా

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఎయిమ్స్ ఎంట్రన్స్‌లో నారాయణ విద్యార్థులు సంచలన విజయాలు నమోదు చేసినట్లు ఆ విద్యా సంస్థల డైరెక్టర్లు డా.పి.సింధూర, పి.శరణి ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా 2వ ర్యాంకుతో పాటు 11, 17, 19, 21, 47, 55, 57, 62, 77, 82 వంటి టాప్ 100లోపు ఆల్‌కేటగిరీ ర్యాంకులతో ఆధిక్యత ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఎంసెట్ కేసెట్, నీట్, జిప్‌మర్ వంటి ఎంట్రన్స్‌లలో టాప్ ర్యాంకులు సాధించిన తమ విద్యార్థులు ఎయిమ్స్‌లోనూ అగ్రస్థానంలో నిలిచారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన భాష్యం

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఎయిమ్స్-2018 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో సత్తా చాటారని ఆ విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. సోమవారమిక్కడ ఆయన మాట్లాడుతూ.. తమ విద్యార్థులు జమ్ముల అరుణ్‌యాదవ్ 16, దాసరి జయాంశులేఖ 32, కట్రావత్ విజయ్‌నాయక్ 77, సముద్రాల రిత్విక్ 126, పాములపాటి శ్రీచరణ్ 154, మద్దెన సాయిశ్రీసౌమ్య 520వ ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. పాఠశాల స్థాయి నుంచే 'భాష్యం మెడిఎయిమ్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం' ద్వారా శిక్షణ ఇవ్వడం వల్లే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని ఆయన వెల్లడించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులను ఛైర్మన్‌తో పాటు విద్యాసంస్థల సీఈవో భాష్యం హనుమంతరావు, ప్రిన్సిపల్ హరిబాబు అభినందించారు.

జగన్‌కు అవగాహన లేదు, వినడు: దేవినేని ఉమా

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టును ఏదోవిధంగా ఆపేందుకు జగన్, ఆయన పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నట్లు జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2009 వరకు 9.2శాతం పనులే జరిగాయని, ప్రస్తుతం 79శాతం పూర్తయ్యాయని ఆయన చెప్పారు. వెలగపూడి సచివాలయంలో మంత్రి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌కు అవగాహన లేదు, చెబితే వినడు, తెలుసుకోడు..అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఎంపీ విజయసాయిరెడ్డి పార్లమెంటులో ప్రశ్నలు వేసి సమాచారం రాబట్టి, దాన్ని పక్క రాష్ట్రాలకు ఇచ్చి ప్రాజెక్టును అడ్డుకునేలా లేఖలు రాయిస్తున్నాడని ఆరోపించారు. మరోవంక కోర్టుల్లో కేసులు వేయిస్తున్నారన్నారు. ప్రజాపద్దుల కమిటీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గంటా 23 నిముషాలు భాజపా నాయకుల ఇళ్లల్లో ఉన్నాడని, వీళ్లు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.

చంద్రబాబువి ఉత్తరకుమార ప్రగల్భాలు

- వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్ విమర్శ

ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి చంద్రబాబువి ఉత్తరకుమార ప్రగల్భాలని వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లడానికి రెండు రోజుల ముందుగానే సీఎం కేంద్రాన్ని తీవ్ర స్థాయిలో నిలదీస్తారంటూ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం చేశారని, తీరా అక్కడకు వెళ్లిన తరువాత ఏం జరిగిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ 11 శాతం వృద్ధి రేటు సాధించిందని ప్రధాని, ముఖ్యమంత్రుల ముందు చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటే కేంద్రం ప్రత్యేక హోదా, విభజన హామీలు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. నగరం గ్రామంలో గ్యాస్ లీకేజీ ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను, గాయపడిన వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చిన తెదేపా ప్రభుత్వం.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

పి.గన్నవరంలోజరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వై.ఎస్.జగన్

రైతన్నకు అండగా ఉంటాం

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు అండగా ఉంటామని జగన్ పేర్కొన్నారు. పగటి పూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పారు. ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్తును అందిస్తామని వెల్లడించారు. రైతు పండించిన పంటకు మద్దతు లేనప్పుడు వారిని ఆదుకోవడం కోసం రూ.30 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత హెరిటేజ్ కంపెనీని అభివృద్ధి చేసుకోవడం కోసం సహకార సంఘాల్లో డెయిరీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని జగన్ విమర్శించారు. తాము పాడిని ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. ప్రతి చోట డెయిరీలను ఏర్పాటు చేసి అసలు ధరకన్నా లీటరుకు రూ.4 అదనంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి రైతుకు రూ.12 వేల రుణాన్ని మే నెలలోనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు రైతులు చనిపోతే ఆ కుటుంబానికి రూ.5 లక్షలు ఇస్తామని స్పష్టం చేశారు. చిన్నా సన్నకారు రైతులకు బోర్లను ఉచితంగా వేయిస్తామని హామీ ఇచ్చారు.

8 వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు అనుమతి

- ఎంసీఐ నిషేధం నుంచి మినహాయింపు ఇచ్చిన సుప్రీం
- నిర్ణీత గడువులోగా లోపాలు సరిచేసుకోవాలని స్పష్టీకరణ
- అధికారులను జవాబుదారులుగా చేసిన ధర్మాసనం

దిల్లీ: మూడు రాష్ట్రాలకు చెందిన ఎనిమిది ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 800 వైద్య, దంతవైద్య సీట్లకు ప్రవేశాలు నిర్వహించుకునేందుకు సుప్రీం కోర్టు సోమవారం అనుమతించింది. కొన్ని లోపాలున్న కారణంగా పలు కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) లేవనెత్తిన లోపాలను నిర్ణీత గడువులోగా సరిదిద్దే బాధ్యతను బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు సుప్రీంకోర్టు అప్పగించింది. లోపాలను సరిదిద్దుకున్నదీ లేనిదీ మూడు నెలల తర్వాత ఎంసీఐ తనిఖీ చేయాలని జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, జస్టిస్ ఇందూ మల్హోత్రాల ధర్మాసనం ఆదేశించింది. ఒకవేళ లోపాలను సరి చేయకపోతే ఆయా రాష్ట్రాల వైద్య విద్య పర్యవేక్షకులుగా ఉండే ముఖ్య కార్యదర్శులు వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మంగళవారం మొదలయ్యే సీట్ల భర్తీ ప్రక్రియలో ఈ 800 సీట్లనూ చేర్చాలని తెలిపింది. తాము ఇలాంటి ఆదేశాలు ఇచ్చినంత మాత్రాన దీనినొక దృష్టాంతంగా తీసుకోరాదనీ, ప్రభుత్వ కళాశాలల్లోని 800 సీట్లు వృథా అయ్యే పరిస్థితి తలెత్తుతుందని భావించే ఈ ఉత్తర్వులు ఇస్తున్నామనీ ధర్మాసనం వివరించింది. అరకొర మౌలిక సదుపాయాలతో వైద్య విద్యను ఎలా అందిస్తారని బిహార్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ఒక దశలో ప్రశ్నించింది. 'వారు చికిత్స చేసేది జంతువులకు కాదు, మనుషులకు. ఇలాంటి లోపాలతో వైద్యవిద్యను ఎలా బోధిస్తారు? ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి మిడిమిడి జ్ఞానంతో వైద్యులు తయారవుతున్నారని గతంలో ఇదే న్యాయస్థానం ఒక తీర్పులో పేర్కొంది' అని గుర్తుచేసింది. ఈ ఒక్కసారికి అవకాశం కల్పిస్తే నిర్ణీత గడువులోగా లోపాలను సరి చేయిస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ మణీందర్ సింగ్ తెలిపారు. దానికి ధర్మాసనం అంగీకరిస్తూ- తదుపరి విచారణను సెప్టెంబరు 25వ తేదీకి వాయిదా వేసింది.

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కోకా రామచంద్రరావు మృతి

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

రామచంద్రరావు (ఫైల్ ఫొటో)

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కోకా రామచంద్రరావు (96) ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. కృష్ణా జిల్లా బందరులో 1922లో జన్మించిన రామచంద్రరావు మద్రాసు లయోలా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, అక్కడే న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. 1968లో హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 1984లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. భార్య ఉమాదేవి 2012లో మృతి చెందగా పెద్దకుమారుడు సుధాకర్ చెన్నైలో, రెండో కుమారుడు రవీంద్ర అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, మూడో కుమారుడు గౌతమ్ నగరంలోనే వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. రామచంద్రరావు భౌతికకాయాన్ని సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు సందర్శించి నివాళులు అర్పించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాల మధ్య రామచంద్రరావు భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి.

ఐఏఎస్ అధికారి ఎ.ఆర్.సుకుమార్‌పై అభియోగాలు

15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గోదాముల సంస్థ ఎండీగా పనిచేసిన సమయంలో తన సొంత ఆర్థిక ప్రయోజనాలకు నిధులను దుర్వినియోగం చేశారంటూ 1984 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎ.ఆర్.సుకుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం అభియోగాలు మోపింది. పదిహేను రోజుల్లో వాటికి లిఖితపూర్వకంగా లేదా వ్యక్తిగతంగా కలిసి సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. అలా చేయని పక్షంలో అందుబాటులో ఉన్న ఆధారాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలను తీసుకుంటామని పేర్కొంది. ఈ మేరకు ఇన్‌ఛార్జి ప్రధానకార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థల శాఖ ముఖ్యకార్యదర్శిగా ఎ.ఆర్.సుకుమార్ పనిచేస్తున్నారు. 2014 ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 2017 ఏప్రిల్ 21వ తేదీ వరకూ గోదాముల సంస్థ ఎండీగా పనిచేశారు. వివిధ పద్దుల నుంచి సంస్థకు చెందిన రూ.80,15,717లను అడ్వాన్సుల రూపంలో తీసుకుని వాటిని తన సొంత ప్రయోజనాలకు వినియోగించుకున్నారనేది ప్రధాన అభియోగం. సంస్థ ఆర్థిక యాజమాన్య నియమాలకు విరుద్ధంగా వ్యవహరించి క్రెడిట్ కార్డు సదుపాయాన్ని పొంది...తన వ్యక్తిగత అవసరాలకు దాన్ని వినియోగించుకున్నారనేది మరో అభియోగం. ఆడిట్‌లో ఈ లోపాలను గుర్తించారు. వాటిపైన ఆయన వివరణను రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

నిధులకు మంత్రుల చుట్టూ తిరిగే రోజులు పోవాలి

- పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సమీక్షలో మంత్రి లోకేశ్

ఈనాడు, ఈనాడు డిజిటల్, అమరావతి: ఎమ్మెల్యేలు నియోజకవర్గాల అభివృద్ధి పనుల కోసం మంత్రుల చుట్టూ తిరిగే రోజులు పోవాలని మంత్రి లోకేష్ అన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ రహదారుల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ. 1,600 కోట్లు కేటాయించామని, వీటికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులన్నింటినీ ఒకేసారి విడుదల చేస్తామని తెలిపారు. అందువల్ల ఎమ్మెల్యేలు నిధుల మంజూరు కోసం మంత్రుల చుట్టు తిరగాల్సిన అవసరం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేల నుంచి వచ్చిన వినతుల ఆధారంగా ఇప్పటికే నిధుల విడుదలకు సంబంధించి 96 నియోజకవర్గాలకు జీవోలు ఇచ్చామని, మిగిలినవి 15 రోజుల్లో జారీ చేస్తామని వివరించారు. రూ.3,575 కోట్ల ఖర్చుతో 2,440 రహదారులు, వంతెన నిర్మాణ పనులు చేస్తున్నామని తెలిపారు. భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ) పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం రోడ్డు అంబులెన్సులు అందించాలని ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పథక అమలుపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

103 ఎన్టీఆర్ సుజల క్లస్టర్లు ఏర్పాటు

గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధిచేసిన తాగు నీటిని అందించేందుకు ఉద్దేశించిన 'ఎన్టీఆర్ సుజల' కార్యక్రమంలో భాగంగా.. మరో ఆరు నెలల్లో 103 క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. రూ.221 కోట్ల నిధులతో 103 నీటిశుద్ధి కేంద్రాలు(మదర్ ప్లాంట్లు).. 2,655 పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "ఉద్దానంలో ఏడు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం పూర్తయింది. 136కి గానూ 135 పంపిణీ కేంద్రాలు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు అన్ని కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలి" అని అధికారులకు సూచించారు. 2019 లోపు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో వంద శాతం ఇంటింటికీ కుళాయి నీరు అందించాలని మంత్రి ఆదేశించారు.

ఉద్యోగ అవకాశాలు

WALK-IN INTERVIEW

POST	SALARY
Vice – Principal: 5 years teaching experience	₹40,000 to ₹60,000 + Perks
M.Sc & B.Tech freshers as Trainee Teachers. Basic subject skills in Mathematics, Physics or Chemistry required	₹10,000 to ₹15,000 + free boarding
Class Incharges: Qualification: P.G. Fluency in English is must	₹12,000 to ₹15,000 + Perks
P.E.T's	₹10,000 to ₹15,000 + Perks
Student Incharges (Male/Female) Qualification: Degree Electricians & Nurses	₹8,000 to ₹10,000 + free boarding and lodging

Walk in for an interview with original Certificates on 23rd & 24th June 2018 between 9.00 a.m. to 4.00 p.m. at our campus

VISWABHARATI
Estd: 1968
ENGLISH MEDIUM HIGH SCHOOL
IIT/ MEDICAL FOUNDATION
Gudivada, Krishna Dist., A.P
Phone: 6301173686, 8008832277
email: viswabharati@yahoo.com

SRI CHUNDI RANGANAYAKULU ENGINEERING COLLEGE
(Estd. 1999 : Approved by AICTE New-Delhi Affiliated to JNTUK-Kakinada,AP)
GANAPAVARAM(V),CHILAKALURIPET(M),GUNTUR DIST-522 619
✆ 99636 69623, 9505731569, 08647-256243; Fax : 08647-258120
Email : correspondent.screnggcollege@gmail.com

WANTED FACULTY

Applications are invited for
Professors / Associate Professors / Asst. Professors in the Dept of Civil, Mech, ECE, EEE, CSE, Physics, Chemistry, Maths, English, Network Engineer, System Administrator with CCNA / CCNP / MCSE Certification, DTP Operator, Lab Technicians and Lab-Asst for All Branches and office staff
Qualifications & Pay scale : As per the latest AICTE Norms
Send your Resume with testimonials should reach the principal office on or before 25/6/2018. Higher pay can be considered for deserving candidates from NIT / IITs/IISC and reputed Universities. Short listed candidates only will be called for Demo & interview with all Original Certificates.
- Preference will be given for sincere, hardworking with right attitude and passion to take a challenge along with B.Tech., M.Tech Ph.d. Qualification only.
- SCREC has a tradition of its staff a regular salary; However,the management has decided to disburse on 31st of every month.
- Outstanding faculty members will be rewarded cash prize & certificate of appreciation, performance based incentive.Encouragement for higher studies towards deserving candidates, Special allowance for Ph.D holders
- Best employee of the year for Teaching / Non Teaching category and many more.

Sd/- Secretary & Correspondent

SURFA COATS (INDIA) PRIVATE LIMITED
An ISO 9001 - 2008 Certified Company
A fast growing multi-crore and multi product decorative paint manufacturing Company based at Bangalore is on the look out for their Marketing Division in Andra Pradesh.

Sr. Sales Officer/ Middle Level Management

Young and dynamic Degree holders or MBA (Marketing) with minimum of 5 years Marketing experience. Should have thorough exposure to dealer network, institutional sales and wide contacts with builders, developers and architects. Result oriented persons with aggressive marketing skills etc. to solicit and promote company's business in similar line in responsible position would be preferred. Pleasing personality, positive attitude and good command over English and other languages are a pre-requisite. Age group 30-35 years.

Sales Executives

Either graduates or under graduates with 2-3 years experience in selling paint or allied products with flair for aggressive marketing. Should own a two wheeler.
Aspiring candidates may forward their resumes within 7 days quoting present and expected salary to:
HR MANAGER
SURFA COATS (INDIA) PVT. LTD.
No. 639, 46th 'A' Cross, 3rd Block,
Rajajinagar, Bangalore-560010
Email: surfa_hr@rediffmail.com

RECRUITMENT FOR ENGLISH INSTRUCTORS

IL & FS Education & Technology Services Ltd. (IL&FS ETS) requires English and Life Skills Trainer to work across all 13 districts of Andhra Pradesh- Anantapuram, Chittoor, East Godavari, Guntur, Kadapa, Krishna, Kurnool, Nellore, Prakasam, Srikakulam, Visakhapatnam, Vizianagaram, West Godavari.
The Trainer shall be deployed to impart the functional English and Life skills training in Schools. The selection process shall include online registration, document verification, written examination, final interview and training which will be conducted for eligible candidates by IL&FS ETS.
MINIMUM QUALIFICATIONS: The Candidates must be Bachelor Degree (Any) and Diploma/Post Graduate diploma in English or Allied subjects (English Literature, Functional English, English Studies, Journalism and mass media etc) preferably B.Ed. and well-versed in Spoken, Written & Function. The candidate must have experience of 2 years post qualification in similar field.
The Candidates shall also be required to upload the following documents with maximum file size of 300 kb in jpg / pdf format while applying: (1) Passport Size Photograph (2) Date of Birth Proof (Birth certificate / Aadhar Card / Pan Card / Class X certificate) (3) Graduation Completion Certificate.
ONLINE APPLICATIONS SHALL BE ACCEPTED
https://aspire.ilfseducation.com/default.aspx
LAST DATE AND TIME FOR SUBMISSION OF ONLINE APPLICATION IS 20th June 2018
For Any Queries, please contact: 9160732020 / 8500540113 between 9AM - 6PM Or E-Mail: helpdesk.aspire.ap@gmail.com
DISCLAIMER
It is to bring to your notice that IL&FS ETS does not charge any fee or accept any deposit during the selection process from candidates and no agency / Institution / person are authorized to charge any such fees. IETS disclaims liability arising out of any fraudulent representation made in this behalf and candidates are advised not to be misled by any such fraudulent misrepresentation.

సెన్సెక్స్ ▼ 74 **35548** | నిఫ్టీ ▼ 18 **10800** | డోజోన్స్ 24960 ▼ 130 | నాస్‌డాక్ 7741 ▼ 05 | రూపాయి 67.99 ▲ (ఒక అమెరికా డాలరుకు) 2 పైసలు | ముడి చమురు 75.15 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	18న	మార్పు%
HPCL	322.10	5.14
ICICI BANK	293.00	3.72
IOC	173.90	3.67
BPCL	423.10	2.63
TATA MOTORS	308.80	1.93
EICHER MOTORS	30135.30	1.90
DR. REDDYS LAB	2385.85	1.53

గ్రహణం (-)

నిఫ్టీ	18న	మార్పు%
HINDALCO INDUST	231.00	-2.70
VEDANTA	232.20	-2.68
BHARTI AIRTEL	370.90	-1.94
KOTAK MAHI BANK	1315.30	-1.84
BAJAJ FINA	2243.15	-1.77
COAL INDIA	274.20	-1.74
HCL TECH	933.20	-1.59

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.99	71.88	బహ్రెయిన్ దీనార్	167.65	191.97
పౌండ్ స్టెర్లింగ్	82.25	95.39	కువైట్ దీనార్	186.34	231.96
యూరో	71.85	83.32	ఒమన్ రియాల్	163.76	188.08
జపనీస్ యెన్/100	56.14	65.10	సౌదీ రియాల్	16.44	19.53
ఆస్ట్రేలియా డాలరు	46.13	53.40	యూఏఈ దిర్హమ్	16.83	19.71
సింగపూర్ డాలరు	45.86	54.34	మలేషియా రింగిట్	15.18	18.67
థాయ్ బాత్/100	189.46	226.59	చైనీస్ యువాన్	7.49	12.14

సోమవారం నిఫ్టీ కదలికలు



ద్రవ్యలోటు లక్ష్యం 3.3%

2018-19పై ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్

దిల్లీ

ఈ ఆర్థిక సంవత్సరంలో (2018-19) ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీలో 3.3 శాతానికి కట్టడి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్ పునరుద్ఘాటించారు. వ్యయాలు తగ్గించుకొని ఈ లక్ష్యాన్ని చేరుకోవల్సిన అవసరం లేదని, ప్రణాళికా వ్యయం కోసం తగినన్ని వనరులు ప్రభుత్వం వద్ద ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్ మాట్లాడుతూ 'ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకెళ్లడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం భారతీయుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తోంది. అట్టడుగు వర్గాలకు కూడా వృద్ధి ప్రతిఫలాలు అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు శ్రమిస్తోంది. ఎన్నికల ఏడాది అయినా సరే.. ద్రవ్యలోటును 3.3 శాతానికి కట్టడి చేసే లక్ష్యాన్ని నిర్దేశించుకొంది.. ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. గతంలో ఎన్నికల ఏడాది వచ్చేసరికి రాజకీయ అవసరాల కోసం ద్రవ్యలోటు, సూక్ష్మ ఆర్థిక స్థిరత్వం, మంచి పాలన.. ఇవన్నీ పక్కకు వెళ్లిపోయేవి. 2013-14, 2008-09 ఆర్థిక సంవత్సరాల్ని పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. కానీ దానికి భిన్నంగా ఈసారి ద్రవ్యలోటును 3.3 శాతానికి పరిమితం చేయాలనుకుంటున్నామ'ని తెలిపారు.

జీఎస్‌టీ మండలి నిర్ణయం మేరకు..

పెట్రో ఉత్పత్తుల్ని వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) పరిధిలోకి తేవడంపై బహుశా వచ్చే సమావేశంలో జీఎస్‌టీ మండలి చర్చిస్తుందేమో చూడాలని గోయెల్ అన్నారు. బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యల్ని పరిష్కరించేందుకు 13 ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) అధిపతులతో నేడు ఆయన సమావేశం కానున్నారు.

పన్నులు సక్రమంగా కడితే పెట్రో బాదుడు ఉండదుగా..

ఎక్సైజ్ సుంకం తగ్గించే యోచన లేదు • కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ

దిల్లీ

'ప్రజలు కనుక పన్నులు సక్రమంగా చెల్లిస్తే, ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అప్పుడు పెట్రో ఉత్పత్తులపై అధిక పన్నులు విధించే అవసరం ప్రభుత్వాలకు ఉండదు' అని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే యోచన లేదని వివరించారు. 'ఉద్యోగులు మాత్రమే పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నారు. మిగిలినవారిలో అత్యధికులు తమ ఆదాయానికి తగ్గట్లు పన్నులు చెల్లించాలి. అప్పుడే పన్ను చెల్లించని సమాజంగా ఉన్న గుర్తింపు పోతుంది' అని జైట్లీ వివరించారు. 'రాజకీయ నాయకులు, అభిప్రాయాలు ఏర్పరచేవారికి నా విజ్ఞాపన ఒక్కటే. ఇంధనేతర రంగాల్లో పన్ను ఎగవేతలు ఆపండి. అందరూ కనుక తమ ఆదాయానికి అనుగుణంగా, పన్ను కడితే, ఇంధనంపై అధిక పన్నుల ద్వారా ఆదాయం ఆర్జించాల్సిన స్థితి ప్రభుత్వాలకు ఉండదు. మధ్య, దీర్ఘకాలంలో ఇది ఎంతో మేలు చేస్తుంది' అని తెలిపారు. జీడీపీలో పన్నుల వాటా 10 శాతం ఉండేదని, గత నాలుగేళ్ల చర్యల వల్ల 11.5 శాతానికి పెరిగిందని జైట్లీ వెల్లడించారు. ఈ పెరిగిన మొత్తంలో 0.72 శాతం ఇంధనేతర

రంగాల పన్ను అని వివరించారు. 2017-18లో ఇంధనేతర రంగాల పన్ను వాటా జీడీపీలో 9.8 శాతానికి చేరిందని, 2007-08 తరవాత ఇదే అధికమని పేర్కొన్నారు. 'ప్రస్తుతం పన్నులు కడుతున్న వారు తమ వాటా మాత్రమే కాక, ఎగవేతదార్లకు సంబంధించిన మొత్తానికి పరిహారం చెల్లిస్తున్నట్లు అవుతోంది' అని జైట్లీ తెలిపారు.

మరికొన్నేళ్లు మనకు ఎదురే లేదు

'జనవరి-మార్చి త్రైమాసికంలో 7.7 శాతం వృద్ధి రేటు ద్వారా, వేగవంతమైన వృద్ధితో సాగుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ మనదే అన్నది స్పష్టమైంది. మరికొన్నేళ్లు ఇదే ధోరణి కొనసాగుతుందనే నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంటే భవిష్యత్తు ప్రస్తుతం కన్నా మెరుగ్గా ఉంటుందనే భావిస్తున్నా' అని జైట్లీ పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నులు తగ్గించడం ద్వారా లీటరు రూ.25కే ఇవ్వొచ్చు అన్న కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి పి.చిదంబరం వ్యాఖ్యలు 'కుత్సిత సలహా'గా ఆయన కొట్టిపారేశారు. ఆయన హయాంలో ఆదిశగా ఎన్నడూ ప్రయత్నించలేదని గుర్తు చేశారు. పెట్రో ఉత్పత్తులపై పన్నులు తగ్గితే, ద్రవ్యలోటు గణనీయంగా పెరిగిపోతుందని జైట్లీ తెలిపారు. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ), దివాలాస్మృతి అమలు వంటి నిర్మాణాత్మక సంస్కరణల నేపథ్యంలో, దేశం రెండు త్రైమాసికాల పాటు సవాళ్లను ఎదుర్కొందని మంత్రి వివరించారు. 'వీటి వల్ల జీడీపీ వృద్ధి 2 శాతం తగ్గుతుందని అంచనా వేసిన వారు, తమ భావన తప్పు అని తెలుసుకునేలా గణాంకాలున్నాయి' అని ఫేస్‌బుక్ పోస్ట్‌లో అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. దీర్ఘకాల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లు ఇచ్చిన బహుమతిగా దీన్ని అభివర్ణించారు. పెద్దనోట్ల రద్దు వల్ల జీడీపీ వృద్ధి 2 శాతం తగ్గుతుందని 2016 నవంబరులో మాజీ ప్రధాని మన్మోహన్ వ్యాఖ్యానించగా, ప్రస్తుత గణాంకాలే దీటుగా జవాబిచ్చాయనే కోణంలో జైట్లీ ఈ పోస్ట్ చేశారు. 'నా కంటే ముందు ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన వ్యక్తి, పేదరికంలో బతకాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ప్రపంచంలోనే వేగవంత వృద్ధి కలిగిన పెద్ద ఆర్థిక వ్యవస్థలో దేశీయులందరినీ భాగం చేస్తూ, ముందుకెళ్తున్నామని గుర్తించాలి' అని జైట్లీ తెలిపారు. 'ఆర్థిక మంత్రి గందరగోళంగా వ్యవహరిస్తూ, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారు. పేదరికాన్ని తాను చాలా దగ్గరనుంచి చూశానని ప్రధాని మోదీ చెప్పారు. అయితే దేశ ప్రజలందరూ పేదలయ్యేలా ఆయన ఆర్థిక మంత్రి (జైట్లీ) మరింత అధికసమయం పాటు పనిచేశారు'ని మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా గతంలో ఎద్దేవా చేయగా, ఆయనకు ఇలా జైట్లీ బదులిచ్చారు. మోదీ ప్రభుత్వం వచ్చాక, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జైట్లీ, గత మే 14న మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం శాఖలేని మంత్రిగా కొనసాగుతున్నారు.

10 కోట్ల మంది యువతకు నైపుణ్యాల్లేవ్: పాయ్

హైదరాబాద్: దేశంలో యువ జనాభా అధికంగా ఉన్నా, ఆమేర ప్రయోజనం ఉండటం లేదని ఇన్ఫోసిస్ మానవ వనరుల విభాగ మాజీ అధిపతి, మాజీ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) టి.వి. మోహన్‌దాస్ పాయ్ చెప్పారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అవసరమైన నైపుణ్యాలు యువతలో కొరవడమే ఇందుకు కారణమని ప్రస్తుతం మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహిస్తున్న పాయ్ వివరించారు. 21-35 ఏళ్ల మధ్య ఉన్న 10 కోట్ల మందికి నైపుణ్యాలు లేనందున, 'యువ' ప్రయోజనం లభించడం లేదన్నారు. యూపీఏ ప్రభుత్వం (2004-14) విద్యారంగంలో సంస్కరణలు తేలేదని, ఫలితంగా అరొకర నైపుణ్యాలున్న యువత తయారైందని వివరించారు. 2025 నాటికి 21-45 ఏళ్ల మధ్య ఉండే 20 కోట్ల మంది అతి తక్కువ నైపుణ్యాలు కలిగి ఉంటారని తెలిపారు. 'ఇప్పుడు సంస్కరణలు ప్రారంభిస్తే, పదేళ్లకు ఫలితం లభిస్తుంది. అంటే ప్రస్తుత తరం ఈ

ప్రయోజనాన్ని కోల్పోయినట్లే' అని పాయ్ వివరించారు. విద్యారంగాన్ని నియంత్రించడం మాని, నాణ్యత పెరిగేందుకు చర్యలు చేట్టాలని, పారదర్శక విధానాలు అవసరమని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశోధనా పత్రంలో పాయ్ తన అభిప్రాయాలు పంచుకున్నారు. దేశం యువ ప్రయోజనాలు పొంది, అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు మరో దశాబ్ద కాలమే సమయం ఉందని ఆ నివేదిక పేర్కొన్న సంగతి విదితమే.

విద్య, వైద్యంపై ప్రభుత్వ పెట్టుబడులు కావాలి: విద్య, వైద్యం, చిన్నారులకు పోషకాహారంపై ప్రభుత్వాలు అధికంగా వెచ్చిస్తేనే నాణ్యమైన యువత లభిస్తారని అసోచామ్ సెక్రటరీ జనరల్ డీఎస్ రావత్ అభిప్రాయ పడ్డారు.

ఈయనొక్కడే..

- **ప్రైవేటు బ్యాంకుల అధిపతుల్లో వేతనం పెరిగింది ఉదయ్ కోటక్‌కే..**
- **మిగతా వారితో పోలిస్తే తక్కువే**

దిల్లీ: ప్రైవేటు రంగ బ్యాంకుల అధిపతుల్లో ఉదయ్ కోటక్‌కు మాత్రమే గత ఆర్థిక సంవత్సరంలో వేతనం పెరిగింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2016-17)తో పోలిస్తే 11.02 శాతం వృద్ధితో రూ.2.63 కోట్ల నుంచి రూ.2.92 కోట్లకు పెరిగింది. అయితే ఇతర ప్రైవేటు రంగ బ్యాంకుల సీఈఓలు, ఎండీలతో పోలిస్తే ఈయన వేతనం తక్కువ కావడం గమనార్హం. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్‌లు విడుదల చేసిన వార్షిక నివేదికల్లో ఆ బ్యాంక్‌ల సీఈఓల వేతనాలు క్షీణించినట్లు ప్రకటించాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు ఇంకా వార్షిక నివేదిక సమర్పించలేదు. ప్రకటించిన బ్యాంక్‌ల నివేదికల ప్రకారం..

- యెస్ బ్యాంక్ సీఈఓ రాణా కపూర్ వేతనం 22.12 శాతం తగ్గింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం అందుకున్న రూ.6.87 కోట్లతో పోలిస్తే రూ.5.53 కోట్లకు పరిమితమైంది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) ఆదిత్య పూరి వేతనం 4.07 శాతం తగ్గినా, 2017-18 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక వేతనం తీసుకొంది మాత్రం ఈయనే. రూ.10.05 కోట్ల నుంచి రూ.9.64 కోట్లకు వార్షిక వేతనం తగ్గింది.
- యాక్సిస్ బ్యాంక్ సీఈఓ శిఖా శర్మ వార్షిక వేతనం 11.5 శాతం తగ్గి రూ.5.39 కోట్ల నుంచి రూ.4.77 కోట్లకు పరిమితమైంది.

కృష్ణపట్నం పోర్టులో 'ఈగల్ పీ60' కంటైనర్ స్కానర్

ఈనాడు, హైదరాబాద్: కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ వాహనాలు వెళుతున్నప్పుడే కంటైనర్లను స్కాన్ చేసే విధంగా డ్రైవ్ థ్రూ ఎక్స్ రే కంటైనర్ స్కానర్ అండ్ రేడియేషన్ పోర్టల్ మానిటర్లను అమర్చారు. ర్యాపిస్కాన్ ఈగల్ పీ60 కంటైనర్ స్కానర్ వల్ల భద్రత పెరగడమే కాక తక్కువ సమయంలో స్కానింగ్ ప్రక్రియ పూర్తవుతుందని, అదనంగా నెలకు కనీసం 5,000 టీఈయూల కంటైనర్లను హ్యాండిల్ చేయడానికి వీలవుతుందని కంపెనీ తెలిపింది. భారత్‌లో కృష్ణపట్నం పోర్టులో మాత్రమే డ్రైవ్ థ్రూ కంటైనర్ స్కానర్ ఉందని, రూ.10 కోట్ల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేశామని కృష్ణపట్నం పోర్టు కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) అనిల్ యెండ్లూరి తెలిపారు. జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ జాన్ జోసెఫ్ దీన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి విశాఖపట్నం జోన్ జీఎస్‌టీ చీఫ్ కమిషనర్ వై.ఎస్.శరావత్ హాజరయ్యారు.

ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో టెమాసెక్ రూ.1000 కోట్ల పెట్టుబడి

- 5 శాతం వాటా విక్రయం

ముంబయి: ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో 5 శాతం వాటాను, సింగపూర్‌కు చెందిన వెల్త్‌ఫండ్ టెమాసెక్ హోల్డింగ్స్ రూ.1000 కోట్లకు కొనుగోలు చేసింది. ఇందుకు బోర్డు అంగీకరించిందని, బ్యాంకు మూలధనం సమీకరణలో ఇదే పెద్ద లావాదేవీ అని ఏయూ బ్యాంక్ తెలిపింది. ఈ బ్యాంకులో ఇప్పటికే ఐఎఫ్‌సీ, వార్‌బర్గ్ పింకస్, క్రిస్ క్యాపిటల్, కేదారా క్యాపిటల్ పెట్టుబడులు పెట్టాయి. ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో గతేడాది బ్యాంక్ రూ.1,913 కోట్లు సమీకరించింది.'టెమాసెక్‌కు చోటు కల్పించడం మా బ్యాంక్ వ్యాపార దక్షతకు పరీక్ష లాంటిది. మార్కెట్ అవకాశాలు, కార్యకలాపాల నిర్వహణలో నిబద్ధతకు దర్పణం. తాజాగా లభించే మూలధనాన్ని శాఖల వ్యాప్తికి, ఆన్‌లైన్ వ్యాపార విస్తరణకు వినియోగిస్తాం' అని ఏయూ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్ తెలిపారు. 1996లో వాహన రుణ సంస్థగా కార్యకలాపాలు ప్రారంభించి, 2017 ఏప్రిల్‌లో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా అవతరించాక, శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2017-18లో బ్యాంక్ రుణాలు 60 శాతం, నిర్వహణలోని ఆస్తులు 50 శాతం వరకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.8,000 కోట్ల డిపాజిట్లను బ్యాంక్ సమీకరించింది.

రూ.1,170 కోట్ల పెట్టుబడులు

- 2018-19పై అరబిందో ఫార్మా అంచనా
- యూఎస్ విపణిలో రెండేళ్లలో 30 కొత్త ఔషధాల విడుదల

ఈనాడు, హైదరాబాద్: కొత్త ఔషధాల విడుదలపై అరబిందో ఫార్మా దృష్టి పెట్టనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, వచ్చే ఏడాదిలో అమెరికా మార్కెట్‌లో దాదాపు 30-40 ఔషధాలను విడుదల చేయాలని, ఇప్పటికే 10 ఔషధాలకు అనుమతులు పొందామని కంపెనీ తెలిపింది. ఓవర్ ద కౌంటర్ (ఓటీసీ) విభాగంలో 2018-19లో 12-14 ఔషధాలను కంపెనీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మార్కెట్ విస్తరణ, కొత్త ఔషధాల విడుదలకు అనుగుణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.5-18 కోట్ల డాలర్ల (దాదాపు రూ.1,170 కోట్లు) పెట్టుబడులు పెట్టాలని అరబిందో భావిస్తోంది. ఇంజెక్టబుల్స్‌ను తయారు చేస్తున్న యూనిట్ 4, యూనిట్ 12లకు ఈఐఆర్‌లు లభించాయని, కొద్ది వారాల క్రితమే యూనిట్ 16లో తనిఖీలు పూర్తయ్యాయని, ఇందులో 3 లోపాలు వెల్లడయ్యాయని కంపెనీ వివరించింది. వీటిని సరిచేశామని, యూఎస్‌ఎఫ్‌డీఏ సమాధానం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపింది. గత ఆరు నెలల్లో కంపెనీ ఔషధ నిల్వలు 10 కోట్ల డాలర్ల మేరకు పెరిగాయి. అమెరికాలో ధరల క్షీణత ధోరణి మరిందని, ఏడాది క్రితంతో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో దాదాపు 8 శాతం తగ్గితే.. అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే ఒక శాతం మాత్రమే క్షీణించాయని తెలిపింది.

రాజమహేంద్రవరం-చెన్నైల మధ్య స్పైస్‌జెట్ విమానం

ఈనాడు, హైదరాబాద్: రాజమహేంద్రవరం-చెన్నై, హైదరాబాద్-కాలికట్‌ల మధ్య నేరు విమాన సేవలను స్పైస్‌జెట్ ప్రారంభించనుంది. ఈ సేవలు జులై ఒకటి నుంచి అందుబాటులోకి వస్తాయని కంపెనీ తెలిపింది. బెంగళూరు, రాజమహేంద్రవరం మధ్య రెండో ఫ్లైట్‌ను (సెకండ్ ఫ్రీక్వెన్సీ)ని ప్రారంభించింది. వీటితో కలిపి మొత్తం 14 కొత్త ఫ్లైట్లను కంపెనీ ప్రకటించింది. బోయింగ్ 737, క్యూ400 టర్బోప్రోప్ విమానాలతో సేవలను విస్తరిస్తున్నట్లు స్పైస్‌జెట్ ముఖ్య విక్రయాల అధికారి శిల్పా భాటియా తెలిపారు. హైదరాబాద్, చెన్నై, దిల్లీ, బెంగళూరు వంటి మెట్రో నగరాల నుంచి దేశ, విదేశాలకు మరిన్ని ఫ్లైట్లను నిర్వహించాలని స్పైస్‌జెట్ భావిస్తోంది.

వేదాంతా పడి.. ఐసీఐసీఐ లేచి

- సెన్సెక్స్‌కు 74 పాయింట్ల నష్టం

సమీక్ష

అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల ప్రభావంతో మార్కెట్‌కు నష్టాలు తప్పలేదు. ముఖ్యంగా అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధ వాతావరణం తీవ్ర రూపు దాల్చడం సెంటిమెంటు దెబ్బతీసింది. మదుపర్లు జాగ్రత్తపడేందుకే మొగ్గు చూపడంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఈ ప్రభావం లోహ రంగాల షేర్లపై ఎక్కువగా కనిపించింది. బ్యాంకింగ్, ఐటీ రంగాల షేర్లు కూడా ఇదే బాటలో పయనించాయి. అయితే అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడంతో చమురు మార్కెటింగ్ షేర్లు రాణించడం, ఐసీఐసీఐ బ్యాంకు ఉన్నత యాజమాన్యంలో మార్పులు ఉండొచ్చన్న వార్తల కారణంగా ఈ బ్యాంకు షేరు దూకుడు కనబర్చడం సూచీల నష్టాలను పరిమితం చేసింది.

ఆద్యంతం స్వల్ప శ్రేణిలోనే: ఉదయం సెన్సెక్స్ 35698.43 పాయింట్ల వద్ద స్తబ్దుగా ఆరంభమైంది. ఆ తర్వాత డీఐఐల కొనుగోళ్ల దన్నుతో సూచీ 35,721.55 వరకు పెరిగింది. అయితే ఇతర ఆసియా మార్కెట్లలో చాలా వాటికి సెలవు దినం కావడం, ఐరోపా మార్కెట్లు బలహీనంగా మొదలవడం వల్ల సూచీ ఆద్యంతం స్వల్ప శ్రేణికే పరిమితమైంది. మధ్యాహ్నం తర్వాత మదుపర్లు అమ్మకాల వైపు మొగ్గు చూపడంతో 35518.73 పాయింట్లకు దిగివచ్చింది. చివరకు 73.88 పాయింట్ల నష్టంతో 35,548.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 17.85 పాయింట్లు కోల్పోయి 10,799.85 వద్ద ముగిసింది.

తొలి రోజే వేదాంతా డీలా: సెన్సెక్స్ సూచీలో అడుగు పెట్టిన తొలి రోజే వేదాంతా డీలాపడింది. అత్యధికంగా నష్టపోయిన (2.07%) షేరుగా నిలిచింది. వేదాంతా రాకతో సూచీ నుంచి డాక్టర్ రెడ్డీస్‌ను తొలగించారు. సెన్సెక్స్ 30లో 10 షేర్లకు లాభాలు రాగా.. 20 నేలచూపులు చూశాయి. అత్యధికంగా నష్టపోయిన వాటిలో కోటక్ మహీంద్రా బ్యాంక్ (1.97%), భారతీ ఎయిర్‌టెల్ (1.67%), కోల్ ఇండియా (1.59%), యాక్సిస్ బ్యాంక్ (1.33%), ఇన్ఫోసిస్ (1.09%), హెచ్‌యూఎల్ (0.81%) షేర్లు ఉన్నాయి. ఉన్నత యాజమాన్యంలో మార్పులు ఉండొచ్చన్న వార్తల నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ షేరు ఉరకలెత్తింది. బీఎస్ఈలో 3.61% వరకు లాభపడింది. టాటా మోటార్స్ 1.83%, బజాజ్ ఆటో 0.98%, మారుతీ సుజుకీ 0.46%, ఎన్‌టీపీసీ 0.42% మేర పెరిగాయి. 5.19%, ఐఓసీ 3.54%, బీపీసీఎల్ 2.7% దూసుకెళ్లాయి.

18న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	392	వరంగల్	394
చిల్లరగా (ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	400
బెంగళూరు	427	చెన్నై	457
19వ తేదీకి...		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	384	నమక్కల్	440

ఎన్‌ఎస్‌ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 370.55 (372.95) 966982
ASIAN PAINTS 1282.05 (1282.20) 512049
AXIS BANK LT 522.55 (528.75) 3711213
BAJAJ AUTO L 2895.30 (2877.15) 427791
BAJAJ FINANC 2243.15 (2283.60) 1126877
BAJAJ FINSER 5995.75 (5979.10) 97677
BHARTI AIRTE 370.90 (378.25) 2812154
BHARTI INFRA 291.30 (293.60) 1377676
BPCL 423.10 (412.25) 6473424
CIPLA 606.50 (611.60) 2518169
COAL INDIA L 274.20 (279.05) 2113771
DR. REDDYS 2385.85 (2349.85) 2310151
EICHER MOTOR 30135.30 (29573.75) 38968
GAIL 338.10 (334.90) 3566948
GRASIM IND 1020.10 (1031.80) 544263
HCL TECH 933.20 (948.30) 1326833
HDFC 1823.55 (1832.25) 1965262
HDFC BANK 2019.15 (2029.60) 1871851
HERO MOTOCOR 3666.15 (3693.70) 361312
HINDALCO IND 231.00 (237.40) 6830177
HINDUSTAN UN 1608.55 (1621.30) 846403
HPCL 322.10 (306.35) 9971832
ICICI BANK 293.00 (282.50) 27792317
INDIABULLS H 1199.95 (1191.00) 947268
INDIAN OIL 173.90 (167.75) 14477349
INDUSINDBANK 1967.95 (1967.35) 792509
INFOSYS LTD 1267.40 (1281.25) 4107423
ITC 264.55 (264.50) 6281093
KOTAK MAHIND 1315.30 (1340.00) 1803688
LARSEN & TOU 1323.20 (1329.90) 951701
LUPIN 902.20 (913.20) 3507092
M&M 913.90 (909.45) 1496081
MARUTI SUZIK 8973.45 (8951.60) 305144
NTPC LTD 157.00 (156.05) 1908287
ONGC 164.60 (165.45) 4390244
POWER GRID C 198.65 (197.85) 2420688
RELIANCE IND 1015.55 (1014.20) 5652374
SBI 276.85 (277.45) 13542420
SUN PHARMA 570.10 (571.30) 6090932
TATA CONSULT 1829.00 (1840.05) 4674987
TATA MOTORS 308.80 (302.95) 8787098
TATA STEEL L 558.50 (566.00) 10566965
TECH MAHINDR 710.55 (707.25) 1693522
TITAN IND 897.70 (903.45) 1309586
ULTRATECH 3669.50 (3691.65) 238900
UPL LIMITED 692.25 (700.70) 453545
VEDANTA LIMI 232.20 (238.60) 15575678
WIPRO 265.75 (266.90) 3119539
YES BANK LTD 331.65 (330.65) 6785348
ZEE ENTERTAI 561.20 (555.00) 1283641

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1211.95 (1214.70) 37290
ACC 1300.40 (1302.10) 293333
ADITYA BIRLA 138.65 (139.90) 1009352
AMBUJA CEMEN 202.90 (204.95) 803881
ASHOK LEYLAN 138.90 (142.25) 13515380
AUROBIND PHA 613.85 (613.85) 2309757
AVENUE SUPER 1523.65 (1535.35) 577068
BANK OFBAROD 130.40 (131.30) 9736608
BEL 114.30 (116.85) 3206451
BHEL 75.95 (75.15) 5643821
BOSCH LTD 17966.55 (18191.10) 11210
BRITANNIA 6074.00 (6136.60) 117358
CADILA HEALT 400.50 (398.50) 1020295
COLGATE PALM 1204.90 (1219.45) 202361
CONTAINER 1232.70 (1263.15) 468463
CUMMINS INDI 671.15 (687.30) 199885
DABUR INDIA 386.40 (383.85) 1639574
DLF LIMITED 199.55 (199.85) 3919736
EMAMI LIMITE 1087.00 (1097.85) 176699
GENERAL INS 725.10 (719.20) 32066
GODREJ CONSU 1160.05 (1162.90) 191573
HAVELLS INDI 547.35 (555.45) 573195
HINDUSTAN ZI 297.90 (304.30) 2677240
ICICI PRU LI 397.50 (401.20) 1416008
IDEA CELLULR 62.25 (60.65) 17051922
INTERGLOBE A 1241.35 (1220.45) 524887
JSW STEEL LT 327.15 (332.55) 3093377
L&TFIN.HOLD 164.40 (165.05) 1144958
LIC HOUS.FIN 500.65 (495.75) 891423
MARICO LIMIT 338.05 (338.60) 430123
MCDOWELL 665.75 (677.25) 749102
MOTHERSON 302.30 (307.95) 3002797
MRF 74359.80 (75351.15) 3810
NHPC LTD 25.60 (25.75) 2569123
NMDC LTD 112.05 (112.95) 1890492
OIL INDIA 217.15 (222.40) 948935
ORACLE FIN S 4152.25 (4107.85) 27544
P&G HYG&HEAL 9995.40 (9738.75) 10883
PETRONET LNG 213.55 (211.65) 2182850
PIDILITE IND 1078.05 (1083.85) 351245
PIRAMAL ENTE 2548.10 (2501.45) 283912
PNB 88.50 (89.85) 12204751
POWER FIN CO 80.70 (82.55) 3569342
RURAL ELEC C 112.75 (113.45) 1590445
SAIL 86.95 (85.55) 15777407
SBI LIFE INS 671.85 (671.80) 159457
SHREE CEMENT 16129.60 (16212.75) 10904
SHRIRAM TRAN 1467.40 (1465.30) 377890
SIEMENS 1012.15 (998.45) 291247
SUN TV LTD 883.05 (908.25) 1373908

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.15 (6.25) 40
AISHWARYA TE 4.15 (4) 120
ALPHAGEO 677.10 (678.20) 1681
AMAR RAJA BA 764.25 (769.95) 10580
ANDHRA BANK 34.80 (35.35) 180057
ANDHRA CEMEN 9.31 (9.35) 4450
ANDHRA PAPER 323.50 (325.05) 288
ANDHRA PETRO 46.90 (47.60) 36546
ANDHRA SUGAR 354.10 (361.90) 669
ANJANI PORTL 166.65 (169.80) 28
ASTRA MICROW 101.35 (100.65) 28281
AUROBINDO PH 614.35 (613.45) 121918
AVANTEL SOFT 384.90 (398.25) 2534
AVANTI FEEDS 1845.40 (1841.35) 22615
AVON ORG 8.98 (9.45) 2208
BALAJI AMIN 596.55 (602.60) 841
BARTRONICS 10.59 (10.59) 19277
BHAGIRA CHEM 289.35 (288) 949
BHAGYA NAG 40.55 (40.95) 6336
BN RATHI SEC 39.85 (40) 270
BRILLIANT SE 4.96 (4.73) 3350
CAMBRIDGE TE 54.70 (54.70) 1863
CIL SECURI 23.40 (24) 2432
COMBAT DRUGS 26.15 (27.50) 2000
CONT COFFEE 275.25 (279.95) 781
COROMAN FERT 419.70 (420.65) 7197
CYBERMATE 2.14 (2.16) 6839
CYIENT LIMIT 716.75 (727.95) 10527
DECCAN CEMEN 425 (425.75) 356
DIVI'S LAB 1097.90 (1101.05) 31206
DR REDDY 2380.25 (2351.10) 259566
FOUR SOFT 64.35 (64.70) 5
GATI CORPN 90.55 (89.60) 163144
GAYATRI PROJ 174.15 (175.25) 1185
GMR INFRASTR 15.85 (15.90) 1357356
GOLDST INFRA 170.25 (173.60) 16547
GOLDSTONE EN 15.70 (16) 9422
GRANULES (I) 88.35 (89.05) 278447
GSS AMERICA 89.30 (89.80) 12126
GVK POWER 11.20 (11.54) 308694
HBL NIFE POW 35.60 (36.80) 24190
HERITAGE FOO 680.65 (691.95) 209
HIL LTD 1967.65 (1976) 155
IDL INDUSTRS 401.95 (402.50) 1004
IKF SOFT 0.52 (0.53) 59264
ILFS ENGINEE 29.20 (30.15) 2365
INCAP 74.40 (70.90) 3
INNAREDY COM 1.99 (1.90) 4866
IVRCL INFRAS 1.31 (1.37) 247603
JEEVAN SCIEN 35.50 (36.15) 220
KAKATIYA CEM 252 (257.65) 2812
KALLAM SPG 27.40 (27.35) 6905
KARAN WOO-SN 2.52 (2.41) 270
KAVERI SEED 570.95 (559.55) 60486
KCP LTD 106.65 (105.90) 3762
KERNEX MICRO 31.20 (29.75) 3201
KNR CONSTRUC 251.80 (264) 28571
KREBS BIO 129.30 (127.10) 1757
LANCO INDUS 287.10 (299) 12738
LANCO INFRAT 0.84 (0.85) 268037
LASER DOT 6.40 (6.14) 9
LAURUS LABS 497.05 (499) 4575
LOKESH MACH 64.20 (65.65) 9060
MADHUCON PRO 12.80 (13) 4025
MEGA SOFT 9.60 (9.75) 950
MIC ELECTRON 3.68 (3.85) 19906
MOLD-TEK.TEC 41.70 (42) 1
MOLDTK PLA 304.80 (309.60) 504
MSR INDIA LT 28.15 (31) 13667
NAGARJAGRICH 30.10 (30) 5320
NATCO PHARMA 829.55 (830) 20444
NAVA BH VENT 144.15 (145.95) 50838
NCC 102.60 (107.10) 711985
NCL IND 170.70 (172.95) 634
NEHA INTER 5.50 (5.43) 9355
NETTLINX 57.70 (55.90) 26679
NEULAND LAB 691.90 (700.30) 400
NIHAR INFO 10.50 (10.65) 2
NILE 579.80 (581.60) 1095
OIL COUNTRY 21.45 (21.50) 12671
PANKAJ POLY 6.50 (6.21) 200
PANYAM CEMEN 25.75 (25.50) 1599
PENNER IND 55.85 (56.30) 23438
PHYTOCHEM I 52.50 (52.30) 2785
PIONEER DIST 275.25 (285.75) 2880
PITTI LAMIN 88.80 (89.80) 12851
POKARNA 169.40 (178.90) 14939
PRAJAY ENGS 9.96 (10.46) 32464
PREMIER EXPL 283 (279) 183
PRISM CEMENT 105.85 (107.60) 3150
PRUDENTL PHA 4.16 (3.95) 251811
RAIN INDUSTR 207.20 (213.90) 220393
RAJ PACKAGIN 28.35 (27.40) 1298
RAM INFORMAT 41 (42.70) 8979
REG.CERAMIC 3.66 (3.85) 325
SAGAR CEM 812.20 (798.30) 8440
SAMKRG PIST 241.85 (242.25) 6388
SAMPRE NUTRI 49.95 (47.85) 212
SATVAH. ISPA 14.60 (14.40) 2500
SMS PHARMA 77.50 (81.30) 20440
SOUTH BIO TE 1.47 (1.40) 1600
SPHERE GLOBA 27.65 (28.75) 9014
SREE RAYAL A 35.35 (36.50) 77751
SRI KPR INDU 25.45 (25.90) 600
SRINIVASA SH 41.05 (43.40) 1113
STARCHIK SP 32.90 (32.90) 517
STEEL EXCHAN 20.20 (21.85) 25667
SUJANA METAL 0.91 (0.92) 800
SUJANA UNIVE 0.51 (0.53) 8647
SURANA TELE 4.74 (4.51) 20
SURYALATA SP 132 (128.30) 537
SURYAVA SPIN 5.43 (5.71) 220
SUVEN PHARMA 229.40 (238.50) 89786
TAJ GVK HOTE 227.90 (233.30) 1192
TANLA 29 (29.95) 38201
TERA SOFTWAR 43 (42.10) 846
TRANS BIOTEK 2.15 (2.18) 12000
TRENDY KNIT 0.19 (0.19) 15110
VAMSHI RUBB 44.70 (47.05) 5401
VICEROY HOTE 8.13 (8.54) 21956
VIJAY TEXTIL 55.70 (55.70) 11308
VIMTA LABS 232.30 (216.75) 58562
VISAKA IND 632.20 (639.75) 3240
VISTA PHARMA 38.45 (39.30) 18918
VIVIMED LABS 67.45 (67) 175568
VST INDUS 2995 (3014.60) 36
XL TELENE 1.35 (1.35) 2560
YBRANT DIGIT 4.17 (4.26) 43250
ZENOTECH LAB 38.75 (39.55) 3353
ZENTECH 83.70 (84.10) 5267

ఆడీ బాస్ అరెస్ట్

- డీజిల్ ఇంజిన్ల ఉద్గారాల కేసు
- ఫోక్స్‌వ్యాగన్‌కు కష్టకాలం

బెర్లిన్: ఆడి చీఫ్ ఎగ్జిక్యూటివ్ రూపర్ట్ స్టాడ్లర్‌ను అరెస్ట్ చేసినట్లు జర్మనీ అధికారులు వెల్లడించారు. ఆడి మాతృసంస్థ ఫోక్స్‌వ్యాగన్ సంస్థ డీజిల్ ఇంజిన్ల నుంచి వెలువడే ఉద్గారాలను తక్కువ చేసి చూపిన కుంభ కోణంలో, సాక్ష్యాలను తారుమారు చేస్తారనే భావనతో స్టాడ్లర్‌ను అరెస్టు చేసినట్లు ప్రాసిక్యూటర్లు వెల్లడించారు. వారం క్రితం స్టాడ్లర్ నివాసంలో మునిచ్ ప్రాసిక్యూటర్లు తనిఖీలు నిర్వహించాక, ఇప్పుడు అరెస్టు చోటుచేసుకుంది. స్టాడ్లర్‌ను జైలులో ఉంచాలా, లేదా అనేది కోర్టు నిర్ణయిస్తుంది.

ఉద్గారాలను తక్కువగా చూసే సాఫ్ట్‌వేర్‌ను డీజిల్ వాహనాలకు అమర్చడం ద్వారా మోసం, పత్రాల్లో వంచన చేసి, ఐరోపా ఖాతాదార్లకు తప్పుడు వాహనాలను ఫోక్స్‌వ్యాగన్ విక్రయించిందని, ఈ కేసులో స్టాడ్లర్ నిందితుడని పేర్కొన్నారు. సాక్ష్యాలను తారుమారు చేస్తారనే భావనతోనే ఆడి సీఈఓను అరెస్టు చేసినట్లు బవేరియన్ రాష్ట్ర ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఈ అరెస్టును ఆడి సంస్థ ధ్రువీకరించింది. అయితే విచారణ జరుగుతున్నందున, ఏ విధమైన వ్యాఖ్యలు చేయబోమని ప్రకటించింది.

2015 నుంచీ వెంటాడుతున్న కేసు

వాహనాల ఇంజిన్లను ప్రయోగశాలల్లో పరీక్షించినపుడు, వాస్తవం కంటే తక్కువ ఉద్గారాలు వెలువడుతున్నట్లు చూపే సాఫ్ట్‌వేర్‌ను ప్రపంచవ్యాప్తంగా 1.10 కోట్ల వాహనాల్లో అమర్చినట్లు 2015లో ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ అంగీకరించింది. ఫోక్స్‌వ్యాగన్ బ్రాండ్ వాహనాలతో పాటు అనుబంధ సంస్థలైన ఆడి, పోర్షె, స్కోడా, సీట్ బ్రాండ్‌ల వాహనాల్లోనూ ఇలానే చేసినట్లు తెలిపింది. ఈ కేసులో అరెస్ట్ అయిన అత్యున్నత అధికారి స్టాడ్లరే. ఈ సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో ఫోక్స్‌వ్యాగన్ విలాసవంత కార్ల అనుబంధ సంస్థ అయిన ఆడిదే ప్రధానపాత్ర అని అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం 20 మంది అనుమానితులని భావిస్తున్నారు. ఆడి ఇంజిన్ అభివృద్ధి విభాగాధిపతి వోగాంగ్ హాజ్‌ను జర్మనీలో 2017 సెప్టెంబరులో అరెస్టు చేసి, జైలులో ఉంచారు. పోర్షె ఇంజిన్ విభాగాధిపతి జోగ్ కెర్నర్‌ను ఏప్రిల్‌లో అరెస్టు చేశారు. ఈ కుంభకోణం బయటపడిన సమయంలో అతను ఆడిలో పనిచేసినట్లు గుర్తించారు. ఫోక్స్‌వ్యాగన్ మాజీ సీఈఓ మార్టిన్ సహా మేనేజర్లు 9 మందిపై అమెరికాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

తాత్కాలిక సీఈఓగా బ్రామ్ స్కాట్: తనపై వచ్చిన ఆరోపణలను స్టాడ్లర్ ఖండించారు. విచారణకు (ఇంటరాగేషన్‌కు) బుధవారం నుంచి తాను సిద్ధమేనని స్పష్టం చేశారు. స్టాడ్లర్‌ను అరెస్టు చేసిన గంటల వ్యవధిలోనే, తాత్కాలిక సీఈఓగా బ్రామ్ స్కాట్‌ను నియమిస్తున్నట్లు ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ ప్రకటించింది. 2011లో ఆయన గ్రూప్‌లో చేరారు.

ఐసీఐసీఐ బాస్‌కు సెలవ్

వీడియోకాన్ కేసు దర్యాప్తు పూర్తయ్యే దాకా..

సీఓఓగా నేడు సందీప్ బక్షి బాధ్యతల స్వీకారం

ముంబయి: ఐసీఐసీఐ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ చందాకొచ్చర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లనున్నారు. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాలు మంజూరు చేయడంలో 'నీకిది-నాకది'కి పాల్పడ్డారనే ఆరోపణలపై దర్యాప్తు పూర్తయ్యేవరకు ఆమె సెలవులోనే ఉంటారని సోమవారం సమావేశమైన బోర్డు వెల్లడించింది. కార్పొరేట్ పాలనా అత్యున్నత ప్రమాణాల మేరకు, విచారణ పూర్తయ్యేవరకు సెలవుపై వెళ్లాలని చందాకొచ్చర్ నిర్ణయించినట్లు ఎక్స్ఛేంజీలకు బ్యాంక్ సమాచారం ఇచ్చింది. ఈ నిర్ణయానికి బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది. బ్యాంకు బీమా వ్యాపార విభాగం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ సీఈఓ, ఎండీగా ఉన్న సందీప్ బక్షిని, ఐసీఐసీఐ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్)గా నియమించారు. అయిదేళ్ల కాలానికి పూర్తిస్థాయి డైరెక్టర్, సీఓఓగా బక్షిని నియమించారు. మంగళవారం (ఈనెల 19న) ఆయన బాధ్యతలు చేపడతారు. బ్యాంకు అన్ని వ్యాపారాలు, కార్పొరేట్ కేంద్రాల కార్యకలాపాలను ఆయన నిర్వహిస్తారు. అయితే సీఈఓ, ఎండీగా చందా కొచ్చర్ కొనసాగుతారు. ఆమె సెలవులో ఉన్నందున, బోర్డుకు సీఓఓ నివేదించాల్సి ఉంటుంది. ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డులోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ కూడా కొచ్చర్ సెలవులో ఉన్నందున, బక్షికి నివేదించాల్సి ఉంటుంది. బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.ఎస్.కన్నన్‌ను ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా నియమించారు. ఇందుకు నియంత్రణ సంస్థల ఆమోదం అవసరం.



ఇదీ జరిగింది: చందాకొచ్చర్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణకు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.ఎన్.శ్రీకృష్ణ నేతృత్వంలో అంతర్గత కమిటీని ఐసీఐసీఐ బ్యాంక్ గత నెలలో నియమించిన సంగతి విదితమే. చందాకొచ్చర్‌పై తొలుత ఆరోపణలు వచ్చినపుడు, ఆమెను పూర్తి మద్దతు ఇస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. కొచ్చర్ నిబంధనలు ఏమీ ఉల్లంఘించలేదని బ్యాంక్ బోర్డ్ ఛైర్మన్ ఎం.కె.శర్మ పేర్కొన్నారు. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాలు ఇవ్వాలన్న నిర్ణయాన్ని అప్పట్లో ఛైర్మన్‌గా ఉన్న కె.వి.కామత్ నేతృత్వంలోని కమిటీ నిర్ణయించిందనీ వెల్లడించారు. అయితే 4 నెలలు గడిచాక, రెండోవిడతగా మే 3న మరిన్ని ఆరోపణలు వచ్చినపుడు, స్వతంత్ర విచారణ జరిపించాలని నిర్ణయించింది. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాలివ్వడంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలన్నిటిపై జస్టిస్ శ్రీకృష్ణ విచారణ జరుపుతారని భావిస్తున్నారు. ప్రస్తుత ఏర్పాట్లు తాత్కాలికమేనని, పారదర్శక విచారణ కోసమే ఇలా చేసినట్లు బ్యాంక్ పేర్కొంది.

మోసాల ముప్పు మనకే ఎక్కువ

ఆర్థిక మోసాల ప్రమాదంపై ఎక్స్‌పీరియన్ నివేదిక

ముంబయి: డిజిటల్ లావాదేవీల్లో ఇటీవల భారతీయులు ముందుంటున్నారు. ఇదే సమయంలో ప్రతి నలుగురిలో ఒకరు ఆర్థిక మోసాలకు గురవుతున్నారు. గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ కంపెనీ ఎక్స్‌పీరియన్ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. నివేదిక ప్రకారం..

✦ 24 శాతం మంది భారతీయులు ఆన్‌లైన్ లావాదేవీలు జరుపుతున్న సమయంలో నేరుగా మోసానికి గురవుతున్నారు.

✦ సగటున 65% మంది డిజిటల్ లావాదేవీలు జరిపేవారు మొబైల్ చెల్లింపులు సులువు కావడంతో అటువైపు మొగ్గు చూపుతున్నారు.

✦ బ్యాంకులకు తమ సమాచారం అందించేందుకు 50% మంది వెనుకాడటం లేదు. ఇదే సమయంలో బ్రాండెడ్ రిటైలర్లకు కేవలం 30 శాతం మందే తమ సమాచారం అందిస్తున్నారు.

✦ చాలా తక్కువ మంది వినియోగదారులు (6%) తమ సర్వీసు ప్రొవైడర్లతో పంచుకున్న సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నారు.

✦ ఎలక్ట్రానిక్స్, ట్రావెల్ మార్కెటింగ్ రంగాల్లో సమాచార సేకరణ బాగా జరుగుతోంది. అయితే ఇక్కడ కూడా ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. టెలికాంలో 57 శాతం, బ్యాంకుల్లో 54 శాతం, రిటైలర్ల విభాగంలో 46 శాతం మంది బాధితులు ఉంటున్నారు.

✦ ఆసియా-పసిఫిక్ దేశాల్లో భారత్ అత్యధికంగా డిజిటల్ వినియోగం చేస్తోంది. దాదాపు 90 శాతం మంది ఈ సేవల్ని వినియోగించుకుంటున్నారు.

✦ ఈ ఆన్‌లైన్ సర్వేను సలహా సంస్థ (అడ్వైజరీ ఫర్మ్) ఐడీసీ సహకారంతో ఆస్ట్రేలియా, చైనా, హాంకాంగ్, భారత్, ఇండోనేషియా, జపాన్, న్యూజిలాండ్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాల్లో ఎక్స్‌పీరియన్ నిర్వహించింది. అయితే ఎంతమందితో సర్వే నిర్వహించిదనే విషయాన్ని వెల్లడించలేదు.

ఈనాడు బిజినెస్

పాస్‌పోర్ట్ ఉపసంహరించినా నీరవ్‌మోదీ ప్రయాణాలు: సీబీఐ

దిల్లీ: నీరవ్‌మోదీ పాస్‌పోర్టును ఉపసంహరించినట్లు ఇంటర్‌పోల్‌లో ఉన్నా, పలు దేశాల్లో పర్యటించగలుగుతున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) పేర్కొంది. ఇంటర్‌పోల్‌కు తాము ఫిబ్రవరి 15నే నీరవ్‌మోదీ పాస్‌పోర్టుపై సమాచారం ఇవ్వగా, ఆ సంస్థ కేంద్రీయ సమాచార వ్యవస్థలో అదేనెల 24 నుంచి ఈ వివరాలున్నాయని, అయినా అతను ప్రయాణిస్తున్నారని సీబీఐ ప్రతినిధి అభిషేక్ దయాల్ తెలిపారు. విదేశీ వ్యవహారాల శాఖ అతని పాస్‌పోర్టును రద్దు చేశాక/ఉపసంహరించాక, ఆ సమాచారాన్ని నోటీస్‌లో పెట్టామని వివరించారు. నీరవ్‌మోదీకి జారీ అయిన 5 పాస్‌పోర్టుల వివరాలనూ ఇంటర్‌పోల్‌కు తెలిపామన్నారు. ఇవి ఒకదానికొకటి అనుసంధానమై ఉంటాయని, పాస్‌పోర్టు పత్రాలన్నీ నిండటంతో వేరొకటి జారీ కావడం, పునరుద్ధరణ వల్ల వాటి సంఖ్యలు వేరుగా ఉంటాయని తెలిపారు. ఇంటర్‌పోల్‌లో వివరాలుండగానే, లండన్ నుంచి హాంకాంగ్‌కు, న్యూయార్క్ నుంచి లండన్‌కు, లండన్ నుంచి పారిస్‌కు నీరవ్‌మోదీ వెళ్లారని బ్రిటన్ వెల్లడించింది. ఇప్పుడు కచ్చితంగా ఎక్కడ ఉన్నారనే సమాచారం లేదని తెలిపింది.

పలాయనవాదిగా మాల్యాపై ముద్ర: ఈడీ తాజా ఛార్జిషీట్

ముంబయి: భారతీయ బ్యాంకులకు చెందిన రూ.3700 కోట్లను బ్రిటన్ కేంద్రంగా పనిచేసే ఎఫ్1 మోటార్‌స్పోర్ట్ సంస్థ, టీ20 ఐపీఎల్ జట్టుతోపాటు ప్రైవేటు జెట్ విమానాల్లో విహరించేందుకు విజయ్‌మాల్యాతో పాటు అతనికి సంబంధం ఉన్న రెండు కంపెనీలు వినియోగించాయని ఆరోపిస్తూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజా ఛార్జిషీట్‌ను ముంబయి ప్రత్యేక కోర్టు ఎదుట సోమవారం దాఖలు చేసింది. ఇందువల్ల కొత్త చట్టం ప్రకారం మాల్యాను పలాయనవాదిగా గుర్తించేందుకు వీలవుతుంది. మాల్యా, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్స్, మరికొందరిని నిందితులుగా చేర్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ విచారణ జరుగుతోంది.

ప్రభుత్వ గుర్తింపు లేని కోర్సులకు పన్ను కట్టాల్సిందే

- సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్

? రెండు వారాల క్రితం ఫ్లాట్‌లపై మీరు రాసిన వ్యాసంలో కొనుగోలుదార్లకు నిర్మాణదారు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) బదిలీ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎందుకు బదిలీ చేయకూడదో కారణాన్ని తెలియజేగలరు?

- సందీప్ చామా, బాలానగర్

నిర్మాణ సామగ్రి కొనుగోలుపై కట్టిన పన్నును ఐటీసీ రూపంలో నిర్మాణదారు తిరిగి పొందొచ్చు. దీంతో ఆ మేరకు ఆయనకు నిర్మాణ వ్యయం తగ్గుతుంది. ఈ తగ్గిన వ్యయాన్ని లెక్కలోకి తీసుకొనే నిర్మాణదారు ఫ్లాట్ ధరను నిర్ణయిస్తాడు. అందువల్ల వినియోగదారుకు ప్రత్యేకంగా మళ్లీ ఐటీసీని బదిలీ చేయాల్సిన అవసరం లేదు.

? నిర్మాణ రంగ కంపెనీలో అకౌంట్స్ మేనేజర్‌గా నేను విధులు నిర్వర్తిస్తున్నాను. నిర్మాణ పనుల నిమిత్తం వివిధ రకాల యంత్రపరికరాలు, వాహనాలను కొనుగోలు చేస్తుంటాం. వీటికి మేం ఐటీసీని క్లెయిమ్ చేసుకోవచ్చా?

- కొండా రామయ్య

ప్లాంటు, యంత్రపరికరాల కోసం వాడే ఏ వాహనాన్ని కొనుగోలు చేసినా ఐటీసీ పొందేందుకు మీరు అర్హులే. ఈ వాహనాలకు ఐటీసీ వర్తించదంటూ కేంద్ర జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) చట్టంలోని సెక్షన్ 17(5)లో ఎలాంటి నిబంధన లేదు.

? మేం లాడ్జి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాం. మా వద్ద రూ.999 లోపు (జీఎస్‌టీ మినహాయింపు) అద్దె ఉన్న గదులు ఉన్నాయి. అలాగే రూ.1500కు మించి అద్దె (జీఎస్‌టీ 12%) ఉన్నవీ ఉన్నాయి. అయితే ఐటీసీని క్లెయిమ్ చేసుకునే విషయంలో మాకో పెద్ద సందేహం ఉంది. ఉదాహరణకు మేం నెలకు రూ.5 లక్షల వ్యాపారం (టర్నోవరు) చేశామనుకుందాం. ఇందులో పన్ను మినహాయింపు ఉన్న రూ.999 లోపు అద్దె గదుల ద్వారా రూ.లక్ష, 12% జీఎస్‌టీ వర్తించే రూ.1500కు మించి అద్దె ఉన్న గదుల ద్వారా రూ.4 లక్షల వ్యాపారం జరిగిందని భావిద్దాం. ఆ నెలలో ఐటీసీ మొత్తం విలువ రూ.10,000 ఉంటే ఆ మొత్తాన్ని పూర్తిగా పూర్తిగా క్లెయిమ్ చేసుకోవచ్చా? లేదంటే కేవలం పన్ను వర్తించిన టర్నోవరుపైనే ఐటీసీని పొందే వీలుంటుందా? స్పష్టం చేయగలరు.

- హోటల్ శ్రీకన్య

జీఎస్‌టీ చట్టంలోని నిబంధనల ప్రకారం పన్ను వర్తించే, పన్ను మినహాయింపు టర్నోవరుల నైష్పత్తిక ప్రాతిపాదికన మీరు ఐటీసీ పొందే వీలుంటుంది. పైన చెప్పిన ఉదాహరణ ప్రకారం మీరు రూ.8000కు (రూ.10,000X 4,00,000/ 5,00,000= 8000) మాత్రమే ఐటీసీని క్లెయిమ్ చేసుకునేందుకు అర్హులు. ఎందుకంటే ఆ రూ.5 లక్షల టర్నోవరులో పన్ను మినహాయింపు, పన్ను వర్తించే టర్నోవరు రెండూ కలిపి ఉన్నాయి.

? ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దే ఉద్దేశంతో ప్రోత్సాహకాలను అందిస్తోంది. విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ఫీజుల తగ్గింపునకు ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. మరో వైపు మన దేశంలో ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థులు చెల్లించే ఫీజులపై కేంద్ర ప్రభుత్వం 18% జీఎస్‌టీ విధిస్తోంది. ఇది సబబేనా? ఎన్ఐసీఎంఏఆర్ విద్యా సంస్థ వసూలు చేస్తున్న జీఎస్‌టీ రశీదు కాపీని మీకు పంపిస్తున్నాను. ఏం చేయాలో మీరు సలహా ఇవ్వగలరు?

- పి.పద్మనాభం, తణుకు

జీఎస్‌టీ చట్టంలోని నిబంధనలు, నోటిఫికేషన్ల ప్రకారం ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఏ విద్యా సంస్థ అందించే ఎలాంటి డిగ్రీ, సర్టిఫికేట్ కోర్సు కోసం చెల్లించే రుసుంపై జీఎస్‌టీ మినహాయింపు ఉంటుంది. అయితే ప్రభుత్వ గుర్తింపు లేని విద్యాసంస్థ అందించే కోర్సుల ఫీజులపై జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుంది. అందువల్ల విద్యార్థులు ఏదేని విద్యా సంస్థలో చేరేటప్పుడు పై నిబంధనల ఆధారంగా నిర్ణయం తీసుకోవడం మంచిది.

? జీఎస్‌టీపై పాఠకులు అడుగుతోన్న వివిధ రకాల సందేహాలను తీర్చుతున్నందుకు ముందుగా మీకు ధన్యవాదాలు. నేను ఓ ప్రైవేట్ రంగ బ్యాంకులో మధ్యస్థాయి అధికారి హోదాలో పనిచేస్తున్నాను. అయితే మా బ్యాంకు పేరుతో 2013 అక్టోబరులో కొనుగోలు చేసిన ఓ కారును ఆఫీసు పనుల నిమిత్తం నాకు ఇచ్చారు. నాలుగేళ్ల తర్వాత అంటే 2017 అక్టోబరులో తిరిగి ఆ కారును కొనుక్కునే అవకాశాన్ని ఉద్యోగులకు బ్యాంకు కల్పించింది. అయితే కారు కొనేవారు ఉద్యోగుల ప్రయోజనాలపై పన్నును (పర్క్‌వైసైట్ ట్యాక్స్)తో పాటు జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని బ్యాంకు చెప్పింది. ఈ ప్రకారం లెక్కవేసి నా నుంచి పన్నులు వసూలు చేశాక కారును నా పేరుపై మార్చారు. ఆఫీసు కార్యకలాపాల కోసం కొనుగోలు చేసి, తిరిగి కొన్ని సంవత్సరాలు వాడాక నా పేరుపై మారిస్తే జీఎస్‌టీ వర్తిస్తుందా? వేరే ప్రైవేట్ బ్యాంకులో పనిచేసే నా మిత్రుడొకరు ఇలాగే కారు కొంటే జీఎస్‌టీ వసూలు చేయలేదు. పర్క్‌వైసైట్ ట్యాక్స్ మాత్రమే కట్టారు. దయచేసి ఈ విషయంలో నాకు స్పష్టత ఇవ్వగలరు.

- భాస్కర్

మీరు పనిచేసే బ్యాంకు మీ నుంచి పని వసూలు చేయడం సరైనదే ననే అని నా అభిప్రాయం. బ్యాంకు కారును విక్రయించడమనేది సరఫరా నిర్వచనం కిందకు వస్తుంది. బ్యాంకు కారు విక్రయానికి జీఎస్‌టీ వర్తించదని జీఎస్‌టీ చట్టంలో ఎక్కడా లేదు. కారు విక్రయించడం వ్యాపార లావాదేవీనే కావడంతో జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. మీ మిత్రుడు నుంచి జీఎస్‌టీ వసూలు చేయలేదంటే ఉద్యోగులకు రూ.50000 వరకు ఇస్తే సరఫరా కిందకు రాదనే నిబంధన కింద వెసులుబాటు ఇచ్చి ఉండవచ్చు.

? ఈ ఏడాది జనవరిలో నేను రూ.38 లక్షల ధరకు ఫ్లాటు కొన్నాను. అయితే ఇది ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. పై రూ.38 లక్షల్లో రూ.8 లక్షలను చెక్కు రూపేణా నిర్మాణదారుకు చెల్లించాను. మిగిలిన రూ.30 లక్షల కోసం బ్యాంకు రుణం తీసుకుంటున్నాను. రూ.16 లక్షలకు సేల్ డీడ్, రూ.22 లక్షలకు వర్క్ ఆర్డరును రూపొందించాం. అయితే రిజిస్ట్రేషన్‌కు ముందే జీఎస్‌టీ చెల్లించాలని నిర్మాణదారు అడుగుతున్నారు. నేను ఎంత జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది?

- దొండి నాగేందర్ సుచిత్ర

జీఎస్‌టీ చట్టం ప్రకారం నిర్మాణదారు ఎప్పుడైతే మీకు పన్ను రశీదు (ట్యాక్స్ ఇన్‌వాయిస్) ఇస్తారో అప్పుడే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ సమయంలో రూ.8 లక్షలకు పన్ను రశీదు ఇస్తే ఈ రూ.8 లక్షలకే జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుంది. ఆ తర్వాత మిగిలిన మొత్తానికి ఎప్పుడెప్పుడు ఎంత మొత్తానికి పన్ను రశీదులు ఇస్తే ఆ మేరకు జీఎస్‌టీ కట్టుకుంటూ రావాలి.

? మేం బిహార్ రాష్ట్రంలో స్టోన్ క్రషింగ్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాం. క్రషింగ్ పనుల నిమిత్తం యంత్ర సామగ్రి, విడి భాగాలు కొనుగోలు చేశాం. అయితే వీటిల్లో కొన్నింటిని స్థానికంగా (బిహార్ రాష్టంలోనే), మరికొన్నింటిని ఇతర రాష్ట్రాల ద్వారా కొనుగోలు చేశాం. స్థానికంగా కొనుగోలు చేసిన వాటికి సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ రశీదులు, ఇతర రాష్ట్రాల ద్వారా కొనుగోలు చేసిన వాటికి ఐజీఎస్‌టీ రశీదులు ఉన్నాయి. అలాగే యంత్రసామగ్రిని ఇతర దేశాల ద్వారా దిగుమతి చేసుకున్నాం. వీటికి కూడా ఐజీఎస్‌టీ, కస్టమ్స్ సుంకం రశీదులు ఉన్నాయి. ఈ కొనుగోళ్లన్నింటిపై మేం ఐటీసీకి ఎలా క్లెయిమ్ చేసుకోవాలి. అయితే క్వారీ మా సొంతం కాదు. అలా గని అద్దెకు కూడా తీసుకోలేదు. సేవల వ్యాపారంలో భాగంగా స్టోన్ క్రషింగ్ పనిని నిర్వహిస్తున్నాం.

- బి.యశోవర్ధన్, అకౌంటెంట్

మీరు నిర్వహించే వ్యాపారానికి జీఎస్‌టీ గుర్తింపు ఉందని అనుకొని ఈ ప్రశ్నకు సమాధానం చెబుతున్నాను. మీరు పైన కొనుగోలు చేశామని చెబుతున్న అన్ని సందర్భాల్లోనూ ఐటీసీ పొందేందుకు అర్హులు. ఎందుకంటే ఇవన్నీ కూడా వ్యాపార, వ్యాపార విస్తరణ లావాదేవీల కిందకే వస్తాయి.

? 2013లో ఓ విల్లాను రూ.80 లక్షలకు కొనుగోలు చేశాను. ఇందులో 95 శాతం మొత్తాన్ని చెక్, నగదు రూపంలో చెల్లిచాను. 2017 జూన్ 30న విల్లా రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. నేను విల్లా మొత్తం ధరపై జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందా లేదంటే. . 95 శాతం చెల్లించగా మిగిలిన 5% ధరపై జీఎస్‌టీ కట్టాలా?

-రామ్ రెడ్డి.జి

జీఎస్‌టీ చట్టంలోని నిబంధనల ప్రకారం జీఎస్‌టీ అమలు తేదీకి ముందు చేసిన చెల్లింపులపై జీఎస్‌టీ వర్తించదు. మీ విషయానికొస్తే జీఎస్‌టీ అమలయ్యాక మిగిలిన 5 శాతం చెల్లించినందున ఈ మొత్తానికి మాత్రమే జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుంది.

? ఇంటి రుణం తీసుకొని 2017 నవంబరులో నేను ఓ ఫ్లాట్ కొనుగోలు చేశాను. 2018 జనవరిలో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. అయితే ఫ్లాట్ కొనేటప్పుడు కొనుగోలు ధరలోనే అన్నీ వచ్చేస్తాయని రిజిస్ట్రేషన్ ఛార్జీలు తప్ప పన్నులేవీ కట్టనవసరం లేదని నిర్మాణదారు చెప్పాడు. ఇప్పుడేమో ఫ్లాట్ ధరపై 12% జీఎస్‌టీ కట్టాలని అంటున్నాడు. నిర్మాణదారు నుంచి నాకు ఇంకా ఎన్‌ఓసీ రావాల్సి ఉంది. నేను జీఎస్‌టీ చెల్లించాల్సిందేనా?

- బి.శంకర్ భాయ్

మీ ప్రశ్నకు సమాధానం దొరకాలంటే లాయర్ వద్దకు వెళ్లాలి. ఎందుకంటే ఇందులో న్యాయపరమైన అంశాలు ముడిపడి ఉన్నాయి. నాకు తెలిసిన మేరకైతే ఓ విషయం చెప్పగలను. అన్ని రకాల రుసుంలు, పన్నులు కలిపి నిర్మాణదారు ధరను నిర్ణయించారని మీరు చెప్పారు. అది రాతపూర్వకంగా ఉంటే మీరు జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఏదేమైనా ఈ సమస్యకు సరైన పరిష్కారం దొరకాలంటే లాయర్ సలహా తీసుకోవడమే మంచిది.

? నాకు గ్యాస్ ఏజెన్సీ ఉంది. జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ కూడా చేయించాం. అయితే వినియోగదార్లకు సరఫరా కోసమని ఏజెన్సీ జీఎస్‌టీ నెంబరుపై వాణిజ్య వాహనాలను కొనుగోలు చేయాలని అనుకుంటున్నాం. ఈ వాహనాల కొనుగోలుపై ఐటీసీ పొందేందుకు వీలుందా?

- పి.వెంకటేశ్వర రావు, అకౌంటెంట్

ఈ ప్రశ్న ఏజెన్సీ యజమాని కోణంలో ఉంది. కాని ప్రశ్న అడిగిన మీరేమో అకౌంటెంట్ అని చెబుతున్నారు. ఇది కొంచెం అయోమయంగా ఉన్నప్పటికీ ఆ ఏజెన్సీ యజమాని కోణంలోనే మీకు సమధానం ఇస్తాను. సరకు రవాణా నిమిత్తం కొనుగోలు చేసే వాహనాలపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందే వీలుంది. సీజీఎస్‌టీ చట్టం-2017లోని సెక్షన్ 17(5) ద్వారా ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది.

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి..మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా

eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

మీ సందేహాలు పంపండి

20 భాషల్లోనూ సీ-టెట్

- కేంద్ర మంత్రి జావడేకర్ వెల్లడి

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీ-టెట్)ను ఎప్పటిలానే 20 భారతీయ భాషల్లో నిర్వహించాలని కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ)కి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ఆదేశాలు జారీచేశారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ సహా 17 భాషలను జాబితా నుంచి తొలగించాలని సీబీఎస్ఈ నిర్ణయించిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'ఎప్పటిలానే 20 భాషల్లోనూ సీ-టెట్‌ను నిర్వహిస్తాం. దీనికి సంబంధించి ఇప్పటికే సీబీఎస్ఈకి ఆదేశాలు జారీచేశాను'అని జావడేకర్ సోమవారం ట్వీట్‌చేశారు. అంతకుముందుగా సీబీఎస్ఈ నిర్ణయంపై డీఎంకే నాయకురాలు కనిమొళి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు ప్రాంతీయ భాషల్లో ఈ పరీక్ష కోసం సన్నద్ధం అయ్యేవారికి ఇది ఎదురుదెబ్బని వ్యాఖ్యానించారు. మాతృభాషను వదిలి హిందీ, సంస్కృతాలను చదవాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని కేంద్రాన్ని ఆమె విమర్శించారు.

వాజ్‌పేయీకి ఉపరాష్ట్రపతి పరామర్శ

ఈనాడు, దిల్లీ: కొద్ది రోజులుగా ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఎయిమ్స్‌కు వెళ్లిన వెంకయ్యనాయుడు వాజ్‌పేయీకి అందుతున్న చికిత్స, ఆయన ఆరోగ్య పరిస్థితి వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వాజ్‌పేయీ ఆరోగ్య పరిస్థితి మెరుగవుతోందని వైద్యులు తనకు వివరించినట్లు వెంకయ్యనాయుడు అనంతరం పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిరణ్ రిజుజులు కూడా వాజ్‌పేయీని పరామర్శించారు.

రేపు రైతులతో ప్రధాని ముఖాముఖి!

దిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న రైతులతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బుధవారం నేరుగా మాట్లాడనున్నారు. 'నరేంద్రమోదీ యాప్' ద్వారా కూడా అన్నదాతలు ఆయనతో మాట్లాడవచ్చు. బుధవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ఆయన వారితో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రాలు, ఉమ్మడి సేవా కేంద్రాలు(సీఎస్‌సీ), దూరదర్శన్, డీడీ-కిసాన్, ఆకాశవాణిల ద్వారా ప్రసారమౌతుంది.

మంచుఖండం మరిగిపోతోంది!

- దేశాలకు దేశాలే గల్లంతయ్యే ఉత్పాతం
- శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో వెల్లడి

ఈ భూమండలం మీద ప్రతి ఖండంలో మానవ ఆవాసాలు ఉన్నాయి.. ఒక్క అంటార్కిటికా తప్ప. పూర్తిగా మంచుతో నిండి ఉండే అంటార్కిటికా ఖండం మీద మనిషి మనుగడ అసాధ్యం. కానీ భవిష్యత్తులో ఈ మంచు ఖండం కాస్తా మామూలు ఖండంగా మారిపోతుందా? దీని మీద మంచు కరిగిపోనుందా? ఫలితంగా భూమండలంపై మహా ఉత్పాతం సంభవించనుందా?.. అంటే అవుననే అంటున్నారు శాస్త్రవేత్తలు. అంతకంటే దిగ్భ్రాంతికరమైన వాస్తవం ఏమింటే.. ఇదేవిధమైన పరిస్థితులు కొనసాగితే 2100 సంవత్సరం నాటికి అంటార్కిటికా మంచు కరిగి సముద్ర మట్టాలు భారీగా పెరిగిపోయే ప్రమాదం ఉంది. ఆ ఉత్పాతానికి ఎన్నో దేశాలు పూర్తిగానూ.. మనదేశంలో తీర ప్రాంతాలూ నీటి మునిగిపోవచ్చు? ఫలితంగా కోట్లాదిమంది మనుగడ ప్రశ్నార్థకమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అయిదేళ్లు..., 84 మంది శాస్త్రవేత్తలు

అంటార్కిటికాపై మంచు కరుగుతున్న వైనంపై ప్రపంచవ్యాప్తంగా 42 పరిశోధనా సంస్థలకు చెందిన 84 మంది శాస్త్రవేత్తలు పరిశీలన చేశారు. దాదాపు అయిదేళ్ల పాటు కొనసాగిన ఈ అధ్యయనంలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగు చూశాయి. ప్రతిష్ఠాత్మకమైన శాస్త్ర, వైజ్ఞానిక పత్రిక అయిన 'నేచర్' ఈ పరిశోధనా ఫలితాలపై రూపొందించిన నివేదికను ప్రచురించింది.

ఇదీ కారణం...

విచ్చలవిడి పారిశ్రామికీకరణ, పర్యావరణాన్ని ధ్వంసం చేయటం, విపరీతమైన కాలుష్యం వల్ల భూతాపం పెరిగిపోతోందని ఎన్నో ఏళ్లుగా శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యాన్ని తగ్గించుకోవటమే దీనికి సరైన పరిష్కారంగా భావిస్తూ వస్తున్నారు. కానీ అది సాధ్యం కాక భూతాపం ఏటేటా పెరిగిపోతూనే ఉంది. అంటార్కిటికా మంచు వేగంగా కరిగిపోవటానికి ఇదే ప్రధాన కారణం.

మనదేశానికీ ముప్పు...

సముద్ర మట్టం పెరగటం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లోని సముద్ర తీరప్రాంతాలు నీట మునిగిపోయే ప్రమాదం ఉన్నట్లు ఇప్పటివరకూ అంచనాలు ఉన్నాయి. కానీ ప్రస్తుత అధ్యయనం ప్రకారం ఈ ముప్పు ఇంకా పెద్దగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ శతాబ్దాంతానికి సముద్ర మట్టం ఎంతో ఎక్కువ పెరుగుతుందని తాజాగా శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అదే జరిగితే తూర్పు తీరంలో దక్షిణాన తమిళనాడు నుంచి ఉత్తరాన పశ్చిమ బెంగాల్ వరకూ చాలా భాగాలు నీట మునిగిపోతాయి. పశ్చిమాన గుజరాత్ వరకూ చాలా ప్రాంతాలు సముద్రం పాలుగాక తప్పదు. పొరుగుదేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్ చాలా వరకూ కనుమరుగవుతాయి. ఇంకా ఎన్నో దేశాల రూపురేఖలు సమూలంగా మారిపోతాయి.

ఏం జరుగుతోంది?

- శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం 2012- 2017 మధ్య కాలంలో అంటార్కిటికాపై మంచు పలక ఎంతో బలహీనపడింది. ఏటా దాదాపు 219 బిలియన్ టన్నుల మంచు కరిగిపోతూ వచ్చింది.
- 2012 కంటే ముందు ఏటా కరిగిన మంచుతో పోల్చితే ఇది మూడు రెట్లు అధికం.
- దీని వల్ల సముద్ర మట్టం 1992 నుంచి 2012 మధ్యకాలంలో 1 సెంటీమీటరు పెరిగింది. కానీ గత అయిదేళ్లలోనే 0.4 సెంటీమీటర్ల వరకూ పెరిగిపోవటం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.
- వేడెక్కుతున్న సముద్ర జలాలు పశ్చిమ అంటార్కిటికా వైపు మంచును శరవేగంగా కరిగిస్తున్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అంతేగాక అంటార్కిటికా ద్వీపకల్పంపై గాలి కూడా వేడెక్కుతోంది. ఫలితంగా కొన్ని మంచు పలకలు విరిగిపోయి సముద్రంలో పడిపోతున్నాయి.
- 1950 నుంచి ఇప్పటి వరకూ 34,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కల మంచు పలకలు కరిగిపోయినట్లు శాస్త్రవేత్తల అధ్యయనాల్లో వెల్లడైంది.
- ఈ మార్పుల వల్ల 2100 నాటికి సముద్ర నీటిమట్టం ఇంకా కనీసం 15 సెంటీమీటర్లు పెరుగుతుందని యూకేలోని లీడ్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అంద్రూ షెపెర్డ్ అభిప్రాయపడ్డారు.

ఎందుకు భయపడాలి?

అంటార్కిటికాపై మంచు కరిగితే ఏమిటి ముప్పు.. అనే దానికి శాస్త్రవేత్తలు స్పష్టమైన వివరణ ఇస్తున్నారు. సముద్ర మట్టాలు 58 మీటర్ల (190 అడుగులు) ఎత్తు పెరగటానికి సరిపడా మంచు అంటార్కిటికాపై ఉంది. భూతాపం బాగా పెరిగి ఈ మంచు కరిగితే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లోని సముద్ర తీరప్రాంతాలు, దీవులు, ద్వీపకల్పాలు మునిగిపోయే ప్రమాదం ఉత్పన్నమవుతుంది.

కొత్త సీజేఐ నియామకంపై ప్రభుత్వ ఉద్దేశాలను ప్రశ్నించొద్దు

- ప్రధాన న్యాయమూర్తి నుంచి సిఫార్సు అందాక దానిపై పరిశీలన
- మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడి

దిల్లీ: తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నియామకంలో ప్రభుత్వ ఉద్దేశాలను ప్రశ్నించరాదని కేంద్ర న్యాయ, ఐటీ శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆనవాయితీ ప్రకారం ప్రస్తుత సీజేఐ నుంచి సిఫార్సు అందినపుడు దానిపై కార్యనిర్వాహక వ్యవస్థ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుత సీజేఐ దీపక్ మిశ్ర ఈ ఏడాది అక్టోబర్ 2న పదవీ విరమణ పొందుతారు. ఆయన తర్వాత అత్యంత సీనియర్ అయిన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ను సీజేఐగా ఎంపిక చేసే విషయంలో సంప్రదాయాలు, నిబంధనలను ప్రభుత్వం పాటిస్తుందా అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం చెప్పారు. "అది ఊహాజనిత ప్రశ్న. సీజేఐ నియామకానికి సంబంధించినంతవరకూ సంప్రదాయాలు స్పష్టంగా ఉన్నాయి. అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును ప్రస్తుత సీజేఐ ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఆ సిఫార్సు అందినప్పుడు దానిపై చర్చిస్తాం" అని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ ఉద్దేశాలను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదన్నారు. గత నాలుగేళ్లలో తన శాఖ సాధించిన విజయాలను వివరించేందుకు సోమవారం ఆయన ఇక్కడ పాత్రికేయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జస్టిస్ దీపక్ మిశ్ర తీరును నిరసిస్తూ నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో కలసి విలేఖర్ల సమావేశాన్ని నిర్వహించిన నేపథ్యంలో తదుపరి సీజేఐగా గొగోయ్ నియామకంపై ఊహాగానాలు మొదలయ్యాయి. జడ్జీల నియామకాలను ప్రభుత్వం చేపట్టడంలేదన్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. 2016లో 126 మందిని, 2017లో 117 మంది జడ్జీలను నియమించామన్నారు. 126 మంది ఎంపిక రికార్డును ఈ ఏడాది చివర్లోగా బద్దలుకొడతామని చెప్పారు. అఖిలభారత స్థాయి జ్యుడీషియల్ సర్వీసును ఏర్పాటుచేయడంపై ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు మధ్య విభేదాలు ఉన్నాయని ఆయన అంగీకరించారు. దిగువ కోర్టుల్లో జడ్జీల ఎంపికపై కేంద్రీకృత ఎంపిక ప్రక్రియ ఉండాలన్నారు. దిగువ కోర్టులకు సంబంధించి హైకోర్టులకున్న స్వయంప్రతిపత్తిని తాము హరించబోమని చెప్పారు.

ఆధార్‌కు సమర్థన

ఆధార్ వ్యవస్థతో అనేక ప్రయోజనాలు కలిగాయని మంత్రి తెలిపారు. ఒకవేళ ఆధార్‌కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పిస్తే ఏం చేస్తారని ప్రశ్నించినప్పుడు.. అది ఊహాజనిత ప్రశ్న అని బదులిచ్చారు. 59.15 కోట్ల మంది భారతీయులు 87.79 కోట్ల బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో సంధానం చేసుకున్నట్లు తెలిపారు. గత నాలుగేళ్లలో నగదు బదిలీ పథకం కింద రూ.4లక్షల కోట్లను పేదలకు పంచినట్లు చెప్పారు. నకిలీ లబ్ధిదారులను తొలగించడం వల్ల రూ.90వేల కోట్ల మేర ఆదా అయ్యిందన్నారు.

నెట్ దుర్వినియోగమవుతోంది :రాజ్‌నాథ్

- ఆర్థిక మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశాలు

దిల్లీ: బాలల అశ్లీల చిత్రాలు, వీడియోలతోపాటు ఇతర అభ్యంతరకర అంశాలను వ్యాప్తి చేసేందుకు అంతర్జాల దుర్వినియోగం పెరుగుతుండటంపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ భద్రతా రంగంలో ఎదురయ్యేపెను సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. హోంశాఖ వ్యవహారాలపై సోమవారమిక్కడ రాజ్‌నాథ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్రమ కార్యకలాపాల కోసం సామాజిక మాధ్యమాలను పలువురు దుర్వినియోగం చేస్తుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు మోసగాళ్లు అమాయకులకు ఫోన్ చేసి సొమ్ము కాజేస్తున్న ఘటనలను ప్రస్తావించారు. ఇలాంటి ఆర్థిక మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతోపాటు వాటిని నిరోధించేందుకు సంస్థాగత యంత్రాంగం ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. సైబర్ నేరాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఈ నెల 21 నుంచి రాజ్‌నాథ్ మంగోలియాలో పర్యటించనున్నారు. 23న మంగోలియా అధ్యక్షుడితో ఆయన సమావేశమవుతారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతంపై చర్చలు జరుపుతారు. 24న తిరిగి స్వదేశానికి చేరుకుంటారు.

సీబీఐపై హ్యాకింగ్ పడగ

సీబీఐపై హ్యాకర్లు పంజా విసిరారు. సంస్థలో బ్యాంకింగ్ మోసాల నిరోధక విభాగం సంయుక్త సంచాలకుడికి కేటాయించిన అధికారిక ఈ-మెయిల్ ఖాతాను గత నెల 17న కొంతసేపు తమ అధీనంలోకి తీసుకున్నారు. అందులో నుంచి దాదాపు 30 వేలమందికి మెయిళ్లు పంపారు. 'మీరు ఈ సందేశాన్ని అందుకుంటున్నట్లయితే మీకొక శుభవార్త. కింద సూచించిన ఈ-మెయిల్ చిరునామాలో స్పందించండి' అని హ్యాకర్లు పంపిన మెయిల్‌లో ఉంది. మరో మెయిల్ చిరునామాను దానికి జోడించారు. దీంతో జాతీయ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్(ఎన్ఐసీ)ను సీబీఐ అధికారులు వెంటనే సంప్రదించారు. హ్యాకర్ల చేతికి చిక్కిన కొద్దిసేపటికే సదరు ఈ-మెయిల్ ఖాతా తనంతట తాను ఆగిపోయిందని ఎన్ఐసీ వెల్లడించింది. హ్యాకింగ్ బారినపడ్డప్పటికీ సీబీఐ ఈ-మెయిల్ ఖాతా నుంచి సమాచారమేమీ తస్కరణకు గురికాలేదని.. సీబీఐ అధికారులు సోమవారం స్పష్టం చేశారు.

దిల్లీ నడిబొడ్డున గ్యాంగ్‌వార్

- పట్టపగలే నడిరోడ్డుపై కాల్పులు
- ముగ్గురు మృతి, ఐదుగురికి గాయాలు
- ఇది టిల్లు, గోగి ముఠాల పనే అంటున్న పోలీసులు

దిల్లీ: దేశ రాజధానిలో సోమవారం నేరగాళ్లు రెచ్చిపోయారు. ఆధిపత్యం కోసం జరుగుతున్న పోరులో భాగంగా ఒకరిపై ఒకరు విచక్షణారహితంగా, నడిరోడ్డుపైనే కాల్పులకు దిగారు. ఫలితంగా ముగ్గురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. మృతుల్లో 37ఏళ్ల సంగీత అనే మహిళ, మోటారుసైకిల్‌పై వెళ్తున్న రాజ్‌కుమార్ అనే సాధారణ పౌరులు ఉన్నారు. గాయపడినవారిలో ముగ్గురు గ్యాంగ్ సభ్యులు, ఇద్దరు సాధారణ పౌరులు ఉన్నారు. ఉత్తరదిల్లీలోని బురారి ప్రాంతంలో గోగి, టిల్లు అలియాస్ సునీల్ అనే ముఠాలు ఈ అరాచకానికి పాల్పడ్డాయని పోలీసులు తెలిపారు. తాజ్‌పుర్ గ్రామానికి చెందిన గోగి, టిల్లు గ్యాంగుల మధ్య 2010 నుంచి వివాదాలున్నాయి. దిల్లీ విశ్వవిద్యాలయం ఎన్నికల సందర్భంగా మొదలైన గొడవల కారణంగా ఇప్పటికే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం బురారియా ప్రాంతంలోని వ్యాయామశాల నుంచి బయటకు వస్తున్న టిల్లు ముఠా సభ్యులు.. అక్కడే నిలిపి ఉంచిన స్కార్పియో వాహనం ఎక్కే ప్రయత్నం చేశారు. అదేసమయంలో మరో వాహనంతో వెనుకనుంచి ఢీకొట్టిన గోగి ముఠా సభ్యులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ముకుల్ అనే ముఠాసభ్యుడు చనిపోయాడు. కాల్పులను తప్పించుకోవడానికి స్కార్పియోను వేగంగా నడపడంతో, అది ఢీకొని మోటారుసైకిల్‌పై వెళ్తున్న రాజ్‌కుమార్ అనే సాధారణ పౌరుడు ప్రాణాలు కోల్పోయాడు. రోడ్డుపై నడుస్తున్న సంగీత అనే మహిళ బుల్లెట్ గాయాలతో చనిపోయింది. వశిష్ఠ్, సచిన్ అనే మరో ఇద్దరు పౌరులకు సైతం బుల్లెట్ గాయాలయ్యాయి. వీరితోపాటు గాయపడ్డ హిమాంశు, జితేందర్, సురేందర్ అనే ముఠాసభ్యులను ఆసుపత్రికి తరలించారు. గోగి ముఠాను నడుపుతున్న జితేందర్‌గోగి తలపై రూ.4 లక్షల రివార్డు ఉంది. ముకుల్ మేనమామ అయిన దీపక్‌ను గోగి 2015లో కాల్చి చంపాడు. ఈ కేసులో సాక్ష్యాధారాలు సేకరించి, గోగిని ఉరి కంబం ఎక్కించడానికి ముకుల్ శతథా ప్రయత్నిస్తున్నాడు. వాస్తవానికి గోగి మరదలితో తనకు అత్యంత సన్నిహిత సంబంధం ఉందని దీపక్ గొప్పలు చెప్పుకునేవాడు. గోగి, నేను అన్నాదమ్ములు అవుతామనేవాడు. ఉక్రోషం పట్టలేని గోగి.. దీపక్‌ను కాల్చి చంపాడు.

సిరియాలో 52 మంది మృత్యువాత

బీరుట్: తూర్పు సిరియాలో వైమానిక దాడులకు 52 మంది బలయ్యారు. వీరంతా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ తరఫున పోరాడుతున్న వారే. అల్-హారీ పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ఈ దాడిని అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు చేపట్టినట్లు సిరియా ప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే దీనితో తమకు ఎలాంటి సంబంధములేదని అమెరికా తోసిపుచ్చింది. మృతిచెందినవారిలో 30 మంది ఇరాక్ సైనికులున్నారు. మరో 16 మంది సిరియా జవాన్లు, స్థానిక పౌర సైనికులు ఉన్నారు. మిగతా ఆరుగురి వివరాలు తెలియరాలేదు. ఇక్కడ ఇరాక్‌తోపాటు ఇరాన్, లెబనాన్, అఫ్గానిస్థాన్ సైనికులనూ అసద్ మోహరించడం గమనార్హం. దాడిలో గాయపడినవారిని అల్బూ కమల్ పట్టణానికి తరలించినట్లు బ్రిటన్‌కు చెందిన మానవ హక్కుల సంస్థ తెలిపింది. గత ఫిబ్రవరిలో ఇక్కడ అమెరికా సేనలు జరిపిన దాడిలో పలువురు రష్యన్లు సహా వంద మంది వరకూ అసద్ మద్దతుదారులు మృత్యువాతపడ్డారు.

నళినీ చిదంబరానికి ఈడీ సమన్లు

దిల్లీ: శారదా పోంజీ కుంభకోణం కేసుకు సంబంధించి మాజీ మంత్రి పి.చిదంబరం భార్య, సీనియర్ న్యాయవాది నళినీ చిదంబరానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా మరోసారి సమన్లు జారీ చేసింది. కోల్‌కతాలోని ఈడీ కార్యాలయం వద్ద ఈనెల 20న హాజరు కావాల్సిందిగా ఆమెకు సమన్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. నగదు అక్రమ చెలామణి నిరోధక చట్టం (పీఎంఎల్)లోని నిబంధనల మేరకు ఈ కేసుతో ఆమెకున్న సంబంధంపై వాంగ్మూలాన్ని నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. కుంభకోణం విచారణ సమయంలో ఆమె పేరు బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆమెకు సమన్ల నోటీసు పంపడం ఇది నాలుగోసారని.. కుంభకోణంపై తమ దర్యాప్తునకు ఆమె సహకరిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ఇద్దరు ముష్కరులను భద్రతా బలగాలు సోమవారం మట్టుపెట్టాయి. రంజాన్ మాస కాల్పుల విరమణను ఎత్తివేసిన మరుసటిరోజే.. బందీపోరా జిల్లాలో ఈ ఆపరేషన్ జరిగింది. ఉగ్రవాదులను ఏరివేయడమే లక్ష్యంగా దీన్ని చేపట్టినట్లు ఓ సైన్యాధికారి తెలిపారు. ఘటన జరిగిన ప్రాంతంలో ముష్కరులు సంచరిస్తున్నట్లు సమాచారం అందిందని, వెంటనే గాలింపు చర్యలు మొదలుపెట్టామని పేర్కొన్నారు. చివరి సమాచారం అందేవరకూ ఆపరేషన్ కొనసాగుతోందని, మరణించిన ఉగ్రవాదులు ఏ సంస్థకు చెందినవారో ఇంకా తెలియలేదని చెప్పారు. శ్రీనగర్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల బలగాలు విస్తృతం తనిఖీలు చేపడుతున్నాయి. నగరంలోకి వచ్చే ప్రతివాహనాన్నీ సోదా చేస్తున్నాయి.

ప్రధాని దృష్టిలో ఈశాన్య రాష్ట్రాలు అష్టలక్ష్మిలు: అమిత్ షా

గువాహటి: ఈశాన్య భారతంలోని ఎనిమిది రాష్ట్రాలను అష్టలక్ష్మిలుగా ప్రధాని నరేంద్ర మోదీ పరిగణిస్తున్నారని భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా అన్నారు. ప్రధాని అనుసరిస్తున్న విధానాలతో.. మనదేశ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో అతిపెద్ద భాగస్వామిగా ఈ ప్రాంతం త్వరలోనే ఆవిర్భవిస్తుందని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో రోడ్డు, రైలు మార్గాల అనుసంధానత, ఐటీ, విద్యుత్తు, విద్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం సుదీర్ఘకాలంపాటు ఈశాన్య రాష్ట్రాలను కాంగ్రెస్ పాలించిందని.. ఫలితంగా ఇన్నాళ్లూ అక్కడ అభివృద్ధి కుంటుపడిందని వ్యాఖ్యానించారు. టాటా ట్రస్ట్ భాగస్వామ్యంతో అసోంలో ఏర్పాటుచేయనున్న 19 క్యాన్సర్ ఆస్పత్రులకు శంకుస్థాపన చేసిన అనంతరం గువాహటిలో షా సోమవారం ఈ మేరకు మాట్లాడారు. అసోం ముఖ్యమంత్రి శర్వానంద సోనోవాల్, అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండూ, టాటా ట్రస్ట్ ఛైర్మన్ రతన్ టాటా తదితరులు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

జపాన్‌ను కుదిపేసిన భూకంపం

- చిగురుటాకులా వణికిన ఒసాకా
- ముగ్గురి దుర్మరణం
- 234 మందికి గాయాలు

టోక్యో: భూ ప్రకంపనల తీవ్రతకు జపాన్ మరోసారి హడలెత్తిపోయింది. ఆ దేశ ప్రధాన నగరాల్లో ఒకటైన ఒసాకాను సోమవారం భూకంపం వణికించింది. శక్తిమంతమైన ఈ భూకంపం ధాటికి ముగ్గురు మృత్యువాతపడ్డారు. 234 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో తొమ్మిదేళ్ల బాలిక కూడా ఉంది. దాదాపు 1.7 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాజా భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైంది. ప్రకంపనల ధాటికి ఒసాకాలో భవనాలు ఊగుతున్న వీడియోలు టీవీల్లో ప్రసారమయ్యాయి. పలు ప్రాంతాల్లో పైపులు పగిలిపోయి నీరు ఎగిసిపడుతుండటం కనిపించింది. రాబోయే 2-3 రోజుల్లో మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశముందని అధికారవర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించాయి. సునామీ హెచ్చరికలేవీ జారీ కాలేదు. మరోవైపు, భూకంపం ధాటికి ఒసాకాలో దాదాపు 80 విమానాల రాకపోకలు రద్దయ్యాయి. వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. పానసోనిక్, కుబోటా, డైకిన్ తదితర సంస్థలు ఒసాకాలో ఉత్పత్తి ప్రక్రియలను తాత్కాలికంగా నిలిపివేశాయి. భూకంపాలు ఎక్కువగా వచ్చే పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో జపాన్ ఉన్న సంగతి గమనార్హం.

పశ్చిమ జపాన్‌లోని ఒసాకాలో భూ ప్రకంపనలతో కుంచించుకుపోయిన రహదారి

ఎంపీలాడ్స్ పనుల వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచండి: సీఐసీ

దిల్లీ: పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీలాడ్స్) కింద చేపట్టిన పనుల వివరాలను కేంద్ర ప్రభుత్వం తన వెబ్‌సైట్‌లో ఉంచాలని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఆదేశించింది. తాము ఎంపీలాడ్స్ నిధులను విడుదల చేసినా, చేపట్టిన పనుల వివరాల రికార్డును నిర్వహించడం లేదని గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వశాఖ.. సీఐసీకి చెప్పిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వచ్చాయి. జిల్లా అధికారుల నుంచి మంత్రిత్వశాఖకు నిధుల వినియోగ ధ్రువీకరణ పత్రాలు (యూసీ) వస్తున్నా వెబ్‌సైట్‌లో వినియోగ వివరాలేమీ ఉంచడం లేదని సమాచార కమిషనర్ శ్రీధర్ ఆచార్యులు చెప్పారు. గ్వాలియర్ నియోజకవర్గంలో ఎంపీలాడ్స్ కింద ఎంపీ నరేంద్ర సింగ్ తోమర్.. 2015 జనవరి నుంచి 2017 ఆగస్టు వరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ప్రశాంత్ జైన్ అనే వ్యక్తి తెలుసుకోగోరారు. తాను కోరిన సమాచారాన్ని మంత్రిత్వశాఖ కానీ, జిల్లా యంత్రాంగం కాని ఇవ్వలేదని సీఐసీకి ప్రశాంత్ జైన్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే సీఐసీ స్పందించింది.

చరిత్ర పుస్తకాల కాషాయీకరణ

- అన్ని తరగతుల పాఠ్యాంశాల్లోనూ చోటు
- ఆరెస్సెస్ ఆదేశంతో సమాయత్తమవుతున్న సర్కారు

ఈనాడు, దిల్లీ: అన్ని స్థాయిల్లోని చరిత్ర పాఠ్యపుస్తకాలనూ కాషాయీకరించేందుకు నరేంద్రమోదీ సర్కారు కసరత్తు చేస్తోంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఆదేశాల మేరకు ఈ దిశగా అడుగులు వేస్తోంది. భారతీయ చరిత్రపై పాఠ్య పుస్తకాల్లో ఉన్న 'వామపక్షవాద వ్యాఖ్యానా'న్ని చెరిపివేయడానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక శాఖ ఇంతవరకు ఏం చేశాయనేదానిపై భాజపా నేతలను ఆరెస్సెస్ ఇటీవల ప్రశ్నించింది. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన చరిత్ర పుస్తకాలను గత నాలుగేళ్లలో పూర్తిగా తిరగ రాయించారు. ఉన్నత విద్య సంబంధిత పుస్తకాల్లోనూ 'ఎరుపు ముద్ర'ను రెండు మంత్రిత్వ శాఖలు కలిసి తుడిచిపెట్టాలని ఆరెస్సెస్ కోరుకొంటోంది. చరిత్రకు సంబంధించిన అన్ని పుస్తకాల్లో భారతీయత (కాషాయీకరణ) కనిపించాలని చెబుతోంది. దేశాన్ని పాలించిన హిందూ, బౌద్ధ రాజుల గురించి ప్రాచీన చరిత్ర మొత్తాన్ని విశదీకరించాలనీ, మధ్యయుగ కాలంలో దేశ ప్రజలపై విదేశీ చక్రవర్తులు సాగించిన దమనకాండనూ సవివరంగా విద్యార్థులకు తెలపాలనీ సంఘ్ ఉద్దేశం. దీంతోపాటు సమకాలీన అంశాలపై ప్రసార మాధ్యమాల్లో తమ దృక్కోణాన్ని సమర్థంగా ఆవిష్కరించే 'కాషాయ మేధావుల'ను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఇటీవల జరిగిన ఆరెస్సెస్ సమావేశాల్లో సీనియర్ నేత గోపాలకృష్ణ గట్టిగా అభిప్రాయపడ్డారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, భారతీయ సంస్కృతి, విశ్వాసాలు, దేశంలోని కల్లోలిత ప్రాంతాలు వంటి వేర్వేరు అంశాలపై సంఘ్ భావాలను బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలనేది సంఘ్ ఉద్దేశం. హిందుత్వమంటే సమ్మిళితమైనది, విచక్షణ రహితమైనది, బలహీన వర్గాలను/ మహిళలను గౌరవించేది అని గట్టిగా చాటిచెప్పడమే ఈ ఉద్దేశం వెనుక ఆలోచన.

శ్యామా ప్రసాద్ ముఖర్జీపై పుస్తకాలు: భాజపా వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీపై పూర్తిస్థాయిలో పుస్తకాలను రూపొందించే పనిలో పురోగతిపైనా ఆరెస్సెస్ ఆరా తీసింది. 'నెహ్రూ స్మారక పురావస్తుశాల, గ్రంథాలయా'నికి అప్పగించారు.

అమరలోకానికి అక్క వెంటే..

- నిమిషం వ్యవధిలో మరణించిన తోబుట్టువులు

నడింపల్లి, న్యూస్‌టుడే: వారిద్దరూ అక్కాచెల్లెళ్లు. ఒకరంటే ఒకరికి ప్రాణం. 90 ఏళ్ల జీవితాన్ని అలాగే గడిపారు. ఆ అనుబంధాన్ని విడదీయడానికి వచ్చిన మరణమే చిన్నబోయేలా ఇద్దరు నిమిషం వ్యవధిలోనే అనంతలోకాలకు పయనమయ్యారు. వెళుతున్నా అన్నట్లుగా చెల్లి వంక చూసి అక్క తనువు చాలిస్తే.. ఇదేమిటి అక్కా నీతోనే నేను వస్తున్నా.. అన్నట్లుగా అక్కనే చూస్తూ చెల్లి నిమిషంలోపే ప్రాణం విడిచింది. గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలం నడింపల్లిలో సోమవారం చోటుచేసుకొన్న ఈ సంఘటన గ్రామంలో విషాదం నింపింది. నడింపల్లికి చెందిన కొడాలి సీతారావమ్మ(94)కు మేనమామతో వివాహమైంది. ఆమెకు ఇద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. చిన్న చెల్లి బాల్యంలోనే మృతిచెందింది. మరో చెల్లి పావులూరి సత్యవతి(90) వివాహానంతరం అమృతలూరు వెళ్లింది. సంతానం లేకపోవడం, భర్త చనిపోవడంతో ఆమె 40 ఏళ్ల నుంచి సీతారావమ్మ వద్దే ఉంటోంది. తల్లిదండ్రుల తరువాత అంతగా ప్రేమానురాగాలు పంచిన అక్కపట్ల సత్యవతి ఎంతో ప్రేమగా ఉండేది. సీతారావమ్మకు నలుగురు ఆడ, ఇద్దరు మగ సంతానం ఉన్నారు. కొన్ని రోజులుగా ఆమె అస్వస్థతతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సీతారావమ్మ తన పక్కనే ఉన్న చెల్లెలిని చూస్తూ.. ఆమె చేతిలో చెయ్యి వేసి తుదిశ్వాస విడిచింది. వెనువెంటనే నిమిషం వ్యవధిలో చెల్లెలు సత్యవతి కన్నుమూసింది. అక్కాచెల్లెళ్లు ఇలా ఒకరివెంట ఒకరు అనంత లోకాలకు చేరడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.



అక్కాచెల్లెళ్ల భౌతిక కాయాలు

'బుఖారీ హంతకులను త్వరగా పట్టుకుని శిక్షించాలి'

దిల్లీ: సీనియర్ పాత్రికేయుడు షుజాత్ బుఖారీ హంతకులను సాధ్యమైనంత త్వరగా పట్టుకుని శిక్షించాలంటూ 11 మీడియా సంస్థలు సోమవారం జమ్ము-కశ్మీరు ప్రభుత్వాన్ని అభ్యర్థించాయి. బుఖారీని హత్య చేయడానికంటే ముందు...సామాజిక మాధ్యమాల్లో ఆయనపై మొదలుపెట్టిన బురదజల్లే కార్యక్రమానికి బాధ్యులెవరనే విషయాన్ని కనుగొనేందుకు ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టాలని కోరాయి. బుఖారీపై విషపూరిత ప్రచారానికి ఒడిగట్టిన వారి ఐపీ అడ్రస్‌లు...మూలాలను కనుగొనేందుకు కేంద్ర హోంశాఖకు చెందిన సైబర్‌సెల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అభ్యర్థించాయి. పలు జర్నలిస్టు సంఘాల సారథ్యంలో జరిగిన స్మారక సభకు హాజరైన వారంతా ఆయన హత్యను తీవ్రంగా ఖండించారు. ఈ నెల 14న బుఖారీ కార్యాలయం వెలుపలే ఆయనను ముగ్గురు వ్యక్తులు దారుణంగా కాల్చి చంపిన విషయం తెలిసిందే.

వీడియో గేమ్స్ వ్యసనం కొకైన్ లాంటిదే

- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

పారిస్: కొకైన్ వంటి మాదకద్రవ్యాలు తీసుకోవడం, జూదమాడటం తరహాలోనే వీడియో గేములు కూడా వ్యసనంగా మారొచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. తాజాగా విడుదల చేసిన 'వ్యాధులపై అంతర్జాతీయ వర్గీకరణ' (ఐసీడీ) 11వ సంచికలో ఈ మేరకు హెచ్చరించింది.

ప్రపంచవ్యాప్తంగా నిపుణులను సంప్రదించి, విస్తృత స్థాయిలో ఆధారాలను సేకరించాక వీడియో గేముల వ్యసనాన్ని కూడా ఐసీడీలో చేర్చాలని నిర్ణయించినట్లు డబ్ల్యూహెచ్‌వో మానసిక ఆరోగ్య విభాగం సంచాలకుడు శేఖర్ సక్సేనా తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ 'గేమింగ్ రుగ్మత'ను పదార్థాల వినియోగం లేదా వ్యసనపరమైన వ్యవహారశైలితో వచ్చే రుగ్మతగా వర్గీకరించారు. ఐసీడీకి సంబంధించి గత మూడు దశాబ్దాల్లో ఇది తొలి ప్రధాన సవరణ.

గేమింగ్ రుగ్మతలో నియంత్రణ లోపం వంటి లక్షణాలు ఉంటాయని సక్సేనా చెప్పారు. ఫలితంగా మిగతా అంశాలన్నీ వదిలేసి ఆన్‌లైన్ గేమ్ మీదే దృష్టి పెట్టడం, ఆటను విరమించడంలో అసహాయత వంటివి చోటుచేసుకుంటాయని పేర్కొన్నారు. అలాంటి వారు నిద్ర, తిండిని కూడా పట్టించుకోరన్నారు. అసాధారణ కేసుల్లో. చదువు మానేయడం, ఉద్యోగం కోల్పోవడం, కుటుంబానికి దూరమైపోవడం జరుగుతోందని వివరించారు. ఈ వ్యసనపరుల్లో ఎక్కువ మంది యువతేనని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మంది ఏదో ఒక రకమైన వీడియోగేమ్‌లు ఆడుతుంటారని, అయితే కొద్దిమందిలోనే అది రుగ్మతగా మారిందన్నారు.

2017లో ప్రపంచ గేమింగ్ పరిశ్రమ 108 బిలియన్ డాలర్లు ఆర్జించిందని గణాంకాలు చెబుతున్నాయి. సినిమాల మీద వచ్చిన ఆదాయం కన్నా ఇది రెట్టింపు. గేమింగ్‌లో 40 శాతం విక్రయాలు తూర్పు ఆసియాలో. ప్రధానంగా చైనా, దక్షిణ కొరియాలో ఉన్నాయి.

పిల్లాడికి పేరు పెట్టడానికి ఎన్నికల నిర్వహణ

నాగ్‌పుర్: పిల్లాడికి పేరు పెట్టాలంటే జన్మనక్షత్రం చూస్తాం.. ఏ అక్షరంతో పేరు మొదలవుతుందో పరిశీలిస్తాం.. నాలుగైదు పేర్లు అనుకుంటాం.. వీలైతే అమ్మానాన్నల పేర్లు కలిపి పెట్టేస్తాం. మహారాష్ట్రలోని గోండియా జిల్లాకు చెందిన మిథున్, మాన్సిబంగ్ దంపతులు ఈ రొటీన్ ప్రక్రియకు వినూత్నంగా ఆలోచించారు. 'మా అబ్బాయికి పేరు పెట్టాలనుకుంటున్నాం. దయచేసి మీ అమూల్యమైన ఓటు వేసి, ఒక పేరు సూచించండి. యక్ష్, యువన్, యౌవిక్ పేర్లలో ఒకదానికి మీ ఓటు వేయండి' అని బ్యానర్లు కట్టారు. ఓటింగ్ పెట్టారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను ఓటు వేయాలని ఆహ్వానించారు. గోండియా లోక్‌సభ స్థానానికి ఇటీవల రాజీనామా చేసిన మాజీ ఎంపీ నానా పటోల్ సైతం వీరిలో ఉన్నారు. జూన్ 15న నిర్వహించిన పోలింగ్‌లో 192 ఓట్లు పోలయ్యాయి. 'యువన్' పేరుకే 92 మంది ఓటు వేయడంతో దాన్నే ఖరారు చేశారు. ఈ దంపతులకు ఐదేళ్ల కుమార్తె 'భూమి' ఉంది. అప్పట్లో కుటుంబంలో ఒకరు చనిపోవడంతో ఓటింగ్ నిర్వహించలేదని మిథున్ చెప్పారు.

కిక్ 2018 ఛాంపియన్స్

బ్రెజిల్ 1 | స్విట్జర్లాండ్ 1

స్టీవ్ జుబెర్

0 ప్రపంచకప్‌లో తన చివరి మూడు మ్యాచ్‌ల్లో బ్రెజిల్ ఒక్కటీ నెగ్గలేదు

బ్రెజిల్ మనలేదు

రొస్తోవ్

అగ్ర జట్ల ప్రపంచకప్ వేట అనుకున్నంత సాఫీగా ఆరంభం కాలేదు. డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ తొలి మ్యాచ్‌లో మెక్సికో చేతిలో దిగ్భ్రాంతికర ఓటమిని చవిచూస్తే.. పోర్చుగల్‌తో స్పెయిన్, ఐస్‌లాండ్‌తో అర్జెంటీనా డ్రా చేసుకున్నాయి. ఇప్పుడు మరో ఫేవరెట్ బ్రెజిల్ కూడా టోర్నీని పేలవంగా ఆరంభించింది. ఆదివారం రాత్రి జరిగిన గ్రూప్-ఈ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 1-1తో సాంబా జట్టును నిలువరించింది. గత ప్రపంచకప్‌లో సెమీస్‌లో భంగపడ్డ బ్రెజిల్.. చాలా మార్పులు చోటు చేసుకున్న జట్టుతో, భారీ అంచనాలతో బరిలోకి దిగింది. స్విస్ జట్టుపై గెలుపు లాంఛనమే అనుకున్నారంతా. కానీ టోర్నీకి ముందు జరిగిన మ్యాచ్‌ల్లోలా జోరును ప్రదర్శించలేకపోయింది. స్విట్జర్లాండ్ జట్టు చక్కని సమన్వయంతో బ్రెజిల్‌ను అడ్డుకుంది.

మ్యాచ్ ఆరంభంలో బ్రెజిల్ స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కాస్త నెమ్మదిగానే మొదలెట్టినా క్రమంగా వేగం పెంచింది. ఫిలిప్ కౌటినో 20వ నిమిషంలో చేసిన కళ్లుచెదిరే గోల్‌తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కౌటినో గోల్ నిజంగా అద్భుతం. బాక్స్ బయటి నుంచి అతడు చక్కని కిక్‌తో స్విస్ గోల్‌కీపర్ యాన్ సోమర్‌ను బోల్తా కొట్టించాడు. వంపు తిరుగుతూ వెళ్లిన బంతి పై మూల నుంచి నెట్లో పడింది. ఐతే రెండో అర్ధభాగంలో స్విస్ జట్టు పుంజుకుంది. 50వ నిమిషంలో స్టీవ్ జుబెర్ గోల్‌తో స్కోరు సమం చేసింది. బ్రెజిల్ డిఫెన్స్ వైఫల్యం జుబెర్‌కు కలిసొచ్చింది. షాకిరి కార్నర్‌ను కొట్టగా.. జుబెర్‌ను డిఫెండర్లు ఒంటరిగా వదిలేశారు. అవకాశాన్ని అతడు సద్వినియోగం చేసుకున్నాడు. తిరిగి ఆధిక్యం సంపాదించేందుకు బ్రెజిల్ తీవ్రంగా ప్రయత్నించింది. కానీ కొద్దిలో అవకాశాలు కోల్పోయింది. కౌటినో, మిరందాలు బాక్స్ నుంచి బంతిని దూరంగా తన్నేయగా.. నెయ్‌మార్ సబ్‌స్టిట్యూట్ రాబర్టో ఫిర్మినో షాట్‌ను గోల్‌కీపర్ సోమర్ అడ్డుకున్నాడు. ఈ ఫలితంతో బ్రెజిల్ ఒక్క పాయింట్‌తో సరిపెట్టుకుంది. 1978 నుంచి బ్రెజిల్ ఒక్కసారి కూడా ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో నెగ్గలేదు.

నిలువరించిన స్విట్జర్లాండ్

వివాదాస్పదమైన హెడర్ గోల్..



ఆ తప్పును గుర్తించివుంటే..

స్విట్జర్లాండ్‌తో మ్యాచ్‌లో తామే గెలవాల్సిందని బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ అన్నాడు. స్విట్జర్లాండ్ చేసిన గోల్ చెల్లదని వీడియో అసిస్టెంట్ రిఫరీ (వార్) ప్రకటించాల్సిందని అన్నాడు. స్విస్ ఆటగాడు స్టీవెన్ జుబెర్ హెడర్ గోల్ సాధించే క్రమంలో తన ముందున్న బ్రెజిల్ ఆటగాడు మిరందాను ను ముందుకు నెట్టాడు. మెక్సికోకు చెందిన రిఫరీ రామోస్ దీన్ని ఫౌల్‌గా గుర్తించలేదు. అప్పుడు వార్ రిఫరీ లేదా అతడి సహాయకుడు రామోస్ దృష్టికి తీసుకురావాల్సిందని నెయ్‌మార్ అభిప్రాయపడ్డాడు. రామోస్ సమీక్ష కోరి ఉంటే తప్పు తెలుసుకునే వాడని, గోల్ చెల్లదని ప్రకటించి ఉండేవాడని అన్నాడు. టోర్నీలో వార్‌తో మంచి ఫలితాలు వచ్చాయని, తమకు మాత్రం అన్యాయం జరగిందని నెయ్‌మార్ చెప్పాడు.

లుకాకు డబుల్

బెల్జియం చేతిలో పనామా చిత్తు

భారీ అంచనాలతో ప్రపంచకప్‌లో బరిలోకి దిగిన బెల్జియం ఘనంగా బోణీ కొట్టింది. తన తొలి మ్యాచ్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. స్టార్ స్ట్రైకర్ లుకాకు డబుల్ కొట్టిన వేళ.. పసికూన పనామాను చిత్తుగా ఓడించింది.

సోచి

ఈ ప్రపంచకప్‌లో బలమైన జట్లలో ఒకటైన బెల్జియం తన తొలి మ్యాచ్‌లో చెలరేగిపోయింది. సోమవారం ఏకపక్షంగా సాగిన గ్రూప్-జి మ్యాచ్‌లో 3-0తో తొలిసారి ప్రపంచకప్ ఆడుతున్న పనామాపై ఘనవిజయం సాధించింది. స్టార్ స్ట్రైకర్ రొమెలు లుకాకు రెండు గోల్స్ (69వ, 75వ) కొట్టగా.. మెర్టెన్స్ (47వ నిమిషం) ఓ గోల్ సాధించాడు. స్టార్లతో నిండిన బెల్జియం దూకుడు ముందు పనామా నిలవలేకపోయింది. మ్యాచ్ ఆద్యంతమూ బెల్జియందే ఆధిపత్యం. బంతిని ఎక్కువగా తన నియంత్రణలోనే ఉంచుకున్న ఆ జట్టు.. పనామా రక్షణశ్రేణిని ఎప్పుడూ ఒత్తిడిలోనే ఉంచింది. ఐతే ఎప్పుడూ ప్రమాదకరంగా లేకపోయినా తొలి అర్ధభాగంలో పనామా కాస్త పోటీ ఇచ్చింది. బెల్జియం గోల్ కొట్టకుండా అడ్డుకోగలిగింది. హజార్డ్, మెర్టెన్స్ అవకాశాలు సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. కానీ లుకాకు బంతితో ఎక్కువగా కనపడలేదు. విరామానికి 0-0తో ఉన్న బెల్జియం ద్వితీయార్ధంలో చెలరేగిపోయింది. ఆట తిరిగి ఆరంభమై కాసేపటికే మెర్టెన్స్.. బెల్జియంను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఓ కళ్లు చెదిరే కిక్‌తో అతడు పనామా గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత ఆ జట్టు దాడులను తీవ్రతరం చేసింది. 54వ నిమిషంలో పనామా ఆటగాడు ముర్రిలో గోల్ ప్రయత్నాన్ని బెల్జియం గోల్‌కీపర్ కోర్టొయిస్ చక్కగా అడ్డుకున్నాడు. ఐతే ఆ తర్వాత బెల్జియం దాడులు పెంచింది. పనామా ఎక్కువగా ఆ దాడులను కాచుకోవడానికే పరిమితమైంది. 69వ నిమిషంలో లుకాకు.. హెడర్ గోల్‌తో బెల్జియం ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. కాసేపటి తర్వాత అతడు మరో గోల్ కొట్టాడు. హజార్డ్ నుంచి చక్కని పాసును అందుకున్న అతడు.. ముందుకు దూసుకెళ్లి పనామా గోల్‌కీపర్‌ను అలవోకగా బోల్తా కొట్టించాడు.

బెల్జియం 3 | పనామా 0

లుకాకు

కన్నీళ్లు తుడిచిన ఫుట్‌బాల్!

పనామాతో మ్యాచ్‌లో రెండు గోల్స్ కొట్టి బెల్జియం విజయంలో కీలక పాత్ర పోషించిన రొమెలు లుకాకు చిన్నతనం నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొని అంతర్జాతీయ ఫుట్‌బాలర్‌గా ఎదిగాడు. అతడి తండ్రి రోజర్ లుకాకు కూడా ఫుట్‌బాలరే. క్లబ్ స్థాయిలో ఆడిన అతను.. పెద్దగా సంపాదించిందేమీ లేదు. అతడి కుటుంబం చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. మూడు పూటలా తిండికీ ఇబ్బందులు ఎదురైన పరిస్థితి. అప్పు చేసి బేకరీల నుంచి బ్రెడ్ తెచ్చి కడుపు నింపుకునేవాళ్లు రొమెలు కుటుంబ సభ్యులు. ఐతే రోజర్ పెద్ద కొడుకైన రొమెలును ఫుట్‌బాలర్‌ను చేయాలని అతడి చిన్నతనంలోనే నిర్ణయమైపోయింది. రొమెలు కూడా ఆరేళ్ల వయసుకే ఆటకు తన జీవితాన్ని అంకితం చేశాడు. ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్ కావడానికి కనీస వయసు 16 ఏళ్లు వచ్చే సమయానికి తాను కెరీర్లో నిలదొక్కుకుంటానని.. కుటుంబం కష్టాలు తీరుస్తానని చిన్నతనంలోనే రొమెలు తల్లిదండ్రులకు హామీ ఇవ్వడం విశేషం. అన్నట్లుగానే ఆ వయసుకే అతను ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్ అయ్యాడు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి మారిపోయింది. రొమెలకిది రెండో ప్రపంచకప్. నాలుగేళ్ల కిందటి టోర్నీలో పెద్దగా రాణించలేకపోయిన అతను.. ఈసారి ఆరంభ పోరులోనే అదరగొట్టాడు.

'వార్' తెచ్చిన విజయం

విక్టర్ క్వేసన్‌ను అడ్డుకుంటున్న కిమ్ మిన్ వూ

స్వీడన్ 1 | దక్షిణ కొరియా 0

నిజ్నీ నొవ్‌గొరాడ్: పుష్కరం విరామం తర్వాత ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లోకి పునరాగమనం చేసిన స్వీడన్ జట్టు టోర్నీలో శుభారంభం చేసింది. గ్రూప్-ఎఫ్‌లో ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 1-0తో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. క్వాలిఫయింగ్ దశలో ఫ్రాన్స్, ఇటలీ లాంటి మేటి జట్లకు షాకిచ్చి ప్రధాన టోర్నీకి అర్హత సాధించిన స్వీడన్.. తొలి మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగి అంచనాలకు తగ్గట్లే రాణించింది. బంతి నియంత్రణలో, గోల్ దాడుల్లో ఆ జట్టుదే ఆధిపత్యం. ఐతే కొరియా గోల్‌కీపర్ చో

దక్షిణ కొరియాపై స్వీడన్ గెలుపు

హ్యున్ వూ తిరుగులేని డిఫెన్స్‌తో రెండు మూడు గోల్ ప్రయత్నాల్ని సమర్థంగా అడ్డుకున్నాడు. స్వీడన్‌కు గెలుపు గోల్ 65వ నిమిషంలో వచ్చింది. పెనాల్టీని సద్వినియోగం చేస్తూ కెప్టెన్ ఆండ్రీస్ గ్రాన్‌క్విస్ట్ ఈ గోల్ సాధించాడు. ఐతే స్వీడన్‌కు పెనాల్టీ అవకాశం నాటకీయ రీతిలో లభించింది. విక్టర్ క్వేసన్‌ను అడ్డుకుంటూ కిమ్ మిన్ వూ చేసిన ఫౌల్‌ను మొదట రిఫరీ గుర్తించలేదు. ఐతే స్వీడన్ ఆటగాళ్లు గట్టిగా అప్పీల్ చేస్తూ తమ ఆగ్రహాన్ని ప్రకటించాక రిఫరీ.. మనసు మార్చుకున్నాడు. వీడియో సమీక్ష సాయం (వార్) కోరాడు. కిమ్ ఫౌల్ చేసినట్లు 'వార్' నిర్ధరించడంతో రిఫరీ స్వీడన్‌కు పెనాల్టీ ఇచ్చాడు. ఆండ్రీస్.. కొరియా గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ సులువుగానే గోల్ కొట్టాడు. అంతకుముందు ఆండ్రీస్ కొట్టిన ఒక షాట్‌ను ప్రత్యర్థి గోల్‌కీపర్ సమర్థంగా అడ్డుకున్నాడు. మరోవైపు కొరియా.. ఏ దశలోనూ ప్రభావవంతంగా కనిపించలేదు. స్టార్ ఆటగాడు సన్ హ్యూంగ్ మిన్ అనారోగ్యంతో మ్యాచ్‌కు దూరం కావడం ఆ జట్టును దెబ్బ తీసింది. ఈ విజయంతో 3 పాయింట్లు సాధించిన స్వీడన్.. డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీని ఓడించిన మెక్సికోతో సమానంగా నిలిచాయి. జర్మనీ, కొరియా ఓటములతో వెనుకబడ్డాయి.

సమీక్ష.. భలే భలే

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో తొలిసారి ప్రవేశపెట్టిన వీడియో సమీక్ష సాయం (వార్) ఆసక్తి రేకెత్తిస్తోంది. తొలి రెండు రోజులు ఈ సాంకేతికతను రిఫరీలు వినియోగించుకోలేదు. దీంతో 'వార్' వల్ల కొత్తగా ఒరిగేదేంటి అన్న చర్చ మొదలైంది. కానీ రిఫరీలు ఈ సాంకేతికతను ఉపయోగించడం మొదలుపెట్టాక.. ఇది మ్యాచ్ ఫలితాల్ని నిర్దేశించేంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఫ్రాన్స్-ఆస్ట్రేలియా మ్యాచ్ ఫలితాన్ని మార్చింది ఈ సాంకేతికతే. సమీక్ష ద్వారా లభించిన పెనాల్టీతో ఫ్రాన్స్ గోల్ కొట్టి ఆస్ట్రేలియాను ఓడించింది. తాజాగా దక్షిణ కొరియాపై స్వీడన్ గెలవడానికి కూడా 'వార్' కీలకమైంది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ ముందు రిఫరీలు పెనాల్టీ ఇవ్వడానికి నిరాకరించి, ఆ తర్వాత 'వార్' సమీక్షతో తమ నిర్ణయాలు మార్చుకున్నారు. స్విట్జర్లాండ్‌తో మ్యాచ్‌లో డ్రాతో సరిపెట్టుకున్న బ్రెజిల్.. రిఫరీ ఈ సాంకేతికతను వినియోగించుకుని ఉంటే విజయం తమదే అయ్యేదని ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ముందుముందు 'వార్' ఇంకెంత కీలకంగా మారుతుందో చూడాలి.

సైకిల్‌పై రష్యాకు..

మాస్కో: సైకిల్‌పై నాలుగు దేశాలు... దాదాపు 4వేల కిలోమీటర్ల ప్రయాణం. ఇదేదో రికార్డు కోసమో లేదా ప్రత్యేకంగా పేరు తెచ్చుకోవడానికే చేసింది కాదు. తనకిష్టమైన ఆటను ఆస్వాదించడానికి.. తన అభిమాన ఆటగాణ్ని ప్రత్యక్షంగా చూడడానికి కేరళకు చెందిన క్లిఫిన్ ఫ్రాన్సిస్ చేసిన సాహస యాత్ర ఇది. 28 ఏళ్ల ఫ్రాన్సిస్‌కు చిన్నప్పటి నుంచే ఫుట్‌బాల్ అంటే పిచ్చి. ఇక అర్జెంటీనా ఆటగాడు లియోనాల్ మెస్సిని దేవుడిలా కొలుస్తాడు. ఒక్కసారైనా మెస్సిని కలిసే అవకాశం లేదా కనీసం దగ్గరనుంచి చూసే క్షణం కోసం చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాడు. రష్యాలో ప్రపంచకప్ నేపథ్యంలో ఈ నెల 26న ఫ్రాన్స్, డెన్మార్క్ మధ్య జరగనున్న ప్రపంచకప్ మ్యాచ్‌కు టికెట్ సంపాదించాడు. రష్యా చేరుకోవడానికి వినూత్న మార్గంలో వెళ్లాలనుకున్నాడు. ఫిబ్రవరి 28న కేరళ నుంచి దుబాయికి విమానంలో వెళ్లాడు. అక్కడే ఓ సైకిల్ కొన్నాడు. దాన్ని తీసుకొని నౌకా ప్రయాణం ద్వారా ఇరాన్ చేరాడు. ఇక అక్కడినుంచి తన సైకిల్ ప్రయాణం మొదలైంది. ఇరాన్, అజర్బైజాన్‌ల మీదుగా రష్యాలో అడుగు పెట్టాడు. ఈ ప్రయాణంలో రోజూ కొత్త కొత్త విషయాలు తెలుసుకున్నానని ఫ్రాన్సిస్ చెబుతున్నాడు. "రష్యా చేరుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇది నాలుగు నెలల సుదీర్ఘ ప్రయాణం. ఈ ప్రయాణంలో రోజూ కొత్త కొత్త వ్యక్తులను కలిశా. కొత్త ప్రదేశాలను చూశా. వివిధ రకాలైన ఆచారాలు, సంస్కృతుల గురించి తెలుసుకున్నా" అని అతను తెలిపాడు. గురువారం మాస్కో చేరుకుంటానని అంటున్న ఫ్రాన్సిస్.. మెస్సీని కలవడమే తన ధ్యేయమని చెబుతున్నాడు. "ఇంత దూరం వచ్చా. నాకు సానుకూల దృక్పథం ఎక్కువ. మెస్సిని కలవడమే నా జీవిత లక్ష్యం. అది సాధ్యమౌతుందో లేదో తెలీదు" అని ఫ్రాన్సిస్ పేర్కొన్నాడు.

82 ఏళ్ల కిందటి ట్రాక్టర్‌తో

ప్రపంచం మొత్తం ఫుట్‌బాల్ జ్వరంతో ఊగిపోతోంది. తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో రష్యాకు తరలి వస్తున్నారు. కొంతమంది విమానంలో వస్తే మరికొందరేమో బస్సుల్లో రష్యా చేరుకుంటున్నారు. అయితే వీటన్నింటికీ భిన్నంగా ట్రాక్టర్‌నే వాహనంగా ఎంచుకొని జర్మనీ నుంచి రష్యా చేరుకొని ఆశ్చర్యపరిచాడు 70 ఏళ్ల హుబర్ట్ విర్త్. జర్మనీలోని ఫోర్చియిమ్‌కు చెందిన హుబర్ట్‌కు ఫుట్‌బాల్ అంటే అమితమైన ఇష్టం. ప్రపంచకప్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించాలనుకున్నాడు. వెంటనే తన దగ్గర ఉన్న 82 ఏళ్ల క్రితం నాటి ట్రాక్టర్‌ను బయటకు తీసి మరమ్మతులు చేయించాడు. వెనక ట్రక్కు స్థానంలో ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేసుకున్నాడు. తనకు కావాల్సినవన్నీ అందులో సర్దుకున్నాడు. తన పెంపుడు కుక్కతో పాటు ప్రయాణం ప్రారంభించాడు. పోలాండ్, బెలారస్ మీదుగా రోజుకు 100కి.మీలు ప్రయాణించి రష్యా చేరుకున్నాడు.

కార్తీక్‌తో హారిక నిశ్చితార్థం

ఈనాడు, హైదరాబాద్: గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక, కార్తీక్ చంద్రల నిశ్చితార్థం ఘనంగా జరిగింది. సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో హారిక, కార్తీక్‌ల వేడుకను నిర్వహించారు. ఆగస్టు 19న హైదరాబాద్‌లో వీరిద్దరి వివాహం జరగనుంది.

• వన్డే ర్యాంకింగ్స్‌లో ఆసీస్ ఆరుకు

మెల్‌బోర్న్: జట్టు పరంగా ప్రమాణాలు పడిపోతూ వస్తున్న ఆస్ట్రేలియా ర్యాంకుల్లో వేగంగా పడిపోతోంది. 34 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆ జట్టు వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి దిగజారింది. తాజాగా ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు వన్డేల్లో ఓడిన ఆసీస్.. 102 పాయింట్లకు పడిపోయి ఆరో ర్యాంకులో నిలిచింది. ఆసీస్ గత 15 వన్డేల్లో 13 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. వన్డే ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ అగ్రస్థానంలో ఉండగా.. భారత్ రెండో స్థానంలో కొనసాగుతోంది.

• టాంపరింగ్ శిక్షలు మరింత కఠినం

దుబాయ్: బాల్ టాంపరింగ్ శిక్షల్ని ఐసీసీ కఠినతరం చేయనుంది. బంతి ఆకారాన్ని ఉద్దేశపూర్వకంగా మార్చితే ప్రస్తుతం లెవెల్-2 నేరంగా ఐసీసీ భావిస్తోంది. సవరించనున్న నిబంధన ప్రకారం బాల్ టాంపరింగ్‌ను లెవెల్-3 నేరంగా పరిగణిస్తారు. ఈ నెలాఖరులో జరిగే వార్షిక సమావేశంలో కొత్త నిబంధనకు ఐసీసీ ఆమోదం తెలపనుంది. వెస్టిండీస్‌తో టెస్టులో బాల్ టాంపరింగ్ వివాదం నేపథ్యంలో శ్రీలంక సారథి చండీమాల్‌పై లెవెల్-2 నేరంగా ఐసీసీ అభియోగాలు నమోదు చేసింది. లెవెల్-2 నేరానికి ఒక టెస్టు లేదా 2 వన్డేలు నిషేధం విధిస్తారు. లెవెల్-3 నేరానికి 4 టెస్టులు లేదా 8 వన్డేల నిషేధం పడుతుంది.

ప్రపంచకప్‌లో ఈనాడు

కొలంబియా	× సా॥ 5.30	జపాన్
పోలెండ్	× రాత్రి 8.30	సెనెగల్
రష్యా	× రాత్రి 11.30	ఈజిప్ట్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

ఆడవా.. ఐతే ఇంటికి పో



మాస్కో: క్రొయేషియా ఫార్వర్డ్ నికొలా కలినిచ్ ప్రపంచకప్ నుంచి ఇంటికొచ్చేస్తున్నాడట. దీనికి కారణం అతను నైజీరియాతో మ్యాచ్‌తో ఆడడటానికి నిరాకరించడమే! నైజీరియాతో మ్యాచ్‌లో రెండో అర్ధభాగంలో సబ్‌స్టిట్యూట్‌గా వెళ్లాల్సిందిగా కోచ్ జ్లాకో డాలిచ్ నికొలాను కోరాడు. అయితే తాను ఆడలేనని అతను చెప్పడంతో కోచ్ నికొలా అతణ్ని స్వదేశానికి వెళ్లిపోవాల్సిందిగా ఆదేశించాడట. వరుసగా నాలుగో అంతర్జాతీయ మ్యాచ్‌లోనూ రిజర్వ్ బెంచ్‌కే పరిమితం అయిన నికొలా.. తనకు వెన్ను గాయం అయిందని.. అందుకే కోచ్ ఆదేశాలు పాటించలేదని చెప్పినట్లు సమాచారం. అయితే కలినిచ్ ఇంటికి వెళ్లే విషయాన్ని క్రొయేషియా ఫుట్‌బాల్ సంఘం అధికారికంగా ధ్రువీకరించలేదు. తొలి మ్యాచ్‌లో క్రొయేషియా 2-0తో నైజీరియాపై గెలిచిన సంగతి తెలిసిందే.

దిల్లీ ధర్నాకు తెరపడేనా?

- మెత్తబడిన ఆప్ ప్రభుత్వం, అధికారులు
- సమస్య పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేయాలని బైజాల్‌కు సిసోడియా లేఖ
- వీలైనంత త్వరగా స్పందించాలని కేజ్రీవాల్ ట్వీట్
- అంకితభావంతో పనిచేస్తున్నామంటున్న ఐఏఎస్‌లు

దిల్లీ

రాజధానిలో ఎనిమిది రోజులుగా నెలకొన్న ప్రతిష్టంభనకు కేజ్రీవాల్ ప్రభుత్వం, ఐఏఎస్ అధికారులు ముగింపు పలికేలా సోమవారం కాస్త మెత్తపడినట్లు కనిపించారు. ఆప్ ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టినట్లు దిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించడం, ఆరోగ్యమంత్రి సత్యేంద్రజైన్ ఆసుపత్రి పాలవడంతో ఇరువర్గాల్లో కాస్త మార్పు కనిపించింది. అధికారులు, ఆప్ మంత్రుల మధ్య సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడానికి చొరవ తీసుకోవాలని సోమవారం ఉదయం సిసోడియా లెఫ్టినెంట్ గవర్నరు(ఎల్‌జీ) అనిల్‌బైజాల్‌కు లేఖ రాయడం గమనార్హం. అధికారుల భద్రతకు స్వయంగా ముఖ్యమంత్రి కేజ్రీవాలే భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. 'మేం చేయగలిగింది మేం చేశాం, మీరు చేయగలిగింది మీరు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది'అని ఆ లేఖలో పేర్కొన్నారు. వీలైనంత త్వరగా సమావేశానికి ఎల్‌జీ ఏర్పాట్లు చేస్తారని ఆశిస్తున్నానని కేజ్రీవాల్ సైతం ట్వీట్ చేశారు. మరోవైపు అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మిజోరం, కేంద్రపాలిత ప్రాంతాల అధికారుల సంఘం 'ఏజీఎంయూటీ' ప్రతినిధులు మాట్లాడుతూ సమ్మెలో ఉన్నామన్న ఆప్ ఆరోపణలు సత్యదూరమన్నారు. తామంతా పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నామని చెప్పారు.

ధర్నాకు థాకరే మద్దతు ఇవ్వలేదు: శివసేన

కేజ్రీవాల్ ధర్నాకు శివసేన అధినేత ఉద్ధవ్‌థాకరే మద్దతు పలికారని వస్తున్న వార్తలను ఆ పార్టీ ప్రతినిధి హర్షల్ ప్రధాన్ ఖండించారు. ఆదివారం కేజ్రీవాల్ తమ నాయకుడికి ఫోన్ చేసినమాట నిజమేనన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పని చేయనివ్వాలని మాత్రమే ఉద్ధవ్ అభిప్రాయం వ్యక్తం చేశారని హర్షల్ స్పష్టం చేశారు. మరోవైపు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంత్రులు సిసోడియా, సత్యేంద్రజైన్‌లను ఎస్పీ రాజ్యసభ ఎంపీ రామ్‌గోపాల్‌యాదవ్ పరామర్శించారు. అవసరమైతే తామూ ధర్నాలో కూర్చుంటామని సంఘీభావం వ్యక్తం చేశారు.

ప్రధానిని విమర్శించిన రాహుల్‌గాంధీ

దిల్లీలో చెలరేగిన గందరగోళం, అవ్యవస్థలను చక్కదిద్దడం మానేసి, ఇంత అరాచకం నెలకొన్నా ప్రధాని మోదీ ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. 'ఎల్‌జీ కార్యాలయంలో దిల్లీ సీఎం ధర్నా చేస్తున్నారు. సీఎం నివాసంలో భాజపా ధర్నాకు దిగింది. దిల్లీ అధికారులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నారు. వీళ్ల డ్రామా వల్ల ప్రజలు బాధ పడుతున్నారు' అని ఆయన ట్వీట్ చేశారు.

మనీష్ సిసోడియా ఆసుపత్రికి తరలింపు

- నిలకడగా ఆరోగ్యమంత్రి జైన్ ఆరోగ్యం

దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఆరోగ్యం క్షీణించడంతో ఆయన్ను సోమవారం ఆసుపత్రికి తరలించారు. మూత్రంలో కీటోన్ స్థాయిలు తగ్గిపోయాయని, రక్తంలో చక్కెరస్థాయి పెరిగిపోయిందని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రి వైద్యులు చెప్పారు. దిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు అనిల్ బైజాల్ కార్యాలయంలో జూన్ 13 నుంచి సిసోడియా నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు అనారోగ్యంతో ఆదివారంరాత్రి ఎల్ఎన్‌జేపీ అత్యవసర గదిలో చేరిన దిల్లీ ఆరోగ్యమంత్రి సత్యేంద్రజైన్ ఆరోగ్యం కూడా కుదుటపడుతోందని వైద్యులు చెప్పారు.

మనీష్ సిసోడియాను స్థానిక ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

కార్యాలయంలో కూర్చుని ధర్నా ఏమిటి?

- మరొకరి ఇంట్లో ఉంటూ సమ్మె చేయలేరు
- ఆందోళన చేయడానికి అధికారం ఎవరిచ్చారు..
- కేజ్రీవాల్ ప్రభుత్వంపై దిల్లీ హైకోర్టు అసహనం

దిల్లీ: డిమాండ్ల సాధన కోసం దిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు అనిల్ బైజాల్ కార్యాలయంలో వారంరోజులుగా ధర్నాకు దిగిన అరవింద్ కేజ్రీవాల్, ముగ్గురు మంత్రుల వైఖరిపై దిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ధర్నా లేదా సమ్మె అనేది కార్యాలయం లేదా ఇంటి బయట చేయాలిగానీ, ఇంట్లో కూర్చుని ఎలా చేస్తారని ప్రశ్నించింది. బైజాల్ కార్యాలయంలో ధర్నాకు కూర్చునే అధికారం ఎవరిచ్చారని నిలదీసింది. 'దీన్ని సమ్మె అనరు. ఎవరో ఒకరి ఇంటి లోపలికి లేదా కార్యాలయంలోకి వెళ్లి సమ్మె చేపట్టకూడదు' అని జస్టిస్ ఎ.కె. చావ్లా, జస్టిస్ నవీన్‌చావ్లాలతో కూడిన ధర్మాసనం ఈమేరకు వ్యాఖ్యానించింది. కేజ్రీవాల్ ఆందోళనను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని ఒకటి, ఐఏఎస్‌లు సమ్మె విరమించేలా ఆదేశాలివ్వాలని మరో వ్యాజ్యం దిల్లీ హైకోర్టులో సోమవారం విచారణకు వచ్చాయి. దిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు(భాజపా) విజేందర్ గుప్తా వ్యాజ్యం దాఖలు చేయగా, మరో వ్యాజ్యాన్ని హరినాథ్‌రామ్ అనే న్యాయవాది దాఖలు చేశారు. గుప్తా వ్యాజ్యంలోనే భాజపా ఎంపీ పర్వేష్‌సింగ్ సాహిబ్, ఆప్ తిరుగుబాటు ఎమ్మెల్యే మంజీదర్‌సింగ్ సిర్సా సంయుక్త వ్యాజ్యదారులుగా సంతకాలు చేశారు. ఎలాంటి ఆదేశాలు జారీ చేయని ధర్మాసనం జూన్ 22కు తదుపరి విచారణను వాయిదా వేసింది.

రాజ్యాంగమే ప్రసాదించింది: ఆప్ ప్రభుత్వం తరపున వకాల్తా పుచ్చుకున్న సీనియర్ అడ్వొకేట్ సుధీర్ నంద్‌రాజోగ్ మాట్లాడుతూ రాజ్యాంగమే ధర్నా చేసే అధికారం ఇచ్చిందన్నారు. మంత్రులు నిర్వహిస్తున్న సమావేశాలకు ఐఏఎస్ అధికారులు హాజరు కావాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సంప్రదాయ సమావేశాలకు ఐఏఎస్‌లు హాజరుకావడం లేదని ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులే అంగీకరించారన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది మాట్లాడుతూ ఐఏఎస్ అధికారులు సమ్మెలో లేరన్నారు. బైజాల్ కార్యాలయాన్ని కేజ్రీవాల్, ఇతర మంత్రులు ఖాళీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ఆదివారం రైళ్లు ఆలస్యం?

ఆగస్టు 15నాటికి కొత్త కాలపట్టిక: పీయూష్

దిల్లీ: వారాంతపు సెలవుల్లో రైళ్లలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇకపై ఇబ్బంది పడే అవకాశం ఉంది. మరమ్మతులు, ఇతర నిర్వహణ ఆదివారం చేపట్టాలని రైల్వేశాఖ నిర్ణయించిందని కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ తెలిపారు. చిన్నచిన్న పనులు వారంలో అన్నిరోజులు నిర్వహిస్తామని, ఆరేడు గంటలు పట్టే పనులు ఆదివారం నిర్వహిస్తామన్నారు. నిర్వహణ కారణంగా ఏదైనా రైలు ఆలస్యమైతే రిజర్వుడు టికెట్ ఉన్న ప్రయాణికులకు భోజనం, మంచినీటిని ఉచితంగా అందజేస్తామన్నారు. రైలు ఆలస్యంపై ఎస్ఎంఎస్‌లు పంపుతామని, దినపత్రికల్లో ప్రకటన ఇస్తామని తెలిపారు. ఆగస్టు 15నాటికి కొత్త రైల్వేటైంటేబుల్ తయారవుతుందని, ఆ తరువాతే రైళ్ల ఆలస్యంపై కచ్చితంగా చెప్పగలుగుతామని మంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్‌రైలు నడపడం చాలా అవసరమని రైల్వే బోర్డు ఛైర్మన్ అశ్వని లోహాని పేర్కొన్నారు.

ఆందోళన చేస్తున్న టెట్ అభ్యర్థులు

ఒక సబ్జెక్టుకు దరఖాస్తు చేస్తే.. మరోటి

పరీక్షా కేంద్రం ముందు ఏపీ టెట్ అభ్యర్థుల ఆందోళన

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ప్రవేశ పరీక్ష(టెట్)కు సంబంధించి సోమవారం జరగాల్సిన పరీక్షలో సబ్జెక్టు మారడంతో పరీక్షకు హాజరైన అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. తాము దరఖాస్తు చేసుకున్న సబ్జెక్టు కాకుండా నిర్ణీత తేదీలో మరో సబ్జెక్టు రాయాల్సి రావడంపై అభ్యర్థులు అయోమయానికి లోనయ్యారు. అదేమని పరీక్షా కేంద్రం నిర్వాహకులను ప్రశ్నిస్తే తమకేమీ సంబంధం లేదని సమాధానమివ్వడంతో అభ్యర్థులు కేంద్రం ముందు ఆందోళనకు దిగారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఆయా జిల్లాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారికి హయత్‌నగర్ సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్షా కేంద్రం(ఆన్‌లైన్)కేటాయించారు. ఈ క్రమంలో సోమవారం సైన్సు, గణితం తదితర పరీక్షలు రాయడానికి రాగా.. తెలుగు పేపర్ రావడంతో అభ్యర్థులు పరీక్షా కేంద్రం ప్రతినిధులను ప్రశ్నించారు. తమకేమీ సంబంధం లేదని వారిని కేంద్రం నుంచి బయటకు పంపించారు. తాము హాజరు కావాల్సిన పరీక్ష 14, 15 తేదీల్లోనే జరిగిందని తెలుసుకున్న అభ్యర్థులు ఏపీప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పేపర్ -2ఏ అంటే గణితం, సామాన్య శాస్త్రం అని, అలాంటిది హాల్‌టికెట్‌పై 18న తెలుగు పరీక్ష అంటూ రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న సమయంలో తెలుగు అని తప్పుపడిందేమోనని గణితం, సామాన్యశాస్త్రం రాయడానికి పరీక్షా కేంద్రానికి వచ్చామని తమకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీచేస్తారని ప్రశ్నించారు. పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. దాదాపు 70 మంది అభ్యర్థులం పరీక్ష రాయలేకపోయామని వివరించారు.

విశాఖలో గాలుల బీభత్సం

- పలుచోట్ల కూలిన చెట్లు
- వడగళ్లు పడి వ్యక్తి మృతి!

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖలో ఉద్ధృతంగా వీచిన గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపించడంతో మధ్యాహ్నానికి నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 41.6 డిగ్రీలకు చేరింది. జనమంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయంలో మధ్యాహ్నం 3 గంటలు దాటాక ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. గాలులు ఉద్ధృతంగా వీచాయి. ముఖ్యంగా పాతనగరంలోని డాబాగార్డెన్స్, పూర్ణామార్కెట్, మహారాణిపేట, జగదాంబకూడలి తదితర ప్రాంతాల్లో గాలుల ప్రభావం ఎక్కువగా కనిపించింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలగా.. మరికొన్నింటి కొమ్మలు విరిగిపడిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. అనంతరం దాదాపు గంట పాటు వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పాత పోస్టాఫీసు కూడలిలో రహదారిపై నిద్రిస్తోన్న ఓ గుర్తు తెలియని వృద్ధుడు వడగళ్ల ధాటికి తట్టుకోలేక ప్రాణాలు విడిచినట్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అతని వివరాలు తెలియరాలేదు. విజయనగరం జిల్లా నుంచి వచ్చానని మృతుడు తమతో అన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మృతిచెందిన వృద్ధుడు

పూర్ణామార్కెట్ సమీపంలోని ప్రసాద్‌గార్డెన్స్ ప్రధాన మార్గంలో కూలిన వృక్షం

భార్యను చంపేసి.. గోతిలో కప్పేసి

- శ్రీకాకుళం జిల్లాలో 9నెలల తర్వాత వెలుగుచూసిన ఘటన

మక్కువ, న్యూస్‌టుడే: కట్టుకున్న భార్యను చంపేసి.. మృతదేహాన్ని మరుగుదొడ్డి గోతిలో కప్పేసి.. ఎవరికీ అనుమానం రాకుండా పైన గచ్చుచేశాడో ప్రబుద్ధుడు. విజయనగరం జిల్లా మక్కువ మండలంలో తొమ్మిది నెలల కిందట చోటుచేసుకున్న ఈ దారుణం సోమవారం వెలుగు చూసింది. మక్కువ మండలంలోని వెంకంపేటకు చెందిన చిటికల రవణమ్మ, నరసింహనాయుడు భార్యాభర్తలు. వీరు తరచూ గొడవ పడేవారు. వీరి తగాదాలు భరించలేక పెద్ద కుమారుడు కిశోర్ రెండేళ్ల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. అయినా వీరి తీరు మారలేదు. గతేడాది సెప్టెంబర్ 22న వీరు మళ్లీ గొడవ పడ్డారు. ఆ సమయంలో నరసింహనాయుడు రవణమ్మ మెడపై కర్రతో కొట్టి చంపేశాడు. బయటకు విషయం పొక్కకుండా మృతదేహాన్ని మరుగుదొడ్డి గుంతలో పూడ్చిపెట్టి పైన గచ్చుచేసి పరారయ్యాడు. మరోవైపు, తన అక్క కనిపించడం లేదని రవణమ్మ సోదరుడు తేలు తిరుపతి గతేడాది అక్టోబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచే నరసింహనాయుడు కనపించకపోవడంతో అనుమానంతో ఆయన్ని పోలీసులు వెతుకుతున్నారు. తాజాగా మూడు రోజుల కిందట విజయనగరంలో నరసింహనాయుడును అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది.

గెలిచే వారికే టిక్కెట్లు ఇస్తాను

- ప్రకాశం జిల్లా నేతలతో ముఖ్యమంత్రి

ఈనాడు అమరావతి: వచ్చే ఎన్నికల్లో గెలిచే వారికే టిక్కెట్లు ఇస్తానని ప్రకాశం జిల్లా తెదేపా ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఆయన సోమవారం ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాల్‌లో ప్రకాశం జిల్లాలో పార్టీ పరిస్థితిపై నాయకులతో సమీక్షించారు. "మనం పనులు చేయడం ఎంత ముఖ్యమో, ప్రజలతో మమేకమవడమూ అంతే ముఖ్యం. చేసింది ప్రజలకు చెప్పగలిగితేనే రాజకీయంగా ప్రయోజనం ఉంటుంది. మీరు నిరంతరం కార్యకర్తలకు, ప్రజలకు దగ్గరగా ఉండాలి. సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొంత మందినైనా మార్చాలి. నేను చాలా సర్వేలు చేయిస్తున్నాను. .." అని పేర్కొన్నారు. తొలుత జిల్లా మంత్రి శిద్ధా రాఘవరావు... బాపట్ల, ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులుగా ఉన్న మంత్రులు పరిటాల సునీత, పి.నారాయణ, తదితరులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో విడివిడిగా మాట్లాడారు. జిల్లాకు చెందిన మిగతా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరితో ఆయన బుధవారం వేర్వేరుగా మాట్లాడనున్నారు. వచ్చే ఎన్నికల్లోగా వెలుగొండ ప్రాజెక్టులో ఒక టన్నెల్ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ పార్టీలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయకపోతే ఎలాంటి వ్యతిరేకత వస్తుందో వివరిస్తూ... కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఆయన ఉదహరించారు. స్వాతంత్ర్యం వచ్చాక ఎవరికీ రానంత ఆదరణ 2014 ఎన్నికల్లో నరేంద్రమోదీకి వచ్చిందని, ఆ తర్వాత అంతే వేగంగా వ్యతిరేకత పెరుగుతోందని చెప్పారు. ఒక నాయకుడు జాగ్రత్తగా లేకపోతే ఇలాంటి పరిస్థితే ఏర్పడుతుందని, ప్రజలు అనునిత్యం గమనిస్తూ ఉంటారని ఆయన పేర్కొన్నారు. మోదీ చెప్పేవన్నీ నినాదాలేనని, వాటిని ఆచరణలోకి తెచ్చే శ్రద్ధ కనిపించదని వ్యాఖ్యానించారు. "నరేంద్రమోదీని మొదటిగా ఛాలెంజ్ చేసింది మనమే. చివరిసారి ఆయనను కలిసినప్పుడు మాకు అన్యాయం చేశారని చెప్పి వచ్చాను. నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని ముఖం మీదే అడిగేశాను. 11 రాష్ట్రాలకు ఇచ్చినప్పుడు మాకు ప్రత్యేకహోదా ఎందుకివ్వరని నిలదీశాను. వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చిన రూ.350 కోట్లు వెనక్కు ఎలా తీసుకుంటారని ప్రశ్నించాను. వారి దగ్గర సమాధానం లేదు. తప్పు చేస్తున్నామన్న భావన వారిలో ఉండబట్టే ఎవరూ మాట్లాడలేదు..." అని వివరించారు. నీతి ఆయోగ్ సమావేశంలో మనం గట్టిగా అడగడంపై మంచి స్పందన వచ్చిందని, దాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు. వైకాపా, భాజపా లాలూచీ రాజకీయాల్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు.

కర్ణాటక తరహాలో పింఛన్ ఇవ్వాలి

ఏపీ మాజీ చట్టసభ సభ్యుల ఫోరం

ఈనాడు డిజిటల్, అమరావతి: కర్ణాటక తరహాలో రాష్ట్రంలోని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు పింఛన్ సహా ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలని ఏపీ మాజీ చట్టసభ సభ్యుల ఫోరం (ఏపీ ఫార్మర్ లెజిస్లేటర్స్ ఫోరం) కోరింది. మాజీ సభ్యులతోపాటు వారి జీవిత భాగస్వాములకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని ఫోరం అధ్యక్షులు కె.సుబ్బరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, సభాపతి కోడెల శివప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడుని కలిసి విజ్ఞప్తి చేసినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సభ్యులకు ఇళ్ల స్థలాలు కేటాయించినా న్యాయవివాదాల కారణంగా కొందరికి దక్కలేదు. రాజధాని అమరావతిలో ఎమ్మెల్యేలు, అధికారులు, న్యాయమూర్తులు, పాత్రికేయులకు గృహాలను కేటాయిస్తున్న తరహాలోనే మాజీ చట్టసభ సభ్యులకు ఇవ్వాలి. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం శాసనసభ, శాసనమండలి ఆవరణలోనే చట్టసభ సభ్యుల ఫోరానికి కార్యాలయం కేటాయించాలి. దిల్లీలోని ఏపీ భవన్‌లో వసతి కోరిన వారికి విభాగం 2 లేదా 3గా పరిగణించాలి. పాలనా అనుభవం కలిగిన మాజీ సభ్యులకు చట్టసభ కమిటీల్లో స్థానం కల్పించాలి...' అని పేర్కొన్నారు.

వలసవాదుల శిబిరంగా మార్చలేం

- వీసా విధానాలను సమర్థించుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- తల్లీపిల్లల్ని విడదీసే నిర్ణయాన్ని తప్పుపట్టిన భార్య మెలానియా

వాషింగ్టన్: వలసవాదుల శిబిరంగా అమెరికా మారకూడదనే ఉద్దేశంతోనే అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నానని దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. పిల్లల్ని ఉపయోగించుకుని కొందరు నేరగాళ్లు అమెరికాలో అడుగుపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. శ్వేతసౌధంలో సోమవారం జరిగిన 'అంతరిక్ష మండలి' సమావేశంలో ట్రంప్ ప్రసంగించారు. వీసా ఆంక్షల పేరుతో తల్లిదండ్రుల్ని-పిల్లల్ని విడదీస్తుండడాన్ని తప్పుపడుతూ ప్రథమ మహిళ మెలానియా వ్యాఖ్యలుచేసిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ వివరణ ఇచ్చారు. వలసల వల్ల ఐరోపా తదితర దేశాల్లో ఏం జరుగుతోందో చూడాలన్నారు. సైన్యంలో ఆరో విభాగంగా 'అంతరిక్ష దళా'న్ని ఏర్పాటు చేయాలని పెంటగన్‌ను ఆదేశించారు. అంతరిక్షంలో అమెరికా ఆధిపత్యం కోసం ఈ దిశగా తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. కక్ష్యలో వ్యర్థాలు ఒకదానినొకటి ఢీకొనకుండా పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

అసాధారణ రీతిలో స్పందించిన మెలానియా

వలస వస్తున్న తల్లిదండ్రుల నుంచి వారి పిల్లల్ని అమెరికా సరిహద్దుల్లోనే విడదీసేలా ఉన్న వీసా విధానాలను మెలానియా ట్రంప్ తప్పుపట్టారు. వలసలపై ట్రంప్ తీసుకున్న కఠిన వైఖరి కారణంగా ఈ ఏడాది ఏప్రిల్ 19-మే 31 మధ్య దాదాపు 2000 మంది పిల్లలను వారి తల్లిదండ్రుల నుంచి విడదీసి నిర్బంధ కేంద్రాల్లో ఉంచారు. సాధారణంగా విధాన నిర్ణయాలపై ప్రథమ మహిళలు ఎవరూ స్పందించరు. అలాంటిది దీనిపై మాత్రం మెలానియా స్పందించారు. కుటుంబాల నుంచి పిల్లల్ని విడదీయడాన్ని ఏవగించుకుంటున్నట్లు చెప్పారు. అన్ని చట్టాలనూ పాటించడమే కాకుండా పాలనను హృదయంతో అందిస్తున్న దేశంగా ఉండాల్సిన అవసరముందని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. వలసవాద సంస్కరణలపై ఇరుపక్షాలూ ఏకాభిప్రాయానికి రావాలని ఆకాంక్షించారు.

తూర్పారబట్టిన లారా బుష్

ట్రంప్ వీసా విధానాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జిబుష్ సతీమణి లారా బుష్ తూర్పారబట్టారు. క్రూరంగా ఉన్న ఈ విధానం తన హృదయాన్ని గాయపరిచిందంటూ 'వాషింగ్టన్ పోస్ట్' ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు. పిల్లల్ని ఉంచిన శిబిరాల్ని చూస్తే రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి సిగ్గుచేటైన పరిణామాలు గుర్తుకొస్తున్నాయని చెప్పారు. పిల్లల్ని విడదీయడాన్ని ఆపేయడంతో పాటు విడిపోయిన వారిని కుటుంబం వద్దకు చేర్చాలని సూచించారు.

మునగ విత్తుతో చౌకలో నీటి శుద్ధి

వాషింగ్టన్: భారత్‌లో విరివిగా కనిపించే మునగచెట్టులోని ప్రొటీన్లు.. వర్ధమాన దేశాల్లో తక్కువ ఖర్చుతో నీటి శుద్ధికి సాయపడతాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సాధారణంగా ఈ చెట్టును ఆహారం, సహజ నూనెల కోసం సాగు చేస్తుంటారు. వీటి విత్తనాలను ప్రాథమిక స్థాయి నీటి శుద్ధి కోసం ఇప్పటికే ఉపయోగిస్తుంటారు. అయితే ఈ ప్రక్రియలో.. విత్తనాలకు సంబంధించిన సేంద్రియ కార్బన్ (డీవోసీ) భారీ మొత్తంలో ఉండిపోతుంది. ఫలితంగా 24 గంటల్లోనే మళ్లీ ఆ నీటిలో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఆ నీరు కొన్ని గంటలు మాత్రమే తాగడానికి పనికొస్తుంది. తాజాగా అమెరికాలోని కార్నెగీ మెలాన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఇసుకలోని సిలికా రేణువులను, మునగ విత్తనాల్లోని ప్రొటీన్లను ఉపయోగించి చౌకైన నీటి శుద్ధి మాధ్యమాన్ని తయారుచేశారు. దీన్ని 'ఎఫ్-శాండ్'గా పేర్కొంటున్నారు. ఇది సూక్ష్మజీవులను చంపేస్తుంది. అవాంఛనీయమైన పదార్థాలను, డీఓసీని తొలగిస్తుంది.

దోమల వృద్ధిని అడ్డుకునే నెత్తళ్లు!



టొరంటో: కీటక నాశకాలతో పన్లేకుండానే దోమలను అంతం చేసే సరికొత్త విధానాన్ని యూనివర్సిటీ ఆఫ్ వాటర్‌లూ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దోమల సంతతి వృద్ధికి కారణమయ్యే కుంటలు, కాలువలు తదితర జలావరణాల్లో నెత్తళ్లను వదిలితే చాలట! నిత్యం ఆహార వేటలో నిమగ్నమయ్యే ఈ బుల్లి చేపలు దోమల లార్వాను అత్యంత ఇష్టంగా తింటాయట. తద్వారా మశకాల ముప్పు చాలామటుకు తగ్గిపోతుందని పరిశోధకుడు బ్రాడ్ ఫెడీ తెలిపారు. 'ఈ విధానంలో పర్యావరణానికి ఎలాంటి హానీ కలుగకుండా, ప్రజారోగ్యంపై ఎలాంటి దుష్ప్రభావం లేకుండా, తక్కువ ఖర్చుతోనే దోమలను అంతం చేయవచ్చు'నని పరిశోధకులు వివరించారు.

పేగు బ్యాక్టీరియాతో వ్యాకులత ముప్పు

వాషింగ్టన్: పేగుల్లోని బ్యాక్టీరియా... వ్యాకులత (డిప్రెషన్), ఆందోళన (యాంగ్జయిటీ)లకు దారితీస్తున్నట్లు తాజా పరిశోధనలో తేలింది! హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కు చెందిన అంతస్రావ విజ్ఞానశాస్త్ర పరిశోధకులు దీన్ని చేపట్టారు. కొన్ని ఎలుకలకు అధిక కొవ్వుతో కూడిన ఆహారాన్నివ్వగా- వాటిలో ఉత్సాహకం కరవై, చురుకుదనం తగ్గినట్లు గుర్తించారు. ఆ తర్వాత అదే ఆహారాన్ని యాంటీ-బయాటిక్స్‌తో కలిపి ఇచ్చినప్పుడు మాత్రం... చురుకుదనం ఇసుమంతైనా తగ్గకుండా, పూర్వస్థితిలోనే ఉన్నట్లు తేలింది. జీర్ణక్రియను నియంత్రించే మెదడు భాగం హిపోథాలమస్... మానసిక పరిస్థితిని నిర్ణయించే న్యూక్లియస్ అక్యుంబెన్స్ పనితీరునూ వారు క్షుణ్నంగా పరిశీలించారు. "మనం తినే ఆహారంతో రక్తంలో చక్కెర స్థాయులే కాదు... పేగుల్లోని క్రిమివ్యవస్థ ప్రభావితమవుతుంది. తదనుగుణంగా మెదడు పనితీరు మారుతుంది. అధిక కొవ్వున్న ఆహారాన్ని భుజించే మధుమేహులు, స్థూలకాయులకు ఆందోళన, వ్యాకులత దరిచేరే ముప్పు లేకపోలేదు" అని అన్నారు... పరిశోధనకర్త సి.రోనాల్డ్‌కాన్!

జంతు మాంసంతో దద్దుర్లు... గుండె జబ్బులు!

వాషింగ్టన్: మాంసాహారం తింటే చర్మంపై దద్దుర్లు వస్తున్నాయా? అయితే, జాగ్రత్త! జంతు మాంసంలో ఉండే 'ఆల్ఫా-గాల్' అనే పదార్థం వల్లే దురదలు, దద్దుర్లు వస్తుంటాయనీ... హృద్రోగానికీ ఇదే కారణమవుతోందని వర్జీనియా విశ్వవిద్యాలయ పరిశోధకులు తేల్చారు. ఆయా ప్రాంతాలను బట్టి 20% వరకూ జనాభా జంతు మాంసం కారణంగా అలెర్జీతో బాధపడుతుంటారని అంచనా వేశారు! ప్రొఫెసర్ కొలీన్ మెక్‌నమరా బృందం- దీనిపై సుదీర్ఘ పరిశోధన సాగించింది. "జంతు మాంసంలో ఉండే ఆల్ఫా-గాల్ అనే పదార్థం ధమనుల్లో తిష్టవేస్తుంది. అంతర గోడలకు అతుక్కుపోయి పెళుసు కడుతుంది. దీంతో రక్త ప్రవాహం సాఫీగా సాగదు. పర్యవసానంగా గుండె జబ్బులు తలెత్తే ప్రమాదం ఉంటుందని ప్రాథమికంగా తేలింది. దీనిపై మరింత లోతైన అధ్యయనం చేపట్టాల్సి ఉంది" అని పరిశోధకులు వివరించారు.

ఉదయాన్నే నిద్రలేచే మహిళలకు కుంగుబాటు దూరం

న్యూయార్క్: సూర్యోదయానికల్లా నిద్రలేచి, పనులు చేసుకునే మహిళలకు కుంగుబాటు ముప్పు తక్కువని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో శాస్త్రవేత్తలు తేల్చారు. ఉదయపు వెలుగు ప్రభావం వల్లే ఇతరుల కంటే వీరి మానసిక స్థితి మెరుగ్గా ఉంటున్నట్లు వివరించారు. అధ్యయనంలో భాగంగా 55 ఏళ్ల సగటు వయసున్న మొత్తం 32,000 మంది మహిళల ఆరోగ్యాన్ని వారు పరీక్షించారు. పొద్దెక్కిన తర్వాత నిద్రలేచే వారితో పోల్చితే... ఉదయాన్నే సూర్యకాంతిలో పనిచేసుకునే వారికి డిప్రెషన్ వచ్చే ముప్పు 12-27% తక్కువగా ఉంటున్నట్లు సెలైన్ వెటెర్ బృందం అంచనా వేసింది. అన్నట్టు... అర్ధరాత్రి వరకూ నిద్రపోని వారిలో చాలా మందికి పెళ్లి చేసుకోవాలన్న ఆలోచనే ఉండదట! ఒంటరి జీవితాన్నే వారు ఎక్కువగా ఇష్టపడతారనీ, వేళకు నిద్రపోరనీ, సిగరెట్లు వంటి వ్యసనాలు వీరిలో ఎక్కువని పరిశోధకులు గమనించారు. మహిళల ఆరోగ్యంపై నిద్రతీరు చాలా ప్రభావం చూపుతుందనీ, వీరు చక్కని జీవనశైలిని అలవర్చుకుంటే... కుటుంబ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సలహా ఇస్తున్నారు వెటెర్!

కుర్రకారుకు జీవనశైలి రుగ్మతలు

న్యూయార్క్: ప్రస్తుతం 20-30 ఏళ్ల వయసులో ఉన్న చాలామంది కుర్రకారును... భవిష్యత్తులో జీవనశైలి కారక వ్యాధులు చుట్టుముట్టే ముప్పుందట! అభద్రత, ఒత్తిడితో కూడిన వాతావరణంలో వారు విధులు నిర్వర్తిస్తుండటం... నిత్యం ఆందోళన వెంటాడుతుండటమే ఇందుక్కారణమని 'హెల్త్ ఫౌండేషన్' పేర్కొంది. "ప్రస్తుతం రెండు పదుల వయసులో ఉన్న చాలామంది తమ ఇళ్లకు దూరంగా ఉంటూ ఒత్తిడికర వాతావరణంలో పనిచేస్తున్నారు. క్రమంగా ఒంటరి జీవితాలకు అలవాటు పడుతున్నారు. బంధువులు, స్నేహితులతో ఎక్కువగా డిజిటల్ సంబంధాలనే కొనసాగిస్తున్నారు. దీంతో వారి మానసిక ఆరోగ్యం గాడి తప్పుతోంది. వచ్చే 30 ఏళ్లలో ఇలాంటి వారికి క్యాన్సర్ తదితర జీవనశైలి సంబంధ రుగ్మతలు వచ్చే ముప్పు లేకపోలేదు" అని ఆ సంస్థ తాజా నివేదికలో హెచ్చరించింది. కుటుంబ సభ్యులతో కలిసి జీవించడం, వీలైనంత వరకూ ఎక్కువ సమయం వారితో గడపడం చాలా అవసరమని సూచించింది.

యూపీ పోలీసు నియామక పరీక్షలో.. 19 మంది హైటెక్ మోసగాళ్లు అరెస్టు

లఖ్‌నవూ: ఉత్తర్ ప్రదేశ్ (యూపీ)లోని పోలీసు కానిస్టేబుల్ నియామక పరీక్షలో... హైటెక్ పరికరాలతో కాపీ కొట్టడం, తమకు బదులుగా వేరొకరిని పంపడం లాంటి మోసాల్లో అభ్యర్థులకు సహకరించిన 19 మందిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరిలో ఎనిమిది మందిని అలహాబాద్‌లో, 11 మందిని గోరఖ్‌పూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. 41,520 పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 860 కేంద్రాల్లో రెండు రోజులపాటు ఈ పరీక్షను నిర్వహిస్తున్నారు. దీనిలో కాపీ కొట్టేవారిపై పోలీసుల ప్రత్యేక కార్యదళం (ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దృష్టిపెట్టినట్లు ఐజీ అమితాబ్ యాశ్ తెలిపారు. పట్టుబడిన వారిలో కొందరి దగ్గర నుంచి బ్లూటూత్ ఆధారంగా పనిచేసే స్పై మైక్రోఫోన్లు, వినికిడి సాధనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 'అవి చాలా చిన్న పరికరాలు. వాటిని చెవి లోపల అమర్చుకునే వీలుంది. దీనికి అనుసంధానించిన చరవాణిని ఎవరికీ కనిపించకుండా లోపల దుస్తుల్లో అభ్యర్థులు దాచిపెట్టారు.'అని అమితాబ్ వివరించారు. మరోవైపు వేరొకరికి బదులుగా పరీక్ష రాయడానికి వచ్చిన వ్యక్తితోపాటు అతణ్ని పంపిన వ్యక్తి నుంచి రూ.4 లక్షల నగదు, పదికిపైగా నకిలీ ఐడీ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇలా మోసాలకు పాల్పడే ముఠాకు సంబంధించి మరో ముగ్గురిని అరెస్టు చేసేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

రాహుల్‌ను కలిసిన కుమారస్వామి

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి సోమవారం కలిశారు. మంగళవారం రాహుల్ పుట్టినరోజు కావడంతో ముందుగానే కుమారస్వామి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెనుక జేడీ(ఎస్) సెక్రటరీ జనరల్ డేనిష్ అలీ, ఏఐసీసీ కర్ణాటక వ్యవహారాల బాధ్యుడు కేసీ వేణుగోపాల్ కూడా రాహుల్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఇది మర్యాదపూర్వక పర్యటనేనని, రాష్ట్రంలోని కాంగ్రెస్-జేడీ(ఎస్) ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు అందిస్తామని రాహుల్ భరోసా ఇచ్చారని జేడీ(ఎస్) వర్గాలు ఈ సందర్భంగా తెలిపాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 20-6-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 311

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



కశ్మీర్‌లో రాజకీయ కల్లోలం

- పీడీపీకి ఆకస్మికంగా మద్దతు ఉపసంహరించిన భాజపా
- కుప్పకూలిన ప్రభుత్వం
- సీఎం మెహబూబా రాజీనామా
- గవర్నర్ పాలనకు రంగం సిద్ధం
- ఉగ్రవాదం కట్టడిలో పీడీపీ విఫలం
- అందుకే ఈ నిర్ణయం: భాజపా

విలేకరులతో మాట్లాడుతున్న మెహబూబా ముఫ్తీ


మీడియా సమావేశంలో భాజపా నేత రాంమాధవ్

దిల్లీ, శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో అనూహ్య రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. భాజపా ఆకస్మికంగా మద్దతు ఉపసంహరించడంతో అక్కడ ప్రభుత్వం కుప్పకూలింది. పీడీపీతో కలిసి 2015లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన భాజపా ఆ కూటమి నుంచి మంగళవారం వైదొలగింది. దీంతో పీడీపీకి చెందిన ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ (59) రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించాలంటూ గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సిఫార్సు చేశారు. ఈ సిఫార్సు ప్రతిని కేంద్ర హోం మంత్రిత్వశాఖకు కూడా పంపించారు. భాజపాకు చెందిన జమ్ముకశ్మీర్ మంత్రులను పార్టీ అధిష్ఠానం మంగళవారం అత్యవసరంగా దిల్లీకి పిలిపించింది. పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా వారితో మాట్లాడారు. ఆ వెంటనే పార్టీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నిర్ణయాన్ని ప్రకటించారు. ఆ తర్వాత కొద్ది సేపటికే ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ.. గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రాకు రాజీనామా సమర్పించారు. కశ్మీరు లోయలో (మిగతా 2లో)

వరంగల్ నుంచి ప్రారంభమైన నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రస్థానం ఐరాస వరకు వెళ్లింది. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కాలంలో అమెరికాలో ప్రదర్శనకు అవకాశం రావడంతో ఆయన పేరు దేశ వ్యాప్తంగా మార్మోగింది. అటు తర్వాత ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. 1971లో ఐక్య రాజ్య సమితిలో ప్రపంచ ప్రముఖుల గొంతులను అనుకరించి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు.

మూగవోయిన వేయి గళాలు

- మిమిక్రీ పితామహుడు పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ అస్తమయం
- ఐరాసలో ప్రపంచ ప్రముఖుల గొంతుకల అనుకరణతో విశ్వ వ్యాప్త గుర్తింపు
- రాజకీయ.. సినీ రంగాల్లోనూ ముద్ర
- తుది శ్వాస వరకు కళకే అంకితం

ఈనాడు – వరంగల్
కాశీబుగ్గ – న్యూస్‌టుడే

తన గొంతులో వెయ్యి గొంతుకలను పలికించడం ద్వారా మిమిక్రీ కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కళాకారుడు, తెలంగాణ ముద్దుబిడ్డ.. పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ (85) అస్తమించారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం వరంగల్ బ్యాంకు కాలనీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. పార్కిన్ సన్ వ్యాధితో బాధపడుతున్న ఆయనకు గత నెలలో తీవ్ర అనారోగ్యం ఏర్పడింది. వరంగల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. మంగళవారం ఆరోగ్య పరిస్థితి విషమించి ఇంట్లోనే కన్నుమూశారు. తుది శ్వాస వరకు కళే సర్వస్వంగా జీవించిన ఆయనకు భార్య శోభావతి, కుమారులు శ్రీనాథ్, రాధాకృష్ణ, కుమార్తెలు లక్ష్మీతులసి, వాసంతి ఉన్నారు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి దానం చేశారు. నేరెళ్ల ఇక లేరన్న సమాచారంతో ఓరుగల్లు ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. అభిమానులు, బంధువులు, కళాకారులు, రాజకీయ నాయకులు ఆయన్ని చివరిసారి చూసేందుకు భారీగా తరలివచ్చారు. ఆయన పార్థివ దేహానికి ప్రముఖులు నివాళులర్పించారు. తెలంగాణ శాసన సభాపతి మధుసూదనాచారి, నవలా రచయిత అంపశయ్య నవీన్‌తోపాటు.. సాహితీప్రియులు..కళాకారులు, శిష్యులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

అభిరుచే అంతవాణ్ని చేసింది

శ్రీహరి, శ్రీలక్ష్మి(అంబమ్మ) దంపతులకు 12వ(చివరి) సంతానంగా 1932 డిసెంబరు 28న నేరెళ్ల వేణుమాధవ్ జన్మించారు. ఆయన తండ్రి శ్రీహరి న్యాయవాదిగా, బహుభాషా కోవిదునిగా పేరుపొందారు. వ్యాపార నేపథ్యమున్న కుటుంబం కావడంతో తండ్రి.. కుమారుణ్ని వ్యాపార రంగం వైపు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పదో ఏటలోనే (మిగతా 2లో)

పేదల ఇళ్లకు ప్రైవేటు భూమి

రూ.500 కోట్ల వ్యయం

- అవసరమైన చోట సేకరణ
- కోన వద్ద వాణిజ్య రేవు
- తిరుపతిలో రెండో ఎలక్ట్రానిక్ క్లస్టర్
- రూ.2827 కోట్లతో వసతులు
- 'మచిలీపట్నానికి' రూ.1385 కోట్ల రుణం
- 'సామాజిక మార్పు' డిమాండ్లపై ప్రత్యేక కమిషన్
- రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయాలు

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మించేందుకు అవసరమైతే ప్రైవేటు స్థలాలను కొనాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. ఇందు కోసం రూ.500 కోట్లు వెచ్చించేందుకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. తిరుపతిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ -2లో మౌలిక వసతులు కల్పించాలని, ఒంగోలు డెయిరీకి రూ. 35 కోట్ల రుణం ఇవ్వాలని నిర్ణయించింది. మరిన్ని నిర్ణయాలివీ..

★ ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని ఏళ్ల తరబడి నివసిస్తున్న వారికి క్రమబద్ధీకరణ. మిగిలిన అర్హుల కోసం అవసరమైతే ప్రైవేటు స్థలాల సేకరణ. 10 పట్టణాభివృద్ధి సంస్థల (ఉడా) పరిధిలో అవసరమైన చోట్ల బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణం.

★ తిరుపతిలోని వికృతమాల గ్రామంలో ఎలక్ట్రానిక్ క్లస్టర్ 2లో మౌలిక వసతుల కల్పన. రూ.2,827.50 కోట్లతో 322 ఎకరాల్లో అభివృద్ధి. సెల్‌ఫోన్ల తయారీతోపాటు ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి ప్రాధాన్యం. 52,930 మందికి ఉపాధి అవకాశం.

★ ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉన్న ప్రకాశం మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ పునరుద్ధరణ. డెయిరీ రైతులను ఆదుకునేందుకు రూ.35 కోట్ల రుణ సాయం. డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా రుణం. రుణంతో ఉద్యోగుల జీతాల చెల్లింపు.

★ రాష్ట్రంలో కమ్యూనికేషన్ టవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేసేందుకు జాయింట్ వెంచర్ కంపెనీ. ఇకపై ప్రభుత్వ స్థలాల్లో మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలంటే (మిగతా 2లో)

ముస్లిం విద్యార్థుల విదేశీ చదువులకు రూ.15 లక్షలు

- ఉన్నత విద్యకు వీలుగా 25 రెసిడెన్షియల్ పాఠశాలలు
- ముస్లిం సంఘ నేతల భేటీలో సీఎం చంద్రబాబు వెల్లడి

3లో

కొత్తగా లక్ష మందికి పింఛన్లు!

15లో

ప్రభుత్వ సలహాదారు పదవికి

పరకాల రాజీనామా

- కేంద్రంపై మీ పోరాటాన్ని శంకించకూడదనే..
- ఆమోదించాలంటూ ముఖ్యమంత్రికి అభ్యర్థన
- జగన్‌వి నీచ స్థాయి ఆలోచనలని వ్యాఖ్య

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వ సలహాదారు పదవికి పరకాల ప్రభాకర్ రాజీనామా చేశారు. రాష్ట్ర హక్కుల సాధన కోసం కేంద్రంపై చేస్తున్న పోరాటాన్ని ఎవ్వరూ (మిగతా 2లో)

కృష్ణా దీవిలో గోల్ఫ్ రిసార్టు

- 150 ఎకరాల్లో ఏర్పాటు
- వినోద, ఆతిథ్య ప్రాజెక్టులు కూడా
- అమరావతిలో పలు ప్రాజెక్టులకు సీఆర్‌డీఏ ప్రతిపాదనలు
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించిన అధికారులు

ఈనాడు – అమరావతి

రాజధాని అమరావతికి పక్కనే కృష్ణా నదిలోని ఒక దీవిలో గోల్ఫ్ రిసార్టు ఏర్పాటుకు సీఆర్‌డీఏ ప్రతిపాదన సిద్ధం చేసింది. 150 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేస్తారు. దీనిలో భాగంగా 18 హోల్స్‌తో ప్రొఫెషనల్ గోల్ఫ్ అసోసియేషన్ (పీజీఏ) ప్రమాణాలతో గోల్ఫ్ కోర్సు రూపొందిస్తారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో గోల్ఫ్ కోర్సుని ఏర్పాటు చేయనున్నారు. దీనికి అవసరమైన భూమిని దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన కేటాయిస్తారు. ఈ ప్రాజెక్టులో భాగంగానే ప్రపంచ పర్యాటకుల్ని ఆకర్షించేందుకు అవసరమైన వినోద, ఆతిథ్య ప్రాజెక్టులూ చేపడతారు. గోల్ఫ్ కోర్సుతో పాటు రాజధానిలో పీపీపీ విధానంలోనూ, ప్రైవేటు సంస్థలు చేపట్టేందుకు కొన్ని ప్రాజెక్టుల్ని సీఆర్‌డీఏ సిద్ధం చేసింది. ఇటీవల స్థిరాస్తి, నిర్మాణరంగ ప్రముఖులతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశంలో ప్రతిపాదిత ప్రాజెక్టుల గురించి సీఆర్‌డీఏ అధికారులు వివరించారు. ఆసక్తి ఉన్నవారు వీటిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆ ప్రాజెక్టుల వివరాలు ఇలా ఉన్నాయి..

1. ఇంటిగ్రేటెడ్ బిజినెస్ పార్కు(ఐబీపీ)

దీన్ని 20 ఎకరాల్లో నిర్మిస్తారు. సేవారంగం అవసరాలకు అనుగుణంగా దీన్ని రూపొందిస్తారు. ఇంటి నుంచి నడిచి వెళ్లేంత దగ్గర్లో కార్యాలయాలుండేలా(వాక్ టు వర్క్) ఐబీపీలో వసతులు ఉండాలన్నది ఆలోచన. సగం కార్యాయాలు, సగం గృహ వసతి కోసం కేటాయిస్తారు.

2. టూరిజం డిస్ట్రిక్ట్

15 ఎకరాల్లో చేపడతారు. దీనిలోనూ సగం నివాస గృహాలకు కేటాయిస్తారు. ఐబీపీకి సమీపంలోనే ఇదీ వస్తుంది. దీనిలో భాగంగా 5 నక్షత్రాల హోటల్, ఇతర పర్యాటక ప్రాజెక్టులు చేపడతారు.

3. లీగల్ సర్వీసెస్ కాంప్లెక్స్

అమరావతిలో హైకోర్టు భవన నిర్మాణం పూర్తయి, పూర్తి స్థాయిలో కార్యకలాపాలు మొదలైతే... సుమారు 8 వేల మంది న్యాయవాదులు ఇక్కడ పనిచేస్తారని అంచనా. వారి కార్యాలయాలు, అనుబంధ సేవల సంబంధించిన కార్యాలయాలు, వసతుల కోసం ఒకటి నుంచి మూడు ఎకరాల విస్తీర్ణంలో లీగల్ సర్వీసెస్ కాంప్లెక్స్ నిర్మించాలన్నది ప్రతిపాదన. మొత్తం 3 లక్షల చ. అడుగులకుపైగా నిర్మిత ప్రాంతం కలిగిన భవనాలు దీనిలో వస్తాయి. కార్పొరేట్ చాంబర్లు, న్యాయవాదుల చాంబర్లు, బిజినెస్ (మిగతా 15లో)

మంత్రి గంటా మనస్తాపం

రాష్ట్ర మంత్రివర్గ భేటీకి గైర్హాజరు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో సీనియర్ సభ్యుడు గంటా శ్రీనివాసరావు మనస్తాపానికి గురయ్యారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశానికి గైర్హాజరయ్యారు. ఆయన అమరావతికి రాకుండా విశాఖపట్నంలోనే ఉండిపోయారని తెలుసుకున్న కొందరు నాయకులు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదని సమాచారం. గత రెండేళ్లుగా తనకు వ్యతిరేకంగా పార్టీలో కొన్ని పరిణామాలు (మిగతా 2లో)

ఇదీ సంగతి!

మానవులతో కంప్యూటర్ చర్చాగోష్ఠి!

- అనర్గళంగా అభిప్రాయాలను కుండబద్ధలుకొట్టిన యంత్రం
- కృత్రిమ మేధస్సులో ఐబీఎం కొత్త ఆవిష్కారం

శాన్ ఫ్రాన్సిస్కో: కృత్రిమ మేధస్సు శరవేగంగా దూసుకొస్తోంది. ఇద్దరు మనుషులతో ఒక కంప్యూటర్ బహిరంగ చర్చకు దిగింది. ఐబీఎం సంస్థ ఈ యంత్రాన్ని రూపొందించింది. కృత్రిమ మేధో పరిజ్ఞానంతో కొన్నేళ్లపాటు పరిశోధించి దీన్ని సాకారం చేసింది. 'ప్రాజెక్టు డిబేటర్' అనే ఈ కంప్యూటర్‌ను ఐబీఎం అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా 'ప్రభుత్వ సబ్సిడీతో అంతరిక్ష పరిశోధన' అంశంపై మాట్లాడాల్సిందిగా ఆ యంత్రానికి సూచించారు. నిజానికి ఈ అంశంపై అది ముందస్తు అధ్యయనం చేయలేదు. అయినా అక్కడక్కడా స్వల్ప విరామాలు మినహా తన వాదనను గట్టిగా వినిపించింది. "అంతరిక్ష పరిశోధనలకు రాయితీ ఇవ్వడమంటే.. మంచి టైర్లపై పెట్టుబడి పెట్టడం లాంటిదన్నమాట. ఇలాంటి పరిశోధన మానవ మేధస్సును పరిపుష్టం చేస్తుంది. యువతలో స్ఫూర్తిని నింపుతుంది. మంచి రోడ్లు, పాఠశాలలు, ఆరోగ్య పరిరక్షణ కన్నా ఇది చాలా ముఖ్యమైనది"అని స్త్రీ స్వరంతో పేర్కొంది. తనలో భారీగా నిల్వ ఉన్న పత్రికలు, మేగజైన్ల నుంచి ఆధారాలను సేకరించడం ద్వారా ఈ కంప్యూటర్ తన ప్రారంభ వాదనను చేసింది. తన వాదనను ఖండిస్తూ నిపుణులైన మానవులు మాట్లాడిన మాటలను శ్రద్ధగా ఆలకించింది. తర్వాత నాలుగు నిమిషాల పాటు వారి వాదనను ఖండించింది. అనంతరం (మిగతా 2లో)

శ్రీవారికి 2 బ్రహ్మోత్సవాలు

- వార్షిక, నవరాత్రి పేరిట నిర్వహణ
- అధికమాసం కారణంగా సన్నాహాలు
- రాత్రి వాహన సేవల సమయంలో మార్పు

3లో

అలెక్స్ హేల్స్

ఇంగ్లాండ్ 481

వన్డేల్లో ప్రపంచ రికార్డు బద్దలు

వన్డే క్రికెట్లో ఇంగ్లాండ్ మరోసారి చరిత్రను తిరగరాసింది. తన పేరిటే ఉన్న అత్యధిక స్కోరు రికార్డును బద్దలు కొట్టింది. మంగళవారం ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో ఆ జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 481 పరుగులు చేసింది. దీంతో 2016లో పాకిస్థాన్‌పై 444/3తో ఇంగ్లాండే నెలకొల్పిన ప్రపంచ రికార్డు బద్దలైంది. ఓపెనర్లు బెయిర్‌స్టో (139) అలెక్స్ హేల్స్ (147 పరుగులు) విధ్వంసక బ్యాటింగ్‌తో జట్టుకు రికార్డు స్కోరు అందించారు. - వివరాలు ఛాంపియన్‌లో

పేదల ఇళ్లకు ప్రైవేటు భూమి

(మొదటి పేజీ తరువాయి)

సింగిల్ విండో అనుమతి. రూ.2వేల కోట్లతో ఈ సంయుక్త వెంచర్ కంపెనీ ఏర్పాటు.

- సముద్ర రవాణాలో దేశం మొత్తం మీద ఏపీ ముందుండేలా పోర్టుల అభివృద్ధి. తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం కోనవద్ద వాణిజ్య రేవు అభివృద్ధి బాధ్యతలు కాకినాడ సెజ్ లిమిటెడ్‌కు అప్పగింత.
- మచిలీపట్నంలో పోర్టు, ఇండస్ట్రియల్ కారిడార్, టౌన్‌షిప్ ఏర్పాటుకు రూ.1385 కోట్ల రుణం తీసుకునేందుకు మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి అనుమతి.
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో విజయనగరం జిల్లా భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి. విమానాశ్రయం నిర్మాణంలో భాగంగా గూడెపువలసలో 27.87 ఎకరాల భూమికి ఎకరాకు రూ.33 లక్షల చొప్పున పరిహారం.
- విశాఖపట్నంలో లులూ కంపెనీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుపై గతంలో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో సవరణ.
- సమగ్ర ఆర్థిక విధానానికి పూర్తి స్థాయి అడ్మిన్ స్ట్రక్చర్ ఏర్పాటు. దీనికి బోర్డు డైరెక్టర్లు, సీఈవో, 56 మంది సిబ్బంది నియామకం.
- దిల్లీలో ఉన్న ఏపీ భవన్‌లో కొత్తగా జాయింట్ కమిషనరు, అసిస్టెంట్ కమిషనరు పోస్టుల నియామకం.
- ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ట్యూషన్ ఫీజుల పెంపు.
- వెలిగొండ ప్రాజెక్టులో రెండో ప్యాకేజీలో ఫీడర్ కాలువ నీటి సరఫరా సామర్థ్యం 328 క్యూసెక్కులకు పెంచడంవల్ల అదనంగా అయిన ఖర్చు రూ.38.78 కోట్ల చెల్లింపు.
- ఐబీఎం నిబంధనల ప్రకారం 4.48 శాతం టెండర్ డిస్కౌంట్ వర్తింపు.
- తెలుగుగంగ ప్రాజెక్టులో అత్యవసరంగా నామినేషన్‌పై చేసిన రూ.1.21 కోట్లకు పాలనాపరమైన అనుమతి.
- నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నిధుల సమీకరణ బాధ్యతలు, ఇప్పటికే పూర్తయిన ఇతర సాగునీటి ప్రాజెక్టుల ఆస్తులు జల వనరుల అభివృద్ధి సంస్థకు బదలాయింపు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మెడికల్ అండ్ డెంటల్ ఇనిస్టిట్యూట్ చట్టం-2007 రద్దుకు ఆమోదం. సెమీ అటానమస్‌గా ఉన్న సంస్థలు ప్రభుత్వ వైద్య కళాశాలలుగా, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులుగా మార్పు. వీటిలో పని చేస్తున్న ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ.
- అనంతపురం జిల్లా పెనుకొండ మండలం కియా కార్ల కంపెనీ వద్ద యర్రమంచి గ్రామంలో ఎఫ్ కేటగిరీ పోలీసు స్టేషన్ ఏర్పాటు.
- కొత్త వేతన సవరణ సంఘానికి సహాయకారిగా ఉండేందుకు 16 తాత్కాలిక పోస్టుల మంజూరు.

సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కామన్వెల్త్ బంగారు పతక విజేతకు ఇంటి స్థలం

పలు సంస్థలు, వ్యక్తులకు భూములు, ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ మంత్రిమండలి సమావేశం నిర్ణయం తీసుకుంది.

- ఒలింపియన్, కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతక విజేత ఎంపీ మాణిక్యాలుకు విశాఖపట్నం జిల్లా గోపాలపట్నంలో 500 చదరపు గజాల ఇళ్ల స్థలం ఉచితంగా కేటాయింపు.
- దీపా చారిటబుల్ ట్రస్టు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.4.50 లక్షల (వడ్డీ రూ.3.96 లక్షలు, 2018లో లీజు రూ.54వేలు) బకాయిలు రద్దు. గుణదలలో ఈ ట్రస్టుకు 0.75 సెంట్ల భూమి కేటాయింపు.
- శ్రీకాకుళం జిల్లా సంచాం గ్రామంలో కొత్త పారిశ్రామిక పార్కు కోసం 17.18 ఎకరాల ప్రభుత్వ భూమి ఏపీఐఐసీకి అప్పగింత.
- కర్నూలు జిల్లా రాచర్ల గ్రామంలో పారిశ్రామిక పార్కు కోసం 26.07 ఎకరాల భూమి ఉచితంగా కేటాయింపు.
- కడప జిల్లా వీఎన్‌పల్లి మండలం అనిమెల, యు.రాజుపాలెం, అలిందెన, గొనుమాకులపల్లి, పిల్లావారిపల్లి గ్రామాల పరిధిలోని 118.87 ఎకరాల ప్రభుత్వ భూమి పవన విద్యుత్తు కేంద్రం కోసం కేటాయింపు. అనిమెల, యు.రాజుపాలెం, గొనుమాకులపల్లి గ్రామాల్లో మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2 లక్షలకు, అలిదెన గ్రామంలో ఎకరా రూ.2.50 లక్షలకు, పిల్లావారిపల్లె గ్రామంలో ఎకరా రూ.1.50 లక్షలకు కేటాయింపు.
- ప్రకాశం జిల్లా దర్శిలో మినీ స్టేడియం నిర్మాణానికి 6.05 ఎకరాల ప్రభుత్వ భూమి అప్పగించేందుకు కలెక్టరుకు అధికారం.
- విశాఖ జిల్లా పరవాడ మండలంలో జాతీయ థర్మల్ ప్రాజెక్టు నిర్మాణానికి 883.08 ఎకరాల ప్రభుత్వ భూమి ఎకరా రూ.2.25 లక్షల ధరకు కేటాయింపు.
- రాష్ట్రంలో సామాజికవర్గ మార్పు కోరుకుంటున్న వివిధ కులాల వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని లోతైన అధ్యయనం చేసి సమగ్ర నివేదిక అందించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు. తమను ఎస్టీలుగా గుర్తించాలని మత్స్యకారులు, వడ్డెరులు.. ఎస్సీలుగా గుర్తించాలని రజకులు కోరుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి కాలువ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వంఏర్పాటు చేసే కమిషన్ ఆయా వర్గాల మూలాలను పరిశీలిస్తుందని, ఎస్సీ, ఎస్టీల్లో ఎవరినైనా చేర్చాలన్నా, తీసేయాలన్నా కేంద్రానికి మాత్రమే అధికారం ఉంటుందని తెలిపారు. సీఎం సభ ఏర్పాట్లలోఉండటంవల్ల మంత్రి గంటా శ్రీనివాసరావు మంత్రివర్గ సమావేశానికి హాజరు కాలేదని వివరించారు.
- భూముల ఆటో మ్యుటేషన్‌కు సంబంధించి ఆర్డినెన్సు జారీకి నిర్ణయం. రిజిస్ట్రేషన్ పూర్తయిన 30 రోజుల్లోగా ఫిర్యాదుల స్వీకరణ. తర్వాత 15 రోజుల్లో రెవెన్యూ అధికారుల విచారణ. 45 రోజుల తర్వాత ఎలాంటి ప్రత్యుత్తరాలతో సంబంధం లేకుండా భూమి బదలాయింపు.

KL UNIVERSITY (DEEMED TO BE UNIVERSITY)
EXCLUSIVE COUNSELLING for MBA & BBA
Counselling Date: 23rd & 24th June
MBA Dual & Sectoral Specializations

Functional Electives:
- Marketing
- Finance ▪ HRM
- Business Analytics
- Digital Marketing
- Supply Chain & Logistics

Sectoral Electives:
- Retail
- Banking
- Information Technology
- Healthcare Management
- Pharma Marketing

Highlights of KLU BUSINESS SCHOOL - MBA :
- Corporate Identity
- 100% placements assistance
- Use of Harvard Business School and IIM Case studies
- Internship abroad & One Sem abroad.
- SAP-Certification
- Teaching by Doctoral faculty
- Paid Internship for deserving candidates

MBA Merit Scholarships are as follows:

ICET Rank	Scholarship per year
1 to 1000	25000
1001 to 3000	20000
3001 to 5000	15000
5001 to 10000	10000
10001 to 25000	5000

XAT, MAT & CAT Percentile	Scholarship per year
91 to 100	50000
81 to 90	30000
71 to 80	20000
61 to 70	10000
51 to 60	5000

Counselling Venue : Vijayawada Campus Green Fields, Vaddeswaram, A.P. Ph: 9666637015, 7997995724, 7997995741
NAAC 'A' Grade
Admin Office : 29-36-38, Museum Road, Governorpet, Vijayawada -02. A.P. Ph: 9966006063

అందుబాటులోకి 'ఈ-పంట'

ఈనాడు, అమరావతి: రైతులు ఎక్కడి నుంచైనా తమ పొలంలో సాగు చేసిన పంట వివరాలను తెలుసుకునేలా 'ఈ పంట'ను అందుబాటులోకి తేవాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఏ సర్వే నెంబర్లో ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేశారనే వివరాలతో పంటల నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే నెంబర్లు, సబ్ డివిజన్ల వారీగా భూమి యాజమాన్య హక్కులను తయారు చేసే భూధార్ విధానాన్ని ఐటీ సలహాదారు సత్యనారాయణ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌రూపంలో మంత్రిమండలి ముందుంచారు.

కశ్మీర్‌లో రాజకీయ కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా పరిస్థితులు మెరుగుపర్చడంలో పీడీపీ విఫలమయిందని భాజపా నిందించింది. రాష్ట్రంలో ఉగ్రవాదం పెరిగిపోతున్నా కట్టడి చేయడంలో ఆ పార్టీ విఫలమవడంతోనే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించాలన్న నిర్ణయం తీసుకున్నట్లు రాం మాధవ్ చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షాతో సంప్రదించిన తర్వాతే జమ్ముకశ్మీర్ ప్రభుత్వం నుంచి వైదొలగినట్లు ప్రకటించారు. శ్రీనగర్‌లో ఇటీవల సీనియర్ పాత్రికేయుడు సుజాత్ బుఖారిని గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపిన సంఘటనను, అదే రోజు ఈద్ సెలవులో ఇంటికి వెళ్తున్న సైనికుడిని ఉగ్రవాదులు అపహరించి, పొట్టనబెట్టుకున్న సంఘటనను రాంమాధవ్ ప్రస్తావించారు. "రాష్ట్రంలోని ఈ కూటమి ప్రభుత్వంలో కొనసాగడాన్ని భాజపా ఇంకా సమర్థించుకోలేదు. ఇప్పుడున్న పరిస్థితిని ప్రస్తుత ప్రభుత్వం నియంత్రించలేదు. పరిపాలన పగ్గాలను గవర్నర్ చేపట్టాల్సిన సమయం ఇది. జమ్ము కశ్మీర్.. భారత్‌లో అంతర్భాగం అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను నియంత్రించడానికి.. పాలన పగ్గాలను గవర్నర్‌కు అప్పగించాలని మేము నిర్ణయించాం." అని రాం మాధవ్ చెప్పారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం, హింస, అతివాదం పెరిగాయని, జీవించే హక్కు, వాక్‌స్వాతంత్ర్యం సహా పౌరుల హక్కులు ప్రమాదంలో పడ్డాయని ఆయన అన్నారు.

"సుజాత్ బుఖారి హత్య తర్వాత కాల్పుల విరమణను పొడిగించాలని అడగలేకపోయాం. ఒక సదుద్దేశంతో పవిత్ర రంజాన్ మాసంలో సైనిక చర్యలను నిలిపివేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ అవకాశాన్ని రాష్ట్రంలో ఆమోదించలేదు. అందుకే పరిస్థితులను నియంత్రించడానికి ఈ నిర్ణయం తీసుకున్నాం." అని రాంమాధవ్ చెప్పారు. భద్రతపరమైన అంశాలకు తోడు తాము రాష్ట్రంలో వివక్షను ఎదుర్కొంటున్నామన్నారు. "కశ్మీర్ లోయ కోసం కేంద్రం చేయాల్సినదంతా చేసింది. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పీడీపీ విఫలమయింది. జమ్ము, లద్దాఖ్‌లో అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో మా పార్టీ నేతలు పీడీపీ నుంచి చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు." అని చెప్పారు. పీడీపీ ఉద్దేశాలను తాము ప్రశ్నించడం లేదని, కానీ కశ్మీర్‌లో జీవన పరిస్థితులు మెరుగుపర్చడంలో ఆ పార్టీ విఫలమయిందని అన్నారు.

87 స్థానాలున్న జమ్ము కశ్మీర్ శాసనసభకు 2014లో జరిగిన ఎన్నికల్లో పీడీపీకి 28, భాజపాకు 25 స్థానాలు దక్కాయి. ఎన్నికల అనంతరం ఈ రెండూ కలిసి కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నేషనల్ కాన్ఫరెన్స్‌కు 15, కాంగ్రెస్‌కు 12 స్థానాలు దక్కాయి. ఇతరులకు ఏడు దక్కాయి. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఎవరితోనూ చేతులు కలపబోమని నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ రెండూ మంగళవారం స్పష్టం చేశాయి. దీంతో గవర్నర్ పాలన అనివార్యం అయింది. ఇప్పుడు గవర్నర్ పాలన విధిస్తే రాష్ట్రంలో 1977 నుంచి గవర్నర్ పాలన ఎనిమిదోసారి అవుతుంది. ఎన్నికల్లో భాజపా, పీడీపీ పరస్పరం తీవ్రంగా విమర్శించుకుంటూ ప్రచారం చేసినా ఎన్నికల అనంతరం ఉమ్మడి అజెండాతో కూటమిగా ఏర్పడ్డాయి. అయితే రెండు పార్టీలు చాలా విషయాల్లో విభేదిస్తూనే వచ్చాయి.

పార్టీల నేతలతో గవర్నర్ సంప్రదింపులు

మెహబూబా రాజీనామా సమర్పించిన అనంతరం గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రా.. ఆమెతో పాటు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనా, నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఎ.మిర్‌తో సంప్రదింపులు జరిపారు. ప్రభుత్వ ఏర్పాటుకు తగిన సంఖ్యాబలం తమకు లేదని మిర్ చెప్పారు. గవర్నర్ పాలన, ఎన్నికలకు ప్రత్యామ్నాయం లేదని ఒమర్.. గవర్నర్‌తో చెప్పారు. ప్రత్యామ్నాయ కూటములతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలరా అని మెహబూబాను, భాజపా నేతలను గవర్నర్ అడిగారు. వారు చేయలేమని చెప్పడంతో రాష్ట్రపతికి నివేదిక పంపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేంతవరకు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగాలని మెహబూబాకు సూచించారు.

మద్దతు ఉపసంహరణ నిర్ణయం గవర్నర్ ద్వారా తెలిసింది

శ్రీనగర్: ప్రభుత్వానికి భాజపా మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు మెహబూబా ముఫ్తీకి ఆ పార్టీ నుంచి కాకుండా ఆశ్చర్యకరంగా గవర్నర్ నుంచి సమాచారం అందింది. మెహబూబా మధ్యాహ్నం తన కార్యాలయంలో ఉండగా ప్రధాన కార్యదర్శి బి.బి.వ్యాస్‌కు గవర్నర్ నుంచి ఫోన్ వచ్చింది. ముఖ్యమంత్రికి వెంటనే కాల్ కలపాల్సిందిగా గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రా ఆయన్ను కోరారు. ఇదంతా రాం మాధవ్ దిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడడానికి కొద్ది నిమిషాల ముందు జరిగింది. వ్యాస్ కాల్ కలపగానే గవర్నర్.. భాజపా నిర్ణయాన్ని మెహబూబాకు తెలిపారు. ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనా నుంచి గవర్నర్‌కు లేఖ అందింది. అదే విషయాన్ని మెహబూబాకు గవర్నర్ తెలియజేశారు. ఈ వార్తను మౌనంగా విన్న ఆమె కొద్ది సేపు ఆగి.. భాజపాతో చర్చలు అవసరం లేదని, రాజీనామా సమర్పిస్తున్నానని చెప్పినట్లు అధికారులు వెల్లడించారు.

కరకు విధానం పనికిరాదు

కరకుగా వ్యవహరించే భద్రతా విధానం రాష్ట్రంలో ఫలితమివ్వదని, స్నేహపూర్వక సంబంధాల పునరుద్ధరణే కీలకమని పీడీపీ ఎప్పుడూ చెబుతూనే ఉంది. జమ్ముకశ్మీర్‌లో చర్చలకు మేము ప్రయత్నిస్తూనే ఉంటాం.

– మెహబూబా ముఫ్తీ

ముందే రాజీనామా చేసి ఉండాల్సింది

మెహబూబా ముఫ్తీ కాళ్ల కిందకు నీళ్లు వచ్చేంత వరకు ఆగకుండా ముందే తనంతట తానే రాజీనామా చేసి ఉండాల్సింది.

–ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్

పీడీపీతో కలిసి భాజపా తప్పిదం చేసింది

పీడీపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి భాజపా పెద్ద తప్పిదం చేసింది. జాతీయ పార్టీ అయిన భాజపా.. ప్రాంతీయ పార్టీ అయిన పీడీపీతో జట్టు కట్టి ఉండాల్సింది కాదు. ప్రాంతీయ పార్టీలే తమలో తాము కూటమిగా ఏర్పడే అవకాశం ఇవ్వాలి.

– గులాంనబీ ఆజాద్, కాంగ్రెస్

పరకాల రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

శంకించకూడదనే తాను వైదొలగాలని నిశ్చయించుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన రాజీనామా లేఖలో స్పష్టం చేశారు. తనకున్న బాంధవ్యాలను అడ్డుగా చూపుతూ కొంతమంది నాయకులు చేస్తున్న ఆరోపణలు చాలా బాధించాయని, అందుకే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ''గత కొన్ని రోజులుగా విపక్షానికి చెందిన కొంత మంది నాయకులు నేను ప్రభుత్వంలో సలహాదారు బాధ్యతల్లో ఉండడాన్ని పదే పదే ఎత్తిచూపుతున్నారు. ఒక పక్క మీరు(చంద్రబాబు) భాజపాతో, కేంద్ర ప్రభుత్వంతో విభేదిస్తూ మరో పక్క నన్ను సలహాదారుగా పెట్టుకోవడమేంటని వేలెత్తి చూపుతున్నారు. కేంద్రం, భాజపాపై మీరు చేస్తున్న ధర్మ పోరాటం మీద ప్రజల్లో అనుమానాలు లేవనెత్తడానికి ప్రయత్నిస్తున్నారు" అని పరకాల తెలిపారు. ''రెండు, మూడు రోజులుగా కొంతమంది చిన్నాచితకా నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే నేను వాటికి ప్రాధాన్యం ఇవ్వక్కర్లేదని నా మిత్రులు అన్నారు. కానీ ప్రతిపక్ష నాయకుని స్థానంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి కూడా ఇదే విషయాన్ని లేవనెత్తి మీ పోరాటాన్ని శంకించడం నన్ను బాధించింది. నా వ్యక్తిగత సంబంధ బాంధవ్యాలకు రాజకీయ ప్రయోజనాలను ఆపాదించ చూడడం, వాటిని తెర వెనుక మంతనాలకు, బేరసారాలకూ మీరు వినియోగిస్తారని ఆరోపించడం ప్రతిపక్ష నాయకుల నీచ స్థాయి ఆలోచనలకు తార్కాణం" అని పేర్కొన్నారు. 'నా కుటుంబలోని వ్యక్తులు (పరకాల భార్య నిర్మలా సీతారామన్ కేంద్ర ప్రభుత్వంలో రక్షణమంత్రిగా ఉన్నారు) వేరొక పార్టీలో ఉన్నందు వల్ల రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడతానని కొందరు ప్రచారం చేయడం నన్ను బాధించింది' అని తెలిపారు. పరిణితి చెందిన వ్యక్తులు ఎవరి రాజకీయాభిప్రాయాలకు వారు నిబద్ధులై ఉండగలరన్నారు. ఆ ఇంగితం కూడా ప్రతిపక్ష నాయకునికి భగవంతుడు ప్రసాదించకపోవడం దురదృష్టకరమన్నారు. 'నేను ప్రభుత్వంలో కొనసాగడం వల్ల మీరు చేపట్టిన ధర్మ పోరాట దీక్ష మీదా, మీ చిత్తశుద్ధి మీదా నీలినీడలు పడకూడదు. అందుకే ప్రభుత్వ సలహాదారు బాధ్యతల నుంచి వైదొలగాలని నిశ్చయించుకున్నా'అని లేఖలో పేర్కొన్నారు. 'నా రాజీనామా విషయాన్ని మీకు తెలియజేసినపుడు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం చేసే తప్పుడు వ్యాఖ్యలను పట్టించుకోవద్దని చెప్పారు. అది మీ పెద్ద మనసుకు తార్కాణం. మీ మాటలను కాదనాల్సి వస్తోంది. త్వరలోనే మిమ్మల్ని కలుసుకుంటాను'అని పేర్కొంటూ లేఖను ముగించారు.

DSC-SGT, SA బ్యాచ్ ప్రా॥: 20-06-18
◆ TET లో 144, 142, 141, 140 వంటి అత్యధిక మార్కులు సాధించిన సంస్థ ◆ SGT స్పెషల్ ఎగ్జామ్ బ్యాచ్ కలదు ◆ టెట్‌లో 130పై మార్కులు వచ్చిన వారికి ఫీజు రాయితీ
టీచర్స్ అకాడమీ కనిగిరి, ప్రకాశం జిల్లా 98486 61318

కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-ALL సబ్జెక్ట్స్
కొత్త బ్యాచ్ ప్రారంభం : 22-6-2018 సా॥ 4 గం॥లకు
8106268482, 9885272474

పూర్ణ హిందీ DSC
బస్ డిపో వెనుక, అవనిగడ్డ.
9949293730, 9550401012
కొత్త బ్యాచ్ : 25-6-18 హాస్టల్, మెటీరియల్

AP-DSC
SGT, SA (All Sub.), TPT,PET,HPT
TS,APలలో వేలది మందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన ఏకైక సంస్థ మాదే
Daily Test
FREE DEMO :24-6-2018 at 10.08 am
RAMAIAH COMPETITIVE COACHING CENTRE
Dilsukhnagar, HYDERABAD 9246208422, 040-66778422 Cell : 8885555202

2018-TETలో సోషల్ స్టేట్ 1st ర్యాంక్
2014 DSC-SGTలో జిల్లా 1st ర్యాంక్ సాధించిన సంస్థ
DSC SGT, SA (ALL) TPT, HPT
న్యూ బ్యాచ్ జూన్ 22 మరియు 27న ప్రారంభం
విజయవాడ ప్రతిభ బందరురోడ్ 93 92 91 75 84

2018 TETలో 142, 140, 140, 140 మార్కులతో ప్రభంజనం
2014 DSCలో స్టేట్ 2, 3, 4, 5 ర్యాంకులు 7 జిల్లా ఫస్ట్‌లు
అవనిగడ్డ విద్యానికేతన్ DSC కృష్ణాజిల్లా
SGT & SA (Mat, Soc, Bio, Eng)
బ్యాచ్ ప్రారంభం : 22-06-2018
94401 04963, 99499 33838

DSC 2008, 12, 14లలో స్టేట్ 1, 1, 2, 2, 2, 3, 3, 4, 4.. ర్యాంకులతో 500 పైగా పోస్టులు
TET 2018లో 142 మార్క్స్‌తో స్టేట్ 1st, 138, 137,135,131... మార్క్స్
Chandra Sir's విజేత హిందీ DSC అవనిగడ్డ - కృష్ణా.
9346628728, 8498935555
బ్యాచ్ : 23-06-2018

DSC - HINDI సైకాలజీ & P.E తెలుగు & హిందీ మీడియం
TET - 18 లో 139, 131, 130, 129 మార్క్స్ సాధించిన సంస్థ
TET - 17 లో స్టేట్ 1st, 2nd, 6th ర్యాంక్స్ సాధించిన సంస్థ
DSC - 14 లో SKLM 1,2,3,4,5,6 ర్యాంకులు సాధించిన సంస్థ
ఫ్రీ డెమో & కొత్త బ్యాచ్ ప్రారంభం: తేది: 23.06.2018, ఉ॥ 9 గం॥లకు హాస్టల్ వసతి కలదు
శ్రీ గౌరి బలగ ఆంధ్రా బ్యాంక్ ఎదురుగా SBI పైన, శ్రీకాకుళం
8985917075, 7893136573

DSC SA (Phy.Sci./Bio/Maths/Social) TPT, PET, SGT
బ్యాచ్‌లు ప్రారంభం : 22-6-18@9AM
బాసర ఇనిస్టిట్యూట్ గవర్నర్‌పేట, విజయవాడ 9030140123 8374022333

EKALAVYA IAS ACADEMY
RANK ASSISTANCE Oriented Program
Degree+IAS, Prelims - cum - Mains
Beside Nagarjuna Hospital, Kanuru, VJA, Ph:6300181832

స్ఫూర్తి DSC నెల్లూరు చాకలివీధి, VRC, నెల్లూరు
TET-18 లో 140,140,140,139,138,137.. సాధించిన సంస్థ
SGT, SA, తెలుగు పండిట్స్ న్యూ బ్యాచ్ డెమో : 20-6-18 9 am
8985005173, 9542543167

మానవులతో కంప్యూటర్ చర్చాగోష్ఠి!

(మొదటి పేజీ తరువాయి)

'టెలిమెడిసిన్'పై చర్చను చేపట్టింది. 2011లో ఐబీఎంకు చెందిన వాట్సన్ కంప్యూటర్.. ఇద్దరు మానవ క్విజ్‌మాస్టర్లను ఓడించింది. ఆ తర్వాత ఐబీఎంకు చెందిన ఇజ్రాయెల్ బృందం తాజా ప్రాజెక్టుపై కసరత్తు మొదలుపెట్టింది. వాస్తవాలు, గణాంకాల కోసం భారీగా డేటాను స్కాన్ చేయడానికి బదులు తాజా ప్రాజెక్టు.. కృత్రిమ మేధస్సులోని అనేక సంక్లిష్ట విభాగాలను వినియోగించింది. వాక్చాతుర్యం, విశ్లేషణ వంటి లోతైన మానవ నైపుణ్యాలను ఎదుర్కొనేలా కొత్త యంత్రాన్ని రూపొందించినట్లు ఐబీఎం పేర్కొంది.

కోస్తాలో నేడూ వడగాల్పులు

ఈనాడు, విశాఖపట్నం: వానాకాలమైనా.. మూడు నాలుగు రోజులుగా వడగాల్పులు దడ పుట్టిస్తున్నాయి. ప్రత్యేకించి విశాఖ జిల్లాలో అవి తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి..మరోవంక శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాలలోనూ వీటి ప్రభావం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం కోస్తాంధ్రలోని కొన్ని జిల్లాల్లో ఈ వడగాల్పుల ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తోంది.

మూగవోయిన వేయి గళాలు

(మొదటి పేజీ తరువాయి)

మిమిక్రీ కళపై మక్కువ పెంచుకున్న నేరెళ్ల తండ్రి ఆశలకు భిన్నంగా తనకు అభిరుచి ఉన్న ఆ రంగంలోనే ఎదగాలని నిర్ణయించుకున్నారు. ఇంటర్ చదివే రోజుల్లో తండ్రి చనిపోయి ఆర్థిక పరిస్థితులు తలకిందులైనా చదువును వదల్లేదు. బీఏ, బీకాం, బీఈడీ పూర్తిచేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947వ సంవత్సరంలో (15 ఏళ్ల ప్రాయంలో) తొలితరం నటుడైన చిత్తూరు నాగయ్య స్వరాన్ని అనుకరించడం ద్వారా తన కళా ప్రస్థానానికి బాటలు వేసుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినా..తనకు గుర్తింపు తెచ్చిన మిమిక్రీని మాత్రం వదల్లేదు. అలా మొదలైన ప్రస్థానం పది వేల ప్రదర్శనల వరకు కొనసాగింది.

అమ్మే ఆది గురువుగా.. మిమిక్రీకి ఏమాత్రం గుర్తింపు లేని రోజుల్లోనే ఆ కళపై మక్కువ పెంచుకున్న ఆయన.. దానికి అమ్మే స్ఫూర్తి అని చెప్పేవారు. 'మా అమ్మకు మిమిక్రీ కళలో పరోక్ష ప్రవేశం ఉండేది. ఆమె ఇంటికొచ్చిన బంధువుల గొంతులను సరదాగా అనుకరించేది. అలా పదేళ్ల ప్రాయం నుంచే భిన్న స్వరాలను అనుకరించడం అలవాటుగా మారింది' అని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. మిమిక్రీ కళ ఎప్పుడు పుట్టిందంటే రామాయణ కాలంలోనే అంటారాయన. "రాముడు మాయలేడిని వెంటాడి బాణం వేసినప్పుడు రాముడి గొంతుని అనుకరిస్తూ "హా సీతా! హా లక్ష్మణా! అంటూ ప్రాణం విడిచిన మారీచుడే" మొదటి మిమిక్రీ కళాకారుడని నవ్వుతూ చెప్పేవారు.

రాజకీయ.. సినీ అవకాశాలను త్యజించి.. అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు వేణుమాధవ్‌కు 1972లో శాసన మండలి సభ్యునిగా అవకాశం ఇచ్చారు. 1978 వరకు ఎమ్మెల్సీగా కొనసాగినా..రాజకీయాలపై ఆసక్తి లేని ఆయన మళ్లీ కళ వైపే మళ్లారు. అనూహ్యంగా సినీ అవకాశాలనూ దక్కించుకున్నారు. గూఢచారి 116తోపాటు..పదకొండు సినిమాల్లో నటించారు. ఆ క్రమంలో సినారె, గుమ్మడి, మిక్కిలినేనిలాంటి వారితో స్నేహం చేశారు. ఈ నలుగురినీ సినీ పరిశ్రమలో 'ఇష్టచతుష్టయం'గా సంబోధించేవారని ప్రతీతి. ఆయనకు ఘంటశాలతోనూ మంచి స్నేహం ఉండేది. అమెరికా పర్యటనలో నెలరోజులు వీరిద్దరూ కలిసే ఉన్నారు. ఘంటసాల గానంతో, నేరేళ్ల మిమిక్రీతో అక్కడి ప్రేక్షకులకు వినోదాన్ని పంచారు. అటు తర్వాతా సినీ అవకాశాలు వెల్లువెత్తినా తనకు గుర్తింపు తెచ్చిన కళకు దూరం కావడం ఇష్టం లేక వాటినీ వదులుకున్నారు.

నేరెళ్ల వేణుమాధవ్ పార్థివ దేహం

భర్త నేత్రాలను దానం చేస్తూ విలపిస్తున్న భార్య శోభావతి

లెక్కలేనన్ని పురస్కారాలు.. ఆయన మిమిక్రీ కళకు చేసిన సేవను గుర్తించిన భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. కాకతీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్లు ఇచ్చి సత్కరించాయి. వివిధ రాష్ట్రాల్లో ఆయన లెక్కలేనన్ని పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. తిరుపతిలో అభిమానుల నుంచి గజారోహణ సత్కారం అందుకున్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు.. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆయన అంతిమయాత్ర స్వగృహం నుంచి ప్రారంభమైంది. ఆటోనగర్ శ్మశాన వాటికలో అంత్య సంస్కారాలు పూర్తిచేశారు. పోలీసులు గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరిపారు. అంత్యక్రియలకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాష్, పలువురు కవులు, కళాకారులు, ఆయన శిష్యులు, అధికారులు హాజరయ్యారు.

గ్రహం అనుగ్రహం

20–6–2018 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
సప్తమి: ఉ. 9-53 తదుపరి అష్టమి
పుబ్బ నక్షత్రం: ఉ. 6-53 తదుపరి ఉత్తర
అమృత ఘడియలు: రా. 11-01 నుంచి 12-33 వరకు
వర్జ్యం: మ. 1-48 నుంచి 3-20 వరకు
దుర్ముహూర్తం: ఉ.11-35 నుంచి 12-27 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5-30; సూర్యాస్తమయం: సా.6-32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	41.5	30.0
నెల్లూరు	41.0	30.0
గుంటూరు	40.4	28.2
ఒంగోలు	40.1	30.8
విజయవాడ	40.0	29.4
తాడేపల్లిగూడెం	40.0	29.0
తిరుపతి	39.7	28.2
విశాఖపట్నం	39.4	22.4
శ్రీకాకుళం	39.0	30.0
నరసాపురం	38.2	28.9
కడప	38.0	27.0
అనంతపురం	37.2	26.0
కర్నూలు	36.2	25.3
హైదరాబాద్	35.7	24.6

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES
A.P: VIJAYAWADA - 520 008
NOTIFICATION
Application forms are invited through online from the candidates who have secured the cutoff scores in NEET UG – 2018 and fulfilled the eligibility criteria for admission into MBBS/BDS Courses available under **Competent Authority Quota** in Medical and Dental Colleges affiliated to Dr. NTR UHS, Vijayawada and also for MBBS course under SVIMS, Tirupati for the Academic Year 2018-19 from 8.00 A.M on 20-06-2018 upto 05.00 P.M on 24-06-2018 from **https://apmedadm.apntruhs.in**
For Details Visit **http://ntruhs.ap.nic.in** and **https://apmedadm.apntruhs.in**
Candidates are advised to watch University Website regularly for further notifications and instructions.
Dt.:19.06.2018 Sd/- REGISTRAR

మంత్రి గంటా మనస్తాపం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నా... వాటిని ఎప్పటికప్పుడు అధినాయకత్వం దృష్టికి తీసుకెళుతున్నా ఫలితం లేకపోయిందని మంత్రి గంటా తన సన్నిహితులతో కొంతకాలంగా చెబుతున్నారు. తాజాగా సర్వే పేరుతో తనను అప్రతిష్టకి గురి చేసేలా, సొంత నియోజకవర్గంలో తనకు వ్యతిరేకత ఉందనేలా ప్రచారం జరగటానికి పార్టీయే ఆస్కారమిచ్చినట్లు మంత్రి భావిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ భూములు తనఖా పెట్టి బ్యాంకు రుణం తీసుకున్నట్లు, విశాఖపట్నంలో భూముల కుంభకోణానికి పాల్పడినట్లు తనపై ఆరోపణలు రావటం వెనక, హైకోర్టులో పిల్ వేయటంలోను పార్టీలోని కొందరి పాత్ర ఉందన్నది ఆయన వాదన. దాన్ని బలపరిచేలా సేకరించిన ఆధారాలను అధినాయకత్వానికి అందించినా... తనపై ఆరోపణలకు అడ్డుకట్ట పడలేదని, మరింతగా పెరిగాయని భావిస్తున్నారు. విశాఖపట్నం భూముల కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక ప్రభుత్వానికి చేరిందని, అందులో తన పాత్ర లేనట్లు తేలినా... దాన్ని బయటపెట్టక పోవటం కూడా తనను ఇబ్బంది పెట్టేందుకేనన్నట్లుగా ఆయన సందేహిస్తున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో వ్యతిరేకత ఉన్నట్లుగా ప్రచారం సాగుతుండటం మనస్తాపానికి గురి చేసినట్లు ఆయన సన్నిహిత వర్గాల కథనం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం విశాఖపట్నం జిల్లా పర్యటనకు వెళుతున్నారు. నగరంలో పట్టాల పంపిణీతో పాటు మంత్రి గంటా శ్రీనివాసరావు నియోజకవర్గమైన భీమిలిలో ఏర్పాటు చేసిన రెండు కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. వీటికి హాజరవాలా... వద్దా అన్న దానిపైనా మంత్రి తర్జనభర్జన పడుతున్నట్లు ఆయన సన్నిహితుల సమాచారం. బుధవారం జరిగే పరిణామాలను బట్టి ఒక నిర్ణయానికి రావాలని భావిస్తున్నట్లు తెలిసింది.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో శ్రీమలయప్పస్వామి (దాచిన చిత్రం)

శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: అధికమాసం కారణంగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. వార్షిక, నవరాత్రి పేరిట బ్రహ్మోత్సవాల నిర్వహణ పనులకు తితిదే శ్రీకారం చుట్టింది. వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 13న ధ్వజారోహణంతో ఆరంభం కానున్నాయి. అదే రోజు రాత్రి శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు యథావిధిగా వాహనసేవలను తితిదే నిర్వహిస్తుంది. రాత్రి సమయంలో మాత్రం 8 గంటల నుంచి 10 గంటల వరకు నిర్వహించనుంది. ఇది వరకు రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు వాహనసేవలు జరిగేవి. గరుడసేవ రాత్రి 7 గంటల నుంచి ప్రారంభించి అర్ధరాత్రి వరకు కొనసాగుతుంది. భక్తుల నుంచి వచ్చిన విన్నపాలను దృష్టిలో పెట్టుకుని ఆగమ సలహా తీసుకున్న అనంతరం తితిదే ఈ మార్పునకు శ్రీకారం చుట్టింది. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై తిరుమల జేఈవో శ్రీనివాసరాజు మంగళవారమిక్కడ సమావేశమై వివిధ విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు మాసాంతానికి పనులు పూర్తి చేస్తామని, గతానుభవాలతో ఏర్పాట్లపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆగస్టు 12 నుంచి 16 వరకు శ్రీవారి ఆలయంలో బాలాలయం అష్టబంధన మహాకుంభాభిషేకం జరుగుతుందని చెప్పారు. 11న అంకురార్పణతో మహా సంప్రోక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ లోపు బ్రహ్మోత్సవాల కోసం జులై 10నే శ్రీవారి పుష్కరిణి మరమ్మతుల పనులు ప్రారంభించి ఆగస్టు 10 లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సమావేశానికి ఆగమపండితులు, ప్రధాన అర్చకులను కూడా రప్పించి ఏర్పాట్లపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రెండు బ్రహ్మోత్సవాల వివరాలను ప్రకటించారు.

వార్షిక నవరాత్రి బ్రహ్మోత్సవాల వివరాలు ఈనాడు.నెట్‌లో

శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు కవచాల తొలగింపు

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారికి స్వర్ణ కవచాలను మంగళవారం శాస్త్రోక్తంగా తొలగించారు. రెండో గంట అనంతరం రంగనాయకుల మండపంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 23 వరకు ఉత్సవమూర్తులు పంచలోహాలతో నిజరూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. స్వర్ణ కవచాల తొలగింపు సందర్భంగా జరిగిన పూజల్లో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

టెట్ ప్రాథమిక 'కీ' విడుదల

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా ముగిసినట్లు మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 3,97,957 మంది దరఖాస్తు చేయగా... 3,70,576 మంది పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు. బుధవారం నుంచి ప్రాథమిక 'కీ' అందుబాటులో ఉంటుందని, అభ్యంతరాలు ఉంటే 23వ తేదీ అర్ధరాత్రి 12గంటల వరకు టెట్ వెబ్‌సైట్ ద్వారా సరైన వివరాలు, ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. తుది 'కీ' 26న, ఫలితాలు 30న ప్రకటిస్తామని చెప్పారు. అభ్యర్థులు రెస్పాన్స్ షీట్లను బుధవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ప్రాథమిక వివరాలు, పుట్టిన తేదీ, పేరు, కులం, లింగ, తదితరాలు కూడా సరిచేసుకోవచ్చని వివరించారు. 23వ తేదీ వరకు వెబ్‌సైట్‌లోని ఫిర్యాదు బాక్సులో అభ్యర్థనలను నమోదు చేయాలన్నారు. పీఈటీ, డాన్స్, మ్యూజిక్ మినహా డీఎస్సీ సిలబస్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

విద్యార్థి అనిరుధ్ బాబును ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిచయం చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగం ప్రారంభించాలి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో ఏర్పాటుచేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగాన్ని ప్రారంభించాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్‌కు కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విన్నవించారు. ఈ మేరకు మంగళవారమిక్కడ ఓ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో హిందీ విభాగం ప్రారంభించాలని యార్లగడ్డ ఆ లేఖలో గుర్తుచేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ వర్ల రామయ్య, ఎండీ ఎన్.వి.సురేంద్రబాబు

పదవీవిరమణ వయోపరిమితి పెంపు సాధ్యం కాదు

ఆర్టీసీ పాలక మండలి తీర్మానం

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ కార్మికుల పదవీ విరమణ వయోపరిమితిని 58 నుంచి 60 ఏళ్లకు పెంచడం సాధ్యం కాదని పాలకమండలి తేల్చింది. సంస్థ ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా ఇది వీలు కాదని తీర్మానించింది. ఆర్టీసీలో అద్దె బస్సులను 35శాతానికి పెంచాలనే ప్రతిపాదనపై నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ఛైర్మన్ వర్ల రామయ్య అధ్యక్షతన మంగళవారం పాలకమండలి సమావేశం జరిగింది. కారుణ్య నియామకాలకు సంబంధించి ఉద్యోగానికి తగిన అర్హత లేని, ఉద్యోగం వద్దనుకునే వారికి పరిహారంగా గతంలో రూ.లక్ష ఇచ్చేవారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.5లక్షలకు పెంచాలని నిర్ణయించారు. వేతనసవరణపై చర్చ జరిగినా కీలక నిర్ణయమేమీ తీసుకోలేదు. తెలంగాణ తరహాలో 16శాతం మధ్యంతర భృతి ఇవ్వాలనే ప్రతిపాదనపై చర్చ నడిచినా...కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలనుకున్నట్లు సమాచారం. ఆర్టీసీ ఎండీ ఎన్.వి.సురేంద్రబాబు, జోనల్ ఛైర్మన్లు, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు సత్యనారాయణ పదవీకాలం పొడిగింపు

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వ ఐటీ సలహాదారు సత్యనారాయణ పదవీ కాలాన్ని ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత శనివారంలో ఆయన పదవీకాలం ముగిసింది. తాజా ఉత్తర్వులతో వచ్చే ఏడాది జూన్ 15 వరకు కొనసాగుతారు.

ముస్లిం పిల్లల విదేశీ విద్యకు 15 లక్షలు

- ముస్లిం సంఘ నేతల భేటీలో సీఎం చంద్రబాబు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: విదేశీ చదువుల కోసం ముస్లిం విద్యార్థులకు ఇస్తున్న మొత్తాన్ని రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఉన్నత చదువులకు వీలుగా 25 రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అశాంతిని సృష్టించడం, కులమతాల మధ్య చిచ్చుపెట్టడమే వైకాపా అజెండాగా ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్ ఘటనలో అమాయకులను శిక్షించవద్దంటూ మంగళవారం ఎంపీ గల్లా జయదేవ్ నేతృత్వంలో ముస్లిం సంఘాల నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విన్నవించారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న షాదీఖానాలో పెళ్లికి వచ్చిన వారి మోటార్ సైకిళ్ల నంబర్లను తీసుకుని ఆర్టీవో కార్యాలయం నుంచి పేర్లు తెప్పించుకుని వారందరిపై కేసులు పెట్టారని ఫిర్యాదు చేశారు. తుని విధ్వంసం వెనుక కరుణాకర్‌రెడ్డి ఉన్నట్లుగానే పాత గుంటూరు విధ్వంసం వెనుక లేళ్ల అప్పిరెడ్డి ఉన్నాడనేది అందరికీ తెలిసిందేనన్నారు. సీఎం స్పందిస్తూ విధ్వంసాలకు పాల్పడిన వారు ఏ స్థాయిలో ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. ఇందులో వైకాపా నేతల పాత్రపై నిశితంగా విచారించాల్సి ఉందని చెప్పారు. ముస్లిం యువకులను ఇబ్బందిపెట్టే ఉద్దేశం లేదని వివరించారు. ఎన్నికలకు ఏడాది మాత్రమే గడువున్న నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలను మరింత పెంచి ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయాలన్నదే వైకాపా నేతల పన్నాగమని ఆయన పేర్కొన్నారు. వీటన్నింటిపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.

పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ ఘటనలో అమాయకులను శిక్షించవద్దంటూ ఎంపీ గల్లా జయదేవ్ నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ముస్లిం సంఘాల నేతలు

నాలుగేళ్లుగా చూస్తూనే ఉన్నాం

ఒక నేరస్థుడు రాజకీయాల్లోకి వస్తే సమాజాన్ని నేరమయం చేసేందుకు ఎలాంటి కుట్రలు పన్నుతారనడానికి రాష్ట్రంలో గత నాలుగేళ్ల కాలంలో వైకాపా నాయకుల పోకడలే నిదర్శనమని చంద్రబాబు అన్నారు. తుని ఘటన, మొన్న పాత గుంటూరు, నిన్న నాయీ బ్రాహ్మణుల అంశంలో కూడా గుర్తు తెలియని వారు నినాదాలు చేసి ఉద్రిక్తతలు పెంచారని ఆ సంఘ నేతలు తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఏమాత్రం అవకాశం దొరికినా ఏదో విధంగా విధ్వంసానికి పాల్పడేందుకు వారు చూస్తున్నారని తెలిపారు.

'జగన్ సొంత జిల్లా కడపకు అన్యాయం జరుగుతున్నా పట్టింపేలేదు.

ఉక్కు పరిశ్రమ ఇచ్చేది లేదని కేంద్రం అఫిడవిట్ వేసినా ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు' అని చంద్రబాబు విమర్శించారు. భాజపా, వైకాపా లాలూచీకి ఇదే నిదర్శనమన్నారు. వారి కుట్ర రాజకీయాలకు రాష్ట్రంలో అంతే లేకుండా పోతోందని, ఆఖరుకు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని కూడా వదిలి పెట్టలేదని వ్యాఖ్యానించారు. తాను కేంద్రంతో రాజీలేని పోరాటం చేస్తున్నానని, ముస్లింలు అందరూ తెదేపాకు ఏకపక్షంగా మద్దతిచ్చి 25 ఎంపీ సీట్లలో ఘనవిజయం సాధించేలా తోడ్పడాలని కోరారు.

అనుకరణలో ఆజానుబాహుడు

- ఏ గొంతు విన్నా.. వెంటనే అనుకరించడంలో నేరెళ్ల దిట్ట

ఈనాడు వరంగల్: ధ్వని అనుకరణ(మిమిక్రీ) కళలో వేణుమాధవ్‌ను మించిన కళాకారులు లేరు. ఎవరి గొంతు విన్నా క్షణాల్లో దాన్ని అనుకరించడం ఆయన ప్రత్యేకత. 'ఒకసారి అమెరికా ప్రదర్శనకు వెళ్లిన ఆయన..ఆ కార్యక్రమానికి వెళ్లేందుకు ట్యాక్సీలో ప్రయాణించారు. డ్రైవర్‌తో మాట కలిపారు. తిరుగు ప్రయాణంలో అచ్చం అతనిలాగే మాట్లాడి' ఆయన్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. ఇలా అనేక వేదికలపై మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాధాకృష్ణన్, సుభాష్ చంద్రబోస్, లాల్‌బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు, ఎన్టీఆర్ తదితర ప్రముఖుల గళాలను తన గొంతుతో పలికించే వారు. వీరందరికి ఆయన ఆప్తులే. ప్రముఖులను కలిసినప్పుడు వారి స్వరంతోనే మాట్లాడి వారిని ఆశ్చర్యచకితుల్ని చేసేవారు. పురుషులతో పాటు..మహిళల స్వరాలను పలికించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అలనాటి నటి భానుమతి మొదలుకుని..శ్రీదేవి వరకు అందరి స్వరాలనూ అనుకరించేవారు.

బహుభాషా కోవిదుడు

తండ్రిలాగే తెలుగుతోపాటు.. తమిళం, హిందీ, ఆంగ్ల భాషలు అనర్గళంగా మాట్లాడగల నేరెళ్ల..ఆయా ప్రాంతాలకు వెళ్లినపుడు అక్కడి భాషను యాసతోపాటు అచ్చుగుద్దినట్టు అనుకరించేవారు. కేవలం స్వరాలే కాదు.. ట్రంపెట్, ఫిడేలు మొదలైన వాయిద్య నాదాలనూ తన గొంతులో పలికించేవారు.

మిమిక్రీ కళను తరతరాలకు అందించాలని తన ఆత్మకథను 'మిమిక్రీ కళ' అనే పేరుతో పుస్తకంగా రాశారు. ఆయన కృషి ఫలితంగానే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 1997లో ఆ విభాగంలో డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టారు. "ధ్వని అనుకరణను శాస్త్రంగా, పాఠ్యాంశంగా, కళారూపక ప్రక్రియగా మలిచి 'మిమిక్రీ కళ' పేరిట వేణుమాధవ్ రచించిన పుస్తకాన్నే అక్కడ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. కోర్సును నడపడానికి తన వంతుగా వర్సిటీకి నిధినీ అందజేశారు. కొంత కాలం పాటు తానే అధ్యాపకునిగా పనిచేశారు.

ప్రముఖులంతా అభిమానులే..ఎన్టీఆర్‌తో ఆప్యాయత

రాష్ట్రపతులు, ఉపరాష్ట్ర పతులు, ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు ఎంతోమంది నేరెళ్ల ప్రదర్శనను చూసి ఆయనను అభిమానులయ్యారు. 'దివంగత ఎన్టీఆర్ తన పట్ల ఎంతో ఆప్యాయత చూపేవారని' ఆయన తరచూ చెప్పేవారు. ఎంత ఎదిగినా ఏనాడూ పుట్టిన గడ్డ ఓరుగల్లును వీడలేదు. ఇక్కడే పుట్టి.., ఇక్కడే తుదిశ్వాస విడిచారు. జ్ఞానపీఠ గ్రహీత దివంగత సినారెను 'అన్న' అంటూ ఆత్మీయంగా పిలిచేవారు.

లెక్కకు మిక్కిలి గుర్తింపులు

వేణుమాధవ్‌పై అనేక జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. 1972లో 'ది స్టేట్స్‌మెన్' పత్రిక నేరెళ్ల గురించి ప్రత్యేక కథనం ప్రచురించింది. గల్ఫ్‌న్యూస్, పది భాషల్లో ప్రచురితమైన అమెరికన్ రిపోర్టర్‌తోపాటు.. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పత్రికలు వ్యాసాలు రాశాయి. మంచి మనసున్న వారని ఎన్నో సందర్భాల్లోనూ రుజువైంది. భారత్-చైనా యుద్ధ సమయంలో నిధుల సేకరణ కోసం ఎన్టీఆర్, గుమ్మడి, కైకాల సత్యనారాయణతో కలిసి నాటకాలు వేశారు. కుమావో పర్వతశ్రేణుల వద్ద సైనికుల కోసమే ప్రదర్శన ఇచ్చి..దేశభక్తిని చాటుకున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, జగన్ సంతాపం

నేరెళ్ల వేణుమాధవ్ మృతి కళారంగానికి తీరని లోటని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నేరెళ్ల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'మిమిక్రీ కళను ప్రాచుర్యంలోకి తెచ్చిన మొదటి వ్యక్తి నేరెళ్ల. తన కళ ద్వారా కోట్లాది మంది తెలుగువారికి చేరువకావడంతో పాటు ఎంతోమంది మిమిక్రీ కళాకారులకు ఆదర్శంగా నిలిచారు' అని సీఎం ప్రశంసించారు. నేరెళ్ల మృతి తెలుగు జాతికి లోటని వైకాపా అధ్యక్షుడు జగన్ ఎర్కొన్నారు.

నీట్ మొదటి ర్యాంకర్‌కు సీఎం అభినందనలు

ఈనాడు డిజిటల్, అమరావతి: నీట్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు, జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు సాధించిన శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన అంకడాల అనిరుధ్‌బాబును ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. నీట్‌తోపాటు జిప్‌మర్‌లో మొదటి ర్యాంకు సాధించిన అనిరుధ్ మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. భవిష్యత్తులో రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఉన్నత చదువుల విషయంలో అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రి అచ్చెన్నాయుడు, అనిరుధ్ తల్లిదండ్రులు తేజేశ్వర్రావు, రమాదేవి, ఉత్తరాంధ్ర తెదేపా శిక్షణ శిబిరం డైరెక్టర్ కె.అప్పలనాయుడు ఉన్నారు.

వేతనాల పెంపుపై సీఎంకు కృతజ్ఞతలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: హోంగార్డ్స్ గౌరవ వేతనాన్ని రూ.400 నుంచి రూ.600కు పెంచడంపై ఏపీ హోంగార్డ్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తంచేసింది. మంగళవారం సీఎం నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసిన సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. హోంగార్డ్స్ ఎంపికలో వయస్సు పెంపుదల, ప్రావిడెంట్ ఫండ్, ర్యాంకుల వారీ గుర్తింపు కోసం విన్నవించారు. స్పందించిన సీఎం త్వరలో వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రిని కలసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.శేషాచార్యులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.వై.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.రామారావు, ఉపాధ్యక్షులు కె.దానం, ఎన్.రామకృష్ణ, కె.రవిబాబు తదితరులున్నారు. అంతకుముందు సంఘం నాయకులు హోంమంత్రి చినరాజప్ప, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, డీజీపీ మాలకొండయ్య, సంఘం గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పెప్సీ కో ఫౌండేషన్ రూ.29.12 కోట్ల భారీ విరాళం

వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థకు అందజేత

సత్యవేడు, న్యూస్‌టుడే: దేశంలో మంచి నీటి సమస్యతో తల్లడిల్లుతున్న వారి కష్టాలను తీర్చుతున్న వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థకు పెప్సీ కో పరిశ్రమ భారీ మొత్తంలో విరాళం ప్రకటించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. పెప్సికో యూనిట్లు ఉన్న తమిళనాడు, ఆంధ్ర, కేరళ రాష్ట్రాల పరిసర ప్రాంతాల్లోని ప్రజల తాగునీటి అవసరాలు 2020 నాటికి పూర్తి స్థాయిలో తీర్చాలనే ఉద్దేశంతో 4.26 మిలియన్ డాలర్ల (రూ.29,12,77,500) విరాళాన్ని ఆ సంస్థకు అందిస్తున్నట్లు వారు వెల్లడించారు. పెప్సీ కో ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, నీటి సంరక్షణ చర్యల కోసం 17 మిలియన్ డాలర్లను ఫౌండేషన్ ద్వారా కేటాయించినట్లు వివరించారు. వాటర్ ఎయిడ్ సంస్థ ప్రపంచంలోని 11 దేశాల్లో సేవలు అందిస్తుండగా.. భారతదేశంలోని 29 రాష్ట్రాల్లో వివిధ రకాల సేవా కార్యక్రమాలతో మారుమూల గ్రామాల్లో సేవలందిస్తున్నట్లు ఆ సంస్థ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ మాధవన్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం..

ఎన్నికల వేళ శాంతిభద్రతలకు పెద్దపీట: డీజీపీ మాలకొండయ్య

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా నేరాలు తగ్గుముఖం పట్టాయని, ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా శాంతిభద్రతలకు పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర డీజీపీ మాలకొండయ్య అన్నారు. కడప జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన డీఎస్పీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.. మౌలిక వసతుల కొరత ఉన్నా శాంతిభద్రతలకు ఇబ్బంది లేకుండా పోలీసుశాఖ పనిచేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, నిర్వహణ బాధ్యతలు ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించామని డీజీపీ అన్నారు. పార్థీ గ్యాంగ్ రాష్ట్రంలో లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్మగ్లర్ సాహుల్‌భాయ్‌ని భారత్‌కు తీసుకొచ్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

యురేనియంతో భూగర్భజలాల కలుషితంపై ఆరా

- తెలుగు రాష్ట్రాల్లో 8 ప్రాంతాల్లో ఈ సమస్య!

ఈనాడు, కాకినాడ: యురేనియంతో భూగర్భ జలాల కలుషితంపై రూర్కీలోని జాతీయ జలరాశి శాస్త్ర కేంద్రం (ఎన్ఐహెచ్) ఆరా తీస్తోంది. ఈ సంస్థ కాకినాడ ప్రాంతీయ కేంద్రం (రీజినల్ డెల్టాయిక్ సెంటర్) పరిధిలో ఎక్కడైనా ఇలాంటి పరిస్థితి ఉందా? అనే దానిపై సమాచారం కోరింది. దేశంలోని 16 రాష్ట్రాల్లో భూగర్భ జలాల్లో యురేనియం మోతాదు.. నిర్దేశిత పరిమితి దాటి ఉందని, ఈ నీరు తాగుతున్న ప్రజల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఇటీవల ఓ పరిశోధన నివేదిక వెల్లడి కావడంతో ఈ సంస్థ అప్రమత్తమైంది. గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో యురేనియం నిల్వలు భూగర్భ జలాల్లో ఎక్కడైనా కలుషితం అవుతున్న ఆనవాళ్లు ఉంటే తక్షణం వివరాలు పంపాలని కాకినాడ కేంద్రాన్ని ఆదేశించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 8 ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో యురేనియం కలిసేందుకు అవకాశం ఉన్నట్లు కాకినాడ కేంద్రం అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం, నల్గొండ, కడప జిల్లాల పరిధిలో కొన్ని చోట్ల ఈ పరిస్థితికి అవకాశం ఉందని ఓ అధికారి 'ఈనాడు' వద్ద అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే లోతుగా అధ్యయనం చేసిన తరువాతే నిర్ధరణకు రాగలమని, ప్రస్తుతం వివరాలు సేకరిస్తున్నామని వివరించారు. ఈ అంశంపై గోదావరి డెల్టా పరిధిలో గతంలో జరిగిన అధ్యయనాలను, రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ నివేదికలను కూడా వీరు పరిశీలించనున్నారు.

ప్రైవేటు పాలిటెక్నిక్ రుసుములు పెంపు

ఈనాడు, అమరావతి: ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ట్యూషన్ రుసుములను పెంచారు. ప్రైవేటు యాజమాన్యాలు ఇచ్చిన వినతి మేరకు పెంచారు. పెంచిన రుసుములకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. డిప్లొమా కోర్సులకు గతంలో రూ.15,500 ఉండగా ఈసారి దీన్ని రూ.25వేలు చేశారు. డీ ఫార్మసీకి రూ.17వేలు ఉండగా దీన్ని రూ.25వేలుకు పెంచారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో డీ ఫార్మసీ, ఇంజినీరింగ్‌లో డిప్లొమా కోర్సులకు గతంలో రూ.3,800 ఉండగా దీన్ని రూ.4,700కు పెంచారు. ట్యూషన్ రుసుముల పెంపునకు నియమించిన కమిటీ రూ.31వేలు వరకు పెంచాలని సిఫార్సు చేయగా ముఖ్యమంత్రి చంద్రబాబు దీన్ని రూ.25వేలుగా నిర్ణయించారు. కర్ణాటకలో రూ.32,110, గుజరాత్‌లో రూ.35వేలు, మహారాష్ట్రలో రూ.57,500 నుంచి రూ.64,500, తమిళనాడులో రూ.30వేలు, ఉత్తరప్రదేశ్‌లో రూ.30వేలు ఉన్నందున రూ.31వేలుకు పెంచాలని కమిటీ సిఫార్సు చేసింది.

10 సాగునీటి ప్రాజెక్టుల తనఖా

- కార్పొరేషన్‌కు బదలాయించేందుకు మంత్రిమండలి ఆమోదం
- రుణ సమీకరణకు చర్యలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రుణ సమీకరణకు వీలుగా దాదాపు 10 ప్రాజెక్టులను జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్‌కు బదలాయిస్తున్నారు. రాష్ట్ర మంత్రిమండలి మంగళవారం ఈ అంశాన్ని ఆమోదించింది. వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు సమీకరిస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్ ఈ ప్రాజెక్టులను ఆస్తులుగా ఆయా బ్యాంకులలో తనఖా పెట్టేందుకు అవకాశం ఉంది. పురుషోత్తపట్నం, చింతలపూడి, సోమశిల, హంద్రీనీవా, గాలేరునగరి, గుండ్లకమ్మ, వెలిగొండ తదితర ప్రాజెక్టులు ఈ జాబితాలో ఉన్నాయి. కేంద్రం సాయం అందిస్తున్న పోలవరం ప్రాజెక్టును మినహాయిస్తే రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టులకు రూ.30 వేల కోట్లకు పైగా నిధులు అవసరమని ఇప్పటికే అంచనా వేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటం, బడ్జెట్‌లో కేటాయింపులు అవసరమైనంత చేయలేని పరిస్థితుల్లో నిధుల సమీకరణకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా కార్పొరేషన్ ద్వారా వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతించింది. ఇందుకోసమే జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్‌ను మళ్లీ పట్టాలపైకి ఎక్కించారు. జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమారే దీనికి ఎండీగా వ్యవహరిస్తారు.

తక్కువ వడ్డీపై దృష్టి

ఇప్పటికే వివిధ బ్యాంకుల నుంచి ఈ కార్పొరేషన్ రూ.4000 కోట్ల రుణం తీసుకుంది. గతంలో కేవలం రుణ పరిమితి రూ.3000 కోట్ల వరకే ఉండేది. ఈ మధ్య కాలంలో ఈ పరిమితిని కూడా తొలగిస్తూ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కొటేషన్ ప్రాతిపదికన వివిధ బ్యాంకుల నుంచి ఎంత తక్కువ వడ్డీకి నిధులు వస్తాయో దృష్టి సారించి ఆ మేరకు రుణం పొందుతున్నారు. ఇప్పటికే మరో రూ.1000 కోట్లు రుణం పొందేందుకు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇందుకు సముఖంగా ఉందని ఖరారు చేశారు. ఆ రుణం తీసుకునే అంశం పెండింగులో పడింది. రుణ సమీకరణకు కొంత ఆర్థికశాఖ నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు తెలిసింది.

ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- దంత వైద్య విద్యకు కూడా..
- జులై మొదటి వారంలో ప్రతిభావంతుల జాబితా

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్/దంత వైద్య విద్యలో ప్రవేశాల కోసం ఈ నెల 20 నుంచి ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు వర్సిటీ ఉపకులపతి డాక్టర్ సీవీరావు తెలిపారు. కేంద్రం నుంచి వచ్చిన జాబితా అనుసరించి రాష్ట్ర విద్యార్థులకు నీట్ ద్వారా వచ్చిన మార్కుల జాబితాను వర్సిటీ ఇప్పటికే ప్రకటించింది. దీనిని అనుసరించి విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసింది. చివరి తేదీ అనంతరం వచ్చిన దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ నుంచి పరిశీలించనున్నారు. అనంతరం జులై మొదటి వారంలో ప్రతిభావంతుల జాబితాను ప్రకటిస్తుంది. ఆపై విద్యార్థుల నుంచి ఆప్షన్లను స్వీకరించి సీట్లను కేటాయించనుంది. వీటి నిర్వహణ తేదీలను తరువాత ప్రకటిస్తామని విశ్వవిద్యాలయం తెలిపింది.

విద్యార్థులకు గందరగోళం

ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 15% సీట్ల(283)ను జాతీయ కూటమి(నేషనల్ పూల్) ద్వారా భర్తీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే..ఈ కళాశాలల జాబితాలోకి ఒంగోలు, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలు, దంత వైద్య కళాశాలకు స్థానం లభించలేదు. సాంకేతిక సమస్య, కేంద్ర నిర్వాకంతో ఈ కళాశాలల సీట్ల వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించలేదు. ఈ సీట్లను మలివిడత కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఇదే సమయంలో నీట్ ర్యాంకులతో రాష్ట్ర స్థాయిలో తొలివిడత ప్రవేశాల కౌన్సెలింగ్ జరగబోతుంది. దీనివల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. జాతీయ కూటమి ద్వారా సీటు వస్తే పొరుగు రాష్ట్రాల్లో యూజీ విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో రాష్ట్ర స్థాయి సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరగబోతుండడంతో ఆప్షన్ల నమోదులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై విద్యార్థులు తికమకకు గురవుతున్నారు. జాతీయ కూటమిలో తొలివిడత కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు జరిగినట్లయితే. ..విద్యార్థులు సరైన నిర్ణయానికి వచ్చే అవకాశం ఉండేది.

www.manavrachna.edu.in

MANAV RACHNA EDUCATIONAL INSTITUTIONS

NAAC ACCREDITED 'A' GRADE UNIVERSITY & PROFESSIONAL INSTITUTIONS

JOURNEY TO EXCELLENCE

WALK-IN COUNSELING FOR VARIOUS UG PROGRAMMES

LIMITED SEATS- APPLY BEFORE IT'S TOO LATE!

Across the journey of last 21 years, Manav Rachna Educational Institutions are standing tall as a visible symbol of knowledge & experience and provides high quality education in various fields. The institutions comprise 15 entities, a deemed university, a state university, dental college and K-12 schools. Institutions at MREI- be it Manav Rachna University (MRU), Manav Rachna Dental College (MRDC) or Manav Rachna International Institute of Research & Studies (MRIIRS) - have the coveted NAAC 'A' grade status, catapulting MREI to the big leagues of higher education.

THE MANAV RACHNA PANORAMA

50+ global academic collaborations. | 386 filed/ granted patents. | 25,000+ Alumni Base. | 500+ reputed MNCs & Indian corporate patronising us.

18 are the countries from which MREI students arrive. | 4000+ research papers in International/ National Journals & Conferences. | 70+ Innovation & Incubation Entrepreneurial Ventures by Manav Rachna Alumni.

Candidates seeking admission in any of the programs offered by MRIIRS & MRU may submit their online application or can report for Physical Counseling.

PROGRAMS:
Engineering | Management | Psychology | Economics | Business Studies | Commerce | Physiotherapy | Nutrition & Dietetics | Computer Applications | Humanities | Media | Hospitality & Hotel Administration | Architecture | Education | Visual Arts | Law | Applied Sciences | Interior Design | Liberal Arts | Data Science | Counseling | Social Work

KEY HIGHLIGHTS:
- MRIIRS Ranked among the Top Educational Institutions of the country in the prestigious 'India Rankings 2018' by NIRF, MHRD, GoI across three categories: Top Universities, Top Engineering & Top Management Institutions.
- Manav Rachna University bestowed with QS I-Gauge Gold rating. Modeled after QS Stars International, QS I-Gauge provides a unique 360 degree perspective to Indian Institutions.
- Industry-Integrated Programs with Xebia, IBM, KPMG, JBM, Su-Kam, Fortis Hospitals, Cygnus Hospitals, BSE, ICICI-Direct, Algonquin College, Canada; AIS, New Zealand and also having a SAP Student Academy.

SCHOLARSHIP OFFERED TO MERITORIOUS STUDENTS

Last Date to Apply for B.Tech (Lateral) & PG Programmes: 27 June, 2018
For Eligibility Criteria, Admission Calendar & more details, visit: www.manavrachna.edu.in

Approved by AICTE, Ministry of HRD, GoI | Council of Architecture (CoA) | BCI | NCTE.

MREI Campus: Sector-43, Delhi-Surajkund Road, Faridabad, E-mail: admissions@manavrachna.edu.in Ph: 0129-4198100/4198600

FOR ENQUIRIES CONTACT 0129-4259000

City Office: Flat No: 101, Sahara Apartments, SR Nagar, Hyderabad. Ph.: 8179283201, 9910244484 Vijayawada- 9515797567, Guntur- 9160503936, Ongole- 9885155707, Nellore- 7989010987

ఈనాడు

చెదిరిన కశ్మీర్ కల

జమ్మూకశ్మీరులో భాజపా నిశ్శబ్దంగా సృష్టించిన పెను రాజకీయ భూకంపం మెహబూబా ముఫ్తీ ప్రభుత్వాన్ని ఒక్కపెట్టున కూల్చేసింది. పాతిక మంది సభ్యులతో పాలక సంకీర్ణ భాగస్వామిగా మెహబూబా సర్కారుకు ప్రాణవాయువులు అందిస్తున్న కమలం పార్టీ ఉన్నట్లుండి మద్దతు ఉపసంహరించడంతో కీలక సరిహద్దు రాష్ట్రం మరోమారు రాష్ట్రపతి పాలనలోకి జారిపోనుంది. ఉత్తర దక్షిణ ధ్రువాల మేలుకలయికగా భాజపాతో భాగస్వామ్యాన్ని పీడీపీ పెద్దాయన ముఫ్తీ మహమ్మద్ సయీద్ తొలినాళ్లలో ఆకాశానికెత్తేసినా, సైద్ధాంతిక సారూప్యత మచ్చుకైనా లేని వాటి సహవాసం మూడేళ్లుగా నీళ్లూ నూనె కలిసినట్లుగానే అఘోరించింది. అర్ధాంతరంగా ప్రభుత్వం పుట్టిమునగడం తథ్యం అనుకొన్నాంగాని, అది ఇప్పటికిప్పుడు కావడమే ఆశ్చర్యకరమని ఒమర్ అబ్దుల్లా అంటున్నారు. పవిత్ర రంజాన్ మాసంలో సైనిక దళాల పక్షాన పాక్షిక కాల్పుల విరమణ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, గడువు ముగిసిందంటూ దాన్ని తొలగించిన మరునాడే ఇంత తీవ్ర నిర్ణయం వెలువడుతుందని ఎవ్వరూ ఊహించలేదు. 'ఉగ్రవాదం, హింస నేడు కశ్మీరులో పెచ్చరిల్లాయి... విప్లవాత్మక ధోరణులు ప్రబలమవుతున్నాయి... పౌరుల ప్రాథమిక హక్కులే ప్రమాదంలో పడుతున్నా'యంటూ పాలక సంకీర్ణం నుంచి భాజపా వైదొలగింది. కశ్మీరులో శాంతిస్థాపన, మూడు పరగణాల్లోనూ శీఘ్రగత ప్రగతే ప్రధాన లక్ష్యాలుగా పాలనపగ్గాలు చేపట్టినా, అవి నెరవేరకపోగా జమ్మూ లద్దాఖ్ ప్రాంతీయులు ఓ విధమైన విచక్షణకు గురవుతున్నారంటూ- ఆ పాపమంతా పీడీపీదేననీ భాజపా ఘాటు విమర్శలు రువ్వింది. మూడేళ్లకు పైబడిన పీడీపీ- భాజపా సంకీర్ణ ఏలుబడి కశ్మీర్ పరిస్థితిని పెనం మీద నుంచి పొయ్యిలోకి దిగజార్చిందన్నది నిజం. అందులో తమ తప్పేమీ లేదని కమలనాథులు తప్పించుకోజాలరన్నదీ నిష్ఠుర సత్యం. జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా ఈ వారంలోనే పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకోనున్న ఎన్ఎన్ వోరా సంక్షుభిత రాష్ట్రాన్ని ఎంత త్వరగా తేటపరచి ఎన్నికలకు సన్నద్ధం చెయ్యగలరో చూడాలి!

కశ్మీరులో ఆందోళనల్ని అదుపు చెయ్యడానికి తగు కార్యాచరణ వ్యూహం ఖరారుకు ఏర్పాటైన అఖిలపక్ష భేటీ- రంజాన్, అమర్‌నాథ్ యాత్రల సందర్భంగా భద్రతా బలగాల చేత కాల్పుల విరమణ పాటింప చేయాలంటూ కేంద్రానికి గత నెలలో విజ్ఞప్తి చేసింది. దాన్ని మన్నించిన కేంద్రం, తద్వారా శాంతియుత వాతావరణం నెలకొని భిన్నవర్గాలతో చర్చలకు మేలుబాటలు పడతాయని ఆశించింది. అదను చూసి కాటేయడంలో ఆరితేరిన సీమాంతర ఉగ్రవాదుల బుసరుసలు ఏ మాత్రం ఆగలేదు సరికదా, వేర్పాటువాదుల సంయుక్త ప్రకటన కేంద్రసర్కారు ఆశలపై నీళ్లు గుమ్మరించింది. 'కశ్మీర్ వివాద పరిష్కారంలో భారత్, పాకిస్థాన్, స్థానిక జనావళి భాగస్వాములు కావాలి... శాంతియుత పంథాలో అర్థవంతమైన చర్చలతోనే సంఘర్షణను పరిష్కరించగలిగేది... ఏ ఒక్కరు చర్చల్లో పాల్గొనకున్నా పరిష్కారం దుర్లభమవుతుంది' అన్న వేర్పాటుశక్తుల పెడసరం- పాకిస్థాన్ కపట నాటక విన్యాసాన్నే కళ్లకు కట్టింది. అమర్‌నాథ్ యాత్ర పూర్తి అయ్యేదాకా కాల్పుల విరమణ సాగించకపోవడం అధికార పీడీపీ గుస్సాకు కారణం అవుతున్నా, యాత్ర భగ్నానికి ఉగ్రవాద మిన్నాగులు మాటేసి ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో కేంద్రం కచ్చితంగా వ్యవహరించింది. ప్రభుత్వానికి భాజపా మద్దతు ఉపసంహరణలో మాత్రం పీడీపీతో నానాటికీ ముదురుతున్న రాజకీయ వైరుధ్యాలే పుణ్యం కట్టుకొన్నాయి. లోయలో అతివాద ముస్లిములకు బలమైన ప్రతినిధిగా ఎదిగివచ్చిన పీడీపీ, జమ్మూలో హిందూ జాతీయవాదానికి గొడుగుపడుతున్న భాజపాల మధ్య- కథువా మైనర్ బాలిక దారుణ హత్యాచారం నుంచి, సైనిక బలగాలపై ఎఫ్ఐఆర్ నమోదు దాకా రాజకీయ స్పర్ధలెన్నో రాజుకొన్నాయి. అంతిమంగా అవే ప్రభుత్వాన్ని దహించేశాయి!

మత ప్రాతిపదికన ఓట్లు నిలువునా చీలిపోయిన 2014 నాటి ఎన్నికల్లో- 97 శాతం ముస్లిములున్న కశ్మీరులో పీడీపీ 25 సీట్లతోపాటు జమ్మూలో మరో మూడు గెలుచుకోగా, 65 శాతం హిందూ మెజారిటీ గల జమ్మూలో భాజపా పాతిక స్థానాల్లో విజయం సాధించింది. 15 సీట్లతో నేషనల్ కాన్ఫరెన్స్, డజను స్థానాలతో కాంగ్రెస్ వాటి వెన్నంటి నిలవడంతో ఆవిర్భవించిన త్రిశంకు సభ రాష్ట్రాన్ని తీవ్ర రాజకీయ అనిశ్చితిలోకి నెట్టేసింది. స్వయంపాలనను పలవరించే పీడీపీ, ప్రత్యేక ప్రతిపత్తి రద్దు కావాల్సిందేననే భాజపాలు- 'జమ్మూకశ్మీరు (సమస్యల)కు జాతీయ పరిష్కారం కోరే దిశగా రూపొందిన అజెండానే సంకీర్ణ సర్కారు స్థాపనలో ఉభయ పక్షాలకూ ఉమ్మడి ప్రాతిపదిక'గా స్వీకరించాయి. భూతాల స్వర్గంగా అభాసు పాలవుతున్న సరిహద్దు రాష్ట్రానికి సవ్యదశ దిశ చూపిస్తామంటూ రాసుకొన్న సంకీర్ణ అజెండా లక్ష్యాలు- ఏ మేరకు అమలయ్యాయంటే, నిర్వేదమే సమాధానం. 2016నాటి ఎదురుకాల్పుల్లో ఉగ్రవాది బుర్హాన్ వానీ కడతేరిపోయాక రాళ్ల దాడులతో విరుచుకుపడుతున్న యువజనం- విధాన నిర్ణేతలకు భద్రతా బలగాలకు పెనుసవాలుగా మారిందన్నది నిస్సందేహం! పాకిస్థాన్ నుంచి అడ్డదారిన నిధులు అందుకొంటూ కశ్మీర్ ఆందోళనలకు ఆజ్యం పోస్తున్న హురియత్ నేతల ముసుగులు తొలగించిన కేంద్రం, సైన్యానికి ఇతోధిక స్వేచ్ఛ ఇచ్చి ఉగ్రవాదుల పీచమణచగలుగుతున్నా- ఉబికి వస్తున్న యువజనం ఆగ్రహావేశాల్ని ఎలా నియంత్రించదలచిందో చూడాలి. సమితి మానవ హక్కుల నివేదికంతా తప్పుల తడక అని విశ్వవేదికపై కుండ బద్దలుకొట్టిన మోదీ సర్కారుకు- సరిహద్దు రాష్ట్రంలో సత్వర శాంతిస్థాపనే పెద్ద సవాలు కానుంది!

పాతాళగర్భ జలం



ప్రపంచ జనాభాలో 15 శాతం భారత్‌లో నివసిస్తుండగా, వారు ఈ పృథ్విలోని మొత్తం భూగర్భ జలాల్లో నాలుగు శాతం వాటాతోనే సరిపెట్టుకోవలసి వస్తోంది. భారత్‌లో 35 శాతం పంట భూమికి మాత్రమే సాగునీటి వసతి ఉన్నందున మిగిలిన 65 శాతం పొలాలకు భూగర్భ జలాలే గతి. ఈ జలాలను పొదుపుగా సమర్థంగా వినియోగించుకోవడానికి మన ప్రభుత్వాలు చేసిందేమీ లేదు. దేశంలోని నదులు వాగులు వంకల మీద మొత్తం 4,525 చిన్నాపెద్దా ఆనకట్టలు నిర్మించినా మన ప్రజలకు తలసరి నీటి నిల్వ సామర్థ్యం 213 ఘనపు మీటర్లు మాత్రమే. అదే రష్యాలో 6,103, ఆస్ట్రేలియాలో 4,733, అమెరికాలో 1,964, చైనాలో 1,111 ఘనపు మీటర్ల తలసరి నిల్వ సామర్థ్యం ఏర్పడింది. ఉన్న నీటిని సమర్థంగా వాడుకోలేకపోవడంతో రైతులు అదే పనిగా భూగర్భ జలాలను తోడేయకతప్పడం లేదు. పలు రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ సౌకర్యం ఉండటంతో భారతీయ రైతులు ఏటా అమెరికా, చైనాలు తోడుతున్న భూగర్భ జలాలకన్నా ఎంతో ఎక్కువ నీటిని తవ్వితీస్తున్నారు. ఏటా వర్షాల వల్ల భూగర్భంలోకి ఇంకుతున్న నీటి కన్నా ఎక్కువ నీటిని తోడేయడం నిర్లక్ష్యానికి ప్రతీక. తాగు, సాగు నీటి అవసరాలకు భూగర్భ జలాలపైనే అత్యధికంగా ఆధారపడుతున్నాం. ప్రాజెక్టు కాల్వల ద్వారా వచ్చే నీటిని పొలాలకు ఎప్పుడు ఎంతమేర వాడాలనేదానిపై రైతుకు అదుపు ఉండదు. అదే పంపుల ద్వారా తోడే భూగర్భ నీటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎంత కావాలంటే అంత వాడుకునే సౌకర్యం అతడికి ఉంటుంది. అందువల్ల భూగర్భ నీటితో పంట ఉత్పాదకత కాల్వల నీటికన్నా రెండింతలు ఎక్కువ ఉంటుంది. ఈ సౌలభ్యంవల్ల గడచిన మూడు దశాబ్దాల్లో సాగు భూముల విస్తరణ భూగర్భ జల ఆధారంగానే జరిగింది. భూగర్భ జలాల వినియోగంపై ప్రభుత్వానికి ఎలాంటి అదుపూ లేదు. అంతా రైతుల అవసరాల ప్రకారం జరుగుతోంది. దేశంలో నికర సాగు భూమి నాలుగు రెట్లు పెరగ్గా అందుకు ప్రధాన కారణం భూగర్భ నీరే. ఏటా 6.3 కోట్ల ఎకరాల పంట భూమికి నీరు అందించడానికి భారతీయ రైతులు 250 ఘనపు కిలోమీటర్ల భూగర్భ జలాలను తోడేస్తున్నారు. ఇది అమెరికా, చైనాలలో తోడుతున్నదానికన్నా చాలా ఎక్కువ. 2013-14లో దేశమంతటా 2.05 కోట్ల బావులు, గొట్టపు బావులు ఉన్నాయని 5వ చిన్న నీటిపారుదల సర్వే లెక్కగట్టింది. ఆరో సర్వే ఫలితాలు 2020లో వెలువడనున్నాయి. ప్రస్తుతం ప్రతి ఏడు కమతాలకు ఒక బావి చొప్పున ఉంది. అదేపనిగా భూగర్భ జలాలు తోడేయడం ఉత్తరోత్రా ఆహార భద్రతను దెబ్బతీస్తుంది. నేల కుంగుబాటుకూ దారితీస్తుంది. భూతాపంవల్ల ప్రపంచవ్యాప్తంగా సముద్రమట్టం పెరుగుతూ తీర నగరాలకు ముప్పు తెస్తోంది. నేల కుంగితే తరచుగా వరదలు వచ్చిపడతాయి. ప్రపంచంలో కొన్నిచోట్ల సముద్ర నీటిమట్టం పెరుగుతున్నదానికన్నా 10 రెట్లు వేగంగా నేల కుంగిపోతోంది. జపాన్ రాజధాని టోక్యోలో నేల రెండు మీటర్లు కుంగిపోవడంతో అక్కడ భూగర్భ జల తవ్వకాన్ని నిషేధించారు.

ప్రమాదకర స్థాయిలో పతనం

అతిగా భూగర్భ జలాన్ని వినియోగించడం వల్ల దేశంలోని 712 జిల్లాలకు 430 జిల్లాల్లో భూగర్భ నీటికి కటకట ఏర్పడింది. మొత్తం 60 శాతం జిల్లాల్లో భూగర్భ జలం విషపూరిత రసాయనాలతో కలుషితమైంది. కొత్త నీటిపారుదల ప్రాజెక్టుల కట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్ల గత నాలుగు దశాబ్దాల్లో అదనపు సాగుభూమి విస్తరణకు భూగర్భ జలాలు దన్నుగా నిలిచాయి. 1970లు, 1990లలో భారతీయ రైతులు ఏడాదికి అయిదు లక్షల బావులు, గొట్టపు బావులు తవ్వేవారు. ఇప్పుడు ఏడాదికి లక్ష బావులే తవ్వుతున్నా అవన్నీ 70 మీటర్లకన్నా మరింత లోతుకు వెళ్లి నీరు తవ్వేస్తున్నారు. ప్రస్తుతం సాగుకు వినియోగిస్తున్న నీటిలో మూడింట రెండొంతులు భూగర్భ జలాలే. 80 శాతం తాగునీటికీ అవే శరణ్యం. నీటి కోసం భూమి లోతుకు వెళ్లినకొద్దీ ఆర్సెనిక్ వంటి కాలకూట విషాల పరిమాణం పెరిగిపోతుంది. ఇది జనారోగ్యాలకు చేటు తెస్తుంది. భారతదేశ గ్రామాల్లో 90 శాతం గృహావసరాలు భూగర్భజలం వల్ల తీరుతున్నాయి. పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇతర దక్షిణ రాష్ట్రాల్లో ఈ పరిస్థితి తీవ్రత చాలా హెచ్చు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోవడం వల్ల సేద్యం మహా ఖరీదైన వ్యవహారంగా మారుతుంది. దాంతో రైతులకు సేద్యం మరింత భారం అవుతుంది. నీటిని మరింత సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చు కాని, నీటి



అతి వినియోగంతో అనర్థం

ఎద్దడి ఉన్న ప్రాంతాల్లోనూ రైతుల్లో ఆ స్పృహ కనిపించడం లేదు. బిందు, తుంపర్ల సేద్యంవల్ల నీటిని పొదుపుగా వాడి ఎక్కువ ఉత్పాదకత సాధించవచ్చు. ఈ తరహా సేద్యాన్ని ప్రోత్సహించడానికి 40 ఏళ్లుగా కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా 2013-14లో దేశంలోని 2.10 కోట్ల సాగునీటి బావుల్లో కేవలం 13 లక్షల బావులను బిందు, తుంపర సేద్యంతో అనుసంధానించారు. భూగర్భ జలాలతో సాగవుతున్న 6.32 కోట్ల హెక్టార్ల భూమిలో 45 లక్షల హెక్టార్లలో మాత్రమే బిందు, తుంపర్లతో సూక్ష్మ సేద్యం చేస్తున్నారు. ఈ తరహా సేద్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వమిచ్చిన సబ్సిడీలు పాతాళ గంగ



పాలైనట్లే కదా! నీటిని పొదుపుగా వాడటం కోసం సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక, సాంకేతిక, సంస్థాగత మద్దతు అందిస్తున్నాయి. సూక్ష్మ సేద్య పద్ధతుల ద్వారా రైతుల ఆదాయాలను పెంచి, పేదరికాన్ని తగ్గించి, ఆహార భద్రత సాధించాలన్నది ప్రభుత్వ ధ్యేయం. స్వచ్ఛంద సంస్థలూ ఈ తరహా సేద్యాన్ని ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నాయి. అయినా కూడా దేశంలో ఇప్పటికీ సూక్ష్మ సేద్యం చాలా పరిమితమే.

నీటి సంరక్షణ, సమర్థ నిర్వహణార్థం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన పథకాన్ని చేపట్టింది. ప్రతి పొలానికి నీటిని అందించడం ఆ నీటిని పొదుపుగా వాడి ఉత్పాదకత పెంచడం ఈ పథక లక్ష్యం. నీటి సరఫరా ఏర్పాట్లు చేయడం, నీటి పంపిణీ, నీటి సమర్థ నిర్వహణ, సాగుకు అన్వయం, వ్యవసాయ విస్తరణ సేవల ద్వారా ప్రతి నీటి బొట్టుకు ఎక్కువ పంట సాధించాలని ఈ పథకం ఉద్దేశిస్తోంది. దీన్ని అయిదేళ్లలో రూ.50 వేల కోట్లతో అమలు చేయాలని కేంద్ర సంకల్పం. కానీ, ఎంత డబ్బు ఖర్చు చేసినా ఉత్తమ సేద్య రీతులపై రైతులకు అవగాహన ఏర్పడనంతవరకు అదంతా వృథా అవుతుంది.

రైతుల ఆదాయం పెరగాలన్నా, భూతాపం వల్ల ఏర్పడే ప్రతికూల వాతావరణాన్ని వారు తట్టుకొని నిలబడాలన్నా నీటి వాడకాన్ని మెరుగుపరచుకోవాల్సిందే. ఈ విషయంలో ఇజ్రాయెలీ సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పరిజ్ఞానాన్ని స్థానిక పరిస్థితులకు అన్వయించుకొని హెచ్చు ఉత్పాదకత సాధించాలి. నీటి వినియోగం చాలా అధికంగా ఉండే చెరకు, వరి పంటలను నీటిఎద్దడి ప్రాంతాల్లో వేయకూడదు. అలాంటిచోట్ల దీనివల్ల కరవు ఏర్పడుతుంది. ఈ వాస్తవాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. 1970-71లో మహారాష్ట్రలో 1,67,000 హెక్టార్లలో చెరకు పండించగా, అది 2011-12కల్లా 10,22,000 హెక్టార్లకు పెరిగింది. వర్షాభావం ఎక్కువగా ఉండే మహారాష్ట్ర నీటిని తాగేసే చెరకు పంట వేస్తుండటం దూరదృష్టి లేమిని సూచిస్తోంది. మరాఠ్వాడాలో కేవలం నాలుగు శాతం సాగుభూమిలో చెరకు వేస్తున్నా, అక్కడ 70 శాతం సాగు నీటిని ఈ ఒక్క పంట కోసమే వినియోగిస్తున్నారు. ఇలాంటి పంటలను కాకుండా వర్షాభావాన్ని తట్టుకునే పంటలను, సమర్థ సేద్య విధానాలను ప్రోత్సహించాలి. ఇజ్రాయెల్ వంటి దేశాల నుంచి ఆధునిక సాగు పద్ధతులను నేర్చుకోవాలి. అడ్డూఆపూ లేకుండా ఇసుకను తవ్వేస్తుండటం మరో సమస్య. దీనివల్ల భూగర్భ జలాల పునఃపూరణ సాధ్యపడటం లేదు. ఇసుక మాఫియా ఆగడాలను ప్రభుత్వాలు ఉక్కుపాదంతో అణచివేయాలి. పట్టణాలు నగరాల్లో నీటి శుద్ధి, పునర్వినియోగాలను తప్పనిసరి చేయాలి. పునర్వినియోగార్హంగా మార్చిన నీటిని పరిశ్రమలు అధికంగా ఉపయోగించాలి. నదులు, చెరువులు, కుంటల పునరుజ్జీవం, భూగర్భ జలాలు కలుషితం కాకుండా నివారించడం, అవి హరించుకుపోకుండా జాగ్రత్తపడటం ఎంతో అవసరం. తుపాను నీటి డ్రెయిన్ల కబ్జాలను తొలగించాలి. భవనాల్లో వాననీటి సంరక్షణ ఏర్పాట్లను తప్పనిసరి చేయాలి. శుద్ధి చేసిన మురుగు నీటి పునర్వినియోగానికి చట్టపరంగా స్వల్ప దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలి. పారిశ్రామిక కాలుష్యాలు నదులు, చెరువుల్లో కలవకుండా కఠిన నియంత్రణలు అమలుచేయాలి. జలాశయాలను ఈ విధంగా సంరక్షించుకుంటే గృహ, సేద్య అవసరాలకు తగినంత నీరు లభిస్తుంది. చిత్తడి నేలలను సంరక్షించుకుంటే జల లభ్యత మెరుగుపడుతుంది.

ఒడిసి పట్టే తీరిది...

వర్షాలవల్ల భూగర్భంలోకి చేరుతున్న నీటికన్నా ఎక్కువ నీటిని తోడేస్తున్నాం. అసలు వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలమట్టాన్ని పెంచేవరకు ఆగడం లేదు కూడా. ఈ పరిస్థితిలో కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలు భూగర్భ జలవినియోగంపై నిఘా వేయడానికి చట్టాలు చేశాయి. చట్టబద్ధ నియంత్రణ సంస్థను ఏర్పరచాయి. నీటిఎద్దడి ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా బోరు బావులు తవ్వడం నేరమని కొన్ని రాష్ట్రాలు ప్రకటించాయి. అందుకు చట్టాలు చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ 2022కల్లా రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీలు నెరవేరాలంటే మొదట బుడిబుడి అడుగులు వేయాలి. వాన నీటి సంరక్షణతో ఏడాది పొడవునా నీరు లభిస్తుంది. చెక్‌డ్యామ్‌లు నీటి లభ్యతను పెంచుతాయి. రైతులు బిందు, తుంపర సేద్యాన్ని చిత్తశుద్ధితో చేపట్టాలి. భూమి లోపల నీటి బుగ్గలను జల బ్యాంకులుగా మార్చి అత్యవసర పరిస్థితుల్లోనే వాడాలని విఖ్యాత శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ ఇచ్చిన సలహా పాటించాలి. 2050కల్లా భారతదేశ జనాభా 170 కోట్లకు చేరనుంది. మధ్యతరగతి భారతం కోరుతున్న పౌష్టికాహార సరఫరా, నీటి వాడకం మరిన్ని రెట్లు పెరగనుంది. ఎన్నికల వేళ రైతులకు ఎడాపెడా వాగ్దానాలు చేసే ముందు రాజకీయ నాయకులు ప్రకృతి సమతౌల్య అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. భూగర్భ జల వినియోగ నియంత్రణకు కేంద్రస్థాయిలో నాలుగు సంస్థలున్నా, భూగర్భ జల లభ్యతపై పక్కా సమాచారం లేదు. భారతదేశంలో సగం ఉపాధి అవకాశాలు సేద్యంలోనే లభిస్తున్నాయి. వాటిని కాపాడుకోవాలంటే నీటిని పొదుపుగా సమర్థంగా వినియోగించడం విధాయకం!

– నీరజ్ కుమార్

ధ్వన్యనుకరణకు తానే ప్రామాణికం

'ఈ గోళమంతా మీ గళంలో ఉంది. మీరు ఉపాధ్యాయులు అయినందుకు యావత్ భారతం గర్విస్తోంది' డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన ఈ వ్యాఖ్య కళాప్రపూర్ణ, పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ విలక్షణతకు అద్దం పడుతుంది. మనకున్న 64 కళల్లో స్వరవంచన సైతం ఒకటి. ధ్వన్యనుకరణ కూడా ఒక కళేనా అన్నవాళ్లకు డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ సిసలైన సమాధానంగా నిలిచారు. 1932లో జన్మించి, పదహారేళ్లప్రాయం నుంచి కోట్లాది మందిని మంత్రముగ్ధుల్ని చేసిన ఆ గొంతు మూగబోయింది అన్న మాట జీర్ణించుకోలేనిది. తెలుగు మహాసభల సందర్భంగా హైదరాబాద్‌లో 1975లో మొట్టమొదటిసారిగా నేరెళ్లవారిని కలుసుకునే అవకాశం నాకు లభించింది. స్టేజీమీద 'మెకనస్ గోల్డ్' అనే ఆంగ్ల చిత్రంలోని ఓ సన్నివేశాన్ని అనుకరిస్తున్నారాయన. వారి వద్దకు వెళ్లి గుర్రపు డెక్కల శబ్దం అనుకరిస్తానని, అవకాశం ఇవ్వాలని ఆయనకు విన్నవించుకున్నాను. అంతే ఆయన నన్ను అమాంతం వేదికమీదకు తీసుకువెళ్ళి, చేతికి ఒక మైకు అందించారు. వారితోపాటుగా ఆ సన్నివేశంలో శబ్దాలను అనుకరించే అరుదైన అవకాశం కల్పించారు. మిమిక్రీ కళాకారుడి ప్రాంతం, వయసుతో నిమిత్తం లేకుండా విశాల హృదయంతో ప్రతిభను ప్రోత్సహించిన సమున్నత వ్యక్తిత్వం ఆయన సొంతం అనడానికి ఈ దృష్టాంతం దర్పణం పడుతోంది.

కళారూప దిగ్గజం

ఆయన గురుకులంలో పరిణతి చెందిన కళాకారులంతా ప్రపంచవ్యాప్తంగా విభిన్న వేదికలపై తమ ప్రతిభను నిరూపించుకుంటూ పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తున్నారంటే అది నేరెళ్ల ఆశీర్వాద బలమే! ధ్వన్యనుకరణ కళను పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక అధ్యయన విభాగంగా ప్రవేశపెట్టడంతోపాటు- తొలినాళ్లలో స్వయంగా అధ్యాపకుడిగా సేవలందించి మిమిక్రీ కళ పెద్దయెత్తున విస్తరించడానికి ఆయన చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఆ మహానుభావుడితోపాటు సహ ఉపాధ్యాయుడిగా పనిచేసే అదృష్టం నాకు లభించింది. ఐక్యరాజ్య సమితిలో ధ్వన్యనుకరణ కళను ప్రదర్శించే అరుదైన అవకాశం దక్కించుకొన్న మొట్టమొదటి వ్యక్తి నేరెళ్ల కావడం తెలుగువారికి గర్వకారణం. సహనం, ఎదుటివారిలోని కళా సృజనాత్మకతను గుర్తించి గౌరవించడం; సమయపాలన, ఎవరినీ పల్లెత్తు మాట అనని సమున్నత వ్యక్తిత్వం, కార్యక్రమాన్ని నిర్దిష్ట కాలావధుల మధ్య ముగించగల నేర్పరితనం వంటివి ఆయన దగ్గర నుంచి శిష్యకోటి అందిపుచ్చుకోగల అత్యుత్తమ లక్షణాలు. ఆయన జన్మించిన డిసెంబరు 28ని ప్రపంచ ధ్వన్యనుకరణ దినోత్సవంగా నిర్వహించడం తెలుగుదనానికి దక్కిన అపురూప గౌరవం!

నేరెళ్ల వేణుమాధవ్
1932-2018

నటన, ధ్వన్యనుకరణలపట్ల బాల్యంనుంచే ప్రత్యేక శ్రద్ధాసక్తులు కనబరచిన నేరెళ్లవారు- కాలం గడుస్తున్నకొద్దీ నిరంతర సాధనతో ప్రతిభకు సానపట్టారు. నిర్విరామ అధ్యయనం, పరిశోధనలకు కట్టుబడి మిమిక్రీ కళలోని కొత్త సంగతులను ఎప్పటికప్పుడు ఔపోసన పడుతూ శిఖరాగ్రాలను అందుకోగలిగారాయన. ఒథెల్లో, టెన్ కమాండ్‌మెంట్స్ వంటి ప్రసిద్ధ ఆంగ్ల చిత్రాల్లోని సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా, శ్రవణపేయంగా అనుకరించిన తీరు ఆయనకు ప్రపంచవ్యాప్త గుర్తింపు సంపాదించిపెట్టింది. అప్పటికప్పుడు విన్న శబ్దాన్ని ఎలాంటి యాంత్రిక సహకారం లేకుండా నూరు శాతం పునఃప్రతిష్ఠించడం ఆయనకే చెల్లింది. వెనువెంటనే గొంతులు మార్చడంతోపాటు- ఏ అంశంపైనైనా అలవోకగా, ఆలోచన రేకెత్తించేలా అనర్గళంగా ప్రసంగించగల విజ్ఞాన ధార ఆయన సొంతం. అనుకరించడం ధ్వన్యనుకరణ కళ పరమార్థం. నేరెళ్ల ఇంటికి ఎవరు వెళ్ళినా ఆప్యాయమైన ఆయన పలకరింపును, ప్రేమమీర అందించే ఆయన ఆతిథ్యాన్ని రుచి చూడకుండా వెనక్కి తిరిగిన దాఖలాలు లేవు. ఏదో కార్యక్రమంకోసం లండన్‌కు వెళ్ళిన సందర్భంగా ఆయన అక్కడి ట్యాక్సీ ఎక్కారు. ఆ ట్యాక్సీని నడుపుతున్న డ్రైవర్‌కు దారి మధ్యలో ఓ రెండు మిమిక్రీ అంశాలు వినిపించారు. ఆయన ప్రతిభకు మంత్రముగ్ధుడైన ట్యాక్సీ డ్రైవరు నేరెళ్లవారి వద్ద డబ్బులు తీసుకోవడానికి ససేమిరా అన్నారు. ఎవరినైనా, ఎక్కడైనా క్షణాల వ్యవధిలో సూదంటు రాయిలా ఆకట్టుకోగల ప్రతిభావ్యుత్పత్తులు ఆయన సొంతం. ధ్వన్యనుకరణ కళకు సంబంధించిన లోతుపాతులను ఒడిసిపట్టే క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఆయన తిరగని గ్రంథాలయం లేదు... తిరగేయని పుస్తకం లేదు! కానీ, ఎక్కడా ప్రామాణిక సమాచారం లభించకపోవడంతో నిరాశ చెందిన నేరెళ్ల- 'మిమిక్రీ ఒక కళ' పేరిట తానే స్వయంగా కాలదోషం అంటని ఒక నిర్దిష్ట గ్రంథాన్ని రచించారు. ఆ రకంగా ఆయన ప్రపంచంలోని ప్రతి శబ్దాన్ని గొంతులో పలికించి, శ్రోతలను మైమరపింపజేసే గొప్ప కళకు ప్రామాణిక రూపమై నిలిచారు.

'పని ఒత్తిడి, తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు, మనసు బాగాలేనప్పుడు నేరెళ్ల వేణుమాధవ్‌కు ఫోన్ చేసి ఆయన మిమిక్రీ విని ఊరట చెందుతా'- స్వయంగా ఆనాటి ప్రధాని పీవీ నరసింహారావు చేసిన ఈ వ్యాఖ్య నేరెళ్ల విశిష్టతకు దర్పణం పడుతుంది. ప్రముఖ వ్యక్తులు ఇతరుల వేషభాషలను అందిపుచ్చుకొంటే ఎలా ఉంటుందన్న విషయాన్ని వేదికలపై ప్రభావమంతంగా ఆవిష్కరించి మిమిక్రీలో సరికొత్త ప్రక్రియకు ఆయన శ్రీకారం చుట్టారు. ఒక బొమ్మ మాట్లాడుతున్నట్లుగా, పక్కనున్న వస్తువు పలుకుతున్నట్లుగా భ్రమింపజేసే అరుదైన 'వెంట్రిలాక్విజమ్' అనే కళను తెలుగు వారికి పరిచయం చేశారాయన.

అసమాన గురువు

ప్రతిభ పుష్కలంగా ఉంటే వ్యక్తులు ఎక్కడ ఉన్నా అవకాశాలు వారిని వెదుక్కుంటూ వచ్చి అక్కున చేరతాయని ఆయన బలంగా నమ్మారు. అందుకే ఎంతోమంది హైదరాబాద్‌కు మారిపొమ్మని సలహా ఇచ్చినా ఆయన మాత్రం తాను జన్మించిన వరంగల్ జిల్లాను వదిలి బయటకు రాలేదు. పుట్టిన గడ్డను వదిలి అవకాశాల కోసం ఇతర ప్రాంతాల్లో స్థిరపడాలన్న ఆలోచనను ఆయన తుదికంటా వ్యతిరేకించారు. నేరెళ్లవారి నమ్మకాన్ని నిలబెడుతూ ప్రతిసారీ అవకాశాలు ఆయనను వెదుక్కుంటూనే తరలివచ్చాయి. శాసనమండలి సభ్యుడిగా ఆయనకు అవకాశం అలా వచ్చిందే! స్వయంగా పీవీ నరసింహారావే పట్టుపట్టి ఆయనకు ఎంఎల్‌సీ అవకాశం కట్టబెట్టారు. గూఢచారి-116 సినిమాలో ధ్వన్యనుకరణ సన్నివేశాన్ని ప్రత్యేకంగా రాయించి, నిర్మాత నాగిరెడ్డి నేరెళ్లవారితో వేషం కట్టించారు. జీవితపు సకల పార్శ్వాలతో అనుబంధం ఉంటే మినహా మిమిక్రీ కళాకారులు వికసించలేరని విశ్వసించిన ఆయన- తుదిశ్వాస వరకూ అందుకు అనుగుణంగానే జీవించారు. చేయిపట్టి నడిపించి, మిమిక్రీ కళలో అక్షరాలు దిద్దించి వేల మంది శిష్యులను తయారు చేసిన ఆ స్థాయి గురువు సమకాలీన సమాజంలో మరొకరు కనిపించరు. కళారంగానికి నేరెళ్లవారు చేసిన సేవలు నిరుపమానమైనవి. ధ్వన్యనుకరణ కళకు కొత్త భాష్యాలు చెప్పి, ఆ రంగంలో ప్రామాణికమై నిలిచిన నేరెళ్ల వేణుమాధవ్ స్వరం ప్రతి తెలుగు వాడి గుండెలోనూ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది!

– వంగీపురం హరికిషన్

(రచయిత– ప్రముఖ ధ్వన్యనుకరణ కళాకారులు)

రుద్రం-రౌద్రం

ప్రపంచాన్నే శాంతింపచేయగల వేదమే 'శివం'. శివం అన్న శబ్దానికి భద్రం, కల్యాణం, శుభం అనే అర్థాలున్నాయి. శివమే శివుడు. అరిష్టాలను నాశనం చేసి శుభాలను ఇస్తాడు. దివ్యమంగళస్వరూపం ఆయనది.

శివుడే రుద్రుడు. రుద్ర శబ్దం కోపాన్ని తెలియచేసే గుణవాచకం. చెడును, దుష్టత్వాన్ని అంతంచేసే ఆయుధమే రౌద్రం. అది క్షేమాన్ని, శ్రేయస్సును కాంక్షిస్తుంది. దక్షప్రజాపతి అహంకారంతో శివుణ్ని అవమానించాడు. నిరీశ్వర యాగాన్ని సంకల్పించాడు. పుట్టింటికొచ్చిన సతీదేవికి పుట్టెడు అవమానం ఎదురైంది. యోగాగ్నిలో భస్మమైంది. ప్రళయకాల రుద్రుడైనాడు శివుడు. దక్షయజ్ఞం ధ్వంసమైంది. భగవానుడినే అవమానించే అహంకారం, సర్వనాశనానికి హేతువవుతుందని, స్త్రీమూర్తికి పుట్టినింట నిరాదరణ ఉండరాదన్న వేదహితమైన సత్యాలను తెలిపింది శివుడి రౌద్రం. కోపానికి, క్రోధానికి తారస్థాయి రూపమే రౌద్రం.

రుద్రసూక్త నమకం ప్రథమ అనువాకంలో 'నమస్తే, రుద్రమన్యవ, ఉతోత ఇషవేనమః' అనే ప్రస్తావనకు- 'ఓ రుద్రదేవా! నీ క్రోధానికి, చేత ధరించిన బాణానికి నమస్కరిస్తున్నాను' అని అర్థం. తనను చెరబట్టిన రావణుడు అలవిమాలిన గొప్పలు చెప్పుకొంటున్నప్పుడు- 'శ్రీరాముడు కన్నెర్ర చేస్తే చాలు, సముద్రాలు ఇంకిపోతాయి. ప్రచండ భానుడు తన ప్రకాశాన్ని కోల్పోతాడు. నీ పది తలలు నేలరాలతాయి' అంటుంది సీతమ్మ.

రావణుడి దుష్టతలంపునకు, అహంకారానికి- శ్రీరాముడి కోపజ్వాల గుణపాఠంగా చెప్పితీరుతుందన్న సీతమ్మ హెచ్చరిక అది.

'శాంతమూర్తి ధర్మరాజు. ఆయనకే కోపం వస్తే సముద్రాలన్నీ ఏకమవుతాయి. ప్రళయం సంభవిస్తుంది. అంగరాజైన కర్ణుణ్ని చూసుకొని భ్రమపడుతున్నావేమో! ఇటువంటివారు పదివేలమందైనా యుద్ధరంగంలో కూలడం తథ్య'మని పాండవ కౌరవ సంధికై రాయబారిగా వెళ్ళిన శ్రీకృష్ణభగవానుడు రారాజును హెచ్చరిస్తాడు. ధర్మమే నాడిగా ఉన్నవారికి కోపంవస్తే అది విలయాన్ని సృష్టిస్తుందని విశదం చేస్తాడు.

కోపం అర్థవంతమైందిగా, అన్యాయాన్ని ప్రతిఘటించేదిగా ఉండాలి. రాళ్ళతో కొట్టి చంపుతున్నా పాము బుసకొట్టకుండా ఉంటే, అది సహజత్వం కాదు. సమర్థనీయమూ కాదు. ఆత్మరక్షణకు, ప్రాణరక్షణకు బుసకొట్టడం ఆవశ్యకం. ఉత్తముడికి వచ్చే కోపం బుద్ధిచెప్పేదిగా ఉంటుంది. కక్ష సాధించేదిగా ఉండదు.

అయినదానికి, కానిదానికి కోపాన్ని ఓ ఆయుధంగా వాడుకుంటే అది బుద్ధిహీనత్వమే అవుతుంది. అందరూ తనను దూరం పెట్టే స్థితి ఏర్పడుతుంది. ఫలితంగా ఒంటరివారైపోయే ప్రమాదం వాటిల్లుతుంది.

అంతర్యామి

భగవద్గీత వ్యక్తిత్వ వికాసానికి, ఔన్నత్యానికి దోహదపడే పవిత్ర గ్రంథం. శ్రీకృష్ణ భగవానుడు సాంఖ్యయోగంలో- క్రోధంవల్ల స్మృతి ఛిన్నాభిన్నమై, బుద్ధి నశించి మనిషి పతనస్థాయికి చేరతాడని తెలియజెప్పాడు.

నేటి మానవచిత్త ప్రవృత్తులు ఎవరి చెప్పుచేతల్లో ఉండేవి కావు. కోరికలకు మూలం విషయాసక్తి. అవి తీరనప్పుడు క్రోధం ఏర్పడటం మానవ నైజంగా ఉంటుంది.

అర్థరహితమైన అహంకారంతో, ఆభిజాత్యంతో వచ్చిపడే, క్రోధావేశాలతో జీవితంలో అలజడి, అశాంతి తప్పవు. శాంతి, సామరస్య ధోరణులు మృగ్యమవుతాయి. విచక్షణాజ్ఞానం శూన్యమవుతుంది. మనుషులమధ్య అగాధమేర్పడుతుంది. మానవ బంధాల మాధుర్యం మంటకలుస్తుంది. అనవసరంగా వచ్చిపడే క్రోధావేశాలు అనర్థదాయకమని నీతిశతకాలు ఉద్బోధిస్తున్నాయి. సమాజంలోని కుటుంబ శాంతిసౌఖ్యాలకై మంచిలక్షణాలను, వ్యక్తిశీలసంపదలను వృద్ధిచేసుకొమ్మని తెలుపుతాయి.

సుమతీ శతకకారుడు బద్దెన తన కోపమె తన శత్రువంటూ సందేశమిచ్చాడు. ప్రజాకవి వేమన, క్రోధంవల్ల గొప్పదనం తగ్గిపోతుందని, పైగా అది దుఃఖహేతువని హితవు చెప్పాడు.

రుద్రుడు కానివాడు రుద్రుని అర్చించకూడదు అంటోంది వేదం. రుద్రుని ఆవాహన చేసుకొని అర్చించాలి. ఆవాహన చేసుకోవడమంటే లోకరక్షణ, శాంతిసౌభాగ్యాల కోసమే తన శక్తిని, వడిని వినియోగించాలి. జ్వలించే స్థితిగతులను చల్లబరచే ఆవేశం, ఆలోచన ఉండాలి. అటువంటి సాధనాపరులు శివస్వరూపులే!

– దానం శివప్రసాదరావు

ఏడాదిలో 8 వేల కి.మీ. సీసీ రోడ్లు

- వైకాపా ఎంపీల రాజీనామాలు డ్రామాలే
- ప్రకాశం జిల్లాలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు

ఈనాడు డిజిటల్, ఒంగోలు: వచ్చే ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల కిలోమీటర్ల సీసీ రహదారులు వేస్తామని పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో 15వేల కిలోమీటర్ల రహదారులను నిర్మించామని వివరించారు. వైకాపా అధినేత జగన్, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మాట్లాడకుండా నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. మంత్రి లోకేశ్ ప్రకాశం జిల్లా చీరాల నియోజకవర్గంలో మంగళవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మత్స్యకారులకు, చేనేత కార్మికులకు పింఛన్ల పంపిణీలో పాల్గొనడంతోపాటు కొత్తపేటలో నిర్మించిన కొత్త

కొణిజేటి చేనేతపురిలో మగ్గం నేస్తున్న మంత్రి లోకేశ్

జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంతటి అభివృద్ధి జరుగుతున్నా ప్రతిపక్షాలు, భాజపా సహకరించడం లేదని ఆరోపించారు. తెలుగు జాతితో పెట్టుకుంటే మసైపోతారన్న అంశాన్ని ప్రధాని మోదీ గుర్తించాలన్నారు. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ నామరూపాల్లేకుండా పోయినట్టే, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న భాజపానూ ప్రజలు తరిమితరిమి కొడతారని హెచ్చరించారు. జగన్, పవన్‌కల్యాణ్‌ల మాటలకు స్క్రిప్టు మోదీ, అమిత్‌షాల నుంచే వస్తోందని ఆరోపించారు. వైకాపా ఎంపీలు రాజీనామాల పేరిట డ్రామాలు ఆడుతూ రక్తి కట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో తెదేపా 25 ఎంపీ స్థానాలను గెలుచుకుని కేంద్రంలో నిర్ణాయక శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సభలో సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడారు. అటవీ మంత్రి శిద్దా రాఘవరావు, శాసనసభ్యులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు స్కోచ్ పురస్కారం

గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ విభాగానికి మరో 3 అవార్డులు

ఈనాడు డిజిటల్, అమరావతి: పరిపాలనలో ఈ ఏడాది మేటి వ్యక్తిగా మంత్రి నారా లోకేశ్‌ను స్కోచ్ అవార్డు వరించింది. దీంతోపాటు గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ విభాగానికి మరో మూడు అవార్డులు దక్కాయి. పంచాయతీరాజ్ శాఖలో సాంకేతికంగా తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు గానూ ఈ పురస్కారాలు దక్కినట్లు మంగళవారం ఆ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 23న దిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారని వెల్లడించింది. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం అవార్డులు వరించడానికి కారణాలులో కొన్ని..

- తాగునీటి రవాణా వాహనాల్లో అధునాతన జీపీఎస్ పరిజ్ఞానం అమలు.
- ట్యాంకర్‌లో నీరు నింపిన చోట నుంచి ప్రజలకు అందించే వరకూ ఫోటోలతో సహా జియో ట్యాగింగ్ అయ్యేలా ప్రత్యేక యాప్.
- జలవాణి కాల్‌సెంటర్ అలర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా నేరుగా పై అధికారి నుంచి కింది స్థాయి అధికారి వరకూ ఫిర్యాదు వెళ్లడం.. అనంతరం ఐవీఆర్ఎస్ విధానం ద్వారా సమస్య పరిష్కారమైందో లేదో బాధితుల నుంచి తెలుసుకోవడం.
- అధునాతన డ్యాష్ బోర్డు ఏర్పాటు ద్వారా పారదర్శకతతో అభివృద్ధి పనులు.
- తాగునీటి సరఫరాలో విజయవంతంగా సెన్సార్లు ఏర్పాటు చేసి పైలెట్ ప్రాజెక్టు చేయడం ద్వారా 60 అంశాలపై పర్యవేక్షణ.
- వివిధ శాఖలతో డేటా అనుసంధానంతో గ్రామాలకు టెన్ స్టార్ రేటింగ్ అమలు.

గోదావరి జలాలకు స్వాగతం

- రైతులతో కలిసి జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దేవినేని
- నేడు కృష్ణా డెల్టాకు నీటి విడుదల

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, ఏలూరు: కృష్ణమ్మ వచ్చే లోపు గోదావరి తల్లి కృష్ణా డెల్టాను మూడు సంవత్సరాలుగా ఆదుకుంటోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. నూజివీడు మండలం సీతారామపురం వద్ద పట్టిసీమ నుంచి వచ్చిన గోదావరి జలాలకు రైతులతో కలసి ఆయన స్వాగతం పలికారు. అంతకు ముందు పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం జానంపేట సమీపంలో తమ్మిలేరు ఆక్విడెక్టు వద్ద జరిగిన జలహారతి కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉమా మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు నీరందించి రూ.18 వేల కోట్ల విలువైన పంటను కాపాడామన్నారు. డెల్టాలో ఆఖరిదశలో ఉన్న పంటలకు సరైన సమయంలో నీరిచ్చి ఆదుకున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. వచ్చే ఏడాది పోలవరం కుడి కాలువకు

తమ్మిలేరు ఆక్విడెక్టు వద్ద పోలవరం కుడికాలువ నీటికి హారతి ఇస్తున్న మంత్రి ఉమా, చిత్రంలో ఎమ్మెల్యే ప్రభాకర్ తదితరులు

ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేస్తామని చెప్పారు. గోదావరి నుంచి వస్తున్న నీటిని బుధవారం కొత్త రెగ్యులేటర్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణా డెల్టాకు విడుదల చేస్తారని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు పనులు జరుగుతుంటే వైకాపా నాయకులకు కడుపు మండిపోతోందని, ప్రాజెక్టు పూర్తైతే తమకు పుట్టగతులు ఉండవని భయపడుతున్నారని దుయ్యబట్టారు ఈ సందర్భంగా సీతారామపురం వద్ద రైతులు మంత్రి ఉమాను పూలమాలతో సత్కరించారు.

ముగిసిన 'ట్రిపుల్‌ఐటీ ధ్రువపత్రాల' పరిశీలన

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక విభాగాల అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఎన్‌సీసీ, క్రీడలు, దివ్యాంగులు, సైనిక సంతతికి చెందిన 260 సీట్లకు గాను 3020 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,338 మంది పత్రాల పరిశీలనకు హాజరైనట్లు ఆర్జీయూకేటీ ప్రవేశాల కన్వీనరు ఎస్ఎస్ఎస్ గోపాలరాజు తెలిపారు. క్రీడా కోటాలో 0.5 శాతం కింద నాలుగువేల మంది విద్యార్థులకు గాను 20 సీట్లు, ఎన్‌సీసీ 1 శాతం కింద 40 సీట్లు, సైనిక సంతతికి 2 శాతం చొప్పున 80 సీట్లు, దివ్యాంగుల కోటాలో 3 శాతం కింద 120 సీట్లు చొప్పున మొత్తం 260 సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. అంటే ప్రత్యేక విభాగాల కోటాలో ఒక్కో సీటుకు 9 మంది పోటీ పడుతున్నారు. మూడు విభాగాలకు పత్రాల పరిశీలన నిర్వహించగా.. చివరి రోజు 1,145 మంది హాజరయ్యారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ టి.స్వరూప్ కాంత్, ఎముకల వైద్య నిపుణుడు పి.వి.స్వామి, నేత్ర వైద్య నిపుణుడు ఈఎస్ఎన్.మూర్తి దివ్యాంగ అభ్యర్థులకు పరీక్షలు చేశారు.

త్వరలో పాత్రికేయులకు శిక్షణ తరగతులు: కాలవ

ఈనాడు డిజిటల్, అమరావతి: పాత్రికేయుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో త్వరలో శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. రెండు జిల్లాల వారికి ఒకచోట శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మొదట అనంతపురం నుంచి దీనికి శ్రీకారం చుట్టాలని సూచించారు. సమాచారశాఖపై మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. పాత్రికేయులు ప్రభుత్వ పథకాల పరిశీలనకు తీసుకెళ్లేందుకు అదనపు బడ్జెట్ కేటాయించాలన్నారు. సమీక్షలో కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్, సమాచారశాఖ సంయుక్త సంచాలకులు మూర్తి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీరాజ్, చందన్‌ల బెయిలు వ్యాజ్యం కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌సీయూ(యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) ఉపకులపతి అప్పారావును మావోయిస్టులతో కలిసి హత్య చేసేందుకు కుట్ర పన్నారన్న ఆరోపణ, మరి కొన్ని అభియోగాలు ఎదుర్కొంటున్న ఎ.పృథ్వీరాజ్, చందన్‌మిశ్రాలకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వారిరువురు దాఖలు చేసిన బెయిలు వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. ఆయుధాలు, వివిధ సామాగ్రి కలిగి ఉండడంతోపాటు హెచ్‌సీయూ వీసీని హత్య చేసేందుకు కుట్ర పన్నారనే ఆరోపణతో పృథ్వీరాజ్, చందన్‌మిశ్రాలను తూర్పుగోదావరి జిల్లా యటపాక పోలీసులు మార్చి 30న అరెస్టు చేసి దిగువ కోర్టులో హాజరు పరిచారు. ఆ కోర్టు బెయిలు నిరాకరించడంతో వారిద్దరు హైకోర్టులో బెయిలు వ్యాజ్యం దాఖలు చేశారు. ఏపీ ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. సాధారణ ప్రక్రియ తరహాలో ఇలాంటి తీవ్రమైన నేరాల్లో బెయిలు ఇవ్వడానికి వీల్లేదని, ఈ కేసు భిన్నమైందన్నారు. పృథ్వీరాజ్‌పై గతంలో నిందితునిగా కేసు నమోదయిందని, ప్రస్తుత కేసులో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. వీసీని హత్య చేయడం ద్వారా మావోయిస్టుల్లోకి యువతను ఆకర్షించేందుకు యత్నం చేశారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. బెయిలు వ్యాజ్యాన్ని కొట్టేశారు.

6 టన్నుల ఎర్ర దుంగలు స్వాధీనం

తిరుపతి, న్యూస్‌టుడే: తిరుపతి కార్యదళం(టాస్క్‌ఫోర్స్) అధికారులు భారీగా ఎర్రదుంగలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి సర్కిల్ కరకంబాడి బీటు పరిధిలోని అటవీ ప్రాంతంలో మంగళవారం తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక కార్యదళం అధికారులు దాడులు నిర్వహించి తరలించడానికి సిద్ధంగా ఉంచిన టిప్పర్‌ను అధీనంలోకి తీసుకున్నారు. అధికారుల రాకను పసిగట్టిన స్మగ్లర్లు పారిపోయారు. వారు వదలిపెట్టివెళ్లిన సుమారు ఆరు టన్నుల బరువున్న 150 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకన్నారు.

సొంత భావాలను రుద్దేందుకే జమిలి ఎన్నికలు

- భాజపాపై సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా విమర్శలు

ఈనాడు, అమరావతి: బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ సొంత భావాలను దేశంపై బలవంతంగా రుద్దేందుకు భాజపా ప్రయత్నిస్తోందని, ఇందులో భాగమే ఒకే దేశం- ఒకే ఎన్నికల నినాదమని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా విమర్శించారు. దాసరి భవన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో జమిలి ఎన్నికలు సాధ్యంకావన్నారు. ఎన్నికల వేళ ప్రధాని మోదీ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్నా, ప్రస్తుతం తద్విరుద్ధంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదని ఆందోళన ప్రకటించారు. అధికారంలోకి వస్తే ఏటా 2కోట్ల కొత్త ఉద్యోగాలు ఇస్తామన్న భాజపా మాటను నిలబెట్టుకోలేదన్నారు. కేంద్ర

విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా. చిత్రంలో రామకృష్ణ

విధానాల వల్ల ఉన్న ఉద్యోగాలు పోయే పరిస్థితులు నెలకొన్నాయని వెల్లడించారు. అందరికీ మంచి రోజులు వస్తాయని మోదీ చెబుతున్నారని, కార్పొరేట్ వర్గాలు, పెద్ద పారిశ్రామికవేత్తలకే మంచి రోజులు వస్తున్నాయని ఆరోపించారు. అన్ని దేశాలతోనూ సత్సంబంధాలు ఉన్నాయంటున్న మోదీ విజయ్‌మాల్యా, నీరవ్‌మోదీలను వెనక్కి తీసుకురావడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రంలో కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి వంటి ఉన్నతస్థాయి పదవులను ప్రైవేటు రంగం నుంచి భర్తీచేయాలని మోదీ నిర్ణయించడం దారుణమన్నారు. జాతీయ స్థాయిలో భావసారూప్యత కలిగిన వారితో కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో అవలంబించాల్సిన రాజకీయ విధానంపై బుధవారం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల భాజపా వైఫల్యాలపై ఆగస్టు 1 నుంచి 14 వరకు ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. విశాఖ భూకబ్జాలపై సిట్‌ను ఏర్పాటుచేసిన ప్రభుత్వం ఆ వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. ఇందులో తెదేపా, వైకాపా వారు ఉండడంతోనే మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. భూకబ్జాల్లో పాత్ర ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

CHEBROLU HANUMAIAH INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES (CHIPS)
(Sponsored by Nagarjuna Education Society) (Approved by AICTE & PCI :: Affiliated to Acharya Nagarjuna University)
Beside R.V.R. & J.C. College of Engineering, Chowdavaram, GUNTUR-522 019. ✆ 7382008494, 9849226300

ADMISSION NOTIFICATION FOR "B" CATEGORY SEATS

Applications are invited from eligible candidates for admission under "B" category seats (Management Quota) in the prescribed proforma for the academic year 2018-2019.

S. No.	Courses Offered	EAMCET CODE	Category "A" seats (70%)	Category "B" seats (30%)
1	B.Pharmacy	CIPS	70	30
2	Pharm.D	CIPS	21	09

Application forms can be downloaded from the college website www.chips.ac.in or can be had from the college office between 10:30 a.m to 4:30 p.m from 20-06-2018 to 29-06-2018. Filled-in applications both Online / Manual in the prescribed form along with copies of relevant certificates and application fee of Rs. 1,000/- (Non- Refundable) paid in cash or by D.D should be submitted to the College Office either in Person or by Registered Post between 20-06-2018 to 29-06-2018 will only be considered. Merit list will be displayed in the College website on 30-06-2018 as per the Govt. rules.

Dr.K.Basavapunnaiah, President — Dr.C.N.Srinivas, Secretary & Correspondent

కర్ణాటకలో సాహితీవేత్తలకు భద్రత

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: అభ్యుదయ, హేతువాదులకు భద్రత కల్పించాలని గౌరీ లంకేశ్ హత్యపై ఏర్పాటైన కర్ణాటక ప్రత్యేక దర్యాప్తు దళం (సిట్) రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీంతో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత గిరీశ్ కర్నాడ్, సాహితీవేత్త ఆచార్య కె.ఎస్.భగవాన్, మైసూరు విశ్వవిద్యాలయ ఆచార్యుడు మహేశ్ చంద్ర గురు, నిడుమామిడి మఠాధిపతి వీరభద్ర చెన్నమల్ల స్వామి, ఆధ్యాత్మికవేత్త నరేంద్రస్వామి తదితరులకు భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. వీరి నివాసాల వెలుపల, లోపల నిఘా కెమెరాల ఏర్పాటు, సాయుధుల భద్రత, బయటకు వెళ్లి వచ్చే సమయంలో ఎస్కార్ట్ తదితరాలను కల్పించనుంది. గిరీశ్ కర్నాడ్, కె.ఎస్.భగవాన్, వీరభద్ర చెన్నమల్ల స్వామి, నరేంద్ర నాయక్‌లకు తొలి ప్రాధాన్యంగా బుధవారం సాయంత్రం నాటికి భద్రతను అందుబాటులోకి తెస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

shoppersstop.com
Download Shoppers Stop app

SALE
★ SUPERHEROES ★

THEY WALKED IN TO SHOP FOR AN OUTFIT, WALKED OUT WITH OUTFITS FOR THE WHOLE WARDROBE.

FIRST CITIZEN PREVIEW SALE
JUNE 20 – 22

FLAT 50%* OFF

★ ★ ★ WANT TO BE A SUPERHERO? ★ ★ ★

SHOPPERS STOP
START SOMETHING NEW

*Conditions apply. Offer valid on select merchandise within select brands. First Citizen refers to First Citizen loyalty program of Shoppers Stop. If you're not a First Citizen member of Shoppers Stop already, visit the store and enroll yourself to avail of this offer among other privileges.

AXIS BANK 10% INSTANT DISCOUNT^^ Minimum spend of ₹7,000
^^Max Discount of ₹1000. Applicable only once per Axis Bank Credit & Debit Card. Offer Validity: 20th June'18 - 3rd August'18. T&C Apply. Visit www.axisbank.com

Golden Glow First Citizens get an additional 5%* discount as First Citizen Reward Points, on net prices of sale merchandise.

CONTRACT.SS.18-0630

కుటుంబాలు ఛిన్నాభిన్నం!

- అమెరికాలో తల్లిదండ్రుల నుంచి బిడ్డలను వేరు చేస్తున్న అధికారులు
- ట్రంప్ సర్కారు చర్యలతో పెరిగిపోతున్న కేసులు
- సర్వత్రా ఆగ్రహం

ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న వలస విధానాలకు వ్యతిరేకంగా అమెరికాలోని ఫీనిక్స్‌లో న్యాయస్థానం వద్ద నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

వాషింగ్టన్: అక్రమ వలసలపై అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సర్కారు అనుసరిస్తున్న కఠిన విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వలసదారుల నుంచి వారి సంతానాన్ని వేరుచేయడంపై అందరూ మండిపడుతున్నారు. ఇది తమ విధానం కాదని అంతర్గత భద్రత శాఖ చెబుతుండగా.. వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. అక్రమంగా సరిహద్దులను దాటినందుకు వలసదారులను అరెస్టు చేయడాన్ని ట్రంప్ ప్రభుత్వం మొదలుపెట్టినప్పటి నుంచి ఇలాంటి కేసుల సంఖ్య భారీగా పెరిగిపోయింది.

6లక్షల మంది

ఎంత తీవ్రంగా కట్టడి చేసినప్పటికీ అమెరికాలో అక్రమ వలసలు ఆగడంలేదు. మెక్సికో సరిహద్దుల గుండా చొరబడేందుకు ప్రయత్నిస్తూ ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్య నెలకు 50వేల మంది పట్టుబడ్డారు. అందులో దాదాపు 15 శాతం మంది కుటుంబాలుగా వస్తున్నారు. పెద్దల వెంట వచ్చిన చిన్నారులు 8 శాతం మంది ఉంటున్నారు. వలసదారుల్లో మెక్సికన్ జాతీయులను వారి దేశంలోకి పంపేయవచ్చు. అయితే హింస ఎక్కువగా ఉండే సెంట్రల్ అమెరికా, గ్వాటెమాలా, హోండురస్, ఎల్ సాల్వేడార్ వంటి దేశాల నుంచి వచ్చేవారిని వెనక్కి పంపడం కష్టమవుతోంది. స్వదేశంలో వేధింపులను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందువల్ల తమకు ఆశ్రయమివ్వాలని వారు కోరుతున్నారు. ఇలా ఆశ్రయం కోరే అక్రమ వలసదారులు లోగడ. . తమ పేర్లను నమోదు చేయించుకునేవారు. వారి వినతి పరిశీలనలో ఉండగా నిర్బంధం నుంచి విడుదలయ్యేవారు. పెండింగ్‌లో ఉన్న అలాంటి కేసులు ఇప్పుడు 6 లక్షలకు చేరాయి. ఈ వలసదారుల్లో చాలామంది విచారణలకు హాజరుకారు. క్రమంగా అమెరికా సమాజంలో కలిసిపోతున్నారు. ఈ 'వెసులుబాటు' వల్లే దేశంలో అక్రమ వలసలు వెల్లువెత్తుతున్నాయని ట్రంప్ సర్కారు చెబుతోంది.

మరెవరూ రాకుండా చూసేందుకే..

2017 అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ మధ్య దాదాపు 700 మంది చిన్నారులను వారి తల్లిదండ్రుల నుంచి వేరు చేశారు. వారిని కొన్ని వారాల పాటు అదుపులో ఉంచుకోవడం లేదా ఇతర సంరక్షణదారుల వద్దకు పంపడం చేస్తున్నారు. ఆ తర్వాత అక్రమ వలసలపై కఠిన చర్యలు తీసుకోవాలని ట్రంప్ ఆదేశించారు. దీంతో అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్ కన్నెర్ర చేశారు. సరిహద్దులను అక్రమంగా దాటిన వారిని క్రిమినల్ అభియోగాలపై అరెస్టు చేస్తామన్నారు. కుటుంబాలతో కలిసి అక్కడి వచ్చినవారి నుంచి చిన్నారులను వేరుచేస్తామన్నారు. ఇతరులు ఇలా అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించకుండా నిలువరించడం దీని ఉద్దేశమని తెలిపారు. ఈ ప్రకటన తర్వాత ఐదువారాలకే 2300 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులనుంచి వేరు చేశారు. వారి పెద్దలపై విచారణకు రోజులు లేదావారాలు పట్టొచ్చు. నేరాన్ని ఒప్పుకొనేలా చాలామందిపై ఒత్తిడి తెస్తున్నారు. అప్పటికే అనుభవించిన శిక్షాకాలాన్ని వారికి శిక్షగా ఖరారు చేస్తున్నారు. ఆశ్రయం కోసం వారు చేసుకున్న దరఖాస్తు పెండింగ్‌లో ఉండగా.. వారిని విడుదల చేస్తున్నారు. అయితే వారికి నేరచరిత్ర ఉన్నట్లు నమోదవుతోంది. అందువల్ల శాశ్వతంగా వారికి అవకాశం మూసుకుపోతోంది.

ఆ చిన్నారుల పరిస్థితేంటి?

వేరుచేసిన చిన్నారులను శరణార్థి పునరావాస కార్యాలయాని (ఓఆర్ఆర్)కి అప్పగిస్తారు. ఈ చిన్నారుల వయసు 1-18 ఏళ్ల మధ్య ఉంటుంది. వీరిని ప్రత్యేక కేంద్రాల్లో ఉంచుతారు. అందులో కొన్ని.. గుడారాల్లో పనిచేస్తున్నాయి. కాంక్రీటు నేలపై చాపలమీద చిన్నారులు నిద్రించాల్సి ఉంటుంది. చుట్టూ బోనులను తలపించే కంచె ఉంటుంది. ఓఆర్ఆర్ వద్ద ప్రస్తుతం 11వేల మంది అక్రమ వలస చిన్నారులు ఉన్నారు. వీరిలో కుటుంబ సభ్యుల తోడు లేకుండా వలస వచ్చినవారూ అనేక మంది ఉన్నారు. ఇప్పటికే అమెరికాలో ఉన్న బంధువులకు వీరిని అప్పగించాలని ఓఆర్ఆర్ భావిస్తోంది. ఈ ప్రక్రియకు కొన్ని నెలలు పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

"నాన్న.. నాన్న.." అంటూ కన్నీరు పెట్టిస్తున్న వలస చిన్నారి ఆడియో

బ్రౌన్స్‌విల్లీ: 'నాన్న.. నాన్న..'అంటూ కంటతడి పెట్టించేలా స్పానిష్ చిన్నారి ఏడుస్తున్నట్లు వినిపిస్తున్న ఓ ఆడియో.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలస విధాన వివాదానికి కేంద్ర బిందువుగా మారుతోంది. సరిహద్దుల గుండా అక్రమంగా దేశంలోకి ప్రవేశించే వలసదారుల నుంచి ట్రంప్ సర్కారు పిల్లలను వేరుచేస్తున్న సంగతి తెలిసిందే. తాజా ఆడియోను ఓ తండ్రి నుంచి చిన్నారిని విడదీస్తున్నప్పుడు రికార్డు చేసినట్లుగా కనిపిస్తోంది. దీన్ని స్వచ్ఛంద సంస్థ "ప్రో పబ్లికా" వెలుగులోకి తెచ్చింది. మరోవైపు ఓ ప్రజావేగు తమకు ఈ ఆడియోను సమర్పించినట్లు మానవ హక్కుల అటార్నీ జెన్నిఫర్ హర్బరీ తెలిపారు. గత వారం దీన్ని రికార్డు చేసినట్లు సమాచారం అందిందని వివరించారు. అయితే ఎక్కడ దీన్ని రికార్డు చేశారో వెల్లడించలేదు. ఆధీనంలోకి తీసుకున్న పిల్లల పట్ల ప్రభుత్వం ఎంతో మానవతాదృక్పథంతో వ్యవహరిస్తుందని, మేలిమి ప్రమాణాలు పాటిస్తుందని హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిర్స్‌జెన్ నీల్సన్ వివరించారు.

రూ.350 కోట్ల విడుదలపై వివరాలు సమర్పించండి

'కొణతాల' పిల్‌లో కేంద్రానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయం కింద 2017-18 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన రూ.350 కోట్లను కేంద్రం వెనక్కి తీసుకోవడాన్ని సవాలు చేస్తూ మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శి, నీతిఆయోగ్ వైస్‌ఛైర్మన్, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు ఆదేశించింది.

మద్యం దుకాణాలపై వివరాలకు ఆదేశం

ఏపీ సర్కారుకు హైకోర్టు నోటీసులు

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని జాతీయ రహదారులకు 500 మీటర్లలోపు మద్యం దుకాణాలకు అనుమతించరాదని అభ్యర్థిస్తూ కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన కొలుసు గోకుల్ పోతురాజు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఏపీ అబ్కారీశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, కృష్ణా జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీ రాష్ట్ర మద్యం డీలర్ల సంఘం అధ్యక్షులకు నోటీసులు జారీచేసింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు ఆదేశించింది.

'ఫార్మసిస్ట్'లకు రూ.2.19 కోట్లు విడుదల

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రుల్లో ఈ-ఔషధి విధానాన్ని అమలు చేస్తున్న ఫార్మసిస్ట్‌లకు ప్రోత్సాహక నగదు చెల్లించేందుకు రూ. 2.19 కోట్లు విడుదల చేస్తూ జాతీయ ఆరోగ్య పథకం సంచాలకులు పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీ చేశారు. నెలకు రూ.1000 వంతున 2016-17 ఆర్థిక సంవత్సరంలో 9 నెలలు, 2017-18లో 12 నెలలకు చెల్లించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. అర్హులైన ఉద్యోగులకు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని సూచించారు. తమ సంఘం చేసిన కృషి ఫలితంగానే ఈ మొత్తం విడుదలైందని ఫార్మసిస్ట్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణమూర్తి తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలపై చిత్తశుద్ధి ఏదీ?

పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

అనంతపురం, న్యూస్‌టుడే: భాజపా, తెదేపా, వైకాపాలకు రాష్ట్ర ప్రయోజనాలపై చిత్తశుద్ధి లేదని, ఆ మూడు పార్టీలు ప్రజలను మభ్యపెడుతున్నాయని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. అనంతపురంలోని డీసీసీ కార్యాలయం వద్ద ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికిప్పుడు లోక్‌సభకు ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీ 200 స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భాజపాను వ్యతిరేకించే పార్టీలతో కలిసి మోదీ పాలనకు మంగళం పాడతామన్నారు. వైకాపా ఎంపీల రాజీనామాలు అంతా నాటకమని, తెదేపా కూడా కేంద్రంతో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకుందని రఘువీరా ఆరోపించారు. ప్రత్యేక హోదా అమలు కావాలన్నా, రైతు రుణాలు పూర్తిగా మాఫీ చేయాలన్నా రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని పేర్కొన్నారు.

జిల్లాల వారీగా భాజపా ఎన్నికల ప్రణాళికలు!

ఈనాడు అమరావతి: జిల్లాకొక ఎన్నికల ప్రణాళికను ప్రకటించాలని భాజపా భావిస్తోంది. జిల్లాల పర్యటనల ద్వారా గుర్తించిన అక్కడి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తూ ఎన్నికల ప్రణాళికలను ప్రకటించడం ద్వారా ప్రజలను ఆకర్షించవచ్చునన్న ఆలోచనలో భాజపా ఉంది. జిల్లాల పర్యటనలో రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఏమీచేయలేదన్న తెదేపా ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు భాజపా గట్టి ప్రయత్నం చేస్తోంది. ఇదే సమయంలో పార్టీ గెలుపు అవకాశాలు కలిగిన నియోజకవర్గాలు, కష్టపడి పనిచేస్తున్న నేతలను గుర్తించడంపై కూడా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ దృష్టిపెట్టారు. పార్టీ అభివృద్ధికి పనిచేసే వారికి పదవులను కేటాయించేందుకు ఈ పర్యటనలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. పార్టీ అధ్యక్ష పదవీ బాధ్యతలు స్వీకరించాక కొత్తగా కార్యవర్గం ఏర్పడాల్సిన అవసరం ఉంది. పార్టీ అధ్యక్షుడు కన్నా జిల్లాల పర్యటన ముగిశాక దానికో రూపం ఇవ్వనున్నారు.

'క్రైస్తవులపై దుష్ప్రచారం చేస్తున్నారు..'

ఈనాడు, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో క్రైస్తవులపై దుష్ప్రచారం చేస్తున్న శివశక్తి, హిందూ జనశక్తికి చెందిన వారిపై తెలుగురాష్ట్రాల్లోని వివిధ పోలీసుస్టేషన్లలో నమోదైన కేసుల విచారణను సీబీఐకి అప్పగించాలంటూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. మంగళవారం ఈ వ్యాజ్యంపై విచారించిన ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వాదనలు వినకుండా ఈ దర్యాప్తునకు ఆదేశించడం కుదరదని స్పష్టం చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చేందుకు అనుమతినివ్వాలని పిటీషనర్ల తరఫు న్యాయవాది కోరారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. క్రైస్తవంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ 'ఆల్‌ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్' జాతీయ ప్రధాన కార్యదర్శి, విశాఖవాసి కొలకలూరి సత్యశీలరావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు.

అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిషనర్ మరియు డైరెక్టర్ కార్యాలయం
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, గుంటూరు, అమరావతి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
ఇ–ప్రొక్యూర్‌మెంట్ T.No.SE(AM)/AP/GNT/Ep/09/2018-19, తేది:19–06–2018
ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా మరియు పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, అనంతపూర్, చిత్తూరు, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మరియు తూర్పు గోదావరి జిల్లాలలోని వివిధ మార్కెట్ యార్డులలో సుమారు రూ.13,93,82,872/– వ్యయంగల పనుల నిమిత్తం రిజిస్టర్డు కాంట్రాక్టర్ల నుండి సూపరింటెండింగ్ ఇంజనీర్ (AM) గుంటూరు, అమరావతివారిచే ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. ఇ-ప్రొక్యూర్‌మెంట్ సైట్ ప్రారంభ తేది: 22–06–2018 సా.4.00 గం. ఏదేని ఇతర సమాచారాన్ని www.apeprocurement.gov.in నుండి లేదా సూపరింటెండింగ్ ఇంజనీర్ (AM) కార్యాలయం, గుంటూరు, అమరావతి నుండి పొందవచ్చును. సం/– సూపరింటెండింగ్ ఇంజనీర్ (AM)

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES
A.P: VIJAYAWADA-520 008
TENDER NOTICE
No. 14/We/TS/DM1/18 Date : 12.06.2018
Sealed Tenders are invited for following work at Dr. NTR University of Health Sciences, Vijayawada.

Sl. No	Name of the work	EMD (in Rs.)	Bid Details
1.	Security printing and supply of OMR / ICR forms to various wings of Dr. NTR UHS, Vijayawada for the years 2018-19 & 2019-2020	1,50,000/-	Bid Document Downloading Start Date : 20.06.2018 @ 10.30 AM Bid Document Downloading End Date : 03.07.2018 @ 3.00 PM

Note : For further details visit **www.apeprocurement.gov.in**
Sd/- REGISTRAR

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పశుసంవర్ధకశాఖ సంచాలకుల కార్యాలయము
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పశువులకు బీమా వర్తింప చేయు నిమిత్తం IRDAచే అధీకృతము చేయబడిన బీమా కంపెనీల నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఆన్‌లైన్‌లో టెండరు డాక్యుమెంట్ తెరచుతేది. 20-6-2018 ఉ.గం. 10.00లకు. ప్రి-బిడ్ సమావేశము : 22-6-2018 ఉ.గం. 11.00లకు. ఆన్‌లైన్ టెండరు డాక్యుమెంట్ ముగింపుతేది. 5-7-2018 మ.గం.3.00 వరకు. ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు ముగింపు తేది. 5-7-2018 సా.గం. 5.00 వరకు. అప్‌లోడ్ చేయబడిన అన్ని డాక్యుమెంట్లు దాఖలు 6-7-2018 మ.గం.3.00 వరకు. టెక్నికల్ బిడ్ తెరచు తేది. 6-7-2018 సా.గం.4.00. ఆర్థిక బిడ్ తెరచు తేది : 9-7-2018 మ.గం. 3.00. వివరాలు e- మార్కెట్ ప్రదేశం http://tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్ : 94907 50260.
DIPR No. 800/CL/Advt/1/1/2018-19 సం/– సంచాలకులు

AP CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
REQUEST FOR PROPOSAL
(Tender Notice No. 14024(34)/7/2018-2nd call dated 18.06.2018)
DEVELOPMENT OF AMARAVATI MARINA IN AMARAVATI CAPITAL CITY, ANDHRA PRADESH ON PUBLIC PRIVATE PARTNERSHIP MODE
- Government of Andhra Pradesh has embarked on development of World Class Amaravati Capital City with good urban governance that is economically vibrant, inclusive and highly livable.
- APCRDA intends to develop state of the art Amaravati Marina on Public Private Partnership (PPP) mode in Amaravati capital city.
- Request for Proposal document may be downloaded from APCRDA website **(https://crda.ap.gov.in).**
- **Due date for submission of bids: 03/07/2018, upto 3.00 pm**

For further details, Please Contact: Shri. V Bhavani Prasad, Joint Director, CCDP, Mobile: 7095599080, **Email ID: bhavaniprasad@apcrda.org,**
Shri P.V.Ramana Rao, Sr. Urban Planner, Planning, Mobile: 9959358880, **Email-id: pvr@apcrda.org**
Sd/- Commissioner, APCRDA

అమ్మా.. నేనెవరమ్మా!

- ముళ్లపొదల్లో ఆడశిశువు
- స్థానికుల చొరవతో నిలిచిన ఊపిరి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: పండంటి పసికందు.. పూర్తి ఆరోగ్యంతో పుట్టిన బంగారు బిడ్డ.. ఆడ శిశువని వదిలేశారో.. ఇతరత్రా చెప్పుకోలేని కారణాలేమైనా ఉన్నాయో. . కానీ, పొత్తిళ్లలో తడయినా ఆరని ఆ పసిదాన్ని నిర్దయగా కంపచెట్లలో విసిరేశారు! అమ్మ స్పర్శను, తల్లిపాల రుచిని చూడకముందే దూరం చేశారు. నవమాసాలు గర్భంలో దాచుకున్న ఆ తల్లి.. భూమిమీదకు ఆరోగ్యంగా వచ్చిన బిడ్డను ఎందుకు దూరం చేసుకుందో.. సంచిలో ఉంచి జనసంచారం లేనిచోట ముళ్ల పొదల్లో పడేసి పోయారు. ఈ అమానవీయ ఘటన కర్నూలు జిల్లా వెల్దుర్తిలో మంగళవారం చోటుచేసుకుంది.

వెల్దుర్తి ఐజీ నగర్ రాఘవేంద్ర థియేటర్‌కు చేరువలోని కంపచెట్ల మధ్య చిన్నారి ఏడుపును వేకువజామున స్థానికులు గుర్తించారు. ముళ్లు గీరుకొని, చీమల దాడికి గురై ఆ గాయాలతో, చలిలో రాత్రంతా ఏడ్చీఏడ్చీ సొమ్మసిల్లిన స్థితిలో ఉన్న ఆ పసిదాన్ని ఖాజాబీ, షమీనా, కాలనీవాసులు చేరదీశారు. వెంటనే పాపకు స్నానం చేయించి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యసేవలు అందించాక పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయాన్ని అంగన్‌వాడీ సిబ్బందికి తెలపడంతో పర్యవేక్షకురాలు రాధమ్మ పాపను కర్నూలు తీసుకెళ్లారు. సీడీపీవో చంద్రకళ ఆధ్వర్యంలో చిన్నారికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు.

పెంచుకునేందుకు మేమంటూ మేం..: పాపను పెంచుకునేందుకు గ్రామస్థులు అనేక మంది పోటీపడి ముందుకొచ్చారు. పిల్లల సంరక్షణ కేంద్రం నుంచి చట్టప్రకారమే దత్తత తీసుకోవాల్సి ఉంటుందని అంగన్‌వాడీ సిబ్బంది వారికి నచ్చజెప్పారు. నిజానికి అంగన్‌వాడీ సిబ్బంది వద్ద గర్భిణి వివరాలు ఉంటాయి. వీటి ఆధారంగా పసికందును కంపచెట్లలో వదిలివెళ్లిన వారి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. ఈ విషయంపై అధికారులు లోతుగా విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కంపచెట్ల మధ్య వదిలేయడంతో గాయాలకు గురైన చిన్నారి

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా

పీఏసీ ఛైర్మన్ బుగ్గన వెల్లడి

కర్నూలు, న్యూస్‌టుడే, ఈనాడు–అమరావతి: ప్రజాపద్దుల సంఘం(పీఏసీ) ఛైర్మన్‌గా ఉంటూ భాజపా నాయకులకు పలు సమాచారాలు అందించినట్లు తెదేపా నాయకులు చేసిన ఆరోపణలను నిరూపిస్తే తన పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం కర్నూలులోని వైకాపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆరోపణలు చేసినవారు నిరూపించకుంటే రాజీనామాలకు సిద్ధమా? అని సవాలు విసిరారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసిన ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుపై సభాహక్కుల కమిటీకి ఫిర్యాదు చేశామని ఆయన పత్రాలను చూపారు. భాజపాతో వైకాపాకు సంబంధాలున్నాయంటూ ఏపీ భవన్ లాగ్‌బుక్‌ను ట్యాంపరింగ్ చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. తెదేపా ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, దీనికి భయపడి ఆరోపణలు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

త్వరలో మంచి రోజులొస్తాయి

- పాదయాత్రలో స్వీకరించిన వినతులన్నింటిని పరిశీలన చేస్తానని హామీ: జగన్

పి.గన్నవరం – న్యూస్‌టుడే

రానున్న ఎన్నికల్లో వైకాపా విజయం సాధిస్తుందని.. ప్రజలకు మంచి రోజులు వస్తాయని వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో సాగుతున్న పాదయాత్ర మంగళవారం పి.గన్నవరం నుంచి చాకలిపాలెం వరకు సాగింది. దారి పొడవునా పలువురు ఆయనను కలుసుకుని అభినందనలు తెలిపారు. కొందరు తమ కష్టాలను చెప్పుకున్నారు. వైకాపా అధికారంలో రాగానే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ప్రజల పక్షాన ఉంటూ వారి అభ్యున్నతికై పాటుపడతానని పేర్కొన్నారు. ఇసుక తవ్వకాలు తదితర విషయాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చాకలిపాలెంలో ఒక ప్రైవేటు చమురు సంస్థ ఉద్యోగులు ఆయనను కలుసుకుని తమ సమస్యలను విన్నవించారు. ప్రజా సంకల్పయాత్రలో స్వీకరించిన వినతులన్నింటిని పరిశీలన చేస్తానని జగన్ వారికి హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఎంపీలు వై.వి. సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, ఎన్.నారాయణస్వామి, ముస్తాఫా, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

చాకలిపాలెంలో పాదయాత్ర చేస్తున్న జగన్ తదితరులు

నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం

అమరావతి: వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం ఇస్తామని ఆ పార్టీ అధ్యక్షులు జగన్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. 'దేవుడి దయతో మన ప్రభుత్వం రాగానే మీ అందరి ముఖంలో చిరునవ్వులు కనిపించేలా కనీస వేతనం ఇస్తాం. ఎప్పటికప్పుడు మీ సమస్యలు పరిష్కారం అయ్యేలా తిరుమల తిరుపతి దేవస్థానం సహా ప్రతి దేవాలయ బోర్డులోనూ ఒక నాయీ బ్రాహ్మణుడ్ని సభ్యుడిగా నియమిస్తాం' అని పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణులపై సచివాలయం సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరించడం గర్హనీయమన్నారు. ఆయన ప్రదర్శించిన హావభావాలు ఆయనలోని అహంకార, నియంత స్వభావాలను కళ్లకు కట్టినట్లు చూపించాయన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాల్సిన తీరు ఇదేనా అని ప్రశ్నించారు. కనీస వేతనాలు ఇవ్వనంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెప్పడం చట్టానికి వ్యతిరేకమని ట్వీట్‌లో పేర్కొన్నారు.

బాబు ప్రధానిని కలిస్తే తప్పేముంది?

- భాజపా నేత విష్ణుకుమార్‌రాజు

ఈనాడు, అమరావతి, విజయవాడ, న్యూస్‌టుడే: ప్రధాని మోదీని చంద్రబాబు కలవడంలో తప్పేముందని భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు ప్రశ్నించారు. నీతి అయోగ్ పాలక మండలి సమావేశంలో వారిద్దరూ కలుసుకోవడంపై ప్రతిపక్షం అనవసర విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుపై రాజకీయ నిర్ణయం జరిగిందన్నారు. త్వరలోనే జోన్ ప్రకటన వచ్చి తీరుతుందని స్పష్టం చేశారు. విధుల నుంచి తొలగించిన సాక్షర భారత్ సమన్వయకర్తలను తిరిగి తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరేందుకు సచివాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.1.58 లక్షల కోట్ల సాయం చేసిన విషయాన్ని వదిలి వెనక్కు తీసుకున్న రూ.350 కోట్ల గురించి ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. భాజపాపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని విలేకరులు ప్రస్తావించగా.. తమ పార్టీ నాయకులు ఇసుకను, భూమిని దోచుకోలేదని, అవినీతిపరులకు కొమ్ముకాయలేదని మండిపడ్డారు.

సమన్వయకర్తల తొలగింపు సరికాదు: అంతకు ముందు విజయవాడలోని ఓ హోటల్‌లో విష్ణుకుమార్‌రాజు విలేకరులతో మాట్లాడారు. 2010 నుంచి పనిచేస్తున్న సాక్షర భారత్ సమన్వయకర్తలను హఠాత్తుగా విధుల నుంచి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని చెప్పారు. వీరికిచ్చే వేతనాలకు రూ.4.50కోట్లు మాత్రమే వ్యయమవుతోందన్నారు.

రైతులతో మోదీ ఏం మాట్లాడతారు?: సోమిరెడ్డి

ఈనాడు, అమరావతి: 'డీజిల్, ఎరువుల ధరలు పెంచి ఆంధ్రప్రదేశ్ రైతాంగంపై రూ. 1,765 కోట్ల భారం వేశారు. కందులు, మొక్కజొన్న, జొన్న కొనడం మా వల్ల కాదని చేతులెత్తేశారు.. ఏం న్యాయం చేశారని ప్రధానమంత్రి మోదీ రైతులతో నేరుగా మాట్లాడతారట?' అని వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్రాన్ని నిలదీశారు. రైతులకు ఎలా న్యాయం చేయాలో ఆంధ్రప్రదేశ్‌ను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కష్టాల్లో ఉన్న రైతులు పంటవిరామం ప్రకటిస్తారంటూ భాజపా నాయకుడు విష్ణుకుమార్‌రాజు, మాజీ డీజీపీ దినేశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

30న నెల్లూరులో దళితతేజం ముగింపు మహాసభ

- లక్ష మందితో నిర్వహణకు సన్నాహాలు
- మంత్రులు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: 'దళితతేజం-తెలుగుదేశం' కార్యక్రమం ముగింపు మహాసభ ఈ నెల 30న నెల్లూరులో నిర్వహించనున్నట్లు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు వెల్లడించారు. సీఎం చంద్రబాబు పాల్గొననున్న ఈ సభను లక్ష మందితో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తెదేపా ఆవిర్భావం నుంచి పాలనలో దళితుల భాగస్వామ్యం, ఆర్థికంగా, సామాజిక అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలు, భవిష్యత్ కార్యాచరణను సభలో వివరిస్తామన్నారు. మంగళవారం ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు మంత్రులు నారాయణ, నక్కా ఆనంద్‌బాబు, జవహర్ మాట్లాడారు. మహాసభ నిర్వహణ, ఏర్పాట్లను మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నారాయణ ఆధ్వర్యంలోని కమిటీలు పర్యవేక్షిస్తాయన్నారు. 13 జిల్లాల నుంచి దళితుల ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జనవరి 26న ప్రారంభమైన దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమం ద్వారా గత కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అన్యాయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లామని చెప్పారు. తెదేపా హయాంలో దళిత నాయకులకు ప్రత్యేక గౌరవం దక్కుతోందని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళిత వాడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఎస్సీ ఉప ప్రణాళికకు రూ.11 వేల కోట్లు కేటాయించి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా తెదేపా పనిచేస్తోందని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కళా వెంకట్రావు. చిత్రంలో మంత్రులు జవహర్, ఆనంద్‌బాబు, నారాయణ

వీసా ఎప్పుడైనా పునరుద్ధరించుకోవచ్చు...!

ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

వచ్చే ఏడాది అమెరికా వెళ్లేందుకు పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేద్దామనుకుంటున్నాను. వీసా దరఖాస్తుతోపాటు ఏవైనా ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందా? *-శ్రీనివాస మురళి కేఎం*

నాన్-ఇమిగ్రెంట్ వీసాలు ధ్రువపత్రాల ఆధారంగా ఉండవు. కాన్సులర్ అధికారి ఎలాంటి ధ్రువపత్రాలను చూడరు. మీ ప్రయాణ కారణాలను ఇంటర్వ్యూ సమయంలో ఆ అధికారితో చర్చించేందుకు సన్నద్ధంగా ఉండండి. వీసా దరఖాస్తు, ఇంటర్వ్యూ షెడ్యూల్ కోసం http://www.ustraveldocs.com/in/in-niv-typeb1b2.asp పరిశీలించండి.

నేను సీనియర్ సిటిజన్‌ను. నా వీసాను పునరుద్ధరించుకోవాలనుకుంటున్నాను. డ్రాప్ బాక్స్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చా? *- సత్యప్రసాద్ మామిళ్ల*

వయసు, వ్యక్తిగత పరిస్థితుల ఆధారంగా ఇంటర్వ్యూ మినహాయింపునకు మీరు అర్హత పొందవచ్చు. దానికి అర్హులైన పక్షంలో http://www.ustraveldocs.com/in/in-niv-visarenew.aspను చూడండి. ఒక వేళ అర్హులు కాకపోతే వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు ఆ వెబ్‌సైట్ ద్వారా ప్రయత్నించండి.

2009లో నాకు పర్యాటక వీసా జారీ అయింది. వీసాను పునరుద్ధరించుకుందామని అనుకుంటున్నాను. ఇప్పటి వరకు అమెరికా పర్యటించలేదు. పునరుద్ధరణ సమయంలో అది సమస్య అవుతుందా? *- ప్రవీణ్ పెనుమత్స*

మీ వీసాను ఎప్పుడైనా పునరుద్ధరించుకోవచ్చు. గడవు తీరకముందు కూడా చేసుకోవచ్చు. వీసా చెల్లుబాటులో ఉన్నా, కాలం తీరి ఏడాదిలోపైన పక్షంలోనూ మీరు ఇంటర్వ్యూ మినహాయింపునకు అర్హత పొందవచ్చు.

అమెరికాలో ఓపీటీపై ఉన్నాను. స్వల్పకాల వ్యవధి కోసం భారతదేశం వద్దామనుకుంటున్నాను. అమెరికా తిరుగు ప్రయాణంలో ఏవైనా ఇబ్బందులు వస్తాయా? ప్రస్తుత వీసా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నేను భారతదేశం వెళ్లే విషయంలో సలహా ఇవ్వగలరు? *- కృష్ణమోహన్ కర్రి*

ఓపీటీని విద్యా కార్యక్రమంలో భాగంగానే పరిగణిస్తారు. ఎఫ్-1 వీసా విద్యార్థులు చెల్లుబాటయ్యే ఓపీటీ స్థితిలో ఉంటే అమెరికా వెలుపలకు వెళ్లేందుకు సాధారణంగా ఇబ్బందులు ఉండవు. విశ్వవిద్యాలయం, విద్యా కార్యక్రమం, ఎస్ఈవిఐఎస్‌లలో మార్పులు లేకుండా మీ వీసా చెల్లుబాటులో ఉంటే అమెరికా వెళ్లేందుకు మీ వీసాను వినియోగించుకోవచ్చు.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.com కు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.govను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు.

కొత్త సంగతి

ఆవిష్కరణ చిన్నదే కావొచ్చు. అది రోజువారీ అవసరాలను తీర్చేదైతే మరింత ప్రయోజనం చేకూరుస్తుంది. చైనా పరిశోధకులు రూపొందించిన ఓ కొత్తరకం ఫిల్టర్ పొర అలాంటిదే. ఉప్పు నీటిని సమర్థంగా, వేగంగా వడపోస్తూ.. తాగు నీరుగా మార్చగల ఇది శాస్త్రరంగాన్నే కాదు, సామాజిక వేత్తలనూ ఆకర్షిస్తోంది. రోజురోజుకీ జటిలమవుతున్న తాగునీటి సమస్యకు మంచి పరిష్కారం చూపే అవకాశం ఉండటమే దీనికి కారణం.

తప్పుతుంది ఉప్పుద్రవం

తాగునీరు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. దాహం తీరక, గుక్కెడు మంచి నీటి కోసం అలమటిస్తున్న బడుగు జీవులు ఎందరో. నిజానికి మన చుట్టూ నీరు లేక కాదు, అది తాగటానికి వీలుగా లేకపోవటమే శాపం. సముద్రాలు, మహా సముద్రాల్లో ఉండేదంతా ఉప్పునీరే. బావుల వంటి వాటిల్లోని భూగర్భజలాలు సైతం వేగంగా ఉప్పునీరుగా మారిపోతోంది. మన భూమ్మీదున్న మొత్తం జలాల్లో 97% తాగడానికి పనికిరాని నీరే! కేవలం 2.5-2.7% మాత్రమే మంచి నీరు. దీనిలోనూ 1.75-2% నీరు మంచు రూపంలోనే ఉంది. ఒకవైపు జనాభా, తాగునీటి అవసరాలు పెరుగుతుండటం.. మరోవైపు మంచినీటి వనరులు తగ్గుతుండటంతో తాగునీటికి రోజురోజుకీ కొరత పెరుగుతూ వస్తోంది. ఇలాంటి నేపథ్యంలో ఉప్పు నీటిని, సముద్ర జలాలను తాగునీరుగా మార్చుకోగలిగితే? చాలావరకు సమస్య పరిష్కారమవుతుంది. ఇందుకోసం చాలాకాలంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. కొంతమేరకు విజయమూ సాధించాం. సముద్ర జలాలను వేడి చేసి, దాన్నుంచి వెలువడే ఆవిరితో తాగు నీటిని గ్రహించటం.. ఉప్పును వడపోసే పలుచటి పొరల గుండా నీటిని పంపించటం వంటి వాటి ద్వారా తాగు నీటిని కొంతవరకు తయారుచేసుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మందికి పైగా ఇలాంటి తాగు నీటిపైనే ఆధారపడుతున్నారు కూడా. అయితే ఇలాంటి ఫిల్టర్ పొరలతో చిక్కేటంటే- నీటి ప్రవాహ వేగం పెరుగుతున్న కొద్దీ లవణాల వడపోత సామర్థ్యం తగ్గుతూ వస్తుండటం. ఈ సమస్యను అధిగమించగలిగితే పెద్ద ముందడుగు పడినట్టే. చైనాలోని ఝెజాంగ్ విశ్వవిద్యాలయానికి చెందిన పదార్థ శాస్త్రవేత్త లిన్ ఝాంగ్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం ఇలాంటి ఆలోచనే చేసింది. వినూత్న ప్రయోగంతో అతి సూక్ష్మమైన నిర్మాణాలతో కూడిన కొత్తరకం ఫిల్టర్ పొరను రూపొందించింది. సుమారు 70 ఏళ్ల కిందట బ్రిటన్ గణిత శాస్త్రవేత్త అలన్ ట్యూరింగ్ ప్రతిపాదించిన ఒక సిద్ధాంతం దీనికి మూలం కావటం విశేషం.

'పులిచారల' సిద్ధాంతమే ప్రేరణ

పులి ఒంటి మీద చారలెలా ఏర్పడతాయి? జీబ్రా చర్మం మీద గీతలెలా పుట్టుకొస్తాయి? మనమైతే అవి అలా పుడతాయంతే అని అనుకుంటాం గానీ శాస్త్రవేత్తలు అలా కాదు. లోగుట్టును కనుగొనేదాకా నిద్రపోరు. అలన్ ట్యూరింగ్ 1952లో అలాంటి ప్రయత్నమే చేశారు. ఆయన గణిత శాస్త్రవేత్తే అయినా దాన్ని జీవశాస్త్రానికి జోడించి కొత్త విషయాలను కనుగొనే ప్రయత్నమూ చేశారు. పిండంలోని కణాలు కాళ్లు, చేతులు, ఎముకల వంటి అవయవాలుగా ఏర్పడటానికి సంబంధించి ఒక గణిత నమూనాని రూపొందించారు. దీని ప్రకారం- రెండు పదార్థాలు నిరంతరం ఒక దాంతో మరోటి ప్రతిచర్య జరుపుతుంటాయి. వీటిల్లో ఒకటి (ప్రతిచర్య కారకం) నెమ్మదిగా స్పందిస్తుంటే.. రెండోది (విస్తరణ కారకం) దాన్ని వెనక్కి నెట్టటానికి ప్రయత్నిస్తుంటుంది. ఈ క్రమంలో అవి రెండూ కలగలసిపోయి రకరకాల ఆకారాల్లో చర్మం మీద మచ్చలు లేదా గీతల వంటివి ఏర్పడటానికి దోహదం చేస్తాయి. ఈ ట్యూరింగ్ ప్రతిపాదన ఇప్పటివరకు కాగితాలకే పరిమితమైంది. కొందరు దీన్ని ప్రయోగశాలలో పరీక్షించారు గానీ 2డి ఆకారాలను మాత్రమే సాధించగలిగారు. అయితే ఝాంగ్ బృందం తొలిసారిగా నైలాన్ లాంటి పాలీమిడ్ పదార్థంతో 3డీ ట్యూరింగ్ ఆకృతులను సృష్టించింది. ఇదే కొత్తరకం ఫిల్టర్ పొర రూపకల్పనకు దారితీసింది.

సంప్రదాయ పద్ధతికి భిన్నంగా..

పైపెరాజిన్, ట్రైమిసాయ్ల్ క్లోరైడ్ అనే రసాయనాల మధ్య ప్రతిచర్యల మూలంగా పాలీమిడ్ ఏర్పడుతుంది. సంప్రదాయ పద్ధతిలోనైతే పైపెరాజిన్ కన్నా ట్రైమిసాయ్ల్ క్లోరైడ్ వేగంగా విస్తరిస్తుంటుంది. ట్యూరింగ్ ఆకారాలు ఏర్పడటానికి ఇది సరిపోదు. అందుకే ఝాంగ్ బృందం పైపెరాజిన్‌కు పాలీవినైల్ ఆల్కహాల్‌ను కలిపి దాని విస్తరణ వేగం తగ్గేలా చేసింది. ఫలితంగా కొన్నిచోట్ల మాత్రమే పాలీమరీకరణ జరిగి.. గరుకైన బొడిపెలతో, రంధ్రాలతో కూడిన పలుచటి పొర ఏర్పడింది. లవణాల వడపోతకు ఇవే కీలకం కావటం గమనార్హం. బంగారు నానోపార్టికల్స్‌ను కలిపిన నీటిని ఈ పొర గుండా పంపించి చూడగా.. నానోపార్టికల్స్ అన్నీ కూడా గరుకుగా ఉన్న చోటే ఆగిపోయాయి. దీంతో ఇది ఉప్పు వంటి లవణాల వడపోతకూ బాగా ఉపయోగపడుతుందని భావించిన ఝాంగ్ ఉప్పునీటితో పరీక్షించి చూశారు. సెలైన్ ద్రావణంలోని ఉప్పును సగానికి పైగా తగ్గిస్తున్నట్టు గుర్తించారు. అంతేకాదు, మెగ్నీషియం క్లోరైడ్, మెగ్నీషియం సల్ఫేట్ వంటి లవణాలనూ సమర్థవంతంగా వడకట్టేసింది. కేవలం చదరపు మీటరు ఫిల్టర్ పొరతో గంటకు 125 లీటర్ల ఉప్పు నీటిని తాగునీరుగా మార్చొచ్చని పరీక్షల్లో బయటపడింది. సంప్రదాయ ఫిల్టర్ పొరల కన్నా ఇది మూడు రెట్ల వేగంతో నీటిని వడపోస్తుండటం విశేషం. దీన్ని పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేయటానికీ వినియోగించుకోవచ్చని ఝాంగ్ చెబుతున్నారు. ఈ ట్యూరింగ్ ఆకృతుల ప్రక్రియ పూర్తిగా అందుబాటులోకి వస్తే- కృత్రిమ ఎముకలు, రక్తనాళాల వంటి వాటి తయారీకి.. ఆ మాటకొస్తే కృత్రిమ అవయవాల రూపకల్పనకూ ఉపయోగపడగలదని శాస్త్రరంగం భావిస్తోంది.

'ఫిఫా' ఫీవర్ మొదలయ్యింది. ఫాలో అవుతున్నారా? 'అబ్బే... ఎక్కడండీ కుదరట్లే! కానీ, ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ చెక్ చేయాల్సిందే! అందుకేమైనా స్మార్ట్ మార్గాలు ఉన్నాయా?' ఎందుకు లేవు.. స్మార్ట్‌ఫోన్ ఉండగా చింతెందుకు? వర్చువల్ అసిస్టెంట్‌ని అడగొచ్చు. అర్థంకాక 'ఊప్స్' అంటే... యాప్స్‌ని ఓపెన్ చేస్తే సరి! కావాలంటే.. తెరపై స్కోర్ బోర్డుని పిన్ చేసి పెట్టుకోవచ్చు. విరామంలో మీరూ వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడేయొచ్చు.

అరచేతిలో.. కిక్‌రో కో!

యాప్‌లు ఏమున్నాయ్

- 365Scores

ఆట ఏదైనా ఏడాదంతా స్కోరు బోర్డుతో సిద్ధంగా ఉంటుంది. ఫిఫా ఫ్యాన్స్‌కి ఇదో ప్రత్యేక అడ్డానే.

ఆండ్రాయిడ్ డౌన్‌లోడ్: https://goo.gl/838rA6

- Stats Zone

యాపిల్ యూజర్లకు ప్రత్యేకం. స్కోర్‌తో పాటు మ్యాచ్‌లకు సంబంధించిన విశ్లేషణాత్మక వివరాల్ని పొందొచ్చు.

యాపిల్ డౌన్‌లోడ్: https://goo.gl/2spbtT

'లైవ్ స్ట్రీమింగ్' అడ్డాలు

- https://www.sonyliv.com

అన్ని మ్యాచ్‌లను ఫుల్ హెచ్‌డీ క్వాలిటీతో లైవ్ చూడొచ్చు. ముగిసిన మ్యాచ్‌ల హైలైట్స్ కూడా ఉంటాయి.

- http://www.espn.in

సోనీ ఈఎస్‌పీఎన్ వెబ్ ఛానల్‌లోనూ లైవ్ స్ట్రీమింగ్ చూడొచ్చు.

- జియో నెట్‌వర్క్ యూజర్లు 'జియో టీవీ'లో వీక్షించొచ్చు.
- ఎయిర్‌టెల్ యూజర్లు యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకుని 'ఎయిర్‌టెల్ టీవీ'లో చూడొచ్చు.

గ్రాఫిక్: శ్రీనివాస్

'ప్లేయర్'గా మారండి

మ్యాచ్‌ల మస్తీ నడుస్తున్నప్పుడు మనం కూడా రొనాల్డో మాదిరిగా 'ఫ్రీకిక్' కొట్టాలనిపిస్తే.. కొట్టొచ్చు. ఎలా సాధ్యం అంటారా? ఫుట్‌బాల్ గేమ్‌లు ఇన్‌స్టాల్ చేసేయండి.

- Cristiano Ronaldo: Kick'n'Run

బంతికి 'కిక్' ఇవ్వగానే పరుగు మొదలవుతుంది. బాల్‌తో పాటు మీరూ మెరుపు వేగంతో పరిగెత్తాలి. వెళ్లే క్రమంలో ఎదురయ్యే నాణాల్ని సేకరిస్తూ స్కోర్ పెంచుకోవాలి. బాల్‌పై దృష్టిపెడుతూనే దార్లో ఎదురయ్యే ప్రమాదాల్ని తప్పించుకోవాలి. మధ్యలో వచ్చే 'పవర్ ప్యాక్'లను తీసుకుని మరింత శక్తిని పుంజుకుని గేమ్ ఆడొచ్చు.

ఆండ్రాయిడ్ డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/Za1ppq

యాపిల్: https://goo.gl/9GMESB

- FIFA: FIFA World Cup

మ్యాచ్‌ల అంతరాయంలో మూడొచ్చినప్పుల్లా మీరూ వరల్డ్‌కప్ ఆడేద్దాం అనుకుంటే గేమ్‌ని డౌన్‌లోడ్ చేయండి. మీకు ఇష్టమైన ఆటగాళ్లతో టీమ్‌ని తయారు చేసుకుని రంగంలో దిగొచ్చు. గేమ్‌లో మీదైన ప్రదర్శన చేస్తూనే జరుగుతున్న వరల్డ్‌కప్ మ్యాచ్‌ల ఫలితాల్ని ఊహిస్తూ పాయింట్స్ సంపాదించొచ్చు.

ఆండ్రాయిడ్ డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/BSFekF

- PES 2018

స్మార్ట్‌ఫోన్‌లకు తగినట్టుగా సులువైన ఇంటర్ఫేస్‌తో తీర్చిద్దిన ఫుట్‌బాల్ గేమ్. మీకు ఇష్టమైన జట్టుని ఎంపిక చేసుకుని ఆన్‌లైన్‌లో స్నేహితులతో కలిసి ఆడొచ్చు. సుమారు 10,000 మంది ప్లేయర్స్ నుంచి మీకు ఇష్టమైన వారిని బ్రౌజ్ చేసి సెలెక్ట్ చేసుకునే వీలుంది.

ఆండ్రాయిడ్ డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/JWQmdn

- Cover art Zlatan Legends

రొటీన్‌గా ఫుట్‌బాల్ ఆడితే ఏముంది? కాస్త భిన్నమైన లుక్‌తో బంతిని తన్నుతూ వెళ్లే ఆట. గ్రాఫిక్స్ ఆకట్టుకుంటాయి.

ఆండ్రాయిడ్ డౌన్‌లోడ్: https://goo.gl/JjshMh

యాపిల్: https://goo.gl/Yv6fCo

మ్యాచ్ ప్రారంభమయ్యే సమయానికి మఠం వేసుకుని టీవీలు, వీడియో స్ట్రీమింగ్‌ల ముందు కూర్చోవడానికి అందరికీ సాధ్యం కాదు. కొందరు ఆఫీసుల నుంచి ఇళ్లకు చేరుకుంటూనో.. షాపింగ్ చేస్తూనో.. మరేవైనా ఇతర పనుల్లో బిజీగా ఉంటారు. అయినప్పటికీ... ఎవరెవరి మధ్య మ్యాచ్ జరుగుతోంది? గోల్ వేశారంటావా? రేపు మ్యాచ్‌లు ఏమున్నాయ్?... లాంటి అప్‌డేట్స్‌ని ఫాలో అవ్వాలనుకోవడం సర్వసాధారణం. జేబులో స్మార్ట్‌ఫోన్ తీయండి. రష్యాలో జరిగే ఫుట్‌బాల్ రచ్చని అంగుళాల తెరపై ఆసక్తిగా తిలకించొచ్చు. నలుగురితో పంచుకోవచ్చు.

'అసిస్టెంట్'ని అడగండి

యాప్‌లు ఓపెన్ చేయడం... మెనూలను బ్రౌజ్ చేసి చూడడం కొంచెం కష్టమే అనుకుంటే సింపుల్‌గా వర్చువల్ అసిస్టెంట్‌లను పిలవండి. అదేనండీ... మీరు ఆండ్రాయిడ్ యూజర్ అయితే గూగుల్ అసిస్టెంట్... యాపిల్ వినియోగదారులైతే సిరి... శామ్‌సంగ్ అయితే బిక్స్‌బీలను పిలిస్తే చాలు. మొత్తం మ్యాచ్‌ల ముచ్చట్లను ముందుంచుతాయి. 'హే సిరీ.. హు ఓన్ ది స్పెయిన్-పోర్చుగల్ మ్యాచ్?' అని అడిగితే క్షణాల్లో విశ్లేషణల్ని వెతికి తెస్తుంది. 'ఒకే గూగుల్ అని పిలిచి... షో మి రొనాల్డో ఫ్రీ కిక్' అంటే.. వీడియో క్లిప్స్‌ని తెచ్చి చూపిస్తుంది. పాత ఫోన్ కొత్త ఫోన్ అనే తేడా లేకుండా వాడేది ట్యాబ్లెట్ అయినా ఐప్యాడ్ అయినా... ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులు వర్చువల్ అసిస్టెంట్‌లతో ఫిఫా ముచ్చట్లు పెట్టొచ్చు. ఒకవేళ ఇంట్లో స్మార్ట్ స్పీకర్లను వాడుతున్నట్లయితే ఫ్రెండ్‌తో ఫుట్‌బాల్ పురాణం వల్లించినట్టే. ఓ పక్క పని చేసుకుంటూనే 'గూగుల్ హోం' స్పీకర్‌తో మ్యాచ్ సంగతుల్ని చర్చించొచ్చు. యాపిల్ యూజర్లు అయితే హోంపాడ్ ఉండనే ఉంది. అడిగిందే తడవుగా అన్ని విశేషాల్ని చెప్పేస్తుంది. అమెజాన్ అలెక్సాని కూడా అడగొచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే స్మార్ట్ స్పీకర్లు పర్సనల్ స్పోర్ట్స్ రిపోర్టర్లుగా పని చేస్తాయన్నమాట.

తెరపై 'పిన్' చేయొచ్చు

పనిలో భాగంలో పలు అవసరాలకు ఫోన్‌ని వాడుతుంటాం. యాప్స్‌ని ఓపెన్ చేస్తాం.. ఇన్‌బాక్స్ చూస్తాం... వాట్సాప్‌లో ఛాట్ చేస్తుంటాం.. ఇవన్నీ చేస్తూనే మరో పక్క మ్యాచ్ స్కోర్‌పై ఓ కన్నేయాలంటే? సాధ్యమే. ఎలాగంటే... లైవ్ స్కోర్ బోర్డుని తెరపై పిన్ చేస్తే పెట్టుకోవచ్చు. దేన్ని ఓపెన్ చేసినా ఎలాంటి ఇబ్బంది లేకుండా స్కోర్‌బోర్డు నిత్యం కనిపిస్తుంది. ఎక్కడ కావాలంటే అక్కడ బోర్డుని అమర్చుకోవచ్చు. దీన్ని సెట్ చేసుకునేందుకు ఫోన్‌లో గూగుల్ సెర్చ్ యాప్‌ని ఓపెన్ చేయాలి. సెర్చ్‌లో 'ఫిఫా వరల్డ్ కప్' అని టైప్ చేయగానే మొత్తం వివరాలు కనిపిస్తాయి. మ్యాచ్‌లు ఏవైనా లైవ్‌లో ఉన్నప్పుడు 'పిన్' ఆప్షన్ ద్వారా స్కోర్‌బోర్డుని తెరపై వచ్చేలా చేయవచ్చు. బోర్డుని నొక్కి ఉంచి తెరపై ఎక్కడైనా అమర్చుకోవచ్చు.

గూగుల్ గూట్లో...

ఏది తెలుసుకోవాలన్నా గూగుల్ గూటి తలుపు తడతాం. ఫిఫా అప్‌డేట్స్‌ని కూడా గూగుల్ ప్రత్యేకంగా అందిస్తోంది. సెర్చ్‌లో 'ఫిఫా వరల్డ్ కప్' అని కొట్టి చూడండి. విభాగాలుగా సమాచారం కనిపిస్తుంది. మ్యాచ్‌ల తాలూకు వివరాలన్నీ ఒక ట్యాబ్‌లో ఉంటే... 'న్యూస్' విభాగంలోకి వెళ్లి మ్యాచ్‌లకు సంబంధించిన మొత్తం వార్తల్ని ఫాలో అవ్వొచ్చు. 'టేబుల్' ట్యాబ్‌లో పాయింట్ల వివరాలు ఉన్నాయి. ఆటగాళ్లకు సంబంధించిన వివరాల్ని తెలుసుకునేందుకు ప్రత్యేక ట్యాబ్ ఉంది. ఇక నెటిజన్ల ఎంటర్‌టైన్మెంట్ అడ్డా యూట్యూబ్‌లోనూ ప్రత్యేకంగా 'ఫిఫాటీవీ' వెలసింది. మ్యాచ్‌లోని హైలైట్స్‌ని ఆకట్టుకునేలా ఎడిట్ చేసి అందిస్తున్నారు. మ్యాచ్‌కి ముందు తర్వాత ప్లేయర్ల ఇంటర్వ్యూల్ని చూడొచ్చు. గూగుల్ వెబ్ సర్వీసులు, యాప్స్‌లోనూ ఒకేరకంగా ఫిఫా కంటెంట్‌ని యాక్సెస్ చేయవచ్చు. గూగుల్ 'డూడుల్స్' కూడా ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ సందడితోనే ముస్తాబవుతున్నాయ్. డూడుల్‌పై క్లిక్ చేస్తే చాలు. అప్‌డేట్స్ కనిపిస్తాయ్.

రేపే ప్రపంచ యోగా దినోత్సవం. స్మార్ట్ ఫోన్ అందుకోండి. ఎందుకంటే యాప్ స్టోర్‌ల్లో యోగా శిక్షణకు తగిన యాప్‌లు సిద్ధంగా ఉన్నాయి. మీకు సరిపడే వాటిని ఎంపిక చేసుకుని సాధన చేయొచ్చు. ఎందుకంటే... మనం ఫిట్‌గా ఉంటేనేగా దేశం ఫిట్‌గా ఉండేది...

సాధనకు సిద్ధమా?

- **THE ART OF LIVING**

ధ్యానం, ఆధ్యాత్మికం, యోగాలకు సంబంధించి గురువు శ్రీశ్రీ రవిశంకర్ వివరణలు చూడొచ్చు. ఆహ్లాదకరమైన మ్యూజిక్ ట్రాక్స్‌తో మీరూ సాధన చేయొచ్చు.

డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/EW1Foa

- **Daily Yoga**

500లకుపైనే ఆసనాలు, వివరణతో కూడిన 500 పైనే వీడియో ట్యుటోరియల్స్ యాప్‌లో ఉన్నాయి. గూగుల్ ప్లేలో 'ఎడిటర్స్ ఛాయిస్'గా నిలిచింది.

డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/3ZfJ37

మరికొన్ని...

- 7pranayama, https://goo.gl/5nw48k
- Simply Yoga, https://goo.gl/J4mn3n

- **Yoga tools from Sadhguru**

ఆధ్యాత్మిక గురువు జగ్గివాసుదేవ్ ఉపన్యాసాలు, సూచనలతో యోగా సాధనకు సిద్ధం అవ్వొచ్చు. ఐదు నిమిషాల నిడివితోనే వీడియోలు, ఉపన్యాసాలు సాగుతాయి. వీడియోలను డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్‌లో వీక్షించే వెసులుబాటు ఉంది.

డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/pFosDR

మెయిల్స్ పోతే రావా?

ప్రశ్నజవాబులు

■ కొన్ని నెలల ముందు నా జీమెయిల్ నుంచి కొన్ని మెయిల్స్ డిలీట్ చేశా. ట్రాష్‌లో కూడా అవి లేవు. వాటిని మళ్లీ తిరిగి పొందడం ఎలా?

– కుట్టి మూర్తి

మెయిల్ ఎకౌంట్ నుంచి శాశ్వతంగా డిలీట్ చేసిన మెయిల్స్‌ని తిరిగి పొందొచ్చు. అందుకు గూగుల్ నిర్వాహకులకు దరఖాస్తు చేసుకోవాలి. https://goo.gl/oHxbHd లింక్‌లోకి వెళ్లి ఏ మెయిల్ ఐడీ నుంచి రికవర్ చేయాలో తెలపాలి. తర్వాత ఏయే తేదీల మధ్య మెయిల్స్‌ని డిలీట్ చేశారో ఎంటర్ చేయాలి. చివరిగా... మీరు రికవర్ చేయాలనుకుంటున్న మెయిల్స్ మీకెంత ముఖ్యమైనవో తెలుపుతూ 'డిస్క్రిప్షన్'లో రాయాలి. మొత్తం వివరాల్ని ఎంటర్ చేసి పంపితే గూగుల్ నుంచి రిప్లైతో పోగొట్టుకున్న మెయిళ్లు వస్తాయి.

■ నేనొక యాప్‌ని క్రియేట్ చేయాలనుకుంటున్నా. అందుకు తగిన వేదికలు ఏంటి?

– గుండ్ల సాయికుమార్

మొబైల్ యాప్‌ని రెండు రకాలుగా డిజైన్ చేయొచ్చు. కోడింగ్ నేర్చుకుని లేదంటే నెట్టింట్లో అందుబాటులో ఉన్న వెబ్‌సైట్‌లను వాడుకుని చేయొచ్చు. జావా, ఆండ్రాయిడ్ స్టూడియోల్లో బేసిక్ నాలెడ్జ్ తెలిసుండాలి. రెండిటిని వాడుకుని అవసరానికి తగిన యాప్‌లను తయారు చేయొచ్చు. జావా, ఆండ్రాయిడ్ స్టూడియో రెండూ రాకుంటే https://thunkable.com లాంటి కొన్ని వెబ్ సర్వీసుని వాడుకుని చేయొచ్చు. అయితే, అన్నింటి కంటే ముందు ఇంటర్నెట్ పరిజ్ఞానంతో లాజికల్‌గా ఆలోచించగలగాలి. అప్పుడు యాప్ డెవలపర్‌గా మారొచ్చు. – సయ్యద్ హాఫీజ్, తెలుగు టెక్ ట్యూట్స్

టెక్నాలజీ వాడకంలో సందేహం ఏదైనా మాకు పంపండి. నిపుణులతో సూచనలు అందిస్తాం. మా ఈ-మెయిల్: ■ its@eenadu.in

ఈనాడు సినిమా

క్రికెట్ గ్రౌండ్‌లో చైతూ

నాగచైతన్య క్రికెటర్‌గా కనిపించనున్నాడా? బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అంటూ ఆల్ రౌండర్ అవతారం ఎత్తనున్నాడా? అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. నాగచైతన్య కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కనుంది. 'నిన్నుకోరి'తో ఆకట్టుకున్న శివ నిర్వాణ దర్శకుడు. ఇందులో సమంత కథానాయికగా నటిస్తోంది. పెళ్లయ్యాక చైతూ, సమంతలు కలిసి నటించడం ఇదే తొలిసారి. అందుకే ఈ చిత్రంపై ఆసక్తి పెరిగింది. ఇందులో నాగచైతన్య ఓ క్రికెటర్‌గా కనిపిస్తాడని తెలుస్తోంది. క్రీడా నేపథ్య చిత్రంలో నటించడం చైతూకి ఇదే తొలిసారి. ప్రస్తుతం 'సవ్యసాచి', 'శైలజారెడ్డి అల్లుడు' చిత్రాలతో బిజీగా ఉన్నాడు చైతూ. ఆ తరవాత వెంకటేష్, నాగచైతన్య కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కనుంది.

పోలీస్ స్టేషన్‌లో సమంత

కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలంటే మనవాళ్లకు మక్కువ ఎక్కువే. అనుష్క నుంచి అంజలి వరకూ ఈ తరహా కథల్ని ప్రయత్నించారు. విజయాల్ని అందుకున్నారు. ఇప్పుడు ఈ జాబితాలో సమంత కూడా చేరింది. సమంత ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'యు టర్న్'. ఆది పినిశెట్టి, రాహుల్ రవీంద్రన్ కీలక పాత్రధారులు. పవన్ కుమార్ దర్శకుడు. శ్రీనివాస్ చిట్టూరి నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా కోసమే ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ పోలీస్ స్టేషన్ సెట్‌లో సమంత, ఆదిపినిశెట్టిపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే సమంత లుక్‌ని విడుదల చేస్తామని చిత్రబృందం తెలిపింది. భూమిక, ఆడుకలం నరేన్, రవి ప్రకాష్, బిర్లా బోస్, ఛత్రపతి శేఖర్ నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: నికేత్

ఇంకో పదేళ్లయినా...



తమన్నా

అనుభవం సంపాదించిన కథానాయికలంతా ఆచితూచి అడుగులేస్తుంటారు. ప్రాధాన్యమున్న పాత్రలే చేయాలన్న తపనతో కనిపిస్తుంటారు. ఈ ప్రయత్నంలో వేగం తగ్గినా ఫర్వాలేదనేది వాళ్ల అభిప్రాయం. మీరూ అంతేనా? అని తమన్నాని అడిగితే... "నేను కథని కథలాగే చూస్తా. ఎప్పుడైనా సరే... హీరోయిన్ చేయాల్సిన పనిని హీరో చేయలేడు, హీరో చేయాల్సింది హీరోయిన్ చేయలేదు. ఎవరు చేయాల్సింది వాళ్లు చేయాలి. నాకు సినిమాలో ఇంత ప్రాధాన్యం ఉండాల్సిందే అనీ... ఇన్ని సన్నివేశాలు కావల్సిందే అని ఎప్పుడూ ఎవరితోనూ చెప్పలేదు. దర్శకులు చెప్పే కథలోనూ, చేయాల్సిన పాత్రలోనూ నాణ్యతనే గమనిస్తా. హీరోల కథల్లోనూ మంచి పాత్రలు లభిస్తాయనడానికి నా ప్రయాణమే ఉదాహరణ. నేనెక్కువగా వాణిజ్య ప్రధానమైన సినిమాలే చేశా. వాటితోనే గుర్తింపు తెచ్చుకొన్నాను, వాటితోనే నా నటనలో ప్రతిభని చూపించా. ఇప్పుడే కాదు, ఇంకో పదేళ్లుగా కథానాయికగా కొనసాగినా నేను చూసేది మొదట కథనే" అని చెప్పింది తమన్నా. ఆమె ప్రస్తుతం 'దటీజ్ మహాలక్ష్మి' చిత్రంలో నటిస్తోంది.

అమ్మ ఉన్న చోట ఆకలి ఉండదు.
చిత్రం: గౌతమ్ నంద
– పంపినవారు: షేక్ బాబ్జీ, ఊబలంక

పంచ్ డైలాగ్

చింతపండు ప్రేమ!

కంగన

బాలీవుడ్‌లో నాయికా ప్రాధాన్య చిత్రాలకు, విభిన్న పాత్రలకు పెట్టింది పేరు కంగనా రనౌత్. అయితే ఆమె ప్రేమకథా చిత్రాల్లో నటించింది తక్కువనే చెప్పాలి. ఆ లోటు తీరుస్తూ త్వరలో ఓ గాఢ ప్రేమకథలో కంగన కనిపించబోతోందట. ఆ చిత్రాన్ని కంగన గాడ్‌ఫాదర్‌గా పిలుచుకునే అనురాగ్ బసు తెరకెక్కించనున్నారు. 'గ్యాంగ్‌స్టర్'తో కంగనను తెరకు పరిచయం చేశారు అనురాగ్. ఆ చిత్రంతోనే కంగన ప్రతిభ వెలుగులోకి వచ్చి ఆమెకు వైవిధ్యమైన చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. కాలక్రమంలో అగ్రకథానాయకులకు దీటుగా తనకంటూ ఓ ఇమేజ్ సృష్టించుకుంది కంగన. అందుకే తన ఉన్నతికి కారణమైన అనురాగ్ అంటే కంగనకు ఎంతో గౌరవ భావం. 2010లో తాను తెరకెక్కించిన 'కైట్స్'లోనూ కంగనకు అవకాశమిచ్చాడు అనురాగ్. ఎనిమిదేళ్ల విరామం తర్వాత మళ్లీ అనురాగ్ ఈ చిత్రం కోసం కంగనను సంప్రదించారని, ఆమె కూడా అంగీకరించిందని సమాచారం. నగర నేపథ్యంలో నేటి యువ తరాన్ని ప్రతిబింబించే ప్రేమకథతో ఆ చిత్రం రూపొందనున్నట్లు తెలుస్తోంది. అయితే దీనికి అనుకుంటున్న టైటిలే కాస్త విచిత్రంగా ఉంది. అదే 'ఇమలి'. అంటే చింతపండు అని అర్థం. అంటే ఇది చింతపండు లాంటి ప్రేమకథ అనుకోవాలేమో. కాగా ప్రస్తుతం 'మెంటల్ హై క్యా'లో నటిస్తున్న కంగన త్వరలోనే 'మణికర్ణిక'తో ఝాన్సీ లక్ష్మీబాయిగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

'పేపర్‌బాయ్' కథేంటి?

సంతోష్ శోభన్

సంతోష్ శోభన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'పేపర్‌బాయ్'. ప్రియా శ్రీ, తన్య హోప్ కథానాయికలు. వి.జయశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. రాములు, వెంకట్, నరసింహతో కలిసి దర్శకుడు సంపత్ నంది నిర్మిస్తున్నారు. టాకీభాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. "రొమాంటిక్ అంశాలతో రూపొందుతున్న చిత్రమిది. హాస్యానికి ప్రాధాన్యముంది. ఇందులో పేపర్‌బాయ్ ఎవరు? అతని కథేంటన్నది తెరపైనే చూడాలి. వచ్చే నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. సంపత్ నంది పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తున్నామ"ని తెలిపాయి చిత్రవర్గాలు. పోసాని కృష్ణమురళి, బిత్తిరి సత్తి, విద్యుల్లేఖ రామన్, జయప్రకాష్‌రెడ్డి, అన్నపూర్ణమ్మ, అభిషేక్ మహర్షి, మహేష్ విట్టా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కూర్పు: తమ్మిరాజు, ఛాయాగ్రహణం: సుందర్‌రాజన్, కళ: రాజీవ్.

ఒక్క సీన్ చాలు!

"సెకండ్ ఇన్నింగ్స్‌లో నాకు అన్నీ మంచి పాత్రలే దక్కుతున్నాయి. 'శతమానం భవతి', 'రంగస్థలం', 'మహానటి'... ఇలా వరుసగా విజయాలు అందుతున్నాయి. ఇప్పుడు 'సమ్మోహనం' చిత్రానికీ మంచి స్పందన రావడం ఆనందంగా ఉంద"న్నారు నరేష్. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహించిన 'సమ్మోహనం'లో సర్వేష్ పాత్రలో నటించారు నరేష్. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేష్ మాట్లాడారు.

"ఈ కథ వినగానే సుధీర్‌బాబు కెరీర్‌లోనే గొప్ప సినిమా అవుతుందని చెప్పాను. నా అంచనా తప్పు కాలేదు. సుధీర్‌బాబు బాగా నటించాడు. అదితీరావు హైదరీతో పాటు ప్రతి ఒక్కరు ప్రతిభ కనబరిచారు. సినిమా నేపథ్యంలో వచ్చిన సినిమాలు సరిగా ఆడిన దాఖలాలు లేవు. కానీ ఇంద్రగంటి మోహనకృష్ణ ఇంద్రజాలం చేశారు. ప్రేక్షకుడి కోణంలో సినిమాని నడిపి విజయవంతమయ్యారు"

✦ "ఈ విజయం నిర్మాత, దర్శకులదే. అలా అభిరుచి కలిగిన దర్శక నిర్మాతలుంటేనే 'సమ్మోహనం' లాంటి చిత్రాలొస్తాయి. సర్వేష్‌గా నా పాత్ర ప్రేక్షకుల్ని మెప్పించడం ఆనందంగా ఉంది. నా కెరీర్‌లో మరో పది మెట్లు ఎక్కేలా చేసింది. నేను ఎస్వీఆర్‌గారి వీరాభిమానిని. ఆయన్ని కలుసుకోవాలనే నటుడ్ని అయ్యా. ఆయనలా అన్ని తరహా పాత్రలూ చేయాలని ఉంది. నా సెకండ్ ఇన్నింగ్స్‌లో ప్రతి పాత్రా ఓ ప్రత్యేక అనుభూతిని పంచుతోంది"

✦ "నాకు చిన్నా పెద్ద అనే తేడా లేదు. పాత్ర నచ్చితే పారితోషికం గురించి పట్టించుకోకుండా నటిస్తా. ఒకే ఒక్క సీన్ చాలు. పాత్ర నిలబడిపోవడానికి. అలాగని వచ్చిన ప్రతి సినిమా ఒప్పుకోవడం లేదు. ఈమధ్య సమయం లేక ఆరు సినిమాల్ని వదులుకోవాల్సి వచ్చింది. ఇక ముందూ మంచి పాత్రలతో అలరిస్తానని హామీ ఇస్తున్నా"

ప్రపంచంతో పనేంటి?

స్నేహా ఉల్లాల్, చరణ్‌తేజ్

చరణ్‌తేజ్, స్నేహా ఉల్లాల్ జంటగా నటించిన చిత్రం 'ఆయుష్మాన్ భవ'. చరణ్ దర్శకుడు. సీటీఎఫ్ నిర్మించింది. మారుతి సహ నిర్మాత. ఈ చిత్రానికి త్రినాథరావు కథ అందించి, దర్శకత్వ పర్యవేక్షణ చేశారు. ఈనెల 21న టీజర్‌ని విడుదల చేస్తారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రపంచంతో పనేంటి? నాకు నేనే ముఖ్యం అనే ధోరణి కలిగిన ఓ యువకుడి కథ ఇది. పరుచూరి సోదరులు అందించిన స్క్రీన్ ప్లే ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు.

మెరుపై సాగరా ఆ గెలుపే నీదిరా
నీ రేపటి లక్ష్యం మరువకు సోదరా
నిప్పులు చిందినా ఏ పిడుగులు ఆపినా
వెనకడుగే వేయక ముందుకు సాగరా

గీతం: మెరుపై సాగరా...
చిత్రం: స్టైల్, రచన: చిన్నిచరణ్
– పంపినవారు:
ఆర్.రాజగోపాల్, ధర్మవరం

గీతోపదేశం

నీ రూపం కన్నుల్లో...

తేజస్విని, నందు

నందు, తేజస్విని ప్రకాష్ జంటగా నటించిన చిత్రం 'కన్నుల్లో నీ రూపమే'. బిక్స్ ఇరుసర్ల దర్శకత్వం వహించారు. భాస్కర్ భాసాని నిర్మాత. ఈనెల 29న విడుదల కానుంది. దర్శకుడు మాట్లాడుతూ "చక్కటి ప్రేమకథ ఇది. ఇంటిల్లిపాదీ చూసి హాయిగా నవ్వుకునేలా ఉంటుంది. ఇటీవల విడుదల చేసిన పాటలకు, ప్రచార చిత్రానికీ మంచి స్పందన లభిస్తోంది. నందుకి ఇదో కొత్త తరహా పాత్ర. తన కెరీర్‌లోనే మంచి చిత్రంగా మిగిలిపోతుంది. సాకేత్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంద"న్నారు.

సునిశిత హాస్యంతో...

నేహాదేశ్ పాండే, శరశ్చంద్ర

శరశ్చంద్ర, నేహాదేశ్ పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'ఐపీసీ సెక్షన్... భార్యాబంధు'. ఆమని, మధునందన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. రెట్టడి శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆలూరి సాంబశివరావు నిర్మాత. విజయ్ కూరాకుల స్వరకర్త. హైదరాబాద్‌లో పాటల విజయోత్సవం జరిగింది. నిర్మాతలు రాజ్ కందుకూరి, మధుర శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ట్రైలర్‌ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇండియన్ పీనల్ కోడ్‌లోని ఒక ముఖ్యమైన సెక్షన్‌ని ఆధారంగా చేసుకొని రూపొందించిన కుటుంబ కథా చిత్రమిది. విడుదలయ్యాక ఈ చిత్రం గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటార"న్నారు. "సున్నితమైన అంశానికి, సునిశిత హాస్యాన్ని జోడించి ఈ చిత్రాన్ని రూపొందించారు దర్శకుడు. విజయ్ స్వరాలు బాగున్నాయి" అన్నారు రాజ్ కందుకూరి, మధుర శ్రీధర్‌రెడ్డి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామన్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో మౌనశ్రీ మల్లిక్, కె.వి.రమణ, వాసు ఇంటూరి, రాగిణి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నవ్వుల జల్లు

అనీషా ఆంబ్రోస్, సిమ్రాన్ చౌదరి

విశ్వక్ సేన్, సాయి సుశాంత్, వెంకట్ కకుమను, అనీషా ఆంబ్రోస్, సిమ్రాన్ చౌదరి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఈ నగరానికి ఏమైంది'. తరుణ్ భాస్కర్ దర్శకుడు. డి.సురేష్‌బాబు నిర్మాత. ఈనెల 29న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "'పెళ్లి చూపులు' తరవాత నేను చేసిన సినిమా ఇది. సురేష్‌బాబు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. థియేటర్‌కి వచ్చిన ప్రతి ప్రేక్షకుడూ నవ్వుకుంటూ బయటకు వెళ్తాడు. కొత్త స్నేహితుల్ని సంపాదించుకుని, పాత స్నేహితుల్ని గుర్తుకు తెచ్చుకుంటాడు. ఈ కథలోని సస్పెన్స్ అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమాని కొంతమంది ప్రేక్షకులకు చూపించాం. వాళ్ల నుంచి సానుకూల స్పందన వచ్చింది. అది మాలో కొండంత విశ్వాసం నింపింద"న్నారు. "ఒకే ఒక్క రోజు సెట్‌కి వెళ్లాను. ఇదో కొత్త తరహా సినిమా. ఇలాంటి చిత్రాలు విజయవంతమైతే పరిశ్రమ బాగుంటుంద"న్నారు నిర్మాత.

షేక్‌స్పియర్ నాటకంలో ప్రియాంక!

ప్రియాంక చోప్రా బాలీవుడ్‌లో ఓ కొత్త చిత్రంలో నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రముఖ దర్శకుడు విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో నటించడం దాదాపు ఖాయమైనట్టే. ప్రియాంకతో కలిసి మరోసారి పనిచేయాలని ఎంతగానో ఆశపడుతున్నారు భరద్వాజ్. ఆయన తెరకెక్కించిన 'కమీనే', '7 ఖూన్ మాఫ్' చిత్రాల్లో ప్రియాంక నటించింది. "ప్రియాంక అంతర్జాతీయంగా పేరు ఉన్న నటి. ఇప్పటికే న్యూయార్క్‌లో ఆమెను రెండు మూడుసార్లు కలిశాను. త్వరలోనే మేమిద్దం కలిసి పనిచేస్తాం. బహుశా షేక్‌స్పియర్ నాటకం 'ట్వెల్త్ నైట్' ఆధారంగా ఈ చిత్రం ఉంటుంది"అని చెప్పారు విశాల్ భరద్వాజ్. ఆయన గతంలోనూ షేక్‌స్పియర్ నాటకాల ఆధారంగా 'మక్‌బూల్', 'ఓంకార', 'హైదర్' చిత్రాలను తెరకెక్కించారు. భరద్వాజ్ ప్రస్తుతం 'చురియాన్' సినిమాతో బిజీగా ఉన్నారు.

మహిళలకేదీ భద్రత..! బయటకెళ్లిన ఆడపిల్ల క్షేమంగా తిరిగొస్తుందని భరోసా ఎక్కడా? ఇంకెన్నాళ్లు భరించాలీ హింసా..! - అంటోన్న సాటి ఆడపిల్లలకు హైదరాబాద్ షీటీమ్స్ బృందం మేమున్నాం అంటోంది.

ఇనఫ్ ఈజ్ ఇనఫ్ (చాలు.. ఇక చాలు) అనే ప్రచారంతో వారి భద్రతకు హామీ ఇస్తోంది. 'వేధింపులూ, అత్యాచారాలూ, లైంగిక హింస ఇప్పటి వరకూ భరించాం. ఇక చాలు.. ఇక మీకు శిక్షపడేలా చేస్తాం' అంటూ అమ్మాయిల చేత ఆకతాయిలకు హెచ్చరికలు విసురుతోంది.

సంచార వాహనం ద్వారా లఘుచిత్రాలూ, ప్రముఖుల సందేశాలూ, వీడియోల్ని ప్రసారం చేస్తూ... స్వీయరక్షణ, వేధింపులకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తోంది.

చాలు... ఇక చాలు!

'మీ టూ' తరహాలో లైంగిక దాడులపై వ్యతిరేక ప్రచారం

సంచార వాహనంతో 'భరోసా' బృందాల అవగాహన

ఇంటా బయట చిన్నారులూ, యువతులూ, మహిళలు... సురక్షితంగా ఉండేందుకు హైదరాబాద్ పోలీసులు వినూత్న తరహాలో కొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టారు. లైంగిక వేధింపులూ, అత్యాచార యత్నాలూ, అత్యాచారాలను ఎదుర్కొనేందుకూ... అనుమానం రాగానే ఫిర్యాదు చేసేలా ఈ ప్రచారాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు. లైంగిక వేధింపుల్ని ఎదుర్కొనే క్రమంలో ప్రారంభమైన 'మీ టూ' తరహాలో బాధితులతో పాటు ప్రజల్లోనూ అవగాహన తేవాలని నిర్ణయించారు. ఇనఫ్ ఈజ్ ఇనఫ్(చాలు... ఇక చాలు...) పేరుతో ఓ సంచార వాహనాన్ని ఏర్పాటుచేశారు. గత నెల 8న ఈ సంచార వాహన సేవలను లాంఛనంగా ప్రారంభించారు. అప్పటి నుంచి నగరంలోని ప్రధాన ప్రాంతాల్లోని కూడళ్లలో ఆ వాహనాన్ని ఆపి 'భరోసా' కేంద్రం సేవల్ని వివరిస్తున్నారు. ఇందులోభాగంగా 'భరోసా', 'షీ' బృందాల నుంచి నలుగురు సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేర్వేరు చోట్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.

భరించకండి... బయటపెట్టండి!

హైదరాబాద్, బెంగుళూరు, ముంబయి, దిల్లీ వంటి మెట్రో నగరాల్లో చిన్నారులూ, మైనర్లూ, యువతులూ, మహిళలపై లైంగిక వేధింపులు పెరగుతున్నాయి. ఇంటా బయటా ఇవి తప్పడం లేదు. పరువుపోతుందనో, పోలీసుల వద్దకు వెళితే టీవీలూ, పత్రికల్లో ప్రచారమై అసలుకే మోసం వస్తుందనే భయంతో బాధితులు తమ సమస్యలపై పెదవి విప్పడం లేదు. కార్యాలయాలూ, ఫ్లాట్లూ, అపార్ట్‌మెంట్లలో కొందరు దుర్మార్గులు లైంగిక కోర్కెలు తీర్చుకునేందుకు పన్నాగాలు పన్ని దాడులు చేస్తున్నారు. సమస్య ఏదయినా సరే వాటిని ఇకపై భరించకండి. అన్యాయాన్ని పోలీసుల దృష్టికి తీసుకురండి... అనే నినాదంతో పోలీస్ ఉన్నతాధికారులు ఈ ప్రచారాన్ని మొదలుపెట్టారు. మీకు మేం అండగా ఉన్నాం. వాళ్లకు శిక్షణ పడేలా చేస్తాం... అనేదే ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశం.

సేవలు ఇలా అందుబాటులో...

హైదరాబాద్ నగరంలో మహిళల భద్రతకు తెలంగాణ సర్కారు తీసుకుంటున్న చర్యలూ... పోలీసులు అందిస్తున్న సేవలను వివరించేందుకు ఈ సంచార వాహన బృందం వెళ్లిన చోట కరపత్రాల్ని పంచుతోంది. వేధింపుల్ని పరిష్కరించేందుకు దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి వచ్చిన 'భరోసా' కేంద్రం గురించీ వివరిస్తోంది. ఆ కేంద్రం ఎలా పనిచేస్తుందనేదీ తెలియజేస్తుందీ బృందం. 'షి' బృందం ఎలా పనిచేస్తుందో కూడా తెలుసుకోవచ్చు. 100కి ఫోను చేసినా... అంతర్జాలం నుంచి సంప్రదించి సమస్య చెప్పినా చాలు...
పరిష్కారం

పొందవచ్చు అని చెప్పడమే ఈ సంచార వాహనం ప్రధానోద్దేశం.

లఘుచిత్రాలు... సందేశాలు...

లైంగిక వేధింపులూ, అత్యాచారాలూ, అత్యాచార యత్నాలూ, భౌతిక దాడులూ, వేధింపులు ఎలా ఉంటాయి... వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై పోలీసులు ఐదు లఘుచిత్రాలను రూపొందించారు. వీటిని సంచార వాహనంలోని బుల్లితెరపై ప్రదర్శిస్తున్నారు. ఒక్కో చిత్రం రెండు నుంచి నాలుగు నిమిషాలు మాత్రమే ఉంటుంది. చిన్నపిల్లలను ఇరుగుపొరుగువారు లేదా పరిచయస్థులైన యువకులూ, వృద్ధులు ఎలా లైంగికంగా వేధిస్తారు... చిన్నపిల్లల మానసిక స్థితి ఎలా ఉంటుందన్న అంశాలతో కూడిన ఒక లఘు చిత్రం ఎక్కువగా ఆకట్టుకుంటోంది. దీంతోపాటు పార్కుల వద్ద పోకిరీలు యువతిని వేధించగా, ఆమెను రక్షించేందుకు 'షి' బృందాలు రావడం, పోకిరీలను పోలీస్ వ్యాన్ ఎక్కించడం వంటి దృశ్యాలున్న లఘుచిత్రం విద్యార్థినులూ, యువతుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతోందని సంచార వాహనం బాధ్యులు ఎస్.ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. లఘు చిత్రాలతో పాటు ప్రముఖుల సందేశాల వీడియోలను కూడా ప్రదర్శిస్తున్నామని వివరించారు.

రోజుకు నాలుగైదు ప్రాంతాలు...

మహిళలూ, యువతులు, చిన్నారుల భద్రత కోసం మేం పనిచేస్తున్నామని చాలా మందికి తెలియదని సంచార బృందం సభ్యుడు, ఎస్సై వెంకటేశ్వర్లు అంటున్నారు. 'టీవీ ఛానెళ్లలో ప్రసారమవుతోన్న నేర వార్తలూ, పత్రికల్లో వస్తున్న కథనాలు చదవుతున్న యువతులూ మహిళలకు 'భరోసా' కేంద్రం ఉందనే విషయం కూడా తెలియదు. మేం ఇస్తున్న కరపత్రాల ద్వారా వారు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. ఇప్పటి వరూ 720 ప్రాంతాల్లో సంచార వాహనంతో ప్రదర్శనలు ఇచ్చాం. మా వాహనం దగ్గరకు వచ్చిన ప్రతీఒక్కరూ లఘు చిత్రాల్ని ఆసక్తిగా చూస్తున్నారు. సందేహాలనూ అడిగి తెలుసుకుంటున్నారు. వీలైనంత ఎక్కువమందికి అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో రోజులో నాలుగైదు ప్రాంతాలకు వెళ్తున్నాం. మా వాహనాన్ని చూశాక అవగాహన పెరిగి... మహిళలు తమ సమస్యల్ని చెప్పుకోవడానికి ధైర్యం చేస్తున్నారు. ఒకతను తల్లీ కూతురిని వేధించడం మొదలుపెట్టాడు. ఆమె ఓ ప్రయివేటు సంస్థలో పనిచేస్తోంది. సికిందరాబాద్‌లో మా వాహనాన్ని చూసిన ఆమె... తన సమస్యను వివరించింది. ఎవరిని సంప్రదించాలో చెప్పాం. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఆ ఫోన్లూ, మెసేజీల ఆధారంగా అతడిని పట్టుకున్నాం. అలాగే మరో అమ్మాయి. తార్నాక బిగ్‌బజార్‌లో పనిచేస్తోంది. అక్కడికి వచ్చిన ఒకతను ఆమెను చూసి ఫోను నంబరు ఇవ్వమని అడిగాడట. ఆమె ఇవ్వకపోవడంతో మరొకరిని అడిగి తీసుకుని రోజూ వేధించడం మొదలుపెట్టాడు. కొన్నిరోజులు అతనివల్ల బాధపడింది. చివరకు చిక్కడపల్లిలో ఈ వాహనాన్ని చూసి తన సమస్యను వివరించింది. అలా అతడినీ పట్టుకోగలిగాం. మా వాహనం వెళ్లిన ప్రతీచోటా ఇలాంటి ఫిర్యాదులు ఒకటీ రెండూ వస్తూనే ఉన్నాయి. అవి విన్నప్పుడు ఏం చేయాలనేదీ అక్కడిక్కడే వివరిస్తున్నాం. వీలైనంత వెంటనే పరిష్కరించే ప్రయత్నం కూడా చేస్తున్నాం. అప్పుడే మరికొందరు ముందుకు వస్తారు..' అని వివరించారు ఆ పోలీసు అధికారి.

– సునీల్ కుమార్, ఈనాడు హైదరాబాద్

బరువు తగ్గడం లేదా

సన్నగా నాజూగ్గా కనిపించాలని ఎవరికి ఉండదు. ఈ ప్రయత్నంలో కొందరు అతిగా వ్యాయామం చేయడానికి ప్రాధాన్యం ఇస్తే... మరికొందరు పూర్తిగా నోరు కట్టేసుకుంటారు. ఈ రెండూ తప్పే. బరువు తగ్గేందుకు ప్రాథమిక సూత్రాల్ని పాటించినప్పుడే లాభాలుంటాయని మరవకూడదు.

- **కెలొరీల లెక్క వద్దు:** సన్నగా మారాలనే ఆలోచనతో ఏది తిన్నా కెలొరీలు లెక్కేస్తుంటారు చాలామంది. నిజానికి అన్నీ సమపాళ్లల్లో తిన్నప్పుడు అదనపు కెలొరీలు శరీరంలో కొవ్వుగా మారే పరిస్థితి ఉండదు. జీవక్రియల్లో అవన్నీ భాగమై అవయవాలన్నీ చురుగ్గా పనిచేసేందుకు సాయపడతాయి. అంతేకాదు వయసుని బట్టి శరీరానికి కెలొరీల అవసరం తప్పనిసరి. దాన్ని తెలుసుకోగలిగితే బరువుని అదుపులో ఉంచుకోవడం సులువు. రోజూ వీలైనన్ని ఎక్కువ కెలొరీలు ఖర్చు పెట్టగలిగితే చాలు.
- **ఒకటే వద్దు:** రోజూ ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్తున్నా అనో, మరో వ్యాయామం చేస్తున్నా అనో సరిపెట్టుకోవద్దు. మీ శరీరం వ్యాయామానికి అలవాటు పడటానికి ముందు ఇలాంటివి చేయాలి. తరువాత శరీరం మొత్తం ప్రభావం చూపించే వ్యాయామాలు వారానికి సరిపడా ప్రణాళిక వేసుకుని చేయాలి. తాడాట, సిట్-అప్స్, డ్యాన్స్, యోగా, ఈత...ఇలా అన్నీ ఉండేలా చూసుకోవాలి. ఉత్సాహంగా ఉండాలంటే కొత్తగా వస్తున్న ఫిట్‌నెస్ ట్రెండ్‌లనూ అనుసరించొచ్చు.
- **నిద్రపోవాల్సిందే:** ఎంత వ్యాయామం చేసినా బరువు తగ్గడంలేదా! అంటే మీరు తగినంతగా నిద్రపోవడంలేదమో గమనించుకోండి. ఎందుకంటే తీసుకున్న ఆహారం, దానికి తగిన వ్యాయామంతో పాటు కంటినిండా నిద్రకూడా అందినప్పుడే శరీర జీవక్రియలన్నీ సక్రమంగా జరుగుతాయి. మీరూ నాజూగ్గా మారతారు.

హీల్స్ వేసుకునే ముందు...

ఎత్తు తక్కువగా ఉన్నప్పుడూ, జీన్స్ వేసుక్నుప్పుడూ, ఆధునికంగా కనిపించాలనుకున్నప్పుడు అమ్మాయిలు ఎత్తుమడమల చెప్పులు ఎంచుకుంటారు. అంతకన్నా ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే సమస్యలొస్తాయి.

- ఎత్తుమడమల చెప్పులు వేసుకుంటే.. మునివేళ్లమీదా ప్రభావం పడుతుంది. అందుకే కాలిగోళ్లు మరీ పొడుగ్గా లేకుండా కత్తిరించుకోవాలి.
- పాదాల పగుళ్లూ, ఇతర ఇన్‌ఫెక్షన్లూ, సమస్యలు లేకుండా చూసుకోవాలి. లేదంటే అవి వేసుకున్నప్పుడు పాదాలపై ఒత్తిడి పడి ఆ సమస్యలు ఇంకా పెరుగుతాయి.
- పాదాలు శుభ్రంగా ఉంచుకోవాలి. స్నానం చేసే సమయంలో ప్యూమిస్ రాయితో మృతచర్మాన్ని తీసేయాలి. స్నానం పూర్తయ్యాక మాయిశ్చరైజర్ లేదంటే పెట్రోలియం జెల్లీతో మర్దన చేసుకోవాలి. పాదాలు మృదువుగా మారతాయి. పాడిబారినట్టు ఉంటే ఆ చెప్పులు వేసుకున్నప్పుడు అసౌకర్యంగా అనిపిస్తుంది.
- చాలామందికి కాలమేదైనా సరే.. పాదాలకు చెమట ఎక్కువగా పడుతుంది. అలాంటప్పుడు హీల్స్ వేసుకుంటే అవి జారినట్లై పాదాలు బెణుకుతాయి. అందుకే ముందుగా యాపిల్ సిడార్ వెనిగర్‌ని అరికాళ్లకు రాయాలి. పావుగంటయ్యాక కడిగేస్తే చెమటా, దుర్వాసనా సమస్యలుండవు.
- కొత్తగా ఎత్తుమడమల చెప్పులు ప్రయత్నిస్తోంటే సాక్సులు వేసుకోవడం మంచిది. దీనివల్ల చర్మానికి ఇబ్బంది ఉండదు. నడకా అలవాటు అవుతుంది.
- నచ్చినవి ఎంపిక చేసుకోవడానికి బదులు పాదాల ఆకృతికి తగ్గట్టు ఎంచుకుంటే నడవడానికి సౌకర్యంగా ఉంటుంది.

ఫొరాహుషార్

ప్రేమించలేదని మార్ఫింగ్ చేశాడు!

ఓ రోజు ఉదయాన్నే నిఖితకి స్నేహితురాలు గీత నుంచి ఫోన్ వచ్చింది. కానీ ఎత్తాలంటే వణికిపోతుంది. నిజానికి గీత ఫోన్‌కాల్ మాత్రమే కాదు ఏ ఫోను, ఏ మెసేజ్ వచ్చినా కూడా ఉలిక్కిపడుతోంది. ఇంతకీ నిఖిత ఎవరూ... ఆమెకు ఏమయ్యిందీ...

నిఖితది హైదరాబాద్. ఉద్యోగస్తురాలు. గత రెండు రోజులుగా ఓ అపరిచితుడి నుంచి ఆమె వాట్సాప్, ఫేస్‌బుక్‌లకు మార్ఫింగ్ చేసిన నగ్న చిత్రాలు వస్తున్నాయి. ఆ ఫొటోలన్నీ ఆమెవే. బ్లాక్ చేసినా కొత్త ఖాతాలూ, కొత్త ఫోన్ నంబర్ల నుంచి మళ్లీ వస్తున్నాయి. ఇప్పుడు అవే ఫొటోల్ని ఆమె స్నేహితులకూ పంపిస్తున్నాడు. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలో తెలియకే ఎవరు ఫోను చేసినా... ఏ మెసేజ్ వచ్చినా స్పందించడానికి భయపడుతోంది. ఇక ఆ ఒత్తిడి తట్టుకోలేక చనిపోవాలనే నిర్ణయానికీ వచ్చేసింది. కానీ అప్పుడే ఓ స్నేహితురాలి సలహాతో, కుటుంబ సభ్యుల సాయంతో సైబరాబాద్ పోలీసుల్ని సంప్రదించింది. ఇంతకీ ఎవరతడు? ఆమెపై ఎందుకీ పగ? దాన్ని పోలీసు బృందం ఎలా ఛేదించిందో చెబుతున్నారు డీసీపీ జానకీ షర్మిల.

నిఖిత ఫిర్యాదు ఆధారంగా ఆమెతో పాటు ఆమె స్నేహితులకు వచ్చిన చిత్రాలూ, సందేశాలను గమనించి వాటిపై నిఘా పెట్టింది మా బృందం. ఇవి ప్రధానంగా ఫేస్‌బుక్‌లో నిఖిత, ఆమె స్నేహితులు కలిసి ట్యాగ్ చేసుకున్న చిత్రాలని అర్థమయ్యింది. వాటిని కత్తిరించి గూగుల్‌లోని నగ్న చిత్రాలతో జతచేసి వాటిని ఆమెవిగా చెబుతూ పంపిస్తున్నాడని తెలుసుకున్నాం. ముందుగా అవి ఏ నకిలీ ఖాతాల నుంచి వస్తున్నాయో తెలుసుకుని వాటిని బ్లాక్ చేయించగలిగాం. ఆమెకు శత్రువులు ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో ఆరా తీయడం మొదలుపెట్టాం. ఆమెతో మాట్లాడితే కొన్నాళ్ల క్రితం సహోద్యోగి రాజేష్ ఆమెను ప్రేమించాననీ, పెళ్లి చేసుకుంటానని ప్రతిపాదన తెచ్చాడని తెలిసింది. అయితే ఆమె దాన్ని తిరస్కరించింది. అతడిని ఓ సారి విచారిద్దాం అనుకుంటే రెండు నెలలుగా అతడు ఉద్యోగానికి రావడం లేదనీ తెలిసింది. అతనే కావచ్చనే సందేహం వచ్చినా ఇతర కోణాల్లోనూ దర్యాప్తు చేయడం మొదలుపెట్టాం. అతడు వాడుతున్న సోషల్‌మీడియా ఖాతాలు ఆధారంగా ఐపీ అడ్రస్‌ని తెలుసుకోగలిగాం. మేం ముందే ఊహించినట్లు రాజేషే నిందితుడని అర్థమైంది. గత కొన్నేళ్లుగా నిఖిత, రాజేష్‌లు ఇద్దరూ ఓ కార్పొరేట్ కంపెనీలో సహోద్యోగులు. ఒకే బృందంలో సభ్యులుగా ఉండేవారు. ఆ క్రమంలో అతడు ఆమెను ఇష్టపడటం మొదలుపెట్టాడు. తన ప్రేమ విషయం ఆమెతోనూ చెప్పాడు. అయితే ఆమె తనకా ఉద్దేశం లేదని చెప్పింది. చాలా రోజులు ఒప్పించడానికి ప్రయత్నించాడు తల్లిదండ్రుల ఇష్టప్రకారమే పెళ్లి చేసుకుంటానని ఆమె చెప్పడంతో అతడు నిఖితపై కోపం పెంచుకున్నాడు. రెండు నెలలుగా విధులకూ వెళ్లడం లేదు. ఈలోగానే ఆమె పేరు మీద వేర్వేరు ఖాతాలు తెరిచి ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరించడం మొదలు పెట్టాడు. అతడి దగ్గరనుంచి వేర్వేరు పేర్లతో ఉన్న సిమ్ కార్డులను, ఫోను, ల్యాప్‌టాప్ వంటివన్నీ స్వాధీన పరుచుకుని అరెస్ట్ చేశాం. ఫేస్ బుక్‌ల వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు ఫొటోలు ట్యాగ్ చేయడం, వ్యక్తిగత ఫొటోలను పెట్టడం వంటివి ఎప్పటికైనా మిమ్మల్ని ప్రమాదంలోకి నెట్టేయొచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండటమే మంచిది.

సైబర్ నేరాలపై సమస్యలుంటే
sho_cybercrimes@cyb.tspolice.gov.in కి సంప్రదించవచ్చు

పక్షికి తాళం తగిలిద్దామా

బైక్ తాళాలూ, కళ్లజోడూ, ఇయర్‌ఫోన్స్, పర్సూ తరచూ మనం ఎక్కడో పెట్టి మరెక్కడో వెతికే వస్తువులు. ఇవి సులువుగా కనిపించేలా ఓ కొక్కానికి తగిలించే ఏర్పాటు చేస్తే బాగుంటుందీ కదూ. అయితే అవి సాదాసీదాగా కాకుండా ఆకట్టుకునేలా భిన్నంగా ఉంటేనే కదా అందం. అలా విభిన్నంగా కనిపించే కొక్కాలే ఇవి. కార్టూన్ బొమ్మలూ, పక్షులూ, మొక్కలూ, గొడుగులూ, బుజ్జి బుజ్జి టెడ్డీబేర్‌లూ... ఇలా అన్నీ అవే. ఇంకొన్ని డిజైన్లు కావాలనుకుంటే ఆన్‌లైన్లోనూ ప్రయత్నించొచ్చు.

నజరానా

లిప్‌స్టిక్ వేసుకునే ముందు పెదవులు పొడారినట్లు కనిపిస్తున్నాయా... కొద్దిగా పెట్రోలియం జెల్లీలో చిటికెడు చక్కెర కలిపి పెదవులకు రాయండి. ఐదు నిమిషాలయ్యాక కడిగేసి లిప్‌స్టిక్ వేసుకుని చూడండి.

బంగారం వెండి

19న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,880	31,850	31,700	31,750
ఆర్నమెంట్	29,780	29,750	29,400	29,450
వెండి (కిలో)	41,150	41,450	41,600	41,600
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,780	31,750	31,885	31,792
ఆర్నమెంట్	29,430	29,350	29,490	29,450
వెండి (కిలో)	41,200	41,300	41,100	41,300
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,720	31,610	-------	-------
ఆర్నమెంట్	29,500	29,400	2,949	2,945 గ్రా
వెండి (కిలో)	42,900	42,900	43.20	43.60 గ్రా

తడివాసన వదలాలంటే

ఈ కాలంలో ఉతికిన దుస్తులు ఒక పట్టాన ఆరవు. ఆరిన బట్టలను అల్మారాలో పెట్టినప్పుడు తడివాసన వస్తుంటాయి. అలాగే కొన్నిసార్లు ఇల్లంతా కూడా దుర్వాసన వస్తుంది. అలాంటప్పుడు ఏం చేయాలంటే...

నిమ్మరసం: దుర్వాసనకు కారణమయ్యే సూక్ష్మజీవులూ, ఫంగస్‌ను నిమ్మరసంలోని ఎసిటిక్ ఆమ్లం నిర్మూలిస్తుంది. అర బకెట్ నీటిలో రెండు చెంచాల నిమ్మరసం కలిపి దుస్తులను అందులో ముంచి ఆరేయండి. అలాగే నిమ్మరసం కలిపిన నీటితో గదుల్నీ తుడవొచ్చు

వెనిగర్: దీనికి కూడా ఫంగస్‌ను నిర్మూలించే శక్తి ఉంటుంది. ఇంట్లో దుర్వాసన వస్తోంటే... వెనిగర్ కలిపిన నీటిని ఇల్లంతా చల్లాలి. ఆ తరువాత తుడిచేయాలి.

వంటసోడా: మీ ముక్కుకు ఇబ్బంది కలిగించే ఎలాంటి దుర్వాసననైనా ఇది పీల్చేస్తుంది. దుర్వాసన వచ్చే ప్రాంతాల్లో దీన్ని అక్కడక్కడా చల్లి చూడండి చాలు. మార్పు తెలుస్తుంది.

ఉప్పు: ఇది ఎక్కువగా ఉండే తేమను పీల్చేస్తుంది. దుర్వాసన సమస్యనీ నివారిస్తుంది. జేబు రుమాలులో ఉప్పు వేసి మూటలా కట్టి దుర్వాసన వచ్చే చోట ఉంచితే చాలు.



అనేక సమస్యలు.. ఆర్థిక ఇబ్బందులు.. మధ్యలో ఆపేసిన వాళ్లు, అసలు చదువుకోని వాళ్లు... మొదట్లో చదువును నిర్లక్ష్యం చేసి తర్వాత జ్ఞానోదయమైన వాళ్లు.. వీళ్లందరికీ నచ్చిన కోర్సులో తక్కువ ఖర్చుతో డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్లను అందిస్తున్నాయి దూరవిద్యా కేంద్రాలు. ప్రతి పౌరుడినీ అక్షరాస్యుడిని చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. వృత్తి, ఉద్యోగాలు చేసుకుంటూ ఇంటి నుంచే ప్రాథమిక విద్య నుంచి పీహెచ్‌డీ వరకు పట్టాలు పుచ్చుకోవచ్చు.

చేరువలో దూరవిద్య!

దూరవిద్య ఇప్పుడు ప్రతి ఒక్కరికీ చాలా దగ్గరైంది. రెగ్యులర్ కోర్సులతో సమానంగా విస్తరిస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి పీహెచ్‌డీ వరకు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసమే ప్రత్యేకంగా కొన్ని విశ్వవిద్యాలయాలు ఆవిర్భవించాయి. దాదాపు ప్రతి యూనివర్సిటీలోనూ దూరవిద్యా విభాగం ఉంది. ఈ సర్టిఫికెట్లను రెగ్యులర్‌తో సమానంగా గుర్తిస్తున్నారు. అందువల్ల కాలేజీలకు వెళ్లి చదవడం సాధ్యం కానివారు దర్జాగా దూరవిద్యలో చేరిపోవచ్చు. ఇగ్నో, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాష్ట్రస్థాయి, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, పలు ప్రైవేటు విద్యాసంస్థలు దూరవిద్యను అందిస్తున్నాయి.

ఓపెన్ స్కూలింగ్

బడికి వెళ్లి చదువుకోవడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఆర్థిక పరిస్థితులు, అనారోగ్యం..ఇలా కారణాలు ఏవైనా కావొచ్చు. వీరి కోసమే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ఆవిర్భవించింది. పౌరులందరినీ విద్యావంతులు చేయాలనే లక్ష్యంతో దీన్ని నెలకొల్పారు. ఇప్పుడున్న వయోజనుల్లో ఎందరో నిరక్షరాస్యులు ఉన్నారు. వారుకూడా ఓపెన్ స్కూల్ బాట పట్టవచ్చు. ప్రైమరీ (ప్రాథమిక), సెకండరీ (హైస్కూల్), సీనియర్ సెకండరీ (ఇంటర్మీడియట్) విద్యను ఈ విధానంలో పూర్తి చేయవచ్చు. రెగ్యులర్ చదువులకు సమానమైన గుర్తింపు ఈ విద్యా విధానానికి ఉంది. ఫీజులు తక్కువగానే ఉంటాయి. విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంచుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనే కోర్సులో చేరిపోవచ్చు. పరీక్షలు ఏడాదికి రెండు సార్లు నిర్వహిస్తారు. సంబంధిత కోర్సు అయిదేళ్లలోగా ఎప్పుడైనా పూర్తిచేసుకోవచ్చు. ఈ వ్యవధిలో తొమ్మిదిసార్లు పరీక్ష రాసుకోవచ్చు.

సెకండరీ కోర్సుల్లో ప్రవేశానికి ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలి. అలాగే జులై 1 నాటికి 14 ఏళ్లు నిండాలి. సీనియర్ సెకండరీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండరీ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి. జులై 1కి పదిహేనేళ్లు పూర్తవ్వాలి. సెకండరీ కోర్సులను తెలుగు, ఇంగ్లిష్, హిందీ మొదలైన మాధ్యమాల్లో చదువుకోవచ్చు. సీనియర్ సెకండరీ కోర్సులు తెలుగు మీడియంలో అందించడం లేదు. అయిదు పేపర్లలోనూ ఉత్తీర్ణత సాధిస్తే కోర్సు పూర్తవుతుంది. విద్యార్థులు అదనంగా మరో రెండు సబ్జెక్టులను తీసుకోవచ్చు. అది తప్పనిసరి కాదు. గరిష్ఠంగా ఏడు సబ్జెక్టులు చదువుకోవచ్చు.

అయిదేళ్లు నిండిన 14 ఏళ్ల లోపు బాలలకు, నిరక్షరాస్యులకు ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) పేరుతో ఏ, బీ, సీ అనే మూడు కోర్సులు ఉన్నాయి. ఇందులో 'ఎ' లెవెల్ మూడో తరగతి స్థాయి, 'బి' అయిదో తరగతి, 'సి' ఎనిమిదో తరగతికి సమానం. ఈ లెవెల్స్ తర్వాత సెకండరీ, అనంతరం సీనియర్ సెకండరీ కోర్సులు చేయవచ్చు.

వర్చువల్ ఓపెన్ స్కూలింగ్: ఎన్ఐఓఎస్‌లో వర్చువల్ విధానంలో ఆరు నెలల వ్యవధితో అగ్రికల్చర్ అండ్ యానిమల్ హజ్బెండరీలో సర్టిఫికెట్ కోర్సు అందిస్తున్నారు. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులు అర్హులు. కోర్సు ఫీజు రూ.1500. అలాగే పది అర్హతతో ఐసీటీ అప్లికేషన్స్‌లో 6 నెలల వ్యవధితో సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. ఫీజు రూ.3000.

ఒకేషనల్ కోర్సులు: సెకండరీ స్థాయిలో కార్పెంట్రీ, సోలార్ ఎనర్జీ టెక్నీషియన్, బయో గ్యాస్ ఎనర్జీ టెక్నీషియన్, బ్యాకరీ అండ్ కన్ఫెక్షనరీ, వెల్డింగ్ టెక్నాలజీ, టైప్ రైటింగ్ కోర్సులు ఉన్నాయి. సీనియర్ సెకండరీలో స్టెనోగ్రఫీ, సెక్రటేరియల్ ప్రాక్టీస్, ప్లాంట్ ప్రొటెక్షన్, హౌస్ కీపింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, క్యాటరింగ్ మేనేజ్‌మెంట్, హోటల్ ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్స్, పౌల్ట్రీ ఫార్మింగ్, వాటర్ మేనేజ్‌మెంట్ ఫర్ క్రాప్ ప్రొడక్షన్, ఫర్నిచర్ అండ్ క్యాబినెట్ మేకింగ్, ఎలక్ట్రోప్లేటింగ్ తదితర కోర్సులు ఉన్నాయి. కోర్సును బట్టి వ్యవధి ఆరు నెలలు లేదా ఏడాది ఉంటుంది. యోగా టీచర్ ట్రైనింగ్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ మొదలైన డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు.

చివరి తేదీ: అపరాధ రుసుం లేకుండా జులై 31, రూ.700 అపరాధ రుసుంతో సెప్టెంబరు 17 వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది. www.nios.ac.in

తెలుగు రాష్ట్రాల్లో: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీల ద్వారా సెకండరీ, సీనియర్ సెకండరీ కోర్సుల్లో చేరవచ్చు. వీటికి సంబంధించిన అర్హతలు, వయసు అన్నీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) మాదిరిగానే ఉంటాయి. వీటిలోనూ ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ కోర్సులు ఉన్నాయి. జులై / ఆగస్టులో ప్రవేశాలకు ప్రకటన వెలువడుతుంది.

నేరుగా డిగ్రీలోకి

విద్యార్హతలతో సంబంధం లేకుండా, ఏ విద్యార్హతలూ లేనివారు నేరుగా డిగ్రీ కోర్సుల్లో చేరిపోవచ్చు. ఇందుకోసం 18 ఏళ్లు నిండి, అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. ఈ విధానంలో ప్రవేశానికి బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రకటన వెలువడింది. జూన్ 20లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 24న ప్రవేశపరీక్ష ఉంటుంది. ఈ యూనివర్సిటీలో సాధారణ డిగ్రీ (బీఏ) కోర్సులను కేవలం రూ.6000 ఫీజుతో పూర్తిచేయవచ్చు. నేరుగా డిగ్రీలో ప్రవేశానికి ఆంధ్రా యూనివర్సిటీ ప్రకటన వెలువడింది. జులై 2లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఇగ్నో

దూరవిద్య ప్రస్తావనలో ప్రథమంగా గుర్తొచ్చేది ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో). ఇక్కడ లేని కోర్సు ఉండదంటే అతిశయోక్తి కాదు. ఎవరు ఏ కోర్సులో చేరాలనుకున్నా ఇగ్నో చిరునామాగా నిలుస్తుంది. తక్కువ ఫీజు, నాణ్యమైన స్టడీ మెటీరియల్, అందుబాటులో అధ్యయన కేంద్రం ఉండడం దీని ప్రత్యేకత. ప్రపంచంలోనే దూరవిద్య విధానంలో ఇగ్నో ఒక విశిష్ట సంస్థగా గుర్తింపు పొందింది. సర్టిఫికెట్, డిప్లొమా, యూజీ, పీజీ, పీజీ డిప్లొమా, ఎంఫిల్, పీహెచ్‌డీ ఇలా అన్ని విభాగాల్లోనూ అన్ని రకాల కోర్సులను ఇగ్నో అందిస్తోంది. ఏడాదికి రెండు సార్లు జనవరి, జులైలో నోటిఫికేషన్లు వస్తాయి. ఇక్కడ బీఏ, బీకాం కోర్సులకు ఏడాదికి రూ.2400 చొప్పున ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. అదే బీఎస్సీ కోర్సుకైతే రూ.4200 చెల్లించాలి. **వెబ్‌సైట్:** www.ignou.ac.in

వీటిని గమనించాలి

దూరవిద్య అందిస్తున్న విశ్వవిద్యాలయం / సంస్థకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) / ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) గుర్తింపు ఉండడం తప్పనిసరి. దీంతోపాటు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డీఈసీ) గుర్తింపు ఉండాలి. కేవలం సంస్థకు గుర్తింపు ఉంటే సరిపోదు. ఆ సంస్థ నిర్వహిస్తున్న కోర్సుకూ గుర్తింపు ఉండాలి. పరీక్ష కేంద్రం, స్టడీ సెంటర్ అందుబాటులో ఉండడం, స్టడీ మెటీరియల్ నాణ్యత, కాంటాక్ట్ తరగతుల నిర్వహణ, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం సరళంగా ఉండడం, అందుబాటు ధరల్లో ఫీజులు ఉండే సంస్థను ఎంచుకోవాలి.

దేశవ్యాప్తంగా దూరవిద్యను అందిస్తున్న విశ్వవిద్యాలయాలు, సంస్థల వివరాలను www.eenadupratibha.net లో చూడవచ్చు.

సందేహాలు - సమాధానాలు



■ దూరవిద్యలో డిగ్రీ చదివితే పోటీ పరీక్షలకు అర్హత ఉంటుందా?

దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసినవారు అన్ని పోటీ పరీక్షలకూ అర్హులే. ఈ అర్హతతో యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామ్ (సీడీఎస్ఈ) రాసుకోవచ్చు. బ్యాంక్ పీవో, క్లర్క్, రైల్వేలో ఏఎస్ఎం, గూడ్స్ గార్డు, రిజర్వేషన్ కమ్ ఎంక్వైరీ క్లర్క్ తదితర పోస్టులకు, కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే గ్రూప్ -1, గ్రూప్ -2, సబ్-ఇన్‌స్పెక్టర్ మొదలైన పరీక్షలన్నింటికీ పోటీ పడవచ్చు.

■ బీటెక్, లా కోర్సులు దూరవిద్యలో చదవడానికి వీలుందా?

బీటెక్ / బీఈ, మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులను దూరవిద్యలో చదువుకోవడానికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతించడం లేదు. అయితే ఇంజినీరింగ్ (బీఈ/ బీటెక్)తో సమానమైన డిగ్రీని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ద్వారా చదువుకోవచ్చు. ఇక్కడ కోర్సు పూర్తిచేసుకున్న వారికి అసోసియేట్ మెంబర్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్ (ఏఎంఐఈ) డిగ్రీని ప్రదానం చేస్తారు. బీఈ / బీటెక్‌లతో సమాన గుర్తింపు ఉన్న కోర్సు ఇది. ఈ డిగ్రీతో యూపీఎస్సీ నిర్వహించే ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్), ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే గేట్‌లతోపాటు డిగ్రీ అర్హతతో ఉండే అన్ని పోటీపరీక్షలకూ హాజరుకావచ్చు. ఎల్ఎల్‌బీ కోర్సును దూరవిద్యలో కొనసాగించడానికి బార్ కౌన్సిల్ అనుమతించడం లేదు. కాబట్టి సాధ్యం కాదు. ఎల్ఎల్ఎంను కొన్ని యూనివర్సిటీలు దూరవిద్య ద్వారా అందిస్తున్నాయి.

■ పదోతరగతి, ఇంటర్మీడియట్ లేకుండా డిగ్రీ దూరవిద్యలో చదివితే అన్ని పోటీ పరీక్షలకు, కోర్సుల్లో ప్రవేశానికి అర్హత లభిస్తుందా?

టెన్త్, ఇంటర్ చదవకపోయినప్పటికీ దూరవిద్య ద్వారా నేరుగా డిగ్రీ కోర్సు పూర్తిచేసినవాళ్లు అన్ని పరీక్షలకూ పోటీపడవచ్చు. సెకండరీ గ్రేడ్ టీచర్లు కావాలనుకున్నవారు 10+2 విధానంలో చదవాల్సిందే. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 10+2+3 విధానం తప్పనిసరి. న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోసం 10+2, మూడేళ్ల ఎల్ఎల్‌బీకి 10+2+3 విధానంలో చదివుండాలి.

■ డిగ్రీ రెండేళ్లు రెగ్యులర్‌గా చదివిన తర్వాత ఉద్యోగం వస్తే మూడో ఏడాది కోర్సు దూరవిద్యలో ఆ ఒక్క ఏడాది చదువుకోవచ్చా? లేదంటే మళ్లీ మొదటి నుంచి చదవాల్సిందేనా?

అనుకోని కారణాలతో డిగ్రీ మధ్యలో ఆపేసినవాళ్లు తిరిగి ప్రథమ సంవత్సరం నుంచి చదవాల్సిన అవసరం లేదు. రెండేళ్ల కోర్సు పూర్తిచేసి ఉంటే మూడో సంవత్సరం కోర్సు దూరవిద్యలో చేరి పరీక్షలు రాసి సర్టిఫికెట్ పొందవచ్చు. ఈ సౌలభ్యాన్ని పలు యూనివర్సిటీలు కల్పిస్తున్నాయి.

■ దూరవిద్యలో ఇగ్నో నుంచి సైకాలజీ, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్ ఒకే విద్యా సంవత్సరంలో చేరవచ్చా? ఒకే విద్యా సంవత్సరంలో రెండు కోర్సులకు అనుమతి ఉందా?

ఒకే విద్యా సంవత్సరంలో దూరవిద్యలో రెండు డిగ్రీలు చేయడానికి అధికారికంగా అనుమతి లేదు. ఒక డిగ్రీతోపాటు మరో సర్టిఫికెట్ కోర్సును లేదా కొన్ని రకాల డిప్లొమాలను ఏకకాలంలో చేసుకోవచ్చు.

■ మూడేళ్ల డిగ్రీ కోర్సు కేవలం ఒక్క ఏడాదిలో పూర్తిచేసుకోవడానికి వన్ సిటింగ్ విధానంలో చదువుకోవచ్చా? ఇలాంటి డిగ్రీలు చెల్లుబాటు అవుతాయా?

మూడేళ్ల కోర్సును ఒకే ఏడాదిలో పూర్తిచేసుకోడానికి అనుమతి లేదు. వన్ సిటింగ్ ప్రకటనలు చూసి మోసపోవద్దు. చేరితే సమయం, డబ్బులు రెండూ వృథా.

■ పోటీపరీక్షలు, ఇంటర్వ్యూల్లో దూరవిద్యలో చదివినవారితో పోలిస్తే రెగ్యులర్ విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందా? నిజమేనా?

అది అపోహ మాత్రమే. ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూల్లో రెగ్యులర్, దూరవిద్య ఇద్దరికీ సమాన ప్రాధాన్యమే ఉంటుంది. మెరుగైన ప్రతిభ చూపినవారికి రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా అవకాశాలు తప్పకుండా లభిస్తాయి. ప్రైవేటు నియామకాలకు సంబంధించి ప్రకటనలో దూరవిద్యలో కోర్సు చేసినవారికి అవకాశం లేదని స్పష్టం చేస్తే తప్ప అక్కడ కూడా రెగ్యులర్, దూరవిద్య ఇద్దరికీ సమాన ప్రాధాన్యమే ఉంటుంది.

■ సైన్స్ డిగ్రీల కోసం రెగ్యులర్‌గా చదవాల్సిందేనా? దూరవిద్యలో చదువుకుంటే సమయం, డబ్బులు ఆదా అవుతాయి కదా?

దూరవిద్య రెగ్యులర్ విద్యకు పూర్తిగా ప్రత్యామ్నాయం కాదు. సైన్స్ కోర్సులైన కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ మొదలైన వాటిని అవకాశం ఉన్నవారంతా రెగ్యులర్‌గా చదవడమే మంచిది. ప్రాక్టికల్స్, ల్యాబ్‌తో ముడిపడి ఉండే కోర్సులను నేరుగా చదువుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వాలి. దూరవిద్యలోనూ ల్యాబ్, ప్రాక్టికల్స్ మొదలైనవి ఉంటాయి. అయితే ఆ సౌలభ్యం పరిమితంగా ఉంటుంది. అందువల్ల అవకాశం ఉన్నవారు రెగ్యులర్ సైన్స్ కోర్సుల్లో చేరితేనే ఎక్కువ ప్రయోజనం పొందవచ్చు. అలా చదవడం వీలు కానివారే దూరవిద్యను ఆశ్రయించడం మంచిది.

నోటీస్ బోర్డు

● అప్రెంటిస్‌షిప్

దక్షిణ మధ్య రైల్వేలో 4103 అప్రెంటిస్ ఖాళీలు

సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వివిధ యూనిట్లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు. **ట్రేడు-ఖాళీలు:** ఏసీ మెకానిక్- 249, కార్పెంటర్- 16, డీజిల్ మెకానిక్- 640, ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్- 18, ఎలక్ట్రీషియన్- 871, ఎలక్ట్రానిక్ మెకానిక్- 102, ఫిట్టర్- 1460, మెషినిస్ట్- 74, ఎంఎండబ్ల్యూ- 24, ఎంఎంటీఎం- 12, పెయింటర్- 40, వెల్డర్- 597.

మొత్తం ఖాళీలు: 4103. **అర్హత:** పదోతరగతి, ఐటీఐ ఉత్తీర్ణత. **వయసు:** 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: విద్యార్హత మార్కుల ఆధారంగా.

ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 17.07.2018.

వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in

● ప్రభుత్వ ఉద్యోగాలు

ఏయూలో బ్యాక్‌లాగ్ పోస్టులు

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్యాక్‌లాగ్(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు) పోస్టుల భర్తీకి దరఖాస్తులు.

పోస్టు-ఖాళీలు: జూనియర్ అసిస్టెంట్- 01, టైపిస్ట్- 01, రికార్డ్ అసిస్టెంట్- 03, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్- 01, డ్రాఫ్ట్స్‌మన్- 01, అటెండర్- 03, గార్డెనర్- 02, మెస్ బాయ్- 12, సెక్యూరిటీ గార్డ్- 10, పంప్ అటెండర్- 04, హెల్పర్- 07.

అర్హతలు: పోస్టును అనుసరించి ఏడు/ పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ, కంప్యూటర్/ టైపింగ్ పరిజ్ఞానం.

వయసు: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు- 18 నుంచి 47, దివ్యాంగులకైతే 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: విద్యార్హత మార్కులు, వయసు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా.

ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేది: 30.06.2018.

వెబ్‌సైట్: http://andhrauniversity.edu.in/

● వాక్ ఇన్ ఇంటర్వ్యూ

వైవీయూలో అకడమిక్ కన్సల్టెంట్లు

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ కన్సల్టెంట్ ఖాళీల భర్తీ.

విభాగాలు: సివిల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ.

అర్హత: ఎంటెక్. **ఇంటర్వ్యూ తేది:** 22.06.2018.

వేదిక: వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రొద్దుటూరు, కడప జిల్లా. www.yogivemanauniversity.ac.in

ఎంఎన్‌నిట్ అలహాబాద్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీ

మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విజిటింగ్ ఫ్యాకల్టీ ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ.

ఖాళీలు: 67. **విభాగాలు:** అప్లయిడ్ మెకానిక్స్, బయోటెక్నాలజీ, కెమికల్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, సీఎస్ఈ, ఈసీఈ, హెచ్ఎస్ఎస్, మేనేజ్‌మెంట్ స్టడీస్.

అర్హత: బ్యాచిలర్/ మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీ, సీఏ/ ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణత. **ఇంటర్వ్యూ తేదీలు:** జూన్ 25 నుంచి 29 వరకు, జులై 2 నుంచి 4 వరకు.

వేదిక: ఈడీసీ కాన్ఫరెన్స్ రూం, ఎంఎన్‌నిట్ అలహాబాద్. **వెబ్‌సైట్:** www.mnnit.ac.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

విరామం ఇస్తే నెరవేరదు లక్ష్యం

జాతీయ అర్హత ప్రవేశపరీక్ష (నీట్)లో ఉత్తమ ర్యాంకు సాధించాలంటే రెండేళ్లపాటు నిరంతర శ్రమ తప్పనిసరని నీట్‌లో 2వ ర్యాంకు సాధించిన రోహన్ పురోహిత్ చెబుతున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఇతడు నీట్‌లో ఎలా అగ్రగణ్యుడిగా నిలిచాడు? దానికి ఎలాంటి వ్యూహం పాటించాడు? అతడి మాటల్లోనే....

నీట్‌లో ఉత్తీర్ణత కావాలన్నా...సాధారణ ర్యాంకు తెచ్చుకోవాలన్నా పుస్తకాల పురుగుగా మారాల్సిన పనిలేదు. టాప్ ర్యాంకు తెచ్చుకోవాలంటే మాత్రం రెండేళ్లపాటు త్యాగం చేయాల్సిందే. అంటే క్రమశిక్షణతో చదువుకోవడం చాలా ముఖ్యం. మనసు వేరే అంశాలపైకి వెళ్లకుండా రెండేళ్లపాటు చదవాలి. ఒక వారం చదివి మరికొన్ని రోజులు విరామం ఇస్తే లక్ష్యం నెరవేరదు. ప్రతిరోజూ ఏకాగ్రతతో సన్నద్ధం కావాలి. నేను ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి రోజుకు 13 గంటలపాటు కృషి చేశాను. ఈ రెండేళ్లూ నాకు ఆదివారానికీ, సోమవారానికీ తేడా ఏమీ లేదు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు చదివేవాణ్ణి. ప్రతి రెండు గంటలకూ ఒక సబ్జెక్టును చదివాను. అందుకే 720 మార్కులకు 690 మార్కులు సాధించాను. 100 ర్యాంకులలోపు ఉంటుందని ఊహించాను. చివరకు 2వ ర్యాంకు దక్కింది.

జ్ఞాపకశక్తి - పరిజ్ఞానాల కలయిక

నీట్‌లో కొన్ని ప్రశ్నలు జ్ఞాపకశక్తినీ, మరికొన్ని పరిజ్ఞానాన్నీ పరీక్షిస్తాయి. అందువల్ల ఈ పరీక్ష రెండింటి కలయికగా చెప్పొచ్చు. అందువల్ల గంటలకొద్దీ చదివితే చాలన్న అభిప్రాయం తప్పు. రుణాత్మక మార్కులు ఉన్నందున ఏమాత్రం తెలియకపోయినా జవాబు పెడితే నష్టమే ఎక్కువ. చాలా ప్రశ్నలకు కింద ఇచ్చిన నాలుగు ఐచ్ఛికాలూ ఒకేలా ఉంటాయి. అందువల్ల కచ్చితమైన జవాబును గుర్తించడం పెద్ద సవాల్ అవుతుంది. వడపోత పద్ధతిలో రెండు ఐచ్ఛికాలు కాదని కచ్చితంగా నిర్ధరణకు వచ్చినప్పుడు మిగిలిన రెండింటిలో ఒకదాన్ని కచ్చితమైన సమాధానంగా గుర్తించవచ్చు.

ఎన్‌సీఈఆర్‌టీ జవాబులే ప్రమాణం

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ప్రకారం నీట్ జరుగుతుంది. నేను రాష్ట్ర సిలబస్(ఐపీఈ) చదివాను. ఆ రెండింటి మధ్య 60 శాతం ఒకటే ఉన్నా 40 శాతం వ్యత్యాసం ఉంది. భౌతిక, రసాయనశాస్త్రాల్లో ఆ తేడా ఏమీ లేకున్నా జీవశాస్త్రం(వృక్ష, జంతుశాస్త్రాలు)లోనే తేడా ఉంటుంది. ఎన్‌సీఈఆర్‌టీలో జీవశాస్త్రంపై ఫోకస్ అధికం. ఇంటర్‌లో జంతుశాస్త్రంలో పాఠ్యాంశాలు లోతుగా ఉంటాయి. దాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని ఎంతవరకు చదవాలో నిర్ణయించుకోవాలి. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల్లో ఉన్న దాని ఆధారంగానే కచ్చితమైన జవాబులను పరిగణనలోకి తీసుకొని మార్కులు ఇస్తారు. కొన్ని అంశాలపై ఇంటర్, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో కొంత తేడా ఉంటుంది. అలాంటి వాటిపై ప్రశ్నలు వచ్చినా జవాబులను మాత్రం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో ఉన్నదే ఎంచుకోవాలి. ముఖ్యంగా వృక్షశాస్త్రంలో విభిన్న జవాబులుంటాయి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో ఉన్నదానికి భిన్నంగా జవాబులను గుర్తించిన నా మిత్రులు కొందరు మార్కులు నష్టపోయారు. మొత్తానికి జీవశాస్త్రానికి సంబంధించి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు కొని చదవటం తప్పనిసరి. అయితే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో మార్పులు చేస్తుంటారు. తాజాగా మార్చిన పుస్తకాలనే ఎంచుకోవాలి.

ప్రణాళిక... వ్యూహం ఇదీ

తరగతి గదిలో చెప్పింది రాసుకోవడంతో పాటు నేను సొంతంగా ముఖ్యమైన అంశాలతో నోట్స్ సిద్ధం చేసుకున్నా. భౌతిక, రసాయనశాస్త్రాల్లో సూత్రాలు(ఫార్ములాస్)ను ఒక చోట రాసుకున్నా. ఆర్గానిక్ కెమిస్ట్రీకి సంబంధించి ఇతర పుస్తకాల నుంచి అదనపు రియాక్షన్లను చదివి రాసుకున్నా.

■ జీవశాస్త్రంలో ఇంటర్, ఎన్‌సీఈఆర్ పాఠ్య పుస్తకాలను ఒకచోట పెట్టుకొని ఒక అంశాన్ని చదివితే భిన్నమైన స్టేట్‌మెంట్లు కనిపిస్తాయి. వాటిని ఒక చోట రాసుకొని సందేహాలను అధ్యాపకుల నుంచి నివృత్తి చేసుకొనేవాణ్ని. ■ ఇనార్గానిక్ కెమిస్ట్రీలో ఆర్డర్స్ అన్నీ ఒకచోట రాసుకున్నాను. అంటే మెల్టింగ్ పాయింట్ ఆర్డర్, బాయిలింగ్ పాయింట్ ఆర్డర్, సాంద్రత తదితర వాటిని ఒక పట్టిక రూపంలో రాసుకున్నా. దానివల్ల అయోమయం ఉండదు. ■ పరీక్షకు నాలుగైదు రోజుల ముందు ముఖ్యమైన అంశాలను రిఫర్ చేసుకుంటూ వెళ్లాను. అందుకు సొంత నోట్స్‌ని వినియోగించుకున్నా. ■ ప్రతిరోజూ తరగతి గదిలో పాఠం చెప్పిన తర్వాత బ్రషింగ్, వాషింగ్, స్నానం చేసే సమయంలో నిన్న ఏం చెప్పారో గుర్తు చేసుకుంటా. అప్పుడప్పుడు కళ్లు మూసుకొని ఆయా పాఠ్యాంశాలను గుర్తు చేసుకున్నా. చదివిన తర్వాత కళ్లు మూసుకొని మననం చేసుకునేవాణ్ణి.

■ పాత ప్రశ్నపత్రాలను సేకరించి వాటికి జవాబులు గుర్తించాను. అది చాలా ముఖ్యం. ఏ అంశాల్లో ప్రశ్నలు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ■ ఒక ప్రశ్నకు నాలుగు ఐచ్ఛికాలు ఇస్తారు. వాటిలో ఒకటి కచ్చితమైంది ఉంటుంది. మిగిలిన మూడు ఐచ్ఛికాల గురించి కూడా నేనే ప్రశ్నలు వేసుకుంటాను. ఏదో ఒక ప్రశ్నకు అవి కచ్చితమైన జవాబులు అవుతాయి కదా? ఆ ప్రశ్న ఏమిటో కూడా ఆలోచించేవాణ్ని. ■ సందేహాలను 'కోరా' వెబ్‌సైట్‌లో కూడా పోస్టు చేశాను. నిపుణులు వాటికి జవాబులు ఇచ్చేవారు. అది కూడా బాగానే ఉపయోగపడింది.

- పెమ్మసాని బాపనయ్య, ఈనాడు- హైదరాబాద్

కశ్మీర్లో ఎందుకీ చిచ్చు

పవిత్ర రంజాన్ మాసం మొదలవటానికి సరిగ్గా రెండు రోజుల ముందు...

కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పేందుకోసం స్వచ్ఛందంగా, తాత్కాలికంగా కాల్పులను విరమిస్తున్నట్లు ప్రకటించి కేంద్ర ప్రభుత్వం అందర్నీ ఆశ్చర్యంలో ముంచింది. కశ్మీర్ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న కఠిన వైఖరిలో మార్పునకు ఇది సంకేతమని కూడా విశ్లేషకులు భావించారు.

నెల రోజుల్లో ఎంతమార్పు?

రంజాన్ మాసం ముగిసి సరిగ్గా మూడు రోజులు గడిచాయో లేదో..

ఉన్నట్టుండి కశ్మీర్‌లో అధికారంలో ఉన్న పీడీపీ సంకీర్ణ ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించి భాజపా మరోసారి అందర్నీ ఆశ్చర్యపరిచింది. కశ్మీర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా బహుశా కాల్పుల విరమణకు ముగింపు పలకొచ్చని అంతా ఊహాగానాలు చేస్తున్న తరుణంలో ఏకంగా సంకీర్ణ సర్కారుకే మంగళం పలికింది. కేవలం నెలరోజుల్లో కశ్మీర్ విషయంలో కేంద్రం, భాజపా వైఖరుల్లో ఎందుకింత గణనీయమైన మార్పు వచ్చిందన్నది పెద్ద చర్చనీయాంశంగా మారింది.

హింస ఎందుకు పెరిగింది?

కశ్మీర్ వేర్పాటువాదులకు 'పోస్టర్ బాయ్'గా ముద్రపడిన బుర్హాన్ వనీని 2016 జులైలో భద్రతా బలగాలు మట్టుపెట్టినప్పటి నుంచీ కశ్మీర్ లోయలో హింస మరింతగా పేట్రేగింది. ఆ తర్వాత నాలుగు నెలల పాటు వరుసగా జరిగిన హింస, విధ్వంసంలో 100 మంది పౌరులూ ప్రాణాలు కోల్పోయారు. భారత పాలనను వ్యతిరేకిస్తున్న యువత- సైన్యం దురాగతాలకు పాల్పడుతోందంటూ సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోల్ని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. సైన్యం వైపు నుంచి ఏ చిన్న హింసాత్మక ఘటన చోటుచేసుకున్నా.. విద్యార్థులు ఆఖరికి పాఠశాల విద్యార్థినులు కూడా వీధుల్లోకి వచ్చి.. సైన్యంపై రాళ్లదాడికి పాల్పడుతున్నారు. వీరిని అదుపు చేయడానికి సైన్యం ప్రయోగించిన పెల్లెట్ గన్స్ వల్ల అనేకమంది తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లారు. వీటిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో... సైన్యం వాటి తీవ్రతను తగ్గించింది.

పెల్లెట్ల గాయాలు

"ప్రాదేశికంగా చూస్తే కశ్మీర్ భద్రంగానే ఉంది. కానీ భావోద్వేగాల పరంగా, మానసికంగా మనం కశ్మీర్‌ను వేగంగా కోల్పోతున్నాం"

– ప్రముఖ జర్నలిస్టు శేఖర్‌గుప్తా కొన్ని నెలల కిందట చేసిన వ్యాఖ్య ఇది. గత నాలుగైదేళ్లుగా అక్కడ చోటుచేసుకుంటున్న పరిణామాల్ని చూస్తుంటే ఈ వ్యాఖ్యలు నిజమేననిపిస్తుంది.

దాదాపు 5 లక్షల మంది సైనికుల మోహరింపు వల్ల కశ్మీర్ భారత బలగాల చేతుల్లో భద్రంగానే ఉంది. కానీ అక్కడి ప్రజలు ముఖ్యంగా యువత భారత్‌కు నానాటికీ దూరమవుతున్నారు. గత ఏడాది శ్రీనగర్‌లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో కేవలం 7 శాతం ఓట్లు పోల్‌కావడం అక్కడి ప్రజల మనోగతాన్ని తెలియజేస్తోంది. భారత భద్రతాదళాలు ఘోరంగా అణచివేతలకు పాల్పడుతున్నాయంటూ కశ్మీరీ యువత పెద్దఎత్తున తిరగబడుతోంది. యువత రాళ్లదాడులు, భద్రతాసిబ్బంది భాష్పవాయుగోళాల ప్రయోగం, తీవ్రవాదుల ఆకస్మిక దాడులతో కశ్మీర్‌లోయ నాలుగేళ్లుగా అట్టుడుకుతోంది. ఈ నాలుగేళ్లలో 619 మంది మిలిటెంట్లను సైన్యం మట్టుబెట్టింది. ఒక్క 2017లోనే 342 తీవ్రవాద సంబంధ ఘటనలు జరిగాయి. 213 మంది మిలిటెంట్లు హతమయ్యారు. 80 మంది భద్రతాసిబ్బంది, 40 మంది పౌరులు చనిపోయారు.

భారత్‌పై వ్యతిరేకత ఎందుకు?

- కశ్మీర్ లోయలోని దాదాపు 60 శాతం మంది 30 ఏళ్లలోపు యువత. వీరికి భారత్ పట్ల ఏ మాత్రం ప్రేమాభిమానాలు లేకపోగా.. ఆగ్రహంగానూ, అయోమయంలోనూ ఉన్నారు. భారత ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని, అవమానించిందని, ఏకాకులమయ్యామనే భావన వారిలో విస్తృతంగా ప్రబలి ఉంది. వారు స్వాతంత్ర్య కాంక్షలో రగిలిపోతున్నారు. భారత అణచివేతకు వ్యతిరేకంగా చావుకైనా సిద్ధపడతామని యువత బాహాటంగానే చెబుతోంది. వీరి భావోద్వేగాల్ని పొరుగునున్న పాకిస్థాన్ మరింతగా ఎగదోస్తోంది.
- రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన పీడీపీ-భాజపా సంకీర్ణ ప్రభుత్వం తానిచ్చిన హామీల్ని ఏ మాత్రం నెరవేర్చలేదనే భావన యువతలో ఉంది. పీడీపీ సునిశిత వేర్పాటువాదాన్ని బలపరిచే పార్టీ అయితే.. భాజపా హిందూ అతివాద పార్టీ అని, భిన్న సిద్ధాంతాలతో పనిచేస్తున్న ఈ రెండు పార్టీలు ఒక సంఘర్షణాత్మక భూభాగంలో ఎలా కలిసి పనిచేయగలవని వారు ప్రశ్నిస్తున్నారు.
- కశ్మీర్ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి సత్ఫలితాలను ఇవ్వడం లేదు. తమ పోరాటాల్ని కేంద్రం చులకనగా చూస్తూ.. కేవలం అణచివేతనే అస్త్రంగా ఎంచుకుంటోందని యువత కసిగా ఉంది.
- ఇతర రాష్ట్రాల్లో గో సంరక్షకులు ముస్లింలపై దాడులకు పాల్పడుతుండడంతో కశ్మీరీ యువత ఏకమవుతోంది.
- కశ్మీర్లో ముస్లింలను ఘోరంగా అణచివేస్తున్నారని వివిధ దేశాల్లోని ముస్లింలు భావిస్తున్నారు. పాకిస్థాన్, సిరియా, అఫ్గానిస్థాన్ తదితర దేశాలకు చెందిన తీవ్రవాదులు కశ్మీర్ లోయలోకి ప్రవేశించి.. స్థానిక యువతను మరింతగా రెచ్చగొడుతున్నారు. దీంతో మత తీవ్రవాదం నానాటికీ పెచ్చుమీరుతోంది.

పవిత్ర రంజాన్ మాసంలో కాల్పుల్ని విరమించి లోయలో శాంతియుత పరిస్థితులు నెలకొనేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని కేంద్రం భావించింది. ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కూడా రాష్ట్రంలోని యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పలుమార్లు పిలుపిచ్చారు. కానీ వాస్తవానికి అక్కడ దీనికి భిన్నమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా యువత రెట్టించిన ఉత్సాహంతో ఈద్ జరుపుకొంటుండగా.. కశ్మీర్లో కాల్పుల విరమణ సందర్భాన్ని 'సద్వినియోగం' చేసుకోవాలన్న భావనతో స్థానిక యువత భారత సైన్యంపై రాళ్ల దాడుల్ని ఉద్ధృతం చేసింది. సైన్యం అనుసరిస్తున్న విధానాలపై పెల్లుబికిన ఆక్రోశాన్ని యువత ఇలా వెళ్లగక్కింది. నిజానికి కాల్పుల విరమణ అన్నది కేంద్రం అనుసరిస్తున్న కఠిన వైఖరికి కొంత సడలింపు మాత్రమే. ఎందుకంటే ప్రధాని మోదీ ఏడాది క్రితం కశ్మీర్‌ను సందర్శించినప్పుడు కూడా "కశ్మీర్ యువత ముందు రెండే మార్గాలున్నాయి.. ఒకటి టూరిజం.. రెండు టెర్రరిజం..!' అంటూ కరకుగానే హెచ్చరికలు చేశారు. రాష్ట్రంలో కేంద్రం పాత్ర ఎక్కువై, ప్రధాన స్రవంతి రాజకీయాలకు చోటు తగ్గిపోతున్న కొద్దీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కూడా కాల్పుల విరమణ వంటి విధానాలు అనివార్యమని, వాటితోనే ఎంతో కొంత ఉద్రిక్తతలు తగ్గుతాయని ఆశించారు. కానీ లోయలోని ఉగ్రవాద సంస్థలేవీ కూడా ఈ కేంద్రం ప్రయత్నాన్ని సానుకూలంగా స్వీకరించలేదు, విశ్వసించనూ లేదు. పైగా ఉగ్రపథంలో ఉన్న యువత దీన్ని తమకు 'అనుకోకుండా దక్కిన అవకాశం'గా తీసుకుని చెలరేగిపోయింది. ఒక దశలో దాడుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు సైన్యం ఎక్కడెక్కడో తలదాచుకోవాల్సిన అగత్యం తలెత్తింది.

సీనియర్ పాత్రికేయుడు, 'రైజింగ్ కశ్మీర్' పత్రికా సంపాదకుడు, కల్లోల లోయలో శాంతి స్థాపన కోసం కొంతకాలంగా చిత్తశుద్ధితో శ్రమిస్తున్న **షుజాత్ బుఖారీ**పై ఆయన కార్యాలయానికి సమీపంలోనే తీవ్రవాదులు కాల్పులు జరిపి, ఆయనను పాశవికంగా హతమార్చటంతో కశ్మీరే కాదు, యావద్దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గత 12 ఏళ్లలో కశ్మీర్‌లో ఒక పాత్రికేయుడిని హతమార్చటం ఇదే ప్రథమం. లోయలో శాంతి సన్నగిల్లుతోందని ప్రపంచానికి చాటిచెప్పిన సంఘటన ఇది.

ఐరాస నివేదిక.. అగ్నికి ఆజ్యం!

కశ్మీర్లో ఒకవైపు ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలోనే.. ఈ నెల 14న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంస్థ వెలువరించిన 49 పేజీల నివేదిక కూడా లోయలో సైన్యం పాత్రను పెద్దఎత్తున తప్పుబట్టింది. భారత అధీనంలోని కశ్మీర్‌లో మానవ హక్కులపై ఐరాస ప్రత్యేకంగా ఒక నివేదిక వెలువరించటం ఇదే ప్రథమం. "కశ్మీర్ వివాదంలో చాలా కాలంగా భారత-పాకిస్థాన్ రాజకీయ వ్యవహారాలే ప్రధాన చర్చనీయాంశాలుగా ఉంటున్నాయిగానీ.. వాస్తవానికి ఈ సంఘర్షణ లక్షలాది మంది కనీస మానవ హక్కులను మంటగలుపుతోంది" అని నివేదిక వ్యాఖ్యానిస్తే.. "భారత ప్రభుత్వం సైనిక బలాన్ని అతిగా వినియోగించకుండా ఉండటం తక్షణావసరం" అని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ అల్ హుస్సేన్ కరకు వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్లో సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం వల్ల లోయలో అత్యాచారాలు, దురాగతాలు పెచ్చుమీరి తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన చోటుచేసుకుంటోందని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని ఐరాస నివేదిక వ్యాఖ్యానించటం ఒక రకంగా సైన్యాన్ని ఆత్మరక్షణలో పడేసింది.

కమిటీలు ఏం చేశాయి?

అనేక ఏళ్లుగా కేంద్రం కశ్మీర్లో శాంతి మంత్రం జపిస్తూనే ఉంది. వేర్పాటువాదులతో చర్చల కోసం ఎప్పటికప్పుడు కమిటీల్ని నియమిస్తూనే ఉంది. 2001లో అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం కె.సి.పంత్ నేతృత్వంలో కమిటీని నియమించింది. కశ్మీర్ లోయలోని వివిధ గ్రూపులతో చర్చలు జరిపిన కె.సి.పంత్- ఇక్కడ ఉద్రిక్తతలు నివారించడానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమేం చేయాలనే దానిపై సవివర నివేదికను అందజేశారు. ఇది జరిగిన కొద్దిరోజులకే జైషే మహమ్మద్ ఆత్మాహుతి దాడుల్ని తీవ్రం చేయడంతో.. కేంద్రం మళ్లీ సైనిక శక్తిపైనే ఆధారపడాల్సి వచ్చింది. 2002లో వాజ్‌పేయి ప్రభుత్వం మళ్లీ అరుణ్‌జైట్లీ కమిటీని, రామ్‌జెఠ్మలానీ కమిటీల్ని నియమించింది. 2003లో వోహ్రా కమిటీ కశ్మీరీ వేర్పాటు వాదులతో చర్చలు జరిపి.. ఈ చర్చల ప్రక్రియను కొనసాగించాలని సిఫార్సు చేసింది. 2010లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రముఖ జర్నలిస్టు దిలీప్ పడ్గావ్‌కర్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని నియమించింది. కశ్మీర్లోని 700 ప్రతినిధి బృందాలతో ఈ కమిటీ చర్చలు జరిపింది. లోయలో శాంతి నెలకొల్పడానికి తీసుకోవాల్సిన చర్యలతో సుదీర్ఘ నివేదికను అందజేసింది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత- గత నవంబరులో నిఘా విభాగం మాజీ చీఫ్ దినేశ్వర్ శర్మ నేతృత్వంలో చర్చల కమిటీని నియమించింది. ఆయన చర్చల ప్రక్రియను ప్రారంభించకముందే.. తాము ఆ కమిటీతో చర్చించేది లేదని వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్ తెగేసిచెప్పింది.

ఉన్నత విద్యావంతులైనా...

కశ్మీర్లో ఇప్పుడు తీవ్రవాదం వైపు మొగ్గు చూపుతున్న వారిలో అనేకమంది ఉన్నత విద్యావంతులు. కాస్తంత సంపన్న కుటుంబాల నుంచి వచ్చిన వారు. రెండేళ్ల కిందట హతమైన బుర్హాన్ వనీ ఒక ఉన్నతస్థాయి కుటుంబం నుంచి వచ్చిన విద్యావంతుడు. సైన్యం చేతిలో చనిపోయిన ఇతని సోదరుడు ఖలీద్ రాజనీతి శాస్త్రంలో పట్టభద్రుడు.

వీరి తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తాజాగా తీవ్రవాద గూపు బాధ్యతలు చేపట్టిన జకీర్ రషీద్ భట్ చండీగఢ్‌లో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించాడు. వీరంతా అనర్గళంగా మాట్లాడుతూ.. ప్రజల్లోకి చొచ్చుకుపోతూ.. కశ్మీరీ వేర్పాటు వాదాన్ని మరింతగా రెచ్చగొడుతున్నారు. దీంతో ప్రజల నుంచి వీరికి పెద్దఎత్తున మద్దతు లభిస్తోంది.

బుర్హాన్ వనీ



- ఈనాడు ప్రత్యేక విభాగం

ఆది నుంచీ అడుగడుగునా అనిశ్చితి...

శ్రీనగర్: జమ్ము-కశ్మీరులో 2014లో శాసన సభ ఎన్నికలు జరగడం.... ఆ తర్వాత పీడీపీ-భాజపాలు జట్టు కట్టి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ పరిణామాల ముఖచిత్రం...

- **2014 డిసెంబరు 28:** శాసనసభ ఫలితాలు వెలువడ్డాయి. ప్రజలు ఎవరికీ పూర్తి మెజారిటీ నివ్వకుండా తీర్పు చెప్పేశారు. పీడీపీకి 28, భాజపాకు 25, ఎన్సీకి 15, కాంగ్రెస్‌పార్టీకి 12 స్థానాలు మాత్రమే దక్కాయి.
- **డిసెంబరు 28:** ఎటూ తేలని పరిస్థితుల్లో జమ్ము-కశ్మీరులో గవర్నర్ పాలన విధింపు. ఎన్నికల పొత్తు కోసం పీడీపీ-భాజపాల చర్చ. ఉమ్మడి కనీస కార్యక్రమం ఖరారుకు చర్చలు ఏకంగా రెండు నెలల పాటూ తెగసాగిన వైనం.
- **2015 మార్చి 01:** జమ్ము-కశ్మీరు ముఖ్యమంత్రిగా ముఫ్తీ మహ్మద్ సయీద్ ప్రమాణస్వీకారం. ముగిసిన గవర్నర్ పాలన.
- **2016 జనవరి 7:** అనారోగ్యంతో దిల్లీలోని 'ఎయిమ్స్'లో ముఫ్తీమహమ్మద్ సయీద్ మృతి.
- **2016 జనవరి 8వ తేదీ:** జమ్ము-కశ్మీరులో మళ్లీ...అంటే మరోసారి గవర్నర్ పాలన విధింపు.
- **2016 మార్చి 22:** ప్రధాని నరేంద్రమోదీతో మెహబూబా ముఫ్తీ దిల్లీలో సమావేశం. కేంద్రం హామీలతో సంతృప్తి చెందినట్లు ఆ తర్వాత మెహబూబా ముఫ్తీ ప్రకటన.
- **ఏప్రిల్ 04:** జమ్ము-కశ్మీరు తొలి మహిళా ముఖ్యమంత్రిగా మెహబూబా ముఫ్తీ ప్రమాణస్వీకారం. అంతమైన గవర్నర్ పరిపాలన.
- **ఏప్రిల్ 05:** భారత్-పాక్ క్రికెట్‌మ్యాచ్ నేపథ్యంలో శ్రీనగర్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో స్థానిక, స్థానికేతర విద్యార్థుల మధ్య ఘర్షణలు.... తీవ్ర సంక్షోభం.
- **జులై 8:** భద్రతా దళాలతో ఎదురుకాల్పుల్లో హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హన్ వానీ హతం. ఆ హత్యతో పీడీపీ-భాజపాల మధ్య పొడసూపిన విభేదాలు. హింసాత్మక నిరసనలు. ఘర్షణల్లో 85 మందికి పైగా మృతి.
- **2018 మే 9:** ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్న ప్రాంతాల్లో ఘర్షణలు. అమాయక ప్రజల హత్యల నేపథ్యంలో అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చిన మెహబూబా ముఫ్తీ. అనంతరం రంజాన్ నేపథ్యంలో కాల్పుల విరమణకు మెహబూబా ముఫ్తీ పిలుపు. ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకించి...ఖండించిన భాజపా నేత, డిప్యూటీ ముఖ్యమంత్రి కవిందర్ గుప్తా.
- **మే 17:** జమ్ము-కశ్మీరులో నెలరోజుల పాటూ కార్యకలాపాల తాత్కాలిక నిలిపివేతకు కేంద్రహోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటన
- **జూన్ 17:** ఏకపక్ష కాల్పుల విరమణను పొడిగించాల్సిన అవసరం లేదన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించిన హోంమంత్రి రాజ్‌నాథ్.
- **జూన్ 18:** భాజపా మంత్రులందరినీ దిల్లీకి పిలిపించిన అధిష్ఠానం.
- **జూన్ 19:** జమ్ము-కశ్మీరులో సంకీర్ణం నుంచి వైదొలగిన భాజపా. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన మెహబూబా ముఫ్తీ. మళ్లీ గవర్నర్ పాలన దిశగా కదులుతున్న జమ్ము-కశ్మీరు.

మరోసారి జాతీయవాద అస్త్రం!

- కశ్మీర్ పరిస్థితులతో ముందుగానే జాగ్రత్త పడిన భాజపా
- సైనిక చర్యల నిలిపివేతను పొడిగిస్తే మొదటికే మోసం వస్తుందని నమ్మిక
- జమ్ము, లద్దాఖ్‌లో రాజకీయాలనూ దృష్టిలో ఉంచుకున్న కమలదళం

ఈనాడు, దిల్లీ: జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వం నుంచి వైదొలగడం ద్వారా మరోసారి జాతీయవాద రాజకీయాస్త్రాన్ని భాజపా సిద్ధం చేసుకున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో పాటు 2019 సాధారణ ఎన్నికలనూ దృష్టిలో ఉంచుకునే జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వం నుంచి వైదొలగినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం నుంచి బయటకు రావాలన్న యోచన తొలుత కేంద్ర నాయకత్వం నుంచే రావడం గమనార్హం. రాష్ట్రంలో ఉగ్రవాదంపై కఠిన వైఖరి అనుసరించడానికి పీడీపీతో భాగస్వామ్యం అడ్డంకిగా ఉందని భాజపా సంప్రదాయ మద్దతుదారుల భావనగా ఉంది. మద్దతు ఉపసంహరణకు భాజపా మంగళవారం వెల్లడించిన కారణాల్లో కశ్మీర్‌లోయలో భద్రత ప్రధానాంశంగా ఉంది. ఉగ్రవాదాన్ని నియంత్రించడంలో పీడీపీ విఫలమయిందని భాజపా ఆరోపించింది. రంజాన్ సందర్భంగా సైనిక చర్యలను నిలిపివేయాలని తీసుకున్న నిర్ణయం ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో... అనుకున్నదాని కన్నా ముందుగానే ప్రభుత్వం నుంచి బయటపడినట్లు కనిపిస్తోంది.

ఈ రెండు పక్షాల మధ్య విచ్ఛిన్న సంకేతాలు కొద్ది నెలల నుంచే వస్తున్నాయి. ఏ పార్టీ ముందుగా బయటకు వస్తుందని కొద్ది వారాలుగా రాజకీయవర్గాల్లో ప్రశ్న చక్కర్లు కొడుతోంది. పీడీపీ-భాజపా మధ్య విభేదాలు అధికారం చేపట్టినప్పటి నుంచే ఉన్నాయి. కథువాలో ఎనిమిదేళ్ల బాలికపై స్థానికులు అత్యాచారం చేసి హత్య చేసిన తర్వాత విభేదాలు మరింత పెరిగాయి. నిందితులకు రాష్ట్ర భాజపా నేతలు మద్దతిచ్చారు. సీనియర్ పాత్రికేయుడు సుజాత్ బుఖారిని ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపడం, అదే రోజున రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్ ఔరంగజేబ్‌ను ఉగ్రవాదులు పొట్టన బెట్టుకోవడం వాటి మధ్య మరింత అగాధాన్ని పెంచి కూటమి విచ్ఛిన్నానికి దారి తీశాయి. వేర్పాటువాదులతో, పాకిస్థాన్ ప్రభుత్వంతో చర్చలు జరపాలన్నది మెహబూబా ముఫ్తీ సూచన. పాకిస్థాన్‌తో చర్చలను కేంద్రం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. వేర్పాటువాదులతో వారి షరతులకు అనుగుణంగా చర్చలు జరపాలన్నది మెహబూబా వాదన. వారితో చర్చలకు కేంద్రం సుముఖం వ్యక్తం చేసినా సైన్యం షరతులకు అనుగుణంగా చర్చలు జరపాలనుకుంది. ఈ విషయంలో రెండు వర్గాలకు ఏకాభిప్రాయం కుదరలేదు. సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఎత్తివేయాలన్నది కూడా మెహబూబా ప్రధాన డిమాండ్. దీనికీ కేంద్రం సుముఖంగా లేదు. కూటమి విచ్ఛిన్నానికి ఇవన్నీ కారణాలే. కశ్మీర్‌లో శాంతి ప్రక్రియకు విఘాతం కలిగించడానికి ఉగ్రవాదులు రాబోయే రోజుల్లో పెద్ద దాడులకు దిగవచ్చని భాజపా భావిస్తోంది. ముఖ్యంగా త్వరలో ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్రపై ఉగ్రవాదులు దాడులకు దిగవచ్చని నిఘా వర్గాల నుంచి కేంద్రానికి సమాచారం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పీడీపీ డిమాండ్ చేసినట్లుగా కాల్పుల విరమణను పొడిగిస్తే ఉగ్రవాదులు బలపడతారని భాజపా విశ్వసిస్తోంది. అమర్‌నాథ్ యాత్ర వంటి వాటిపై ఉగ్రవాదుల దాడులు జరిగితే.. అప్పటికీ పీడీపీతో కలిసి ప్రభుత్వంలో భాజపా ఉంటే దేశవ్యాప్తంగా మిగిలిన చోట్ల హిందుత్వ ఓట్లను పోగొట్టుకోవాల్సి వస్తుందన్న ఆందోళన భాజపాలో ఉంది. అందుకే.. సైనిక ఆపరేషన్ల నిలిపివేతను పొడిగించాలన్న పీడీపీ డిమాండ్‌కు భాజపా అంగీకరించడం లేదు. మరోవైపు హురియత్ నేతలెవ్వరూ కేంద్రం ప్రారంభించిన శాంతి చర్చల్లో పాల్గొనడానికి ముందుకు రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సైనిక ఆపరేషన్ల నిలిపివేతను పొడిగించడం దండగ అని కేంద్ర భావిస్తోంది.



మరోవైపు రాష్ట్రంలో రాజకీయ కారణాలు కూడా కూటమి విచ్ఛిన్నానికి కారణమే. జమ్ములో 37 శాసనసభ స్థానాలున్నాయి. లద్దాఖ్‌లో నాలుగు అసెంబ్లీ స్థానాలున్నాయి. కశ్మీర్‌లోయలో 46 శాసనసభ స్థానాలున్నాయి. జమ్ము, లద్దాఖ్ నుంచి భాజపాకు ఎక్కువ స్థానాలు వచ్చాయి. ఈ ప్రాంతాల అభివృద్ధిలో పీడీపీ వివక్ష చూపిస్తోందని, ఇదే కొనసాగితే తమకు రాజకీయంగా నష్టం జరుగుతుందని భాజపా విశ్వసిస్తోంది. పీడీపీతో తెగదెంపులు చేసుకోవడానికి ఇదీ ఒక కారణమే.

గవర్నర్ పాలన.. కశ్మీర్‌కే ప్రత్యేకం

- ఇతర రాష్ట్రాల్లోనైతే రాష్ట్రపతి పాలన

దిల్లీ: దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వం లేకపోతే అక్కడ రాష్ట్రపతి పాలన విధిస్తుంటారు. ఒక్క జమ్ము కశ్మీర్ మాత్రం దీనికి మినహాయింపు. అక్కడ ఇలాంటి సందర్భాల్లో రాష్ట్రపతి పాలనను కాకుండా గవర్నర్ పాలన విధిస్తారు. 'జమ్ము కశ్మీర్ రాజ్యాంగం'లో 92వ సెక్షన్ కింద రాష్ట్రపతి ఆమోదంతో ఆరు నెలల పాటు గవర్నర్ పాలన అమలు చేసే వీలుంది. ప్రత్యేక ప్రతిపత్తిని రాజ్యాంగం కల్పించడంతో ఆ ఒక్క రాష్ట్రానికి విడిగా రాజ్యాంగం, నిబంధనలు ఉన్నాయి. దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో 356వ రాజ్యాంగ నిబంధన కింద రాష్ట్రపతి పాలన అమలు చేస్తారు. గవర్నర్ పాలన వస్తే రాష్ట్ర శాసనసభను రద్దు చేయడమో, సుప్త చేతనావస్థలో ఉంచడమో చేస్తారు. ఆరు నెలల గడువు ముగిసేలోగా రాష్ట్ర యంత్రాంగాన్ని పునరుద్ధరించడం సాధ్యం కాకపోతే గవర్నర్ పాలనను కొనసాగిస్తారు. 370వ అధికరణం ప్రకారం జమ్ముకశ్మీర్‌పై పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వాలకు పరిమిత అధికారాలే ఉంటాయి. 1965 వరకు ఆ రాష్ట్రానికి ప్రభుత్వాధినేతగా గవర్నర్ కాకుండా 'సదర్-ఇ-రియాసత్' ఉండేవారు. ప్రభుత్వాధినేతను ముఖ్యమంత్రి అని కాకుండా ప్రధానమంత్రి అనేవారు.

1977 నుంచి ఏడుసార్లు... జమ్ముకశ్మీర్‌లో 1977 నుంచి ఇప్పటి వరకు ఏడుసార్లు గవర్నర్ పాలనను విధించారు. దివంగత నేత షేక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ప్రభుత్వానికి మద్దతును కాంగ్రెస్ ఉపసంహరించుకోవడంతో ఆ ఏడాది మార్చి 26న మొదటిసారి గవర్నర్ పాలన అమల్లోకి వచ్చింది. అది 105 రోజులు కొనసాగింది.

- 1986 మార్చిలో రెండోసారి గవర్నర్ పాలన వచ్చింది. అది 246 రోజులు కొనసాగింది.
- 1990 జనవరిలో ముఖ్యమంత్రిగా ఫరూక్ అబ్దుల్లా రాజీనామాతో మూడోసారి అమల్లోకి వచ్చిన గవర్నర్ పాలన అత్యంత సుదీర్ఘంగా ఆరు సంవత్సరాల 264 రోజుల పాటు కొనసాగింది..!!
- 2002 ఫిబ్రవరిలో నాలుగోసారి (15 రోజులు), 2008లో అయిదోసారి (174 రోజులు), 2014లో ఆరోసారి, 2016లో ఏడోసారి గవర్నర్ పాలన వచ్చింది.
- భాజపా-పీడీపీ సంకీర్ణం కుప్పకూలడంతో ఇప్పుడు ఎనిమిదోసారి రాష్ట్రపతి పాలన రాబోతోంది. గవర్నర్‌గా ఎన్.ఎన్.వోహ్రా హయాంలో కేంద్రపాలన రావడం నాలుగోసారి కానుంది.
- గతంలో ఏడుసార్లు కేంద్ర పాలన రావడం వెనుక రాజకీయ పరిణామాలకు ప్రస్తుత ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తండ్రి, దివంగత పీడీపీ అధినేత ముఫ్తీ మహమ్మద్ సయీద్‌ది కీలకపాత్ర అని చెప్పవచ్చు. చివరిసారిగా 2016 జనవరి 8న గవర్నర్ పాలన రావడానికి ముఫ్తీ సయీద్ మరణం కారణమయింది. అప్పుడు భాజపా, పీడీపీలు ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను నాలుగు రోజులు వాయిదా వేశాయి.

జమ్ముకశ్మీర్‌లో ఏం జరగవచ్చంటే..!

ఈనాడు, దిల్లీ: జమ్ముకశ్మీర్‌లో తాజాగా విధించబోతున్న గవర్నర్ పాలన 2019 సార్వత్రిక ఎన్నికలు ముగిసేవరకు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 87 మంది సభ్యులున్న శాసనసభలో పీడీపీకి 28 మంది, భాజపాకి 25 మంది బలం ఉంది. ఆధిక్యానికి అవసరమైన 45 మంది సభ్యుల బలం రెండు పార్టీలకూ లేదు. కాంగ్రెస్‌కి 12 మంది ఎమ్మెల్యేలున్నా... పీడీపీతో పొత్తు ప్రసక్తే లేదని ఆ పార్టీ స్పష్టం చేసేసింది. నేషనల్ కాన్ఫరెన్స్‌కి 15 మంది సభ్యుల బలం ఉంది. తాజాగా ఎన్నికలు నిర్వహించాలని ఆ పార్టీ అధినేత ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేస్తున్నారు. అటు పీడీపీ కూడా తాము ఎవరితో పొత్తుకోసం చూడడం లేదని చెప్పేసింది. ఇవన్నీ చూస్తే కశ్మీర్‌లో మరో ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు సమీప భవిష్యత్తులో లేవని స్పష్టమవుతోంది. ఎన్నికలు జరిగే అవకాశాన్ని భాజపా తోసిపుచ్చుతోంది. రాబోయే ఏడాది పాటు ఉగ్రవాదులపై భారత సైన్యం కఠినంగా వ్యవహరిస్తుంది. సైన్యానికి తిరుగులేదని ఉగ్రవాదులు గ్రహించేలా చేస్తుంది. ఇది దేశంలోని ఇతర ప్రాంతాల్లోని భాజపా ఓటర్లకు సానుకూల సంకేతాలు పంపిస్తుంది. ఏడాదిలో కశ్మీర్ నుంచి ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టి... ఆ విషయంలో సైన్యానికి తాము స్వేచ్ఛనిచ్చిన విషయాన్ని 2019 ఎన్నికల్లో భాజపా ప్రచారం చేస్తుంది. ఆ ఎన్నికల్లోనూ గెలిచి మళ్లీ అధికారం దక్కించుకుంటే మాత్రం కశ్మీర్‌లో భాజపా మళ్లీ పీడీపీతో చేతులు కలిపే అవకాశాలుంటాయి.

అమర్‌నాథ్ యాత్ర ముగిశాక కొత్త గవర్నర్!

దిల్లీ: అమర్‌నాథ్ యాత్ర ముగిశాక జమ్ముకశ్మీర్‌కు కొత్త గవర్నర్ నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ యాత్ర ఈ నెల 28న ప్రారంభమవుతుంది. రెండు నెలల పాటు కొనసాగుతుంది. ప్రస్తుత గవర్నర్ ఎన్.ఎన్.వోరాకున్న అపార అనుభవం రీత్యా ఈసారి కూడా యాత్రకు ఇన్‌ఛార్జిగా ఆయనే ఉండాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు భాజపా సీనియర్ నేత ఒకరు తెలిపారు. ప్రస్తుతం కశ్మీర్‌లో భద్రతా వాతావరణం క్షీణిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి గట్టి భద్రత కల్పించడం పెద్ద సవాల్. వోరా.. 2008 జూన్‌లో గవర్నర్‌గా నియమితులయ్యారు. 2013లో ఆయన పదవీకాలాన్ని కేంద్రం పొడిగించింది. యూపీఏ హయాంలో నియమితులై, భాజపా హయాంలోనూ కొనసాగుతున్న అతికొద్ది మంది గవర్నర్లలో వోరా కూడా ఉన్నారు.

600 మంది సైనికులు బలయ్యాక బయటకొస్తారా?

సంకీర్ణ సర్కారు నుంచి భాజపా తప్పుకోవడంపై శివసేన స్పందన

ముంబయి: జమ్ము-కశ్మీర్ సంకీర్ణ సర్కారు నుంచి భాజపా బయటకు రావడాన్ని ఎన్డీఏ ప్రధాన మిత్రపక్షం శివసేన స్వాగతించింది. అధికార పీడీపీతో భాజపా తెగతెంపులు చేసుకోవడాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆహ్వానిస్తూనే.. విమర్శలనూ విసిరారు. మంగళవారమిక్కడ శివసేన 52వ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. కార్యకర్తలను ఉద్దేశించి ఉద్ధవ్ మాట్లాడుతూ- 'భాజపా నిర్ణయానికి శుభాకాంక్షలు. కానీ, జమ్ము-కశ్మీర్ ప్రభుత్వంలో కొనసాగడం వృథా అని మూడేళ్లయ్యాక... 600 మంది సైనికులు ప్రాణాలొదిలాక తెలిసొచ్చిందా?" అని ప్రశ్నించారు. పీడీపీ-భాజపాది అపవిత్ర, అక్రమ కలయికనీ, ఇది జాతి వ్యతిరేక సంకీర్ణమని గతంలో ఠాక్రే చాలాసార్లు విమర్శించారు.

కశ్మీర్‌లో ముగ్గురు జైషే ఉగ్ర నేతలు హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ముగ్గురు జైషే మహమ్మద్ (జేఈఎం) ఉగ్రవాద నాయకులను భద్రతా బలగాలు మంగళవారం మట్టుపెట్టాయి. వీరిలో కమాండర్ స్థాయి ముష్కరుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా పుల్వామా జిల్లాలోని త్రాల్ పట్టణంలో సంచరిస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. గాలింపు చర్యలు చేపడుతుండగా.. ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. రెండు వర్గాల మధ్యకాల్పులు కొనసాగుతున్నాయి. ముగ్గురు కరుడుగట్టిన ఉగ్రవాదులు మరణించినట్లు కశ్మీర్ డీజీపీ ఎస్‌పీ వైద్ ఓ ట్వీట్‌చేశారు.

'రక్షణ'కు సైబర్ ముప్పు ఎక్కువ: సీతారామన్

దిల్లీ: రక్షణ రంగానికి సైబర్ భద్రత ముప్పు ఎక్కువని ఆ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. దేశ సైబర్ రంగాన్ని దాడుల నుంచి రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంలో ప్రబలశక్తిగా ఎదగాలన్న దేశ దార్శనికతకు అనుగుణంగా అన్ని సంస్థల్లోనూ మానవ వనరులను సృష్టించాలని కోరారు. రక్షణ ఉత్పాదక శాఖ నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు.

అమెరికాలోని రాక్‌ఫోర్డ్‌లో ఓ సూపర్‌మార్కెట్ వద్ద వరద నీటిలో కారులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడుతున్న స్థానికులు. రాక్ నది పరీవాహక ప్రాంతంలో భారీగా వర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించింది

సందీప్... సరైనోడే..



ఆస్తుల నాణ్యత తగ్గిపోతోంది..
నిరర్థక ఆస్తులు పెరిగిపోతున్నాయి..
లాభదాయకత క్రమంగా క్షీణిస్తోంది..
మదుపర్ల విశ్వాసం సన్నగిల్లుతోంది..

- ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ఐసీఐసీఐ బ్యాంక్ బాధ్యతల్ని మోయడానికి సిద్ధమయ్యారు సందీప్ బక్షి. ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగానికి ప్రస్తుతం ఆయన మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా ఉన్నారు. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణం ఇచ్చిన వ్యవహారంలో అంతర్గత విచారణ జరుగుతున్న నేపథ్యంలో బ్యాంక్ సీఈఓ చందాకొచ్చర్‌ను సెలవుపై పంపిన విషయం తెలిసిందే. ఆమె స్థానాన్ని భర్తీ చేయకపోయినా ప్రత్యేకంగా ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఓఓ-చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్) స్థానాన్ని సృష్టించి సందీప్ సరైనోడే అని బ్యాంక్ బాధ్యతల్ని బోర్డు అప్పజెప్పింది. అయితే ఈయన ప్రయాణం సులువుగా ఉంటుందని చెప్పలేమని, ఎన్నో సమస్యలు ఆయనకు స్వాగతం పలుకుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. వీటిని అధిగమించి ఆయన మదుపర్ల విశ్వాసాన్ని ఎంతమేరకు రాబట్టగలుగుతారు? బ్యాంక్ నిర్దేశించుకున్న లక్ష్యాల్ని అందుకుంటారా? అన్నది చూడాలంటున్నారు.

బ్యాంక్‌లోకి ఎప్పుడొచ్చారు?

సందీప్ బక్షి ఛండీగఢ్‌లోని పంజాబ్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. ఆ తరవాత జంషెడ్‌పూర్‌లోని జేవియర్ లేబర్ రిలేషన్స్ ఇనిస్టిట్యూట్ (ఎక్స్ఎల్ఆర్ఐ) నుంచి మేనేజ్‌మెంట్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1983లో ఓఆర్‌జీ సిస్టమ్స్ అనే కంప్యూటర్ మార్కెటింగ్ కంపెనీలో తొలి ఉద్యోగంలో చేరారు.

✦ 1986లో ఐసీఐసీఐ బ్యాంక్‌లో కార్యకలాపాల విభాగ అధికారిగా దిల్లీలో చేరారు. వ్యాపార అభివృద్ధి, ప్రాజెక్టుల అంచనాలు, వాటి పర్యవేక్షణ, వ్యాపార పునర్నిర్మాణం తదితర బాధ్యతల్ని తొలుత నిర్వహించారు. అక్కడి నుంచి వెనుతిరిగి చూడలేదు. పదేళ్లలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు. ఉత్తర జోనల్ కార్యాలయానికి సంబంధించి రిస్క్ మేనేజ్‌మెంట్ బాధ్యతల్ని కూడా ఆయనకే అప్పగించారు. ఉత్తర, తూర్పు రీజియన్లలోని కార్పొరేట్ ఖాతాదారుల కార్యకలాపాలు కూడా చూసుకొనేవారు. 2002లో ఐసీఐసీఐ అనుబంధ సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్‌లో చేరారు. 2007 నుంచి 2009 వరకు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా కొనసాగారు. 2010 నుంచి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో సీఈఓ, ఎండీగా కొనసాగుతున్నారు. తాజాగా ఐసీఐసీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.ఎస్.కన్నన్‌ను ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు సీఈఓగా నియమించి సందీప్‌ను సీఓఓగా బోర్డు తెరపైకి తీసుకొచ్చింది.

✦ సందీప్ బక్షికి పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రధానంగా బ్యాంక్ లాభదాయకత గత కొన్ని త్రైమాసికాలుగా క్షీణిస్తోంది. మార్చి 2018తో ముగిసిన త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1020 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఎనిమిది త్రైమాసికాల్లో ఇదే అత్యల్పం కావడం గమనార్హం. 2017-18 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బ్యాంక్‌కు రూ.1650 కోట్ల నికర లాభం వచ్చింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం నాలుగో, మూడో త్రైమాసికాల్లో వరుసగా నమోదు చేసిన నికర లాభం రూ.2,020 కోట్లు, రూ.2,440 కోట్లతో పోలిస్తే లాభం తగ్గింది.

✦ ఇంకా చెప్పాలంటే వచ్చిన లాభం కూడా అనుబంధ సంస్థల్లో వాటా విక్రయంతో వచ్చిందే. ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్‌లో 7 శాతం వాటాను తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా రూ.2,099 కోట్లకు విక్రయించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నికర లాభంలో రూ.1,711 కోట్లు వాటా విక్రయం వల్లే వచ్చింది. ఇదే కాకుండా ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌లో 20.78 శాతం వాటా విక్రయంతో రూ.3,480 కోట్లు సమీకరించింది. 2016-17లో కూడా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో వాటా విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ సంస్థల్లో వాటాలు విక్రయించకపోతే గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఆర్జించిన లాభాలు మరింత తక్కువగా ఉండేవి.

ఐసీఐసీఐ బ్యాంక్ కథాకమామీషు

వ్యవస్థాపితం- 1994
ప్రధాన కార్యాలయం- ముంబయి
ఛైర్మన్- ఎం.కె.శర్మ
ఆదాయం- రూ.72,386 కోట్లు (2017-18)
నికర లాభం- రూ.6,777 కోట్లు (2017-18)
మొత్తం ఆస్తుల విలువ- రూ.7,37,546 కోట్లు
మార్కెట్ విలువ- రూ.1,87,771 కోట్లు
మొండి బకాయిలు- రూ.34,000 కోట్లు
శాఖలు- 4,850, **ఏటీఎంలు-** 14,404
మొత్తం ఉద్యోగులు- సుమారు 84,096

ఆస్తుల నాణ్యత కీలకం

ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి 8.84 శాతానికి పెరిగాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2016-17)లో ఇదే సమయంలో 7.89 శాతంగా ఉన్నాయి. 2017-18 తొలి మూడు త్రైమాసికాల్లో స్థూల నిరర్థక ఆస్తులు గణనీయంగా తగ్గినా, నాలుగో త్రైమాసికం వచ్చేసరికి అనూహ్యంగా పెరిగి రూ.15,737 కోట్ల ఎన్‌పీఏలు జతయ్యాయి. వీటిని తగ్గిస్తూ, బ్యాంక్ ఆస్తుల నాణ్యత దెబ్బతినకుండా కాపాడాల్సిన బాధ్యత సందీప్‌పై ఉంది.

✦ ఇదే సమయంలో బ్యాంక్ 2020 నాటికి భారీ లక్ష్యాల్ని నిర్దేశించుకొన్నట్లు ఇటీవల ఆర్థిక ఫలితాల ప్రకటన సమయంలో వెల్లడించింది. నికర నిరర్థక ఆస్తుల్ని 1.5 శాతానికి తగ్గించాలన్నది ఇందులో ప్రధాన లక్ష్యం. మార్చి 2020 నాటికి కేటాయింపుల కవరేజీ నిష్పత్తిని (పీసీఆర్-ప్రొవిజన్ కవరేజ్ రేషియో) 70 శాతానికిపైగా పెంచాలని అనుకుంటున్నట్లు చందాకొచ్చర్ వెల్లడించారు. మార్చి 2018 నాటికి బ్యాంక్ నికర ఎన్‌పీఏల నిష్పత్తి 4.77 శాతం, పీసీఆర్ 60.5 శాతం ఉన్నాయి.

✦ పారిశ్రామిక, వాణిజ్య రంగ రుణాల్లో వృద్ధి తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో అన్ని బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు... రిటైల్, చిన్న, మధ్య స్థాయి సంస్థలు (ఎస్ఎంఈ), వ్యవసాయ రంగాల్లో వృద్ధిని ఆశిస్తున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా మొత్తం రుణాల్లో 60 శాతం రిటైల్ రంగానికి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకొంది. మార్చి 2018 నాటికి ఈ విభాగంలో రుణాలు 56.6 శాతం ఉన్నాయి. ఈ పోర్ట్‌ఫోలియోను విస్తరించడానికి పోటీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బ్యాంక్ తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. అలాగే విదేశీ రుణ పోర్ట్‌ఫోలియోను 10 శాతం కంటే తక్కువకు తీసుకురావాలని కూడా భావిస్తోంది. ఇవన్నీ కూడా ఇప్పుడు బక్షి సారథ్యంలోనే ముందుకెళ్లాలి. ఆ దిశగా ఆయన ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

మదుపర్లను ఆకట్టుకోవాలి

బక్షి ముందున్న సవాళ్లలో మదుపర్ల విశ్వాసం కూడా కీలకం. బ్యాంకింగ్ రంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉండటమే కాకుండా, ఇక్కడ మోసాలు పెరిగిపోవడం, దర్యాప్తు సంస్థలు జోక్యం చేసుకొని విచారణ కొనసాగిస్తుండటంతో మదుపర్లలో ఈ రంగంపై విశ్వాసం సన్నగిల్లుతోంది. ఐసీఐసీఐ బ్యాంక్ విషయానికొస్తే జనవరి నుంచి షేరు ధర దాదాపు 10 శాతం క్షీణించింది. ఇదే సమయంలో బీఎస్ఈ సెన్సెక్స్ 5 శాతం పెరిగింది. కొత్త బాధ్యతలు తీసుకున్న సందీప్ బక్షి బ్యాంక్ నిర్వహణలో సమూల మార్పులు తీసుకొచ్చి లాభదాయకతను పెంచి, మొండి బాకీలను తగ్గించగలిగితే మదుపర్లలో మళ్లీ విశ్వాసం తెప్పించడం కష్టమేమీ కాదు. ఇప్పటికే ఆయన నియామకంతో షేరు ధర క్రమంగా పెరుగుతోంది. అంటే మదుపర్లు ఆయన మీద మంచి అభిప్రాయంతోనే ఉన్నారనిపిస్తోంది. భవిష్యత్తులో ఈ నమ్మకాన్ని ఆయన నిలబెట్టుకొని ఐసీఐసీఐ బ్యాంక్‌ను తిరిగి మంచి స్థానానికి చేరుస్తారని ఆశిద్దాం.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఎందుకిలా..

ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్.. దేశంలో దిగ్గజ ప్రైవేట్ బ్యాంకులు ఇవి. గత కొన్నేళ్లుగా ఈ రెండు బ్యాంకులకు మహిళలే సారథ్యం వహిస్తూ వస్తున్నారు. వాళ్లే చందాకొచ్చర్, శిఖాశర్మ. దేశీయ బ్యాంకింగ్ రంగంలోనే అత్యుత్తమ బ్యాంకర్లుగా ఈ ఇరువురు పేరు సంపాదించారు. శక్తిమంత మహిళలుగా ఖ్యాతి గడించారు. వీళ్లను ఆదర్శంగా చేసుకొని వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన మహిళలు లేకపోలేదు. మరి ఇంతటి ఘనతకెక్కిన ఈ ఇద్దరి శకం వారివారి బ్యాంకుల్లో ముగింపు దశకు చేరినట్లే కనిపిస్తోంది. వీళ్లిద్దరి సంగతి ఇలా ఉంటే దేశంలోనే మొట్టమొదటి మహిళా బ్యాంకుకైనా భారతీయ మహిళ బ్యాంకుకు తొలి ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన ఉషా సుబ్రమణియన్ కూడా పీఎన్‌బీ కుంభకోణం ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

చందాకొచ్చర్

వీడియోకాన్ రుణ వ్యవహారంలో క్విడ్‌ప్రోకో పాల్పడిన ఆరోపణలు చందాకొచ్చర్‌ను వెంటాడుతున్నాయి. ఈ పరిణామం సీఈఓ, ఎండీ పదవికి ఆమెను తాత్కాలికంగా దూరం చేసింది. అంతర్గత దర్యాప్తు తేలేవరకు చందాను సెలవులపై పంపేందుకు బోర్డు నిర్ణయం తీసుకుంది. అంతర్గత దర్యాప్తే కాకుండా సీబీఐ, సెబీ దర్యాప్తును కూడా ఆమె ఎదుర్కోనున్నారు. ఈ వ్యవహారమంతా ముగిసేవరకు కొచ్చర్ తిరిగి సీఈఓ, ఎండీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉండకపోవచ్చననే అభిప్రాయం వినిపిస్తోంది. అయితే మనదేశంలో కేసులు అంతత్వరగా పరిష్కారం కావు కాబట్టి కొచ్చర్ తన పదవికి శాశ్వతంగా దూరమయ్యేందుకే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని కూడా విశ్లేషకులు అంటున్నారు.

శిఖాశర్మ

మూడు విడతలుగా యాక్సిస్ బ్యాంకుకు సారథ్యం వహిస్తూ వచ్చారు శిఖాశర్మ. అయితే ఆమెను మళ్లీ నియమించేందుకు బోర్డు సమ్మతంగా ఉన్నప్పటికీ ఆర్‌బీఐ అభ్యంతరాలు లేవనెత్తింది. బ్యాంకు ఆస్తుల నాణ్యత బాగా క్షీణించడమే పునఃనియామకంపై ఆర్‌బీఐ అభ్యంతరం చెప్పడానికి ఓ కారణమై ఉండొచ్చని చెబుతున్నారు. అంతేకాకుండా పెద్దనోట్ల రద్దు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు, ఆర్థిక ఫలితాల లీకేజీ వ్యవహారం లాంటివి కూడా ఆమె నిష్క్రమణకు పరోక్షంగా దారితీశాయి. ఆర్‌బీఐ అభ్యంతరాల నేపథ్యంలో శిఖా శర్మ అనూహ్య నిర్ణయం తీసుకోక తప్పిందికాదు. కొత్త పదవీకాలాన్ని మూడేళ్లు వద్దనీ, ఏడు నెలలు చాలని ఆమె కోరారు. బ్యాంకు బోర్డు ఆమోదం కూడా వెంటనే లభించింది. దీంతో ఈ డిసెంబరు తర్వాత ఆమె తన పదవి నుంచి తప్పుకోనున్నారు. అయితే ఇందుకు కూడా ఆర్‌బీఐ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ మరోసారి ఆమె నియామకంపై ఆర్‌బీఐ ప్రశ్నిస్తే మరింత అనూహ్య నిర్ణయం వెలువడినా ఆశ్చర్యపోనవసరం లేదు.

ఉషా అనంత సుబ్రమణియన్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని ఎంతలా కుదిపేసిందో అందరికీ తెలిసిందే. ఎల్ఓయూల ద్వారా నీరవ్‌మోదీ, ఆయన సంబంధీకులు నిర్వహించిన రూ.వేల కోట్ల మోసపూరిత లావాదేవీలు బ్యాంకుల విశ్వసనీయతనే దెబ్బతీసే పరిస్థితిని సృష్టించాయి. అయితే ఈ లావాదేవీల వ్యవహారం ఆ సమయంలో బ్యాంకుకు ఎండీగా ఉన్న ఉషా అనంత సుబ్రమణియన్‌కు తెలిసే జరిగాయని సీబీఐ తన ఛార్జ్‌షీటులో పేర్కొనడం నిజంగా ఆందోళన చెందాల్సిన విషయమే. పైగా ఆర్‌బీఐను కూడా వీళ్లు తప్పుదోవ పట్టించారని అందులో సీబీఐ ఆరోపించింది. ఇందులో అనంత్ సుబ్రమణియన్‌కు బ్యాంకులో కొందరు ఉన్నతాధికారులు కూడా సహకరించారని తెలిపింది. మోసం జరుగుతున్నప్పుడే ఆమె కఠిన చర్యలు తీసుకొని ఉండి ఉంటే దేశంలోనే రెండో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుగా ఉన్న పీఎన్‌బీకి ప్రస్తుత సంక్షోభ పరిస్థితి ఎదురయ్యేదే కాదనే మాట వినిపిస్తోంది.

శిఖాశర్మ

ఉషా అనంత సుబ్రమణియన్

అనుకోలేదు..
ఇలా జరుగుతుందని

చందాకొచ్చర్‌ను సెలవుపై పంపించడం ద్వారా ఆమెపై ఐసీఐసీఐ బ్యాంక్ బోర్డుకున్న కృతజ్ఞతాభావం మరోసారి నిరూపితమైంది. విశ్లేషకుల, ఆర్థిక నిపుణుల్లో చాలా మంది వ్యక్తం చేస్తోన్న అభిప్రాయం ఇదే. చందాపై ఆరోపణలు వచ్చిన రోజు నుంచి ఆమెను తొలగించాలనే డిమాండు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఆరోపణలు అవాస్తవమని తేలేవరకు ఆమెనైనా స్వచ్ఛందంగా బాధ్యతల నుంచి తప్పుకోవాలనే సూచనలు కూడా వచ్చాయి. కాని ఇదేమీ జరగలేదు. ఎన్ని ఆరోపణలు రాని... ఎలాంటి విమర్శలు ఎదురవ్వని సుమారు మూడు నెలలుగా ఆమెకు అండగా నిలుస్తూనే వచ్చింది బోర్డు. ఆఖరుకు ఒత్తిడికి తలొగ్గాల్సి వచ్చిందో ఏమో అంతర్గత దర్యాప్తు తేలేవరకు ఆమెను సెలవు మీద పంపించేందుకు నిర్ణయం తీసుకుంది. సీఓఓగా సందీప్ బక్షికి బాధ్యతలు అప్పగించిందే కాని.. సీఈఓ, ఎండీ కుర్చీని ఆమె తిరిగి వచ్చే వరకు ఖాళీగా ఉంచేందుకే మొగ్గు చూపింది. ఇదొక్కటి చాలదా బోర్డుకు ఆమెపై ఎంతటి గౌరవముందో చెప్పడానికి. అంతేకాదు.. సెలవు మీద ఉన్నప్పటికీ కార్యకలాపాలు, నిర్ణయాల విషయంలో బోర్డును ఆమె నీడ వెంటాడుతుందనడంలో ఎలాంటి సందేహాలు ఉండనక్కర్లేదని అంటున్నారు కొందరు విశ్లేషకులు.

✦ పద్మభూషణ్ నుంచి మాయని మచ్చ వరకు

ఐసీఐసీఐ బ్యాంక్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా 1984లో చందాకొచ్చర్ అడుగుపెట్టారు. పాతికేళ్లలోనే బ్యాంకులో అత్యున్నత స్థాయికి చేరారు. పిన్నవయస్సులోనే సీఈఓ పదవిని అధిరోహించిన ఘనతను సంపాదించారు. 2009 నుంచి ఇప్పటివరకు అంటే తొమ్మిదేళ్ల పాటు ఎండీ, సీఈఓ కుర్చీ ఆమెదే. 2009లో ఏర్పడిన సంక్షోభం నుంచి బ్యాంకును గట్టెక్కించడంలో కీలక పాత్ర పోషించారు. బ్యాంకు పురోగతికి ఆమె చేసిన కృషి అంతా ఇంతా కాదు. కీలక నిర్ణయాల విషయంలో ఆమె చూపే చొరవ, సాహసం కారణంగా దేశంలోనే దిగ్గజ ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటిగా ఐసీఐసీఐ బ్యాంకు అవతరించింది. అంతర్జాతీయంగానూ పేరున్న బ్యాంకుల జాబితాలోనూ చోటు సంపాదించింది. 2011లో ఆమెను పద్మభూషణ్ పురస్కారం వరించింది. అత్యుత్తమ బ్యాంకర్ అవార్డులను కూడా అందుకున్నారు. ఫోర్బ్స్ శక్తిమంత మహిళల జాబితాలో పలుమార్లు కొచ్చర్ చోటు సంపాదించారు. ఇంతటి అద్భుతమైన ఉద్యోగ జీవితాన్ని అనుభవించిన ఆమెకు ఆఖర్లో చోటుచేసుకున్న పరిణామాలు మాయనిమచ్చగా మారాయి.

✦ సెలవులు ఎన్ని రోజులు..

చందాకొచ్చర్‌ను సెలవుపై పంపించేశారు సరే... మరి ఆమె ఎప్పుడు తిరిగి బాధ్యతలు చేపడతారు? దర్యాప్తు పూర్తయ్యాక మళ్లీ ఆమెకే బాధ్యతలు అప్పజెప్తారా? లేదంటే ఈలోపు ఎవరినైనా కొత్త సీఈఓను నియమిస్తారా? ప్రస్తుతం కార్పొరేట్ పరిశ్రమలో జరుగుతున్న చర్చ ఇది. అయితే ఆమె తిరిగి బాధ్యతలు చేపట్టడం, చేపట్టకపోవడం అనే విషయం అంతర్గత దర్యాప్తు ప్రక్రియ పూర్తవడంపై ఆధారపడి ఉంది. ఒకవేళ బ్యాంకు అంతర్గత దర్యాప్తులో ఆమెపై ఆరోపణలు అవాస్తవమని తేలినా కూడా బయటి దర్యాప్తు సంస్థల దర్యాప్తులు పూర్తయ్యేవరకు ఆమెపై పడ్డ ఆరోపణల మచ్చ అలాగే ఉంటుంది. ఇదేమీ పట్టించుకోకుండా అంతర్గత దర్యాప్తును పరిగణనలోకి తీసుకోని బోర్డు ఆమెకు తిరిగి బాధ్యతలు అప్పజెప్పినా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు విశ్లేషకులు. అయితే ఈ దర్యాప్తు పూర్తవడానికి ఎంత కాలం పడుతుందన్నదే కీలకమని చెబుతున్నారు. ఎందుకంటే ఆమెకు ఇప్పటికే పదవీ విరమణ వయస్సు దాటినందున దర్యాప్తు ముగియడానికి ఒకటి రెండేళ్లు పడితే తిరిగి ఆమెకు బాధ్యతలు అప్పజెప్పే విషయాన్ని బోర్డు పునఃపరిశీలించే అవకాశాలూ లేకపోలేదని అభిప్రాయపడుతున్నారు.

మచ్చ.. మలుపులు

- **2008 డిసెంబరు:** వీడియోకాన్ గ్రూపు ఛైర్మన్ వేణుగోపాల్ ధూత్‌తో కలిసి చందాకొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ న్యూపవర్ రెన్యూవబుల్స్ సంస్థను ఏర్పాటు చేశారు.
- **2009 జనవరి-** న్యూపవర్ డైరెక్టరుగా ధూత్ రాజీనామా చేశారు. 25,000 షేర్లను రూ.2.5 లక్షలకుదీపక్ కొచ్చర్‌కు విక్రయించారు.
- **మే-** ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓగా చందాకొచ్చర్ బాధ్యతలు స్వీకరించారు.
- **2012-** వీడియోకాన్ గ్రూపునకు ఐసీఐసీఐ బ్యాంకు రూ.3,250 కోట్ల రుణం మంజూరు
- **2017-** వీడియోకాన్ రుణం నిరర్థక ఆస్తిగా ప్రకటన
- **2018 మార్చి-** వీడియోకాన్ రుణం మంజూరీలో కొచ్చర్ క్విడ్‌ప్రోకోకు పాల్పడినట్లు ఆరోపణలు
- **మార్చి 28-** కొచ్చర్‌పై వచ్చిన ఆరోపణలు నిరాధారమంటూ అండగా నిలిచిన ఐసీఐసీఐ బోర్డు
- **ఏప్రిల్ 6-** చందాకొచ్చర్, దీపక్ కొచ్చర్‌లకు సీబీఐ లుక్అవుట్ నోటీసులు
- **మే 30-** వీడియోకాన్ రుణ వ్యవహారంలో చందా పాత్రపై అంతర్గత దర్యాప్తునకు కమిటీ
- **జూన్ 18-** కొచ్చర్‌ను సెలవుల మీద పంపేందుకు బోర్డు నిర్ణయం, సీఓఓగా సందీప్ బక్షి.

చందా ప్రస్థానం

1984- ఐసీఐసీఐ బ్యాంకులో మేనేజ్‌మెంట్ ట్రైనీగా నియామకం
1998- జనరల్ మేనేజరుగా పదోన్నతి
2000- రిటైల్ వ్యాపార విభాగానికి సారథ్యం
2001- ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా బాధ్యతలు
2006- డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టరుగా పదోన్నతి
2007- సీఎఫ్ఓ, సంయుక్త ఎండీ హోదా
2009 నుంచి - మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ బాధ్యతలు

సెన్సెక్స్ ▼ 262 — 35287

నిఫ్టీ ▼ 89 — 10711

డోజోన్స్ 24687 ▼ 301

నాస్‌డాక్ 7700 ▼ 47

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 68.38 ▼ 39 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 75.19 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+)

నిఫ్టీ	19న	మార్పు %
GAIL (INDIA)	342.75	1.38
BAJAJ FINANCE	2270.60	1.22
ITC	266.05	0.57
DR. REDDYS LAB	2393.00	0.30
HDFC	1828.00	0.24
HDFC BANK	2023.50	0.22
ONGC	164.80	0.12

గ్రహణం (-)

నిఫ్టీ	19న	మార్పు %
VEDANTA	224.30	-3.40
INDIAN OIL CORP	168.60	-3.05
HPCL	313.00	-2.83
UPL	674.10	-2.62
M & M	891.40	-2.46
HINDALCO	225.80	-2.25
BPCL	413.60	-2.25

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.87	71.74	బహ్రెయిన్ దీనార్	167.33	191.60
పౌండ్ స్టెర్లింగ్	82.10	95.22	కువైట్ దీనార్	185.79	231.35
యూరో	72.02	83.53	ఒమన్ రియాల్	163.44	187.71
జపనీస్ యెన్/100	56.33	65.33	సౌదీ రియాల్	16.40	19.49
ఆస్ట్రేలియా డాలరు	45.84	53.03	యూఏఈ దిర్హమ్	16.80	19.67
సింగపూర్ డాలరు	45.80	54.25	మలేషియా రింగిట్	15.15	18.64
థాయ్ బాత్/100	189.38	226.49	చైనీస్ యువాన్	7.46	12.09

మంగళవారం నిఫ్టీ కదలికలు



అమెరికా విపణిలోకి డాక్టర్ రెడ్డీస్ కొత్త ఔషధం

ఈనాడు, హైదరాబాద్: మూర్ఛ సంబంధ రుగ్మతల చికిత్సకు వినియోగించే సూది మందు జనరిక్‌ను అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టేందుకు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అనుమతి ఇచ్చింది. సింగిల్ డోస్ ఇన్‌ఫ్యూషన్ బ్యాగ్‌ల రూపంలో లెవిటిరాసెట్రమ్ ఇన్ సోడియం క్లోరైడ్ ఇంజెక్షన్‌ను 500 ఎంజీ/100 ఎంఎల్, 1000 ఎంజీ/100 ఎంఎల్, 1500 ఎంజీ/100 ఎంఎల్ మోతాదుల్లో విక్రయించడానికి అనుమతి లభించిందని కంపెనీ వెల్లడించింది. హెచ్‌క్యూ స్పెషాలిటీ ఫార్మా కార్పొరేషన్ విక్రయిస్తున్న ఔషధానికి జనరిక్‌ను ప్రవేశపెట్టడానికి డాక్టర్ రెడ్డీస్‌కు ఆమోదం లభించింది.

డాన్‌లా చేతికి టైటాన్ టైమ్‌ప్రోడక్ట్స్

ఈనాడు, హైదరాబాద్: టైటాన్ కంపెనీకి చెందిన టైటాన్ టైమ్‌ప్రోడక్ట్స్ (టీటీపీఎల్)ను హైదరాబాద్‌కు చెందిన డాన్‌లా టెక్నాలజీస్ కొనుగోలు చేసింది. టీటీపీఎల్‌ను రూ.18.5 కోట్లకు సొంతం చేసుకున్నట్లు డాన్‌లా తెలిపింది. టీటీపీఎల్ ఎలక్ట్రానిక్స్‌ను తయారు చేస్తోంది. ఆటోమోటివ్ ఇంజినీరింగ్ సేవలు, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల అభివృద్ధి, భద్రత సొల్యూషన్లను అందిస్తున్న డాన్‌లా టెక్నాలజీస్‌కు ఈ కొనుగోలు బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్ అవుతుంది. కంపెనీ డిజైన్ చేసిన ఉత్పత్తులను తయారు చేయడానికి టీటీపీఎల్ దోహదం చేస్తుందని డాన్‌లా వివరించింది. కంపెనీకి చెందిన ఇంజినీరింగ్ విభాగం ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సొల్యూషన్లను అందిస్తోంది.

హైదరాబాద్‌లో విద్యుత్ కార్లు

ఈనాడు, హైదరాబాద్: సంస్థలు తమ ఉద్యోగుల రవాణాకు ఉపయోగించేందుకు విద్యుత్ వాహనాలను లిథియం అర్బన్ టెక్నాలజీస్ అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే బెంగళూరు, దిల్లీల్లో ఈ సేవలను అందిస్తోన్న ఈ సంస్థ తాజాగా హైదరాబాద్‌కు తమ సేవలను విస్తరించింది. పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ వాహనాలకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని వీటిని ప్రవేశపెడుతున్నట్లు సంస్థ ఆపరేషన్స్ హెడ్ ప్రవీణ్ సాలిన్స్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 40 కార్లను ప్రవేశపెట్టినట్లు, ఏడాదిలో వీటి సంఖ్య 250కు చేరుకుంటుందని వివరించారు.

మీ డిపాజిట్లు సురక్షితం

- ఆర్‌బీఐకు మరిన్ని అధికారాలిస్తాం
- ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ)ల్లోని ప్రజల సొమ్ము 100 శాతం సురక్షితంగా ఉన్నాయని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో ఇటీవల వరుస మోసాలు వెలుగుచూసిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పదమూడు ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతుల సమావేశం అనంతరం మీడియాతో గోయల్ మాట్లాడారు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు మరింత మెరుగ్గా పనిచేసేందుకు.. అవసరమైతే రిజర్వు బ్యాంక్‌కు మరిన్ని అధికారులు ఇవ్వడానికైనా సిద్ధమని అన్నారు. పీఎస్‌బీల వెనక ప్రభుత్వం ఉందని, డిపాజిట్‌దార్ల సొమ్ము 100 శాతం భద్రంగా ఉందని తెలిపారు. ప్రైవేట్ రంగ బ్యాంక్‌లు, ఆదాయపు పన్ను చెల్లించని కొన్ని కంపెనీల భద్రత గురించి తనకు తెలియదని చెప్పుకొచ్చారు. ప్రైవేట్ కంపెనీలు మోసానికి పాల్పడ్డాయి తప్పా.. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు ఎటువంటి తప్పు చేయలేదని వెల్లడించారు. రిజర్వు బ్యాంక్‌కు అధికారాల కొరత ఉందని తాను భావించడం లేదని, ఏమైనా సమస్యలు ఉంటే చర్చించి పరిష్కరిస్తామని పీయూష్ గోయల్ అన్నారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి నిజమైన కార్పొరేట్ సంస్థలు, చిన్న వ్యాపారులను గుర్తించి.. వారికి రుణాలు ఇచ్చే వ్యూహాలపై చర్చించినట్లు వివరించారు. అర్హత కలిగిన, మంచి పని తీరు ఉన్న కంపెనీలకే రుణాలు ఇవ్వాలని బ్యాంక్‌లు నిర్ణయించినట్లు పీయూష్ తెలిపారు. బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన మొండి బకాయిల అంశం సైతం సమావేశంలో చర్చకు వచ్చింది. ఆర్‌బీఐ కొన్ని బ్యాంక్‌లపై విధించిన ఆంక్షలు గురించి కూడా చర్చించారు.

ఎయిరిండియా విక్రయం ఇప్పుడే ఉండదు

- ప్రక్రియ నిలిపేసిన ప్రభుత్వం
- జైట్లీ నేతృత్వంలో సమావేశ ఫలితం

దిల్లీ: ఎయిరిండియాలో వాటా విక్రయ అంశాన్ని ప్రభుత్వం ప్రస్తుతానికి పక్కన పెట్టేసింది. భారీ రుణాల్లో చిక్కుకున్న ఈ సంస్థలో 24 శాతం వాటా అట్టేపెట్టుకుని, 76 శాతం వాటా విక్రయించాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. అయితే ఎయిరిండియాలో వాటా కొనుగోలుదారు సంస్థకు ఉన్న రూ.24,000 కోట్ల రుణాలతో పాటు మరో రూ.8,000 కోట్లు చెల్లింపు బాధ్యతలు కూడా తీసుకోవాల్సి ఉన్నందున, బిడ్ వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో ఎయిరిండియాలో 100 శాతం వాటా విక్రయించాలన్న సూచనలూ వచ్చాయి. కానీ ఎన్నికల సంవత్సరం కావడంతో ఇందుకు ప్రభుత్వం వెనుకాడుతోంది. సంస్థ రోజువారీ కార్యకలాపాల కోసం నిధులను ప్రభుత్వమే మంజూరు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. అవసరమైతే కొన్ని విమానాల కొనుగోలుకు ఆర్డర్లు ఇవ్వాలని కూడా భావిస్తోంది. కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు పౌర విమానయాన మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ఇన్‌ఛార్జి మంత్రి పీయూష్ గోయల్, మంత్రి సురేశ్ ప్రభు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక-పౌర విమానయాన శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. దీనిపై ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ 'ప్రస్తుతం ఎయిరిండియాకు నిర్వహణ లాభాలొస్తున్నాయి. ఏ విమానంలో సీట్లు ఖాళీగా ఉండటం లేదు. వ్యయ నియంత్రణ చర్యలు అమలవుతున్నాయి. నిర్వహణ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడంపై దృష్టి సారించాం. ఉన్నత స్థాయి నుంచి చిన్న ఉద్యోగుల వరకు అందరిలో స్థైర్యం నెలకొల్పే చర్యలు తీసుకుంటాం. ఇందువల్ల సంస్థ తీరు తప్పనిసరిగా మెరుగు పడుతుంది. అవసరమైనపుడు నిధులు కూడా అందిస్తాం. అందువల్ల సంస్థలో వాటా విక్రయానికి హడావుడి పడాల్సిన అవసరం లేదు' అని చెప్పారు. ఎయిరిండియా పబ్లిక్ ఇష్యూకు వచ్చే ముందు, సంస్థను లాభాల్లోకి వచ్చేలా చూడాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా వివరించారు.

చైనా, అమెరికా సుంకాల రగడ

బీజింగ్: అమెరికా, చైనాల మధ్య సుంకాల యుద్ధం అంతకంతకూ తీవ్రమవుతోంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ఇదేరీతిన సాగితే, ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య యుద్ధాలు తప్పవనే ఆందోళనతో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యాయి. చైనా కనుక అన్యాయపూరిత విధానాలు విడనాడకపోతే, మరో 200 బిలియన్ డాలర్ల (సుమారు రూ.13 లక్షల కోట్ల) విలువైన చైనా ఉత్పత్తులపై దిగుమతి సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా హెచ్చరించారు. అమెరికా, చైనాల మధ్య వాణిజ్యంలో సమతౌల్యత లేదని, 376 బి.డాలర్ల (సుమారు రూ.24.44 లక్షల కోట్ల) మేర చైనా అక్రమంగా లాభపడుతోందని ట్రంప్ ఆరోపించారు. 50 బి.డాలర్ల (సుమారు రూ.3.25 లక్షల కోట్ల) విలువైన చైనా ఉత్పత్తులపై సుంకం విధిస్తున్నట్లు గతవారంలో అమెరికా ప్రకటించింది. దీనికి ప్రతిగా, అమెరికా నుంచి దిగుమతి అవుతున్న 50 బి.డాలర్ల విలువైన 659 రకాల ఉత్పత్తులపై సుంకం విధిస్తామని చైనా ప్రకటించడంతో, అమెరికా తాజా హెచ్చరికలు చేసింది. 'చైనా తన అన్యాయపూరిత విధానాలు మార్చుకునేలా మా తదుపరి చర్యలుంటాయి. అమెరికా ఉత్పత్తులను చైనా తన విపణిలోకి అనుమతించాలి. ఇరుదేశాల మధ్య ఎగుమతి, దిగుమతులు సమానంగా ఉండాలన్నదే మా విధానం. రెండో విడతలో 10% సుంకం విధించాల్సిన చైనా ఉత్పత్తులను గుర్తించాలని ఆదేశించా' అని ట్రంప్ స్పష్టం చేశారు.

అపర కుబేరుడు జెఫ్ బెజోస్

ఫోర్బ్స్ జాబితాలో అగ్రస్థానం

దిల్లీ: ఫోర్బ్స్ ప్రకటించిన ప్రపంచ కుబేరుల జాబితాలో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ తొలి స్థానాన్ని దక్కించుకున్నారు. 141.9 బిలియన్ డాలర్ల (దాదాపు 9.5 లక్షల కోట్లు) సంపదతో అగ్రస్థానంలో నిలిచారు. ఆ తరవాత స్థానంలో మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఉన్నారు. ఈయన సంపద విలువ 92.9 బి.డాలర్లు. మార్కెట్ మాంత్రికుడు వారెన్ బఫెట్ 82.2 బి.డాలర్ల సంపదతో మూడో స్థానం సంపాదించారు. ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా అమెజాన్ రెండో స్థానంలో నిలిచింది. యాపిల్ మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో విడుదల చేసిన ఫార్చ్యూన్ జాబితాలో 177.87 బి.డాలర్ల ఆదాయంతో అమెజాన్ 8వ స్థానంలో నిలిచింది. ఇప్పుడు ఫోర్బ్స్ జాబితాలో అనూహ్యంగా రెండో స్థానానికి ఎగబాకడం విశేషం.

దేశంలో కోటీశ్వరులు.. 2.63 లక్షల మంది

ముంబయి: అత్యధిక మంది కోటీశ్వరులు ఉన్న దేశాల్లో భారత్‌కు 11వ స్థానం దక్కింది. మొత్తం 2.63 లక్షల మంది కోటీశ్వరులు భారత్‌లో ఉన్నట్లు లెక్క తేలింది. క్యాప్ జెమినీ విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. కొత్తగా వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వచ్చినప్పటికీ.. సంపన్నుల సంఖ్య పెరగడం గమనార్హం. గతేడాది భారత్‌లో అత్యధిక నికర విలువ కలిగిన వ్యక్తుల (హెచ్ఎన్‌డబ్ల్యూఐ) సంఖ్య, వారి సంపద 20 శాతం చొప్పున వృద్ధి చెందాయని, సంపన్నుల సంఖ్య వృద్ధిలో వేగవంతమైన దేశంగా భారత్ అవతరించిందని నివేదిక తెలిపింది. ఈ 2.63 లక్షల మంది మొత్తం సంపద 21 శాతం వృద్ధి లక్ష కోట్ల డాలర్లను దాటడం విశేషం. హెచ్ఎన్‌డబ్ల్యూఐ అంటే కనీసం ఒక మిలియన్ డాలర్లు (దాదాపు రూ.6.7 కోట్లు) కలిగిన వ్యక్తి. ఇంకా ఈ నివేదిక ఏమంటోందంటే..

- ✦ అత్యధిక నికర విలువ కలిగిన వ్యక్తుల సంఖ్య (11.2 శాతం), సంపద (12 శాతం) వృద్ధి విషయంలో భారత్ ముందు నిలిచింది.
- ✦ కోటీశ్వరుల సంఖ్య విషయానికొస్తే భారత్‌కు అంతర్జాతీయంగా 11వ స్థానానికి పెరిగింది. అమెరికా, జపాన్, జర్మనీ, చైనాలు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి.
- ✦ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదిత కంపెనీల మొత్తం విలువ గతేడాది 50 శాతానికి పైగా పెరగడం, భారత జీడీపీ 6.7 శాతం వృద్ధి సాధించడం.. మన దేశంలో కోటీశ్వరుల సంఖ్య పెరగడానికి దోహదం చేశాయి.

19న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	392	వరంగల్	394
చిల్లరగా(ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	400
బెంగళూరు	429	చెన్నై	457
20వ తేదీకి...		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	384	నమక్కల్	440

మాల్యా పని పట్టండి మోదీజీ

- అతనివి రక్తంతో తడిసిన చేతులు
- ప్రధానికి కింగ్‌ఫిషర్ ఉద్యోగుల లేఖ

దిల్లీ: బ్యాంకులకు వేల కోట్ల రూపాయల రుణాలతో పాటు తమకు వేతనాలు ఎగవేసిన విజయ్‌మాల్యాను కఠినంగా శిక్షించాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్‌కు కింగ్‌ఫిషర్ ఉద్యోగులు లేఖ రాశారు. అతని చేతులు రక్తంతో తడిచి ఉన్నాయని, పరారీలో ఉన్న అతన్ని తీసుకువచ్చి, కఠినంగా శిక్షించాలని అభ్యర్థించారు. బ్యాంకుల వద్ద రుణంగా తీసుకున్న రూ.3,700 కోట్లను విజయ్‌మాల్యా, అతని రెండు సంస్థల నిర్వాహకులు కలిసి ఎఫ్ 1 మోటార్‌స్పోర్ట్ సంస్థకు, ఒక టీ20 జట్టు కోసం, ప్రైవేటు జెట్ విమానాల్లో విహరించేందుకు వినియోగించారని ఆరోపిస్తూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసిన మరుసటిరోజే ఈ లేఖ అందింది. లేఖలోని అంశాలు ఇలా..

'మీమే వీ విదేశాంగ విధానాన్ని అభినందిస్తున్నాం. మీ నేతృత్వంలో దేశ ఖ్యాతి ఇనుమడిస్తోంది. లండన్‌లో వేతనాలు ఎగవేయడాన్ని అత్యంత తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. వేతనాలు లభించక ఏర్పడిన ఇబ్బందుల ఫలితంగా ఒక ఉద్యోగి భార్య ఆత్మహత్య చేసుకుంటే, మరింత కఠినంగా వ్యవహరిస్తారు. పరోక్షంగా మాల్యా ఇలా హంతకుడయ్యాడు. బ్రిటన్ నుంచి విజయ్ మాల్యాను బహిష్కరించడానికి ఈ నేరం ఒక్కటి చాలు. అయినా కూడా ఇప్పటివరకు అతన్ని అక్కడ అనుమతిస్తున్నారంటే ఆశ్చర్యం వేస్తోంది. ఈ పరిస్థితులు చూస్తుంటే, కోర్టులు న్యాయం చేయడానికి లేవు, సామాన్యులను వేధించడానికి మాత్రం పనికి వస్తున్నట్లు ఉంది. మమ్మల్ని ఆదుకోవడంలో వ్యవస్థ విఫలమైందని భావిస్తున్నాం. న్యాయం కోసం మేం ఎక్కని, దిగని గుమ్మం లేదు. అయినా ఉపశమనం లభించలేదు. అయితే మాల్యా ఆదాయపు పన్ను చెల్లించనందుకు, మేము నోటీసులు అందుకుంటున్నాం' అని ఆవేదన వ్యక్తం చేశారు.

5 శాతం కూడా వసూలు చేసుకోలేరు: తనకు ఇచ్చిన రుణాల్లో 5 శాతాన్ని కూడా వసూలు చేసుకోలేరనే ధీమాను ఒకసారి మాతో వ్యక్తిగత సంభాషణల సందర్భంగా మాల్యా పేర్కొన్నారు. అంటే అతని వెనకాల ఎంతటి పెద్ద వ్యక్తులు ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. మాల్యాకు సహకరిస్తున్న వారిని కూడా బయటకు తేవాలని ప్రధానిని అభ్యర్థించారు.

లాజిస్టిక్స్ పరిశ్రమకు హైదరాబాద్ కేంద్రం

నాలుగేళ్లలో 1.96 లక్షల ఉద్యోగాలు: టీమ్‌లీజ్

ఈనాడు, హైదరాబాద్: వచ్చే నాలుగేళ్లలో హైదరాబాద్ ప్రాంతంలో లాజిస్టిక్స్ రంగం దాదాపు రెండు లక్షల ఉద్యోగావకాశాలను కల్పించే అవకాశం ఉంది. వస్తు, సేవల పన్ను అమలు, లాజిస్టిక్స్ రంగంలో సగటు వార్షిక వృద్ధిరేటు 10.5 శాతం ఉండడం వంటి సానుకూల అంశాల కారణంగా హైదరాబాద్ ప్రాంతంలో ఈ రంగంలో 1,96,000 ఉద్యోగాలు రాగలవని టీమ్‌లీజ్ అంచనా వేసింది. రోడ్డు, రైలు, వాయు రవాణా, గోదాములు తదితర విభాగాల్లో కొత్త ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఒక్క రోడ్డు రవాణా విభాగంలోనే 1,45,307 ఉద్యోగాలు వచ్చే వీలుంది. దేశంలో లాజిస్టిక్స్ పరిశ్రమ అభివృద్ధికి హైదరాబాద్ కీలక ప్రాంతంగా మారింది. శంషాబాద్, మహబూబ్‌నగర్‌లు ప్రధాన గోదాము క్యారిడార్‌లుగా ఉన్నాయి. అంతేకాక విమానాశ్రయానికి దగ్గరగా ఉన్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ సహాయ వైస్ ప్రెసిడెంట్ సందీప్ సేన్ తెలిపారు. దాదాపు 100 కిలోమీటర్ల మేరకు రూ.1,930 కోట్ల పెట్టుబడులతో విశాలమైన రోడ్డు క్యారిడార్ల నిర్మాణం, మల్టీ మోడల్ పార్కుల ఏర్పాటు, హైదరాబాద్‌కు చెందిన కంపెనీలు కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను, వినూత్న సొల్యూషన్లను ప్రవేశపెట్టడం వంటి అంశాలు ఉద్యోగావకాశాలను పెంచనున్నాయి. ప్రస్తుతం లాజిస్టిక్స్ రంగంలో నిపుణుల కొరత ఉంది. రవాణా రంగంలో సరైన పని వాతావరణ ఉండదనే అభిప్రాయం, లింగ భేదం, కాలం చెల్లిన పని విధానాలు ఈ రంగానికి నిపుణులను దూరం చేస్తున్నాయని టీమ్‌లీజ్ తన నివేదికలో పేర్కొంది. హైదరాబాద్‌లో ఈ లాజిస్టిక్స్ ఉప విభాగాల్లో 1.18 లక్షల మంది పని చేస్తున్నారని, సీనియర్ నిపుణుల లభ్యత సంతృప్తికరంగా ఉన్నప్పటికీ.. జూనియర్ నిపుణుల కొరత ఉందని వివరించింది. దేశ వ్యాప్తంగా వచ్చే నాలుగేళ్లలో 30 లక్షల ఉద్యోగాలు లభించే వీలుంది. 2018-2022 మధ్య రూ.14.19 లక్షల కోట్ల పెట్టుబడులు రాగలవని పేర్కొంది. 2010లో ఈ రంగంలో పని చేస్తున్న మొత్తం ఉద్యోగుల్లో మహిళలు 5 శాతం మంది మాత్రమే ఉంటే.. ప్రస్తుతం 20 శాతం మందికి పెరిగిందని, వచ్చే నాలుగేళ్లలో 26 శాతానికి చేరుతుందని టీమ్‌లీజ్ వెల్లడించింది.

వాణిజ్య యుద్ధం రాజుకుంది

- కుప్పకూలిన అంతర్జాతీయ మార్కెట్లు
- అదే దారిలో మన సూచీలు

సమీక్ష

వరుసగా రెండో రోజూ సూచీలు డీలాపడ్డాయి. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లు కుదేలయ్యాయి. మన సూచీలు ఇందుకు మినహాయింపేమీ కాదు. చైనా వస్తువులపై అదనపు సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం, ప్రతిగా చైనా కూడా ఘాటుగా సమాధానం ఇవ్వడంతో వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చింది. ఆసియా మార్కెట్లలో హాంగ్‌సెంగ్ 841 పాయింట్లు, జపాన్ నిక్కీ 402 పాయింట్లు, షాంఘై కాంపోజిట్ 115 పాయింట్లు చొప్పున నష్టాలు నమోదు చేశాయి. ఐరోపా మార్కెట్లు సైతం నీరసంగానే ట్రేడయ్యాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలు స్థిరంగా కొనసాగించారు. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం నష్టాలకు తోడైంది.

సెన్సెక్స్ ఉదయం 35,552.47 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. అన్ని రంగాల షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇంట్రాడేలో 35,249.06 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. చివరకు 261.52 పాయింట్ల నష్టంతో 35,286.74 దగ్గర స్థిరపడింది. ఈ నెల 6 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు కావడం గమనార్హం. ఇక నిఫ్టీ సైతం 89.40 పాయింట్లు కోల్పోయి 10,710.45 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,701.20-10,789.45 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 26 నష్టాలు చవిచూశాయి. వేదాంతా 3.55%, ఎం అండ్ ఎం 2.23%, అదానీ పోర్ట్స్ 2%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.91%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.90%, సన్‌ఫార్మా 1.88%, బజాజ్ ఆటో 1.81%, ఇన్ఫోసిస్ 1.77%, ఎస్‌బీఐ 1.61%, విప్రో 1.49%, మారుతీ సుజుకీ 1.39% చొప్పున డీలాపడ్డాయి. ఐటీసీ, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు మాత్రం స్వల్పంగా రాణించాయి. అన్ని రంగాల సూచీలు నేలచూపులు చూశాయి. లోహ అత్యధికంగా 1.69 శాతం కోల్పోయింది. స్థిరాస్తి, చమురు- గ్యాస్, ఐటీ, టెక్, పీఎస్‌యూ, వాహన, విద్యుత్ రంగాలు అదే బాటలో నడిచాయి.



వీళ్లది ప్రేమ గోల్

ప్రపంచకప్ గెలిచేందుకు జట్లు మైదానంలో యుద్ధం చేస్తుంటే.. నచ్చిన అమ్మాయి మనసు గెలుచుకునేందుకు అభిమానులూ అంతే స్థాయిలో కష్టపడుతున్నారు. రష్యాకు వచ్చిన వివిధ దేశాల యువకులు స్థానిక అమ్మాయిలతో స్నేహం పెంచుకొనే పనిలో పడ్డారు. ఇప్పటికే నలుగురు రష్యా అమ్మాయిల ఫోన్ నంబర్లు తీసుకున్న అర్జెంటీనా అభిమాని అగస్టిన్.. ట్రోఫీ ముగిసేలోపు వీలైనంత ఎక్కువ మందితో స్నేహం చేస్తానంటున్నాడు. "మా జట్టు మ్యాచ్‌లు లేని సమయంలో ఏం చేయాలో తెలీట్లేదు. అందుకే రష్యా అమ్మాయిల గురించి తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నా" అని ఓ అభిమాని చెప్పాడు. రష్యా అమ్మాయిలు కూడా కూడా విదేశీయులకు స్వాగతం పలుకుతున్నారు. "ఈ ప్రపంచకప్ వల్ల విదేశీయులను కలవడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. అదే మాకు కలిగే ప్రధాన ప్రయోజనం" అని 25 ఏళ్ల మారియా తెలిపింది. "వారంలో నేను రెండు రోజులు డేట్‌కు వెళ్లేదాన్ని. ఇప్పుడు నాలుగు రోజులు వెళ్తున్నా. ఎవరికీ కాదు అని చెప్పలేకపోతున్నా" అని ల్యూబోవ్ అనే మరో యువతి చెప్పింది.

~~444~~

481

- వన్డేల్లో ఇంగ్లాండ్ కొత్త ప్రపంచ రికార్డు
- హేల్స్, బెయిర్‌స్టో విధ్వంసం
- ఆసీస్ బౌలింగ్ ఊచకోత

సాంచెజ్‌కు రెడ్ కార్డు చూపిస్తున్న రిఫరీ

16ను 61 ఓడించింది

డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ.. మెక్సికో చేతిలో షాక్ తింది. హాట్ ఫేవరెట్ బ్రెజిల్.. చిన్న జట్టు స్విట్జర్లాండ్‌తో పోరులో డ్రాతో సరిపెట్టుకుంది. పసికూన ఐస్‌లాండ్‌తో పోరులో అర్జెంటీనాకూ అదే ఫలితం. ఇలా ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో రోజుకో సంచలన ఫలితం వస్తోంది. ఈ ఒరవడిని కొనసాగిస్తూ మంగళవారం మరో అనూహ్య ఫలితం వచ్చింది. గ్రూప్-హెచ్ ఫేవరెట్ అయిన కొలంబియా.. ఫిఫా ర్యాంకింగ్స్‌లో తనకంటే 45 ర్యాంకులు దిగువన ఉన్న జపాన్ చేతిలో అనూహ్య పరాజయం చవిచూసింది. మ్యాచ్ ఆరంభంలోనే కీలక ఆటగాడు కార్లోస్ సాంచెజ్ రెడ్ కార్డుతో మైదానాన్ని వీడటం కొలంబియా కొంపముంచింది. పదిమందితోనే ఒక దశ వరకు నెట్టుకొచ్చిన కొలంబియా.. తర్వాత చేతులెత్తేసింది. ప్రపంచకప్‌లో ఓ దక్షిణ అమెరికా జట్టును ఓడించిన తొలి ఆసియా జట్టుగా జపాన్ చరిత్రకెక్కింది.

కొలంబియాకు జపాన్ షాక్ ● కొంపముంచిన రెడ్ కార్డ్

గోల్ కొడుతున్న ఒసాకో

జపాన్ ఆటగాళ్ల ఆనందం

సరాన్స్క్

ప్రపంచకప్‌లో మరో ఆసక్తికర ఫలితం. ఫిఫా ర్యాంకింగ్స్‌లో 61వ స్థానంలో ఉన్న జపాన్.. 16వ స్థానంలో ఉన్న కొలంబియాకు షాకిచ్చింది. మంగళవారం జరిగిన గ్రూప్-హెచ్ మ్యాచ్‌లో జపాన్ 2-1తో కొలంబియాపై విజయం సాధించింది. మ్యాచ్ నాలుగో నిమిషం నుంచే పది మందితో ఆడాల్సి రావడం కొలంబియాకు చేటు చేసింది. మూడో నిమిషంలో సాంచెజ్ గోల్ పోస్టు దగ్గర బంతిని చేత్తో అడ్డుకోవడంతో రిఫరీ అతడికి రెడ్ కార్డు ఇచ్చాడు. ఆరో నిమిషంలోనే జపాన్ పెనాల్టీ సంపాదించింది. కగావా గోల్ కొట్టి జపాన్‌కు ఆధిక్యాన్నందించాడు. ఐతే ఒక కీలక ఆటగాడిని కోల్పోయినా, ఆరంభంలోనే వెనుకబడ్డా కొలంబియా ఏమీ డీలా పడలేదు. ప్రత్యర్థిని దీటుగానే ఎదుర్కొంది. ఆ జట్టు ఆటగాళ్లు దూకుడు ప్రదర్శించారు. 39వ నిమిషంలో క్వింటెరో గోల్‌తో కొలంబియా స్కోరు సమం చేయగలిగింది. కానీ ద్వితీయార్ధంలో కొలంబియా స్థాయికి తగ్గట్లు ఆడలేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ జట్టు సూపర్ స్టార్ రోడ్రిగెజ్ సత్తా చాటలేకపోయాడు. పిక్క గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోని అతను.. అవకాశాల్ని సొమ్ము చేసుకోలేకపోయాడు. మిగతా ఆటగాళ్లూ అంతంతమాత్రంగానే ఆడారు. కొలంబియా బలహీనతను రెండో అర్ధంలో సొమ్ము చేసుకున్న జపాన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడారు. స్టార్ ఆటగాడు కీసుకో హోండా ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. 73వ నిమిషంలో చుట్టూ కొలంబియా డిఫెండర్లు మూగి ఉన్నప్పటికీ వాళ్ల కంటే ఎత్తుకు ఎగిరిన ఒసాకో.. కార్నర్‌ను అద్భుత రీతిలో తలతో గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత కూడా కొలంబియాకు జపాన్ ఆటగాళ్ల దాడిని కాచుకోవడానికే సరిపోయింది. గత ప్రపంచకప్‌లో జపాన్‌ను కొలంబియా 4-1తో చిత్తు చేయడం విశేషం. ఆ ఓటమికి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. ఆ టోర్నీలో జపాన్ ఒక్క విజయమూ లేకుండా నిష్క్రమించింది. రెండు నెలల కిందటే కోచ్‌ను మార్చిన జపాన్.. టోర్నీలో ఎలాంటి ప్రదర్శన చేస్తుందో అన్న సందేహాలు నెలకొన్నాయి. కొలంబియా ఒక ఆటగాడిని కోల్పోయినప్పటికీ.. జపాన్ ప్రతిభను తక్కువ చేయడానికేమీ లేదు. మ్యాచ్‌లో ఆ జట్టు చక్కటి ప్రదర్శన చేసింది. కొలంబియాను ఓడించడంతో జపాన్ నాకౌట్ చేరే అవకాశాలు మెరుగ్గానే కనిపిస్తున్నాయి.

> ● మంగళవారం జపాన్‌తో పోరులో కొలంబియా ఆటగాడు సాంచెజ్ 2 గంటల 56 సెకన్లకే రెడ్ కార్డుతో బయటికి వెళ్లాడు. ప్రపంచకప్ చరిత్రలోనే ఓ మ్యాచ్‌లో అతి తక్కువ సమయంలో రెడ్ కార్డు కార్డు అందుకున్న ఆటగాళ్లలో అతను రెండో వాడు. 1986 ప్రపంచకప్‌లో ఆల్బర్టో బటిస్టా 54 సెకన్లకే రెడ్ కార్డుతో బయటికెళ్లి రికార్డులకెక్కాడు.

కేన్

ఇంగ్లాండ్ జట్టు సంబరం

కేన్ డబుల్

- ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ శుభారంభం
- టునీషియాపై 2-1తో విజయం

ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ తడబడుతూ బోణీ కొట్టింది. కెప్టెన్ హ్యారీ కేన్ రెండు గోల్స్‌తో ఆదుకోవడంతో గ్రూప్-జి మ్యాచ్‌లో టునీషియాపై 2-1తో గెలిచింది. ఇంజురీ టైమ్‌లో కేన్ గోల్‌తో ఇంగ్లాండ్ గట్టెక్కింది.

వోల్గోగ్రాడ్ (రష్యా)

ప్రపంచకప్‌ను ఇంగ్లాండ్ విజయంతో ఆరంభించింది. ఐతే గెలుపు అంత తేలిగ్గా దక్కలేదు. గ్రూప్-జిలో ఆడిన తన తొలి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 2-1తో టునీషియాపై కష్టపడి గెలిచింది. ఇంగ్లాండ్ ఖాతాలోని రెండు గోల్సూ కేన్ (11వ, 90+1) సాధించినవే. టునీషియా తరఫున సాసి గోల్ (35వ నిమిషం, పెనాల్టీ) కొట్టాడు. మ్యాచ్‌లో బంతిని ఎక్కువగా తన నియంత్రణలోనే ఉంచుకున్న ఇంగ్లాండ్ త్వరగానే ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. యంగ్ నుంచి క్రాస్ అందుకున్న స్టోన్స్ గోల్ ప్రయత్నంగా చేయగా.. టునీషియా గోల్‌కీపర్ హసెన్ చక్కగా అడ్డుకున్నాడు. కానీ వెనక్కి వచ్చిన బంతిని కేన్ నెట్లోకి కొట్టి ఇంగ్లాండ్‌ను ఆనందంలో ముంచెత్తాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ దూకుడు కొనసాగించింది. ఐతే అనేక మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయింది. 35వ నిమిషంలో టునీషియా స్కోరు సమం చేసింది. బెన్ యూసెఫ్‌ను కైల్ వాకర్ మోచేతితో పడేయడంతో టునీషియాకు రిఫరీ విల్మర్ రొల్డాన్ పెనాల్టీ ఇచ్చాడు. దీన్ని ఫెర్జాని సాసి సద్వినియోగం చేశాడు. రెండో అర్ధభాగంలోనూ ఇంగ్లాండే ఆధిపత్యాన్ని ప్రదర్శించినా టునీషియా రక్షణ శ్రేణిని ఒత్తిడిలోకి నెట్టలేకపోయింది. మ్యాచ్ డ్రాగా ముగియడం ఖాయమే అనుకున్నారంతా. కానీ ఇంజురీ సమయంలో కేన్ హెడర్ గోల్‌తో ఇంగ్లాండ్ విజయాన్ని అందుకుంది.

ఇంగ్లాండ్ 2	టునీషియా 1
కేన్ (11వ, 90+1)	సాసి గోల్ (35వ)

పోలెండ్‌పై సెనెగల్ సంచలనం

మాస్కో: ప్రపంచకప్‌లో మరో సంచలనం. మంగళవారం గ్రూప్-హెచ్ మ్యాచ్‌లో సెనెగల్ 2-1తో ప్రపంచ నంబర్-8 పోలెండ్‌కు షాకిచ్చింది. పోలెండ్ ఘోర తప్పిదాలు సెనగల్‌కు కలిసొచ్చాయి. అదృష్టమూ ఆ జట్టుకు తోడైంది. పోలెండ్ ఆటగాడు సియోనెక్ 37వ నిమిషంలో సెల్ఫ్ గోల్ చేయడంతో సెనగల్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 60వ నిమిషంలో నియాంగ్ గోల్‌తో ఆధిక్యాన్ని సెనెగల్ 2-0కు పెంచుకుంది. చెల్లాచెదురైన పోలెండ్ డిఫెన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ.. అడ్డుగా గోల్‌కీపర్ కూడా లేని నెట్లోకి నియాంగ్ అలవోకగా బంతిని పంపాడు. 86వ నిమిషంలో క్రిచోవియాక్ గోల్‌తో సెనెగల్ ఆధిక్యాన్ని పోలెండ్ 2-1కి తగ్గించింది. మిగతా కొద్ది సమయంలో స్కోరు సమం చేయడానికి పోలెండ్ గట్టిగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సెనెగల్ ఫిఫా ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉంది. గ్రూప్-హెచ్ నుంచి అలవోకగా నాకౌట్‌కు అర్హత సాధించగలదన్న అంచనాలతో టోర్నీలో అడుగుపెట్టిన పోలెండ్.. ఈ ఓటమితో అవకాశాలను క్లిష్టం చేసుకుంది.

సెనెగల్ 2	పోలెండ్ 1
సియోనెక్ (37 వ), నియాంగ్ (60 వ)	క్రిచోవియాక్ (86 వ)

నాటింగ్‌హామ్

మూడేళ్ల కిందట వన్డే ప్రపంచకప్‌లో గ్రూప్ దశనైనా దాటలేకపోయింది ఇంగ్లాండ్. టెస్టులకే తప్ప వన్డేలకు ఇంగ్లాండ్ పనికిరాదంటూ ఎన్ని విమర్శలో! కానీ కొన్ని నెలలకే ఇంగ్లాండ్‌లో అనూహ్య మార్పు. వన్డేలు, టీ20ల్లో హిట్టింగ్‌ను మరో స్థాయికి తీసుకెళ్తూ చెలరేగిపోయారు ఆ జట్టు బ్యాట్స్‌మెన్. చూస్తుండగానే పరిమిత ఓవర్ల క్రికెట్లో ప్రమాదకర జట్టుగా మారింది ఇంగ్లాండ్. రెండేళ్ల కిందట వన్డేల్లో అత్యధిక స్కోరు రికార్డు బద్దలు కొట్టేసింది. ఇప్పుడు మరోసారి ఆ జట్టు బ్యాట్స్‌మెన్ ప్రతాపం చూపించారు. ఆస్ట్రేలియా బౌలింగ్‌ను ఊచకోత కోశారు. ప్రపంచ రికార్డు బద్దలు కొట్టారు. ఓ దశలో 500 పరుగుల మార్కునూ అందుకునేలా కనిపించిన ఇంగ్లిష్ జట్టు చివరికి 481/6తో ఇన్నింగ్స్ ముగించింది.

హేల్స్ 147

ఇంగ్లాండ్ వన్డే జట్టు మరోసారి రెచ్చిపోయింది. తన రికార్డును తానే బద్దలుకొడుతూ 50 ఓవర్ల ఆటలో అత్యధిక స్కోరు నమోదు చేసింది. ఆస్ట్రేలియాతో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా మంగళవారం మూడో వన్డేలో మోర్గాన్ సేన నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 481 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. 2016లో మోర్గాన్ నేతృత్వంలోని ఇంగ్లాండ్ జట్టే పాకిస్థాన్‌పై 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 444 పరుగులు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆ స్కోరు కంటే ఇప్పుడు 37 పరుగులు ఎక్కువే చేసింది ఇంగ్లాండ్. ఈ రికార్డులో ప్రధాన వాటా మూడో స్థానంలో వచ్చిన అలెక్స్ హేల్స్ (147; 92 బంతుల్లో 16×4, 5×6), ఓపెనర్ జానీ బెయిర్‌స్టో (139; 92 బంతుల్లో 15×4, 5×6)లదే. మరో ఓపెనర్ జేసన్ రాయ్ (82; 61 బంతుల్లో 7×4, 4×6), కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (67; 30 బంతుల్లో 3×4, 6×6) కూడా చెలరేగిపోయారు. తొలి వికెట్‌కు రాయ్, బెయిర్‌స్టో 19.3 ఓవర్లలోనే 159 పరుగులు జోడించి భారీ స్కోరుకు పునాది వేశారు. రాయ్ ఔటయ్యాక హేల్స్ రావడంతో.. అగ్నికి వాయువు తోడైనట్లు అయింది. ఈ జోడీ 88 బంతుల్లోనే 151 పరుగులు జోడించడంతో ఇంగ్లాండ్ స్కోరు 34వ ఓవర్లోనే 300 దాటింది. బెయిర్‌స్టో 69 బంతుల్లో, హేల్స్ 62 బంతుల్లో సెంచరీలు పూర్తి చేశారు. జట్టు స్కోరు 310 వద్ద బెయిర్‌స్టో ఔటయ్యాడు. బట్లర్ (11) ఎంతోసేపు క్రీజులో నిలవలేదు. ఐతే హేల్స్‌కు మోర్గాన్ తోడవడంతో మళ్లీ మోత మొదలైంది.

500 కొట్టేసేవాళ్లే..: 46వ ఓవర్లో రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో హేల్స్ బాదిన సిక్సర్‌తో కొత్త రికార్డు నమోదైంది. 46 ఓవర్లకు ఇంగ్లాండ్ స్కోరు 450/3. హేల్స్, మోర్గాన్ అప్పుడున్న ఊపులో ఇంగ్లాండ్ 500 స్కోరునీ అందుకుంటుందనిపించింది. ఐతే 48వ ఓవర్లో హేల్స్, మోర్గాన్ భారీ షాట్లకు ప్రయత్నించి వరుస బంతుల్లో వెనుదిరిగారు. దీంతో 500 ఆశలకు బ్రేక్ పడింది. చివరి నాలుగు ఓవర్లలో 31 పరుగులే వచ్చాయి. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్.. కడపటి వార్తలందేసరికి 18 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. షార్ట్ (15), హెడ్ (51), షాన్ మార్ష్ (24) ఔటయ్యారు. ఈ సిరీస్ తొలి రెండు వన్డేల్లో నెగ్గిన ఇంగ్లాండ్ 2-0 ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే.

481/6

అంతర్జాతీయ వన్డేల్లో ఇదే అత్యధిక స్కోరు. మొత్తంగా లిస్ట్-ఎ క్రికెట్లో ఇది రెండో అత్యధికం. 2007లో 496/4తో గ్లూసెస్టర్‌షైర్‌పై సర్రే రికార్డు స్కోరు సాధించింది.

- రెండేళ్ల కిందట ఇంగ్లాండ్ పాకిస్థాన్‌పై ప్రపంచ రికార్డు నెలకొల్పిన నాటింగ్‌హామ్ మైదానంలోనే ప్రస్తుత రికార్డు కూడా నమోదవడం విశేషం.
- ఈ మ్యాచ్‌లో 92 బంతుల్లో 147 పరుగులతో టాప్‌స్కోరర్‌గా నిలిచిన అలెక్స్ హేల్సే గత ప్రపంచ రికార్డు స్కోరులోనూ అత్యధిక పరుగులు చేశాడు. ఆ మ్యాచ్‌లో అతను 122 బంతుల్లో 171 పరుగులు చేశాడు.
- ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో 21 సిక్సర్లు, 41 ఫోర్లు ఉన్నాయి. వాటి ద్వారానే 290 పరుగులొచ్చాయి.
- ఇంగ్లాండ్ ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఇదే రోజు ఇంగ్లాండ్‌లోనే జరుగుతున్న దేశవాళీ మ్యాచ్‌లో లీసెస్టర్‌షైర్‌పై భారత్-ఎ జట్టు 4 వికెట్లకు 458 పరుగులు సాధించింది. ఆ మ్యాచ్ కూడా ఇంగ్లాండ్‌లోనే జరగడం విశేషం.

వన్డేల్లో అత్యధిక స్కోర్లు

జట్టు	స్కోరు	ప్రత్యర్థి	ఏడాది
ఇంగ్లాండ్	481/6	ఆస్ట్రేలియా	2018
ఇంగ్లాండ్	444/3	పాకిస్థాన్	2016
శ్రీలంక	443/9	నెదర్లాండ్స్	2006
దక్షిణాఫ్రికా	439/2	వెస్టిండీస్	2015
దక్షిణాఫ్రికా	438/9	ఆస్ట్రేలియా	2006

ప్రపంచకప్‌లో ఈనాడు

పోర్చుగల్	సా॥ 5.30	మొరాకో
ఉరుగ్వే	రాత్రి 8.30	సౌదీ అరేబియా
ఇరాన్	రాత్రి 11.30	స్పెయిన్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

చండిమాల్‌పై సస్పెన్షన్

దుబాయ్: వెస్టిండీస్‌తో రెండో టెస్టు సందర్భంగా బాల్ టాంపరింగ్‌కు పాల్పడ్డందుకు శ్రీలంక కెప్టెన్ చండిమాల్‌కు శిక్ష పడింది. ఐసీసీ మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్ అతడిపై ఓ టెస్టు మ్యాచ్ సస్పెన్షన్ విధించాడు. దీంతో విండీస్‌తో మూడో టెస్టుకు చండిమాల్ దూరమయ్యాడు.

విండీస్-లంక రెండో టెస్టు డ్రా

గ్రాస్ ఐలెట్: వెస్టిండీస్-శ్రీలంక రెండో టెస్టు డ్రాగా ముగిసింది. 296 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ మ్యాచ్ ముగిసే సమయానికి 5 వికెట్లకు 147 పరుగులే చేసింది. 117/5తో కష్టాల్లో పడ్డ విండీస్‌ను బ్రాత్‌వైట్ (59 నాటౌట్), హోప్ (39) ఆదుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 253, విండీస్ 300 పరుగులకు ఆలౌటయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో లంక 342 పరుగులు చేసింది.

అగర్వాల్ 151

పృథ్వీ షా 132

- భారత్-ఎ పరుగుల మోత
- లీసెస్టర్‌షైర్‌పై 458/4

లీసెస్టర్‌షైర్: ఇంగ్లాండ్ పర్యటనలో భారత్-ఎ జట్టు చెలరేగిపోయింది. విధ్వంసక బ్యాటింగ్‌తో పరుగుల వరద పారించింది. ముక్కోణపు సిరీస్‌కు సన్నాహకంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 281 పరుగుల తేడాతో లీసెస్టర్‌షైర్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎ.. మయాంక్ అగర్వాల్ (151; 106 బంతుల్లో 18×4, 5×6), పృథ్వీ షా (132; 104 బంతుల్లో 20×4, 3×6), శుభ్‌మన్ గిల్ (86; 54 బంతుల్లో 7×4, 5×6) వీరబాదుడు బాదడంతో 4 వికెట్లకు 458 పరుగుల భారీ స్కోరు చేసింది. లిస్ట్-ఎ (అంతర్జాతీయ, దేశవాళీ వన్డేలు) క్రికెట్లో ఇది మూడో అత్యధిక స్కోరు. చాహర్ (3/24), ప్రసిద్ధ్ కృష్ణ (2/48), దీపక్ హూడా (2/9), అక్షర్ పటేల్ (2/18) ధాటికి ఛేదనలో లీసెస్టర్‌షైర్ 40.4 ఓవర్లలో 177 పరుగులకే ఆలౌటైంది. భారత్-ఎ జట్టు.. ఇంగ్లాండ్ లయన్స్, వెస్టిండీస్-ఎ జట్లతో ఈ నెల 22 నుంచి ముక్కోణపు సిరీస్‌లో ఆడనుంది.

అయిదు రోజుల పనిదినాలు మరో ఏడాది పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో సచివాలయ, విభాగాధిపతుల కార్యాలయాలు, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు వారానికి అయిదు రోజుల పనిదినాలను మరో ఏడాది పాటు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి 5.30 గంటల వరకూ పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పిల్లల చదువుల రీత్యా ఇప్పటికీ చాలామంది ఉద్యోగుల కుటుంబాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. అమరావతిలో ఇంకా రవాణా, వసతి సదుపాయాలు పూర్తి స్థాయిలో సమకూరలేదు. దాంతో అయిదు రోజుల పనిదినాలను మరో ఏడాది పాటు పొడిగించాలని కోరుతూ ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు.

1 నుంచి సామాజిక, ఆర్థిక సర్వే

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఇంటింటా సర్వే నిర్వహించడానికి వస్తున్న సిబ్బందికి కచ్చితమైన సమాచారాన్ని ఇచ్చి ప్రజలు సహకరించాలని శాంపుల్ డిజైన్ రీసెర్చ్ డివిజన్ (కోల్‌కత్తా) అడిషనల్ డైరెక్టర్ జనరల్ టి.కె.సన్యాల్ పేర్కొన్నారు. జాతీయ నమూనా సర్వే సంస్థ(ఎన్.ఎస్.ఎస్.ఒ.) ఆధ్వర్యంలో జులై 1 నుంచి డిసెంబరు వరకు రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక సర్వే జరగనుంది. దీనికి సంబంధించిన విజయవాడ, విశాఖపట్టణం, కాకినాడ ప్రాంతీయ కార్యాలయాలకు చెందిన గణాంకాధికారులకు మంగళవారం విజయవాడలోని ఓ హోటల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాల్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వేకు ప్రస్తుతం నిర్వహించే దానికి మార్పులను తెలియజేశారు.

ఉచిత యోగా తరగతులు

ఈనాడు, దిల్లీ: దేశ రాజధానిలో గోల్‌మార్కెట్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ధాన్య మందిరంలో ఉచిత యోగా తరగతులు ప్రారంభించనున్నట్లు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి ఉదయం 6.30 - 8.30 గంటల మధ్య యోగా నిపుణుడు భవవాన్ స్వరూప్ నేతృత్వంలో తరగతులు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ప్రతి గంటకు ఒక బ్యాచ్ చొప్పున శిక్షణ ఉంటుందని ప్రవీణ్‌ప్రకాశ్ పేర్కొన్నారు.

ఉండవల్లిలో యోగా దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమం

ఈనాడు డిజిటల్, అమరావతి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఉండవల్లిలోని ప్రజా దర్బారు హాలులో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఏడు నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామని ఆయూష్ శాఖ కమిషనర్ పీఏ శోభ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు, విద్యార్థినులు పాల్గొంటారని వివరించారు.

ఆదరణ పథకంలో స్వల్ప మార్పులు

ఈనాడు, ఈనాడు డిజిటల్, అమరావతి: ఆదరణ-2 పథకంలో రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు తీసుకొచ్చింది. దరఖాస్తు చేసుకునే సమయంలో కుల ధ్రువీకరణ పత్రం సంఖ్యను తప్పక నమోదు చేయాలన్న నిబంధనను సడలించింది. ఇకపై దరఖాస్తు సమయంలో స్వయం ధ్రువీకరణ(సెల్ఫ్ డిక్లరేషన్) ఇచ్చి, మండల స్థాయిలో లబ్ధిదారుల ఎంపిక చేసే సమయంలో సమర్పిస్తే సరిపోతుంది. కొత్త విధానం ప్రకారం యూనిట్లు ఏర్పాటయ్యాక 70శాతం వ్యయాన్ని విడుదల చేయనున్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి.ఉదయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు.

గృహ నిర్మాణ పథకాల పేర్లు మార్పు

రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న గృహ నిర్మాణ పథకాల పేర్లను మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ పథకం(బీఎల్‌సీ)ని ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎమ్‌ఏవై)-ఎన్టీఆర్(పట్టణ)గా, పీఎమ్‌ఏవై గ్రామీణ్ పథకాన్ని పీఎమ్‌ఏవై-ఎన్టీఆర్(గ్రామీణ)గా మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

కొత్తగా లక్ష మందికి పింఛన్లు!

- డ్వాక్రా మహిళలకు ఇసుక రేవులు
- అగ్రిగోల్డ్‌పై సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

ఈనాడు అమరావతి: రాష్ట్రంలో కొత్తగా మరో లక్ష సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఇసుక రేవుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని డ్వాక్రా మహిళల పర్యవేక్షణలో నిర్వహించాలన్న నిర్ణయం తీసుకున్నారు. అగ్రి గోల్డ్ బాధితుల సమస్య సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఒక కమిటీ వేయాలని నిర్ణయించారు. బలహీన వర్గాల గృహ నిర్మాణం, ఏపీఐఐసీ అవసరాలకు పనికొస్తాయనుకుంటే అగ్రి గోల్డ్ భూముల్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం మంత్రివర్గ సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చ ముగిశాక మంత్రులు పలు అంశాలను లేవనెత్తారు. 1100కి (పరిష్కార వేదిక) ఫోన్ చేసిన వారికి... వారు అర్హులో కాదో చూడకుండా స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా నేరుగా పింఛన్లు మంజూరు చేశారని మంత్రి సుజయకృష్ణ రంగారావు ప్రస్తావించారు. ఆయనతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అయ్యన్నపాత్రుడు గొంతు కలిపారు. తమ దగ్గర విలువైన భూములు, ఆస్తులు, కార్లు ఉన్నవారికీ పింఛన్లు వచ్చాయని, వారిలో చాలామంది వైకాపాకు చెందిన వారున్నారని సోమిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని...'అలాంటి సమస్యలేమైనా ఉంటే నా దృష్టికి అప్పుడే తీసుకురావాలి కదా? టెలీ కాన్ఫరెన్స్‌లోనైనా మీరెందుకు ప్రస్తావించలేదు?' అని ప్రశ్నించారు. అభ్యంతరాల్ని కలెక్టర్, జిల్లా అధికారుల దృష్టికి తెచ్చామని, పైనుంచి జాబితాలో ఆమోదం పొంది వచ్చాయని వారు చెప్పడంతో ఏమీ చేయలేకపోయామని మంత్రులు బదులిచ్చారు. మరో లక్ష పింఛన్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. డ్వాక్రా సంఘాలకు ఇసుక రీచ్‌లు అప్పగించాలని నిర్ణయించారు.

నగరాభివృద్ధి సంస్థల పరిధిలో రూ.2 లక్షల రాయితీ. .రాష్ట్రంలో నగరాభివృద్ధి సంస్థల పరిధిలోకి వచ్చే గ్రామాల్లోని పేదల గృహ నిర్మాణానికి రూ.2 లక్షల చొప్పున (సొంత స్థలంలో కట్టుకునే వారికి) రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. నగరాభివృద్ధి సంస్థల పరిధిలోకి వచ్చే గ్రామాలకు పట్టణాల్లో మాదిరిగా గృహ నిర్మాణ రాయితీ వర్తింపజేసి, వాటికి పక్కనే గ్రామాల్లో తక్కువ రాయితీ ఇస్తే ఇబ్బందులు వస్తున్నాయని మంత్రులు ప్రస్తావించారు. దీనిపై చాలా చర్చ జరిగిన మీదట... పేదల గృహ నిర్మాణానికి ఇచ్చే రాయితీని నాలుగు కేటగిరీలుగా చేయాలని నిర్ణయించారు. గ్రామాల్లో ఇది వరకులానే రూ.లక్షన్నర, నగరాభివృద్ధి సంస్థల పరిధిలోకి వచ్చే గ్రామాల్లో రూ.2 లక్షలు, పట్టణాలు, నగరాల్లో సొంత స్థలం ఉంటే రూ.2.50 లక్షలు, జీ+3 విధానంలో నిర్మించే ఇళ్లకు రూ.3 లక్షలు చొప్పున రాయితీ ఇస్తారు. రెవెన్యూ శాఖకు సంబంధిం చుక్కల భూములు, 22(ఎ)లోని భూములు, కోపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీల పరిధిలోకి వచ్చే భూముల సమస్యల్ని 3నెలల్లో పూర్తిగా కొలిక్కి తేవాలని సీఎం ఆదేశించారు. వచ్చే ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటి నుంచే తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో పంట ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం పెంచేందుకు అవసరమైన గిడ్డంగులు నిర్మిస్తామని, వీటిని చిన్న పరిశ్రమలుగా గుర్తించి (ఎంఎస్ఎంఈ) రాయితీలు వర్తింపజేసే అంశాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

★ మంత్రులు మరింత చురుగ్గా ఉండాలని, శాఖలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 'పొలిటికల్ గవర్నెన్స్' అలవాటు చేసుకోవాలన్నారు. పసుపు కుంకుమ, పెళ్లికానుక వంటి పథకాల్ని ప్రజల్లోకి ఇంకా బలంగా తీసుకెళ్లాల్సి ఉందన్న ప్రస్తావన వచ్చింది.

సమాచార కమిషనర్ల ఎంపికపై సమావేశం..

రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) ప్రధాన కమిషనరు, కమిషనర్ల నియామకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. దీనికి ప్రధాన ప్రతిపక్ష నేత జగన్ హాజరు కాలేదు. కమిషనర్ల నియామకంపై తదుపరి సమావేశంలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని యనమల తెలిపారు.

శిథిల భవనం.. రోగుల్లో భయం భయం

కృష్ణా జిల్లా గుడివాడ ఆసుపత్రిలో చేరిన రోగుల పరిస్థితి దయనీయం. ఎక్కడ పెచ్చులూడి మీద పడతాయోనన్న భయం వారిని వెంటాడుతోంది. 1984లో కట్టిన ఆసుపత్రిలోనే ఇప్పటికీ వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. భవనం పూర్తిగా శిథిల స్థితికి చేరి భయానకంగా ఉంది. దీని పక్కనే అత్యాధునిక హంగులతో నూతన భవన సముదాయాన్ని నిర్మించారు. కానీ ప్రారంభానికి నోచుకోలేదు. అన్ని సదుపాయాలనూ పూర్తి చేసినప్పటికీ నూతన భవనం 4 నెలలుగా వృథాగానే ఉంది. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ఉంటున్నామని.. ముఖ్యమంత్రి స్పందించి త్వరగా కొత్త ఆసుపత్రిని ప్రారంభించాలని రోగులు కోరుతున్నారు. - **ఈనాడు, అమరావతి**

కృష్ణా దీవిలో గోల్ఫ్ రిసార్టు

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్, సర్వీసు అపార్ట్‌మెంట్లు వంటివి దీనిలో ప్రతిపాదిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో ఇక్కడి అవసరాలకు 10 లక్షల నిర్మిత ప్రాంతం కలిగిన భవనాలు అవసరమవుతాయని అంచనా.

4. పారిశ్రామిక పార్కు: కాలుష్య రహిత పరిశ్రమల కోసం 300 ఎకరాల్లో సమీకృత పారిశ్రామిక టౌన్‌షిప్‌గా దీన్ని అభివృద్ధి చేస్తారు. అక్కడ పనిచేసేవారికి అవసరమైన నివాస, వాణిజ్య వసతులూ ఉంటాయి.

5. సమీకృత క్రీడా ప్రాంగణం (స్పోర్ట్స్ హబ్): పరిపాలన నగరంలోనే 20 ఎకరాల్లో ఇది ఏర్పాటవుతుంది. 11 ఎకరాల్లో క్రీడా వసతులు, మిగతా 9 ఎకరాల్లో నివాస, వాణిజ్య వసతులు కల్పిస్తారు. 25 వేల మంది కూర్చునేలా అవుట్‌డోర్ స్టేడియం, 5 వేల చ.మీ. వైశాల్యం గల మల్టీ ఈవెంట్ స్పోర్ట్స్ హాల్, వెయ్యి మందికి శిక్షణనిచ్చే అకాడెమీ వంటివి ఏర్పాటవుతాయి. రూ.242 కోట్లు వ్యయమవుతాయని అంచనా. ప్రాజెక్టు టెండరు దశలో ఉంది.

6. రివర్ ఫ్రంట్-లీజర్ రిసార్టు: కృష్ణా నదిలోని ఒక దీవిలో 20 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు చేపడతారు. లీజర్ రిసార్ట్, కాటేజీలు, షాపింగ్ తదితర అవసరాల కోసం వాణిజ్య భవనాలు నిర్మిస్తారు.

7. మైస్ హబ్: సదస్సులు, సమావేశాలు, ఎగ్జిబిషన్లు వంటివి నిర్వహించేందుకు పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించనున్నారు. దీన్నే మైస్(మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్) హబ్‌గా వ్యవహరిస్తారు. 20 ఎకరాల్లో దీన్ని ప్రతిపాదించారు. 12.5 ఎకరాల్లో కన్వెన్షన్, ఎగ్జిబిషన్ సెంటర్ నిర్మిస్తారు. 1.5 ఎకరాల్లో హోటల్ నిర్మిస్తారు. ఆరు ఎకరాల ఖాళీ స్థలం ఉంటుంది. రెండో దశలో ఈ ప్రాజెక్టుని మరింత విస్తరించే అవకాశం ఉంది.

8. ఐటీ పార్కు: 198 ఎకరాల్లో ఐటీ పార్కు వస్తుంది. 53 ఎకరాల్లో ఐటీ ఎస్ఈజెడ్ ఏర్పాటుకు అనుమతి కోసం సీఆర్‌డీఏ దరఖాస్తు చేసింది. ఐటీ, ఎలక్ట్రానిక్స్ సంస్థల అవసరాలకు తగ్గట్టుగా ఇక్కడ భవనాలు నిర్మిస్తారు. మొదటి దశలో 10 లక్షల చ.అడుగుల విస్తీర్ణంతో కూడిన భవనాలు నిర్మించాలన్నది ఆలోచన.

జగన్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని పరకాలకు క్షమాపణ చెప్పాలి: కాలువ

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్‌పై వైకాపా అధ్యక్షుడు జగన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి కాలువ శ్రీనివాసులు మండిపడ్డారు. మంగళవారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. సమైక్య రాష్ట్రం కోసం పోరాడిన వ్యక్తిపై విమర్శలు చేయడానికి నోరెలా వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరకాలపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. కుటుంబ బంధాలు, ఆచరించే సిద్ధాంతాలు వేరు వేరుగా ఉండటంలో తప్పేముందని ప్రశ్నించారు.

ఆ జీవోతో బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం

ఈనాడు డిజిటల్, అమరావతి: జీవో నెం.2వల్ల బీసీ, ఓసీ, మైనారిటీ ఉద్యోగులకు పదోన్నతుల్లో తీరని నష్టం జరుగుతుందని సచివాలయ బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాల నేతలు మంత్రి అచ్చెన్నాయుడివద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఆ జీవో విడుదలకు ముందే అడ్డుకోవాలని కోరారు. మంగళవారం విజయవాడలో మంత్రిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. పదోన్నతులు, రిజర్వేషన్లు, సీనియారిటీ తదితర విషయాల్లో సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను లెక్కచేయకుండా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు పదోన్నతులు పొందేలా జీవోలో వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. సంబంధిత దస్త్రం ఆమోదం తుది దశలో ఉందని, అడ్డుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

ఎస్వీబీసీ సీఈవోగా యలమంచిలి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ సీఈవోగా యలమంచిలి వెంకట నగేష్ నియమితులయ్యారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

'సాగు, ఉపాధి' అనుసంధానానికి సీఎంలతో ఉప సంఘం

- సభ్యుల్లో చంద్రబాబునాయుడు

ఈనాడు, దిల్లీ: ఉపాధి హామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేసేలా సమన్వయ విధానాన్ని రూపొందించేందుకుగాను ఏడుగురు ముఖ్యమంత్రులతో కూడిన ఉపసంఘాన్ని కేంద్రం ఏర్పాటుచేసింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ ఉపసంఘంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడుతో పాటు బిహార్, గుజరాత్, యూపీ, పశ్చిమబెంగాల్, సిక్కిం రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్‌చాంద్ సభ్యులుగా ఉంటారు. ఉపసంఘానికి అవసరమైన సమాచారాన్ని నీతి ఆయోగ్ అందజేయనుంది. 2022 కల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ప్రధాని మోదీ ఆశయానికి అనుగుణంగా ఈ సంఘం సూచనలిస్తుంది. ఈనెల 17న జరిగిన నీతిఆయోగ్ సమావేశంలో ఉపాధిహామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేయాలంటూ చంద్రబాబు సూచించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉపసంఘంలో మిమ్మల్ని సభ్యునిగా నియమించామంటూ చంద్రబాబునాయుడుకు నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ మంగళవారం లేఖరాశారు. రాష్ట్రానికి నోడల్ అధికారిని త్వరలోనే పంపించనున్నట్లు అందులో ప్రస్తావించారు. అయితే.. చంద్రబాబునాయుడి చిరునామాను 'వెలగపూడి, హైదరాబాద్'గా నీతి ఆయోగ్ పేర్కొనడం గమనార్హం!

ఎక్సైజ్‌లో పదోన్నతులకు మార్గం సుగమం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్‌శాఖలో పదోన్నతులకు మార్గం సుగమమైంది. ఈ శాఖలో పని చేస్తున్న వారిలో దాదాపు 80శాతం మంది ఉద్యోగులపై ఏసీబీ కేసులుండటంతో గత ఏడేళ్లుగా పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారికి పదోన్నతులు ఇచ్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని కోరగా ఆయన సానుకూలత వ్యక్తం చేసినట్లు ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.నరసింహులు 'ఈనాడు'కు తెలిపారు.

భయంకరమైన నొప్పి వేధిస్తోంది

- క్యాన్సర్ చికిత్స అనుభవాలను పంచుకున్న ఇర్ఫాన్ ఖాన్

దిల్లీ: ప్రాణాంతక క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్ ఖాన్ తన మనసులోని భావాలను తాజాగా బయటపెట్టారు. వ్యాధిపై పోరాటంలో ఎదురవుతున్న కష్టాలను వెల్లడించారు. భయంకరమైన నొప్పి తనను వేధిస్తున్న తీరును వివరించారు. న్యూరోఎండోక్రైన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 51 ఏళ్ల ఇర్ఫాన్.. ప్రస్తుతం లండన్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. చికిత్సలో ఎదురవుతున్న అనుభవాలను వివరిస్తూ ఓ ఆంగ్ల వార్తాసంస్థకు తాను రాసిన లేఖను ట్విటర్‌లో మంగళవారం ఆయన పోస్ట్ చేశారు. అత్యంత అరుదైన వ్యాధితో తాను బాధపడుతున్నానని. . చికిత్సలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని ఇర్ఫాన్ వ్యాఖ్యానించారు. శక్తినంతటినీ కూడదీసుకొని.. జీవితమనే ఆటను మెరుగ్గా ఆడేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ ఉందని తెలిసిన తర్వాత తొలిసారిగా ఇప్పుడే తాను స్వేచ్ఛ అనుభవిస్తున్నానని.. ఇది తనకు గొప్ప విజయమని పేర్కొన్నారు.

ఎడారిలో నీటిని పండించేశారు!

- గాలిని శుద్ధ జలంగా మార్చిన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

న్యూయార్క్: ఎడారులు, మెట్ట ప్రాంతాల్లో ఇక నీటికి కరవుండదట. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది గొంతుల దాహార్తి తీరిపోనుందట. అందునా, ప్రకృతి ప్రసాదించిన ఎండను పీల్చి... గాలిని పిండి... పండించిన 'శుద్ధ' జలంతో! ఇందుకు సంబంధించి నిరుడు అద్దాల గదిలో రూపొందించిన కొత్త సిద్ధాంతాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా ప్రయోగించారు... బెర్కెలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు!

ఒమర్ యాఘీ... వర్సిటీలోని 'లారెన్స్ బెర్కెలే నేషనల్ లేబొరేటరీ' శాస్త్రవేత్త. ప్రపంచ వ్యాప్తంగా ఎడారి, మెట్ట ప్రాంతాలవారి తాగునీటి కష్టాలకు చలించి... ప్రకృతిలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అన్వేషణ ఆరంభించారు. సూర్యరశ్మి సాయంతో గాలిని ఆవిరిగా మార్చి, దానిని చల్లబరచడం ద్వారా నీటిని తయారుచేసే సిద్ధాంతాన్ని రూపొందించారు. దీనిని అమలు చేసేందుకు లోహ-సేంద్రియ పొర (మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్- ఎంవోఎఫ్)ను రూపొందించారు. "ఈ ఫ్రేమ్‌వర్క్‌కు విద్యుత్‌తో పన్లేదు. కేవలం సూర్య కాంతి ఉంటే సరిపోతుంది. దీనికి ఒకవైపు అల్యూమినియం రేకు ఉంటుంది. అది ఎండను గ్రహిస్తుంది. ఎంవోఎఫ్ ఈ వేడితో గాలిని ఆవిరిగా మార్చుతుంది. బయటి పెట్టెలో ఉండే కండెన్సర్, కూలర్లు ఆవిరిని చల్లార్చి, నీటిగా మార్చుతాయి. ఇలా ఒక రోజుకు కిలో ఎంవోఎఫ్ ద్వారా 400 మిల్లీలీటర్ల (కప్పున్నర) నీళ్లు వస్తాయి. గతంలో జిర్కోనియంతో తయారుచేసిన ఎంవోఎఫ్‌కంటే ఇది చాలా చవక. అరిజోనా ఎడారి ప్రాంతంలోని స్కాట్స్‌డేల్‌లో చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది. అక్కడ గాలిలో తేమ శాతం చాలా తక్కువ. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య చాలా వ్యత్యాసం కూడా ఉంటుంది" అని యాఘీ వివరించారు.



వరుసకట్టిన అంకుర సంస్థలు: ప్రయోగం విజయవంతం కావడంతో.. ఎంవోఎఫ్ నీటి పెట్టెల తయారీకి చాలా అంకుర సంస్థలు వరుస కట్టినట్టు పరిశోధకులు తెలిపారు. త్వరలోనే వీటిని మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ పరిశోధనపై 'సైన్స్ అడ్వాన్సెస్' పత్రిక తాజా సంచికలో ప్రత్యేక కథనం అందించింది.

ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల తుపాకులు

- అమెరికా పౌరుల దగ్గరే 39.3 కోట్లు
- భారతీయుల వద్ద 7.1 కోట్లు

ఐరాస: ప్రపంచంలో వంద కోట్లకు పైగా తుపాకులున్నాయని.. వీటిలో 85.7 కోట్లు పౌరుల చేతుల్లోనే ఉన్నాయని ఓ అధ్యయనం లెక్కగట్టింది. ఆయుధాలు కలిగిఉన్న పౌరుల్లో 46% అమెరికన్లేనని తేల్చింది. ఆ దేశ పౌరుల వద్ద 39.3 కోట్ల తుపాకులున్నాయని వెల్లడించింది. పౌరులు చట్టబద్ధంగా తీసుకున్న ఆయుధాలతోపాటు.. అక్రమంగా పొందినవాటికీ కలిపి ఈ అంచనాలను వేసింది. నాటు తుపాకులు సహా మందుగుండును ఉపయోగించే అన్ని ఆయుధాలనూ ఇందులో లెక్కగట్టింది. ఇందుకోసం 'స్మాల్ ఆర్మ్స్ సర్వే' పేరుతో అధ్యయనం నిర్వహించారు. దీని ఫలితాల నివేదికను ఐరాస సదస్సులో తాజాగా ఆవిష్కరించారు. ఇందులో అమెరికా తర్వాతి స్థానంలో భారత్ నిలిచింది. భారత్‌లో పౌరుల వద్ద 7.1 కోట్ల ఆయుధాలున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. చైనా (4.97 కోట్లు), పాకిస్థాన్ (4.39 కోట్లు), రష్యా (1.76 కోట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. "పౌరుల వద్ద ఉన్న ఆయుధాలను బట్టి చూస్తే.. అమెరికా చాలా ముందుంది. ఆ దేశం తర్వాతి స్థానాల్లో ఉన్న 25 దేశాల్లోని పౌరుల ఆయుధాలను కలిపినా.. అగ్రరాజ్యంలోని పౌరుల ఆయుధాల సంఖ్యను మించదు. అమెరికా పౌరులు ఏటా సగటున 1.4 కోట్ల తుపాకులు కొంటున్నారు. ఆ దేశంలో నివాసముంటున్న ప్రతి వంద మందికీ 121 తుపాకులున్నాయి" అని అధ్యయనానికి నేతృత్వం వహించిన ఆరోన్ కార్ప్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల సైన్యాల వద్ద 13.3 కోట్లు.. భద్రత సంస్థల వద్ద 2.27 కోట్ల తుపాకులున్నాయని చెప్పారు. అత్యధిక ఆయుధాలు కలిగిఉన్న జాబితాల్లో సైన్యం పరంగా రష్యా, చైనా, ఉత్తర కొరియా, ఉక్రెయిన్, అమెరికా.. భద్రత సంస్థల పరంగా రష్యా, చైనా, భారత్, ఈజిప్ట్, అమెరికా తొలి ఐదు స్థానాల్లో ఉన్నట్లు పేర్కొన్నారు.

చిన్నారులపై నేరాల నివారణ: 'కరదీపిక'ను ఆవిష్కరించిన మేనకాగాంధీ

- అన్ని పీఎస్‌లలోనూ అందుబాటులో..

దిల్లీ: చిన్నారులపై నేరాల నివారణ...ఆయా కేసుల్లో అనుసరించాల్సిన ప్రక్రియ, సంబంధిత చట్టాలు, న్యాయస్థానాల తాజా తీర్పులను సమగ్రంగా సంకలనం చేసిన 'కరదీపిక(హ్యాండ్‌బుక్)'ను కేంద్రమంత్రి మేనకాగాంధీ మంగళవారం నాడిక్కడ ఆవిష్కరించారు. ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ ఇది అందుబాటులో ఉండేలా తమ మంత్రిత్వశాఖ చర్యలు చేపడుతుందని మేనకాగాంధీ తెలిపారు. ప్రధానంగా స్థానిక భాషల్లో అందుబాటులో ఉండేలా చూడనున్నట్లు చెప్పారు. చిన్నారులపై నేరాల విషయంలో అనుసరించాల్సిన ప్రక్రియను వివరిస్తున్న ఈ పుస్తకం పోలీసు సిబ్బందికి కరదీపికగా నిలుస్తుందని ఆమె అన్నారు. 'బ్యూరో ఆఫ్ పోలీస్ రిసర్చ్ అండ్ డెవలప్‌మెంట్'(బీపీఆర్‌డీ), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) దీనిని సంకలనం చేశాయి.

నువ్వంటే నాకిష్టం..

- ఎస్పీపై మనసు పారేసుకున్న సైకాలజీ విద్యార్థిని!
- ఆయనను కలిసే దాకా కదలబోనని తిష్ఠ

ఉజ్జయిని: వీరాభిమానులతో అప్పుడప్పుడు సినీతారలు, క్రీడాకారులు తలలు పట్టుకునే సంగతి తెలిసిందే. ఈ సంస్కృతి ఇప్పుడు ఐపీఎస్ అధికారుల వరకూ వచ్చేసింది. మధ్యప్రదేశ్‌లో ఎస్పీగా పనిచేస్తున్న 34 ఏళ్ల సచిన్ అతుల్కర్‌కు తాజాగా ఇలాంటి చిక్కే వచ్చిపడింది. సామాజిక అనుసంధాన వేదికల్లోని ఈయన ఫోటోలను చూసి పంజాబ్‌లోని హోషియార్‌పుర్‌కు చెందిన 27 ఏళ్ల యువతి వీరాభిమానం పెంచుకొన్నారు. మూడు రోజులుగా ఆమె సచిన్ కోసం ఉజ్జయినిలో తిష్ఠవేశారు. ఆమెను తిప్పి పంపేందుకు, కౌన్సెలింగ్ ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆమె మహిళా పోలీసుల అదుపులోవున్నారు. 'కార్యాలయంతోపాటు సచిన్ వెళ్లే ప్రతిచోటా కలిసేందుకు ఆమె ప్రయత్నిస్తోంది. అసలు చెప్పినమాట వినడంలేదు. కండలు తిరిగిన సచిన్ దేహం, ఆయన హుందాతనం అంటే చాలా ఇష్టమని పదేపదే చెబుతోంది. ఆమె తల్లిదండ్రులను పిలిపించాం. వారితో వెళ్లబోనని ఆమె తెగేసి చెబుతోంది' అని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి రేఖ వర్మ తెలిపారు. 'ఆమె సైకాలజీలో పీజీ చదువుతోంది. పంజాబ్ వెళ్లే రైలు ఎక్కించేందుకు ఆమెను నగ్డా స్టేషన్‌కు తీసుకెళ్లాం. అయితే రైలు ఎక్కిస్తే.. దూకేస్తానని బెదిరించింది' అని వివరించారు. మరోవైపు విధులకు సంబంధించి ఎవరినైనా కలుస్తానని, వ్యక్తిగతంగా అయితే కలవబోనని సచిన్ తెగేసి చెప్పారు.

భారత్-ఫ్రాన్స్ మధ్య బలమైన అభివృద్ధి భాగస్వామ్యం: సుష్మా

పారిస్: శాస్త్ర సాంకేతిక, శుద్ధ ఇంధనం, మౌలిక సదుపాయాలు సహా వివిధ రంగాల్లో బలమైన అభివృద్ధి భాగస్వామ్యాన్ని రూపొందించుకునేందుకు భారత్-ఫ్రాన్స్ పనిచేస్తున్నాయని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ చెప్పారు. రోమ్ నుంచి సోమవారం పారిస్‌కు చేరుకున్న ఆమె మంగళవారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో భేటీ అయ్యారు.

అందుకే భారత్‌కు చోటివ్వలేకపోయాం..!

- విద్యార్థి వీసా నిబంధనలకు..

వలసదారుల ఎంఓయూకు ముడిపెట్టిన యూకే

లండన్: విద్యార్థి వీసా నిబంధనలను సరళతరం చేసిన దేశాల జాబితాలో భారత్‌కు చోటివ్వని యూకే - అందుకు ఓ ఎంఓయూపై భారత్ సంతకం చేయడానికి నిరాకరించడమే కారణమంటూ.. రెండింటికీ ముడిపెట్టింది. ఈమేరకు అక్రమ వలసదారులను వెనక్కి పంపేందుకు ఉద్దేశించిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) అపరిష్కృతంగా ఉన్న అంశాన్ని ప్రస్తావించింది. విద్యార్థి వీసాల విషయంలో కొన్ని దేశాలకు సడలింపులు ఇవ్వడానికి ఇటీవల యూకే నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలో భారత్‌కు చోటు కల్పించక పోవడంతో విద్యార్థి వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా కాలపరిమితికి మించి ఉంటున్న భారతీయుల అంశంపై ఓ పరిష్కారం కనుగొనకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు బ్రిటన్ అంతర్జాతీయ వాణిజ్య మంత్రి లియామ్ ఫాక్స్ పేర్కొన్నారు.

అత్యంత వయసైన సుమత్రా ఒరంగుటాన్ మృతి

- 62ఏళ్ల వయసులో కన్నుమూసిన అరుదైన వానరం

పెర్త్: 'సుమత్రా ఒరంగుటాన్' జాతిలోనే అత్యంత వృద్ధురాలిగా రికార్డు సాధించిన.. 'ప్వాన్' అనే 62 ఏళ్ల వానరం కన్నుమూసింది. ఆస్ట్రేలియాలో పెర్త్‌లోని ఓ జంతుప్రదర్శనలో సోమవారం ఇది ప్రాణాలు విడిచినట్లు అక్కడి అధికారులు తెలిపారు. ప్వాన్‌కు 11 పిల్లలు. వాటి ద్వారా మరో 54 కోతులూ దాని సంతతిలో చేరాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ జంతు ప్రదర్శనశాలలు, అడవుల్లో ఇవి ఉన్నాయి. ఇండోనేసియాలోని సుమత్రా దీవిలో ఈ అరుదైన సుమత్రా ఒరంగుటాన్‌లు కనిపిస్తాయి. ఆడ ఒరంగుటాన్‌లు 50 ఏళ్లకు మించి బతకడం చాలా అరుదు.

సియాచిన్‌లో సైనికులకు 'సద్గురు' యోగ పాఠాలు

- 21న జరిగే కార్యక్రమానికి హాజరౌతున్న జగ్గీ వాసుదేవ్

జమ్ము: సియాచిన్ హిమనీనదం ప్రాంతంలో దేశరక్షణ విధుల్లో నిమగ్నమై ఉన్న సైనిక సిబ్బంది కోసం 'ఇషా' ఫౌండేషన్ ఈ నెల 21న యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించబోతోంది. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజున అక్కడ జరగబోయే కార్యక్రమానికి 'ఇషా' వ్యవస్థాపకుడు, సద్గురు జగ్గీ వాసుదేవ్ ప్రత్యేక అతిథిగా హాజరౌతారు. ఆయన సియాచిన్ బేస్ క్యాంపునకు వెళ్లి....అక్కడి సిబ్బందిని కలుసుకుంటారు. ఇందుకోసం ఆయన మంగళవారం ఉదయమే లే సైనిక స్థావరానికి చేరుకున్నారు.

రాహుల్ గాంధీకి ప్రధాని జన్మదిన శుభాకాంక్షలు

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన జీవితం సంపూర్ణ ఆయురారోగ్యాలతో సాగిపోవాలని ఆకాంక్షించారు. అలాగే ఏఐసీసీ మీడియా ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలా సహా పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రాహుల్‌గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలి పుట్టినరోజు సందర్భంగా.. పలు రాష్ట్రాల్లో కార్యకర్తలు వివిధ కార్యక్రమాలు చేపట్టారు.

కుమారులు ఇంటినుంచి వెళ్లగొట్టారంటూ కోర్టులో అర్జున్ సింగ్ భార్య కేసు

భోపాల్: కుమారులు తనను ఇంటి నుంచి బలవంతంగా వెళ్లగొట్టారని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అర్జున్ సింగ్ భార్య సరోజ్ కుమారీ మంగళవారం స్థానిక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అర్జున్ సింగ్‌కు ఇద్దరు కుమారులు. వీరిలో అజయ్ సింగ్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్ పక్ష నాయకుడిగా కొనసాగుతున్నారు. ఈయనతోపాటు మరో కుమారుడు అభిమన్యు సింగ్‌పైనా గృహహింస కేసు పెట్టేందుకు.. 83ఏళ్ల కుమారీ తన కుమార్తెతో కలిసి కోర్టుకు వచ్చారు. వచ్చే నెల 19న విచారణకు హాజరుకావాలని అజయ్, అభిమన్యులకు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నోటీసులు పంపారు. ఫిర్యాదులో అజయ్ సింగ్ సతీమణి సునీతి సింగ్ పేరునూ కుమారి ప్రస్తావించారు. తన సంరక్షణ బాధ్యతలను ఎవరూ పట్టించుకోవడంలేదని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు.

బీజేడీ, తెరాస, వైకాపా కీలకం

- రాజ్యసభ ఉపాధ్యక్షుడి ఎన్నిక ఫలితాన్ని తేల్చేవి ఈ మూడు పార్టీలే
- ఉభయ శిబిరాల్లో విస్తృత మంతనాలు

ఈనాడు - దిల్లీ

రాజ్యసభ ఉపాధ్యక్షుడి (డిప్యూటీ ఛైర్మన్) ఎన్నికలో బిజూ జనతాదళ్ (బీజేడీ), వైకాపా, తెరాస ఓట్లు అత్యంత కీలకంగా మారబోతున్నాయి. అధికార పార్టీ అభ్యర్థి విజయం సాధించాలంటే ఈ పార్టీల ఎంపీల మద్దతు కచ్చితంగా అవసరమవుతుంది. అధికార, విపక్ష శిబిరాల్లోని ఓట్లు దాదాపు సమానంగా ఉండడంతో ఉభయ వర్గాలూ ఈ మూడు పార్టీలపై దృష్టి సారించాయి.

- రాజ్యసభలోని 245 మంది సభ్యులూ ఓటింగ్‌కు వచ్చినట్లయితే ఉపాధ్యక్ష అభ్యర్థి గెలుపునకు 122 ఓట్లు అవసరం.
- తెలుగుదేశానికి చెందిన ఆరుగురితో కలిపి విపక్షం వద్ద 117 ఓట్లు ఉన్నట్లు లెక్క. (కేరళలో ఈ నెలాఖరులో జరిగే ఎన్నికల్లో విపక్షాలకు లభించే మూడు స్థానాలూ దీనిలో ఉన్నాయి)
- అధికార పక్షం వరకు చూస్తే అత్యధికంగా భాజపాలో 69 మంది ఉన్నారు.
- మిత్రపక్షాలు, స్వతంత్రులు, నామినేటెడ్ సభ్యులు ఎన్డీఏకి ఓట్లు వేస్తే మొత్తం 111 ఓట్లు అవుతాయి. వీరిలో స్నేహపూరిత ఏఐఏడీఎంకేకి చెందిన 13 మంది, స్వతంత్ర సభ్యుడు అమర్‌సింగ్ కూడా ఉన్నారు.
- ఈ పరిస్థితుల్లో భాజపాయేతర, కాంగ్రెసేతల పార్టీలు కీలకంగా మారనున్నాయి. బీజేడీ(9), తెరాస(6), వైకాపా(2)... వెరశి 17 మంది ఎంపీలు ఈ జాబితాలో ఉన్నారు.

లెక్క సరిచేయడంపై భాజపా మల్లగుల్లాలు

రాజ్యసభలో ఎన్డీఏ సభ్యుల కంటే ఇతరులే ఎక్కువ. ఎన్డీఏ, భాజపాలకు వ్యతిరేకంగా ఉన్న ఎంపీలు 134 మంది. బీజేడీ, తెరాస, వైకాపాలను విపక్ష శిబిరం నుంచి తప్పించేందుకు భాజపా వ్యూహకర్తలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. 2017లో రాష్ట్రపతి ఎన్నికలు జరిగినప్పుడు ఆ పార్టీలన్నీ భాజపాకి మద్దతు పలికాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లోనూ వైకాపా, తెరాసలు భాజపా అభ్యర్థికి అండగా నిలిచినా బీజేడీ మాత్రం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతునిచ్చింది. భాజపా కంటే తెదేపాయే తమకు పెద్ద శత్రువని వైకాపా భావిస్తున్నందువల్ల ఆ పార్టీపై ఎన్డీఏ దృష్టి సారించింది. ఈ పరిస్థితుల్లో ఈ మూడు పార్టీలను తమ శిబిరంలో ఉంచడం విపక్షానికి పెద్ద సవాల్‌గా మారింది.

వేరే పార్టీకి కాంగ్రెస్ విడిచిపెట్టేనా?!

ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై విపక్షంలో ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు. తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థికి కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ మద్దతు పలకాలని తృణమూల్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ డిమాండ్ చేస్తున్నారు. టీఎంసీకి మద్దతు పలకడం వామపక్షాలకు ఇష్టం లేకపోతే ప్రత్యామ్నాయంగా బీజేడీ నుంచి ఒకరిని నిలబెట్టాలనేది ఆమె ప్రతిపాదన. దీనిని ఆమోదించడం కాంగ్రెస్‌కు అంత సులభం కాదు. గత నాలుగు దశాబ్దాలుగా రాజ్యసభ ఉపాధ్యక్షులుగా కాంగ్రెస్ అభ్యర్థులే ఉంటున్నారు. అందువల్ల ఈసారీ విపక్షాల ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టే అవకాశం తమకే దక్కాలనేది ఆ పార్టీ వాదన. ఇప్పటికే ప్రాంతీయ పక్షాలకు వత్తాసు పలుకుతున్నట్లు పార్టీ శ్రేణుల్లో విమర్శలున్న దృష్ట్యా ఈ పదవిని వదులుకోలేమని కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. ఈ పరిస్థితుల్లో విపక్ష ఐక్యతకు ఈ ఎన్నిక ఒక పరీక్షగా నిలవబోతోంది.

- రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరించే ఉప రాష్ట్రపతిని ఎన్నుకోవడంలో ఉభయ సభల సభ్యులకూ పాత్ర ఉంటుంది. ఉపాధ్యక్షుడిని రాజ్యసభ సభ్యులే ఎన్నుకుంటారు.

సన్నాహాలపై చర్చించిన వెంకయ్యనాయుడు

రాజ్యసభ ఉపాధ్యక్ష ఎన్నికలపై సభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు మంగళవారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్‌తో చర్చించారు. ప్రస్తుత ఉపాధ్యక్షుడు పి.జె.కురియన్ జులై 2న పదవీ విరమణ చేయనుండడంతో ఆ పదవి ఖాళీ కానుంది. ఎన్డీఏ పాలనలో ఇది చివరి సంవత్సరం కావడం, విధాన నిర్ణయాలతో ముడిపడిన అనేక చట్టాలను ఎగువసభలో ఆమోదించుకోవాల్సి ఉండడంతో డిప్యూటీ ఛైర్మన్ పదవి కీలకంగా మారింది. దీని దృష్ట్యా మోదీ సర్కారుపై సానుకూలంగా ఉన్న విపక్షాలతో మంతనాలు జరుగుతున్నాయని భాజపా నేత ఒకరు తెలిపారు. ఎన్డీఏ వ్యతిరేక పక్షాలన్నీ తమకు మద్దతునిచ్చేలా చూడడమే తొలి ప్రాధాన్యమని కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు.

నిరసన విరమించిన కేజ్రీ

- విధులకు హాజరైన ఐఏఎస్‌లు

దిల్లీ: మంత్రులు నిర్వహించే సమావేశాలకు ఐఏఎస్ అధికారులు హాజరుకావడంతో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం తన నిరసనను విరమించారు. గత 9 రోజులుగా ఆయన దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ కార్యాలయంలో బైఠాయించిన విషయం తెలిసిందే. ఐఏఎస్‌లు విధులకు హాజరుకావడం ఓ చిరు విజయమని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఎల్‌జీ కార్యాలయం నుంచి సీఎం బయటకు రాగానే కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం తన నివాసం వద్ద కార్యకర్తల్ని ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడారు. 'ఐఏఎస్ అధికారుల సమ్మెకు లెఫ్టినెంట్ గవర్నర్ ప్రేరేపించి ఉంటే అది చాలా దురదృష్టకరం. 90% మంది ఐఏఎస్‌లు చాలా మంచివారు. ఆప్ ప్రభుత్వంతో కలిసి పనిచేయవద్దని తమపై ఒత్తిడి వస్తున్నట్లు కొందరు ఐఏఎస్‌లు ప్రైవేటుగా నాకు చెప్పారు. ఈ అంశాన్ని పరిష్కరించుకునేందుకే దీనిని ప్రజల్లోకి తీసుకువచ్చాం. దిల్లీకి రాష్ట్ర ప్రతిపత్తి కోసం పోరాటం కొనసాగుతుంది' అని ఆయన ప్రకటించారు. ఎల్‌జీ కార్యాలయం లోపల కేజ్రీవాల్ కూర్చోవడం ధర్నా కాదనీ, ఎల్‌జీని కలిసేందుకు సీఎం చేస్తున్న నిరీక్షణ అనీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా విలేకరులకు తెలిపారు. ప్రధాన కార్యదర్శి సహా ఆరుగురు ఐఏఎస్‌లు సమావేశాలకు వచ్చారని చెప్పారు. ఎల్‌జీ కార్యాలయంలో కేజ్రీవాల్, ఇతర మంత్రులు ధర్నాకు దిగడంపై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. వేసవి సెలవుల అనంతరం దీనిపై విచారణ చేపట్టనున్నట్లు జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ ఇందు మల్హోత్రాలతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం పేర్కొంది.

జర్నలిస్టులకు గూగుల్ శిక్షణ

నకిలీ వార్తలపై అవగాహన కల్పించేందుకే..

దిల్లీ: తెలుగు, తమిళంతోపాటు ఆరు ప్రాంతీయ భాషలు, ఆంగ్ల మీడియా జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు సాంకేతిక దిగ్గజం గూగుల్ ఓ కార్యక్రమం చేపట్టనుంది. నకిలీ వార్తల కట్టడి, అసత్య సమాచారానికి అడ్డుకట్ట తదితర అంశాలపై దీని ద్వారా అవగాహన కల్పించనుంది. "ద గూగుల్ న్యూస్ ఇనీషియేటివ్ ఇండియా ట్రైనింగ్ నెట్‌వర్క్" పేరిట ఈ కార్యక్రమం చేపడతామని, దీని ద్వారా ఏడాది కాలంలో 8,000 మందికి శిక్షణ ఇస్తామని గూగుల్ తెలిపింది. దీనికోసం దేశవ్యాప్తంగా 200 మంది పాత్రికేయుల్ని ఎంపికచేసి ప్రత్యేక శిక్షణ ఇస్తామని, వీరు కార్యశాలల ద్వారా మిగతావారికి అవగాహన కల్పిస్తారని పేర్కొంది. ఈ కార్యశాలలు తెలుగు, తమిళం, బెంగాలీ, మరాఠీ, కన్నడ, హిందీ, ఆంగ్లంలో కొనసాగుతాయని పేర్కొంది. 'వార్తల్లోని అంశాలను రూఢీపరచుకోవడం, ఆన్‌లైన్ సాయంతో పరిశీలన, డిజిటల్ విలువలపై ఈ కార్యక్రమంలో దృష్టిసారిస్తాం' అని తెలిపింది.

పాక్ వద్దే పది ఎక్కువ!

- భారత్ కంటే పాకిస్థాన్‌లోనే అణు వార్‌హెడ్‌లు అధికం: సిప్రీ

లండన్: అణు వార్‌హెడ్‌ల సంఖ్య పరంగా భారత్ కంటే పాకిస్థానే ముందుందని స్వీడన్‌కు చెందిన 'స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ' (సిప్రి) నివేదిక వెల్లడించింది. పాక్ వద్ద కంటే చైనాలో రెట్టింపు సంఖ్యలో ఇవి ఉన్నాయని పేర్కొంది. 'భారత్, పాకిస్థాన్ దేశాలు రెండూ తమ అణ్వాయుధ నిల్వల్ని పెంచుకుంటున్నాయి. గాలిలో, నేలపై, నీటిమీద నుంచి ప్రయోగించగల క్షిపణి వ్యవస్థల్ని కొత్తగా అభివృద్ధి చేసుకుంటున్నాయి. అణ్వాయుధ భాండాగారాన్ని చైనా ఆధునికీకరించుకొంటోంది. ఆయుధాల సంఖ్యనీ పెంచుకొంటోంది. మొత్తం వార్‌హెడ్‌లలో రష్యా, అమెరికాల వద్దనే 92% పైగా ఉన్నాయి. అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, భారత్, పాకిస్థాన్, ఇజ్రాయెల్, ఉత్తర కొరియా... ఈ 9 దేశాల వద్ద కలిపి ఈ ఏడాది ఆరంభం నాటికి 14,465అణు వార్‌హెడ్‌లుఉన్నాయి. 2017లో ఈ సంఖ్య 14,935గా ఉండేది. ఆయుధ నియంత్రణకు అమెరికా, రష్యా వంటి దేశాలు తీసుకున్న నిర్ణయం కారణంగా ఈ సంఖ్య తగ్గింది. సంఖ్య అయితే తగ్గినా, ఆధునికీకరణ కొనసాగుతూనే ఉంద'ని తెలిపింది. వివిధ దేశాలు సరికొత్త వ్యవస్థల్ని మోహరించే ప్రయత్నాల్లో ఉన్నాయని సిప్రి తెలిపింది.

గత ఏడాది కంటే ఈ ఏడాది 10 ఎక్కువగా సమకూర్చుకొన్న పాకిస్థాన్ వద్ద మొత్తం 140-150 వరకు వార్‌హెడ్‌లు ఉండే అవకాశం ఉంది. భారత్ వద్ద ఇవి 130-140 మధ్య ఉండవచ్చు.
– సిప్రి వార్షిక నివేదిక

చైనా పర్యటనలో కిమ్

బీజింగ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఇటీవల చరిత్రాత్మక భేటీలో పాల్గొన్న ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తాజాగా చైనా పర్యటనకు వెళ్లారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఆయన సమావేశమయ్యారు. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వాయుధరహితంగా మార్చేందుకు ట్రంప్‌తో భేటీలో అంగీకరించిన నేపథ్యంలో.. తదుపరి కార్యాచరణ ప్రణాళికపై జిన్‌పింగ్‌తో కిమ్ చర్చించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నుంచి ఆయన చైనాలో పర్యటిస్తుండటం ఇది మూడోసారి.

కలుషితాహారం తిన్న ముగ్గురు చిన్నారులు మృతి

ముంబయి: మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో ఓ గృహప్రవేశ వేడుకలో కలుషిత ఆహారం తీసుకున్న ముగ్గురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. మరో 40 మంది ఆసుపత్రి పాలయ్యారు. మహద్ గ్రామంలో సోమవారం రాత్రి సుభాష్ మానె అనే వ్యక్తి ఏర్పాటు చేసిన విందులో ఈ ఘటన జరిగింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 21-6-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 312

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

'మిస్ ఇండియా' కిరీటంతో అనుక్రీతి (మధ్యలో). రెండో స్థానంలో నిలిచిన మీనాక్షి చౌధరి (ఎడమ), మూడో స్థానంలో శ్రేయా (కుడి)

'మిస్ ఇండియా'గా చెన్నై యువతి అనుక్రీతి

ఆంధ్ర అమ్మాయి శ్రేయాకు మూడోస్థానం

ముంబయి: 'మిస్ ఇండియా' అందాల పోటీలో ఈసారి తమిళనాడుకు చెందిన 19ఏళ్ల అనుక్రీతి విజేతగా నిలిచారు. అంతకుముందు ఏడాది ఈ పోటీలో గెలుపొంది, 'మిస్ వరల్డ్-2017'గానూ ఎంపికైన మానుషీ ఛిల్లర్.. అనుక్రీతికి 'అందాల కిరీటం' బహూకరించారు. ముంబయిలో అట్టహాసంగా జరిగిన వేడుకలో ఈ ఫలితాలను ప్రకటించారు. పోటీలో రెండో స్థానంలో మీనాక్షి (మిగతా 2లో)

జోధ్‌పూర్‌లో యోగా సాధన చేస్తున్న యువతులు

నేడు ప్రపంచ యోగం

- అంతర్జాతీయ దినోత్సవానికి సర్వం సిద్ధం
- దేహ్రాదూన్‌లో ప్రధాని.. సురినామ్‌లో రాష్ట్రపతి

దిల్లీ: యోగా దినోత్సవానికి యావత్తు ప్రపంచం సమాయత్తమైంది. ఈ ఏడాది 'శాంతి కోసం యోగా' అంశం(థీమ్)తో నాలుగో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 5 వేల కార్యక్రమాలు జరుగుతాయని ఆయుష్ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 150కి పైగా దేశాల్లోనూ భారత రాయబార కార్యాలయాలు (మిగతా 2లో)

రూ.10,000 కోట్ల మైలురాయి దాటిన మార్గదర్శి

- దేశంలోనే మొదటి స్థానం
- 2025నాటికి రూ.20వేల కోట్ల వ్యాపార లక్ష్యం

మార్గదర్శి చిట్ ఫండ్ తన 55 ఏళ్ల ప్రస్థానంలో కీలక మైలురాయిని అధిగమించింది. వార్షిక టర్నోవర్ రూ.10వేల కోట్లకు చేరిన తొలి చిట్ ఫండ్ సంస్థగా రికార్డు సృష్టించింది. దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. తెలుగు రాష్ట్రాలతోపాటు, తమిళనాడు, కర్ణాటకల్లో వ్యాపారాన్ని విస్తృతం చేసి 2025 నాటికి రూ.20వేల కోట్ల లక్ష్యాన్ని చేరాలని నిర్దేశించుకున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శైలజాకిరణ్ ప్రకటించారు. 1995 నుంచి 26 రెట్ల వృద్ధిని సాధించినట్లు పేర్కొన్నారు.

- పూర్తి వివరాలు బిజినెస్ పేజీలో

కేంద్రంపై లేఖాస్త్రాలు

- 10 రోజుల వ్యవధిలో 10
- ప్రధాని, కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి ఉత్తరాలు
- పలు సమస్యల ప్రస్తావన
- కడప ఉక్కుపై మోదీకి లేఖ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పలు సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంపై లేఖాస్త్రాలు సంధిస్తున్నారు. 10 రోజుల వ్యవధిలో ప్రధాని, కేంద్ర మంత్రులకు ఆయన 10 లేఖలు రాశారు.

కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై మెకాన్ సంస్థ ఇచ్చిన సాధ్యాసాధ్యాల నివేదిక ఆధారంగా సుప్రీం కోర్టులో సవరణ అఫిడవిట్‌ను కేంద్రం వెంటనే దాఖలు చేయాలని కోరుతూ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు లేఖ రాశారు. ఈ లేఖ వివరాలను ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. 'సెయిల్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఇటీవల సుప్రీం కోర్టులో కేంద్ర ఉక్కు (మిగతా 2లో)

అంగన్‌వాడీలకు వరాలు

- కార్యకర్తల గౌరవ వేతనం రూ. 10,500లకు పెంపు
- ఆయాలకు రూ.6 వేలు చేస్తూ ముఖ్యమంత్రి ప్రకటన
- పేద పిల్లల సంరక్షణ బాధ్యత తీసుకోవాలంటూ దిశానిర్దేశం

ఈనాడు డిజిటల్ – అమరావతి
ఈనాడు – అమరావతి

అంగన్‌వాడీలపై సీఎం వరాల జల్లు కురిపించారు. కార్యకర్తల గౌరవ వేతనాన్ని రూ.7 వేల నుంచి రూ.10,500 వరకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఆయాల వేతనాన్ని రూ.4,500 నుంచి రూ.6 వేలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.305 కోట్లు ఖర్చు అవుతుందని వెల్లడించారు. ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు, సాధికారమిత్రలతో జరిగిన

ముఖ్యమంత్రితో కరచాలనానికి పోటీ పడుతున్న సాధికారమిత్రలు, అంగన్‌వాడీలు

సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిర్ణయాలు ప్రకటించారు. రానున్న రోజుల్లో మెడికల్ అలవెన్స్, రవాణా ఛార్జీల విషయాన్ని కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు ప్రతి అంగన్వాడీ ఆవరణంలో పిల్లలు ఆడుకోవడానికి వీలుగా పరికరాలు, ఆటస్థలం అభివృద్ధికి రూ.15వేలు కేటాయిస్తామన్నారు. పోషకాహార లోపాన్ని నివారించడానికి పంచాయతీల్లో న్యూట్రి గార్డెన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అక్కడ పెంచే కూరగాయలను అంగన్వాడీలకు పంపిణీ చేస్తామన్నారు. పేద పిల్లల బాధ్యతను తీసుకుంటున్న మీకు అండగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు సీఎం స్పష్టం చేశారు. పేద పిల్లల సంరక్షణ బాధ్యతతోపాటు సాధికారమిత్రలతో కలిసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేయాలని అంగన్వాడీలకు సూచించారు. అనంతపురం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్న మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత వేతనాల పెంపు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణా డెల్టాకు నీటి విడుదల

రాష్ట్రంలో నీటి సమస్యలను దూరం చేసేందుకు నదుల అనుసంధానం చేపట్టామని, కృష్ణా, గోదావరి నదులను కలిపి సత్ఫలితాలను సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లోటు వర్షపాతం నమోదైనా భవిష్యత్తులో (మిగతా 2లో)

గుండెపోటు నివారణకు స్మార్ట్ స్టెంట్

టొరంటో: గుండెపోటు నివారణ దిశగా శాస్త్రవేత్తలు ముందంజ వేశారు. హృదయంలో రక్తప్రవాహాన్ని ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షించే స్మార్ట్ స్టెంట్‌ను అభివృద్ధి చేశారు. వైద్యరంగంలో ఉపయోగించే తుప్పుపట్టని ఉక్కుతోనే తాము తాజా స్టెంట్‌ను తయారు చేసినట్లు బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వెల్లడించారు. సాధారణ స్టెంట్లలాగే అది కనిపిస్తుందని.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న విధానాల్లోనే దాన్ని శరీరంలో సులువుగా ప్రవేశపెట్టవచ్చునని తెలిపారు. ఇందులోని సూక్ష్మ సెన్సర్ రక్తప్రవాహంలో స్వల్పస్థాయి మార్పులను కూడా స్పష్టంగా గుర్తిస్తుందన్నారు. సాధారణ స్టెంట్లు వేయించుకున్న ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరిలో రక్తనాళాలు తిరిగి మూసుకుపోయి గుండెపోటు వచ్చే ప్రమాదముంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. స్మార్ట్ స్టెంట్లను ఉపయోగిస్తే ఈ ప్రమాదమేమీ ఉండబోదని స్పష్టం చేశారు. రక్తనాళాల పరిస్థితిని అవి ఎప్పటికప్పుడు తెలియజేస్తాయని చెప్పారు. దీంతో తగిన చికిత్స అందించి గుండెపోటును నివారించవచ్చునని వివరించారు.

కడపలో ఉక్కు పరిశ్రమ సాధన ఆమరణదీక్షలో కూర్చున్న ఎంపీ సీఎం.రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవికి మద్దతు తెలుపుతున్న మంత్రులు నక్కా ఆనందబాబు, ఆదినారాయణ రెడ్డి, శిద్దా రాఘవరావు తదితరులు

ప్రాణాలైనా అర్పిస్తాం.. ఉక్కు పరిశ్రమ సాధిస్తాం

- కేంద్రం కుటిలనీతిని ప్రశ్నిస్తూ ఉద్యమిస్తాం
- అన్ని వసతులు కల్పిస్తామని చెప్పినా వెనకడుగేస్తుంటే ఎలా: ఎంపీ సీఎం రమేష్
- కడపలో ఆమరణదీక్ష ప్రారంభం

3లో

రాజధానిలో జంతు ప్రదర్శనశాల.. నైట్ సఫారీ

- తాడేపల్లి కొండలపై 251 హెక్టార్లలో ఏర్పాటు
- రాజధాని పనుల పురోగతిపై సీఎం సమీక్ష

5లో

ప్రభుత్వాసుపత్రులు భేష్!

- అరుదైన శస్త్ర చికిత్సల్లో కీలక భాగస్వామ్యం
- ఆరోగ్య సదస్సులో ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఈనాడు – విశాఖపట్నం

కార్పొరేట్ ఆసుపత్రులతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రులు ఏమాత్రం తీసిపోవని నిరూపించింది ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ. ఆయా ఆసుపత్రులు చేసిన అరుదైన శస్త్ర చికిత్సలపై బుధవారం విశాఖపట్నంలో ప్రజెంటేషన్ ఇచ్చింది. గురువారం ఆరోగ్య ఉత్సవ్ జరగనున్న నేపథ్యంలో బుధవారం ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఇందులో జిల్లాకు 4 చొప్పున అరుదైన ఘనతలను ప్రదర్శించారు. వాటిలో కొన్నింటి వివరాలివీ..

★ పుట్టిన 7 రోజులకే ఓ బిడ్డకు ప్రపంచంలోనే అరుదైన శస్త్ర చికిత్సను ఈ మధ్యే విశాఖ కేజీహెచ్‌లో చేశారు. ఆ బిడ్డకు పుట్టుకతోనే పెదాలు, నాలుక, పళ్ల చిగుళ్లన్నీ అతుక్కుపోయి ఉండటం, నోరు తెరిచే అవకాశమే లేకపోవడాన్ని వైద్యులు గుర్తించారు. డాక్టర్ పి.వి.సుధాకర్ బృందం ఈ కేసును సవాల్‌గా తీసుకుని బిడ్డ మామూలు స్థితికి వచ్చేలా శస్త్ర చికిత్సలు చేశారు. వారం రోజుల్లోనే ఆ బిడ్డ కోలుకుంది. ఇది 100 కోట్ల మందిలో ఒకరికి జరుగుతుందని, ఈ సర్జరీ ప్రపంచంలో 41వదని వైద్యులు తెలిపారు.

ఆరోగ్య సదస్సులో మాట్లాడుతున్న పూనం మాలకొండయ్య తదితరులు

★ 32 వారాల చిన్నారి పేగు మూసుకుపోయి ప్రాణాపాయ స్థితిలో వచ్చినప్పుడు కాకినాడ జీజీహెచ్‌లో డి.మాణిక్యాంబ బృందం శస్త్ర చికిత్స చేసింది.

★ సామర్లకోటలో వరికోత సమయంలో యంత్రంలో పడిన ఓ వ్యక్తి వీపు భాగం, కాళ్లు కోతకు గురయ్యాయి. శరీరం ముక్కలై, ఎముకలు విరిగి తీవ్రంగా రక్తం కారుతూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని కాకినాడ జీజీహెచ్‌లో ఆర్.మహాలక్ష్మి బృందం కాపాడింది. ఎముకలు, నరాలు, చర్మం, ఛాతీభాగం అన్నింటినీ జాగ్రత్తగా పేర్చి ఆ వ్యక్తికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు.

★ 25ఏళ్ల ఆదివాసీ యువకుడికి ముక్కులో సజీవంగా జలగ ఉండటం, దాని ప్రభావంతో తీవ్ర తలనొప్పి, రక్తస్రావం అవుతూ ఉండటాన్ని గమనించి జీజీహెచ్‌లో జీఎస్ఎన్ మూర్తి బృందం దాన్ని తొలగించి ఉపశమనం కలిగించారు.

★ మానసిక స్థితి సరిగా లేకుండా పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తున్న ఓ 14 ఏళ్ల అమ్మాయికి గుంటూరు జీజీహెచ్ వైద్యులు ఈ మధ్యే చక్కటి జీవితాన్ని (మిగతా 2లో)

నిరుద్యోగ భృతి పర్యవేక్షణ డ్వాక్రా మహిళలకు

- పంపిణీ కూడా వారికే
- సాధికారమిత్రలకు స్మార్ట్‌ఫోన్లు

5లో

అవన్నీ అపోహలే!

- 'ఆటోమేషన్' తో ఉద్యోగాలు మొత్తం పోవు
- తీరు మారుతుందంతే...
- గ్లోబల్ ఫ్యూచర్ ఆఫ్ వర్క్ సర్వే స్పష్టీకరణ

16లో

బస్సున్నా.. 'సామర్థ్యం' లేదు కన్నా!

- ఫిట్‌నెస్ లేకుండానే తిరిగేస్తున్న 4,800 బడి బస్సులు

3లో

జమ్ముకశ్మీర్‌లో గవర్నర్ పాలన అమల్లోకి

- సుప్తచేతనావస్థలో శాసనసభ
- భద్రతాచర్యలను సమీక్షించిన గవర్నర్ వోహ్రా

దిల్లీ, శ్రీనగర్: జమ్ము కశ్మీర్ బుధవారం నుంచి గవర్నర్ పాలనలోకి వచ్చింది. దీంతో రాష్ట్ర శాసనసభను సుప్తచేతనావస్థలో ఉంచుతూ గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రా.. గెజిట్ నోటిఫికేషన్ వెలువరించారు. గవర్నర్‌పాలన అమల్లోకి వచ్చిన వెంటనే ఆయన శ్రీనగర్‌లో ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో భద్రత పరిస్థితులను చర్చించారు. అమర్‌నాథ్ యాత్రకు భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. మరోవైపు... కశ్మీర్‌లోయలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా సైన్యం చేపట్టిన చర్యలు మునపటిలాగానే కొనసాగుతాయని సైన్యాధిపతి జనరల్ బిపిన్ (మిగతా 2లో)

ఇదీ సంగతి!

ఏదో ఒకరోజున నన్నూ వెళ్లిపొమ్మంటాడు. అప్పటిదాకా చూస్తూ ఉండటం ఎందుకు లెమ్మని ముందే వెళ్తున్నా!

ఒక్కటి చాలదు.. రెండు కావాలి!

- రెండు ఉద్యోగాలుంటేనే మేలు
- జపాన్ యువత వింత ధోరణి
- ఆదాయం సరిపోకనే ఈ పరిస్థితి
- నిద్రాహారాలు మానుకొని పనికి సిద్ధం

బీటెక్ చేసినవాళ్లు, బీఎస్సీ చేసినవాళ్లు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవడం.. ఏదోక ఉద్యోగం దొరికితే చాలనుకుని సంతృప్తి పడడం మనదేశంలో చాలా మామూలు వ్యవహారం. ఎందుకంటే ఇక్కడ ఉద్యోగం దొరకటమే కష్టం కనుక. కానీ జపాన్‌లో పరిస్థితి ఇందుకు భిన్నం. ఒక ఉద్యోగంతో అక్కడి యువతీ యువకులు సరిపెట్టుకోవటం లేదు. ఒక ఉద్యోగం చేస్తూనే రెండో ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నారు. సంపాదన సరిపోకపోవడమే దీనికి ప్రధాన కారణం. 'ఒక ఉద్యోగంతో నా సంపాదన సరిపోవటం లేదు, తప్పనిసరై ఖాళీ సమయంలో పనిచేయటానికి రెండో ఉద్యోగం కోసం వెతుకుతున్నా..' అని చెప్పే వారు ఆ దేశంలో కోకొల్లలు.

కార్మికుల కొరత

■ జపాన్‌లో వృద్ధుల సంఖ్య ఎక్కువ. ఉద్యోగాలు చేసే యుక్తవయస్కుల సంఖ్య తక్కువ. దీంతో ఎన్నో సంస్థలు కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నాయి.

■ ఉద్యోగం చేయటానికి అనువైన వయసు ఉన్న జనాభా ఆ దేశంలో తగ్గిపోతోంది. 15-64 ఏళ్ల మధ్య వయస్కుల సంఖ్య 2000 సంవత్సరంలో 8 కోట్లకు (మిగతా 2లో)

జీతభత్యాలు అరకొర..

జపాన్‌లో ఉద్యోగుల జీతభత్యాల్లో చాన్నాళ్లుగా పెరుగుదల లేదు. కానీ అదే సమయంలో ఖర్చులు బాగా పెరిగిపోయాయి. అరకొర ఆదాయంతో కుటుంబం గడవటం కష్టంగా మారుతోంది.

■ ఒక కుటుంబానికి సగటున నెలకు 3,300 డాలర్ల వ్యయం (దాదాపు రూ. 2.25 లక్షలు) ఉంటోంది. దీంతో తప్పనిసరై రెండో ఉద్యోగం వెతుక్కుంటున్నారు.

■ జపాన్‌లో అందరూ ఎక్కువ పనిచేస్తారు. కార్యాలయ వేళలు పూర్తయినా పనిచేస్తూనే ఉంటారు. అందువల్ల వారికి ఖాళీ సమయం అనేది తక్కువ. అయినా మిగిలిన ఆ కొద్ది సమయంలోనే వేరే పని చేయటానికి సిద్ధపడుతున్నారు చాలామంది. దీనివల్ల విశ్రాంతి ఉండటం లేదు. అయినా తప్పక పని చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు వరాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరలో ఐదు నదులను అనుసంధానం చేసే కార్యక్రమాన్ని చేపడతామని పునరుద్ఘాటించారు. బుధవారం ఆయన ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజలు చేసి కొత్తగా నిర్మించిన హెడ్ రెగ్యులేటర్ నుంచి తూర్పు డెల్టాకు నీటిని వదిలారు. పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ప్రస్తుతం పెన్నా, గోదావరి నదులను అనుసంధానించనున్నాం. శ్రీకాకుళం జిల్లాలో నాగావళి, వంశధార నదులను కలిపి... గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానిస్తే ఇక రాష్ట్రంలో కరవు ఉండదు" అన్నారు. నీటి కొరత కారణంగా ఇటీవలి వరకు సాగుకు ఆలస్యంగా జలాలను విడుదల చేయడం వల్ల పంట చేతికి వచ్చేసరికి తుపాన్లు వచ్చేవన్నారు. ఈసారి గోదావరి డెల్టాకు జూన్ 1నే నీటిని అందించామని, కృష్ణా డెల్టాకు 20నే విడుదల చేస్తున్నామని వివరించారు. ప్రకాశం బ్యారేజి 160 సంవత్సరాల చరిత్రలో గత ఏడాది చుక్క నీటిని కూడా సముద్రంలోకి వదలలేదన్నారు. కృష్ణా నదిపై ఎగువన ఆలమట్టి, నారాయణపూర్, జూరాల వద్ద ఆనకట్టలు కట్టడం వల్ల మనకు నీరు రావడం లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతున్నా ఏమీ లేదని కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడం సరికాదని చంద్రబాబు అన్నారు. "పోలవరం పనులు 56 శాతం అయ్యాయి. ఎంతో సంక్లిష్టమైన డయాఫ్రం వాల్ నిర్మాణం కూడా పూర్తయింది. ప్రస్తుతం జెట్ గ్రౌటింగ్ పనులు జరుగుతున్నాయి. సెప్టెంబరులో గ్యాలరీ వాక్‌ను నిర్వహిస్తాం. అక్టోబరులో మొదటి గేట్‌ను బిగిస్తాం" అని వివరించారు.

కృష్ణా డెల్టాకు నీటి విడుదల సందర్భంగా గంగమ్మకు సారె సమర్పించి పూజలు చేస్తున్న సీఎం చంద్రబాబు

మంత్రి నుంచి లస్కర్ దాకా ఎంతో కష్టపడ్డారు

జలవనరుల విషయంలో దేశంలోనే మనం ప్రథమ స్థానంలో ఉన్నామని నీతి ఆయోగ్ నివేదిక తేటతెల్లం చేసిందని ముఖ్యమంత్రి వివరించారు. దీనికి మంత్రి దేవినేని, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ నుంచి కింది స్థాయిలో లస్కర్ వరకు అందరూ కష్టపడుతున్నారని కితాబిచ్చారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం ఉన్నా భూగర్భ జలం 2 మీటర్లు పెరిగిందన్నారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ఆయకట్టు సంఘాల అధ్యక్షులు, అపెక్స్ కమిటీ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబును సన్మానించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా, పౌరసరఫరాల శాఖ మంత్రి పుల్లారావు, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ జలీల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ నేతల హర్షం.. అంగన్వాడీ కార్యకర్తల వేతనాలు పెంచుతూ ముఖమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల తెలుగునాడు అంగన్వాడీ ట్రేడ్ యూనియన్, సీఐటీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలుగునాడు అంగన్వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ శోభ హైమావతి, సీఐటీయూ నాయకురాలు సుబ్బరావమ్మ, తదితరులు ఉండవల్లిలో సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తల్లీ పిల్లల్ని విడదీయకుండా ఉత్తర్వులు వెలువరిస్తా

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: వలసవస్తున్న తల్లీపిల్లల్ని విడదీయకుండా మెక్సికో సరిహద్దులో వారంతా ఒకేచోట ఉండేలా కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అక్రమ వలసలకు అడ్డుకట్ట పేరుతో తల్లిదండ్రుల నుంచి పిల్లల్ని విడదీసి వేరే శిబిరాలకు తరలిస్తున్న తీరుపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. వలసలపై కాంగ్రెస్‌లో ఆమోదం పొందబోతున్న చట్టానికి అనుగుణంగా కొద్దిసేపట్లోనే ఉత్తర్వులు ఇవ్వబోతున్నానని ట్రంప్ బుధవారం శ్వేతసౌధంలో చెప్పారు. కుటుంబాలను కలిపి ఉంచుతామనీ, అయితే కఠినంగా వ్యవహరించకపోతే... అవసరం లేనివారితో దేశమంతా నిండిపోతుందని వ్యాఖ్యానించారు. వలసలపై బిల్లును అమెరికా ప్రతినిధుల సభ గురువారం పరిశీలించనుంది.

కోస్తాపై వడగాల్పుల పడగ!

- నేడూ అన్ని జిల్లాల్లో ఎండ తీవ్రత
- శ్రీకాకుళంలో వడదెబ్బకు ఇద్దరి మృతి

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి నేటికీ బలపడని క్రమంలో వేడి అంతకంతకూ పెరిగి, కోస్తా జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత కొనసాగుతోందని వాతావరణ శాఖ నివేదిక సమర్పించింది. శ్రీకాకుళం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలపై వీటి ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. గురువారం కోస్తాలోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఎండ తీవ్రత కొనసాగుతుంది. వడగాల్పులకూ అవకాశం ఉంది. మరోవైపు రానున్న రెండ్రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు పడతాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ప్రస్తుతం తీర ప్రాంతంలో సముద్రం కల్లోలంగా ఉండి, బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరించింది.

ఇద్దరిని బలిగొన్న వడగాల్పులు..

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పలాస మండలం తర్లాకోట పంచాయతీ కొత్తవూరుకు చెందిన ఎల్.సింహాద్రినాయుడు(70) బుధవారం ఉదయం వడదెబ్బకు గురై మృతిచెందాడు. మందస మండలం సొండిపూడికి చెందిన జడ్డిడి అప్పలమ్మ(74) దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా వడదెబ్బ తగిలి కన్నుమూసింది.

కేంద్రంపై లేఖాస్త్రాలు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టు ఆర్థికంగా అనుకూలం కాదంటూ అఫిడవిట్ దాఖలు చేసింది. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆందోళనను కలిగించింది. వారి మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రాజెక్టు వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఆర్థికంగా దన్నుగా ఉంటుంది. సుప్రీం కోర్టులో వెంటనే సవరణ అఫిడవిట్‌ను దాఖలు చేయాలి' అని ఆ లేఖలో చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

- విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల నుంచి అంతర్జాతీయ సర్వీసులు నడిపే అంశాన్ని పరిశీలించాలని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయానశాఖ మంత్రి సురేశ్ ప్రభును కోరారు. సర్వీసులు నడిపేందుకు ఎయిర్ ఇండియా గతంలో ముందుకొచ్చినా భద్రతా కారణాలతో తిరస్కరించారని పేర్కొన్నారు.
- పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఒడిశా కాలుష్య నియంత్రణ మండలి, ఛత్తీస్‌గఢ్ పర్యావరణ సంరక్షణ బోర్డు ఇచ్చిన పనుల నిలిపివేత ఉత్తర్వులను పూర్తి స్థాయిలో ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని మరో లేఖలో చంద్రబాబు డిమాండు చేశారు. ప్రభుత్వం లేదా ప్రత్యేక సంస్థతో ప్రజాభిప్రాయ సేకరణ జరిపించాలని కోరుతూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులశాఖ మంత్రి హర్షవర్ధన్‌కు లేఖ రాశారు.
- ఆంధ్రప్రదేశ్ అవసరాలకు సరిపడా గ్యాస్ కేటాయింపుల తర్వాతే ఇతర రాష్ట్రాలకు ఇవ్వాలని కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను లేఖలో కోరారు.
- తిరుమల తిరుపతి దేవస్థానాల విషయంలో పురావస్తుశాఖ ప్రధాన కార్యాలయం నుంచి అమరావతి సర్కిల్ దాకా నడిచిన వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర సాంస్కృతికశాఖ మంత్రి మహేశ్ శర్మకు రాసిన లేఖలో కోరారు.
- భారతీయ జీడిపప్పు పరిశ్రమను నష్టాల నుంచి గట్టెక్కించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్ ప్రభుకు లేఖ రాశారు.
- రిజర్వు బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం బకాయిల వసూళ్లకు బ్యాంకులు తీసుకుంటున్న చర్యలవల్ల విద్యుత్తు రంగం మరింత ఒత్తిడికి లోనవుతోందని కేంద్ర విద్యుత్తుశాఖ మంత్రికి లేఖ రాశారు.
- పప్పుధాన్యాల దిగుమతులవల్ల దేశ రైతాంగం నష్టపోకుండా చూడాలని వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్ ప్రభుకు రాసిన మరో లేఖలో చంద్రబాబు కోరారు. మొజాంబిక్ నుంచి 1.49 లక్షల కందులు ఇప్పటికే దిగుమతి చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రైతుల వద్ద ఇంకా 6 లక్షల టన్నుల కందుల నిల్వలు ఉండగా.. నాఫెడ్ వద్ద 40లక్షల టన్నులు ఉన్నాయని గుర్తు చేశారు.
- విశాఖపట్నం విమానాశ్రయంలో పౌర విమానాల రాకపోకల సమయాలపై ఎలాంటి ఆంక్షలు విధించొద్దని రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు బుధవారం లేఖ రాశారు. ప్రస్తుత షెడ్యూళ్ల ప్రకారమే పౌర విమానాల రాకపోకలను అనుమతించాలని కోరారు.

ఒక్కటి చాలదు.. రెండు కావాలి!

(మొదటి పేజీ తరువాయి)

పైగా ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 7.5 కోట్లకు తగ్గింది. 2065 నాటికి ఇంకా క్షీణించి 4.5 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

- ఉద్యోగాలు ఉన్నప్పటికీ చేసేవారు దొరకటం లేదు. అందువల్ల వివిధ సంస్థలు పార్ట్-టైమ్ ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. ఎక్కడో ఒక దగ్గర ఉద్యోగం చేస్తున్న వారు... రెండో పని కోసం వస్తే వెంటనే ఒప్పేసుకుంటున్నాయి.
- ఇలా రెండో ఉద్యోగం కోసం వచ్చే వారిలో ఎక్కువమంది వయసు 50 ఏళ్లకు దగ్గరగా ఉంటోంది.

ప్రభుత్వం ఓకే

నిజానికి జపాన్‌లో రెండో ఉద్యోగం చేయటం నిషిద్ధం. ప్రభుత్వ నిబంధనలను అందుకు ఒప్పుకోవు. అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకొని రెండో ఉద్యోగం చేయరాదని, అటువంటి వారిని పనిలోకి తీసుకోరాదంటూ ఉన్న నిబంధనలను కొంతకాలం క్రితం ప్రభుత్వం సడలించింది. దీనివల్ల రికార్డు స్థాయిలో 75 లక్షలమందికి రెండో ఉద్యోగం లభించింది. అయితే దీనిపై అక్కడ విమర్శలు కూడా ఉన్నాయి. ఒకపక్క ఉద్యోగులు తక్కువ పనిచేయాలనే ఉద్దేశంతో వారికి సెలవులు అధికంగా ఇవ్వటం, ఇతర ప్రోత్సాహకాలు కల్పిస్తూ, మరోపక్క రెండో ఉద్యోగం చేయటానికి ఎలా అంగీకరిస్తారని ప్రభుత్వాన్ని కొందరు నిలదీస్తున్నారు.

> **జపాన్ ఆర్థిక వ్యవస్థకు కిక్కు**
>
> రెండో ఉద్యోగం చేసే వారి సంఖ్య పెరిగిన ఫలితంగా జపాన్‌లో ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెరిగింది. ఇది ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తోంది. జపాన్ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)కి ఏటా దాదాపు 8 ట్రిలియన్ ఎన్ (జపాన్ కరెన్సీ)లను రెండో ఉద్యోగం చేసే వారు సమకూర్చుతున్నారు.

పిల్లలు ఏడ్చినా ఫర్వాలేదు..

జనాభా పెరుగుదల భారత్, చైనా దేశాల్లో ప్రధాన సమస్య. జపాన్‌లో మాత్రం జనాభా తగ్గిపోవటం పెద్ద సమస్యగా మారింది. ఆ దేశంలో వృద్ధుల సంఖ్య పెరిగి, యువతీ యువకుల సంఖ్య తగ్గిపోతుండడమే దీనికి కారణం. ఆ దేశంలో గత ఏడాదిలో 9.46 లక్షల జననాలు నమోదయ్యాయి. 1899 తర్వాత ఇదే కనిష్ఠ జననాల సంఖ్య. అక్కడ పిల్లలను కనే వయసున్న యువతుల సంఖ్య ఎంతో తగ్గిపోయింది. వారిలోనూ పిల్లలను కనటానికి సిద్ధపడే వారి సంఖ్య ఇంకా తక్కువ. అందుకే అక్కడ జనాభా వేగంగా క్షీణిస్తోంది. దీనికి పరిష్కారం కనుగొనటానికి జపాన్ ప్రభుత్వం ఎంతగానో ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడి కొందరు రాజకీయ నాయకులు వినూత్నంగా 'వుయ్ లవ్ బేబీస్ ప్రాజెక్టు' చేపట్టారు. ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో చిన్న పిల్లలు ఏడిస్తే, ఆ చుట్టుపక్కల ఉన్నవారు ఎంతో అసౌకర్యంగా భావిస్తారు. ఈ పరిస్థితి చిన్న పిల్లల తల్లిదండ్రులకు కూడా ఇబ్బందికరమే. అందుకే చాలామంది బహిరంగ ప్రదేశాలకు చిన్న పిల్లలను తీసుకువెళ్లటానికి వెనకాడుతుంటారు. జపాన్ ప్రజల్లో పిల్లలను కనాలనే ఆసక్తి తగ్గిపోవటానికి తావిస్తున్న ఎన్నో కారణాలతో ఇది కూడా ఒకటి. ఇప్పుడు ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. 'వుయ్ లవ్ బేబీస్ ప్రాజెక్టు' ప్రకారం చిన్న పిల్లలు ఎక్కడైనా ఎప్పుడైనా ఏడ్వటానికి పరిమితులు ఉండకూడదనేది ఉద్యంగా మొదలైంది. ఇందులో ఎంతోమంది స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. వ్యక్తులతో పాటు వ్యాపార సంస్థలు, హోటళ్లు, ఇతర ప్రదేశాల్లో.. 'ఇక్కడ చిన్న పిల్లలు ఏడిస్తే ఏ ఇబ్బంది లేదు' అనే అర్థం వచ్చేలా 'ఇట్స్ ఒకే టు క్రై' అని స్టిక్కర్లు అంటిస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు ఎంతో పెద్దదిగా విస్తరించింది.

– ఈనాడు ప్రత్యేక విభాగం

జమ్ముకశ్మీర్‌లో గవర్నర్ పాలన అమల్లోకి

(మొదటి పేజీ తరువాయి)

రావత్ చెప్పారు. సైనిక చర్యలపై గవర్నర్ పాలన ప్రభావం ఉండకపోవచ్చన్నారు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిల్లీలో వేరుగా మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమయి శాంతియుత పరిస్థితులు నెలకొనాలని కేంద్రం కోరుకుంటోందని చెప్పారు. మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు మంగళవారం భాజపా ఆకస్మికంగా ప్రకటించడంతో మెహబూబా ముఫ్తీ ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు ఏ పార్టీ కూడా ముందుకు రాకపోవడంతో గవర్నర్ పాలనకు ఎన్.ఎన్.వోహ్రా సిఫార్సు చేస్తూ రాష్ట్రపతిభవన్‌కు నివేదిక పంపారు. ఆ సమయంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సురినామ్‌కు వెళ్తూ విమానప్రయాణంలో ఉన్నారు. నివేదిక వివరాలను వెంటనే రాష్ట్రపతి భవన్ సురినామ్‌కు పంపించింది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున మూడుకు విమానం అక్కడ దిగాల్సి ఉండడంతో అక్కడికే నివేదిక పంపారు. నివేదిక పరిశీలించిన రాష్ట్రపతి తన ఆమోద ముద్ర వేశారు. బుధవారం ఉదయం ఆరుకు హోం మంత్రిత్వశాఖకు దాన్ని పంపించారు. గవర్నర్ పాలన అమలు ప్రక్రియను సిద్ధం చేసిన హోం మంత్రిత్వశాఖ.. దాన్ని శ్రీనగర్‌కు పంపించింది. రాష్ట్రపతి ఆమోద ముద్ర వచ్చిన వెంటనే గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రా.. రాష్ట్రంలో గవర్నర్ పాలనను అమల్లోకి తీసుకొచ్చారు. గడచిన నాలుగు దశాబ్దాల్లో రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించడం ఇది ఎనిమిదోసారి. 2008 నుంచి వోహ్రా హయాంలో గవర్నర్ పాలన విధించడం ఇది నాలుగోసారి.

పీడీపీ-భాజపా కూటమి విచ్ఛిన్నం కావడంపై కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ప్రజలు టపాసులు కాల్చి సంతోషం వ్యక్తం చేయగా కొంత మంది మాత్రం గవర్నర్ పాలన కన్నా ప్రజాప్రభుత్వమే మేలని అభిప్రాయపడ్డారు. గవర్నర్ పాలన అంటే నేరుగా దిల్లీ పాలనే అని వారు పేర్కొన్నారు.

వోహ్రా స్థానంలో త్వరలో కొత్త గవర్నర్!

ఎన్.ఎన్.వోహ్రా పదవీ కాలం ఈ నెల చివరి వారంలో ముగియనుంది. ఆయన స్థానంలో మాజీ లెఫ్టినెంట్ జనరల్ దీపేంద్ర సింగ్ హూడాకు బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. కశ్మీర్ అంశాల్లో ఆయనకు అనుభవం ఉంది. అయితే వోహ్రాను అమర్‌నాథ్ యాత్ర ముగిసేవరకు కొనసాగించవచ్చు. పదవీ విరమణ పొందిన సైన్యాధికారులు మేజర్ జనరల్ జి.డి.బక్షి, లెఫ్టినెంట్ జనరల్ అటా హస్నైన్, జనరల్ బిక్రమ్‌జిత్ సింగ్, జమ్ముకశ్మీర్‌లో వివిధ వర్గాలతో చర్చలకు కేంద్రం తరఫున ప్రత్యేక ప్రతినిధిగా నియమితులయిన దినేశ్వర్ శర్మ పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చాయి. అయితే హూడా పేరునే కేంద్రం ఖరారు చేసినట్లు తెలిసింది.

రంజాన్ మాసంలోనూ ఉగ్రవాద కార్యకలాపాలు: జనరల్ రావత్

రంజాన్ పవిత్ర మాసంలో సమస్యలు లేకుండా ప్రజలు ప్రార్థనలు నిర్వహించుకోవడానికి వీలుగా సైనిక ఆపరేషన్లను నిలిపివేశామని సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. అయినా ఉగ్రవాదులు తమ కార్యకలాపాలు కొనసాగించారని, అందుకే సైనిక చర్యల నిలిపివేతను ఎత్తివేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గవర్నర్ పాలన ప్రభావం సైనిక చర్యలపై ఉంటుందనుకోవడం లేదని, సైనిక చర్యల్లో రాజకీయ జోక్యం ఏమీ లేదని చెప్పారు. సైన్యం ఎలా పని చేయాలో చెబుతూ ఎప్పుడూ ఎటువంటి నియంత్రణ లేదన్నారు.

'మిస్ ఇండియా'గా చెన్నై యువతి అనుక్రీతి

(మొదటి పేజీ తరువాయి)

చౌధరి (హరియాణా), మూడో స్థానంలో శ్రేయా రావు (ఆంధ్రప్రదేశ్) నిలిచారు. క్రికెటర్లు కేఎల్ రాహుల్, ఇర్ఫాన్ పఠాన్, బాలీవుడ్ తారలు బాబీ దేవోల్, మలైకా అరోరా, కునాల్ కపూర్ తదితరులు పోటీకి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మానుషీతోపాటు బాలీవుడ్ తారలు కరీనా కపూర్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, మాధురి దీక్షిత్ నృత్య ప్రదర్శనలతో కనులవిందు చేశారు. దర్శకనిర్మాత కరణ్ జోహార్, నటుడు ఆయుష్మాన్ ఖురానా వేడుకకు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. మొత్తం 30 రాష్ట్రాల (దిల్లీ సహా) భామలు ఈ కిరీటం కోసం పోటీపడ్డారు. విజేతగా నిలిచిన అనుక్రీతి.. 'మిస్ వరల్డ్-2018' పోటీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు.

ప్రభుత్వాసుపత్రులు భేష్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రసాదించారు. ప్రస్తుతం ఈ అమ్మాయి పాఠశాలకు వెళ్తోందని, ఆటల్లో చక్కటి భాగస్వామ్యాన్ని కనబరుస్తోందని వైద్యులు తెలిపారు.

- కర్నూలు జీజీహెచ్‌లోని కార్డియాక్ విభాగం అత్యాధునిక పరికరాలతో మెరుగైన సర్జరీలను చేయడంలో ముందుందని అక్కడి విభాగాధిపతి డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గతేడాది 154 శస్త్ర చికిత్సలు చేసినట్లు వెల్లడించారు.
- రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రి ట్రామా కేసుల్లో ప్రాణం పోసి ముందంజలో కొనసాగుతోంది. ఇదే ఆసుపత్రిలో పాముకాటుతో వచ్చే కేసులు ఏటా 450 వరకూ ఉంటాయి. సమయానుకూలంగా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల 99శాతం మందిని కాపాడగలిగామని వారు చెప్పారు.
- విజయనగరం జిల్లాల్లోని పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో ఆదివాసీల కోసం అత్యాధునిక సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు తెలిపారు. ఇక్కడ ఆధునాతన ఐసీయూ ఉందని చెప్పారు.

ఉత్తమ వైద్య స్టాళ్లకు బహుమతులు

ఆరోగ్య సదస్సులో ఉత్తమ వైద్య సేవలపై చర్చ జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లకు ఆమె బహుమతులు అందజేశారు. అంటు వ్యాధుల విభాగంలో గుంటూరు, విశాఖ, అనంతపురం తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.

నేడు ఏపీ ఆరోగ్య ఉత్సవ్-2018

విశాఖపట్నం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ వైద్య విధానాలు, రాష్ట్రంలో అమలవుతున్న విధానాలపై విస్తృతంగా చర్చించి మరింత మెరుగైన స్థాయిలో వైద్య సేవలందించేందుకు గురువారం విశాఖపట్నంలో 'ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య ఉత్సవ్-2018'ను నిర్వహిస్తున్నామని పూనం మాలకొండయ్య తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని, ఈ సందర్భంగా ఆయన 5 పథకాలను ప్రారంభిస్తారని తెలిపారు. తాము తీసుకుంటున్న చర్యల ఫలితంగా 2015లో ఆరోగ్య ఖర్చుల కింద ప్రతి వ్యక్తి రూ.5వేల వరకూ ఖర్చు చేస్తే ఆ ఖర్చులు 2017 ఆగస్టు నాటికి రూ.1600కు తగ్గాయని వివరించారు.

విశ్వాస్ మాండలిక్, యోగా ఇన్‌స్టిట్యూట్‌లకు అవార్డులు

దిల్లీ: యోగా అభివృద్ధికి చేసిన విశేష కృషికి గాను. . వ్యక్తిగతంగా విశ్వాస్ మాండలిక్ (నాసిక్), సంస్థాగతంగా యోగా ఇన్‌స్టిట్యూట్ (ముంబయి)లకు ప్రధాన మంత్రి అవార్డులు వరించాయి. దేశవ్యాప్తంగా బహిరంగ ప్రకటన ద్వారా ప్రతిపాదనలకు ఆహ్వానించగా మొత్తం వివిధ కేటగిరీల కింద 186 నామినేషన్లు అందాయి. వాటిని పరిశీలించిన ప్రాథమిక కమిటీ, మదింపు కమిటీ (జ్యూరీ)లు చివరకు ఈ రెండు అవార్డులను ఎంపిక చేసినట్లు ఆయుష్ శాఖ తెలిపింది. అవార్డుకు ఎంపికైన యోగా ప్రముఖుడు విశ్వాస్ మాండలిక్ 1978లో యోగా విద్యాధామ్ పేరిట తొలి శాఖను ఏర్పాటు చేయగా.. నేడు దేశవ్యాప్తంగా 160 కేంద్రాలను నిర్వహిస్తున్నారు. 1983లో యోగ విద్యా గురుకుల్ పేరిట ఓ సంస్థను కూడా స్థాపించారు. వివిధ శిక్షణ కోర్సులకు సంబంధించి 42 పుస్తకాలు రాశారు. 300 సీడీలు కూడా రూపొందించారు. సంస్థాగతంగా ప్రధాని అవార్డుకు ఎంపికైన యోగా ఇన్‌స్టిట్యూట్‌కు వందేళ్ల చరిత్ర ఉంది. 1918లో యోగేంద్రజీ దీన్ని ప్రారంభించారు. 50 వేలకు పైగా యోగా టీచర్లను తయారుచేసిన ఈ సంస్థ వివిధ అంశాలపై దాదాపు 500 సంచికలను కూడా ప్రచురించింది. ప్రధాని అవార్డు విజేతలకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలతో పాటు రూ. 25 లక్షల వంతున నగదు ప్రోత్సాహకాలను అందజేస్తారు.

బుధవారం సూరత్‌లోని స్వామి నారాయణ్ గురుకుల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

నేడు ప్రపంచ యోగం

(మొదటి పేజీ తరువాయి)

స్థానికులతో కలిసి యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో దాదాపు 55 వేల మంది యోగా సాధకులు ఆసనాలు వేయనున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సురినామ్‌లో ఆ దేశాధ్యక్షుడు దిసీ బౌతర్సేతో కలిపి యోగా దినోత్సవంలో పాల్గొంటున్నారు. ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముంబయిలోను, ఐరోపాలో పర్యటిస్తున్న విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ బ్రసెల్స్‌లోనూ, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లఖ్‌నవూలోను యోగా సాధకులతో కలిసి పాల్గొంటున్నారు. సద్గురు జగ్గీ వాసుదేవ్ సియాచిన్‌లోని సైనిక స్థావరాన్ని సందర్శించి.. సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. కేంద్ర మంత్రులు దిల్లీతో పాటు, వివిధ ప్రాంతాల్లో పాల్గొంటున్నారు. కాగా ఆరోగ్యానికి యోగా 'పాస్‌పోర్ట్' వంటిదంటూ ఇప్పటికే ప్రధాని దేశ ప్రజల్లో ఉత్సాహం నింపారు. స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వాలు యోగా దినోత్సవాన్ని జరుపుతున్నాయి. దేశ రాజధానిలో రాజ్‌పథ్ వద్ద ప్రధాన కార్యక్రమం సహా 8 చోట్ల నిర్వహిస్తున్నారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఎర్రకోట వద్ద జరిగే కార్యక్రమంలో బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ వంటి కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది సహా 50 వేల మంది పాల్గొంటున్నారు. 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' రోహిణిలోనూ, పతంజలి యోగాసమితి ద్వారకలోనూ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఆయుష్ శాఖ ప్రత్యేక చరవాణి యాప్‌ను ప్రారంభించగా.. మహిళా, శిశు అభివృద్ధి శాఖ మహిళల్లో యోగా పట్ల చైతన్యం కల్పించేందుకు 'యోగా ఫర్ 9టూ5' అనే పోటీని నిర్వహిస్తోంది. యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రాత్రి దేహ్రాదూన్‌కు చేరుకున్నారు.

'యోగాను మతంతో ముడిపెట్టొద్దు!'

లఖ్‌నవూ: యోగాను రాజకీయ సాధనంగా వినియోగించరాదని.. దీన్ని ప్రత్యేకించి ఓ మతంతో ముడిపెట్టవద్దంటూ అగ్రస్థాయి ముస్లిం సంఘాలు బుధవారం పేర్కొన్నాయి. యోగాను వ్యాయామం, దేహదారుఢ్యం కోణంలోనే చూడాలని సూచించాయి. యోగా దినోత్సవాన్ని అన్ని మతాలు, వర్గాల వారూ ప్రోత్సహించాలని ఆల్ ఇండియా ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు ప్రతినిధి సజ్జద్ నోమానీ సూచించారు.

గ్రహం అనుగ్రహం

21–6–2018 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
అష్టమి: ఉ. 8-13 తదుపరి నవమి
ఉత్తర నక్షత్రం: ఉ. 5-57 తదుపరి హస్త
తె. 5-29 తదుపరి చిత్త
అమృత ఘడియలు: రా. 11-36 నుంచి 1-10 వరకు
వర్జ్యం: మ. 2-11 నుంచి 3-45 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-51 నుంచి 10-43 వరకు
తిరిగి మ. 3-04 నుంచి 3-56 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5-30; సూర్యాస్తమయం: సా.6-33

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	42.0	29.0
గుంటూరు	41.2	28.4
విజయవాడ	41.0	29.0
హన్మకొండ	41.0	28.5
కరీంనగర్	41.0	27.0
ఒంగోలు	40.9	29.3
శ్రీకాకుళం	40.0	30.0
నెల్లూరు	40.0	30.0
తాడేపల్లిగూడెం	40.0	28.5
తిరుపతి	40.0	28.0
కడప	40.0	28.0
సూర్యాపేట	39.5	28.0
విశాఖపట్నం	39.4	28.4
ఖమ్మం	39.0	30.0
నరసాపురం	38.4	29.5
మెదక్	38.2	24.8
హైదరాబాద్	37.8	25.5
కర్నూలు	37.6	26.2
అనంతపురం	36.6	27.0

కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-ALL సబ్జెక్ట్స్
కొత్త బ్యాచ్ ప్రారంభం: 22-6-2018 సా॥ 4 గం॥లకు
8106268482, 9885272474

DSC హిందీ
QUEST 4/18 Brodipet, Guntur

పూర్ణ హిందీ DSC
9949293730, 9550401012
కొత్త బ్యాచ్: 25-6-18

S.I / కానిస్టేబుల్స్
RPF, గ్రూప్ IV, VRO
Fee: 5000/- 25-06-18
శివాజీ 93463 64702

AP-DSC
COMPETITIVE COACHING CENTRE
Dilsukhnagar, HYDERABAD

విజేత హిందీ DSC
9346628728, 8498935555

YES&YES PUBLICATIONS
AP-DSC, SGT(All), SA (Maths), Social, Biology, Telugu, English, G.K.
90320 64822

DSC SGT, TPT, SA (ALL)
ప్రతిభ
93 92 91 75 84

APDSC-HINDI
RANKERS HINDI ACADEMY

DSC బయాలజీ (SA)
గణపతి
95058 66099
95427 15559

DSC SA TPT, PET, SGT
బాసర ఇన్‌స్టిట్యూట్
9030140123
8374022333

DSC SGT, TPT, English, School Asst (All)
బ్యాచ్ ప్రారంభం: 23-6-18
బ్రహ్మాస్
8019013199
9032686069

EKALAVYA IAS ACADEMY
RANK ASSISTANCE Oriented Program
Degree+IAS, Prelims-cum-Mains
Beside Nagarjuna Hospital, Kanuru, VJA, Ph:6300181832

షైన్ ఇండియా అకాడమీ
APPSC GROUP-II
25th June కొత్త బ్యాచ్ ప్రారంభం
9573193746

సాగుకు సాంకేతిక సహకారం

రైతు సేవా యాప్‌తో సమస్త సమాచారం

ఈనాడు, గుంటూరు: రాష్ట్రంలో సాగుకు సంబంధించిన సమస్త సమాచారం అందించేందుకు వ్యవసాయశాఖ 'రైతు సేవా' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతులు భూమి చదును నుంచి వరి కోత యంత్రాల వరకూ ఏది అవసరమైనా యాప్ ద్వారా అద్దెకు సమకూర్చుకోవచ్చు. ప్రయోగాత్మకంగా రబీ సీజన్‌లో ఈ యాప్‌ను ఉభయగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా జిల్లాలో పరీక్షించి చూశారు. వరికోత యంత్రాలు అవసరమైనవారు యాప్ ద్వారా అద్దెకు సమకూర్చుకుని కోతలు పూర్తి చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ నుంచి పూర్తి స్థాయిలో యాప్‌ను రైతులకు వ్యవసాయశాఖ అందుబాటులోకి తెచ్చింది. జిల్లాల్లో వ్యవసాయాధికారులకు అవగాహన కల్పించి రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా శిక్షణ ఇచ్చే బాధ్యతలను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. సాగు ఉపకరణాలు, విత్తనాలు, ఎరువులు, పంట ఉత్పత్తులు ఇలా రైతువద్ద వస్తువులను యాప్‌లో ప్రదర్శించే వెసులుబాటు ఉంది. రైతులకు సమీపంలో ఉన్న జల వనరులు, విత్తనాల లభ్యత, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, పచ్చి గడ్డి, వర్మీ కంపోస్టు, వివిధ మొక్కల నర్సరీలు, పంట రుణాలు, పండ్లు, కూరగాయలు, వివిధ మార్కెట్లలో ధరలు, వాతావరణం, వివిధ పంటలకు సంబంధించిన వీడియోలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకూ 11.75 లక్షల మంది రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

ఉక్కు పరిశ్రమకు ప్రాణాలైనా అర్పిస్తాం

- కడపలో ఎంపీ సీఎం రమేష్ ఆమరణదీక్ష ప్రారంభం

ఈనాడు – కడప

ఉక్కు పరిశ్రమ ఇవ్వకపోతే కేంద్ర మంత్రుల గుండెల్లో ఉద్యమ గునపాలు గుచ్చి గుణపాఠం చెబుతామని రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ హెచ్చరించారు. 'ప్రాణాలైనా అర్పిస్తాం.. ఉక్కు పరిశ్రమ సాధిస్తాం.. కేంద్రం కుటిలనీతిని ప్రశ్నిస్తూ ఆమరణదీక్షతో ఉద్యమిస్తాం.. మోదీ నయవంచనపై న్యాయమైన పోరాటమే చేస్తాం.. కడప ఉక్కు.. ఆంధ్రుల హక్కు అన్న నినాదమే మా ఉద్యమవాదంగా మలచుకుని ముందడుగేస్తాం.. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని దిల్లీ స్థాయిలో ప్రశ్నిస్తాం...'అని పేర్కొన్నారు. ఉక్కుపరిశ్రమపై కేంద్రం వాదనను నిరసిస్తూ కడపలో బుధవారం ఆయన ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. ఉదయం 8.30 గంటలకు తన స్వగ్రామమైన పోట్లదుర్తి నుంచి భారీ కాన్వాయ్‌తో బయలుదేరి ప్రదర్శనగా కడపకు చేరుకున్నారు. పలుకూడళ్లలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్, పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత 530 రోజులుగా ఉక్కు సాధనకు దీక్ష చేస్తున్న నిరశనకారుల వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. అక్కడి నుంచి జడ్పీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్దకు చేరుకుని సర్వమత ప్రార్థనలు చేశారు. మతాధిపతుల ఆశీస్సులు అందుకున్నారు. సీఎం రమేష్ మాట్లాడుతూ... హైదరాబాద్ దూరమైతే పారిశ్రామికంగా దెబ్బతింటుందని తెలిసే విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు గురించి ప్రస్తావించారన్నారు. భాజపా తన ఎన్నికల ప్రణాళికలో విభజనచట్టం హామీలు నెరవేర్చుతామని పేర్కొంటేనే తెదేపా పొత్తు

కడపలో ఉక్కు పరిశ్రమ సాధన ఆమరణదీక్షలో కూర్చున్న ఎంపీ సీఎం.రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి

పెట్టుకుందని.. తిరుపతిలో వెంకన్న సాక్షిగా మోదీ మాట ఇచ్చారని గుర్తు చేశారు. సెయిల్ నుంచి మెకాన్ వరకు అధ్యయన కమిటీల పేరుతో కాలయాపన చేసి.. ఇప్పుడు చేతులెత్తేయడం దారుణమని దుయ్యబట్టారు. ఆఖరుకు కార్యదళాన్ని వేసి గాలికొదిలేశారని, పార్లమెంటు సాక్షిగా మోసగిస్తున్నారని విమర్శించారు. తెదేపా ముఖ్య నేతలంతా దిల్లీ వెళ్లి వెంకయ్యనాయుడు సమక్షంలో చర్చించినా చివరకు సాధ్యం కాదని చెప్పడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి, నీరు, ప్రహరీ, రైల్వేలైను వరకు అన్ని మౌలికవసతులు కల్పించేందుకు సిద్ధమని స్పష్టం చేసినా నాన్చుడు ధోరణి అవలంబిస్తూ కేంద్రం ముందుకు రాలేదని వివరించారు. కొందరు రాజకీయం చేస్తూ ఏపీ ప్రభుత్వం వల్లే ఆలస్యమైందని చెబుతున్నారని.. 20 ప్రశ్నలకూ సమాధానం ఇచ్చిందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రారంభించిన రెండేళ్లలో కార్యకలాపాలు ప్రారంభం కాకుంటే ఆ గనులు రద్దు చేయడానికి నియమావళి ఉందన్న విషయం కేంద్రానికి తెలియదా?.. అని సీఎం రమేష్ ప్రశ్నించారు. ఆరడుగుల ఎత్తు ఉన్న కడప ఎంపీ ఆరురోజుల పాటు కూడా దీక్ష చేయలేకపోవడం బాధాకరమని చెప్పారు. కేసుల కోసం కేంద్రం వద్ద వైకాపా లాలూచీ పడుతోందని.. కడప ఉక్కుపై వైఎస్ జగన్ మిన్నకుండిపోవడం దారుణమని దుయ్యబట్టారు. సీఎం రమేష్‌తో పాటు ఆమరణదీక్షకు దిగిన ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ ఆస్తులు కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే కడప వాసి అయిన జగన్... మోదీని ప్రశ్నించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. తమ దీక్ష జగన్, అవినాష్ రెడ్డి మాదిరి మొక్కుబడిగా ఉండదని.. కడప వాణి దిల్లీకి వినిపించేలా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలను నయవంచన చేసిందని విమర్శించారు. పార్లమెంటు తలుపులు మూసి నాడు కాంగ్రెస్ రాష్ట్రాన్ని విభజిస్తే... ప్రస్తుతం భాజపా నయవంచన చేసిందన్నారు. మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సీబీఐ కోర్టుకెళ్లే జగన్.. కేవలం కేసుల నుంచి కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని.. సాక్షాత్తూ సొంత జిల్లాకు అన్యాయం జరుగుతున్నా కళ్లప్పగించి చూడటం శోచనీయమని దుయ్యబట్టారు. జిల్లా మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత జగన్ ఉక్కు పరిశ్రమపై నోరుమెదపకపోవడం చూస్తే కడపకు అన్యాయం చేస్తున్నట్లేనని విమర్శించారు. ఉక్కు సాధన సమితి అధ్యక్షులు ప్రవీణ్ మాట్లాడుతూ ఉద్యమాన్ని ఎంత అణచివేస్తే పోరాటం అంత ఉద్ధృతమవుతుందని హెచ్చరించారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీతో పాటు పలు సంఘాలు సీఎం రమేష్ దీక్షకు మద్దతు తెలిపాయి. విప్ మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, తితిదే ఛైర్మన్ పుట్టాసుధాకర్ యాదవ్, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలిదానాలు కోరుకుంటున్నారా?

- మంత్రులు అమరనాథ్‌రెడ్డి, సుజయకృష్ణ రంగారావు

ఈనాడు డిజిటల్, అమరావతి: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రులు అమరనాథ్ రెడ్డి, సుజయకృష్ణ రంగారావు విమర్శించారు. విశాఖ ఉక్కు ఉద్యమం తరహాలో బలిదానాలు కోరుకుంటున్నారా? అని నిలదీశారు. పరిశ్రమ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించిన మెకాన్ సంస్థ అనుకూలంగా నివేదిక ఇచ్చినా మొండిగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. ఉక్కు పరిశ్రమను ఏర్పాటుకు ప్రైవేటు సంస్థలు ముందుకొస్తుంటే... కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెప్పడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సమాచారం ఇచ్చిందని, ఈ విషయంలో రాష్ట్ర భాజపా నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి అమరనాథ్‌రెడ్డి మాట్లాడారు. "పరిశ్రమ ఏర్పాటుకు ముడిసరుకు అందుబాటులో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా పరిశ్రమ ఏర్పాటు సాధ్యంకాదని చెప్పడం ఎంత వరకు సమంజసం?" అని అన్నారు. సుజయకృష్ణ రంగారావు మాట్లాడుతూ.. "మెకాన్ సంస్థ క్షేత్రస్థాయిలో పరిశీలించి 130 మిలియన్ టన్నుల ముడి సరుకు అందుబాటులో ఉన్నట్లు అంచనా వేసింది. పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలంగా నివేదిక ఇచ్చింది. కేంద్రం అడిగిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం అందించింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా... పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని 2014లో సెయిల్ ఇచ్చిన నివేదికను కేంద్రం కోర్టులో దాఖలు చేసిందన్నారు.

తెదేపా అసత్యాలు ప్రచారం చేస్తోంది: జీవీఎల్

ఈనాడు, దిల్లీ: తెదేపా అబద్ధాలు ప్రచారం చేస్తోందని భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు విమర్శించారు. బుధవారమిక్కడ ఆయన మాట్లాడుతూ.. కడప ఉక్కుపై తెదేపా తప్పుడు ప్రచారాన్ని తిప్పిగొట్టడానికి తన దగ్గర ఆధారాలున్నాయని తెలిపారు. ఉక్కు లభ్యత వివరాలు ఇవ్వాలని మెకాన్ సంస్థ టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కోరి 8 నెలలైనా..రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. కనీస పరిజ్ఞానం లేకుండా దీక్షలు చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారని ఆయన విమర్శించారు.

బస్సున్నా.. 'సామర్థ్యం' లేదు కన్నా!

- ఫిట్‌నెస్ లేకుండానే తిరుగుతున్న 4,800 బడి బస్సులు
- విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టని పాఠశాలల యాజమాన్యాలు

ఈనాడు, అమరావతి: విద్యా సంవత్సరం ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా... రాష్ట్రంలో ఇప్పటికీ వేల సంఖ్యలో బస్సులు సామర్థ్యం(ఫిట్‌నెస్) లేకుండానే రోడ్లపైన తిరుగుతున్నాయి. సామర్థ్య ధ్రువపత్రాలు (ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు) లేకుండా నడిచే బస్సులను జప్తు చేస్తామని రవాణాశాఖ హెచ్చరిస్తున్నా...యాజమాన్యాలు వాటిని బేఖాతరు చేస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా 23,754 బడి బస్సులు ఉండగా...మంగళవారం వరకూ 18,974 బస్సులే సామర్థ్య ధ్రువపత్రాలు పొందాయి. మిగతా 4,780బస్సులు (20.27 శాతం) ఈ పత్రాలు లేకుండానే నడుస్తున్నాయి. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి నెల రోజుల

ముందు నుంచే బడి బస్సుల సామర్థ్య పరీక్షలను రవాణాశాఖ నిర్వహిస్తోంది. తనిఖీల సందర్భంగా ఇంజిన్ సామర్థ్యం, వాహన స్థితి, బ్రేకులు, టైర్లు ఎలా ఉన్నాయి? ప్రమాద సమయాల్లో బయటపడేందుకు అత్యవసర ద్వారం ఉందా? చిన్నారులు బస్సులోకి ఎక్కేందుకు తగిన ఎత్తులో మెట్లు ఉన్నాయా? వాహన చోదకుడికి తగిన అనుభవం ఉందా? అతని ఆరోగ్యస్థితి సక్రమంగా ఉందా? తదితర అంశాలు పరిశీలిస్తారు. అవన్నీ సక్రమంగా ఉంటేనే సామర్థ్య ధ్రువపత్రం జారీ చేస్తారు. అప్పుడు మాత్రమే ఆ బస్సుల్లో విద్యార్థులను ఎక్కించుకోవాలి. అయితే చాలా బస్సులు ఇప్పటికీ ఈ తనిఖీలు చేయించుకోలేదు. ఫిట్‌నెస్ లేకుండానే అవి రోడ్లపైన తిరుగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆ నాలుగు జిల్లాల్లోనే 56.21 శాతం బస్సులు

సామర్థ్య ధ్రువపత్రాలు లేని బడి బస్సుల్లో 56.21 శాతం తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, చిత్తూరు జిల్లాల పరిధిలోనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,780 బస్సులకు సామర్థ్య ధ్రువపత్రాలు లేకపోగా....ఈ నాలుగు జిల్లాల పరిధిలోనే 2,687 బస్సులకు అలాంటి పత్రాలు లేవు. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 914, గుంటూరులో 698, పశ్చిమగోదావరిలో 556, చిత్తూరులో 519 బస్సులు సామర్థ్య ధ్రువపత్రాలు లేకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి. రుసుములు వసూలు చేసే విషయంలో నిక్కచ్చగా వ్యవహరించే యాజమాన్యాలు సామర్థ్యం లేని బస్సులను అనుభవం లేని డ్రైవర్లతో రోడ్డెక్కిస్తూ విద్యార్థుల భద్రతతో చెలగాటమాడుతున్నాయి. మరోపక్క సామర్థ్య పత్రాలు లేకుండా రోడ్లపై తిరిగే బస్సులను గుర్తిస్తే జప్తుచేసి కేసు నమోదు చేస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

తనిఖీల్లో వెలుగుచూసిన లోపాలు

సామర్థ్య పరీక్షలు చేయించుకున్న వాహనాల్లోనూ కొన్నింటిలో అనేక లోపాలు వెలుగుచేశాయి. వీటిల్లో ప్రధానమైనవి...

★ పిల్లలు బస్సులోకి ఎక్కడానికి వీలుగా మెట్లు లేవు.
★ హ్యాండ్ రెయిలింగ్ లేదు.
★ ప్రథమ చికిత్స పెట్టెలో మందులు, ఇతర వస్తువులు లేవు.
★ అగ్నిమాపక పరికరాలు ఊసే లేదు.
★ బస్సుకు ముందు వెనుక భాగంలో అద్దాల్లేవు.
★ డోర్‌లోక్ సరిగ్గా పనిచేయడం లేదు.
★ బస్సుల కిటికీలకు మూడు వరుసలకుగాను రెండు వరుసల్లోనే ఇనుప కమ్ములున్నాయి.



కియాలో అనంత యువతకే ప్రాధాన్యం

- సంస్థ ఎండీ షిమ్ స్పష్టీకరణ

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: కియా పరిశ్రమలోని ఉద్యోగాల్లో అనంతపురం జిల్లా యువతకే తొలి ప్రాధాన్యం ఇస్తామని కియా మోటార్స్ ఎండీ హ్యూన్‌కుక్‌షిమ్ స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా పెనుకొండ మండలం ఎర్రమంచి పరిధిలో నిర్మిస్తున్న కియా పరిశ్రమలో ఉద్యోగాలకు యువత ఎంపిక పరంగా బుధవారం తొలి అడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), కియా మోటార్స్ ఇండియా ఆధ్వర్యంలో ఆటోమొబైల్ ప్రాథమిక సాంకేతిక కోర్సులో మొదటి బృందానికి శిక్షణ ప్రారంభించారు. ఎర్రమంచిలో నూతనంగా నిర్మించిన ఏపీఎస్ఎస్‌డీసీ శిక్షణ కేంద్రంలో కియా మోటార్స్ ఎండీ షిమ్, ఏపీఎస్ఎస్‌డీసీ సీఈవో సాంబశివరావు, కలెక్టర్ వీరపాండియన్ తదితరులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సీఈవో, కలెక్టర్ ప్రసంగిస్తూ.. కియా మోటార్స్ మొదటి దశలో పనిచేయటానికి 600 మంది ఉద్యోగులు అవసరం ఉందన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో 2వేల మంది అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. వీరికి సాంకేతిక కోర్సులో ఐదు రోజుల శిక్షణ ఇస్తామని వివరించారు. శిక్షణ తర్వాత పరీక్ష నిర్వహించి

ప్రసంగిస్తున్న కియా మోటార్స్ ఎండీ షిమ్

600 మంది ప్రతిభావంతులకు కియా ప్రధాన పరిశ్రమలో, మిగిలిన 1,400 మందికి అనుబంధ సంస్థల్లో అవకాశం కల్పిస్తామని చెప్పారు. జులైలో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మరో విడత శిక్షణ ప్రారంభిస్తామని వివరించారు. కొరియా ప్రతినిధి కిమ్, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ రామారావు, ఏపీఐఐసీ ప్రాంతీయ మేనేజర్ నాగేశ్వరరావు, పలువురు కొరియా ప్రతినిధులు పాల్గొన్నారు.

26 నుంచి పవన్ పోరాట యాత్ర

- కంటి సమస్య వల్లే ఇంత ఆలస్యం
- పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జూన్ 26 నుంచి తిరిగి తన పోరాట యాత్ర ప్రారంభించనున్నారు. విశాఖ జిల్లాలో మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోను దాదాపు మూడు నాలుగు రోజుల పాటు ఈ యాత్ర ఉంటుందని, ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశిస్తుందని జనసేన ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి బుధవారమిక్కడ ఓ ప్రకటనలో తెలిపారు. పవన్ భద్రతా సిబ్బందిలో ఎక్కువ మంది ముస్లింలు ఉండడంతో వారికి రంజాన్ సెలవుల కారణంగా పవన్ పోరాట యాత్ర వాయిదా పడ్డ సంగతి తెలిసిందే. ఇంతలో పవన్‌కల్యాణ్‌కు కంటి సమస్య వచ్చింది. ఆయనకు వైద్యం చేసిన ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యులు శస్త్రచికిత్స అవసరమని చెప్పడంతో పోరాట యాత్ర మరికొద్ది రోజులు ఆలస్యమయింది. ఈ నెల 24న పవన్ కల్యాణ్ కంటికి శస్త్రచికిత్స చేయాలని తొలుత నిర్ణయించినా ఇప్పుడు మరింత సమయం పడుతుందని వైద్యులు పేర్కొన్నారని మహేందర్‌రెడ్డి వివరించారు. దీంతో రెండో విడత పోరాట యాత్రను పవన్ ప్రారంభించబోతున్నారని చెప్పారు. విశాఖ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పర్యటన తర్వాత ఉత్తరాంధ్ర మేధావులతోను పవన్ సమావేశం అవుతారని వెల్లడించారు.

ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ అమలు చేయాలి

సీఎంకు నేషనల్ మజ్దూర్ యూనియన్ విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ కార్మికులకు తక్షణమే వేతన సవరణ చేపట్టాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తిచేశారు. వేతన సవరణ అమలు చేయాల్సిన గడువు ముగిసి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిర్ణయం తీసుకోకపోవడం మూలంగా కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని.. తక్షణమే వేతన సవరణకు ఆదేశాలివ్వాలని కోరారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకులు చల్లా చంద్రయ్య, పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, డీఎస్‌పీ రావు తదితరులు బుధవారం సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీంతోపాటు మరికొన్నిఅంశాలను అందులో ప్రస్తావించారు. వివరాలు.. ★ సంస్థ అప్పులతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున 5 సంవత్సరాల మోటారు వాహనాల పన్నును మినహాయించాలి. ★ అక్రమ రవాణా నియంత్రణకు ప్రభుత్వ పరంగా నిర్దిష్ట ప్రణాళికకు ఆదేశాలు ఇప్పించాలి. ★ విశ్రాంత ఆర్టీసీ కార్మికులకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలి. ★ ఆర్టీసీ కార్మికుల గృహనిర్మాణానికి తగిన ఆదేశాలు ఇవ్వాలి.

ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్‌ఎంయూ నేతలు

శ్రీవారి ఆభరణాలు భద్రమేనని నిరూపిస్తారా?: రమణ దీక్షితులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తితిదేలో శ్రీవారి ఆభరణాలు భద్రంగా ఉన్నాయని నిరూపిస్తారా? అని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు సవాల్ విసిరారు. శ్రీవారి కైంకర్యాలు, నైవేద్యం, ఆలయ నిర్వహణలో లోపాలను ఎత్తి చూపినందుకే రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసులు పంపుతారా అని ప్రశ్నించారు. స్వామివారి పరువును రూ.100 కోట్లుగా లెక్కగట్టారా? అని వ్యాఖ్యానించారు. జులైలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని, త్వరలోనే తేదీ ప్రకటిస్తానని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది డిసెంబరు 8 నుంచి 22వరకు ఆలయంలో చేపట్టిన మరమ్మతుల కారణంగా లోపలి పోటు ధ్వంసమైందని అధికారులకు చెబితే ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని జేఈవో శ్రీనివాసరాజు తన నోరుమూయించారని తెలిపారు. సీఎం, మేడమ్ అనుమతితో ఇలా జరుగుతుందని చెప్పారని పేర్కొన్నారు. మేడమ్ ఎవరో తనకు తెలియదని పేర్కొన్నారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన దాటవేత ధోరణి అవలంభించారు.

అన్యమతస్థులతో కలిసి ప్రభుత్వంపై విమర్శలా?

- రమణ దీక్షితులపై ఆనంద సూర్య ఆగ్రహం

కృష్ణలంక, న్యూస్‌టుడే: తితిదే మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు వైఖరి కళ్లు మూసుకుని పాలు తాగుతున్న పిల్లి చందంగా ఉందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య విమర్శించారు. అన్యమతస్థుడైన జగన్మోహన్‌రెడ్డితో భేటీ, తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఇంట్లో పూజలు చేయడం, బుధవారం అన్య మతస్థులైన యువకులను పక్కన కూర్చోబెట్టుకుని తితిదేలో ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించడం ఆయనకు తగదని వ్యాఖ్యానించారు. విజయవాడలో బుధవారం రమణ దీక్షితులు ఆరోపణలపై ఆయన స్పందించారు. హైందవ సంప్రదాయాన్ని, హిందూవాదులను తప్పుదోవ పట్టించే విధంగా ఆయన చేసిన అసంబద్ధ ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు. రమణ దీక్షితులును సమర్థిస్తున్న కొన్ని సంఘాలు, కొంత మంది బ్రాహ్మణ ప్రముఖులు వాస్తవాలను గమనించాలని ఈ సందర్భంగా సూచించారు. ఆయన ఒక మాజీ ప్రధాన అర్చకుడిగా కాకుండా వైకాపా, భాజపా ప్రేరేపిత రాజకీయ నాయకుడిలా వ్యవహరిస్తూ పొరుగు రాష్ట్రాల్లో ప్రెస్ మీట్లు పెట్టి తితిదే ఔన్నత్యాన్ని, హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా తితిదే బోర్డు ఎదుట హాజరై సమస్యను చెప్పుకొంటే పరిష్కారం లభిస్తుందని హితవు పలికారు.

ఈనాడు

బ్యాంకుల క్షాళనే లక్ష్యంగా...

అశేష జన విశ్వాసమే పటిష్ఠ పునాదిగా ప్రజాధనానికి ధర్మకర్తృత్వం వహిస్తూ జాతి ప్రగతికి శాయశక్తులా దోహదపడాల్సిన విశిష్ట బాధ్యత బ్యాంకింగ్ రంగానిది. అంతటి కీలక రంగాన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఏళ్ల తరబడి తప్పుడు పత్రాలతో వేలకోట్ల రూపాయల మేర అవకతవకలకు తెగబడినా, రిజర్వు బ్యాంకు ఎందువల్ల పసిగట్టలేకపోయింది? ఈ ఘోర వైఫల్యానికి ప్రధాన జవాబుదారీ ఎవరంటూ వీరప్ప మొయిలీ నేతృత్వంలోని పార్లమెంటరీ స్థాయీసంఘం గతవారం సూటిగా నిలదీసినప్పుడు, రిజర్వు బ్యాంకు సారథి ఉర్జిత్ పటేల్ స్వీయ పరిమితుల్ని ఏకరువు పెట్టారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్ని సమర్థంగా నియంత్రించడానికి ఇప్పుడున్న అధికారాలు ఎంతమాత్రం సరిపోవన్న ఉర్జిత్ వాదనకు, స్థాయీసంఘం సభ్యుల నుంచి ప్రతికూల స్పందన వ్యక్తమైంది. వాస్తవానికి ఈ అంశంపై అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రతిపాదననే రిజర్వు బ్యాంకు గవర్నరు తన వాదనగా కమిటీ ఎదుట వినిపించారు. భూరి నిరర్థక ఆస్తులు మెడకు గుదిబండై కూలబడుతున్న ప్రభుత్వరంగ బ్యాంకులకు పునర్ మూలధనీకరణ పేరిట చికిత్సను స్వాగతించిన ఐఎంఎఫ్- మరింత స్వేచ్ఛను, అదనపు అధికారాలను కట్టబెట్టి రిజర్వు బ్యాంకును బలోపేతం చేయాలని తనవంతుగా సూచించడం తెలిసిందే. తెరవెనక ఏం జరిగిందో ఏమో- ఉర్జిత్ వ్యాఖ్యల పట్ల ఇప్పుడు అధికారిక స్పందనలో గుణాత్మక మార్పు ప్రస్ఫుటమవుతోంది. ప్రభుత్వరంగ బ్యాంకులు మెరుగ్గా పనిచేసేందుకు అవసరమైతే రిజర్వు బ్యాంకుకు మరిన్ని అధికారాల ప్రదానానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తాజాగా సుముఖత వ్యక్తీకరించారు. పదమూడు ప్రభుత్వరంగ బ్యాంకుల అధిపతులతో మేధామథనం దరిమిలా కేంద్రంలో పరివర్తిత బాణీ సమర్థ నియంత్రణాధికార సంస్థగా ఆర్‌బీఐని ఏ మేరకు ఎలా పటిష్ఠీకరించగలదో చూడాలి!

సాధారణ పౌరులు, సగటు ఖాతాదారుల రుణ అవసరాలు తీర్చేందుకు అలవిమాలిన షరతులు విధించి, పూచీకత్తులు డిమాండు చేసే బ్యాంకులు- బడా కార్పొరేట్ సంస్థలకు వేలకోట్ల రూపాయల నిధుల్ని ఉదారంగా ఎలా ధారాదత్తం చేస్తున్నాయన్నది గడ్డుప్రశ్న. అకౌంటింగ్‌లో దాపరికం కూడదన్న రిజర్వు బ్యాంకు నిర్దేశాలను తుంగలో తొక్కిన సిబ్బంది విధిద్రోహాలే చీకటి లావాదేవీలకు మార్గం సుగమం చేస్తుండటం నడుస్తున్న చరిత్ర. పర్యవసానంగా పెద్దయెత్తున పారుబాకీలు పేరుకుపోవడం చూస్తున్నాం. గత డిసెంబరు నాటికి దేశవ్యాప్తంగా బ్యాంకులన్నింటి నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏల) మొత్తం ఎనిమిది లక్షల నలభై వేలకోట్ల రూపాయలకు పైబడింది. బాకీల చెల్లింపు రికార్డు అధ్వానంగా ఉన్నవారికి, ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ముద్రపడినవారికి సైతం రుణాలు ఇట్టే ఎలా మంజూరవుతున్నాయని ఆక్షేపించిన కేంద్ర నిఘా సంఘం (సీవీసీ), పర్యవేక్షణ లోపాలపరంగా రిజర్వు బ్యాంకునూ తప్పుపట్టింది. ఏడాదికో రెండేళ్లకో నిర్ణీత కాలావధిలో ఖాతాల తనిఖీ చేపట్టాల్సింది పోయి, రిస్కు ఉందని భావించినప్పుడే ఆరా తీసే పద్ధతి చోరాగ్రేసరులకు అయాచిత వరమైందన్నది కఠోర యథార్థం. రిజర్వు బ్యాంకు నామినేట్ చేసే వ్యక్తి సంచాలకుడి హోదాలో బ్యాంకుల పనిపోకడల్ని పర్యవేక్షించగల వీలుంది. ఆ దృష్ట్యా తనకు తెలియకుండానే రుణపందేరం జరిగిపోయిందని, ప్రతి బ్యాంకు శాఖనూ నఖశిఖ పర్యంతం పర్యవేక్షించడం ఆచరణ సాధ్యం కాదంటూ ఆర్‌బీఐ ప్రధాన బాధ్యతను దులపరించుకోజాలదు. వెరసి, ఆర్‌బీఐ కొత్తగా దొరకబుచ్చుకొనే అదనపు అధికారాల మాట ఎలాగున్నా- అంతర్గత కట్టుబాట్లు, వెలుపలి నియంత్రణలన్నింటినీ సాకల్యంగా ప్రక్షాళిస్తేనే తప్ప పరిస్థితి కుదుటపడదు!

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తరహా భారీ మోసాల వెనక కర్త, కర్మ, క్రియ ఎవరైనప్పటికీ జాతికి బదులిచ్చుకోవాల్సింది ప్రభుత్వమేనన్న ఆర్‌బీఐ మాజీ సారథి వై.వి.రెడ్డి వ్యాఖ్యలు అక్షర సత్యాలు. బహుశా ఆ స్పృహతోనే కావచ్చు- ప్రభుత్వరంగ బ్యాంకుల వెనక కేంద్రం ఉందని, ఖాతాదారుల సొమ్ము సురక్షితమని విత్తమంత్రి గోయల్ అభయమిస్తున్నారు. కేవలం హామీలు, భరోసాలతోనే ప్రజానీకంలో బ్యాంకింగ్ వ్యవస్థ పట్ల విశ్వసనీయత అమాంతం మెరుగుపడదు. నీరవ్ మోదీ, అతగాడి సంబంధీకులు పీఎన్‌బీలోని ఇంటిదొంగలతో జట్టుకట్టి ఆ బ్యాంకు పుట్టి ముంచినట్లు ఫిబ్రవరిలోనే బట్టబయలైంది. గుమాస్తాలు, విదేశ మారక ద్రవ్య నిర్వహణదారులు, ప్రాంతీయ కార్యాలయ అధికారులు, ఆడిటర్లు సహా మొత్తం 54 మంది పీఎన్‌బీ సిబ్బంది- దేశ చరిత్రలోనే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణంలో ఎలా భాగస్వాములైందీ 162 పుటల అంతర్గత నివేదిక కళ్లకు కడుతోంది. వేలాది ఆధారాలు పరిశీలించి కూర్చిన నివేదిక ఏప్రిల్ మొదటివారంలో సిద్ధమైన దరిమిలా ఎవరెవరిపై ఏమేమి చర్యలు చేపట్టారో నేటికీ అగమ్యం. గత అయిదేళ్లలో 23 వేలకు పైగా బ్యాంకు మోసాలు చోటుచేసుకున్నట్లు సమాచార హక్కు చట్టం ద్వారా రాబట్టిన వివరాలు ధ్రువీకరిస్తున్నాయి. ఏ ఒకరిద్దరు కేటుగాళ్లో కాదు- హర్షద్ మెహతాలకు కేతన్ పరేఖ్‌లకు విక్రం కొఠారీలకు లోపాయికారీగా సహకరించిన విధిద్రోహులందరి ముసుగులూ తొలగాలి. అసంబద్ధ నిర్ణయాలకు మొహరు వేసిన బోర్డు సభ్యుల్నీ వదిలిపెట్టకూడదు. కొందరు వ్యాపారవేత్తలు, బ్యాంకర్లు కుమ్మక్కై దేశ భవిష్యత్తును దోచుకుంటున్నారని వగచే బదులు కంతల పూడ్చివేతకు రిజర్వుబ్యాంకు ముందుకురకాలి. కేంద్రం ముందస్తు అనుమతి లేకుండా బ్యాంకు బోర్డులు ఏమీ చేయలేని దుస్థితిని రూపుమాపడం ద్వారా ప్రభుత్వమూ చిత్తశుద్ధి చాటుకోవాలి!

జగమంతా యోగ మయం

ముప్పవరపు వెంకయ్యనాయుడు
(భారత ఉపరాష్ట్రపతి)

యోగమంటే ఇంద్రియాలను వశం చేసుకోవడం, మానసిక శక్తుల్ని ఏకం చేయడం, ఏకాగ్రతను సాధించడం, ఆత్మశక్తిని మేల్కొలపడం, సాధన చేయడం, అదృష్టాన్ని అందిపుచ్చుకోవడం! తత్వశాస్త్రంలోని ఆరు దర్శనాల్లో యోగ దర్శనం ఒకటి. భగవద్గీతలో ప్రతి అధ్యాయాన్నీ యోగమనే అంటారు. అభ్యాసం, వైరాగ్యం ద్వారానే చిత్తవృత్తులను నిరోధించడం సాధ్యమవుతుందని పెద్దలు చెబుతారు. అభ్యాసం అంటే అవసరమైనది నేర్చుకోవడం, వైరాగ్యం అంటే అనవసరమైనదాన్ని విడిచిపెట్టడం. అది శారీరకంగా కావచ్చు, మానసికంగా కావచ్చు. ఇప్పుడు ఎందరో మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్న ఈ విషయాలను మన రుషులు ఏనాడో లోకానికి అందించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం రూపంలో అదే పరంపరను భారతీయులు మరోసారి ప్రపంచానికి అందిస్తున్నారు.

ఆరోగ్యప్రదాయిని

ప్రస్తుతం ఎన్నో సమస్యలు యువతను పట్టి పీడిస్తున్నాయి. బరువు పెరగడం నుంచి, ఆత్మ న్యూనత వరకు ప్రతిదీ సమస్యే. తమపై తమకు అదుపు లేకపోవడం, నమ్మకం కొరవడటం, మనోనిగ్రహం లేకపోవడం వల్లే ఈ సమస్యలు ముప్పిరిగొంటున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఒత్తిడి, గతి తప్పిన జీవన విధానం, మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా శారీరక, మానసిక సమస్యలతో యువత సతమతమవుతోంది. దీర్ఘకాలంలో ఇవన్నీ క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులకు కారణం అవుతాయి. మూడు పదుల వయసుకే అనేక వ్యాధులు యువతను పలకరించడం ఈ రోజుల్లో సర్వసాధారణంగా మారిపోయింది. ఇలాంటి సమస్యలన్నింటికీ మన ముందు తరాలవారు పరిష్కారాన్ని చూపించారు. అదే యోగశాస్త్రం. ఇందులో ఎన్నో విభాగాలు ఉన్నాయి. 64 పురాతన కళల్లోనూ ఇది ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. యోగశాస్త్రంలో ప్రవీణులైన ఎందరో మహనీయులు తమ రంగాల్లో అద్భుతాలు సాధించడం చూస్తున్నాం. అలాంటి శాస్త్రం కనుమరుగు అవుతుందా అనుకుంటున్న సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ... యోగమార్గం దిశగా ప్రపంచాన్ని ఉత్తేజితం చేశారు. ఐక్యరాజ్య సమితిలో ఆయన చేసిన ప్రసంగం- అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆరంభానికి నాంది పలికింది. ఇది శుభ పరిణామం. ఇదే సంకల్పంతో యావత్ ప్రపంచం ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఈ మార్గాన్ని అనుసరిస్తోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రకటన తరవాత ప్రపంచవ్యాప్తంగా ఈ విషయం తెలియనివారు సైతం దీన్ని సాధన చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. భారత యువత ఇదే మార్గంలో జాగృతం కావలసిన అవసరం ఉంది.

'యోగస్ చిత్తవృత్తి నిరోధః'- పతంజలి యోగ సూత్రాల్లో, యోగ స్వరూప లక్షణాలు చెప్పుకొందాం అంటూ ప్రారంభించగానే మొదటగా చెప్పే మాట ఇది. చిత్తవృత్తులను నిగ్రహించడమే యోగమని దీని అర్థం. నిజానికి యోగశాస్త్రం సర్వస్వం మనసును, శరీరాన్ని అదుపులోకి తెచ్చుకుని మనిషి ఎలా ఎదగాలో తెలియజేస్తుంది. అంతఃకరణ చతుష్టయం అనే మాట బహుశా చాలామందికి తెలియకపోవచ్చుగాని, అవి అందరిలోనూ ఉంటాయి. ఇంద్రియం, మనసు, బుద్ధి, అహంభావం అనే ఈ నాలుగూ- మనసు చేసే వేరు వేరు పనులు. చిత్తంలో ఏర్పడే సంకల్పాలనే వృత్తులు అంటారు. మనసు ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ మన ఇంద్రియాలు మనసును బయటకు లాగుతూ ఉంటాయి. మనసుపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ మనిషిని పక్కదోవ పట్టిస్తూ ఉంటాయి. ఇంద్రియాల ద్వారా మనసును నిగ్రహించడమే మనో నిగ్రహం. మనలో చాలామందికి ఈ తతంగమంతా తెలియకపోయినా, ప్రతివారూ దీనికి లోనవుతూనే ఉంటారు. ఫలితంగా ఎన్నో ఇబ్బందులను కొనితెచ్చుకుంటున్నారు. ఆహారం, పలుకు, పనులు, మనసు, శరీరం విషయంలో నిగ్రహం... ఇలా ప్రతి విషయంలో ఒక్క క్షణం ఆలోచన కలిగేలా శరీరాన్ని, మనసును అదుపు చేయడమే యోగా.



నేడు అంతర్జాతీయ యోగ దినోత్సవం

యోగా అంటే ముందు మనలోకి మనం ప్రవేశించడంతో ప్రారంభమై అనంతమైన ప్రకృతిలోకి ప్రవేశించగలిగే మార్గాన్ని కల్పిస్తుంది.

భారతీయ రుషి పరంపర అనేక యోగా మార్గాలను నిర్వచించింది. ఇందులో ఆసనాల రూపంలో ఆరోగ్య సాధనను ఎవరైనా చేయవచ్చు. బరువు తగ్గడం, కొవ్వు తగ్గించడం, కోపాన్ని నియంత్రించడం, జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుదల, ఏకాగ్రత, నిద్రలేమి నివారణ ... ఇలా ఎన్నో అనారోగ్య సమస్యల కోసం యోగ మార్గాన్ని దివ్య ఔషధంగా ఎంచుకోవచ్చు. ప్రాచీన కాలంలో ప్రాథమిక స్థాయిలోనే యోగాను అభ్యసించేవారు. పరాయి పాలనలో మగ్గి, స్వతంత్రాన్ని సాధించుకోగలిగాం. కానీ స్వాధీనతను, స్వాభిమానాన్ని విస్మరించి యోగమార్గాన్ని మరుగున పడేసుకున్నాం. ఇప్పుడిప్పుడే దేశ ప్రజలు యోగ ప్రక్రియను అభ్యసిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకునే బాటలో పయనించడం ఆహ్వానించదగ్గ పరిణామం. మన దేశంలోనే కాదు, విదేశాల్లోనూ దీనికి పెరిగిన ప్రాధాన్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. విదేశాలకు చెందిన ఎంతోమంది యోగా గురువులుగా వారివారి దేశాల్లో భారతీయ యోగాను సాధన చేయిస్తుండటం చూస్తే- ఓ భారతీయుడిగా గర్వంగా ఉంది. లాటిన్ అమెరికా పర్యటనలో భాగంగా, పెరూ దేశంలోని లీమా నగరాన్ని సందర్శించినప్పుడు అక్కడ యోగా నిర్వహణ కేంద్రాల బోర్డులు నన్ను ఆనందపరచాయి. ఎంతోమంది దేశాధినేతలు, వారి దేశాల్లో యోగాభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వడం సంతోషపరచింది. హరిద్వార్‌లో జరిగిన అంతర్జాతీయ యోగా సదస్సుకు సత్ చిదానంద ఆహ్వానం మేరకు వెళ్లాను. అక్కడ వివిధ దేశాలవారు యోగా చేసే తీరును వివరించారు. వారి వివరణ నన్ను అబ్బురపరచింది. మూలాల్లోకి వెళ్ళి, సాధన చేస్తున్న వారి సంకల్పం అద్భుతం. మన దేశ ఔన్నత్యానికి ఈ రోజు ప్రపంచమంతా హారతి పట్టడం చూసి, నా మనసు ఆనందంతో నిండిపోతోంది.

విదేశీయులంతా యోగా మార్గంలో ముందుకు సాగుతుంటే, ఈ నేల మీద పుట్టినవారు కొందరు, దానిపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం విచారకరం. మనది ప్రజాస్వామ్య దేశం. భిన్న సంస్కృతులకు నెలవు. అలాంటివాటిలో మంచిని చేకూర్చే ఏ విషయాన్నయినా స్వీకరించడం తప్పు కాదు. ఆరోగ్యాన్ని అందించే యోగాను ఓ వ్యాయామంగా భావించడంలో తప్పు లేదు. యోగాలో ఎక్కడా మత ప్రస్తావన లేదు. అలాంటప్పుడు దానికి రకరకాల రంగులు పులిమి, విమర్శించడంలో అర్థం లేదు. యోగా అనేది ఒక ఆరోగ్య శాస్త్రం. వైద్యుడి విషయంలో మతం చూడటం ఎంత పొరపాటో, దీని విషయంలోనూ అలాంటి ప్రయత్నం చేయడం అంతే పొరపాటు. యోగశాస్త్రం సర్వధర్మాలకూ సంబంధించింది. సర్వ మతాలకూ సమ్మతమైనది, యోగా అభ్యాసం సర్వకాలాలకూ వర్తించేది. యోగా సాధన సర్వులకూ ఉపయోగపడేది. అలాంటి యోగా- ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అత్యంత సులభమైన మార్గం. దీనికి ఎలాంటి వ్యయ ప్రయాసలు ఉండవు. సంకల్పం, సాధన, సద్వివేచన ఉంటే చాలు.

మహానుభావుల కృషి ఫలం

యోగాను సరదాగానే నేర్చుకోవచ్చు. ఇష్టపడి, కాస్తంత కష్టపడి సాధన చేస్తే దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇది ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం కావాలి. ఎన్‌సీసీ లాంటి వాటిలోనూ ఓ భాగంగా, పాఠ్యాంశంగా చేర్చాలి. పాఠశాల, కళాశాల స్థాయిలోనూ ఓ పీరియడ్‌గా చేర్చాల్సిన అవసరం ఉంది. ఎంతో ప్రాచీనమైన ఈ కళను శ్రీశ్రీ రవిశంకర్, బాబా రామ్‌దేవ్ లాంటివారు పునరుద్ధరించి, ప్రపంచానికి అందిస్తుండటం సంతోషకరం. ఆర్ట్ ఆఫ్ లివింగ్, పతంజలి పీఠం లాంటి ఆధ్యాత్మిక సంస్థలు ఈ విషయంలో చేస్తున్న కృషి అభినందనీయం. ఇదే మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి. దేశం కోసం కాదు.... దేహం కోసం... దేహం ఆరోగ్యంగా ఉండటం కోసం. నిత్యం యోగా సాధన ద్వారా క్యాన్సర్, గుండె వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. కాలుష్యం కారణంగా వస్తున్న వ్యాధుల ముప్పును ఎదుర్కోవచ్చు. ముందు యోగా సాధన చేయండి. ఆపై అధ్యయనం చేయండి. తరవాత దేశ సౌభాగ్యం కోసం సమాయత్తం కండి. వివేకానందుడు చెప్పినట్లు- ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి కావాలి. యోగా సాధన వల్ల శరీరం చురుగ్గా ఉండటమే కాదు, మనసూ అదుపులో ఉంటుంది. ఫలితంగా మనం చేసే ప్రతి పనీ ఫలితాలను ఇస్తుంది. యోగా ద్వారా ఆరోగ్యం లభిస్తుంది. ఆరోగ్యానికి మించిన భాగ్యం మరొకటి లేదు. అందుకే మన పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే- యోగా ద్వారా యోగ్యత సిద్ధిస్తుంది!

కొత్త చదువులతోనే కొలువులు

ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక రంగం బహుముఖాలుగా విస్తరిస్తోంది. పరిశోధన-అభివృద్ధికి మన్నన పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రూపురేఖల్లో సత్వర మార్పులు చోటుచేసుకొంటున్నాయి. ఆయా రంగాల్లో వస్తున్న మార్పుల కారణంగా ఉద్యోగావకాశాలూ వెల్లువెత్తుతున్నాయి. కానీ ఆధునిక కోర్సులను సమయానుకూలంగా అందిపుచ్చుకోవడంలో వెనకబాటు భారతీయ విద్యార్థుల పాలిట శాపమవుతోంది. కాలంచెల్లిన కోర్సులు చదవడం, అందులోనూ సరైన నైపుణ్యాలు కొరవడుతుండటం వారి ఉపాధి అవకాశాలను దారుణంగా దెబ్బతీస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యారంగంలో సరికొత్త కోర్సులను సత్వరం ప్రవేశపెట్టి- యువతలో అవగాహన కల్పించడం ద్వారా మాత్రమే నిరుద్యోగ సమస్యను ఎదుర్కోవడం సాధ్యం!

అవకాశాల వెల్లువ

నాణ్యత ప్రమాణాలు గల విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు అధికంగా ఉద్యోగాలు సంపాదిస్తున్నారని స్కిల్ ఇండియా-2018 నివేదిక స్పష్టీకరించింది. గత అయిదేళ్ల వ్యవధిలో దేశంలో ఉద్యోగావకాశాలు 33.95 శాతం నుంచి 45.60 శాతం వరకు పెరిగాయి. ప్రస్తుతం భారత్‌లో 47.3 కోట్ల మంది వివిధ రంగాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2022నాటికి సుమారు 60 కోట్ల మేర కొత్త తరహా ఉద్యోగాలు ప్రపంచ విపణిలోకి వస్తాయని అంచనా. ఆ మేరకు ఆయా రంగాలకు సంబంధించి కొత్త ఆధునిక విజ్ఞాన కోర్సులు చదివినవారు మాత్రమే నియామకాలు పొందగలరని ప్రపంచ ఆర్థిక సంస్థ తాజా నివేదిక చాటించింది. వివిధ సాంకేతిక సంస్థల్లో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిలో 65 శాతం తాత్కాలిక శిక్షణ ద్వారా ఉద్యోగ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. దీర్ఘకాలం ఈ ఏర్పాటు సాధ్యం కాదు కనుక ఉద్యోగాల్లో కొనసాగాలనుకునేవారు, అందులో రాణించాలనుకొనేవారు, కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకునేవారు 'నిరంతర విద్యార్థి'గా సంబంధిత కోర్సులు అభ్యసించి, పూర్తిస్థాయి నైపుణ్యాలు అలవరచుకొనక తప్పదు. చదువు పూర్తి కాకముందే ప్రాంగణ నియామకాల్లో కొలువులు సంపాదించాలన్న విద్యార్థుల లక్ష్యం- కాలంచెల్లిన విద్య వల్ల నీరుగారుతోంది. బిడ్డల భవిష్యత్తుపై ఆశలు పెంచుకున్న తల్లిదండ్రుల్లో ఆందోళన నింపుతోంది. ఆటోమేషన్ ప్రభావం, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), అమెరికాలో ట్రంప్ ప్రకంపనలు, పారిశ్రామిక అవసరాలను గుర్తించడంలో విద్యావ్యవస్థల వైఫల్యం వంటి అనేక కారణాలు ప్రాంగణ నియామకాలు దక్కకుండా విద్యార్థులకు అడ్డుపడుతున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో ప్రాంగణ నియామకాలకు అర్హత సాధిస్తున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతుండటం ఆందోళన కలిగించే అంశం. అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఐఐటీ వంటి జాతీయ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు ఎంతో కొంత మెరుగుదల సాధిస్తున్నారు. వీటిలో ప్రాంగణ నియామకాలు ఏటా పెరుగుతున్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో స్నాతకోత్తర విద్య (పీజీ) చదివే విద్యార్థులకు ఈసారి భారీగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని 'నాస్కామ్' తాజా నివేదిక పేర్కొంది. విద్యార్థుల ఎంపికలో పేరున్న సాంకేతిక సంస్థలు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ముఖ్యంగా కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్, రొబోటిక్స్, అగ్‌మెంటెడ్ వర్చ్యువల్ రియాలిటీ తదితర కోర్సుల్లో ప్రావీణ్యంగల విద్యార్థులకు మాత్రం 35 నుంచి 40 శాతం అధికంగా జీతభత్యాలు చెల్లించడానికి సంస్థలు ముందుకు వస్తున్నాయి. 'అసోచామ్' నివేదిక ప్రకారం బిజినెస్ స్కూళ్లలో సైతం ప్రాంగణ నియామకాలు భారీగా పడిపోయాయి.



పాతకోర్సులతో నష్టపోతున్న విద్యార్థులు

ఇంజినీరింగ్ విద్యలో చేరిన, ఉద్యోగాలు పొందినవారి వివరాలు

సంవత్సరం	భారత్‌లో చేరికలు	ఉద్యోగాల శాతం	తెలంగాణలో చేరికలు	ఉద్యోగాల శాతం	ఆంధ్రప్రదేశ్‌లో చేరికలు	ఉద్యోగాల శాతం
2012-13	9,67,345	28.3	86,746	28.9	93,004	25.6
2013-14	9,44,391	31.3	84,662	30.0	89,827	27.9
2014-15	8,75,234	38.2	77,871	33.6	87,955	34.7
2015-16	8,54,823	42.3	74,519	35.7	96,721	35.3
2016-17	7,72,072	47.0	74,366	40.2	89,996	40.3
2017-18	7,50,206	43.4	70,329	43.8	90,098	37.7

ఆధారం: అఖిల భారత సాంకేతిక విద్యామండలి

విదేశాల బాటలో...

భారత్‌లో ఉద్యోగావకాశాలు దొరక్కపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కోసం విదేశాలవైపు దృష్టి సారిస్తున్నారు. నిరుడు హెచ్‌ఎస్‌బీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వాల్యూ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్' సర్వే విదేశీ చదువుల పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రస్ఫుటీకరించింది. తమ పిల్లలను విదేశాల్లో చదివిస్తామన్న తల్లిదండ్రులు 2016లో సుమారు 47 శాతం ఉండగా, 2017 నాటికి అది 67 శాతానికి చేరుకుంది. ప్రపంచవ్యాప్తంగా 86 దేశాల్లో అయిదున్నర లక్షలకు పైగా భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. అమెరికాలో 2.06లక్షల మంది, కెనడాలో లక్ష మంది, ఆస్ట్రేలియాలో 63 వేలు, న్యూజిలాండ్‌లో 30 వేలు, బహ్రెయిన్‌లో 27 వేల మంది, బ్రిటన్‌లో 14వేలకు పైగా, జర్మనీలో 13వేలకు పైగా, ఫిలిప్పీన్స్‌లో 8,500 మంది, రష్యా, ఉక్రెయిన్‌లలో ఎనిమిది వేలమంది చొప్పున విద్యార్థులు చదువుకుంటున్నారు. మొత్తం భారతీయ విద్యార్థుల్లో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల్లో సుమారు 66.85 శాతం విద్యార్థులు ఉండటం గమనార్హం. అమెరికాలో ఇతర దేశాల విద్యార్థుల సంఖ్య 11 లక్షలు. కాగా ఆ దేశంలో చైనా తరవాత భారత్‌కు చెందిన విద్యార్థులే అత్యధికం. చదువుల పేరిట విద్యార్థులు విదేశీ విద్యాసంస్థలకు పెద్ద మొత్తాలు చెల్లిస్తూ తరలిపోతుంటే దాని ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ప్రపంచ మేటి వర్సిటీల ర్యాంకింగుల్లో భారత విద్యాసంస్థల వెనకబాటే దీనికి కారణమన్నది చేదు నిజం. అమెరికా వంటి దేశాల్లో విశ్వవిద్యాలయాలు నాణ్యమైన ఉన్నత విద్యను అందజేస్తూ భారత విద్యార్థులను ఊరిస్తున్నాయి. ఈ పరిస్థితి మారాలి. భారత్‌లో 799 విశ్వవిద్యాలయాలు ఉండగా ఏ ఒక్కటీ వంద లోపు స్థానం సాధించలేకపోయింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ముంబయి) మాత్రం 162వ స్థానం సాధించింది.

దేశ విద్యావ్యవస్థ గుణాత్మకంగా మారాలి. విషయ పరిజ్ఞానం పెరగాలి. ఎప్పటికప్పుడు కొత్త కోర్సులు వెల్లువెత్తాలి. వివిధ పారిశ్రామిక సంస్థలతో విద్యాసంస్థల యాజమాన్యాలు ఒప్పందాలు కుదుర్చుకోవాలి. చదువుతోపాటే విద్యార్థులకు వృత్తినైపుణ్యాలు అందజేయడానికి 'ఇంటర్న్‌షిప్' విధానానికి ప్రాధాన్యం పెంచాలి. అధ్యాపక, ఉపాధ్యాయులూ నిరంతర విద్యార్థులుగా పరిశోధన-అభివృద్ధి ఒరవడిని అలవరచుకోవాలి. అప్పుడే నేటితరం విద్యార్థులకు భావి జీవితం పట్ల తిరుగులేని భరోసా ఏర్పడుతుంది!

– డాక్టర్ సిలువేరు హరినాథ్
(రచయిత– 'సెస్'లో పరిశోధకులు)

దక్షిణాయనం

రేపటి విషయమై నిన్ననే ఆలోచించి, ఈవేళ ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించడం వివేకవంతుల పద్ధతి. దక్షిణాయనం వారికి సరిగ్గా అలాంటిది. 'ఉత్తరాయణ పుణ్యకాలం' అనే మాట మన విషయంలో నిజం కావాలని ఆశించేవారికి- దక్షిణాయనం సాధనాకాలంగా గోచరిస్తుంది. అనుకూలమైన వేదికగా నిలుస్తుంది.

వర్షరుతువుతో మొదలయ్యే దక్షిణాయనాన్ని సృష్టికి ఆరంభ కాలమని చెబుతారు. తొలకరితో నేలతల్లి పులకరిస్తుంది. విత్తుకు జీవం పోస్తుంది. మానవ హృదయం- ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం. అమృతత్వసిద్ధికి ఉపకరించే విత్తనాలను కడుపులో దాచుకున్న పంటభూమి. ఆ విత్తులు మొలకెత్తాలంటే సాధన అనే తడి తగలాలి. దక్షిణాయనపు తొలకరి కలిసిరావాలి. కనుక దక్షిణాయనాన్ని సాధనానుకూలం అన్నారు.

శ్రావణంతో దక్షిణాయనం మొదలవుతుంది. శ్రావణమాసంలో వేదశ్రవణం పరమపావనం. వేదపండితులు ఎదురైతే 'శ్రావణ భాద్రపదాలు' ఏతెంచాయనేవారు. వారి సంచారాలు, వేదసభలు శ్రావణంలో ముమ్మరం అవుతాయి. వేద పఠన, శ్రవణాదులతో ఆధ్యాత్మిక చైతన్యం పురివిచ్చుకొంటుంది. కుండలిని జాగృతం అవుతుంది. విత్తు మొలకవుతుంది.

భాద్రపదంలో బ్రహ్మదేవుడు గణపతిగా ఆవిర్భవిస్తాడు. గణపతిది పృథివీతత్వం. అంటే, షట్చక్రాల్లో మొదటిదైన మూలాధారతత్వం. కనుకనే దీక్షితులవారు గణపతిని 'మూలాధార క్షేత్రజ్ఞుడు' అన్నారు, వాతాపి గణపతింభజే కీర్తనలో! ఈమాసంలో మట్టి వినాయకుడి రూపంలో పృథివీతత్వాన్ని ఆరాధిస్తాం. మూలాధారంలో కుండలిని జాగృతికి స్వాగతం పలుకుతాం.

శ్రావణ భాద్రపదాల దరిమిలా గుండె తలుపు తట్టే ఆశ్వయుజం- శక్తికి సంకేతం. సకలశక్తి స్వరూపిణిగా దేవీ నవరాత్రుల పేరుతో అమ్మవారి అన్ని చైతన్య స్వరూపాలను ఆవాహన చేసుకొనే కాలమిది. అమృతత్వసిద్ధికి అడ్డుపడుతున్న అంతశ్శత్రువులను నిర్మూలించి మనిషి మహాశక్తిమంతుడయ్యే సమయం ఇది. ఆదిశక్తియైన సీతమ్మవారి అన్వేషణకై, హనుమ తనలోని సర్వశక్తులను కూడగట్టుకున్నది ఆశ్వయుజంలోనే. ప్రయాణం మొదలైంది ఈ శరదృతువులోనే. హనుమస్ఫూర్తితో మనలోని శత్రువులను మట్టుబెట్టడానికి కీలకమైన మాసమిది. ఆ విజయానికి ప్రతీకే- విజయదశమి సంబరం. అదే దసరా నవరాత్రుల పరమార్థం.

పుట్టుకకు కారణం- కాముడు (మన్మథుడు). మరణానికి మూలం- కాలుడు (యముడు). కాముణ్ని, కాలుణ్ని శివుడే సంహరించాడని పురాణ కథనం. శివుడికి ప్రీతిపాత్రమైంది- కార్తికం! శివారాధనం- కార్తిక మాసానికి పతాక శీర్షిక వంటిది. యముణ్ని మన్మథుణ్ని మట్టి కరిపించాడంటే అర్థం- మనిషిని చావుపుట్టుకల నుంచి దూరం చేస్తాడని! కనుక కార్తికంలో పరమశివార్చనకు ప్రాశస్త్యం లభించింది.

'నేను చనిపోతున్నాను' అన్నది అజ్ఞానం. 'దేహాన్ని విడిచిపెడుతున్నాను' అనేది జ్ఞానం. జ్ఞానంలోంచి మోక్షానికి నడిపించేవాడు మహావిష్ణువు. మార్గశిర మాసం విష్ణుపారమ్యాన్ని భజిస్తుంది. 'మాసాల్లో నేను మార్గశీర్షం' అని గీతాచార్యుడు ప్రకటించడం దానికి కారణం. విష్ణువును మోక్షప్రదాతగా చెబుతారు. విష్ణు ఆరాధనతో జీవుడు జ్ఞానస్థితిలోంచి మోక్షమార్గం పడతాడు. తదుపరి పుష్యమాఘాలు సూర్యారాధనకు అనుకూలాలు. పుష్యంతో ఉత్తరాయణం ఆరంభం అవుతుంది. శ్రావణంతో సాధన మొదలై, భాద్రపదంలో గణపతిని, ఆశ్వయుజంలో అమ్మవారిని, కార్తికంలో శివుణ్ని, మార్గశీర్షంలో మహావిష్ణువును, పుష్యమాఘాల్లో సూర్యుణ్ని అర్చించడంతో అమృతత్వ స్థితి సిద్ధిస్తుంది. ఇదే 'పంచాయతన' పూజావిధానం. గాణాపత్యం, శాక్తేయం, శైవం, వైష్ణవం, సౌరం. అయిదింటి సమ్మేళన మహాయోగం- పంచాయతనం. దక్షిణాయనంలోని ఈ సాధనాక్రమం ఉత్తరాయణంలో పుణ్యఫలాలను అందించి, జీవుణ్ని ఆవలిగట్టుకు చేరుస్తుంది. ఆ ప్రయాణానికి ఇదే శుభ సుముహూర్తం. దీన్ని సద్వినియోగం చేసుకోవడం మనిషి కర్తవ్యం!

– ఎర్రాప్రగడ రామకృష్ణ

నిరుద్యోగ భృతిపై డ్వాక్రా కన్ను

- పంపిణీ, పర్యవేక్షణ బాధ్యతలు వారికే
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వం త్వరలో నిరుద్యోగులకు పంపిణీ చేయనున్న నిరుద్యోగ భృతి పర్యవేక్షణ బాధ్యతను డ్వాక్రా మహిళలకు అప్పగించనుంది. పంపిణీ కూడా వారి చేతనే చేయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఉండవల్లిలోని ప్రజాదర్బార్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సాధికారమిత్రలు, అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 4.60 లక్షల మంది సాధికారమిత్రలకు స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వీటికి ప్రతి నెలా రీఛార్జీ ప్రభుత్వమే చేయిస్తుందన్నారు. సాధికారమిత్రలు వారికి కేటాయించిన 35 కుటుంబాలకు సమర్థంగా ప్రభుత్వ పథకాలను చేరవచేసిన వారికి అవార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. సాధికారమిత్రలు తమ పరిధిలో సమస్యలను తెలియజేసేందుకు హాయ్ చంద్రన్న యాప్‌ను సిద్ధం చేసినట్టు తెలిపారు.

రూ.120 కోట్లతో రుతురుమాళ్ల పంపిణీ..

ఆడబిడ్డల కష్టాలను దగ్గరి నుంచి చూశానని, వారికి రుతుక్రమ సమయంలో తలెత్తె ఇబ్బందులను తొలగించేందుకు రూ.120 కోట్లు వెచ్చించి రక్ష పథకం పేరుతో రేషన్ దుకాణాల్లో రుతురుమాళ్లు అందుబాటులో ఉంచనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో గ్రామాల్లోని ఏఎన్ఎమ్ కేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా మార్చి అన్ని పరీక్షలు అందుబాటులోకి తెస్తామన్నారు.

రేటింగ్ చూసి గ్రామానికి పిల్లనిచ్చే పరిస్థితి రావాలి...

రాష్ట్రంలో ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, కుళాయి, సిమెంట్ రహదారి, తదితర పది అంశాల ప్రాతిపదికన స్టార్ రేటింగ్‌లు ఇస్తున్నామని, ఈ రేటింగ్‌ను చూసే ఆయా గ్రామాల్లోని అబ్బాయిలకు పిల్లనిచ్చే పరిస్థితి రావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నారా

మల్లవల్లి పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖిలో మాట్లాడుతున్న చంద్రబాబు

లోకేశ్ అన్నారు. 10 అంశాల్లో గ్రామాల పరిస్థితిని తెలిపే విధంగా డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2019 నాటికి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికీ 135 లీటర్ల నీటిని అందించనున్నట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

కిడ్నీలు పాడైన వ్యక్తికి రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్: కర్నూలు జిల్లాకు చెందిన సాధికారమిత్ర సుజాత తన 35 కుటుంబాల పరిధిలో ఉన్న ఓ వ్యక్తి రెండు కిడ్నీలు పాడైపోయి వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ఇబ్బందిపడుతున్నారని సీఎం దృష్టికి తీసుకురాగా అతని పేరు మీద రూ.2 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ, మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని మునిసిపాలిటీల్లో లక్షమంది మహిళలకు(20 లక్షల కుటుంబాలు) రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన వైద్య విద్యార్థులను అభినందించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా త్వరలో 3,500 మందికి ఒకేసారి స్వయంగా క్యాన్సర్ పరీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గిన్నిస్ బుక్ రికార్డుకు దరఖాస్తు చేసుకున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపారు.

175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు

ఈనాడు డిజిటల్, విజయవాడ: రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో మల్లవల్లి పారిశ్రామిక వేత్తలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో రానున్న మూడు నెలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పిస్తామని, మీరు పరిశ్రమలు ఏర్పాటు చేయడమే ఆలస్యమని అన్నారు. తొమ్మిది నెలల్లో పరిశ్రమలు స్థాపించాలన్నారు. ఎన్నికలకు ముందే తుదిరూపు వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఉత్తమ విధానాలపై సలహాలివ్వండి

- ఆర్థికవేత్తలకు చంద్రబాబు విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: సామాజిక, ఆర్థికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు చేపట్టాల్సిన చర్యలపై కోపెన్ హాగెన్ కాన్సెన్సస్ సంస్థ, టాటా ట్రస్ట్‌తో కలసి రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. కోపెన్ హాగెన్ కాన్సెన్సస్ అధ్యక్షుడు జార్న్ లాంబోర్గ్ సారథ్యంలో ప్రముఖ ఆర్థికవేత్తలతో కూడిన కమిటీ విస్తృత అధ్యయనం తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో అమలు చేయాల్సిన 77 అంశాలు, చర్యల్ని గుర్తించింది. లాంబోర్గ్ సారథ్యంలో ఆర్థికవేత్తల బృందం బుధవారం రాత్రి ఉండవల్లిలో ముఖ్యమంత్రితో

కోపెన్ హాగెన్ కాన్సెన్సస్ అధ్యక్షుడు జార్న్ లాంబోర్గ్ నేతృత్వంలోని ఆర్థికవేత్తల బృందంతో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు

సమావేశమైంది. "మీ బృందం చాలా మంచి అధ్యయనం చేసింది. రాష్ట్రంలో అమలు చేయాల్సిన ఉత్తమ విధానాలపై ఒక కార్యాచరణ ప్రణాళికనూ రూపొందించండి" అని వారిని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన బృందంలో నోబెల్ బహుమతి గ్రహీత ఫిన్ ఇ కిడ్లాండ్, ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మహేంద్రదేవ్, ఆక్స్‌ఫాం ఇండియా సీఈఓ నిషా అగర్వాల్, గ్లోబల్ అలయెన్స్ ఫర్ ఇంప్రూవ్డ్ న్యూట్రిషన్ ఛైర్మన్ వినీత బాలి తదితరులున్నారు.

రాజధానిలో జంతు ప్రదర్శనశాల

- తాడేపల్లి కొండలపై 251 హెక్టార్లలో ఏర్పాటు
- సచివాలయ టవర్ల నిర్మాణానికి గుత్తేదారుల ఖరారు
- రాజధాని పనుల పురోగతిపై సీఎం సమీక్ష

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో 251 హెక్టార్లలో జంతు ప్రదర్శన శాల, నైట్ సఫారీ ఏర్పాటు చేయనున్నారు. తాడేపల్లి కొండలపై అనువైన స్థలాన్ని గుర్తించామని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తెచ్చారు.

బొటానికల్ గార్డెన్‌ను కూడా అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. అమరావతిలో జరుగుతున్న వివిధ పనుల పురోగతిని ముఖ్యమంత్రి బుధవారం రాత్రి ఉండవల్లిలో సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులతో సమీక్షించారు.

- కృష్ణా కరకట్ట మార్గాన్ని రాజధాని బృహత్ ప్రణాళికలో పేర్కొన్నట్టుగా నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు రూపొందించిన ప్రతిపాదనపై చర్చించారు. ప్రస్తుతానికి దాన్ని పక్కన పెట్టాలని.. మిగతా రహదారులు, మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
- పరిపాలన నగరంలో నిర్మించ తలపెట్టిన ఐకానిక్ టవర్స్‌పై షాపూర్జీ పల్లోంజీ సంస్థ ప్రతినిధులు ప్రజంటేషన్ ఇచ్చారు. వీటిలో 20 లక్షల చ.అడుగుల నిర్మితప్రాంతం ఉంటుందన్నారు. వాణిజ్య, నివాస అవసరాలకు తగ్గట్టుగా ఐకానిక్ టవర్స్ నిర్మాణం జరుగుతుందని, ఒక హోటల్ కూడా ఉంటుందని తెలిపారు. వాటిలో ఒక టవర్ ఎత్తు 374 మీటర్లు, రెండో టవర్ ఎత్తు 239 మీటర్లు ఉంటుందన్నారు. నిర్మాణానికి రూ.4 వేల కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుని తీసుకొచ్చేందుకు లాభదాయక మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి సూచించారు. టవర్ల ఆకృతుల్ని మరింత మెరుగుపరచాలని ఆయన తెలిపారు.
- పరిపాలన నగరంలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల నిర్మాణానికి గుత్తేదారులను ఖరారు చేశారు. ఐదు టవర్లకు గాను... ముఖ్యమంత్రి కార్యాలయం ఉండే టవర్‌ను ఎన్‌సీసీ; 1, 2 టవర్లను ఎస్‌పీసీపీఎల్; 3, 4 టవర్లను ఎల్ అండ్ టీ సంస్థలు నిర్మిస్తాయి.
- రాజధానిలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనుల పురోగతిని సాధారణ ప్రజలు కూడా ఆన్‌లైన్‌లో రియల్‌టైంలో తెలుసుకునేందుకు వెబ్ పోర్టల్ రూపొందించినట్టు అధికారులు తెలిపారు. భౌతికంగా అక్కడ ఎంత శాతం పనులు పూర్తయ్యాయో చూడటంతో పాటు, ఎంత విలువైన పనులు జరిగాయో కూడా ప్రజలు తెలుసుకోవచ్చునని వెల్లడించారు.
- సింగపూర్-విజయవాడ మధ్య నేరుగా విమాన సర్వీసు నడిపేందుకు అవసరమైన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవలసిందిగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఉత్తర్వును వెంటనే వెనక్కు తీసుకోవాలి

- ఆర్టీసీ ఈయూ డిమాండ్

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆర్టీసీ గ్యారేజీ సిబ్బందిని కుదించాలన్న నిర్ణయాన్ని యాజమాన్యం తక్షణమే వెనక్కు తీసుకోవాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు వై.వి.రావు డిమాండ్ చేశారు. ఉత్తర్వును రద్దుచేయాలంటూ ఈ నెల 25 వరకూ అన్ని డిపోల ముందు ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నెల 25న ప్రాంతీయ మేనేజర్ కార్యాలయాలను ముట్టడిస్తామని.. తీరు మారకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెనుకాడబోమని తెలిపారు. బుధవారం విజయవాడలో ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) 13 జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈయూ ప్రధాన కార్యదర్శి కె.పద్మాకర్ మాట్లాడుతూ. ఆర్టీసీ ఉద్యోగులకు 27శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

విశాఖకు 'ఆకర్షణీయ' అవార్డు

దిల్లీ: వివిధ కేటగిరీల కింద భారత ఆకర్షణీయ నగరాల అవార్డు (2018)కు గాను దేశంలోని ప్రముఖ నగరాలతో పాటు విశాఖపట్నం ఎంపికైంది. ఆకర్షణీయ ప్రాంగణ (స్మార్ట్ క్యాంపస్) ప్రాజెక్టు కింద ఏపీలోని ఈ నగరాన్ని అవార్డుకు ఎంపిక చేశారు. అలాగే సమగ్రంగా పథకాల అమల్లో అద్భుత ప్రగతికి గాను సూరత్ అవార్డును దక్కించుకున్నట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ బుధవారం వెల్లడించింది. వీటితో పాటు భోపాల్, అహ్మదాబాద్, న్యూదిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్‌డీఎంసీ), జబల్‌పుర్, పుణే, కోయంబత్తూర్, జైపుర్ నగరాలు వివిధ విభాగాల్లో అవార్డులు దక్కించుకున్నాయి.

రూ. 66 కోట్లతో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి నిధి

ఈనాడు, అమరావతి: విశాఖ-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి రూ.66 కోట్లతో నిధి ఏర్పాటు చేసేందుకు పరిశ్రమల శాఖ కమిషనర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు ఇచ్చింది. అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగించవచ్చు. ప్రాజెక్టు డైరక్టర్ ఈ నిధిని నిర్వహిస్తారు. కార్యకలాపాల నిర్వహణ, అధ్యయనం, సర్వే, సలహాదారుల నియామకం, వారికి చెల్లింపులు వంటి అంశాలను ఆయన పర్యవేక్షిస్తారు.

వైఎస్ కలలుగన్న స్వర్ణయుగం తెస్తా

- చంద్రబాబు అబద్ధాల్లో పీహెచ్‌డీ తీసుకున్నారు
- 2024 నాటికి మద్యం దుకాణాలు లేకుండా చేస్తా
- రాజోలులో జగన్ వ్యాఖ్యలు

ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కలలుగన్న స్వర్ణయుగం తెస్తానని వైకాపా అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి హామీ ఇచ్చారు. హామీలు ఇచ్చి నెరవేర్చని పక్షంలో అధికారం నుంచి దించే రోజులు వచ్చినప్పుడే విశ్వసనీయత అనే పదానికి అర్థం వస్తుందని, అప్పుడే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజోలులో బుధవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను నాలుగేళ్ల కాలంలో నెరవేర్చలేని చంద్రబాబుకు... ఎన్నికలు ఇంకా 6నెలల కాలం ఉండగా ఇళ్లు, పింఛన్లు, నిరుద్యోగ భృతి వంటివి గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. వెయ్యి కొబ్బరి కాయలకు రూ.14వేల ధర రావాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.9 వేలే

రాజోలులో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న జగన్. సభలో పాల్గొన్న జనం

ఇస్తున్నారని, రైతులంతా ఈ విషయాన్ని తనవద్ద చెబితే మనసు గాయమైపోయిందని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి అనేక మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతుంటే, వారిని క్షేమంగా తీసురావడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు పీహెచ్‌డీ తీసుకున్నారని విమర్శించారు. కాపుల రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంజునాథ కమిషన్ రిపోర్టు రాకముందే చంద్రబాబు అది వచ్చిందంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించానని, తన పని అయిపోయిందన్నట్లు చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. రూ.5వేల కోట్లతో కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని అడగటానికి వెళ్లిన కాపు సోదరులను అవమానపరిచే పరిస్థితి తెచ్చారని, చివరకు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఆయన కుటుంబ సభ్యులనూ అవమానించారని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లిన చంద్రబాబు హోదాపై గళమెత్తాల్సింది పోయి ఆయన ముందు అతి వినయం ప్రదర్శించారని ఎద్దేవా చేశారు. ప్రధాని ఎడమ చెయ్యి లాక్కుని మరీ పలకరించడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 2024 నాటికి మద్యం దుకాణాలు లేకుండా చేస్తానని తెలిపారు.

విచారణ ఆవశ్యకతపై జులైలో నిర్ణయిస్తాం

- అమరావతి పనుల ఫిర్యాదులపై ప్రపంచబ్యాంకు ప్రతినిధి

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో ప్రతిపాదించిన పనుల వల్ల తమ జీవనోపాధికే కాకుండా పర్యావరణానికీ ముప్పు వాటిల్లబోతోందంటూ కొంతమంది స్థానికులు చేసిన ఆరోపణలపై విచారణ ఆవశ్యకతను జులైలో నిర్ణయిస్తామని ప్రపంచబ్యాంకు అధికారి తెలిపారు. అమరావతి నిర్మాణ పనుల నిమిత్తం ప్రపంచ బ్యాంకు, ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ప్రతిపాదిత నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో పనుల వల్ల ఆహార భద్రతకు, తమ జీవనోపాధికి, పునరాశ్రయానికి హాని కలుగుతుందని గత ఏడాది మే 25న కొందరు స్థానికులు ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదు చేశారు. పథక నివేదికల తయారీలో పర్యావరణ, సామాజిక ప్రమాణాలను ప్రపంచ బ్యాంకు పట్టించుకోకపోవడం దీనికి కారణమని దానిలో పేర్కొన్నారు. దీనిపై ప్రపంచ బ్యాంకు అధికార ప్రతినిధి పీటీఐ వార్తాసంస్థకు ఈ-మెయిల్‌లో సమాధానం ఇచ్చారు. స్థానికుల ఫిర్యాదును బ్యాంకు పరిశీలిస్తోందన్నారు. విచారణ అవసరమా వద్దా అనే అంశంపై కార్యనిర్వాహక సంచాలకుల మండలికి సిఫార్సు చేయడాన్ని మాత్రం వాయిదా వేసినట్లు చెప్పారు. 'ప్రపంచబ్యాంకు ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్టుల వల్ల తమకు హాని కలిగే అవకాశం ఉందని భావించేవారిలో ఇద్దరు, అంతకుమించిన వ్యక్తులు తమ ఆందోళనను ప్రపంచబ్యాంకు దృష్టికి తీసుకురావచ్చు. రుణాన్ని తీసుకునే దేశ కార్యకలాపాలతో సంబంధం లేకుండా మా సొంత విధానాలు ఆధారంగా ఇలాంటివి పరిశీలిస్తాం. విచారణ కొన్ని నెలల సమయం కూడా తీసుకోవచ్చు. అందువల్ల దానికి నిర్దిష్ట కాల వ్యవధి అంటూ లేదు. అయితే విచారణ చేపట్టిన కారణంగా ప్రాజెక్టు కార్యకలాపాలేవీ నిలిచిపోవు' అని స్పష్టంచేశారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పరిశీలనకు ప్రపంచబ్యాంకు బృందం సెప్టెంబరులో అమరావతిని సందర్శించింది.

చైనాతో నిరంతర చెలిమి: ఉన్

బీజింగ్: చైనాతో తమకు నిరంతర చెలిమి ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ పేర్కొన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన కిమ్... చైనాతో సత్సంబంధాలను కొనసాగించుకునేందుకు రెండ్రోజుల పర్యటన నిమిత్తం బీజింగ్‌కు వచ్చారు. ప్రధాన మిత్రదేశానికి విధేయతను పునరుద్ఘాటించే ఈ పర్యటన బుధవారం ముగిసింది. అమెరికాకు ఉ.కొరియా సన్నిహితమైతే ప్రాంతీయంగా తమ ఆర్థిక, భద్రతపరమైన ప్రయోజనాలు దెబ్బతింటాయని చైనా భావిస్తోంది. అమెరికా-ఉ.కొరియా మధ్య సింగపూర్‌లో జరిగిన చర్చల్లో చైనా పాల్గొనకపోయినా కిమ్ అక్కడకు వెళ్లడానికి విమానాన్ని సమకూర్చింది. ట్రంప్‌తో భేటీ విజయవంతమయ్యేలా సహకరించినందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు కిమ్ మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. స్నేహబంధాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. సింగపూర్‌లో కుదిరిన ఒప్పందాన్ని అమల్లోకి తీసుకురావాలని అమెరికా, ఉ.కొరియాలకు చైనా సూచించింది. అణుదౌత్యంలో తమ నిర్మాణాత్మక పాత్రను కొనసాగిస్తామని తెలిపింది.

విశాఖలో సమావేశమైన ఐదు జిల్లాల సంయుక్త కలెక్టర్లు

సంతృప్త సూచీ పెంచేందుకు 9 సూత్రాలు

- విశాఖలో సమావేశమైన జేసీల బృందం
- సీసీఎల్ఏకు సిఫార్సులపై చర్చ

వన్‌టౌన్ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: రెవెన్యూశాఖ ద్వారా మెరుగైన సేవలందించి ప్రజల్లో సంతృప్త స్థాయిని పెంచేందుకు 9 అంశాలను ప్రాతిపదికగా తీసుకోవాలని ఐదు జిల్లాల సంయుక్త కలెక్టర్లతో కూడిన బృందం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న ముఖ్యమైన సేవలను అధ్యయనం చేసి రెవెన్యూ సేవలపట్ల ప్రజల్లో సంతృప్త స్థాయి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర భూపరిపాలనా వ్యవహారాల ముఖ్య కమిషనరు (సీసీఎల్ఏ) ఐదు జిల్లాల సంయుక్త కలెక్టర్లతో కమిటీ వేశారు. శ్రీకాకుళం జిల్లా జేసీ చక్రధర బాబు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీలో విశాఖపట్నం, కర్నూలు, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాల సంయుక్త కలెక్టర్లు జి.సృజన, ప్రసన్న వెంకటేష్, మల్లికార్జున్, గిరీష్‌లను సభ్యులుగా నియమించారు. బుధవారం విశాఖలోని ప్రభుత్వ అతిథి గృహంలో కమిటీ సమావేశమై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బుధవారం సాయంత్రం కలెక్టరేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 22ఏ జాబితాల్లో మార్పులు, చేర్పులు, వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్, ఆటో మ్యుటేషన్, అనాధీన భూములు, నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చడం, భూ ఆధార్, సాదా బైనామా కేసులు, ఎఫ్ఎంబీల డిజిటైజేషన్, నోషనల్ సబ్‌డివిజన్, కుల ధ్రువీకరణ పత్రాల జారీ వంటి సేవల్లో వేగం పెంచడంద్వారా సంతృప్త సూచీని పెంచవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు నివేదికను రూపొందించి సీసీఎల్ఏకు పంపారు.

విజయవాడలో పవన్ కల్యాణ్ మూడు రోజుల పర్యటన

ఈనాడు, అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ మూడు రోజుల పాటు విజయవాడలో పర్యటించనున్నారు. 23, 24, 25 తేదీల్లో ఆయన విజయవాడలో ఉంటారు. పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతారు. 25న విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు.

143 మందికి తహశీల్దార్లుగా పదోన్నతులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 143 మందికి తహశీల్దార్లుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ఇన్‌ఛార్జి ప్రధాన కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా బుధవారం ఉత్తర్వులను జారీచేశారు. జోన్-1లో 25, జోన్-2లో 25, జోన్-3లో 37, జోన్-3లో 56 మంది డిప్యూటీ తహశీల్దార్లకు తహశీల్దార్‌గా పదోన్నతి లభించింది.

సీఎం పర్యటనలో పాల్గొననున్న మంత్రి గంటా!

- అంతరం తొలగిపోయే అవకాశం?
- తెదేపా వర్గాల ఆశాభావం

ఈనాడు, అమరావతి: పార్టీ వైఖరిపై మనస్తాపంతో మంగళవారం నాటి మంత్రివర్గ సమావేశానికి గైర్హాజరైన మంత్రి గంటా శ్రీనివాసరావు... విశాఖపట్నం, భీమిలిల్లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనే కార్యక్రమాలకు హాజరవనున్నట్లు తెదేపా వర్గాల సమాచారం. ఏదోఒక సందర్భంలో ముఖ్యమంత్రితోను భేటీ అయ్యే అవకాశముందని, అంతరం తొలగిపోయే వీలుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గంటాకి వియ్యంకుడైన మంత్రి నారాయణ బుధవారం ఫోన్లో ఆయను సంప్రదించారు. సీఎం చంద్రబాబు వైఖరిని తెలియజేస్తూ అర్థం చేసుకోవాలని నచ్చజెప్పటానికి ప్రయత్నించారు. ముఖ్యమంత్రి విశాఖ పర్యటనలో పాల్గొనకపోతే పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందికరమని సూచించారు. విశాఖపట్నంజిల్లా ఇన్‌ఛార్జ్ అయిన ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప సైతం బుధవారం రాత్రి మంత్రి గంటాతో మాట్లాడారు. గురువారం ఉదయమే ఇంటికొచ్చి కలుస్తానని సీఎం పర్యటనలో పాల్గొనాలని పేర్కొన్నారు. భీమిలిలో ఏర్పాటైన కార్యక్రమాలు గంటా సూచించినవే కావటంతో వాటిలో పాల్గొనటమే సరైందని ఆయన సన్నిహితులు సైతం చెప్పినట్లు సమాచారం. మంత్రి నారాయణ నెల్లూరు జిల్లా పర్యటనను రద్దుచేసుకుని సీఎంతో కలిసి విశాఖపట్నం వెళ్లనున్నారు. ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, మంత్రి నారాయణ గంటాని సీఎంతో భేటీకి ఒప్పించే వీలుందని పార్టీ వర్గాల కథనం.

పెరగనున్న భూముల విలువలు?

- అనంతపురం, శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు, కడప జిల్లాల్లో పెంపు పక్కా!
- మరికొన్ని జిల్లాల్లో యథాతథానికి అవకాశం
- వీటితో పాటు పెరగనున్న స్టాంపు డ్యూటీలు
- కసరత్తు మొదలైన భూముల మార్కెట్ విలువల మదింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువల మదింపు జరగబోతుంది. ఇందులో భాగంగా కొన్ని జిల్లాల్లో భూముల మార్కెట్ విలువ పెరగడం, మరికొన్ని జిల్లాల్లో యథాతథంగా ఉండడం లేదా తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలను పరిగణనలోకి తీసుకోనున్నారు. తాజాగా నిర్ణయించే భూముల మార్కెట్ విలువలు రానున్న ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ తగిన కసరత్తు ప్రారంభించింది.

జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా...

నగర/పట్టణ ప్రాంతాల్లో భూముల విలువలను ఏడాదికోకసారి, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోకసారి సవరిస్తున్నారు. ఈ క్రమంలోనే రానున్న ఆగస్టు ఒకటో తేదీ నుంచి భూముల విలువలను సవరించే ముందు తీసుకోవల్సిన జాగ్రత్తలపై సెంట్రల్ వాల్యుయేషన్ అడ్వయిజరీ కమిటీ ఇటీవల సమావేశమై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిస్థితులను సమీక్షించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఛైర్మన్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో భూముల విలువలను మదింపు చేయాలని నిర్ణయించారు. తదుపరి చర్యల్లో భాగంగా జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా ఉండే అర్బన్ కమిటీ నగరాలు, పురపాలక సంఘాలు, పట్టణాభివృద్ధి సంస్థల్లో ఇప్పటివరకు జరిగిన లావాదేవీలను అనుసరించి నిర్ణయాలు తీసుకోనుంది.

అత్యధికంగా అనంతపురం జిల్లా నుంచే..

2016-17 ఆర్థిక సంవత్సరంలో కంటే 2017-18లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు 22.13% మేర ఆదాయం ఎక్కువగా వచ్చింది. ప్రధానంగా అనంతపురం జిల్లాలో 39.49%, శ్రీకాకుళం జిల్లాలో 35.20%, కడప జిల్లాలో 33.67%, గుంటూరు జిల్లాలో 30.12%, కృష్ణా జిల్లాలో 29.91%, నెల్లూరు జిల్లాలో 21.19%, పశ్చిమ గోదావరి జిల్లాలో 20.48% వంతున ఆదాయం పెరిగింది. విశాఖపట్నం జిల్లాలో 4.02%, తూర్పుగోదావరి జిల్లా 7.21%, చిత్తూరు జిల్లాలో 19.39% వంతున ఆదాయం పెరిగింది. విజయనగరం జిల్లాలో మాత్రం 2016-17లో కంటే 2017-18లో 2.35% ఆదాయం తక్కువగా నమోదైంది. ఇలా జిల్లాల వారీగా నమోదైన ఆదాయం పెరుగుదల ఏయే మండలాల్లో, ఏయే ప్రాంతాల దగ్గర్లో పెరిగిందో, అందుకు దారితీసిన కారణాలేంటో జిల్లా కమిటీ ఆరా తీయనుంది. ఇదే సమయంలో ప్రభుత్వపరంగా భూ సమీకరణ జరగాలనుకుంటే... ఆ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని విలువల పెంపుపై నిర్ణయాన్ని తీసుకోనున్నారు.

ఆ ప్రాంతాల్లో ఆచితూచి..: ప్రభుత్వం ఖరారు చేసిన భూవిలువలను అనుసరించి మాత్రమే భూసమీకరణ సమయంలో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల భూసమీకరణ జరగాల్సిన ప్రాంతాల్లో భూముల విలువల పెంపు విషయంలో జిల్లా అధికారులు ఆచితూచి నిర్ణయాలు తీసుకోనున్నారు. మరోవంక.. ఆయా మండలాల సబ్‌రిజిస్ట్రార్లు వారి ప్రాంతాల్లోని నమోదైన లావాదేవీల వివరాలతో ప్రతిపాదనలు తయారుచేస్తున్నారు. తుది నిర్ణయం మాత్రం జాయింట్ కలెక్టర్లదే. అయితే ఇక్కడే ఓ సమస్య వస్తోంది. ఈ వ్యవహారంలో జాయింట్ కలెక్టర్లు తగిన సమయాన్ని కేటాయించకపోతుండడంతో హడావుడిగా భూముల విలువలను ఖరారు చేస్తున్నారు. దీని వల్ల శాస్త్రీయత లోపిస్తోందని, అసమానతలు చోటుచేసుకుంటున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వపరంగా తగిన చర్యలు అవసరమని సూచిస్తున్నారు.

పెరగనున్న ఇతర ఛార్జీలు: కిందటేడాది నమోదైన ఆదాయాన్ని అనుసరించి అనంతపురం, శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు, కడప జిల్లాల్లో భూముల విలువలు పెరుగుదల అనివార్యంగా కనిపిస్తోంది. ఎంత అన్నది ఆయా ప్రాంతాల్లోని పరిశ్రమలు, ఇతర అభివృద్ధి అంశాలను అనుసరించి ఉంటుంది. పెంపు కూడా డిమాండ్ కలిగిన ప్రాంతాల్లో మాత్రమే ఉంటుంది. భూముల విలువలు జిల్లా వ్యాప్తంగా ఒకే విధంగా ఉండవు. డిమాండ్ ఉన్న ప్రాంతాలను అనుసరించి మారిపోతుంటాయి. భూముల క్రయవిక్రయాలు అనుసరించి స్టాంపు డ్యూటీ కింద 5%, బదలాయింపు ఫీజు కింద 1.5%, రిజిస్ట్రేషన్ ఛార్జీల కింద 1% మొత్తాన్ని అదనంగా వసూలు చేయడం అనివార్యం.

ఇండోనేసియా పడవ ప్రమాదంలో.. 178కి పెరిగిన గల్లంతైనవారి సంఖ్య

సిమలుంగన్: ఇండోనేసియాలో పడవ బోల్తా పడటంతో గల్లంతైనవారి సంఖ్య 178కి పెరిగింది! ఉత్తర సుమత్రాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తోబా లేక్‌లో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. బోల్తా పడిన సమయంలో పడవలో 80 మంది వున్నట్లు తొలుత వార్తలు వచ్చాయి. అయితే బాధితుల కుటుంబాలతో మాట్లాడిన అనంతరం ఈ సంఖ్య 178గా పోలీసులు బుధవారం వెల్లడించారు. ఇప్పటివరకూ నాలుగు మృతదేహాలను వెలికితీశామని, 18 మందిని ప్రాణాలతో కాపాడామని తెలిపారు.

ANDHRA LOYOLA COLLEGE
(Autonomous), VIJAYAWADA
(AFFILIATED TO KRISHNA UNIVERSITY)
SPOT ADMISSIONS for
B.B.A - AVIATION MANAGEMENT
B.B.A - HOTEL MANAGEMENT
Elig: Inter Any Group Fee: 40,000/- per sem
Low Fees. Highly Demanded & Highly Paid Job Oriented Courses
SPOT ADMISSION Dates: 21.6.2018 to 23.06.2018
Cont: 91333 40136
91333 40137 / 91333 40138

DEPARTMENT OF TECHNICAL EDUCATION: VIJAYAWADA
(on behalf of APSCHE)
APEAMCET-2018 ADMISSIONS (MPC STREAM)
SECOND PHASE NOTIFICATION
FOR WEB BASED COUNSELLING
The Qualified candidates of APEAMCET-2018 desirous of seeking admission into B.E/B.Tech/B.Pharmacy/Pharm-D Courses are informed that the web counselling process comprising of certificate verification and exercising of options from 01-07-2018 to 05-07-2018. For complete details and schedule, refer the detailed notification placed on the website https://apeamcet.nic.in
Date: 20.06.2018
Place: Vijayawada
Sd/- G.S Panda Das,IAS
Convenor,APEAMCET-2018 Admissions

శ్రీయుత ప్రత్యేక కలెక్టరు (భూ.సే.) టి.జి.పి., నెల్లూరు వారి కార్యావర్తనములు
ప్రస్తుతం: శ్రీమతి పి.ప్రశాంతి M.A.,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం. VI (ఎ)

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఆర్.సి.డి1/98/2018 — తేది : 30-04-2018

ఈ దిగువ నుదహరించిన షెడ్యూల్ దాఖలా ఎ. 78.86సెంట్లు భూములకు నెల్లూరు జిల్లా, మర్రిపాడు మండలం పడమటినాయునిపల్లి గ్రామము నందు ప్రజాహిత ఉపయోగార్థం అనగా బ్యాలన్సింగ్ రిజర్వాయరు-1 నిర్మాణము కొరకు రీచ్-1 క్రింద భూమి కావలయునని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనల ననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ప్రతిపాదిత భూసేకరణలో ఎలాంటి నిర్వాసిత కుటుంబములు లేవు.

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్ /12 (3జి) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11 (4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) తెలుగుగంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు / ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారి ముందస్తు అనుమతిలేనిదే, ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం / కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురింపబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా శ్రీ ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు** — మండలం: **మర్రిపాడు** — గ్రామం: **పడమటినాయునిపల్లి**

క్ర. సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం.	తరగతి	సంబంధిత ఆసామి పేరు - చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర
1.	385/2	3.14	0.35	పట్టా మెట్ట	గండికోట కొండమ్మ భర్త వెంకట సుబ్బయ్య మరియు ఇతరులు	668	385/1	384/1	386
2.	396	3.07	0.20	పట్టా మెట్ట	రామిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి తండ్రి నాగిరెడ్డి	393	608	397	395
3.	397/1, 2	1.32	0.45	పట్టా మెట్ట	రామిరెడ్డి ఓబయ్య	393	399	399	396, 608
4.	399	4.92	4.09	పట్టా మెట్ట	రామిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తండ్రి నాగిరెడ్డి మాచుపల్లె రామిరెడ్డి	393	401	400, 384/3	608, 609, 397
5.	400	3.49	3.49	పట్టా మెట్ట	రామిరెడ్డి ఓబులకొండయ్య మరియు ఇతరులు రామిరెడ్డి జయ ఓబులరెడ్డి తండ్రి ఓబుల్రెడ్డి రామిరెడ్డి గంగిరెడ్డి తండ్రి చెంచిరెడ్డి	384/3	401	384/3	399
6.	401	9.14	9.14	పట్టా మెట్ట	బంకా సీతారామిరెడ్డి తండ్రి నారపరెడ్డి రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తండ్రి ఓబుల్‌రెడ్డి మరియు ఇతరులు	399, 400	613	384/3	600, 601
7.	609	4.38	0.31	పట్టా మెట్ట	రామిరెడ్డి జయ ఓబులరెడ్డి తండ్రి ఓబుల్రెడ్డి	608	610	611, 399	607
8.	613	2.49	2.23	పట్టా మెట్ట	రామిరెడ్డి నాగరత్నమ్మ భర్త రోసిరెడ్డి కంభం ఆదిలక్ష్మమ్మ రామిరెడ్డి అచ్చమ్మ భర్త చినరామిరెడ్డి	401	612	384/3	612
9.	528/ 1, 3	3.62	0.97	పట్టా మెట్ట	రాచపల్లి గంగిరెడ్డి తండ్రి బాపిరెడ్డి మరియు ఇతరులు	529, 537, 547	526	548	527
10.	532	2.71	2.71	పట్టా మెట్ట	అందూరి రమణయ్య తండ్రి పిచ్చయ్య మరియు ఇతరులు అదూరు నాగమ్మ	614	531	534, 533	531
11.	533	5.53	5.53	పట్టా మెట్ట	రాచపల్లి కృష్ణారెడ్డి తండ్రి నాగిరెడ్డి రాచపల్లి కిష్టయ్య తండ్రి నాగిరెడ్డి రాచపల్లి తిరుపతిరెడ్డి తండ్రి: లక్ష్మీరెడ్డి	534	531	536	532
12.	534	1.45	1.45	పట్టా మెట్ట	రాచపల్లి గంగిరెడ్డి రాచపల్లి కిష్టయ్య తండ్రి నాగిరెడ్డి రాచపల్లి కృష్ణారెడ్డి తండ్రి నాగిరెడ్డి	535	538	535	532, 614
13.	536	2.50	2.50	పట్టా మెట్ట	రాచపల్లి కృష్ణారెడ్డి తండ్రి నాగిరెడ్డి బంకా రమణయ్య తండ్రి వెంకటసుబ్బయ్య	535	537	538	533, 631
14.	538	4.18	4.18	పట్టా మెట్ట	బంకా వెంకటయ్య తండ్రి: వెంకటసుబ్బయ్య కటారు వెంకటయ్య తండ్రి: పెద్ద నాగయ్య	535	537	540, 539	536
15.	539	0.58	0.58	పట్టా మెట్ట	కటారు వెంకటయ్య తండ్రి పెద్ద నాగయ్య పోలిరెడ్డి పెద్దకొండయ్య తండ్రి వీరయ్య పోలిరెడ్డి సాంబయ్య తండ్రి: వీరయ్య పువ్వాడి పెద్దగురవయ్య తండ్రి: బాలగురవయ్య పోలిరెడ్డి కొండయ్య తండ్రి: వీరయ్య	535	538	540	538
16.	544	5.40	5.40	పట్టా మెట్ట	పోలిరెడ్డి కొండయ్య తండ్రి: కొండయ్య పోలిరెడ్డి చినకొండయ్య తండ్రి: కొండయ్య పోలిరెడ్డి సాంబయ్య తండ్రి: వీరయ్య పోలిరెడ్డి చినకొండయ్య తండ్రి: వీరయ్య	543 542	550	535	545 540
17.	545	0.55	0.55	పట్టా మెట్ట	పోలిరెడ్డి చంద్ర తండ్రి: పెద్దకొండయ్య పోలిరెడ్డి రామకృష్ణ తండ్రి: పెద్దకొండయ్య పోలిరెడ్డి కొండయ్య తండ్రి: కొండయ్య పోలిరెడ్డి చినకొండయ్య తండ్రి: కొండయ్య	540	550	544	546
18.	547	430	2.95	పట్టా మెట్ట	పోలిరెడ్డి చంద్ర తండ్రి: పెద్దకొండయ్య పోలిరెడ్డి రామకృష్ణ తండ్రి: పెద్దకొండయ్య పోలిరెడ్డి కొండయ్య తండ్రి: కొండయ్య పోలిరెడ్డి చినకొండయ్య తండ్రి: కొండయ్య పోలిరెడ్డి సాంబయ్య తండ్రి: వీరయ్య పోలిరెడ్డి చినకొండయ్య పోలిరెడ్డి చినకొండయ్య తండ్రి: వీరయ్య	537	548, 528	546	528
19	548/1	5.38	5.38	పట్టా మెట్ట	పోలిరెడ్డి చంద్ర తండ్రి: పెద్దకొండయ్య మరియు ఇతరులు పోలిరెడ్డి రామకృష్ణ తండ్రి: పెద్ద కొండయ్య పోలిరెడ్డి కొండయ్య తండ్రి: వీరయ్య పోలిరెడ్డి సాంబయ్య తండ్రి: వీరయ్య	547	516	519	528
20	551	0.07	0.07	పట్టా మెట్ట	గ్రంధి చెన్నంశెట్టి మరియు ఇతరులు	535	553	555	550 552
21	552	0.07	0.07	పట్టా మెట్ట	గ్రంధి చెన్నంశెట్టి	550	551	551	553
22.	554	2.72	2.72	పట్టా మెట్ట పట్టా మెట్ట	రాచపల్లి చిన్నక్క భర్త: పిచ్చిరెడ్డి రాచపల్లి తిరుపతిరెడ్డి తండ్రి: లక్ష్మిరెడ్డి	550	555	553	514
23.	514	4.25	4.25	పట్టా మెట్ట	బైనబోయిన వెంకటసుబ్బమ్మ భర్త: వెంకటయ్య కారుదుంప వెంకటమ్మ భర్త: పెద్దసుబ్బయ్య ఈడే సుబ్బమ్మ కటారి పిచ్చమ్మ భర్త: వెంకటయ్య గుత్తిరెడ్డి నాగిరెడ్డి తండ్రి: నాగిరెడ్డి	516, 515, 550	513, 555	554	517
24.	518	2.19	2.19	పట్టా మెట్ట	రాపూరు పద్మమ్మ భర్త: రమణారెడ్డి మన్నే ఓబులమ్మ మరియు ఇతరులు	519	646	517	519
25.	519/1, 3	7.00	7.00	పట్టా మెట్ట	గతిరెడ్డి నాగిరెడ్డి రాచపల్లి సుబ్బమ్మ భర్త: సుబ్బయ్య రాచపల్లి కృష్ణయ్య తండ్రి: నాగిరెడ్డి రాచపల్లి గంగాద్రి తండ్రి: గంగిరెడ్డి కాటూరు రోసమ్మ భర్త: వెంకటయ్య గోగుల వెంకటయ్య తండ్రి: చిన్నయ్య	526, 516	645, 646	517, 518	520
26.	521	3.32	2.04	పట్టా మెట్ట	రాపూరు రమణారెడ్డి తండ్రి: శేషరెడ్డి మరియు ఇతరులు	523, 522	639, 640	520	637
27.	576	546	1.14	సర్వీసు ఇనాం	తిరుపల్లె ఆదినారాయణ తండ్రి: నారయ్య మరియు ఇతరులు	575	677	577	575
28.	562/1	3.00	3.00	పట్టా మెట్ట	ఇదమకంటి నరసయ్య తండ్రి: వెంకటేశు మరియు ఇతరులు గుత్తిరెడ్డి నాగిరెడ్డి తండ్రి: వెంకటసుబ్బయ్య అందూరు వెంకటసుబ్బయ్య తండ్రి: రోశయ్య	561, 262	575	261	563, 564
29.	558/1, 2	1.43	1.43	పట్టా మెట్ట	కరుదుంప చలమయ్య తండ్రి: పెద్దసుబ్బయ్య పువ్వాడి తిరిపాలు తండ్రి: మద్దయ్య	555	559, 511, 560	556, 557	512
30.	566	6.08	1.90	పట్టా మెట్ట	రాచపల్లి చిన్నక్క భర్త: పిచ్చిరెడ్డి మరియు ఇతరులు	510	568	565, 575, 567	643
31.	515	0.27	0.27	పట్టా మెట్ట	బైనబోయిన వెంకటసుబ్బమ్మ భర్త: నాగయ్య	516	514	514	514
	మొత్తం		78.86						

సం/- శ్రీమతి పి. ప్రశాంతి, ఎం.ఎ., ప్రత్యేక కలెక్టరు, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు

రోజువారీ వాహన తనిఖీలకు స్వస్తి

- బ్రేక్‌డౌన్‌లు, ప్రమాదాలకు దారితీసే అవకాశం
- నిర్వహణ షెడ్యూళ్లలో తాజా మార్పుల ఫలితమిది

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్టీసీ బస్సులను మెకానిక్‌లు రోజూ క్షుణ్ణంగా పరిశీలించే తనిఖీ విధానానికి యాజమాన్యం మంగళం పాడేసింది. ఇది బ్రేక్‌డౌన్‌లు, ప్రమాదాల పెరుగుదలకు దారి తీస్తుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. బస్సులు మార్గమధ్యంలో మొరాయించకుండా, ప్రమాదాల బారిన పడకుండా చూడటమే లక్ష్యంగా రోజువారి, వారానికోసారి, బస్సు తిరిగిన కిలోమీటర్లకు అనుగుణంగా రెండు సార్లు. . ఇలా నిర్దిష్ట కాలావధిలో తనిఖీలు చేయాలి. గుర్తించిన లోపాలను సరిచేసి బస్సును కండిషన్‌లో ఉంచాలి. ఈ ప్రక్రియను సవరిస్తూ తాజాగా యాజమాన్యం ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడు ఆందోళనకు కారణమవుతున్నాయి.

ప్రస్తుతం ఏం జరుగుతోంది: సర్వీసు ముగించుకుని గ్యారేజీలోకి వచ్చిన బస్సును మెకానిక్‌లు క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. ఇంజిన్, స్ప్రింగ్స్ పరిస్థితి, నట్లు, బోల్టులు సరిగ్గా ఉన్నాయా? లేదా? ఆయిల్ లీకేజీలున్నాయా? క్లాంపులు ఎలా ఉన్నాయి? ఎయిర్ లీక్‌లు ఏమైనా ఉన్నాయా? చక్రాలకు తగినంత గాలి ఉందా? కూలింగ్ సిస్టమ్ సక్రమంగా పనిచేస్తోందా? తదితర అంశాలను పరిశీలించాలి. ఏ చిన్న లోపామున్నా వెంటనే ఆ సమాచారాన్ని గ్యారేజీలో నమోదు చేయించి.. వాటికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలి. ఆ తర్వాత మాత్రమే బస్సు రోడ్డెక్కుతుంది.

కొత్త మార్పు ఏమిటంటే: బస్సుల సాంకేతికతలో అత్యాధునిక మార్పులు వచ్చినందున రోజువారీ తనిఖీలు అవసరం లేదని భావించిన యాజమాన్యం ఇప్పటివరకూ అమల్లో ఉన్న ఈ విధానాన్ని తాజాగా ఎత్తేసింది. బస్సును నడిపేటప్పుడు డ్రైవరు గుర్తించిన లోపాలను గ్యారేజీలో నివేదిస్తే సరిపోతుందని ఆ మేరకు మరమ్మతులు చేపడతామని పేర్కొంది.

ప్రస్తుతం ఏం జరుగుతోంది: పల్లెవెలుగు, సిటీ ఆర్డనరీ బస్సులు ప్రతి 12 వేల కి.మీ. తిరిగిన తర్వాత ఒకసారి, ప్రతి 36 వేల కి.మీ., ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, గరుడ తదితర హైఎండ్ బస్సులకు ప్రతి 15 వేల కి.మీ.కు, ప్రతి 45 వేల కి.మీ.కు గ్యారేజీకి తీసుకెళ్లి అవసరమైన మరమ్మతులు చేయాలి.

కొత్త మార్పు ఏమిటంటే: ఇకపై అన్ని బస్సులనూ ప్రతి 20 వేల కి.మీ. తిరిగిన తర్వాత ఒకసారి, 60 వేల కి.మీ. తిరిగిన తర్వాత మరోసారి మరమ్మతులు చేస్తారు. దీనిప్రకారం ఇప్పటివరకూ ప్రతి రెండు మూడు నెలలకోసారి జరుగుతున్న మరమ్మతులు ఇకపై ఆరు నెలలకోసారి జరుగుతాయి. నాలుగు నెలలకోసారి జరగాల్సిన మరమ్మతులు తొమ్మిది నెలలకోసారి జరుగుతాయి.

ఈ మార్పులతో నష్టమేంటి?

- మెకానిక్ రోజూ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేయడానికి... డ్రైవర్ వాహనం నడిపేటప్పుడు గుర్తించిన లోపాలను మాత్రమే చెప్పడానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. డ్రైవర్లు చాలా లోపాలను గమనించలేరు. ఫలితంగా బస్సు రోడ్డెక్కాక మొరాయించవచ్చు.
- మరమ్మతులు చేయాల్సిన కాలావధిని పెంచేయడం మూలంగా వాహనాలు నిర్వహణ లేక తరచూ మొండికేయవచ్చు.
- ఉదాహరణకు పవర్ స్టీరింగ్ ఆయిల్ లీకవడాన్ని డ్రైవర్ గమనించలేరు. ఆ సమస్య ఉంటే బస్సునడుస్తున్నప్పుడే స్టీరింగ్ కదలదు.
- బ్రేక్ సిస్టమ్‌లో ప్లాస్టిక్ ఎయిర్ పైపులు ఉంటాయి. వాటిని పరిశీలించకపోతే రోజూ ఎయిర్ లీకై బ్రేక్‌లు పనిచేయవు. ఇవన్నీ రోడ్డు ప్రమాదాలకు ఆస్కారమిచ్చే అంశాలు. ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేసేవి.

కార్మిక సంఘాలు ఏమంటున్నాయంటే

- డ్రైవర్ గుర్తించలేని అనేక లోపాలు మెకానిక్ తనిఖీల్లోనే బయటపడతాయి. వాటిని ఎత్తేయడం సరికాదు. దీర్ఘకాలంలో ఇది సంస్థ నిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. తక్షణమే ఆదేశాలను ఉపసంహరించుకోవాలి.
  – సి.చంద్రయ్య, నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు
- గ్యారేజీ కార్మికులపైన పనిభారం పెరుగుతుంది. దాదాపు 1500 మెకానిక్ సిబ్బంది ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుంది. అవసరమైతే సమ్మె నోటీసు ఇస్తాం.
  – పలిశెట్టి దామోదర్‌రావు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు

తొలగించింది కేంద్రమైతే విమర్శలు రాష్ట్రంపైనా?: జూపూడి

ఈనాడు డిజిటల్, అమరావతి: సాక్షర భారత్ మిషన్ సమన్వయకర్తలను తొలగించింది కేంద్ర ప్రభుత్వమైతే, రాష్ట్ర ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు విమర్శించారు. సచివాలయంలో జూపూడి మాట్లాడారు. సాక్షర భారత్ సమన్వయకర్తలను కొనసాగించేందుకు కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ముడుసార్లు లేఖ రాసిందని వివరించారు. దేశవ్యాప్తంగా లక్ష మందిని తొలగించామని కేంద్రం వివరణ ఇచ్చిందని చెప్పారు. సీఎంకు తెలియకుండా రాష్ట్రంలో సాక్షరభారత్ సమన్వయకర్తలను తొలగించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.

మోదీపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

ఈనాడు, శ్రీకాకుళం: గత నాలుగేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్రానికి ఏమేమి చేసిందన్న వివరాలతో పుస్తకరూపంలో ఇంటింటికి పంపిణీ చేస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. జిల్లాల పర్యటనను శ్రీకాకుళంలో బుధవారం ప్రారంభించిన సందర్భంగా పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అనేక నిధులు ఇచ్చినా.. అవి నీతికి పాల్పడుతూ.. భాజపాను, ప్రధాని నరేంద్రమోదీని రాష్ట్ర ప్రజల ముందు దోషిగా నిలబెట్టేందుకు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. నిధులు ఇచ్చేందుకు కేంద్రం సుముఖంగా ఉన్నా ప్రత్యేకవాహక సంస్థలు ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం దేశవ్యాప్తంగా 150 సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకమైనా ప్రవేశపెట్టిందా అని ప్రశ్నించారు. నాలుగేళ్లలో అవినీతిలో పోటీ పడ్డారంటూ ధ్వజమెత్తారు. ఇసుక వ్యవహారంలో తెదేపా ఎమ్మెల్యేలు అక్రమాలకు పాల్పడుతున్నారని, ఎన్‌ఆర్‌ఈజీఎస్, నీరు-చెట్టు, పంట కుంటలు, మరుగుదొడ్ల నిర్మాణాల్లో కూడా అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా జిల్లాల వారీగా ఎన్నికల ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలతో పాటు ప్రకాశంను కూడా వెనకబడిన జిల్లాగా గుర్తించి అభివృద్ధి చేస్తామని చెప్పారు.

24న పోలవరానికి కన్నా: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఈ నెల 24న పోలవరం వెళ్తున్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పి.వెంకటసత్యనారాయణ వెల్లడించారు. ప్రాజెక్టును పరిశీలించి ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తారన్నారు.

ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం: సోము వీర్రాజు

కార్పొరేషన్ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: రాష్ట్రవిభజన సందర్భంగా ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని, కడప ఉక్కు కర్మాగార నిర్మాణం సహా విశాఖ రైల్వే జోన్‌పై త్వరలోనే ప్రకటన చేస్తామని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం విశాఖలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఉన్న పదేళ్ల సమయంలో కేంద్రంలోని భాజపాకు ఇంకా ఆరేళ్లు మిగిలి ఉండగా.. గత ఎన్నికలవేళ ప్రజలకిచ్చిన హామీల అమలుకు తెదేపాకు ఏడాది మాత్రమే ఉందన్నారు. ఏపీకి ఇచ్చిన అత్యధిక హామీలను ఇప్పటికే నెరవేర్చామని, మిగతావాటినీ త్వరలో పూర్తిచేస్తామన్నారు. ఇటీవల జిల్లాల్లో పర్యటించి రాష్ట్రప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్నామన్నారు. నీరు-చెట్టు కార్యక్రమంలో రూ.14 వేల కోట్ల వ్యయం చేసినట్లు చూపుతున్నారని, రూ.10 వేల కోట్లు మట్టి తవ్వడానికే వినియోగించారన్నారు. ఒక కంపెనీకి లాభం చేకూర్చడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం నిర్మాణం ప్రారంభించారని ఆరోపించారు. గత ఐదేళ్లలో రూ.10లక్షల కోట్లు ఖర్చు చేసినా, రాష్ట్రంలో నేటికీ పేదలకు ఇళ్లు, మౌలిక వసతులు కల్పించలేకపోయారని విమర్శించారు. సర్వశిక్ష అభియాన్‌లో రూ.1.50 లక్షల కోట్లు అవినీతి జరిగిందన్నారు.

కుట్రచేస్తూ దొరికిపోయి.. నోటీసులతో బెదిరిస్తారా?

బుగ్గనపై ఎంపీ కనకమేడల ధ్వజం

ఈనాడు అమరావతి: కుట్ర రాజకీయాలు చేస్తూ దొరికిపోయిన వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు సభాహక్కుల ఉల్లంఘన నోటీసులిస్తున్నారని తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. "బుగ్గన దిల్లీలోని సౌత్ అవెన్యూలో రాంమాధవ్ ఇంటికెళ్లినట్టు కారు డ్రైవర్ చెబుతున్నారు. లాగ్‌బుక్‌లోనూ నమోదైంది. భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణతో కలసి రాంమాధవ్‌ను కలిశారా, లేదా అన్నదానిపై బుగ్గన ఎందుకు సమాధానం చెప్పలేదు?" అని ఆయన ప్రశ్నించారు.

పర్యాటక ప్రదేశంగా శ్రీహరికోట ప్రాంతం!

ఈనాడు డిజిటల్, అమరావతి: విశాఖపట్నం పరిధిలోని బీచ్‌లలో ప్రతి 10 కిలోమీటర్లకు ఒకచోట పర్యాటకుల కోసం మౌలిక వసతులను కల్పించాలని ఏపీ పర్యాటకశాఖ నిర్ణయించింది. నెల్లూరులోని శ్రీహరికోట అంతరిక్ష కేంద్రాన్ని పర్యాటకులు సందర్శించేందుకుగల అవకాశాలను పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. పారిశ్రామిక పర్యాటకంలో భాగంగా తిరుపతి సమీపంలోని శ్రీసిటీని చూపించేందుకు చర్యలు తీసుకోవాలని పర్యాటకశాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఆ శాఖ అధికారులకు సూచించారు. 'ప్రజల అవసరాలకు అనుగుణంగా పర్యాటకాభివృద్ధి' అనే అంశంపై పర్యాటకశాఖ క్షేత్ర స్థాయి అధికారులతో బుధవారం విజయవాడలో కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా మీనా మాట్లాడారు. అరకు ప్రాంతంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గిరిజనులకు భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. హైదరాబాద్ బిర్యానీ స్థాయిలో బొంగు చికెన్ (బాంబూ చికెన్) ప్రాధాన్యతను విశ్వవ్యాప్తం చేయాలని పేర్కొన్నారు.

మలేషియా వర్సిటీ కళాశాలతో ఒప్పందం

ఈనాడు, అమరావతి: అకడమిక్ కార్యక్రమాలు, పాఠ్యాంశాల అభివృద్ధికి పరస్పరం అధికారుల మార్పు, రాష్ట్ర వర్సిటీల్లో డ్యూయల్ డిగ్రీ కోర్సుల అమలుపై ఉన్నత విద్యామండలి, మలేషియా లింకన్ వర్సిటీ కళాశాల మధ్య బుధవారం అవగాహనా ఒప్పందం కుదిరింది. ఇది ఐదేళ్లపాటు కొనసాగుతుంది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు, అధ్యాపకులు ఈ ఒప్పందంలో భాగంగా మలేషియా లింకన్ వర్సిటీని సందర్శించవచ్చు. కోర్సుల డిజైనింగ్, వినూత్న బోధన పద్ధతుల్లోని అనుభవాలను పరస్పరం పంచుకుంటారు.

పశ్చిమలో నీరవ్ మోదీ బినామీలు!

దేవరపల్లి, న్యూస్‌టుడే: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీకి పశ్చిమ గోదావరి జిల్లాలో బినామీల పేరిట ఆస్తులు ఉన్నట్లు సీబీఐ అనుమానిస్తోంది. బినామీలుగా భావిస్తున్న జిల్లాకు చెందిన కొందరు వ్యక్తుల ఆస్తుల వివరాలను తమకు సమర్పించాలంటూ బెంగళూరులోని సీబీఐ న్యాయస్థానం ఇక్కడి అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం దేవరపల్లి, కొవ్వూరు, చాగల్లు మండలాలకు చెందిన కొందరి ఆస్తుల వివరాలను పరిశీలించింది. వీటికి సంబంధించి కొన్ని పత్రాలను తాజాగా న్యాయస్థానానికి సమర్పించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

విద్యుత్తుశాఖ భూముల రక్షణకు చర్యలు: కళా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్తుశాఖకు సంబంధించిన భూములను గుర్తించి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని ఇంధనశాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో ఎక్కడా విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయంలో బుధవారం ఇంధన శాఖాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. 'విశాఖపట్నంలో భూగర్భ విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలి. డిజిటల్ పేమెంట్లపై ప్రజల్లో చైతన్యం తేవాలి' అని మంత్రి సూచించారు.

మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

makarandam@eenadu.in

చెట్లు చిగురిస్తాయి... ఆకులవుతాయి...
అవి రాలి తిరిగి చెట్టుకు ఎరువుగా మారతాయి... కొత్త చిగుళ్లకు కారణమవుతాయి...
ఆత్మ కూడా అంతే మనిషి రూపంలో పుడుతుంది.
ఆ శరీరంతో ఎన్నో కర్మలు నిర్వర్తిస్తుంది.
వాటినే భావి జన్మపరంపరకు బాటలుగా వేసుకుంటుంది.
ఈ చక్రీయ భ్రమణంలో పుట్టుకకు, చావుకు అతీతమైన సహజ స్థితి ఒకటుంటుంది.
ఎవరికైనా సరే ఆ స్థితికి తీసుకెళ్లే సాధనా మార్గమే యోగం.
ఒక్కమాటలో చెప్పాలంటే యోగా మనల్ని మనకు పరిచయం చేసే ఏకైక మార్గం.
శరీరాన్ని సాధనంగా చేసుకుని... శ్వాసను మార్గంగా మార్చుకుని
మనిషి చేసే ఈ ఆధ్యాత్మిక యాత్ర అద్భుతమైంది. అపురూపమైంది.
ఆరోగ్యం, ఆనందం, ఆయుష్షు దీని ఉప ఉత్పత్తులు.



నీలోని నీవు ఎలా ఉన్నావు?

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఆయనే స్ఫూర్తి..

మహేశ్వరుడు యోగానంద స్వరూపుడు. భారతీయ సంప్రదాయంలోని యోగమంతా కలిసి ఒక మూర్తిగా రూపొందితే అదే శివ స్వరూపం. సాధకులకు ఆ రూపం, వ్యక్తిత్వం అంతులేని స్ఫూర్తినిస్తుంటాయి. చంచలమైన మనసును ఎలా అదుపు చేసుకోవాలో యోగశాస్త్రం ఒక్కో మెట్టుగా విధానాలన్నిటినీ పతంజలి మహర్షి చెప్పారు. మనసును స్థిరం చేసినప్పుడు

చేరినప్పుడు మనిషి సమాజాన్ని చూసే దృక్కోణమే మారిపోతుంది. జ్ఞానాన్ని పొందాలనుకున్న ఏ సాధకుడైనా యోగ సమాధి నిష్ఠలో ఉన్న యోగమూర్తి అయిన శివుడి స్వరూపాన్ని గమనిస్తే తాను అనుసరించాల్సిన మార్గమేమిటో బోధపడుతుంది.

పద్మాసనం

యోగసాధనలో శివుడు ఈ ఆసనంలోనే ఉంటాడు. అందులో ఉండి ధ్యానం చేస్తే హృదయస్థానంలో మనసును ఏకాగ్రం చేయడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎడమకాలును కుడి తొడపై, కుడి కాలును ఎడమ తొడపై ఉంచి రెండు చేతులను మోకాళ్ల మీదకు తెచ్చి.. ఎడమ అరచేతిలో కుడి అరచేతిని ఉంచుతారు. ఆ స్థితిలో వెన్నెముక నిటారుగా ఉంటుంది. ధ్యానం చేయడానికి శరీరం అనువుగా ఉంటుంది. శివుడి చిన్ముద్ర జ్ఞానానికి చిహ్నం.

యోగ సమాధి

శివస్వరూపంలో కనిపించే మరొక మహోన్నత చిహ్నం సమాధి స్థితి. సమాధి అంటే సాధకుడు దేన్నైతే ధ్యానిస్తున్నాడో దానిలో లీనమైపోవడం. యోగానికి సంబంధించిన ఎనిమిది అంశాలలో సమాధి చివరిది. **ఉన్మని, మనోన్మని, అమరత్వం, లయం, తత్వం, శూన్యాశూన్యం, పరమపదం, అమనస్కం, అద్వైతం, నిరాలంబం, నిరంజనం, జీవన్ముక్తి, సహజం, తుర్యం, తురీయం..** ఇవన్నీ సమాధికి పర్యాయపదాలు.

మూడు కళ్లూ...

యోగమూర్తి అయిన శివుడికి ఉండే మూడు కళ్లు ఆయన సాధనకు సంబంధించిన విషయాలను తెలియజేస్తుంటాయి. యోగసాధనలో సఫలీకృతులైన సాధకులు సమాధిస్థితిలో చేరుకున్నప్పుడు నుదురు భాగంలో ఉండే ఆజ్ఞాచక్రం దగ్గర ఆత్మజ్యోతి ప్రకాశిస్తుంది. ఆ స్వామికుండే మూడోకన్ను ఆజ్ఞాచక్రంలో ప్రకాశించే ఆత్మజ్యోతికి నిదర్శనం. అలాగే సత్వరజస్తమోగుణాలనే మూడు గుణాలకు శివుడు అతీతుడనే అర్థంకూడా ఉంది.

మెడలో పాములెందుకు?

యోగనిష్ఠలో ఉన్న పరమేశ్వరుడి మెడలో పాములు కనిపిస్తాయి. ఈ పాములు యోగసాధన ద్వారా చెడును అదుపు చేయవచ్చనే సందేశాన్నిస్తూ కనిపిస్తాయి. ఆ స్వామి శిరసున ధరించిన గంగ కూడా యోగ సాధనకు నిదర్శనమే! యోగ సాధకుడు సంపదలను స్వార్థం కోసం కాకుండా.. పరుల కోసం వినియోగించే తత్వాన్ని కలిగి ఉంటాడన్న సందేశం గంగ ద్వారా అందుతుంది.

శరీరాన్ని బుద్ధితో, బుద్ధిని మనస్సుతో, మనసును ఆత్మతో, ఆత్మను పరమాత్మతో ఐక్యం చేయగలగాలి. ఇలా చేయడం అంత తేలికేం కాదు. ఈ స్థితిని సాధించాలంటే ఒక క్రమ పద్ధతిలో జీవించాలి. ఆలోచించాలి. ఆ జీవన విధానాన్ని యోగ సాధన అంటారు. శరీరం, మనసు కేంద్రీకృతమైనప్పుడే ఈ లక్ష్యాన్ని సాధించగలుగుతాం. ప్రాణాయామ ధ్యాన ఆసనాదులు యోగసిద్ధికి దోహదం చేస్తాయి.

రామాయణం ఆరంభంలో వాల్మీకి వర్ణించిన పదహారు సత్పురుష లక్షణాలలో 'ఆత్మవాన్' అనేదొకటి. 'రాముడు ఆత్మవిదుడు' అన్నారు వాల్మీకి. అది యోగి లక్షణం. 'నీకు పట్టం కడుతున్నాను' అని తండ్రి అన్నప్పుడు రాముడు పట్టరాని సంతోషంతో ఊగిపోలేదు. మర్నాడే అరణ్యాలకు పోవాలని తీర్పిస్తే కుంగిపోనూలేదు. అడవుల్లో కష్టాలకు కంటతడి పెట్టిన దాఖలాలు లేవు. 'ఏనాడో పాపం చేసి పుట్టాను. ఈ కోతి మూకతో వేగుతున్నాను' అని చింతించిన ఘట్టాలు లేవు. భరతునితో, విభీషణుడితో మధ్యలో గుహుడితోనూ ఆయన ఒకేలా ఉన్నాడు. అయోధ్యలో, అడవిలో ఒకేలా ఉండగలిగాడు. అదే యోగజీవనమంటే!

ఇంతటి స్థిర చిత్తం, స్థిత ప్రజ్ఞత రావాలంటే తనను తాను తెలుసుకోవాలి. శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా అదుపు చాలా ముఖ్యం. అందుకే యోగమంటే చిత్తవృత్తుల నిరోధంగా పతంజలి మహర్షి నిర్వచించారు. మన శరీరంలో 72వేల నాడులు, 206 ఎముకలు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఐదు కోశాలు అనేక ధాతువులు ఉన్నాయి. శరీరం పటిష్ఠంగా ఉండాలంటే నాడీ మండలం దృఢంగా ఉండాలి. నాడీ మండలాన్ని ప్రభావితం చేస్తూ ప్రధాన శక్తి కేంద్రాల్ని షట్చక్రాలుగా వ్యవహరిస్తారు. మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరం, అనాహతం, విశుద్ధం, ఆజ్ఞ అనే ఆరు చక్రాల్ని అధిగమిస్తే పరమపదమైన సహస్రార చక్రం ఉంటుంది. ఆ చక్రాన్ని అందుకోవడానికి సాధకులు సాగించే మార్గమే యోగ. 'ఉద్ధరేదాత్మనాత్మనం' తనను తానే ఉద్ధరించుకోవాలి. ఇది యోగావలంబనకు మౌలిక సూత్రం. **ఆరోగ్యమనేది ఒకరి నుంచి అరువు తెచ్చుకునేది కాదు. ఆధ్యాత్మిక శక్తి ఒకరు ధారపోస్తే సంక్రమించేది కాదు. ఎవరికివారు శోధించుకోవాలి. సాధించాలి. ఆస్వాదించాలి. 'యోగ ఫర్ లివ్ లైఫ్ టు పొటెన్షియల్' అనే నినాదంతో నేటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించింది.** 'జీవితాన్ని శక్తివంతం చేసుకోవడానికి యోగ సాధన చేయాలి' అనే శారీరక ఆరోగ్య సూత్రాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. యోగ అనేది మధురమైన మిఠాయి లాంటిది. ఆస్వాదిస్తేనే దాని వైశిష్ట్యం తెలుస్తుంది.

రకరకాల ఆసనాలు, ప్రాణాయామం వంటి ప్రక్రియలను సాధన చేయడమే యోగా అని చాలామంది పొరబడతారు. వాస్తవానికి అవి సోపానాలు మాత్రమే! యోగజీవనం సిద్ధించడానికి అవి సాధనాల వంటివి. పరికరాల వంటివి.

యోగమంటే పరిపూర్ణ జీవన విధానం. తొణికిసలాడే అద్భుతమైన జీవన కళ! యోగస్థితి ఉన్నతమైందని గీతాచార్యుడు బోధించాడు. యోగి కావాలని అర్జునుణ్ని స్వయంగా ఆదేశించాడు.

'హంస'ధ్వని

మనిషి బతుకుకే కాదు తనను తాను తెలుసుకునే యోగ ప్రక్రియలకు కూడా మనం పీల్చి వదిలే శ్వాసలే మూలాధారం. ముక్కులోని గాలి మోక్షానికి దారి... అన్నారు యోగి వేమన. మనిషి నిమిషానికి సగటున 15 సార్లు ఊపిరి పీలుస్తాడు. గంటకు 900 సార్లు. రోజుకు 21,600 సార్లు మన ప్రయత్నమేమీ లేకుండా శ్వాసక్రియ జరుగుతుంటుంది. శ్వాస లోనికి వెళ్లేటప్పుడు 'స' అని, బయటకు వచ్చేటప్పుడు 'హ'కార ధ్వని చేస్తూ ఉంటుంది. దీన్నే హంస మంత్రమని వివరిస్తోంది క్రియా యోగం. మనిషి శరీరంలో సహజంగా జరిగే ఈ మంత్ర జపాన్ని పూర్తి ఎరుకతో... తెలిసి చేయడమే తనను తాను తెలుసుకునే మార్గమంటుంది ఈ యోగ ప్రక్రియ.

పంచప్రాణాలంటే..

యోగ అభ్యాసం అనగానే ముందుగా వినిపించే మాట ప్రాణాయామం. అసలీ ప్రాణం అంటే ఏంటి? అది ఎన్ని రకాలు?. లోక వ్యవహారంలో "నీమీదే పంచప్రాణాలు పెట్టుకున్నాను!" అనే మాట తరచూ వినిపిస్తుంటుంది. ఈ నానుడిలోని పంచప్రాణాల వివరణను మన రుషులు ఎంతో విశ్లేషించి చెప్పారు.

"హృది ప్రాణోగుదే పానః సమానో నాభి సంస్థితః

ఉదానః కంఠ దేశస్థో వ్యానః సర్వశరీరగః"

ఈ శరీరంలో అయిదు ప్రాణవాయువులు ఉంటాయి. వాటికి ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యాన అని అయిదు పేర్లు. హృదయంలో ప్రాణవాయువు, గుదంలో అపానవాయువు, నాభిలో సమాన వాయువు, కంఠంలో ఉదాన వాయువు, శరీరం అంతటా వ్యాన వాయువు వ్యాపించి ఉంటుంది.

తిండీ యోగమే

యోగం అనే పదానికి శబ్దార్థ చంద్రిక సూచించిన అర్థాల్లో 'కూడిక', కూర్పు అనేవి చాలా ముఖ్యమైనవి. యోగ సాధనలు మనసును కట్టడి చేస్తాయి. దాని స్వేచ్ఛా సంచారాన్ని అదుపు చేయడం ద్వారా మనిషితో మనసుకు కూర్పునిస్తాయి. అలాగే తనువు, మనసు కూడి ఉండడమే అసలైన యోగం. చిత్త వృత్తుల నిరోధం ద్వారా మనసుతో చక్కటి స్నేహం, అవగాహన ఏర్పడితే మనిషికి ప్రస్తుతం తానున్న స్థితి గురించి పూర్తి ఎరుక ఉంటుంది. ఇలా మనసుకు, తనువుకు సంబంధాన్ని ఏర్పరచడంలో ఆహారం చాలా ముఖ్య పాత్ర పోషిస్తుంది. అందుకే యోగా చేసేవారు తప్పనిసరిగా ఆహార నియమాలు పాటిస్తారు. మనం తినే ఆహారం రాజస, తామస, సత్త్వ గుణాల్లో ఉంటుంది. ఏరకమైన ఆహారం ఎక్కువగా తీసుకునే వ్యక్తులు అలాంటి స్వభావాలను కలిగి ఉంటారని యోగ శాస్త్రం చెబుతుంది. సత్త్వ శుద్ధి కలిగిన ఆహారం సాత్త్విక భావాలనిస్తుంది. ఇలాంటి ఆహారం తీసుకునే వారి శరీరానికి, మనసుకు ఒక దివ్య బంధం ఏర్పడుతుంది. ఈ కూడికే ఆహార యోగం.

సాధన సమయంలో శారీరక, మానసిక మార్పులను, అనేక ప్రలోభాలను ఓర్పుతో, నేర్పుతో జయించాల్సి ఉంటుంది. రజో, తమో గుణాలున్న ఆహారం తీసుకునే వారికి ఈ శక్తి తక్కువగా ఉంటుంది. వీరు యోగ సాధనలో నిలవడం కష్టమవుతుంది. ఇలా నిలబడలేనివారిని రామకృష్ణ పరమహంస 'అల్పబుద్ధులు'గా అభివర్ణించారు. సాధనలో అలా జారిపోతున్న వారి గురించి పతంజలి మహర్షి 'స్థాన్యువని మంత్రణే సంగస్మయాకరణం పునరనిష్ట ప్రసంగాత్' అనే సూత్రంతో హెచ్చరించారు. తీసుకునే ఆహారం యోగ సాధకుల పాలిట అపాయం అవుతుంది. దీన్ని జయించే ఏకైక ఉపాయం యుక్తాహారం. అదే సాత్త్వికాహారం. యోగ సాధనలో పరిపూర్ణత సాధించిన వారు సిద్ధులమవుతారు. వారి మానసిక స్థితి అనుక్షణం సాత్త్వికంగా ఉంటుంది.

సరైన ఆహారం తీసుకోకపోవడమే కాదు అసలు ఆహారం తీసుకోకపోవడం కూడా సరైన విధానం కాదు. యోగ సాధకులకు ఇది మంచిది కాదని మాస్టర్ సి.వి.వి.(కంచుపాటి వెంకటరావు వెంకస్వామి రావు) చెప్పేవారు. సాధన ప్రారంభించే ముందు అందరినీ అల్పాహారం తీసుకోమని చెప్పేవారు. ఆయన రూపొందించిన యోగ విధానం పేరు 'భ్రుక్త రహిత తారక రాజ యోగ సాధన'. ఈ సాధన చేస్తున్నప్పుడు ఎవరైనా అతిగా ఆహారం తీసుకుని వచ్చినా, ఎవరైనా అసలు ఆహారం తీసుకోకున్నా ఆ విషయాలు మాస్టర్‌కు వెంటనే తెలిసేది. వారికి ఆయన తగిన విధంగా యోగ మార్గాలను సూచించే వారు. సాధన చేస్తున్న సమయంలో కడుపు నిండిన వారు, ఖాళీ కడుపుతో ఉన్న వారు శారీరకంగా ఒకే స్థితిని పొందడం భక్తులు గమనించేవారు. కాబట్టి యోగ సాధకులు ఆహార విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యోగశాస్త్రం చెబుతుంది.

నీకు నువ్వు ఇచ్చుకునే విలువైన నజరానా యోగ సాధన

– టిబెట్ రచయిత రిన్‌పోచే!

పనిలో నైపుణ్యం చూపించు!

చేసే పనిలో నేర్పరితనాన్ని చూపించగలగడం కూడా యోగమే. యోగః కర్మాను కౌశలమ్ అంటారు. మనం ఒక పని చేస్తున్నప్పుడు మన మనసు దానిమీదే లగ్నం కావాలి. ఆ సమయంలో వేరే విషయాలేవీ మనసుపై ప్రసరించవు. యోగ పరిభాషలో దీన్ని చిత్త వృత్తి నిరోధం అంటారు. దీన్నే ఏకాగ్రత అని పిలుస్తాం. దీనివల్ల ఆ పని నాణ్యంగా ఉంటుంది. సత్ఫలితాలు వస్తాయి. ఇలా పని చేసేవాడు యోగి అవుతాడు.

అనాశ్రిత కర్మఫలం
కార్యం కర్మ కరోతి యః

అంటుంది ఆత్మ సంయమ యోగం. అంటే ఎలాంటి ఫలితాన్ని ఆశించకుండా పని చేయమంటుంది. మరి ఫలితాన్ని ఆశించకుండా కర్మాచరణం ఎలా సాధ్యపడుతుంది. నేల దున్ని, నారు పోసి, నీరు పెట్టిన రైతన్న ఎలాంటి ఫలితాన్ని ఆశించొద్దా... కచ్చితంగా ఆశించాలి. కానీ మనం పని చేసే విధానంలోనే మార్పులు రావాలి. కర్తవ్య కర్మను చేసుకుంటూ పోయేవాడు యోగి. ఇక్కడ కర్తవ్య కర్మ అంటే తనకు కేటాయించి ఉన్న పని అని అర్థం. అయితే నా పనిని నేను చేసుకుంటూ పోతున్నాను. అనే భావంతో పని చేయడం వల్ల ఒక సమత్వ స్థితి వస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ స్థితిలో చేసే వారి పనిలో నాణ్యత ఉంటుంది. దినచర్యలో దైవ సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ, చేసే ప్రతి పనీ దైవ సేవగా భావిస్తూ, విశ్వ ప్రేమను, సర్వభూత దయా గుణాన్ని అలవాటు చేసుకోవాలి. ఈ అభ్యాసం వల్ల సృష్టి అణువణువులో దైవత్వాన్ని చూడగలుగుతాం. ఇదే అనన్య చింతన. ఈ అభ్యాసం ఫలించిన సాధకుడికి భౌతికంగా, మానసికంగా సమ దృష్టి కలుగుతుంది. మనసులో ప్రతికూల, అనుకూల భావాలు క్రమంగా తగ్గిపోతాయి. వినియోగాన్ని బట్టి మాత్రమే ఆ వస్తువును స్వీకరిస్తాం తప్ప విలువను బట్టి కాదు. న్యాయమూర్తి చెడ్డవాడికి శిక్ష వేసినా అది కర్తవ్య నిర్వహణలో భాగమే తప్ప అతని మనసుకు తాకదు. అభ్యాస యోగ కౌశలుడు తనకు ఎదురైన పరిస్థితుల విషయంలో ఒక న్యాయమూర్తిగా మాత్రమే ప్రవర్తిస్తాడు. విశాలమైన విశ్వంలో తన పాత్రను గుర్తించి సమ దర్శనాన్ని, కర్మాచరణలో నైపుణ్యాన్ని సాధించి తన జీవన పయనంలో సురక్షితంగా గమ్యాన్నిచేరుకుంటాడు. కృతార్థుడు అవుతాడు.

రచన: ఎర్రాప్రగడ రామకృష్ణ, యల్లాప్రగడ మల్లికార్జునరావు, కావూరి రాజేష్‌పటేల్

ఈ విషయం అర్థం చేసుకో...

ఈ సృష్టి అంతా రేఖాగణిత సూత్రాల ఆధారంగా ఉంటుంది. మన శరీరం కూడా అంతే! కొన్నేళ్లు వెనక్కి వెళ్తే.. తుపాను వచ్చిన ప్రతిసారీ టీవీ ప్రసారాల్లో అంతరాయాలు వచ్చేవి. యాంటెన్నాని సరిచేయాల్సి వచ్చేది. అది ఒక విధమైన కోణంలో ఉంటేనే టీవీలో ప్రసారాలు బాగా వచ్చేవి. ఈ శరీరం కూడా అలాంటిదే! మీరు దానిని సరైన స్థితిలో ఉంచితే, అది పూర్తి విశ్వాన్ని గ్రహించగలదు. మీరు దానిని వేరే విధంగా ఉంచితే సమస్యలు వస్తాయి. మీకు మీ పంచేంద్రియాలు తప్ప ఇంకేమీ తెలియవు. మన శరీరం ఒక బారోమీటర్ వంటిది. మీకు దానిని ఎలా చూడాలో తెలిస్తే, అది మీ గురించి, మీ చుట్టూ ఉన్న ప్రపంచం గురించి అంతా తెలియజేస్తుంది. మీ శరీరం మీకు ఎప్పుడూ అబద్ధం చెప్పదు, అందుకనే మనం యోగాలో మన శరీరాన్ని నమ్మడం నేర్చుకుంటాము. యోగా ద్వారా మనం మన భౌతిక శరీరంలో జరిగే కొన్ని నిర్బంధపు ప్రక్రియలను స్పృహతో జరిపే ప్రక్రియలుగా మారుస్తాం. తద్వారా శరీరాన్ని అన్నింటినీ గ్రహించగలిగే, తెలుసుకోగలిగే ఒక శక్తిమంతమైన పరికరంగా మారుస్తాం. శరీరాన్ని ఎలా చదవాలో తెలిస్తే, అది మీ సామర్థ్యాన్ని, మీ పరిమితులని మీ భూత, భవిష్యత్, వర్తమానాలన్నిటినీ మీకు తెలియజేస్తుంది.

యోగా అన్నప్పుడు చాలా మంది శరీరాన్ని అసాధ్యమైన భంగిమల్లోకి తిప్పడం అని అర్థం చేసుకుంటారు. యోగా అంటే శరీరాన్ని మెలికలు తిప్పటం లేక తల్లక్రిందులుగా నుంచోవటం కాదు. యోగా అనేది ఒక వ్యాయామ పద్ధతి కాదు, అది మనిషిని తను చేరుకోగల అత్యున్నత స్థితికి చేరవేసే ఒక సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానం. అసలు యోగా అంటే ఐక్యం అని అర్థం . మీరు అన్నిటితో ఐక్యం అయితే, అదే యోగా!

- సద్గురు జగ్గీ వాసుదేవ్

ఏ క్షేత్రంలో అయినా మూలవిరాట్టుకు నిత్యాభిషేకాలు నిత్యం జరుగుతాయి. సందర్భానుసారం సహస్ర ఘటాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తుంటారు. కానీ, పూరీలో కొలువైన జగన్నాథుడికి ఏడాదికి ఒకేసారి అభిషేకం నిర్వహిస్తారు. ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి రోజు ఇది జరుగుతుంది. దీనిని దేవస్నాన పూర్ణిమగా వ్యవహరిస్తారు.

జగన్నాథునికి జలుబు.. జ్వరం!

పూరీలోని మూలవరులను వేప చెక్కలతో రూపొందిస్తారు. నిత్యాభిషేకాలు చేస్తే కలప పాడవుతుందని ఇలా ఏడాదికోసారి అభిషేకం నిర్వహించే సంప్రదాయం వచ్చింది. స్వామివారికి నిత్యం దర్పణ స్నానం నిర్వహిస్తారు. అంటే.. స్వామివారి ఎదుట అద్దం ఉంచి.. అందులో కనిపించే ప్రతిబింబానికి అభిషేకం చేస్తారన్నమాట. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమినాడు మాత్రం మూలమూర్తికి ప్రత్యక్ష అభిషేకం చేస్తారు. జగన్నాథుడితో పాటు బలభద్రుడు, సుభద్రలకు కూడా అభిషేకం ఘనంగా నిర్వహిస్తారు.

స్నానపౌర్ణమి ఉత్సవం పూర్తయ్యాక.. ముగ్గురు దేవతా మూర్తులను ఆలయ ప్రాంగణంలోని చీకటి మందిరానికి తరలిస్తారు. దీనికీ ఓ కారణముంది. నీటిలో తడిసిన దేవతలకు జలుబు చేస్తుందని, జ్వరం వస్తుందని ఓ నమ్మకం. అందుకే దేవతామూర్తులను పదిహేను రోజుల పాటు చీకటి మందిరంలో ఉంచి ప్రత్యేకంగా చూసుకుంటారు. ఈ పదిహేను రోజులు స్వామికి సమర్పించే నైవేద్యాల్లోనూ ఆయుర్వేద మూలికలు వాడుతారు. ఈ పదిహేను రోజులు భక్తులకు జగన్నాథుడి దర్శనం లభించదు. గర్భాలయంలో స్వామివారి పటాన్ని ఉంచుతారు. దీనిని పట్టచిత్రా అని పిలుస్తారు. సరిగ్గా రథయాత్రకు ముందురోజు చీకటి మందిరం నుంచి మూలవరులను గర్భాలయానికి తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు.

ఈనాడు సినిమా

సభకు నమస్కారం

నాని

తెలుగులో మహా పాపులర్ డైలాగుల్లో 'సభకు నమస్కారం' ఒకటి. ఇప్పుడు ఇదే టైటిల్‌గా మారిపోయిందని టాలీవుడ్ టాక్. నాని కథానాయకుడిగా దిల్‌రాజు ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఓ యువ దర్శకుడు ఈ సినిమాతో చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి 'సభకు నమస్కారం' అనే టైటిల్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. రాజకీయ నేపథ్యంలో సాగే సినిమా ఇదని, అందుకే ఆ తరహా టైటిల్ నిర్ణయించారని సమాచారం. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తి వివరాలు తెలుస్తాయి.

కొత్త కబుర్లు

లండన్‌లో లవ్ స్టోరీ

'అఖిల్', 'హలో' తరవాత ముచ్చటగా మూడో ప్రయత్నంగా ఓ సినిమా చేస్తున్నాడు అఖిల్. 'తొలిప్రేమ'తో యువ హృదయాల్ని ఆకట్టుకున్న వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ వారంలోనే లండన్‌లో చిత్రీకరణ మొదలవ్వబోతోంది. అక్కడ ఓ భారీ షెడ్యూల్ చిత్రీకరిస్తారు. అక్కడి నుంచి తిరిగొచ్చాక హైదరాబాద్‌లో మరో షెడ్యూల్ ఉంటుంది. ఇందులో అఖిల్ ఓ ప్లేబాయ్‌గా కనిపించబోతున్నట్టు టాక్. అమ్మాయిల్ని వల్లో వేసుకుని, వాళ్లతో రొమాన్స్ నడిపే కుర్రాడిగా అఖిల్ పాత్ర ఉండబోతోంట. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి భోగవల్లి ప్రసాద్ నిర్మాత.


అఖిల్

నితిన్

భీష్మ... ది బ్రహ్మచారి

'ఛలో'తో ఓ మంచి విజయాన్ని అందుకున్నాడు వెంకీ కుడుముల. ఇప్పుడు నితిన్ కోసం ఓ కథ సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. దీనికి 'భీష్మ' అనే టైటిల్ పరిశీలిస్తున్నార్ట. ట్యాగ్ లైన్ కూడా ఉంది. అదే... 'సింగిల్ ఫరెవర్'. టైటిల్‌ని బట్టి నితిన్ బ్రహ్మచారి పాత్రలో కనిపించబోతున్నాడని తెలిసిపోతోంది. పెళ్లంటే చిరాకు, కోపం ప్రదర్శించే కుర్రాడిగా నితిన్ పాత్ర ఉండబోతోందట. భారతంలో భీష్ముడు బ్రహ్మచారిగానే ఉండిపోయాడు. అందుకే ఆ టైటిల్‌ని పెట్టారేమో.

గీతతో గోవింద్

'పెళ్లిచూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాలతో ఆకట్టుకున్నాడు విజయ్ దేవరకొండ. ఇప్పుడు 'టాక్సీవాలా'గా రాబోతున్నాడు. 'నోటా' చిత్రీకరణ దశలో ఉంది. మరోవైపు పరశురాం దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి బన్నీ వాసు నిర్మాత. ఈ చిత్రానికి 'గీత గో గోవిందం' అనే టైటిల్ ఖరారు చేశారు. గురువారం ప్రీ లుక్ విడుదల చేస్తారు. గోపీ సుందర్ స్వరాలు సమకూరుస్తున్నారు. గీత, గోవింద్ అనే ఇద్దరి ప్రేమకథ ఇది. అందుకే ఈ పేరు పెట్టారని సమాచారం.


విజయ్

కమల్‌హాసన్

ఆగిపోయిన సినిమాని.. మళ్లీ..

కమల్‌హాసన్ దృష్టి ఇప్పుడు సినిమాలపై పడింది. గత కొంతకాలంగా రాజకీయాలతో బిజీగా ఉన్న కమల్.. ఇప్పుడు మళ్లీ సినిమా వైపు చూడడం మొదలెట్టారు. సినిమా పూర్తయినా, విడుదలకు నోచుకోని 'విశ్వరూపం 2'ని ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు మధ్యలో ఆగిపోయిన 'శభాష్ నాయుడు'నీ పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కమల్, శ్రుతిహాసన్ తొలిసారి కలసి నటిస్తున్న చిత్రమిది. కమల్ దర్శకత్వం వహిస్తున్నారు. కొంతమేర చిత్రీకరణ కూడా జరిగింది. ఓ ప్రమాదంలో కమల్ గాయపడడంతో 'శభాష్ నాయుడు' చిత్రీకరణ ఆపేశారు. ఆ తరవాత కమల్ రాజకీయపరంగా బిజీ అయ్యారు. ఇప్పుడీ చిత్రాన్ని పూర్తి చేయాలనే నిర్ణయానికి వచ్చారు కమల్. శంకర్‌తో కలసి చేయబోతున్న 'భారతీయుడు 2' కంటే ముందే 'శభాష్ నాయుడు' విడుదల అవుతుందని సమాచారం.

శివుడి ఆజ్ఞ లేనిదే...

ఉదయ్ శంకర్

"శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. బంధాలు బలపడడానికి, విడిపోవడానికీ కారణం ఆయనే. మనమంతా నిమిత్తమాత్రులం.. ఈ నాటకంలో పాత్రలం. ఇదే ఈ కథలో చెప్పబోతున్నాం'' అంటున్నారు చంద్ర సిద్దార్థ్. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఆటగదరా శివ'. ఉదయ్ శంకర్ కథానాయకుడిగా నటించారు. రాక్‌లైన్ వెంకటేష్ నిర్మాత. జులై 14న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ''జీవితంలో గ్యారెంటీ ఉన్నది ఒక్క చావుకి మాత్రమే. అది తెలిసీ చాలా మంది చావుకి భయపడతారు. దాన్నుంచి తప్పించుకుని తిరగడానికి ప్రయత్నిస్తారు. ఉరిశిక్ష పడిన ఖైదీ జైలు నుంచి తప్పించుకుంటాడు. ఆ తరవాత ఏమైందన్నదే కథ. కన్నడలో విజయవంతమైన 'రామ రామ రే' చిత్రానికి ఇది రీమేక్. అయినా తెలుగు వాతావరణానికి చాలా దగ్గరగా ఉంటుంద''న్నారు. దొడ్డన్న, హైపర్ ఆది, చమ్మక్ చంద్ర, చలాకీ చంటి, దీప్తి కీలక పాత్రలు పోషించారు.

ఆలియా భట్ డబుల్ సెంచరీ!

బాలీవుడ్ భామ ఆలియా భట్ గూఢచారిగా ప్రధాన పాత్రలో నటించిన 'రాజీ' ఇటీవల విడుదలై ప్రేక్షకాదరణతో బాక్సాఫీసు వద్ద సత్తా చాటుతోంది. ఇప్పటికే రూ.100 కోట్ల మార్కు దాటేసిన ఈ చిత్రం తాజాగా మరో మైలురాయిని అందుకుంది. ప్రపంచవ్యాప్త వసూళ్లలో రూ.200 కోట్లు దాటేసింది. గత మంగళవారం నాటికి రూ.207 కోట్ల వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాత కరణ్ జోహార్ ప్రకటించారు. దీంతో ఈ ఏడాది ఘన విజయం సాధించిన చిత్రాల్లో ఒకటిగా స్థానం సంపాదించుకుంది 'రాజీ'. 1971 నేపథ్యంలో మేఘనా గుల్జార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మాతృదేశం కోసం పాకిస్థాన్ ఆర్మీ అధికారిని పెళ్లి చేసుకుని గూఢచారిగా కీలక సమాచారం సేకరించి ఇక్కడి సైన్యానికి సహకరించిన ఓ కశ్మీరీ అమ్మాయి నిజజీవిత కథతో ఈ చిత్రం రూపొందింది. ఓ వైపు మాతృదేశ భక్తి, మరో వైపు గూఢచారిగా కట్టుకున్న భర్తకు ద్రోహం చేస్తున్నానన్న ఆవేదన మధ్య నలిగిపోయిన సగటు అమ్మాయిగా ఆలియా నటన ప్రేక్షకులను కట్టిపడేసింది. ప్రస్తుతం ఆలియా 'బ్రహ్మాస్త్ర', 'కళంక్', 'గల్లీబాయ్' చిత్రాలలో నటిస్తుంది.

సిటీ బస్సుల్లో తిరిగినవాణ్ని కదా...



హాస్యనటుడిగా కీలకపాత్రలతో అలరిస్తూనే... కుదిరిన ప్రతిసారీ కథానాయకుడిగా కూడా సందడి చేస్తుంటారు శ్రీనివాసరెడ్డి. ఆయన ఏం చేసినా ప్రేక్షకుల్ని నవ్వించడం మాత్రం మరిచిపోరు. కామెడీ పండించడంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని సృష్టించుకొన్నారు. కెరీర్ పరంగా జోరు మీదున్న ఆయన కథానాయకుడిగా 'జంబలకిడి పంబ' అనే చిత్రం చేశారు. ఆ చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

"కథే కథానాయకుడు అనిపించిన సినిమాలే చేస్తున్నా. 'జయమ్ము నిశ్చయమ్మురా', 'ఆనందో బ్రహ్మ' తర్వాత నేను చేసిన సినిమా ఇది. ఇందులో నాకంటే కూడా కొన్ని చోట్ల కథానాయికకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. 'జంబలకిడి పంబ' అనే మంత్రంతో ఒక జంట ఆత్మలు మారిపోతాయి. అబ్బాయేమో అమ్మాయి, అమ్మాయి అబ్బాయి అవుతారు. అదెలా? అలా మారిపోయాక ఎన్ని ఇబ్బందులొస్తాయి? అనే విషయాల్ని తెరపైనే చూడాలి. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది".

స్కర్టు.. నైటీ వేసుకొన్నప్పుడే

"అమ్మాయి హావభావాలతో నటించడమనేదే నాకు పెద్ద సవాల్‌గా నిలిచిన విషయం. నరేష్, రాజేంద్రప్రసాద్‌తో పాటు... 'చంటబ్బాయ్'లో చిరంజీవి అమ్మాయిగా ఎలా నటించారో గమనించా. అలాగే ఇంట్లో నేనూ కొన్ని కసరత్తులు చేశా. నైటీ వేసుకొని నటించే సన్నివేశాలు రేపు చేయాలన్నప్పుడు... ఇంట్లో మా ఆవిడ నైటీ వేసుకొని బాగున్నానో లేదో చూసుకోవడం, బాగోలేకపోతే ఏం చేయాలో తెలుసుకోవడం... ఇలా కొన్ని జాగ్రత్తలు తీసుకొన్నా. నేను ఇంట్లో నైటీ వేసుకోవడం చూసి మా అమ్మాయి ఆటపట్టించేది. 'అమ్మా మనింట్లోకి చమేలీ రాణి వచ్చేసింది' అని నవ్వేది. ఇదివరకు వచ్చిన పేర్లే నా సినిమాలకి కుదురుతున్నాయి. వాటి పేరు చెడగొట్టడం లేదన్న ఓ తృప్తి మాత్రం ఉంది".

అతిగా చేయలేదు

"మా ఇంట్లోనూ మహిళలున్నారు. నాకు ఇద్దరమ్మాయిలు. సిటీ బస్సులో తిరిగినవాణ్ని కదా, స్త్రీలని గౌరవించడం మన సంప్రదాయం అని ప్రతి బస్సులోనూ రాసింది చూసి, చదువుకొని... మహిళల పట్ల గౌరవభావంతో మెలిగినవాణ్ని. సెన్సార్ బృందంలోని మహిళలు కూడా ఈ సినిమా చూశాక చాలా బాగుంది, ఎక్కడా అతిగా చేయలేదన్నారు. ఒక చోట మహిళల రుతుక్రమం నేపథ్యంలోనూ సన్నివేశాలుంటాయి. వాటిని తీర్చిదిద్దిన విధానం కూడా హుందాగా ఉంటుంది. వెన్నెల కిషోర్, తనికెళ్ల భరణి, పోసాని కృష్ణమురళి, షకలక శంకర్, రాజేష్ ఇలా చాలా మంది ఇందులో మంచి పాత్రల్లో కనిపిస్తారు. మా చిన్నమ్మాయి ఆశ్రిత కూడా ఇందులో కనిపిస్తుంది. కథానాయిక సిద్ధి ఇద్నానీ రంగస్థలం నుంచి వచ్చిన నటి. చాలా బాగా నటించింది. తదుపరి సినిమాలో కూడా నాతో కలిసి నటించమని అడుగుతా".

కామెడీ పాత్రలే కీలకం

"కథానాయకుడిగా అయినా, హాస్య ప్రధానమైన పాత్రయినా.. తృప్తి ముఖ్యం. అందుకే ఏదైనా కొత్త కథలో నేను నటిస్తే బాగుంటుందన్నప్పుడే కథానాయకుడిగా సినిమాలు చేస్తుంటా. నాకు కామెడీ పాత్రలే కీలకం. నా విషయంలో కథానాయకుడి పాత్రలంటే వారానికి ఒకసారి వచ్చే సంతలాగా అన్నమాట!

భాగ్యనగర్ వీధుల్లో గమ్మత్తు...

"ప్రస్తుతం 'అరవింద సమేత', 'ఎఫ్2', 'అమర్ అక్బర్ ఆంటోనీ' తదితర చిత్రాల్లో నటిస్తున్నా. 'పంతం', 'వీరభోగ వసంతరాయలు' చిత్రాల్లోనూ నటించా. కథానాయకుడిగా శ్రీనివాస్ అనే దర్శకుడితో ఓ సినిమా చేయబోతున్నా. కోన వెంకట్ 'గీతాంజలి 2'ని ప్రకటించారు కానీ... అందులో నేనున్నానో లేదో తెలియదు. 13 మంది హాస్య నటులం కలిసి ఫ్లైయింగ్ కలర్స్ అని ఓ గ్రూప్ పెట్టాం. త్వరలోనే మేం అంతా కలిసి ఒక నిర్మాణ సంస్థని ఏర్పాటు చేస్తున్నాం. అందులో 'భాగ్యనగర్ వీధుల్లో గమ్మత్తు' పేరుతో సినిమా చేయబోతున్నాం".

గీతోపదేశం

ప్రతీ రోజు విలువైంది కాదా
ప్రయత్నిస్తే గెలుపేదో రాదా
చేద్దామంటే చూద్దామంటే కాలం ఆగదు
అయ్యేదేదో అవుతుందంటే కలతే తీరదు

గీతం: ఓ మారియా ఓ మారియా...
చిత్రం: చూడాలని ఉంది
రచన: చంద్రబోస్
– పంపినవారు:
బి.రఘునాథరెడ్డి, ఉదయగిరి

మెయిల్ ఐడీ:
cinema@eenadu.net

పంచ్ డైలాగ్

ముసలితనం అంటే చేతకానితనం కాదు. నిలువెత్తు అనుభవం.
చిత్రం: నేల టికెట్టు
– పంపినవారు:
కె.చక్రవర్తి, కర్నూలు

అందాల పోటీల్లో అదరగొట్టేశారు!

వెండితెరపైనే కాదు వేదికలపైనా అదరగొట్టేస్తుంది కరీనాకపూర్. ఈ విషయం చాలా సార్లు నిరూపించింది. ఇప్పుడు మరోసారి స్టెప్పులతో కేకపెట్టించింది కరీనా. ముంబయిలో జరిగిన 'ఫెమినా మిస్ ఇండియా 2018' కార్యక్రమంలో సినిమా తారలు ఆటపాటలతో సందడి చేశారు. కరీనాతో పాటు మాధురీ దీక్షిత్, జాక్వెలైన్ ఫెర్నాండెజ్ తమదైన డ్యాన్స్‌లతో వీక్షకుల్ని ఆనందపరిచారు.

కరీన

మాధురీ దీక్షిత్

జాక్వెలిన్ ఫెర్నాండెజ్

'ఇది కథ కాదు' చూసి...


సాంబశివరావు

వినోదం... సందేశాల మేళవింపుతో తెరకెక్కిన మా చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచుతుందన్నారు ఆలూరి సాంబశివరావు. ఆయన నిర్మించిన చిత్రం 'ఐపీసీ సెక్షన్ భార్యాబంధు'. శరత్‌చంద్ర, నేహాదేశ్ పాండే జంటగా శ్రీనివాస్ రెట్టాడి దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ నెల 29న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఆలూరి సాంబశివరావు విలేకర్ల సమావేశం నిర్వహించారు. "బాలచందర్ దర్శకత్వం వహించిన 'ఇది కథ కాదు' చూశాక 'ఎప్పటికైనా ఇలాంటి సినిమా నిర్మించాలి' అనుకొన్నా. పలుమార్లు చిత్ర పరిశ్రమకి వచ్చాను కానీ.. నా ఆలోచనలకి అనుగుణమైన పరిస్థితులు కనిపించలేదు. ఉద్యోగ విరమణ తర్వాత 'చెంబు చినసత్యం'తో నిర్మాతగా తొలి ప్రయత్నం చేశా. ఆ చిత్రం నిరాశపరిచింది. ఆ తర్వాత 'నేనే ముఖ్యమంత్రి' అనే చిత్రం చేశా. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. ఒక మంచి కథతో చేసిన 'ఐపీసీ సెక్షన్ భార్యాబంధు' నిర్మాతగా తృప్తినిచ్చింది. మహిళల రక్షణ కోసం మన రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాన్ని కొంతమంది ఎలా దుర్వినియోగం చేస్తున్నారనేది ఆలోచన రేకెత్తించేలా చెప్పాం. ఆమని, శరత్ చంద్ర, నేహాదేశ్‌పాండే, మధునందన్, వాసు ఇంటూరి, రాగిణి తదితరులు మంచి అభినయం ప్రదర్శించారు. దర్శకుడు శ్రీనివాస్ రెట్టాడి మొదలుకొని.. అనుభవమున్న సాంకేతిక నిపుణులు కలిసి ఈ సినిమాని జనరంజకంగా తీర్చిదిద్దారు. 29న ఏడెనిమిది సినిమాలు ప్రేక్షకుల ముందుకొస్తున్నా మా చిత్రంపై నమ్మకంతో మేం అదే రోజున విడుదల చేస్తున్నాం" అన్నారు ఆలూరి సాంబశివరావు.

'సూపర్ స్కెచ్' పాటలు


సురేందర్ రెడ్డి, రవి చావలి, సురేందర్ రెడ్డి, ఇంద్ర, నర్సింగ్, ఎ.పద్మనాభ రెడ్డి

రవి చావలి దర్శకత్వం వహించిన చిత్రం 'సూపర్‌స్కెచ్'. నర్సింగ్ మక్కల, ఇంద్ర, సమీర్ దత్త, కార్తీక్‌రెడ్డి, చక్రి మాగంటి, సోఫియా సింగ్ ప్రధాన పాత్రధారులు. బలరామ్ మక్కల, ఎ.పద్మనాభ రెడ్డి నిర్మాతలు. కార్తీక్ స్వరకర్త. బుధవారం హైదరాబాద్‌లో పాటల విడుదల వేడుక జరిగింది. ప్రముఖ దర్శకుడు సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తొలి సీడీని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "మత్తు మందుకి బానిసలైన నలుగురు తెలివైన క్రిమినల్స్ కథ ఇది. అందరి దగ్గర మంచిగా నటిస్తూ పోలీసులకి ముచ్చెమటలు పట్టిస్తుంటారు. వాళ్లని నిజాయతీగల పోలీసు అధికారి నాయక్ ఎలా పట్టుకొన్నాడనేది ఆసక్తికరం. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుందీ చిత్రం. కార్తీక్ మంచి సంగీతం అందించాడు. చిత్రాన్ని ఈ నెల 29న విడుదల చేస్తాం" అన్నారు. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ "రవి చావలి దర్శకుడిగా తనని తాను నిరూపించుకున్నారు. ఆయన తీసిన 'ది ఎండ్', 'సామాన్యుడు' చిత్రాలంటే నాకు ఇష్టం. ఈ సినిమా కూడా అంతకుమించిన విజయం అందుకోవాలి" అన్నారు. కార్యక్రమంలో ఛాయాగ్రాహకుడు సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

వసుంధర

తమన్నా రహస్యం అదే!

పాల రాతి శిల్పంలా.. ఎప్పుడూ నాజూగ్గా ఉంటుంది తమన్నా. సొగసుగానే కాదు.. సౌమ్యంగానూ కనిపించే తమన్నా దాని వెనుక ఉన్న రహస్యం యోగానే అంటోంది. గోరువెచ్చటి నీళ్లు, నానబెట్టి పొట్టు తీసిన బాదంతో ఆమె ఉదయం మొదలవుతుంది. దాంతోపాటు వ్యాయామానికి గంట సమయం కేటాయిస్తుంది. మొదటి అరగంటా రకరకాల వర్కవుట్లు చేస్తుంది. ఇక చివరి అరగంట మాత్రం ధ్యానం, యోగాకే సమయం కేటాయిస్తుంది. రోజుకు రెండుమూడు ఆసనాలను సాధన చేస్తుంది. అన్నీ జిమ్‌లోనే. తన వద్ద ఎవరైనా యోగా అంటే ఇష్టమని చెబితే చాలు... వాళ్లతో గంటలు గంటలు ఆ అంశంపై చర్చిస్తుంది. అంతే కాదు ఎప్పటికప్పుడు ట్విట్టర్‌లో తన యోగా వర్కవుట్ల ఫొటోలూ, అందుకు సంబంధించిన సమాచారాన్నీ ఉంచుతుంది. 'ఈ సాధన వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వచ్చేసి చర్మం అందంగా మెరుస్తుంది. అలానే ఒత్తిడి ఉఫ్‌మని దూరమవుతుంది. మనసులోని ప్రతికూల ఆలోచనలూ పోతాయి. సినిమా రంగంలో ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లుంటాయి. నిద్ర సరిగా ఉండదు. ఓ నిర్ణీత సమయమంటూ లేని పని వేళలు. ఈ క్రమంలో శారీరకంగానే, మానసికంగానూ ఒత్తిడి ఉంటుంది. దాన్ని దూరం చేసుకోవాలంటే యోగానే ఔషధం. అవుట్‌డోర్ షూటింగ్‌లో ఉన్నా తప్పనిసరిగా సమయం కేటాయిస్తా. అందుకు సంబంధించిన రకరకాల యాప్‌లూ ఫాలో అవుతుంటా. ఆహారం విషయంలోనూ అంతే జాగ్రత్తలు తీసుకుంటా. శరీరాన్ని చల్లబరిచేందుకు పెరుగు ఎక్కువగా తింటా. రోజులో అధిక మోతాదులో మంచినీళ్లు, పండ్ల రసాలూ, సూప్‌లూ, కొబ్బరినీళ్లు తీసుకోవడానికి ప్రాధాన్యమిస్తుంటా. జంక్‌ఫుడ్ జోలికి అస్సలు వెళ్లను. చక్కెరకు చాలా దూరంగా ఉంటా' అంటూ తన యోగా సాధనా, ఆహార నియమాల గురించి చెప్పుకొచ్చింది తమన్నా.

ఈ మిస్ఇండియా 10 విదేశీభాషల ప్రతిభావని

ఈ ఏడాది మిస్ ఇండియా వరల్డ్‌గా మెరిసింది పందొమ్మిదేళ్ల అనుక్రీతి వాస్. ఈ చక్కనమ్మ చదువుల్లోనే కాదు... అందాల పోటీలూ, ఆసక్తుల్లోనూ ప్రతిభావంతురాలే. మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగి.. అందాల జాబిలమ్మలా మెరిసిన ఈ అమ్మాయి గురించి మరిన్ని విశేషాలివిగో..

ఎవరీమె: ఈ ఏడాది మిస్ ఇండియా వరల్డ్‌గా ఎంపికై యువ తరం మనసు దోచుకుంది. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్... ఇలా సామాజిక మాధ్యమాల్లోనూ తనదైన శైలిలో ఆకట్టుకుంటోంది. చెన్నైలో పుట్టి పెరిగిన అనుక్రీతి కొన్ని నెలల క్రితం మిస్ తమిళనాడు, మరో అందాల పోటీలో విజేతగా నిలిచింది. అందంతో చూపరుల్ని కట్టిపడేసింది.

ప్రోత్సాహం: అనుక్రీతి వాస్ మిస్ ఇండియా వరల్డ్‌గా ఎంపిక కావడం వెనక రకుల్‌ప్రీత్ సింగ్ ఓ మెంటార్‌గా చేసిన సూచనలు ఎన్నో ఉన్నాయి. అనుక్రీతి పోటీలకు వెళ్లడానికి ముందు రకుల్ ప్రీత్‌సింగ్ వద్దే శిక్షణ తీసుకుంది. అందం, ఆత్మవిశ్వాసం, అభినయం, ఆహారం, నడకా, నడత వంటి విషయాలెన్నింటి గురించో తెలుసుకుంది. సాధన చేసింది. రకుల్ కూడా కేవలం శిక్షణలా కాకుండా... ఆత్మస్థయిర్యాన్ని పెంచింది. రకుల్‌కీ, అనుక్రీతికి సంబంధం ఏంటనుకుంటున్నారా... ఈ అందాల పోటీల్లో సౌత్ జోన్‌కు రకుల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తోంది.

నేపథ్యం: అనుక్రీతి పుట్టి పెరిగింది చెన్నైలోనే. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి. కొన్ని పరిస్థితుల కారణంగా తండ్రి దూరం కావడంతో తల్లి ఆమెని పెంచి పెద్ద చేసింది. 'నేను అమ్మ కష్టాలను చూస్తూ పెరిగా. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తన మనసులోనే దాచుకుని నన్ను పెంచింది. మోడలింగ్ ఎంచుకున్నప్పుడు చాలామంది అమ్మని నానా రకాలుగా విమర్శించారు. నిందించారు. నేను కూడా తెలిసో తెలియకో కొన్ని పొరపాట్లు చేశా. అయినా అమ్మ కదా... అన్నీ గుండెల్లో దాచుకుంది. ఇప్పుడు ఈ విజయంతో అయినా అమ్మ గర్విస్తుందని అనుకుంటున్నా' అంటూ బాధనీ, సంతోషాన్నీ పంచుకుంది అనుక్రీతి.

చదువు: అనుక్రీతి చెన్నైలోని ఆర్ఎస్‌కె హయ్యర్ సెకండరీ స్కూల్‌లో చదువుకుంది. లయోలా కాలేజీలో ఇంటర్ పూర్తి చేసింది. ఆ తరువాత తన తల్లి కోరిక మేరకు ఫ్రెంచ్‌లో బీఏ చేస్తోంది. ఆమె అనువాదకర్త కావాలనేది తల్లి ఆశ. అలానే అనుక్రీతికి కూడా భాషలు నేర్చుకోవడం అంటే చాలా ఇష్టం. ఇప్పటికే పది ప్రపంచ భాషల్ని నేర్చుకుంది.

అభిరుచులు: ఈమెకు చదువూ, భాషలు నేర్చుకోవడంతోపాటు డాన్స్ అంటే ప్రాణం. ఎన్నో వేదికల మీద ప్రదర్శనలు ఇచ్చింది. సమయం దొరికితే బైక్ తీసుకుని రయ్‌మంటూ రైడింగ్‌కి వెళ్లిపోతుంది. అంతేనా స్కూల్, కాలేజీలో ఉన్నప్పుడు రాష్ట్రస్థాయిలో అథ్లెట్‌గానూ చాలా పోటీల్లో పాల్గొంది.

నటన: అనుక్రీతి లక్ష్యం తెర మీద కనిపించడం. అందుకే మోడలింగ్‌లో కొంత కాలం పనిచేశాక అందాల పోటీల వైపు మొగ్గు చూపింది. అయితే దానికి స్ఫూర్తి చిన్నతనంలో తాను ఐశ్వర్యారాయ్‌ని ప్రపంచ సుందరిగా టీవీలో చూడటమే అంటుంది. ఆ కార్యక్రమం చూశాక... అక్కడికి వెళ్లాలంటే ఏం చేయాలా అని ఆలోచించిందట. కొన్నాళ్లకు అందాలపోటీలో పాల్గొనాలనే నిర్ణయం తీసుకుంటే... బంధువులంతా తన తల్లిని వెనక్కి లాగే ప్రయత్నం చేశారట. ఆమె మాత్రం కూతురి లక్ష్యానికి ప్రాధాన్యమిచ్చి సమర్థించింది. ప్రోత్సహించింది. అందుకే తన విజయం తల్లికే అంకితమని చెబుతుంది అనుక్రీతి గర్వంగా.

ఐసీయూ నుంచి వచ్చి... యోగా గురువై...

ఒకప్పుడు... ఆమె చదువుల ఒత్తిడిలో కూరుకుపోయి ఇంట్లో కన్నా ఐసీయూలోనే గడిపిన రోజులెక్కువ. ఇప్పుడు... యోగాతో తనను తాను మార్చుకుంది. అంతేనా గూగుల్, ఎల్‌అండ్‌టీ, వరల్డ్‌బ్యాంకు... వంటి ప్రముఖ కార్పొరేట్ సంస్థలన్నింటికీ యోగా గురువు అయ్యింది. ఆమె కమలేష్ బర్వాల్. ఓ సాధారణ అమ్మాయి నుంచి యోగా గురువుగా మారి... అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆమె కథ... ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

సిమ్లాలో ఓ సంపన్న కుటుంబంలో పుట్టిన కమలేష్ బర్వాల్ చదువులో చాలా చురుకు. చిన్నప్పుడు వ్యాపారవేత్త కావాలని కలలు కనేది. అందుకే బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్‌లో చేరింది. బాగా చదవాలనే ఉద్దేశంతో తోటివారితో పోటీ పడేది. అయితే రోజులు గడిచేకొద్దీ ఆ పోటీ తీవ్ర ఒత్తిడిగా మారిపోయింది. ఆ ప్రభావం మెదడుపై పడి, చివరకు అనారోగ్యానికి గురైంది. చిన్న విషయాన్ని కూడా తట్టుకోలేనంత బలహీనురాలైంది. ఆ తరువాత హిస్టీరిక్‌గా మారింది. ఆరోగ్యం క్షీణించింది. చివరకు ఐసీయూలో చేరాల్సిన పరిస్థితి వచ్చింది. చదువు పూర్తయ్యే సరికి కాలేజీలో కంటే ఐసీయూలోనే గడిపిన రోజులు ఎక్కువ. కమలేష్‌ని అలా చూసిన ఆమె తల్లి ఎంతగానో బాధపడేది. ఎలాగైనా సరే కూతుర్ని బాగు చేసుకోవాలని న్యూరోసర్జన్ డాక్టర్ రూపక్‌ని సంప్రదించింది. ఆ వైద్యుడి సలహానే కమలేష్ జీవితాన్ని మలుపు తిప్పుతుందని ఆ రోజు ఎవరూ ఊహించలేదు. చివరికి ఆ డాక్టర్ కూడా.

యోగా చికిత్సతో...

కేవలం యోగాతోనే ఆమె సమస్య నయంకావచ్చని డాక్టర్ రూపక్ ఆ తల్లికి సూచించారు. అందులో ముఖ్యంగా 'సుదర్శనక్రియ'ను నేర్పించమని చెప్పారు. అలా కమలేష్ తల్లితో సిమ్లాలోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌కి వెళ్లింది. అక్కడ యోగా శిక్షణలో చేరింది. కమలేష్ 'సుదర్శనక్రియ' నేర్చుకోవడమే కాదు... నిత్యం సాధన చేసేది. ఫలితంగా కొద్ది రోజుల్లోనే ఆమె పూర్తి ఆరోగ్యవంతురాలైంది. యోగా వల్ల కలిగే లాభాలను తెలుసుకుంది. తాను నేర్చుకున్నది ఇతరులకీ నేర్పించాలనుకుంది. అందుకు అవసరమైన నైపుణ్యాలూ, ఇతర యోగాసనాలు నేర్చుకుంది. యోగా శిక్షకురాలిగా అర్హత సాధించింది. 'ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్' సభ్యురాలిగా ప్రజల్లోకి యోగాను తీసుకెళ్లే దిశగా అడుగులు వేసింది. అలా గత దాదాపు 20 ఏళ్లుగా 150 దేశాల్లో పర్యటించి యోగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇప్పుడు 'ది ఇండియన్ యోగా అసోసియేషన్'కి ఆమె సెక్రటరీ జనరల్‌గా కూడా ఎంపికైంది.

నెల్లో ఎక్కువరోజులు ఐసీయూలో ఉన్న తనను యోగా మామూలు మనిషిలా మార్చిందంటుంది కమలేష్. 'కాలేజీ రోజుల్లో నాకు యోగా, ధ్యానం అనే పదాలే తెలీవు. అనారోగ్యంతో నా జీవితం ముగిసిపోయింది అనుకునే సమయంలో యోగా నన్ను మనిషిని చేసింది. యోగా మనలో శక్తిసామర్థ్యాలను మనకే పరిచయం చేస్తుంది. ఈ పోటీ ప్రపంచంలో ఎదురయ్యే ఒత్తిళ్లను తట్టుకొనే శక్తినిస్తుంది. మెదడును ప్రశాంతంగా మార్చే వ్యాయామం ఇది' అని చెబుతుందామె.

ప్రముఖ సంస్థలకు...

దేశవిదేశాల్లో ఆమె యోగా శిక్షణ ఇవ్వడం ఒకెత్తయితే... ఎన్నో కార్పొరేట్ సంస్థల ఉద్యోగుల్లోనూ తన యోగా శిక్షణతో మార్పు తెచ్చిందామె. వాటిల్లో గూగుల్, వరల్డ్‌బ్యాంక్, ఎల్ అండ్ టీతోపాటూ, మైక్రోసాఫ్ట్... వంటివెన్నో ఉన్నాయి. అంతేకాదు నాసాలోని శాస్త్రవేత్తలకూ ఆమె యోగా శిక్షణ ఇచ్చింది. అలాగే... ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్న ప్రాంతాలకూ కమలేష్ వెళ్తుంది. వాళ్లలోనూ మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తుంది. 'ఆ సమయంలో బాధితులు తీవ్రంగా కుంగిపోతారు. కళ్లముందు జరిగిన సంఘటనలు పదే పదే గుర్తొస్తుంటాయి. ఏం చేయాలో తెలియని పరిస్థితి. కుటుంబసభ్యులూ దూరమైపోయి ఉండొచ్చు. దాంతో అచేతన స్థితిలోకి వెళ్లిపోతారు. బలహీనులైతే ఆత్మహత్యకూ పాల్పడతారు. వారికి ఆహారం, దుస్తులతో పాటు మానసిక చికిత్సా అవసరం. అందుకే అటు వంటి వారికీ యోగా, ధ్యానం ద్వారా చికిత్స చేస్తుంటా. కొన్నిసార్లు ఎలాంటి సౌకర్యాలు లేని చిన్నచిన్న గ్రామాలకూ వెళ్లాల్సి వస్తుంది. అలాంటప్పుడు మాత్రం మిగిలిన కార్యక్రమాల కన్నా... వీటికే అధిక ప్రాధాన్యం ఇస్తా. ఒకవిధంగా అది నా బాధ్యత అనుకుంటా...' అని చెబుతుందామె.

– సీహెచ్. వసుంధరాదేవి

ఆ వ్యాయామంపై పరిశోధన చేశా!

- కేవలం కార్పొరేట్ సంస్థలకే కాదు... దేశవ్యాప్తంగా 583 పాఠశాలల్లోని 50వేలమంది విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నా.
- ఇది కంప్యూటర్ యుగం. ఈ పోటీ ప్రపంచంలో అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోగలగాలి. అంటే మన మెదడు అంత చురుగ్గా ఉండాలి. కానీ సాంకేతికత పెరగడం వల్ల దానికి మనం బానిసలవుతున్నాం. అలా ఒత్తిడిలోకి కూరుకుపోతున్నాం. అనారోగ్యాలూ తప్పడంలేదు. ఇవన్నీ గుర్తించాకే 'సూక్ష్మ వ్యాయామం' అందుబాటులోకి తెచ్చా. ఈ వ్యాయామాల ద్వారా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. దీన్ని అందుబాటులోకి తెచ్చేముందు ఎన్నో పరిశోధనలూ కూడా చేశా.
- ఉన్న సమయంలోనే యోగా చేయాలనుకుంటారు కొందరు. అలా చేయాలనుకునేవారికి ఆసనాలకు సంబంధించిన వీడియోలు యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్నాయి. నా పేరు కొడితే... కావాల్సిన ఆసనాల గురించి తెలుసుకోవచ్చు.

కమలేష్ తన సహచరుడు ఆకాశ్‌నే పెళ్లి చేసుకుంది. అయితే పెళ్లికి ముందే పిల్లలు వద్దనుకున్నారు. దానికి కారణం యోగానే. తన దగ్గర శిక్షణ తీసుకున్నవారే తమ పిల్లలు అనుకోవడమే అని అంటుందామె.

సుదర్శన్‌ప్రక్రియ అంటే...

'దీనిపై ఎందరో ప్రముఖులు పలు పరిశోధనలు చేశారు. ఒత్తిడికి లోనై, అలసిన శరీరానికి నిద్ర తప్పనిసరి. అయినప్పటికీ కొన్నిసార్లు కేవలం నిద్ర వల్ల విశ్రాంతి కలగదు. మనసును శరీరానికి అనుసంధానం చేయాలి. అలాగే మన శరీరంలోని అవయవాల పనితీరు, మెదడు మధ్య ఓ అనుసంధానం ఉంటుంది. ఎప్పుడైతే మెదడు ఒత్తిడికి లోనవుతుందో అప్పుడు శరీర పనితీరు కూడా అదుపు తప్పుతుంది. సుదర్శనక్రియతో మనసును అదుపు చేయొచ్చు. అలా శరీర పనితీరు సజావుగా సాగేలా చేయొచ్చు. శ్వాసను కూడా అదుపులోకి తెచ్చుకోవచ్చు. సుదర్శనక్రియ ద్వారా ఆలోచనాశైలి కూడా మారుతుంది....' అని వివరిస్తుంది కమలేష్.

ఇంటి వైద్యం

దానిమ్మతో... అతిసారం దూరం!

వర్షాకాలంలో అతిసారం లేదా విరేచనాల సమస్య కాస్త ఎక్కువే. వర్షాలవల్ల వాతావరణంలో తేమ పెరగడం, ఎక్కడపడితే అక్కడ నీళ్లు నిలిచిపోయి, వాటిపై హానికరమైన సూక్ష్మజీవులూ, ఈగలు ముసరడం, తాగునీరు కలుషితం కావడం... అన్నీ కలిపి అతిసారానికి దారితీస్తాయి. ఈ కాలంలో జీర్ణశక్తి తక్కువగా ఉండటం, ఆ ప్రభావం రోగనిరోధకశక్తి అంతంతమాత్రంగా ఉండటం వల్ల కూడా అతిసారం బాధిస్తుంది. ఇలాంటి సమస్య రాకుండా ఉండాలంటే ఏం చేయాలో చూద్దాం.

ఆహారపరంగా... ఈ కాలంలో తేలికగా జీర్ణమయ్యే కూరగాయలూ, తాజాగా, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. అప్పుడే ఆహారం కలుషితం కాదు. వేడి ఆహారం తీసుకుంటే జీర్ణశక్తి పనితీరు మెరుగుపడుతుంది. ఆకుకూరలూ, మాంసాహారం, దుంపకూరల్ని వీలైనంతవరకూ తీసుకోకూడదు. రోడ్లపై, హోటళ్లలో తినే అలవాటు ఉన్నవారు ఈ కాలంలో మానేయడం మంచిది. వానాకాలంలో తాగునీరు ఎక్కువగా కలుషితమవుతుంది. అందుకే కాచి, చల్లార్చిన నీళ్లనే తాగాలి. మల, మూత్రవిసర్జన తరువాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం అత్యంతవసరం. చంటిపిల్లలున్నవారు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వాళ్ల దుస్తుల్ని వేడినీటిలో ఉతకడం మంచిది. ఇంట్లోకి ఈగలు ముసరకుండా చూసుకోవాలి.

దానిమ్మ తొక్కలతో..

విరేచనాలు అవుతోంటే... ఆహారంలో మార్పులు చేయాలి. తేలిగ్గా జీర్ణమయ్యేలా సూప్‌లు తీసుకోవాలి. ద్రవపదార్థాల మోతాదు పెంచాలి. బియ్యాన్ని వేయించి జావలా చేసి అందులో మజ్జిగా, ఉప్పు కలిపి తరచూ తీసుకోవాలి. ఈ జావ డీహైడ్రేషన్ రాకుండా చేస్తుంది. పల్చని మజ్జిగను రోజులో వీలైనన్ని ఎక్కువసార్లు తాగాలి. మజ్జిగలో ఉండే ప్రొబయోటిక్స్ విరేచనాల్ని అరికడతాయి. దానిమ్మ, అరటి, యాపిల్ పండ్లు తినవచ్చు.

- విరేచనాలకు దానిమ్మపండు ఔషధంలా పనిచేస్తుంది. దానిమ్మ రసాన్ని కొంచెం కొంచెంగా రోజులో నాలుగైదుసార్లు తాగాలి. అలాగే దానిమ్మ పండు తొక్కలు కూడా ఆ సమస్యను నివారిస్తాయి. ఆయుర్వేద ఔషధాల్లో ఎండిన దానిమ్మ తొక్కల చూర్ణాన్ని కలుపుతారు. దాన్ని మనమూ చేసుకోవచ్చు. ఈ పండ్ల తొక్కలను ఎండబెట్టి భద్రపరుచుకోవాలి. అవసరమైనప్పుడు చిన్నచిన్న ముక్కలుగా చేసుకుని మిక్సీలో పొడిగా చేయాలి. ఈ పొడిని చెంచాడు తీసుకుని గ్లాసుడు నీళ్లు కలిపి నాలుగోవంతు మిగిలేవరకు మరిగించి వడకట్టుకోవాలి. గోరువెచ్చగా రోజులో మూడు లేదా నాలుగు సార్లు తీసుకోవాలి.
- చెంచా వాము వేయించి నల్లగా మారాక అందులో సుమారుగా 100 మిల్లీ లీటర్ల నీటిని కలిపి, అది సగంపైగా మరగించి వడకట్టుకొని గోరువెచ్చగా తాగాలి. ఇలా రోజులో మూడు లేదా నాలుగుసార్లు తాగితే విరేచనాలు తగ్గుతాయి.
- జాజికాయ అరగదీసి చెంచాడు తీసుకుని దానికి కొద్దిగా పటిక బెల్లం కలిపి రోజుల్లో మూడు లేదా నాలుగుసార్లు తీసుకోవాలి. తక్కువ పరిమాణంలో చంటిపిల్లలకు కూడా ఇవ్వొచ్చు. అంతేగానీ, సమస్య కనబడగానే యాంటీ బయాటిక్స్ మందుల కోసం పరిగెత్తకుండా, ముందు తేలికపాటి పరిష్కార మార్గాలు ప్రయత్నిస్తే, అనారోగ్యాన్ని దూరం చేసుకోవచ్చు.

డాక్టర్ గాయత్రీదేవి, ఆరోగ్యపీఠం

బంగారం వెండి

20న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,670	31,880	31,750	31,700
ఆర్నమెంట్	29,580	29,780	29,400	29,400
వెండి (కిలో)	40,800	41,150	41,000	41,600

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,750	31,780	31,705	31,885
ఆర్నమెంట్	29,300	29,430	29,320	29,490
వెండి (కిలో)	40,900	41,200	40,800	41,100

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,550	31,720	--------	--------
ఆర్నమెంట్	29,340	29,500	2,932	2,949 గ్రా
వెండి (కిలో)	41,900	42,900	43.00	43.20 గ్రా

తప్పు చేస్తోందని వారికి చెప్పేదెలా?

మావారి ఉద్యోగ రీత్యా మేం సిటీలో ఉంటాం. మాకు ఇద్దరు పిల్లలు. మా దగ్గరి బంధువులొకరు వాళ్లమ్మాయికి ఏదో కోచింగ్ ఉందని కొన్నాళ్లు మా ఇంట్లో ఉంచుతామని అడిగారు. మేం కూడా సంతోషంగానే ఒప్పుకున్నాం. తను ఓ వారం రోజులు బాగానే ఉంది. తరువాత నుంచీ కోచింగ్‌కి సరిగా వెళ్లడంలేదు. గంటలు గంటలు ఫోన్లు మాట్లాడుతుంది, ఛాటింగ్ చేస్తుంది. రాత్రంతా మేల్కొని నెట్ ముందు కూర్చుంటుంది. ఇంటి బయట నాలుగైదు సార్లు అబ్బాయిలతో మాట్లాడుతూ కనిపించింది. చదువుపై ధ్యాస పెట్టట్లేదు. ఆమె తల్లిదండ్రులకు ఈ విషయాలు ఎలా చెప్పాలో అర్థం కావట్లేదు. ఒక వేళ చెబితే మమ్మల్ని తప్పుగా భావించొచ్చనీ, బంధుత్వం పోతుందని మా వారు భయపడుతున్నారు. ఏం చేయాలో చెప్పండి. - సోదరి

మీ పరిస్థితి నేను అర్థం చేసుకోగలను. అదే స్థానంలో మీ పిల్లలు ఉంటే వెంటనే స్పందించి ఉండేవారు. ధైర్యంగా మీరు చేయాలనుకున్నది చేసేవారు. సమస్య వచ్చింది ఇంకొకరి కూతురికి అయ్యేసరికి ఆలోచించాల్సి వస్తుంది. తల్లిదండ్రులకు ఆమె గురించి చెబితే వారెలా స్పందిస్తారో తెలియదు. లేనిపోని అపనిందలు వేశారని అభిప్రాయపడే ప్రమాదమూ లేకపోలేదు. ఇక్కడ మీరు మరో కోణంలో కూడా ఆలోచించి చూడండి. ఆ పాప గురించి మీకు పూర్తిగా అవగాహన ఉండి ఉండకపోవచ్చు. మీ కుటుంబం కొత్త కావడం, తల్లిదండ్రులకు దూరంగా ఉండటం వల్ల తాను ఇలా ఉంటోందేమో! తనతోపాటు కోచింగ్ తీసుకుంటున్న వారిని స్నేహితులుగా భావించి మాట్లాడుతూ ఉండొచ్చు. తన ఇంట్లో ఉన్నా. అలానే ఫోన్లు మాట్లాడుతూ, ఛాటింగ్ చేస్తుందేమో! మీ కుటుంబ సభ్యులు తనని కలుపుకోవడం, మాట్లాడటం, కలిసి భోజనం చేసేలా చూడండి. సమయం దొరికినప్పుడు బయటకు తీసుకెళ్లండి. ఇంట్లో సరదాగా కబుర్లు చెప్పండి. అయినా తనలో మార్పు రాలేదంటే అప్పుడే వాళ్ల అమ్మని పిలిచి చెప్పండి. ఆ విషయం ఆ పాపకి తెలియనివ్వకండి. లేదంటే కొన్ని రోజులు ఆ పాప తల్లిని మీ ఇంట్లోనే ఉండమని అడగండి. ఆ అమ్మాయి ప్రవర్తనని దగ్గరగా చూసేలా చేయండి. తను ఛాటింగ్, ఫోన్లు మాట్లాడుతున్నప్పుడే ఆమె తల్లితో పరోక్షంగా విషయాలను ప్రస్తావించొచ్చు. దీంతోపాటు ప్రతి ఇంటికీ కొన్ని పద్ధతులుంటాయి. మీ ఇంట్లోనూ అలాంటి కొన్ని పద్ధతులు ఉంటే అదే విషయం ఆమె తల్లికి చెప్పండి. బంధువుల మధ్య దూరాలూ, అపార్థాలు పెరిగే బదులు.. మీ ఇంటి పద్ధతులూ, అలవాట్లను బట్టి నడుచుకునేలా ఆ అమ్మాయికి సూచించమని చాలా సానుకూల ధోరణిలో వివరించండి. అలానే ఆ అమ్మాయిని కూడా ప్రతి విషయంలో మీ పిల్లలతోపాటు సమానంగా చూసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిజేయండి. అన్ని సందర్భాల్లోనూ స్పష్టంగా, పారదర్శకంగా ఉండండి. వీటన్నింటితోపాటూ బంధుత్వానికి మీరిచ్చే విలువ ఆమెకు తెలియాలి. అప్పుడే మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉండదు.

డియర్ వసుంధర



డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.

ఆధునిక టెక్నాలజీలైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లర్నింగ్, డీప్ లర్నింగ్, డేటా సైన్స్ తదితరాలు మేనేజ్‌మెంట్ విద్యలో కొత్త ధోరణులకు కారణమవుతున్నాయి. దీంతో సంప్రదాయ ఎంబీఏలకు మించిన నైపుణ్యాలను కలిగిన కొత్త మేనేజర్లను కార్పొరేట్ రంగం కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎంబీఏలో సరికొత్త స్పెషలైజేషన్స్ వస్తున్నాయి. వాటిపై అవగాహన ఉంటే తగినదాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

నయా ఐచ్ఛికాలతో నవీన ఎంబీఏ!

రెండేళ్ల కాలవ్యవధి గల కోర్సు మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ). ప్రథమ, ద్వితీయ సెమిస్టర్లలో విద్యార్థులు మేనేజ్‌మెంట్ విద్య ప్రాథమిక విషయ పరిజ్ఞాన (కోర్) సబ్జెక్టులైన నిర్వహణ సూత్రాలు, హ్యూమన్ రిసోర్సెస్, స్టాటిస్టిక్స్, ఆర్థికశాస్త్రం, ఆపరేషన్ మేనేజ్‌మెంట్, ఆర్థిక నిర్వహణ, మార్కెటింగ్ సబ్జెక్టులను అభ్యసిస్తారు. ప్రాథమిక సబ్జెక్టులు విద్యార్థులకు మేనేజ్‌మెంట్ భావనలు, సిద్ధాంతాల పట్ల పటిష్ఠమైన పునాదిని వేస్తాయి. మొదటి ఏడాది పూర్తిచేసిన వారు రెండో సంవత్సర ప్రవేశానికి ముందు స్పెషలైజేషన్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

ఎంబీఏను ఎంచుకున్నవారు ముందు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఇది ఇతర పీజీ కోర్సుల్లా కాకుండా మల్టీ డిసిప్లినరీ కోర్సు. కాబట్టి, విద్యార్థి వివిధ కోణాల నుంచి ఆలోచించగల తత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలి. అసలు విద్యార్థి ఎంబీఏ జీవితం కళాశాల ఎంపిక నుంచి ప్రారంభమవుతుంది. కాబట్టి మెరుగైన బి స్కూల్/ కళాశాలను ఫ్యాకల్టీ, మౌలిక సదుపాయాలు, పూర్వవిద్యార్థుల నియామకాలు, కంపెనీల రిక్రూట్‌మెంట్ ఆధారంగా ఎంచుకోవాలి. విద్యార్థి చురుకుగా, వివిధ కమిటీల స్థాపనలో, కమిటీల్లో ఉదాహరణకు- ప్లేస్‌మెంట్ కమిటీ, మేనేజ్‌మెంట్ ఫెస్ట్ కమిటీల్లో ఆక్టివ్ మెంబర్‌గా ఉండాలి.

మొదటి సంవత్సరం నుంచే విద్యార్థి పాఠాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సమకాలీన అంశాలపట్ల అవగాహన పెంచుకోవాలి. డిబేట్లు, క్విజ్ పోటీల్లో మొదటి నుంచీ చురుగ్గా పాల్గొనాలి. సీనియర్లు, కళాశాల పూర్వ విద్యార్థులతో సత్సంబంధాలు పెంచుకోవడం ద్వారా రిక్రూట్‌మెంట్‌లో ముందడుగు వేయొచ్చు. నెట్‌వర్క్ కూడా అభివృద్ధి చెందుతుంది. ఎంబీఏ విద్యార్థులకు నెట్‌వర్క్ ఎంతో అవసరం కూడా.

వినూత్న ధోరణులు

ఎంబీఏ విద్య ప్రపంచీకరణ, కొత్త పరిణామాలు, చట్టాలు, టెక్నాలజీ మేళవింపుతో కొత్త పోకడలు సంతరించుకుంటూనే ఉంటుంది. కొత్తగా ఈ రంగంలో డేటా అనలిటిక్స్/ డేటా సైన్స్ తమదైన ముద్ర వేస్తున్నాయి. వివిధ కొత్త స్పెషలైజేషన్లూ అందుబాటులోకి వస్తున్నాయి. మూక్స్ డిజిటల్ విస్ఫోటాన్ని ఎంబీఏలో సృష్టిస్తున్నాయి. ఈ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డీప్ లర్నింగ్ టెక్నిక్‌లు నిర్ణయాలు తీసుకోవడంలో దోహదపడుతున్నాయి. కాబట్టి విద్యార్థులు ఈ రంగాల్లోనూ తమ ప్రతిభను మెరుగుపరచుకోవాలి. ముఖ్యంగా ఇంటర్న్‌షిప్‌ల గురించి తెలుసుకుంటూ, తమకు తగ్గవాటిని చేస్తుండాలి.

సరికొత్త ఉద్యోగాలు పొందాలంటే..?

సానుకూల జీడీపీ అంచనాలు, స్టాక్ మార్కెట్ల బుల్ ట్రెండ్, అనుకూల వ్యాపారావకాశాల వల్ల ఇండస్ట్రీలో హైరింగ్ పెరిగింది. తరగతికే పరిమితం కాకుండా ఇంటర్న్‌షిప్‌లు, స్టార్టప్‌ల ద్వారా తమ కొత్త ఆలోచనలకు కార్యరూపం ఇవ్వొచ్చు. ఎంబీఏ చదివినవారు ఉద్యోగం చేయడానికే కాకుండా ఉద్యోగకల్పన ఇవ్వగల ఆలోచనలకూ పదును పెట్టగలగాలి. కార్పొరేట్ రంగంలో పైకి రావాలనుకునేవారు బృందంలో పనిచేసే నేర్పు, నాయకత్వ లక్షణాలతోపాటు తమ స్పెషలైజేషన్‌లో సాంకేతిక నైపుణ్యాలనూ అభివృద్ధి చేసుకోవాలి.

బిజినెస్ అనలిస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, డేటా అనలిస్ట్, ఆంత్రప్రెన్యూర్ అడ్వైజర్, అండర్ రైటర్, ప్రొడక్ట్ అనలిస్ట్ వంటి కొత్త తరహా ఉద్యోగాలకు ఎంబీఏ ప్రాతిపదికగా ఉంటోంది. ఈ ఉద్యోగాలకు అర్హత సంపాదించాలనుకునేవారు.. కోర్సు పూర్తయ్యేలోగా నిర్దిష్టంగా కొన్ని చేయాల్సి ఉంటుంది.

కంపెనీల్లో చోటు చేసుకుంటున్న మార్పులు, ప్రపంచీకరణ, అధిక పోటీతత్వం కారణంగా కొత్త/ నూతన తరహా ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి.

- బిజినెస్ అనలిస్ట్‌గా ఉద్యోగాన్ని పొందాలనుకునేవారు ఆపరేషన్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌ను ఎంచుకుంటే మంచిది.
- ప్రొడక్ట్ అనలిస్ట్ అవ్వాలనుకునేవారు మార్కెటింగ్, కన్సల్టెన్సీ/ ఆపరేషన్స్‌ను ఎంచుకోవచ్చు. డిగ్రీలో ఇంజినీరింగ్ చదివినవారికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.
- ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, అండర్ రైటర్ ఉద్యోగాలు ప్రతి ఎంబీఏ ఫైనాన్స్ విద్యార్థి స్వప్నం. కానీ ఈ రోల్‌ను సాధించాలంటే టాప్ టైర్ బిజినెస్ స్కూల్స్ విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈ రంగంలో రాణించాలంటే సీఎఫ్ఏ, సీపీఏ, జీఏఆర్‌పీ వారు అందించే ఎఫ్ఆర్ఎం కోర్సులను చేయడం అవసరం.

ప్రొ. బి. రాజశేఖర్
డీన్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్.సి.యు.

- డేటా అనలిస్ట్ కావాలనుకునే వారు డేటా అనలిటిక్స్/ బిజినెస్ అనలిటిక్స్‌లను ఎంచుకుని స్టాటిస్టిక్స్, బిగ్‌డేటా టూల్స్ అయిన ఆర్, పైథాన్, ఎస్ఏఎస్, మ్యాట్‌ల్యాబ్ వంటి టూల్స్‌పై పట్టు సాధించాలి.
- ఆంత్రప్రెన్యూర్ అడ్వైజర్‌గా రాణించాలంటే కన్సల్టెన్సీ, మార్కెటింగ్ లేదా ఆపరేషన్స్ స్పెషలైజేషన్‌ను ఎంచుకోవాలి. సాధారణంగా అడ్వైజర్/ కన్సల్టెంట్ రోల్స్ టాప్ టైర్ 'బి' స్కూల్ విద్యార్థులకు దొరుకుతాయి. విద్యార్థి దశలోనే ఇంటర్న్‌షిప్ చేయడం, కొత్త టూల్స్ నేర్చుకోవడం ద్వారా తాము ఎంచుకున్న రంగంలో స్థిరపడొచ్చు.

ప్రముఖ బీ స్కూల్సులో ఆధునిక స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ప్రాధాన్యం దృష్ట్యా హెచ్‌సీయూ, ఐఐఈ, సీబీఐటీ లాంటి సంస్థల్లో వీటిని ప్రవేశపెడుతున్నారు. సాధారణ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో చదివేవారు కూడా ఆన్‌లైన్ ద్వారా నూతన స్పెషలైజేషన్లకు సంబంధమున్న కోర్సులను అభ్యసించవచ్చు.

విభిన్న స్పెషలైజేషన్లు

మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లే కాకుండా ఎంబీఏలో ఎన్నో విభిన్న, కొత్త స్పెషలైజేషన్లున్నాయి. వాటిలో కొన్ని..

అనలిటిక్స్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో అంకెలు, డేటా పాత్ర చాలా కీలకం. ప్రతి వ్యాపార సంస్థకూ వివిధ నిర్ణయాలు తీసుకోవడంలో డేటా కలెక్షన్, ఇంటర్‌ప్రిటేషన్, కండెన్సింగ్ ఆఫ్ డేటా చాలా విలువైంది. ఇటీవలి కాలంలో అనలిటిక్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ రంగం అందిస్తున్న ఉన్నత వేతనాలు, విరివిగా ఉన్న ఉద్యోగావకాశాలే ఇందుకు కారణం.

గ్రాడ్యుయేషన్‌లో మేథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్‌సైన్స్, బీటెక్ చేసినవారు ఎంబీఏలో దీన్ని ఎంచుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవచ్చు. అంకెలపట్ల మక్కువ, త్వరగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, మేథమేటికల్ స్కిల్స్, చురుకుదనం, కోడింగ్ నైపుణ్యాలు గల అభ్యర్థులకు ఇది తోడ్పడుతుంది. యాడ్‌ఆన్ కోర్సులైన ఆర్ సాఫ్ట్‌వేర్, హడూప్, పైథాన్, బిగ్‌డేటా, అడ్వాన్స్‌డ్ స్టాటిస్టిక్స్ వంటి కోర్సులను కోర్స్‌ఎరా, ఎడెక్స్ వెబ్‌సైట్లలో నేర్చుకోవచ్చు.

ఎంబీఏ అనలిటిక్స్ పూర్తి చేసినవారికి డేటా అనలిస్ట్, డేటా సైంటిస్ట్, బిగ్‌డేటా కన్సల్టెంట్, డేటా ఆర్కిటెక్ట్, బిజినెస్ అనలిస్ట్ వంటి ఉద్యోగావకాశాలు ఉన్నతవేతనంతో దేశవిదేశాల్లో అందుబాటులో ఉన్నాయి. 2020 నాటికి మనదేశంలో అయిదు లక్షలమంది డేటా అనలిస్టుల అవసరం ఉందని అంచనా.

బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్

దేశంలో బీమా, ఇన్సూరెన్స్ రంగాలు పరివర్తన దశలో ఉన్నాయి. గతంతో పోలిస్తే నిరుద్యోగం తగ్గుముఖం పట్టడం, ఉద్యోగులకు మంచి జీతాలు రావడం వల్ల ప్రజల్లో పొదుపు పట్ల ఆసక్తి పెరిగింది. ఏదైనా డిగ్రీ చేసిన అభ్యర్థులు ఈ ఐచ్ఛికాన్ని ఎంచుకోవచ్చు. ముఖ్యంగా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, చలాకీగా పనిచేసే తత్వం, అంకెలపట్ల ఆసక్తి, కస్టమర్ మేనేజ్‌మెంట్, అమ్మకపు నైపుణ్యాలను విద్యార్థులు కలిగివుండాలి. బ్యాంకింగ్ రెగ్యులేషన్స్, ఫండ్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్, కార్పొరేట్ బ్యాంకింగ్, ట్రేడ్ ఫైనాన్స్ వంటి సబ్జెక్టులను విద్యార్థులు చదువుతారు.

ఉద్యోగావకాశాలపరంగా అభ్యర్థులకు పర్సనల్ ఫైనాన్షియల్ అడ్వైజర్, ఫండ్ మేనేజర్స్, బ్యాంకింగ్ స్పెషలిస్ట్, సిప్ అడ్వైజర్, రిస్క్ మేనేజర్, ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ అభ్యర్థులకు అవకాశాలున్నాయి.

కన్సల్టింగ్

ప్రతి వ్యాపార సంస్థ తమ నిర్ణయాలను తీసుకునే క్రమంలో అనుభవజ్ఞుడైన వ్యక్తి లేదా కన్సల్టెంట్ సలహాలు, సూచనలను తీసుకుంటుంది. కన్సల్టెంట్ సంబంధిత రంగంలో విశేష అనుభవం, జ్ఞానం, లోతుగా అధ్యయనం చేసే నేర్పరితనం, స్పష్టత, పోటీ తట్టుకుని వ్యాపారం చేయగలిగిన సామర్థ్యం, రిస్క్ మిటిగేషన్ వంటి నైపుణ్యాలు ఉండాలి. ఐటీ, హెచ్‌ఆర్, ఫైనాన్స్, టాక్స్, స్ట్రాటజీ, స్టార్టప్ కన్సల్టింగ్ వంటి వాటిల్లో తమకంటూ ఒక రంగంలో ప్రత్యేకతను ఏర్పరచుకోవాలి. మంచి బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ కన్సల్టింగ్ చేసినవారికి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బూజ్, మెకిన్సే కన్సల్టింగ్, ఏటీ కార్నీ వంటి సంస్థలు ఎర్రతివాచీ పరుస్తున్నాయి.

ఆంత్రప్రెన్యూర్‌షిప్

ఉద్యోగం కాదు.. తమ ఆలోచనలను వ్యాపార రూపంలో కార్యరూపం దాల్చుకోవాలనుకునే వారు ఈ ఐచ్ఛికాన్ని ఎంచుకోవచ్చు. తద్వారా తమ కలలను సాకారం చేసుకోవచ్చు. ముఖ్యంగా కుటుంబ వ్యాపార నేపథ్యం, కొనసాగింపు, అభివృద్ధి చేయాలనుకునేవారు దీన్ని ఎంచుకోవచ్చు. దేశాభివృద్ధిలో ఆంత్రప్రెన్యూర్ల పాత్ర విడదీయలేనిది. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఫండింగ్, ఏంజిల్ ఇన్వెస్టింగ్ వంటివి యువతను తమ సొంత సంస్థలు నెలకొల్పేలా ప్రేరేపిస్తున్నాయి.

సృజనాత్మకత, రిస్క్ టేకింగ్, పీపుల్ స్కిల్స్, దూరదృష్టి, అపజయాలకు కుంగిపోని మనస్తత్వం, పట్టుదల వంటి లక్షణాలున్నవారు దీన్ని ఎంచుకోవడానికి అర్హులు. దీన్ని పూర్తిచేసిన వారు స్టార్టప్స్, కుటుంబ వ్యాపారం, సొంత సంస్థలను నెలకొల్పుకోవచ్చు. ఆంత్రప్రెన్యూర్‌గా రాణించవచ్చు.

రిటైలింగ్

వేగంగా మార్పులు చెందుతున్న రంగాల్లో రిటైలింగ్ మొదటి వరుసలో ఉంటుంది. విరివిగా ఉద్యోగావకాశాలూ అందిస్తున్నదీ రంగం. మనదేశంలో టాటా, బిర్లా, అంబానీ, అదానీలు రిటైలింగ్‌లో తమకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. సేల్స్, అడ్వర్టైజింగ్, మార్కెట్ రిసెర్చ్, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ పట్ల ఆసక్తి ఉన్న అభ్యర్థులకు అవకాశాలు పుష్కలం. వినియోగదారుడు కొత్తదనాన్ని ఎప్పుడూ కోరుకుంటాడు. ఆ కొత్తదనాన్ని అందించగలిగే నైపుణ్యం ఉన్నవారు ఈ రంగంలో రాణిస్తారు.

మర్చెండైజింగ్, రిటైల్ మేనేజ్‌మెంట్, ఎక్స్‌పీరియన్స్ మేనేజ్‌మెంట్, స్టోర్ ఆప్టిమైజేషన్, కస్టమర్ సైకాలజీ వంటి సబ్జెక్టులను విద్యార్థులు అభ్యసిస్తారు. క్రియేటివ్ అడ్వర్టైజింగ్ హెడ్, రిటైల్ మేనేజర్, కస్టమర్ రిలేషన్ మేనేజర్, బ్రాండ్ స్పెషలిస్ట్ పోస్టులుంటాయి. ఈ-కామర్స్ రంగంలోనూ అవకాశాలుంటాయి. విద్యార్థులు సిక్స్ సిగ్మా, లీడ్ మేనేజ్‌మెంట్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ వంటి యాడ్ ఆన్ కోర్సులను చేసి తమ అవకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

Creature comfort తెలుసా!

ఉద్యోగాల నిమిత్తం నగరాలకు వెళ్లడం.. అక్కడ ఉండటానికి మంచి ప్రదేశాలను కోరుకోవడం సహజమే. ఈ సౌకర్యవంతమైన పరిస్థితులను వివరించడానికి ఇంగ్లిష్‌లో ఒక వ్యక్తీకరణ ఉంది. ఏమిటది?

Govind: I am still on the lookout for a place which gives me creature comfort. I am tired of living in cramped places (ఇంకా నేను వెదుకుతూనే ఉన్నాను, నేను సుఖంగా జీవించగల చోటు కోసం. నాకు విసుగెత్తి పోయింది, ఇరుకు చోట్లలో ఉండటం).

ఎం. సురేశన్

Eswar: You can't find it so easily in this congested city, unless you go to the outskirts of the city – very difficult to live in the city, if, as you say you want creature comfort (ఈ ఇరుకు నగరంలో నీకటువంటి ఇల్లు దొరకడం కష్టం, నువ్వు ఇష్టపడితే నగర శివార్లలో తప్ప).

Govind: Oh, let me tell you. Yesterday I ran into our friend Sudhakar, after a long time. You know he always talks shop and never about general matters. He bored me to death with what he does in his office, and how his boss appreciated him for his promptness in doing work (నీతో చెప్పాలో విషయం. చాలా కాలం తరువాత నేను మన స్నేహితుడు సుధాకర్‌ను అనుకోకుండా కలుసుకున్నాను. అతను తన ఆఫీసులో ఎలా పని చేస్తున్నదీ, తన బాస్ తనను ఎలా మెచ్చుకున్నదీ చెప్పి నన్ను విసుగెత్తించాడు).

Eswar: He never gives a heads up call about general information. That is the trouble with him. He always tires us (వాడెప్పుడూ అంతే. మామూలు విషయాల గురించి చెప్పడు. అదే వాడితో వచ్చిన చిక్కు. ఎప్పుడూ మనల్ని విసిగిస్తాడు).

Govind: I lost all the joy of meeting him after a long time. He never talks of anything but his job (చాలాకాలం తరువాత అతన్ని కలుసుకున్న సంతోషం మొత్తం పోయింది. ఎంతసేపూ తన ఉద్యోగం గురించి తప్ప ఇక దేని గురించీ మాట్లాడడు).

Eswar: He is always like that. That is why I always avoid him (వాడెప్పుడూ అంతే. అందుకనే వాడిని తప్పించుకుని తిరుగుతాను నేను).

MODERN ENGLISH USAGE

Now let us look at the expressions from the conversation above:

1. Creature comfort = Things which make us feel comfortable (మనల్ని సుఖవంతంగా చేసే పరిస్థితులు)

Sairam: You know I have been transferred to this place recently. Can you tell me a place where I can live comfortably? (నీకు తెలుసు కదా, ఈమధ్యనే ఈ చోటికి బదిలీ అయ్యానని. ఎక్కడైనా సుఖంగా బతికే చోటును చెప్పగలవా?)

Dinakar: If you insist on creature comfort, the best place for you is the outskirts of the city. That is where you feel happy and peaceful (నీకు అంత సౌఖ్యంగా ఉండే చోటు కావాలంటే నగర శివార్లకు వెళ్లాల్సిందే. అక్కడే నీకు సంతోషంగా, ప్రశాంతంగా ఉంటుంది).



2) Heads up call = Give information about something (ఒక విషయాన్ని గురించిన సమాచారాన్ని ఇవ్వడం)

Sridhar: I am leaving for Hyderabad in three days. You said you had work there. Will you accompany me? (మూడు రోజుల్లో నేను హైదరాబాద్ వెళ్తున్నా. నీకేదో పని ఉందని చెప్పావు కదా? నువ్వూ నాతో వస్తావా?)

Ravi: Give me a heads up call about when exactly you are leaving. I will go with you too (నువ్వెప్పుడు వెళ్లేది నాకు కచ్చితంగా చెప్పు. నేనూ నీతో వస్తాను).

ఈ 'creature comfort', Heads up call అనేవి ఇప్పుడిప్పుడే వాడుకలోకి వస్తున్న వ్యక్తీకరణలు. వీటిని తెలుసుకోవడం అవసరం.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

మహిళా డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది. **పోస్టులు:** గెస్ట్ ఫ్యాకల్టీ **ఖాళీలు:** నిబంధనల ప్రకారం. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో 55శాతం మార్కులతో పీజీ, నెట్/ స్లెట్/ సెట్/ ఎంఫిల్/ పీహెచ్‌డీ. తెలంగాణలో 5, 6 జోన్లకు చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. **ఎంపిక:** విద్యార్హతలు, రాతపరీక్ష, డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా.
రాతపరీక్ష తేది: 01.07.2018
దరఖాస్తు: ఆన్‌లైన్. **చివరి తేది:** 28.06.2018
వెబ్‌సైట్: http://www.tswreis.in/

డీఆర్‌డీఓలో సైంటిస్ట్ పోస్టులు

సంస్థ: డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ), దిల్లీ. **పోస్టు:** సైంటిస్ట్ **ఖాళీలు:** 19
అర్హత: మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ, గేట్ స్కోరు. **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఆన్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.100
చివరి తేది: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (16-22 జూన్ 2018)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోపు. **వెబ్‌సైట్:** https://rac.gov.in/

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్), హైదరాబాద్. **పోస్టులు:** థీమాటిక్ ఎక్స్‌పర్ట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ తదితరాలు (కాంట్రాక్టు). **ఖాళీలు:** 15 **వర్క్ లొకేషన్:** డీడీయూజీకేవై డివిజన్, ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్/ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, న్యూదిల్లీ. **అర్హత, వయసు, ఎంపిక:** ఎన్ఐఆర్‌డీపీఆర్ నిబంధనల ప్రకారం.
దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరి తేది:** 29.06.2018, http://nird.org.in/

తెలంగాణలో పారా మెడికల్ కోర్సులు

ప్రవేశాలు

తెలంగాణ స్టేట్ పారామెడికల్ బోర్డు 2018-19 విద్యా సంవత్సరానికిగానూ రాష్ట్రంలోని వివిధ పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. **కోర్సులు:** మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఆప్టోమెట్రీ టెక్నీషియన్ తదితర పారా మెడికల్. **కాలవ్యవధి:** 2 సంవత్సరాలు.
మొత్తం సీట్ల సంఖ్య: 33,871 (ప్రభుత్వ శిక్షణ సంస్థల్లో 591, ప్రైవేటులో 33,280) **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత (బైపీసీ అభ్యర్థులకు ప్రాధాన్యం).
ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్.
చివరి తేది: ప్రభుత్వ శిక్షణ సంస్థలకు 09.07.2018, ప్రైవేటు సంస్థలకు 12.07.2018. **వెబ్‌సైట్:** http://www.tspmb.telangana.gov.in/

ఐఆర్‌సీటీసీలో సూపర్‌వైజర్లు

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సంస్థ: ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) సౌత్ జోన్.
పోస్టు: సూపర్‌వైజర్ (హాస్పిటాలిటీ) (ఒప్పంద ప్రాతిపదికన) **ఖాళీలు:** 120
అర్హత: హాస్పిటాలిటీ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీతోపాటు రెండేళ్ల పని అనుభవం. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
ఇంటర్వ్యూ తేదీలు-వేదికలు: ఐహెచ్ఎం చెన్నైలో జూన్ 25, ఐహెచ్ఎం బెంగళూరులో జూన్ 27, ఐహెచ్ఎం త్రివేండ్రంలో జూన్ 29.
వెబ్‌సైట్: http://www.ihmchennai.org/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

శ్రీయుత ప్రత్యేక కలెక్టరు (భూ.సే.) టి.జి.పి. నెల్లూరు వారి కార్యవర్తనములు
ప్రస్తుతము: శ్రీమతి పి.ప్రశాంతి ఎం.ఎ.,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఫారం నెం. VII

ఆర్సీ డీ1.102/2017 తేది: 30.05.2018

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనముకై అనగా తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించి డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామమందు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కొరకు విస్తీర్ణము ఎ. 49.46 సెంట్లు భూములు కావలెనని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు భావించినందున, 2013వ సంవత్సరము 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములను విచారణ జరిపిన పిమ్మట శ్రీ ప్రత్యేక కలెక్టరు, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తము భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2017-18నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరము 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

శ్రీయుత ప్రత్యేక కలెక్టరు, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19 (1) విభాగంననుసరించిన ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమున్నకై అనగా తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించి డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామం నందు బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కొరకు విస్తీర్ణము ఎ. 49.46 సెంట్లు అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు **మండలం : డక్కిలి** **గ్రామం : ఆల్తూరుపాడు**

క్రమ సంఖ్య	సర్వే నెం. /సబ్ డి.నెం.	విస్తీర్ణం	తరగతి	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	సాగు/బీడు
1.	3-1	1.86	పట్టా మాగాణి	కటకం గంగయ్య తండ్రి: వెంకటరమణయ్య	కటకం గంగయ్య తండ్రి: వెంకటరమణయ్య	బీడు
2.	3-2	0.31	పట్టా మాగాణి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	బీడు
3.	3-3	0.40	పట్టా మాగాణి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	బీడు
4	3-4	0.11	పట్టా మాగాణి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	బీడు
5.	3-5	0.12	పట్టా మాగాణి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	బీడు
6.	3-6	0.50	పట్టా మాగాణి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	బీడు
7.	3-7	0.51	పట్టా మాగాణి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి: ముని ఆచారి	బీడు
8.	3-8	0.24	పట్టా మాగాణి	వెలుగు ప్రభావతమ్మ భర్త: కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త: కృష్ణయ్య	బీడు
9.	3-9	0.22	పట్టా మాగాణి	వెలుగు ప్రభావతమ్మ భర్త: కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త: కృష్ణయ్య	వరి
10.	3-10	0.48	పట్టా మాగాణి	కావిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి తండ్రి: సుబ్బారెడ్డి	పంజా ఈశ్వరయ్య తండ్రి: లేట్ రామయ్య	బీడు
11.	3-11	0.24	పట్టా మాగాణి	వెలుగు ప్రభావతమ్మ భర్త: కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త: కృష్ణయ్య	వరి
12.	3-12	0.22	పట్టా మాగాణి	వెలుగు ప్రభావతమ్మ భర్త: కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త: కృష్ణయ్య	వరి
13.	4-1	0.14	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి బోరు-1
14.	4-2	0.17	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
15.	4-3	0.47	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
16.	4-4	0.33	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
17.	4-5	0.25	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
18.	4-6	0.33	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
19.	4-7	0.11	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
20.	4-8	0.15	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
21.	4-9	1.22	పట్టా మాగాణి	చిలమనూరు మల్లిఖార్జునరెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు మల్లిఖార్జునరెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
22.	4-10	0.13	పట్టా మాగాణి	చిలమనూరు మల్లిఖార్జునరెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు మల్లిఖార్జునరెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
23.	4-11	0.34	పట్టా మాగాణి	సంకురాత్రి మునెయ్య తండ్రి: గోవిందు	సంకురాత్రి మునెయ్య తండ్రి: గోవిందు	వరి
24	4-12	0.05	పట్టా మాగాణి	చెరుకూరి పెంచలయ్య తండ్రి: యల్లయ్య	సంకురాత్రి మునెయ్య తండ్రి: గోవిందు	వరి
25.	4-13	0.33	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	వరి
26.	4-14	0.21	పట్టా మాగాణి	చిలమనూరు మల్లికార్జునరెడ్డి తండ్రి: లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు మల్లికార్జునరెడ్డి తండ్రి: లేట్ వెంకరెడ్డి	వరి
27.	4-15	0.21	పట్టా మాగాణి	చిలమనూరు మల్లిఖార్జునరెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు మల్లిఖార్జునరెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	వరి
28.	4-16	0.31	పట్టా మాగాణి	పెనమల పెంచలు తండ్రి రంగయ్య	సంకురాత్రి మునెయ్య తండ్రి గోవిందు	వరి
		0.31	పట్టా మాగాణి	పెనమల పెంచలు తండ్రి రంగయ్య	సంకురాత్రి రమణయ్య తండ్రి మునెయ్య	వరి
29.	4-17	0.80	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	వరి
30.	4-18	0.50	పట్టా మాగాణి	చిలమనూరు మల్లికార్జునరెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు మల్లికార్జునరెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	వరి
31.	4-19	0.24	పట్టా మాగాణి	పెనమల పెంచలు తండ్రి రంగయ్య	సంకురాత్రి మునెయ్య తండ్రి గోవిందు	వరి
		0.25	పట్టా మాగాణి	పెనమల పెంచలు తండ్రి రంగయ్య	సంకురాత్రి రమణయ్య తండ్రి మునెయ్య	వరి
32.	5-1	0.75	పట్టా మాగాణి	చిలమనూరు మల్లికార్జునరెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	చిలమనూరు మల్లికార్జునరెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	వరి
		1.07	పట్టా మాగాణి	నేలబల్లి నారాయణమ్మ భర్త పెద్ద చెంచురెడ్డి	నేలబల్లి నారాయణమ్మ భర్త పెద్ద చెంచురెడ్డి	వరి
33.	5-3	0.21	పట్టా మాగాణి	మన్నేపల్లి మునిక్రిష్ణమ్మ భర్త లేట్ రమణయ్య	మన్నేపల్లి మునిక్రిష్ణమ్మ భర్త లేట్ రమణయ్య	వరి
34.	5-4	0.07	పట్టా మాగాణి	గోనుపల్లి వెంకటకృష్ణయ్య తండ్రి లేట్ వెంకటయ్య	గోనుపల్లి నరసయ్య తండ్రి రోశయ్య	వరి
35.	5-5	0.10	పట్టా మాగాణి	గోనుపల్లి శ్రీనివాసులు తండ్రి నరసయ్య	గోనుపల్లి నరసయ్య తండ్రి రోశయ్య	వరి
36.	5-6	0.05	పట్టా మాగాణి	శివరాత్రి సులోచనమ్మ భర్త లేట్ మునిక్రిష్ణయ్య	శివరాత్రి సులోచనమ్మ భర్త లేట్ మునిక్రిష్ణయ్య	వరి
		0.26	పట్టా మాగాణి	ముద్దా ఈశ్వర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	ముద్దా ఈశ్వర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	వరి
37.	5-7	0.81	పట్టా మాగాణి	పింగాణి శ్రీనివాసులురెడ్డి తండ్రి ఈశ్వరయ్య	పింగాణి మునెమ్మ భర్త ఈశ్వర్‌రెడ్డి	వరి
38.	6-1	0.36	పట్టా మాగాణి	పులి కృష్ణారెడ్డి తండ్రి వెంకటరెడ్డి	పులి కృష్ణారెడ్డి తండ్రి వెంకటరెడ్డి	వరి
		0.38	పట్టా మాగాణి	పైగాల గురవయ్య తండ్రి లేట్ రమణయ్య	పైగాల గురవయ్య తండ్రి లేట్ రమణయ్య	వరి
		0.26	పట్టా మాగాణి పట్టా మాగాణి	పైడిమంతుల మునిక్రిష్ణయ్య పులి కృష్ణారెడ్డి తండ్రి వెంకటరెడ్డి పైగాల గురవయ్య తండ్రి లేట్ రమణయ్య	కలవలపూడి విశ్వనాథం తండ్రి లేట్ గున్నయ్య	వరి
39.	6-2	0.61		గోనుపల్లి శ్రీనివాసులు తండ్రి నరసయ్య	గోనుపల్లి మునికుమార్ తండ్రి లేట్ నరసయ్య	వరి, బోర్-1, మోటార్-1
		0.25	పట్టా మాగాణి	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వరి వేప-4
40.	6-3	0.50	పట్టా మాగాణి	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వరి
41.	6-4	0.06	పట్టా మాగాణి	గోనుపల్లి రోశయ్య తండ్రి పెంచలయ్య	రొంపిచెర్ల రాజేశ్వరమ్మ భర్త సుబ్రమణ్యం	వరి
42.	6-5	0.30	పట్టా మాగాణి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి ముని ఆచారి	ఎల్లోజి సుబ్బనాచారి తండ్రి ముని ఆచారి	బీడు
43.	6-6	0.55	పట్టా మాగాణి	రొంపిచెర్ల రాజేశ్వరమ్మ భర్త సుబ్రమణ్యం	రొంపిచెర్ల రాజేశ్వరమ్మ భర్త సుబ్రమణ్యం	వరి
44.	6-7	0.6	పట్టా మాగాణి	రొంపిచెర్ల రాజేశ్వరమ్మ భర్త సుబ్రమణ్యం	రొంపిచెర్ల రాజేశ్వరమ్మ భర్త సుబ్రమణ్యం	వరి
45.	7-1	0.34	పట్టా మాగాణి	మన్నేపల్లి మునిక్రిష్ణమ్మ భర్త లేట్ రమణయ్య	మన్నేపల్లి మునిక్రిష్ణమ్మ భర్త లేట్ రమణయ్య	వరి
46.	7-2	0.13	పట్టా మాగాణి	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వరి
47.	7-3	0.20	పట్టా మాగాణి	గోనుపల్లి వెంకటకృష్ణయ్య తండ్రి లేట్ వెంకటయ్య	గోనుపల్లి శ్రీనివాసులు తండ్రి నరసయ్య	వరి
48.	7-4	0.50	పట్టా మాగాణి	కుర్రా మునెమ్మ భర్త పట్టాభిరామిరెడ్డి	కుర్రా మునెమ్మ భర్త పట్టాభిరామిరెడ్డి	వరి
49.	7-5	0.10	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి గున్నరెడ్డి చిల్లకూరు గురవారెడ్డి తండ్రి గున్నారెడ్డి కాలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం యకసిరి ప్రసాద్ తండ్రి లేట్ ఈశ్వర్‌రెడ్డి	గోనుపల్లి శ్రీనివాసులు తండ్రి నరసయ్య	వరి
		0.45	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి గున్నరెడ్డి చిల్లకూరు గురవారెడ్డి తండ్రి గున్నరెడ్డి కాలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం యాకసిరి ప్రసాద్ తండ్రి లేట్ ఈశ్వర్‌రెడ్డి	యాకసిరి సుకవేనమ్మ భర్త ఈశ్వర్‌రెడ్డి	వరి
		0.10	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి గున్నరెడ్డి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి గున్నరెడ్డి	వరి
		0.40	పట్టా మాగాణి	కాలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	కాలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	వరి
50.	7-6	0.54	పట్టా మాగాణి	కుర్రా మునెమ్మ భర్త పట్టాభిరామిరెడ్డి	కుర్రా మునెమ్మ భర్త పట్టాభిరామిరెడ్డి	వరి
51.	7-7	0.17	పట్టా మాగాణి	ముద్దా వెంకటమ్మ భర్త ఈశ్వర్‌రెడ్డి	ముద్దా వెంకటమ్మ భర్త ఈశ్వర్‌రెడ్డి	వరి
		0.17	పట్టా మాగాణి	ముద్దా శివమోహన్‌రెడ్డి తండ్రి లేట్ ఈశ్వర్‌రెడ్డి	ముద్దా శివమోహన్‌రెడ్డి తండ్రి లేట్ ఈశ్వర్‌రెడ్డి	వరి
		0.35	పట్టా మాగాణి	శివరాతిరి సులోచనమ్మ భర్త లేట్ మునిక్రిష్ణయ్య	శివరాతిరి సులోచనమ్మ భర్త లేట్ మునిక్రిష్ణయ్య	వరి
52.	7-8	0.08	పట్టా మాగాణి	మన్నేపల్లి మునిక్రిష్ణమ్మ భర్త లేట్ రమణయ్య	మన్నేపల్లి మునిక్రిష్ణమ్మ భర్త లేట్ రమణయ్య	వరి
53.	7-9	0.03	పట్టా మాగాణి	గోనుపల్లి వెంకటకృష్ణయ్య తండ్రి లేట్ వెంకటయ్య	యాకసిరి రమణయ్య	వరి
54.	7-10	0.03	పట్టా మాగాణి	గోనుపల్లి వెంకటకృష్ణయ్య తండ్రి లేట్ వెంకటయ్య	కలువకొల్లు ధనుంజయ తండ్రి శివయ్య	వరి
55.	7-11	0.06	పట్టా మాగాణి	కటకం మునిరెడ్డి	యాకసిరి పెంచలయ్య	వరి
		0.07	పట్టా మాగాణి	కటకం మునిరెడ్డి	యాకసిరి పెంచలయ్య	వరి
56.	8-1	0.29	పట్టా మాగాణి	కలవలపూడి సంపూర్ణమ్మ భర్త నాగరాజు	కలవలపూడి సంపూర్ణమ్మ భర్త నాగరాజు	వరి, జువ్వి-1 తాటి-5, మర్రి-1
57.	8-2	0.18	పట్టా మాగాణి	కలవలపూడి సంపూర్ణమ్మ భర్త నాగరాజు	కలవలపూడి సంపూర్ణమ్మ భర్త నాగరాజు	వరి
		0.32	పట్టా మాగాణి	కలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	కలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	వరి
58.	8-3	0.14	పట్టా మాగాణి	కలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	కలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	వరి, జువ్వి-1 తాటి-5,మర్రి-1
59.	8-4	1.33	పట్టా మాగాణి	పొదలకూరు రాజయ్య తండ్రి శేషయ్య	పొదలకూరు రాజయ్య తండ్రి శేషయ్య	వరి
60.	8-5	0.34	పట్టా మాగాణి	చిల్లకూరు గురవారరెడ్డి తండ్రి గున్నరెడ్డి చిల్లకూరు గురవారెడ్డి తండ్రి గున్నరెడ్డి	గోనుపల్లి శ్రీనివాసులు తండ్రి నరసయ్య	వరి
		0.35	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి గున్నరెడ్డి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి గున్నరెడ్డి	వరి
61.	8-6	0.55	పట్టా మాగాణి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	వరి
62.	8-7	0.18	పట్టా మాగాణి	ముద్దా శివశంకర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	ముద్దా శివశంకర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	వరి, తాటి-11
		0.30	పట్టా మాగాణి	ముద్దా వెంకటమ్మ భర్త ఈశ్వర్‌రెడ్డి	ముద్దా వెంకటమ్మ భర్త ఈశ్వర్‌రెడ్డి	వరి
		0.25	పట్టా మాగాణి	శివరాతిరి సులోచనమ్మ భర్త లేట్ మునిక్రిష్ణయ్య	శివరాతిరి సులోచనమ్మ భర్త లేట్ మునిక్రిష్ణయ్య	వరి
63.	9-1	0.16	పట్టా మాగాణి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	వరి
64.	9-2	0.31	పట్టా మాగాణి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	వరి
65.	9-4ఎ	0.13	పట్టా మాగాణి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	వరి
66.	9-5	0.14	పట్టా మాగాణి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	వరి
67.	9-6ఎ	0.30	పట్టా మాగాణి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	వరి
68.	9-7	0.16	పట్టా మాగాణి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	వరి
69.	9-8	0.15	పట్టా మాగాణి	ముద్దా శివశంకర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	ముద్దా శివశంకర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	వరి
70.	9-9ఎ	0.15	పట్టా మాగాణి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	వరి
71.	9-11ఎ	0.08	పట్టా మాగాణి	కలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	కలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	వరి
72.	10-1	0.24	పట్టా మెట్ట	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామిరెడ్డి	వరి
73.	10-2	0.07	పట్టా మెట్ట	సంకురాత్రి మునెయ్య తండ్రి గోవిందు	సంకురాత్రి మునెయ్య తండ్రి గోవిందు	వరి

(మిగతా 12లో)

విషం చిమ్మిన ప్రేమ

- **మరొకరితో పెళ్లికి సిద్ధమవడంతో యువతి హత్య**
- **అనంతరం ఆత్మహత్య చేసుకున్న మాజీ ప్రియుడు**
- **తెల్లవారితే యువతి వివాహమనగా దారుణం**

దొండపూడి లహరి

ఆళ్ళ కిరణ్

పోలవరం, న్యూస్‌టుడే: మరొకరితో పెళ్లికి సిద్ధపడ్డ మాజీ ప్రియురాలిని కత్తితో దాడిచేసి హత్యచేశాడు ఓ యువకుడు. ఆపై తానూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా టి.నర్సాపురం మండలం మధ్యాహ్నపువారిగూడేనికి చెందిన ఆళ్ళ కిరణ్ (25), జంగారెడ్డిగూడేనికి చెందిన దొండపూడి లహరి(21)లు నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ఐదు నెలల కిందట ఆమె మనసు మారింది. పోలవరానికి చెందిన తాడేపల్లి సురేష్‌ను ప్రేమించింది. విషయం తెలిసిన కిరణ్ బెదిరించడంతో జంగారెడ్డిగూడెం పోలీసుస్టేషన్‌లో లహరి ఫిర్యాదు చేసింది. దాంతో కిరణ్‌ను స్టేషన్‌కు పిలిపించి ఎస్సై మందలించారు. ఇకపై ఆమె జోలికి వెళ్లనని హామీపత్రం రాయించుకుని వదిలి పెట్టారు. దీంతో కిరణ్‌లో కసి పెరిగి ఆమెను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. మరోవైపు బుధవారం ఉదయం దేవరపల్లి మండలం గౌరీపట్నం చర్చిలో లహరి, సురేష్‌ల వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో లహరి సురేష్ వాళ్ల ఇంట్లోనే ఉంటోంది. ఈ సమాచారం తెలియడంతో కిరణ్ విచక్షణ కోల్పోయాడు. మంగళవారం రాత్రి పోలవరం పంచాయతీ పరిధిలో లహరి ఉంటున్న పరిసరాలను పరిశీలించాడు. రాత్రి ఒంటి గంటన్నర సమయంలో ఆమె ఉన్న ఇంటి తలుపు తట్టాడు. ఆమెతో పాటు లోపల ఉన్న సురేష్ తలుపు తీయడంతో అతనిని పక్కకు తోసి మంచంపై పడుకున్న లహరిని కత్తితో విచక్షణారహితంగా గాయపరిచాడు. ఇంతలో ఆరుబయట పడుకున్న సురేష్ తమ్ముడు సతీష్ వచ్చి కిరణ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయగా అతని చేతిపైన కత్తితో నరికి వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేశాడు. అనంతరం గోడ దూకి సమీపంలోని జామాయిల్ తోటలోకి వెళ్లిపోయాడు. తెల్లవారిన అనంతరం ఒక్కసారిగా ఊరంతా విషయం గుప్పుమంది. తోటలో పడి ఉన్న అతనిని చూసి స్థానికులు పోలీసులకు తెలియజేశారు. వారు అక్కడకు వెళ్లేసరికి కిరణ్ మరణించాడు.

జులై ఆఖరుకు మెట్రో రయ్‌రయ్

అమీర్‌పేట-ఎల్‌బీనగర్ ట్రయల్‌రన్ పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: అమీర్‌పేట నుంచి ఎల్‌బీనగర్ వరకు 16 కి.మీ. మేర మెట్రోరైలు పనులన్నీ జులై ఆఖరు నాటికి పూర్తిచేసి.. తెలంగాణ సీఎం కేసీఆర్ సమయం ఇవ్వగానే ప్రారంభించనున్నట్లు తెలంగాణ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ట్రయల్‌రన్ పూర్తిచేసి కమిషనర్ ఆఫ్ మెట్రోరైలు సేఫ్టీ(సీఎంఆర్ఎస్) అనుమతులన్నీ పొంది సిద్ధంగా ఉండాలని హెచ్ఎంఆర్, ఎల్ అండ్ టీ మెట్రోరైలు సంస్థలను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. పీపీపీ విధానంలో ప్రపంచంలోనే అతిపెద్దదైన మన మెట్రో నిర్మాణం సాహసోపేతమని అన్నారు. అమీర్‌పేట నుంచి ఎల్‌బీనగర్ వరకు ప్రారంభమైన ట్రయల్‌రన్‌ను మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్ అండ్ టీ మెట్రోరైలు ఎండీ కేవీబీరెడ్డితో కలిసి బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. లక్డీకాపూల్, నాంపల్లి, ఎంజీబీఎస్ స్టేషన్ల వద్ద పనులను పరిశీలించారు. మెట్రోలోనే ఎల్‌బీనగర్ స్టేషన్ చేరుకున్న కేటీఆర్ అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడారు. హైటెక్‌సిటీ మార్గం అక్టోబరు నాటికి సిద్ధం అవుతుందనీ, ఇవన్నీ పూర్తయితే 56 కి.మీ. మార్గం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మెట్రో మాల్స్‌కు కూడా మంచి స్పందన ఉందన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ యూజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో యూజీ, పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశం పొందేందుకు విశ్వవిద్యాలయ వర్గాలు ప్రకటన విడుదల చేశాయి. అంతర్జాలం ద్వారా దరఖాస్తు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపాయి. 2018-19 సంవత్సరానికి యూజీ (బీఏ/బీకాం/బీఎస్సీ), పీజీలోని ఎంబీఏ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంఎల్ఐఎస్‌సీ, బీఎల్ఐఎస్‌సీ, డిప్లొమా, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు ఈ నెల(జూన్) 21 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి తేదీ ఆగస్టు 9. ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.braou.ac.in, www.braouonline.in లను, సేవా కేంద్రాల నంబర్లు 73829 29570, 73829 29580లలో సంప్రదించవచ్చు.

టూత్‌పేస్టులోని సమ్మేళనంతో మొండి బ్యాక్టీరియాల పెరుగుదల ముప్పు!

మెల్‌బోర్న్: టూత్‌పేస్టులు సహా పలు ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే ఓ రసాయనం.. ఔషధాలకు లొంగని బ్యాక్టీరియాల పెరుగుదలకు కారణమయ్యే ముప్పుందని తాజా అధ్యయనమొకటి గుర్తించింది. సాధారణంగా యాంటీబయోటిక్ ఔషధాల మితిమీరిన వాడకంతో.. వాటి ప్రభావాన్ని తట్టుకోగల మొండి బ్యాక్టీరియాలు తయారవుతుంటాయి. దీంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. అయితే, ఔషధాల అతి వినియోగమే కాకుండా.. కొన్ని రసాయనాలు కూడా మొండి బ్యాక్టీరియాల ఆవిర్భావానికి కారణమవుతాయని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు వెల్లడించారు. చేతులను శుభ్రపర్చుకునేందుకు ఉపయోగించే సమ్మేళనాలు, టూత్‌పేస్టులు సహా రెండు వేలకుపైగా ఉత్పత్తుల్లో సర్వసాధారణంగా వినియోగించే 'ట్రైక్లోశాన్' అనే రసాయనం కూడా ఇలాంటి విపత్కర పరిస్థితికి కారణమవుతున్నట్లు తాము గుర్తించామన్నారు. ఇళ్లలో నుంచి ఈ రసాయన అవశేషాలు అధికస్థాయిలో వాతావరణంలో కలుస్తూ.. ఔషధాలకు లొంగని బ్యాక్టీరియాల పెరుగుదలకు దారితీస్తున్నాయని వెల్లడించారు.

దిల్లీలో రాహుల్‌గాంధీతో సమావేశమైన ఏపీ కాంగ్రెస్ నేతలు

ఓటు బ్యాంకుపై దృష్టి పెట్టండి

- ప్రభుత్వ ఏర్పాటులో కీలకం కానున్నాం
- ఏపీ కాంగ్రెస్ నేతలతో రాహుల్‌గాంధీ

ఈనాడు, దిల్లీ: గత ఎన్నికల్లో పార్టీకి దూరమైన ఓటు బ్యాంకుపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నేతలకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సూచించారు. పార్టీని వీడిన నేతలను ఆహ్వానించడంతో పాటు ఓటర్లు కూడా పార్టీ వైపు వచ్చేలా చూడాలన్నారు. బుధవారమిక్కడ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీ నేతృత్వంలో ఏపీ కాంగ్రెస్ నేతలు రఘువీరారెడ్డి, కేవీపీ రామచంద్రరావు, సుబ్బరామిరెడ్డి, పళ్లంరాజు, కనుమూరి బాపిరాజు, జేడీ శీలం, చింతామోహన్, పనబాక లక్ష్మి, తులసిరెడ్డి, తదితర 25 మంది నేతలు రాహుల్‌గాంధీతో వన్ టు వన్ భేటీ అయ్యారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటులో కాంగ్రెస్ కీలకం కానుందని, గెలుపు గుర్రాలపై దృష్టి సారించాలని రాహుల్ చెప్పారు. పొత్తులపై ఆలోచించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సహకారం లేకుండా రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు కాలేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటు బ్యాంకుని 10శాతం నుంచి 15శాతం వరకు పెంచిన నేతల భవిష్యత్తుకు తాను భరోసా ఇస్తున్నానని తెలిపారు. పార్టీలో కోవర్టులపై దృష్టి పెట్టాలని, వైకాపాకు వెళ్లిన ఓటు బ్యాంకు తిరిగి వచ్చేలా కృషి చేయాలని చెప్పారు. వైఎస్ పేద ప్రజలు చెప్పేది వినేవారని, జగన్ మాత్రం స్వార్థ ప్రయోజనాలకు పనిచేస్తారని, భాజపాతో మిలాఖత్ అయ్యారని, ఆ ఊబిలోంచి బయటకు రాలేరని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పీసీసీ కమిటీని పూర్తి స్థాయిలో వేయాలని, వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా ముగ్గురిని, మేనిఫెస్టో, ప్రచార కమిటీకి ఒక్కొక్కరిని వెంటనే నియమించాలని నేతలు కోరారు. రాష్ట్రంలో గెలిచే అవకాశాలున్న 15 లోక్‌సభ, 75 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ముందుగానే ప్రకటించాలని కోరగా ఆ జాబితా ఇవ్వాలని రాహుల్ సూచించారు. ఆ తర్వాత ఊమెన్ చాందీ కొద్దిసేపు రాష్ట్ర పార్టీ నేతలతో సమావేశమయ్యారు. జులై 9 నుంచి 13, జులై 16 నుంచి 18 వరకు తొలివిడతగా జిల్లాల్లో పర్యటిస్తానని చెప్పారు. ఆగస్టు 15 కల్లా జిల్లా, అసెంబ్లీ స్థాయి కమిటీలు పూర్తి చేయాలని, ఆ దిశగా కసరత్తు చేయాలని రఘువీరారెడ్డికి సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

(11వ పేజీ తరువాయి)		0.07	పట్టా మెట్ట	సంకురాత్రి రమణయ్య తండ్రి పోలయ్య	సంకురాత్రి రమణయ్య తండ్రి పోలయ్య	
74.	10-3	0.15	పట్టా మెట్ట	సంకురాత్రి జయచంద్ర తండ్రి గోవిందు	సంకురాత్రి జయచంద్ర తండ్రి గోవిందు	వరి, తాటి-7
75.	10-4	0.36	పట్టా మెట్ట	జడ్డా నారపనాయుడు తండ్రి రామయ్య	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి మునిరెడ్డి	వరి,తాటి-20, బావి-1
76.	10-5	0.23	పట్టా మెట్ట	గోన నాదమునిరెడ్డి తండ్రి మునిరెడ్డి	గోన నాదమునిరెడ్డి తండ్రి మునిరెడ్డి	వరి
		0.23	పట్టా మెట్ట	జడ్డా సూర్యారావు తండ్రి పుల్లయ్య	జడ్డా సూర్యారావు తండ్రి పుల్లయ్య	వరి
77.	10-6	0.13	పట్టా మెట్ట	కాసుల హేమలత భర్త వెంకటేశ్వర్లు	కాసుల హేమలత భర్త వెంకటేశ్వర్లు	వరి,బోరు-1 వేప-4,మునగ-1
78.	10-7	0.25	పట్టా మెట్ట	జడపల్లి రమణయ్య తండ్రి గురవయ్య	జడపల్లి రమణయ్య తండ్రి గురవయ్య	వరి
79.	10-8	0.13	పట్టా మెట్ట	జడపల్లి రమణయ్య తండ్రి గురవయ్య	జడపల్లి రమణయ్య తండ్రి గురవయ్య	వరి,తాటి-6 కుంకుడు-2
80.	10-9	0.42	పట్టా మాగాణి	కలవలపూడి విశ్వనాథం తండ్రి గున్నయ్య	కలవలపూడి విశ్వనాథం తండ్రి గున్నయ్య	వరి
		0.28	పట్టా మాగాణి	ముద్దా శివశంకర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	ముద్దా శివశంకర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	వరి
81.	10-10	0.32	పట్టా మాగాణి	ముద్దా శివమోహన్‌రెడ్డి తండ్రి లేట్ ఈశ్వర్‌రెడ్డి	ముద్దా వెంకటమ్మ భర్త ఈశ్వర్‌రెడ్డి	వరి
		0.55	పట్టా మాగాణి	శివరాతిరి మునిక్రిష్ణయ్య	శివరాతిరి సులోచనమ్మ భర్త లేట్ మునిక్రిష్ణయ్య	వరి
82.	11	1.15	ఇనాం మాగాణి	వడ్ల, కమ్మర	పులి కృష్ణారెడ్డి తండ్రి వెంకటరెడ్డి	వరి
		0.375	ఇనాం మాగాణి	వడ్ల, కమ్మర	పైగాల గురవయ్య తండ్రి లేట్ రమణయ్య	వరి
		0.305	ఇనాం మాగాణి	వడ్ల, కమ్మర	కలవలపూడి విశ్వనాథం తండ్రి గున్నయ్య	వరి
83.	12-1	0.14	పట్టా మెట్ట	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వరి
84.	12-2	0.18	పట్టా మెట్ట	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వరి
85.	13-1	0.18	పట్టా మెట్ట	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	వరి
86.	13-2	0.20	పట్టా మాగాణి	గోనుపల్లి శ్రీనివాసులు తండ్రి నరసయ్య	గోనుపల్లి శ్రీనివాసులు తండ్రి నరసయ్య	వరి
87.	13-3	0.05	పట్టా మాగాణి	పట్టాచిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి
		0.18	పట్టా మాగాణి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి
88.	13-4	0.21	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి బావి-1
89.	13-5	0.25	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి బోరు-1
		0.62	పట్టా మాగాణి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి
90.	13-6	0.19	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి
91.	13-7	0.53	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి
		0.27	పట్టా మాగాణి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి
92.	13-8	0.05	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి
		0.22	పట్టా మాగాణి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నరెడ్డి	వరి
93.	15-5బి	0.62	పట్టా మాగాణి	పసుపులేటి మునిప్రసాద్ తండ్రి లేట్ మునిక్రిష్ణయ్య	పసుపులేటి మునిప్రసాద్ తండ్రి లేట్ మునిక్రిష్ణయ్య	వరి,బోరు-3 వేప-1
94.	16-3బి	0.47	పట్టా మాగాణి	మన్నేపల్లి పెంచలనరసయ్య తండ్రి పెంచలయ్య	మన్నేపల్లి పెంచలనరసయ్య తండ్రి పెంచలయ్య	వరి
95.	16-4బి	0.34	పట్టా మెట్ట	చెరుకూరు పోలయ్య తండ్రి మునెయ్య	చెరుకూరు పోలయ్య తండ్రి మునెయ్య	వరి,తాటి-11 వేప-2
96.	23-1	0.57	పట్టా మెట్ట	పులి సుభాషిణి భర్త చినచెంచురెడ్డి	పులి సుభాషిణి భర్త చినచెంచురెడ్డి	వరి వేప-1
97.	23-3ఎ	0.05	పట్టా మాగాణి	యాకసిరి అమరావతి భర్త రాజారెడ్డి	యాకసిరి అమరావతి భర్త రాజారెడ్డి	వరి
98.	23-5ఎ	0.26	పట్టా మాగాణి	కనుపర్తి యానాదిరెడ్డి తండ్రి: మునిరెడ్డి	కనుపర్తి యానాదిరెడ్డి తండ్రి: మునిరెడ్డి	వరి
99.	23-6ఎ	0.30	పట్టా మాగాణి	యాకసిరి ప్రసాద్ తండ్రి: లేట్ ఈశ్వర్‌రెడ్డి	యాకసిరి సుకవేణమ్మ తండ్రి: ఈశ్వర్‌రెడ్డి	వరి
100.	23-7ఎ	0.24	పట్టా మాగాణి	కనుపర్తి యానాదిరెడ్డి తండ్రి: మునిరెడ్డి	కనుపర్తి యానాదిరెడ్డి తండ్రి: మునిరెడ్డి	వరి
101	23-8ఎ	0.19	పట్టా మాగాణి	కనుపర్తి యానాదిరెడ్డి తండ్రి: మునిరెడ్డి	కనుపర్తి యానాదిరెడ్డి తండ్రి: మునిరెడ్డి	వరి
102	23-9ఎ	0.11	పట్టా మాగాణి	కనుపర్తి యానాదిరెడ్డి తండ్రి: మునిరెడ్డి	కనుపర్తి యానాదిరెడ్డి తండ్రి: మునిరెడ్డి	వరి
103	24-4బి	0.49	పట్టా మాగాణి	గుంటకింద రమణమ్మ భర్త: మునిక్రిష్ణారెడ్డి	గుంటకింద రమణమ్మ భర్త: మునిక్రిష్ణారెడ్డి	వరి వేప-1 బోరు-1 మోటార్-1 బావి-1
104.	117-1	1.48	పట్టా మాగాణి	పొదలకూరు రాజయ్య తండ్రి: శేషయ్య	పొదలకూరు రాజయ్య తండ్రి: శేషయ్య	వరి
105.	117-2	0.11	పట్టా మాగాణి	కలవలపూడి విశ్వనాథం తండ్రి: గున్నయ్య	కలవలపూడి విశ్వనాథం తండ్రి: గున్నయ్య	వరి
106.	117-3	0.17	పట్టా మాగాణి	కలవలపూడి విశ్వనాథం తండ్రి: గున్నయ్య	కలవలపూడి విశ్వనాథం తండ్రి: గున్నయ్య	వరి
107.	117-4	0.33	పట్టా మాగాణి	పాదులేటి జ్యోతమ్మ భర్త: దశరథరామిరెడ్డి	పాదులేటి జ్యోతమ్మ భర్త: దశరథరామిరెడ్డి	వరి
108	117-5ఎ	0.06	పట్టా మాగాణి	శివరాతిరి సులోచనమ్మ భర్త: లేట్ మునిక్రిష్ణయ్య	శివరాతిరి సులోచనమ్మ భర్త: లేట్ మునిక్రిష్ణయ్య	వరి
109	117-5బి	0.10	పట్టా మాగాణి	శివరాతిరి సులోచనమ్మ భర్త: లేట్ మునిక్రిష్ణయ్య	శివరాతిరి సులోచనమ్మ భర్త: లేట్ మునిక్రిష్ణయ్య	వరి
110.	117-8ఎ	0.05	పట్టా మాగాణి	వెలుగోటి నీరజ భర్త: వెంకటరమణయ్య	వెలుగోటి నీరజ భర్త: వెంకటరమణయ్య	వరి
111.	118-1	0.08	పట్టా మెట్ట	కాసుల హేమలత భర్త: వెంకటేశ్వర్లు	కాసుల హేమలత భర్త: వెంకటేశ్వర్లు	వరి బోరు-1
112.	118-2ఎ	0.28	పట్టా మెట్ట	కాసుల హేమలత భర్త: వెంకటేశ్వర్లు	కాసుల హేమలత భర్త: వెంకటేశ్వర్లు	వరి
113.	118-3ఎ	0.23	పట్టా మెట్ట	కాసుల హేమలత భర్త: వెంకటేశ్వర్లు	కాసుల హేమలత భర్త: వెంకటేశ్వర్లు	వరి
114	118-4ఎ	0.02	పట్టా మెట్ట	కాసుల హేమలత భర్త: వెంకటేశ్వర్లు	కాసుల హేమలత భర్త: వెంకటేశ్వర్లు	వరి
115	118-6ఎ	0.30	పట్టా మెట్ట	సంకురాతిరి శ్రీనివాసులు తండ్రి: గోవిందు	సంకురాతిరి శ్రీనివాసులు తండ్రి: గోవిందు	బీడు
116	122-2ఎ	0.05	పట్టా మెట్ట	చెలికం రాజమ్మ భర్త: పొట్టిరెడ్డి	చెలికం రాజమ్మ భర్త: పొట్టిరెడ్డి	వరి
117	122-3ఎ	0.04	పట్టా మెట్ట	పాదులేటి జ్యోతమ్మ భర్త: దశరథరామిరెడ్డి	పాదులేటి జ్యోతమ్మ భర్త: దశరథరామిరెడ్డి	వరి
118.	122-7ఎ	0.02	పట్టా మెట్ట	పాదులేటి జ్యోతమ్మ భర్త: దశరథరామిరెడ్డి	పాదులేటి జ్యోతమ్మ భర్త: దశరథరామిరెడ్డి	వరి
119.	138-1ఎ	0.05	పట్టా మాగాణి	జడపల్లి రమణయ్య తండ్రి: గురవయ్య	జడపల్లి రమణయ్య తండ్రి: గురవయ్య	వరి
		0.27	పట్టా మాగాణి	తిరగాబత్తిన రమణయ్య తండ్రి: సిద్ధయ్య	తిరగాబత్తిన రమణయ్య తండ్రి: సిద్ధయ్య	వరి
120	138-2ఎ	0.01	పట్టా మాగాణి	తిరగాబత్తిన రమణయ్య తండ్రి: సిద్ధయ్య	తిరగాబత్తిన రమణయ్య తండ్రి: సిద్ధయ్య	వరి
121.	138-6ఎ	0.05	పట్టా మాగాణి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్ద మునిరెడ్డి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్ద మునిరెడ్డి	వరి
122.	139-1ఎ	0.21	పట్టా మాగాణి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్ద మునిరెడ్డి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్ద మునిరెడ్డి	వరి
123.	139-2	0.19	పట్టా మాగాణి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్ద మునిరెడ్డి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్ద మునిరెడ్డి	వరి
124.	139-3	0.17	పట్టా మాగాణి	బత్తిన భాస్కర్ రెడ్డి తండ్రి: పెద్దమునిరెడ్డి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్దమునిరెడ్డి	వరి బోరు-1, బావి-1
125	139-4ఎ	0.63	పట్టా మాగాణి	మన్నేపల్లి పెంచల నరసయ్య తండ్రి: పెంచలయ్య	మన్నేపల్లి పెంచల నరసయ్య తండ్రి: పెంచలయ్య	వరి
126.	139-5	0.29	పట్టా మాగాణి	మన్నేపల్లి పెంచల నరసయ్య తండ్రి: పెంచలయ్య	మన్నేపల్లి పెంచల నరసయ్య తండ్రి: పెంచలయ్య	వరి బోరు-1
127.	139-6ఎ	0.20	పట్టా మాగాణి	మన్నేపల్లి పెంచల నరసయ్య తండ్రి: పెంచలయ్య	మన్నేపల్లి పెంచల నరసయ్య తండ్రి: పెంచలయ్య	వరి
128.	139-7ఎ	0.16	పట్టా మాగాణి	మన్నేపల్లి మల్లీశ్వరి భర్త: పెంచలనరసయ్య	మన్నేపల్లి మల్లీశ్వరి భర్త: పెంచలనరసయ్య	వరి
129.	140-1ఎ	0.10	పట్టా మాగాణి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్దమునిరెడ్డి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి: పెద్దమునిరెడ్డి	వరి
130.	140-2ఎ	0.02	పట్టా మాగాణి	చెరుకూరి వెంకటసుబ్బయ్య తండ్రి: వెంకటరామయ్య	చెరుకూరి వెంకటసుబ్బయ్య తండ్రి: వెంకటరామయ్య	వరి
131.	174-1	0.06	పట్టా మాగాణి	రాపూరు మునెయ్య	కలువకొల్లు చిన్నబ్బయ్య తండ్రి: సుబ్బానాయుడు	వరి
132.	175-1	0.66	పట్టా మాగాణి	కలువకొల్లు వీరరాఘవులు తండ్రి: శేషమనాయుడు	కలువకొల్లు వీరరాఘవులు తండ్రి: శేషమనాయుడు	వరి
		0.66	పట్టా మాగాణి	కలువకొల్లు రమేష్‌బాబు తండ్రి: శేషమనాయుడు	కలువకొల్లు రమేష్‌బాబు తండ్రి: శేషమనాయుడు	వరి
133	175-2ఎ	0.37	పట్టా మాగాణి	వేముల వెంకట్రామయ్య తండ్రి: పాపయ్య	వేముల వెంకట్రామయ్య తండ్రి: పాపయ్య	వరి
		0.37	పట్టా మాగాణి	వేముల శ్రీనివాసులు తండ్రి: పాపయ్య అలియాస్ గుండయ్య	వేముల శ్రీనివాసులు తండ్రి: పాపయ్య అలియాస్ గుండయ్య	వరి
		0.72	పట్టా మాగాణి	ఏలేశ్వరం సరోజనమ్మ తండ్రి: వేముల నరసయ్య	ఏలేశ్వరం సరోజనమ్మ తండ్రి: వేముల నరసయ్య	వరి
	మొత్తం	49.46				

ఈ భూముల ప్లాను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ. సే)., తెలుగుగంగ ప్రాజెక్ట్, నెల్లూరు యూనిట్ వారి కార్యాలయములో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలో అయినా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులయినవారు ఎవ్వరును లేరు.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలోగాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/- శ్రీమతి పి.ప్రశాంతి, ఎం.ఏ.,
ప్రత్యేక కలెక్టరు, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు

ఇక పోలీస్ విచారణ ఒకే చోట

- పాస్‌పోర్టు దరఖాస్తుదారులకు ఊరట
- 17 పార్లమెంట్ నియోజవర్గాల్లో పీవోపీఎస్‌కేలు
- ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి డా.ఈ.విష్ణువర్దన్ రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: 'నగరానికి చెందిన ఓ విద్యార్థి కళాశాల వసతి గృహంలో ఉంటూ బెంగళూరులో విద్యనభ్యసిస్తున్నారు. శాశ్వత, ప్రస్తుత చిరునామాలో.. ఇరు రాష్ట్రాల పోలీసులు విచారణ పూర్తయిన తర్వాతే పాస్‌పోర్టును జారీ చేసేవారు. రెండు చోట్ల చేయాల్సి రావడంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడేవారు. దరఖాస్తుదారుడికి నేర చరిత్ర లేకపోతే శాశ్వత చిరునామాలో విచారణ చేస్తే సరిపోతుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాల పోలీసులకు సూచించింది. అందుకు అనుగుణంగానే దరఖాస్తులోనూ

సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్దన్ రెడ్డి

మార్పులు.. చేర్పులు చేశామని.. ఒక్క చిరునామానే పేర్కొంటే సరిపోతుందని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు(ఆర్పీవో) అధికారి డా. ఈ. విష్ణువర్దన్ రెడ్డి వివరించారు. సికింద్రాబాద్‌లోని ఆర్పీవో కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 17 ఎంపీ నియోజకవర్గాల్లోనూ పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల(పీవోపీఎస్‌కే) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లుగా వివరించారు. ఇప్పటికే ఏడు చోట్ల పీవోపీఎస్‌కేలను ప్రారంభించామన్నారు. ఈ కేంద్రాల్లో చేసిన దరఖాస్తులు హైదరాబాద్‌కు పంపించాల్సి ఉండటంతో పాస్‌పోర్టు జారీలో అయిదు నుంచి ఆరు రోజుల పాటు ఎక్కువ సమయం పడుతుందన్నారు. దీన్ని అధిగమించేందుకు ముందుగా వరంగల్‌లోని పీవోపీఎస్‌కేను.. ఆ తర్వాత దశలవారీగా మిగిలిన ఆరింటిని పాస్‌పోర్టు సేవా కేంద్రాలుగా మార్చుతామన్నారు. పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగమయ్యేలా తెలంగాణ పోలీసులు వినియోగిస్తున్న 'వెరిఫాస్ట్' అప్లికేషన్‌ను పాస్‌పోర్టు సేవా సిస్టంతో ఈ నెలాఖరుకు అనుసంధానం చేస్తామన్నారు.

మనకు రెండు పురస్కారాలు

ఏటా జూన్ 26న నిర్వహించే పాస్‌పోర్టు సేవా దివస్‌ను పురస్కరించుకుని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆర్పీవోలకు పురస్కారాలను ప్రకటిస్తోంది. పోలీస్ వెరిఫికేషన్‌ను వేగంగా పూర్తి చేస్తున్నందుకు గాను తెలంగాణ పోలీసులకు.. అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు గాను కేటగిరీ ఏ విభాగంలో హైదరాబాద్ ఆర్పీవోకు మొదటి స్థానం దక్కిందని విష్ణువర్దన్ రెడ్డి వివరించారు.

ఆధునిక పరిజ్ఞానంతో మెగా విత్తన పార్కు

- నాణ్యత నిర్ధారణకు బార్ కోడింగ్
- 'ఈనాడు'తో అయోవా విశ్వవిద్యాలయ అంతర్జాతీయ కార్యకలాపాల పర్యవేక్షకుడు దిలీప్ కుమార్

ఈనాడు, అమరావతి: 'బీజ విత్తనంతో వస్తే విత్తన పాకెట్లతో బయటకు వెళ్లేలా కర్నూలు జిల్లా మెగా విత్తన పార్కు ఏర్పాటవుతోంది. బార్ కోడింగ్‌తో నాణ్యమైన విత్తనమో కాదో రైతులు మొబైల్ ద్వారా తెలుసుకోవచ్చు' అని అయోవా విశ్వవిద్యాలయ అంతర్జాతీయ కార్యకలాపాల పర్యవేక్షకుడు దిలీప్ కుమార్ వెల్లడించారు. రైతులకు నాణ్యమైన విత్తనం అందించడం కోసం దేశంలో మరెక్కడా లేని విధంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 'ఆంధ్రప్రదేశ్ మెగా విత్తన పార్కు'లో విత్తనాలు ఉత్పత్తి చేస్తామని తెలిపారు. కర్నూలు జిల్లా తంగెడంచలో 600 ఎకరాల్లో ఏర్పాటయ్యే విత్తన పార్కుకు అమెరికాకు చెందిన అయోవా విశ్వవిద్యాలయం సాంకేతిక సహకారం అందిస్తోంది. ఈ సందర్భంగా జరిగిన కార్యశాలకు హాజరైన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. 'ప్రస్తుతం విత్తన పరిశోధన, ఉత్పత్తి, ఆరబెట్టడం, శుద్ధి, ధ్రువీకరణ వేర్వేరు చోట్ల జరుగుతున్నాయి. దీనివల్ల కాలహరణంతోపాటు విత్తన లభ్యత జాప్యమవుతుంది. మెగా విత్తన పార్కులో సీడ్ వ్యాల్యూ చైన్ విధానం అమలు చేస్తాం. ప్లాట్లుగా విభజించి విత్తన తయారీ సంస్థలు, రైతులు, రైతు ఉత్పత్తి సంఘాలకు కేటాయిస్తాం. వారంతా ఇక్కడే నాణ్యమైన విత్తనాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. ఇస్టాను (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ సీడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ) ఇక్కడ ఏర్పాటు చేస్తాం. ఇందులో అన్ని విభాగాలుంటాయి. విదేశాలకు ఎగుమతి చేసుకునే విధంగా సౌకర్యాలుంటాయి. బార్‌కోడింగ్ విధానంలో నకిలీ విత్తనానికి చెక్ పెట్టవచ్చు. నాణ్యమైన విత్తనాన్ని ధ్రువీకరించి ప్యాకెట్లను బార్ కోడింగ్‌కు అనుసంధానిస్తాం. దీంతో అక్రమంగా నాసిరకం విత్తనాలను కలిపి విక్రయించాలన్నా సాధ్యం కాదు. విత్తనం ఎక్కడ నుంచి వచ్చింది? నాణ్యమైనదా? కాదా? అనేది రైతులు తమ మొబైల్ నుంచే తెలుసుకోవచ్చు. ప్రస్తుత ఖరీఫ్ నుంచే ఇక్కడ ప్లాట్లు వేసి విత్తన తయారీ మొదలవుతుంది' అని ఆయన వివరించారు.

త్వరలో విత్తన పార్కు పనులు: సోమిరెడ్డి

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా తంగెడంచ మెగాసీడ్ పార్కు పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. త్వరలో పూర్తిస్థాయి సీఈఓ నియామకంతోపాటు భవనాలకు టెండర్లు పిలుస్తామన్నారు. మెగాసీడ్ పార్కు ఏర్పాటుకు సంబంధించి పనుల ప్రణాళికపై రెండు రోజుల కార్యశాలను ఆయన బుధవారం విజయవాడలో ప్రారంభించారు. భూకేటాయింపుతోపాటు బడ్జెట్లో రూ.100 కోట్లు కేటాయించామని మంత్రి గుర్తు చేశారు. రెండేళ్లలోపు తొలివిడత పనులు పూర్తిచేసి విత్తన పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనం అందజేయడంతోపాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా సీడ్‌పార్కు ఏర్పాటవుతుందని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ వివరించారు. మెగాసీడ్ పార్కులో

సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సోమిరెడ్డి

చేపట్టనున్న పనులతోపాటు మూడు నిమిషాల వీడియోను అయోవా రాష్ట్ర విశ్వవిద్యాలయ గ్లోబల్ ప్రోగ్రామ్ లీడర్ దిలీప్‌కుమార్ గుంటుకు ఆవిష్కరించారు. విత్తన తయారీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రంగా మారబోతోందని సీడ్‌మెన్స్ అసోసియేషన్ కార్యదర్శి నిరంజన్‌కుమార్ చెప్పారు.

ఇష్టాగోష్ఠిలో మాట్లాడుతున్న దగ్గుబాటి

నేతల 'ధన' తాపత్రయం అందుకే..

- ఎన్నికల్లో పోటీ.. కోట్లతో కూడుకున్న వ్యవహారమైపోయింది
- నోట్ల రద్దు తొందరపాటు చర్యే: దగ్గుబాటి

ఈనాడు డిజిటల్, విజయవాడ: ఎన్నికల్లో పోటీ చేయడం అంటే.. రూ.కోట్లతో కూడుకున్న పని అని, ప్రస్తుత ఎమ్మెల్యేల్లో 80 శాతం మంది కోట్లు ఖర్చు పెట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అందుకే ఏదో ఒకటి చేసి సంపాదించాలని ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట పడే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం దగ్గుబాటి విలేకరులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాలన.. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజనతోనే పోలవరం ప్రాజెక్టు నిర్మించుకునే అవకాశం వచ్చిందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం నిర్మాణాన్ని ప్రస్తావిస్తే తెలంగాణలో ఓట్లు పడవని ఎవరూ మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. పట్టిసీమతో కృష్ణా డెల్టా రైతులు సకాలంలో నాట్లు వేసుకుంటున్నారన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అమరావతి నగర నిర్మాణం తలపెట్టడం మంచి పరిణామమే కానీ.. మూడు పంటలు పండే వేల ఎకరాలు తీసుకోవడం సరికాదని దగ్గుబాటి పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీకి వ్యక్తిగతంగా స్వార్థం లేదనేది తన అభిప్రాయమని చెప్పారు. నోట్ల రద్దు తొందరపాటు చర్యేనన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో విపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి బాగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు.

ఆగస్టు 1 నుంచి వైద్య విద్య తరగతులు

మొదలైన దరఖాస్తుల స్వీకరణ ● 2న సీట్ల కేటాయింపు

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్, దంత వైద్య విద్యలో ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. పరిశీలన అనంతరం ఈ నెల 25వ తేదీన ప్రతిభావంతుల జాబితా ప్రకటించనున్నారు. ఈ నెల 26 నుంచి జులై ఒకటో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. మరోవంక...ఈ నెల 27వ తేదీ నుంచి జులై రెండో తేదీ వరకు విద్యార్థులు ఆప్షన్ల నమోదుకు అవకాశాన్ని కల్పించారు. జులై 2వ తేదీన సీట్ల కేటాయింపు జరగనుంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. సీట్ల వివరాలను కళాశాలల వారీగా ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

వివరాలు ప్రకటించడంలేదని ఫిర్యాదులు

ఈనాడు, అమరావతి: చుక్కల భూములు, నిషిద్ధ 22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ బుధవారం నుంచి ప్రారంభమైంది. వచ్చేనెల 5వ తేదీ వరకు ఈ సమస్యల పరిష్కారానికి గ్రామ సభల నిర్వహణ మొదలైంది. వీటి ప్రారంభానికి ముందు నిషిద్ధ భూముల జాబితా, ఇతర వివరాలను ప్రకటించాల్సి ఉండగా కొన్నిచోట్ల ఇంకా జరగలేదని తెలిసింది. ఇదే విషయమై ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ నెంబర్లకు కూడా ఫిర్యాదులు వస్తుండడం గమనార్హం. విధుల నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శించే మండల రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేఈ కృష్ణమూర్తి హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
నెం.1 నుండి 14/18-19 **e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది: 15-6-18
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకము మరమ్మతులు క్రింద 13 నిర్మాణము మరియు పి.ఆర్.ఆర్. (ఎస్‌సిసి) క్రింద ఒక పని నిర్వహణ కొరకు అంచనా విలువ: రూ. 297.00 లక్షలతో పనులు చేపట్టుట కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఇ-ప్లాట్‌ఫారంలో టెండరు డాక్యుమెంట్ లభ్యత: 25-6-2018 మ. 3 గం. నుండి 11-7-2018 మ. 3 గం. వరకు. టెండర్లు స్వీకరణకు ఆఖరి తేది: 11-7-2018 సా. 3.30 గం. వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది: 11-7-2018 సా. 4 గం. ఆర్థిక బిడ్ తెరచు తేది: 11-7-2018 సా. 4 గం. వివరాలకు ఈ కార్యాలయములో పొందవచ్చును. ఫోన్: 94401 04090.
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, పి.ఐ.యు. డివిజన్, నెల్లూరు
DIPR No 812/CL/Advt/1/1/2018-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 6/SRP 2018-19/VJA/CE (R&B)/MDR/EE(R)/DEE4/AE2/2018
తేది: 18-6-2018
కృష్ణాజిల్లాలో 1 పనికొరకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. పని విలువ రూ. 2.92 కోట్లు. టెండర్లను e-మార్కెట్ ప్రదేశం నుండి ది. 22-6-2018 సా.గం. 5.00ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది 10.7.2018 సా.గం. 5.00 వరకు. సంబంధిత SE: SE (R&B) విజయవాడ. తదుపరి వివరాలు e-మార్కెట్ ప్రదేశం www.tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
DIPR No. 818/CL/Advt/1/1/2018-19 సం/- చీఫ్ ఇంజినీర్ (R&B) MDR

Government of Andhra Pradesh, APEWIDC, Vijayawada, Amaravathi.
"e-procurement tender notice"
NIT No.s : 85 to 97/CE/APEWIDC/VJA/2018-19, Dt: 20.06.2018
Tenders invited (1st call) for Establishment of Water Sports Academy at Thatipudi of Gantyada in Vizianagram (DT), Supply of Man Power Services on Outsourcing basis in the office of APEWIDC.
(2nd call) for Construction of Treasury Office building at Srikakulam, Ponduru, Kothuru, Narasannapeta, Palasa, Rajam, Ranasthalam, Kotabommali in Srikakulam(DT), at Kurupam in Vizianagaram (DT), at Adoni in Kurnool (DT), at Kothacheruvu in Ananthapur (DT), at Movva in Krishna (DT), at Akiveedu, Palakollu, Bhimadolu, Jangareddygudem, Penugonda in W.G.(DT), Minorities Shadimahal at Rayadurgam, Additional rooms in Govt.B.C.College Boys Hostel at Kadiri (V&M) at Ananthapur (DT), BC College Girls Hostel at Mangalagiri in Guntur (DT), Aqua lab cum fisheries training centre at Tanuku in W.G. (DT), Polytechnic buildings at Kamalapuram of Kadapa (DT), Tadipathri of Ananthapur (DT), Adoni of Kurnool (DT) & Pillaripattu (located in Nagari) of Chittoor (DT).
(3rd call) for C/o Polytechnic buildings at jangareddygudem, Tadepalligudem in W.G(DT), Pithapuram in E.G.(DT), Krosuru in Guntur (DT), C/o Sainik school Infrastructure works at Kalikiri in Chittoor (DT), Providing Face lifting (Painting) & Repairs & Renovation works to APSWRS Complexes at Srikakulam, Vizianagaram, Visakhapatnam, Guntur, Chittoor Districts, Estabishment of Aqua Lab cum Training Centre at Pedamarium of WG(DT)
(4th call) for Establishment of Aqua Lab cum Training Centre at Avanigadda of Krishna (DT)
Further details can be had from the O/o MD, APEWIDC, Chittinagar, Vijayawada and viewed at https://tender.apeprocurement.gov.in or Phone No: 0866-2512822
Sd/-xxx
Managing Director,
APEWIDC, Vijayawada.

శ్రీయుత ప్రత్యేక కలెక్టరు (భూ.సే.) టి.జి.పి., నెల్లూరు వారి కార్యావర్తనములు
ప్రస్తుతం: శ్రీమతి పి.ప్రశాంతి M.A.,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం.VI (ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1)ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఆర్పి.డి1/99/2018 — తేది.30.4.2018

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా ఎ. 126.76 సెంట్లు భూములకు నెల్లూరు జిల్లా, మర్రిపాడు మండలం పడమటినాయునిపల్లి గ్రామము నందు ప్రజాహిత ఉపయోగార్థం అనగా బ్యాలన్సింగ్ రిజర్వాయరు -1 నిర్మాణము కొరకు రీచ్-2 క్రింద భూమి కావలయునని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగు గంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూ సేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11 (1)న నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ప్రతిపాదిత భూసేకరణలో ఎలాంటి నిర్వాసిత కుటుంబములు లేవు.

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్ - 12 (3జి) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉప కలెక్టరు (భూ సేకరణ), తెలుగు గంగ ప్రాజెక్టు, నెల్లూరు వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11 (4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కలెక్టరు/ భూసేకరణ తెలుగు గంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్.నెల్లూరు/ ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారి ముందస్తు అనుమతిలేనిదే, ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయవిక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ 15 ననుసరించి భూ సేకరణపై ఏవైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించిన తేది నుండి 60 (ఆరువది) దినములలోగా శ్రీ ప్రత్యేక కలెక్టరు (భూ సేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్. ఆర్.నెల్లూరు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరి వారి యెదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు** — మండలం: **మర్రిపాడు** — గ్రామం: **పడమటినాయునిపల్లి**

క్ర. సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం.	తరగతి	సంబంధిత ఆసామి పేరు – చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర
1.	359	8.32	7.76	సర్వీస్ ఇనాం మెట్ట	రామిరెడ్డి ఓబులరెడ్డి తండ్రి చెంచురెడ్డి రామిరెడ్డి కొండారెడ్డి తండ్రి పెద్దకొండారెడ్డి రామిరెడ్డి గంగిరెడ్డి తండ్రి చెంచురెడ్డి రామిరెడ్డి దశరదరామిరెడ్డి తండ్రి పెద్ద పెంచలరెడ్డి రామిరెడ్డి సీతారామిరెడ్డి తండ్రి పెద్దపెంచలరెడ్డి మరియు ఇతరులు	360	358	364 357	535 384/3
2.	351	2.65	2.65	పట్టా మెట్ట	ఈటె పెద్దకొండయ్య తండ్రి కొండయ్య బంక వెంకటరెడ్డి తండ్రి నాగిరెడ్డి ఈటె మల్లికార్జున తండ్రి పెద్దకొండయ్య	364	535	355 356	359 358
3.	352	2.46	2.46	పట్టా మెట్ట	బంక శ్రీదేవి భర్త శ్రీనివాసులు కంభం గంగమ్మ భర్త వెంకటరెడ్డి	596	351	350	353
4.	353	3.02	3.02	పట్టా మెట్ట	కంభం తిరుపాలురెడ్డి తండ్రి వెంకటరెడ్డి బంక శ్రీదేవి భర్త శ్రీనివాసులు కంభం గంగమ్మ భర్త వెంకటరెడ్డి	595	355 351	352	354
5.	360	5.44	0.11	సర్వీస్ ఇనాం మెట్ట	రామిరెడ్డి ఓబులరెడ్డి తండ్రి చెంచురెడ్డి రామిరెడ్డి ఓబులరెడ్డి తండ్రి పెద్ద పెంచలరెడ్డి రామిరెడ్డి కొండారెడ్డి తండ్రిపెద్ద కొండారెడ్డి రామిరెడ్డి గంగిరెడ్డి తండ్రి చెంచురెడ్డి రామిరెడ్డి దశరదరామిరెడ్డి తండ్రి పెద్ద పెంచలరెడ్డి రామిరెడ్డి సీతారామిరెడ్డి తండ్రి పెద్ద పెంచలరెడ్డి	361	369	364	384/3
6.	346	4.80	4.80	పట్టా మెట్ట	ఇరుపోతు ఓబులేసు తండ్రి కాంతయ్య వనం ఓబులమ్మ భర్త పెంచలయ్య ఇరుపోతు పావులమ్మ భర్త ఓబయ్య వనం పెంచలయ్య తండ్రి చెన్నయ్య ఇరుపోతు ఓబయ్య తండ్రి పెద్దబ్బి	597	345	344 598	347 350
7.	347	2.99	2.99	పట్టా మెట్ట	ఈటె చిన కొండయ్య తండ్రి కొండయ్య	350	349 348 345	346	350
8.	348	1.44	1.44	పట్టా మెట్ట	ఈటి చిన కొండయ్య తండ్రి కొండయ్య రాచపల్లి వెంకటయ్య తండ్రి సుబ్బయ్య	347	340	345	349
9.	343	1.84	1.84	పట్టా మెట్ట	ఇరుపోతు పావులమ్మ భర్త ఓబయ్య ఇరుపోతు శ్రీనివాసులు తండ్రి బాల ఓబయ్య మరియు ఇతరులు	598	341	342	344
10.	345	1.00	1.00	పట్టా మెట్ట	ఉల్లాది లక్ష్మినరసమ్మ భర్త నరసయ్య	346	340	344	348
11.	340	3.25	3.25	పట్టా మెట్ట	ఉల్లాది లక్ష్మినరసమ్మ భర్త నరసయ్య నల్లనూకల పెద్దరోశయ్య తండ్రి నరసయ్య	349 348 345 341	339	336	535
12	339	2.28	2.28	పట్టా మెట్ట	వనం చక్రపాణి తండ్రి బావికాడ పెంచలయ్య రాచపల్లి సుబ్బయ్య, తండ్రి సుబ్బయ్య పోలిరెడ్డి చిన కొండయ్య తండ్రి వీరయ్య	240	338	337 336	535
13.	338	2.94	2.94	పట్టా మెట్ట	ప్రబిలేటి కొండయ్య తండ్రి మల్లెం కొండయ్య నల్లనూకల పెద్ద రోశయ్య తండ్రి నరసయ్య మరియు ఇతరులు ప్రబిలేటి లక్ష్మయ్య, భర్త తిరుపాలు	339	269	270 337	535
14.	342	4.23	4.23	పట్టా మెట్ట	ఇరుపోతు బాల వెంకటయ్య తండ్రి బాల వెంకటయ్య వనం నరసింహారావు తండ్రి బావికాడ పెంచలయ్య వనం చక్రపాణి తండ్రి బావికాడ పెంచలయ్య ఇరుపోతు శ్రీనివాసులు తండ్రి బాల ఓబయ్య	598	341	336 335	343
15.	336	7.92	7.92	పట్టా మెట్ట	వనం పెంచలయ్య తండ్రి చెన్నయ్య మరియు ఇతరులు రాచపల్లి గంగిరెడ్డి తండ్రి బావిరెడ్డి గడ్డం కొండమ్మ భర్త నరసింహులు	335	337 272	324 334	339 340 341 342
16.	270	3.04	3.04	పట్టా మెట్ట	రాచపల్లి గంగిరెడ్డి తండ్రి బావిరెడ్డి గడ్డం కొండమ్మ భర్త నరసింహులు గడ్డం రోశయ్య, తండ్రి కొండయ్య రాచపల్లి సుబ్బయ్య తండ్రి వెంకటయ్య రాచపల్లి గంగాద్రి తండ్రి గంగిరెడ్డి రాచపల్లి తిరుపతిరెడ్డి కానగల పెంచలయ్య తండ్రి వెంకటయ్య కానగల వెంకటయ్య తండ్రి వెంకటయ్య గ్రామ ఉమ్మడి భూమి	337	269	272, 271 268 535	338
17.	269	1.40	1.40	పట్టా మెట్ట	బైనబోయిన తిరుపాలు తండ్రి వెంకటయ్య రాచపల్లి వెంకటయ్య తండ్రి సుబ్బయ్య	338	535	270	535
18	271	3.72	3.72	పట్టా మెట్ట	గడ్డం కొండమ్మ భర్త నరసింహులు కానగల పెంచలయ్య తండ్రి వెంకటయ్య గడ్డం రోశియ్య తండ్రి కొండయ్య కానగల చినవెంకటయ్య తండ్రి వెంకటయ్య	272	268	275 276 277	270
19	272	5.39	5.39	పట్టా మెట్ట	వనం నరసింహారావు తండ్రి పెంచలయ్య కొన్నిపాటి పెంచలయ్య తండ్రి నరసయ్య కొన్నిపాటి పెంచలయ్య తండ్రి పీసయ్య వనం పెంచలయ్య తండ్రి చెన్నయ్య వనం ఓబులమ్మ భర్త యానాది	336	271 275	273	270 337
20	324	17.94	17.94	పట్టా మెట్ట	కానగల పెంచలయ్య తండ్రి వెంకటయ్య పాలెం మాధవయ్య తండ్రి బంగారయ్య కానగల చిన వెంకటయ్య తండ్రి వెంకటయ్య వనం ఓబులమ్మ భర్త యానాది వనం పెంచలయ్య తండ్రి చెన్నయ్య గ్రంధి చంద్రమౌళి కానగల పెంచలయ్య తండ్రి వెంకటయ్య	325	273 274 323	322	336 334
21	276/1	2.86	2.86	పట్టా మెట్ట	ఇరుపోతు వెంకటయ్య తండ్రి గుండయ్య ఇరుపోతు రమణమ్మ భర్త రమణయ్య ఇరుపోతు నారాయణమ్మ భర్త తుట్లయ్య ఇరుపోతు ఓబయ్య తండ్రి పెద్దబ్బి ఇరుపోతు ఓబులేసు తండ్రి వెంకటయ్య ఇరుపోతు ఓబయ్య తండ్రి గుండయ్య ఇరుపోతు సీతమ్మ భర్త వెంకటయ్య ఇరుపోతు రమణయ్య తండ్రి గుండయ్య	275	277	279, 280, 274	271
22.	277	3.89	3.89	పట్టా మెట్ట	ఇరుపోతు వెంకటయ్య తండ్రి గుండయ్య ఇరుపోతు రమణమ్మ భర్త రమణయ్య ఇరుపోతు నారాయణమ్మ భర్త తుట్లయ్య ఇరుపోతు ఓబయ్య తండ్రి పెద్దబ్బి ఇరుపోతు ఓబులేసు తండ్రి వెంకటయ్య ఇరుపోతు ఓబయ్య తండ్రి గుండయ్య ఇరుపోతు సీతమ్మ భర్త వెంకటయ్య ఇరుపోతు రమణయ్య తండ్రి గుండయ్య	276	268	278, 279	271
23.	278	0.71	0.71	పట్టా మెట్ట	నరిక కోటయ్య తండ్రి పెంచలయ్య	277	268	279	277
24	279/1, 2	4.57	4.57	పట్టా మెట్ట	వనం పెంచలయ్య తండ్రి చెన్నయ్య పదచాల నాగమ్మ భర్త వెంగయ్య పదచాల నాగయ్య తండ్రి ఫకీరయ్య కంటే కృష్ణయ్య తండ్రి రామయ్య	280, 284	268, 286	285	278, 277, 276

(మిగతా 16లో)

బోన్‌మారో మార్పిడి చికిత్స పొందినవారితో ప్రతాప్ సి.రెడ్డి, ప్రీతారెడ్డి తదితరులు

దాతలు ముందుకొస్తే మరింత మందిని కాపాడొచ్చు

- విజయవంతంగా 1,500 బీఎంటీ శస్త్రచికిత్సలు
- అపోలో ఆస్పత్రుల ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి

ఈనాడు డిజిటల్, చెన్నై: 'క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అయినప్పటికీ ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చు. దీన్ని నిరూపించేలా వివిధ దేశాలకు చెందిన 1,500 మందికి విజయవంతంగా బోన్ మారో మార్పిడి (బీఎంటీ) శస్త్రచికిత్సలను పూర్తి చేశాం. ఇంతమంది ప్రాణాలు కాపాడినందుకు గర్వంగా ఉంది. ఇది ఒక మైలు రాయి..' అని అపోలో ఆస్పత్రుల ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి పేర్కొన్నారు. 1,500 బీఎంటీ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా బుధవారం నగరంలోని ప్రముఖ హోటల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అపోలో క్యాన్సర్ సెంటర్ మెడికల్ ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ నిమ్మగడ్డ, డాక్టర్ ప్రీతా రెడ్డి, దేశంలోని వివిధ అపోలో శాఖల్లోని బీఎంటీ వైద్య బృందాలు, వివిధ దేశాల నుంచి వచ్చి శస్త్రచికిత్సలు చేసుకున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. 1995లో తొలిసారిగా బీఎంటీ శస్త్రచికిత్సను అపోలో విజయవంతంగా నిర్వహించిందని ప్రతాప్ సి.రెడ్డి చెప్పారు. 99 శాతం విజయవంతమైన శస్త్రచికిత్సలతో ఆ సంఖ్యను అందుకున్నామన్నారు. ఇందులో 65శాతం మంది పిడియాట్రిక్ రోగులున్నారని చెప్పారు. ఇంకా చాలా మందికి ఈ వైద్యచికిత్సలు అవసరం ఉందని.. దాతలు ముందుకొస్తే మరింత మందిని రక్షించవచ్చని పేర్కొన్నారు. డాక్టర్ రమేష్ నిమ్మగడ్డ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఇక్కడ బీఎంటీ వైద్యం పొంది ఆరోగ్యంగా ఉన్న పలువురు తమ అనుభవాలను వెల్లడించారు.

మధుమేహ రోగులకు అధునాతన పరికరం

కొత్త పరికరంతో చక్కెర స్థాయిని పరీక్షించుకుంటున్న ఓ రోగి

చెన్నై, న్యూస్‌టుడే: రక్త నమూనా లేకుండానే మధుమేహ వ్యాధిగ్రస్థులు రక్తంలో చక్కెర స్థాయి పరీక్షించుకోడానికి ఓ అధునాతన పరికరాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు సెయింట్ పీటర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ పరిశోధన కేంద్రంలోని బయో మెడికల్ ఇంజినీరింగ్ విభాగం తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన మంగళవారం విడుదల చేసింది. 'రోగి ముక్కు ద్వారా గాలిని ఈ పరికరంలోకి వదులుతూ చక్కెర స్థాయిని పరీక్షించుకోవచ్చు. బయో మెడికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కాంతారాజ్ సూచనలు, సలహాలతో విద్యార్థిని నాన్సి ఈ పరికరాన్ని అభివృద్ధి చేశారు. తగిన అనుమతితో ఈ పరికరాన్ని మార్కెట్టులోకి ప్రవేశపెట్టాం. ఈ పరికరంతో సుమారు వేయి మందిని పరీక్షించగా.. చాలావరకు కచ్చితమైన ఫలితాలు వచ్చినట్లు' పేర్కొంది.

త్వరలో వినూత్నంగా సాక్షరభారత్

- నైపుణ్యాభివృద్ధితో మిళితం
- మంత్రి గంటా, ఆదిత్యనాథ్‌దాస్ వెల్లడి

ఈనాడు, అమరావతి: సాక్షరభారత్ పథకాన్ని తాత్కాలికంగా మాత్రమే నిలిపివేశామని, త్వరలో వినూత్న రీతిలో అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వమే మంగళం పాడిందని, గత ఏడాది సెప్టెంబరులోనే నిధులు నిలిపివేసిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మార్చి వరకు కొనసాగించామని వెల్లడించారు. సాక్షరభారత్ కార్యక్రమాన్ని నైపుణ్యాభివృద్ధి అంశాలతో మిళితం చేయనున్నట్లు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ తెలిపారు. కొత్త కార్యక్రమంలో సంబంధిత ఉద్యోగులందరి సేవలను వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 70 లక్షల మంది నిరక్షరాస్యులు ఉండగా.. ఈ కార్యక్రమం ద్వారా 55 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దామన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా

నాలుగేళ్లు కలిసి ఉండి ఇప్పుడు ఆర్భాటమా

తెదేపాపై సీపీఎం, సీపీఐ నేతల విమర్శలు

ఈనాడు డిజిటల్, విజయవాడ: వెనుకబడిన ప్రాంతాలు, తరగతుల్లోని సామాన్య ప్రజల సంక్షేమం మెరుగుపడటం సహా ఆర్థికంగా వృద్ధి సాధించినప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతోందని, ఇందుకు నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర రాజకీయ సదస్సు నిర్వహించారు. రాఘవులు మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వకుండా భాజపా దారుణంగా వంచించిదన్నారు. అటువంటి పార్టీతో నాలుగేళ్లపాటు కలిసున్న తెదేపా ఇప్పుడు బయటకువచ్చి ఆర్భాటం చేస్తుందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంపదపరులంతా లాభాల కోసం తమ పెట్టుబడులను ఇతరప్రాంతాలకు తరలిస్తుండగా, రాష్ట్రాభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ పెట్టుబడుల కోసం ఆరాట పడుతున్నారన్నారు. రైతులు, కూలీలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ.. రాజధాని పేరుతో ఒకేచోట అభివృద్ధిని కేంద్రీకరించే పద్ధతి వల్ల గత అనుభవాలే పునరావృతమవుతాయన్నారు. అనంతరం సీపీఐ, సీపీఎం నేతలు సంయుక్తంగా 55 తీర్మానాలను ప్రవేశపెట్టారు. వీటిలో ప్రత్యేకహోదాతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలన్నారు.

సీఎంఎఫ్‌ఎస్‌తో నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట

విశాఖపట్నం, న్యూస్‌టుడే: సమగ్ర ఆర్థిక యాజమాన్య సేవలు (సీఎఫ్‌ఎంఎస్) అమలు ద్వారా నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడడంతో పాటు ఏడాదికి రూ.వెయ్యి కోట్ల వరకు ఆదా అవుతున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. బుధవారం విశాఖ వచ్చిన ఆయన కలెక్టరేట్ వెనుక భాగంలో రూ.10కోట్లతో నిర్మించనున్న ఖజానా, అనుబంధ శాఖల కార్యాలయ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో యనమల రామకృష్ణుడు మాట్లాడారు. సీఎఫ్‌ఎంఎస్ ప్రారంభ దశలో కొన్ని సమస్యలు వచ్చాయని, ప్రస్తుతం అన్నీ కుదుటపడ్డాయన్నారు. స్థానిక సంస్థల ఉద్యోగుల పేరోల్స్‌లో కొన్ని సమస్యలు వచ్చాయని, వాటిని సరిదిద్దుతున్నామని చెప్పారు. రెండు దఫాల రుణమాఫీ మొత్తాన్ని త్వరలో చెల్లిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్నవాటికి అదనంగా 3.50 లక్షల పింఛన్లు ఇవ్వనున్నట్లు యనమల తెలిపారు. రాష్ట్రంలో 9 జిల్లాల్లో ఖజానా శాఖ భవన సముదాయాల నిర్మాణానికి రూ.90 కోట్లు, 65 ఉప ఖజానా కార్యాలయాల భవనాల నిర్మాణానికి రూ.65 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. దేశంలోనే అధికంగా రాష్ట్రంలో 18 వేల కిలోమీటర్ల మేర సీసీ రహదారుల నిర్మాణం పూర్తిచేశామన్నారు.

సెన్సెక్స్ ▲ 261	35547	
నిఫ్టీ ▲ 62	10772	
డోజోన్స్ 24699 ▼ 01		
నాస్‌డాక్ 7799 ▲ 74		
రూపాయి 68.08 ▲ 30 పైసలు	(ఒక అమెరికా డాలరుకు)	
ముడి చమురు 74.83 ▼	(బ్రెంట్ ధర డాలర్లలో)	

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	20న	మార్పు %
RELIANCE IND	1019.25	2.33
VEDANTA	228.70	1.96
INDUSIND BANK	1967.40	1.86
KOTAK MAHI BANK	1324.60	1.64
HDFC BANK	2056.15	1.61
YES BANK	336.10	1.57
TATA STEEL	563.25	1.49

గ్రహణం (-)

నిఫ్టీ	20న	మార్పు %
UPL	652.25	-3.24
INDIAN OIL CORP	165.40	-1.90
HPCL	307.90	-1.63
ONGC	162.75	-1.24
DR. REDDYS LAB	2367.75	-1.06
HCL TECH	910.95	-1.03
ITC	263.75	-0.86

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	61.98	71.87
పౌండ్ స్టెర్లింగ్	81.57	94.59
యూరో	71.75	83.22
జపనీస్ యెన్/100	56.29	65.27
ఆస్ట్రేలియా డాలరు	45.82	53.03
సింగపూర్ డాలరు	45.68	54.10
థాయ్ బాత్/100	189.20	226.27
బహ్రెయిన్ దీనార్	167.62	191.93
కువైట్ దీనార్	186.06	231.68
ఒమన్ రియాల్	163.73	188.04
సౌదీ రియాల్	16.43	19.53
యూఏఈ దిర్హమ్	16.83	19.71
మలేషియా రింగిట్	15.15	18.62
చైనీస్ యువాన్	7.44	12.06

బుధవారం నిఫ్టీ కదలికలు



జీఎస్‌టీలోకి తెచ్చినా.. పెట్రో ధరలంతే!

- అదనంగా వ్యాట్ ఉండనే ఉంటుంది
- ప్రస్తుత స్థాయిలోనే కొత్త ధరలు..
- ప్రపంచ దేశాల్లో అంతా అలానే
- అధికార వర్గాల అంచనాలు

దిల్లీ: ఒక వేళ జీఎస్‌టీ విధానంలోకి పెట్రోలు, డీజిల్‌లను తీసుకువస్తే కేవలం గరిష్ఠ పన్ను రేటు అయిన 28 శాతం మాత్రమే విధించరు. దానికి స్థానిక పన్ను లేదా వ్యాట్‌ను అదనంగా జతచేస్తారని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. జీఎస్‌టీ, వ్యాట్ రెండూ కలిపితే ప్రస్తుతం ఉన్న పన్ను స్థాయికే వస్తుందని చెబుతున్నారు.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఎక్సైజ్ సుంకానికి తోడు రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా వ్యాట్‌ను కూడా కలిపి వసూలు చేసుకుంటున్నాయి. అయితే జీఎస్‌టీ కిందకు జంట ఇంధనాల(పెట్రోలు, డీజిల్)ను తీసుకువస్తే మాత్రం ప్రభుత్వం రూ.20,000 కోట్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను కోల్పోవడానికి సిద్ధంగా ఉండాల్సి ఉంటుందని ఆ అధికారి పేర్కొన్నారు.

ప్రపంచంలో ఎక్కడా కూడా పెట్రోలు, డీజిల్‌లపై కేవలం జీఎస్‌టీ మాత్రమే విధించడం లేదు. కాబట్టి భారత్‌లో కూడా జీఎస్‌టీ, వ్యాట్ కలిపి విధించాల్సి వస్తుంద'ని జీఎస్‌టీ అమలులో పాల్గొంటున్న ఆ అధికారి తెలిపారు. అయితే పెట్రోలు ఉత్పత్తులను జీఎస్‌టీలోకి ఎపుడు తీసుకురావాలన్నది రాజకీయ నిర్ణయమని.. కేంద్రం, రాష్ట్రాలు కలిసి తీసుకోవాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

ఇదీ పరిస్థితి

- ✦ ప్రస్తుతం కేంద్రం లీటరు పెట్రోలుపై రూ.19.48; లీటరు డీజిల్‌పై రూ.15.33 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తోంది. వీటికి తోడు విలువ జోడించిన పన్ను (వ్యాట్)ను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం విడిగా వసూలు చేసుకుంటుంది.
- ✦ అండమాన్ నికోబార్ దీవులు కనిష్ఠంగా(పెట్రోలు, డీజిల్) 6% విక్రయ పన్నులు విధిస్తోంది. ఇక పెట్రోలుపై అత్యధికం ముంబయిలో 39.12 శాతం వ్యాట్ ఉండగా.. డీజిల్‌పై అత్యధికంగా తెలంగాణలో 26 శాతం వ్యాట్ ఉంది.
- ✦ దిల్లీలో పెట్రోలుపై 27%; డీజిల్‌పై 17.24 శాతం చొప్పున వ్యాట్ విధిస్తున్నారు.
- ✦ పెట్రోలుపై మొత్తం పన్ను 45-50 శాతంగా ఉంటోండగా.. డీజిల్‌పై 35-40 శాతం వరకు ఉంది.

జీఎస్‌టీకి ముందు ఉన్న మొత్తం పన్నులన్నీ కలిపిన అనంతరం వచ్చిన మొత్తం పన్నును బట్టి జీఎస్‌టీలో ఉన్న 5, 12, 18, 28 శాతం పన్ను శ్లాబుల్లో దేనికో ఒకదానికి మార్చారు. అయితే పెట్రోలు, డీజిల్ విషయానికొస్తే ఇప్పటికే అవి గరిష్ఠ పన్ను రేటును అధిగమించాయి. కాబట్టి జీఎస్‌టీలోని గరిష్ఠ పన్ను శ్లాబు అయిన 28 శాతానికి విధిస్తే అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేంద్ర అధికారి అంటున్నారు. 'రాష్ట్రాలకు వచ్చే నష్టాలను పూడ్చడానికి కేంద్రం వద్ద తగిన నిధులు లేవు. కాబట్టి పరిష్కారం ఏమిటంటే రాష్ట్రాలకు కొంత వ్యాట్‌ను అనుమతించాలి. అయితే ప్రస్తుత పన్ను స్థాయిలను అవి అధిగమించకుండా ఉండాల'ని ఆయన చెప్పుకొచ్చారు.

దాదాపు డజనుకు పైగా ఉన్న కేంద్ర, రాష్ట్ర పన్నులను రద్దు చేసి వాటి స్థానంలో జులై 1, 2017న కేంద్రం జీఎస్‌టీని అమలు చేసిన సంగతి తెలిసిందే. అయితే పెట్రోలు, డీజిల్, సహజ వాయువు, ముడి చమురు, ఏటీఎఫ్‌లను జీఎస్‌టీలోకి తీసుకురాలేదు.

షామీ 1000వ సేవా కేంద్రం

హైదరాబాద్‌లో ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: స్మార్ట్‌ఫోన్ల విపణిలో అతి తక్కువ సమయంలోనే షామీ కంపెనీ అగ్రస్థానంలో చేరడానికి ముఖ్యమైన కారణాల్లో విక్రయానంతర సేవలు ఒకటని.. మరమ్మతుకు వచ్చిన స్మార్ట్ ఫోన్లలో 95 శాతం ఫోన్లను 4 గంటల్లో తిరిగి ఖాతాదారుకు షామీ సేవా (సర్వీసు) కేంద్రాలు అందిస్తున్నాయని షామీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మను జైన్ తెలిపారు. హైదరాబాద్‌లో షామీ 1000వ అధీకృత సర్వీస్ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం ఏడాది కాలంలో అధీకృత సర్వీస్ కేంద్రాలను రెట్టింపు చేశామని, 2017, జూన్‌లో బెంగళూరులో 500వ కేంద్రాన్ని ప్రారంభించగా.. ఏడాదిలో సర్వీస్ కేంద్రాలు 1000కి చేరాయని వివరించారు. థర్డ్ పార్టీ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా సర్వీస్ కేంద్రాలను షామీ నిర్వహిస్తోంది. విడి భాగాలు, సాంకేతిక పరిజ్ఞానం, ధరలపై నియంత్రణ మొదలైనవన్నీ షామీ చేతిలో ఉంటాయి. మరమ్మతు చేయించుకున్న ఖాతాదారుల్లో 86 శాతం మంది సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని జైన్ తెలిపారు. ఇ-టోకెన్ వ్యవస్థ ద్వారా ఖాతాదారులు తమ సమీప సర్వీస్ కేంద్రంలో ముందుగానే సమయాన్ని బుక్ చేసుకోవచ్చని, దీని వల్ల ఖాతాదారుకు 72 శాతం సమయం ఆదా అవుతుందని చెప్పారు.

హైదరాబాద్‌లో స్మార్ట్‌వర్క్స్ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: కంపెనీలు కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి కార్యాలయ స్థల సదుపాయాన్ని కల్పిస్తున్న స్మార్ట్‌వర్క్స్ హైదరాబాద్‌లో హైటెక్ సిటీలో కేంద్రాన్ని ప్రారంభించింది. 86 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 1,700 సీట్లు ఉంటాయని, హైదరాబాద్‌లో ప్రారంభించిన కేంద్రంతో దేశ వ్యాప్తంగా 9 నగరాల్లో మొత్తం కేంద్రాలు 15కు చేరతాయని స్మార్ట్‌వర్క్స్ వ్యవస్థాపకుడు నితీశ్ సర్దా తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ స్థలం ఉందని వచ్చే మూడేళ్లలో దీన్ని 50 లక్షల చదరపు అడుగులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రారంభించిన కేంద్రంలో 70 శాతం స్థలాన్ని 8 కంపెనీలు ఇప్పటికే బుక్ చేసుకున్నాయన్నారు.

స్థిరమైన ఉద్యోగాల సృష్టి అవసరం

- లేకుంటే ఆర్థిక వ్యవస్థకు ఆటంకం
- నాస్‌కామ్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్

బెంగళూరు: దేశంలో స్థిరమైన ఉద్యోగాల వృద్ధి అవసరమని.. లేకుంటే ఆర్థిక వ్యవస్థకు విఘాతం కలిగించొచ్చని నాస్‌కామ్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. కోర్‌నెట్ గ్లోబల్ ఇండియా సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. 2017 సెప్టెంబరు నుంచి 2018 మార్చి మధ్య సంఘటిత రంగంలో దాదాపు 40 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగిందని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని, ఇందులో 50 శాతం సేవా రంగంలోనివేనని చంద్రశేఖర్ చెప్పారు. అయితే ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జనవరి- మార్చి త్రైమాసికంలో భారత వృద్ధి 7.7 శాతానికి పెరగడం వల్ల.. చైనాను వెనక్కి నెట్టి వేగవంతమైన వృద్ధి నమోదు చేస్తున్న దేశంగా నిలిచిందని తెలిపారు. 2022 నాటికి ఇన్ఫో టెక్, బీఎఫ్ఎస్ఐలపై అధిక ప్రభావం ఉంటుందని, వాహన, రిటైల్‌లపై ఒక మాదిరిగా, దుస్తులు, తోళ్ల రంగాలపై తక్కువగా ఉండొచ్చన్న ఫిక్కీ, నాస్‌కామ్ నివేదికను ఆయన గుర్తుచేశారు. దేశ జీడీపీలో నిర్మాణ రంగం 8 శాతం వాటా కలిగి ఉందని, వ్యవసాయం తర్వాత ఈ రంగానిదే ఎక్కువ ప్రాధాన్యమని చంద్రశేఖరన్ తెలిపారు. భారత్‌లో కార్పొరేట్ల వృద్ధికి స్థిరాస్తి కీలకమని అన్నారు. ఆర్థిక వ్యవస్థపై రాజకీయ ప్రభావం తగ్గుతోందని, కార్పొరేట్ల ప్రభావం పెరుగుతోందని వివరించారు.

మారుతీ ఆల్టో రారాజు

- మేలో అత్యధికంగా అమ్ముడైన బ్రాండ్ ఇదే
- విక్రయాలు తగ్గినా అగ్రస్థానంలోనే..
- టాప్-10లో ఏడు ఈ కంపెనీవే

దిల్లీ: మారుతీ సుజుకీ సంస్థ మరోసారి సత్తా చాటింది. మే నెలలో దేశీయ ప్రయాణికుల వాహనాల (పీవీ) విభాగంలో ఎక్కువగా అమ్ముడవుతున్న కార్లలో ఈ సంస్థకు చెందిన 7 వాహనాలు టాప్-10 జాబితాలో చోటు దక్కించుకోవడం విశేషం. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్ (సియామ్) విడుదల చేసిన సమాచారం ఆధారంగా మారుతీ ఆల్టో కారు జాబితాలో అగ్రస్థానం దక్కించుకొంది. మే నెలలో మారుతీ సంస్థ 21,890 ఆల్టో వాహనాలు విక్రయించింది. ఏడాది క్రితం ఇదే నెలలో విక్రయించిన 23,618 వాహనాలతో పోలిస్తే ఈ సంఖ్య తక్కువే అయినా అగ్రస్థానంలోనే కొనసాగింది. హ్యుందాయ్ క్రెటా 11,004 వాహనాల విక్రయాలతో ఏడో స్థానంలో నిలిచింది. ఇదే సంస్థకు చెందిన గ్రాండ్ ఐ10 ఎనిమిదో స్థానం దక్కించుకొంది. ఎలైట్ ఐ 20 తొమ్మిదో స్థానంలో ఉంది. వివరాలు ఇలా...

- ✦ మారుతీ సుజుకీకి చెందిన ఎర్టిగా గత ఏడాది మే నెలలో టాప్-10 జాబితాలో చోటు దక్కించుకొంది. ఈసారి మాత్రం జాబితాలో లేదు.
- ✦ హ్యుందాయ్ కంపెనీకి చెందిన క్రెటా గత ఏడాది మే నెలలో 8,377 వాహన విక్రయాలతో తొమ్మిదో స్థానంలో ఉండగా, ఈసారి 11,004 వాహన విక్రయాలతో ఏడో స్థానానికి ఎగబాకింది.
- ✦ మారుతీ స్విఫ్ట్ గత ఏడాది మేలో 16,532 వాహన విక్రయాలతో రెండో స్థానంలో ఉండగా, ఈసారి మాత్రం విక్రయాలు పెరిగినా నాలుగో స్థానానికి దిగజారింది.
- ✦ గత ఏడాది మేలో కాంపాక్ట్ సెడాన్ డిజైర్ వాహన విక్రయాలు 9,073 కాగా, ఈ ఏడాది మేలో ఏకంగా 19,735 వాహన విక్రయాలతో రెండో స్థానంలో నిలవడం విశేషం.

స్థానం	మోడల్	విక్రయాలు
1	ఆల్టో	21,890
2	డిజైర్	19,735
3	బాలెనో	19,398
4	స్విఫ్ట్	19,208
5	వ్యాగన్ ఆర్	15,794
6	విటారా బ్రెజా	15,629
7	క్రెటా	11,004
8	గ్రాండ్ ఐ10	10,939
9	ఎలైట్ ఐ20	10,664
10	సెలెరియో	10,160

సాధారణ మార్కెట్‌లో పిట్రాన్ మొబైల్ విడి భాగాలు

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో పిట్రాన్ బ్రాండ్‌తో మొబైల్ విడి భాగాలను విక్రయిస్తున్న పాల్‌రెడ్ ఆన్‌లైన్ టెక్నాలజీస్ సాధారణ మార్కెట్‌లోకి కూడా అడుగు పెట్టింది. హైదరాబాద్‌కు చెందిన పాల్‌రెడ్ టెక్నాలజీస్‌కు పాల్‌రెడ్ ఆన్‌లైన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ. www.LatestOne.com వెబ్‌సైట్ ద్వారా మొబైల్ విడి భాగాలను విక్రయిస్తోంది. సాధారణ మార్కెట్‌లో విక్రయాలకు తెలంగాణ ప్రాంత ప్రధాన పంపిణీదారుగా ప్లేటైమ్ ఎలక్ట్రానిక్స్‌ను నియమించామని, దీంతో దేశ వ్యాప్తంగా ప్రధాన పంపిణీదారులు 6 మందికి చేరతారని కంపెనీ వెల్లడించింది. 12 రాష్ట్రాల్లో ప్రస్తుతం సాధారణ పంపిణీదారులు 40 మంది ఉన్నారని, దీన్ని 120 మందికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పిట్రాన్ సీఈఓ అమీన్ ఖ్వాజా తెలిపారు.

20న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	392	వరంగల్	394
చిల్లరగా(ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	400
బెంగళూరు	429	చెన్నై	457
21వ తేదీకి...		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	384	నమక్కల్	440

కొనుగోళ్ల కళ

- పుంజుకున్న విదేశీ మార్కెట్లు
- సెన్సెక్స్‌కు 261 పాయింట్ల లాభం

సమీక్ష

వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఇటీవల డీలాపడిన లోహ, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు లాభాలు నమోదు చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రికార్డు గరిష్ఠానికి చేరడం దోహదపడింది. అంతర్జాతీయ మార్కెట్లు తిరిగి పుంజుకోవడం కలిసొచ్చింది. శుక్రవారం ఒపెక్ సమావేశం నేపథ్యంలో చమురు ధరల తగ్గుదల కొనసాగింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి కోలుకోవడం సెంటిమెంట్‌ను బలపరచింది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,329.61 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 35,571.37 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 260.59 పాయింట్ల లాభంతో 35,547.33 పాయింట్ల దగ్గర స్థిరపడింది. అంతర్జాతీయ ప్రతికూలతలతో గత రెండు సెషన్లలో సూచీ 335.40 పాయింట్లు కోల్పోయింది. ఇక నిఫ్టీ సైతం 61.60 పాయింట్లు పెరిగి 10,772.05 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,724.05- 10,781.80 పాయింట్ల మధ్య కదలాడింది.

ఇండిగో ధమాల్: కంపెనీ అత్యున్నత కార్యవర్గానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసిందన్న వార్తలతో నేపథ్యంలో ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు కుదేలయ్యాయి. ఇంట్రాడేలో 8.39 శాతం కోల్పోయిన షేరు.. చివరకు 7.49 శాతం నష్టంతో రూ.1136.15 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,535.62 కోట్లు తగ్గి రూ.43,674.38 కోట్లకు చేరింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 లాభాలతో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.44%, వేదాంతా 2.10%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.93%, యెస్ బ్యాంక్ 1.66%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.58%, టాటా స్టీల్ 1.52%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.50%, ఎం అండ్ ఎం 1.15%, హెచ్‌డీఎఫ్‌సీ 1.09%, అదానీ పోర్ట్స్ 0.92% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ (1.24%), కోల్ ఇండియా (0.92%), ఐటీసీ (0.90%), విప్రో (0.71%)లు మాత్రం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో లోహ 1.09 శాతం లాభపడింది. బ్యాంకింగ్, స్థిరాస్తి, విద్యుత్, మన్నికైన వినిమయ వస్తువులు, వాహన షేర్లు అదే బాటలో నడిచాయి. ఎఫ్ఎమ్‌సీజీ, యంత్ర పరికరాలు, చమురు- గ్యాస్, పీఎస్‌యూ, ఐటీ స్క్రిప్‌లు మాత్రం డీలాపడ్డాయి.

మహీంద్రా టీయూవీ 300 ప్లస్

ధర రూ.9.59 లక్షలు

దిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) నుంచి 9-సీటర్ వాహనం టీయూవీ 300 ప్లస్ విపణిలోకి విడుదలైంది. దీని ధర రూ.9.59 లక్షలు (ఎక్స్‌షోరూమ్, దిల్లీ). 2.2 లీటర్ (120 హెచ్‌పీ) డీజిల్ ఇంజిన్‌తో 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో ఇది రూపొందింది. 'వాహనంలో ఎక్కువ స్థలం, అధిక సామర్థ్యం ఉండాలని కోరుకొనే వినియోగదారులకు టీయూవీ 300 ప్లస్ మంచి ఎంపిక' అని ఎం అండ్ ఎం అధిపతి (అమ్మకాలు-మార్కెటింగ్, ఆటోమేటివ్ విభాగం) విజయ్ రామ్ నక్రా తెలిపారు. 2015లో టీయూవీ 300 (7-సీటర్) వాహనాన్ని విపణిలోకి విడుదల చేసినప్పటి నుంచి దాదాపు 80,000 వాహనాల్ని ఎం అండ్ ఎం విక్రయించింది. టీయూవీ 300 ప్లస్ విషయానికొస్తే మైక్రో హైబ్రిడ్, కుషన్ సస్పెన్షన్ సాంకేతికతలతోపాటు మరిన్ని అదనపు హంగులతో దీన్ని తయారు చేశారు.

ఏడాదిలో ఐటీసీ ఆహార తయారీ యూనిట్

- రూ.800 కోట్లతో మెదక్‌లో ఏర్పాటు
- హైదరాబాద్‌లో 'కోహినూర్' హోటల్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని మెదక్‌లో దాదాపు రూ.800 కోట్లతో ఐటీసీ ఏర్పాటు చేస్తున్న సమగ్ర ఆహార తయారీ యూనిట్ వచ్చే ఏడాది ద్వితీయార్థానికి సిద్ధం కానుంది. దాదాపు 7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో బిస్కెట్లు, ఐటీసీ విక్రయిస్తున్న చిరుతిళ్లు మొదలైనవి తయారవుతాయని కంపెనీ ప్రతినిధి తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఐటీసీ కోహినూర్ లగ్జరీ హోటల్‌ను కంపెనీ లాంఛనంగా త్వరలో ప్రారంభించనుంది. ఇది కంపెనీకి 12వ లగ్జరీ హోటల్ అవుతుంది. దాదాపు రూ.750 కోట్లతో దీన్ని అభివృద్ధి చేశామని, 271 అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన గదులు, సూట్లు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు ఇందులో ఉన్నాయని వివరించారు. వీటితోపాటు సమావేశ మందిరాలు, కాయకల్ప స్పా, సిగ్నేచర్ రెస్టారెంట్ వంటి సదుపాయాలు ఇందులో ఉంటాయి. హైదరాబాద్‌లో ఐటీసీ కాకతీయ పేరుతో ఇప్పటికే ఒక హోటల్ ఉంది. తెలంగాణలో దాదాపు రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్లు గతంలో ఐటీసీ వెల్లడించింది. ఇందుకు అనుగుణంగా వీటిని ఏర్పాటు చేస్తోంది. మూడేళ్ల క్రితం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఐటీసీకి అనుమతి పత్రాన్ని ఇచ్చింది.

ITC Limited

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో కూడా 144 గదులతో ఐటీసీ హోటల్‌ను ఏర్పాటు చేస్తోంది. 2019 చివరి నాటికి ఇది అందుబాటులోకి వచ్చే వీలుంది. దీంతోపాటు పేపర్‌బోర్డులు, ప్రత్యేక కాగితాలను తయారు చేస్తున్న ఐటీసీ పీఎస్‌పీడీని కూడా కంపెనీ విస్తరించనుంది. బ్లీచ్‌డ్ కెమికల్ థర్మో మెకానిక్ పల్ప్ మిల్లును ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల దిగుమతులు తగ్గుతాయని కంపెనీ ప్రతినిధి తెలిపారు.

రెండేళ్లలో..: రెండేళ్లలో దేశంలో నెంబర్ వన్ ఆహార కంపెనీగా ఎదగాలని ఐటీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా ఫారమ్‌ల్యాండ్ బ్రాండ్‌తో ఇటీవల బంగాళదుంపలు, యాపిళ్లను, ఐటీసీ మాస్టర్ చెఫ్ పేరుతో తేమ లేని ఉల్లిపాయలు మొదలైన వాటిని ఉత్తరాది మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఖరీదైన చాక్లెట్లను ప్రవేశపెట్టింది. దేశ వ్యాప్తంగా 20 సమగ్ర ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని కంపెనీ భావిస్తోంది. ఇందులో భాగంగానే మెదక్‌లో యూనిట్‌ను నెలకొల్పుతోంది. వ్యాపార విస్తరణకు రూ.25,000 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు గతంలో కంపెనీ ప్రకటించింది. ఈ పెట్టుబడుల్లో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తోంది. ఒక్క ఎఫ్ఎంసీజీ వ్యాపారం ద్వారానే రూ.లక్ష కోట్ల టర్నోవరు సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 365.65 (362.45) 4112085
ASIAN PAINTS 1271.30 (1269.20) 484907
AXIS BANK LT 519.10 (517.20) 4555002
BAJAJ AUTO L 2869.65 (2849.80) 502478
BAJAJ FINANC 2267.80 (2270.60) 1127273
BAJAJ FINSER 5947.55 (5913.20) 149334
BHARTI AIRTE 371.90 (371.20) 2510768
BHARTI INFRA 285.30 (287.75) 1887084
BPCL 410.70 (413.60) 3012519
CIPLA 602.85 (601.85) 9121187
COAL INDIA L 270.60 (272.95) 3006367
DR. REDDYS 2367.75 (2393.00) 1149681
EICHER MOTOR 29805.30 (29949.65) 25043
GAIL 343.00 (342.75) 3914019
GRASIM IND 1017.30 (1010.10) 870965
HCL TECH 910.95 (920.45) 1410131
HDFC 1847.00 (1828.00) 1680840
HDFC BANK 2056.15 (2023.50) 2262928
HERO MOTOCOR 3655.80 (3652.75) 433541
HINDALCO IND 226.20 (225.80) 7229700
HINDUSTAN UN 1602.40 (1601.00) 1535703
HPCL 307.90 (313.00) 3191497
ICICI BANK 293.20 (292.80) 20364143
INDIABULLS H 1194.05 (1182.60) 859847
INDIAN OIL 165.40 (168.60) 8942761
INDUSINDBANK 1967.40 (1931.50) 489671
INFOSYS LTD 1243.15 (1241.60) 2685901
ITC 263.75 (266.05) 9540207
KOTAK MAHIND 1324.60 (1303.25) 1125338
LARSEN & TOU 1306.75 (1310.40) 2207289
LUPIN 899.85 (897.85) 2626824
M&M 904.40 (891.40) 2671370
MARUTI SUZIK 8948.30 (8862.60) 325981
NTPC LTD 157.05 (156.15) 6052044
ONGC 162.75 (164.80) 5768211
POWER GRID C 199.15 (198.70) 4590123
RELIANCE IND 1019.25 (996.05) 7193824
SBI 273.30 (272.60) 14002946
SUN PHARMA 564.10 (559.95) 4435880
TATA CONSULT 1822.45 (1824.50) 3107695
TATA MOTORS 305.60 (305.05) 6607472
TATA STEEL L 563.25 (555.00) 6610703
TECH MAHINDR 690.55 (695.75) 2117024
TITAN IND 888.35 (889.00) 1850681
ULTRATECH 3651.35 (3648.00) 222658
UPL LIMITED 652.25 (674.10) 2714660
VEDANTA LIMI 228.70 (224.30) 17011598
WIPRO 259.70 (261.00) 1921955
YES BANK LTD 336.10 (330.90) 7720519
ZEE ENTERTAI 560.90 (554.50) 1526705

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1204.40 (1208.55) 48673
ACC 1275.20 (1284.55) 306583
ADITYA BIRLA 139.25 (138.85) 9572962
AMBUJA CEMEN 197.75 (200.25) 1716864
ASHOK LEYLAN 137.00 (136.50) 13655265
AUROBIND PHA 618.80 (608.55) 2544123
AVENUE SUPER 1483.75 (1485.05) 367314
BANK OFBAROD 125.10 (127.85) 22227705
BEL 111.75 (113.45) 3419789
BHEL 74.90 (74.40) 5077061
BOSCH LTD 17750.50 (17858.95) 11729
BRITANNIA 5995.55 (5976.55) 129644
CADILA HEALT 411.80 (408.95) 2069692
COLGATE PALM 1192.70 (1192.40) 266804
CONTAINER 1274.30 (1268.45) 332380
CUMMINS INDI 668.40 (678.10) 168237
DABUR INDIA 379.80 (379.85) 1215628
DLF LIMITED 200.70 (195.55) 4323867
EMAMI LIMITE 1073.05 (1065.65) 267863
GENERAL INS 721.15 (720.95) 158644
GODREJ CONSU 1162.25 (1165.10) 359256
HAVELLS INDI 534.90 (539.35) 908594
HINDUSTAN ZI 295.00 (295.90) 1277530
IDEA CELLULR 61.50 (61.70) 8886621
INTERGLOBE A 1136.45 (1228.65) 2727498
JSW STEEL LT 335.15 (327.50) 4389564
L&TFIN.HOLD 163.35 (162.80) 3206354
LIC HOUS.FIN 495.85 (490.30) 1405044
MARICO LIMIT 335.40 (334.40) 940278
MCDOWELL 667.05 (673.35) 1242456
MOTHERSON 307.35 (309.25) 3829980
MRF 74877.65 (74849.80) 11625
NHPC LTD 25.25 (25.30) 5161525
NMDC LTD 109.15 (108.00) 1894788
OIL INDIA 211.25 (214.50) 938380
ORACLE FIN S 4054.10 (4115.25) 18224
P&G HYG&HEAL 9950.95 (9962.15) 1374
PETRONET LNG 212.80 (215.50) 3963471
PIDILITE IND 1072.75 (1060.10) 336627
PIRAMAL ENTE 2548.10 (2545.85) 315796
PNB 86.20 (86.80) 15014284
POWER FIN CO 82.20 (79.95) 5944661
RURAL ELEC C 111.40 (110.30) 4842471
SAIL 84.45 (83.20) 17349352
SBI LIFE INS 676.20 (673.45) 294569
SHREE CEMENT 15499.95 (15728.70) 48979
SHRIRAM TRAN 1490.90 (1466.85) 449323
SIEMENS 999.50 (996.70) 84819
SUN TV LTD 839.40 (861.90) 1602532

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 3.99 (3.95) 5798
ALPHAGEO 635.35 (640.85) 1881
AMAR RAJA BA 766.60 (762.90) 11340
ANDHRA BANK 34.15 (34.25) 144190
ANDHRA CEMEN 9.02 (9.18) 8446
ANDHRA PAPER 327.55 (320) 2161
ANDHRA PETRO 46.10 (46.50) 12965
ANDHRA SUGAR 344.05 (341.25) 747
ANJANI PORTL 167 (165) 131
ASTRA MICROW 100 (99.80) 26641
AUROBINDO PH 617.55 (609.30) 90692
AVANTEL SOFT 375.90 (377.35) 3728
AVANTI FEEDS 1625.65 (1730.80) 59029
AVON ORG 8.16 (8.55) 3976
BALAJI AMIN 593.85 (580.10) 1565
BARTRONICS 10.64 (10.37) 37751
BHAGIRA CHEM 268.15 (271.10) 1120
BHAGYA NAG 40.10 (40.45) 2352
BN RATHI SEC 39 (38.35) 53409
BRILLIANT SE 4.97 (4.90) 126425
CAMBRIDGE TE 54.65 (53.65) 120
CIL SECURI 24 (22.50) 10
COMBAT DRUGS 25.20 (26.50) 4485
CONT COFFEE 268.70 (267.35) 5108
COROMAN FERT 409.45 (410.85) 9048
CUBEX TUB 18.50 (19.25) 1000
CYBERMATE 2.17 (2.14) 9121
CYIENT LIMIT 710.50 (710.50) 5887
DECCAN CEMEN 415.60 (416.40) 243
DIVI'S LAB 1083.25 (1092.20) 30845
DIVYA GRANIT 75 (76.70) 339
DR REDDY 2369.05 (2394.70) 96362
FOUR SOFT 64 (60.75) 358
GATI CORPN 89.50 (89.10) 104733
GAYATRI PROJ 169.75 (170.20) 3610
GMR INFRASTR 15.70 (15.55) 891208
GOLDST INFRA 163.10 (162.05) 30123
GOLDSTONE EN 16.69 (15.90) 9868
GRANULES (I) 87.90 (88.10) 194673
GSS AMERICA 83.60 (85.05) 4776
GVK POWER 10.96 (11.02) 243828
HBL NIFE POW 35.60 (34.45) 32512
HERITAGE FOO 660.80 (670.40) 1026
HIFCO MARWEL 44 (46.30) 32
HIL LTD 1877.10 (1936.65) 3257
IDL INDUSTRS 400 (392.15) 79
IKF SOFT 0.51 (0.50) 30732
ILFS ENGINEE 28.50 (28.35) 4679
INCAP 70.70 (74.40) 121
INNAREDY COM 1.96 (2.02) 9881
IVRCL INFRAS 1.34 (1.28) 329809
JEEVAN SCIEN 34 (34.50) 1501
KAKATIYA CEM 243.55 (249.80) 4616
KALLAM SPG 28.30 (27.05) 80519
KAVERI SEED 584.10 (583.35) 51535
KCP LTD 106 (105.55) 4509
KERNEX MICRO 28.50 (30) 5350
KNR CONSTRUC 235.45 (249.10) 18810
KREBS BIO 132 (130.95) 1717
LANCO INDUS 274.75 (280.60) 6572
LANCO INFRAT 0.83 (0.84) 340126
LAURUS LABS 488.95 (488.75) 888
LOKESH MACH 62.60 (61.75) 913
MADHUCON PRO 12.70 (12.55) 8052
MEGA SOFT 9.30 (9.51) 9216
MIC ELECTRON 3.45 (3.55) 51966
MOLD-TEK.TEC 43.85 (43.90) 7675
MOLDTK PLA 305.65 (306.30) 5305
MSR INDIA LT 28.60 (27.20) 1596
NAGARJAGRICH 28.60 (29.10) 4063
NATCO PHARMA 822.45 (832.10) 10069
NAVA BH VENT 142.50 (140.35) 42565
NCC 102.90 (101.30) 297920
NCL IND 170.10 (172.80) 2000
NEHA INTER 5.46 (5.42) 13700
NETTLINX 54.95 (54.05) 5200
NEULAND LAB 685.50 (690.15) 228
NILE 577.05 (571.70) 1694
OIL COUNTRY 20.50 (20.80) 1652
PANYAM CEMEN 23.55 (24.30) 5000
PENNER IND 53.10 (53.45) 22026
PHYTOCHEM I 53.20 (53.60) 352
PIONEER DIST 271.35 (273.65) 2269
PITTI LAMIN 88 (87.70) 10476
POKARNA 160.60 (161.90) 3127
PRAJAY ENGS 9.37 (9.18) 13212
PREMIER EXPL 268.15 (269.05) 823
PRISM CEMENT 102.90 (102.75) 14749
PRUDENTL PHA 3.95 (3.90) 214370
RAASI REFRAC 3.41 (3.25) 149
RAIN INDUSTR 207.55 (197.70) 159221
RAJ PACKAGIN 28.50 (28.55) 642
RAJVIR INDUS 34.30 (36.10) 16
RAM INFORMAT 38.20 (38.45) 9690
SAGAR CEM 797.75 (811.95) 145
SAMKRG PIST 232.10 (235.85) 3017
SAMPRE NUTRI 49 (49.90) 90
SATVAH. ISPA 14.30 (14.45) 4841
SMS PHARMA 73.30 (74.65) 4461
SOUTH BIO TE 1.47 (1.40) 782
SREE RAYAL A 34.35 (34.55) 31612
SRI KPR INDU 25.45 (25.45) 4005
SRINIVASA SH 41.90 (40.20) 750
STARCHIK SP 33 (32.90) 300
STEEL EXCHAN 19.55 (19.80) 46539
SUJANA METAL 0.93 (0.91) 50
SUJANA TOWER 2.50 (2.57) 3274
SUJANA UNIVE 0.53 (0.53) 29075
SURANA TELE 4.68 (4.69) 350
SURYALAKSH.C 53.50 (52.55) 1152
SURYALATA SP 128.10 (132) 559
SUVEN PHARMA 223.65 (217.75) 183722
TAJ GVK HOTE 227.15 (227.20) 4121
TANLA 29.75 (29) 21918
TERA SOFTWAR 42.90 (40.90) 2787
VAMSHI RUBB 45.85 (45.95) 1221
VBC FERRO 39.10 (37.25) 500
VICEROY HOTE 8.01 (7.80) 11543
VIMTA LABS 227.10 (218.95) 8777
VISAKA IND 608.05 (619.25) 9430
VISTA PHARMA 37.50 (37.05) 7528
VIVIMED LABS 65.90 (64.45) 81172
YBRANT DIGIT 4.21 (4.11) 38106
ZENOTECH LAB 38.65 (38.70) 4218
ZENTECH 102.35 (85.30) 365817

చిట్‌ఫండ్ సంస్థలకు మార్గదర్శిగా నిలుస్తాం

- చందాదార్ల ప్రయోజనాలకే పెద్దపీట ● అదే మా విజయ రహస్యం
- సిబ్బంది నిబద్ధత వల్లే ఉన్నతి ● చిట్‌లపై జీఎస్‌టీ తొలగించాలి
- మళ్లీ డిపాజిట్లు స్వీకరించే ఉద్దేశం లేదు

'ఈనాడు' ఇంటర్వ్యూ
మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ
శైలజా కిరణ్

బోర్డులు తిప్పేసే చిట్‌ఫండ్ సంస్థలు కొన్ని అయితే.. పాడుకున్న చిట్ మొత్తాన్ని సకాలంలో చెల్లించని సంస్థలు ఇంకొన్ని.. తాము మాత్రం ఇందుకు మినహాయింపు అని నిరూపిస్తోంది మార్గదర్శి.

అంతేనా.. 'మార్గదర్శి తోడుంటే.. ఆనందం మీవెంటే' అన్నది కేవలం ప్రచార నినాదం కాదని.. పక్కా వాస్తవమని నిరూపిస్తోంది మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ.

సరైన హామీలు (ష్యూరిటీలు) చూపిస్తే చాలు.. వారంలోపే చిట్ సభ్యులకు తాము పాడుకున్న మొత్తాన్ని అందిస్తున్నాం అంటున్నారు సంస్థ ఎండీ శైలజా కిరణ్.

55 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం కలిగిన ఈ సంస్థ.. ప్రజల నమ్మకమే పునాదిగా ఎదుగుతోందని, భవిష్యత్ తరాలు కూడా చిట్‌ఫండ్ అంటే తమ సంస్థనే గుర్తించేలా 'మార్గదర్శి'ని నిలబెడతామని ఆమె చెప్పుకొచ్చారు. దేశంలో మరే చిట్‌ఫండ్ సంస్థ సాధించని విధంగా, గత ఆర్థిక సంవత్సరంలో కీలక మైలురాయి రూ.10,000 కోట్ల టర్నోవర్‌ను మార్గదర్శి చిట్ ఫండ్ అధిగమించింది.

ఈ నేపథ్యంలో ఆమె 'ఈనాడు'కిచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఈనాడు వాణిజ్య విభాగం

? మార్గదర్శి 55 ఏళ్ల ప్రస్థానంలో కీలకాంశాలను వివరిస్తారా..

శైలజాకిరణ్: 1962లో ఛైర్మన్ రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్‌ను ప్రారంభించారు. 1990లో నేను మార్గదర్శిలో చేరాను. తొలుత 6 నెలల పాటు శాఖలో పనిచేసి, వ్యాపారం ఎలా జరుగుతోంది, ఖాతాదార్ల అభిప్రాయాలు ఎలా ఉన్నాయి, సిబ్బంది తీరు వంటివి ఆకళింపు చేసుకున్నా. మార్గదర్శిపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతటి నమ్మకం ఉందో అర్థమైంది. ఆ ఏడాదే.. అంటే సంస్థను స్థాపించిన 27 ఏళ్లకు రూ.100 కోట్ల టర్నోవర్‌ను సాధించిందీ సంస్థ. తరవాత ఏడాది ఆర్థిక సంవత్సర కాలాన్ని మార్చడంతో రూ.74 కోట్లకు తగ్గింది. తదుపరి ఏడాది రూ.147 కోట్లకు పెరిగింది. 1991-92 నుంచి సంస్థ కార్యకలాపాల్లో నా ప్రమేయం పెరిగింది. సంస్థపై ప్రజల్లో ఉన్న గుడ్‌విల్‌కు తగ్గట్లు విస్తరిస్తే, మరింతమందికి చేరువవుతుందని భావించాను. నా అభిప్రాయం సరైనదే అని ఛైర్మన్, కుటుంబ సభ్యులు, ఇతర సీనియర్ సహచరులు నమ్మి ప్రోత్సహించడం వల్లే శాఖలను విస్తరిస్తూ వస్తున్నాం. ఏడాదికి 3 శాఖల చొప్పున ప్రారంభించాం. 1995లో ఎండీగా బాధ్యతలు స్వీకరించా. కొత్తగూడెం వంటి ప్రాంతాల్లో కొత్త శాఖను ప్రారంభించినపుడు, వరుసల్లో నిలబడి ప్రజలు చిట్ గ్రూపుల్లో చేరడం నాకు మరింత స్థైర్యాన్నిచ్చింది. 1995లో రూ.500 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం, సాధించాం. 2000వ సంవత్సరంలో రూ.1000 కోట్లకు చేరాం. 2017-18లో రూ.10,200 కోట్లు అధిగమించాం. తెలంగాణలో 33, ఆంధ్రప్రదేశ్‌లో 36, తమిళనాడులో 16, కర్ణాటకలో 20.. మొత్తం 105 శాఖల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నాం.

? రూ.100 కోట్ల నుంచి రూ.1000 కోట్ల వ్యాపారానికి పదేళ్లలోనే చేరారు. అక్కడనుంచి రూ.10,000 కోట్లకు వచ్చేందుకు 17 ఏళ్లకు పైగా పట్టింది. కారణమేంటి

సమాధానం: చిట్‌ఫండ్ వ్యాపారం తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది ప్రాంతాల్లో సంప్రదాయంగా వస్తున్నదే. ప్రారంభంలో పొదుపు, మదుపునకు ఇదే ఆధారం. శాఖల విస్తరణకు అనుగుణంగా వ్యాపారం వేగంగా వృద్ధి చెందింది. తరవాత బ్యాంకులు, షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లు, బంగారంపై పెట్టుబడుల వంటి భిన్న అవకాశాలు ఏర్పడ్డాయి. మా వరకు వ్యాపార వృద్ధి ఉన్నా, ఖాతాదార్లపై వ్యక్తిగత శ్రద్ధ తగ్గకూడదన్నదే తొలి నుంచి మా ఆశయం. ప్రతి ఒక్క ఖాతాదారుకు వారి అవసరాలకు అనుగుణంగా చిట్ రూపంలో నగదును అందించడమే ధ్యేయం. ఇదే క్రమంలో వసూళ్లు బాగుండటమూ కీలకమే. ఈ కార్యకలాపాలన్నీ స్థిరపరచుకునేందుకు (కన్సాలిడేట్ చేసుకునేందుకు) గత అయిదారేళ్లలో విస్తరణ తగ్గిస్తూ వచ్చాం. మళ్లీ పెంచుతున్నాం. అందువల్లే వచ్చే ఏడేళ్లలోనే ప్రస్తుత వ్యాపారానికి రెట్టింపు సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. కానీ సుదూర ప్రాంతాలకు వెళ్లం. ప్రస్తుత 4 రాష్ట్రాల్లోనే విస్తరణకు భారీ అవకాశాలున్నాయి.

? పెద్దమొత్తం చిట్‌లకు ఆదరణ అధికంగా ఉందంటున్నారు, కారణాలేమిటి

స: చిట్‌లను పిల్లల విద్య, వివాహం, వాహనం, స్థలం, ఇల్లు కొనుగోలు నిమిత్తం వేస్తుంటారు. 20 ఏళ్ల క్రితం చేతిలో రూ.5 లక్షలుంటే పెళ్లి బాగా చేసేవారు. ఇప్పుడు రూ.25-50 లక్షలు అవుతోంది. గతంలో కళాశాల విద్య మొత్తానికి రూ.500 అయితే, ప్రస్తుతం ఎల్‌కేజీకే రూ.లక్ష కట్టాల్సి వస్తోంది. అందుకనుగుణంగా చిట్ మొత్తాన్ని కూడా పెంచుకుంటున్నారు. రూ.2.5-10 లక్షల చిట్‌లకు ఆదరణ అధికంగా ఉంది. అన్ని ఆదాయ వర్గాలకు, వారి స్థాయికి తగ్గట్లు డబ్బు అవసరం ఉంటుంది. ఉన్న సొమ్మంతా ఒకే రంగంలో పెట్టుబడులు పెట్టకూడదు. షేర్లు, మ్యూచువల్‌ఫండ్‌లు, బంగారంపై పెట్టుబడులు పెరిగితే బాగానే ఉంటుంది. విలువ తగ్గితే, అవసరమైనపుడు అమ్ముకోలేకపోవచ్చు. స్థిరాస్తులు కూడా వెంటనే అమ్మడం వీలుకాదు. అదే చిట్ అయితే, 2-3 నెలల ప్రణాళికతోనే సొమ్ము పొందొచ్చు.

? పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ ప్రభావం ఎలా ఉంది? డిజిటలీకరణ చర్యలేం తీసుకుంటున్నారు

స: పెద్దనోట్ల రద్దుకు ముందు నగదు, చెక్‌ల ద్వారా చెల్లింపులు చెరి సగం ఉండేవి. అనంతరం చెక్‌లు, ఆన్‌లైన్ చెల్లింపులు 65 శాతానికి పెరిగాయి. ఆన్‌లైన్, కార్డు, యాప్ ద్వారా నెలకు రూ.50 కోట్ల మేర జమవుతున్నాయి. జీఎస్‌టీ పన్నురేటును 18 నుంచి 12 శాతానికి తగ్గించినా, రూ.లక్ష పాడుకున్న వారికి రూ.600 వరకు భారం పడుతోంది. బ్యాంకుల్లో లభించే వడ్డీ కానీ, మరే ప్రతిఫలంపైనా లేనందున, చిట్‌పైనా జీఎస్‌టీ తొలగించాలని కోరుతున్నాం. ఇందుకు కలిసి కట్టుగా ప్రయత్నిస్తున్నాం. లక్షలమంది ఖాతాదారుల ప్రయోజనార్థం రాష్ట్రప్రభుత్వాలు కూడా ఈ విషయంలో కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని అడుగుతున్నాం.

? డిపాజిట్లు పునఃప్రారంభించే యోచన ఉందా

స: మా ఛైర్మన్ చిట్‌ఫండ్ వ్యాపారాన్ని ప్రారంభించి, నమ్మకంగా చెల్లింపులు జరపడం వల్ల, ప్రజలే డిపాజిట్లు తీసుకోమని కోరారు. అలా రూ.వేలకోట్ల రూపాయలకు చేరింది. నెలాఖరునే వడ్డీ ఇవ్వడంతో, పదవీ విరమణ చేసిన వారు సౌఖ్యంగా జీవించారు. మొత్తం తిరిగి చెల్లించేశాం. అప్పట్లో 4 దశాబ్దాల పాటు మార్గదర్శి ఆధారంగా ఆర్థిక ప్రణాళికలు సాకారం చేసుకున్నవారెందరో. ప్రస్తుత పరిస్థితుల్లో మళ్లీ డిపాజిట్లు స్వీకరించే యోచన లేదు.

మార్గదర్శిలోనే చిట్ ఎందుకు కట్టాలో వివరించగలరా

దేశంలో అసంఘటిత రంగంలోనే చిట్ వ్యాపారం ఎక్కువగా ఉంది. మోసాలు అధికం కూడా వీటిలోనే. సంఘటిత రంగంలో రూ.60,000 కోట్ల మేర వ్యాపారం జరుగుతోంది. ఈ సంస్థలు ఎంత చిట్ నిర్వహిస్తే, ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి, రిజిస్ట్రార్‌కు అప్పగించాలి. ఇందువల్ల చిట్‌సభ్యుల సొమ్ముకు భద్రత ఉంటుంది. సంఘటిత రంగంలో మార్గదర్శి అగ్రగామి సంస్థ. ఖాతాదారు సరైన ష్యూరిటీలు చూపితే, వారికి అత్యవసరమైతే వారంలోపే చిట్ మొత్తాన్ని అందచేస్తున్నాం. మా ఖాతాదారుల్లో 30-40 శాతం మంది పాడుకున్న 15 రోజుల్లో పాట మొత్తాన్ని పొందుతున్నారు. 70-90 శాతం మందికి 30-45 రోజుల్లోపే పాటమొత్తం అందుతోంది. అందరు సభ్యుల ప్రయోజనాలను కాపాడటం కోసమే ష్యూరిటీల విషయంలో అప్రమత్తంగా ఉంటాం. బ్యాంకులో రుణం తీసుకోవాలంటే, సరైన ఆస్తులు తనఖా పెట్టాల్సిందే కదా. చిట్ పాడుకున్న వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, సక్రమంగా చెల్లించేవాడని నమ్మితే అతనికి సంబంధీకులు ష్యూరిటీ ఇస్తారు. ఇలాంటి వ్యక్తులనే చందాదార్లుగా ఎంచుకునేలా మా సిబ్బంది, ఏజెంట్లకు శిక్షణ ఇప్పిస్తుంటాం. ఇలా వ్యవహరించడం వల్లే విదేశాల్లో ఉన్న వారు కూడా తమ పెద్దల ద్వారా, మా వద్ద చిట్‌లు వేసుకుంటున్నారు. రూ.15 లక్షల చిట్‌వరకు వేతనాన్నిబట్టి ఉద్యోగుల హామీ తీసుకుంటున్నాం. నెలవారీ వాయిదాలు కట్టలేని కేసులు మా వద్ద 2-3 శాతమే. 99 శాతం రికవరీ మా దగ్గర ఉంది.

మీ పిల్లలను ఈ సంప్రదాయ వ్యాపారంలోకి తీసుకొస్తారా..

స: మా తల్లిదండ్రులకు మేమిద్దరం ఆడపిల్లలమే. నాన్నకు వ్యాపార సంస్థలున్నందున, వాటిని నిర్వహించాలనే దృక్పథంతోనే పెంచారు, అలానే పెరిగాము. చిన్ననాటి నుంచి అనుకున్నది పూర్తయ్యేవరకు విశ్రమించని ధోరణి నాది. పాఠశాల నుంచి వచ్చి, హోంవర్క్ పూర్తి చేశాకే, బూట్లు విప్పేదాన్ని. వివాహం అయ్యాక, ఛైర్మన్ సూచనతో మార్గదర్శి బాధ్యతలు చేపట్టా. ఈ వ్యాపారంలో ఉద్యోగులు, ఏజెంట్లు, ఖాతాదారుల్లో 90 శాతం మంది పురుషులే. అయితే ఇవేమీ నేను పట్టించుకోలేదు. వ్యాపార దృక్పథానికి తోడు కష్టపడేతత్వమే ఆలంబనగా ముందుకు సాగా. తొలి ప్రాధాన్యత మార్గదర్శికే అని పేర్కొన్నా, ఆచరిస్తున్నా. రోజులో 12-14-16 గంటలు పనిచేసిన సందర్భాలు ఎన్నో. సిబ్బందిని కలుపుకొని పోవడం, ప్రేరణ కలిగించడం, నా ఆలోచనల అమల్లో వారిని భాగస్వాములను చేయడమే నా విజయ రహస్యం. కంపెనీ ఉన్నతితోనే తమ అభ్యున్నతి బాగుంటుందని గ్రహించి ఉద్యోగులు, నిబద్ధతతో పనిచేస్తున్నారు. మాకు ముగ్గురు ఆడపిల్లలు. వీరిలో పెద్దవాళ్లు ఇద్దరూ వ్యాపార నిర్వహణకు అలవాటు పడుతున్నారు. చిన్ననాటి నుంచి వారిని అలానే పెంచాం. వారు మా వారసత్వం కొనసాగిస్తారు. భవిష్యత్తులోనూ ఈ రంగంలోని సంస్థలకు 'మార్గదర్శి'గా కొనసాగాలన్నదే మా ఆకాంక్ష.

? ఏ వయసు నుంచి చిట్‌లో సభ్యులుగా చేరడం మంచిది, ఇందువల్ల కలిగే ప్రయోజనాలేంటి

స: యువత ఉద్యోగం, వ్యాపారం ద్వారా ఆర్జించడం ప్రారంభించగానే చిట్‌లో చేరడం వల్ల అధిక ప్రయోజనాలుంటాయి. నెలవారీ తక్కువమొత్తంలో నగదు జమచేస్తూ, ఒకేసారి పెద్దమొత్తాన్ని, డివిడెండుతో కలిసి పొందగలగడం చిట్ ప్రత్యేకత. డబ్బు అందుబాటులో ఉంటే ఎవరైనా ఖర్చు చేసేస్తాం. చిట్‌లో చేరితే, తప్పనిసరిగా పొదుపు చేస్తాం. వ్యక్తిగత ఆర్థిక క్రమశిక్షణ ఏర్పడుతుంది. నిజమైన అవసరాలకే ఈ నగదు వినియోగించుకుంటారు. 40-50 నెలల చిట్‌లో సభ్యులుగా చేరితే, 6-8 శాతం వడ్డీ మేర ఆర్జన ఉంటుంది. ముందస్తు ప్రణాళిక మేరకు వ్యవహరిస్తే, అధిక వడ్డీకి రుణాలు తీసుకునే పనే ఉండదు. దీర్ఘకాల చిట్‌ల సభ్యులు 30 నెలల తరవాత పాడుకుంటే, 50 పైసల వడ్డీ మాత్రమే చెల్లించినట్లు అవుతుంది.

బుధవారం హైదరాబాద్‌లో రూ.10,000 కోట్ల టర్నోవర్ అధిగమించిన చిహ్నాన్ని చూపిస్తున్న మార్గదర్శి చిట్ ఫండ్ ఎండీ శైలజాకిరణ్. చిత్రంలో జీఎంలు రాజాజీ, ఏఎస్ఎన్ రాజు

రూ.10,000 కోట్ల స్థాయికి..

- 2025కి రూ.20,000 కోట్ల వ్యాపార లక్ష్యం ● దేశంలోనే అగ్రస్థానానికి మార్గదర్శి చిట్‌ఫండ్

ఈనాడు, హైదరాబాద్: రానున్న ఏడేళ్లలో వ్యాపారాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో మార్గదర్శి చిట్ ఫండ్ ముందుకు వెళ్తోంది. 2017-18లో రూ.10,204 కోట్ల టర్నోవర్ సాధించిన ఈ సంస్థ 2025కల్లా రూ.20వేల కోట్ల వ్యాపారానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. సంస్థ వ్యాపారం రూ.10వేల కోట్ల మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో మార్గదర్శి చిట్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజాకిరణ్ బుధవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడారు. 1962లో రామోజీరావు ప్రారంభించిన ఈ సంస్థ నేడు దేశంలోనే మొదటి స్థానానికి చేరిందనీ, ఖాతాదారులు తమపై చూపుతున్న నమ్మకమే ఇందుకు తోడ్పడిందని శైలజా కిరణ్ పేర్కొన్నారు. తమ సంస్థ టర్నోవర్ 1995 నుంచి 26 రెట్లు పెరిగిందన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.10,800 కోట్ల టర్నోవర్‌ను లక్ష్యంగా విధించుకున్నామనీ.. ఇది రూ.11,000 కోట్ల వరకూ చేరుకోవచ్చునీ తెలిపారు.

ఈ ఏడాది మరో 5-6 శాఖలు

విస్తరణ ప్రణాళికల్లో భాగంగా.. ఈ ఏడాది 5-6 కొత్త శాఖలను ప్రారంభించబోతున్నట్లు శైలజాకిరణ్ వెల్లడించారు. ప్రస్తుతం రూ.50వేల నుంచి రూ.80లక్షల వరకూ చిట్ గ్రూపులున్నాయనీ.. త్వరలోనే రూ.కోటి చిట్ గ్రూపును ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పెద్ద చిట్ గ్రూపుల్లో ఉన్న ఖాతాదారులకే ఇందులో ప్రాధాన్యం ఇస్తామన్నారు. సాధారణంగా రూ.5లక్షలు, రూ.10లక్షల చిట్‌లకు ఎక్కువ ఆదరణ ఉంటోందన్నారు. 'దక్షిణ భారత దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకలో కలిపి సంస్థకు 105 శాఖలు ఉన్నాయి. వ్యాపార విస్తరణ కూడా ఈ రాష్ట్రాల్లోనే ఉండేలా చూస్తున్నాం. కొన్ని పరిమితుల దృష్ట్యా ఇతర రాష్ట్రాలకు విస్తరించే ఆలోచన చేయడం లేదు. తెలంగాణలో జిల్లాలు పెరగడంతో వ్యాపారాభివృద్ధికి అవకాశాలు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లోనూ విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం ఏటా 10శాతం వృద్ధి రేటును సాధిస్తున్నాం. భవిష్యత్తులో కూడా ఇది కొనసాగుతుంది' అని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలోకి అడుగుపెట్టే అవకాశం ఉందా..? అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. అలాంటి ఆలోచనేమీ లేదనీ.. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ను ప్రారంభించాలనే విషయాన్ని ఆలోచిస్తున్నామని చెప్పారు. చిట్ ఫండ్‌లపై 3.75శాతం (పన్నులు తీసేయక ముందు) మార్జిన్ లభిస్తుందని, తక్కువ మార్జిన్‌తో.. ఎక్కువ నష్టభయం ఉన్న వ్యాపారమిదని శైలజాకిరణ్ పేర్కొన్నారు. రికవరీ 99శాతం వరకూ ఉందని పేర్కొన్నారు.

జీఎస్‌టీ వల్ల భారం..

'ప్రస్తుతం చిట్ ఫండ్ల కమీషన్‌పై 12శాతం జీఎస్‌టీ ఉంది. దీన్ని ఖాతాదారులే భరించాల్సి వస్తోంది. మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా ఆధారపడే చిట్ ఫండ్‌లపై ఈ భారం మోపడం బాధాకరం. ఆర్థిక సేవల్లో చిట్ ఫండ్‌లపైనే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. చిట్ ఫండ్‌లపై జీఎస్‌టీని పూర్తిగా రద్దు చేయాలి. లేదా కనీసం 5శాతానికి పరిమితం చేయాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు దీనికోసం చొరవ చూపాల'ని శైలజా కిరణ్ కోరారు.

ఎయిరిండియాను బలోపేతం చేస్తాం

వ్యూహాత్మక వాటా విక్రయానికీ కట్టుబడి ఉన్నాం: కేంద్రం

దిల్లీ: ఎయిరిండియాలో వ్యూహాత్మక వాటా విక్రయానికి ప్రభుత్వం ఇప్పటికీ కట్టుబడి ఉందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే సంస్థను సమర్థంగా నడిపించేందుకు ప్రణాళికను రూపొందించే పనిలో ఉన్నామని పేర్కొంది. ఎయిరిండియాకు ఏది లాభదాయకమైతే ఆవిధంగా భవిష్యత్ చర్యలు చేపట్టేందుకు త్వరలో నిర్ణయం తీసుకుంటామని పౌర విమానయాన మంత్రి సురేశ్ ప్రభు వెల్లడించారు. ప్రస్తుతం ఎయిరిండియా అధిక రుణ భారం సహా వివిధ సమస్యలు ఎదుర్కొంటోందని తెలిపారు. ఎయిరిండియాలో వాటా విక్రయ ప్రతిపాదనకు బిడ్డర్లను ఆకర్షించే విషయంలో ప్రభుత్వం విఫలమైన విషయం తెలిసిందే. అంతేకాకుండా ప్రస్తుతానికి ఎయిరిండియాలో వాటా విక్రయ ప్రణాళికను ప్రభుత్వం వెనక్కితీసుకుందని ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికారి కూడా వెల్లడించారు. 'ఎయిరిండియా వ్యూహాత్మక వాటా విక్రయానికి కట్టుబడి ఉన్నాం. అయితే పరిస్థితులు, అవకాశాలను మేం పరిశీలించి మదింపు చేయాల్సి ఉంది. ఆ తర్వాత తగువిధంగా నిర్ణయం ఉంటుంద'ని పౌర విమానయాన సహాయ మంత్రి జయంత్ సిన్హా వెల్లడించారు. బిడ్డర్‌లు ఎవరూ రాకపోవడంతో ఆ ప్రక్రియ ముగిసిపోయింది. ఇప్పుడు ప్రత్యామ్నాయాలపై ఆలోచన చేస్తున్నామని ఆయన అన్నారు.

విదేశీ ప్రయాణానికి 'మహారాజా' క్లాసు సీట్లు

ఎయిరిండియా అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో 'మహారాజా' బిజినెస్ క్లాసు సీట్లను త్వరలో అందుబాటులోకి తేనున్నారు. ఇందుకుగాను బోయింగ్ 777, బోయింగ్ 787 విమానాల్లో ఉన్న ఫస్ట్ క్లాసు, బిజినెస్ క్లాసు సీట్లను మహారాజా బిజినెస్ సీట్లుగా మార్చనున్నారు. ఇదేకాకుండా వివిధ రకాల ఆహార పదార్థాలు, సిబ్బందికి కొత్త యూనిఫారంలు లాంటి సదుపాయాలను కూడా ప్రవేశపెట్టనున్నారు. రేపు ఈ కొత్త సేవలు, ఉత్పత్తులను ప్రారంభించే అవకాశం ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో 15,000 టవర్లు

- అదనంగా 3,000 కి.మీ ఆప్టికల్ కేబుల్
- ఎయిర్‌టెల్ ప్రణాళిక
- 2 రాష్ట్రాల్లో 3 కోట్ల మంది చందాదారులు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కిల్‌లో టవర్ల నెట్‌వర్క్‌ను ఎయిర్‌టెల్ విస్తరించనుంది. అధిక వేగం కలిగిన మొబైల్ డేటాను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టు లీప్ కింద 15,000 కొత్త టవర్లను (సైట్లు) ఏర్పాటు చేస్తున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ఏపీ, తెలంగాణ సర్కిల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అవనీత్ సింగ్ పురి తెలిపారు. సాధారణంగా ఒక్కో టవర్ ఏర్పాటుకు సగటున రూ.30 నుంచి రూ.35 లక్షలు ఖర్చవుతుందన్నారు. టవర్లతోపాటు 3,000 కిలోమీటర్ల పొడవున ఆప్టికల్ ఫైబర్ కేబుల్(ఓఎఫ్‌సీ)ను వేయనున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో 10 వేల టవర్లు, 500 కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌ను వేశారు. ఖాతాదారులు వేగవంతమైన మొబైల్ డేటాను పొందడానికి వీలుగా ప్రీ-5జీ మాసివ్ ఎంఐఎంఓ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సింగ్ చెప్పారు. ఎంఐఎంఓ టెక్నాలజీ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని 5-7 రెట్లు పెంచుతుందన్నారు. భారత్‌లో చందాదారులు మొబైల్ ఫోన్లపై డేటాను ఎక్కువ వినియోగిస్తున్నారని, వచ్చే ఏడాది కాలంలో వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి ఫోను స్మార్ట్ ఫోన్ (4జీ) కాగలదని వివరించారు. 2జీ సేవల పరంగా తెలుగు రాష్ట్రాల్లో 95 శాతం జనాభాను, 4జీ సేవల పరంగా 85 శాతం జనాభాను ఎయిర్‌టెల్ కవర్ చేస్తోందని, రెండు రాష్ట్రాల్లో కంపెనీకి ప్రస్తుతం 3 కోట్ల మంది చందాదారులు ఉన్నారన్నారు. టెలినార్ విలీనం కారణంగా రెండు రాష్ట్రాల్లో 30 లక్షల మంది చందాదారులు లభించారని చెప్పారు. ప్రస్తుతం ఎయిర్‌టెల్‌కు తెలుగు రాష్ట్రాల్లో 44,000 సైట్లు ఉన్నాయి. ఇందులో 17,000 సైట్లు 4జీ సేవలను అందించగలవు. ఇప్పటి వరకూ 18,000 కిలోమీటర్ల పొడవున ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ఉంది. తక్కువ ధరకు అందరికీ 4జీ ఫోన్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చేపట్టిన మేరా పహలే స్మార్ట్ ఫోన్ కార్యక్రమం కింద 9 కంపెనీలతో చేతులు కలిపి 42 మోడళ్ల ఫోన్లను వినియోగదారులకు అందిస్తున్నామని, మొత్తం చందాదారుల్లో 4జీ చందాదారులు 40 శాతం మంది ఉన్నారని సింగ్ తెలిపారు.

బ్యాంకులు, పోస్టాఫీసుల్లో 18,000 ఆధార్ కేంద్రాలు

దిల్లీ: ఆధార్ కార్డు నమోదు, మార్పు చేర్పుల కోసం బ్యాంకులు, పోస్టాఫీసుల ప్రాంగణాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయమని ఉడాయ్ గత జులై నుంచి కోరుతూ వస్తోంది. దీనికి స్పందించిన బ్యాంకులు, పోస్టాఫీసులు 18 వేల కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయని ఉడాయ్ సీఈఓ అజయ్ భూషణ్ పాండే తెలిపారు. 10 శాఖల్లో కనీసం ఒక శాఖలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయమంటూ ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులను ఉడాయ్ కోరింది. 'బ్యాంకులు, పోస్టాఫీసు ప్రాంగణాల్లో ఇప్పటిదాకా 18 వేల ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. మిగతా చోట్ల కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తాం. మొత్తం 26 వేల కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నామ'ని పాండే వివరించారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని ప్రాంగణాల్లో ఇప్పటిదాకా 10,000 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మరో 3,800 కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. 13 వేల పోస్టాఫీసు ప్రాంగణాల్లో కూడా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే 8 వేల కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

వెళ్లనంటున్నా.. పంపించేశారా

- హైడ్రామా మధ్య చందా కొచ్చర్ సెలవు నిర్ణయం?
- బలవంతంగా బోర్డు ఒప్పించిందంటూ మీడియా కథనాలు

దిల్లీ: దీర్ఘకాలిక సెలవుపై వెళ్లేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓ చందాకొచ్చర్ ఇష్టపూర్వకంగా ఏమీ ఒప్పుకోలేదట. బోర్డు సభ్యులే ఆమెను బలవంతంగా అంగీకరించేలా చేశారట. మీడియా వర్గాల కథనం ప్రకారం సమావేశం ఆద్యంతం హైడ్రామా మధ్య చాలా వాడీవేడీగానే జరిగినట్లు తెలుస్తోంది. కొచ్చర్, బోర్డు సభ్యుల మధ్య తీవ్ర వాదోపవాదాలు నడిచినట్లు సమాచారం. అసలు నేను ఎందుకు సెలవు పెట్టి వెళ్లాలి? అలా వెళ్లమని ఆర్‌బీఐ చెప్పిందా లేదంటే సెబీ చెప్పిందా? ఏ నియంత్రణ సంస్థ కూడా చెప్పనప్పుడు మీకు ఆ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరమేమిటని చందాకొచ్చర్ గట్టిగానే ప్రశ్నించినట్లు సమాచారం. అయితే ఆమె చేసిన వాదనకు ఐసీఐసీఐ బ్యాంక్‌లో అత్యధిక వాటా ఉన్న ఎల్ఐసీ ఛైర్మన్ కూడా గట్టిగానే సమాధానం ఇచ్చారట. మీపై ఆరోపణలు ఉన్నాయి. ఆరోపణలు వచ్చినప్పుడు వాస్తవానికైతే మీరు పదవి నుంచే తప్పుకోవాలి. కాని మిమ్మల్ని కేవలం సెలవుపైనే పంపిస్తున్నాం. మీ పదవిని కూడా అలాగే ఉంచుతున్నాం. అలాంటప్పుడు ఒప్పుకోవడానికి మీకు అభ్యంతరమేమిటి? అని ఆయన అడిగినట్లు తెలుస్తోంది. అయినా కూడా చందాకొచ్చర్ ససేమిరా అనడంతో మీరు ఈ నిర్ణయానికి ఒప్పుకోవల్సిందే? తప్పదు అంతకుమించి మీకు మరో అవకాశం లేదని ఎల్ఐసీ ఛైర్మన్ ఖరాఖండిగా చెప్పేశారట. దీంతో ఈ వ్యవహారం మరింత ముదురుతుందని భావించిన బ్యాంకు స్వతంత్ర డైరెక్టర్లు ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా కూడా వాళ్ల మాటలేవీ వినకుండా రుసరుసలాడుకుంటూ గది నుంచి ఆమె బయటకు వెళ్లిపోయారు. బోర్డు సభ్యులు ఆమెకు సర్ది చెప్పి తిరిగి ఆమెను తీసుకొచ్చారు. ఆ తర్వాత ఆమెను ఎలాగోలా బలవంతంగా ఒప్పించేశారు. ఆఖరుకు సెలవుపై పంపిచాలన్నది అందరి సంయుక్త నిర్ణయమంటూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రకటనకు కూడా ఆమె అయిష్టంగానే అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది.

సామాన్యులకు న్యాయం చేయాలి

● పోలీసులకు హోం మంత్రి చినరాజప్ప సూచన ● అనంతలో ఘనంగా ఎస్ఐల పాసింగ్ పరేడ్

మొత్తం 652 మంది ఎస్ఐలు శిక్షణ పొందగా... వీరిలో 165 మంది మహిళలు ఉన్నారు..

సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో మహిళా ఎస్సైల కవాతు ★ గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉపముఖ్యమంత్రి

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: "ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేరాలు పోలీసు వ్యవస్థకు పెను సవాల్‌గా నిలిచాయి. నేరస్తులు ఇప్పుడు విలాస జీవితం కోసం నేరాలకు పాల్పడుతున్నారు. ఈ కోవలో ఉన్నత విద్యావంతులూ ఉండటం విస్మయానికి గురి చేస్తోంది. ఇలాంటి వారి పట్ల పోలీసు వ్యవస్థ మరింత దృష్టి సారించాల్సిన అవసరం, ఆవశ్యకత ఉంది" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాలయ చినరాజప్ప పేర్కొన్నారు. బుధవారం అనంతపురం పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ) మైదానంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్ఐల పాసింగ్ పరేడ్ ఘనంగా జరిగింది. తొలుత హోంమంత్రి కంటిన్‌జెంట్స్ కవాతును ప్రారంభించారు. ఆ తర్వాత మాట్లాడుతూ..ప్రపంచంలో పుట్టుకొస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దొంగలు కూడా అనుసరిస్తున్నారు. వీటికి దీటుగా ఎస్ఐలకు శిక్షణలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై తర్ఫీదు ఇప్పించామన్నారు. విధి నిర్వహణలో ఎన్నో రకాలు ఒత్తిళ్లు వస్తాయని, వాటినన్నింటిని అధిగమించి సామాన్యులకు న్యాయం చేయడమే బాధ్యతగా గుర్తించుకోవాలని హితవు పలికారు.

రాష్ట్ర డీజీపీ ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లను పూర్తిగా కట్టడి చేసే శక్తి సామార్థ్యం మన పోలీసు వ్యవస్థకు ఉందని గుర్తు చేశారు. పోలీసు శిక్షణ విభాగం ఐజీ ఎన్.సంజయ్ మాట్లాడుతూ శిక్షార్థులందరికీ ప్రజలతో సానుకూల దృక్పథాన్ని కలిగే ఉండేలా నేర్పించామన్నారు. పురుషులకు దీటుగా మహిళా ఎస్ఐలు కూడా శిక్షణలో రాణించారని చెప్పారు. ఆ తర్వాత వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభా చూపిన శిక్షణ ఎస్ఐలకు బహుమతులు ప్రదానం చేశారు.

(13వ పేజీ తరువాయి)

					కంటే పద్మావతమ్మ భర్త చిన్నయ్య; వనం యానాది, తండ్రి చెన్నయ్య; కంటే రమణమ్మ భర్త సుబ్బారాయుడు				
25.	280	0.85	0.85	పట్టా మెట్ట	వనం ఓబులమ్మ భర్త యానాది; పదచాల నాగమ్మ భర్త వెంగయ్య; పదచాల నాగయ్య తండ్రి ఫకీరయ్య	274	279	284, 281	276
26	281	0.65	0.65	పట్టా మెట్ట	వనం ఓబులమ్మ భర్త యానాది; పదచాల నాగమ్మ భర్త వెంగయ్య; పదచాల నాగయ్య తండ్రి ఫకీరయ్య	274	284	283	280
27	282	3.29	3.29	ఇనాం మెట్ట	పోలిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తండ్రి వెంకటరెడ్డి	323	283, 288	291, 292	274
28	283	0.86	0.86	పట్టా మెట్ట	పోలిరెడ్డి చిన్నారెడ్డి తండ్రి చిన వెంకటరెడ్డి	282	284, 285	288	281
29	284	1.37	1.37	పట్టా మెట్ట	పదచామలిగి ఫకీరయ్య తండ్రి నాగయ్య; వనం ఓబులమ్మ భర్త యానాది	280, 281	279	285, 283	279
30	285	3.79	3.79	పట్టా మెట్ట	బండి ఆదెమ్మ భర్త లింగయ్య; పోలరెడ్డి చిన్నారెడ్డి తండ్రి చిన వెంకటరెడ్డి; పదచాల హజరత్తయ్య తండ్రి శ్రీనివాసులు; పదచాల రత్నమ్మ భర్త రామసుబ్బయ్య; బండి సుబ్బయ్య తండ్రి వెంకటయ్య	283	286, 287	288	279, 284
31	286	1.69	1.69	పట్టా మెట్ట	పోలిరెడ్డి చిన్నారెడ్డి తండ్రి చిన వెంకటరెడ్డి	285	268	287	279
32	287	1.27	1.27	పట్టా మెట్ట	పోలిరెడ్డి చిన్నారెడ్డి తండ్రి చిన వెంకటరెడ్డి	285	268	288	286
33	361	6.10	0.19	పట్టా మెట్ట	రామిరెడ్డి ఓబులరెడ్డి తండ్రి చెంచురెడ్డి మరియు ఇతరులు	363	360	364	384/3
34	291	7.12	7.12	పట్టా మెట్ట	పాశం వెంకటయ్య తండ్రి సుబ్బయ్య; జంగిట రోశయ్య తండ్రి పెద్ద నాగయ్య; బొడ్డు రోశయ్య తండ్రి అంకయ్య; జంగిటి రోసమ్మ భర్త యల్లయ్య; పాశం వెంకటయ్య తండ్రి యల్లయ్య; జంగిటి రోశయ్య తండ్రి పెద్ద నాగయ్య	282, 292	290	296	288
35.	290	3.79	3.79	పట్టా మెట్ట	చీరాల రత్నమ్మ భర్త జనార్దన్; బొడ్డు రోశయ్య తండ్రి అంకయ్య; పోలంరెడ్డి రమణమ్మ భర్త ఓబులరెడ్డి; పాశం పెద్ద వెంకటయ్య తండ్రి సుబ్బయ్య; మన్నే చెంచురామిరెడ్డి తండ్రి పిచ్చిరెడ్డి; మన్నే రాంగోపాల్‌రెడ్డి తండ్రి చెంచురెడ్డి	291	289	296	288
36.	289	4.28	4.28	పట్టా మెట్ట	మన్నే సాంబరెడ్డి తండ్రి చెంచురెడ్డి; పోలిరెడ్డి సుబ్బమ్మ భర్త వెంకటరెడ్డి; చీరాల రత్నమ్మ భర్త జనార్దన్	290	268	296	288
37.	331	5.91	5.36	ఇనాం మెట్ట	వనం పెంచలయ్య తండ్రి చెన్నయ్య మరియు ఇతరులు	330	332, 325	326, 325	598, 599
38.	362	0.24	0.04	పట్టా మెట్ట	రామిరెడ్డి పెంచలరెడ్డి మరియు ఇతరులు	363/1	361	363/1	384/3
		మొత్తం	126.76						

సం/- శ్రీమతి పి. ప్రశాంతి, ఎం.ఏ.,
ప్రత్యేక కలెక్టరు, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు

సినీతారల వ్యభిచారం కేసు దర్యాప్తు వేగిరం

● తెలుగు సంఘాల చెల్లింపులపై అమెరికా పోలీసుల దృష్టి

ఈనాడు, హైదరాబాద్: తెలుగునాట సంచలనం సృష్టిస్తున్న సినీతారల వ్యభిచారం కేసు ప్రకంపనలు ఇంకా ఆగడం లేదు. చేతికి దొరికిన చిత్తుకాగితంతో చరిత్ర మొత్తం తవ్వితీస్తున్న అమెరికా పోలీసులు ఇప్పుడు దర్యాప్తును మరింత వేగిరం చేసినట్లు తెలుస్తోంది. తొలుత ఇదేదో మోదుగుమూడి కిషన్ దంపతుల వ్యవహారంగానే భావించినప్పటికీ ఆరుగురు సినీనటులు, ఇంకా అనేక మంది విటులకు సంబంధించిన వ్యవహారాలు బయటకు వచ్చిన విషయం విదితమే. రకరకాల సాంస్కృతిక సంస్థల పేర్లతో మహిళలను అమెరికా రప్పించి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని అమెరికా పోలీసులు అనుమానిస్తున్నట్లు సమాచారం. దీన్ని నిగ్గు తేల్చే ఉద్దేశంతోనే ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులు ఇప్పుడు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. వివిధ తెలుగు సంఘాల ప్రతినిధులను విచారించిన అధికారులు గత కొన్ని సంవత్సరాలుగా ఆయా సంఘాల కార్యక్రమాలకు హాజరైన వారి వివరాలను మన దేశంలోని అమెరికా కాన్సులేట్ కార్యాలయాల నుంచి తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. వారి ఆర్థిక లావాదేవీలనూ ఆరా తీస్తున్నట్లు సమాచారం. తాము సినీతారలను పిలిపిస్తుంటామని, సాంస్కృతిక కార్యక్రమాల వరకే తమకు తెలుసని వివిధ సంఘాల వారు చెప్పినట్లు తెలుస్తోంది. నటీనటులు వచ్చి వెళ్లడానికి విమాన టిక్కెట్లు, బస చేయడానికి హోటల్ గదులకయ్యే ఖర్చు మాత్రమే చెల్లిస్తామని, ఆర్థికంగా ప్రయోజనాలేవీ కల్పించమని సంఘాల ప్రతినిధులు చెప్పినట్లు సమాచారం. కాని కొందరు నటీమణుల ఖాతాల్లో పెద్దమొత్తంలో డాలర్లు జమైనట్లు, ఇంకా కొందరైతే తిరుగు ప్రయాణంలో డాలర్లను రూపాయలుగా మార్చుకున్నారని అమెరికా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వ్యభిచారం కేసులో అరెస్టై ప్రస్తుతం జైల్లో ఉన్న మోదుగుమూడి దంపతులను గురువారం ఇల్లినాయిస్ జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు.

అవి నకిలీ లేఖలు

తానా అధ్యక్షుడు సతీష్ వేమన

ఈనాడు, అమరావతి: షికాగో సెక్స్ రాకెట్‌లో పట్టుబడ్డ మోదుగుమూడి కిషన్, చంద్రకళ దంపతులతో ఉత్తర అమెరికా తెలుగు అసోషియేషన్‌కు (తానా) ఎలాంటి సంబంధం లేదని తానా అధ్యక్షుడు సతీష్ వేమన ఒక ప్రకటనలో తెలిపారు. మోదుగుమూడి దంపతులు తానా పేరిట నకిలీ లేఖలు తయారు చేసినట్లు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం దర్యాప్తులో ఇప్పటికే తేలిందని పేర్కొన్నారు. ఆ విభాగం దర్యాప్తు అధికారులు ఈ లేఖల విషయంలో తనను ఈ మెయిల్ ద్వారా సంప్రదించగా.. .అవి తాను రాసినవి కావని సమాచారమిచ్చానని వివరించారు.

అనర్హులు రావద్దు.. అర్హులు కోల్పోవద్దు

పీఎంఏవై లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద పట్టణాల్లో లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను తప్పనిసరిగా వర్తింపజేయాలని అధికారులను నిర్దేశిస్తూ సంబంధిత ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు మున్సిపల్ పరిపాలన డైరక్టర్, జిల్లా కలెక్టర్లు, ఉడాల వైస్ ఛైర్మన్లు, సీఆర్‌డీఏ కమిషనర్‌తో పాటు ఆయా మున్సిపాలిటీల కార్పొరేషన్ల కమిషనర్‌లు కేంద్ర నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఈ పథకం కింద లబ్ధిదారుల అర్హతలను పేర్కొంటోంది.

- 2011 లెక్కల ఆధారంగా పట్టణాలుగా ఉండి, ఆ తర్వాత పట్టణాలుగా నోటిఫై అయిన అన్ని చోట్లా ఈ పథకం వర్తింపజేయవచ్చు.
- లబ్ధిదారులకు లేదా ఆ కుటుంబంలో వారికి (పెళ్లికాని పిల్లలు) ఎక్కడా ఇల్లు ఉండకూడదు.
- ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల ఏడాది ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదు.
- యుక్త వయసు వచ్చి సొంతంగా సంపాదించుకుంటున్న కుటుంబ సభ్యుడు ఎవరైనా విడిగా లబ్ధిదారుడుగా ఉండొచ్చు. వారికి కూడా ఎక్కడా సొంత పక్కా ఇల్లు ఉండకూడదు.
- రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబరు నెలలోనే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నేతృత్వంలో లబ్ధిదారుల ఎంపికకు కమిటీ ఏర్పాటు చేసి పథకం అర్హతలు నిర్దేశించింది.

అవన్నీ అపోహలే!



రెండు దశాబ్దాల క్రితం వరకూ ఏ కార్యాలయాన్ని చూసినా... టేబుళ్లు, కుర్చీలు, టైపు రైటర్లు కనిపించేవి. ఉద్యోగులు ఫైళ్లు ముందేసుకొని కుస్తీ పట్టేవారు. ఇప్పుడు ఫైళ్లు పోయి కంప్యూటర్లు వచ్చాయి. ప్రతి ఉద్యోగికి ఒక కంప్యూటర్ తప్పనిసరి అయింది. మరో పదేళ్ల తర్వాత ఇలా కూడా ఉండకపోవచ్చు! కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) కల రోబోలు కార్యాలయాల్లో నిర్విరామంగా పనిచేస్తున్న దృశ్యం కనిపిస్తుంది. ఉద్యోగులకు బదులు అన్ని పనులనూ యంత్రాలే చక్కబెడతాయి. 'ఆటోమేషన్' వల్ల రాబోతున్న మార్పు ఇది. దీని వల్ల ఎటువంటి విపరీత పరిణామాలు ఎదురవుతాయనే భయాలు... ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగాలు పోయి ఎంతో మంది నిరుద్యోగులుగా మిగిలిపోతారనే ఆందోళన ఉంది. ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తప్పిస్తే, ఇతర రంగాలు ప్రాధాన్యం కోల్పోతాయనే అభిప్రాయం కూడా ఉంది. ఈ భయాల్లో అన్నీ నిజం కాదని '2017-18 గ్లోబల్ ఫ్యూచర్ ఆఫ్ వర్క్ సర్వే' స్పష్టం చేసింది. 'ఆటోమేషన్' తప్పనిసరి పరిణామం అయినప్పటికీ, ఉద్యోగాలకు ఇబ్బంది ఉండదని పేర్కొంది. దీనిపై ఎన్నో అపోహలకు ఈ నివేదికలో సమాధానాలు ఉన్నాయి.

అపోహ: సంస్థల్లో నిర్వహణ వ్యయాలు తగ్గించుకోవటానికి, పొరపాట్లు నివారించటానికి 'ఆటోమేషన్' ప్రధాన ఆయుధం అవుతుంది.

సర్వేలో పాల్గొన్న వారు దీనికి ఏ విధంగా స్పందించారంటే...



'ఆటోమేషన్' ప్రధాన లక్ష్యం ఉద్యోగులు మెరుగైన పనితీరును ప్రదర్శించేలా చేయటంతోపాటు ఉత్పాదకత పెంచుకోవటం.

అపోహ: 'ఆటోమేషన్' కేవలం ఐటీకి సంబంధించిన అంశం...

- అదొక్కటే కాదు...
- 'ఆటోమేషన్' విజయవంతం కావాలంటే సమర్థత, నాయకత్వం, సంస్థాగత నిర్మాణం, నిపుణులను ఆకర్షించటం, నూతన పద్ధతులు అవసరం.
- ఈ మార్పులో క్రియాశీలకమైన పాత్ర మానవ వనరుల విధానాలదే.

అపోహ: ఉద్యోగాలు తగ్గిపోతాయి...

- ఇది కొంతవరకే నిజం.
- కొత్త అవసరాలకు అనుగుణంగా కాంట్రాక్టు ఉద్యోగ నియామకాలు పెరుగుతాయి.
- శాశ్వత ఉద్యోగాల స్థానంలో పార్ట్-టైమ్, తక్కువ పనిగంటలు ఉండే ఉద్యోగాలు ఎక్కువగా లభిస్తాయి.

అపోహ: ప్రస్తుత ఉద్యోగులు పనికిరారు...!

- 'ఆటోమేషన్' అంటే ఎక్కువ మంది భయపడేది దీనికే. కొత్త పని వాతావరణంలో ప్రస్తుత ఉద్యోగులు పనికిరాకపోవచ్చని, అందువల్ల ఎంతో మంది నిరుద్యోగులుగా మారతారనే ఆందోళన ఉంది.
- సమీప భవిష్యత్తులో ఉద్యోగాల తీరుతెన్నులు సమూలంగా మారిపోయే అవకాశం ఉంది.
- ఉద్యోగులు కొత్త పద్ధతులను అనుసరించి పనిచేయాల్సి వస్తుంది.
- నూతన అవసరాలకు అనువైన నైపుణ్యాలు సమకూర్చుకున్న వారికి జీతభత్యాలు ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది.



నేటి తాత్కాలిక ఉద్యోగులే రేపటి శాశ్వత ఉద్యోగులు

తాత్కాలిక, కాంట్రాక్టు ఉద్యోగులు... శాశ్వత ఉద్యోగుల మాదిరిగానే ప్రభావవంతంగా పనిచేస్తారని ఈ సర్వేలో పాల్గొన్న వారిలో అత్యధికులు పేర్కొన్నారు. అంతేగాక వివిధ సంస్థల్లోని తాత్కాలిక ఉద్యోగుల్లో..., కొంతమంది శాశ్వత ఉద్యోగులు అవుతారని వివరించారు. 'ఆటోమేషన్' యుగానికి దగ్గరగా ఉన్న ప్రస్తుత తరుణంలో భవిష్యత్తు సవాళ్లను దృష్టిలో పెట్టుకొని పని పద్ధతులు మార్చుకోవటం, ఉద్యోగులను కొత్త అవసరాలకు అనుగుణంగా తయారు చేయటం వ్యాపార సంస్థల ముందున్న ప్రధాన కర్తవ్యంగా ఈ సర్వే స్పష్టం చేసింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

పొరుగుసే'వల' విసిరాడు

● అమెరికా వాహనాల బీమా పర్యవేక్షణ పేరుతో మోసం
● రూ.25 కోట్లు స్వాహా చేసి బోర్డు తిప్పేసిన పీవీఆర్ సాఫ్ట్ టెక్
● తెలుగు రాష్ట్రాల్లో వెయ్యి మందికిపైగా బాధితులు

ఈనాడు - హైదరాబాద్

ప్రధాన నిందితుడు ధీరజ్

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని వాహనాల బీమా పర్యవేక్షిస్తే చాలు నెలకు రూ.1.75 లక్షల ఆదాయం వస్తుందంటూ హైదరాబాద్‌కు చెందిన పీవీఆర్ సాఫ్ట్ టెక్ సొల్యూషన్ ఘరానా మోసానికి పాల్పడింది. బీమా పాలసీలను పర్యవేక్షించేందుకు ఐదు కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్ ఉచితంగా ఇస్తామని, ధరావతుగా రూ.2.5 లక్షలు చెల్లించాలంటూ సంస్థ ప్రతినిధులు ధీరజ్, వెంకట్, కవిత పలువురిని ఆకర్షించారు. ఇలా ఏడాదిన్నర వ్యవధిలో వేయి మందికి పైగా వ్యక్తుల నుంచి రూ.25 కోట్లు స్వాహా చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. బాధితులు సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని డీసీపీ అవినాశ్ మహంతి (నేర పరిశోధన) తెలిపారు.

ఇలా వలలోకి...: హైదరాబాద్‌లో ఉంటున్న ధీరజ్ రెండేళ్ల క్రితం చిక్కడపల్లిలో విదేశీ, బహుళజాతి సంస్థలకు పొరుగు సేవలందించేందుకు పీవీఆర్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్ పేరుతో సంస్థను స్థాపించాడు. రెండు,మూడు నెలలకే నష్టాలు రావడంతో మోసాలు చేసి రూ.లక్షలు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అమెరికాలో రవాణాశాఖ అధికారులు వాహనాల జీవితబీమాను పర్యవేక్షించేందుకు ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి ఇవ్వాలంటూ ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారని అంతర్జాలం ద్వారా తెలుసుకుని మోసానికి పథకం వేశాడు. ఓ స్నేహితుడి ద్వారా ఆ సాఫ్ట్‌వేర్ తెప్పించుకుని, వాహనాల బీమా సాఫ్ట్‌వేర్‌ను పర్యవేక్షించే కాంట్రాక్టు వచ్చిందంటూ ప్రకటనలిచ్చాడు. ఐదు కంప్యూటర్లు ఉచితంగా ఇస్తానంటే హైదరాబాద్, వరంగల్, జడ్చర్ల, విజయవాడ, వైజాగ్, రాజమండ్రి, తిరుపతి నుంచి పలువురు ఆసక్తి ప్రదర్శించారు. ప్రతి ఒక్కరితో ఏడాది పాటు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ధరావతుగా వారు చెల్లించిన రూ.2.5 లక్షలతోనే కంప్యూటర్లు కొనిచ్చాడు. ఒక్కో కంప్యూటర్‌కు నెలకు రూ.35వేలు కనీస ఆదాయం వస్తుందంటూ వివరించాడు. ఒప్పందం కుదుర్చుకునే వారి సంఖ్య పెరగడంతో హిమాయత్‌నగర్‌లో మరో శాఖను ప్రారంభించాడు. అక్కడ కవిత, మరో ఇద్దరికి బాధ్యతలు అప్పగించాడు. కొద్దిరోజుల పాటు నెలనెలా రూ.5వేల నుంచి రూ.10వేల చొప్పున చెల్లించాడు. గతేడాది అక్టోబర్ నుంచి చెల్లింపులు ఆపేశాడు.

అంకెలు సరిచేస్తే వేలల్లో ఆదాయమంటూ

అమెరికాలో ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు, ట్రక్కులు కొనుగోలు చేసిన వాహన యజమానులు వాటికి జీవితకాలం బీమా చేశారా? లేదా? అని తెలుసుకునేందుకు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు. సాఫ్ట్‌వేర్‌లో ఇటాలిక్ భాషలో ఉంటే దాన్ని టైమ్స్ రోమన్ భాషలోని అంకెల్లోకి మార్చాలి. ఆయా అంకెలను మార్చే పద్ధతిలో గ్రేడింగ్‌ను ధీరజ్ నిర్ణయించాడు. 50శాతం సరిగ్గా ఉంటే నెలకు ఒక కంప్యూటర్‌కు రూ.2వేలు, 51శాతం నుంచి 60శాతం వరకూ సరిగ్గా ఉంటే రూ.17వేలు, 61శాతం నుంచి 80శాతం వరకూ ఉంటే రూ.35వేలు, 81శాతం నుంచి 100శాతం సక్రమంగా ఉంటే రూ.72వేల ఇస్తానని నమ్మబలికాడు. అయితే ఎవరికీ 61శాతం గ్రేడింగ్‌కు మించి ఇవ్వలేదు. వీరికి రూ.35వేల చొప్పున ఇవ్వకుండా రూ.10వేలతో సరిపెట్టేవాడు. డబ్బులివ్వాలంటూ జడ్చర్లలోని ఓ ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు అబ్రహం గట్టిగా నిలదీసేసరికి రెండురోజుల్లో ఇస్తానంటూ చెప్పి పీవీఆర్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్ కార్యాలయాలకు తాళం వేశాడు. దీంతో ఆయనతో పాటు 11 మంది సీసీఎస్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

బాబు తరఫున ప్రచారం చేస్తాం..

● రజక, వడ్డెర, మత్స్యకార సంఘాల ప్రకటన

ఈనాడు, అమరావతి: రజక, వడ్డెర, మత్స్యకారులను.. ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చే విషయమై అధ్యయనానికి కమిషన్ ఏర్పాటుచేయడం హర్షణీయమని ఆ సంఘాల నేతలు పేర్కొన్నారు. బుధవారం ఉండవల్లి ప్రజాదర్బార్ సమావేశమందిరంలో ముఖ్యమంత్రి చంద్రబాబును రజక, వడ్డెర, మత్స్యకార సంఘాల ప్రతినిధులు వేర్వేరుగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. తమ వర్గాలకు పలు రాయితీలు కల్పించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని వివరించారు. సీఎం చంద్రబాబు తరఫున వచ్చే ఎన్నికల్లో గ్రామ గ్రామాన తిరిగి ప్రచారం చేస్తామని వడ్డెర సంఘం, వడ్డెర సంక్షేమ సంఘం నేతలు పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి ఋణపడి ఉంటామని మత్స్యకారుల సహకార సమాఖ్య ఛైర్మన్ పాలుశెట్టి, తొమ్మిది తీరప్రాంత జిల్లాల సహకార సంఘాల నాయకులు వివరించారు. రజక సమాఖ్యకు రూ.100 కోట్లు కేటాయించేందుకు అంగీకరించడంపై ఆంధ్రప్రదేశ్ రజక సమాఖ్య అధ్యక్షుడు రాజమండ్రి నారాయణ, జిల్లాల అధ్యక్షులు, ఐకాస నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

బుగ్గనపై సభా హక్కుల నోటీసు

ఈనాడు, అమరావతి: వైకాపా శాసనసభ్యుడు, ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై తెదేపా ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, వి.హనుమంతరాయచౌదరి సభా హక్కుల నోటీసులు ఇచ్చారు. బుధవారం శాసనసభ కార్యదర్శి విజయ్‌రాజ్‌కి వారిద్దరూ ఈ నోటీసులు అందజేశారు. "వివిధ శాసనసభ కమిటీల నుంచి సేకరించిన సమాచారాన్ని బుగ్గన దిల్లీలో భాజపా నాయకుడు రాంమాధవ్‌కు అందజేశారు. బుగ్గన అలా చేయడం సభా హక్కుల్ని ఉల్లంఘించడమే. ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్ హోదాలో వివిధ సభా కమిటీల నుంచి సమాచారం తీసుకునే అవకాశం బుగ్గనకు లభిస్తుంది. అలా తీసుకున్న సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి. కమిటీ సభ్యులకు తప్ప ఎవరికీ ఇవ్వకూడదు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై జరుగుతున్న కుట్రలో భాగంగానే బుగ్గన దిల్లీలో రాంమాధవ్‌ను కలిశారు. ఆయనపై తగిన చర్యలు తీసుకోండి. అవసరమైతే ఈ అంశాన్ని హక్కుల కమిటీకి పంపించండి" అని స్పీకర్‌ను ఉద్దేశించి రాసిన లేఖలో తెదేపా ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

'ఎ' కథ తేలిపోయింది

ప్రపంచకప్ నాకౌట్లో అడుగుపెట్టిన తొలి రెండు జట్లుగా ఉరుగ్వే, రష్యా నిలిచాయి. బుధవారం సౌదీ అరేబియాను ఉరుగ్వే ఓడించడంతో గ్రూప్-ఎ ఫలితం తేలిపోయింది. గ్రూపులో అన్ని జట్లూ రెండేసి మ్యాచ్‌లు ఆడగా.. రెండింటికి రెండూ గెలిచి ఉరుగ్వే, రష్యా తుది-16లో ప్రవేశించాయి. ఆడిన రెండూ ఓడిపోయి ఈజిప్ట్, సౌదీ అరేబియా జట్లు నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించాయి. పోటీ ఇక అగ్ర స్థానం కోసమే. సోమవారం ఉరుగ్వే, రష్యా మధ్య మ్యాచ్‌లో గెలిచే జట్టు గ్రూప్ విజేతగా నిలుస్తుంది.

సురెజ్

ప్రపంచకప్‌లో క్రిస్టియానో రొనాల్డో జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అతడు పోర్చుగల్‌కు హీరో అయ్యాడు. తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై మూడు గోల్స్ కొట్టిన రొనాల్డో.. మొరాకోపైనా సత్తా చాటాడు. అతడి గోల్‌తోనే పోర్చుగల్ మ్యాచ్ నెగ్గి నాకౌట్ సమరానికి చేరువైంది. మొరాకో ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన తొలి జట్టయింది.

నాకౌట్లో రష్యా, ఉరుగ్వే

ఈజిప్ట్, సౌదీ అరేబియా ఔట్

డెనిస్ చెరిషెవ్

ఐరోపా టాప్ స్కోరర్

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ సాధించిన ఐరోపా ఆటగాడిగా రొనాల్డో ఘనత సాధించాడు. మొరాకోపై సాధించిన గోల్ కెరీర్‌లో అతడికి 85వది. ఆల్‌టైమ్ గోల్ స్కోరర్ల జాబితాలో ఇరాన్ దిగ్గజం అలీ దెయి (109 గోల్స్) మాత్రమే రొనాల్డో కన్నా ముందున్నాడు. ఈ టోర్నీలో రొనాల్డో ఇప్పటివరకు నాలుగు గోల్స్ కొట్టాడు.

మళ్లీ రొనాల్డో మాయ

రష్యా	3	ఈజిప్ట్	1
ఫాతి (సెల్ఫ్ గోల్, 47వ), చెరిషెవ్ (59వ), జుబా (62వ)		మహమ్మద్ సలా (73వ)	

చెరిషెవ్ గోల్

రష్యా అదరహో..

సెయింట్ పీటర్స్‌బర్గ్

ప్రపంచకప్‌నకు ముందు వరుసగా ఏడు పరాజయాలు. సన్నాహక మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటింది లేదు. అలాంటి రష్యా.. టోర్నీ మొదలవగానే ఒక్కసారిగా రెచ్చిపోతోంది. సొంత అభిమానుల మద్దతుతో అదరగొడుతోంది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన రష్యా వరుసగా రెండో విజయంతో ప్రపంచకప్ నాకౌట్‌కు దూసుకెళ్లింది. మంగళవారం రాత్రి జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఆ జట్టు 3-1తో ఈజిప్ట్‌పై విజయం సాధించింది. రష్యా తరఫున చెరిషెవ్, జుబా చెరో గోల్ కొట్టారు. సెల్ఫ్ గోల్ కూడా రష్యాకు కలిసొచ్చింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఈజిప్ట్ 45వ ర్యాంకులో ఉండగా. . రష్యాది 70వ స్థానం. భారీ ఆశల మధ్య సలా బరిలోకి దిగినా ఈజిప్ట్ రాత మారలేదు. రష్యా దూకుడు ముందు ఆ జట్టు నిలువలేకపోయింది. ఈజిప్ట్‌కు వరుసగా రెండో పరాజయం తప్పలేదు.

రష్యా దూకుడు..: మ్యాచ్ ఆరంభానికి ముందు అందరి దృష్టిలో ఈజిప్టే ఫేవరెట్. అగ్రశ్రేణి ఆటగాడు మహమ్మద్ సలా బరిలోకి దిగుతుండడంతో పాటు ర్యాంకింగ్స్‌లో కూడా రష్యా కంటే ముందుండడంతో ఈజిప్ట్ గెలుస్తుందన్నది అంచనా. కానీ చిన్న జట్ల సంచలనాల విజయాలు ఒరవడిని కొనసాగిస్తూ రష్యా చెలరేగిపోయింది. రెండు జట్లు హోరాహోరీగా తలపడడంతో తొలి అర్ధభాగంలో గోల్సేమీ నమోదు కాలేదు. విరామం తర్వాత కూడా రెండు జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. అయితే ఈజిప్ట్ ఆటగాడు అహ్మద్ ఫాతి 47వ నిమిషంలో సెల్ఫ్‌గోల్ కొట్టడంతో రష్యాను సంబరంలో ముంచెత్తింది. రష్యా ఆటగాడు అర్టెమ్ జ్యూబా తన్నిన బంతిని దూరం కొట్టడానికి ఫాతి ప్రయత్నించాడు. కానీ బంతి అతడి కాలికి తగిలి వలలో పడింది. ఆ తర్వాత రష్యా జోరు పెంచింది. చకచకా రెండు గోల్స్ కొట్టి ప్రత్యర్థిని దిగ్భ్రాంతికి గురిచేసింది. చెరిషెవ్ 59వ నిమిషంలో ఈజిప్ట్ డిఫెన్స్‌ను ఛేదిస్తూ రష్యా ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. కాసేపటికే జుబా (62వ నిమిషంలో) గోల్ కొట్టి రష్యా ఆనందాన్ని రెట్టింపు చేశాడు. ఈజిప్ట్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను సలా చేశాడు. 73వ నిమిషంలో లభించిన పెనాల్టీని అతడు గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత గోల్స్ కోసం ఈజిప్ట్ ఎంత ప్రయత్నించినప్పటికీ రష్యా రక్షణ శ్రేణిని బోల్తా కొట్టించలేకపోయింది.

గ్రూప్–ఎ	మ్యా	గె	డ్రా	ఓ	పా
రష్యా	2	2	0	0	6
ఉరుగ్వే	2	2	0	0	6
ఈజిప్ట్	2	0	0	2	0
సౌదీఅరేబియా	2	0	0	2	0

నోట్: మ్యా: మ్యాచ్‌లు; గె- గెలుపు; ఓ- ఓటమి; పా-పాయింట్లు

ఉరుగ్వే	1	సౌదీ అరేబియా	0
సురెజ్ (23వ నిమిషం)			

సురెజ్ గోల్ చేసిందిలా..

మెరిసిన సురెజ్

సౌదీపై ఉరుగ్వే విజయం

రొస్తొవ్–ఆన్–డాన్: వరుసగా రెండో విజయంతో ఉరుగ్వే ప్రపంచకప్ నాకౌట్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఉరుగ్వే 1-0తో సౌదీ అరేబియాను ఓడించింది. గోల్‌తో ఉరుగ్వేను గెలిపించిన స్టార్ స్ట్రైకర్ లూయిస్ సురెజ్ తన 100వ అంతర్జాతీయ మ్యాచ్‌ను చిరస్మరణీయంగా మార్చుకున్నాడు. ఉరుగ్వే తొలి మ్యాచ్‌లో ఈజిప్ట్‌పై 1-0తో గెలిచిన సంగతి తెలిసిందే. ఆరంభ మ్యాచ్‌లో రష్యా చేతిలో 0-5తో ఓడిపోయిన సౌదీ ఈసారి మెరుగైన ప్రదర్శనే చేసింది. ఉరుగ్వేకు పోటీ ఇచ్చింది. కానీ గోల్‌కీపర్ మహ్మద్ అల్ ఒవైస్ చేసిన పొరపాటుకు మూల్యం చెల్లించుకుంది. ఇప్పటివరకు ప్రపంచకప్‌లలో 12 మ్యాచ్‌లు ఆడిన సౌదీ ఒక్కటీ నెగ్గలేదు. మ్యాచ్ ఆరంభంలో సౌదీ రక్షణశ్రేణి.. ఉరుగ్వేను చాలా గట్టిగా ప్రతిఘటించింది. ఐతే 23వ నిమిషంలో అల్ ఒవైస్ తప్పిదంతో సురెజ్ అలవోకగా గోల్ కొట్టి ఉరుగ్వేను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఉరుగ్వే ఆటగాడు కార్లోస్ శాంచెస్ కొట్టిన కార్నర్‌ను అందుకునేందుకు ఒవైస్ ముందుకు రాగా అది అతడికి అందలేదు. అతడి వెనకే పొంచి ఉన్న సురెజ్ దగ్గరకు వచ్చిన బంతిని గోల్‌కీపర్ అడ్డుగాలేని నెట్లోకి అలవోకగా తన్నేశాడు. మూడు ప్రపంచకప్‌లలో స్కోర్ చేసిన తొలి ఉరుగ్వే ఆటగాడిగా సురెజ్ ఘనత సాధించాడు. ఆ తర్వాత ఉరుగ్వే కొన్ని అవకాశాలు సృష్టించుకున్నా మరో గోల్ సాధించలేకపోయింది. ముగింపు దశలో బంతి ఎక్కువ తన నియంత్రణలోనే ఉంచుకున్నా సౌదీ అరేబియా జట్టు.. స్కోరు సమం చేయలేకపోయింది.

పిల్లి జోస్యం నిజమైంది

మాస్కో: అచిలీస్ జోస్యం మరోసారి నిజమైంది. ఆరంభ మ్యాచ్‌లో సౌదీ అరేబియాపై ఆతిథ్య రష్యా గెలుస్తుందని చెప్పిన ఈ చెవిటి పిల్లి.. రష్యా రెండో మ్యాచ్ ఫలితాన్ని సరిగ్గానే ఊహించింది. అది సూచించినట్లే ఈజిప్ట్‌పై రష్యా గెలిచింది. రష్యా నాకౌట్‌కు అర్హత సాధించడంతో ఇప్పుడందరి దృష్టి దానిపైనే పడింది.

భారత్ తొలి సిరీస్ వెస్టిండీస్‌తో...

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్

దుబాయ్: మొట్టమొదటి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా భారత్ తన తొలి సిరీస్ కోసం వెస్టిండీస్‌లో పర్యటించనుంది. 2018-23 కాలానికి ఐసీసీ బుధవారం.. భవిష్య పర్యటన ప్రణాళికను ప్రకటించింది. డబ్ల్యూటీసీలో భాగంగా భారత్ విండీస్‌లో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడుతుందని ఐసీసీ తెలిపింది. మొత్తంగా టాప్-9 టెస్టు జట్లు డబ్ల్యూటీసీలో పోటీపడతాయి. ఈ టోర్నీ 2019 జులై 15 నుంచి 2021 ఏప్రిల్ 30 వరకు జరుగుతుంది. 2019 ప్రపంచకప్ ముగిసిన వెంటనే భారత జట్టు కరీబియన్ పర్యటనకు వెళ్తుంది. ఊహించినట్లే డబ్ల్యూటీసీలో భారత్, పాకిస్థాన్‌లు తలపడబోవట్లేదు. ఐతే ఫైనల్లో తలపడే అవకాశమైతే ఉంది. టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ మొత్తం 18 మ్యాచ్‌లు ఆడనుంది. అందులో 12 ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌లతోనే కావడం విశేషం. 2020 మార్చి 1 నుంచి 2022 మార్చి 31 వరకు 13 జట్లతో వన్డే లీగ్ జరగనుంది.

పోర్చుగల్ విజయం • మొరాకో ఔట్

మాస్కో

రొనాల్డో మళ్లీ మెరిశాడు. పోర్చుగల్‌కు విజయాన్నందించాడు. రొనాల్డో కొట్టిన గోల్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 1-0తో మొరాకోను ఓడించింది. దీంతో ఆ జట్టు 4 పాయింట్లతో గ్రూప్-బిలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. 1998 తర్వాత తొలిసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించిన మొరాకో.. వరుసగా రెండో ఓటమితో నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది. లుజ్నికి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో మొరాకో లోతైన డిఫెన్స్‌తో బరిలోకి దిగింది. కానీ తిరుగులేని ఫామ్‌లో ఉన్న రొనాల్డోకు ఆ రక్షణశ్రేణిని ఛేదించడానికి ఎంతో సమయం పట్టలేదు. నాలుగో నిమిషంలోనే గోల్ కొట్టి పోర్చుగల్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఓ చక్కని హెడర్‌తో అతడు మొ రాకో గోల్‌కీపర్ మహ్మాదీని బోల్తా కొట్టించాడు. కాసేపటికే రొనాల్డో మరో గోల్ కొట్టినంత పనిచేశాడు. కానీ అతడి కిక్ గోల్ పోస్ట్‌కు కాస్త పక్క నుంచి వెళ్లింది. కానీ మొరాకో కూడా బలంగా పుంజుకుంది. గట్టిగా పోరాడింది. బలమైన డిఫెన్స్‌తో మరో గోల్ కొట్టకుండా పోర్చుగల్‌ను అడ్డుకోవడమే కాదు.. తాను కూడా ఎటాకింగ్‌కు దిగింది. పదో నిమిషంలో మొరాకో ఆటగాడు డా కోస్టా గోల్ చేసేవాడే. పెనాల్టీ కార్నర్‌ను జియెచ్ గాల్లోకి కొట్టగా.. కోస్టా హెడర్‌ను పోర్చుగల్ గోల్‌కీపర్ పాట్రిసియో చక్కగా అడ్డుకున్నాడు. విరామం తర్వాత కూడా మ్యాచ్ పోటాపోటీగా సాగింది. 57వ నిమిషంలో బెలందా హెడర్‌ను పాట్రిసియో కుడివైపు దూకుతూ అద్భుతంగా అడ్డుకోకపోతే మొరాకో స్కోరు సమం చేసేదే. తర్వాత రెండు జట్లూ అవకాశాలు సృష్టించుకున్నా ఆఖరి వరకూ గోల్స్ కొట్టలేకపోయాయి. మొరాకోనే బంతిని ఎక్కువగా నియంత్రణలోనే ఉంచుకోవడం విశేషం. తొలి మ్యాచ్‌లో ఇరాన్ చేతిలో ఓడిన ఆ జట్టుకు ఈ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయడం ఊరటనిచ్చే విషయమే. పోర్చుగల్ తన తర్వాతి మ్యాచ్‌లో ఈ నెల 25న ఇరాన్‌తో తలపడుతుంది.

పోర్చుగల్	1	మొరాకో	0
క్రిస్టియానో రొనాల్డో (4వ ని)			

అభిమానులే శుభ్రం చేశారు

మ్యాచ్ ముగియగానే ఎంత తొందరగా ఇళ్లకు పోదామా అని ఎదురు చూస్తారు ప్రేక్షకులు. కానీ జపాన్ అభిమానులు మాత్రం ఇందుకు భిన్నంగా కొలంబియాతో మ్యాచ్ ముగిశాక తాము కూర్చున్న స్టాండ్స్‌ను శుభ్రం చేశారు. తినగా మిగిలిన ఆహార పదార్థాలు, నీళ్ల సీసాలు, కప్పులను జపాన్ అభిమానులు చెత్తబుట్టలో వేశారు. పోలెండ్‌తో మ్యాచ్ అనంతరం సెనగల్ అభిమానులూ ఇలానే స్టేడియాన్ని శుభ్రపరిచారు.

ఫుట్‌బాలర్లతో పిల్లల్ని కనండి

ప్రకటనపై బర్గర్ కింగ్ క్షమాపణ

మాస్కో: బర్గర్ కింగ్ ఆహార సంస్థ రష్యా ప్రజలను మన్నించమని కోరింది. ప్రపంచకప్ ఫుట్‌బాల్ జట్ల ఆటగాళ్ల ద్వారా గర్భందాల్చే రష్యా మహిళలకు జీవితాంతం వూపర్స్ (చాక్లెట్ బర్గర్లు) ఉచితంగా ఇస్తామని ప్రకటించిన బర్గర్ కింగ్ ఆ ప్రకటన చేసినందుకు క్షమాపణలు కోరింది. "ఉత్తమ ఫుట్‌బాల్ ఆటగాళ్ల ద్వారా పిల్లలకు జన్మనిచ్చి రష్యా ఫుట్‌బాల్ భవితవ్యాన్ని మెరుగ్గా తీర్చిదిద్దండి. అలాంటి మహిళలకు జీవితాంతం వూపర్స్‌ను ఉచితంగా అందిస్తాం" అని బర్గర్ కింగ్ తన సామాజిక మాధ్యమాల ఖాతాల్లో పోస్టు చేసింది. అయితే దీనిపై తీవ్ర విమర్శలు చెలరేగడంతో ఆ పోస్టును తొలగించడమే కాకుండా మన్నించమని కోరింది.

ప్రపంచకప్‌లో ఈనాడు

	గ్రూప్		సమయం
డెన్మార్క్	గ్రూప్-సి	ఆస్ట్రేలియా	సా॥ 5.30
ఫ్రాన్స్	గ్రూప్-సి	పెరూ	రాత్రి 8.30
అర్జెంటీనా	గ్రూప్-డి	క్రొయేషియా	రాత్రి 11.30

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

ఇరాన్ మహిళలు ఇక స్టేడియాలకు...

టెహ్రాన్: ఫుట్‌బాల్ ప్రపంచకప్.. దేశాల మధ్య అంతరాలను దూరం చేస్తోంది. అభిమానుల మధ్య ప్రేమనూ పెంచుతోంది. ఇప్పుడు అదే ఫుట్‌బాల్ ప్రపంచకప్ వల్ల 1979 తర్వాత తొలిసారిగా ఇరాన్‌లోని మహిళలు స్టేడియాలకు వచ్చి మ్యాచ్‌లు చూసే అవకాశం లభించింది. ఇరాన్‌లో మహిళలు స్టేడియాలకు వచ్చి మ్యాచ్‌లు చూడడం నిషేధం. అయితే ప్రస్తుత ప్రపంచకప్‌లో తన తొలి మ్యాచ్‌లో ఇరాన్ 1-0తో మొరాకోపై విజయం సాధించింది. ఆ విజయం తర్వాత టెహ్రాన్‌లోని వీధులన్నీ సంబరాలు చేసుకుంటున్న అభిమానులతో నిండిపోయాయి. దాంతో టెహ్రాన్‌లోని స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరల ద్వారా బుధవారం తమ దేశం ఆడే రెండో మ్యాచ్‌ను చూడడానికి అక్కడి ప్రభుత్వం మహిళలకు అనుమతిచ్చింది. దాంతో టెహ్రాన్‌లోని లక్ష మంది సామర్థ్యం ఉన్న స్టేడియంలో మహిళలు కనిపిస్తున్నారు. "ఈ నిర్ణయం సంతోషాన్నిస్తోంది. ఇరాన్, పోర్చుగల్ జట్ల మధ్య మ్యాచ్ కూడా ఇదే స్టేడియంలో చూసే అవకాశం కల్పిస్తారని నమ్ముతున్నా. ఈ నిర్ణయంతో కుటుంబాలతో కలిసి చాలా మంది మ్యాచ్‌లు చూడడానికి వస్తారు" అని ఇరాన్ మహిళా ఎంపీ సివోశి తెలిపింది.

హాకీని జాతీయ క్రీడగా గుర్తించండి

ప్రధానికి నవీన్ పట్నాయక్ విజ్ఞప్తి

దిల్లీ: హాకీ.. భారత జాతీయ క్రీడ! కొన్నేళ్లుగా అనుకుంటున్నదిదే. ఐతే అధికారికంగా మాత్రం అలా ఎక్కడా లేదు. ఈ విషయం తెలిసి ఆశ్చర్యపోయిన ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్.. జాతీయ క్రీడగా హాకీకి అధికారిక గుర్తింపును ప్రసాదించాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. నవంబరులో జరిగే హాకీ ప్రపంచకప్‌నకు ఒడిశా ఆతిథ్యమిస్తోంది. ఆ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సమయంలో హాకీకి గుర్తింపు లేదన్న సంగతి నవీన్ పట్నాయక్‌కు తెలిసింది. హాకీకి అధికారిక గుర్తింపును ఇవ్వడం ద్వారా దేశానికి గర్వకారణంగా నిలిచిన ఆటగాళ్లను గౌరవించినట్లవుతుందని ప్రధానికి రాసిన లేఖలో నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు.

యోయో పాసైన రోహిత్

దిల్లీ: టీమ్‌ఇండియా పరిమిత ఓవర్ల జట్టు వైస్‌కెప్టెన్ రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై నెలకొన్న అనుమానాలను పటాపంచలు చేశాడు. బుధవారం బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో యోయో టెస్టుకు హాజరైన రోహిత్ విజయవంతంగా పూర్తి చేశాడు.

ఆసీస్ సగమైనా కొట్టలేదు

ఇంగ్లాండ్‌దే వన్డే సిరీస్

నాటింగ్‌హమ్: గెలవాలంటే 482 పరుగులు చేయాలి. వన్డేల్లో ప్రపంచ రికార్డు సృష్టించాలి. ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో ఆస్ట్రేలియా ముందున్న సమీకరణం ఇది. కానీ ఆ జట్టు పోరాటం సగానికి కూడా చేరలేదు. భారీ లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 37 ఓవర్లలో 239 పరుగులకే కుప్పకూలింది. 242 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన ఇంగ్లాండ్. . ఐదు వన్డేల సిరీస్‌ను మరో రెండు వన్డేలు ఉండగానే సొంతం చేసుకుంది. టిమ్ హెడ్ (51; 39 బంతుల్లో 7×4) రాణించడంతో మొదట ఆసీస్ ధాటిగానే ఇన్నింగ్స్ ఆరంభించింది. ఐతే మొయిన్ అలీ (3/28), రషీద్ (4/47) విజృంభించడంతో ఆసీస్ జట్టు వేగంగా వికెట్లు కోల్పోయింది. అంతకుముందు బెయిర్‌స్టో (139), హేల్స్ (147) మెరుపు వేగంతో సెంచరీలు చేయడంతో ఇంగ్లాండ్ (481/6) వన్డేల్లో అత్యధిక స్కోరు చేసిన సంగతి తెలిసిందే.

జాతీయ అవార్డులకు ఇక స్వీయ ప్రతిపాదన

- ప్రభుత్వ ఉపాధ్యాయులకు కేంద్ర మంత్రి వెల్లడి

దిల్లీ: దేశంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు ఇక జాతీయ అవార్డులకు నేరుగా తమ ప్రతిపాదనలను పంపించుకోవచ్చని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ బుధవారం వెల్లడించారు. గతేడాది వరకూ రాష్ట్ర ప్రభుత్వాలే ఎంపిక చేసి ఈ ప్రతిపాదనలు పంపించేవి. ఇకపై ఎవరికి వారే ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు పంపిచుకునేలా కొత్త విధానాన్ని రూపొందించినట్లు మంత్రి తెలిపారు. అందిన ప్రతిపాదనల్లో.. తొలుత ప్రతి జిల్లా నుంచి ముగ్గురిని, అనంతరం ప్రతి రాష్ట్రానికి ఆరుగురిని ఎంపిక చేస్తారు. చివరకు 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులు/ప్రిన్సిపాళ్లను జాతీయస్థాయిలో ఏర్పాటైన స్వతంత్ర న్యాయనిర్ణయ సంఘం (జ్యూరీ) ఎంపిక చేస్తుందని మంత్రి వివరించారు. ప్రతిపాదనలు పంపించే ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణకు సంబంధించిన వీడియోలను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల బోధన విధానం, నవ్యాలోచనలు, విద్యావిధానంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందని మంత్రి వివరించారు.

బెంగళూరులో మరోసారి కేజ్రీవాల్‌కు చికిత్స

దిల్లీ: ప్రకృతి వైద్యం నిమిత్తం దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరోసారి బెంగళూరుకు వెళ్లనున్నారు. గురువారం నుంచి పదిరోజుల పాటు ఆయన అక్కడే ఉంటారు. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయంలో 9 రోజులపాటు నిరసన తెలిపి, మంగళవారం దానిని విరమించిన ఆయన అనారోగ్యానికి గురయ్యారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పెట్రోలు ధరలు తగ్గించాలని వామపక్షాల ధర్నా

దిల్లీ: పెట్రోలు, డీజిల్‌ల ధరలు తగ్గించాలని డిమాండు చేస్తూ బుధవారం ఇక్కడి పార్లమెంటు స్ట్రీట్‌లో వామపక్షాలు ధర్నా చేశాయి. సీపీఎం, సీపీఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పీ, సీపీఐ(ఎంఎల్), ఎస్‌యూసీఐ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. సీపీఎం నాయకురాలు బృందా కారాట్ మాట్లాడుతూ సామాన్యుల కోసం మోదీ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని విమర్శించారు. మొత్తం దక్షిణాసియాలో ఒక్క భారత్‌లోనే పెట్రోలు ధరలు అధికంగా ఉన్నాయని అన్నారు.

పుణెలోని డీఆర్‌డీఓ ప్రయోగశాలలో పేలుడు

- ఓ కార్మికుడి మృతి

పుణె: మహారాష్ట్రలోని పుణెలో ఉన్న రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ప్రయోగశాలలో పేలుడు చోటుచేసుకుంది. ఘటనలో ఓ కార్మికుడు మృతిచెందగా.. మరొకరు గాయపడ్డారు. 'అధిక శక్తి పదార్థ పరిశోధక ప్రయోగశాల (హెచ్‌ఈఎమ్ఆర్ఎల్)'లో మంగళవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. విధ్వంసక పదార్థాన్ని కార్మికులు ముక్కలుగా చేస్తున్నప్పుడు పేలుడు సంభవించినట్లు పేర్కొన్నారు. లక్ష్మీకాంత్ సోనావానె (26) అనే కాంట్రాక్టు ఉద్యోగి.. ఆసుపత్రికి తరలించేలోపే మృత్యువాతపడ్డట్లు వివరించారు.

డీఎన్ఏ పరీక్షల కోసం సీసీఎంబీకి గీత రక్తనమూనాలు

ఇండోర్: దాదాపు 15 ఏళ్లపాటు పాకిస్థాన్‌లో జీవించి 2015లో తిరిగి స్వదేశానికి చేరుకున్న భారతీయ బధిర యువతి గీత రక్తనమూనాలను డీఎన్ఏ పరీక్షల కోసం తాజాగా హైదరాబాద్‌లోని 'సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ(సీసీఎంబీ)'కి పంపించారు. విదేశాంగశాఖ ఆదేశాలమేరకు ప్రస్తుతం రక్తనమూనాలను సీసీఎంబీకి పంపించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. గీత తల్లిదండ్రులెవరో ఇప్పటికీ గుర్తించలేకపోయిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

మెదడు తరంగాలే రోబోలకు ఆదేశాలు

బోస్టన్: చేతి సైగలు, మెదడు తరంగాలతో రోబోలను నియంత్రించేందుకు తోడ్పడే అధునాతన సాంకేతికతను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మరమనుషులు తప్పులు చేయకుండా అడ్డుకోవడానికి ఇది ఉపయోగపడే అవకాశముంది. యంత్ర అభ్యాస పరిజ్ఞానంతో అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నిపుణులు ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారు. వేల కొద్దీ ఈఈజీ, ఈఎంజీ స్కానింగ్ చిత్రాలతో దీనికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతో మెదడు తరంగాలను విశ్లేషించే సామర్థ్యం దీని సొంతమైంది. కండరాల చర్యలు, చేతి సంకేతాలను విశ్లేషించే పరిజ్ఞానాన్ని దీనికి జోడించారు. ఇదివరకు పరిచయంలేని వ్యక్తుల మెదడు తరంగాలను సైతం ఈ పరిజ్ఞానం సాయంతో రోబోలు చక్కగా చదవగలగడం విశేషం. 'ఇప్పటివరకూ రోబోలు మన మెదడు తరంగాలు చదవాలంటే మనం ప్రత్యేక ఆలోచనా విధానాలపై శిక్షణ తీసుకోవాలి. తాజా పరిశోధనలో ఈ సమస్యను అధిగమించాం.' అని పరిశోధకులు డేనియేలా రస్ తెలిపారు.

చర్చలో ఎవరు నెగ్గుతారో అల్గారిథమ్ చెప్పేస్తుంది

వాషింగ్టన్: చర్చలో ఎవరు నెగ్గుతారో ముందుగానే అంచనావేసే సరికొత్త అల్గారిథమ్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. అమెరికాలోని నార్త్‌ఈస్టర్న్ వర్సిటీ నిపుణులు దీన్ని అభివృద్ధిచేశారు. భాషా పరమైన సమాచార విశ్లేషణ, కృత్రిమ మేధస్సు తదితర పరిజ్ఞానాలను దీనిలో ఉపయోగించారు. ఆక్స్‌ఫర్డ్ తరహా 188 చర్చాగోష్ఠిలను ఆధారంగా దీన్ని తీర్చిదిద్దారు. 74 చర్చల్లో విజేతలను ఇది ముందుగానే గుర్తించడం విశేషం. ఫేస్‌బుక్, ట్విటర్ లాంటి వేదికలపై చర్చల్లో నాణ్యతను అంచనా వేసేందుకు ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుందని పరిశోధకులు లీ వాంగ్ తెలిపారు.

నవ్వే ఫొటోలతో నకిలీలకు చెక్

లండన్: పళ్లు బయటపెట్టి నవ్వినప్పుడు మనం తీసుకునే ఫొటోలు ఇతరులతో సరిపోలే అవకాశం చాలా తక్కువని తాజా అధ్యయనంలో తేలింది. ఇలా తీసుకొనే ఫొటోలతో నకిలీ గుర్తింపు కార్డులకు చెక్‌పెట్టొచ్చని వెలుగులోకి వచ్చింది. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లతో మార్పులు చేస్తున్న ఫొటోలు.. మన కళ్లతోపాటు స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లనూ బురిడీ కొట్టిస్తున్నాయి. దీంతో మన ఫొటోలను ఇతరులు ఉపయోగించుకోలేకుండా చేసే విధానాలపై దృష్టి కేంద్రీకరిస్తూ బ్రిటన్‌లోని యార్క్ వర్సిటీ నిపుణులు తాజా పరిశోధన చేపట్టారు. 40 మంది దీనిలో పాల్గొన్నారు. భిన్నరకాల 60 ఫొటోలను వీరికిచ్చి గుర్తుపట్టమన్నారు. అనంతర విశ్లేషణలో నవ్వినప్పుడు తీసుకునే చిత్రాలు ఇతరులతో సరిపోలే అవకాశం తక్కువగావున్నట్లు గుర్తించారు. గుర్తింపు కార్డులను తీసుకునే సమయంలో పళ్లు బయటపెట్టిన చిత్రాలు ఉపయోగిస్తే వీటి దుర్వినియోగాన్ని అడ్డుకునే అవకాశముందని పరిశోధనలో పాలుపంచుకున్న మిలేవా తెలిపారు.

ఆహార భద్రత ఘనత రైతులదే

- వారి ఆదాయాన్ని రెట్టింపు చేసి తీరుతాం
- వ్యవసాయ బడ్జెట్టు గణనీయంగా పెంచాం
- మునుపటి ప్రభుత్వాలు కర్షకుల్ని విస్మరించాయి
- నమో యాప్ ద్వారా వ్యవసాయదారులతో ముచ్చటించిన ప్రధాని

దిల్లీ: దేశానికి ఆహార భద్రత కల్పిస్తున్న ఘనత రైతులదేననీ, ఆ విషయంలో పూర్తి ఖ్యాతి వారికే దక్కుతుందనీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. అంతటి కీలకపాత్ర పోషిస్తున్న రైతుల్ని ప్రభుత్వాలు మొదటి నుంచీ వారి మానాన వారిని వదిలేశాయనీ, దానివల్ల వ్యవసాయదారుల ఆదాయం పడిపోతూ వచ్చిందనీ విమర్శించారు. తమ ప్రభుత్వానికి రైతులపై పూర్తి విశ్వాసం ఉందనీ, 2022 నాటికి వారి ఆదాయాన్ని రెట్టింపు చేసి తీరుతామనీ పునరుద్ఘాటించారు. బుధవారం 'నరేంద్ర మోదీ యాప్' ద్వారా 600కి పైగా జిల్లాలకు చెందిన రైతులతో ప్రత్యక్ష ప్రసార సదస్సు విధానంలో ప్రధాని ముచ్చటించారు. విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల అమ్మకం వరకు వివిధ దశల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుని ఏ విధంగా రైతుల్ని ఆదుకుంటున్నదీ వివరించారు.

ఆదాయం పెంచుతామంటే చాలా మంది నవ్వారు: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, విద్యుత్తు, మార్కెట్లు... వీటన్నింటినీ ఒక విస్తృత విధానం ద్వారా రైతులకు ఇవ్వడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచబోతున్నామని ప్రధాని చెప్పారు. '2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని మేం నిర్ణయించి, దాని గురించి వివరించగానే చాలామంది నవ్వారు. అది సాధ్యమే కాదని పెదవి విరిచారు. నాకు మాత్రం రైతులపై నమ్మకం ఉండడంతో ఈ లక్ష్య సాధనకు ముందడుగు వేస్తున్నాం. పెట్టుబడి వ్యయం తగ్గించుకోవడం, పండిన పంటకు తగిన ధర కల్పించడం, పంట కోత అనంతర నష్టాలను తగ్గించడం, ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల్ని సృష్టించడం... ఈ నాలుగు స్తంభాల ద్వారా మేం లక్ష్యాన్ని చేరుకుంటాం. ఉత్పత్తి వ్యయంపై కనీసం 1.5 రెట్లు మేర ఆదాయం రైతుకు వచ్చేలా ప్రస్తుత ఆర్థిక సంవత్సర కనీస మద్దతు ధరల్ని ప్రకటించాం' అని మోదీ వివరించారు.

బడ్జెట్టు రెట్టింపు చేశాం: మునుపటి ప్రభుత్వ హయాంలో అయిదేళ్లలో వ్యవసాయ రంగంపై రూ.1.21 లక్షల కోట్లు కేటాయిస్తే 2014-19 మధ్య తాము దీనిని దాదాపు రెట్టింపు చేసి రూ.2.12 లక్షల కోట్లకు చేర్చామని చెప్పారు. రైతు సంక్షేమానికి తమకున్న కట్టుబాటును ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో మునుపెన్నడూ లేని వృద్ధి సాధించడం వల్ల దేశంలో పంట దిగుబడులు 2017-18లో 28 కోట్ల టన్నుల్ని చేరుకున్నాయని చెప్పారు. ఆహార ధాన్యాలతోపాటు పండ్లు, పాలు, కూరగాయల దిగుబడులు బాగా వృద్ధి చెందాయన్నారు. దళారుల వ్యవస్థను రూపుమాపడానికి ఇ-నామ్ ఆన్‌లైన్ వేదికను ప్రారంభించామని చెప్పారు. పంట బీమా పరిధినీ పెంచామన్నారు.

కశ్మీర్‌పై మోదీ విధానం సరైనదే

- కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ స్పష్టీకరణ
- సమస్య ఈనాటిది కాదని వెల్లడి

దిల్లీ: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కశ్మీర్ విధానం సరైనదేనని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. కశ్మీర్ సమస్య ఈనాటిది కాదని, ఎప్పటి నుంచో ఉందని గుర్తు చేశారు. కశ్మీర్‌లోయలో శాంతి, అభివృద్ధికి భాజపా చేయాల్సినదంతా చేసిందన్నారు. 'ద వీక్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ కశ్మీర్ విధానం బలహీనపడుతోందా అని ప్రశ్నించగా రాజ్‌నాథ్ స్పందిస్తూ "లేదు, మోదీ కశ్మీర్ విధానం సరైనదే. అందులో సందేహం లేదు. పరిస్థితులు చక్కబడడానికి సమయం పడుతుంది. సమస్య ఇవాల్టిదో, నిన్నటిదో కాదు." అని బదులిచ్చారు. ముఫ్తీ మహ్మద్ సయీద్, మెహబూబా ముఫ్తీ మధ్య పోలికలు తీసుకురాకూడదని, మెహబూబా కూడా ప్రయత్నించారని, కశ్మీర్ సమస్య చాలా పాతదని, అన్ని ప్రభుత్వాలకూ ప్రధాన సవాలేనని చెప్పారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదమే ప్రధాన సవాలన్నారు. కాల్పుల విరమణ నిర్ణయం తప్పిదమని భావిస్తున్నారా అని ప్రశ్నించగా లేదన్నారు. ప్రభుత్వం దాన్ని కాల్పుల విరమణ అని చెప్పలేదని, నెల పాటు సైనిక చర్యల నిలిపివేత మాత్రమేనని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌లో మాజీ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్న ప్రచారంపై అడగగా అవునంటూ ఇమ్రాన్‌కు పాకిస్థాన్ సైన్యం మద్దతిస్తోందని చెప్పారు.

అమెరికా వెళ్లిపోనున్న అరవింద్ సుబ్రమణియన్

- ప్రధాన ఆర్థిక సలహాదారు బాధ్యతల నుంచి వైదొలగాలని నిర్ణయం
- కుటుంబ అవసరాలే కారణం

దిల్లీ: ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తన బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. తప్పనిసరి కుటుంబ అవసరాల కారణంగా తిరిగి ఆయన అమెరికా వెళ్లిపోతున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం ఫేస్‌బుక్‌లో వెల్లడించారు. 2014, అక్టోబరు 16న సుబ్రమణియన్‌ను ఆర్థిక మంత్రిత్వశాఖలో మూడేళ్ల కాలానికి ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియమించారు. 2017లో పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగించారు. ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టకముందు అమెరికాలోని పీటర్‌సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్స్‌లో డెనిస్ వెదర్‌స్టోన్ సీనియర్ ఫెలోగా, సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌లో సీనియర్ ఫెలోగా పని చేశారు. ప్రధాన ఆర్థిక సలహాదారు బాధ్యతలు మునుపెన్నడూ లేనంత సంతృప్తినిచ్చాయని సుబ్రమణియన్ బుధవారం ట్విటర్‌లో పేర్కొంటూ జైట్లీకి ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ నిర్వహించని మంచి బాధ్యతలు నిర్వహించానన్నారు. మంచి జ్ఞాపకాలతో అమెరికా వెళ్తానని చెప్పారు. భవిష్యత్తులోనూ దేశానికి సేవలు చేసేందుకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. అమెరికా ఎప్పుడు వెళ్తున్నారని ప్రశ్నించగా కచ్చితమైన తేదీ ఇంకా నిర్ణయం కాలేదని, ఒకటి రెండు నెలల్లో వెళ్లవచ్చని అన్నారు.

ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు 'జామ్'(జన్‌ధన్, ఆధార్, మొబైల్)ను డేటాబేస్‌గా వినియోగించాలన్న యోచన సుబ్రమణియన్‌దేనని, సమాఖ్య వ్యవస్థ సహకారపూరితానికే పరిమితం కాకుండా పోటీస్ఫూర్తిని ప్రదర్శించగల వ్యవస్థగా ఉండాలన్నది కూడా ఆయన ఆలోచనేనని జైట్లీ చెప్పారు.

ఆయన మేధో సామర్థ్యాన్ని, ఆలోచనలను తాను వ్యక్తిగతంగా కోల్పోతున్నానని అన్నారు. ఆర్థిక సర్వేల్లో విశ్లేషణ నాణ్యతను పెంచారన్నారు. ఈ నాలుగేళ్ల పాటు ఆయన రూపొందించిన ఆర్థిక సర్వేలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయని, దేశవ్యాప్తంగా ఇప్పుడవి బోధనాంశాలని అన్నారు. రెవెన్యూ న్యూట్రల్ రేట్‌కు ఆయన రూపకల్పన చేశారని, ఫలితంగా జీఎస్‌టీ ప్రవేశపెట్టడానికి అవసరమయిన రాజ్యాంగ సవరణకు కావాల్సిన ఏకాభిప్రాయం సాధ్యమయిందని చెప్పారు. సంపన్నులకు రాయితీలు ఎత్తివేయడం, సార్వత్రిక కనీస ఆదాయం, వాతావరణ మార్పులు వగైరా అంశాలపై సుబ్రమణియన్ భావి ఆలోచనలను పంచుకున్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఆయన తొలి ఆన్‌లైన్ కోర్సును నిర్వహించారు. ప్రభుత్వ ఆన్‌లైన్ విద్యా వేదిక 'స్వయం'ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ ఆన్‌లైన్ వేదికకు మంచి ఆదరణ లభించింది.

భారత్‌పై అవగాహన లేని సుబ్రమణియన్: ఎస్‌జేఎం

దిల్లీ: నూతన ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) భారత్ గురించి తెలిసిన వ్యక్తయి ఉండాలని ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) వ్యాఖ్యానించింది. సీఈఏగా అరవింద్ సుబ్రమణియన్ రాజీనామా చేయడంపై ఎస్‌జేఎం సహ కన్వీనర్ అశ్వనీ మహాజన్ స్పందించారు. 'సుబ్రమణియన్‌కు భారత్‌పై అవగాహన లేదు. ఆయనకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గురించి మాత్రమే తెలుసు. మన ఆర్థిక వ్యవస్థలో ముఖ్య భాగాలైన వ్యవసాయం, రైతులను ఆయన విస్మరించారు. నీతి ఆయోగ్ మాజీ ఛైర్మన్ అరవింద్ పనగడియా మాదిరిగానే ఆయన కూడా 'వాషింగ్టన్ కాన్సెస్' అనే సంస్థ చెప్పిన భావజాలాన్నే చొప్పిస్తున్నారు. ఆయన ఆలోచనలు, అజెండాలో స్పష్టత లేదు. భారతీయ విలువలు, ఆచారాలు, ప్రజల గురించి తెలిసిన వ్యక్తిని, భారత రైతులు, కార్మికులు, పారిశ్రామికవేత్తలపై నమ్మకం ఉండే వారిని తదుపరి సీఈఓగా నియమించాల'ని ట్వీట్‌లో పేర్కొన్నారు.

మునిగే నౌకను విడిచిపెడుతున్న నిపుణులు: రాహుల్

దిల్లీ: మునిగే నౌకను విడిచిపెట్టి నిపుణులు పారిపోతున్నారంటూ అరవింద్ సుబ్రమణియన్ రాజీనామాపై వ్యాఖ్యానిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. 'ఆర్థిక శాఖ (మాజీ?) మంత్రి తాళం వేసిన గదిలో ఉండి ఫేస్‌బుక్‌లో తాజా వార్తలు పంపుతున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ తాళాలు భాజపా కోశాధికారి చేతిలో ఉన్నాయి. ఆర్ఎస్ఎస్‌లోని అదృశ్య హస్తాలు నౌకను రాళ్లవైపు తీసుకెళ్తున్నాయి. దాంతో మునిగే నౌకను విడిచి నిపుణులు పారిపోతున్నారు' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

సలానీలో అమర జవాను ఔరంగజేబ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్

కశ్మీర్‌లో అమర జవాను కుటుంబాన్ని పరామర్శించిన నిర్మల సీతారామన్

జమ్ము: కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రవాదుల చేతిలో హత్యకు గురైన జవాను. . కుటుంబ సభ్యులను రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ పరామర్శించారు. సీనియర్ సైనిక అధికారులతో కలిసి.. పూంచ్ జిల్లాలోని మారుమూల పల్లెటూరు సలానీలో ఉన్న అమర జవాను ఔరంగజేబ్ ఇంటికి ఆమె బుధవారం వెళ్లారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈద్ జరుపుకొనేందుకు జూన్ 14న ఇంటికి వస్తున్న ఔరంగజేబ్‌ను దక్షిణ కశ్మీర్‌లో ఉగ్రవాదులు అపహరించుకుపోయి హత్యచేశారు. ఔరంగజేబ్ త్యాగం దేశానికే ఆదర్శప్రాయమని నిర్మల కొనియాడారు. ఈ సందేశాన్ని పౌరులందరికీ వినిపించేందుకే ఆయన ఇంటిని సందర్శించానని చెప్పారు.

ఉగ్రవాదుల కాల్పుల్లో పోలీస్ మృతి

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు గాయపడ్డారు. శ్రీనగర్-జమ్ము జాతీయ రహదారిలోని గల్లందర్ వద్ద బుధవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు వ్యానులో వెళ్తుండగా ముష్కరులు ఈ దారుణానికి తెగించారు.

సమతౌల్య అభివృద్ధిని అడ్డుకున్న ప్రభావ వర్గాలు: అమిత్ షా

దిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని మూడు ప్రాంతాల్లో నిష్పక్షపాత, సమతౌల్య అభివృద్ధికి తమ పార్టీ చేస్తున్న కృషిని రాష్ట్రంలోని కొన్ని ప్రభావ వర్గాలు (ప్రెజర్ గ్రూప్స్) అడ్డుకున్నాయని భాజపా అధ్యక్షుడు అమిత్ షా బుధవారం ఆరోపించారు. కశ్మీర్ లోయలో శాంతిభద్రతలు క్షీణించడం కూడా తాము ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడానికి ఒక కారణమని చెప్పారు. మద్దతు ఉపసంహరణ నిర్ణయాన్ని 2019 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకోలేదని స్పష్టం చేశారు.

జమ్ము కశ్మీర్ ప్రధాన కార్యదర్శిగా బి.వి.ఆర్.సుబ్రమణ్యం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఛత్తీస్‌గఢ్ కేడర్ ఐఏఎస్ అధికారి బి.వి.ఆర్.సుబ్రమణ్యం నియమితులయ్యారు. ఇప్పటి వరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బి.బి.వ్యాస్, నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాల నిపుణుడు, సూపర్‌కాప్‌గా పేరున్న కె.విజయ్‌కుమార్‌లు గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రాకు సలహాదారులుగా నియమితులయ్యారు. సుబ్రమణ్యం ఛత్తీస్‌గఢ్ అదనపు ప్రధాన కార్యదర్శి (హోం వ్యవహారాలు)గా ఉన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఛైర్మన్ అరెస్టు

మరో ఇద్దరు బ్యాంకు అధికారులు.. మాజీ సీఎండీ కూడా..

పుణె: రుణాల మంజూరులో భారీ అక్రమాలకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఛైర్మన్ రవీంద్ర పి. మరాఠే అరెస్టయ్యారు. బుధవారం రవీంద్రతో పాటు బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర కె.గుప్తా, జోనల్ మేనేజర్ నిత్యానంద్ దేశ్‌పాండే (అహ్మదాబాద్), మాజీ సీఎండీ సుశీల్ ముహ్నోత్ (జయపుర)లను కూడా ఆర్థిక నేరాల నిరోధక విభాగం (ఈఓడబ్ల్యు) అదుపులోకి తీసుకుంది. పుణేకు చెందిన డీఎస్‌కే గ్రూప్ కంపెనీలకు అక్రమ పద్ధతుల్లో రూ.3వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసిన కేసులో వీరు నిందితులు. డీఎస్‌కే గ్రూప్‌నకు చెందిన ఇద్దరు ప్రతినిధులు, ఛార్టర్డ్ అకౌంటెంట్‌లను కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాథు లా మార్గంలో చైనాలోకి మానససరోవర్ యాత్రికుల ప్రవేశం

గ్యాంగ్‌టక్: మానససరోవర్‌కు వెళ్లే భారతీయ యాత్రికుల బృందం బుధవారం నాథు లా మార్గంలో చైనాలోకి ప్రవేశించింది. గతేడాది డోక్లామ్‌లో తలెత్తిన ప్రతిష్టంభన అనంతరం భారతీయ యాత్రికులు ఆ దేశ భూభాగంలోకి అడుగుపెట్టడం ఇదే మొదటి సారి. ఈ ఏడాది అనుమతించిన తొలి బ్యాచ్‌లో 31 మంది యాత్రికులతో పాటు ఇద్దరు సమన్వయ అధికారులు ఉన్నారు.

రాహుల్‌తో కమల్‌హాసన్ భేటీ

దిల్లీ, చెన్నై-న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నటుడు, మక్కళ్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్‌హాసన్ బుధవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలను చర్చించారు. 'మేం రాజకీయాలపై చర్చించుకున్నాం. అయితే అవి మీరు అనుకుంటున్న విషయాలపై కాదు' అని ఆయన విలేకరులకు స్పష్టంచేశారు. తమిళనాడులో పొత్తు కుదుర్చుకోవడంపై తాము చర్చించలేదని తేల్చిచెబుతూ ఇది మర్యాదపూర్వక భేటీ మాత్రమేనన్నారు. పార్టీ గుర్తింపునకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతోనూ ఆయన భేటీ అయ్యారు.

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిపై అమెరికా ఆగ్రహం

- ఆ సంస్థ నుంచి వైదొలగుతున్నాం: నిక్కీ హేలీ

వాషింగ్టన్/ఐక్యరాజ్యసమితి: అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యూఎన్‌హెచ్ఆర్‌సీ) పనితీరుపై మరోసారి కన్నెర్ర చేసింది. గత కొన్నాళ్లుగా హెచ్చరిస్తున్నా ఇజ్రాయెల్ పట్ల అనుసరిస్తున్న వివక్షాపూరితవైఖరిని మండలి ఏ మాత్రం మార్చుకోలేదని తీవ్రంగా ఆక్షేపించింది. మండలి నుంచి తమ దేశం వైదొలగుతున్నట్లు ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ ప్రకటించారు. ఇజ్రాయెల్ వ్యతిరేక శక్తులకు యూఎన్ హెచ్ఆర్‌సీ కేంద్రంగా మారిందని ఆమె ఆరోపించారు. అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో తల్లిదండ్రుల నుంచి పిల్లలను వేరు చేయటం 'మతిలేని చర్య' అంటూ యూఎన్ హైకమిషనర్ (మానవహక్కుల మండలి) తీవ్రంగా స్పందించిన మరుసటి రోజే యూఎన్ హెచ్ఆర్‌సీ నుంచి వైదొలగుతున్నట్లు అమెరికా ప్రకటించింది.

ట్రంప్ వలస విధానం క్రూరమైనది

- సత్య నాదెళ్ల ఘాటు విమర్శ
- ఉద్యోగులకు అండగా ఉంటామని ప్రకటన

వాషింగ్టన్: అక్రమ వలసదార్లపై చర్యలు పేరుతో చిన్న పిల్లలను తమ కుటుంబ సభ్యులతో వేరుచేస్తున్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంపై మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల తన బ్లాగులో ఘాటుగా స్పందించారు. అమెరికా ప్రభుత్వ నూతన వలస విధానాన్ని తప్పుపడుతూ అయిదు అంశాలను ప్రస్తావించారు.

- **క్రూర, దోషపూరిత విధానం:** సరిహద్దుల్లో అమలు చేస్తున్న నూతన వలస విధానం క్రూరమైనది. దోషపూరితమైనది. దీన్ని మార్చాలని కోరుతున్నాం. మైక్రోసాఫ్ట్ అధ్యక్షుడు బ్రాడ్ దీనిపై మా సంస్థ వైఖరేమిటో స్పష్టం చేశారు.
- **వలసవాదుల దేశం:** అమెరికా అంటేనే వలసవచ్చినవారి దేశం. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రాంతాలు, మన సంస్థల అభివృద్ధి కోసం ప్రపంచం మొత్తాన్ని ఆకర్షిస్తున్నాం. అలాంటివారందరికీ మనం ఆశాదీపంగా ఉన్నాం. అమెరికా దక్షిణ సరిహద్దు వద్ద వలస వచ్చిన వారి కుటుంబాల నుంచి పిల్లలను విడదీయాలన్న ఆ అసహ్యకర విధానంపై మీ అందరిలాగానే నేనూ భయపడుతున్నాను.
- **నా విజయానికి కారణం వలసే:** నన్ను అమెరికాకు చెందిన రెండు అద్భుత విధానాలు తీర్చిదిద్దాయి. ఒకటి అమెరికా సాంకేతిక పరిజ్ఞానం. ఇది నాకు అందుబాటులోకి రావడం వల్లనే నేను ఎన్నో కలలు కనగలిగాను. రెండోది ఉదారమైన వలస విధానం. దీనివల్లనే నా కలలను నెరవేర్చుకోగలిగాను. వేరే చోట ఎక్కడా నాకిది సాధ్యమయ్యేది కాదు.
- **మైక్రోసాఫ్ట్ ఇందులో భాగస్వామి కాదు:** సరిహద్దుల్లో పిల్లలను వేరు చేసేందుకు అమెరికా ప్రభుత్వం చేపట్టిన ఏ ప్రాజెక్టులోనూ మైక్రోసాఫ్ట్ భాగస్వామి కాబోదని స్పష్టం చేస్తున్నా.
- **వలసలే మన బలం:** వలస విధానం కారణంగానే అమెరికాకు ఎన్నో ప్రయోజనాలు కలిగాయి. దీన్ని పరిరక్షించి, ప్రోత్సహించాలి. ప్రతి ఒక్కరి గౌరవం, మానవహక్కులు కాపాడే వలసవిధానానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం. దీనర్థం మైక్రోసాఫ్ట్‌లో పనిచేసే ప్రతి ఒక్క వలస ఉద్యోగి పక్షాన నిలబడుతామని చెప్పడమే.

రోహిత్ మరణాన్ని రాజకీయం చేసిన విపక్షాలు

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపణ

దిల్లీ: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన దళిత పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల మరణాన్ని ప్రతిపక్షాలు రాజకీయం కోసం వాడుకున్నాయని భాజపా ఆరోపించింది. కాంగ్రెస్, ఇండియన్ ముస్లిం లీగ్ సహా ఇతర పార్టీలు ఆ విషాదకర సంఘటనపై తప్పుడు ప్రచారం చేశాయని బుధవారం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. పార్టీలు నిర్వహించే ర్యాలీలకు హాజరయి, భాజపాపై విమర్శలు చేసినందుకు రూ.20 లక్షలు ఇస్తామని చెప్పిన ఇండియన్ ముస్లింలీగ్... ఆ తరువాత ఆ హామీని పట్టించుకోలేదంటూ రోహిత్ తల్లి రాధిక విమర్శించినట్టు వచ్చిన వార్తలను ఆయన ప్రస్తావించారు. ముస్లింలీగ్ పంపించిన చెక్కులు చెల్లలేదని ఆమె చెప్పారని అన్నారు. 'నన్ను ఎందుకు ఇంత ఇబ్బంది పెట్టాలి. వాయిదాల పద్ధతిలో కొరియర్ ద్వారా చెక్కులు పంపించే బదులు నన్ను పిలిపించి ఒకేసారి ఇవ్వవచ్చుగా. ఇవ్వలేమంటే ఆ విషయమైనా చెప్పొచ్చుగా' అంటూ రాధిక చెప్పారని మంత్రి వివరించారు. ప్రతిపక్షాలు ఎంతకాలం పాటు ఇలాంటి అసహ్యకరమైన రాజకీయాలు చేస్తాయని ప్రశ్నించారు. భాజపా, ఆర్ఎస్ఎస్ వర్గీయుల వేధింపుల కారణంగానే రోహిత్ ఆత్మహత్య చేసుకున్నట్టు విపక్షాలు ప్రచారం చేశాయని అన్నారు. ఇందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సహా, ఇతర విపక్ష నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 22-6-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 313

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



పెద్దన్న పలాయనం!

ప్రపంచంలో ఏమూల.. ఏ దేశంలో.. ఏం జరిగినా... అది అమెరికాకు కావాలి. తమ ప్రయోజనాలకు భంగకర మనో.. మద్దతుగా ఉంటామనో.. లేక మరేదైనా వంకతో ఇతర దేశాల వ్యవ హారాల్లో తలదూర్చటం ఆ దేశానికి వెన్నతో పెట్టిన విద్య. అందుకు వర్తక, రక్షణ ఒప్పందాలను తెరమీదకు తీసుకు వస్తుంది. ఏమీ దొరక్కపోతే మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందనే పాట ఎత్తుకుంటుంది. తద్వారా ఆ దేశం, అమెరికాతో ఏదో ఒక ఒప్పందా నికి రావలసిన పరిస్థితి కల్పిస్తుంది. ఇలా దశాబ్దాల తరబడి అమెరికా తన ప్రాబల్యాన్ని ప్రపంచం అంతా విస్తరిం చుకుంది. కానీ అనూహ్యంగా ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ దీనికి గండి కొట్టటం మొదలు పెట్టారు. ఎన్నో ఏళ్లుగా వివిధ దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాల నుంచి వైదొలగటం మొదలు పెట్టారు.

– ప్రత్యేక కథనం 11లో

దోమలపై డ్రోన్ యుద్ధం


అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు యోగ సాధన

- రెండేళ్లలో పరిపూర్ణ పరిష్కారం
- పల్లెలకు ఆధునిక వైద్య సేవలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- 'ఆరోగ్య ఉత్సవం'లో 5 కొత్త కార్యక్రమాలకు శ్రీకారం
- అవినీతిపరుల మాటలు నమ్మొద్దని పిలుపు
- విశాఖలో మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీ

ఈనాడు – విశాఖపట్నం

దోమల్ని నివారించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవాల్‌గా తీసుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో దోమల నివారణకు పరిపూర్ణ పరిష్కారాన్ని చూపెడతామని చెప్పారు. దీనికోసం ఒక వినూత్న కార్యక్రమాన్ని తెస్తామని, తద్వారా అనేక వ్యాధులకు అడ్డుకట్ట వేస్తామని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా నివారణలో భాగంగా డ్రోన్లను ఉపయోగించే పద్ధతుల్నీ అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మారుమూల పల్లెలకూ ఆధునాతన వైద్య సేవలందేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. విశాఖపట్నంలో ఆరోగ్యశాఖ, మెడ్‌టెక్ జోన్ ఆధ్వర్యంలో గత 4 రోజులుగా జరుగుతున్న 'ఆరోగ్య ఉత్సవం' ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా 5 కొత్త పథకాల్ని ప్రారంభించారు. ఈ- సబ్‌సెంటర్లు, ఆర్ఎఫ్ఐడీ, ముఖ్యమంత్రి బాల సురక్ష యోజన పథకాల్ని ప్రారంభించడంతోపాటు ఉచిత డయాలసిస్ కేంద్రాలను, ఏపీ మెడికల్ రీహాబిలిటేషన్ టూరిజంను (అమ్రిత్) ఇదే వేదిక నుంచే ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రముఖులందరితో, కంపెనీ యజమానులతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. అనంతరం మాట్లాడారు. 'ప్రతి ఇంటికీ 15 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ వసతిని కల్పిస్తున్నాం. దీనిద్వారా గ్రామీణ ప్రాంతాల్లో టెలీ మెడిసిన్ సేవల్ని అందుబాటులోకి తెచ్చాం. గూగుల్ సాంకేతికతతో ఒక గ్రామం నుంచి 20 కి.మీ. దూరం వరకూ ఎలాంటి తీగల్లేకుండా కేవలం బాండ్‌విడ్త్ ద్వారానే టెలీ మెడిసిన్ సేవలు అందేలా చేస్తున్నాం. 3 ఐటీడీఏల్లో 40 సబ్‌సెంటర్లను ఈ- సబ్‌సెంటర్లుగా మార్చాం. ఆ కేంద్రాలకు రోగులొచ్చాక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యులు మాట్లాడతారు. ఆన్‌లైన్‌లో మందుల వివరాలు నమోదు చేస్తారు. వెండింగ్ మిషన్ ద్వారా (మిగతా 2లో)

అలక వీడిన గంటా 5లో


అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం దేహ్రాదూన్‌లో యోగ సాధన చేస్తున్న ప్రధాని మోదీ

14లో

ఏకీకరణ యోగం

ప్రపంచానికి అస్వస్థత నుంచి స్వస్థతకు ఒక మార్గాన్ని చూపింది యోగా. చక్కని ఆరోగ్యం కోసం ప్రపంచవ్యాప్తంగా అందరూ పరితపిస్తుండడంతో యోగా అతిపెద్ద ప్రజా ఉద్యమంగా మారింది. ప్రస్తుత కల్లోలిత ప్రపంచాన్ని ఏకీకృతం చేసే శక్తిమంతమైనదిగా ఆవిర్భవించింది.

– దేహ్రాదూన్‌లో ప్రధాని మోదీ

ఎండ మండి.. మొలక ఎండి

వాడిన పత్తి మొలకను చూపిస్తున్న ఓ రైతు

ఖరీఫ్ ఆరంభంలోనే రైతులకు అగచాట్లు

- అప్రమత్తం చేయడంలో యంత్రాంగం విఫలం

ఈనాడు – అమరావతి

విత్తనం వేసిన వారానికే రైతులకు మొలక కష్టాలు మొదలయ్యాయి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల ప్రభావంతో నేలబారునే ఎండు ముఖం పడుతున్నాయి. ఈ నెల రెండో వారం నుంచి ఎండలు పెరుగుతాయని వాతావరణశాఖ సూచించినా.. రైతుల్ని అప్రమత్తం చేయడంలో వ్యవసాయశాఖ విఫలమైంది. విత్తన పంపిణీలోనూ సన్నద్ధత కొరవడింది. పంట రుణాలు, నవీకరణకు రైతులు అవస్థలు పడుతున్నారు. జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు రాయలసీమలో 28 వేల హెక్టార్లలో వేరుశనగ విత్తనం వేశారు. ఇందులో కొంత మొలక రాలేదు. మొలిచింది దక్కుతుందో లేదో అన్నట్లుంది.

12 వేల హెక్టార్లలో పత్తి

గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో దాదాపు 12 వేల హెక్టార్లలో రైతులు పత్తి విత్తనం నాటారు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతుండటంతో చిరుమొలక దశలో ఉన్న మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కజొన్న, మినుము వానలేక వడలిపోతున్నాయి.

జూన్ రెండో వారం తర్వాత రాష్ట్రంలో ఎండలు పెరిగి, వర్షాలు వెనకాడతాయని వాతావరణశాఖ ముందే (మిగతా 2లో)

వైకాపా ఎంపీల రాజీనామాలు ఆమోదం

- బుధవారం నుంచే అమలులోకి
- స్పష్టం చేసిన లోక్‌సభ సభాపతి సుమిత్రా మహాజన్

మేకపాటి

సుబ్బారెడ్డి

వరప్రసాదరావు

మిథున్‌రెడ్డి

అవినాశ్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: వైకాపా ఎంపీల రాజీనామాకు లోక్‌సభ సభాపతి సుమిత్రా మహాజన్ ఆమోద ముద్ర వేశారు. బుధవారం నుంచే అమలులోకి వస్తాయని లోక్‌సభ సెక్రటేరియట్ బులెటిన్ జారీ చేసింది. బడ్జెట్ తుదివిడత సమావేశాల అనంతరం ఏప్రిల్ 6న వైకాపా ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి రాజీనామా చేశారు. సుమారు 50 రోజుల తర్వాత మే 29న స్పీకర్ వారిని పిలిచి మాట్లాడారు. రాజీనామాలపై పునరాలోచించుకోవాలని, భావోద్వేగంతో చేసినట్లు అనిపిస్తోందని వారికి నచ్చజెప్పారు. వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేయడంతో మరోసారి జూన్ 6న వారితో సభాపతి మాట్లాడారు. రాజీనామా చేస్తున్నట్లు మళ్లీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సూచించగా ఆ మేరకు అందజేశారు. అనంతరం విదేశీపర్యటనకు వెళ్లిన సుమిత్రా మహాజన్ బుధవారం ఎంపీ రాజీనామాలను ఆమోదించారు. గురువారం లోక్‌సభ సెక్రటేరియెట్ బులెటిన్ విడుదల చేసింది.

ఉప ఎన్నికలు లేనట్లేనా?

చట్టసభల్లో ఖాళీలు ఏర్పడితే ఆరు నెలల్లోపు ఉప ఎన్నికలు జరగాలని ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 147, 149, 150, 151 స్పష్టం చేస్తున్నాయి. అయితే 1) ప్రస్తుతం నడుస్తున్న సభ కాలపరిమితి ఏడాది లోపు ముగిసేలా ఉన్నా; 2) కేంద్ర ఎన్నికల సంఘం కేంద్రంతో కలిసి ఆయా స్థానాల్లో ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహణ కష్టసాధ్యం అభిప్రాయానికి వచ్చినా ఈ నిబంధనలు వర్తించవు.

ఎన్నికలకు ఏడాది గడువు అంటే...

ప్రస్తుతం నడుస్తున్న సభ కాలపరిమితి ఏడాది లోపు ముగియడం అనే దానిపై వేర్వేరు వాదనలు (మిగతా 2లో)

ఏ అధికారంతో మీడియా ముందు 'పరేడ్' నిర్వహిస్తున్నారు?

- ప్రమాణపత్రం దాఖలు చేయండి
- ఏపీ డీజీపీకి హైకోర్టు ఆదేశం

5లో

ఆటోలకు జీవితకాల పన్ను

- చిన్నపాటి సరకు రవాణా వాహనాలకూ అమలు
- మూడు నెలలకోసారి చెల్లింపు విధానం రద్దు

6లో

ఇదీ సంగతి!



మీ లేఖలకు కేంద్రం సమాధానం సార్ "మీ దస్తూరీ చాలా బాగుంది, మంచి భాష రాశారు. కొట్టివేతలు లేవు, వెరీగుడ్..." అని ఉంది.

పాఠశాలలకు మరో 2 రోజులు సెలవులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాలలకు మరో రెండు రోజులు సెలవులు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల మూడు రోజులు ఇచ్చిన సెలవులు గురువారంతో ముగిశాయి. తాజాగా శుక్ర, శనివారం సెలవులు ప్రకటించారు. వాతావరణ శాఖ హెచ్చరికలతోపాటు తీవ్రమైన ఎండల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు తప్పనిసరిగా సెలవులు ప్రకటించాలని, ఒకవేళ ఎవరైనా పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

భూకంపాలనూ తట్టుకుంటాయ్

- ఆధునిక సాంకేతికతతో సచివాలయ టవర్లు
- దేశంలోనే తొలిసారిగా ట్విన్‌లిఫ్ట్ పరిజ్ఞాన వినియోగం
- 1 నుంచి పనులు ప్రారంభం
- వ్యయం రూ.2,271 కోట్లు

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతిలోని పరిపాలనా నగరంలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల నిర్మాణంలో ప్రకృతి విపత్తుల్ని తట్టుకునేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. వీటిని 'డయాగ్రిడ్' విధానంలో నిర్మించనున్నారు. ఈ భవనాల్లో దేశంలోనే మొదటిసారిగా ఒకే ఒరలో రెండు లిఫ్టులు ('ట్విన్‌లిఫ్ట్') పరిజ్ఞానాన్ని ఉపయోగించనుండటం మరో ప్రత్యేకతగా రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనరు చెరుకూరి శ్రీధర్ తెలిపారు. సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల కోసం 5 భారీ టవర్ల నిర్మాణానికి సీఆర్‌డీఏ ఇప్పటికే టెండర్లు ఖరారు చేసింది. మొత్తం 5 టవర్ల నిర్మాణ వ్యయం రూ. 2,271.32 కోట్లు. వీటిలో ముఖ్యమంత్రి కార్యాలయం, సాధారణ పరిపాలనా విభాగం ఉండే టవర్‌ను ఎన్‌సీసీ (రూ. 554.23 కోట్లు), 1, 2 (మిగతా 2లో)

చిల్లర కష్టాలకు చెల్లు..

ఈనాడు, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీలో పల్లెవెలుగు మినహా ఇతర అన్ని బస్సుల్లో (ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ..) ఛార్జీలను సంస్థ సవరించింది. ఈ పెంపు గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి అమల్లోకి వచ్చింది. చిల్లర సమస్యను అధిగమించేందుకు ఈ ఛార్జీల సవరణ చేపట్టినట్లు ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు గురువారం సాయంత్రం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం.. ఉదాహరణకు టికెట్ ధర రూ.81 నుంచి రూ.84 మధ్య ఉంటే రూ.85, రూ.86-90 మధ్య ఉంటే రూ. 90 వసూలు చేస్తారు. వెన్నెల బస్సుల్లో ఇప్పటికే ఈ విధానం అమల్లో ఉంది.

ఉపాధ్యాయుల సర్దుబాటు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్.. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఎక్కువ మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

చిత్తశుద్ధి ఉంటే ఉప ఎన్నికలు పెట్టించండి: కేశినేని నాని

ఈనాడు అమరావతి: వైకాపాకు చిత్తశుద్ధి ఉంటే వాళ్ల ఎంపీలు రాజీనామా చేసిన నియోజకవర్గాల్లో కేంద్రాన్ని ఒప్పించి ఉప ఎన్నికలు పెట్టించాలని తెదేపా నాయకుడు, విజయవాడ ఎంపీ కేశినేని నాని సవాల్ విసిరారు. 'ఎంపీల రాజీనామాల్ని ఆమోదింపజేసుకునే విషయంలో వైకాపా తాత్సారం చేసి మరోసారి ప్రజల విశ్వాసం కోల్పోయింది.' అని నాని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు.

కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-ALL సబ్జెక్ట్స్
కొత్త బ్యాచ్ ప్రారంభం : 22-6-2018 సా॥ 4 గం॥లకు
8106268482, 9885272474

S.I / కానిస్టేబుల్స్
R.S. అగర్వాల్
By పుష్పా శివాజీ 25-06-18
శివాజీ 93463 64702

GROUP-II
Group-II Free Demo 24-6-18 @ 10am
DREAMS IAS STUDY CIRCLE
Benzcircle, VIJAYAWADA
Ph:7799155559, 0866-6645559

AP-DSC
SGT, SA (All Sub.), TPT,PET,HPT
FREE DEMO :24-6-2018 at 10.08 am
RAMAIAH
COMPETITIVE COACHING CENTRE

IAS గ్రూప్-1&2 DSC
IBPS POs RPF SI కానిస్టేబుల్స్
కలామ్ IAS
86391 55740

విజేత DSC
9346628728, 8498935555

SI కానిస్టేబుల్స్ RPF RRB
బ్రహ్మాస్
8019013199
9032686069

DSC బయాలజీ (SA)
గణపతి
95058 66099
95427 15559

DSC SA TPT,PET,SGT
బ్యాచ్ ప్రారంభం: 22-6-18@9AM
బాసర
9030140123
8374022333

స్ఫూర్తి DSC
8985005173, 9542543167

DSC SGT TPT Eng.
బ్యాచ్ ప్రారంభం: 23-6-18
బ్రహ్మాస్
8019013199
9032686069

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
50/50 విద్యార్థులకు UPSC/కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ Assistance
Degree + IAS
(50 students)
3yrs Integrated Program
After Degree - Morning Batch (1 year)
During Degree - Evening Batch (2 years)
Civil Services IAS Exam
on June 24th SUN. 10 am & 5 pm
Hostel facility
Beside Nagarjuna Hospital,Kanuru, VIJAYAWADA. Ph: 6300181832



విశాఖలో లబ్ధిదారుకు ఇంటి స్థల పట్టా పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఉప ముఖ్యమంత్రులు కేఈ కృష్ణమూర్తి, చినరాజప్ప, మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులు

విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో పట్టాల పంపిణీ కౌంటర్లవద్ద భారీ జన సందోహం

దోమలపై డ్రోన్ యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఆటోమేటిక్‌గా మందులు తీసుకునే విధానం అమలులో ఉంటుంది. గురువారం నుంచి ఈ విధానం అందుబాటులోకి వచ్చింది' అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పలువురితో ఆయన వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు.

పుట్టిన బిడ్డలు తప్పిపోకుండా..

'ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు అయిన తర్వాత పసిపిల్లలు మాయమవడం, తారుమారు అవడం చూస్తుంటాం. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా పిల్లలు వేరుకాకుండా చూసే సాంకేతికతను తీసుకొస్తున్నాం. తల్లీబిడ్డను ఎవరూ వేరు చేయనంత జాగ్రత్తలు ఇందులో ఉంటాయి. 0-18ఏళ్ల గ్రామీణ పిల్లల్లో చిన్న వయసులో లోపాల్ని గుర్తించేందుకు ముఖ్యమంత్రి బాల సురక్ష కార్యక్రమం కింద 450 సంచార ఆరోగ్య బృందాల్ని ప్రవేశ పెడుతున్నాం. ప్రతి వాహనంలో ఇద్దరు వైద్యులు, ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉంటూ అన్ని గ్రామాల్లోని పిల్లల్లో లోపాల్ని వీరు గుర్తిస్తారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మంది పిల్లలకు మేలు జరుగుతుంది' అని సీఎం చెప్పారు.

పీపీపీ విధానం మీద నమ్మకముంది

'రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నంలో ప్రభుత్వం దగ్గర అన్ని సాంకేతికతలు ఉండవు. ఇలాంటి వెలితిని భర్తీ చేసేందుకు పీపీపీ విధానం ద్వారా ఇతర సంస్థల్నీ భాగస్వాముల్ని చేస్తున్నాం. పేదలకు మెరుగైన, అధునాతన సేవలందించేందుకు ఈ పీపీపీ విధానం ఎంతో మేలనే నమ్మకం నాకుంది. ప్రభుత్వ నిధులద్వారా ఎంబీబీఎస్ చదివి డాక్టర్లై విదేశాలకెళ్లి స్థిరపడే వైద్యుల మీద మీ అభిప్రాయమేంటని నన్ను చాలామంది అడిగారు. నేనిచ్చే సమాధానం ఒక్కటే. ఆరోగ్యశాఖలో దేశంలో ఎక్కడాలేని సాంకేతికతతో, వినూత్న కార్యక్రమాలతో రాష్ట్రం ముందుకెళ్తోంది. ఇప్పుడు పీపీపీ విధానంలో చాలా కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాయి. విదేశాలకు వెళ్లిన వారు కూడా వచ్చి సేవలందించే స్థాయిని మనం కల్పిస్తాం. ఇది జరుగుతుంది' అని చంద్రబాబు వెల్లడించారు. డ్రోన్‌ల ద్వారా మారుమూల గ్రామాలకు రక్తాన్ని చేరవేసే ఆలోచనలూ రావడం అభినందనీయమని చెప్పారు.

అంతకు ముందుగా ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా రాష్ట్రంలో సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఆ పథకం సీఈవో ఇందూ భూషణ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆరోగ్య ఉత్సవం సందర్భంగా నిర్వహించిన హాకథాన్, డాటాథాన్‌లో విజేతలకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ఆరోగ్యశాఖలో అత్యుత్తమ సేవలందించిన వారికి సీఎం అవార్డుల్ని అందజేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, మంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, రాష్ట్ర ఆరోగ్యశాఖ సలహాదారు జితేంద్ర శర్మ, ప్రపంచ బ్యాంకు సీనియర్ హెల్త్ స్పెషలిస్టు షీనా ఛాబ్రా, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి పెడెన్, యూఎన్‌డీపీ నేషనల్ ప్రోగ్రాం మేనేజర్ మనీష్ పంత్, కేంద్ర కుటుంబ ఆరోగ్యశాఖ అదనపు కార్యదర్శి అరుణ్ సింఘాల్ తదితరులు ప్రసంగించారు.

భీమిలిలో సౌరఫలకాల తయారీ పరిశ్రమ ప్రారంభం

విశాఖ శివారు భీమిలిలోని డెక్కతిపాలెంలో గాన్కో ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఏటా 60 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం ఉన్న సౌర ఫలకాలను ఈ సంస్థ తయారు చేయనుంది. రూ.29.67 కోట్ల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సౌర ఫలకాల తయారీ కంపెనీని ఏర్పాటు చేయడం సంతోషకరమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కితాబిచ్చారు. ఈ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వచ్చేలా మంత్రి గంటా చొరవ తీసుకున్నారు. సంస్థ ఎండీ గాడు అప్పల నాయుడు భీమిలి నియోజకవర్గ పార్టీ కీలక నాయకుడు.

అవినీతిపరులు.. కొత్తగా వచ్చినవారి మాటలు నమ్మొద్దు

'పేదలంతా ఆనందంగా ఉండాలి. మీ ఆదాయం పెరగాలి. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా సేవా కార్యక్రమాల్లో కోత ఉండకూడదు. మీకు అండగా ఉంటా. సమస్యలన్నీ పరిష్కరిస్తా. అవినీతిలో కూరుకుపోయిన వ్యక్తులు. కొత్తగా వచ్చిన వ్యక్తులు మమ్మల్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ఎవరేమన్నా ప్రభుత్వానికి అండగా ఉంటామని మీరు గట్టిగా శపథం చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో గురువారం సాయంత్రం జరిగిన మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదిక ప్రాంగణంలో 87 కౌంటర్లు ఏర్పాటుచేసి 9,054 మందికి 9,16,999 చదరపు గజాల రూ.2,220 కోట్ల విలువైన స్థలాన్ని అందించారు. విశాఖలో మూడు విడతలుగా 60,965 మందికి రూ. 10,600 కోట్ల విలువైన 44,26,764 చదరపు గజాల స్థలాన్ని అందించినట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. ఈ భూములపై తక్షణమే లబ్ధిదారులకు సర్వ హక్కులు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. అందరికీ ఫోన్లు చేస్తామని.. అధికారులు, అనధికారులు పైసా తీసుకున్నట్లు తెలిసినా కఠిన చర్యలు తప్పవని.. పేదోళ్ల పొట్టకొడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో 3.55 లక్షల మందికి పట్టాలిచ్చామని, మరో 28,137 పట్టాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. జాయింట్ ఫార్మింగ్ సొసైటీలకు 1.14 లక్షల ఎకరాల్లో పట్టాలిచ్చి పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. రానున్న కాలంలో 10వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు, పోలీసులతో సహా ఇతర ఉద్యోగాలు మరో 10వేలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో 3వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆయుష్మాన్ భారత్ మిషన్‌లో భాగంగా ఆ పథకం సీఈవో ఇందు భూషణ్‌తో ఒప్పంద పత్రాన్ని మార్చుకుంటున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య. చిత్రంలో మంత్రులు గంటా శ్రీనివాసరావు, చిన రాజప్ప, ఎంపి హరిబాబు, తదితరులు

వైకాపా ఎంపీల రాజీనామాలు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

వస్తున్నాయి. 16వ లోక్‌సభ ఏర్పడిన తేదీని(మార్చి 18) పరిగణనలోకి తీసుకోవాలని ఒక వాదన, సభ తొలి సమావేశం తేదీని (జూన్4) తీసుకోవాలని మరో వాదన ఉన్నాయి. భిన్నాభిప్రాయాలున్నప్పటికీ ఉప ఎన్నికల నిర్వహణపై తుది నిర్ణయం మాత్రం ఎన్నికల కమిషన్‌దే.

ఉప ఎన్నికలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి: వైకాపా

రాజీనామాల ఆమోదాన్ని స్వాగతిస్తున్నామని వైకాపా నేత సుబ్బారెడ్డి తెలిపారు. ప్రజల్లోకి వెళ్లి వారిమద్దతు కూడగట్టుకొనే ప్రయత్నం చేస్తామన్నారు. ఖాళీ అయిన స్థానాల్లో ఉప ఎన్నికలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గురువామిక్కడ ఆయన డిమాండు చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం తాము 14 నెలల క్రితమే రాజీనామా చేశామని, డ్రామాలు ఆడుతున్నది తెదేపా నేతలే అని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. తెదేపా ఎంపీలు ఎందుకుచేయడంలేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలు కావాలని అనుకొనేది తామని, వద్దనుకొనేది తెదేపా అని ఎన్నికలంటే ఆ పార్టీకి భయం కాబట్టే వైకాపా ఎమ్మెల్యేల ఫిరాయింపుపై చర్యలు తీసుకోవడం లేదన్నారు.

కోస్తాలో కొనసాగుతున్న ఎండలు

- నేడు రాష్ట్రంలో కొన్నిచోట్ల వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: కోస్తా జిల్లాల్లో ఎండల తీవ్రత కొనసాగుతూనే ఉంది. శుక్రవారం కూడా ఎండ తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2, 3 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు. అక్కడక్కడ 39-41డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంతో కలిపి వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడి ఉందని వెల్లడించారు. ఇది సముద్రమట్టానికి 2.1 కిలోమీటర్ల నుంచి 4.5 కి.మీ ఎత్తులో ఉందని తెలిపారు. ఇప్పటివరకు బలహీనంగా ఉన్న నైరుతి రుతుపవనాలు.. బలపడే అవకాశం కనిపిస్తోందని చెప్పారు. ఈ ప్రభావంతో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో పలుచోట్ల శుక్రవారం ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు ఉంటాయని చెప్పారు. ఆ తర్వాత 3 రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

ఎన్‌ఆర్‌టీ ఐకాన్ టవర్‌కు నేడు శంకుస్థాపన

ఈనాడు డిజిటల్, అమరావతి, తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలోని రాయపూడి వద్ద ప్రవాసాంధ్రులకు నిర్మించ తలపెట్టిన ఎన్‌ఆర్‌టీ ఐకాన్ టవర్ నిర్మాణానికి శుక్రవారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుంది. చంద్రబాబునాయుడు ఉండవల్లి నివాసం నుంచి నేరుగా రహదారి మార్గంలో శంకుస్థాపన ప్రదేశానికి చేరుకొంటారు. 10.45నిమిషాలకు కార్యక్రమాన్ని ముగించుకొని సచివాలయానికి వెళతారు.

రాజధానిలోని పరిపాలన నగరంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఐకాన్ టవర్‌ను నిర్మించనున్నారు. సుమారు రూ.400 కోట్ల అంచనా వ్యయంతో 36 అంతస్తులుగా భవనాన్ని ఏపీఎన్‌ఆర్‌టీ నిర్మించనుంది. అమరావతి నగరానికి అద్దం పట్టేలా ఆంగ్ల అక్షరం 'ఏ' తరహాలో ఆకృతిని రూపొందించారు. రెండు టవర్ల మధ్యలో గ్లోబ్ ఆకృతిని నిర్మించనున్నారు. కొరియాకు చెందిన స్పేస్ కార్పొరేషన్ సంస్థ ఈ భవన ఆకృతిని రూపొందించింది. అధునాతనమైన ఎక్సో స్కెల్టెన్ విధానంలో నిర్మిస్తున్న ఈ భవనంలో అంతస్తుల మధ్యలో కాంక్రీటు పిల్లర్లు ఉండకపోవడంతో ఆరు శాతం ఎక్కువ స్థల లభ్యత ఉంటుందని ఏపీఎన్‌ఆర్‌టీ అధికారులు పేర్కొన్నారు.

ఎన్‌ఆర్‌టీ ఐకాన్ టవర్ ఆకృతి

ఐటీ కంపెనీలు, నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, ఇన్ఫినిటీ స్విమ్మింగ్‌పూల్, వాణిజ్య సముదాయాలు, రెస్టారెంట్లతో కూడిన ఈ భవనం అమరావతికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని తెలిపారు. ఈ టవర్ వల్ల ప్రత్యక్షంగా ఐదు వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని ఆయా వర్గాలు చెబుతున్నాయి.

ఎండ మండి.. మొలక ఎండి

(మొదటి పేజీ తరువాయి)

సూచించింది. జులైలో మళ్లీ అనుకూలంగా ఉంటుందని పేర్కొంది. ఈ విషయాన్ని రైతులకు చేరవేయాలనే బాధ్యతను వ్యవసాయశాఖ విస్మరించింది. ఫలితంగా ఎకరానికి వేలాది రూపాయలు ఖర్చు చేసి తెచ్చిన విత్తనం, నాటిన ఖర్చులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

కడపలో 60 శాతం తక్కువ వర్షపాతం: జూన్ 1 నుంచి కడపలో సాధారణం కంటే 60 శాతం తక్కువ వర్షం కురిసింది. ప్రకాశంలో 42, శ్రీకాకుళంలో 33, గుంటూరులో 26, నెల్లూరులో 19 శాతం చొప్పున లోటు వర్షపాతం నెలకొంది. అక్కడక్కడా చిరుజల్లులు పడుతున్నా పంటల సాగుకు అనుకూలించేంతగా లేవు.

సాగు ధ్రువీకరణ పత్రానికి ఎన్ని మెలికలో: సాగు ధ్రువీకరణ పత్రం ఇస్తే.. విత్తనాలు తెచ్చుకుంటామని రైతులు అడుగుతుంటే.. 'విత్తనం వేస్తేనే మీరు సాగు చేస్తున్నట్లు లెక్క.. అప్పుడే పత్రం ఇస్తాం..' అని వ్యవసాయశాఖ చెబుతోంది. 'ఆ పొలంలో మీరే సాగు చేస్తారని నమ్మకమేంటి? ఆధారం చూపండి' అంటున్నారు. దీంతో కౌలు రైతులకు రాయితీ విత్తనాలు అందడం లేదు.

నాణ్యత లేవని: వేరుశనగ విత్తనాలు.. ప్రైవేటు మార్కెట్‌లోనే తక్కువ ధరకు లభిస్తున్నాయి. దీంతో రాయితీ విత్తన కేంద్రాల వద్ద రద్దీ తగ్గింది. వేరుశనగ విత్తనాలు నాణ్యంగా లేవని చిత్తూరు నుంచి వెనక్కు వచ్చాయి. కర్నూలుకు పుచ్చుపట్టిన జీలుగలు వచ్చాయి. వాటిని వెనక్కు పంపారు.

వరి విత్తనాలపై దోబూచులాట: దొడ్డు రకాల వరిసాగు నియంత్రించాలని చెబుతున్న వ్యవసాయశాఖ.. సదరు విత్తనాలను జిల్లాలకు పంపాక. . రైతులకు సరఫరా చేసే సమయంలో నిలిపివేయించింది. అధికారుల తీరుపై శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో ఈ ఏడాదికి 1001 వరి విత్తనం పంపిణీ చేస్తున్నట్లు మంత్రి సోమిరెడ్డి ప్రకటించారు. అయినా జిల్లాల్లో సందిగ్ధత కొనసాగుతూనే ఉంది.

గంజెహళ్లిలో ఎండలకు వేర్లు ఎండిపోతున్న పత్తి మొక్కలను చూపిస్తున్న రైతు ఉరుకుంద

ఖరీఫ్ సాగు లక్ష్యం	42.78
ఇప్పటికి పంటలు వేయాల్సింది	2.97
పంటలు వేసింది	1.74
(అంకెలు లక్షల హెక్టార్లలో)	
సాగైన పంటలు (వేల హెక్టార్లలో)	
చెరకు	66
వేరుశనగ	28
పత్తి	12
నువ్వులు	10
మినుము	3
పెసర	3

రుణం.. గందరగోళం: ఖరీఫ్ పంట రుణాల మంజూరు ప్రక్రియ పలుచోట్ల ఇంకా ప్రారంభించలేదు. కౌలు రైతులకు సాగుదారు ధ్రువపత్రాలివ్వడంలో జాప్యం తప్పడం లేదు. రుణాల రెన్యువల్ కోసం రాయలసీమలో రైతులు బ్యాంకుల ముందు బారులు తీరుతున్నారు. అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తేనే రుణాలు పునరుద్ధరిస్తామని బ్యాంకర్లు స్పష్టం చేస్తుండటంతో వడ్డీ వ్యాపారుల వద్ద రూ. లక్షకు రూ.4 వేల అదనంగా చెల్లించే ఒప్పందంతో నగదు తీసుకుని బ్యాంకులకు కడుతున్నారు.

'అమృత'ం కురవని అభివృద్ధి

- నిధులున్నా పనుల్లో తీవ్ర జాప్యం
- స్థలాల కొరత, రాజకీయ జోక్యం

ఈనాడు, అమరావతి: నిధులున్నా పనులు చేయలేని నీరసం.. అభివృద్ధిని ప్రజలకు చేర్చలేని నిర్లక్ష్యం.. ఇదీ అమృత్ పథకం తీరు... పట్టణాల్లో మెరుగైన తాగునీటి సరఫరా, కొత్తగా మురుగు నీటి పారుదల వ్యవస్థను ప్రవేశపెట్టడం, వరద నీటి కాలువల నిర్మాణం, ఉద్యానవనాల అభివృద్ధి కోసం ఉద్దేశించిన ఈ పథకం పనులు నత్తనుతలపిస్తున్నాయి.

మొదటి విడత రూ.813 కోట్లతో ప్రతిపాదించిన పనుల్లో 22 తాగునీటి సరఫరా, మరో 46 ఉద్యానవనాలున్నాయి. తాజా సమాచారం ప్రకారం వీటిలో ఇప్పటివరకూ ఏడు పనులే పూర్తయ్యాయి. 16 పనులు ప్రారంభమే కాలేదు. మరో 43 వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకో రెండు పనులపై అనుమతులివ్వాలి. తాగునీటి పైపులైన్ల పనుల స్థల వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖలు, సంస్థల నుంచి అనుమతుల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

- చిత్తూరు జిల్లా మదనపల్లెలో, కడపలో రెండు తాగునీటి జలాశయాల నిర్మాణం కోసం నిధులు కేటాయించినా స్థలం అందుబాటులో లేక పనులు ప్రారంభం కాలేదు.
- ఉత్తరాంధ్ర జిల్లాలు పనుల్లో బాగా వెనుకబడ్డాయి.
- విశాఖపట్నంలో ప్రతిపాదించిన పనుల్లో ఇప్పటికీ 10 శాతం పూర్తి చేయలేదు.
- అనంతపురంలో మురుగునీటి సరఫరా, నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనుల కోసం రెండు సార్లు టెండర్లు పిలవగా గుత్తేదారుల నుంచి స్పందన లేదు.
- నంద్యాల, ఆదోని, ధర్మవరం, గుంతకల్, చిలకలూరిపేట, తాడేపల్లిగూడెంలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు స్థలాల కొరత ప్రతిబంధకంగా తయారైంది.

రెండో విడతలో రూ.2వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పనులను పూర్తి స్థాయిలో ప్రారంభించలేదు. ఇందులో తాగునీటి సరఫరా, మురుగు నీటి పారుదల, ఉద్యానవనాలు, వరద నీటి ప్రవాహ కాలువ నిర్మాణాలున్నాయి. చిత్తూరు, తూర్పుగోదావరి, విశాఖపట్నం, గుంటూరులలో ఈ పనులను ప్రతిపాదించారు. వీటిలో ఇప్పటివరకూ పది శాతం పనులూ పూర్తి కాలేదు.

- విజయవాడలో భూగర్భ మురుగు నీటి పారుదల, తాగునీటి సరఫరా కోసం రూ.47 కోట్లు కేటాయించినా ఇప్పటికీ ఖర్చు కాలేదు. రూ.కోటితో పచ్చదనాన్ని అభివృద్ధి చేసే పనులు ఇటీవలే ప్రారంభించారు. రాజకీయ జోక్యంతో మిగతా నిధుల వ్యయంపై ప్రతిష్టంభన ఏర్పడింది.

అమృత్‌లో రెండు విడతలుగా లక్షకుపైగా జనాభా ఉన్న పట్టణాల్లో ప్రతిపాదించిన పనులు, తాజా పరిస్థితి.....

తాగునీటి సరఫరా	25
ఉద్యానవనాలు	47
మెరుగైన మురుగునీటిపారుదల	6
వరదనీటి ప్రవాహ కాలువలు	2
మొత్తం	80

వివిధ దశల్లో పనులు	48	పూర్తయినవి	7
ఇప్పటికీ ప్రారంభించని పనులు	23	అనుమతులివ్వాల్సినవి	2

రాజకీయ జోక్యంతో ఇబ్బంది

అత్యధిక నగరాల్లో స్థలాల సమస్య, రాజకీయ జోక్యం, గుత్తేదారుల అనాసక్తితో పనుల్లో జాప్యం జరుగుతోంది.

(మొదటి పేజీ తరువాయి)

టవర్లను షాపూర్జీ పల్లోంజీ (రూ.932.47 కోట్లు), 3, 4 టవర్లను ఎల్‌అండ్‌టీ (రూ.784.62 కోట్లు) సంస్థలు నిర్మించనున్నాయి. ఈ 3 సంస్థలకు పనులు అప్పగిస్తూ సీఆర్‌డీఏ గురువారం ధ్రువీకరణ పత్రాలు అందజేసింది. ఆయా సంస్థలు జులై 1 నుంచి నిర్మాణ పనులు ప్రారంభించనున్నాయి. మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలన్నది లక్ష్యం.

అటు అందం.. ఇటు దృఢత్వం..

ముఖ్యమంత్రి కార్యాలయ టవర్ 50 అంతస్తులు, మిగతా నాలుగు టవర్లు 40 అంతస్తుల చొప్పున ఉంటాయి. డయాగ్రిడ్ విధానంలో నిలువు స్తంభాలు (కాలమ్స్) ఉండవు. భవనం మధ్యలో 'సెంట్రల్ కాంక్రీట్ కోర్' ఉంటుంది.

భూకంపాలనూ తట్టుకుంటాయ్

భవనం చుట్టూ బలిష్టమైన మెటల్ పైపులతో రూపొందించిన స్టీల్ డయాగ్రిడ్ నిర్మాణం ఉంటుంది. భవనం బరువంతా సెంట్రల్ కోర్‌తోపాటు ఈ గ్రిడ్‌పైనే ఆధారపడుతుంది. దీనివల్ల సాధారణ భవనాలకంటే ఇవి ఎక్కువ దృఢంగా ఉంటాయి. దీనిలో 'బక్లింగ్ రెసిస్టెన్స్ బ్రాస్' టెక్నాలజీ వినియోగిస్తారు. దీనివల్ల డయాగ్రిడ్‌కు కొంత సాగే (ఎలాస్టిక్) గుణం వస్తుంది. భూకంపాలవల్ల భారీ కుదుపులు తలెత్తితే... సాగే గుణంవల్ల డయాగ్రిడ్ షాక్ అబ్జార్బర్‌లా పని చేస్తుందని సీఆర్‌డీఏ అధికారులు వివరించారు. భవనాల్లో కాలమ్స్ లేకపోవడంవల్ల ఎక్కువ స్థలం అందుబాటులోకి వస్తుంది. భవనం చుట్టూ అద్దాలు ఉండటం ధారాళంగా వెలుతురు వస్తుందని, విద్యుత్తు వినియోగం తగ్గుతుందని వివరించారు. 'ట్విన్ లిఫ్ట్'ల టెక్నాలజీ ఈ భవనాల్లో మరో ప్రత్యేకత. సాధారణంగా ఒక షాఫ్ట్‌లో ఒకే లిఫ్ట్ కారు ఉంటుంది. 'ట్విన్ లిఫ్ట్' విధానంలో ఒకే షాఫ్ట్‌లో రెండు లిఫ్ట్‌లు ఉంటాయి. కొన్ని అంతస్తుల వరకు ఒక లిఫ్ట్, మరి కొన్ని అంతస్తుల వరకు మరో లిఫ్ట్ పనిచేస్తుంది.

★ 5 టవర్లను 35 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు.
★ సీఎం కార్యాలయం 49వ అంతస్తులో ఉంటుంది. 50వ అంతస్తులో (టెర్రేస్) హెలిప్యాడ్ ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

22–6–2018 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
నవమి: ఉ. 6-54 తదుపరి దశమి
చిత్త నక్షత్రం: తె. 5-24 తదుపరి స్వాతి
అమృత ఘడియలు: రా. 11-01 నుంచి 12-36 వరకు
వర్జ్యం: మ. 1-27 నుంచి 3-03 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-07 నుంచి 8-59 వరకు
తిరిగి మ. 12-28 నుంచి 1-20 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-30; సూర్యాస్తమయం: సా.6-33
ఆర్ద్ర కార్తె ప్రారంభం

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విజయవాడ	40.6	29.2
గుంటూరు	40.5	29.2
నెల్లూరు	40.0	30.0
కడప	40.0	27.0
ఒంగోలు	39.8	29.6
రాజమహేంద్రవరం	39.5	29.0
తిరుపతి	39.5	28.8
తాడేపల్లిగూడెం	39.5	28.0
హైదరాబాద్	37.3	26.5
నరసాపురం	36.2	29.1
విశాఖపట్నం	36.0	29.0
శ్రీకాకుళం	36.0	29.0
కర్నూలు	36.0	26.2
అనంతపురం	35.0	26.9

విజయవాడ నగరంలోని ఓ హోటల్‌లో పవన్ కల్యాణ్ దంపతులు

మూడు రోజులపాటు విజయవాడలో పవన్ కల్యాణ్

గన్నవరం, న్యూస్‌టుడే: పలు కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం జనసేన అధినేత, సినీనటుడు పవన్ కల్యాణ్ విజయవాడ చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సాయంత్రం గన్నవరం వచ్చారు. నేరుగా ఆప్రాన్ నుంచి కారులో విజయవాడ వెళ్లారు. ఇక్కడ మూడు రోజుల పాటు ఉంటారు. పవన్ రాక తెలుసుకున్న అభిమానులు అధిక సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకోవటంతో కోలాహల వాతావరణం నెలకొంది.

సహకారంలో స్వాహా పర్వం

- నెల్లూరు కేంద్రంగా రూ.20కోట్లు పక్కదారి
- వీధి వ్యాపారులను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిన వైనం
- వారికి రుణాలిచ్చి ఆపై జేబుల్లో వేసుకున్న బ్యాంకు అధికారులు
- ఎన్‌పీఏలు పేరుకుపోవడంతో వెలుగులోకి..!

ఈనాడు – నెల్లూరు

నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు చెందిన నెల్లూరులోని ఓ శాఖతో సహా జిల్లాలోని నాలుగు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో(పీఏసీఎస్) భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. వీటిల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది కలిపి ఏకంగా రూ.20 కోట్లను అక్రమ మార్గాల్లో రుణాలుగా మంజూరు చేసి తమ జేబుల్లో వేసుకున్నారు. ఇప్పటి వరకు బహిర్గతమైనది రూ.10 కోట్ల వరకు ఉన్నా.. అప్పు ఖాతాల రెన్యువల్స్(పునరుద్ధరణ) మాటున కనిపించని విధంగా కుంభకోణం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూడేళ్లుగా వ్యవహారం

గత మూడేళ్లుగా నగరంలోని రామ్మూర్తినగర్ పరిధిలోని సహకార బ్యాంకు శాఖలో మొత్తం 60 మంది పేరిట బోగస్ రుణాలను సృష్టించి రూ.5 కోట్లు స్వాహా చేశారు. ఇందుకోసం రుణగ్రహీతలుగా రోడ్డు పక్కన వ్యాపారం చేసే వారిని ఎంచుకుని వారితో ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు వారంతా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నట్లుగా వేతన ధ్రువీకరణ పత్రాలు.. వారి పేరిట బ్యాంకు స్టేట్‌మెంట్లను ఓ నెట్ కేంద్రం సహకారంతో తయారు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో దళారీ ఒకరు కీలక పాత్ర వహించారు. అతనితో బ్యాంకు సిబ్బంది కుమ్మక్కు అయ్యారు. ఆవ్యాపారులకు సంబంధించిన ఆధార్ కార్డులు, ఇతర పత్రాలను తీసుకెళ్లి రుణం తీసుకోటానికి సహకరించినందుకు కొంత మొత్తాన్ని వారికి ఇచ్చారు. రుణంగా మంజూరు చేసిన మొత్తాన్ని వారి ఖాతా నుంచి ఉపసంహరించటానికి అవసరమైన సంతకాలను వారినుంచి తీసుకున్నారు. బ్యాంకు ఆడిట్ సిబ్బందికి కూడా అనుమానం రాకుండా పత్రాలను తయారు చేశారు. బ్యాంకు మేనేజర్ గట్టిగా నిలదీస్తే.. రూ.3 కోట్ల వరకు తిరిగి చెల్లించారు.

ఎక్కువ మంజూరు చేసి..

మరో విధానంలో బ్యాంకులో లావాదేవీలు నిర్వహించటానికి వచ్చిన వారికి తెలియకుండానే అధిక మొత్తం రుణాన్ని మంజూరు చేసి.. వారి నుంచి సంతకాలు చేయించిన పత్రాల ఆధారంగా అదనపు మొత్తాన్ని సిబ్బంది ఉపసంహరించారు. ఇలా అదనంగా మంజూరు చేసిన మొత్తాన్ని తమ ఖాతాలో వేసుకున్నారు. మూడేళ్లుగా ఒకే శాఖలో భారీ మొత్తంలో నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) విలువ పెరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో కుంభకోణం భారీ మొత్తానికి చేరుకుంది.

★ జిల్లాలో సూళ్లూరుపేట సహకార సంఘం పరిధిలో రూ.2 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. పీఏసీఎస్(ప్యాక్స్) ఛైర్మన్‌కు, రుణం తీసుకున్న వ్యక్తికి తెలియకుండా మొత్తం వ్యవహారాన్ని నడిపించారు. 2014-15 సంవత్సరం నుంచే ఇక్కడ బినామీల భాగోతం జరిగినట్లు విచారణలో తేలింది.

★ వాకాడు, చిట్టమూరు ప్యాక్స్‌లో కలిపి ఇప్పటి వరకు రూ.2.20 కోట్ల మొత్తం స్వాహా చేశారు. బినామీ పేర్లతో.. అసలు అక్కడ లేని వ్యక్తుల పేర్లను కూడా చేర్చి సహకార సంఘం సొమ్ము మొత్తాన్ని మింగేశారు. గత రెండేళ్లలో మొత్తం వ్యవహారం జరిగినట్లు గుర్తించారు.

★ జిల్లాలో సహకార శాఖ పరిధిలోకి వచ్చే ప్యాక్స్ 99 ఉన్నాయి. అందులో ప్రతి చోటా కనీసం 150 రుణ ఖాతాలు ఉన్నాయి. వాటిలో చాలా వరకు ఏటా ఖాతాలను పునరుద్ధరిస్తున్నారు.

★ పొదలకూరు బ్యాంకు పరిధిలో సుమారు రూ.10 కోట్ల మేర పాత బకాయిలు(ఎన్‌పీఏలుగా) ఉన్నాయి. వాటిని ఎవరికి ఇచ్చారనే వివరాలు కూడా అందుబాటులో లేవు. ఇది కూడా గతంలో జరిగిన కుంభకోణంగానే అధికారులు అంచనా వేస్తున్నారు.

విచారణకు ఆదేశం

సహకార బ్యాంకులు, ప్యాక్స్‌లో జరిగిన బినామీ లావాదేవీలపై పూర్తి స్థాయి విచారణకు సహకాం చట్టం 52 ప్రకారం విచారణకు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో అన్ని సహకార బ్యాంకు శాఖలు, ప్యాక్స్‌లో ఎన్‌పీఏ ఉన్న వాటి వివరాలను తీసుకుని.. నేరుగా వెళ్లి వాస్తవాన్ని తేల్చాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు త్వరలో విచారణ మొదలు కానుంది. నెల్లూరులోని రామ్మూర్తినగర్ శాఖలో జరిగిన అక్రమాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నిశాఖల్లో విచారణచేయిస్తున్నట్లు జిల్లాకేంద్ర సహకారబ్యాంకు ఛైర్మన్ ధనుంజయరెడ్డి 'ఈనాడు'తో చెప్పారు.

'నీట్' కేసులో సీబీఎస్‌ఈ విజ్ఞాపనను తిరస్కరించిన 'సుప్రీం'

దిల్లీ: ఇన్విజిలేటర్ తప్పిదంతో 'నీట్'లో 30 నిమిషాల సమయాన్ని కోల్పోయిన విద్యార్థులకు అదనపు మార్కులు కలపాలంటూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను 10 రోజుల్లోగా అమలు చేయాల్సిందిగా సుప్రీంకోర్టు సీబీఎస్‌ఈని ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సీబీఎస్‌ఈ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, జస్టిస్ ఇందు మల్హోత్రాలతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం గురువారం తిరస్కరించింది. మే 6న నిర్వహించిన వైద్యవిద్య ప్రవేశ పరీక్ష (నీట్) సందర్భంగా మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లోని ఓ కేంద్రంలో 24 మంది విద్యార్థులను ఇన్విజిలేటర్ నిర్ణీత సమయంలో పరీక్ష రాయడానికి అనుమతించలేదు. దీంతో వారిలో ఒకరైన వైష్ణవి సందీప్ మణియార్ హైకోర్టును ఆశ్రయించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. తమకు 10.30 వరకు రాసేందుకు అనుమతించలేదంటూ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు తీర్పు ఇస్తూ.. సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల సూచించిన విధానంలోనే ఆయా విద్యార్థులకు అదనపు మార్కులు కలపాలని ఆదేశించింది. వారికొచ్చిన మార్కులను సమీక్షించి.. మార్పులు చేసిన మార్కుల జాబితాలను ఈనెల 22 నాటికి విడుదల చేయాలని పేర్కొంది. అలాగే వారిని రెండో విడత కౌన్సిలింగ్‌కు పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. దీనిపై సీబీఎస్‌ఈ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కాగా ఇంతకుముందు ఉమ్మడి న్యాయవిద్య ప్రవేశపరీక్ష (క్లాట్)కు సంబంధించిన ఇలాంటి కేసులో విద్యార్థులు జవాబులిచ్చే సామర్థ్యం ఆధారంగా వారికి అదనపు మార్కులను లెక్కించి కలుపుతూ ఓ విధానాన్ని రూపొందించాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది.

ADMISSION GUIDANCE
NEET - INDIA
MBBS
60 LKS TOTAL PACKAGE
© 9676178928, 8466963781

Inst. of Dental Edu. & Advance Studies (IDEAS) Gwalior MP
B.D.S.
₹10.50* Lakhs
Complete Tuition, Hostel & Mess fee
(on SPECIAL SCHOLARSHIP PACKAGE)
*T&C Apply
One time registration is compulsory for taking Admission in M.P.
Registration on: www.dme.mponline.gov.in
Last Date 25th June 2018
Visit web: www.ideasgwalior.org
99850 67090
7049 67 67 67 / 777 1916 777
PANKAJ

చోరీకి వచ్చి.. ప్రాణాలు కోల్పోయి..

- అనారోగ్యంతో మృతి చెందిన నిందితుడు
- ఫిన్స్ పరికరంతో మృతుడి గుర్తింపు

బాపట్ల, న్యూస్‌టుడే: ఇంట్లో చోరీ చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి ఆ ప్రయత్నంలో ఉండగానే అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సంఘటన గుంటూరు జిల్లా బాపట్లలో చోటుచేసుకుంది. ఆధునికతను అందిపుచ్చుకున్న పోలీసులు ఫిన్స్ పరికరం ద్వారా నిందితుడు ఎవరనేది కొద్ది నిమిషాల్లోనే గుర్తించారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపూరుపాలేనికి చెందిన చిన్నపోతుల వెంకటేశ్వర్లు(65) దొంగతనాలకు పాల్పడుతుంటాడు. అతడిపై చీరాల, బాపట్ల మండలం వెదుళ్లపల్లి, బాపట్ల పోలీసు స్టేషన్లలో చోరీ కేసులున్నాయి. స్థానిక భీమావారిపాలెంలోని న్యాయవాది చొప్పకట్ల రామాంజనేయులు ఇంట్లో చోరీకి గురువారం తెల్లవారుజామున వచ్చాడు. లోనికి వెళ్లే ప్రయత్నంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. అరగంట తర్వాత రామాంజనేయులు తండ్రి సాంబశివరావు బయటకు వచ్చి చూసి 108 అంబులెన్స్‌కు సమాచారమివ్వగా వారు వచ్చి చూసి అప్పటికే మృతి చెందాడని చెప్పి వెళ్లిపోయారు. అందిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి పరిశీలించగా.. జేబులో ఆస్తమా బాధితులు వినియోగించే ఇన్‌హేలర్, మందు బిళ్లలతోపాటు గంజాయి ప్యాకెట్, చిన్న టార్చి లైటు దొరికాయి. ఫిన్స్ పరికరంలోకి వేలిముద్రలను ఎస్సై తీసుకోగా మృతుడు ఈపూరుపాలేనికి చెందిన చిన్నపోతుల వెంకటేశ్వర్లు అని, ఆయనపై పలు చోరీ కేసులు ఉన్నాయనే సమాచారాన్ని ఇచ్చింది. ఆస్తమాతో అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయి ఉంటాడని భావిస్తున్నారు.

చిన్నపోతుల వెంకటేశ్వర్లు మృతదేహం

ఫిన్స్ పరికరం

ఫిన్స్ పనితీరు ఇలా...: నిందితుల గుర్తింపు, నేరాల నిరోధానికి పోలీసు శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ట్యాబ్, బయోమెట్రిక్ వేలిముద్ర పరికరంతో కూడిన ఫిన్స్ పరికరాన్ని వినియోగిస్తోంది. ఏ కేసులో అయినా నిందితులు పట్టుపడినప్పుడు వారి వేలిముద్రలను పోలీసులు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫిన్స్ యాప్‌తో అనుసంధానిస్తున్నారు. అనుమానితుల వేలిముద్రలను సేకరిస్తున్నారు. గతంలో అతడు నిందితుడైతే ఫిన్స్ ద్వారా సేకరించిన వేలిముద్రలు ఆన్‌లైన్ రికార్డుల్లో ఉన్న వాటితో సరిపోతే వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్టేషన్లలోని కేసులు, నేరాల వివరాలు ట్యాబ్‌లోకి వస్తాయి.

ప్రేమ వేధింపులు తాళలేక యువతి బలవన్మరణం

సి.వరలక్ష్మి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: ప్రేమ వేధింపులు తాళలేక సి.వరలక్ష్మి(21) అనే యువతి విషపుగుళికలు తిని ఆత్మహత్య చేసుకుంది. కడప జిల్లా పెండ్లిమర్రి మండలం మొయిళ్లకాల్వలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయిళ్లకాల్వ ఎస్సీ కాలనీకి చెందిన వరలక్ష్మి డిగ్రీ పూర్తిచేసింది. ప్రస్తుతం కడపలో కంప్యూటర్ కోర్సు చేస్తోంది. పెండ్లిమర్రి మండలం కొత్తపేటకు చెందిన ఎ.సమరసింహారెడ్డి డిగ్రీ వరకు చదివాడు. ఇతడు కొంతకాలం నుంచి ప్రేమిస్తున్నానంటూ వరలక్ష్మి వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. బుధవారం కంప్యూటర్ శిక్షణకు కడప వెళ్లి వస్తూ బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా సమరసింహారెడ్డి ఆమెను వెంబడించాడు. నిన్ను ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకో.. లేకపోతే మీ గ్రామంలోనే నిన్ను అవమానపరుస్తా అంటూ వరలక్ష్మిని బెదిరించాడు. దీంతో మనస్తాపానికి గురై వరలక్ష్మి ఇంట్లో ఉన్న విషపుగుళికలు తిని అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు గమనించి వెంటనే కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.



shreyansh.in / VF 124 / 0618

కన్న కుమారుడే కాలయముడు

- వృద్ధ దంపతుల దారుణ హత్య
- ఇంటిని అమ్మే విషయంలో వివాదమే కారణం

మోర్జంపాడు (మాచవరం), న్యూస్‌టుడే: కన్న కుమారుడే ఆ తల్లిదండ్రుల పాలిట కాలయముడయ్యాడు. మలి వయసులో ఆసరాగా ఉండాల్సిన వ్యక్తే మద్యం మత్తులో కన్నవారిని కర్కశంగా కడతేర్చాడు. ఈ సంఘటన గుంటూరు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడులో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మోర్జంపాడు గ్రామానికి చెందిన దుగ్గ పుల్లారెడ్డి (65), పూర్ణమ్మ (60) దంపతులకు కుమార్తె లక్ష్మి, కుమారుడు నరసింహారెడ్డి సంతానం. కుమార్తె వివాహం అయ్యి అత్తారింటికి వెళ్లిపోగా, కుమారుడు అత్తవారి ఊరైన ప్రకాశం జిల్లా అద్దంకి మండలం శంఖవరప్పాడులో ఆర్ఎంపీ వైద్యుడిగా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం మోర్జంపాడులో పుల్లారెడ్డి కొత్త ఇల్లు నిర్మించుకున్నారు. ఆ సమయంలో కుమారుడి వద్ద కొంత సొమ్ము తీసుకున్నారు. రెండు నెలల క్రితం నరసింహారెడ్డి తాను నివసిస్తున్న ఊరిలో రూ.10 లక్షలతో ఇల్లు కొన్నాడు. ఈ నేపథ్యంలో సొంత ఊరిలో ఇంటిని అమ్మాలని అమ్మ, నాన్నలపై ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. డబ్బు అవసరమైతే తమకున్న నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలు అమ్ముకోమని సలహా ఇచ్చారు. అప్పట్నుంచీ తండ్రీ, కుమారుల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో బుధవారం మోర్జంపాడులోని బంధువుల ఇంట్లో వివాహం ఉండడంతో నరసింహారెడ్డి స్వగ్రామం వచ్చాడు. రాత్రి బాగా మద్యం తాగి తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. గురువారం మధ్యాహ్నం మళ్లీ మద్యం తాగి వచ్చి వారితో వివాదం పెట్టుకున్నాడు. ఆ సమయంలో కుర్చీలో కూర్చున్న తండ్రి, వరండాలో ఉన్న తల్లి తలపై పదునైన ఆయుధంతో బలంగా కొట్టాడు. దెబ్బలు గట్టిగా తగలడంతో వారిద్దరూ తలలు పగిలి అక్కడికక్కడే చనిపోయారు. వెంటనే నరసింహారెడ్డి పరారయ్యాడు. అనంతరం ఇరుగుపొరుగు వారు బంధువులకు సమాచారం ఇచ్చారు. సత్తెనపల్లి సీఐ కాలేషావలీ, పిడుగురాళ్ల రూరల్ సీఐ సుబ్బారావు, బెల్లంకొండ ఎస్సై జయకుమార్ సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

పుల్లారెడ్డి, పూర్ణమ్మ (పాతచిత్రం)

'అడ్మినిస్ట్రేటివ్ సభ్యుడ్ని' ఎప్పటిలోగా నియమిస్తారో చెప్పండి

- ఏపీఏటీ వ్యవహారంలో ఏపీసీఎస్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రైబ్యునల్(ఏపీఏటీ)లో పరిపాలనా సభ్యుల(అడ్మినిస్ట్రేటివ్ మెంబర్)ను ఎప్పటిలోగా నియమిస్తారో చెప్పాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. ఇంజనీర్ల సీనియార్టీ, పదోన్నతుల వ్యవహారంలో ఏపీ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ జారీచేసిన మెమో, నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో రెండు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. సర్వీసు వివాదాంశంలో మొదటగా ఏపీఏటీని ఆశ్రయించాల్సి ఉండగా.. నేరుగా హైకోర్టుకు రావడంపై పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. తమ వ్యాజ్యాల్ని ఏపీఏటీ బెంచ్ విచారించే తావులేకపోవడంతో నేరుగా హైకోర్టును ఆశ్రయించామన్నారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. అడ్మినిస్ట్రేటివ్ సభ్యుడ్ని ఎందుకు నియమించలేదని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. నియమించడమో లేకపోతే ట్రైబ్యునల్‌ను తీసేయడమో ఏదో ఒకటి చేయాలని వ్యాఖ్యానించింది. తెలంగాణ సర్కారు ట్రైబ్యునల్‌ను మూసివేస్తూ తన వైఖరిని తెలిపిందని గుర్తుచేసింది.

మాజీ నక్సలైట్ పరమేశ్వరన్ మృతి

- 1987లో ఐఏఎస్ అధికారుల అపహరణ కేసులో కీలక నిందితుడు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మాజీ నక్సలైట్ టి.పరమేశ్వరన్ అలియాస్ నందు (50) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం బొడ్డాం గ్రామ శివారు చింతలపూడి పంచాయతీలో నివసిస్తోన్న పరమేశ్వరన్ కొంతకాలం నుంచి తీవ్ర మధుమేహ వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆసుపత్రిలో చేరారు. చిన్న వయసులోనే మావోయిస్టు పార్టీలో చేరిన పరమేశ్వరన్ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు దళంలో జోనల్ స్థాయి నాయకుడిగా ఎదిగారు. తన సహచరి స్వరూపను ప్రేమించి ఉద్యమంలో ఉన్న సమయంలోనే వివాహం చేసుకున్నారు. 1987లో తూర్పుగోదావరి జిల్లా గుర్తేడులో ఏడుగురు ఐఏఎస్ అధికారుల అపహరణ కేసులో పరమేశ్వరన్ కీలక వ్యక్తి. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపింది. కలిమెల ప్రాంతంలో పోలీసు స్టేషన్లపై దాడులు చేసి ఆయుధాలు ఎత్తుకుపోయిన ఘటనకు సూత్రధారిగా పేరొందారు. అనారోగ్య కారణాలతో 2011లో ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన పరమేశ్వరన్ అప్పటి నుంచి మారుమూల గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి సంతానం లేకపోవడంతో ఇటీవలే ఏడాది వయసు పాపను దత్తత తీసుకున్నారు.

ఈనాడు

భావి తరానికి ఉజ్జ్వల యోగం

స్వస్థత, సంపూర్ణ ఆరోగ్యాలకు మేలిమి మార్గంగా యోగాభ్యాసాన్ని ప్రస్తుతించే ప్రధాని మోదీ చెప్పినట్లు- 'నేడు డెహ్రాడూన్ నుంచి డర్బన్ వరకు, షాంఘైనుంచి షికాగో వరకు, జకార్తా నుంచి జోహానెస్‌బర్గ్ వరకు... అసంఖ్యాక జీవితాలను ప్రభావితం చేస్తోంది'. వేరే మాటల్లో, యోగా బొడ్డుపేగు బంధంతో విశ్వకల్యాణ భావన సాకారమవుతోంది. నిన్న నాలుగో అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా 170 దేశాల్లో సమాదరణ ఉత్సవ సంరంభం, సహస్రాబ్దాల భారతీయ సంస్కృతీ వారసత్వానికి కొత్తగా ఒటెత్తుతున్న సమధిక ప్రాధాన్యాన్ని కళ్లకు కట్టింది. సింధు నాగరికతలో యోగాసనాల ఆనవాళ్లు కనిపించడం, మొహెంజొదారోలో పద్మాసన పశుపతి ముద్ర లభించడం ప్రాచీనతకు సాక్ష్యాలుగా వర్ధిల్లుతున్నాయి. శతాబ్దాలక్రితమే యోగా ఎల్లలు దాటి ఖండాంతర ఖ్యాతి సముపార్జించింది, ఆధునిక ప్రపంచంలో మునుపెన్నడెరుగని స్థాయి గుర్తింపు, ఆదరణ లభిస్తుండటానికి ముఖ్యకారకులు ప్రధానమంత్రే. దాదాపు నాలుగేళ్లక్రితం సర్వప్రతినిధి సభలో ప్రధాని మోదీ చేసిన ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసిన ఐక్యరాజ్య సమితి, ఏటా జూన్ ఇరవై ఒకటో తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణకు మార్గం సుగమం చేయడం తెలిసిందే. అది మొదలు ఆ రోజున విదేశాలతోపాటు దేశీయంగానూ అనేక విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో యోగాభ్యాస సందడి ఉత్సాహం పరవళ్లెత్తడం చూస్తున్నాం. అది ఏడాదికొకమారు ప్రత్యేక సందర్భంగానే కాక రేపటిపౌరుల దైనందిన అభ్యాసమై విలసిల్లేలా పాఠ్యప్రణాళికల్ని ప్రక్షాళించాల్సిన అవసరం నేడెంతో ఉంది!

సమకాలీన పోటీ ప్రపంచంలో తరతమ భేదాలతో దాదాపు ప్రతి జీవన రంగానా ఇంతలంతలవుతున్న ఒత్తిళ్లు పలు రుగ్మతలు తెచ్చిపెడుతున్నాయి. ఆ విపరీత ఒత్తిళ్లను నిభాయించే శక్తినిచ్చే యోగా మెదడుకు ప్రశాంతత చేకూరుస్తుందని సాధకుల అనుభవాలు చాటుతున్నాయి. క్రమం తప్పకుండా యోగాసనాలు వేసి, ధ్యానం చేస్తున్నవారిలో ప్రతికూల యోచనలు నశించి జ్ఞాపక, గ్రహణ శక్తులు ఇనుమడిస్తున్నట్లు పరిశోధనలు నిరూపిస్తున్నాయి. అందువల్ల యోగాభ్యాసం మధ్య వయస్కులు, వయోవృద్ధులకే పరిమితం కాదని, అది సర్వజన శ్రేయస్సాధకమనడంలో భిన్నాభిప్రాయాలకు తావే లేదు. ప్రస్తుత యాంత్రిక జీవనం, అనారోగ్యకర ఆహారపుటలవాట్లు పుణ్యమా అని పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో సైతం ఆరోగ్య సమస్యలు పెచ్చరిల్లుతున్నాయి. కనీస వ్యాయామం కొరవడి స్థూలకాయం (ఒబెసిటీ) సంబంధ రుగ్మతలు కమ్ముకుంటున్నాయి. ఒత్తిడినుంచి ఉపశమనం కలిగించి, చక్కటి ఏకాగ్రతకు చురుకైన జీవనశైలికి భరోసా ఇవ్వగల యోగాపై దేశంలో కొన్ని విశ్వవిద్యాలయాలు ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టినా, వాటి సంఖ్య వేళ్లపై లెక్కపెట్టే స్థాయిలోనే ఉంది. దేశవ్యాప్తంగా ఎనిమిదో తరగతి దాకా పాఠశాలల్లో నిర్బంధ యోగా శిక్షణ ఇచ్చేలా చూడాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం గత ఆగస్టులో కొట్టిపారేసింది. ఆ సందర్భంగా, పాఠశాలల్లో ఏం చెప్పాలో నిర్ణయించాల్సింది ప్రభుత్వమేనని అసందిగ్ధంగా ప్రకటించింది. సుదీర్ఘ విరామానంతరం ఆరునుంచి పదోతరగతి వరకు పుస్తకాల్లో భారతీయ తత్వశాస్త్రం, ఆయుర్వేదం తదితరాలతో పాటు యోగా సమాచారాన్నీ కేంద్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) తాజాగా పొందుపరచింది. ఇంజినీరింగ్ విద్యార్థులకు వేదాలు, పురాణాలతోపాటు యోగాను పరిచయం చేసేలా పాఠ్య ప్రణాళికల్ని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఇటీవలే సంస్కరించింది. ప్రతి విద్యాలయంలోనూ 'యోగముద్ర' విలసిల్లేలా చేయాల్సిన విస్తృత అజెండాకు, ఈ పరిమిత చర్యలు ప్రత్యామ్నాయాలు కానేకావు.

పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడే వారిని చురుగ్గా ఉంచే ఆటలు, వ్యాయామం పాఠశాల విద్యలో మిళితం కావాలని డాక్టర్ కలాం, అమర్త్యసేన్, సచిన్ తెందుల్కర్ ప్రభృతులెందరో లోగడ పిలుపిచ్చారు. ఆరునుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరూ విధిగా ఏదో ఒక క్రీడాంశంలో పాల్గొనాలని నిర్దేశిస్తూ జారీ అయిన సర్కారీ ఉత్తర్వులు సైతం నీరుకారిపోవడం- ఇక్కడ ఏళ్ల తరబడి తిష్ఠవేసిన వ్యవస్థాగత అలసత్వానికి రుజువు. విద్యాహక్కు చట్టం ప్రకారం- ప్రతి పాఠశాలలో ఆటస్థలం, క్రీడాసామగ్రి ఉండితీరాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, యావత్ దక్షిణ భారతావనిలో మూడోవంతు పాఠశాలలకు ఆటస్థలాలన్నవే లేవు. ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్న చోట్లా కనీస వసతులకు, సిబ్బందికి కొరత వెక్కిరిస్తోంది. కిక్కిరిసిపోతున్న నగరాల్లో క్రీడా వికాస స్ఫూర్తి పరిఢవిల్లజేసే ప్రణాళిక రచన, దీటైన కార్యాచరణ ఎండమావుల్ని తలపిస్తున్నాయి! రేపటి పౌరుల రోజూ అరగంటలైనా వ్యాయామం, శారీరక శ్రమ, యోగా చేసే ముస్తుందు దాపురించనున్న ఎన్నో రుగ్మతలనుంచి తమను తాము భద్రంగా కాపాడుకోగల వీలుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. యోగాభ్యాసానికి సువిశాల క్రీడామైదానాలు అక్కర్లేదు, ఖరీదైన వ్యాయామ పరికరాలతోనూ పనిలేదు. అందువల్ల అన్ని అంచెల విద్యాసంస్థల్లోనూ యోగా బోధన, శిక్షణ, అభ్యాసాలను తప్పనిసరి చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. నూట ముప్పై కోట్లకు పైబడిన దేశ జనావళికి ఇప్పటికీ యోగా శిక్షకుల సంఖ్య సుమారు రెండు లక్షలేనని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నాణ్యమైన యోగా బోధకుల్ని తర్ఫీదుగరిపే అభివృద్ధి చేసేందుకు వ్యూహాలపైనా కేంద్రం దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. 'ముందు తరాల మానవాళి జీవనంలో భారతీయ యోగా ప్రధాన భూమిక పోషించనుంది' అన్నది ప్రముఖ తత్వవేత్త అరబిందో ఘోష్ ఏనాడో చేసిన భవిష్యద్దర్శనం. ప్రతి బడిలో యోగాభ్యాసానికి ఒరవడి దిద్దే సమర్థ ప్రణాళిక అమలుకు నోచుకున్నప్పుడే, జాతికి సమగ్ర వికాస యోగం!

మొద్దుబారిన చట్టాలు

విత్తన అవసరాలను గుర్తించి, వాటిని సక్రమంగా పంపిణీ చేయలేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. పంట లక్ష్యాలను ఘనంగా ప్రకటిస్తున్న వ్యవసాయ శాఖ అవసరం మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచడంలో విఫలమవుతోంది. విత్తన ఎంపిక దశలోనే చోటుచేసుకుంటున్న నాణ్యత లోపాలు దిగుబడులపై ప్రభావం చూపుతున్నాయి. విత్తనోత్పత్తికి అత్యుత్తమ పరిస్థితులున్న తెలుగు రాష్ట్రాలలో నేటికీ నాణ్యత సమస్యగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. విత్తన నష్టాలు సంభవించినప్పుడు తూతూమంత్రంగా చేపడుతున్న చర్యలు వ్యవస్థలోని లొసుగులకు అద్దం పడుతున్నాయి. చట్టాల్లోని లోటుపాట్లను సరిదిద్ది రైతుకు మేలు చేసేలా మార్పులు తీసుకు రావాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరిస్తోంది. 2002 నాటి జాతీయ విత్తన విధానం రైతుల ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైంది. 1966 విత్తన చట్టం స్థానంలో తీసుకురావాలని భావించి 2004లో రూపొందించిన బిల్లు నేటికీ ఆమోదానికి నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు సొంత చట్టాలను రూపొందిస్తే ప్రయోజనం ఉంటుంది. మోసాలకు పాల్పడే వ్యక్తులు, కంపెనీలపై జీవితకాలం నిషేధం విధించేలా కఠిన చర్యలుండాలి. పీడీ చట్టాలు అమలు చేస్తున్నా మోసాలు ఆగనందున మరింత కఠినచర్యలకు నడుం బిగించాలి.

పుట్లు పండించే విత్తులేవీ?

కర్షకులు ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తమవుతున్నారు. దుక్కులు దున్ని నారుమడులు పోస్తున్నారు. విత్తన నాణ్యత బాగుండి, పరిస్థితులు అనుకూలిస్తే మంచి దిగుబడులు పొందగలుగుతారు. లేదంటే కష్టాలు తప్పవు. అందువల్ల మేలైన విత్తనాలను అందించడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గతంతో పోలిస్తే రైతులు ప్రభుత్వ సంస్థల విత్తనాలపైనే ఆధారపడటం లేదు. నచ్చిన విత్తనాలు ఎక్కడ దొరికినా సేకరించుకుంటున్నారు. ఫలితంగా ప్రైవేటు కంపెనీల విత్తనాలకూ గిరాకీ ఏర్పడుతోంది. దేశంలో ఉత్పత్తయ్యే విత్తనాల్లో దాదాపు 60 శాతానికి పైగా తెలుగు రాష్ట్రాలవే. ప్రపంచ విత్తన ఎగుమతుల్లో 1.38 శాతం వాటాతో భారత్ 26వ స్థానంలో ఉంది. ప్రపంచ వార్షిక విత్తన వ్యాపారం సుమారు 4500 కోట్ల డాలర్లు. 2020 నాటికి ఇది 9200 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా. అమెరికా, ఫ్రాన్స్, చైనా, బ్రెజిల్, భారత్ ప్రపంచ విత్తనరంగంలో తొలి అయిదు స్థానాల్లో ఉన్నాయి. ఇవి ప్రపంచ విత్తన వ్యాపారంలో దాదాపు 66 శాతం వాటా కలిగి ఉన్నాయి. 2010లో వంద కోట్ల డాలర్ల విలువైన విత్తన వ్యాపారం చేసిన భారత్ 2014 నాటికి దాన్ని 220 కోట్ల డాలర్లకు పెంచుకుంది.

పడకేసిన పరిశోధనలు

దేశం మొత్తం విత్తన వ్యాపారంలో సుమారు 82.2 శాతం కూరగాయేతర విత్తనాలే ఉన్నాయి. ఇందులో పత్తి వాటా ఒక్కటే 36 శాతం. మొత్తం విత్తనాల మార్కెట్లో 76 శాతానికిపైగా ప్రైవేటు రంగానిదే. ప్రైవేటు రంగం ప్రభ వెలిగిపోవడానికి ప్రభుత్వ రంగంలో పరిశోధనలు మందగించడమే కారణం. ప్రభుత్వ పరిశోధన సంస్థల నుంచి కొత్త విత్తన రకాలు వెలుగు చూడటమే లేదు. నాణ్యమైన విత్తనాలను అందించకపోవడం వల్ల ఏటా రైతులు 20 నుంచి 30 శాతం దిగుబడుల్ని కోల్పోతున్నారని అంచనా. విత్తనోత్పత్తికి అత్యంత అనువైన పరిస్థితులు ఉన్న దేశంగా భారత్‌కు అవకాశాలు అనేకం. అందువల్లే ప్రపంచంలో పేరెన్నికగన్న విత్తన కంపెనీలన్నీ ఇక్కడ తయారీకి మొగ్గు చూపాయి. వ్యవసాయంపై ఆధారపడిన దేశం కావడంతో బహుళజాతి విత్తన కంపెనీలన్నీ ఇక్కడే దృష్టి సారించాయి. కొన్ని ప్రైవేటు కంపెనీల విత్తనాలకున్న గిరాకీ దృష్ట్యా, వాటిని అచ్చుగుద్దినట్టు పోలిన విత్తనాలను కొందరు అక్రమార్కులు మార్కెట్లో గుమ్మరిస్తున్నారు. నిరక్షరాస్యులైన ఎందరో రైతులు వాటిని కొని నష్టపోతున్నారు. ఈ విషయంలో కొందరు డీలర్లు మోసాలకు పాల్పడుతున్నా వారిని నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

ఆహార భద్రత సవాళ్లను అధిగమించాలంటే ఇప్పుడున్న విత్తనాల నాణ్యత మరింత మెరుగుపడాలి. రెట్టింపు దిగుబడులు ఇచ్చే వంగడాలపై పరిశోధనలు సాగాల్సి ఉంది. ప్రభుత్వ రంగంలో పరిశోధనలు దాదాపు పడకేశాయి. ప్రైవేట్ రంగం నుంచి వస్తున్న వంగడాలు దిగుబడుల పెంపునకు కొంతవరకు దోహదపడుతున్నా, కఠినమైన చట్టాలు లేకపోవడం వల్ల మోసాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక ఏడాది ఏదైనా విత్తనం ఆదరణ పొందిందంటే, మరుసటి సంవత్సరం వాటిని భారీగా ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నారు. తెలంగాణలో గతేడాది 'సోనా' రకానికున్న గిరాకీ దృష్ట్యా ఈసారి వాటిని విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులో ఉంచింది. కానీ రైతులు 'సాంబమసూరి'ని ఎక్కువగా కోరుకోవడాన్ని అంచనా వేయలేకపోయింది. వేరుసెనగ విత్తనాల కోసం ఏటా తోపులాటలకు దారితీసే పరిస్థితులు ఈసారి ఆంధ్రప్రదేశ్‌లో ఉండకపోవచ్చు. మార్కెట్ ధర కంటే సబ్సిడీపై ఇస్తున్న విత్తన ధరలు అధికంగా ఉండటంతో వాటిని కొనేందుకు రైతులు ఇష్టపడటం లేదు. చెరువులు జలకళతో

విత్తన నాణ్యతే రైతుకు పెను సమస్య

ఉండటం వల్ల రాయలసీమ రైతులు ఈసారి పాతపంట నుంచే విత్తనాలను జాగ్రత్త పరచుకోవడం అభినందనీయం. ఫలితంగా వ్యవసాయశాఖ అందుబాటులో ఉంచిన విత్తనాలను కొనేవారు లేరు. సాధారణంగా రైతులు దిగుబడిని, మార్కెట్లో ఉన్న గిరాకీని బట్టి ఏయే రకాలకు ఎక్కువ ధర పలుకుతుందనే అంశాల ఆధారంగా విత్తనాలను ఎంచుకుంటున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా ఒక ఏడాది అత్యధికంగా రైతులు ఇష్టపడ్డారని భావించి అవే రకాలను అందుబాటులో ఉంచితే ఫలితం ఉండదు. క్షేత్రస్థాయిలో ఈ పరిణామాలను పరిశీలిస్తూ నిర్ణయాలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం మొక్కుబడిగా వ్యవహరిస్తుండటం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయంలో రైతుల తప్పిదాలూ ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 40 శాతం భూమిని కౌలుదారులే సాగు చేస్తుండటం, చాలావరకు కౌలు ఒప్పందాలన్నీ జూన్‌లోనే ఖరారవుతుండటం వల్ల రైతులు విత్తనోత్పత్తి, నాణ్యత వంటి అంశాలను పట్టించుకోవడం లేదు. దీనివల్ల మేలుజాతి విత్తనాల వాడకం సన్నగిల్లుతోంది. సాధారణ, సంకర రకాల్లో ఏది వాడితే దిగుబడి బాగా వస్తుందనే అంశంపైనా గందరగోళం ఉంది. వాణిజ్య పంటల సాగులో ఇటువంటి సందేహాలు వస్తుంటాయి. ప్రాచుర్యం పొందిన రెండు రకాలను సంకరం చేయడం ద్వారా వచ్చేది హైబ్రిడ్ వంగడం కాబట్టి, ఇక్కడ సంకరం చేయడానికి ఎంపిక చేసుకున్న రకం లక్షణాలు కీలక పాత్ర పోషిస్తుంటాయి. విత్తనం లక్షణాలు, అది అందించే దిగుబడి, చీడపీడలతో పాటు ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకునే శక్తి ఎంతవరకు ఉంటుంది తదితర విషయాలను పరిశీలించాలి. సంకర రకాలలో ఈ లక్షణాలను ముందుగా గుర్తించలేం. అందువల్ల నేరుగా విత్తన కంపెనీల నుంచి మేలైన వంగడాల కొనుగోలు మంచిది.



చీడపీడలతో సతమతం

నారుమడులు పోసుకునే ముందుగానే విత్తనశుద్ధి చేసుకుంటే చీడపీడలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. పత్తిపై గత ఏడాది గులాబీ రంగు పురుగు విజృంభించింది. పత్తిలో పొగాకు లద్దెపురుగు, గులాబీరంగు కాయతొలుచు పురుగులను నిరోధించే లక్షణాలున్నాయని ప్రచారం పొందిన బీటీ విత్తనాలను రైతులు ఇబ్బడిముబ్బడిగా కొని సాగుచేశారు. కొన్నేళ్లుగా బీటీ జన్యువు ఆ పురుగుల్ని నిరోధించలేక పోతోందని పలు సంఘటనలు రుజువు చేశాయి. గులాబీరంగు పురుగు విజృంభణతో దేశవ్యాప్తంగా గత ఏడాది రైతులు వందల కోట్ల రూపాయలు నష్టపోయారు. కొన్నేళ్లుగా ఈ మందుల్ని తట్టుకునే శక్తిని పురుగులు పెంచుకోవడంతో అంతకంటే గాఢత కలిగిన మందులు వాడాల్సి వస్తోంది. ఈ భయాలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం బీజీ-3 విత్తనాలపై నిషేధాన్ని విధించింది. దొడ్డిదారిన వీటిని అమ్మిన వ్యాపారులపై తెలుగు రాష్ట్రాల్లో పలు కేసులు నమోదయ్యాయి. ఎంత నిషేధం విధించినా దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో బీజీ-3 పత్తిని అనధికారికంగా సాగుచేశారని వార్తలొస్తున్నాయి. పర్యావరణానికి ప్రమాదమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరించిన నేపథ్యంలో వీటి వ్యాప్తిని నియంత్రించడం ప్రభుత్వాల బాధ్యత. రాయల్టీల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసినప్పటికీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కొన్ని బహుళజాతి విత్తన సంస్థలను కట్టడి చేయాల్సి ఉంది. తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా ముందస్తు పెట్టుబడిని అందించడం రైతులకెంతో ఉపకరిస్తోంది. కౌలుదారులకూ ఈ పథకాన్ని వర్తింపచేస్తే మరింత ప్రయోజనం కలిగి ఉండేది. ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్న విత్తన రాయితీల ధరలను సమీక్షించుకుని రైతులకు మేలు చేసేలా వ్యవహరించడం మంచిది. విత్తన మోసాల బాధ్యులపై చేపడుతున్న చర్యలకు పదును పెట్టాలి. వ్యవసాయశాఖ మెతకవైఖరి పలు సందర్భాల్లో విమర్శలపాలైంది. విత్తన నాణ్యత విషయంలో రాజీలేని ధోరణి సత్ఫలితాలను ఇస్తుంది. రైతుల అవసరాలను గుర్తెరిగి సీజన్ ముంగిట విత్తనాలు సేకరిస్తుండటం సమస్యలకు దారితీస్తోంది. ఆయా పంటల్లో పంచాయతీల వారీగా రైతు స్థాయిలో విత్తనోత్పత్తిని ప్రోత్సహించడమే సమస్యకు పరిష్కారం. మోసగాళ్ల నుంచి చట్టాలు తమను కాపాడతాయని రైతులు ఆశిస్తారు. కానీ ఆ చట్టాలు చట్టుబండలైనప్పుడు వారు తమ గోడు ఎవరి వద్ద వెళ్లబోసుకోవాలి? అధిక దిగుబడినిచ్చే మేలుజాతి వంగడాలను సాగుచేస్తేనే రైతుకు ప్రయోజనం ఉంటుంది. అన్నదాతకు ఆ భరోసా ఇవ్వడం ప్రభుత్వాల కర్తవ్యం!

- అమిర్నేని హరికృష్ణ

మౌనాన్ని ఛేదించిన న్యాయమూర్తి!

ఈ సంవత్సరం మొదట్లో భారత న్యాయవ్యవస్థ సంచలన పరిణామాలను చవిచూసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తర్వాత సీనియర్లయిన నలుగురు జడ్జీలు- రంజన్ గొగోయ్, మదన్ బి. లోకూర్, కురియన్ జోసెఫ్‌లు జాస్తి చలమేశ్వర్ నాయకత్వంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి న్యాయవ్యవస్థలోని కొన్ని లొసుగులను వెల్లడించడం సర్వత్రా సంచలనం రేకెత్తించింది. ఈ మొత్తం వ్యవహారంలో న్యాయమూర్తి చలమేశ్వర్ కీలక పాత్ర పోషించారు. ఆయన నేడు పదవీ విరమణ చేస్తున్నారు. ఏడేళ్లు సుప్రీంకోర్టు జడ్జీగా బాధ్యతలు నిర్వహించిన ఆయన- గౌహతి, కేరళ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగానూ పనిచేశారు. మొత్తంగా రెండు దశాబ్దాలపాటు వివిధ స్థాయుల్లో ఆయన న్యాయమూర్తిగా వ్యవహరించారు. న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు సంబంధించి చలమేశ్వర్ అత్యంత ముఖ్యమైన అంశాలను లేవనెత్తారు. మౌనాన్ని ఛేదించిన న్యాయమూర్తిగా ఆయనను ఈ దేశం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు 'వీధికెక్కడం' అపూర్వమన్న వారితో పాటు, దురదృష్టకరమని పెదవి విరిచిన వారూ ఉన్నారు. ప్రజాస్వామ్య పథంలో న్యాయవ్యవస్థది అత్యంత కీలకమైన పాత్ర. అందులోని వ్యవస్థీకృత సమస్యలను, లొసుగులను ఎప్పటికప్పుడు కప్పిపుచ్చడంవల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పే తప్ప ప్రయోజనం లేదు. 'ఓ ఇరవై ఏళ్ల తరవాత దేశ ప్రజలు- అప్పట్లో న్యాయమూర్తులు తమ ఆత్మలను తాకట్టుపెట్టారు అని అపార్థం చేసుకోకుండా ఉండటం కోసమే న్యాయవ్యవస్థలో అసలేం జరుగుతోందన్న విషయాన్ని నేరుగా తెలియజేస్తున్నాం' అని న్యాయమూర్తి చలమేశ్వర్ చేసిన వ్యాఖ్య గమనించదగింది.

లొసుగులపై నిరసన గళం!

చలమేశ్వర్ లేవనెత్తిన అంశాలు వివాదాస్పదమైనవిగా కనిపించినా, ఆయనలో తిరుగుబాటు తత్వం ఉందని అనుకోవడానికి ఆస్కారం ఉన్నా ఎక్కడా ఆయన ఔచిత్యం తప్పలేదు. న్యాయవ్యవస్థలో ఈ సమస్యలు చాలా కాలంగా పేరుకు పోయాయి అని చెప్పడం ద్వారా తన గురి ఏదో ఒక వ్యక్తి మీద కాదు అన్న విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. 'సుప్రీంకోర్టు నిర్వహణలో అంతా సవ్యంగా లేదు' అని ఆయన అన్న మాటల్లో నిందారోపణకన్నా ఆవేదనపాలే కచ్చితంగా ఎక్కువ. 'కొలీజియం' విషయంలో ఆయనకు నిర్దిష్ట అభిప్రాయాలు ఉన్నాయి. జడ్జీలను జడ్జీలే నియమించే సంప్రదాయం భారత్‌లో తప్ప మరే ప్రజాస్వామ్య దేశంలోనూ లేదు. న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వ జోక్యం ఉండకూడదన్న వాదనను ఆయన అంగీకరించలేదు. అది ప్రజాస్వామ్య సంప్రదాయాలకే విరుద్ధం అని అభిప్రాయపడ్డారాయన. 2014లో న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన చట్టాన్ని పార్లమెంటు ఆమోదిస్తే- 2015 అక్టోబర్ 16న సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేసింది. ఆ కేసును విచారించిన అయిదుగురు న్యాయమూర్తుల్లో చలమేశ్వర్ సైతం ఒకరు. ఆ చట్టంపై విచారణ కొనసాగించిన న్యాయమూర్తులంతా 'కొలీజియం' వ్యవస్థలోని లోపాలను విమర్శించారు. కానీ, తీర్పు మాత్రం చట్టాన్ని తోసిపుచ్చడానికి అనుకూలంగానే ఇచ్చారు. చలమేశ్వర్ ఒక్కరే పార్లమెంటు చేసిన చట్టాన్ని సమర్థించారు. జడ్జీల నియామకంలో న్యాయవ్యవస్థకు ప్రాధాన్యం అన్న మాట రాజ్యాంగ మౌలిక చట్రంలో అంతర్భాగం అనే వాదనను ఆయన తోసిపుచ్చారు. నిజానికి 'కొలీజియం' గురించిన ప్రస్తావన రాజ్యాంగంలో ఎక్కడా లేదు. న్యాయమూర్తుల నియామక బిల్లుకు అన్ని జాతీయ పార్టీలు, ప్రధానమైన ప్రాంతీయ పార్టీలు కలిపి మొత్తం 26 రాజకీయ పక్షాల మద్దతు ఉంది. 20 రాష్ట్రాల శాసన సభలు ఆ బిల్లుకు ఆమోద ముద్ర వేశాయి. అయినా సుప్రీం కోర్టు ఆ బిల్లు చెల్లదని తీర్పు చెప్పింది. 'కొలీజియం' వ్యవస్థ దేశంలో ముందు నుంచీ లేదు. అది 1993లో న్యాయమూర్తి జె.ఎస్.వర్మ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు ప్రకారమే అవతరించింది. న్యాయమూర్తి వర్మ సైతం 'కొలీజియం' వ్యవస్థను 'అపార్థం చేసుకున్నారని, దుర్వినియోగం

జస్టిస్ జాస్తి చలమేశ్వర్... సంస్కరణవాదిగా చెరిగిపోని ముద్ర

చేశారు' అని వ్యాఖ్యానించారు. పరిపాలన సంస్కరణల కమిషన్, పార్లమెంటరీ స్థాయీ సంఘాల సిఫార్సులు, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు, న్యాయకోవిదుల సూచనల మేరకే జడ్జీల నియామక చట్టం రూపుదాల్చింది.

న్యాయమూర్తుల నియామక విధానంలో గడచిన రెండు దశాబ్దాలుగా అనేక వివాదాలు తలెత్తాయని, ఆ వ్యవస్థ నిర్ణయాల్లో దాపరికం కనిపిస్తోందని చలమేశ్వర్ వాదించారు. 'కొలీజియం' 'బంధుప్రీతికి, ఆశ్రిత పక్షపాతానికి' నిలయంగా మారిందని- అనర్హులనూ న్యాయమూర్తులుగా నియమిస్తున్నారని, ఒక సందర్భంలో అయితే అవినీతి ఆరోపణలున్న వ్యక్తిని సైతం జడ్జీగా నియమించారని చలమేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'కొలీజియం' నిర్ణయాలకు సంబంధించిన రికార్డులు ప్రధాన న్యాయమూర్తి మినహా ఇతర జడ్జీలకు సైతం అందుబాటులో లేని వాతావరణం చాలాకాలం కొనసాగింది. అందుకే న్యాయమూర్తి కేహార్ సీజేఐగా ఉన్నప్పుడు 'కొలీజియం' సమావేశాలకు హాజరు కావడానికి చలమేశ్వర్ నిరాకరించారు. అనంతరం 'కొలీజియం' నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను సర్వోన్నత న్యాయస్థానం 'వెబ్‌సైట్'లో అందరికీ అందుబాటులో ఉంచాలని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని 'కొలీజియమే' తీర్మానించింది. ఇది చలమేశ్వర్ అభ్యంతరాల చలవే! ఆ తీర్మానం తరవాతే చలమేశ్వర్ 'కొలీజియం' సమావేశాలకు హాజరయ్యారు.

మేలిమి తీర్పులు

గౌహతి, కేరళ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా చలమేశ్వర్ ఎన్నో మంచి తీర్పులు చెప్పారు. సమాచార సాంకేతిక చట్టంలోని 66-ఎ సెక్షన్ చెల్లదని న్యాయమూర్తి రోహింటన్ నారీమన్‌తో కలిసి చలమేశ్వర్ వెలువరించిన తీర్పు విశిష్టమైంది. ఎవరికైనా ఆగ్రహమో, అసౌకర్యమో కలిగించే సమాచారం అంతర్జాల ఆధారిత సామాజిక మాధ్యమాలలో ఉంచితే వారిని అరెస్టు చేయడానికి, మూడేళ్ల జైలు శిక్ష విధించడానికి ఉద్దేశించిన నిబంధన అది. అయితే ఇతర మాధ్యమాలకు ఈ నిబంధన వర్తించనప్పుడు అంతర్జాల మాధ్యమాలకు సైతం దీన్ని వర్తింపజేయరాదని న్యాయమూర్తులు నారీమన్, చలమేశ్వర్ తేల్చి చెప్పి భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడారు. ఆ నిబంధన కింద ఎంతోమంది అమాయకులు కటకటాల పాలయ్యారు. 2012లో శివసేన అధినేత బాల్ ఠాక్రే మరణించిన సందర్భంగా ముంబయిలో బంద్ పాటించడాన్ని అభ్యంతర పెట్టిన ఇద్దరు అమ్మాయిలను ఆ నిబంధన కింద అరెస్టు చేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లో నాటి మంత్రి ఆజంఖాన్‌ను విమర్శిస్తూ 'ఫేస్‌బుక్'లో రాసినందుకు 2015 మార్చి 17న విద్యార్థి విక్కీఖాన్‌ను అరెస్టు చేశారు. 2012 అక్టోబర్‌లో కార్తీ చిదంబరాన్ని విమర్శించినందుకు 46ఏళ్ల ఓ వ్యాపారిని నిర్బంధించారు. అవినీతికి వ్యతిరేకంగా వ్యంగ్య చిత్రాలు గీసిన అసీం త్రివేదీని జైలులో పెట్టారు. మమతా బెనర్జీకి వ్యతిరేకంగా గీసిన ఒక కార్టూన్‌ను 'ఫేస్‌బుక్'లో ప్రచారంలో పెట్టినందుకు కోల్‌కతా ప్రొఫెసర్ అంబికేశ్ మహా పాత్రను నిర్బంధించారు.

రాజ్యాంగంలోని 19(1)-ఎ అధికరణ భావ ప్రకటన స్వేచ్ఛకు అవకాశం కల్పిస్తోంది. 19(2) అధికరణ ఆ స్వేచ్ఛకు కొన్ని పరిమితులు విధిస్తోంది. 66-ఎ సెక్షన్ ఆ పరిమితులను నేరాలుగా పరిగణించింది. అది రాజ్యాంగ విరుద్ధం అని న్యాయమూర్తి నారీమన్‌తోపాటు చలమేశ్వర్‌తో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పి- భావ ప్రకటన స్వేచ్ఛకు పట్టం కట్టింది. పౌర హక్కుల పరిరక్షణ కోసం సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుల వరసలో ఈ తీర్పునకు చిరస్థానం ఉంటుంది. అశాంతికి అంటుకట్టి, జాతి భద్రతకు భంగం కలిగించనంతకాలం- ప్రజామోదం లేకపోయినప్పటికీ ఏ చర్చనూ, అనుకూల వాదాన్నీ నిరోధించేందుకు వీల్లేదని అందువల్ల నిబంధన 66-ఎ రాజ్యాంగ విరుద్ధమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఆధార్ కార్డు లేనంత మాత్రాన ఏ వ్యక్తికీ ప్రభుత్వ సబ్సిడీలు అందకుండా అడ్డుకోరాదని ముగ్గురు న్యాయమూర్తుల (సుప్రీం) ధర్మాసనం తీర్పు చెప్పింది. న్యాయమూర్తులు శరద్ అరవింద్ బోబ్డే, చొక్కలింగం నాగప్పన్‌తో కూడిన ఆ ధర్మాసనంలో చలమేశ్వర్ సైతం ఉన్నారు. నిర్లిప్తతను ఛేదించి, వ్యవస్థ లోపాలను చర్చకుపెట్టి, ప్రజాస్వామ్య సంస్కరణలకు తెరతీసిన న్యాయమూర్తిగా చలమేశ్వర్ చిరస్మరణీయులు!

- ఆర్వీ రామారావ్

మధుర వాక్కు

అనేకానేక జీవరాశుల్లో మాట కలిగిన వాడు మనిషి ఒక్కడే. సరైన సమయంలో, సరైన విధంగా మాట్లాడే మాటలతోనే మనిషి, జీవన సాఫల్యం పొందగల వీలుంది. శిక్షణతో మాటలు నేర్వడం వల్లే పక్షిజాతిలో చిలుక భిన్నమై, ముద్దులొలికే పలుకులతో మన మనసులను ఆకట్టుకుంటుంది. పసితనంలో పిల్లలు వచ్చీరాని మాటలతో పెద్దలను మురిపిస్తారు. వాళ్లు మనసులో ఏదీ దాచుకోరు. కల్లాకపటం తెలియనితనం అది.

పెద్దవుతున్న కొద్దీ- ఎప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికా మాటలాడుతూ, మనసులోని భావాలను సంపూర్ణంగా వ్యక్తం చేయకుండా, లౌక్యం ప్రదర్శిస్తారు. ఒకవేళ ఎవరైనా నిస్సంకోచంగా, ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే- బోళామనిషి, ఏది మాట్లాడాలో, ఏది మాట్లాడకూడదో బొత్తిగా తెలియని వెర్రిబాగులవాడు అంటారు. యథార్థంగా మాట్లాడే వాళ్లకన్నా, మాట్లాడటంలో మర్మం చూపించే వాళ్లనే నమ్మేస్థితికి చేరుకున్నాం.

ఎదుటి మనిషిమీద మనకు మంచో చెడో ఒక అభిప్రాయం కలగడానికి కారణం- మాటే. మన వ్యక్తిత్వానికి చిరునామాగా నిలిచే మాటల్ని ఎంతో జాగ్రత్తగా ఆచితూచి ఉపయోగించాల్సి ఉంది.

మనం మాట్లాడే మాటలు అమృతం చిలకరించినట్లు ఉండాలే తప్ప, శరాల్లా మనసుల్ని గాయపరచకూడదని పెద్దలమాట. వినసొంపైన మాటే మంత్రంలా పనిచేసి పదిమందినీ దగ్గరకు చేరుస్తుంది. పరుషమైన మాట తన అనుకున్న వాళ్లను దూరం చేస్తుంది. కాగల కార్యాలను అడ్డుకుంటుంది. వినదగునెవ్వరు చెప్పిన- అంటూ మాట్లాడటం కన్నా, వినడంలోనే వినయం ఉందని గురువులు చెబుతారు. మాట్లాడటంలో సమతుల్యత, సంయమనం ఉండాలన్నది అంతర్లీనార్థం.

మంచి మాటలు మాట్లాడితే అంతటా, అందరికీ మేలే కలుగుతుంది. చక్కగా మాట్లాడటాన్ని ఓ కళగా చెబుతారు. అరవై నాలుగు కళల్లో వాచకాన్ని చేర్చారు. ఎలాంటి మాటలు పొరపాటునైనా నోటి నుంచి వెలువడకూడదో మన పూర్వీకులు స్పష్టంగా విశదీకరించారు. ఎదుటివారితో కఠినంగా మాట్లాడటం, అసత్యం పలకడం, పితూరీలు చెప్పడం, అసందర్భ ప్రలాపం... వీటికి దూరంగా ఉంటే వాచలత్వాన్ని అదుపు చేసుకున్నట్టే.

అంతర్యామి

భగవంతుణ్ని ప్రసన్నం చేసుకునే విధానంలోనూ మాటలదే పైచేయి. మంత్రాలు, శ్లోకాలు అన్నీ కమ్మని, వినసొంపైన మాటల సముదాయమే. బాధలకు తాళలేక కీర్తనల రూపంలో మొరపెట్టుకున్నా పెదవి విప్పని శ్రీరాముణ్ని పలుకే బంగారమాయెనా అంటూ సున్నితంగా నిలదీస్తాడు రామదాసు. అంతేకాక- ననూ బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లీ అంటూ తగిన సమయం చూసి, తన బాధను రామయ్య మనసు కరిగేలా విన్నవించమని అయోనిజనూ అర్థిస్తాడు. తిలకము దిద్దెరుగా, కస్తూరి తిలకము దిద్దెరుగా కలకలమను ముఖకళ గని సొక్కుచు పలుకులనమ్మ తమ లొలికెడు స్వామికి- అంటాడు త్యాగరాజు తన కీర్తనలో. మనసుతో వినగలగాలే కాని భగవంతుడివెప్పుడూ అమృత వాక్కులే!

మనోవాక్కాయ కర్మలను త్రికరణాలంటాం. మనసుతో ఆలోచించేది, నోటితో చెప్పేది, చేసే పని మూడూ ఏకోన్ముఖంగా ఉన్నప్పుడు మాత్రమే ఏదైనా చేస్తే దానికి సత్ఫలితం ఉంటుందన్నది శాస్త్రం. అంటే మనసులోని భావాల సంచయం ముందుగా మాట అవుతుంది. తరవాత పనిగా రూపాంతరం చెందుతుంది. మాట కచ్చితంగా ఉంటే చేసే పని లోపరహితంగా ఉంటుంది. సర్వజనావళినీ తన గానంతో అలరించే కోకిల వసంతకాలం వచ్చే వరకు మౌనంగా వేచి ఉంటుంది అన్నది చాణక్య నీతి. సమయం వచ్చేవరకు పెదవి విప్పకపోవడం మన గౌరవాన్ని ఇనుమడింపజేస్తుంది. సందర్భోచితంగా సంభాషించడం, ఆ ఘనతను కాపాడుకుంటూ చేసే ప్రియవచనం, తన స్థాయికి శక్తికి తగ్గట్టుగా ప్రదర్శించే కోపం- ఇవి తెలుసుకున్నవాడు విజ్ఞుడు అంటాడు చాణక్యుడు.

మాట నిక్కచ్చిగా ఉండి, దానికి కట్టుబడి ఉండే మనిషిని సమాజం ఆదరిస్తుంది, అనుసరిస్తుంది. మాట విలువ తెలిసిన మనిషి పొదుపుగా, జాగ్రత్తగా ఉపయోగిస్తాడు. సమయానుకూలంగా తన వాక్కుల్లో నవరసాలూ వ్యక్తం చేసే వ్యక్తి- మాట విలువ తెలిసిన మహనీయుడు, మాననీయుడు.

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

పట్టణ గుండెలు జాగ్రత్త!

మన దేశంలో ఎక్కువ మంది ప్రాణాలను 'గుండె జబ్బులే' బలి తీసుకుంటున్నాయి. అయితే ఈ గుండె జబ్బుల తీరు దేశమంతా ఒకే రకంగా లేదు.

కొన్ని ప్రాంతాల్లో ఈ ముప్పు ఎక్కువగా ఉంటే కొన్ని ప్రాంతాల్లో కొంత తక్కువగా ఉంటోంది. కాబట్టి దీని తీరుతెన్నులెట్లా ఉన్నాయో నిగ్గు తేల్చటం అవసరమని వైద్యరంగం ఎప్పటి నుంచో భావిస్తోంది. దీనికి సమాధానంగానే తాజాగా భారత పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్, హార్వర్డ్‌కు చెందిన టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంస్థలు రెండూ దేశవ్యాప్తంగా అధ్యయనం నిర్వహించాయి. దీనిలో.. పల్లెలతో పోలిస్తే పట్టణ ప్రజలకు, అలాగే దేశం మొత్తమ్మీద కేరళవాసులకు గుండె జబ్బుల ముప్పు ఎక్కువగా ఉంటోందని తేలటం ఆశ్చర్యకరం.

గుండె జబ్బుల ముప్పు ఎవరికి ఎక్కువ?

- పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారికి
- ముఖ్యంగా ఆదాయం ఎక్కువగా ఉంటున్న, సంపన్న కుటుంబాల్లో వారికి

పట్టణ విద్యావంతులకు ముప్పు ఎక్కువుండటం విస్మయకరం.

భారీ సర్వే

సర్వే కోసం దేశంలోని 29 రాష్ట్రాల్లో 27 రాష్ట్రాలను, 7 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఐదింటిని పరిశీలించారు. 34-70 ఏళ్ల మధ్య వయసున్న దాదాపు 8,00,000 మంది ఆరోగ్య స్థితిని అంచనా వేశారు. అలాగే జిల్లాస్థాయి ఇంటింటి సర్వే-4 (డీఎల్‌హెచ్‌ఎస్-4), రెండో వార్షిక ఆరోగ్య సర్వే వివరాలనూ క్రోడీకరించారు.

అంచనా

ముప్పు అంచనా కోసం ప్రఖ్యాత 'ఫ్రేమింగ్‌హ్యామ్' అధ్యయనంలోలాగే ఆర్థిక స్తోమతు, వయసు, చదువు, బరువు, రక్తంలో చక్కెర అధికంగా ఉందా? పొగ అలవాటుందా? హైబీపీ ఉందా? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

రకరకాల ముప్పులన్నింటినీ క్రోడీకరించి చూసినప్పుడు దేశం మొత్తమ్మీద గుండె జబ్బుల ముప్పు కేరళ వాసులకు అధికంగా (19.9%) ఉండగా ఝార్ఖండ్ వాసుల్లో అతి తక్కువగా (13.2%) ఉన్నట్టు వెల్లడైంది.

గుండెజబ్బుల ముప్పు దక్షిణ భారత ప్రజల్లో ఎక్కువగా కనబడుతోంది

తెలంగాణ వాసుల్లో 15-16% ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 18% వరకూ ఉండటం గమనార్హం.

పల్లెల్లో.. పేదింట.. పొగ!

- పల్లెల్లోనూ, అల్పాదాయ పేద వర్గాల్లోనూ 'పొగ' అతిపెద్ద ముప్పుకారకంగా ఉంటోంది. ఈ వ్యసనాన్ని దూరంగా ఉంచటం తక్షణావసరం.

పట్టణాల్లో.. జీవనశైలి!

- పట్టణాల్లోనూ, సంపన్న కుటుంబాల్లోనూ.. ఊబకాయం, మధుమేహం, హైబీపీ అతిముఖ్యమైన ముప్పు కారకాలుగా నిలుస్తున్నాయి. ఈ మూడూ కూడా మన జీవనశైలితో ముడిపడినవే. పైగా ఈ ముప్పులు పట్టణ ప్రాంతంలోని స్త్రీపురుషులు ఇరువురిలోనూ ఎక్కువగానే ఉంటున్నాయి.

యోగా జీవితంలో భాగం కావాలి

- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్యమంత్రి

ఈనాడు డిజిటల్, అమరావతి: యోగా, ధ్యానం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. శరీరాన్ని, మనసును ఏకకాలంలో నియంత్రించే శక్తి యోగాకు ఉందని, వీటివల్ల ఏ రంగంలోని వారైనా రాణించవచ్చని అభిప్రాయపడ్డారు. ఎన్నోరకాల మానసిక ఆందోళనలు, ఒత్తిళ్లు, ఆరోగ్య సమస్యలతో ప్రస్తుతం చాలా మంది ప్రజలు కుటుంబ వ్యవస్థకు దూరమై జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యోగా, ధ్యానం ప్రతి ఒక్కరూ అలవర్చుకుంటే జీవనం సాఫీగా ఉంటుందని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాలులో నిర్వహించిన యోగా వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సుమారు గంటసేపు విద్యార్థులతో ఆసనాలు వేసి అనంతరం ధ్యానం చేశారు. ప్రతి ఒక్కరం యోగా చేస్తామని, మానసిక ఒత్తిళ్లు దరి చేరకుండా ధ్యానం అలవాటు చేసుకుంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. 'ఎక్కువ మంది ఆనందం, ఆరోగ్యాన్ని మరిచి డబ్బు వెనుక పరుగెడుతున్నారు. మనిషికి సంపద అవసరమే. కానీ ఆనందం లేకపోతే జీవితానికి విలువే లేదని గుర్తించాలి. ప్రస్తుతం శారీరక సమస్యల కంటే మెదడుకు సంబంధించిన వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి. సమస్యకు పరిష్కారం మన చేతుల్లోనే ఉంచుకుని వైద్యుల వద్దకు పరుగులు పెట్టడం అర్థం లేని పని. ఈ సమస్యల నుంచి బయటపడేందుకు యోగా, ధ్యానమే మందు' అని ముఖ్యమంత్రి సూచించారు.

యోగ సాధన చేస్తున్న సీఎం చంద్రబాబు

ఆరోగ్యానికి నవ ఊపిరి

- ఆరోగ్య ఉత్సవంలో కొత్త ఆలోచనలతో వచ్చిన యువత
- సీఎం చేతుల మీదుగా అవార్డుల ప్రదానం

ఈనాడు – విశాఖపట్నం

దేశంలో పట్టిపీడిస్తున్న ఆరోగ్య సమస్యలకు చక్కటి పరిష్కారాలను చూపించింది యువత. విశాఖలో 4 రోజుల పాటు నిర్వహించిన ఆరోగ్య ఉత్సవంలో వీరి ఆవిష్కరణలు అద్భుతమనిపించాయి. తక్కువ ఖర్చుతో వైద్య పరికరాల తయారీకి వారు చూపిన చొరవ పలువురిని ఆకట్టుకుంది. ఆరోగ్య ఉత్సవం ద్వారా కొత్త పరిష్కారాల్ని వెలికితీయాలనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా ఆలోచనల్ని ఆహ్వానించి.. ప్రత్యేకంగా హాకథాన్ నిర్వహించారు. 3 ఉత్తమ పరిష్కారాల్ని బహుమతులకు ఎంపిక చేశారు. వీరికి గురువారం ముఖ్యమంత్రి చేతులమీద అవార్డులు, నగదు బహుమతులు అందజేశారు.

డ్రోన్‌తో రక్తం సరఫరా

రోడ్డు వసతి లేని గ్రామాలు మన దేశంలో చాలానే. అలాంటి మారుమూల ప్రాంతాలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని చేరవేసేందుకు దిల్లీకి చెందిన బీటెక్ విద్యార్థి జయదిత్య ఖన్నా, అతని మిత్రబృందం ఇచ్చిన ఆలోచనలు.. ప్రయోగాత్మకంగా చేసిన ప్రయత్నం అబ్బురపరిచింది. ఆరోగ్య ఉత్సవంలో మొదటి బహుమతిని సాధించింది. ఇతను చేసిందేంటంటే.. డ్రోన్‌లో ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసి ఉంచాడు. సుమారు 7 కి.మీ దూరం ఉన్న గ్రామానికి రక్తపు ప్యాకెట్లు తీసుకెళ్లేందుకు వీలుగా ప్రత్యేక డబ్బాను ఏర్పాటు చేశాడు. ఆ రక్తం ఏ గ్రామానికెళ్లాలి? ఎక్కడికి చేరాలనే అక్షాంశాలు, రేఖాంశాల్ని సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచాడు. ప్రత్యేకంగా ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య సేవలకు దీనిని ఉపయోగించవచ్చని ఖన్నా వివరించారు.

గ్లవ్‌తో ఫిజియో థెరపీ

గుండెపోటు వచ్చిన రోగుల్లో ఫిజియో థెరపీ ఫలితాన్ని గుర్తించడం కష్టంగానే ఉంటుంది. ఇప్పటివరకూ దీనికో ప్రమాణం లేదు. ఈ సమస్యకు సాంకేతికతతో చక్కటి పరిష్కారం ఇచ్చారు.. తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన యువతులు దీపికా గుణశేఖరన్, కృష్ణా శివానంద్. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ప్రస్తుతం కోయంబత్తూరులోని ఇంక్యుబేషన్ టవర్స్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వీరిద్దరూ ఒక కొత్త ఆలోచనతో ఈ ఉత్సవానికి వచ్చి రెండో బహుమతిని గెలుచుకున్నారు. చేతికి తొడిగే గ్లవ్‌లో ప్రత్యేక సెన్సార్లు అమర్చడం ద్వారా.. గుండెపోటు వచ్చిన రోగుల్లో ఫిజియో థెరపీ ఎంతమేర ఫలితం ఇచ్చిందనేది స్పష్టంగా తెలుసుకోవచ్చని వారు చేసి చూపించారు. రోగులతో వీడియో గేమ్‌లు ఆడించడం, ఇతర ఆసక్తికర పనులు చేయించడం ద్వారా వచ్చే కదలికల్ని బట్టి ఈ సెన్సార్లు వారిలో ఫిజియో థెరపీ ద్వారా ఎంతవరకు మేలు జరిగిందనేది చెప్పేస్తాయని వీరంటున్నారు. వీటిని ధరించి ఇంట్లోనే ఫిజియో థెరపీ చేయించి మంచి ఫలితాలు పొందొచ్చని ఈ యువతులు సూచిస్తున్నారు.

తండ్రీ కొడుకుల ప్రయోగం

పసిపిల్లల్లో వాంతులు, విరేచనాలు వచ్చినప్పుడు వారి ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణిస్తూ ఉంటుంది. శరీరంలోని నీరు ధారాళంగా బయటికిపోయి ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుంది. ప్రత్యేకించి ఇలాంటి పిల్లల శరీరం ఎంత నీరు కోల్పోయింది? ఎంత ఫ్లూయిడ్స్‌ని పంపించాలనేది అంచనా దొరకదు. ఈ సమస్యకు పరిష్కారం చూపించి మూడో బహుమతి సొంతం చేసుకున్నారు.. బెంగళూరుకు చెందిన మావోమ్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు వివేక్, ఆయన తండ్రి డాక్టర్ మారుతి. వీరిద్దరూ కలిసి బయో ఎంపెడెన్స్ డివైజ్ అనే పరికరాన్ని కనిపెట్టారు. ఈ పరికరాన్ని పిల్లల చేతులకు అనుసంధానించేందుకు వీలుగా స్టిక్కర్లు ఉంటాయి. దీని ద్వారా పిల్లల శరీరంలో ఎంత నీరు ఉంది? ఇంకా ఎంత నీరు అవసరం అనేది చెప్పేస్తున్నారు. ఈ డివైజ్‌కు ఉండే మానిటర్ ద్వారా ఆ గణాంకాల్ని ప్రత్యక్షంగా చూడొచ్చు. ఈ పరికరాన్ని విదేశాల నుంచి తేవాలంటే రూ.3 లక్షలు అవుతుందని, స్థానికంగా దొరికే వస్తువులద్వారా మన దేశంలో అతి తక్కువగా అందించవచ్చని వారు చెబుతున్నారు.

విశాఖ విమానాశ్రయంలో రూ.100 కోట్లతో టాక్సీట్రాక్

- నౌకాదళ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ విమానాశ్రయంలో ఎక్కువ విమానాలు రాకపోకలు సాగించడానికి వీలుగా రూ.100 కోట్లతో టాక్సీ ట్రాక్ నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. గురువారం విశాఖ వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో విమానాశ్రయంలో తూర్పు నౌకాదళపతి వైస్ అడ్మిరల్ కరంబీర్ సింగ్, ఇతర నౌకాదళాధికారులు, పోర్టు ఛైర్మన్ ఎం.టి.కృష్ణబాబు, రాష్ట్ర విమాన ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గంటపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే విశాఖ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, ఈ పరిస్థితుల్లో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తే అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. ఆంక్షలు లేకుండా ఉండాలంటే ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలో చెబితే రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తొలుత టాక్సీ ట్రాక్ నిర్మిస్తే విమానాల రాకపోకలు పెరగడానికి అవకాశం ఉంటుందని, దానికి పోర్టుకు చెందిన 50 ఎకరాల స్థలం అవసరమవుతుందని నౌకాదళాధికారులు పేర్కొన్నారు. అక్కడే ఉన్న పోర్టు ఛైర్మన్ కృష్ణబాబు సానుకూలంగా స్పందించారు. విమానాశ్రయ అధికారులకు ముందుగా స్థలాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు అంగీకరించారు. నిర్మాణానికి 8 నెలల సమయం పడుతుందని విమానాశ్రయ డైరెక్టరు జి.ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సమయాలపై ఆంక్షలు విధిస్తే శ్రీలంక నుంచి విశాఖకు నడుపుతున్న విమానాన్ని తాము నడపలేమని శ్రీలంకన్ ఎయిర్‌వేస్ ఇప్పటికే తేల్చి చెప్పింది. శ్రీలంక విమానం రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చేస్తామని తూర్పు నౌకాదళాధిపతి గురువారం నాటి సమీక్షలో హామీ ఇచ్చారు. ఆంక్షల ప్రతిపాదన విషయాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని, ఈ లోపు తాను రక్షణశాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

జగన్ మోదీ రెడ్డిగా పేరు మార్చుకో

కుప్పం పర్యటనలో మంత్రి లోకేష్ ఎద్దేవా

శాంతిపురం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు 18 అంశాలపై న్యాయం చేస్తామని పార్లమెంటులో హామీ ఇచ్చి మాట తప్పిన ప్రధాని మోదీ ప్రభుత్వంపై పల్లెత్తుమాట అనని జగన్.. రాష్ట్ర ప్రజలను మోసగించేందుకు మాయమాటలు చెబుతున్నారని మంత్రి లోకేష్ విమర్శించారు. ప్రధానిని విమర్శించిన మరుక్షణం జైలుపాలు కావడం ఖాయమని భయపడే ఆవిధంగా వ్యవహరిస్తున్నారన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో గురువారం పర్యటించారు. శాంతిపురం మండల పరిధి రాళ్లబూదుగూరు, తుమ్మిశి ఐటీఐ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రసంగించారు. జగన్ పేరును 'జగన్‌మోదీరెడ్డి'గా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు.

25 లోక్‌సభ స్థానాలలో గెలుపుతో ప్రత్యేక హోదా: రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలను తెదేపా గెలుపొందడం ఖాయమని లోకేష్ స్పష్టం చేశారు. ఎవరు ప్రధాని అవుతారన్న విషయాన్ని చంద్రబాబు నిర్ణయిస్తారని... తద్వారా ప్రత్యేకహోదాను సాధించుకొని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకుందామన్నారు. నిరుద్యోగ భృతిని త్వరలోనే అందిస్తామన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి, ఎంపీ శివప్రసాద్, ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అలక వీడిన గంటా

- రెండు విడతలుగా సీఎంతో భేటీ
- చేదు అనుభవాలన్నింటినీ వివరించిన మంత్రి
- అనునయించిన చంద్రబాబు

ఈనాడు – అమరావతి, ఈనాడు – విశాఖపట్నం, న్యూస్‌టుడే– ఎంవీపీ కాలనీ: ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, మంత్రి నారాయణల కృషి, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రస్తుతానికి సమాధానపడ్డారు. ఒకింత తేడాతోనైనా ఎప్పటిలాగే విశాఖపట్నంలో జరిగిన ముఖ్యమంత్రి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం ఉదయమే గంటా నివాసానికెళ్లిన చినరాజప్ప పట్టుదలతో ఆయనతో కలిసి విమానాశ్రయానికి వెళ్లి సీఎంకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ముఖ్యమంత్రి తన వాహనంలో మంత్రి గంటాను ఎక్కించుకుని ప్రయాణంలో పావుగంటపాటు, ఆ తరువాత మధ్యాహ్న భోజన సమయంలో మరో పావుగంటకుపైగా మాట్లాడారు.

గత కొన్నేళ్లుగా తనకుపార్టీలో, ప్రభుత్వంలో ఎదురైన అనుభవాలను గంటా వివరించారు. విశాఖలో ఏం జరిగినా తనకే ముడిపెట్టడం, అన్ని విషయాల్లో తననే లక్ష్యంగా చేసుకోవడం ఇబ్బందికరంగా మారిందని చెప్పినట్లు వినికిడి. కాంగ్రెస్‌లో మంత్రిగా ఉన్నప్పుడే తన మెంటార్ చంద్రబాబు అని చెప్పానని గుర్తు చేసుకున్నట్లు తెలిసింది. 2014లో తిరిగి తెదేపాలో చేరినప్పటి నుంచీ వరుసగా ఎదురవుతున్న అనుభవాలన్నింటినీ ఒక్కొక్కటిగా వివరించారు. కారులో ప్రయాణించే సమయంలో పక్కనున్న కలెక్టరును చూపుతూ... తాను ప్రభుత్వ భూముల్ని తనఖా పెట్టిందీ, లేనిదీ ఆయనను అడిగి తెలుసుకోవచ్చని సీఎంకు సూచించినట్లు సమాచారం. భీమిలిలో ప్రధాన ప్రతిపక్షానికి కౌన్సిలర్ స్థాయి వ్యక్తి బాధ్యుడిగా ఉన్నారని, ఈ సారీ తాను అక్కడి నుంచే పోటీ చేసి 50వేల ఓట్లతో గెలిచే పరిస్థితి ఉంటే.. ఓడిపోతానని అనడం ఏమిటని అన్నట్లు తెలిసింది. వీటన్నింటినీ ఓపికగా విన్న చంద్రబాబు... మంత్రిని అనునయించారు. రాజకీయాల్లో ఇలాంటివన్నీ సహజమని, పట్టించుకోవద్దని సూచించినట్లు సమాచారం.

గంటానే భీమిలి అభ్యర్థి: చినరాజప్ప.. భీమిలి నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావే రాబోయే ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిగా పోటీ చేస్తారని ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప తెలిపారు. చర్చల అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భీమిలి నియోజకవర్గంలో ప్రతిపక్షమే లేదని.. మళ్లీ భీమిలి నుంచే పోటీ చేసి గెలుస్తానని గంటా ధైర్యంగా చెబుతున్నారని అన్నారు.

విశాఖలో జరిగిన ఆరోగ్య ఉత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి గంటా

చెప్పాల్సి వచ్చినప్పుడు చెబుతా: గంటా

గత మూడు రోజులుగా నెలకొన్న పరిణామాలు.. అలక వ్యవహారంపై స్పందించడానికి మంత్రి గంటా శ్రీనివాసరావు నిరాకరించారు. 'ఏం చెప్పాలో.. ఎప్పుడు చెప్పాలో నాకో ఆలోచన ఉంది.. చెప్పాల్సి వచ్చినప్పుడు చెబుతా'.. అని వ్యాఖ్యానించారు.

ఏ అధికారంతో మీడియా ముందు 'పరేడ్' నిర్వహిస్తున్నారు?

- ప్రమాణపత్రం దాఖలు చేయండి
- ఏపీ డీజీపీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: నిందితుల్ని, అనుమానితుల్ని మీడియా ముందుంచి బహిరంగంగా పరేడ్ చేయించడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వారి హుందాతనానికి, వ్యక్తిగత గోప్యతకు విఘాతం కలిగించే అధికారం పోలీసులకు లేదని స్పష్టం చేసింది. ఏ అధికారంతో పోలీసులు బహిరంగంగా వారిని మీడియా ముందు ప్రవేశపెడుతున్నారో తెలియజేస్తూ ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఏపీ డీజీపీని ఆదేశించింది. విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. తన తల్లి కావటి అలిమేలును నిందితురాలిగా అనుమానిస్తూ కర్నూలు జిల్లా ఆత్మకూరు డీఎస్పీ మాధవరెడ్డి మీడియా ముందు ప్రవేశపెట్టారని పేర్కొంటూ ప్రకాశం జిల్లా చీరాల మండలం ఆదినారాయణపురానికి చెందిన కావటి సాగర్ హైకోర్టును ఆశ్రయించారు. తన తల్లిని కోర్టులో హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం విచారణ సందర్భంగా పోలీసులు అలిమేలుతో వ్యవహరించిన తీరుకు సంబంధించిన ఫోటోలు, పత్రికలో ప్రచురితమైన వివరాల్ని కోర్టుకు సమర్పించారు. ఆ వివరాల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. నిందితులు, అనుమానితులను మీడియా ముందుంచి పత్రికల్లో, టీవీల్లో వచ్చే విధంగా అనుమతించే అధికారం పోలీసులకు లేదని పేర్కొంది. ఏ నిబంధన అందుకు అనుమతిస్తుందో చెప్పాలని డీజీపీని ఆదేశించింది.

2,400 కిమీ పూర్తయిన ప్రజాసంకల్ప యాత్ర

రాజోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లాలో కొనసాగుతున్న వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ప్రజాసంకల్ప యాత్ర' 2,400 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. గురువారం ఉదయం రాజోలు గ్రామీణ మండలంలోని చింతలపల్లి గ్రామంలోకి ప్రవేశించిన విపక్ష నేతకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. 2,400 కిలోమీటర్ల యాత్ర పూర్తయిన సందర్భంగా గ్రామంలో జగన్ కొబ్బరి మొక్క నాటారు. మరో కిలోమీటరు నడిచి ఉదయం 10 గంటలకు పాదయాత్ర ముగించారు. అనంతరం హైదరాబాద్‌కు పయనమయ్యారు.

చింతలపల్లిలో కొబ్బరి మొక్క నాటుతున్న జగన్

విభజన హామీలపై భాజపా సమాధానం చెప్పాలి: లోక్‌సత్తా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విభజనతో నష్టపోయిన నవ్యాంధ్రకు కేంద్రం ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారో భాజపా నేతలు సమాధానం చెప్పాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రత్యేక హోదా, విభజన హామీలు ఆంధ్రుల హక్కు. ఆంధ్రప్రదేశ్ అంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జమానా కాదు. 5 కోట్ల మంది ప్రజల'ని కేంద్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ప్రజలకు సేవలు అందడంలేదన్నారు.

ప్రకృతి చికిత్స కేంద్రంలో చేరిన కేజ్రీవాల్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకృతి వైద్య చికిత్స కోసం బెంగళూరు చేరుకున్నారు. గురువారం సాయంత్రం ఆయన దొడ్డ బిదరకల్లులోని జిందాల్ ప్రకృతి చికిత్స కేంద్రంలో చేరారు. పది రోజులు ఇక్కడే ఉండి వైద్య సేవలు పొందనున్నారు. గతంలోనూ కేజ్రీవాల్ ఇక్కడ చికిత్స పొందిన విషయం తెలిసిందే.

కడప ఉక్కుపై భాజపా మాయ మాటలు

- కర్మాగారం ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తుంటే ఎలా?
- రెండోరోజు ఆమరణదీక్షలో ఎంపీ సీఎం రమేష్ ఆగ్రహం

ఈనాడు, కడప: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రాన్ని నిలదీయాల్సిన భాజపా నాయకులు తలోమాట మాట్లాడుతున్నారని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ ధ్వజమెత్తారు. ఆ పార్టీకి చెందిన సోము వీర్రాజు, నరసింహారావు వంటి నాయకులు తెదేపా దీక్షకు మద్దతివ్వొదని చెబుతున్నారని.. ఉక్కు పరిశ్రమ ఇచ్చేది తామేనంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వారి కపట మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సుప్రీంకోర్టులో కేంద్రం ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని అఫిడవిట్ దాఖలు చేసినప్పుడు ఆ నేతలంతా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తమ దీక్షను నీరుగార్చేందుకు ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ఇది ప్రజా ఉద్యమమని మీరు(భాజపా) ఏం చేసినా రెట్టింపు అవుతుందని హెచ్చరించారు. 'కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కేంద్రం కాలయాపన చేస్తూనే గడిపేస్తామంటే ఎలా..?.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని, ఐదుకోట్ల మంది భవిష్యత్తును సమాధి చేస్తుంటే చూస్తూ ఉంటామా..'' అన్నారు. కడప జడ్పీ ప్రాంగణంలో ఆయన చేపట్టిన ఆమరణదీక్ష రెండోరోజుకు చేరుకుంది. దీక్షకు బీసీ, ఆర్టీసీ కార్మిక సంఘాలతో పాటు తెలంగాణ రైతు సంఘ నాయకులు, జూనియర్ కళాశాల విద్యార్థులు, ముస్లిం సోదరులు, మంత్రులు ఆదినారాయణరెడ్డి సుజయకృష్ణ మద్దతు ప్రకటించారు. ఎంపీతో పాటు దీక్ష చేస్తున్న ఎమ్మెల్సీ బీటెక్ రవికి వైద్యపరీక్షలు నిర్వహించి నీరసంగా ఉన్నట్లు గుర్తించారు.

మద్దతుదారులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎంపీ సీఎం.రమేష్. చిత్రంలో దీక్షలో ఉన్న ఎమ్మెల్సీ రవి, మంత్రి ఆదినారాయణరెడ్డి

రాజకీయాలకు అతీతంగా 'ఉక్కు' పోరాటం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు

విజయవాడ, న్యూస్‌టుడే: కడపలో ఉక్కు పరిశ్రమ వచ్చే వరకు విశ్రమించమని.. ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఈ నెల 29వ తేదీన కడప బంద్‌కు వామపక్షాలు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. ఉక్కు పరిశ్రమ సాధనకు రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు.

నాలుగేళ్లపాటు కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తెదేపా కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై తీవ్ర కాలయాపన చేసిందన్నారు. విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. కడప ఉక్కు పరిశ్రమ సాధనకు విద్యార్థుల భాగస్వామ్యంతో పోరాటం చేస్తామన్నారు. జనసేన రాజకీయ సలహాదారు మాదాసు గంగాధరం, వైకాపా విజయవాడ నగర అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

కాంగ్రెస్ గతే భాజపాకు: కేఈ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: హామీలను నెరవేర్చకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న భాజపాకు. కాంగ్రెస్ పార్టీ గతే పడుతుందని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి హెచ్చరించారు. గురువారం సాయంత్రం విశాఖలో మూడో విడత క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరంలో మూడు విడతల్లో 61వేల మందికి పట్టాలు పంపిణీ చేశామని, బదలాయింపు హక్కులూ కల్పించామన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన భూములకు నిరభ్యంతర ధ్రువపత్రాలు (ఎన్‌వోసీ) ఇస్తున్నామన్నారు. విశాఖలో కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేశామన్నారు. 22ఏ జాబితాల సవరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని వివరించారు.

పోలీసు స్టేషన్ల నిర్వహణ ఖర్చుల పెంపు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసు స్టేషన్ల నిర్వహణ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. స్టేషనరీ కొనుగోలు, దర్యాప్తు ఖర్చులు, ఇతర అవసరాలకు ఆయా స్టేషన్ల స్థాయిని బట్టి ప్రభుత్వం ప్రతి నెలా కొంత మొత్తాన్ని చెల్లిస్తోంది. పదేళ్ల కిందట నిర్ణయించిన మొత్తాల్నే ఇప్పటికీ చెల్లిస్తుండటంతో స్టేషన్ల నిర్వహణ భారంగా మారుతోంది. దీంతో పలుచోట్ల స్టేషన్ సిబ్బంది ఫిర్యాదుదారుల నుంచే నిర్వహణ ఖర్చులు వసూలు చేస్తున్నారు. మరోవైపు గత పదేళ్లలో నేరాల రేటు పెరిగింది. ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చుల కింద చెల్లిస్తున్న మొత్తాల్ని పెంచాలని కోరుతూ డీజీపీ ఎం.మాలకొండయ్య చేసిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏ.ఆర్.అనూరాధ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామీణ పోలీసు స్టేషన్లకు ఇప్పటిదాకా రూ.4,000 ఇస్తుండగా ఇక 8,000 ఇస్తారు. జిల్లా కేంద్రాల్లో పోలీసుస్టేషన్లకు రూ.6,000 నుంచి రూ.12,000కు, నగర కమిషనరేట్లలోని పోలీసుస్టేషన్లకు రూ.10,000 నుంచి రూ.15,000కు పెంచారు.

EDUCATION

★ Join B.Sc-Veterinary Sci/ B.Sc. Agriculture- 4Yrs, Eli : Bi.P.C - No EAMCET/No NEET -UGC Recog-Job Assistance. Admissions in Progress-Cont: ASIAN, VJA. ✆ 91333 40149/ 63094 93450

GOVERNMENT OF ANDHRA PRADESH
DEPARTMENT OF TECHNICAL EDUCATION
DIPLOMA IN PHARMACY and HM & CT
ADMISSION NOTIFICATION - 2018

1. Applications are invited from eligible candidates from the State of Andhra Pradesh for admission into three years Diploma course in Hotel Management & Catering Technology (HM & CT) and two years Diploma in Pharmacy offered at Govt./Aided/ Private Unaided & 2nd shift Polytechnics in existing Engineering colleges and Pharmacy Institutions, under the control of Department of Technical Education, A.P., Vijayawada.
2. **Eligibility :**
   i. For Diploma in HM&CT - Pass in Intermediate or equivalent.
   ii. For Diploma in Pharmacy - Pass in Intermediate (Bi.P.C. or M.P.C.) or 10+2 of CBSE, ICSE, (Bi.P.C. or M.P.C.).

For complete details visit: **http://www.dteap.nic.in, http://www.sbtetap.gov.in**
Commencement of submission / filing online application : 22.06.2018.

Sd/- G.S. PANDA DAS
SPECIAL COMMISSIONER
H/6030/2018, Dt: 21.06.2018

దగదర్తి విమానాశ్రయం నిర్మాణానికి ఎన్ఐఏఎల్‌తో ప్రభుత్వం ఒప్పందం

ఈనాడు అమరావతి: నెల్లూరు జిల్లాలోని దగదర్తి వద్ద ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో విమానాశ్రయ నిర్మాణం దిశగా మరో ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకి సంబంధించి నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్(ఎన్ఐఏఎల్) సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాయితీ ఒప్పందం చేసుకుంది. వెలగపూడిలోని సచివాలయంలో ఇంధన, ఐ అండ్ ఐ, సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.వెంకటేశ్వర్లు, ఎన్ఐఏఎల్ ఎండీ వి.ఉమేష్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అజయ్‌జైన్ మాట్లాడుతూ... దగదర్తి విమానాశ్రయం నుంచి 2020 జనవరి నాటికి విమానాల రాకపోకలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. విమానాశ్రయ నిర్మాణానికి వచ్చే ఆగస్టులో శంకుస్థాపన జరిగే అవకాశముందన్నారు. దగదర్తి విమానాశ్రయాన్ని పెద్దగా ఆడంబరాలు లేకుండా తక్కువ ఖర్చుతో నిర్మించనున్నారు. 1352 ఎకరాల్లో రూ.368 కోట్లతో నిర్మిస్తారు. ఏటా గరిష్ఠంగా 19 లక్షల ప్రయాణికులు రాకపోకలు సాగించేలా, 55 వేల టన్నుల వార్షిక సరకు రవాణా సామర్థ్యంలో నిర్మించనున్నారు. 3150 మీటర్ల పొడవైన రన్‌వే ఉంటుంది.

కొరియా హంగులతో అనంతపురం శిల్పారామం

ఈనాడు డిజిటల్, అమరావతి: అనంతపురంలో రూ.170 కోట్లతో నిర్మించనున్న శిల్పారామంలో కొరియన్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలని పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. కియా పరిశ్రమ ఏర్పాటైన నేపథ్యంలో ఇక్కడికి వచ్చే వారి అవసరాలను పరిగనలోకి తీసుకొని శిల్పారామంలో కొంత భాగాన్ని కేటాయించాలన్నారు. కొరియన్ సంస్కృతి ప్రతిబింబించేలా చేతి వృత్తులు, ఫుడ్ కోర్టు, ఇతరత్రా నిర్మాణాలుండాలని వివరించారు. అనంతపురానికి సమీపంలో బెంగళూరు జాతీయ రహదారి వద్ద 43 ఎకరాల విస్తీర్ణంతో నిర్మించనున్న శిల్పారామంపై ముఖేష్ కుమార్ మీనా గురువారం సచివాలయంలో సమీక్షించారు. 80 శాతం పనులు బీవోటీ విధానంలో, 20 శాతం పనులు ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రాజెక్టు ప్రణాళికను త్వరలో జరగనున్న ఏపీ పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ బోర్డు సమావేశంలో ఉంచనున్నారు.

ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా పి.నరసింహారావు పునర్నియామకం!

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడి(వైస్‌ఛైర్మన్)గా పి.నరసింహారావుకు మరోమారు అవకాశం కల్పించనున్నారు. ఆయన నియామకానికి సంబంధించిన దస్త్రానికి ముఖ్యమంత్రి కార్యాలయం ఆమోదం తెలిపింది. దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్నత విద్యామండలి మరో ఉపాధ్యక్షురాలు వలీకుమారి.. ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షురాలిగా, ఇన్నోవేషన్ సొసైటీ సీఈవోగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వలీకుమారిని పూర్తిస్థాయిలో ఇన్నోవేషన్ సొసైటీకే కేటాయించి, ఆమె స్థానంలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా ఆచార్య కోటేశ్వరరావును నియమించాలని ఉన్నత విద్యాశాఖ దస్త్రం పంపగా కోటేశ్వరరావు వివరాలు పంపాలంటూ సీఎం కార్యాలయం ఆదేశించింది.

TSRTC
ఈ-టెండరు ప్రకటన
పల్లె వెలుగు

టి.ఎస్.ఆర్.టి.సి. ఈ క్రింది మాధ్యమాల ద్వారా ప్రకటనల హక్కుల కొరకు కాంట్రాక్టర్ల నియామకం ఈ-టెండరు ఆన్‌లైన్ విధానంలో కోరబడుచున్నవి. (ఏ) నల్లగొండ, మహబూబ్ నగర్, మెదక్ మరియు నిజామాబాద్ రీజియన్‌లలోని బస్‌స్టేషన్‌ల యందు హోర్డింగ్‌లు మరియు లాలిపాప్ బోర్డుల ద్వారా (టెండర్ ఐడి-61873) (బి) అదిలాబాద్ రీజియన్‌లోని బస్‌స్టేషన్‌ల యందు లాలిపాప్ బోర్డుల ద్వారా (టెండరు ఐడి-61929) (సి) హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ రీజియన్‌ల నందు సిటీ ఆర్డినరీ బస్సులలో మహిళలు మరియు పురుషులను వేరు చేయు విభాగినుల (women partition wall) మీద (టెండర్ ఐడి-61946) (డి) సికింద్రాబాద్ రీజియన్‌లోని బస్సులలో సీటు వెనుక భాగంలో (టెండర్ ఐడి-61957) 1) బిడ్ దాఖలు తేది.22.06.2018 నుండి 09.07.2018 (సాయంత్రం 05.00 గంటల వరకు) 2) ఈ-టెండర్ నియమ నిబంధనలు మరియు టెండర్ ఫారాలను https://tender.telangana.gov.in లేదా www.tsrtc.telangana.gov.in" వెబ్‌సైట్ నుండి పొందవచ్చును. 3) పూర్తి వివరముల కొరకు చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (M&C) & డైరెక్టర్ (CP) TSRTC గారిని 9959225400/040-27616078 నంబరు నందు సంప్రదించగలరు. 4) ఎటువంటి కారణం చూపకుండానే ఏదైనా/అన్ని టెండర్లను తిరస్కరించు/రద్దు చేయు హక్కు TSRTC కి కలదు.
నెం.C4/10(12)/2018-OPD(M&C) తేది:22-06-2018 సం/- చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (M&C) & డైరెక్టర్ (CP)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీ రాజ్ శాఖ
నెం. 100/2018-19 ఇ- ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 18.06.2018
సూపరింటెండింగ్ ఇంజనీర్, పంచాయతీరాజ్ సర్కిల్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ("PMGSY") గ్రాంట్‌లో మంజూరు కాబడిన 1 పనికి గాను అంచనా విలువ రూ. 285.87 లక్షలతో చేపట్టుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ డాక్యుమెంట్ల లభ్యత 23-06-2018 నుండి. టెండర్లు స్వీకరణ తేది: 23-06-2018 నుండి 30-06-2018న మ.3.00 గం. వరకు. టెండర్లు సమర్పణ ముగింపు తేది: 30-06-2018 మ. 5.00 గం.లకు సాంకేతిక బిడ్ తేది: 02-07-2018న ఉ. 11.00 గం.లకు మరియు ఆర్థిక బిడ్ తెరచు తేది: 03-07-2018న ఉ.11.00 గం.లకు తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నుండి పొందవచ్చును.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీ రాజ్ సర్కిల్, ఏలూరు
DIPR No. 833/CL/Advt/1/1/2018-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఆర్.సి.నెం.టి6/08/నిట్ నెం.154 నుంచి 179 వరకు/ 18–19 తేది : 15.06.2018
సూపరింటెండింగ్ ఇంజనీర్, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు పరిధిలోని వివిధ నియోజకవర్గములలో సి.సి.రోడ్లు, బి.టి.రోడ్లు నిర్మాణము మరియు రెవివల్స్, షాదీఖానా భవన నిర్మాణము కొరకు టెండర్లు కోరబడుచున్నవి. **26 పనులకు అంచనా విలువ** : రూ. 5239.30 లక్షలు. 26 పనులకు టెండర్లు 29.6.2018 నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా కోరబడుచున్నవి. వివరములకై ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడవచ్చును.
DIPR No. 836/CL/Advt/1/1/2018-19 సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
నెం.టి.ఓ/ 02 నుండి 16/ 2018-19 ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్ట్ నోటీసు తేది: 11.06.2018
కార్యనిర్వాహక ఇంజనీరు, గూడూరు వారి పరిధిలో గల 15 సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకముల నిర్వహణ పనులు అంచనా విలువ : రూ. 365.90 లక్షలతో 14వ ఆర్థిక సంఘము నిధుల క్రింద ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు జారీచేయడమైనది. ఇ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ నోటీసు నెం.2 నుండి 5 వరకు, టెండరు షెడ్యూలు ప్రారంభ తేది : 25.6.2018 సా.5 గం. తరువాత. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు చివరి తేది : 9.7.2018 సా.3 గం. వరకు, బిడ్ స్వీకరణ చివరి తేది : 9.7.2018 సా.3.30 గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరచు తేది: 9.7.2018 సా॥ 4 గం.తరువాత. ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది: 12.7.2018 సా॥ 5 గం. తరువాత. నోటీసు నెం.6 నుండి 16 వరకు తేదీల వివరాల కోసం ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నందు చూడగలరు.
DIPR No. 841/CL/Advt/1/1/2018-19 సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స మరియు పారిశుద్ధ్య శాఖ, గూడూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు సవరణ నోటీసు
టెండరు నోటీసు నెం. 4/2018-19, తేది: 15-5-2018లోని, నిట్ నెం. 37 నుండి 64 వరకు సవరణ నోటీస్ నెం. 1/2018-19 తేది 14-6-2018 సవరించిన ప్రకారం: టెండరు నోటీసు నెం. 4/2018-19 తేది 15-5-2018 లో నిట్ నెం. 37, 38, 39, 40, 42, 47, 48, 50, 51, 53, 59, 61, 62/2018-19లోని పదమూడు ప్యాకేజిల క్రింద యాబది ఏడు పనులకు పి.ఆర్.రోడ్స్ (యస్.సి.పి) 2017-18 గ్రాంటు, పి.ఆర్.రోడ్స్ (యస్.టి.సి) 2017-18 గ్రాంటు నిధులతో పిలవబడి Online ద్వారా తేది 28-06-2018 నుండి చూడగలరు. వివరములు ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు
DIPR No. 855/CL/Advt/1/1/2018-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వార్డ్ క్లాసెస్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లి. (APBCCFC Ltd.,)
టెండరు ప్రకటన
"ఆదరణ పథకం క్రింద పనిముట్ల సరఫరా కొరకు సరఫరాదారుల ఎంపిక" నిమిత్తమై ప్రతిపాదన కొరకు అభ్యర్థన (RFP)
ఆదరణ పథకం పరిధిలోకి వచ్చే వృత్తులు-వడ్రంగి పని, బంగారం పని, కమ్మరి పని, ఇత్తడి పని మరియు లాండ్రి పనిముట్లు (దోబీలకు)
ఈ RFPలోని ఆదరణ పథకం క్రింద పనిముట్ల సరఫరా కొరకు వారి ప్రతిపాదనలను దాఖలు చేయవలసినదిగాది VC&MD APBCCFC Ltd. సరఫరాదారులను కోరుతున్నారు. (తయారీదారులు/అధీకృత డీలర్లు/సోల్ మార్కెటర్లు). G.O.Ms.1 వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, తేది: 10/3/2018 మరియు G.O.Ms.9 వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ తేది 19/6/2018 ద్వారా ఆదరణ పథకం వివరాలు జారీచేయబడినవి.
షెడ్యూలు మరియు సంప్రదించవలసిన వివరాలు దిగువ పేర్కొనబడినవి

RFP జారీ తేది మరియు సమయం	22.6.2018
ప్రిబిడ్ సమావేశం	28/6/2018 మ.గం. 3.00 లాండ్రి పనిముట్లు (దోబీలకు) RFP No. ADARANA (ii)-06/2018 29.6.2018 మ.గం. 3.00 (వడ్రంగి పని, బంగారం పని, కమ్మరి పని, ఇత్తడి పని పనిముట్లకు) RFP No. ADARANA (i) - 06/2018
ప్రిబిడ్ సమావేశ స్థలి	APBCCFC కార్యాలయము, 4వ అంతస్తు, విశాల్‌రెసిడెన్సి, VR సిద్ధార్థ కాలేజి సమీపాన, కానూరు, తాడిగడప, విజయవాడ–521 137.
బిడ్ డాక్యుమెంటు లభించబోవు వెబ్‌సైట్లు	http://www.aponline.gov.in/ http://ap.meeseva.gov.in / http://www.ap.gov.in
దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ మరియు సమయము	6.7.2018 సా.గం. 5.00
ప్రి-బిడ్ సందేహాలను పంపవలసినది	adaranabccfc@gmail.com
సంప్రదించవలసిన వ్యక్తులు	K.రాజేంద్రబాబు 80960 28832, Y.రామసుధాకర్ 89788 82153.

DIPR No. 187PP/CL/Advt/1/1/2018-19 సం/- విసి మరియు మేనేజింగ్ డైరెక్టర్

ట్రంప్ చిత్రపటానికి పూజలు..రక్తాభిషేకం

- **త్వరలోనే కలుద్దామంటూ జనగామ జిల్లావాసికి అమెరికా అధ్యక్షుడు ట్వీట్**

జనగామ, న్యూస్‌టుడే: తెలంగాణలోని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన బుస్సా కృష్ణ అనే యువకుడు ట్రంప్‌నకు వీరాభిమాని. ఏకంగా ఆయన్ని ఆరాధ్య దైవంగా పూజించే స్థాయికి అభిమానం వెళ్లింది. ఏడాది కాలంగా తన ఇంటిలో ట్రంప్ చిత్రపటాన్ని పూజిస్తున్నారు. వేలు కోసుకొని రక్త తర్పణం కూడా చేస్తున్నారు. కృష్ణ తన ఫేస్ బుక్ పేజీలో ట్రంప్ కోసం చేస్తున్న పూజలకు సంబంధించిన ఛాయాచిత్రాలు, దృశ్యాలను పోస్ట్ చేశారు. వీటిని అతని మిత్రులు ట్విటర్‌లోనూ ఉంచారు. తనను ఆరాధిస్తున్న కృష్ణ గురించి తెలుసుకున్న ట్రంప్ ఈ నెల 19న ట్విటర్ ద్వారా స్పందించారు. కోట్ల మంది భారతీయుల్లో కృష్ణను తన ఆప్తమిత్రుడిగా భావిస్తున్నాననీ, త్వరలోనే కలుద్దామని పేర్కొన్నారు. దీనిపై కృష్ణ స్పందిస్తూ.. తనకు ట్రంప్ అంటే ఎంతో అభిమానమన్నారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాకముందు చాలా ఏళ్లక్రితం డబ్ల్యూడబ్ల్యూఈ అనే కార్యక్రమంలో హోస్ట్‌గా వచ్చేవారనీ, చాలా ఉత్సాహంగా పాల్గొనేవారనీ, తొలిసారిగా ఆయన్ని అక్కడే చూశానన్నారు. అప్పట్నుంచే ట్రంప్ అభిమానిగా మారానని తెలిపారు. ట్రంప్‌లోని ముక్కుసూటితనం, చురుకుదనం తనకెంతగానో నచ్చుతాయనీ, ఆయన హావభావాలు తనలో విపరీతమైన ఉత్సాహాన్ని నింపేవన్నారు.

ఆటోలకు జీవితకాల పన్ను

- **చిన్నపాటి సరకు రవాణా వాహనాలకూ అమలు**

ఈనాడు డిజిటల్ – ఏలూరు

ఆటో, చిన్నతరహా సరకు రవాణా వాహనాలకు ఇకపై జీవిత కాల పన్ను విధించనున్నారు. ప్రయాణికుల ఆటోలకు 1శాతం, సరకులు తరలించే చిన్నతరహా వాహనాలకు 7శాతం పన్ను విధిస్తారు. వాహనంతో కలిపి సరకు బరువు 3,000 కేజీల లోపు ఉండే రవాణా వాహనాలు ఈ పరిధిలోకి వస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్నీ కలిపి 92 లక్షల వాహనాలున్నాయి. ఇందులో ఇలాంటి వాహనాలు పది శాతం దాకా ఉంటాయి. ఇప్పటి వరకూ వీటిపై మూడునెలలకోసారి పన్ను చెల్లింపు విధానం అమల్లో ఉంది. ఆటోలకు రూ.100, సరకు రవాణా వాహనాలకు రూ.550 నుంచి రూ.850 వరకు ఉండేది. అయితే దాదాపు 30శాతం వాహనదారులు పన్ను చెల్లించడం లేదు. ఇకపై నూతనంగా కొనే వాహనాలకు రిజిస్ట్రేషను సమయంలోనే జీవిత కాలపన్ను వసూలు చేసేస్తారు. అప్పుడిక 15 ఏళ్ల వరకు చెల్లించే అవసరం ఉండదు. దీనికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం ఆర్డినెన్సు తీసుకొచ్చింది. పాత వాహనాలకు కూడా ఇది అమలవుతుంది.

కొత్త వాహనాలకు జీవితకాల పన్ను ఇలా..

ప్రయాణికుల ఆటో షోరూమ్ ధరపై ఒక శాతం జీవితకాల పన్ను వసూలు చేస్తారు. ప్రస్తుతం ఆటో ఖరీదు రూ.1.80 లక్షల వరకు ఉంది. అంటే రూ.1,800 వరకు జీవితకాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. చిన్నపాటి సరకు రవాణా వాహనాలకు 7 శాతం వంతున వసూలు చేస్తారు.

అపరాధ రుసుములకు చరమగీతం

మూడునెలలకోసారి పన్ను చెల్లించే విధానంలో ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికానికి సంబంధించి పన్ను ఏప్రిల్ నెలలోనే చెల్లించాలి. మే 1న చెల్లించినా అపరాధ రుసుం 25శాతం, జూన్‌లో అయితే 50శాతం, అనంతరం నుంచి 100శాతం అదనంగా చెల్లించాలి.

పాత వాహనాలకు...

కాలపరిమితి	ఆటోలకు	వస్తువులు తరలించే వాహనాలకు
మూడేళ్లలోపు కొన్నవాటికి	1.5 శాతం	6.5 శాతం
3 నుంచి 6 సంవత్సరాలకు	1.4 శాతం	5 శాతం
6 నుంచి 9 సంవత్సరాలకు	1.3 శాతం	4 శాతం
9 సంవత్సరాల పైబడి	1 శాతం	1 శాతం

పన్ను కట్టకుండా రవాణా శాఖాధికారులు పట్టుకుంటే మాత్రం పై రుసుములకు రెట్టింపు స్థాయిలో వసూలు చేస్తారు. ఇకపై జీవితకాల పన్ను అమలు కానుండటంతో అపరాధ రుసుముల బెడద ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఎన్జీ రంగా వర్సిటీ ఆచార్యుల పదోన్నతులకు ఆమోదం

ఈనాడు, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సహాయ, సహ ఆచార్యులకు పదోన్నతులు కల్పించేందుకు పాలకమండలి ఆమోదించింది. గురువారం వర్సిటీ పరిపాలన భవన్ లాంలో.. ఉపకులపతి డాక్టరు వి.దామోదరనాయుడు అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. ఈ నెల 18 నుంచి 21వ తేదీల మధ్య సహాయ, సహ ఆచార్యులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపిన 171 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించేందుకు పాలకమండలి సభ్యులు ఆమోదించారు. లాంఫాంలోని జియోస్పేషియల్ కేంద్రం నిర్వహణకు రూ.29.98 లక్షలు, వర్సిటీ పరిపాలన భవనాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.19 లక్షలు కేటాయించారు. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి ఏడాదిలో పూర్తిచేసేందుకు ప్రణాళిక రూపొందించామని ఉపకులపతి దామోదరనాయుడు సభ్యులకు తెలిపారు. సమావేశానికి పాలకమండలి సభ్యులుగా ఉన్న పార్వతీపురం, విజయనగరం ఎమ్మెల్యేలు చిరంజీవులు, మీసాల గీత, ఇతర సభ్యులు హాజరయ్యారు.

పవర్ అంతా అవినీతికే..

- **ఏసీబీకి చిక్కిన కావలి రూరల్ విద్యుత్తు లైన్ ఇన్‌స్పెక్టర్**

సూరే లక్ష్మీరెడ్డి

కావలి, న్యూస్‌టుడే: శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రూరల్ విద్యుత్తు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సూరే లక్ష్మీరెడ్డి ఆస్తులపై గురువారం ఏసీబీ అధికారులు దాడులుచేశారు. ఆదాయానికి మించిన ఆస్తులున్నాయన్న సమాచారం మేరకు.. ఏసీబీ డీఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కావలి, జలదంకి, ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని వల్లూరులో ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకు సోదాలు నిర్వహించారు. ఆస్తులకు సంబంధించిన పలు పత్రాలను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ప్రస్తుతం లభ్యమైన పత్రాల ఆధారంగా రూ.1.80 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించామని, వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో ఇంకా ఎక్కువగా ఉంటుందని డీఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. లక్ష్మీరెడ్డి సొంతూరు జలదంకి. ఆయన తొలుత విద్యుత్తు శాఖలో సహాయకునిగా, ఆ తర్వాత లైన్‌మెన్‌గా విధులు నిర్వహించారు. పదోన్నతిపై ఇన్‌స్పెక్టర్‌గా బోగోలు మండలంలో విధులు నిర్వహిస్తూ మూడు రోజుల క్రితం బదిలీపై కావలి రూరల్‌కు వచ్చారు. ఆయన విద్యుత్తు ఉద్యోగుల సంఘం నాయకునిగా కూడా పనిచేస్తున్నారు.

గుర్తించిన ఆస్తులు: ★ **ఇళ్లు:** కావలిలో నాలుగు, జలదంకిలో రెండు, ప్రకాశం జిల్లాలోని వల్లూరులో 1
★ **పొలాలు:** లక్ష్మీరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, బంధువుల పేర్లపై 50 ఎకరాల వ్యవసాయ భూమి
★ **ప్లాట్లు, రొయ్యల సాగు:** కావలి పట్టణంలో రెండు ప్లాట్లు, బోగోలు మండలంలోని వెంకటేశ్వరపాలెంలో ఎనిమిది ఎకరాల్లో రొయ్యల చెరువులు. (రొయ్యలసాగులో ఇప్పటివరకు రూ.39 లక్షలు వెచ్చించినట్లు గుర్తించారు.)
★ **నగదు, ఆభరణాలు:** బ్యాంకు ఖాతాలు, లాకర్లలో రూ. 9.57 లక్షలు, 23 సవర్ల బంగారం

అగ్రిగోల్డ్ కేసులో అభియోగపత్రాలు!

15రోజుల్లో పూర్తి చేసేందుకు సీఐడీ సన్నద్ధం

ఈనాడు, అమరావతి: వివిధ రకాల ఆకర్షణీయ పథకాల పేరిట ప్రజల నుంచి భారీగా డిపాజిట్లు సేకరించి కాలపరిమితి ముగిశాక... చెల్లించకుండా బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్ సంస్థపై రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన అన్ని కేసుల్లోనూ పదిహేను రోజుల వ్యవధిలో అభియోగ పత్రాలు దాఖలు చేసేందుకు ఏపీ సీఐడీ సిద్ధమవుతోంది. పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడు పోలీసుస్టేషన్ పరిధిలో 2015 జనవరిలో నమోదైన కేసుకు సంబంధించి ఇటీవల ఏలూరు న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేసింది. వచ్చే నెల మొదటి వారంలోగా మిగతా అన్నీ కేసుల్లోనూ ఇలాగే ముందుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2014లో అగ్రిగోల్డ్ కుంభకోణం వెలుగులోకి రాగా, అదే సంవత్సరం డిసెంబరు 24న నెల్లూరు మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ సంస్థపై రాష్ట్రంలో తొలి కేసు నమోదైంది. ఆ తర్వాత వరుసగా... పశ్చిమగోదావరి, కడప, చిత్తూరు, కర్నూలు, రాజమహేంద్రవరం, కర్నూలు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పలు పోలీసుస్టేషన్లలో మొత్తం పది కేసులు నమోదయ్యాయి. తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వీటన్నిటినీ సీఐడీకి అప్పగించింది. అత్యంత కీలకమైన ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తికావడం, దానిలో సంస్థ అక్రమంగా డిపాజిట్లు సేకరించిన తీరు, ఖాతాదారులను మోసగించిన విధానం తదితర అంశాలకు సంబంధించి శాస్త్రీయ ఆధారాలు లభ్యమవ్వడంతో అభియోగపత్రాలు వేయడంపై సీఐడీ ఇప్పుడు దృష్టిసారించింది. అన్ని కేసుల్లోనూ పదిహేను రోజుల వ్యవధిలో అభియోగపత్రాలు దాఖలు చేసేందుకు వీలుగా సీఐడీ విభాగాధిపతి సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ఆర్థిక నేరాల విభాగం అదనపు డీజీపీ అమిత్‌గార్గ్ దర్యాప్తు అధికారులతో సమీక్షిస్తూ...అవసరమైన సూచనలు అందిస్తున్నారు.

సోనియాతో కమల్ భేటీ

చెన్నై, న్యూస్‌టుడే: మక్కళ్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు కమల్‌హాసన్ గురువారం దిల్లీలో యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడులోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిపై ఇరువురూ చర్చించారు. అది మర్యాదపూర్వక భేటీయేనని కమల్‌హాసన్ విలేఖరులతో పేర్కొన్నారు. విపక్ష పార్టీలను ఏకతాటిపైకి తెచ్చే అంశంలో కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతారా అన్న ప్రశ్నకు.. ఆ అంశాల గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటవుతుందని చెప్పారు. గాంధీ కుటుంబంతో తనకు వ్యక్తిగత బంధం ఉందన్నారు. బుధవారం ఆయనరాహుల్‌గాంధీతో సమావేశమయ్యారు.

తెదేపా అవినీతిని బయటపెడతాం: కన్నా

బలగ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో తెదేపా అవినీతి మితిమీరిపోయిందని.. తగిన ఆధారాలతో త్వరలోనే ఆ పార్టీ రంగును బయటపెడతామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం శ్రీకాకుళంలోని భాజపా జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తున్న నిధులను తీసుకుంటూ.. తిరిగి ఎదురుదాడి చేస్తున్నారని చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ అవినీతిని నిరూపించలేకపోతే జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమే అని కన్నా సవాలు విసిరారు. చంద్రబాబు దర్శకత్వంలో సీఎం రమేష్ లాంటి పాత్రధారులు బాగా నటిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాయలసీమ అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని ఆయన చెప్పారు.

గృహహింసతో తగ్గుతున్న రాష్ట్ర స్థూల ఉత్పత్తి

- **ఏపీ ప్రాధాన్యాల ప్రాజెక్టు అధ్యయనం**

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీలపై గృహహింస మూలంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 1.8 శాతం తగ్గిపోతోంది. దీని విలువ రూ.13,000 కోట్లు అని ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యాల ప్రాజెక్టు అధ్యయనం తేల్చింది. దీని నియంత్రణకు సిఫార్సు చేసిన కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం రూపాయి ఖర్చు చేస్తే రూ.20 ప్రతిఫలం లభిస్తుందని పేర్కొంది. ఏపీ ప్రభుత్వం వివిధ రంగాలపై చేస్తున్న ఖర్చుతో ఎలాంటి విధానాలను అమలు చేస్తే మెరుగైన సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుంది? గరిష్ఠ ప్రయోజనం చేకూరుతుంది? అనే అంశంపై టాటా ట్రస్ట్, కోపెన్‌హాగెన్ కాన్‌సెన్సెస్ కేంద్రాలు 'ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యాల ప్రాజెక్టు' పేరిట సంయుక్తంగా అధ్యయనం నిర్వహించాయి. రాష్ట్రంలోని దాదాపు 600 మంది అధికారులు, నిపుణలతో చర్చించి, వారి నుంచి సమాచారం సేకరించి దాని ఆధారంగా మొత్తం 22 రంగాల్లోని 77 అంశాలను విశ్లేషించి పరిశోధన పత్రాలను సిద్ధం చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా పేరు గడించిన ఆర్థికవేత్తలతో ఏర్పడిన ప్రముఖుల మండలి ఈ అధ్యయనం చేసింది. ఆ ఫలితాలను కోపెన్‌హాగెన్ కాన్‌సెన్సెస్ అధ్యక్షుడు డా.బియార్న్ లోమ్‌బర్గ్ విజయవాడలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

వివరాలు వెల్లడిస్తున్న బియార్న్ లోమ్‌బర్గ్

- ■ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ పరిమాణం ఏటా దాదాపు రూ.25 వేల కోట్ల మేర పెరుగుతోంది. ఈ అదనపు నిధులను పోషకాహారం, విద్య, ఆరోగ్యం, గృహహింస నిర్మూలన కార్యక్రమాలపైన వెచ్చిస్తే మెరుగైన ఫలితాలు సాధ్యపడతాయి.
- ■ గర్భిణులకు పౌష్టికాహారం సరఫరా చేసే కార్యక్రమంపై వెచ్చించే ప్రతి రూపాయికి రూ.40 ప్రతిఫలం ఉంటుంది.
- ■ పోషకాహార లోపం, ఆరోగ్యపరమైన అంశాల్లో శ్రద్ధపెట్టి చేసే ప్రతి రూపాయి ఖర్చుకు రూ.69 ప్రయోజనం పరోక్షంగా కలుగుతుంది.
- ■ ఏపీలో గుండె సంబంధిత వ్యాధుల తీవ్రత అధికంగా ఉంది. దీన్నీ నియంత్రించేందుకు 30-69 వయోవర్గానికి చెందిన వారికి ముందస్తు ఆరోగ్య పరీక్షలు నిర్వహించగలిగితే 13 ఏళ్ల వ్యవధిలో 2.6 లక్షల మరణాలను అరికట్టొచ్చు.
- ■ మా అధ్యయన అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించాం. వాటి అమలుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. రెండు నెలల్లో కార్యాచరణ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం.

ఆర్థిక వేత్తల ప్రముఖుల మండలిలో.. నార్వే దేశానికి చెందిన నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ ఫిన్ కిడ్‌ల్యాండ్, ఆక్స్‌ఫాం ఇండియా సీఈవో నిషా అగర్వాల్, గ్లోబల్ అలయెన్స్ ఫర్ ఇంప్రూవ్డ్ న్యూట్రిషన్ అధ్యక్షురాలు వినితా బాలీ, ఇండియన్ ఎకనమిక్ అసోషియేషన్ అధ్యక్షుడు మహేంద్ర దేవ్‌లు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

రిజిస్ట్రార్ల సంఘం వెల్లడి

ఈనాడు, అమరావతి: ఎట్టకేలకు ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని జూనియర్ అసిస్టెంట్లలో సీనియర్లకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి అధికారికంగా నిర్ణయం తీసుకున్నారని.. రిజిస్ట్రార్ల సంఘం అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి జీవీ కొండారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించిందని పేర్కొన్నారు.

వ్యవసాయ విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రవేశ పరీక్ష తేదీలు, కేంద్రాల సమాచారాన్ని విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.angrau.ac.in లో పెట్టామని పీజీ కోర్సుల డీన్ డాక్టర్ బాలగురవయ్య గురువారం తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

ఆక్వా పార్కు పైపులైను నిర్మాణం ఆపేయాలి

- **సెల్‌టవర్ ఎక్కి ముగ్గురు ఆందోళనకారుల డిమాండ్**

వీరవాసరం, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం గ్రామీణ మండలం తుందుర్రులో ఆక్వా ఫుడ్ పార్కు పైపులైన్ల ఏర్పాటు పనులు నిలిపివేయాలంటూ ఆ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సెల్‌టవర్ ఎక్కారు. పైపులైన్ల ఏర్పాటు పనులను నిలివేయాలని గతంలో గ్రామస్థులు ఆందోళన చేయగా అప్పట్లో నిలిపివేశారు. గురువారం పార్కు యాజమాన్యం పోలీసు బలగాల సహాయంతో పైపులైను ఏర్పాటు పనులను ప్రారంభించారు. పనులు జరుగుతున్న సమయంలో గ్రామంలో ఎటువంటి ఆందోళనలు, నిరసనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తుందుర్రు గ్రామానికి చెందిన ఆక్వా ఫుడ్ పార్కు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు ఆరేటి సత్యవతి, కొయ్యే సంపతరావు, కొయ్యే పెదపాలు పోలీసుల కన్నుగప్పి సమీప గ్రామాలైన మత్స్యపురి, కొప్పరు గ్రామాలకు చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటలకు సెల్‌టవర్లు ఎక్కి పైపులైన్ల పనులు నిలివేయాలని డిమాండ్ చేశారు. రాత్రి 9 గంటల సమయం వరకూ వారు సెల్ టవర్ల పైనే ఉన్నారు. మత్స్యపురిలో సెల్‌టవర్‌పై ఉన్న ఆరేటి సత్యవతితో వీరవాసరం తహశీల్దార్ ఎం.ముక్కంటి చర్చిస్తున్నారు. కొప్పర్రులో టవర్‌పై ఉన్న కొయ్యే సంపతరావు, పెదపాలుతో అక్కడ వీఆర్వో నరసింహస్వామి మాట్లాడుతున్నారు. సంఘటనా స్థలంలో పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఉన్నారు.

సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న సత్యవతి

ఎంఎల్ఎస్ పాయింట్లపై ఆకస్మిక దాడులు

15 గిడ్డంగుల నిర్వాహకులపై కేసులు

ఈనాడు డిజిటల్, అమరావతి: పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలోని మండల స్థాయి గిడ్డంగుల (ఎంఎల్ఎస్)పై తూనికలు కొలతల శాఖ గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 25 బృందాలు 38 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాయి. 15 కేంద్రాల్లో ఉండాల్సిన బియ్యం కంటే.. తక్కువ ఉండడంతో వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు గోదాములో అత్యధికంగా 500 కిలోలు (4 శాతం), కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు గోదాములో 220 కిలోలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

ఆన్‌లైన్ ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో మోసాలు

- **దేశవ్యాప్తంగా రూ.5 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు**
- **సైబరాబాద్ పోలీసులకు చిక్కిన ముంబయి ముఠా**

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్ ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో దేశవ్యాప్తంగా పలువురు బాధితుల నుంచి రూ.5 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్ల ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాజేంద్రనగర్‌కు చెందిన శ్వేత అనే బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో ముఠా బాగోతం బహిర్గతమైంది. ముంబయి కేంద్రంగా నకిలీ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి మోసాలకు పాల్పడుతున్న నలుగురు నిందితుల్ని అరెస్టు చేసి రూ.13 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ముఠా కార్యకలాపాల గురించి సైబరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్.. నేరవిభాగం డీసీపీ జానకిషర్మిల, సైబర్‌క్రైమ్ ఏసీపీ శ్రీనివాసకుమార్‌తో కలిసి విలేకరులకు వివరించారు. ఆన్‌లైన్ ఫారెక్స్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలొస్తాయని శ్వేత నిందితులను ఫోన్‌లో సంప్రదించి రూ.1.92 లక్షల్ని పెట్టుబడిగా పెట్టారు. బాధితురాల్ని నమ్మించేందుకు 'మెటాట్రేడ్4 సాఫ్ట్‌వేర్ అప్లికేషన్' ద్వారా ఒక ఖాతాను సృష్టించిన నిందితులు.. ఆమెకు యూజర్ ఐడీ, లాగిన్ పాస్‌వర్డ్ ఇచ్చారు. లాభాలొస్తుండటంతో బాధితురాలు మరో రూ.7.26 లక్షలు పెట్టుబడి పెట్టారు. కొద్ది రోజుల అనంతరం రూ.1.18 లక్షల లాభం ఉన్నట్లు ఖాతాలో కనిపించడంతో ఆ సొమ్ము ఇవ్వాలని నిందితుల్ని బాధితురాలు ఫోన్‌లో అడిగారు. అప్పటి నుంచి నిందితులు సదరు ఫోన్ నంబరును స్విచ్ ఆఫ్ చేయడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు గత మే8న సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోజుకు 40వేల మందికి ఖరీదీ సందేశాలు: ముంబయి కేంద్రంగా 2017జులైలో సూరత్‌కు చెందిన షానవాజ్ అబ్దుల్ రెహమాన్ ఈ దందా ప్రారంభించినట్లు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, ఎస్సై కె.విజయ్‌వర్ధన్ దర్యాప్తు బృందం గుర్తించింది. మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాకి చెందిన అలోక్ పవార్(25), నికేత్‌షెట్టి(26), నవాజ్ అన్సారి(24)ని రెహమాన్ తన ముఠాలో చేర్చుకొన్నాడు. డేటాబేస్ ఇండియా.కో.ఇన్ లాంటి వెబ్‌సైట్ల నుంచి షేర్‌మార్కెట్ ఖాతాదారుల వివరాల్ని సేకరించి ప్రతి రోజు దాదాపు 40వేల మందికి ఫోన్ చేసి పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు చేశాడు. తొలుత బాధితుల ఖాతాలో లాభాలు చూపిస్తూ కొన్నాళ్ల తర్వాత ఖాతాలను తొలగించేవారు. అ తరహా దందాను తొలుత సూరత్‌కు చెందిన ఫరూఖ్ అహ్మదీ, మక్సూద్ అహ్మదీ ముఠా www.richforexmarkets.com వెబ్‌సైట్ ద్వారా ప్రారంభించి వదిలేయగా.. దాన్ని లఖాని కొనసాగించి దేశవ్యాప్తంగా దాదాపు 120 మందిని వంచించినట్లు దర్యాప్తులో తేలింది.

మెరుగవుతున్న వాజ్‌పేయీ ఆరోగ్యం

దిల్లీ: ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆరోగ్య పరిస్థితి క్రమేపీ మెరుగవుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు గురువారం వెల్లడించాయి. త్వరలోనే ఆయనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఛాతి, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లతో ఈనెల 11న వాజ్‌పేయీని ఎయిమ్స్‌లో చేర్పించగా.. నిపుణుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది.

ఈనాడు
విజయవాడ
శుక్రవారం జూన్ 22, 2018

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
autopage@eenadu.in

రయ్ రయ్

మోయలేనంత బరువు... అయినా ఫర్వాలేదు
దానిపైనే రైడ్ చేయాలనే కసి!
ధర చుక్కల్లోనే...
అయితే ఏంటట?
చుక్కల్లో
చంద్రుడిలా
ఒక్కసారైనా
ఊరేగాలనిపిస్తుంది!
మైలేజీ తక్కువ...
అయినా క్రేజీ క్రేజీ
ఫీలింగ్ తగ్గితేగా! బైక్ ప్రియులు అభిమాన
హార్లీ డేవిడ్‌సన్ గురించి చెప్పుకునే మాట ఇది.
నిన్నటిదాకా అది ఖరీదైన మోటార్‌సైకిల్...
ఇప్పుడు మధ్యతరగతికీ చేరువవుతోందిఫు...
ఈ అందాల రాక్షసి ఈమధ్యే అమెరికా,
భారత్‌ల మధ్య రాజుకున్న దిగుమతి
సుంకాల వివాదంలో వార్తాంశం అయింది.
అయినా జోరు ఆగట్లేదు! పదండి
దీనిపై అలా అలా
ఓ రౌండేసి వద్దాం.

స్ట్రీట్ 750
భారత్‌లో అత్యధికంగా అమ్ముడవుతున్న సూపర్‌బైక్. ఏడాదికి రెండువేల రెండువందలు అమ్ముడవుతున్నాయి.

దేశవ్యాప్తంగా 27 హార్లీ డేవిడ్‌సన్ డీలర్‌షిప్‌లు ఉన్నాయి. హైదరాబాద్ షోరూం ఇండియాలో మొదటిది.

అందాల రాక్షసి కోసం...

‘హార్లీ అంటే ప్రాణంలేని యంత్రం కాదు.. నాలో సగం’ అంటాడు ఆర్కిటెక్ట్ శరత్. ‘నేను హార్లీ యజమానిని’ అని గర్వంగా చెప్పుకుంటున్న హైదరాబాదీ. దాదాపు అందరిదీ ఇదే మాట. కొందరికి దాని స్టైల్ నచ్చితే.. హార్లీతోనే మాకో ప్రత్యేకమైన జీవనశైలి అనేవాళ్లు ఎందరో. ఎందుకింత పిచ్చిప్రేమ అంటే స్టైల్, డిజైన్, ఇంజిన్, పనితీరు.. ఎన్నో జవాబులొస్తాయ్. అందుకేమరి హై-ఎండ్ విభాగంలో దునియా మొత్తమ్మీద అత్యధికంగా అమ్ముడవుతున్న బైక్ ఇదే. దీన్ని రైడింగ్ చేయడం అంటే ఒక ప్రత్యేకమైన సంస్కృతిలో ఇమిడిపోవడమే.

అందుకే ప్రేమంటా

ప్రేమలో పడ్డ ఓ కుర్రాడు తన ప్రేయసిలో నచ్చే గుణాలే వివరిస్తాడు. హార్లీని ఇష్టపడ్డవాళ్లు ఏం చెబుతున్నారంటే...

- **భారీ రూపం:** భారీతనానికి ప్రతిరూపం హార్లీ. భారీకాయులు, కండరగండలు ఎక్కువమంది చూపు దీనిపైనే. హార్లీ రోడ్డుమీద వెళ్తుంటే చూపరుల గుండెలు దడదడలాడతాయ్. నడిపేవాళ్లకి రాజసం. ఇంత బరువున్నా క్షణాల్లో వంద కిలోమీటర్ల వేగం అందుకునే సత్తా దీనికుంది.
- **ఇంజిన్:** హార్లీకే ప్రత్యేకమైంది వీ-ట్విన్ ఇంజిన్. రెండు ఇంజిన్ల కలయికతో ఏర్పడింది. అంటే రెండు రెట్ల శక్తి దీని సొంతం. ఖరీదైన పోర్షె కారుకీ ఇదే టెక్నాలజీ వాడుతున్నారు. రోజులో వెయ్యి కిలోమీటర్లు అవలీలగా దాటేయొచ్చు.
- **రక్షణ:** ఒక్కసారి కిక్ కొడితే బిందాస్‌గా ఏడెనిమిది వందల కిలోమీటర్లు వెళ్లిపోవచ్చంటారు అభిమానులు. భారీ టైర్లు, వీల్‌బేస్ ఎక్కువ కావడంతో రోడ్డుపై పట్టుంటుంది. యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ ప్రమాదాల్లో రక్షణగా ఉంటుంది. కొన్ని మోడళ్లలో ఎయిర్ బెలూన్లు కూడా ఉన్నాయి.
- **సౌకర్యం:** వేల కిలోమీటర్లు ప్రయాణించినా అలుపన్నదే లేకుండా డిజైన్‌ని మలిచారు. కిందికి దిగిన సీటింగ్, భుజాలకు సమాంతరంగా హ్యాండిల్.. సౌకర్యవంతంగా ఉంటుంది.
- **రూపం:** డిజైన్‌లో మొదట్నుంచీ హార్లీది టాప్ గేరే. అందుకేనేమో అభిమానులు దీన్ని ముద్దుగా అందాల రాక్షసి, సెక్సీ బేబీ అంటూ పిలుచుకుంటారు. రైడింగ్‌లో దడదడదడమంటూ చేసే శబ్దం వింటుంటే ఎవర్కైనా రోమాలు నిక్కబొడుచుకోవాల్సిందే.
- **హాగ్స్:** హాగ్స్.. హార్లీ ఓనర్స్ గ్రూప్‌కి సంక్షిప్తం. ప్రపంచమంతా ఉన్నారు. నగరానికో చాప్టర్. తరచూ కలుసుకోవడాలు, వారాంతాల్లో టూర్లు. ఈ మజాని మోజుపడని వాళ్లు అరుదే.
- **మోడళ్లు:** భారత్‌లో పదిహేను వరకు మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతీదీ ప్రత్యేకమే. ప్రతి మోడల్ పేరూ భిన్నమే. ఫ్యాట్‌బోయ్, ఫ్యాట్ బాబ్, స్ట్రీట్ బాబ్, నైట్ వి రాడ్, ఐరన్... పేరులోనే ఓ వైబ్రేషన్ ఉంది. తక్కువ ఖరీదైంది స్ట్రీట్ 750. అత్యధిక వేగం గంటకు 180 కిమీలు.

కంపెనీ సైతం

హార్లీ మేరా ప్యారీ అనేవాళ్లు బోలెడుమంది. వాళ్లని ఆకట్టుకోవడానికి కంపెనీ కూడా చేయాల్సిందంతా చేస్తోంది. సెంచరీ దాటిన చరిత్ర సంస్థది. అమెరికాలో పుట్టి.. యూరోప్‌లో ఇరగదీసి ఎనిమిదేళ్ల కిందటే భారత్‌లో అడుగుపెట్టింది. విస్తరణ ప్రణాళికలు భారీగానే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఇరవై డీలర్‌షిప్‌లు తెరిచింది. ధరలు భారీగా ఉండటంతో మొదట్లో ఉన్నతవర్గాలకే అందుబాటులో ఉండేది. మధ్యతరగతివారినీ చేరువ కావడానికి స్ట్రీట్ 750 పేరుతో నాలుగున్నర లక్షల రూపాయల్లోపే ఓ బండిని విడుదల చేసింది. వాటి యజమాని కాకపోయినా కనీసం ఒక్కసారైనా బండి నడపాలని మోజు పడేవాళ్లు ఎంతోమంది. వీళ్లను చేరడానికి ఈమధ్యే యూజ్డ్ బైక్ విభాగం ప్రారంభించింది. హెల్మెట్లు, జాకెట్లు, చేయితొడుగులు.. రకరకాల యాక్సెసరీస్ తయారు చేసి అమ్ముతున్నారు. హరియాణాలోని బవాల్‌లో ఉత్పత్తి కేంద్రం కూడా తెరిచారు. బైకర్లలో జోష్ నింపడానికి తరచూ టూర్లు నిర్వహిస్తోంది.

ఇదొక ప్రేమబంధం

ఏడాదిన్నరగా హార్లీడేవిడ్‌సన్ బైక్ నడుపుతున్నా. ‘మైలేజీ, ఇంధన నిల్వ సామర్థ్యం తక్కువ. ఇదే ధరలో మంచి ఫీచర్లున్న బైక్ దొరుకుతుందిగా’ అంటుంటారు చాలామంది. కానీ హార్లీకి ఓ ప్రత్యేకమైన క్యారెక్టర్ ఉంటుంది. దానికి యజమాని కావడం అంటే ప్రత్యేకమైన జీవనశైలి ఏర్పరచుకోవడం. వేరే బైక్‌తో అది అసాధ్యం. సాధారణంగా మన వైఖరిని బట్టి నప్పే వాహనం ఎంచుకుంటాం. కానీ ఒక్కసారి హార్లీ మన సొంతమైతే ఆ రాజసం, దర్పానికి అనుగుణంగా మారిపోతాం. దాన్ని ఒంటరిగా వదిలి ఉండలేం. ఎక్కడ పార్కింగ్ చేసినా మనసంతా దానిపైనే ఉంటుంది. మొత్తానికి ఒక ప్రేమికురాలితో ఉండే అనుబంధంలా ఉంటుంది. హైదరాబాద్‌లో హాగ్ రైడర్ ఛాప్టర్ ఉంది. మేమంతా వారాంతాల్లో ఒక్కచోటికి చేరతాం. నగర శివార్లు, లాంగ్‌డ్రైవ్‌లకు వెళ్తుంటాం. ఆ సమయంలో మేం పొందే అనుభూతి మాటల్లో చెప్పలేం.

- **శరత్,** హార్లీడేవిడ్‌సన్ యజమాని

ప్రతి వారం టూరు

బైక్ కొనగానే వినియోగదారుడితో మా బంధం మొదలవుతుంది. సాఫ్ట్‌వేర్, యాక్సెస్సరీలు, సర్వీస్ అనే మూడు విభాగాలు సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రతి ఆదివారం మా షోరూం దగ్గర ‘హాగ్స్ రైడ్’ ఉంటుంది. కనీసం యాభైమంది పోగవుతారు. ఏదో ఒక టూరుకు వెళ్లేలా సమన్వయం చేస్తాం. ఐదు, పది, ఇరవై లక్షల రూపాయల విలువైన మా ఉత్పత్తిని ఒకరికి అమ్మినపుడు వాళ్లు సంతృప్తి పొందేలా చూడాల్సిన బాధ్యత మాది అని ఫీలవుతాం. హార్లీ కొనేవాళ్లలో ఐటీ, కార్పొరేట్ ఉద్యోగులు.. ఆర్కిటెక్ట్‌లు, న్యాయవాదులు, వ్యాపారస్తులు.. పలురకాల వృత్తుల వారున్నారు. అంతా ఒక కుటుంబంలా కలిసిపోతారు. ఈ హాగ్స్ కుటుంబసభ్యుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతూనే ఉంది. ఒక్క హైదరాబాద్‌లోనే నెలకు 25 వరకు బైక్‌లు అమ్ముతున్నాం. దేశవ్యాప్తంగా ఆ సంఖ్య 350. తక్కువ జీతం ఉన్నవాళ్లు సైతం కొనగలిగేలా ఎక్కువ కాలపరిమితితో రుణాలపై ఇస్తున్నాం.

- **రాకేశ్ జైస్వాల్,** హార్లీ డేవిడ్‌సన్ ప్రతినిధి

ఆవిష్కరణ

కాలుష్యమా.. బండి నడవదు

బేసిక్ నుంచి అత్యధిక ధర ఉండే భారీ బైక్ దాకా ప్రతి వాహనం కాలుష్యం వెదజల్లుతూనే ఉంది. మానవాళికి ఇప్పుడిదో పెద్ద సమస్య. మరి ఎవరెంత వదులుతున్నారు? దీన్ని ఆపేదెలా? అని ఆలోచించారు ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు. పరిష్కారంగా బీఆర్‌హెచ్‌ఎంఏఎస్ (బైకర్ అండ్ రైడర్ హెల్త్ మానిటరింగ్ విత్ యాంటీ థెఫ్ట్ సిస్టమ్) అనే పరికరం తయారు చేశారు. దీంతో ఏ వాహనం ఎంత కాలుష్యం వెదజల్లుతోంది అనే విషయం ఇట్టే తెలుస్తుంది. సెన్సర్లతో కూడిన ఈ పరికరాన్ని మన స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానించాలి. బండి ప్రారంభించి కొంతదూరం వెళ్లగానే ఆ వాహనం నుంచి కార్బన్ మోనాక్సైడ్, హైడ్రో కార్బన్లు, బయటికి వదిలే పొగ.. ఎంత వాతావరణంలోకి కలుస్తున్నాయో సెల్‌ఫోన్ తెర మీద చూపిస్తాయి. ఒకవేళ అది పరిమితికి మించి ఉంటే సందేశాల రూపంలో హెచ్చరికలు పంపుతాయి. పదిరోజుల్లో దాన్ని సరిచేయించకపోతే బైక్ స్టార్టవదు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు అమన్ చతుర్వేది, షిమోనా క్లేరీ, సౌమ్య తివారీ డిజైనర్లు. ఈ ఆవిష్కరణకు పలు అవార్డులు కూడా అందుకున్నారు.

చిట్కా

క్రోమ్ మెరుపులిలా

వాహనం ఏదైనా దాని క్రోమ్ భాగాలు (వెండి రంగులో ఉండేవి) తళతళ మెరుస్తుంటేనే చూడ్డానికి అందంగా ఉంటాయి. సర్వీసింగ్ సెంటర్‌కి తీసుకెళ్లి శుభ్రం చేయించడం కొంచెం ఖరీదైన వ్యవహారమే. మరేంటి పరిష్కారం? ఇంట్లో ఉండే వస్తువులతోనే వాటిని బాగా మెరిసేలా చేయొచ్చు. ముందు ఒక గుడ్డను తీసుకొని దానికి తెలుపు వెనిగర్ అద్ది క్రోమ్ భాగాలన్నింటిపై రుద్దాలి. తర్వాత ఒక కప్పు ఆల్కహాల్, మరో కప్పు నీరు, ఒక చెంచాడు వెనిగర్ కలిపిన మిశ్రమంతో ఆ గుడ్డను ముంచి మరింత గట్టిగా రాయాలి. తర్వాత కాసేపు ఆరబెట్టాలి. అయినా ఇంకా ఏవైనా మొండి మరకల్లాంటివి ఉంటే నిమ్మకాయబద్ద, బేకింగ్ సోడా వేసి రుద్దాలి. తర్వాత వాటిపై కాస్త బేబీ ఆయిల్ వేసి ఒక పొడిగుడ్డతో గెట్టిగా రుద్దితే మెరుపులే మెరుపులు.

ఔరా

ట్రాఫిక్ జాం @ 175కి.మీ.

- 175 కిలోమీటర్లు. ట్రాఫిక్‌జాం కారణంగా నిలిచిపోయిన వాహనాల బారుల పొడవు ఇది. బాప్‌రే.. అనిపిస్తుంది కదూ! ఇది ప్రపంచంలోనే అతి పొడవైన ట్రాఫిక్‌జాం. ఫ్రాన్స్‌లోని లియోన్ నుంచి పారిస్ వరకు ఫిబ్రవరి 16, 1980న ఏర్పడింది. అతి క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల కారణంగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి ఇలా జరిగింది. దీంతో స్థానికులతోపాటు, సెలవుల్ని సరదాగా గడపడానికి వచ్చిన వేలకొద్దీ యాత్రికులు ఇందులో ఇరుక్కుపోయారు.
- ప్రపంచంలోనే మొట్టమొదటి ఆటోమొబైల్ ప్రమాదం ఓహియోలోని క్లీవ్‌లాండ్‌లో 1891లో జరిగింది. జేమ్స్ విలియం లాంబార్ట్ అనే వ్యక్తి కారు నడుపుతూ రోడ్డుపక్కనున్న ఒక చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నడిపే వ్యక్తికి స్వల్ప గాయాలే అయినా ఇది తొలి ప్రమాదంగా చరిత్రలో నిలిచిపోయింది.

వాహన సురక్ష

హెల్మెట్ కన్నా ప్రాణం మిన్నా

- ఒక వాహనదారుడు తన వాహనానికి బీమా చేయించినా, ఐఎస్ఐ/బీఐఎస్ హెల్మెట్ వాడనపుడు ఏదైనా ప్రమాదానికి గురైతే నష్టపరిహారం చెల్లించడానికి బీమా కంపెనీలు తిరస్కరించే అవకాశం ఉందా? ఈమధ్య కర్నాటకలో ఇలాగే జరిగిందనీ, హైకోర్టు సైతం దీన్ని సమర్థించిందని పత్రికల్లో చదివాను. పూర్తి వివరాలు తెలియజేయండి.

  - **గోవిందప్ప,** అనంతపురం

భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) నిర్దేశించిన ఐఎస్ఐ మార్కు హెల్మెట్‌లనే ధరించాలనే నిబంధన బెంగళూరులో ఉంది. ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి బీమా సంస్థ నష్టపరిహారం ఇవ్వడానికి నిరాకరిస్తోందని హైకోర్టును ఆశ్రయించాడు. కానీ నాన్ ఐఎస్ఐ హెల్మెట్ ధరించిన కారణంగా మీరు పరిహారానికి అనర్హులంటూ కోర్టు తీర్పు చెప్పింది. అయితే ద్విచక్రవాహనం డ్రైవ్ చేసేటప్పుడు బీఐఎస్ మార్కు ఉన్న హెల్మెట్ ధరించాలని మోటార్ వెహికిల్ నిబంధనల్లో ఇంకా చేర్చారా? లేదా? అనేదానిపై స్పష్టత లేదు. ఇది నిబంధనల్లో భాగం అయితేనే దీని ఆధారంగా బీమా సంస్థ పరిహారాన్ని నిరాకరించే అవకాశం ఉంటుంది. ఇది తలకు అయ్యే గాయాలకు మాత్రమే పరిమితం అవుతుంది. మరోవైపు సురక్షితమైన హెల్మెట్ ధరించకపోవడంతో సహా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల క్లెయిం నిరాకరించవచ్చు. నిబంధనల సంగతి ఎలా ఉన్నా ప్రతి వాహనదారుడూ భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ధ్రువీకరించిన నాణ్యమైన హెల్మెట్ మాత్రమే ధరించాలి. ఎందుకంటే ఎవరి జీవితం అయినా వెయ్యి రూపాయల ధర ఉండే ఐఎస్ఐ హెల్మెట్ కన్నా ఎంతో విలువైంది.

- **సజ్జా ప్రవీణ్‌చౌదరి,** పాలసీబజార్ మోటార్ ఇన్సూరెన్స్ హెడ్

వాసన.. ఆ కథేంటో చూడు!

లోపల కూర్చోబోతుంటే.. ఏదో దుర్వాసన. డోరు తీసి కాసేపు అలా ఉంచేస్తే అంతా సెట్ అవుతుందని తేలిగ్గా తీసుకోవద్దు బాస్. ప్రతిదానికీ ఒక అర్థం ఉంటుంది. అది తెలుసుకుంటే కారుతోపాటు మన ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చు.

బూజు: కారులో ఏసీ ఆన్ చేయగానే ఒకలాంటి బూజుపట్టిన వాసన గుప్పుమంటుంది. దీనర్థం ఎయిర్ కండీషన్ లోపలి గోడల్లో ఫంగస్ పేరుకుపోయిందని అర్థం.

తీపి: సిరప్ వాసన, తీపి వాసన వస్తుందంటే కూలింగ్ సిస్టమ్‌లో ఏదో లీకేజీ అవుతోందని భావం. అత్యంత వేడిగా ఉండే హీట్ ఎక్ఛ్సేంజర్‌లో లోహం కరిగిపోయి అందులో నుంచి ఈ వాసన వెలువడొచ్చు. సాధారణంగా ఇది డాష్‌బోర్డ్‌కి వెనకాల ఉంటుంది. ఆవిరి రూపంలో క్యాబిన్‌లో ప్రవేశిస్తుంది. ఈ గాలి పీల్చితే ఆరోగ్యానికి మంచిది కాదు.

మంట: వేడిగా ఉండే ఇంజిన్ లేదా పొగగొట్టంపై ఇంధనం నేరుగా పడ్డపుడు ఈ మండే వాసన వెలువడుతుంది. లీకేజీ ఎక్కడుందో గమనించాలి.

కుళ్లిన కోడిగుడ్లు: క్యాటలిటిక్ కన్వర్టర్ చెడిపోతే కుళ్లిపోయిన కోడిగుడ్లు లేదా సల్ఫర్ వాసన వస్తుంది. ఇంజిన్ లేదా ఎమిషన్ సిస్టమ్‌లో ఏదైనా ఇబ్బంది ఏర్పడితే ఆ ప్రభావం క్యాటలిటిక్ కన్వర్టర్ మీద పడుతుంది.

రబ్బరు: ఇంజిన్‌తోపాటు ఇతర కీలక భాగాల్లో ఒకదాన్నొకటి కలిపేలా రబ్బరు బెల్టులుంటాయి. అవి పట్టు తప్పిపోయి దేనికిందైనా పడి నలిగిపోయినా, నడుస్తున్న యంత్రానికి ఒరుసుకుపోయినా అత్యధిక వేడి పుట్టి ఇలా వాసన వస్తుంది.

విద్యుత్తు: టోస్టర్‌లోని మాడిపోయిన బ్రెడ్ వాసన వస్తుందా? అయితే ఎక్కడో విద్యుత్తు వైర్ల షార్ట్‌సర్క్యూటైందనీ లేదా వైర్లు మాడిపోతున్నాయని గ్రహించాలి. అలక్ష్యం చేయకుండా వెంటనే అప్రమత్తం కావాలి.

ఇంధనం: కారు స్టార్ట్ చేయడానికి ప్రయత్నించిన ప్రతిసారీ ఇంజిన్‌లో దహన ప్రక్రియ జరిగి కొద్దిగా పెట్రోల్ లేదా డీజిల్ వాసన రావడం మామూలే. నిమిషాలు గడిచినా ఇంకా అలాగే ఉందంటే ఇంధన ట్యాంకు మూత పెట్టడం మర్చిపోవడమో, వదులుగా ఉండటమో అయ్యుండాలి. భాష్పీభవన ఉద్గారాల నియంత్రణ వ్యవస్థ (ఎవాపోరేటివ్ ఎమిషన్స్ కంట్రోల్ సిస్టమ్) .. ఆయిల్ లీక్ అవుతూ ఉండొచ్చు. లేదా ఇంధన ట్యాంకు నుంచి ఏవైనా లీకేజీలు ఉన్నాయేమో చూడాలి. ఏదేమైనా ఇవన్నీ ప్రమాదకరం. వెంటనే చెక్ చేయాలి.

కుళ్లిన: సీట్ల కింద ఏవైనా పండ్లు, అరటి తొక్కలు పడేసి మర్చిపోయి ఉంటే కుళ్లిపోయిన వాసన వస్తుంది.

ఈనాడు సినిమా

మహేష్‌బాబు

అతిథితో అదితి?

అదితిరావు హైదరి

టాలీవుడ్ 'అతిథి' మహేష్‌బాబు. ఎందుకంటే ఆ పేరుతో ఆయనో సినిమా చేశారు. ఇప్పుడు ఈ అతిథితో అదితి జట్టు కట్టబోతున్నట్లు తెలుస్తోంది. మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 25వ చిత్రం ఇప్పుడు సెట్స్‌పై ఉంది. వంశీ పైడిపల్లి దర్శకుడు. ప్రస్తుతం డెహ్రాడూన్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఓ కథానాయికగా పూజా హెగ్డేని ఎంచుకున్నారు. ఇప్పుడు మరో నాయికగా అదితిరావు హైదరిని తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల విడుదలైన 'సమ్మోహనం'తో ఆకట్టుకుంది అదితి. ఆమె నటన మహేష్‌కు బాగా నచ్చిందట. అందుకే ఈ ఆఫర్ అందిందని తెలుస్తోంది. అయితే చిత్రబృందం మాత్రం అదితి రాకని అధికారికంగా ధ్రువీకరించాల్సివుంది. ఈ చిత్రంలో మహేష్ కాలేజీ విద్యార్థిగా కనిపించబోతున్నాడట. 2019 సంక్రాంతికి విడుదలయ్యే అవకాశాలున్నాయి.

కాజల్

పంచ్ డైలాగ్

నమ్మకం లేని చోట ప్రేమ ఉండదు, ప్రేమలేని చోట నేను ఉండలేను.

చిత్రం: వర్షం

– పంపినవారు: పి. ఉమాదేవి, హైదరాబాద్.

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

కొత్త పాత్రలో శ్రుతి

శ్రుతిహాసన్

కమల్‌హాసన్‌లానే శ్రుతిహాసన్ కూడా సకల కళావల్లభురాలు. నటన, సంగీతం, పాటలు, చిత్రలేఖనం అంటూ అన్ని రంగాల్లోనూ 'నేనూ ఉన్నా' అనిపించుకుంటుంది. ఇప్పుడు నిర్మాణ రంగంలోనూ అడుగుపెట్టబోతోంది. శ్రుతికి నిర్మాతగా మారాలని ఎప్పటి నుంచో ఆశ. అందుకు తగిన ప్రణాళికల్ని కూడా సిద్ధం చేసుకుంది. ఇప్పుడు తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. జయప్రకాష్ రాధాకృష్ణన్ దర్శకత్వం వహిస్తున్న 'ది మస్కిటో ఫిలాసఫీ' అనే చిత్రానికి శ్రుతి నిర్మాతగా వ్యవహరించబోతోంది. తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. తెలుగులోనూ విడుదల చేసే అవకాశాలున్నాయి. ఇందులో శ్రుతి నటిస్తుందా, లేదా? అనేది మాత్రం తెలియాల్సివుంది.

గీతోపదేశం

స్వర్గాలని అందుకోనాలని
వడిగా గుడిమెట్లెక్కేవు
సాటి మనిషి వేదన చూస్తూ
జాలి లేని శిలవైనావు
కరుణను మరిపించేదా
చదువు సంస్కారం అంటే
గుండె బండగా మార్చేదా
సంప్రదాయమంటే

గీతం: చుట్టుపక్కల చూడరా...

చిత్రం: రుద్రవీణ

రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి

– పంపినవారు: రాచర్ల శివ, ఒంగోలు

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

మహేష్ కళ్లలో మెరుపు కనిపిస్తోంది

పవిత్రా లోకేష్, నరేష్, తనికెళ్ల భరణి, శివలెంక కృష్ణప్రసాద్, ఇంద్రగంటి మోహనకృష్ణ, సుధీర్‌బాబు, వివేక్ సాగర్, పి.జి.విందా

"మహేష్ బావగా నాకు బాగా దగ్గర. కానీ నటుడిగా మా ఇద్దరి మధ్య దూరం ఉందనిపించింది. 'సమ్మోహనం' ఓ నటుడిగా తనకు దగ్గర చేసింది. ఇప్పుడు నా గురించి మాట్లాడేటప్పుడు బావ కళ్లలో మెరుపు కనిపిస్తోంద"న్నారు సుధీర్‌బాబు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'సమ్మోహనం'. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకుడు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. హైదరాబాద్‌లో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ "నా కెరీర్‌లో తొలి విజయం 'ప్రేమకథా చిత్రమ్'తో దక్కింది. ఆ తరవాత చాలా మంచి సినిమాలు చేశాను. కానీ నన్నందరూ 'ప్రేమకథా చిత్రమ్' సుధీర్‌బాబుగానే చూశారు. ఇంద్రగంటి భాషని భార్యలా ప్రేమిస్తారు. ఆయన నాకు మంచి సినిమా ఇచ్చార"న్నారు. "ఎలాంటి తప్పులు లేకుండా సినిమాలు రావడం అరుదుగా జరుగుతుంటాయి. అలాంటి సినిమాల్లో ఇదొకటి" అన్నారు నరేష్. "కథ వినగానే సుధీర్‌బాబు ఒప్పుకున్నాడు. ఓ నమ్మకంతో, ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశాడు. తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన 'పెళ్లి చూపులు'లో ఓ సన్నివేశం చూసి.. 'నేను కూడా ఇలాంటి కథ రాస్తే బాగుంటుందే' అనిపించింది. ఆ స్ఫూర్తితోనే ఈ కథ తయారు చేసుకున్నా" అన్నారు ఇంద్రగంటి. "మా సంస్థకు మరో మంచి చిత్రాన్ని అందించారు ఇంద్రగంటి. నిర్మాతగా చాలా సంతోషంగా ఉన్నా" అన్నారు శివలెంక కృష్ణ ప్రసాద్. ఈ కార్యక్రమంలో తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, పవిత్రా లోకేష్, తరుణ్ భాస్కర్, వివేక్ సాగర్, హర్షిణి, రాహుల్ రామకృష్ణ, మార్తాండ్ కె. వెంకటేష్, పి.జి.విందా తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చిన్నపిల్లనే!

"కథానాయికగా ఒక స్థాయిలో ఉన్నాననీ... స్టార్‌ని కాబట్టి ఎప్పుడూ గంభీరంగానే నడుచుకోవాలనే నియమాలు నాకు లేవు. వీలైనంత వరకూ నా హోదా, నాకున్న గుర్తింపుని మరిచిపోవడానికే ఇష్టపడతా. అలా బతకడంలోనే ఉంది అసలైన ఆనందం" అంటోంది కాజల్. పదేళ్లుగా దక్షిణాదిలో అగ్ర కథానాయికగా కొనసాగుతోంది కాజల్. ప్రస్తుతం రవితేజతో కలిసి ఓ చిత్రంలో నటిస్తోంది. మంగళవారమే పుట్టినరోజును జరుపుకొంది కాజల్. ఎంచక్కా కుటుంబ సభ్యులతో గడిపింది. ఆ సందడిని సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతోనూ పంచుకొంది. అగ్ర కథానాయిక అనిపించుకొన్నాక మీ జీవితంలో వచ్చిన మార్పులేమిటి? అని అడిగితే... "ఆ మార్పు కేవలం వృత్తిపరంగానే. వ్యక్తిగత జీవితంలో నేనేమీ మారలేదు. ఖాళీ దొరికినప్పుడంతా చిన్నప్పుడు నా చెల్లెలితోనూ, స్నేహితులతోనూ కలిసి ఎలా అల్లరి చేసేదాన్నో ఇప్పుడూ అంతే. ఇంట్లో అడుగుపెడితే చిన్నపిల్లగా మారిపోతా. చిన్నప్పుడు చేసిన అల్లరి పనులు ఇప్పుడు కూడా చేస్తుంటా. బయట కూడా నేను స్టార్‌ని అనే విషయం ఎప్పుడో కానీ గుర్తుకురాదు. వృత్తి వరకు వచ్చేసరికి కొంచెం సీరియస్‌గా మారిపోతుంటా. ప్రేక్షకులు నన్నీ స్థాయికి చేర్చినప్పుడు, నేను అందుకు తగ్గట్టుగానే పని చేయాలి కదా అనుకొంటూ మరింత బాధ్యతతో వ్యవహరిస్తుంటా" అని చెప్పుకొచ్చింది కాజల్.

అన్నదాతల సలహాతో...

ఆర్.నారాయణమూర్తి

ఆర్.నారాయణమూర్తి నటించి దర్శకత్వం వహించిన చిత్రం 'అన్నదాతా సుఖీభవ'. మే 18న ఈచిత్రం విడుదలైంది. అయితే ఈ చిత్రాన్ని జులై 7న మరోసారి విడుదల చేస్తున్నామని ప్రకటించారు నారాయణమూర్తి. ఆయన మాట్లాడుతూ "రైతులే ఈ దేశానికి వెన్నెముక. వాళ్లంతా బాగుండాలి. అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకోకూడదు, బతుకుపోరులో గెలవాలని చెప్పిన చిత్రమిది. చూసిన వాళ్లంతా 'చాలా బాగుంది' అన్నారు. పాటలకు కూడా మంచి స్పందన వచ్చింది. విజయవాడలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు 'మంచి సినిమా తీశావయ్యా' అంటూ అభినందించి, సన్మానం కూడా చేశారు. కానీ.. ఎండల వల్ల ఎక్కువ మంది థియేటర్లకు రావడానికి భయపడ్డారు. దాంతో చేరవలసినవాళ్లకు ఈ సినిమా చేరలేదు. 'ఎండలు తగ్గాక మళ్లీ విడుదల చేయండి..' అని రైతులు సలహా ఇచ్చారు. అందుకే జులై 7న ఈ చిత్రాన్ని మరోసారి విడుదల చేస్తున్నాం" అన్నారు.

'దామిని విల్లా'లో...

ఆదిత్య ఓం, రేఖా బోజ్

ఆదిత్య ఓం, రేఖా బోజ్ జంటగా నటిస్తున్న చిత్రం 'దామిని విల్లా'. రాకేష్ రెడ్డి దర్శకుడు. పోలారావు దండెం, ప్రతాప్ దండెం నిర్మాతలు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "హారర్ చిత్రాల్లో కొత్తరకమైన ట్రెండ్ సృష్టించే చిత్రమిది. కథ, కథనాలు వినూత్నంగా ఉంటాయి. దామిని అనే విల్లాలో జరిగే కథ కాబట్టి ఆ పేరు పెట్టాం. ఆ విల్లాలో ఏం జరిగింది? అక్కడ దెయ్యం ఉందా, లేదా? అనేది ఆసక్తికరం. వచ్చే యేడాది ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు.

సంజుగా ముందు అనుకున్నది రణ్‌వీర్‌నే

రణ్‌వీర్‌సింగ్

సంజయ్‌దత్ జీవిత కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'సంజు'. ఇందులో సంజయ్‌గా రణ్‌బీర్ కపూర్ నటిస్తున్నాడు. ట్రైలర్ విడుదలయ్యాకా సంజయ్ పాత్రలో రణ్‌బీర్ ఒదిగిపోయాడంటూ ప్రశంసలొచ్చాయి. కానీ ఈ పాత్రకు ముందుగా అనుకున్నది రణ్‌వీర్ సింగ్‌నని చెబుతున్నారు 'సంజు' చిత్ర నిర్మాత విధు వినోద్ చోప్రా. దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ సంజయ్‌దత్ బయోపిక్ తీస్తానని చెప్పినప్పుడు వినోద్ చోప్రా ఒకింత ఆశ్చర్యపోయారట. "సంజయ్‌దత్ బయోపిక్ తెరకెక్కిస్తానని హిరాణీ చెప్పినప్పుడు 'సినిమా తీసేటంత గొప్ప విషయాలు సంజయ్ జీవితంలో ఏమున్నాయి?' అని హిరాణీతో అన్నాను. ఇంకా నా జీవితం సినిమాగా తీస్తే బాగుంటుందేమో. ఓ కుర్రాడు కాశ్మీర్ విడిచి ఏ పరిస్థితుల్లో ముంబయి వచ్చాడు. ఇక్కడికొచ్చాకా ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నాడు..ఇదంతా ఆసక్తికరంగా ఉంటుంది అన్నాను (నవ్వుతూ..). దీంతో హిరాణీ, రచయిత జోషి ఖంగుతిన్నారు. కానీ హిరాణీ...సంజయ్ జీవితంలోని ఒక్కో అంశాన్నీ విపులంగా చెబుతూ వెళుతుంటే సంజయ్ జీవితంలో ఇన్ని మలుపులున్నాయా అంటూ ఆశ్చర్యపోయాను. హిరాణీ చెప్పింది ఓ గొప్ప కథ అని అర్థమైంది" అని చెప్పారు వినోద్ చోప్రా. సంజయ్ పాత్రలో ఎవరు నటిస్తారు? అని అడగ్గానే హిరాణీ 'రణ్‌బీర్' అని చెప్పాడు. కానీ నాకు అది నచ్చలేదు. రణ్‌వీర్ సింగ్ లాంటి నటుడు అయితే బాగుంటుందని చెప్పాను. కానీ రణ్‌బీర్ అయితే పాత్రకు సరిపోతాడని హిరాణీ బలంగా నమ్మారు. అయిష్టంగానే ఒప్పుకున్నాను. చిత్రీకరణ మొదలైన కొన్ని రోజులకు సంజయ్ పాత్రలోకి రణ్‌బీర్ పరకాయ ప్రవేశం చేసిన తీరు చూసి నా నోట మాట రాలేదు"అని చెప్పారు వినోద్ చోప్రా.

పుస్తకంగా ప్రియాంక జీవితం

ప్రియాంక చోప్రా

బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా తన జీవితాన్ని పుస్తక రూపంలో తీసుకొస్తుంది. దీనికి 'అన్‌ఫినిష్డ్' అనే పేరు పెట్టింది. తాజాగా ఈ పుస్తకం కవర్ పేజీని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకొంది. "నేను ఎప్పటి నుంచో పుస్తకం రాయాలి అనుకుంటున్నాను. కానీ సమయం కుదిరేది కాదు. ఎదురుచూశాను. ఎందుకంటే నేను సాధించాల్సింది ఇంకా పూర్తి కాలేదు. పుస్తకం రాయడం కంటే ముందు నేను చేయాల్సింది, సాధించాల్సింది, జీవించాల్సింది చాలా ఉంది అనుకున్నాను. ఓ పబ్లిక్ పర్సనాలిటీగా నా జీవితంలోకి చూస్తే ఇప్పుడు నా జీవితం ఉన్న స్థితి, సాధించిన విజయాలు నన్ను గర్వపడేలా చేశాయి. 'నీ కథ ముగింపు చెప్పడానికి ఎప్పుడూ ప్రయత్నించకు...' ఇదే నేను మీకు చెప్పేది. ఎందుకంటే జీవితం నేర్పే గొప్ప పాఠాలు ప్రయాణం సాగుతున్నప్పుడు తెలుసుకుంటాం...."అని రాసుకొచ్చింది ప్రియాంక. ఆమె తన పుస్తకం గురించి చెప్పగానే అభిమానులు ఖుషీ అయిపోయారు. "వావ్..నా రాణి ప్రియాంక నుంచి పుస్తకం రాస్తోంది. నువ్వు సాధించిన ప్రతి విజయాన్ని నేను ఆస్వాదిస్తున్నాను" అని ఓ అభిమాని స్పందించాడు. ఓ నటి, నిర్మాత, సామాజిక కార్యకర్త, యునిసెఫ్ రాయబారి...ఇలా ప్రియాంక వివిధ పాత్రలో సాధించిన అన్ని విషయాలు ఈ పుస్తకంలో ఉంటాయి.

ఆ 'స్మగ్లర్' ఎవరు?

దర్శిత, వైభవ్

కన్నడలో విజయవంతమైన చిత్రం 'పానీపూరి'. వైభవ్, జగదీశ్, సంజయ్, దర్శిత, అను నటించారు. నవీన్ కుమార్ కె.ఫి దర్శకుడు. ఈ చిత్రాన్ని తెలుగులో 'స్మగ్లర్' పేరుతో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ "నేటితరం అభిరుచికి తగిన కథ ఇది. యువతరానికి బాగా నచ్చుతుంది. పతాక సన్నివేశాలు ఉత్కంఠ భరితంగా సాగుతాయి. సంతోష్ బాగ్లోట్ సంగీతం అదనపు ఆకర్షణ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామ"న్నారు.

వసుంధర

వర్ణాల కలబోతగా డిజైను చేసిన సిల్కు గౌను... పూల మోటిఫ్‌లతో తీర్చిదిద్దిన టాప్ లుక్కే వేరు.

చిన్నారులు బుట్టబొమ్మల్లా.. అందంగా, ఆకర్షణీయమైన గౌనుల్లో ఒదిగిపోవాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అలాంటిదే ఈ దుస్తుల శ్రేణి. ఆధునిక డిజైన్లూ, అందమైన ప్రింట్లతో అదరగొట్టే ఈ వస్త్రాలు మీ చిన్నారులకు ప్రత్యేకం. ఎంచుకోవడమే ఆలస్యం.

ఫ్యాషన్ ఫ్యాషన్

నగలు, దుస్తులు:
KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
సైఫాబాద్: 040–23231147/23423440
జూబ్లీహిల్స్: 040–23540862,
కూకట్‌పల్లి: 040–23152323
విజయవాడ: 0866–2496464
తిరుపతి: 0877–2238820
వైజాగ్: 0891–2577905

బుట్టబొమ్మలకు ముచ్చటైన గౌను!

పూలతలు పరుచుకున్నట్టు అందంగా మలచిన గౌనుకు వావ్ అని పించే క్రోషెట్ తరహా టాప్.

ఆకట్టుకునే గౌనుకు కళ తెచ్చిన రెట్రో డిజిటల్ ప్రింటూ, ఎంబ్రాయిడరీ హంగులు.

పూల డిజైనూ... డిజిటల్ ప్రింట్ల కలబోతగా రూపొం దిన సిల్కు గౌను. దానికి పూసల ఎంబ్రాయిడరీ అదనపు ఆకర్షణ.

సిల్కు ఫ్యాన్సీ లెహెంగాకు.. ఎంబ్రాయిడరీ, కుందన్ లేస్, కుచ్చులతో తీర్చిదిద్దిన అంచు ప్రత్యేకం.

email:
vasundhara
@eenadu.net

మోడల్స్: బేబీ సస్మిన్, చైత్ర, అక్షర
ఫొటోలు: పాతూరి పద్మావతి

నజరానా

పిల్లలు జలుబుతో బాధపడుతుంటే వాళ్లు స్నానం చేసే నీళ్లలో కాస్త యూకలిప్టస్ నూనె కలిపి చూడండి.

వలయాలు పోవాలంటే ఎలా?

డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

నాకు ఇరవై మూడేళ్లు. చదువు పూర్తై ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నా. నేను చాలా తెల్లగా ఉంటా. కానీ నా కళ్లకింద నల్లటి వలయాలు ఇబ్బంది పెడుతున్నాయి. గత మూడేళ్ల నుంచీ ఈ సమస్యతో బాధపడుతున్నా. మేకప్‌తో అవి కనిపించకుండా చేయడానికి ప్రయత్నిస్తుంటా. అయినా అవి కనిపిస్తూనే ఉన్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం ఉండదా?

- ఓ సోదరి

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదనే చెప్పొచ్చు. అయితే అదుపులో ఉంచుకోవడం మన చేతుల్లో పనే. కళ్ల కింద వలయాలు రావడానికి కారణాలు తెలుసుకుంటే తగ్గించుకోవడం సులువవుతుంది. ఈ సమస్య ప్రధానంగా వంశపారంపర్యంగా వస్తుంది. అలానే ఆలస్యంగా పడుకోవడం, కంటినిండా నిద్రలేకపోవడం, ఒత్తిడీ, అలర్జీలూ, కళ్లు నలిపినప్పుడు రావచ్చు. దాంతోపాటు సైనస్, ఎటోపిక్ డెర్మటైటిస్, ఎగ్జిమా, రక్తహీనతా, ఆస్తమా, డీహైడ్రేషన్... ఇలా చాలానే కారణాలున్నాయి. ఈ సమస్యను తగ్గించడానికి ప్రతిరోజూ ఏదో ఒక నూనెతో కళ్లచుట్టూ మర్దన చేసుకోవాలి. నిద్రపోయేముందు మాయిశ్చరైజర్ రాసుకుని అండర్ ఐ క్రీమ్‌ని పూతలా వేసుకోవాలి. అలాంటి క్రీమ్‌లను వైద్యుల సలహాతో ఎంచుకోవచ్చు. అలానే విటమిన్ సి, కె, కెఫీన్, లికోరిస్ ఉన్న క్రీములు వాడాలి. సన్‌స్క్రీన్ తప్పనిసరిగా రాయాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే సమస్య అదుపులో ఉంటుంది. చికిత్సే కావాలనుకుంటే కెమికల్ పీల్ చేయించుకుంటే ఫలితం ఉంటుంది.

వంటింటి పదార్థాలతోనూ వలయాలను తగ్గించుకోవడం సాధ్యమవుతుంది. అందుకేం చేయాలంటే.. బంగాళాదుంప గుజ్జులో, చెంచా చొప్పున నిమ్మరసం, గులాబీ నీళ్లు చేర్చి కళ్ల కింద పూతలా వేసుకోవాలి. కాసేపయ్యాక మర్దన చేసుకుని కడిగేసుకోవాలి. ఇలా రోజు విడిచి రోజు చేస్తుండాలి. గ్రీన్ టీ బ్యాగులను ఫ్రిజ్‌లో ఉంచి కళ్లమీద పెట్టుకోవాలి. చెంచా చొప్పున పుదీనా గుజ్జూ, నిమ్మరసం, కొబ్బరి నూనె కలిపి కళ్లచుట్టూ పూతలా వేసుకోవాలి. పచ్చికొబ్బరిని గుజ్జులా చేసి అందులో కీరా గుజ్జూ, నిమ్మరసం కలిపి కళ్ల అడుగున రాసుకోవాలి. కాసేపయ్యాక చల్లటి నీళ్లతో కడిగేసుకోవాలి. అలానే డార్క్ చాక్లెట్లూ, వాల్‌నట్స్, చేపలు.. వంటివి ఎక్కువగా తీసుకోవాలి. వీటి నుంచి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అంది రక్తప్రసరణ మెరుగవుతుంది. దాంతో నల్లటి వలయాలు కూడా తగ్గుతాయి. అలాగే కంటి నిండా నిద్రపోవాలి. కంప్యూటర్ ముందు పనిచేస్తున్నవారు ప్రతి గంటకోసారి కళ్లకు విశ్రాంతి ఇవ్వాలి. కీరదోస, బంగాదుంప ముక్కలను చక్రాల్లా తరిగి కళ్ల మీద పెట్టుకుంటూ ఉండాలి. ఇలా చేయడం వల్ల చాలా మంచి ఫలితం ఉంటుంది.

– మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

బంగారం-వెండి

21న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,510	31,670	31,550	31,750
ఆర్నమెంట్	29,430	29,580	29,300	29,400
వెండి (కిలో)	40,650	40,800	40,900	41,000

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,600	31,750	31,460	31,705
ఆర్నమెంట్	29,300	29,300	29,150	29,320
వెండి (కిలో)	40,700	40,900	40,650	40,800

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,400	31,550	-------	-------
ఆర్నమెంట్	29,200	29,340	2,915	2,932 గ్రా
వెండి (కిలో)	41,900	41,900	42.90	43.00 గ్రా

నెలసరిలో మార్పులా!

కౌమారంలో కనిపించే ప్రధాన మార్పు నెలసరి. కానీ హార్మోన్ల పనితీరూ, రక్తహీనతా వంటి కారణాల వల్ల నెలసరిలో కొందరికి సమస్యలు ఎదురవుతాయి. అలాంటప్పుడు ఏం చేయాలంటే...

వాస్తవానికి పదిహేను సంవత్సరాల వరకూ నెలసరి మొదలుకాకపోతే.. దాన్ని తేలిగ్గా తీసుకోవడానికి లేదు. చాలామంది ఇంట్లో ఎవరో ఒకరిని ఉదాహరణగా చూపించి వాళ్లకీ ఇంతే, వీళ్లూ అంతే అంటారు కానీ శారీరకంగా ఎవరి సమస్యలు వారివి. పదిహేను సంవత్సరాలు వస్తోంటే వైద్యుల్ని సంప్రదించి కారణం తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

❑ నెలసరి మొదలైన తరువాత కూడా ఆలస్యంగానో, ముందుగానో వస్తుందిగా పర్వాలేదు అని నిర్లక్ష్యం చేయకూడదు. ప్రతిసారీ 21 రోజులకంటే ముందుగానే వస్తున్నా, 35 రోజులు పాటూ రాకపోయినా నిర్లక్ష్యం చేయకూడదు.

❑ కొందరు అమ్మాయిలకు ఏడు రోజులు దాటినా రక్తస్రావం అవుతుంటుంది. అలానే రెండు గంటల వ్యవధిలో ఒకటికి మించి శానిటరీ న్యాప్‌కిన్లను మారుస్తున్నారా. ఇది అధిక రక్తస్రావానికి సంకేతం. దానికి కారణాలు ఉంటాయి కాబట్టి తెలుసుకోగలగాలి.

అలాగే నెలసరికీ, నెలసరికీ మధ్యలో అకారణంగా రక్తస్రావం అవుతున్నా ఆ సమయంలో తీవ్రంగా వచ్చే నొప్పీ, జ్వరం వంటి లక్షణాలున్నా వైద్యులతో చెప్పాలి.

❑ అధికబరువు సమస్య ఉన్నా, అవాంఛిత రోమాలు వస్తోన్నా, నెలసరి సమయంలో తీవ్రమైన నొప్పిని భరించాల్సి వస్తున్నా...అది మామూలే అనుకోవద్దు. కొన్నిసార్లు పీసీఓడీ, అండాశయాల్లో సిస్టులు ఉన్నా... ఇలా కావచ్చు.

చెల్లెళ్లకి నాన్నయ్యా!

ఇరవై ఏళ్లకే కుటుంబ బాధ్యతలు తీసుకున్నా రామె. తల్లిని చూసుకుంటూ... ముగ్గురు చెల్లెళ్లకీ తానే తండ్రై చదువులు చెప్పించారు. ప్రభుత్వ ఉద్యోగినులుగా తీర్చిదిద్దారు. వారికి పెళ్లి చేశాకే ఆమె మెట్టినింటికి వెళ్లారు. కుటుంబానికి అండగా ఉండి... ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న ఆమే కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం చిగురుకోటలో ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహిస్తోన్న రాజకుమారి.

నా కథ

ఆ రోజు నాన్న ఆఫీసుకు బయల్దేరుతూ 'వెళ్లొస్తానమ్మా...' అని అనడం నాకు ఇంకా గుర్తే. అలా వెళ్లారో లేదో ఇంట్లో ఫోను రింగ్ అయింది. అమ్మ పనిలో ఉండటంతో నేనే ఎత్తి హలో అన్నా. 'మీ నాన్న గుండెపోటుతో చనిపోయారు' అంటూ అవతలి నుంచి ఎవరో చెప్పారు. ఏం జరుగుతోందో అర్థం కాలేదు. నాన్నని ఇంటికి తీసుకొచ్చారు. బంధువులూ, సహోద్యోగులంతా వచ్చారు. జరగాల్సినవన్నీ చకచకా జరిగిపోయాయి. అంతా ఓ కలలా అనిపించింది.

ఆశయాలను బతికించాలని: అమ్మ నాన్న మరణాన్ని తట్టుకోలేకపోయింది. ఆమెకి బయట ప్రపంచం తెలియదు. పెద్దగా చదువుకోలేదు. మేం నలుగురం ఆడపిల్లలం. నాన్న ఉద్యోగమే మాకు ఆధారం. అది తప్ప వేరే ఆస్తిపాస్తులేం లేవు. ఉన్న ఆస్తల్లా నాన్నే. ఆ సమయంలోనే ఇంటి బాధ్యతను నా భుజాల మీద వేసుకున్నా. అప్పటికి డిగ్రీ చివరి సంవత్సరంలో ఉన్నా. నాన్న ఆశయాలను బతికించాలనే చెల్లెళ్లని చదివించాలని నిర్ణయించుకున్నా. మాది కృష్ణా జిల్లా ముదినేపల్లి. నాన్న వృత్తి రీత్యా నందిగామలో ఉండేవాళ్లం. మేం నలుగురం ఆడపిల్లలం కావడంతో చాలామంది నాన్నని చిన్నచూపు చూసేవారు. మమ్మల్ని బడికి పంపుతుంటే 'ఆడపిల్లలకు చదువెందుకయ్యా' అంటూ అనేవారు. ఆయన మాత్రం ఆ మాటలకి నవ్వేవారు. 'వాళ్లకు ఆస్తులు ఇవ్వకపోయినా ఫరవాలేదు. జ్ఞానం ఇస్తే సరిపోతుంది' అని అనేవారు. అందుకే ఆయన బయటకు ఎక్కడకు వెళ్లినా కూడా నన్ను తీసుకెళ్లేవారు. కూరగాయలూ, సరకులు కొనడం, బ్యాంకు పనులు.. ఇలా ప్రతిదీ నేర్పించేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే మగపిల్లాడిలా పెంచారు. నాన్న మరణం మా జీవితంలో పెద్ద కుదుపు. కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. బంధువులు దూరం జరిగారు. ఆత్మీయులు ముఖం చాటేశారు. నాన్న ఉద్యోగం రావడంతో జూనియర్ అసిస్టెంట్‌గా డీఈఓ ఆఫీసులో చేరిపోయా.

నాలోనే దాచుకున్నా: అప్పటికి పెద్ద చెల్లి, రెండో చెల్లి ఇంటర్, చిన్నది ఎనిమిదో తరగతి చదువుతున్నారు. మా అందర్నీ బాగా చదివించడం నాన్న కల. అది నెరవేర్చాలని... నేను చదువు ఆపేశా. వాళ్ల చదువుకి ఎక్కడా ఇబ్బంది కలగకుండా.. ఇంటిని నెట్టుకురావడానికి చాలా కష్టమయ్యేది. నా కోసం ఏది కొనుక్కోకుండా, దాచుకోకుండా వాళ్ల కోసమే బతికా. నాన్న ఉంటే ఎలా చూసుకునేవారో అలానే లోటు లేకుండా చూసుకోవడానికి అహర్నిశలూ తాపత్రయపడేదాన్ని. నన్ను చూసి అమ్మ చాలా గర్వించేది. నేను ఒంటరిగా కుటుంబంకోసం పోరాడుతుంటే చాలామంది చులకనగా చూసేవారు. ఏడిపించేవారు. బస్సుల్లో, రోడ్డు మీద నడుస్తున్నప్పుడో ఇబ్బందిపెట్టేవారు. ఇదంతా 1983 తరువాతి మాట. ఆ రోజుల్లో ఆడవాళ్లు బయటకు రావడం కాస్త తక్కువే. 'బయటకు వస్తే మగరాయుడు' అనేవాళ్లు. చాలాసార్లు సమస్యలు ఎదురయ్యాయి. కానీ ఏది అమ్మకీ, చెల్లెళ్లకీ చెప్పుకోలేదు. అలా పలు సవాళ్ల మధ్య ఇద్దరి చెల్లెళ్లకి మంచి సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేశా. అప్పటికే పెద్ద చెల్లి శాంతి, రెండో చెల్లి సుజాత ఎంఏ చేశారు. నేనూ దూరవిద్యలో పీజీ, ఎంఈడీ పూర్తి చేశా. వాళ్ల పెళ్లి సమయంలో 'నువ్వు చేసుకోకుండా వాళ్లకి చేయడం ఏంటీ' అని చాలామంది అన్నారు. వాళ్ల బాధ్యతలు చూశాకే నేను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నా.

ముగ్గురం ఒకే కాలేజీ: ఏడేళ్లు ఉద్యోగం చేశాక నాకు స్టడీ లీవ్ పెట్టుకునే అవకాశం వచ్చింది. అప్పుడు ముగ్గురం అక్కచెల్లెళ్లం బీఈడీ ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించాం. అలా మచిలీపట్నంలోని నేషనల్ కాలేజీలో ముగ్గురం చదువుకున్నాం. మంచి ర్యాంకులు వచ్చాయి. వాళ్లకే టీచర్లుగా ఉద్యోగాలు వచ్చాయి. నేను అప్పటికే జూనియర్ అసిస్టెంట్ హోదాలో ఉన్నా. బీఈడీ చేయడంతో తక్కువ కాలంలోనే నాకూ పదోన్నతి లభించింది. ఆ తరువాత అమ్మ మా మేనమామ కొడుకుతో పెళ్లి చేసింది. అలాగని కుటుంబ బాధ్యతలకు దూరంగా జరగలేదు. పెళ్లి అయినా చిన్న చెల్లి విజయనీ, అమ్మనీ చూసుకుంటూనే ఉన్నా. బంధువులు కావడంతో అత్తింటివారూ ప్రోత్సహించారు. అలా చిన్న చెల్లి కూడా బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం తెచ్చుకున్నాక దానికి పెళ్లి చేశా. ఇప్పుడు నాకో పాప. ప్రస్తుతం నేను గెజిటెడ్ ఆఫీసర్ స్థాయిలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నా. నా ముగ్గురు చెల్లెళ్లు ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా ఉన్నారు.

విహారి
ఈనాడు శుక్రవారం
విజయవాడ
జూన్ 22, 2018

vihari@eenadu.in

యుగాల కిందట ఆంజనేయుడు అక్కడికి వెళ్తే లంకిణి అడ్డగించిందంటారు! ఇప్పుడు వెళ్తే మనకు సాదర స్వాగతం లభిస్తుంది. అప్పట్లో సీతమ్మ జాడ దొరక్క హనుమ పురమంతా గాలించాడని చెబుతారు!! ఇప్పుడదే అశోక వనం చిరునామా ఇట్టే దొరికిపోతుంది! అంతేనా! మంచి ప్యాకేజీ ఎంచుకుంటే.. సీతమ్మ కూర్చున్నారని చెప్పే చోటును, ఆంజనేయుడి అఖండ పాదాలను, రావణ గుహలను చూసిరావొచ్చు. బౌద్ధ ధర్మం వైభవాన్ని మనసారా ఆస్వాదించవచ్చు. సముద్ర తీరాల్లో సేదతీరొచ్చు.. తేయాకు తోటల్లో విహరించవచ్చు.. ఇలాంటి రకరకాల అనుభూతులు మూటగట్టుకోవాలనుందా.. అయితే... లంఘించండి లంకకు!

కొండపై కోట

లంకలో ప్రధాన ఆకర్షణ సిగిరియా కొండ. ఇది దంబుల్లా నగరం సమీపంలో ఉంటుంది. సింహాకృతిలో ఠీవీగా కనిపించే ఈ భారీ కొండ ఎత్తు 200 మీటర్లు. శ్రీలంక నాగరికతకు నిలువెత్తు నిదర్శనమిది. 5వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించే కశ్యప అనే రాజు.. సిగిరియా కొండపై రాజప్రాసాదం, కోటలు కట్టించాడట. కోటకు వెళ్లే దారి వెంట నీటి కొలనులు, ఉద్యానవనాలు కనిపిస్తాయి. పైగా కొలనుల్లో ఫౌంటెయిన్‌లు ఉండటం, అవి నేటికీ పని చేస్తుండటం విశేషం. కొండపై నాటి రాజప్రాసాదాల శిథిల నిర్మాణాలు ఇప్పటికీ కనిపిస్తాయి. పచ్చిక బయళ్లు, భారీ వృక్షాలతో కొండ పైభాగం ఆహ్లాదభరితంగా ఉంటుంది. ఎన్నో వైవిధ్యాలకు నెలవైన సిగిరియా యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది.



లంకకు లంఘిస్తే..

చిన్నపిల్లల సాంఘికశాస్త్రం పుస్తకాల్లో.. భారతదేశం పటం చూసినప్పుడు.. అందులోనే మరో దేశం కూడా కనిపిస్తుంది కదా! కన్యాకుమారి దిగువన.. సముద్రంలో మధ్యన.. కాస్త అటూఇటూగా ముక్కోణాకృతిలో ఉండే ఆ చిట్టి దేశమే శ్రీలంక. మనకు లంక పేరెత్తగానే రామాయణం గుర్తుకొస్తుంది. మన ఇతిహాసంతో ముడిపడిన దేశమది. మనదేశంలో పుట్టిపెరిగిన బౌద్ధాన్ని ఆదరించి, ఆచరిస్తున్న ప్రాంతమది. అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన శాంకరీదేవి ఆలయం ఉన్నది అక్కడే. దశాబ్దాల తరబడి అంతర్గత యుద్ధంతో సతమతమైన సిలోన్.. ఈ మధ్య ట్రావెలోకంలో పసందైన ప్రదేశంగా ముద్రవేసుకుంది. సంస్కృతి, సంప్రదాయాల కలబోతగా పర్యాటక ప్రియులను అలరిస్తోంది. ప్రకృతి ఆరాధకులకు, ఆధ్యాత్మిక సాధకులకు, పర్యావరణ హితులకు.. ఇలా ఒకరేమిటి? ఇక్కడ అందరికీ అన్నీ ఉన్నాయి. అందుకే లంకకేగేవారి సంఖ్య ఏటికేడూ పెరుగుతోంది. మన భారతీయులు అందునా.. తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీలంక పర్యటనకు క్యూ కడుతున్నారు. భారత్ నుంచి యాత్రికులను ఆకర్షించేందుకు శ్రీలంక ప్రభుత్వం కొన్నేళ్లుగా పక్కా ప్రణాళికలు అమలు చేస్తూ వచ్చింది. రామాయణంతో ముడిపడిన స్థలాలను సందర్శన కేంద్రాలుగా తీర్చిదిద్దింది. ఇతర దేశాల పర్యాటకులను ఆకర్షించేలా సముద్ర తీరాలను అభివృద్ధి పరిచింది.

ఆదిశక్తిపీఠం..

'లంకాయాం శాంకరీదేవీ'.. అష్టాదశ శక్తిపీఠాల్లో మొదటిది శ్రీలంకలోని ట్రింకోమలీ పట్టణంలోని శాంకరీదేవి ఆలయం. పచ్చటి ప్రకృతికి ఆలవాలంగా ఉంటుందీ ప్రాంతం. సముద్రంలోకి చొచ్చుకువచ్చిన ఎత్తయిన పర్వతంపై అమ్మవారి ఆలయం కనిపిస్తుంది. లంకకు వచ్చే పర్యాటకులందరూ ఈ ఆలయాన్ని తప్పకుండా దర్శిస్తారు. పదిహేడో శతాబ్దంలో పోర్చుగీసువారి దాడిలో ఇక్కడి ఆలయం ధ్వంసం అయింది. శతాబ్దాల తరబడి ఈ ఆలయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. 2005లో శ్రీలంక ప్రభుత్వం ఆలయాన్ని పునర్నిర్మింపజేసింది. అప్పటి నుంచి శాంకరీదేవి ఆలయం ప్రముఖ సందర్శనీయ కేంద్రంగా నిలుస్తోంది. ఇక్కడికి సమీపంలోనే శ్రీరాముడు ప్రతిష్ఠించిందిగా చెప్పే కోణేశ్వరాలయం ఉంటుంది. శ్రీలంకలోని ప్రధాన నగరాల్లో ఒకటైన దంబుల్లా నుంచి ట్రింకోమలీ 106 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

మరిన్ని

- కాండీ-ఎల్లా రైలు ప్రయాణం శ్రీలంకలోని ప్రకృతి సౌందర్యాన్ని పరిచయం చేస్తుంది. సముద్ర తీరం వెంబడి, దట్టమైన అడవుల గుండా, పచ్చటి పొలాల మీదుగా సాగే రైలు ప్రయాణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.
- కాండీ, నువర ఏలియా ప్రాంతాల్లో తేయాకు తోటలు విస్తృతంగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు వసతి సౌకర్యాలు కూడా ఉన్నాయి.
- చుట్టూ సముద్రం ఉన్న లంకలో అందమైన బీచ్‌లు ఎన్నో ఉన్నాయి. కొలొంబో నుంచి మొదలుపెడితే జాఫ్నా వరకు ఎన్నో తీరాలు పర్యాటకులతో సందడిగా ఉంటాయి. బెన్‌టోటా బీచ్, ట్రింకోమలీ సమీపంలోని నీలవెళ్లి తీరం, తూర్పుతీరంలోని అరుగమ్, పస్సికూడ, దక్షిణ తీరంలోని మిరిస్సా తదితర బీచ్‌లు సంద్రంలో సాహసక్రీడలకు అడ్డాగా నిలుస్తున్నాయి.

- కొలొంబోకు 153 కి.మీ దూరంలోని మిరిస్సా తీరానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడి నుంచి బోట్‌లో సముద్రంలోకి వెళ్తే.. బ్లూవేల్స్ ఉన్న ప్రాంతానికి చేరుకోవచ్చు. ఆ భారీ జలచరాలు పల్టీలు కొట్టడాన్ని చూడొచ్చు.

రూ.20వేలకే

శ్రీలంక పర్యటన ప్యాకేజీలు చాలానే ఉన్నాయి. చాలా పర్యాటక సంస్థలు 'శ్రీలంకలో రామాయణ యాత్ర' పేరిట ప్యాకేజీలు నిర్వహిస్తున్నాయి. ప్యాకేజీల ధరలు రూ.20వేల నుంచి రూ.75వేల వరకు ఉంటున్నాయి.

లంకలో రామాయణం

సుందరకాండలో శ్రీలంకను వాల్మీకి సుందరమైన ప్రదేశంగా వర్ణించారు. అందుకు తగ్గట్టుగానే పర్వతాలు, లోయలు, నదులు, పచ్చదనంతో లంక ఎంతో అందంగా ఉంటుంది. వీటి మధ్యలో రామాయణగాథకు సంబంధం ఉన్నాయని చెప్పే ప్రాంతాలు కనిపిస్తుంటాయి.

- ఆంజనేయుడు లంకలో తొలిసారిగా రంబోడా అనే ప్రాంతంలో అడుగుపెట్టాడట. ఇక్కడ హనుమంతుడి భవ్యమందిరం కూడా ఉంది. ఇక్కడి జలపాతం మనోహరంగా ఉంటుంది. కాండీ నగరం నుంచి రంబోడాకు సుమారు 50 కిలోమీటర్లు.



- సీతమ్మను రావణుడు తీసుకొచ్చిన మార్గంగా 'సీత ఎలియా' పేరు చెబుతారు. సీతమ్మను బంధించి ఉంచిన అశోకవనం కూడా ఇక్కడికి సమీపంలోనే ఉంటుంది. ఇక్కడే ఆంజనేయుడి పాదముద్రలు కూడా కనిపిస్తాయి. ఈ ప్రాంతాలను చూసేందుకు పర్యాటకులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. ఇక్కడ సీతమ్మవారి ఆలయం కూడా ఉంది. కాండీ నుంచి సీత ఎలియా 80 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
- ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్ర ప్రయోగానికి మూర్ఛిల్లిన లక్ష్మణుడిని కాపాడటానికి ఆంజనేయుడు హిమాలయాలకు వెళ్లి సంజీవని పర్వతం తెచ్చాడని రామాయణంలో చదివాం. ఆ సంజీవని పర్వతంలో కొంత భాగం పడిన ప్రాంతంగా రితిగల పేరు చెబుతారు. ఇక్కడి పర్వతంపై అనేక ఔషధ వృక్షాలు నేటికీ కనిపిస్తాయి. లంకలోని ప్రముఖ పర్యాటక కేంద్రం సిగిరియా నుంచి రితిగల 45 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
- ఇవేకాకుండా నువార ఏలియా సమీపంలోని రావణ గుహలు, రావణుడి కాలానికి చెందిన సొరంగ మార్గాలు, రావణ జలపాతం, కొలొంబో దగ్గర్లోని విభీషణ ఆలయం, చిలా సమీపంలోని లంకేశ్వరుడి కాలంనాటి విమానాశ్రయంగా చెప్పే గుర్లపోతా తదితర ప్రదేశాలెన్నో నాటి రామయణ ఘట్టాలను ప్రతిబింబిస్తాయి.

మందలు మందలుగా..

వన్యమృగాల ప్రేమికులకు లంక పర్యటన మధురానుభూతిని అందిస్తుంది. దట్టమైన అడవులు, నదీనదాలు ఈ ద్వీపాన్ని పర్యావరణ కేంద్రంగా నిలబెట్టాయి. దంబుల్లాకు 30 కిలోమీటర్ల దూరంలో మిన్నేరియా నేషనల్ పార్క్‌లో ఏనుగులు మందలు మందలుగా సంచరిస్తుంటాయి. సిగిరియా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలోనూ ఏనుగులను చూడొచ్చు. శ్రీలంక దక్షిణ తీరంలోని యల నేషనల్ పార్క్ జీవ వైవిధ్యానికి పట్టుగొమ్మ. ఏనుగులు, ఎలుగుబంట్లు, చిరుతలు, జడలబర్రెలు ఇక్కడ ఎక్కువగా కనిపిస్తాయి. జూన్ నుంచి సెప్టెంబర్ సందర్శకుల తాకిడి ఉంటుంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యాటకులను లోనికి అనుమతిస్తారు. ఇక్కడ సఫారీ భలేగా సాగుతుంది.

సొంతంగా వెళ్లాలంటే?

హైదరాబాద్ నుంచి శ్రీలంక నాన్‌స్టాప్, సింగిల్‌స్టాప్ విమాన సర్వీసులు, విజయవాడ, విశాఖపట్టణం నుంచి సింగిల్‌స్టాప్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. చెన్నై నుంచి విమానాలు ఎక్కువగా అందుబాటులో ఉంటాయి. టికెట్ ఛార్జీలు రూ.4,200 నుంచి రూ.15,000 వరకు ఉంటాయి.

వీసా సులభం

శ్రీలంక వీసా ఆన్‌లైన్‌లో పొందవచ్చు. ఈటీఏ (ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్) వీసా కోసం కనీసం ఆరునెలల గడువు ఉన్న పాస్‌పోర్ట్, వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం ఉండాలి. రూ.1800 ఆన్‌లైన్‌లో కట్టాల్సి ఉంటుంది. వారం రోజుల్లో వీసా లభిస్తుంది. 30 రోజుల గడువుతో, రెండుసార్లు వెళ్లే సౌలభ్యం కల్పిస్తారు. వీసా కోసం http://www.eta.gov.lk వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అడుగడుగున ఆరామం



భారత్ నుంచి లంకలోకి ప్రవేశించిన బౌద్ధధర్మం అక్కడ విశేష ప్రాచుర్యం పొందింది. నేటికీ అక్కడ బుద్ధిజం ప్రభావం తగ్గలేదు.. ఆనాటి బౌద్ధ ఆరామాల ప్రాభవం తగ్గలేదు. లంక జనాభాలో దాదాపు 70 శాతం మంది బౌద్ధ మతస్థులే! ఇందుకు తగ్గట్టుగా లంకలో బౌద్ధ ఆరామాలు కోకొల్లలు. శతాబ్దాల పాటు లంక రాజధానిగా వెలుగొందిన అనురాధపురలో చారిత్రక ఆలయాలు ఎన్నో ఉన్నాయి. దంబుల్లాలోని గుహాలయాలు ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందాయి. 150 మీటర్ల ఎత్తున్న గుహాలయాల్లో బుద్ధుడి ప్రతిమలు విశేషంగా ఆకర్షిస్తాయి. ఇక్కడే గోల్డెన్ బుద్ధ ఆలయాన్ని కూడా సందర్శించవచ్చు.

ఏ వీసా ఎన్ని రోజుల్లో..

విదేశాలకు వెళ్లే ఆలోచనలో ఉన్నారా? ఏ దేశానికేగినా వీసా తప్పనిసరి! విహారానికి వీసా పొందడం పెద్ద కష్టమేం కాదు. కాకపోతే వివిధ దేశాల వీసా పొందడానికి ఎప్పుడు దరఖాస్తు చేయాలి? ఫీజు ఎంత? ప్రక్రియ ఎన్ని రోజుల్లో ముగుస్తుంది? తదితర వివరాలు తెలుసుకుని ఉండటం మంచిది.

మలేసియా
దరఖాస్తు ఎప్పుడు: 1 నెల ముందు
వీసా ఇంటర్వ్యూ: తప్పనిసరి
రుసుము: రూ.6,000
ప్రక్రియ ముగింపు: 4–5 రోజులు

రష్యా
దరఖాస్తు ఎప్పుడు: మూడు వారాల ముందు
వీసా ఇంటర్వ్యూ: తప్పనిసరి
రుసుము: రూ.2,480 (ఒకసారి ప్రవేశానికి) రూ.8,980 (ఎన్నిసార్లయినా వెళ్లొచ్చు)
ప్రక్రియ ముగింపు: రెండు వారాలు

యుకె
దరఖాస్తు ఎప్పుడు: మూడు నెలల ముందు
వీసా ఇంటర్వ్యూ: తప్పనిసరి
రుసుము: రూ.8,300
ప్రక్రియ ముగింపు: మూడు వారాలు

ఆస్ట్రేలియా
దరఖాస్తు ఎప్పుడు: నాలుగు వారాల ముందు
వీసా ఇంటర్వ్యూ: తప్పనిసరి
రుసుము: రూ.7,500
ప్రక్రియ ముగింపు: 29 రోజులు

జర్మనీ
దరఖాస్తు ఎప్పుడు: మూడు వారాల ముందు
వీసా ఇంటర్వ్యూ: తప్పనిసరి
రుసుము: రూ.4,900
ప్రక్రియ ముగింపు: 15 పనిదినాలు

థాయ్‌లాండ్
దరఖాస్తు ఎప్పుడు: ఒక వారం ముందుగా
వీసా ఇంటర్వ్యూ: అవసరం లేదు
రుసుము: రూ. 2,500
ప్రక్రియ ముగింపు: మూడు పనిదినాలు

అమెరికా
దరఖాస్తు ఎప్పుడు: మూడు నెలల ముందు
వీసా ఇంటర్వ్యూ: తప్పనిసరి
రుసుము: రూ.11,200
ప్రక్రియ ముగింపు: 60 రోజులు

ట్రిప్‌కో టిప్

విహారకేంద్రాల్లో చాలావరకు చెల్లింపులు కార్డుతో జరిగేలా చూడాలి. క్యాష్‌బ్యాక్ ఆఫర్లను వినియోగించుకోండి. మీ కార్డులోని రీడీమ్ పాయింట్లను విరివిగా వాడుకోండి. అలాగే కూపన్స్ ఉన్నా.. ఉపయోగించండి. దేశవిదేశాల్లో చెల్లుబాటయ్యే విధంగా ట్రావెల్‌కార్డులు దొరుకుతాయి. వాటిని వాడటం అన్ని విధాల మంచిది. కార్డు పోయినా.. డబ్బు పదిలంగా ఉంటుంది. అయితే, కార్డు పిన్ నెంబర్‌ను బయటకు చెప్పడం, కార్డు మరచిపోవడం వంటివి చేయకండి.

బాప్‌రే బాప్... ప్రతీసేవకో యాప్

టికెట్ బుకింగ్ కోసం ఓ యాప్! రద్దు చేయడానికో యాప్! రైల్లో భోజనం కావాలంటే మరో యాప్! బోగీ శుభ్రం చేయాడానికీ యాప్! ఇప్పుడు రైల్వే సేవలన్నీ అప్లికేషన్ల చుట్టూ తిరుగుతున్నాయి. ఆటల్లో, పాటల్లో రోజుకో అప్లికేషన్ వచ్చినట్టే.. రైల్వేలోనూ కొత్త కొత్త యాప్‌లు పట్టాలెక్కుతున్నాయి. భారతీయ రైల్వేకు అనుబంధంగా గూగుల్ ప్లేస్టోర్‌లో దాదాపు 250 యాప్‌లు ఉన్నాయంటే.. ఆశ్చర్యం కలగక మానదు. వీటిలో కేవలం 50 అప్లికేషన్లు రైల్వే, అనుబంధ సంస్థలు నిర్వహిస్తుంటే.. మిగతా 200 అప్లికేషన్లు ప్రైవేట్ సంస్థలు, స్టార్టప్‌లు రూపొందించినవి కావడం విశేషం! డిజిటల్ ఇండియా నేపథ్యంలో అప్లికేషన్ల పర్వం మరింత ఊపందుకుంది. టికెట్ బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ యాప్, బోగీలు శుభ్రం చేయడానికి రైల్ సార్థీ (RAIL SAARTHI), ఆహారం ఆర్డర్ చేయడానికి ఫుడ్ ఆన్ ట్రాక్ (Food on Track), పార్సిల్ పంపడానికి బుకింగ్ కోసం రైల్వేస్ పార్సిల్ (Railways Parcel) ఇలా రకరకాల అప్లికేషన్లు యాప్‌స్టోర్‌లో చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఈనెల 13న రైల్వేశాఖ యూటీఎస్ ఆన్ మొబైల్ (UTS on mobile app) అప్లికేషన్‌ని విడుదల చేసింది. ఈ యాప్ సహాయంతో కన్‌ఫర్మ్ కాని టికెట్లను రద్దు చేయొచ్చు, సీజనల్, ప్లాట్‌ఫామ్ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఇబ్బడిముబ్బడిగా వస్తున్న యాప్‌లను ఆదరిస్తున్న వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంటోంది. ఐఆర్‌సీటీసీ, అనుబంధ అప్లికేషన్లను రోజుకు 30 వేల మంది వరకు ఇన్‌స్టాల్ చేసుకుంటున్నట్లు రైల్వేశాఖ చెబుతోంది. అయితే, ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉన్న అప్లికేషన్లలో ఏది రైల్వేశాఖ నిర్వహిస్తున్నదో, ఏది బయటి సంస్థలు రూపొందించినదో వినియోగదారులు గుర్తించాలి. ఏదేమైనా యాప్‌ల సహకారంతో రైల్వే సేవలు చాలామందికి దగ్గరవుతున్నాయి.

పోటీ లేకుండా.. చాటి చెప్పేలా!

పంపా నది పరవళ్లు.. అంతకుమించి అలరించే పంచవాద్యాల హోరు.. దీనిని మించి అబ్బురపరిచే పాముల్లాంటి పడవలు.. వాటిని జోరుగా నడిపిస్తూ 'తయ్యారే తయ్యా.. ఆరన్మూల పల్లియోడమ్' అంటూ ఎలుగెత్తి పాడే సరంగులు.. ఈ సందడిని వీక్షించడానికి కేరళలో ఓ మూలన ఉండే ఆరన్మూల గ్రామానికి వేలమంది పర్యాటకులు తరలి వెళ్తుంటారు. ఏటా ఓనమ్ పండగ సందర్భంగా ఆగస్ట్-సెప్టెంబర్ మధ్య పల్లియోడమ్ పోటీలు (స్నేక్ బోట్ రేస్) నిర్వహిస్తారు. ఇదే సమయంలో ఆరన్మూల క్షేత్రంలో కొలువుదీరిన పార్థసారథుడి ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయి. ప్రతి సంవత్సరం పోటాపోటీగా సాగే పడవ పందేలు ఈ దఫా ఎలాంటి పోటీ లేకుండా నిర్వహించాలని నిర్ణయించారు. పోటీ జోరులో పడి సంప్రదాయ వేడుక గాడి తప్పుతోందని భావించిన ఆలయ సంఘం, పల్లియోడమ్ సంఘాలు పందేలకు స్వస్తి పలికాయి. ఆరన్మూలలో కొలువుదీరిన పార్థసారథిని కీర్తిస్తూ.. పల్లియోడమ్ ఉత్సవాలు శతాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆరన్మూల, చుట్టుపక్కల గ్రామాల నుంచి పడవలు నడిపే బృందాలు పదుల సంఖ్యలో వచ్చి పాల్గొంటుంటాయి. కాలక్రమంలో ఉత్సవాలు కాస్తా పందేలుగా మారాయి. ఆటపాటలతో అలరిస్తుండటంతో వీటిని చూసేందుకు జనాలు విపరీతంగా వచ్చేవారు. గెలిచిన వారికి జ్ఞాపికలు, నగదు బహుమానం కూడా ఇచ్చేవారు. అయితే పోటీ సంప్రదాయానికి తెరదించాలని ఇటీవల నిర్ణయించారు. కేరళ సంస్కృతి, సంప్రదాయాలు చాటిచెప్పేలా పోటీలు జరుగుతాయని పార్థసారథి ఆలయ పెద్దలు చెబుతున్నారు.

నే పోతున్నా..!

- అంతర్జాతీయ ఒప్పందాల నుంచి తప్పుకుంటున్న అమెరికా
- తాజాగా ఐరాస మానవ హక్కుల మండలికి చెల్లు చీటీ
- ఇదంతా 'ట్రంప్'రితనమే..
- ప్రపంచ రాజకీయాల్లో అనూహ్య మార్పు

అంతర్జాతీయ ఒప్పందాల నుంచి క్రమంగా అమెరికా తప్పుకుంటోంది. దీనికి సూత్రధారి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఒబామా హయాంలో అమెరికాతో సహా 12 దేశాలు ఎన్నో దఫాలుగా సంప్రదింపుల తర్వాత కుదుర్చుకున్న ట్రాన్స్- పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం నుంచి ట్రంప్ అధికారంలోకి రాగానే తప్పుకున్నారు. తాజాగా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి నుంచి అమెరికా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ రెండింటి మధ్యకాలంలో అమెరికా గతంలో కుదుర్చుకున్న ఎన్నో వర్తక, పర్యావరణ, రక్షణ ఒప్పందాల నుంచి ట్రంప్ వైదొలిగారు. దీంతో అగ్రరాజ్యమే అర్థాంతరంగా దీర్ఘకాలిక ఒప్పందాల నుంచి వైదొలగటమేమిటని...? ప్రశ్నించే వారి సంఖ్య పెరిగిపోతోంది. ఈ నిర్ణయాల ఫలితంగా అమెరికా ప్రతిష్ఠ మసకబారిపోతుందని హెచ్చరిస్తున్నా ట్రంప్ పట్టించుకోవటం లేదు. 'అమెరికా ఫస్ట్' అని గిరిగీసుకొని తనకు తోచిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇదే వైఖరిని కొనసాగిస్తే ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణలు సమూలంగా మారిపోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వివిధ ఒప్పందాల నుంచి అమెరికా తప్పుకుంటున్న చోట చైనా అడుగుపెట్టే అవకాశం ఉన్నట్లు హెచ్చరిస్తున్నారు.

ట్రాన్స్- పసిఫిక్ భాగస్వామ్యానికి చెల్లు

ఇది ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్న కాలంలో కుదిరింది. ఆసియా దేశాలపై చైనా ఆర్థిక పెత్తనం ఉండకూడదని, ఆ దేశాల్లో అమెరికా ఆధిపత్యం కొనసాగాలని దీనికి శ్రీకారం చుట్టారు. ప్రపంచ జీడీపీలో 40% వాటా ఉన్న 12 దేశాలు ఈ ఒప్పందంలో భాగం పంచుకున్నాయి. అమెరికాతో పాటు కెనడా, ఆస్ట్రేలియా, జపాన్, సింగపూర్, మలేషియా, కెనడా తదితర దేశాలు ఇందులో ఉన్నాయి. కానీ ఈ ఒప్పందం అమెరికా ప్రయోజనాలకు విరుద్ధమని, అమెరికా కంపెనీలు ఇతర దేశాలకు తరలిపోతాయని ట్రంప్ విమర్శించారు. టీపీపీ నుంచి వైదొలిగారు.

నాఫ్టా

ఉత్తర అమెరికా దేశాలైన కెనడా, అమెరికా, మెక్సికో దేశాల మధ్య హద్దులు లేని వర్తకం కోసం ఉద్దేశించిన ఒప్పందమే ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (నాఫ్టా). 1994లో ఇది అమల్లోకి వచ్చింది. దీనివల్ల కెనడా, మెక్సికోతో తన వర్తకాన్ని అమెరికా మూడింతలు పెంచుకుంది. ట్రంప్ నాఫ్టా నిబంధనలు మార్చడానికి సంప్రదింపులు ప్రారంభించారు. అంటే ప్రస్తుత ఒప్పందాన్ని వద్దనుకున్నట్లే.

అమెరికా- దక్షిణ కొరియా

అమెరికాకు 12 దేశాలతో ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఉన్నాయి. దక్షిణా కొరియాతో కుదుర్చుకున్న 'కోరస్' కూడా ఇటువంటిదే. ఇంతటి దారుణమైన వర్తక ఒప్పందం లేదు- అన్ని ట్రంప్ మూడు నెలల నుంచి దీనిపై విరుచుకుపడుతున్నారు. దీని నుంచి ఏకపక్షంగా వైదొలుగుతామని బెదిరిస్తున్నారు. ఉత్తర కొరియా బూచిని చూపిస్తూ..., దక్షిణ కొరియాకు తమ మద్దతు ఉండాలంటే ఈ వర్తక ఒప్పందం నిబంధనలను మార్చాలని స్పష్టం చేస్తున్నారు.

ట్రాన్స్ పసిఫిక్ భాగస్వామ్యం (టీపీపీ) నుంచి వైదొలుగుతూ గత ఏడాది జనవరిలో అధికారిక ఉత్తర్వు మీద సంతకం చేసిన ట్రంప్

కెనడాపై కన్నెర్ర!

అమెరికా పొరుగుదేశమే కెనడా. అసలు ఈ రెండు దేశాలు వేరు వేరు కాదు... అనుకునే విధంగా అమెరికా, కెనడా మధ్య బలమైన సామాజిక, ఆర్థిక, రక్షణ బంధం ఉంది. అందుకే రెండు దేశాల మధ్య బలమైన రక్షణ సంబంధాలు ఏర్పడ్డాయి. అవి వర్తకానికీ విస్తరించాయి. కానీ ట్రంప్ తాజాగా కెనడా స్టీలు, అల్యూమినియంపై అదనపు సుంకాలు విధిస్తానని హెచ్చరించటం కెనడాను దిగ్భ్రాంతికి గురిచేసింది. దీన్ని అమర్యాదకరమైన చర్యగా కెనడా అధ్యక్షుడు జస్టిన్ ట్రూడెవ్ అభివర్ణించారు.

ఇరాన్ అణు ఇరకాటం

ఎంతో కష్టపడి 2015లో ఇరాన్‌తో కుదుర్చుకున్న అణు ఒప్పందం నుంచి గత నెలలో అమెరికా వైదొలగింది. ఇరాన్‌తో అణు ఒప్పందం విషయంలో అప్పట్లో అమెరికాతో పాటు ఎన్నో ఐరోపా దేశాల శ్రమించాయి. దీన్ని చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించాయి. కానీ ట్రంప్ దానికి గండికొట్టారు.

పారిస్ వాతావరణ ఒప్పందం

ప్రపంచ దేశాల మధ్య ఎన్నో దఫాలుగా జరిగిన చర్చల ఫలితమే పారిస్ వాతావరణ ఒప్పందం. ఈ ఒప్పందం కుదుర్చుకోవటంలో ఒబామా క్రియాశీలకమైన పాత్ర పోషించారు. పర్యావరణాన్ని కాపాడుకోవటానికి, తద్వారా ఈ భూమండలాన్ని రక్షించుకోవటానికి 2020 నుంచి చేపట్టాల్సిన చర్యలపై దేశాలన్నీ ఒక అవగాహనకు వచ్చి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కానీ ఇది అమెరికా ప్రయోజనాలకు నష్టదాయకమని విమర్శలకు దిగారు. అంతటితో ఊరుకోలేదు. గత ఏడాది జూన్ 1న ఈ ఒప్పందం నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

నాటో కూటమి

జీ7 కూటమిపై ఇటీవల విమర్శలతో విరుచుకుపడిన డోనాల్డ్ ట్రంప్, ఇక తన అస్త్రాలను 'నాటో'పై ఎక్కు పెడతారని అనుకుంటున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కమ్యూనిస్టు కూటమి దేశాలను ఐక్యంగా ఎదుర్కొనటానికి అమెరికా, నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) ను సృష్టించింది. ఇది 29 దేశాల మధ్య కుదిరిన రక్షణ ఒప్పందం. ఏదైనా సభ్య దేశం రక్షణ ప్రయోజనాలకు భంగం కలిగితే, అన్ని దేశాల సైన్యాలు ఉమ్మడిగా శత్రుదేశంపై దాడిచేస్తాయి. ఈ ఒప్పందంలోని ప్రధానాంశం ఇదే. నాటోను అడ్డుపెట్టుకొని అమెరికా ఎన్నో దేశాలపై దాడులకు దిగిన విషయం జగద్విదితమే. ఎన్నో దశాబ్దాల పాటు నాటోను తన జేబు సంస్థగా వాడుకుంది. దీనిపైనా ట్రంప్ కన్నుపడింది. వచ్చే నెలలో జరగనున్న నాటో సమావేశం సందర్భంగా తమ ఐక్యతను బలంగా ప్రపంచానికి చాటి చెప్పటానికి బదులు ట్రంప్ ఏ పుల్ల పెడతాడోనని... నాటో కూటమి దేశాలు ఆందోళనకు గురవుతున్నాయి.

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి

ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడిన ప్రపంచ స్థాయి సంస్థ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనపై దర్యాప్తు చేయటం, దిద్దుబాటు చర్యలు సిఫార్సు చేయటం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాలు. ఈ అత్యున్నత స్థాయి హక్కుల మండలి నుంచి తాజాగా అమెరికా వైదొలిగింది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే ఈ సంస్థలో తాము ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీనికి రాజకీయ పక్షపాతం ఉందని ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధిగా ఉన్న నిక్కీ హేలీ వ్యాఖ్యానించారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

'సాదాబైనామా' భూముల క్రమబద్ధీకరణ

ఈనాడు అమరావతి: సన్న, చిన్నకారు రైతుల సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణకు గురువారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. 2.5 ఎకరాల మాగాణి లేదా ఐదు ఎకరాల మెట్ట పొలం కలిగిన చిన్న రైతులకు ఇది వర్తిస్తుంది. 1.25 ఎకరాల మాగాణి లేదా 2.5 ఎకరాల మెట్ట కలిగిన వారు కూడా సన్నకారు రైతులై ఉండి...2014 జూన్ 2నాటికి ముందు జరిగిన 'అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్' ఒప్పందాలకు మాత్రమే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. ఈ సౌకర్యాన్ని పొందాలనుకునే వారు ముందుగా తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేసుకోవాలి. వారు పరిశీలన చేసి వాస్తవమని తేలితే సంబంధిత రైతు పేరుపై తహశీల్దార్ క్రమబద్ధీకరిస్తారు. వీరికి స్టాంపు డ్యూటీ నుంచి మినహాయింపు లభిస్తుందని ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి వెల్లడించారు. గ్రామీణ ప్రాంత రైతులకు మాత్రమే ఈ నిర్ణయం వర్తిస్తుందన్నారు. స్టాంపుడ్యూటీ రూ.5వేలలోపు ఉంటేనే బదలాయింపు, రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఇంతకంటే ఎక్కువగా ఉంటే సంబంధితుల నుంచి వసూలు చేస్తారు.

ఉద్యోగ భద్రత కోరుతూ రిలే నిరాహార దీక్షలు

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆయుష్ పారా మెడికల్ సిబ్బంది గత 12 రోజుల నుంచి విజయవాడలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని అర్థిస్తున్నారు. ఉద్యోగ భద్రత లేకుండాపోవడంతోపాటు వేతనాల చెల్లింపులు జరగనందున సుమారు 1000 కుటుంబాలు రోడ్డునపడ్డాయని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు: మంత్రి శిద్ధా

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని 3,250 పర్యావరణ క్లబ్‌ల సహకారంతో పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు తెలిపారు. ప్లాస్టిక్ రహిత పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏపీ జాతీయ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో బీచ్‌లు, హార్బర్లు, నదులు, ఇతర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు గురువారం ఓ ప్రకటనలో వివరించారు.

నాయీబ్రాహ్మణుల ముసుగులో సీఎంపై దాడికి యత్నం

నాయీబ్రాహ్మణ సమాఖ్య ఛైర్మన్ నాగేశ్వరరావు వెల్లడి

ఈనాడు, అమరావతి: నాయీబ్రాహ్మణుల ముసుగులో కడప జిల్లా పులివెందులకు చెందిన సుబ్బారెడ్డి, యాదయ్యలు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుపై దాడికి ప్రయత్నించారని నాయీబ్రాహ్మణ సమాఖ్య ఛైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు చెప్పారు. తెదేపాకు వెన్నెముకగా నిలిచిన నాయీబ్రాహ్మణులను పార్టీ నుంచి దూరం చేయాలనే కుట్రలో భాగంగానే వైకాపా నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

హిందూ-ముస్లిం జంటతో అమర్యాదకర ప్రవర్తన

ట్విటర్ ద్వారా సుష్మాస్వరాజ్ సాయం కోరిన బాధితురాలు

లఖ్‌నవూ, దిల్లీ: మతాంతర వివాహం చేసుకున్న ఓ జంట పట్ల అవమానకరంగా ప్రవర్తించిన పాస్‌పోర్టు సేవాకేంద్రం అధికారి ఒకరు తగిన మూల్యం చెల్లించుకున్నారు! ముస్లిం వ్యక్తిని పెళ్లి చేసుకున్నందుకు హిందూ మహిళను మందలించిన ఆయనపై బదిలీ వేటుపడింది. విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ జోక్యంతో దంపతులకు పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. మహమ్మద్ అనాస్ సిద్దిఖీ, తన్వీ సేత్ 12 ఏళ్లక్రితం వివాహం చేసుకున్నారు. పాస్‌పోర్టుల కోసం బుధవారం వారు లఖ్‌నవూలోని సేవాకేంద్రానికి వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న వికాస్ మిశ్ర అవమానించారు. మతం మార్చుకొని వస్తేనే పాస్‌పోర్టు జారీ చేస్తామని సిద్దిఖీకి తేల్చిచెప్పారు. వివాహం తర్వాత ఇంటిపేరు ఎందుకు మార్చుకోలేదని గద్దించారు. దీంతో తీవ్రంగా నొచ్చుకున్న తన్వీ.. సుష్మాస్వరాజ్‌కు విషయాన్ని వివరిస్తూ ట్విటర్‌లో పోస్ట్ పెట్టారు. దీంతో వికాస్‌పై గురువారం బదిలీ వేటు పడింది. మరోవైపు, వికాస్ 'నిఖానామా'లో తన్వీ పేరు వేరుగా ఉండటంతో పేరు మార్చుకోవాలని మాత్రమే తాను సూచించానని తెలిపారు.

భారత సంతతి వైద్యుడికి పట్టం

- దిగ్గజ సంస్థల సంయుక్త భాగస్వామ్య సంస్థకు నాయకత్వం

దిల్లీ: భారత సంతతి వైద్యుడు, పాత్రికేయుడు అతుల్ గవాండేకు అమెరికాలో అరుదైన గౌరవం దక్కింది. లాభాపేక్ష లేని తమ కొత్త ఆరోగ్యపరిరక్షణ జాయింట్ వెంచర్‌కు నాయకుడిగా గవాండేను అమెజాన్, బెర్క్‌షైర్ హాథ్‌వే, జేపీ మోర్గాన్ సంస్థలు ఎంపిక చేశాయి. ఆరోగ్యపరిరక్షణను మెరుగుపరచడం, వైద్య ఖర్చులను తగ్గించడం ఈ కొత్త వెంచర్ లక్ష్యం. ఇది బోస్టన్ కేంద్రంగా పనిచేస్తుంది. ఆరోగ్య పరిరక్షణపై పెరుగుతున్న వ్యయాలను కట్టడి చేయడంలో అమెరికా విఫలమైందంటూ గవాండే పలు కథనాలు రాశారు. ఆయన బ్రిగ్‌హామ్ అండ్ విమెన్స్ హాస్పటల్‌లో జనరల్, ఎండోక్రైన్ శస్త్రచికిత్స నిపుణుడిగా పనిచేస్తున్నారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో ప్రొఫెసర్‌గానూ వ్యవహరిస్తున్నారు. అత్యంత ప్రజాదరణ పొందిన అనేక పుస్తకాలను ఆయన రాశారు. ఆయన బ్రూక్లిన్‌లో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వలస వెళ్లారు.

దరఖాస్తుదారు మరణించినా విచారణ కొనసాగింపు

- నిర్ణయం తీసుకున్న సమాచార కమిషన్

దిల్లీ: సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసిన వ్యక్తి మరణించిన తర్వాత కూడా ఆ దరాఖస్తుపై సమాచార కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. సమాచారం ఇవ్వడంలో ప్రభుత్వ విభాగాలు ఇబ్బంది పెడితే దరఖాస్తుదారులు కేంద్ర సమాచార కమిషన్‌కు అప్పీల్ చేసుకోవడానికి చట్టం అనుమతిస్తోంది. 2017లో ఖరారు చేసిన నిబంధనల ప్రకారం.. దరఖాస్తుదారు మరణిస్తే సమాచార కమిషన్.. తన వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రక్రియను ఆపివేయవచ్చు. ప్రభుత్వ విభాగాల్లో అవకతవకలు, కుంభకోణాలకు సంబంధించిన సమాచారాన్ని కోరిన కొందరు సమాచార హక్కు కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు సమాచార హక్కు కార్యకర్తలు 2017 నిబంధనలను వ్యతిరేకించారు. కేంద్ర సమాచార కమిషన్ ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంది. దరఖాస్తుదారు మరణించినా సంబంధిత కేసును యథావిధిగా విచారించాలని ఇటీవల నిర్వహించిన సమావేశంలో నిర్ణయించింది. సంబంధిత దరఖాస్తుపై తీసుకున్న నిర్ణయాన్ని కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

మోన్‌శాంటో మందు వల్లే నాకు క్యాన్సర్

- అమెరికాలో ఓ వ్యక్తి దావా
- వేగంగా విచారణకు తీసుకున్న కోర్టు

శాన్ ఫ్రాన్సిస్కో: అమెరికాలో క్యాన్సర్‌తో అంపశయ్య మీదున్న ఓ వ్యక్తి.. వ్యవసాయ రసాయన దిగ్గజం మోన్‌శాంటోపై దావా వేశారు. ఆ సంస్థ ఉత్పత్తి చేసిన 'రౌండప్' అనే కలుపుమొక్కల నాశని వల్లే తనకు ఈ వ్యాధి వచ్చినట్లు ఆయన ఆరోపించారు. ఇది అమెరికాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనికి పరిహారాన్ని చెల్లించాల్సి వస్తే మోన్‌శాంటోకు భారీ నష్టాలు తప్పవని విశ్లేషకులు చెబుతున్నారు. 'రౌండప్'లో ప్రధానంగా గ్లైఫాసేట్ ఉంటుంది. ఇది అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్‌కారకమని కొందరు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వ నియంత్రణ సంస్థలు, ఆరోగ్య నిపుణులు, న్యాయవాదుల మధ్య ఎడతెగని చర్చ జరుగుతోంది. ఒక పాఠశాలలో గ్రౌండ్‌కీపర్‌గా పనిచేసినప్పుడు 2012 నుంచి రెండేళ్లపాటు ఆ రసాయనాన్ని ఉపయోగించానని డెవేన్ జాన్సన్ (46) చెప్పాడు. 2014లో ఆయనకు 'నాన్ హాడ్కిన్ లింఫోమా' అనే క్యాన్సర్ వచ్చింది. రెండేళ్ల తర్వాత ఆయన పనిచేయలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో ఆయన మోన్‌శాంటో మీద దావా వేశాడు. అమెరికాలో ఇప్పటికే మోన్‌శాంటోపై వేలాది దావాలున్నాయి. అతడు కొన్ని నెలల పాటే జీవించే అవకాశం ఉన్నందువల్ల ఈ కేసును వేగంగా విచారణకు చేపట్టినట్లు చెప్పారు. వచ్చే వారమే ఇది ప్రారంభం కానుందని తెలిపారు. గ్లైఫాసేట్‌ను 'క్యాన్సర్ కారకం కావొచ్చు' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు చెందిన అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధక సంస్థ వర్గీకరించింది. ఐరోపా ఆహార భద్రత, రసాయన సంస్థలు కూడా ఇదే రీతిలో పేర్కొన్నాయి. అమెరికా ఆరోగ్య అధ్యయన శాఖ మాత్రం.. ఆ రసాయనంలో విషతుల్యత పరిమితంగానే ఉందని పేర్కొంది. క్యాన్సర్‌కు గ్లైఫాసేట్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేదని మోన్‌శాంటో వాదిస్తోంది.

మలేసియాలో సెల్‌ఫోన్ పేలి.. 'క్రాడిల్ ఫండ్' సంస్థ సీఈఓ మృతి

దిల్లీ: మలేసియాలో అంకుర సంస్థలను ప్రోత్సహించే క్రాడిల్ ఫండ్ సంస్థ సీఈఓ నజ్రీన్ హసన్ (45).. సెల్‌ఫోన్ పేలుడు కారణంగా మృత్యువాతపడ్డారు. ఆయన పడక గదిలో రెండు ఫోన్లు ఛార్జింగ్ పెట్టగా.. వాటిలో ఒకటి విస్ఫోటనం చెంది మంటలు అంటుకున్నాయి. గదిలో చిక్కుకుపోయి పొగ వల్ల ఊపిరాడక హసన్ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. గతవారం ఈ ఘటన జరిగినట్లు వెల్లడించారు. హసన్‌కు బ్లాక్‌బెర్రీ, హువావే సంస్థల ఫోన్లు ఉన్నాయని.. వీటిలో ఏది పేలిందన్న విషయం ఇంకా తెలియదని ఆయన బంధువు తెలిపారు.

కొత్త రక్తమంటే కురువృద్ధులే..!

- యువతకు పగ్గాలపై ఆచరణలో రిక్త'హస్తం'
- అనుభవ లేమి, నిధుల కొరతతో అడ్డంకులు
- అమలు కాని రాహుల్‌గాంధీ మాట

ఈనాడు – దిల్లీ

కాంగ్రెస్‌కి జవసత్వాలు ఇచ్చేందుకు యువ రక్తాన్ని ఎక్కిస్తానని అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించినా ఆచరణలో మాత్రం కురువృద్ధులకే పెద్దపీట లభిస్తోంది. అనుభవలేమి, పార్టీకి ఆర్థిక వనరులు సమకూర్చడంలో ఎదురవుతున్న ఇబ్బందులు వంటి కారణాలతో యువతకు బదులుగా వృద్ధనేతలకే ఇటీవలి కాలంలో పలు రాష్ట్రాల్లో బాధ్యతలను అప్పగిస్తూ వస్తున్నారు. యువ నేతలకు అందలమెక్కిస్తానని ఈ ఏడాది మార్చిలో జరిగిన ప్లీనరీ సమావేశంలో రాహుల్ ప్రకటించారు. మోదీ సర్కారు లోపాలను గుర్తించి, వాటిపై ఓటర్లను ఆలోచింపజేయగల ఉత్సాహం యువ నేతల్లో ఉన్నా... పార్టీ రాష్ట్ర శాఖల్లో ఉండే అన్ని వర్గాలనూ కలుపుకొనిపోగలిగే అనుభవం వారిలో తక్కువగా కనిపిస్తోంది. ఈ ఏడాది చివర్లో నాలుగు రాష్ట్రాలకు, వచ్చే ఏడాదిలో లోక్‌సభకు జరగనున్న ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీకి నిధుల అవసరం బాగా ఉంది. వీటిని సమకూర్చే నైపుణ్యం యువతకి లేకపోవడంతో వృద్ధ తరానికే పదవులు లభిస్తున్నాయి.

ఇవిగో ఉదాహరణలు...

- ఎన్నికలకు వెళ్లబోతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి పార్టీ సారథిగా 75 ఏళ్ల కమల్‌నాథ్‌ను నియమించారు. 47 ఏళ్ల జ్యోతిరాదిత్య సింధియాని వెనక్కినెట్టారు.
- పార్టీ సంస్థాగత వ్యవహారాలు చూసే ప్రధాన కార్యదర్శి అశోక్ గహ్లోత్ (73) రాజస్థాన్‌లో కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నారు. పీసీసీ అధ్యక్షునిగా 45 ఏళ్ల సచిన్ పైలట్ ఉన్నా అక్కడ ఆయనది ద్వితీయ స్థానమే.
- ఈ రెండు రాష్ట్రాల వరకు చూస్తే జ్యోతిరాదిత్య సింధియాని గానీ, సచిన్ పైలట్‌ను గానీ సీఎం అభ్యర్థులుగానూ ప్రకటించలేదు.
- కురువృద్ధుడైన మోతీలాల్ వోరా (89)ని కోశాధికారిగా తప్పించి, కనిష్ సింగ్(40)ని ఆ స్థానంలో తీసుకువస్తారనే అంచనాలైతే ఉన్నా అదీ డోలాయమానంలో పడింది.
- ఛత్తీస్‌గఢ్‌లో భూపేష్ బాఘెల్ (58)కి ప్రత్యామ్నాయంగా కవాసీ లక్ష్మా (34) అనే నేతను రాహుల్ ప్రోత్సహిస్తూ వచ్చినా ఇప్పటికీ పగ్గాలు మాత్రం చేతులు మారలేదు.
- ఒడిశాలో ప్రసాద్ హరిచందన్ (54) బదులు నిరంజన్ పట్నాయక్ (76)ను మళ్లీ తీసుకువచ్చారు.
- కేరళ మాజీ ముఖ్యమంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఊమెన్ చాందీ (74)ని ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల బాధ్యునిగా నియమించారు.
- సోనియాగాంధీకి అత్యంత విధేయుడైన అహ్మద్ పటేల్ (68) ఇప్పటికీ జాతీయ స్థాయిలో పార్టీ వ్యూహరచన బృందంలో కీలక పాత్రధారిగానే ఉన్నారు.
- పశ్చిమబెంగాల్, అండమాన్-నికోబార్ దీవులకు పార్టీ బాధ్యునిగా ఉన్న ప్రధాన కార్యదర్శి సి.పి.జోషి (69) స్థానంలోమాత్రం గౌరవ్‌గగొయ్(35)ని నియమించారు.
- హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యునిగా ఉన్న సుశీల్‌కుమార్ శిందే (76) స్థానంలో రజనీ పాటిల్ (59)ని నియమించారు.

మారడానికి ఇష్టపడని పాత తరం

కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియాగాంధీ ఉన్నప్పుడు... 60 ఏళ్ల పైబడిన వృద్ధ నేతల్లో చాలామంది ఆమెపై అచంచల విశ్వాసం వ్యక్తం చేస్తూ వచ్చేవారు. పార్టీ వ్యవహారాల్లో రాహుల్ ప్రమేయాన్ని అంతర్గతంగా వారు వ్యతిరేకించేవారు. తప్పులు చేసినా అంత సులభంగా శిక్షలు వేయకుండా వదిలేస్తారనే ఉద్దేశంతో వీరంతా సోనియా నాయకత్వాన్ని ఇష్టపడేవారు. పార్టీ పగ్గాలను రాహుల్ చేపట్టడాన్ని వీరు ఇష్టపడలేదు. యువరక్తాన్ని పార్టీలో నింపాలని రాహుల్ నిర్ణయించుకున్నా ఇప్పటి వరకు ఆ దిశగా పడిన అడుగులు పెద్దగా లేవని పార్టీ నేత ఒకరు చెప్పారు. 2019 ఎన్నికల్లోగా దీనికి ఊపు తెచ్చే అవకాశాలూ తక్కువేనన్నారు. పంజాబ్‌లో పార్టీని అధికారంలోకి తెచ్చే బాధ్యతను పూర్తిగా కెప్టెన్ అమరీందర్‌సింగ్ భుజస్కంధాలపై వేసి విజయం సాధించిన రీతిలో ఇతరచోట్లా చేసి, ఆర్థిక ఇబ్బందులను తగ్గించుకోవాలని పార్టీ భావిస్తోంది.

ఆ వివరాలు వెల్లడిస్తే సభాహక్కుల ఉల్లంఘనా?

- రాజ్యసభ సచివాలయాన్ని ప్రశ్నించిన సీఐసీ
- జస్టిస్ నాగార్జునరెడ్డిపై అభిశంసన తీర్మానం వ్యవహారం

దిల్లీ: హైకోర్టు న్యాయమూర్తిపై అభిశంసన తీర్మానానికి సంబంధించిన రికార్డులను ఆర్టీఐ చట్టం కింద వెల్లడించడం పార్లమెంటరీ హక్కుల ఉల్లంఘన ఎలా అవుతుందో తెలపాలంటూ ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) రాజ్యసభ సచివాలయాన్ని ప్రశ్నించారు. గతంలో హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డిపై అభిశంసన తీర్మానానికి సంబంధించి.. కొన్ని వివరాలను తెలియజేయాలంటూ ఎస్.మల్లేశ్వరరావు అనే వ్యక్తి ఆర్టీఐ కింద రాజ్యసభ సచివాలయాన్ని కోరారు. దీనిపై పొందిన సమాచారంతో సంతృప్తి చెందని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీంతో వివరాలు తెలపాల్సిందిగా సీఐసీ ఆర్.కె.మాథుర్ రాజ్యసభ సచివాలయాన్ని ఆదేశించారు. ఈమేరకు సంబంధిత అధికారులు సమాధానమిస్తూ - మల్లేశ్వరరావుకు కొంత సమాచారం ఇచ్చామని, అయితే తీర్మానం నోటీసు, తీర్మానానికి మద్దతు ఉపసంహరించుకున్న సభ్యుల పేర్లు వంటివి రాజ్యసభ సెక్రటరీ జనరల్ వద్ద ఉంటాయని తెలిపారు. వాటిని వెల్లడించడానికి వీలు పడదని, అలాంటి పత్రాలు సభావ్యవహారాలకు, సభాహక్కులకు సంబంధించినవిగా పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టం, 2005 సెక్షన్ 8(1)(సి) కింద వెల్లడించడానికి వాటికి మినహాయింపు ఉన్నట్లు తెలిపారు. దీనిపై సీఐసీ రాజ్యసభ కేంద్ర ప్రజా సమాచార అధికారికి ఆదేశాలిచ్చారు.

శరీరాకృతి పాడవుతుందనే భయంతో నగర ప్రాంతపు మహిళలు చనుబాలివ్వరు

మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ వ్యాఖ్య

ఇండోర్: పట్టణ ప్రాంతపు మహిళలు తమ శరీరాకృతి పాడవుతుందనే భయంతో తమ శిశువులకు చనుబాలివ్వరని మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికీ నగరాల్లో మహిళలు.. చనుబాలిస్తే శరీరాకృతి పాడవుతుందని నమ్ముతున్నారని.. పిల్లలకు సీసాపాలు పడుతున్నారన్నారు. సీసాపాలు పడితే వారి భవిష్యత్తు కూడా సీసా లాగానే ముక్కలవుతుందన్నారు.

భార్యగా నా పేరును మోదీయే ప్రస్తావించారు

- ఆయనకు పెళ్లే కాలేదని ఆనందిబెన్ చెప్పడం దిగ్భ్రాంతికరం: జశోదాబెన్

దిల్లీ: ప్రధాని మోదీ అవివాహితుడని మధ్యప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ చేసిన వ్యాఖ్య పట్ల మోదీ సతీమణి జశోదాబెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో స్వయంగా మోదీయే అఫిడవిట్‌లో తమ వివాహం గురించి ప్రస్తావించారని గుర్తు చేశారు. "తాను వివాహితుడినని అఫిడవిట్‌లో ప్రకటించారు. ఆయన భార్యగా నా పేరు అందులో పేర్కొన్నారు. మా వివాహం గురించి ఆమె చెప్పింది దిగ్భ్రాంతికరం." అని అన్నారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆనందిబెన్ మాట్లాడుతూ నరేంద్రభాయ్‌కి పెళ్లి కాలేదని అందరికీ తెలుసు అని అన్నారు. ఈ వ్యాఖ్యలు మీడియాలో రావడంతో జశోదాబెన్ తమ వివాహం గురించి వివరణ ఇచ్చారు. ఆనందిబెన్ వ్యాఖ్యలపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. "బాగా చదువుకున్న మహిళ ఒక ఉపాధ్యాయురాలి (జశోదాబెన్ ఉపాధ్యాయురాలిగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు) గురించి ఇలా మాట్లాడడం సరికాదు. ఆమె తీరుతో ప్రధానమంత్రి ప్రతిష్ఠకు మచ్చ ఏర్పడింది. ఆయనంటే నాకెంతో గౌరవం. ఆయన నాకు రాముడు. ఆనందిబెన్ వ్యాఖ్యలు ఆయనను అవమానించడమే." అని అన్నారు.

భాజపాను చరిత్ర క్షమించదు

కశ్మీర్ పరిణామాలపై శివసేన వ్యాఖ్య

ముంబయి: జమ్ము-కశ్మీర్‌లో అరాచకాన్ని విస్తరింపజేసిన భాజపా ప్రస్తుతం అధికారం నుంచి తప్పుకొందని శివసేన విమర్శించింది. ఆ పార్టీ పదవీకాంక్షను దేశ ప్రజలెవరూ క్షమించబోరని పేర్కొంది. కశ్మీర్‌లో భాజపా వ్యవహరించిన తీరుపై ఆ పార్టీ పత్రిక 'సామ్నా' తన సంపాదకీయంలో విమర్శించింది. 'కశ్మీర్ లోయలో అరాచకాన్ని వ్యాపింపజేసి, ఆ తరువాత అధికారాన్ని విడిచిపెట్టింది. గతంలో ఎన్నడూ పరిస్థితులు ఇప్పుడంత దారుణంగా దిగజారలేదు. గతంలో ఎన్నడూ ఇంత సంఖ్యలో జవాన్లు ప్రాణాలు కోల్పోలేదు. ఇదంతా భాజపా పరిపాలనలోనే చోటుచేసుకుంది. అయితే తప్పంతా పీడీపీ నాయకురాలు మెహబూబా ముఫ్తీపై నెట్టేసింది. బ్రిటిష్ వారు కూడా ఇదే పద్ధతిలో వెళ్లిపోయారు. దేశ పరిపాలన అంటే చిన్నపిల్లల ఆట కాదు' అని వ్యాఖ్యానించింది.

ఉద్యోగ అవకాశాలు

SIR C.R. REDDY COLLEGE OF ENGINEERING
VATLURU, ELURU-534007, W.G.Dist.
Permanently Affiliated to JNTU, Kakinada
Ph: 08812-230840, 230565, website: www.sircrrengg.ac.in
WANTED FACULTY
Applications are invited from the eligible Candidates for the following Positions.
Asst. Professors : Mechanical, Mathematics
Qualification & Experience: As per AICTE norms. Higher pay for exceptional Candidates. Apply with in 7 days.
e-mail a copy to: principal.sircrrengg@gmail.com
Sd/- N.V.K. Durga Rao, SECRETARY

WANTED CIVIL ENGINEERS
Who have experience on High-rise buildings
- Senior site Engineer (Exp. 5-7 yrs.)
- Planning Engineer (Exp. 3-5 yrs.)
- Junior Engineers (Exp. 0-2 yrs.)
- Architect (Exp. 3 yrs.)
- Sr./Jr. Accountant (Exp. 5 yrs.)
THE SKIGH, Sy.No. 170, Near AP Police Headquarters, Ippatam, Tadepalli, Amaravati. Ph: 7794030800, 9177122219, Email: asksquare@gmail.com

WANTED STAFF
- Sr. Lecturer : Zoology (Experience in NEET Coaching)
- Academic Co-ordinator : (Any PG with experience)
- Mess Incharge : (Good experience in residential colleges)
- Tutors : in Maths, Physics, Chemistry
- Wardens for Boys
- Wardens, Girls Care Takers (Experienced women)
Attend INTERVIEW on 24-06-2018 (between 11 AM and 5 PM)
UMAMAHESWARA JUNIOR COLLEGE
Umamaheswara Nagar, Lawyerpet, ONGOLE.
98481 52506, 94407 90652, 94418 74989
KALYANI ADS

KVSR SIDDHARTHA COLLEGE OF PHARMACEUTICAL SCIENCES
Pinnamaneni polyclinic Road, Siddhartha Nagar, Vijayawada-10. Ph:0866-2479775
ISO 9001:2015 Certified Institution,Approved by AICTE, PCI New Delhi and Govt of AP
(Sponsored by : Siddhartha Academy of General & Technical Education, Vijayawada-10)
WANTED ASSISTANT PROFESSORS TO TEACH PHARMACY PRACTICE
QUALIFICATIONS: Pharm.D or Pharm.D (PB) or IClass M.Pharmacy (Pharmacy Practice) with reasonable good experience are eligible.
Pay commensurate with qualifications & experience.
Applications along with detailed CV and copies of certificates releating to qualifications and experience may be sent to the Secretary, Siddhartha Academy, Vijayawada-520010, within 10 days from the date of publication of this advertisement or email to siddharthaacademy75@gmail.com.
Vijayawada,Dt.:21-06-2018 (Sd/-) P.LAKSHMANA RAO Secretary

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
పటమటలంక, విజయవాడ
Cell: 80080 03297, 9959021300

సెన్సెక్స్ ▼ 115	నిఫ్టీ ▼ 31	డోజోన్స్ 24520 ▼ 139	నాస్‌డాక్ 7732 ▼ 49	రూపాయి 67.98 ▲ 10 పైసలు	ముడి చమురు 73.78 ▼
35432	10741			(ఒక అమెరికా డాలరుకు)	(బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	21న	మార్పు%
IOCL	170.25	2.93
BPCL	421.95	2.74
HPC	315.20	2.37
ICICI BANK	297.95	1.62
RELIANCE IND	1031.95	1.25
BAJAJ FINSERV	5991.55	0.74
HDFC	1858.90	0.64

గ్రహణం (-)

నిఫ్టీ	21న	మార్పు%
M&M	883.60	-2.30
TITAN COMPANY	868.40	-2.25
DR. REDDYS LAB	2316.40	-2.17
BHARTI INFRATEL	279.60	-2.00
ONGC	159.70	-1.87
POWER GRID CORP.	195.45	-1.86
INDIABULLS HSG FIN	1173.25	-1.74

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	62.04	71.94
పౌండ్ స్టెర్లింగ్	81.63	94.69
యూరో	71.71	83.18
జపనీస్ యెన్/100	56.09	65.06
ఆస్ట్రేలియా డాలరు	45.69	52.86
సింగపూర్ డాలరు	45.56	53.98
థాయ్ బాత్/100	188.29	225.25
బహ్రెయిన్ దీనార్	167.79	192.12
కువైట్ దీనార్	186.24	231.84
ఒమన్ రియాల్	163.89	188.23
సౌదీ రియాల్	16.45	19.55
యూఏఈ దిర్హమ్	16.85	19.73
మలేషియా రింగిట్	15.14	18.62
చైనీస్ యువాన్	7.44	12.06

గురువారం నిఫ్టీ కదలికలు



'సత్యం' కేసులో ఏడేళ్ల నిషేధం ఎత్తివేత

- సుప్రీం ఆదేశాల నేపథ్యంలో సెబీ నిర్ణయం

దిల్లీ: సత్యం కంప్యూటర్ సర్వీసెస్ కేసులో వివిధ సంస్థలపై విధించిన ఏడేళ్ల నిషేధాన్ని మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ ఎత్తివేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో సెబీ ఆ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సెక్యూరిటీ మార్కెట్ల నుంచి వివిధ సంస్థలపై నిషేధం విధిస్తూ సెప్టెంబరు 2015లో సెబీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే సత్యం వ్యవస్థాపకుడు రామలింగ రాజు బంధువులకు చెందిన కంపెనీలతో పాటు ఇతర కంపెనీలపై అపరాధ రుసుములు విధించడంపై మళ్లీ ఆదేశాలను జారీ చేయాలంటూ ఆగస్టు 2017లో సెక్యూరిటీస్ అప్పీలేట్ ట్రైబ్యునల్(శాట్) సెబీని కోరింది. ఆ కంపెనీలు ఇన్‌సైడర్ నిబంధనలను ఉల్లంఘించిన కారణంగా సెబీ నిర్ణయాన్ని ట్రైబ్యునల్ సమర్థించింది కూడా. అయితే శాట్ ఆదేశాలను ఆయా కంపెనీలు సుప్రీం కోర్టులో సవాలు చేశాయి. కాగా, మే 14న వెలువడిన సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆ కంపెనీలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తూ సెబీ తాజా నిర్ణయం తీసుకుందని బీఎస్ఈ ఒక సర్క్యులర్‌లో పేర్కొంది. సుప్రీం కోర్టుకు అప్పీలు దాఖలు చేసిన వారిలో దివంగత అంజిరాజు చింతలపాటి, బి. అప్పలనరసమ్మ, బి రామ రాజు జూనియర్, బి తేజ రాజు, చింతలపాటి హోల్డింగ్స్, చింతలపాటి శ్రీనివాస రాజులున్నారు.

విశాఖలో పెప్పర్‌ఫ్రై 'స్టూడియో'

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో ఫర్నీచర్, ఇతర గృహాలంకరణ వస్తువులను విక్రయిస్తున్న పెప్పర్‌ఫ్రై విశాఖలో పెప్పర్‌ఫ్రై స్టూడియోను ఏర్పాటు చేస్తోంది. ఫర్నీచర్‌ను చేతితో తాకి అనుభూతి పొంది వినియోగదారులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడానికి పెప్పర్‌ఫ్రై స్టూడియోల పేరుతో ఎక్స్‌పీరియన్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వచ్చే రెండు నెలల్లో విశాఖలో స్టూడియోను ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ చీఫ్ కేటగిరి ఆఫీసర్ హుస్సేన్ కెసురి తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 32 స్టూడియోలు ఉన్నాయని, 2019, ఏప్రిల్ నాటికి వీటిని 70కి పెంచనున్నామని చెప్పారు. పెప్పర్‌ఫ్రై సొంత బ్రాండ్లు, మార్కెట్ ప్లేస్ విధానంలో ఇతర తయారీదారుల ఫర్నీచర్, అలంకరణ వస్తువులను విక్రయిస్తోంది. 2016-17లో రూ.1,000 కోట్ల టర్నోవరును నమోదు చేశామని, ఇందులో సొంత బ్రాండ్ల ద్వారా జరిగిన విక్రయాలు రూ.500 కోట్లు ఉంటాయన్నారు. 2020 నాటికి మొత్తం టర్నోవరును రూ.6,500 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఫర్నీచర్ విభాగంలో 10 బ్రాండ్లతో ఉత్పత్తులను కంపెనీ విక్రయిస్తోంది. అలంకరణ వస్తువుల్లో కూడా బ్రాండ్లను ప్రవేశపెట్టనుంది. దేశంలో 500 నగరాల్లో డెలివరీ చేయగలిగిన సదుపాయాలు ఉన్నందున ఐకియా విక్రయించే ఫర్నీచర్‌ను డెలివరీ చేయడానికి ఆ కంపెనీతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు.

తనిఖీల సమాచారం వెల్లడించాల్సిందే

- ఔషధ కంపెనీలకు సెబీ ఆదేశాలు
- టేకోవర్, బైబ్యాక్ నిబంధనల్లో సవరణ

ముంబయి

అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తనిఖీలు, దర్యాప్తు నివేదికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఔషధ కంపెనీలను సెబీ ఆదేశించింది. లేకుంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. 'యూఎస్ఎఫ్‌డీఏ ఏదేని చర్యలు చేపడితే ఆ విషయాన్ని కంపెనీలు తెలియజేయడం లేదు. మాకు సమాచారం తెలియజేయడం తప్పనిసరి. అలా చేయకుంటే చర్యలు తీసుకుంటామ'ని సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి వెల్లడించారు. అలాగే కంపెనీల టేకోవర్ నిబంధనల్లో సెబీ మార్పులు చేసింది. ఇందులో భాగంగా షేర్ల టెండరింగ్ తేదీకి ఒక రోజు ముందు వరకు ఓపెన్ ఆఫర్ ధరను పెంచుకునే వీలు కల్పించింది. దీంతో పాటు బైబ్యాక్ నిబంధనల్లోనూ సవరణలు చేసింది. గురువారం జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనలకు సెబీ డైరెక్టర్ల బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ సవరణలకు అనుగుణంగా సెబీ నిబంధనల చట్టం- 2011లో మార్పులు చేయనుంది. ఇవేకాకుండా సమావేశంలో మరి కొన్ని కీలక నిర్ణయాలను సెబీ తీసుకుంది. ఆ వివరాలు ఇలా..

చట్టపరమైన చర్యలు ప్రారంభించాం

ఎన్ఎస్ఈ కోలొకేషన్ కేసు

కోలొకేషన్ కేసు విషయంలో ఎన్ఎస్ఈ నుంచి దర్యాప్తు నివేదిక అందిందని త్యాగి తెలిపారు. నివేదికను పరిశీలించడం కూడా పూర్తయిందని, దాని ఆధారంగా ఇప్పటికే వివిధ సంస్థలపై చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభించామని పేర్కొన్నారు. అలాగే ఈ కేసు దర్యాప్తు వ్యవహారం ఎన్ఎస్ఈ పబ్లిక్ ఇష్యూకు అడ్డంకి కాదని స్పష్టం చేశారు.

రెండు రోజుల ముందు ధరల శ్రేణి వివరాలు

పబ్లిక్ ఇష్యూలు

ఐపీఓ (తొలి పబ్లిక్ ఆఫర్) నిబంధనలను సెబీ సవరించింది. ఇందులో భాగంగా ఐపీఓ ధరల శ్రేణి వివరాలను ఇష్యూ ప్రారంభ తేదీకి రెండు రోజులు ముందు ప్రకటించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఐదు రోజుల ముందు కంపెనీలు వెల్లడిస్తున్నాయి. అలాగే పబ్లిక్ ఇష్యూ, రైట్స్ ఇష్యూల సమయంలో ఐదేళ్లవి కాకుండా మూడేళ్లకు సంబంధించిన ఆర్థిక వివరాలను ప్రకటిస్తే సరిపోతుంది. ఈ మేరకు ఐసీడీఆర్ (ఇష్యూ ఆఫ్ డిస్‌క్లోజర్ రిక్వయిర్‌మెంట్స్) నిబంధనల్లో సవరణకు సెబీ బోర్డు ఆమోదముద్ర వేసింది.

ముంబయిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ త్యాగి, శాశ్వత సభ్యురాలు మదాబి పూరి

4 నివేదికలు అందాయ్

వాట్సాప్ లీకేజీ

వాట్సాప్ ద్వారా కంపెనీల ఆర్థిక సమాచార లీకేజీ వ్యవహారానికి సంబంధించి నాలుగు నివేదికలు అందాయని అజయ్ త్యాగి వెల్లడించారు. ఈ నివేదికలను పరిశీలించి విస్తృత దర్యాప్తును కొనసాగిస్తామని తెలిపారు. టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బాటా ఇండియాలకు సెబీ ప్రాథమిక దర్యాప్తు ఆదేశాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. వాట్సాప్ లీకేజీ వ్యవహారంపై అంతర్గత దర్యాప్తు నిర్వహించి, తిరిగి ఆ నివేదికను అందజేయమని అందులో వీటికి తెలిపింది. ఇప్పుడు ఈ నాలుగు కంపెనీల నుంచి అందిన నివేదికల ఆధారంగా దర్యాప్తు నిర్వహిస్తామని త్యాగి వెల్లడించారు. అంతేకాకుండా ఈ వ్యవహారానికి సంబంధించి అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడతామని తెలిపారు.

ఐసీఐసీఐ నుంచి వివరణ రావాల్సి ఉంది

కొచ్చర్ వ్యవహారం

చందాకొచ్చర్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి ఇంకా వివరణ రావాల్సి ఉందని త్యాగి తెలిపారు. వివిధ సంస్థలకు రుణ పరిమితి పొడిగింపు విషయంలో కొచ్చర్, ఆమె కుటుంబీకులు ఏమైనా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారా అనే అంశంపై సెబీతో పాటు సీబీఐ, ఇతర నియంత్రణ సంస్థలు దర్యాప్తు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కేసుల్లో 2012లో వీడియోకాన్‌కు రుణ పునర్‌వ్యవస్థీకరణ కింద జారీ చేసిన రూ.3,250 కోట్ల రుణ వ్యవహారం కూడా ఉంది.

ఎండీ కుర్చీలో రెండు విడతలే

ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీ సంస్థలు

స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీలు లాంటి మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టిట్యూషన్ల (ఎంఐఐలు)లో మేనేజింగ్ డైరెక్టరు పదవిని ఒక వ్యక్తి రెండు విడతలు మాత్రమే నిర్వహించొచ్చు. ఐదేళ్లు చొప్పున గరిష్ఠంగా రెండు సార్లు లేదంటే 65 ఏళ్ల వరకు పదవిలో కొనసాగేలా ఎంఐఐల నిబంధనల్లో మార్పులు చేసింది. ప్రస్తుత ఎండీలకు కూడా ఇది వర్తిస్తుంది. అయితే పనితీరుపై సమీక్ష ఆధారంగా మరో విడత పదవీకాలాన్ని పొడిగించాలా? వద్దా? అనే నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఈ సంస్థల్లోని పబ్లిక్ ఇంట్రస్ట్ డైరెక్టరుగా (పీఐఐ) కూడా ఒక వ్యక్తి మూడు సార్లు మూడేళ్లు చొప్పున లేదంటే 75 ఏళ్ల వయస్సు వరకు పదవిలో కొనసాగాలని తెలిపింది. నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ ఏర్పాటుకు సెబీ అనుమతినిచ్చింది. ఎస్ఎమ్ఈ పబ్లిక్ ఇష్యూల్లో యాంకర్ ఇన్వెస్టర్ల పెట్టుబడి పరిమితి రూ.2 కోట్లకు తగ్గించింది.

సినిమా పరిశ్రమపై జీఎస్‌టీ భారం

- టికెట్లపై 28% పన్ను తగ్గించాలి
- వ్యక్తులకు మినహాయింపు ఇవ్వాలి
- పరిశ్రమ విన్నపం
- అసోచామ్, పీడబ్ల్యూసీ నివేదిక విడుదల

ఈనాడు - హైదరాబాద్

సినిమా పరిశ్రమకు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) భారంగా మారుతోందని, నిర్మాతల నుంచి, ఎగ్జిబిటర్ల వరకూ అందరి పైనా ప్రతికూల ప్రభావం చూపుతోందని పరిశ్రమ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సామాన్యుల వినోదంలో ప్రధాన భాగమైన సినిమా టికెట్లపైన లగ్జరీ వస్తువులపై విధిస్తున్న 28 శాతం సుంకాన్ని విధిస్తున్నారని, జీఎస్‌టీతో పాటు కొన్ని రాష్ట్రాల్లో స్థానిక సంస్థలు వివిధ స్థాయిల్లో వినోద పన్నును వసూలు చేస్తున్నాయని వెల్లడించాయి. సినిమా పరిశ్రమ- జీఎస్‌టీ ప్రభావంపై అసోచామ్, పీడబ్ల్యూసీ సంయుక్తంగా ఒక నివేదికను విడుదల చేశాయి. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడారు. రూ.100 లోపు ధర టికెట్లపై 18 శాతం, అంతకంటే ఎక్కువ ధర టికెట్లపై 28 శాతం జీఎస్‌టీని విధిస్తున్నారని, దీనికి అదనంగా విధిస్తున్న స్థానిక వినోద పన్నును రద్దు చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం విధిస్తున్న 28 శాతం జీఎస్‌టీని ప్రభుత్వం (జీఎస్‌టీ మండలి) పునః పరిశీలించాలని ఈ రేటును తగ్గించాలని పరిశ్రమ వర్గాలు సూచించాయి. దేశీయ చిత్ర పరిశ్రమకు పరిశ్రమ హోదా కల్పించాలని అసోచామ్, పీడబ్ల్యూసీ నివేదికలో పేర్కొన్నారు.

త్వరలో టికెట్ల ధరలు పెరుగుతాయ్

పరిశ్రమలోని వర్కర్ల వంటి వ్యక్తులపైన కూడా జీఎస్‌టీ పడుతోందని, చాలా మంది జీఎస్‌టీ రిటర్నులను దాఖలు చేయడంలో ఇబ్బందులు పడుతున్నారని ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ తెలిపారు. జీఎస్‌టీ వల్ల 95 శాతం మంది నిర్మాతలు నష్టపోతున్నారని, కనీసం వ్యక్తులపైనైనా జీఎస్‌టీని తొలగించాలన్నారు. జీఎస్‌టీ రాక ముందు వివిధ రాష్ట్రాల్లో సినిమా పరిశ్రమపై పన్ను భారం వేర్వేరుగా ఉండేదని, జీఎస్‌టీ వల్ల నిర్మాతలపై పన్ను భారం తగ్గకపోగా.. పెరిగిందని, రిటర్న్‌ల దాఖలు చేయడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. 'జీఎస్‌టీ, ఇతర కారణాల వల్ల సినిమా టికెట్ల రేట్లు త్వరలోనే పెరగనున్నాయని చెప్పారు. 'రూ.150 టికెట్‌పై రూ.42 జీఎస్‌టీ పోతోంది. ఈ నేపథ్యంలో రూ.150 టికెట్‌ను రూ.200కు పెంచే వీలుంది. అలానే రూ.100 టికెట్‌ను రూ.150 చేయొచ్చు. దీని వల్ల అంతిమంగా ప్రేక్షకులపై భారం పడుతుంది' భరద్వాజ్ అన్నారు. టికెట్ రేటు పెరిగితే.. థియేటర్‌లో విక్రయించే తినుబండారాల రేట్లు కూడా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. సినిమా పరిశ్రమపై 28 శాతం పన్ను ఎందుకు విధించకూడదో ప్రభుత్వానికి వివరించడంలో పరిశ్రమ విఫలమైందని, అందువల్లే టికెట్లను 28 శాతం పన్ను శ్లాబ్‌లోకి చేర్చారని సినిమా పరిశ్రమ వాణిజ్య మండలికి చెందిన పి.సుబ్రమణ్యం తెలిపారు. అమ్యూజిమెంట్ పార్కులపై మొదట్లో 28 శాతం పన్ను విధించినప్పటికీ.. ఆ తర్వాత తగ్గించారని, అదే విధంగా సినిమా టికెట్లపై పన్నును కూడా సమీక్షించాలని అసోచామ్ సెక్రటరీ జనరల్ డి.ఎస్.రావత్ కోరారు. సినిమా పరిశ్రమపై పన్ను భారాన్ని తగ్గించాలని అసోచామ్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ జాతీయ మండలి ఛైర్మన్ కె.వి.రావు పేర్కొన్నారు. పీడబ్ల్యూసీ తరఫున అనితా రాస్తోగి మాట్లాడారు.

జీఎస్‌టీ మండలి దృష్టికి తీసుకెళతాం

జీఎస్‌టీకి ముందు వివిధ రాష్ట్రాల్లో సినిమా పరిశ్రమపై విధిస్తున్న సగటు పన్ను ఆధారంగా శ్లాబ్‌లను నిర్ణయించారని కార్యక్రమానికి హాజరైన మేడ్చల్ జీఎస్‌టీ కమిషనరేట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఇది విధానపరమైన నిర్ణయమని చెప్పారు. వివిధ రంగాల ఇబ్బందులను పరిశీలించడానికి జీఎస్‌టీ మండలి 18 రంగాలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందని, మీడియా, వినోద పరిశ్రమ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను ఈ రంగానికి చెందిన ప్రత్యేక బృందం దృష్టికి తీసుకువెళతామన్నారు.

నివేదికను విడుదల చేస్తున్న తమ్మారెడ్డి భరద్వాజ్, అసోచామ్ తెలంగాణ అభివృద్ధి మండలి ఛైర్మన్ శ్రీకాంత్, అసోచామ్ ఎంటర్‌టైన్‌మెంట్ మండలి ఛైర్మన్ కె.వి.రావు, జీఎస్‌టీ కమిషనర్ శ్రీనివాస్, డి.ఎస్.రావత్, పీడబ్ల్యూసీ పార్టనర్ రాస్తోగి

ఔషధ రంగంలో పెట్టుబడులకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ కొత్త 'ఫండ్'

ఈనాడు, హైదరాబాద్: ఔషధ, ఆరోగ్య సంరక్షణ, డయాగ్నోస్టిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ కంపెనీ కొత్త ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమును ప్రారంభించింది. ఈ మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఈనెల 25 నుంచి జులై 9 వరకూ తెరిచి ఉంటుందని విలేకరుల సమావేశంలో కంపెనీ తెలిపింది. మదుపర్లు కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలని పేర్కొంది.

21న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	392	వరంగల్	394
చిల్లరగా (ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	400
బెంగళూరు	429	చెన్నై	457
22వ తేదీకి...		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	384	నమక్కల్	440

వాణిజ్య భయంతో మార్కెట్లు డీలా

- ప్రారంభ లాభాలు ఆవిరి
- సెన్సెక్స్‌కు 115 పాయింట్ల నష్టం

సమీక్ష

ప్రపంచ వాణిజ్య భయంతో మన మార్కెట్లు డీలా పడ్డాయి. దీనికితోడు దేశీయంగా ఎలాంటి కీలక పరిణామాలు లేకపోవడంతో మదుపర్లు ఆచితూచి అడుగేశారు. దీంతో ప్రారంభంలో వచ్చిన లాభాలు కూడా ఆవిరయ్యాయి. అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలపై నెలకొన్న అనిశ్చితుల ప్రభావంతో ఆసియా, ఐరోపా మార్కెట్లూ నష్టాల్లోనే ట్రేడయ్యాయి. భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకొనే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో భారత్ కూడా ప్రతీకార చర్యకు దిగింది. యూఎస్ నుంచి దిగుమతి చేసుకొంటున్న కొన్ని ఉత్పత్తులపై సుంకం విధించింది. నేడు జరుగనున్న ఒపెక్ దేశాల సమావేశంలో ముడి చమురు ఉత్పత్తి పెంచేందుకు సంబంధించి తీసుకొనే నిర్ణయంతోపాటు ప్రపంచ మార్కెట్లలో అస్థిరత్వం కూడా కీలకం కానుందని విశ్లేషకులు అంచనా వేశారు. దీంతో మదుపర్ల విశ్వాసం మరింత సన్నగిల్లింది.

బీఎస్ఈ సెన్సెక్స్ ట్రేడింగ్ ప్రారంభంలో 131 పాయింట్ల లాభంతో 35644.05 వద్ద మొదలైంది. అయితే ఆరంభ లాభాల్ని కోల్పోతూ వచ్చి చివరకు 114.94 పాయింట్ల (0.32 శాతం) నష్టంతో 35,432.39 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 10,809.60-10,725.90 పాయింట్ల మధ్య కదలాడి చివరకు 30.95 పాయింట్ల నష్టం (0.29 శాతం)తో 10,741.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.22 శాతం లాభంతో రూ.1,032.25 వద్ద ముగిసింది. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ లాభపడిన షేర్లలో ఉన్నాయి. ఎం అండ్ ఎం షేరు అత్యధికంగా 2.11 శాతం నష్టపోయింది. ఓఎన్‌జీసీ (1.90%), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (1.88%), ఎస్‌బీఐ (1.67%), సన్‌ఫార్మా (1.67%), ఏషియన్ పెయింట్స్ (1.39%), బజాజ్ ఆటో (1.37%) నష్టపోయిన జాబితాలో ఉన్నాయి. రంగాల వారీ సూచీల్లో ఆరోగ్య సంరక్షణ షేర్లు 1.11 శాతం, యంత్ర పరికరాలు 1.09 శాతం, లోహ షేర్లు 0.98 శాతం, మౌలికం 0.93 శాతం, విద్యుత్ 0.91 శాతం, వాహన 0.90 శాతం, పీఎస్‌యూ 0.85 శాతం, మన్నికైన వినిమయ వస్తువుల సూచీ 0.84 శాతం చొప్పున నష్టపోయాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడే అవకాశం ఉంది. దేశీయంగా కీలక పరిణామాలు కొరవడటం ప్రభావం చూపొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒపెక్ దేశాల సమావేశంపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. తక్కువ ముడి చమురు ధరలు మార్కెట్లకు దన్నుగా నిలవొచ్చని అంటున్నారు. ఉత్పత్తి కోతలను ఎత్తివేస్తే భారత మార్కెట్లకు ఉపశమనం లభించొచ్చు. నేడు నిఫ్టీ 10720- 10825 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చైనా, అమెరికాల మధ్య వాణిజ్య యుద్ధం నడుస్తున్న నేపథ్యంలో.. అంతర్జాతీయ మార్కెట్ల పరిణామాలపై మదుపర్లు కన్నేసే అవకాశం ఉంది. అమెరికా, భారత్‌లు దిగుమతులపై సుంకాల ప్రకటనలు ప్రభావం చూపొచ్చు. ఇంధన, ఐటీ షేర్లు రాణించొచ్చని భావిస్తున్నారు.

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 366.90 (365.65) 4844094
ASIAN PAINTS 1253.00 (1271.30) 1179247
AXIS BANK LT 513.05 (519.10) 4856050
BAJAJ AUTO L 2830.10 (2869.65) 300367
BAJAJ FINANC 2257.45 (2267.80) 717023
BAJAJ FINSER 5991.55 (5947.55) 229623
BHARTI AIRTE 368.70 (371.90) 3841053
BHARTI INFRA 279.60 (285.30) 5646050
BPCL 421.95 (410.70) 4296333
CIPLA 603.50 (602.85) 3052143
COAL INDIA L 267.70 (270.60) 2506852
DR. REDDYS 2316.40 (2367.75) 1115131
EICHER MOTOR 29424.90 (29805.30) 23594
GAIL 339.30 (343.00) 4186616
GRASIM IND 1011.95 (1017.30) 587811
HCL TECH 902.55 (910.95) 1604451
HDFC 1858.90 (1847.00) 3185688
HDFC BANK 2057.60 (2056.15) 3377676
HERO MOTOCOR 3635.20 (3655.80) 280729
HINDALCO IND 222.30 (226.20) 6019694
HINDUSTAN UN 1593.45 (1602.40) 1185462
HPCL 315.20 (307.90) 9148518
ICICI BANK 297.95 (293.20) 30192796
INDIABULLS H 1173.25 (1194.05) 1286455
INDIAN OIL 170.25 (165.40) 9990246
INDUSINDBANK 1960.50 (1967.40) 779490
INFOSYS LTD 1246.55 (1243.15) 2899395
ITC 260.85 (263.75) 7137481
KOTAK MAHIND 1313.95 (1324.60) 915466
LARSEN & TOU 1289.80 (1306.75) 2161971
LUPIN 899.65 (899.85) 2196762
M&M 883.60 (904.40) 4202520
MARUTI SUZIK 8863.05 (8948.30) 313349
NTPC LTD 155.25 (157.05) 8000295
ONGC 159.70 (162.75) 12638114
POWER GRID C 195.45 (199.15) 6155201
RELIANCE IND 1031.95 (1019.25) 10509756
SBI 268.65 (273.30) 12954943
SUN PHARMA 554.50 (564.10) 3243433
TATA CONSULT 1819.35 (1822.45) 2910659
TATA MOTORS 307.00 (305.60) 5085379
TATA STEEL L 557.75 (563.25) 8465198
TECH MAHINDR 685.30 (690.55) 2599578
TITAN IND 868.40 (888.35) 1274479
ULTRATECH 3616.90 (3651.35) 321887
UPL LIMITED 646.00 (652.25) 3150079
VEDANTA LIMI 229.05 (228.70) 16864366
WIPRO 258.65 (259.70) 3815401
YES BANK LTD 332.95 (336.10) 5133865
ZEE ENTERTAI 563.45 (560.90) 3124614

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1205.55 (1204.40) 29006
ACC 1270.05 (1275.20) 368454
ADITYA BIRLA 136.90 (139.25) 2198365
AMBUJA CEMEN 197.00 (197.75) 2532830
ASHOK LEYLAN 135.10 (137.00) 11600357
AUROBIND PHA 608.55 (618.80) 2093121
AVENUE SUPER 1490.35 (1483.75) 660901
BANK OFBAROD 122.00 (125.10) 16021753
BEL 109.35 (111.75) 5383200
BHEL 75.45 (74.90) 8314390
BOSCH LTD 17985.60 (17750.50) 11268
BRITANNIA 5962.70 (5995.55) 75986
CADILA HEALT 412.30 (411.80) 1535823
COLGATE PALM 1177.75 (1192.70) 155536
CONTAINER 1256.30 (1274.30) 229247
CUMMINS INDI 679.15 (668.40) 338538
DABUR INDIA 385.60 (379.80) 1033023
DLF LIMITED 198.85 (200.70) 3660058
EMAMI LIMITE 530.00 (1073.05) 238293
GENERAL INS 723.70 (721.15) 18589
GODREJ CONSU 1166.70 (1162.25) 539399
HAVELLS INDI 532.85 (534.90) 838315
HINDUSTAN ZI 290.40 (295.00) 1726567
ICICI PRU LI 389.00 (388.30) 738173
IDEA CELLULR 60.80 (61.50) 6144029
INTERGLOBE A 1175.95 (1136.45) 3074994
JSW STEEL LT 332.85 (335.15) 3111133
L&TFIN.HOLD 160.95 (163.35) 2544020
LIC HOUS.FIN 502.35 (495.85) 1935213
MARICO LIMIT 335.25 (335.40) 1154226
MCDOWELL 653.75 (667.05) 753118
MOTHERSON 306.65 (307.35) 2146716
MRF 74771.65 (74877.65) 3478
NHPC LTD 25.00 (25.25) 3856661
NMDC LTD 107.30 (109.15) 1171968
OIL INDIA 209.60 (211.25) 1037100
ORACLE FIN S 4047.85 (4054.10) 17239
P&G HYG&HEAL 9944.50 (9950.95) 1761
PETRONET LNG 209.85 (212.80) 4135526
PIDILITE IND 1038.30 (1072.75) 563297
PIRAMAL ENTE 2536.40 (2548.10) 158278
PNB 83.40 (86.20) 17947960
POWER FIN CO 81.35 (82.20) 9063335
RURAL ELEC C 110.50 (111.40) 3027390
SAIL 82.45 (84.45) 12169547
SBI LIFE INS 675.45 (676.20) 192773
SHREE CEMENT 15306.30 (15499.95) 16088
SHRIRAM TRAN 1483.40 (1490.90) 286841
SIEMENS 991.30 (999.50) 121202
SUN TV LTD 840.20 (839.40) 4150664

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 3.84 (3.99) 1911
ALPHAGEO 629.65 (635.35) 2029
AMAR RAJA BA 758.45 (766.60) 12679
ANDHRA BANK 33.80 (34.15) 165531
ANDHRA CEMEN 9.02 (9.02) 13776
ANDHRA PAPER 329.55 (327.55) 885
ANDHRA PETRO 45.45 (46.10) 10488
ANDHRA SUGAR 340.60 (344.05) 69
ASTRA MICROW 102.55 (100) 65311
AUROBINDO PH 608.55 (617.55) 90337
AVANTEL SOFT 363.40 (375.90) 2196
AVANTI FEEDS 1561.85 (1625.65) 51168
BARTRONICS 10.37 (10.64) 5689
BHAGYA NAG 40 (40.10) 1571
BN RATHI SEC 39.05 (39) 10780
BRILLIANT SE 4.91 (4.97) 266027
CAMBRIDGE TE 55.70 (54.65) 565
CONT COFFEE 272.30 (268.70) 3267
COROMAN FERT 406.05 (409.45) 4248
CUBEX TUB 17.65 (18.50) 1672
CYBERMATE 2.10 (2.17) 4843
CYIENT LIMIT 707.75 (710.50) 7598
DECCAN CEMEN 411.10 (415.60) 612
DIVI'S LAB 1056 (1083.25) 112836
DR REDDY 2316.65 (2369.05) 102198
GATI CORPN 87.80 (89.50) 49537
GAYATRI PROJ 164.45 (169.75) 6890
GMR INFRASTR 15.95 (15.70) 1034767
GOLDST INFRA 155.65 (163.10) 40207
GOLDSTONE EN 17.16 (16.69) 2060
GRANULES (I) 85.70 (87.90) 164490
GSS AMERICA 80.80 (83.60) 2455
GVK POWER 11.02 (10.96) 320669
HBL NIFE POW 34.95 (35.60) 20440
HERITAGE FOO 655.65 (660.80) 448
HIL LTD 1825.85 (1877.10) 1186
HIND FLUROCA 10.85 (11.94) 672
IDL INDUSTRS 395.70 (400) 31
IKF SOFT 0.51 (0.51) 5200
ILFS ENGINEE 28.20 (28.50) 4963
INCAP 70.70 (70.70) 138
INNAREDY COM 1.87 (1.96) 1910
IVRCL INFRAS 1.36 (1.34) 269069
JEEVAN SCIEN 33.75 (34) 2157
KAKATIYA CEM 241.45 (243.55) 1401
KALLAM SPG 27.85 (28.30) 5292
KARAN WOO-SN 2.62 (2.52) 51
KAVERI SEED 580.35 (584.10) 21936
KCP LTD 101.95 (106) 6304
KERNEX MICRO 28.50 (28.50) 3410
KNR CONSTRUC 240.05 (235.45) 45825
KREBS BIO 133.70 (132) 1
LANCO INDUS 268.30 (274.75) 12208
LANCO INFRAT 0.80 (0.83) 618984
LASER DOT 6.08 (6.40) 50
LAURUS LABS 484.45 (488.95) 397
LOKESH MACH 62.05 (62.60) 686
MADHUCON PRO 12.85 (12.70) 3427
MEGA SOFT 9.38 (9.30) 70
MIC ELECTRON 3.40 (3.45) 11855
MOLD-TEK.TEC 43.60 (43.85) 372
MOLDTK PLA 302.40 (305.65) 4357
MSR INDIA LT 26.15 (28.60) 5780
NAGARJAGRICH 29.15 (28.60) 5092
NATCO PHARMA 804.35 (822.45) 12959
NAVA BH VENT 139.95 (142.50) 17779
NCC 99.65 (102.90) 411152
NCL IND 169.80 (170.10) 5712
NEHA INTER 5.25 (5.46) 14732
NETTLINX 54.35 (54.95) 10613
NEULAND LAB 689.85 (685.50) 6876
NIHAR INFO 10.20 (10.50) 1499
NILE 551.35 (577.05) 8016
OIL COUNTRY 20.05 (20.50) 3317
PANKAJ POLY 6.18 (6.50) 115
PANYAM CEMEN 23 (23.55) 7971
PENNER IND 52.30 (53.10) 27261
PHYTOCHEM I 50.95 (53.20) 2050
PIONEER DIST 267.45 (271.35) 2559
PITTI LAMIN 87.60 (88) 1294
POKARNA 163.60 (160.60) 12930
PRAJAY ENGS 9.30 (9.37) 14925
PREMIER EXPL 266.30 (268.15) 135
PRISM CEMENT 101.50 (102.90) 22306
PRUDENTL PHA 3.87 (3.95) 101455
RAGSAN PETRO 63 (63.20) 100
RAIN INDUSTR 197.95 (207.55) 149379
RAJ PACKAGIN 29.50 (28.50) 1473
RAJVIR INDUS 32.70 (34.30) 2
RAM INFORMAT 38.50 (38.20) 106
SAGAR CEM 805.20 (797.75) 314
SAMKRG PIST 227.90 (232.10) 4741
SAMPRE NUTRI 49 (49) 76
SATVAH. ISPA 14.15 (14.30) 1753
SMS PHARMA 72.60 (73.30) 1890
SOUTH BIO TE 1.54 (1.47) 4809
SPHERE GLOBA 27.90 (27.25) 50
SREE RAYAL A 33.65 (34.35) 42540
SRI KPR INDU 25.50 (25.45) 1992
STARCHIK SP 33 (33) 1998
STEEL EXCHAN 18.15 (19.55) 8035
SUJANA METAL 0.93 (0.93) 100
SUJANA UNIVE 0.53 (0.53) 20358
SURANA TELE 4.41 (4.68) 20380
SURYALAKSH.C 54.50 (53.50) 3660
SUVEN PHARMA 216.20 (223.65) 65673
TAJ GVK HOTE 222.35 (227.15) 4947
TANLA 30 (29.75) 14610
TERA SOFTWAR 40.85 (42.90) 2222
TRANS BIOTEK 2.15 (2.15) 400
VAMSHI RUBB 46.50 (45.85) 760
VBC FERRO 37.35 (39.10) 329
VICEROY HOTE 7.79 (8.01) 6646
VIJAY TEXTIL 58.15 (56.50) 3699
VIMTA LABS 222.15 (227.10) 3155
VISAKA IND 588.60 (608.05) 9642
VISTA PHARMA 39.60 (37.50) 362676
VIVIMED LABS 63.65 (65.90) 56269
VJIL CONSULT 20 (20) 102
VST INDUS 2918.80 (2966.20) 194
XL TELENE 1.23 (1.25) 3866
YBRANT DIGIT 4.07 (4.21) 192983
ZENOTECH LAB 38.40 (38.65) 6770
ZENTECH 109 (102.35) 432120

ఈనాడు బిజినెస్

వేతనాలు పెరగవ్ 2030కి..

- భారత్‌లోనే ఈ విచిత్ర పరిస్థితి
- అవసరానికి మించి నిపుణుల లభ్యత వల్లే
- ఇతర దేశాల్లో భారీగా నైపుణ్యాల కొరత
- అక్కడ వేతన పెరుగుదల వల్ల కంపెనీలకు ఇబ్బంది
- కార్న్ ఫెర్రీ నివేదిక అంచనా

ముంబయి

అధిక నైపుణ్యం కలిగిన వారికి, దేశంలో వేతనాల పెరుగుదల ఉండని స్థితి మరో పుష్కరకాలానికి (2030లో) ఏర్పడుతుందని ఒక నివేదిక అంచనా వేస్తోంది. ప్రపంచం అంతా నిపుణుల కొరత ఉంటే, దేశంలో మాత్రం అవసరానికి మించి లభించడమే ఇందుకు కారణమని, అంతర్జాతీయ నైపుణ్య విశ్లేషణా సంస్థ కార్న్ ఫెర్రీ అంచనా వేసింది. 'ప్రపంచంలో మరే దేశంలో లేని విధంగా, అధిక నైపుణ్యం కలిగిన వారు, అవసరానికి మించి లభించే స్థితి భారత్‌లో 2030కి ఉంటుంది' అని వివరించింది. ఇతర దేశాల్లో మాత్రం, కొరత వల్ల, అధిక నైపుణ్యం కలిగిన వారికి భారీగా వేతనాల పెరుగుదల ఉంటుందని అంచనా వేసింది. ఇందువల్ల ప్రపంచవ్యాప్తంగా సంస్థలు సిబ్బంది కోసం అదనంగా 2.5 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.163 లక్షల కోట్లు) వెచ్చించాల్సి వస్తుందని పేర్కొంది.

- ✦ 2020, 2025, 2030 నాటికి నిపుణులకు గిరాకీ భారత్ సహా వివిధ దేశాల్లో ఎలా ఉంటుందనే విషయాన్ని సంస్థ అధ్యయనం చేసింది.
- ✦ ఆర్థిక-వ్యాపార సేవలు, సాంకేతికత- ప్రసార మాధ్యమాలు-టెలి కమ్యూనికేషన్లు, తయారీ రంగాలపై సంస్థ అంచనాలు విడుదల చేసింది.
- ✦ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా, జర్మనీలో ఉద్యోగుల వ్యయాలు భారీగా పెరగనున్నాయి.
- ✦ 2030 నాటికి మిగిలిన దేశాల కంటే అధికంగా అమెరికా సంస్థలు 531 బిలియన్ డాలర్లు (సుమారు రూ.34.50 లక్షల కోట్లు) అధికంగా చెల్లించాల్సి రావచ్చు. జర్మనీ 176 బి.డాలర్ల (సుమారు రూ.11.44 లక్షల కోట్లు) మేర ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది.
- ✦ ఆసియా పసిఫిక్ దేశాల్లో కూడా వేతనాల పెరుగుదల వల్ల అదనంగా లక్ష కోట్ల డాలర్ల (సుమారు రూ.65 లక్షల కోట్లు) చెల్లించాల్సి రావచ్చు.
- ✦ జపాన్ 468 బి.డాలర్లు (సుమారు రూ.30.42 లక్షల కోట్లు) అధికంగా చెల్లించాల్సి రావచ్చు.
- ✦ చైనా సంస్థలు కూడా 342 బి.డాలర్లు (సుమారు రూ.22.23 లక్షల కోట్లు) ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. చైనాలో అధిక నైపుణ్యాలు కలిగిన వారు, గిరాకీ కంటే 10 లక్షల మంది తక్కువగా లభిస్తారు. ఇందువల్ల వేతనాల్లో వృద్ధి మరే దేశం కంటే అధికంగా 51 బి. డాలర్ల (సుమారు రూ.3.31 లక్షల కోట్లు) చెల్లించాల్సి రావచ్చు.
- ✦ తక్కువమంది సిబ్బందిని కలిగిన చిన్న దేశాలపై ఒత్తిడి అధికంగా ఉంటుంది. హాంకాంగ్, సింగపూర్ వంటి దేశాలు చెల్లించాల్సిన మొత్తాలు 2017 జీడీపీలో 10 శాతానికి సమానం అవుతాయి.
- ✦ సిబ్బందికి సగటున అధిక చెల్లింపు ఏడాదికి 14,710 డాలర్లు (సుమారు రూ.9.60 లక్షలు) జమచేయాల్సి వస్తుంది. అధిక నైపుణ్యం గలవారికి ఏడాదికి 40,539 డాలర్లు (సుమారు రూ.26.35 లక్షలు), సింగపూర్‌లో 29,065 డాలర్లు (సుమారు రూ.19 లక్షలు), ఆస్ట్రేలియాలో 28,625 డాలర్లు (సుమారు రూ.18.60 లక్షలు) చెల్లించాల్సి రావచ్చు.

ఏం జరుగుతుంది?: ప్రపంచ దేశాల్లో సామర్థ్యాల కొరత తీవ్రమవుతుంది. కార్మికులు అధికంగా ఉన్నా, కంపెనీల మనుగడకు సరిపడా నైపుణ్యాలు వారిలో ఉండవు. మొత్తంమీద చూస్తే, వేతనాల పెరుగుదల ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉంటుంది. అయితే అత్యంత కీలక నైపుణ్యాలు కలిగిన వారి లభ్యత బాగా తక్కువగా ఉంటుంది. అత్యుత్తమ కంపెనీలతో పోటీ పడాలంటే మాత్రం వీరికి అత్యంత భారీగా వేతనాలను అందించాల్సి వస్తుంది. ఇందువల్ల కంపెనీల లాభదాయకత భారీగా క్షీణిస్తుంది.

రాసలీల.. రాజీనామా

ఉద్యోగితో సంబంధం.. ఊడిన ఇంటెల్ సీఈఓ ఉద్యోగం



న్యూయార్క్: ఇంటెల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) బ్రియాన్ జానిచ్ రాజీనామా చేశారు. కంపెనీ ఉద్యోగితో గతంలో సంబంధం కలిగి ఉండడం ఇందుకు నేపథ్యం. సంస్థ విధానాలకు విరుద్ధమైన పని చేయడం వల్లే బ్రియాన్ రాజీనామా కోరినట్లు కంపెనీ ఈ సందర్భంగా ప్రకటించింది. 'కంపెనీ విధివిధానాలకు అనుగుణంగానే జానిచ్ రాజీనామాను అంగీకరించినట్లు బోర్డు తెలిపింది. అయితే సీఈఓతో సంబంధం నెరపిన ఉద్యోగి వివరాలను వెల్లడించడానికి కంపెనీ ప్రతినిధి నిరాకరించారు. బ్రియాన్ స్థానంలో మరొకరిని నియమించే వరకు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) బాబ్ స్వాన్ తాత్కాలిక సీఈఓగా వ్యవహరిస్తారు. కంపెనీకి బయటా.. లోపలా సీఈఓ స్థానానికి అర్హులైన వారి కోసం శోధిస్తామని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

58 ఏళ్ల వయసులో..: బ్రియాన్ 1982లో ఇంటెల్‌లో ఇంజినీర్‌గా చేరారు. వ్యక్తిగత కంప్యూటర్ల పరిశ్రమ అప్పుడప్పుడే పుంజుకుంటోంది. ఆ తర్వాత పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ఇంటెల్ తన 50 ఏళ్ల చరిత్రలో మొదటి నుంచీ ఉద్యోగులకు ర్యాంకుల ఇవ్వడం ద్వారానే పదోన్నతులు కల్పిస్తూ ఉంది. మూడు దశాబ్దాల్లో ఆయన కంపెనీలో అగ్ర ర్యాంకుకు చేరుకోవడంతో 2013లో సీఈఓగా పదోన్నతి పొందారు. సీఈఓకు ముందు సీఎఫ్ఓగానూ చేశారు. ఆయన తన హయాంలో చిప్స్ తయారీతో పాటు కొత్త విభాగాల వైపు కంపెనీని నడిపించారు. ఇండస్ట్రియల్ సిస్టమ్స్, స్వయం చోదిత కార్లు తదితర కొత్త మార్కెట్ల వైపు పయనించేలా చేశారు. అయితే ఉద్యోగితో సంబంధం పెట్టుకోవడంతో ఈ 58 ఏళ్ల వయసులో అవమానభారంతో కంపెనీ నుంచి వైదొలగాల్సి వచ్చింది. ఈయన రాజీనామాతో కంపెనీకి నాయకత్వ సంక్షోభం ఏర్పడిందని విశ్లేషకులు అంటున్నారు.

మార్చిలోగా 50 కొత్త వాహనాలు

టాటా మోటార్స్

దిల్లీ: వాణిజ్య వాహనాల (సీవీ) విభాగంలో దాదాపు 50 రకాల కొత్త ఉత్పత్తుల్ని ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకురావాలని టాటా మోటార్స్ ప్రణాళిక రచించింది. ఈ వాహన తయారీ దిగ్గజం గత ఆర్థిక సంవత్సరంలో (2017-18) వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా దాదాపు రూ.1900 కోట్లు మిగుల్చుకోగలిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా దాదాపు ఇంతే మొత్తంలో వ్యయాన్ని తగ్గించుకొనేలా లక్ష్యం విధించుకొంది. సీవీ విభాగంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,500 కోట్ల పెట్టుబడి ప్రణాళికను కూడా సిద్ధం చేసింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)తో పాటు కెపాసిటీ విస్తరణ, బీఎస్-6 నిబంధనలకు అనుగుణంగా వాహనాల ఉత్పత్తి కోసం దీన్ని వినియోగించనుంది. ఏప్రిల్ 1, 2020 నాటికి బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా వాహనాలు రూపొందించాలని ప్రభుత్వం గడువు విధించిన నేపథ్యంలో ఆ దిశగా సంస్థ అడుగులు వేస్తోంది. 'గత ఆర్థిక సంవత్సరం 50కి పైగా వాహనాలను తీసుకొచ్చాం. ఇప్పుడు అదే ప్రణాళికతో వెళ్తున్నామ'ని కంపెనీ అధ్యక్షుడు (వాణిజ్య వాహనాలు) గిరీష్ వాఘ్ తెలిపారు.

అమెరికా సరకు మరింత భారం

- 29 ఉత్పత్తులపై సుంకాల పెంపు
- ఆగస్టు 4 నుంచి అమల్లోకి

దిల్లీ: అమెరికా నుంచి దిగుమతి అయ్యే పప్పు దినుసులు, ఇనుము-ఉక్కుతో తయారైనవి సహా 29 రకాల ఉత్పత్తులపై సుంకాన్ని పెంచుతూ ఆర్థికశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టు 4 నుంచి కొత్త సుంకాలు అమల్లోకి వస్తాయి. మనదేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై అమెరికా సుంకాలు పెంచడంతో, 241 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1600 కోట్ల) భారం పడింది. అందుకు దీటుగా ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. అమెరికా-ఐరోపా సమాఖ్య, అమెరికా-చైనాల మధ్య కూడా ఇదే తరహా సుంకాల యుద్ధం నడుస్తున్న సంగతి విదితమే.

డబ్ల్యూటీఓకు సమాచారం ఇచ్చి..

30 ఉత్పత్తులపై 50 శాతం వరకు సుంకాలు పెంచాలని భావిస్తున్నామని, ప్రపంచ వాణిజ్య సమాఖ్య (డబ్ల్యూటీఓ)కు గతవారంలోనే మన దేశం సమాచారం ఇచ్చింది. ఇందులో హార్లేడేవిడ్‌సన్, ట్రయంఫ్ బైక్‌లపై దిగుమతి సుంకాన్ని 50 శాతానికి పెంచాలనుకుంటున్నట్లు తెలిపారు. అయితే సుంకాల పెంపు జాబితాలో 800 సీసీ కంటే అధిక సామర్థ్యం కలిగిన మోటార్‌సైకిళ్లు లేకపోవడం గమనార్హం.

సుంకాలు పెరిగేది ఇలా

	ప్రస్తుతం	ఆగస్టు 4 నుంచి
బఠానీలు, సెనగలు, మసూర్‌పప్పు	30 శాతం	70 శాతం
కాయధాన్యాలు (లెంటిల్)	30 శాతం	40 శాతం
పెంకు కలిగిన బాదం	కిలోకు రూ.100	కిలోకు రూ.120
పెంకులోని బాదం	కిలోకు రూ.35	కిలోకు రూ.42
పెంకు ఉన్న వాల్‌నట్స్	30 శాతం	120 శాతం
యాపిల్ పళ్లు	50 శాతం	75 శాతం
బోరిక్ యాసిడ్	10 శాతం	17.50 శాతం
ఫాస్ఫారిక్ యాసిడ్	10 శాతం	20 శాతం
ఇనుము ఫ్లాట్‌రోల్డ్ ఉత్పత్తులు	15 శాతం	27.50 శాతం
ఉక్కు ఫ్లాట్‌రోల్డ్ ఉత్పత్తులు	15 శాతం	22.50 శాతం
ఆర్టెమియా (రొయ్యల్లోరకం)	--	30 శాతం

- ✦ కొన్ని ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని భారీగా పెంచినందున, దేశీయ ఉత్పత్తులు చౌకగా లభిస్తాయి. ఇది దేశీయ తయారీకి ఊతమిస్తుందని భావిస్తున్నారు.
- ✦ వాహనాలు, నిర్మాణరంగ భారీయంత్రాలు, సెల్‌ఫోన్ల తయారీకి వినియోగించే సిమ్‌సాకెట్, ఇతర యంత్రభాగాలపై సుంకాన్ని 15 శాతం నుంచి 25 శాతానికి గతంలోనే పెంచిన సంగతి విదితమే.

ఐడీ ఫ్రెష్‌లో ప్రేమ్‌జీ పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: గారెలు తినాలనుకుంటే.. క్షణాల్లో సిద్ధం చేసుకునే విధంగా బెంగళూరుకు చెందిన ఐడీ ఫ్రెష్ ఫుడ్స్ గారెల పిండిని హైదరాబాద్ మార్కెట్‌లోకి తీసుకురానుంది. ఇప్పటికే బెంగళూరు, చెన్నైల్లో గారెల పిండిని విడుదల చేసిన కంపెనీ తాజాగా హైదరాబాద్ మార్కెట్‌లోకి అడుగుపెడుతోంది. ప్రత్యేకమైన మేధో సంపత్తి హక్కులు కలిగిన ప్యాక్‌లో ఈ పిండిని విక్రయిస్తున్నారు. ప్యాక్‌ను ఒత్తితే చాలు పిండి గారెలుగా బాండీలో పడుతుంది. పెట్టుబడుల కోసం అజీమ్ ప్రేమ్‌జీ ఏర్పాటు చేసిన ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ ఇందులో పెట్టుబడులు పెట్టింది. 375 గ్రాములుంటే గారెల పిండి ప్యాక్ ధర రూ.80. 10 గారెలు వరకూ వండుకోవచ్చని ఐడీ ఫ్రెష్ ఫుడ్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ పి.సి.ముస్తాఫా తెలిపారు.

ఘనంగా మార్గదర్శి వార్షిక సమావేశం

ఈనాడు, హైదరాబాద్: గత ఆర్థిక సంవత్సరంలో రూ.10వేల కోట్ల టర్నోవర్ సాధించిన మార్గదర్శి చిట్ ఫండ్ వార్షిక సమావేశం రామోజీ ఫిలిం సిటీలో గురువారం ఘనంగా జరిగింది. మార్గదర్శి జనరల్ మేనేజర్లతో పాటు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 105 శాఖల నుంచి మేనేజర్లు, సిబ్బంది, ఏజెంట్లు హాజరయ్యారు. రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు, ఏజెంట్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శైలజాకిరణ్ మాట్లాడుతూ.. 'సరళీకృత ఆర్థిక వ్యవస్థలో ఎదురైన సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ ముందుకెళ్లాలనే లక్ష్యంతోనే మార్గదర్శి చిట్ ఫండ్ అడుగులు వేస్తూ వచ్చింది. దేశంలోనే తొలిసారిగా చిట్ ఫండ్ వ్యాపారంలో రూ.10వేల కోట్ల మైలురాయిని అధిగమించింది' అన్నారు. ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందిస్తూ, వారి ప్రతి ఆర్థిక అవసరంలోనూ మేమున్నాం అనే భరోసా కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యం అన్నారు. ఖాతాదారులతో ఎలా మెలగాలనే విషయమై సంస్థలోని సిబ్బంది, ఏజెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వడంతో పాటు, తగిన మార్గ నిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మార్గదర్శి చేరువ కావడంలో సిబ్బంది పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. మార్గదర్శిని ఆర్థికంగా బలోపేతంగా ఉంచేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 'ఈనాడు' ఎండీ సీహెచ్ కిరణ్, రామోజీ ఫిలిం సిటీ ఎండీ విజయేశ్వరి, బాలాజీ హేచరీస్ ఎండీ వి.సుందర నాయుడు, రామోజీ ఫిలిం సిటీ ఎండీ రామ్మోహన్‌రావు, భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, సీఎండీ కృష్ణ ఎల్లా, జాయింట్ ఎండీ సుచిత్రా ఎల్లా తదితరులతో పాటు రామోజీ గ్రూపు సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రూ.10,000 కోట్ల టర్నోవర్ అధిగమించిన సందర్భంగా రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు చేతుల మీదుగా మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజాకిరణ్‌కు జ్ఞాపిక అందచేస్తున్న సంస్థ జనరల్ మేనేజర్లు

బీఎండబ్ల్యూ గ్రాన్ టురిస్మో

ధర రూ.66.5 లక్షలు

దిల్లీ: జర్మన్ విలాసవంత కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ నుంచి డీజిల్ వేరియంట్‌లో 6 సిరీస్ గ్రాన్ టురిస్మో మోడల్ కారు భారత్ విపణిలోకి వచ్చింది. దీని ధర రూ.66.5 లక్షలు. బీఎండబ్ల్యూ 630డీ గ్రాన్ టురిస్మో డీజిల్ రకం రెండు డిజైన్లలో (లగ్జరీ లైన్, ఎం స్పోర్ట్) రూపొందించినట్లు, గురువారం నుంచి డీలర్ల వద్ద ఇవి అందుబాటులో ఉంటాయని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. లగ్జరీ లైన్ రకం కారు రూ.66.5 లక్షలు కాగా, ఎం స్పోర్ట్ రకం కారు ధరను రూ.73.7 లక్షలుగా నిర్ణయించారు. ఈ కొత్త రకం కారు 3-లీటర్ 6-సిలిండర్ డీజిల్ ఇంజిన్, 265 హెచ్‌పీ సామర్థ్యంతో రూపొందింది. 6.1 సెకన్లలో 100 కి.మీ వేగం అందుకోవడం దీని సొంతం.

బండి తీసి బయటకు వెళ్లాలన్నా..

సంచిలో కూరగాయలను నిండాలన్నా..

ఇంట్లో ఏసీ చల్లగా తగలాలన్నా..

ఫ్రిజ్‌లో ఆపిల్ తీసి తినాలన్నా.. ఇపుడు కొంచెం కష్టమవుతోంది.

వీటన్నిటినీ ప్రత్యక్షంగా, పరోక్షంగా నడుపుతున్న 'ఇంధనం' ధరలు పెరగడమే ఇందుకు కారణం.

ఇంటిపై ఇంధన భారం

- పెరిగిన పెట్రోలు ధరలతో జేబుకు చిల్లు
- రవాణా వ్యయాల వల్ల కూరగాయలూ ప్రియం
- ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, మైక్రోవేవ్‌లు కొనాలన్నా చిక్కే
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం

పెట్రో ధరలు పెరగడానికి ప్రధాన కారణం అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమంటుండడమే. గత వారం రోజులుగా కాస్త శాంతించాయి. అవి మరింత తగ్గడానికి పెట్రోలియం ఎగుమతి దేశాల సంఘం (ఒపెక్) ప్రయత్నాలు చేస్తూనే ఉంది. నేడు వియన్నాలో జరగనున్న కీలక సమావేశం చమురు ధరలను ఎటు తీసుకెళుతుందో చూడాలి.

ఈ ప్రపంచంలో జరిగే అన్ని పరిణామాలు ఒకదానికొకటి సంబంధం కలిగే ఉంటాయి. అంటే ఎక్కడో ఏదో జరిగితే మరెక్కడో.. ఇక్కడో దాని ప్రభావం కనిపిస్తుంది. దీన్నే 'సీతాకోకచిలుక ప్రభావం' అని అంటారు. ఒకప్పుడు ముడి చమురు సరఫరా బాగా పెరిగి.. ధరలు బాగా తగ్గడంతో ఉత్పత్తిలో కోత విధిస్తూ వచ్చిన ఒపెక్.. ఇపుడు పరిస్థితులు తారుమారు కావడంతో మళ్లీ సరఫరా పెంపు వైపు వెళుతోంది. నేడు జరగనున్న సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోవచ్చు.

నేడు ఒపెక్ సమావేశం

వేటిపై ప్రభావం అంటే..: డీజిల్ ధరలు పెరిగాయనుకుంటే సరుకులు రవాణా చేయడం కొంచెం భారమవుతుంది. ఆ భారాన్ని వర్తకులు ప్రజల వైపు బదిలీ చేస్తారు. అపుడు రవాణా అయ్యే అన్ని సరుకుల ధరలూ పెరుగుతాయి. రోజువారీగా రవాణా అయ్యే కూరగాయలపై ఆ ప్రభావం పడుతుంది. గత ఏడాది కాలంలో డీజిల్ ధర లీటరుకు రూ.8; పెట్రోలు ధర రూ.9 దాకా పెరిగాయి. రోజువారీ ధరల పెంపు 'స్లో పాయిజనింగ్' లాంటిదని విశ్లేషకులు అంటుంటారు.

ఎలక్ట్రానిక్ పరికరాల ధరలూ..: ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రో ఓవెన్లు వంటి ధరలు ఈ నెలలో 2-5 శాతం వరకు పెరగవచ్చన్న అంచనాలున్నాయి. రూపాయి పతనానికి తోడు ముడి చమురు ధరలు పెరగడం ఇందుకు కారణమవుతున్నాయి. ముడి పదార్థాలైన ఉక్కు, రాగి ధరలు పెరగడమూ మరో కారణం. ప్రీమియం మోడళ్లపై రూ.400-1500 వరకు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనాలు.

చమురు కంపెనీలపైనా..: ముడి చమురు ధరలు 2014లో పీపాకు 110 డాలర్లు ఉన్న సమయంలో ఉన్న పెట్రో రేట్లు.. ఇపుడు 70-80 డాలర్లకు చేరినా అదే స్థాయిలో ఉన్నాయి. ముడి చమురుధరలు అప్పట్లో భారీగా ఉండడంతో ఓఎన్‌జీసీ వంటి అప్‌స్ట్రీమ్ కంపెనీలు లాభపడగా.. బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి డౌన్‌స్ట్రీమ్ కంపెనీలు బాగా నష్టపోయాయి. అయితే ఇటీవలి కాలంలో అవి తగ్గడంతో చమురు మార్కెటింగ్ కంపెనీలన్నీ కోలుకున్నాయి.

ఫండ్‌ల చూపు అటు వైపు: చమురు ధరలు తగ్గుతాయన్న అంచనాలతో మ్యూచువల్ ఫండ్‌లు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌ల షేర్లను కొనుగోలు చేస్తున్నాయి. చమురు మార్కెటింగ్ సంస్థల్లో ఈ రెండు చిన్నవి కావడంతో తగ్గే చమురు ధరల వల్ల మార్కెటింగ్ మార్జిన్లు భారీగా పెరగవచ్చన్నది అంచనా. ఇండియన్ ఆయిల్ కంపెనీ కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉన్నా.. పై రెండు కంపెనీలతో పోలిస్తే మార్జిన్లపై ప్రభావం తక్కువగా ఉంటుందని అవి విశ్వసిస్తున్నాయి. అగ్రగామి 10 మ్యూచువల్ ఫండ్‌లలో ఏడు సంస్థలు 2.94 లక్షల హెచ్‌పీసీఎల్ షేర్లు; అగ్రగామి 10 ఫండ్ కంపెనీల్లో ఆరు సంస్థలు 52 లక్షల బీపీసీఎల్ షేర్లు కొనుగోలు చేశాయంటే అవి ఈ రెండింటిపైనా.. ముడి చమురు ధరల తగ్గుదలపైనా ఎంత నమ్మకం పెట్టుకున్నాయో అర్థమవుతుంది.

ఒపెక్ నిర్ణయం ఉత్పత్తి పెంపు వైపు!

ముడి చమురు ధరల ఏప్రిల్‌లో 70 డాలర్లను అధిగమించినప్పటి నుంచి ఒపెక్‌తో పాటు ఇతర తయారీదారు దేశాలు చమురు ఉత్పత్తిని పెంచాలని భావిస్తూ ఉన్నాయి. శుక్రవారం(నేడు) జరగబోయే ఒపెక్ సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం వెలువడనుంది. అయితే ఎంత మేర సరఫరా పెంచుతాయోనని ప్రపంచం కళ్లన్నీ అటువైపే చూస్తున్నాయి. ఇప్పటికే రష్యా, సౌదీ అరేబియాలు మే నెలలో ఉత్పత్తిని పెంచాయి. తద్వారా ఉత్పత్తి పెంపునకు ఇదే సరైన సమయమని అవి సంకేతాలు పంపాయి. అయితే ఒపెక్‌లోని ఇరాన్, వెనుజువెలా, అల్జీరియా, ఇరాక్‌లు ప్రతిపాదిత పెంపును వ్యతిరేకిస్తున్నాయి. 1.5 మిలియన్ బీపీడీ మేర ఉత్పత్తి పెంపు చేయాలని నేటి సమావేశంలో రష్యా, సౌదీ అరేబియాలు ప్రతిపాదించవచ్చు. అయితే ఇతర దేశాలు ఏమాత్రం ఏకాభిప్రాయానికి వస్తాయన్నది కీలకం కానుంది.

భారత్‌కేంటి ప్రయోజనం

ఒపెక్ దేశాల నుంచి 83 శాతం మేర దిగుమతి చేసుకుంటున్న భారత్ కూడా ఈ ప్రకటనపై ఆసక్తిగా ఉంది. ఎందుకంటే పెట్రో ధరలతో పాటు.. వాణిజ్య లోటుపై ఇప్పటికే భారత్‌పై ప్రభావం పడిన విషయం తెలిసిందే. నేటి సమావేశంలో చమురు ఉత్పత్తి పెంచితే అది చమురు ధరలను తగ్గిస్తుంది. తద్వారా భారత దిగుమతి బిల్లు దిగివచ్చి.. వాణిజ్య లోటు కూడా కిందకు దిగివస్తుంది. మేలో భారత వాణిజ్య లోటు 14.62 బి. డాలర్లకు పెరిగింది. ద్రవ్యోల్బణం(మే) కూడా నాలుగు నెలల గరిష్ఠమైన 4.87 శాతానికి చేరింది. ఇవన్నీ కిందకు దిగిరావాలంటే నేటి నిర్ణయం భారత్‌కు చాలా కీలకం.



సియాచిన్‌లో సద్గురు పాఠాలు

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధక్షేత్రమైన సియాచిన్.. గురువారం యోగాసనాలకు వేదికైంది. ఇక్కడ సేవలందిస్తున్న సైనికులతో.. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆసనాలు వేయించారు. కఠినమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వారికి చిట్కాలూ చెప్పారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మొత్తం 250 మంది సైనిక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జమ్ముకశ్మీర్‌లోని లద్దాఖ్ ప్రాంతంలోనున్న సియాచిన్.. సముద్ర మట్టానికి 18వేల నుంచి 21వేల అడుగుల ఎత్తులో ఉంది.

కోటలో కొత్త రికార్డు

రాజస్థాన్‌లో లక్షకు పైగా మంది ఒకేసారి యోగాసనాలు వేసి.. ప్రపంచ రికార్డు సృష్టించారు. కోట నగరంలో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. గురువారం యోగా గురువు రామ్‌దేవ్ బాబా ఆధ్వర్యంలో 'అతిపెద్ద యోగా శిక్షణ' కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధర రాజే కూడా దీనికి హాజరయ్యారు. దాదాపు 2లక్షల మంది ఈ శిబిరంలో పాల్గొన్నారు. గతేడాది మైసూర్‌లో 55వేల మంది ఒకేసారి యోగా చేసి ప్రపంచ రికార్డు సాధించారు. తాజా కార్యక్రమంలో ఆ రికార్డు బద్దలైనట్లు గిన్నిస్ బుక్ ప్రతినిధులు తెలిపారు. కోటలో 1.05 లక్షల మంది ఒకేసారి యోగా చేసినట్లు ఇప్పటివరకూ గుర్తించామని.. డ్రోన్ కెమెరాల ద్వారా లెక్కింపు ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నారు.

కోటలో యోగా సాధన చేస్తున్న ప్రజలు, బాబారాందేవ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే

ఏకీకరణ 'యోగా'ం

- కల్లోలిత ప్రపంచానికి ఇదే మార్గం
- ఆరోగ్యం కోసం తపనతో యోగా ప్రజా ఉద్యమంగా మారింది
- సమస్యలకు పరిష్కారం చూపే మార్గమిది: మోదీ
- దేహ్రాదూన్‌లో 50వేల మందితో కలిసి యోగాభ్యాసం

దేహ్రాదూన్

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేహ్రాదూన్‌లో సూర్యనమస్కారాలు చేస్తున్న ప్రధాని మోదీ

భారతదేశానికి చెందిన ప్రాచీన యోగ విద్య... ప్రస్తుత కల్లోలిత ప్రపంచాన్ని ఏకీకృతం చేసే శక్తిమంతమైనదిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో అటవీ పరిశోధన సంస్థ (ఎఫ్ఆర్ఐ) ప్రాంగణంలో 50వేల మంది ఔత్సాహికులతో కలిసి ఆయన యోగ సాధన చేసి, ప్రసంగించారు. 'అస్వస్థత నుంచి స్వస్థత కోసం ప్రపంచానికి ఒక మార్గాన్ని యోగా చూపింది. ప్రజల జీవితాల్లో జవసత్వాలు నింపడానికి యోగా ఉపయోగపడుతోంది. చక్కని ఆరోగ్యం కోసం ప్రపంచవ్యాప్తంగా అందరూ పరితపిస్తుండడంతో యోగా అతిపెద్ద ప్రజా ఉద్యమంగా మారింది. శాంతియుత ప్రపంచాన్ని సృష్టించడానికి ఇది అవసరం. దేహ్రాదూన్ నుంచి డబ్లిన్, షాంఘై నుంచి షికాగో, జకార్తా నుంచి జొహన్నెస్‌బర్గ్, హిమాలయా పర్వతశ్రేణులు, ఎడారులు... ఇలా విశ్వవ్యాప్తమైన యోగా కోట్లాది మంది జీవితాలను సుసంపన్నం చేస్తోంది. సమాజాల్లో మైత్రీ భావనను యోగా ప్రోది చేస్తుంది. ఇది జాతి ఐక్యతకు దోహదపడుతుంది' అని ఆయన పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికే కాకుండా ప్రజల మధ్య, దేశాల నడుమ ఐక్యతకు; విశ్వమానవ సౌభ్రాతృత్వానికి దోహదపడగల శక్తి యోగాకి ఉందని చెప్పారు. విచ్ఛిన్నకర శక్తులు పేట్రేగిపోతున్న తరుణంలో ప్రపంచ శాంతి, సోదరభావాలకు యోగా దారి చూపుతుందన్నారు.

ఐరాస ఆమోదం ఓ ఘనత

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాటించాలని తాను చేసిన ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితి అతి తక్కువ సమయంలో ఆమోదించడం- చరిత్రలో ఓ ఘనత అని మోదీ పేర్కొన్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు యోగాను తమకు సంబంధించినదిగా భావిస్తున్నారని చెప్పారు. మిగిలిన ప్రపంచం నుంచి గౌరవం పొందాలంటే ముందుగా ప్రజలు తమ విశిష్ట సంస్కృతి, వారసత్వాలైన యోగా వంటివాటిని గౌరవించడం నేర్చుకొని, వాటిలో భాగం పంచుకోవాలని అభిప్రాయపడ్డారు. ప్రశాంతంగా, సృజనాత్మకంగా, సంతృప్తికరమైన జీవితాన్ని సాగించడం యోగాతో సాధ్యమన్నారు. వ్యక్తులుగా గానీ, సమాజంగా గానీ మనం ఎదుర్కొనే సమస్యలకు ఇక్కడ సరైన పరిష్కారం లభిస్తుందన్నారు. 'విభజించే బదులు యోగా అందరినీ కలుపుతుంది. శత్రుత్వం బదులు ఏకత్వాన్ని పెంచుతుంది. బాధల్ని పెంచే బదులు స్వస్థత చేకూరుస్తుంది. ప్రపంచానికి ఆశాకిరణం యోగా. ప్రాచీనమైనదైనా ఆధునికమైనది కావడం వల్లనే ఇది అందమైనది. అందుకే నిరంతరం వికసిస్తోంది. భారతీయ వారసత్వ క్రమంలో దీనిది కీలక భూమిక. దానికి మనమంతా గర్వపడాలి' అని మోదీ చెప్పారు. టోక్యో నుంచి టొరంటో వరకు, స్టాక్‌హోం నుంచి సావోపాలో వరకు కోట్లమంది ప్రజలపై యోగా సానుకూల ప్రభావాన్ని చూపిస్తోందన్నారు. ఆరోగ్యంగా ఉండడానికే కాకుండా ఆనందమయ, శాంతియుత జీవనానికి యోగాభ్యాసాన్ని కొనసాగించాలని ప్రజల్ని కోరారు. యోగా దినోత్సవం సందర్భంగా మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జేఇన్‌లు పరస్పరం కొరియా భాషలో ట్విటర్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

> యోగాకు పెరుగుతున్న ప్రాచుర్యంతో భారతదేశం- మిగిలిన ప్రపంచానికి సన్నిహితమవుతోంది. రాబోయే రోజుల్లో ఇది మరింతగా బలపడుతుంది. ఉత్తరాఖండ్... కొన్ని తరాలుగా యోగాకు ప్రధాన కేంద్రం. అసాధారణ శక్తిని అందించే ఈ ప్రక్రియకు ఆదిగురు శంకరాచార్య, స్వామి వివేకానంద వంటివారు ఆకర్షితులయ్యారు. – మోదీ

సురినామ్‌లో యోగా వేసిన కోవింద్

పరమరిబో: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గురువారం లాటిన్ అమెరికా దేశమైన సురినామ్‌లో అధ్యక్షుడు దీసీ బేతర్సేతో కలిసి ఆసనాలు వేశారు. ఇద్దరు దేశాధినేతలు కలిసి యోగా దినోత్సవాన యోగా చేయడం ఇదే తొలిసారి.

పాఠ్యాంశాల్లో యోగాను చేర్చాలి: వెంకయ్యనాయుడు

ముంబయి: ఆరోగ్యవంతమైన దేశాన్ని నిర్మించడానికి వీలుగా పాఠ్యాంశాల్లో యోగాను చేర్చాల్సిన అవసరం ఉందని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. గురువారం బాంద్రాలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మారుతున్న జీవనశైలి అలవాట్లతో పెరిగిన ఒత్తిడి నుంచి యోగాతో ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయం వద్ద యోగా చేస్తున్న ప్రజలు

బెంగళూరులో తన నివాసంలో యోగా చేస్తున్న మాజీ ప్రధాని దేవేగౌడ

గర్భిణులకు ప్రత్యేకంగా..

గర్భిణులతో కలిసి కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ మంత్రి మేనక గాంధీ యోగాసనాలు ఆచరించారు. దిల్లీలోని సహజ శిశుజనన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులకు మేలు కలిగిలా.. వారి శరీరంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ఆసనాలకు ప్రత్యేక మార్పులు చేసినట్లు నిపుణులు పేర్కొన్నారు. త్రికోణాసనం, పశ్చిమోత్తానాసనం, అశ్వసంచాలనాసనం వంటివాటిని గర్భిణులతో వేయించారు. ఇటు త్వరలో తల్లి కాబోతున్న టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా కూడా.. తాను ఈ ప్రత్యేక ఆసనాలను వేస్తున్న వీడియోను ట్విటర్‌లో పంచుకున్నారు.

మతాలకు అతీతంగా..

కేరళకు చెందిన ఇన్ఫాంట్ ట్రెసా అనే 67ఏళ్ల క్రైస్తవ సన్యాసిని.. యోగా పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు పాటుపడుతున్నారు. యోగాకు మతంతో సంబంధం లేదని..ఎవరైనా ఆచరించవచ్చని చాటిచెబుతున్నారు. 30 ఏళ్లుగా యోగాను ఆచరిస్తూ.. 5వేలకు పైగా మందికి ఆమె శిక్షణ ఇచ్చారు. "తీవ్రమైన నడుం నొప్పితో నేను బాధపడేదాన్ని. యోగా గురించి తెలుసుకొని.. 1985లో దాన్ని ఆచరించడం మొదలుపెట్టా. కొన్ని నెలల్లోనే సమస్య దూరమైంది. అప్పటి నుంచి బైబిల్‌తోపాటు యోగా కూడా నా వెంటే ఉంది" అని ట్రెసా చెప్పారు.

ఆ సీఎంలు దూరంగానే..

బిహార్‌లో నిర్వహించిన యోగా ప్రత్యేక వేడుకకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ దూరంగా ఉన్నారు. గవర్నర్ సత్యపాల్ మలిక్, కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్‌తోపాటు భాజపా నేత, ఉపముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోదీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే నీతీశ్ గైర్హాజరుపై రాజకీయం చేయాల్సిన అవసరం లేదని భాజపా, జేడీయూ (నీతీశ్ పార్టీ) వర్గాలు వ్యాఖ్యానించాయి. నీతీశ్ ఎన్నో ఏళ్లుగా రోజూ యోగా చేస్తున్నారని.. కార్యక్రమానికి రాకపోవడం పెద్ద విషయం కాదని రవిశంకర్, సుశీల్‌కుమార్ అన్నారు. మరోవైపు కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి కూడా తమ రాష్ట్రంలో జరిగిన యోగా కార్యక్రమాల్లో పాల్గొనలేదు. యోగా గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ ఓ ట్వీట్ మాత్రం చేశారు. అనారోగ్యం కారణంగా దిల్లీ సీఎం కేజ్రీవాల్ కూడా వేడుకలకు దూరంగా ఉన్నారు. ఇటు పశ్చిమ బెంగాల్‌లో యోగా కార్యక్రమాలు అంత అట్టహాసంగా ఏమీ జరగలేదు. ముఖ్యమంత్రి మమత బెనర్జీతోపాటు ఆ రాష్ట్ర మంత్రులెవరూ వేడుకల్లో పాల్గొనలేదు.

మోదీ కార్యక్రమాన్ని యూట్యూబ్‌లో ప్రసారం చేయలేకపోయిన పీఐబీ

ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న యోగా కార్యక్రమాన్ని.. భారత పత్రికా సమాచార సంస్థ (పీఐబీ) అధికారిక యూట్యూబ్ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయలేకపోయింది. సాంకేతిక కారణాలతో పీఐబీ ఛానెల్‌ను యూట్యూబ్ నిలిపివేసింది. 'భాగస్వామ్య ఒప్పందాల'కు ఆ సంస్థ మార్పులు చేయడంతో ఈ సమస్య ఏర్పడింది. ఛానెల్ నిలిపివేత అంశాన్ని పీఐబీ బుధవారమే యూట్యూబ్ దృష్టికి తీసుకువెళ్లింది. గురువారం ఉదయం 8గంటలకు ఛానెల్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. అయితే అప్పటికే మోదీ కార్యక్రమం ముగిసింది.

నాగ్‌పుర్‌లో యోగా సాధన చేస్తున్న ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళ జ్యోతి ఆమ్గే



నాగ్‌పుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆసనం వేసిన చిన్నారి

రుణ మాఫీ శాశ్వత పరిష్కారం కాదు

- మరిన్ని రైతు అనుకూల విధానాలు అవసరం
- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

పుణె

ముంబయిలో యోగా చేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, కేంద్ర మంత్రి బబుల్ సుప్రియో(కుడి చివర)

రైతులకు అనుకూలంగా మరిన్ని విధానాలను అమలు చేయాల్సి ఉందని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. అదే సమయంలో పంట రుణాల మాఫీ శాశ్వత పరిష్కార మార్గం కాదని, ఇది దీర్ఘకాలంలో వ్యవసాయ రంగాన్ని, రైతులను దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డారు. గురువారం ఇక్కడి వైకుంఠ్ మెహతా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ సంస్థలో 'వ్యవసాయాన్ని నిర్వహణీయ, లాభసాటి ఉపాధిగా మార్చడం' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి వ్యవసాయంతో పాటు, పశుపోషణ, కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని, అలా చేసిన వారు ఆత్మహత్యలు చేసుకోరని అన్నారు. 'వినియోగదార్లు అధికసంఖ్యలో ఉన్నందువల్ల వారికి ప్రాధాన్యమిస్తూ విధానాలు రూపొందిస్తుంటాం. అదే సమయంలో రైతుల ప్రయోజనాలను విస్మరించకూడదు. ఈ రెండింటి మధ్య సమన్వయం కుదర్చడమే పెద్ద సవాల'ని అన్నారు. రైతుల అనుకూల పథకాలను రూపొందించడంతోపాటు, అవి అసలైన లబ్ధిదారులకు అందేలా చూడాలని సూచించారు. పంటలను అమ్ముకోవడమే రైతుల ముందున్న పెద్ద సమస్య అని చెప్పారు. 'ధరల విషయంలో వారికి వాస్తవ సమయంలో సరయిన సమాచారం అందాలి. ఇందుకోసం ఈ-నాం వ్యవస్థను బలోపేతం చేయాలి. ఒకే మార్కెట్ రుసుము ఉండేలా వ్యవసాయ మార్కెట్ల చట్టాన్ని సవరించాలని సూచించారు. ప్రస్తుతానికి ఆహార భద్రత ఉన్నా, పెరగనున్న అవసరాల దృష్ట్యా ధీమాగా ఉండలేని పరిస్థితి ఉందని అన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి నాలుగు 'ఐ'లు...నీటిపారుదల (ఇరిగేషన్), మౌలిక వసతులు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), పెట్టుబడులు (ఇన్‌వెస్ట్‌మెంట్), బీమా(ఇన్సూరెన్స్)లు అవసరమని వివరించారు. దిగుబడులు పెరిగే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగశాల నుంచి పొలం వరకు విస్తరించాలని, మార్కెటింగ్ వ్యవస్థను పటిష్ఠ పరచాలని ఉపరాష్ట్రపతి కోరారు.

భారత వ్యవసాయ విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ మాట్లాడుతూ హరిత విప్లవం నుంచి సతత హరిత విప్లవంవైపు మళ్లాలని సూచించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా మార్కెట్‌తో అనుసంధానం చేయడమే అసలైన సమస్య అని చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రసంగిస్తూ రైతులకు మేలు కలిగించేలా ప్రభుత్వం పంటలను కొనుగోలు చేస్తున్నా వాటిని ఎలా అమ్ముకోవాలో తెలియడం లేదని అన్నారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ మాట్లాడుతూ వ్యవసాయం ద్వారా సంపద సృష్టి జరగాల్సి ఉందని చెప్పారు. ఇందుకోసం నైపుణ్యాభివృద్ధి, ఇతర సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలని అన్నారు.

మరఠ్వాడాలో 433 మంది రైతుల ఆత్మహత్య

ఔరంగాబాద్: మహారాష్ట్రలోని మరఠ్వాడా ప్రాంతంలో ఈ ఏడాదిలో ఇంతవరకు 433 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ప్రాంతంలోని ఎనిమిది జిల్లాల్లో జనవరి ఒకటి నుంచి జూన్ 17 వరకు ఈ దుర్ఘటనలు చోటుచేసుకున్నాయని అధికారవర్గాలు తెలిపాయి. పంట రుణాల మాఫీ, జలసంరక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ ఆత్మహత్యలు ఆగకపోవడం గమనార్హం. అప్పుల భారం పెరగడం, సరయిన దిగుబడులు రాకపోవడం, పత్తికి గులాబీరంగు పురుగు ఆశించడం, వడగళ్లవానతో పంటలు కోల్పోవడం వంటివి రైతుల ఆత్మహత్యలకు కారణాలయ్యాయి. కరవు ప్రాంతమైన బీడ్ జిల్లాలో అత్యధికంగా 81 మంది ప్రాణాలు తీసుకున్నారు.

హైదరాబాద్‌లోని సంజీవయ్యపార్కులో తాడు సాయంతో యోగాసనాలు వేస్తున్న విద్యార్థిని

మరో పన్నెండు లక్షల పత్రాలు

దిల్లీ: పనామా పత్రాల లీక్ వ్యవహారంలో తాజాగా వెల్లడయిన అంశాలను ఆదాయపు పన్ను విభాగం, రిజర్వు బ్యాంకు సహా వివిధ సంస్థలతో కూడిన బహుళ సంస్థల గ్రూప్ (ఎంఏజీ) పరిశీలిస్తోందని ఆర్థిక మంత్రిత్వశాఖ గురువారం వెల్లడించింది. పనామా పత్రాల లీక్ అంశాన్ని తొలుత అంతర్జాతీయ పరిశోధనాత్మక విలేకర్ల కన్సార్షియం (ఐసీఐజే) 2016, ఏప్రిల్4న వెలుగులోకి తెచ్చింది. మీడియాలో వచ్చిన ఒక కథనం ప్రకారం 12లక్షలకు పైగా తాజా పత్రాలు వెలుగులోకి వచ్చాయి. అందులో 12వేల పత్రాలు భారతీయులకు సంబంధించినవి.

డిపాజిట్లు అమితం

- అమిత్ షా డైరెక్టర్‌గా ఉన్న

జిల్లా సహకార బ్యాంకుకు డిపాజిట్ల వెల్లువ

ముంబయి: భాజపా అధ్యక్షుడు అమిత్ షా డైరెక్టర్‌గా ఉన్న అహ్మదాబాద్ జిల్లా సహకార బ్యాంకు (ఏడీసీబీ)కు పెద్ద నోట్ల రద్దు తర్వాత ఆ నోట్ల డిపాజిట్లు వెల్లువెత్తాయి. జిల్లా సహకార బ్యాంకులన్నింటిలోనూ ఈ బ్యాంకుకే ఎక్కువ డిపాజిట్లు వచ్చాయి. 2016, నవంబరు 8న ఆకస్మికంగా పెద్ద నోట్లను రద్దు చేసిన తర్వాత ఈ బ్యాంకులో ఐదు రోజుల్లో మొత్తం రూ.745.59 కోట్ల విలువైన రూ.500, రూ.వెయ్యి నోట్లు జమ అయ్యాయి. ఏడీసీబీ తర్వాత స్థానంలో రాజ్‌కోట్ జిల్లా సహకార బ్యాంకు నిలిచింది. ఈ బ్యాంకు ఛైర్మన్ జయేశ్‌భాయ్ విఠల్‌భాయ్ రాడాడియా.. గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపాని ప్రభుత్వంలో కేబినెట్ మంత్రి. ఈ బ్యాంకులో రూ.693.19 కోట్ల విలువైన రూ.500, రూ.వెయ్యి నోట్లు జమయ్యాయి. ముంబయికి చెందిన సమాచార హక్కు కార్యకర్త మనోరంజన్ ఎస్.రాయ్ చేసిన దరఖాస్తుతో ఈ వివరాలు వెల్లడయ్యాయి. నల్లధనాన్ని చలామణిలోకి తెస్తున్నారన్న అనుమానంతో 2016 నవంబరు 14 తర్వాత జిల్లా సహకార బ్యాంకుల్లో... రద్దయిన నోట్ల డిపాజిట్లను నిలిపివేశారు.

ఏడీసీబీ వెబ్‌సైట్‌లో ఉన్న వివరాల ప్రకారం.. అమిత్ షా ఇంకా ఆ బ్యాంకు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. చాలా సంవత్సరాల నుంచి ఆ బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్నారు. 2000లో దానికి ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు. 2017, మార్చి 31 నాటికి ఏడీసీబీ మొత్తం డిపాజిట్ల విలువ రూ.5,050 కోట్లు. 2016-17లో ఆ బ్యాంకు నికర లాభం రూ.14.31 కోట్లు.

అహ్మదాబాద్, రాజ్‌కోట్ జిల్లా సహకార బ్యాంకుల్లో జమ అయిన రద్దయిన నోట్ల విలువ గుజరాత్ రాష్ట్ర సహకార బ్యాంకు కన్నా చాలా ఎక్కువ కావడం గమనార్హం. రాష్ట్ర సహకార బ్యాంకులో... రద్దయిన నోట్ల జమ కేవలం రూ.1.11 కోట్లు మాత్రమే.

దేశవ్యాప్తంగా డిపాజిట్ అయిన రద్దయిన పెద్ద నోట్ల మొత్తం విలువ రూ.15.28లక్షల కోట్లు కాగా అందులో సగానికిపైగా అంటే రూ.7.91లక్షల కోట్లు కేవలం ఏడు ప్రభుత్వ రంగ బ్యాంకులు, 32 రాష్ట్ర సహకార బ్యాంకులు, 370 జిల్లా సహకార బ్యాంకులు, దాదాపు 40 తపాలా కార్యాలయాల్లో జమయ్యాయి. ఏడు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.7.57 లక్షల కోట్లు, 32 రాష్ట్ర సహకార బ్యాంకుల్లో రూ.6,407 కోట్లు, 370 జిల్లా సహకార బ్యాంకుల్లో రూ.22,271 కోట్లు జమయ్యాయి. 39 తపాలా కార్యాలయాల్లో జమయిన మొత్తం రూ.4,408 కోట్లు. మిగిలిన 14 ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దయిన పాత నోట్ల డిపాజిట్ల వివరాలను వెల్లడించలేదు.

కేవలం కొన్ని బ్యాంకులు, వాటి శాఖలు, కొన్ని తపాలా కార్యాలయాలు, రాష్ట్ర సహకార బ్యాంకులు, జిల్లా సహకార బ్యాంకుల్లోనే సగానికి పైగా పాత నోట్లు జమకావడం తీవ్రమయిన అంశమేనని మనోరంజన్ అన్నారు. అండమాన్ నికోబార్ దీవుల్లో నాలుగు లక్షలకన్నా తక్కువ జనాభా ఉండగా అక్కడి రాష్ట్ర సహకార బ్యాంకుకు చెందిన 29శాఖల నుంచి రూ.85.76 కోట్లు జమ కావడం గమనార్హం.

కర్ణాటకలోని మైసూరులో యోగా చేస్తున్న 30 వేల మంది

ఆ కుటుంబాలను వేరు చేయొద్దు: ట్రంప్

వాషింగ్టన్: అక్రమంగా వలస వచ్చిన కుటుంబాల నుంచి చిన్నారులను వేరు చేసే దారుణ పద్ధతికి అమెరికా స్వస్తి పలికింది. ఈ మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. వేరు చేసిన చిన్నారులను బోనుల్లో ఉంచిన ఫొటోలపై ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహజ్వాల వ్యక్తంకావడంతో ఆయన ఈ చర్యకు ఉపక్రమించారు. గత కొన్ని వారాల్లో దాదాపు 2500 మంది చిన్నారులను వారి తల్లిదండ్రుల నుంచి వేరుచేశారు. "సదరు కుటుంబాలను ఒక్కటిగానే ఉంచుతాం. దీనివల్ల సమస్య పరిష్కారమవుతుంది. అదే సమయంలో సరిహద్దును శక్తిమంతంగానే ఉంచుతాం. అక్రమ వలసలను ఏమాత్రం ఉపేక్షించబోం" అని ట్రంప్ పేర్కొన్నారు. కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశాక ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కుటుంబాలను వేరు చేయడం తనకు ఇష్టంలేదన్నారు. అక్రమవలసదారులపై విచారణ పెండింగ్‌లో ఉండగా వారి కుటుంబాలను ఒక్కటిగా ఉంచాలని ఉత్తర్వులో అంతర్గత భద్రత శాఖను ట్రంప్ ఆదేశించారు.

ప్రపంచకప్‌లో ఈనాడు

బ్రెజిల్	గ్రూప్-ఈ X సా॥ 5.30	కోస్టారికా
నైజీరియా	గ్రూప్-డి X రాత్రి 8.30	ఐస్‌లాండ్
సెర్బియా	గ్రూప్-ఈ X రాత్రి 11.30	స్విట్జర్లాండ్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

యువీ మద్దతు ఫ్రాన్స్‌కే

"గత ప్రపంచకప్‌లలో బ్రెజిల్‌కు మద్దతు ఇచ్చేవాడిని. కానీ ఈసారి ఫ్రాన్స్‌కు మద్దతు ఇస్తున్నా. దీనికి కారణం మాంచెస్టర్ యునైటెడ్ ఆటగాడు పాల్ పోగ్బా ఆ జట్టులో ఉండడమే. భారత క్రికెట్ జట్టూ ఫుట్‌బాల్ ఆడుతుంది.. కానీ బుమ్రాకు ఫుట్‌బాల్ సరిగా రాదు. హార్దిక్ ఫర్వాలేదు. అతనింకా మెరుగు పడాలి. రోహిత్‌శర్మ గురించైతే చెప్పుకోవక్కర్లేదు. అతను బంతి పాస్ చేస్తాడు. కానీ కదలడు. జహీర్ కూడా అంతే. ఇక ఆశిష్‌ను ఫుట్‌బాల్ ఆడకు గాయాలు అవుతాయని సలహాలిస్తా" – యువరాజ్ సింగ్

శృంగారంపై నిషేధం లేదు కానీ..

వోల్గోగ్రాడ్ (రష్యా): ప్రపంచకప్ సమయంలో ఫుట్‌బాల్ ఆటగాళ్లు శృంగారంలో పాల్గొనాలా.. లేదా.. అన్న విషయంలో గతంలో చాలా సార్లు చర్చలు జరిగాయి. ఈ విషయంలో ఒకొక్క కోచ్ తీరు ఒక్కోలా ఉంటుంది. ఈసారీ అంతే. ప్రపంచకప్‌నకు ముందు జర్మనీ కోచ్.. జోకిమ్ లో.. ఆటగాళ్లు సెక్స్‌లో పాల్గొనడంపై నిషేధం విధించాడు. ఆటగాళ్ల ఏకాగ్రత దెబ్బతినకుండా ఉండేందుకే ఈ నిర్ణయం జోకిమ్ తీసుకున్నాడని తెలుస్తోంది. అలాగే సామాజిక మాధ్యమాల్లో కూడా ఎక్కువగా కనిపించొద్దని ఆటగాళ్లను జోకిమ్ ఆదేశించాడు. ఐస్‌లాండ్ కోచ్ హల్ గ్రిమస్స్ మాత్రం తమ ఆటగాళ్లపై ఇలాంటి నిషేధాలు ఏమీ లేవంటున్నాడు. ఐతే ఓ షరతు పెట్టాడు. అదేంటంటే.. భార్యలతో మాత్రమే సెక్స్‌లో పాల్గొనాలట. జట్టు సభ్యుల సెక్స్ నిషేధం ఏమైనా విధించారా అని ఓ ఐస్‌లాండ్ విలేకరి అడిగినప్పుడు.. "అవును.. అది భార్యలు రానంతవరకే. సెక్స్‌పై నిషేధమేమీ లేదు" అని హల్‌గ్రిమ్సన్ చెప్పాడు. ఐస్‌లాండ్ ఆటగాళ్ల కుటుంబాలు గురువారమే వాళ్లతో కలిశాయి. ఆ జట్టు శుక్రవారం గ్రూప్-డి మ్యాచ్‌లో నైజీరియాతో తలపడనుంది.

ఫైనల్లో ఇంగ్లాండ్, అర్జెంటీనా

బెక్‌హమ్ జోస్యం

బీజింగ్: ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లాండ్, అర్జెంటీనాలు తలపడే అవకాశం ఉందని ఇంగ్లాండ్ మాజీ స్టార్ డేవిడ్ బెక్‌హమ్ జోస్యం చెప్పాడు. తొలి మ్యాచ్‌లో ట్యునీషియాపై 2-1తో గెలిచి ఇంగ్లాండ్ శుభారంభం చేసిన నేపథ్యంలో అతనీ వ్యాఖ్యలు చేశాడు. "ప్రపంచకప్ ఫైనల్లో అర్జెంటీనాతో ఇంగ్లాండ్ తలపడుతుందని నమ్ముతున్నాను. ప్రపంచకప్ గెలవడానికి ఇంగ్లాండ్‌కు అర్హత ఉంది. ఇలా చెబితే నేనేదో దేశం తరఫున మాట్లాడుతున్నానని, పక్షపాతినని అనుకుంటారు. తొలి మ్యాచ్‌లో ట్యునీషియాపై జట్టు విజయం ఎంతో ఆనందంగా అనిపించింది. ఇంగ్లాండ్ జట్టులో అంతా కుర్రాళ్లే. వాళ్లకు ప్రపంచకప్‌లో ఆడిన అనుభవం లేదు. ప్రతి మ్యాచ్ మా జట్టుకు సవాలే. ఎందుకంటే ఈ టోర్నీలో ఆడే జట్లన్నీ మెరుగైనవే" అని బెక్‌హమ్ చెప్పాడు.

పాక్‌తో పోరుకు సై

- ఫేవరేట్‌గా భారత్
- కబడ్డీ మాస్టర్స్ టోర్నీ

దుబాయి: చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో పోరుకు భారత కబడ్డీ జట్టు సిద్ధమైంది. శుక్రవారం నుంచి దుబాయిలో ఆరంభం కానున్న కబడ్డీ మాస్టర్స్ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్.. పాక్‌తో తలపడనుంది. బలమైన జట్టుతో బరిలో దిగుతున్న భారతే ఫేవరేట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. పాకిస్థాన్, ఇరాన్, కొరియా లాంటి జట్లు పోటీపడుతుండడంతో ప్రతిష్ఠాత్మకమైన ఆసియా క్రీడలకు ముందు ఈ టోర్నీని సన్నాహకంగా ఉపయోగించుకోవాలని భారత్ అనుకుంటుంది. "ఆసియా క్రీడల్లో ఇరాన్, పాకిస్థాన్, కొరియా జట్లు కూడా పాల్గొంటాయి. కాబట్టి ఈ టోర్నీ సెమీస్ లాంటిది. ఆసియా క్రీడలకు మంచి సన్నాహకంగా ఉపయోగపడనుంది" అని భారత కోచ్ శ్రీనివాస్ రెడ్డి తెలిపాడు. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో పాక్, కెన్యాలతో కలిసి భారత్ గ్రూప్- ఎలో ఉంది. గ్రూప్- బిలో ఇరాన్, కొరియా, అర్జెంటీనా జట్లు ఉన్నాయి. గతేడాది ఆసియా ఛాంపియన్‌షిప్ ఫైనల్లో పాక్‌ను చిత్తు చేసి జట్టును విజేతగా నిలిపిన అజయ్ ఠాకూర్ సారథ్యంలో మరోసారి భారత్ బరిలో దిగనుంది. రాహుల్ చౌదరి, పర్దీప్ నర్వాల్, రోహిత్ కుమార్, రిషాంక్ దేవడిగ, మోను గోయత్, దీపక్ హుడా, మంజీత్ చిల్లర్, సురేందర్ నాడా, గిరీష్ ఎర్నాక లాంటి ఆటగాళ్లతో భారత జట్టు బలంగా ఉంది. స్టార్ ఇండియాతో కలిసి అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య (ఐకేఎఫ్) ఈ టోర్నీని నిర్వహిస్తోంది. భారత్, పాక్ మ్యాచ్ రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

వచ్చే ఐదేళ్లలో 203

- టీమ్ ఇండియా ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లు
- అన్ని జట్ల కన్నా ఎక్కువ

దిల్లీ: టీమ్‌ఇండియా వచ్చే ఐదేళ్ల భవిష్య పర్యటన ప్రణాళికలో భాగంగా అన్ని జట్ల కన్నా ఎక్కువగా అన్ని ఫార్మాట్లలో కలిపి 203 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ ఆవృత్తిలో భారత్ 51 టెస్టు మ్యాచ్‌లు, 83 వన్డేలు, 69 టీ20ల్లో పోటీపడనుంది. ఆడే మ్యాచ్‌ల విషయంలో భారత్‌కు రెండో స్థానంలో ఉన్న వెస్టిండీస్ (186), మూడో స్థానంలో ఉన్న ఇంగ్లాండ్ (175)కు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. టెస్టు మ్యాచ్‌ల్లో మాత్రం భారత్.. ఇంగ్లాండ్ (59 మ్యాచ్‌లు) తర్వాత రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా 47 మ్యాచ్‌లతో మూడో స్థానంలో ఉంది. భారత జట్టు ఒక్క వెస్టిండీస్‌తోనే 75 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది.

6 తన చివరి ఎనిమిది ప్రపంచకప్‌లలో ఫ్రాన్స్ నాకౌట్ చేరడం ఇది ఆరోసారి

గోల్ చేసిన ఆనందంలో బపె

0 ప్రపంచకప్‌లలో గత ఎనిమిది మ్యాచ్‌లలో పెరూ విజయాలు. ఒక్కటీ నెగ్గని పెరూ.. రెండింటిని డ్రా చేసుకుంది. రెండు గోల్స్ మాత్రమే సాధించింది.

నాకౌట్లో ఫ్రాన్స్

పెరూపై 1-0తో విజయం ● గోల్ కొట్టిన బపె

వరుసగా రెండో విజయంతో ఫ్రాన్స్ జట్టు ప్రపంచకప్ నాకౌట్‌కు దూసుకెళ్లింది. బపె గోల్‌తో 1-0తో పెరూను ఓడించింది. ఆరు పాయింట్లతో గ్రూప్ 'సి'లో అగ్రస్థానంలో నిలిచింది. వరుసగా రెండో ఓటమితో పెరూ నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది.

ఎక్తరిన్‌బర్గ్

ఫ్రాన్స్ జట్టు ప్రపంచకప్ తుది 16కు అర్హత సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 1-0తో పెరూను ఓడించింది. గట్టి పోటీ ఎదురైన మ్యాచ్‌లో యువ ఆటగాడు బపె 34వ నిమిషంలో కొట్టిన గోల్‌తో ఫ్రాన్స్ గట్టెక్కింది. మేజర్ టోర్నీలో గోల్ సాధించిన అత్యంత పిన్నవయసు ఫ్రాన్స్ ఆటగాడిగా 19 ఏళ్ల బపె ఘనత సాధించాడు. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 2-1తో నెగ్గిన ఫ్రాన్స్.. ఈ విజయంతో మొత్తం పాయింట్లను ఆరుకు పెంచుకుని గ్రూప్-సి అగ్రస్థానంలో నిలిచింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే నాకౌట్‌కు అర్హత సాధించింది. 1982 తర్వాత తొలిసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించిన పెరూ ఇంత త్వరగా నిష్క్రమించడంతో ఆ జట్టు అభిమానులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ ప్రదర్శన మరీ గొప్పగా ఏమీ లేదు. పెరూ గట్టి పోటీనే ఇచ్చింది. బంతిని ఎక్కువగా తన నియంత్రణలోనే ఉంచుకుంది. ఐతే 11వ నిమిషంలో ఫ్రాన్స్‌కు మంచి అవకాశం లభించింది. కానీ గ్రీజ్‌మన్ బంతిని దూరంగా తన్నేశాడు. పోగ్బా కూడా పెరూ గోల్ కీపర్ గాలెస్‌ను బోల్తా కొట్టించలేకపోయాడు. కెరీర్‌లో 100వ మ్యాచ్ ఆడుతున్న లారిస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. ఐతే బపె 34వ నిమిషంలో సాధించిన గోల్‌తో ఫ్రాన్స్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత విరామానికి కాసేపు ముందు హెర్నాండెజ్‌కు మంచి అవకాశం వచ్చింది. కానీ పెరూ రక్షణశ్రేణి అతణ్ని అడ్డుకుంది. రెండో అర్ధభాగంలో పెరూ పదును పెంచింది. ప్రపంచకప్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలన్న పట్టుదలతో పోరాడింది. పెరూ ఎంత ప్రయత్నించినా స్కోరు సమం చేయలేకపోయింది. ఆఖరి నిమిషాల్లో లభించిన ఫ్రీకిక్‌ను డెంబెలె సద్వినియోగం చేయలేకపోయాడు. ఫ్రాన్స్.. గ్రూప్‌లో అగ్రస్థానం కోసం మంగళవారం డెన్మార్క్‌తో తలపడుతుంది.

గ్రూప్-సి	మ్యా	గె	డ్రా	ఓ	పా
ఫ్రాన్స్	2	2	0	0	6
డెన్మార్క్	2	1	1	0	4
ఆస్ట్రేలియా	2	0	1	1	1
పెరూ	2	0	0	2	0

నోట్: మ్యా: మ్యాచ్‌లు; గె- గెలుపు; ఓ- ఓటమి; పా-పాయింట్లు

కల చెదిరింది... నిరాశలో పెరూ అభిమానులు

ఫిఫా ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా మరో స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసింది. గురువారం గ్రూప్-సిలో బలమైన డెన్మార్క్‌తో అద్భుతంగా ఆడి మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకుంది. సాకరూస్ క్రమశిక్షణ, పట్టుదలకు వార్ (వీడియో అసిస్టెంట్ రిఫరీ) సాంకేతిక సాయం కలిసి రావడంతో ఆ జట్టు ఒక పాయింట్ ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసినా... తొలి మ్యాచ్‌లో నెగ్గిన డెన్మార్క్ మొత్తం నాలుగు పాయింట్లతో నాకౌట్ అవకాశాలను మెరుగుపరుచుకుంది.

వారికి వార్ తోడైంది

డెన్మార్క్‌తో డ్రా చేసుకున్న ఆస్ట్రేలియా

సమరా

ఆస్ట్రేలియా ర్యాంకు 36... డెన్మార్క్ ర్యాంకు 12. గ్రూప్-సిలో సాకరూస్‌కు బలహీనమైన జట్టన్న పేరుంది. ఐతే గురువారం ఈ రెండు జట్ల మధ్య ప్రపంచకప్ మ్యాచ్ చూస్తే.. ర్యాంకుకి ఆటతో ఏం సంబంధం అనిపిస్తుంది. మ్యాచ్‌లో ఆరంభం నుంచి డెన్మార్క్‌పై ఆస్ట్రేలియా ఎదురుదాడులు చేసింది. ఐదో నిమిషంలోనే ఆ జట్టుకు ఓ గోల్ తప్పిపోయింది. కానీ తొలి దెబ్బ కొట్టింది డెన్మార్కే. ఏడో నిమిషంలో క్రిస్టియన్ ఎరిక్సన్ చేసిన గోల్‌తో ఆ జట్టు ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా గోల్ ప్రాంతంలోకి దూసుకొచ్చిన జోర్గెన్‌సన్.. ఎరిక్సన్‌కు పాస్ అందించడం.. అతను కళ్లుచెదిరే గోల్ చేయడం వెంటనే జరిగిపోయాయి. నేరుగా కొట్టిన ఈ షాట్‌ను ఆస్ట్రేలియా గోల్ కీపర్ ఎగిరినా అడ్డుకోలేకపోయాడు. 38వ నిమిషంలో లభించిన పెనాల్టీని జెడ్నెక్ గోల్‌గా మలచడంతో ఆసీస్ స్కోరు సమం చేసింది. కార్నర్ షాట్‌ను అడ్డుకునే ప్రయత్నంలో డెన్మార్క్ డిఫెండర్ పౌల్‌సెన్ గోల్‌పోస్ట్ సమీపంలో చేతితో బంతిని ముట్టుకున్నాడు. సాకరూస్ ఆటగాళ్లు అప్పీల్ చేయడంతో రిఫరీ వార్ సాయం తీసుకున్నాడు. పౌల్‌సెన్ బంతిని చేతితో అడ్డుకున్నట్లు తేలడంతో రిఫరీ.. ఆస్ట్రేలియాకు పెనాల్టీ ఇచ్చాడు. గత మ్యాచ్‌లో పెనాల్టీని కొట్టే జట్టును గోల్ అందించిన జెడ్నెక్.. మరోసారి ఎలాంటి తడబాటు లేకుండా బంతిని గోల్‌లోకి పంపించేశాడు. ఆ తర్వాత రెండు జట్లూ ఆధిక్యం కోసం చాలా ప్రయత్నాలే చేసినా ఫలించలేదు. బంతిని ఎక్కువశాతం తన ఆధీనంలోనే ఉంచుకున్న ఆస్ట్రేలియా (51 శాతం) ఎక్కువసార్లు గోల్స్ చేసే అవకాశాన్ని పొందింది. ఆస్ట్రేలియా తన తొలి మ్యాచ్‌లో 1-2తో ఫ్రాన్స్ చేతిలో ఓడిపోయింది.

ఇరాన్‌పై విజయం

అదృష్ట స్పెయిన్

ప్రపంచకప్ ఫేవరెట్లలో ఒకటైన స్పెయిన్ తొలి గెలుపు రుచి చూసింది. అదృష్టం కూడా తోడైన మ్యాచ్‌లో ఇరాన్‌ను ఓడించి గ్రూప్-బిలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. డీగో కోస్టా స్పెయిన్ తరఫున గోల్ కొట్టాడు. ఇరాన్ గట్టిగానే పోరాడినా ఓటమి తప్పలేదు.

కజాన్

ప్రపంచకప్‌లో స్పెయిన్‌కు తొలి విజయం. బుధవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో స్పెయిన్ 1-0 తేడాతో ఇరాన్‌ను ఓడించింది. డీగో కోస్టా (54వ నిమిషం) గోల్‌తో తన జట్టుకు విజయాన్ని అందించాడు. స్పెయిన్‌కు అదృష్టం కూడా బాగానే కలిసొచ్చింది. మ్యాచ్‌లో స్పెయిన్‌కు ఇరాన్ గట్టి పోటీ ఇచ్చింది. ఆద్యంతం దూకుడు ప్రదర్శించింది. మరోవైపు స్పెయిన్ కూడా జోరు అందుకోవడంతో మ్యాచ్ హోరాహోరీగా సాగింది. రెండు జట్లు పోటాపోటీగా తలపడడంతో గోల్స్‌మీ నమోదు కాకుండానే తొలి అర్ధభాగం ముగిసింది. గోల్ చేసేందుకు వచ్చిన అవకాశాలను రెండు జట్లూ సద్వినియోగం చేసుకోలేకపోయాయి. కిక్‌లు చాలా వరకు గోల్ పోస్టు పక్కనుంచే వెళ్లాయి. రెండో అర్ధభాగంలో రెండు జట్లు మరింత దూకుడుగా ఆడాయి. 54వ నిమిషంలో డీగో కోస్టా గోల్ కొట్టి స్పెయిన్ ఖాతా తెరిచాడు. అయితే ఈ గోల్‌లో డీగో కృషి కన్నా అదృష్టం పాత్రే ఎక్కువ. బంతిని అందుకొని ప్రత్యర్థి రక్షణశ్రేణిని దాటుకుంటూ గోల్‌పోస్టు వైపు వేగంగా వెళుతున్న డీగోను అడ్డుకునేందుకు ఇరాన్ ఆటగాడు రమిన్ రెజాయిన్ ప్రయత్నించాడు. రమిన్ బంతిని దూరంగా తన్నాలని చూశాడు. కానీ అతను తన్నిన బంతి డీగో మోకాలికి తాకి వెళ్లి వలలో పడింది. దాంతో స్పెయిన్ సంతోషంలో మునిగిపోయింది. ఆ తర్వాత గోల్స్ కోసం రెండు జట్లు తీవ్రంగా శ్రమించాయి. ఇరాన్ ఆటగాడు ఎజతోలహి గోల్ కొట్టడంతో (62వ నిమిషంలో) ఆ జట్టు ఆటగాళ్లు సంబరాలు చేసుకోవడం మొదలెట్టారు. అయితే వాళ్ల సంతోషం కాసేపే. ఆ గోల్ ఆఫ్‌సైడ్ అని 'వార్' సమీక్షలో తేలింది. ఆ తర్వాత ఇరాన్ ఎంత ప్రయత్నించినప్పటికీ స్కోరు సమం చేయలేకపోయింది. ఈ గెలుపుతో స్పెయిన్ గ్రూప్-బిలో అగ్రస్థానానికి దూసుకెళ్లి, నాకౌట్ దశకు చేరువైంది.



బిడ్డతో న్యూజిలాండ్ ప్రధాని జెసిండా అర్డెర్న్, ఆమె భర్త క్లార్క్ గేఫోర్డ్

పండంటి పాపకు జన్మనిచ్చిన న్యూజీలాండ్ ప్రధాని ఆర్డెర్న్

ఆక్లాండ్: న్యూజీలాండ్ ప్రధాన మంత్రి జెసిండా ఆర్డెర్న్ గురువారం పండంటి పాపకు జన్మనిచ్చారు. ప్రభుత్వాధినేతగా ఉన్నప్పుడే ప్రసవించిన రెండో మహిళగా ఈమె రికార్డు సృష్టించారు. 37ఏళ్ల ఆర్డెర్న్, 40ఏళ్ల క్లార్క్ గేఫోర్డ్‌లకు ఈ పసిపాప తొలి సంతానం. 3.3 కేజీల బరువుతో పాప ఆరోగ్యంగా పుట్టిందంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్డెర్న్ తన ఆనందాన్ని పంచుకున్నారు. 'కొత్త తల్లిదండ్రులు రుచిచూసే అనుభూతులనూ మేం ఆస్వాదిస్తున్నాం. చాలా మంది నుంచి వస్తున్న శుభాకాంక్షలతో పట్టలేనంత ఆనందంగా ఉంది'అంటూ ఆమె వివరించారు. అయితే బిడ్డకు జన్మనిచ్చిన రెండో మహిళా ప్రధాని మీరేనంటూ విలేకరులు శుభాకాంక్షలు చెప్పగా.. ఇందులో అంత ఘనతేమీలేదంటూ ఆమె కొట్టిపారేశారు. గత అక్టోబరులో ప్రధానిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. 1990లో పాక్ ప్రధానిగా ఉన్నప్పుడే బెనజీర్ భుట్టో తల్లయ్యారు.

రాజమౌళి, విజయేంద్రప్రసాద్‌లతో కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ అహిర్, కిషన్‌రెడ్డి తదితరులు

దర్శకుడు రాజమౌళితో కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ భేటీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి, ఆయన తండ్రి 'భజ్‌రంగి భాయిజాన్' చిత్ర రచయిత విజయేంద్రప్రసాద్‌లతో వారి నివాసంలో కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ అహిర్ నాయకత్వంలోని తెలంగాణ భాజపా రాష్ట్ర బృందం గురువారం భేటీ అయింది. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం నాలుగేళ్లుగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించి మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు.

పకడ్బందీగా టెలిమెట్రీ వ్యవస్థ

- **రెండో దశలో ఏపీలో 23 చోట్ల, తెలంగాణలో 6 టెలిమెట్రీలు**
- **కృష్ణా నదీ యాజమాన్యబోర్డు ప్రతిపాదన**
- **14 చోట్ల ఏర్పాటుకు ఉభయ రాష్ట్రాల అంగీకారం**

ఈనాడు - హైదరాబాద్

రిజర్వాయర్లలోకి వచ్చే ప్రవాహం, కాలువలకు విడుదల చేసే నీటి లెక్కల్లో అపోహలు లేకుండా ఉండేందుకు టెలిమెట్రీ వ్యవస్థను మరింత పకడ్బందీగా నిర్వహించాలని కృష్ణానదీ యాజమాన్యబోర్డు నిర్ణయించింది. మొదటి దశ టెలిమెట్రీల ఏర్పాటులో లోపాలు, అదనంగా చేపట్టాల్సిన చర్యలు, రెండవ దశ టెలిమెట్రీల ఏర్పాటు అంశాలపై బోర్డు గురువారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. బోర్డు ఛైర్మన్ సాహు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యకార్యదర్శి పరమేశం, కేంద్ర జలసంఘం హైదరాబాద్ రీజియన్ చీఫ్ ఇంజినీర్ రంగారెడ్డి, తెలంగాణ నుంచి చీఫ్ ఇంజినీర్లు సునీల్, ఖగేందర్, ఆంధ్రప్రదేశ్ నుంచి నారాయణరెడ్డి, సతీష్‌కుమార్, జబ్బార్‌లతోపాటు పుణెలోని కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ నిపుణులు పాల్గొన్నారు. నదీ ప్రాంతంలో కేంద్రజలసంఘం గేజింగ్ స్టేషన్లున్న చోట అదనంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని నిర్ణయించారు. తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో టెలిమెట్రీల ఏర్పాటుకు తీసుకొన్న చర్యలు, అవి పని చేస్తున్న విధానాన్ని గురించి గతంలో బోర్డు కార్యదర్శిగా పని చేసి, ప్రస్తుతం జలసంఘం చీఫ్ ఇంజినీర్‌గా, బోర్డు ఛైర్మన్‌గా ఉన్న రంగారెడ్డి వివరించారు. టెలిమెట్రీల నిర్వహణలో ఎదురయ్యే సమస్యల గురించి పుణెలోని పరిశోధన సంస్థ ఇంజినీర్లు వివరించారు. మొదటి దశలో ఏర్పాటు చేసిన టెలిమెట్రీల్లో కొన్ని పని చేయడం లేదని, కాలువ లోతు ఐదు మీటర్ల కంటే ఎక్కువ ఉన్న చోట అదనంగా మరో పరికరాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. మొదటి దశలో ఏర్పాటు చేసిన 18లో 13 తెలంగాణలో ఉండగా, మిగిలినవి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. రెండవ దశలో 29 ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన. ఇందులో 23 ఆంధ్రలో కాగా, మిగిలిన ఆరు తెలంగాణలో ఉన్నాయి. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ దిగువన టెలిమెట్రీ ఏర్పాటు చేశారు. దీనికి దిగవన బనకచెర్ల వద్ద మూడు కాలువలకు నీటిని పంపేలా రెగ్యులేటర్లున్నాయి. వీటి వద్ద ఏర్పాటు చేయాలని తెలంగాణ కోరగా, ఆంధ్రప్రదేశ్ అంగీకరించలేదని తెలిసింది. తెలంగాణ ఇంజినీర్లు పట్టుపట్టగా కొంత కాలం తర్వాత పరిశీలిద్దామని ఛైర్మన్ పేర్కొన్నట్లు సమాచారం. పులిచింతల, ప్రకాశం బ్యారేజి వద్ద ఏర్పాటు చేయడంపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. పట్టిసీమ నుంచి వచ్చే నీటిని మినహాయించి ప్రకాశం బ్యారేజి వద్ద నీటిని లెక్కగట్టడానికి తమకేమీ అభ్యంతరం లేదని ఆంధ్రప్రదేశ్ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తెలంగాణలో మధ్యతరహా ప్రాజెక్టుల వద్ద కూడా ఏర్పాటు చేయాలని ఏపీ కోరినట్లు సమాచారం. మొత్తమ్మీద రెండవదశలో 14 చోట్ల ఏర్పాటు చేయడానికి ఉభయరాష్ట్రాలు అంగీకరించినట్లు తెలిసింది. ఎత్తిపోతల పథకాల వద్ద పంపుల నుంచి నీటిని విడుదల చేస్తారు కాబట్టి మళ్లీ ప్రత్యేకంగా టెలిమెట్రీల అవసరం ఉందా అన్నదానిపై కూడా చర్చ జరిగింది.

తితిదే ప్రతిష్ఠను కాపాడుకోవాలి

రాయలసీమ అధ్యయనాల సమితి అధ్యక్షుడు భూమన్, సినీ నిర్మాత ఎన్‌వీ ప్రసాద్

తిరుపతి, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంపై రమణ దీక్షితులు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని తితిదే ప్రతిష్ఠను కాపాడుకోవడం ప్రజలు, శ్రీవారి భక్తులు బాధ్యతగా స్వీకరించాలని రాయలసీమ అధ్యయనాల సమితి అధ్యక్షుడు భూమన్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత ఎన్‌వీ ప్రసాద్ అన్నారు. తిరుపతిలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. రమణదీక్షితులు ఒక్కరే ప్రధాన అర్చకులు కాదని, ఆయనతో పాటు మరో ముగ్గురు ఉన్నారనే విషయాన్ని భక్తులు గుర్తించాలని ఎన్‌వీ ప్రసాద్ కోరారు. ఆయన నిరాహారదీక్షకు దిగితే రాజకీయాలకు అతీతంగా తిరుపతి వాసులు, భక్తులతో కలిసి తిరుపతి నుంచి పాదయాత్రగా తిరుమలకు చేరుకుని అక్కడ నిరసన, ఆయన ఆస్తుల వద్ద శాంతియుతంగా గోవిందనామాలతో నిరసన చేపడతామని హెచ్చరించారు. ఆలయంలోని పోటులో గుప్త నిధుల తవ్వకాలు, శ్రీవారిని 25 రోజుల పస్తు పెట్టడం, వజ్రం వేలం వేయడం వంటి ఆరోపణలు అవాస్తవమన్నారు. తితిదేలోని ఇంజినీర్లు, పోటు సిబ్బందికి తెలియకుండా ఎలా తవ్వకాలు చేస్తారని ప్రశ్నించారు. వెయ్యి కాళ్ల మండపం తొలగించినప్పుడు అక్కడ నిధులు లభ్యమయ్యాయనడం హాస్యాస్పదమని అన్నారు. వెయ్యికాళ్ల మండపం, ఆలయ పోటులో ఎక్కడా నేలమాలిగలు లేవనడానికి ప్రముఖులు రమేష్, కృష్ణమాచార్యులు రచించిన పుస్తకాలు నిదర్శనమని భూమన్ అన్నారు. స్వామి వారు 25 రోజులు పస్తులు ఉంటే అప్పుడు ఎందుకు మాట్లాడలేదో భక్తులకు సమాధానం చెప్పాలని రమణదీక్షితుల్ని కోరారు. ఆలయ పోటులో కడప బండలు ఉండడంతో స్వామి వారికి తయారు చేసే ప్రసాదాల ట్రేలను లాగే సమయంలో ఖాళీలు ఏర్పడతాయని, వాటికి మరమ్మతులు చేస్తారని వివరించారు. రమణదీక్షితులు నేతలను కలవడం వల్ల ఆయనకు న్యాయం కంటే.. కలిసిన నాయకులకే రాజకీయ ఇబ్బందులు తప్పవన్నారు.

న్యాయ వ్యవస్థపై ప్రత్యేక ముద్ర

- **నేడు జస్టిస్ చలమేశ్వర్ పదవీ విరమణ**
- **ఏడేళ్లలో ఎన్నో కీలక కేసుల విచారణ**

దిల్లీ: సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ శుక్రవారం పదవీ విరమణ చేయనున్నారు. సర్వోన్నత న్యాయస్థానంలో ఆయన దాదాపు ఏడేళ్లు సేవలందించారు. ప్రధాన న్యాయమూర్తి పనితీరుపై సహచర న్యాయమూర్తులతో కలిసి జనవరి 12న విలేకరుల సమావేశంలో ఆయన చేసిన విమర్శలు సంచలనం సృష్టించాయి. గోప్యత హక్కు ప్రాథమిక హక్కు అవుతుందని చరిత్రాత్మక తీర్పు ప్రకటించిన తొమ్మండుగురు న్యాయమూర్తుల్లో ఆయన ఒకరు. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని రద్దు చేసిన అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో ఆయన ఒకరు. కొలీజియం సిఫార్సులు అపారదర్శకంగా ఉంటున్నాయని తప్పుపట్టిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్.

కృష్ణా జిల్లా ముద్దుబిడ్డ: 1953 జూన్ 23న జన్మించిన జస్టిస్ చలమేశ్వర్ స్వస్థలం కృష్ణా జిల్లా మొవ్వ మండలంలోని పెదముత్తేవి. మచిలీపట్నంలో పాఠశాల విద్య, చెన్నైలో కళాశాల విద్య పూర్తయ్యాక 1976లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. 1995లో సీనియర్ న్యాయవాది అయ్యారు. ఏపీ, గువాహటి, కేరళ హైకోర్టులకు సేవలందించాక 2011 అక్టోబరు 10న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు.

కొలీజియంలో ఖాళీ కానున్న స్థానం

ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌కు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించే అంశంపై డోలాయమాన పరిస్థితి మరికొంత కాలం కొనసాగడం అనివార్యంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు కొలీజియం ఆయన పేరును సిఫార్సు చేయగా ప్రభుత్వం దానిని తిప్పి పంపడం, జస్టిస్ జోసెఫ్ పేరునే పునరుద్ఘాటించాలని కొలీజియం భావించడం తెలిసిందే. పదవీ విరమణ చేస్తున్న జస్టిస్ చలమేశ్వర్ స్థానంలో మరో న్యాయమూర్తి కొలీజియంలోకి రావాల్సి ఉంది. ప్రస్తుతం సీనియారిటీ జాబితాలో ఆరోస్థానంలో ఉన్న జస్టిస్ ఎ.కె.సిక్రి... అయిదుగురు సభ్యుల కొలీజియంలోకి రానున్నారు. అప్పుడు జస్టిస్ జోసెఫ్ పేరు పునరుద్ఘాటన అంశాన్ని కొత్తగా కొలీజియం పరిశీలించి, నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

శ్రీవారి ఆభరణాన్ని విదేశాలకు తరలించారని ఓ ఐపీఎస్ చెప్పారు

- **ఈ విషయం అప్పట్లో విపక్షంలో ఉన్న తెదేపాకూ తెలుసన్నారు**
- **వైకాపా, తెదేపాలు సీబీఐ విచారణకు డిమాండ్ చేయాలి**
- **ట్విట్టర్‌లో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు**

ఈనాడు అమరావతి: తిరుమల శ్రీవారికి చెందిన ఒక ఆభరణాన్ని కొన్ని సంవత్సరాల కిందట ప్రైవేటు విమానంలో ఒక మధ్యప్రాచ్య దేశానికి కొందరు తరలించినట్లుగా కొన్నేళ్ల క్రితం ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి తనకు చెప్పారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆ విషయం అప్పట్లో విపక్షంలో ఉన్న తెదేపా నాయకులకూ తెలుసని అధికారి తనతో చెప్పారని వెల్లడించారు. శ్రీవారి ఆభరణాలు అదృశ్యమయ్యాయంటూ రమణ దీక్షితులు చేస్తున్న ఆరోపణలపై పవన్‌కల్యాణ్ గురువారం ట్విట్టర్‌లో స్పందించారు. 'కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ విమానాశ్రయం లాంజ్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారితో ముచ్చటించా. శ్రీవారి ఆభరణం తరలిపోయిన విషయం ఆయన చెప్పారు. అందుకే రమణ దీక్షితులు చేస్తున్న ఆరోపణలు ఆశ్చర్యం కలిగించలేదు. ఆ భగవంతుడు నోరు మెదపడు కాబట్టి ఆస్తుల్ని ఎవరైనా దోచుకోవచ్చని దొంగలు అనుకుంటున్నట్టున్నారు' అని పవన్ వ్యాఖ్యానించారు. శ్రీవారి ఆభరణాలు, గులాబీ రంగు వజ్రం అదృశ్యమయ్యాయంటూ రమణ దీక్షితులు చేస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం ఇస్తున్న సమాధానాలు సంతృప్తికరంగా లేవన్నారు. భక్తులు విసిరిన నాణెం తగిలే గులాబీ రంగు వజ్రం ముక్కలైందా? ఆ తర్వాత అది ఎలా మాయమైంది? అన్న విషయం తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ నిపుణుల పర్యవేక్షణలో ఆ ఘటనను ఎందుకు పునఃసృష్టించకూడదని (సీన్ రీక్రియేషన్) ఆయన ప్రశ్నించారు. 'శ్రీవారి గులాబీ రంగు వజ్రం, విలువైన ఆభరణాలు అదృశ్యమైతే తెదేపా, వైకాపాలు ఎందుకంత ఉదాసీనంగా ఉంటున్నాయి? ఆ పార్టీలు సీబీఐ విచారణకు పట్టుబట్టేంతవరకూ నేను విడిచిపెట్టను. శ్రీవారి ఆభరణాలు దోచుకున్న వారు, వారికి సహకరించినవారు ఆ కలియుగ దైవం ఆగ్రహానికి గురవుతారు. నరకానికి పోతారు' అని ఆయన పేర్కొన్నారు. రమణ దీక్షితులు దీక్షకు తాను మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

ఉత్తరాంధ్రను పట్టించుకోకపోతే మరో వేర్పాటు ఉద్యమం

సీనియర్ రాజకీయ నాయకులు ఉత్తరాంధ్రను దోచుకోవడం ఆపాలని, కాలుష్య కారక పరిశ్రమలకు డంపింగ్ యార్డుగా మార్చడం ఆపేయాలని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఆ ప్రాంతాన్ని ఇంకా నిర్లక్ష్యం చేస్తే మరో ప్రత్యేక ఉద్యమానికి దారితీసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. 'రాజధానిలో ఇప్పటికే చాలా భూములు తీసుకున్నారు. ఇక భూసేకరణ ఆపండి. ఈ అంశంపై అమరావతిలో రైతుల్ని కలుస్తా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూ సంరక్షకురాలిగా ఉండాలే తప్ప భూ కబ్జాదారుగా మారకూడదు' అని పేర్కొన్నారు. ఒక రైతుతో తానున్న ఫొటోను ఆయన పోస్ట్ చేశారు. సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాటంలో ఆ రైతు పాదంలోకి బుల్లెట్ దూసుకుపోయిందని, తమ ప్రాథమిక హక్కుల కోసం పోరాడేందుకు ఆయన ఇప్పటికీ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నాయీ బ్రాహ్మణులకు తాను మద్దతిస్తున్నట్లు పేర్కొన్నారు.

AUTHORISED DEALERS- AP: Vijayawada: R.M. Hero, Ph: 2490701, 9100914968; Dasarath Hero, Ph: 7799766324; Machavaram, Ph: 9703218818; R.M.Motors (P) Ltd, Ph: 7799766343; **Gudivada:** Sri Lakshmi Hero, Ph: 7799766403; **Guntur:** Associated Hero, Ph: 7799766413; Gautham Hero, Ph: 7799766369; **Narasaraopeta:** Yerramsetty Hero, Ph: 7799766375; **Ongole:** Associated Hero, Ph: 7799766402; **Chirala:** Srinivasa Hero, Ph: 7799766423; **Nellore:** A.M Reddy Hero, Ph: 7799766418; Sarayu Hero: 8448389666; **Gudur:** Viswa Sai Hero, Ph: 7799766382; **Kavali:** Sree Devi Motors, Ph: 7799766359; **Tanuku:** V. Somasundara Rao Hero, Ph: 7799766363; **Bhimavaram:** Reddy and Reddy Hero, Ph: 7799766388; **Eluru:** Sai Swarna Hero, Ph: 7799766376; **Jangareddygudem:** Sai Satyan Hero, Ph: 8448994754; **Visakhapatnam:** Sree Siva Sankar Hero, Ph: 7799766367; Sri Harsha Hero, Ph: 7799766357; **Vizianagaram:** Varalakshmi Hero, Ph: 7799766353; **Anakapalli:** Lakshmi Srinivasa Hero, Ph: 7799766364; **Gajuwaka:** Siva Sankar Hero, Ph: 7799766344; **Srikakulam:** Varam Hero, Ph: 7799766414; **Rajahmundry:** Reddy Babu Hero, Ph: 7799766352; C.P Reddy Hero, Ph: 7799766389; **Kakinada:** Jayaram Hero, Ph: 7799766328; Jagadeeswari Hero, Ph: 7799766424; **Amalapuram:** Sri Jayaram Hero, Ph: 7799766406; **Anantapur:** C. Thippaiah Hero, Ph: 7799766395; Narasimha Hero, Ph: 7799766381; **Hindupur:** Sai Teja Motors, Ph: 7799766421; **Kurnool:** Shariff Hero, Ph: 7799766394; Sasya Hero, Ph: 7799766354; **Nandyal:** Sowjanya Hero, Ph: 7799766386; **Adoni:** Tarun Motors, Ph: 7799766349; **Tirupati:** Prudhvi Hero: 8448183643; Sri Gopal Hero, Ph: 7799766348; Sri Gopal Hero (Branch), Ph: 2261105; **Chitoor:** Sri Gopal Hero, Ph: 7799766399; **Cuddapah:** Sri Gopal Hero, Ph: 7799766411; **Proddutur:** Sri Gopal Hero, Ph: 7799766323.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

CA



ఈనాడు

విజయవాడ 23-6-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 314

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఎన్నికలన్నీ ఒకేసారి

- అంతా సిద్ధంగా ఉండండి
- అనంతపురం జిల్లా నేతల సమీక్షలో ముఖ్యమంత్రి

ఈనాడు అమరావతి: లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారి రానున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురం జిల్లాకు చెందిన తెదేపా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో ఆయన ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన భాజపా నాయకులు దేశంలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. హడావుడిగా పెద్ద నోట్లు రద్దు చేసి నగదు కొరత తెచ్చారని, బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీశారని చెప్పారు. జీఎస్టీని కూడా హడావుడిగా అమల్లోకి తేవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల దేశంలో తలెత్తిన సంక్షోభాల ప్రభావం రాష్ట్రంపై పడకుండా చూశామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు తెదేపాపై విష ప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. వైకాపా ఎంపీలు (మిగతా 2లో)

రాజధాని అమరావతి ప్రాంతంలో దశావతార వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గణపతి సచ్చిదానందస్వామి, చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, మంత్రి పుల్లారావు, దర్శకుడు రాఘవేంద్రరావు, ఆలయ నిర్వాహకుడు లింగమనేని రమేష్ తదితరులు.

రాజధానిలో అధునాతన దేవాలయం

- దశావతార వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ
- కార్యక్రమాల్లో పాల్గొన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్
- పరస్పర అభివాదం చేసుకున్న నేతలు
- 15 నిమిషాలు ఒకే గదిలో..

14లో

ఆవిష్కరణలతో రండి..

- అండగా ఉంటాం
- ఎన్ఆర్‌టీ ఐకాన్ టవర్ శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో

నాటి మీడియా సమావేశంపై పశ్చాత్తాపం లేదు

- లోపాన్ని లేవనెత్తావంటూ మాజీ న్యాయమూర్తులూ ప్రశంసించారు
- కేసుల కేటాయింపులో సమస్య ఉంది
- న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు అప్పుడప్పుడూ ప్రమాదం
- జస్టిస్ జోసెఫ్‌కు పదోన్నతి ఇవ్వకపోవడం సరికాదు
- ఆయన 'అసాధారణ' న్యాయమూర్తి
- జస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్యలు
- సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ

15లో

రోగి చెప్పేందే రోగం

ఆంధ్రప్రదేశ్ సహా మన దేశంలోని ప్రభుత్వాసుపత్రుల్లో రోగికి వైద్యులు సగటున కేటాయించే సమయం ఎంతో తెలుసా? కేవలం రెండంటే రెండే నిమిషాలు. ఈ సమయంలోనే రోగి చెప్పింది వినాలి. మందులు రాయాలి. చికిత్సకు సిఫార్సు చేయాలి. ప్రస్తుతం నెలకొన్న విపరీతమైన రద్దీతో అది ఇంకా తగ్గుతోంది. అదే అమెరికాలో రోగికి వైద్యుడు కేటాయించే సమయం సరాసరిన 2016లో 20 నిమిషాలుంటే 2017 నాటికి మరో 12 సెకన్లు పెరిగింది. బ్రిటన్‌లోనూ పెరుగుదల కనిపించింది. స్వీడన్‌లో ఏకంగా 22.5 నిమిషాల సమయాన్ని రోగికి వైద్యులు కేటాయిస్తున్నారు.

- దానికే మందుల చిట్టీ
- సమయంతో వైద్యుల సమరం
- ఆసుపత్రుల్లో ఒక్కో రోగికి కేటాయించేది 2 నిమిషాలే
- పెరగని వైద్య నియామకాలు
- పెరుగుతున్న రోగులు
- విదేశాల్లో వివరంగా విన్నాకే చికిత్స



ఈనాడు – అమరావతి,
ఈనాడు యంత్రాంగం

బోధనాసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు తగినంత సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. సోమవారం వంటి రోజుల్లో అధిక సంఖ్యలో ఉంటున్న రోగులను చూడాల్సి రావడం, శస్త్ర చికిత్సలు చేయాల్సిన సంఖ్య పెరిగిపోతుండటంతో వైద్యులు ఒత్తిడికి గురవుతున్నారు. పెరిగిన రోగుల రద్దీకి తగినట్లుగా వైద్యుల సంఖ్య పెరగకపోవడమూ ఇబ్బందిగా మారింది. జలుబు, దగ్గు, జ్వరానికీ బోధనాసుపత్రులకు రోగులు రావడంవల్లా అవి కిక్కిరిసిపోతున్నాయి. కనీసం నాడీ పట్టుకోవడమూ కొన్నిచోట్ల కరవైపోతోంది. రోగి చెప్పింది వినడం.. వెంటనే మందుల చీటి చేతుల్లో పెట్టడం చాలాచోట్ల కనిపిస్తోంది. రోగులు తక్కువగా వచ్చే రోజుల్లోనే ఎక్కువసేపు పరీక్షించేందుకు వైద్యులకు సమయం దొరుకుతోంది. ఇటువంటి సందర్భాలు చాలా పరిమితంగా ఉంటున్నాయి.

రిఫరల్ వ్యవస్థలో లోపాలు

బోధనాసుపత్రులకు రోగుల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం 'రిఫరల్' వ్యవస్థ సక్రమంగా లేకపోవడమేనని ఓ ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షణాధికారి 'ఈనాడు'తో పేర్కొన్నారు. హైదరాబాద్, ఇతర రాష్ట్రాల్లో వైద్య సేవలు పొందేందుకు వెళ్లేవారు క్రమేణా గుంటూరు, కర్నూలు జీజీహెచ్‌లకు మళ్లుతున్నారు. రోగులు వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు రావడం మంచిదే అయినా దానికి తగిన విధంగా వైద్యుల నియామకాలు, సౌకర్యాలు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. 'రోగికి కనీసం 10 నిమిషాలు కేటాయిస్తే తప్ప అనారోగ్య తీవ్రతపై స్పష్టత రాదు. 3 గంటల్లో 200 మందికి పైగా రోగులను చూడాల్సి వస్తోంది' అని అనంతపురం బోధనాసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అరాఫత్ (మిగతా 2లో)



డిగ్రీ కళాశాలల రుసుముల్లో ఇష్టారాజ్యం

- ఒక్కో వర్సిటీ పరిధిలో ఒక్కోవిధంగా పెంపు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- రాష్ట్రప్రభుత్వ ఖజానాపై భారం

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల రుసుముల నిర్ణయంలో విశ్వవిద్యాలయాలు పాటిస్తున్న విధానాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. వర్సిటీల మధ్య రుసుముల్లో ప్రస్తుతం భారీ వ్యత్యాసం నెలకొంటోంది. ఉన్నతవిద్యలో ప్రభుత్వమే బోధన రుసుములు చెల్లిస్తున్నందున ఫీజుల పెంపును అటు వర్సిటీలుగాని, ఇటు ఉన్నతాధికారులుగాని పట్టించుకోవడం లేదు. డిగ్రీలో దాదాపు 80శాతం వరకు రుసుమును ప్రభుత్వమే చెల్లిస్తోంది. దీంతో విద్యార్థులపై పెద్దగా భారంపడదని ప్రైవేటు యాజమాన్యాలు, వర్సిటీలు భావిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. వృత్తివిద్యా కోర్సుల రుసుముల నిర్ణయానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక వ్యవస్థ ఉండగా.. డిగ్రీ, పీజీ కళాశాలలకు వచ్చేసరికి విశ్వవిద్యాలయాల ఆమోదమే తుదినిర్ణయం. కళాశాలల్లోని మౌలికవసతులను పట్టించుకోకుండానే రుసుములు నిర్ణయించేస్తున్నారు. ఇటీవల ఉన్నత విద్యామండలి డిగ్రీ కళాశాలలపై నియమించిన కమిటీ తనిఖీల్లో అనేక వాస్తవాలు వెలుగుచూశాయి. చాలా కళాశాలల్లో అర్హులైన అధ్యాపకులు లేకపోగా.. కొన్నింటిని ఇరుకుగదుల్లో కొనసాగిస్తున్నారు. ఇలాంటిచోట విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని పరిస్థితి నెలకొన్నా.. వాటికీ వేలాది రూపాయాలను (మిగతా 2లో)

పువ్వులాంటోడ్ని కోస్తానంటారా?

- కుమారుడి పోస్టుమార్టంకు అంగీకరించని తండ్రి
- ఆసుపత్రి సిబ్బంది, పోలీసులపై దాడికి దిగిన వైనం
- కాకినాడ జీజీహెచ్‌లో ఘటన

5లో

'ఆధార్' వివరాలు ఇవ్వడానికి చట్టం అనుమతించదు!

దిల్లీ: 'ఆధార్' బయోమెట్రిక్ సమాచారాన్ని నేరాల దర్యాప్తులో వాడుకోవడానికి ఆధార్ చట్టం అనుమతించదని 'భారత విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రాధికార సంస్థ' (ఉడాయ్)శుక్రవారం స్పష్టం చేసింది. నేరాలను ఛేదించే క్రమంలో పరిమితంగా ఆధార్ డేటాను తెలుసునేందుకు అనుమతించాలన్న 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' అభ్యర్థన నేపథ్యంలో ఇలా స్పందించింది. ఏ నేర దర్యాప్తు సంస్థకు కూడా ఈ వివరాలను అందచేసే ప్రసక్తే లేదని కూడా తెలిపింది.

S.I / కానిస్టేబుల్స్ RPF, గ్రూప్ IV, VRO
అర్థమేటిక్, రీజనింగ్, జనరల్ స్టడీస్‌తో బ్యాచ్ ప్రారంభం
Fee: 5000/- 25-06-18
SICE శివాజి ఇన్‌స్టిట్యూట్, గుంటూరు 93463 64702

కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-ALL
8106268482, 9885272474

AP-DSC
RAMAIAH COMPETITIVE COACHING CENTRE
FREE DEMO: 24-6-2018 at 10.08 am
HYDERABAD

GROUP-II
Group-II Free Demo 24-6-18 @ 10am
DREAMS IAS STUDY CIRCLE
Benzcircle, VIJAYAWADA
Ph:7799155559, 0866-6645559

DSC SGT, SA (ALL) TPT, HPT
ప్రతిభ బందరురోడ్
93 92 91 75 84

SI కానిస్టేబుల్స్ RPF RRB
బ్రహ్మాస్ 8019013199 9032686069

PAVAN KUMAR'S IAS
Group I & II (తెలుగు మీడియం)
జూన్ 27 నుండి ప్రారంభం
VIJAYAWADA Ph: 9966961027

వాల్మీకి DSC
L.P. & SA (తెలుగు)
Free DEMO
Cell: 62812 29244, 63033 41854

DSC SA (Phy.Sci./Bio/Maths/Social) TPT PET SGT
బాసర ఇన్‌స్టిట్యూట్
9030140123 8374022333

DSC SGT TPT Eng. Sch. Asst. (All)
బ్యాచ్ ప్రారంభం: నేడే
బ్రహ్మాస్ 8019013199 9032686069

GROUP-I EM&TM
రాష్ట్రంలో అద్భుతమైన ఫ్యాకల్టీ కలయికతో
ఉచిత డెమో: 24-06-2018 @ 10 AM
Krishna Pradeep's 21st Century IAS
Ph: 8686233879, 040 - 66787733

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
50/50 విద్యార్థులకు UPSC /కేంద్ర /రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ Assistance.
Degree + IAS (50 students) 3yrs Integrated Program
After Degree - Morning Batch (1 year)
During Degree - Evening Batch(2 years)
ఇంటిని మరిపించే Hostel facility
Civil Services IAS Exam పై ఉచిత అవగాహనా సదస్సు on June 24th SUN. 10 am & 5 pm
IAS Coaching సొంత పుస్తకాలు గల ఏకైక సంస్థ
విద్యార్థులు / తల్లిదండ్రులు అందరూ ఆహ్వానితులే
Beside Nagarjuna Hospital,Kanuru, VIJAYAWADA. Ph: 6300181832

అమరావతి రాయపూడి సమీపంలో ఎన్ఆర్‌టీ టవర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నారాయణ, కొల్లు రవీంద్ర తదితరులు

ఆవిష్కరణలతో రండి..

- ఎన్ఆర్‌టీ ఐకాన్ టవర్ శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి

ఈనాడు డిజిటల్, అమరావతి: సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చిన ప్రవాసాంధ్రులకు ప్రభుత్వపరంగా అవసరమైన సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. వినూత్నమైన ఆలోచనలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ప్రవాసులకు పిలుపునిచ్చారు. ఐటీ రంగం ఆవిష్కరణలకు తలమానికంగా ఉన్న సిలికాన్ వ్యాలీ తరహాలోనే.. ఆవిష్కరణలకు కేంద్రంగా (ఇన్నోవేషన్ వ్యాలీ) అమరావతి మారాలని ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలైన ప్రవాసులు రాష్ట్రానికి వచ్చి జన్మభూమి రుణం తీర్చుకోవాలని కోరారు. రాయపూడి వద్ద ఏపీ ఎన్ఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన ఈ ఐకాన్ భవనానికి శుక్రవారం ముఖ్యమంత్రి భూమి పూజ చేసి సభలో మాట్లాడారు. "తెలుగు వారు ప్రపంచంలో ఎక్కడున్నా ఆ దేశ భవిష్యత్తు, అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా ఉన్నారు. అక్కడి రాజకీయాల్లోనూ వారి ముద్ర ఉండాలి. దేశంలో ఎంతో మంది విదేశాలకు వెళ్తున్నా వారే పారిశ్రామికవేత్తలుగా మారుతున్నారు. ఇది శుభ పరిణామం. సిలికాన్ వ్యాలీలో తలసరి ఆదాయం ఎక్కువగా వారి నుంచే రావడం గర్వకారణం. దేశంలోని ఐటీ నిపుణుల్లో నలుగురిలో ఒకరు ఉన్నారు. నాలెడ్జి ఎకానమీగా రాష్ట్రం తయారు కావాలని గత నాలుగేళ్లల్లో చదువుకు ఎంతో ప్రాధాన్యమిచ్చాం. పదోతరగతి పరీక్షలు మొదలుకొని జేఈఈ, నీట్ వంటి జాతీయ పరీక్షల్లోనూ సత్తా చాటుతున్నారు. సాంకేతికతను వినియోగించి రాష్ట్రంలోనూ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. భూధార్ పరిజ్ఞానాన్ని అక్టోబరులోపు తీసుకొస్తాం. సంక్షేమపథకాలతో పాటు ఇంటింటి చెత్త సేకరణలోనూ సాంకేతికతను ప్రవేశపెట్టాం. గోబర్ధన్ గ్రామాల్లో పేడ సేకరణ) త్వరలో అమలు చేస్తాం. చెత్త నుంచి కూడా సంపద సృష్టించే విధానానికి శ్రీకారం చుట్టాం...." అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

ఎన్నికలన్నీ ఒకేసారి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు రాకుండా చూసుకుని రాజీనామాలు చేశారని, కేసుల మాఫీ కోసమే భాజపాతో ఆ పార్టీ అంటకాగుతోందని పేర్కొన్నారు. భాజపా, వైకాపా, జనసేనల కుట్ర రాజకీయాలను ఎండగట్టాలని చెప్పారు. "మనపై ప్రతి రోజూ పది రకాల విమర్శలు చేస్తున్నారు. వాటన్నింటినీ సమర్థంగా తిప్పికొట్టాలి. రాజశేఖర్‌రెడ్డి రూ. 200 పింఛను ఇచ్చి 200 సార్లు చెప్పేవారు. ఇప్పుడు నెలకు రూ.1000 చొప్పున పింఛను ఇస్తున్నాం. దాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి..." అని సూచించారు. ఏ రోజున ఎంత మంది నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉంటున్నారో తనకు ఎప్పటికప్పుడు ఆర్టీజీ, ఇతర మార్గాల్లో సమాచారం వస్తుందని తెలిపారు.

విభేదాలు వీడండి..!

అనంతపురం జిల్లా మొదటి నుంచీ తెదేపాకి కంచుకోట వంటిదని, నాయకుల మధ్య విభేదాలు ఉంటే పక్కన పెట్టి వచ్చే ఎన్నికల్లో మొత్తం అన్ని స్థానాలు పార్టీ గెలిచేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికల సంవత్సరంలో నాయకులు విభేదాలతో రచ్చకెక్కడం మంచిది కాదని, అందరూ ఐక్యంగా పనిచేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరితో ఆయన వ్యక్తిగతంగా మాట్లాడారు. మంత్రి పరిటాల సునీతతో మాట్లాడేటప్పుడు... వరదాపురం సూరి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావులను లోపలికి పిలిచి మాట్లాడారు. గొడవలు పడటం మానేసి, కలసి పని చేయాలని సునీత, సూరిలకు ఆయన గట్టిగా చెప్పారు. సూరి బయటకు వెళ్లాక... మంత్రి కాలవ శ్రీనివాసులు, ఎంపీ నిమ్మల కిష్టప్ప, శాసనమండలిలో ప్రభుత్వ విప్ పయ్యావుల కేశవ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పార్థసారథిని లోపలికి పిలిచారు. జిల్లాలో పార్టీ నాయకుల మధ్య విభేదాల గురించే వారితోను ప్రస్తావించారు. ఈ సమావేశానికి అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి హాజరవలేదు. కడపలో ఉక్కు కర్మాగారం కోసం సీఎం రమేష్ చేస్తున్న నిరాహారదీక్షపై జేసీ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అలాంటి వ్యాఖ్యల వల్లే సమస్యలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

అనంతపురం జిల్లాకు చెందిన నేతలతో అమరావతిలో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు

డిగ్రీ కళాశాలల రుసుముల్లో ఇష్టారాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాల్సి వస్తోంది.

ఇదేం పెంపు..!

డిగ్రీ కళాశాలల రుసుములను ఏటా 10 శాతం పెంపు చేసేందుకు వర్సిటీలకు అవకాశం ఉంది. దీంతో కొన్ని విశ్వవిద్యాలయాలు ఏటా పెంచుకుంటూ వెళ్తుండగా.. మరికొన్ని రెండు, మూడేళ్లకు ఒకసారి పెంచుతుండటంతో రుసుముల్లో భారీ వ్యత్యాసం నెలకొంటోంది. గతంలో అన్ని కళాశాలల రుసుములను సమానం చేసేందుకు ఉన్నత విద్యామండలి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో రుసుములను పెంపు చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. ఈ కమిటీ అన్నివర్సిటీలను పరిశీలించిన అనంతరం అతి తక్కువ, అత్యధికంగా ఉన్న రుసుములను మధ్యస్తంగా ఒక సంఖ్యకు తీసుకురావాలని సూచించింది. ఎక్కువరుసుములు ఉన్న చోట వాటిని తగ్గించలేక, తక్కువ ఉన్నచోట పెంపు చేస్తే ప్రభుత్వంపై భారం పడుతుందనే ఉద్దేశంతో ఉన్నతవిద్యామండలి దీన్ని మూలకుపడేసింది.

వ్యత్యాసమిదీ..!

ఆంధ్ర వర్సిటీలో బీఏకు రూ.9 వేలు ఉంటే, నాగార్జునలో రూ.8,730, యోగివేమనలో 9,630, విక్రమసింహపురిలో రూ.10,330, శ్రీవేంకటేశ్వరలో దాదాపు రూ.15 వేలుగా ఉంది. గుంటూరులో పేరుగాంచిన కళాశాల బీఏ కోర్సుకు తీసుకుంటున్న రుసుముల కంటే నెల్లూరు, చిత్తూరులోని సాధారణ కళాశాల్లో ఫీజులు అధికంగా ఉంటున్నాయి. బీఎస్సీలో ఆంధ్ర వర్సిటీ పరిధిలో రూ.13వేలు, నాగార్జునలో రూ.13,150, యోగివేమనలో రూ.14,030, విక్రమసింహపురిలో రూ.13,370 ఉండగా శ్రీవేంకటేశ్వర వర్సిటీలో రూ.19వేలుకు పైగా ఉంది. రాష్ట్రంలోని ముఖ్యమైన వర్సిటీలైన ఆంధ్ర, నాగార్జున కంటే కొన్నికోర్సుల్లో ఇతర విశ్వవిద్యాలయాల్లో ఎక్కువ మొత్తంలో రుసుములు వసూలు చేస్తున్నారు. ఇలా దాదాపు అన్నికోర్సుల్లోనూ వ్యత్యాసం నెలకొంది.

వర్సిటీ	డిగ్రీ రుసుములు
విక్రమ సింహపురి	రూ. 10,330-13,370
కృష్ణా	రూ. 7,600-11,430
యోగివేమన	రూ. 9,630-14,030
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్	రూ. 7,724-10,943
శ్రీకృష్ణదేవరాయ	రూ. 6,640-7,750
ఆచార్యనాగార్జున	రూ. 8,730-13,150
శ్రీవేంకటేశ్వర	రూ. 15,381-19,858
ఆంధ్రా	రూ. 9,000-13,000
ఆదికవినన్నయ్య	రూ. 9,000-12,300
రాయలసీమ	రూ. 8,470-11,000

యుద్ధప్రాతిపదికన మెగా సీడ్ పార్కు పనులు

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయనున్న మెగా సీడ్ పార్కు పనులను వేగవంతం చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లో అందజేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మెగా సీడ్ పార్కుకు తక్షణమే ముఖ్యకార్యనిర్వహణాధికారి, సాంకేతిక, ఆపరేషన్స్ తదితర విభాగాలకు సంచాలకులను నియమించాలని చెప్పారు. ప్రపంచస్థాయి విత్తన పరిశోధన ప్రయోగశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడ ఉత్పత్తయ్యే విత్తనాలు విదేశాలకు ఎగుమతయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ఈ పార్కు పనులపై శుక్రవారం ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌హాల్‌లో సమీక్షించారు. పరిపాలన భవనాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, పరిశోధనశాలల పనులు ప్రారంభించాలని, నీటి సౌకర్యం, విద్యుత్తు, అంతర్గత రహదారుల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రోత్సాహకాలకు సంబంధించి ప్రత్యేక ఒక విధానాన్ని రూపొందించాల్సి ఉందని అధికారులు చెప్పగా... రూపొందించి తీసుకువస్తే వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఆమోదిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా ఐయోవా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలను చంద్రబాబు సత్కరించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి బి.రాజశేఖర్, సీఎంవో ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్, కార్యదర్శి రాజమౌళి, అమెరికాకు చెందిన ఐయోవా విశ్వవిద్యాలయ గ్లోబల్ ప్రోగ్రాం లీడర్ డాక్టర్ దిలీప్ కుమార్, గ్యారీ బిలిప్స్, కె.ఎస్. వరప్రసాద్, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థకు చెందిన డాక్టర్ అరవిందకుమార్, రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

విశాఖ, ముంబయిలో 24 పరిశోధన కేంద్రాలు

ఈనాడు, దిల్లీ: సముద్ర, నౌకా నిర్మాణ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి నిమిత్తం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్, షిప్ బిల్డింగ్ (సీఈఎంఎస్) ఆసియా పసిఫిక్ ప్రాంతంలో తొలిసారిగా 24 పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ముంబయిలో శుక్రవారం ఆ సంస్థ ఛైర్మన్ అరుణ్ శర్మ తెలిపారు. విశాఖపట్నంలో 18, ముంబయిలో 6 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రొడక్ట్ డిజైన్, వాలిడేషన్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, హల్ డిజైన్, ఆటోమేషన్, వెల్డింగ్ టెక్నాలజీ, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, అడ్వాన్స్ మిషిన్ మరియు రోబోటిక్స్, ఎలక్ట్రికల్ తదితర కోర్సులు ఉంటాయని వివరించారు. ఈ కోర్సుల ద్వారా సముద్ర, నౌకానిర్మాణ రంగాల్లో యోగ్యత పెంచడానికి ఈ పరిశోధనశాలలు ఉపకరిస్తాయని అరుణ్ శర్మ పేర్కొన్నారు.

పార్టీ మారాల్సిన అవసరం లేదు

మంత్రి గంటా

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ జిల్లాలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలి నియోజకవర్గం నుంచే మళ్లీ పోటీ చేస్తానని, ఈసారి 50 వేల ఓట్ల ఆధిక్యంతో గెలవడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రాత్రి విశాఖలో విలేకరులతో మాట్లాడుతూ తాను గతంలో భీమిలి నుంచి 39వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించానని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లోనూ భీమిలి నుంచి తెదేపా తరఫునే పోటీ చేస్తాననితేల్చిచెప్పారు. తాను పార్టీ మారతానని జరుగుతున్న ప్రచారంలోనూ వాస్తవం లేదన్నారు. పార్టీని వదిలి వెళ్లాల్సిన అవసరం తనకేముందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తనను ఎంతగానో ఆదరించారని పేర్కొన్నారు. అయితే ఇటీవలి కొన్ని పరిణామాలు తనను బాధించాయని తెలిపారు. ఏం జరిగింది? ఎక్కడ బాధపడాల్సి వచ్చిందన్న వివరాలు త్వరలో చెబుతానని అన్నారు.

రోగి చెప్పిందే రోగం!

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. బోధనాసుపత్రుల్లో నిష్ణాతులైన వైద్యులు ఉంటారన్న ఆశతో ఇక్కడికి వస్తున్నామని విజయవాడ బోధనాసుపత్రిలో కృష్ణా జిల్లా మైలవరం సమీప గ్రామానికి చెందిన వెంకటస్వామి పేర్కొన్నారు.

- గుంటూరు జీజీహెచ్, విజయవాడ, కాకినాడ, వైజాగ్ కేజీహెచ్, రాజమండ్రి జిల్లా ఆసుపత్రుల్లో ఓపీకి వచ్చిన రోగులను 60 సెకన్ల నుంచి 2 నిమిషాలే వైద్యులు చూడగలుగుతున్నారు.
- విశాఖ కేజీహెచ్‌లో గత సోమవారం ఓపీ ద్వారా వైద్య సేవలు పొందేందుకు 4వేల మంది రోగులు వచ్చారు. వీరిలో ఎముకలు, ప్రసూతి, సర్జరీ, కార్డియాలజీ, న్యూరో సర్జరీ, పిల్లలు తదితర విభాగాలకు సగటున 400 నుంచి 450 వరకూ వచ్చారు. చర్మ వ్యాధులు, యూరాలజీ, ఆప్తమాలజీ వంటి విభాగాలకు తక్కువ సంఖ్యలో రోగులు వచ్చారు. వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అందుబాటులో ఉన్నారు. మొత్తం 4 గంటల సేపు రోగులను పరీక్షించారు. రోగుల సంఖ్య తక్కువగా ఉన్న ఓపీ విభాగాల్లో మధ్యాహ్నం 12 గంటలకే ముగించుకుని వార్డు పనులకు వెళ్లారు.
- గుంటూరు సర్వజనాసుపత్రిలో ఓపీ కింద సరాసరిన 3వేల మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. సోమవారంనాడు ఈ సంఖ్య పెరుగుతోంది. ఒక్కో రోగికి 60 సెకండ్ల నుంచి నిమిషం సమయాన్నే వైద్యులు కేటాయిస్తున్నారు. ఇక్కడ 20ఏళ్ల కిందట ఎన్ని పోస్టులున్నాయో, ఇప్పుడూ అన్నే ఉన్నాయి. అందులో కొన్ని ఖాళీలున్నాయి.
- విజయవాడ ప్రభుత్వాసుపత్రిలోని మెడికల్ విభాగంలో ముగ్గురు పీజీలు, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉండగా 378 మంది రోగులు గత సోమవారం వచ్చారు. వీరందరికీ వీరే 3 నుంచి 4 గంటల వ్యవధిలో వైద్య సేవలందించారు. అన్ని రకాల విభాగాల్లో కలిపి సోమవారం 1800 మంది ఓపీ ద్వారా వైద్య సేవలు పొందారు. వీరిలో 700 మంది పాత రోగులున్నారు. వైద్యులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలూ కొన్ని చోట్ల ఉన్నాయి. కృష్ణా జిల్లాలోని పెనుగంచిప్రోలు మండలం నుంచి వచ్చిన ఓ మహిళ తీవ్ర తల, చెవు నొప్పి గురించి వైద్యులకు వివరాలు చెప్పేలోగానే మందులు రాసిచ్చిన చీటిని ఆమె చేతిలో పెట్టి పంపించేశారు.
- అనంతపురం ఆసుపత్రిలో సోమవారం సర్జరీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, సైకియాట్రీ విభాగాల్లో మాత్రమే ప్రొఫెసర్లు ఓపీలో కనిపించారు. అసోసియేట్ ప్రొఫెసర్లు ఏ విభాగంలోనూ కనిపించలేదు. ప్రతి ఓపీలోనూ ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇద్దరు హౌస్‌సర్జన్లు ఉన్నారు. ఇక్కడ ఎక్కువ హౌస్ సర్జన్లతోనే వైద్య సేవలు అందుతున్నాయి. 2,214 మంది ఓపీలో వైద్య సేవలు పొందారు.
- కర్నూలు సర్వజన ఆసుపత్రిలో వైద్యుల కొరత రోగులపై ప్రభావం చూపిస్తోంది. న్యూరాలజీ, గైనకాలజీ, నెఫ్రాలజీ, జనరల్ ఫిజీషియన్ వంటి విభాగాల్లో రోజుకు 150 నుంచి 200 వరకూ ఓపీకి వస్తున్నారు. ఇంతమందిని చూడాలంటే తగిన సమయం ఉండటం లేదని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన భాషిమియా మాట్లాడుతూ '10 సంవత్సరాలుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. ఆసుపత్రిలో వైద్యులు చూస్తున్నారు. ఇంకా తగ్గడం లేదు. నా బాధను పూర్తిగా చెప్పేందుకు సమయం సరిపోవడం లేదు' అని పేర్కొన్నారు.
- కాకినాడ ఆసుపత్రిలో 20 విభాగాలున్నాయి. 200 మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. వీరిలో ఓపీ సేవలకు అందుబాటులో ఉండేవారు 70 నుంచి 100 మంది. గత సోమవారం సగటున 93 మంది రోగులను ఓ వైద్యుడు పరీక్షించాల్సి వచ్చింది.
- రాజమహేంద్రవరం వైద్య విధాన పరిషత్తు జిల్లా ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగానికి రోజుకు 250 మంది, ఆర్థో విభాగానికి 200 లోపు రోగులు వస్తున్నారు. ఇక్కడ స్పెషలిస్ట్ వైద్యులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ల కొరత వేధిస్తోంది.

బోధనాసుపత్రులకు రోగుల రాక పెరుగుదల

2016-17లో ఔట్ పేషంట్లు	60,41,438
2017-18లో ఔట్ పేషంట్లు	88,73,543
2016-17లో ఇన్‌పేషంట్లు	7,70,912
2017-18లో ఇన్‌పేషంట్లు	8,06,523
2016-17లో శస్త్ర చికిత్సలు	4,34,563
2017-18లో శస్త్ర చికిత్సలు	4,73,609

వైద్య, ఆరోగ్యశాఖ పీపీపీ విధానంలో తల్లీ బిడ్డ, ఉచిత రక్త పరీక్షలవంటి పథకాలను భారీగా చేపట్టిన నేపథ్యంలో ఆసుపత్రులకు 30% వరకూ రోగుల రద్దీ పెరిగింది. దీని ప్రభావం జిల్లా కేంద్రాల్లో ఉండే బోధనాసుపత్రులపై కనిపిస్తోంది.

కారణాలివీ..

- ప్రాథమిక, సామాజిక, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు పొందేందుకు ప్రజలు ఆసక్తి కనబరచడం లేదు. జలుబు, దగ్గు, జ్వరంలాంటి సమస్యలకూ నేరుగా బోధనాసుపత్రులకు వచ్చేస్తున్నారు.
- నగరాలు, పట్టణాల్లో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలున్నా వాటిలో ఉచిత రక్త పరీక్షలు చేయించుకునేందుకు అవకాశమున్నా, ఎంబీబీఎస్ వైద్యుడి ద్వారా వైద్య సేవలు పొందే వీలున్నా, టెలీ మెడిసిన్ ద్వారా సేవలు పొందేందుకు అవకాశమున్నా రోగులు పట్టించుకోవడం లేదు. సూపర్ స్పెషాలిటీ వైద్యుల కోసమే పరుగులు తీస్తున్నారు.

వస్త్రాల బడ్జెట్ చేనేత శాఖకు కేటాయించాలి

- సంక్షేమశాఖ నుంచి రూ.124 కోట్లు బకాయిలు చెల్లించాలి
- ఆప్కో పాలకమండలి సమావేశంలో తీర్మానం

ఈనాడు అమరావతి: సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు సరఫరా చేసే వస్త్రాలకు సంబంధించిన బడ్జెట్‌ను నేరుగా చేనేత శాఖకే కేటాయించాలని ఆప్కో పాలకమండలి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. సంక్షేమ శాఖల నుంచి గతేడాదికి సంబంధించిన రూ.124కోట్ల బకాయిలు రాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని..ఇలాంటివి పునరావృతం కాకుండా నేరుగా అందజేయాలని అభిప్రాయపడింది. శుక్రవారం విజయవాడలో జరిగిన ఆప్కో పాలకమండలి సమావేశం ఈ మేరకు తీర్మానించింది. ఆప్కో ఛైర్మన్ జి.శ్రీనివాసులు, చేనేత జౌళిశాఖ కమిషనర్ శ్రీనివాస శ్రీనరేష్, పాలకమండలి సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి ఆర్డర్లు కూడా సకాలంలో రాకపోవడంపై సమావేశంలో చర్చించారు. చేనేత వస్త్రాలపై అవగాహన ఉన్న వెంకటగిరి(నెల్లూరు జిల్లాలో)కి చెందిన 30మందిని పొరుగుసేవల కింద తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆప్కో షోరూంలలో నియమించాలని తీర్మానించారు. మరోవైపు పాలకమండలి పదవీకాలాన్ని ఆర్నెళ్లపాటు పొడిగించారు కనుక, పాత పాలకమండలిలో డైరెక్టర్‌గా సమావేశంలో పాల్గొంటానంటూ చిత్తూరు జిల్లాకు చెందిన మిద్దెల హరి వచ్చారు. అయితే శ్రీకాళహస్తి సొసైటీ ఛైర్మన్‌గా పదవీకాలం ఏడాదిన్నర కిందటే ముగిసినందున ఇప్పుడు ఆప్కో పాలకమండలిలో సభ్యత్వం లేదని.. ఏదిఏమైనా పాలకమండలిలో అధికారికంగా సభ్యత్వాన్నివ్వాల్సింది మేం కాదు అంటూ పాలకమండలి సభ్యులు ఆయన్ను వారించారు.

కోస్తాపై 'నైరుతి' ప్రభావం

ఈనాడు, విశాఖపట్నం: కోస్తాకు మళ్లీ తీపి కబురు. ఇన్నాళ్లూ బలహీనంగా ఉన్న రుతుపవనాలు ఇప్పుడు కోస్తా జిల్లాల్లో బలపడి సాధారణ స్థితికి వచ్చినట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఎండల తీవ్రత తగ్గి వర్షాలు పడుతున్నాయని ఆ శాఖ అధికారులు వివరించారు. ఇవి రాయలసీమలో మాత్రం ఇంకా బలపడలేదు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈనెల 26వ తేదీనుంచి కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలుంటాయని వారు తెలిపారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆ తర్వాత మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉండే అవకాశం ఉంది.

గ్రహం అనుగ్రహం

23-6-2018 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
దశమి: ఉ. 6-03 తదుపరి ఏకాదశి
స్వాతి నక్షత్రం: పూర్తి
అమృత ఘడియలు: రా. 8-44 నుంచి 10-21 వరకు
వర్జ్యం: ఉ. 11-02 నుంచి 12-39 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-30 నుంచి 7-14 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5-30; సూర్యాస్తమయం: సా.6-33

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
మెదక్	40.1	22.9
సూర్యాపేట	40.0	27.0
నెల్లూరు	39.0	29.0
కడప	38.0	27.0
ఒంగోలు	37.6	29.6
తిరుపతి	37.6	27.6
తాడేపల్లిగూడెం	37.5	27.0
ఖమ్మం	37.0	31.0
నిజామాబాద్	36.9	26.4
గుంటూరు	35.6	25.8
విజయవాడ	35.5	28.0
హైదరాబాద్	34.3	25.7
శ్రీకాకుళం	34.0	28.0
రాజమహేంద్రవరం	34.0	27.0
కర్నూలు	33.6	25.7
విశాఖపట్నం	33.0	26.8
నరసాపురం	32.8	29.4
అనంతపురం	32.1	27.1

ఇదీ సంగతి!



తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్.
సాంకేతిక విద్యా శాఖ
TSICET - 2018
ప్రవేశ ప్రకటన
వెబ్ బేస్డ్ కౌన్సిలింగ్ కొరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ పరిశీలన మరియు ఆప్షన్ ఎక్సర్‌సైజ్.
ఎంబిఎ మరియు ఎంసిఎ కోర్సులలో ప్రవేశం పొందగోరుతున్న, TSICET - 2018లో అర్హులైన అభ్యర్థులకు తెలియజేయునది ఏమనగా అడ్మిషన్ కౌన్సిలింగ్ ప్రక్రియ 30-6-2018న ప్రారంభమవుతుంది. TSICET - 2018లో అర్హులుకాక లేదా హాజరుకాక, క్వాలిఫైయింగ్ పరీక్షలో ఉత్తీర్ణులై, అవసరమైన మార్కుల శాతాన్ని పొందిన మైనారిటీ అభ్యర్థులు కూడా మైనారిటీ కాలేజీలలో మిగిలిపోయిన ఖాళీలందు ప్రవేశానికి పరిశీలించబడే నిమిత్తం కౌన్సిలింగ్‌కు హాజరు కావచ్చును. తదుపరి వివరాలు మరియు కౌన్సిలింగ్ షెడ్యూలును 30-6-2018న వెబ్‌సైట్: https://tsicet.nic.in నందు చూడవచ్చును.
తేది: 22-6-2018 సం/-
ప్రదేశం: హైదరాబాద్ నవీన్ మిట్టల్, ఐఎఎస్
DIPR No. 890DP/CL/ADVT/1/2018-19. కన్వీనర్, TSICET-2018 & CTE

Get it NOW | 0 Down Payment
Low Cost 18 months EMI

Available on leading Credit Cards and Consumer Loans.

iPhone X

₹5,599
Effective Monthly Cost*

iPhone 8 Plus

₹4,599
Effective Monthly Cost*

iPhone 8

₹3,999
Effective Monthly Cost*

iPhone 7 Plus

₹3,599
Effective Monthly Cost*

iPhone 7

₹2,999
Effective Monthly Cost*

Effective Monthly Cost* will be calculated basis the best available price at the store.
For more details, log on to www.indiaistore.com

Also get additional 5% cashback on Credit Cards of the following Banks#:

AXIS BANK | citi Credit Cards | HDFC BANK We understand your world | ICICI Bank Credit Cards | Standard Chartered

0 Down Payment and Low Cost EMI is available on the following credit cards: American Express | Axis Bank | Bank of Baroda | Citi | HDFC Bank | HSBC Bank | ICICI Bank | IndusInd Bank | J&K Bank | Kotak Mahindra Bank | RBL Bank | Standard Chartered Bank | SBI Card | Union Bank of India | YES Bank

Also available on HDFC Bank Debit Cards and Consumer Loans from Capital First, HDB Financial Services and HDFC Bank.

For nearest store details, SMS: Store <space> Pincode to 7600030000 or log on to www.indiaistore.com

*Terms and conditions apply. Effective Monthly Cost for the customer is computed basis the Low Cost EMI on 18 month tenure. The Effective Monthly Cost mentioned above is calculated on the MRP of ₹95,390 for iPhone X 64GB, MRP of ₹77,560 for iPhone 8 Plus 64GB, MRP of ₹67,940 for iPhone 8 64GB, MRP of ₹62,840 for iPhone 7 Plus 32GB and MRP of ₹52,370 for iPhone 7 32GB. GST will be applicable on interest component of the EMI and will be over and above the Effective Monthly Cost mentioned above.
#The additional 5% cashback offer is applicable only on 18 month tenure EMI transactions on Axis Bank Credit Card, Citi Credit Card, HDFC Bank Debit and Credit Cards, ICICI Bank Credit Card and Standard Chartered Credit Card. The offer is valid for transactions made using Brand EMI option on Pine Labs terminals. Additional cashback is valid over and above the best available price at the store. The cashback shall be credited on or before 120 business days from the date of transaction on a best effort basis to all open and active card members' accounts only. Product features vary by model. The offer may be revised or withdrawn without any prior notice. Limited period offers. For detailed terms and conditions log on to www.indiaistore.com. TM and © 2018 Apple Inc. All rights reserved.

Distribution Partners: Brightstar | HCL INFOSYSTEMS | INGRAM | RASHI PERIPHERALS | Redington

ఈనాడు

ఆగని అరణ్యఘోష

మనిషికన్నా ముందు అడవి పుట్టింది. ఆ తల్లి ఒడిలో పెరిగి నాగరికత నేర్చామంటూ గొడ్డలి పట్టి అభివృద్ధి పేరిట మానవజాతి యథేచ్ఛగా సాగిస్తున్న వన విధ్వంసం- పచ్చదనాన్ని, ప్రకృతిలో సమతూకాన్ని హరించివేస్తోంది. భూమండలం మీద 2014-16 సంవత్సరాల మధ్య ఏటా 90వేల చదరపు కిలోమీటర్ల మేర, ఆస్ట్రియా విస్తీర్ణమంత అడవులు అంతరించిపోయాయంటున్న తాజా గణాంక వివరాలు నివ్వెరపరుస్తున్నాయి. దేశీయంగానూ అటవీ ఆచ్ఛాదన వేగంగా హరించుకుపోతున్నట్లు భాగ్యనగరంలోని జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం (ఎన్ఆర్ఎస్సీ) విశ్లేషణ చాటుతోంది. ఎకాయెకి 46 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోని అడవులు హరిత ఆచ్ఛాదన కోల్పోవడం, జాతీయ స్థాయిలో అత్యవసర దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను ఉద్బోధిస్తోంది. దేశవ్యాప్తంగా 2015-2017 సంవత్సరాల మధ్య ప్రతి రోజూ సగటున 63 ఫుట్‌బాల్ మైదానాలంత విస్తీర్ణంలోని అడవుల్ని అభివృద్ధి ప్రాజెక్టుల పద్దులో పణం పెట్టినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. గరిష్ఠస్థాయిలో అటవీ భూముల అన్యాక్రాంతమైన జాబితాలో మధ్యప్రదేశ్, అసోం, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర తొలి అయిదు స్థానాల్లో నిలిచినట్లు ఆరు నెలల క్రితం కేంద్రమే రాజ్యసభాముఖంగా ప్రకటించింది. చార్‌ధామ్, సిమ్లా-పర్వానూ జాతీయ రహదారి, ముంబయి-గోవా హైవే, మహారాష్ట్రలో బులెట్ రైలు... ఈ తరహా అభివృద్ధి పద్దులో వేలాది చెట్లను ఖర్చు రాసేసే ప్రక్రియ అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. 2013-16 సంవత్సరాల మధ్య ఆరు లక్షల వృక్షాలు అక్రమంగా నరికివేతకు గురైన ఏపీ, తెలంగాణల్లోనూ ఇప్పటికీ గొడ్డళ్ల బారిన పడుతున్న అరణ్యాల మరణఘోష వినే నాథుడు లేడు. వివిధ ప్రాజెక్టులకు అధికారికంగా అనుమతుల పందేరం, పరిహారాల వసూళ్లు జరిగిన తరవాత- ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం కేటాయించాల్సిన 'కంపా' నిధుల్ని కేంద్రం విడుదల చేయకపోవడం రాష్ట్రాల ఆర్థిక ఇక్కట్లను తీవ్రతరం చేస్తోంది.

అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అరణ్య భూముల్ని వినియోగించినట్లయితే అందుకు బదులుగా సామాజిక అడవులు పెంచాలని అటవీ పరిరక్షణ చట్టం నిర్దేశిస్తోంది. డ్యాములు, ఖనిజ తవ్వకాలు, పరిశ్రమలు తదితరాల కోసం బదలాయించే అడవికి సమాన విస్తీర్ణంగల భూమిలో వనాల పెంపకంతోపాటు నష్టపోయిన వృక్షసంపదకూ తగిన పరిహారాన్ని పర్యావరణ మంత్రిత్వ శాఖకు దఖలుపరచాలి. వసూలైన అడవుల బదలాయింపు, ప్రత్యామ్నాయ వనాల పెంపకానికి సంబంధించిన నియంత్రణ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం కొరవడి అటవీ పునరుద్ధరణ చతికిలపడుతోంది. సుమారు లక్ష ఎకరాల మేర అటవీ ప్రాంతాన్ని కోల్పోయిన తెలంగాణలో మొక్కలు నాటామని అటవీ శాఖ చెబుతున్నది కేవలం లక్ష ఎకరాల్లోనే. అటవీ పునరుద్ధరణను వేగవంతం చేసేందుకు 2006నాటి సుప్రీం తీర్పు అనుసారం నెలకొల్పిన 'కంపా'(ప్రత్యామ్నాయ అటవీ నిర్వహణ సంఘం) వద్ద ఏడాదిన్నర క్రితం వేలకోట్లు పలు ప్రైవేటు సంస్థలు జమచేసిన పరిహారం, వడ్డీ రూ.42 వేలకోట్ల నిధిగా పోగుపడ్డాయి. అందులో 90 శాతం మొత్తాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలని ఎప్పుడో నిర్ణయించినా, విధి విధానాలు ఇంకా రూపొందించాల్సి ఉండటం విస్మయపరుస్తోంది. 1952లో, 1988లో జాతీయ అటవీ విధానాలు కొలువుతీరినా దేశ భూభాగంలో 33 శాతం విస్తీర్ణం మేర అడవులు విస్తరించాలన్న లక్ష్యసాధన దిశగా సరైన అడుగులు పడనేలేదు. కేవలం 21.53 శాతం విస్తీర్ణానికే పరిమితమైన అటవీ ఆచ్ఛాదనను చురుగ్గా పెంపొందించేందుకంటూ నాలుగు నెలల క్రితం విడుదల చేసిన జాతీయ అటవీ విధాన ముసాయిదాలో సైతం సమగ్ర దృక్పథం కరవైందన్న విమర్శలు పోటెత్తుతున్నాయి. నేపాల్, బంగ్లాదేశ్‌లతోపాటు ఇండియాలో ఇటీవలి వరదల బీభత్సానికి అడవుల నరికివేతే ముఖ్య కారణమంటున్న అధ్యయనాల వెలుగులో సత్వర కార్యాచరణను ప్రాథమ్య ప్రాతిపదికన పట్టాలకు ఎక్కించాలి!

రెండో ప్రపంచ యుద్ధానికి ముందు 75 శాతం అటవీ ఆచ్ఛాదనతో పచ్చగా కళకళలాడిన కోస్టారికా అనంతరం వనవిధ్వంసం పెచ్చరిల్లి 21 శాతానికి పరిమితమైంది. అనంతర కాలంలో అవిరళ కృషితో అక్కడి అడవుల విస్తీర్ణం 52 శాతానికి పైబడింది. అడవుల నరికివేతపై ఉపగ్రహ నిఘా పెట్టి హరిత ఛాయ పెంపొందించేందుకు ప్రత్యేక వ్యూహం అమలుపరచిన బ్రెజిల్ 60 శాతం అటవీ విస్తీర్ణంతో అలరారుతోంది. అత్యధిక భూవిస్తీర్ణంలో అరణ్యాలను కంటికి రెప్పలా సాకుతున్న దేశాల జాబితాలో రష్యా, కెనడాల తరవాతి స్థానం బ్రెజిల్‌దే. అటువంటి స్ఫూర్తిమంతమైన విజయగాథల నుంచి విలువైన గుణపాఠాలు నేర్చి భారతావని దీమాగా ముందడుగేయాలి. జాతి భవితకు కొత్త ఊపిరులూదేలా వనాల సంరక్షణకు, విస్తృత ప్రాతిపదికన అటవీ ఆచ్ఛాదనను పెంపొందించడానికి నిర్దిష్ట కాలావధిలో నిర్దిష్ట కార్యాచరణ చేపట్టాలి. అందుకోసం జాతీయ స్థాయి స్థూల ప్రణాళికను కూర్చి రాష్ట్రాలవారీగా భౌగోళిక ప్రత్యేకతలు, పరిమితులు, స్థితిగతులకు తగ్గట్లు వేర్వేరు లక్ష్యాల్ని ఖరారు చేసేందుకు నిపుణుల సంఘాన్నొకదాన్ని నెలకొల్పాలి. ఆ కమిటీ అందించిన సూచనలు, ప్రతిపాదనలపై సంప్రతింపుల దరిమిలా మౌలిక అంగీకారం కుదిరాక జిల్లాలు, ప్రాంతాలవారీగా అటవీ పెంపకం ఊపందుకోవాలి. పచ్చని చెట్లు శీతోష్ణస్థితి సమతౌల్యాన్ని కాపాడి, జలప్రవాహాల్ని క్రమబద్ధీకరిస్తాయి. మానవాళి ఆరోగ్యకర భవితకు నిచ్చెనమెట్లవుతాయి. హరిత భారతావనికి ప్రాణవాయువులూదేలా ప్రభుత్వాలు ప్రాప్తకాలజ్ఞత కనబరచాల్సిన తరుణమిది. వాటి కృషికి సామాజిక చేతనా జతకూడితేనే పర్యావరణ పరిరక్షణ గాడిన పడుతుంది!

యువత పోటెత్తడం వరమా శాపమా?

డాక్టర్ మహేంద్రబాబు కురువ

భారతదేశం సమీప భవిష్యత్తులో ప్రపంచానికే ఆర్థిక చుక్కానిలా నిలుస్తుందన్న అంచనాలు ఇటీవల వినిపించేవి. దీనికి ప్రధాన కారణం- మన దేశ జనాభా బాగా ఎక్కువ కావడం మాత్రమే కాదు- అది యువతేజం ఉట్టిపడే జనాభా కావడం. జనాభా సగటు వయసు జపాన్‌లో 46 సంవత్సరాలు. చైనాలో అది 37 ఏళ్లు ఉంటే భారత్‌లో 27.3 సంవత్సరాలు మాత్రమేనని నిరుడు ఓ సర్వే తేల్చింది. జనాభాలో యువత శాతం ఎక్కువైనప్పుడు ఉద్యోగాలు, వృత్తివ్యాపారాల ద్వారా వారి ఆర్జన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ని వృద్ధి చేస్తుంది. అదే సమయంలో ఇతర ప్రధాన దేశాల జనాభా ముదిమి మీదపడుతూ సంపాదన తక్కువ, ఖర్చు ఎక్కువ అయిపోతుంది. అదే భారతదేశ సంపాదన ఎక్కువ, పింఛన్లు, వైద్య ఖర్చుల మీద వ్యయం తక్కువ అనే పరిస్థితి ఉంటుంది. భారత్ 'యంగిస్థాన్' అనే పేరును సార్థకం చేసుకుంటుందని అందరూ నమ్మారు. కానీ, ఈ యువ జనాధిక్యత వల్ల లాభం 2030 వరకే సిద్ధిస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోకపోతే మొదటికే మోసం వస్తుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశోధన విభాగం హెచ్చరించింది. జననాల రేటు తగ్గిన రాష్ట్రాల్లో వృద్ధుల సంఖ్య పెరగడం ఆందోళనకరమని పేర్కొంది. ఉదాహరణగా కర్ణాటకను తీసుకుంటే, 1971లో అక్కడ 60 ఏళ్లుపైబడిన వృద్ధుల సంఖ్య 17.9 లక్షలు మాత్రమే. అది అప్పటి కర్ణాటక జనాభాలో 6.1 శాతం. కానీ, 2011 జనగణన నాటికి ఆ సంఖ్య 57.9 లక్షలకు (9.5 శాతం) పెరిగింది. ఈ లెక్కన మరో దశాబ్ది తరవాత పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో కనిపిస్తున్న ఈ పరిణామం పలు దశల తరవాత మరిన్ని రాష్ట్రాల్లో నమోదయ్యే అవకాశం ఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతూపోతే యువజనాధిక్య ప్రయోజనం కాస్తా వృద్ధ విస్ఫోటనంగా మారిపోవచ్చు. మరి దేశంలో నిజంగానే ఆ పరిస్థితి ఏర్పడుతుందా అన్నది సరళమైన ప్రశ్నలానే కనిపించినా, వాస్తవం సంక్లిష్టంగా ఉంటుంది. నేడు యువజనులు ఎదుర్కొంటున్న సవాళ్లను, వృద్ధాప్యం అది తెచ్చిపెట్టే సమస్యలను లోతుగా అర్థం చేసుకుని సరైన విధానాలను రూపొందించాలి.

నిర్వచనం మారాలి

సాధారణంగా పారిశ్రామికీకరణకు లోనైన దేశాలన్నింటిలో వయోవర్గాల్లో మార్పులు వస్తాయి. జననాలు తగ్గి క్రమంగా వృద్ధుల సంఖ్య అధికమవుతుంది. వారిలో మరణాలు రేటూ ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా జనాభా సగటు వయసులో తేడాలు వస్తాయి. జపాన్‌లో 1952లో సగటు వయసు 26 ఏళ్లు. ఇప్పుడది 46 సంవత్సరాలు. ఇదే కాలంలో చైనాలో 24 నుంచి 37 ఏళ్లకు పెరిగింది. 2050కల్లా అది 48 ఏళ్లకు చేరనుంది. ముందు భారత్ కూడా ఇదే వయో పరిణామాన్ని వీక్షించాల్సిరావచ్చు.

పారిశ్రామికీకరణ వల్ల ప్రజల ఆదాయాలు, వాటితోపాటు ఆయుష్షు అధికమవుతుంది. దీనికితోడు వైద్యం, సాంకేతిక పరిజ్ఞానాల్లో వచ్చిన అధునాతన పురోగతి కూడా మరణాల రేటును తగ్గించి ఆయుష్షును పెంచుతున్నాయి. అంతే కాదు పూర్వీకులకన్నా నేటి సీనియర్ పౌరులు ఎక్కువ ఆరోగ్యవంతంగా జీవించగలుగుతున్నారు. చాలా ఏళ్లపాటు వారి అసలు వయసుకన్నా తక్కువ వయసువారిగా కనిపిస్తున్నారు కూడా. మునుపటికన్నా ఎక్కువ సత్తువ, ఉత్తేజం వారిలో ఉట్టిపడుతున్నాయి. కాబట్టి 60 ఏళ్లు రాగానే మనుషుల్లో పని చేసే ఓపిక ఉండదని మామూలు జనం అనుకొన్నా- ప్రభుత్వాలు, విద్యావంతులు అలా భావించరాదు. అధునాతన వైద్యం చలవతో నేడు 60 ఏళ్లు దాటిన వారూ చక్కగా పనిచేయగలుగుతున్నారు. వారి ఉత్పాదకత కూడా ఎక్కువే. 60ఏళ్లు దాటినవారెందరో విశ్వవిద్యాలయ ఆచార్యులుగా, పాత్రికేయులుగా, మేనేజర్లుగా పనిచేస్తూ ఉండటం చూస్తూనే ఉన్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వయసు 65 ఏళ్లు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వయసు 72 ఏళ్లు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వయసు 85 ఏళ్లు. అయినా వీరంతా రాజకీయాల్లో చురుగ్గా పనిచేస్తున్నారు. ఈ ధోరణి కేవలం ఉన్నత వర్గీయులకే పరిమితం కాదు. ముది వయసులోనూ ఎండనకా వాననక రోజువారీ వేతన కూలీలుగా, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనివారిగా, పోర్టర్లుగా, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నవారెందరో! అసంఘటిత రంగంలో వృద్ధులు ఆర్థిక అనివార్యతల వల్ల పనిచేయాల్సి వస్తోంది. అలాంటి వారికి ప్రభుత్వం సామాజిక భద్రత ఏర్పాటుచేయాలి. మొత్తంమీద 60 ఏళ్లు దాటిన తరవాతా సమాజంలో ఉత్పాదక విధులు నిర్వహిస్తున్నవారెందరో ఉన్నారని తెలుస్తోంది. వారిని అనవసర బరువుగా పరిగణించడం తప్పు. వయసు మీరడమనేది సహజ పరిణామం. వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, పింఛన్లు తదితరాలపై అయ్యే ఖర్చు గురించి అదే పనిగా తర్జనభర్జనలు చేసే కన్నా, పదవీ విరమణానంతరం కూడా పనితనం చూపేవారిని ఉపయోగించుకోవడానికి తగు విధానాలను రూపొందించి అమలు చేయాలి. 60, 62, 65 ఏళ్లంటూ పదవీ విరమణ వయసు నిర్ణయించి సమర్థులను సైతం ఇంటికి పంపేయడం మంచిది కాదు. కార్యదక్షత, శక్తీ ఉత్సాహం ఉన్నవారు దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడతారని గ్రహించాలి. వారి ప్రతిభ, శ్రమలను సద్వినియోగం చేసుకోవాలి. వారిని నిరుపయోగంగా కాలగర్భంలో కలిసిపోనివ్వడం క్షంతవ్యం కాదు. వృద్ధులు మన ఖజానాకు బరువనే మనస్తత్వాన్ని ప్రజలు, ప్రభుత్వాలూ వదిలించుకోవాలి. నిజానికి వారి వల్లే సమాజ రథం ముందుకు కదలుతోందని గ్రహించాలి. ఏళ్లతరబడి ఉద్యోగ జీవితంలో వారు చేసిన శ్రమఫలాన్ని నేటి యువతరం ఆరగిస్తోంది. తాము సృష్టించిన సంపదలో ఒక చిన్నభాగాన్ని మాత్రమే వృద్ధాప్యంలో తిరిగి తీసుకుంటున్నారు. అలాగని పదవీ విరమణ వయసును మరింత కాలం పొడిగించాలని ఇక్కడ వాదించడం లేదు. అలాచేస్తే ప్రభుత్వ బడ్జెట్లపై భారం పెరుగుతుంది, యువతకు ఉద్యోగాలు రావడం ఆలస్యమవుతుంది. సంఘటిత రంగంలో పదవీ విరమణ చేసినవారి సేవలను ఉపయోగించుకోవడానికి పకడ్బందీ విధానాన్ని రూపొందించుకోవాలి. ఉద్యోగ జీవితంలో వారి ఉత్పాదకత, సామర్థ్యాల ప్రాతిపదికపై వారి పదవీ విరమణ వయసును పొడిగించవచ్చు. అసంఘటిత రంగానికి వస్తే వృద్ధులకు పింఛన్ల చెల్లింపు ఆరోగ్య బీమా తదితర సామాజిక భద్రతా పథకాలను వర్తింపజేయాలి. దీనికోసం బడ్జెట్‌లో అదనపు నిధులు కేటాయించాలి. యువతకు ఆధునిక నైపుణ్యాలు అలవరచి, ఉత్పాదకత పెంచి అధునాతన పరిశ్రమలను విస్తరించినప్పుడు దేశ జీడీపీ, దానితోపాటే సామాజిక భద్రతకు నిధులూ వృద్ధి అవుతాయి. అప్పుడు మాత్రమే అసలు సిసలు యువజనాధిక్య లాభం చేకూరుతుంది.



వనరుల సద్వినియోగం కీలకం



కొత్త సవాళ్లు

మరోవైపు దేశంలోని యువ జనాభా అంతటికీ పనులు చూపించడం పెద్ద సవాలు అవుతోంది. పనిచేసే జనాభా విషయంలో భారత్ త్వరలోనే చైనాను మించిపోనుంది. టెక్నాలజీ వేగంగా మారిపోతున్న ఈ రోజుల్లో వారందరినీ ఉత్పాదక పనుల్లో నియోగించడమెలా అన్నది సమస్యగా తయారైంది. కొంత కాలంగా దేశంలో పెట్టుబడులు తగ్గిపోతున్నాయి. వృద్ధిరేటు పెరుగుతున్నా అందుకు తగ్గట్లు ఉపాధి అవకాశాలు ఇనుమడించడం లేదు. పారిశ్రామిక, సేవా రంగాలతోపాటు వ్యవసాయ రంగంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మారుతున్న కాలానికి తగ్గట్లు మన విద్యా విధానం మారకపోవడం పెద్ద లోటు. సాంకేతికత వేగంగా పురోగమిస్తున్న ఈ రోజుల్లో కర్మాగారాల్లో మూసివేతలు పెచ్చరిల్లనున్నాయి. ఇక కొత్త ఉద్యోగాల సృష్టి కష్టమవుతుందన్నది నిష్ఠుర సత్యం. ఆధునిక యంత్రాల వల్ల దేశంలో 52 శాతం కర్మాగార ఉద్యోగాలు గల్లంతవుతాయని మెకిన్సే లెక్కకట్టింది. ఈ లెక్కన మన యువతకు ఉపాధి అవకాశాలు ఎలా పుట్టుకొస్తాయో నిపుణులకు సైతం చిక్కు ప్రశ్నగానే మిగిలింది. ఇటీవల ఒక ఆర్థిక వ్యవహారాల పత్రిక నిర్వహించిన సర్వేలో పాల్గొన్నవారిలో 62 శాతం ఉపాధి అవకాశాలు తరిగిపోతున్నాయని భావిస్తున్నారు. 15-29 ఏళ్ళ వయసు భారతీయుల్లో 30 శాతానికి మంచి చదువు కాని, ఉద్యోగాలు, ఉపాధి శిక్షణ కాని లేవని 2017లో ప్రపంచ బ్యాంకు అధ్యయనం తేల్చింది. ఈ లోపాలను వెంటనే సరిదిద్దకపోతే యువజనాధిక్యత వల్ల లాభం రావాల్సిందిపోయి సమాజానికి తీరని నష్టం వాటిల్లవచ్చు.

మారుతున్న రోజుల్లో నెగ్గుకురావడానికి అవసరమైన నైపుణ్యాలను యువతకు అలవరచడం ద్వారా మాత్రమే యువశక్తిని దేశ ప్రగతి రథానికి జవనాశ్వాలుగా తీర్చిదిద్దగలం. ఈ వాస్తవాన్ని మోదీ ప్రభుత్వం గుర్తించడం సంతోషించాల్సిన విషయం. 2016లో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ 5.57 లక్షల యువతకు శిక్షణ ఇచ్చినా, వారిలో 12 శాతానికే ఉపాధి లభించింది. కార్మిక చట్టాల్లోని నియంత్రణలు, ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఆలస్యం, అలసత్వాలు, అధికార గణాలు సృష్టించే ఆటంకాల వల్ల శిక్షిత యువతకు త్వరగా ఉద్యోగాలు రావడం లేదు. ఒకటి మాత్రం నిజం- నైపుణ్యం, ఉత్పాదకత రాత్రి తెల్లారేసరికి వృద్ధి చెందవు. వీటి మెరుగుదలకు నిరంతర కృషి అవసరం. ప్రభుత్వం దీనికి కావలసిన నిధులను కేటాయిస్తూ శిక్షణ-ఫలితాలపై నిఘా వేసి లోటుపాట్లను సరిదిద్దుతూ ఆశించిన లక్ష్యాల సాధనకు పట్టుదల ప్రదర్శించాలి. ఏ శిక్షణ విజయవంతం కావాలన్నా పునాది బాగా ఉండాలి. ప్రాథమిక విద్య నుంచే పునాది పడాలి. అందుకే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిశోధన పత్రం దేశమంతటా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మెరుగుపరచాలని సూచించింది. విద్యారంగంపై అధిక శ్రద్ధాసక్తులు కేటాయించాలన్నది. విద్యార్థులకు మాతృభాషతోపాటు ఆంగ్లంపైనా పట్టు ఉండేలా చూడాలి. వృత్తివిద్యా శిక్షణను ముమ్మరం చేయాలి. ఈ విధంగా మన యువతరం నైపుణ్యాలను, శక్తిసామర్థ్యాలను మెరుగుపరచాలి. ఒక్క చదువు మీద దృష్టిపెడితే సరిపోదు, పారిశ్రామిక వాతావరణాన్నీ మార్చాలి. మితిమీరిన నియంత్రణలు పనికిరావని గ్రహించి అధికార గణం దృక్పథాన్ని సరిదిద్దాలి. ఈ విధంగా యువ జనాభా ఆధిక్యాన్ని గొప్ప సానుకూలాంశంగా మలచుకోవాలి. దేశంలో వృద్ధుల శాతం పెరగడానికి ముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

(రచయిత- హెచ్ఎన్‌బీ గఢ్వాల్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ డీన్)

దేశ జనాభాలో వృద్ధులు (60+ వయోపరిమితిలోనివారు... కోట్లలో)

విభాగం	పురుషులు	మహిళలు	మొత్తం	జనాభాలో వాటా (శాతాల్లో)		
				పు	మ	సగటు
గ్రామీణం	42.78	40.60	83.38	8.4	9.2	8.8
నగరం	19.55	18.16	37.71	7.7	8.5	8.1
మొత్తం	62.33	58.76	121.09	8.2	9.0	8.6

రాజకీయ వస్తాదులు

గజేంద్రుడి ఆర్తనాదం విన్న విష్ణుమూర్తి 'సిరికింజెప్పడు... శంఖచక్ర యుగమున్ చేదోయి సంధింపడు, ఏ పరివారంబును జీరడు' అని పోతన పద్యంలో చెప్పినట్లు- ఎవరికీ చెప్పాపెట్టకుండా, కనీసం వాహనమైనా తీసుకోకుండా భక్తుడి రక్షణకు చకచకా ఎలా వెళ్లగలిగాడు? దేహదారుఢ్యం ఉండబట్టి... బానపొట్ట లేకపోబట్టి. ఇది ద్వాపర యుగం కథ! అసలు సిసలు దేహదారుఢ్యం సవాలు (ఫిట్‌నెస్ ఛాలెంజ్) అప్పుడే మొదలైంది. మన అనుభవంలోకి వచ్చేసరికి కలియుగంలో ఇంతకాలమైంది. 'నను పాలింపగ నడచీ వచ్చితివా' అని ఇప్పుడు పాడుకుంటున్నాం. 'నడిపించేవాడే నాయకుడు, నడిచేవాడు కాదు' అనుకోవడానికీ వీల్లేదు. తాను నడుస్తూ జనాన్ని నడిపించేవాడే నిజమైన నాయకుడు.

'పదండి ముందుకు
పదండి తోసుకు
పోదాం పోదాం పైపైకి' అనేది శ్రీశ్రీ మహాప్రస్థానమే కాదు- ప్రజాశ్రీ మహాప్రస్థానం కూడా!

ఈ కారణాలన్నింటివల్లా ఇప్పుడు దేశ రాజకీయాల్లో దారుఢ్య సవాల్ (ఫిట్‌నెస్ ఛాలెంజ్) పెద్ద చర్చనీయాంశమై పోయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలుకొని కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి వరకు ఇందులో పాత్రధారులయ్యారు. ఎవరి పాత్రను వారు దారుఢ్యంతో పోషిస్తున్నారు. తమను తాము భూషించుకుంటున్నారు.

ఒకప్పుడు 'నాయకులకు మంచి బుర్రలుంటే చాలు. ఫర్వాలేదు' అని అనుకునేవాళ్లు. ఇప్పుడలా కాదు. 'బుర్ర ఉండాలి. బొర్ర ఉండకూడదు' అనేది గీటురాయి అయిపోయింది. నాయకులు ఇప్పుడు ఎవరికి వారు 'బొర్రలను' తడుముకుంటున్నారు. దేశమును ప్రేమించుమన్నా అనకుండా 'దేహమును ప్రేమించుమన్నా' అని మనసులో పాడుకొంటున్నారు.

ఈ వ్యవహారానికి మూలకారకుడు కేంద్రమంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్. 'మనం దృఢంగా ఉంటే, దేశం దృఢంగా ఉంటుంది' అంటూ ఆయన దారుఢ్య సవాలు ప్రారంభించారు. తాను బస్కీలు తీస్తున్న వీడియోల్ని ట్విటర్లో పోస్టు చేశారు. తమ తమ ఫిట్‌నెస్ వీడియోలనూ పోస్టు చేయమంటూ క్రీడాకారులు విరాట్ కోహ్లీ, ధోనీ, సైనా నెహ్వాల్; నటులు అమితాబ్‌బచ్చన్, సల్మాన్‌ఖాన్ లాంటి కొందరు ప్రముఖులకు ఆయన సవాలు విసిరారు. ఇది అంటుకుంది. విరాట్ కోహ్లీ రంగంలోకి దిగాడు. తన ఫిట్‌నెస్ వీడియోలను పోస్టు చేస్తూ, మోదీకి కూడా ట్యాగ్ చేసేసరికి ప్రధానీ సవాలును స్వీకరించారు. తాను సైతం తన ఫిట్‌నెస్ చెప్పే వీడియో పోస్టులను ప్రజలతో పంచుకున్నారు. ఆయన అంతటితో ఆగలేదు. ఈ మధ్యనే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తరవాత అందలమెక్కిన కుమారస్వామికి సవాలు విసిరారు. కుమారస్వామీ తక్కువ తినలేదు. సవాలుకు తగిన జవాబు ఇచ్చేశారు. 'దేహదారుఢ్యం ఎంతో ముఖ్యమైందని నేనూ నమ్ముతాను... యోగ, ట్రెడ్‌మిల్ నా రోజువారీ కార్యక్రమాల్లో భాగమే. కానీ నేను నా రాష్ట్రమైన కర్ణాటక 'ఫిట్‌నెస్' గురించే ఎక్కువ యోచిస్తున్నాను' అనేశారు.

మోదీ సవాలు ప్రతిపక్ష నాయకులకు, ఆ మాటకొస్తే ప్రతీ ప్రతిపక్ష నాయకులకు చురుకు పుట్టించింది. కాంగ్రెస్ నాయకులు ఈ ఫిట్‌నెస్ సవాలును ఇంకో రకంగా స్వీకరించారు. పూర్తిగా రాజకీయ దారుఢ్య సవాలుగా మార్చేశారు. 'మోదీగారూ! మీరు కోహ్లీ సవాలు స్వీకరించారు. బాగానే ఉంది. నేనూ మీకు ఓ సవాలు విసురుతున్నాను. పెట్రోలు ధరలు తగ్గించండి. ఆ పని చేయకపోతే, మీరు ఎలాగైనా చేసేట్లు కాంగ్రెస్ దేశమంతటా ఆందోళన చేస్తుంది'



అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ బాణం సంధించారు. రాహుల్ బాణం వేస్తే, ఆయన సహచరులు ఊరుకుంటారా? కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జెవాలా ఇది మామూలు సవాలా అన్నట్లు స్పందించేశారు. ఇక్కడ స్పందించడమంటే నిందించడమే. 'చమురు ధరలు 11 రోజుల నుంచి పెరుగుతూనే ఉన్నాయి. అయినా ప్రధాని మోదీ ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నారు. నాలుగేళ్లు ఎక్సైజు కింద దోచుకున్న 10 లక్షల కోట్ల రూపాయలను చమురు ధరలు తగ్గించడానికి ఉపయోగిస్తే మీ సొమ్మేం పోతుంది' అని ప్రశ్నించారు. చమురు ధరలు తగ్గిస్తే, సంక్షేమ పథకాలకు అంత డబ్బుండదని కేంద్రమంత్రులు అంటున్న మాటల్నీ ఆయన ఎగతాళి చేశారు.

లాలుప్రసాద్ యాదవ్ కుమారుడు రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు తేజస్వి యాదవ్, మోదీ మీద యుద్ధానికి దొరికిన ఆయుధాన్ని వదులుకోలేదు. ఆయన క్రికెటర్ కూడా. 'విరాట్ కోహ్లీ విసిరిన సవాలును మీరు స్వీకరించారు. మరి నిరుద్యోగులకు ఉపాధికల్పన, రైతులకు చేయూత, దళితులు, అల్పసంఖ్యాక వర్గాల మీద దాడులను నిరోధించగలరా?' అంటూ మోదీ మీద 'మాటల బ్యాటింగ్' చేశారు. దొరకునా ఇటువంటి అవకాశం అనుకొని ఎంతోమంది రెచ్చిపోయారు.

దారుఢ్య సవాలు పుణ్యమా అని రాజకీయ నాయకులకు స్వస్వరూప జ్ఞానం వచ్చేసింది. రోజూ తమ పరువు ఎంత పెరిగిందని ఆలోచించకుండా, తమ బరువు ఎంత తగ్గిందని ఆలోచించుకుంటున్నారు. 'రాజకీయ కసరత్తులకేం తొందర, శరీర కసరత్తులు నేర్చుకో ముందర' అంటూ ఆత్మప్రబోధం చేసుకుంటున్నారు. ఒకప్పుడు రాజులుండేవారు. రాజ్యాలుండేవి. అది రాజరికం. రాజులు తమ రాజ్య రక్షణ కోసం యుద్ధవిద్యల్లో శిక్షణ పొందేవారు. ఇప్పుడు మంత్రులొచ్చారు. ఇది ప్రజాస్వామ్యం. కొంతమంది ప్రజాప్రతినిధులు ఎటువంటి శిక్షణా లేకుండానే చట్టసభల్లో మైకుల్లాంటి 'ఆయుధాల'తో 'యుద్ధవిద్య'లు ప్రదర్శిస్తున్నారు. ఇది తమ స్వార్థరాజ్య రక్షణ కోసం!

'నాయకులారా... మీరు విపరీతమైన స్వార్థంతో దారుఢ్య సవాలును స్వీకరిస్తున్నారు' అని ఎవరైనా అన్నా నేతలు పట్టించుకోవడం లేదు. తాము ధరించే ప్యాంట్లు, చొక్కాలు వదులైనా సరే- త్యాగబుద్ధితో భరిస్తున్నారు. 'నా ఒంటి బరువుకు నేనేద్వవలెగాని' అని ఎవరన్నా భుజాలు తడుముకుంటున్నారు. బరువో, రేవో తేల్చుకుంటున్నారు. యోగా కేంద్రాలకు పోటీగా నాయకుల ఇళ్లే రాజకీయ యోగా కేంద్రాలు అయ్యేట్లున్నాయి. ఈ వరస చూస్తే ఇకముందు ఎన్నికల పద్ధతిలో పెనుమార్పు వచ్చి, మరింత తేలిగ్గా కచ్చితమైన ఫలితం వెలువడినా ఆశ్చర్యపడాల్సిన అవసరమే లేదు. ఈ తరహా ఎన్నికలకు కనీసం ప్రజల అవసరమూ లేదు. పోలింగ్ రోజున నాయకులకు మధ్య దేహదారుఢ్య పోటీలు పెడితే సరి! అందులో గెలిచేవాడికే పదవి. రాజ్యం వస్తాదుల భోజ్యం అంటే ఎవరు కాదంటారు, కాదన్నవాడు బతికి బట్టకట్టగలడా? మనకూ నాయకుల్లో అక్కడక్కడా వస్తాదులు ఉన్నారు. ఒకప్పటి ములాయం సింగ్ యాదవ్ రాజకీయ వస్తాదుగానే కాదు, వాస్తవ వస్తాదుగానూ పేరు సంపాదించుకున్నవాడేగా!

సీతా స్వయంవరంలో శ్రీరాముడు దేహదారుఢ్యంతోటే శివధనుస్సును విరగ్గొట్టాడు కదా! ఈ స్ఫూర్తితో ఎన్నికల స్వయంవరంలో దేహదారుఢ్య పరీక్షలు పెడితే సరి! నాయకులు చురుగ్గా పనిచేస్తారు. నాయకులు దేశ పరిశ్రమల మీద కన్నా దేహ పరిశ్రమల మీద దృష్టిపెడతారు. పది కాలాలపాటు ఆయురారోగ్యాలతో విలసిల్లుతారు. నేతల ఆరోగ్యమే దేశానికి ఆరోగ్యమూ సౌభాగ్యమూ!

నేతల్లారా... దేహదారుఢ్యం కోసం పోటీపడండి... విరుచుకుపడండి!

– శంకరనారాయణ

వాయిదాల జీవితం

సాధారణంగా చాలామంది పనులు వాయిదా వేస్తుంటారు. కొందరికది అలవాటు. కొందరికి సరదా! 'తొందరేముంది చేద్దాంలే' అనుకుంటారు. అలా వాయిదాలమీద వాయిదాలతో అసలు ఆ పని సంగతే మరిచిపోతారు. ఇలా వాయిదాల అలవాటుతో ఎన్నో కోల్పోవాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. సోమరితనానికి వాయిదాల అలవాటు ఒక ప్రధాన లక్షణం.

సోమరులు జీవచ్ఛవాలతో సమానమని పెద్దలు చెబుతారు. పెద్దల మాటల్ని మనం మనసుకు పట్టించుకోవాలి. ఆచరణగా మార్చుకోవాలి. లేకపోతే, ప్రతిదీ మనం అనుభవంతోనే తెలుసుకోవాలనుకుంటే, జీవిత సత్యాలను అర్థం చేసుకునేలోపల ఆయువు ముగిసిపోతుంది. పోయిన ధనాన్ని తిరిగి సంపాదించవచ్చునేమోగాని, ఆయువులో అధికంగా ఒక్క శ్వాస కూడా మనం సంపాదించలేం. కానీ, ఈ సత్యం పట్ల జాగరూకత చూపించనివారు యాంత్రికంగా జీవితం గడిపేస్తుంటారు.

రేపటి పనిని నేడు, నేటి పనిని ఇప్పుడే చేయాలని కార్యదీక్ష కలవాళ్లు అనుకుంటారు. అలా చెయ్యడానికి పూనుకొంటారు. అప్పుడే పనులవేగం పెరుగుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయడానికి వీలవుతుంది. మన జీవితకాలంలో ఏమి సాధించామన్నదే జీవన సాఫల్య గణనలోకి వస్తుంది. అంతేతప్ప, ఎన్నాళ్లు జీవించామనేది లెక్కలోకి రాదు.

సమయం విలువ తెలిసినవారు క్షణమైనా వ్యర్థం చెయ్యరు. ప్రతి క్షణాన్నీ ఎలా సద్వినియోగం చెయ్యాలో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. తాము ఎంచుకున్న రంగంలో మానసికంగా, భౌతికంగా నిమగ్నులై ఉంటారు. ఒక రచయిత, కవి, చిత్రకారుడు భౌతికంగా చేసే కృషి కన్నా ఎన్నో రెట్లు మానసికంగా చేసే భావనాత్మక కృషి ఉంటుంది. నిద్రలో మనసులో మథనం జరుగుతూనే ఉంటుంది. వాటిని చెదిరిపోకుండా పదిలపరచుకోగలిగితే అద్భుత సృజనలుగా ఆవిష్కృతమవుతాయి. బ్రహ్మ సృష్టికర్త అయితే కళాకారుడు, కవి సృజనకారులు. అయితే,

అంతర్యామి

దేన్నికైనా ప్రాతిపదిక పవిత్రంగా ఉండాలి. భావ ప్రసారంలో స్పష్టత ఉండాలి. అప్పుడే అది ఆశించిన ప్రయోజనాన్ని పొందుతుంది.

జీవితాన్ని సుఖలాలసత్వంతో, ప్రయోజన శూన్యంగా, విలువైన సమయాన్ని వ్యర్థం చేస్తూ బతికేవారికీ, పశు, పక్షి, కీటకాలకూ పెద్దగా తేడా ఏమీ ఉండదు. మనిషి ఆ దశలన్నీ దాటి ప్రస్తుత దశకు చేరుకున్నాడంటారు విజ్ఞులు. అది మరచిపోకుండా ఊర్ధ్వ దృష్టితో పరంధాముడి ధామంకేసి మనసు లగ్నం చేయాలి.

ఆ క్షణంలో చేయడానికి ఏమీ లేదనుకోకూడదు. భౌతికంగా చేయడానికి ఏమీ ఉండకపోయినా మనసును అంతర్యామి వైపు నడిపించడానికి అనుక్షణమూ ప్రయత్నించాలి.

సుందరకాండలో అద్భుతాలు చేసిన ఆంజనేయుడు, చేయడానికి వేరే ఏమీ లేనప్పుడు ఆత్మారాముని జపిస్తూ, తపిస్తూ, సాధనమార్గానికి ఆదర్శం అయ్యాడు. మనం కూడా దాన్ని ఆచరణలోకి తెచ్చుకోవాలి. ధ్యానానికి సంకల్పం తప్ప మరే ఆడంబరాలూ అవసరం లేదు. ధ్యానాన్నీ వాయిదాలు వేయడం మూర్ఖత్వం.

ఎందుకంటే, మృత్యువు మన మరణ ఘడియలను ఎప్పుడూ వాయిదా వెయ్యదు!

– కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

సీఆర్‌డీఏ బాండ్లకు క్రిసిల్ ఏ+ రేటింగ్

పెట్టుబడుల ఆకర్షణకు ప్రయోజనకరం!

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులకు సంస్థాగత మదుపరుల నుంచి నిధులు సమీకరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) విడుదల చేయనున్న బాండ్లకు ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఎ+ రేటింగ్ ఇచ్చింది. రాజధాని బాండ్లలో సంస్థాగత మదుపరులు పెట్టుబడులు పెట్టేలా ఆకర్షించేందుకు క్రిసిల్ రేటింగ్ ఉపయోగపడుతుందని సీఆర్‌డీఏ వర్గాలు భావిస్తున్నాయి. ఈ బాండ్ల ద్వారా రూ. రెండు వేల కోట్ల వరకు సమీకరించాలని సీఆర్‌డీఏ లక్ష్యంగా పెట్టుకుంది. త్వరలోనే అరేంజర్ల నియామకం పూర్తి చేసి మార్కెట్‌లోకి వెళ్లాలని సీఆర్‌డీఏ యోచిస్తోంది. ఈ బాండ్లకు సంబంధించి సీఆర్‌డీఏ లోగడే బ్రిక్‌వర్క్, స్మెరా సంస్థలతో రేటింగ్ ప్రక్రియ నిర్వహించింది. ఆ రెండు సంస్థలూ ఏఏ- రేటింగ్ ఇచ్చాయి. క్రిసిల్ వంటి అగ్రశ్రేణి సంస్థల రేటింగ్ ఉంటే బాండ్లకు మార్కెట్‌లో మరింత ఆకర్షణ పెరుగుతుందన్న నిపుణుల సూచన మేరకు ఆ ప్రక్రియనూ సీఆర్‌డీఏ పూర్తి చేసింది. ఈ బాండ్లకు సంబంధించి గత నెలలో ముంబయిలో సీఆర్‌డీఏ నిర్వహించిన మదుపరుల సమావేశానికి సుమారు 70 మంది హాజరయ్యారు. మరోవైపు అరేంజర్ల ఎంపికకు సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. సీఆర్‌డీఏ విడుదల చేసే బాండ్లకు రాష్ట్ర ప్రభుత్వం హామీనిస్తోంది.

నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనాలు ఇవ్వాలి

విజయవాడలో అఖిలపక్ష సమావేశం

విజయవాడ, న్యూస్‌టుడే: కులవృత్తిని నమ్ముకుని బతుకుతున్న నాయీ బ్రాహ్మణులపై ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడటం దారుణమని వైకాపా నేత, మాజీ మంత్రి పార్థసారథి అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం విజయవాడ హనుమాన్‌పేట సీపీఐ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఒక కేశఖండన టికెట్‌పై రూ.12 నుంచి రూ.25 చెల్లిస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి ఏ రీతిలో పెంచారో చెప్పాలన్నారు. నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనాలివ్వాలని, వారిని కూడా దేవాలయాల్లో శాశ్వత ఉద్యోగులుగా తీసుకోవాలన్నారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్ధభట్ల యానాదయ్య మాట్లాడుతూ తిరుపతిలో కేవలం ఈ వృత్తి కారణంగా ఏడాదికి రూ.350 కోట్లు ఆదాయం వస్తుందన్నారు. అక్కడ 240 మంది మినహా మిగిలిన 1150 మంది కూలీలుగా పని చేస్తున్నారన్నారు. కనీస వేతనాలు ఇవ్వని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. సమావేశంలో విజయవాడ సీపీఐ నగరకార్యదర్శి దోనేపూడి శంకర్, సేవా సంఘం సభ్యులు రావుకొల్లు మల్లేశ్వరరావు, మాజీశాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ అవార్డు నగదు పెంపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఏటా డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ పేరుతో ఇచ్చే అవార్డు నగదు మొత్తాన్ని పెంచుతూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటివరకు ఈ అవార్డు కింద రూ.లక్ష ఇస్తుండగా ఈ మొత్తాన్ని రూ.10లక్షలకు పెంచింది. జులై 6న బాలమురళీకృష్ణ జయంతి సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు.

తాడోపేడో తేల్చుకుంటాం!

- కేంద్ర దుష్ట రాజకీయాలను ఎండగడతాం
- కడప ఉక్కుదీక్షలో సీఎం రమేష్ వ్యాఖ్య
- గళంకలిపిన తెదేపా ఎంపీలు
- దీక్షలతో ఉపయోగం లేదన్న జేసీ
- చేస్తే ఆ కష్టం తెలుస్తుందన్న మంత్రి ఆది

దీక్షకు సంఘీభావం తెలుపుతున్న తెదేపా ప్రజాప్రతినిధులు, నాయకులు

ఈనాడు - కడప

నమ్మించి నట్టేట ముంచిన కేంద్ర దుష్ట రాజకీయాలను ఉద్యమబాటలోనే ఎండగడతాం.. తాడోపేడో తేల్చుకుంటామని రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ అన్నారు. తెలుగు జాతిని అవమానించిన ఏ పార్టీ బతికి బట్టకట్టలేదని దిల్లీ పెద్దలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. వైకాపాలా రాజీడ్రామాలు ఆడకుండా ఉక్కుపరిశ్రమ కోసం ప్రాణాలైనా ఇస్తామని స్పష్టం చేశారు. కడపలో 3 రోజులుగా చేపడుతున్న ఆమరణదీక్షకు శుక్రవారం తెదేపా ఎంపీలు, ముఖ్య నేతలు మద్దతు తెలిపారు. నేతలు మురళీమోహన్, కేశినేని నాని, కొనకళ్ల నారాయణ, విజయమ్మ, కుసుమకుమారి తదితరులు సీఎం రమేష్‌కు మద్దతుగా రిలేదీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ.. కడప ఉద్యమం విశాఖ ఉక్కు ఉద్యమాన్ని తలపిస్తోందన్నారు. భాజపా నాయకులు అఫిడవిట్‌లో ఓ మాట, బయట ఓ మాట చెబుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ..రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే సీఎం చంద్రబాబుకు మంచి పేరు వస్తుందనే మోదీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకుండా మోసగిస్తోందని విమర్శించారు. ఉక్కు ఉద్యమంతో మోదీ దిగిరావాల్సిందేనని ఎంపీ మురళీమోహన్ అన్నారు. చీకటి ఒప్పందాల కోసం జగన్ ప్రధాని మోదీకి సాగిలబడ్డారని విమర్శించారు. కాంగ్రెస్‌కు పట్టిన గతే భాజపాకు పడుతుందని హెచ్చరించారు. బాహుబలి సినిమావసూళ్ల కంటే తక్కువ నిధులు కేంద్రం ఏపీకి ఇచ్చిందని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ విమర్శించారు. కేంద్రం విభజన చట్టం హామీలు అమలు చేయకుంటే ఏపీ భాజపా అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. మోదీ, అమిత్‌షా, భాజపా అధికారంలోకి రాకుండా ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ.. వైకాపాలో కొందరు రాజీడ్రామాలు ఆడుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వం కుడిచేతిలో జగన్, ఎడమచేతిలో పవన్‌ను పెట్టుకుని కథ నడిపిస్తున్నారని ఎంపీ నిమ్మలకిష్టప్ప ఎద్దేవా చేశారు. అమరావతి శంకుస్థాపనకు వచ్చిన మోదీ దోసెడు మట్టి, చెంబుడు నీళ్లు తెచ్చి ఆంధ్రుల నోట్లో మట్టికొట్టారని ఎంపీ గరికపాటి మోహన్‌రావు విమర్శించారు. గుజరాత్ కంటే ఏపీ ముందు కెళుతుందనే భయంతోనే మోసం చేస్తున్నారని ఎంపీ బుట్టా రేణుక దుయ్యబట్టారు. రాజ్యసభ సభ్యులతో రాజీనామాలు చేయించకుండా వైకాపా రాజకీయం చేస్తోందని ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. కడప ఉక్కు దీక్ష విశాఖలో ఉద్యమాన్ని తలపిస్తోందని ఎంపీ అవంతి శ్రీనివాస్ అన్నారు. చిత్తూరు ఎంపీ శివప్రసాద్ తన ప్రసంగం మొత్తం హరికథ రూపంలో వివరించారు.

ఆరోగ్యం చెడగొట్టుకోకుండా దీక్ష విరమించు: జేసీ

'ఉక్కు దీక్షలతో ఉపయోగం లేదు.. మోదీ ఉన్నంత వరకు ఆంధ్రప్రదేశ్‌కు ఏమీ చేయరు. కేంద్రం మొండివైఖరితో ఉంది.. ఉక్కు కాదు కదా తుక్కు కూడా రాదు. ఆరోగ్యం చెడగొట్టుకోకుండా తొందరగా దీక్ష విరమించు' అని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి హితవు పలికారు. జగన్ గురించి జేసీ మాట్లాడుతూ.. 'నువ్వు.. నీ తాత చెబితే తప్ప బ్రహ్మదేవుడు చెప్పినా వినవు.. వయసులో పెద్దవాళ్లైనా సార్! అని పిలవాలంటావు. గర్వం తగ్గించుకో' అని సూచించారు. రాజశేఖర్‌రెడ్డిలో ఉన్న ఓర్పులో సగమైనా జగన్‌కు ఉంటే తాను ఎప్పుడో మద్దతిచ్చేవాడినని స్పష్టం చేశారు. జేసీ వ్యాఖ్యలపై మంత్రి ఆదినారాయణరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆమరణ దీక్ష చేస్తే ఆ కష్టం తెలుస్తుందని.. వచ్చి నాలుగు మాటలు మాట్లాడి భోజన సమయమైందని జేసీ వెళ్లారని ఆయన మాటలు పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పండుల రవీంద్రబాబు, సీతామహాలక్ష్మి, వర్ల రామయ్య పాల్గొన్నారు.

'చేనేత' సంక్షేమానికి ప్రత్యేక విధానపత్రం

- మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: చేనేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఓ విధానపత్రాన్ని తయారుచేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. సొసైటీల్లో ఉన్న సభ్యులకు మాత్రమే కాకుండా చేనేతలందరికీ ఉపయోగపడేలా సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నామని తెలిపారు. శుక్రవారం సచివాలయంలో 13 జిల్లాల చేనేత కార్మికుల పెద్దలతో సమావేశమైన అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. ఆప్కో బకాయిల నుంచి వెసులుబాటు కల్పించాలని, జనతా వస్త్రాల పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని, యార్న్‌పై సబ్సిడీ పెంచాలని, ఆరోగ్య బీమా సౌకర్యంపై కార్మికుల నుంచి అభ్యర్థనలు అందాయి. వీటిపై కూలంకుషంగా చర్చించి తయారుచేయనున్న విధానపత్రంలో చేరుస్తాం. వర్షాకాలంలో చేనేత కార్మికులకు ఆర్థికసాయాన్ని ఇవ్వాలన్న అభ్యర్థనలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తున్నాం. చేనేతల కోసం కార్పొరేషన్ లేదా ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసే విషయాన్ని పరిశీలిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు రజకులను ఎస్సీ.. వడ్డెర, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు వీలుగా ప్రత్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. కమిషన్ ఏర్పాటుపై రెండ్రోజుల్లో ఉత్తర్వులు వస్తాయని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకానికి తాత్కాలిక విరామం

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో ఒప్పంద ప్రాతిపదికన పంచాయతీ కార్యదర్శుల నియామక ప్రక్రియకు తాత్కాలిక విరామమేర్పడింది. ఒప్పంద పంచాయతీ కార్యదర్శుల నియామకానికి ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. పరిపాలన, సాంకేతిక కారణాలతో ఈ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ రంజిత్‌భాష ఉత్తర్వులిచ్చారు.

EDUCATION
★ ADMISSIONS Ag.B.Sc, ICAR APPROVED@7.5L. ✆ 7083847452.

అడ్మిషన్ గైడెన్స్ - 2018
B.V.SC @ జైపూర్ V.C.I Recog.,
Ag.B.Sc సెంట్రల్ యూనివర్సిటీ (సెంట్రల్ గవర్నమెంట్)
4 Lakhs / 4 yrs. 10 Seats Only
K.K.Raju, 89195 44392

ASIAN INSTITUTE OF VETERINARY AND AGRICULTURAL SCIENCES
B.Sc Veterinary Science Dur: 4 yrs - Elig: Bi.P.C | B.Sc Agriculture Dur: 4 yrs - Elig: Bi.P.C
❖ UGC & Govt. Recognised ❖ Morethan 2 Lakhs Jobs
❖ Placements Assured ❖ Eligible for Govt. Jobs
అడ్మిషన్లు జరుగుచున్నవి వెంటనే సంప్రదించండి
www.asianvetagri.com
Gollanapalli (V), Gannavaram (M), Vijayawada.
9133351165, 9581714852

ఏపీకి చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్

- కుప్పం పర్యటనలో మంత్రి నారా లోకేష్

శాంతిపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని.. ఆయనపై నమ్మకంతోనే రాష్ట్రానికి పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్నాయని పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలోభాగంగా.. రెండో రోజు శుక్రవారం ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతకుముందు మధ్యాహ్నం పార్టీ కార్యకర్తల సమావేశంలోనూ మంత్రి ప్రసంగించారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమంతోపాటు పారిశ్రామిక, ఉద్యోగ, ఉపాధి రంగాల ముందంజకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని పలు అంశాలు ఉదహరించారు. ఐటీ రంగంలో 36 వేల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించామన్నారు. కియా మోటార్స్ సహా అపోలో టైర్స్, ఏషియన్ పెయింట్స్ తదితర పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు.

భాజపాకు ఎదురుగాలి: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి దేశవ్యాప్తంగా ఎదురుగాలి వీస్తోందని, 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆ పార్టీకి సరైన గుణపాఠం చెబుతారని లోకేశ్ పేర్కొన్నారు. వైకాపా పత్రికలో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఒక్క వార్త అయినా రాశారా..? అని ప్రశ్నించారు. 'రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్న వైకాపా ఓ డ్రామా కంపెనీ. అందులో కమెడియన్ జగన్‌మోహన్ రెడ్డి. సహాయ నటులు ఆ పార్టీ ఎంపీలు. ఈ డ్రామాకు ప్రధాని మోదీ, అమిత్‌షా దర్శకత్వం వహిస్తున్నారు. వైకాపా ఎంపీల రాజీనామా కూడా ఓ నాటకమే' అని లోకేశ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఇవ్వకపోతే రానున్న ఎన్నికల్లో అసలైన సినిమా ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలవుతుందని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాకపోయి ఉంటే ఏపీ భవిష్యత్తు అంధకారంలో ఉండేదని పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు సారథ్యంలో ఇతర రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి సాధిస్తున్నామని తెలిపారు.

కుప్పం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో మంత్రి అమర్‌నాథరెడ్డి

పువ్వులాంటోడ్ని కోస్తానంటే ఊరుకుంటానా?

- కుమారుడి పోస్టుమార్టంకు అంగీకరించని తండ్రి

బాలాజీ చెరువు(కాకినాడ), న్యూస్‌టుడే

"పువ్వులాంటోడు నా బిడ్డ.... ఆడ్ని కోసి గుడ్డసు డతానంటే సూత్తా ఊరుకుంటానా. మీ దగ్గర ఏవేవో పెద్ద పెద్ద మిసన్లుంటాయ్ కదా... ఆడ్ని మల్లా తిరంగా సూడండి... ఎక్కడికీ పోడు... మా బుడ్డోడు బతికే ఉంటాడు. మా ఊరి దేవర ఆడికి పెద్ద ఉజ్జోగం వత్తాదన్నాడు. యారా దొన్ని.. సెప్పాడా? లేదా...? ఓరే... ఆలకి సెప్పు మట్టి పిసికిన సేతులివి. నా బిడ్డ జోలికొచ్చారో... ఒకొక్కడిపని సెప్తాను. సుబ్బి లేవరా... నిన్ను కోసెత్తారంట నాన్నా. ఏమనుకుంటున్నార్రా వీళ్లు రాజుగాడంటే.." ఇదీ... అల్లారు ముద్దుగా పెంచుకున్న తన కుమారుడు మృత్యువాత పడితే మృతదేహానికి పోస్టుమార్టం వద్దంటూ ఓ తండ్రిపడ్డ ఆవేదన. తన కుమారుడు చనిపోయాడని చెబుతూ.. కోసేయడమేంటని ప్రశ్నించిన అమాయకుడైన ఆ తండ్రి ఆక్రందన అందరి హృదయాలను ద్రవింపజేసింది.

విశాఖపట్నం జిల్లా కొయ్యూరు మండలం పోతారం గిరిజన గ్రామానికి చెందిన బోడెం సుబ్బారావు(11) స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 17న నేరేడు పండ్ల కోసం చెట్టుఎక్కి కిందపడ్డాడు. ప్రమాదంలో బాలుడి ఎడమ కాలు విరిగిపోగా, కుడి చెంప భాగంలో తీవ్ర గాయమైంది. తండ్రి కుమార్‌రాజు కుమారుడిని గ్రామానికి 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ్నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించాడు. నాటి నుంచి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం బాలుడు మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత సిబ్బంది ఆ బాలుడిని స్ట్రెచ్చర్‌పై మార్చురీకి తరలిస్తుండగా బాలుడి తండ్రి వారి వెనకే వస్తూ ఎక్కడికి తీసుకెళుతున్నారంటూ ప్రశ్నించాడు. అక్కడేం చేస్తారని అడిగాడు. మృతదేహానికి కోత ఏర్పాటు చేసి పోస్టుమార్టం చేస్తారని వారు చెప్పారు. అంతే... ఒక్కసారిగా బాలుడి తండ్రి వారిపై ఉగ్రరూపం దాల్చి ఘర్షణకు దిగాడు. తన బిడ్డను కొయ్యడమేంటని, అక్కడికక్కడే వదిలిపోవాలన్నాడు. అలా కుదరదని అంటే వారిని కొట్టబోయాడు. వారు కంగారుపడి మృతదేహాన్ని స్ట్రెచ్చర్‌పైనే ఉంచి అక్కడ వదిలి వెళ్లిపోయారు. అతనికి సర్దిచెప్పేందుకు మరికొందరు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కుమార్‌రాజు తన కుమారుడి మృతదేహాన్ని సమీపంలో చెట్టు కిందికి తరలించి తువ్వాలుతో గాలి విసురుతూ అక్కడే కూర్చున్నాడు. పోలీసులు జోక్యం చేసుకొని సమీపించేందుకు యత్నించిన వారందరిపైనా రాళ్లదాడికి దిగాడు. కొద్ది గంటల పాటు జరిగిన ఈ తంతు రణరంగాన్ని తలపించింది. ఆ సమయంలో బాలుడి తండ్రికి సోదరుడైన దొన్నితో కలిసి ఫోరెన్సిక్ విభాగాధిపతి డా. ఉమామహేశ్వరరావు, సహాయ అధ్యాపకుడు డా.ఫణికిరణ్.. రాజు వద్దకు వెళ్లారు. శరీరాన్ని ముక్కలుగా కోయడం పచ్చి అబద్ధమని తెలిపారు. వారి వివరణతో బాలుడి తండ్రి శాంతించాడు. మృతదేహాన్ని సిబ్బందికి అప్పగించి చివరకు పోస్టుమార్టం నిర్వహించేందుకు అంగీకరించాడు.

బోడెం సుబ్బారావు మృతదేహం

రైతుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు

- సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ

పోలవరం, కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు రైతుల జీవనాడి అని సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. లక్షలాది మంది రైతులకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టు ఎంత త్వరగా పూర్తయితే అంత మంచిదన్నారు. శుక్రవారం నమూనా ప్రాజెక్టును, స్పిల్ వే వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం పనులను పవర్ పాయింట్ ద్వారా వీక్షించి ప్రాజెక్టు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు 2010 అంచనా ప్రకారం రూ.16 వేల కోట్లు కాగా.. ఇప్పుడు రూ.58 వేల కోట్లకు పెరిగిందన్నారు. అందులో నిర్వాసితులకు రూ.33వేల కోట్లు ఖర్చు చూపారన్నారు. నిర్వాసితులందరికీ వేర్వేరు విధాలుగా పరిహారం ఇస్తున్నారని తెలిసిందని.. అందరికీ ఒకే విధమైన పరిహారం ఇవ్వాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎక్కడాలేని విధంగా ఇక్కడ డయాఫ్రం వాల్‌ను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం గొప్ప విషయమని.. నీటి ప్రవాహాన్ని మరల్చేందుకు ప్రత్యేకంగా స్పిల్ వే నిర్మిస్తున్నారని వివరించారు. దాదాపు 68శాతం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినట్లు చెబుతున్నారన్నారు. పరిహారం విషయంలో ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని మూలలంక బాధిత రైతులు లక్ష్మీనారాయణకు వివరించగా.. నిబంధనలు ఎలా ఉన్నాయో పరిశీలించాక మాట్లాడదామని వారితో అన్నారు.

పోలవరం పనులను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

ముగ్గురు ఐఏఎస్ అధికారుల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) కార్యదర్శిగా ఉన్న పి. కోటేశ్వరరావును కడప జిల్లా సంయుక్త కలెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం కడప జిల్లా సంయుక్త కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ విభాగం డైరెక్టరుగా పనిచేస్తున్న సి.నాగరాణిని చేనేత, జౌళి శాఖ డైరెక్టరుగా బదిలీ చేసింది. విశాఖ జిల్లాలోని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఉన్న పి.రవిసుభాష్‌ను డా.ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా నియమించింది. పాడేరు సబ్‌కలెక్టర్ డి.కె. బాలాజీకి పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఏపీ ఈసెట్ కౌన్సెలింగ్ 9 నుంచి

ఈనాడు, అమరావతి: ఏపీ ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కన్వీనర్ పండాదాస్ ప్రకటించారు. వచ్చే నెల 9నుంచి 12వ తేదీవరకు దీన్ని నిర్వహించనున్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలనను ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. పత్రాల పరిశీలనలో సమస్యలు ఏర్పడినవారు మాత్రమే సహాయ కేంద్రాలకు హాజరుకావాల్సి ఉంటుంది. క్రీడలు, ఎన్‌సీసీ, క్యాప్, విభిన్న ప్రతిభావంతుల ధ్రువీకరణ పత్రాలకు ప్రత్యేకంగా విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. వచ్చే నెల 9 నుంచి 12వ తేదీ వరకు అభ్యర్థులు ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. 14న సీట్లను కేటాయిస్తారు.

సంస్కృత విద్యాపీఠంపై ఫిర్యాదుల పరంపర

- డీన్ పేరుతో లేఖలు

ఈనాడు - తిరుపతి: తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఉపకులపతి మురళీధర్‌శర్మపై నిత్యం యూజీసీతోపాటు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖకు కొందరు ఫిర్యాదులు చేస్తుండటంపై తిరుపతి పశ్చిమ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు పోలీసులు 9 మందికి తాఖీదులు జారీ చేశారు. విద్యాపీఠం వీసీపై ఇక్కడే విద్యా విభాగంలో డీన్‌గా పనిచేస్తున్న ప్రహ్లాద్‌జోషీ పేరుతో ఫిర్యాదులు వెళ్లాయి. ఈ ఫిర్యాదులపై విశ్వవిద్యాలయ పాలకమండలి ఎప్పటికప్పుడు ఉపకులపతి వివరణ తీసుకుంటోంది. కేవలం ఒకే వ్యక్తి పేరుతో లేఖల పరంపరపై పాలకమండలి సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా వీసీని ఆదేశించారు. ఆ మేరకు డీన్ ప్రహ్లాద్ జోషీ సంజాయిషీ కోరారు. తనకు ఎలాంటి సంబంధం లేదని వివరిస్తూనే, తన సంతకంతో కొందరు ఫిర్యాదులు పంపుతున్నారని పశ్చిమ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తొమ్మిది మందిని విచారణకు హాజరుకావాలని పోలీసులు ఆదేశించారు.

25న శ్రీవారి ఆభరణాల పరిశీలన

తితిదే ధర్మకర్తల మండలి నిర్ణయం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి స్వర్ణాభరణాలను తితిదే ధర్మకర్తల మండలి ఈ నెల 25న పరిశీలించనుంది. స్వామి వారికి అన్నప్రసాదాలు తయారు చేసే వకుళామాత పోటునూ తనిఖీ చేయనుంది. స్వామి ఆభరణాల భద్రత, శ్రీవారికి అన్నప్రసాదాలు తయారుచేసే పోటులో తవ్వకాలపై ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు ఆరోపణల నేపథ్యంలో.. అనుమానాల నివృత్తికి మండలి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 26న జరగనున్న ధర్మకర్తల మండలి సమావేశం ఉదయం కాకుండా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నిర్వహించనున్నారు. జ్యేష్ఠాభిషేకం ఉత్సవాల నేపథ్యంలో ఈ మార్పు చేశారు.

ఎన్టీఆర్ విద్యోన్నతి ప్రోత్సాహకం పెంపు!

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం కింద సివిల్స్ శిక్షణ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రతినెలా ఇచ్చే ప్రోత్సాహకాన్ని రూ.10వేల నుంచి రూ.12 వేలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో పాటు శిక్షణా సంస్థకు చెల్లిస్తున్న రుసుమును సైతం పెంచాలని సంక్షేమ శాఖల అధికారులు నిర్ణయించారు. దీన్ని రూ.1.20 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఒక్కో అభ్యర్థికి రూ.90 వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ ఫీజుల ప్రకారం శిక్షణ ఇచ్చేందుకు వివిధ సంస్థలు నిరాకరిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల సంచాలకులు ఇటీవల సమావేశమై దీనిపై చర్చించారు. సంస్థలకు చెల్లిస్తున్న మొత్తాన్ని పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. త్వరలో అనుమతులు లభించే అవకాశాలున్నాయి.

సిపెట్ ఆన్‌లైన్ పరీక్ష దరఖాస్తుకు 27 వరకు గడువు

ఆటోనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) కోర్సుల్లో ప్రవేశాలకు.. జులై 1న జరగనున్న ఆలిండియా సిపెట్ జేఈఈ ఆన్‌లైన్ పరీక్షకు ఈ నెల 27వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సిపెట్ విజయవాడ డైరెక్టర్ అండ్ హెడ్ వి.కిరణ్‌కుమార్ తెలిపారు. విజయవాడలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కోర్సుల్లో చేరేవారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా ఫీజు రీఎంబర్స్‌మెంట్ సదుపాయం కల్పించిందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు https://eadmission.cipet.gov.in వెబ్‌సైట్‌లో పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9959333415, 8977033373, 9440531978 నెంబర్లలో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1800 3002 8373లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కాపు వసతిగృహ నిర్మాణానికి నిధులకు వినతి

ఈనాడు డిజిటల్, అమరావతి: రాయలసీమ విద్యార్థుల కోసం తిరుపతిలో నిర్మించనున్న కాపు వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బలిజ అభ్యుదయ సమితి తరఫున అఖిల భారత కాపు సమాఖ్య నేతలు సీఎంకు వినతిపత్రం అందజేశారు. రాయలసీమ విద్యార్థుల కోసం తిరుపతిలో రూ.30 కోట్ల విలువైన ఎకరంన్నర స్థలం కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు. సీఎంను కలిసిన వారిలో సమాఖ్య అధ్యక్షుడు ఊక విజయకుమార్, కాపు కార్పొరేషన్ డైరెక్టరు రాయల మురళీమోహన్ తదితరులు ఉన్నారు.

24 నుంచి అందుబాటులోకి ఏపీ సెట్ హాల్ టిక్కెట్లు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల ఉద్యోగాలకు అర్హత కల్పించే రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష (ఏపీసెట్) హాల్ టిక్కెట్లు ఈ నెల 24 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నామని సెట్ సభ్య కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తుదారులు ఏపీ సెట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

వైద్య పర్యాటకానికి రంగం సిద్ధం

- విశాఖ రుషికొండ ప్రాంతంలో ఏర్పాటుకు సన్నద్ధం
- తొలుత 15 గృహాల్లో ప్రారంభం
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో మౌలికవసతుల అభివృద్ధి!

వైద్య పర్యాటకానికి కేటాయించిన వుడా రోహౌసింగ్ ప్రాంగణం

ఈనాడు - విశాఖపట్నం

రాష్ట్రంలో మొదటిసారిగా వైద్య పర్యాటకానికి విశాఖలో బీజం పడింది. పలు రకాల అనారోగ్యాలతో బాధపడుతున్నవారు, శస్త్రచికిత్స చేయించుకున్నవారు ప్రశాంతమైన వాతావరణంలో కొంతకాలంపాటు విశ్రాంతి తీసుకోవాలనుకుంటారు. అదే సమయంలో వారికి అవసరమైన వైద్యం పొందడంతో పాటు ఆరోగ్య బాగోగులు చూసుకోవడానికి నిపుణులైన సిబ్బంది అందుబాటులో ఉంటే కొండంత భరోసాగా ఉన్నట్లు భావిస్తారు. అన్ని రకాల వైద్యసేవలు ఒకేచోట లభిస్తే బాగుంటుందని కోరుకుంటారు.. వీటన్నింటినీ విశాఖలో అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆదర్శనీయంగా కేరళ..

కేరళ మినహా దేశంలో మరెక్కడా ఎక్కడా ఇలాంటి ప్రత్యేక కేంద్రాలు అందుబాటులో లేవు. కేరళ ప్రభుత్వం వైద్య పర్యాటకాన్ని ఎంతగానో అభివృద్ధి చేసింది. శస్త్రచికిత్సల అనంతర సేవలను అందించడానికి, విశ్రాంతిగా గడపడానికి వీలుకల్పించే మౌలిక వసతులను ప్రైవేటు సంస్థలతో అభివృద్ధి చేయించింది. ఇంగ్లిషు వైద్యంతోపాటు హోమియోపతి, ఆయుర్వేదం తదితర వైదవిధానాల్లోనూ, నాచురోపతి పేరుతో ప్రకృతివైద్య సేవలను వైద్య పర్యాటకంలో భాగంగా అందిస్తున్నారు. ఆహార నియమాలు, వ్యాయామం, వైద్యపరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపైనా నిపుణులు అవగాహన కల్పిస్తారు. ఈ తరహా సేవలన్నీ లభించేలా వైద్య పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం విశాఖను వేదికగా ఎంచుకుంది.

విశాఖలోని సుందర సాగరతీరం ఉన్న రుషికొండ ప్రాంతంలో వుడా రోహౌసింగ్ ప్రాంగణంలోని 15 భవనాలను ముందుగా వైద్యపర్యాటకంలో భాగంగా వివిధ రకాల సేవలందించే సంస్థలకు కేటాయిస్తారు. అందుకోసం ఇప్పటికే 'అమృత్ సొసైటీ' పేరుతో సంస్థను ఏర్పాటుచేశారు. వైద్య, ఆరోగ్యశాఖ, పర్యాటకశాఖలు ఈ ప్రాజెక్టును విజయవంతం చేయడానికి కృషి చేస్తాయి. వైద్యఆరోగ్యశాఖ తరఫున 'ఆయుష్' విభాగం వైద్య పర్యాటకానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తోంది. అవసరమైన మౌలికవసతులను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. విశాఖలో ఏర్పాటు చేయనున్న వైద్య పర్యాటక ప్రాజెక్టు విజయవంతానికి తొలుత ప్రతిపాదనలు ఆహ్వానించి (ఆర్.ఎఫ్.పి.) ఎలాంటి వసతులను అందించాలన్న అంశంపై తుదినిర్ణయం తీసుకోనున్నారు.

వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ

ఏటా లక్షలాది మంది దేశ విదేశీ పర్యాటకులు విశాఖకు వస్తున్న నేపథ్యంలో వైద్య పర్యాటకానికి అవసరమైన మౌలికవసతులను విశాఖలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ప్రయోగాత్మకంగా 15 గృహాలను అవసరమైన సేవలు అందించడానికి కేటాయించి స్పందన బట్టి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమృత్ ప్రాజెక్టును గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

– పూనం మాలకొండయ్య,
వైద్య,ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

విశాఖ కేజీహెచ్ కేంద్రంగా శిశు మరణాలపై అధ్యయనం

ఈనాడు, అమరావతి: శిశు మరణాలను తగ్గించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సంబంధిత కారణాలపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేకంగా విశాఖ కేజీహెచ్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. శిశు మరణాలు జరిగిన వెంటనే సంబంధిత ఆస్పత్రుల అధికారులు ఆయా కేసు షీట్లను పంపించాల్సి ఉంటుంది. వీటిని ఈ కేంద్రంలోని గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యనిపుణులు పరిశీలించి అవగాహనకు వస్తారు. అనంతరం గుర్తించిన అంశాల ప్రతిపాదికన అవసరమైన శిక్షణ కార్యక్రమాలను వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి నిర్వహించనున్నారు. దీని వల్ల సత్ఫలితాలు కనిపిస్తాయన్న ఆశాభావాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి పూనం మాలకొండయ్య వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ జులై నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

ఆరోగ్యసేవలపై ప్రత్యేక పుస్తకం: సాధికార మిత్రలకు ఆరోగ్యసేవలపై అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలుగులో ప్రత్యేక పుస్తకాన్ని ప్రచురించింది. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువుల సంరక్షణ, ఎన్టీఆర్ వైద్య పరీక్షలు, ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రాలు, చంద్రన్న సంచార చికిత్స, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచిత డయాలసిస్ సేవలు తదితర సమాచారం పొందుపరిచారు.

సహ కమిషనర్లను నియమించలేదెందుకు?

- సమాధానం చెప్పాలంటూ ఏపీ సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: న్యాయస్థానానికి ఇచ్చిన హామీ మేరకు సమాచార కమిషనర్లను ఎందుకు నియమించలేదో చెప్పాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేశ్‌కుమార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో ప్రమాణపత్రం దాఖలు చేయాలంటూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. స.హ(సమాచార హక్కు చట్టం) కమిషనర్ల నియామకంలో జరుగుతున్న జాప్యాన్ని సవాలు చేస్తూ 'ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్' స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి గతేడాది హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఆపై కోర్టు ఆదేశానుసారం ఏపీలో స.హ కమిషనర్లను ఇప్పటివరకు నియమించలేదంటూ కోర్టుధిక్కరణ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం పైమేరకు ఆదేశించింది.

అనిశా కేసులో మాజీ డీఎంహెచ్‌వోకు మూడేళ్ల జైలు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న నేరం రుజువుకావటంతో విజయనగరం జిల్లా మాజీ వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి అప్పలరామయ్యకు.. మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ విశాఖలోని మూడో అదనపు జిల్లా న్యాయస్థానం, అవినీతి నిరోధక న్యాయస్థానం న్యాయమూర్తి తీర్పునిచ్చారు. విజయనగరం అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ ఎస్.కె.షకీలా భాను అందించిన కేసు వివరాల ప్రకారం.. 2003లో డాక్టర్ అప్పలరామయ్య విజయనగరంలో డీఎంహెచ్‌వోగా పనిచేసేవారు. ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో అనిశా అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో ఆమేరకు రుజువు కావడంతో కోర్టు శిక్షను ఖరారు చేసింది.

సంక్షేమ పథకాలతో వలసలు తగ్గాయి

రాష్ట్ర వడ్డెర సంఘాల నాయకులు

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వలసలు తగ్గాయని రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు అన్నారు. వడ్డెరల జీవన విధానాలను అధ్యయనం చేసేందుకు కమిటీ నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి, రాష్ట్ర వడ్డెర ఫెడరేషన్ ఛైర్మన్ దేవర్ల మురళి ఆధ్వర్యంలో వడ్డెర సంఘాల నాయకులు శుక్రవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రిని సన్మానించారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చుతామని మహానాడులో తీర్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అఖిల భారత వడ్డెర సంఘం అధ్యక్షుడు వెల్లెపు నాగేశ్వరరావు, రాష్ట్ర వడ్డెర్ల సంఘం నాయకులు బత్తుల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వెటర్నరీ భవనం ప్రారంభానికి ముఖ్యమంత్రికి ఆహ్వానం

తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయంలో రూ.15 కోట్లతో నిర్మించిన తారకరామ భవనం ప్రారంభోత్సవానికి వర్సిటీ బోర్డు సభ్యుడు డాక్టర్ కరుణానిధి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ఈ మేరకు సీఎంను కలిసి విన్నవించినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

A.P. CO-OPERATIVE OILSEEDS GROWERS' FEDN. LTD.,
D.No. 55-17, 2 to 4 "C" Block, 4th Floor, Road No.2, Industrial Estate, Jawahar Autonagar, Vijayawada-520 007, Ph No.: 0866-2974545, E-mail : apoilfedbrkr@gmail.com
APOILFED
Ref. No. MK/CM/Pack. Matrl./294/ 2018-19 Dt : 21.06.2018
E - AUCTION NOTICE
Name of Work: Empanelment of Suppliers for SUPPLY OF PACKING MATERIAL to APOILFED through NeML e-auction Platform REQUIREMENT OF PACKING MATERIALS FOR 6 MONTHS. **e-Auction Date : 12.07.2018.** Contact Details for Enrolment in NCDEX e-Market Ltd : **Sreeram : 8121156977; Anjaneyulu: 9642332994**, Email: **askus@neml.in**. Further details can be seen @ NCDEX e-Markets Ltd @ **www.neml.in**
Sd/- V. C & MANAGING DIRECTOR

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
టెండరు ఆహ్వాన ప్రకటన
సంవత్సరానికి కావలసిన కెమికల్ మెటీరియల్స్ సేకరణ నిమిత్తం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (పి అండ్ పి), తి.తి.దేలు ప్రెస్ కార్యాలయం వారిచే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తి.తి.దేవస్థానములు, తిరుపతి వారి తరపున ఈ-టెండర్లు కోరడమైనది. ఆసక్తిగల వారుడిజిటల్ సర్టిఫికెట్ ద్వారా సంతకం చేసి సెక్యూరిటీ మోడ్‌లో www.apeprocurement.gov.inకు లాగానై ఈ-టెండరు నందు పాల్గొనవలెను. లేదా తితిదే వెబ్‌సైట్ : www.tirumal.org నుంచి బిడ్ డౌన్‌లోడ్ చేసుకోవలెను. దరావతు రూ॥లు. 33,500/-. తదుపరి వివరాలకు గాను సంప్రదించవలసిన ఫోన్ నెం: 0877-2264292.
కార్యనిర్వహణాధికారి
Roc.No: PR4/1090/Adv.No: 125/ PRO/2018, Dt: 22-06-2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
e- ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 10/PLAN MDR/GNT/C.E. (R&B) MDR/EE(R)/DEE4/AE1 తేది: 20.6.2018
గుంటూరు జిల్లాలో 1 పనికొరకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా విలువ: రూ. 6.00 కోట్లు. టెండర్లను ది. 25-6-2018 మ.గం. 3.00ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 2-7-2018 మ.గం. 3.30 వరకు. సంబంధిత SE: పర్యవేక్షక ఇంజినీరు (R&B) గుంటూరు. తదుపరి వివరాలు e-మార్కెట్ ప్రదేశం www.tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
DIPR No 876/CL/Advt/1/1/2018-19 సం/- చీఫ్ ఇంజినీర్, (R&B), MDR

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ
ఆసక్తి వ్యక్తీకరణ
No.01/EOI/UGD/18-19 తేది: 18-6-2018
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యొక్క 13 జిల్లాలలో 152 గ్రామాలు/ఆవాసాలలో రమారమి 2400 కి.మీ. పొడవునా 3 సంవత్సరాల డిఫెక్ట్ లయబిలిటీ వ్యవధితో సరఫరా, వేయుట మరియు U-PVC/DWC PE పైపులను కలుపుటతోపాటు భూగర్భ డ్రైనేజి సిస్టం ఏర్పాటు కొరకు ఆసక్తి వ్యక్తీకరణ. EOI దాఖలుకు ప్రారంభ తేది: 25-6-2018. ఆసక్తి వ్యక్తీకరణను స్వీకరణకు చివరి తేది: 24-7-2018 గం. 15.00 లోపు. టెండర్లు తెరుచు తేది: 24-7-2018 గం. 15.30 లకు. వివరమైన సమాచారము కొరకు మా వెబ్‌సైట్ www.pred.gov.in ను గమనించగలరు. e-మెయిల్: eic_pr@ap.gov.in
DIPR No 867/CL/Advt/1/1/2018-19 సం/- ఇంజినీర్ - ఇన్ - చీఫ్ పంచాయతీరాజ్, విజయవాడ

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)
'E' Procurement Notice No. 29/VMC-Engg/CDB/AE/2018-19, Dt. 22-06-2018

Sl. No.	Name of work	Estimate Amount Rs. in Lakhs
1.	Construction of Community Hall (1 work)	109.00

Contact: Superintending Engineer, VMC, Vijayawada - 520 001
Further details can be seen @ 'e' procurement maket place @ www.tender.apeprocurement.gov.in.
Download of bid documents starts - 23-06-2018 @ 03.30 P.M.
Last date/ time for receipt of tenders 07-07-2018 up to 4.00 P.M.
Sd/- P. ADISESHU, for COMMISSIONER

సెక్రటరీ కార్యాలయము
ఆం.ప్ర. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ
D.No. 12-467-9, మోక్షసాయి ప్లాజా, సర్వీస్‌రోడ్, తాడేపల్లి. గుంటూరు జిల్లా - 522 501
స్వల్ప వ్యవధి టెండరు ప్రకటన R.C. No. Amenities/17021/1/2018, తేది: 20-6-2018
2018 - 19 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు 1.ట్రంక్ బాక్స్‌లు 2.ప్లేట్లు, కటోరాలతో గ్లాసులు 3.పాత్రలు 4.చున్నీలు 5.కార్పెట్లు 6.తువ్వాళ్లు 7.బెడ్‌షీట్లు, 8.కాస్మెటిక్ కిట్లు, 9.టు టైర్ కాట్స్ మరియు డ్యూయల్ డెస్కుల సరఫరాకు వార్షికరేట్ కాంట్రాక్ట్ కొరకు సమోదైన తయారీదారులు / ట్రేడర్స్/ సరఫరాదారుల నుండి వేర్వేరు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. నియమనిబంధనలతో కూడిన టెండరు షెడ్యూళ్లను క్ర.సం. 1 నుండి 8 వరకు రూ. 15,000/-లు క్ర.సం. 9కి రూ. 25,000/-లను డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో సెక్రటరీ APSWREI సొసైటీ పేరిట తాడేపల్లి వద్ద చెల్లుబాటగునట్లు చెల్లించి ది. 23-6-2018 నుండి 29-6-2018 వరకు అన్ని పనిదినములలో ఉ.గం. 10.00 నుండి సా.గం.5.30 వరకు. సెక్రటరీ కార్యాలయము, APSWREI సొసైటీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా నుండి పొందవచ్చును. సదరు టెండరు షెడ్యూళ్లను www.apswreis.info నుండి కూడా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. పూరించిన టెండరు ఫారాల స్వీకరణ తేది : 2.7.2018 మ.గం. 3.00 వరకు.
DIPR No. 185PP/CL/Advt/1/1/2018-19 సం/- సెక్రటరీ

రైతుకు దన్నుగా 'వెలుగు'

- త్వరలో 'ముదురు తోటల పునరుద్ధరణ' పథకం
- తొలిగా జీడిమామిడి సాగు దిగుబడి పెంపుపై దృష్టి
- పైలట్ ప్రాజెక్టుగా 29 గిరిజన మండలాల్లో అమలు
- 4,500 మందికి గిరిజన రైతులకు ప్రయోజనం

ఈనాడు డిజిటల్ - అమరావతి

పంటల సాగులో రైతులకు దన్నుగా నిలిచేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(వెలుగు/సెర్ప్) కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకోసం ముదురు తోటల పునరుద్ధరణ కార్యక్రమం పేరుతో ఒక కొత్త పథకాన్ని త్వరలో అమల్లోకి తీసుకువస్తోంది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగులో దిగుబడి పెంపునకు అవసరమైన సూచనలు రైతులకు ఇవ్వడంతో పాటు కొంత మొత్తాన్ని రుణంగా అందించనున్నారు. తొలిగా గిరిజన ప్రాంతాల్లోని జీడి మామిడి(క్యాషియో) సాగుపై దృష్టి పెట్టిన అధికారులు సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, కే.ఆర్.పురం, చింతూరు సమీకృత గిరిజన ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పరిధిలోని 29 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ విజయవంతమైతే వచ్చే ఏడాది నుంచి మామిడి, చీనీ(బత్తాయి), దానిమ్మ తదితర ఉద్యానపంటల సాగుకు ఈ పథకాన్ని విస్తరించనున్నారు.

ప్రతి రైతుకు రూ. 10 వేలు: ఎంపిక చేసిన గిరిజన మండలాల్లో మొత్తం 6,500 ఎకరాల్లో 4,500 మంది రైతులు జీడి మామిడి పంటను సాగు చేస్తున్నారు. వీరిలో ఒకొక్కరికి గిరిజన ఉపప్రణాళిక కింద రూ.5 వేల మొత్తాన్ని రాయితీగా అందించడంతో పాటు సెర్ప్ ద్వారా మరో రూ.5 వేలు రుణంగా అందిస్తారు. రాష్ట్రంలో ఎకరా సాగుకు జీడి మామిడి దిగుబడి 250 కిలోలు ఉండగా ఇదే పంట మీద మహారాష్ట్రలోని రైతులు ఎకరాపై 500 కిలోల దిగుబడి సాధిస్తున్నారు. దీనిపై దృష్టి సారించిన అధికారులు ఈ సాగులో దిగుబడి పెంచేందుకు సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలతో సెర్ప్ పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇప్పించారు. వీరు క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించనున్నారు. పథకం అమలుకు గాను 20 ఏళ్ల పైబడిన చెట్లను పరిగణనలోకి తీసుకుంటారు. ఒక్కో రైతుకు ఎకరా నుంచి ఎకరంన్నర సాగుకు పథకాన్ని పరిమితం చేయనున్నారు. దళారులు పంటకు సరైన మార్కెట్ ధర దక్కకుండా చేస్తున్నారని గుర్తించిన అధికారులు వాస్తవ ధరకు కొనుగోలు చేసేలా ఓలమ్ అనే కంపెనీతో ఇప్పటికే ఒప్పందం చేసుకున్నారు.

ఈ పథకం కింద రైతులకు చేకూరే ప్రయోజనం

- చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు అందిస్తారు.
- మొక్కలకు అనవసరంగాఉన్న కొమ్మల కత్తిరింపుపై అవగాహన కల్పిస్తారు.
- నీటి వినియోగంపై అవగాహన.
- ఎరువులు ఏ సమయంలో వేయాలి. ఎంత పరిమాణంలో వేయాలన్న అంశంపై..
- సాగుకు సోకే తెగులు నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు వివరిస్తూ 50 శాతం దిగుబడి పెరిగేలా చేయడం.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు. చిత్రంలో మండాది వెంకట్రావు, కృష్ణదాసు తదితరులు

కనీస వేతనం ఇవ్వకుంటే పోరాడుతాం

రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం స్పష్టీకరణ

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: రేషన్ డీలర్లకు కనీస వేతనాలు ఇవ్వకుంటే రోడ్డెక్కి పోరాడుతామని ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుగతా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మండాది వెంకట్రావు తెలిపారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్ని సమస్యలు వచ్చినా ప్రభుత్వానికి మచ్చ రాకుండా పని చేస్తున్నామన్నారు. నెలకు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు మాత్రమే మిగులుతోందని.. ఇది దుకాణ అద్దెలకు కూడా సరిపోవడం లేదన్నారు. విద్యుత్తు బిల్లులు, సహాయకుడికి వేతనం, సరకుల దిగుమతి, తరుగులాంటి ఖర్చులు డీలర్లు భరించే స్థితిలో లేరన్నారు. కనీస వేతనంగా రూ.30 వేలు ఇవ్వాలని, నాలుగోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, దుకాణం అద్దె, సరకుల రవాణా, దిగుమతి ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుడి వేలుముద్రలు పడకపోతే నామినిగా మరొకరికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ-పోస్ యంత్రాల్లో ప్రభుత్వం ఇచ్చిన సిమ్‌కార్డులు పని చేయకపోవడంతో కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారని దీన్ని డీలర్ల వైఫల్యంగా చూపడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు వి.కృష్ణదాసు, రాష్ట్ర వ్యాప్త డీలర్లు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణలో.. సిబ్బంది పాత్ర ఉంటే కఠిన చర్యలు: మంత్రి శిద్దా

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎర్రచందనం అక్రమ రవాణాలో అటవీ శాఖ అధికారుల పాత్ర ఉన్నట్లు రుజువయితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. అటవీ నిబంధనలు అతిక్రమించే వారిపై ఉదాసీనంగా వ్యవహరించబోమని, ఏ రాజకీయపార్టీ వారైనా శిక్ష తప్పదని స్పష్టం చేశారు. ఎర్రచందన పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందుకోసం తొలిసారిగా రూ.25 కోట్లు కేటాయించినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీశైలంలోని ఇష్టకామేశ్వరి దేవాలయానికి వెళ్లే భక్తులను అటవీ సిబ్బంది, వాచర్ల కోసం కేటాయించిన వాహనాల్లో తరలిస్తున్నారని, అధిక మొత్తాల్లో వసూళ్లకు పాల్పడుతున్నారన్న విషయం తన దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. దీనిపై నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమాజానికి దక్కని పరిశోధన ఫలాలు

ఏయూ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు వెల్లడి

సదస్సులో ప్రసంగిస్తున్న ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు, వేదికపై యూజీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు

నగరం, చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు జరుగుతున్న పరిశోధనల ఫలితాలు ప్రజలకు చేరడం లేదని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా నగరంలోని ఎస్వీఆర్‌ఎం కళాశాలలో పరిశ్రమలు, పర్యావరణంలో రసాయనశాస్త్ర పరిజ్ఞానం అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. రసాయన సమ్మిళితమే మానవ శరీరమని, అధ్యాపకులు ఈ శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సుధాకరరావు అధ్యక్షోపన్యాసం చేయగా పర్యావరణ కాలుష్యానికి ప్రధానమైన కారకాల్లో ప్లాస్టిక్ ఒకటని నిర్వాహకుల్లో ఒకరైన ఆచార్య సోమశేఖర్ అన్నారు. ఇరాన్, శ్రీలంక, మలేషియా, హాంగ్‌కాంగ్ తదితర దేశాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. కళాశాల కరస్పాండెంట్ ఆచార్య ఆర్.ప్రభాకర్, యూజీసీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి.శ్రీనివాస్, శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐఎస్‌సీ ఆచార్యుడు డాక్టర్ జి.నరహరిశర్మ, తదితరులు ప్రసంగించారు.

ఆయేషా మీరా హత్య కేసులో.. నార్కో అనాలసిస్ పిటిషన్ కొట్టివేత

విజయవాడ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఆయేషా మీరా హత్య కేసు పునఃవిచారణలో భాగంగా ఏడుగురు అనుమానితులపై నార్కోఅనాలసిస్ అనుమతి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ విజయవాడ నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2007 డిసెంబర్ 26 రాత్రి ఇబ్రహీంపట్నంలోని శ్రీ దుర్గా మహిళా వసతిగృహంలో ఆయేషా మీరాపై అత్యాచారం జరిగి హత్యకు గురికాగా ఈ కేసు పలుమలుపులు తిరుగుతూ సత్యంబాబు అనే వ్యక్తిని పోలీసులు తెరపైకి తీసుకొచ్చారు. 2010లో ఈ కేసులో విజయవాడ మహిళా సెషన్స్ న్యాయస్థానం సత్యంబాబుకు జీవిత ఖైదీ శిక్ష విధించగా ఆయన హైకోర్టులో అప్పీలు చేశారు. మార్చి 31, 2017న హైకోర్టు ఈ కేసును కొట్టి వేస్తూ సత్యంబాబును విడుదల చేయాలని ఆదేశించింది. దీంతోపాటు ఈ కేసును తిరిగి విచారించాలని తీర్పులో పేర్కొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటుచేసి విచారణకు ఆదేశించింది. ఈ మేరకు కోనేరు సతీష్(44), అబ్బూరి గణేష్(29), చింతల పవన్‌కుమార్(38), ఐనపూరి పద్మ(50), ఐనపూరి వెంకట శివరామకృష్ణ(57), సౌమ్య(31), కవిత(31)పై సిట్ బృందం తిరిగి విచారణ చేపట్టింది. దర్యాప్తులో భాగంగా అనుమానితులు విచారణకు సహకరించడం లేదని వీరిని నార్కోఅనాలసిస్ పరీక్షలకు అనుమతించాలని కోరుతూ సిట్ అధికారులు ఏప్రిల్ 03, 2018న విజయవాడ నాలుగో ఏసీఎంఎం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

సినీతారలకు వీసాలు నిరాకరిస్తున్న అమెరికా

తెలుగు సంఘాల మెడకు మోదుగుమూడి ఉచ్చు

ఈనాడు, హైదరాబాద్: దేశం కాని దేశంలో ఐక్యతను చాటుకునేందుకు ఏర్పాటు చేసుకున్న అమెరికాలోని తెలుగు సంఘాలకు కిషన్ మోదుగుమూడి రూపంలో కొత్త కష్టం వచ్చి పడింది. వచ్చే నెలలో ఒక ప్రముఖ సంఘం నిర్వహించబోయే కార్యక్రమానికి సినీతారలకు వీసాలు నిరాకరించడంతో పాటు ఇతర ప్రముఖుల విషయంలోనూ అమెరికా పోలీసులు భారీ కోత విధించినట్లు సమాచారం. మామూలుగా అయితే ఈ సంఘాల నుంచి ఆహ్వానం అందిన వారందరికీ తాత్కాలిక వీసాలు మంజూరు చేస్తుంటారు. మోదుగుమూడి ఉదంతాన్ని అమెరికా పోలీసులు తీవ్రంగా పరిగణిస్తుండటంతో నిరాకరిస్తున్నారు. సినీతారలను ఎందుకు పిలిపిస్తారని ఇటీవల సాంస్కృతిక సంస్థల నిర్వాహకులను అమెరికా పోలీసులు సూటిగా అడగ్గా, కార్యక్రమాన్ని ఆకర్షణీయంగా చేసేందుకు, ఎక్కువ మంది హాజరయ్యేందుకు రప్పిస్తుంటామని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సమాధానం పట్ల అధికారులు అంతగా సంతృప్తి చెందలేదని, ఇందులో ఇంకా ఏదో మతలబు ఉందని అనుమానిస్తున్నారని, తాజా ఉదంతాన్ని ఉదాహరణగా చూపుతున్నారని తెలుగు సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. తెలుగు సంఘాలకు ఈ కుంభకోణంతో సంబంధం లేకపోయినా మోదుగుమూడి దంపతులు వాటి పేర్లు వాడుకున్నారు. దీంతో దీని ప్రభావం అన్ని తెలుగు సంఘాలపై పడింది. భవిష్యత్తులో సమావేశాలు ఎలా నిర్వహించాలా అని సంఘాల ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు.

అమిత్‌షాపై విచారణకు ఆదేశించండి: రఘువీరా

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, ఆయన కుమారుడు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని, వారిపై ప్రధాని మోదీ సీబీఐ విచారణకు ఆదేశించాలని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. అమిత్‌షా డైరెక్టర్‌గా ఉన్న అహ్మదాబాద్‌లోని డీసీసీబీ బ్యాంకులో పెద్ద నోట్ల రద్దు సమయంలో కేవలం 5 రోజుల్లో రూ.745.50 కోట్ల పాత నోట్లు జమయ్యాయన్నారు. ఐదు రోజుల్లో అన్ని కోట్లు ఎలా జమయ్యాయని ప్రశ్నించారు. వైకాపా ఎంపీల రాజీనామాలు బూడిదలో పోసిన పన్నీరే.. అని రఘువీరారెడ్డి వ్యాఖ్యానించారు. ఎంపీలు రాజీనామాలు చేసిన 3 నెలలకు ఆమోదించడం వెనుక ఉప ఎన్నికలు జరగకూడదనే భాజపా కుట్ర ఉందని ఆరోపించారు. "అప్పుడే ఆమోదించి ఉంటే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చేది. రాజంపేట, తిరుపతిలో తెదేపాతో పొత్తులో భాగంగా భాజపా పోటీ చేయాల్సి వచ్చేది. వారికి డిపాజిట్లు కూడా రావని తెలిసే రాజీనామాల ఆమోదంలో జాప్యం చేశారు. భాజపా వలలో వైకాపా చిక్కుకుంది" అని రఘువీరా ఆరోపించారు.

నెలాఖరులో గోదావరి బోర్డు సమావేశం

ఈనాడు, హైదరాబాద్ : గోదావరి నదీ యాజమాన్యబోర్డు సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. ఈ మేరకు బోర్డు సభ్యకార్యదర్శి సమీర్‌ఛటర్జీ రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు లేఖ రాశారు. గోదావరి బేసిన్‌లో చేపట్టిన ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, టెలిమెట్రీ ఏర్పాటు, ఎగువ సీలేరు, దిగువ సీలేరులో ఉత్పత్తయ్యే విద్యుత్తు పంపిణీ తదితర అంశాలను అజెండాలో చేర్చారు. ఇంద్రావతిపై ఒడిశా చేపట్టిన మిడిల్ కొలాబ్ ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి అంశాన్ని కూడా బోర్డు చర్చించనుంది. రెండు తెలుగు రాష్ట్రాలు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాయి.

ఓ జూనియర్... జంకు ఏల?

ర్యాంకులు సాధించి... కౌన్సెలింగ్‌ని ఛేదించి...
కొత్త రెక్కలతో కాలేజీల్లో ఫ్రెషర్స్ వాలిపోయే సమయమిది..
ఎగిరొచ్చే ఆ గువ్వల మదిలో ఎన్నో సందేహాలు... సూర్య, విరాట్‌లూ ఫ్రెషర్లే. మరి, వారి సందేహాల్ని తీర్చేదెవరు? సీనియర్లే!!
ఎందుకంటే.. వారూ నిన్న మొన్నటి జూనియర్లే కదా!

'సూర్య.. బ్యాగులో నీ డ్రస్‌లు అన్నీ సర్దుకున్నావా? హాస్టల్ భోజనం ఎలా ఉంటుందో ఏమో? పచ్చళ్లేమైనా తీసుకెళ్తావా? అంటూ... అమ్మ. "రేయ్ అన్నయ్యా.. కొత్త ఫ్రెండ్స్. కొత్త ప్లేస్. ఇంక మేం గుర్తుంటామా?'

అంటూ.. ఇంకోవైపు చెల్లి.

ఈ మాటలన్నీ తన రూమ్‌లో ఉన్న సూర్య.. చెవిన పడుతున్నాయి. చదివిన పుస్తకాలు, ఆడిన బ్యాట్, తొక్కిన సైకిల్...ఇంటర్ జ్ఞాపకాలు. వీటిని దాటుకొని ఆలోచనలు క్యాంపస్ గేటు దగ్గర ఆగాయి...

- **క్యాంపస్ లైఫ్ ఎలా ఉంటుంది?**
- **ఎలాంటి ఫ్రెండ్స్ కలుస్తారు?**
- **నేను త్వరగా కలిసిపోతానా?**
- **ర్యాగింగ్ ఏమైనా చేస్తే?**
- **ఇల్లు వదిలి హాస్టల్‌లో ఉండాలా?**
- **భోజనం ఎలా ఉంటుందో?**
- **రూమ్ మేట్స్ ఎవరొస్తారో?...**

ఇలా ఎన్నో ప్రశ్నలు. సూర్య.. ఉన్న స్థితి తనకే కొత్తగా చిత్రంగా అనిపిస్తోంది. నెల క్రితం ఇవేం లేవు. మంచి మార్కులు, ర్యాంకులతో ఫ్రెండ్స్‌తో మస్తీ చేసిన నేనేనా ఇలా ఆలోచిస్తున్నది అనుకుంటూ గది నుంచి బయటికి వచ్చాడు. తన బెస్టీ విరాట్‌కి ఫోన్ చేశాడు.

'మాట్లాడాల్రా... కలుద్దాం. మన అడ్డాకి వచ్చెయ్' అని ఫోన్ కట్ చేశాడు. మదిలో ఓవర్‌లైట్ అయిన ఆలోచనలతో బయటికి అడుగులు వేశాడు. ఎందుకీ మార్పు? దీన్నేలా అధిగమించాలి? ఇవి సూర్య.. ఒక్కడి ఆలోచనలే కాదు. క్యాంపస్‌లో అడుగుపెట్టే ఫ్రెషర్స్ ముందున్న ప్రశ్నలు!!

వీధి చివరున్న సలీమ్ భాయ్ ఛాయ్ బండి పక్కనే ఓ పిట్టగోడ. దానిపై కూర్చున్న సూర్య.... విరాట్‌ల చర్చ ఇలా సాగుతోంది.. అందుకు సీనియర్లు ఏం చెబుతున్నారో చూద్దాం రండి?

సూర్య: రేయ్ విరాట్. ఇన్నేళ్లు ఓ గ్యాంగులా తిరిగాం. ఇప్పుడు సింగిల్‌గా వేరు వేరు క్యాంపస్‌ల్లోకి వెళ్తున్నాం. ర్యాగింగ్ ఉంటుందా? ఉంటే ఏం చేయాలి?

విరాట్: నేనూ అదే ఆలోచిస్తున్నా. చాలా సినిమాల్లో చూశాంగారా. అలాగే ర్యాగ్ చేస్తారంటావా?

సీనియర్ సలహా:

'అంత సీన్ లేదు. దేశంలోని చాలా కాలేజీల్లో ర్యాగింగ్ భూతాన్ని ఎప్పుడో తరిమేశారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు మరింత అప్రమత్తంగా ఉన్నాయి. ఒకవేళ ఉన్నా అది ఫన్ కోసమే తప్పా.. సినిమాల్లో చూపించినట్టు ఉండదు. మీరు జాయిన్ అయ్యే క్యాంపస్ కహానీల్ని ముందే తెలుసుకోవడం మంచిది. అందుకు తగినట్టుగా సిద్ధం అవ్వొచ్చు. ఒకవేళ హద్దులు దాటేసి ర్యాగింగ్‌కి పాల్పడితే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు వెనకాడొద్దు.

- హారిక, ఎంటెక్ సెకండ్ ఇయర్

విరాట్: మన చిన్నప్పటి ఫ్రెండ్స్ గురించి తెలుసు. ఇప్పుడు వేరు వేరు క్యాంపస్‌లకు వెళ్తున్నాం. అక్కడ మనకి మంచి ఫ్రెండ్స్ దొరుకుతారా?

సూర్య: ఏమోరా? నాకు డౌటే. కొత్తగా ఏమేం అలవాటు చేసుకోవాలో?

సీనియర్ సలహా:

'స్నేహం లెక్కలేసుకుని చేసేది కాదు. హాయ్‌తో మొదలై అలా కలిసిపోతాం. కొన్ని రోజులకు తెలిసిపోతుంది మనకి కరెక్టా.. కాదాని. ఎలాంటి అపోహలకు తావు లేకుండా మనసేం చెబితే అదే చేయండి. మీ మనస్తత్వానికి సరిపడే వారితో జట్టుకట్టండి. తర్వాత నాలుగేళ్లు వాళ్లే మీతో అంటిపెట్టుకుని ఉంటారు. ఆ గ్యాంగుతో తీపి గుర్తుల్ని ఎప్పటికీ మర్చిపోలేరు. మరి మనమూ వారికి అలా మంచి ఫ్రెండ్‌లా ఉండాలి మర్చిపోవద్దు. గెలిచినప్పుడు చప్పట్లు కొట్టి, ఓడిపోయినప్పుడు వెన్ను తట్టే స్నేహితుడు దొరికితే హాయే.

- ప్రఘ్నేష్, బీటెక్ సెకండ్ ఇయర్

సూర్య: చెల్లి... ఇంటికెనక గల్లీ క్రికెట్... నేను రోజూ అడుకునే పప్పీ. ఇవన్నీ మిస్ అయిపోవాలా?

విరాట్: నువ్వింకా నయంరా. నువ్వు మన రాష్ట్రంలోనే. నేనైతే రాష్ట్రాలు దాటేస్తున్నా. నేనెవడితో చెప్పుకోవాలి?

సీనియర్ సలహా:

'మొదట్లో అందరి మానసిక స్థితి ఇలానే ఉంటుంది. అందరితో కలిసిపోయి హోమ్‌సిక్‌ని పోగొట్టుకోవచ్చు. అన్నీ షేర్ చేసుకోగలిగే బెస్టీలు ఒకరిద్దరు ఉంటే చాలు. ఇంటి ధ్యాసని రానివ్వరు. అయినా, ఫ్యామిలీని మిస్ అవుతున్నాం అనిపిస్తే ఎప్పుడంటే అప్పుడు వీడియో కాల్స్, సెల్ఫీలు, టెక్స్ట్‌మెసేజ్‌లు. అన్నీ సర్దుకునేటప్పుడు మీకు ఇష్టమైన ప్లేటు... దిండు.. ఇలా ఏవైనా ప్యాక్ చేసుకోండి. ఇవి కొంత ఊరటనిస్తాయి.

- సౌరభ్, బీటెక్ సెకండ్ ఇయర్

విరాట్: ఇంట్లో అమ్మ వండిందే నాకు సరిగ్గా ఎక్కదు. ఇప్పుడు హాస్టల్ ఫుడ్ ఏంట్రా బాబు. ఏం తినాలి? ఎలా తినాల్రా!

సూర్య: మీటూ. నాకూ అర్థం కావట్లే!

సీనియర్ సలహా:

క్యాంపస్‌ల్లో మెస్‌లు బాగుంటాయ్. దానికి తోడు స్నేహితుల సందడితో ఏం తింటున్నామో... కూడా తెలియదు. కొన్ని క్యాంపస్‌ల్లో నార్త్... సౌత్ ఇండియన్ మెనూలుంటాయి. సెలెక్ట్ చేసుకుని కావాల్సింది తినొచ్చు. అమ్మ వంటకు ఏవీ సరికాదు. అయినా అడ్జెస్ట్ కావాల్సిందే.

- సుప్రజ, డిగ్రీ సెకండ్ ఇయర్

'ఫస్ట్ డే' కిక్కే వేరప్పా!

కొత్త క్యాంపస్.. కొత్త ప్రాంతం... తెరచిన రోజే కాలేజీకి ఎవరొస్తారులే అనుకోవద్దు. మొదటి రోజే వెళ్తే ఆ కిక్కే వేరు. ఎందుకంటే...

- అప్పుడే పుట్టిన బిడ్డకి తల్లి పాలు తాగించడం ఎంత ముఖ్యమో... క్యాంపస్‌లో కొత్తగా అడుగుపెట్టి రూపాంతరం చెందే విద్యార్థికి మొదటి రోజు అంతే విలువైంది. కాలేజీ యాజమాన్యాలు చేపట్టే 'ఓరియంటేషన్'కి ఉండే ప్రాధాన్యత అలాంటిది. విద్యార్థుల్లో బెరుకుతనాన్ని పోగొట్టేందుకు పలు రకాల సెషన్స్ ఉంటాయి. ఓ నాలుగేళ్ల పాటు తిరిగే క్యాంపస్‌పై 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' తొలిరోజు పరిచయ కేరింతలతోటే కలుగుతుంది.

- మొదటి వారం జరిగే తరగతుల్ని మిస్ చేసుకోవద్దు. సబ్జెక్టులు, కోర్సులు.. వాటికున్న ప్రాధాన్యత, బోధనా పరమైన అంశాలపై స్పష్టతనిచ్చే అంశాల్ని విద్యార్థులతో పంచుకుంటారు.
- క్యాంపస్‌కి వచ్చే ముందే విద్యార్థులు 'అడల్ట్ కమ్యూనికేషన్'ని అలవర్చుకోవాలి. భయం, బెరుకు లేకుండా అధ్యాపకుల నుంచి కావాల్సిన సమాచారాన్ని రాబట్టుకునేలా కమ్యూనికేషన్‌ని పెంచుకోవాలి.
- 'ఫ్రెషర్స్ డే' ఎప్పుడెప్పుడా అని ఎదురు చూడాలి. ఎందుకంటే సీనియర్లతో స్పోర్టీవ్‌గా కలిసిపోయేందుకు అదే సరైన వేదిక.
- చివరి రోజు క్యాంపస్ నుంచి ఎలా వెళ్లాలనుకుంటున్నారో దృష్టిలో పెట్టుకుని తొలి రోజు ప్లానింగ్ మొదలవ్వాలి.

- వెంకటరావు యడ్ల, ఆచార్యులు,
పుదుచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయం

నీ కన్నీళ్లు యాసిడ్లై కాలుస్తున్నాయ్

మనసులో మాట

అది 2010. నేను ఇంటర్ పూర్తిచేసి హాలిడేస్‌లో ఉన్నా. మా అన్నయ్య ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. మా అన్నయ్య పెళ్లికి వాళ్ల ఫ్రెండ్స్ ముంబై నుంచి వచ్చారు. వారిలో ఒకరితో పాటు వచ్చిన అమ్మాయి నన్ను ఎంతగానో ఆకర్షించింది. తను మా అన్నయ్య ఫ్రెండ్‌కి చెల్లి. తన మాట తీరు, చొరవ, నవ్వు, జుట్టు... ఇలా అన్నీ నచ్చాయి. పెళ్లిలో నేనేం చేస్తున్నా... కళ్లు తననే వెదికేవి. తన దృష్టిలో పడ్డానికి నానా తంటాలు పడ్డా. వాళ్ల బంధువులు హైదరాబాద్‌లోనే ఉండటంతో మూడు రోజులు ఇక్కడే ఉంది. తన నంబర్ సంపాదించాను. వాట్సప్‌లో హాయ్ మెసేజ్‌తో స్టార్ట్ చేశాను. కొన్ని రోజులకు మంచి స్నేహితులమయ్యాం. అప్పుడప్పుడూ బంధువుల ఇంటికి హైదరాబాద్‌కు వచ్చేది. నేనూ ఇక్కడే ఇంజినీరింగ్‌లో చేరా. సెకండియర్లో నా మనసులో మాట చెప్పేశాను. ఎలాంటి కండీషన్లు, కన్ఫ్యూజన్లు, వెయిటింగ్‌లూ లేకుండా నా లవ్ ఓకే అయ్యింది. ఇంకేముంది ముంబైకి హైదరాబాద్ ఎంత దగ్గరో అర్థమైంది. నేను అక్కడికి వెళ్లడం... తను ఇక్కడికి వచ్చినప్పుడు కలవడం, సినిమాలు, షికార్లు, నైట్ పార్టీలు...

నేను తనని జున్నూ అంటే... నన్ను చీకూ అనేది. ఇద్దరం చాలా దగ్గరయ్యాం. నా ఇంజినీరింగ్ పూర్తికాగానే మంచి ఉద్యోగం చూసుకొని పెళ్లి చేసుకోవడమే తరువాయి అనుకున్నాను.

ఒకసారి తను నాకు మూడు రోజులుగా ఫోన్ చేయలేదు. నేను చేసినా లిఫ్ట్ చేయలేదు. ఒకరోజు రాత్రి ఫోన్ చేసింది. ఏమి అడిగినా చెప్పడం లేదు. అలా ఏడుస్తూనే ఉంది. నేను వెంటనే బయలుదేరి ముంబై వెళ్లాను. నన్ను హత్తుకొని గట్టిగా ఏడ్చేసింది. ఏం జరిగిందో చెప్పమన్నాను. ఎలాంటి విషయమైనా ఎదుర్కొందామని ధైర్యం చెప్పాను. అప్పుడు తన బాధను బయటపెట్టింది. ఒకరోజు తను నా నంబర్ అనుకొని వేరే నంబర్‌కు వాట్సప్ మెసేజ్ పంపిందంటా... తర్వాత రాంగ్ నంబర్ అని చెప్పినా... అవతల ఆ అబ్బాయి వినలేదు. స్నేహం చేయాలంటూ వెంటపడ్డాడు. సరే ఫ్రెండిషిప్పే కదా...! అని అప్పుడప్పుడూ మెసేజ్ చేసేదట. అలా క్లోజ్ అయిన అతను ఒక రోజు పార్టీలో తనని బలవంతం చేశాడు. దాంతో కుంగిపోయింది. ఏం ఫర్వాలేదని ధైర్యం చెప్పాను. వాడికి గట్టిగా వార్నింగ్ ఇచ్చాను. 'జున్నూ మనం పెళ్లి చేసుకుందాం' అన్నాను. తను ఒప్పుకోలేదు. ఎంత బతిమాలిన వినడం లేదు. 'నేను నీ ప్రేమకు సూటవను చీకూ... నన్ను క్షమించూ' అంటోంది. ఇది జరిగి సంవత్సరం అవుతోంది. ఇంకా తను ఆ పీడకలనే తలచుకొని బాధపడుతోంది. నేను ఎంత చెప్పినా వినడం లేదు. నన్ను దూరం పెడుతోంది. జున్ను రాల్చే కన్నీళ్లు... నా ఒంటిపై యాసిడ్‌లా కురుస్తున్నాయి.

ప్రేమంటే అమృతం అది ఎంతటి గాయాలనైనా మాన్పుతుంది. నా ప్రేమను స్వీకరించు. మనిద్దరం పెళ్లి చేసుకుందాం. ప్లీజ్...! **- చీకూ**

ఈనాడు సినిమా

నాని

కీర్తిసురేష్

మరోసారి లోకల్ జోడీ?

నేను లోకల్‌తో ఆకట్టుకొన్నారు నాని - కీర్తిసురేష్. ఆ ఇద్దరూ మరోసారి జోడీ కట్టే అవకాశాలున్నాయి. నాని కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'జెర్సీ' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రం కోసమే కీర్తిని సంప్రదించినట్టు తెలిసింది. ఆమె 'మహానటి' తర్వాత తెలుగులో సినిమాలేవీ ఒప్పుకోలేదు. ప్రస్తుతం తమిళ చిత్రాలతోనే బిజీగా గడుపుతోంది. 'జెర్సీ' మొదలు కావడానికి కూడా ఇంకా చాలా సమయం ఉంది కాబట్టి... కీర్తి ఈ చిత్రం కోసం కాల్షీట్లు సర్దుబాటు చేసే అవకాశాలున్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

మున్నాభాయ్‌ని దింపేశాడు!

'సంజు'లో రణ్‌బీర్‌కపూర్

మున్నాభాయ్ ఎం.బి.బి.ఎస్ చిత్రంలో క్లాస్ రూమ్‌లో సంజయ్ పండించే వినోదం ప్రేక్షకులు మర్చిపోలేరు. ఇప్పుడు అదే సన్నివేశాన్ని సంజయ్ బయోపిక్‌గా వస్తున్న 'సంజు'లో రీక్రియేట్ చేశారు. ఆ సన్నివేశంలో సంజయ్‌ని రణ్‌బీర్‌కపూర్ అచ్చుగుద్దినట్టు దించేశాడు అంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా 'సంజు'లో 'మున్నాభాయ్ ఎం.బి.బి.ఎస్' చిత్రానికి సంబంధించిన సన్నివేశాల టీజర్‌ను చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ ట్విట్టర్‌లో పంచుకొన్నారు. "మున్నాభాయ్..'లోని మీకు ఎంతో ఇష్టమైన సన్నివేశం ఇది. మళ్లీ పదిహేనేళ్ల తర్వాత రీక్రియేట్ చేశాను" అని ట్వీటారు హిరాణి. ఈ ఏడాది బాలీవుడ్ నుంచి వస్తున్న అత్యంత ఆసక్తి చిత్రాల్లో 'సంజు' ముందు వరసలోనే ఉంటుంది అనేలా ఈ చిత్రంపై అంచనాలు ఏర్పడ్డాయి.

కోపం కాదు కానీ...

రాశీ ఖన్నా

"వేరొకరు వేలెత్తి చూపించేంత వరకు నా తప్పుల్ని నేను కప్పి పుచ్చుకోను. నేనేం చేశానో అందరికంటే ముందు నాకే తెలుస్తుంది. అందుకే విమర్శల విషయంలో నా ఆలోచనలు ఎప్పుడూ సానుకూలంగానే ఉంటాయి" అంటోంది రాశీ ఖన్నా. ప్రస్తుతం 'శ్రీనివాస కళ్యాణం'లో నటిస్తున్న ఆమె, నటిగా నేను ఎదగడంలో విమర్శ పాత్ర చాలా ఉందని చెబుతోంది. మరి విమర్శలు మీకెప్పుడూ కోపం తెప్పించలేదా? అని అడిగితే... "నాలోనే పెద్ద విమర్శకురాలు ఉంది. సినిమా చూసుకుంటున్నప్పుడు నేను చేసిన కొన్ని తప్పులు నాకే కనిపిస్తుంటాయి. అలాంటప్పుడు నాపైన నేనే కోపం తెచ్చుకోలేను కదా" అని సమాధానమిస్తోంది రాశీ ఖన్నా. అసలు మీకు కోపం ఎప్పుడెప్పుడొస్తుందని అడిగితే "ఎదుటివాళ్లలో సమయపాలన లేనప్పుడు వస్తుంది. అది కోపం కూడా కాదు, చిరాకు అనొచ్చేమో. ఇక నిజంగా కోపం ఎప్పుడొస్తుందంటే మన పక్కన లేని వేరొకరి గురించి లేని పోనివి చెప్పేవాళ్ల పైన వస్తుంద"ని చెప్పింది రాశి.

ఇలా మొదలైంది

అఖిల్, నిధి అగర్వాల్

తన మూడో చిత్రం కోసం అఖిల్ రంగంలోకి దిగాడు. ఆనందంగా ఆరంభించాం... అందుకే ఈ నవ్వులు అంటూ సెట్లో సరదాగా తీసుకొన్న ఫొటోని కూడా అభిమానులతో పంచుకొన్నాడు. 'హలో'తో ప్రేక్షకుల్ని మెప్పించిన ఆయన, ఈసారి అదే ఉత్సాహంతో కెమెరా ముందుకెళ్లాడు. ఈసారి అఖిల్‌తో నిధి అగర్వాల్ జోడీ కట్టింది. 'సవ్యసాచి'లో నాగచైతన్య సరసన నటించిన నిధి ఆ వెంటనే, అఖిల్ చిత్రం కోసం అంగీకారం తెలిపింది. అన్నదమ్ముల చిత్రాల్లో నటించిన ఆమె వరుసగా అలరించబోతోంది నిధి. 'తొలిప్రేమ'తో విజయాన్ని అందుకొన్న దర్శకుడు వెంకీ అట్లూరి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్నారు. తమన్ స్వరకర్త.

మనసుల్ని కదిలించే ప్రేమకథ

తేజస్విని, నందు

నందు, తేజస్విని ప్రకాష్ జంటగా నటించిన చిత్రం 'కన్నుల్లో నీ రూపమే'. బిక్స్ ఇరుసడ్ల దర్శకుడు భాస్కర్ నిర్మాత. ఈనెల 29న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. దర్శకుడు మాట్లాడుతూ "మనసుల్ని కదిలించే ప్రేమ కథ ఇది. నందు నటన తప్పకుండా నచ్చుతుంది. కొత్త దర్శకుడైనా సరే, నాకు నిర్మాత అన్ని విధాలా సహకరించారు. కథపై నమ్మకంతోనే ఈ సినిమా తీశామ"న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సినీ చరిత్రకారుడు నందగోపాల్ కన్నుమూత


నందగోపాల్



ప్రపంచ సినిమా రంగం పరిణామాన్ని.. ప్రగతిని తరాలుగా దగ్గర్నుంచి పరిశీలిస్తూ... తన రచనలతో విశ్లేషిస్తూ, చరిత్రగా భవిష్యత్ తరాలకి అందించిన రచయిత, సినీ పాత్రికేయుడు, విమర్శకుడు నాదెళ్ల నందగోపాల్ (84) ఇక లేరు. శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకి భార్య కల్పనాదేవితో పాటు, ఇద్దరు కుమారులు గోపీచంద్, ప్రత్యగాత్మ, కూతురు కవిత ఉన్నారు. 61వ జాతీయ సినీ పురస్కారాల్లో 'సినిమాగా సినిమా' పుస్తకానికిగానూ ఉత్తమ సినిమా గ్రంథం రచయితగా స్వర్ణకమలం అందుకొన్నారు నందగోపాల్. అదే రచనకిగానూ 2013లో ఉత్తమ సినిమా గ్రంథంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కూడా నంది పురస్కారాన్ని పొందారు. ప్రపంచ స్థాయి నుంచి తెలుగు సినిమా దాకా సినీ పరిశ్రమలోని వివిధ సాంకేతిక విభాగాల పరిణామ క్రమంపై రచించిన 424 పేజీల గ్రంథం 'సినిమాగా సినిమా'. 43 రచనల్లో ఉత్తమ రచనగా ఎంపికైంది. ఎల్వీ ప్రసాద్, బి.నాగిరెడ్డి, ఎ.చక్రపాణి సినీ దిగ్గజాలకి సన్నిహితంగా మెలుగుతూ సినిమా జర్నలిజంలో భాగంగా నిర్వహించిన పలు వర్క్‌షాప్స్‌లో భాగం పంచుకొన్నారు. దిగ్గజ నటులు ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతోనూ మంచి అనుబంధం కొనసాగించారు. ఎన్టీఆర్ రాజకీయ పార్టీ ప్రారంభించిన సమయంలో కూడా ఆయనకి చేదోడు వాదోడుగా ఆయన పక్కనే ఉన్నారు. కృష్ణా జిల్లా లక్ష్మీపురంలో జన్మించిన నందగోపాల్ తన 18వ ఏట ప్రసిద్ధ రచయిత, దర్శకుడు గోపీచంద్ తన 'పేరంటాలు' చిత్రంపై నిర్వహించిన జాతీయస్థాయి పోటీలో ప్రథమ బహుమతి సొంతం చేసుకొన్నారు. 1952లో మద్రాసులో బీఏ చదువుతూనే, దర్శకుడు, నాటి 'జ్వాల' పత్రిక సంపాదకుడైన కె.ప్రత్యగాత్మ వద్ద సహాయకుడిగా చేరి పాత్రికేయ జీవితాన్ని ఆరంభించారు. 1967లో యునెస్కో సహకారంతో, ప్రపంచ ప్రసిద్ధ చలన చిత్ర చరిత్రకారిణి మేరీ సెటస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, పుణెలో ఫిల్మ్ అప్రిషియేషన్ కోర్స్‌ని అధ్యయనం చేశారు. 1967 - 78 మధ్య కాలంలో తెలుగు తెర, కినిమా పత్రికలకి సంపాదకునిగా వ్యవహరిస్తూ పాఠకుల్లో సినిమా అభిరుచిని పెంపొందించడానికి కృషి చేశారు. 1978 - 85 కాలంలో ప్రాంతీయ సెన్సార్ బోర్డ్ ప్రాంతీయ సలహా మండలి సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. ఫిల్మోత్సవ్ - 80కి కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తరఫున పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధాల శాఖ అధికార పత్రిక 'తెలుగు వెలుగు' తొలి సంపాదకుడిగా కూడా పనిచేశారు నందగోపాల్. సెన్సార్ బోర్డ్ ప్రాంతీయ సలహా మండలి సభ్యునిగా, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్క్రిప్ట్ కమిటీ సభ్యుడిగానూ సేవలందించారు. 1995లో ఉత్తమ సినీ విమర్శకుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది పురస్కారం సొంతం చేసుకున్న ఆయన 2013లో దక్షిణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి నిర్వహించిన భారతీయ సినిమా శతాబ్ది వేడుకల్లో సినీ పాత్రికేయుడిగా సత్కారం పొందారు. నందగోపాల్ మృతితో తెలుగు సినిమా వర్గాలు సంతాపం వ్యక్తం చేశాయి. శనివారం మధ్యాహ్నం 12 గంటలకి హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పంచ్ డైలాగ్

అమ్మా నాన్నలను నమ్ముకుంటే ఆకేసి పెడతారు, ఆమ్మాయిలను నమ్ముకుంటే నాకేసి పెడతారు.

సినిమా: నాన్న నేను నా బాయ్‌ఫ్రెండ్స్.

– పంపినవారు: బొండా నూకరాజు, కాకినాడ.

శ్రీవిష్ణు చిత్రం ప్రారంభం

కృష్ణవిజయ్.ఎల్, నారా రోహిత్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీవిష్ణు, రిజ్వాన్

కృష్ణవిజయ్.ఎల్ దర్శకత్వంలో శ్రీవిష్ణు కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. రోహిణి కథానాయిక. రిజ్వాన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు నారా రోహిత్ క్లాప్‌నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన 'అప్పట్లో ఒకడుండేవాడు', 'నీది నాది ఒకే కథ' తర్వాత చిత్రాలకి నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించా. ఇప్పుడు మరొకసారి నిర్మాణంలో భాగమవుతూనే, ఈ చిత్రానికి దర్శకత్వం చేస్తుండడం ఆనందంగా ఉంది. వచ్చే నెలలో రెగ్యులర్ చిత్రీకరణ మొదలుపెడతాం. ఈ ఏడాది చివర్లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. కథానాయకుడు శ్రీవిష్ణు మాట్లాడుతూ "విజయ్, నేను కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్నాం. ఈసారి ఆయన దర్శకత్వంలో సినిమా చేస్తుండడం సంతోషంగా ఉంది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "దర్శకుడు ఒక వినూత్నమైన కథని సిద్ధం చేశారు. వినగానే మంచి అనుభూతి కలిగింది. ఒక మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ "కథాబలంతో కూడిన సినిమా ఇది. విజయ్‌తో కలిసి పనిచేయడం బాగుంటుంది" అన్నారు. రఘుబాబు, అచ్యుత్ రామారావు, ఎ.ఎస్.రవికుమార్ చౌదరి, అజయ్ ఘోష్, రవి వర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సిద్, కూర్పు: ధర్మేంద్ర కాకర్ల, కళ: మురళి కొండేటి.

ఇకపై నాణ్యతే ముఖ్యం!



"ఎంత అనుభవం సంపాదించినా... కాలం మారుతున్నకొద్దీ నేర్చుకోవల్సింది చాలా ఉంటుంది. ఇకపైన మా సంస్థలో చిన్న చిత్రాలు నిర్మించినా.. భారీ వ్యయంతో కూడిన చిత్రాలైనా నాణ్యతకే పెద్దపీట వేయబోతున్నామ"న్నారు డి.సురేష్‌బాబు. ఆయన నిర్మించిన చిత్రం 'ఈ నగరానికి ఏమైంది?'. తరుణ్‌భాస్కర్ దర్శకత్వం వహించారు. ఈ నెల 29న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా డి.సురేష్‌బాబు శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"రెండేళ్లుగా కొత్త తరహా కథల్ని... యువ ప్రతిభని ప్రోత్సహించడంపైనే దృష్టి పెట్టా. ఇది నిరంతరం కొనసాగాలనేదే నా అభిమతం. 'పెళ్ళిచూపులు' తర్వాత తరుణ్‌భాస్కర్‌కి అగ్ర కథానాయకుల నుంచి కూడా అవకాశాలు అందాయి. కానీ అతను మాత్రం మరొకసారి కొత్తవాళ్లతో, చిన్న సినిమానే తీయాలని ఈ కథ రాసుకున్నాడు. మంచి అంచనాలతో చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. తరుణ్ భాస్కర్‌లో మంచి ప్రతిభ ఉంది. ఈ చిత్రం కోసం దర్శకుడికి కావల్సినంత స్వేచ్ఛ ఇచ్చా. కానీ ఆ స్వేచ్ఛని ఎక్కడా దుర్వినియోగం చేయకుండా సినిమాని పూర్తి చేశాడు. కొత్త రకమైన వినోదం... సింక్ సౌండింగ్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. సాంకేతికంగా ఈ సినిమా ఎంతో సంతృప్తినిచ్చింది. పలువురు కొత్త నటులు ఈ చిత్రంతో వెలుగులోకొస్తారు".

రెహమాన్‌ను దగ్గరగా పరిశీలించా

"మీరు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సినిమాలు చేస్తున్నారు కానీ.. అంతర్జాతీయ స్థాయిలో నిలబడటం లేదెందుకని ఒకసారి నన్నొక విదేశీయుడు అడిగాడు. మీ సినిమాల్లో సాంకేతికపరంగా నాణ్యత ఉండదని కూడా అతనే చెప్పాడు. సాంకేతికత అందుబాటులో ఉంటే చాలదు, దాన్ని వందశాతం సద్వినియోగం చేసుకొన్నప్పుడే ఫలితాలుంటాయి. 'సూపర్ పోలీస్' చేస్తున్నప్పుడు ఎ.ఆర్.రెహమాన్ పనిని పరిశీలించాను. అసలు నాణ్యత అంటే ఏంటో అతన్నుంచే నేర్చుకున్నా. ఒకొక్క బాణీ కోసం చాలా సమయం తీసుకొనేవాడు. కానీ నాణ్యత విషయంలో మాత్రం రాజీపడేవాడు కాదు".

హిరణ్య.. దొరసాని

"మా సంస్థ నుంచి వరుసగా చిత్రాలు రాబోతున్నాయి. వెంకటేష్, నాగచైతన్య కథానాయకులుగా బాబీ దర్శకత్వంలో త్వరలోనే ఓ సినిమా మొదలవుతుంది. అలాగే వెంకటేష్ - వెంకీ అట్లూరి కలయికలో ఓ చిత్రం, వెంకటేష్ - త్రినాథరావు దర్శకత్వంలో మరో చిత్రం ప్రారంభిస్తాం. రానా కథానాయకుడిగా గుణశేఖర్ దర్శకత్వంలో 'హిరణ్య' రూపొందనుంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపొందనున్న ఆ చిత్రం కోసం 18 నెలలుగా విజువల్ ఎఫెక్ట్స్ పనులు జరుగుతున్నాయి. వీటితో పాటు రవికాంత్ పేరేపు దర్శకత్వంలో ఓ చిత్రం, కొత్త దర్శకుడు మహేంద్ర తీయనున్న తెలంగాణ ప్రేమకథ 'దొరసాని'లోనూ రాని కథానాయకుడిగా నటించబోతున్నాడు. మా నాన్న డి.రామానాయుడు జీవితం ఆధారంగా సినిమా తీసే ఆలోచనలేవీ లేవు".

ఐశ్వర్యరాయ్

ఇండియన్ మడోన్నా అనేలా...

ఐశ్వర్యరాయ్ అందగత్తే కాదు... డ్యాన్స్ కూడా బాగానే చేస్తుంది. కానీ ఆమె చేసిన ఓ పాటే తనకు నచ్చలేదు. ఐశ్వర్యరాయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫన్నేఖాన్'. ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతం ఉంది. 'పెపికాల్ సే...' అంటూ ఈ పాట సాగుతుంది. కానీ ఆ పాట లిరిక్స్ ఐశ్వర్యకు నచ్చలేదట. ఆ పాటకు డ్యాన్స్ చేయడం ఆమెకు సౌకర్యంగా అనిపించకపోవడంతో నిర్మాతలు పాటను మార్చేసి కొత్త లిరిక్స్‌తో వేరే పాట రాయించారు. 'హల్కా...హల్కా..' అంటూ ఈ పాట సాగుతుందట. దీనికి ఫ్రాంక్ గట్సన్ నృత్యదర్శకుడు. బియోన్స్, జెన్నీఫర్ లోపేజ్, రిహానా లాంటి అంతర్జాతీయ పాప్ సింగర్‌లతో కలిసి పనిచేసిన కొరియోగ్రాఫర్ ఫ్రాంక్. ఈ పాటలో ఐశ్వర్యరాయ్ 'ఇండియన్ మడోన్నా' అనేలా ఉంటుందని చిత్రవర్గాలు చెబుతున్నాయి. "అంతర్జాతీయంగా పాపులర్ అయిన పాప్‌సింగర్ పాత్రలో ఐశ్వర్య నటించనుంది. అందుకే లైవ్ షోస్ ద్వారా అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్న పలువురు కొరియోగ్రాఫర్‌లను పరిశీలించాక ఫ్రాంక్ సరైన వ్యక్తి అని నిర్ణయించుకొని ఆయన్ని సంప్రదించాం" అని దర్శకుడు అతుల్ మాంజ్రేకర్ ఓ పత్రికతో చెప్పారు. ఈ చిత్రంలో అనిల్‌కపూర్, రాజ్‌కుమార్ రావ్‌లు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఎముక ఆరోగ్యానికి నువ్వులు

మనం కూరగాయలూ, పండ్లు ఎన్నో తీసుకుంటాం కదా... ఈ కిందివాటినీ తరచూ తినేందుకు ప్రయత్నిస్తే ఎన్నో లాభాలుంటాయని చెబుతున్నారు నిపుణులు. అవేంటో చూసేద్దామా.

అవిసెగింజలు: వీటిలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువ. ఇవి హార్మోన్ల అసమతుల్యతని తగ్గిస్తాయి. నెలసరి సమస్యలు అదుపులో ఉంటాయి. వీటిల్లో కావాల్సినంత పీచు ఉంటుంది. అవిసె నుంచి అందే మాంసకృతులు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కూడా కాంతిమంతంగా మారుతుంది. బరువు కూడా సులువుగా తగ్గొచ్చు.

గుమ్మడిపలుకులు: వీటిలో మాంసకృత్తులు పుష్కలం. శరీరానికి అవసరమైన జింక్, మెగ్నీషియం, క్యాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి ఖనిజాలన్నీ ఇందులో ఉంటాయి. ఇతర విటమిన్లూ అందుతాయి. వీటిని తీసుకోవడం వల్ల హృద్రోగాలకు దూరంగా ఉండొచ్చు. సెరటోనిన్ స్థాయులు పెరుగుతాయి.

నువ్వులు: జింక్, క్యాల్షియం, ఫాస్ఫరస్ వీటిలో ఎక్కువ. ఇవి ఎముక మజ్జ ఏర్పడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఎముక పుష్టినీ పెంచుతాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల అధిక రక్తపోటూ, గుండె జబ్బుల్ని అదుపులో పెట్టుకోవచ్చు.

మెంతులు: బాలింతలు వీటిని తీసుకోవడం వల్ల వారిలో పాల ఉత్పత్తి పెరుగుతుంది. కాబట్టి గర్భిణిగా ఉన్నప్పటి నుంచే వీటిని ఆహారంలో చేర్చి పెడుతుంటారు. గౌట్, గాయాలూ, అల్సర్లూ, చుండ్రూ, ఎగ్జిమా, సయాటికా లాంటి సమస్యలకు మెంతులు చక్కటి పరిష్కారం. మధుమేహులు మెంతులు నానబెట్టిన నీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెరస్థాయులు సమతూకంలో ఉంటాయి.

జీలకర్ర: ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. ఇందులో ఇనుము అధికం. మధుమేహాన్ని, రక్తంలో కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది. బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. వాపులను నివారిస్తుంది.

సోంపూ: ఇవి రుచికి తియ్యగా ఉండటంతోపాటు ఆహార అరుగుదలకు తోడ్పడతాయి.

క్యాల్షియం నిల్వలు అంటున్నారు... అంటే?

ప్ర మా ఆంటీ ఈ మధ్య మామోగ్రఫీ స్క్రీనింగ్ చేయించుకుంది. ఆమెకు రొమ్ము భాగంలో సూక్ష్మ క్యాల్షియం నిల్వలు ఉన్నాయని ఆ పరీక్షలో తేలింది. వైద్యులు ఇది ప్రమాదకరం కావచ్చని చెబుతూనే ఆ క్యాల్షియం నిల్వలోని కొంత భాగాన్ని బయాప్సీకి పంపించడం మంచిదని సూచించారు. వాళ్లు చెప్పినట్లుగా అది ప్రమాదకరమా. ఇదేమైనా సమస్యకు సంకేతం అంటారా? – ఓ సోదరి

డియర్ వసుంధర

డా॥ గీతానాగశ్రీ
క్యాన్సర్ శస్త్రచికిత్సా నిపుణురాలు

జ ఇలాంటి సూక్ష్మ క్యాల్షియం నిల్వలు ఉన్నాయంటే కాస్త సందేహించాల్సిన విషయమే. ఇవి క్యాన్సర్‌కి సంకేతం కావచ్చు. అందుకే బయాప్సీకి పంపించి పరిశీలించాలని చెప్పి ఉంటారు. దీనికీ ఓ పద్ధతి ఉంది. చిన్న వైరులాంటిదాన్ని రొమ్ములోకి పంపించి ఆ సూక్ష్మ క్యాల్షియం నిల్వలో ఒకదాన్ని తొలిగించి పరీక్షిస్తారు. ఒకవేళ పరీక్షలో పాజిటివ్ అని వస్తే... అదనంగా ఉన్న మిగిలిన నిల్వలన్నింటినీ తొలగిస్తారు. అవి రొమ్ము మొత్తం కనిపిస్తూంటే రొమ్మును కూడా పూర్తిగా తీసేయల్సి ఉంటుంది. వీలైనంతవరూ నిర్లక్ష్యం చేయకపోవడమే మంచిది. ముందుగా మామోగ్రఫీ చేయించుకోవడం వల్ల ఇలా సమస్యను ప్రారంభదశలోనే అంచనా వేసేందుకు అవకాశం ఉంటుంది. అప్పుడే తొంభైఅయిదు నుంచి వందశాతం వరకూ చికిత్స చేయించుకోవచ్చు. రొమ్మును తీసేయాల్సిన అవసరం కూడా ఉండదు. కాబట్టి మీరు నిర్లక్ష్యం చేయకండి.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

దటీజ్... మహాలక్ష్మి!

... అవును ఈమె పేరు గుత్తుల మహాలక్ష్మి!
త్వరలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టబోతోంది.
మహిళలకు న్యాయం చేయడమే తన లక్ష్యం అంటోంది.
దానికి కారణం ఉంది. కొన్నాళ్లక్రితం ఆమెను...
భర్త వదిలేశాడు. ఒళ్లో చంటిపిల్లాడు. పుట్టింటికెళ్తే... వాళ్లూ పట్టించుకోలేదు. ఖాళీ కడుపుతో... మనసునిండా బాధతో ఏడుపు తప్ప ఏమీ మిగల్లేదు.
ఆ పరిస్థితుల్లో ఆమె చావును కాకుండా ఓ లక్ష్యాన్ని ఆశ్రయించింది.
అలా ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సై శిక్షణను విజయవంతంగా పూర్తిచేసి...
ఆత్మవిశ్వాసంతో తన జీవితాన్ని మళ్లీ మొదలు పెట్టబోతోంది.

'యుద్ధం తప్పదనుకున్నప్పుడు అరచేయి కూడా ఆయుధమే అవుతుంది' అని నమ్ముతా. ఒకప్పుడు నా చదువెందుకూ పనికిరాదన్నవారే ఇప్పుడు నువ్వు గ్రేట్ అంటున్నారు. నేను ఇప్పుడు అందుకుంటోన్న ప్రశంసల కన్నా అప్పుడు విన్న విమర్శల్నే గుర్తుపెట్టుకున్నా. ప్రతి విమర్శను నా లక్ష్యానికి జతచేసుకున్నా. అందుకే ఎస్సై కాగలిగానేమో. నా బతుకు పోరాటంలో ఎన్నో మలుపులు. ప్రతి సంఘటనా నాలో నిబ్బరాన్ని పెంచింది. జీవితంలో కొత్త లక్ష్యాలు ఏర్పరుచుకునేలా చేసింది. గెలుపు రుచి చూపించింది. అలాగని నేను చిన్నప్పుడు ఎస్సై కావాలనుకోలేదు. మా ఇంట్లో ఆడపిల్లలు ఎవరూ పోలీసు రంగంలోనే లేరు. కేవలం నాకు ఎదురైన పరిస్థితులే నన్ను పోలీసును చేశాయి.

వెక్కిరించారు...

మాది తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలంలోని చిన్న గూళ్లపాలెం. చిన్నప్పటి నుంచీ చదువుల్లోనూ ముందుండేదాన్ని. పదోతరగతి వరకూ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చదువుకున్నా. ఆ తరువాత డిగ్రీ రాజమండ్రిలో, మైక్రోబయాలజీలో పీజీ వైజాగ్‌లో పూర్తి చేశా. ఉద్యోగం చేయాలనుకున్నా. ఆ ప్రయత్నాల్లో ఉన్నప్పుడే 'ఇక అవన్నీ వద్దు. మంచి సంబంధం' అంటూ పెళ్లి చేశారు. అందరు అమ్మాయిల్లానే నేనూ కోటి కలలతో అత్తారింట్లో అడుగుపెట్టా. మా వారు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి. డిప్యుటేషన్ మీద దిల్లీ, అసోం వంటి ప్రాంతాలకు తిరిగే వాళ్లం. ఉద్యోగం చేస్తానంటే... 'నీదీ ఓ చదువేనా. మా వాడు చేస్తున్న ఉద్యోగానికి ఇంతకంటే మంచి కట్నం వచ్చేది' అంటూ వెక్కిరించేవారు అత్తింటివారు. దెప్పిపొడుపులూ తప్పేవి కావు. అన్నింటినీ భరిస్తోన్న సమయంలోనే పిల్లాడు కడుపులో పడ్డాడు. చివరకు పెళ్లయిన నాలుగేళ్లకే విడిపోవాల్సి వచ్చింది. బాబుని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయా.

ఇంట్లో వాళ్లే అలా...

భవిష్యత్తు అర్థంకాలేదు. ఎన్ని రాత్రులు ఏడ్చానో కూడా గుర్తులేదు. అన్నయ్యలూ, అమ్మానాన్నలే ప్రపంచం అనుకున్నా. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ వారి బాధ్యతల్ని నెత్తిన వేసుకున్నా. అంతా అనుకున్నట్లు జరిగితే చెప్పడానికి ఏముంది. ఆర్థిక విషయాల్లో గొడవలు వచ్చాయి. పిల్లాడి భవిష్యత్తు అర్థంకాలేదు. నా బతుకు నేను బతకాలనుకున్నా. ఇంట్లోవాళ్లు సాయం చేయకపోగా నానామాటలన్నారు. సొంతవాళ్లే ఇలా చేసేసరికి కుంగిపోయా. సాయంకోసం చాలా మందినే అర్థించా. అంతా 'నీ సొంతవాళ్లే కదా!' అన్నారే తప్ప ఎవరూ మా విషయాల్లో కల్పించుకోలేదు.

ఆడపిల్లవు... అవసరమా అన్నారు

చివరకు కట్టుబట్టలతో ఇంటి నుంచి బయటికి వచ్చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. న్యాయం చేయాల్సిన పెద్దలూ, పోలీసులూ... చూస్తూ ఉండిపోయారు. నాకేమో ఎక్కడికి వెళ్లాలో తెలియలేదు. మా మేనత్త పెద్ద కొడుకు, కోడలు అంటే బావసాయి ప్రసాద్, అక్క శ్రీదేవి ఆశ్రయమిచ్చారు. కోర్టులో కేసు వేద్దాం అనిపించింది కానీ పోరాటాలు చేస్తూ పోతే... పిల్లాడి పరిస్థితి ఏమవుతుందని అనిపించింది. సరిగ్గా నిద్ర ఉండేది కాదు. ఆ సమయంలో అక్కా, బావా 'ఇప్పుడు ఆస్తికోసం నువ్వు పోరాటం చేయడం కన్నా... నీ కాళ్లమీద నువ్వు నిలబడటం ముఖ్యం..' అని పదేపదే చెప్పేవారు. నాకూ నిజమేనని అనిపించింది. నా అదృష్టమో ఏమో తెలియదు కానీ ఆ సమయంలో కానిస్టేబుల్, ఎస్సై నోటిఫికేషన్ పడింది. నా వయసుపరంగా చూస్తే నాకు అదే చివరి అవకాశం. పోలీసు ఉద్యోగానికి ప్రయత్నించాలనుకుంటున్నా అని అక్కా, బావలకి చెప్పా. మొదట షాక్ అయ్యారు. 'ఆడపిల్లవు. కష్టపడలేవేమో. నీకు నమ్మకం ఉంటే ప్రయత్నించు...' అని చెప్పారు. నిజానికి నేను కూడా మొదట బ్యాంకు ఉద్యోగాలకు వెళ్లాలనుకున్నా. కానీ ఆలోచిస్తే చదువుకున్న అమ్మాయినైన నాకే ఎక్కడా న్యాయం జరగలేదు. మరి ఏ చదువూలేని ఆడపిల్లల పరిస్థితి ఏంటీ అని అనిపించింది. అందుకే దీన్నే ఎంచుకోవాలనకున్నా. నా కాళ్లమీద నేను నిలబడటమే కాదు నలుగురికీ న్యాయం చేయగలను అనే ఆలోచనతోనే ముందడుగు వేశా.

ఆపకుండా పరుగెత్తేదాన్ని...

ఆలోచించిందే తడవుగా కర్నూలు వెళ్లి కోచింగ్‌లో చేరిపోయా. రోజూ నా స్థాయికి మించి కష్టపడేదాన్ని. రాత పరీక్షల్లో నాకు పెద్దగా సమస్యలు లేకపోయినా ఓ బిడ్డ తల్లిగా నా శారీరక సామర్థ్యం తగ్గుతుంది కదా. దాంతో అందరికంటే కాస్త ఎక్కువే కష్టపడాల్సి వచ్చింది. పైగా ఎప్పుడూ శ్రమ పడని శరీరం కావడంతో నీరసం వచ్చేసేది. ఈలోగా కానిస్టేబుల్ పరీక్ష పూర్తయ్యింది. కానీ నేను ఎంపిక కాలేకపోయా. అది తెలిసి అంతా 'ఆడపిల్లకు ఇవన్నీ ఎందుకు...', 'నీ వల్ల కాదు...' అని నేరుగా నాతోనే అన్నారు. ఆ క్షణంలో వాళ్ల మాటలు బాధ అనిపించినా సరే! ఎక్కడా నిరుత్సాహం, నిరాశను దరిచేరనివ్వలేదు. కర్నూల్‌లో కానిస్టేబుల్ సుంకయ్యగారనీ ఉండేవారు. ఆయనా, నా కోచ్ బ్రహ్మం గారు నా పట్టుదల చూసి నాకెంతో సాయం చేశారు. రోజూ ఉదయాన్నే ఆరుకిలోమీటర్లు ఆపకుండా పరుగెత్తించేవారు. అలా ఎనిమిది రౌండ్లు పూర్తిచేసేదాన్ని. నా కష్టం చూసి అక్క బాధపడి ఓ తల్లిలా నా దగ్గరకు వచ్చింది. పరుగెత్తడం అలవాటు లేదు కదా... అందుకే మొదట్లో తరచూ జ్వరం వచ్చేసేది. ఓ అథ్లెట్ ప్రాక్టీస్ చేస్తుంటే ఆమెతో పాటు నేనూ పరుగెత్తేదాన్ని. ఎన్నో మెలకువలూ తెలుసుకునేదాన్ని. అలా రోజులో కనీసం పద్నాలుగు గంటల పాటు కష్టపడేదాన్ని. రోజు రోజుకీ పరుగులో మెరుగు అయ్యాను. శారీరక సామర్థ్యం అందుకున్నా. చివరికి తొమ్మిది నిమిషాల పది సెకన్లలో పూర్తి చేయగలిగాను. ఆ సమయంలో పిల్లాడిని అక్కే చూసుకుంది. అలా పన్నెండు నెలలపాటు అనంతపురంలో ఎస్సై శిక్షణను పూర్తిచేయగలిగా. త్వరలో ఉద్యోగంలో చేరబోతున్నా. ఇప్పుడు నా ముందున్న లక్ష్యం ఒకటే. మా వాడికి ఇప్పుడు పదేళ్లు. వాడిని బాగా చదివించి సివిల్ సర్వీసెస్ సాధించేలా చేయాలి.

నొప్పి ఉన్నా సరే...

- నేను ఎస్సై శిక్షణకు ఎంపికయ్యాక ఓ రోజు బండిపై వెళ్తుంటే కుక్క అడ్డం వచ్చింది. దాంతో నేను కిందపడిపోయా. కాలికి దెబ్బ తగిలింది. ఈలోగానే శిక్షణ మొదలవ్వడంతో వెళ్లక తప్పలేదు. మొదట్లో ఇరవై నిమిషాల్లోగా 3.2 కిలోమీటర్లు పరుగెత్తాల్సి ఉండేది. కానీ కాలు ఏ మాత్రం కదిపినా నొప్పి వచ్చేది. ఈ వంకతో నేను ఏ మినహాయింపునీ కోరుకోలేదు. ఓ సారి పరుగు పెట్టాక ఆగేదాన్ని కాదు. నా పరిస్థితి చూసి పరుగు అయిపోయిన వెంటనే ఫిజియోథెరపీకి పంపించేవారు. అలా నెమ్మదిగా నా మీద నేను నమ్మకం పెంచుకుంటూ వచ్చా.
- అమ్మాయిలకూ, అబ్బాయిలకూ శిక్షణలో ఏ తేడా ఉండదు. పరుగూ, ఈత, డ్రైవింగ్, బీవోఏసీ శిక్షణలతో పాటు కంప్యూటర్ కూడా నేర్పుతారు. మొదట్లో కొన్ని సార్లు ఇబ్బందిపడినా ఎక్కడా ఆగలేదు. అన్నింటినీ అధిగమిస్తూనే వచ్చా.
- నా ఆశలన్నీ పిల్లాడి మీదే. మూడేళ్ల వరకూ వాడిని ఏ రోజూ వదిలిపెట్టింది లేదు. శిక్షణ కారణంగా వాడిని అక్క దగ్గరే వదిలిపెట్టా. ఏడాదిలో వాడిని చూసిన సందర్భాలు వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఇప్పుడు ఫోన్‌లు మాట్లాడే అవకాశం ఉండటంతో వాడితో మాట్లాడితే కానీ నా రోజు మొదలయ్యేది కాదు. ఎప్పుడైనా నేను బేలగా మారిపోయానని వాడికి అనిపిస్తే... వాడు నాకు ఓ నాన్నలా భరోసా ఇచ్చేవాడు.

– స్వాతి కొరపాటి

బంగారం వెండి



22న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,915	2,915
వెండి (గ్రా)	43.50	42.90

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,520	31,510	31,500	31,550	31,600	31,600	31,525	31,460	31,330	31,400
ఆర్నమెంట్	29,430	29,430	29,300	29,300	29,260	29,300	29,170	29,150	29,140	29,200
వెండి(కిలో)	40,925	40,650	40,900	40,900	40,800	40,700	40,900	40,650	41,900	41,900

నజరానా

కాఫీపొడి గడ్డకట్టకుండా ఉండాలంటే... కాసిని బియ్యంగింజల్ని వస్త్రంలో మూటలా చుట్టి ఆ సీసాలో వేసి చూడండి.

అమెరికా స్కాలర్‌షిప్... వస్తుందనుకోలేదు

అమెరికాకు చాలామంది వెళ్తుంటారు. చదువు కోసం కొందరు.. ఉపాధి కోసం మరికొందరు.. చుట్టపుచూపుగా ఇంకొందరు... ఛలో అమెరికా అంటుంటారు. వీరిలో కొందరు ప్రత్యేకం. అమెరికాలో దిగినప్పటి నుంచీ వారికి విశేష ఆతిథ్యం లభిస్తుంది. ఊహించని సహకారం అందుతుంది. ఉచితంగా ఉపకార వేతనమూ సమకూరుతుంది. ఎందుకంటే? వాళ్లు 'ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్'కి ఎంపికయ్యారు మరి. కళల విభాగంలో ఈ ఫెలోషిప్ పొందిన కూచిపూడి నృత్యకారిణి లలితా సింధూరి అలా ఇటీవలే అమెరికా వెళ్లొచ్చింది.

ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్ గురించి నాలుగేళ్ల కిందటే తెలుసు. అప్పుడే దరఖాస్తు చేసుకోవాలనుకున్నా. కానీ గతేడాది అవకాశం వచ్చింది. దరఖాస్తు చేసుకుంటే పరిశోధనాంశం వైవిధ్యంగా ఉండాలన్నారు. అలాంటిదే ఎంచుకున్నా. తొలుత మౌఖిక పరీక్ష. అందులో ఉత్తీర్ణత సాధిస్తే.. టోఫెల్, జీఆర్ఈ వంటి పరీక్షల్లో మంచి స్కోర్ సాధించాలి. అప్పుడు గానీ అమెరికాలో అడుగుపెట్టలేం. అన్నీ దాటి గతేడాది అమెరికా వెళ్లా. 'ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్' కోసం మనదేశం నుంచి 32 మంది ఎంపికయ్యారు. కళల విభాగంలో నేనొక్కదాన్నే.

ఖర్చంతా వాళ్లదే!

ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్ ప్రతిష్ఠాత్మకమైంది. విద్యా, పరిశోధనలో విజ్ఞాన మార్పిడి కోసం అమెరికా ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసింది. విద్య, వైద్యం, కళలు, శాస్త్ర, సాంకేతిక... రంగాల్లో 100 దేశాల నుంచి అతికొద్ది మందిని అమెరికాకు ఆహ్వానిస్తారు. అక్కడి విద్యాసంస్థలూ, విశ్వవిద్యాలయాల్లో అవకాశం కల్పిస్తారు. ఏడాది పాటు కొనసాగే పరిశోధనకు అయ్యే ఖర్చంతా ఆ ప్రభుత్వమే భరిస్తుంది. పరిశోధనలో భాగంగా అక్కడి లైబ్రరీలూ, ప్రయోగశాలలూ, ఆడిటోరియాలకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. అక్కడ రాష్ట్రాల్లోనూ పర్యటించొచ్చు. అంతేగాక, ప్రతి నెలా 2,000 డాలర్ల ఉపకార వేతనం కూడా ఇస్తారు.

మరింత మెరుగయ్యా...

భారతావని కళలకు కాణాచి అయితే.. అధ్యయనానికి అసలుసిసలు చిరునామా అమెరికా! కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయక్కడ. పరిశోధన కోసం బోలెడన్ని లైబ్రరీలు, నాట్య ప్రదర్శన కోసం లెక్కలేనన్ని వేదికలు. 'భిన్న సంస్కృతుల సమ్మేళనం' (క్రాస్ కల్చరల్ ట్రైనింగ్) నా పరిశోధనాంశం. న్యూయార్క్ యూనివర్సిటీలో నా పరిశోధన చేశా. అక్కడి పాశ్చాత్య నృత్యరీతులనూ నేర్చుకున్నా. అమెరికన్ మోడ్రన్ డ్యాన్స్, రష్యన్ బ్యాలే, స్పానిష్ ఫ్లెమింకో, ఆఫ్రికన్ ప్లాటిజ్ ఇలా విభిన్నమైన నృత్యరూపాలపై పరిశోధన చేశా. వీటివల్ల శారీరకంగా, మానసికంగా నాలో ఎంతో మార్పు వచ్చింది. కూచిపూడిని మరింత మెరుగ్గా అర్థం చేసుకున్నా.

మనసును తాకాయి..

నా పరిశోధనలో భాగంగా అమెరికాలోని వివిధ యూనివర్సిటీలకు వెళ్లా. అక్కడ మన కూచిపూడి ప్రస్థానం, ప్రత్యేకతలు, ఈ సంప్రదాయంలోని గురు శిష్య పరంపర గురించి అక్కడివారికి వివరించా. ప్రదర్శనలూ ఇచ్చా. శ్రీకృష్ణుని మీద మియామీలో ఒక నృత్య రూపకం ప్రదర్శించా. భాష అర్థం కాకపోయినా.. అందులోని భావం మనసును కదిలించిందని విదేశీ ప్రతినిధులు నన్నెంతో అభినందించారు. కళాకారులు సంఘంలోని సమస్యలను తమ కళతో ఎత్తిచూపాలి. నేను అమెరికాలో ఉన్న సమయంలో ఇక్కడ ఆసిఫా ఘటన జరిగింది. అమానవీయ ఉదంతంపై సామాజిక స్పృహ రగిలించేలా 'విజిల్ ఫర్ ఆసిఫా' అనే నృత్యరూపకాన్ని కొలంబియా యూనివర్సిటీలో ప్రదర్శించా. ఎన్నో ప్రశంసలొచ్చాయి.

ఊహ తెలియనప్పటి నుంచే.. నేను పుట్టింది అమలాపురంలో. శాస్త్రీయ కూచిపూడి నృత్యంలో లబ్ధప్రతిష్ఠులైన మొదటి తరం 'మూర్తి త్రయం'లో ఒకరైన వెంపటి వెంకటనారాయణ మా ముత్తాత. నాకు ఊహ తెలియని వయసులోనే నాట్యం చేయడం మొదలుపెట్టా. నాన్నగారు వేణుగోపాల కృష్ణప్రసాద్ కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు. నాకు పసుమర్తి శ్రీనివాస్, వేదాంతం సత్యనరసింహశాస్త్రి లాంటి గొప్ప గురువుల దగ్గర నాకు శిక్షణనిప్పించారు. ఇంజినీరింగ్ చేశా. నాట్యానికే జీవితం అంకితం అనుకున్నా. వెంటనే కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 'మాస్టర్ ఇన్ డ్యాన్స్'లో చేరాను. ఎమ్.ఏ పూర్తయ్యాక పీహెచ్‌డీలో చేరా.

ఫుల్‌బ్రైట్ తరఫున ఐక్యరాజ్యసమితి సందర్శించే అవకాశం దక్కింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిర్వహించిన సదస్సులో శాంతి ప్రతినిధిగా పాల్గొన్నా. అప్పుడే సమితి మొత్తం చూశాను. ఎమ్ఎస్ సుబ్బులక్ష్మి గారు కచేరి ఇచ్చిన ప్రదేశాన్ని చూసినప్పుడు ఏదో తెలియని అనుభూతి కలిగింది. ఏనాటికైనా ఐక్యరాజ్యసమితిలో ప్రదర్శన ఇవ్వాలన్నది నా సంకల్పం.

– నాగరాజు, ఈటీవీ హైదరాబాద్

బృందావనం

వంకాయ పెంచేద్దామా!

'వంకాయ వంటి కూరయు...' అన్నట్లుగా కూరగాయల్లో అగ్రతాంబూలం వంకాయదే! ఇంత ప్రత్యేకత ఉన్న వంకాయను మన ఇంట్లో ఎలా పెంచుకోవాలో చూద్దామా.

మరీ చల్లని ప్రాంతాల్లో తప్ప ప్రపంచమంతటా విరివిగా పండే వంకాయ శాస్త్రీయ నామం సొలానమ్ మెలాంజినా. బ్రింజాల్ అనే పేరు మనదేశంలో ఎక్కువగా వాడుకలో ఉంది. అబర్‌గెన్ అన్నా ఇదే. దీన్ని ఎగ్ ప్లాంట్ అనీ అంటారు. ఒక రకం వంకాయలు తెల్లగా, అండాకారంలో అచ్చంగా కోడిగుడ్లు మొక్కకు వేలాడుతున్నాయా అన్నట్లు ఉంటాయి మరి. మనదేశంలో ఎన్నో రకాల వంకాయలు - రంగూ, ఆకారం, పరిమాణం, ప్రాంతం, అభిరుచిని బట్టి ఎవరి ఎంపిక వారిదే. అలాగే కొన్ని వంటలు కొన్ని రకాలతో చేస్తేనే బాగుంటాయి కూడా.

వంకాయల్ని అన్ని కాలాల్లోనూ పండించుకోవచ్చు. వర్షాకాలం పంటగా జూన్-జులై నెలల్లో నాటుకోవాలి. కావాల్సిన రకం విత్తనాలు తెచ్చి నారు పోసుకోవడమో లేదా షేడ్‌నెట్లలో పెంచి అమ్ముతున్న నారు తెచ్చి నాటుకోవడమో చేయాలి. నారు వయసు 25-30 రోజుల మధ్య ఉన్నప్పుడు కుండీల్లో లేదా ముందుగా సిద్ధం చేసి పెట్టుకున్న మళ్లలో నాటుకోవాలి. నేలలో నాటుకుంటే, మొక్కకూ మొక్కకూ మధ్య అడుగున్నర దూరం ఉండేలా చూసుకోవాలి. కుండీలో అయితే దాని పరిమాణాన్ని బట్టి 2-3 మొక్కలు నాటుకోవచ్చు. ఎప్పుడైనా సరే సాయంత్రం పూట మట్టిని తడిపి నాటుకుంటే తెల్లారేసరికి చక్కగా కుదురుకుని ఉంటాయి. వంగకు ఎండ సరిగ్గా తగలాలి. మట్టి పూర్తిగా పొడిబారి పోకుండా నీళ్లు పోస్తూ ఉండాలి. వంగ నాటిన 45-50 రోజుల్లో కాయడం మొదలెట్టి రెండు నెలలపాటు బాగా కాస్తుంది. మళ్లీ అక్టోబరు-నవంబరు నెలల్లో నాటుకుని కాపు వచ్చేవరకూ కావాలంటే అలాగే ఉంచి నీళ్లూ, ఎరువులు సరిగా ఇవ్వాలి. మొక్క మీదే ముదిరిన కాయలను అలాగే ఉంచి, పండాక విత్తనాలు తీసి బాగా కడిగి నీడలో ఎండబెట్టి దాచుకుంటే మళ్లీ నాటుకోవడానికి పనికొస్తాయి.

ఎరువూ ఉండాలి: కుండీలో లేదా మడిలో ముందుగానే తగినంత పశువుల ఎరువూ, ఎముకల పొడీ, పిండి ఎరువులూ, జీవ ఎరువులు కలపడం వల్ల తరువాత పోషకాలను ఇవ్వాల్సిన అవసరం అంతగా రాదు. అప్పుడప్పుడూ జీవామృతం, వర్మీవాష్ వంటివి అందించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. కుండీలో లేదా మడిలో పుదీనా కొమ్మలు నాటుకోవడం వల్ల పురుగులు దరిచేరవు. అలాగే బంతి మొక్కలు ఒకటి రెండింటిని అదే కుండీలో నాటుకుంటే నులిపురుగుల నుంచి రక్షణ దొరుకుతుంది. మునగాకు రసాన్ని 24 గంటలు నిల్వ ఉంచి 2-3 సార్లు చల్లడం వల్ల వడలు తెగులూ, సీతాఫలం ఆకు కషాయం చల్లడం వల్ల కాండం లేదా కాయతొలిచే పురుగు అదుపులో ఉంటాయి. వంగకు ప్రమాదం కలిగించే సమస్యలు ప్రధానంగా ఇవే. అయితే గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే - సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పెంచదలుచుకున్నప్పుడు సమస్యను ముందుగానే గుర్తించాలి. అంటే తప్పకుండా మీరు తీరిక చేసుకుని మీ మొక్కలతో రోజూ ముచ్చటించాలి.

దేశవాళీ రకాలతోపాటు ప్రతి విషయంలోనూ అధిక దిగుబడిని ఇచ్చే సంకర రకాలున్నాయి. సంకర రకాల్లో ఈ కిందవి దొరుకుతాయేమో చూడండి. ఇవి అధిక దిగుబడిని ఇవ్వడంతోపాటు కొన్ని రకాల చీడపీడలను తట్టుకుంటాయి .

ఉదారంగు సన్నని, పొడవు కాయల కోసం - పూసాపర్పుల్ లాంగ్, పూసా పర్పుల్ క్లస్టర్, హైబ్రిడ్ 5

ఉదారంగు లావు, పొడవు కాయల కోసం - పూసాక్రాంతి

ఉదారంగు గుండ్రని కాయలకు - శ్యామల, అర్కనవనీల్, అంబారా

చారల అండాకారపు కాయలకు - మహీ సూపర్ 10, కల్పతరు, మంజుశ్రీ

ఆకుపచ్చని అండాకారపు కాయలకు - ఆర్తి, మహీ99, అర్క కుసుమాకర్

ఆకుపచ్చని పొడవు కాయలకు - అర్క షిరీన్

తెల్లని అండాకారపు కాయలకు - వైట్ పొన్ని

– బోడెంపూడి శ్రీదేవి, ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

ముఖానికి పెసరపిండి!

వంటింట్లో ఉండే పెసరపిండితో ఇలా చేసి చూడండి. చర్మం తాజాగా ఆరోగ్యంగా ఉంటుంది.

- జిడ్డు చర్మతత్వం ఉంటే ముఖం కడుక్కున్న కొద్దిసేపటికే తాజాగా ఉండదు. దాంతో దుమ్మూ, ధూళి సులువుగా చేరిపోతాయి. మొటిమల సమస్యా తప్పదు. అలాంటప్పుడు పావుకప్పు పెసరపిండికి రెండు చెంచాల పెరుగు, చెంచా కీరదోస రసం, రెండు చుక్కల ఆలివ్‌నూనె కలిపి ముఖానికి పూతలా రాయాలి. బాగా ఆరాక కడిగేయాలి.
- పావుకప్పు పెసరపిండిలో మూడు చెంచాల కొద్దిగా ఆపిల్ గుజ్జు, చెంచా తేనె, అరచెక్క నిమ్మరసం కలిపి ముద్దలా చేసుకోవాలి. దీన్ని ఉదయాన్నే ముఖానికి రాసుకుని పావుగంటాగి గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే సరి. ముఖంపై పేరుకున్న నలుపు పోయి తాజాగా కనిపిస్తుంది. ఇలా రోజుమార్చి రోజు చేస్తుంటే ఫలితం కనిపిస్తుంది.
- మెడా, మోచేతులు నల్లగా మారి, బరకగా కనిపిస్తున్నాయా... అలాంటప్పుడు పావుకప్పు పెసరపిండికి, చెంచా నిమ్మరసం, గులాబీ నీరు చేర్చి మెత్తగా చేసుకుని సమస్య ఉన్న ప్రాంతాల్లో పూతలా వేయాలి. ఇలా తరచూ చేయడంవల్ల చర్మఛాయ కూడా మెరుగు పడుతుంది.

ఈనాడు
విజేత
sports@eenadu.in
శనివారం జూన్ 23, 2018 10
విజయవాడ

వార్ శాసిస్తోంది..!



'హ్యాండ్ ఆఫ్ గాడ్' గురించి తెలుసుగా..? 1986 ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్లో అది అర్జెంటీనా గోల్ చేయడంలో తోడ్పడింది. విషయమేంటంటే అప్పుడు మారడోనా చేయి తగిలి బంతి గోల్‌లోకి వెళ్లింది. రిఫరీ గుర్తించకపోవడంతో అది గోల్ అయింది. ఆ మ్యాచ్‌లో 2–1తో ఇంగ్లాండ్‌ను ఓడించిన అర్జెంటీనా ఏకంగా ప్రపంచకప్‌ను ఎగరేసుకుపోయింది. బంతికి చేయి తాకడంపై మారడోనా వివరణ ఇస్తూ.. అది దేవుడి చేయి అన్నాడు. అదే ఘటన జరిగితే ఇప్పుడు జరిగితే గోల్ అవుతుందా?

కచ్చితంగా గోల్ కాదు..! ఎందుకంటే ఇప్పుడు వార్ (వీడియో సమీక్ష సాయం) అమల్లో ఉంది. అది రష్యాలో ప్రపంచకప్‌ను శాసిస్తోంది.. పొరపాట్లను సరిదిద్దుతోంది.. తప్పులు తగ్గిస్తోంది.. మొత్తానికి ప్రపంచకప్‌లో తెరవెనుక శక్తిగా మారింది 'వార్'.

గత ప్రపంచకప్‌లతో పోలిస్తే ఇప్పటివరకు అత్యంత తక్కువ రెడ్ కార్డులు నమోదైన ప్రపంచకప్ (0.06) ఇదే. మ్యాచ్‌లో అత్యంత తక్కువ ఆఫ్‌సైడ్‌లు (సగటు 3 లోపే) నమోదైందీ ఈసారే. అత్యధిక పెనాల్టీలతో పాటు.. సెట్ పీసెస్ (కార్నర్ కిక్, ఫ్రీకిక్, పెనాల్టీలు, త్రోఇన్‌లు) ద్వారా ఎక్కువ గోల్స్ నమోదైన ప్రపంచకప్ కూడా ఇదే. వీటన్నింటికీ కారణం 'వార్'.

ఫుట్‌బాల్‌లో 'వార్' ఓ సంచలనం. క్లబ్ టోర్నీల్లో విజయవంతంగా అమలయ్యాక.. ప్రపంచకప్‌లో దీన్ని అమలు చేయాలా వద్దా అన్నదానిపై పెద్ద చర్చే జరిగింది. ఐతే ఫిఫా కొత్త సాంకేతికతకే ఓటేసింది. ఇప్పుడిది ప్రపంచకప్ స్వరూపాన్నే మార్చేస్తోంది. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో ఫ్రాన్స్ ఆటగాడు గ్రీజ్‌మన్‌ను ప్రత్యర్థి ఆటగాడు తోసేశాడు. ఇది గమనించని రిఫరీ ఆటను కొనసాగించాడు. తర్వాత ఆలోచన మార్చుకుని 'వార్' సాయం అడిగాడు. ఫ్రాన్స్‌కు పెనాల్టీ వచ్చింది. గోల్ కొట్టిన ఆ జట్టు గెలిచింది. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో డెన్మార్క్ ఆటగాడు పెనాల్టీ ప్రాంతంలో ఫౌల్ చేశాడు. బంతి అతడి చేతికి తాకింది. రిఫరీ దీన్ని గమనించలేదు. ఐతే ఆస్ట్రేలియా ఆటగాళ్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అతడు సమీక్షకు వెళ్లాడు. రిప్లేలో ఫౌల్ జరిగిందని తేలడంతో ఆస్ట్రేలియాకు పెనాల్టీ లభించింది. గోల్ కొట్టిన ఆసీస్ మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఈ రెండు ఉదాహరణలు చాలు.. ప్రపంచకప్‌లో వార్ ప్రభావమెంతో తెలియజేయడానికి. ఈసారి ప్రపంచకప్‌లో మొత్తం 11 పెనాల్టీలు రాగా.. అందులో వార్ ద్వారా వచ్చినవే ఐదు. వాటిలో నాలుగు గోల్స్ కావడం విశేషం. పెనాల్టీలు మాత్రమే కాదు.. రెడ్ కార్డులు ఇవ్వడంలోనూ వార్‌ది కీలకపాత్ర. దీనికి భయపడే ఆటగాళ్లు పెనాల్టీ ప్రాంతంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నారు.

అసంతృప్తి రాగాలు..: మరి 'వార్'తో మొత్తం తప్పులన్నీ ఆగిపోతాయా అంటే ఔనని అనలేం. ఐతే దీని వల్ల కొత్త తప్పులైతే జరగట్లేదు. ఈ సాంకేతికత వల్ల నష్టమైతే లేదు. జపాన్‌తో మ్యాచ్‌లో కొలంబియా ఆటగాడు ఫౌల్ చేసినా రిఫరీ దాన్ని గుర్తించలేదు. పైగా కొలంబియాకు ఫ్రీకిక్ లభించింది. ఆ జట్టు దాన్ని ఉపయోగించుకుని గోల్ చేసింది కూడా. ఐతే తర్వాత మరో గోల్ చేసి జపాన్ గెలిచింది. లేదంటే జపాన్ నష్టపోయేది. 'వార్' బృందానికి గోల్స్ నిర్ణయించడంలో, పెనాల్టీలు, రెడ్ కార్డులు ఇవ్వడంలో మాత్రమే అధికారముంటుంది. ఆటలో 'వార్' పాత్రను పరిమితం చేయడానికి ఫిఫా ఈ నిర్ణయం తీసుకుంది. ఇక బ్రెజిల్, ఇంగ్లాండ్ జట్లు ఇప్పటికే ఈ కొత్త సాంకేతికతపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. బ్రెజిల్ ఫిఫాకు ఫిర్యాదు చేసింది కూడా. స్విట్జర్లాండ్ ఆటగాడు ఫౌల్ చేసినా గుర్తించలేదని.. అప్పుడే ఆ జట్టు ఖాతాలో గోల్ చేరిందనేది బ్రెజిల్ ఆరోపణ. ఇక ట్యునీషియా ఆటగాళ్లు పదేపదే ఆటగాళ్లను కిందకు తోసేసినా ప్రధాన రిఫరీ గానీ.. వీడియో రిఫరీలు గానీ గుర్తించకపోవడంపై ఇంగ్లాండ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మరి 'వార్'ను అమలు చేయడం వల్ల ఉపయోగం ఏంటని ప్రశ్నించింది. ఐతే ఆటలో తప్పుల్ని పూర్తిగా అరికట్టలేకపోయినా.. ఈ కొత్త సాంకేతికత ఆటకు ఎంతో మేలు చేస్తుందన్నది వాస్తవం.

18

ఓ ప్రపంచకప్‌లో అత్యధికంగా ఇచ్చిన పెనాల్టీల సంఖ్య ఇది. గ్రూప్ దశ సగమైనా పూర్తి కాలేదు. అప్పుడే ఈ ప్రపంచకప్‌లో 11 పెనాల్టీలు నమోదయ్యాయి. అందులో కొత్త సాంకేతికత వార్ ద్వారా వచ్చినవే ఐదు కావడం విశేషం.

వీళ్లముందు బచ్చన్ బలాదూర్!

సురెజ్

మారడోనా

అతను కొరికేస్తాడు..

జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అన్నట్లుగా.. ఉరుగ్వే ఆటగాడు సురెజ్‌కు రిఫరీల కళ్లుగప్పి ప్రత్యర్థి ఆటగాళ్లను కొరికి గాయపరచడం అలవాటు. అతను అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో, క్లబ్ ఆటలో పలుమార్లు ప్రత్యర్థుల్ని కొరికేశాడు. 2014 ప్రపంచకప్‌లో అయితే అతడి కాటు తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటలీ డిఫెండర్ చీలినిని అతను గట్టిగా కొరికేశాడు. అంతకుముందు చాలాసార్లు ప్రత్యర్థుల్ని కొరికి ఏమీ ఎరగనట్లు నటించి బతికిపోయాడు కానీ.. ఆ మ్యాచ్‌లో మాత్రం పట్టుబడిపోయాడు. ప్రత్యర్థి ఒంటిపై గాటుపడేలా కొరకడంతో అతడికి వెంటనే రెడ్ కార్డు ఇచ్చాడు రిఫరీ. తర్వాత ఫిఫా అతడిపై నాలుగు నెలల నిషేధం కూడా విధించింది.

ఒకరేమో ప్రత్యర్థి చేయి ఊరికే అలా భుజానికి తాకితే.. ముఖం పచ్చడైపోయినట్లు బాధను నటిస్తాడు. ఇంకొకరు అవతలి జట్టు ఆటగాడిని కొరికేసి.. ఏమీ ఎరగనట్లు అమాయకచూపులు చూస్తుంటాడు. మరొకరు బంతిని ఉద్దేశపూర్వకంగా చేత్తో అడ్డుకుని.. తన ప్రమేయం ఏమీ లేనట్లు భ్రమింపజేస్తాడు. ఫుట్‌బాల్‌లో ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణం. ఈ ఆటలో కొందరి ఈ నట కౌశలం చూస్తే వీళ్లు ఫుట్‌బాల్ ఎందుకాడుతున్నారు.. సినిమాల్లోకి వెళ్తే మన కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్‌లు కూడా వీళ్ల ముందు బలాదూరే కదా అనిపిస్తుంది. మేటి ఫుట్‌బాలర్లుగా పేరు తెచ్చుకున్న వాళ్లు సైతం జట్టు కోసం మైదానంలో చేసే నట విన్యాసాలు చూస్తే విస్తుపోవాల్సిందే!

ఏమీ జరక్కుండానే బాధను నటించడం, ఏదో అయిపోయినట్లు భ్రమింపజేయడం నటులకే సాధ్యమా.. మా వల్ల కాదా అన్నట్లుగా ఉంటుంది ఫుట్‌బాలర్ల తీరు. ఈ ఆటలో ఫీల్డ్ గోల్ కొట్టడం అంత సులువు కాదు. పెనాల్టీ.. కుదరకపోతే కనీసం ఫ్రీ కిక్ అయినా లభిస్తే గోల్ కొట్టేందుకు మెరుగైన అవకాశాలుంటాయి. ప్రత్యర్థి ఆటగాడు తనను ప్రమాదకర రీతిలో అడ్డుకున్నట్లు రిఫరీ భావిస్తే.. అడ్డుకున్న ప్రదేశాన్ని బట్టి ఫ్రీ కిక్కో, పెనాల్టీనో ఇస్తాడు. ముఖ్యంగా పెనాల్టీ లభించిందంటే తేలిగ్గా పనైపోతుంది. దీని కోసం ఆటగాళ్లు వేసే వేషాలు అన్నీ ఇన్నీ కావు. ప్రత్యర్థి ఆటగాడు కనీసం తాకనైనా తాకకుండానే ముందుకు పడిపోయి, పల్టీలు కొట్టేస్తుంటారు. గాయమైనట్లు హావభావాలిస్తుంటారు. ప్రత్యర్థి ఆటగాడు తాకింది ఒకచోటైతే ఇంకో భాగాన్ని పట్టుకుని బాధను నటిస్తుంటారు. ముఖ్యంగా పెనాల్టీ ప్రాంతంలోకి రాగానే ఆటగాళ్ల నట కౌశలం మరో స్థాయికి చేరిపోతుంది. అక్కడే మహానటులు దర్శనమిస్తారు. మైదానంలో కూలబడిపోయి చేసే విన్యాసాలు, ఇచ్చే హావభావాలు చూస్తే అయ్యో పాపం అనిపిస్తుంది. కానీ రీప్లేలో చూశాక మన అమాయకత్వానికి తిట్టుకోవాల్సి ఉంటుంది. ఒంటికేమీ దెబ్బ తాకకుండానే ఏదో జరిగిపోయినట్లు రిఫరీల్ని తప్పుదోవ పట్టించి పెనాల్టీ తెచ్చుకుని మ్యాచ్ ఫలితాల్ని మార్చిన ఘనులు చాలామందే ఉన్నారు. అదే సమయంలో ప్రత్యర్థి ఆటగాడిని ఉద్దేశపూర్వకంగా గాయపరిచి, బంతిని కావాలనే చేత్తో అడ్డుకుని.. ఆ తర్వాత ఏమీ ఎరగనట్లు నటించేసి ప్రత్యర్థికి నష్టం చేసిన వాళ్లూ కోకొల్లలు. దీంతో పాటు ప్రత్యర్థికి గెలిచే అవకాశం రాకుండా సమయం వృథా చేయడం కోసం డ్రామా నడిపించేవాళ్లు కూడా చాలామందే ఉంటారు. చుట్టూ కెమెరాలున్న సంగతి తెలిసి కూడా ఏమీ తెలియనట్లు ఆటగాళ్లు వేసే వేషాలు చూసి ఔరా అనుకుంటారు వీక్షకులు! కీలక మ్యాచ్‌ల్లో ఇలాంటి వేషాలేసి ఫలితాల్ని మార్చేస్తే ఆటగాళ్ల విలువ పడిపోతుంది. పరువు పోతుంది. అయినా కూడా వాళ్లలో మార్పేమీ రాదు. ఏం చేసినా జట్టు ప్రయోజనాల కోసమే అంటారు. చరిత్రలో ఎందరో మేటి ఆటగాళ్లు వేషాలతో పరువు తీసుకున్న వాళ్లే. స్వచ్ఛంగా ఆట ఆడే వాళ్లు చాలా కొద్దిమందే కనిపిస్తారు ఫుట్‌బాల్‌లో.

ఫలితాలే మారిపోతాయ్

మైదానంలో ఆటగాళ్లు వేసే నాటకాల వల్ల ఎన్నోసార్లు మ్యాచ్‌ల ఫలితాలే మారిపోతుంటాయి. ప్రపంచకప్‌ల్లోనూ ఇలాంటి ఘటనలు కోకొల్లలు. ప్రపంచకప్ ఫైనల్ ఫలితాలు కూడా మారిపోయిన ఉదంతాలు చరిత్రలో ఉండటం విశేషం.

- 1990 ప్రపంచకప్ తుది పోరులో అర్జెంటీనాతో పశ్చిమ జర్మనీ తలపడింది. మ్యాచ్ హోరాహోరీగా సాగుతున్నపుడు జర్మనీ ఆటగాడు జుర్గెన్ క్లిన్స్‌మన్ తనలోని నటుణ్ని బయటికి తెచ్చాడు. ప్రమాదకర రీతిలో పల్టీ కొట్టాడు. అతడిని పడేశాడని భావించి ప్రత్యర్థి ఆటగాడు పెడ్రో మోంజాన్‌ను రిఫరీ రెడ్ కార్డు చూపించాడు. కానీ రీప్లేలో అతను రెడ్ కార్డు అందుకునేంతగా క్లిన్స్‌మన్‌ను దెబ్బ తీయలేదని తేలింది. తర్వాత అర్జెంటీనా పదిమందితోనే ఆడింది. 85వ నిమిషంలో జర్మనీ గెలుపు గోల్ సాధించింది. ప్రపంచకప్‌ను ఎగరేసుకుపోయింది.
- 1986 ప్రపంచప్‌లో ఇంగ్లాండ్‌తో క్వార్టర్ ఫైనల్లో అర్జెంటీనా సూపర్ స్టార్ మారడోనా 51వ నిమిషంలో అద్భుత రీతిలో గోల్ కొట్టాడు. ఇంకో నాలుగు నిమిషాలకే మరో గోల్ అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 2-1తో అర్జెంటీనా గెలిచింది. ఐతే మారడోనా తొలి గోల్‌లో అతడి చేతిది కీలక పాత్ర అని రీప్లేలో తేలింది. కానీ ఆ విషయాన్ని రిఫరీ పసిగట్టలేదు. మారడోనా కూడా ఏమీ ఎరగనట్లే ఉన్నాడు. మ్యాచ్ అనంతరం ఈ విషయాన్ని ప్రస్తావిస్తే.. ఆ చెయ్యి దేవుడిది అయ్యుండొచ్చని వ్యాఖ్యానించాడు డీగో. దీంతో ఈ గోల్‌కు 'హ్యాండ్ ఆఫ్ గాడ్'గా పేరొచ్చింది. మారడోనా ఫౌల్‌ను రిఫరీ గుర్తించి ఉంటే అది గోలే అయ్యేది కాదు. అతడికి రెడ్‌కార్డు ఇచ్చేవాడు. రెండో గోలూ నమోదయ్యేది కాదు. మ్యాచ్ ఇంగ్లాండ్ సొంతమయ్యేదేమో! ఈ టోర్నీలో అంతిమంగా అర్జెంటీనానే విజేతగా నిలవడం గమనార్హం.
- ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే గొప్ప ఆటగాళ్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న బ్రెజిల్ దిగ్గజం రివాల్డో 2002 ప్రపంచకప్‌లో దారుణంగా ప్రవర్తించాడు. కార్నర్‌లో నిలబడి ఉన్న అతడి వైపు హకన్ ఉన్సాయ్ బంతిని తన్నాడు. అది కాలికి తాకితే.. రివాల్డో మాత్రం ముఖం పట్టుకుని ఎగిరి అవతలికి దూకాడు. రిఫరీ హకన్‌కు రెడ్ కార్డు ఇచ్చి మైదానం నుంచి పంపేశాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ గెలిచింది.

'వార్'తో కొంచెం మారింది..

గత ప్రపంచకప్‌లతో పోలిస్తే ఈసారి నాటకాల రాయుళ్ల ఆటలు అంతగా సాగట్లేదు. ఇలా అతి చేసే వాళ్లకు అడ్డుకట్ట వేయడానికి ఒక సాంకేతిక అందుబాటులోకి వచ్చింది. అదే.. వీడియో సమీక్ష సాయం (వార్). దీని సాయంతో రిఫరీలు నిజంగా అసలేం జరిగిందో తెలుసుకుంటున్నారు. నాటకాల రాయుళ్లకు కొంత మేర చెక్ పెడుతున్నారు. ఇంతకుముందు రీప్లేకు అవకాశమే లేకపోవడంతో ఆటగాళ్లు తన నట కౌశలంతో రిఫరీల్ని గందరగోళంలో పడేసేవాళ్లు. ఇప్పటికీ కొంతమంది అలా చేస్తున్నప్పటికీ.. ఈ అతి చాలా వరకు తగ్గింది. 'వార్'ను దృష్టిలో ఉంచుకుని ఆటగాళ్లు కొంచెం అదుపులో ఉంటున్నారు.

జిదానె
మెటరజ్జి

దొరికాడు.. ప్రపంచకప్ పోయింది

అది 2006 ప్రపంచకప్ ఫైనల్. ఫ్రాన్స్ తరపున ఆ జట్టు స్టార్ జిదానె గోల్ కొడితే.. ఇటలీకి మెటరజ్జి గోల్ అందించాడు. నిర్ణీత సమయంలో స్కోరు 1-1తో సమమైంది. మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. ఇంకో పది నిమిషాల్లో అది కూడా పూర్తి కాబోతోంది. ఇరు జట్లూ హోరాహోరీగా తలపడుతున్నాయి. ఆ సమయంలో జిదానెకు మతి తప్పింది. రిఫరీని ఒక కంట కనిపెడుతూ.. ఎద్దు తరహాలో దూసుకెళ్లి మెటరజ్జి ఎదను తలతో గట్టిగా ఢీకొట్టాడు. అతను ఎగిరి పడ్డాడు. తర్వాత ఏమీ తెలియనట్లుగా జిదానె అమాయకపు చూపులు చూడటం మొదలుపెట్టాడు. అయితే రిఫరీ పరిస్థితి అర్థం చేసుకుని జిదానెకు రెడ్ కార్డు చూపించడంతో మైదానాన్ని వీడాల్సి వచ్చాడు. ఈ పరిణామం ఫ్రాన్స్‌కు పెద్ద ఎదురుదెబ్బ. తర్వాత మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు దారి తీసింది. ఇటలీ 5-3తో నెగ్గింది. జిదానె ఆటలో కొనసాగితే ఆ పది నిమిషాల్లో ఫ్రాన్స్ గోల్ కొట్టేదేమో! లేదంటే పెనాల్టీ షూటౌట్లో జిదానె జట్టును గెలిపించేవాడేమో! రిఫరీ కళ్లగప్పి తప్పు చేసి, తర్వాత నటనతో బయటపడదామనుకుంటే కథ ఎలా అడ్డం తిరుగుతుందో చెప్పడానికి ఇది రుజువు.

అమ్మకూచి.. గాబ్రియల్

మాంచెస్టర్ సిటీ జట్టు తరపున గోల్ కొట్టిన ప్రతిసారి గోల్ పోస్ట్ నుంచి కార్నర్‌కు పరుగెత్తి.. అక్కడ స్టాండ్స్ వైపు చూస్తూ ఫోన్ రింగ్ చేస్తున్నట్లు సంజ్ఞలు చేస్తాడా కుర్రాడు. ఇలా గోల్ కొట్టిన ప్రతిసారీ అతను ఇలా చేస్తూనే ఉంటాడు. ఫుట్‌బాల్‌లో గోల్ కొట్టినప్పుడు ఆటగాళ్లు ఎంతో భిన్నంగా సంబరాలు చేసుకుంటారు. కానీ ఈ కుర్రాడిలా మాత్రం ఇంత విచిత్రంగా ఎవరూ చేయరు. అతనలా చేయడానికి కారణం అతని అమ్మ. ఆ కుర్రాడే బ్రెజిల్ నయా సంచలనం గాబ్రియల్ జీసెస్. అమ్మ వెరా లూసియా డినిజ్‌పై ప్రేమతో గోల్ కొట్టిన ప్రతిసారి ఆమెను గుర్తు చేసుకుంటాడు గాబ్రియల్. ఇదొక్కటే కాదు అతను ఏం చేసినా అమ్మ ముద్ర ఉండాల్సిందే.

ఖర్చులకు అమ్మ ఇవ్వాల్సిందే!

ఫుట్‌బాల్ స్టార్లు అంటే ఎలా ఉంటారు.. ఎంత విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు.. డబ్బులను ఎంత విచ్చలవిడిగా ఖర్చు చేస్తారో అభిమానులకు తెలుసు. కానీ 19 ఏళ్ల వయసులోనే అతనికి స్టార్ ఆటగాడు అనే పేరు వచ్చినా.. మాంచెస్టర్ సిటీ అతణ్ని ఏకంగా రూ.244 కోట్లు పెట్టి కొనుక్కున్నా ఖర్చు చేయాలంటే ఇప్పటికీ అమ్మనే అడుగుతాడు. ఎందుకంటే గాబ్రియల్ అమ్మకూచి. నాన్న దూరం కావడంతో చిన్నప్పటి నుంచి అతణ్ని అమ్మే అన్నీ తానై పెంచింది. 19 ఏళ్లు వచ్చినా..ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా అమ్మతోనే వెళతాడు. ఆనందమైనా, బాధ అయినా అమ్మతోనే.

మురికివాడల్లో పుట్టి..

బ్రెజిల్‌లోని సావొపౌలోలో పుట్టిన గాబ్రియల్ కష్టాల మధ్య పెరిగాడు. నలుగురు అన్నదమ్ములను పెంచడానికి తన తల్లి పడిన కష్టాలు గుర్తు చేసుకుంటూ ఇప్పటికీ కన్నీరుపెడతాడు. ఇళ్లలో పని చేస్తూ ఆమె అందరిని పెంచింది. అందుకే అమాంతం వచ్చి పడిన డబ్బు, పేరు అతనిలో ఏం మార్పులు తీసుకురాలేదు. ఎంత ఎదిగినా ఒదగాలన్న అమ్మ మాటే అతనికి శాసనం. ఎక్కడికి వెళ్లాలన్నా, ఏం చేయాలన్నా, ఏం తినాలన్నా, ఎవరిని కలవాలన్నా అంతా అమ్మ చెప్పాల్సిందే. మందు, సిగరెట్ లాంటి వాటికి గాబ్రియల్ దూరంగా ఉన్నాడంటే కారణం అతని అమ్మే. పెద్ద స్టార్, డబ్బు ఉన్నా.. తన బేబి (గాబ్రియల్ ముద్దు పేరు) అమ్మాయిల జోలికి వెళ్లడని.. వారిని ఎంతో గౌరవిస్తాడని అతని అమ్మ వెరా చెప్పింది.

www.relaxofootwear.com | Download ShopatRelaxo app on
Shop online at www.shopatrelaxo.com
• All names, logos & brands used here are property of their respective owners and are being used for identification purpose only, which does not imply any endorsement • Product images shown are for representation purpose only, actual may vary. Colour may vary due to printing limitations.
RELAXO AUTHORISED DISTRIBUTORS: Guntur: Jaiomkar Enterprises, Ph: 7386609375; Nellore: S.R.R Agencies, Ph: 9440455132; Ongole: Reethikaa Agency, Ph: 9290046204; Sri Lakshmi Srinivasa Associates, Ph: 9441326697; Vijayawada: Gowel Footwear, Ph: 9849534501; Paramount Footwear, Ph: 9704514649; Popular Footwear, Ph: 9848886457; Sri Annapurna Agencies, Ph: 9292550555; Shyam Enterprises, Ph: 9885777012.
Franchisee enquiries solicited for Relaxo Exclusive Stores, contact: Ashish Tyagi +91 9891279070, Email: ashishtyagi@relaxofootwear.com
/SparxGoForIt
Flipkart | amazon.in | Paytm | snapdeal | AJIO.com | Myntra | WALKWAY | more. MEGASTORE | DMart | METRO Cash & Carry

ప్రపంచకప్‌లో ఈనాడు

బెల్జియం	గ్రూప్-జి × సా॥ 5.30	ట్యునీషియా
దక్షిణ కొరియా	గ్రూప్-ఎఫ్ × రాత్రి 8.30	మెక్సికో
జర్మనీ	గ్రూప్-ఎఫ్ × రాత్రి 11.30	స్వీడన్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

కిక్ 2018 ఛాంపియన్

11 తన తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించకపోవడం 11 ప్రపంచకప్‌ల తర్వాత అర్జెంటీనాకు ఇదే తొలిసారి.

270.8 బార్సిలోనా తరఫున మెస్సి ప్రతి 93.3 నిమిషాలకు ఓ గోల్ కొట్టాడు. ప్రపంచకప్‌లో అతడి సగటు గోల్ సమయం 270.8 నిమిషాలు.

647 ప్రపంచకప్‌లలో ఒక్క గోల్ కూడా కొట్టకుండా మెస్సి మైదానంలో గడిపిన నిమిషాలు. గత ప్రపంచకప్‌లో అర్జెంటీనా చివరి గ్రూప్ మ్యాచ్‌లో నైజీరియాపై మెస్సి తన చివరి గోల్ కొట్టాడు.

మెస్సి జట్టు ఓడిందని..

దిల్లీ: ఫిఫా ప్రపంచకప్‌లో లియనల్ మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా 0-3తో ఓడిపోవడాన్ని భరించలేక ఒక భారత అభిమాని ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో ఇళ్లు విడిచి వెళ్లిపోయాడు. ఫుట్‌బాల్‌ను అమితంగా ప్రేమించే కేరళలో ఈ ఉదంతం చోటు చేసుకుంది. మెస్సిని ఆరాధించే దిను అలెక్స్ అనే కుర్రాడు క్రొయేషియా మ్యాచ్ కోసం ఎంతో ఆశగా టీవీ ముందు కూర్చున్నాడు. మెస్సి అనే పేరున్న టీ షర్ట్‌ను కూడా ధరించాడు. కానీ క్రొయేషియా చేతిలో అర్జెంటీనా ఘోర పరాభవాన్ని చవిచూడడంతో అతను తట్టుకోలేకపోయాడు. "ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళుతున్నా.. ఇంకా చూడటానికి ఏం లేదు" అని లేఖ రాసి ఇళ్లు విడిచిపోయాడు.

పెను విషాదం: అర్జెంటీనా మీడియా: క్రొయేషియా చేతిలో తమ జట్టు ఓటమిని అర్జెంటీనా మీడియా పెను విషాదంగా అభివర్ణించింది. పరాజయం ఘోర అవమానమని పేర్కొంది. "క్రొయేషియా చేతిలో ఓటమి తీరని విషాదం. అర్జెంటీనా నిరాశపరిచింది. ప్రపంచకప్ నుంచి నిష్క్రమించే స్థితిలో నిలిచింది" అని ఓ పత్రిక తన వెబ్‌సైట్లో రాసింది.

విలపిస్తున్న అర్జెంటీనా అభిమాని

గోల్ కొడుతున్న నెయ్‌మార్

సాంబా... ఊపిరి పీల్చుకో!

ఫిఫా ప్రపంచకప్‌లో మహా మహా జట్లు తడబడిపోతున్నాయి.. స్టార్లు తేలిపోతున్నారు.. చిన్న జట్లు చెలరేగిపోతున్నాయి! ఈ స్థితిలో బ్రెజిల్ నిలిచింది. తన స్థాయి ఆటను ప్రదర్శిస్తూ గ్రూప్–ఈలో కోస్టారికాను ఓడించి ప్రపంచకప్‌లో ఆశలు నిలబెట్టుకుంది. ఆ జట్టు ఇంజూరీ సమయంలో ఒకటికి రెండు గోల్స్ కొట్టేయడం విశేషం. స్టార్ ఆటగాడు నెయ్‌మార్‌తో పాటు కౌటినో ఇంజూరీ సమయంలో గోల్స్‌తో జట్టును విజయపథంలో నడిపించారు. ఈ విజయంతో గ్రూప్–ఈలో బ్రెజిల్ 4 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.

- ఆట ఆఖర్లో గోల్స్ కొట్టిన నెయ్‌మార్, కౌటినో
- కోస్టారికాపై 2-0తో గెలిచిన బ్రెజిల్

సెయింట్ పీటర్స్‌బర్గ్

ప్రపంచకప్‌లో బ్రెజిల్ బోణీ కొట్టింది. నాకౌట్ రేసులో ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఆ జట్టు 2-0తో కోస్టారికాను ఓడించింది. కౌటినో (90+1), నెయ్‌మార్ (90+7) బ్రెజిల్ తరఫున గోల్స్ కొట్టారు. అయితే ఈ మ్యాచ్‌లో తన పటిష్టమైన డిఫెన్స్‌తో బ్రెజిల్‌కు పెద్ద పరీక్షే పెట్టింది కోస్టారికా. మ్యాచ్ ఆరంభంలో బంతిని తన అధీనంలోనే ఎక్కువగా ఉంచుకుంటూ బ్రెజిల్‌కు గోల్ చేసే అవకాశాలే ఇవ్వలేదు. పైగా ఎదురుదాడులు చేసింది. 13వ నిమిషంలో ఆ జట్టుకు ఒక గోల్ తప్పిపోయింది. అక్కడ నుంచి బ్రెజిల్ గోల్స్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది. నెయ్‌మార్, కౌటినో సారథ్యంలో పదే పదే కోస్టారికా డిఫెన్స్‌కు పరీక్ష పెట్టింది. కానీ చాలాసార్లు బంతి గోల్‌పోస్ట్ పైనుంచో లేదా పక్క నుంచో వెళ్లిపోయింది. దీనికి తోడు గోల్‌కీపర్ నవాస్ గోడలా అడ్డుపడి బ్రెజిల్ ప్రయత్నాలను వమ్ము చేశాడు. 26వ నిమిషంలో గోల్ కొట్టినా దాన్ని రిఫరీ ఆఫ్‌సైడ్‌గా ప్రకటించాడు. అర్ధభాగం అయ్యే సమయానికి స్కోరు 0-0గా నిలిచింది.

ఇంజూరీ సమయం మార్చేసింది: ఈ మ్యాచ్ ఫలితాన్ని తేల్చింది ఇంజూరీ సమయమే. మ్యాచ్ 0-0తో డ్రాగా ముగుస్తుందేమో అనిపించిన తరుణంలో ఇంజూరీ సమయంలో కౌటినో గోల్ చేయడంతో స్టేడియం దద్దరిల్లిపోయింది. మార్కో నుంచి క్రాస్‌ను అందుకున్న గాబ్రియల్ జీసస్.. గోల్‌పోస్ట్ ప్రాంతంలో కౌటినోకు పాస్ అందించడం అతను బంతిని గోల్‌లోకి పంపడం జరిగిపోయాయి. కాసేపటికే బ్రెజిల్ మరో దెబ్బ కొట్టింది. డగ్లస్ కోస్టా నుంచి పాస్ అందుకున్న నెయ్‌మార్.. అలాగే ఉరికి వస్తూ బంతిని కాలితో గోల్‌లోకి నెట్టాశాడు.

నెయ్‌మార్ దొరికాడిలా!: ఒకవైపు గోల్స్ రావట్లేదన్న నిరాశ.. మరోవైపు కరిగిపోతున్న సమయం! ఈ స్థితిలో బ్రెజిల్‌కు ఓ పెనాల్టీ లభించింది. నెయ్‌మార్‌ను ప్రత్యర్థి ఆటగాడు గోంజెలెజ్ బలంగా తోసేశాడనే కారణంతో. కానీ ఆటగాళ్లు అప్పీల్ చేయడంతో రిఫరీ 'వార్' సాయం తీసుకున్నాడు. ప్రత్యర్థి ఆటగాడు తమాయించుకునే క్రమంలో నెయ్‌మార్ పొట్టకు చేతిని తాకించాడని.. బ్రెజిల్ స్టార్ కావాలనే ఇలా పడిపోయాడని తెలుసుకున్న రిఫరీ.. పెనాల్టీని రద్దు చేసి, నెయ్‌మార్‌కు ఎల్లో కార్డు చూపించాడు.

ఐస్‌లాండ్‌పై నైజీరియా విజయం

నైజీరియా	2	ఐస్‌లాండ్	0
మూసా (49వ, 75వ)			

వోల్గోగ్రాడ్: మూసా రెండు గోల్స్ కొట్టడంతో గ్రూప్-డిలో జరిగిన మరో మ్యాచ్‌లో నైజీరియా 2-0తో ప్రపంచకప్ అరంగేట్ర జట్టు ఐస్‌లాండ్‌పై విజయం సాధించింది. నాకౌట్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. తొలి మ్యాచ్‌లో క్రొయేషియా చేతిలో ఓడిన నైజీరియా ఈ మ్యాచ్‌లో తొలి అర్ధభాగంలో పెద్దగా దూకుడు ప్రదర్శించలేదు. కానీ ద్వితీయార్ధంలో పుంజుకుంది. 49, 75వ నిమిషాల్లో మూసా కొట్టిన గోల్స్‌తో విజయాన్నందుకుంది. ఐస్‌లాండ్ 83వ నిమిషంలో పెనాల్టీని వృథా చేసుకుంది. జిల్ఫీ సిగుర్డ్‌సన్ బంతిని బార్‌పై నుంచి కొట్టాడు.

రేసులో మూడూ...

ఐస్‌లాండ్‌పై నైజీరియా విజయంతో అర్జెంటీనాకు కాస్త ఊరటే. ఆ జట్టుకు సమీకరణం కాస్త తేలికైంది. గ్రూప్-డి నుంచి క్రొయేషియా తర్వాత రెండో జట్టుగా నాకౌట్ చేరే జట్టేదనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముందంజ వేయడానికి మూడు జట్లకూ అవకాశముంది. ఈ నెల 26న గ్రూప్ ఆఖరి మ్యాచ్‌ల్లో నైజీరియా(3 పాయింట్లు)తో అర్జెంటీనా(1), క్రొయేషియా(6)తో ఐస్‌లాండ్(1) తలపడతాయి. రెండు మ్యాచ్‌లూ ఒకే సమయానికి ఆరంభమవుతాయి.

- క్రొయేషియా చేతిలో ఐస్‌లాండ్ ఓడితే (డ్రా చేసుకున్నా కూడా) అర్జెంటీనా మామూలుగా గెలిచినా తుది-16కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ ఐస్‌లాండ్ గెలిస్తే.. నైజీరియాపై అర్జెంటీనా ఎక్కువ గోల్స్ తేడాతో గెలవాల్సివుంటుంది.
- ఒకవేళ నైజీరియా గెలిస్తే 6 పాయింట్లతో నాకౌట్లో అడుగుపెడుతుంది. అప్పుడు ఐస్‌లాండ్ గెలిచినా ఎలాంటి ప్రయోజనం ఉండదు. రెండు మ్యాచ్‌లూ డ్రాగా ముగిసినా ముందుకెళ్లేది నైజీరియానే.

ఏ ప్రపంచకప్పయినా ఫేవరెట్ల జాబితాలో అర్జెంటీనా ఉండాల్సిందే. ఈసారీ అంతే. టైటిల్ సాధించకపోయినా.. టోర్నీలో చాలా ముందుకు వెళ్లగలిగే సత్తా ఆ జట్టుకుందనే విషయంలో సందేహాలేమీ లేవు. మెస్సి లాంటి స్టార్ ఉన్నప్పుడు భారీ అంచనాలూ సహజమే. ... కానీ అనూహ్యం.

అంచనాలే పెనుభారమై మెస్సి చతికిలపడ్డ వేళ.. అర్జెంటీనాకు ఘోర పరాభవం. పేలవ ప్రదర్శనను కొనసాగిస్తూ క్రొయేషియా చేతిలో చిత్తుగా ఓడిన ఆ జట్టు కనీసం నాకౌట్ కూడా వెళ్లలేని ప్రమాదంలో పడింది. అనూహ్యంగా విజృంభించిన క్రొయేషియా అర్జెంటీనాను చిత్తు చేసి నాకౌట్‌కు దూసుకెళ్లింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఆ జట్టు మెస్సికి కళ్లెం వేయడంలో విజయవంతమైంది.


నైరాశ్యంలో మెస్సి

దిమ్మదిరిగింది

- గ్రూప్ దశలోనే నిష్క్రమించే ప్రమాదంలో అర్జెంటీనా
- సంచలన విజయంతో నాకౌట్‌కు క్రొయేషియా

నిజ్నీ నొవ్‌గొరాడ్

ప్రపంచకప్‌లో పెద్దజట్లను చిన్నజట్లు ఓడించే ఒరవడిని కొనసాగిస్తూ క్రొయేషియా రెచ్చిపోయింది. సమష్టి కృషితో మెరిసిన ఆ జట్టు గురువారం రాత్రి జరిగిన గ్రూప్- డి మ్యాచ్‌లో రెండుసార్లు ఛాంపియన్, ప్రపంచ నంబర్-5 అర్జెంటీనాపై 3-0 గోల్స్‌తో ఘనవిజయం సాధించింది. రెబిచ్ (53వ), మోడ్రిచ్ (80వ), రకితిచ్ (90+1) ఆ జట్టుకు గోల్స్ అందించారు. మెస్సి అనుకున్న స్థాయిలో రాణించలేకపోవడం, గోల్‌కీపర్ విల్లీ కాబలెరో వైఫల్యం అర్జెంటీనా కొంప ముంచాయి. ప్రపంచకప్ చరిత్రలో అర్జెంటీనా కేవలం మూడుసార్లు మాత్రమే గ్రూప్ దశలో నిష్క్రమించింది. చివరిసారి 2002లో నాకౌట్ చేరలేకపోయింది. గత 60 ఏళ్లలో గ్రూప్ దశలో అర్జెంటీనాకు ఇదే అతి పెద్ద ఓటమి కావడం గమనార్హం.

క్రొయేషియా ఆధిపత్యం: మొదటి మ్యాచ్‌లో ఐస్‌లాండ్ లాంటి చిన్న జట్టుతో డ్రాతో సరిపెట్టుకోవడంతో ఈ మ్యాచ్‌లో ఎలాగైనా విజయం సాధించాలని బరిలో దిగిన అర్జెంటీనాను క్రొయేషియా దూకుడైన ఆటతో అడ్డుకుంది. డిఫెన్స్, ఎటాకింగ్ ఇలా అన్ని విభాగాల్లోనూ అదరగొట్టింది. భారీ అంచనాలతో మైదానంలోకి దిగిన మెస్సినే లక్ష్యంగా చేసుకున్న క్రొయేషియా అతనికి ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. తొలి అర్ధభాగంలో 20 సార్లు మాత్రమే బంతిని తాకాడంటే అతణ్ని ఎలా కట్టడి చేశారో అర్థం చేసుకోవచ్చు. మ్యాచ్ ఆరంభమైన కొద్దిసేపటికే క్రొయేషియా గోల్ కొట్టినంత పని చేసింది. అర్జెంటీనా రక్షణశ్రేణిని ఛేదిస్తూ దూసుకెళ్లిన ఆ జట్టు ఆటగాడు పెరిసిచ్ కొట్టిన బంతిని ఎడమ వైపు డైవ్ చేస్తూ అర్జెంటీనా గోల్‌కీపర్ అడ్డుకున్నాడు. ఆ తర్వాత కూడా రెండు జట్లు పరస్పర దాడులను కొనసాగించాయి. మెస్సి రెండు సార్లు ప్రత్యర్థి గోల్ వరకు వెళ్లగలిగాడు కానీ స్కోర్ కొట్టలేకపోయాడు. క్రొయేషియా రక్షణ శ్రేణి అతణ్ని సమర్థంగా నిలవరించగలిగింది. రెండు జట్లు పోటాపోటీగా తలపడడంతో తొలి అర్ధభాగం గోల్సేమీ నమోదు కాకుండానే ముగిసింది.

క్రొయేషియా	3	అర్జెంటీనా	0
రెబిచ్ (53వ), మోడ్రిచ్ (80వ), రకితిచ్ (90+1వ)			

గోల్ చేసిన ఆనందంలో మోడ్రిచ్

కలిసొచ్చిన గోల్‌కీపర్ వైఫల్యం: అర్జెంటీనా గోల్‌కీపర్ వైఫల్యం కూడా ఈ మ్యాచ్‌లో క్రొయేషియాకు కలిసొచ్చింది. విరామం తర్వాత జోరు పెంచిన క్రొయేషియా పదే పదే అర్జెంటీనా బాక్స్‌వైపు దూసుకెళ్తూ ఆ జట్టు రక్షణ శ్రేణిపై తీవ్ర ఒత్తిడి పెంచింది. ఆ జట్టు ప్రయత్నాలకు 53వ నిమిషంలో తొలి ఫలితం లభించింది. అర్జెంటీనా గోల్ కీపర్ కాబలెరో పొరపాటును అవకాశంగా మలుచుకున్న రెబిచ్. అర్జెంటీనాను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. తన దగ్గరకు వచ్చిన బంతిని మెర్కాడోకు అందించాలని భావించి కాబలెరో దాన్ని తన్నాడు. కానీ బంతి కొంచెం దూరంగా వెళ్లింది. అక్కడే కాచుకొని ఉన్న రెబిచ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బంతిని వలలోకి పంపాడు. ఆ తర్వాత క్రొయేషియా ఆటగాళ్లు రెట్టించిన ఉత్సాహంతో మరింత దూకుడుగా ఆడారు. 80వ నిమిషంలో ఆ జట్టు ఆధిక్యం 2-0కు పెరిగింది. లుకా మోడ్రిచ్ 90 అడుగుల దూరం నుంచి అద్భుతంగా గోల్ కొట్టి క్రొయేషియాను సంబరాల్లో ముంచెత్తాడు. స్కోరును సమం చేసేందుకు అర్జెంటీనా గొప్పగా ప్రయత్నించినప్పటికీ క్రొయేషియా ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. చివర్లో ఇంజూరీ సమయంలో ఇవాన్ రకితిచ్ (90+1) గోల్ కీపర్ లేని వలలోకి బంతిని అలవోకగా పంపేశాడు. క్రొయేషియా ఆటగాళ్లు సంబరాల్లో మునిగి తేలగా.. మెస్సి బృందం బాధతో మైదానాన్ని వీడింది. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన అర్జెంటీనా దిగ్గజం మారడోనా కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఆ దేశ అభిమానులంతా కూడా కన్నీటిపర్యంతమయ్యారు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన క్రొయేషియా ఆరు పాయింట్లతో నాకౌట్‌కు చేరుకుంది.

అది బౌలర్ల పాలిట శాపం

దిల్లీ: వన్డేల్లో ఒక్కో ఇన్నింగ్స్‌కు రెండు కొత్త బంతుల విధానం వల్ల బ్యాటింగ్ విధ్వంసం తారస్థాయికి చేరిందని క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ అభిప్రాయపడుతున్నాడు. అది బౌలర్ల పాలిట శాపంగా పరిణమించిందని అతను అంటున్నాడు. ఇటీవల ఇంగ్లాండ్ వన్డేల్లో అత్యధిక జట్టు స్కోరు నమోదు చేయడంపై స్పందిస్తూ సచిన్ ఇలా అన్నాడు. "వన్డేల్లో రెండు కొత్త బంతుల విధానమే బ్యాటింగ్‌లో విధ్వంసానికి మూలం. బంతి పూర్తిగా పాతబడి రివర్స్ స్వింగయ్యే అవకాశం ఉండట్లేదు. చివరి ఓవర్లలో కీలకమైన రివర్స్ స్వింగ్ చాలా రోజులుగా కనుమరుగవుతోంది" అని సచిన్ ట్వీట్ చేశాడు. మరోవైపు రాను రాను క్రికెట్లో బౌలర్ల పరిస్థితి దారుణంగా మారుతుందని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అంటున్నాడు. "క్రికెట్ బౌలర్ల పట్ల క్రూరంగా మారుతోంది. తొలిరోజుల్లోనేను వన్డేలు ఆడినపుడు ఒకటే బంతి ఉండేది. ఇన్నింగ్స్ సగం ముగిశాక రివర్స్ స్వింగ్ లభించేది. బ్యాట్స్‌మన్‌కు అది సవాలుగా నిలిచేది" అని విరాట్ చెప్పాడు. పాక్ రివర్స్ స్వింగ్ దిగ్గజం వకార్ యూనిస్ కూడా సచిన్ మాటలతో ఏకీభవించాడు.

ప్రపంచకప్ జట్లకు హ్యాకింగ్ భయం

బ్రౌనిస్టే: ఫిఫా ప్రపంచకప్‌లో ఆడుతున్న జట్లకు హ్యాకింగ్ భయం పట్టుకుంది. హ్యాకర్లు తమ విలువైన డేటాను ఎక్కడ దొంగిలిస్తారో.. తమ ప్రణాళికలను ఏమైనా తస్కరిస్తారో అని వారు ఆందోళన చెందుతున్నారు. అందుకే అన్ని జట్లు సైబర్‌దాడులనే దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. రష్యాలో అడుగుపెట్టిన నాటి నుంచి ఆస్ట్రేలియా జట్టు అసలు తమ సొంత ఇంటర్నెట్‌ను మాత్రమే వాడుతోంది. ఇందుకోసం ప్రత్యేకమైన 4జీ మొబైల్ రౌటర్లను వెంట తెచ్చుకుంది. పబ్లిక్ వైఫైలను ఏ ఆటగాడూ ఉపయోగించొద్దని ఆ జట్టు మేనేజ్‌మెంట్ ఆదేశాలు జారీ చేసింది. ఇంగ్లాండ్ జట్టు ఆటగాళ్లు తమ స్మార్టుఫోన్లు హ్యాక్ కాకుండా ఉండడం కోసం ప్రత్యేకమైన ఇన్‌క్రిప్షన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు. తమ దేశ భద్రతా ఏజెన్సీల హెచ్చరికల నేపథ్యంలో ఫ్రాన్స్ ఆటగాళ్లు ఆన్‌లైన్‌కు దూరంగా ఉంటున్నారు. హోటల్స్‌లో కంప్యూటర్లు, ఫోన్లు వదలొద్దని అధికారులు ఆటగాళ్లకు సూచించారు. ఇంటర్నెట్‌లో ప్రత్యక్ష ప్రసారం చూస్తున్న సమయంలో మాల్‌వేర్‌తో ఇబ్బందులు ఉంటాయని అభిమానులు జాగ్రత్తగా ఉండాలని వారు చెప్పారు.

పాక్‌తో భారత్ ఢీ

నేటి నుంచే ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ

స్టార్ స్పోర్ట్స్-1లో సాయంత్రం 5.30 నుంచి

బ్రెడా (నెదర్లాండ్స్): భారత హాకీ జట్టుకు సవాల్. శనివారం ఆరంభం కానున్న ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తన తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. గత 36 ఏళ్లలో భారత్ ఎప్పుడూ ఛాంపియన్స్ ట్రోఫీలో టైటిల్ గెలవలేదు. 2016లో లండన్‌లో జరిగిన టోర్నీలో రజతం గెలవడమే భారత్‌కు ఇప్పటిదాకా అత్యుత్తమ ప్రదర్శన. భారత్, పాక్‌తో పాటు ఒలింపిక్ ఛాంపియన్ అర్జెంటీనా, ప్రపంచ నంబర్‌వన్ ఆస్ట్రేలియా, బెల్జియం, ఆతిథ్య నెదర్లాండ్స్ లాంటి జట్లు టోర్నీ బరిలో దిగనున్నాయి.

పాక్‌పై భారత్ విజయం

దుబాయ్: తొలి కబడ్డీ మాస్టర్స్ దుబాయ్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం తొలి మ్యాచ్‌లో భారత్ 36-20తో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఓడించింది. ఈ పోటీని నెమ్మదిగా మొదలుపెట్టిన భారత్.. ఆ తర్వాత ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. కెప్టెన్ అజయ్ ఠాకూర్ (8 పాయింట్లు) ముందుండి నడిపించాడు.



కౌంటీలకు వెళ్లకపోవడం మేలే చేసింది



దిల్లీ: కౌంటీల్లో ఆడాల్సి ఉన్నా గాయం కారణంగా వెళ్లకపోవడం తనకు మేలే చేసిందని భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న అతను ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు టీమ్‌ఇండియా బయల్దేరి వెళుతున్న సందర్భంగా విలేకరులతో మాట్లాడాడు. "గాయం కారణంగా కౌంటీల్లో ఆడే అవకాశం పోయింది. అయితే దీని వల్ల మేలే జరిగిందని భావిస్తున్నా. ఇంగ్లాండ్ పర్యటించి నాలుగేళ్లు అయిపోయింది. నిజానికి ఇది సుదీర్ఘ విరామమే. అక్కడ పరిస్థితులపై అవగాహన కోసం ముందుగా వెళ్లాలని అనుకున్నా. వెళ్లి ఉంటే 90 శాతం మాత్రమే మెరుగ్గా అనిపించేదేమో. మానేయడం వల్ల ఇప్పుడు 110 శాతం మెరుగ్గా ఉంది. ఎందుకంటే ఈ పర్యటనకు ముందు చాలా తాజాగా ఉన్నా. గాయం కూడా మంచి పనే చేసింది. గత ఇంగ్లాండ్ పర్యటన గురించే అందరూ మాట్లాడుతున్నారు. ఆ తర్వాత మేం అక్కడ ఛాంపియన్స్ ట్రోఫీ (2017) కూడా ఆడాం. ఇప్పుడు పర్యటనకు పూర్తి సన్నద్ధతతో ఉన్నా. ముంబయిలో ఆరేడు సెషన్లు ప్రాక్టీస్ చేశాను. యో యో పరీక్షలో కూడా ఉత్తీర్ణుడనయ్యా" అని విరాట్ చెప్పాడు.



శుక్రవారం దిల్లీలో 'వాణిజ్య భవన్' శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఈనాడు బిజినెస్

ఎస్‌బీఐ నాలుగో ఎండీగా అర్జిత్ బసు

దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నాలుగో మేనేజింగ్ డైరెక్టరుగా అర్జిత్ బసును ప్రభుత్వం నియమించింది. ఎస్‌బీఐ చట్టం ప్రకారం బ్యాంకులో నలుగురు ఎండీలు ఉండాలి. రజనీశ్ కుమార్‌ను ఛైర్మన్‌గా నియమించినప్పుడు, అప్పటివరకు ఆయన నిర్వహిస్తూ వచ్చిన ఎండీ పదవి ఖాళీ అయ్యింది. ఆ తర్వాత ఎవరినీ నియమించలేదు. అర్జిత్ బసు నియామకంతో ఇప్పుడు ఎస్‌బీఐలో ఎండీల సంఖ్య నాలుగుకి చేరింది. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అర్జిత్ బసును ఎండీగా నియమించినట్లు ఓ ప్రకటనలో ప్రభుత్వం వెల్లడించింది. ఆయన బాధ్యతలు చేపట్టే రోజు నుంచి నియామకం అమల్లోకి వస్తుందని, పదవీవిరమణ చేసే అక్టోబరు 2020 వరకు ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొంది.

ప్రపంచం మనవైపే చూస్తోంది

- రెండంకెల వృద్ధి రేటే లక్ష్యం
- అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ వాటా రెట్టింపవ్వాలి
- ఎగుమతుల వృద్ధిలో రాష్ట్రాలదే కీలక పాత్ర
- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- వాణిజ్య భవన్ నిర్మాణానికి శంకుస్థాపన

దిల్లీ: ఐదు లక్షల కోట్ల డాలర్లకు మించి ఆర్థిక వ్యవస్థను కలిగిన దేశాల సరసన భారత్ చేరాలంటే రెండంకెల వృద్ధి రేటును మనం లక్ష్యంగా పెట్టుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అంతేకాకుండా ప్రపంచ వాణిజ్యంలో భారత వాటా పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. వాణిజ్య మంత్రిత్వ శాఖ కొత్త కార్యాలయం 'వాణిజ్య భవన్' నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. భారత్‌ను వ్యాపారానుకూల దేశంగా తీర్చిదిద్దేందుకు గత నాలుగేళ్లలో తమ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని తెలిపారు. ద్రవ్యోల్బణం, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యలోటు లాంటి స్థూల ఆర్థిక గణాంకాలన్నింటినీ నియంత్రణలో ఉంచిందని పేర్కొన్నారు. '2017-18 నాలుగో త్రైమాసికంలో దేశ వృద్ధి రేటు 7.7 శాతం నమోదైంది. ఇప్పుడు 7-8 శాతానికి మించి వృద్ధి సాధించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రెండంకెల వృద్ధిని సాధించే దిశగా మనం అడుగులు వేయాల్సిన సమయం వచ్చింద'ని మోదీ తెలిపారు. 5 లక్షల కోట్ల డాలర్ల క్లబ్బులోకి భారత ఆర్థిక వ్యవస్థ ఎప్పుడు చేరుతుందా అని ఇప్పుడు ప్రపంచమంతా మనవైపే చూస్తోందని ప్రధాని చెప్పారు. నిర్దేశిత సమయంలోపే వాణిజ్య భవన్ పూర్తవుతుందని భావిస్తున్నామని తెలిపారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

- దేశీయ ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉంది. ఇందుకు రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాలి.
- ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటాను ప్రస్తుతమున్న 1.6 శాతం నుంచి 3.4 శాతానికి పెంచడంపై వాణిజ్య శాఖ దృష్టి పెట్టాలి.
- రెండంకెల వృద్ధి, ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటాను రెండింతలు పెంచుకోవడాన్ని సాధించేందుకు వాణిజ్య మంత్రిత్వ శాఖ, పరిశ్రమ, వాణిజ్య సంఘాలు కృషి చేయాలి.
- దిగుమతులపై ఆధారపడటం తగ్గాలంటే తయారీ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలి. ఉదాహరణకు ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం పెంచాలి.
- అవరోధాలు, ఆలస్యం, తప్పుదోవ పట్టించడం లాంటి వాటి కారణంగా పనులు ఆలస్యమయ్యే సంస్కృతి నుంచి దేశం బయటపడింది.
- వస్తు, సేవల పన్ను విధానం వల్ల వ్యాపారానుకూలత పరిస్థితులు పెరగడంతో పాటు, పన్నులు చెల్లించే వారి సంఖ్య పెరిగింది. కొత్త పన్ను చట్టం కింద కొత్తగా 54 లక్షల మంది పన్ను చెల్లింపుదార్లు నమోదు చేసుకున్నారు. దీంతో పరోక్ష పన్నులు చెల్లించే వారి సంఖ్య కోటికి చేరింది.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ మారకపు నిల్వలు కూడా రికార్డు స్థాయిలో పెరిగాయి.

26న ప్రధాని చేతుల మీదుగా ఏఐఐబీ సమావేశం ప్రారంభం

ఈ నెల 26న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) మూడో వార్షిక సమావేశం ప్రారంభం కానుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం, ఏఐఐబీ సంయుక్తంగా ముంబయిలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రధాని మోదీతో పాటు ఆర్థిక మంత్రి పీయూష్ గోయెల్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ఇందులో పాల్గొంటారు. ఆసియా ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడుల అంశంపై సమావేశంలో సభ్య దేశాలు చర్చించనున్నాయి. బీజింగ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వరిస్తున్న ఏఐఐబీలో భారత్ రెండో అతిపెద్ద వాటాదారుగా ఉంది.

చమురు ఉత్పత్తి పెంపు

- సమావేశంలో రాజీకొచ్చిన సౌదీ, ఇరాన్‌లు
- చమురు ధరలు చల్లబడే అవకాశం
- లక్ష్యం ప్రకటనలో ఒపెక్ విఫలం

వియన్నా: వచ్చే నెల నుంచి ముడి చమురు ఉత్పత్తిని ఓ మోస్తరుగా పెంచడానికి పెట్రోలియం ఎగుమతి దేశాల సంఘం (ఒపెక్) శుక్రవారం అంగీకారం తెలిపింది. సరఫరా కొరతను పరిహరించి.. ముడి చమురు ధరలను తగ్గించడానికి సహాయం చేయాల్సిందిగా వినియోగదారు దేశాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో సహకరించాల్సిందిగా ఇరాన్‌ను సౌదీ అరేబియా కోరింది. తాజా పరిణామాలతో చమురు ధరలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు.

అయితే ఎంత మేర ఉత్పత్తిని పెంచాలన్న స్పష్టమైన లక్ష్యాన్ని ప్రకటించడంలో ఒపెక్ ఒప్పందం విఫలమైంది. దీంటో ట్రేడర్లు ఎవరి వారు ఎంత మేర ఒపెక్ సరఫరా పెంచుతుందన్నదానిపై అంచనాలు వేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఒపెక్ ఎంత పెంచుతుందోనని చూస్తున్నట్లున్నారు. 'ఒపెక్ ఉత్పత్తిని తగిన విధంగా పెంచుతుందనే భావిస్తున్నాం. ధరలు కిందకు దిగి రావాల్సిన అవసరం ఉంద'ని ఒపెక్ నిర్ణయం వెలువడిన గంటలోపే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ చేశారు.

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ చమురు లోటు బారిన పడకుండా సరఫరాను పెంచాలని అమెరికా, చైనా, భారత్‌లు ఒపెక్‌ను కోరిన సంగతి తెలిసిందే. అంతక్రితం అంగీకరించిన ఉత్పత్తి కోతలను పూడ్చేలా 100 శాతం ప్రయత్నిస్తామని ఒపెక్ ప్రకటన విడుదల చేసినా.. ఎంత మేర పెంపు ఉంటుందన్నదానిపై స్పష్టతనివ్వలేదు. కాగా, ఒప్పందం వల్ల ఒక మిలియన్ బ్యారెళ్ల లేదా అంతర్జాతీయ సరఫరాలో 1 శాతానికి సమానమైన చమురును అదనంగా ఉత్పత్తి జరగవచ్చని సౌదీ అరేబియా అంచనా వేస్తోంది. ఒపెక్ సభ్య దేశమైన ఇరాక్ అంచనా ప్రకారం.. వచ్చే నెల నుంచి రోజుకు 7,70,000 బ్యారెళ్ల చొప్పున ఉత్పత్తి ఉంటుంది. 14 దేశాల ఒపెక్ ప్రస్తుతం దేశాల వారీగా ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ణయించడం మానివేయడంతో సౌదీ అరేబియా మరింత ఎక్కువ ఉత్పత్తి చేయడానికి వీలవుతుంది.

ఒపెక్ సమావేశం సందర్భంగా విలేకరులతో మాట్లాడుతున్న సౌదీఅరేబియా చమురు మంత్రి ఖలీద్ అల్ ఫలి



ఎంత ప్రయత్నించినా.. చక్కెర చేదు తగ్గట్లేదు

- కలిసిరాని ప్రభుత్వ విధానాలు
- నిర్మాణాత్మక మరమ్మతులు అవసరం
- చక్కెర-చెరకు ధరలను అనుసంధానం చేయాలంటున్న పరిశ్రమ

దిల్లీ: చక్కెర పరిశ్రమలో సంక్షోభం ఏర్పడిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అదనపు ఉత్పత్తి, ధరల తగ్గుదల ఇందుకు నేపథ్యం. అయితే నగదు కొరత ఎక్కువగా ఉన్న ఈ పరిశ్రమను సమస్యల నుంచి బయటపడేయడానికి పలు విధానాలను తీసుకువచ్చింది. కానీ పరిశ్రమలో విశ్వాసాన్ని పుంజుకునేలా చేయలేకపోయింది. ఒత్తిడిలో ఉన్న చెరకు రైతుల ముఖంలో నవ్వు తెప్పించలేకపోయింది.

చక్కెరపై ఎగుమతి సుంకం తొలగించడం, దిగుమతి సుంకం రెండింతలు చేయడం; రెండు నెలల విక్రయాలపై షరతుల వంటి విధానాలను ప్రభుత్వం ప్రవేశపెట్టినా.. పడుతున్న చక్కెర ధరలకు కళ్లెం పడలేదు. దిల్లీ మార్కెట్లో చక్కెర ధర గత నెలలో మూడేళ్ల కనిష్ఠ స్థాయి అయిన రూ.2770 (100 కిలోలు)కు చేరడం గమనార్హం. ప్రభుత్వం ప్రకటించిన, తీసుకొచ్చిన కొన్ని విధానాలు.. వాటి ప్రభావాన్ని చూస్తే..

1. కనీస ఎగుమతి పరిమాణ పథకం (మినిమం ఇండికేటివ్ ఎక్స్‌పోర్ట్స్ క్వాంటిటీ స్కీమ్) కూడా కలిసిరాలేదు. (ఈ పథకం కింద ప్రతీ మిల్లరు తన ఉత్పత్తిలో కొంత పరిమాణం మేర ఎగుమతి చేయడం తప్పనిసరి.) ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో అదనపు ఉత్పత్తి నేపథ్యంలో అంతర్జాతీయ ధరలు ఒత్తిడికి లోనయ్యాయి. దీంతో అదనపు సబ్సిడీ(టన్నుకు రూ.5.5) ప్రకటించినా కూడా ప్రయోజనం దక్కలేదు.
2. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రూ.7000 కోట్ల ఉద్దీపన ప్యాకేజీని పరిశ్రమ వర్గాలు కంటితుడుపు చర్యగా భావిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రైతులను ఆకట్టుకోవడానికి భాజపా ప్రయత్నిస్తోందన్న రాజకీయ విమర్శలూ వచ్చాయి.
3. దాదాపు 3 మిలియన్ టన్నుల చక్కెర నిల్వలను సృష్టించడమనేది ఈ ప్యాకేజీలో ఒక భాగం. ఇది మంచి అడుగుగా కనిపించినా విశ్లేషకులు మాత్రం పెదవి విరుస్తున్నాయి. ఎందుకంటే ఉత్పత్తి అధికంగా అయిన ఏడాది తర్వాత కొరత ఉన్న సీజను వచ్చినపుడే ఈ ముందస్తు నిల్వల వల్ల ఉపయోగం ఉంటుందన్నది వారి వాదన. కానీ ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర తయారీదారు అయిన బ్రెజిల్‌ను తోసిరాజని భారత్ అగ్రగామి తయారీదారుకు అవతరించే అవకాశం ఉన్నపుడు దాని వల్ల ఫలితం ఉండదు.
4. 2018-19లో చక్కెర ఉత్పత్తి భారీగా ఉండొచ్చంటున్నారు. ప్రస్తుత సీజనులో రికార్డు గరిష్ఠ స్థాయిలో 32 మిలియన్ టన్నులకు చేరింది కూడా. ఈ సీజనే కాదు.. వచ్చే సీజనులోనూ ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌దే పైచేయిగా ఉండొచ్చన్న అంచనాలున్నాయి.
5. రూ.4,440 కోట్ల వరకు వడ్డీ లేకుండా రుణాలను అందజేయడం ద్వారా చక్కెర మిల్లులు ఎథనాల్ ఉత్పత్తిని పెంచుకోవడానికి ఇటీవలే కేంద్ర మంత్రి మండలి అనుమతినిచ్చింది. అయిదేళ్ల కాలానికి రూ.1330 కోట్ల వడ్డీ సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుంది. ఒక ఏడాది పాటు మారటోరియం గడువు కూడా ఇందులో కలిసి ఉంటుంది. ఇది ఒక్కటే ఇపుడు చక్కెర పరిశ్రమకు మేలు చేసే విధానం అని చెప్పవచ్చు.

ఇలా చేస్తే ప్రయోజనం..

ఇలాంటి సంక్షోభ సమయంలో బ్రెజిల్ తరహా నమూనాను మనమూ పాటించొచ్చు. చక్కెర ధరలు బాగా తగ్గినపుడు చెరకును ఎథనాల్ ఉత్పత్తి దిశగా మళ్లించాలి. ప్రస్తుతం మిల్లులు సి-భార మొలాసిస్ నుంచి బయో ఇంధనాన్ని తయారు చేస్తున్నాయి. దాని బదులుగా బి-భార మొలాసిస్ నుంచి ఎథనాల్‌ను తయారు చేయాలి. అయితే ఇక్కడ కూడా ఒక సమస్య ఉంది. ఎథనాల్‌కు అధిక ధరలుండాలని పరిశ్రమ కోరుకుంటోంది. ఆహార మంత్రిత్వ శాఖ అందుకు మద్దతు తెలిపినా.. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ అందుకు విముఖత చూపే అవకాశం ఉంది.

అలా జరగకపోవచ్చు..

మొత్తం మీద చక్కెర పరిశ్రమలో నిర్మాణాత్మక మరమ్మతులు అవసరం. చెరకు ధరను చక్కెర ధరకు అనుసంధానం చేయాలి. పంటకు కృత్రిమంగా తప్పనిసరిగా ఒక ధరను నిర్ణయించే విధానం నుంచి బయటకు రావాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అయితే వచ్చే ఏడాది ఎన్నికలున్న నేపథ్యంలో రైతులపై భారం వేసి ఓటు బ్యాంకును పోగొట్టుకోవడానికి ప్రభుత్వం సిద్ధపడకపోవచ్చు.

రూ.12,500 కోట్ల మాల్యా ఆస్తుల జప్తునకు ఈడీ సమాయత్తం

- కొత్త ఆర్డినెన్స్ కింద చర్యలకు సిద్ధం
- ముంబయి కోర్టులో దరఖాస్తు సమర్పణ

ముంబయి: ఆర్థిక నేరాలకు పాల్పడి దేశం విడిచి పారిపోయిన నేరస్థులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపబోతోంది. ఇందులో భాగంగా తొలి అడుగు పడింది. విజయ్ మాల్యాపై ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ ఆర్డినెన్స్‌ను ప్రయోగించబోతోంది. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముంబయి కోర్టులో దరఖాస్తు సమర్పించింది. భారీ మొత్తంలో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతున్న నేరస్థుల్ని నిరోధించేందుకు ప్రభుత్వం ఏప్రిల్ 21న కొత్త ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. దీని ప్రకారం, పారిపోయిన వ్యక్తుల ఆస్తుల్ని ఇక్కడ జప్తు చేసే అధికారం ప్రభుత్వానికి లభిస్తుంది.

విజయ్ మాల్యాను పలాయనవాదిగా ప్రకటించడంతోపాటు అతని రూ.12,500 కోట్ల విలువైన ఆస్తుల్ని జప్తు చేసేందుకు అనుమతి కోరుతూ ముంబయి కోర్టులో ఈడీ దరఖాస్తు సమర్పించింది. ఈ ఆస్తుల్లో స్థిరాస్తులతోపాటు షేర్లు కూడా ఉన్నాయి. వీటిని స్వాధీనం చేసుకొనేందుకు ఈడీ రంగం సిద్ధం చేసింది. ఐడీబీఐ బ్యాంక్, ఎస్‌బీఐ కన్సార్షియం నుంచి రూ.9,000 కోట్ల రుణాల్ని తీసుకొని వాటిని ఎగవేసి మాల్యా లండన్‌కు పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ కేసు తరవాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను మోసం చేసిన కేసులో వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలపై కూడా ఈ ఆర్డినెన్స్ కింద చర్యలు తీసుకొనేందుకు ఈడీ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

నీరవ్‌కు త్వరలోనే రెడ్‌కార్నర్ నోటీసు!

దిల్లీ: దేశం విడిచిపెట్టి పారిపోయిన నీరవ్ మోదీకి త్వరలో రెడ్‌కార్నర్ నోటీసును (ఆర్‌సీఎన్) ఇంటర్‌పోల్ అధికారులు జారీ చేసే అవకాశం ఉంది. సీబీఐ సమర్పించిన పత్రాలపై ఇంటర్‌పోల్ సంతృప్తి వ్యక్తం చేసిందని, త్వరలో నోటీసులు జారీ చేయొచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. సీబీఐ సమర్పించిన పత్రాల్లో ముంబయి ప్రత్యేక కోర్టు జారీ చేసిన నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు, పీఎన్‌బీ కుంభకోణం కేసుకు సంబంధించిన ఛార్జిషీట్లు ఉన్నాయి. లయాన్‌కు (ఫ్రాన్స్) చెందిన ఇంటర్నేషనల్ పోలీస్ కోఆపరేషన్ ఏజెన్సీ ఈ పత్రాలను పరిశీలించి, అవి సరిగ్గానే ఉన్నట్లు నిర్ధరణకు వచ్చిందని ఆ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని తెలిపాయి. ఈ రోజు లేదంటే వచ్చే వారం ప్రారంభంలో రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

అరెస్టు వారెంట్ జారీ చేసిన సూరత్ కోర్టు: నీరవ్ మోదీకి సూరత్‌లోని ఓ కోర్టు అరెస్టు వారెంట్‌ను జారీ చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) నమోదుచేసిన కస్టమ్స్ సుంకం ఎగవేత కేసు విషయంలో ఈ చర్య చేపట్టింది. కోర్టు విచారణకు గైర్హాజరయ్యారంటూ ప్రధాన న్యాయమూర్తి బి.హెచ్.కపాడియా అరెస్టు వారెంటును జారీ చేశారని ప్రభుత్వ తరపు న్యాయవాది నయన్ సుఖద్‌వాలా తెలిపారు. వజ్రాలు, ముత్యాల దిగుమతులపై సుంకం ఎగ్గొట్టేందుకు తప్పుడు మార్గాలను అనుసరించాయంటూ ఆరోపిస్తూ నీరవ్‌పైనా, సూరత్ సెజ్‌లోని ఆయన కంపెనీలపైనా మార్చిలో ముంబయి డీఆర్ఐ ఈ కేసు నమోదు చేసింది.

ల్యాంకో విద్యుత్ ప్లాంట్ల విక్రయం!

బిడ్‌లను ఆహ్వానించిన యాక్సిస్ బ్యాంక్

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని ల్యాంకో ఇన్‌ఫ్రాకు చెందిన మూడు గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టుల విక్రయానికి యాక్సిస్ బ్యాంక్ బిడ్‌లను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. అయితే ఫలానా ప్లాంటు అని పేరు చెప్పకుండా మొత్తం 1,476 మెగావాట్ల సామర్థ్యమున్న 3 ప్లాంట్లను విక్రయించేందుకు యాక్సిస్ బ్యాంక్ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేయగా.. ఈ మూడు ప్లాంట్లు ల్యాంకో ఇన్‌ఫ్రావేనని సంబంధిత వర్గాలు ధ్రువీకరించాయి. బిడ్‌ల దాఖలుకు జూన్ 30ని ఆఖరి తేదీగా యాక్సిస్ బ్యాంక్ నిర్ణయించింది. బిడ్‌ల ప్రక్రియ ముగిశాక సరైన కొనుగోలుదారును నిర్ణయించి ఆ విషయాన్ని జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ)కు బ్యాంకు సిఫారసు చేస్తుంది. ల్యాంకో ఇన్‌ఫ్రా అనుబంధ సంస్థ ల్యాంకో కొండపల్లి పవర్ ఈ మూడు ప్లాంట్లను నెలకొల్పింది. ఫేజ్-1 ప్లాంటు సామర్థ్యం 368 మెగావాట్లు కాగా.. ఫేజ్-2 సామర్థ్యం 366 మెగావాట్లు, ఫేజ్-3 సామర్థ్యం 742 మెగావాట్లు. ఇవన్నీ గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులు కావడంతో గ్యాస్ కొరత కారణంగా వీటిల్లో ప్రస్తుతం విద్యుదుత్పత్తి జరగడం లేదు. ఫేజ్-1 ప్లాంటు పాక్షికంగా పనిచేస్తుండగా.. మిగిలిన రెండు ప్లాంట్లను మూసివేశారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. వ్యూహాత్మక రుణ పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక కింద రుణాన్ని ఈక్విటీ కింద మార్పు చేసి ఈ ఏడాది జనవరిలో ల్యాంకో కొండపల్లి పవర్‌ను యాక్సిస్ బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకుల బృందం తమ అధీనంలోకి తీసుకుంది. ప్రస్తుతం ఈ విద్యుదుత్పత్తి కంపెనీల్లో బ్యాంకులకు 52 శాతం వాటా ఉంది. బ్యాంకులకు, ఇతర ఆర్థిక సంస్థలకు ఈ కంపెనీ రూ.3,500 కోట్ల వరకు బకాయిపడినట్లు తెలుస్తోంది.

రక్షణలో 20 లక్షల ఉద్యోగాలు!

- రూ.70 వేల కోట్ల పెట్టుబడులు
- చిన్న కంపెనీలకు మరిన్ని అవకాశాలు
- సీఐఐ సదస్సులో ఎస్ఐడీఎం డైరెక్టర్ జనరల్ సాహా

ఈనాడు - హైదరాబాద్

ఆయుధాలు, రక్షణ ఉత్పత్తుల తయారీని దేశీయంగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు రక్షణ, ఏరోస్పేస్ రంగంలో ప్రైవేటు కంపెనీలకు ఆకర్షణీయమైన అవకాశాలను అందించనున్నాయని, ముఖ్యంగా ఈ రంగంలోని చిన్న, మధ్య స్థాయి సంస్థలు (ఎంఎస్ఎంఈ) ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) డైరెక్టర్ జనరల్ సుబ్రాతా సాహా అన్నారు. రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలోని అవకాశాలపై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో కలిసి ఎస్ఐడీఎం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. రక్షణ, ఏరోస్పేస్ రంగంలో ఫైటర్ విమానాలు, యుటిలిటీ హెలికాప్టర్లు, యుద్ధ నౌకలు, క్షిపణులు తదితర 13 విభాగాల్లో 2025 నాటికి స్వయంసమృద్ధి సాధించగలవని ప్రభుత్వం భావిస్తోందని, ఈ 13 విభాగాల్లో 10 రంగాల్లో హైదరాబాద్‌లోని కంపెనీలకు పూర్తి పట్టు రాగలదన్నారు. '2025 నాటికి ఈ విభాగాల్లో టర్నోవరు రూ.1.70 లక్షల కోట్లకు (దాదాపు 26 బిలియన్ డాలర్లు) చేరగలదని అంచనా. రూ.70,000 కోట్ల పెట్టుబడులు రాగలవని భావిస్తున్నారు. తద్వారా 20-30 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించే వీలుంది. రూ.35,000 కోట్ల ఎగుమతులు చేసే అవకాశం ఉందని' తెలిపారు. రక్షణ రంగంలోని పెద్ద కంపెనీలు (ఓఎంఈ) పరికరాలను సమకూర్చుకోవడానికి చిన్న కంపెనీలపై ఆధారపడుతున్నాయని, చిన్న కంపెనీలకు ఓఎంఈలు ఇంటిగ్రేటర్లుగా పని చేస్తున్నాయన్నారు. అందువల్ల భవిష్యత్తులో చిన్న కంపెనీలకు మరిన్ని అవకాశాలు లభించగలవని చెప్పారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లలో రక్షణ కారిడార్లు వస్తున్నాయని, తమిళనాడు క్యారిడార్ వల్ల హైదరాబాద్‌లోని పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

హైదరాబాద్‌లో ఏరోస్పేస్ విశ్వవిద్యాలయం!

హైదరాబాద్‌లో ఏరోస్పేస్, ఏవియేషన్ రంగాల కోసం విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. విశ్వవిద్యాలయానికి అవసరమైన భూమి, ఇతర మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చగలదని, పరిశ్రమలోని కంపెనీలు, ఇతర భాగస్వాములతో కలిసి దీన్ని నెలకొల్పాలని యోచిస్తున్నామని తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ (రక్షణ, ఏరోస్పేస్) పి.ఎ.ప్రవీణ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనపై అధ్యయనం చేయడానికి కన్సల్టెన్సీ సంస్థను నియమించామని, రెండు నెలల్లో ఇది నివేదికను అందించగలదన్నారు. నివేదికకు అనుగుణంగా ముందుకు సాగుతామని వివరించారు. రక్షణ, ఏరోస్పేస్ ముసాయిదా విధానాన్ని తయారు చేశామని, దీనిపై అభిప్రాయాలు సేకరిస్తున్నామని చెప్పారు. 'హైదరాబాద్‌లో 25కు పైగా పెద్ద రక్షణ కంపెనీలు ఉన్నాయి. దాదాపు 1,000 చిన్న మధ్య స్థాయి కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రక్షణ, ఏరోస్పేస్ రంగానికి సంబంధించి హైదరాబాద్‌లో బలమైన వ్యవస్థ (ఎకో సిస్టమ్) అభివృద్ధి చెందింది. దీన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నా'రు.

నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిపుణులను అందించడానికి, ఇప్పటికే ఉన్న నిపుణుల నైపుణ్యాలను పెంచడంపై దృష్టి సారిస్తున్నామని, ఈ రంగంలోని నిపుణులకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్ కోర్సులను అందించడానికి అంతర్జాతీయ విద్యా సంస్థలతో చేతులు కలుపుతున్నామని, ఏరో స్కిల్స్ అకాడమీలను ఏర్పాటు చేస్తున్నామని ప్రవీణ్ తెలిపారు. బ్రిటన్‌కు చెందిన క్రాన్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయం, ఫ్రాన్స్‌కు చెందిన ఏరో క్యాంపస్ వంటి వాటితో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. రక్షణ రంగంలో అంకుర కంపెనీలను అభివృద్ధి చేయడానికి ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోరామన్నారు. 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఇటీవలే ఏరోస్పేస్ రంగం కోసం సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌ను ప్రారంభించారు. టాస్క్ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తోంది. టి-హబ్‌లో రక్షణ, ఏరోస్పేస్ రంగానికి చెందిన అంకుర కంపెనీలు పని చేస్తున్నాయి. హార్డ్‌వేర్ కోసం టి-వర్క్స్ రానుంది. రీసెర్చ్ అండ్ ఇన్నొవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) పరిశోధన సంస్థలను ఒక తాటిపైకి తీసుకువస్తోంది. ఈ పరిణామాలు హైదరాబాద్‌లో రక్షణ, ఏరోస్పేస్ మరింత బలోపేతం కావడానికి దోహదం చేయగలదన్నా'రు. కేంద్రం ప్రకటించిన ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సెలెన్స్ (ఐడెక్స్) కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో ఐడెక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.

అదానీ గ్రూప్ పార్కు..

విమానాల తయారీలో వినియోగించే ప్రత్యేక లోహాల (కాంపొజిట్స్) తయారీకి హైదరాబాద్ సమీపంలో అదానీ గ్రూప్ కాంపొజిట్స్ పార్కును ఏర్పాటు చేయనుంది. ప్రభుత్వం నుంచి కంపెనీ భూమి తీసుకుందని, పార్కులో కాంపొజిట్స్ లోహాల తయారీ, శిక్షణ యూనిట్ వంటివి ఉంటాయని ప్రవీణ్ చెప్పారు. పార్కు పనులు ప్రారంభమయ్యాయని, నవంబరు నాటికి ఈ పార్కు సిద్ధమయ్యే అవకాశం ఉందని చెప్పారు. పెట్టుబడులు ఇతర వివరాలను వెల్లడించలేదు. ప్రత్యేక లోహాలు విమాన బరువును తగ్గించడంతోపాటు ఇంధన సామర్థ్యాన్ని పెంచుతాయి. రానున్న రోజుల్లో కాంపొజిట్స్, ప్రత్యేక లోహాలు రక్షణ, ఏరోస్పేస్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలవని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ భావిస్తోంది. విడి భాగాలు, ప్రత్యేక లోహాల వంటి వాటిని భారత్‌కు చెందిన దాదాపు 46 కంపెనీల నుంచి ఎయిర్‌బస్ సమకూర్చుకుంటోంది. వీటిలో అదానీ గ్రూప్ కంపెనీ కూడా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగంలో సామర్థ్యాలను పెంచుకోవాలని అదానీ భావిస్తోంది.

సీఐఐ ఏర్పాటు చేసిన రక్షణ, ఏరోస్పేస్ సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐడీఎం డైరెక్టర్ జనరల్ సుబ్రాతా సాహా (ఎడమ నుంచి మూడో వ్యక్తి). పక్కన తెలంగాణ పరిశ్రమల శాఖ డైరెక్టర్ ప్రవీణ్ (ఎడమ నుంచి రెండో వ్యక్తి) తదితరులు

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్ ▲ 257	నిఫ్టీ ▲ 81
35690	10822

అయిదో వారమూ లాభాలే

- మధ్యాహ్నం తర్వాత పుంజుకున్న సూచీలు
- రాణించిన ఔషధ, టెలికాం షేర్లు

సమీక్ష

ఆరంభ నష్టాల నుంచి సూచీలు బలంగా పుంజుకున్నాయి. ఆరోగ్య సంరక్షణ, టెలికాం, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో మధ్యాహ్నం తర్వాత మార్కెట్లు సత్తా చాటాయి. ఒపెక్ దేశాల సమావేశం నుంచి సానుకూల సంకేతాలు రావొచ్చన్న అంచనాలు కలిసొచ్చాయి. చమురు ఉత్పత్తి పెంచితే ధరలు తగ్గొచ్చన్న వార్తలే ఇందుకు నేపథ్యం. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. సూచీలు వరుసగా అయిదో వారం లాభాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ 67.46 పాయింట్లు, నిఫ్టీ 4.15 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,428.42 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. అదే ధోరణి కొనసాగిస్తూ.. ఇంట్రాడేలో 35,344.49 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. మధ్యాహ్నం తర్వాత బలంగా పుంజుకున్న సూచీలు లాభాల్లోకి వచ్చాయి. ఒకానొకదశలో 35,741.26 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. చివరకు 257.21 పాయింట్ల లాభంతో 35,689.60 దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 80.75 పాయింట్లు పెరిగి 10,821.85 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,710.45- 10,837 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ కేన్సర్ చికిత్సలో వినియోగించే దుర్వాలుమాబ్ ఔషధానికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) తుది అనుమతి ఇవ్వడంతో ఆస్ట్రాజెనెకా ఫార్మా షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో 10.97 శాతం పెరిగిన షేరు.. చివరకు 9.32 శాతం లాభంతో రూ.1478.55 వద్ద ముగిసింది.

✦ గత కొన్ని సెషన్లుగా కొత్త గరిష్ఠాలకు చేరిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు లాభాల స్వీకరణ ఎదురైంది. 1.94 శాతం నష్టపోయిన షేరు రూ.1012.30 దగ్గర స్థిరపడింది

సెన్సెక్స్ 30 షేర్లలో 21 లాభాలతో ముగిశాయి. సన్‌ఫార్మా 3.91%, ఎం అండ్ ఎం 2.78%, హెచ్‌డీఎఫ్‌సీ 2.54%, యాక్సిస్ బ్యాంక్ 2.22%, భారతీ ఎయిర్‌టెల్ 1.74%, ఎస్‌బీఐ 1.69%, ఐటీసీ 1.67%, ఎన్‌టీపీసీ 1.26%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.22%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.11% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ (1.94%), కోల్ ఇండియా (0.99%), టీసీఎస్ (0.44%), విప్రో (0.41%)లు మాత్రం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో ఆరోగ్య సంరక్షణ 1.31 శాతం లాభపడింది. టెలికాం, బ్యాంకింగ్, విద్యుత్, ఎఫ్ఎమ్‌సీజీ, పీఎస్‌యూ, వాహన, మౌలిక, మన్నికైన వినిమయ వస్తువులు, లోహ, యంత్ర పరికరాల షేర్లు అదే బాటలో నడిచాయి.

మార్కెట్ కబుర్లు

✦ అమెరికా సమీకృత ఉక్కు తయారీ యూనిట్ ఏసెరో జంక్షన్ కొనుగోలు, నవీకరణకు దశలవారీగా 500 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,390 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు **జేఎస్‌డబ్ల్యూ స్టీల్** వెల్లడించింది. ఒహియోలో ఉన్న ఈ ప్లాంట్ సామర్థ్యం ఏడాదికి 3 మిలియన్ టన్నులు.

✦ ముంబయి హౌసింగ్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు నుంచి రూ.11,744.26 కోట్ల విలువైన ఆర్డరును **కెపాసిటీ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, టాటా ప్రాజెక్ట్స్**ల కన్సార్షియం దక్కించుకుంది. ఇందులో కెపాసిటీకి రూ.4,357.12 కోట్ల విలువైన 37.1 శాతం వాటా ఉంది. టాటా ప్రాజెక్ట్స్‌కు 36.9 శాతం, సీఐటీఐసీ కన్‌స్ట్రక్షన్ 26 శాతం చొప్పున పనులు ఉన్నాయి.

✦ రైల్వే కన్సల్టెన్సీ సంస్థ **రైట్స్** పబ్లిక్ ఇష్యూ చివరి రోజు ముగిసే సరికి 67 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 2.52 కోట్ల షేర్లను జారీ చేయగా.. 169 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 71.72 రెట్లు, సంస్థాగతేర మదుపర్ల విభాగంలో 194.56 రెట్లు రిటైల్ విభాగంలో 14.72 రెట్ల స్పందన కనిపించింది.

✦ ఇండోర్‌లో ఉన్న నిర్మాణంలో ఉన్న రిటైల్ స్థిరాస్తిని రూ.234 కోట్లకు **ఫీనిక్స్ మిల్స్** కొనుగోలు చేసింది. అనుబంధ సంస్థ ఇన్‌సైట్ హోటల్ అండ్ లీజర్ ద్వారా ఈ కొనుగోలు పూర్తి చేయనుంది.

✦ రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతిపాదించిన రుణ పరిష్కార ప్రణాళికకు ఔళి సంస్థ **అలోక్ ఇండస్ట్రీస్** రుణదాతలు ఆమోదం తెలిపారు.

✦ ఇండోనేషియాలో నష్టాల్లో ఉన్న పైస్టార్ టెక్స్‌టైల్ ఇండోనేషియా మూసివేయనున్నట్లు **బాంబే డైయింగ్** ప్రకటించింది.

✦ **ఫైన్ ఆర్గానిక్ ఇండస్ట్రీస్** పబ్లిక్ ఇష్యూ చివరి రోజున 9 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 53,65,497 షేర్లను జారీ చేయగా.. 4,78,34,875 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీలో 12.86 రెట్లు, రిటైల్ విభాగంలో 1.44 రెట్ల స్పందన కనిపించింది.

✦ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల ఇష్యూకు **జ్యోతీ లేబొరేటరీస్** వాటాదార్లు ఆమోదం తెలిపారు.

భారత్-22 ఈటీఎఫ్‌కు రెండు రెట్ల స్పందన

రూ.14,000 కోట్ల విలువైన బిడ్‌లు దాఖలు

దిల్లీ: భారత్-22 ఈటీఎఫ్ రెండో దశ ఆఫర్‌కు మదుపర్ల నుంచి మంచి స్పందన వచ్చింది. రూ.6,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఆఫర్‌ను తెరపైకి తీసుకురాగా, రూ.14,000 కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. మదుపర్ల నుంచి రెండు రెట్ల స్పందన వచ్చింది. దాదాపు లక్ష దరఖాస్తులు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రూ.6,000 కోట్లతో పాటు అదనంగా మరో రూ.2,400 కోట్ల (గ్రీన్-షూ ఆప్షన్)ను కూడా సమీకరించేందుకు ప్రభుత్వానికి అవకాశం ఉంది. బిడ్‌లు ఎక్కువ మొత్తానికి రావడంతో అదనపు నిధుల సమీకరణకు కూడా ప్రభుత్వం మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోందని విశ్లేషకుల అంచనా. జూన్ 19న భారత్-22 ఈటీఎఫ్ ఫాలో-ఆన్ ఫండ్ ఆఫర్ (ఎఫ్ఎఫ్ఓ)ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ దీన్ని నిర్వహించబోతోంది. భారత్-22 ఈటీఎఫ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల 22 షేర్లు అంతర్భాగమై ఉంటాయి. గత ఏడాది నవంబరులో భారత్-22 ఈటీఎఫ్ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ)ను ప్రభుత్వం తీసుకొచ్చింది. రూ.14,500 కోట్ల సమీకరణ లక్ష్యంతో ముందుకురాగా, దాదాపు రూ.32,000 కోట్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. తాజాగా ఫాలో-ఆన్ ఫండ్ ఆఫర్‌ను తీసుకొచ్చింది.

ఐరోపా కార్లపై 20% సుంకం విధిస్తా

డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: ఐరోపా నుంచి దిగుమతి అవుతున్న అన్ని కార్లపై 20 శాతం సుంకం విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అమెరికా ఉత్పత్తులపై యూరోపియన్ సమాఖ్య(ఈయూ) విధించిన సుంకాలను, వాణిజ్య అడ్డుగోడలను తొలగిస్తే తప్ప అడుగు వెనక్కు వేసేది లేదని తెలిపారు. బోర్‌బాన్ విస్కీల నుంచి మోటార్‌సైకిళ్ల వరకు అమెరికా ఉత్పత్తులపై ఈయూ సుంకాలను విధించిన అనంతరం ట్రంప్ హెచ్చరిక వెలువడడం గమనార్హం. అయితే ఐరోపా ఉక్కు, అల్యూమినియం ఎగుమతులపై వరుసగా 25%, 10% చొప్పున భారీ సుంకాలను విధిస్తున్నట్లు జూన్ 1న ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలోనే ఈయూ ఆ విధంగా స్పందించింది. 'అమెరికాలో కార్లను తయారు చేయండి. విదేశాల నుంచి దిగుమతి చేసుకోవద్ద'న్న సంకేతాలను ట్రంప్ ఇవ్వడం గమనార్హం.

షార్ప్‌కు రోహిత్ ప్రచారం

జపాన్ దిగ్గజ సంస్థ షార్ప్ టీవీల ప్రచారకర్తగా ప్రముఖ క్రికెట్ ఆటగాడు రోహిత్ శర్మను నియమించింది. ఆక్వాస్ శ్రేణి ఎల్ఈడీ టీవీల విడుదల ద్వారా భారత్‌లో మరోసారి సత్తా చాటడానికి కంపెనీ సిద్ధమవుతోంది. 'రోహిత్ శర్మను ప్రచారకర్తగా నియమించుకోవడం చాలా ఆనందంగా ఉంది. అతని ఆట, నిలకడలు ఆమోఘం. జపాన్ పరిశోధన, అభివృద్ధిల ద్వారా ఎల్ఈడీ పరిజ్ఞానంలో వినూత్నతలను భారత్‌కు తీసుకురావడం గర్వకారణంగా ఉంది. రోహిత్ శర్మతో భారత్‌లో ఆక్వా బ్రాండ్ విజయవంతం సాధిస్తుందని ఆశిస్తున్నాం' అని షార్ప్ టీవీ ఇండియా డైరెక్టర్ (అమ్మకాలు) జేమ్స్ యాంగ్ వెల్లడించారు. క్రికెట్‌తో భారతీయుల అనుబంధం, ప్రేమతో తెలియజేసే విధంగా 'బెస్ట్ సీన్ ఆన్ షార్ప్' నినాదంతో ప్రచార ప్రకటనలను కంపెనీ రూపొందించింది. దేశంలో నెట్‌వర్క్ విస్తరణ ప్రణాళికలను సైతం కంపెనీ సిద్ధం చేసింది. షార్ప్ వంటి దిగ్గజ బ్రాండ్‌తో జట్టు కట్టడం ఆనందకరమని రోహిత్ శర్మ అన్నారు. 'టెక్ ఔత్సాహికుడిగా షార్ప్ బ్రాండ్ అంటే చాలా ఇష్టం. ఆటలు లేదా సినిమాలను ఇందులో చూడటానికి ఇష్టపడతా' అని తెలిపారు.

22న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	392	వరంగల్	394
చిల్లరగా(ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	400
బెంగళూరు	429	చెన్నై	457
23వ తేదీకి...		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	384	నమక్కల్	440

హామీ రుణదాతగా పరిగణించేలా ఆదేశాలివ్వండి

- 'డెక్కన్ క్రానికల్' రుణ వ్యవహారంలో ఇండియా బుల్స్ వినతి
- ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు

ఈనాడు, హైదరాబాద్: డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్(డీసీహెచ్ఎల్) దివాలా పరిష్కార ప్రక్రియలో తమను హామీ రుణదాతగా పరిగణించేలా దివాలా పరిష్కార నిపుణులను (ఆర్‌పీ) ఆదేశించాలని కోరుతూ.. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌లో ఇండియా బుల్స్ పిటిషన్ దాఖలు చేసింది.

డీసీహెచ్ఎల్ బ్యాంకులు, ఇతర రుణదాతలకు సుమారు రూ.4000 కోట్ల దాకా చెల్లించాల్సి ఉండగా.. కెనరా బ్యాంకు ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన విషయం తెలిసిందే. కెనరా బ్యాంకు వ్యవహారాన్ని విచారించిన ఎన్‌సీఎల్‌టీ దివాలా పరిష్కార ప్రక్రియకు అనుమతిస్తూ గతంలో ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఆర్‌పీగా మమతా బినానీ వ్యవహరిస్తున్నారు.

రంగంలోకి ఇండియా బుల్స్

ఆస్తులు తాకట్టు పెట్టుకోవడం ద్వారా ఇండియా బుల్స్ సుమారు రూ.100 కోట్ల వరకు డీసీహెచ్ఎల్‌కు రుణమిచ్చినట్టు సమాచారం. ఇటీవల తాకట్టులో ఉన్న ఆస్తిని ఆ సంస్థ వేలం వేయడానికి ప్రయత్నించగా.. డీసీహెచ్ఎల్‌కు చెందిన వినాయక్ రవిరెడ్డి ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. వేలాన్ని అంగీకరించవద్దని, ఆ ఆస్తిని కూడా దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా చూడాలని అభ్యర్థించారు. ప్రస్తుతం తమను హామీ రుణదాతగా పరిగణించాలంటూ ఆర్‌పీకి దరఖాస్తు చేసుకున్నామని, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెలువరించలేదని ఇండియా బుల్స్ ఎన్‌సీఎల్‌టీకి నివేదించింది. అందువల్ల తమను హామీ రుణదాతగా పరిగణించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్ దాఖలు చేశామని ఇండియా బుల్స్ తరఫు న్యాయవాది చెప్పారు. వాదనలు విన్న ట్రైబ్యునల్ సభ్యులు రాటకొండ మురళి ఇండియా బుల్స్ పిటిషన్‌ను పరిశీలించాలంటూ రిజిస్ట్రీని ఆదేశించారు. ఏవైనా అభ్యంతరాలుంటే చెప్పడానికి వీలుగా జులై 6వ తేదీకి విచారణను వాయిదా వేశారు.

స్వాధీనానికి ఎస్‌ఆర్‌ఇఐ, జీ గ్రూపుల ఆసక్తి

దివాలా పరిష్కార ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే మధ్యంతర నివేదికను ఆర్‌పీ సమర్పించారు. గత వారం మరో నివేదికనూ అందజేశారు. ఇందులో డీసీహెచ్ఎల్‌ను స్వాధీనం చేసుకోవడానికి పలు కంపెనీ ఆసక్తి చూపినట్టు పేర్కొన్నారు. టైమ్స్ గ్రూపుతోపాటు హిందుస్థాన్ టైమ్స్, టీవీ9కు చెందిన ఐల్యాబ్స్, ఎస్సెల్ (జీ) గ్రూపునకు చెందిన ఆర్మ్ ఇన్‌ఫ్రా అండ్ యుటిలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌ఆర్‌ఇఐ మల్టీపుల్ అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్, విజన్ ఇండియా ఫండ్, ఫ్యూచర్ గ్రేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్, అడోనిస్ లిమిటెడ్, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్‌లు ఆసక్తి చూపిన కంపెనీల్లో ఉన్నాయి. ప్రస్తుతం ఎస్‌ఆర్‌ఇఐ మల్టీపుల్ అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌తోపాటు జీ గ్రూపునకు చెందిన ఆర్మ్ ఇన్‌ఫ్రాలు రంగంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. డీసీహెచ్ఎల్ రుణదాతల్లో ఎస్‌ఆర్‌ఇఐ కూడా ఉంది.

shoppersstop.com
Download Shoppers Stop app

SALE
★ SUPERHEROES ★

THEY WALKED IN TO SHOP FOR AN OUTFIT, WALKED OUT WITH OUTFITS FOR THE WHOLE WARDROBE.

FLAT 50%* OFF
JUNE 23-24

★ ★ ★ WANT TO BE A SUPERHERO? ★ ★ ★

SHOPPERS STOP
START SOMETHING NEW

*Conditions apply. Offer valid on select merchandise within select brands.

AXIS BANK 10% INSTANT DISCOUNT^^ | Minimum spend of ₹7,000
^^Max Discount of ₹1000. Applicable only once per Axis Bank Credit & Debit Card. Offer Validity: 20th June'18 - 3rd August'18. T&C Apply. Visit www.axisbank.com

Golden Glow First Citizens get an additional 5%* discount as First Citizen Reward Points, on net prices of sale merchandise.

CONTRACT.SS.18-0630

కొత్త అంచనాల ఆమోదంపై కసరత్తు

- పోలవరంలో 8 అంశాలపై కేంద్ర జలసంఘం అనుమానాలు
- వివరణలతో రాష్ట్ర ప్రభుత్వం నివేదిక

ఈనాడు - అమరావతి

పోలవరంలో రూ.58,319 కోట్లకు అంచనాలు సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన నివేదికకు సంబంధించిన అనుమానాలను నివృత్తి చేసే కార్యక్రమం పూర్తయింది. పోలవరంలో తదుపరి కీలక మైలురాయి కొత్త డీపీఆర్‌కు కేంద్రం ఆమోదముద్ర వేయడమే. ఇందులో భాగంగా దాదాపు ఎనిమిది అంశాలపై కేంద్ర జలసంఘం లేవనెత్తిన అంశాలకు ఏపీ అధికారులు తుది సమాధానాలు పంపారు. ఇప్పటికే మౌఖికంగా వారికి సమాధానాలు తెలిపినా లిఖితపూర్వకంగా వివరణలు కోరారు. ఈ మేరకు జవాబులు ఇస్తూ లేఖను పోలవరం ఇంజినీర్ ఇన్‌చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం మెయిల్ ద్వారా పంపారు. స్కోచ్ అవార్డుల స్వీకరణకు రాష్ట్ర జలవనరుల బృందం శనివారం దిల్లీ వెళుతోంది. ఈ సందర్భంగా అక్కడ నేరుగా కేంద్ర జలసంఘం అధికారులను కలిసి ఈ ప్రతిని అందిస్తామని అధికారులు 'ఈనాడు'కు చెప్పారు.

★ పోలవరం కుడి, ఎడమ కాలువల అంచనాలు ఎందుకు మరీ ఎక్కువయ్యాయో తెలియజేయాలన్నదే ప్రధానాంశం. పని పరిమాణం పెరగడానికి కారణాలతో పాటు తొలి డీపీఆర్ ప్రకారం కాకుండా మార్పులు ఎందుకని కేంద్ర జలసంఘం ప్రశ్నించింది.

★ ప్రాజెక్టు ప్రతిపాదన 1941 నుంచే ప్రారంభమైంది. 1980లో గోదావరి ట్రైబ్యునల్ అవార్డును ఖరారు చేశారు. 1976-81 సంవత్సరాల మధ్య జరిగిన సర్వే ఆధారంగానే ఎడమ కాలువకు సంబంధించి 1982లో కేంద్ర జలసంఘానికి తొలి డీపీఆర్ పంపారు. కుడి కాలువకు సంబంధించి 1984 లోనూ ప్రధానడ్యాంతో కలిపి 1987లో డీపీఆర్ సమర్పించారు. తదనంతర కాలాల్లో కేంద్ర జలసంఘం సాంకేతిక అంశాలతో ఇచ్చిన తుది మార్గదర్శకాల ప్రకారం ఎన్నో మార్పులు చేస్తూ వచ్చారు. ఈ మేరకు 2005-06 ధరల ప్రకారం అంచనాలు రూపొందించి 2009లో ఆమోదం పొందారు. 2010-11 ధరల ప్రకారం అంచనాలు రూపొందించి సాంకేతిక సలహా సంఘం ఆమోదం పొందారు. ఇప్పుడు తాజాగా 2013-14 ధరలతో తాజా అంచనాలు నవీకరించారు.

★ భూభౌతిక పరిస్థితుల్లో మార్పుల వల్ల పని అంచనా మారిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. తొలుత కుడి, ఎడమ కాలువలను 8,500 క్యూసెక్కుల మేరకే నిర్మించాలనుకున్నారు. ఆ తర్వాత 17,500 క్యూసెక్కులకు పెరిగింది. గోదావరిలో ప్రవాహాలు తగ్గుతున్నందునే కాలువల సామర్థ్యం పెంచుకోవాల్సి వచ్చిందని అధికారులు సమాధానమిచ్చారు. వంద రోజుల్లో 80 టీఎంసీలు ప్రకాశం బ్యారేజీకి తరలించేలా తొలుత కాలువ సామర్థ్యం నిర్దేశించారని, ప్రస్తుతం గోదావరిలో సెప్టెంబరు తర్వాత ప్రవాహాలు తగ్గుతున్నందున ఆ మేరకు తక్కువ రోజుల్లోనే లక్ష్యం మేరకు నీటిని కుడి ఎడమ కాలువల మీదుగా మళ్లించాల్సి వస్తోందని వివరించారు.

ఏడాదిగా చర్చోపచర్చలు

పోలవరానికి సవరించిన అంచనాలు గతేడాది ఆగస్టులోనే కేంద్రానికి పంపారు. ఆ తర్వాత మళ్లీ కొన్ని అనుమానాలతో వెనక్కు పంపగా.. వాటికీ సమాధానాలిచ్చారు. కేంద్ర జలసంఘం అధికారులకు ఈ విషయాలపై స్పష్టత లేకపోవడంతో ఇంజినీరింగు అధికారుల్లో దిగువ స్థాయి బృందాలను వారి అనుమానాలు నివృత్తి చేసేందుకు దిల్లీ పంపేవారు. వారు వారి పరిధిలో అంశాలకు మాత్రమే సమాధానాలిచ్చేవారు. ఈ నేపథ్యంలో నేరుగా కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావులే వారి వద్ద కూర్చుని అనేక సందేహాలను నివృత్తి చేశారు. తాజాగా దిల్లీలో శనివారం నివేదిక అందించనున్నారు.

రాజధానిలో దశావతార వెంకన్న

- విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

ఈనాడు - గుంటూరు

నవ్యాంధ్ర రాజధాని ప్రాంతంలో అధునాతనంగా నిర్మించిన 11 అడుగుల ఎత్తైన దశావతార వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న రెయిన్ ట్రీ పార్కు ప్రాంగణంలో లింగమనేని ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎల్‌ఈపీఎల్) సంస్థ ఈ దేవాలయాన్ని నిర్మించింది. ఈ ఆలయాన్ని శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభం, రాజగోపురం ప్రతిష్ఠాపనలో ముఖ్యమంత్రితో పాటు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి వారిద్దరితో పూజలు చేయించారు. వారు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహాగణపతి, మహాలక్ష్మి, గరుడ విగ్రహం, కలశాల ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం వంటి కార్యక్రమాలు మూడు గంటల పాటు నిర్విరామంగా సాగాయి. ఈ దేవాలయాన్ని చూస్తుంటే తిరుపతి వేంకటేశ్వరస్వామిని చూసినంత ఆనందం కలుగుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి దేవాలయాలు రాజధానిలో ఉండటం వల్ల ఆధ్యాత్మికంగా కూడా ఈ ప్రాంతం విరాజిల్లుతుందని, తిరుపతి గుడిని నమూనాగా తీసుకుని దీన్ని నిర్మించడం బాగుందని నిర్వాహకులైన లింగమనేని రమేష్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. మంత్రులు నారాయణ, పుల్లారావు, కొల్లురవీంద్రతో పాటు ఎమ్మెల్యేలు పైడికొండల మాణిక్యాలరావు, జీవీ ఆంజనేయులు, గద్దెరామ్మోహన్, బోండా ఉమా, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, దర్శకుడు కె.రాఘవేంద్రరావు, సీఎం ప్రత్యేకకార్యదర్శి సతీష్‌చంద్ర, విజయవాడ సీపీ గౌతంసవాంగ్, పాల్గొన్నారు. భక్తులు హాజరయ్యారు.

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, చిత్రంలో సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్

చంద్రబాబు, పవన్ పరస్పరం అభివాదం

ప్రతిష్ఠాపన కార్యక్రమాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్, గణపతి సచ్చిదానంద స్వామి, నిర్వాహకుడు లింగమనేని రమేష్ దేవాలయ ఆవరణలోని గదిలో 15 నిమిషాల పాటు ఆసీనులయ్యారని అధికార వర్గాల ద్వారా తెలిసింది. తొలుత పూజా కార్యక్రమాల్లో భాగంగా ఒకరికొకరు పరస్పరం అభివాదం చేసుకున్నారు. మంత్రులు నారాయణ, పుల్లారావు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే, మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావుతో పాటు పలువురు తెదేపా నేతలు అక్కడే బయట ఉన్నారు. పూజలు ముగించుకుని బయటకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ ఈ దేవాలయం బాగుందన్నారు. అనంతరం అక్కడి నుంచి సచివాలయానికి వెళ్లారు. పవన్ కల్యాణ్ మీడియా ముందుకు రాకుండా మరో మార్గం నుంచి విజయవాడ వెళ్లిపోయారు.

విజయవాడ-సింగపూర్ విమానం మరింత ఆలస్యం

- త్వరలో బిడ్‌లు పిలవనున్న పౌరవిమానయాన శాఖ

ఈనాడు, అమరావతి: విజయవాడ-సింగపూర్ మధ్య నేరుగా విమాన సర్వీసు కల సాకారమయ్యేందుకు మరింత సమయం పట్టనుంది. రెగ్యులర్ ప్రయాణికుల కోసం విదేశీ విమానయాన సంస్థలు మన దేశానికి ప్రత్యేక విమానాలు (చార్టర్డ్ ఎయిర్‌క్రాఫ్ట్స్) నడిపేందుకు కేంద్ర పౌరవిమానయానశాఖ నిబంధనలు అంగీకరించడం లేదు. దేశీయ విమానయాన సంస్థలకు మాత్రమే ఆ అవకాశం ఉంది. ఇందులో భాగంగా కేంద్రం త్వరలో బిడ్‌లు పిలవనుంది. దీనిపై వచ్చే వారంలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో దిల్లీలో ఒక సమావేశం కూడా నిర్వహిస్తోంది. ఈ ప్రక్రియంతా కొలిక్కి వచ్చి విజయవాడ నుంచి సింగపూర్‌కి విమానం నడపడం వచ్చే సెప్టెంబరు వరకు సాధ్యం కాదని సమాచారం. రెండు మూడు నెలల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఒత్తిడి తెచ్చిన సింగపూర్ ప్రతినిధులు

రాజధాని అమరావతిలో స్టార్టప్ ప్రాంత అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న సింగపూర్ సంస్థలు విజయవాడ, సింగపూర్ మధ్య నేరుగా విమాన సర్వీసు నడపాలని గట్టిగా కోరుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ఛైర్మన్లుగా పరస్పర సహకారం కోసం ఏర్పాటైన సంయుక్త కార్యాచరణ అమలు కమిటీ (జేఐఎస్‌సీ) సమావేశాల అజెండాలోను ఇది ప్రధానాంశంగా ఉంటోంది. గత నెలలో జరిగిన జేఐఎస్‌సీ సమావేశంలోను దీనిపై సింగపూర్ ప్రతినిధులు గట్టిగా ఒత్తిడి తెచ్చారు. జులై నుంచే విమాన సర్వీసు ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. విజయవాడకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో విమానం నడపాలని గతంలో సిల్క్‌ఎయిర్‌వేస్‌ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. తగినంత మంది ప్రయాణికులు లేకపోతే... ఆ సంస్థలకు వచ్చే నష్టాన్ని ఈ విధానంలో భర్తీ చేయనుంది. ఈ ప్రతిపాదనకు కేంద్రం అనుమతివ్వలేదు. "విదేశీ విమానయాన సంస్థలు చార్టర్డ్ విమానం నడపాలంటే... దానిలో ఏ ప్రయాణికులు ఇక్కడికి వస్తారో... వారినే మళ్లీ తీసుకెళ్లాలి. సిల్క్‌ఎయిర్‌వేస్ విజయవాడకు రెగ్యులర్ ప్రయాణికుల కోసం చార్టర్డ్ విమానం నడిపే అవకాశం లేదు. ఇండిగో, స్పైస్‌జెట్, ఇండియన్ ఎయిర్‌లైన్స్ వంటి దేశీయ విమానయాన సంస్థలు చార్టర్డ్ విమానాలు నడిపే వీలుంది..." అని ఐ అండ్ ఐ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ వెల్లడించారు.

ఇద్దరు తెలుగు వారికి సాహిత్య అకాడమీ పురస్కారాలు

ఈనాడు, దిల్లీ: ఇద్దరు తెలుగు వారికి ఈ ఏడాది కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారాలు లభించాయి. 'ఆనందలోకం' కవితా సంపుటి రచయిత నారంశెట్టి ఉమామహేశ్వరరావుకు బాలసాహితీ పురస్కారాన్ని ప్రకటించారు. యువ సాహిత్య విభాగంలో 'ఆకు కదలని చోటు' కవితా సంపుటిని రచించిన బాల సుధాకర మౌళికి అవార్డు లభించింది. ఈ మేరకు సాహిత్య అకాడమి కార్యదర్శి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాదికి 23 మందిని 'బాల సాహిత్య', 21 మందిని 'యువసాహిత్య' పురస్కారాలకు ఎంపిక చేశారు. నవంబరు 14వ తేదీన బాలసాహిత్య అవార్డుల ప్రదానం జరుగుతుంది. యువ పురస్కారాల ప్రదానం తేదీలను మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. ఈ అవార్డు కింద విజేతలకు రూ.50 వేల చొప్పున నగదు బహుమతి (చెక్కురూపంలో)... జ్ఞాపికలను అందచేస్తారు.

ఉమా మహేశ్వరరావు

బాల సుధాకర మౌళి

చమురు శుద్ధి కర్మాగారానికి శంకుస్థాపన చేసిన మంగోలియా

భారత్ సాయంతో నిర్మాణం

ఉలాన్‌బాతర్: తమ దేశంలోనే తొలి చమురు శుద్ధి కర్మాగారానికి.. మంగోలియా శుక్రవారం శంకుస్థాపన చేసింది. భారత్ అందిస్తోన్న రూ.6.7 వేల కోట్ల రుణ సాయంతో.. ఈ కర్మాగార నిర్మాణాన్ని ఆ దేశం తలపెట్టింది. ఈ నేపథ్యంలో శంకుస్థాపన కార్యక్రమానికి.. భారత హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అతిథిగా హాజరయ్యారు. మంగోలియా ప్రధాని ఉఖ్నాగిన్ ఖరెల్సుఖ్ సహా అక్కడి ప్రభుత్వ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు దేశాల మధ్య బంధాలు ప్రస్తుతం కీలక మైలురాయిని చేరుకున్నాయని.. మున్ముందు అవి మరింత బలపడతాయని రాజ్‌నాథ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అల్టాన్షిరీ సామ్‌లోని స్టాంట్సిన్ హూలోయ్‌లో ఈ కర్మాగార నిర్మాణం జరుగుతోంది. దీనితో తమ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని.. ఇంధన దిగుమతుల కోసం విదేశాల (ప్రధానంగా రష్యా) మీద ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని మంగోలియా భావిస్తోంది.

అసత్య ప్రచారాలు ఎందుకు?

- రమణదీక్షితులను ప్రశ్నించిన తిరుమల జేఈవో
- ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నామని వెల్లడి

తిరుమల, న్యూస్‌టుడే: ఏం సాధించాలని తిరుమల ఆలయంపై, ప్రమేయం లేని వ్యక్తులపై అసత్య ప్రచారం చేస్తున్నారని రమణదీక్షితులను ఉద్దేశించి తిరుమల జేఈవో శ్రీనివాసరాజు ప్రశ్నించారు. ఈ విషయంలో తాము ఏ విచారణకైనా, శిక్షకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తిరుమలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'శ్రీవారి సన్నిధానంలో 40 ఏళ్లుగా విధులు నిర్వర్తించి పుణ్యం సంపాదించుకున్నారు. మీ జీవితాన్ని ఎందుకు పలుచన చేసుకుంటున్నారు? శ్రీవారి కైంకర్యాల్లో ఏ అధికారి జోక్యం ఉండదు. అప్పుడుకూడా ఇప్పుడున్న అర్చకులే ఉన్నారు. ఏలోటు లేకున్నా లేనిపోని అసత్యాలతో భక్తులకు ఏం సంకేతాలిస్తున్నారు? నిబంధనలకు విరుద్ధంగా ఆలయానికి మీరు పూలు తెచ్చినా, అగరువత్తులు తీసుకువచ్చినా పట్టించుకున్నామా? సాటి అర్చకులు మీపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు కదా? ఆభరణాలు తరలిపోయాయని అసత్యాలు ప్రచారం చేస్తున్నారు.. వైకుంఠద్వారంలోనే ఏటా 20 రోజులపాటు తనిఖీలు నిర్వహిస్తుంటారు. బంగారంలో తరుగున్నా, రాయి రాలినా తగు కారణాలతో నమోదు చేస్తారు. ఇది ఒకరిద్దరితో జరిగే వ్యవహారం కాదు. ఆభరణాల భద్రత, శ్రీవారి కైంకర్యాల విషయంలో వ్యవస్థలు బలోపేతంగా ఉన్నాయి. విజిలెన్స్, సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. అయినా ఆభరణాలు తరలడం సాధ్యమా? అన్నప్రసాదాలు తయారుచేసే పోటును లోగడ మూడు సార్లు మరమ్మతు చేశారు. ఈ తరుణంలో రెండో ప్రాకారంలోని పడిపోటు నుంచి ప్రసాదాలు తయారు చేసుకొని వచ్చి ఇక్కడి అమ్మవారి విగ్రహం ఎదుట నివేదించారు. నిత్యం రాత్రి కైంకర్యానికి దోసె పడి నివేదన, లడ్డూ, వడ ప్రసాదం కూడా పడిపోటులో తయారుచేసినవి కావా? ప్రసాదాలను తెచ్చే సమయంలో భక్తుల రాకపోకలను నిలిపివేస్తున్న విషయం నిత్యం జరుగుతున్నదే కదా? ఉత్సవమూర్తుల ఊరేగింపులో ప్రసాదాలను నివేదించడం లేదా? ఇన్ని సందర్భాల్లో కాని ప్రసాదాల మలినం.. మీరన్నట్లు ఎలా అవుతుంది? గత డిసెంబరులో చేపట్టిన మరమ్మతును మీరు పరిశీలించలేదా? ఇక్కడ నేల మాలిగలంటూ ముఖ్యమంత్రి, మేడం అంటూ ఎలా ఆరోపిస్తారు? మీరు అభ్యంతరం చెప్పడం వల్లే పోటులో పైకప్పు భద్రత కోసం స్తంభం ఏర్పాటు నిలిపివేయలేదా? దీనివల్ల ఏదేని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు? రమణదీక్షితులు స్వామీ.. ఇకనైనా పద్ధతి మార్చుకోండి. మీకు మంచి బుద్ధిని ప్రసాదించమని భగవంతుణ్ని వేడుకుంటున్నా. భక్తకోటి కూడా ఆయన మాటలను నమ్మవద్దు' అని పేర్కొన్నారు. పోటు మరమ్మతులు చేపట్టిన తితిదే సీఈ చంద్రశేఖరరెడ్డి, ఎస్ఈ రామచంద్రారెడ్డి, ఈఈ సుబ్రమణ్యంను జేఈవో వెంటపెట్టుకుని ఆధారాలతో పాటు విలేకరులకు వివరించారు.

మంత్రి సునీతతో సీఐటీయూ నాయకులు

అంగన్‌వాడీల వేతనాల పెంపుపై సీఐటీయూ నాయకుల హర్షం

ఈనాడు డిజిటల్, అమరావతి: అంగన్‌వాడీ కార్యకర్తల జీతాల పెంపుపై అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాస ప్రాంగణంలోని ప్రజా దర్బారు హాలులో మంత్రి పరిటాల సునీతను కలిసి కృతజ్ఞతలు కలిశారు. మంత్రిని కలిసిన వారిలో సీఐటీయూ అధ్యక్షురాలు బేబిరాణి, ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు మోటారు బైకులను సత్వరమే ఇవ్వాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వం దివ్యాంగులకు ఉచితంగా ఇస్తామన్న 2,600 మోటారు బైకులు, ఎలక్ట్రిక్ చక్రాల కుర్చీలను తక్షణమే అందజేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర నాయకులు ఆ శాఖ కమిషనర్, ఎండీ సి.నాగరాణికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ఏడాది అందజేయాల్సిన బైకులను ఇప్పటికీ ఇవ్వలేదని వికలాంగుల హక్కుల జాతీయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోడూరు అప్పలనాయుడు ఈసందర్భంగా వెల్లడించారు. దివ్యాంగుల విశిష్ట గుర్తింపు కార్డుల జారీ తదితర అంశాలను నెరవేర్చాలని వారు కమిషనర్‌ను కోరారు.

స్కోచ్ ఛైర్మన్ సమీర్ కొచ్చర్ నుంచి పురస్కారాన్ని స్వీకరిస్తున్న ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాం ప్రసాద్

ఏపీకి 22 స్కోచ్ అవార్డులు

ఏపీఐఐసీకి వరుసగా రెండో ఏడాదీ స్థానం

ఈనాడు, దిల్లీ, ఈనాడు డిజిటల్, అమరావతి: దేశంలో వివిధ విభాగాల్లో సత్తా చాటిన శాఖలు, సంస్థలు, వ్యక్తులకు ప్రతిష్ఠాత్మక సంస్థ స్కోచ్ అందించే అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ సత్తా చాటింది. స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డుల్లో 22 పురస్కారాలు దక్కించుకుంది. ఉత్తమ పాలన, పారదర్శకత అమలు సహా పలు పథకాలతో రాష్ట్ర పురపాలక సంఘాలు అవార్డులు దక్కించుకున్నాయి. పాఠశాల విద్య, ఘనవ్యర్థాల నిర్వహణ, ఈ-కార్యాలయం, గృహనిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన తదితర పలు విభాగాల్లో తాడిపత్రి పురపాలక సంఘానికి 10 పురస్కారాలు దక్కాయి. వీటిని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ అందుకున్నారు. ఉద్యోగులు సహా అందరూ ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో కర్నూలులో ప్రతి ఆదివారం నిర్వహించే 'హ్యాపీ సండే' కార్యక్రమానికి , మున్సిపాలిటీ పరిధిలో అంగన్‌వాడీల ఆధునికీకరణకు దక్కిన అవార్డులు కమిషనర్ హరినాథ్‌రెడ్డి అందుకున్నారు. రెండంకెల వృద్ధిరేటుకు సంబంధించి ఏపీ ప్రణాళిక విభాగానికి అవార్డు లభించింది. విజయవాడ పరిధిలో చెత్త సేకరణ, సీసీ కెమెరాల నిర్వహణకు సంబంధించి నగరపాలికకు అవార్డులు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ) వరుసగా రెండో ఏడాది 'స్కోచ్' పురస్కారానికి ఎంపికైంది. 'పారిశ్రామిక కేటాయింపులపై మూడో పక్షంతో పర్యవేక్షణ' అంశంలో అవార్డు దక్కింది. ఏడుగురు యువ గ్రామీణ పారిశ్రామిక వేత్తలు పురస్కారాలు అందుకున్నారు.

పవన్‌వి గాలి మాటలు: కేఈ

ఈనాడు, అమరావతి: తిరుమల-తిరుపతి దేవస్థానం వేదికగా భాజపా, వైకాపా, జనసేన పార్టీలు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ ఇంఛార్జి మంత్రి కేఈ కృష్ణమూర్తి ధ్వజమెత్తారు. సచివాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. "పవన్ అంటే గాలి. గాలి వార్తలను నమ్మి వాటిని చెప్పడం తప్ప..ఆలోచించే శక్తి, వివేచన ఆయనకు లేదు. రీల్ లైఫ్ వేరు. రియల్ లైఫ్ వేరు. ఎవరో రాసిచ్చిన పాఠాన్ని చదవడం అలవాటుగా మారింది. ఏ ఐపీఎస్ అధికారి చెప్పారో తెలిపితే వాస్తవాలు తెలుసుకుంటాం. విశ్వసనీయత లేని అర్చకులు రమణ దీక్షితులకు ఆయన మద్దతు తెలపడం రాజకీయ కుట్రనే. స్వామివారి ఆభరణాల విషయంలో ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఆభరణాల వ్యవహారంపై విచారణ జరిపిన రెండు కమిషన్ల నివేదికలను బయటపెట్టేందుకు సిద్ధమని" పేర్కొన్నారు.

విజయవాడలో పవన్‌కల్యాణ్ అద్దెకు తీసుకున్న భవనం ★ గృహప్రవేశం చేస్తున్న పవన్‌కల్యాణ్ దంపతులు

విజయవాడలో పవన్ మకాం

కుటుంబసభ్యులతో సహా గృహప్రవేశం

ఈనాడు, అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడలోనే ఇక ఎక్కువ కాలం మకాం చేయనున్నారు. నగరంలోని పటమటలంకలో రెండంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. శుక్రవారం మంచిరోజు కావడంతో ఆయన కుటుంబసభ్యులతో సహా కొత్త ఇంట్లోకి గృహప్రవేశం చేశారు. భార్య అన్నా లెజినోవా, కుమారుడు అకీరానందన్‌తో సహా ఆయన ఈ ఇంట్లోకి ప్రవేశించారు. ఏ హడావుడి, ముందస్తు సమాచారం ఏమీ లేకుండానే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మంగళగిరి సమీపంలోని కాజా వద్ద స్వంత ఇల్లు, పార్టీ కార్యాలయం నిర్మాణానికి గతంలోనే శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఆ భవనాలు నిర్మాణం ఉన్నాయి. ఇప్పటివరకూ విజయవాడలో తాత్కాలిక పార్టీ కార్యాలయంలోనే పవన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ పార్టీ కార్యాలయం చిన్నగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హోటల్‌లోనూ బస చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ రెండంతస్తుల విశాల భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. పవన్ నివాసం, పార్టీ కార్యాలయంగానూ వినియోగించనున్నారు. పర్యటనలు లేని సమయంలో ఎక్కువ రోజులు ఇక్కడే ఉండేలా ఆయన తన కార్యక్రమాలను రూపొందించుకుంటున్నారని, ఇక విస్తృతంగా పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తారని జనసేన వర్గాలు తెలియజేశాయి.

వచ్చే ఎన్నికల్లో వైకాపాకు పవన్ మద్దతు

తిరుపతి మాజీ ఎంపీ వరప్రసాద్ వ్యాఖ్య

రేణిగుంట, న్యూస్‌టుడే: 'రానున్న ఎన్నికల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మద్దతు వైకాపాకు ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పవన్ నాతో చెప్పారు' అని తిరుపతి మాజీ ఎంపీ వరప్రసాద్ తెలిపారు. వైకాపా ఎంపీల రాజీనామాలకు ఆమోదం లభించిన అనంతరం హైదరాబాద్ నుంచి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సారి ముఖ్యమంత్రి చంద్రబాబుకు మద్దతు ఇవ్వనని, జగన్‌కు మద్దతు తెలుపుతానని పవన్ గతంలో తనతో అన్నారని వరప్రసాద్ పేర్కొన్నారు. 'మేం రాజీనామాలు చేశాం. తెదేపా ఎంపీలూ రాజీనామా చేయాలి' అని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

సీఎంలిద్దరూ కలిసి పోరాడాలి: టీజీ

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల సమస్యలపై ముఖ్యమంత్రులిద్దరూ కలిసి పనిచేయాలని తెదేపా ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. రెండు రాష్ట్రాల్లో ఉక్కు పరిశ్రమల ఏర్పాటుపై కేంద్రం విభజన చట్టంలో ఇచ్చిన హామీని నెరవేర్చుకొనే దిశగా కలిసి పనిచేయాలన్నారు. శుక్రవారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సొంతంగా ఉక్కు పరిశ్రమ నిర్మించుకుంటామని అంటే కేంద్రం ఏపీకి మాత్రం ఎందుకు ఇస్తుందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ నిజాయితీగానే ఉన్నారని, నిజాయితీ వేరు, పాలన వేరని టీజీ వ్యాఖ్యానించారు. "తెరాస ఎంపీ కేకేపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా కేకేను నియమిస్తే ఆ క్షణమే రాజీనామా చేస్తా" అని పేర్కొన్నారు.

న్యాయవాదుల నోటరీ గుర్తింపు ఐదేళ్లకు పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా గడువు ముగిసిన పలువురు న్యాయవాదులకు మరో అయిదేళ్ల పాటు నోటరీ గుర్తింపును పొడిగించారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి డి.సాంబశివరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాజధానికి వేల ఎకరాలు అవసరమా..?

'కల్లామ్స్ వేకప్ కాల్' పుస్తకావిష్కరణలో అజేయకల్లాం

సీతంపేట(విశాఖపట్నం), న్యూస్‌టుడే: రాష్ట్రానికి రాజధాని నగరాన్ని నిర్మించడానికి వేల ఎకరాలు అవసరం లేదని, జపాన్ రాజధాని టోక్యో వంటి ప్రపంచస్థాయి నగరాలు కూడా చిన్నవేనని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి అజేయకల్లాం అన్నారు. అజేయకల్లాం రాసిన 'కల్లామ్స్ వేకప్ కాల్'(ఆంగ్లం), 'మేలుకొలుపు'(తెలుగు) పుస్తకాలను విశాఖలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఈఏఎస్ శర్మ శుక్రవారం అవిష్కరించారు. ప్రజాస్పందన అధ్యక్షుడు సీఎస్ రావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అజేయ కల్లాం మాట్లాడుతూ అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో రాజధాని నగరాలు కూడా చిన్నవేన్నారు. టోక్యోలో పరిపాలనా భవనాలు మాత్రమే ఉన్నాయని పరిశ్రమలు లేవన్నారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తులకు స్వేచ్ఛ ఎంత అవసరమో, వ్యవస్థలకు కూడా స్వేచ్ఛ అంతే అవసరమన్నారు. ఒక పార్టీనుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు వేరే పార్టీలోకి మారిన సందర్భంలో ఫిర్యాదులు పరిష్కరించేందుకు స్పీకర్లకు స్వేచ్ఛలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అవినీతిని అరికట్టేందుకు వికేంద్రీకరణ మంచి మార్గమని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో సచివాలయాలు ఏర్పాటుచేసి కమిటీలు వేసినప్పుడే పారదర్శకత ఉంటుందని అభిప్రాయపడ్డారు. 1980వ సంవత్సరానికి ముందు ఎన్నికల్లో పోటీచేసే వ్యక్తులు తమ ఆస్తులు కోల్పోయేవారని, ఇప్పుడు ఒక ఎమ్మెల్యే గెలవాలంటే రూ. 25 కోట్లు వరకూ ఖర్చుచేస్తున్నా వారి ఆస్తులు తరగకుండా పెరుగుతుండడాన్ని ప్రతిఒక్కరూ గమనించాలన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అజేయకల్లాం, సీఎస్‌రావు, ఈఏఎస్‌శర్మ

లిడ్‌క్యాప్‌కు డైరెక్టర్ల నియామకం

ఈనాడు డిజిటల్, అమరావతి: తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ(లిడ్‌క్యాప్)కు ఏడుగురు డైరెక్టర్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్.వెంకటరమణ, మల్లిపూడి వెంకట మునిప్రసాద్, మద్దిపాటి వెంకటరాజు, సొంగా రవీంద్రవర్మ, డొక్కా నాగభూషణం, ఆవుల తిప్పేస్వామి, గోడునూరు గోపయ్యలను డైరెక్టర్లగా నియమించారు. వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భర్తపై దాడి.. ఆపై నిర్బంధం

- ఆరు నెలలుగా నరకయాతన అనుభవిస్తున్న వైనం
- అల్లవరం మండలంలో వెలుగుచూసిన ఘటన

అమలాపురం, న్యూస్‌టుడే: ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా ఆరు నెలలు.. కాళ్లు, చేతులు విరిగిపోయి నరకం అనుభవించాడు. అయినా కట్టుకున్న భార్య మనసు కరగలేదు. గాయాల నుంచి రక్తమోడుతున్నా భర్తను ఆమె నిర్దాక్షిణ్యంగా గదిలో బంధించింది. ఈ విషయాన్ని ఆరునెలల పాటు బాహ్య ప్రపంచానికి తెలియకుండా దాచింది.. ఈ ఉదంతం తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం మిలటరీ కాలనీలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సఖినేటిపల్లి గ్రామానికి చెందిన కొక్కిరిగడ్డ సత్యనారాయణకు అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన సూర్యకుమారితో 2003లో పెళ్లయింది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. కొమరగిరిపట్నం ఇల్లరికం వచ్చిన సత్యనారాయణ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి వచ్చి ఇదే గ్రామంలో స్వగృహం నిర్మించుకున్నాడు. కొంతకాలంగా ఇంటివద్దే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే సత్యనారాయణకు, భార్య సూర్యకుమారికి గొడవలు మొదలయ్యాయి. ఆరు నెలలుగా సత్యనారాయణ బాహ్య ప్రపంచానికి దూరమయ్యాడు. సఖినేటిపల్లిలో ఉంటున్న సత్యనారాయణ సోదరుడు నాగమల్లేశ్వరరావుకు గురువారం ఆయన పరిస్థితిపై ఫోన్ ద్వారా సమాచారం అందింది. ఆయన పోలీసులను ఆశ్రయించిన క్రమంలో ఈ దారుణం వెలుగుచూసింది. సత్యనారాయణ కదలలేని దుస్థితిలో కన్నీరు కారుస్తూ కనిపించాడు. భార్య సూర్యకుమారిని నిలదీసినవారికి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాడికి పాల్పడ్డారనే సమాధానం వచ్చింది. బాధితుడిని ఆటోలో అల్లవరం పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. తనను జనవరి 11న రాత్రి సమయంలో భార్య, పిల్లలు ఉండగానే విద్యుత్తు దీపాలు ఆర్పివేసి విచక్షణరహితంగా దాడి చేశారని బాధితుడు పోలీసుల వద్ద వాపోయారు. ఆనాటినుంచి గదిలో నిర్బంధించిందన్నారు.

నాటి సమావేశంపై పశ్చాత్తాపం లేదు

- జస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్యలు
- సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ

దిల్లీ

ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌కు సుప్రీం కోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించరాదన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని జస్టిస్ జె.చలమేశ్వర్ తప్పుపట్టారు. ఈ చర్య 'నిలబడద'ని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా శుక్రవారం పదవీ విరమణ పొందిన ఆయన వేరువేరుగా పలు వార్తా మాధ్యమాలతో మాట్లాడారు. ఉన్నత న్యాయవ్యవస్థ విశ్వసనీయత 'అప్పుడప్పుడూ' ప్రమాదంలో పడుతోందని అభిప్రాయపడ్డారు. సుప్రీం కోర్టులో కేసుల కేటాయింపుపై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్ర వ్యవహారశైలిని తప్పుపడుతూ ముగ్గురు సీనియర్ జడ్జీలతో కలసి పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించడాన్ని ఆయన సమర్థించుకున్నారు.

"జస్టిస్ జోసెఫ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి అవుతారని ఆకాంక్షిస్తున్నా. దాన్ని నేను అడ్డుకోలేదు. ఆయన పదోన్నతి కోసం పదేపదే అడుగుతున్నా. ఆయనకు పదోన్నతి ఇవ్వాలని కొలీజియం తన సిఫార్సును ఏకగ్రీవంగా పునరుద్ఘాటించింది" అని జస్టిస్ చలమేశ్వర్ పేర్కొన్నారు. జస్టిస్ జోసెఫ్‌ను 'అసాధారణ' న్యాయమూర్తిగా ఆయన అభివర్ణించారు. ఆయనను పదోన్నతి కల్పించాల్సిందన్నారు. కొలీజియం.. ఆయన పేరును మరోసారి సిఫార్సు చేయాలని కోరారు. "ఆయనేమీ నా మతానికి, సామాజిక వర్గానికి, భాషకు సంబంధించిన వ్యక్తి కారు. అయినా ఆయన కోసం పోరాడా" అని చెప్పారు. జడ్జీల పదోన్నతుల అంశంపై కొలీజియం చేసిన సిఫార్సులపై పరిశీలనకు కేంద్రం నెలల సమయాన్ని తీసుకోరాదని పేర్కొన్నారు. దీనివల్ల ఖాళీలు భర్తీకాక.. మరిన్ని దావాలు పెండింగ్‌లో పడిపోతాయని చెప్పారు.

రోజులు మారతాయి..

భారత న్యాయవ్యవస్థ విశ్వసనీయత ప్రమాదంలో పడిందా అన్న ప్రశ్నకు.. 'అప్పుడప్పుడూ ప్రమాదంలో పడుతోంది" అని జస్టిస్ చలమేశ్వర్ బదులిచ్చారు. అయితే మరో వార్తా మాధ్యమంతో మాట్లాడుతూ న్యాయవ్యవస్థ ప్రమాదంలో ఉందని తానెప్పుడూ అనుకోలేదని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో న్యాయ విద్యార్థిగా ఉన్నప్పటి తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. "మా అధ్యాపకుడు ప్రొఫెసర్ గోపాలకృష్ణ శాస్త్రి వద్ద నాటి పరిస్థితులపై అసంతృప్తిని వెళ్లగక్కా. ఆయన చిరునవ్వు నవ్వి.. ఇది క్లిష్ట సమయమేనని తనకు తెలుసన్నారు. అయితే హిట్లర్ వంటివారిని నువ్వు చూడలేదని చెప్పారు. ఏదీ శాశ్వతం కాదని, కొన్ని సమస్యలున్నమాట నిజమేన్నారు. కానీ పరిస్థితుల్లో మార్పు వస్తుందని ధైర్యం చెప్పారు" అని జస్టిస్ చలమేశ్వర్ ఉద్ఘాటించారు.

సమస్య ఉంది..

జస్టిస్ దీపక్ మిశ్రకు తనకు మధ్య వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచిన అంశంపై జస్టిస్ చలమేశ్వర్ స్పందించారు. కేసుల కేటాయింపుపై సీజేఐకి విశేషాధికారం ఉన్నమాట నిజమేనని అంగీకరించారు. అయితే కేసుల కేటాయింపుపై సమస్య ఉందని, దాన్ని పరిష్కరించాలని చెప్పారు. రాత్రికిరాత్రే ఏ సమస్యా పరిష్కారం కాదని తనకు తెలుసన్నారు. సమస్య కొనసాగుతోందని, ఒక ప్రయత్నం జరిగిందని తెలిపారు.

అధికారంలో ఉన్నవారిని కలుస్తోంది ఎవరో..

సీజేఐపై ఆరోపణలు వచ్చిన ప్రసాద్ ఎడ్యుకేషన్ ట్రస్టు కేసులో విచారణకు ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో ధర్మాసనం ఏర్పాటు చేయాలన్న తన నిర్ణయాన్ని కొట్టేయడంపై జస్టిస్ చలమేశ్వర్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఆ కేసు చాలా తీవ్రమైనదని, అందులో హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు అరెస్టయ్యారని, ఫలితంగా సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసిందని చెప్పారు. జనవరి 12న తాను పాత్రికేయ సమావేశం నిర్వహించిన రోజున సీపీఐ నేత డి.రాజా తన అధికార నివాసానికి రావడంపై వచ్చిన విమర్శలను ఆయన ఖండించారు. ఆ రోజున తన నివాసం వెలుపల పెద్ద సంఖ్యలో మీడియా ఉండటాన్ని చూసిన ఆయన.. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగిందేమోనన్న ఆందోళనతో ఇంట్లోకి వచ్చారని చెప్పారు. ఇంతకుమించి వేరే కారణమేదీ లేదన్నారు. 'నాకు ఇంకా కొన్ని వారాల పదవీకాలం ఉన్న దశలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించా. ఆ రోజున నేను ఎవరిని కలిశానన్నది అప్రస్తుతం. అంతకన్నా ముఖ్యమైన అంశమేమిటంటే.. అధికారంలో ఉన్న వారిని కలుస్తోంది ఎవరు? ఆ భేటీలు ఎక్కడ జరుగుతున్నాయి" అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. సీజేఐకి వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలకు సంబంధించిన కేసుపై విచారణకు రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని కొట్టేసేందుకు తొలుత ఏడుగురు జడ్జీలతోను, ఆ తర్వాత ఐదుగురు జడ్జీలతోను ధర్మాసనాలను ఏర్పాటు చేయడాన్ని ఆయన ప్రశ్నించారు.

మంచివాళ్ల మౌనం..

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రపై తాను తిరుగుబావుటా ఎగురవేయడంపై స్పందిస్తూ.. జనవరి 12న విలేఖరుల సమావేశాన్ని నిర్వహించడంపై తానేమీ పశ్చాత్తాపం చెందడంలేదని జస్టిస్ చలమేశ్వర్ చెప్పారు. సర్వోన్నత న్యాయస్థానం పనితీరులో లోపాలను వెలుగులోకి తెచ్చానంటూ అనేక మంది మాజీ న్యాయమూర్తులు తనను ప్రశంసించినప్పటికీ, దానిపై బహిరంగంగా మాట్లాడేందుకు వారు అశక్తత వ్యక్తంచేశారని చెప్పారు. "మంచివాళ్ల మౌనమే ఎక్కువ నష్టం కలిగిస్తుంది" అని పేర్కొన్నారు.

రద్దయిన నోట్ల జమ అసాధారణమేమీ కాదు

అహ్మదాబాద్ డీసీసీబీ వ్యవహారంపై నాబార్డు వివరణ

దిల్లీ: భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా డైరెక్టర్‌గా ఉన్న అహ్మదాబాద్ జిల్లా సహకార బ్యాంకు (డీసీసీబీ)లో రద్దయిన పెద్ద నోట్లు జమ అసాధారణ రీతిలో జరగలేదని నాబార్డు స్పష్టం చేసింది. ఈ బ్యాంకులో కేవలం మొదటి అయిదు రోజుల్లో రూ.746 కోట్లు విలువ చేసే రద్దయిన నోట్లు జమయినట్టు వచ్చిన వార్తలపై శుక్రవారం వివరణ ఇచ్చింది. బ్యాంకు స్థాయికి తగ్గట్టుగానే డిపాజిట్లు ఉన్నాయని, నిబంధనల మేరకు వినియోగదారుల వివరాలను సేకరించారని తెలిపింది. నోట్లు రద్దయిన సమయంలో (2016 నవంబరు 10-14 తేదీల మధ్య) రూ.745.59 కోట్ల మేర జమ/మార్పిడి జరిగినట్టు పేర్కొంది. ఇది అసాధారణమేమీ కాదని, మొత్తం 17 లక్షల మంది ఖాతాదారుల్లో 1.6 లక్షల (9.37 శాతం) మంది మాత్రమే ఈ సొమ్మును డిపాజిట్ చేశారని తెలిపింది.

పెద్దనోట్ల రద్దు భారీ కుంభకోణం: కాంగ్రెస్

ఈనాడు, దిల్లీ: పెద్ద నోట్ల రద్దు వెనుక భారీ కుంభకోణం ఉందని ఏఐసీసీ కమ్యూనికేషన్ల ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా ఓ ప్రకటనలో ఆరోపించారు. గుజరాత్‌లో భాజపా నేతలు అధ్యక్షులుగా ఉన్న డీసీసీబీల్లో కేవలం ఐదు రోజుల్లో రూ.3,118.51 కోట్లు పాత పెద్దనోట్లు మార్పిడి/జమ జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రస్థాయి సహకార బ్యాంకుల్లో రూ.58.51 కోట్లు, జిల్లా సహకార బ్యాంకుల్లో రూ.520.92 కోట్లు లావాదేవీలు జరిగాయన్నారు. తెలంగాణలో రాష్ట్రస్థాయి సహకార బ్యాంకుల్లో రూ.278.09 కోట్లు, జిల్లాస్థాయి సహకార బ్యాంకుల్లో రూ. 324.96 కోట్లు లావాదేవీలు జరిగాయని తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ వివరాలు తెలిసినట్టు వెల్లడించారు.

లాభసాటి వ్యవసాయంతోనే ఆహార భద్రత

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్య

పుణే: దేశ భద్రతకు ఆహార భద్రతే కీలకమని, అందువల్ల వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాల్సి ఉందని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. శుక్రవారం ఇక్కడి వైకుంఠ్ మెహతా నేషనల్ కోఆపరేటివ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన వ్యవసాయ సంప్రదింపుల సదస్సు ముగింపు సందర్భంగా ఆయన ప్రసంగించారు. భారత్ ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే దేశంగా ఎదగడంలో రైతుల కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. రైతులు దేశ ఆహార భద్రతను కాపాడుతుండగా, సైనికులు దేశ సరిహద్దుల భద్రతను రక్షిస్తున్నారని అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి బహుముఖ వ్యూహాలు అవసరమని తెలిపారు.

ఆదర్శప్రాయం బారామతి: దేశంలో వ్యవసాయ పరిశోధనలకు బారామతి ఆదర్శ ప్రాంతంగా మారిందని వెంకయ్య నాయుడు ప్రశంసించారు. బారామతిలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు.

యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ

- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

స్కిల్ సర్టిఫికేషన్ కోర్సుల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఈనాడు, అమరావతి: దేశంలోనే మొదటిసారి అమరావతిలో ప్రారంభించనున్న అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రంతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని నైపుణ్యాభివృద్ధి, యువజన సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. విజయవాడలో శుక్రవారం అంతర్జాతీయ నైపుణ్య సర్టిఫికేషన్ కోర్సులకు సంబంధించిన కరపత్రాలను నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో కె.సాంబశివరావు, సింగపూర్‌కు చెందిన స్కిల్స్ ఎస్‌జీ వెంచర్స్ బోర్డు సభ్యుడు షరీన్ టె, సింక్రోసెర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్ ఎండీ రాజా సురేష్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ మూడు సంస్థల ఆధ్వర్యంలో మూడు కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. మ్యారేజ్ ఫ్యాషన్, ఫొటోగ్రాఫిక్ మేకప్ ఆర్టిస్ట్ (60రోజుల శిక్షణ), అప్పెరల్ ఫ్యాషన్ డిజైనర్ (120 రోజులు), వ్యాపారంలో సాధికారత సాధించడం, ఉపాధి పొందడం కోసం శిక్షణ (60రోజులు) ఇవ్వనున్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో సాంబశివరావు మాట్లాడుతూ.. సాధారణంగా ఇతర దేశాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సింగపూర్ ప్రభుత్వం అంగీకరించదని, మన రాష్ట్రంలో మాత్రం శిక్షణనిచ్చేందుకు ముందుకురావడం ఆనందదాయకమని అన్నారు. సింగపూర్ నుంచే శిక్షకులు, ప్రయోగశాలలు, పరికరాలు తీసుకువస్తారని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారందరూ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. మొత్తం ఆరు కోర్సుల్లో ప్రవేశాలు ఉండగా, జులై 6నుంచి మూడింటిని ప్రారంభిస్తున్నామని, మిగతావి ఆగస్టులో మొదలుపెడతామని వివరించారు. ఆసక్తి ఉన్నవారు http://jobskills.apssdc.in/sdc/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలుంటాయని తెలిపారు.

తాగునీటి పథకాలకు రూ.2500 కోట్ల రుణం

ఈనాడు అమరావతి: నాలుగు జిల్లాలలో తాగునీటి పథకాలను నిర్వహించేందుకు ఆయా తాగునీటి ప్రాజెక్టుల ఆస్తులను తనఖాపెట్టి బ్యాంకుల రుణం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర నీటి సరఫరా సంస్థ(డీడబ్ల్యూఎస్‌సీ) రూ.2500 కోట్లు బ్యాంకుల నుంచి రుణం తీసుకునేందుకు ఆ సంస్థ ఎండీకి అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల్లో తాగునీటి పథకాల నిర్వహణకు ఈ రుణాలను పంజాబ్, సింధ్ బ్యాంకు (రూ.1000కోట్లు), విజయా బ్యాంకు నుంచి రూ.వేయి కోట్లు, కెనరాబ్యాంకు నుంచి రూ.500 కోట్ల రుణాలను తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎనిమిది జిల్లాలలో తాగునీటి పథకాల నిర్మాణానికి బ్యాంకుల నుంచి మొత్తం రూ.5,330 కోట్లు రుణం తీసుకునేందుకు అనుమతించాలని డీడబ్ల్యూఎస్‌సీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుతానికి నాలుగు జిల్లాలలో పథకాలు చేపట్టేందుకు రూ.2500 కోట్లు రుణం తీసుకునేందుకు ప్రభుత్వం ఆమోదించింది.

శాసనసభ రద్దు వైపు అఖిలపక్షం మొగ్గు?

శ్రీనగర్: జమ్ము-కశ్మీరు శాసనసభను రద్దు చేసి...తాజాగా ఎన్నికలను నిర్వహించాలన్న అభిప్రాయాన్ని నేషనల్ కాన్ఫరెన్స్‌తో సహా పలు పార్టీలు శుక్రవారం వ్యక్తం చేశాయి. గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రా నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఈ అభిప్రాయాలు వ్యక్తమైనాయి. జమ్ము-కశ్మీరులో పరిస్థితిపై చర్చించడానికే వోహ్రా అఖిలపక్షాన్ని ఏర్పాటు చేశారు. జమ్ము-కశ్మీరులో గవర్నర్ పరిపాలన విధింపు నేపథ్యంలో వోహ్రా ఈ సమావేశాన్ని నిర్వహించడం గమనార్హం. తక్షణమే ఇక్కడి శాసనసభను రద్దు చేసి....సాధ్యమైనంత త్వరలో ఎన్నికలను నిర్వహించడానికి వీలైన వాతావరణాన్ని నెలకొల్పాలన్న అభిప్రాయాన్ని పలు పార్టీలు వ్యక్తం చేశాయి.

బడిలోనే బాలుడి హత్య

గుజరాత్‌లో దారుణం

వడోదర: గుజరాత్‌లో ఓ విద్యార్థి పాఠశాలలోనే దారుణ హత్యకు గురయ్యాడు. గతేడాది గురుగ్రామ్‌లో సంచలనం రేపిన ఏడేళ్ల విద్యార్థి హత్య ఘటనను తలపిస్తూ.. వడోదరలో ఈ ఘాతుకం వెలుగు చూసింది. బరన్‌పోరా ప్రాంతంలోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దేవ్ భగవాన్‌దాస్ తడ్వీ (14) మృతదేహాన్ని స్కూలు మొదటి అంతస్తులోని మరుగుదొడ్డిలో శుక్రవారం కనుగొన్నారు. రెండు షిఫ్టులతో నడుస్తున్న పాఠశాలలో మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. బాలుడి శరీరంపై 10 చోట్ల కత్తిపోట్లు ఉన్నట్లు డిప్యూటీ పోలీసు కమిషనర్ ఆర్.ఎస్.భగోరా తెలిపారు. పాఠశాలకు సమీపాన ఓ సంచి (స్కూల్ బ్యాగ్)లో ఉన్న పదునైన ఆయుధాలు, కారపు పొడి కలిపిన నీళ్లతో సీసాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సీనియర్ విద్యార్థిపైనే అనుమానాలు!

బాలుడిని ఓ సీనియర్ విద్యార్థే హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తడ్వీకి, మరో విద్యార్థికి మధ్య కొద్ది రోజుల క్రితం తగాదా జరిగినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈమేరకు నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు వడోదర పోలీస్ కమిషనర్ తెలిపారు.

పండ్లు కోసుకున్నందుకు బాలుడి కాల్చివేత

ఖగరియా(బిహారు): మామిడి పండ్లు తినాలన్న చాపల్యంతో ఓ తోటలోకి వెళ్లి...చెట్టెక్కి కోసుకుంటున్న పదేళ్ల బాలుడు అక్కడ కాపలా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి చేతిలో హత్యకు గురైన చెందిన దయనీయ సంఘటన ఇది. షేర్‌ఘర్ గ్రామంలో గురువారం ఈ దుర్ఘటన జరిగింది. ఈ గ్రామానికి చెందిన సత్యం(10) అనే బాలుడు సమీపంలోని ఓ మామిడితోటలోకి వెళ్లాడు. అక్కడి కాపలాదారు రామ యాదవ్ అది చూసి అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. పండ్లు కోయడం ఆపేసి చెట్టు దిగిరావాలంటూ సత్యాన్ని హెచ్చరించాడు. సత్యం మాట వినకపోయే సరికి కోపోద్రిక్తుడైన రామ యాదవ్ తుపాకీ తీసుకుని బాలుడిపై కాల్పులకు తెగబడ్డాడు.

అక్టోబర్ 2 నాటికి మరుగుదొడ్లన్నీ ఆధునికీకరణ

దిల్లీ: మహాత్మ గాంధీ 149వ జయంతి (వచ్చే అక్టోబర్ 2) నాటికి.. దేశవ్యాప్తంగా అన్ని స్టేషన్లలోని మరుగుదొడ్లనూ ఆధునికీకరించాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు అన్ని జోన్లకూ.. రైల్వే బోర్డు ఛైర్మన్ అశ్వనీ లోహానీ లేఖ రాశారు. స్టేషన్లన్నింటిలోనూ మరుగుదొడ్లలో దివ్యాంగులకు అవసరమైన ప్రత్యేక వసతులు కల్పించాలని ఆదేశించారు.

భారత తొలి రోబోటిక్ టెలిస్కోపు ప్రారంభం

దిల్లీ: భారత తొలి రోబోటిక్ టెలిస్కోపు తన సేవలను ప్రారంభించింది. ఆకాశంలో ప్రకాశవంతమైన ఖగోళవస్తువుల వైపునకు తన దృష్టిని మళ్లించింది. 'ఇండియన్ ఆస్ట్రోనోమికల్ అబ్జర్వేటరీ' (ఐఏవో) అనే టెలిస్కోపును లద్దాఖ్‌లో ఏర్పాటుచేశారు. ఇది ఈ నెల 12న తొలిసారిగా రాత్రివేళ ఆకాశాన్ని వీక్షించిందని ఈ కేంద్రం అధిపతి జి.సి.అనుపమ చెప్పారు. సమీపంలోని దేదీప్యమాన ఖగోళవస్తువులతో కూడిన 'మెస్సియర్ క్యాటలాగ్' నుంచి కొన్ని లక్ష్యాలను ఎంపిక చేసి, వాటిపైకి ఈ టెలిస్కోపు దృష్టిని మళ్లించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో అమెరికా, బ్రిటన్, జపాన్, జర్మనీ, తైవాన్, ఇజ్రాయెల్ శాస్త్రవేత్తలు కూడా భాగస్వామ్యం వహించారు. రూ.3.5 కోట్లతో ఏర్పాటైన ఈ టెలిస్కోపును బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్, బొంబాయి ఐఐటీలు సంయుక్తంగా నిర్మించాయి. దీని ద్వారా ఏటా వెయ్యి గిగాబైట్ల డేటా వెలువడుతుందని అంచనా వేస్తున్నారు.

టిబెట్-కాఠ్‌మాండూ మధ్య రైలుమార్గం

బీజింగ్: చైనా, నేపాల్‌ల మధ్య సరకు రవాణా సులభతరం కానుంది. టిబెట్-కాఠ్‌మాండూలను అనుసంధానిస్తూ వ్యూహాత్మక రైలుమార్గాన్ని నిర్మించాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి. నేపాల్ ప్రధాని కె.పి.శర్మ ఓలి ఐదు రోజుల పర్యటన నిమిత్తం చైనా వెళ్లిన సంగతి గమనార్హం. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ప్రధానమంత్రి లీ కెకియాంగ్‌లతో గురువారం ఆయన చర్చలు జరిపారు. అనంతరం టిబెట్-కాఠ్‌మాండూ రైల్వేమార్గానికి సంబంధించిన అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు సంతకాలు చేశాయి. సరకు రవాణాలో భారత్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా 2016లోనూ ఓలి చైనాతో ఓ ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంగతి గమనార్హం.

కశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

- అంతమైనవారిలో ఐఎస్‌జేకే నాయకుడు
- ఎదురుకాల్పుల్లో పోలీసుతోపాటు ఓ పౌరుడి మృతి

శుక్రవారం అనంత్‌నాగ్ జిల్లాలో ఎదురుకాల్పులు జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న స్థానికులు

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో భద్రత దళాలు నలుగురు ఉగ్రవాదులను మట్టుపెట్టాయి. హతమైనవారిలో ఇస్లామిక్ స్టేట్ జమ్ముకశ్మీర్ (ఐఎస్‌జేకే) ఉగ్రముఠా నాయకుడు దావూద్ అహ్మద్ సోఫి కూడా ఉన్నాడు. అనంతనాగ్ జిల్లాలోని ఖిరాం అనే మారుమూల గ్రామంలో ఈ ఆపరేషన్ జరిగినట్లు అధికారులు తెలిపారు. మరికొద్ది రోజుల్లో అమర్‌నాథ్ యాత్ర మొదలుకానుండటంతో.. భద్రత దళాలు ఉగ్రవాద వ్యతిరేక చర్యలను ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది. ఉగ్రవాదుల ఉనికికి సంబంధించి నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో.. శుక్రవారం సూర్యోదయానికి ముందే ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ముష్కరులున్న ఇంటిని బలగాలు సమీపించగానే.. వారు కాల్పులకు తెగబడ్డారని పేర్కొన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఓ పోలీసు, మరో పౌరుడు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. మొత్తం నలుగురు ఉగ్రవాదులనూ బలగాలు అంతం చేశాయని వివరించారు. ఘటన స్థలానికి కొంత మంది యువకులు చేరుకుని బలగాలపై రాళ్లు రువ్వారని.. బలప్రయోగంతో కట్టడి చేసినట్లు పేర్కొన్నారు. కాల్పుల్లో హతమైన దావూద్‌పై.. పలు హత్య కేసులు, రాళ్లు రువ్విన ఘటనలకు సంబంధించిన కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. మిగతా ముగ్గురు ముష్కరులూ ఐఎస్‌జేకే సభ్యులై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

పుల్వామాలో ఉగ్రవాదుల దాడి..

జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో భద్రతదళాలపై ఉగ్రవాదులు శుక్రవారం దాడికి తెగబడ్డారు. ఘటనలో నలుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు సహా మొత్తం తొమ్మిది మంది భద్రత సిబ్బంది క్షతగాత్రులయ్యారు.

ఉగ్రవాదుల ముందు సత్యాగ్రహం చేయాలా?: జైట్లీ

దిల్లీ: లొంగిపోయేందుకు నిరాకరించే ఉగ్రవాదులతో వ్యవహరించడం శాంతిభద్రతల సమస్య అని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించారు. కశ్మీర్‌లో సమస్యల పరిష్కారానికి 'బలప్రయోగ విధానం' పనికిరాదని కాంగ్రెస్, ఇతర మానవ హక్కుల సంఘాలు చేసిన వ్యాఖ్యపై జైట్లీ ఫేస్‌బుక్ ద్వారా స్పందించారు. హంతకులతో వ్యవహరించడం శాంతిభద్రతల విధానం కిందికి వస్తుందని పేర్కొన్నారు. 'ఉగ్రవాదులు చావడానికైనా, చంపడానికైనా సిద్ధంగా ఉంటారు. వారి ముందు సత్యాగ్రహం చేయాలా? చంపడానికి వస్తుంటే.. ఎదురుగా ఉండే భద్రతా దళాలు వారిని చర్చలకు పిలవాలా?' అని ప్రశ్నించారు. 'ఉగ్రవాదులు, జిహాదీలు కోర్టులను భయపెడుతున్నారు. సంపాదకులను, అమాయకులను హత్య చేస్తున్నారు. మరో మతాన్ని అనుసరించడానికి అనుమతివ్వడం లేదు. కశ్మీర్ పౌరుల మానవ హక్కులకు విఘాతం కలిగిస్తున్నార'ని వ్యాఖ్యానించారు.

రైల్‌భవన్ ఎదుట కేరళ సీఎం, ఎంపీల నిరసన

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా.. దిల్లీలోని రైల్ భవన్ ఎదుట కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రానికి చెందిన వామపక్ష ఎంపీలు కూడా ఇందులో పాల్గొన్నారు. పాలక్కాడ్‌లో రైలు బోగీల తయారీ కర్మాగారం ఏర్పాటు యోచనను విరమించుకోవాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతూ. . ఈ నిరసన ప్రదర్శన జరిగింది. కేరళ వామపక్ష కూటమి పాలనలో ఉన్నందునే కేంద్రం వివక్ష చూపుతోందని విజయన్ ఆరోపించారు.

ఐదుగురు మహిళలపై దుండగుల ముఠా అత్యాచారం

ఝార్ఖండ్‌లో ఘటన

రాంచీ: ఝార్ఖండ్‌లో ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన ఐదుగురు మహిళా కార్యకర్తలపై.. ఓ దుండగుల ముఠా సామూహిక అత్యాచారానికి ఒడిగట్టింది. వలసలు, మానవుల అక్రమ రవాణా వంటి అంశాలపై జనాలకు అవగాహన కల్పించేందుకు.. బాధితులు ఖూంటీ జిల్లాలోని చోచాంగ్ గ్రామానికి వెళ్లినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. మొత్తం 11 మంది స్వచ్ఛంద కార్యకర్తల బృందం మంగళవారం గ్రామంలో వీధి నాటకం ప్రదర్శిస్తుండగా.. కొంత మంది సాయుధ దుండగులు వారిని అడ్డుకున్నారు. తుపాకులతో బెదిరించి.. వారిని సమీపంలో అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 'పత్తల్‌గడీ' ఆచారం వెనుకున్న వ్యక్తులే ఈ దారుణానికి పాల్పడ్డట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని రాంచీ డీఐజీ అమోల్ హోంకర్ తెలిపారు. గ్రామంలోకి ఇతరుల ప్రవేశంపై నిషేధం విధించి, సార్వభౌమిక అధికారం తమదేనంటూ ఆంక్షలను జారీ చేసుకోవడమే పత్తల్‌గడీ ఆచారం. కేసుకు సంబంధించి ఇప్పటివరకూ ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు.

భూఆక్రమణను అడ్డుకున్నందుకు దళిత రైతు హతం!

బిహారులో దారుణం

భోపాల్: భూ ఆక్రమణను తీవ్రంగా వ్యతిరేకించినందుకు కిశోరీలాల్ జాటవ్(70) అనే దళిత రైతు దారుణ హత్యకు గురైనారు. తాను ఎప్పుడో లీజుగా ఇచ్చిన భూమిని కాజేసేందుకు యత్నిస్తున్న వారిని కిశోరీలాల్ అడ్డుకోవడంతో దుండగులు ఈ దురాగతానికి పాల్పడ్డారు. ఆయనపై పెట్రోలు పోసి నిప్పంటించారు. బెరసాయ్ తెహసీల్‌లోని పరసోరియా ఘట్మేడీలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఆయనపై దాడికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

అన్నమో రామచంద్రా..!

- ప్రపంచవ్యాప్తంగా అన్నార్థుల సంఖ్యలో మళ్లీ పెరుగుదల
- దశాబ్దకాలంలో ఇదే తొలిసారి
- ఐరాస తాజా నివేదికలో వెల్లడి

ఐరాస: ప్రపంచవ్యాప్తంగా మళ్లీ ఆకలి కేకలు పెరుగుతున్నాయని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక ఒకటి తేల్చింది. దాదాపు దశాబ్దకాలానికిపైగా తగ్గుతూ వచ్చిన అన్నార్థుల సంఖ్యలో తొలిసారిగా ఇటీవల పెరుగుదల కనిపించినట్లు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పోషకాహార లేమితో బాధపడుతున్నవారి సంఖ్య 2015లో 77.7 కోట్లుగా ఉండగా.. 2016 నాటికి మరో 3.8 కోట్లు పెరిగి 81.5 కోట్లకు చేరుకుందని తెలిపింది. 'ఐరాస సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీ)-2018' పేరుతో తాజా నివేదిక విడుదలైంది.

ఘర్షణలు, కరవు, విపత్తుల కారణంగా పర్యావరణంలో వస్తున్న మార్పులతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రతికూల ప్రభావం పడుతోందని నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత ఏర్పడుతుండటానికి ఇవే ప్రధాన కారణాలని పేర్కొంది. ఘర్షణల కల్లోలంతో 18 దేశాల్లో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నట్లు వెల్లడించింది. హింసాత్మక ఘర్షణల కారణంగా 2017లో 6.85 కోట్ల మంది తప్పనిసరి పరిస్థితుల్లో వలసబాట పట్టారని తెలియజేసింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఐరాస సభ్యదేశాలు 2030ని తుది గడువుగా నిర్దేశించుకున్న సంగతిని గుర్తుచేసింది. అందుకు కేవలం 12 ఏళ్లే మిగిలి ఉండటంతో.. లక్ష్యాలను చేరుకునే దిశగా ముమ్మర కృషి చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పింది.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు

- ప్రకృతి విపత్తులతో 2017లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లింది.
- భారత్ సహా దక్షిణాసియా మొత్తంగా బాల్య వివాహాలు 2000-2017 మధ్య 40 శాతం తగ్గాయి. దక్షిణాసియావ్యాప్తంగా నీటి కొరత మాత్రం పెరుగుతోంది.
- ప్రపంచవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి 10 మందిలో తొమ్మిదిమంది కలుషిత గాలినే పీల్చుకుంటున్నారు. దక్షిణాసియాలో ఈ పరిస్థితి విషమంగా ఉంది.

నిర్బంధంలో 100 మంది భారతీయులు

అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తుండగా అదుపులోకి తీసుకున్న అధికారులు

వాషింగ్టన్: అమెరికాలోని వలసదారుల నిర్బంధ కేంద్రాల్లో ప్రస్తుతం దాదాపు 100 మంది భారతీయులు బందీలుగా ఉన్నారు. వారిలో అత్యధికులు పంజాబీలు, క్రైస్తవులే. దక్షిణ సరిహద్దుల నుంచి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తుండగా అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బందీలకు సంబంధించిన సమాచారం తమ వద్ద ఉందని.. నిర్బంధ కేంద్రాల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని అమెరికాలోని భారత దౌత్య అధికారులు వెల్లడించారు. న్యూ మెక్సికోలోని నిర్బంధ కేంద్రంలో సుమారు 40-45 మంది, ఒరెగాన్‌లో 52 మంది భారతీయులు బందీలుగా ఉన్నారని తెలిపారు. మరోవైపు, ఉత్తర అమెరికా పంజాబీ సంఘం(నాపా) సేకరించిన వివరాల ప్రకారం.. 2013-15 మధ్య అమెరికా సరిహద్దుల్లో 27 వేలమందికిపైగా భారతీయులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో నాలుగు వేలమంది మహిళలు, 300 మంది చిన్నారులు ఉన్నారు. బందీల్లో ఎక్కువమంది ఇప్పటికీ జైళ్లలోనే మగ్గుతున్నారు.

మహారాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా ఖర్గే

పార్టీలో విస్తృత స్థాయి నియామకాలు

దిల్లీ, ఈనాడు, దిల్లీ: వివిధ రాష్ట్రాల కీలక పార్టీ పదవుల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తాజాగా నియామకాలు చేపట్టారు. మహారాష్ట్ర వ్యవహారాల ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఇన్‌ఛార్జిగా మల్లికార్జున్ ఖర్గేను శుక్రవారం నియమించారు. ఇంతవరకు పలు పార్టీ పదవులకు జరిపిన నియామకాలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లోత్ వెల్లడించారు. కాంగ్రెస్ సేవాదళ్ మాజీ అధిపతి మహేంద్ర జోషి, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలంలు ఏఐసీసీ కార్యదర్శులు (ప్రధాన కార్యదర్శికి అనుబంధంగా) గాను.. శశికాంత్ శర్మ ఏఐసీసీ సంయుక్త కార్యదర్శిగాను నియమితులయ్యారు.

ఏపీకి కార్యదర్శులు: తమిళనాడుకు చెందిన క్రిస్టోఫర్ తిలక్, సీడీ మెయ్యప్పన్‌లను ఆంధ్రప్రదేశ్‌కు ఏఐసీసీ కార్యదర్శులుగా నియమించారు.

కమల్ పార్టీని నమోదు చేసుకున్న ఈసీ

దిల్లీ: ప్రముఖ తమిళ సినీనటుడు కమల్ హాసన్ ప్రారంభించిన మక్కల్ నీది మయ్యం (ఎమ్ఎన్ఎమ్) పార్టీని.. ఎన్నికల సంఘం (ఈసీ) రాజకీయ పార్టీగా నమోదు చేసుకుంది. ఈ మేరకు కమల్ సమర్పించిన దరఖాస్తులను పరిశీలించామని.. పార్టీ నమోదు ప్రక్రియను పూర్తిచేశామని ఈసీ వర్గాలు తెలిపాయి.

మతాలవారీగా ఉపాధి ప్రాధామ్యాల్లో వైరుధ్యాలు

సేద్యంలో ఎక్కువ మంది హిందువులే • పారిశ్రామిక ఉద్యోగాలవైపు ముస్లింలు

దిల్లీ: భారత్‌లో మతాలవారీగా ఉపాధి ప్రాధామ్యాలు మారుతున్నట్లు జనాభా లెక్కల వివరాల్లో వెల్లడైంది. హిందువులు వ్యవసాయం వైపు, ముస్లింలు పారిశ్రామిక ఉద్యోగాల వైపు మొగ్గుతున్నట్లు తేలింది. 'రిజిస్ట్రార్ జనరల్, భారత సెన్సెస్ కమిషనర్' విడుదల చేసిన 2011 జనాభా లెక్కల వివరాలు ఈ మేరకు స్పష్టంచేస్తున్నాయి. దీని ప్రకారం.. వ్యవసాయ కార్యకలాపాల్లో నిమగ్నమైన ప్రధాన శ్రామికుల్లో 45.40 శాతం మంది హిందువులే. ఉద్యోగాలు చేస్తున్న ముస్లింలలో 60 శాతం మంది పారిశ్రామిక ఉద్యోగాలు చేపడుతున్నారు. అయితే అక్షరాస్యత విషయంలో ముస్లింలు అట్టడుగున ఉన్నారు. దీన్నిబట్టి వారు పెద్ద ఉద్యోగాల్లో ఎక్కువగా లేరని స్పష్టమవుతోంది. ఏడేళ్లు దాటినవారిలో నిరక్షరాస్యులు ముస్లింలలో 42.7 శాతంగా ఉండగా.. హిందువుల్లో 36.40 శాతం మంది ఉన్నారు.

ముస్లింల వద్ద వ్యవసాయ భూములు తక్కువగా ఉండటం వల్లే వారు తయారీ రంగంలో ఉద్యోగాలను ఎంచుకుంటున్నారని నిపుణులు చెబుతున్నారు. 2005లో ఏర్పాటు చేసిన సచార్ కమిటీ ఇచ్చిన నివేదికలోనూ ఈ అంశం ఉందని వివరించారు.

2001 నుంచి 2011 మధ్య ముస్లిం జనాభా ఒక మోస్తరు స్థాయిలో 0.8 శాతం మేర పెరిగి 13.8 కోట్లకు చేరిందని మతాలవారీగా విడుదలైన జనాభాలెక్కల వివరాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో హిందువుల జనాభా 0.7 శాతం మేర తగ్గి, 96.63 కోట్లకు చేరింది. మరోవైపు కులాల వారీ డేటాను ఇంకా వెల్లడి చేయలేదు.

చిలీలోని శాంటియాగోలో ఫిడేల్ క్యాస్ట్రో స్మారకం వద్ద నివాళి అర్పిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఆయన సతీమణి సవిత

ప్రాణాంతకంగా అంటువ్యాధులు

ఈనాడు - హైదరాబాద్

దేశంలో అంటువ్యాధులు నానాటికీ ప్రాణాంతకంగా మారుతున్నాయి. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ముందస్తు జాగ్రత్తలతో నివారించదగిన నీళ్ల విరేచనాలు(డయేరియా) బారిన పడి కూడా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. కుక్కకాటు కారణంగా రేబిస్ ఇన్‌ఫెక్షన్‌కు గురైన వారిలో ఒక్కరు కూడా బతికకపోవడం గమనార్హం. హెచ్ఐవీ/ ఎయిడ్స్ కేసులతో దేశం మొత్తమ్మీద చికిత్స పొందుతున్నవారు 11,81,125 మంది కాగా.. అత్యధికంగా మహారాష్ట్రలో 2,39,014 కేసులున్నాయి. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 1,72,666 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో 73,360 మంది ఈ వ్యాధితో చికిత్స పొందుతున్నారు. సిఫిలిస్ వ్యాధిగ్రస్తులు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉండటం సుఖవ్యాధుల నివారణలో మన వెనుకబాటును తెలియజేస్తోంది. ఇప్పటికీ క్షయ ప్రమాదకరంగా విజృంభిస్తోంది. ఎన్ని రూపాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. క్షయ, హెచ్ఐవీ వంటి వ్యాధులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తాజా గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ఆరోగ్య సంచాలకుల కార్యాలయం నుంచి సేకరించిన వ్యాధుల చిట్టా సమాచారం ఆధారంగా రూపొందించిన నివేదికను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తాజాగా 'జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2018'గా విడుదల చేసింది. తెలుగురాష్ట్రాల్లో పరిస్థితులపై నివేదికలో పలు అంశాలను పొందుపరిచారు.

ఏపీలో వ్యాధులు ఇలా...

- వైరల్ హెపటైటీస్ కారణంగా ఏపీలో అత్యధికంగా 73 మరణాలు సంభవించాయి.
- దేశంలో 93 రేబిస్ కేసులు నమోదు కాగా.. ఏపీలో 5 నమోదయ్యాయి. వీరంతా మృత్యువాత పడ్డారు.
- నిమోనియా బారిన 31,628 మంది పడగా.. వీరిలో 346 మంది చనిపోయారు.
- అత్యధిక వైరల్ మెనింజైటీస్ కేసులు ఏపీలో 1,493 నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా 121 మంది మృత్యువాతపడగా.. ఏపీలో 33 మంది చనిపోయారు.
- ఏపీలో ప్రతి 10వేల మందిలో 0.66 శాతం కుష్ఠు కేసులున్నట్లుగా గుర్తించారు.
- మెదడువాపు కేసులు 638 నమోదుకాగా.. 44 మంది చనిపోయారు.
- స్వైన్‌ఫ్లూ బారినపడిన వారి సంఖ్య 476 కాగా 14 మంది మరణించారు.
- రాష్ట్రంలో మలేరియా కేసుల సంఖ్య గత మూడేళ్లలో గణనీయంగా తగ్గింది. 2015లో 25,042 నమోదుకాగా.. 2016లో 23,613, 2017లో 16,913 కేసులు నమోదయ్యాయి.
- డెంగీ కేసులు మాత్రం పెరిగాయి. 2015లో 3,159 నమోదుకాగా.. 2016లో 3,417, 2017లో 4,844 చొప్పున గుర్తించారు.
- నీళ్లవిరేచనాలతో మృతుల సంఖ్య కూడా ఏపీలో ఎక్కువగానే ఉంది. గతేడాది 11,63,707 డయేరియా కేసులు నమోదు కాగా.. 50 మంది మృతిచెందారు. ఇందులో పురుషులు 31 మంది.

2017లో అంటువ్యాధుల వల్ల సంభవించిన మరణాలు (శాతాల్లో)



- రాష్ట్రంలో టైఫాయిడ్ కేసులు 1,59,809 నమోదు కాగా.. 17 మంది చనిపోయారు.
- అత్యవసర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు 30,45,868 నమోదుకాగా.. 324 మంది మృతిచెందారు.
- గతేడాది 67,074 క్షయ కేసులు (ఇందులో ప్రైవేటులో 16,044) నమోదయ్యాయి.
- దేశంలో అత్యధికంగా ఏపీలో సిఫిలిస్ కేసులు 5,155 నమోదయ్యాయి.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

- సిగ్నల్ మార్చి తాడిపత్రి-గుత్తి మధ్య రైలు ఆపిన దుండగులు
- రాళ్లతో దాడిచేసి ఆభరణాలు, నగదు అపహరణ

హైదరాబాద్, పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: కాచిగూడ-చిత్తూరు మధ్య నడిచే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరిగింది. సిగ్నల్ మార్చి రైలు ఆగేలా చేసిన ఆగంతకులు..రాళ్ల దాడితో ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తూ మహిళల నుంచి బంగారు ఆభరణాలు..నగదు దోచుకున్నారు. ఈ మేరకు శుక్రవారం బాధితులు కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ విజయ్‌లాల్ కథనం ప్రకారం.. 'రైలు గురువారం సాయంత్రం చిత్తూరు నుంచి బయలుదేరింది. ఆగంతకులు సిగ్నల్ మార్చడంతో(టాంపరింగ్) అర్ధరాత్రి తాడిపత్రి-గుత్తి మధ్య జూటూరు స్టేషన్‌లో రైలు నిలిచిపోయింది. అనంతరం ఆగంతకులు బోగీలపై రాళ్ల వర్షం కురిపించారు. తర్వాత కొందరు రైలు సమీపంలో వంగగా..వాళ్ల వీపుపై నిలబడిన ఆగంతకుడు కిటికీ సమీపంలో కూర్చున్న మహిళల మెడలోని ఆభరణాలు, నగదు సంచులు లాక్కున్నారు. ఎస్-10 బోగీలో ఉన్న నగరంలోని బేగంబజార్‌కు చెందిన రేష్మ (24) మెడలోని 11 తులాల నల్లపూసల గొలుసు, ఎస్-11 బోగీలోని నాందేడ్ వాసి మయూరి (60) తులం మంగళ సూత్రం, అదే బోగీలోని రైల్వేకోడూరుకు చెందిన ఫాతిమా(55) నుంచి రూ.10 వేల నగదు, ఏటీఎం కార్డు ఉన్న పర్సు లాక్కుని ఉడాయించారు. దోపిడీలో 15 మంది వరకు పాల్గొన్నట్లు గుర్తించాం. కాచిగూడలో కేసు నమోదు చేసి గుత్తికి బదిలీ చేశాం.' అని సీఐ తెలిపారు.

నాలుగేళ్లలో ఏం చేశారో చెప్పే ధైర్యం ఉందా?

ముఖ్యమంత్రికి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా సవాల్

విజయనగరం కంటోన్మెంట్ న్యూస్‌టుడే: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు సంబంధించి ఈ నాలుగేళ్లలో ఏం అమలు చేశారో.. వచ్చే ఏడాదిలో ఏం చేయబోతున్నారో చెప్పే ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉందా అంటూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ సవాలు విసిరారు. శుక్రవారం విజయనగరంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను కేంద్ర ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసిందని, అయినా సంతృప్తి చెందకుండా ఇంకా ఎక్కువే చేస్తుందని కన్నా చెప్పారు. ఎంపీ హరిబాబు నాయకత్వంలో విశాఖకు రైల్వే జోన్ తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామని ఆయన ప్రకటించారు. కడప ఉక్కు పరిశ్రమ విషయంలో ప్రస్తుతం పెద్ద డ్రామా నడుస్తోందన్నారు. అందులో భాగంగానే ఎంపీ సీఎం రమేశ్‌తో తెదేపా దీక్ష చేయిస్తుందని విమర్శించారు. రాష్ట్రానికి ఇస్తున్న ప్రతి పైసా కేంద్రానిదేనని, పేరు మాత్రం చంద్రబాబుదని ఆయన ఎద్దేవా చేశారు.

సనాతన ధార్మిక విజ్ఞాన పరీక్ష ఫలితాలు విడుదల

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మార్చిలో తెలుగు రాష్ట్రాలు, చెన్నైలోని తెలుగు విద్యార్థులకు నిర్వహించిన 35వ సనాతన ధార్మిక విజ్ఞాన పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. 47,950 మంది పరీక్షలకు హాజరుకాగా 81శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ధర్మపరిచయంపై పరీక్ష నిర్వహించామని తిరుపతి జేఈవో భాస్కర్ తెలిపారు.

దిల్లీ శ్రీవారి ఆలయంలో 'ఇస్కాన్' కీర్తనలు

ఈనాడు, దిల్లీ: దిల్లీలోని గోల్‌మార్కెట్ శ్రీవారి ఆలయంలో 'యాన్ ఈవెనింగ్ ఆఫ్ బ్లెస్సింగ్స్ ఫ్రం బాలాజీ' పేరుతో ఇస్కాన్ ఈ నెల 24న ఓ కార్యక్రమం నిర్వహించనుంది. సాయంత్రం ఆరింటికి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఇస్కాన్ విదేశీ భక్తులు శ్రీవారిపై కీర్తనలు ఆలపించనున్నారు. తిరుమల శ్రీవారి విశేషాలు, శ్రీకృష్ణుడిపై ప్రసంగాలు ఉంటాయని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమాల ఏర్పాట్లపై శుక్రవారం ఇస్కాన్ ప్రతినిధులు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్‌తో చర్చించారు.

అరకులో క్రీడా పాఠశాల

- 16 ప్రభుత్వ ఐటీఐల్లో వసతి గృహాలు
- పక్కాగా ఎస్సీ ఎస్టీ ఉపప్రణాళిక నిధుల వ్యయం
- మంత్రి ఆనంద్‌బాబు వెల్లడి

ఈనాడు, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ ఎస్టీ ఉపప్రణాళిక నిధుల వ్యయానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఉపప్రణాళిక 20వ నోడల్ ఏజెన్సీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో దళితులకు కేటాయించిన నిధుల్లో 97%, గిరిజనుల అభివృద్ధి నిధుల్లో 95% ఖర్చుపెట్టడం చరిత్రాత్మకమని వివరించారు. 2018-19లో ఎస్సీ ఉపప్రణాళికకు రూ.11,228.11 కోట్లు, ఎస్టీ ఉపప్రణాళికకు రూ.4,176.60 కోట్లు కేటాయించగా.. ఈ నిధుల వ్యయానికి నోడల్ ఏజెన్సీ సమావేశంలో ఆమోదం పొందిన పనుల వివరాలను మంత్రి వెల్లడించారు.

ఎస్సీ ఆవాసాల్లో: ■ రూ.55.73 కోట్లతో 3,220 రహదారుల నిర్మాణం
- రూ.241.86 కోట్లతో తాగునీటి సదుపాయం
- 70 కంటే ఎక్కువ మంది ఎస్సీ విద్యార్థులు ఉన్న 16 ప్రభుత్వ ఐటీఐల్లో వసతి గృహాల నిర్మాణం
- కర్నూలు, కాకినాడ, నెల్లూరు, తెనాలి, కావలి, జగ్గయ్యపేట, అద్దంకి, విశాఖపట్నం, వినుకొండలో రూ.194.34 కోట్లతో 481 అభివృద్ధి పనులు

గిరిజనులకు: ■ రూ.171.90 కోట్లతో తూర్పుగోదావరి జిల్లాలోని 4 విలీన మండలాల్లో గిరిజనుల కోసం 51 ఎత్తిపోతల పథకాలు. రూ.97.66 కోట్లతో శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రధాన కాలువపై ఎత్తిపోతల పథకం
- 11.36 కోట్లతో రంపచోడవరంలో రెసిడెన్షియల్ ఐటీఐ
- రూ.140 కోట్లతో రాష్ట్రంలోని 6 సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల ప్రధాన కేంద్రాల్లో, 8 జిల్లా కేంద్రాల్లో బహుళ ఉపయోగ ఇండోర్ స్టేడియాల నిర్మాణం. అరకులో క్రీడా పాఠశాల నిర్మాణం
- రూ.276.92 కోట్లతో 1398 గిరిజన గ్రామాలకు 2,800 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం

అన్ని జిల్లాల్లో రియల్‌టైం గవర్నెన్స్ కేంద్రాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాజధానిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రియల్‌టైం గవర్నెన్స్(ఆర్టీజీ) కేంద్రాలను ఏర్పాటుచేసి సత్వర సేవలను విస్తృతం చేయనున్నట్లు రాష్ట్ర అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు తెలిపారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అడ్రియన్ ఫౌజ్జార్డ్, తనూజ్ మాథుర్ తదితరులు శుక్రవారం అమరావతిలోని ఆర్టీజీ కేంద్రాన్ని పరిశీలించారు. దేశంలో రియల్‌టైం గవర్నెన్స్ అమలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. వరదలు, పిడుగుల సమాచారంపై ప్రజలను అప్రమత్తం చేయడంలో ఆర్టీజీ పాత్రను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి విస్తృత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్న తీరును దృశ్యరూపంలో చూపించారు. రాష్ట్రంలో నాలుగు వేల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వర్చువల్ తరగతుల నిర్వహణ, నాలుగు నుంచి ఐదు వేల ఇళ్లలో నిర్వహిస్తున్న లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ తీరును తెలుసుకుని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ప్రశంసించారు. సమావేశంలో ఆర్టీజీ సీఈవో బాబు, డైరెక్టర్లు బాలాజీ ఆదివిష్ణు, అనంతకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ డిప్లొమా దరఖాస్తులకు 27 వరకు గడువు

గుంటూరు, న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 27 వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ డి.భాస్కరరావు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆస్తుల జప్తు ఉత్తర్వులు ఉపసంహరణ

ఈనాడు, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని వెంకట్రాయ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ఆస్తులను జప్తు చేస్తూ 2011లో జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉపసంహరించుకుంది. ఆ ఆస్తుల జప్తు చేయడానికి కారణమైన కేసులు న్యాయస్థానాల్లో వీగిపోయినందున.. తన ఆస్తులను జప్తు నుంచి విడుదల చేయాలని కోరుతూ ఆయన ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. తీర్పు ప్రతులనూ వినతిపత్రంతో జత చేశారు. వాటిని పరిశీలించిన అనంతరం గతంలో జారీ చేసిన జప్తు ఉత్తర్వులను ఉపసంహరించుకుంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏ.ఆర్.అనూరాధ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 24-6-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 315

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-00 పేజీలు 16+24+32 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

'నెట్టి'ంట లైఫై!

- వైఫై కన్నా వేగంగా పనిచేసే పరిజ్ఞానం
- విద్యుత్ కాంతి సాయంతో పనిచేస్తుంది

ఇంటర్నెట్ లేని జీవితాన్ని ఊహించుకోలేని రోజులివి. అలాంటి ఇంటర్నెట్‌తో అనుసంధానం విషయంలో వైఫై తెచ్చిన విప్లవం అంతా ఇంతా కాదు. వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ.. వైఫై అనుసంధానంలోనూ అనేక లోపాలున్నాయి. అందుకే ఇప్పుడు దీని స్థానంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం రాబోతోంది. దానిపేరు 'లైఫై'. విద్యుత్ కాంతి ఆధారంగా ఇది వినియోగదారుల్ని ఇంటర్నెట్‌తో అనుసంధానం చేస్తుంది. రేడియో తరంగాలపై ఆధారపడే వైఫై కన్నా ఇది ఎన్నో రెట్లు ఎక్కువ ప్రయోజనకరం.

14లో

బుల్లి కంప్యూటర్

- క్యాన్సర్ చికిత్సలో ఎంతో ఉపయోగం

బియ్యం గింజ పక్కన ఉన్నదే బుల్లి కంప్యూటర్

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత బుల్లి కంప్యూటర్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. దీని పరిమాణం 0.3 మిల్లీమీటర్లు. 'మిషిగన్ మైక్రోమోట్'గా పిలుస్తున్న ఈ బుల్లికంప్యూటర్ క్యాన్సర్ వ్యాధి పర్యవేక్షణ, చికిత్సలో తోడ్పడే వీలుంది. కనీస అవసరాలు తీర్చగలిగే బుల్లి కంప్యూటరే లక్ష్యంగా దీన్ని అభివృద్ధి చేసినట్లు అమెరికాలోని మిషిగన్ వర్సిటీ అధ్యాపకుడు డేవిడ్ బ్లావ్ తెలిపారు. దీనిలో ర్యామ్, ఫోటోవోల్టాయిక్ ఘటాలు, వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్లు, రిసీవర్లు, ప్రాసెసర్లు ఉన్నాయి. ఉష్ణోగ్రతల్లోని 0.1 డిగ్రీల సెల్సియస్ లాంటి స్వల్పతేడానూ ఇది గుర్తించగలదు.

సాయం అంతంతే

నాలుగేళ్లుగా చాలా హామీల్ని అమలు చేయలేదు

- ప్రత్యేక హోదాను విస్మరించారు
- కాల పరిమితితో అమలుకు కేంద్రాన్ని ఆదేశించండి
- సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్
- పోలవరంతో భద్రాద్రి ఆలయానికి ముప్పు లేదని వెల్లడి

ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి నాలుగేళ్లయినా.. విభజన హామీల్లో చాలా వాటిని కేంద్రం ఇప్పటికీ నెరవేర్చలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని విస్మరించిందని నివేదించింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నింటినీ నిర్దిష్ట కాలపరిమితిలోగా నెరవేర్చాలంటూ కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఈ నాలుగేళ్లలో కేంద్రం సాయం అంతంత మాత్రమేనని కోర్టుకు తెలిపింది. విభజన చట్టం అమలులో జాప్యంపై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలుచేసింది. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా రూ.57,948.86 కోట్లపై కేంద్రం ఇంకా స్పందించలేదని, ప్రత్యేక రైల్వే జోన్ అంశాన్ని పక్కనబెట్టిందని కోర్టుకు నివేదించింది. ఉమ్మడి సంస్థల విభజన, విద్యాసంస్థల ఏర్పాటు, అమరావతిలో హైకోర్టు నిర్మాణం... తదితర అంశాల్ని ప్రస్తావించింది. విభజన చట్టంలోని ప్రధాన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదంటూ ఆ హామీలన్నింటినీ సుదీర్ఘ అఫిడవిట్‌లో ఏపీ ప్రభుత్వం ప్రస్తావించింది. వెనకబడిన జిల్లాలకు రూ. 24350 కోట్లు ప్యాకేజీ కోరగా రూ.1050 కోట్లు ఇచ్చారని, అమరావతి నిర్మాణానికి రూ.11,602 కోట్లతో డీపీఆర్ పంపగా.. రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చారని కోర్టు దృష్టికి తెచ్చింది. ఏపీ, తెలంగాణ మధ్య సమస్యలపైనా కేంద్రం నుంచి స్పందన లేదని తెలిపింది.

కౌంటర్ అఫిడవిట్‌లోని పూర్తి వివరాలు.. 11లో

విహారంలో విషాదం

- పవిత్ర సంగమంలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు
- గాలింపునకు వరద ఉద్ధృతి అడ్డంకి

2లో

అధికారులొస్తున్నా.. అడగలేమాయె

- గ్రామ సభలపై పెదవి విరుస్తున్న ప్రజానీకం
- నిషిద్ధ, చుక్కల భూములకే పరిమితం చేసిన ఫలితమిది
- ఈ రెండు అంశాలకూ స్పందన నామమాత్రం

16లో

ఇసుక ప్రక్షాళన!

వారంలో జరగాల్సిందే

- ఆ తర్వాత ఆకస్మిక తనిఖీలు
- తేడావస్తే కఠిన చర్యలు
- అక్రమ రవాణా లేదని 75 శాతం మంది చెప్పారు
- ముఖ్యమంత్రి వెల్లడి



ఈనాడు – అమరావతి

'ఇసుక రీచ్‌లలో ఎక్కడైనా తప్పులు జరుగుతుంటే వారం రోజుల్లోగా ప్రక్షాళన చేయాలి. ఆ తర్వాత నేనే స్వయంగా ఆకస్మిక, వర్చువల్ తనిఖీలు నిర్వహిస్తా. తేడా వస్తే కఠిన చర్యలు తప్పవు' అని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపట్ల 82 శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ కొంతమంది విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి వాటికి తావులేకుండా చూడాలని ఆదేశించారు. ఎవరైనా అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపిస్తే ఎక్కడ జరుగుతుందో చూపించాలని సవాల్ విసిరేలా (మిగతా 2లో)

15 రోజులకో జిల్లా పర్యటన

- అక్కడే రెండ్రోజులు మకాం: సీఎం

2లో

ఆసుపత్రి బిల్లు.. గుండె గుబేలు!

- తెలంగాణ కంటే ఆంధ్రలో వైద్య ఖర్చు ఎక్కువ
- తలసరి ఖర్చు తెలంగాణలో అధికం
- దిల్లీలో అతితక్కువ
- దేశంలో 34 శాతం మందికి ఆరోగ్యబీమా
- బడ్జెట్ కేటాయింపుల్లో తక్కువ ప్రాధాన్యం
- కేంద్ర, రాష్ట్రాల వాటా 31: 69 శాతం
- మనకంటే పొరుగుదేశాలే నయం
- జాతీయ ఆరోగ్య ముఖచిత్రం-2018లో వెల్లడి

16లో

పీఈటీ పోస్టులకు భౌతిక సామర్థ్య పరీక్షలు!

- డీఎస్సీలో తొలిసారిగా నిర్వహణ
- 30 మార్కులు కేటాయింపు
- పాఠ్యాంశాలు ఖరారు చేసిన విద్యాశాఖ

3లో

'డి' కొట్టండి!

- కశ్మీర్‌లో భద్రతా దళాలకు కేంద్రం ఆదేశం
- తెరపైకి కొత్త '4డి' వ్యూహం

14లో

'నల్ల'తాచై కాటేసింది

- అత్తింటివారిపై పగతో భోజనంలో విషం కలిపిన మహిళ
- మహారాష్ట్రలో ఐదుగురి బలి
- 80 మందికి పైగా అస్వస్థత

14లో

గ్రామాలు ఆత్మ.. నగరాలు శక్తి

- అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్
- ఎన్డీయే పథకాలతో నవ భారతానికి పునాదులు
- ప్రధాని మోదీ

14లో

S.I / కానిస్టేబుల్స్
R.S. అగర్వాల్ అర్థమెటిక్ & రీజనింగ్ Bit to Bit By పుష్పాల శివాజి 25-06-18
శివాజి SICE ఇనిస్టిట్యూట్, గుంటూరు 93463 64702

పూర్ణ హిందీ DSC
9949293730, 9550401012
కొత్త బ్యాచ్: 25-6-18 పక్కలు, మెటీరియల్

కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT, TPT, SA-ALL సబ్జెక్ట్స్
8106268482, 9885272474

S.I / కానిస్టేబుల్స్
RPF, గ్రూప్ IV, VRO
Fee: 5000/- 25-06-18
శివాజి SICE ఇనిస్టిట్యూట్, గుంటూరు 93463 64702

DSC-SGT-SA (ALL)
S.A. తెలుగు స్పెషల్ ఫ్యా. కె.జ్యోతిబసు
S.A. English
S.A. Maths, Social, Bio, Phy, Hindi
స్ఫూర్తి అకాడమీ 4/1, బ్రాడీపేట, గుంటూరు 86390 24439

AP-DSC
SGT, SA (All Sub), TPT, PET, HPT
FREE DEMO : 24-6-2018 at 10.08 am
RAMA COMPETITIVE COACHING CENTRE
Dilsukhnagar: 9246208422, 040-66778422
HYDERABAD Cell : 8885555202

SI & కానిస్టేబుల్స్ VRO/Gr-IV/RPF
New Batches 25-6-18
భాగ్యకిరణ్ ఇన్‌స్టిట్యూట్ DSNR 9603290758

2017 - SI & కానిస్టేబుల్స్
SI & కానిస్టేబుల్స్ 18వ బ్యాచ్ 27-6-18, 10am
Seperate Batches for TM & EM
శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ 0884 - 2362744 98482 56254 98481 36254

SI కానిస్టేబుల్స్ RPF RRB
టాలెంట్ టెస్ట్: నేడు ఉ. 10 గంటలకు
STAR బ్రహ్మాస్ 8019013199 9032686069

2018-TET
DSC SGT, SA (ALL) TPT, HPT
ప్రతిభ బందరురోడ్ 93 92 91 75 84

RPF (కానిస్టేబుల్స్) అర్హత : 10th
RPF (SI) అర్హత : డిగ్రీ
వయస్సు : 18-30 / ఉద్యోగాలు : 9,500
కాపు విద్యార్థులకు ఉచిత కోచింగ్
హార్వెస్ట్ 9160419854 9030450459

స్ఫూర్తి DSC
SGT, SA, తెలుగు ఎంటెక్, బిగ్ బ్యాచ్ : 24-6-18
Exam Batch
SGT - Tri Method
94400 09134, 89850 05173

స్కాలర్స్ RRB గుంటూరు
Every Week New Batch RPF
& Upcoming Notification T.C.
Batch Starts on 25-06-2018
ALP / Technician, GROUP-D
Online Exams
90003 36584

IAS/IPS
క్రిష్ణప్రదీప్, డా॥ గణేష్, ఆకెళ్ల రాఘవేంద్ర, పాషా, డా. శ్రీధర్ వంటి జాతీయ స్థాయి ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో
రెండవ బ్యాచ్ ప్రారంభం తేదీ: 15-7-2018 నుండి
Krishna Pradeep's 21st Century IAS
Opp.Sub Registrar Office, Ashok Nagar, Hyd.
Ph: 8686233879, 040 - 66787733
Opp. Chutnies Restaurant, KPHB. Ph: 9502318332

HYD ఫ్యాకల్టీ గడవర్తి వెంకటేశ్వర్లుచే ఏకానమీ
IAS గ్రూప్-1&2 DSC SA సోషల్
IBPS POs RPF SI కానిస్టేబుల్స్
కలామ్ IAS 86391 55740

TET 137,134 మార్కులు
DSC: SGT/SA's (ALL)
V.రాజులు 98667 15363 83416 29208

S.I. కానిస్టేబుల్
HIP హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్
Hyd. 9848262600, 9849771902

DSC TPT SGT Eng. Sch. Asst. (All)
బ్యాచ్ ప్రారంభమైనది
STAR బ్రహ్మాస్ కాకినాడ 8019013199 9032686069

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P: VIJAYAWADA-8.
NOTIFICATION
Separate Online Applications are invited from Indian Citizens and Others, who have secured cut off scores and above in NEET-2018 for admission into Management Quota (Category B & C) seats in MBBS/BDS Courses in Private Un-aided Non-Minority, Minority Medical and Dental Colleges and NRI Quota Seats in Sri Padmavathi Medical College for Women in the State of Andhra Pradesh for the academic year 2018-19 from 9.00 AM on 24.06.2018 upto 9.00 PM on 30.06.2018 on https://appvtmedadm.apntruhs.in/.
For details read the prospectus available on the University website: http://ntruhs.ap.nic.in. Candidates are advised to watch the University website regularly for further Notifications and Instructions
Vijayawada, Date 23.06.2018 Sd/- REGISTRAR

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com
13 సం॥ అనుభవం కలిగిన
50/50 విద్యార్థులకు UPSC/కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ Assistance
Degree + IAS (50 students) 3yrs Integrated Program
After Degree - Morning Batch (1 year)
During Degree - Evening Batch (2 years)
Civil Services IAS Exam
on June 24th SUN. 10 am & 5 pm
Hostel facility
Beside Nagarjuna Hospital, Kanuru, VIJAYAWADA. Ph: 6300181832

అలవిగాని హామీలివ్వడంలో అర్థం లేదు

- అలాంటి వారు అధికారంలోకొస్తే అస్తవ్యస్తమే
- ప్రభుత్వ ప్రగతి గురించి గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలి
- అంగన్‌వాడీ టీచర్లకు సీఎం సూచన

ఈనాడు డిజిటల్ - అమరావతి

అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆచరణ సాధ్యంకాని హామీలు గుప్పించడంలో అర్థం లేదని, అలాంటి వారు అధికారంలోకొస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చంద్రన్న ఉంటేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని గ్రామాల్లో చాటాలని అంగన్‌వాడీ టీచర్లను కోరారు. ఉండవల్లిలోని ప్రజా దర్బారు హాలులో గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు శనివారం ముఖ్యమంత్రిని కలిశారు. తమ జీతాలు పెంచినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఒక పార్టీ వరుస ఎన్నికల్లో గెలిచి అధికారంలో ఉంటేనే అభివృద్ధి జరిగేందుకు వీలు పడుతుంది. ఇప్పటికే ప్రభుత్వంపై ప్రజల్లో 75శాతం ఉన్న సంతృప్తి 90 శాతానికి పెంచాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రం సాధిస్తున్న ప్రగతికి మీరంతా అండగా ఉంటే ప్రతిపక్షమనేదే ఉండదు. వచ్చే ఎన్నికల్లో అన్ని లోక్‌సభ సీట్లూ మనమే గెలిస్తే ప్రధానిని మనమే నిర్ణయించవచ్చు. అప్పుడు రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, రైల్వే జోన్ తదితర హామీలను సాధించుకోవచ్చు' అని వివరించారు. క్షేత్ర స్థాయిలో జరిగిన అభివృద్ధి, సాధించిన విజయాలను పిల్లల తల్లిదండ్రులు, గ్రామీణులకు వివరించి చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పరిటాల సునీత, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు, మహిళా నేత రాణి తదితరులు పాల్గొన్నారు.

30నాటికి నెల్లూరుకు దళిత చైతన్య రథాలు

నెల్లూరులో నిర్వహించే దళిత తేజం మహాసభ కోసం దళిత చైతన్య రథాలు ప్రతి జిల్లా నుంచి బయల్దేరి 30వ తేదీ నాటికి నెల్లూరుకు చేరుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 30న నెల్లూరు వేదికగా జరిగే దళిత తేజం ర్యాలీ, మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27 నుంచి బయల్దేరే రథాల్లో ప్రతి గ్రామం నుంచి 10 మంది దళితులు తరలిరావాలని కోరారు. కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, దామోదరం సంజీవయ్య, బాలయోగి, ఎస్ ఆర్ శంకరన్, ఫాదర్ ఫెరార్ తదితర దళిత ప్రముఖుల పేర్లతో చైతన్య రథాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నెల్లూరు దళిత తేజం సభపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, దళిత నేతలు, ఎస్సీ విభాగం నాయకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'దళితుల సంక్షేమానికి నాలుగేళ్లలో రూ.40వేల కోట్ల బడ్జెట్ కేటాయించాం. ఏటా 90 శాతానికిపైగా నిధులు ఖర్చు పెడుతున్నాం. దళిత విద్యార్థుల విదేశీ విద్య కోసం రూ.15 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టాన్ని బలహీనపర్చవద్దని కేంద్రాన్ని కోరాం. అవసరమైతే సుప్రీం కోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేయడానికీ సిద్ధంగా ఉన్నాం' అని ముఖ్యమంత్రి వివరించారు.

లక్షన్నర మందికి విత్తనోత్పత్తిలో శిక్షణ: సీఎం

ఈనాడు, అమరావతి: కర్నూలు మెగా సీడ్ పార్కు ద్వారా లక్షన్నర మందికి విత్తనోత్పత్తిలో శిక్షణ ఇవ్వాలని అమెరికాకు చెందిన అయోవా రాష్ట్ర విశ్వవిద్యాలయ ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. శనివారం సచివాలయంలో ఆయనను కలిసిన ప్రతినిధులు సీడ్ పార్కు సమగ్ర ప్రాజెక్టు నివేదికను అందించారు. నివేదికకు వారం గడువిస్తే 24 గంటల్లోనే అందించడంపై వారిని సీఎం అభినందించారు. అంతర్జాతీయ విత్తన పరీక్షా కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. దేశంలో ఇలాంటి పరీక్షా కేంద్రం ఇప్పటి దాకా తమిళనాడు తప్ప మరెక్కడా ప్రభుత్వ రంగంలో లేదని గుర్తు చేశారు. మెక్సికోలోని అంతర్జాతీయ మొక్కజొన్న పరిశోధనా సంస్థ (సిమ్మెట్) తన కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయనుండటం సంతోషకరమని చెప్పారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై కార్యశాల

ఈనాడు, అమరావతి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా వెయ్యి మందితో సాగరతీరంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అనంతరం ఇదే అంశంపై కార్యశాల ఉంటుందన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్.జవహర్, సీఐడీ విభాగాధిపతి సీహెచ్ ద్వారకాతిరుమలరావులు ఈ కార్యశాలను ప్రారంభిస్తారని వెల్లడించారు.

నేటి నుంచి వైద్యవిద్య బీ, సీ కేటగిరీ సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్, దంతవైద్య విద్యలో యాజమాన్య కోటా(బీ, సీ) సీట్ల భర్తీకి నీట్‌లో అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆదివారం నుంచి ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం స్వీకరించనుంది. ఆన్‌లైన్ ద్వారా వీటిని పంపాలి. ఈ నెల 30 వరకు స్వీకరిస్తారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయి.

15 రోజులకో జిల్లా పర్యటన

- గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను కలుస్తా: సీఎం

ఈనాడు, అమరావతి: 'పక్షం రోజులకో జిల్లాకు వస్తా. రెండ్రోజులు అక్కడే ఉండి ఒక రోజు గ్రామాల్లో పర్యటించి ప్రజలను కలుస్తా. రెండో రోజు పార్టీ శ్రేణులతో సమావేశమవుతా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ నేతలకు వెల్లడించారు. వచ్చే నెల నుంచి 2. 3 నెలల పాటు గ్రామదర్శిని పేరుతో నియోజకవర్గంలోని ప్రతి ఇంటినీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల బాధ్యులు సందర్శించాలని, ఆ ఇంట్లో వారితో మాట్లాడాలని సూచించారు. శనివారం ఉండవల్లిలోని ప్రజాదర్బార్ హాలులో ఆయన కర్నూలు జిల్లా తెదేపా నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులతో సమావేశమయ్యారు. తర్వాత ఒక్కొక్కరితో ముఖాముఖి నిర్వహించారు.

'ఎప్పుడు ఎన్నికలొచ్చినా సిద్ధంగా ఉండాలి. ఇప్పటికైతే చాలా ముందంజలో ఉన్నాం. నాయకుడి సమర్థత, చొరవను బట్టే ప్రజలు ఓట్లు వేస్తారు. అందువల్లే నాయకులు బాధ్యత తీసుకుని వ్యక్తిగతంగా ఎదగడంతోపాటు పార్టీకి పేరు తేవాలి. 40 ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ నాలుగేళ్లలో చేశాం. వాటిపై రాజకీయ బాధ్యత తీసుకోవాలి. అలా తీసుకున్న చోట విజయం సాధించాం. తీసుకోకపోతేనే సమస్యలొస్తాయి. గడచిన నాలుగేళ్లలో అంగన్‌వాడీలకు, వీఆర్‌ఏలకు, హోంగార్డులకు వేతనాలను పెంచాం. వారంతా మనతోనే ఉంటామని చెబుతున్నారు. వీరిలో ఒకవర్గం గతంలో కాంగ్రెస్‌తో ఉండేది. ఇప్పుడదే వర్గం మీతోనే ఉంటామని నాకే చెప్పారు. ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్దకు ఓటర్లను తీసుకురావడం, సహాయపడటంలో ఈ మూడు వర్గాలే కీలకం. అయితే వీరిని మనతో కలుపుకొని పోవడంలో మీరు ఎంత సమర్థంగా ఉన్నారనేదే ప్రశ్న. నాయకులుగా గౌరవం కావాలనుకున్నపుడు బాధ్యత తీసుకోవాలి. ఇష్టం వచ్చినట్లు చేస్తామంటే లేనిపోని సమస్యలొస్తాయి. మైనారిటీల ఓట్లూ మనకు వచ్చే పరిస్థితి వచ్చింది. రాయలసీమలో ఎవరూ ఊహించని అభివృద్ధి చేశాం. ఈ పరిణామాలను అనుకూలంగా మలచుకోలేకపోతే ఎలా? మనం చేసిన పనులతో 100శాతం సీట్లు మనకే రావాలి. కానీ మన నాయకత్వం బృందంగా పని చేయకపోవడంలోనే సమస్య ఉంది. మీలో ఇగో సమస్యలతో పార్టీకి ఇబ్బంది తేవొద్దు. పార్టీ కార్యకర్తలు, ప్రజల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు. అధికారం ఉన్నా లేకపోయినా 36 ఏళ్లుగా పార్టీ వెన్నంటే కార్యకర్తలున్నారు. వారిపట్ల ఆ గౌరవ భావాన్ని మనంచూపాలి'అని నాయకులకు కర్తవ్య బోధ చేశారు.

ఎవరికి వారే అన్నట్లుగా ఉన్నారు

పార్టీ పరిస్థితి, క్షేత్ర స్థాయిలో కొన్ని అంశాలను నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. కర్నూలు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యులు ఎవరికివారేనన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్షాల విమర్శలను ఏకతాటిపైకి వచ్చి తిప్పికొట్టడం లేదని, ఏదైనా మాట్లాడితే ఉపముఖ్యమంత్రి కేఈ మినహా మరెవరూ మాట్లాడటం లేదని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పొరుగు సేవల నియామక ఏజెన్సీలు డబ్బులు వసూలు చేస్తున్నాయని, దీంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని పేర్కొన్నారు. నేతలు లేవనెత్తిన అంశాలపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. 'అందరూ కలిసికట్టుగా టీం వర్క్ చేస్తేనే మంచి ఫలితాలొస్తాయి. పొరుగు సేవల ఏజెన్సీలు ఎక్కడైనా డబ్బులు వసూలు చేస్తుంటే మా దృష్టికి తీసుకు రండి. వెంటనే ఆ సంస్థలపై చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.

అందరినీ కలుపుకొని వెళ్లండి

'మీలో మీకు అహంతో (ఇగో) ఒంటెత్తు పోకడలు వద్దు.. సమన్వయంతో కలిసి పని చేయండి' ' అని చంద్రబాబు కర్నూలు నేతలకు స్పష్టం చేశారు. పార్టీలో, జిల్లాలో అందరినీ కలుపుకొని వెళ్లాలని మంత్రి భూమా అఖిలప్రియకు సూచించారు. భూమా అనుయాయుడు ఏవీ సుబ్బారెడ్డితో విభేదాలను పక్కనబెట్టాలని చెప్పారు. ఏవీ సుబ్బారెడ్డికి నామినేటెడ్ పదవి ఇస్తానని, నందికొట్కూరు నియోజకవర్గ పార్టీ బాధ్యుడు శివానందరెడ్డి భవిష్యత్తును తాను చూసుకుంటానని సీఎం భరోసా ఇచ్చారు. కర్నూలు, నంద్యాల లోక్‌సభ పరిధిలోని నాయకులతో వేర్వేరుగా ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఆళ్లగడ్డ నుంచి ఇరిగెల రాంపుల్లారెడ్డిని సమావేశానికి ఆహ్వానించకపోవడం చర్చకొచ్చింది. ఇక మీదట ఆయననూ పిలవాలని, పార్టీలో కలుపుకొని వెళ్లాలని సీఎం సూచించారు. రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్‌లకు నియోజకవర్గాలు లేవని, అందువల్ల కర్నూలు లోక్‌సభ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి వారు పని చేయాలని చెప్పారు. కర్నూలు లోక్‌సభ పరిధిలో ఎంపీ బుట్టా రేణుక, టీజీ వెంకటేష్, కేఈ ప్రభాకర్ తిరగాలని సీఎం చెప్పగా.. ఈ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యులకు ఆ విషయాన్ని చెప్పాలని సీఎంను టీజీ కోరారు. వారికి సహకరించండని ఆయా నియోజకవర్గాల బాధ్యులను సీఎం ఆదేశించారు.

స.హ. కమిషనర్ల నియామకానికి కసరత్తు

జాబితాలో పలువురు సివిల్ సర్వీసుల విశ్రాంత అధికారులు, పాత్రికేయులు

ఈనాడు, అమరావతి: సమాచార కమిషనర్ల ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. వివిధ వర్గాల నుంచి అందిన దరఖాస్తులను తీసుకుని పరిశీలన చేయించడంతోపాటు వడపోత ప్రక్రియ చేపట్టింది. సమాచార కమిషన్‌లో ఒక ప్రధాన సమాచార కమిషనర్, ముగ్గురు కమిషనర్ల పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీ కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. పదవీ విరమణ చేసిన సివిల్ సర్వీసుల అధికారులతోపాటు ఇంజినీర్లు, ఆచార్యులు, జర్నలిస్టుల నుంచి 300 దరఖాస్తులొచ్చాయి. ఇందులో నుంచి 50 మంది పేర్లను పరిగణనలోకి తీసుకుంది. పోలీసుల ద్వారా విచారణ చేయించింది. వారిలో నలుగురు పాత్రికేయులు ఉన్నారు. ఒకరికి అవకాశం దక్కవచ్చు. సివిల్ సర్వీసుల నుంచి మాజీ అధికారులు ఎంవీ సత్యనారాయణ, బీవీ రమణ కుమార్, జి.సూర్యప్రకాశరావు, నాగన్న, పురుషోత్తమరావు, మల్లికార్జునరావు, వెంకట్రామయ్య పేర్లు పరిశీలిస్తున్నారు. వాణిజ్య పన్నులశాఖలో పనిచేస్తూ త్వరలో పదవీ విరమణ చేయనున్న మరో అధికారి పేరు కూడా జాబితాలో ఉంది.

గ్రహం అనుగ్రహం

24-6-2018 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
ఏకాదశి: ఉ. 5-42 తదుపరి ద్వాదశి
స్వాతి నక్షత్రం: ఉ. 5-39 తదుపరి విశాఖ
అమృత ఘడియలు: రా. 9-23 నుంచి 11-02 వరకు
వర్జ్యం: ఉ. 11-26 నుంచి 1-06 వరకు
దుర్ముహూర్తం: సా. 4-50 నుంచి 5-42 వరకు
రాహుకాలం: మ. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5-31; సూర్యాస్తమయం: సా.6-34
తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేక ప్రారంభం
మతత్రయ ఏకాదశి

ఇసుక ప్రక్షాళన!

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు ఉండాలని సూచించారు. వెలగపూడి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇసుక రీచ్‌ల పర్యవేక్షణ బాధ్యత కలెక్టర్లేదనని స్పష్టం చేశారు. ప్రతి రీచ్‌కు ఒక అధికారిని బాధ్యుడిగా నియమించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇసుక విధానంపై నిర్వహించిన సర్వే వివరాలను ముఖ్యమంత్రి వెల్లడించారు.

- మీ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందా? అంటే కడప జిల్లాలో అత్యధికంగా 32 శాతం మంది అవునని చెప్పారు.
- మీ దగ్గర ఇసుక రీచ్‌లలో నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారా? అంటే విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికంగా 30 శాతం మంది అవునని సమాధానమిచ్చారు.
- ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బాగోలేవని పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా 22 శాతం మంది చెప్పారు.

ఈ ప్రాంతాల్లో సమస్య తీవ్రత అధికం.. 'రాష్ట్రవ్యాప్తంగా 188 ఇసుక రీచ్‌లలో సమాచారం సేకరించాం. అనంతపురం జిల్లా తరిమెల, చిత్తూరు జిల్లా మంచూరు, తూర్పుగోదావరి జిల్లా పసర్లపూడి, గుంటూరు జిల్లా మునుగోడు, చామర్రు, కృష్ణా జిల్లా చల్లపల్లి, కర్నూలు జిల్లా శతనికోట, ప్రకాశం జిల్లా దర్శనిపాడు, శ్రీకాకుళం జిల్లా బత్తిలి, బత్తేరు, విశాఖపట్నం జిల్లా మహాసాహెబ్‌పేట, విజయనగరం జిల్లా ఎం.గుమడం-2, పశ్చిమగోదావరి జిల్లా పోలవరం, కడప జిల్లా సున్నపురాళ్లపల్లిలో సమస్య అధికంగా ఉంది. ఈ వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపించాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

ప్రశ్న	సర్వేలో పాల్గొన్నవారు	అవునన్నవారు	లేదన్నవారు
మీ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందా?	9,067	2,263 (25%)	6,804 (75%)
రాజకీయ నాయకులు ఇసుక రీచులను తమ ఆధీనంలో పెట్టుకున్నారని భావిస్తున్నారా?	7,574	1,438 (19%)	6,136 (81%)
మీ దగ్గరున్న ఇసుక రీచుల్లో నిర్ణీత ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నారా?	6,838	1,606 (23%)	5,232 (77%)
ఇసుక రవాణాకు తమ వాహనాలనే వాడాలని ఎవరైనా ఒత్తిడి తెస్తున్నారా?	6,666	531 (8%)	6,135 (92%)
ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయా?	6,307	5,167 (82%)	1,140 (18%)
రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై మీరు సంతృప్తికరంగా ఉన్నారా?	6,849	5,530 (81%)	1319 (19%)

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
సూర్యాపేట	39.0	25.0
తిరుపతి	38.8	29.1
నెల్లూరు	38.0	29.0
మెదక్	37.5	20.5
కడప	37.0	26.0
ఒంగోలు	36.9	29.2
శ్రీకాకుళం	36.0	29.0
రాజమహేంద్రవరం	36.0	27.0
ఖమ్మం	36.0	27.0
తాడేపల్లిగూడెం	36.0	26.0
విశాఖపట్నం	35.2	27.0
విజయవాడ	35.1	25.0
గుంటూరు	34.5	28.2
అనంతపురం	34.3	24.6
కర్నూలు	32.8	26.8
హైదరాబాద్	31.2	22.7
నరసాపురం	30.6	26.6

విహారంలో విషాదం

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం: విహారయాత్ర కోసం వచ్చిన నలుగురు ఇంజినీరింగు విద్యార్థులు ప్రమాదవశాత్తు కృష్ణా నదిలో గల్లంతయ్యారు. ఈ విషాదం కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పవిత్రసంగమం వద్ద శనివారం మధ్యాహ్నం జరిగింది. గోదావరి కృష్ణా నదుల సంగమ ప్రాంతాన్ని దర్శించాలని వచ్చిన విద్యార్థుల పట్ల విధి వక్రీకరించింది. సహచర విద్యార్థులు, పర్యాటకులు వద్దని వారిస్తున్నప్పటికి ఇద్దరు విద్యార్థులు నదిలో దిగారు.

వారిని కాపాడేందుకు మిగిలిన ఇద్దరూ దూకి గల్లంతయ్యారు. నదిలో శనివారం రాత్రి వరకు గాలించినప్పటికీ విద్యార్థుల ఆచూకీ లభించలేదు. చీకటిపడటంతో గాలింపును తాత్కాలికంగా నిలిపివేశారు. గాలింపునకు వరద ప్రభావం ప్రధాన అడ్డంకిగా మారుతోంది. కృష్ణా జిల్లా కంచికచర్లలోని మిక్ ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రవీణ్, చైతన్య, శ్రీనాథ్, రాజ్‌కుమార్, సాయిరాంలు శనివారం మధ్యాహ్నం కంచికచర్ల నుంచి నేరుగా ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్దకు చేరుకున్నారు. గోదావరి నుంచి పట్టిసీమ జలాలను తీసుకువచ్చే కాలువ కృష్ణా నది సంగమ ప్రాంతం పవిత్రసంగమం ఘాట్‌ను మధ్యాహ్నం 2.45 ప్రాంతంలో వీక్షించారు. వీరిలో ముందుగా చైతన్య, శ్రీనాథ్‌లు ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన ఇనుప జాలిని దాటి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మిగిలిన సహచరులు, పర్యాటకులు వారించినా వినిపించుకోలేదు. క్షణంలో వారు నీటిలో మునిగిపోతూ కేకలు వేశారు. దీంతో సహ విద్యార్థులు ప్రవీణ్, రాజ్‌కుమార్‌లు నీటిలోకి దూకారు. ఆ సమయంలో పట్టిసీమ నుంచి వచ్చే వరద ఉద్ధృతి ఎక్కువగా ఉంది. దాదాపు 5600 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. చూస్తుండగానే రెప్పపాటులో అందరూ వరదలో మునిగిపోయారు. మరో సహచర విద్యార్థి సాయిరాం గట్టుపై అరుస్తూ కేకలు పెట్టారు. ఎవరూ రక్షించేందుకు సాహసించలేదు. ఆ విద్యార్థి సమీపంలో ఉన్న వాటర్‌స్పోర్ట్స్ సిబ్బంది సాయాన్ని అర్థించాడు. వారు, గజ ఈతగాళ్లు గాలించినా ఆచూకీ దొరకలేదు. వెంటనే సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలు రంగంలోకి దిగాయి. రాత్రి వరకూ గాలించినా ఆచూకీ లభించలేదు. సంయుక్త కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ-2 బాబురావు, అదనపు సంయుక్త కమిషనర్ కాంతిరాణాటాటా గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గల్లంతైన విద్యార్థుల్లో శ్రీనాథ్ తిరువూరుకు చెందినవాడు కాగా, చైతన్య రెడ్డిగూడెం మండలం రంగాపురం, రాజ్‌కుమార్ విజయవాడ నగరం పంజాసెంటర్ కొత్తపేట, కె.ప్రవీణ్ గుంటూరు జిల్లా చౌపాడు వాసులుగా గుర్తించారు. ఈ సంఘటనతో పవిత్రసంగమం వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం కృష్ణా నదికి ఇచ్చే నవహారతిని రద్దు చేశారు. పవిత్రసంగమం వద్ద విద్యార్థుల గల్లంతుపై ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ఇకపై జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకటనలో డిమాండ్ చేశారు.

నాగ కృష్ణచైతన్య

కె.ప్రవీణ్

ఎస్.శ్రీనాథ్

పి.రాజ్‌కుమార్

గల్లంతైన విద్యార్థుల కోసం పవిత్రసంగమం వద్ద గాలిస్తున్న సిబ్బంది

ఇదీ సంగతి!

ముఖ్యమంత్రులు ధర్నాలు చేయటానికి ప్రత్యేక స్థలం కేటాయించాలి సార్. ఎవరు ఎప్పుడు వస్తారో తెలియదు. అపరిష్కృత సమస్యలు బోలెడున్నాయి...

దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఓ వితంతువుకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న వెంకయ్యనాయుడు

వితంతువులపై సమాజం దృష్టికోణం మారాలి

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: వితంతువులపై సమాజం దృష్టికోణం మారాల్సిన అవసరముందని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. వితంతు పునర్వివాహాలకు తగినంత ప్రోత్సాహం లభించడం లేదని, ఈ పరిస్థితి పూర్తిగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచ వితంతు దినోత్సవాన్ని పురస్కరించుకొని లుంబా ఫౌండేషన్ శనివారమిక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఇక్కడ రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. వాటిలో మొదటిది వితంతువులపై మన దృష్టికోణం మారాలి. రెండోది వారి అభ్యున్నతి కోసం కృషిచేయాలి'అని ఆయన అన్నారు. 'నూతన భారత్" లక్ష్యంలో మహిళలకు ఆర్థిక సాధికారత కూడా భాగమని చెప్పారు. వితంతువుల పిల్లలకు విద్యా సదుపాయం కల్పించడంపై కేంద్రం, పౌర సమాజం, ప్రైవేటు రంగం చేతులు కలపాలని ఆయన అభ్యర్థించారు. మరోవైపు వితంతువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.

ఆగస్టులో బీసీల కొత్త రాజకీయ పార్టీ

విజయవాడ, న్యూస్‌టుడే: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లపై అన్ని పార్టీలు స్పష్టమైన ప్రకటన చేయాలని బీసీ రాజకీయ ఐకాస ఛైర్మన్ ఎన్.వెంకటరమణ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఆగస్టులో కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం ఆయన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జనాభాలో అత్యధికశాతం బీసీలు ఉన్నా రెండు, మూడుశాతం ఉన్న వర్గాలే రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్నాయన్నారు.

అదనానికి పట్టేశారు!

- బీటీపీ, పేరూరుకు కృష్ణా జలాలు తరలించే పనులు
- రెండూ అంచనా కంటే అధికానికే గుత్తేదారుల సొంతం
- ప్రభుత్వంపై రూ.41 కోట్ల భారం

ఈనాడు – అనంతపురం

భైరవానితిప్ప జలాశయం



పేరూరు జలాశయం

రెండు ప్రాజెక్టులకు కృష్ణా జలాలను మళ్లించేందుకు అనువుగా రూ.908 కోట్ల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచారు. వీటిలో ప్రభుత్వ అంచనాను గుత్తేదారులు దాటేశారు. అంచనా కంటే అదనపు మొత్తానికే వ్యూహాత్మకంగా టెండర్లు వేసి, రెండు పనులనూ దక్కించుకున్నారు. ఫలితంగా సర్కారుపై అదనంగా రూ.41 కోట్ల మేర భారం పడనుంది. ఇది అనంతపురం జిల్లాలోని రెండు కీలక పనుల టెండర్లలో తాజాగా చోటుచేసుకున్న మతలబు.

జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గ పరిధి రామగిరి మండలంలోని ఎగువ పెన్నా జలాశయం(పేరూరు జలాశయం), రాయదుర్గం నియోజకవర్గ పరిధి గుమ్మఘట్ట మండలంలోని భైరవానితిప్ప జలాశయాని(బీటీపీ)కి ఎగువన కర్ణాటకలో నిర్మాణాలు కారణంగా నీరు రాకుండా పోయింది. దీంతో హంద్రీ-నీవా సుజల స్రవంతిలో భాగంగా అనంతపురం జిల్లాకు వచ్చే కృష్ణా జలాల్లో కొంత ఈ రెండు జలాశయాలకు మళ్లించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించి, తర్వాత ఉత్తర్వులిచ్చారు. హంద్రీ-నీవాలో భాగమైన జీడిపల్లి జలాశయానికి వచ్చే నీటిని తీసుకెళ్లాల్సి ఉంది. జీడిపల్లి జలాశయం నుంచి పేరూరుకు నీరు తరలించాలంటే 54 కి.మీ. కాల్వ తవ్వకంతోపాటు, 4 ఎత్తిపోతల పథకాలు, సోమరవాండ్లపల్లి, పుట్టకనుమల వద్ద చెరో జలాశయం నిర్మాణం, 116 వరకు కట్టడాలు నిర్మించాల్సి ఉంది. వీటన్నింటికీ కలిపి రూ.565 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. భైరవానితిప్పకు నీరు తరలించేందుకు 94 కి.మీ.కాల్వ తవ్వకం, 210 కట్టడాల నిర్మాణం, 14 ఎత్తిపోతలు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీటిలో ఎత్తిపోతల పథకాలు కాక, మిగిలిన కాల్వ తవ్వకం, వాటిపై కట్టడాల నిర్మాణానికి సంబంధించి రూ.343 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వానించారు. ఈ రెండు పనులు కలిపి రూ.908 కోట్లతో టెండర్లు పిలిచారు.

రెండూ అదనమే..

పేరూరుకు నీరు తరలించేందుకు రూ.565 కోట్లతో పిలిచిన టెండర్లలో హెచ్‌ఈఎస్, మెగా ఇంజినీరింగ్ సంస్థలు పోటీపడ్డాయి. వీటి సాంకేతిక అర్హత పరిశీలనలో హెచ్‌ఈఎస్ అర్హత సాధించలేదు. మెగా ఒక్కటే బరిలో నిలిచింది. ఈ సంస్థ అంచనాకంటే 4.65 శాతం అదనపు మొత్తానికి టెండరు వేయగా, ఇంజినీర్లు ఖరారు చేశారు. దీనివల్ల ప్రభుత్వంపై అదనంగా రూ.26.27 కోట్ల భారం పడనుంది.

★ ఇక బీటీపీకి నీరు తరలించే పనులకు రూ.343 కోట్లతో టెండర్లు పిలవగా.. హెచ్‌ఈఎస్, ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఆర్ఎంఎన్ ఇన్‌ఫ్రా, శ్రీసాయిలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ టెండర్లు దాఖలు చేశాయి. ఆయా గుత్తేదారు సంస్థల సాంకేతిక అర్హత పరిశీలనలో ఆర్ఎంఎన్ ఇన్‌ఫ్రా, శ్రీసాయిలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ అర్హత సాధించలేకపోయాయి. మిగిలిన రెండు సంస్థలూ అంచనా కంటే అధిక మొత్తానికి టెండర్లు వేశాయి. వీటిలో హెచ్‌ఈఎస్ 4.85 శాతం, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ 4.32 శాతానికి టెండర్లు వేయటంతో ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు పనులు ఖరారయ్యాయి. దీనివల్ల ప్రభుత్వంపై రూ.14.81 కోట్ల మేర భారం పడుతోంది.

★ మొత్తంగా ఈ రెండు పనుల్లో అంచనా కంటే అదనపు మొత్తానికి టెండర్లు వేసిన నేపథ్యంతో ప్రభుత్వంపై రూ.41.08 కోట్ల భారం పడుతోంది. ఖరారైన టెండర్ల తుది ఆమోదం కోసం హంద్రీ-నీవా ఇంజినీర్లు, కమిషనర్ ఆఫ్ టెండర్స్‌కు పంపారు.

కావేరిపై సుప్రీంలో సవాల్ చేస్తాం

కర్ణాటక సీఎం కుమారస్వామి

ఈనాడు, బెంగళూరు: కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా కావేరి నదీ జలాల నిర్వహణ ప్రాధికార కమిటీ ఏర్పాటు చేయడాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి హెచ్.డి.కుమారస్వామి ప్రకటించారు. ఆయన శనివారం బెంగళూరులో మాధ్యమ ప్రతినిధులతో మాట్లాడారు. పార్లమెంటులో విస్తృతంగా చర్చించకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల కర్ణాటకకు తీరని అన్యాయం వాటిల్లనుందన్నారు. 'మేము ప్రాధికార కమిటి ఏర్పాటును వ్యతిరేకించడం లేదు. కర్ణాటకలోని నాలుగు కావేరి జలాశయాల నుంచి తమిళనాడుకు నదీ జలాల విడుదలకు విధించిన నియమావళి రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంది. ఆ నియమావళి సవరించాలని డిమాండు చేశాం. ప్రాధికార కమిటీ వల్ల రాష్ట్రానికి కలిగే నష్టాలపై సాగునీటి నిపుణుడిచే అధ్యయాన్ని చేయిస్తున్నాం' అని తెలిపారు. ప్రాధికార నియమాల్లో కొన్ని అంశాలు సమాఖ్య వ్యవస్థ మౌలిక హక్కుల్ని హరించేవిగా ఉన్నాయన్నారు. ఈ అంశాల్ని కేంద్ర సాగునీటి మంత్రి నితిన్ గడ్కరి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని అసహనం వ్యక్తం చేశారు. 'కన్నడిగులు సహనశీలురు. తమకు ఇబ్బంది కలిగినా శాసన ఉల్లంఘనకు పాల్పడలేదు. అంత మాత్రాన దాన్ని బలహీనతగా భావిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి' అని హెచ్చరించారు. పది రోజులకో మారు జలాశయాల్లోని నీటి పరిమాణాల్ని కొలిచి విడుదలకు ఏర్పాట్లు, ఏఏ పంటల్ని పండించాలో కూడా సూచించటం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమేనన్నారు. కమిటీ ఏర్పాట్లు.. కేంద్ర ప్రభుత్వ పాపపు సంతానమని కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి డి.కె.శివకుమార్ వ్యాఖ్యానించారు. శనివారం హుబ్బళ్లిలో మాధ్యమ ప్రతినిధులతో మాట్లాడారు.

పీఈటీ పోస్టులకు భౌతిక సామర్థ్య పరీక్షలు!

- డీఎస్సీలో తొలిసారిగా నిర్వహణ
- 30 మార్కులు కేటాయింపు
- పాఠ్యాంశాలు ఖరారు చేసిన విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: వ్యాయామ ఉపాధ్యాయుల(పీఈటీ) డీఎస్సీ-2018 సిలబస్‌ను పాఠశాల విద్యాశాఖ ఖరారు చేసింది. ఒకటి, రెండు రోజుల్లో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది. మొదటిసారిగా వ్యాయామ ఉపాధ్యాయులకు భౌతిక సామర్థ్య పరీక్ష(ఫిజికల్ ఎఫిసెన్సీ టెస్ట్) నిర్వహిస్తున్నారు. టెట్‌కు 20మార్కులు వెయిటేజీ ఉన్నందున డీఎస్సీని 80మార్కులకు నిర్వహించనున్నారు. ఇందులో భౌతిక సామర్థ్య పరీక్షకు 30మార్కులు, లిఖితపూర్వక పరీక్షకు 50మార్కులు కేటాయించారు. ఒక్కో ప్రశ్నకు అర మార్కు చొప్పున 100ప్రశ్నలు ఇవ్వనున్నారు. జనరల్ నాలెడ్జ్, వర్తమాన వ్యవహారాలకు 5 మార్కులు, మిగతా 45మార్కులకు వ్యాయామ విద్యపై ప్రశ్నలు ఉంటాయి. డీపీఈడీ పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,056 పీఈటీ పోస్టులను భర్తీ చేయనున్నారు.

భౌతిక సామర్థ్య పరీక్ష ఇలా..: పురుషులకు 100, 800 మీటర్ల పరుగు పందెం, మహిళలకు 100, 400 మీటర్ల పరుగు పందెం నిర్వహించనున్నారు. దీనికి 10మార్కులు కేటాయించారు.

★ లాంగ్ జంప్, హై జంప్‌కు 10మార్కులు.

★ పురుషులకు షాట్‌పుట్ సుమారు 5.5కిలోలు(16ఎల్‌బీఎస్), మహిళలకు 3.5కిలోలు(8ఎల్‌బీఎస్)కు 10మార్కులు కేటాయించారు.

అభ్యర్థుల్లో అనుమానాలు: మొదటిసారిగా నిర్వహిస్తున్న భౌతిక సామర్థ్య పరీక్షపై అభ్యర్థులు ఎన్నో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ పరీక్షకు 42ఏళ్ల వరకు అర్హత కల్పించారు. రిజర్వేషన్ కేటగిరీలకు 47ఏళ్ల వరకు అవకాశం ఉంది. ఈ వయస్సులో పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్ చేయడం సాధ్యమవుతుందా? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు గర్భవతులు, బాలింతలు, గుండె సంబంధిత జబ్బులున్నవారు, కొన్ని దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి భౌతిక సామర్థ్య పరీక్షలు ఎలా నిర్వహిస్తారని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు 30మార్కులకు నిర్వహించే ఈ పరీక్షల్లో అక్రమాలు జరిగే అవకాశం ఉంటుందని ఆరోపిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ మాత్రం వీరి సందేహాలను పట్టించుకోవడం లేదు. అభ్యర్థుల వయస్సు, ఆరోగ్య పరిస్థితి అనుసరించే భౌతిక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారని వ్యాయామ విద్య నిపుణులు పేర్కొంటున్నారు. క్రీడల్లో మెరుగైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకే ఈ విధానం తీసుకొచ్చినట్లు వెల్లడిస్తున్నారు.

9 జిల్లాలకు గురుకుల సమన్వయకర్తల నియామకం

ప్రధానాచార్యులకు పదోన్నతులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు చెందిన గ్రేడ్-1 ప్రధానాచార్యులు 9 మందికి జిల్లా సమన్వయకర్తలుగా పదోన్నతి లభించింది. ఆ మేరకు రాష్ట్ర ఎస్సీ గురుకులాల కార్యదర్శి కల్నల్ రాములు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు జిల్లాల ఇన్‌ఛార్జి సమన్వయకర్తలను అవే స్థానాల్లో కొనసాగిస్తూ పోస్టింగ్‌లు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా సమన్వయకర్తగా డి.చినభూషణం, పశ్చిమగోదావరి-ఎం.డేవిడ్, కృష్ణా-పి.యానాది, ప్రకాశం-వి.విశాలాక్షేశ్వరి, నెల్లూరు-టి.హేమలత, తూర్పుగోదావరి జిల్లా డీసీగా పిఠాపురం గురుకులం ప్రిన్సిపల్ బి.సుబ్రహ్మణ్యం, కర్నూలు జిల్లా డీసీగా మదనపల్లె గురుకులం ప్రిన్సిపల్ కె.వి.స్వర్ణకుమారి, కడప జిల్లా డీసీగా రాయచోటి గురుకులం ప్రిన్సిపల్ ఎన్.నాగరాజుని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం, విశాఖ, గుంటూరు, అనంతపురం జిల్లాల సమన్వయకర్తలను నియమించలేదు. వాటికి సీనియరు ప్రిన్సిపల్స్‌ని ఇన్‌ఛార్జి డీసీలుగా నియమించి పరిపాలన కార్యక్రమాలను నిర్వహింపజేస్తున్నారు.

కడప ఉక్కు పరిశ్రమపై తెదేపావన్నీ నాటకాలే: కన్నా

విజయనగరం, న్యూస్‌టుడే: కడపలో ఉక్కు కర్మాగారం నిర్మాణం సాధ్యపడదని తెలిసినా ముఖ్యమంత్రి తన పార్టీ నేతలతో దీక్షలుచేయించి నాటకాలు ఆడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. విజయనగరం జిల్లాలో రెండోరోజు పర్యటనలో భాగంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందుగా జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కడప ఉక్కు కర్మాగారం, విశాఖ రైల్వే జోన్, దుగ్గరాజపట్నం పోర్టు ఏర్పాటు విషయాలు విభజనచట్టంలో పరిశీలించాలని మాత్రమే ఉందని తెలిపారు. దీనికి కట్టుబడి మూడు అంశాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలించినందున విభజన హామీలన్నీ అమలు చేసినట్లేనని చెప్పారు. ముఖ్యమంత్రిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారణ చేయించుకునే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. సీఎం అవినీతిని తాను నిరూపించకపోతే జైలుకు వెళతానని ప్రకటించారు.

పేదలందరికీ రాయితీ ఫలాలు

- ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వెల్లడి

కానూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ఫలాలు పేదలకు అందేలా పౌర సరఫరాల శాఖ కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. శనివారం కృష్ణా జిల్లా కానూరులోని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల భవన్‌లో పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్‌గా చల్లా రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి కేఈ మాట్లాడుతూ.. పౌర సరఫరాల శాఖకు మంచి బృందం ఉందని తద్వారా పేద ప్రజలకు అందించే బియ్యం, రేషన్ సకాలంలో వారికి అందించాలన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. పేద ప్రజలకు సకాలంలో సరకులు ఇవ్వడంతోపాటు తూనికలు కొలతల్లో ఏవిధమైన తేడాలు లేకుండా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార కమిషన్ ఛైర్మన్ జేఆర్ పుష్పరాజ్ మాట్లాడుతూ.. చక్కెర వ్యాధిగ్రస్థులకు బ్రౌన్‌రైస్ అందించడంతో పాటు గిరిజన ప్రాంతాల్లో ఇంటింటికీ సరకులు అందించి ప్రజలకు చేరువ అవుతామన్నారు. చల్లా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఏపీ పౌర సరఫరాల సంస్థను దేశంలోనే మొదటిస్థానంలో నిలపడానికి పెద్దన్న పాత్ర పోషిస్తానన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఎంపీ బుట్టా రేణుక, ఎండీ సూర్యకుమారి, కర్నూలు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చల్లా రామకృష్ణారెడ్డి. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కాలవ శ్రీనివాసులు

లిఫ్టులో ఇరుక్కుపోయిన నాయకులు: ప్రమాణ స్వీకారం సమయంలో.. ముఖ్యనేతల కోసం ఏర్పాటు చేసిన లిఫ్టులో సాంకేతిక సమస్య తలెత్తి మధ్యలో ఆగిపోయింది. దీంతో పార్టీ నేతలు ఇబ్బంది పడ్డారు. 15 నిమిషాల పాటు లిఫ్టు తలుపులు తెరుచుకోవలేదు. అందులో ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, రామకృష్ణారెడ్డి కుమారుడు తదితర నేతలు ఉన్నారు. ఎంతసేపటికీ లిఫ్టు కిందకు రాకపోవడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమై కర్రలు, పలుగులు సాయంతో లిఫ్టు తలుపులు తెరిచారు. మరోవైపు, లిఫ్టు కోసం ఐదో అంతస్తులో నిరీక్షించిన మంత్రులు కేఈ, ప్రత్తిపాటి, ఎంత సేపటికీ లిఫ్టు రాకపోవడంతో మెట్ల మార్గం నుంచి కిందకు దిగారు.

తిరుచానూరు అమ్మవారి తెప్పోత్సవాలు ప్రారంభం

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు శనివారం సాయంత్రం శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి రూపంలో అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. –న్యూస్‌టుడే, తిరుచానూరు

ప్రజాసంఘాల నేతలను విడుదల చేయాలి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు

గాంధీనగర్ (విజయవాడ) న్యూస్‌టుడే: దళితులు, ఆదివాసీల సమస్యలపై పోరాడుతున్న ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడం విచారకరమని, సత్వరమే వారిని విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.చిట్టిబాబు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగి అన్నివర్గాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయాలని కోరుతూ.. మహారాష్ట్రలో ఇటీవల చేపట్టిన నిరసనల సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకున్న సుధీర్ ధావలే, సోమాసేన, నరేంద్ర, గాడ్లింగ్, మహేష్‌రౌత్, రోనా విల్సన్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. వీరిని కోరేగావ్ హింసాత్మక సంఘటనలకు బాధ్యులుగా చిత్రీకరిస్తూ అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజావ్యతిరేక యూఏపీఏ చట్టాన్ని రద్దు చేయడంతో పాటు ఈ చట్టం ద్వారా నమోదు చేసిన అక్రమ కేసులను తొలగించాలని చిట్టిబాబు కోరారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు టి.ఆంజనేయులు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఓపీడీఆర్ నాయకుడు కె.కోటేశ్వరరావు, చైతన్య మహిళా సంఘం నాయకురాలు జానకి, వివిధ సంఘాల నేతలు రాయల శ్రీధర్, ఎల్.వి.కుటుంబరావు, ఎన్.క్రాంతికుమార్, బి.కొండారెడ్డి, అసరవిల్లి కృష్ణ, డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం ఆదివారం నుంచి 3 రోజుల పాటు తితిదే నిర్వహించనుంది. ప్రతి ఏటా జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేటట్టుగా నిర్వహించే ఈ ఉత్సవాన్నే అభిద్యేయక అభిషేకంగానూ పిలుస్తారు. అభిషేకాదులతో స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించే నిమిత్తం జరిపే వేడుక ఇది. ఈ వేడుక కారణంగా స్వామివారికి ఈ నెల 24, 25 తేదీల్లో వసంతోత్సవం, 26న కల్యాణోత్సవం, ఊంజలసేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను తితిదే రద్దు చేసింది.

ADMISSION GUIDANCE in AP, TS, KT, TN, PC - 2018-19
MBBS / BDS
UNDER NRI QUOTA
MY MBBS Ab.: 63097 34755

ADMISSION GUIDANCE NEET - INDIA
MBBS
60 LKS TOTAL PACKAGE
9676178928, 8466963781

LOVELY PROFESSIONAL UNIVERSITY PUNJAB (INDIA)
Ministry of Human Resources, Government of India
RANKS LPU NO. 2 IN INDIA IN MANAGEMENT
(Outreach and Inclusivity) - NIRF rankings 2018
LPU surpassed all IIMs, including IIM Ahmedabad and IIM Bangalore and all universities of India on Outreach and Inclusivity parameter and ranked 38th overall.
MANAGEMENT PROGRAMMES 2018
▪ MBA[1] ▪ MBA (Hons.)[1]
(Specializations available in Finance, Human Resources, Marketing, Operations, International Business, IT, Retail Mgmt., Strategy, Hospital & Healthcare Management, Entrepreneurship, E-Commerce, Business Analytics, Banking and Financial Services, Agri-Business Management)
▪ BBA[1] ▪ BBA (Hons.)[1] ▪ B.Com.[1]
▪ Dual Degree BBA - MBA[1]
▪ Dual Degree BBA (Hons.) - MBA[1]
▪ BBA (Information Technology)[1]
▪ BBA (Financial Markets)
▪ Integrated BBA - MBA (4yrs.)
▪ BBA (Oil and Gas Mgmt.)
▪ BBA (International Finance)
▪ BBA (Tourism & Hospitality)
([1]Accredited by the prestigious ACBSP, USA)
LAST DATE OF ADMISSION WITH FULL SCHOLARSHIP
30th JUNE 2018
Scholarships SCHOLARSHIPS UPTO ₹ 2.6 LAKH PER STUDENT
HOW TO APPLY? Applicants can apply online at www.lpu.in

Meet our counsellors in	Time : 10AM to 7PM	Toll Free: 1800-102-4428	
Vijayawada	#40-1-60, 1st Floor, Chand Imprea, Benz Circle	Ph: 09216656007	24-30 June
Nellore	Hotel Minerva Grand, Grand Trunk Road, Saraswathi Nagar, Dargamitta	Ph: 09780036429	24-26 June

LOVELY PROFESSIONAL UNIVERSITY (LPU) SUNDAY OPEN
Jalandhar-Delhi G.T. Road, Phagwara, Punjab | SMS LPU to 53030
admissions@lpu.co.in | Toll Free : 1800-102-4428 WWW.LPU.IN

www.bfitdoon.com BFIT GROUP OF INSTITUTIONS SUDDHOWALA DEHRADUN
SCHOLARSHIPS Tuition Fee Waiver upto 100% Ph. 7456000102
HYDERABAD OFFICE Flat No. 201, 2nd Floor, Konark Tower, Above Konark Diagnostic Center, Dilsukhnagar
SCHOOL OF POLYTECHNIC- SOP Diploma Engineering 10th PASS FEE PER YEAR
Civil • Mechanical • Electronics • Electrical • Computer Sc. ₹ 35,000
Lateral Entry in all Diploma Courses (10+2 PCM/ITI) ₹ 35,000
AFFILIATED TO UBTER & APPROVED BY AICTE, MINISTRY OF HRD, GOVT. OF INDIA
HNBGU CENTRAL GOVT. UNIVERSITY REGULAR DEGREE COURSES
(University Established since 1973, UGC Recognised, Ministry of HRD, NAAC 'A' Accredited University)

UG Courses	FEE PER YEAR	PG Courses	FEE PER YEAR
SCHOOL OF LIFE & ALLIED SCIENCES- SLAS			
B.Sc. (BioTech./Micro Bio)	₹ 40,000	M.Sc. (Micro Bio/Bio Tech)	₹ 55,000
B.Sc. (Geology)	₹ 40,000	M.Sc. (Geology)	₹ 49,500
B.Sc. (Eco/Statistics)	₹ 31,000	M.Sc. (Statistics)	₹ 39,500
B.Sc. (PCM/CBZ)	₹ 28,000	M.Sc. (Chem./Zoology)	₹ 45,000
B.Sc. (Home Sc.)	₹ 30,000	M.Sc. (Phys./Botany)	₹ 40,000
		M.Sc. (Bio Chemistry)	₹ 49,500
		M.Sc. (EVS/Math.)	₹ 35,000
SCHOOL OF AGRICULTURE SCIENCES- SAS			
B.Sc. (Agriculture)	₹ 59,500	M.Sc. (Agri./Agronomy)	₹ 59,500
B.Sc. (Forestry/Horticulture)	₹ 49,500	M.Sc. (Ag./Seed Sc.&Tech)	₹ 59,500
		M.Sc. (Horticulture/Forestry)	₹ 50,000
SCHOOL OF MANAGEMENT STUDIES- SMS		SCHOOL OF HOTEL MANAGEMENT- SHM	
B.B.A.	₹ 45,000	BHM Bachelor Hotel Management	₹ 59,500
B.Com.	₹ 33,000		
B.Com (C.A.)	₹ 35,000		
M.Com	₹ 39,500	Certificate Diploma (AHLEI) 1Year	₹ 30,000
SCHOOL OF TECHNOLOGY, INFORMATION & COMPUTER SCIENCE- STICS			
B.Sc. (IT)	₹ 31,000	M.Sc. (IT)	₹ 35,000
B.C.A.	₹ 33,000	MCA	₹ 65,000
SCHOOL OF ARTS & JOURNALISM- SAJ			
B.A. (Hons.) Mass Comm.	₹ 40,000	M.A. (Mass Comm.)	₹ 49,500
B.A. (Econ./English)	₹ 28,000	M.A. (Math.)	₹ 35,000
B.A. (Socio./Pol.Sc./Hindi)	₹ 28,000	M.A.(Geography)	₹ 35,000
		M.A.(Eco./Eng./Pol.Sc./Edu.)	₹ 35,000
SCHOOL OF FOOD TECHNOLOGY		BUSINESS SCHOOL	
B.Sc Food Technology	₹ 49,500	MBA (Including Foreign Tour)	₹ 97,500
M.Sc Food Technology	₹ 59,500	APPROVED BY AICTE, MINISTRY OF HRD GOVT. OF INDIA	

AFFILIATED TO UTTARAKHAND TECHNICAL UNIVERSITY- STATE GOVT. UNIVERSITY, GOVT. OF UTTARAKHAND
One Year Certified Course in Hotel Management : ₹ 30,000
Approved Institutions of AHLEI (U.S.A.)
Hostel Fee Per Year : ₹ 50,000 (Inclusive of food, Veg/Non-Veg)
CAMPUS : BFIT GROUP OF INSTITUTION, DEHRADUN
Sudhowala, Chakrata Road, Dehradun Uttarakhand 248007
Phone : 9719460515, 9997777828, 7300900900, 7300900909, 7300900919, 7300900929
www.gncmh.com PHONE: 7302000156, 7302000157, 7302000158, 7302000159 KIPS JHAJRA DEHRADUN
APPROVED BY PHARMACY COUNCIL OF INDIA & ALL INDIA COUNCIL FOR TECHNICAL EDUCATION, MINISTRY OF HRD, GOVT. OF INDIA
• D.PHARMA • B.PHARMA • B.PHARMA (Lateral Entry)

డాక్టర్ కోర్సు
చైనా
MBBS
ADMISSIONS
₹.14 లక్షలలో
5 సం. MBBS
ఇంటర్నేషనల్
యూనివర్సిటీ క్యాంపస్‌లో
Note : ఫిలిప్పైన్స్‌తో సహా ఏ దేశముకైన MBBS కి NEET తప్పనిసరి.
www.mciindia.org
NEETలో క్వాలిఫై అవసరం లేదని చెప్పే కన్సల్టెన్సీ మాటలు విని మోసపోకండి
P.SITARAMAIAH
Rtd. Andhra Bank Manager
94402 57535

ఈనాడు

మనసే ఆయుధం

మనిషికి మనసే బలం, బలహీనతా! మనసే స్వర్గం- మనిషికి అది సహకరిస్తే. మనసే నరకం- అది మనిషిని ఎదిరిస్తే. 'మనసును జయించాలి'- అంటుంది ప్రాచీన భారతీయ సాహిత్యం. 'మనసును మనకు అనుకూలంగా మలచుకోవాలి' అంటుంది ఆధునిక మనస్తత్వ శాస్త్రం. 'బొగ్గు మండితే అగ్గి, అగ్గి ఆరిపోతే బొగ్గు' అని విశ్వంభరలో సినారె చెప్పినట్లు- ఆ రెండూ ఒకటే కదా అనిపిస్తుంది. కాని మొదటిది అణచివేత. అణచివేత ఎక్కడుంటుందో తిరుగుబాటు అక్కడుంటుంది. రెండోది బుజ్జగింపు. అంటే నెమ్మదిగా దారికి తెచ్చుకొని ప్రయోజనకరంగా మార్చుకోవడం, దాంతో మనసే మనిషికి సైన్యంగా మారుతుంది. 'కవితారూప తపస్సు చేసెదను శ్రీకంఠా! మనస్సంయమాది విధానంబులు చేతకానితన మైతిన్' అన్నారు విశ్వనాథ. మనసును నిగ్రహించడం కష్టసాధ్యమైన పని. దాన్ని 'శ్వపుచ్ఛోన్నమన న్యాయం'గా చెబుతారు. అంటే కుక్కతోక వంకరను సరిచేయడం లాంటిదని అర్థం. కాబట్టి ఆ పని మాని కవిత్వ సృజనలోకి మళ్లించారు విశ్వనాథ. అద్భుత ఫలితాలు సాధించారు. తన మనసును తనకు అనుకూలంగా మలచుకోవడం చిన్న విషయమేమీ కాదు. 'తెలియరాదు మనసు తీరుతెన్నులు చూడ, బంధ మోక్షములకు సంధి మనసు' అన్నారు నండూరి రామకృష్ణమాచార్య. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' అని ఉపనిషత్తులు చెప్పిన మాటకు భావానువాదం అది. బంధానికి మోక్షానికి మధ్య అడ్డుగోడలా నిలిచిన మనసును మోక్షం వైపు నిదానంగా మళ్లించడంలోనే మనిషి ప్రజ్ఞ నిరూపితం అవుతుంది. 'పుత్ర మిత్రధన సంపత్ భ్రాంతి వాంఛా లతల్ కోసీ కోయదు నా మనంబు అకటా' అని ధూర్జటి మహాకవి లాంటివాడు మోహబంధంలో ఇరుక్కుని విడిపించుకోలేక విలవిల్లాడాడు. మనసు పట్టు అంతటిది. కాబట్టే మనసును మదించిన ఏనుగుతో పోలుస్తారు కవులు.

మనిషి తన మనసును తాను అర్థం చేసుకోవడమే చాలా కష్టం. 'తెలియగ వచ్చు ఖగోళము, తెలియును శాస్త్రముల తీరుతెన్నులు చూడన్, తెలియును కళలను మనుజుడు- తెలియడుగద తన మనస్సు తేటగ సుమతీ' అని కవులు తేల్చి చెప్పారు. తన మనసు సంగతి తనకు తెలియదు గాని- మనిషి ఎదుటివారి మనసు చదివేశానంటాడు. స్త్రీల విషయంలో ఇది మరీ విడ్డూరం అన్నారు- శ్రీకృష్ణతులాభారం నాటకంలో ముత్తరాజు సుబ్బారావు. ఆడవారితో ఒక్కసారి మాట్లాడే అవకాశం దక్కగానే, 'వారి మనోగతులెల్ల తేటతెల్లముగ స్ఫురించెనంచును తలంతురు పో మగవారలు' అని విస్తుపోయారు. 'సత్యము కనుగొన్న ఎంత రసికాగ్రణికైనను నారికేళపాకము కదా కామినీ హృదయ కావ్యరస గ్రహణమ్ము' అని కృష్ణుడి నోట పలికించారు. శ్రీరమణ మిథునం కథలో ప్రాణంకన్నా ఎక్కువగా తాను ప్రేమించే భర్త తనకన్నా ముందు పోవాలని భార్య కోరుకుంటుంది. దానికి సమాధానం చెప్పిస్తూ- 'నేను లేకుంటే ఆయన ఒక్క క్షణం బతకలేడురా' అనిపిస్తారు రచయిత. అదీ కామినీ హృదయ కావ్య రస గ్రహణ పారీణత అంటే! పరుల అంతరంగాల సంగతి అలా ఉంచి, తమ మనసులో భావాలను ఉన్నవి ఉన్నట్లుగా అక్షరాల్లోకి అనువదించడం కూడా చాలా కష్టమే అంటారు కవులు. 'మానసవీణ పల్కు పలు మంగళ గీతులెథాతథంబుగా కానుక చేయగల్గు అధికారము గల్గిన భాష ఏదియున్ కానగ రాదు వాహికగ' అంటూ కవులు ఎన్నోసార్లు వాపోతారు. మనసులో ఊహ చాలా గొప్పగా ఉంటుంది. కాగితంమీదకు వచ్చేసరికి దాని సాంద్రత పలచనవుతుంది. 'మనసే మకరంద సుమం, దాని పాట పరిమళం... మాటల్లో చెప్పలేదు నేరుగా ఏ గళం' అన్నది కవుల భావన. 'ఒక్క కవిత రాయాలని ఎంత చచ్చి బతికానో, ఎన్ని ఎన్ని భావాలను ఏరితెచ్చి ఉతికానో' అనేది రసరాజుదే కాదు, కవులందరి మనోభావం. మనసు ఎంతటి సంక్లిష్టభరితమైనదో చెప్పే ఉదాహరణలివన్నీ!

పంచేంద్రియాలకు భావోద్వేగాలతో నిమిత్తం లేదు. వాటికి నొప్పి ఒకటే తెలుసు. కాని మనసుకు రెండువైపులా రెండు బలమైన రెక్కలున్నాయి. దిగులు, బెంగ, కోపం, దుఃఖం వంటివన్నీ ఒకవైపు- ప్రేమ, ఆప్యాయత, దయ, సంతోషం మరోవైపు. ఈ రెండు రెక్కల సాయంతో మనసు యథేచ్ఛగా విహరిస్తూ ఉంటుంది. అయినదానికీ కానిదానికీ బాధపడుతూ ఉంటుంది. మాధవుడే వచ్చి మనోమందిరం ముందు నిలబడినా 'మందమతిని నీవు వచ్చు మధుర క్షణమేదో కాస్త ముందు తెలిసెనా ప్రభూ! ఈ మందిరమిటులుంచేనా' అని చింతిస్తుందే తప్ప, ఆయన ఉనికిలోని మాధుర్యాన్ని ఆస్వాదించడం అరుదు. పతంజలి శాస్త్రి చెప్పినట్లు 'వచ్చేదాకా రావేమోనని బెంగ... తీరా వచ్చాకా వెళ్లిపోతావనే బెంగ'తో సతమతం కావడం మనసు లక్షణం. దానికి తోడు ఉన్న దానికన్నా ఎక్కువ ఊహించుకోవడం మరో దురలవాటు- అది సంపద అయినా, సమస్య అయినా! 'సమస్య పట్ల అతిగా స్పందించడమే కుంగుబాటుకు కారణం' అంటున్నారు నార్వేజియన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు హన్స్ నోడల్. 'విశ్లేషణ కాకుండా, పరిష్కారం దిశగా మనసును మరల్చండి... వాస్తవిక దృక్పథంతో పరిశీలించండి' అని ఆయన సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు 'ముదిమి వాలనీయరాదు తలపులపై... ముదిమి చేరనీయరాదు మనసు పొరలపై' అనేది ఆయన సూచన సారాంశం. 'గెలవకపోవడం కాదు- ఆ ప్రయత్నాన్ని ఆపేయడమే అసలైన ఓటమి' అంటున్నారు మనస్తత్వవేత్తలు. జరిగినదానికి చింతిస్తూ కూర్చోకుండా మనసును పరిష్కారం దిశగా మలచుకొంటే 'కానిది లేదు మానవుడు గాఢతరమ్ముగ దీక్ష పూనుచో' అన్న కవి వాక్కు ప్రతి మనిషి జీవితంలోనూ నిజం అవుతుంది. 'మనసును ఆయుధంగా మార్చుకో' అన్న మాటకు అదే అర్థం!

జీడీపీ వృద్ధితో కొత్త శిఖరాలకు!

సురేశ్ ప్రభు

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి ఇటీవలే నాలుగేళ్లు పూర్తయింది. ప్రభుత్వ పాలన తీరుపై ప్రజలు ఒక అంచనాకు రావడానికి ఈ సమయం చాలు. మరికొన్ని నెలల్లో పార్లమెంటు ఎన్నికల హడావుడి మొదలు కానుంది. ప్రతిపక్షాలు అందుకు ఇప్పటినుంచే సమాయత్తమవుతున్నాయి. టీవీ, అంతర్జాలం, సామాజిక మాధ్యమాల వ్యాప్తి వల్ల ఎన్నికలు హోరాహోరీ సమరంగా మారిపోయాయి. వివిధ సమస్యలపై రాజకీయ పార్టీలు వాదప్రతివాదాలతో వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. ఈ పోరాటాలు ఎలక్ట్రానిక్ మీడియా చలవతో మన లోగిళ్లలోకి వచ్చేస్తున్నాయి. ఈ సందర్భంగా పరిపాలన రీతులు, వాటి సామర్థ్యం గురించి పరిశీలించడం సందర్భోచితంగా ఉంటుంది. వృత్తినిపుణుడిగా జీవితం ప్రారంభించిన నాకు రాజకీయాలకంటే పరిపాలన సంబంధ అంశాల మీదనే ఎక్కువ ఆసక్తి. గతంలో వాజపేయీ ప్రభుత్వం 'పరిపాలన, అభివృద్ధి' అనే జోడు గుర్రాలపై ముందుకు సాగింది. ఆ ప్రభుత్వంలో నేనూ భాగస్వామిని. ఎన్డీయే పాలనకు ముందే ఆర్థిక సరళీకరణ మొదలైనా, అప్పట్లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెద్దగా పెరిగింది లేదు. ఎన్డీయే అధికారంలోకి వచ్చాకనే జీడీపీ రెండంకెల వృద్ధిరేటు సాధించింది. అంతకుముందు ఎన్నికల రాజకీయాల్లో జీడీపీ వృద్ధి గురించి ఎవరూ ప్రస్తావించేవారు కారు. అది ఎన్నికల్లో గెలవడానికి ఉపయోగపడదనే అపోహ ఉండటమే దీనికి కారణం. 20 ఏళ్ల క్రితం ఎన్డీయే ఏర్పడినప్పుడు విడుదలైన జాతీయ పాలనా అజెండా పత్రం ఎన్డీయే విలక్షణ పంథాకు చిహ్నంగా నిలిచింది. వాజ్‌పేయీ ప్రభుత్వం చాటిన సత్పరిపాలన, ఎలక్ట్రానిక్ పాలన, కార్పొరేట్ పాలనలు ఎన్డీయే విధానానికి పునాదిరాళ్లుగా నిలిచాయి.

సానుకూల వాతావరణం

వాజ్‌పేయీ ప్రభుత్వం 2004 ఎన్నికల్లో అనూహ్యంగా ఓడిపోయినా గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలోని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్డీయే అజెండాను కొనసాగించాయి. సమర్థ పాలనకు, అభివృద్ధి సాధనకు ప్రయోగశాలలుగా నిలిచాయి. 2014 ఎన్నికల ప్రణాళికలో భారతీయ జనతా పార్టీ దేశంలో సులువుగా వ్యాపారం ప్రారంభించి నడుపుకొనే సౌలభ్యం కల్పిస్తానని వాగ్దానం చేసింది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టేనాటికి ప్రపంచ బ్యాంకు వ్యాపార సౌలభ్య సూచీలో భారత్ 142వ స్థానంలో ఉంది. మోదీ ప్రభుత్వం హుటాహుటిన చేపట్టిన సంస్కరణల చలవతో కేవలం రెండేళ్లలోనే భారత్ 130వ స్థానానికి ఎగబాకింది. 2017 అక్టోబరు వచ్చేసరికి ఏకంగా 100వ స్థానంలోకి చేరింది. జిల్లా స్థాయిలోనూ వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడానికి వాణిజ్య శాఖ కృషి చేస్తోంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల భాగస్వామ్యంతో కేంద్ర పారిశ్రామిక విధాన ప్రోత్సాహక మండలి (డీఐపీపీ) వ్యాపారాలపై నియంత్రణలను సడలించి సానుకూల వాతావరణం ఏర్పరచింది. 2015లో మొత్తం 98 పరామితుల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు వ్యాపార సౌలభ్య సూచీలో ర్యాంకులిచ్చారు. 2017 ఆగస్టులో 372 అంశాల వ్యాపార సంస్కరణ కార్యాచరణ ప్రణాళికను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపిణీ చేశాం. ఈ విధానం అమలును పర్యవేక్షించడానికి అంకితమైన పోర్టల్‌ను ప్రారంభించాం. తాము చేపట్టిన సంస్కరణల గురించి రాష్ట్రాలు ఎప్పటికప్పుడు ఈ పోర్టల్‌కు నివేదిస్తాయి. ఇలాంటి పోర్టల్‌ను ఏర్పాటు చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. భౌగోళికంగా, రాజకీయంగా పరస్పరం భిన్నమైన ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హరియాణ, రాజస్థాన్, పశ్చిమ్ బంగ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు ప్రతిపాదిత సంస్కరణల్లో 98 నుంచి 100 శాతం వరకు అమలు చేశాయి. పెట్టుబడులను ఆకర్షించడంలో అవి పోటీపడుతున్నాయి. ఇది ఎంతో హర్షించాల్సిన పరిణామమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

మోదీ సర్కారు చేపట్టిన పథకాల్లో మేకిన్ ఇండియా (భారత్‌లో తయారీ) పథకం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రధాని మోదీ ఈ పథకం గురించి మొట్టమొదటిసారి 2014 స్వాతంత్ర్య దిన ప్రసంగంలో ప్రస్తావించారు. అంతకు ముందు యూపీఏ ప్రభుత్వ పాలన చివరి సంవత్సరంలో ఆర్థికాభివృద్ధి రేటు దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత తక్కువస్థాయికి పడిపోయింది. భారత్ ప్రగతిపై అంతర్జాతీయ పెట్టుబడిదారులకు నమ్మకం సన్నగిల్లసాగింది. ఆ తరుణంలో మోదీ 'మేకిన్ ఇండియా' ప్రసంగం భారత్ సత్తాపై అనుమానాలను తొలగించి, తిరిగి నమ్మకం పాదుగొల్పడానికి తోడ్పడింది. అందరిలో ఉత్సాహం, కొత్త ఆశలు నింపింది. ఆ ఆశలను సాకారం చేయడానికి మోదీ సర్కారు నడుం బిగించింది. కొత్త పెట్టుబడులకు స్వాగతం, నవీకరణకు ప్రోత్సాహం, నైపుణ్యాల వృద్ధి, మేధాహక్కుల రక్షణ, ప్రపంచశ్రేణి మౌలిక వసతుల నిర్మాణానికి తోడ్పడే ప్రాతిపదికను వేగంగా ఏర్పరచింది. పారిశ్రామిక ఉత్పత్తి, ప్రాసెసింగ్, సేవలు, రక్షణ, మౌలిక సదుపాయాలు, కమ్యూనికేషన్లతో సహా మొత్తం 25 రంగాల్లో 'మేకిన్ ఇండియా'ను ప్రోత్సహించాలని సర్కారు నిర్ణయించింది. 2014 ఏప్రిల్ నుంచి 2017 డిసెంబరు వరకు భారత్‌లోకి 20,899 కోట్ల డాలర్ల విదేశీ ప్రత్యక్ష

ఎన్డీయే సర్కారు కార్యాచరణ ప్రణాళిక

పెట్టుబడులు ప్రవహించాయి. ఇది ఎన్నడూ ఎరుగని రికార్డు. ఈ పెట్టుబడులు బ్యాంకింగ్, బీమా, కొరియర్, బీపీఓ, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, టెలీకమ్యూనికేషన్స్ వంటి సేవా రంగాలతోపాటు సరకుల వ్యాపారం, భవన నిర్మాణం, ఆటొమొబైల్ పరిశ్రమల్లోకీ ప్రవహించాయి. సూక్ష్మ చిన్న పరిశ్రమల్లోనూ నవకల్పనలను ప్రోత్సహించడానికి 2016 జనవరిలో కేంద్ర ప్రభుత్వం స్టార్టప్ ఇండియా పథకాన్ని ప్రారంభించింది. దీనికింద లభించిన ప్రోత్సాహకాలతో గడచిన రెండేళ్లలో 9,000 అంకుర పరిశ్రమలు (స్టార్టప్) ప్రారంభమయ్యాయి.



సూక్ష్మ పరిశ్రమలు చిన్న పరిశ్రమలుగా, చిన్న పరిశ్రమలు మధ్యతరహా సంస్థలుగా, అవి భారీ పరిశ్రమలుగా రూపొందాలి. భారత్ సుసంపన్నం కావాలంటే ఎగుమతులు వృద్ధి చెందాల్సిందే. చైనా, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ తదితర దేశాలు ఎగుమతుల కారణంగానే వేగంగా అభివృద్ధి చెందాయి. అసలు ఏ దేశమైనా భాగ్యవంతం కావడంలో అంతర్జాతీయ వాణిజ్యానిది కీలకపాత్ర. మన జీడీపీలో 40 శాతాన్ని అంతర్జాతీయ వాణిజ్యం ద్వారా సాధించాలని కేంద్ర ప్రభుత్వం లక్షిస్తోంది. భారత్‌ను అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందించడానికి ఒక కార్యాచరణ ప్రణాళికతో ముందుకొస్తోంది.

సేవారంగమే ఆలంబన

ప్రస్తుతం 2.6 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న భారత జీడీపీ 2025నాటికి అయిదు లక్షల కోట్ల డాలర్లకు, 2030నాటికి 6.84 లక్షల కోట్ల డాలర్లకు పెరుగుతుందని అంచనా. 2025 నాటికి అయిదు లక్షల కోట్ల డాలర్ల జీడీపీలో మూడు లక్షల కోట్ల డాలర్లు సేవా రంగం నుంచి లభిస్తాయని ఆశిస్తున్నాం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల నుంచి చెరి లక్ష కోట్ల డాలర్లు లభించనున్నాయి. జీడీపీలో సేవా రంగ వాటా పెరగడం ఆర్థిక వ్యవస్థ పరిణతికి చిహ్నం. ముందే చెప్పుకొన్నట్లు వస్తుసేవల ఎగుమతులు ఆర్థిక రథానికి ప్రధాన చోదకశక్తిగా పనిచేస్తాయి. అందుకే ఎగుమతులను భారీయెత్తున ప్రోత్సహించాలని భారత ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఈ లక్ష్యసాధనకు బహుముఖ వ్యూహం చేపట్టింది. మార్కెట్ అవకాశాల అన్వేషణ, వాటిని అందిపుచ్చుకొనే మార్గాలపై పరిశోధన, కొత్త వస్తుసేవల రూపకల్పన, కొత్త మార్కెట్లలోకి చొచ్చుకుపోవడం వంటివి ఈ వ్యూహంలో అంతర్భాగాలు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు ఎగుమతులు పెంచడానికి అక్కడ వాణిజ్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. ఇలాంటి ప్రయత్నాల వల్ల ఇటీవల మన ఎగుమతుల్లో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోంది. 2017-18లో సరకుల ఎగుమతులు అంతకుముందు సంవత్సరంకన్నా 9.8 శాతం, సేవల ఎగుమతులు 17.8 శాతం పెరిగాయి. మొత్తం ఎగుమతులు 12.9 శాతం వృద్ధిరేటు నమోదుచేశాయి. ఈ ఏడాది ఒక్క మే నెలలోనే 2,886 కోట్ల డాలర్ల ఎగుమతులు సాధించాం. గత ఏడాది ఇదే నెలలో ఎగుమతుల విలువ 2,401 కోట్ల డాలర్లు. ఇది ఏకంగా 20.18 శాతం పెరుగుదల. గడచిన ఆరు నెలల్లో సరికొత్త రికార్డు కూడా. సంప్రదాయ సరకులతోపాటు కొత్త ఉత్పత్తుల ఎగుమతీ పెరిగేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకొంటోంది. ప్రభుత్వం 12 ముఖ్యమైన సేవలను గుర్తించి, వాటి ఎగుమతులను పెంచడానికి రూ.5,000 కోట్లు కేటాయించింది. వీటిలో వైద్య పర్యాటకం, విమానయానం ఉన్నాయి. ఈ సేవలను జాతీయంగా, అంతర్జాతీయంగా వృద్ధి చేయనున్నాం. చిరకాలంగా కొన్ని రకాల వస్తువుల ఎగుమతికి పేరుగాంచిన ప్రాంతాల్లో ఎగుమతి ప్రోత్సాహక సముదాయాల (క్లస్టర్ల)ను ఏర్పాటు చేయనున్నాం. త్వరలో వెలువడనున్న కొత్త పారిశ్రామిక విధానం ఎగుమతుల విస్తరణకు ప్రాధాన్యమిస్తుంది. సముద్ర తీర ప్రాంతాల్లో క్లస్టర్ల విస్తరణ ద్వారా ఎగుమతులను వేగంగా పెంచవచ్చు. వ్యవసాయ సరకుల ఎగుమతుల వృద్ధికీ ప్రభుత్వం నిబద్ధమై ఉంది. అందుకోసం విమాన రవాణా కేంద్రాలను (ఎయిర్ హబ్స్) స్థాపించాలని యోచిస్తున్నాం.

లక్షించిన ప్రకారం ఎగుమతులను పెంచే కృషిలో కొన్ని సవాళ్లు, సమస్యలు అనివార్యంగా ఎదురవుతాయి. వాటి పరిష్కారానికి సంబంధిత మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో ఒక బృందం ఏర్పాటైంది. తమ పరిధిలోకి వచ్చే వస్తువుల ఎగుమతులను పెంచడానికి ప్రతి మంత్రిత్వ శాఖ కృషిచేయాలి. స్వదేశంలో తీసుకొంటున్న ఈ చర్యలకు తోడు విదేశాల్లో చేయాల్సింది ఎంతో ఉంది. ఎగుమతుల వృద్ధికి కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ త్వరలోనే 10 భారత రాయబార కార్యాలయాల్లో ప్రత్యేక విభాగాలను నెలకొల్పనుంది. ఏప్రిల్‌లో దిల్లీలో జరిగిన సమావేశంలో భారత పరిశ్రమల మహా సమాఖ్య (సీఐఐ) ఎగుమతుల వృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. నెలాఖరులో భారత రాయబార కార్యాలయాల అధిపతులతో జరిగే సమావేశంలో వాణిజ్యానికి మరిన్ని ప్రోత్సాహకాలనిచ్చే విషయం చర్చకు రానుంది. ఎగుమతుల వృద్ధికి ఇంకా ఏం చేయాలనేదానిపై వారు చర్చిస్తారు. ఇటీవలి నెలల్లో ఎగుమతులు గణనీయంగా పెరిగినా, అది చాలదు. అవి మరింత భారీగా పెరగాలి. అందుకు సకల విధాలా కృషి చేయాలి.

(రచయిత- కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, పౌర విమానయాన శాఖా మంత్రి)

అవినీతి భల్లూకం పట్టులో...

పుణ్యభూమి

ప్రకృతిలో ఎంత చెట్టుకు అంత గాలి అన్నది ప్రజల నిత్యానుభవం.
ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంత పదవికి అంత అవినీతి అన్నది లంచాల బాధితుల నిరంతర నిర్వేదం!

ఠంచనుగా వేళకు హాజరై, నియమానుసారం కర్తవ్య నిర్వహణకు నిబద్ధమై, బుద్ధిగా తలొంచుకొని సిబ్బంది ఎవరికి వారు సక్రమంగా విధులు నిర్వర్తిస్తుంటే అది, పవిత్ర భారతదేశంలో సగటు సర్కారీ కార్యాలయం ఎందుకవుతుంది? అవసరార్థులై వచ్చినవాళ్లను పదేపదే చుట్టూ తిప్పించుకోవాలి. ఫైలుకిదీ రేటు, పనికింత ఫీజు అని తత్వం తలకెక్కేలా బోధపరచి నిక్కచ్చిగా ముక్కుపిండి పనులు చేయాలి. లంచాలు దండుకోవడంలో, యథాశక్తి మామూళ్లు పిండుకోవడంలో ఏ మాత్రం వెనకంజ వేసినా- ఆసియా ఖండంలో అత్యంత అవినీతిమయ దేశమన్న భారత్ రికార్డుకు ఎక్కడ ముప్పొచ్చి పడుతుందోనన్న వెరపుతో దేశంలో లంచావతారుల వీర విజృంభణ హోరెత్తిస్తోంది. జనజీవన అవసరాలతో నేరుగా ముడివడిన ప్రభుత్వ కార్యాలయాలన్నీ తరతమ భేదాలతో అవినీతిని శ్వాసిస్తూ నిత్య లంచం పచ్చతోరణంగా వర్ధిల్లుతున్నాయి. ఆమ్యామ్యాలు సమర్పించుకోలేనివాళ్ల బతుకుల్ని నరకప్రాయం చేస్తూ పౌరసేవల స్వరూప స్వభావాలనే మార్చేస్తున్నాయి. మీరే చూడండి... భూదస్త్రాల ప్రక్షాళనతో తినమరిగినవాళ్ల అడ్డగోలు చేతివాటమే అందుకు తాజా దృష్టాంతం.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూదస్త్రాల నవీకరణ, కొత్త పట్టా పాస్‌పుస్తకాల పంపిణీల పుణ్యమా అని క్షేత్రస్థాయి సిబ్బంది సందడిగా పండగ చేసుకుంటున్నారు. ప్రాంతాలవారీగా భూముల ధరవరల్లో హెచ్చుతగ్గుల ప్రాతిపదికన ఒక్కో పాస్ పుస్తకానికీ రెండు వేల నుంచి పదిహేను వేల రూపాయల వరకు మామూళ్లు జుర్రుకుంటున్నారు. వారసత్వ బదిలీ, మ్యుటేషన్, భాగపంపిణీ తదితరాల్లో అక్రమాలకు ఆస్కారం ఉన్నచోటల్లా వసూళ్ల దందా పెచ్చరిల్లుతోంది. కొంతమంది గ్రామ రెవిన్యూ అధికారులు, తహసీల్దారుల లీలలు రచ్చకెక్కిన దృష్ట్యా, గుట్టుచప్పుడు కాకుండా పని చక్కబెట్టేసే బాగోతాలకు పట్టపగ్గాల్లేకుండా పోయాయి. కొన్ని నామధేయాలే వెల్లడవుతున్నాయంటే అర్థం- తక్కిన మరెందరో సకలవిధ జాగ్రత్తలూ తీసుకుంటున్నారని! తెలుగు గడ్డమైన పట్టాదారు పాస్ పుస్తకాలనేముంది- పహాణీల జారీ, బిల్డింగ్ ప్లాన్ల మంజూరు, విద్యుత్ మీటర్ల ఏర్పాటు, సర్వీస్ కనెక్షన్ల జారీ... దాదాపు పౌరసేవలన్నీ లంచాల లోగిళ్లుగా భ్రష్టుపడుతున్నా ముసుగులు తొలగుతున్నవాళ్ల సంఖ్య పరిమితంగానే ఉంటోంది. సర్కారీ కొలువంటేనే చేతనైనంత దోచుకోవడానికి జీవితకాల లైసెన్సుగా చలామణీ అవుతున్న రోజుల్లో మౌలిక నిర్వచనాలకు అనుబంధ సూత్రాలు పుట్టుకొస్తున్నాయి. 'ప్రజల వలన ప్రజల చేత ప్రజల కొరకు'గా అభివర్ణించేది ప్రజాస్వామ్యం. 'అధికారుల వలన దళారుల చేత లంచగొండుల కొరకు'గా వర్ధిల్లుతున్నది లంచాల స్వామ్యం!

మొన్నీమధ్యే దేశంలోని పదమూడు రాష్ట్రాల్లో విస్తృత అధ్యయనమొకటి నిర్వహించారు. లంచాలు మేపితేనే తప్ప రకరకాల ప్రభుత్వ సేవలు దక్కడం లేదని, అందులో పాల్గొన్న 27 శాతం కుటుంబాలు గగ్గోలు పెట్టాయి. నోరువిప్పని బాధితులెందరో ఎవరు లెక్కించగలరు? ప్రతి పదిమంది భారతీయుల్లో ఏడుగురు అవినీతి బాధితులేనని 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' సంస్థ మదింపు వేసింది. పోలీస్ ఠాణాలు, దర్యాప్తు సంస్థలు, భూ లావాదేవీలు సహా పదకొండు రకాల సేవల్లో అవినీతి పద్దుకింద దేశంలో ఏటా మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా జమపడుతోందని అది లెక్కకట్టింది. విభాగాలవారీగా లంచాలమేత చురుగ్గా ఉన్న తొలి నాలుగింటా ఉభయ తెలుగు రాష్ట్రాలూ కొలువుతీరగా- లంచాల మేతలో ప్రథమ ర్యాంకు తమిళనాడుకు దఖలుపడింది.

'కొన్ని శాఖలు రెండంకెల అభివృద్ధిని నమోదు చేస్తున్నాయి... రెవిన్యూ విభాగంలోనేమో అవినీతి రెండంకెల్లో నెలకొంది' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ మధ్య వాపోయారు. 'అవినీతి రహిత పాలన అందిస్తా'మని తనవంతుగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లోనే ప్రకటించారు. రెండేళ్లు గడిచాక- ఏపీలో అవినీతి పెరిగిందని 72 శాతం పౌరులు మొత్తుకుంటున్నారు. తెలంగాణలో అంతే శాతం ప్రజలు తాము అవినీతి బాధితులమని వెల్లడించారు. అడపాదడపా ఏసీబీ (అవినీతి నిరోధక విభాగం) దాడుల్లో దొరుకుతున్న చిన్నచేపల వద్దే కోట్ల రూపాయల ఆస్తిపాస్తులు వెలుగు చూస్తుండటం- లంచాలమేత ఎంత భారీ పరిశ్రమగా విస్తరించి స్థిరపడిందో సోదాహరణంగా తెలియజెబుతోంది.

వసూల్ రాజాల శక్తిసామర్థ్యాలను ఇదమిత్థంగా నిర్ధారించగల సరైన కొలమానాలేమీ లేవు. పింఛన్లు, ఉపకార వేతనాలు, భూసమస్యలతోపాటు కడకు శవ పరీక్షల దగ్గరా మామూళ్లు చేతిలో పడనిదే ఎదుటివాళ్లను కదలనివ్వని రాక్షసత్వాన్ని కిలోల్లో టన్నుల్లో తూచగలమా? పదేళ్ల క్రితమే ఒక హెడ్‌కానిస్టేబుల్ ఆస్తుల చిట్టాలో- నాలుగు ఇళ్లు, పందొమ్మిది ఇళ్ల స్థలాలు, దాదాపు పాతిక ఎకరాల భూమి, అరకోటి విలువ చేసే తాకట్టు పత్రాలు బయటపడటం కరీంనగర్ జిల్లాలో గగ్గోలు పుట్టించింది. లంచాల సొమ్ము పంచుకోవడంలో వాటాలు తేలక ఇటీవల అమరావతి పంచాయతీ కమిషనరేట్‌లోని ఇద్దరు అధికారులు తమ కార్యాలయ ఆవరణలోనే బాహాబాహీకి తెగబడటం తీవ్ర కలకలం రేకెత్తించింది. 'చిన్నవాళ్లం... మా దగ్గరేముంటాయ్ సార్?' అని బీద అరుపులు అరిచే దిగువస్థాయి ఉద్యోగుల ఇళ్లలోనూ బయటపడుతున్న నగలు, నగదు, ఆస్తిపత్రాల వివరాలు విశ్వరూపం దాల్చిన అవినీతి వాటావరణానికి మచ్చుతునకలు!

దాడుల్లో పట్టుబడినా, కేసులు పెట్టినా హడలెత్తిపోయే అర్భకులెవరూ లేరిక్కడ. దేశంలో నమోదువుతున్న ప్రతి వంద అవినీతి కేసులలో కేవలం 19 మాత్రమే శిక్షల ఖరారుకు నోచుకుంటున్నాయి. పదిహేనేళ్ల గణాంకాల విశ్లేషణ చాటుతున్న కఠోర యథార్థమిది. కాలం కలిసిరాక పట్టుబడినవాళ్లలో 80 శాతానికి పైగా ఏ శిక్షా పడకుండా దర్జాగా తప్పించుకుంటున్నారన్న మాట. కూపీ లాగుతున్నారనో, నిఘా పెట్టారనో ఉప్పందగానే ఎక్కడికక్కడ బేరాలు, ప్రలోభాలు, సర్దుబాట్లతో జాగ్రత్తపడుతున్న అక్రమార్కులు మరెందరో ఎన్నడూ కచ్చితంగా వెల్లడయ్యే అవకాశమే లేదు.

'భరత ఖండంబు చక్కని పాడియావు... తెల్లవారను గడుసరి గొల్లవారు పిదుకుచున్నారు మూతుల బిగియ కట్టి' అంటూ అలనాటి పరాయి పాలకుల దుర్మార్గాల్ని దౌర్జన్యాల్ని చిలకమర్తి లక్ష్మీనరసింహ కవి అక్షరీకరించారు. కొన్నేళ్లుగా దేశపౌరుల పెడరెక్కలు విరిచికట్టి సర్కారీ కొలువే ఆసరాగా లంచావతారులూ అలాగే దోచుకుంటున్నారు. వాళ్లలో బెదురు పుట్టించే దారేమిటో 'నీతిఆయోగ్' సూచించింది. విజిలెన్స్ కేసుల విచారణ పూర్తి కావడానికి సగటున ఎనిమిదేళ్లు పట్టడం మూలాన లంచాల మేతగాళ్లలో గొప్ప ధీమా ఉట్టిపడుతోంది. స్వల్పవ్యవధిలో ఆ కేసుల్ని చకచకా తెమిల్చేలా ప్రత్యేక న్యాయస్థానాలు నెలకొల్పాలన్నది 'నీతి ఆయోగ్' సూచన. అదొక్కటే సరిపోదు. అవినీతి ఆరోపణలు వచ్చిన సందర్భంలో ప్రాథమిక ఆధారాలున్నట్లు అనిశా నిర్ధారించడంతోనే, అతగాడి ఉద్యోగాన్ని ఊడబెరికి అక్రమాస్తుల్ని స్వాధీనం చేసుకుని లంచావతారుల్ని ఒడ్డునపడ్డ చేపల్లా చేసేలా నిబంధనావళిని ప్రక్షాళించాలి.

పైరవీలతో, పలుకుబడితో, భారీగా ముడుపులు చెల్లించీ ఇతరత్రా ప్రలోభపెట్టీ ఉద్యోగాలు, కీలక బాధ్యతలు దక్కించుకుంటున్నవాళ్లు- అంతకంతా లంచాల రూపేణా కూడగట్టాలని ఉరకలెత్తుతున్నారు. కొమ్మలు విరిచినంత మాత్రాన విషవృక్షం అంతరించిపోదు. అసలది మొలకెత్తకుండానే చూసుకోవడం సర్వోత్తమం. ప్రభుత్వ నియామకాలన్నీ పారదర్శకంగా జరిపి, తీసుకుంటున్న జీతానికి తగ్గట్లు విధ్యుక్త ధర్మం నిర్వహించని సిబ్బంది జీవితమే దుర్భరమయ్యేలా విధివిధానాల్ని పరిపుష్టీకరించాలి. అవినీతి మేతను కట్టడి చేశాకనే సింగపూర్ అద్భుత ప్రగతికి చిరునామాగా ఎదిగింది. గాడి తప్పేవాళ్ల తాటతీసే చొరవ కనబరచిన హాంకాంగ్ సైతం ప్రణాళికాబద్ధంగా పురోగమిస్తోంది. అందుకు విరుద్ధంగా ఇక్కడ పట్టపగ్గాలు లేని అవినీతి పోకడలు, లంచాల భ్రష్ట సంస్కృతి జాతిమూలగను జుర్రేస్తున్నాయి.

జలగలు, పందికొక్కుల లక్షణాల్ని పుణికిపుచ్చుకొన్న అధికార సిబ్బంది, గుత్తేదారులు, దళారుల భరతం పట్టే సమగ్ర ప్రక్షాళనే సుపరిపాలనకు దారి తీస్తుంది. ఏమంటారు?

– బాలు

సాక్షాత్కారం

ఆత్మ సాక్షాత్కారం వేరు, దైవ సాక్షాత్కారం వేరు. మొదటిది జరగడమే కష్టం. అది జరిగితే రెండోది తనంత తానుగానే సంభవిస్తుంది. ఆత్మ సాక్షాత్కారానికి ఆధ్యాత్మికవేత్తలు కొన్ని మార్గాలు సూచించారు.

ఆత్మ సాక్షాత్కారం కలగడానికి పూర్వజన్మ వాసనా బలం కలిగి ఉండాలంటారు కొందరు. సాధకుడి మనసులో తొలుత కొన్ని ప్రశ్నలు ఉదయిస్తాయి. కంటికి కనిపిస్తూ, నిరంతరం పరిణామం చెందుతున్న ఈ సృష్టికి మూలం ఏమిటి, దాని వెనక దాగిన శక్తి ఏమిటి? ఇంత అద్భుతంగా గతి తప్పకుండా సాగుతున్న ఈ కదలికలకు, అనేక చర్యలకు చోదకశక్తి ఏది లాంటి ప్రశ్నలవి. వాటికి సమాధానాలు తెలుసుకోగలిగితే ఆత్మజ్ఞానం కలగడం సులువేనని చెబుతారు ఆధ్యాత్మికవేత్తలు. అవి కచ్చితంగా భాగవతంలో మాత్రమే దొరుకుతాయి.

భాగవతంలో ఏదో ఒక పద్యాన్నో, ఘట్టాన్నో చదవడం మొదలెడితే- ఆపై వారి ప్రమేయం లేకుండానే లోపలికి, ఇంకా లోతులకు తీసుకెళ్లిపోతాయవి. ఆ క్రమంలో పాఠకుల మనసుల్లో ఉత్కంఠ, జిజ్ఞాస బయలుదేరతాయి. మరికొన్ని ప్రశ్నలూ పుడతాయి. ఇలా... భాగవతంలోని విషయం చదువరులను అలౌకిక పరమార్థ స్థితికి చేరుస్తుంది. ఆత్మజ్ఞానం కలగడానికి భాగవతం ఎలా దోహదకారి కాగలదనే సందేహం కలగవచ్చు. దాని ఆవిర్భావానికి దారితీసిన ఘటనలే అందుకు కారణమనే సమాధానమూ ఆ వెంటనే వస్తుంది. అది సంస్కృత భాషలోదా, తెలుగు భాషలోదా అన్న సందేహం అక్కర్లేదు. రెండు భాషల్లోనూ భాగవత ఆవిర్భావ నేపథ్యం అదే.

వ్యాసుడు భారతాన్ని రచించాడు. ఏకరాశిగా ఉన్న వేదాలను వ్యాసం (నాలుగుగా) చేశాడు (అందుకే వేదవ్యాసుడనే పేరు పొందాడు.) పురాణాలు, ఉపపురాణాలు రచించాడు. అయినా ఏదో వెలితి మనసును ఆవరించుకుని ఉంది. స్తబ్ధుగా కూర్చుని ఆలోచనలో పడిపోయాడు. నారదుడు ప్రత్యక్షమై ఎందుకలా ఉన్నావని అడిగాడు. వ్యాసుడు చెప్పాడు. అప్పుడు నారదుడు వ్యాసుడితో- 'నువ్వు ఇంత వరకూ లౌకిక విషయాలకు సంబంధించిన రచనలే చేశావు. పారమార్థిక చింతనను ప్రేరేపించే రచనలు చెయ్యలేదు. ఆ లోటు తీర్చే దిశగా ప్రయత్నాలు చెయ్యి' అని సలహా ఇచ్చాడు. ఆ మాటను సాక్షాత్తు విష్ణుమూర్తి చెప్పిందిగా భావించి (నారదుడు విష్ణు అంశ సంభూతుడని, ఆయన ధరించిన ఇరవై ఒక్క అవతారాల్లో ఇదీ ఒకటనే అభిప్రాయం ప్రచారంలో ఉంది) భాగవత రచనకు పూనుకొన్నాడు.

అనువాదానికి సిద్ధమైనప్పుడు పోతన పరిస్థితీ అదే. నారాయణ శతకం, భోగినీ దండకం



అంతర్యామి

మొదలైన గ్రంథాలను రచించాడు. అయినా ఏదో అసంతృప్తి తొలుస్తోంది. మనశ్శాంతి కోసం గోదావరి తీరంలో సైకత వేదిక మీద పద్మాసనం వేసుకుని ధ్యానంలో కూర్చున్నాడు. ఆ క్షణంలో ఆయన పక్కన తళుక్కున ఒక మెరుపు మెరిసింది. ఉత్తర క్షణంలో శ్రీరామచంద్రమూర్తి 'శ్రీమహాభాగవతాన్ని తెలిగించు, నీ భవబంధాలన్నీ తొలగిపోతాయి' అని పలికి అంతర్ధానమైపోయాడు. కర్తవ్యం బోధపడింది. ఆనంద పరవశుడై- పలికేది భాగవతం, పలికించేవాడు రామభద్రుడు, (కాబట్టి) నేను పలికితే పాపాలను హరించే కావ్యం అవుతుంది. (ఇన్ని లాభాలు ఉన్నప్పుడు) భాగవతాన్ని కాకుండా వేరే విషయాన్ని ఎందుకు పలుకుతాను (పలకను) అని ఆంధ్రీకరణకు పూనుకొన్నాడు. ఈ భాగవతాన్ని భవిష్యత్తులో చదివేవారెవ్వరైనా ఆధ్యాత్మిక మార్గానికి మరలాలని అభిలషించాడు. అందుకు తగ్గట్లు అందులో ఎన్నో సూక్తులు, బోధనలు, భక్తి భావనా విషయాలు, భగవంతుడి కథలు, లీలలు వంటి ముక్తిదాయక విషయాలు చెప్పారిద్దరూ.

ఇలా... ఆత్మ సాక్షాత్కారం పొందిన దరిమిలా దైవ సాక్షాత్కారమై వ్యాసుడు, పోతన రచించి, అనువదించిన పురాణమే భాగవతం. అందుకే భాగవతాన్ని చదువుతున్నప్పుడు ఎవరైనా ఏ భేదాలు లేకుండా కేవలం భక్తిభావం కలిగి ఉంటారు. అలా నిర్వికార, నిరామయ చిత్తంతో పారాయణ చేసేవారు ఆత్మసాక్షాత్కారం పొందినవారుగా మారిపోతారు. ఫలితంగా వారికి ఆముష్మిక భావనే తప్ప ఐహిక భావనలుండవు!

– అయ్యగారి శ్రీనివాసరావు

వితంతు వివక్ష.. ఓ మూఢాచారం

- మార్పు కుటుంబ సభ్యుల నుంచే ప్రారంభమవ్వాలి
- రాష్ట్ర స్థాయి వితంతువుల మహాసభలో వక్తల పిలుపు
- ఏపీ, తెలంగాణ నుంచి భారీగా తరలివచ్చిన మహిళలు

ఈనాడు – అమరావతి

వితంతు వివక్ష విముక్తికి పోరాట గోడపత్రికను విడుదల చేస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, వివిధ మతాలు, బాలవికాస ప్రతినిధులు, కార్యక్రమానికి హాజరైన వితంతువులు

వితంతువులు ఎదుర్కొంటున్న వివక్షను వారి నోట వింటుంటే హృదయం ద్రవించి పోతోందని మహిళా కమి ఎంపీ కొనకళ్ల నారాయణ సహా పలువురు ప్రజాప్రతినిధులు, సర్వ మత గురువులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రతి కుటుంబంలోనూ ముందుగా మార్పు రావాలన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మైదానంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి వితంతువుల మహాసభను శనివారం నిర్వహించారు. జూన్ 23న అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోనే తొలిసారిగా వేల మందితో భారీఎత్తున నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి కూడా భారీసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ముఖ్యఅతిథి ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ...బాల్య వివాహాలను అరికట్టేందుకు ఎంత కఠిన చట్టాలు అమలు చేస్తున్నామో, వితంతువులను హింసించేలా ఆచరిస్తున్న కట్టుబాట్లవిషయంలోనూ అలాగే చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంలో బాలవికాస సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సభలో చేసిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ.. భర్త చనిపోయిన మహిళలు బొట్టు, గాజులు, పూలను తీసేయాలనే మూఢాచారం నేటికీ కొనసాగడం బాధాకరమన్నారు. ఒక మహిళగా ఇలాంటి కార్యక్రమానికి హాజరవడం గర్వంగా భావిస్తున్నానని కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ అన్నారు. మహిళను ఆరాధించే పుణ్యభూమి మనదని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బాల వికాస వ్యవస్థాపకురాలు బాల థెరిసా జింగాస్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నాలుగు కోట్ల మంది వితంతువులు 50 ఏళ్లలోపు వారు ఉంటే.. ఏపీలో 18 లక్షలు, తెలంగాణలో 16లక్షల మంది ఉన్నారన్నారు. వితంతువైన తల్లి పెట్టే అన్నం, ఇచ్చే ఆస్తి, పంచే ప్రేమలో లేని దోషం, ఆమె ఇచ్చే దీవెనలో ఎందుకు దర్శిస్తున్నామనే విషయం ప్రతి ఒక్కరూ ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

తీర్మానాలివీ..

వితంతువుల సంక్షేమానికి సంబంధించి అమలు చేయాల్సిన పలు తీర్మానాలు చేశారు.

★ ప్రస్తుతం వితంతువులకు ఇస్తున్న రూ.వెయ్యి పింఛను చాలడం లేదు. వారికోసం ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

★ పునర్వివాహాలు చేసుకునే వారికి ప్రోత్సాహకాలు అందించాలి.

★ అంతర్జాతీయ మహిళా దినోత్సవం మాదిరిగానే.. వితంతు దినోత్సవాన్ని సైతం నిర్వహించాలి.

★ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలలో వితంతువులతో కొబ్బరికాయ కొట్టించి ప్రారంభిస్తే.. మిగతా అందరిలోనూ మార్పు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

కార్యక్రమంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మత గురువులు పాల్గొని వితంతు మూఢాచారాలను రూపుమాపాలంటూ గళమెత్తారు.

ప్రాజెక్టు నివేదిక సమర్పించండి

- విశాఖ తీరంలో ప్రాజెక్టుపై రిలయన్స్‌ను కోరిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: విశాఖ జిల్లాలో నెలకొల్పే ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక (డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) ఇవ్వాలని రిలయన్స్ సంస్థను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీని ఆధారంగా భూకేటాయింపు, రిజిస్ట్రేషన్‌పై తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. నావికాదళ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశాఖ తూర్పు తీరంలో ప్రత్యేక ఇంజినీరింగ్ ప్రాజెక్టును తలపెట్టారు. 2016 జనవరిలో రిలయన్స్‌కు చెందిన అనిల్ అంబానీ గ్రూపు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. షిప్ బిల్డింగ్, ఇతరత్రా యూనిట్ల ఏర్పాటుకోసం ప్రాథమికంగా రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకని విశాఖ జిల్లాలో వెయ్యి ఎకరాల సమీకరణకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఏపీఐఐసీ ఎకరా రూ.25 లక్షలకు పైగా రైతులకు చెల్లించి భూమిని సేకరిస్తోంది. మరోవైపు, ఎకరా రూపాయి ధరకు 99 ఏళ్ల లీజుకు భూములు కేటాయించాలని రిలయన్స్ కోరుతోంది. ఎక్కువ మొత్తానికి రైతుల నుంచి సేకరించి ఎకరా రూపాయి లీజుకి ఇవ్వడం ఎలాని ఇప్పటికే తర్జనభర్జనలు మొదలయ్యాయి. రిలయన్స్ నుంచి సకాలంలో డీపీఆర్ రాకపోతే అదే భూమిలను ఇతర పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించాలని యోచిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

జగన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి: మంత్రి నక్కా

ఈనాడు, అమరావతి: వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిన వైకాపా అధ్యక్షుడు జగన్‌పై తక్షణం ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టంకింద (అట్రాసిటీ) కేసు పెట్టాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. సంక్షేమం అంటే ఏమిటో వైకాపా నేతలకు తెలుసా అని ప్రశ్నించారు. పల్లెలకు వస్తే అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపుతామని, దళితుల సంక్షేమానికి ఎవరేం చేశారో దమ్ముంటే చర్చకు సిద్ధం కావాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను రికార్డు స్థాయిలో 97.52శాతం ఖర్చు పెట్టామన్నారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' ప్రవేశాలను లాటరీ ద్వారా ఎంపిక చేసే విధానాన్ని ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 9,000 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా ప్రతిభ ప్రాతిపదికన ఐదో తరగతికి 4,050 మంది, ఒకటో తరగతికి 2,600 మంది ఎంపికయ్యారని మంత్రి వివరించారు.

వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టి ఉంచిన ప్రదేశం వద్దే పడుకున్న పోలీసులు ★ అమరావతి నమూనా వద్ద దుస్తులు ఆరబెట్టుకుంటున్న పోలీసులు

పవిత్ర మట్టిని... పట్టించుకోరా!

ఎన్నో ఆశలతో ప్రజా రాజధాని అమరావతికి 2015 అక్టోబరు 2న ఉద్దండ్రాయునిపాలెం వద్ద భూమి పూజ నిర్వహించారు. దేశంలోని 80 పవిత్ర స్థలాల నుంచి, రాష్ట్రంలోని 13 వేల పంచాయతీల నుంచి, 3 వేల వార్డుల నుంచి మట్టిని తీసుకువచ్చి, ఆ మట్టిలో 35 నదుల నుంచి తెచ్చిన పవిత్ర జలాలను కలిపి పవిత్రంగా ఒకచోట కలిపి ఉంచారు. ఈ ప్రాంతాన్ని, రాజధాని నమూనా ప్రదేశాన్ని చూసేందుకు కొన్నాళ్ల పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రదేశాలనుంచి పర్యాటకులు వచ్చారు. అయితే ఆ ప్రదేశానికి భద్రతకు కేటాయించిన పోలీసులకు కనీస వసతి కల్పించలేదు. మట్టివద్దే నిద్రించాల్సిన దుస్థితి. నమూనా కోసం ఏర్పాటు చేసిన షెడ్డునే వీరంతా వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. రాజధాని నమూనా వద్దే పోలీసులు విడిచిన దుస్తులు వేస్తూ, ఆరబెట్టుకోవాల్సిన దుస్థితి. ప్రస్తుతం అక్కడ ఎలాంటి నిర్మాణం లేకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. పర్యాటకుల సంఖ్య కూడా బాగా తగ్గిపోయింది. – ఈనాడు, అమరావతి

హైకోర్టు భవనానికి టెండర్లు

రూ.699.10 కోట్ల అంచనా

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో హైకోర్టు భవన నిర్మాణానికి సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. రూ.699.10 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించింది. ప్రభుత్వ భవనాల సముదాయం బ్లాక్ ఎఫ్‌లో పునాది, గ్రౌండ్‌ఫ్లోర్‌తోపాటు ఏడు అంతస్తుల్లో దీన్ని నిర్మించాల్సి ఉంటుంది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ఈ నెల 29 సాయంత్రం 4 గంటల నుంచి టెండరు దరఖాస్తులు తీసుకోవచ్చని గుత్తేదారు సంస్థలకు సూచించింది. జులై 25 సాయంత్రం 3 గంటలలోగా దాఖలు చేయాల్సి ఉంటుంది. సాంకేతిక బిడ్లను అదే రోజు సాయంత్రం 4 గంటలకు పరిశీలిస్తారు. ఆర్థిక బిడ్లను జులై 30న తెరిచి పరిశీలిస్తారు.

పవన్‌తో నాదెండ్ల మనోహర్ భేటీ

ఈనాడు, అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో శాసనసభ మాజీ సభాపతి నాదెండ్ల మనోహర్, పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్‌లు శనివారం భేటీ అయ్యారు. విజయవాడ పటమటలంకలోని పవన్ కల్యాణ్ ఇంటికి వచ్చిన వారిరువురు దాదాపు 30 నిమిషాల పాటు ఆయనతో సమావేశమయ్యారు. రాజధానిలో నూతనంగా నిర్మించిన దశావతార వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరైనందున కృతజ్ఞతలు తెలిపేందుకే పవన్‌ను కలిసినట్లు నాదెండ్ల మనోహర్ "ఈనాడు"కు తెలిపారు. ఇది మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని అన్నారు. అలాగే ఆదివారం జరగనున్న స్వామివారి కల్యాణ మహోత్సవానికి రావాలని పవన్‌ను ఆహ్వానించినట్లు సమాచారం.

చింతలపల్లిలో ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న జగన్

ప్రజాసంకల్పయాత్రకు వర్షం అంతరాయం

- ఉదయం నిలిచిన జగన్ పాదయాత్ర
- ఒలింపిక్ రన్ ప్రారంభించిన వైకాపా అధినేత

రాజోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రకు శనివారం వర్షం కారణంగా అంతరాయం ఏర్పడింది. తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలంలోని చింతలపల్లి గ్రామం నుంచి ఉదయం ప్రారంభం కావాల్సిన ఈ పాదయాత్ర కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు జగన్ బసచేసిన ప్రదేశానికి పెద్దఎత్తున చేరుకున్నారు. అయితే ఉదయం వర్షం కురవడంతో పాదయాత్ర నిలిచిపోయింది. ఒలింపిక్‌డే సందర్భంగా వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు అధిక సంఖ్యలో జగన్ బసచేసిన ప్రదేశానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా అక్కడ జిల్లా పరిషత్తు మాజీ ఛైర్మన్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జగన్ ఒలింపిక్ జ్యోతిని వెలిగించారు. జెండా ఊపి ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు పాదయాత్ర ప్రారంభించిన జగన్.. చింతలపల్లి నుంచి కూనవరం మీదుగా 4 కిలోమీటర్ల దూరంలోని ములికిపల్లి ప్రధాన కూడలికి చేరుకున్నారు. అక్కడ మహిళలు, యువతతో ముచ్చటించారు. వారి సమస్యలు విన్నారు. తర్వాత స్థానికంగా ఏర్పాటు చేసిన బసకు చేరుకున్నారు.

జగన్‌కు రాజకీయ పెద్దన్న కన్నా: కాలవ శ్రీనివాసులు

ఈనాడు డిజిటల్, అమరావతి: జగన్‌కు రాజకీయ పెద్దన్నగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వ్యవహరిస్తున్నారని మంత్రి కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. ఏపీని అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటున్న జగన్‌కు సాయపడేందుకే భాజపా కన్నా లక్ష్మీనారాయణను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిందని ఆరోపించారు. వైకాపాలో చేరదామని అన్ని ఏరాట్లు చేసుకున్న ఆయన ఉన్నట్టుండి భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులవ్వడంతోనే భాజపా ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందో అర్థమవుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మళ్లీ అధికారమిస్తే రాష్ట్రాన్ని లూటీ చేస్తారని కన్నా వ్యాఖ్యానించడం దీనికి మరింత బలం చేకూరుస్తోందని విమర్శించారు. ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాలులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. భాజపా, జగన్, పవన్ ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా అత్యధిక శాసనసభ స్థానాలతోపాటు 25 లోక్‌సభ స్థానాలు గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

బాలికపై 6 నెలలుగా అత్యాచారం

నిజామాబాద్‌లో ఓ బాలుడి దురాగతం

నిజామాబాద్ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ బాలికపై బాలుడు అత్యాచారానికి పాల్పడటమే కాకుండా దాన్ని సెల్ఫీ వీడియో తీసి మిత్రులకు పంపించడం.. ఆ సాకుతో బెదిరిస్తూ ఆర్నెళ్లుగా అఘాయిత్యానికి పాల్పడుతున్న ఘటన నిజామాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన పదో తరగతి బాలిక(15)కు వారి ఇంటి పక్కనే ఉండే ఇంటర్ పూర్తయిన విద్యార్థి(17)తో పరిచయం ఉంది. ఆరు నెలల కిందట బాలిక పుట్టినరోజు ఉండగా ఆ బాలుడు తన స్నేహితులతో కలిసి ఆమెను బయటకు తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రాంతంలో కేక్ కట్ చేసి తిరిగి ఇంటి దగ్గర దింపాడు. ఆ సమయంలో తీసుకొన్న చిత్రాలు, వీడియోలతో బెదిరింపులకు పాల్పడుతూ.. బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో తరుచూ వెళ్లి లొంగదీసుకున్నాడు. దీన్ని కూడా సెల్ఫీ వీడియోలో చిత్రీకరించి అతని మిత్రులకు వాట్సాప్‌లో పంపించాడు. బాలిక తండ్రి చరవాణి ఇటీవల చోరీకి గురవడంతో ఇంట్లో ఉన్న మరో చరవాణిని ఉపయోగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఈ నంబరుకి సదరు బాలుడు పలుమార్లు ఫోన్ చేయగా.. బాలిక తండ్రికి అనుమానం వచ్చి ఆరాతీయటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

భాజపా కుట్ర రాజకీయాలను బయటపెడతాం

- విభజనచట్టంలోని అన్ని అంశాలను కేంద్రం నెరవేర్చాల్సిందే
- సీఎం రమేష్ నిరశన దీక్షలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు
- పవన్ ధోరణి షూటింగ్ అయ్యాక విశ్రాంతి తీసుకున్నట్లుందని విమర్శ

ఈనాడు – కడప

దీక్షలో ప్రసంగిస్తున్న కళా వెంకట్రావు. వేదికపై ఎంపీ సీఎం.రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి

భాజపా కుట్ర రాజకీయాలను బయటపెడతామని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళా వెంకట్రావు అన్నారు. విభజనచట్టంలోని అన్ని అంశాలను కేంద్రం నెరవేర్చాల్సిందేనని కాదంటే తెలుగువారి ఆత్మగౌరవ సత్తా చాటుతాం అన్నారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాకు ఉక్కు పరిశ్రమ అవసరం చాలా ఉందన్నారు. కడపలో రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి ఉక్కుపరిశ్రమ సాధన కోసం చేపట్టిన ఆమరణదీక్ష శనివారం నాలుగోరోజుకు చేరుకుంది. మద్దతు తెలపడానికి వచ్చిన కళా వెంకట్రావు మాట్లాడుతూ ఇంత ప్రధానమైన అంశంపై జిల్లావాసిగా ఉన్న వైకాపా అధినేత జగన్ నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. విభజనచట్టం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తుంటే.. కేంద్ర మంత్రి పీయూష్‌గోయెల్ చట్టం చదవాలని చెబుతున్నారన్నారు. మరి ఏ చట్టం చదివి మోదీ తిరుపతిలో, అరుణ్‌జైట్లీ రాజ్యసభలో మాట్లాడారో చెప్పాలన్నారు. సినిమా షూటింగ్ అయ్యాక నటులు విదేశాల్లో విశ్రాంతి తీసుకున్నట్లు, పవన్ మూడురోజులకోసారి బయటకొచ్చి మాట్లాడుతున్నారని విమర్శించారు. భాజపా నేతలు కన్నా లక్ష్మీనారాయణ, సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి కడపలో ప్రధానితో ఉక్కుపరిశ్రమకు శంకుస్థాపన చేయిస్తామని ఓ చోట.. ప్రభుత్వం వసతులు కల్పించడంలేదని మరోచోట మాట్లాడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అసలు ప్రభుత్వం వసతులు కల్పించకుంటే ప్రధానితో ఎలా శంకుస్థాపన చేయిస్తామన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కు ఉద్యమం విశాఖ ఉక్కు పోరాటాన్ని తలపిస్తోందని మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. సీఎం రమేష్ దీక్ష చరిత్రాత్మకమని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇది జిల్లా సమస్య కాదు రాష్ట్ర సమస్యని మరో మంత్రి అమర్‌నాథరెడ్డి అన్నారు. మెకాన్, సెయిల్ ఈ పరిశ్రమ ఏర్పాటుకు సానుకూల నివేదిక ఇచ్చినా కేంద్రం స్పందించడంలేదన్నారు. కార్యక్రమంలో కడప, అనంతపురం జిల్లాలకు చెందిన తెదేపా నాయకులు తదితరులు పాల్గొని మద్దతు పలికారు.

క్షీణిస్తోన్న ఆరోగ్యం: దీక్ష చేస్తోన్న సీఎం రమేష్, బీటెక్‌రవి ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోంది. రమేష్‌కు గ్లూకోజ్ స్థాయి 62ఎంజీ బీటెక్‌రవికి 59ఎంజీ ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితిపై స్థానిక యంత్రాంగం జిల్లా కలెక్టర్, ఎస్పీకి సమాచారం ఇచ్చింది.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Roc.No:TTD-34022(31)/119/2018-Procurement Sec-TTD తేది: 23-06-2018.

టి.టి.డి., తిరుపతి మార్కెటింగ్ విభాగం వారిచే కాటన్ బ్లౌజ్ పీసులు సేకరణ కొరకు ఈ-టెండర్లు కోరడమైనది. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలకుగాను లాగాన్ అవ్వవలసిన వెబ్‌సైట్ : http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in. కరెంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి ఆపై "మోర్" మరియు "తిరుమల తిరుపతి దేవస్థానములు- మార్కెటింగ్"ను ఎంపిక చేసుకోవాలి. తదుపరి వివరాలకుగాను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 0877- 2264079, 2264555. ఫ్యాక్స్ నెం.0877-2264554.

క్ర. సం.	ఐటమ్ పేరు	ధరావతు (రూ.లు)	టెండరు కాలము	టెండరు తేది: టెక్నికల్ బిడ్	టెండరు తేది: ఫైనాన్షియల్ బిడ్
1.	1,42,000 సంఖ్యల కాటన్ బ్లౌజ్ పీసులు	1,95,000 (ఒకలక్ష తొంభై అయిదువేల రూపాయలు మాత్రమే)	ఆరు నెలలు	07-07-2018 మ.3.30 గంIIలకు	07-07-2018 సా. 4.30 గంIIలకు

Roc.No.PR4/1090/Adv.No.126/PRO/2018, Dated: 23.06.2018. – కార్యనిర్వహణాధికారి

AMARAVATI DEVELOPMENT CORPORATION LTD.,
PLOT NO.25 SECTOR:4, LOTUS LAND MARK, KEDARESWARAPET, VIJAYAWADA – 520003 (A.P.)

CIN-U93000 AP 2015 SGC105535

RFP. Notice No.13/CE/ADCL/Engg/2018-19 Dt.21.06.2018

REQUEST FOR PROPOSAL

Amaravati Development Corporation Limited (ADCL) invites " Request for Proposal" (RFP) from reputed Agencies or Bidders with Proven Track record for supply of UNIQUE TREES (As per Specifications mentioned in RFP document) to different locations of ADCL/ Amaravati Capital City Area, as per terms and conditions laid down in RFP document (under Two Cover System). Renowned "Agencies" or "Bidders" with proven track record in similar works can download "RFP Document" w.e.f 25-06-2018 from ADCL website, i.e. www.ccdmc.co.in The filled in "RFP Document" should reach to HoD & Dy. Conservator of Forests, UG & F Wing, ADCL, Vijayawada. Plot No: 25, Sector: 4, Road No: 4, Lotus Land Mark, Kedarewarapet, Ayodhyanagar, Vijayawada-520003, Andhra Pradesh, **before 3:00 PM on or before 10-07-2018.** For further Information if any may contact Sri. Y. Srinivasa Reddy, Deputy Conservator of Forests, ADCL, Mobile No: 7095599886

Sd/- Chairperson & Managing Director, ADCL, Vijayawada

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P)

E Procurement Tender Notice

NIT No. 27/PROC/CRDA-13021(36)/12/2018-DEE 29 – USI - APCRDA Dated: 23.06.2018

Name of Work : "Investigation, Design and Construction of Civil structure (sub structure & super structure) works for High Court building of Basement + ground + 7 floors (B+G+7) including earthwork, pile, raft foundations, RCC framed structure consisting of Retaining wall, shear/core wall, Slabs, beams, PT Slabs & beams, Ridge beams, inclined columns, using modular/system formwork, reinforcement works, waterproofing and other miscellaneous works complying to the requirements of GRIHA five star rating certification for High court building in Super block "F" of Amaravati Government Complex area in Amaravati Capital City, Andhra Pradesh on Design Build Item rate contract." – **ECV :Rs. 699.10 Crores**

The bid can be downloaded on AP e-procurement portal from **29.06.2018 to 25.07.2018 up to 14.00 Hrs.** Due date for submission of Bid **25.07.2018 up to 15.00 Hrs,** Technical bid opening **25.07.2018 @16.00Hrs.** Financial Bid Opening **30.07.2018.** For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

For any further clarifications contact Sri.M.Zacharaiah, Director(H&B) +91-7095599842, zacharaiah.m@apcrda.org

Sd/- Commissioner, APCRDA

గాలి, జగన్ లబ్ధి కోసమే కొర్రీలు

- ఉక్కు పరిశ్రమపై భాజపా, వైకాపాలది వికృత క్రీడ
- కేంద్రం తీరుపై ఎంపీ సీఎం రమేశ్ బహిరంగ లేఖ

ఈనాడు డిజిటల్, అమరావతి: ఓబుళాపురం గనుల్లో గాలి జనార్దన్‌రెడ్డి, జగన్‌కు లబ్ధి చేకూర్చేందుకు కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ ఆరోపించారు. గత ఏడాది టీజీ వెంకటేశ్‌తో కలిసి తాను రాజ్యసభలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై అడిగిన ప్రశ్నకు కేంద్రం సానుకూలంగానే స్పందించిందని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం భాజపా, వైకాపాలు కలిసి ఆడుతున్న ఈ వికృత క్రీడలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై వైకాపా అధినేత జగన్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కడప ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరుపై శనివారం ఆయన ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. "సుమారు యాభై ఏళ్ల క్రితం జరిగిన విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించినట్లే, ప్రస్తుతం కడప ఉక్కు కర్మాగారం కోసం జరుగుతున్న ఉద్యమం అదే ప్రభావం చూపనుంది. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం కడపలో ఉందని మెకాన్ కమిటీ నివేదిక ఇచ్చినా పరిశ్రమ నెలకొల్పడం సాధ్యం కాదనడం తెలుగుజాతిపై కక్ష సాధింపు చర్యలకు దిగటమే. నిరుడు జూన్ 12న దీనిపై కేంద్రం వివరణ అడిగితే రాష్ట్రం ఇవ్వలేదని భాజపా నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారు. ఆరుసార్లు జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశాల్లో వారు అడిగిన ప్రతి అంశానికి ఏపీ ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. దురుద్దేశంతో క్లారిఫికేషన్ పేరిట నాలుగేళ్లు కాలయాపన చేసి మోసం చేశారు" అని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తెదేపా రాజీపడే ప్రసక్తే లేదని సీఎం రమేశ్ స్పష్టం చేశారు.

మోదీ ఏ మాత్రం స్పందించడం లేదు!: ఎంపీ జేసీ

అనంతపురం, న్యూస్‌టుడే: "ఉక్కు పరిశ్రమ కోసం మావాడు (ఎంపీ సీఎం రమేష్) ప్రయత్నం చేస్తున్నాడు. అతను వంద శాతం విజయం సాధిస్తాడు. సమస్య తీవ్రతను కేంద్రానికి తెలియజెప్పడానికి దీక్షలు చేయాల్సిందే. కానీ.. నేను ఒక్కటే చెబుతున్నా. ప్రధాని మోదీ తీరు దున్నపోతుపై వర్షం కురిసినట్లుంది. ఆయన ఏ మాత్రం స్పందించడం లేదు. ఈ సమయంలో ఇలాంటి ఆందోళనలతో ఆరోగ్యం చెడిపోతుందని చెప్పానే తప్ప.. దీక్షలు చేయొద్దని అనలేదు" అని అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అనంతపురంలో మాట్లాడుతూ.. అనిశా పేరు చెప్పి కొందరు అధికారులను, ఉద్యోగులను బెదిరిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలంటేనే కష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. పలువురు ప్రజాప్రతినిధులు సైతం అధికారులను భయపెడుతున్నారని.. ఇలాచేయడం వారికి తగదని ఆయన స్పష్టం చేశారు.

బీఎస్సీ డిగ్రీ విద్యార్థికి ఆంధ్ర విశ్వవిద్యాలయం జారీచేసిన బీకాం పట్టా

బీకాంలో కెమిస్ట్రీ!

విశాఖపట్నం, న్యూస్‌టుడే: డిగ్రీలో సైన్స్ సబ్జెక్టులు చదివిన విద్యార్థికి బీకాం (బ్యాచురల్ ఆఫ్ కామర్స్) ఒ.డి. (ఒరిజినల్ డిగ్రీ) జారీచేసి తన నిర్లక్ష్యాన్ని నిరూపించుకుంది ఆంధ్ర విశ్వవిద్యాలయం. ఈ నెల 18న ఏయూ పరీక్షల విభాగం జారీచేసిన ఒ.డి.లో ఈ తప్పు దొర్లింది. ధ్రువీకరణపత్రాల జారీ నుంచి పరీక్షల నిర్వహణ వరకు ఏయూలో నిత్యం అపశ్రుతులమయమే. పార్ట్-1లో ఆంగ్లం, తెలుగు, హెచ్‌సి సబ్జెక్టులు, పార్ట్ 2లో కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులు అభ్యసించినట్లుగా పేర్కొంటూ బీకాం ఓడీ పత్రం జారీ చేసింది. పట్టా జారీ చేసి విద్యార్థి చేతికి అందాక తప్పులు చోటు చేసుకున్న విషయాన్ని గుర్తించిన అధికారులు గుట్టుగా ఆ ధ్రువీకరణ పత్రాన్ని సరిచేసి అందించే పనిలో పడ్డారు.

మతోన్మాద శక్తులు చెలరేగిపోతున్నాయి

కారెం శివాజీ

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: భాజపా హయాంలో దేశంలో మతోన్మాద శక్తులు చెలరేగిపోతున్నాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో దళితులపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు భాజపా కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే రాష్ట్రపతిని కలిసి ఆ చట్టాన్ని తొమ్మిదో షెడ్యూల్లో కలపాలని కోరామని, వర్షాకాలపు సమావేశాల్లోగా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు.

EDUCATION
★ Ag. BSC SEATS AVAILABLE- ICAR COLLEGES IN MAHARASTRA ✆ 7993680148/ 9100948360

Admissions for BAMS, BHMS, BNYS Courses
Management seats are available in A.P. for the Academic year 2018-19
Contact: 9440663157 - 9849281540 9573458000 - 9441145356

B.Sc (Hons) Agri
Recog. by UGC, State Higher Education
Eligi : All Govt., Private Jobs
NO EAMCET, NO DONATION
www.sunagbsc.org
99492 63343

FOR SALE

PC600-8 Shovel (Komatsu make)
- Bucket Capacity 4.0 Cu. mtr
- Life till date 14623 hrs still it is in working condition.

Interested parties may send quotations.
Mr. K.V.Ramana, Sr. Vice President (Mines)
Cell: 9912229204
e-mail: ramanakv@sagarcements.in
SAGAR CEMENTS LTD., Mattampally (V&M), Suryapet (Dt), Talangana State - 508 204

MBBS
Ministry Of Health Of Russia
SMOLENSK STATE MEDICAL UNIVERSITY
Invites Indian students for direct Government Admissions
Recognized by India, WHO, USA & UK, Min. Qual.-50% in XII in PCB
UNIVERSITY- Founded in 1920, Very high standards of education, English Medium in all years, 1050 Indian students (430 Girls) studying, 125 got degree in 2018 Closed campus, 8 hospitals (6000 Beds).
MCI SCREENING TEST- Our graduates of 2008 to 2017 have given BEST results among graduates of all foreign medical colleges (Official web sites of Indian Embassy, Moscow and NBE, New Delhi who conducts Screening Test confirm this).
HOSTELS- 2 and 4 seated big rooms, separate blocks for boys and girls.
INDIAN MESS - Mess with Indian food cooked by Indian cooks.
Fee (Tuition+Hostel+Med.Ins.) - USD 6000/year (App. Rs. 4,00,000/-) and one time payment of Rs.1,50,000/- (By Bank Draft only) which includes – Admission, student visa fee, air ticket Delhi - Moscow.
Bank loans are available. Scholarship for topper students.
Contact: Dr. Aeron, Tel: Russia +79605805555
Official Internet Site:www.sgmu.info
Information Centers in A.P. (Parents of Students)
Vijayawada: Mr. Naga Babu Chennu – 9912061976
Vishakhapatnam: Mr. Paparao Bandi - 9441575976
Kakinada: Mr. Paparao Bandi – 9441575976
Tirupati: Mrs. M. Sujatha Naidu - 9491772471

వధువు కావలెను

Kapu 28 6' BE (BITS) MS MNC 20 LPA ★ 27 6' BE MS (IIIT) MNC 26 LPA ★ 28 5'11" BE MBA MNC 26 LPA 10Cr ★ 27 6' BE MS 140K 10Cr ★ 25 5'9" MS ★ 8790017711 (A)

కాపు డైవర్సీ 36 సం॥ 5'9" పుణేలో SWE 1L.P.M గల వరుడికి P.G చేసిన తగిన అమ్మాయి కావలెను. సంప్రదించండి (డైరెక్ట్) ✆ 9700127397/ 9000100567 (A)

కమ్మ Now in India 34 5' 11 CPA Australia Citizen 70K 3 Cr వరునకు తగిన కమ్మ వధువు కావలెను. (డైరెక్ట్). ✆ 94944 19511. (B)

కాపు: B.Tech/ 5'8"/ 25 Y/ V.Fair/ 25 కోట్ల ఆస్తి/ 60 వేల జీతంతో Govt. జాబ్ చేస్తున్న వరునికొరకు (అర్జంట్)గా సంప్రదించండి. ✆ 90320 94810 ★ 92485 37764. (B)

ఆర్యవైశ్య/ 27/5'6"/ 6L/ 15 కోట్లు & 36/ 5'7"/ 5L 2 కోట్లు/ రెండోపెళ్ళి/ 37/ 5'9"/ 11L/ 5 కోట్లు & 40/ 5'6"/ 30L/ 6 కోట్లు/ "మా సేవ" మ్యారేజ్‌బ్యూరో ✆ 9291503949 (A)

రెడ్డి/ M.Tech/ C. Govt. Asst. మేనేజర్ (FCI)/ 11 Lakhs PA/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014. (A)

మాల/ M.Tech/ C. Govt. J.E. (రైల్వే)/ 12 Lakhs P.A./ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9703794175. (A)

కుమ్మరి/ B.Tech MBA/ C. Govt. డిప్యూటి మేనేజర్ (SBI)/ 12 Lakhs P.A./ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9989450693. (A)

బెస్త/ M.Tech/ Govt. గ్రూప్-I ఆఫీసర్ (MPDO)/ 90,000/- PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8886957298. (A)

క్రిస్టియన్ మాదిగ/ M.Tech, NIT/ Govt. AEE (జెన్‌కో)/ 1 Lakh P.M./ 5'11" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014. (A)

పద్మశాలి/ B.Tech/ C. Govt. J.T.O. (BSNL)/ 70,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678. (A)

రజక/ B.Tech, MBA/ C.Govt. Asst. మేనేజర్ (SBI)/ 65000/-PM/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9581317506 (A)

మాదిగ/ B.Tech/ C.Govt Asst. Exq. ఇంజనీర్ (BHEL)/ 75000/-PM/ 5'9" ఎత్తు/ 29సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9642459724 (A)

గౌడ (కట్నప్రసక్తిలేదు) 27/ 5'10" B.Tech/ SWE/ Deloitte 15lakhs P/A అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246964555 (A)

వైశ్య 27 5'7" B.Tech Airforce C.Govt Job 1Lakh PM వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. ✆ 9618483383 (A)

వడ్డెర (కట్నప్రసక్తిలేదు) 27/ 5'10" B.Tech/ SWE/ TCS 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246555529 (A)

గౌడ, కుల, కట్నప్రసక్తిలేదు. (2వపెళ్ళి) 36/ 5'10" B.Tech/ MS/ SWE/ 1.5L PM సొంత ప్రాపర్టీగల వరుడికి అందమైన ఎడ్యూకేటెడ్ వధువు కావలెను. చాలా అర్జెంట్. ✆ 9550296562 (A)

కాపు (కుల, కట్నప్రసక్తిలేదు) 27/5'10"/ B.Tech/ SWE/ Amazon 15Lakhs P/A అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246171703 (A)

SC హిందూమాల (కట్నప్రసక్తిలేదు) 27/ 5'10"/ B.Tech/ SWE/ IBM 85,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246151501 (A)

క్రిస్టియన్/ 27/ 5'10"/ B.Tech (NIIT), MBA (IIM)/ SWE/ Hyd/ 1 లక్ష PM/ అందమైన వరునికి తగిన వధువు కావలెను. ✆ 8919759359 (A)

రెడ్డి/ కుల/ కట్న ప్రసక్తిలేని/ 33/ 5'7"/ Fr/ MBA/ H.R/ Sr. SWE/ Hyd/ 70,000/- PM/ చాలావెల్‌సెటిల్డ్ వరునికి/ అందమైన వధువు కావలెను. అర్జెంట్ ✆ 6303382635 (A)

రెడ్డి (Now Hyd) 1990/ 5'8" B.Tech/ MS/ US/ 100K/ 25 కోట్ల ఆస్తి ★ 1988/ 5'8" B.Tech/ MS/ US/ 100K. Ph: 9505551788/ 8885559579 (A)

రెడ్డి 1992/ 6'1" Bits పిలాని/ MS/ US/ 110K ★ 1988/ 5'9", B.Tech/ MS/ US/ 110K. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో ✆ 9505551788/ 8885559579 (A)

రెడ్డి 1989/ 6'1" B.Tech/ MBA/ 18L. P.A/ BNG ★ డైవర్సీ 1989/ 5'10" B.Tech/ Business/ 70L P.A/ Rich 9505551788/ 8885559579 (A)

గౌడ 28/5'10" B.Tech/ MS/ USA/ SWE/ 100K/ H1B/ వెల్‌సెటిల్డ్ వరుడికి B.Tech/ MS/ డాక్టర్/ PG వధువు కావలెను. ✆ 9848041335/ 9848371924 (A)

కాపు/ 32/ MBBS, MD (Gen. Med) 3 Lakhs/ PM/ 33/ B.Tech (IAM) PGDM/ 18 Lakhs/ PA వరులకు వధువు కావలెను. కట్నం లేదు. ✆ 9885904303 (A)

యాదవ: B.ఫార్మసి, C.Govt మేనేజర్, SBI బ్యాంక్, 70,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 8008939651 (A)

హిందూ మాదిగ: M.Tech, C.Govt, ఎలక్ట్రికల్ ఇంజనీర్, రైల్వేస్, 65,000/- PM, 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 8297439565 (A)

పెరిక: MBBS, PG, డాక్టర్, 60,000/- PM, 5'11" ఎత్తు, 28 సం॥ల వరునికి Any Govt, B.Tech, MBA, M.Tech, MSc, SWE, డిగ్రీ వధువు కావలెను. ✆ 9618007652 (A)

పద్మశాలి: B.Tech, IIST, C.Govt, సైంటిస్ట్, ISRO, 85,000/- PM, 6' ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9908222406 (A)

రజక: M.Tech, C.Govt. మెకానికల్ ఇంజనీర్, జెన్‌కో, 80,000/- PM, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

వడ్డెర: కట్నప్రసక్తిలేదు, M.Sc, C.Govt, ట్యాక్స్ ఆఫీసర్, ఇన్‌కమ్ ట్యాక్స్ Dept., 55,000/- PM, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

బెస్త, గంగపుత్ర: కట్నప్రసక్తిలేదు. M.Tech, C.Govt, ఎలక్ట్రికల్ ఇంజనీర్, BHEL, 62,000/- PM, 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823 (A)

కమ్మ (డైవర్సీ), 32, ఎరుపు, 5'.11", B.Tech, 12 లక్షలు 1 సం॥, 1 1/2 కోటి ఆస్తి, అందమైన వరుడికి 1 లేక 2వ వివాహ వధువు కావలెను. కమ్మ సంపన్నుల వివాహ వేదిక - 96425 77386. (G)

Naidu 38, 5.7, ME PHD (Dive) Star Anusham Elite Own Business & Institutions/ Medical & Dental Seeks Suitable Doctor/ MBA Bride From Decent Family. Mail. akrnvr2018@gmail.com (A)

కాపు 43/5'8"/ B.Tech కాంట్రాక్టర్, 2Lakhs P/M 50Cr ప్రాపర్టీ/ Only Son వరుడికి Any డిగ్రీ, PG అందమైన సంప్రదాయ కుటుంబ వధువు కావలెను. (కట్న ప్రసక్తిలేదు) ✆ 9346344474 (A)

కమ్మ, 5'10", MS, SWE, Hyd, 33 సం॥, 3 కోట్ల ఆస్తి కలిగిన బుద్ధిమంతుడైన ఉత్తర నక్షత్రం అబ్బాయికి అందమైన వధువు కావలెను. (డైరెక్ట్) ✆ 9490701399 (A)

రెడ్డి, 29, 5'7", B.Com, Pvt Job, ఒంటరికి ఇల్లరికం కావాల్సినవారు ఫొటో Whatsappలో Send. 6301609922 డైరెక్ట్ (A)

శిష్టకరణం - 38 / 5.4 / B.Com / బిజినెస్ వెల్‌సెటిల్డ్ వెజిటేరియన్ వరునికి FC / BC డిగ్రీ వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్ కాంటాక్ట్ సెల్: 9849627019. (O)

CNB/ 45 Years/ 5'7"/ Height Rly Employee Salary 70K, PM Legal Divorcee No, Children Hyderabad Ph No: 9676564376 (A)

2వ పెళ్ళి కాపు 45Y/ Govt Exp 65000 PM/ వెల్‌సెటిల్డ్ ప్రాపర్టీ గల వరునికి తగిన సాంప్రదాయ వధువు కావలెను. కుల, పట్టింపులేదు. 6309593020 (A)

ముదిరాజ్ 29/ 5'10"/ MBBS, MS సూపర్ స్పెషాలిటి చేస్తున్న వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. ✆ 8142540968. (A)

SC (క్రిస్టియన్) 29/ 5'10"/ MBBS, MS, సూపర్ స్పెషాలిటి చేస్తున్న సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. 9494038601. (A)

రజక: 26/ 5'9"/ M.Tech/ SWE/ 20 Lacs P.A. సెటిల్డ్ అందమైన వరునికి తగిన వధువు కావలెను. 8125210344. (A)

పద్మశాలి 58, 5.6" ప్రైవేట్ జాబ్. భార్య కోల్పోయిన వరునికి 45-55 సం॥ ఏ బాధ్యతలులేని ఆరోగ్యవంతమైన BC/FC వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ కాంటాక్ట్. ✆ 77803 79753 (D).

గౌరీ హృదయ విజేత అతనే..!

'చాలా ప్రేమ వివాహాల్లాగే మా పెళ్లికూడా అంత తేలికగా ఏం జరగలేదు.. అడుగడుగునా అడ్డంకులు, అనూహ్యమైన అవాంతరాలు! అవి మా బంధాన్ని మరింత పటిష్టపరిచాయే తప్ప మరేం చేయలేకపోయాయి. మతాలు వేరవడంతోపాటు ఆయన వృత్తి కూడా మా ఇంట్లోవారికి పెద్దగా నచ్చలేదు. అదీగాక అప్పటికి మేం ఇంకా వయసు పరంగా చిన్నవాళ్లం.. అదికూడా అవరోధంగా మారికూర్చుంది. ఆయనవైపు వారికీ ఈ సంబంధం ఇష్టంలేదు.

మా ఇంట్లోవాళ్లకు ఏ మాత్రం అనుమానం రాకుండా ఉండేందుకు ఆయన మా మతం కుర్రాడిలా వేషం వేసుకుని, పేరు మార్చుకుని మరీ నా దగ్గరకు వచ్చేవారు. నా పైన ఎంతో ప్రేముంది కాబట్టే అన్ని అగచాట్లు పడ్డారు..' ఈ మాటలు అంటున్నదెవరో కాదు బాలీవుడ్ కింగ్ ఖాన్, షారూఖ్ జీవితేశ్వరి గౌరీఖాన్.

గౌరి చెప్పిన విశేషాలలో కొన్ని..

- మేమిద్దరం ఉండేది దిల్లీ. ప్రేమికులుగా ఉండే రోజుల్లో ఓసారి మా ఇద్దరి నడుమా ఏదో తగవొచ్చింది. అంతే.. కనీసం తనతో చెప్పకుండా కోపంతో దిల్లీ వదిలి ముంబయి వెళ్లిపోయాను. ఆ తర్వాత తను కేవలం పదివేలు జేబులో వేసుకుని నన్ను వెదుక్కుంటూ ముంబయి వచ్చేశాడు. చివరకు ఆ ముంబయే మా నివాసమవుతుందని ఎంత మాత్రం అప్పట్లో ఊహించలేదు నేను.
- మా ప్రణయం సుమారుగా ఆరేడేళ్లు.. ఇక వైవాహిక జీవిత పయనం ప్రారంభమై ఇన్నేళ్లయినా మాకిద్దరికీ పరస్పరం అదే ప్రేమ.. అదే అనురాగం! ఎప్పుడూ ఏవో ఖరీదైన బహుమతులు తెచ్చిస్తారాయన. కానీ నేను ఇంతవరకూ ఆయనకు ఎలాంటి బహుమతీ ఇవ్వలేదు. అలా ఇవ్వద్దన్నది ఆయన పెట్టిన నిబంధనే!
- మా ఉదయాలు చక్కని కాఫీతో, కమ్మని కబుర్లతో మొదలవుతాయి. అలా గడిపే సమయం ద్వారా లభించే ఉత్తేజం అంతా ఇంతా కాదు.
- మా వైవాహికబంధం విజయరహస్యం ఏమంటే- మేము ప్రతి చిన్నవిషయానికీ హైరానపడిపోం. తేలికగా తీసుకుంటాం. అదేంటి? ఇదేంటి? అంటూ ఆయన నాపై తరచూ ప్రశ్నల వర్షం కురిపించరు. అదీగాక కూర్చుని నాతో గొడవ పడడానికి ఆయనకి తీరికా ఉండదు. మా బంధంలో పరస్పరం వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించుకుంటాం. ఇది ఏ భార్యాభర్తలకైనా అవసరమని నా ఉద్దేశం.
- ఒకప్పుడు ఆయన సినిమాలు ఫెయిలవ్వాలని కోరుకునేదాన్ని. ఆ తళుకుబెళుకుల రంగం అంటే అప్పట్లో నాకంత ఆసక్తి ఉండేది కాదు. ఆయన సినిమాలు పరాజయం పాలైతే ఎంచక్కా దిల్లీ వెళ్లిపోవచ్చని ఆశ పడేదాన్ని.
- అలా అనుకున్నదానినే తర్వాత కాలంలో ఆయన సినిమాలకు నిర్మాతగా కూడా వ్యవహరించాను.
- షారూఖ్ సినిమాలకు తొలి విమర్శకురాల్ని నేనే.. ఏదైనా సినిమాలో ఆయన సరిగా నటించక పోయినా లేక లోటుపాట్లున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తాను. ఎందుకంటే నేను ప్రేక్షకురాల్ని. నాకా స్వేచ్ఛ ఉంది. ఆ కోణం నుంచే నా విమర్శ ఉంటుంది. ఇక నేనూ ఆ నిజం చెప్పకపోతే ఆయనకు ఇంకెవరు చెబుతారు?
- షారూఖ్, పిల్లలే నా ప్రపంచం. నా దృష్టిలో అతను ఉత్తమోత్తమ భర్త, తండ్రి! నిజంగా నేను చాలా అదృష్టవంతురాల్ని. కనుకే నాకతను లభించాడు. నాకు ఇలాంటి జీవితం దొరికింది. అన్ని విషయాల్లో వెన్నుదన్నుగా నిలిచే భర్త లభించడంకన్నా ఏ భార్యకైనా కావాల్సిన అదృష్టం ఏముంటుంది?!

పెళ్లి తర్వాతే ఏదైనా...

వివాహబంధానికి మేం చాలా ప్రాధాన్యమిస్తాం. దాన్ని నిలబెట్టుకోవడానికి ఎంతో కష్టపడతాం. మృదువుగా ఉండడం, విషయాల్ని తేలికగా తీసుకోవడం సానుకూల దృక్పథం వీటితోపాటు గుండెలనిండా ప్రేమ ఉంటే ఇదేం అసాధ్యం కాదు. పెళ్లికి, ప్రియసతికి ప్రాధాన్యం ఇవ్వకపోతే జీవితంలో ఇక దేనికివ్వాలి? ఏదైనా వీటి తర్వాతే కదా? అనేది నా అభిప్రాయం. అసలు వివాహాన్ని కూడా సాధారణంగా తీసుకోవడం ఏమిటనేది నా ప్రశ్న.

– షారూఖ్

సేకరణ: ప్రణవి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

కాపు 45 సం॥ 6 Ht, గవర్నమెంట్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ M.Sc., B.Ed, P.hd, 85,000/- P/M విడో, పిల్లలు లేరు. 17 ఎకరాలు పొలం గల మహిళకు వరుడు కావలెను. 8008158673 (E)

బ్రాహ్మణ 53 సం॥ 5.9 Ht పంచాయతీరాజ్ E.O. M.A 125000/- P/M విడో పిల్లలు లేరు. 12 ఎకరాలు పొలం గల మహిళకు వరుడు కావలెను. 8008158673 (E)

★ ★ ★

రెడ్డి/ B.Tech/ 32/ 5'.5"/ అందమైన, ఆస్తిపరురాలు అయిన వధువుకు ఉద్యోగం లేక బిజినెస్‌లో హైదరాబాద్‌లో సెటిల్ అయిన వరుడు కావలెను. ✆ 63098 81091. (G)

వరుడు కావలెను: మాల, క్రైస్తవ, 39y, Govt. లెక్చరర్, పాప కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను (విడోవర్ or డైవర్స్). డైరెక్ట్ కాంటాక్ట్: 86390 34913, 98494 20243. (G)

గౌడ డైవర్సీ 29Y, 5'.5" H తెలుపు కలర్ కాంట్రాక్ట్ నర్స్ 15000/M 15 లక్షల ప్రాపర్టీ గల వధువుకి గౌడ కులానికి చెందిన వరుడు కావలెను. ✆ 94922 73521 (B).

SC మాల(హిందూ), 24, 5'.8", B.Tech, వైట్ కలర్ వధువుకు స్టేట్/ సెంట్రల్ Govt. ఉద్యోగం ఉన్న వరుడు కావలెను. సంప్ర: 80960 74433, 08854-254433. (G)

శెట్టిబలిజ/ 33y/ 5'.6"/ గవర్నమెంట్ టీచర్‌గా చేస్తున్న వధువుకు చదువుకున్న, ఆస్తి ఉన్న, ఎంప్లాయి అయిన వరుడు కావలెను. కమ్మ, రెడ్డి అయినా ఫర్వాలేదు. రాజమండ్రి, ✆ 93999 66977. (G)

★ ★ ★

కమ్మ 36/ B.Tech, 5'.4", Fair SWE, 3 కోట్లు ప్రాపర్టీ గల అందమైన రూపవతికి తగిన SWE వరుడు కావలెను. డైరెక్టుగా సం. ✆ 78429 45655 (B).

కాపు / 27 సం॥ / 5'.5"/ Fair/ BA/ సాంప్రదాయమైన వధువుకు సాంప్రదాయమైన జాబ్ / బిజినెస్ వెల్ సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 70361 85392 (B).

కాపు–సెకండ్ మ్యారేజ్, కుల పట్టింపు లేదు. పిల్లలు సెటిల్, రిటైర్డ్ ఎంప్లాయిస్ మాత్రమే. సంప్రదించండి. ✆ 91820 07702.

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WhatsApp Your Photo & Biodata to 9347262769. We will Send the Suitable Matches. www. pellisandadi.com ESTD: 1991 (A)

బ్రాహ్మణ వధువు వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ, Hyd. ✆ 9248600342/ 8019207503. brahmininformationmatri@gmail.com (A)

మాల స్పెషల్ : IAS, IPS, IRS, IRTS, MBBS, MD.M.S, USA, Govt. Jobs, SWE. 7893013265 (N).

అన్ని కుల/ కులాంతర దేశ, విదేశ, 1, 2వ, లేట్, డాక్టర్స్, ఇంజనీర్స్, గవర్నమెంట్, ప్రైవేట్, బిజినెస్ సంబంధాలకై (20 సం॥ల అనుభవం, వ్యక్తిగత శ్రద్ధ) ✆ 8497939432 (A)

మాదిగ, మాల, వధువు, వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Suresh ✆ 7702262508, Blue Trend Matrimonial (P) Ltd (A)

పద్మశాలి వధువు, వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Swapnika ✆ 7032018248, Blue Trend Matrimonial (P) Ltd (A)

P.Supriyareddy, Rich Reddy Boys & Girls, India & Abroad Matches, All Emp, Govt, Pvt, SWE, Doc's, Business, Divorcees From all Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762, Email: palletisupriyareddy@gmail.com (A)

కాపు/ నాయుడు బలిజ మున్నూరుకాపు సంబంధాలకు మాత్రమే నమ్మకమైన ఏకైక సంస్థ: వివరాలకు 7661800583/ 8885055566 (A)

కులపట్టింపు లేనివారికి 2 వ/ లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2PM - 5PM పరిచయ వేదిక జరుగును. 1000 మంది వధూవరుల లిస్ట్ ఇవ్వబడును. Hyd 9440937900 (A).

కాపు పెళ్ళి సంబంధములు కొరకు సంప్రదించండి. డాక్టర్స్, SWE, NRI, ఎంప్లాయిస్, Highstatus, బిజినెస్ వారికి పెళ్ళి సంబంధములు కుదుర్చును. ✆ 98665 21319 (B).

ఆర్యవైశ్య వివాహ పరిచయవేదిక 1st 2nd/ Late Marriage Also 08/07/18న భవానీ మ్యారేజ్ బ్యూరో ఆఫీస్ ECIL లో జరుగును ✆ 9704656103/ 9533608887 (A)

★ ★ ★

లక్ష్మి మ్యారేజ్ బ్యూరో: కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే పెళ్లి సంబంధాలు చూడబడును. ప్రొ॥ జాస్తి సైదారావు. ✆ 97055 88313, 91827 31506.

★ ★ ★

వాసవి – విజయవాడ (ర) వారి 55వ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక మరియు 11వ పునర్వివాహ పరిచయవేదిక 15.7.2018 తేదీన I.V. ప్యాలెస్, విజయవాడ నందు ఉ. 9 గంటలకు మరియు మధ్యాహ్నం 2 గంటలకు జరుగును. వివరాలకు: 99120 26286, 81064 54284. (B)

కమ్మ ప్రత్యేకం డాక్టర్స్/ Engg/ PG/ డిగ్రీ/ 1వ/ 2వ వివాహాలకై సంప్రదించండి. గత 10 సం॥ల నుండి నిజాయితీగా సేవచేస్తున్న విజయారావు. Hyd. ✆ 9618226996 (A)

లక్ష్మీదుర్గా మ్యారేజ్‌లింక్స్ బ్రాహ్మణులకు, వైశ్యులకు మాత్రమే. 1వ, 2వ సంబంధాలకు సంప్ర & వివాహాది శుభకార్యాలకు కేటరింగ్ Only Veg. ✆ 63034 28272, 79979 16346 (B).

మారు మనస్సు రక్షణ ప్రార్థన అనుభవము కలిగిన అన్ని కులముల వధూవరులకై వెంటనే సంప్రదించండి. ది కార్నర్ స్టోన్. ✆ 83095 47432, 89777 70727 (B).

వరుడు కావలెను

కాపు, విడోవర్, 60 Yrs/ 5'.10"/ బ్యాంక్ మేనేజర్ (రిటైర్డ్), వెల్ సెటిల్డ్, బాధ్యతలు లేని వరుడికి 45-50 సం॥ వయస్సుగల బాధ్యతలు లేని వధువు కావలెను. ✆ 95150 65079. (G)

కాపు /కుల పట్టింపు లేదు / 48 సం॥ / 5'.6"/ 1st వరునకు 1st పిల్లలు లేని విడో / డైవర్సీ వధువు కావలెను. ఇల్లరికం OK. నో బ్రోకర్స్, డైరెక్ట్ ✆ 90595 64069 (B).

బ్రాహ్మణ/ 29, B.Tech (CAT) MBA/ 12L ★ 26, B.Tech IRS 8L ★ 31 B.Tech, MS 22L ★ 28, B.Tech MS (US) $ 1L ★ 27, MBBS ✆ 8555024711 (A).

కమ్మ/ 33 సం॥ 5'8" ఫెయిర్, ఎం.టెక్ (IT), 13 లక్షలు సం॥కి/ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్‌కి వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ ✆ 6303766686 (A).

Kamma 28 Yrs 5'.11" B.Tech SWE Swiggy 54 LK PA 12 Cr Property + Rental Income Well Settled only Son. Seeks Good Looking Bride (Direct) Cont: 8660762190, 9945682309 (E)

★ ★ ★

కాపు/ 31,5/ MBA/ వైజాగ్‌లో సొంత బిజినెస్ నెలకు లక్ష రూపాయలు సంపాదన గల వరుడుకు సాంప్రదాయం గల వధువు కావలెను. (కుల ప్రసక్తిలేదు) ✆ 8185801801, 9000739007. (C)

మొదిలియార్ 32, 5.2" B.E ★ 31, 5.4", BBA బిజినెస్ వరులకు అగ్రకులమునకు చెందిన డిగ్రీ/ఇంటర్ చదివిన వధువులు కావలెను. ✆ 93471 10201 (J)

కులప్రసక్తి లేదు/ 30Y/ 5'.10"/ 3 M డైవర్సీ/ BE, MBA/ 6 L M/ జాబ్ చేస్తున్న వరుడికి డిగ్రీ చదివిన అమ్మాయి. కులప్రసక్తి లేదు/ 27y/ M.Tech/ ఆస్ట్రేలియాలో జాబ్ చేస్తున్న వరుడికి B.Tech చదివిన వధువు కావలెను. (డైరెక్ట్ పార్టీస్), ✆ 70361 16838, 89811 14680. (G)

నాయుడు డైవర్సీ 48 సం॥ Govt ఆఫీసర్ 5'6" 3Cr ప్రాపర్టీ కల్గిన వరునికి గౌరవ/ సంపన్న కుటుంబం, 40-45 సం॥ విడో/ డైవర్సీ పెళ్లికాని వధువు కావలెను. ✆ 9603997882 (A).

★ ★ ★

ఆర్యవైశ్య 36Y 5.6" ఎత్తు వరుడికి అందమైన చదువుకున్న వధువు కావలెను. కులప్రసక్తి లేదు. సెల్: 94401 88152 (M).

కమ్మ/ 45సం/5'9"ఎ/డైవర్సీ/డిగ్రీ/ఇల్లు/రాజధాని దగ్గర 6 ఎకరాలు పొలం ఉన్న పిల్లలు లేని వరుడుకు కమ్మ వధువు కావలెను. డైరెక్ట్ నెం (వాట్సప్) 91828 99792(I).

CNB BC, 5'6", 42Y, Fair, Business/ 20K, 1Cr కు ఏ బాదరబందీలేని స్థిరాస్తి లేక ఉద్యోగం ఉన్న విడో, డైవర్సీ (పిల్లలు ఉన్న లేకున్నా) కావలెను. ✆ 8499813603 (A).

రెడ్డి 32Y/ 5.5 B.Sc కంప్యూటర్స్ 40 Lakhs ప్రాపర్టీ. జీతం 30,000 P.M గల వరుడికి అందమైన వధువు కావలెను. (కుల పట్టింపు లేదు) నో బ్రోకర్స్. ✆ 99666 91963 (J)

Age-35, 5'6", ప్రైవేట్‌జాబ్ చేస్తున్న ఒంటరి వరుడుకి రెండవ పెళ్ళి అందమైన వధువు కావలెను. కులపట్టింపులేదు. డైరెక్ట్‌గా సంప్రదించండి. ✆ 8179806040 (A)

Kapu 25 5'7" MS 100K 10Cr ★ 24 5'6" BE MNC 10Cr ★ 23 5'4" BE MNC 5Cr ★ 22 5'4" BE (IIT) MNC 14 LPA ★ 24 5'2" MS 140K ★ 26 5'3" MBBS MD (Radio) ★ 9989019945 (A)

పద్మనాయక వెలమ 24 సం॥ 5'2" ఫెయిర్ ఆర్గానిక్ కెమిస్ట్రి M.Sc చేసిన వధువుకి వెల్‌సెటిల్డ్ తగిన వరుడు కావలెను డైరెక్ట్ ✆ 9393012178/ 8465999458 (A)

మాల: MBBS, MD (Gen. Medicine)/ 5'5"/ 26 Y/ V.Fair 1 కోటి ఆస్తి/ 1 లక్ష జీతంతో డాక్టర్‌గా చేస్తున్న వధువు కొరకు (అర్జంట్)గా సంప్రదించండి. ✆ 81065 01199 ★ 81214 94810. (B)

గౌడ/ B.Tech, IIT/ C.Govt. టెక్నికల్ ఆఫీసర్ (BHEL)/ 40,000/-PM/ 5'5" ఎత్తు/ 24సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9989450693 (A)

పద్మశాలి/ B.Tech/ C.Govt. Sr.Asst. (రిజర్వ్ బ్యాంక్)/ 42000/-PM/ 5'4" ఎత్తు/ 24సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298 (A)

మాల/ B.Tech/ C.Govt. Sr.టెక్నికల్ ఆఫీసర్ (ECIL)/ 50,000/-PM/ 5'5" ఎత్తు/ 24సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9703794175 (A)

యాదవ/ B.Tech, MBA/ C.Govt. Asst. మేనేజర్ (SBI)/ 35000/-PM/ 5'4" ఎత్తు/ 24సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885055185 (A)

బ్రాహ్మణ కుటుంబానికి చెందిన 29 సం॥లు B.Sc.,B.Ed Pvt Teacher సౌనకస గోత్రం Pvt/ Govt or పురోహితం అయినా సరే. 6301244182 / 6302223161 (A)

విశ్వబ్రాహ్మణ 25, 5'4" fr B.Tech, SWE Capgemini, 35,000 సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9290022700 (A)

CNB 28/ 5'1" PG/ Cr.Govt. ఆఫీసర్ ★ 30/ 5'5" B.Tech/ SWE/ H1B వీసా Now in ఇండియా ★ 34/ 5'6" IPS. ✆ వాట్సప్ 9347009998/ 9396617778 (A)

కాపు ఓన్లీడాటర్ 26, 5'6" Fr B.Tech, SWE, CTS 40,000 PM. సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9959265078 (A)

గంగపుత్ర 24/ 5'5"/ B.Tech/ SWE/ DELOITTE 35,000 PM. 2Cr ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246964555 (A)

కమ్మ (కుల పట్టింపులేదు) 28/ 5'4" B.Tech/ SWE 60,000 pm చాలా అందమైన వధువుకు ఇండియా/ అబ్రాడ్ వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. చాలా అర్జెంట్ ✆ 9550296562 (A)

కాపు: B.Tech/ రైల్వే (A.E) 50,000 pm 25 సం॥ వధువుకి వరుడు & M.Tech/ Govt/ సైంటిస్ట్ (DRDO) 90,000 PM 28 సం॥ వరుడికి వధువు కావలెను. ✆ 8340841945 (A)

SC మాదిగ 23, 5'5", B.Tech (NIT) ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ C.Govt Job 40 వేలు P/M వెల్‌సెటిల్డ్ వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 9908200117 (A)

రెండోపెళ్ళి/ కులపట్టింపులేదు/ ఆస్తిప్రసక్తిలేదు/ 28/ 5'2"/ డిగ్రీ/ చాలా చాలా అందమైన వధువుకు వరుడి ఫోటో & బయోడేటా 9949595523కు వాట్సప్ చెయ్యండి. (నో కాన్ఫరెన్స్ కాల్స్ ప్లీజ్) (A)

SC మాల 23, 5'5" ఫెయిర్ B.Tech (CBIT) A.E.E. ఇరిగేషన్ Dept 35,000/- pm అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వరుడు కావలెను. ✆ 8019705648 (A)

కమ్మ 23, 5'6" ఫెయిర్ B.Tech SWE, Infosys 35 వేలు P/M అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 7207041141 (A)

రెడ్డి 24/ 5'5" B.Tech/ SWE/ TCS 35,000/- pm V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246333320 (A)

వైశ్య 23, 5'6" B.Tech, SWE, TCS 35,000 pm అందమైన సాంప్రధాయక కుటుంబపు వధువుకు అందమైన వరుడు కావలెను. ✆ 9948005247 (A)

గౌడ్ 2nd: 33/ 5'1"/ BDS/ డెంటిస్ట్/ Hyd ★ 37/5'5"/ డెంటల్ సర్జన్ / MS/ Hyd ★ 32/ 5'3"/ MBBS/ PG/ Hyd డైవర్సీ అమ్మాయిలకు అబ్బాయిలు కావలెను. సం॥ శుభమస్తు, Hyd 9490479371 (A)

చౌదరి / విడో/ 30Y/ 5'4"/ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ 17 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9515337427 (A)

కాపు/ డైవర్సీ/ కుల ప్రసక్తిలేని/ 32/ 5'3"/ Fr/ MBA/ Sr.SWE/ Hyd/ 60,000/- PM చాలా అందమైన/ వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. అర్జెంట్ ✆ 9966538381 (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

CNB/ SC మాల/ 35/ 5'2"/ MCA/ SWE/ 11 లక్షలు. P.A/ మంచి వధువుకు తగిన మంచి వరుడు కావలెను. అర్జెంట్ ✆ 7386427256 వాట్సప్: 7386103012 (A)

బ్రాహ్మణ/ రెండోపెళ్లి/ 35/ 5'3"/ PG/ Pvt. జాబ్/ 10,000/- PM/ పిల్లలు లేని వధువుకు జాబ్/ బిజినెస్ వరుడు కావలెను. ✆ 9030056547/ 9676812525 (A)

రెడ్డి 1992/ 5'5" B.Tech/ V.Fair/ 25 కోట్ల ఆస్తి ★ 1991/ 5'6", B.Tech/ 6 L.P.A నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో Ph: 8885559579/ 9505551788 (A)

రెడ్డి (విజయవాడ) 1989/ 5'3" CA/ 10 L.P.A/ Hyd ★ డైవర్సీ 1989/ 5'2" BBA/ MBA/ V.Fair & Rich Ph: 8885559579/ 9505551788 (A)

రెడ్డి 1993/ 5'4", B.Tech/ MS/ USA/ 84K/ H1B/ Fair ★ 1992/ 5'9" B.Tech/ MS/ US. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో 8885559579/ 9505551788 (A)

వెలమ: 40లక్షల ఆస్తి, B.Tech, SWE, 35,000/- PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9908222406 (A)

క్రిస్టియన్ మాల: 30లక్షల ఆస్తి, B.Tech, Govt. Asst. ఇంజనీర్, R&B, 50,000/- PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8297439565 (A)

కమ్మ: M.Tech, Govt. Asst. ఇంజనీర్, ఇరిగేషన్ Dept. 50,000/- PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

ముదిరాజ్: B.Tech, C.Govt. క్వాలిటీ ఇన్స్‌పెక్టర్, FCI, 32,000/- PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

అగ్నికుల క్షత్రియ: B.Tech, C.Govt. Asst. మేనేజర్, ఆంధ్రా బ్యాంక్, 45,000/- PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

Brahmin (Madhwa) (Subsect No Bar) MSc, PhD 30Y, 5'3" Job in USA fair, Seeks Ph.D/ SWE/ in USA Groom ✆ 9949773958/ 9440147198 (A)

కాపు/ 27/ 5'.2"/ B.Sc B.Ed/ టీచర్/ 35000 Pm/ సంప్రదాయ కుటుంబం యొక్క ప్రాధాన్యత మరియు మానవ సంబంధాల పట్ల సరైన అవగాహన కలిగి ఉండి, నైతిక విలువలు ఉన్నటువంటి అందమైన వధువుకు వరుడు కావలెను - meruvu.1966@gmail.com (Q)

Wanted Groom (OC or BC) for divorced kapu well property bride, 36Y, 5'4", V.Fair, Having 8 yr old daughter, B.Tech/MBA, S/W in Hyd, Sal: 15L P.A. email: csunilnagam@gmail.com (I).

SC, లేట్‌మ్యారేజ్, 5'5", 75K PM, Govt. డాక్టర్, 1st or 2nd. Any డిగ్రీ, Any Caste వరుడు కావలెను. 8121107338, 9494731201 (A)

కాపు/ డైవర్సీ/ 33/ PVT జాబ్/ 50K, 3cr ఆస్తిగల వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. ✆ 9052327553/ 9052327622 (A)

SC మాల, హిందూ, B.Tech/ 25/ 5'4"/ SWE/ Tech మహేంద్ర Hyd 40K/ PM చాలాఅందమైన వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 9705960270 (A)

బ్రాహ్మణ 28/ 5'5"/ డిగ్రీ అందమైన వధువుకు వరుడు కావలెను. శాఖ పట్టింపులేదు. జాబ్ & బిజినెస్ OK (పురోహితం, OK) 8978691424 (A)

కాపు: 26/ 5'4"/ MBBS, MS సూపర్ స్పెషాలిటి చేస్తున్న అందమైన సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. 9581635726. (A)

విశ్వబ్రాహ్మణ/ 26/ 5'4"/ MBBS, MD, జనరల్ మెడిసిన్ చేస్తున్న అందమైన మంచి ప్రాపర్టీ గల సంప్రదాయమైన వధువుకు వరుడు కావలెను. 8125210356. (A)

SC/ 26/ 5'4"/ MBBS/ MD సూపర్ స్పెషాలిటి చేస్తున్న సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. 9494038701. (A)

బ్రాహ్మణ/ 20, B.Com ★ 23, B.Tech 3L ★ 29, M.Sc, 2.5L ★ 26, B.Tech (BITS)/ MS (US) Wkg ★ 22, 5'5" MBA హరితస ★ 24 MBBS 9440449285 (A).

యాదవ 24 సం॥ 5'.1" ఎత్తు తెలుపు B.Tech S/W Engr వధువుకి తగిన S/W Engr. గాని గవర్నమెంట్ ఉద్యోగం కలిగిన వరుడు కావలెను. ✆ 9642713981. (C)

కమ్మ/లేట్‌మ్యారేజ్/ 30Y/ 5'.5"/ ఫెయిర్/ కోట్ల ఆస్తి సొంత వ్యాపారం 2 Laks PM గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తిలేదు. ఫోన్: 7095616567. (C)

కాపు / విడో / 27 సం॥లు / 20 కోట్ల ప్రాపర్టీ కలిగి ప్రమాదంలో భర్తను మరియు పేరెంట్స్‌ను కోల్పోయిన అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (ఆస్తి, కుల ప్రసక్తి లేదు) Contact whatsapp ✆ 90304 58459 (B).

కమ్మ /విడో / 29 సం॥లు / B.Tech/ 22 కోట్ల ప్రాపర్టీ మీద నెలకు 20 లక్షలు రెంట్స్ వస్తూ ప్రమాదంలో భర్తను మరియు పేరెంట్స్‌ను కోల్పోయిన అందమైన ఒంటరి వధువుకు వరుడు అర్జెంటుగా కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు). Contact : whatsapp Ph: 81211 13493 (B).

కమ్మ / 30Y 5'.4" Fair M.Tech, M.Sc (UK) Job in Hyd 30,000 P/M 10 ఎ॥ ల్యాండ్ వధువుకి తగిన కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574 (B).

USA/ కమ్మ / 34Y, 5'.5", Slim Fair, B.Tech (ECE) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ H1B వీసా Settled Family వధువుకు USAలో ఉన్న కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574 (B).

వివాహ వేదిక

కులపట్టింపు లేని వారికి అన్ని కులాల 1వ/ 2వ / లేట్ / విడో/ డైవర్సీ/ విడోయర్స్/ పెన్షనర్స్ వ॥ 20-70 సం॥ స్త్రీలకు ఫ్రీ, పు॥ సర్వీస్ ఛార్జ్. త్వరగా సంబంధం కుదుర్చబడును ✆ 7893688248 (A)

20 సం॥లు అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహ వేదిక ✆ 9849414098, 040- 66317515 satyasaivivahavedika.com (A)

15 రో॥ అన్ని కులాలవారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతిపెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com ✆ 98490 58673, 94418 29644, 94407 85888- Watsup. (B)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్‌క్యాస్ట్) MBBS/ MD/MS/ MCH/ DM/ BDS & బిజినెస్ మ్యాన్స్‌కి 1వ /2వ / విడో, దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9966808059 (A)

Specially Doct (3000 ప్రొఫైల్స్), MBBS, MD, MS, DM, MDS & డా॥కి మాత్రమే 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులముల వారికి కుదుర్చబడును. ✆ 9866411588 (A)

రెడ్డి కులస్థులకు తక్కువ సమయంలో వివాహ సంబంధాలు కుదుర్చబడును. దండెం మ్యారేజ్ బ్యూరో ✆ 6303738265 dandemmarriagebureau@gmail.com (A)

Since 1989 శ్రీకన్యవివాహ వేదిక Hyd అన్నికులాల & కులాంతర 1వ, 2వ, లేట్ మ్యారేజెస్. ఇండియా/ అబ్రాడ్. వేల్పుల బిక్షపతి ✆ 27619998 వాట్సప్: 9396617778/ 9347009998 (A)

ఓన్లీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్: OC, BC లు మాత్రమే. డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, గౌట్ ఎంప్లాయిస్, అబ్రాడ్స్, బిజినెస్ మ్యాన్స్ & ఆల్ దేశ/ విదేశీ సంబంధాలకై ✆ 9959305599 (A)

ఓన్లీ Govt. ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్ని మతాల, కులాల 1వ, 2వ, లేట్/ వీడో/ డైవర్సీ వివాహాలు & Govt. ఎంప్లాయిస్ సం॥దాలు కొరకు వెరిఫాస్ట్ సెటిల్‌కై ✆ 9000185415 (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com Hyd: 9440831748/ Gunt: 9440759945/ Vsp: 9441735157 (A)

అన్ని కులాల వారికి: డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, అబ్రాడ్స్, బిజినెస్, హైరిచర్స్ & ఆల్ గౌట్ ఎంప్లాయిస్ 1వ, 2వ, దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

ఫ్లోరైడ్‌కు విరుగుడు.. చెట్ల కర్బనం

- జల శుద్ధీకరణకు పెద్దసంస్థలు వాడుతున్నదిదే
- పరిశోధనలకు దేశంలో అంతగా ఆదరణ లేదు
- అందుకే యువత చూపు విదేశాల వైపు
- అంతర్జాతీయ సదస్సులో భారత్ శిరోమణి డాక్టరు కాజా

నగరం(చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: చెట్ల అవశేషాలను కాల్చడం ద్వారా వచ్చే కర్బనంతో ఫ్లోరైడ్ నీటిని వడగట్టి, శుద్ధ జలాన్ని అందించవచ్చని తన పరిశోధనలో తేలినట్లు భారత్ శిరోమణి పురస్కార గ్రహీత, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు డాక్టరు కాజా సోమశేఖర్‌రావు అన్నారు. గుంటూరు జిల్లా నగరం ఎస్వీ ఆర్ఎం కళాశాలలో 'పరిశ్రమలు, పర్యావరణంలో రసాయనశాస్త్ర పరిజ్ఞానం'పై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శనివారం రెండో రోజూ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లోనే ఉద్దానం, జి.కొండూరు, నల్గొండ ప్రాంతాల్లోని నీటిని ఈ కర్బనంతో శుద్ధిచేసినప్పుడు 98 శాతం మేర ఫ్లోరైడ్ ప్రభావం కనిపించలేదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోకపోవడంతో ఉద్దానం సమస్య దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిందన్నారు. అనేక పెద్ద సంస్థలు తమ జల శుద్ధీకరణ ఉపకరణాల్లో ఈ కర్బనాన్నే ఉపయోగిస్తున్నాయని తెలిపారు. దీనితో తోలు, ఇతర పరిశ్రమల వద్ద వ్యర్థ జలాలను కూడా తిరిగి వినియోగంలోకి తేవచ్చని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం సాధ్యమవుతుందని చెప్పారు. మన దేశంలో పరిశోధన రంగానికి పెద్దగా ఆదరణ లేకపోయినా ఇతర దేశాల వారు ఆసక్తి కనబరుస్తున్నారని, తమ జర్నల్ ఆఫ్ అప్లికబుల్ కెమిస్ట్రీలో ప్రచురితమయ్యే రసాయన పరిశోధనలు, ఆలోచనలు, ఇతర అంశాలను జర్మనీ, అమెరికావంటి దేశాలు నిశితంగా పరిశీలిస్తున్నాయని వివరించారు. విదేశాల్లోలా మన దేశంలో ప్లాస్టిక్ పునర్వినియోగ పద్ధతులు పెద్దగా లేకపోవటంతో కాలుష్యం పెచ్చుపెరుగుతోందన్నారు. పరిశోధన రంగానికి తగిన నిధులు లేకపోవడం, ఫలితాలు సమాజానికి చేరడంలో తీవ్ర జాప్యం జరుగుతోండటంతో యువత విదేశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతోందని కాజా అభిప్రాయపడ్డారు. ఇరాన్, కామెరూన్, శ్రీలంక, దక్షిణ ఆఫ్రికా దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ పరిశోధనల అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమాలను నిర్వాహక కార్యదర్శి, ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మున్నం కృష్ణమూర్తి పర్యవేక్షించారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.

డాక్టరు కాజా సోమశేఖర్‌రావు

ఇండోనేషియా చేరిన భారత నౌకలు

- ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ ఒప్పందం దిశగా అడుగులు

విశాఖపట్నం(సింధియా), న్యూస్‌టుడే: భారత నౌకాదళం ఇండోనేషియాతో వ్యూహాత్మక రక్షణ ఒప్పందం దిశగా అడుగులు వేస్తుంది. ఈ ఏడాది మే నెలలో ఇండోనేషియా పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోదీ ఇరుదేశాల నౌకాదళాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. దీనిలోభాగంగా మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ కమోర్తా, ఐఎన్ఎస్ శక్తి నౌకలు శనివారం ఇండోనేషియాలోని మకాస్సర్ పోర్టుకు చేరుకున్నాయని నౌకాదళ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నౌకాదళ అధికారులు, సిబ్బందికి స్థానిక సంప్రదాయాలతో ఆ దేశ అధికార బృందం ఘనస్వాగతం పలికింది. ఈ రెండు నౌకలు మూడురోజుల పాటు సాంస్కృతిక, సామాజిక పౌరభాగస్వామ్యంతో నిర్వహించే సందర్శనకు అందుబాటులో ఉండనున్నాయి. తీర భద్రత, రక్షణ విధానంలో 'భారత్ యాక్ట్ ఈస్ట్‌పాలసీ'ను అనుసరిస్తూ పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం ఇరుదేశాలు ముందుకు సాగుతాయని నేవీ వర్గాలు వెల్లడించాయి.

మకాస్సర్ పోర్టుకు చేరిన ఐఎన్ఎస్ కమోర్తా నౌక

CA

పుస్తకం తెచ్చిన మార్పు

మా ఊర్లో విశ్వనాథం గారు వయోజన కేంద్రం నడిపించేవారు. ఆ కేంద్రానికి ఒకరోజు పుచ్చలపల్లి సుందరయ్య గారు వచ్చారు. ఈ కేంద్రంలో టీచర్ లేరని అక్కడి వారు ఫిర్యాదు చేశారు. అప్పుడాయన... ఈ ఊర్లో ఎవరూ చదువుకోలేదా? అన్నారు. అందరూ నాపేరు చెప్పారు. అప్పుడు నేను ఇంటర్ చదివి సెలవుల్లో ఇంటికి వచ్చాను. వెంటనే నన్ను ఆయన వద్దకు తీసుకువెళ్లారు. ఈ కేంద్రంలో పనిచేస్తావా? అన్నారు. చేస్తాను...అన్నాను. అప్పుడు ఆయన ఏం చేస్తావో చెప్పు అన్నారు. 'అక్షరాలు దిద్దిస్తా'ను అన్నాను. అక్షరాలు దిద్దించే మనిషి అవసరం లేదన్నారు. మరి ఏం చేయాలన్నట్లు ఆయన వైపు చూశాను. ఆయన ఒక పుస్తకం చదివి వినిపించాలి అన్నారు. అది నాకు చాలా సులువైన పని, సరేనన్నాను. అప్పుడు ఆయన ఇచ్చిన పుస్తకం గోర్కీ రాసిన అమ్మ. ఆ నవలను ప్రతిరోజూ ఆ వయోజన కేంద్రంలో చదివేవాణ్ని. దీనివల్ల అక్కడికి వచ్చేవారిలో చైతన్యం వచ్చింది. ఒక సారి క్లాస్ జరుగుతుండగా... దొరలు వచ్చి పొలంలో పంట దగ్గరికి కాపలా వెళ్లమని కేంద్రంలో కూర్చొని నవల వింటున్న వారిని పురమాయించారు. వారు ఈ క్లాస్ ముగిశాక వెళ్తామన్నారు. అప్పుడు దొరలు మా భూమిలో బతుకుతూ పంటకంటే మీకు క్లాసే ముఖ్యమా? అని గుడ్లురిమారు... వారంత అవును అన్నారు. అప్పుడు నాకు అన్పించింది.. అది ఆ పుస్తకం వల్ల వారిలో వచ్చిన మార్పు అని.

మా కుటుంబాన్ని వెలివేశారు

ఓ విద్యార్థి... సామాజిక కార్యకర్తయ్యాడు
ఆ కార్యకర్త నిజాం వ్యతిరేక పోరాటయోధుడయ్యాడు
ఆ యోధుడు విద్యావేత్తయ్యాడు
ఆ విద్యావేత్త... ఉద్యమకారుడయ్యాడు...
ఇలా ఎన్నో పాత్రలు పోషించి పరిపూర్ణుడయ్యాడు చుక్కారామయ్య. ఎందరో జీవితాలకు చుక్కానైన లెక్కల మాస్టరు ఐఐటీ రామయ్య. 92ఏళ్ల వయస్సులోనూ నేర్చుకుంటూ, చదువుకుంటూ, రాసుకుంటూ ఉన్న ఆయన జీవనయానంలోని విశేషాలు 'హాయ్'కి ప్రత్యేకం.

చుక్కానైన రామయ్య

ఏటా ఐఐటీకి సిద్ధమయ్యే వాణ్ని

● 9 దశాబ్దాల ప్రస్థానం మీది. ప్రజలు మిమ్మల్ని ఏ విధంగా గుర్తు పెట్టుకోవాలి? ఉపాధ్యాయుడిగానా? ఉద్యమకారుడిగానా? పోరాటయోధుడిగానా?

తెలంగాణ సామాన్య పౌరుడిగా నన్ను గుర్తుపెట్టుకుంటే చాలు. చాలా మంది నిజాంకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. వారిలో నేను ఒకడిని అయినందుకు గర్వంగా ఉంటుంది.

● ఎన్ని పోరాటాలు చేసినా... ఐఐటీ రామయ్యగానే నేటి తరానికి మీరు గుర్తు... అసలు ఐఐటీ ఇన్స్టిట్యూట్ పెట్టాలనే ఆలోచన ఎందుకు వచ్చింది?

నేను నాగార్జున కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వర్తించేవాడిని. అప్పట్లో 58 ఏళ్లకు పదవీవిరమణ చేయాలి. కొత్తవారికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో నేను 53 ఏళ్లకే పదవీ విరమణ తీసుకున్నాను. మా అమ్మాయి ఐఐటీకి ఎంపికైంది. ఐఐటీ అడ్మిషన్ ప్రక్రియ జరిగేటప్పుడు అభ్యర్థులతో పాటు, తల్లిదండ్రులను ఆహ్వానించేవారు. అక్కడికి నాలా 400 మంది వరకూ తల్లిదండ్రులు వచ్చారు. వారిలో తెలుగువారు ఎంతమంది ఉన్నారోనని తెలుసుకున్నాను. 25 మందికంటే ఎక్కువ లేరు. అప్పుడు నాకు ఆలోచన మొదలైంది. ఇంత ప్రతిష్ఠాత్మక ఐఐటీలో తెలుగు విద్యార్థులు లేకపోవడం ఏమిటి? అనే ప్రశ్న మొదలైంది. హైదరాబాద్‌కు అదే ప్రశ్నతో పయానమయ్యాను. ఐఐటీల్లోకి తెలుగు విద్యార్థులను ఎక్కువగా పంపాలనే ఉద్దేశంతో శిక్షణ మొదలుపెట్టాను.

● ఐఐటీ ప్రమాణాలు దిగజారాయనే ఆరోపణలపై మీ అభిప్రాయం?

మీరన్నట్టు దిగజారిన మాట వాస్తవమే. అయితే అంత నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు. ఐఐటీల పేరు ప్రతిష్ఠలు ఇప్పటికీ ప్రపంచంలో చెక్కు చెదరలేదు. ఐఐటీలు పెట్టిన తొలినాళ్లలో విద్యార్థుల ప్రతిభ ప్రపంచ దేశాల్లో ప్రశంసలు అందుకుంది. ఐఐటీ పూర్తిఅయిన తర్వాత ఏం చేయాలనుకుంటున్నారని అప్పటి నా తరగతి గదిలో విద్యార్థులను ప్రశ్నించాను. రిసెర్చ్ చేయాలనో, ప్రజలకు ఉపయోగపడేది ఏదో ఒకటి చేయాలనో.. అప్పటి విద్యార్థులు చెప్పేవారు.

● ఐఐటీల్లో చదివి ప్రతిభ సంపాదించి విదేశాలకు వెళ్లిన వారు తిరిగి భారత్ వైపు రావడం లేదు. ఎందుకు?

'రిసెర్చ్ కోసం మేం ఐఐటీకి వచ్చాం. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చాం. రిసెర్చ్‌కి కావాల్సిన వసతులు భారత్‌లో లేవు. అక్కడ బాగా ఉన్నాయ'నేది వెళ్లిన వారు చెప్పే సమాధానం. నేను చాలా మందితో మాట్లాడాను. వారందరూ ఇలాగే చెప్పారు.

● ప్రభుత్వాలు రిసెర్చ్‌పై దృష్టి ఎందుకు పెట్టలేదు?

నాయకులకు 21 శతాబ్దాన్ని నడిపించే విజ్ఞానం లేకపోవడమే.

● ఎప్పుడో మీరు గణితం చదువుకున్నారు? ... ఐఐటీ శిక్షణకు ఎలా బోధించేవారు?

ముందు నేను మూలాల నుంచి నేర్చుకునేవాణ్ని. ప్రతి ప్రాబ్లం ముందు నేను చేసేవాణ్ని. అప్పుడు ఆ సమస్యలోని ప్రత్యేకత నాకు అర్థమయ్యేది. ఇదంతా మా ఆవిడ చూసి... రిటైర్ అయ్యాక అయినా విశ్రాంతి తీసుకుంటావనుకుంటే నువ్వు ఇలా మొద్దులా లెక్కలు చేస్తూ కూర్చుంటావా అనేది(సరదాగా).

● నేటి విద్యాబోధనలో లోపాలేంటే?

ఉపాధ్యాయులు పిల్లలతో చర్చించడం లేదు. పాఠం అంతా చెప్పాక అర్థమైందా..? అంటారు. పిల్లలు తలలు ఊపుతారు. నేనైతే బయటికి వచ్చిన తర్వాత విద్యార్థిని అడిగేవాణ్ని. అప్పుడు అర్థం కాలేదని చెప్పేవాడు. పిల్లలు తమకు అర్థం కావడం లేదని పది మంది ముందు చెప్పలేరు. అందుకే మనం వ్యక్తిగతంగా పర్యవేక్షించాలి. పిల్లల్లో ఆలోచన శక్తిని పెంచే ప్రశ్నలు వేయాలి. వాటి గురించి ఆలోచించే సమయం ఇవ్వాలి. వారు చెప్పిన సమాధానాలపై చర్చించాలి. నేను ప్రాబ్లం ఇచ్చి పిల్లలతోనే సమాధానం చేయించేవాడిని... వారు పలువిధాల దాన్ని పరిష్కరించేవారు. నాకంటే వేగంగా సమాధానాలు కనిపెట్టేవాళ్లు.

● ఐఐటీ సిలబస్‌గానీ, పేపర్‌గాని ఏటా మారుతుంటాయి. దీనికి మీరు ఎలా ప్రిపేర్ అయ్యేవారు?

ఒక సంవత్సరం ఇచ్చిన ప్రశ్న మరో సంవత్సరం రాదు. అదే అందులోని ప్రత్యేకత. అయినా ప్రశ్నపత్రం ఏనాడు సిలబస్‌ను దాటేది కాదు. అంత అద్భుతంగా రూపొందించేవారు. దీనికి విద్యార్థిలానే ప్రతీ సంవత్సరం ప్రిపేర్ అయ్యేవాడిని. సబ్జెక్టు మూలాలు పిల్లలకు బోధిస్తే... వాటిని ఎలా ఎక్కడ ఉపయోగించుకోవాలో వారే చూసుకుంటారు.

● గణితం మీద మీకు ఇంత ఆసక్తి ఎందుకు?

మాకు చిన్నప్పుడు ఉపాధ్యాయులు ప్రతి రోజూ ఎక్కాలు చదివించేవారు. ఎవరైనా 19×9 ఎంత అంటే 171 అని టక్కునే చెప్పేవారు. హన్మకొండలో నేను 3 తరగతిలో చేరాను. అప్పట్లో ఉర్దూ మీడియం. అది నా మాతృభాష కాదు. అందుకే అంత ఆసక్తి ఉండేది కాదు. నాకు గణితం ఒక్కటే అర్థమయ్యేది. దానిమీదే ఆసక్తి పెరిగింది. ఉపాధ్యాయులూ నన్ను ఎక్కువగా గణితంలోనే ప్రోత్సహించేవారు. అందుకే మాతృభాషలోనే విద్య ఉండాలనేది నా అభిప్రాయం.

● హన్మకొండ నుంచి మీ ప్రయాణం ఎలా మొదలైంది?

మా నాన్న పౌరహిత్యం చేసేవారు. చిన్నప్పుడు నాకు 10 ఏళ్లు దాటగానే మంత్రాలు నేర్పించడం మొదలుపెట్టారు. మా అమ్మ వచ్చి వీడికి మంత్రాలు వద్దంది. 'మరి మంత్రాలు రాకుంటే... వీడేం చేసి బతుకుతాడు?' అన్నాడు నాన్న. వాణ్ని హన్మకొండలో చదివిస్తానంది. 'వీడు ఆ చదువు చదువుకుంటే ఊర్లో ఉండడు... నిన్ను ఎవరు చూసుకుంటారు?' అన్నాడు నాన్న. ఈ రెండు విషయాలు నా మనసులో నాటుకుపోయాయి. అందుకే నేను ఇప్పుడూ ఊరికి వెళ్లి వస్తుంటాను. ఎప్పుడూ అమ్మను నాతోనే ఉంచుకున్నాను. నేను హన్మకొండలో అడ్వకేట్ ఇంట్లో ఉండేవాణ్ని. ఆయన ప్రోత్సాహంతో నేను ఎదిగాను. ఇద్దరు చెల్లెళ్లు. వారు చదువుకోలేదు. తమ్ముడు ముంబై ఐఐటీ నుంచి ఎంటెక్ చేసి బెంగళూరు అంతరిక్ష పరిశోధన శాస్త్రవేత్తగా సేవలందించారు. మా పిల్లలు అమెరికాలో ఉన్నారు.

● ఉద్యమాల వైపు ఎలా మళ్లారు?

మా ఊరు వరంగల్ జిల్లా గూడూరు. ఊర్లో విశ్వనాథం గారని ఉండేవారు. గాంధేయవాది. సామాజిక కార్యక్రమాల్లో బాగా పాల్గొనేవారు. వాటిల్లో అస్పృశ్య నివారణ ఒకటి. అందులో నేనూ పాల్గొన్నాను. ఒకసారి మాదిగల ఇంటికి వెళ్లాను. ఇందుకు తోటి బ్రాహ్మణులు మా కుటుంబాన్ని బహిష్కరించారు. శుభకార్యానికి సైతం మా ఇంటికి వచ్చేవారు కాదు. ఈ సంఘటనలు నన్ను కదిలించాయి. ఒక ఏడాది బహిష్కరణకు గురైన మా కుటుంబమే ఇంత వేదన చెందుతుంటే.. జీవితాంతం వెలివేయబడిన మాల, మాదిగల పరిస్థితి ఏమిటనే ప్రశ్న నాలో ఉదయించింది. అప్పటి నుంచి సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాను.

● జైలు జీవితం... అక్కడి అనుభవాలు?

అవకాశం ఉన్నప్పుడల్లా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. అలా కమ్యూనిస్టు పార్టీలతో అనుబంధం ఏర్పడింది. భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నాను. అప్పట్లో సమావేశాలు నిర్వహించాలంటే పాలకుల అనుమతి అవసరం. అలా లేకుండా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు నన్ను అరెస్టు చేసి ఔరంగాబద్ జైలుకు తరలించారు. అప్పుడు నాకు 21 ఏళ్లు. అక్కడ ఓ ఇన్‌స్పెక్టర్ 'ఏం చదివావ్' అని ప్రశ్నించాడు. (బీఎస్సీ) ఫిజిక్స్, కెమిస్ట్రీ అని చెబుతుంటే... మధ్యలోనే ఆపి 'అది కాదు... వేరే పుస్తకాలు ఏమైనా చదివావా?' అన్నారు. డిస్కవరీ ఆఫ్ ఇండియా, లెటర్స్ ఆఫ్ ఇందిరాగాంధీ వంటి సామాజిక, రాజకీయ అవగాహన పెంచే పుస్తకాలు నాకు పరిచయం చేశారు. జైలులోనే నాలో రాజకీయ భావనలు ఏర్పడ్డాయి.

సమాజాన్ని చదవండి

పరీక్షలకు కోసం చదవకండి. మీరు చదివే ప్రతి అక్షరం మీకు పనికొస్తుంది. క్లాస్ రూం చదువే కాకుండా... ఇతర పుస్తకాలు, సమాజాన్ని చదవండి. టెక్నాలజీతో సమానంగా క్లాస్ రూం మారాలి. అప్పుడే విద్యార్థులు కాలాన్ని అందిపుచ్చుకుంటారు.

● నిజాం వ్యతిరేక ఉద్యమంలోకి ఎలా వచ్చారు?

కౌలుదారులకు వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టాం. అదే తర్వాత సాయుధపోరాటమైంది. అప్పుడు ఆ పని నిజాం వ్యతిరేకమే కదా! అలా పోరాటంలో భాగస్వామ్యమయ్యాను.

● 2007 నుంచి 2015 వరకూ దేశవ్యాప్తంగా 40 వేల మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎందుకిలా జరుగుతోంది?

ఇది జటిలమైన సమస్య. ఇవి జూనియర్ కళాశాల స్థాయిలోనే జరుగుతున్నాయి. డాక్టర్, ఐఐటీలే కావాలని తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారు. అందుకు అనుగుణంగానే కళాశాలలూ... దీంతో వారిలో ఒత్తిడి పెరిగిపోతోంది. డాక్టర్, ఇంజినీరే కాకుండా సమాజంలో చాలా వృత్తులున్నాయి. విలేకరి, స్పోర్ట్స్, సంగీతం... ఇలా ఎన్నో వృత్తులున్నాయి. పిల్లలకు ఎందులో ఆసక్తి ఉందో గుర్తించి అందులో ప్రోత్సహిస్తే ఆత్మహత్యలు తగ్గుతాయి.

● ఆరోగ్య రహస్యం?

చిన్న పిల్లలతో గడపడమే నా ఆరోగ్య రహస్యం. మనిషికి ఆలోచన ఉంటే ముఖం మీద ముడతలు రావు. బతికి ఉన్నంత కాలం... నేను పిల్లలతో మాట్లాడుతుంటాను.

● ప్రత్యేక తెలంగాణతో సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మారు. అది సాధ్యమైందనుకుంటున్నారా?

ఈ ప్రభుత్వం విద్య ప్రాధాన్యతలను అందుకోలేదు. వారి ప్రాధాన్యాలు వేరేగా ఉన్నాయి. సింగపూర్, సౌత్ కొరియాలాంటి దేశాల్లో విద్యపై ప్రభుత్వాలు బాగా దృష్టి పెట్టాయి. అభివృద్ధి సాధించాయి. మనం దీన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

ఒక్కరూ ఎంపిక కాలేదు

నా ఫస్ట్ బ్యాచ్ 8 మంది. వీరిలో ఒక్కరికీ సీటు రాలేదు. ఇలా కాదనుకొని సబ్జెక్టు కోసం ఖరగ్‌పూర్ వెళ్లాను. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏ పుస్తకాలు వాడుతున్నారో తెలుసుకున్నాను. 'సుకునోకో' అనే పుస్తకం చూడటానికి చిన్నదే. అందులోని సమస్యలు మాత్రం ఇనుపగుగ్గిళ్ల లెక్కన చాలా కష్టంగా ఉంటాయి. వాటిని సాధన చేశాను.

ఓ పుస్తకం రాశాను

పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే ప్రయత్నం జరగడం లేదు. అమెరికా వెళ్లి 15 విశ్వవిద్యాలయాలు తిరిగాను. అక్కడ ప్రాథమిక విద్యపై ఉన్న పుస్తకాలను తెచ్చాను. అక్కడ కేజీ పాఠశాలల్లో విద్యార్థుల్లో ఆలోచనను రేకెత్తిస్తారు. అక్కడి పుస్తకాలు చదివి, పరిస్థితులు చూసి .... నాకున్న అవగాహనతో ఒక పుస్తకం రాశాను.

ఇన్‌స్పెక్షన్ ఇలా జరగాలి

టీచర్ల ప్రతిభను పిల్లలు చెప్పే జవాబులతో లెక్క గడుతున్నారు. అలా కాకుండా అధికారులు ఇన్‌స్పెక్షన్ అప్పుడు రెండు రోజులు అక్కడే ఉండాలి. పిల్లలని సమగ్రంగా పరిశీలించాలి. 'వందేమాతరం' అనే సంస్థ ఈ విషయంలో మంచి పనిచేస్తోంది. పరీక్షలకు 45 రోజుల ముందు నుంచే వారు పిల్లలను సిద్ధం చేస్తారు. మంచి ఆహారం అందించి... తోటి పిల్లలు, నిపుణులతో అనుమానాలు నివృత్తి చేయిస్తారు. అప్పుడు పరీక్షలకు పంపుతారు.

అక్కడ గైడ్స్ ఉండవు

అమెరికాలో గైడ్స్ అమ్మరు. ఇక్కడ ఇంజినీరింగ్ విద్యకూ గైడ్స్ అమ్ముతుంటే ఇక ప్రతిభ ఎక్కడొస్తుంది. అమెరికాలో మొదటి సంవత్సరం విద్యార్థుల బోధనకు అనుభవజ్ఞుడైనా ప్రొఫెసర్‌ను పంపుతారు. ఎందుకంటే ముందు సబ్జెక్టు మీద ఆసక్తి పెంచుతారు. ఇక్కడ అప్పుడే ఇంజినీరింగ్ పూర్తి చేసిన వ్యక్తిని జూనియర్లకు బోధించడానికి నియమిస్తారు. ఎంసెట్ లాంటి పోటీ పరీక్షల్లో సమాచారం అడుగుతారు. ప్రపంచంలో ఏ పరీక్ష ఇలా ఉండదు. అక్కడి పరీక్షలు విశ్లేషణ సామర్థ్యాన్ని తెలుసుకొనేలా ఉంటాయి. క్రియేటివ్ థింకింగ్‌ని అంచనా వేసేలా ఉంటాయి. అందుకే అక్కడ మనలా 99శాతం, 99.5 శాతం మార్కులు రావు.

చదువంటే అక్షరాలు గుర్తుపట్టడమా?

చదవడం అంటే అక్షరాలు గుర్తుపట్టడం కాదు. వాటిలోని భావాలను అర్థం చేసుకోవడం. సారాన్ని జీవితానికి అన్వయించుకోవడం. అమెరికాలో ముందుగా తండ్రి ఒక పేరాగ్రాఫ్ చదివి పిల్లలకు వినిపిస్తారు. ఎందుకంటే ... ఎక్కడ ఆపాలి? ఎక్కడ టోన్ పెంచాలి? తగ్గించాలి? అనేవి పిల్లలకు నేర్పడానికి. అలా ప్రతి అక్షరం వెనుక అర్థాన్ని బోధించాలి.

ఆటలతో మేలు

నాకు హాకీ ఇష్టం. చాలాకాలం ఆడేవాణ్ని. ఆటలు ఆడకుంటే సామూహికంగా ఆలోచించే విధానం రాదు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ఇతర దేశాలతో కలిసి పనిచేయవలసి వస్తుంది. మనం గ్లోబల్ మనిషిలా తయారు కావాలి. మన కాళ్లు మాత్రం లోకల్‌గా ఉండాలి.

నన్ను అమ్మాయి అనుకొనే వారు

వంద చిత్రాల అనుభవం
రాజకీయ రంగ ప్రవేశం
మళ్లీ సినిమాల ప్రయాణం
రీల్ జీవితంలో ఎత్తుపల్లాలు..
రియల్ జీవితంలో గెలుపోటములు..
ఇదీ నవ్వుల నటరాజు నరేష్ జీవన యానం. అందులోని కష్టాలు, నష్టాలు, సంతోషాలు, సందర్భాలు 'హాయ్'తో పంచుకున్నాడు.

త్రివిక్రమ్‌గారితో పనిచేసేటప్పుడు జంధ్యాలగారి స్కూల్ వాతావరణం కనిపించింది. ఇంద్రగంటి మోహనకృష్ణ నాకు మరో జంధ్యాల. ఇప్పుడున్న దర్శకులంతా ప్రతిభావంతులే. ఎవరి శైలి వాళ్లది. ఓ సీరియస్ విషయాన్ని చాలా అందంగా, నవ్విస్తూ చెప్పడం త్రివిక్రమ్, ఇంద్రగంటిలలో చూశా.

■ సినిమా వదిలి రాజకీయాల్లోకి వెళ్లారు. మళ్లీ ఇటు వచ్చారు. పరిశ్రమ ఆదరిస్తుందా? అనే భయం లేదా?

రాజకీయాల్లోకి వెళ్లే నాటికి నటుడిగా నాకు వంద చిత్రాల అనుభవం ఉంది. పరిశ్రమలోని లోటు పాట్లు ఏంటో నాకు తెలుసు. 'ప్రతి మనిషికీ ఓ ఆఖరి పేజీ ఉంటుంది. అందులో 'ఇక నాకేం అక్కర్లేద్దు' అని రాసుకుంటే మిగిలిన పేజీలు రాసుకోవడం ఈజీ' - అని నేనే నా పుస్తకంలో రాసుకున్నా. సినిమా కుటుంబంలో పుట్టడమే నా అదృష్టం. అందలాలు ఎక్కాలంటే కొన్ని దెబ్బలు తినక తప్పదని తెలుసుకున్నా.

■ అప్పటికీ ఇప్పటికీ సినిమా చాలా మారింది. వాటిని నటుడిగా ఎలా తట్టుకోగలుగుతున్నారు?

నేను మళ్లీ సినిమాల్లోకి వచ్చినప్పటికి పరిస్థితుల్లో చాలా మార్పులు కనిపించాయి. అప్పటి దర్శకులు లేరు. కొత్త వాళ్లతో పరిచయాలూ లేవు. 'నరేష్‌ని ఎలా వాడుకోవాలి' అనే విషయంలో వాళ్లలో కొంత కన్‌ఫ్యూజన్ ఉంది. వచ్చిన పాత్రని చేసుకుంటూ వెళ్లా. 'మీ శ్రేయోభిలాషి', 'దృశ్యం'లాంటి చిత్రాలు గట్టి పునాది వేశాయి. 'చందమామ కథలు' రూపంలో ఓ కొత్త పాత్ర పడింది. 'భలే భలే మగాడివోయ్'లో కామెడీ ఫాదర్‌గా పేరు వచ్చింది. ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు.

■ వ్యక్తిగతంగా నైరాశ్యంలోకి వెళ్లిన సందర్భాలేంటి?

సినిమా జీవితంలో, నిజ జీవితంలో నాకు తగిలిన దెబ్బలు ఇంకెవరికీ తగలేదు. ఎంతో మంది మోసం చేశారు. నా వ్యక్తిగత జీవితంలో చాలా నష్టపోయా. విడాకులు తీసుకున్నా. నటులకు జీవితాన్ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం. 24 గంటలూ ఓ వ్యామోహంలో పనిచేయాల్సి ఉంటుంది. వాటిని ఇంట్లోవాళ్లు అర్థం చేసుకోరు. సంపాదించినదంతా సినిమాల్లోనే పెట్టేవాడ్ని. అప్పట్లో 'దిగ్విజయం' అనే సినిమా తీశా. అది విడుదలకు నోచుకోలేదు. 'అదృష్టం', 'హలో డార్లింగ్'లాంటి సినిమాలు జనాలకు నచ్చలేదు. మానసికంగా ఆ పరాజయాలు నన్ను బాగా దెబ్బతీశాయి. మా గురువుగారు జంధ్యాల మరణం పెద్ద లోటు. తర్వాత నిర్మాతలెవరూ నా దగ్గరకు రాకపోవడంతో.. సినిమాల్ని వదులుకోవాలన్న నిర్ణయానికొచ్చా. అప్పుడే రాజకీయాల్లో చేరాను. ఆ ప్రయాణంలో ఆర్థికంగా చాలా నష్టపోయాను. ఇక పరిశ్రమలో అవమానాలు అంటారా? అవి ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. అడ్వాన్సులు ఇచ్చి వెనక్కి తీసుకున్నవాళ్లు చాలామంది ఉన్నారు.

■ మీలో ఓ రచయిత ఉన్నాడట కదా?

కవిత్వం, కథలు రాస్తుంటా. అది కూడా ఇంగ్లిష్‌లో. నేను రాసిన కథని ఓ దర్శకుడు ఓకే చేశాడు. త్వరలో సినిమాగా వస్తుంది. నా కథలు, భావాలు కలిపి ఓ పుస్తకం రాస్తున్నా.

■ ఆడవేషం అంటే ముందుగా గుర్తొచ్చేది మీరే. 'చిత్రం భళారే విచిత్రం' ఎలా కార్యరూపం దాల్చింది?

చిన్నప్పటి నుంచీ నాలో అమ్మ పోలికలు ఉండేవి. అందుకనేనేమో హీరో అయ్యాక కనీసం ఒక్క సినిమాలో అయినా 'ఆడవేషం వేయాలి' అని గట్టిగా ఫిక్సయ్యా. ఓ ఇంగ్లిష్ సినిమా చూశా. చాలా బాగా నచ్చింది. ఆ స్ఫూర్తితో ఓ కథ రాసుకుని జంధ్యాల గారి దగ్గరకు వెళ్లా. 'నీ ఎత్తు అయిదు అడుగుల పది అంగుళాలు. నువ్వు ఆడ వేషం వేస్తే జనాలు చూస్తారా' అని అడిగారు. నాకూ నిజమే అనిపించింది. 'ఓ పనిచేద్దాం.. సరదాగా ఓసారి ట్రైల్ వేద్దాం' అని 'చూపులు కలసిన శుభవేళ'లో తొలిసారి ఆడవేషం వేయించారు. సుత్తివీరభద్రారావుగారితో ఓ డ్యూయెట్ తీశారు. నాకు తెలిసి ఇద్దరు మగవాళ్లపై తెరకెక్కించిన ఏకైక డ్యూయెట్ అది. ఆ సమయంలోనే 'చిత్రం భళారే విచిత్రం' కథ నన్ను వెదుక్కుంటూ నా దగ్గరకు వచ్చింది. ఆ పాత్ర కోసం పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ కథని తమిళంలో కమల్‌హాసన్‌తో రీమేక్ చేద్దామనుకున్నారు. నా సినిమా చూసి 'నరేష్ చాలా బాగా చేశాడు. ఇతన్ని మర్చిపోవాలంటే మరో పదేళ్లు పడుతుంది. నేను కూడా పదేళ్ల తరవాతే లేడీ గెటప్ వేస్తా' అన్నార్ట. ఆ మాట విని పద్మశ్రీ వచ్చినంత సంబరపడ్డా.

■ మిమ్మల్ని నిజంగానే అమ్మాయి అని భ్రమపడినవాళ్లు ఉన్నారా?

అయ్యో.. చాలామంది. ఓసారి మా సెట్లోకి వేరే నిర్మాత వచ్చాడు. నన్ను చూసి మనసు పారేసుకున్నారు. తర్వాత అసలు విషయం తెలిసి వెనక్కి తిరిగి చూడకుండా పరిగెట్టాడు. ఇప్పటి వరకూ మళ్లీ కనిపించలేదు.. (నవ్వుతూ).

■ మళ్లీ అలాంటి వేషం వేయాలనిపించలేదా?

ఇప్పుడు అనిపిస్తోంది. తప్పకుండా 'చిత్రం భళారే విచిత్రం 2' తీస్తా. అలాంటి కొత్త తరహా ప్రయత్నాలు చేయాలన్న కసి, తపన ఇప్పటి దర్శకుల్లో కనిపిస్తోంది.

– మహమ్మద్ అన్వర్

ఈనాడు సినిమా

'ఎఫ్ 2' మొదలైంది



వెంకటేష్, వరుణ్‌తేజ్, మెహరీన్‌పై క్లాప్‌నిస్తున్న అల్లు అరవింద్

టాలీవుడ్‌లో మల్టీస్టారర్ పరంపరని కొనసాగిస్తూ మరో చిత్రం ఇప్పుడు పట్టాలెక్కింది. వెంకటేష్, వరుణ్‌తేజ్ కథానాయకులుగా 'ఎఫ్ 2' అనే చిత్రం ప్రారంభమైంది. 'ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' ఉపశీర్షిక. తమన్నా, మెహరీన్ కథానాయికలు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు నిర్మాత. శనివారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నిచ్చారు. దిల్‌రాజు, వెంకటేష్, వరుణ్‌లు కలసి స్క్రిప్టుని దర్శకుడికి అందించారు. "వినోదానికి ప్రాధాన్యం ఉన్న చిత్రమిది. వచ్చే నెల 5 నుంచి చిత్రీకరణ మొదలెడతాం. సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంటుంది. సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం అందిస్తున్నారు. మిగిలిన వివరాలు త్వరలో ప్రకటిస్తాం" అని చిత్ర బృందం తెలిపింది.

క్లాప్.. క్లాప్

నిహారిక మరో చిత్రం

నిహారిక, రాహుల్ విజయ్‌పై క్లాప్‌నిస్తున్న నాగబాబు

రాహుల్ విజయ్, నిహారిక జంటగా నిర్వాణ సినిమాస్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. ప్రణీత్ బ్రమనందపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ యర్మారెడ్డి, సుజన్ యారబోలు, రామ్ నరేష్ నిర్మిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నాగబాబు క్లాప్‌నిచ్చారు. కథానాయకుడు వరుణ్‌తేజ్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "రొమాంటిక్ కామెడీ కథతో రూపొందుతున్న చిత్రమిది. ఇదివరకు 'ముద్దపప్పు ఆవకాయ్', 'నాన్న కూచి' వెబ్ సిరీస్‌లు చేశాను. నేను తెరకెక్కించిన తొలి చిత్రమిది. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుంది" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "దర్శకుడు తయారు చేసిన కథ చాలా బాగుంది. శేఖర్ కమ్ముల సినిమాల శైలిలో అందరికీ వినోదం పంచుతుందీ చిత్రం. 'ఈమాయ పేరేమిటో' తర్వాత నేను చేస్తున్న చిత్రమిది" అన్నారు. నిహారిక మాట్లాడుతూ "దర్శకుడు ప్రణీత మా కుటుంబ స్నేహితుడు. తను ఈ సినిమాని కొత్తగా తీర్చిదిద్దనున్నారు. పలు చిత్రాల్ని పంపిణీ చేసిన నిర్వాణ సినిమాస్ ఈ చిత్రంతో నిర్మాణం ప్రారంభిస్తున్నందుకు అభినందనలు" అన్నారు. శివాజీరాజా మాట్లాడుతూ "ప్రణీత్‌తో 'నాన్న కూచి' వెబ్‌సిరీస్ చేశా. దర్శకత్వంలో ఎంతో స్పష్టత కలిగిన ఆయన తొలి సినిమాలో నేనొక కీలక పాత్ర పోషిస్తుండడం ఆనందంగా ఉంది" అన్నారు. సత్య, కోటేశ్వర రావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: హరిజ్‌ప్రసాద్, సంగీతం: మార్క్ కె.రాబిన్, కళ: అవినాష్ కొల్ల, పాటలు: కృష్ణకాంత్.

నాకు ఆ వెసులుబాటు ఉంది!

పూజాహెగ్డే

జిగేల్ రాణిగా ప్రత్యేకమైన అందంతో ఆకట్టుకుంది పూజాహెగ్డే. ప్రస్తుతం కెరీర్ పరంగా కూడా ఆమె జిగేల్‌మంటూ మెరుస్తోంది. ఎన్టీఆర్, మహేష్‌బాబు, ప్రభాస్... ఇలా అగ్ర కథానాయకులతో కలిసి నటించే అవకాశాల్ని అందుకొంది. మరో పక్క హిందీపైనా దృష్టిపెట్టింది. ఇప్పటిదాకా సాగిన నా సినీ ప్రయాణంలో ఎక్కువసార్లు ఆశ్చర్యపోవడమే తప్ప... మితిమీరిన కష్టాలు, సవాళ్లంటూ పెద్దగా ఎదుర్కోలేదని చెబుతోంది పూజాహెగ్డే. "సెట్లో ఎదురయ్యే సవాళ్లు, అక్కడ పడే కష్టం విషయంలో ఎవ్వరికీ మినహాయింపు ఉండదు. అక్కడ శ్రమించడం స్వతహాగా నాకూ ఇష్టమే. కానీ అక్కడిదాకా చేరుకొనే క్రమంలోనే చాలామందికి ఎన్నో అనుభవాలు ఎదురవుతుంటాయి. నా విషయంలో మాత్రం సినిమా రంగంలోకి ప్రవేశించడం మొదలుకొని... వరుసగా అవకాశాలు అందుకోవడం వరకు అన్నీ అనుకోకుండానే జరిగిపోతుంటాయి. మనం ఏమాత్రం ఊహించని సంఘటనలు మన జీవితంలో జరిగితే ఆశ్చర్యపోతాం కదా. నేనూ అదే అనుభవంలో ఉంటున్నా. ఎటొచ్చీ అవకాశాల గురించి ప్రత్యేకంగా ఆలోచించే అవసరమే రావడం లేదు కాబట్టి... స్వేచ్ఛగా పనిచేసే వెసులుబాటు నాకు లభిస్తోంది. భవిష్యత్తులోనూ నా ప్రయాణం ఇలాగే ఉంటే ఎంత బాగుంటుందో" అంటూ గారాలు పోతోంది పూజాహెగ్డే.

నాగశౌర్య చిత్రం ప్రారంభం

శంకరప్రసాద్, ఉషాబాల, నాగశౌర్య, వి.ఆనంద్‌ప్రసాద్, రాజా కొలుసు

భవ్య క్రియేషన్స్ పతాకంపై నాగశౌర్య కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. రాజా కొలుసు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వి.ఆనంద్‌ప్రసాద్ నిర్మిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ఆగస్టు నుంచి చిత్రీకరణ మొదలవుతున్నట్టు నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగశౌర్య తల్లిదండ్రులు ఉషాబాల, శంకరప్రసాద్, నిర్మాత భార్య కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకి ఛాయాగ్రహణం: సాయిశ్రీరామ్, సంగీతం: మహతి స్వరసాగర్, కళ: వివేక్, కూర్పు: ప్రవీణ్ పూడి.

గీత ప్రేమలో గోవిందం

విజయ్ దేవరకొండ, రష్మిక మందాన్న

విజయ్ దేవరకొండ, రష్మిక మందాన్న జంటగా నటిస్తున్న చిత్రం 'గీత గోవిందం'. పరశురాం దర్శకుడు. జీఏ 2 సంస్థ నిర్మిస్తోంది. బన్నీ వాసు నిర్మాత. అల్లు అరవింద్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. శనివారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ "పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి చిత్రాలతో స్టార్‌డమ్ సంపాదించుకున్నాడు విజయ్. తన కెరీర్‌లో 'గీత గోవిందం' మరో ఉత్తమ చిత్రంగా నిలుస్తుంది. విజయ్, రష్మికల మధ్య వచ్చే సన్నివేశాలే ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "గీతా ఆర్ట్స్‌లో ఇది నా రెండో చిత్రం. విజయ్ దేవరకొండ ఇమేజ్‌ని దృష్టిలో ఉంచుకుని ఈ కథ తయారు చేశాను. గీత, గోవిందం చేసే అల్లరి అంతా ఇంతా కాదు. వీరిద్దరి కెమిస్ట్రీ వెండి తెరపై చూడాల్సిందే" అన్నారు. "యువతరం, కుటుంబ ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలూ ఇందులో ఉన్నాయి. గోపీసుందర్ అందించిన సంగీతం తప్పకుండా ఆకట్టుకుంటుంద"న్నారు నిర్మాత. నాగబాబు, సుబ్బరాజు, వెన్నెల కిషోర్, రాహుల్ రామకృష్ణ, గిరిబాబు, అన్నపూర్ణమ్మ తదితరులు నటించారు. ఛాయాగ్రహణం: మణికందన్

ఆదితో సురభి

సాయికుమార్ తనయుడు ఆది కథానాయకుడిగా శ్రీ హనుమాన్ మూవీ మేకర్స్ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. శ్రీనివాసనాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. చింతలపూడి శ్రీనివాస్, చావలి రామాంజనేయులు నిర్మాతలు. ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైంది. వచ్చే నెలలో రెగ్యులర్ షూటింగ్ జరగబోతోంది. కథానాయికగా సురభిని ఎంచుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "కథ చాలా బాగా కుదిరింది. ఆదిని ఓ కొత్త కోణంలో చూస్తారు. రావు రమేష్, రాధిక, రాజీవ్ కనకాల పాత్రలు కూడా ఆకట్టుకుంటాయ"న్నారు. అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సాంబ భీమవరపు

నిర్మాత కావాలనుకున్నా

మహీధర్

"సినిమా అంటే ఇష్టం. దాంతో నిర్మాత కావాలనుకొన్నా. మంచి కథలు దొరకలేదు. ఇంతలో ఒక కథ నన్నే హీరోని చేసింది" అన్నారు మహీధర్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'నా లవ్ స్టోరీ'. సోనాక్షిసింగ్ కథానాయిక. శివ గంగాధర్ దర్శకత్వం వహించారు. జి.లక్ష్మి నిర్మాత. చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మహీధర్ శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. "మాది విజయవాడ. సివిల్ ఇంజినీరింగ్ చేశాక, మోడలింగ్‌లోకి వెళదామనుకొన్నా. దిల్లీ, హర్యానలో కొన్ని రోజులు ఉద్యోగం చేశా. సినిమాలపై ఆసక్తితో నిర్మాణం వైపు దృష్టిపెట్టడంతో పాటు, భిక్షుగారి దగ్గర నటన కూడా నేర్చుకొన్నా. దర్శకుడు శివ గంగాధర్ 'నా లవ్‌స్టోరీ' కథ చెప్పారు. గేటెడ్ కమ్యూనిటీ నేపథ్యంలో సాగే అందమైన ప్రేమ కథా చిత్రమిది. అబ్బాయిలకి సరైన వయసులో పెళ్ళిళ్లు కావడం లేదు. అమ్మాయిల డిమాండ్లు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ఒక అబ్బాయి ఒక అమ్మాయి ప్రేమని ఎలా పొందాడు? వాళ్ల ప్రేమ ఎక్కడిదాకా దారితీసిందనే విషయాల్ని తెరపైనే చూడాలి. సోనాక్షి సింగ్ రావత్ చక్కటి అభినయం ప్రదర్శించింది. శేషగిరిరావు నిర్మాణం, ఈశ్వర్ కిరణ్ కెమెరా పనితనం, వేదనివాస్ సంగీతం, భువనచంద్ర, శివశక్తి దత్తా గీతాలు... ఇలా అన్నీ బాగా కుదిరాయి" అన్నారు మహీధర్. భారతీబాబు దర్శకత్వంలో 'నటన' అనే చిత్రం చేశానని, భవిష్యత్తులో నిర్మాణంపై కూడా దృష్టిపెట్టబోతున్నానని ఆయన తెలిపారు.

పంచ్ డైలాగ్

వైద్యరంగంలో ఏడు శాతం జీఎస్టీ ఉన్న సింగపూర్‌లో ఉచిత వైద్యం అందిస్తున్నప్పుడు, 27 శాతం జీఎస్టీ ఉన్న మన దేశంలో ఎందుకు ఉచిత వైద్యం అందించడంలేదు?

చిత్రం: అదిరింది

– పంపినవారు: గడ్డం పవన్, ఈమెయిల్

పరిశోధనాత్మక రచనతో...

అల్లాణి శ్రీధర్

స్వయంపాలనతో తెలంగాణ సమాజం ఏ విధంగా రూపుదిద్దుకొంటోందనే విషయంపై... తెలంగాణ రాష్ట్ర జలవనరుల ఛైర్మన్ వి.ప్రకాష్ రాసిన పరిశోధనాత్మక రచన ఆధారంగా ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు దర్శకుడు అల్లాణి శ్రీధర్ తెలిపారు. కేసీఆర్ చేపట్టిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం భారతదేశ రాజకీయ, సామాజిక ముఖచిత్రాన్ని ప్రభావితం చేసిందనీ, ఆ విషయాల్ని కూడా ప్రస్తావిస్తూ వర్తమాన తెలంగాణ నేపథ్యంలో సినిమాని రూపొందించనున్నట్టు అల్లాణి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా తన దర్శకత్వంలో వచ్చిన 'చిలుకూరు బాలాజీ' చిత్రాన్ని హిందీలోనూ రీమేక్ చేస్తున్నట్టు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు అల్లాణి శ్రీధర్.

అందరూ అఖండులే

అప్పటి ముచ్చట!

ఎస్వీఆర్

మద్రాసులో ఓ తమిళ చిత్రం షూటింగ్... శివాజీ గణేశన్ మేకప్‌తో సిద్ధంగా ఉన్నారు. కాసేపట్లో మేకప్ పూర్తి చేసుకుని ఎస్వి రంగారావు వచ్చారు. శివాజీ గణేశన్ ఆయన పాదాలకు నమస్కరిస్తూ 'రాక్షసుడా! ఈ ఒక్క సీనూ నాకు వదిలిపెట్టు' అన్నారట. అది విన్న ఎస్వీఆర్ పగలబడి నవ్వి వెనుక వైపు చూపిస్తూ 'అటు చూడరా... బ్రహ్మరాక్షసి వచ్చేసింది. మనిద్దరినీ మింగేస్తుంది' అన్నారట. అప్పుడే వచ్చిన సావిత్రి ఆ మాట వింటూనే రాక్షసిలాగ వికటాట్టహాసం చేసిందట. భయం నటించిన శివాజీ మరోవైపు చూస్తూ, 'మరేం భయం లేదు. అదిగో కళాసరస్వతి వస్తోంది' అంటూ అప్పుడే అడుగుపెట్టిన సీనియర్ నటి కన్నాంబకు నమస్కరించారట. అప్పటి తారల మధ్య అలాంటి సరదా సంభాషణలతో సెట్లో వాతావరణం సందడిగా ఉండేది

– శ్రీవత్స

సావిత్రి

కన్నాంబ

శివాజీ గణేశన్

కొత్త ముద్దు

జాక్వెలిన్

జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఓ కొత్త ముద్దు సన్నివేశంలో నటించింది. పైగా ఇలాంటి ముద్దు ఆమెకు తొలిసారి కూడా. అది ఓ లెస్బియన్ ముద్దు. జాక్వెలిన్ తాజాగా ఓ బ్రిటన్ సినిమాలో నటిస్తోంది. జేమ్స్ సింప్సన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా పేరు 'డెఫినిషన్ ఆఫ్ ఫియర్'. ఇది సైకలాజికల్ హారర్ చిత్రం. ఇందులో జాక్వెలిన్ సైకాలజిస్టుగా కీలక పాత్రలో నటిస్తోంది. ఇందులోనే జాక్వెలిన్ ఓ అమ్మాయితో పెదవులు కలిపే సన్నివేశం ఉందట ఇది వరకు జాక్వెలిన్ 'మర్డర్ 2' లో ఇమ్రాన్ హష్మితో, 'ఎ జెంటిల్‌మ్యాన్' లో సిద్ధార్థ్ మల్హోత్రాతో, 'జుద్వా2' లో వరుణ్ ధావన్‌తో, 'బ్రదర్స్'లో అక్షయ్‌కుమార్‌తో ముద్దుసీన్లలో నటించింది.

నీలోని నువ్వెవరో తేలాలి... దేవాంతకా

పాటంటే.. పదాల మూట. అక్షరాలతో స్వరాలు ఆడుకునే ఆట. అందులో సరదాలు, సంతోషాలు, కష్టాలు, కన్నీళ్లూ అన్నీ రంగరించొచ్చు. వీలైతే జీవితసారం మొత్తం ధారబోయొచ్చు. అయితే అన్ని పాటలూ ఈ అవకాశాన్ని ఇవ్వవు. అన్ని కథలూ ఇందుకు సరిపోవు. కొన్నిసార్లు రచయితే.. ఆ దారి వెదుక్కోవాలి. చైతన్య ప్రసాద్ అదే చేశారు. ప్రాణ భీతితో జైలు నుంచి పారిపోయిన ఖైదీని ప్రతీకగా తీసుకుని - లోకానికీ, జీవితానికీ, మనిషి తత్వానికీ సంబంధించిన తాత్వికతను బోధించే ప్రయత్నం చేశారు. చంద్రసిద్దార్థ్ దర్శకత్వం వహించిన 'ఆటగదరా శివ'లో 'ఇదేనా నిజంగా..' అనే పాట వింటే ఆ విషయం అర్థం అవుతుంది. ఈ పాట గురించి రచయిత చైతన్య ప్రసాద్ ఏమన్నారంటే...

'ఆటగదరా శివ'లో ఉదయ్ శంకర్

"సినిమాలో తొలి పాట ఇది. వారం రోజుల్లో ఉరి అనగా జైలు నుంచి పారిపోయిన ఖైదీ నేపథ్యంలో వినిపిస్తుంది పాట. అతను దాక్కోవడం, భయపడడం ఇవన్నీ తెరపై కనిపిస్తాయి. 'ఊరకే పారిపోవడమే కాకుండా.. కాస్త ఫిలాసఫీ కూడా ఉండేలా చూడు' అని దర్శకుడు చంద్రసిద్దార్థ్ నాతో చెప్పారు. ఆ సమయంలో మా సోదరి ఆసుపత్రిలో ఉంది. తనతో పాటు ఉంటూ సేవలు చేస్తున్నాను. ఆమెను ఆ స్థితిలో చూసినప్పుడు మనసు పరిపరివిధాలుగా ఆలోచించడం మొదలెట్టింది. అసలు జీవితం ఏమిటి? మనిషి అస్తిత్వం ఎక్కడ ఉంది? ఇలాంటి ప్రశ్నలతో నాలో నేను మధనపడుతున్నా. సరిగ్గా.. అలాంటి భావాల్ని విశ్లేషించాల్సిన అవసరం ఈ పాటలో కనిపించింది. అక్కడే.. ఆ ఆసుపత్రిలోనే ఈ పాట రాశాను. మనిషంటే ఆకారం, అలంకారాలు, గెడ్డాలు, మీసాలు కాదు. ఇంకేదో ఉంది. దాన్ని వెదికిపట్టుకోవాలి. మనలో మనం అన్వేషించాలి.. అదే ఈ పాటలో చెప్పాలనిపించింది.

'లోకమే పెద్ద జైలు' అని పెద్దలు ఎప్పుడో చెప్పారు. ఆ మాటే గుర్తు చేస్తూ పల్లవి మొదలెట్టాను. 'పలుకుతుంది కెలుకుతుంది నవ్వుతూనే నిన్ను చంపేస్తుంది' అంటూ లోక తత్వం చెప్పాను. చరణాలు రెండూ మనిషి అస్థిత్వానికి సంబంధించినవి. మనలో చాలామంది నీడని చూసి భయపడతాం. అది మన మానసిక స్థితిని బట్టి ఉంటుంది. కథానాయకుడి స్థితి కూడా అలాంటిదే. అందుకే "నీ నీడలే.. నీ జాడలే

వెంటపడ్డ చాలు.. జంకుతావు నీవే

ప్రాణభీతి తోటి పరుగు తీసినావే" అని రాశా.

ఒక్కసారి పాట అందుకున్నాక రాయడానికి ఎంతో సమయం పట్టలేదు. ఎందుకంటే చంద్రసిద్ధార్థ్ తనకేం కావాలో చెప్పి, భారమంతా మనకే వదిలేస్తాడు. తనకు సాహిత్యం, భాషపై మంచి అవగాహన ఉంది. చిన్న చిన్న సవరణలతో పాట పూర్తయిపోయింది. ఈ సినిమాలో మొత్తం నాలుగు పాటలు రాశాను. అన్నీ తాత్వికతకు చెందినవే. ఓ పాటలో భగవద్గీత సారం ప్రతిధ్వనిస్తుంటుంది. మరో పాటలో ఉరి శిక్ష పడిన ఖైదీకి, తలారీకి మధ్య జరిగే సంవాదం, వాళ్ల అంతరంగాన్ని ఆవిష్కరించే పాట. ఇలా ప్రతీ పాట మనసుకు సంతృప్తినిచ్చేదే"

చైతన్య ప్రసాద్

కొత్త పాట గురూ!

చిత్రం: ఆటగదరా శివ
సంగీతం: వాసుకి వైభవ్
గానం: వాసుకి వైభవ్
రచన: చైతన్య ప్రసాద్

పల్లవి:
ఇదేనా.. నిజంగా
స్వేచ్ఛనిచ్చు ఆరు బయలు
పిచ్చోడా.. వెర్రోడా
లోకమంటే పెద్ద జైలు
పలుకుతుంది.. కెలుకుతుంది
తడుముతుంది.. తరుముతుంది
నవ్వుతూ నిన్నే చంపేస్తుంది
న్యూస్టోరీ.. న్యూస్‌స్టోరీ
బొమ్మ గుద్ది పంచుతోంది
న్యూ స్టోరీ.. న్యూస్ స్టోరీ
రేటు కట్టి అమ్ముతోంది

చరణం 1:
నీ నీడలే.. నీ జాడలే
వెంటపడ్డ చాలు.. జంకుతావు నీవే
ప్రాణభీతి తోటి పరుగు తీసినావే
నిన్ను నువ్వే దొంగలాగ తరుముకుంటు
నీకు నువ్వే దొరకకుండా తప్పుకుంటు
ఈ ఆట.. ఈ వేట సాగింది
దేవాంతకా

చరణం 2:
నువ్వెవరో నీకే తెలియదు
ఎత్తు లావు చూసి ఎవరు నిన్ను పోల్చగలరు
నిన్ను నిన్నులాగ కచ్చితంగా తేల్చలేరు
గెడ్డం మీసం అసలు రూపు దాచలేవు
మారువేషం వేసి నిజం మార్చలేవు
నీలోని నువ్వెవరో తేలాలి
దేవాంతకా
న్యూ స్టోరీ.. న్యూస్ స్టోరీ..
అన్నిచోట్ల అతని బొమ్మే
న్యూ స్టోరీ.. న్యూస్ స్టోరీ
అన్ని చోటల్ల అతని...
ఆ అన్ని చోట్ల అతని బొమ్మే

ద్రోణవల్లి హారిక.. అచ్చ తెలుగు అమ్మాయి. పెంటేల హరికృష్ణ, కోనేరు హంపిల తరువాత తెలుగు రాష్ట్రాల నుంచి చదరంగంలో అత్యున్నత స్థాయికి చేరుకున్న క్రీడాకారిణి. అద్వితీయ ప్రదర్శనతో తనదైన ముద్ర వేసిన ఘనత హారికది. పద్దెనిమిదేళ్లుగా చదరంగంలో ఎదురులేని రాణిగా కొనసాగుతున్న హారిక త్వరలోనే పెళ్లి పీటలెక్కనుంది. హైదరాబాద్‌కు చెందిన కార్తీక్ చంద్రను వివాహం చేసుకోనుంది. పెళ్లి ఏర్పాట్లలో హడావుడిగా ఉన్న హారిక అంతరంగ ఆవిష్కరణ ఇది.

గట్టిగా మాట్లాడితే ఇష్టం

ఇంతకుముందు పెళ్లి గురించి ఎలాంటి ఆలోచనలు ఉండేవి?

ఒకప్పుడు ఎలాంటి అబ్బాయితో పెళ్లవుతుందీ... ఆ తరువాత కెరీర్ కొనసాగించగలనా... అనే భయం ఉండేది. నన్ను ప్రోత్సహించే వ్యక్తితోనే పెళ్లి కావాలని కోరుకున్నా. కార్తీక్‌ను కలిశాక నా భయాలన్నీ తొలగిపోయాయి. చాలా మంచి వ్యక్తి. మచ్చలేని వ్యక్తిత్వం. తనది హైదరాబాద్. సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. వాళ్ల కుటుంబ వ్యాపారాలు చూసుకుంటున్నాడు. తనది అందమైన కుటుంబం. నేను ఇప్పటికే అందరితో బాగా కలిసిపోయా. నాపై ఎంతో ఆప్యాయత చూపిస్తున్నారు. నేను టోర్నీలకు వెళ్తున్నప్పుడు ఆల్ ద బెస్ట్ చెబుతున్నారు. నేను కోరుకున్నది అదే. నా జీవితంలో అత్యంత ఆనందకరమైన దశ ఇది. పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకోవాలన్నది మొదట్నుంచీ నా అభిప్రాయం.

ఎలాంటి అబ్బాయి భర్తగా రావాలని కోరుకున్నారు?

నాన్నకూ, నాకూ మొదట్నుంచీ ఇదే విషయంపై చర్చ జరిగేది. 'చెస్ క్రీడాకారిణిగా ఎక్కువ ప్రయాణాలు చేస్తుంటావు.. పెళ్లయ్యాక అలా వెళ్లడం కుదరదు' అని అనేవారు. ఆ విషయంలో మాత్రం నేను ఒప్పుకోనని చెప్పా. నా ఆటా, ప్రయాణాల్లో జోక్యం చేసుకోని వ్యక్తినే చేసుకుంటానని అనే దాన్ని. ఏ టోర్నీ ఆడాలీ, ఎన్ని రోజులు వెళ్లాలీ అని ఆంక్షలు విధించే వ్యక్తయితే కుదరదని ముందే చెప్పా. ఒక్కోసారి టోర్నీల కోసం విదేశాలకు వెళ్తాం. కొన్నిసార్లు ఇంట్లోనే ఉంటాం. క్రీడాకారుల జీవితంలో అన్ని ప్రణాళిక ప్రకారమే జరుగుతాయి. అప్పటికప్పుడు ఆడే టోర్నీలేవీ ఉండవు. అందుకే నాపై ఆంక్షలు పెట్టని వ్యక్తే కావాలనుకున్నా. అదృష్టవశాత్తు నా అభిప్రాయాలకు విలువిచ్చే అబ్బాయే దొరికాడు. మంచివాడు. అందరూ బాగుండాలనీ, ఆనందంగా ఉండాలని కోరుకుంటాడు. ఇతరులకు సహాయం చేసే మంచి మనసుంది.

కార్తీక్‌కి ఇంట్లో ఉండటం, ప్రయాణాలు చేయడమంటే చాలా ఇష్టం. అన్నిటికంటే నేను చెస్ ఆడటం అతనికి ఇంకా ఎక్కువ ఇష్టం. నన్ను బాగా అర్థం చేసుకున్నాడు. ఇద్దరిదీ ఒకేలాంటి మనస్తత్వం. అభిరుచులూ బాగా కలిశాయి. తనతో నా జీవితం సంతోషంగా ఉంటుందని వందశాతం నమ్ముతా. ఇక మీదటా ఆటలో మరింత ప్రతిభ చూపుతూ, అత్తారింట్లో మంచి పేరు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం.

కార్తీక్ గురించి మీ అభిప్రాయం?

సంతోషంగా ఉంటాడు. కొత్తవారితో తొందరగా కలవడు. పరిచయమైతే సన్నిహితంగా మెలగుతాడు. చిన్నప్పుడు నా నోరు పెద్దదని స్నేహితులు అనేవాళ్లు. అప్పట్నుంచీ మెల్లిగా మాట్లాడటం అలవాటు చేసుకున్నా. ఇప్పుడు కార్తీక్... 'అంత మెల్లిగా మాట్లాడుతున్నావేంటి? గట్టిగా మాట్లాడు...' అని అంటున్నాడు. నేను గట్టిగా మాట్లాడటం ఇష్టపడే వ్యక్తిని తొలిసారి కలవడం ఆనందంగా అనిపించింది.

పెళ్లి తరువాత చెస్‌కు ప్రాధాన్యం తగ్గొచ్చా?

18 ఏళ్లుగా ఆడుతున్నా. చెస్ నా జీవితంలో అంతర్భాగం. ఇప్పటికీ చెస్‌కే నా తొలి ప్రాధాన్యం. పెళ్లి తరువాత కూడా ఆటకి అంతే ప్రాధాన్యం ఇస్తా. వైవాహిక జీవితాన్నీ, కెరీర్‌ను సమన్వయం చేసుకుంటా. నేను చెస్ కొనసాగించాలన్నది కార్తీక్ దృఢమైన అభిప్రాయం. అతడికి ఫుట్‌బాల్, క్రికెట్ అంటే ఆసక్తి ఎక్కువ. చెస్‌ను కూడా ఫాలో అవుతాడు. తప్పులేమీ చేయకుండా ఎత్తులు వేస్తాడు. ఆటపై కొంచెం పట్టు కూడా ఉంది. అలాగని నేనెప్పుడూ అతడితో ఆడలేదు. ఆడాలని కూడా అనుకోవట్లేదు! నా గేమ్‌లు బాగా ఫాలో అవుతాడు. ఏ టోర్నీలో ఎలా ఆడానో చెప్తుంటాడు. వీడియోలు, ఫలితాలు వీక్షిస్తాడు. 'నువ్వు గెలుస్తావు' అని ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఉంటాడు.

ఇప్పటి మాదిరే వివాహం తర్వాత చెస్‌పై ఏకాగ్రత సాధ్యమేనా?

పెళ్లి తరువాత కూడా కెరీర్‌లో విజయవంతమైన వాళ్లున్నారు. పరిస్థితుల్ని ఎలా సమన్వయం చేసుకుంటామన్నదే ముఖ్యం. సర్దుకుపోవడం కీలకం. అదంతా నాపైనే ఆధారపడి ఉంటుంది. కెరీర్, జీవితంలో మరింత క్రమశిక్షణతో ఉండాలి. పెళ్లి తరువాత కెరీర్‌లో మార్పుండదు. నిజం చెప్పాలంటే అప్పుడే మరింత స్థిరత్వం వస్తుంది. మెదడు ప్రశాంతంగా ఉంటుంది. చెస్‌పై మరింత ఏకాగ్రత ఉంచొచ్చు.

ఒకవైపు పెళ్లి... మరోవైపు టోర్నీలు ఎలా సాధ్యం?

జులై 27 నుంచి ఆగస్టు 4 వరకు ఇరాన్‌లో ఆసియా టీమ్ చెస్ ఛాంపియన్‌షిప్ ఉంది. జనవరి నుంచి ఏప్రిల్ వరకూ ఖాళీగానే ఉన్నా. ఈలోపు సింహభాగం షాపింగ్ పూర్తిచేశా. పెళ్లికి ముందు కొన్ని పనులు మాత్రమే ఉన్నాయి. 14 ఏళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో టీమ్ ఛాంపియన్‌షిప్‌లలో భారత్‌కు ఆడుతున్నా. ఏ ఒక్క టోర్నీని కూడా మిస్ కాలేదు. భారత్ తరఫున ఆడకుండా కూడా ఉండలేను. పెళ్లికి 15 రోజుల ముందు వరకూ ఇరాన్‌లో ఉండాలి. పెళ్లి కదా... ముందులా ఏకాగ్రతతో ఆడతానో లేదోనని కాస్త భయంగా ఉందంతే. చేయాల్సిన పనులయితే ఏవీ లేవు కాబట్టి ఆడి రమ్మని నాన్నా, కార్తీక్ చెప్పారు. ఇంతకన్నా ఇంకేం కావాలి. ఇద్దరూ మద్దతుగా నిలవడం గొప్పగా అనిపించింది.

హనీమూన్ ఎక్కడ?

తప్పకుండా వెళ్తాం. కానీ ఎక్కడ అనేది ఇంకా నిర్ణయించుకోలేదు. ఇప్పటి వరకూ కెరీర్ కోసమని ఎన్నో సార్లు సొంతంగా అన్నీ బుక్ చేసుకొని ప్రయాణించా. హనీమూన్ బాధ్యత మాత్రం కార్తీక్‌కే అప్పగించా.

అత్తారిల్లు హైదరాబాద్‌లోనేగా...?

పెళ్లి తరువాత హైదరాబాద్‌లోనే ఉండాలనుకున్నా. ఇక్కడ ఉంటూ కెరీర్ కొనసాగించొచ్చని అనుకున్నా. బయట ఉండి కూడా ఆడొచ్చు. కానీ ఇక్కడి వాతావరణం, ఆహారం నాకెంతో ఇష్టం. ఇప్పుడు అంతా నేను కోరుకున్నట్లే జరుగుతుండటం ఆనందంగా ఉంది. ఆరేడేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నా. ఎప్పుడూ టోర్నీలంటూ బిజీబిజీ. హైదరాబాద్‌లో ఎక్కువ ప్రదేశాలు తెలియవు. కార్తీక్ పరిచయమయ్యాకే హైదరాబాద్‌లో తిరుగుతున్నా.

– వరికుప్పల రమేష్, ఈనాడు హైదరాబాద్

నిజ జీవితంలో హారిక ఎలా ఉంటుంది?

అందరితో బాగా మాట్లాడతా. సిగ్గుపడను. ప్రయాణాల్ని ఆస్వాదిస్తుంటా.

ఖాళీ సమయాల్లో ఏం చేస్తారు?

సినిమాలు, టీవీ షోలు చూస్తా. అప్పుడప్పుడు పుస్తకాలు చదువుతా. జీవిత చరిత్రలు ఎక్కువ. తెలుగు, తమిళం, మళయాలం, హిందీ సినిమాలు ఎక్కువగా చూస్తా. తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లిష్‌పై మంచి పట్టుంది. వినోదం, ప్రేమ కథలతో పాటు ఆహ్లాదంగా అనిపించే సినిమాలు చూస్తా.

మీ క్లోజ్ ఫ్రెండ్స్ ఎవరు?

చాలామందే ఉన్నారు. చిన్నప్పట్నుంచీ ఇంకా కొనసాగుతున్నారు. అందులో ఎవరో ఒకరి పేరు చెప్పడం నాకిష్టం లేదు. అందరూ ముఖ్యమే.

హాబీలు..

వంట చేయడం.. టీవీ చూడటం

భవిష్యత్తు ప్రణాళికలేంటి?

ప్రస్తుతం ప్రపంచ స్థాయిలో 13వ ర్యాంకులో ఉన్నా. ప్రపంచ నంబర్‌వన్‌గా నిలవడం.. ప్రపంచ ఛాంపియన్ అవడం జీవిత ఆశయాలు. అందుకు దగ్గర్లోనే ఉన్నానని అనిపిస్తోంది. ఈ ఏడాది ద్వితీయార్థం నాకెంతో కీలకం. చాలా టోర్నీలున్నాయి. ఆసియా టీమ్ చెస్, ఒలింపియాడ్‌తో సహా ముఖ్యమైన టోర్నీల్లో బరిలో దిగుతున్నా.

చక్కటి సెల్ఫీల కోసం

రాత్రిపూటా, వెలుతురు సరిగ్గా లేనిచోట సెల్ఫీలు సరిగ్గా రావు. అలాంటప్పుడు ఈ ఎల్ఈడీ సెల్ఫీ బ్యూటీ రింగ్ వాడి చూడండి. దీన్ని ఫోను ముందు భాగంలో, అంటే ఫ్రంట్ కెమెరా దగ్గర పెట్టేసి స్విచ్ నొక్కితే చాలు. ఫొటోలు తీసుకుంటున్నప్పుడు ముఖంపై వెలుతురు పడుతుంది. ఫొటోలూ చక్కగా వస్తాయి. దీన్ని వాడుకోవడం కూడా సులువే. ఎప్పటికప్పుడు బ్యాటరీలను మార్చుకునే అవకాశం కూడా ఉంది.

లేత రంగులు నప్పుతాయా?

? పదో తరగతి వరకూ మా ఊరిలోనే చదివా. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కాలేజీలో ఇంటరులో చేరా. ఇప్పటివరకూ నేను వేసుకున్న డ్రెస్‌ల రంగులన్నీ ఇంచు మించు ఒకే తరహాలో ఉన్నాయి. ఇప్పుడు నా స్నేహితులంతా నేను ఎంచుకున్నవి ఏ మాత్రం బాలేదు అంటున్నారు. ఇకపై నాకు నప్పవనీ చెబుతున్నారు. నేను కాస్త నల్లగా ఉంటా. ఇప్పుడు ఏం చేయాలో తెలియడంలేదు. ఎలాంటివి ప్రయత్నించొచ్చు?

– సీహెచ్. కార్తీక, హైదరాబాద్

✔ మీరు కాస్త ఛాయ తక్కువంటున్నారు కాబట్టి కొట్టొచ్చినట్లు కనబడే రంగుల జోలికి వెళ్లొద్దు. మీకు పేస్టల్ షేడ్స్ బాగుంటాయి. నీలం రంగులో జేడ్‌బ్లూ, ఐస్‌బ్లూ వంటి ప్రయత్నించొచ్చు. ఎరుపులో కాషాయం కలిసిన ఎరుపు మినహా మిగిలిన ఛాయల్లో వేసుకోవచ్చు. అలానే ఆకుపచ్చలో పిస్తాగ్రీన్, లేతాకుపచ్చ వంటివి మీకు చక్కగా నప్పుతాయి. నిమ్మ, లేత పసుపు రంగులు మీ చర్మఛాయని మరింతగా మెరిపిస్తాయి. వీటికి జతగా గులాబీని కాంట్రాస్ట్‌గా ఎంచుకుంటే మెరిసిపోవచ్చు. ఏకవర్ణంలో కాకుండా లెహేరియా ప్రింటు తరహాలో కలగలిపి ఉండే వర్ణాలను ఎంచుకుని చూడండి. మీకు తెలుపు కన్నా నలుపుఛాయలే బాగుంటాయి. పేస్టల్ బ్లవుజుకి జతగా డెనిమ్ స్కర్ట్ లేదా జీన్స్ వేసుకోవచ్చు. పై టాపు లేత రంగుల్లో ఉండేలా చూసుకోవాలి. అలానే టాప్‌లను పేస్టల్స్‌లో ఎంచుకున్నప్పుడు బాటమ్ కచ్చితంగా ముదురురంగులో ఉండాలి. నిజానికి మీకు బ్రౌను రంగు చాలా బాగుంటుంది. దానికి ఒకే రంగులో కాకుండా కాస్త కాంట్రాస్ట్ ఎంచుకుంటే మీకంటూ ఓ లుక్ వస్తుంది.

డియర్ వసుంధర

ధన్యా గుత్తా
డిజైనర్

– మీ సందేహాలను vasufashion@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

23న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,600	31,520	31,570	31,500
ఆర్నమెంట్	29,500	29,430	29,300	29,300
వెండి (కిలో)	41,500	40,925	41,200	40,900

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,680	31,600	31,610	31,525
ఆర్నమెంట్	29,310	29,260	29,250	29,170
వెండి (కిలో)	41,000	40,800	40,800	40,900

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,430	31,330	-------	-------
ఆర్నమెంట్	29,230	29,140	2,925	2,915 గ్రా
వెండి (కిలో)	41,900	41,900	43.40	43.50 గ్రా

ఆరో ప్రయత్నంలో ఐఏఎఫ్‌కు ఎంపిక!

ఓ ప్రకృతి విపత్తు... ఆంచల్‌లో లక్ష్యసాధనకు పునాది వేసింది. ఆర్థిక పరిస్థితులు అడ్డుపడినా... ప్రయత్నాలు విఫలమవుతున్నా పట్టువదలని సంకల్పంతో ఐఏఎఫ్(భారత వైమానిక దళం)కు ఎంపికవడానికి సాధన చేసింది. ప్రతికూలతల్ని దాటుకుంటూ.. ఐదుసార్లు ఓడిపోయినా ఆరోసారి మాత్రం ఆరులక్షల మంది అభ్యర్థులతో పోటీ పడింది. ఇరవై ఆరు మంది విజేతల్లో చోటు దక్కించుకుని స్వరాష్ట్రం మధ్యప్రదేశ్ నుంచి తొలిసారి ఐఏఎఫ్ శిక్షణకు ఎంపికైంది.

ఉత్తరాఖండ్ వరదల్లో వేల మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆ సమయంలో భారత వైమానిక దళం, సైనిక దళం.. సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషించింది. అప్పుడు ఇంటర్ చదువుతోన్న ఆంచల్ ఆ సన్నివేశాల్ని చూసి కదిలిపోయింది. విపత్కర పరిస్థితుల్లో సైతం మేమున్నామని బాధితులకు అండగా నిలుస్తున్న వైమానిక దళానికి మనసులోనే సలాం చేసింది. అక్కడితో ఆగిపోలేదు. ఎప్పటికైనా తాను కూడా వారిలా యూనిఫాం ధరించాలనే ఆలోచనను మనసులో నాటుకుంది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అనుకున్నదానికే కట్టుబడి ఉంది. సాధించి కన్న తల్లిదండ్రులకూ మంచి పేరు తీసుకొచ్చింది ఆంచల్. పలువురి చేత శభాష్ అనిపించుకుంది.

అలాగని ఆంచల్ ఉన్నత కుటుంబంలో పుట్టలేదు. ఆమె మధ్యప్రదేశ్‌లోని నీమచ్ జిల్లాలోని బతుకుదెరువుకోసం టీ దుకాణం నడిపే ఓ సామాన్యుడి కూతురు. ఆమె తండ్రికి ముగ్గురు సంతానంలో ఆంచల్ పెద్దది. తండ్రి టీ అమ్మితేనే రోజు గడిచే పరిస్థితి. అయినా ఆ అమ్మాయి మాత్రం చదువుల్లో, ఆటల్లో ఎప్పుడూ ముందే. తండ్రికి భారం కాకుండా ప్రతిభతో ఉపకారవేతనాలు అందుకుంటూ చదువుకుంది. తరువాత పోటీ పరీక్షలకు సిద్ధమైంది. తొలి ప్రయత్నంలోనే సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైంది. కానీ ఆ ఉద్యోగం తన లక్ష్య సాధనకు అడ్డొస్తుందని చేరలేదు. మరోసారి పరీక్ష రాసినప్పుడు లేబర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైంది. ఈసారి ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకుంది. ఎందుకంటే కుటుంబానికి అండగా ఉండాలంటే తాను ఉద్యోగం చేయడం తప్పనిసరైంది. దాంతో విధులకు సమయం కేటాయిస్తూనే.. ఏఎఫ్‌సీఏటీ (ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్)కి సిద్ధమయ్యేది. ఉద్యోగం చేస్తూనే పరీక్షకు హాజరయ్యేది. దాదాపు ఐదు ప్రయత్నాల్లోనూ ఆంచల్‌కి ఓటమి ఎదురైంది. చివరికి ఆరో ప్రయత్నంలో ఆమె తన సత్తా చాటుకుంది. ఆరులక్షల మంది అభ్యర్థులతో పోటీ పడి మరీ పరీక్ష రాసింది. ఈనెల మొదటివారంలో విడుదలైన ఆ ఫలితాల్లో కేవలం ఇరవై ఆరు మంది మాత్రమే ఐఏఎఫ్‌కి ఎంపికయ్యారు. వారిలో ఆరుగురు అమ్మాయిలుంటే అందులో ఆంచల్ కూడా ఉంది. మధ్యప్రదేశ్ నుంచి తొలిసారి ఐఏఎఫ్‌కి ఎంపికైన ఆంచల్ విజయాన్ని అభినందిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. మహిళా శిశుసంక్షేమ శాఖా మంత్రి ఆంచల్ ఇల్లు వెతుక్కుంటూ వెళ్లి ప్రశంసించడమే కాదు.. ఓ చిన్నపాటి సన్మానం కూడా చేశారు. మరిప్పుడు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకోవడానికి సిద్ధమవుతోన్న ఆమె సంకల్పానికి మనమూ సలాం కొడదాం.

మేకప్ మార్చేయండి!

చర్మతత్వానికి తగినట్లుగా క్రీంలను ఎలా ఎంచుకుంటామో... అలంకరణ సామగ్రి విషయంలోనూ అలానే జాగ్రత్తలు తీసుకోవాలి. వివిధ చర్మతత్వాలకు తగినట్లుగా మేకప్ ఎలా వేసుకోవాలో చూద్దాం.

పొడి చర్మం: చర్మం మరీ పొడిగా ఉంటే మేకప్ సరిగ్గా అంటుకోదు. అందుకే మేకప్ వేసుకునే ముందు చర్మానికి నప్పే క్లెన్సర్‌తో శుభ్రం చేసుకోవాలి. ఆ తరువాత మాయిశ్చరైజర్‌ని ముఖానికి రాసుకోవాలి.

❖ ఈ చర్మతత్వం ఉన్నవాళ్లు రోజూవారీ మేకప్ కోసం బీబీ క్రీమ్‌లు వాడితే మంచిది. ఇవి చర్మానికి తేమ అందించి తాజాగా, మంచి రంగులో కనిపించేలా చేస్తాయి. ఫౌండేషన్ జోలికి వెళ్లకపోవడమే మేలు. చర్మం ఎక్కువగా పొడిబారి ఉన్నప్పుడు ఫౌండేషన్ రాసుకుంటే ఒక పూతలా ఎబ్బెట్టుగా కనిపిస్తుంది.

❖ ఇది పూర్తయ్యాక కూడా చిన్న చిన్న మచ్చలు కనిపిస్తున్నాయనుకుంటే కన్సీలర్‌ను వాడాలి. దాన్ని చుక్కలు చుక్కలుగా పెట్టుకుని వేళ్లతో అద్దినట్లు చేస్తే సరిపోతుంది. చివరగా పౌడర్ రాసుకోవడం మాత్రం తప్పనిసరి.

జిడ్డు చర్మం: చర్మం ఎలాగూ పొడిగా ఉండదు కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ మేకప్ ఎక్కువగా వేసుకోవాల్సిన అవసరం లేదు. ముందు క్లెన్సర్‌తో ముఖం కడుక్కున్నాక మ్యాటిఫైయింగ్ తరహా ప్రైమర్‌ను రాసుకోవాలి. దీనివల్ల చర్మం జిడ్డుగా కనిపించదు.

❖ ఇప్పుడు కొద్దిగా బీబీక్రీమ్ లేదంటే క్రీం తరహా ఫౌండేషన్ రాసుకోవాలి. లిక్విడ్ ఉత్పత్తుల జోలికి వెళ్లకూడదు. అదయ్యాక...

❖ సెట్టింగ్ పౌడర్ అద్దుకుంటే సరిపోతుంది. ఇది మేకప్ ఎక్కువ సేపు తాజాగా ఉండేలా చేస్తుంది. వీళ్లకు సెట్టింగ్ స్ప్రే కూడా చక్కగా పనిచేస్తుంది.

పొట్ట కండరాలకు ప్లాంక్

ప్లాంక్స్ చేయడం వల్ల పొట్టకు కావాల్సిన వ్యాయామం అంది అక్కడి కండరాలు బలంగా మారతాయి. ముఖ్యంగా ఎల్బో ప్లాంక్ (మోచేతుల ఆధారంగా చేసేది) వల్ల పొట్ట తగ్గే అవకాశం చాలా ఎక్కువ. దీన్ని చేయడం వల్ల ఒకేసారి దాదాపు 20 కండరాలు ఉత్తేజమవుతాయి. భుజాలూ, నడుమూ, చేతులూ, కాళ్లూ, గ్లూట్స్ ఇలా ప్రతి ఒక్క భాగంలోని కండరానికి మేలు జరుగుతుంది. దీన్ని చేయడం వల్ల నడుము నొప్పి, తుంటి మీద అధిక ఒత్తిడి పడటం లాంటి సమస్యలూ ఉండవు.

1



ముందుగా యోగా మ్యాట్‌పై బోర్లా పడుకోవాలి. కాళ్లను చిత్రంలో చూపిన విధంగా పెట్టాలి. మోచేతులపై భారం వేస్తూ రెండు చేతులను నేలను తాకిస్తూ కలిపి పట్టుకోవాలి. భుజాలు తొంభై డిగ్రీల కోణంలో ఉండేలా చూడాలి. నెమ్మదిగా తల కిందికి దించుతూ గాలి పీలుస్తూ పొట్ట కండరాల్ని బిగుతుగా చేయాలి. అలా కాసేపు ఉండాలి. ఆ తరువాత విరామం ఇవ్వాలి.

- ఒక్కో భంగిమలో మొదట్లో దాదాపు 20–30 సెకన్లపాటు ఉండొచ్చు. దాన్ని క్రమంగా పెంచుకుంటూ నిమిషం వరకూ సాధన చేయొచ్చు. ఈ రెండు (1, 2) వ్యాయామాలను 10 సార్లు చేయాలి.

2

ఇప్పుడు నెమ్మదిగా గాలిని వదులుతూ తలను పూర్తిగా కిందకు దించే ప్రయత్నం చేయాలి. తరువాత చిత్రంలో చూపినవిధంగా కాళ్లను చాపి తుంటిభాగాన్ని ఎత్తాలి. ఈ భంగిమ ఆంగ్ల అక్షరం 'వి'ని తిరగేసినట్లుగా ఉంటుంది. దీన్ని చేయడం వల్ల కాళ్లు బాగా సాగడమే కాదు మీ శరీర పై భాగానికి మంచి వ్యాయామం అంది పొట్ట కండరాలు బలపడతాయి. అలసటా దూరం అవుతుంది.

3

ఇంతకు ముందున్న స్థితిలోనే ఉంటూ నెమ్మదిగా కుడికాలిని ముందుకు జరపాలి. మోకాలిని మడిచి దాదాపు ఛాతీ వరకూ తీసుకువెళ్లాలి. పాదాన్ని ఎడమకాలి తొడకు తాకే ప్రయత్నం చేయాలి. ఇదేవిధంగా రెండోకాలితో కూడా చేయాలి. దీన్ని చేస్తున్నప్పుడు తలను కిందకు వంచాలి. కాలిని ముందుకు చాపినప్పుడు గాలి వదలాలి. వెనక్కి తీసుకున్నప్పుడు గాలిని పీల్చుకోవాలి

ఎవరు చేయకూడదు? స్పాండిలైటిస్ ఉన్నవారు. మెడనొప్పి ఉన్నవారు చేయకూడదు.

డాక్టర్ మణిపవిత్ర
ఫిట్‌నెస్ నిపుణురాలు

4

చేతులను చిత్రంలో చూపినవిధంగా చాపి నేలకు ఆనించాలి. ఇప్పుడు ఎడమకాలిని మోకాలి వరకు మడిచి కుడి మోచేయి వరకూ తీసుకొచ్చే ప్రయత్నం చేయాలి. అదే విధంగా రెండో కాలితో కూడా చేయాలి.

ఆహా! .. ఏమి రుచి
aha@eenadu.in ఈనాడు
ఆదివారం 24 జూన్ 2018
విజయవాడ

సన్నగా మొదలైన చిటపట చినుకులు.. జడివానగా మారి వర్షమై ముంచెత్తుతుంటే మనసు కేరింతలు కొట్టకుండా ఉంటుందా? అలాంటప్పుడు ఊరకనే ఎలా ఉండగలుగుతాం. వేడివేడి పకోడీలు, సమోసాలతో నోటికి పనిచెబుతాం. తప్పేం లేదు కానీ... ఈసారి ఎప్పటిలా కాకుండా పోషకాలు కలిసిన కరకరలతో వర్షాకాలానికి స్వాగతం చెబుదాం. చిరుధాన్యాలతో కమ్మని కరకరలు ఎలా చేసుకోవాలో ఐఐఎంఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్) వివరంగా చెబుతోంది...

వహ్వా ధాన్యం జిహ్వా ధన్యం

జొన్నలతో బాకర్‌వాడీ

కావాల్సినవి: మసాలా కోసం: మిరియాలపొడి-10గ్రా, పంచదార- 40గ్రా, నువ్వులు- 50గ్రా, జీలకర్ర- అరచెంచా, సోంపు గింజలు- పావుచెంచా, బాదం- మూడు, ధనియాలు- 50గ్రా, ఉప్పు- తగినంత, కారం- 30గ్రా, చాట్‌మసాలా- పావుచెంచా, మినపప్పు- 50గ్రా, గసగసాలపొడి- 10గ్రా

పిండి కోసం: గోధుమపిండి- 60గ్రా, జొన్నపిండి- 50గ్రా, సెనగపిండి- 50గ్రా, నూనె- వేయించడానికి సరిపడేంత, నీళ్లు- తగినంత

తయారీ: ఒక కడాయిలో నూనె వేయకుండా నువ్వులు, జీలకర్ర, సోంపు, బాదం, ధనియాలు, మినపప్పు వేసి దోరగా వేయించుకోవాలి. చల్లార్చి మిక్సీలో పొడి కొట్టుకున్న తర్వాత అందులో మిరియాలపొడి, ఉప్పు, కారం, పంచదార, గసగసాలపొడి వేసి ఒక్కసారి మిక్సీ పట్టాలి. ఇందులో ఒక చెంచాడు సెనగపిండిని వేయించి కలుపుకుంటే బాకర్‌వాడీలకు కావాల్సిన మసాలా సిద్ధమయినట్టే. ఇప్పుడు గోధుమ, జొన్న, సెనగపిండిలో తగినంత ఉప్పు, కారం వేసి చపాతీపిండిలా కలుపుకోవాలి. కొద్దిగా పిండి చేతిలోకి తీసుకుని చపాతీలా ఒత్తి... పైన మసాలా సమంగా చల్లుతూ చపాతీని ఒక రోల్‌లా చుట్టుకుంటే వెళ్లాలి. వాటిని చాకుతో సమానంగా చక్రాల్లా తరిగి నూనెలో వేయిస్తే కమ్మని తియ్యని బాకర్‌వాడీలు సిద్ధం.

కొర్రలు, కొబ్బరి...

కావాల్సినవి: కొర్రలు- కప్పు, కొబ్బరి కోరు- కప్పు, నెయ్యి- రెండు చెంచాలు, కొత్తిమీర తురుము- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, తాలింపు దినుసులు

తయారీ: కొర్రలని రెండు గంటలు ముందుగా నానబెట్టి ఉంచుకోవాలి. తగినంత నీళ్లు పోసి మెత్తగా ఉడికించుకోవాలి. ఒక కడాయిలో నెయ్యి వేసి అందులో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకుతో తాలింపు వేసి అందులో ముందుగా కొర్ర అన్నం, చివరిగా కొబ్బరి వేసి రెండు నిమిషాలు మంట మీద మగ్గనిచ్చి దించేయడమే.

మధుమేహానికి దూరంగా..

- చిరుధాన్యాల్లోని పీచు మలబద్ధకం బారిన పడకుండా చేస్తుంది.
- వీటిల్లోని పిండి పదార్థాలు నిదానంగా జీర్ణమవుతాయి కాబట్టి రక్తంలో గ్లూకోజ్ త్వరగా కలవదు. ఇలా ఇవి మధుమేహం నియంత్రణలో ఉండటానికి తోడ్పడతాయి.
- వీటిల్లోని మెగ్నీషియం... పార్శ్వ నొప్పి, గుండెపోటు ముప్పు తప్పడానికి తోడ్పడుతుంది. అలాగే నియాసిన్ కొలెస్ట్రాల్ తగ్గేలా చేస్తుంది.
- చిరుధాన్యాల మూలంగా ట్రైగ్లిజరైడ్ల స్థాయిలు తగ్గుతాయి. ఫలితంగా గుండెజబ్బుల నివారణకు తోడ్పడతాయి.
- చిరుధాన్యాల్లో ప్రొటీన్ శాతం ఎక్కువ. అందుకే శాకాహారులకు ఈ ఆహారం ఎంతగానో మేలుచేస్తుంది.
- ఇవి పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి తోడ్పడతాయి.

తాలిపిట్టు..

కావాల్సినవి: సజ్జపిండి- కప్పు, బియ్యప్పిండి- రెండు చెంచాలు, ఉల్లిపాయ- ఒకటి, పచ్చిమిర్చి- 3, వాము- కొద్దిగా, నూనె, ఉప్పు- తగినంత, వేడినీళ్లు- తగినన్ని,

తయారీ: ఒక పాత్రలో పైన చెప్పిన పదార్థాలన్నింటిని వేసుకుని వేడినీళ్లతో పిండి కలుపుకోవాలి. ప్లాస్టిక్ కాగితంపై నూనె రాసుకుని వీటిని పల్చగా ఒత్తుకోవాలి. మధ్యలో చిల్లులు పెట్టి పెనంపై రెండు వైపులా కాల్చుకోవాలి. సాస్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.

సామ, రాజ్మా పట్టీ

కావాల్సినవి: జొన్నలు- అరకప్పు, సామలు- అరకప్పు, కొర్రలు- అరకప్పు, ఊదలు- అరకప్పు, సజ్జలు- అరకప్పు, రాజ్మా- అరకప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయలు- కప్పు, పచ్చిమిర్చి- ఆరు, క్యాప్సికమ్- ఒకటి, అల్లం- అంగుళంన్నర ముక్క, క్యారెట్ తురుము- అరకప్పు, బంగాళాదుంప- ఒకటి, స్వీట్‌కార్న్- పావుకప్పు, బ్రెడ్ పొడి- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత,

తయారీ: చిరుధాన్యాలన్నింటినీ శుభ్రంగా కడిగి వాటిని పదినిమిషాల పాటూ నీటిలో నానించి ఉంచాలి. తగినన్ని నీళ్లుపోసి వాటిని మెత్తగా ఉడికించుకోవాలి. బంగాళాదుంపలని కూడా విడిగా ఉడికించి పెట్టుకోవాలి. ఇప్పుడు ఉల్లిపాయలు, క్యాప్సికమ్, క్యారెట్‌లను సన్నగా తరిగి పెట్టుకోవాలి. ఇందులోనే స్వీట్‌కార్న్, అల్లం తరుగు, ఉడికించిన బంగాళదుంప ముద్ద, ఉడికించిన చిరుధాన్యాలు, తగినంత ఉప్పు కూడా వేసుకుని చిన్న ఉండలుగా చేసుకుని వడల్లా ఒత్తుకోవాలి. వీటిని కడాయిపైన ఉంచి రెండువైపులా దోరగా కాల్చుకోవాలి.

సజ్జలతో పకోడి

కావాల్సినవి: సజ్జపిండి- కప్పు, సెనగపిండి- అరకప్పు, ఉల్లిపాయ- ఒకటి(నిలువుగా తరిగి పెట్టుకోవాలి), పచ్చిమిర్చి- నాలుగు(సన్నగా తరిగి పెట్టుకోవాలి), కారం, ఉప్పు- తగినంత

తయారీ: ఒక పాత్రలో పై అన్నింటిని వేసి నీళ్లు పోసి పకోడి పిండిలా కలిపి పెట్టుకోవాలి. నూనెలో పకోడీల మాదిరిగా వేయించుకుంటే చినుకు పడేవేళ కరకరలాడుతూ తినొచ్చు.

వేడివేడి వడ

కావాల్సినవి: సజ్జలు(సగం ఉడికించి ఆరబెట్టిన సజ్జలు)- కప్పు, సెనగపిండి- పావుకప్పు, ఉప్పు, నూనె- తగినంత, లవంగాలు- నాలుగు, దాల్చినిచెక్క పొడి- పావుచెంచాలో సగం, కారం- రెండు చెంచాలు

తయారీ: సజ్జలని ముందుగా రుబ్బి పెట్టుకోవాలి. ఇలా రుబ్బిన పిండికి సెనగపిండి, ఉప్పు, కారం, దాల్చినిచెక్క పొడి వేసి కలుపుకోవాలి. దీనిని చిన్న ఉండలుగా చేసుకుని వడలుగా ఒత్తుకుని నూనెలో వేయించుకుంటే సజ్జ వడలు సిద్ధం.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ (ఐఐఎంఆర్).. సంప్రదాయ వంటలతో రుచికరమైన ఆహారం అందించడంతోపాటూ.. మధుమేహ వ్యాధిగ్రస్తులు రుచితో రాజీపడకుండా తినే అద్భుతమైన వంటకాలు చేయవచ్చని నిరూపిస్తోంది. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, సామలు, ఊదలు, అరికలతో ఇన్‌స్టెంట్ టిఫిన్స్, స్నాక్స్, మిఠాయిలు, కిచిడీలు తయారు చేసుకోవచ్చని ప్రయోగపూర్వకంగా నిరూపిస్తోంది. అందులో కొన్ని...

– ప్రశాంత్, ఈనాడు డిజిటల్, హైదరాబాద్

పక్కాలోకల్

కట్టెల పొయ్యి కథే వేరు!

ఆహారప్రియులకు గుంటూరు సుభానీ బిర్యానీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సుభానీ బిర్యాని పేరు చెబితే చెవులు రిక్కించి వింటూ... మనసులో ఆ నేతి ఘుమఘుమలని ఒక్కసారైనా నెమరేసుకోని వారుంటారా?...

ఎంత సేపైనా ఎదురుచూస్తాం. ఆ బిర్యానీ రుచేదో చూసే పోతాం అంటారు సుభానీ బిర్యానీ గురించి తెలిసిన వాళ్లు. చాలామందికి తెలియని విషయమేంటంటే అక్కడ బిర్యానీతో పాటూ కిచిడీది కూడా సంవత్సరాలు తరబడినా మరిచిపోలేని రుచని. అవును... గుంటూరులోని సుభానీ హోటల్‌లో నేతితో చేసిన వంటకాల రుచికి మరే వంటకాలు సరిపోవు అనేది వాస్తవమే. ఈ హోటల్ గురించి చుట్టుపక్కల ప్రాంతాల్లో తెలియని వారు ఉండరంటే నమ్మండి. అక్కడి కిచిడీ, చికెన్ బిర్యాని, మటన్ బిర్యాని, పాయా, రోటి, కబాబ్ రుచులు అద్భుతంగా ఉంటాయంటారు ఫుడ్ లవర్స్.

సీటుదొరికితే చాలనుకుంటారు...

ఉదయం ఆరున్నరకి మొదలైన హోటల్ రాత్రి తొమ్మిదిన్నరైనా తెరిచే ఉంటుంది. అయితే మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి మాత్రం ఆ రద్దీని తట్టుకోవడం కష్టమే. ఆ సమయంలో కూర్చుందామన్నా చోటులేనంతగా రద్దీ ఉంటుంది. ఈ హోటల్ బిర్యానీ, పాయా, కబాబ్‌లకు ఎంత పేరో కిచిడీకి అంతే ప్రత్యేకం. ఎంత నాన్‌వెజ్‌ని ఇష్టపడే వారయినా సరే కిచిడీని తినకుండా వెళ్లలేరు. అదే ఈ హోటల్ ప్రత్యేకత. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కిచిడీ అందుబాటులోనే ఉంటుంది. స్వచ్ఛమైన నేతితో చేస్తారు కాబట్టే దీనికా రుచి. దీంతోపాటూ నంచుకోవడానికి పెరుగు చట్నీ, కలియా, గోంగూర కూర, చికెన్ గ్రేవీ ఇస్తారు. ప్రతిరోజు 100కిలోల బియ్యాన్ని కిచిడీ కోసమే ఉపయోగిస్తారట. జగపతి బాబు, వేణు, జయప్రకాశ్‌రెడ్డి, దర్శకుడు బాబీ వంటి వారికి సుపరిచితమైన రుచి ఈ సుభానీ కిచిడీ.

కట్టెల పొయ్యిపైనే వండుతారు..

నిమిషాల్లో వంటను పూర్తిచేసే ఆధునిక యంత్రాలు ఎన్ని ఉన్నా.. సుభానీ హోటల్లో మాత్రం ఇప్పటికీ కట్టెల పొయ్యిపైనే వంటకాలు చేస్తారు. వంటకు కావాల్సిన మసాలాలని స్వయంగా నూరుకుంటారు. కల్తీలేకుండా జాగ్రత్తపడతారు. ఇంతకీ సుభానీ ఈ బిర్యానీ సెంటర్‌ని ప్రారంభించడానికి వెనుక ఉన్న కథ చెప్పనే లేదు కదూ... 2001లో ఓ చిన్న బండిపై కిచిడీ, కబాబ్‌ల అమ్మకం ప్రారంభించారాయన. అప్పట్లో వాటి ధర ప్లేటు రూ.10. వాటి రుచిని మరిచిపోలేని వినియోగదారులు చాలామంది రోజూ ఇక్కడికి వచ్చి తినిపోయేవారు. క్రమంగా వ్యాపారం విస్తరించింది. 2012లో ఇది ఒక హోటల్‌గా రూపం సంతరించుకుంది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే వారి సంఖ్యా పెరిగిపోయింది. 'వినియోగదారులకు నాణ్యతలో ఎటువంటి లోటు రాకుండా, రుచికరమైన ఆహారం అందించడమే నా విజయరహస్యం. ప్రస్తుతం కిచిడీ ఒక ప్లేటు రూ.70. ఒక వ్యక్తికి సరిపోయేదాని కంటే ఎక్కువగానే ఇస్తాం అని' అంటున్నారు హోటల్ యజమాని షేక్ సుబానీ.

– అక్కల మనోజ్,
ఈనాడు జర్నలిజం స్కూల్

సెలబ్రిటీ రుచి

ఆలూ పరాటా హాంఫట్!

అందానికి... ఆహారానికి సంబంధం ఉందా? ఎందుకు లేదు.. నా ఆహారమే నా అందానికీ, ఫిట్‌నెస్‌కి కారణం అంటోంది కొత్తగా దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టిన అందాల నటి శ్రేయ...

ఉత్తరాది అమ్మాయిని కాబట్టి... నాకు దక్షిణాది వంటకాల గురించి తెలియదనుకుంటే పొరపాటే. సాంబారు, దోసె, ఊతప్పం అంటే ప్రాణం పెడతా. అలాని రోటీలు, నాన్‌లు ఇష్టపడను అని కాదు... వాటిల్లోకి రాజ్‌మా, చోళే ఉంటే కుమ్మిపారేస్తా. మన దేశంలో దొరికే ఏ రుచిని వదలిపెట్టనంటే నమ్మండి. ముఖ్యంగా మలబార్ రుచులను చాలా ఇష్టంగా తింటాను. చేపల కూరలు ఎలా చేసినా ఇష్టమే. చేపలు, చికెన్ అది కూడా కారంకారంగా ఉంటే మొహమాటం లేకుండా తినేస్తా. ఇంక అమ్మ వండే ఆలూ పరాటాలైతే.. చిటికెలో మాయమైపోవాల్సిందే. చెన్నా టికియా నా ఆల్‌టైమ్ ఫేవరిట్. ఫిట్‌నెస్ కోసం మాత్రం నా డైట్ వేరేగా ఉంటుంది.

జంక్ ఆహారానికి దూరం..

ప్రతీరోజూ నా ఆహారంలో పండ్లు ఉండాల్సిందే. మామిడి అయితే సీజన్ అయ్యేంతవరకు అవే తింటాను. అన్నీ తింటా అంటున్నావు కదా... మరి తిననవి ఏంటి అంటారా? నేను జంక్ ఫుడ్‌కి పూర్తిగా దూరంగా ఉంటాను. పాస్తాలు, చైనీస్ వంటకాలు వంటి విదేశీ ఆహారం నచ్చదు. ఉదయాన్నే వేడినీళ్లల్లో తేనె కలుపుకొని తాగుతా. ఒక్కోసారి ఉసిరికాయ రసంలో, ఒక్కోసారి నిమ్మరసంలో వేసుకుని తేనె తీసుకుంటా. ఎంత ఇష్టమైన ఆహారం అయినా ఎక్కువ తినను. ఎంత ఆకలో అంతే తింటాను. చివరిలో పెరుగు తప్పనిసరి. సాయంత్రం ఏడు ఎనిమిదికి భోజనం అయిపోవాల్సిందే. నా రహస్యం అదే. 'లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్'. – సీహెచ్ వసుంధరాదేవి

తిండికి తగిన వ్యాయామం..

ఇవన్నీ ఒకెత్తు అయితే వ్యాయామం మరో ఎత్తు. ప్రతీరోజూ అయిదుగంటలకు నా రోజు మొదలవుతుంది. ఈత, జిమ్, కథక్ నృత్యం చేస్తా. వారానికి ఒకరోజు తక్కువ మాట్లాడటం అలవరుచుకుంటే అది కూడా మనసుకు వ్యాయామంలా పనిచేస్తుంది.

సాయం అంతంతే

- నాలుగేళ్లుగా చాలా హామీల్ని అమలు చేయలేదు
- సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్

విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్ని కేంద్రం చాలావరకు నెరవేర్చలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ మేరకు కేంద్రం ఇచ్చిన హామీలు, వాటి ప్రస్తుత స్థితిని అఫిడవిట్‌లో సమగ్రంగా వివరించింది.

పదో షెడ్యూలులోని సంస్థలు

విభజన చట్టంలోని పదో షెడ్యూలులో పేర్కొన్న సంస్థల విభజన ఇప్పటికీ జరగలేదు. 142 రాష్ట్ర సంస్థల్ని విభజించలేదు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందన లేదు.

నదీ నిర్వహణ

విభజన చట్టం 11వ షెడ్యూలులో ప్రస్తావించిన నదీ నిర్వహణ అంశాన్ని నిర్దిష్ట కాలావధి మేరకు చిత్తశుద్ధితో అమలుచేయాలని కోరుతున్నాం.

బొగ్గు, చమురు, విద్యుత్ అంశాలు

విభజన చట్టంలోని 12వ షెడ్యూలులో పేర్కొన్న బొగ్గు, చమురు, గ్యాస్, విద్యుత్తుకు సంబంధించిన సమస్యల్ని కాల పరిమితితో కేంద్రం పరిష్కరించాలి. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌ను షెడ్యూలు 9లో పొందుపరిచారు. ఏపీ విభజన చట్టం సెక్షన్ 66 కింద ఈ సమస్యను కేంద్రానికి నివేదించడం జరిగింది. దీనిపై కేంద్రం చర్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

కడప ఉక్కు

ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని షెడ్యూలు 13లో ఉంది. దీని ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై మెకాన్ సంస్థ 2018 ఫిబ్రవరిలో నివేదికను కేంద్ర ఉక్కుశాఖకు అందజేసింది. దీనిపై నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం. కడపలో సమీకృత ఉక్కు పరిశ్రమను కాలపరిమితితో ఏర్పాటు చేయడంపై కేంద్రం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గిరిజన విశ్వవిద్యాలయం

విజయనగరం జిల్లా రెల్లిలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి 526 ఎకరాల భూమిని 2015 ఫిబ్రవరిలో కేటాయించాం. ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదల చేశాం. రెండు దశల్లో నిర్మాణం చేస్తామని, తొలి దశను రూ.420 కోట్లతో చేపడతామన్న కేంద్ర ప్రభుత్వం- 2018-19 కేంద్ర బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించింది. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కాలేదు. రెల్లిలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు వీలుగా ఇందిరాగాంధీ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయాల చట్టం- 2007ను కేంద్రం తక్షణం సవరించాలని, తగిన నిధులు కేటాయించి, శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేయాలని కోరుతున్నాం.

తిరుపతిలో ఐఐటీ

తిరుపతిలో ఐఐటీని ఏర్పాటుచేయాలంటూ షెడ్యూలు 13లో పొందుపరిచారు. దీని ఏర్పాటు కోసం 530 ఎకరాల భూమిని కేటాయించాం. ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.8.30 కోట్లు విడుదల చేశాం. 2015-16లో తాత్కాలిక భవనాల్లో ఈ సంస్థ ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టు విలువ రూ.3,150 కోట్లు కాగా.. ఈ నాలుగేళ్లలో కేంద్రం విడుదల చేసింది రూ.100.93 కోట్లు మాత్రమే. 2018-19 బడ్జెట్‌లో కేంద్రం రూ.50 కోట్లు ప్రతిపాదించింది. ఐఐటీ శాశ్వత భవనాల ఏర్పాటుకు తగిన నిధులు ఇవ్వాలని, ఫ్యాకల్టీ నియామకాన్ని తక్షణమే చేపట్టాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

అనంతలో కేంద్రీయ విశ్వవిద్యాలయం

అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలని షెడ్యూలు 13లో ఉంది. దీనికి 491 ఎకరాలు కేటాయించి, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదల చేశాం. కేంద్రం తొలి దశలో రూ.450 కోట్లతో పనులు చేపడతామని 2018-19 బడ్జెట్‌లో రూ.10 కోట్లు ప్రతిపాదించింది. కేంద్రీయ విశ్వవిద్యాలయాలు చట్టం, 2009ని సవరించి.. అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. (అఫిడవిట్ దాఖలు సమయానికి కేంద్రీయ విశ్వవిద్యాలయంపై కేంద్రం ప్రకటన చేయలేదు. దీంతో దీనిని ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు).

తాడేపల్లిగూడెం నిట్

షెడ్యూల్‌లో 13లో పేర్కొన్న 'నిట్'ను తాడేపల్లిగూడెంలో ఏర్పాటుచేశారు. 173 ఎకరాలు కేటాయించాం. రూ.7.10 కోట్లు ప్రహరీ గోడకు విడుదల చేశాం. 2015-16 నుంచి తరగతులు తాత్కాలిక భవనాల్లో ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు తాత్కాలిక అంచనా రూ.460.50 కోట్లు కాగా.. కేంద్రం రూ.60 కోట్లు విడుదల చేసింది. 2018-19 బడ్జెట్‌లో రూ.54 కోట్లు పొందుపరిచింది. శాశ్వత భవనాలకు తగిన నిధులివ్వాలని, ఫ్యాకల్టీ నియామకాన్ని చేపట్టాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

విశాఖలో ఐఐఎం

షెడ్యూలు 13లో పొందుపరిచిన ఐఐఎంను విశాఖపట్నంలో ఏర్పాటు చేశారు. దీనికోసం 2016 జనవరిలో 242 ఎకరాల భూమిని కేటాయించాం. ప్రహరీగోడ నిర్మాణానికి రూ.4.25 కోట్లు విడుదలచేశాం. ఇది 2015-16 విద్యా సంవత్సరంలో తాత్కాలిక భవనాల్లో ప్రారంభమైంది. ప్రాజెక్టు అంచనా రూ.691.58 కోట్లు కాగా.. కేంద్రం నాలుగేళ్లలో రూ.55.96 కోట్లు విడుదలచేసింది. 2018-19 బడ్జెట్‌లో రూ.42 కోట్లు ప్రతిపాదించింది. తక్షణమే శాశ్వత భవనాల ఏర్పాటుకు నిధులు విడుదల చేయాలని, ఫ్యాకల్టీని నియమించాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

తిరుపతిలో ఐసర్

షెడ్యూలు 13లో పొందుపరచినట్లుగా- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)ను తిరుపతిలో ఏర్పాటుచేశారు. దీనికి 255 ఎకరాలు కేటాయించి.. రూ.6.50 కోట్లు ప్రహరీగోడ నిర్మాణానికి విడుదల చేశాం. 2015-16లో తాత్కాలిక భవనాల్లో ఇది ప్రారంభమైంది. ప్రాజెక్టు అంచనా రూ.1613 కోట్లు కాగా.. కేంద్రం నాలుగేళ్లలో ఇచ్చింది రూ.104.02 కోట్లు మాత్రమే. 2018-19 బడ్జెట్‌లో రూ.49 కోట్లు ప్రతిపాదించింది. శాశ్వత భవనాల నిర్మాణానికి తగిన నిధులు విడుదల చేయాలని, ఫ్యాకల్టీ నియామకం చేపట్టాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

గుంటూరులో వ్యవసాయ వర్సిటీ

గుంటూరు జిల్లాలో వ్యవసాయ వర్సిటీ ఏర్పాటుకు 110 ఎకరాలు కేటాయించాం. రూ.0.95 కోట్లు ప్రహరీగోడ నిర్మాణానికి విడుదల చేశాం. ప్రాజెక్టు అంచనా రూ.1504 కోట్లు కాగా.. కేంద్రం నాలుగేళ్లలో రూ.135 కోట్లు విడుదల చేసింది. 2018-19 బడ్జెట్‌లో రూ.65 కోట్లు ప్రతిపాదన చేసింది. తగిన నిధులు విడుదలచేసి శాశ్వత భవనాలు, ఫ్యాకల్టీ నియామకం చేపట్టాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

కర్నూలులో మరో సంస్థ

కర్నూలులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఏర్పాటుకు 152 ఎకరాలు కేటాయించాం. రూ.6.16 కోట్లు ప్రహరీగోడ నిర్మాణానికి విడుదలచేశాం. 2015-16 విద్యా సంవత్సరం నుంచి తమిళనాడులోని కాంచీపురంలో తాత్కాలిక క్యాంపస్‌లో ప్రారంభమైంది. ప్రాజెక్టు అంచనా రూ.400 కోట్లు కాగా.. కేంద్రం నాలుగేళ్లలో రూ.23.10 కోట్లు విడుదలచేసింది. 2018-19 బడ్జెట్‌లో రూ.30 కోట్లు ప్రతిపాదించింది. శాశ్వత భవనాలకు తగిన నిధులు విడుదల చేయాలని, ఫ్యాకల్టీని నియమించాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

మంగళగిరిలో ఎయిమ్స్

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఎయిమ్స్ ఏర్పాటుకు 185 ఎకరాలు కేటాయించాం. 2018-19 విద్యా సంవత్సరం నుంచి ఇది ప్రారంభం కావాల్సి ఉంది. ప్రాజెక్టు అంచనా రూ.1618 కోట్లు కాగా కేంద్రం రూ.106.01 కోట్లు విడుదలచేసింది. తగిన నిధులు విడుదలచేసి, శాశ్వత భవనాలు నిర్మాణం చేపట్టాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

పెట్రో కాంప్లెక్స్

గ్రీన్ ఫీల్డ్ చమురు రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో ఉంది. దీనిని ఏర్పాటుచేయాలంటూ 2014 ఆగస్టు 25న కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్), గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్), ఏపీ ప్రభుత్వం 2017 జనవరిలో ఎంవోయూ చేసుకున్నప్పటికీ.. ప్రాజెక్టు ముందుకు సాగడంలేదు. పూల్డ్ ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్(పీఐఆర్ఆర్) 14 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలని చేసిన విజ్ఞప్తి కేంద్రం వద్ద ఇంకా పెండింగ్‌లోనే ఉంది. తక్షణమే పీఐఆర్ఆర్‌ను 10 శాతానికి తగ్గించి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ లేకుండా కాలపరిమితితో సంస్థను ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

విజయవాడలో విపత్తు నిర్వహణ సంస్థ

విజయవాడలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(విపత్తు నిర్వహణ జాతీయ సంస్థ) ఏర్పాటుకు 10 ఎకరాలు కేటాయించి ప్రహరీగోడ నిర్మాణానికి రూ.23.07 కోట్లు విడుదల చేశాం. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.70.87 కోట్లు. 2018-19 నుంచి ఇది ప్రారంభం కావాల్సి ఉంది. తక్షణమే తగిన నిధులు విడుదలచేసి సంస్థను ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

ర్యాపిడ్ రైల్, రోడ్ కనెక్టివిటీ

ఏపీలో కొత్తగా నిర్మితమయ్యే రాజధాని నుంచి హైదరాబాద్‌తో పాటు, తెలంగాణలోని ఇతర పట్టణాలకు ర్యాపిడ్ రైల్, రోడ్ కనెక్టివిటీ ఏర్పాటు గురించి విభజన చట్టంలో పొందుపరిచారు. దీనిపై కేంద్రం సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్(ఎస్ఏజీ) అధికారులతో పరిశీలన కమిటీ వేసింది. కేంద్ర రైల్వే శాఖ సిద్ధంచేసిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) అమలు పెండింగ్ ఉంది. దీనిని కాలపరిమితితో అమలుచేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. రహదారుల అనుసంధానంపై ఐదు ప్రాజెక్టుల్ని ప్రతిపాదిస్తూ కేంద్రానికి పంపాం. కాల పరిమితితో వీటిని అమలుచేయాలి.

మెట్రో రైలు

విశాఖపట్నం,.. విజయవాడ-గుంటూరు-తెనాలిలను కలుపుతూ మెట్రో రైలును ఏర్పాటు చేయాల్సి ఉంది. విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టుల డీపీఆర్‌లను కేంద్రానికి పంపాం. కొత్త మెట్రో రైలు విధానం ప్రకారం వాటిని కేంద్రం తిప్పి పంపింది. ఈ ప్రాజెక్టులకు వంద శాతం కేంద్రం నిధులు ఇవ్వాలి. కేంద్ర పన్నులు, సేవా పన్ను, ఇతరత్రా పన్నులు మినహాయిస్తూ మెట్రో ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

విశాఖలో పెట్రోలియం ఎనర్జీ సంస్థ

విశాఖపట్నంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ సంస్థ ఏర్పాటుకు 202 ఎకరాలు కేటాయించాం. భూసేకరణ, ప్రహరీగోడ నిర్మాణానికి రూ.68 కోట్లు విడుదల చేశాం. 2016-17 తాత్కాలిక భవనాల్లో ఇది ప్రారంభమైంది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.665 కోట్లు కాగా.. కేంద్రం రూ.53.17 కోట్లు విడుదల చేసింది. 2018-19 బడ్జెట్‌లో రూ.32 కోట్లు ప్రతిపాదించింది. తగిన నిధులు విడుదల చేసి ఫ్యాకల్టీ నియమించాలని కేంద్రాన్ని కోరుతున్నాం. వైజాగ్-చెన్నై పారిశ్రామిక నడవా ఇంకా కేంద్రం పరిశీలనలోనే ఉంది. కాల పరిమితితో పూర్తిచేయాలని కోరుతున్నాం.

విశాఖలో రైల్వే జోన్

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేజోన్‌ను ఏర్పాటుచేయాలని విభజన చట్టంలో ఉంది. విశాఖపట్నం కేంద్రంగా దీనిని ఏర్పాటుచేయాలని 2014 ఆగస్టు 25న కేంద్రాన్ని కోరాం. దీని సాధ్యాసాధ్యాల పరిశీలనకు కేంద్రం ఒక కమిటీని వేసింది. ఇది రైల్వేశాఖ పరిశీలనలో ఉంది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌ను తక్షణమే ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

పోలవరంతో భద్రాద్రి ఆలయానికి ముప్పులేదు

విభజన చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. ప్రాజెక్టు ప్రభావిత ప్రాంత ప్రజలు, గ్రామాలు, అటవీ ప్రాంతం, చారిత్రక ఆలయాలు, గిరిజనుల సంస్కృతి, గోదావరి నది తదితర అంశాల్ని విస్మరించి ప్రాజెక్టు చేపడుతున్నామనేది అవాస్తవం. గిరిజనుల సంస్కృతి, పర్యావరణం, ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతంలోని కుటుంబాల జీవనోపాధి అంశాల్లో ఎంతో పారదర్శకతను పాటిస్తున్నాం. భద్రాచలంలోని శ్రీ సీతారామస్వామి ఆలయం రిజర్వాయిర్ పూర్తిస్థాయి మట్టానికి చాలా ఎత్తులో ఉంది. పోలవరం ప్రాజెక్టు వల్ల ఆలయానికి ఎలాంటి ముప్పు లేదు. పోలవరం ముంపువల్ల చాలా మంది నష్టపోతారు, శ్రీ సీతారామస్వామి ఆలయం దెబ్బతింటుంది, విద్యావకాశాలు దెబ్బతింటాయన్న ఆరోపణల్ని ఖండిస్తున్నాం. తెలంగాణలోని బూర్గంపాడు గ్రామం తప్ప మరే ఇతర ప్రాంతం పోలవరం ముంపు పరిధిలోకి రాదు. ఖమ్మం జిల్లాలోని ఏడు ముంపు మండలాల్ని విభజన చట్టాన్ని సవరిస్తూ ఏపీలో కలిపారు. పోలవరానికి ఇప్పటి వరకు రూ.7918.04 కోట్లు ఖర్చుచేయగా.. కేంద్రం రూ.5349.70 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఇంకా రూ.2568.34 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ప్రాజెక్టు సవరించిన అంచనా రూ.57,940.86 కోట్లకు కూడా కేంద్రం నుంచి అనుమతి రావాల్సి ఉంది.

అంతర్జాతీయ విమానాశ్రయాలు

విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్ని అంతర్జాతీయ ప్రమాణాలతో విస్తరించాలని చట్టంలో ఉంది. దీనికి సంబంధించి విజయవాడలో 698 ఎకరాలు, తిరుపతిలో 732 ఎకరాల్ని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించాం. విశాఖపట్నం నుంచే అంతర్జాతీయ రాకపోకలు సాగుతున్నాయి. విజయవాడ, తిరుపతిల నుంచి అంతర్జాతీయ సేవల్ని ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

విభజన చట్టం సెక్షన్ 9

గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ.858.37 కోట్ల డీపీఆర్‌ను కేంద్రానికి పంపాం. ఇది కేంద్ర హోంశాఖ పరిశీలనలో ఉంది. తక్షణమే తగిన నిధులు విడుదలచేసి గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

విధానసభ స్థానాల పెంపు

ఆంధ్రప్రదేశ్ విధానసభ స్థానాల్ని 175 నుంచి 225కు పెంచాలని విభజన చట్టంలో ఉంది. ఈ అంశం కేంద్ర హోంశాఖ పరిశీలనలో ఉంది. వీలైనంత త్వరగా ఈ సమస్య పరిష్కరించాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

సెక్షన్ 94(3), (4)

కొత్త రాజధానిలో రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, శాసనసభ, శాసనమండలి, ఇతర సదుపాయాల ఏర్పాటుకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. ల్యాండ్ పూలింగ్ ద్వారా రాజధాని ప్రాంతంలోని రైతులు రూ.50 వేల కోట్లకుపైగా విలువైన 33 వేల ఎకరాలు భూములు ఇచ్చారు. దీనికి సంబంధించి రూ.11,602 కోట్ల డీపీఆర్‌ను కేంద్రానికి పంపగా.. కేంద్రం నుంచి రూ.1500 కోట్లు మాత్రమే మద్దతు లభించింది. సుమారు నాలుగేళ్లుగా విభజన చట్టంలోని హామీల అమలుకోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోంది. విభజన చట్టంలోని అన్నిహామీలు కాలపరిమితితో పూర్తిచేయాలని కోరుతోంది.

హైకోర్టు ఏర్పాటు

అమరావతిలో హైకోర్టు ఏర్పాటు(సెక్షన్ 31(1),(2))కు ఫాస్టర్ అండ్ పార్టనర్స్ సంస్థ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది. హైకోర్టు నిర్మాణంపై ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ కూడా ఏపీ అధికారులతో చర్చించింది. అన్ని సదుపాయాలతో హైకోర్టు ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.

సెక్షన్ 46(I)

రెవెన్యూ లోటు 2014-15 బడ్జెట్‌లోనే ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ హామీ ఇచ్చారు. 2014-15 రెవెన్యూ లోటు రూ.16,078.76 కోట్లు అని కాగ్ తేల్చింది. కానీ ఆ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.2303 కోట్లు, 2015-16లో రూ.500 కోట్లు, 2016-17లో రూ.1176.50 కోట్లు చొప్పున మొత్తం రూ.3979.50 కోట్లు మాత్రమే కేంద్రం విడుదల చేసింది. మరోవైపు 2014-15లో రెవెన్యూ లోటు రూ.4117.89 కోట్లు అని కేంద్రం చెబుతోంది. తక్షణమే మిగిలిన రూ.12,099.26 కోట్లను విడుదల చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

ప్రత్యేకాభివృద్ధి ప్యాకేజీ

ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిమిత్తం రూ.24,350 కోట్లు ప్రతిపాదనలు కేంద్రానికి పంపాం. 2014-15, 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాల్లో వెనకబడిన జిల్లాలకు రూ.350 కోట్లు చొప్పున మొత్తం రూ.1050 కోట్లను మాత్రమే విడుదలచేసింది. బుందేల్‌ఖండ్ ప్యాకేజీలో ఒక్కొక్కరిపై రూ.4115 ఇస్తుండగా ఏపీ విషయంలో రూ.428.57 మాత్రమే ఇస్తున్నారు... ఇది 20..2.2014లో నాటిప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీకి పూర్తి విరుద్ధం. 142 రాష్ట్ర సంస్థలకు సంబంధించి విభజన ఇంకా పూర్తికాలేదు. సెక్షన్ 85లో పేర్కొన్న విధంగా ఏర్పాటైన గోదావరి, కృష్ణా బోర్డులు తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నాయి.

దుగరాజపట్నంలో కొత్త పోర్టు

నెల్లూరు జిల్లా దుగరాజపట్నంలో కొత్త పోర్టును అభివృద్ధిచేసి 2018కి తొలి దశను పూర్తిచేయాలని విభజన చట్టంలో ఉంది. ఆ ప్రాంతంలో ప్రాజెక్టు సాధ్యం కాదని నీతిఆయోగ్ అభిప్రాయపడడంతో వేరే ప్రాంతం చూపించాలని కేంద్ర నౌకాయాన శాఖ సూచించింది. విభజన చట్టంలో ఇబ్బందిగా ఉన్న నిబంధనలు సవరించి, తగిన చర్యలు తీసుకొని దుగరాజపట్నంలో కాలపరిమితితో పోర్టు ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.

హామీలు అమలుచేయాలి

ఏపీ విభజన చట్టాన్ని తూచ తప్పకుండా అమలుచేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. 20.2.2014న రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రత్యేకహోదా ఐదేళ్లు ఇస్తామని ప్రకటించారు. కానీ ఆ హామీ నెరవేరలేదు. విభజన చట్టంలోని వివిధ హామీల అమలుపై ప్రధానమంత్రికి, కేంద్రమంత్రులు, అధికారులకు ఏపీ ముఖ్యమంత్రి, మంత్రులు పలుసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ ఫలితం లేదు. కాలపరిమితితో అన్నిహామీలు అమలు చేయాలని కోరుతున్నాం.

- ఈనాడు, దిల్లీ

ప్రలోభాల జోరు.. ప్రచార హోరు

29న బార్ కౌన్సిళ్ల ఎన్నికలు

ఈనాడు, హైదరాబాద్: సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఈనెల 29న తెలుగు రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు నిర్వహిస్తున్న ఎన్నికలు హామీలు, ప్రలోభాలతో ప్రచారం జోరుగా కొనసాగుతోంది. బార్ కౌన్సిళ్లకు సభ్యులుగా ఎంపికైతే న్యాయవాదుల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలపై రాజకీయ నేతలను తలపించేలా హామీలు గుప్పిస్తున్నారు. మరోవైపు జిల్లాలు, తాలూకా అసోసియేషన్లకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసి ఇస్తున్నారు. కొంతమంది అసోసియేషన్‌లకు టీవీలు సైతం పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న న్యాయవాదులు జిల్లాల వారీగా పర్యటిస్తున్నారు. అక్కడ స్థానికంగా బలంగా ఉన్న న్యాయవాదుల బృందంతో ఉదయం సమావేశమై రాత్రి పార్టీలు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ 107, తెలంగాణకు 86 మంది పోటీ పడుతున్నారు. ఇళ్ల స్థలాలు, కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య కార్డులు ఇప్పిస్తామని, బీమాను రూ.5 లక్షల నుంచి 10 లక్షల దాకా పెంచడానికి చర్యలు తీసుకుంటామని తెలంగాణలో హామీలు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రలోభాలతోపాటు వ్యయం ఎక్కువగా ఉంది. వ్యక్తిగతంగా, అసోసియేషన్‌లకు కానుకలు అందిస్తున్నారు. ఏపీలో రూ. ఒకటి నుంచి రెండు కోట్ల దాకా వ్యయం చేస్తున్నట్లు అంచనా. అంతేకాదు రాజకీయ పార్టీల మద్దతును తీసుకుంటున్నారు. తెలంగాణలో 27676 మంది, ఏపీలో 20,072 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రిటర్నింగ్ అధికారులుగా హైకోర్టు న్యాయమూర్తులు వ్యవహరించనున్నారు. ఒక్కో బార్ కౌన్సిల్‌కు 25 మంది సభ్యుల ఎంపిక జరుగుతుంది. ఒక్కో న్యాయవాది ప్రాధాన్యక్రమంలో అయిదుగురికి ఓటు వేయవచ్చు. ఏపీలో జులై 11న, తెలంగాణలో 23న కౌంటింగ్ జరుగుతుంది.

గోదావరిలో దూకి కుటుంబం ఆత్మహత్య

- భార్యాభర్తలు, కుమార్తె మృతదేహాలు లభ్యం
- మరో చిన్నారి గల్లంతు
- శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి వాసులుగా గుర్తింపు

కొవ్వూరుపట్టణం - న్యూస్‌టుడే

వందల మైళ్ల దూరంలోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన ఓ కుటుంబం పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు గోష్పద క్షేత్రంలోని ఓ స్నానఘట్టం వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కొవ్వూరు లాంచీల రేవు నుంచి గీతామందిరం ఎదురుగా గోదావరి తీరం వెంట నీటిలో తల్లి, చిన్నారి మృతదేహాలు ఒకచోట.. సమీపంలోనే తండ్రి మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించాయి. కోటబొమ్మాళికి చెందిన దంపతులు పొందూరి రవికుమార్(29), పావని(24), వారి పిల్లలు హారిక(4), పూజిత(3)తో కలిసి శుక్రవారం ఉదయం కొవ్వూరుకు వచ్చారు. భక్తాంజనేయ స్నానఘట్టం వద్ద కూర్చుని వెంట తెచ్చిన రెండు సంచులు, పాదరక్షలను అక్కడే వదిలి గోదావరిలోకి దిగి అంతర్ధానమయ్యారు. శనివారం ఉదయానికి రెండు ప్రదేశాల్లో వీరిలో ముగ్గురి మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. స్థానికుల సమాచారం మేరకు.. భక్తాంజనేయ స్నానఘట్టం వద్ద పోలీసులు గాలించగా దుస్తులు,

గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న రవికుమార్, పావని దంపతులు

వారి కుమార్తెలు పూజిత, హారిక

పాదరక్షలు, సంచులు కనిపించాయి. నదిలో మరో నల్లటి బ్యాగు తేలి ఉండటాన్ని గమనించారు. దానిలో రవికుమార్ కుటుంబానికి చెందిన రేషన్‌కార్డు, కుటుంబసభ్యుల ఆధార్ పత్రాలు, వైద్య పరీక్షల కాగితాలు దొరికాయి. దీంతో కోటబొమ్మాళి పోలీసులు, బంధువులను స్థానిక అధికారులు అప్రమత్తం చేశారు. కుటుంబమంతా కలసి కొవ్వూరు వచ్చారని చెబుతుండగా హారిక ఆచూకీ తెలియలేదు. ఇద్దరు చిన్న పిల్లలను చూశామని కొందరు చెప్పడంతో హారిక గల్లంతై ఉంటుందని భావించి పోలీసులు పడవపై గోదావరిలో గాలించారు. ముగ్గురి మృతదేహాలు బాగా ఉబ్బి ఉండటాన్ని బట్టి శుక్రవారం ఉదయమే గోదావరిలో దూకి ఉంటారని భావిస్తున్నారు. రవికుమార్, పావని పాదరక్షలు సంచిలో ఉండగా.. హారిక, పూజితలకు చెందిన ఒకొక్క పాదరక్ష మాత్రమే దొరికాయి.

అనారోగ్యమే కారణమా...

నీటిలో దొరికిన బ్యాగ్‌లో ఆసుపత్రులకు సంబంధించిన పలు పత్రాలు దొరికాయి. అవన్నీ నీటిలో తడిచిపోవడంతో పూర్తి వివరాలు దొరకలేదు. రవికుమార్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. అందుకే నిరుత్సాహంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చునని భావిస్తున్నారు.

కుటుంబం ఆత్మహత్యతో విషాదం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: పిల్లలతో సహా దంపతులు గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోటబొమ్మాళిలో విషాదాన్ని నింపింది. రవికుమార్ క్యాన్సర్‌తో బాధపడటంతో పాటు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో కోటబొమ్మాళిలో నిర్మించుకున్న ఇంటిని సైతం అమ్మినట్లు సమాచారం. ఈ కుటుంబం ప్రస్తుతం నరసన్నపేటలో రవికుమార్ తల్లి రమణమ్మతో కలిసి నివసిస్తోంది. తిరుపతికి వెళ్లి తిరిగివస్తూ కొవ్వూరు వద్ద దిగినట్లు సమాచారం.

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం కోర్సులకు ప్రవేశాలు

ఈనాడు, హైదరాబాద్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) తమ ఆసుపత్రిలో నిర్వహించే మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఎం) కోర్సులో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది. రెండున్నర సంవత్సరాల కోర్సుకు ఎంబీబీఎస్, బీడీఎస్, బీటెక్, బీఫార్మసీ, బీఏఎంఎస్, హోమియో, బీహెచ్‌ఎంఎస్, యునాని, బీఏ , బీకాం, బీబీఏ తదితర డిగ్రీ కోర్సు చదివిన అభ్యర్థులు అర్హులు. అభ్యర్థులు www.nims.edu.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడు చేసుకొని ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని నిమ్స్ అకాడమిక్ ఇన్‌ఛార్జి మార్త రమేశ్ తెలిపారు. దీనికి సంబంధించి జులై 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, 27న ఫలితాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఆగస్టు మొదటి తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన విద్యార్థులకు బోధనారుసుములతోపాటు ఆర్టీసి బస్ సౌకర్యం అందిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సును అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిమ్స్ ఒక్కటే.

నెలాఖరు నుంచి జనసేన రాజకీయ శిక్షణ తరగతులు

ఈనాడు, అమరావతి: జనసేన పార్టీ బూత్‌స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు అన్ని నియోజకవర్గాల్లో ఈ నెలాఖరు నుంచి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర నుంచి ఈ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. "ప్రజల్లో కొనసాగుతున్న భేదాభిప్రాయాలు, వైషమ్యాలను తొలగించడానికే ఈ ప్రయత్నం. పార్టీ రాజకీయ వ్యూహకర్త దేవ్ బృందం, జనసేన తరఫున బొమ్మదేవర శ్రీధర్‌లు ఈ శిక్షణ తరగతులను పర్యవేక్షిస్తారు. 1977లో అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా మధ్యతరగతి మేధావులూ పోరాడారు. మాతృభూమి కోసం వారి భాగస్వామ్యం అవసరం. రాజకీయ వైరుధ్యాలను నేను విధానపరంగా చూస్తానే తప్ప వ్యక్తిగతంగా చూడను. వైకాపా, తెదేపాలో ఈ అంశం లోపించడంతోనే అసెంబ్లీ సమావేశాలు సరిగా జరగడం లేదు. వైకాపా, తెదేపాల్లో నేనుగౌరవించే నాయకులకు నాదొక విన్నపం. ఏదైనా సందర్భంలో మీరు నన్ను కలిసినప్పుడు మర్యాదపూర్వకంగా మీ పార్టీ నాయకుల యోగక్షేమాల గురించి వాకబు చేసిన దాన్ని వేరే విధంగా అన్వయించడం సరికాదు" అని పవన్ పేర్కొన్నారు.

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

గూగుల్.. ఇంటర్నెట్‌ను ఉపయోగించే ప్రతి ఒక్కరికి ఈ పదం సుపరిచితమే. ఏ రంగానికి చెందిన ఎలాంటి విషయమైనా మనం తెలుసుకోవాలంటే ముందుగా వెతికేది ఈ సెర్చ్ ఇంజిన్‌లోనే. ఇప్పుడు అదే గూగుల్.. మీకు నచ్చిన వస్తువును వెతికి మరి కొనుక్కునే ఆన్‌లైన్ విక్రయ ప్లాట్‌ఫాంను సిద్ధం చేస్తోందట. అంతేకాదు భారత్ నుంచే ఈ కార్యకలాపాలను మొదలుపెట్టనుందట. ఎప్పుడు? ఎలా? ఎందుకో తెలుసుకుందామా.

కోడిగుడ్లు

23న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	392	వరంగల్	394
చిల్లరగా (ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	400
బెంగళూరు	429	చెన్నై	457
24వ తేదీకి		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	384	నమక్కల్	440

గూగుల్‌లో కొందామా!

● అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌కు పోటీగా ఆన్‌లైన్ విక్రయ సంస్థ ● భారత్ నుంచే కార్యకలాపాలు! ● దీపావళికి సిద్ధం?

ప్రస్తుతం భారత ఇ-కామర్స్ విపణి పరిమాణం దాదాపు 3850 కోట్ల డాలర్లు కాగా.. 2020 కల్లా ఇది 10,000 కోట్ల డాలర్లకు చేరుతుందని ఓ అంచనా. మన దేశంలో ఆన్‌లైన్ విక్రయ వ్యాపార వృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్నాయని చెప్పడానికి ఈ గణాంకాలే నిదర్శనం. అందుకే ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజాలు ఏదోవిధంగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అమెరికాకు చెందిన అమెజాన్ ఇప్పటికే మన దేశీయ ఆన్‌లైన్ విక్రయాల విపణిలో దూసుకెళ్తుండగా.. అదే దేశానికి చెందిన వాల్‌మార్ట్ కూడా ఫ్లిప్‌కార్ట్ కొనుగోలు ద్వారా తన ఉనికిని సుస్థిరం చేసుకునేందుకు సిద్ధమైంది. ఇప్పుడు మరో అమెరికా సంస్థ గూగుల్ కూడా భారత ఆన్‌లైన్ విక్రయ విపణిలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రణాళికలు రచిస్తోన్నట్లు తెలుస్తోంది. ఇ-కామర్స్ సంస్థ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసినట్లు కూడా సమాచారం. తొలుత ఈ సంస్థ కార్యకలాపాలను భారత్ నుంచే మొదలుపెట్టనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీపావళి కల్లా ఈ సంస్థ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఇదే జరిగితే ఆ సంస్థ ముందుగా పోటీపడాల్సింది అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తోనే.

ఒంటరిగానే అడుగులు..

ఐదేళ్ల క్రితం అమెజాన్ ఎలాగైతే ఒంటరిగా భారత ఆన్‌లైన్ విక్రయ విపణిలో అడుగుపెట్టిందో ఆ మార్గాన్నే గూగుల్ అనుసరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఫ్లిప్‌కార్ట్‌లో వాటా కొనుగోలు ద్వారా భారత ఇ-కామర్స్ విపణిలో అడుగుపెట్టేందుకు కూడా గూగుల్ ప్రయత్నించింది. ఫ్లిఫ్‌కార్ట్ వాటాదార్లు ప్రతిపాదించిన విలువ ఎక్కువని భావించిందో లేదంటే ఇతరత్రా ఏ కారణం రీత్యానో ప్రస్తుతానికైతే అందులో వాటా కొనుగోలు ప్రయత్నాన్ని ఉపసంహరించుకున్నట్లు కనిపిస్తోంది. అయినా కూడా ఇప్పటికీ ఫ్లిప్‌కార్ట్‌లో కనీసం 200 కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టే అవకాశాన్ని గూగుల్ పరిశీలిస్తుందనే మాట మాత్రం వినిపిస్తూనే ఉంది..

ఆసక్తికి అదే సంకేతమా..: భారత్‌లో ఇ-కామర్స్ సంస్థ ఏర్పాటు చేయనున్నట్లు వస్తోన్న వార్తలను ఊహాగానాలుగా గూగుల్ అధికారులు కొట్టిపారేస్తున్నప్పటికీ.. ఇటీవల పరిణామాలు చూస్తే ఈ వ్యాపారంలో అడుగుపెట్టేందుకు గూగుల్ ఎంత మేర ఆసక్తికి చూపుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల చైనాలోని ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ జేడీ డాట్‌కామ్‌లో 55 కోట్ల డాలర్లను గూగుల్ పెట్టుబడిగా పెట్టింది. అంతేకాకుండా వ్యూహాత్మక భాగస్వామ్య ప్రణాళిక కింద వ్యాపార వృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తామని ఇరు సంస్థలు ఓ సంయుక్త ప్రకటనలో కూడా తెలిపాయి. మరోవైపు ఫ్లిప్‌కార్ట్‌లో వాటా కొనుగోలుకు ప్రయత్నించిన సంగతి మనకు తెలిసిందే.

ఏడాదిగా రహస్య ప్రణాళిక

ఇ-కామర్స్ విపణిలో అడుగుపెట్టాలనే విషయంపై ఏడాది కాలంగా గూగుల్ ప్రణాళికలు రచిస్తోన్నట్లు తెలుస్తోంది. అయితే చాలా రహస్యంగా ఈ ప్రణాళికను ముందుకు తీసుకెళ్తోందని ఈ పరిణామంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. ప్రయోగాత్మకంగా భారత్‌లో ప్రారంభించి.. ఆ తర్వాత వర్ధమాన దేశాలకు విస్తరించే యత్నాల్లో ఉందని అవి తెలిపాయి. అయితే ఆన్‌లైన్ వ్యాపార విపణిలో అడుగుపెట్టేముందు.. ఆ వ్యాపార స్వరూపాన్ని, లోతుపాతులను తెలుసుకునేందుకు గూగుల్ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. ఆన్‌లైన్ విక్రయ ప్లాట్‌ఫాం కోసం విక్రయ సంస్థలను గుర్తించే పనిలోనే ఉంది. వాటి వివరాలను సంపాదించే ఉద్దేశంతోనే తేజ్‌యాప్‌ను తీసుకొచ్చినట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటివరకు సుమారు 15,000 విక్రయ సంస్థలను గుర్తించినట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతంలో ఆన్‌లైన్ వ్యాపార విస్తరణకు 'ఇంటర్నెట్ సాథీ' కార్యక్రమాన్ని కూడా ఉపయోగించుకునే ఉద్దేశంలో ఉందని తెలుస్తోంది. మరోవైపు 1.8 కోట్ల మంది జీమెయిల్ వినియోగదారులు ఉండటం కూడా గూగుల్ ఇ-కామర్స్ సంస్థకు మరో కలిసొచ్చే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

పూర్వ వైభవం దిశగా ఇన్ఫీ

● డిజిటల్ సామర్థ్య విస్తరణకు అత్యంత ప్రాధాన్యం
● సంస్థ ఏజీఎంలో నీలేకని

బెంగళూరు

కంపెనీ స్థిరత్వంపై నెలకొన్న ఆందోళనలను తొలగించేందుకు ఏడాదికాలంలో పలు చర్యలు చేపట్టామని ఇన్ఫోసిస్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నందన్ నీలేకని తెలిపారు. 'గతేడాది ఆగస్టులో నేను మళ్లీ ఇన్ఫోసిస్‌లో అడుగుపెట్టినప్పుడు.. కంపెనీ స్థిరత్వంపై ఆందోళన వెలిబుచ్చారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ఏడాదికాలంగా మేం ఎన్నో చర్యలు తీసుకున్నామ'ని ఇన్ఫోసిస్ 37వ వార్షిక సాధారణ సమావేశంలో నీలేకని చెప్పారు. 'ప్రస్తుతం అత్యంత స్థిరమైన యాజమాన్య బృందం, బోర్డు మనకు ఉన్నాయి. అందరూ ఐక్యంగా ఉన్నారు. పూర్వ వైభవం దిశగా కంపెనీ అడుగులు పడటం మొదలయ్యాయి. మా దృష్టంతా దీనిని మరింత ముందుకు తీసుకెళ్లడంపైనే' అని ఆయన చెప్పారు. బోర్డులో ఉన్న తన సహ సభ్యులు, వాటాదార్ల సహకారంతో ఆశయాలను సాధించే విషయంలో కంపెనీ ఎలాంటి ప్రయత్నానికైనా సిద్ధంగా ఉందని అన్నారు. ఏడాదికాలంలో ఎదురైన కొద్దిపాటి సవాళ్లను ఎదుర్కొని మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించడంలో ఈ బృందమే కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ఇంతటి ఆదర్శవంతమైన కంపెనీకి తిరిగి సేవలందించే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

ఇన్ఫోసిస్‌లో పరిపాలన వ్యవహారాలపై ఫిర్యాదు చూస్తూ సెబీకి ఓ సామాజిక కార్యకర్త రాసిన లేఖను ప్రస్తావిస్తూ వాటాదార్లు లేవనెత్తిన ఆందోళనలను తొలగించేందుకు కంపెనీ ప్రయత్నిస్తుందని నీలేకని చెప్పారు. 'వాటాదార్లు ఎప్పటికప్పుడు తమ ఆందోళనను మా దృష్టికి తీసుకొస్తే.. వాటిని పరిష్కరించే దిశగా కంపెనీ చర్యలు చేపడుతుంది.

వ్యాపారం, వినియోగదారుల ప్రయోజనాలే తమకు ముఖ్యమ'ని ఆయన అన్నారు. తమ వినియోగదారులు ఎన్నో కీలక మార్పులను, అంతరాయాలను చూస్తూ వచ్చారని.. మున్ముందు కంపెనీ భవిష్యత్ అద్భుతంగా ఉంటుందని భావిస్తున్నామని అన్నారు. ఇన్ఫోసిస్‌లో అంతకుముందున్న అత్యుత్తమ కార్పొరేట్ పాలనా ప్రమాణాలను తీసుకొనిరావడంతో నీలేకని విఫలమయ్యారంటూ ఈ ఏడాది మేలో ఓ సామాజిక కార్యకర్త సెబీకి లేఖ రాశారు. మరోవైపు మూర్తి సహా కంపెనీకి చెందిన సహ వ్యవస్థాపకులెవరు రాకపోవడంపై నీలేకని మాట్లాడుతూ 'ప్రతిఒక్కరూ హాజరవుతారని అనుకున్నాను. వాళ్లు కూడా హాజరయ్యేవారే. అయితే ప్రయాణంలో ఉంటే రావడం వీలుపడదు కదా. అయినా ప్రతి ఏడాది 25 ఏళ్ల వేడుకగా మనం భావించాలి. అందువల్ల ఇలాంటి ప్రశ్నలకు తావివ్వద్ద'ని చెప్పారు.

సాంప్రదాయ విభాగాలు డిజిటల్ వైపే: డిజిటల్ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ప్రాధాన్యం ఇస్తూనే తన సంప్రదాయ కీలక విభాగాలను డిజిటలీకరణ దిశగా నడిపించాలనే ప్రణాళికతో కంపెనీ ముందుకు వెళ్తోందని నీలేకని అన్నారు. డిజిటల్ విప్లవంలో డేటా ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, ఐటీ, ఆర్థిక సేవలు ఇలా అన్ని రంగాల్లో డేటా ఉపయోగం కీలకం అవుతోందని చెప్పారు. డిజిటల్ సామర్థ్యాన్ని అందిపుచ్చుకునే విషయంలో క్లయింట్లకు కంపెనీ సహకారం అందిస్తుందని చెప్పారు. మరోవైపు డిజిటల్ విభాగానికి ఐదంచెల వ్యూహాన్ని సిద్ధం చేశామని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ చెప్పారు. తమ క్లయింట్లకు డేటా, అనలటిక్స్‌లకు సంబంధించిన సేవలు అందించడాన్ని ముఖ్యమైన అంశంగా కంపెనీ భావిస్తోందని చెప్పారు. సీఈఓగా సలీల్‌కు ఇదే మొదటి ఏజీఎం కావడం గమనార్హం.

మొత్తం డివిడెండు రూ.43.50: 2018 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.20.50 తుది డివిడెండును బోర్డు సిఫారసు చేసింది. అలాగే ఒక్కో షేరుకు ప్రత్యేక డివిడెండు కింద రూ.10 ఇవ్వనుంది. 2017 అక్టోబరులో ఇచ్చిన రూ.13 మధ్యంతర డివిడెండుతో కలుపుకుంటే గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం డివిడెండు రూ.43.50కు చేరిందని నీలేకని చెప్పారు. అంతకుముందు సంవత్సరంలో చెల్లించిన మొత్తం డివిడెండు రూ.25.75 అని ఆయన అన్నారు.

రెండో ఏడాదీ మూర్తి గైర్హాజరు

ఇన్ఫోసిస్ వార్షిక సాధారణ సమావేశానికి (ఏజీఎం) ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణ మూర్తి గైర్హాజరయ్యారు. అయితే విదేశీ పర్యటనలో ఉన్నందువల్లే సమావేశానికి రాలేదని మూర్తి సన్నిహితుడొకరు తెలిపారు. కాగా.. మూర్తి ఏజీఎంకు రాకపోవడం వరుసగా ఇది రెండోసారి. గతేడాది ఏజీఎంకి కూడా ఆయన దూరంగా ఉన్నారు. క్రితం సంవత్సరం జూన్ 24న జరిగిన సమావేశానికి మూర్తితో పాటు కంపెనీ ఇతర సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని, ఎస్.గోపాల కృష్ణన్, ఎస్.డి.శిబులాల్, కె.దినేశ్ కూడా గైర్హాజరయ్యారు. వీళ్లందరూ కంపెనీ ఏజీఎంకు దూరంగా ఉండటం అదే మొదటిసారి కావడం గమనార్హం. పాలనపరమైన అంశాలపై అప్పటి సీఈఓ విశాల్ సిక్కా, బోర్డు సభ్యులతో తీవ్ర బేధాభిప్రాయాలు రావడమే ఇందుకు కారణమై ఉండొచ్చని ఆ సమయంలో చర్చ నడించింది కూడా.

15 కిలోలు మించితే మోతే

'బ్యాగేజీ' ఛార్జీలు పెంచిన ఇండిగో, గోఎయిర్, స్పైస్‌జెట్

దిల్లీ: బ్యాగేజీ బరువు 15 కిలోలు మించితే ఛార్జీల వడ్డనకు ఇండిగో, గోఎయిర్, స్పైస్‌జెట్‌లు నిర్ణయం తీసుకున్నాయి. ఇండిగో అధికారిక వెబ్‌సైట్ ప్రకారం బ్యాగేజ్ బరువు 15 కిలోలు కంటే ఎక్కువగా ఉంటే ఆపైన ప్రతి కిలోకి రూ.400 ఛార్జీ వసూలు చేయనుంది. ముందస్తు బుకింగ్‌లకైతే ఆపైన 5 కిలోలకు రూ.1900, పది కిలోలకు రూ.3,800, పదిహేను కిలోలకు రూ.5,700 చొప్పున ఛార్జీ విధించనుంది. శుక్రవారం నుంచి సవరించిన ఛార్జీలు అమల్లోకి వచ్చాయి. గోఎయిర్ కూడా ఇంచుమించు ఇదే తరహాలో ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ఆ సంస్థ వెబ్‌సైట్ ప్రకారం తెలుస్తోంది. అయితే గోఎయిర్ సవరించిన ఛార్జీలను నిన్నటి నుంచే వర్తింపజేసింది. స్పైస్‌జెట్ విషయానికొస్తే అదనంగా 5, 10, 15, 20, 30 కిలోలపై రూ.1600, రూ.3,200, రూ.4,800, రూ.6,400, రూ.9,600 చొప్పున ఛార్జీలు విధించనుంది. ఈ సవరించిన ఛార్జీలను స్పైస్‌జెట్ కూడా శుక్రవారం నుంచే అమల్లోకి తెచ్చింది. మరోవైపు ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా విషయానికొస్తే 25 కిలోల వరకు బ్యాగేజీపై ఎలాంటి రుసుం లేదు.

తుమ్మల కిశోర్

బినామీ బహుమతి అంత తేలికాదు



దేశంలో కోటీశ్వరులతో పాటు వారి సంపద కూడా నానాటికీ పెరుగుతోంది. ఒక అంచనా ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో దేశంలోని వ్యక్తుల సంపద 11 శాతం దాకా పెరిగి రూ.344 లక్షల కోట్లకు చేరింది. నైట్ ఫ్రాంక్స్ వెల్త్ నివేదిక ప్రకారం దేశంలో సంపన్నులు (50 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపద ఉన్నవారు) 2022 నాటికి 71 శాతం పెరుగుతారు. విలాసవంతమైన, అత్యంత ఖరీదైన కార్లు, ఇతర వస్తువుల అమ్మకాలు జోరందుకుంటున్నాయి. అయితే ఆదాయపు పన్ను చెల్లింపు విషయంలో మాత్రం ఇప్పటికీ చాలా వెనుకబడే ఉన్నాం. దేశంలో వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారి సంఖ్య కేవలం 6 కోట్లే. అంటే మొత్తం జనాభాలో ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు కేవలం 4.6 శాతమే. ఒక దేశంలో పన్ను వసూలు శాతం పరంగా చూసినట్లయితే పలు అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల కంటే చాలా వెనుకబడి ఉన్నామని అర్థమవుతుంది. 2016-17లో జీడీపీలో పన్నుల శాతం 11 శాతం ఉండగా ఇది 2017-18లో 12 శాతానికి పెరిగే అవకాశం ఉంది. అమెరికాలో జీడీపీలో పన్ను వసూళ్లు 26 శాతం ఉండగా, జర్మనీలో 45 శాతం, జపాన్‌లో 36 శాతం, దక్షిణ కొరియాలో 34 శాతం, రష్యా, చైనాలలో 20 శాతం ఉన్నాయి. దేశంలో పన్ను ఎగవేతదార్ల సంఖ్య లెక్కకు మించి పెరుగుతోంది. ఆదాయం కోట్లలో ఉన్నా ఆదాయపు పన్ను పరిధిలోకి రాని వారి సంఖ్య పెరుగుతోంది. నగదు లావాదేవీలు అధికంగా జరిగే స్థిరాస్తి, అసంఘటిత రంగాలతోపాటు ఇతర రంగాల్లో పన్ను ఎగవేతలు పెరుగుతున్నాయి. పన్ను ఎగవేతను అరికట్టే దిశలో ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టడంతోపాటు భారీ జరిమానాలు విధించేలా చట్టాలను మరింత పదునుపెట్టింది. మరోవైపు బినామీ కార్యకలాపాలను అరికట్టే దిశలో 2016లో బినామీ చట్టానికి కొన్ని కీలక సవరణలు చేసింది. ఈ చట్టం అమలు వల్ల ప్రభుత్వానికి బినామీ ఆస్తులను స్వాధీనం చేసుకొనే వెసులుబాటు కలిగింది. అంతేకాక బినామీ కార్యకలాపాలు నిర్వహించే వారికి భారీ జరిమానాతోపాటు 1-7 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే వీలుంది. అయితే పన్ను ఎగవేతను, బినామీ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రభుత్వం శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, ఆదాయపు పన్ను విభాగం ప్రజలను భాగస్వాములను చేస్తూ ఒక ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించాయి. పన్ను ఎగవేతదారులు, బినామీ ఆస్తుల సమాచారాన్ని ప్రభుత్వానికి అందిస్తే భారీ పారితోషికం పొందే అవకాశం కల్పిస్తోంది. గతంలో ఇటువంటి పథకాన్ని 2007లో తొలిసారిగా ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం ప్రవేశపెట్టింది. ఆ పథకం అంత ప్రాచుర్యం పొందలేదు. అప్పట్లో బహుమతులు కూడా తక్కువ మొత్తాల్లో ఉండేవి. ఈ నేపథ్యంలో ఐటీ విభాగం ఈ కొత్త పథకాన్ని భారీ బహుమతులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది.

ఇదీ ఆ పథకం

కోట్లకు పడగలెత్తుతూ, బినామీ ఆస్తులను కూడబెడుతూ ఆదాయపు పన్ను ఎగవేస్తూ సమాజంలో దర్జాగా తిరుగుతున్న ఘరానా వ్యక్తుల భరతం పట్టాలనుకునేవారికి ఒక చక్కటి అవకాశాన్ని ఐటీ విభాగం కల్పిస్తోంది. పన్ను ఎగవేతదార్లను గుర్తించి, మీదగ్గరున్న సమాచారాన్ని ఐటీ విభాగానికి అందించడం ద్వారా వారిని పట్టించడంలో మీరూ భాగస్వాములు కావొచ్చు. రూ.కోటి నుంచి రూ.5 కోట్ల దాకా బహుమతులు గెలుచుకోవచ్చు. ఆదాయపు పన్ను ఎగవేత, బినామీ ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజల నుంచి సేకరించే లక్ష్యంతో కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఇటీవల ఈ ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇన్‌కంటాక్స్ ఇన్‌ఫర్మాంట్ రివార్డ్స్ స్కీమ్-2108 కింద ఎవరైనా ఆదాయపు పన్ను ఎగవేత సమాచారాన్ని, బినామీ ఆస్తుల (దేశ, విదేశాలలో) వివరాలను అందించవచ్చు. ఈ పథకం కింద సమాచారాన్ని అందించేందుకు విదేశీయులు కూడా అర్హులే. సమాచారాన్ని ఒక వ్యక్తి లేదా కొందరు వ్యక్తులు కలిసి ఒక బృందంగా ఏర్పడి కూడా ఈ పథకంలో పాలుపంచుకోవచ్చు.

మీ దగ్గర సమాచారం ఉంటే...

మీ దగ్గర ఆదాయపు పన్ను ఎగవేతదార్ల, బినామీ వ్యక్తుల (దేశ, విదేశాలలో) సమాచారం ఉంటే వెంటనే డైరెక్టర్ జనరల్ ఇన్‌కంటాక్స్ (డీజీఐటీ-ఇన్వెస్టిగేషన్) లేదా ప్రిన్సిపల్ కమిషనర్ ఇన్‌కంటాక్స్ (పీసీఐటీ-ఇన్వెస్టిగేషన్) లేదా జాయింట్ డైరెక్టర్ (జేడీఐటీ-ఇన్వెస్టిగేషన్)ను సంప్రదించండి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఈ కార్యాలయాలు హైదరాబాద్‌లోని ఆయాకర్ భవన్‌లో ఉన్నాయి. మీరిచ్చిన సమాచారాన్ని పరిశీలించిన తరవాత అది ఆమోదయోగ్యంగా ఉన్నట్లయితే జేడీఐటీ ఆ సమాచారాన్నిచ్చిన వ్యక్తికి ఒక 'ఇన్‌ఫర్మాంట్ కోడ్'ను కేటాయిస్తారు. భవిష్యత్తులో ఈ కోడ్ ద్వారానే వ్యక్తిని గుర్తించడం జరుగుతుంది. ఒకవేళ ఇచ్చిన సమాచారం సంతృప్తికరంగా, నమ్మదగ్గదిగా లేనట్లయితే తొలిదశలోనే తిరస్కరిస్తారు. ఐటీ విభాగానికి సమాచారాన్ని అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంటాయి. మీ దగ్గరున్న సమాచారాన్ని ఐటీ విభాగం రూపొందించిన అనుబంధ పత్రం-ఎ లో పొందుపరచాల్సి ఉంటుంది. అలాకాకుండా సమాచారాన్ని మెయిళ్లు, ఇతరత్రా సామాజిక మధ్యమాల ద్వారా పంపినట్లయితే గుర్తించరు.

ఆదాయపు పన్ను ఎగవేత, బినామీ లావాదేవీలు, దేశవిదేశాలలో ఉన్న నల్లధనం, ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని ఆదాయపు పన్ను శాఖకు అందించి భారీ బహుమతులు పొందాలంటే ఆ లావాదేవీలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉండాలి. ఆకాశరామన్న ఉత్తరంలానో, సామాజిక మాధ్యమాలలోనో అరకొర సమాచారం ఇస్తే సరిపోదు. అంతేకాదు ఆ లావాదేవీలకు సంబంధించిన పత్రాల నకళ్లు, ఆయా వ్యక్తుల పూర్తి వివరాలు (ఆధార్ కార్డు, పాన్ నంబర్లు లాంటివి), లావాదేవీలు నడిచిన క్రమం, తీరుతెన్నులు వంటి వివరాలన్నీ తప్పనిసరిగా పొందుపరచాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి బినామీ ఆస్తులను కూడగడుతున్నాడన్న సమాచారాన్ని అందించాలంటే ఆ ఆస్తులకు సంబంధించిన వివరాలు, పత్రాలు, బినామీగా వ్యవహరించిన వ్యక్తుల పేర్లు, వివరాలు, ఆస్తుల మార్కెట్ విలువ వంటి పూర్తి వివరాలను ఆదాయపు పన్ను శాఖకు అందించాలి. అదేవిధంగా పన్ను ఎగవేత, దేశవిదేశాలలో అక్రమ ఆస్తుల సంపాదనపై పూర్తి వివరాలు అందించాలి. పూర్తి సమాచారం లేకున్నా లేదా తప్పుడు సమాచారం ఇచ్చినా ఈ పథకం కింద బహుమతి పొందే అర్హత ఉండదు. తప్పుడు సమాచారమిచ్చినందుకు ఆ వ్యక్తిపై ఆదాయపు పన్ను విభాగం న్యాయపరమైన చర్యలు చేపట్టవచ్చు. అందువల్ల బినామీ లావాదేవీలు, పన్ను ఎగవేతలపై కచ్చితమైన సమాచారంతో, సరైన పత్రాలు, రుజువులతోనే ముందుకెళ్లాలి.

బహుమతులు అందని ద్రాక్షేనా?

- ✦ బినామీ లావాదేవీల బహుమతి పథకం (బినామీ ట్రాన్సాక్షన్, ఇన్‌ఫర్మాంట్ రివార్డు స్కీమ్-2018) కింద గరిష్ఠంగా రూ.కోటి వరకు బహుమతి పొందే అవకాశం ఉంది.
- ✦ దేశవిదేశాలలో ఉన్న నల్లధనం, ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని అందించినట్లయితే నల్లధన చట్టం (బ్లాక్ మనీ-అన్‌డిస్‌క్లోజ్డ్ ఫారిన్ ఇన్‌కం అండ్ అసెట్స్ అండ్ ఇంపోజిషన్ ఆఫ్ టాక్స్ యాక్ట్-2015) కింద రూ.5 కోట్లదాకా బహుమతి పొందవచ్చు.

అయితే ఈ పథకం కింద బహుమతి పొందడం అంత తేలిక కాదన్నది గమనార్హం. చిన్న చిన్న పన్నుల ఎగవేత లేదా బినామీ లావాదేవీలు ఈ పథకం పరిధిలోకి రావు. ఈ పథకం కింద బహుమతి పొందాలంటే మీరిచ్చిన సమాచారంలో కనీసం రూ.5 కోట్ల మేర లెక్కలు చూపని ఆదాయంపై పన్ను ఎగవేత జరిగిందని నిర్ధారించగలగాలి. అప్పుడే ఈ పథకం కింద బహుమతి పొందే అర్హత సాధించవచ్చు. అంటే భారీ ఎత్తున పన్ను ఎగవేత, బినామీ ఆస్తుల లావాదేవీలను గుర్తిస్తేనే బహుమతి పొందే వీలుంటుంది. అదేవిధంగా బహుమతి మొత్తాన్ని పన్ను ఎగవేత మొత్తంలో ఏ మేరకు ఆదాయపు పన్ను విభాగం రాబట్టగలదో దానిపై లెక్కగడతారు. బహుమతిని రెండు విడతలుగా చెల్లిస్తారు. మొదటిది మధ్యంతర బహుమతి. ఈ బహుమతిని పన్ను ఎగవేతకు సంబంధించి అసెస్మెంట్ పూర్తయిన 4 నెలలలోపు చెల్లిస్తారు. తుది బహుమతి మొత్తాన్ని చెల్లించే విషయంలో మరో 6 నెలలు పడుతుంది. కొన్ని సందర్భాలలో న్యాయపరమైన సమస్యలు తలెత్తినట్లయితే మరింత సమయం పట్టొచ్చు. ఏది ఏమైనా ఆదాయపు పన్ను విభాగం ప్రకటించిన భారీ బహుమతుల పథకానికి అర్హత పొంది బహుమతి అందుకోవాలంటే పలు చిక్కుముడులు విప్పడంతోపాటు పలు షరతులకు లోబడి అత్యంత కీలక సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. అలా అందించిన సమాచారాన్ని వివిధ కోణాల్లో పరిశీలించి పన్ను ఎగవేత జరిగిందని నిర్ధారించుకొన్న తర్వాతే బహుమతికి అర్హత వస్తుంది.

కొత్త ఉద్యోగీ... బీమా చేశారా?



గ్రాఫిక్: సుధాకర్

ఉద్యోగం.. ఒక వ్యక్తి జీవితంలో ఓ కొత్త అధ్యాయం. సంపాదన ప్రారంభం కావడంతోనే కొన్ని బాధ్యతల బరువులూ నెత్తిమీదకు వస్తాయి. కొత్తగా వచ్చిన.. రాబోయే ఈ బాధ్యతలకు ఆర్థిక రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది కదా.. మరి, ఉద్యోగంలో చేరగానే మీకంటూ ఓ ధీమా అదేనండీ బీమా పాలసీ ఉండాలి కదా..

సంపాదన ప్రారంభించగానే బాధ్యతలు.. వాటికి ఆర్థిక రక్షణలాంటి మాటలు అంతగా రుచించవు. ఇప్పుడే అంత తొందరేమిటి? అనే భావనా ఉంటుంది. అవసరం వచ్చినప్పుడు చూద్దాం అనిపిస్తుంది. ఇలా ఆలోచించి.. ముందు పెట్టుబడులు పెడదాం.. అని అటువైపు వెళ్తుంటారు. పొదుపు, పెట్టుబడుల ద్వారా కాస్త రాబడి ఆర్జించాలని ఆలోచిస్తారు. సంపాదనలో నుంచి కొంత పొదుపు చేయడం తప్పనిసరి. కానీ, ఈ పొదుపు మొత్తానికీ, మీ కలలూ, లక్ష్యాలకూ ఒక రక్షణ ఉండాలి కదా. అదే బీమా. అనుకోని సంఘటన జరిగినప్పుడు పాలసీదారుడిపై ఆధారపడిన వారికి బీమా మొత్తం తన సంపాదనకు ప్రత్యామ్నాయంగా మారాలి. వారికి ఏ ఆర్థిక ఇబ్బందిగా లేకుండా చూసుకోవాలి. కేవలం పొదుపే చేస్తే ఈ రక్షణ కల్పించడం కష్టసాధ్యం. కాబట్టి.. పొదుపు చేయండి.. దానికన్నా ముందు ఆ పొదుపు మొత్తానికి ఓ రక్షణ కల్పించండి.

చిన్న వయసులో...

ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే.. చిన్న వయసులోనే ఆర్థిక నిర్ణయాలు తీసుకునే శక్తిని సంపాదించాలి. సరైన ప్రణాళికతో తీసుకునే ఆర్థిక నిర్ణయాలు ఒక వ్యక్తిని అత్యున్నత స్థానంలో నిలబెడతాయి. చిన్న వయసులో ఉన్నప్పుడు బీమా పాలసీ తీసుకుంటే.. తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ ఉంటుంది. భవిష్యత్తులో మీ వయసు పెరుగుతుంది. బాధ్యతలూ పెరుగుతాయి. కానీ, బీమా ప్రీమియం మాత్రం అంతే ఉంటుంది. మీరు పూర్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు.. బీమా ప్రీమియం చెల్లిస్తుంటే.. అదనపు భారంగా తోస్తుంది. కానీ, అనుకోకుండా ఏదైనా తీవ్ర వ్యాధి బారిన పడితే.. కొత్తగా బీమా పాలసీ కూడా ఇవ్వరు. ఇచ్చినా భారీ ప్రీమియం ఉంటుంది. వయసు పెరగడం, ఆరోగ్య కారణాలు, ధూమపానంలాంటివి బీమా ప్రీమియాన్ని ప్రభావితం చేస్తాయి.

అదనపు లాభం..

బీమా పాలసీ తీసుకోవడం ద్వారా ఆర్థికంగా భరోసా ఉంటుంది. ఇది ప్రాథమిక ప్రయోజనం. కానీ, అదనపు ప్రయోజనాలను చూస్తే.. జీవిత బీమా పాలసీకి చెల్లించిన ప్రీమియానికి సెక్షన్ 80సీ పరిమితుల మేరకు ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది. పాలసీదారుడికి ఏదైనా జరిగినప్పుడు నామినీకి అందే పరిహారం లేదా పాలసీ వ్యవధి తీరాక వచ్చే బీమా మొత్తానికీ సెక్షన్ 10(డీ) ప్రకారం ఎలాంటి పన్నూ ఉండదు. పూర్తి రక్షణకే పరిమితమైన పాలసీలతోపాటు.. దీర్ఘకాలిక పొదుపు పథకంగానూ బీమా పాలసీలు ఉపయోగపడతాయి. ఇంటి కొనుగోలు, కారు, పదవీ విరమణ ప్రణాళికల్లాంటి వాటికీ బీమా పథకాలను వాడుకోవచ్చు. ఇవే కాకుండా.. ఇంటి రుణం, వాహన రుణం, వ్యక్తిగత రుణం, క్రెడిట్ కార్డు లాంటి ఇతర రుణాలు తీసుకున్నప్పుడు వాటికీ ఓ రక్షణ కల్పించాలి. అంటే.. ఈ రుణాలు తీసుకున్న వ్యక్తికి ఏదైనా జరిగితే.. అతని/ఆమె కుటుంబ సభ్యులపైన ఆ రుణ భారం పడకుండా చూసేలా బీమా తీసుకోవాలి. బీమా పాలసీల వల్ల పొదుపు చేసే అలవాటు రావడంతోపాటు, ఆర్థిక క్రమశిక్షణా పెరుగుతుంది.

ఏం చేయాలంటే..

ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న బీమా పాలసీలు రక్షణతోపాటు.. జీవితంలో వివిధ దశలు, ఆర్థిక అవసరాలకు తగ్గట్టుగా ఉన్నాయి. వ్యక్తి వయసు, అతని జీవన విధానం, ప్రీమియం చెల్లించగల సామర్థ్యం ఆధారంగా పాలసీలను వారికి అనువైన విధంగా అందిస్తున్నాయి. తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ కావాలనుకుంటే.. టర్మ్ పాలసీని ఎంచుకోవచ్చు. టర్మ్ పాలసీదారుడికి ఏదైనా జరిగితే నామినీకి ఆ బీమా మొత్తం పరిహారంగా అందుతుంది. సంప్రదాయ యూనిట్ ఆధారిత బీమా పాలసీ తీసుకుంటే.. వ్యవధి తీరిన తర్వాత మంచి మొత్తం చేతికి వస్తుంది. మధ్యలోనే పాలసీదారుడు మరణించినప్పుడు పరిహారం ఇస్తుంది. టర్మ్ పాలసీతో పోలిస్తే ఇది కాస్త ఖరీదే. కానీ.. బీమా రక్షణతోపాటు, కొంత పెట్టుబడి పెట్టాలనుకున్నప్పుడు దీన్ని ఎంచుకోవడం ఓ మార్గం. అవసరమైనప్పుడు ఈ పాలసీ నుంచి రుణంగా కొంత డబ్బు తీసుకోవచ్చు. లేదా పాక్షికంగా కొంత మొత్తాన్ని తీసుకునే వెసులుబాటు ఉంటుంది. నిర్ణీత వ్యవధి తర్వాత పూర్తిగా బయటకు కూడా రావచ్చు.

✦ మీ లక్ష్యం ఏమిటి అన్నది తెలుసుకున్న తర్వాత.. బీమా సంస్థల వెబ్‌సైట్లను/ ఆయా సంస్థల శాఖలకు నేరుగా వెళ్లి సలహాదారుడిని సంప్రదించవచ్చు.

✦ మీకు కావాల్సిన సమాచారం అంతా సేకరించుకోండి. మీ అవసరాలకు తగిన పాలసీ ఏది అన్నది పూర్తిగా అవగాహన చేసుకోండి.

✦ క్లెయిం చెల్లింపుల చరిత్ర, కంపెనీ పూర్వాపరాలు కూడా పరిశీలించండి. ఆ తర్వాతే ఎక్కడ నుంచి పాలసీ తీసుకోవాలనేది నిర్ణయించుకోండి.

బీమా పాలసీలు మీ ఇంటి గుమ్మం దగ్గరకే అందుబాటులోకి వస్తున్నాయి. చేయాల్సిన ప్రాధాన్య జాబితాలో దీనికి మొదటిస్థానం ఇవ్వండి. జీవితమంతా ఆర్థిక రక్షణ చక్రం తోడుగా ముందుకెళ్లండి.

- **పరాగ్ రాజా,** చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్

కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఏం చేయాలి? రూపాయి రూపాయినీ ఎలా జమ చేయడం ఎలా? పిల్లల చదువుల ఖర్చు, వారి వివాహానికి ఎంత అవుతుంది? పదవీ విరమణ ప్రణాళిక సంగతేమిటి? ఆర్థిక ప్రణాళిక విషయానికి వచ్చే సరికి చాలామందికి ఉండే సహజ సందేహాలే ఇవి.. ఇవన్నీ దీర్ఘకాలిక లక్ష్యాలే. ఇంతకాలం పెట్టుబడి పెట్టేప్పుడు.. కష్టార్జితం సురక్షితంగా ఉండాలంటే ఏ మార్గం ఎంచుకోవాలి?

బాండ్.. ఓ దీర్ఘకాల నేస్తం!

సంపద సృష్టించాలంటే.. అధిక రాబడిని ఆర్జించే పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి. అధిక రాబడి ఉన్న చోట అధిక నష్టభయమూ ఉంటుంది. వ్యాపారవేత్తలు, వృత్తి నిపుణులు ఇలాంటి నష్టభయాన్ని భరిస్తూనే అంచెలంచెలుగా ధనవంతులుగా మారారు. సంపాదనకు ఒక దశ ఉంటుంది. ఆ తర్వాత నుంచి దాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేయాల్సిందే. కొందరికి సంప్రదాయ పథకాల్లో పెట్టుబడే ఇష్టం. పిల్లల చదువులైనా.. వివాహం ఖర్చుల కోసం కూడబెట్టేందుకూ ఇదే తరహాలో మదుపు చేస్తుంటారు.

లక్ష్యం ఏదైనా.. అవసరం అయ్యే మొత్తం కన్నా రూపాయి కూడా మనదగ్గర తక్కువ కాకూడదు. ఇవన్నీ కూడా దీర్ఘకాలిక లక్ష్యాలే కాబట్టి, ఓపికతో మదుపును కొనసాగిస్తూ ఉండాలి. పెట్టుబడి పథకాల ఎంపికలో జాగ్రత్త తీసుకోవాలి. అదే సమయంలో స్వల్పకాలిక అవసరాల కోసం వాటిలోని మొత్తాన్ని ఉపసంహరించకూడదు.

సురక్షితంగా ఉంటూ.. దీర్ఘకాలంలో మంచి రాబడికి వీలు కల్పించే సురక్షిత పథకాల విషయానికి వచ్చినప్పుడు 4 పథకాలను ప్రముఖంగా ప్రస్తావించవచ్చు. ఇందులో ఏవి ఎంత మేరకు ఉపయోగమో తెలుసుకుందాం..

◆ **ట్యాక్స్ ఫ్రీ బాండ్లు:** కొన్నేళ్ల క్రితం ప్రభుత్వరంగ సంస్థలైన ఎన్‌హెచ్ఏఐ, ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, హడ్కో, ఎన్‌టీపీసీ తదితర సంస్థలు మదుపరుల నుంచి సొమ్ము సమీకరించడానికి బాండ్లను విడుదల చేశాయి. వీటిపై వచ్చే వడ్డీపై పన్ను ఉండదు. ప్రస్తుతం ఈ బాండ్ల జారీని నిలిపివేశారు. సెకండరీ మార్కెట్లో వీటిని విక్రయించుకోవచ్చు. ఇవి అందించే వడ్డీ శాతం 6% - 6.5% మేరకే ఉండటంతో సెకండరీ మార్కెట్లోనూ వీటిని తొందరగా సొమ్ము చేసుకునే విషయంలో కొన్నిసార్లు ఇబ్బందులు వస్తుంటాయి. దీర్ఘకాలిక బాండ్ల వ్యవధి 17 ఏళ్లు (ఆర్ఈసీ, నవంబరు 5, 2035), రాబడి 6శాతం. దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు ఇంత తక్కువ వడ్డీతో సొమ్ము కూడబెట్టడం అంత తెలివైనదేమీ కాదు. సురక్షితంగా ఉండేలా మదుపు చేసినా.. వ్యవధి పూర్తయిన తర్వాత వచ్చిన మొత్తాన్ని ఎక్కడ మదుపు చేయాలనే విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు.

◆ **10 ఏళ్ల బ్యాంకు ఎఫ్‌డీ లేదా ఆర్‌బీఐ ట్యాక్సబుల్ బాండ్లు:** బ్యాంకు డిపాజిట్లతో 6% -6.5% వరకూ రాబడి వస్తుంది. ఆర్‌బీఐ బాండ్లు 7.75% వడ్డీనిస్తున్నాయి. వీటి వ్యవధి 7ఏళ్లు. ఈ రెండు పథకాలపై వచ్చే వడ్డీకి ఆదాయపు పన్ను వర్తిస్తుంది.

◆ **దీర్ఘకాలిక మ్యూచువల్ ఫండ్లు:** మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ' మ్యూచువల్ ఫండ్ విభాగాలను స్థిరీకరణ చేసింది. ఇందులో ఫిక్స్‌డ్ ఇన్‌కం పథకాల్లో 'లాంగ్ డ్యూరేషన్' విభాగాన్ని తీసుకొచ్చింది. ఈ ఫండ్లు 7 ఏళ్లకు మించి వ్యవధి ఉన్న వివిధ పెట్టుబడి పథకాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం, కాస్త సురక్షితంగా పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఇవి సరిపోతాయి. ఉదాహరణకు.. ఒక ఫండ్ దీర్ఘకాలిక గవర్నమెంట్ పథకంలో మదుపు చేస్తుందనుకుందాం.. ఆ బాండు వ్యవధి 2046 వరకూ ఉంది. అంటే.. 28 ఏళ్ల సమయం ఉంది. ఫండ్ సంస్థ ఇందులో మదుపు చేసినప్పుడు ఆ వ్యవధి తీరేంతవరకూ కొనసాగుతుంది. తర్వాత పెట్టుబడి మొత్తాన్ని వెనక్కి తీసుకుంటుంది. పెట్టుబడి పెట్టినప్పుడు ఉన్న వడ్డీ రేటే ఈ వ్యవధి మొత్తం కొనసాగుతుంది. ఈ 28 ఏళ్లలో వడ్డీ రేటులో హెచ్చుతగ్గులు ఉండొచ్చు.. కానీ, వ్యవధి ఎక్కువగా ఉండటం వల్ల దీని ప్రభావం పెద్దగా ఉండదు. ప్రస్తుతం ఈ పేపర్ 8.1శాతం వరకూ వడ్డీనిస్తోంది. ఈ సెక్యూరిటీల్లో మదుపు చేసే ఫండ్ల నుంచి ఖర్చులు.. పన్నులు పోను నికరంగా 7శాతం వరకూ నికరంగా రాబడిని ఆశించవచ్చు. ఎన్ఏవీ ఆధారంగా మార్కెట్లో విక్రయించుకునే అవకాశం ఉంటుంది కాబట్టి, పెట్టుబడిని వెనక్కి తీసుకునే విషయంలో పెద్దగా ఇబ్బంది కూడా ఉండదు. ఈ ఫండ్లు ప్రభుత్వ సెక్యూరిటీలు, అధిక రేటింగ్ ఉన్న రుణ పత్రాల్లోనూ మదుపు చేస్తాయి.. కాబట్టి, సురక్షితంగా, దీర్ఘకాలంపాటు పెట్టుబడిని కొనసాగించాలనుకునేవారికి ఇవి అనుకూలమే.

- **సందీప్ సిక్కా,** ఈడీ, సీఈఓ, రిలయన్స్ మ్యూచువల్ ఫండ్

ప్రభుత్వ హామీతో... పీపీఎఫ్

ప్రభుత్వ హామీ ఉండటంతోపాటు వచ్చిన వడ్డీపై పన్ను లేకుండా ఉండే పథకం ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్). సురక్షిత పథకాల్లో ఎంతో ప్రజాదరణ పొందిన పథకమిది. దీని వ్యవధి 15 ఏళ్లు. అవసరమైతే మరో 5 ఏళ్లు పొడిగించుకునే వెసులుబాటు ఉంది. ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.1,50,000 వరకే మదుపు చేయగలం. వెంటనే నగదుగా మార్చుకునే విషయంలోనూ కొంత ఇబ్బంది ఉంటుంది. పెట్టుబడి ప్రారంభించిన ఆరేళ్ల తర్వాతే పాక్షికంగా కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

బంగారంలో మదుపు ఎలా?

▮ నా వార్షిక వేతనం రూ.8.20లక్షలు. వయసు 27 ఏళ్లు. ప్రస్తుతానికి పెద్ద బాధ్యతలేమీ లేవు. 15–20 ఏళ్ల వ్యవధితో ఏదైనా పెట్టుబడి పథకాలు ఎంచుకోవాలని అనుకుంటున్నాను. నెలకు రూ. 10వేల వరకూ పెట్టుబడి పెట్టగలను. టర్మ్ పాలసీ తీసుకోవాలా? ప్రణాళిక సూచించండి.

- *భరత్ కుమార్*

ముందుగా మీరు దాదాపు రూ.కోటి విలువైన టర్మ్ బీమా పాలసీని తీసుకోవాలి. దీన్ని రెండు భాగాలుగా విడగొట్టి, రెండు బీమా సంస్థల నుంచి తీసుకోవడం ఉత్తమం. మీరు మదుపు చేయాలనుకుంటున్న రూ.4వేలను పీపీఎఫ్‌లో జమ చేయండి. మిగతా రూ.6వేలను ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో ఎస్ఐపీ ద్వారా పెట్టుబడి పెట్టుకోండి.

▮ మా అమ్మాయి పేరుమీద నెలకు రూ.1,000 చొప్పున సుకన్య సమృద్ధి యోజనలో జమ చేస్తున్నాను. ఇప్పుడు నెలకు రూ.5వేలు తన చదువుల కోసం, మరో రూ.5వేలు బంగారం లాంటివి కొనేందుకు ఉపయోగించుకునేలా పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. మూడేళ్ల తర్వాత ఈ పెట్టుబడిని కొనసాగిస్తానో లేదో తెలియదు. బ్యాంకు డిపాజిట్లు కాకుండా.. నేను ఏ తరహా పెట్టుబడులు ఎంచుకోవాలి? - *వికాస్ చైతన్య*

మీరు పెట్టాలనుకుంటున్న రూ.5వేలను దీర్ఘకాలిక లక్ష్యంతో ఈక్విటీ హైబ్రీడ్ మ్యూచువల్ ఫండ్లలో సిప్ చేయండి. దీనికోసం ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఈక్విటీ హైబ్రిడ్ 95 ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్ ఫండ్‌లను ఎంచుకోవచ్చు. మీరు బంగారంలో మదుపు చేయాలనుకుంటే.. యాక్సిస్ గోల్డ్ ఫండ్, కొటక్ గోల్డ్ ఫండ్ రెగ్యులర్ ప్లాన్ లాంటివి పరిశీలించండి.

▮ నా వయసు 46 ఏళ్లు. నెలకు రూ.20వేలు వచ్చేలా నేను ఏదైనా మంచి పెట్టుబడి పథకంలో మదుపు చేయాలనుకుంటున్నాను. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేయడం మంచిదా? తక్కువ పెట్టుబడితో అధిక రాబడి వచ్చేలా ఎక్కడ మదుపు చేయాలి.. రెండేళ్ల తర్వాత ఈ డబ్బును తిరిగి తీసుకుంటాను.

- *నారాయణ*

▮ మీకు నెలకు రూ.20వేలు కావాలంటే.. దాదాపు 7శాతం రాబడి ఇచ్చే పథకాల్లో దాదాపు రూ.34,50,000 వరకూ మదుపు చేయాల్సి ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక రాబడి రావాలంటే నష్టభయం ఉన్నవాటిలో పెట్టుబడి పెట్టాలి. కానీ, 5-7 ఏళ్ల వ్యవధి ఉంటేనే వీటిలో మదుపు చేయాలి. మీకు రెండేళ్ల వ్యవధి ఉంది కాబట్టి, ఇలాంటి పథకాల జోలికి వెళ్లకూడదు. నష్టభయం లేని పథకాలే ఎంచుకోవాలి. ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా డెట్ మ్యూచువల్ ఫండ్లు ఎంచుకోవచ్చు. తక్కువ వ్యవధి ఉన్న నేపథ్యంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లే మేలు.

- **తుమ్మ బాల్‌రాజ్,** సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

రానీయకండి.. ఆర్థిక ఇబ్బందులు

ఆర్థిక ఇబ్బందులకు తాళలేక...
ఇలాంటి వార్తలు తరచూ వింటూనే ఉంటాం. వస్తున్న ఆదాయం సరిపోక.. ఖర్చులను ఎలా ఎదుర్కోవాలో తెలియక.. మానసికంగా ఎదురయ్యే సంఘర్షణను తట్టుకోలేక.. ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఎంతో కఠినమైన నిర్ణయం.. ఇలాంటి పరిస్థితి రాకుండా.. అప్పులకు దూరంగా.. ఉన్నదాంట్లో సర్దుకుపోవడం అలవాటు చేసుకోవడంతోపాటు.. ఎప్పటికప్పుడు మన ఆర్థిక స్థితిని సమీక్షించుకుంటూ ఉండాలి. అప్పుడే జీవితం సాఫీగా సాగుతుంది.

ప్రతి వ్యక్తి ఆర్థిక అవసరాలు భిన్నంగా ఉంటాయి. ఎవరికి వారికే ఆ అవసరం, పరిస్థితి అర్థం అవుతుంది. జీవితంలో ఏదో ఒకసారైన ఆర్థికంగా ఇబ్బంది ఎదురుకాని వారు ఎవరూ ఉండరు. కానీ, వాటిని సమర్థంగా తట్టుకోవడంలోనే వ్యక్తి ఆర్థిక విజయం ఆధారపడి ఉంటుంది. అవసరాలకు డబ్బు అందకపోవడం మానసికంగా ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. ఇది తరచూ ఎదురవుతుంటే.. మన శక్తికి మించి ఆర్థిక జీవనం గడుపుతున్నామని అర్థం. మరి, ఈ పరిస్థితిని ఎలా గుర్తించాలి.

వస్తున్న ఆదాయం ఎంత? అయ్యే ఖర్చెంత? తెలుసుకోవాలంటే.. ప్రతి కుటుంబానికీ తప్పనిసరిగా బడ్జెట్ అంటూ ఉండాలి. ఖర్చుల గురించి స్పష్టత రావడంతోపాటు, అనవసర వ్యయాన్ని నియంత్రించుకునేందుకూ ఇది ఉపకరిస్తుంది. ఎంత జమా ఖర్చుల పద్దులు రాసుకున్నా.. కొన్నిసార్లు దానికి కట్టుబడి ఉండటం సాధ్యం కాకపోవచ్చు. దీనికి కారణం, మనం అనుకున్న ఖర్చులకు మించి అనుకోని వ్యయాలు చేయాల్సి రావడమే. ఏదో ఒక నెల ఇలాంటి సమస్య ఉందంటే సరిపెట్టుకోవచ్చు. కానీ, క్రమం తప్పకుండా ఇలాగే జరుగుతుంటే కచ్చితంగా మనం ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్తున్నామని అర్థం చేసుకోవాల్సిందే. అనుకున్న బడ్జెట్‌కు కట్టుబడకపోవడం అంటే ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతిన్నట్లే అని భావించాల్సి ఉంటుంది. సాధ్యమైనంత వరకూ ఈ పరిస్థితి రాకుండా చూసుకోవాలి. అనుకోని ఖర్చులు ఎందుకు వస్తున్నాయో పరిశీలించాలి. వాటిని ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలేమున్నాయో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

నిత్యావసరాలకూ అప్పా?

కుటుంబం అంటే కొన్ని ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. ఇంటి అద్దె లేదా రుణ వాయిదా... నిత్యావసరాలు.. కొన్ని బిల్లులు తప్పనిసరి అవసరాలు. వీటిని తప్పించుకోవడం సాధ్యం కాదు. ఇలాంటి అవసరాలకూ అప్పు చేస్తేగానీ గడవని పరిస్థితి వస్తే మాత్రం అప్పుల ఊబిలోకి వెళ్తున్నట్లే లెక్క. క్రెడిట్ కార్డు ఉందిగా ఎందుకు బెంగ అన్నట్లు ప్రవరిస్తుంటారు కొందరు. కానీ, ఇది కూడా అప్పు అన్న సంగతి విస్మరించకూడదు. సాధ్యమైనంత వరకూ నెలవారీ అవసరాలకు క్రెడిట్ కార్డు వాడకపోవడమే ఉత్తమం.

జీతం జాగ్రత్తగా...

ఈ నెల జీతం మూడు నెలల తర్వాత ఖర్చు చేయాలి. దీనర్థం మన బ్యాంకు ఖాతాలో కచ్చితంగా మూడు నెలల జీతం నిల్వగా ఉండాలి. ఆరు నెలల ఖర్చులకు సరిపడా ఉంటే మరింత బాగుంటుంది. అన్ని వేళలా ఇది సాధ్యం కాదు అనేది చాలామంది మాట. సాధ్యమైన వారు ఇలాంటి ఏర్పాటు చేసుకోవచ్చు. సాధ్యం కాదు అనుకున్న వారు.. చిన్న మొత్తంతోనైనా ప్రారంభించాలి. కనీసం ఒక నెల ఖర్చులకు సరిపడా మొత్తమైనా నగదు రూపంలో అందుబాటులో ఉండాలి. జీతం వచ్చీ రాగానే ఖర్చుల జాబితా సిద్ధంగా ఉండకూడదు. జీతం వచ్చిన మొదటి రోజూ నెలాఖరు రోజులాగే భావించి ఖర్చు చేయడం అలవాటు చేసుకోవాలి. మొదటి రోజు చేతికి వచ్చినంత ఖర్చు పెట్టి.. 20 రోజుల తర్వాత చేతి ఖర్చులకూ తడుముకోవాల్సిన అవసరం ఎప్పుడూ రాకూడదు. ఒక నెల కష్టమైనా.. మరుసటి నెల నుంచి అది అలవాటు అవుతుంది.

తర్వాత చూద్దాం... అలవాటు కావాలి...

రేపు చేయాల్సింది ఈరోజు.. ఈ రోజు పని ఇప్పుడే.. ఇది పని సూత్రం.. ఖర్చు సూత్రం ఇందుకు భిన్నంగా ఉంటుంది.. అనుకున్న వెంటనే ఖర్చు చేయడం కాదు.. దాన్ని వీలైనంత కాలం తర్వాత చూద్దాం అని వాయిదా వేయడం నేర్చుకోవాలి. మరీ పిసినారిగా ఉండాలని చెప్పడం ఇక్కడ ఉద్దేశం కాదు. ఏ ఖర్చునైనా ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అంతే. గత రెండేళ్లలో మీరు కొన్న వస్తువులేమిటి? పొందిన సేవలేమిటి? వాటివల్ల ప్రస్తుతం వస్తున్న ప్రయోజనం ఏమిటి? దీన్ని ప్రతి ఒక్కరూ ఒకసారి తనిఖీ చేసుకోవాలి. ఇది ఒక రకంగా చెప్పాలంటే.. మన ఇంట్లో ఏమున్నాయి.. ఏం లేవు అనేది తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది కూడా. మార్కెట్లోకి కొత్త వస్తువులు వస్తూనే ఉంటాయి. కానీ, మన ఇంట్లో ఉండే పాత వస్తువులు అదే పని చేస్తుంటే..ఆ కొత్త వస్తువులతో అవసరం ఏముంటుంది చెప్పండి! 'నేడు అవసరం లేని వస్తువులు కొంటే.. భవిష్యత్తులో అవసరమైన వస్తువులను అమ్మేయాల్సి ఉంటుంది' అనే వారెన్ బఫెట్ మాట ఎప్పుడూ మర్చిపోకూడని సూత్రం.

అప్పులు.. హామీలు వద్దు...

అవసరానికి అప్పు తీసుకోవడం.. అధిక వడ్డీ ఆశతో అప్పు ఇవ్వడం.. మరో వ్యక్తి చేస్తున్న రుణానికి హామీ.. ఇవన్నీ నేడు చిక్కులను తెస్తున్నాయి. వీలైనంత వరకూ అప్పు చేయకూడదు. అందులోనూ అధిక వడ్డీ ఉండే క్రెడిట్ కార్డుపై నగదు, వ్యక్తిగత రుణాలు, లేదా చేబదుల్లాంటివి.. ఇవన్నీ మీరు సంపాదించిన మొత్తం నుంచి వడ్డీల రూపంలోనే మోయలేని భారాన్ని మిగులుస్తాయి. ఇక అధిక వడ్డీ ఆశతో అప్పులిస్తే... కొన్నాళ్లపాటు ఆ వడ్డీ బాగానే అందుతుంది. ఆ తర్వాతే అసలుకూ ఎసరు అవుతుంది. దీనికి వందల ఉదాహరణలు మనం చెప్పుకోవచ్చు. ఇక హామీ ఉండటం అంటే చేయని అప్పు మన నెత్తిపైన ఉన్నట్లే.. ఇదీ ఆర్థికంగా మనల్ని ఇబ్బందుల్లోకి నెట్టే అంశమే. కాబట్టి.. ఈ మూడు విషయాల్లోనూ ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిందే!

నెట్టింట లైఫై విప్లవం!

ఇంటర్నెట్‌తో అనుసంధానం విషయంలో ఓ కొత్త శకాన్ని లైఫై ఆవిష్కరించబోతోందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. విద్యుత్ కాంతి ఆధారంగా ఇది వినియోగదారుల్ని ఇంటర్నెట్‌తో అనుసంధానం చేస్తుంది. రేడియో తరంగాలపై ఆధారపడే వైఫై కన్నా ఇది ఎన్నో రెట్లు ఎక్కువ ప్రయోజనాన్ని ఇస్తుందంటున్నారు.

ఎలా పనిచేస్తుంది?



- ఎల్ఈడీ దీపాల నుంచి వెలువడే కాంతి తరంగాలు డేటాను బట్వాడా చేస్తాయి. పాత తరహా ఇథర్నెట్ కేబుళ్లు, ప్రస్తుత వైఫై రౌటర్ లాగానే ఈ ప్రసారం ఉంటుంది.
- ఎల్ఈడీ దీపాలు కాంతిని పెంచడం, తగ్గించడం ద్వారా సమాచార సంకేతాల్ని బట్వాడా చేస్తాయి. వాటిని ఎలక్ట్రానిక్ పరికరాలకు అమర్చిన ఫొటో డిటెక్టర్లు సంగ్రహిస్తాయి.
- ఎల్ఈడీల నుంచి మిణుకు మిణుకుమంటూ వచ్చే కాంతి మనిషి కంటి చూపును ఏ మాత్రం ప్రభావితం చేయదు. కానీ సమాచారాన్ని ఎన్నో రెట్లు ఎక్కువగా ప్రసారం చేస్తుంది.

లైఫైతో ప్రయోజనాలేమిటి?

- సెకనుకు 224 గిగా బైట్ల వేగంతో లైఫై పనిచేస్తుందని తాజా పరీక్షల్లో తేలింది.
- ఈ లెక్కన సెకనుకు 1.5 జీబీ డేటా(మ్యూజిక్, వీడియోలు, యాప్‌లు)ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ప్రస్తుతం అమలులో ఉన్న వైఫై కన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా, వేగంగా ఇది పనిచేస్తుంది

ఎక్కువ భద్రత

- కాంతి తరంగాలు గోడలు దాటి బయటికి వెళ్లవు కాబట్టి- లైఫై సంకేతాలు నిర్దిష్ట ప్రదేశంలోనే ఉంటాయి. అందువల్ల సంకేతాల్ని తస్కరిస్తారనే భయం లేదు.
- ఎలక్ట్రానిక్ పరికరాల మధ్య ప్రత్యక్ష కమ్యూనికేషన్‌ను వినియోగదారుడు సులువుగా పర్యవేక్షించొచ్చు. వైఫై, బ్లూటూత్‌లకు లాగా అదనపు భద్రతా చర్యలు దీనికి అవసరం లేదు.
- వెలుతురు అన్ని చోట్లా ఉంటుంది కాబట్టి మనుషుల ఆరోగ్యానికి ఎలాంటి ముప్పు ఉండదు.
- విమానాలు, ఆసుపత్రులు తదితర చోట్ల వాడే సున్నిసిత ఎలక్ట్రానిక్ పరికరాలతో లైఫై అనుసంధానం ఉండదు.

ఖర్చు తక్కువ

- ఎల్ఈడీ వెలుతురును వినియోగించుకుంటుంది కాబట్టి లైఫైకి కొద్దిపాటి అదనపు విద్యుత్తు ఉంటే చాలు.
- లైఫైలో వాడే విడిభాగాలు వైఫైలో వినియోగించే రేడియో సాంకేతిక పరిజ్ఞానం కన్నా చౌకైనవి.

ఎప్పుడు అందుబాటులోకి?

లైఫై వల్ల పలు ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. అది వినియోగంలోకి రావడంలో ఆలస్యం తప్పకపోవచ్చు. ప్రైవేటు వినియోగదారులు విస్తృతంతా వినియోగించడానికన్నా ముందుగా.. పరిశ్రమలు, కార్యాలయాల అవసరాలకు అనుగుణంగా దీనిని వినియోగించాల్సి ఉంది.

నష్టాలూ ఉన్నాయి

- ఇప్పుడు వినియోగంలో ఉన్న చాలా పరికరాలు కాంతి కిరణాల సాయంతో డేటాను బాట్వాడా చేసే, సంగ్రహించే స్థితిలో లేవు. లైఫై సంకేతాల్ని అవి అందుకోవడం కష్టం.
- ప్రస్తుతం లైఫైతో అనుసంధానం కలిగిన కొన్ని పరికరాలు ఉన్నప్పటికీ.. అవి భారీ పరిమాణంతో కూడుకున్నవి, వినియోగానికి అనువుగా లేవు.

- వైఫై నుంచి లైఫైకి వెంటనే మారడం అంత సులువుకాదు. దీనికి కొంత పరివర్తనా పరమైన కష్టాలూ తప్పకపోవచ్చునని నిపుణులు చెబుతున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

గ్రామాలు ఆత్మ.. నగరాలు శక్తి

- అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్
- ఒక్క కుటుంబ క్షేమమే ఆ పార్టీకి ముఖ్యం
- ఎన్డీఏ పథకాలతో నవభారతానికి పునాదులు: మోదీ

రాజ్‌గఢ్‌లో మోహన్‌పురా నీటి పారుదల ప్రాజెక్టును ప్రారంభించిన సందర్భంగా ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ఇండోర్: గ్రామాలు మన దేశానికి ఆత్మ అయితే నగరాలు వాటికి శక్తినిచ్చే కేంద్రాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశాన్ని దీర్ఘకాలం పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ... నగరాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందనీ, తాము అధికారంలోకి వచ్చాక వాటి రూపురేఖలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నామనీ చెప్పారు. శనివారం మధ్యప్రదేశ్‌లో వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, రూ.4713 కోట్ల పనుల్ని ప్రారంభించారు. స్వచ్ఛభారత్‌లో మెరుగైన పనితీరు కనపరిచి, దేశంలో ప్రథమ స్థానాన నిలిచిన ఇండోర్ నగరాన్ని అభినందించారు. 'జనాభా వృద్ధికి తగ్గట్టు నగరాల్లో సదుపాయాలు అభివృద్ధి చెందడం లేదు. కాంగ్రెస్ హయాంలో ఇవి తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. పదేళ్ల యూపీఏ పాలనలో నిర్మించిన ఇళ్లకంటే మూడింతల నివాసాలను మేం నిర్మింపజేశాం. ఈ పనిని యూపీఏ చేయాలంటే 20 ఏళ్లు పట్టేది' అని చెప్పారు. విజయవాడ సహా వివిధ నగరపాలక సంస్థల అధికారులకు స్వచ్ఛభారత్ పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు.

అవినీతిరహిత, పారదర్శక పాలన మాది

గత నాలుగేళ్లలో పారదర్శకమైన, అవినీతి రహిత పాలనను దేశానికి అందిస్తూ వచ్చినట్లు ప్రధాని తెలిపారు. ఆ ఫలితాలను ప్రజలు చూడగలుగుతున్నారని చెప్పారు. స్వచ్ఛభారత్‌ను అవహేళన చేస్తున్నవారు ఇండోర్ నగరాన్ని చూస్తే మార్పు అంటే ఎలా ఉంటుందో చూడవచ్చన్నారు. పరిశుభ్రతలో దేశానికే ఈ నగరం ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. ఇంతవరకు 2300 నగరాలు/ పట్టణాలు ఆరుబయట మలవిసర్జన రహితమైనవిగా గుర్తింపు పొందాయనీ, మహాత్మాగాంధీ 150వ జయంతి నాటికి స్వచ్ఛభారత్ స్వప్నం నెరవేరుతుందనీ చెప్పారు.

శిఖర సమానులను తక్కువ చేశారు

'భారతీయ జనసంఘ్' (బీజేఎస్) వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్‌ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని రాజ్‌గఢ్‌లో జరిగిన సభలో మోదీ ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పాలనలో ఒక కుటుంబాన్ని పైకెత్తడం కోసం మిగిలిన శిఖర సమాన నేతల సేవల్ని తక్కువగా చేసి చూపించేందుకు ఉద్దేశపూర్వక ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఇది చాలా దురదృష్టకరమన్నారు.

శ్యామాప్రసాద్ దార్శనికత స్ఫూర్తిదాయకం

శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన కృషి, ఆయన దార్శనికత నేటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశానికి తొలి పారిశ్రామిక విధానాన్ని అందించింది ఆయనేనన్నారు. 'ప్రజల ఆకాంక్షల్ని ప్రభుత్వాలు నెరవేర్చి, వారి జీవితాలను మెరుగుపరచాలనేది ముఖర్జీ నమ్మిన సిద్ధాంతం. పారిశ్రామికీకరణ, విద్య, మహిళా సాధికారత, అణు విధానాల్లో ఆయన ఆలోచనలు, చేసిన కృషి ఇప్పటి కాలానికీ వర్తిస్తాయి. విద్య, ఆర్థిక రంగం, ఆరోగ్యం, జాతీయ భద్రత, అభివృద్ధి అనేవి ఆయన ప్రాధాన్యాంశాలు. యువతకు నైపుణ్యాన్ని సమకూర్చి, అవకాశాలు అందించి, దేశాభివృద్ధికి వారు తోడ్పడేలా చేయాలనే దార్శనికతతో ముఖర్జీ సేవలందించారు. స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా వంటివి ఆయన ఆలోచనలకు ప్రతిబింబమే'నని మోదీ చెప్పారు.

'నల్ల'తాచు అయ్యి కాటేసింది

- అత్తింటివారిపై పగతో భోజనంలో విషం కలిపిన మహిళ
- మహారాష్ట్రలో ఐదుగురి బలి
- 80 మందికి పైగా అస్వస్థత

ముంబయి: భర్త, అత్తింటివారిపై ఉన్న పగతో ఒక మహిళ చేసిన దారుణం.. ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. ఒక విందులో తన మెట్టింటివారిని చంపేందుకు ఆహారపదార్థాల్లో విషం కలపడంతో ఐదుగురు అతిథులు చనిపోయారు.

పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని ఖాలాపూర్‌కు చెందిన ప్రజ్ఞ్య సుర్వాసె (23)కు రెండేళ్ల కిందట సురేశ్ గోవింద్ సుర్వాసె అనే వ్యక్తితో వివాహమైంది. ప్రజ్ఞ్యకు ఇది రెండో వివాహం. ఉల్కా షిండే అనే బంధువు వల్ల తన మొదటి భర్త విడాకులు ఇచ్చాడని ఆమె భావిస్తోంది. తన నడవడికపై అనుమానాలు కలిగించిందని పగ పెంచుకుంది. ఇప్పుడు రెండో పెళ్లిని కూడా చెడగొట్టేందుకు ప్రయత్నిస్తోందని, తనకు వ్యతిరేకంగా తన అత్తకు నూరిపోస్తోందని భావించింది. భర్త, అత్త, ఆడపడుచులు తనను వేధించడం మొదలుపెట్టారని పోలీసులకు చెప్పింది. నల్లగా ఉన్నానని, వంట సరిగా చేయడంలేదని నిత్యం సతాయిస్తున్నారని పేర్కొంది.

ఈ నేపథ్యంలో సోమవారం మహాడ్ గ్రామంలో సుభాష్ మానే అనే బంధువు ఇంట జరిగిన ఒక విందు సందర్భంగా అత్తింటివారిని తుదముట్టించాలని ప్రజ్ఞ్య కుట్ర పన్నింది. పాములను చంపేందుకు వాడే విషపదార్థాన్ని తెచ్చి.. పప్పులో కలిపింది. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకూ విడతల వారీగా విందు భోజనాన్ని వడ్డించారు. ఉల్కా షిండే కుటుంబం సహా 120 మంది ఈ విందుకు హాజరయ్యారు. కొన్నిగంటల తర్వాత 88 మంది అస్వస్థతకు గురయ్యారు. తలతిరగడం, వాంతులు, కడుపునొప్పి వంటి లక్షణాలు వారిలో కనిపించాయి. వారందరినీ ఆసుపత్రిలో చేర్చారు. వీరిలో ఉల్కా షిండే కుమారుడు సహా ముగ్గురు చిన్నారులు చనిపోయారు. గురువారం మరో ఇద్దరు కన్నుమూశారు.

సాయంత్రం 4.30 గంటల నుంచి 6.00 గంటల మధ్య భోజనం చేసినవారే అస్వస్థతకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఆ సమయంలో వడ్డన చేసిన వారిని విచారించారు. వారిలో ప్రజ్ఞ్య కూడా ఉంది. పోలీసు విచారణలో ఆమె నేరాన్ని అంగీకరించింది. ఆమె చంపాలనుకున్నవారు.. విషం కలపడానికి ముందే భోజనం చేసేయడంతో ఆమె పన్నాగం పారలేదు. ఈ గొడవతో సంబంధంలేని వారు చనిపోయారు.

గోవధకు పాల్పడినట్లు ఒప్పుకోవాలని తీవ్రంగా దాడి

- సంచలనం రేపుతున్న వీడియో
- పోలీసుల అదుపులోనున్న మరో గోమాంస విక్రేత మృతి

లఖ్‌నవూ: గోవధకు పాల్పడినట్లు ఒప్పుకోవాలని 65ఏళ్ల వ్యక్తిని కొడుతున్నట్లు కనిపిస్తున్న వీడియో ఒకటి సంచలనం రేపుతోంది. మరోవైపు పోలీసులు అదుపులోకి తీసుకున్న ఓ గోమాంస విక్రేత మరణించారు. రెండు ఘటనలూ ఉత్తర్ ప్రదేశ్‌లోనే జరిగాయి. మొదటి ఘటన హాపుర్‌లో చోటుచేసుకుంది. తనను కొట్టొద్దంటూ వేడుకొంటున్న బాధితుణ్ని 65ఏళ్ల సమయుద్దీన్‌గా పోలీసులు గుర్తించారు. గోవధకు పాల్పడిన మిగతావారి వివరాలు వెల్లడించాలని ఆయన్ను చితకబాదుతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఓ ద్విచక్ర వాహనదారుడితో గొడవ అనంతరం స్థానికులు ఆయన్ను కొడుతున్న దృశ్యాలూ దీనిలో ఉన్నాయి. రెండో ఘటన బరేలీలో జరిగింది. మాంసం వ్యాపారి అయిన సలీం ఖురేషీ (45)ను ఇద్దరు కానిస్టేబుళ్లు ఈ నెల 14న తీసుకెళ్లారు. ఆయన్ను తీవ్రంగా కొట్టినట్లు ఆయన భార్య ఫర్జానా ఆరోపించారు. మొదట సలీంను స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం దిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఆయన మరణించారు. ఆయన్ను తీసుకువెళ్లిన ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జినీ ఎస్ఎస్‌పీ సస్పెండ్ చేశారు.

అత్యాచారం చేసి మూత్రం తాగించారు

- 'ఝార్ఖండ్ సామూహిక అత్యాచార' నిందితుల రాక్షసత్వం

రాంచీ: ఝార్ఖండ్‌లో ఇటీవల చోటుచేసుకున్న సామూహిక అత్యాచార కేసుకు సంబంధించి విస్మయకర విషయాలు వెలుగుచూస్తున్నాయి. తుపాకులతో బెదిరించి ఐదుగురు మహిళలను ఎత్తికెళ్లి అత్యాచారానికి పాల్పడ్డ ముఠా.. అత్యంత పాశవిక చర్యలకు ఒడిగట్టినట్లు వెల్లడైంది. గత మంగళవారం ఖూంటీ జిల్లాలోని చోచాంగ్ గ్రామంలో ఈ ఘటన జరిగిన సంగతి తెలిసిందే. అత్యాచార సమయంలో దుండగులు తమతో బలవంతంగా మూత్రం తాగించినట్లు ఓ బాధిత మహిళ ఒక పత్రికకు వెల్లడించారు. "ఓ బాధితురాలి జననాంగంలో ఒక దుండగుడు కర్కశంగా చెట్టు కొమ్మను.. మరొకడు పిస్టల్‌ను, ఇంకొకడు పొగాకును పెట్టారు. బాధితులతో బలవంతంగా మూత్రం కూడా తాగించారు. నాలుగు గంటలపాటు వారి రాక్షసత్వం కొనసాగింది" అని ఆమె తెలిపారు. ఈ ఘటనలో బాధితులంతా ఓ స్వచ్ఛంద సంస్థకు చెందినవారు. వలసలు, మానవుల అక్రమ రవాణా వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు. . చోచాంగ్‌లోని మిషనరీ పాఠశాలలో నాటక ప్రదర్శన ఇచ్చేందుకు వారు వెళ్లారు. ఇటు దుండగుల ముఠాలో.. 'పత్తల్‌గడీ' ఆచారం వెనుకున్న వ్యక్తులతోపాటు మావోయిస్టు సంస్థ పీఎల్ఎఫ్ఐ సభ్యులున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మొత్తం ఆరుగురు నిందితులను గుర్తించామని.. వారిలో ఇద్దరిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. ఘటన జరిగినప్పుడు మిషనరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆల్ఫోన్సో దుండగుల వెంట వెళ్లాలని బాధితులకు సూచించాడని పోలీసులు తెలిపారు.

అణు యుద్ధం చేయకపోతే ఆక్రమిత కశ్మీర్ దక్కదు

- పండిట్ల ఊచకోతకు జగ్మోహన్ బాధ్యుడు
- కాంగ్రెస్ సీనియర్ నేత సైఫుద్దీన్ సోజ్ వ్యాఖ్యలు
- కశ్మీర్‌పై కొత్త పుస్తకం రేపు విడుదల

దిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య అణుయుద్ధం జరగనిదే పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ఎన్నటికీ మనకు దక్కదని కాంగ్రెస్ సీనియర్ నేత సైఫుద్దీన్ సోజ్ పేర్కొన్నారు. కశ్మీర్ లోయను భారత్, పీవోకేను పాకిస్థాన్ పాలించుకోవచ్చన్నారు. కశ్మీర్ ప్రజలు పాకిస్థాన్‌లో విలీనాన్ని కోరుకోవడం లేదనీ, స్వాతంత్ర్య సాధనే వారి తొలి అభిమతమనీ గతంలో చెప్పిన పాక్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌తో తాను ఏకీభవిస్తున్నానని చెప్పారు. కశ్మీర్‌లో పాక్ నియంత్రణలో ఉన్న భూభాగానికి, ఇతర ప్రాంతానికి మధ్య ఎలాంటి సరిహద్దులు ఉండకూడదని అభిప్రాయపడ్డారు. 'కశ్మీర్: గ్లింప్సెస్ ఆఫ్ హిస్టరీ అండ్ ది స్టోరీ ఆఫ్ స్ట్రగుల్' (కశ్మీర్ చారిత్రక పరిణామాలు... పోరాట గాథ) శీర్షికన సోజ్ రచించిన పుస్తకం సోమవారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ద్వారా పుస్తకాన్ని అమ్ముకునేందుకు తాను ప్రయత్నిస్తున్నట్లు సొంత పార్టీ నేతలే ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. హైదరాబాద్‌ను తీసుకునేందుకు గానూ కశ్మీర్‌ను పాకిస్థాన్‌కు ఇచ్చేందుకు సర్దార్ పటేల్ ముందుకొచ్చిన విషయాన్ని తాను పుస్తకంలో రాశాననీ, దానిని పూర్తిగా చదవాలనీ అభిప్రాయపడ్డారు. కశ్మీర్‌పై నెహ్రూకు ఉన్న ప్రేమ కారణంగా అది భారత్‌లో ఉందని చెప్పారు. కశ్మీర్ పండిట్ల ఊచకోతకు మాజీ గవర్నర్ జగ్‌మోహన్ కారణమని సోజ్ తన పుస్తకంలో నిందించారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు చోటుచేసుకున్న ఘటనలు, వాటిపై హిందువులు, ముస్లింలలో ఉన్న అభిప్రాయాలు గురించి వివరించారు. సాయుధ బలగాల ప్రత్యేకాధికార చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) అమల్లోకి వచ్చిన తీరును ప్రస్తావించారు.

భారత హైకమిషనర్ గురుద్వారా సందర్శనను అడ్డుకున్న పాకిస్థాన్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని భారత హైకమిషనర్ అజయ్ బిసారియాను.. రావల్పిండీలోని పంజా సాహిబ్ గురుద్వారాను సందర్శించకుండా పాక్ అడ్డుకుంది. ఈ పర్యటనకు ముందస్తుగానే అనుమతులన్నీ తీసుకున్నప్పటికీ.. ఇస్లామాబాద్‌కు బిసారియా వెనుదిరిగి రావాల్సివచ్చిందని భారత అధికారులు తెలిపారు. బిసారియా వెంట ఆయన భార్య కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్.. పాకిస్థాన్ విదేశాంగశాఖ దృష్టికి తీసుకువెళ్లింది. ఇలా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది.

తగ్గిన పెట్రోలు, డీజిల్ ధరలు

దిల్లీ: పెట్రోలు, డీజిల్‌ల ధరలు శనివారం కూడా తగ్గాయి. మెట్రో నగరాల్లో లీటరు పెట్రోలు ధర 9 నుంచి 13 పైసల మేర; డీజిల్ ధర 7 నుంచి 12 పైసల మేర తగ్గింది. పెట్రోలు ధర దిల్లీ, కోల్‌కతా, చెన్నైల్లో 9 పైసలు, ముంబయిలో 13 పైసలు వంతున తగ్గింది. డీజిల్ ధర దిల్లీ, కోల్‌కతాల్లో 7 పైసలు వంతున, చెన్నైలో 8 పైసలు, ముంబయిలో 12 పైసలు మేర తగ్గింది.

కశ్మీర్‌లో '4డి' వ్యూహం అమలు

- భద్రతా దళాలకు కేంద్రం ఆదేశం
- తెరపైకి కొత్త వ్యూహం

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో భాజపా-పీడీపీ సంకీర్ణ సర్కారు ప్రస్థానం ముగిశాక.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు సరికొత్త విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అవలంబించబోతోంది. '4డి' వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. దీనికింద 'డిఫెండ్' (రక్షించు), డిస్ట్రాయ్ (నాశనం చేయి, డిఫీట్ (ఓడించు), డినై (నిరాకరించు) అనే విధానాలు ఉంటాయి. కశ్మీర్ లోయలో సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ వ్యూహాన్ని అమలు చేయాలని భద్రతా దళాలకు ఆదేశాలు అందాయి.

'డిఫెండ్' కింద.. భద్రతా దళాల శిబిరాల వద్ద భద్రతను బలోపేతం చేయాలి. 'డిస్ట్రాయ్'లో భాగంగా ఉగ్రవాదులు, వారి సురక్షిత ఆవాసాలను భద్రతా దళాలు నాశనం చేయాలి. 'డిఫీట్'లో భాగంగా వేర్పాటువాద సిద్ధాంతాన్ని అణచివేయాలి. 'డినై' కింద ఉగ్రవాద సంస్థల్లోకి యువత చేరకుడా అడ్డుకోవాలి.

హురియత్ నేతలపై కఠిన వైఖరిని అవలంబించాలని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆ ముఠా నాయకుడు యాసిన్ మాలిక్‌ను అదుపులోకి తీసుకున్నారు. హురియత్ ఛైర్మన్ మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్‌ను గృహ నిర్బంధంలో ఉంచారు. భద్రతా దళాలపై రాళ్లు రువ్వే ఘటనలకు మాలిక్ బాధ్యుడని ఓ అధికారి చెప్పారు. రాళ్లు రువ్వేవారికి ఇక నుంచి ఎలాంటి క్షమాభిక్ష పెట్టరాదని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి ఒకరు చెప్పారు. తొలిసారి రాళ్లు రువ్విన 4500 మందికి క్షమాభిక్ష పెట్టాలని నాటి ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ గత నవంబర్‌లో నిర్ణయించిన సంగతి తెలిసిందే. పీడీపీ ప్రభుత్వం వల్ల భాజపాకు చాలా ఇబ్బందులు తలెత్తాయని, భద్రతా దళాల కార్యకలాపాలను నెమ్మదింపచేయాలని పోలీసులకు ఆదేశాలు అందేవని సదరు కేంద్ర మంత్రి చెప్పారు.

మరోవైపు ఉగ్రవాదుల అంత్యక్రియల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేవారిపై కఠిన చర్యలు చేపట్టాలని జమ్మూకశ్మీర్ పోలీసులు నిర్ణయించారు. సదరు ముష్కరుల 'త్యాగాల'ను కీర్తిస్తూ సాగుతున్న ఈ ప్రసంగాలతో ఉగ్రవాద ముఠాలవైపు యువత ఆకర్షితమవుతున్నందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంత్యక్రియలు జరిగే ప్రాంతానికి చేరుకునే మార్గాలపై ఆంక్షలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని, దీనివల్ల అక్కడ ఎక్కువ మంది గుమికూడకుండా ఉంటారని చెప్పారు.

లష్కరే, కాంగ్రెస్ ఒకే తాటిపై ఉన్నాయా?

- రాహుల్ సమాధానం చెప్పాలి: అమిత్ షా

జమ్ము: ఉగ్రసంస్థ లష్కరే తోయిబా (ఎల్ఈటీ), కాంగ్రెస్ పార్టీ ఒకే తాటిపై ఉన్నాయా అంటూ భాజపా అధ్యక్షుడు అమిత్ షా ప్రశ్నించారు. దీనికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు గులాం నబీ ఆజాద్, సైఫుద్దీన్ సోజ్ చేసిన వ్యాఖ్యలను ఎల్ఈటీ సమర్థించిన నేపథ్యంలో.. షా ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌లో సైన్యం ఉగ్రవాదుల కన్నా పౌరులనే ఎక్కువగా బలి తీసుకుంటుందంటూ ఆజాద్ వ్యాఖ్యానించగా.. కశ్మీరీలు స్వాతంత్ర్యాన్ని కోరుకుంటారని సోజ్ ఇటీవల అభిప్రాయం వ్యక్తం చేశారు. వీటిని ఎల్ఈటీ సమర్థించింది. జన్ సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ కృషి వల్లే కశ్మీర్ దేశంలో భాగంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖర్జీ వర్ధంతి సందర్భంగా శనివారం జమ్ములో జరిగిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఎన్నికల కమిటీ, సీనియర్ నేతలతో అమిత్ షా సమావేశమైనట్లు భాజపా నాయకులు తెలిపారు.

కశ్మీర్ పాత్రికేయులకు భాజపా నేత హెచ్చరిక

కశ్మీర్ పాత్రికేయులను హెచ్చరిస్తూ భాజపా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చౌదరి లాల్‌సింగ్ చేసిన వ్యాఖ్యలపై నిరసనలు వ్యక్తమయ్యాయి. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కథువా అత్యాచారం కేసును ప్రస్తావించారు. ఈ కేసులో నిందితులకు మద్దతుగా ఆయన ఆందోళన చేయడంతో పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. దానిని దృష్టిలో పెట్టుకొని. .. 'కశ్మీర్ పాత్రికేయులు ఓ తప్పుడు వాతావరణాన్ని సృష్టించారు. మీరు చేసే పనికి పరిమితులు విధించుకోండి. (రైజింగ్ స్టార్ పత్రిక సంపాదకుడు షుజాత్ బుఖారీకి) ఏమి జరిగిందో గుర్తించుకొండి. జాగ్రత్తపడండి. సోదరభావం చెడిపోకుండా పరిమితులు పెట్టుకోండి. అప్పుడే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుంద'ని అన్నారు. ఈ సంఘటనపై తప్పుడు ప్రచారం జరగడం వల్లనే రాజీనామా చేయాల్సి వచ్చిందని అన్నారు.

ఫిజియోథెరపీకని వెళ్లి శవమైన ఆర్మీ మేజర్ భార్య!

దిల్లీ: ఫిజియోథెరపీ చేయించుకోవడానికి శనివారం ఉదయం వెళ్లిన ఓ ఆర్మీ మేజర్ భార్య మధ్యాహ్నానికల్లా రోడ్డుమీద శవమై కనిపించారు. పదునైన ఆయుధంతో ఆమె గొంతు కోసినట్లుగా ఉంది. ఆమెపై నుంచి వాహనాన్ని నడిపించిన గుర్తులూ స్పష్టంగా కనిపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భర్తకు ఇచ్చే అధికారిక వాహనంలోనే ఆమెను డ్రైవరు సైనిక ఆసుపత్రి వద్ద దింపేసి వెళ్లారు. తిరిగి అదే డ్రైవరు పికప్ చేసుకునేందుకు వెళితే...ఆమె అసలు ఫిజియోథెరపీకే రాలేదని తెలిసింది. చివరకు మధ్యాహ్నం 1.30 గంటలకు దిల్లీ కంటోన్మెంట్ మెట్రో స్టేషన్ వద్ద నడిరోడ్డు మీద ఆమె మృతదేహాన్ని కనుగొన్న ఎవరో పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఆమె వద్ద మొబైల్ ఫోనుకానీ....నగలో...ఇతరత్రా ఏదైనా గుర్తులు కానీ లేకపోవడంతో ఆమె ఫొటోను అన్ని పీఎస్‌లకూ పంపారు. ఈ లోగా ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. తెలిసిన వాళ్లే ఎవరో ఆమెను చంపేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఈబీ-5 పెట్టుబడిదారుల వీసాపై ట్రంప్ కన్ను

- సంస్కరణలు.. లేదంటే రద్దు!

వాషింగ్టన్: ట్రంప్ ప్రభుత్వం ఇప్పుడు ఈబీ-5 పెట్టుబడిదారుల వీసా పథకంపై దృష్టిసారించింది. ఈ పథకం దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టం చేసేదిశగా తగు సంస్కరణలు చేయాలనీ...లేదంటే అసలీ వీసా పథకాన్నే రద్దు చేసిపారేయాలనీ అమెరికన్ కాంగ్రెస్‌కు ట్రంప్‌సర్కారు సూచించింది. కనీసం పదిలక్షల డాలర్ల విలువైన పెట్టుబడులు అమెరికాలో పెట్టే విదేశీయులకు ఈ పథకం కింద గ్రీన్‌కార్డులు లభిస్తాయి. ఈ మేరకు పెట్టే పెట్టుబడుల వల్ల కనీసం పది పూర్తికాలపు ఉద్యోగాల కల్పనకూ వీలుకలుగుతుంది. అయితే, ఈ పథకాన్ని ఆసరాగా తీసుకుని పలువురు విదేశీయులు అమెరికాలో తీవ్రమైన దుర్వినియోగానికి...మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ఇప్పుడు ట్రంప్ సర్కారు యోచనలో పడింది. వాస్తవానికి ఈబీ-5 పెట్టుబడిదారుల వీసా పథకాన్ని చట్టసభల సభ్యులు కొందరు ఎప్పటి నుంచో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీనాటికి 'ఈబీ-5 రీజనల్ సెంటర్ ప్రోగ్రాం' కాలపరిమితి పరిసమాప్తం కానుంది. ఈబీ-5 పథకం కింద నిర్దేశిత మొత్తాల్లో పెట్టుబడులు పెట్టే విదేశీయులకు ఏటా కనీసం పదివేల వీసాలను మంజూరు చేస్తున్న విషయం ఈ సందర్భంగా గమనార్హం.

దుర్భేధ్యంగా అంతర్జాతీయ సరిహద్దులు!

అమెరికాలోకి ఎవరూ చట్టవిరుద్ధంగా ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటించారు. ప్రజలు తమ దేశానికి రావాలని తాను మనసారా ఆకాంక్షిస్తున్నాననీ.. అయితే, సక్రమ మార్గాన మాత్రమే రావాలన్నది తన ఆకాంక్ష అని చెప్పారు. అంతర్జాతీయ సరిహద్దులను దుర్భేధ్యంగా తయారు చేయడమే తన కర్తవ్యమని నొక్కి చెప్పారు. తద్వారా అక్రమ ప్రవేశాలను సమర్థంగా అడ్డుకుంటామన్నారు. అంతేకాదు, కేవలం ప్రతిభావంతులైన వారు మాత్రమే అమెరికాకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఇమిగ్రెంట్ల ఘాతుకానికి బలైపోయిన వారి కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు.

ఉత్తర కొరియాతో ఇప్పటికీ ముప్పే

ఉత్తర కొరియాతో జరిగిన చరిత్రాత్మక శిఖరాగ్ర సదస్సు విజయం సాధించినట్లు చెబుతున్నప్పటికీ ఆ దేశం నుంచి అణ్వాయుధ ముప్పు తొలగిపోలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. ఆంక్షలను కొనసాగించాలని నిర్ణయించినట్లు వివరించారు. ఉత్తర కొరియా ప్రభుత్వ విధానాలు, చర్యల వల్ల దేశ భద్రతకు, విదేశాంగ విధానానికి, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ముప్పు పొంచి ఉందని తెలిపారు. అందువల్ల ఉత్తర కొరియాకు సంబంధించి ఏడాది పాటు జాతీయ అత్యవసర పరిస్థితిని కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పదిలో మూడు అవార్డులు మనకే

- ఐదు, ఆరు, ఏడు ర్యాంకుల్లో విజయవాడ, తిరుపతి, విశాఖ

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో ఐదో స్థానాన్ని సొంతం చేసుకుంది. మొదటి పది స్థానాల్లో విజయవాడ ఐదు, తిరుపతి ఆరు, విశాఖపట్నం ఏడో స్థానాలను దక్కించుకున్నాయి. మొత్తం అవార్డుల్లో పది శాతం ర్యాంకులు రాష్ట్రానికి లభించాయి. టాప్ 200లో 19 ర్యాంకులు, టాప్ 300లో 31 ర్యాంకులు రాష్ట్రం చేజిక్కాయి. పరిశుభ్ర నగరం కేటగిరిలో విజయవాడ, ఘన వ్యర్థాల నిర్వహణ(ఎస్‌డబ్ల్యూఎం)లో తిరుపతి ర్యాంకులు పొందాయి. లక్ష జనాభా దాటిన, లక్షలోపు జనాభా కలిగిన పట్టణ, నగరాల్లో పరిశుభ్రతపై కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ 2018 సంవత్సరానికి నిర్వహించిన సర్వే ఫలితాల్లో రాష్ట్రం పలు అవార్డులు సాధించింది. ఇండోర్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి చేతుల మీదుగా రాష్ట్రానికి చెందిన కలెక్టర్లు, నగరపాలికలు, పురపాలికల కమిషనర్లు అవార్డులు స్వీకరించారు.

ఇదే స్ఫూర్తితో పని చేయాలి: మంత్రి నారాయణ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయిలో అవార్డులు పొంది రాష్ట్రంలోని అత్యధిక నగరపాలక, పురపాలక సంఘాలు సత్తా చాటాయని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ హర్షం ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో పని చేసి జాతీయ స్థాయిలో మొదటి పది స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.

జింబాబ్వే అధ్యక్షుడి ర్యాలీలో పేలిన బాంబు

- ఉపాధ్యక్షుడికి గాయాలు

బులవాయో: జింబాబ్వే అధ్యక్షుడు ఎమర్సన్ నంగాగ్వ శనివారం ఇక్కడ త్రుటిలో ప్రమాదాన్ని తప్పించుకున్నారు. ఆయన పాల్గొన్న ఎన్నికల ప్రచార సభలో బాంబు పేలింది. ఇందులో ఉపాధ్యక్షుడు కెమో మొహది, అధికార జేఏఎన్‌యూ-పీఎఫ్ పార్టీ అధ్యక్షురాలు, క్యాబినెట్ మంత్రి ఒపా ముచింగురి-కషిరి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంగెల్‌బర్ట్ రుగేజి గాయపడ్డారు. ఎమర్సన్.. సభా వేదికను దిగి వస్తున్న తరుణంలో ఈ పేలుడు చోటుచేసుకుంది. ఆ వెంటనే భద్రతా సిబ్బంది ఆయనను అక్కడి నుంచి తరలించారు.

సంక్లిష్ట ప్రాంతాల్లో పట్టాల పర్యవేక్షణకు డ్రోన్లు

ఈనాడు, దిల్లీ: రైలు పట్టాల పర్యవేక్షణలో ఇకపై డ్రోన్లు రంగ ప్రవేశం చేయనున్నాయి. ప్రతికూల వాతావరణం ఉన్నచోట, సంక్లిష్ట ప్రాంతాల్లో వీటి సేవల్ని వినియోగించుకోనున్నారు. వీటిని రూర్కీ ఐఐటీ అభివృద్ధి చేస్తోంది. రైల్‌టెల్ కార్పొరేషన్, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటైన 'టెలికాం సెంటర్స్ ఆఫ్ ఎక్సెలెన్స్' (టీసీఓఈ) దీనిలో భాగస్వాములుగా ఉన్నాయి. రూర్కీ చుట్టుపక్కల ప్రాంతాల్లో వీటిని పరీక్షిస్తున్నారు. ఈ ప్రయోగాలు విజయవంతమైతే రైలు పట్టాల పర్యవేక్షణ మరింత మెరుగుపడనుంది.

శనివారం క్యూబాలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, క్యూబా అధ్యక్షుడు డయజ్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు దేశాల అధికారులు

హుసాముద్దీన్‌కు స్వర్ణం

దిల్లీ: తెలంగాణ బాక్సింగ్ యువ సంచలనం మహమ్మద్ హుసాముద్దీన్ (56 కేజీలు) అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మరోసారి మెరిశాడు. జర్మనీలో జరుగుతున్న కెమిస్ట్రీ కప్ బాక్సింగ్ టోర్నీలో స్వర్ణ పతకం సాధించి సత్తాచాటాడు. శనివారం ఫైనల్లో హుసాముద్దీన్ మనదేశానికే చెందిన మదన్ లాల్‌పై విజయం సాధించి పసిడి సొంతం చేసుకున్నాడు. మరో బాక్సర్ గౌరవ్ సోలంకి (52 కేజీలు) కూడా బంగారు పతకం సాధించడంతో భారత్ ఈ టోర్నీని రెండు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో ముగించింది. గౌరవ్ ఫైనల్లో జార్జ్ అలెజాండ్రో (క్యూబా) పై నెగ్గాడు. అమిత్ పంగాల్ (49 కేజీలు), ధీరజ్ రంగి (64 కేజీలు), నరేందర్ (+91 కేజీలు) సెమీస్‌లో ఓడి కాంస్యాలతో సరిపెట్టుకున్నారు. అమిత్ 0-5తో డామియన్ (క్యూబా), ధీరజ్ 2-3తో అల్కాస్బే (జోర్డాన్), నరేందర్.. రిచర్డ్ (అమెరికా) చేతిలో ఓటమి పాలయ్యారు.

కోహ్లి, అనుష్కలకు లీగల్ నోటీసు

ముంబయి: ఇటీవలే టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, అతడి భార్య అనుష్క శర్మ కలిసి కార్లో ప్రయాణిస్తుండగా.. అర్హాన్ సింగ్ ఒక వ్యక్తి రోడ్డుపై చెత్త పారబోస్తుండగా అనుష్క అతడిని మందలించడం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను కోహ్లి ట్విటర్లో షేర్ చేయగా.. తర్వాత అర్హాన్ వాళ్లకు బదులిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. తనతో అనుష్క చాలా అమర్యాదకరంగా మాట్లాడిందని, ఆమెను ఆపకుండా ఆ ఉదంతాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకోవాలన్న తాపత్రయమే కోహ్లిలో కనిపించిందని విమర్శించాడు. అతను అంతటితో ఆగకుండా ఇప్పుడు కోహ్లి, అనుష్కలకు అతను లీగల్ నోటీసు కూడా ఇచ్చాడు. "నా న్యాయ సలహాదారులు వారికి నోటీసులిచ్చారు. బంతి ఇప్పుడు వారి కోర్టులో ఉంది. దీనిపై ఏ వ్యాఖ్యానాలూ చేయను. వారి బదులు కోసం ఎదురు చూస్తున్నా" అని అర్హాన్ చెప్పాడు.

మెక్‌కలమ్

డోపీగా దొరికాడు కానీ..

దిల్లీ: 2016 ఐపీఎల్ సందర్భంగా న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెక్‌కలమ్ డోపింగ్ పరీక్షల్లో విఫలమైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతను తాను వాడిన ఉత్ప్రేరకం విషయంలో మినహాయింపు ఉన్నట్లుగా ధ్రువపత్రం సమర్పించడం ద్వారా నిషేధం తప్పించుకున్నట్లు తేలింది. 2016లో భారత్‌లో ఒక ప్రముఖ ఆటగాడు డోప్ పరీక్షలో విఫలమైనట్లుగా ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) పేర్కొంది. ఐతే ఆ ఆటగాడెవరన్నది బీసీసీఐ దాచి ఉంచింది. అదే ఏడాది సాంగ్వాన్, యూసుఫ్ పఠాన్, అభిషేక్ గుప్తా దేశవాళీ మ్యాచ్‌ల సందర్భంగా డోప్ పరీక్షల్లో విఫలమైనట్లు మాత్రం బీసీసీఐ ప్రకటించింది. ఐతే ఇప్పుడు మెక్‌కలమే స్వయంగా తాను డోపీగా తేలడం గురించి వెల్లడించాడు. ఆస్తమా బాధితుడైన మెక్‌కలమ్ దిల్లీలో కాలుష్యం వల్ల బాగా ఇబ్బంది పడటంతో తాను ఎప్పుడూ వాడే ఇన్‌హేలర్ మందు ఎక్కువ స్థాయిలో తీసుకున్నాడట. దీని ఫలితంగా డోప్ పరీక్షల్లో అతను పట్టుబడ్డాడట. దీనిపై బీసీసీఐ అతడిని వివరణ కోరగా.. స్వీడన్‌కు చెందిన వైద్య నిపుణుల నుంచి ధ్రువపత్రం సమర్పించడం ద్వారా నిషేధం నుంచి బయటపడినట్లు వెల్లడైంది. "ఆ సమయంలో ఇన్‌హేలర్ అతిగా వాడాను. బీసీసీఐ నాకు సహకరించింది" అని మెక్‌కలమ్ తెలిపాడు.

ప్రపంచకప్‌లో ఈనాడు

ఇంగ్లాండ్	గ్రూప్-జి × సా॥ 5.30	పనామా
జపాన్	గ్రూప్-హెచ్ × రాత్రి 8.30	సెనెగల్
పోలెండ్	గ్రూప్-హెచ్ × రాత్రి 11.30	కొలంబియా

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

ఈసారి ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫేవరెట్లలో బెల్జియం కూడా ఒకటంటే చాలామంది అంగీకరించలేదు. కానీ టోర్నీలో ఆ జట్టు ప్రదర్శన చూశాక అది ఫేవరెట్టే అని అందరూ ఒప్పుకోవాల్సి వస్తోంది. జర్మనీ, బ్రెజిల్, అర్జెంటీనా లాంటి హాట్ ఫేవరెట్లు అంతంతమాత్రంగా ఆడుతుంటే.. బెల్జియం మాత్రం మెరుపులు మెరిపిస్తూ సాగిపోతోంది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ భారీ విజయాలతో ఆ జట్టు నాకౌట్లోకి దూసుకెళ్లింది. శనివారం బెల్జియం 5-2తో టునీషియాపై ఘనవిజయం సాధించింది.

లుకాకు

1 బెల్జియం ఓ ప్రపంచ కప్ మ్యాచ్‌లో ఐదు గోల్స్ కొట్టడమిదే తొలిసారి.

4 ఈ ప్రపంచకప్‌లో లుకాకు కొట్టిన గోల్స్. పనామాతో తొలి మ్యాచ్‌లో రెండు గోల్స్ కొట్టిన అతను.. తాజాగా టునీషియాపై ఇంకో రెండో గోల్స్ సాధించాడు. టాప్‌స్కోరర్లలో రొనాల్డోతో సమానంగా అగ్ర స్థానంలో ఉన్నాడు.

13 ప్రపంచకప్ గ్రూప్ దశలో ఓటమి లేకుండా బెల్జియం ఆడిన మ్యాచ్‌లు.

బెల్జియం గర్జన

- 5-2తో టునీషియాపై ఘనవిజయం
- రెండో గెలుపుతో నాకౌట్లోకి ప్రవేశం

బెల్జియం 5	టునీషియా 2
లుకాకు (16వ, 45+3), హజార్డ్ (6వ, 51వ), మికీ బాట్షాయి (90వ)	డిలాన్ బ్రాన్ (18వ), ఖజ్రి (90+3)

లుకాకు గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించాడిలా...

మాస్కో

అనుకున్నట్లే గ్రూప్-జి నుంచి నాకౌట్ బెర్తు సొంతం చేసుకున్న తొలి జట్టు బెల్జియమే అయింది. తొలి మ్యాచ్‌లో పనామాను చిత్తు చేసిన ఆ జట్టు.. రెండో మ్యాచ్‌లో టునీషియాపై 5-2తో భారీ విజయం నమోదు చేసింది. సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ స్టార్ స్ట్రైకర్ లుకాకు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ రెండు గోల్స్ (16వ, 45+3వ) కొట్టాడు. మరో స్టార్ ఆటగాడు ఈడెన్ హజార్డ్ కూడా అదరగొట్టాడు. అతనూ రెండు గోల్స్ (6వ, 51వ) సాధించాడు. బెల్జియం తరపున మరో గోల్ మికీ బాట్షాయి 90వ నిమిషంలో కొట్టాడు. టునీషియా జట్టులో డిలాన్ బ్రాన్ (18వ), ఖజ్రి (90+3) గోల్స్ సాధించారు. పనామాతో పోరులో తమ జట్టు ఆరంభంలో నెమ్మదిగా ఆడిందంటూ కోచ్ విమర్శించిన నేపథ్యంలో ఈసారి బెల్జియం ఆటగాళ్లు దూకుడు పెంచారు. ఆ జట్టుకు ఆరో నిమిషంలోనే పెనాల్టీ లభించింది. కెప్టెన్ హజార్డ్ సునాయాసంగా గోల్ కొట్టేశాడు. ఇంకో పది నిమిషాలకు మెర్టెన్స్ నుంచి చక్కటి పాస్ అందుకుని లుకాకు చక్కటి గోల్ సాధించాడు. రెండు నిమిషాల తర్వాత టునీషియా గోల్ కొట్టి బెల్జియంకు షాకిచ్చింది. తర్వాత బెల్జియంకు వచ్చిన మంచి అవకాశాలు వృథా అయ్యాయి. స్టార్ మిడ్‌ఫీల్డర్ డిబ్రుయిన్ రెండుసార్లు గోల్ అవకాశాలు సృష్టించినా సహచరులు సద్వినియోగం చేసుకోలేదు. ఐతే ప్రథమార్ధపు అదనపు సమయంలో లుకాకు గోల్ కొట్టి బెల్జియం ఆధిక్యాన్ని మరింత పెంచగా.. ద్వితీయార్ధంలో కాసేపటికే హజార్డ్ తన రెండో గోల్ అందుకున్నాడు. నిర్ణీత సమయం చివరి నిమిషంలో సబ్‌స్టిట్యూట్ బాట్షాయి మరో గోల్‌తో జట్టుకు 5-1తో తిరుగులేని ఆధిక్యం అందించాడు. చివర్లో బెల్జియం ఆటగాళ్లు కొంచెం ఉదాసీనంగా ఉండటంతో టునీషియా మరో గోల్ సాధించి, ఓటమి అంతరాన్ని కొంచెం తగ్గించింది.

ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ

మన్‌దీప్ గోల్ సంబరం

పాక్ చిత్తు.. చిత్తు...

4-0 గోల్స్‌తో గెలిచిన భారత్

ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు అద్భుత ఆరంభం...! శ్రీజేశ్ సేన కళ్లుచెదిరేలా ఆడిన వేళ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ చిత్తుగా ఓడిపోయింది. పాక్‌పై ఇటీవల విజయపరంపరను కొనసాగిస్తూ భారత్ ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఘనంగా బోణీ కొట్టిన మన బృందం.. ఆదివారం ఒలింపిక్ ఛాంపియన్ అర్జెంటీనాతో పోరుకు సిద్ధమైంది.

బ్రెడా (నెదర్లాండ్స్)

ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో భారత్ శుభారంభం. అటు అటాకింగ్‌లో ఇటు డిఫెన్స్‌లో అదరగొట్టిన భారత్ 4-0తో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టింది. చివరి పది నిమిషాల్లో మూడు గోల్స్ కొట్టిన భారత్ ఘన విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి చివరి వరకు శ్రీజేశ్ సేనదే పైచేయి. ఆరంభంలో రెండు పెనాల్టీకార్నర్‌లను వృథా చేసుకున్న భారత్.. ఆ తర్వాత ఏ అవకాశం దొరికినా వదల్లేదు. రెండో క్వార్టర్ కొద్దిసేపట్లో ముగుస్తుందనగా పాక్ గోల్‌పోస్ట్ దిశగా దూసుకొచ్చిన రమణ్‌దీప్ సింగ్ (20వ ని) బంతిని గోల్‌లోకి పంపేశాడు. మూడో క్వార్టర్ ఆరంభంలో పాక్‌కు గోల్ చేసేందుకు బంగారు అవకాశం దొరికినా అజాజ్ అహ్మద్ కొట్టిన మెరుపు షాట్‌ను గోల్‌కీపర్ శ్రీజేశ్ సమర్థంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత భారత డిఫెండర్లు చురుగ్గా వ్యవహరించడంతో పాక్‌కు ఒక పెనాల్టీ కార్నర్ కూడా వృథా అయింది. అయితే మ్యాచ్‌లో హైలైట్ నాలుగో క్వార్టరే. మరో పది నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా.. దిల్‌ప్రీత్ (52వ ని) గోల్ చేసి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. చివరి ఐదు నిమిషాల్లో మరో రెండు గోల్స్ పడ్డాయి. 57వ నిమిషంలో మన్‌దీప్, ఆఖరి నిమిషంలో లలిత్ ఉపాధ్యాయ్ గోల్ కొట్టి భారత విజయాన్ని పరిపూర్ణం చేశారు. ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఒలింపిక్ ఛాంపియన్ అర్జెంటీనాతో భారత్ తలపడనుంది.

భారత్ × అర్జెంటీనా – సాయంత్రం 3.30 నుంచి స్టార్ స్పోర్ట్స్1లో

నాకౌట్లో మెక్సికో

దక్షిణ కొరియాపై విజయం

మెక్సికో 2	దక్షిణ కొరియా 1
కార్లోస్ వెలా (26వ), హెర్నాండెజ్ (66వ)	సన్ హ్యూన్ మిన్ (90+3)

హెర్నాండెజ్

రొస్తోవ్: అగ్ర జట్టు జర్మనీపై సంచలన విజయం ప్రపంచకప్‌ను గొప్పగా ఆరంభించిన మెక్సికో.. రెండో మ్యాచ్‌లోనూ జోరుకొనసాగించింది. శనివారం దక్షిణ కొరియాను 2-1తో ఓడించి గ్రూప్-ఎఫ్ నుంచి నాకౌట్ చేరిన తొలి జట్టయింది. తొలి మ్యాచ్‌లో స్వీడన్ చేతిలో ఓడిన దక్షిణ కొరియా.. వరుసగా రెండో ఓటమితో దాదాపుగా నాకౌట్‌కు దూరమైంది. ఈ మ్యాచ్ ఆద్యంతమూ మెక్సికో జోరే కొనసాగింది. 26వ నిమిషంలో ఆ జట్టుకు పెనాల్టీ లభించగా.. కార్లోస్ వెలా గోల్ కొట్టి ఆధిక్యం అందించాడు. ద్వితీయార్ధంలో హెర్నాండెజ్ మెరిశాడు. అతను 66వ నిమిషంలో ఫీల్డ్ గోల్ కొట్టాడు. దక్షిణకొరియాకు మెక్సికో స్ట్రైకర్లను కాచుకోవడానికే సరిపోయింది. ఆ జట్టు పెద్దగా దాడులు చేయలేదు. అదనపు సమయంలో సన్ హ్యూన్ మిన్ గోల్ కొట్టి కొరియాకు కొంచెం ఊరటనిచ్చాడు.

భారత్‌కు మరో భారీ విజయం

దుబాయ్: కబడ్డీ మాస్టర్స్ టోర్నీలో భారత్ జోరు కొనసాగిస్తోంది. తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన భారత్.. శనివారం తన రెండో మ్యాచ్‌లో 48-19తో కెన్యాపై భారీ విజయాన్నందుకుంది. రైడర్ కిషాంక్ 15 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇటీవలే ప్రొ కబడ్డీ వేలంలో రికార్డు ధర దక్కించుకున్న మోను గోయత్ 9 పాయింట్లతో సత్తా చాటాడు. ఈ విజయంతో భారత్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

మెక్సికో కోసం 2 టన్నుల ఆహారం!

మెక్సికో నగరం: ప్రపంచకప్‌లో తలపడుతున్న మెక్సికో ఆటగాళ్ల కోసం ఆ జట్టు మేనేజ్‌మెంట్ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తమ ఆటగాళ్లకు ఇష్టమైన ఆహారాన్ని అందించడానికి ప్రత్యేకంగా రెండు టన్నుల ఆహార పదార్థాలను తమ వెంట తీసుకొచ్చింది. ఇందులో ఆవు మాంసం, సంప్రదాయ టాకోస్ లాంటివి ఉన్నాయి. గతంలో కలుషితమైన మాంసం తినడం వల్ల ఆటగాళ్లు అనారోగ్యం పాలయ్యారు. అందుకే ఈసారి చాలా జాగ్రత్తలు తీసుకున్నారు.

చివరి నిమిషంలో గెలుపు గోల్

జెర్దాన్ షాచిరి

కాలింగ్రాడ్: డ్రాగా ముగుస్తుందనుకున్న మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ ఆటగాడు జెర్దాన్ షాచిరి అద్భుతమే చేశాడు. సరిగ్గా నిర్ణీత సమయం ముగుస్తున్నపుడు.. 90వ నిమిషంలో గోల్ కొట్టి తమ జట్టుకు విజయాన్నందించాడు. శుక్రవారం రాత్రి జరిగిన గ్రూప్- ఈ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 2-1 గోల్స్ తేడాతో సెర్బియాపై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభంలో సెర్బియాదే దూకుడు. ఐదు నిమిషాలకే హెడర్ గోల్ కొట్టి అలెగ్జాండర్ మిత్రోవిచ్ స్విస్‌కు షాకిచ్చాడు. తర్వాత కూడా సెర్బియా దూకుడు కొనసాగించింది. అయితే మరో గోల్ చేయకుండా స్విట్జర్లాండ్ రక్షణశ్రేణి సెర్బియా ఆటగాళ్లను నిలువరించింది. రెండో అర్ధంలో స్విట్జర్లాండ్ దూకుడు పెంచింది. 52వ నిమిషంలో ఆ జట్టు ఆటగాడు గ్రానిట్ జాకా 25 గజాల దూరం నుంచి కళ్లు చెదిరే రీతిలో గోల్ కొట్టి స్కోరు సమం చేశాడు. తర్వాత రెండు జట్లు హోరాహోరీగా తలపడడంతో మ్యాచ్ డ్రాగా ముగుస్తుందని అంతా అనుకున్నారు. కానీ షచిరి చివర్లో గోల్ కొట్టి స్విస్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. రెండు మ్యాచ్‌ల్లో ఓ డ్రా, ఓ విజయంతో నాలుగు పాయింట్లు సాధించిన స్విట్జర్లాండ్.. నాకౌట్‌కు చేరువైంది.

స్విట్జర్లాండ్ 2	సెర్బియా 1
గ్రానిట్ జాకా (52వ) జెర్దాన్ షాశివి (90వ)	అలెగ్జాండర్ (5వ)

బ్రెజిల్.. అంత వీజీ కాదు!

ఈసారి ప్రపంచకప్‌లో దక్షిణ అమెరికా మేటి జట్లకు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. టైటిల్ ఫేవరెట్లనుకున్న జట్లకు అనూహ్య ఫలితాలొచ్చాయి. బ్రెజిల్, అర్జెంటీనా జట్లు రెండూ తొలి మ్యాచ్‌ల్లో చిన్న జట్లతో తలపడి డ్రాతో సరిపెట్టుకోవాల్సి రావడం ఆశ్చర్యం కలిగించే విషయం. బ్రెజిల్ జట్టు.. కోస్టారికాతో మ్యాచ్‌లో డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చేట్లు కనిపించింది. కానీ ఇంజురీ సమయంలో రెండు గోల్స్‌తో గట్టెక్కింది. ప్రస్తుతం గ్రూప్-ఇలో ఆ జట్టు అగ్రస్థానంలో ఉన్నప్పటికీ నాకౌట్ బెర్తు ఖాయమేమీ కాదు. తన చివరి మ్యాచ్‌లో ఆ జట్టు సెర్బియాను ఓడిస్తే సులువుగానే ముందంజ వేస్తుంది. కానీ ఆ మ్యాచ్ ఓడినా, డ్రాతో సరిపెట్టుకున్నా అవకాశాలు సంక్లిష్టమవుతాయి. బ్రెజిల్‌ను సెర్బియా ఓడించగలిగితే.. గ్రూప్‌లో మరో మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా ఆ జట్టే నాకౌట్ చేరుతుంది. స్విస్.. కోస్టారికాపై నెగ్గినా, లేదా డ్రా చేసుకున్నా రెండో నాకౌట్ బెర్తును ఖాయం చేసుకుంటుంది. బ్రెజిల్, కోస్టారికా టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి. ఇక్కడ బ్రెజిల్ ఓడి.. అక్కడ కోస్టారికా గెలిస్తే.. అప్పుడు రేసు రసవత్తరంగా మారుతుంది. గోల్ తేడా మెరుగ్గా ఉన్న జట్టు ముందుకు వెళ్తుంది. ఈ సమీకరణాలతో సంబంధం లేకుండా ముందంజ వేయాలంటే మాత్రం బ్రెజిల్.. సెర్బియాను ఓడించడమొక్కటే మార్గం.

ఆసుపత్రి బిల్లు.. గుండె గుబిల్లు

- తెలంగాణ కంటే ఆంధ్రలో వైద్య ఖర్చు ఎక్కువ
- జాతీయ ఆరోగ్య ముఖచిత్రం-2018లో వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

అనారోగ్యంతో ఒక్కసారి ఆసుపత్రిలో చేరితే భారీగా ఖర్చవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లో సరాసరి ఒక కుటుంబానికి ఖర్చు రూ.33,671 కాగా, తెలంగాణలో రూ.26,092. ఇదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే వరుసగా రూ.15,411, రూ.13,698. అటు గ్రామీణ, ఇటు పట్టణ ప్రాంతాల్లోనూ వైద్యానికి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఖర్చవుతునట్లు జాతీయ ఆరోగ్య ముఖచిత్రం-2018 పేర్కొంది. ఆరోగ్యరంగంలో ప్రభుత్వాలు చేస్తున్న తలసరి ఖర్చు తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువగా ఉంది. 2015-16లో వాస్తవ ఖర్చును పరిగణనలోకి తీసుకుంటే ఆంధ్రప్రదేశ్ తలసరి ఖర్చు రూ.1,013 కాగా, తెలంగాణలో రూ.1,322గా ఉంది. వెనుకబడిన రాష్ట్రాలైన అసోం, ఝార్ఖండ్, ఉత్తరాఖండ్ ఎక్కువగా ఖర్చు చేస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ రూ.1,463తో మొదటి స్థానంలో ఉంది. ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో సరాసరి రూ.2,878 ఖర్చు చేస్తుండగా, మిజోరాం అత్యధికంగా రూ.5,862, అరుణాచల్‌ప్రదేశ్ రూ.5,177 వెచ్చించారు. పెద్ద రాష్ట్రాలన్నింటిలోనూ ఆరోగ్యరంగంపై చేసే ఖర్చు చాలా తక్కువగా ఉందని నివేదిక వెల్లడించింది. ఆసుపత్రిలో చేరిన వారు చేసే సరాసరి ఖర్చులో జాతీయ సగటు కంటే తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతంలో తక్కువగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో చాలా ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో గుజరాత్‌లో సరాసరి చాలా ఎక్కువగా అంటే ఏకంగా రూ.32,503గా ఉంది. రాజస్థాన్‌లో కూడా రూ.29,779 ఉంది. పట్టణ ప్రాంతాల్లో గుజరాత్‌లో తక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్ కంటే పైన అసోం, గోవా, జమ్మూ-కశ్మీర్ మాత్రమే ఉన్నాయి. దేశ రాజధాని దిల్లీలో అతితక్కువగా ఆసుపత్రిలో చేరిన వారి సరాసరి వైద్య ఖర్చు రూ.8,286 కావడం గమనార్హం. జాతీయ సరాసరి కంటే ఇది బాగా తక్కువ. దేశం మొత్తమ్మీద చూసినపుడు ఆసుపత్రిలో చేరిన ఒక కుటుంబం ఖర్చు గ్రామీణ ప్రాంతంలో రూ.16,956 కాగా, పట్టణ ప్రాంతంలో రూ.26,455. అనేక రాష్ట్రాల్లో ఖర్చు ఈ సగటు కంటే ఎక్కువగా ఉంది.

తక్కువ కేటాయింపులు

ఆరోగ్య రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ కేటాయింపులు చేస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. దేశం మొత్తమ్మీద కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కలిపి 2015-16లో రూ.లక్షా 40 వేల కోట్లు ఖర్చుచేశాయి. అంటే తలసరి ఖర్చు రూ.1,112. 2009-10లో తలసరి ఖర్చు రూ.621. జాతీయ స్థూల ఉత్పత్తితో పోల్చినపుడు కేటాయింపుల్లో మాత్రం 2009-10కి, 2015-16కు గుర్తించదగిన మార్పేమీ లేదని నివేదిక పేర్కొంది. మొత్తం ఖర్చులో కేంద్రం వాటా 31 శాతం కాగా, రాష్ట్రాలు 69 శాతం ఖర్చుచేశాయి. మొత్తం వ్యయంలో వైద్య, ప్రజారోగ్య శాఖ విభాగాల్లో అత్యధికంగా 78.7 శాతం ఖర్చు చేయగా, కుటుంబ సంక్షేమానికి 12.6 శాతం వ్యయం చేశారు. బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులో ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఈ నివేదికను బట్టి స్పష్టమవుతుంది. ప్రసవాలకయ్యే ఖర్చు ప్రైవేటు ఆసుపత్రుల్లో చాలా ఎక్కువగా ఉందని కూడా ఈ నివేదిక వెల్లడించింది. ఒక బిడ్డ ప్రసవానికి సరాసరిన గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.1,587 ఖర్చవుతుండగా, ప్రైవేటు ఆసుపత్రిలో రూ.14,778 ఖర్చవుతుంది. ఇదే పట్టణ ప్రాంతాల్లో వరుసగా రూ.2,117, రూ.20,328గా పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో 67.8 శాతం మంది వైద్యానికి తమ కుటుంబ ఆదాయం, ఆదా చేసుకొన్న మొత్తం నుంచే ఎక్కువగా ఖర్చు చేస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో 74.9 శాతం మంది ఇలా వెచ్చిస్తున్నారు. గ్రామాల్లో 24.9 శాతం, పట్టణాల్లో 18.2 శాతం ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు చేస్తున్నారు.

43 కోట్ల మందికి ఆరోగ్యబీమా

- 2016-17 లెక్కల ప్రకారం దేశంలో వ్యక్తిగతంగా ఆరోగ్య బీమా సౌకర్యం ఉన్నవారు 43 కోట్ల మంది.
- దేశ జనాభాలో ఇది 34 శాతం.
- ప్రభుత్వ బీమా కంపెనీల పరిధిలో ఉన్నవారు 79 శాతం మంది.
- కుటుంబాల మొత్తానికి సంబంధించిన, వ్యక్తిగత పాలసీల కోసం ప్రైవేటు బీమా కంపెనీలనే ఎక్కువ మంది ఆశ్రయించారు.
- కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్‌ఎస్) కింద 2013-14లో చేసిన ఖర్చు రూ.1,839 కోట్లు.
- 2016-17లో రూ.2,238 కోట్లు .
- ప్రయోజనం పొందిన వారి సంఖ్య మాత్రం 37 లక్షల నుంచి 31 లక్షలకు తగ్గిపోయింది.
- సీజీహెచ్‌ఎస్ కింద సరాసరి ఖర్చు 2013-14లో రూ.4,970 కాగా, 2016-17లో రూ.7,219.
- ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీం కింద 2.93 కోట్ల మంది ఉండగా, ప్రయోజనం కలిగేది 12.4 కోట్ల మందికి.
- ఈ పథకం కింద చేసిన ఖర్చు 2013లో రూ.4,058.13 కోట్లు కాగా, 2017 నాటికి రూ.6,256.57 కోట్లు.
- ప్రయోజనం పొందే వారి సంఖ్య 7.21 కోట్ల నుంచి 12.4 కోట్లకు పెరిగింది. తలసరి ఖర్చు మాత్రం రూ.563 నుంచి రూ.505కు తగ్గింది. 2016-2017 లోనే ఈ పథకం పరిధిలోకి నాలుగుకోట్ల మంది కొత్తగా వచ్చి చేరారు.

ఇతర దేశాలకంటే చాలా తక్కువ

స్థూల జాతీయ ఉత్పత్తిలో ఆరోగ్య రంగానికి భారత ప్రభుత్వం చేస్తున్న వ్యయం ఇతర దేశాల కంటే చాలా తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. 2015లో భారత దేశం చేసిన వ్యయం జీడీపీలో ఒక శాతం కాగా,

ఎక్కువ ఆదాయం కలిగిన దేశాలు 5.2శాతం , మధ్యస్తంగా ఆదాయం కలిగిన దేశాలు 3.8 శాతం, దిగువ మధ్యతరహా ఆదాయం కలిగిన దేశాలు 2.5 శాతం, తక్కువ ఆదాయం కలిగిన దేశాలు 1.4శాతం వ్యయం చేశాయి. చిన్నదేశాలు, సరిహద్దు దేశాలు కూడా మన కంటే ఆరోగ్యరంగానికి అధిక ప్రాధాన్యమిచ్చాయి. మాల్దీవులు ఏకంగా 9.4శాతం ఖర్చు చేయగా, భూటాన్ 2.5, శ్రీలంక 1.6, నేపాల్ 1.1శాతం చేశాయి. ఆరోగ్య రంగానికి ప్రభుత్వాలు చేస్తున్న తలసరి ఖర్చులో కూడా భారత దేశం వెనకబడి ఉంది. మాల్దీవులు 770 డాలర్లు, థాయిలాండ్ 166 డాలర్లు, భూటాన్ 66, శ్రీలంక 63 డాలర్లు వెచ్చిస్తే మనం మాత్రం 16 డాలర్లు మాత్రమే ఖర్చు చేయడం గమనార్హం.

ఆరోగ్యరంగానికి ప్రభుత్వం చేస్తున్న వ్యయం

సంవత్సరం	ఖర్చు (రూ.కోట్లలో)	జనాభా (కోట్లలో)	జీడీపీ	తలసరి ఖర్చు (రూపాయల్లో)	జీడీపీలో ప్రభుత్వ ఖర్చు శాతం
2009-10	72,536	117	64,77,827	621	1.12
2010-11	83,101	118	77,84,115	701	1.07
2011-12	96,221	120	87,36,039	802	1.10
2012-13	1,08,236	122	99,51,344	890	1.09
2013-14	1,12,270	123	1,12,72,764	913	1.00
2014-15	1,21,600.23	125	1,24,33,749	973	0.98
2015-16	1,40,054.55	126	1,37,64,037	1,112	1.02
2016-17 (సవరణ బడ్జెట్)	1,78,875.63	128	15,253,714	1,397	1.17
2017-18	2,13,719.58	129	1,67,51,688	1,657	1.28

ఆరోగ్య రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు (శాతాల్లో)



ఆర్యోగ రంగంలో ప్రభుత్వ వ్యయ నిష్పత్తి (2015-16) (శాతాల్లో)



కుటుంబ సంక్షేమం కోసం రాష్ట్రాలు చేస్తున్న వ్యయం (2015-16లో)



విద్యార్థుల మనసు చూరగొన్న తమిళ ఉపాధ్యాయుడికి ప్రశంసలు

ట్విట్టర్‌లో ఏఆర్ రెహమాన్, హృతిక్‌రోషన్ అభినందనలు

ఉపాధ్యాయుడు భగవాన్

పళ్ళిపట్టు, న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరువళ్ళూరు జిల్లా పళ్ళిపట్టుకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సినీ ప్రముఖులు ఏఆర్ రెహమాన్, హృతిక్ రోషన్ తదితరులు ప్రశంసలతో ముంచెత్తారు. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు కన్నెత్తి చూడని నేటి రోజుల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడు భగవాన్ బదిలీని నిలిపేయాలని విద్యార్థులు ఆందోళన బాట పట్టిన అంశం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాధికారులు తిరుత్తణి సమీప అరుంగుళం పాఠశాలకు బదిలీ చేశారు. దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. బదిలీ ఉత్తర్వులు తీసుకోడానికి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడిని చుట్టుముట్టి బోరున విలపించారు. ఈ చిత్రాలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో సినీ ప్రముఖులు స్పందించారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ తన ట్విట్టర్ పేజీలో గురుశిష్యుల బంధాన్ని అభినందిస్తూ పూల గుచ్ఛం ఉంచారు. ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ఇవ్వాలని అగ్ర కథానాయకుడు హృతిక్‌రోషన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఎస్సీ గురుకుల విద్యార్థులకు యాజమాన్య కోటాలో వైద్య విద్య

- ప్రవేశం కోసం రూ.12 లక్షలు చొప్పున చెల్లించేందుకు సిద్ధమైన ప్రభుత్వం

ఈనాడు డిజిటల్, అమరావతి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో చదివి నీట్(జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష) ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన పేదలకు ప్రభుత్వం అండగా నిలవాలని భావిస్తోంది. వైద్య విద్యలో వారి ప్రవేశాలకయ్యే వ్యయాన్ని భరించాలన్న సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రతిపాదనకు రాష్ట్రప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ప్రతిపాదనలు ఇప్పటికే ముఖ్యమంత్రి వద్దకు చేరాయి. ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడవచ్చని తెలుస్తోంది. ఈ గురుకుల సంస్థ 15 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్, మరో 9 మందికి దంత విద్య(బీడీఎస్)లో యాజమాన్య కోటా(బీ కేటగిరీ) కింద ప్రవేశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఒక్కో విద్యార్థికి రూ.12 లక్షల చొప్పున చెల్లించి ప్రవేశాలు కల్పిస్తుంది. నాలుగున్నరేళ్ల పాటు కోర్సు ఫీజు, విద్యార్థుల వసతికయ్యే వ్యయాన్ని భరించనుంది. ఇటీవల వెల్లడైన నీట్ ఫలితాల్లో 100 మందికి పైగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు వైద్య విద్యకు అర్హత సాధించారు. వీరిలో ఆరుగురికి ఎంబీబీఎస్, మరో తొమ్మిది మందికి దంత విద్యలో ప్రవేశాలు దక్కవచ్చని అంచనా. వీరితో పాటు మరో 15 మందికి మెరుగైన మార్కులే వచ్చినా కన్వీనర్ కోటాలో ప్రవేశాలు దక్కే అవకాశం లేదు. 'బీ' కేటగిరీలో ప్రవేశాలు లభించే అవకాశం ఉన్నా లక్షల్లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది కాబట్టి ప్రభుత్వమే అండగా ఉండాలని భావిస్తోంది.

ఆదాయ లక్ష్యంగా ప్రాజెక్టుల ఎంపిక

సూర్యదేవర మహేంద్రదేవ్ వెల్లడి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఆదాయవ్యయాల నిష్పత్తే లక్ష్యంగా రాష్ట్ర అభివృద్ధి ప్రాధాన్య ప్రాజెక్టుల ఎంపిక జరుగుతోందని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఉపకులపతి సూర్యదేవర మహేంద్రదేవ్ అన్నారు. ప్రాజెక్టుల విషయమై నోబెల్ బహుమతి గ్రహీత పిన్‌కిడ్‌లాండ్, మరికొందరితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించాక ఆయన తన స్వగ్రామం గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడికి వచ్చారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. అగ్రపారిశ్రామికవేత్త రతన్‌టాటాతో ముఖ్యమంత్రి సమావేశమయ్యాక ఆయన రాష్ట్రాభివృద్ధి కోసం కొంత వెచ్చించేందుకు సుముఖత చూపారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏయే ప్రాజెక్టులైతే అభివృద్ధికి దోహదం చేస్తాయనే అంశాలపై ఏడాదిగా విద్యా నిపుణులు, స్వచ్ఛంద సంస్థలతో చర్చిస్తున్నామని తెలిపారు. వారి సూచనల ఆధారంగా కొన్ని ప్రాజెక్టులను ఎంపిక చేశామన్నారు. యువతలో సాంకేతిక నైపుణ్యం పెంపునకు అగ్ర ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ప్రాధాన్య ప్రాజెక్టులపై నివేదిక రూపొందించి ముఖ్యమంత్రికి సమర్పించనున్నట్లు చెప్పారు.

సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలకు ముఖ్యమంత్రి అభినందనలు

ఈనాడు, అమరావతి: ఈసారి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు సాధించిన ఇద్దరు తెలుగువారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందనలు తెలిపారు. రచయితలు నారంశెట్టి ఉమామహేశ్వరరావు (బాలసాహితీ పురస్కారం), బాల సుధాకరమౌళి (యువసాహిత్య విభాగం)ల స్ఫూర్తితో తెలుగు సాహిత్యంలో మరిన్ని కుసుమాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

కుటుంబ కలహాలకు బాలుడి బలి?

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలు ఓ విద్యార్థి నిండు ప్రాణాలు బలిగొన్నాయి. నిత్యం గొడవపడుతున్న తల్లిదండ్రులను చూసి మనస్తాపానికి గురైన ఓ బాలుడు బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పిడుగురాళ్ల లెనిన్‌నగర్‌లో నివసిస్తున్న మేళం చినకాంతారావు, కాంతమ్మల పెద్ద కుమారుడు అశోక్‌కుమార్(12) లెనిన్‌నగర్ జడ్పీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు, బంధువులు గాలించారు. శనివారం ఉదయం ఉన్నత పాఠశాల ప్రాంతంలో క్రికెట్ ఆడుకుంటున్న పిల్లలు పాఠశాల కిటికీ నుంచి చూడగా అశోక్‌కుమార్ చీరకు వేలాడుతూ కన్పించాడు. స్థానికులు వచ్చి తాళాలు పగులగొట్టి చూడగా అప్పటికే మరణించాడు. తండ్రి కాంతారావు మద్యం తాగి తరచూ తల్లితో గొడవపడేవాడని, దీంతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

విద్యుత్‌తీగే యమపాశం

తీగలు తాకి మృతిచెందిన సుబ్బయ్య

వేలేరుపాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగ ఆ కూలీ పాలిట యమపాశమైంది. పశ్చిమగోదావరి జిల్లా వేలేరుపాడు మండలం బండ్లబోరుకు చెందిన బోను కనకారావు ఇంటి శ్లాబు నుంచి వర్షపునీరు కారుతోంది. శ్లాబుకు మరమ్మతు చేయించేందుకు రాళ్లపూడికి చెందిన మద్దాల సుబ్బయ్య(51), బండ్లబోరుకు చెందిన బోను వీరబాబును శనివారం పనికి పెట్టుకున్నారు. వారిద్దరూ ఉదయం ఇంటి ఆవరణలోని ఇసుకను డాబాపైకి తరలిస్తున్నారు. ఈ క్రమంలో డాబాకు ఆనుకుని ఉన్న 33/11 కేవీ విద్యుత్తు తీగకు సుబ్బయ్య మెడ తగలడంతో మంటల్లో శరీరం సగం వరకు కాలి మృతి చెందాడు. సుబ్బయ్య కుటుంబానికి పరిహారం చెల్లించాలంటూ మృతదేహాన్ని డాబాపై నుంచి కిందకు దించకుండా మధ్యాహ్నం వరకు బంధువులు ఆందోళన చేశారు. ఆ తరువాత సయోధ్య కుదిరి విరమించారు.

బాలికను గర్భవతిని చేసిన కామాంధుడు

విశాఖపట్నం జిల్లాలో వెలుగుచూసిన ఘటన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పదమూడేళ్ల బాలికను మాయమాటలతో మభ్యపెట్టి గర్భవతిని చేసిన ఓ కామాంధుడి ఉదంతమిది. విశాఖపట్నంలోని పెదగంట్యాడ మండలం గంగవరం మత్స్యకార గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గంగవరం గ్రామానికి చెందిన బాలిక చదువు మానేసి ఇంట్లోనే ఉంటోంది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వై.దేవుడు (53) కుటుంబం అదే వీధిలో నివసిస్తోంది. దేవుడు తరచూ ఆ బాలికను తన ఇంటికి పిలిచి చాక్‌లెట్లు, బిస్కెట్లు కొని ఇచ్చేవాడు. ఈ క్రమంలో శారీరకంగా లోబర్చుకున్నాడు. ఇటీవల బాలిక శరీరంలోని మార్పులను గమనించిన కుటుంబ సభ్యులు గాజువాకలోని వైద్యులకు చూపించారు. వైద్యపరీక్షల అనంతరం ఆరో నెల గర్భవతి అని నిర్ధారించారు. బాధిత కుంటుంబీకుల ఫిర్యాదు మేరకు హార్బర్ జోన్ ఏసీపీ రంగరాజు న్యూపోర్టు స్టేషన్‌కు చేరుకొని విచారణ జరిపారు. అనంతరం బాలికను వైద్యపరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అత్యాచారం, భయపెట్టి లోబర్చుకోవడం, పోక్సో యాక్టు కింద కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ రంగరాజు తెలిపారు.

అధికారులొస్తున్నా.. అడగలేమాయె

- గ్రామ సభలపై పెదవి విరుస్తున్న ప్రజానీకం

ఈనాడు, యంత్రాంగం: మండల కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగితే కానీ కలుసుకోలేని అధికారులు నేరుగా గ్రామానికే వస్తున్నా వారు ప్రజల విజ్ఞాపనలను స్వీకరించట్లేదు. ఇక్కడ నిర్వహిస్తున్నది గ్రామసభే అయినా ఇక్కడ ఏ వినతులను పడితే ఆ వినతుల్ని తీసుకోలేమని చెప్పడంతో గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 22ఏ నిషిద్ధ భూములు, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి మాత్రమే ఈ గ్రామసభలను పరిమితం చేయడం అసంతృప్తి వ్యక్తమవడానికి కారణం. 22ఏ నిషిద్ధ భూములు, చుక్కల భూముల సమస్యలు కొన్ని జిల్లాల్లో అదీ కూడా పరిమిత మండలాల్లో మాత్రమే ఉన్నాయి. దీనివల్ల ఈ ప్రాంతాల్లో మినహా మిగిలినచోట్ల నిర్వహిస్తున్న గ్రామసభలు ప్రజోపయోగకరంగా లేవు. మండలంలో ఎంపికచేసిన గ్రామాల్లో నిర్ణీత తేదీల్లో తహసీల్దారు లేదా డిప్యూటీ తహసీల్దార్ నేతృత్వంలో రెండు కమిటీలు గ్రామ సభల్లో పాల్గొంటున్నాయి. నిషిద్ధ భూములు, చుక్కల భూముల గురించిన అంశాలకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నందున తామేమీ చేయలేమని గ్రామ సభల్లో పాల్గొంటోన్న రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. 'గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిసి నా సర్వే నెంబరులో దొర్లిన తప్పు గురించి వివరించి సరిచేయించుకోవాలని రాగా... ఇప్పుడు అవేమీ చూడమని అధికారులు చెబుతున్నారు. వీరినందరిని కలవాలంటే సాధ్యమయ్యే పనికాదు. ఇతర సమస్యల పరిష్కారానికి కూడా ఈ సభలు జరిగేలా చూడాలి' అన్నారు కృష్ణా జిల్లాకు చెందిన నారాయణ. నిర్దేశించిన రెండు అంశాలపై అర్జీలు అంతంతమా

త్రమే 22ఏ నిషిద్ధ భూములు, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన గ్రామ సభలపై విస్తృతంగా ప్రచారం చేసి అర్జీలు తీసుకోవాల్సి ఉండగా స్థానిక అధికారులు తేలికగా తీసుకుంటున్నారు. విజయవాడ శివారులోని రామవరప్పాడు గ్రామసభ శనివారం ఉదయం 11 గంటలైనా ప్రారంభంకాలేదు. చుక్కల భూముల సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయి పరిస్థితులు, మార్గదర్శకాలు సరిపోలడం లేదు. దరఖాస్తు అందిన వెంటనే దీని ఆధారాలు చూసుకుని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. ఇందులోనూ చిక్కులు వస్తున్నాయి. ముందస్తుగా ఆర్ఎస్ఆర్(రెవెన్యూ సెటిల్‌మెంట్ రిజిష్టర్)లోని జాబితా ఆధారంగా భూములను 22-ఏలోకి ఎక్కించారు. తర్వాత చాలాచోట్ల మార్పులు వచ్చాయి. ఇప్పుడు కొత్త ఆర్ఎస్ఆర్ చాలా మండలాల్లో అందుబాటులో లేదు. దీంతో పాతదాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ కారణంగా వేలాదిగా భవనాలు, కట్టడాలు, ఇళ్లు, కీలక సముదాయాలు కూడా నిషేధిత జాబితాలో కనిపిస్తున్నాయి. వాటికి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సంబంధించిన రికార్డు వ్యవస్థ పటిష్ఠంగా లేకపోవడం సమస్యలను తీవ్రం చేస్తోందని అధికారిక వర్గాలు కూడా పేర్కొంటున్నాయి. ఈ నెల 20 నుంచి మొదలైన గ్రామ సభలు వచ్చేనెల 5వ తేదీ వరకు జరగనున్నాయి. ఇప్పటివరకు 3,180 గ్రామాల్లో సభలు జరిగాయి. 22ఏ కింద 1,368, చుక్కల భూముల కింద 1,351 దరఖాస్తులు వచ్చాయి. స్పందన తక్కువగా ఉండడంపై భూపరిపాలన శాఖ ఇంఛార్జి కార్యదర్శి ఎం.జగన్నాధం స్పందిస్తూ 'తక్కువగా దరఖాస్తులు వస్తున్నాయంటే ఆయా ప్రాంతాల్లో సమస్యలు తక్కువగా ఉన్నట్లు భావించాలి' అని అన్నారు.

చుక్కల భూములు: బ్రిటిష్ వారి హయాంలో సాగులోలేని భూముల వివరాల నమోదు సమయంలో సంబంధితులు అందుబాటులో లేనందున చుక్కలు పెట్టేశారు. వీటిపై క్రయ, విక్రయాలను నిషేధిస్తూ రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ కింద చేర్చారు. 12 ఏళ్లపాటు సాగులో ఉన్న రైతులకు యాజమాన్య హక్కులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నిషిద్ధ భూములు: ప్రభుత్వ స్థలాలను వేలం ద్వారా గతంలో విక్రయించారు. వీటిని కొన్నిచోట్ల ప్రభుత్వ ఆస్తులుగా చూపిస్తున్నందున నిషిద్ధ జాబితాలోకి వెళ్లాయి. లేఔట్లలోని కొన్ని సర్వే నెంబర్లనీ ఈ జాబితాలోకి చేర్చారు. అలాగే ఒకే సర్వే నెంబరులో పది ఎకరాల్లో ఎకరా మాత్రమే ప్రభుత్వానికి చెందినది ఉంటే... మొత్తాన్ని చేర్చారు.

- ప్రకాశం జిల్లాలో తొలిరోజు 98 గ్రామసభలు జరిగితే 6106 అర్జీలు నమోదయ్యాయి. వాటిలో రెండు అర్జీలను మాత్రమే పరిష్కరించారు. 1102 అర్జీలను సరైన ఆధారాలు లేవని తిరస్కరించారు. 22-ఏ కింద నమోదైన అర్జీలు 614 వస్తే వాటిలో 481 అర్జీలను తిరస్కరించారు.
- తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నం గ్రామంలో శనివారం రెండు దరఖాస్తులు వచ్చాయి. మలికిపురం మండల కేంద్రమైనా ఒక దరఖాస్తురాలేదు.
- కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్టణం మండలం కొట్టికలపూడి గ్రామంలో, కంచికచర్ల సమీపంలోని మున్నలూరు గ్రామ సభలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.

వర్ణశోభితం



నల్లని ముక్కు, తెల్లని మీసాలు, గడ్డం, ఎర్రని పెదాలు, నుదురు, ఆకుపచ్చని తోక.. ఇలాంటి వర్ణాలతో ఉన్న ఓ పక్షి శుక్రవారం హైదరాబాద్ గండిపేట ప్రాంతంలో కనిపించింది. చూడ్డానికి మనిషి ముఖా ఆకృతిని పోలిన దీని పేరు కొపర్‌స్మిత్ బార్‌బిట్. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో మాత్రమే కనిపిస్తుంది. వర్షాకాలంలో చెట్లపై చిన్న పండ్లను తింటూ.. వాతావరణం ఆహ్లాదంగా ఉన్నపుడే బయటికి వచ్చే అరుదైన పక్షి ఇది. – ఈనాడు, హైదరాబాద్

హిందూ శ్మశానవాటికలో నిద్రిస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు

శ్మశానంలో పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల నిద్ర

పాలకొల్లు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రెండ్రోజులుగా శ్మశానంలోనే నిద్రిస్తున్నారు. పాలకొల్లు పట్టణంలో రూ.కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగాలని. . రాత్రి, పగలు పనుల వద్దే గడుపుతున్నారు. రూ.3.50 కోట్లతో స్థానికంగా చేపట్టిన హిందూ శ్మశానవాటిక పనులు నిలిచిపోవడంతో శుక్రవారం రాత్రి అక్కడే గుత్తేదారులు, అధికారులతో సమీక్షించారు. శనివారం ఉదయం నుంచి పనుల్లో కదలిక వచ్చేలా ఆదేశాలిచ్చారు. అనంతరం అక్కడే అల్పాహారం చేసి విశ్రమించారు. శనివారం ఉదయం సంబంధిత పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఏలూరులో జరిగిన తెదేపా సమన్వయ కమిటీ సమావేశంలోనూ పాల్గొని వచ్చారు. రాత్రి తిరిగి శ్మశానంలోనే బస చేశారు.

పంచాయతీరాజ్‌కు స్కోచ్ అవార్డుల పంట

ఈనాడు, అమరావతి: వివిధ కార్యక్రమాల నిర్వహణలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సమాచార, సాంకేతికశాఖలు, వ్యక్తిగత విభాగంలో మంత్రి లోకేశ్ సాధించిన స్కోచ్ అవార్డులను శనివారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు అందజేశారు. మంత్రి లోకేశ్ తరపున పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సంచాలకుడు రంజిత్ బాషా, తాగునీటి సరఫరా విభాగ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ప్రభాకర్, ఏపీ ఆవిష్కరణ సంస్థ సీఈవో వల్లికుమార్ అవార్డులు అందుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తాగునీటి సరఫరాలో ట్రాకింగ్ విధానం అమలు, గ్రామాల్లో పన్ను విధింపు, వసూళ్ల కోసం ఆధునిక సాంకేతికత వినియోగం తదితర అంశాల్లో ఎనిమిది అవార్డులు సాధించారు. ఐటీ రంగంలో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ ఆవిష్కరణలు, ఐటీ రంగ అభివృద్ధిలో ఫలితాలపై మూడు, వ్యక్తిగత విభాగంలో మంత్రి లోకేశ్ మరో అవార్డుకు ఎంపికయ్యారు.

ఏపీ నీటిపారుదల శాఖకు: ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ చేపట్టిన ప్రాజెక్టులు, పథకాలను 19 ప్రతిష్ఠాత్మక స్కోచ్ పురస్కా

స్కోచ్ అవార్డు అందుకుంటున్న గ్రామీణాభివృద్ధిశాఖ సంచాలకుడు రంజిత్ బాషా తదితరులు

రాలు వరించాయి. నీటి పారుదల రంగంలో ఈ ఏడాది మేటి రాష్ట్రం విభాగంలో జాతీయ స్థాయిలో ప్లాటినం పురస్కారం దక్కింది. భూగర్భ నీటిమట్టంపై వాస్తవిక పర్యవేక్షణ, పట్టిసీమ ఎత్తిపోతల, నీరు-చెట్టు పథకాలకు ప్లాటినం విభాగంలోపురస్కారాలు లభించాయి. ఏపీ నీటి వనరుల సమాచార వ్యవస్థ, పురుషోత్తపట్నం, గండికోట, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాలకు బంగారు విభాగంలో అవార్డులు దక్కాయి. వెబ్ ఆధారిత ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ వ్యవస్థకు కాంస్య విభాగంలో అవార్డు లభించింది.

పశుసంవర్ధకశాఖ, సీఆర్‌డీఏలకు కూడా..: ప్రభుత్వ రాయితీ పథకాలను గ్రామ స్థాయి వరకు రైతులకు పారదర్శకంగా అందించడంలో అవలంబిస్తున్న సాంకేతిక విధానానికి పశుసంవర్ధకశాఖకు స్కోచ్ అవార్డు-2018 లభించింది. శాఖ డైరెక్టర్ సోమశేఖర్ దీన్ని అందుకున్నారు. భూదస్త్రాల సంరక్షణలో క్రియాశీలకంగా ఉన్న 'బ్లాక్ చైన్ టెక్నాలజీ', అమరావతి సమాచారాన్ని తెలిపే 'మన అమరావతి' యాప్‌కు లభించిన స్కోచ్ పురస్కారాలను సీఆర్‌డీఏ అధికారులు అందుకున్నారు.

స్కోచ్ పురస్కారంతో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ సోమశేఖర్

STATE & RAILWAY
సబ్ - ఇన్‌స్పెక్టర్స్ (SI's)
Exclusive SI's Batch (TM)
అడ్మిషన్లు జరుగుచున్నవి ★ హాస్టలు వసతి కలదు
ప్రతిరోజు On-line Exams మరియు Explanation
విజయసాధన స్టడీ సర్కిల్ 2/7 బ్రాడీపేట, గుంటూరు.
VICTORY INVITES YOU
☎: 2240433, 92931 77737

ACE Engineering Academy
22+
43 ALL INDIA 1st RANKS IN GATE
7 ALL INDIA 1st RANKS IN ESE
VIJAYAWADA
ADMISSIONS ARE OPEN
GATE+PSUs - 2019
REGULAR BATCHES START FROM
25th JUNE 2018
Rama Chandra Nagar, Opp. Stella College, Near Benz Circle, Vijayawada – 520 008.
0866-2490001, 96760 76001
www.aceenggacademy.com
To WIN the RACE.. Join ACE...

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 25-6-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 316
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 14+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

మృత్యుదారులు

తెలుగు రాష్ట్రాల్లో ఘోర రోడ్డు ప్రమాదాలు

24 మంది దుర్మరణం

మృతుల్లో 22 మంది మహిళలే

- కర్నూలు జిల్లాలో ఆటోను బస్సు ఢీకొన్న ఘటనలో తొమ్మిది మంది దుర్మరణం
- తెలంగాణ యాదాద్రి జిల్లాలో మూసీ కాల్వలో ట్రాక్టర్ పడి పదిహేను మంది మృతి
- డ్రైవర్ల నిర్లక్ష్యమే రెండు ప్రమాదాలకూ కారణం

కర్నూలు జిల్లాలో ప్రమాద స్థలం వద్ద పడివున్న మృతదేహాలు, ధ్వంసమైన ఆటో

తెలంగాణ వేములకొండ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మహిళా కూలీలు, రోదిస్తున్న బంధువులు

తెల్లవారుతూనే తెలుగు రాష్ట్రాల్లో విషాదం అలుముకుంది. కాయకష్టాన్నే నమ్ముకున్న కుటుంబాలు కకావికలమయ్యాయి. వారి ఇంటి దీపాలు ఆరిపోయాయి. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో కాలువలోకి ట్రాక్టరు దూసుకెళ్లి 15మంది విగతజీవులయ్యారు. వీరిలో ఒకరు నాలుగేళ్ల పసిబాలుడు కాగా మిగిలిన వారందరూ మహిళలే. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో జాతీయ రహదారిపై వ్యతిరేక మార్గంలో వెళుతున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆటో రహదారి పక్కన గుంతలో పడింది. ప్రమాదంలో ఎనిమిది మంది మహిళలు, ఓ వృద్ధుడు కన్నుమూశారు. రెండు చోట్లా కలిపి 24 మంది మృత్యువాత పడ్డారు.

కొంగు బిగించి పత్తినాట్లకు ట్రాక్టరులో బయలుదేరిన మహిళలు పొలంగట్టుకు చేరకముందే వలిగొండ మండలం వేములకొండ గ్రామం వద్ద మూసీ కాలువలో చిక్కుకుపోయారు. చేయి అందేలోగానే వారి ఊపిరి ఆగిపోయింది. కంటిచికిత్సల కోసం కర్నూలు జిల్లాలోని కోడుమూరు నుంచి మహానందికి ఆటోలో బయలుదేరిన వారు గమ్యాన్ని చూడకముందే కనిపించని లోకాలకు వెళ్లిపోయారు. – పూర్తి వివరాలు 6లో

నీలి తెరల మధ్య చిక్కుకున్న మనిషి!

తెర' జీవితాలంటే సాధారణంగా సినిమా నటులవే అనుకుంటుంటాం గానీ... వాస్తవంలో ఇప్పుడు మనందరివీ 'తెర' జీవితాలే! లేస్తూనే మొబైల్ ముఖం చూస్తాం! ఇక ఇంట్లో, ఆఫీసుల్లో కంప్యూటర్ల ముందే కాలం కరిగించేస్తున్నాం. మధ్యలో కాస్త సమయం చిక్కితే టీవీకి అతుక్కుపోతాం. ఇక ప్రయాణాల్లోనూ మొబైళ్లు, ట్యాబ్లెట్లే చేతుల్లో ఉంటాయి. ఇలా లేచిన దగ్గర్నుంచీ పడుకునే వరకూ మన జీవితంలో అత్యధిక భాగం ఏదో ఒక 'తెర' ముందరే గడిచిపోతోంది! ఎటు చూసినా, ఏం చేసినా 'డిజిటల్ తెర'లే మన ముందుంటున్నాయి. మన జీవితాల్లో ఈ 'స్క్రీన్ టైమ్' అన్నది సగటున రోజులో 6 గంటలకు పైగా ఉంటోంది. కాదనలేంగానీ.. ఈ స్క్రీన్‌లన్నింటి నుంచీ వెలువడే నీలి కాంతి.. బ్లూ లైట్.. మన కంటికీ, ఒంటికీ కూడా సమస్యలు తెచ్చిపెడుతోందని ఆధునిక పరిశోధనా రంగం గుర్తించింది. దీన్నుంచి తప్పించుకోవటం తక్షణావసరమనీ హెచ్చరిస్తోంది. మరి మనల్ని పూర్తిగా ఆవరించిన ఈ 'నీలి విప్లవాన్ని' మనం ఎదుర్కొనేదెలా?

పూర్తి కథనం.. 5 లో

పేదల ఇళ్లకు స్థలం పోటు!

- రెండు లక్షల పట్టణ పేదల గృహాలకు జాగా కొరత
- ఇప్పటికీ కొలిక్కిరాని లబ్ధిదారుల ఎంపిక
- రుణాలు విడుదల చేయని బ్యాంకులు

ఈనాడు, అమరావతి: పట్టణ పేదల గృహ నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపికలో జాప్యం, భూముల కొరత ప్రతిబంధకాలు అవుతున్నాయి. కేంద్రం కేటాయించిన ఇళ్లను వీలైనంతా వినియోగించుకోవాలనుకున్నా అనుకోని సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై), ఎన్టీఆర్ నగర్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 73 పట్టణాల్లో 4.81 లక్షల పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి ఏడాది క్రితం శ్రీకారం చుట్టాయి. వీటిలో 2.81 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో 47 వేలకుపైగా ఇటీవలే శ్లాబ్‌లు పూర్తయ్యాయి. మరో 1.81 లక్షల ఇళ్లకు పునాదులు పడ్డాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

★ కేంద్రం దశల వారీగా కేటాయించిన ఇళ్లను పట్టణ పేదలకు మార్చిలోగా పూర్తిచేసి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినా 2లక్షల ఇళ్లకు స్థలాల కొరత ఏర్పడింది. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమహేంద్రవరం,కాకినాడ, ఏలూరు, ఒంగోలు, కడప వంటి (మిగతా 2లో)



అనంతపురం జిల్లా యాడికిలో పగలే వెలుగుతున్న వీధి దీపం

పగలే వెన్నెల.. నిధులే దుబారా!

- 24 గంటలూ వెలుగుతున్న వీధి దీపాలు
- ఎంసీబీ బాక్సుల లేమి ఫలితం
- మరికొన్ని ప్రాంతాల్లో మూడో తీగలేక...

ఈనాడు – అమరావతి

చంద్ర క్రాంతి పథకంలో రాష్ట్రంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వీధి దీపాలు కొన్నిచోట్ల పగలూ, రాత్రి వెలుగుతున్నాయి. విద్యుత్తు పొదుపు చర్యల్లో భాగంగా భారీ ఎత్తున ఈ దీపాలు ఏర్పాటు చేసినప్పటికీ అవసరమైన కనీస చర్యలు కొన్నిచోట్ల తీసుకోకపోవడంతో ఆ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. దీంతో విద్యుత్తు వృథా అవుతోంది. 12,918 గ్రామ పంచాయతీల్లో రెండు దశల్లో 25,23,234 ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేసి తద్వారా ఏటా 280 మిలియన్ యూనిట్ల విద్యుత్తును (రూ.168 కోట్లు విలువ) ఆదా చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. తొలి దశలో తూర్పుగోదావరి, అనంతపురం, కడప, చిత్తూరు, విజయనగరం, పశ్చిమగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో 13,80,069 ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకూ 8,69,418 అమర్చారు. వీటిల్లో కడప, చిత్తూరు, విశాఖపట్నం, అనంతపురం జిల్లాల పరిధిలోని కొన్ని పంచాయతీల్లోని కొన్ని వీధుల్లో దీపాలు 24 గంటలూ వెలుగుతున్నాయి.

కారణం–1: సీసీఎంఎస్‌లో (సెంట్రలైజ్డ్ కంట్రోల్ మానిటరింగ్ సిస్టమ్) భాగంగా ప్రతి 30, 40 వీధి దీపాలకు ఒక ఎంసీబీ జంక్షన్ బాక్సు ఏర్పాటు చేయాలి. రిమోట్ విధానంతో చీకటి పడగానే దీపాలు వేయడం, పగలు (మిగతా 2లో)

శాంతి, అహింసలదే గెలుపు

- సమస్యలకు పరిష్కారం హింస కాదు
- ఏడాదిలోనే ప్రజలు జీఎస్టీకి అలవాటుపడ్డారు
- భారత్, అఫ్గాన్ క్రికెట్ జట్లకు అభినందన
- 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ

దిల్లీ: ఎప్పటికైనా నెగ్గేది శాంతి, అహింసలేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బ్రిటిష్ హయాంలో జలియన్‌వాలాబాగ్‌లో చోటు చేసుకున్నటువంటి ఊచకోత ఘటనలు చూస్తే... క్రూరత్వం, హింసలతో ఏ సమస్యనూ పరిష్కరించలేమనేది స్పష్టమవుతుందన్నారు. మానవాళి మొత్తాన్ని కుదిపేసిన ఈ ఊచకోత జరిగి వచ్చే ఏడాదికి వందేళ్లు (మిగతా 2లో)

సౌదీలో వనితలు రయ్.. రయ్

- వాహనాలు నడిపిన మహిళలు
- దశాబ్దాల నిషేధం రద్దుతో పెల్లుబికిన ఆనందం

రియాద్: ఎన్నో ఏళ్ల తర్వాత సౌదీ మహిళలు ఆదివారం వాహనాలు నడుపుతూ చెప్పలేనంత ఆనందోత్సాహాల్లో మునిగి పోయారు. ఒక్కసారిగా ఏదో తెలియని స్వేచ్ఛ వచ్చినట్లు భావోద్వేగంతో పలువురు కదిలిపోయారు. మహిళలు వాహనాలు నడపడంపై ఉన్న నిషేధాన్ని ఇటీవల సౌదీ అరేబియా పాలకులు రద్దు చేసిన విషయం గమనార్హం. రాజ్యాభిషిక్తుడు కానున్న ప్రిన్స్ మహమ్మద్ ఎంతో ప్రగతికారక దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా వాహనాలను తీసుకుని రోడ్లపైకి వచ్చిన మహిళలు ఒక్కొక్కరూ ఒక్కోరకంగా తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. అంతా నమ్మశక్యంకానంత అద్భుతంగా ఉందన్న భావాలను మరెందరో వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాలన్నీ దాదాపుగా ఈ తరహా వ్యాఖ్యలతో వెల్లువెత్తిపోయాయి. 'పక్షిలా రెక్కలు చాచుకుని స్వేచ్ఛగా విహరిస్తున్నట్లుందని' రచయిత్రి సమర్ అల్మొగ్రెన్ పేర్కొన్నారు. సౌదీ మహిళల జీవితంలో ఇదో చారిత్రక ఘట్టం అని టీవీ వ్యాఖ్యాత సబికా అల్-దొసారి చెప్పారు.

ఆదివారం దర్వాన్‌లో కారు నడుపుతూ విజయ సంకేతం చూపుతున్న సౌదీ మహిళ

నిఖిల్ హండా

సైనిక మేజర్ ఉన్మాదం

- సహచరుడి భార్యను గొంతుకోసి హత్య
- తనను పెళ్లాడట్లేదన్న అక్కసుతో దారుణం
- నిందితుడిని అరెస్టు చేసిన దిల్లీ పోలీసులు

2లో

శైలజ ద్వివేది

ఇదీ సంగతి!



అలాంటి వార్తలు చూసి భయపడకు. నేను మూడేళ్లుగా చూస్తున్నా, ఏంగాదు!

తేలియాడే సౌర విద్యుత్తు ప్రాజెక్టు

- విశాఖలో 2 రిజర్వాయర్లపై 5 మెగావాట్ల పలకలు
- జీవీఎంసీకి ఏటా రూ.5 కోట్ల ఆదాయం

ఈనాడు – విశాఖపట్నం

రిజర్వాయరులో నిల్వ ఉన్న నీటిపై తేలియాడే సౌర పలకల సాంకేతికతను విశాఖపట్నం అందిపుచ్చుకుంటోంది. విద్యుత్తు ఖర్చుల్ని భారీగా తగ్గించుకుని ఏటా రూ.5 కోట్ల విలువచేసే విద్యుత్తును ఉత్పత్తి చేసేలా జీవీఎంసీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ముడసర్లోవ రిజర్వాయరులో రూ.13 కోట్లతో ఈ పలకల్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు కనీసం 1 మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తిని మొదలు (మిగతా 2లో)

ముడసర్లోవ రిజర్వాయరులో ఏర్పాటు చేసిన సౌర పలకలు

ముడసర్లోవ రిజర్వాయరు

సోలారు పలకల సామర్థ్యం:	2 మెగావాట్లు
ఏర్పాటుచేసే పలకల సంఖ్య:	6250
విస్తీర్ణం:	6 ఎకరాలు
ఏటా తయారయ్యే యూనిట్ల అంచనా:	34 లక్షలు
ఏటా ఆదాయం అంచనా:	రూ.2 కోట్లు

మేఘాద్రిగడ్డ రిజర్వాయరు

సోలారు పలకల సామర్థ్యం:	3 మెగావాట్లు
ఏర్పాటుచేసే పలకల సంఖ్య:	9400
విస్తీర్ణం:	11 ఎకరాలు
ఏటా తయారయ్యే యూనిట్ల అంచనా:	51 లక్షలు
ఏటా ఆదాయం అంచనా:	రూ.3 కోట్లు

అనుమతిస్తే 'బ్రహ్మణి' నిర్మిస్తా

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టినా సహకరిస్తా
- నాకు రావాల్సిన మొత్తాన్ని చెల్లించాలి
- కడప ఉక్కు పరిశ్రమపై గాలి జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యలు

11 లో

ఉక్కు దీక్ష @ 5వ రోజు

క్షీణించిన సీఎం రమేష్ ఆరోగ్యం

దక్షిణ దిల్లీలోని కొన్ని కాలనీలను పునరుద్ధరించడంలో భాగంగా 14వేల వృక్షాలను తొలగించేందుకు అటవీ శాఖ అనుమతించడంపై స్థానికులు, పర్యావరణవేత్తలు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం సరోజినినగర్‌లో దాదాపు 15 వందల మంది చెట్లకు పచ్చని రిబ్బను చుట్టి, వాటిని కౌగిలించుకున్నారు. ఈ సందర్భంగా చెట్లను రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. దిల్లీలో రోజురోజుకూ వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుతున్న పరిస్థితుల్లో దానికి పరిష్కారం కనుక్కోవడానికి బదులు చెట్లను నరికివేసేందుకు అనుమతులు ఇవ్వడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

శాంతి, అహింసలదే గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తవుతున్న సందర్భంగా అది చాటిచెబుతున్న సందేశాన్ని ప్రజలు తప్పనిసరిగా గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఆదివారం 'మన్ కీ బాత్' (మనసులో మాట) కార్యక్రమం ద్వారా ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'శాంతి, అహింస, త్యాగం, బలిదానాలే చివరకు విజయం సాధిస్తాయి. మన దేశ స్వాతంత్ర్య పోరాటం ఎంతో సుదీర్ఘమైనది. లెక్కకు మిక్కిలి త్యాగాలు దానిలో మనకు కనిపిస్తాయి. ముఖ్యంగా జలియన్‌వాలా బాగ్ ఘటన. అది జరిగిన చీకటి రోజు... 1919 ఏప్రిల్ 13ని మనమెలా మరిచిపోగలం? అధికార పరిమితులన్నింటినీ చెరిపేసి, క్రూరత్వ సరిహద్దులను దాటేసి... నిరాయుధులైన, నిర్దోషులైన అమాయక ప్రజలను పొట్టనపెట్టుకున్న ఆ భయానక ఘటనకు ఇప్పుడు వందేళ్లు పూర్తవుతున్నాయి. దానిని ఎలా జరుపుకోవాలో మనమంతా ఆలోచించాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు.

పారిశ్రామికాభివృద్ధి పునాదులు శ్యామాప్రసాద్ వేసినవే

గురునానక్ 550వ జయంతి సందర్భంగా వచ్చే ఏడాది జరిగే ఉత్సవాల్లో వినూత్నత కోసం కూడా ప్రజలు తమ ఆలోచనల్ని పంచుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ ప్రకాశ్ పర్వ్ (జయంతి)ని ప్రేరణ పర్వ్ (స్ఫూర్తిదాయక ఉత్సవం)గా కూడా సగర్వంగా జరుపుకోవచ్చని చెప్పారు. మూఢనమ్మకాలను పారద్రోలే విషయంలో 15వ శతాబ్దపు కవి కబీర్‌దాస్ చేసిన కృషిని ప్రధాని గుర్తు చేసుకున్నారు. భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త శ్యామాప్రసాద్ ముఖర్జీ మన దేశ ఐక్యత కోసం 52వ ఏట ప్రాణత్యాగం చేశారని చెప్పారు. ఆయన ఇచ్చిన సందేశాన్ని గుర్తుపెట్టుకుని, దేశాభివృద్ధికి సౌభ్రాతృత్వంతో పునరంకితం కావాలన్నారు. భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధికి బలమైన పునాదులు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. '1948లో స్వతంత్ర భారతంలో రూపొందిన తొలి పారిశ్రామిక విధానంపై ముఖర్జీ ముద్ర ఉంది. ఆయన ఆలోచనలు, దార్శనికత దానిలో ప్రతిఫలిస్తాయి. పారిశ్రామికంగా మన దేశం స్వయం సమృద్ధి సాధించి, సమర్థంగా ఎదగాలనీ, అన్ని రంగాల్లో సుసంపన్నం కావాలనేది ఆయన స్వప్నం.' అని వివరించారు.

జీఎస్టీ అమలు ఘనత రాష్ట్రాలదే

దేశంలో వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి రావడంతో 'ఇన్‌స్పెక్టర్ రాజ్' అంతమయిందని ప్రధాని చెప్పారు. ఏడాది పూర్తిచేసుకుంటున్న కొత్త వ్యవస్థపై ఖ్యాతిని ఎవరికైనా ఇవ్వాలంటే అది దేశంలోని రాష్ట్రాలకేనని అన్నారు. దేశ ప్రయోజనాల రీత్యా ఈ విషయంలో అన్ని రాష్ట్రాలు ఒక్కతాటిపైకి వచ్చాయని చెప్పారు. ఇంత భారీ పన్ను సంస్కరణ అమలుకు సాధారణంగా 5 నుంచి 7 ఏళ్లు పడుతుందనీ, ప్రజలు మాత్రం ఏడాదిలోనే అలవాటు పడ్డారనీ పేర్కొన్నారు. ఐ.పి.ఎల్.లో రాణించిన అఫ్గానిస్థాన్ బౌలర్ రషీద్‌ఖాన్‌ను, గగనతలంలో తేలుతూ యోగాభ్యాసం చేసిన భారత వాయుసేన సిబ్బందిని ప్రధాని తన ప్రసంగంలో అభినందించారు. బెంగళూరులో మొదటిసారిగా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లోపాల్గొన్న అఫ్గాన్‌జట్టు తన మదిలో ప్రత్యేకస్థానందక్కించుకుంటుందని చెప్పారు. ట్రోఫీ స్వీకరణ సమయంలో వేదికపైకి అఫ్గాన్ జట్టునూ భారత క్రికెట్‌జట్టు పిలవడం, కలిసి ఫోటోలు దిగడం క్రీడాస్ఫూర్తినిచాటి, యావత్ ప్రపంచానికీ సమున్నతంగా నిలిచిపోయిందని కొనియాడారు.

నగరాల్లో సౌఖ్యవంతమైన రవాణా సదుపాయాలు

దిల్లీ: సౌఖ్యవంతమైన రవాణా వ్యవస్థను తక్కువ ఖర్చుతో నగరాల ప్రజలకు అందించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యమని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. దిల్లీ మెట్రోలో భాగమైన ముంద్కా-బహదూర్‌గఢ్ మార్గాన్ని ఆదివారం ప్రత్యక్ష ప్రసార సదస్సు విధానంలో ఆయన ప్రారంభించారు. అనుసంధానతకు, అభివృద్ధికి నేరుగా సంబంధం ఉందన్నారు. మెట్రో రైళ్ల పెట్టెలను మన దేశంలోనే తయారుచేసి... 'భారత్‌లో తయారీ' కార్యక్రమానికి ఊపునివ్వాలని తమ ప్రభుత్వం కోరుకుంటున్నట్లు చెప్పారు. 'దిల్లీ మెట్రోను రూపొందించడంలో అనేక దేశాలు మనకు సాయం చేశాయి. ఇతర దేశాల మెట్రోలకు పెట్టెలను రూపకల్పన చేయడం ద్వారా మనం వారికి సాయం చేస్తున్నాం. మెట్రో రైలు పనులు సహకార సమాఖ్య తత్వానికి ప్రతీకలు. దీనిలో కేంద్రం-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తుంటాయి. నవ భారత్‌కు సరికొత్త మౌలిక సదుపాయాలు కావాలి. దానికోసం అనుసంధానతపైనే కాకుండా అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడంపైనా పెద్దఎత్తున దృష్టి సారించాం' అని ప్రధాని తెలిపారు.

మెట్రో ప్రమాణాలపై శ్రీధరన్ కమిటీ

దేశంలో మెట్రో రైలు వ్యవస్థల కోసం ప్రమాణాలు రూపొందించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు ప్రధాని ఆమోదం తెలిపారు. మెట్రోమ్యాన్‌గా పేరొందిన ఇ.శ్రీధరన్ దీనికి నేతృత్వం వహిస్తారు.

పేదల ఇళ్లకు స్థలం పోటు!

(మొదటి పేజీ తరువాయి)

నగరాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడం, ప్రయివేట్ స్థలాల ధరలు ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని పరిస్థితి. ప్రధాన పట్టణాల్లో 1158 ఎకరాల భూమి అవసరమని అధికారులు నివేదిక రూపొందించారు. ప్రయివేట్ స్థలాల సేకరణ కోసం రూ.540కోట్లు అవసరమని అంచనా వేశారు.

- పట్టణ పేదల కోసం 2.81లక్షల ఇళ్ల నిర్మాణ పనులైతే ప్రారంభమైనా ఇప్పటికీ అత్యధిక ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తికాలేదు. అతి కష్టంమీద 5వేల మంది జాబితాను సిద్ధం చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) మరో 50 వేల మందికి పాన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసింది. లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లా స్థాయిలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీకి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఛైర్మన్. సభ్య కన్వీనర్‌గా పురపాలక/నగరపాలక సంస్థ కమిషనర్ ఉంటారు. కలెక్టర్, ఎమ్మెల్యే, పురపాలక ఛైర్మన్, నగరపాలక సంస్థ మేయర్ సభ్యులు. ఈ కమిటీ ఇళ్ల కోసం అర్హులైన పేదలను ఎంపిక చేసి జాబితాలను ప్రభుత్వానికి పంపాలి. 70 శాతానికిపైగా పురపాలక, నగరపాలక సంస్థల్లో ఎమ్మెల్యే, పురపాలక ఛైర్మన్, నగరపాలిక మేయర్ మధ్య సమన్వయ లోపం, ఇతర రాజకీయ కారణాలతో లబ్ధిదారుల ఎంపిక కొలిక్కి రాలేదు.
- మూడు విభాగాల్లో పట్టణ పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్ల కోసం లబ్ధిదారులు బ్యాంకుల నుంచి రూ.17వేల కోట్ల రుణాలు తీసుకోవలసి ఉంటుంది. 300 చదరపు అడుగుల(ఎస్ఎఫ్‌టీ) ఇంటికి రూ.2.65 లక్షలు, 365 ఎస్ఎఫ్‌టీకి రూ.3.65 లక్షలు, 430 ఎస్ఎఫ్‌టీ ఇంటి నిర్మాణంపై రూ.4.65 లక్షల రుణాన్ని బ్యాంకుల నుంచి లబ్ధిదారులు తీసుకోవాలి. ప్రభుత్వం నిర్మిస్తున్న ఇంటినే హామీగా చూపిస్తూ బ్యాంకులు రుణాలిచ్చేలా ప్రభుత్వమే చొరవ తీసుకుంటోంది. లబ్ధిదారుల ఎంపికలో జాప్యంతో బ్యాంకు రుణాలు నిలిచిపోవడం ఇళ్ల నిర్మాణ బాధ్యతలు చూస్తున్న ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ(ఏపీ టిడ్కో)కు సమస్యగా తయారైంది. హడ్కో నుంచి ఇప్పటివరకు తెచ్చిన వెయ్యి కోట్ల రుణాన్ని ఖర్చుచేశారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయితే తప్ప బ్యాంకులు రుణాలిచ్చే అవకాశం లేదు.

రాష్ట్రంలోని పది నగరాభివృద్ధి సంస్థల పరిధి గ్రామాల్లో పేదలకు బహుళ అంతస్థుల్లో ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 20న మంత్రిమండలి నిర్ణయంపై అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు పురపాలక, నగరపాలక సంస్థల పరిధిలోని పేదల కోసం మాత్రమే పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్ కార్యక్రమం వర్తింపజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై కేంద్రం ఇటీవల నగరాభివృద్ధి సంస్థల పరిధిలోని పేదలకూ కార్యక్రమ అమలు కోసం అనుమతించింది. పట్టణాల్లో ప్రస్తుతం జీ+3 (గ్రౌండ్, మరో మూడు అంతస్థుల్లో) ఇళ్లు నిర్మిస్తోంది. అదే ప్రాతిపదికన బహుళ అంతస్థుల్లోనే ఇళ్లు నిర్మిస్తారా? మరో అదనపు అంతస్థు (జీ+4) ప్రతిపాదిస్తారా? వ్యక్తిగత ఇళ్లకు అనుమతిస్తారా? అనేది నెలాఖరుకు స్పష్టత రానుంది.

కనిపించని ఆంగ్ల నైపుణ్యం..!

- సత్ఫలితాలివ్వని ప్రయోగాత్మక ప్రాజెక్టు
- విశ్లేషణ చేయని అధికార యంత్రాంగం
- మరో కొత్త ప్రాజెక్టు ఇచ్చేందుకు ప్రయత్నం

ఈనాడు, అమరావతి: ఏదైనా పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసినప్పుడు అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా ముందుకువెళ్తారు. ఆ ప్రాజెక్టు ఫలితాలపై విశ్లేషణ చేస్తారు. కానీ, ఉన్నత విద్యామండలి చేపట్టిన ఆంగ్ల నైపుణ్య ప్రాజెక్టులో ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో లక్షమంది విద్యార్థులకు ఆంగ్లభాషలో నైపుణ్యం అందించేందుకు బ్రిటిష్ కౌన్సిల్, ఉన్నత విద్యామండలి మధ్య గతేడాది ఒప్పందం కుదిరింది. ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ ప్రాజెక్టు లక్ష్యంలో సగం కూడా నెరవేరలేదు. పాత ప్రాజెక్టు అమలే సరిగా లేకపోయినా ఇప్పుడు డిగ్రీ కళాశాలల్లో మరో లక్షమందికి శిక్షణ ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో సంఖ్య తక్కువగా ఉన్నందున ప్రైవేటు కళాశాలల్లోనూ ఇవ్వాలని నిర్ణయించారు. గతేడాది చేపట్టిన ప్రాజెక్టుకు రూ.13 కోట్లు చెల్లింపులు చేయగా లబ్ధిపొందిన విద్యార్థుల సంఖ్య 40శాతం మించలేదు. ఉన్నత విద్యామండలి కొనసాగించిన ఈ ఆంగ్ల నైపుణ్య ప్రాజెక్టు అమలు, ఫలితాలపై అంతర్గత విచారణ చేయించాలని ఉన్నత విద్యామండలి సమావేశంలోనూ ఇటీవల నిర్ణయించారు. ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని తీర్మానించారు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టు.. కళాశాల విద్య చేపడుతున్నందున ఈ విచారణలో కొంత జాప్యం చోటుచేసుకుంది.

ఇదీ పరిస్థితి.. బ్రిటిష్ కౌన్సిల్ తరపున దిల్లీ సమీపంలోని నోయిడాకు చెందిన ఓ ప్రైవేటు ఏజెన్సీ ఈ ప్రాజెక్టును నిర్వహిస్తోంది. మొదట 150మంది ఆంగ్ల అధ్యాపకులకు ఈ సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 112 మందికి మాత్రమే ఇవ్వగలిగారు. ఈ మాస్టర్ శిక్షకులు మరో 2,500మంది ఆంగ్ల అధ్యాపకులకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా.. 1,979మందికి శిక్షణ ఇచ్చారు. వీరు కళాశాలల్లో విద్యార్థులకు ఆంగ్ల నైపుణ్యంపై బోధన చేయాలి. శిక్షకుల ఎంపికలోనే లక్ష్యం చేరుకోలేకపోయిన అధికారులు.. విద్యార్థులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడంలోనూ వెనుకబడ్డారు. శిక్షణపై పూర్తిస్థాయి అవగాహన కల్పించకపోవడంతో విద్యార్థులు కూడా ఆసక్తి చూపడం లేదు. లక్ష మంది విద్యార్థులకు గాను.. 85వేలు మంది విద్యార్థులు మాత్రమే శిక్షణకు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలోనూ 100గంటలపాటు నిర్వహించే ముఖాముఖి తరగతులకు హాజరైంది కేవలం 38,400మాత్రమే. ఆన్‌లైన్ తరగతులకు కేవలం 9వేల మంది మాత్రమే హాజరయ్యారు.

మళ్లీ కొత్తగా.. ఈ ఏడాది డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేశారు. వీటితోపాటు పాఠశాల విద్యలోనూ ఓ కొత్త ప్రాజెక్టు అప్పగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల పనితీరు అంచనా వేసేందుకు సర్వే ప్రాజెక్టును ఈ సంస్థకు అప్పగించాలని భావిస్తున్నారు.

స్వగ్రామంలో జస్టిస్ చలమేశ్వర్ నూతన గృహ ప్రవేశం

కూచిపూడి, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు జడ్జిగా ఏడేళ్లపాటు సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేసిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ తన స్వగ్రామమైన కృష్ణా జిల్లా మొవ్వ మండలం పెదముత్తేవికి చేరుకున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇంట్లోకి శనివారం సాయంత్రం కుటుంబసమేతంగా గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కొసరాజు వీరయ్య చౌదరి, ఎంపీ కేశినేని నాని, రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు ఉన్నారు.

10 పరమ చెత్త నగరాల్లో 8 పశ్చిమ బెంగాల్‌లోనే

ఇండోర్: దేశంలో నగరాల పరిశుభ్రత ఏ విధంగా ఉందో తెలుసుకునేందుకు నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2018లో అట్టడుగున ఉన్న 10 నగరాల్లో 8...పశ్చిమ బెంగాల్‌కు చెందినవే. మిగిలిన రెండూబిహార్‌లో ఉన్నాయి. లక్ష పైచిలుకు జనాభా కలిగిన 485 నగరాల్లో చిట్టచివరన నిలిచిన భద్రేశ్వర్ కూడా అదే రాష్ట్రంలో ఉంది. హుగ్లీ జిల్లాలోని ఈ నగరానికి 4000 పాయింట్లకు గానూ కేవలం 448.33 లభించాయి. దేశంలో అగ్రస్థానాన నిలిచిన ఇండోర్‌కు 3707 పాయింట్లు రావడం చూస్తే ఈ నగరం ఎంత వెనుకబడిందో అర్థమవుతుంది.

తేలియాడే సౌర విద్యుత్తు ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టాలని భావిస్తున్నారు. వచ్చే నెల నుంచి 2 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తయ్యేలా పనులు జరుగుతున్నాయి. స్మార్ట్ సిటీ మిషన్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ సంయుక్తంగా ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.18 కోట్ల రుణం తీసుకుని నగరానికి సమీపంలోని మేఘాద్రిగెడ్డ రిజర్వాయరులో 3 మెగావాట్ల సోలారు ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాయి. ప్రస్తుతం ఇది టెండరు దశలో ఉంది. రిజర్వాయరుపై సోలారు పలకలు, వివిధ రకాల పరికరాలు వాడటం వల్ల నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రాజెక్టులో ఏర్పాట్లు ఉన్నాయి. ఇక్కడ ఇనుము స్థానంలో అల్యూమినియం వాడటంతో తుప్పు పట్టడం, దాని ద్వారా నీరు పాడవడమనేది లేకుండా చేస్తున్నారు. వీటికి నట్లు, బోల్టులు దాదాపుగా అల్యూమినియంతో చేసినవే వాడుతున్నట్లు అధికారులు చెప్పారు. రిజర్వాయరులోని నీటిపై పలకలు తేలియాడేందుకు వీలుగా ప్రత్యేక అమరికలు పెడుతున్నారు. వీటిమీద సోలారు పలకలు ఉంటాయి. నీరు కదిలినప్పుడల్లా ఈ అమరిక కదులుతూ ఉంటుంది. ఇవి ఆ ప్రాంతం నుంచి పక్కకు వెళ్లకుండా గట్టుతో ముడిపెట్టారు.

పగలే వెన్నెల.. నిధులే దుబారా!

(మొదటి పేజీ తరువాయి)

ఆపడం చేయాలి. సుమారు 22వేల ఎంసీబీ బాక్సులను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఈఈఎస్ఎల్ 8వేల బాక్సులనే పెట్టింది.

కారణం-2: వీధి దీపాల ఏర్పాటుకు ముందుగా డిస్కమ్‌లు మూడో విద్యుత్తు తీగ (థర్డ్ వైర్) వేయాలి. కడప, విశాఖపట్నం, అనంతపురం, చిత్తూరు జిల్లాల పరిధిలో ఈ ప్రక్రియ ఇప్పటికీ నూరు శాతం పూర్తి కాలేదు. అయినా పలు పంచాయతీల్లో ఎల్ఈడీ వీధి దీపాలు అమర్చారు. దీంతో గృహాలకు విద్యుత్తు సరఫరా జరిగే లైను నుంచే వీధి దీపాలకు సరఫరా ఇస్తున్నారు. అలాంటప్పుడు అవి పగలు వెలగకుండా ఉండేలా ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలి. కానీ కొన్నిచోట్ల వాటిని పెట్టలేదు. దీంతో 24 గంటలూ వెలుగుతున్నాయి.

- అనంతపురం జిల్లా యాడికిలో 1100 వీధి దీపాలు అమర్చగా వాటిలో 459 పగలూ, రాత్రి వెలుగుతున్నాయి.
- విజయనగరం జిల్లా సారికలో 85 వీధి దీపాలు అమర్చారు. ఇవన్నీ 24 గంటలూ వెలుగుతూనే ఉన్నాయి.
- విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండల కేంద్రంలో కొన్ని వీధుల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి.
- కడప జిల్లా బోరెడ్డిగారిపల్లెలో 2 నెలల కింద 350 ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. మూడో తీగ ఏర్పాటు చేయకపోవడంతో ఇవి నిరంతరం వెలుగుతున్నాయి.

విజయనగరం జిల్లా సారిక పంచాయతీలో 24 గంటలూ వెలుగుతున్న వీధి దీపం

అధికారులు ఏమన్నారంటే.. 'విశాఖపట్నం జిల్లా పాడేరు ప్రాంతంలో మినహా మిగతా అన్నిచోట్లా మూడో విద్యుత్తు తీగను వేశాం. ఎక్కడైనా 24 గంటలూ వీధి దీపాలు వెలుగుతున్నాయని మా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తాం' అని తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సీఎండీ హెచ్‌వై.దొర తెలిపారు. 'ఎస్‌పీడీసీఎల్ పరిధిలో 95శాతం గ్రామాల్లో మూడో విద్యుత్తు తీగను వేశాం. కొత్తగా ఏర్పడిన వీధుల్లో ఎల్ఈడీ దీపాలు అమర్చుతుంటే అలాంటి చోటా తీగ వేస్తున్నాం. ఫలానా ప్రాంతంలో మూడో విద్యుత్తు తీగ వేయలేదని మా దృష్టికి తీసుకొస్తే వెంటనే వేస్తాం' అని దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎస్‌పీడీసీఎల్) సీఎండీ ఎంఎం.నాయక్ చెప్పారు.

సైనిక మేజర్ ఉన్మాదం

- సహచరుడి భార్యను గొంతుకోసి హత్య

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఓ సైనిక మేజర్ భార్య హత్యకు గురైన కేసులో.. మరో సైనిక మేజర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇక్కడి కంటోన్మెంట్ ప్రాంతంలో శనివారం సాయంత్రం మేజర్ అమిత్ ద్వివేది భార్య శైలజ ద్వివేది (33) మృతదేహం లభ్యమైంది. ఆమెను మేజర్ నిఖిల్ హండా గొంతు కోసి హత్య చేసినట్లు తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. తనను ఆమె పెళ్లి చేసుకునేందుకు అంగీకరించట్లేదన్న అక్కసుతోనే అతడు ఈ దారుణానికి పాల్పడ్డాడని వివరించారు. హండాకు శైలజతో వివాహేతర సంబంధం ఉందని మరో అధికారి అన్నారు. ఇటు హత్య అనంతరం బాధితురాలిపై నుంచి కారు పోనిచ్చి.. ఘటనను హండా రోడ్డు ప్రమాదంలా చిత్రించే ప్రయత్నం చేశాడని సీనియర్ పోలీసు అధికారి విజయ్ కుమార్ పేర్కొన్నారు. "మూడేళ్ల క్రితం నుంచి అమిత్ కుటుంబంతో హండాకు పరిచయం ఉంది. అప్పుడు వారు నాగాలాండ్‌లో కలిసి పనిచేసేవారు. అమిత్‌కు దిల్లీకి బదిలీ కావడంతో.. శైలజ కూడా ఆయన తోపాటు ఇక్కడికి వచ్చేశారు. శైలజను హండా 'ఇష్ట'పడేవాడు. తరుచూ తనను పెళ్లిచేసుకోమని ఆమెను కోరేవాడు. ఆమె అందుకు నిరాకరిస్తూ వచ్చారు. శైలజ మొబైల్ ఫోన్‌లోని సమాచారం ఆధారంగా.. హండాతో ఆమెకు విభేదాలు తలెత్తినట్లు గుర్తించాం. ఫిజియోథెరపీ చేయించుకునేందుకు అని చెప్పి.. శైలజ తన భర్త అధికారిక వాహనంలో ఉదయం కంటోన్మెంట్ ప్రాంతంలోని సైనిక ఆసుపత్రికి వెళ్లారు. అక్కడికి హండా వచ్చినట్లు సీసీ కెమెరాల్లో రికార్డైంది. అతడితో కలిసి శైలజ కారులో బయటకు వెళ్లారు. అమిత్ కూడా హండాపై అనుమానం వ్యక్తంచేశారు"అని తెలిపారు. కారులో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుందని.. దీంతో హండా కత్తితో శైలజ గొంతును కోశాడని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్ కంటోన్మెంట్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో హండా తలదాచుకున్నట్లు తెలిసిందని.. ఆదివారం అక్కడి నుంచి కారులో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

మిషిగాన్-డియర్ బోర్న్ వర్సిటీతో వీఐటీ-ఏపీ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: బీబీఏ డిగ్రీ కోర్సుకు సంబంధించి వీఐటీ-ఏపీ వర్సిటీ..యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్ డియర్ బోర్న్ యుఎండీతో అవగాహన ఒప్పందం చేసుకుంది. అమెరికాలోని మిషిగాన్-డియర్ బోర్న్ వర్సిటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఛాన్సలర్ డానియల్ లిటిల్, వీఐటీ ఛాన్సలర్ జి.విశ్వనాథన్ ఈ మేరకు అంగీకార పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో అమరావతిలోని వీఐటీ వర్సిటీలో బీబీఏ చేసే విద్యార్థులు రెండేళ్లు అమరావతిలో.. రెండేళ్లు అమెరికాలో చదువుకోవచ్చని విశ్వనాథన్ తెలిపారు. చదువు పూర్తయ్యాక ఆ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పొందవచ్చన్నారు. మరో ఆప్షన్‌గా అమరావతిలో మూడేళ్ల బీబీఏ డిగ్రీ, ఏడాది డిప్లొమా చేశాక ఎంఎస్ అమెరికాలో చేయవచ్చని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే వీఐటీ అమరావతి ప్రాంగణంలో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు యుఎండీలో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసే సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు బీబీఏకు దరఖాస్తు చేసుకోవచ్చని వీఐటీ-ఏపీ వర్సిటీ ఉపాధ్యక్షుడు శేఖర్ విశ్వనాథన్ తెలిపారు.

నేటి నుంచి వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: నైరుతీ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశాలున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కొన్నిచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని, మంగళవారం నుంచి కోస్తాంధ్ర అన్ని జిల్లాల్లోనూ వర్షాలకు అవకాశం ఉంటుందని ఆ శాఖ పేర్కొంది. రాయలసీమలో అక్కడక్కడ పడే అవకాశం ఉండొచ్చని వివరించింది. ఈనెల 28న కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు తెలిపారు.

ఏసీల 'స్థిర ఉష్ణోగ్రత' 24 డిగ్రీల వద్దే ఉండాలి

- విద్యుత్ ఆదానే లక్ష్యంగా కేంద్రం సూచనలు
- అవగాహన కల్పించేందుకు త్వరలో ప్రత్యేక ప్రచారం

దిల్లీ: విద్యుత్ ఆదానే లక్ష్యంగా ఏసీల ఉష్ణోగ్రతల్లో పరిమితులు సూచించాలని కేంద్రం భావిస్తోంది. "స్థిర ఉష్ణోగ్రత (డిఫాల్ట్ టెంపరేచర్)" 24 డిగ్రీల సెల్సియస్ వద్దే ఉండేలా చూడాలని ప్రణాళికలు రచిస్తోంది. దీని కోసం ఏసీ తయారీ సంస్థలకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఓ సూచన చేసింది. ఉష్ణోగ్రతను 24 నుంచి 26 డిగ్రీల మధ్యే కొనసాగేలా చూడాలని దీనిలో ప్రతిపాదించింది. అంటే సగటు నిర్వహణ ఉష్ణోగ్రత ఈ పరిమితి మధ్యే ఉండాలన్నమాట. దీన్ని నిర్దేశించేందుకు ఇంధన సమర్థ వినియోగ విభాగం (బీఈఈ) ప్రత్యేక సర్వే చేపట్టింది. గ్రీన్‌హౌస్ వాయువుల తగ్గింపు, ఇంధన ఆదాపై దీనిలో దృష్టిసారించింది. తాజా ఏసీ పరిమితులపై అవగాహన కల్పించేందుకు వచ్చే ఆరు నెలలపాటు ప్రత్యేక ప్రచారాన్నీ బీఈఈ చేపట్టనుంది. ఈ ప్రతిపాదన అమలైతే ఏడాదిలో 2 కోట్ల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని విద్యుత్ శాఖ అంచనావేసింది. మరోవైపు ఏసీలో ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెంచితే.. ఆరు శాతం వరకూ విద్యుత్ వినియోగాన్ని తగ్గించొచ్చని విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ తెలిపారు. 'మానవ శరీర ఉష్ణోగ్రత 36 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంటుంది. అయితే చాలావరకూ హోటళ్లు, రెస్టారెంట్లు తమ ఏసీల ఉష్ణోగ్రతల 18 నుంచి 21 మధ్య పెడుతుంటాయి. దీంతో అతిథులు శరీరాన్ని వేడిగా ఉంచే దుస్తులు వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీని వల్ల చాలా విద్యుత్ వృథా అవుతోంది. స్థిర ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్ ఉండాలని జపాన్ ఇప్పటికే చట్టంచేసింది'అని సింగ్ వివరించారు. మరోవైపు విమానాశ్రయాలు, హోటళ్లు, షాపింగ్ ప్రాంగణాలు, ప్రభుత్వ భవనాలు ఈ పరిమితిని పాటించేలా చూసేందుకు ప్రభుత్వం త్వరలో సూచనలు చేయనుంది.

తెదేపా నాయకులే కడప ఉక్కు పరిశ్రమను అడ్డుకున్నారు: పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: కడపలో ఉక్కు పరిశ్రమ రాలేదని ఇప్పుడు గోల చేస్తున్న కొందరు తెదేపా నాయకులే అప్పట్లో దీని నిర్మాణం కోసం జిందాల్ సంస్థ ముందుకొస్తే అడ్డుకున్నారని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆరోపించారు. ఆయా నాయకులకు లబ్ధి చేకూరితేనే కర్మాగారం ఏర్పాటు కావాలా? లేకపోతే కాకూడదా? ఇదెక్కడి ద్వంద్వ వైఖరి?...అని ఆయన ప్రశ్నించారు. విజయవాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం రాత్రి పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యారు. అనంతరం వారిరువురు కలిసి విలేకరులతో మాట్లాడారు. లండన్‌లో తాను పర్యటించినప్పుడు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ఎంత వాటాలు, పర్సంటేజీలు ఇస్తారని అడిగే స్థాయికి మీ ప్రభుత్వాలు పడిపోవడం చాలా ఇబ్బంది కలిగిస్తోందని, అందుకే తాము రావడం లేదని కొందరు పారిశ్రామికవేత్తలు చెప్పారని పవన్ వివరించారు. ఇప్పుడు ఉక్కు కర్మాగారం వ్యవహారం కూడా తనకు అదే కోవలో కనిపిస్తోందని, ఇలాంటి పరిస్థితులను జనసేన, సీపీఎం, సీపీఐ కలిసి మార్చాలనుకుంటున్నాయని చెప్పారు. ఒకే ఆలోచన విధానంతో ఉన్నామని, తమతో పాటు ఇంకెవరైనా కలిసొచ్చినా వారితో కలిసి ముందుకెళ్తామని తెలిపారు. మూడు, నాలుగు నెలల తర్వాత అందరం కలిసి ఉమ్మడి కార్యక్రమం చేపడతామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గద్దె దిగి మెరుగైన ప్రభుత్వం రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. అలాగని చంద్రబాబు గద్దె దిగితే జగన్ రావడం కాదని, వేల కోట్ల రూపాయల కుంభకోణాల్లో నిందితుడిగా ఉన్న జగన్ సీఎం పదవి ఆశించడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ఇసుక మాఫియా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టిందని తాము చెబితే బాగుందని చెప్పి ఇప్పుడు ఆ విధానాన్ని మారుస్తున్నారని చెప్పారు. కడప ఉక్కు కర్మాగారం కోసం ఈ నెల 29న ప్రతిపక్షాలు నిర్వహించే జిల్లా బంద్‌కు మద్దతు ప్రకటిస్తున్నామని, దానికి సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా అదే రోజు కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. విభజన హామీల సాధనకు జనసేన, సీపీఎం, సీపీఐ తదితర పార్టీలన్నీ కలిసి ఉద్యమిస్తాయని, సెప్టెంబరులో విజయవాడలో నిర్వహించే భారీ ప్రదర్శనలో పవన్‌కల్యాణ్ కూడా పాల్గొంటారని వెల్లడించారు.

గ్రహం అనుగ్రహం

25-6-2018 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
ద్వాదశి: ఉ. 5-50 తదుపరి త్రయోదశి
విశాఖ నక్షత్రం: ఉ. 6-30 తదుపరి అనూరాధ
అమృత ఘడియలు: రా. 8-53 నుంచి 10-34 వరకు
వర్జ్యం: ఉ. 10-44 నుంచి 12-25 వరకు
దుర్ముహూర్తం: మ. 12-29 నుంచి 1-21 వరకు
తిరిగి మ. 3-05 నుంచి 3-57 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5-31; సూర్యాస్తమయం: సా.6-34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
గుంటూరు	39.2	29.1
ఒంగోలు	38.9	28.9
తిరుపతి	38.6	28.4
విజయవాడ	37.6	27.0
శ్రీకాకుళం	37.0	27.5
కడప	37.0	27.0
రాజమహేంద్రవరం	37.0	22.0
విశాఖపట్నం	36.6	27.4
అనంతపురం	36.3	24.8
నెల్లూరు	35.0	28.0
తాడేపల్లిగూడెం	33.5	26.5
నరసాపురం	33.0	26.0
హైదరాబాద్	32.9	23.3



గుంటూరు మున్సిపల్ మార్కెట్‌లో ఓ దుకాణంలోని రిఫ్రిజిరేటర్‌లో కొన్ని రోజులుగా గడ్డకట్టిన మాంసాన్ని గుర్తించి బయట పారవేయిస్తున్న మాంసం అభివృద్ధి సంస్థ రాష్ట్ర ఛైర్మన్ ప్రకాశ్‌నాయుడు

నాసిరకం మాంసాన్ని విక్రయిస్తే చర్యలు

మాంసం అభివృద్ధి సంస్థ రాష్ట్ర ఛైర్మన్ ప్రకాశ్‌నాయుడు వెల్లడి

గుంటూరు, న్యూస్‌టుడే: మార్కెట్, దుకాణాల్లో విక్రయించే చేపలు, మాంసాన్ని తాజాగా, నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని మాంసం అభివృద్ధి సంస్థ రాష్ట్ర ఛైర్మన్ ప్రకాశ్‌నాయుడు సూచించారు. ఆదివారం ఆయన గుంటూరులోని జీఎంసీ పరిధిలోని వెన్‌లాక్ చేపలు, మాంసం మార్కెట్‌తోపాటు పలు ప్రాంతాల్లో నగరపాలక అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల్లో నిల్వ ఉంచిన చేపలు, మాంసం విక్రయాలు చేస్తుండడం, అపరిశుభ్ర పరిస్థితులను గమనించారు. ఒక దుకాణంలోని ఫ్రిజ్‌లో మంచుగడ్డలు కట్టిన, బూజు పట్టిన చేపలు, మాంసాన్ని గుర్తించారు. పలు దుకాణాల్లో నిల్వ ఉంచిన 200 కిలోల చేపలు, 15 కిలోల కోడి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాసిరకం మాంసం విక్రయిస్తున్న దుకాణాలపై రూ.37 వేల వరకు అపరాధ రుసుము విధించారు. మరోమారు విక్రయాల్లో తప్పు చేస్తే దుకాణాలను మూసివేయిస్తామని హెచ్చరించారు.

నరాల వ్యాధిగ్రస్థుడిపై సీఎం ఉదారత

వైద్యం కోసం రూ.15 లక్షల విడుదలకు ఆదేశం

ఈనాడు డిజిటల్, అమరావతి: అరుదైన నరాల బలహీనత వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి చికిత్స కోసం రూ.15 లక్షలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అనంతపురానికి చెందిన ఎన్నికపాటి శ్రీరాములు కుమారుడు అజయ్‌కుమార్ ఈ అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు. కొడుకుతో కలిసి శ్రీరాములు ఆదివారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రిని కలిశారు. అజయ్‌కుమార్‌కు 32 ఏళ్లు వచ్చినా మాట్లాడలేకపోవడం, కుడి చేయి మెలితిరిగిపోవడం, మెడవాపు, హారన్ శబ్దానికి నాలుక బయటపెట్టడం వంటి సమస్యలున్నాయని ముఖ్యమంత్రికి వివరించారు. వైద్యానికి రూ.17 లక్షలు ఖర్చవుతుందని, పిండిమర ఆడించుకునే తమకు అంత స్థోమత లేదని విన్నవించారు.

ఇంధన సామర్థ్యంపై కార్యశాల.. అజయ్‌జైన్‌కు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఇంధన సామర్థ్య సంస్థ (బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 28, 29వ తేదీల్లో ఇంధన సామర్థ్యంపై ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో జరిగే కార్యశాలకు రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్‌కు ఆహ్వానం అందిందని ఏపీ ఇంధన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇంధన సంరక్షణలో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను వివరించాలని కోరుతూ బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే కోరారని ప్రకటనలో పేర్కొంది. "గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఈడీ వీధిదీపాల ఏర్పాటులో ఏపీ చర్యలను బీఈఈ అభినందించింది. తాగునీటి సరఫరా వ్యవస్థలో పాత పంపుసెట్లు మార్చి కొత్తవి అమర్చడానికి బీఈఈ 50 శాతం ఆర్థిక సాయం అందిస్తోంది. తద్వారా కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కడప జిల్లాల్లో ఏటా 7.67 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదా అవుతోంది" అని ప్రకటనలో పేర్కొంది.

జనమే బలం.. జలమే ధ్యేయం

- ప్రజాభాగస్వామ్యంతో వినూత్న కార్యక్రమాలు
- ఆచరణలో ఒక్కో రాష్ట్రానిది ఒక్కో ప్రత్యేకత
- అత్యుత్తమమైన వాటితో నీతి ఆయోగ్ నివేదిక
- ఆంధ్రప్రదేశ్‌లోని రియల్ టైమ్ జలవనరుల పర్యవేక్షణ వ్యవస్థకు చోటు

ఈనాడు – అమరావతి

జలసంరక్షణకు పెద్దపీట వేయడంలో ఒక్కో రాష్ట్రానిది ఒక్కో తీరు. ప్రజలను భాగస్వామ్యంతో అమలు చేస్తున్న కార్యక్రమాల వల్ల కొన్ని ప్రాంతాల్లో నీటిమట్టాలు పెరిగాయి. కొంతమేర సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించినట్లయింది. ఊరూరా 'పానీ సమితి'లతో ఇంటి ముంగిటికే తాగునీటిని అందించడం, నీటికుంటలతో రెండు పంటలు పండించడం, జలవనరుల లభ్యతను రియల్ టైమ్‌లో పర్యవేక్షించడం, నీటివనరులకు పునరుజ్జీవం కల్పించి భూగర్భజలాల మట్టాన్ని, ఆయకట్టు విస్తీర్ణాన్ని పెంచడం వంటివి అమలు చేస్తున్నాయి. ఇలాంటి ఆరు అత్యుత్తమమైన ఆచరణలను నీతి ఆయోగ్ ఎంపిక చేసింది. వీటిల్లో ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న రియల్‌టైమ్ జలవనరుల సమగ్ర సమాచార వ్యవస్థకు చోటు దక్కింది. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు కూడా ఎంపికయ్యాయి.

గుజరాత్ — ఇంటి ముంగిటికే తాగునీటి సరఫరా

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి ముంగిటికే తాగునీరు పథకం

- **ప్రధాన అంశాలు:** తాగునీటి సరఫరాపై గ్రామ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అమలుకు 'పానీ సమితి'లను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు వ్యయంలో 10శాతాన్ని ప్రతి ఇంటి నుంచి చందాల రూపంలో వసూలు చేశారు. 90శాతాన్ని రాష్ట్ర నీరు, పారిశుద్ధ్య నిర్వహణ సంస్థ (వాస్మో) భరిస్తుంది. సాఫీగా సాగే వరకూ సమితిలకు అవసరమైన చేయూత, సాంకేతిక సహకారం, సామర్థ్యాలను పెంచుకునేందుకు తోడ్పాటు అందిస్తుంది.
- **ప్రభావం:** 50శాతం గ్రామాల్లో ఈ పథకాలు నిర్మించారు. 18,400 పానీ సమితిలు నెలకొల్పారు. తాగునీటి నాణ్యత లోపంతో జరిగే ఘటనలు అరికట్టారు.
- **నేర్చుకోవాల్సింది:** తాగునీటి సరఫరా వ్యవస్థల్లో సవాళ్ల పరిష్కారానికి ప్రజాభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి. అమలు, నిర్వహణ, ఛార్జీల విధింపు తదితర బాధ్యతలు స్థానిక సంస్థలకు ఇవ్వాలి.

ఆంధ్రప్రదేశ్ — జలవనరుల సమగ్ర సమాచార వ్యవస్థ

- **ప్రధాన అంశాలు:** రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా జలవనరుల సమగ్ర సమాచార వ్యవస్థను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోంది. వర్షపాతం, భూగర్భజలం, మట్టిలో తేమశాతం, చెరువులు, చెక్‌డ్యామ్‌లు తదితర నీటి సూచీలను పర్యవేక్షిస్తోంది. ఉపగ్రహ సమాచారం, భూమిలోని తేమను తెలుసుకునేందుకు సెన్సార్లను ఉపయోగించుకుని జలవనరుల పరిస్థితి అంచనా వేస్తోంది.
- **ప్రభావం:** భూగర్భజలాల మట్టం గణనీయంగా పెరిగేందుకు ఈ వ్యవస్థ దోహదపడింది.
- **నేర్చుకోవాల్సింది:** రియల్ టైమ్ పర్యవేక్షణకు వీలుగా జలవనరుల సమాచార నిధిని ఏర్పాటు చేసుకోవాలి. దాని ఆధారంగా అవసరమైన నిర్ణయాలు తీసుకోవాచ్చు.



ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్యాష్‌బోర్డు

మధ్యప్రదేశ్ — పంటకుంటలతో సాగునీటి సదుపాయం

- **ప్రధాన అంశాలు:** 2006లో దేవాస్ జిల్లాలో భగీరథ్ క్రిషిక్ యోజనను ప్రారంభించారు. వేలల్లో పంటకుంటలు నిర్మించారు. అధిక విస్తీర్ణంలో భూములున్న రైతులకు వీటి నిర్మాణానికి నాబార్డుతో రుణం ఇప్పించారు.
- **ప్రభావం:** దేవాస్ జిల్లాలో రైతులు 8వేల జలాశయాలు నిర్మించుకున్నారు. 40వేల హెక్టార్లకు సాగునీటి సదుపాయం ఏర్పడింది. ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్నారు.
- **నేర్చుకోవాల్సింది:** ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లోనే ఇలాంటి ప్రాజెక్టులు అమలు చేయాలి. ఎదురవుతున్న సమస్యలు, అవరోధాలు గుర్తించిన తర్వాత వాటిని అధిగమించే చర్యలు తీసుకోవాలి.

దేవాస్ జిల్లాలో రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి కుంటలు

రాజస్థాన్ — ముఖ్యమంత్రి జల స్వావలంబన అభియాన్

- **ప్రధాన అంశాలు:** జలవనరులకు పునరుజ్జీవం, భూగర్భజలాల మట్టం పెంపు, రక్షిత తాగునీటి సరఫరా లక్ష్యం. ప్రజా భాగస్వామ్యంతో చేపడుతోంది. విరాళాలు సేకరిస్తోంది. ప్రయోజనాలపై సామాజిక-ఆర్థిక ప్రభావాన్ని మదిస్తోంది.
- **ప్రభావం:** 4 లక్షలకు పైగా నీటి సంరక్షణ కట్టడాలు నిర్మించారు. కోటికి పైగా మొక్కలు నాటారు. 21 జిల్లాల పరిధిలో అయిదు అడుగుల మేర భూగర్భ జలమట్టంతో పాటు ఆయకట్టు విస్తీర్ణం పెరిగింది.
- **నేర్చుకోవాల్సింది:** నీటి నిర్వహణ, సంరక్షణకు పటిష్ఠమైన విధానాలు, నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. అమలు ఫలితాలు తెలుసుకునేందుకు సమగ్ర ప్రభావ మదింపు చేపట్టాలి.



ఉనికి కోల్పోయిన జలవనరులకు పునరుజ్జీవం కల్పించిన ప్రాంతం

రాజస్థాన్ — సమీకృత సాగునీటి పరిష్కార వ్యవస్థ

- **ప్రధాన అంశాలు:** సంచోర్ ప్రాంతంలో నర్మదా నదీ తీరం వెంబడి దీన్ని అమలు చేసింది. సూక్ష్మసేద్యాన్ని తప్పనిసరి చేసింది. 2200 నీటి వినియోగ సంఘాలను ఏర్పాటు చేసి ప్రాతినిధ్య నీటి యాజమాన్య విధానాన్ని అమలు చేసింది. ఆ సంఘాలు వసూలు చేసే రుసుముల్లో 90శాతాన్ని వారే వినియోగించుకునేందుకు వీలు కల్పించింది.
- **ప్రభావం:** సాగుకు యోగ్యమైన భూమి విస్తీర్ణం 1.35లక్షల హెక్టార్ల నుంచి 2.46లక్షల హెక్టార్లకు పెరిగింది. 233 గ్రామాల్లో సాగు సామర్థ్యం పెరిగింది. 1541 గ్రామాలు, మూడు పట్టణాలకు తాగునీటి సదుపాయం లభించింది. 2013-14తో పోలిస్తే ఆహారోత్పత్తి 277 శాతం పెరిగింది. కలుషిత నీటి వినియోగ ప్రమాద ఘటనలు 40శాతం మేర తగ్గాయి.
- **నేర్చుకోవాల్సింది:** నీటి వినియోగ సంఘాలు వసూలు చేసే రుసుముల్లో 90శాతాన్ని మొత్తాన్ని ఆ సంఘాలకే ఇవ్వడంతో అవి స్వతంత్రంగా పని చేసేందుకు వీలువుతుంది.

సంచార్ ప్రాంతంలో సూక్ష్మసేద్య విధానాల ద్వారా సాగైన తోటలు

ఒడిశా — పానీ పంచాయతీల నిర్వహణలో సాగునీటి వ్యవస్థలు

- **ప్రధాన అంశాలు:** ప్రత్యేక చట్టం చేసి నీటి వినియోగ సంఘాల తరహాలోనే పానీ పంచాయతీలు ఏర్పాటు చేసింది. సాగునీటి వ్యవస్థలను ప్రభావవంతంగా నిర్వహించడం, అందుబాటులో ఉన్న నీటిని రైతులందరికీ సమానంగా సరఫరా చేయడం ఉద్దేశం. అత్యుత్తమ పనితీరు కనబరిచే పానీ పంచాయతీలను అభినందిస్తోంది. వాటి పనితీరును మిగతా వారికి తెలిసేలా త్రైమాసిక సంచికల్లో వివరాలు ప్రచురిస్తోంది.
- **ప్రభావం:** 70శాతం సాగునీటి వ్యవస్థలు పానీ పంచాయతీల నిర్వహణలోనే ఉన్నాయి. రుసుములను వినియోగించుకునే అవకాశం కల్పించడంతో ఈ వ్యవస్థ బలోపేతానికి దోహదపడింది.
- **నేర్చుకోవాల్సింది:** ప్రభావవంతమైన నీటి నిర్వహణకు పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. నీటి నిర్వహణకు సంబంధించిన అత్యుత్తమ ఆచరణలు మిగతా ప్రాంతాల్లో తెలిసేలా విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలి.

పానీ పంచాయతీల ఆధ్వర్యంలోనే ఈ కాలువల నిర్వహణ సాగుతోంది

అధికారం కోసమే ఆరోపణలు

ఆంధ్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు కె.ఇ. ప్రభాకర్

ఈనాడు డిజిటల్, విజయవాడ: విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి వై.శ్రీకాంత్ అధికారం కోసమే రాష్ట్ర కబడ్డీ సంఘంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆంధ్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు కె.ఇ.ప్రభాకర్ అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జాతీయస్థాయి బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్‌ను నిర్వహించే బాధ్యతను అమెచ్యూర్ కబడ్డీ సమాఖ్య రెండు సార్లు అప్పగించినా నిర్వహించలేకపోయామన్నారు. అయినా సమాఖ్యపై ఉన్న గౌరవంతో గతేడాది మళ్లీ కేటాయించారు. ఈ పోటీలను గుంటూరు జిల్లా వడ్లమూడిలో నిర్వహించేందుకు వై.శ్రీకాంత్ ముందుకొచ్చారు. అయితే పోటీలు దగ్గర పడుతుండగా ఆయన అందుబాటులో లేకుండా పోయారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు శ్రీకాంత్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. దీంతో తనను పదవి నుంచి తొలగిస్తారనే భయంతో.. ధ్రువీకరణ పత్రాల విషయంలో కొంతమంది క్రీడాకారిణులతో రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యదర్శి వి.వీరలంకయ్య లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ అసత్య ఆరోపణలు చేయించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఒప్పుకుంటూ శ్రీకాంత్ స్వయంగా లేఖ రాశాడని మీడియాకు తెలిపారు.

నా సంతకం ఫోర్జరీ చేశారు: వై.శ్రీకాంత్

తాను క్రీడాకారిణులను అడ్డుపెట్టుకొని వీరలంకయ్యపై అసత్య ఆరోపణలు చేశానంటూ కృష్ణా జిల్లా కబడ్డీ సంఘం లెటర్ హెడ్‌పై నేను రాసివ్వలేదు.. దానిపై నా సంతకాన్ని ఫోర్జరీ చేశారని వై.శ్రీకాంత్ అన్నారు. శాప్ నుంచి వచ్చిన నిధులను కార్యదర్శి వీరలంకయ్య తన సొంతానికి వాడుకున్నారని, దీనిపై ఏసీబీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

హెచ్‌టీ పత్తిపై నియంత్రణ మంత్రం

- గ్లైఫోసేట్ అందకుండా చేయాలని వ్యవసాయ శాఖ వ్యూహం
- సానుకూలత వ్యక్తం చేసిన కేంద్రం
- మిగిలిన రాష్ట్రాలూ ఆలోచించాలని సూచన

ఈనాడు – అమరావతి

అనుమతి లేని హెచ్‌టీ పత్తి విత్తన సాగు నియంత్రణకు వ్యవసాయ శాఖ కొత్త దారులు వెదుకుతోంది. పత్తి విత్తన వ్యాపారులు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుని తమ అక్రమ వ్యాపారాన్ని విస్తరిస్తుండగా వ్యవసాయ శాఖ వారి ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. హెచ్‌టీకి మూలమైన గ్లైఫోసేట్ దొరక్కుండా చేయడం తాజా వ్యూహం. ఒకప్పుడు నకిలీ విత్తనాలంటే తెల్ల సంచుల్లో ఏదో ఒక సంస్థ, పేరు పెట్టి అమ్మేవారు. అధికారులు పట్టుకున్నా ఇలాంటి సంస్థలెక్కడా కన్పించవనేది వారి ఉద్దేశం. రాష్ట్రంలో ఇప్పటిదాకా కోస్తా, రాయలసీమకే పరిమితమైన ఈ విత్తనం ఈ మధ్య కాలంలో ఉత్తరాంధ్ర.. అటు నుంచి ఒడిశాకూ తరలుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో మొత్తం పత్తి సాగులో 15 శాతం మించి ఇది సాగవుతుందనే అంచనాలున్నాయి. కొన్నిచోట్ల విత్తనంపై గులాబీరంగు చుక్క పెడుతున్నారు. ఆ విధంగా గులాబీ రంగు పురుగును తట్టుకుంటుందని చెప్పకనే చెబుతున్నారు. మరికొందరు గీతల రూపంలో సంకేతాలు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గతేడాదితో పాటు ఈ మధ్య కాలంలో పట్టుబడ్డ ప్యాకెట్లపై ఏకంగా బీజీ-3 అనే ముద్రించడం, ప్రధాన కంపెనీల పేరుండడంతో రైతులు వీటినే నిజమైనవిగా భావించి కొంటున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖకు పట్టుబడిన విత్తనాల్లో ఇదే బయటపడింది.

గ్లైఫోసేట్ అంటే...

ఇదొక రసాయనం. కలుపు మొక్కల్ని నిర్మూలిస్తుంది. తేయాకు పంటలో వాడకానికే దీనికి అనుమతి ఉంది. మిగిలినచోట్ల విక్రయించకూడదు. అయినా పలు రాష్ట్రాల్లో ఇబ్బడి ముబ్బడిగా విక్రయిస్తున్నారు. తేయాకు ఉనికి లేని ప్రాంతాల్లోనూ లక్షల లీటర్ల విక్రయాలు సాగుతున్నాయి. ప్రస్తుతం హెచ్‌టీ సాగు పెరుగుతున్న నేపథ్యంలో ఈ రసాయనాన్ని అందుబాటులో లేకుండా చేస్తే సాగు దానంతట అదే తగ్గుతుందనేది ఏపీ వ్యవసాయశాఖ వ్యూహం.

దిల్లీ సమావేశం వేదికగా...

హెచ్‌టీ పత్తిసాగును నియంత్రించేదెలా! అనే అంశంపై ఇటీవల దిల్లీలో జరిగిన సమావేశానికి రాష్ట్రం నుంచి ఏపీ సీడ్స్ ఎండీ ఎస్.బాలకృష్ణ, డీఎన్ఏ లాబ్ ఏడీఏ జయకృష్ణ హాజరయ్యారు. 'గ్లైఫోసేట్'ను అందకుండా చేస్తే మొత్తం పరిస్థితి అదుపులోకి వస్తుందని తెలిపారు. అన్ని రాష్ట్రాలూ దీన్ని పాటించవచ్చని కేంద్రం సూచించింది. "సమస్య మీవద్దే ఉంది.. పరిష్కారం మీ వద్దే ఉంది.. మేం కొత్తగా చేయాల్సిందేముంది?" అంటూ స్పష్టత ఇచ్చింది. ప్రజారోగ్యంపై దాని ప్రభావాన్ని అధ్యయనం చేయాలని సంబంధితశాఖలకు సూచించింది.

ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు చేయాలి: జాక్టో

ఈనాడు డిజిటల్, అమరావతి: ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) డిమాండ్ చేసింది. ఉమ్మడి సర్వీసు నిబంధనలపై రాష్ట్రపతి గెజిట్ జారీచేసినా న్యాయస్థానం ఉత్తర్వుల కారణంగా ఉపాధ్యాయుల పదోన్నతులు నిలిచిపోయాయని జాక్టో కో కన్వీనర్ యం.రాజశేఖర్‌రావు తెలిపారు. ఆదివారం విజయవాడలో జాక్టో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్‌రావు మాట్లాడుతూ. . సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బిల్లులు చేసే అధికారాలను తగ్గించడాన్ని వ్యతిరేకించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

నేడు వీఆర్‌ఏల రాష్ట్రస్థాయి సదస్సు

ఈనాడు డిజిటల్, అమరావతి: గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్రస్థాయి సదస్సు సోమవారం విజయవాడలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం గౌరవాధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఆదివారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. వీఆర్‌ఏల వేతనాలను గత నాలుగేళ్లలో రెండు సార్లు పెంచినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా సన్మానం చేయనున్నట్లు వివరించారు. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు.

వచ్చే నెలలో పుట్టపర్తి, సాగర్‌కు విమానయాన సేవలు

విజయవాడ నుంచి నడపనున్న 'సుప్రీం ఎయిర్ లైన్స్'

ఈనాడు, అమరావతి: వచ్చే నెల నుంచి విజయవాడ నుంచి పుట్టపర్తి, నాగార్జునసాగర్ మధ్య విమానయాన సేవలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో ప్రారంభ తేదీని ఖరారు చేయనున్నారు. విజయవాడ నుంచి ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ రెండు ప్రాంతాలకు ప్రత్యేకించి పర్యాటకులకు విమానయాన సేవలు ప్రారంభించేందుకు రాష్ట్ర విమానయాన అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) ప్రజాభిప్రాయాన్ని కోరినపుడు అత్యధికులు తమ సమ్మతిని తెలిపారు. దీనిపై బిడ్లను ఆహ్వానించినపుడు మిగతా సంస్థల కంటే 'సుప్రీం ఎయిర్‌లైన్స్' తక్కువ ఖర్చుకు నడిపేందుకు ముందుకు వచ్చిందని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాగానే సుప్రీం ఎయిర్‌లైన్స్‌తో అవగాహన ఒప్పందం చేసుకొని సేవలు ప్రారంభించనున్నారు. విజయవాడ నుంచి పుట్టపర్తికి రోజూ ఉదయం 7 గంటలకు విమానం బయలుదేరి 8.30 గంటలకు చేరుకుంటుంది. తిరిగి 9 గంటలకు పుట్టపర్తిలో బయలుదేరి 10.30 గంటలకు విజయవాడకు రానుంది. సాయంత్రం మళ్లీ 5 గంటలకు మరో సర్వీసు నడపనున్నారు. విజయవాడ నుంచి నాగార్జునసాగర్‌కు ఉదయం 11 గంటలకు బయలుదేరే విమానం తిరిగి సాయంత్రం 3 గంటలకు వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

'బీకాంలో కెమిస్ట్రీ'పై మంత్రి గంటా ఆగ్రహం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఎస్సీ విద్యార్థికి బీకాం ధ్రువీకరణపత్రం జారీచేసిన ఘటనకు సంబంధించి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎస్సీ విద్యార్థికి బీకాం పట్టా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇందుకు కారణమైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. సమగ్ర విచారణ జరపాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య నాగేశ్వరరావును ఆదేశించారు. అమరావతి నుంచి వీసీతో ఈ మేరకు మంత్రి చరవాణిలో మాట్లాడారు.

27 ధ్రువీకరణపత్రాల్లో తప్పిదాలు: ఉపకులపతి

ఈ సంఘటనపై ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు సైతం స్పందించారు. బీఎస్సీ విద్యార్థికి ఏయూ జారీ చేసిన ఒ.డి. 2016లో ముద్రించారన్నారు. ఆ సమయంలో 27 మందికి జారీ చేసిన ధ్రువీకరణపత్రాల్లోను ఇటువంటి తప్పిదాలు చోటు చేసుకున్నాయన్నారు. అందరు విద్యార్థులకు దీనిపై సమాచారం పంపించామని.. ప్రస్తుతం సమస్య ఎదుర్కొంటున్న విద్యార్థి అప్పట్లో అందుబాటులోకి రాలేదని చెప్పారు. బాధిత విద్యార్థి ఈ ఒ.డి.తోనే ఉద్యోగానికి దరఖాస్తు చేయడం.. ఆ కంపెనీ దీనిపై ప్రశ్నించడంతో తిరిగి ఏయూ దృష్టికి తీసుకొచ్చారన్నారు. తప్పులు సరిచేసి ముద్రించిన కొత్త ధ్రువీకరణపత్రాన్ని సోమవారం అందజేస్తామని నాగేశ్వరరావు తెలిపారు. ధ్రువీకరణపత్రం ముద్రణ పొరుగు సేవల సంస్థ వద్ద జరుగుతుందని అక్కడ జరిగిన తప్పిదమే ఇందుకు కారణమన్నారు. ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ జరపనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల్లేవ్

- సరఫరా అరకొరే
- గోదాముల్లో మూలిగేవి కొన్ని..
- కంపెనీలు అందజేయనివి మరికొన్ని..
- పరీక్షల్లో ఇంకొన్ని..

ఈనాడు – గుంటూరు

ప్రభుత్వాసుపత్రులకు అవసరమైన ఔషధాలను సకాలంలో పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో రోగులు ప్రైవేటుగా మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకుని బోధనాసుపత్రుల దాకా పారాసిటమోల్, కాల్షియం వంటి ఔషధాలూ దొరకని పరిస్థితి నెలకొంది. వీటిని సరఫరా చేయాల్సిన ఆంధ్రప్రదేశ్ వైద్య, మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) సకాలంలో స్పందించడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే మందుల కొరత సమస్య తలెత్తింది. మరోవైపు ఈ సంస్థకు చెందిన వైద్య భాండాగారాల్లో పెద్ద మొత్తంలో ఔషధ నిల్వలు మూలుగుతున్నాయి. మొదటి త్రైమాసికంలో పంపిణీ చేయాల్సిన మందుల్లో అనేకం ఇప్పటికీ నాణ్యత పరీక్షల్లోనే ఉన్నాయి. అవి పరీక్షలు పూర్తి చేసుకుని ఔషధ భాండాగారాలకు వచ్చేందుకు గరిష్ఠంగా నెల రోజులకుపైగా పడుతోందని తెలుస్తోంది. పరీక్షలకు పంపడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది.



గుంటూరులోని కేంద్ర ఔషధ భాండాగారంలో నిండుగా నిల్వలు ★ గుంటూరు జీజీహెచ్ నుంచి వెళ్లిన ఇండెంట్‌కు తమ వద్ద మందుల లభ్యత లేదని తెలియజేస్తూ పంపిన లేఖ

★ గుంటూరు ఔషధ భాండాగారం నుంచి గుంటూరు, విజయవాడ బోధనాసుపత్రులతోపాటు దంత వైద్యశాల, రెండు జిల్లాల పరిధిలో 130కు పైగా ఉన్న పీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆసుపత్రులకు మందులు సరఫరా అవుతాయి. ప్రస్తుతం ఈ భాండాగారంలో మందుల నిల్వలు భారీగా ఉన్నాయి. కానీ ఆసుపత్రుల్లో మాత్రం సరిగా లేవు.

★ గుంటూరు జీజీహెచ్‌కు సగటున రోజుకు వెయ్యి నుంచి 1500 మంది రోగులు వస్తారు. ఈ ఆసుపత్రి నుంచి ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి ఔషధ భాండాగారానికి ఇండెంట్ వెళుతుంది. ప్రతి సారీ అందులో 50 శాతం మందులే ఇస్తున్నారు. మిగిలినవి పరీక్షల్లో ఉన్నాయని చెబుతున్నారు. మరి కొన్నింటికి మందుల కంపెనీల నుంచి కొనుగోళ్ల ఆర్డర్లు (పీఓ ఆర్డర్) రాలేదని, రవాణాలో (ఎల్ఆర్) ఉన్నాయని అంటున్నారు. పెయిన్ కిల్లర్ ఔషధమైన డైక్లో ఫినాక్, మధుమేహులకు అవసరమైన ఎటిల్ వంటి మందులతోపాటు పారాసిటమోల్, కాల్షియం మందులు, విషం కేసు బాధితులకు ఇచ్చేందుకు ఎడ్రినలిన్, ఎడ్రోసిన్ ఇంజెక్షన్లు, ఎసిడిటీకి వాడే పెంటాప్రజ్వల్, అరికాళ్ల మంటలకు వాడే వైట్‌సిల్ ఆయిల్, దగ్గుకు వాడే ఆంట్రాక్లిన్ వంటి పలు మందులు లేవని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు చెప్పారు.

★ పీహెచ్‌సీల నుంచి పారాసిటమోల్, కాల్షియం, బీ కాంప్లెక్స్ వంటి మందులకు డిమాండ్ ఉందని, సరఫరా చేయలేకపోతున్నామని అధికారులు వెల్లడించారు. కొన్ని మందులను కంపెనీలు ఇవ్వడం లేదని, జాప్యం చేస్తున్నాయని వివరించారు.

అత్యవసర సమయాల్లో అన్ని ఆసుపత్రుల్లో సేవలు

రాష్ట్ర పింఛన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రమాదాలు జరిగినపుడు, ఇతర అత్యవసర సమయాల్లో సర్కారు ఆమోదం లేని ఆసుపత్రుల్లో చికిత్స పొందినా ఉద్యోగులు, పింఛనుదారులు మెడికల్ రీఎంబర్స్‌మెంట్ పొందవచ్చని రాష్ట్ర పింఛన్‌దారుల చర్చావేదిక అధ్యక్షులు ఈదర వీరయ్య తెలిపారు. ఇందుకోసం ప్రాథమిక దర్యాప్తు నివేదిక(ఎఫ్ఐఆర్)ను తప్పనిసరిగా అందించాల్సి ఉంటుందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల పే స్కేల్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ రీఎంబర్స్‌మెంట్‌ను మూడు కేటగిరీలుగా విభజించిందని అందులో వివరించారు. 50 వేల బిల్లులను మంజూరు చేసే అధికారం జిల్లా స్థాయిలోని అధికారులకు ఉంటుందని.. అంతకుమించినవి రాష్ట్ర స్థాయిలోని సంబంధిత విభాగాల అధికారుల పరిధిలో ఉంటుందని ఆయన చెప్పారు.

కశ్మీరీ పాత్రికేయులను బెదిరించిన భాజపా నేత చౌదరి లాల్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని పలు మీడియా సంస్థలు ఆదివారం దిల్లీలో డిమాండు చేశాయి.

ADMISSION GUIDANCE-2018
AP/TS/TN/KA/MH/UP
MBBS BDS
BHMS BAMS AG (B.SC)
NEET, NRI Quota
SSR: 9347340332, 8639314566

ఈనాడు

ప్లాస్టిక్‌పై జాతీయోద్యమం

పర్యావరణానికి పెను ప్రమాదంగా పరిణమించి, జీవావరణానికి నిశ్శబ్దంగా మరణశాసనం లిఖిస్తున్న ప్లాస్టిక్ భూతం ఏటికేడు భయానకంగా జడలు విరబోసుకుంటోంది. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చెయ్యడమే లక్ష్యంగా ఈ నెల తొలివారంలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ఆతిథ్యమిచ్చిన ఇండియా ఎన్నో ఏళ్ల క్రితమే ఆ మహమ్మారిపై యుద్ధప్రకటన చేసింది. మాటల్లో పోటెత్తే ఆదర్శాలు చేతల్లో ఆవిరైపోయి ప్లాస్టిక్ చేతి సంచులు చేటు సంచులుగా పదేపదే రుజువవుతున్న వేళ- మహారాష్ట్ర ప్రభుత్వం దేశార్థిక రాజధాని ముంబయి మహానగరంలో ప్లాస్టిక్‌పై కదనకాహళి మోగించింది. మార్చి 23న జారీ అయి తాజాగా అమలులోకి వచ్చిన నోటిఫికేషన్ అనుసారం- ప్లాస్టిక్ సంచుల తయారీ, వినియోగం, రవాణా, పంపిణీ, అమ్మకం, నిల్వ, దిగుమతులన్నీ నిషిద్ధం. ప్లాస్టిక్ లేదా థర్మాకోల్‌తో తయారయ్యే కప్పులు, ప్లేట్లు, గ్లాసుల వంటి ఉత్పాదనలన్నింటినీ నిషేధించిన ప్రభుత్వం- నిబంధనల ఉల్లంఘనులకు భారీ జరిమానాలతోపాటు మూడోసారీ తప్పుచేస్తే మూడు నెలల జైలుశిక్షనూ ప్రతిపాదించడం విశేషం! మహారాష్ట్రలో రెండున్నర వేలదాకా ఉన్న ప్లాస్టిక్ సంచుల తయారీ యూనిట్లలో 56 వేలమంది పని చేస్తున్నారని, ఆయా సంస్థలు బ్యాంకులకు రూ.11 వేలకోట్ల దాకా చెల్లించాల్సి ఉందనీ గణాంకాలు చాటుతున్నాయి. ప్లాస్టిక్ సంచుల నిషేధంతో కూరలు, పళ్లు, మాంసం, చేపల మార్కెట్లతోపాటు వీధుల్లో తినుబండారాల వ్యాపారాలు మూత పడుతున్నాయి. ప్లాస్టిక్ ఉత్పాదనలకు ప్రత్యామ్నాయాల్ని చూపని ప్రభుత్వం- జరిమానాలు విధించి వసూలు చేసేందుకు 250 మంది ఇన్‌స్పెక్టర్లకు మాత్రం శిక్షణ ఇచ్చింది. కరీంనగర్ పట్టణంలో 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ సంచుల్ని నిషేధించిన నగరపాలక సంస్థ కుటుంబానికి రెండు గుడ్డసంచుల్ని పంపిణీ చెయ్యాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఒక్క తీరుగా జాగృత జన మహోద్యమంగా సాగాల్సిన ప్లాస్టిక్‌పై యుద్ధం- ఇలా అరకొరగా అసంబద్ధంగా తెమలిపోతుండటమే చెరుపు చేస్తోంది!

పట్టుమని వందేళ్ల క్రితం పుట్టిన ప్లాస్టిక్ ప్రపంచవ్యాప్తంగా మానవాళి జీవనంలో అంతర్భాగమైపోయింది. శతాబ్ద కాలంలో ఉత్పత్తి అయిన పరిమాణానికి మించిన ప్లాస్టిక్ గత పదేళ్లలోనే తయారైందంటే, దాని వినియోగం ఎంత ఉద్ధృతంగా సాగుతోందో బోధపడుతుంది. ప్రపంచంలో ఇప్పటివరకు 830 కోట్ల టన్నుల సూక్ష్మ ప్లాస్టిక్ తయారైందని, 2015 నాటికే 630 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం అతలాకుతలమవుతోందని శాస్త్రవేత్తలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నారు. ఆయా వ్యర్థాల్లో శుద్ధి, పునశ్శుద్ధికి నోచుకొన్నది 21 శాతం కాగా, తక్కినదంతా భూమిపైనో, సముద్రాల్లోనో పేరుకుపోయి జీవావరణాన్ని దారుణంగా దెబ్బతీస్తోందిప్పుడు! ఏటా 1,900 కోట్ల పౌండ్ల ప్లాస్టిక్ పదార్థాలు సముద్రాల్లో కలుస్తున్నాయని వాటివల్ల జలచరాల అస్తిత్వమే పెనుప్రమాదంలో పడుతోందని తీవ్రాందోళన వ్యక్తమవుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాల్ని ఆహారంగా భ్రమించి తినే చేపలవంటి జలచరాల్ని మనుషులు భుజిస్తే వాటిల్లే ఆరోగ్య సమస్యలు ఇన్నీ అన్నీ కావని హెచ్చరికలు మోతెక్కుతున్నాయి. ప్లాస్టిక్ కాలుష్యంతో భూగర్భ జలాలూ విషకలుషితమై మనిషి మనుగడే దుర్భరమవుతుంది. ఆహారోత్పత్తులు, సౌందర్య సాధనాల ప్యాకేజింగ్, బొమ్మలు, నీటి పైపుల తయారీకి వాడే పాలీ వినైల్ క్లోరైడ్‌తో క్యాన్సర్, చర్మవ్యాధుల వంటివి చుట్టుముట్టే ప్రమాదం ఉంది. నీటి బాటిళ్ల తయారీకి వాడే పాలీ కార్బొనేట్లతో ఊబకాయం, క్యాన్సర్, మధుమేహం వెంటాడుతాయి. ప్రతి మనిషి జీవితాన్ని ఇంతగా చెండుకుతింటున్న ప్లాస్టిక్‌ను నిత్యజీవన వినియోగం నుంచి పూర్తిగా తొలగించాలంటే- అరకొర నిషేధాలతో విఫల ప్రయోగాలు కాదు, దీటైన ప్రత్యామ్నాయాలను ప్రజలకు చేరువ చేసే జాతీయోద్యమమే సాగించాలి!

ప్లాస్టిక్ సంచుల్ని మొత్తంగా నిషేధించడమో, ఉత్పత్తిదారులే తిరిగి సేకరించే విధానాల్ని పరిశీలించడమో చెయ్యకపోతే, భావితరానికి అణ్వాస్త్రాల్ని మించిన పెనుముప్పు దాపురిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం లోగడే నిష్ఠుర సత్యం పలికింది. ప్లాస్టిక్ సంచులు తిని నరకయాతన అనుభవిస్తూ ఏటా వేల సంఖ్యలో కనుమూస్తున్న పశువులు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కడతేరి పోతున్న జలచరాలు, పౌరుల నరనరాల్లో ఇంకుతున్న ప్లాస్టిక్ దుష్ప్రభావాలు- ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కళ్లు తెరిపించాలి. దేశీయంగా షాంపూ పొట్లాలు రూ.3,000 కోట్లు, బిస్కెట్ ప్యాకెట్లు రూ.25 వేలకోట్లు, పండ్ల రసాలు రూ.1,500 కోట్లు, చిరుతిళ్లు రూ.13వేల కోట్లు- ఇలా అనేకానేక వ్యాపార ఉత్పాదనల్ని సమస్త వినియోగదారులకు చేరువచేసే సులభ సాధనంగా ప్లాస్టిక్ విశ్వరూపం దాల్చింది. ప్రపంచవ్యాప్తంగా వాడుతున్న ప్లాస్టిక్‌లో యాభై శాతానికి పైగా వాడి పారేసేదే ఉంటుందని, ప్లాస్టిక్ బాటిళ్లే నిమిషానికి పది లక్షలు అమ్ముడుపోతున్నాయని విశ్లేషణలు చాటుతున్న నేపథ్యంలో- యుద్ధవ్యూహం సర్వసమగ్రంగా ఉండాలి. ప్లాస్టిక్ బాటిళ్లకూ అన్ని విధాలుగా దీటైన ప్రత్యామ్నాయాల తయారీ ఊపందుకొనేలా పరిశోధనలు సాగాలి. 1992 లగాయతు ప్లాస్టిక్ వ్యర్థాల పునశ్శుద్ధికి ప్రధాన కేంద్రంగా ఉన్న చైనా- దిగుమతులపై ఇటీవల నిషేధం విధించిన దరిమిలా ఏ దేశానికా దేశం సొంతంగా ఏర్పాట్లు చేసుకోక తప్పదు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పటిష్ఠ రహదారుల నిర్మాణ సాంకేతికత అందుబాటులోకి వస్తున్న తరుణంలో ఆ దిశగా దృష్టి సారించడం, చౌకైన ప్రత్యామ్నాయాల్ని మార్కెట్లలో సిద్ధం చేసి, ఉత్పాదక స్థాయిలోనే ప్లాస్టిక్‌పై వేటు వెయ్యడం, జన జాగృతి పెంచి స్వచ్ఛంద నిషేధానికి పౌరుల్ని సంసిద్ధం చెయ్యడం- ఇలా నిర్దిష్ట కాలావధుల్లో ప్రభుత్వాలు నిష్ఠగా కార్యపట్టికను అమలుచేసినప్పుడే సత్ఫలితాలు ఒనగూడుతాయి!

ప్రపంచ వాణిజ్యంలో ఇష్టారాజ్యం

ఆచార్య కె.బి. విద్యాసాగర్

రెండో ప్రపంచ యుద్ధానంతరం త్వరితగతిన అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ సంస్థల స్థాపనకు, వ్యవస్థాగత మార్పులకు అనేక దేశాలు నాందిపలికాయి. ఇందులో భాగంగానే ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ఆవిర్భవించాయి. ఆ తరవాత కాలంలో వర్తకాన్ని ప్రోత్సహించేందుకు 1947 అక్టోబరు 30న 23 దేశాలు ఒప్పందాన్ని చేసుకున్నాయి. అంతర్జాతీయ వర్తక ప్రపంచంలో ఇదో మైలురాయి. ఈ ఒప్పందం 1994 ఏప్రిల్ 14 వరకు అమలులో ఉంది. అనంతరం కొత్తగా స్థాపించిన ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్- డబ్ల్యూటీఓ)లో చేరాయి. ప్రస్తుతం అంతర్జాతీయ వివిధ విషయాలన్నీ దీని నేతృత్వంలో సాగుతున్నాయి. ఇందులో 164 దేశాలు సభ్యత్వం కలిగి ఉన్నాయి.

డబ్ల్యూటీఓ మనుగడ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. దీనికి ముఖ్యకారణం సభ్యదేశాలు నియమావళిని తరచూ ఉల్లంఘిస్తుండటమే. కొన్ని ప్రత్యేక లక్ష్యాల సాధనకు డబ్ల్యూటీఓను ఏర్పాటు చేశారు. దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, ఏదైనా దేశం లేదా దేశాలు ఇబ్బందులు కల్పిస్తే అడ్డుకోవడం, వాణిజ్యపరంగా దేశాలమధ్య ఏర్పడిన వివాదాలను పరిష్కరించడం ముఖ్యమైన లక్ష్యాలు. అంతర్జాతీయ వాణిజ్యం పరిధిపెరిగే విధంగా దేశాల మధ్య చర్చలను ప్రోత్సహించడం, సభ్యదేశాలకు వర్తక విధానాల రూపకల్పనలో సహాయం, వర్ధమాన దేశాలు విపణిలో నిలదొక్కుకొనేందుకు సహకారం అందించడం దీని బాధ్యత. సభ్యదేశాల మేధాపరమైన హక్కులను కాపాడటం, వస్తుసేవల వాణిజ్యం ద్వైపాక్షికత్వమయ్యేందుకు కృషి చేయడం వంటి లక్ష్యాల సాధనలో సభ్యదేశాల నుంచే డబ్ల్యూటీఓ అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. నియమ నిబంధనలను తు.చ. తప్పక పాటిస్తామని ప్రతిజ్ఞ చేసిన సభ్యదేశాలే ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి.

నిబంధనల బేఖాతరు

అంతర్జాతీయ వాణిజ్య పురోగతి మూడు అంశాలపై ఆధారపడి ఉంది. మొదటిది విచక్షణ లేని వాణిజ్యం. దీని ప్రకారం ఏ సభ్యదేశమూ మిగిలిన దేశాల వాణిజ్యంపై ఎలాంటి విచక్షణ చూపరాదు. దీనినే 'ప్రిన్సిపల్ ఆఫ్ నాన్ డిస్క్రిమినేషన్' అంటారు. ఇందులో ప్రధానమైనది ప్రతి సభ్యదేశాన్నీ 'అత్యంత అనుకూల దేశంగా' (మోస్ట్ ఫేవర్డ్ నేషన్, ఎంఎఫ్ఎన్) గుర్తించడం. ఏ దేశం సభ్యదేశాలను టారిఫ్ పరంగా గాని, మినహాయింపుల పరంగాగాని, ప్రత్యేక సౌకర్యాల విషయంలో గాని వేరుగా పరిగణించరాదు. సమాన అవకాశాలు, షరతులను అందరికీ వర్తింపజేయాలి. ఈ నిబంధనను సభ్యదేశాలు ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. వాటికి ఇష్టం ఉన్న దేశాలకు మాత్రమే దీన్ని వర్తింపజేస్తున్నాయి. భారత్‌ను ఉదాహరణగా తీసుకుంటే, పాకిస్థాన్‌కు ఎంఎఫ్ఎన్ సౌకర్యాన్ని 1996లోనే కల్పించింది. భారత్‌కు అదే గుర్తింపును మాత్రం పాక్ ఇవ్వలేదు. దీంతో పాకిస్థాన్‌కు తాను ఇచ్చిన గుర్తింపును ఉపసంహరించే ఆలోచన భారత్ చేస్తోంది. ఇది కార్యరూపం దాలిస్తే, భారత్-పాక్ మధ్య జరుగుతున్న 261 కోట్ల డాలర్ల విలువైన వర్తకం ఆగిపోవచ్చు.

భారత్‌కు కంటగింపు కలిగిస్తున్న మరో అంశం ఉంది. చాలా ఆలస్యంగా వాణిజ్య కూటమిలో చేరిన చైనా (2001లో చైనా డబ్ల్యూటీఓ సభ్యత్వం పొందింది)కు పాకిస్థాన్ ఎంఎఫ్ఎన్ హోదాను 2013లోనే కల్పించింది. పాకిస్థాన్, చైనాతో జరుపుతున్న వాణిజ్యం కూడా అధికం. ఇది సుమారు 1,500 కోట్ల డాలర్ల వరకు ఉంది. దీంతో పోలిస్తే పాకిస్థాన్‌తో భారత్ వాణిజ్యం 20 శాతం మాత్రమే. భవిష్యత్తులో ఈ పరిమాణం మరింతగా తగ్గే అవకాశాలే ఉన్నాయి. డబ్ల్యూటీఓలో సభ్యత్వం గల ఐరోపా దేశాల చట్టాలు ఎంఎఫ్ఎన్ హోదా ఇతర దేశాలకు కల్పించడంలో అడ్డంకిగా ఉన్నాయి. ప్రస్తుతానికి చాలా

ప్రాభవం కోల్పోతున్న డబ్ల్యూటీఓ

ఐరోపా దేశాల్లో అమలులో ఉన్న చట్టాలు, ఆయా దేశాల మార్కెట్ల రక్షణకు అనువుగా ఉన్నాయి. ఈ చట్టాలను ఆయా దేశాలు సవరిస్తే తప్ప, ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛా వాణిజ్యం పురోగమించే అవకాశం లేదు.

సభ్యదేశాల్లో అధిక భాగం ద్వైపాక్షిక, త్రైపాక్షిక, బహుళ ఒప్పందాలు చేసుకోవడంలో తీరిక లేకుండా ఉన్నాయి. వీటిని 'ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాలు' అని వ్యవహరిస్తారు. ఈ విధంగా ప్రత్యేక ఒప్పందాలు చేసుకొన్న దేశాలు, అందరికీ సమానమైన వాణిజ్యావకాశాలను కల్పించలేవు. దీనికితోడు, ప్రపంచం మొత్తం మీద వర్తక సమూహాల ఏర్పాటు (ట్రేడ్ బ్లాక్స్) అప్రతిహతంగా సాగుతోంది. జి-8, బ్రిక్స్, ఈయూ, ఏషియాన్ తదితర సంస్థలు ఇందుకు ఉదాహరణ. ప్రస్తుతం ప్రపంచం మొత్తం మీద ఇటువంటి సమూహాలు దాదాపు 40 వరకు ఉన్నట్లు అంచనా. ఈ విషయంలో చైనా క్రియాశీలంగా వ్యవహరిస్తోంది. అది ఈ మధ్యనే ఏషియాన్‌తో ప్రత్యేక వర్తక ఒప్పందం చేసుకుంది.

అంతర్జాతీయ వాణిజ్యం అభివృద్ధి చెందడంలో మరో కీలకాంశం ఇచ్చిపుచ్చుకొనే ధోరణి. దీని ప్రకారం ప్రతి సభ్యదేశం పెరుగుదలకు అవసరమైన వాతావరణాన్ని కల్పించాలి. వాణిజ్య షరతులు ఒక దేశానికి అనుకూలంగా, మరో దేశానికి ప్రతికూలంగా ఉండరాదు. ఒక దేశం మరొక దేశానికి సుంకాల మినహాయింపు లేదా మరేదైనా ఇచ్చినట్లయితే దాన్ని మిగిలిన సభ్యదేశాలన్నింటికీ వర్తింపజేయాలి. ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. ఒక్కొక్క దేశానిది ఒక్కో దారి. కొంతమేరకు సమానావకాశాలు, షరతులు, మినహాయింపులు 'వర్తక సమూహం'లోని సభ్యదేశాల మధ్య కొనసాగుతున్నాయి. ఒకే దేశం అనేక సమూహాలు, కూటముల్లో భాగస్వామిగా చేరడం వల్ల, అంతర్జాతీయ వాణిజ్యం గందరగోళంగా ఉంది. ఈ నేపథ్యంలో స్వేచ్ఛావిపణి మాటకు విలువ, అర్థం లేదు. ఇచ్చి పుచ్చుకొనే ధోరణి అభివృద్ధి చెందిన దేశాల మధ్య పరిఢవిల్లినంతగా, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య లేదు. డబ్ల్యూటీఓ బలమైన సంస్థగా ఎదగలేకపోవడానికి ఇదొక కారణం. డబ్ల్యూటీఓ నియమావళిలో మరొక ముఖ్యాంశం- స్వదేశీ, విదేశీ ఉత్పత్తిదారుల మధ్య వివక్ష చూపకపోవడం! దీన్నే 'జాతీయ ఆదరణ' (నేషనల్ ట్రీట్‌మెంట్)గా పిలుస్తారు. స్వదేశంలోని కంపెనీలకు ఇచ్చిన రాయితీలు, మినహాయింపులు విదేశీ కంపెనీలకూ వర్తింపజేయాలి. విధానపరమైన నిర్ణయాల రూపకల్పనలోగాని, వాటి అమలులోగాని విదేశీ కంపెనీల పట్ల విచక్షణ చూపరాదు. ఈ నిబంధనను చాలా సభ్యదేశాలు పాటించడంలేదు. కొన్ని దేశాలు, విదేశీ కంపెనీలు స్వదేశీ ముడిసరకులనే వాడాలని, సరకు రవాణాలో కొన్ని కంపెనీల రవాణా సాధనాలనే ఉపయోగించాలని, సిబ్బంది కూడా తమ దేశం వారే అయి ఉండాలని నిబంధనలను విధిస్తున్నాయి. కొన్ని దేశాలు విపరీతమైన దిగుమతి సుంకాలను విధిస్తూ ఇతర దేశాల వస్తువులు పోటీకి నిలబడలేని స్థితిని కల్పిస్తున్నాయి.

విశ్వవిపణిలో అగ్రదేశాలు



ఆధారం: ప్రపంచ వాణిజ్య సంస్థ

ఐరాసకు అగ్ని పరీక్ష

ఇంత అసంబద్ధంగా కొనసాగుతున్న 'అంతర్జాతీయ స్వేచ్ఛావిపణి' లక్ష్యం ప్రస్తుతం అమెరికా, చైనా ఏకపక్ష నిర్ణయాల వల్ల మరింత కుదేలవుతోంది. ఒకప్పుడు 'ఏకధ్రువ శక్తి'గా వెలిగిన అమెరికా ప్రస్తుతం అంతర్జాతీయ ఒప్పందాల నుంచి వైదొలుగుతోంది. స్వేచ్ఛావాణిజ్యం ఇందులో ఒక భాగం. దీనికితోడు, దిగుమతులపై విపరీతంగా సుంకాలను పెంచుతూ స్వేచ్ఛా వాణిజ్యానికి విఘాతం కలిగిస్తోంది. చైనా-అమెరికాల మధ్య 'వాణిజ్య యుద్ధం' (ట్రేడ్ వార్) ఇప్పట్లో సమసిపోయే పరిస్థితి కనిపించడం లేదు. అమెరికా మిత్రదేశాలైన బ్రిటన్, కెనడా సైతం ఇదే ధోరణి అనుసరించవచ్చు. ఇక ఐరోపా దేశాలది మరో దారి. ఇంతవరకు అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమతో కలిసిరావడం లేదని పర్యావరణ పరంగా, కార్మిక, మానవ హక్కుల పరంగా వాటికి చిత్తశుద్ధి లేదని, మేధోహక్కులకు భంగం కలిగిస్తున్నాయని ఆక్రోశించిన అమెరికా దాని మిత్రదేశాలు తమ దారి తాము చూసుకోవడం విచారకరం.

ఈ నేపథ్యంలో అసలు డబ్ల్యూటీఓ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. సభ్యదేశాలపై చర్యలకు ఏ మాత్రం అధికారం లేని సంస్థ వల్ల స్వేచ్ఛా వాణిజ్య లక్ష్యానికి చేకూరే ప్రయోజనం ఏమీలేదు. త్వరలోనే ఉనికి, ప్రాభవాలను కోల్పోయిన సంస్థగా మిగిలిపోకుండా ఉండాలంటే దేశాల మధ్య గట్టి సంకల్పం అవసరం. సానుభూతి మాటల వల్ల పరిస్థితి చక్కబడదు. ఐక్యరాజ్య సమితి అన్ని దేశాలను సమావేశపరచాలి. జరుగుతున్న నష్టాన్ని వివరించాలి. సభ్య దేశాలు విజ్ఞతతో మెలిగే విధంగా కృషి చేయాలి. లేనట్లయితే 'స్వేచ్ఛావిపణి' భావనకు అర్థమే ఉండదు!

(రచయిత- పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

క్షమార్హులు కానేకారు...

ఎ.సూర్యప్రకాశ్

జూన్ నెల అనగానే మండుటెండలే కాదు... మన చరిత్రలో చెరగని ఓ పీడకల కూడా గుర్తుకొస్తుంది. అదే ఎమర్జన్సీ. 1975 జూన్ 25నాడు కాంగ్రెస్ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఆత్యయిక స్థితి విధించి జవజీవాలు ఉట్టిపడే మన ప్రజాస్వామ్యం పీక నులిమి నియంతృత్వంగా మార్చేశారు. ఎమర్జన్సీ మన ప్రాథమిక హక్కులతోపాటు జీవించే హక్కునూ హరించేసింది. భారతీయులు ప్రజాస్వామ్య ఛత్రం కింద నిరంతరం స్వేచ్ఛావాయువులు పీలుస్తూ ఉండాలన్నా, మన రాజ్యాంగ విలువలను సంరక్షించుకోవాలన్నా, 1975-77 మధ్య ఎమర్జన్సీ కాలంలో సంభవించిన ఘోరాలను మరచిపోకూడదు, వాటికి కారకులైనవారిని క్షమించరాదు.

యోధుల పోరాటపటిమ

మొదట మనం మరవకూడని అంశాలు, సంస్థలు, వ్యక్తులను ఒకసారి మననం చేసుకుందాం. ఇందిరా గాంధీ నిరంకుశ ప్రభుత్వంపై ప్రాణాలకు తెగించి మరీ పోరాడి చివరకు 1977 మార్చిలో ప్రజాస్వామ్య రథాన్ని మళ్ళీ గాడిన పెట్టిన వందలాది రాజకీయ, సామాజిక నాయకులు, కార్యకర్తల త్యాగాలను ఎన్నటికీ విస్మరించకూడదు. వీరిలో జయప్రకాశ్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయీ, చంద్రశేఖర్, జార్జి ఫెర్నాండెజ్, ఎల్‌కే అడ్వాణీ, చరణ్ సింగ్, మధు దండావతే, మొరార్జీ దేశాయ్, నానాజీ దేశ్‌ముఖ్, రామకృష్ణ హెగ్డే, సికందర్ బక్త్, నరేంద్ర మోదీ, హెచ్‌డీ దేవెగౌడ, లాలు ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్ తదితరుల త్యాగాలు చిరస్మరణీయాలు.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) పోషించిన బలీయ పాత్ర అసమానమైనది. అంతర్గత భద్రతా పరిరక్షణ చట్టం (మీసా) కింద మొత్తం 6,330 మంది రాజకీయ కార్యకర్తలు జైలుపాలయ్యారు. వారిలో 4,026 మంది ఆరెస్సెస్, జన సంఘ్ (భారతీయ జనతా పార్టీ పూర్వ సంస్థ)లకు చెందినవారే. వీరిలో ఆరెస్సెస్ సర్‌సంఘ్ చాలక్ బాలాసాహెబ్ దేవరస్, ప్రస్తుత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రస్తుత కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, ప్రకాశ్ జవడేకర్, అనంత్ కుమార్, రామ్‌విలాస్ పాసవాన్, సీనియర్ ఆరెస్సెస్ నాయకుడు దత్తాత్రేయ హోసబలేల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇంకా అప్పటి పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం స్వామి రెండుసార్లు గుట్టుగా దేశం విడిచివెళ్లి అమెరికా, బ్రిటన్‌లలో ఇందిరా గాంధీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఆ రోజుల్లో ఆరెస్సెస్ ప్రచారక్‌గా ఉన్న నరేంద్ర మోదీ అజ్ఞాతవాసం నుంచి ఎమర్జన్సీపై పోరాడారు. ఆత్యయిక స్థితిని నిరసిస్తూ కరపత్రాలు, సాహిత్యం వెలువరించి పంపిణీ చేయడం, జైలులో ఉన్న నాయకుల కుటుంబాలను ఆదుకోవడం వంటి కార్యక్రమాలను నిర్వహించేవారు. ఆనాటి హెబియస్ కార్పస్ వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తీర్పుపై ఏకైక నిరసన గళం వినిపించిన న్యాయమూర్తి హెచ్‌ఆర్ ఖన్నాను ఈ దేశం ఎప్పటికీ మరువకూడదు. 'చట్టం నిర్దేశించిన పద్ధతిలో తప్ప మరేవిధంగానూ ఏ ఒక్క పౌరుడి ప్రాణాలను, వ్యక్తిగత స్వేచ్ఛను హరించకూడ'దని 21వ రాజ్యాంగ అధికరణ నిర్దేశిస్తోంది. ఎమర్జన్సీ కాలంలో ఈ స్వేచ్ఛను సంరక్షించుకోవడానికి కోర్టుకు వెళ్లే హక్కు పౌరులకు ఉందా లేదా అన్నది పై కేసులో సుప్రీంకోర్టు తేల్చాల్సి ఉంది. ప్రజాస్వామ్య దేశానికి, నియంతృత్వ దేశానికి మధ్యగల తేడాను ఈ స్వేచ్ఛ నిర్వచిస్తోంది. ఎమర్జన్సీ రోజుల్లో

ఇందిరా గాంధీ | బన్సీలాల్ | వీసీ శుక్లా

ఆత్యయిక స్థితి అరాచకాలు

పౌరులకు ఈ స్వేచ్ఛ ఉండదన్న ప్రభుత్వ దృక్పథాన్ని అటార్నీ జనరల్ నీరేన్ డే నొక్కి చెప్పారు. అలాగైతే ఎవరైనా పోలీసు అధికారి వ్యక్తిగత కక్షతో తనకు గిట్టని పౌరుణ్ని చంపితే, దానికి న్యాయపరమైన చర్యలేవీ ఉండవా అని జస్టిస్ ఖన్నా ప్రశ్నించగా, 'ఉండవు' అని నీరేన్ డే తెగేసి చెప్పారు. కోర్టు గదిలో ఉన్నవారంతా ఈ జవాబుకు నిశ్చేష్టులయ్యారు. ఈ తతంగాన్ని మిగిలిన న్యాయమూర్తులు నోరు మెదపకుండా చూస్తూ కూర్చున్నారని ఖన్నా తన ఆత్మకథలో వెల్లడించారు. వారిలో ప్రధాన న్యాయమూర్తి ఏఎన్ రే సహా న్యాయమూర్తులు ఎంహెచ్ బేగ్, వైవీ చంద్రచూడ్, పీఎన్ భగవతి ఉన్నారు. చివరకు వారంతా కూడబలుక్కొని ప్రభుత్వ దృక్పథాన్ని సమర్థించి పౌరుల ప్రాణ, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కును హరించేశారు. జస్టిస్ ఖన్నా ఒక్కరే ఈ దృక్పథంతో విభేదించారు. ఇందిరాగాంధీ ఆ తరవాత ఖన్నా సీనియారిటీని పక్కనపెట్టి జస్టిస్ బేగ్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అయితేనేం... ప్రజాస్వామ్యాన్ని, మౌలిక హక్కులనూ ప్రేమించేవారందరికీ ఖన్నా ఆరాధనీయుడిగా నిలిచిపోయారు.

ఎమర్జన్సీ రోజుల్లో దౌష్ట్యానికి పాల్పడిన నాయకులు, వ్యక్తులు చాలామందే ఉన్నారు. వారు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షంతవ్యులు కారు. ఈ జాబితాలో మొదటిస్థానంలో నిలిచే వ్యక్తి ఇందిరాగాంధీయే. ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చి, సామూహిక జనన నిరోధ శస్త్రచికిత్సలను అనుమతించి, తన స్వార్థం కోసం రాజ్యాంగాన్ని, ఎన్నికల చట్టాలను అడ్డగోలుగా సవరించి, ఉన్నత న్యాయవ్యవస్థను బలహీనపరచడానికి 42వ రాజ్యాంగ సవరణ తెచ్చి, కార్యనిర్వాహక ఉత్తర్వులతోనే రాజ్యాంగాన్ని సవరించే అధికారాన్ని రాష్ట్రపతికి కట్టబెట్టినందుకు- ఆమెను ఈ జాతి ఎన్నటికీ క్షమించలేదు. అలాగే ఇంజినీరింగ్ విద్యార్థి పి. రాజన్‌ను చిత్రహింసలు పెట్టి హతమార్చిన కేరళ పోలీసులు, లారెన్స్ ఫెర్నాండెజ్‌ను నెలల తరబడి హింసించి కూడా శిక్ష పడకుండా తప్పించుకున్న కర్ణాటక పోలీసులూ క్షంతవ్యులు కారు.

ఇందిర ప్రభుత్వంలో సమాచార, ప్రసార శాఖ మంత్రిగా పత్రికలపై సెన్సార్ విధించి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికను ప్రభుత్వ అధీనం చేయాలని చూసిన వీసీ శుక్లా పరమ ప్రజాస్వామ్య ద్రోహి. వార్తాపత్రికలపై దాడులు చేసి మూసివేయించే అధికారాన్ని జిల్లా మేజిస్ట్రేట్లకు కట్టబెట్టే చట్టాలు తెచ్చిన శాల్తీ ఆయన. చివరకు మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ టాగోర్‌ల వ్యాఖ్యలు, సూక్తులను సైతం పత్రికలు ప్రచురించకూడదనేంతవరకు వెళ్లారాయన. అప్పట్లో బాలీవుడ్ గాయకుడు కిశోర్ కుమార్ ప్రభుత్వ వాణిజ్య ప్రచార గీతం పాడటానికి నిరాకరించడంతో ఆలిండియా రేడియోలో ఆయన పాటలు ప్రసారం కాకుండా చూసిన ఘనుడు శుక్లా!

జీవితాలతో చెలగాటం

ఎమర్జన్సీలో జైలుపాలైన రాజకీయ ఖైదీలను ఇందిరా గాంధీ కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారని విపరీత వ్యాఖ్యలు చేసిన జస్టిస్ బేగ్ న్యాయవ్యవస్థకు కళంకంగా నిలిచిపోయారు. ఎమర్జన్సీ వ్యతిరేకులను నిర్బంధంలో ఉంచడానికి జైలు గదులు సరిపోవడం లేదని తిహార్ జైలు సూపరింటెండెంటు చెప్పినప్పుడు, ఖైదీలను ఆస్బెస్టాస్ రేకుల గదుల్లోకి నెట్టి సలసలా మరిగించాలని, మరి కొందరిని మానసిక చికిత్సాలయాల్లో పడేయాలని సూచించిన దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యదర్శి నవీన్ చావ్లాను ఎప్పటికీ క్షమించకూడదు. హరియాణా ముఖ్యమంత్రిగా, రక్షణ మంత్రిగా పదవులు వెలగబెట్టిన బన్సీలాల్ దారుణాలు అన్నీ ఇన్నీ కావు. సామూహిక నిర్బంధ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స శిబిరాలను నిర్వహించిన ప్రబుద్ధుడు బన్సీ. ముస్లిముల గ్రామమైన ఉట్టావర్‌లో నడిపిన ఇలాంటి శిబిరంలో హాహాకారాలు చెలరేగాయి. ట్రక్కుల నుంచి దిగిన పోలీసులు ఆ గ్రామంలో 8 నుంచి 80 ఏళ్ల మధ్య వయసుగల ముస్లిం బాలురు, పురుషులను బలవంతంగా తీసుకెళ్లి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించారు. పలు ఉత్తరాది రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు, పోలీసులు తలా ఇన్ని నిర్బంధ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలని కోటా విధించారు. చాలాచోట్ల ఉపాధ్యాయులూ ఈ చికిత్సలు చేయించుకోవలసి వచ్చింది. అందుకు నిరాకరించినవారిని మీసా చట్టం కింద జైల్లో కుక్కేవారు. ఈ దారుణాలన్నింటినీ మనం మరచిపోతే మన ప్రజాతంత్ర జీవన విధానమే ప్రమాదంలో పడుతుంది.

(రచయిత- ప్రసార భారతి ఛైర్మన్)

సేవాధర్మం

దైవాన్ని లోపల చూసుకోవడం ధ్యానం. పక్కనున్నవారిలో చూడటం సేవ. సేవ చేస్తే- వారిని జనం స్వార్థానికి ఉపయోగించుకుంటారన్న భయం ఉంది లోకంలో. ప్రతి విషయాన్నీ తప్పుపట్టే ధోరణిలో చూడకుండా జాగ్రత్తగా, తెలివిగా వ్యవహరిస్తే సరిపోతుంది.

సేవ పరిపక్వతను తీసుకొస్తుంది. పరిపక్వత మనిషిని ధ్యానంలో ఉండేలా చేస్తుంది. ధ్యానం, పోగొట్టుకున్న చిరునవ్వును ముఖంమీద ప్రకాశింపజేస్తుంది. ఎవరైతే బాధ్యతల్లో తలమునకలైఉంటారో వారి దృష్టి ప్రార్థనవైపు మళ్ళదు. చాలా సందర్భాల్లో, ఎవరైతే ప్రార్థనల్లో నిమగ్నమైఉంటారో వారు బాధ్యతలను ఇష్టపడరు. ఆధ్యాత్మికత రెండింటినీ ఒకటి చేస్తుంది. సేవ, ఆధ్యాత్మిక సాధన కలిసి ఉంటాయి. ధ్యానంలో ఉండే వ్యక్తి తన ఆనందాన్ని ప్రతి ఒక్కరితో పంచుకుంటారు. ఇతరులకు సేవలందించినప్పుడు, ఆ సేవలు వారికి ఆనందం కలిగించినప్పుడు వ్యక్తి యోగ్యత పెరుగుతుంది. ఒక గొప్ప అర్హత సంపాదించుకున్నట్లవుతుంది.

సేవలు అందించి ఎంతో మేలు పొందిన వారూ ఎందరో కనిపిస్తారు. తమ సంతోషానికి కారణం తామందిస్తున్న సేవల ఫలితమే అని చెప్పేవారూ ఉన్నారు. జీవితంలో సంతోషం కరవైనట్లు అనిపిస్తే సేవలందించడంలో మనిషి లీనమవ్వాలి. అది వ్యక్తిలో ఉత్సాహాన్ని పెంచి సంతోషంగా ఉంచుతుంది. సేవాగుణంలో అద్భుతశక్తి దాగివుంది. మనిషిలో అనవసర భయాలు తొలగిపోతాయి. ఒక లక్ష్యం ఏర్పడుతుంది. చేసే పనులు అర్థవంతమవుతాయి. దీర్ఘకాల ప్రయోజనం చేకూరుతుంది.

నిరాశా నిస్పృహలకు లోనవుతుండేవారికి సేవామార్గం ఒక మహాభాగ్యం. నిరాశతో నిండిన మనసుతో దిక్కుతోచని పరిస్థితులు ఎదురైన సందర్భాల్లో ఒంటరిగా కూర్చుని 'నేను ఈ పరిస్థితుల్లో ఆనందంగా ఉండాలంటే ఏం చేయాలి' అని ప్రశ్నించుకోవాలి. 'నాకే ఎందుకు ఇలా జరుగుతోంది, ఈ పరిస్థితి నాకే ఏమిటి'- అనుకుంటే మరింత నిరాశకు గురి చేస్తాయి ఆలోచనలు. చరిత్ర చూస్తే ప్రజలకు నిజమైన సేవలందించినవారే చిరస్థాయిగా మిగిలిపోయిన విషయం అర్థమవుతుంది.

ప్రాథమికంగా చూస్తే మనిషికి జీవితంలో రెండు మార్గాలు కనిపిస్తాయి. వెలుగు వైపు మళ్ళడం, వెలుగుకు దూరంగా వెళ్ళడం. దేన్ని ఎంపిక చేసుకున్నారన్న దానిమీదే ఆధారపడి ఉంటుంది. జీవితంలో మనిషిగా విజయం సాధించాలంటే వివేకంతో వెలుగును ఎంచుకునే నిగూఢమైన శక్తిని పెంపొందించుకోవాలి.

ప్రతి మనిషీ గొప్పవాడే. ఎవరైనా సేవలందించగలుగుతారు. దానికి ఎటువంటి విద్యార్హతలు, డబ్బు అవసరం లేదు. కారణం వెతకాల్సిన పనిలేదు. ఉండాల్సిందల్లా స్పందించే హృదయం. దాన్నిండా ప్రేమ.

అంతర్యామి

మనస్ఫూర్తిగా సేవలందిస్తున్నప్పుడు అది భుక్తి కోసమే అయినా తన అవసరాలు, కోరికలు స్ఫురణకు రావు. ఎదుటివారి సౌఖ్యం, భద్రత మాత్రమే దృష్టిలో ఉంటాయి. నిస్వార్థపరులు ప్రతిఫలాన్ని ఆశించి ఏ పనీ చేయరు. అటువంటివారికి దైవకృప తప్పకుండా లభిస్తుంది. ఎవరికైనా సహాయపడినప్పుడు, సేవలందించినప్పుడు హృదయం విశాలమవుతుంది. ఆత్మసంతృప్తి కలుగుతుంది.

నిశ్శబ్దమంటే ప్రార్థన/ ప్రార్థనంటే నమ్మకం/ నమ్మకం అంటే ప్రేమ/ ప్రేమ ఒక సేవ/ సేవ ద్వారా లభించేది శాంతి అంటారు మదర్ థెరెసా. ఏ విధంగా సేవలందించగలను అన్న దృష్టి మనిషిలో కలిగితే, అదే అతడి జీవితంలో కేంద్ర బిందువైతే- అభివృద్ధిలో అద్భుతాలు చూడొచ్చు.

ఏ పని తీసుకున్నా ఆ పని చేయడంలో ఒక్కొక్కరి దృక్పథం ఒక్కోలా ఉంటుంది. ఒకరు ఈ పనిని నరకంగా భావిస్తే, మరొకరు దానినే కర్తవ్యంగా తీసుకుంటారు. వేరొకరు దానినే భగవంతుడి ఆశీర్వాదంగా, తమకు లభించిన అదృష్టంగా భావించి చేస్తారు. ఆ దృక్పథంలోనే స్వర్గం-నరకం దాగి ఉన్నాయని గ్రహించాలి. దాన్నిబట్టే జీవితంలో సుఖసంతోషాలు ఆధారపడి ఉంటాయి. కేవలం ఆర్జించగలిగే స్థితి ఉండటం, సంపదలు కలిగి ఉండటం సరిపోదు. సంతృప్తి ఉంటే ఏ సిరిసంపదలతోనూ పనిలేదు. ప్రాప్తమున్నదాంట్లో ఆనందంగా జీవించగలగడం గొప్ప విషయం!

– మంత్రవాది మహేశ్వర్

భయపెడుతున్న నీలి కాంతి!

ఒకప్పుడు పగలంతా పనులు చేసుకునే వాళ్లం. పొద్దుగూకుతూనే పడుకునేవాళ్లం. అంతే!

అది సహజమైన జీవనశైలి. సూర్యుడొక్కడే మనకు కనిపించే కాంతి. మనుషులూ ఆయనతోనే లేచేవారు, ఆయనతో పాటే విశ్రమించేవాళ్లు. మనిషీ ప్రకృతీ మమేకమై నడిచిన రోజులవి. కానీ ఇప్పుడు రాత్రికి అర్థం మారిపోయింది. పగటికంటే రాత్రి మిరుమిట్లు ఎక్కువైపోతున్నాయి. రాత్రి జీవితం పగటికంటే సుదీర్ఘమైనదిగా కూడా తయారవుతోంది. దీన్ని మన ఘనతగా చెప్పుకొంటున్నాంగానీ దీనికి మనం చెల్లిస్తున్న మూల్యం కూడా ఎక్కువేనని వైద్యరంగం ఇప్పుడిప్పుడే స్పష్టంగా గుర్తిస్తోంది. రాత్రి కృత్రిమ కాంతులు చూసి మన మెదడు భ్రమపడుతోంది. ఏది శ్రమించే సమయమో, ఏది విశ్రమించే సమయమో తెలియక గందరగోళపడుతోంది. ఇది ఒక సమస్య అయితే .. మన చుట్టూ ఉన్న కృత్రిమ కాంతిలో ఉండే 'బ్లూ లైట్' వల్ల కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయని పరిశోధనా రంగం గట్టిగా హెచ్చరిస్తోంది. ముఖ్యంగా మనం రోజంతా మొబైల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, ట్యాబ్లెట్ల వంటి డిజిటల్ తెరల ముందర గడుపుతుండటం వల్ల తీవ్ర అనర్థాలు సంప్రాప్తిస్తున్నాయి. దీన్ని గర్తించి జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి అని హార్వర్డ్‌తో సహా ప్రపంచ పరిశోధకులంతా నొక్కి చెబుతున్నారు.

తెరల మధ్యే తెల్లవారుతోంది!

ఉదయం లేస్తూనే మొబైల్ చూడటంతో మొదలయ్యే మన జీవితం రోజంతా డిజిటల్ స్క్రీన్ల మధ్యే గడిచిపోతోంది. ఇలా రోజులో అధిక భాగం ఏదో ఒక డిజిటల్ స్క్రీన్‌ను, చాలా దగ్గర నుంచి చూస్తుండటం క్రమేపీ పెద్ద ఆరోగ్య సమస్యగా తయారవుతోందని, దీనివల్ల ఒకప్పటి కంటే ఇప్పుడు కంటి వ్యాధులు, నిద్ర సమస్యలు పెరిగిపోతున్నాయని పరిశోధకులు గుర్తించారు.

ప్రపంచ వ్యాప్తంగా **60%** జనాభా రోజులో **6** గంటల కంటే ఎక్కువ సమయమే డిజిటల్ తెరల ముందు గడుపుతున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.

కుర్రకారు సగటున రోజులో **10-12** గంటలకు పైగా ఈ స్క్రీన్స్‌తో గడుపుతున్నారు.

రోజూ డిజిటల్ పరికరాలు వాడుతున్న వారిలో **70%** మంది దీనికి సంబంధించిన ఏదో లక్షణాలతో సతమత మవుతున్నారు.

ఇవీ సమస్యలు

- డిజిటల్ స్క్రీన్ల నుంచి వెలువడే కాంతిలో 25% వరకూ బ్లూలైట్ ఉంటోంది. దీర్ఘకాలం ఈ కాంతి మన కంటికి సోకటం వల్ల కంటికీ, ఒంటికీ కూడా ప్రమాదాలు వచ్చిపడుతున్నాయి.
- బ్లూలైట్ వల్ల కంటి వ్యాధులు గత దశాబ్దంలో 12% పెరిగాయని అంచనా.

కంటి తిప్పలు

- రెటీనా పొర దెబ్బతినటం
- ప్రకాశవంతమైన కాంతిని చూసినప్పుడు ఒక్కక్షణం చూపు మసకబారినా సాధారణంగా కొద్దిక్షణాల్లోనే మళ్లీ మామూలు అయిపోతుంది. కానీ ఈ బ్లూలైట్ ప్రభావానికి ఎక్కువగా లోనైనప్పుడు .. ఇలా సత్వరమే కోలుకోలేకపోతోందని కూడా గుర్తించారు.
- కళ్లు పొడిబారటం
- చూపు బూజురుబూజురుగా మారటం
- శుక్లాలు
- మధ్య చూపు దెబ్బతినే మాక్యులర్ డీజనరేషన్
- తలనొప్పి

ఒంటి సమస్యలు

- నిద్ర చెడిపోవటం
- జ్ఞాపకశక్తి అస్తవ్యస్తం
- ఏకాగ్రత తగ్గిపోవడం
- చదువుల్లోనూ వెనకబాటు
- ఆకలిని నియంత్రించే హార్మోన్లూ అస్తవ్యస్తమై తిండి అలవాట్లు మరిపోవటం, డిప్రెషన్, ఊబకాయం, మధుమేహం ముప్పు పెరుగుతోంది.

పిల్లల కనుగుడ్లు నీలికాంతిని ఎక్కువగా గ్రహిస్తాయని కూడా పరిశోధకులు గుర్తించారు. కాబట్టి పిల్లల స్క్రీన్‌టైమ్ బాగా తగ్గించటం చాలా అసవరం.

నీలికాంతి ప్రభావం మన మీద ఎలా ఉంటుందో తెలుసా?

- ప్రధానంగా ఈ నీలి కాంతి మన నిద్రను ప్రభావితం చేసే మెలటోనిన్ అనే హార్మోను ఉత్పత్తిని, విడుదలను ప్రభావితం చేస్తుంది. దీంతో 'నిద్ర-మెలకువ'లను నియంత్రించే సర్కాడియన్ రిథమ్ అస్తవ్యస్తమవుతోంది. ఇతర హార్మోన్లూ తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి.
- నీలికాంతి నేరుగా కంటిలోని రెటీనా పొర మీద పడుతుంది. ఫలితంగా రెటీనా పొర బలహీనపడి చూపు సమస్యలు తలెత్తుతున్నాయి.

మన కనుగుడ్డులో వెనక భాగాన ఉండే 'రెటీనా' పొర అత్యంత సున్నితమైనది. దీనికి ప్రమాదకరమైన కాంతి సోకటం మంచిదికాదు. అతినీలలోహిత కిరణాల వంటివాటిని మన కను గుడ్డు మీద ముందుండే తెల్లటి కార్నియా పొర, దాని వెనక ఉండే కటకం (లెన్సు) చాలా వరకూ అడ్డుకుంటాయి. కానీ అవి బ్లూలైట్‌ను మాత్రం ఆపలేవు. దీంతో బ్లూ లైట్ నేరుగా కంటిలోకి వెళ్లి సున్నితమైన రెటీనా మీద పడి, దాన్ని దెబ్బతీస్తుంది. దీర్ఘకాలం ఈ కాంతికి ప్రభావితమైతే చూపు కన్ను, చూపు యంత్రాంగం మొత్తం అలసిపోతోంది. చూపు మందగిస్తుంది. దీన్నే 'డిజిటల్ ఐ స్ట్రెయిన్' అంటారు. డిజిటల్ స్క్రీన్లు ఇప్పుడు మరింత ప్రకాశవంతంగా, స్పష్టంగా ఉండేందుకు ఎల్ఈడీ తెరలను (బ్యాక్ లిట్ ఎల్ఈడీ) ఎక్కువగా వాడుతున్నారు. వీటి నుంచి చాలా శక్తిమంతమైన నీలికాంతి వెలువడుతుంది. ఇప్పుడు స్క్రీన్లు అన్నింటా దీన్నే విరివిగా వాడుతుండటం వల్ల మన కంటికి ఈ బ్లూలైట్ తాకిడి మరింత ఎక్కువైపోతోంది. రోజూ డిజిటల్ పరికరాలు వాడుతున్న వారిలో దాదాపు 70% మంది దీనికి సంబంధించిన ఏదో లక్షణాలతో సతమతమవుతున్నారు. ఇప్పుడు మనల్ని ఆకట్టుకుంటున్న ఎల్ఈడీ వంటి మిరుమిట్లు గొల్పుతున్న లైట్లన్నింటి నుంచీ కూడా ఈ నీలికాంతి వెలువడుతుంటుంది.

నీలి విప్లవంలో కొట్టుకుపోవద్దు!

తగ్గించాలి: అవసరమున్నా లేకపోయినా రోజంతా టీవీ, కంప్యూటర్, మొబైల్ వంటి ఏదో ఒక డిజిటల్ స్క్రీన్‌తో గడపటమన్నది బాగా తగ్గించుకోవాలి. మరీ ముఖ్యంగా రాత్రిపూట ఈ 'స్క్రీన్ టైమ్' బాగా తగ్గించటం తప్పనిసరి. ముఖ్యంగా నిద్ర పోవటానికి గంట ముందే వీటన్నింటినీ కట్టెయ్యాలి!

రెప్పవేయండి: డిజిటల్ స్క్రీన్లు చూసేప్పుడు మధ్య మధ్యలో గుర్తుపెట్టుకుని రెప్ప వేయటమూ తప్పనిసరి!

20-20-20 సూత్రం

20 నిమిషాలకు | **20 సెకన్లపాటు** | **20 అడుగుల దూరం**

మొబైల్, కంప్యూటర్ వంటివి ఏకధాటిగా చూస్తూనే ఉండకుండా మధ్యమధ్యలో చిన్నచిన్న విరామాలు తీసుకోవాలి. ప్రతి 20 నిమిషాలకు 20 సెకన్ల పాటు చిన్న విరామం తీసుకుని.. 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువు ఏదో ఒక వస్తువు మీద దృష్టి నిలపాలన్నది ఇప్పుడు పరిశోధనా రంగం బలంగా సూచిస్తున్న సూత్రం!



నైట్ గార్డ్: చాలా డిజిటల్ పరికరాల్లో ఇప్పుడు బ్లూలైట్‌ను వడపోసేసే ఫిల్టర్లు ఉంటాయి. కొత్తతరం మొబైల్ ఫోన్లు అన్నింటిలోనూ డిస్‌ప్లేలోకి వెళ్లి చూస్తే నైట్‌గార్డ్ అనో, నైట్‌టైమ్ సెట్టింగ్స్ అనో, బ్లూలైట్ ఫిల్టర్ అనో.. రకరకాల పేర్లతో ఓ ఆప్షన్ కనబడుతుంది. దీన్ని ఆన్ చేస్తే స్క్రీన్ ప్రకాశం కొద్దిగా తగ్గి, పసుపు ఛాయలోకి (యెల్లో టింట్) మారుతుంది. దీంతో బ్లూలైట్ బాగా తగ్గిపోతుంది. ఈ ఆప్షన్ పెట్టుకోవటం కంటికీ, ఒంటికీ కూడా మంచిది.

యాప్‌లు: ఒకవేళ మీ మొబైల్‌లో ఇన్‌బిల్ట్‌గా ఈ ఆప్షన్ లేకపోతే ప్లే స్టోర్లలో బ్లూలైట్‌ను తగ్గించే యాప్‌లు చాలానే ఉన్నాయి. వాటిలో ఏదో ఒకటి డౌన్‌లోడ్ చేసుకుని, ఇన్‌స్టాల్ చేసుకోవటం మంచిది.

అద్దాలు: దీర్ఘకాలం అనివార్యంగా కంప్యూటర్లు, ట్యాబ్లెట్ల వంటి వాటి ముందర గడపాల్సిన వారి కోసం ఇప్పుడు బ్లూలైట్‌ను తగ్గించే ప్రత్యేక కోటింగ్ వేసిన కళ్లద్దాలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని వాడొచ్చు. అలాగే కంప్యూటర్లకూ, మొబైళ్లకూ కూడా బ్లూలైట్ ఫిల్టర్ గ్లాసులు దొరుకుతున్నాయి, వాటిని అమర్చుకోవటం కొంత మేలు.

రాత్రి లైట్లు: ఎల్ఈడీ లైట్ల వల్ల కరెంటు ఖర్చు బాగానే తగ్గుతుందిగానీ వీటి నుంచి బ్లూలైట్ చాలా ఎక్కువగా వెలువడుతుంది. అందుకే వీలైంత వరకూ రాత్రిపూట తక్కువ కాంతినిచ్చే ఎర్ర లైట్లను (డిమ్ రెడ్ లైట్స్) వాడమని హార్వర్డ్ పరిశోధకులు సూచిస్తున్నారు.

ఆహారం: కంటికి హానికరమైన బ్లూలైట్‌ను తట్టుకునే, కొంత వరకూ అడ్డుకునే శక్తి పెరిగేందుకు మనం ఆహారంలో లూటైన్, జెక్సాంథిన్ అనే పోషకాలు ఎక్కువగా తీసుకుంటే మంచిదని ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు. ఇవి పాలకూర, గుడ్లు, గోబీపువ్వు, తాజా మొక్కజొన్నల వంటి వాటిలో ఉంటాయి.

ఏమిటీ నీలి కాంతి?

కాంతి అంటే మనం ఏమో అనుకుంటాంగానీ.. వాస్తవానికి అది విద్యుదయస్కాంత అణువుల ప్రవాహం! ఈ అణు ప్రవాహం తరంగాల రూపంలో ఉంటుంది. అలాగే మనం మనం కంటికి కనిపించేదే కాంతి అనుకుంటాంగానీ.. వాస్తవానికి కాంతిని విశ్లేషించి చూస్తే దానిలో మన కంటికి కనిపించేది కొంత భాగమే. గామా కిరణాలు, ఎక్స్-కిరణాలు, అతినీల లోహిత (యూవీ) కిరణాలు, పరారుణ (ఇన్‌ఫ్రారెడ్) కిరణాలు.. ఇలా కాంతిలో చాలా ఉంటాయి కానీ అవన్నీ మన కంటికి కనిపించవు. కాంతి వర్ణ పటంలో మన కంటికి కనిపించేది.. ఇంద్రధనస్సులో ఉన్నట్టు ఏడు రంగులుండే (ఎరుపు, నారింజ, పసుపు, ఆకుపచ్చ, నీలం మొ॥) భాగం మాత్రమే. ఈ కనిపించే రంగులన్నింటిలోకీ చాలా ప్రత్యేకమైనది నీలి రంగు. ఇది అత్యధిక శక్తిని విడుదల చేస్తుంది. అందుకే మన మీద దీని ప్రభావం చాలా ఎక్కువ. ఈ 'బ్లూ లైట్' వెలుతురు అంతటా ఉంటుంది.



బ్లూ లైట్ నేరుగా కంటిలోకి వెళ్లి సున్నితమైన రెటీనా మీద పడి, దాన్ని దెబ్బతీస్తుంది.

సూర్యకాంతిలో కూడా ఉంటుంది. కాకపోతే పగటిపూట ఈ కాంతి వల్ల మనకు చాలా మేలు జరుగుతుంది. అది మనలో చురుకుదనాన్ని పెంచుతుంది. స్పందనలను, భావోద్వేగాలను మెరుగుపరుస్తుంది. ఇంత వరకూ మంచిదే. కానీ ఈ బ్లూలైట్ మన సెల్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ నోట్‌బుక్స్ వంటి డిజిటల్ తెరల నుంచి, అలాగే ఎల్ఈడీ, ఫ్లోరసెంట్ లైట్ల నుంచి కూడా విడుదల అవుతుంటుంది.

కావటానికి సూర్యకాంతితో పోలిస్తే వీటి నుంచి వెలువడేది తక్కువే. కానీ మనం రోజంతా అధిక సమయం ఈ స్క్రీన్ల మధ్యే, వీటికి దగ్గరగా గడుపుతుండటం, రాత్రిపూట కూడా వీటితోనే సాంగత్యం చేస్తుండటం వల్ల ఇప్పుడు ఈ నీలి కాంతే ప్రమాదకరంగా పరిణమిస్తోంది.

కానీ ఈ పరికరాలు వాడకుండా నేటి మన జీవితాన్ని ఊహించటం కూడా కష్టం. అందుకే ఇప్పుడు 'బ్లూ లైట్' గురించి ప్రపంచవ్యాప్తంగా ఆందోళన ఎక్కువ అవుతోంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

నిలకడగా నైరుతి పురోగతి

ఈ వారంలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్న రుతుపవనాలు: ఐఎండీ

దిల్లీ: స్తబ్దుగా మారిన నైరుతి రుతు పవనాలు పురోగమించడం ప్రారంభించాయి. ఇప్పటి వరకు దేశంలో 25% కంటే తక్కువ ప్రాంతాల్లోనే ఎంతోకొంత వర్షాలు కురియగా మిగిలిన ప్రాంతాలు నైరుతి ఆగమనానికి ఎదురు చూస్తున్నాయి. నైరుతి మళ్లీ వేగం అందుకొందనీ, ఈ వారంలోనే ఇది ఉత్తరాది, మధ్య భారతదేశంలోని అనేక ప్రాంతాలకు విస్తరిస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. పెరిగిన వేడితో సతమతం అవుతున్న ఈ ప్రాంతాలకు రెండుమూడు రోజుల్లోనే ఊరట లభిస్తుందని ఐఎండీ అదనపు డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. వాయవ్య భారత్‌లో, ఉత్తరాదిలోని మైదాన ప్రాంతాల్లో ఈ నెల 27 తర్వాత 'రుతుపవనాల ముందస్తు జల్లుల'కు వాతావరణం అనుకూలంగా ఉంటుందని చెప్పారు. దేశ రాజధాని దిల్లీకి ఎప్పటిమాదిరిగానే ఈ నెల 29 నాటికి రుతుపవనాలు చేరుకుంటాయన్నారు.

ఇప్పటివరకు లోటు 10%

'శనివారం నుంచి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఆదివారం నాటికి ఇవి గుజరాత్‌లోని సౌరాష్ట్ర, అహ్మదాబాద్; మహారాష్ట్రలోని అమరావతి; తూర్పు వైపు- అసోం, పశ్చిమ బెంగాల్‌లకు విస్తరించాయి. రాబోయే 48 గంటల్లో ఒడిశా, బెంగాల్‌లలోని మిగిలిన ప్రాంతాల్లో; గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌లలో రుతుపవన జల్లులు కురుస్తాయి' అని మహాపాత్ర చెప్పారు. మూడు రోజులు ముందుగా.. మే 28నే పలకరించిన నైరుతి రుతుపవనాలు కేరళలోని కోస్తా ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, దక్షిణ గుజరాత్‌ల వరకు విస్తరించాయి. అయినా శనివారం వరకు కురవాల్సిన వర్షంలో 10% మేర లోటు ఉంది. ఒక్క దక్షిణ ద్వీపకల్పంలో 29% అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన చోట్ల 24 నుంచి 29% లోటు ఉంది.

విమర్శిస్తే ఛానల్ కట్!

- **తమిళనాడులో మీడియా గొంతు నొక్కేస్తున్న సర్కారు**
- **స్వీయ కేబుల్ నెట్‌వర్క్‌తో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు గండి**

చెన్నై: తమిళనాడులో వార్తా ఛానళ్ల గొంతు నొక్కేసే కార్యక్రమం సాగుతోంది. ఎమర్జెన్సీ రోజులను తలపిస్తూ అక్కడి సర్కారు.. విమర్శనాత్మక కథనాలపై కత్తి కడుతోంది. వ్యతిరేక వార్తలను ప్రసారం చేస్తే నిర్దాక్షిణ్యంగా ఆ ఛానల్ ప్రసారాలను నిలిపివేస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని అరసు కేబుల్ టీవీ కార్పొరేషన్‌ను అడ్డుపెట్టుకొని భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అణచివేస్తోంది. రాష్ట్రంలో 60 శాతం టీవీ కనెక్షన్లు ఈ సంస్థ పరిధిలో ఉన్నాయి.

దివంగత ముఖ్యమంత్రి జయలలిత ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్కే నగర్ అసెంబ్లీ స్థానానికి గత డిసెంబర్ 21న ఉప ఎన్నికలు జరిగాయి. అన్నాడీఎంకే అభ్యర్థిగా మధుసూదనన్, స్వతంత్ర అభ్యర్థి టీటీవీ దినకరన్ బరిలోకి దిగారు. పోలింగ్ ముగిశాక 'కావేరి టీవీ'.. ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రకటించడం మొదలుపెట్టింది. దినకరన్ ముందంజలో ఉన్నట్లు పేర్కొంది. అరగంటలోనే ఈ ఛానల్.. అరసు కేబుల్ నెట్‌వర్క్ నుంచి అదృశ్యమైంది. ఇప్పటికీ దీన్ని పునరుద్ధరించలేదు.

తమిళనాడు విలేఖరుల సంఘం వివరాల ప్రకారం.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రసారం చేశారన్న కారణాలతోనే టీవీ ఛానల్ కట్ చేసిన ఇలాంటి సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో తూత్తుకుడిలో వేదంత కర్మాగారానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను ప్రసారం చేసినందుకు సత్యం టీవీని కట్ చేశారు. 'న్యూస్ 18 తమిళనాడు'కూ ఇదే ఫలితం ఎదురైంది. సదరు నిరసనలపై చర్చను ప్రసారం చేసినందుకు 'పుదియా తలైమురై' టీవీని 124వ స్లాట్ నుంచి 499 స్లాట్‌కు నెట్టేశారు.

దీనిపై టీవీ ఛానళ్ల యాజమాన్యాలు అధికారికంగా మాట్లాడేందుకు భయపడుతున్నాయి. అనధికారికంగా తమ గోడు వెళ్లబోసుకుంటున్నాయి. 'గత ఏడాది డిసెంబర్ 21న రాత్రి 7 గంటల సమయంలో ఆర్కే నగర్ ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రసారం చేయడం మొదలుపెట్టాం. వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేశారు. 'దినకరన్ గెలుస్తారని మీరు ఎలా చెబుతారు.. ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయవద్దు.' అని చెప్పారు. అయినా మేం కార్యక్రమాన్ని కొనసాగించాం. అరగంటలోపే అరసు నెట్‌వర్క్ నుంచి మా ఛానల్ మాయమైంది" అని సదరు టీవీ ఛానల్ ప్రతినిధి పేర్కొన్నారు. మరో సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి తీరుపై మేం ఒక విమర్శనాత్మక కథనం ప్రసారం చేస్తున్నప్పుడు ఆయన స్వస్థలం సేలంతోపాటు పొరుగునున్న ఈరోడ్, కోయంబత్తూర్ జిల్లాల్లో మా ప్రసారాలను నిలిపివేశారు. తూత్తుకుడి నిరసనల సమయంలోనూ మా ఛానల్‌ను కట్ చేశారు. ప్రజల ఒత్తిడితో పునరుద్ధరించారు" అని పేర్కొన్నారు. ఆ ఆరోపణల్లో నిజం లేదని మత్స్యశాఖ మంత్రి జయకుమార్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ చర్య సబబేనని సమర్థించుకున్నారు.

గుత్తాధిపత్యం..: మారన్ సోదరులకు చెందిన సుమంగళి కేబుల్ నెట్‌వర్క్ గుత్తాధిపత్యాన్ని దెబ్బతీయడానికే అరసు సంస్థను తొలుత 2007లో నాటి డీఎంకే సర్కారు ఏర్పాటు చేసింది. అప్పట్లో డీఎంకే అధినేత కరుణానిధి కుటుంబానికి, మారన్‌లకు మధ్య విభేదాలు రావడంతో ఈ చర్యను చేపట్టింది. 2011లో నాటి ముఖ్యమంత్రి జయలలిత దీన్ని పునరుద్ధరించారు. అయితే అన్నాడీఎంకే హయాంలో అరసు నెట్‌వర్క్ గుత్తాధిపత్యం మొదలైంది. ఏ రాష్ట్రంలోనూ ప్రభుత్వ సొంత కేబుల్ నెట్‌వర్క్ లేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇది టెలికామ్ నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫార్సులకు విరుద్ధమని తెలిపారు.

సాంకేతిక కారణాలట!: ఈ వ్యవహారంపై స్పందించేందుకు అరసు కేబుల్ అధికారులు నిరాకరిస్తున్నారు. సాంకేతిక కారణాల వల్లే సదరు సమస్యలు తలెత్తాయని చెప్పారు. స్లాట్‌ల కేటాయింపునకు త్వరలో వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రస్తుత సంక్షోభంపై గళం విప్పేందుకు తమిళనాడు మీడియా సంస్థలు వచ్చే నెలలో సమావేశం కానున్నాయి. అయితే భయాందోళన వాతావరణంలో ఎంత మంది ప్రతినిధులు దీనిపై మాట్లాడతారో వేచిచూడాలి.

రాజ్యాంగబద్ధ నియంతృత్వంగా మార్చిన ఇందిరాగాంధీ: జైట్లీ

దిల్లీ: దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1975లో అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి, ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగబద్ధ నియంతృత్వపాలనగా మార్చేశారని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ విమర్శించారు. ఎమర్జెన్సీ విధించి సోమవారం నాటికి 43 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఫేస్‌బుక్ ద్వారా ఆయన స్పందించారు. మూడు సవివర వ్యాఖ్యల్లో మొదటిదానిని 'ది ఎమర్జెన్సీ రీ-విజిటెడ్' (అత్యయిక పరిస్థితి అవలోకనం) పేరుతో ఆదివారం విడుదల చేశారు. 'అంతర్జాతీయ పరిణామాల పేరుతో ఇందిర 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీని విధించారు. ప్రతీ పౌరునికీ రాజ్యాంగం కల్పించిన కీలకమైన ప్రాథమిక హక్కుల్ని స్తంభింపజేశారు. కల్పిత కారణాలతో అందరి గళాలనూ నొక్కేశారు. ఇందిర నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా సత్యాగ్రహం చేసినవారిలో మొదటివాడిని నేను. చరిత్రలో భాగం కాబోతున్న పరిణామాల్లో పాల్గొంటున్న విషయం అప్పట్లో 22 ఏళ్ల వయస్కుడినైన నాకు తెలియదు. నిరసన సమావేశాన్ని నిర్వహించినందుకు 'అంతర్గత భద్రత నిర్వహణ చట్టం' (మీసా) కింద 1975 జూన్ 26న నన్ను తీహార్ కారాగారంలో ఖైదుచేశారు. అదే సమయంలో అనేకమంది విపక్ష నేతల్ని అరెస్టు చేశారు. ఆనాటి ఘటనలు నా జీవితాన్ని మలుపుతిప్పాయి' అని జైట్లీ చెప్పారు. 'సొంత పార్టీలోని సీనియర్ నేతల్నీ, విపక్షాల మహా కూటమిని సవాల్ చేయడం ఇందిర రాజకీయ ప్రస్థానంలో కీలకాంశాలు. 1971 సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గిన తర్వాత అయిదేళ్ల పాటు శక్తిమంతమైన రాజకీయ కేంద్రంగా ఆమె వెలిగిపోయారు. ఆర్థిక రంగం మాత్రం ఆ సమయంలో కుప్పకూలిపోయే పరిస్థితికి చేరింది. ధరలు అమాంతం పెరిగిపోయాయి. నిరుద్యోగం విజృంభించింది. విదేశీ మారక ద్రవ్యానికి సంబంధించిన ఫెరా చట్టాన్నీ అప్పుడే తెచ్చారు. ప్రజాకర్షక పథకాలకే ఆమె పెద్దపీట వేశారు. క్రమేణా ఆమె రాజకీయ వ్యూహం... మేధావి వర్గంలో ప్రభుత్వం సానుభూతి కోల్పోవడానికి కారణమయింది' అని జైట్లీ వివరించారు. రెండో భాగాన్ని సోమవారం విడుదల చేస్తారు.

కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో భద్రత దళాలు.. లష్కరే తోయిబా (ఎల్ఈటీ)కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులను మట్టుపెట్టాయి. హతమైనవారిలో ఎల్ఈటీ డివిజనల్ కమాండర్ షకూర్ అహ్మద్‌ధార్ కూడా ఉన్నాడు. ఆదివారం కుల్గామ్ జిల్లాలో ఉగ్రవాదులకు, భద్రత దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో వీరు మరణించినట్లు పోలీసులు తెలిపారు. మరో ఉగ్రవాది లొంగిపోయినట్లు పేర్కొన్నారు. గురువారం అమర్‌నాథ్ యాత్ర ఆరంభమవుతున్న నేపథ్యంలో.. జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి ప్రాంతంలో ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్లను భద్రత దళాలు ముమ్మరం చేశాయి.

చొరబడేందుకు సిద్ధంగా 250 మంది ఉగ్రవాదులు: కశ్మీర్‌లోకి చొరబడేందుకు నియంత్రణ రేఖకు ఆవల వివిధ చోట్ల 250 నుంచి 275 మంది దాకా ఉగ్రవాదులు కాచుకు కూర్చున్నారని భారత సైన్యం తెలిపింది. కశ్మీర్ లోయ ప్రాంతంలోనూ ఇంతే సంఖ్యలో ఉగ్రవాదులు క్రియాశీలంగా ఉన్నారని పేర్కొంది.

వైద్య విద్యార్థులకు రూ.20 లక్షల పరిహారం

దిల్లీ: మెరిట్ ప్రాతిపదికన ప్రవేశార్హత ఉన్నప్పటికీ అక్రమంగా 19 మంది విద్యార్థులకు అడ్మిషన్లను తిరస్కరించిన కేసులో సదరు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.20లక్షల చొప్పున పరిహారం చెల్లించాల్సిందిగా మహారాష్ట్రలోని ఓ వైద్య కళాశాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు నెలల వ్యవధిలోగా ఆయా మొత్తాలను చెల్లించేయాల్సిందిగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ 19 మంది విద్యార్థులకు ముంబయిలోని డాక్టర్. ఉల్హాస్ పాటిల్ వైద్య కళాశాల ప్రవేశాన్ని కల్పించలేదు. 2012-13 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో వారికి ప్రవేశాన్ని నిరాకరించింది. దీనిపై విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

బ్యాంకింగ్ కరస్పాండెంట్లుగా మహిళలు

ఈనాడు, దిల్లీ: గ్రామాల్లోని స్వయం సహాయక బృందాల మహిళలను బ్యాంకింగ్ కరస్పాండెంట్లు (బీసీలు)గా నియమించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదించింది. దీనిని పరిశీలించాలని కోరుతూ ఆర్థిక శాఖకు లేఖ రాసింది. గ్రామాలకు బ్యాంకు సేవలు విస్తరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించినా చాలా చోట్ల ఆ ప్రయోగం సఫలం కాలేదు. తక్కువ లావాదేవీల కారణంగా తగినంత ఆదాయం లేకపోవడంతో దాదాపు 12వేల కరస్పాండెంట్లు సేవలు అందించడం లేదు. అందువల్ల మహిళలకు ఈ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని గ్రామీణాభివృద్ధి శాఖ భావిస్తోంది.

మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ

దిల్లీ: మాదకద్రవ్యాల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రత్యేకంగా సిద్ధంచేసిన కార్యచరణ ప్రణాళికను 15 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేయాలని కేంద్రం భావిస్తోంది. ఎంపిక చేసిన జిల్లాల్లో విశాఖపట్నంతోపాటు పుణె, ఐజ్వాల్, దీబ్రూగఢ్, లూథియానా తదితర ప్రాంతాలున్నాయి. 'ఏడాదిపాటు ఎంపికచేసిన జిల్లాల్లో కార్యాచరణను అమలుచేస్తాం. మత్తు పదార్థాలకు బానిసలుగా మారేవారి సంఖ్యను తగ్గించడం, జిల్లాను మత్తు పదార్థాల రహితంగా మార్చడం తదితర లక్ష్యాలను చేరుకునే దిశగా ఈ కార్యచరణను సిద్ధంచేశాం'అని కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి తెలిపారు.

ఇక జల విమానాల రయ్‌రయ్!

దిల్లీ: మనదేశంలో జల విమానాల రాకపోకలకు రంగం సిద్ధమవుతోంది. వాటి టేకాఫ్, ల్యాండింగ్‌లకు వీలుగా జల విమానాశ్రయాల(ఏరోడ్రోమ్) ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిసారించింది. సంబంధిత లైసెన్స్‌ల జారీకి తాజాగా 'పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ)' మార్గదర్శకాలు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా విమానాల రాకపోకలు భారీగా పెరగనున్నాయని.. జల విమానాలకూ డిమాండ్ ఏర్పడనుందని డీజీసీఏ తెలిపింది. తదనుగుణంగా తీర/నదీ/కాల్వ ప్రాంతాల నుంచి ఉభయచర/జల విమానాలు రాకపోకలు సాగించేందుకు తగిన సదుపాయాలు అవసరమని పేర్కొంది.

కొత్త సంస్థను స్థాపించిన ప్రవీణ్ తొగాడియా

దిల్లీ: విశ్వహిందూ పరిషత్ మాజీ నాయకుడు ప్రవీణ్ తొగాడియా ఆదివారం అంతర్రాష్ట్రీయ హిందూ పరిషత్ (ఏహెచ్‌పీ) పేరుతో కొత్త సంస్థను ప్రారంభించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హిందూ ఓట్ల ఏకీకరణే లక్ష్యంగా ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిరం నిర్మాణంలో మోదీ ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. తాము మద్దతిచ్చిన ప్రభుత్వం తమను మోసగించిందని హిందువులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. వారు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారని, అందుకే కొత్త సంస్థను పెట్టామని తెలిపారు. హిందువుల సంక్షేమం కోసం పోరాడుతానని తెలిపారు.

నీరవ్ మోదీకి అరెస్టు వారెంట్

దిల్లీ, లండన్: నీరవ్ మోదీపై సూరత్ కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంట్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఇ-మెయిల్ ద్వారా అతనికి చేరవేసింది. రూ.890 కోట్ల విలువైన ముత్యాలు, వజ్రాల దిగుమతిపై రూ.52 కోట్ల కస్టమ్స్ సుంకం ఎగవేసిన కేసులో కోర్టు నీరవ్ మోదీకి ఈ వారెంటు జారీ చేసింది. సుంకం లేకుండా దిగుమతి చేసుకుని, వాటిని బహిరంగ విపణికి మళ్లించారంటూ నీరవ్‌పైనా, సూరత్ సెజ్‌లోని ఆయన కంపెనీలపైనా మార్చిలో ముంబయి డీఆర్ఐ ఈ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

లండన్‌లోనే నివాసం: ఇదిలా ఉంటే పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను మోసపూరిత లావాదేవీల ద్వారా దాదాపు 2 బిలియన్ డాలర్ల మేర (దాదాపు రూ.15,000 కోట్లు) నష్టపరచి, దేశం విడిచిపెట్టి పారిపోయిన నీరవ్‌మోదీ లండన్‌లో తలదాచుకుంటున్నట్లు గుర్తించారు. మేఫెయిర్ ఏరియాలోని ఓల్డ్ బాండ్ వీధిలో ఉన్న తన జువెలరీ బొటిక్ 'నీరవ్‌మోదీ'పై ఉన్న ఫ్లాట్‌లో నీరవ్ ఉంటున్నట్లు అక్కడి ఓ పత్రిక వెల్లడించింది. గత ఫిబ్రవరిలో అతని పాస్‌పోర్టును భారత్ ఉపసంహరించాక, బ్రిటన్ నుంచి విదేశాలకు మళ్లీ బ్రిటన్‌కు నాలుగుసార్లు రాకపోకలు సాగించాడని తేలింది.

కేంద్రానికి వ్యతిరేకంగా సీపీఎం ఆందోళన

దిల్లీ: కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళన చేపట్టాలని సీపీఎం తన శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇక్కడ 3 రోజుల పాటు జరిగిన ఆ పార్టీ కేంద్ర కమిటీ సమావేశం ఆదివారం ముగిసింది. భాజపా నాలుగేళ్ల పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల జీవనోపాధిపై దాడులు జరుగుతున్నాయని, మతపరంగా విభజన జరిగిందని ఆరోపించింది.

EDUCATION
★ Inter Pass or Fail Join BBA - Aviation, BHM-Hotel Mgt, Dip. in Hotel Mgt, more then 10 Lakh Jobs, 100% Job Assistance. Cont: Spice King, Vijayawada. ✆ 83408 17777, 79974 56222.

Admissions are in Progress for
B.Sc AGRICULTURE
Dur:4yrs. Elig: BI.P.C/MPC/Dip.in Agri
Exclusive Girls Campus
* UGC Recog. * Morethan 2 Lakhs Jobs
* 100% Jobs * Eli.for All Govt / Pvt.Jobs
Cont: PADMAVATI, Vijayawada
84669 96337 / 96665 85111

ఉసురు తీసిన ఆటో డ్రైవర్

- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- తొమ్మిది మంది దుర్మరణం
- మరో ఐదుగురికి తీవ్రగాయాలు
- పసరు వైద్యం కోసం మహానంది వెళుతుండగా దుర్ఘటన
- ఆటో వ్యతిరేకదిశ ప్రయాణమే ప్రమాదానికి కారణం

ఈనాడు డిజిటల్ – కర్నూలు, ఓర్వకల్లు, కర్నూలు నేరవిభాగం – న్యూస్‌టుడే

శవపరీక్షకు మృతదేహాలను తీసుకొస్తున్న బంధువులు

వ్యతిరేక దిశలో వస్తున్న ఆటోను ఢీకొట్టిన బస్సు(ఊహాచిత్రం) సంఘటన స్థలంలో బస్సు

మెరుగైన కంటి చూపు కోసం వైద్యానికి బయలుదేరిన ఆ అభాగ్యుల జీవితాలకు ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం ప్రాణాంతకమైంది. వ్యతిరేకదిశలో మితిమీరిన వేగంతో కూడిన ఆటో ప్రయాణం వారిని తిరిగిరాని అనంతలోకాలకు తీసుకుపోయింది. ఏకంగా తొమ్మిది మందిని పొట్టనపెట్టుకున్న ఈ విషాదకర దుర్ఘటన కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లె సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. కర్నూలు జిల్లాలోని కోడుమూరు మండలం కల్లపారి, గూడూరు మండలం చనుగొండ్ల, వెల్దుర్తి మండలం రామళ్లకోట, కానాల గ్రామాలకు చెందిన సుమారు 40 మంది మహానందిలో కంటికి పసరు వైద్యం చేయించుకునేందుకు పయనమయ్యారు. తెల్లవారు జామున మూడు గంటలకు మూడు ఆటోల్లో వారంతా బయలుదేరారు. రెండు ఆటోలు ముందు వెళ్లగా వెనుక వస్తున్న మూడో ఆటోలో డ్రైవర్‌తో సహా 14 మంది ప్రయాణిస్తున్నారు. ఓర్వకల్లు సమీపంలోని సోమయాజులపల్లె వద్ద నేరుగా వెళ్తే దూరం పెరుగుతుందని జాతీయ రహదారిపై వాహనాలకు ఎదురుగా వెళ్తూ డ్రైవర్ శ్రీనివాస్ వ్యతిరేక దిశ(రాంగ్‌రూట్)ను ఎంచుకున్నారు. అప్పటికే ఆటోలో ప్రయాణికులు వారిస్తున్నా.. వారి మాటలు ఖాతరు చేయక లైట్లు వేసి నడుపుతున్నానంటూ సుమారు ఒకటిన్నర కిలోమీటరు మేర వ్యతిరేకదిశలోనే మొండితనంగా ముందుకు సాగాడు. ఇంతలో ఎదురుగా వేగంగా వస్తున్న నంద్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆటో రహదారి పక్కన గుంతలో పడిపోయింది. ఆటో పూర్తిగా దెబ్బ తినడంతో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన మిగిలిన ఏడుగురిని కర్నూలు పెద్దాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కల్లపారి గ్రామానికి చెందిన జి.గోవిందమ్మ, చనుగొండ్లకు చెందిన లక్ష్మీదేవి మృతి చెందారు. క్షతగాత్రుడు బోయ అశోక్ ఫిర్యాదు మేరకు బస్సు, ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేసి, ఓర్వకల్లు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు బాధ్యతలను కర్నూలు ట్రాఫిక్ డీఎస్పీ గంగయ్యకు అప్పగిస్తున్నట్లు డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్ తెలిపారు.

ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

ఈనాడు డిజిటల్, అమరావతి: కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందడం పట్ల సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాదంపై కర్నూలు కలెక్టర్, ఎస్పీతో ముఖ్యమంత్రి ఆదివారం మాట్లాడారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, డీఐజీ శ్రీనివాస్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆసుపత్రిలో ఉండి శవపరీక్షలు చేయించి మృతదేహాలను కుటుంబసభ్యులకు త్వరితగతిన అప్పగించేలా చర్యలు తీసుకున్నారు. క్షతగాత్రులకు ప్రత్యేక వైద్యసేవలు అందించే ఏర్పాట్లు చేశారు.

ప్రమాద ఘటనలు బాధించాయి: పవన్

యాదాద్రి భువనగిరి జిల్లాలో ట్రాక్టర్ బోల్తా పడి పది మంది వ్యవసాయ కూలీలు మృతి చెందడం, కృష్ణా జిల్లా పవిత్ర సంగమం వద్ద నలుగురు యువకులు గల్లంతైన ఘటనలు తనను చాలా బాధించాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. మరణించిన వారి కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పవిత్ర సంగమం వద్ద ఎత్తైన టవర్ ఏర్పాటు చేసి అనుక్షణం పర్యవేక్షిస్తూ ఉండాలని ఏపీ ప్రభుత్వానికి సూచించారు.

మృతుల వివరాలు..

కోడుమూరు మండలం కల్లపారి గ్రామానికి చెందినవారు

- ★ సందెపోగు గౌరమ్మ(50) (గ్రామ సర్పంచి)
- ★ ఆర్.మాణిక్యమ్మ(45)
- ★ బి.మారెప్ప(45)
- ★ బి.లక్ష్మీదేవి(43)
- ★ జి.ఈరమ్మ(50)
- ★ జి.గోవిందమ్మ(50)

గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందినవారు

- ★ చనుగొండ్ల లక్ష్మీదేవి(45)
- ★ హుస్సేనమ్మ(65) (వీరిద్దరూ అత్తా కోడళ్లు)

వెల్దుర్తి మండలం రామళ్లకోటకు చెందినవారు

- ★ పి.సోమక్క(70)

క్షతగాత్రుల వివరాలు..

- ★ డ్రైవర్ శ్రీనివాస్ అలియాస్ వాసు(కల్లపారి)
- ★ బి.అశోక్(చనుగొండ్ల)
- ★ బి.భగవంత్(కానాల)
- ★ సరోజమ్మ(చనుగొండ్ల)
- ★ మద్దిలేటి(చనుగొండ్ల)

శోకం నింపిన ప్రమాదం

ఈనాడు డిజిటల్ – కర్నూలు

కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలోని సోమయాజులపల్లెలో చోటుచేసుకున్న ప్రమాదంలో మృతిచెందిన వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని కూలీ కుటుంబాలకు చెందిన వారే. వీరిలో కొడుకులు..కోడళ్లు సుగ్గి(వలస) వెళితే ఇంటివద్దే కాపలా ఉంటూ మనవళ్లు, మనమరాళ్లను చూసుకుంటూ ఆసరాగా ఉంటున్నవారూ ఉన్నారు. పెద్ద దిక్కులంతా ఆదివారం తెల్లవారుజామున బయలుదేరి తెల్లారేసరికి విగతజీవులుగా మారిపోయిన వైనం ఆయా కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది.

నాలుగు నెలల క్రితమే తండ్రి... ఇప్పుడు తల్లి



ప్రేమరాజ్

ఈ చిత్రంలో రోదిస్తున్న ప్రేమరాజ్ కోడుమూరు మండలం కల్లపారి గ్రామానికి చెందిన మాణిక్యమ్మ(45) చిన్న కుమారుడు. నాలుగు నెలల క్రితమే తండ్రి లక్ష్మన్నను కోల్పోయాడు. ప్రస్తుత ప్రమాదంలో తల్లి మాణిక్యమ్మ మృతి చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా పోయింది. మాణిక్యమ్మ కూలి పనులకు వెళుతూ బిడ్డలకు చేదోడువాదోడుగా ఉండేది. ప్రమాదానికి గురై మృత్యువాత పడటంతో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

గ్రామానికి, కుటుంబానికి పెద్ద దిక్కు

యోహాన్(కుమారుడు)

కల్లపారి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పందెపోగు గౌరమ్మ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు సాధించారు. గౌరమ్మ భర్త కేశన్న పదేళ్ల క్రితమే చనిపోయారు. కష్టాలకు ఎదురొడ్డి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలకు ఆమె పెళ్లిళ్లు చేశారు. గ్రామంతోపాటు కుటుంబానికి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారు. మంచి చెడులు చూసుకునే కన్నతల్లిని కోల్పోయామంటూ కుమారుడు యోహాన్ ఆస్పత్రి వద్ద కన్నీటిపర్యంతమయ్యారు.

నానమ్మ ఇకలేదని తెలియదు

మానసిక వికలాంగుడు మధు

వెల్దుర్తి మండలం రామళ్లకోటకు చెందిన పి.సోమక్కకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. భర్త రాముడు, పెద్ద కుమారుడు మృతి చెందారు. మూడో కుమారుడు ఈశ్వరనాయుడు కుమారుడు మధు మానసిక వికలాంగుడు. మధు బాగోగులు చిన్నప్పటి నుంచీ సోమక్కే చూసుకునేది. మందులు వేయడం నుంచి అన్నం, స్నానం వంటి సపర్యలన్నీ ఆమే చూసుకొనేది. నానమ్మ చనిపోయిందని, తన బాగోగులు చూసుకునేందుకు ఇక ఆమె లేదనే విషయం అర్థం చేసుకోలేని మధు ఒంటరిగా ఇంట్లోనే ఉండటం పలువురిని కలిచివేస్తోంది.

పిల్లలకు తోడేది?

సుంకన్న

‘‘మాది కూలీ కుటుంబం. ఈ ప్రమాదంలో మా అమ్మ గూడూరు వీరమ్మ చనిపోయింది. కొన్నేళ్ల క్రితం నాన్న చనిపోయారు. మేం ఇద్దరు పిల్లలం. మేం వలసలకు వెళ్లినప్పుడు మా బిడ్డలకు అన్నం వండి పెడుతూ తోడుగా ఉండేది. కూలి పనులకు ధైర్యంగా వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించుకొచ్చుకునే వాళ్లం. ఇప్పుడు మా పరిస్థితి ఏంటి?’’ అని వీరమ్మ కుమారుడు సుంకన్న రోదిస్తున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

మారెప్ప, లక్ష్మీదేవి మృతదేహాలు

కల్లపారి గ్రామానికి చెందిన బొరుసు మారెప్ప(45), లక్ష్మీదేవి(43) భార్యాభర్తలు. అన్యోన్యంగా ఉండే ఈ దంపతుల అనుబంధాన్ని మృత్యువూ విడదీయలేకపోయింది. ఆటో ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. వీరు ఆటో డ్రైవర్ శ్రీనివాసులు తల్లిదండ్రులే కావడం గమనార్హం. లక్ష్మీదేవి డ్వాక్రా గ్రూపు లీడర్‌గా పనిచేస్తోంది. ముగ్గురు కుమారులకు పెళ్లిళ్లు చేసి చిన్న కుమారుడు శ్రీనివాసులు వద్ద ఉంటున్నారు. ఆమె కుమార్తెకు వివాహం జరిగాక చనిపోయినట్లు బంధువులు చెప్పారు.

రోదన.. తీరని వేదన

- శోకసంద్రంలో వేములకొండ
- పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాలు

వలిగొండ, న్యూస్‌టుడే: కన్నవారిని పోగొట్టుకుని రోదిస్తున్న వారు కొందరైతే.. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన వారు మరికొందరు.. ఇలా ఆ ప్రాంతమంతా రోదనలతో మిన్నంటిపోయింది. బాధిత కుటుంబీకులు, బంధువులు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయారు. ఈ దృశ్యాలన్నీ చూపరుల కంట తడి పెట్టించాయి. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండలో ఆదివారం చోటుచేసుకున్న ఘటన హృదయవిదారకంగా మారింది. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబాల్లో ట్రాక్టర్ ప్రమాదం పెనువిషాదాన్ని మిగిల్చింది. వేములకొండ పరిధిలోని హరిశ్చంద్రారెడ్డి వ్యవసాయ భూమిని మూడేళ్లుగా వెంకటనారాయణ కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాడు. తన ట్రాక్టరుపై సుమారు 30 మంది కూలీలను పత్తి విత్తనాల్ని నాటే నిమిత్తం తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో సిగరెట్ ముట్టించుకుంటుండగా ట్రాక్టర్ నల్లచెరువు కట్టపై అదుపు తప్పి పక్కనున్న కాలువలోకి పల్టీకొట్టింది. దీంతో ఊపిరాడక నాలుగేళ్ల బాలుడు, 14 మంది మహిళా కూలీల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. చనిపోయిన కుటుంబాలది ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ.

ఈ చిన్నారులకు దిక్కెవరు..

అవంతిక, నాని

ప్రమాదంలో మృతిచెందిన సుంచు నర్మదకు కుమారుడు నాని, కుమార్తె అవంతిక ఉన్నారు. వీరు అయిదేళ్ల వయస్సు లోపువారే. భర్త నరేష్ కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో 8నెలల కిందట ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఒకూలి పనిచేస్తూ పిల్లలిద్దరినీ పోషించుకుంటున్న నర్మద ప్రమాదంలో కన్నుమూసింది. దీంతో పసిపిల్లలిద్దరూ దిక్కులేని వారయ్యారు. తల్లి తిరిగి రాని లోకాలకు తరలిపోయిందన్న విషయం పాపం చిన్నారులకు తెలియదు.

భర్త దూరంగా ఉంటూ..

యమున, యశ్విత

పంజాల భాగ్యమ్మకు ఇద్దరు కుమార్తెలున్నారు. భర్త కొంతకాలంగా భాగ్యమ్మను వదిలేసి దూరంగా ఉంటున్నా కుటుంబానికి పెద్ద దిక్కులా వ్యవహరిస్తూ కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది. తల్లిని కోల్పోవడంతో ఈమె ఇద్దరు కూతుళ్లు యమున, యశ్వితలు దిక్కులేని వారయ్యారు.

తల్లితోనే తరలిరాని లోకాలకు..

శకుంతల, చిన్నారి మల్లికార్జున్ మృతదేహాలు

ఆంధ్రా ప్రాంతం నుంచి వలస వచ్చి కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న శకుంతల ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. పనికి వెళ్తూ తన నాలుగేళ్ల కుమారుణ్ని వెంట తీసుకెళ్లింది. ఈ ఘటనలో తల్లితో పాటే చిన్నారి మల్లికార్జున్ కూడా విగతజీవుడయ్యాడు.

గజ్జెల సవ్వడి వినిపించదిక

పెళ్లీడుకొచ్చిన కుమార్తె గజ్జెల సవ్వడి ఆ ఇంట్లో ఇక వినిపించదు. ఆదివారం సెలవుదినం కావడంతో తల్లితో పాటు కూలి పనికి బయల్దేరిన కాడిగళ్ల మానస తల్లి లక్ష్మమ్మతో పాటే చనిపోయింది. ఈ ఘటనను లక్ష్మమ్మ భర్త లింగయ్య జీర్ణించుకోలేకపోతున్నారు. గతేడాది వలిగొండలోని ఒక ప్రైవేటు కళాశాలలో మానస ఇంటర్ పూర్తి చేసింది.

అమ్మే నాన్నలా.. అన్నీ తానై..

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రాములమ్మ కుటుంబానికి అన్నీ తానై నడిపిస్తోంది. ఈమె భర్త బుచ్చయ్య గతంలోనే మరణించాడు. దీంతో ఆమె కూలి పనిచేస్తూ నలుగురు కుమార్తెల పెళ్లిళ్లు చేసింది. ఒక కుమార్తె తల్లిపైనే ఆధారపడి జీవిస్తోంది. మగ దిక్కు లేకున్నా కుటుంబ పెద్దగా వ్యవహరిస్తున్న తల్లి కూడా ఇప్పుడు దూరమైందన్న విషయాన్ని నలుగురు కుమార్తెలు జీర్ణించుకోలేకపోతున్నారు.

మరణవార్త విని దుబాయ్ నుంచి..

ప్రమాదంలో చనిపోయిన బీసు కవిత భర్త శ్రీను ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. నెలరోజుల కిందటే ఇంటికి వచ్చి వెళ్లాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కవిత గ్రామంలోనే వ్యవసాయ కూలిగా పనిచేస్తోంది. భార్య మరణవార్త విని పరదేశంలో ఉన్న శ్రీను ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక సెలవుపై ఇక్కడకు బయలుదేరాడు.

★ ట్రాక్టర్ బోల్తా ఘటనలో మరణించిన బందారపు స్వరూప భర్త శేఖర్ దుబాయ్‌లో ఉంటున్నాడు. ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమారునికి అనారోగ్య సమస్య ఉండటంతో శస్త్రచికిత్స చేయించి వారం కిందటే తిరిగి దుబాయ్ వెళ్లాడు. ఇంతలోనే భార్య మరణ వార్త విని తట్టుకోలేకపోయాడు. వెంటనే అక్కణ్నించి బయలుదేరాడు.

పాపం చిన్నారులు..

ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఏనుగుల మాధవికి ఇద్దరు సంతానం. భర్త సైదులుతో పాటు మాధవి కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కూతుళ్లిద్దరూ పసివాళ్లే కావడంతో దిక్కుతోచని స్థితిలో సైదులు బోరున విలపిస్తున్నాడు.

సురక్షితమైన ఆర్టీసీలోనే ప్రయాణించండి

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం
- ఆర్టీసీ తరఫున మరో రూ.లక్ష ఇస్తాం: వర్ల

ఈనాడు డిజిటల్ – కర్నూలు: కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం ఆటో డ్రైవర్లకు కనువిప్పు కావాలని, రాష్ట్ర ప్రజలు సురక్షితమైన ఆర్టీసీలోనే ప్రయాణించాలని ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య కోరారు. ఆయన ఆదివారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. కల్లపారి గ్రామంలో ప్రతి బాధిత కుటుంబం వద్దకు వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. ముఖ్యమంత్రితో జిల్లా కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడారని, మృతులు తొమ్మిది మందిలో చంద్రన్న బీమా ఒక్కరికే వచ్చే అవకాశం ఉన్నట్లు వివరించారని వర్ల రామయ్య తెలిపారు. మృతుల ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వడానికి నిర్ణయించినట్లు వెల్లడించారు. సహజంగా డ్రైవర్ తప్పిదం ఉంటే ఆర్టీసీ పరిహారం ఇస్తుందని, ఛైర్మన్‌గా తొలిసారి జిల్లాకు వచ్చిన తాను సొంత నిర్ణయంతో ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు ఇస్తానన్నారు. వర్ల రామయ్యను స్థానికుడు సత్యనారాయణరెడ్డి పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించిన వర్ల గ్రామస్థుల కోరిక మేరకు బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున, క్షతగాత్రులకు రూ.20 వేల చొప్పున అందిస్తామన్నారు. మూడు రోజుల్లోగా పరిహారం బాధితులకు చేరేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఊపిరాడక ప్రాణాలు పోయాయి

- అదుపు తప్పి మూసీ కాల్వలో పడిపోయిన ట్రాక్టర్
- బాలుడు, 14 మంది మహిళల దుర్మరణం
- చోదకుడు పొగ తాగుతూ వాహనం నడపడమే ప్రమాదానికి కారణం

ఆదివారం ఉదయం వలిగొండ మండలం వేములకొండ సమీపంలో మూసీకాల్వలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్, ట్రాలీ

ఈనాడు, నల్గొండ: వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబీకులు.. రోజూలాగే పొలం పనికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. తాము పనిచేయాల్సిన యజమాని ట్రాక్టరులోనే ఎక్కారు. అందరూ సందడిగా మాట్లాడుకుంటుండగా.. వారు ప్రయాణిస్తున్న వాహనం పక్కనేఉన్న కాలువలోకి ఒక్కసారిగా దూసుకెళ్లింది. అంతే హాహాకారాలు.. రోదనలు.. చోదకుడు నిర్లక్ష్యంగా ఒక చేత్తో ట్రాక్టర్ నడుపుతూ మరో చేత్తో పొగతాగడమే వాహనం అదుపు తప్పడానికి కారణమైంది. ఆ నిర్లక్ష్యమే పలు కుటుంబాల్లో దీపాలను ఆర్పేసింది. బయలుదేరిన అయిదు నిమిషాల్లోనే ఊహించని రీతిలో వచ్చిన మృత్యువు నాలుగేళ్ల బాలుడు, 14 మంది మహిళా కూలీలను బలితీసుకుంది. ప్రమాదంలో 9మంది క్షతగాత్రులు కాగా.. నలుగురు ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ఘోర ప్రమాదం ఆ గ్రామాన్ని విషాదంలో నింపింది. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

వేములకొండ గ్రామానికి చెందిన సుమారు 30 మంది కూలీలు గ్రామశివారులోని సుమారు 2 కి.మీ. దూరంలో ఉన్న వెంకటనారాయణ అనే రైతు పొలంలో పత్తి విత్తనాలను నాటేందుకు ట్రాక్టర్‌లో వెళుతున్నారు. ట్రాక్టర్‌ను రైతు స్వయంగా నడుపుతున్నాడు. ఉదయం సుమారు 9.25 గంటల సమయంలో బయల్దేరిన ట్రాక్టర్ ఐదు నిమిషాల లోనే అదుపు తప్పి పక్కనే ఉన్న మూసీ కాల్వలో తిరగబడింది. రహదారి వెడల్పుగానే ఉన్నా చోదకుడు సిగరెట్ కాలుస్తూ వాహనం నిర్లక్ష్యంగా నడపడంతో ప్రమాదం జరిగింది. వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్ కాల్వలోకి దూసుకెళ్లడంతో తొట్టె(ట్రాలీ) కాల్వలో బోల్తాకొట్టింది. ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్న వారు స్వల్పగాయాలతో బయటపడగా.. తొట్టెలో ఉన్నవారంతా కింద చిక్కుకుపోయారు. కాల్వలోని ఒండ్రు మట్టి బురద, గుర్రపుడెక్క కూలీలకు ఊపిరాడకుండా చేసింది. దీంతో వారంతా జలసమాధి కాగా... పలువురు గాయపడ్డారు. గ్రామస్థులు, పోలీసులు కలిసి మృతదేహాలను వెలికి తీసి శవపరీక్ష నిమిత్తం వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తమ ప్రాథమిక విచారణలో వెల్లడించారు. డ్రైవర్ వెంకట నారాయణను అదుపులోకి తీసుకున్నట్లు చౌటుప్పల్ ఏసీపీ రమేశ్ తెలిపారు. డ్రైవర్‌పై ఐపీసీ 304 సెక్షన్ కింద, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

రూ.3 లక్షల చొప్పున పరిహారం: మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, రెండు పడకగదుల ఇళ్లు, చదువుకునే పిల్లలకు పీజీ వరకు ఉచిత విద్యను సర్కారే అందిస్తుందని మంత్రి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి మృతులకు ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా మరో రూ.లక్షను ఆర్థిక సాయంగా ప్రకటించారు.

అంతా కళ్ల ముందే

పత్తి విత్తనాలను నాటేందుకు దాదాపు 30 మందిమి ట్రాక్టర్‌లో బయల్దేరాం. ముందు నుంచి ద్విచక్రవాహనం వస్తుండటంతో వాహనాన్ని కాల్వ అంచువైపు తిప్పారు. దీంతో ట్రాలీ అదుపుతప్పి కాల్వలోకి జారిపోయి తిరగబడింది. కొందరం అందులోంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నాం. మా కళ్ల ముందే అందరూ ఊపిరాడక చనిపోయారు. గ్రామస్థులంతా వచ్చి ప్రమాదంలో గాయపడిన వారిని ఒడ్డుకు చేర్చారు. – అఖిల

పొగ తాగుతూ నడిపాడు

ఒక చేత్తో పొగతాగుతూ మరో చేత్తో డ్రైవర్ ట్రాక్టర్ నడుపుతున్నాడు. ఒక్కసారిగా ముందు నుంచి వాహనం రావడంతో ట్రాక్టర్ అదుపు తప్పి కాల్వలో పడిపోయింది. అఖిల వెళ్లి గ్రామస్థులందరినీ తీసుకురావడంతో కొందరం వారి సాయంతో బయటికి వచ్చాం. ఇంకొందరు బురదలో ఊపిరాడక చనిపోయారు. –అనిత

మామను ట్రాక్టర్‌తో తొక్కించాడు

- భూమి ఇవ్వలేదని అల్లుడి దురాగతం
- అడ్డుకోకుండా ప్రేరేపించిన కుమార్తె

మల్లయ్య మృతదేహం

సారంగాపూర్, న్యూస్‌టుడే: కుమార్తె, అల్లుడు సుఖంగా జీవించాలనుకున్నాడు.. తనకున్న భూమిలో నాలుగెకరాలు రాసిచ్చాడు.. మరో రెండెకరాలు తనకే ఇవ్వాలని అల్లుడు కోరగా.. నిరాకరించిన మామపై ట్రాక్టర్‌తో తొక్కించి కిరాతకంగా హతమార్చిన సంఘటన జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలో జరిగింది. తండ్రిని కాపాడాల్సిన కుమార్తె సైతం భర్తకు తోడుగా నిలవడం గ్రామస్థులను తీవ్రంగా కలచివేసింది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. రేచపల్లికి చెందిన పూరెళ్లి గంగయ్యకు ముగ్గురు కుమారులు కాగా రెండో కుమారుడు మల్లయ్య(48)కు తనవాటలోని ఆరెకరాలు పంచి ఇచ్చాడు. పదేళ్ల కిందట మల్లయ్య తన ఒక్కగానొక్క కుమార్తె జల(కావ్య)ను ఇదే గ్రామానికి చెందిన దీటి కొమురయ్యకు ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో రెండెకరాలు, మరి కొద్దిరోజులకు మరో రెండెకరాలు ఇవ్వడంతో కొమురయ్య సాగు చేసుకుంటున్నాడు. మల్లయ్య మిగిలిన రెండెకరాలు సాగు చేసుకుంటుండగా కొంతకాలంగా ఆ భూమిని కూడా తనకే ఇవ్వాలంటూ మల్లయ్యపై అల్లుడు ఒత్తిడి తీసుకువస్తున్నాడు. ఇందుకు మల్లయ్య నిరాకరించడంతో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ విషయంతోపాటు మల్లయ్య గతంలో గల్ఫ్ వెళ్లిన సమయంలో డబ్బులు భార్య గంగుకు పంపించగా డబ్బులన్నీ అల్లుడు, కుమార్తె దాచుకోవడంతో గొడవలు జరిగాయి. గంగు తన తల్లి గ్రామంలో ఉంటుండగా.. రేచపల్లిలో మల్లయ్య ఒంటరిగా ఉంటున్నాడు.

ట్రాక్టర్‌తో ఢీకొట్టి.. నాగళ్లతో ఈడ్చుకెళ్లి..

వారం క్రితం మల్లయ్య భూమిని అల్లుడు కొమురయ్య దున్నాడు. తిరిగి మల్లయ్య ట్రాక్టర్‌తో అదే భూమిని దున్నించాడు. ఆ భూమిలో ఆదివారం విత్తనాలు వేసేందుకు కొమురయ్య, భార్య జలతోపాటు వెళ్లాడు. విషయం తెలిసిన మల్లయ్య తన తండ్రి గంగయ్యతో కలిసి చేనులోకి వెళ్లాడు. అప్పటికే కొమురయ్య ట్రాక్టర్‌తో విత్తనాలు వేస్తుండగా అడ్డుకునేందుకు మల్లయ్య ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న కుమార్తె జల ఎప్పటికైనా తన తండ్రి భూమికి అడ్డు వస్తాడని భర్తను ప్రేరేపించడంతో ట్రాక్టర్‌తో ఢీకొట్టి పై నుంచి వెళ్లాడు. వెనుక ఉన్న నాగళ్లలో చిక్కుకున్నప్పటికీ ఆగకుండా అలాగే తిప్పడంతో తీవ్ర గాయాలతో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సీఐ రాజేశ్, ఎస్ఐ రాజయ్యలు పరిశీలించారు. కొమురయ్య, జలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కళ్ల ముందే కన్న కొడుకును చంపుతుంటే చూసి ఏమీ చేయకుండా ఉండిపోయానని తండ్రి గంగయ్య రోదనలు కంటతడిపెట్టించాయి. కొమురయ్య, జల సారంగాపూర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం.

సీలేరులో చిక్కుకున్న విద్యార్థులు

- రక్షించిన పోలీసులు, జెన్‌కో సిబ్బంది

ప్రమాదం నుంచి బయటపడిన విద్యార్థులు

చింతూరు న్యూస్‌టుడే: ఏపీ జెన్‌కోలో అప్రెంటీస్ చేయడానికి వచ్చిన ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు సీలేరు నదిలో చిక్కుకుని తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పాల్‌రాజ్, జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంటూ ఏపీ జెన్‌కోలో అప్రెంటీస్ చేస్తున్నారు. ఆదివారం కావడంతో సీలేరు నదిలోకి విహారం కోసం వెళ్లి నీటిలోకి దిగి సరదాగా గడుపుతున్నారు. ఇదే సమయంలో పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కోసం ఆకస్మికంగా నీటిని నదిలోకి విడుదల చేయడంతో ఒక్కసారిగా నదీ ప్రవాహం పెరిగింది. ప్రవాహానికి విద్యార్థులు కొట్టుకుపోయి నది మధ్యలో బండరాళ్ల మధ్య చిక్కుకుపోయారు. స్థానికులు గమనించి పోలీసులు, జెన్‌కో సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు విద్యుదుత్పత్తిని నిలిపివేసి నది ఉద్ధృతిని తగ్గించారు. నది మధ్యలో చిక్కుకున్న విద్యార్థులను తాళ్ల సాయంతో రక్షించారు. విద్యార్థులు దర్మల నాగరాజు, శివాజీ, రవితేజ, ప్రసన్నకుమార్, దుర్గాప్రసాద్, కిరణ్‌కుమార్, శ్రీకాంత్ పెనుప్రమాదం నుంచి బయటపడ్డారు.

గుంటూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

నకరికల్లు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా నకరికల్లు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పశువుల లోడుతో వెళుతున్న మినీ వ్యాన్ చెట్టును ఢీకొనగా డ్రైవర్ సపావత్ నరేష్‌నాయక్ (28), పాతపోతు నాను (37) దుర్మరణం చెందారు. వాహనంలో ఉన్న వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా తెలంగాణలోని నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం, రాళ్లపాడుతండా వాసులు.

కృష్ణాలో గల్లంతైన విద్యార్థులు మృతి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద శనివారం గల్లంతైన నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. విహారయాత్రకు వచ్చిన నలుగురు విద్యార్థులు గల్లంతయ్యారన్న విషయం తెలుసుకున్న వెంటనే ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు, స్థానిక జాలర్లు, అగ్నిమాపక శాఖ సిబ్బంది రంగంలోకి దిగారు. శనివారం అర్ధరాత్రి వరకు గాలించినా విద్యార్థుల ఆచూకీ లభించలేదు. తిరిగి ఆదివారం తెల్లవారుజాము నుంచే వెతుకులాట ప్రారంభించారు. 10 గంటల కల్లా నాగచైతన్య, రాజ్‌కుమార్, శ్రీనాథ్, ప్రవీణ్ మృతదేహాలను వెలికితీశారు.

చదివింది ఏడు అద్భుతాలు చేశాడు!

అంతరిక్షంలోకి అవలీలగా వెళ్లిరాగల సాంకేతిక పరిజ్ఞానం ఉన్న మనకి..

ఆకలిచావును అరికట్టే యంత్రం గురించి తెలియకపోవడం విచిత్రం. మనసుతో ఆలోచించేవాళ్లు లేకపోవడమే మన సమస్య.

అలా ఆలోచించడానికి పేరుచివర పెద్దపెద్ద డిగ్రీలే ఉండాల్సిన అవసరం లేదు అని నిరూపించాడా కుర్రాడు.

రైతులు, సామాన్యులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకి పలమనేరుకు చెందిన పవన్ పరిష్కారాలు చూపించాడు..

అర్ధరాత్రి కరెంట్ వస్తే పొలానికి ఆశగా వెళ్లిన రైతన్నకు విద్యుత్ తీగలే యమపాశాలైన దుర్ఘటనలు ఎన్ని చదవలేదు మనం. మనలానే పవన్ కూడా చదివి ఊరుకోలేదు. వ్యవసాయబావి దగ్గర మోటార్‌ని ఇంటినుంచే సెల్‌ఫోన్ సాయంతో ఆన్, ఆఫ్ చేసే పరికరాన్ని తయారుచేశాడు.

కారణాలేవైనా అడవుల్లోని ఏనుగులు సరిహద్దు గ్రామాల పంటలు మీద పడి నాశనం చేస్తుంటాయి. రైతుకు అది తీవ్రమైన నష్టాన్ని తెచ్చిపెడుతుంది. ఏనుగులకు తేనెటీగలు చేసే శబ్దం అంటే నచ్చదు. సరిగ్గా వాటి బలహీనతను తెలుసుకుని అరగంటకోసం ఎవ్వరి సాయం లేకుండా పొలాల్లో తేనెటీగల మాదిరిగా శబ్దం చేసే పరికరాన్ని కనిపెట్టి రైతులకు ఊరటనిచ్చాడు పవన్.

రైలుగేట్ల దగ్గర సరైన పర్యవేక్షణ లేక ఏటా ఎంతమంది మృత్యువాత పడుతున్నారో తెలియని విషయం కాదు. సౌరవిద్యుత్ సాయంతో రైలు రాకపోకలని గమనించి తనంతట తానుగా పనిచేసే రైలు గేటుని తయారుచేశాడు పవన్.

మీకో అనుమానం రావొచ్చు. ఇన్ని పరికరాలు కనిపెట్టిన పవన్ పేరొందిన ఏ విదేశీ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడా అని. విదేశాల్లో కాదుకదా... స్వదేశంలో కూడా పవన్ ఏ డిగ్రీలు చదవలేదు. ఆమాటకొస్తే నాలుగ్గోడల మధ్య కూర్చుని చదివే పెద్ద చదువులేవి అతను చదవలేదు. అలా చదివింది ఏడోతరగతివరకూ మాత్రమే. అది కూడా గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలో. తను చదివింది సమాజాన్ని.. అది ఎదుర్కొంటున్న సమస్యల్ని మాత్రమే. అందుకే పెద్దపెద్ద యూనివర్సిటీ, శాస్త్రవేత్తలు అందించలేని సమస్యలకి పవన్ చాలా తేలిగ్గా పరిష్కారాలని అందించాడు. అబ్దుల్‌కలాం వంటి వారి ప్రశంసలని అందుకున్నాడు. తాజాగా..యునైటెడ్ టెక్నలాజికల్ రీసెర్చి విశ్వవిద్యాలయం పవన్ ఆవిష్కరణలని గుర్తించి అతనికి గౌరవ డాక్టరేట్ అందించింది.

ఎలా వచ్చిందీ ఆసక్తి...

ఏ పరికరాన్ని చూసినా అందులో ఎలాంటి సాంకేతికతను ఉపయోగించారో తెలుసుకోవాలనే కుతూహలమే పవన్‌ని విభిన్నమైన పరికరాలు తయారుచేసే దిశగా నడిపించింది. పవన్ స్వస్థలం పలమనేరు మండలంలోని మొరం అనే గ్రామం. సాధారణంగా గ్రామాల్లో తరచూ ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం అందించే దిశగానే పవన్ తన పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. పవనశక్తి సాయంతో ఇంటికి విద్యుత్‌ని అందించే తొలిప్రయోగం విజయవంతం అవ్వడంతో.. వాళ్ల గ్రామంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో పనిచేసేలా ఎఫ్‌ఎం స్టేషన్‌నే ప్రారంభించాడు. విద్యుత్‌ని ఆదాచేసే విధంగా పవన్ తయారుచేసిన ఓ పరికరాన్ని గుంటూరు కలెక్టర్ నెట్‌క్యాప్ ద్వారా అమల్లోకి తీసుకొచ్చింది. పట్టు పరుగులు పెంచే రైతులకు ఊజీ పురుగుల బెడద చిన్నదేం కాదు. వాటిని నివారించేందుకు 2013లో పవన్ తయారుచేసిన 'ఊజీనాశన్' అనే పరికరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చూసి ముచ్చటపడ్డారు. ఆ పరికరాన్ని రైతులకు అందుబాటులోకి వచ్చేట్టు చొరవ తీసుకున్నారు. ఈ ప్రయోగాలకు మెచ్చిన ద్రవిడ యూనివర్శిటీ 'డైనమిక్ సైంటిస్టు' అనే అవార్డును ఇస్తే... అంబేడ్కర్ యూనివర్శిటీ 'యంగ్‌సైంటిస్టు'గా గుర్తించింది. దీనికి హైదరాబాదు నాబార్డు ప్రశంసలూ తోడయ్యాయి. అలా ఏడోతరగతి కూడా చదవని పవన్.. ఎస్వీయూనివర్శిటీలో తరగతులు బోధించే అవకాశాన్ని చేజిక్కించుకున్నాడు.

ఇద్దరి నుంచి ఇరవైమందికి...

గ్రామీణ నేపథ్యం... అంతంత మాత్రపు ఆర్థిక పరిస్థితులు... ఏడోతరగతి చదివిన ఓ కుర్రాడు ఈ రోజు 20 మందితో ఓ సంస్థ స్థాపించాడంటే యువతకు ఇంతకంటే స్ఫూర్తిగా ఎవరుంటారు? 'గ్రామంలో నేను ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించాలనే ఇలా వివిధ పరికరాల ఆవిష్కరణ మొదలుపెట్టా. ఒకసారి ఏదయినా పరికరాన్ని చూస్తే.. నా మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతాయి. ఆ పరికరం ఎలా తయారయింది? మనమైతే ఇంకా వినూత్నంగా తయారుచేయొచ్చా? ఇలా అనుక్షణం నాలో కొత్త ఆలోచనలు సుడులు తిరుగుతుండేవి. వాటికి కార్యరూపం ఇవ్వాలనే 2011లో పవన్‌ఎంపవర్ సొల్యూషన్ పేరిట ఇద్దరితో ఒక సంస్థను మొదలుపెట్టాను. ఇప్పుడు అందులో 20 మంది పనిచేస్తున్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం మా సంస్థ బ్రాంచీలున్నాయి. వీటిని ఇంకా విస్తరించాలని అనుకుంటున్నాను. కానీ వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి కావాల్సిన ఆర్థిక వనరులు లేవు. ప్రభుత్వం సహకరిస్తేనే అది సాధ్యమవుతుంది'. అంటున్నాడు పవన్

– కావేరి సుబ్రహ్మణ్యం, పలమనేరు.

కళకు జీవం శిలకు ప్రాణం

కొండలను పిండి చేయడం వేరు...

ఆ బండలను అద్భుత రూపాలుగా మలచడం వేరు...

మొదటి పని యంత్రాలు కూడా చేస్తాయి. కానీ రెండో పనిని మాత్రం కచ్చితంగా ఓ సృజనకారుడైన శిల్పే చేయగలడు.

యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో పాలుపంచుకుంటున్న వందలాది మంది శిల్పులు అక్షరాలా రెండు లక్షల టన్నుల శిలలను అద్భుత కళాఖండాలుగా మార్చే పనిలో ఉన్నారు. తమ ఉలులను కుంచెలుగా మార్చి అద్భుత శిల్పాకళా విన్యాసం చేస్తున్న వీరి నేపథ్యం నుంచి అన్నీ ప్రత్యేకమే...

ప్రపంచమంతా మెచ్చేలా... చూసిన వాళ్లంతా ఔరా అనేలా యాదాద్రిని మలచాలన్న దృఢ సంకల్పంతో జరుగుతున్న ఈ బృహత్ కార్యక్రమంలో కరకు బండలు బద్దలవుతున్నాయి. అపురూప శిల్పాలవుతున్నాయి. తనువును, మనసును లక్ష్యంపైనే పెట్టి రాయిని అద్భుత రూపాలుగా మార్చే పనిలో ఇక్కడ శిల్పులున్నారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న ఈ కళావిన్యాసంలో 800 మంది శిల్పులు భాగస్వాములవుతున్నారు. అంతే సంఖ్యలో కూలీలు సహకారం అందిస్తున్నారు. ఈ పనులన్నీ ప్రధాన స్థపతి సుందర్‌రాజన్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

ప్రధాన ఆలయానికి అవసరమైన శిల్పాలన్నీ తమిళనాడులోని మదురై, తిరుచ్చి, కారక్కుడి, తిరునల్‌వేళి, పుదుకొట్టై, మాథూర్, సంగ్రణ్‌కోవిల్, ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం, ఆళ్లగడ్డ, తిరుపతి నుంచి వచ్చిన శిల్పుల చేతిలో రూపొందుతున్నాయి. ముడి రాయిని శిల్పంగా మలిచే వారికి మూడు శాస్త్రాలపై పట్టుండాలి. వాస్తు, శిల్ప, ఆలయ శాస్త్రాలు కచ్చితంగా తెలిసి ఉండాల్సిందే. లేదంటే మూర్తిలో జీవకళ ఉట్టిపడదని నమ్ముతారు. అందుకే ప్రధాన ఆలయాల నిర్మాణం లేదా పునర్‌నిర్మాణాలకు ఆ శాస్త్రాలు తెలిసిన వారినే ఎంపిక చేసుకుంటారు. ప్రస్తుతం యాదాద్రిలో పని చేస్తున్న చాలా మది శిల్పులను కదిలిస్తే తమకు శిల్ప కళా నైపుణ్యం వంశపారంపర్యంగానే వచ్చిందని చెబుతారు. వారు దాదాపు నలభై, యాభై ఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు. 'చిన్న వయసు నుంచే ఈ పనిలో ఉండడం వల్ల పెద్దగా చదువుకో లేకపోయాం. మాకీ విద్యలో ఎలాంటి డిగ్రీలు లేవు. ఎవరూ తర్ఫీదునివ్వలేదు. మా తల్లిదండ్రులు చేస్తుండగా చూసి నేర్చుకున్నదే ఇదంతా' అంటారు వీరు. "ఎనిమిది దశాబ్దాలుగా మేం శిల్పాలు చెక్కే వృత్తిలోనే ఉన్నాం. మా పూర్వీకులది తమిళనాడు. తిరుమలలో అభివృద్ధి పనులు జరిగేటప్పుడు మా కుటుంబం అంతా ఇక్కడకు వచ్చేసింది. తిరుమలలోని స్వామి వారి పుష్కరిణి, గాలిగోపురం, శ్రీవారి మెట్టు, అలివేలుమంగాపురం, గోవిందరాజపురం దేవాలయాల్లోని ప్రధాన పనులన్నీ మా కుటుంబమే చేసింది. నేను 13వ ఏట నుంచే మా తండ్రి నుంచి ఈ కళను నేర్చుకున్నాను. ఇప్పుడు నా దగ్గర దాదాపు 250 మంది శిల్పులున్నారు. వారు యాదాద్రి ఆలయ పునర్‌నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. ఇక్కడ శిల్పాలను ఎంతో నియమనిష్టలతో చేస్తున్నా" మంటారు గణేశన్‌చారి. ఆయనతో పాటు అందరిదీ ఒకేరకమైన జీవన శైలి.

నియమాల తోరణం...

శిల్పులు రోజుకు 10 గంటలకు పైగా కష్టపడతారు. శిల్పాలకు జీవకళ ఉట్టిపడాలంటే నియమనిష్ఠలు పాటించాల్సిందేనని నమ్ముతారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలు తప్పనిసరిగా స్నానాదికాలు తప్పనిసరి. మధ్యలో మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా మళ్లీ స్నానం చేసిన తర్వాతే శిల్పాలను చెక్కే పనిని మొదలుపెడతారు. ఉదయం ఏడు గంటలకే మొదలయ్యే వారి దినచర్య సాయంత్రం ఏడున్నర తర్వాత ముగుస్తుంది. మధ్యాహ్న భోజనం తర్వాత అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకునే సమయం మినహా వారూ శిల్పాలకు ప్రాణం పోసే పనిలోనే నిమగ్నమవుతారు. కొందరు తప్పనిసరిగా పంచె ధరిస్తారు. నరసింహమూర్తి , పరశురాముడు వంటి రౌద్రంగా ఉండే విగ్రహాల తయారీ సమయంలో శిల్పులు శాంతి మంత్రం జపించడం ఆనవాయితీగా వస్తోంది.

సంక్లిష్టం...

మనం చూసి ఆహా అనుకునే విగ్రహాలన్నీ సృజనాత్మకత, చేయితిరిగిన కళవిన్యాసానికి నిదర్శనాలు. దాన్ని తయారు చేయడానికి శిల్పులు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఒక ముడి శిల నుంచి విగ్రహాన్ని తయారు చేయాలంటే ఆ పనిని 124 భాగాలుగా విభజించుకుంటారు. స్థపతి సూచించిన కొలతల ప్రకారం రాయిపై మార్కింగ్ వేసుకుంటారు. దాన్ని తిరిగి ఎనిమిది నుంచి పది సార్లు సరిచేసుకుంటూ చివరికి శిల్పానికి అనుగుణంగా ఉండే దశకు తీసుకువస్తారు. విగ్రహం తయారీకి ఒక రాయిని ఎంపిక చేసుకునేటపుడు దానిని అనేక విధాలుగా పరీక్షిస్తారు. పరిసరాల్లోని మట్టి నమూనాల ఆధారంగా రాయి జీవితకాలాన్ని, దాని గట్టిదనాన్ని అంచనా వేస్తారు. ఇక చెక్కే సమయంలో వారు చూపించే ఏకాగ్రతపైనే ఆ శిల్పం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. కాగితంపై ఉన్న మార్కింగ్‌ను చూస్తూ అదే డిజైన్‌ను రాయిపైన చెక్కాలంటే ఎంతో నైపుణ్యం కావాలి. "కాగితంపై వేస్తున్న బొమ్మ అనుకున్నట్లు రాకపోతే మరో కాగితంపై వేయొచ్చు. కాని శిల్పం చెక్కేటప్పుడు అలా కుదరదు. మాకు ఒక శిల్పానికి కావాల్సిన రాయిని కొలతలు వేసి ఇస్తారు. దానికి అనుగుణంగా శిల్పాన్ని చెక్కుతాం. ప్రధానమైన శిల్పాలు చెక్కేటపుడు సాధ్యమైనంత వరకు అనుభవం ఉన్నవారికి బాధ్యతలు అప్పగిస్తామని"మని అంటారు తమిళనాడు తిరుచ్చికి చెందిన వరదరాజన్. ఇప్పుడు అందివస్తున్న సాంకేతిక నైపుణ్యం, యంత్రాలు కొంత వరకు పనిని సులభం చేస్తున్నాయి. గతంలో ఒక ఆళ్వార్ విగ్రహాన్ని దాదాపు నలుగురైదుగురు మనుషులు రాత్రింబవళ్లు కష్టపడి ఏడాది కాలం పాటు చెక్కేవాళ్లం. ఇప్పుడు కొంత మిషనరీ సహకారం తీసుకుంటున్నాం కాబట్టి దానిని నాలుగైదు నెలల్లో పూర్తి చేస్తున్నాం. ఎంత యాంత్రిక సహకారం ఉన్నా శిల్పిలో సృజనాత్మకత లేకపోతే శిల్పంలో జీవకళ పోతుంది." అంటున్నారు శిల్పి ప్రస్తుతం యాదాద్రి శిల్పాల్లో ఎక్కువ భాగం తమిళనాడుకు చెందిన శిల్పులే చెక్కుతున్నారు.

యాదాద్రి పనుల్లో సంఖ్యాశాస్త్రాన్ని కూడా ఆచరిస్తున్నారు. దేవదేవుడికి ఇష్టమైన ఎనిమిది సంఖ్యతో ఎనిమిది మంది గుత్తేదారులు, 800 మంది శిల్పకారులు, కూలీలతో పనులు చేయిస్తున్నారు.

శిల్ప, వాస్తు శాస్త్రం ఆధారంగా ఏ శిల్పాన్ని ఎన్ని రోజుల్లో పూర్తి చేయాలో నిర్ణయిస్తారు. ఆ రోజుల నియమాన్ని తప్పనిసరిగా పాటిస్తారు. ఆలోగా శిల్పాన్ని చెక్కరు.. తొందరగా పూర్తిచేస్తే ఆ జీవకళ రాదని వారి నమ్మకం.

– జీడిపల్లి దత్తురెడ్డి, నల్గొండ
ఫోటోలు: సంపత్

రాజగోపురం... ముస్లిం శిల్పులు..

భుక్తి కోసం చేపట్టే ఏ పనైనా భక్తితో చేయాల్సిందే. దీనికి కులం, మతంతో పనిలేదని చాటి చెబుతున్నారా శిల్పకారులు. కళకు మతం అంటదని వారంటున్నారు. ఓ బృహత్కార్యాన్ని భుజస్కందాలపై వేసుకొని శ్రమిస్తున్నారు వీరు. షేక్ రబ్బానీ, షౌకత్ అలీ, మహమ్మద్ యూనిస్ వీళ్లే కాదు దాదాపు 200 మంది ముస్లిం శిల్పులు, కూలీలు యాదాద్రిలో ఏడంతస్తులుగా నిర్మితమవుతున్న మహారాజగోపురం నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. వీరిది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలోని తురకపాలెం. "మా తాతల కాలం నుంచి దేవతా విగ్రహాల తయారీలోనే మా కుటుంబం బతుకుతోంది. దాదాపు 80 ఏళ్లుగా ఇదే మా వృత్తి.

ఆలయాలే కాదు మేం మసీదులు కూడా కడతాం, మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో ఇటీవలే చర్చిని నిర్మించాం. మాకు మతంతో సంబంధం లేదు. పనే దైవం. యాదాద్రి ఆలయ మహారాజగోపురాన్ని నిర్మించడం మా పూర్వజన్మ సుకృతం" అని సంతోషం వ్యక్తం చేశారు షేక్ రబ్బానీ. దేవాలయ శిల్పాలను చెక్కేటపుడు వీరు కూడా కఠిన నియమాలను పాటిస్తారు. ఉదయమే స్నానాదికాలు పూర్తి చేసుకొని మాత్రమే పనిని ప్రారంభిస్తారు. పనిలో ఉన్నప్పుడు మాంసం, మద్యం ముట్టరు.

అంతా కృష్ణ శిలతోనే...

కొండపైన 2.33 ఎకరాల స్థలంలో జరుగుతున్న ఆలయంలో విగ్రహాలన్నీ కృష్ణశిలతోనే జరుగుతున్నాయి. ఈ శిలను గుంటూరు - ప్రకాశం జిల్లా సరిహద్దుల్లో ఉన్న గురిజేపల్లి, కోటప్పకొండ ప్రాంతం నుంచి తీసుకువస్తున్నారు. ప్రధానాలయం అంతా కృష్ణశిలతోనే నిర్మించడం దేశంలోనే ప్రథమం. కృష్ణ శిల ప్రాంతంలో ఉన్న మట్టినమూనాలను సేకరించి మద్రాసు ఐఐటీ వారితో పరీక్షలు చేయించారు. దాదాపు రెండు వేల ఏళ్ల వరకూ ఈ శిలకు క్షయం ఉండదని ఆ పరీక్షల్లో తేలింది. గత 500 ఏళ్లలోనే దేశంలోని ఏ ప్రాంతంలోనూ ఇలాంటి ఆలయం నిర్మించలేదని అంటున్నారు. దాదాపు రెండు లక్షల టన్నుల రాయితో శిల్పాలను చెక్కుతున్నారు పనులన్నీ వైష్ణవాచారం, ఆగమ, శిల్ప, వాస్తు శాస్త్రం ఆధారంగానే జరుగుతున్నాయంటున్నారు ప్రధాన స్థపతి సుందర్‌రాజన్.

యువత సైతం...

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న కాలంలో ఈ వృత్తిని ఎంచుకుంటున్న యువత తక్కువే అని చెప్పాలి. అయితే ఇక్కడ పనిచేస్తున్న శిల్పుల్లో దాదాపు 80 శాతం మంది 35 ఏళ్ల వయసు వారే. వీరు రోజుకు దాదాపు రూ.1800 నుంచి రూ. 2వేల వరకు సంపాదిస్తున్నారు. పనిని బట్టి, వారి నైపుణ్యాన్ని బట్టి స్థపతులు శిల్పులకు వేతనం చెల్లిస్తారు. ఇందులో ఎక్కువగా కొత్తగా వృత్తిలో చేరేవారి కన్నా వంశపారంపర్యంగా ఈ వృత్తినే నమ్ముకున్న వారే ఎక్కువమంది ఉన్నారు. తండ్రి, తాతల నుంచి వచ్చిన వృత్తి కావడం, ఇందులో పవిత్రత గోచరించడం, ఆర్థికంగానూ బాగుండటంతో వీరు ఈ వృత్తిలోనే కొనసాగుతున్నారు.

ధూళి బాధ...

ఎప్పుడూ దుమ్ము, దూళిలో పనిచేయడం, శిల్పాలు చెక్కేటపుడు దృష్టిని తీక్షణంగా కేంద్రీకరించడం వల్ల 45 ఏళ్లు వచ్చే వరకే చాలా మంది శిల్పులకు అస్తమా, దగ్గు, దమ్ములాంటి రోగాలు చుట్టుముడుతున్నాయి. దీంతో వారు 50 ఏళ్లు పైబడితే శిల్పాలు చెక్కే పనిపై అంతగా దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు.

కాఫీ తాగి బతికేస్తున్నారు!

భోజనం చేయకుండా మీరు ఎన్ని రోజులు ఉండగలరు..

మహా అయితే 4 లేదా 5 రోజులు...

అంతే కదా...

కానీ ఈ చిత్రంలో కనిపిస్తోన్న మహిళ భోజనం చేసి 40 ఏళ్లు...

ఇంకో విశేషం కూడా ఉంది...

ఆమె ఇన్నేళ్లుగా ఏ ఘనాహారాన్నీ తీసుకోలేదు. కేవలం కాఫీ తాగి బతికేస్తున్నారు...

ప్రస్తుతం కర్నూలులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్‌గా పనిచేస్తున్న ఎస్.విజయలక్ష్మమ్మ (53) సొంతూరు కోవెలకుంట్ల సమీపంలోని కలుగొట్ల. అమ్మానాన్న పామిరెడ్డి-లక్ష్మమ్మ. మొదటి నుంచీ ఆహారం అంటే అనాసక్తి. ఐదో తరగతి వరకు సొంతూర్లోనే చదువు. రోజూ అమ్మ చేసిన జొన్న రొట్టె.. వెన్న తినేవారు. ఆరో తరగతిలో చేరాక ఆమె ఆహారపుటలవాట్లు పూర్తిగా మారిపోయాయి. ఊర్లో హైస్కూల్ లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేవనూరు వెళ్లి చదువుకునే వారు. ఆ సమయంలో పుస్తకాల సంచితోపాటు భోజనం క్యారియర్ మోసుకెళ్లాలంటే భారంగా అనిపించడంతో క్రమంగా భోజనం మానేశారు. ఇంట్లో సమృద్ధిగా పాడి ఉండడంతో ఎక్కువ సార్లు కాఫీ తాగేవారు. చివరకు అదే అలవాటుగా మారిపోయి ఘనాహారం పూర్తిగా మానేశారు. పెళ్లైన తొలినాళ్లలో భార్య అలవాటును మార్చడానికి ఆమె భర్త సుబ్బారెడ్డి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కొందరు వైద్యులను సంప్రదిస్తే ఆమె శరీర తత్వానికి కాఫీ సరిపోయిందని.. ఏం ఫర్వాలేదని చెప్పారు. ప్రస్తుతం విజయలక్ష్మమ్మ రోజూ ఉదయం 5 గంటల నుంచి కాఫీ తాగడం మొదలుపెడతారు. అప్పటి నుంచి గంటగంటకీ ఒక పెద్ద కప్పుతో కాఫీ తాగుతారు. రోజూ రెండు లీటర్ల పాలతో 20-30 పైగా కప్పుల కాఫీ తాగాల్సిందే.

వైద్యుల అవసరం రాలేదు

విజయలక్ష్మమ్మకు దైవభక్తి ఎక్కువ. ఉదయం 4 గంటలకే లేచి పూజలు చేస్తారు. ఆపై భర్తతో కలిసి యోగా చేస్తారు. నాలుగు దశాబ్దాలుగా కాఫీ తప్ప ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఉన్నప్పటికీ ఆరోగ్య సమస్యలేమీ రాలేదు. భార్య అలవాటుపై సుబ్బారెడ్డి కొందరు వైద్యులను సంప్రదిస్తే తన శరీర తత్వానికి కాఫీ సరిపోవడం వల్ల ఏ సమస్యలూ రాలేదని, ఏం ఫర్వాలేదని చెప్పడంతో కాస్త కుదుటపడ్డారు. సమయానికి కాఫీ తాగకపోతే మాత్రం తలనొప్పి, అలసటగా అనిపిస్తుందట. పైగా మజ్జిగ తాగితే కడుపులో మంట వస్తుందని చెబుతున్నారామె. ఏదైనా ఫంక్షన్లకు వెళ్లాల్సి వస్తే ఆకలిగా లేదని చెప్పి తిరిగి వచ్చేస్తారు. మరీ మొహమాట పెడితే ఐస్‌క్రీం తిని వస్తారు.

ఎప్పుడూ ఆహారం ముట్టుకోని విజయలక్ష్మి భర్తకు మాత్రం శుభ్రంగా వండి పెడతారు.

ఇదండీ విజయలక్ష్మమ్మ కాఫీ కథ...

– యడ్లపాటి బసవ సురేంద్ర, కర్నూలు

ఈనాడు సినిమా

ప్రభాస్ ప్రేమ కథ @ 1970

ప్రభాస్

వెండితెరపై గత జీవితాన్ని, జీవన విధానాన్ని ఆవిష్కరించడంలో మన దర్శకులు పోటీ పడుతున్నారు. 'రంగస్థలం' 1980 నేపథ్యంలో సాగిన కథ. 'మహానటి' కోసం కూడా గతంలోకి వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు ప్రభాస్ సినిమా కోసం క్యాలెండర్‌లోని పేజీల్ని వెనక్కి తిప్పుతున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా యువీ క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతోంది. రాధాకృష్ణ దర్శకత్వం వహిస్తారు. ఇది 1970 నేపథ్యంలో సాగే ప్రేమకథని తెలుస్తోంది. కథ ప్రకారం యూరప్‌లోనే ఎక్కువ భాగం తెరకెక్కిస్తారు. కాస్త ఫాంటసీ, థ్రిల్లింగ్, యాక్షన్ కూడా జోడించారట. ఈ సినిమా కోసం కొత్త తరహా సెట్లు నిర్మించే పనిలో ఉంది చిత్రబృందం. కళా దర్శకుడు, ప్రొడక్షన్ డిజైనర్ రవీందర్ అప్పటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కొన్ని సెట్లు తీర్చిదిద్దే పనిలో ఉన్నారని సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో చిత్రీకరణ మొదలవుతుంది. పూజా హెగ్డే కథానాయికగా నటించనుంది. ప్రస్తుతం ప్రభాస్ 'సాహో' చిత్రీకరణలో బిజీగా ఉన్నాడు.

సెంథిల్ కుమార్, అల్లు అరవింద్, హర్షవర్ధన్ రామేశ్వర్, రాజమౌళి, ప్రేమ్‌రక్షిత్, సాయి కొర్రపాటి, చిరంజీవి, కల్యాణ్ దేవ్, మురళీ శర్మ, కీరవాణి, రాకేష్ శశి, మాళవిక నాయర్

తండ్రిలాంటి నిర్మాత క్యాషియర్‌లా మారిపోయాడు - చిరంజీవి

"ఆరోజుల్లో సినిమాకి సంబంధించిన కథ విషయంలో నిర్మాత జోక్యం బాగుండేది. తమ అభిరుచికి తగిన సినిమాల్ని తీసేవారు. నిర్మాత తండ్రి పాత్ర పోషించేవాడు. అలాంటి నిర్మాత ఇప్పుడు క్యాషియర్‌లా మారిపోయాడ"న్నారు చిరంజీవి. ఆయన అల్లుడు కల్యాణ్‌దేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'విజేత'. మాళవిక నాయర్ నాయిక. సాయి కొర్రపాటి నిర్మాత. రాకేష్ శశి దర్శకుడు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాలు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిరంజీవి పాటల్ని ఆవిష్కరించారు. ట్రైలర్ రాజమౌళి చేతుల మీదుగా విడుదలైంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "'విజేత' అనే పేరు పెట్టిన వెంటనే నాకు 35 ఏళ్ల క్రితం నేను చేసిన 'విజేత' గుర్తొచ్చింది. కథ ప్రకారం ఆ విజేతకూ, ఈ విజేతకూ సారుప్యం ఉంది. దర్శకుడు రాకేశ్ కథ వినిపించప్పుడే బాగా నచ్చింది. చక్కటి మధ్యతరగతి కథా చిత్రమిది. ఆనాడు మాస్, యాక్షన్ చిత్రాలు ఉధృతంగా చేస్తున్న సమయంలో 'విజేత' కథ నా దగ్గరకు వచ్చింది. ఇలాంటి కథల్ని అభిమానులు ఎలా ఆదరిస్తారో అని భయపడ్డాను. కానీ మంచి విజయాన్ని అందుకుంది. ఈ 'విజేత' కూడా ప్రేక్షకులకు నచ్చుతుంది. కల్యాణ్‌దేవ్‌కి ఈ సినిమాతో అభిమానుల ఆశీస్సులు లభిస్తాయి. సాయి కొర్రపాటి లాంటి అభిరుచి గల నిర్మాతలు పరిశ్రమలో ఉండాలి. ఈ చిత్రబృందంలోకి సెంథిల్ వచ్చినప్పుడే సినిమా విజయవంతమైందనిపించింది. హర్షవర్ధన్ పాటలు బాగున్నాయి. కోడి పాట ముందే విన్నా. అప్పుడే బాగా నచ్చింది. కల్యాణ్ వ్యాపారవేత్త తనయుడు. అయినా నటనవైపు మొగ్గు చూపాడు. సత్యానంద్ గారి దగ్గర శిక్షణ తీసుకున్నాడు. నటనలోనూ, డాన్సుల్లోనూ రాణించాడు. రొమాంటిక్ సీన్లలో ఇమిడిపోయాడు. మాళవిక బాగుంది. మురళీ శర్మని చూస్తే మధ్యతరగతి తండ్రి గుర్తొస్తారు. ఇంతమంది పేరున్న నటీనటులతో కలసి నటించే అవకాశం రావడం కల్యాణ్ అదృష్టం. జులై 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నార"న్నారు. రాజమౌళి మాట్లాడుతూ ''చిరంజీవిగారు మంచి నటుడు, డాన్సర్, ఫైటర్. కథని జడ్జ్ చేయడంలో ఆయన్ని మించినవాళ్లు లేరు. 'మగధీర' కథ ఆయనకే ముందు చెప్పా. 'విజేత' కథ విని 'బాగుంది' అని పచ్చజెండా ఊపారు. అదే ఈ సినిమాపై నమ్మకాన్ని పెంచింది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడని నిర్మాత సాయి కొర్రపాటి. సెంథిల్ వచ్చినప్పుడే ఇది పెద్ద సినిమా అవుతుందనిపించింది. కోడి పాట నాకు చూపించారు. నాకే కాదు.. మా ఇంట్లో వాళ్లందరికీ నచ్చింది. అప్పటి విజేత చిరంజీవిగారికి ఎంత పేరు తీసుకొచ్చిందో, ఇప్పటి 'విజేత' కల్యాణ్‌దేవ్‌కి అంత పేరు తీసుకురావాలి'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ "మెగా కుటుంబ సభ్యులు సినిమాల్లోకి రావడానికి కారణం అభిమానులు ఇచ్చే ధైర్యమే. తన ప్రతిభతోనూ కల్యాణ్ మెప్పిస్తాడ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "చిరంజీవిగారికి కథ చెప్పిన సందర్భం జీవితాంతం మర్చిపోలేను. ఓ గొప్ప కుటుంబం నుంచి కథానాయకుడు వస్తున్నప్పుడు కాస్త భయం కూడా ఉంటుంది. చాలా జాగ్రత్తలు తీసుకుని ఈ సినిమా చేశాం" అన్నారు. కల్యాణ్ దేవ్ మాట్లాడుతూ "దర్శకుడుకి చాలా క్లారిటీ ఉంది. సోదరుడిలా ప్రోత్సహించారు. మురళీశర్మలాంటి అనుభవజ్ఞులతో పనిచేసే అవకాశం రావడం అదృష్టం" అన్నారు. ఈ కార్యక్రమంలో సెంథిల్‌కుమార్, కీరవాణి, హర్షవర్ధన్ రమేశ్వర్, మాళవిక నాయర్, అవసరాల శ్రీనివాస్, తిరుపతి ప్రసాద్, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

సమంత

ఎవరికొచ్చినా సంతోషమే

బలమైన కథానాయిక పాత్రలో ఎవరు కనిపించినా, వాటిని తానే చేసినంత సంతోషం కలుగుతుందని చెబుతోంది సమంత. ఈ ఏడాది ఆమె నటనతో మాయే చేసింది. 'రంగస్థలం', 'మహానటి' చిత్రాలతో సమంతకొచ్చిన పేరు అంతా ఇంతా కాదు. కథానాయికల పాత్రల గురించి ఎప్పుడూ మాట్లాడుతుంటుందామె. అలాగని తానేమీ నాయికా ప్రాధాన్యమున్న కథలకి పక్షపాతిని కానంటోంది. "స్వతహాగా వాణిజ్య ప్రధానమైన సినిమాల్ని చూడ్డానికే ఇష్టపడతా. వాటిలో ఒక్క కథానాయికే ఉండదు. అన్ని పాత్రలూ బలంగా ఉంటాయి. నటిగా నా ప్రాధాన్యం ఎప్పుడూ కథకే. మంచి కథలో, మంచి పాత్రలు తప్పనిసరిగా ఉంటాయనే నమ్మకం నాది. కానీ కొన్నిసార్లు 'ఇలాంటి పాత్రలు మన కథానాయికలు చేయలేరు' అనే మాటల్ని వింటుంటా. అలాంటి భయాలతో మంచి పాత్రల్ని సృష్టించడానికి ఎవ్వరూ వెనకాడకూడదు. మంచి పాత్రలిస్తే అద్భుతాలు సృష్టిస్తామని ఇప్పటికే చాలా మంది నిరూపించారు కదా. అది చూసైనా మాకోసం పాత్రలు సృష్టించాల్సిందే" అని చెబుతోంది సమంత.

వెలుగుతున్న సూర్యుణ్ని మబ్బుమూయును
మనిషి తెలివియనే సూర్యుణ్ని కోపం మూయును
గాలి వీచ మబ్బు తెరలు కదలిపోవులే
మాట కలుపుకొన్న కోపమే చెలిమియగునులే

గీతం: పిల్లలూ దేవుడు చల్లని వారే...
చిత్రం: లేత మనసులు
రచన: ఆరుద్ర
– పంపినవారు: వి.పద్మజాప్రసాద్, హైదరాబాద్

గీతోపదేశం

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ హైదరాబాద్ - 501512

'లవర్' గీతాలొచ్చాయ్!

సమీర్‌రెడ్డి, దిల్‌రాజు, శిరీష్, రాజ్‌తరుణ్, హర్షిత్ రెడ్డి, అనీష్‌కృష్ణ, రిషి రిచ్, రిధి, సాయికార్తీక్

"కథ బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. మంచి కథల్ని ఎంచుకొని సినిమాలు చేయడంతోనే మా సంస్థకి ఇంత పేరొచ్చింది. ఆ పేరుకు తగ్గట్టుగానే ప్రతి సినిమాని ఒక సవాల్‌గా తీసుకొని చేస్తున్నాం" అన్నారు దిల్‌రాజు. ఆయన నిర్మాణ సారథ్యంలో రూపొందిన చిత్రం 'లవర్'. రాజ్‌తరుణ్, రిధి జంటగా నటించారు. అనీష్‌కృష్ణ దర్శకుడు. హర్షిత్ రెడ్డి నిర్మాత. శిరీష్ సమర్పిస్తున్నారు. అంకిత్ తివారి, రిషి రిచ్, అర్కో, తనీశ్ బాగ్చి, సాయికార్తీక్ స్వరాలు సమకూర్చారు. ఆదివారం హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. దర్శకుడు సతీష్ వేగేశ్న, అనిల్ రావిపూడి తొలి సీడీని ఆవిష్కరించారు. దిల్‌రాజు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "మా కుటుంబం నుంచి వస్తున్న తర్వాతి తరం నిర్మాత హర్షిత్. అనీష్ చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా చేశాడు. అనీష్ మొదట ఈ కథని తన తొలి సినిమాలాగే మల్టీప్లెక్స్ ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకొని రాసుకొన్నాడు. అన్ని వర్గాల ప్రేక్షకులకీ నచ్చేలా తనతో కథని చేయించి ఈ సినిమా తీశాం. గతేడాది ఆరు విజయాల తర్వాత, మా సంస్థ నుంచి ఈసారి విడుదలవుతున్న తొలి సినిమా ఇది. మేం 'ఆర్య', 'భద్ర' చిత్రాల సమయంలో కథానాయకుల లుక్ గురించి ఎన్ని జాగ్రత్తలు తీసుకొన్నామో, హర్షిత్ కూడా అంతే జాగ్రత్త తీసుకొని ఈ సినిమా చేశాడు. ఒకొక్క పాటని ఒక్కో సంగీత దర్శకుడితో చేయించాడు. ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన లభించింది. రాజ్ తరుణ్ ఈమధ్య చేసిన సినిమాలు ఆడకపోయినా, ఈ సినిమా ఫస్ట్ లుక్ ఆన్‌లైన్‌లో ట్రెండింగ్ అయ్యింది. మా సంస్థ నుంచి ఒక సినిమా వస్తుందంటే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. మంచి బృందం కలిసి చేసిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సంగీతం విన్నవాళ్లు మెచ్చుకుంటున్నారు. రాజ్‌తరుణ్‌తో ఇదివరకు రెండు మూడు కథలు అనుకొన్నాం కానీ... కుదరలేదు. సరిపడే కథలొస్తే ఆయనతో సినిమాలు చేస్తూనే ఉంటాం" అన్నారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ "నాకు ఇది తొలి సినిమాలాగే ఉంది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం సమీర్‌రెడ్డి. లుక్ పరంగా కొత్తగా ఉన్నానంటున్నారు. దానికి కారణం నిర్మాత హర్షిత్. నా గురించి నాకంటే ఎక్కువ జాగ్రత్త తీసుకొన్నాడు. అనీష్ ఈ సినిమాని బాగా తీశాడు. ఈ అవకాశం ఇచ్చినందుకు దిల్‌రాజుకి కృతజ్ఞతలు. ఆయన నాతో ఏడాదికొక సినిమా చేస్తానంటే, వేరొక సినిమా కూడా చేయన"న్నారు. హర్షిత్ మాట్లాడుతూ "బాబాయ్‌లిద్దరూ తపన కలిగిన నిర్మాతలు. వాళ్ల ప్రోత్సాహం, సహకారంతోనే ఈ సినిమా చేశా" అన్నారు. శ్రీమణి మాట్లాడుతూ "ప్రతి పాటకీ ఒక కాన్సెప్ట్ ఉండాలనే నియమంతో ఈ చిత్రంలో పాటలు రాశా. హర్షిత్, అనీష్‌లకి మంచి పేరు తీసుకొచ్చే చిత్రమవుతుంద"న్నారు. ఈ కార్యక్రమంలో రాజా రవీంద్ర, ప్రవీణ్, రాజా, సురేంద్ర, రిషి రిచ్, సాయి కార్తీక్, రాజీవ్ కనకాల, సమీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహ బంధం విలువ తెలిపేలా..

ఆమని

సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆమనికి మంచి పాత్రలే దక్కుతున్నాయి. 'భరత్ అనే నేను'లో ఓ కీలక పాత్ర పోషించిన ఆమని ఇప్పుడు 'ఐపీసీ సెక్షన్ భార్యాబంధు'లో నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించబోతున్నారు. రెట్టడి శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఆమని విలేకరులతో మాట్లాడుతూ "ఈ సినిమాలో నటించే అవకాశం వచ్చినప్పుడు మొదట సంకోచించాను. 'చిన్న సినిమా కదా, ఈ సమయంలో అవసరమా' అనిపించింది. కానీ కథ విన్న తరవాత.. 'తప్పకుండా చేయాల్సిందే' అని నిర్ణయించుకున్నాను. వివాహబంధం విలువ తెలిపే చిత్రమిది. ఈరోజుల్లో చిన్న చిన్న కారణాలకే జంటలు విడిపోతున్నాయి. వాళ్లంతా ఒక్కసారి ఆలోచించుకునేలా సన్నివేశాలు ఉంటాయి. ఓ రచయితగా, మానసిక నిపుణురాలిగా నటించాను. పెళ్లి నేపథ్యంలో వచ్చే పాట అందరినీ ఆకట్టుకుంటుంది. నటీనటులు, సాంకేతిక నిపుణులంతా చాలా కష్టపడ్డారు. వాళ్ల ప్రతిభ తెరపై కనిపిస్తుంది. తప్పకుండా ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంద"న్నారు.

ఈ స్టార్ హీరో ఎవరు?

చిన్న వయసులోనే భిన్నమైన హెయిర్ స్టైల్‌తో కనిపిస్తున్న ఈ కుర్రాడు ఎవరు? అనుకుంటున్నారా? ఇప్పుడు ఇతనో స్టార్ హీరో. ఇప్పుడూ ఇలాగే డిఫరెంట్ హెయిర్ స్టైల్‌తోనూ..చిత్ర విచిత్ర దుస్తులు ధరించి ఫోజులిస్తుంటాడు. అక్కడితో ఆగకుండా ఆ ఫొటోలను అభిమానుల కోసం సామాజిక మాధ్యమాల్లో పంచుకొంటూ ఉంటాడు. అతడు ఎవరో కాదు....వెండితెర అల్లా ఉద్దీన్ ఖిల్జీ రణ్‌వీర్‌సింగ్. తన చిన్ననాటి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకొన్నాడు రణ్‌వీర్. 'అవంత్ గార్డే...1985' అని ఈ ఫొటో గురించి రాశాడు. దీనికి బాలీవుడ్ తారల నుంచి అభిమానుల నుంచీ భిన్నమైన కామెంట్లు వచ్చాయి. ఈ మధ్య రణ్‌వీర్ ప్రతి పోస్ట్‌కి తప్పకుండా కామెంట్లు పెట్టే జాబితాలో ముందే ఉంటుంది దీపికా పదుకొణె. తాజాగా ఈ ఫొటోకు కూడా 'నో.....' అంటూ 'చూడలేకపోతున్నాను...' అనే అర్థం వచ్చేలా ఎమోజీని పెట్టింది దీపిక. దానికి 'అనుకోకుండా....అది నిజం...నేనే' అని రాశాడు రణ్‌వీర్. 'బాబా..బాబా..భాంద్ షీప్..నెక్స్ట్ లెవల్'అంటూ దర్శకుడు అలీ అబ్బాస్ జాఫర్ కామెంట్ చేశారు. ఈ ఫొటోలోని వ్యక్తి కనిపిస్తే అరెస్ట్ చేయండని కొందరు స్పందించారు.

పంచ్ డైలాగ్

ఉలి దెబ్బకు బాధపడితే శిల శిల్పం అవుతుందా?..
దున్నేటప్పుడు బాధపడితే నేల కడుపున బంగారం పండుతుందా?
చిత్రం: సూర్యవంశం
– పంపినవారు: మల్లా మణికంఠ, ధనుపురం

రేణుదేశాయ్ నిశ్చితార్థం

నటి రేణుదేశాయ్ నిశ్చితార్థం జరిగింది. ఆ విషయాన్ని ఆమె ఆదివారం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. కాబోయే భర్తతో ఉంగరాలు మార్చుకొంటున్నప్పటి ఫొటోతో పాటు, తన పిల్లలతో కలిసి ఉన్న ఫొటోల్ని పంచుకొన్నారామె. అయితే తనకు కాబోయే భర్త వివరాల్ని కానీ, నిశ్చితార్థం ఎక్కడ జరిగిందనే విషయాన్ని కానీ ఆమె బయటపెట్టలేదు. తాను వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతున్నట్టు రేణుదేశాయ్ కొంతకాలంగా చెబుతూ వస్తున్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ఆ విషయాన్ని ఖరారు చేశారు. పవన్‌కల్యాణ్ నుంచి విడిపోయిన రేణుదేశాయ్ కొంత కాలంగా పుణెలో పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. నిశ్చితార్థం సమయంలో రేణుదేశాయ్‌తో పాటే పిల్లలు అకీరా, ఆద్య ఉన్నారు. "జీవితంలో సంతోషకరమైన దశని మొదలుపెట్టే సమయంలో నా పిల్లలు నా పక్కనే ఉండటం చాలా సంతోషాన్నిస్తోంది. వాళ్లు లేకపోతే నా సంతోషం పరిపూర్ణం కాదు" అని ట్వీట్ చేశారు రేణుదేశాయ్. "బాధ నుంచి కోలుకొనేందుకు, నాకు తోడుగా నిలిచిన నీ మనసుకు ధన్యవాదాలు" అంటూ కాబోయే భర్తని ఉద్దేశించి ఇన్‌స్టగ్రామ్‌లో రాశారు రేణు.

క్రైమ్ కథతో...

నిఖిత పవర్, విశ్వపై క్లాప్‌నిస్తున్న జీవా

విశ్వ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ఇది నా బయోపిక్'. నిఖిత పవర్ కథానాయిక. శివ గణేష్ దర్శకత్వం వహిస్తున్నారు. రవిచంద్ర ఈమండి, శ్రీనివాస్ జివి రెడ్డి, నాగేంద్ర వర్మ నిర్మాతలు. హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి నటుడు జీవా క్లాప్‌నిచ్చారు. తెరాస నాయకుడు మెట్ట సూర్యప్రకాష్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "క్రైమ్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఇదివరకు నేను తీసిన '33 ప్రేమకథలు' చిత్రానికి మంచి స్పందన లభించింది. రెండో చిత్రం 'సకల కళావల్లభుడు' త్వరలోనే విడుదలవుతుంది. మూడో ప్రయత్నంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా" అన్నారు. నిర్మాతల్లో ఒకరైన రవిచంద్ర ఈమండి మాట్లాడుతూ "దర్శకుడు ఆసక్తికరమైన కథని సిద్ధం చేశాడు. వచ్చే నెల 26 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలుపెడతామ"న్నారు. పృథ్వీ, అపూర్వ, జబర్దస్త్ మురళి, పప్పు ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జగదీష్ చీకటి, సంగీతం: అజయ్ పట్నాయక్.

ఏవండీ.. బరువు తగ్గండీ!

పొద్దున్నే నిద్రలేచి వ్యాయామం చేస్తానంటారు... కానీ చేయరు! కొవ్వుపదార్థాలు మానేస్తాననీ చెబుతారు... కానీ నాన్‌లూ, పిజాలూ, బర్గర్‌లు లాగించేస్తారు. వేళకు నిద్రపొమ్మంటే... కంప్యూటరు ముందునుంచీ కదలరు. కూరల్లో కాస్త ఉప్పు తగ్గిస్తే... ఏంటీ చప్పిడి తిండి అంటూ కోప్పడతారు... ఇలా శ్రీవారి బరువుకు సంబంధించిన కథల గురించి ఎన్నయినా చెప్పేస్తారు చాలామంది మహిళలు. అలా బాధపడటం కన్నా... తన బరువును తగ్గించే ప్రయత్నం ఎందుకు చేయకూడదు. దానివల్ల మనమూ సన్నబడొచ్చు. అదెలా అంటారా... చదవండి మరి.

పెళ్లికి ముందు...ఫిట్‌గా ఉండాలీ, అందంగా కనిపించాలి, పిడికెడు పొట్ట కూడా ఉండకూడదు... అని అమ్మాయిలే కాదు, అబ్బాయిలూ ఆలోచిస్తారు. దానికి సంబంధించి తీసుకునే జాగ్రత్తలూ, పాటించే కొత్తకొత్త నియమాల జాబితా చాంతాండంత ఉంటుంది. తీరా పెళ్లయ్యాక ఉద్యోగం, కుటుంబం, పిల్లలూ, ఆలస్యంగా పడుకోవడం, ఆహార నియమాలు పాటించకపోవడం... అన్నీ కలిపి బరువు పెంచేస్తాయి. అవే క్రమంగా అనారోగ్యాలూ, వైవాహిక జీవితంలో సమస్యలు తెచ్చి... మానసిక కుంగుబాటుకు దారి తీస్తాయి. శ్రీవారి బాగోగులు చూసే ఇల్లాలిగా.. వారి ఆరోగ్యం కూడా స్త్రీ చేతిలోనే ఉంటుంది కాబట్టి 'ఛలో సన్నబడదాం..' అంటూ ఆయన్నీ ప్రోత్సహించండి. ముందుగా...

మానసికంగా సిద్ధం చేయండి...

చాలామంది మహిళలు చేసే పొరపాటు 'మీరు బరువు తగ్గాల్సిందే. అవి తినొద్దు.. ఇవి తినొద్దు' అని ఆర్డర్లు వేసేస్తుంటారు. దీంతో రకరకాల ఒత్తిళ్లలో ఉన్న మగవారు ఈ విషయాన్ని ప్రతికూలంగా తీసుకుంటారు. గట్టిగా దబాయింపుగా చెప్పడాన్ని మాత్రమే వారు పట్టించుకుంటారు గానీ.. అసలు విషయాన్ని పక్కన పెట్టేస్తుంటారు. కొందరు అనుకుంటారు కానీ ఆరంభంలోనే ఆగిపోతారు. 'తను చెబితే నేను చేయాలా... నాకు తెలియదా ఎప్పుడు ఏం చేయాలో...' అనే ధోరణిలో తమ ఆరోగ్యాన్నీ, ఫిట్‌నెస్‌ని నిర్లక్ష్యం చేసేవారూ ఉంటారు. కాబట్టి భర్త బరువు తగ్గాలి అనుకుంటే.. ముందు మానసికంగా సిద్ధం చేయాలి. పెళ్లికి ముందు ఫొటోలు చూపించి.. 'మళ్లీ మనం ఇలా ఎప్పుడవుదాం..' అని అడిగి చూడండి. కలిసి వ్యాయామం చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టడం, చిలిపి సవాళ్లు విసరడం.. వంటివి శ్రీవారిని తప్పకుండా ఆ దిశగా ప్రేరేపిస్తాయి. భార్యాభర్తలు కలిసి వ్యాయామం చేయడం వల్ల ఎన్నో లాభాలున్నాయి. ఒకరినొకరు స్ఫూర్తి పొందుతూ ముందుకు సాగొచ్చు. పార్టనర్ యోగా, పార్టనర్ ఏరోబిక్స్, పార్టనర్ ఎక్సర్‌సైజెస్, పార్టనర్ ఫిట్‌నెస్... ఇలా రకరకాలుగా ప్రయత్నించొచ్చు. ఇంటికి దగ్గరలోని పార్కుకో, మైదానానికో ఇద్దరూ కలిసి ఉదయం నడకకు వెళ్లొచ్చు. తాడాట ఆడొచ్చు. గోడ కుర్చీలు వేయొచ్చు. స్క్వాట్స్‌ను ప్రయత్నించొచ్చు. ట్రైనర్‌ను పెట్టుకుని ఇద్దరూ కలిసీ వ్యాయామాలు చేయొచ్చు అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణురాలు మణిపవిత్ర.

అప్పుడేం చేయాలంటే..

❖ మీరు కావచ్చు, ఆయన కావచ్చు... అప్పటివరకూ జీవనశైలిలో చేసిన పొరపాట్లన్నీ ఓ జాబితాగా రాసుకోవాలి. ఇక మీదట చేయాల్సిన నియమాలను మరో కాగితంపై రాయాలి. చేయకూడనివి రెడ్ మార్కర్‌తో కొట్టేసి చేయాల్సినవి గ్రీన్ మార్కర్‌తో టిక్ చేయాలి. ఆ జాబితాను ప్రతిరోజూ ఇద్దరూ చూసేలా ఒక చోట అంటించుకోవాలి. అలా చూడటం వల్ల మెదడులో చేయాలన్న స్ఫూర్తి పెరుగుతుంది.

❖ నిపుణుల్ని సంప్రదించి బరువు తగ్గడానికి ఎలాంటి నియమాలు పాటించాలన్నదీ ఓ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ఆహార నియమాలూ, చేయాల్సిన వ్యాయామ ప్రక్రియ గురించి రాసుకోవాలి. ఎలా చేయాలన్నది మాట్లాడుకోవాలి. ఒక్కరి నిర్ణయమం మీదే వెళ్లడం సరికాదు.

❖ ఇద్దరూ కలిసి ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం అలవాటు చేసుకోవాలి. కలిసి వ్యాయామ సాధన చేయడం, అల్పాహారం తీసుకోవడం మొదలుపెట్టాలి. వీలుంటే మిగతా సమయాల్లోనూ కలిసి తినడానికి ప్రాధాన్యమివ్వాలి.

❖ రోజూ ఒకే రకమైన వ్యాయామ సాధనలు కాకుండా ఒక రోజు నడకా, మరోరోజు జాగింగ్.. ఇలా రోజూ వ్యాయామ సాధనలో కొత్తదనం ఉండేలా ప్రణాళిక వేయాలి. ఈ రోజుల్లో ఇద్దరూ కలిసి చేసే యోగాసనాలు ఉన్నాయి. అలా ఇద్దరూ కలిసి చేయడం వల్ల ఫలితాలు చాలా త్వరగా ఉంటాయని చెబుతున్నారు యోగా నిపుణులు.

❖ ఒక వేళ మీ శ్రీవారు బద్ధకించినా గట్టిగా అరవడం, విసురుగా మాట్లాడటం, కోప్పడటం సరికాదు. నియమాలు పాటించడంలో వెనకబడినా, ఒకరోజు బద్ధకించినా తేలిగ్గానే తీసుకోవాలి తప్ప సహనం కోల్పోకూడదు.

వంటింట్లో చేయాల్సిన మార్పులు...

● బరువు తగ్గడానికి పూర్తిగా పొట్ట మాడ్చుకోవాల్సిన అవసరంలేదు. మాంసకృత్తులూ, పిండిపదార్థాలు శరీరానికి అందాలి. పిండిపదార్థాలు అంటే అన్నం, బ్రెడ్ నుంచి అందేవి కాకుండా సంక్లిష్ట పిండిపదార్థాలు ఎంచుకునేలా చూసుకోవాలి. అంటే బ్రౌన్‌రైస్, తృణధాన్యాలూ, ఓట్స్ వంటి వాటితో చేసిన పదార్థాలు అన్న మాట. వీటిని కూడా మితంగా తీసుకోవాలి. వీటిల్లో పీచు ఉండటమే కాదు.. . అరగడానికీ ఎక్కువ సమయం పడుతుంది.

● మాంసాహారం దూరంగా పెట్టాల్సిన పనిలేదు. మీ వారికి ఎక్కువగా తినే అలవాటు ఉంటే పూర్తిగా మానేయమనకుండా ఆ పరిమాణం తగ్గిస్తూ రావాలి. బదులుగా మీల్‌మేకర్, స్కిన్‌లెస్ చికెన్ ఎంచుకోవచ్చు. అంతేకానీ అలవాటు లేని బ్రకోలీ, లెట్యూస్ వంటివి శ్రీవారికి వడ్డించేయడం సరికాదు.

● తీపి పదార్థాలు బరువు పెరగడానికి కారణమవుతాయి. అందుకే మిఠాయిలను మాత్రం ఎంత తగ్గిస్తే అంత మంచిది. బదులుగా తేనె, తాజా పండ్లూ, ఖర్జూరాలూ, ఎండు ద్రాక్ష వంటివి ఇవ్వొచ్చు. వీటితో చేసిన స్వీట్లు కూడా ఆరోగ్యానికి మంచిదే.

● రెస్టారంట్లూ, రోడ్డువారల ఆహారాన్ని పూర్తిగా దూరం పెట్టేయడం మంచిది. మంచి నీళ్లు ఎక్కువగా తాగాలి. పండ్ల రసాలకు బదులు పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. కీరదోస, క్యారెట్, బీట్‌రూట్, టొమాటోతో సలాడ్లు చేయడం మంచిది. నూనె, ఉప్పూ ఎంత తక్కువ తీసుకుంటే అంత త్వరగా ఫలితం ఉంటుంది.

● అల్పాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. రాజ్మా, పెసలూ, బఠాణీ, సెనగలూ, గుడ్లూ, సోయా, పల్లీలూ... ఇవన్నీ మనం తీసుకునే భోజనంలో తప్పకుండా ఉండేలా చూసుకోవాలి. వీటిలోని మాంసకృత్తులు శరీరానికి శక్తిని అందిస్తాయి.

● కాఫీ, టీలు తాగినా చక్కెర్లకు దూరంగా ఉండాలి. వాటితోపాటు ఉదయం, సాయంత్రం గ్రీన్ టీ తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు బరువు తగ్గడంలోనే కాదు.. శరీరంలోని విషవ్యర్థాలను బయటకు పంపడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి అంటున్నారు పోషకాహార నిపుణురాలు డాక్టర్ లతాశశి.

సరదా సరదాగా..

వ్యాయామం, బరువు తగ్గడం, డైటింగ్ వంటి మాటలు మనసులోంచి తీస్తే చాలా మంచిది. ఇద్దరూ కలిసి వ్యక్తిగత సమయం కేటాయించుకుంటున్నాం అని భావిస్తే చాలా బాగుంటుంది. భార్యాభర్తలిద్దరూ కలిసి సరదాగా ఈత తరగతులకు వెళ్లడం, సైక్లింగ్ చేయడం, టెన్నిస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటివి ఆడొచ్చు. చిన్నారుల్లా మారి.. ఎంత హడావుడిగా ఉన్నా.. రోజులో ఎంతో కొంత సమయం ఇలా గడపడం వల్ల ఆరోగ్యపరంగా ఎంత మేలు జరుగుతుందో.. మానసికంగానూ అంతే ప్రయోజనం ఉంటుంది. పైగా ఇద్దరి మధ్యా అనుబంధం అంతకుముందు కంటే మెరుగ్గా ఉంటుంది. దాంతోపాటు కొత్త జంటలా మారిపోయి.. ఏరోబిక్స్, జుంబా, సల్సా వంటి నృత్య రీత్యుల్ని నేర్చుకోవడం మొదలు పెట్టొచ్చు. వీటన్నింటి వల్ల కెలొరీలు అధిక మొత్తంలో ఖర్చు అవుతాయి. నిద్రలేమి సమస్యలూ దూరమవుతాయి.

కేబుల్‌టీవీ ఇంటి పేరు అయింది!

మహిళలు ముందుకు రాని కేబుల్ టీవీ నిర్వహణలో ఆమె తనదైన ముద్ర వేసుకుంది. చీరకట్టుతో స్తంభాలు ఎక్కుతుంది.. కేబుల్ వైర్లు సరి చేస్తుంది. తన గ్రామంలో ఇంటింటా వినోదాలు పంచుతూ.. తనింట్లో ఆర్థిక సమస్యల్ని సరిదిద్దుకుంది. పిల్లల్ని చదివిస్తూ.. ఇల్లు కట్టుకున్న ఆమే కేబుల్ టీవీ మంగమ్మ. ఆ కష్టం ఆమె మాటల్లోనే...

మాది సిద్దిపేట జిల్లా మర్కూక్. పందొమ్మిదేళ్లుగా కేబుల్ టీవీ బాధ్యతలు నిర్వహిస్తున్నా. 40తో మొదలు పెట్టి 500 కనెక్షన్లకి చేరుకున్నా. నేనసలు ఇటువైపు రావడానికి కారణం ఆర్థిక సమస్యలు. ఆయన దినసరి కూలీగా తెచ్చే సంపాదన అంతంత మాత్రమే. మరో వైపు ముగ్గురు పిల్లలు. దాంతో నాకే ఏదైనా చేయాలనిపించింది. అప్పుడే మా అన్నయ్య కేబుల్ టీవీ నిర్వహణలో నష్టాలు వచ్చి తీసేయాలని చూస్తున్నాడు. అది తెలిసి నేను నడుపుతానని చెప్పా. 'నీవల్ల కాదు. వద్దంటే వద్దు' అని అన్నయ్య వాదించాడు. నేను వినకుండా తీసుకున్నా. అప్పట్లో కేవలం నలభై కనెక్షన్లు మాత్రమే ఉండేవి. తీగలు ఏర్పాటు చేయడం, మరమ్మతులు చేయడం, ఛానళ్ల ఫ్రీక్వెన్సీ సరిచూడటం.. వంటివి గందరగోళంగా ఉండేవి. కొన్నాళ్లు అన్నయ్య సాయం తీసుకుని కేబుల్ నిర్వహణలో అవగాహన తెచ్చుకున్నా.

స్తంభాలు ఎక్కుతా: అప్పటి నుంచీ ఇప్పటి వరకూ వీధుల్లో నిచ్చెన సాయంతో విద్యుత్తు స్తంభాలెక్కి తీగలు బిగించడం, సరిచేయడం చేస్తుంటా. వానాకాలంలో ఈదురుగాలల వల్ల తీగలు తెగడం, వదులు కావడం, సిగ్నళ్లు సరిగా రాకపోవడం. ఇలా చాలా సమస్యలొస్తాయి. కొన్ని సార్లు తడిసిన స్తంభాలు ఎక్కాల్సి ఉంటుంది. వాటిని నేను సమస్యలుగా ఎన్నడూ భావించలేదు. ఆర్థికంగా నా కుటుంబానికి అండగా ఉంటున్నానని మాత్రమే ఆలోచించేదాన్ని. అయితే నేను చీర కట్టుకుని నిచ్చెన ఎక్కడం, తీగలు సరిచేయడం చూసి మొదట్లో చాలామంది ఎగతాళిగా మాట్లాడారు. 'మగరాయుడి పనులు నీకెందుకమ్మా' అంటూ విమర్శించారు. అయినా ఆ సమయంలో నవ్వి ఊరుకునేదాన్ని తప్ప..మనసులోకి తీసుకునే దాన్ని కాదు. ఎందుకంటే అది నేను నిర్దేశించుకున్న భవిష్యత్తు కాబట్టి. ఇదిలా ఉంటే నా గురించి చుట్టుపక్కల గ్రామాల వారూ కేబుల్ సేవలు కోరుకోవడం మొదలుపెట్టారు. దాంతో ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాదు.. నా ఇంటి పేరు కేబుల్‌టీవీగా మారిపోయింది.

అదే సమస్య: అంతా బాగానే ఉంది కానీ.. ఇక్కడ ఎదురయ్యే ప్రధాన సమస్య బిల్లు వసూలు. చాలామంది అడిగిన వెంటనే డబ్బులు ఇవ్వరు. రేపు ఇస్తా. మాపిస్తా అంటూ ఇంటిచుట్టూ తిప్పించుకుంటారు. మా అన్నయ్య ఈ విషయంలోనే నష్టపోయాడు. అందుకే నేను మొదట్నుంచీ ఈ విషయంలో కచ్చితంగా ఉంటా. డబ్బులు సకాలంలో ఇవ్వకపోతే కేబుల్ కనెక్షన్ తీసేస్తా. దాంతో చాలామంది గొడవలకు దిగడం, దురుసుగా ప్రవర్తించడం చేస్తుంటారు. దీంతోపాటు కిరాణా దుకాణం కూడా నిర్వహిస్తున్నా. అయితే అంతా బాగుంది అనుకునే సరికి ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లో వస్తువులూ, కిరణా సరకూ, డబ్బులు తీసుకెళ్లారు. లక్షల్లోనే నష్టం. ఆయనకి ఓ ప్రమాదం వల్ల ఉపాధి దూరమైంది. ఇంటి వద్దే ఉంటున్నారు. ఇంటి భారమంతా నా మీదే పడింది. ఇలాంటి కుదుపుల్ని భరిస్తూనే నేను కేబుల్ టీవీ సేవల్ని నిర్వహిస్తున్నా.

ఒంటరిగానే: ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తట్టుకుని రూపాయి రూపాయి కూడబెట్టా. ఇల్లు కట్టించా. ముగ్గురు పిల్లల్ని చదివించా. ఇప్పుడు ఇద్దరు అమ్మాయిలకు ఘనంగా పెళ్లిళ్లు కూడా చేశా. అయినా నేను రెట్టించిన ఉత్సాహంతోనే ఈ పనులన్నీ చేస్తున్నా. అయితే ఒకప్పటిలా ఇప్పుడు పరిస్థితి లేదు. గ్రామాల్లో కూడా డీటీహెచ్ సేవలు కోరుకుంటున్నారు. ఇప్పటికే మా ఊర్లో యాభై మంది కేబుల్ మానుకుని డీటీహెచ్ ఉపయోగించుకుంటున్నారు. అయినా నేను పోటీని తట్టుకుని మెరుగ్గా కేబుల్ సేవలు అందించడానికి నా వంతు కృషి చేస్తున్నా.

– చంద్ర మదన్‌మోహన్, ఈనాడు, హైదరాబాద్.

అన్నయ్య విడాకులు ఆపేదెలా?

? మాది మధ్యతరగతి కుటుంబం. ఎనిమిదేళ్ల క్రితం అన్నయ్య పెళ్లైంది. పాపకి ఇప్పుడు నాలుగేళ్లు. అయితే పెళ్లయ్యాక వదినకి ఆసక్తి ఉండటంతో అన్నయ్య ఆమెని డిగ్రీ, పీజీ చదివించాడు. గ్రూప్స్ కోచింగ్ ఇప్పించాడు. అయితే చదువుకున్నన్ని రోజులూ మా అన్నయ్యతో బాగుంది. చదువు అవ్వగానే పాపని వదిలేసి.. బంగారం, డబ్బులు తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మా అన్నయ్యని వద్దంటోంది. మేం పాపని ఇప్పుడు తల్లివద్దకే పంపాం. పైగా మా వదిన విడాకుల నోటీసు ఇచ్చింది. ఇంతకుముందు మా వదిన చెల్లెలికి రెండు పెళ్లిళ్లు అయ్యాయి. మొదటి భర్త దగ్గర భరణం ఐదు లక్షలు, తరువాత మూడు లక్షలు ఎదురు కట్నం తీసుకుని తన తల్లిదండ్రులు పెళ్లి చేశారు. ఇప్పుడు మా వదిన విషయంలోనూ అలానే చేయాలనుకుంటున్నారు. పైగా పాప చేత తల్లిని 'అక్కా' అని పిలిపిస్తున్నారు. బడిలో కూడా వాళ్లింటి పేరే రాయించారు. వదినా పెళ్లికి సిద్ధంగా ఉంది. అయితే మా అన్నయ్య ఇన్నాళ్లూ తన సంపాదనంతా భార్య చదువుకే ఖర్చు పెట్టాడు. ఇప్పుడు ఈ సమస్యని మేం ఎలా ఎదుర్కొనేది.

– ఓ సోదరి

✔ మీరు అన్నీ ముందే ఊహించుకుని భయపడుతున్నారనిపిస్తోంది. మీ వదిన ఏ కారణాలతో విడాకులకు దరఖాస్తు చేశారనేది ముందు తెలుసుకోండి. సరైన కారణాలు చూపించకుండా విడాకులు ఇవ్వడం కుదరదు. ఆ కేసు ఇంకా నోటీసు దశలోనే ఉంటే కౌంటర్ వేసే ముందు వకాలత్ వేయగానే మధ్యవర్తి దగ్గరకి పంపిస్తారు. అప్పుడు మీ అన్నయ్యని విడాకులు తీసుకునే ప్రసక్తి లేదని కచ్చితంగా చెప్పమనండి. పెళ్లయ్యాక మీ వదిన చదువూ, ఉద్యోగం వచ్చేందుకు అవసరమైన శిక్షణ వంటివన్నీ మీ అన్నయ్య సంపాదన ద్వారా అందుకున్నవే అని సాక్ష్యాలతో కోర్టులో నిరూపించండి. దీని వల్ల విడాకులు తీసుకోకుండా చూడవచ్చు. అలానే విడాకులు రాకుండా మరో పెళ్లిని చట్టం ఒప్పుకోదు. అయినా అలాంటి ప్రయత్నాలు చేస్తుంటే దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను కోర్టుకి చూపించి పాప కస్టడీని కోరవచ్చు. దీనికోసం వేరుగా గార్డియన్ అండ్ వార్డ్స్ చట్టం కింద మీ అన్నయ్యతో ఈ కస్టడీ పిటిషన్ వేయించండి. దానిలో పాప బాధ్యతలు తీసుకోగలననీ, ఆమె క్షేమంగా ఉండే పరిస్థితులన్నీ తండ్రిగా తన దగ్గరే ఉన్నాయనీ ఆధారాలు చూపించాలి. ఒకవేళ విడాకులయ్యాక పాప సంరక్షణ బాధ్యతలు ఎవరికి ఇచ్చినా.. అక్కడ వారికేదైనా ఇబ్బంది కలిగితే కోర్టుని సంప్రదించవచ్చు. ఆ పరిస్థితులను బట్టి కోర్టు ఆ కస్టడీ షరతులను మార్చడానికి అవకాశం ఉంటుంది. విడాకుల కేసుల్లో సాధారణంగా ఆడపిల్లలకి ఐదేళ్లు వచ్చే వరకూ తల్లి దగ్గరే పెరగాలని చాలా తీర్పులొచ్చాయి. అలా కుదరని పక్షంలో వారంలో మూడు రోజుల చొప్పున తల్లీ, తండ్రి వద్ద ఉండేలా కోర్టుని కోరుకోవచ్చు. అలానే అన్నయ్యకి విడాకులు ఇష్టం లేదనీ, ఆ పరిస్థితి వస్తే ఆమెకు భరణం ఇచ్చే స్థోమతా లేదని నిరూపించుకోవాలి. అలా రుజువైతే ఆమెకు పరిహారం ఇవ్వమని కోర్టు ఆదేశించకపోవచ్చు. ఇక పాప ఇంటి పేరు మీదే ఉంటుందని పాఠశాలకు ఓ దరఖాస్తు పంపండి. దానికి వారు సమ్మతించకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామనే విషయం స్పష్టం చేసి కోర్టుకి తెలియజేయండి. ఇక ఇవన్నీ మీరు చూపించే సాక్ష్యాధారాలపైనే ఉంటాయనే విషయం మరిచిపోవద్దు.

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి
న్యాయవాది

vasulegal@eenadu.net

రోజంతా ఏసీలోనా

చాలామంది ఉద్యోగినులు రోజంతా ఏసీలోనే పని చేస్తుంటారు. దాంతో చర్మం, జుట్టూ, పెదాలు తరచూ పొడిబారుతుంటాయి. ఈ సమస్యని అధిగమించాలంటే ఏం చేయాలో తెలుసా!

■ ఏసీ వల్ల వచ్చే చల్లని గాలిలో తేమ ఉండదు. చర్మానికి కావల్సిన తేమ అందాలంటే వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడమే ముఖ్యం. దాంతోపాటే రెండు గంటలకోసారైనా ఓ ఐదు నిమిషాలు కారిడార్‌లో అటూ ఇటూ నడవడం అలవాటు చేసుకోవాలి.

■ క్లెన్సర్లూ, ఫేస్‌వాష్‌లూ వాడుతున్నట్లైతే వాటిలో నురగ రాని రకాల్ని ఎంచుకోవాలి. అలాగే రెండుగంటలకోసారి చల్లని నీటితో ముఖం తుడుచుకోవాలి.

■ చర్మం ఎక్కువగా పొడిబారుతుంటే స్వయంగా తేమ అందించే ఏర్పాటు చేసుకోవాలి. చిన్నపాటి హ్యుమిడిఫయర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. వీటి ధర తక్కువగానే ఉంటుంది. లేదంటే ఆఫీసు డెస్కు మీద గాజు పాత్ర ఉంచి అందులో నీళ్లు పోసి కొన్ని పూల రెక్కల్ని వేయాలి. ఈ అమరిక చూడటానికి ఆకర్షణీయంగా ఉంటుంది. తేమని అందించడంలో తోడ్పడుతుంది.

■ వారానికోసారైనా నూనెతో చర్మానికి మర్దనా చేయడం మంచిది. దీనివల్ల చర్మం తొందరగా పొడిబారదు. అలానే స్నానం చేయగానే తడి మీద మాయిశ్చరైజర్ లేదంటే కొబ్బరి నూనె వంటివి రాయడం మంచిది. దాంతోపాటే తేనే, కీరదోస, బాదం నూనె.. లాంటివి తరచూ ముఖానికి రాసుకుంటే మంచిది.

***

చదివిద్దామిలా...

బడులు ప్రారంభమయ్యాయి.. ఇంటికి వచ్చింది మొదలు చిన్నారులకు చదువూ, హోంవర్క్‌తోనే సరిపోతుంది. అలాంటప్పుడు పిల్లల గదిని ప్రత్యేకంగా ఉంచాలి. చదువు మీద ఆసక్తిని పెంచుతూ.. మానసిక వికాసానికి దోహదపడేలా చూసుకోవాలి.

❖ చిన్నారుల గదిలో గాలీ, వెలుతురూ సరిగ్గా అందేలా చూడాలి. అలానే విద్యుత్ బల్బుల విషయానికొస్తే అవి బాగా కాంతిమంతంగా వెలిగేవి అమర్చాలి. అలాకాకుండా కాస్త వెలుగు తగ్గితే గదిలో కాంతివిహీనంగా అనిపిస్తుంది. ఆ ప్రభావం మనసుపై పడుతుంది. మనసులో ఓ నిర్లిప్తత ఏర్పడుతుంది.

❖ కిటికీ, లేదంటే ఓ పక్కన టేబుల్ మీద పచ్చని మొక్కను ఏర్పాటు చేయాలి. అది ఆక్సిజన్‌ను అందించడమే కాదు. మనసులో సానుకూల ఆలోచనలకు దోహదం చేస్తుంది. దాంతోపాటు తాజా పువ్వులతో వాజ్‌ను కూడా ఉంచితే తెలియకుండానే మనసును ఆ పువ్వులూ, వాసనా ఉత్తేజితం చేస్తాయి.

❖ గదిలో లేత రంగులు కాకుండా ముదురువి ఎంచుకోవాలి. ప్రకాశవంతంగా కనిపించే రంగులు మెదడు చురుగ్గా ఉండటానికి సాయపడతాయి. అందుకు దుప్పటీ, దిండు గలేబులూ, కర్టెన్లూ, కార్పెట్ ఇలా అన్నీ వర్ణరంజితంగా ఉండేలా చూసుకోవాలి.

❖ పిల్లల గదిలో పుస్తకాల అల్మరా తప్పనిసరిగా ఉండాలి. అందులో ఆసక్తికరంగా అనిపించే పుస్తకాలను అమర్చి ఉంచాలి. వారికి ఎదురుగా కనిపిస్తున్నప్పుడు తీసి చదువుతారు.

❖ పజిళ్లూ, పుస్తకాలూ, రూబిక్స్ క్యూబ్, చదరంగం, ఇలా ఇండోర్ గేమ్‌లకు సంబంధించినవి ఓ అరలో ఉంచాలి. ఇవన్నీ పిల్లల మెదడుకు మేతలాంటివి. ఆలోచనా శక్తినీ, చురుకుదనాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

❖ గదిలో ఆహారపదార్థాలకీ ఓ అరని కేటాయించాలి. నువ్వుల ఉండలూ, పల్లీ పట్టీ, ఎండు ఫలాలూ, గింజలూ.. ఇలా యాంటీఆక్సిడెంట్లను అందించే వాటిని పారదర్శకంగా కనిపించే గాజు డబ్బాల్లో నిల్వ చేసి పెట్టాలి. చదువుతూ మధ్యలో వాటిని తినడానికి ఆసక్తి చూపుతారు. ఇవి ఆరోగ్యానికి మేలు చేయడమేకాదు... ఎదుగుదల్లోనూ కీలక పాత్ర పోషిస్తాయి.

చదువు

రక్షణ రంగంలో లక్షణమైన కొలువులకు ప్రకటనలు వెలువడ్డాయి. పది పాసైతే చాలు నేవీలో చేరిపోవచ్చు. ఇంటర్ లేదా డిప్లొమా ఉంటే ఎయిర్ ఫోర్స్ లోకి వెళ్లిపోవచ్చు. బీటెక్ విద్యార్థులైతే నౌకాదళంలో సబ్ లెఫ్టినెంట్ అవకాశం సొంతం చేసుకోవచ్చు. ఈ మూడు అర్హతలతోనూ మేటి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు వీటికోసం పోటీపడవచ్చు.

రమ్మంటున్నాయి.. రక్షణ కొలువులు!

ఇంటర్, డిప్లొమాలతో... ఎయిర్ మెన్

ఇంటర్, డిప్లొమా విద్యార్థులను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆహ్వానిస్తోంది. ఎంపికైనవారు ఎయిర్‌ఫోర్స్‌లో ఫిట్టర్, టెక్నీషియన్ హోదాలతో కెరియర్ ప్రారంభించి మంచి భవిష్యత్తు సొంతం చేసుకోవచ్చు. ఆన్‌లైన్ పరీక్ష, శారీరక సామర్థ్య, వైద్యపరీక్షల ద్వారా ఎంపిక చేస్తారు.

విద్యార్హత: గ్రూప్– ఎక్స్: ఈ ఉద్యోగాలకు ఇంటర్ / ప్లస్ 2 మ్యాథ్స్, ఫిజిక్స్‌తో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఇంగ్లిష్‌లోనూ 50 శాతం మార్కులు తప్పనిసరి. లేదా 50 శాతం మార్కులతో ఏదైనా మూడేళ్ల డిప్లొమా కోర్సు పూర్తిచేసినవారు అర్హులే. డిప్లొమా ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి. డిప్లొమాలో ఇంగ్లిష్ లేకపోతే ఇంటర్/ పదో తరగతి ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

గ్రూప్ – వై: ఈ ఉద్యోగాలకు ఇంటర్ ఏదైనా గ్రూప్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులు. ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులుండాలి. ఈ గ్రూప్‌లో మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్ పోస్టులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఇంగ్లిష్ లోనూ 50 శాతం మార్కులు తప్పనిసరి.

మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఇంటర్ చదువుకున్నవారు గ్రూప్- ఎక్స్, వై రెండు ఉద్యోగాలకూ అర్హులే. వీరు ఎక్స్, వై ల్లో నచ్చిన గ్రూప్ కోసం దరఖాస్తు చేసుకుని పరీక్ష రాసుకోవచ్చు లేదా రెండు గ్రూప్‌లకూ కలిపి నిర్వహించే పరీక్షనూ ఎంచుకోవచ్చు. ఈ అవకాశం ఆన్‌లైన్ దరఖాస్తు చేసేప్పుడు ఉపయోగించుకోవాలి. డిప్లొమా విద్యార్థులు గ్రూప్ ఎక్స్ పోస్టులకు మాత్రమే అర్హులు.

ఎంపిక: ఫేజ్ 1, ఫేజ్ -2 పరీక్షల ద్వారా.

ఫేజ్ –1 పరీక్ష ఇలా... ఈ పరీక్షను ఆన్‌లైన్ లో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే వస్తాయి. https://airmenselection.cdac.in లో మాక్‌పరీక్షను రాసుకోవచ్చు.

ఫేజ్ –2లో... ఫేజ్ -1 లో అర్హత సాధించినవారి సర్టిఫికెట్లను నిర్దేశిత ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్‌లో పరిశీలిస్తారు. అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలుంటాయి.

ఎంపికైతే..: ఎంపికైనవారికి శిక్షణలో రూ.14600 స్టైపెండ్‌గా చెల్లిస్తారు. శిక్షణ అనంతరం విధుల్లో చేరినవారికి గ్రేడ్ పేతో కలుపుకుని గ్రూప్ ఎక్స్‌లో అయితే రూ.33100, గ్రూప్ వై లో రూ. 26900 మూలవేతనం లభిస్తుంది. శిక్షణ అనంతరం అభ్యర్థులను సంబంధిత ట్రేడ్ శిక్షణ కేంద్రాలకు పంపుతారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారిని విధుల్లోకి తీసుకుంటారు. గ్రూప్ ఎక్స్‌లో ఎంపికైనవారు ఫిట్టర్‌గా, గ్రూప్ వైలో చేరినవారు టెక్నీషియన్‌గా సేవలు అందిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: జులై 3

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జులై 24

ఆన్‌లైన్ పరీక్షలు: సెప్టెంబరు 13 నుంచి 16 వరకు నిర్వహిస్తారు.

అడ్మిట్ కార్డులు: ఆగస్టులో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పరీక్ష ఫీజు: రూ. 250

వయసు: జులై 14, 1998 - జూన్ 26, 2002 మధ్య జన్మించినవారు అర్హులు.

ఎత్తు: కనీసం 152.5 సెం.మీ. ఉండాలి. ఊపిరి పీల్చక ముందు, పీల్చిన తర్వాత ఛాతీ వ్యత్యాసం కనీసం 5 సెం.మీ. తప్పనిసరి. దృష్టిదోషం ఉండరాదు. వినికిడి సామర్థ్యం స్పష్టంగా ఉండాలి.

బీటెక్‌తో... సబ్ లెఫ్టినెంట్

బీటెక్ చివరి సంవత్సరం, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ చివరి ఏడాది కోర్సులు చదువుతున్న విద్యార్థులకు భారతీయ నౌకాదళం ఆహ్వానం పలుకుతోంది. వివిధ ఇంజినీరింగ్ బ్రాంచీలవారికి ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచీల్లో శాశ్వత, తాత్కాలిక కమిషన్ విధానంలో ఇండియన్ నేవీ ఉద్యోగాలు కల్పిస్తుంది. బీటెక్ లో అయిదో సెమిస్టర్ వరకు కనీసం 60 శాతం మార్కులు సాధించినవాళ్లు ఈ పోస్టులకు పోటీపడవచ్చు. బీటెక్ మార్కుల ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించినవారికి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ చేపడుతుంది. ఎంపికైనవారిని శిక్షణలోకి తీసుకుంటారు. ఈ సమయంలో స్టైపెండ్ అందిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారిని సబ్ లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.

వయసు: జులై 2, 1995- జులై 1, 1998 మధ్య జన్మించివుండాలి. **ఎత్తు:** 157 సెం.మీ. మహిళలకు 152 సెం.మీ. తప్పనిసరి.

ఎగ్జిక్యూటివ్ బ్రాంచి..

ఇందులో రెండు విభాగాలున్నాయి.

జనరల్ సర్వీస్ (ఎక్స్): బీఈ/ బీటెక్ ఏ బ్రాంచి విద్యార్థులైనా జనరల్ సర్వీస్ (ఎక్స్) ఉద్యోగానికి అర్హులు. అయితే పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పర్మనెంట్ కమిషన్, షార్ట్ సర్వీస్ కమిషన్ రెండు విభాగాల్లోనూ అవకాశాలు ఉంటాయి.

ఐటీ: కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ ఇంజినీరింగ్ చదివినవాళ్లు ఐటీ విభాగం పోస్టులకు అర్హులు. మహిళలకు అవకాశం లేదు. షార్ట్ సర్వీస్ కమిషన్‌లో ఈ పోస్టులు భర్తీ చేస్తారు.

టెక్నికల్ బ్రాంచి..

ఇందులో మూడు విభాగాల్లోని పోస్టులను షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో భర్తీ చేస్తారు.

ఇంజినీరింగ్ బ్రాంచ్: మెకానికల్, మెరైన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రొడక్షన్, ఏరోనాటికల్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, కంట్రోల్ ఇంజినీరింగ్, ఏరోస్పేస్, ఆటోమొబైల్స్, మెటలర్జీ, మెకట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్.. వీటిలో ఏ విభాగం విద్యార్థులైనా ఇంజినీరింగ్ బ్రాంచి పోస్టులకు అర్హులు. పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ఎలక్ట్రికల్ బ్రాంచి: ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, టెలి కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజినీరింగ్, కంట్రోల్ సిస్టమ్ ఇంజినీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఏవియానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ విభాగాల్లో ఎందులోనైనా ఇంజినీరింగ్ చదివినవాళ్లు అర్హులు. పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

నేవల్ ఆర్కిటెక్చర్ (ఎన్ఏ): మెకానికల్, సివిల్, ఏరోనాటికల్, ఏరోస్పేస్, మెటలర్జీ, నేవల్ ఆర్కిటెక్చర్, ఓషన్, మెరైన్ ఇంజినీరింగ్, షిప్ టెక్నాలజీ, షిప్ బిల్డింగ్, షిప్ డిజైన్ విభాగాల్లో ఎందులోనైనా ఇంజినీరింగ్ చదివినవారు అర్హులు. మహిళలూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక విధానం.. దరఖాస్తు చేసుకున్నవారిని బీటెక్ ఐదో సెమిస్టర్/ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఏడో సెమిస్టర్ వరకున్న మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వారికి నేవల్ క్యాంపస్ సెలక్షన్ టీం ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ఇందులో ఎంపికైనవారికి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు చేపడుతుంది. విశాఖపట్నం, కోల్‌కతా, బెంగళూరు, భోపాల్, కోయంబత్తూరుల్లో డిసెంబరు-ఏప్రిల్ మధ్యలో ఇంటర్వ్యూలు ఉంటాయి. స్టేజ్-1 పరీక్షలో ఇంటెలిజెన్స్ టెస్టు, పిక్చర్ పర్సెప్షన్ టెస్టు, గ్రూప్ డిస్కషన్ ఉంటాయి. అర్హత సాధించినవారికి స్టేజ్-2 ఇంటర్వ్యూలు...అంటే సైకలాజికల్, గ్రూప్ పరీక్షలు, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అర్హత సాధిస్తే వైద్య పరీక్షలుంటాయి. ఆపై అర్హులను ఉద్యోగానికి ఎంపికచేస్తారు.

ఎంపికైతే...

ఎంపికైన అభ్యర్థులకు ఇండియన్ నేవల్ అకాడెమీ - ఎజిమాలలో వచ్చే ఏడాది జూన్ నుంచి శిక్షణ మొదలవుతుంది. అభ్యర్థులు శిక్షణలో చేరేటప్పటికి బీటెక్ లేదా ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. అభ్యర్థులకు 22 వారాలపాటు శిక్షణ కొనసాగుతుంది. అనంతరం సంబంధిత కేంద్రాల్లో ట్రేడ్ శిక్షణ నిర్వహిస్తారు. జనరల్ సర్వీస్‌కి ఎంపికైనవారికి శిక్షణ వ్యవధి 44 వారాలు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారిని సబ్ లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగంలోకి తీసుకుంటారు. పర్మనెంట్ కమిషన్ విధానంలో ఎంపికైనవాళ్లు పదవీ విరమణ వయసు వచ్చేంత వరకు ఉద్యోగంలో కొనసాగవచ్చు. అదే షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఎంపికైతే పదేళ్లు సర్వీసులో కొనసాగుతారు. ఆ తర్వాత అవకాశాన్ని బట్టి ఒక్కో విడతలో రెండేళ్లు చొప్పున మరో నాలుగేళ్ల పాటు కొనసాగిస్తారు. అనంతరం ఖాళీలుండి, అభ్యర్థులు అన్నివిధాలా అర్హులుగా ఉంటే పర్మనెంట్ కమిషన్ విధానంలోకి తీసుకుంటారు. అన్నీ కలుపుకుని సీటీసీ విధానంలో నెలకు రూ.85 వేలకు పైగా వేతనంగా పొందవచ్చు. తక్కువ ధరలకు క్యాంటీన్, రైలు, విమాన ప్రయాణాల్లో రాయితీలు, పిల్లల చదువులకు ఆర్థిక ప్రోత్సాహం...ఇతర ప్రయోజనాలు దక్కుతాయి.

దరఖాస్తులు: ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అర్హతలున్నవారు ప్రాధాన్యం ప్రకారం ఆప్షన్లు ఇచ్చుకోవాలి. పోస్టులకు విడివిడిగా దరఖాస్తు చేయరాదు.

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: జూన్ 30

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జులై 30

పదితో... నేవీలో చెఫ్, స్టివార్డ్స్, హైజీనిస్టులు

చెఫ్, స్టివార్డ్స్, హైజీనిస్ట్ పోస్టుల భర్తీకి ఇండియన్ నేవీ ప్రకటన విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు పదో తరగతి అర్హత ఉంటే చాలు. రాత, దేహదార్ఢ్య, వైద్య పరీక్షల ద్వారా నియామకాలు చేపడతారు. పరీక్షలో ఎంపికై, విజయవంతంగా శిక్షణ ముగించుకుని విధుల్లో చేరినవారు మొదటి నెల నుంచే రూ.35,000 వేతనం రూపంలో పొందవచ్చు.

పరీక్ష ఇలా..: ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రశ్నపత్రంలో రెండు విభాగాలు ఉంటాయి. సైన్సు, మ్యాథమేటిక్స్ ఒక విభాగంలో; జనరల్ నాలెడ్జ్ మరో విభాగంలో అడుగుతారు. అభ్యర్థులు రెండు సెక్షన్లలోనూ అర్హత సాధించడం తప్పనిసరి. సిలబస్, మాదిరి ప్రశ్నపత్రం ఇండియన్ నేవీ వెబ్‌సైట్‌లో లభిస్తాయి.

రాత పరీక్షలో అర్హత సాధించినవారికి దేహదార్ఢ్య పరీక్షలు నిర్వహించి, అర్హత సాధిస్తే వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ఇందులోనూ విజయవంతమైతే రాతపరీక్షలో చూపిన ప్రతిభ ప్రాతిపదికన తుది నియామకాలు చేపడతారు.

ఎంపికైతే: అన్ని దశలూ విజయవంతంగా పూర్తిచేసుకుని ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో మరోసారి మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. అర్హత సాధించినవారికి ఏప్రిల్, 2019 నుంచి అక్కడే 15 వారాల ప్రాథమిక శిక్షణ నిర్వహిస్తారు. అనంతరం నేవీ శిక్షణ కేంద్రాల్లో వృత్తి సంబంధిత శిక్షణ అందిస్తారు. శిక్షణ సమయంలో రూ.14600 స్టైపెండ్ గా చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారిని విధుల్లోకి తీసుకుంటారు. చెఫ్‌గా ఎంపికైనవారు విధుల్లో భాగంగా ఆహారాన్ని వండాలి. ఆహార పదార్థాల స్టోర్ నిర్వహణ బాధ్యతను చూసుకోవాలి. స్టివార్డ్‌గా విధులు నిర్వహించేవారు వడ్డన బాధ్యతలు తీసుకుంటారు. భోజన తయారీలోనూ వీరు పాలుపంచుకుంటారు. వీరు వెయిటర్‌గానూ వ్యవహరించాలి. హైజీనిస్ట్‌గా ఎంపికైనవారు గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. విధుల్లో చేరిన మొదటి నెల నుంచి అలవెన్సులతో కలిపి రూ. 35,000కు పైగా వేతనం రూపంలో లభిస్తుంది.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత

వయసు: ఏప్రిల్ 1, 1998 - మార్చి 31, 2002 మధ్య జన్మించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జులై 1

ప్రవేశ పత్రాలు: ఆగస్టులో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

పరీక్ష: సెప్టెంబరు లేదా అక్టోబరులో నిర్వహిస్తారు

ఫలితాలు: ఫిబ్రవరి 21, 2019న ప్రకటిస్తారు.

రెగ్యులేటరీ అఫైర్స్‌లో పీజీ!

రెగ్యులేటరీ అఫైర్స్‌లో పీజీ డిప్లొమా చేయాలనుంది. అందించే సంస్థలు, వాటి ప్రవేశ వివరాలను అందించగలరు. - **శ్రీలక్ష్మి**

మీ ప్రశ్నసుబట్టి మీరు బీఎస్‌సీ లేదా బీఫార్మసీ/ ఎంఫార్మసీ చేసినవారై ఉండాలి. ఈ కోర్సును నిమ్స్ (జయపుర) యూనివర్సిటీ, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రెగ్యులేటరీ అఫైర్స్ (జీఐఆర్ఏ)- పుణె, జామియా హమ్‌దర్ద్ యూనివర్సిటీ- దిల్లీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్- ముంబయి, బయో ఇన్ఫర్మాటిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా- నోయిడా వారు అందిస్తున్నారు. డిగ్రీలో సైన్స్ సబ్జెక్టుల్లో కనీస అర్హత ఉండాలి. మరిన్ని వివరాలకు పై విశ్వవిద్యాలయాల వెబ్‌సైట్లను సందర్శించొచ్చు.

మిసైల్స్ గురించి చదవాలంటే?

పదో తరగతి పూర్తిచేశాను. నాకు మిసైల్స్ గురించిన సమాచారం అంటే ఆసక్తి. పై చదువులను మిసైల్స్‌కు సంబంధించిన అంశాల్లో చేయాలనుంది. ఇంటర్ నుంచి ఏ కోర్సులను ఎంచుకోవడం ద్వారా నా లక్ష్యాన్ని చేరుకోగలను. - *టి. ఆదిత్య రెడ్డి,* నిర్మల్

మిసైల్స్ రక్షణ శాఖకు చెందినవి. ఈ రంగంపై ఆసక్తి ఉన్నవారు ఇంటర్‌లో ఎంపీసీని ఎంచుకోవాలి. తరువాత ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో డిగ్రీ, పీజీ చేయాల్సి ఉంటుంది. డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీవారు అందించే కోర్సుల ద్వారా మీ సంకల్పాన్ని చేరుకోవచ్చు. దీనికోసం ఎన్‌డీఏ పరీక్ష అర్హత సాధించాలి. దీనిద్వారా మిలిటరీ, ఏర్‌ఫోర్స్, నేవీ ఫోర్స్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, డిఫెన్స్ సంస్థలైన హెచ్ఏఎల్, ఎన్ఏఎల్, ఇతర సంస్థలైన డీఆర్‌డీఎల్, డీఆర్‌డీఓ వంటి పరిశోధన సంస్థల్లోనూ ఉద్యోగాన్ని సాధించవచ్చు.

- ప్రొ.బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

సీఐఎంఎఫ్ఆర్, ధన్‌బాద్‌లో 45 ఖాళీలు

సంస్థ: సీఎస్ఐఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రిసెర్చ్ (సీఐఎంఎఫ్ఆర్), ధన్‌బాద్ (ఝార్ఖండ్). **పోస్టులు:** టెక్నికల్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్ (కాంట్రాక్టు)

ఖాళీలు: 45 **అర్హత:** సంబంధిత బ్రాంచులు/ సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణత. **వయసు:** టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు 30 ఏళ్లు, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.500

చివరి తేది: 27.07.2018

వెబ్‌సైట్: http://cimfr.nic.in/vacancies.html

బీఎస్ఎఫ్‌లో 207 కానిస్టేబుల్ పోస్టులు

భారత హోంమంత్రిత్వ శాఖకు చెందిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్క్‌షాప్‌లో గ్రూప్ సి టెక్నికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** కానిస్టేబుల్ **ఖాళీలు:** 207 **అర్హత:** పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత లేదా మూడేళ్ల అనుభవం. **వయసు:** 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్

చివరి తేది: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (23-29 జూన్ 2018)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు.

వెబ్‌సైట్: http://bsf.nic.in/

ప్రవేశాలు

ఇగ్నో, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ

న్యూదిల్లీలోని ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) జులై-2018 సెషన్ ప్రవేశాలకు, హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2018-19 ఏడాది ప్రవేశాలకు ప్రకటనలు విడుదల చేశాయి.

కోర్సులు: రెండు వర్సిటీలూ మాస్టర్స్ డిగ్రీ, బ్యాచిలర్స్ డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులను అందిస్తున్నాయి. **అర్హత, వయసు, ఎంపిక:** ఆయా వర్సిటీల నిబంధనల ప్రకారం. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **చివరి తేది:** ఇగ్నో ప్రోగ్రాములకు జులై 15, అంబేడ్కర్ వర్సిటీ ప్రోగ్రాములకు సెప్టెంబరు 12. **వెబ్‌సైట్:** http://www.ignou.ac.in, https://www.braouonline.in/

ఉద్యాన విశ్వవిద్యాలయంలో డిప్లొమా

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం 2018-19 సంవత్సరానికి డిప్లొమా ప్రోగ్రాములో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు: హార్టికల్చర్‌లో డిప్లొమా (రెండేళ్లు) (50 సీట్లు) **అర్హత:** తెలంగాణకు చెందిన పదోతరగతి అభ్యర్థులు అర్హులు. కనీసం 4 సంవత్సరాలు గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదివి ఉండాలి.

వయసు: 15-25 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్. **చివరి తేది:** 25.07.2018

వెబ్‌సైట్: http://skltshu.ac.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఒప్పంద ప్రాతిపదికన)

ఖాళీలు: 34 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, బోధన, పరిశోధన రంగాల్లో అనుభవం.

ఇంటర్వ్యూ తేది: 2018 జులై 9 నుంచి 12 వరకు. **వేదిక:** న్యూ కమిటీ రూం, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, 4, బ్లాక్-బి, ఇంద్రప్రస్థ ఎస్టేట్, న్యూదిల్లీ-110002.
వెబ్‌సైట్: http://spa.ac.in/

ఫెలోషిప్స్

ఐఐఎస్‌టీ, తిరువనంతపురం

సంస్థ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ), తిరువనంతపురం. **పోస్టులు:** ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్ తదితర ప్రాజెక్ట్ పర్సనల్ (తాత్కాలిక). **ఖాళీలు:** 20

అర్హత: సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్/ ఎంఎస్, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు: 25.06.2018 నుంచి 16.07.2018 వరకు.

వెబ్‌సైట్: https://www.iist.ac.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

దీక్ష చేస్తున్న సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవిలకు సంఘీభావం తెలిపేందుకు శిబిరానికి వెళ్లిన మంత్రులు చినరాజప్ప, కాల్వ శ్రీనివాసులు, ప్రత్తిపాటి పుల్లారావు, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, ప్రభుత్వ విప్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే బోండా ఉమ, కడప జిల్లా తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

ఉక్కు దీక్ష @ 5వ రోజు

ఈనాడు, కడప: ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని వైకాపా, భాజపా దిల్లీ వీధుల్లో తాకట్టు పెట్టాయని రాష్ట్ర మంత్రులు ధ్వజమెత్తారు. ఆ పార్టీల నేతలు విభజనచట్టం హామీలపై పోరాడకుండా మోదీ ముందు సాగిలపడి లాలూచీ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని కలియుగ సైంధవుల్లా అడ్డుకుంటున్నారన్నారు. వైకాపా కపట నాటకాలతో కాలం వెళ్లదీస్తుంటే, భాజపా మాయమాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ చేపట్టిన ఆమరణదీక్ష ఆదివారానికి ఐదో రోజుకి చేరింది. రాష్ట్రమంత్రులు చినరాజప్ప, ప్రత్తిపాటి పుల్లారావు, కాలవ శ్రీనివాసులు, గంటా శ్రీనివాసరావుతో పాటు తితిదే పాలకమండలి సభ్యులు, సినీదర్శకుడు రాఘవేంద్రరావు, వివిధ సంఘాల వారు శిబిరం వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు. పుట్టిన సొంత గడ్డ కడపకు అన్యాయం జరుగుతున్నా కళ్లప్పగించి చూస్తోన్న జగన్.. విజయసాయిరెడ్డిని మోదీ ఇంట్లో పెట్టారని ఉపముఖ్యమంత్రి చినరాజప్ప విమర్శించారు. కేంద్రం రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటుంటే జగన్, పవన్ నోరు ఎందుకు పెగలడం లేదని మంత్రి ప్రత్తిపాటి ప్రశ్నించారు. బళ్లారిలో గాలిజనార్దన్‌రెడ్డికి, కడపలో జగన్‌కు లబ్ధి చేకూర్చేందుకే భాజపా కడపకు ఉక్కుపరిశ్రమ రాకుండా అడ్డుకుంటోందన్నారు. మోదీతో వైకాపా రాజీ కోసం ఆరాటపడుతుంటే.. తెదేపా రాజీలేని పోరాటం సాగిస్తోందని మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ పవిత్ర లక్ష్యంతో సీఎం రమేష్ దిల్లీలో కదలిక తెచ్చేలా దీక్ష చేస్తుండటం అభినందనీయమన్నారు. జగన్.. మోదీ పేరు ఎత్తాలంటేనే భయపడుతున్నారన్నారు. వైకాపా ఐదుగురు ఎంపీలతో రాజీడ్రామాలు ఆడిందన్న ఆయన.. తెదేపా ఒక్క పిలుపుతో 100 మంది మద్దతిచ్చిన విషయం గుర్తెరగాలన్నారు. కేంద్రం ఉక్కుపరిశ్రమ సాధ్యం కాదని చెప్పడం రాజకీయ కక్షసాధింపేనని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు విమర్శించారు. మన రాష్ట్ర హక్కుల సాధనకు స్వాతంత్ర్య పోరాటాన్ని తలపించేలా కేంద్రంపై పోరాటం ఉండాలని సినీదర్శకుడు రాఘవేంద్రరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి ఆదినారాయణరెడ్డి, ఎంపీ టీజీ వెంకటేష్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమ, అనంతపురం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

తీవ్రంగా క్షీణించిన ఆరోగ్యం

ఆమరణదీక్ష చేస్తోన్న ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవిల ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. శరీరంలో చక్కెరస్థాయి గణనీయంగా తగ్గిపోగా.. కీటోన్స్ పెరుగుతున్నాయి. రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్, సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్ ఆదివారం వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. విశ్రాంతి అవసరమని సూచించారు. వారి ఆరోగ్యంపై ఉద్యమకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అనుమతిస్తే 'బ్రహ్మణి' నిర్మిస్తా

కడప ఉక్కు పరిశ్రమపై గాలి జనార్దన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని బ్రహ్మణి ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమలో మిగిలిన పనులను పూర్తి చేసి, ఉక్కు ఉత్పత్తి ప్రారంభించేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి కోరారు. తనకు నిర్మాణ బాధ్యతలను అప్పగిస్తే రెండేళ్లలో పరిశ్రమను నిర్మిస్తానన్నారు. ఆదివారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమ నిర్మాణ, నిర్వహణ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్ర ప్రభుత్వం చేపట్టినా అప్పగించేందుకు సిద్ధమని ప్రకటించారు. బ్రహ్మణి స్టీల్స్ ఏర్పాటులో భాగంగా భూమి కొనుగోలు తదితర పనుల కోసం నేను రూ.1350 కోట్లు ఖర్చు చేశానని తెలిపారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)తో లెక్క కట్టించి, నాకు రావలసిన మొత్తాన్ని అందించి పరిశ్రమను ప్రారంభించాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు పంపుతున్నట్లు వెల్లడించారు.

డిజైన్లకు మెకాన్ సంస్థే సహకరించింది

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు లేవని మెకాన్ సంస్థ ఇచ్చిన నివేదికను తాను పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్నానని జనార్దన్‌రెడ్డి చెప్పారు. గతంలో తాను పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రాగా, అప్పట్లో మెకాన్ సంస్థే నివేదిక రూపొందించిందని, పరిశ్రమ నిర్మాణ డిజైన్లకు ఆ సంస్థే సహకరించిందని గుర్తుచేశారు. బళ్లారి గనుల నుంచి రెండున్నర మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని బ్రహ్మణి స్టీల్స్‌కు కేటాయిస్తే సరిపోతుందన్నారు. గండికోట జలాశయం నుంచి ఉక్కు పరిశ్రమకు రెండున్నర టీఎంసీల నీటిని కేటాయించేందుకు అవకాశం ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి పరిశ్రమ ఏర్పాటుకు సుమారు 10,600 ఎకరాల భూమిని కేటాయించారని, పనులు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్‌రెడ్డి పరిశ్రమకు సంబంధించి ఇచ్చిన అన్ని ప్రభుత్వ ఆదేశాలను రద్దు చేశారని తెలిపారు. కిరణ్ కుమార్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేస్తే పనులను ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

షరతుల ఆమోదమే లక్ష్యం

- జీటీఎస్ పాయింట్‌ను మళ్లీ ఏర్పాటు చేయాలి
- సంయుక్త క్షేత్ర తనిఖీని తిరిగి కొనసాగించాలి
- సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా ఎదుట వాదనలు వినిపించనున్న అటవీశాఖ
- బళ్లారి రక్షిత అటవీప్రాంతం అంతర్ రాష్ట్ర సరిహద్దు వివాదం
- నేడు, రేపు డెహ్రాడూన్‌లో కీలక సమావేశం

ఈనాడు - అమరావతి, అనంతపురం

ఆంధ్రప్రదేశ్-కర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న బళ్లారి రక్షిత అటవీ ప్రాంతం సరిహద్దు వివాదానికి సంబంధించి సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా ఎదుట తన వాదనలు వినిపించేందుకు ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ సిద్ధమవుతోంది. హద్దుల గుర్తింపుపై సంబంధిత అధికారులు ఎదుట మూడు ప్రధాన షరతులు పెట్టనుంది. వాటికి ఆమోదం తెలిపేంతవరకూ ప్రతిపాదించే అంతర్‌రాష్ట్ర సరిహద్దులను అంగీకరించకూడదని నిర్ణయించింది. డెహ్రాడూన్‌లోని సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో ఈ అంశంపై కీలక సమావేశం జరగనుంది.

ప్రధాన షరతులివే

1 మైనింగ్ యజమానులు అక్రమతవ్వకాలు జరిపి కొన్నేళ్ల కిందట ధ్వంసం చేసిన గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ స్టేషన్ (జీటీఎస్) పాయింట్‌ను 1896 బళ్లారి రక్షిత అటవీ ప్రాంత రేఖాచిత్రం ఆధారంగా భూమిపై గుర్తించాలి. అంతర్ రాష్ట్ర సరిహద్దులు నిర్ణయించే ముందే పాత సుంకులమ్మ (సుగలమ్మ) ఆలయం సమీపంలో దీనిని మళ్లీ ఏర్పాటు చేయాలి.

ఇలాంటి జీటీఎస్‌నే మళ్లీ ఏర్పాటు చేయమని అటవీశాఖ కోరుతోంది

2 సర్వే ఆఫ్ ఇండియా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అధికారులతో మే 29 నుంచి జూన్ 4 వరకూ సాగి నిలిచిపోయిన సంయుక్త క్షేత్ర తనిఖీని తిరిగి కొనసాగించాలి. ఆంధ్రప్రదేశ్ అధికారులు ప్రతిపాదించే అంతర్ రాష్ట్ర సరిహద్దు పాయింట్లు గుర్తించేందుకు ఇది తప్పనిసరి.

3 గుర్తించిన జియో రిఫరెన్స్ పాయింట్లను, 1896 బళ్లారి రక్షిత అటవీ ప్రాంతం రేఖా చిత్రంతోనూ, అంతర్‌రాష్ట్ర సరిహద్దు పాయింట్లతోనూ పోల్చి చూడాలి. అవి క్షేత్రంపై ఎక్కడొస్తున్నాయో తనిఖీ చేయాలి.

నేపథ్యమిది!

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్ణాటకలోని బళ్లారి జిల్లాల సరిహద్దులో గాలి జనార్దన్‌రెడ్డితో పాటు ఇతరులకు ఇనుప ఖనిజ లీజులు ఉండేవి. హద్దులు దాటేసి అక్రమ తవ్వకాలు జరిపారనేది ఆరోపణ. దీనిపై ఏపీ, కర్ణాటక రాష్ట్రాల మధ్య 1963 నుంచి వివాదం నడుస్తోంది. అంతర్ రాష్ట్ర సరిహద్దులను మూడు నెలల్లోగా తేల్చాలంటూ 2017 నవంబరు 14న సర్వే ఆఫ్ ఇండియాను సుప్రీంకోర్టు ఆదేశించింది. అనంతరం జరిగిన రెండు సమావేశాల్లో చర్చించి 1896 బళ్లారి రక్షిత అటవీ ప్రాంతం రేఖా చిత్రం ప్రాతిపదికగా అంతర్‌రాష్ట్ర సరిహద్దులను గుర్తించాలని నిర్ణయించారు.

- ఈ ఏడాది ఏప్రిల్‌లో సర్వే అండ్ లాండ్ రికార్డ్స్, అటవీశాఖకు సంబంధించి నలుగురు అధికారులతో ఏపీ ప్రభుత్వం ఓ తనిఖీ బృందాన్ని నియమించింది. వీరు సర్వే ఆఫ్ ఇండియా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించి చాలావరకు సరిహద్దు తేల్చే ఆనవాళ్లు లేకుండా చేశారని గుర్తించారు. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం, మలపనగుడి, హెచ్.సిద్ధాపురం, బళ్లారి జిల్లా పరిధిలోని విఠలాపురం, తుమిటి, బెళగళ్, ఒన్నళ్లి తదితర 9 గ్రామాల పరిధిలో 51 జియో రిఫరెన్స్ పాయింట్లు గుర్తించారు. వీటిలో అనంతపురం జిల్లా పరిధిలోని మూడు గ్రామాల్లో 15, బళ్లారి జిల్లాలోని ఆరు గ్రామాల పరిధిలో మిగతా 36 పాయింట్లు గుర్తించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వే ప్రకారం ఏపీకి చెందిన అటవీ ప్రాంతమంతా ప్రస్తుతం మన ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నట్లు తేలింది.
- ఓబుళాపురంలో గవిసిద్ధేశ్వరస్వామి, సుంకులమ్మ దేవాలయాలు ఉన్నట్లు పాత మ్యాపుల్లో ఉంది. ప్రస్తుతం గవిసిద్ధేశ్వరస్వామి దేవాలయం మాత్రమే ఉంది. గతంలో కొండపైనున్న సుంకులమ్మ ఆలయాన్ని ఇనుప ఖనిజ తవ్వకాలకు అక్కడి నుంచి తొలగించి కింద మరోచోట నిర్మించారు. దీని సమీపంలోని జీటీఎస్‌ను పూర్తిగా తొలగించేశారు. దీని ద్వారానే సర్వే ఆఫ్ ఇండియా అధికారులు స్పష్టమైన కొలతలు వేసేందుకు అవకాశం ఉంటుంది. అందుకే దాన్ని తీసేసిన చోట మళ్లీ ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులు కోరనున్నారు. ఇప్పటికే తాత్కాలికంగా జీటీఎస్ మార్కింగ్ కూడా చేశారు.

బృంద సభ్యులు వీరే

డెహ్రాడూన్‌కు వెళ్లనున్న బృందంలో అదనపు పీసీసీఎఫ్ డా.ఆర్.పి.ఖజురియా, అనంతపురం అటవీశాఖ సంరక్షణాధికారి ఏ.భరత్‌కుమార్, డివిజనల్ అటవీ అధికారి ఏ.చంద్రశేఖర్‌తో పాటు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ తరఫున కర్నూలు, కాకినాడ ఆర్డీడీలు, డైరెక్టరేట్‌లో ఉన్న ఏడీ ఉన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసిన అనుభవం కలిగిన అనంతపురం ఏడీ మశ్చీంద్రనాథ్‌ను కూడా ఈ బృందంతో పంపించేందుకు ఆ జిల్లా కలెక్టర్ వీరపాండియన్ ప్రత్యేక అనుమతి తీసుకున్నారు.

ఓబుళాపురం అటవీ ప్రాంతంలో ఇనుప ఖనిజ గనులు (పాతచిత్రం)

కడలిలో పాదయాత్ర చేస్తున్న వైకాపా అధినేత వైఎస్ జగన్

కడలి నుంచి నగరానికి..

సమస్యలు వింటూ సాగిన జగన్

రాజోలు, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం కడలి గ్రామం నుంచి వేగివారిపాలెం, మామిడికుదురు మండలం గెద్దాడ, మొగలికుదురు గ్రామాల మీదుగా నగరం గ్రామానికి చేరుకుంది. జగన్ శనివారం రాత్రి బసచేసిన ప్రదేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు ఆదివారం ఉదయానికే భారీగా తరలివచ్చారు. ఉదయం 8:30 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర వేగివారిపాలెం, మామిడికుదురు మండలం గెద్దాడ చేరుకుంది. అక్కడ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను జగన్ ఎగురవేశారు. మొగలికుదురు గ్రామం మీదుగా ప్రజల సమస్యలు వింటూ, వినతులు స్వీకరిస్తూ ఏడు కిలోమీటర్లు నడిచి ఒంటి గంటకు తాటిపాక ప్రధాన కూడలికి చేరుకున్నారు. అక్కడ భోజన కోసం కాస్త విరామం ప్రకటించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు పాదయాత్ర ప్రారంభమై రెండు కిలోమీటర్లు సాగింది. దారిలో ప్రజలకు అభివాదం చేస్తూ, యువతతో సెల్ఫీలు దిగుతూ సాయంత్రం 5.30 గంటలకు నగరం గ్రామానికి జగన్ చేరుకున్నారు. అనంతరం నగరంలో ఏర్పాటు చేసిన రాత్రి బస ప్రదేశానికి వెళ్లారు.

కేంద్రం పైసా బకాయి లేదు

- పోలవరం ప్రాజెక్టు పరిశీలనలలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా వెల్లడి

పోలవరం, కొయ్యలగూడెం, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ప్రాజెక్టును అడ్డుకుంటోందని దుష్ప్రచారం చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఆయన ఆధ్వర్యంలోని భాజపా బృందం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించింది. స్పిల్‌వే పనుల వద్ద ఏర్పాటు చేసిన సభలో కన్నా లక్ష్మీనారాయణ ప్రసంగించారు. అంతకుముందు రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోను మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రమే నిధులు ఇస్తుందని, ఇప్పటి వరకు పైసా కూడా బకాయి లేదన్నారు. చంద్రబాబు మాత్రం బకాయిలను చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని చెప్పడం ఎంత వరకూ సబబు అని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారంటే ప్రాజెక్టు నిర్మాణంపై ప్రధాని మోదీకి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గడ్కరీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డంగా పడుకున్నా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయించే బాధ్యత కేంద్రానిదేనని ప్రకటించారని గుర్తుచేశారు.

పట్టిసీమలో అవినీతిపై కమిటీని వేస్తాం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందని నిపుణులు చెప్పారని కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కేవలం రూ.350 కోట్లతో పూర్తి కావాల్సి ఉండగా ఏకంగా రూ.1,600 కోట్లు మేర ఖర్చు చూపించారని ఆరోపించారు. పోలవరం భూసేకరణలోనే ఎక్కువగా అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుందన్నారు. త్వరలోనే పార్టీ తరఫున ప్రత్యేక కమిటీ వేసి ఈ ఆరోపణలపై విచారణ చేపడతామన్నారు. చంద్రబాబుకు నిజంగా ప్రాజెక్టులపై చిత్తశుద్ధి ఉంటే వంశధార, నగరి, గాలేరు, హంద్రీనీవా వంటివి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

పోలవరం పనులను పరిశీలిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీలు జీవీఎల్ నరసింహారావు, గోకరాజు గంగరాజు, మాజీ మంత్రి మాణిక్యాలరావు తదితరులు

అవకతవకలు ఉంటే కఠిన చర్యలు: ఎంపీ జీవీఎల్

పోలవరం ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వానికి అక్షయ పాత్రలా మారిందనే ఆరోపణలు ఉన్నాయని భాజపా అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎటువంటి అవకతవకలు, అక్రమాలు జరిగినా బాధ్యులపై కచ్చితంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆదివారం భాజపా బృందంతో కలిసి పోలవరం పనులను పరిశీలించిన అనంతరం నరసింహారావు విలేకరులతో మాట్లాడారు. చట్టసభల్లో కూడా పోలవరంపై ఉన్న అనుమానాలపై ప్రశ్నిస్తామని స్పష్టంచేశారు. పోలవరం పనులు వేగవంతంగా జరుగుతున్నాయంటే అందుకు కారణం కేంద్రం వెనువెంటనే నిధులు కేటాయిస్తూ బిల్లులు పెండింగ్ లేకుండా చేయడమేనని భాజపా మహిళా మోర్చా జాతీయ సహ ఇన్‌ఛార్జి పురందేశ్వరి చెప్పారు. ఈ మేరకు సహ చట్టం దరఖాస్తు ద్వారా తీసుకున్న సమాచార ప్రతులను చూపించారు. పోలవరం ప్రాజెక్టు సందర్శన కార్యక్రమంలో ఎంపీలు కంభంపాటి హరిబాబు, గోకరాజు గంగరాజు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకుల డుమ్మా

ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సాగిన పోలవరం పర్యటనకు రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ డుమ్మా కొట్టారు. ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలో ఆ పార్టీ నాయకులు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కన్నా ఆధ్వర్యంలో వారంతా బస్సులో పోలవరం పర్యటనకు బయలుదేరగా ఆకుల సత్యనారాయణ, ఆయన వర్గం మాత్రం బస్సులో వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఆకులతో 'ఈనాడు' మాట్లాడగా.. కన్నాకు పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చిన సమయంలో హర్షించిన వారిలో తాను ప్రథముడినని చెప్పారు. అదేసమయంలో.. జిల్లాకు చెందిన ఉన్నత పదవులు కలిగిన నేతలలో సహా మరికొందరు ఆయన నియామకంపై వ్యతిరేకత వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఆదివారం పత్రికా సమావేశంలో గతంలో వ్యతిరేకత వ్యక్తం చేసిన వారికే పెద్దపీట వేయడం తనకు బాధ కలిగించిందని, అందువల్లే పోలవరం కార్యక్రమానికి వెళ్లాలని అనిపించలేదని చెప్పారు.

'కేంద్రం చేతిలో కీలుబొమ్మలా జగన్'

ఈనాడు, అమరావతి: సొంత జిల్లా కడపకు అన్యాయం జరుగుతున్నా ప్రతిపక్షనేత జగన్ పట్టించుకోవడం లేదని ఏపీ దివ్యాంగుల, మాంసం అభివృద్ధి సంస్థల ఛైర్మన్లు గోనుగుంట్ల కోటేశ్వరరావు, ప్రకాశ్‌నాయుడు విమర్శించారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే నిలదీయకుండా కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారిపోయారని దుయ్యబట్టారు. గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో కోటేశ్వరరావు, ప్రకాశ్‌నాయుడు ఆదివారం విలేకరులతో మాట్లాడారు.

వయోజన విద్యా కేంద్రాలను కొనసాగించాలి: రామకృష్ణ

విజయవాడ, న్యూస్‌టుడే: సాక్షర భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వయోజన విద్యా కేంద్రాలను కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన ఓ లేఖ రాశారు. సాక్షరభారత్ కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వం తొలగించడం సరి కాదన్నారు.

నాలుగేళ్ల కష్టానికి ఇది గుర్తింపు

రాష్ట్రానికి స్కోచ్ పురస్కారాలపై మంత్రి దేవినేని

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: నీటిపారుదల రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'నేషనల్ సిగ్నిఫికెన్స్ ప్లాటినమ్ అవార్డు' సహా ఏపీ జలవనరులశాఖ 19 స్కోచ్ పురస్కారాలు దక్కించుకుందని రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి నాలుగేళ్లపాటు పడిన కష్టానికి ఇది గుర్తింపని పేర్కొన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని మరింత ప్రగతి చూపేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. విజయవాడలోని విడిది కార్యాలయంలో ఆదివారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. "రాష్ట్రం నుంచి మొత్తం 9 ప్రాజెక్టులు అవార్డులకు ఎంపికయ్యాయి. వీటిలో పట్టిసీమ ఎత్తిపోతల, నీరు-చెట్టు, రియల్ టైం వాటర్ మానిటరింగ్ పథకాలకు ప్లాటినమ్ పురస్కారాలు దక్కాయి. పురుషోత్తపట్నం, గండికోట-సీబీఆర్, ముచ్చుమర్రి ఎత్తిపోతల, జలవనరుల సమాచారం-నిర్వహణ వ్యవస్థ (ఏపీ వారిమ్స్), రియల్ టైం మానిటరింగ్ పథకాలకు బంగారు పురస్కారాలు దక్కాయి. మరో 9 ప్రాజెక్టులకు ప్రాథమికంగా 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' పురస్కారాలు లభించాయి" అని మంత్రి వివరించారు. ఈ గుర్తింపు వెనుక రెవెన్యూ, అటవీ, వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖల సమష్టి కృషి ఉందన్నారు. వైకాపాలో జగన్ తర్వాత స్థానం తనదే అని చెప్పుకుంటున్న విజయసాయిరెడ్డి గోతులు తీస్తున్నారని మంత్రి ఉమా ఆరోపించారు. కేసుల నుంచి జగన్ తాత్కాలిక ఉపశమనం పొందినా వాటి నుంచి ఈ జన్మలో బయట పడలేరని వ్యాఖ్యానించారు.

లోక్‌సభ స్థానానికో ఇన్‌ఛార్జి

ఎన్నికలకు సిద్ధమవుతున్న భాజపా

దిల్లీ: వచ్చే పార్లమెంటు ఎన్నికల కోసం భాజపా కసరత్తు మొదలుపెడుతోంది. లోక్‌సభ స్థానాలన్నింటిలోనూ ఒక ఇన్‌ఛార్జిని నియమించనుంది. అలాగే ప్రతి రాష్ట్రానికీ 11 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేయబోతోంది. సదరు ఇన్‌ఛార్జిని లోక్‌సభ స్థానం వెలుపలి వ్యక్తిని నియమిస్తారు. ఇలాంటి విధానాన్ని బీఎస్పీ ఎన్నో ఏళ్లుగా అనుసరిస్తోంది. దీన్ని భాజపా అమలుచేయడం ఇదే మొదటిసారి. 11 మంది కమిటీని 'ఎన్నికల సన్నద్ధత బృందం'గా వ్యవహరిస్తారు. రాష్ట్రానికి సంబంధించిన 13 నిర్దిష్ట లక్ష్యాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. సంస్థాగత వ్యవహారాలపై ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షా ఇప్పటికే దృష్టిసారించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి మొదలుపెట్టి అన్ని రాష్ట్రాలనూ పర్యటించే కార్యక్రమానికి అమిత్ షా శ్రీకారం చుట్టారు. జులై చివరి నాటికి అన్ని రాష్ట్రాల్లోనూ పర్యటించి, ఎన్నికల సన్నద్ధతను సమీక్షిస్తారు. ప్రతి లోక్‌సభ స్థానానికీ ఒక ఇన్‌ఛార్జితోపాటు సామాజిక మాధ్యమం, మీడియా వ్యవహారాలు, న్యాయ వ్యవహారాలపై ముగ్గురేసి సభ్యులతో వేరువేరు బృందాలను ఏర్పాటు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర పథకాల అమలును పర్యవేక్షించడానికి ఇద్దరు సభ్యుల మరో బృందం కూడా ఏర్పాటవుతుంది.

జాతీయ ఓబీసీ ఫెడరేషన్ ఛైర్మన్‌గా జస్టిస్ ఈశ్వరయ్య

- ఏపీ వ్యవహారాల ప్రతినిధిగా గూడూరి వెంకటేశ్వరరావు

జస్టిస్ ఈశ్వరయ్య

ఈనాడు, దిల్లీ: దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో పనిచేస్తున్న బీసీ సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ జాతీయ ఓబీసీ ఫెడరేషన్ ఏర్పాటైంది. ఛైర్మన్‌గా జస్టిస్ వంగాల ఈశ్వరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఫెడరేషన్ ఏపీ వ్యవహారాల ప్రతినిధిగా జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఆదివారమిక్కడ 29 రాష్ట్రాలకు చెందిన బీసీ సంఘాల ప్రతినిధులతో ఐక్య కార్యాచరణ సమితి సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. "చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి. హైదరాబాద్, విజయవాడల్లో తొలి జాతీయ సమావేశాలు నిర్వహించాలి" వంటి పది తీర్మానాలు చేశారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదించేలా ఆయా పార్టీలపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు.

'శ్రీవారి కానుకలను రమణ దీక్షితులు కొల్లగొట్టారు'

గుంటూరు, న్యూస్‌టుడే: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి చెందాల్సిన కానుకలను ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు కొల్లగొట్టారని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ సిరిపురపు శ్రీధర్ ఆరోపించారు. గుంటూరులోని బ్రాహ్మణ చైతన్య వేదిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఓ వీఐపీ దగ్గర యజ్ఞం చేసి స్వామి వారికి 33 వెండి బిందెలు అవసరమని తీసుకుని వాటిని తన ఇంటికి తరలించుకున్నారు. ఆయన మనుమడు ఆగమ పరీక్షల్లో తప్పినా అర్చకునిగా తీసుకోవాలని తితిదే అధికారులపై ఒత్తిడి తెచ్చారు" అని ఆరోపించారు.

ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర: పుట్టా

అనంతపురం, న్యూస్‌టుడే: శ్రీవారి ఆభరణాలపై ఆరోపణలు చేస్తున్న రమణ దీక్షితులు వెనుక రాజకీయ కుట్ర ఉందని తితిదే ఛైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆభరణాలకు సంబంధించి కచ్చితమైన లెక్కలు ఉన్నాయన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే తమను సంప్రదించాలని అలాకాకుండా ఎక్కడికో వెళ్లి అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. లేని వజ్రాన్ని చూపమంటే ఎక్కడి నుంచి తెస్తారన్నారు.

ముందస్తుకు సై: కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలకు తమ పార్టీ సిద్ధంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. దేశంలో ముందస్తు ఎన్నికలు రావొచ్చని తనకు అనుమానంగా ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి దానం నాగేందర్ ఆదివారం తెలంగాణభవన్‌లో కేసీఆర్ సమక్షంలో తెరాసలో చేరారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'నాలుగేళ్ల నుంచి ఏపీలో జరుగున్నదేమిటో మనం చూడట్లేదా? డమ్కీలు కొట్టడం తప్ప అక్కడ పని జరగట్లేదు. మాకంటే పెద్ద ఎవడూ లేడన్న స్థాయిలో ఏదోదో చేస్తామని అన్నారు. కేవలం మాటలు చెప్పుకుంటపోతే అయ్యేదేమీ లేదని రుజువైంది. ఏపీకి భిన్నంగా తెలంగాణలో నాయకులందరం కష్టపడి పనిచేశాం కాబట్టే మంచి ఫలితాలు, అభివృద్ధిని సాధించాం' అని వివరించారు.

35900–36000 శ్రేణిలో నిరోధం!



సమీక్ష : అంతర్జాతీయ, దేశీయ పరిణామాలు స్తబ్దుగా ఉండటంతో గత వారం సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా మన సూచీలు ట్రేడయ్యాయి. అమెరికా- చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరోసారి వెలుగులోకి రావడం ప్రభావం చూపింది. పూర్తిస్థాయి వాణిజ్య యుద్ధానికి రెండు దేశాలు సిద్ధంకావడంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనపడ్డాయి. దేశీయ గణాంకాలు మిశ్రమంగా నమోదయ్యాయి. దేశ వాణిజ్య లోటు నాలుగు నెలల గరిష్ఠానికి చేరింది. ఇదే సమయంలో సెజ్‌ల ఎగుమతులు 38 శాతం పెరిగాయి. కశ్మీర్‌లో ప్రభుత్వానికి భాజపా ఆకస్మికంగా మద్దతు ఉపసంహరించుకోవడం వంటి రాజకీయ పరిణామాలతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.2 శాతం పెరిగి 35690 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 0.2 శాతం లాభంతో 10,822 పాయింట్ల దగ్గర స్థిరపడింది. చిన్న, మధ్య షేర్లకు అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ, చమురు- గ్యాస్ షేర్లు లాభపడగా, లోహ, యంత్ర పరికరాలు, ఐటీ షేర్లు డీలాపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌ఐఐలు) నికరంగా రూ.4738 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్‌ల కొనుగోళ్లు రూ.4721 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 5:8గా నమోదుకావడం..
చిన్న, మధ్య షేర్లలో అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } 35,250 పాయింట్ల మద్దతు దక్కించుకున్న సెన్సెక్స్.. గత వారం స్వల్ప లాభాలతో సరిపెట్టుకుంది. సమీపకాలంలో 35,900- 36,000 పాయింట్ల శ్రేణిలో బలమైన నిరోధం ఎదురుకావొచ్చు. నష్టాలు ఎదురైతే 34700- 35000 పాయింట్ల మధ్యలో మద్దతు లభించొచ్చు.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు, ముడి చమురు ధరల కదలికలు ఈ వారం మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. దేశీయంగా చూస్తే జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు 28న ముగియనున్నందున, సూచీలు ఒడుదొడుకులు ఎదుర్కొనే అవకాశం ఉంది. రంగం, షేరు ఆధారిత కదలికలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. సమీపకాలంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు, ఎఫ్‌ఐఐ, డీఐఐల పెట్టుబడులు మార్కెట్‌కు దిశానిర్దేశం చేయొచ్చు. చమురు ఉత్పత్తిని స్వల్పంగా పెంచాలన్న ఒపెక్ నిర్ణయం మార్కెట్లపై ప్రభావం చూపనుంది. గత శుక్రవారం అంచనాల కంటే తక్కువగా ఉత్పత్తి పెంపు ప్రకటించడంతో, ముడిచమురు ధరలు పెరిగాయి. ఇదే ధోరణి కొనసాగితే.. భారత మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. 28న అమెరికా తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలు, 29న బ్రిటన్ తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలు వెలువడనున్నాయి. దేశీయంగా ఈ ఏడాదిలో ఇప్పటివరకు వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైంది. రుతుపవనాల పురోగతిపై మదుపర్లు ఓ కన్నేసే అవకాశం ఉంది. చిన్న, మధ్య షేర్ల కంటే పెద్ద షేర్లపైనే మార్కెట్ వర్గాలు మొగ్గుచూపుతున్నాయి. సమీపకాలంలో ఇదే ధోరణి కొనసాగొచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 35,329, 35,000, 34,735;
తక్షణ నిరోధ స్థాయిలు: 35,993, 36,256, 36,444

మార్కెట్లు పుంజుకుంటే.. 35900- 36000 పాయింట్ల శ్రేణిలో నిరోధం ఎదురుకావొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

కోడిగుడ్లు

24న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)			
హైదరాబాద్	382	వరంగల్	384
చిల్లరగా (ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	390
బెంగళూరు	429	చెన్నై	457
25వ తేదీకి		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	378	నమక్కల్	440

సానుకూలమే.. కానీ!

● అంతర్జాతీయ పరిణామాలు కీలకం ● సూచీలకు ఒడుదొడుకులు
● డెరివేటివ్ కాంట్రాక్టులకు గురువారమే గడువు ● 10830- 10930 మధ్య నిఫ్టీ కదలికలు
● చమురు షేర్లపై ఒపెక్ నిర్ణయ ప్రభావం ● ఔషధ షేర్లు పైపైకే ● విశ్లేషకుల అంచనాలు

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
యాక్సిస్ బ్యాంక్	526	539	504
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2083	2113	2035
ఐసీఐసీఐ బ్యాంక్	301	307	293
ఎస్‌బీఐ	273	279	263
యెస్ బ్యాంక్	335	340	327

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	905	929	890
ఇన్ఫోసిస్	1248	1263	1233
టీసీఎస్	1890	1840	1785
టెక్ మహీంద్రా	691	701	675
విప్రో	258	262	253

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	426	434	416
హెచ్‌పీసీఎల్	311	321	302
ఐఓసీ	170	175	166
ఓఎన్‌జీసీ	160	162	158
రిలయన్స్ ఇండస్ట్రీస్	1013	1038	996

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
మారుతీ సుజుకీ	8875	8934	8780
ఎంఅండ్‌ఎం	908	932	870
బజాజ్ ఆటో	2832	2856	2794
టాటా మోటార్స్	308	312	301
టీవీఎస్ మోటార్	583	591	573

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	222	225	217
టాటా స్టీల్	562	569	552
వేదాంత	229	232	225
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	337	342	329

సిమెంట్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అంబుజా సిమెంట్స్	205	213	192
ఇండియా సిమెంట్స్	112	117	104
శ్రీ సిమెంట్	15578	16118	14710
అల్ట్రాటెక్ సిమెంట్	3641	3711	3528

స్టాక్ మార్కెట్ ఈ వారం

మన మార్కెట్ ఈవారం సానుకూలంగా కదలాడే అవకాశం ఉంది. అమెరికా- చైనాల మధ్య సుంకాల సమరం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు కూడా సూచీలకు దిశానిర్దేశం చేస్తాయి. జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుకు గడువు గురువారం తీరిపోనుండటంతో ఒడుదొడుకులకూ ఆస్కారం ఉంది. నిఫ్టీ ఈవారం 10830- 10930 శ్రేణిలో చలించొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గతవారాన్ని మార్కెట్ సానుకూలంగా ముగించడం సెంటిమెంటు బలపడేందుకు దోహదం చేయొచ్చని అభిప్రాయపడుతున్నారు. సమీపకాలంలో కొత్త జీవన గరిష్ఠ స్థాయిలను సూచీ అందుకునే అవకాశం ఉందనీ విశ్లేషిస్తున్నారు. చమురు ఉత్పత్తి పెంపునకు ఒపెక్ దేశాలు తీసుకున్న నిర్ణయం చమురు రంగ షేర్లపై ప్రభావం చూపించవచ్చు. ఔషధ రంగ షేర్లకు సానుకూలతలు కొనసాగొచ్చు. ఆయా రంగాలు, కంపెనీల షేర్లపై విశ్లేషకుల అంచనాలు ఇలా..

✔ దిశానిర్దేశం చేసే ప్రధాన పరిణామాలేవీ లేకపోవడంతో **ఐటీ** రంగ షేర్లు ఈవారం ఒక శ్రేణికి లోబడి చలించే అవకాశం ఉంది. అయితే రూపాయి కదలికలపై మదుపర్లు దృష్టి సారించాలి. వార్షిక సాధారణ సమావేశంలో ఇన్ఫీ యాజమాన్యం చేసిన వ్యాఖ్యల ప్రభావం షేరుపై ఉండొచ్చు.

✔ ఒపెక్ దేశాలతో పాటు రష్యాలో చమురు ఉత్పత్తి ఎంతమేర పెరుగుతుందనే అంశంపై ఆధారపడి **చమురు** షేర్ల కదలికలుంటాయి. రోజుకు 10 లక్షల బ్యారెళ్లకు మించి ఉత్పత్తి పెంచకూడదని నిర్ణయించినా, వాస్తవానికి వచ్చేసరికి 60,000 బ్యారెళ్లకు మించి చేయరని అంచనా వేస్తున్నారు. ఈ ప్రభావం ఇప్పటికే పడినందున, ప్రస్తుత స్థాయిల్లోనే చమురు ధరలు ఉంటాయనే అంచనాలూ ఉన్నాయి.

✔ **భారీ యంత్రపరికరాల** రంగ షేర్లు దీర్ఘకాలానికి ప్రతికూల ధోరణిలో చలించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2017-18లో ఆర్డర్లను చేజిక్కించుకునే విషయంలో భెల్ మెరుగైన పనితీరు కనబర్చినప్పటికీ, ముందుముందు ఆర్డర్ల రాకలో స్తబ్దత కొనసాగొచ్చని భావిస్తున్నారు.

✔ **వాహన రంగ** షేర్లకు ఈవారం అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. సానుకూలతను తెచ్చిపెట్టే కీలక పరిణామాలేవీ లేకపోవడం ఇందుకు కారణం. మార్కెట్ కదలికల ఆధారంగా కూడా ఈ షేర్లు చలించొచ్చు. ఒపెక్ నిర్ణయాన్ని కూడా మదుపర్లు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

✔ **లోహ, గనుల** రంగాల షేర్లు ఈవారం ఒడుదొడుకుల మధ్య చలించే అవకాశం ఉంది. డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగియనుండటం ఇందుకు దోహదం చేయొచ్చు. వర్షాకాలమైనందున, నిర్మాణ రంగ పనులు నెమ్మదిస్తుండటంతో ఉక్కు రంగ కంపెనీల షేర్లు స్తబ్దుగా చలించవచ్చు.

✔ టారిఫ్ ఒత్తిళ్ల వల్ల **టెలికాం** షేర్లు బలహీనంగా చలించవచ్చు. రిలయన్స్ జియో సేవలు ఆరంభమైన 2016 సెప్టెంబరు నుంచి కంపెనీలకు ఆదాయం తగ్గుతూ వస్తోంది. ఇదే ధోరణి మధ్యకాలానికి కొనసాగొచ్చు. ఈ ఆర్థిక సంవత్సరంలో నెట్‌వర్క్‌ల పటిష్ఠానికి పెట్టుబడులు పెట్టాలని సంస్థలు నిర్ణయించాయి.

✔ ప్రభావిత అంశాలు లేనందున, **ఎఫ్‌ఎంసీజీ** షేర్లు పరిమిత శ్రేణిలో చలించొచ్చు. అంతర్గత సానుకూలతలున్నా, మార్కెట్‌కు అనుగుణంగా ఈ షేర్ల కదలికలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

✔ ప్రైవేటు **బ్యాంకుల** షేర్లు సానుకూలంగా కదలాడొచ్చు. కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లను ఒక బ్రోకరేజీ సంస్థ సిఫారసు చేస్తోంది. ఎన్‌సీఎల్‌టీకి చేరిన నిరర్థక ఆస్తుల నుంచి భారీ రికవరీలు ఉంటున్నందున, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా లాభపడొచ్చు. బాండ్‌ల ప్రతిఫలాల్లో ఒడుదొడుకులు బ్యాంకింగ్‌కు ఉపకరించవచ్చని భావిస్తున్నారు.

✔ ప్రధాన మార్కెట్‌కు అనుగుణంగా **సిమెంటు** షేర్లు చలించొచ్చు. మధ్య, దీర్ఘకాలానికి మాత్రం ఈ రంగంపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. ఎన్నికల సంవత్సరం కావడంతో, మౌలిక వసతులపై ప్రభుత్వాలు అధికంగా వెచ్చిస్తాయని, ఇందువల్ల సిమెంటుకు గిరాకీ పెరుగుతుందని పేర్కొంటున్నారు.

✔ **ఔషధ** సంస్థల ఆదాయాలు పెరుగుతాయనే అంచనాలతో, సంస్థాగత పెట్టుబడిదార్లు అధికంగా కొనుగోళ్లు చేస్తున్నందున, ఈ రంగ షేర్లు లాభపడే వీలుంది.

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	75	76	74
సీజీ పవర్	55	57	53
ఎల్‌అండ్‌టీ	1300	1318	1275
థెర్మాక్స్	1080	1107	1057
సీమెన్స్	994	1014	966

ఎఫ్‌ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
కోల్గేట్ పామోలివ్	1180	1199	1155
డాబర్ ఇండియా	385	390	379
గోద్రేజ్ కన్జూమర్	1166	1190	1133
హెచ్‌యూఎల్	1608	1630	1570
ఐటీసీ	265	271	257

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	374.55	382.70	362.30
ఐడియా సెల్యులార్	60.55	61.60	59.70
ఆర్‌కామ్	14.70	15.20	14.40
టాటా కమ్యూనికేషన్స్	602.00	612.10	592.20
మహానగర్ టెలిఫోన్	17.85	19.90	15.30

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	611.10	625.50	589.10
కేడిలా హెల్త్‌కేర్	409.20	418.90	400.70
డాక్టర్ రెడ్డీస్	2336.25	2392.70	2245.80
లుపిన్	902.90	925.60	870.30
సిప్లా	615.70	632.50	586.90

ఐడియా-వొడాఫోన్ విలీనం ఆలస్యం?

రూ.4,700 కోట్లు చెల్లించాలంటూ టెలికాం విభాగం తాజా నోటీసులు!

దిల్లీ: ఐడియా సెల్యులార్, వొడాఫోన్ ఇండియా విలీనం మరికొంత కాలం ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఈనెల 30 నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని భావించినా, రూ.4,700 కోట్ల వసూలు కోసం టెలికాం విభాగం (డాట్) తాజా నోటీసులు జారీ చేయనుండటమే ఇందుకు కారణమని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఐడియాతో విలీనం ముందే ఈ మొత్తం చెల్లించాలని వొడాఫోన్‌ను డాట్ కోరనుంది. 2015లో వొడాఫోన్ తమ అనుబంధ సంస్థలైన వొడాఫోన్ తూర్పు, దక్షిణ, వొడాఫోన్ సెల్యులార్, వొడాఫోన్ డిజిలింక్‌లను వొడాఫోన్ మొబైల్ సర్వీసెస్‌లో విలీనం చేసింది. ఇప్పుడీ సంస్థనే వొడాఫోన్ ఇండియాగా పేర్కొంటున్నారు. ఓటీఎస్‌సీ ఛార్జీల కింద రూ.6678 కోట్లు చెల్లించాలని వొడాఫోన్‌ను డాట్ ఆదేశించగా, సుప్రీంకోర్టులో ఆ సంస్థ సవాలు చేసింది. కోర్టుఆదేశాల ప్రకారం రూ.2,000 కోట్లు మాత్రమే సంస్థ చెల్లించింది. ఇప్పుడు మిగిలిన మొత్తానికి నోటీసును డాట్ జారీ చేయనుంది.

పేటెంట్ కేసులో డాక్టర్ రెడ్డీస్‌కు నిరాశ

హైదరాబాద్: వివిధ రకాల క్యాన్సర్ చికిత్స కోసం వినియోగించే అలిమ్టా పేటెంటు విషయంలో ఎలీ లిల్లీ అండ్ కంపెనీతో ఏర్పడిన న్యాయ వివాదంలో డాక్టర్ రెడ్డీస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఔషధానికి సంబంధించిన పేటెంటు గడువు లిల్లీ సంస్థకు మే 2022 వరకూ ఉండగా.. అది ముగియకముందే ప్రత్యామ్నాయ రూపంలో ఈ ఔషధాన్ని మార్కెట్ చేసేందుకు ప్రయత్నించడం పేటెంటు ఉల్లంఘనల కిందకు వస్తుందని అమెరికాలోని ఇండియానాలోని సదరన్ డిస్ట్రిక్ట్ కోర్టు అభిప్రాయపడింది. 'పోటీ కంపెనీ తమ అలిమ్టా విటమిన్ ఔషధానికి సంబంధించి ప్రత్యామ్నాయ ఉత్పత్తులను విడుదల చేసేందుకు ప్రయత్నించడం పేటెంట్ల ఉల్లంఘన కిందకు వస్తుందని కోర్టు పేర్కొనడం ఆనందంగా ఉందని' కోర్టు తీర్పుపై ఎలీ లిల్లీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ జనరల్ కౌన్సిల్ మైఖేల్ జె.హారింగ్టన్ పేర్కొన్నారు. ఈ ఔషధాన్ని కనుగొనేందుకు తమ సంస్థ విస్తృతస్థాయి పరిశోధన చేసిందనీ, మేధో హక్కుల సంపత్తి కింద దీన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

సెన్సెక్స్ @ 44,000!

- వచ్చే జూన్‌కు చేరొచ్చు
- బేర్‌ల చేతిలోకి వెళితే 26,500కు..
- మోర్గాన్ స్టాన్లీ నివేదిక

దిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లతో పోలిస్తే, భారత మార్కెట్ల వృద్ధి అధికంగా ఉంటుందని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ పరిస్థితుల వల్ల వాస్తవ ప్రతిఫలాలపై పరిమితులున్నా, జోరు కొనసాగుతుందని పేర్కొంది. దేశ వృద్ధిరేటుకు తోడు, అధిక మార్కెట్ విలువ కలిగిన సంస్థల షేర్లు అందుబాటు ధరల్లో లభిస్తుండటంతో మార్కెట్లు పెరగడానికి అవకాశం ఉందని వివరించింది. ఇదే సమయంలో పెరుగుతున్న ముడి చమురు ధరలు, అధిక ప్రతిఫలాల వల్ల మార్కెట్ల దూకుడుకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొంది. 2018లో 5 శాతం, 2019లో 23 శాతం, 2020లో 24 శాతం చొప్పున బీఎస్ఈ సెన్సెక్స్ పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంకా తన నివేదికలో ఏం చెబుతోందంటే..

✦ సాధారణ పరిస్థితుల్లో జూన్ 2019 కల్లా సెన్సెక్స్ 36,000 స్థాయిలో ఉంటుంది. (50 శాతం సంభావ్యత). బుల్ మార్కెట్ కొనసాగితే 44,000 పాయింట్ల స్థాయికి (30 శాతం సంభావ్యత) చేరుతుంది. ఒకవేళ బేర్ మార్కెట్ ఉంటే 26,500 పాయింట్లకు (20 శాతం సంభావ్యత) పడిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం సెన్సెక్స్ 35,600 పాయింట్ల వద్ద ట్రేడవుతున్న సంగతి తెలిసిందే.

✦ పెరుగుతున్న ముడి చమురు ధరలతో మార్కెట్లకు ప్రమాదం పొంచి ఉంది. ద్రవ్యలోటు, వృద్ధిపై చమురు ధరలు ప్రభావం చూపే అవకాశం ఉంది.

✦ సమీప కాలంలో అంతర్జాతీయ మార్కెట్లను అనుసరించి భారతీయ మార్కెట్లు కదిలే అవకాశం ఉంది.

✦ వినియోగం, ఎగుమతులు, ప్రభుత్వ వ్యయం, ప్రైవేటు సంస్థల మూలధన వ్యయాలు పెరగడం.. ఇవన్నీ కలిపి 2018, 2019లో బలమైన వృద్ధి నమోదు కావచ్చు. 2018లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన సమీక్షల్లో కఠినంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఎన్నికల ఏడాది కావడంతో బడ్జెట్‌లో అంచనా వేసిన ద్రవ్యలోటు కంటే అదనపు లోటు ఏర్పడే అవకాశం కూడా లేకపోలేదు. సమీప కాలంలో ప్రపంచ మార్కెట్లే, దేశీయ మార్కెట్ పనితీరుకు కీలకం అవుతుంది. ప్రపంచ మార్కెట్లలో నష్టభయం పరంగా 13 ఏళ్ల కనిష్ఠస్థాయికి భారత్ విపణి చేరింది. అంతర్జాతీయ విపణిలో ప్రతిఫలం తక్కువగా ఉండగా, భారత్‌లో వృద్ధి బాగుందని నివేదిక వివరించింది.

చైనా నుంచి దిగుమతులు తగ్గించుకోనున్న మిధాని

నెల్లూరులో అల్యూమినియం అల్లాయ్ ఉత్పత్తి కేంద్రం

హైదరాబాద్: ప్రత్యేక లోహాలను తయారు చేసే మిధాని (మిశ్ర ధాతు నిగం) సంస్థ చైనా దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకోవాలని యోచిస్తోంది. రక్షణరంగ ఉత్పత్తుల తయారీలో ఉపయోగపడే పలు రకాల లోహాలు చైనా నుంచి వస్తున్నాయి. వాటి నాణ్యత సరిగా లేకపోవడం, అధిక ధరల నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకుంది. భారత్‌లో తయారీ నినాదం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో నాల్కోతో కలిసి ఉమ్మడిగా అల్యూమినియం అల్లాయ్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించేందుకు పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) మరో ఆరు నెలల్లో సిద్ధం కానుందని మిధాని ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దినేశ్ కుమార్ లిఖి తెలిపారు. చైనా నుంచి వస్తున్న లోహాలు కొన్నిసార్లు నాసిరకంగా ఉంటున్నాయని ఆయన పేర్కొన్నారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలోని మిధాని ప్రత్యేక ఉక్కు, సూపర్ అల్లాయ్స్, టైటానియం అల్లాయ్‌లాంటి ప్రత్యేక లోహాలను తయారు చేస్తుంది. ఇప్పటికే చైనా నుంచి దిగుమతులను తగ్గించుకోవడానికి పలు చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. టంగ్‌స్టన్, కోబాల్ట్, నికెల్‌లాంటివి దేశంలో లభించడం లేదనీ, దిగుమతులపైనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. వియత్నాంలోని టంగ్‌స్టన్ గనిలో కొంత వాటా తీసుకోవాలని మరో ప్రభుత్వ సంస్థ ఎన్‌ఎండీసీతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో 10శాతం వృద్ధి రేటును ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

విశాఖ ప్లాంట్‌పై ఏషియన్ పెయింట్స్ రూ.1785 కోట్ల పెట్టుబడులు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీగా సామర్థ్య విస్తరణకు ఏషియన్ పెయింట్స్ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న ఉత్పత్తి సామర్థ్యానికి మరో 1.1 మిలియన్ కిలో లీటర్లు జత చేసేందుకు, విశాఖపట్నం, మైసూరు ప్లాంట్‌లపై రూ.4000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఏడాదికి 5 లక్షల కిలో లీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న విశాఖపట్నం ప్లాంట్‌పై రూ.1,785 కోట్లు, ఏడాదికి 6 లక్షల కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన మైసూర్ ప్లాంట్‌పై రూ.2,300 కోట్ల చొప్పున కంపెనీ పెట్టుబడులు పెట్టనుంది. 'అతిపెద్ద సామర్థ్య విస్తరణకు సిద్ధమయ్యాం. మొదటి దశలో ఏడాదికి చెరో 3 లక్షల కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ బేస్డ్ పెయింట్‌ల ప్లాంట్‌లను మైసూరు, విశాఖపట్నంలలో ప్రారంభించనున్నాం' అని ఏషియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కేబీఎస్ ఆనంద్ వార్షిక నివేదికలో పేర్కొన్నారు. 16 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏషియన్ పెయింట్స్‌కు ప్రపంచవ్యాప్తంగా 25 తయారీ ప్లాంట్‌లు ఉన్నాయి.

బ్యాంకు ఎండీల పదవులకు 28 నుంచి ఇంటర్వ్యూలు

దిల్లీ: దాదాపు డజను ప్రభుత్వరంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీలు) మేనేజింగ్ డైరెక్టరు (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పదవులు ఖాళీగా ఉన్నందున, నియామక ప్రక్రియను బ్యాంక్స్ బోర్డ్ బ్యూరో (బీబీబీ) ప్రారంభించనుంది. ఈ నెల 28 నుంచి ఇంటర్వ్యూలు జరపబోతోంది. ఎండీ పదవుల రేసులో 34 మంది ఉన్నారు. వీరిలో వివిధ బ్యాంకుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. ఎస్‌బీఐలో పని చేస్తున్న డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్లు కూడా తొలిసారిగా ఎండీ పదవి కోసం ఇంటర్వ్యూలకు హాజరు కాబోతున్నారు. ప్రస్తుతానికి దేనా బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌ల్లో ఎండీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, యూకో బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల్లో ఎండీ పోస్టుల్ని ఈ ఆర్థిక సంవత్సరంలో సృష్టించబోతున్నారు. ఐడీబీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓ ఎం.కె. జైన్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా వెళ్లిన నేపథ్యంలో తాత్కాలికంగా (మూడు నెలలపాటు) ఆ బాధ్యతల్ని ఎస్‌బీఐ ఎండీ శ్రీరామ్‌కు ప్రభుత్వం అప్పగించిన సంగతి తెలిసిందే. ఇక్కడ కూడా ఎండీ పోస్టు ఖాళీగా ఉన్నట్లే.

సహజవాయువు డీలా!

కమొడిటీస్ ఈ వారం

● పసిడి, వెండి



బంగారం ఆగస్టు కాంట్రాక్టు గతవారం రూ.30,975 వద్ద నష్టాలతో ఆరంభమైంది. తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో రూ.31,098 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. కానీ ఈ స్థాయిని నిలబెట్టుకోవడంలో కాంట్రాక్టు విఫలమైంది. అమ్మకాలు వెల్లువెత్తడంతో, మద్దతు స్థాయినీ కోల్పోయి కాంట్రాక్టు రూ.30,515 స్థాయికి పడిపోయింది. ఆఖరుకు 1.18% నష్టంతో రూ.30,610 వద్ద ముగిసింది. ఈవారం కూడా కాంట్రాక్టు దిద్దుబాటుకు లోనుకావచ్చు. అయితే రూ.30,360 వద్ద మద్దతు కనిపిస్తోంది. ఈ స్థాయి కంటే కూడా కిందకు వస్తే రూ.30,158, రూ.30,093 వరకు కాంట్రాక్టు పడిపోయే అవకాశం ఉంది. పైన పేర్కొన్న సాంకేతిక అంశాలతో పాటు అమెరికా, ఇతర దేశాలు విడుదల చేసే కీలక ఆర్థిక గణాంకాలు పసిడి కాంట్రాక్టుకు దిశానిర్దేశం చేస్తాయి. వెండి జులై కాంట్రాక్టు కిందటివారం రూ.40,175 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత రూ.40,332కి చేరాక, అమ్మకాల ఒత్తిడికి లోనై రూ.39,391 వరకు దిద్దుబాటు అయ్యింది. చివరకు 0.94 శాతం నష్టంతో రూ.39,796 వద్ద స్థిరపడింది. గత రెండు వారాలుగా వెండి కాంట్రాక్టు ప్రతికూల ధోరణిలో చలించినందున ఈవారం కాస్త పుంజుకునే అవకాశం ఉంది. అయితే సాంకేతికంగా కాంట్రాక్టు రూ.39,560 కంటే దిగువన ట్రేడయితే రూ.39,347; ఆ తర్వాత రూ.39,123 వరకు పడిపోయే అవకాశం ఉంది.

● ప్రాథమిక లోహాలు

రాగి ఆగస్టు కాంట్రాక్టు ఈరోజు రూ.459 దిగువన చలిస్తే రూ.452 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. అయితే షార్ట్ పొజిషన్లుంటే ఈ స్థాయి వద్ద లాభాలు స్వీకరించడం ఉత్తమం. సీసం జులై కాంట్రాక్టు ఈవారం రూ.166 ఎగువన ట్రేడ్ కాకుంటే లాంగ్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. అలాగే రూ.162 స్థాయి దిగువకు వస్తే రూ.156 వరకు కాంట్రాక్టు దిగివచ్చే అవకాశం ఉంది. జింక్ జులై కాంట్రాక్టు ఈరోజు రూ.206.85 ఎగువన ముగిస్తే కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. లేదంటే రూ.204.75 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని షార్ట్ సెల్ చేయడం ఉత్తమం. అల్యూమినియం జులై కాంట్రాక్టు ఈవారం మరింత దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం ఉంది. రూ.146.35 కంటే పైన చలించకుంటే రూ.143.45 వరకు కాంట్రాక్టు దిగిరావొచ్చు. నికెల్ జులై కాంట్రాక్టు ఈవారం కాస్త కిందకు వచ్చినా మరింత పడిపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల లాంగ్ పొజిషన్లకు దూరంగా ఉండటం మేలు. తక్కువ నష్టభయంతో ట్రేడ్ చేసే మదుపర్లు రూ.1074 దరిదాపులో స్టాప్‌లాస్ పెట్టుకొని రూ.1045 స్థాయి వద్ద షార్ట్ సెల్ చేయొచ్చు.

● ఇంధన రంగం

చమురు ఉత్పత్తి పెంపునకు ఒపెక్ దేశాలు నిర్ణయం తీసుకోవడం వల్ల ముడిచమురు జులై కాంట్రాక్టుపై ప్రభావం పడుతుంది. ఉత్పత్తి పెంపుతో చమురు ధరలు దిగివచ్చే అవకాశం ఉన్నందున కాంట్రాక్టు అమ్మకాల ఒత్తిడికి లోనుకావచ్చు. సహజవాయువు కాంట్రాక్టు ఈవారం మరింత డీలాపడొచ్చు. అందువల్ల రూ.205.55 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని రూ.203.75 దరిదాపులో కాంట్రాక్టును షార్ట్‌సెల్ చేయొచ్చు. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) కాంట్రాక్టు రూ.672 దిగువకు వస్తే రూ.624; ఆ తర్వాత రూ.620.60 వరకు పడిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రూ.639 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని షార్ట్‌సెల్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
రాగి (ఆగస్టు)	478	460.70	(3.62)
సీసం (జులై)	163.75	164.75	0.61
జింక్ (జులై)	216.55	201.30	(4.64)
అల్యూమినియం (జులై)	151.35	148.75	(1.75)
నికెల్ (జులై)	1,030.10	1,043.20	1.27
ముడి చమురు (జులై)	4,401	4,675	6
సహజ వాయువు (జులై)	207	200.50	(3.14)
సీపీఓ (జూన్)	637.50	631.20	0.99

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

ప్రపంచకప్‌లో ఈనాడు

ఉరుగ్వే	గ్రూప్-ఎ × సా॥ 7.30	రష్యా
సౌదీ అరేబియా	గ్రూప్-ఎ × సా॥ 7.30	ఈజిప్ట్
స్పెయిన్	గ్రూప్-బి × రాత్రి 11.30	మొరాకో
ఇరాన్	గ్రూప్-బి × రాత్రి 11.30	పోర్చుగల్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

కిక్ 2018 ఛాంపియన్స్

5 ఇప్పటివరకు ఐదు గోల్స్‌తో కేన్ టోర్నీలో టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. అంతేకాదు.. గారీ లినేకర్ (1986) తర్వాత ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ కొట్టిన తొలి ఇంగ్లాండ్ ఆటగాడిగా అతడు ఘనత సాధించాడు.

2006 ప్రపంచకప్ విజేత ఇటలీ.. తర్వాతి టోర్నీ గ్రూప్ దశలోనే మట్టికరిచింది. 2010 విజేత స్పెయిన్‌కూ తర్వాతి టోర్నీలో గ్రూప్ దశలోనే చుక్కెదురైంది. 2014లో కప్పు గెలిచిన జర్మనీ.. ఈసారి తొలి మ్యాచ్‌లో మెక్సికో చేతిలో కంగు తింది. తర్వాతి మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసేసరికి స్కోరు 1-1. అదనపు సమయం కూడా అయిపోవస్తోంది. ఆటలో ఇంకొన్ని క్షణాలే మిగిలున్నాయి. ఇక గెలుపుపై ఆశలు లేనట్లే! నాకౌట్ అవకాశం గాల్లో దీపమే! అదృష్టం మహబాగా కలిసొస్తే తప్ప ఇటలీ, స్పెయిన్‌ల బాటలోనే గ్రూప్ దశ నిష్క్రమణే!

ఆఖర్లో అద్భుతం



ఇలాంటి స్థితిలో అద్భుతం జరిగింది. అనుకోని వరంలా జర్మనీకి ఫ్రీకిక్ వచ్చింది. అందివచ్చిన అవకాశాన్ని గొప్పగా వినియోగించుకున్నాడు టోని క్రూస్. అతను కార్నర్ నుంచి ప్రత్యర్థి డిఫెండర్లను, గోల్‌కీపర్‌ను ఎంత బాగా బోల్తా కొట్టించాడో, బంతిని ఎంత ఆశ్చర్యకర రీతిలో గోల్ పోస్ట్‌లోకి పంపించాడో మాటల్లో వర్ణించడం కష్టం. ఇక మ్యాచ్ ఆగబోయే క్షణాల్లో నమోదైన గోల్.. ఆవిరవుతున్న జర్మనీ నాకౌట్ ఆశలకు ఊపిరి పోసింది.

● జర్మనీ ఆశలు సజీవం ● చివరి క్షణాల్లో క్రూస్ గోల్ ● 2-1తో స్వీడన్‌పై విజయం

క్రూస్

జర్మనీ 2	స్వీడన్ 1
మార్కో రయిస్ (45+3), టోని క్రూస్ (90+5)	టోవోనెన్ (32)

సోచి

డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ ఈ ప్రపంచకప్‌లో మరో పరాభవం దిశగా సాగి.. చివరికి నాటకీయ రీతిలో విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 2-1తో స్వీడన్‌పై విజయం సాధించింది. ఆ జట్టులో మార్కో రయిస్ (45+3), టోని క్రూస్ (90+5) గోల్స్ సాధించారు. స్వీడన్ తరపున టోవోనెన్ 32వ నిమిషంలో గోల్ కొట్టాడు. మెక్సికో చేతిలో అనూహ్య పరాజయంతో టోర్నీని ఆరంభించిన ప్రపంచ నంబర్‌వన్ జర్మనీ.. ఫిఫా ర్యాంకింగ్స్‌లో 20వ స్థానంలో ఉన్న స్వీడన్‌తో పోరులోనూ ప్రథమార్ధం వరకు 0-1తో వెనుకబడే ఉంది. మ్యాచ్ మొత్తంలో ఆ జట్టుదే ఆధిపత్యం అయినా, 71 శాతం బంతిని తన నియంత్రణలోనే ఉంచుకున్నా, గోల్ దాడులు చాలానే చేసినా.. 47వ నిమిషం వరకు స్వీడనే ఆధిక్యంలో నిలిచింది. స్వీడన్ గోల్ కీపర్, డిఫెండర్లు.. జర్మనీ దాడుల్ని సమర్థంగా అడ్డుకున్నారు. కొన్నిసార్లు దురదృష్టం కూడా జర్మనీని వెంటాడింది. 32వ నిమిషంలో టోవోనెన్ అద్భుత రీతిలో గోల్ కొట్టి స్వీడన్‌కు ఆధిక్యాన్నందించడం ద్వారా జర్మనీ జట్టును, అభిమానుల్ని విస్మయానికి గురి చేశాడు. అక్కడి నుంచి జర్మనీకి ఉత్కంఠభరిత క్షణాలు మొదలయ్యాయి. ప్రథమార్ధం అదనపు సమయంలో వెర్నర్ ఇచ్చిన క్రాస్‌ను గొమెజ్ అందుకోలేకపోయినప్పటికీ.. వెనుకే ఉన్న రయిస్ మోకాలితో చక్కటి గోల్ కొట్టడంతో స్కోరు సమం చేయడంతో జర్మనీ అభిమానులు హమ్మయ్య అనుకున్నారు. ఇక ద్వితీయార్ధంలో జర్మనీ ఆటగాళ్ల చక్కటి పాసింగ్‌తో గెలుపు గోల్ కోసం గట్టి ప్రయత్నాలే చేశారు. కానీ ఫలితం లేకపోయింది. పైగా 82వ నిమిషంలో జర్మనీ జెరోమ్ బోటెంగ్ సేవలు కోల్పోయింది. రెండో పసుపు కార్డు అందుకున్న బోటెంగ్ మైదానాన్ని వీడటంతో జర్మనీ పదిమందితోనే ఆడాల్సి వచ్చింది. నిర్ణీత సమయం ముగిసినా గోల్ కాలేదు. అదనపు సమయం కూడా అయిపోతుండగా జర్మనీకి ఫ్రీకిక్ లభించగా.. క్రూస్ బంతిని అద్భుత రీతిలో వంకర్లు తిప్పుతూ గోల్ కొట్టి జర్మనీని సంబరాల్లో ముంచెత్తాడు.

జపాన్ 2.. సెనెగల్ 2

హోండా

జపాన్ 2	సెనెగల్ 2
తకాషి ఇనుయ్ (34వ), కిసుకె హోండా (78వ)	దియో మానె (11వ), మౌసా వేగ్ (71వ)

ఎక్తరిన్‌బర్గ్: ప్రపంచకప్‌లో ఆదివారం జపాన్, సెనగల్ మధ్య జరిగిన గ్రూప్-హెచ్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. పోరాటపటిమను ప్రదర్శించిన జపాన్.. రెండుసార్లు వెనుకబడ్డా పుంజుకుంది. జపాన్ తరపున తకాషి ఇనుయ్ (34వ), కిసుకె హోండా (78వ) గోల్స్ కొట్టగా.. సెనెగల్ జట్టులో సాదియో మానె (11వ), మౌసా వేగ్ (71వ) స్కోర్ చేశారు. ఈ మ్యాచ్‌లో ఏ జట్టు గెలిచినా నాకౌట్‌కు అర్హత సాధించేదే. కానీ డ్రా కావడంతో గ్రూప్ ఆసక్తికరంగా మారింది. అన్ని జట్లూ నాకౌట్ రేసులో ఉన్నాయి. రెండు మ్యాచ్‌ల నుంచి జపాన్, సెనెగల్‌లు చెరో నాలుగు పాయింట్లు సాధించాయి. తమ తొలి మ్యాచ్‌ల్లో అనూహ్యంగా ఓడిన కొలంబియా, పోలెండ్ జట్ల మధ్య ఆదివారం రాత్రి మ్యాచ్ ఉంది.

64 గళ్ల ప్రజ్ఞ

12 ఏళ్లు.. పిల్లలు బుద్ధిగా పాఠశాలకు వెళ్లే వయసు.. అమ్మ పెట్టింది తిని.. నాన్న చెప్పింది విని.. హాయిగా గడిపేసే సమయం! కానీ ఆ చిన్న బుర్ర మాత్రం అందరిలా ఖాళీగా ఉండలేదు. చిన్నప్పుడే పెద్ద పెద్ద లెక్కలు వేసేసింది. ఎత్తులకు పై ఎత్తులు ఆలోచించింది. ఆ పిల్లాడిని ఆటలో మేటిగా తయారు చేసింది. 12 ఏళ్ల వయసులో గ్రాండ్‌మాస్టర్ హోదా సంపాదించిన ప్రజ్ఞానంద గురించే ఇదంతా..!

ఈనాడు క్రీడావిభాగం

తల్లితో ప్రజ్ఞానంద

గ్రెండైన్ ఓపెన్ చెస్ టోర్నీలో మూడో గ్రాండ్‌మాస్టర్ నార్మ్ సాధించి.. 12 ఏళ్ల 10 నెలల వయసులో గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు ప్రజ్ఞ. ప్రపంచంలో జీఎం హోదా సాధించిన రెండో పిన్న వయస్కుడిగా.. భారత్ తరపున ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా అతను అరుదైన రికార్డులు నెలకొల్పాడు. భారత చెస్ మేటి విశ్వనాథన్ ఆనంద్‌కు సైతం ఈ ఘనత దక్కలేదు. అతను మూడో నార్మ్ సాధించే సమయానికి వయసు 18 ఏళ్లు. ప్రజ్ఞానంద వయసులో అతను కనీసం ఇంటర్నేషనల్ మాస్టర్ కూడా కాలేదు.

తమిళనాడుకు చెందిన ప్రజ్ఞది మధ్య తరగతి కుటుంబం. నాన్న రమేశ్‌బాబుకు చిన్నప్పుడే పోలియో సోకింది. కానీ ఎంతో కష్టపడి చదువుకుని బ్యాంకులో ఉద్యోగం సంపాదించగలిగాడు. సీఏ చేయాలనుకున్న అతని కోరిక మాత్రం తీరలేదు. తన పిల్లల కలలను అయినా నెరవేర్చాలనేది ఆయన పట్టుదల. అందుకే ప్రజ్ఞతో పాటు అతని సోదరి వైశాలిని వారికి ఇష్టమైన చెస్‌లో ఎదిగేలా ప్రోత్సహించాడు. నిజానికి ఆరంభంలో వైశాలి మాత్రమే చెస్‌లోకి వెళ్లింది. కానీ అక్కను చూసి స్ఫూర్తి పొందిన ప్రజ్ఞ ఆటలోకి వచ్చాడు. అయితే ఒకే కుటుంబం నుంచి ఇద్దరు క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడం ఆ కుటుంబానికి చాలా కష్టం అయింది. ముఖ్యంగా ప్రజ్ఞ నాన్న తిరగలేని పరిస్థితి కావడంతో అమ్మ తోడుగా లేదా ఒంటరిగా వాళ్లే అన్ని టోర్నమెంట్లకు వెళ్లేవాళ్లు. చెస్‌లో మెరవడంతో ప్రజ్ఞ, వైశాలిలకు స్పాన్సర్ల అండ దొరికింది.

ఇద్దరు ప్రపంచ ఛాంపియన్లు: కోచ్ ఆర్‌బీ రమేశ్ శిక్షణలో చిన్న వయసులోనే ప్రజ్ఞ, వైశాలి రాటుదేలారు. వేగంగా గ్రహించే శక్తి.. ఎదుటివారి ఆటను బట్టి వ్యూహాలను మార్చుకునే నైపుణ్యం ఉండడంతో వారు త్వరగా ఎదిగారు. అండర్-8, 10లో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో ప్రజ్ఞ విజేతగా నిలిస్తే.. అతని అక్క వైశాలి అండర్-12, 14 టోర్నీలో టైటిళ్లు సాధించింది. ఒకవైపు కోచ్ రమేశ్ అనుభవం, అక్క రూపంలో ఇంట్లోనే ప్రాక్టీస్ కోసం మంచి భాగస్వామి అందుబాటులో ఉండడంతో ప్రజ్ఞానందకు ఎంతో మేలు చేసింది. వెళ్లిన ప్రతి టోర్నీలోనూ మెరుగైన ఆటను ప్రదర్శించడంతో అతని ఆటెంతో మెరుగైంది. 2016లో 10 ఏళ్ల 19 రోజుల వయసులో పిన్న వయసులోనే ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ గెలిచిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు ఈ చెన్నై బాలుడు. గతేడాది ప్రపంచ జూనియర్ చెస్ టోర్నీలో తొలి గ్రాండ్‌మాస్టర్ నార్మ్ సాధించిన ప్రజ్ఞ.. ఈ ఏప్రిల్‌లో గ్రీస్‌లో జరిగిన ఫిషర్ స్మారక టోర్నీలో రెండో నార్మ్ సొంతం చేసుకున్నాడు. తాజాగా మూడో నార్మ్ సంపాదించడంతో పాటు 2500 ఎలో రేటింగ్ సాధించి గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. పిన్న వయసులోనే గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన అరుదైన జాబితాలో సెర్గి కర్జాకిన్ (ఉక్రెయిన్, 12 సంవత్సరాల 7 నెలలు) ప్రజ్ఞానంద కన్నా ముందున్నాడు. గతేడాది కర్జాకిన్ రికార్డును బద్దలు కొట్టే అవకాశం ప్రజ్ఞకు కొద్దిలో తప్పింది. 13 ఏళ్లకే గ్రాండ్‌మాస్టర్ అయి సంచలనం సృష్టించిన ప్రజ్ఞ.. ముస్ముందు మరిన్ని రికార్డులు సృష్టించడం ఖాయమని కోచ్ రమేశ్ ధీమా వ్యక్తం చేశాడు.

కేన్ హ్యాట్రిక్

● నాకౌట్‌కు ఇంగ్లాండ్
● పనామా చిత్తు చిత్తు

నిజ్నీ నొవ్‌గొరోడ్ (రష్యా): ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ జోరు కొనసాగించింది. వరుసగా రెండో విజయంతో నాకౌట్‌కు దూసుకెళ్లింది. గోల్స్ మోత మోగించిన ఆ జట్టు 6-1తో పనామాను చిత్తు చిత్తుగా ఓడించింది. కెప్టెన్ హ్యారీ కేన్ హ్యాట్రిక్‌తో మెరిశాడు. ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌కు ఇదే అతి పెద్ద విజయం. కేన్ (22వ-పెనాల్టీ, 45+1-పెనాల్టీ, 62వ) మూడు గోల్స్ చేయగా.. స్టోన్స్ (8వ, 40వ) రెండు గోల్స్ కొట్టాడు. లింగార్డ్ (36వ) ఓ గోల్ చేశాడు. ఇంగ్లాండ్ తొలి అర్ధభాగంలోనే ఐదు గోల్స్ సాధించడం విశేషం. పనామా తరపున నమోదైన ఏకైక గోల్‌ను బలాయ్ 78వ నిమిషంలో సాధించాడు. ప్రపంచకప్‌లో ఆ జట్టుకు ఇదే తొలి గోల్. ఇంగ్లాండ్ విజయంతో గ్రూప్-జి ఫలితం తేలిపోయింది. బెల్జియంతోపాటు ఇంగ్లాండ్ ముందంజ వేయగా.. టునీషియా, పనామా నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించాయి. బెల్జియం, ఇంగ్లాండ్ గురువారం గ్రూపులో అగ్రస్థానం కోసం పోటీపడనున్నాయి. 2010 తర్వాత ఇంగ్లాండ్ నాకౌట్‌కు అర్హత సాధించడం ఇదే తొలిసారి.



కేన్

ఇంగ్లాండ్ 6	పనామా 1
కేన్ (22వ, 45+1వ, 62వ) స్టోన్స్ (8వ, 40వ) లింగార్డ్ (36వ)	బలాయ్ (78వ)

అర్జెంటీనాకు ఉన్న కష్టాలు చాలవని..



రోషినో: ఒక డ్రా.. ఒక పరాజయంతో నాకౌట్ అవకాశాల్ని ప్రమాదంలో పడేసుకుంది అర్జెంటీనా. ఇప్పుడా జట్టు చివరి మ్యాచ్‌లో నైజీరియాపై ఘనవిజయం సాధించాలి. అదే సమయంలో గ్రూప్-డిలో జరిగే మరో మ్యాచ్‌లో క్రొయేషియా చేతిలో ఐస్‌లాండ్ ఓడిపోవాలి, లేదా ఆ మ్యాచ్ డ్రా కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో అర్జెంటీనాకు ఒక చేదు వార్త! ఐస్‌లాండ్‌తో మ్యాచ్‌కు క్రొయేషియా తమ జట్టులోని కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిస్తోందట. క్రొయేషియా జట్టులో ఇప్పటికే ఆరుగురు ఆటగాళ్లు ఎల్లో కార్డు అందుకున్నారు. వీరిలో ఎవరికైనా మరో ఎల్లో కార్డు ఎదురైతే నాకౌట్‌కు దూరమవుతారు. గ్రూప్ దశలో ఒక్క ఎల్లో కార్డే అందుకుంటే.. అది నాకౌట్ నుంచి వర్తించదు. నాకౌట్‌లో ఎల్లో కార్డు అందుకుంటే అదే మొదటిదవుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎల్లో కార్డు అందుకున్న కీలక ఆటగాళ్లను ఐస్‌లాండ్‌తో మ్యాచ్‌కు దూరం పెడుతున్నాడు ఆ జట్టు కోచ్. ఇది ప్రత్యర్థికి కలిసొచ్చే అంశమే.

ఆ అభిమాని చనిపోయాడు: ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో క్రొయేషియా చేతిలో అర్జెంటీనా పరాభవాన్ని తట్టుకోలేక ఇల్లు వదిలి వెళ్లిపోయిన కేరళ అభిమాని దిను అలెక్స్ ప్రాణాలు కోల్పోయాడు. కొట్టాయంలోని ఒక చెరువు నుంచి 30 ఏళ్ల అలెక్స్ మృతదేహాన్ని ఆదివారం వెలికి తీశారు. అర్జెంటీనా ఓటమితో తీవ్రంగా కలత చెందిన అలెక్స్.. శుక్రవారం తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు లేఖ రాసి పెట్టి ఇల్లు వదిలి వెళ్లిపోయాడు.

బట్లర్ అద్భుత శతకం

ఉత్కంఠ పోరులో ఇంగ్లాండ్ గెలుపు

బట్లర్

మాంచెస్టర్: ఆస్ట్రేలియాతో ఐదు వన్డేల సిరీస్‌ను ఇంగ్లాండ్ 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన చివరి వన్డేలో ఆ జట్టు ఒక వికెట్ తేడాతో నెగ్గింది. 206 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆ జట్టు 48.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మొదట మొయిన్ అలీ (4/46), కురన్ (2/44)ల ధాటికి ఆస్ట్రేలియా 34.4 ఓవర్లలో 205 పరుగులకే ఆలౌటైంది. హెడ్ (56), కేరీ (44), షార్ట్ (47 నాటౌట్) మినహా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. అనంతరం స్టాన్‌లేక్ (3/35), రిచర్డ్‌సన్ (3/51) విజృంభించడంతో ఇంగ్లాండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఐతే 114/8తో ఓటమి అంచున నిలిచిన జట్టుకు బట్లర్ (110 నాటౌట్; 122 బంతుల్లో 12×4, 1×6) అద్భుత ఇన్నింగ్స్‌తో విజయాన్నందించాడు. రషీద్ (20) అతడికి సహకరించాడు.

సురేఖ జోడీకి కాంస్యం

సాల్ట్ లేక్ సిటీ (యుఎస్ఏ): తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో మెరిసింది. యుఎస్‌ఏలో జరుగుతున్న మూడో దశ ఆర్చరీ ప్రపంచకప్ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మతో జతకట్టిన సురేఖ కాంస్యం దక్కించుకుంది. ఆదివారం కాంస్య పతాక పోరులో సురేఖ- అభిషేక్ జోడీ 147-140 తేడాతో జేమివాన్- క్రిస్ చాఫ్ (యుఎస్ఏ) జంటపై నెగ్గింది. మరోవైపు పురుషుల సింగిల్స్ కాంపౌండ్ విభాగంలో అభిషేక్ వర్మ రజతం గెలుచుకున్నాడు. ఫైనల్లో అభిషేక్ 123-140తో ప్రపంచ ఛాంపియన్ హన్‌సెన్ (డెన్మార్క్) చేతిలో పరాజయం పాలయ్యాడు. రికర్వ్ మహిళల సింగిల్స్‌లో దీపిక కుమారి ఫైనల్ చేరింది.

అర్జెంటీనాకు భారత్ షాక్

బ్రెడా (నెదర్లాండ్స్): ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు హవా కొనసాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1తో ఒలింపిక్ ఛాంపియన్ అర్జెంటీనాకు షాకిచ్చింది. టోర్నీలో వరుసగా రెండో విజయం సాధించింది. భారత్ తరపున హర్మన్‌ప్రీత్ సింగ్ (17వ), మన్‌దీప్ సింగ్ (28వ) చెరో గోల్ కొట్టారు. ప్రపంచ నంబర్-2 అర్జెంటీనా తరపున నమోదైన ఏకైక గోల్‌ను గాంజాలో పీలట్ సాధించాడు. 300వ మ్యాచ్‌లో బరిలోకి దిగిన సర్దార్ సింగ్ మిడ్‌ఫీల్డ్‌లో చక్కని ప్రదర్శన చేశాడు. టోర్నీలో తన తొలి మ్యాచ్‌లో భారత్ 4-0తో పాకిస్థాన్‌పై గెలిచిన సంగతి తెలిసిందే. భారత్ తాజా విజయంతో ఆరు పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

ఫెదరర్‌కు కొరిచ్ చెక్



కొరిచ్

హాలె: ప్రపంచ నంబర్‌వన్ రోజర్ ఫెదరర్‌కు షాక్! స్విస్ దిగ్గజం జోరుకు చెక్ పెడుతూ క్రొయేషియా కుర్రాడు బోర్నా కొరిచ్ హాలె ఓపెన్‌ను ఎగరేసుకుపోయాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో కొరిచ్ 7-6 (6), 3-6, 6-2తో రోజర్‌ను ఓడించాడు. ఈ పరాజయంతో ఫెదరర్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంకును రఫెల్ నాదల్‌కు కోల్పోనున్నాడు.

భారత్‌తో మ్యాచ్‌లో ఫిక్సింగ్ చేయమన్నారు



కరాచి: 2015 వన్డే ప్రపంచకప్ సందర్భంగా భారత్‌తో మ్యాచ్‌లో స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడాలని తనను బుకీలు సంప్రదించినట్లు పాకిస్థాన్ క్రికెటర్ ఉమర్ అక్మల్ వెల్లడించాడు. "2015 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌లో వరుసగా రెండు బంతులు ఆడకుండా వదిలేస్తే బుకీలు దాదాపు రూ.1.3 కోట్లు ఇస్తామన్నారు. టోర్నీలో భారత్‌తో అదే మా మొదటి మ్యాచ్. అంతకుముందు కూడా అలాంటి ఆఫర్లు వచ్చాయి. కానీ వాటిని తిరస్కరించా. మరోసారి ఇలాంటి ఉద్దేశాలతో నా దగ్గరకు రావద్దని వాళ్లకు గట్టిగా చెప్పా" అని అక్మల్ చెప్పాడు. ఆ మ్యాచ్‌లో కోహ్లి (107) సెంచరీ చేయడంతో భారత్ గెలిచింది.

మధుమేహ నియంత్రణకు క్షయ టీకా!



బోస్టన్: క్షయ నివారణ టీకాతో మధుమేహానికి కూడా అడ్డుకట్ట వేయొచ్చునని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. ఎలుకల్లో మధుమేహ నియంత్రణకు ఈ టీకా అద్భుతంగా పనిచేసిందని.. త్వరలో మానవులపై కీలక ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నామని వారు వెల్లడించారు. సాధారణంగా 'బాసిల్లస్ కాల్మెట్టె-గ్వెరిన్(బీసీజీ)' టీకాను క్షయ నివారణకు ఉపయోగిస్తారు. మూత్రాశయ క్యాన్సర్ వ్యాధి చికిత్సలోనూ వినియోగిస్తుంటారు. అయితే, మధుమేహకారక టీ-కణాలను(ఒకరకం తెల్లరక్తకణాలు) నాశనం చేయగల సామర్థ్యం కూడా బీసీజీకి ఉందని మసాచుసెట్స్ జనరల్ ఆస్పత్రి(ఎంజీహెచ్) పరిశోధకుల బృందం గుర్తించింది. స్వల్పస్థాయిలో ఇన్సులిన్ ఉత్పత్తినీ ఈ ఔషధం ప్రేరేపిస్తున్నట్లు నిర్ధారించింది. మానవులపై బీసీజీతో ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ(ఎఫ్‌డీఏ) అనుమతులు మంజూరు చేసింది.

ఎంజైమ్‌తో వైరస్‌ల వృద్ధికి అడ్డుకట్ట

వాషింగ్టన్: మానవ శరీరంలో వైరస్‌లు తమ సంఖ్యను వృద్ధి చేసుకోకుండా నిలువరించగల అద్భుత సామర్థ్యమున్న సమ్మేళనాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. వైరస్‌లను నిరోధించగల మెరుగైన ఔషధాల తయారీకి తాజా ఆవిష్కరణ దోహదపడే అవకాశముంది. మానవులు, ఇతర క్షీరదాల్లో 'వైపరిన్' అనే ఎంజైమ్ సహజసిద్ధంగా ఉంటుంది. 'డీడీహెచ్ సీటీపీ' అనే కీలక అణువుల ఉత్పత్తికి ఈ ఎంజైమ్ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. వైరస్‌ల కళ్లుగప్పి వాటి జన్యురాశిలోకి 'డీడీహెచ్‌సీటీపీ' ప్రవేశిస్తుందని.. జన్యు సమాచార ప్రతిరూపాలను తయారుచేసుకొని అవి సంతానానికి అందించుకోకుండా నివారిస్తుందని అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. దీంతో వైరస్‌ల సంఖ్య పెరుగుదలకు అడ్డుకట్ట పడుతుందని వెల్లడించారు. వైపరిన్ విడుదలను ప్రేరేపించే ఔషధాలను అభివృద్ధి చేయడంపై తాము ప్రస్తుతం దృష్టిసారించినట్లు తెలిపారు.

తాగే ఎలక్ట్రానిక్ సెన్సర్లతో వ్యాధుల పర్యవేక్షణ!

లండన్: లక్షలాది ఎలక్ట్రానిక్ సెన్సర్లతో కూడిన ద్రావణాన్ని రోగులకు తాగించి.. వారిలో వ్యాధుల తీవ్రతను వైద్యులు తెలుసుకునే వినూత్న విధానం త్వరలో అందుబాటులోకి రానుంది. ఇందుకోసం రక్తకణాల పరిమాణంలో ఉండే ఎలక్ట్రానిక్ వలయాలను బ్రిటన్‌లోని ఇంపీరియల్ కాలేజ్ లండన్, ఫ్రాన్స్‌లోని ఎకోల్ పాలీటెక్నిక్ ఫెడరల్ డి లాసన్నే(ఈపీఎఫ్ఎల్) పరిశోధకులు సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ సూక్ష్మ సెన్సర్లపై మూడు ఎలక్ట్రోడ్‌లు ఉంటాయి. బ్యాక్టీరియా లేదా ఎర్రరక్తకణాలుగా శరీరాన్ని నమ్మించేందుకు వీలుగా వాటిపై ప్రత్యేక పూత పూస్తారు. సూదిమందుల రూపంలో రక్తప్రవాహంలోకి ప్రవేశించే సెన్సర్లు.. నేరుగా జబ్బుపడ్డ అవయవాన్ని చేరుకుంటాయి. అక్కడే స్థిరపడి.. రోగులు వేసుకునే ఔషధాలకు తగినట్లుగా ప్రతిచర్యలను కలుగజేస్తాయి. తీగలరహిత శక్తిమార్పిడి వ్యవస్థతో సంబంధిత సమాచారాన్ని సేకరిస్తారు. ఫలితంగా వ్యాధి తీవ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వీలవుతుంది. శరీరం వెలుపల ఉండే విద్యుదయస్కాంత క్షేత్రం ద్వారా సెన్సర్లను ప్రేరేపిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రధానంగా ఈ విధానంలో క్యాన్సర్ కణితుల తీవ్రతను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని చెప్పారు. చికిత్స అనంతరం సెన్సర్లను సులభంగానే శరీరం నుంచి బయటకు పంపొచ్చునని వెల్లడించారు.

నీరు, చమురు, ఆల్కహాల్..

అన్ని ద్రవాలనూ వికర్షించే పూత అందుబాటులోకి!

వాషింగ్టన్: ఎలాంటి ఉపరితలంపైనే వేయగలిగేందుకు వీలుగా ఉండి.. నీరు, చమురు, ఆల్కహాల్‌లను వికర్షించే సామర్థ్యమున్న సరికొత్త రసాయనిక పూతను శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. అమెరికాలోని మిషిగన్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ఆచార్యుడిగా పనిచేస్తున్న భారత సంతతి శాస్త్రవేత్త అనీశ్ టుటేజా కూడా ఈ ఆవిష్కరణలో పాలుపంచుకున్నారు. తాము సృష్టించిన పూత దాదాపు అన్ని రకాల ద్రవాలను వికర్షిస్తుందని అనీశ్ తెలిపారు. వాతావరణ మార్పుల నుంచి సెన్సర్లు, రాడార్లు, యాంటెనాలను రక్షించేందుకు ఉపయోగపడుతుందని వెల్లడించారు. ప్రయాణంలో నౌకలపై ఘర్షణ ప్రభావాన్ని తగ్గించడం ద్వారా.. ఇంధన అవసరాలను కూడా తగ్గిస్తుందని వివరించారు. వచ్చే రెండేళ్లలో ఈ పూతను విపణిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంచెక్కా కట్టేద్దాం!



ప్రపంచంలోని పలు నగరాల్లో చెక్కతో ఆకాశ హర్మ్యాల నిర్మాణం

మన పూర్వీకులు చెక్కను ఉపయోగించి ఇళ్లు కట్టేవారు. శతాబ్దాలుగా అవి కాలపరీక్షకు తట్టుకుని నిలబడ్డాయి. లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ హాల్, చైనా ఫర్‌బిడన్ సిటీలోని భవన పైకప్పులు దీనికి ఉదాహరణలు. కాలగమనంలో స్టీలు, కాంక్రీటు రంగ ప్రవేశంచేసి.. భవన నిర్మాణాల స్వరూపాన్ని సమూలంగా మార్చేశాయి. ఇప్పుడు ఏ ఊళ్లో చూసినా కాంక్రీటు కుప్పల్లాంటి భవంతులే. నిర్మాణ రంగంలో ఇదో విప్లవమైనప్పటికీ... దీనివల్ల పర్యావరణానికి కలిగే నష్టాలు ఎన్నెన్నో!! ఇప్పుడు మళ్లీ పాత రోజులు పునరావృతం అవుతున్నాయి. కాంక్రీటు భవంతుల స్థానే.. చెక్కతో ఆకాశహర్మ్యాలను నిర్మించడం సరికొత్త పోకడగా మారింది. ప్రపంచంలోని అనేక నగరాల్లో ఇలాంటి భవంతులు వెలుస్తున్నాయి. జపాన్, అమెరికా, ఐరోపాలోని పలు దేశాల్లో ఒకట్రెండు అంతస్తుల ఇళ్లను చెక్కతో నిర్మించడం పరిపాటి. అక్కడి శీతల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఎక్కువమంది ఇలాంటి ఇళ్లలోనే నివసిస్తున్నారు కూడా. కానీ 10 నుంచి 80 అంతస్తులదాకా ఆకాశహర్మ్యాల్ని అచ్చంగా చెక్కతోనే నిర్మిస్తుండడం ఇప్పుడు నయా పోకడ. ఊతం కోసం నిర్మాణంలో అత్యంత స్వల్పంగానే స్టీలును వాడుతున్నారు. అత్యున్నత ప్రమాణాలతో, సుదీర్ఘకాలం మనగలిగేలా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వీటిని నిర్మిస్తున్నారు. అగ్ని ప్రమాదాల్ని తట్టుకునేలా, వర్షపునీరు, మంచుకు పాడవకుండా కొన్ని రకాల రసాయనాలు, జిగురును వాడుతున్నారు.

నష్టాలూ ఉన్నాయి

- చెక్కతో భవనాల నిర్మాణం లాభదాయకం కాదని, ఖర్చుతో కూడుకున్న పని అనేది స్థిరాస్తి రంగ నిపుణుల వాదన.
- అడవులు ఎక్కువగా ఉన్న, చౌకగా చెక్క లభ్యమయ్యే దేశాల్లో ఈ భవంతుల నిర్మాణం సులువేమో కానీ... భారత్‌తో పాటు దక్షిణాసియా దేశాలు, గల్ఫ్, ఆఫ్రికాలోని ఎడారి ప్రాంత దేశాల్లో ఇలా అచ్చంగా చెక్కతోనే భవంతుల్ని నిర్మించడం ఆచరణ సాధ్యంకాదు. ఇక్కడ అంత విరివిగా చెక్క లభ్యం కాదు.
- అగ్ని ప్రమాదాలు, చెదలు లాంటి వాటిని తట్టుకునేలా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని, రసాయనాలు, గ్లూను వినియోగించి వీటిని నిర్మించాల్సి ఉంటుంది కాబట్టి ఖర్చు పెరుగుతుంది.
- భవంతుల నిర్మాణం కోసం విపరీతంగా చెట్లను నరికివేయడం పర్యావరణ హితం కాదనేది పర్యావరణ వేత్తల వాదన.

స్టాక్‌హోమ్ (స్వీడన్)

భవంతి పేరు: ట్రాటోపెన్
20 అంతస్తులు, 436 అడుగులు
నిర్మాణం పూర్తయ్యేది – 2023లో
ఇందులో ఎక్కువగా క్రాస్ లామినేటెడ్ టింబర్(సీఎల్‌టీ)ని వాడుతున్నారు

చెక్కతో ఎందుకు నిర్మిస్తున్నారు?



- చెక్క భవనాలు పర్యావరణ అనుకూలం.
- నిర్మాణానికి వాడిన చెక్కను తిరిగి ఉపయోగించొచ్చు.
- చెక్క గోడలు శబ్దాల్ని తగ్గిస్తాయి.
- భూకంపాలు సంభవించినపుడు నష్టం తక్కువగా ఉంటుంది.
- అతి వేడి, అతి శీతల వాతావరణాల నుంచి మనుషుల్ని చెక్క గోడలు కాపాడతాయి.
- చెక్క ఆధార నిర్మాణ సామగ్రి తయారీకి తక్కువ ఇంధన శక్తి అవసరమవుతుంది.
- చెక్క భవంతులు చూడటానికి ఎంతో అందంగా కనిపిస్తాయి.
- వాతావరణ మార్పులకు కార్బన్ డై ఆక్సైడ్ తోడ్పడకుండా చెక్క భవంతులు సహకరిస్తాయి.
- గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను అరికట్టడానికి దోహదం.
- వేరొకచోట ఇంటి నమూనాను తయారుచేసి నిర్మించాల్సిన చోటికి తరలించొచ్చు.
- బలానికి బలమూ ఉంటుంది, బరువూ ఉండదు. వృథా తక్కువ.
- ఈ కంప్యూటర్ల యుగంలో పేపర్ తయారీకి కలపను ఎక్కువగా వాడరు కాబట్టి.. దానిని భవంతుల నిర్మాణానికి వాడొచ్చనేది నిపుణుల విశ్లేషణ.

చెక్క ఆకాశహర్మ్యాలు ఎక్కడెక్కడ నిర్మాణం?

వాంకోవర్ (కెనడా)

భవంతి పేరు: యూబీసీ బ్రోక్ కామన్స్
18 అంతస్తులు, 173 అడుగులు
నిర్మాణం పూర్తయినది: 2017
క్రాస్ లామినేటెడ్ టింబర్(సీఎల్‌టీ)ని ఈ భవన నిర్మాణానికి వాడారు. ఇది స్టీలు అంతటి బలమైనది. 80% తేలికైనది. అగ్ని ప్రమాదాల్ని తట్టుకునేలా చెక్కపై పాలియురేథేన్ గ్లూను వాడారు.

స్కెల్లెఫ్టియా (స్వీడన్)

భవంతి పేరు: కుల్తుర్‌హూషి
19 అంతస్తులు, 249 అడుగులు
నిర్మాణం పూర్తి చేసేది: 2019లో

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)

భవంతి పేరు: ఫోర్ట్ అపార్ట్‌మెంట్స్
10 అంతస్తులు, 104 అడుగులు
నిర్మాణం పూర్తయినది: 2012
గ్లూతో లామినేట్ చేసిన చెక్క(గ్లూలామ్)ను కాలమ్‌లకు వాడారు.

బెర్గన్ (నార్వే)

భవంతి పేరు: హ్యాట్
19 అంతస్తులు, 105 అడుగులు
నిర్మాణం పూర్తయినది- 2014

బెర్గెన్ (నార్వే)



భవంతి పేరు: ట్రీట్
14 అంతస్తులు, 105 అడుగులు
నిర్మాణం పూర్తయినది: 2014

లండన్ (బ్రిటన్)



భవంతి పేరు: స్ప్లింటర్
80 అంతస్తులు, 985 అడుగులు
నిర్మాణం పూర్తయ్యేది- నిర్దిష్టంగా తెలియదు

- ఈనాడు ప్రత్యేక విభాగం

నేలపై కూర్చొని చదువుకునే విద్యార్థుల కోసం ఓ అంకుర సంస్థ సరికొత్త ఆవిష్కరణతో ముందుకు వచ్చింది. బల్లలు, కుర్చీలు లాంటి మౌలిక సదుపాయాలులేని పాఠశాలల పాలిట ఇది వరంలా మారే అవకాశముంది. "డెస్కిట్"గా పిలుస్తున్న ఈ ఆవిష్కరణ.. కొత్తతరం పుస్తకాల సంచికి ప్రతిరూపం. కేవలం కేజీ బరువుండే ఈ సంచికి వెనుకవైపు ఓ చిన్న బల్ల అనుసంధానమై ఉంటుంది. దీనిపై పుస్తకాలు పెట్టుకొని రాసుకోవచ్చు. అవసరంలేనప్పుడు ఎంచక్కా దీన్ని ముడిచేసుకోవచ్చు. దీంతో ఇది అచ్చమైన పుస్తకాల సంచిలా మారిపోతుంది.

ఇంటి అద్దె పెంపునకు నిబంధనలేమిటి?

- సమాచార కమిషన్‌ను ఆశ్రయించిన ప్రధాని బంధువు

దిల్లీ: ప్రధాని బంధువునని చెప్పుకొనే 90 ఏళ్ల వృద్ధురాలు దహీబెన్ నరోత్తమ్‌దాస్ మోదీ తన సమస్య పరిష్కారం కోసం ప్రధాన సమాచార కమిషనర్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. మోదీ స్వస్థలమైన వాద్‌నగర్ (గుజరాత్‌లోని మెహసానా జిల్లా)లో ఉన్న తన ఇంటిని ఆమె బీడీ కార్మికుల సంక్షేమ నిధి ఆధ్వర్యంలో నిర్వహించే ఆరోగ్య కేంద్రానికి అద్దెకు ఇచ్చారు. అద్దె నిర్ణయించడానికి అనుసరించే విధానాలు ఏమిటో తెలపాలంటూ ఆమె సంబంధిత అధికారులను అడిగినా సంతృప్తికరమైన సమాధానం ఇవ్వకపోవడంతో కేంద్ర సమాచార కమిషనర్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది.

కథువా బాధితురాలికి మితిమీరి మత్తుమందు

- కోమాలోకి జారిపోయిన బాలిక
- ఫోరెన్సిక్ నిపుణుల నివేదిక

జమ్మూ/ దిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కథువా అత్యాచార, హత్య ఘటనలో బాధిత బాలికకు నిందితులు చాలా అధిక మోతాదులో మత్తు మందు ఇచ్చారని ఫోరెన్సిక్ నిపుణులు పేర్కొన్నారు. దీనివల్ల ఆ చిన్నారి కోమాలోకి జారిపోయి ఉంటుందని పేర్కొన్నారు.

8 ఏళ్ల వయసున్న ఈ చిన్నారిని ఈ ఏడాది జనవరి 10న జమ్మూకశ్మీర్‌లోని కథువాలో అపహరించిన నిందితులు ఆమెకు మత్తుమందు ఇచ్చి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ సంగతి తెలిసిందే. అదే 14న ఆమెను హత్యచేశారు. ఈ కేసులో 8 మందిని అరెస్టుచేశారు. స్థానికంగా దొరికే మన్నార్ అనే మత్తు మందు, మరో రకం మాత్రల ప్రభావాన్ని పరిశీలించేందుకు పోలీసులు ఈ నెల మొదట్లో మృతురాలి అంతర్ అవయవాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. తనపై పాశవిక దాడి జరుగుతున్నప్పుడు ఆ చిన్నారి అరవకుండా ఎలా ఉంటుందన్న నిందితుల తరఫు న్యాయవాదుల ప్రశ్న నేపథ్యంలో వారు ఈ చర్యను చేపట్టారు. దీనిపై ఇటీవలే వైద్య నిపుణుల నుంచి నివేదిక వచ్చింది. అందులోని అంశాల ప్రకారం..

- బాధితురాలికి ఇచ్చిన మందులో క్లోనాజెపామ్ లవణం ఉంది. దాన్ని రోగి వయస్సు, బరువును దృష్టిలో ఉంచుకొని వైద్య పర్యవేక్షణలో మాత్రమే ఇవ్వాలి.
- బాధితురాలి బరువు 30 కిలోలుగా ఉందనుకుంటే.. చికిత్స కోసమైతే రోజుకు 0.1 నుంచి 0.2 మిల్లీగ్రాముల చొప్పున ఇవ్వాలి. అది కూడా మూడు విడతల్లో ఇవ్వాలి.
- మొదట్లో ఆమెకు బలవంతంగా క్లోనాజెపామ్ 0.5 మిల్లీగ్రాముల మాత్రలను ఐదింటిని ఇచ్చారు. ఆ తర్వాత కూడా మరిన్ని మాత్రలను ఇచ్చారు.
- మితిమీరిన డోసు వల్ల మగత, అయోమయం, చేతల్లో సమన్వయం లేకపోవడం, మెల్లగా స్పందించడం, శ్వాస నెమ్మదించడం, కోమాలోకి జారిపోవడం, అంతిమంగా మరణం చోటుచేసుకుంటాయి.
- ఈ మందుతోపాటు 'మన్నార్'ను ఇవ్వడం వల్ల తలెత్తే ప్రభావంపై విశ్లేషించడం కష్టమని నిపుణులు పేర్కొన్నారు.

ఒకే ఇంట్లో 132 నాగుపాములు, పిల్లలు

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: ఒకే ఇంట్లో 132 నాగుపాములు, పిల్లలు.. వింటేనే ఒళ్లు గగుర్పొడిచే సంఘటన ఒడిశా రాష్ట్రంలో వెలుగుచూసింది. భద్రక్ జిల్లా ధామ్‌నగర్ సమితి పయికోసాహి గ్రామంలో బిజయ్ భుయ్యా ఇంట్లో ఈ పాములను స్నేక్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు పట్టుకున్నారు. ఐదారేళ్లుగా ఇంట్లో నాగుపాము కన్పిస్తోందని, దాన్ని పూజిస్తున్నామని భుయ్యా చెబుతున్నారు. 21వ తేదీ రాత్రి ఇంట్లో చిన్నారులకు రెండు పాము పిల్లలు కన్పించాయి. వాటిని తండ్రికి చూపించారు. అవి ఇంట్లోని ఓ రంధ్రంలో దూరడంతో భుయ్యా అందులో ఫినాయిల్ పోశాడు. దీంతో నాలుగైదు పాము పిల్లలు బయటకు వచ్చాయి. భయపడిన కుటుంబీకులు రాత్రి పక్కింట్లో పడుకున్నారు. ఉదయం స్నేక్ హెల్ప్‌లైన్ ప్రతినిధి షేక్ మీర్జాకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చారు. మట్టి ఇల్లు కావడంతో పలుచోట్ల పడిన రంధ్రాలను పరిశీలించగా మరిన్ని నాగుపాము పిల్లలు, గుడ్లు కన్పించాయి. పాములు పట్టేవారిని రప్పించి తవ్వితీస్తుంటే గుట్టలుగుట్టలుగా రాసాగాయి. శనివారం రాత్రికి 120 పాములు, పాము పిల్లలు, 25 గుడ్లు కనిపించాయి. ఆదివారం ఉదయానికి మొత్తం 132 పాములు బయటపడ్డాయి. దీనిపై అటవీ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. పాములను చూసేందుకు భుయ్యా ఇంటి వద్ద స్థానికులు బారులుదీరారు.

బిజయ్ భుయ్యా ఇంట్లో కనిపించిన పాములు, పాము పిల్లలు

సుప్రీం న్యాయమూర్తులకు కొత్త రోస్టర్

- 2 నుంచి అమల్లోకి..

దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఎవరెవరు ఏయే తరహా కేసుల్ని విచారణకు చేపట్టాలో తెలిపే కొత్త రోస్టర్ జులై 2 నుంచి అమల్లోకి రానుంది. వేసవి సెలవుల అనంతరం ఆ రోజు నుంచి కేసుల విచారణ మొదలవుతుంది. జస్టిస్ చలమేశ్వర్ రెండ్రోజుల క్రితం పదవీ విరమణ చేయడంతో కొత్త రోస్టర్‌ని రూపొందించారు.

- ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, సామాజిక న్యాయం, ఎన్నికలు, హెబియస్ కార్పస్, నాయస్థాన ధిక్కరణ కేసుల్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలిస్తుంది.
- కార్మిక చట్టాలు, పరోక్ష పన్నులు, పర్సనల్ లా, కంపెనీ లా కేసుల్ని జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం చూస్తుంది.
- సర్వీసు విషయాలు, సామాజిక న్యాయం, వైయక్తిక చట్టాలు, భూసేకరణ, గనులు-ఖనిజాలు, వినియోగదారుల పరిరక్షణ, సాయుధ బలగాలు/ పారా మిలిటరీ బలగాల కేసుల్ని జస్టిస్ మదన్ బి లోకుర్ ధర్మాసనం చూస్తుంది. పర్యావరణ సమతౌల్యం, అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణ, చెట్ల నరికివేత, భూగర్భ జల మట్టాల సంబంధిత కేసుల్ని కూడా ఇదే ధర్మాసనం విచారిస్తుంది.
- కార్మిక చట్టాలు, అద్దె నియంత్రణ చట్టం, కుటుంబ చట్టాలు, న్యాయస్థాన ధిక్కరణ, వైయక్తిక చట్టాల కేసుల్ని జస్టిస్ కురియన్ జోసెఫ్ ధర్మాసనం చేపడుతుంది. మతపరమైన, ధార్మిక వ్యవహారాలు, కౌలు చట్టాలు, భూ సంబంధిత చట్టాలతో ముడిపడిన అన్నిరకాల కేసుల్ని ఇదే ధర్మాసనం పరిశీలిస్తుంది.
- ప్రత్యక్ష/ పరోక్ష పన్నులు, ఎన్నికలు-నేర వ్యవహారాలు, వైయక్తిక చట్టం, న్యాయస్థాన ధిక్కరణ, సాధారణ సివిల్ కేసులు, న్యాయాధికారుల నియామకాలతో ముడిపడిన కేసుల్ని కొలీజియంలో కొత్త సభ్యుడు కాబోతున్న జస్టిస్ సిక్రి ధర్మాసనం చూస్తుంది.
- ఈ ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులు కాకుండా మిగిలిన ఆరుగురు న్యాయమూర్తులు ఏయే తరహా కేసుల్ని విచారిస్తారో కొత్త రోస్టర్లో పేర్కొన్నారు.

కేసుల్ని ధర్మాసనాలకు కేటాయించడంలో సీజేఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఈ ఏడాది జనవరి 12న నలుగురు న్యాయమూర్తులు విలేకరుల సమావేశంలో ఆరోపించిన మీదట తొలిసారిగా ఫిబ్రవరి ఒకటో తేదీన కొత్త రోస్టర్‌ను బహిర్గతం చేశారు. మళ్లీ ఇప్పుడు రెండోసారి రోస్టర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

ఇద్దరి పేర్లను రెండోసారి తిప్పి పంపిన కేంద్రం

ఇద్దరు సీనియర్ న్యాయవాదుల్ని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించడానికి సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సును కేంద్ర ప్రభుత్వం రెండోసారి తిప్పి పంపింది. వారిద్దరిపైనా ఫిర్యాదులున్నాయంటూ రెండున్నరేళ్లుగా ప్రభుత్వం ఆ సిఫార్సును పక్కన పెట్టింది. ఎట్టకేలకు గత నెలలో ఒక నిర్ణయానికి వచ్చి, వారి పేర్లను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. అయితే- వారిపై వచ్చిన ఫిర్యాదుల్లో పస లేదంటూ కొలీజియం మళ్లీ ప్రభుత్వామోదానికి ఇవే పేర్లను సిఫార్సు చేసింది. ప్రభుత్వం తన వైఖరిని పునరుద్ఘాటించింది. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పదవీ విరమణతో ఖాళీ అయిన కొలీజియం స్థానాన్ని భర్తీ చేశాక అయిదుగురు సభ్యులూ కలిసి దీనిపై ఏం చేయాలనేది నిర్ణయిస్తారు. ఇద్దరు న్యాయవాదుల్లో ఒకరైన మహమ్మద్ మన్సూర్... సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, దివంగత జస్టిస్ సాఘిర్ అహ్మద్ కుమారుడు. రెండో వ్యక్తి బషారత్ అలీఖాన్. ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ఉన్నప్పుడు కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై నియమించిన కార్యాచరణ బృందానికి జస్టిస్ అహ్మద్ నేతృత్వం వహించారు. ఇదిలా ఉండగా- నజీర్ అహ్మద్ బేగ్ అనే న్యాయవాదిని జమ్ముకశ్మీర్ హైకోర్టులో న్యాయమూర్తిగా నియమించాలన్న సిఫార్సునూ తిరస్కరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి కారణమేమిటో వెంటనే తెలియరాలేదు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00



ఈనాడు

విజయవాడ 26-6-2018 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 317

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

అరుణోదయం

అమెరికా దిగువ సభకు తెలుగు మహిళ!

ఏడేళ్ల వయసులో హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లిన ఓ తెలుగమ్మాయి... ఇప్పుడు అక్కడి చట్టసభలోనూ కాలుపెట్టనుంది! ఆమే 53 ఏళ్ల అరుణా మిల్లర్. వాషింగ్టన్ డీసీలోని 'మేరీలాండ్'.. నుంచి అరుణ ప్రతినిధుల సభకు బరిలో ఉన్నారు. మంగళవారం జరిగే ప్రాథమిక ఎంపికలో ఆమె గెలుపు ఖాయమని ఆమె మద్దతుదారులు అంటున్నారు. 2లో

మృత్యువుకి ఆటో ఇటో!

- ప్రయాణికుల ప్రాణాలు బలిగొంటున్న ఆటోలు
- ఆకారంలో చిన్నవైనా ఘోరాలకు హేతువులు
- ఏటా 800 మందిని పొట్టన పెట్టుకుంటున్న వైనం
- కేసులు పెట్టినా తీరు మారని డ్రైవర్లు

ఆటోరిక్షాలు చూడటానికి చిన్న వాహనాలే కానీ పెద్ద ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఏటా సుమారు 800 మందికి పైగా ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, నిబంధనలను ఉల్లంఘించి ఆటో స్వరూపాన్నే మార్చేస్తుండటం. .కనీసం వాహనం నడిపేందుకు తగినంత వెసులుబాటు లేని విధంగా డ్రైవర్ పక్కనే ప్రయాణికులను కూర్చోబెట్టుకోవడం, వ్యతిరేక దిశలో వాహనాలు నడపటం వంటివి దీనికి కారణమవుతున్నాయి. తాజాగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లె సమీపంలో జరిగిన ఆటో ప్రమాదమూ ఇలాంటి నిర్లక్ష్యాల మూలంగా చోటుచేసుకున్నదే. అందుకే ప్రమాదం చిన్నదైనా...ప్రాణనష్టం భారీగా ఉంటోంది. 11లో

ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయంటే!

- ఆటోడ్రైవర్ తన సీటుకు పక్కన ప్రయాణికులను కూర్చొబెట్టుకోరాదు. ఇలా చేయడం వల్ల వాహనం హ్యాండిల్ సరిగ్గా తిప్పడానికి వీలు కాదు. ఎదురుగా వచ్చే వాహనాలు కానీ, రోడ్డు కానీ సరిగ్గా కనిపించదు. ఇది ప్రమాదాలకు దారితీస్తోంది.
- ఆటోల నిర్మాణం నగరాలు, పట్టణాల పరిధిలో అంతర్గతంగా తిరిగేందుకు వీలుగానే ఉంటుంది. దూరప్రాంత ప్రయాణికులకు, అతివేగంతో నడిపేందుకు అనుకూలంగా వీటి నిర్మాణం ఉండదు. కానీ అత్యధిక శాతం ఆటోలు దూరప్రాంతాలకూ ప్రయాణికులను తీసుకెళ్తున్నాయి.
- జాతీయ రహదారులపై ఆటోలను తిప్పడం నిషిద్ధం. కానీ పరిమితికి మించిన వేగంతోనూ, జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారులపై వ్యతిరేక దిశలోనూ నడిపేస్తున్నారు.
- ఆటోల్లో లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి పాటలు వింటూ కూడా నడుపుతున్నారు.

54 వేల కేసులు

రాష్ట్రంలోని ఆటోల్లో అత్యధిక శాతం ఉల్లంఘనలకు పాల్పడేవే. అయితే వాటిని తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్న తీరు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 23వ తేదీ మధ్య రవాణా శాఖ 53,497 కేసులు నమోదు చేసింది. వాస్తవంగా చూస్తే అంతకు అనేక రెట్లు ఉల్లంఘనలు ఉంటాయి.

అనంతపురం జిల్లాలో డ్రైవర్ పక్కనే ప్రయాణికులు

కెనడాయానం

భారతీయ విద్యార్థులకు తీపి కబురు

ఉన్నత విద్యాభ్యాసం కోసం కెనడా వెళ్లాలనుకునే భారతీయులకు శుభవార్త! మన దేశ విద్యార్థులకు లబ్ధి చేకూరేలా వీసా జారీ ప్రక్రియలో కెనడా ప్రభుత్వం మార్పులు చేపట్టింది. నూతన విధానంలో వీసా పరిశీలన(ప్రాసెసింగ్) సమయం గణనీయంగా తగ్గనుంది. దీనిద్వారా చైనా, భారత్, వియత్నాం, ఫిలిప్పీన్స్ విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. 2లో

అమెరికా వరం

మన నిపుణులకు మంచి రోజులు!

"అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా ఆవిష్కరించేవారే మాకు కావాలి. మాపై దండెత్తడానికి వచ్చేవారికి (అక్రమ వలసదారులకు) ఇక చోటివ్వలేం" అంటూ ట్రంప్ చేసిన ట్వీట్లు గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయులకు తీపికబురు అందించాయి. అవి భారతీయ నిపుణులకు అనుకూలంగా ఉన్నాయని విశ్లేషకులంటున్నారు. 2లో

10 వేల కోట్లివ్వండి

పోలవరంపై కేంద్ర మంత్రి గడ్కరీకి చంద్రబాబు లేఖ

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 2013-14 ధరల ప్రకారం సవరించిన అంచనాలు ఆమోదించే లోగా తక్షణం రూ.10వేల కోట్లు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక లేఖ రాశారు. '2010-11 అంచనాల ప్రకారం ఇంకా రూ.431.27 కోట్లు, ఇప్పటికే రాష్ట్రం ఖర్చు చేసిన మొత్తంలో రూ.1504.14 కోట్లు (మొత్తం రూ.1935.41 కోట్లు) రావాలి. ఈ నిధులన్నీ తక్షణం అందించే ఏర్పాటు చేయాలి...' అని ఆయన కోరారు.

- పోలవరంలో ఇప్పటికే 55శాతం పనులు పూర్తయ్యాయి. 2010-11 అంచనా వ్యయంలోని రూ.16010.45 కోట్లకు నాటి నుంచి ఇప్పటివరకూ మొత్తం రూ.13,978.54 కోట్లు ఖర్చు చేశాం. 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాజెక్టుపై రాష్ట్రం రూ.8662.67 కోట్లు (2018 మే నెలాఖరు వరకు) ఖర్చు చేయగా.. కేంద్రం రూ.6727.26 కోట్లు మాత్రమే తిరిగి చెల్లించింది. ఇంకా రూ.1935.41 కోట్లు ఇవ్వాల్సి ఉంది.
- 1.4.2014 నాటికి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమయ్యే నీటిపారుదల వ్యయమంతా (మిగతా 2లో)

సోమవారం విజయవాడలో గ్రామ రెవెన్యూ సహాయకుల ఆత్మీయ అభినందన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న ఉద్యోగ నేతలు

ముప్పేట ఉక్కు ఉద్యమం

- కడప దీక్షకు మద్దతుగా మూడురోజుల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- మంగళవారం నియోజకవర్గ కేంద్రాల్లో మోటారు సైకిల్ ర్యాలీలు
- బుధవారం జిల్లా కేంద్రాల్లో దీక్షలు, కేంద్ర కార్యాలయాలవద్ద నిరసనలు
- గురువారం దిల్లీలో ఎంపీల ధర్నా
- చంద్రబాబు పిలుపు 2లో
- జగన్, జనార్దన్‌రెడ్డిల కోసమే కేంద్రం తాత్సారం చేస్తోందని ధ్వజం

రాష్ట్రానికి ఫ్లెక్స్‌ట్రానిక్స్!

- రూ.585 కోట్ల పెట్టుబడులు
- 6,600 మందికి ఉద్యోగావకాశాలు
- నేడు ముఖ్యమంత్రి, ఐటీ మంత్రితో సంస్థ ప్రతినిధుల భేటీ

ఈనాడు, అమరావతి: ప్రపంచంలోని ఐదు అతి పెద్ద ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో ఒకటైన 'ఫ్లెక్స్‌ట్రానిక్స్' రాష్ట్రానికి రానుంది. రూ.585 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. సుమారు 30 దేశాల్లో 2 లక్షలకు పైగా ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ రాకతో రాష్ట్రంలోనూ 6,600 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. సంస్థ ప్రతినిధులు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, సమాచార, సాంకేతిక(ఐటీ) మంత్రి లోకేశ్‌తో సమావేశం కానున్నారు. అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖతో రాష్ట్రంలో పెట్టుబడులపై ఒప్పందం చేసుకోనున్నారు. సంస్థ ప్రతినిధులతో (మిగతా 2లో)

ఖాళీ స్థలాలపై కీలక నిర్ణయం

- 50 శాతానికి రుసుముల తగ్గింపు
- పారిశ్రామిక అనుమతులపై మరింత సరళీకృత విధానం
- మొత్తం రుసుములపై మరో 25 శాతం రాయితీ

ఈనాడు, అమరావతి: పరిశ్రమల ఏర్పాటుకు వినియోగించే ఖాళీ స్థలాలపై రుసుముల భారాన్ని 50 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఇప్పటికే పరిశ్రమలు, వాణిజ్యశాఖ.. రాయితీలు, అనుమతుల పరంగా అనేక సరళీకరణ విధానాలు తీసుకొచ్చింది. ఈ క్రమంలో కొత్తగా పరిశ్రమలు స్థాపించే సంస్థలు/వ్యక్తులు నగరపాలక/పురపాలక/నగరాభివృద్ధి సంస్థల నుంచి తీసుకునే అనుమతులపై ప్రత్యేకించి ఖాళీ స్థలాల(ఓపెన్ స్పేస్ ఛార్జీలు)పై విధించే 14% రుసుములు భారమవుతున్నాయని పరిశ్రమల, వాణిజ్యశాఖ కమిషనర్ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామికాభివృద్ధి దృష్ట్యా ఈ మేరకు సవరణలు చేయాలన్న ప్రతిపాదనలను పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఆమోదించింది. సవరించిన (మిగతా 2లో)

చిల్లర మోత

- సవరణ పేరుతో ఛార్జీలు పెంచిన ఆర్టీసీ
- రూ.11 ఉంటే 15
- పరోక్షంగా ప్రయాణికులపై అదనపు బాదుడు
- ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌లలో..
- త్వరలో పల్లెవెలుగుల్లో..

ఈనాడు, అమరావతి: చిల్లర డబ్బుల సమస్యకు పరిష్కారం పేరుతో ప్రయాణికులపై ఆర్టీసీ అదనపు భారం మోపుతోంది. ఛార్జీల భారం మోపడం లేదని పైకి చెబుతూనే పరోక్షంగా బాదుతోంది. టిక్కెట్టు తీసుకునేటప్పుడు చిల్లర డబ్బుల సమస్య ఏర్పడుతోందని.. ధరలను తదుపరి రూ.5కు సవరించింది. ఈ నెల 22వ తేదీ నుంచి ఆ ధరలను అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఇటీవల వరకూ కనీస టిక్కెట్టు ధర రూ.11 ఉండగా...ప్రస్తుతం అది రూ.15కు, డీలక్స్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ.17గా ఉన్న కనీస టిక్కెట్టు రూ.20కు పెరిగింది. దీంతో ఒక స్టేజీ దూరం ప్రయాణించినా సరే.. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో రూ.4, డీలక్స్, ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో రూ.3 అదనంగా ప్రయాణికులు చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో దాదాపు 36 శాతం, డీలక్స్, ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ తదితర సర్వీసుల్లో 17 శాతం మేర కనీస టిక్కెట్టు ధర పెరిగింది. ఇలా ప్రయాణికులపై రోజుకు సుమారు రూ.68 లక్షల మేర అదనపు భారం పడుతోంది. నెలకు (మిగతా 2లో)

ఓటర్ల జాతర

- రాష్ట్రంలోని పంచాయతీల్లో 2,54,30,292 మంది
- అగ్రస్థానం మహిళలదే
- తూర్పుగోదావరిలో అత్యధికం
- రెండు, మూడు స్థానాల్లో గుంటూరు, పశ్చిమగోదావరి

ఈనాడు, అమరావతి: ఈ నెల 15న కలెక్టర్లు వెల్లడించిన తుది జాబితాల ప్రకారం రాష్ట్రంలోని 12,918 పంచాయతీల్లో ఓటర్ల సంఖ్య 2,54,30,292. వీరిలో పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఉన్నారు. పురుషులు 1,26,49,167, మహిళలు 1,27,79,758, ఇతరులు 1367గా నిర్ధారించారు. అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలో 30.02 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. రెండో స్థానంలో గుంటూరు, మూడో స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నాయి. ఆగస్టుతో సర్పంచిల పదవీకాలం ముగియనుండటంతో తదుపరి ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో కలెక్టర్లు జిల్లాల వారీగా పంచాయతీ ఓటర్ల తుది జాబితాలను ప్రకటించారు. హడావుడిగా చేసిన ఈ ప్రక్రియతో అత్యధిక జిల్లాల్లో ఓటర్ల జాబితాలు తప్పులు దొర్లాయి. ఒకరికి బదులు మరొకరు ఫొటో ఉండటం, పేర్లు తప్పుగా రావడం, మృతి చెందిన, శాశ్వతంగా గ్రామాలు విడిచి వెళ్లిన వారికి ఓటు హక్కు (మిగతా 2లో)

నేటితో 43 ఏళ్లు

ఎమర్జెన్సీ చీకట్ల వెనుక ఆ ఐదేంటి?

14లో

ఇదీ సంగతి!

అక్రమంగా అమెరికాకు వచ్చేవారి పట్ల తను ఎంత కఠినంగా, దృఢంగా ఉంటాడో తెలియచెప్పటానికట!

ఉద్యోగాల్లో వసూళ్ల పర్వం

- సర్వశిక్షా అభియాన్ పొరుగుసేవల నియామకాల్లో రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల చొప్పున వసూళ్లు
- నిరుద్యోగులను దండుకుంటున్న దళారులు

ఈనాడు - అమరావతి

సర్వశిక్షా అభియాన్‌లో పొరుగు సేవల ద్వారా భర్తీ చేస్తున్న పోస్టులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగుల నుంచి పోటీ తీవ్రంగా ఉండడంతో కొందరు దళారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. డిమాండ్‌ను అనుసరించి రూ.1.5లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేస్తున్నారు. సర్వశిక్షా అభియాన్.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కొనసాగే ప్రాజెక్టు కావడంతో ఒకసారి ఉద్యోగం వస్తే ఎలాంటి ఇబ్బంది (మిగతా 2లో)

ముందుగానే ఒప్పందాలు

- గుంటూరు జిల్లాలోని దుర్గి మండలంలో కొంత మంది నిరుద్యోగుల నుంచి రూ.50వేలు చొప్పున ముందుస్తుగా తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. కొంతమంది నుంచి అడ్వాన్సుగా కొంతమొత్తం తీసుకున్నట్లు ఈ జిల్లాలో ఆరోపణలున్నాయి. దీంట్లో సర్వశిక్షా అభియాన్‌లోని కొందరు సిబ్బందికి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.
- కర్నూలు జిల్లాలో రిజర్వేషన్ రోస్టర్‌ను ప్రకటించలేదు. ఇక్కడ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలంటే ఆ సంస్థ గుంటూరు జిల్లాలోని చిరునామా ఇచ్చింది. దీంతో కొందరు రిజిస్టర్ పోస్టులో పంపుతుండగా.. మరికొందరు నేరుగా వెళ్లి దరఖాస్తులు ఇస్తున్నారు. నిరుద్యోగులు ఎవరైనా సర్వశిక్షా అభియాన్ కార్యాలయానికి వచ్చినా తమకేమి సంబంధంలేదని, పొరుగుసేవల సంస్థనే సంప్రదించాలని అధికారులు చెప్పుతుండడంతో కొందరు నేరుగా గుంటూరు వెళ్తున్నారు. ఇక్కడ ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులతో ముందుస్తుగానే ఒప్పందాలు చేసుకున్నారనే ప్రచారం సాగుతోంది. పోస్టులకు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.
- ప్రకాశం జిల్లాలో సీఆర్పీ పోస్టులకు డిమాండ్ అధికంగా ఉంది. భౌతికశాస్త్రం, గణితం సీఆర్పీ పోస్టులకు రూ.1.5లక్షలు అడుగుతున్నారని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. కొందరు రాజకీయనాయకులు కొన్ని పోస్టులకు సిఫార్సులు చేసినట్లు ప్రచారం సాగుతోంది.
- శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేక అధికారులు, క్షేత్రస్థాయి(సైట్) ఇంజినీర్లు, సీఆర్టీలకు డిమాండ్ అధికంగా ఉంది. నిరుద్యోగుల నుంచి వస్తున్న పోటీకి అనుగుణంగా ఇక్కడి ముందస్తు ఒప్పందాలు సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

ముంబయిలో బహుళ అంతస్తుల భవనం పక్కనే కుంగిన నేల

కుంగిన ముంబయి

- మహానగరాన్ని ముంచెత్తిన వాన 16లో
- వేర్వేరు ఘటనల్లో నలుగురు మృత్యువాత

సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన ఆత్మీయ అభినందన సభలో.. సంఘీభావం ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, బొప్పరాజు వెంకటేశ్వర్లు, పెద్దన్న, గోపాలరావు, అశోక్‌బాబు, మంత్రి దేవినేని ఉమా. భారీగా హాజరైన గ్రామరెవెన్యూ సహాయకులు

ముప్పేట ఉక్కు ఉద్యమం

ఈనాడు, అమరావతి: కడప ఉక్కు పరిశ్రమ కోసం సీఎం రమేశ్, బీటెక్ రవి దీక్షలకు మద్దతుగా మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు, బుధవారం జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల దగ్గర నిరసనలు, ధర్నాలు చేయాలని చెప్పారు. తెదేపా ఎంపీలు గురువారం దిల్లీలో ధర్నా చేస్తారని తెలిపారు. కడప ఉక్కు దీక్షపై సోమవారం ఆయన ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ బాధ్యులు, నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అయిదు కోట్ల ఆంధ్రులు ఈ దీక్షకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. గాలి జనార్దన్‌రెడ్డి, జగన్‌లకు లబ్ధి చేకూర్చేందుకే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రం తాత్సారం చేస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. జనార్దన్‌రెడ్డితో ఉక్కు పరిశ్రమ పెట్టించేటట్లయితే.. చట్టంలో పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సెయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని చట్టంలో ఉందని గుర్తు చేశారు. 'సీఎం రమేష్, బీటెక్ రవి ఆరు రోజులుగా ఉక్కు దీక్ష చేస్తున్నారు. వారికి మద్దతుగా స్వచ్ఛందంగా ప్రజలు వస్తున్నారు. తెదేపా పోరాటానికి మద్దతిస్తున్నారు. ఆందోళన చేస్తున్న వారందరికీ అభినందనలు. రాష్ట్రాభివృద్ధికి రాజీలేని పోరాటం చేద్దాం. తెదేపా నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పని చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి...' అని చంద్రబాబు పేర్కొన్నారు.

కడప ఉక్కు-రాయలసీమ హక్కు

'1960 దశకంలో విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదం ప్రతి ధ్వనించింది. ఆంధ్రుల పోరాట తీవ్రతకు కేంద్రం దిగి వచ్చి విశాఖలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పింది. అదే స్ఫూర్తితో ఇప్పుడు 'కడప ఉక్కు-రాయలసీమ హక్కు' నినాదంతో పోరాడుదాం. ఈ నినాదం దేశం మొత్తం ప్రతి ధ్వనించాలి. ప్రతి ఒక్కరూ దీనిలో భాగస్వాములు కావాలి. కేంద్రం దిగి వచ్చేదాకా కలసి కట్టుగా పోరాడాలి. దీనిని అడ్డుకున్నవాళ్లే ఇప్పుడు దీక్షపై విమర్శలు చేస్తున్నారు. కేంద్రం రోజుకో మాట చెబుతోంది. ఇస్తామని ఒకసారి.. . ఇవ్వడం లేదని ఒకసారి... పరిశీలిస్తున్నామని మరోసారి చెబుతూ ఊసరవెల్లి రాజకీయాలు చేస్తోంది. ఆరుసార్లు నిర్వహించిన టాస్క్‌ఫోర్సు సమావేశాల్లో అడిగిన వాటికల్లా జవాబులిచ్చాం. గనులు రిజర్వు చేశాం. రైల్వే ట్రాక్ వేస్తామన్నాం. విద్యుత్తు నీళ్లు, ప్రోత్సాహకాలు ఇస్తామన్నాం. మెకాన్ కమిటీ దీనికి అనుకూలంగా నివేదిక ఇచ్చింది. అయినా సుప్రీంకోర్టులో వ్యతిరేకంగా కేంద్రం అఫిడవిట్ వేసింది. కేంద్రానికి అనేక లేఖలు రాశాం. పార్లమెంటులో ప్రస్తావించాం. ప్రధానిని, కేంద్ర మంత్రులను కలసి విజ్ఞప్తి చేశాం. కేంద్రంలోని భాజపా నేతలు మొండిగా వ్యవహరిస్తున్నారు. తక్కువ వడ్డీకి అప్పు తెచ్చి బుల్లెట్ ట్రైన్ నిర్మించడంపై శ్రద్ధ చూపిస్తున్న కేంద్రం... కడప ఉక్కు కర్మాగారం విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తుందో చెప్పాలి. విశాఖ రైల్వేజోన్, పెట్రోలియం కాంప్లెక్స్ కూడా సాధించాలి. విభజన చట్టంలోని 19 అంశాలు అమలు చేయాల్సిందే.

జగన్, గాలి ఆస్తులు ఎందుకు వేలం వేయడం లేదు?

'అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకున్నాం. న్యాయస్థానం పర్యవేక్షణలో వేలం వేస్తున్నాం. బాధితులకు న్యాయం చేస్తున్నాం. ఆ చిత్తశుద్ధి కేంద్రంలో ఎందుకు లోపించింది? గాలి జనార్దన్‌రెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆస్తులను ఎందుకు వేలం వేయడం లేదు? లూటీ చేసిన ప్రజాధనాన్ని ప్రజల కోసం ఎందుకు వినియోగించడం లేదు? భాజపా, వైకాపా, జనసేన కుట్ర రాజకీయాల్ని ఎండగట్టాలి. తెలుగుదేశం పార్టీని దెబ్బ తీయడం, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే ఈ పార్టీల అజెండా. భాజపా, వైకాపా కుట్రదారులైతే పవన్ పాత్రధారిగా మారారు. కేసుల మాఫీకి భాజపాతో కుమ్మక్కైన వైకాపా కేంద్రం, ప్రధానిని ఒక్క మాటా అనడం లేదు. జగన్ పాదయాత్ర, వైకాపా చేపట్టేవన్నీ మొక్కుబడి కార్యక్రమాలే. అందుకే ప్రజల్లో స్పందన లభించడం లేదు.

ప్రజలకు అండగా నిలవాలి

- గ్రామ రెవెన్యూ సహాయకుల ఆత్మీయ అభినందన సభలో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా నిలవాలని గ్రామ రెవెన్యూ సహాయకులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హితవు పలికారు. గౌరవవేతనాన్ని రూ.10,500లకు పెంచినందుకు కృతజ్ఞతగా గ్రామ రెవెన్యూ సహాయకులు విజయవాడలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఆయన మాట్లాడారు. "సన్మానం అక్కర్లేదు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తే అదే చాలు. ఇంకా వచ్చిన కొన్ని విజ్ఞప్తులను పరిశీలించి న్యాయం చేస్తాం. మట్టి ఖర్చులకు ఇకపై రూ.15,000ను ఇస్తాం. బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇస్తున్నాం. తెల్లకార్డులు రద్దుకాకుండా చూస్తున్నాం. మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది. త్వరలో విశాఖలో 25వేల ఇంటి జాగాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించబోతున్నాం..." అని ఆయన వివరించారు. ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించడం, ఆఫీస్-కమ్-రెసిడెన్సీ సౌకర్యం కల్పించడం వంటివి పరిశీలిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్జీఓ సంఘాధ్యక్షుడు అశోక్‌బాబు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ సేవకుల ఇతర డిమాండ్లను కూడా పరిష్కరించాలని, ఒప్పంద ఉద్యోగులకు తెల్లరేషన్ కార్డుల సౌకర్యాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సేవకులకు చెందిన మూడు సంఘాల ముఖ్యనేతలు కైకాల గోపాలరావు, పెద్దన్న ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గౌరవవేతనం, కరవు, రవాణా భత్యం, ఇతర వినతులను తీర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పరకాలను క్షోభకు గురిచేశారు

రాజకీయాలు దిగజారిపోతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 'ఎంతకి దిగజారిపోతున్నాయంటే రాష్ట్రానికి సలహాదారుగా ఉన్న పరకాల ప్రభాకర్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగారు. తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆయనను మానసిక క్షోభకు గురి చేశారు. ఇలాంటి వాటిని ఎప్పటికప్పుడు మనం ఖండించాలి...'అని వ్యాఖ్యానించారు.

10వేల కోట్లివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా కేంద్రమే భరిస్తుందని ఇప్పటికే ప్రకటించారు. రూ.57,940.86 కోట్లతో సవరించిన అంచనాలను కేంద్ర జలసంఘానికి సమర్పించాం. వారు అడిగిన సందేహాలకు సమాధానాలూ పంపాం. తక్షణమే ఇవి ఆమోదం పొందేలా చూడగలరు. భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు వేగంగా అమలు చేస్తున్నాం. పనులు వేగవంతం చేశాం. నిధులు సకాలంలో అందకపోతే అన్ని పనులకు ఇబ్బందులొస్తాయి.

ఆగస్టు 15 కల్లా ప్రాజెక్టుల టెండర్లు పూర్తి కావాలి

రాష్ట్రంలో కొత్తగా చేపట్టదలుచుకున్న ప్రాధాన్య ప్రాజెక్టుల టెండర్ల ప్రక్రియ మొత్తం ఆగస్టు 15 నాటికి పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. వంశధార రెండోభాగం, రెండోదశ పనుల్లో భాగంగా హిరమండలం జలాశయంలో 5 టీఎంసీల నీరు నిలబెట్టాలన్నారు. వివిధ ప్రాజెక్టుల పనుల పురోగతిని సీఎం సోమవారం సమీక్షించారు. దిగువ కాఫర్ డ్యాం జెట్ గ్రౌటింగు పనులు తక్షణం వేగవంతం చేసి జులై 9 నాటికి పూర్తి చేయాలని చెప్పారు. పునరావాసం, భూసేకరణకు రూ.219.25 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు చెప్పగా తూర్పుగోదావరి జిల్లాలో పునరావాస పనులు వేగవంతం చేయాలని అక్కడి కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. పెదపాలెం, చినసేన, పులకుర్తి, అవుకు టన్నెల్, పులికనుమ ఎత్తిపోతల పథకాలు తదితరాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, జులై 15 నాటికి కొండవీటి వాగు ఎత్తిపోతల పనులు పూర్తవుతాయని, జులై31 నాటికి కుప్పం కాలువ నుంచి నీటిని విడుదల చేసేందుకు సిద్ధమవుతుందని అధికారులు వివరించారు. గుండ్లకమ్మ పనులు తుది దశకు చేరాయని, ఆగస్టు 31 నాటికి వెలిగొండ హెడ్ రెగ్యులేటర్, నెల్లూరు- సంగం బ్యారేజి పనులు పూర్తవుతాయని చెప్పారు. జలవనరులశాఖకు 19 స్కోచ్ అవార్డులు దక్కడం అరుదైన ఘనతగా చంద్రబాబు అభివర్ణించారు. మంత్రి దేవినేని ఉమాను, అధికారులను అభినందించారు. నీటిపారుదల రంగంలో స్టేట్ ఆఫ్‌ది ఇయర్ కింద ప్లాటినం అవార్డుతో పాటు మరో 18 అవార్డులు సాధించడాన్ని ప్రశంసించారు. 54 ప్రాజెక్టుల పూర్తి, పంచనదుల మహాసంగమం, గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేద్దామని పేర్కొన్నారు. చర్చలో భాగంగా నిధులు విడుదలలో ఆలస్యం చేయడం లేదన్న భాజపా నేతల వ్యాఖ్యలను తప్పుబట్టారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, అధికారులు సాయిప్రసాద్, శశిభూషణ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బృందస్ఫూర్తితోనే 60 అవార్డులు

బృంద స్ఫూర్తి వల్లే ఆంధ్రప్రదేశ్ 60 అవార్డులు సాధించిందని, అద్భుత బృందం అనే పేరు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఈ అవార్డులు రాష్ట్ర ప్రజలకే అంకితమన్నారు. నీరు-ప్రగతి, వ్యవసాయాభివృద్ధిపై సోమవారం కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇతర రాష్ట్రాలకు సగటున 20 నుంచి 30 అవార్డులు మాత్రమే వచ్చాయన్నారు. గ్రామీణ, పట్టణాభివృద్ధి, జలవనరులు, ఐటీశాఖల్లో ఎక్కువ అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. వీటిని సాధించిన వారందరికీ త్వరలో సత్కారం చేస్తామన్నారు. 'పెళ్లికానుక ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయొద్దు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల్లో విత్తన పంపిణీ వేగవంతం చేయాలి. ఈ నెలాఖరులోగా రూ.300 కోట్ల ఉపాధి నిధులతో పనులు పూర్తి చేయాలి. వృక్షమిత్రలను ప్రోత్సహించాలి. ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు, పంటరుణాలు అందించాలి. సూక్ష్మపోషకాలు ఉచితంగా ఇవ్వాలి. సాగు విస్తీర్ణం 2కోట్ల ఎకరాలకు చేరాలి. ఉద్యాన సాగు కోటి ఎకరాలకు పెరగాలి...' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

రాష్ట్రానికి ఫ్లెక్స్‌ట్రానిక్స్!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి లోకేశ్ బెంగుళూరు, తిరుపతిలో ఇప్పటికే పలుసార్లు సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకున్న సానుకూలతలను వివరించారు. అవసరమైన సమాచారాన్ని అధికారులు అందించేలా ఏర్పాట్లు చేశారు. కంపెనీ రాకతో ప్రపంచంలో మరిన్ని అగ్రగామి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే జోరుగా...

ప్రపంచంలోనే పెద్ద కంపెనీల్లో ఒకటైన ఫాక్స్‌కాన్‌తోపాటు సెల్కాన్, కార్బన్, డిక్సన్ కంపెనీలు ఇప్పటికే రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించాయి. ఎలక్ట్రానిక్స్ రంగ అభివృద్ధికి ప్రత్యేకంగా తయారీ క్లస్టర్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. ఫాక్స్‌కాన్ కంపెనీలో సుమారు 14 వేల మంది మహిళలు పనిచేస్తున్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఈ ఏడాది విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రిలయన్స్ అంగీకరించిన విషయం తెలిసిందే. తిరుపతి విమానాశ్రయానికి సమీపంలో 150 ఎకరాల్లో రోజుకు 10లక్షల జియో ఫోన్లు, సెటాప్ బాక్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తయారు చేసే కంపెనీని రిలయన్స్ ఏర్పాటు చేయనుంది. దీనివల్ల ఒకేచోట 25 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అధికారులు తెలిపారు.

అమెరికా చట్టసభలో 'అరుణోదయం'!

వాషింగ్టన్: ఓ తెలుగు మహిళ... అమెరికా చట్టసభలో కాలుపెట్టనుంది! ఆమే 53 ఏళ్ల అరుణామిల్లర్. 1972లో ఇక్కడకు వచ్చి, సివిల్ ఇంజినీరుగా స్థిరపడ్డారామె. వాషింగ్టన్ రాష్ట్రం నుంచి ప్రతినిధులసభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)కు భారతీయ-అమెరికన్ మహిళగా ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం... అరుణకు తప్పకుండా దక్కుతుందన్న విశ్వాసం డెమొక్రటిక్ పార్టీ నేతల్లో తొణికిసలాడుతోంది. ఇంతకుముందు ప్రమీలా జయపాల్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. 'మేరీలాండ్'.. నుంచి అరుణ ప్రతినిధుల సభకు బరిలో ఉన్నారు. వ్యాపార దిగ్గజమైన తన ప్రత్యర్థి, సొంత పార్టీకి చెందిన డేవిడ్ ట్రోన్ ఇబ్బడి ముబ్బడిగా సొంతడబ్బు ఖర్చుచేస్తున్నా.. అరుణ మాత్రం మద్దతుదారులు ఇచ్చిన కొద్దిపాటి మొత్తంతో సాదాసీదాగా ప్రచారం చేసుకుపోతున్నారు. అయినా, రోజురోజుకు ఆమెకు మద్దతు పెరుగుతుండటం విశేషం. 2010లో హౌస్ ఆఫ్ డెలిగేట్స్‌కు ఎన్నికైన ఆమె.. తన ప్రతిభతో అందరి దృష్టినీ ఆకట్టుకున్నారు. ఇప్పుడిది ఆమెకు కలిసొచ్చే అంశం కానుంది. ఉత్కంఠభరితంగా మారిన ఈ పోటీపై- "10 మిలియన్ కోట్ల డాలర్ల మనిషి డేవిడ్‌ను అరుణ ఎదుర్కోగలరా?" అని ప్రముఖ పత్రిక వాషింగ్టన్ పోస్ట్ తాజా సంచికలో ప్రత్యేక కథనం ప్రచురించింది కూడా! దీంతో దేశవ్యాప్తంగా ఈ ఎన్నికపై ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నాయి.

2018-TETలో సోషల్ స్టేట్ 1st ర్యాంక్
2014 DSC-SGTలో జిల్లా 1st ర్యాంక్ సాధించిన సంస్థ
DSC SGT, SA (ALL) TPT, HPT
న్యూ బ్యాచ్: జూన్ 27న ప్రారంభం
విజయవాడ ప్రతిభ బందరురోడ్ 93 92 91 75 84

PAVAN KUMAR'S IAS
Group I & II (తెలుగు మీడియం)
జూన్ 27 నుండి ప్రారంభం
VIJAYAWADA Ph: 9966961027

EKALAVYA IAS ACADEMY
RANK ASSISTANCE Oriented Program
Degree+IAS, Prelims - cum - Mains
మీరు చేరబోయే సంస్థతో EKALAVYAను స్వయంగా సరిపోల్చుకొని మీ పిల్లల భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోండి.
Beside Nagarjuna Hospital, Kanuru, VJA, Ph:6300181832

చిల్లర మోత

(మొదటి పేజీ తరువాయి)

రూ.2.04 కోట్ల భారాన్ని వారు భరించాల్సి వస్తోంది. ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు సగటున 68 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోంది. వీరిలో 34 లక్షల మంది ప్రయాణికులు స్పెషల్ టైపు సర్వీసుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. చిల్లర సమస్యను అధిగమించడం కోసం టిక్కెట్టు ధరలు సవరిస్తున్నట్లు చెప్పిన ఆర్టీసీ. . ఛార్జీల పెంపుకే మొగ్గు చూపింది. ఉదాహరణకు రూ.41 టిక్కెట్టు ధర ఉంటే దాన్ని రూ.40కు సవరించవచ్చు. కానీ రూ.45కు పెంచింది. రూ.56 టిక్కెట్టు ధర ఉంటే దాన్ని రూ.55కు తగ్గించవచ్చు. కానీ దాన్ని రూ.60కు పెంచింది. ఇలా సగటున ఒక్కో ప్రయాణికుడిపై రోజుకు దాదాపు రూ.2 వరకూ అదనపు భారం పడుతోంది.

పెంపు ఇలా...

- విజయవాడ-ఏలూరు మధ్య ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసు టిక్కెట్టు ధర రూ.66 ఉండేది...ఇప్పుడు రూ.70కు పెరిగింది.
- విజయవాడ-గుంటూరు మధ్య రూ.36 టిక్కెట్టు ఉండేది. ..ఇది రూ.40కు పెరిగింది.
- శ్రీకాకుళం-విశాఖపట్నం మధ్య రూ.106 టిక్కెట్టు ఉండేది. ఇది రూ.110కు పెరిగింది.
- మిగతా రూట్లలోనూ ఇదే పరిస్థితి ఉంది.

పల్లెవెలుగుల ఛార్జీల సవరణకూ ప్రతిపాదన

పల్లెవెలుగు బస్సుల్లోనూ ఇదే తరహా సవరణను అమలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దాని ప్రకారం అయిదు కిలోమీటర్లకు టిక్కెట్టు ధర ప్రస్తుతం రూ.6 ఉండగా...అది రూ.5 కానుంది. కానీ 10 కి.మీ దూరానికి రూ.8గా ఉన్న టిక్కెట్టు ధర రూ.10కు పెరగనుంది. తగ్గించిన చోట రూపాయి తగ్గించగా, పెంచిన చోట రూ.2 నుంచి రూ.3 వరకూ పెంచనుంది. ఈ సవరణను జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఇదే జరిగితే ప్రయాణికులపైన మరింత భారం పడే అవకాశముంది.

ఖాళీ స్థలాలపై కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం ఇక నుంచి ఖాళీ స్థలంపై విధించే రుసుములో 50శాతం చెల్లిస్తే చాలు. లేనపుడు నిర్మాణ ప్రాంతం(ప్లాట్ ఏరియా)లో భవన నిర్మాణం చుట్టూ విడిచి పెట్టే స్థలం(సెట్‌బ్యాక్ స్పేస్) కాక అదనంగా మరో పది శాతం స్థలాన్ని మొక్కల పెంపకానికి పారిశ్రామిక సంస్థలు విడిచిపెట్టినా చాలని ప్రభుత్వం సూచించింది. పారిశ్రామిక అవసరాల కోసం అనుమతులు తీసుకొని తరువాత పారిశ్రామికేతర అవసరాల కోసం వినియోగించినట్లు తెలిస్తే 14 శాతం రుసుము చెల్లించాల్సి ఉంటుందని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ పేర్కొంది. అనుమతుల కోసం పురపాలక, నగరపాలక, నగరాభివృద్ధి సంస్థలకు చెల్లించే మొత్తం రుసుములపైనా 25శాతం రాయితీ ప్రకటించింది.

జులైలో దేశవ్యాప్తంగా సీపీఎం నిరసనలు!

దిల్లీ: త్రిపుర, పశ్చిమబెంగాల్‌లలో ప్రజాస్వామ్యం హత్యకు గురైందని ఆరోపిస్తూ...అందుకు నిరసనగా దేశవ్యాప్తంగా జులైలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఎం నిర్ణయించింది. త్రిపురలో లెఫ్ట్‌పార్టీ కార్యకర్తలపై జరిగిన దాడులను ఆదివారం నాడిక్కడ పరిసమాప్తమైన సీపీఎం కేంద్ర కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. త్రిపుర శాసనసభ ఎన్నికలప్పటి నుంచీ నలుగురు పార్టీ కార్యకర్తలు హత్యకు గురైనారంది. పార్టీ కార్యాలయాలు ధ్వంసమైనాయంది. దాడులు విపరీతమై పోవడంతో దాదాపు 5వందల మంది కార్యకర్తలు ఇళ్లు మారినట్లు సీపీఎం తెలిపింది.

ఉద్యోగాల్లో వసూళ్ల పర్వం

(మొదటి పేజీ తరువాయి)

ఉండదనే ఉద్దేశంతో కొందరు నిరుద్యోగులు డబ్బులు చెల్లించేందుకు వెనుకాడడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,379 ఖాళీలు ఉన్నట్లు సర్వశిక్షా అభియాన్ ప్రకటించింది. వీటి భర్తీని జిల్లాకో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. 13జిల్లాలకు కలిపి 12ఏజెన్సీలు పోస్టుల భర్తీని చేపడుతున్నాయి. వీటిల్లో క్షేత్రస్థాయి ఇంజినీర్లు, ప్రత్యేక అధికారులు, పాఠశాలల సముదాయాల పరిధిలోని సీఆర్పీలు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, వంటమనుషులు ఇలా 24విభాగాల్లో పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇంత పెద్దమొత్తంలో పొరుగుసేవల ద్వారా భర్తీ చేయడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి. నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, వీరిలో నుంచి ఒక్కో పోస్టుకు ఇద్దర్ని ఎంపిక చేయడమంతా పొరుగుసేవల ఏజెన్సీల ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా కమిటీలు ఉన్నా మౌఖిక పరీక్షలకు ఇద్దరు అభ్యర్థులను సరఫరా చేసేది మాత్రం ప్రైవేటు ఏజెన్సీనే. ఈ నేపథ్యంలో పోస్టులు ఇప్పిస్తామంటూ దళారులు భారీగా వసూళ్లకుపాల్పడుతున్నారు. దీనికితోడు కొన్ని జిల్లాల్లో రాజకీయ పైరవీలు సాగుతున్నాయి.

జిల్లాలవారీగా ఉన్న ఖాళీలు

జిల్లా	పోస్టులు
శ్రీకాకుళం	207
విజయనగరం	147
విశాఖపట్నం	242
తూర్పుగోదావరి	235
పశ్చిమగోదావరి	97
కృష్ణా	141
గుంటూరు	221
ప్రకాశం	76
నెల్లూరు	132
చిత్తూరు	483
కడప	105
అనంతపురం	117
కర్నూలు	176

కేసులు నమోదు చేయాలని చెప్పాం

పొరుగుసేవల ఉద్యోగాల భర్తీకి కలెక్టర్ అధ్యక్షతన జిల్లాల్లో కమిటీలు ఉన్నాయి. ఒక్కో పోస్టుకు ఇద్దర్ని పంపించాలని పొరుగుసేవల ఏజెన్సీలను ఆదేశించాం. ఈ ఇద్దరికి జిల్లా కమిటీ మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తుంది. వీరిలో అర్హులు లేకపోతే మరో ఇద్దరి ప్రైవేటు ఏజెన్సీ పంపిస్తుంది. ఎక్కడైనా డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి, అయా వ్యక్తులు, సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించాం. ప్రైవేటు ఏజెన్సీని బ్లాక్‌లిస్టులో పెడతాం.

– సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి జి.శ్రీనివాస్

ఓటర్ల జాతర

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం వంటివి చోటుచేసుకున్నాయి. శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికే ఇలాంటి అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి.

కలెక్టర్లు ప్రకటించిన తుది జాబితాల ప్రకారం వివిధ జిల్లాల్లో పంచాయతీ ఓటర్ల వివరాలివి. వీటిపై అధికారికంగా ప్రభుత్వం ప్రకటన చేయాల్సి ఉంది.

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కృష్ణా	10,40,340	10,53,334	112	20,93,786
విజయనగరం	6,84,551	6,96,157	63	13,80,771
విశాఖపట్నం	8,23,990	8,55,361	58	16,79,409
ప్రకాశం	10,00,192	10,00,142	53	20,00,387
చిత్తూరు	11,28,333	11,41,009	203	22,69,545
నెల్లూరు	7,53,550	7,74,543	168	15,28,261
పశ్చిమ గోదావరి	11,33,376	11,66,274	64	22,99,714
శ్రీకాకుళం	6,65,910	6,60,152	35	13,26,097
కడప	6,56,359	6,72,328	110	13,28,797
కర్నూలు	9,62,380	9,65,714	163	19,28,257
గుంటూరు	11,95,852	12,28,812	138	24,24,802
అనంతపురం	11,06,073	10,62,331	40	21,68,444
తూర్పు గోదావరి	14,98,261	15,03,601	160	30,02,022
మొత్తం	1,26,49,167	1,27,79,758	1367	2,54,30,292

నేడు, రేపు ఉత్తరకోస్తాలో భారీ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో నైరుతీ రుతుపవనాలు బలపడుతున్నాయి. వీటి ప్రభావంతో పలు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీగానూ, మరికొన్ని చోట్ల మోస్తరుగానూ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికీ నైరుతీ రుతుపవనాలు బలహీనంగానే ఉన్నాయి. సోమవారం పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మచిలీపట్నంలో 40.2, జంగమహేశ్వరపురంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పటివరకు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతూ వస్తోంది.

భారతీయ విద్యార్థులకు కెనడా తీపికబురు

టొరంటో: నాణ్యమైన విద్య కోసం అంతర్జాతీయ విద్యార్థులు తమ దేశానికి వచ్చేందుకు ప్రాధాన్యమిచ్చేలా తాజా వీసా నిబంధనలు రూపొందించినట్లు 'కెనడా వలస, శరణార్థులు, పౌరసత్వ సంస్థ(ఐఆర్‌సీసీ)' వెల్లడించింది. ఇందులో భాగంగా 'స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(సీడీఎస్)' పేరుతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. దీనిద్వారా చైనా, భారత్, వియత్నాం, ఫిలిప్పీన్స్ విద్యార్థులు ప్రయోజనం పొందనున్నట్లు వివరించింది. కెనడాలో విజయవంతంగా విద్యాభ్యాసం పూర్తిచేసుకునేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, భాషా నైపుణ్యాలు తమకు ఉన్నట్లు తగిన వివరణ ఇవ్వగలిగితే.. ఈ నాలుగు దేశాల విద్యార్థులకు త్వరితగతిన వీసాలు మంజూరు చేస్తామని పేర్కొంది. ఎస్‌డీఎస్ కింద వీసా దక్కించుకున్న విద్యార్థులు కెనడాలో శాశ్వత నివాసం, పౌరసత్వం లభించే అవకాశాలు కూడా మెరుగుపడతాయని వెల్లడించింది. ప్రస్తుతం కెనడాలో విద్యార్థి వీసాల పరిశీలనకు 60 రోజుల సమయం పడుతోంది. నూతన విధానం అమల్లోకి వస్తే.. ఈ వ్యవధి 45 రోజులకు తగ్గుతుందని అంచనా.

గ్రహం అనుగ్రహం

26–6–2018 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
త్రయోదశి: ఉ. 6-30 తదుపరి చతుర్దశి
అనూరాధ నక్షత్రం: ఉ. 7-53 తదుపరి జ్యేష్ఠ
అమృత ఘడియలు: రా. 12-14 నుంచి 1-57 వరకు
వర్జ్యం: మ. 1-54 నుంచి 3-37 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-08 నుంచి 9-00 వరకు
తిరిగి రా. 10-57 నుంచి 11-41 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5-31; సూర్యాస్తమయం: సా.6-34

మా వలస విధానం లోపభూయిష్టం

- అమెరికాను నిలబెట్టేవారిని ఎగతాళి చేస్తున్నట్టుంది
- దండెత్తడానికి వచ్చేవారిని తిప్పి పంపేస్తాం
- అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్లు

వాషింగ్టన్: అమెరికా వలస చట్టం లోపభూయిష్టంగా ఉందనీ... శాశ్వత పౌరసత్వం కోసం చట్టబద్ధంగా నిరీక్షిస్తున్నవారిని పరిహసించేదిలా తయారైందని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. తమపై దండెత్తడానికి వచ్చేవారికి చోటివ్వలేమనీ.. ఇలాంటి వారిని కోర్టులు, న్యాయమూర్తులతో పన్లేకుండా వచ్చినచోటుకే నేరుగా తిప్పి పంపేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం పలు ట్వీట్లు చేశారు.

మెక్సికో తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా వలస వచ్చేవారిని అరెస్టు చేస్తామనీ, వారి పిల్లలను స్వాధీనం చేసుకుంటామని గతనెల ట్రంప్ వెల్లడించారు. అప్పట్నుంచి వేలాది మంది చిన్నారులు తమ కుటుంబాలకు దూరమయ్యారు. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తం కావడంతో ట్రంప్ కాస్త వెనక్కి తగ్గారు. ఈ ప్రక్రియను నిలిపివేస్తూ, తమ ఆధీనంలో ఉన్న చిన్నారులను తిరిగి వారి కుటుంబాలకు చేర్చేలా ఇటీవల ఆదేశాలు ఇచ్చారు. గత బుధవారం నాటికి 522 మంది చిన్నారులను వారి కుటుంబాలకు చేర్చినట్లు హోంల్యాండ్ భద్రతా విభాగం సోమవారం వెల్లడించింది. ఇంకా 2,053 మంది మైనర్లు తమ ఆధీనంలో ఉన్నట్లు తెలిపింది.

ఆ ట్వీట్లు... భారతీయులకు స్వీట్లు?

ప్రస్తుత వలస విధానంతో ఎక్కువగా ఇబ్బంది ఎదుర్కొంటున్నది భారతీయ-అమెరికన్లే. వీరిలో చాలామంది ఆయా రంగాల్లో ఆరితేరిన నిపుణులు. ప్రస్తుత నిబంధనల ప్రకారం... ఏటా జారీచేసే శాశ్వత పౌరసత్వం/నివాసం (గ్రీన్‌కార్డు) కోటాలో ఒక దేశానికి 7% మాత్రమే వస్తాయి. దీంతో వేలాది మంది భారతీయులు అమెరికా గ్రీన్‌కార్డు కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇదే విధానం కొనసాగితే- 70 ఏళ్లు నిరీక్షించినా కొందరికి గ్రీన్‌కార్డు రాకపోవచ్చట! ఈ విధానాన్ని ట్రంప్ మొదట్నుంచీ వ్యతిరేకిస్తున్నారు. "అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా ఆవిష్కరించేవారే మాకు కావాలి. కానీ, ప్రస్తుత వలస చట్టం ఇలాంటి వారిని పరిహసించేదిగా తయారైంది. మాపై దండెత్తడానికి వచ్చేవారికి (అక్రమ వలసదారులకు) ఇక చోటివ్వలేం. విచారణ లేకుండానే వచ్చిన చోటుకు తిప్పి పంపేస్తాం" అని ఆయన తాజా ట్వీట్లలో స్పష్టం చేయడం విశేషం. కోటా విధానంతో తమకు ప్రయోజనంలేదనీ.. ప్రతిభ ఆధార (మెరిట్ బేస్డ్) వలస విధానం ఉండాలని ఆయన తన మనసులో మాటను మరోసారి బయటపెట్టారు. లోపభూయిష్టమైన వలస విధానానికి మునుపటి డెమొక్రటిక్ ప్రభుత్వాలే కారణమని పనిలోపనిగా ప్రతిపక్షంపైనా ఆయన విమర్శలు గుప్పించారు. గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయులకు ట్రంప్ ట్వీట్లు మద్దతు పలుకుతున్నట్లుగా ఉందన్న విశ్లేషణలు ప్రచారమవుతున్నాయి.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	40.0	28.0
గుంటూరు	39.4	28.6
విజయవాడ	39.0	27.8
ఒంగోలు	39.0	26.5
తిరుపతి	38.9	25.1
విశాఖపట్నం	38.0	28.4
కడప	38.0	27.0
అనంతపురం	37.5	25.7
నరసాపురం	37.4	27.4
శ్రీకాకుళం	37.0	26.5
నెల్లూరు	37.0	26.0
కర్నూలు	36.5	26.2
తాడేపల్లిగూడెం	35.5	26.0
హైదరాబాద్	33.2	24.7

శ్రీవారి ఆభరణాలకు పటిష్ఠ భద్రత

- తితిదే అధ్యక్షుడు పుట్టా సుధాకర యాదవ్ స్పష్టీకరణ
- స్వర్ణాభరణాల ప్రదర్శనకు ఆగమపండితుల అభ్యంతరం

తిరుమల - న్యూస్‌టుడే

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి స్వర్ణాభరణాలన్నీ భద్రంగానే ఉన్నాయని తితిదే ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పుట్టా సుధాకరయాదవ్ స్పష్టం చేశారు. బీరువాల్లో ఉన్న స్వామివారి ఆభరణాలను, తిరువాభరణం దస్త్రాలను, అన్నప్రసాదాల తయారీ పోటును ఆలయ అధికారులతో కలిసి మండలి అధ్యక్షుడు, సభ్యులు సోమవారం పరిశీలించారు. 'తిరువాభరణం దస్త్రంలోని సమాచారం మేరకు ఆభరణాలను చూడగా అన్నీ కనిపించాయి. నగల వారీగా ఆ దస్త్రంలో నమోదై ఉన్నాయా.. లేదా.. అని పరిశీలించాం. మధ్యాహ్నం కొన్ని తనిఖీ చేయగా.. ఎక్కడా తేడా రాలేదు. ఆభరణాలను ఉన్న లాకర్ల తాళాలు నలుగురు అధికారుల దగ్గర ఉంటాయి. వీరిలో ఒకరిని కాదని మరొకరు తలుపులు తీయడానికి వీల్లేని విధంగా వ్యవస్థ ఉంది. మా ప్రత్యక్ష పరిశీలనలో పగిలిపోయిన 'రూబీ' కూడా కనిపించింది. పగిలిన ముక్కలు, పొడిని భద్రపరిచి ఉంచారు. ఇక్కడ సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి...' అని సుధాకరయాదవ్ వివరించారు. 'రమణదీక్షితులు చెప్పినట్లుగా తవ్వకాలు జరిపిన పక్షంలో పోటు మండపం కూలిపోయే పరిస్థితి ఉంది. వంట చెరకు పొయ్యిల నుంచి రాతి గోడలకు రక్షణ నిమిత్తం కొంత భాగం ఇటుకలతో నిర్మాణాలు మార్పు చేపట్టారు. ఈ వ్యవహారం ఐదారేళ్లకోసారి జరిగేదే. వ్యవస్థ బలోపేతంగా ఉన్నాయని, ఆభరణాలు భద్రంగా ఉన్నాయని రమణదీక్షితులకు కూడా తెలుసు. అయినా అసత్యాలు చెబుతున్నారు. ఇకనైనా దేవుడి దగ్గరకి వచ్చి క్షమాపణలు చెప్పాలి. మేము ఇక్కడే ఉంటాం. సమస్యలేమున్నా ఉంటే.. మాట్లాడుకుందాం రండి...' అని సుధాకరయాదవ్ పేర్కొన్నారు. తితిదే బోర్డు సభ్యులు డొక్కా జగన్నాథం మాట్లాడుతూ ఆరోపణలు చేస్తున్న విజయసాయిరెడ్డికి ఆభరణాలను చూపించాలని ఉందని, ఆయన కన్ను పడితే కాజేస్తారేమోనని భయం తమకు ఉంది అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు, శ్రీవేంకటేశ్వర భక్తి ఛానెల్ ఛైర్మన్ కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఒక్క గంటలో ఉండగా పట్టుదలతో ప్రయత్నించి ఏదైనా కనిపించకుండా.. పదవీవిరమణ అనంతరం చేసే ఆరోపణలకు విలువ ఉండదన్నారు. సభ్యులు సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ అన్యమత స్థల సమక్షంలో రమణదీక్షితులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, పొట్లూరి రమేష్‌బాబు, రుద్రరాజు పద్మరాజు, అశోక్‌రెడ్డి, శ్రీకృష్ణ, చల్లా రామచంద్రారెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి, సుధ నారాయణమూర్తి, రాయపాటి సాంబశివరావు ఆభరణాలను పరిశీలించారు.

మాట్లాడుతున్న తితిదే అధ్యక్షుడు పుట్టా సుధాకర యాదవ్. చిత్రంలో సభ్యులు రుద్రరాజు పద్మరాజు, పెద్దిరెడ్డి, బొండా ఉమామహేశ్వరరావు

నేడు ధర్మకర్తల మండలి సమావేశం

తితిదే ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం అధ్యక్షుడు పుట్టా సుధాకర యాదవ్ అధ్యక్షతన తిరుమలలో జరగనుంది. రాష్ట్రంలో కల్యాణమండపాలు, తిరుమలలో యాత్రిసదన్, ఒంటిమిట్టలో ఉద్యోగులకు, భక్తులకు వసతి సముదాయం నిర్మాణం, చిల్లర నాణేల మార్పిడిపై ఉపసంఘం ఏర్పాటు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ తదితర అంశాలపై చర్చ జరగనుంది. ఉదయం 11.45 గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుంది.

ప్రదర్శనకు ఆగమ సలహామండలి నిరాకరణ

శ్రీవారి ఆభరణాల ప్రదర్శనకు తితిదే ఆగమ సలహా మండలి అనుమతి నిరాకరించింది. స్వామివారి ఆభరణాలను బంగారువాకిలి వెలుపలికి తీసుకురావడం ఆగమశాస్త్రానికి విరుద్ధమని స్పష్టం చేసింది. వార్షిక తనిఖీలు, బ్రహ్మోత్సవాలు శుద్ధం చేయడం, మెరుగు పెట్టే పనులన్నీ స్వామి సన్నిధిలోనే జరుగుతాయని విషయాన్ని ప్రస్తావించింది. అనుమానాల నివృత్తి చేయడానికి ధర్మకర్తల మండలి తీర్మానం చేసి ఉండవచ్చని, ఈ నిర్ణయం ఆగమశాస్త్రానికి విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు సలహా మండలి సభ్యులు సుందర వరద భట్టాచార్యులు శ్రీవారి ఆలయం ఎదుట మీడియాకు తెలిపారు. ఇతర సభ్యులైన ఆపేక్షిత దేశికాచార్యులు, జగన్నాథాచార్యులు, మోహనరంగాచార్యులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం.

రెండేళ్లకు ఒకసారి న్యాయమూర్తులతో స్వామి వారి ఆభరణాల పరిశీలన: సీఎం

ఈనాడు, అమరావతి: తితిదే ప్రతిష్ఠ, భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని ఇకపై స్వామి వారి ఆభరణాలు, ఇతర అంశాలపై రెండేళ్లకు ఒకసారి న్యాయమూర్తులతో సమగ్ర పరిశీలన చేయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. విజయవాడలో సోమవారం రాత్రి జరిగిన గ్రామ రెవెన్యూ సహాయకుల ఆత్మీయ అభినందన సభలో ఈ విషయాన్ని వెల్లడించారు. 'రాజకీయాలకు స్వామి వారిని కూడా ఉపయోగించుకుంటున్నారు. రికార్డుల్లో లేని నగలు, ఆభరణాలపై గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఆగమ సలహా మండలి సభ్యులు ప్రజల ముందు ఆభరణాలు ఉంచడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ఇంతకు ముందు కూడా న్యాయమూర్తులతో కమిటీ వేసి వాస్తవాలను వివరించాం. ఆ విషయం అందరికీ తెలుసు. ఇప్పుడు కూడా న్యాయమూర్తుల పరిశీలన అనంతరం అన్ని వివరాలను వెల్లడిస్తాం. ప్రజల ముందు పెడతాం. తిరుమల పవిత్రతను కాపాడడానికి కృషి చేస్తాం...' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

దుర్గగుడి 'డార్మెటరీ'లో సీసీ కెమెరాలు

- సిబ్బంది పొంతన లేని సమాధానంతో భక్తుల ఆందోళన
- అప్పట్లో భద్రత కోసం ఏర్పాటు చేశాం: ఈవో

ఈనాడు, అమరావతి: విజయవాడ దుర్గగుడికి చెందిన డార్మెటరీలో సీసీ కెమెరాలు ఉండడం వివాదానికి దారితీసింది. విజయవాడలో రైల్వేస్టేషన్‌కు సమీపంలో దుర్గగుడికి చెందిన సి.వి.రెడ్డి చారిటీస్‌కు చెందిన స్థలంలో డార్మెటరీ(అదం) మంచాలకు ఒక గది చొప్పున అద్దెకు ఆరు నెలల కిందట నిర్మించారు. వీటిని మంచాల చొప్పున అద్దెకు ఇస్తున్నారు. కాకినాడకు చెందిన ఓ కుటుంబం దుర్గగుడిలో పెళ్లి వేడుకను నిర్వహించేందుకు బెజవాడకు వచ్చారు. రైల్వేస్టేషన్‌కు దగ్గర ఉన్న దుర్గగుడి డార్మెటరీని అద్దెకు తీసుకున్నారు. ఇందులో సీసీ కెమెరాలు ఉన్న విషయాన్ని సోమవారం ఉదయం గమనించారు. కెమెరాలు ఎందుకు ఉన్నాయని అక్కడి సిబ్బందిని ప్రశ్నించారు. వాళ్లు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో.. పెళ్లి బృందం ఆందోళనకు దిగింది. కెమెరాలకు కనెక్షన్ ఇవ్వలేదని తొలుత చెప్పారు.. లైట్లు ఎందుకు వెలుగుతున్నాయని ప్రశ్నించడంతో..మూడు రోజుల కిందట కనెక్షన్లు తొలగించామంటూ మాట మార్చారని వాపోయారు. మహిళా భక్తులు స్నానాలు చేసే వద్దాక ఇక్కడే దుస్తులు మార్చుకుంటున్నారని, సీసీ కెమెరాలు ఎలా పెడతారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటికి కనెక్షన్ ఇవ్వలేదని సిబ్బంది వారికి నచ్చజెప్పారు. అనంతరం గదుల్లో ఉన్న సీసీ కెమెరాలను వెనక్కు తిప్పేశారు.

నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ఈవో: భవనాలను నిర్మించిన సమయంలో అవి సత్రాలు కావడంతో భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, తర్వాత వాటిని డార్మెటరీలుగా మార్చామని దుర్గగుడి ఈవో పద్మ వెల్లడించారు. అక్కడికి ఈమధ్య భక్తులు వస్తున్నారన్నారు. తాజాగా భక్తుల ఆందోళన నేపథ్యంలో ఏం జరిగిందనే విషయాన్ని పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. వివాహాల కోసం వచ్చేవాళ్లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా దుస్తులు మార్చుకునే గదులు నిర్మిస్తామన్నారు.

పోలీసుల విచారణ..!: విజయవాడ టూటౌన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. అయితే.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, గతంలో జరిగిన నేపథ్యంలో వచ్చినట్లు వెల్లడించారు. ఎవరైనా ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామన్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో డార్మెటరీల్లో ఉన్న సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా గుర్తించనట్లు సమాచారం.

వేకువ కోసం వేయికళ్లతో..!

- ఖైదీల్లో కనిపిస్తున్న పశ్చాత్తాపం
- శిక్ష పడిన వారిలో గూడు కట్టుకున్న బాధ
- ఆత్మీయుల పలకరింపు లేక మరికొందరి వేదన
- నెల్లూరు కేంద్ర కారాగారం ఖైదీలపై మానసిక వైద్యుడి విశ్లేషణ

ఈనాడు - అమరావతి

- నా కుమారుడు నాన్న..నాన్న అని పిలుస్తున్నట్లు అనిపిస్తుంది. నిద్ర పట్టడం లేదు. ఎందుకలా జరిగిందో అర్థం కావడం లేదు
- ఓ ఖైదీ ఆవేదన
- క్షణికావేశంలో తప్పు చేశా. నన్ను పరామర్శించేందుకు కుటుంబసభ్యులు కూడా రావడం లేదు
- మరో ఖైదీ పశ్చాత్తాపం

నెల్లూరు కేంద్ర కారాగారంలో శిక్ష పడిన ఖైదీల మానసిక పరిస్థితి ఇది. ఈ కారాగారంలోని ఖైదీలు, నిందితులకు గూడూరు ప్రాంతీయ ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వి.గంగాధర్ 18నెలల పాటు కౌన్సెలింగ్‌తో పాటు వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీల మానసిక ఆరోగ్య పరిస్థితులను విశ్లేషించారు. ఈ కేంద్ర కారాగారంలో సుమారు 300 మంది రిమాండ్ ఖైదీలు, 300 మంది శిక్ష పడిన వారు ఉన్నారు. జిల్లా కలెక్టర్, వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త ఆదేశాల మేరకు వారానికి ఒకరోజు సుమారు వంద మంది ఖైదీలకు గంగాధర్ వైద్య సేవలను అందించారు. వీరిలో 65 మంది రిమాండ్ ఖైదీలు ఉన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారితోపాటు ఏసీబీ కేసుల్లో పట్టుబడిన వారు, వరకట్న వేధింపుల్లో నిందితులు వీరిలో ఉన్నారు. నిందితులకంటే శిక్ష పడిన ఖైదీల్లోనే ఎక్కువ పశ్చాత్తాపం కనిపిస్తోందని వైద్యుడు గంగాధర్ పేర్కొన్నారు. క్షణికావేశంలో తప్పు చేశామనే బాధ వారిలో ఎక్కువగా కనిపించిందని తెలిపారు. వీరిలో కొందరు మానసికంగా తొలి నుంచి బాధపడుతున్న వారే ఉన్నారని కుటుంబనేపథ్యాన్ని బట్టి విశ్లేషించారు. శిక్షపడి మూడేళ్ల నుంచి ఉన్న వారిలో 80శాతం గ్రామీణులే. 90శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారున్నారు. వీరిలో 25 నుంచి 40 ఏళ్ల వయస్సువారు ఎక్కువగా ఉన్నారు. 50ఏళ్లకుపైగా వయస్సున్న వారు పది మంది వరకు ఉన్నారు. హత్యలు చేసినట్లు రుజువై శిక్ష పడినవారు 26 మంది ఉన్నారు. వీరిలో 11 మంది భార్యలను చంపినవారు. శిక్ష పడిన వారిలో ఎక్కువ మందిని చూసేందుకు కుటుంబసభ్యులు, బంధువులు కూడా రావడం లేదు. దీంతో ఇలాంటివారి మానసిక ఆరోగ్య పరిస్థితి సవ్యంగా లేదు. నిద్ర పట్టకపోవడం, తినాలని అనిపించకపోవడం, చనిపోవాలనుకుంటుండడం, వారిలో వారే మాట్లాడుకోవడం, నలుగురిలో కలవలేక కుమిలిపోతున్న వారు ఉన్నారు. రిమాండ్ ఖైదీలకు బెయిల్ వచ్చే అవకాశం ఉన్నా బయట ఎవరూ పట్టించుకోవడం లేదన్న నిరాశ కొందరిలో కనిపించింది. తప్పులు చేసే వారిలో చాలామంది మద్యానికి బానిసలని డాక్టర్ గంగాధర్ పేర్కొన్నారు. కేంద్ర కారాగారాల్లో మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటే సత్ఫలితాలు వస్తాయని అభిప్రాయపడుతున్నారు. తొందరపాటు, స్థానిక పరిస్థితుల దృష్ట్యా తప్పు చేసిన వారు ఒంటరితనాన్ని అనుభవిస్తూ వేదనకు గురవుతున్నారని, ఇలాంటి వారికి తగిన కౌన్సెలింగ్ ఇచ్చి వైద్య సేవలు అందించినట్లయితే సత్ఫలితాలు వస్తాయని అభిప్రాయపడుతున్నారు. జాతీయ మానవ హక్కుల సంఘం కూడా ఇదే సూచించిందని వివరించారు. జైళ్ల సిబ్బందికి కూడా మానసిక నిపుణులతో శిక్షణ ఇప్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ గంగాధర్ కృషిని వైద్య ఆరోగ్య శాఖ అభినందించింది. ఇటీవల విశాఖలో జరిగిన 'ఆరోగ్య ఉత్సవ్'లో డాక్టర్ గంగాధర్ సమర్పించిన పత్రానికి ప్రత్యేక బహుమతి లభించింది.

డాక్టర్ వి.గంగాధర్

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- అప్పుల బాధ.. కుమారుల మృతితో మనస్తాపం

కసాపురం (గుంతకల్లు), న్యూస్‌టుడే: ఆ కుటుంబంపై విధి పగబట్టింది. చేతికొచ్చిన కుమారులను అనారోగ్యం రూపంలో పొట్టనపెట్టుకొంది. మూర్ఛ రూపంలో మనవడినీ బలితీసుకొంది. చివరికి మనస్తాపం రూపంలో ఆ కుటుంబ పెద్దల్నీ మృత్యుపాలు చేసింది. ఈ హృదయ విదారక ఘటన అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని కసాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకొంది. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం ఏరూరు గ్రామానికి చెందిన చిన్నమారెప్ప(63), భార్య లక్ష్మిదేవి(58) బళ్లారిలో స్థిరపడ్డారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్నమారెప్ప కొప్పల్ పురపాలక సంఘంలో చిరుద్యోగిగా పనిచేసి అయిదేళ్ల కిందట పదవీ విరమణ చేశారు. రెండేళ్ల కిందట ఆయన పెద్ద కుమారుడు క్యాన్సర్ బారినపడి మరణించాడు. ఏడాది కిందట మరో కుమారుడు కిడ్నీలు విఫలమై మృతి చెందాడు. ఏడు నెలల కిందట వీరి మనవడు మూర్ఛ వ్యాధితో మరణించాడు. ఇలా కుటుంబంలో వరుస మరణాలు సంభవించడం... వారి చికిత్స కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందారు. సోమవారం కసాపురం ఆంజనేయస్వామిని వృద్ధులు దర్శించుకున్నారు. అనంతరం సమీపంలోని వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చివరి కుమారుడు ఆంజనేయులు బెంగళూరులో స్థిరపడ్డాడు. తల్లిదండ్రులు అప్పుల బాధ తాళలేకనే ఆత్మహత్య చేసుకొన్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యవసాయానికి 'ఉపాధి' అనుసంధానంపై సమాలోచనలు

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానించడంపై ప్రభుత్వ స్థాయిలో సమాలోచనలు చేస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖల ముఖ్య కార్యదర్శులు, ఇతర అధికారులు దీనిపై చర్చించేందుకు సమావేశమయ్యారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించడంపై సూచనలు ఇచ్చేందుకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నేతృత్వంలో ఆరుగురు ముఖ్యమంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటుచేస్తూ ఇటీవల దిల్లీలో నిర్వహించిన నీతిఆయోగ్ సమావేశంలో ప్రధాని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రంగంలోకి దిగారు.

సొంత జిల్లాకు జగన్ వెన్నుపోటు

ఎంపీ రాయపాటి విమర్శ

ఈనాడు డిజిటల్, అమరావతి: తనకు దేవుడిచ్చిన అన్న గాలి జనార్దన్‌రెడ్డి కోసం ఉక్కు కర్మాగారాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టిన జగన్.. సొంత జిల్లా కడపకు వెన్నుపోటు పొడుస్తున్నారని తెదేపా లోక్‌సభ సభ్యుడు రాయపాటి సాంబశివరావు విమర్శించారు. కర్ణాటక ఎన్నికల్లో అందించిన ఆర్థిక సహకారానికి కడప స్టీల్ ప్లాంట్‌ను గాలి జనార్దన్‌రెడ్డికి బహుమతిగా ఇచ్చేందుకు యత్నిస్తూ కేంద్రం మరో నీకది-నాకది(క్విడ్ ప్రో) తంతుకు తెరతీసిందని ఆరోపించారు. జమ్మలమడుగులో బ్రహ్మణి స్టీల్స్ నిర్మించడానికి అనుమతి కోరుతూ జనార్దన్‌రెడ్డి పెట్టిన విలేకరుల సమావేశమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ మేరకు సోమవారం రాయపాటి ప్రకటన విడుదల చేశారు. "భాజపా, వైకాపా జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటే. అధికారం కోసం అడ్డదారులు తొక్కుతూ 5 కోట్ల మంది ఆంధ్రులను వంచిస్తున్నాయి. రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నాయి. తెదేపాను ఎదుర్కోలేక వైకాపా, జనసేనలతో కలిసి భాజపా కుట్ర రాజకీయాలకు పాల్పడుతోంది" అంటూ రాయపాటి విమర్శించారు.

సన్మానాల పేరిట అధికార దుర్వినియోగం: మధు

విజయవాడ, న్యూస్‌టుడే: సన్మానాల పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు అభినందనల పేరిట సన్మానాలు చేసేలా.. వేతనాల పెంపు, రాయితీలు, ప్రయోజనాలు పొందిన వారిపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు.

కేశఖండన చేసే వారిని ఉద్యోగులుగా గుర్తించాలి

నాయీ బ్రాహ్మణ ఐకాస

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో కేశఖండన చేసే వారిని ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని ఆ సంఘం ఐకాస ప్రతినిధులు అన్నవరపు బ్రహ్మయ్య, గుంటుపల్లి రాందాస్, ఇతర సభ్యులు ప్రభుత్వానికి విన్నవించారు. టికెట్‌కు రూ.25 ఇస్తామని గతంలో సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. వీరు ఇంకా కనీస వేతనం కావాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం ఈ మేరకు ఐకాస ప్రతినిధులు ముఖ్యమంత్రి కార్యాలయంలోని దేవదాయ వ్యవహారాలు చూసే ఉన్నతాధికారి గిరిజాశంకర్ తదితరులను కలిసి డిమాండ్లు వినిపించారు. ఆ తర్వాత సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతోనే ఉందని చెప్పారు. ఆ రోజు ముఖ్యమంత్రి తమ వ్యవహారాన్ని టి.డి.జనార్దన్‌కు అప్పజెప్పారని, ఆయన పిలుపు మేరకు సోమవారం వచ్చి తాము ఉన్నతాధికారులను కలిశామని వివరించారు. తాము ఇప్పటికీ కనీస వేతనమే కోరుతున్నామని చెప్పారు. ఆలయాల్లో కేశఖండన చేసే తమను ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అలా చేస్తేనే తమకు ఈఎస్ఐ సదుపాయం వర్తిస్తుందన్నారు. ఈపీఎఫ్ అవకాశం ఉంటుందన్నారు. ఆయా ఆలయాల ఆదాయాన్ని బట్టి తమకు ఎంతో కొంత కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు.

పలకరింపులతో సాగిన జగన్ యాత్ర

మామిడికుదురు, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామం నుంచి సోమవారం ఉదయం ప్రారంభమైన వైకాపా అధినేత జగన్మోహనరెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రసంగాలు లేకుండా పలకరింపులతోనే సాగింది. సెల్ఫీలు తీసుకునేందుకు మహిళలు, చిన్నారులు క్యూ కట్టారు. ఎవర్నీ కాదనకుండా అందరికీ అవకాశం కల్పించారు. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులను చిరునవ్వుతో జగన్ పలకరించారు. నగరం గ్రామంలో ఉమ్రా యాత్రకు సంబంధించిన బాధిత ముస్లింలు ఆయనకు వినతిపత్రాన్ని ఇచ్చేందుకు ప్లకార్డులతో ర్యాలీగా కదలివచ్చారు. వారి సమస్యను విన్నారు. అక్కడి నుంచి మామిడికుదురు మీదుగా పాశర్లపూడిబాడవ వరకు పాదయాత్ర చేరుకోగానే సాయంత్రం 6.15 గంటలకు ముగించారు. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పలువురు పార్టీలో చేరారు.

నగరంలో మహిళల విన్నపాలను వింటున్న జగన్

చంద్రబాబు పాలనలో రాష్ట్రం తిరోగమనం

హైదరాబాద్, న్యూస్‌టుడే: చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ 20ఏళ్లు వెనక్కి వెళ్లిందని వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు దిల్లీకి వెళ్లిన ప్రతిసారీ ప్రధాని మోదీకి దండాలు పెట్టడం తప్ప నాలుగేళ్లుగా చేసిందేమీ లేదని విమర్శించారు. నీతిఆయోగ్ సమావేశం జరిగి తొమ్మిది రోజులు గడుస్తున్నా ఏయే అంశాలపై చర్చించారో నేటికీ ప్రజలకు స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. సమావేశం అనంతరం మీడియా ముందుకు వచ్చి వాస్తవాలు చెబుతానన్న చంద్రబాబు ఎందుకు వెనకడుగు వేశారో చెప్పలేదని విమర్శించారు. భాజపాతో చీకటి ఒప్పందం కుదరడంతోనే నోరు మెదపడం లేదని ఆరోపించారు. దీనిపై చంద్రబాబు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలోనే కడప ఉక్కు పరిశ్రమ కోసం దీక్ష అంటూ మరో వంచనకు పూనుకున్నారని పేర్కొన్నారు.

సమతౌల్యం కోసమే 2019 ఎన్నికల్లో పోటీ

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ట్వీట్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సమతౌల్యం సాధించేందుకే 2019 ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వెల్లడించారు. ట్విట్టర్‌లో సోమవారం ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. 2014 ఎన్నికల్లో తెలుగు ప్రజల సుస్థిరత కోసం సహకారం అందించామని కూడా అదే ట్వీట్‌లో ఆయన పేర్కొన్నారు. 2013 భూసేకరణచట్టం అమలుతీరుపై విశాఖపట్టణంలో ఒక వర్క్‌షాపు నిర్వహించబోతున్నట్లు పవన్ వెల్లడించారు. ఇందులో మేధావులతో పాటు ఈ చట్టానికి సంబంధించిన భాగస్వామ్యులందరూ పాల్గొంటారని చెప్పారు. ఈ చట్టం అమలు కాకపోవడం వల్ల వరుసగా సంభవిస్తున్న ప్రమాదకర పరిణామాలపై చర్చ జరుగుతుందన్నారు.

విశాఖ చేరిన పవన్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రజాపోరాట యాత్రలో పాల్గొనేందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోమవారం విశాఖ నగరానికి వచ్చారు. ఆయనతో పాటు పిల్లలు అకీరా, ఆద్య కూడా వచ్చారు.

వైకాపాతో జనసేన జట్టుకడితే మేం తప్పుకుంటాం: రామకృష్ణ

కడపలో ఉక్కుకర్మాగారం సాధనకు ఈ నెల 29న కడప బంద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కూడళ్లలో ర్యాలీలు, నిరసనలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చెప్పారు. సోమవారం విశాఖలో విలేకరులతో మాట్లాడారు. వైకాపాతో జనసేన కలిస్తే తాము ఆ పార్టీతో కొనసాగలేమని స్పష్టంచేశారు. విశాఖ భూ కుంభకోణాలపై సిట్ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీ హరిత పురస్కారాలకు 94 మంది ఎంపిక

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు కృషిచేసే వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వ విభాగాలకు అందించే ఏపీ హరిత పురస్కారాల(గ్రీనరీ అవార్డుల)కు మొత్తం 94 మంది ఎంపికైనట్లు రాష్ట్ర పచ్చదన, సుందరీకరణ కార్పొరేషన్ ఎండీ ఎన్.చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. 8 విభాగాలు, 30 ఉప విభాగాల్లో మొత్తం 452 దరఖాస్తులు అందాయని ఆయన పేర్కొన్నారు. నలుగురు జ్యూరీ సభ్యులతో కూడిన బృందాలు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల కృషిని పరిశీలించి, 94 మందిని అవార్డులకు ఎంపిక చేశాయని వివరించారు. ఈ నెలాఖరులో రాష్ట్ర స్థాయిలో కార్యక్రమం నిర్వహించి పురస్కారాలు అందజేస్తామని సోమవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'ఇళ్ల' నిర్మాణాల రూ.2వేల కోట్లు ఏం చేశారు?

- పచ్చ చొక్కాల వారికే ఇళ్లు: నరసింహారావు

ఈనాడు, అమరావతి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించే ఇళ్ల విషయంలో భారీగా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని భాజపా జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆరోపించారు. విజయవాడలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ "ఈ పథకం కింద తొలివిడతలో 7.42 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.3,202 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేయగా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,072 కోట్లు మాత్రమే వ్యయం చేసింది. మిగిలిన 2 వేల కోట్లరూపాయలను దేనికి మళ్లించారు? చదరపు అడుగు నిర్మాణానికి రూ.1,100 అవుతుండగా రూ.2,400 ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటి? కేంద్రం దీనిపై వివరణ కోరుతూ రాష్ట్రానికి లేఖ రాసే అవకాశం ఉంది. పచ్చ చొక్కాల వారికి మాత్రమే ఇళ్లను కేటాయిస్తున్నారు. పేదలు అడిగితే రూ.30వేల నుంచి లక్ష రూపాయల వరకు ముడుపులు తీసుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఒక రూపాయి కూడా కేంద్రం వద్ద పెండింగులో లేదు. కడపలో ఉక్కు కర్మాగారానికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబే మోకాలడ్డుతున్నారు. మురుగునీటి వ్యవస్థను చక్కదిద్దేందుకు రూ.1000 కోట్లు ఇస్తే ఇప్పటివరకు రూ.230 కోట్లను మాత్రమే వెచ్చించింది. ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి" నరసింహారావు డిమాండ్ చేశారు.

'కన్నా లక్ష్మీనారాయణది వైకాపా ఎజెండాయే'

ఈనాడు, అమరావతి: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వైకాపా ఎజెండానే అమలు చేస్తున్నారని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.డి.హిదయత్ విమర్శించారు. కన్నా లక్ష్మీనారాయణ ఎప్పుడూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని, రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రమంతటా సమైక్య ఉద్యమం జరుగుతుంటే ఆయన సోనియా కాళ్లు పట్టుకుని ముఖ్యమంత్రి ఎలా అవ్వాలా? అని ఆలోచించారని విమర్శించారు. ఇప్పుడు మోదీ కాళ్లు పట్టుకుంటున్నారని విమర్శించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఈనాడు

కల్తీలపై ఏదీ కదనభేరి?

ఎవరు ఏ వ్యాపారం చేసినా లాభం కోసమే. ఆహార ఉత్పాదనలకూ ఆ సూత్రం వర్తించేదే అయినా- నాణ్యత ప్రమాణాల విషయంలో ఏ మాత్రం రాజీపడినా, అది ప్రజారోగ్యాన్ని బలిపీఠం మీదకు నెట్టే జాతిద్రోహమే! ఆహారోత్పత్తుల తనిఖీల్ని క్రమానుగతంగా చేపడుతున్నా- జనారోగ్యంపై ఆందోళన పెంచేలా నాణ్యత లేని కల్తీ సరుకులు విస్తరిస్తున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ తాజాగా ప్రకటించింది. కఠిన దండనలు, జరిమానాలతోనే పరిస్థితిని చక్కదిద్దగల వీలుందంటూ ఇప్పుడే నిద్రనుంచి మేల్కొన్నట్లుగా సూక్తి ముక్తావళి వినిపిస్తోంది. దేశీయంగా ఆహార పదార్థాల్ని కల్తీ చేసేవాళ్లకు రూ.10 లక్షల జరిమానా, యావజ్జీవం దాకా జైలుశిక్ష విధించాలంటూ భారతీయ ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ కొత్తగా ప్రతిపాదిస్తోంది. పుష్కరకాలంనాటి చట్టాన్ని సవరించి, వ్యక్తులు లేదా వ్యాపార సంస్థలు కావాలనే ఆహార పదార్థాల్ని కల్తీ చేస్తే ప్రతిపాదిత శిక్షలు విధించేలా చూడాలని ప్రాధికార సంస్థ సంకల్పిస్తోంది. నిందితులు బుద్ధిపూర్వకంగా కల్తీకి ఒడిగట్టారో లేదో ఎవరు తేలుస్తారన్నది అసలు ప్రశ్న! పసుపు, కారం, పప్పులు, ఉప్పులు... ఇలా కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లు ఎక్కడికక్కడ వందల కోట్ల రూపాయల దందా విచ్చలవిడిగా సాగుతున్న నేపథ్యంలో- పదిలక్షల రూపాయల జరిమానా హాస్యాస్పదం కాదా? వినియోగదారులకు వాస్తవంగా ముప్పు వాటిల్లినా లేకున్నా కల్తీదందాసురులకు శిక్షలు విధించాల్సిందేనన్న విషయంలో మరో మాట లేదు. ఆహార భద్రత, పౌష్టికాహార నిధిని ఏర్పాటు చేసి ఉత్పాదనల నాణ్యత ప్రమాణాలపై జాగ్రత్త కార్యక్రమాల్ని చేపట్టదలచడంలో ఇప్పటికే ఎంతో జాప్యం జరిగిందని చెప్పక తప్పదు. 2011-12లో 13శాతంగా ఉన్న ఆహార కల్తీ 2016-17నాటికి 23శాతానికి పెరిగిపోవడానికి అన్ని స్థాయిల్లో అంతెత్తున మేటవేసిన నిష్పూచీతనమే పుణ్యం కట్టుకొంది. కల్తీ రాకాసులపై ఉక్కుపాదం మోపడంలో ఏళ్ల తరబడి ప్రభుత్వాల ఉపేక్ష భావమే జనారోగ్యాన్ని కర్కశంగా చిదిమేస్తోంది!

'ప్రజలకు ఏది కల్తీయో తెలియడం లేదు... విధి లేని పరిస్థితుల్లో విషాహారం తీసుకొంటున్నారు' అని నిరుడు డిసెంబరులో వాపోయిన ఉమ్మడి హైకోర్టు- 'నామమాత్రపు తనిఖీలతో సరిపెడతారా?' అంటూ ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల్నీ నిలదీసింది. 'కల్తీ నివారణకు అధికారుల్లో చిత్తశుద్ధి లేదు... వ్యాపారులకు లాభాపేక్ష తప్ప ప్రజారోగ్యం పట్టదు' అని స్పష్టీకరించడం ద్వారా ప్రజల జీవించే హక్కును కాలరాస్తున్నదెవరో కళ్లకు కట్టింది. ఆర్థిక సంస్కరణల శకంలో మారిన పౌరుల జీవన శైలికి అనుగుణంగా అనూహ్య అభివృద్ధి సాధించిన వాటిలో ఆహార రంగం ఒకటి. మారిన కాలమాన పరిస్థితులకు తగ్గట్లు 2006లో తెచ్చిన ఆహార భద్రత చట్టం- అంత క్రితం ఉన్న శిక్షల పదునునూ అగరదీసి కొరగానిదిగా అభాసుపాలైంది. అధికార శ్రేణుల్లో అవినీతి దానికి జతపడటంతో కల్తీ వ్యాపారాలకు పట్టపగ్గాల్లేని దుస్థితి ఊరూవాడా రాజ్యమేలుతోంది. స్వచ్ఛమైన వేరుశనగ నూనె పేరిట మలేసియానుంచి దిగుమతి చేసుకొన్న పామాయిల్‌ను విక్రయించే నెట్‌వర్కును 17 ఏళ్లుగా నిర్వహిస్తున్న నేరగాడు- నెలనెలా ముడుపులతో అధికారుల్ని లొంగదీసి వందల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన సంగతి కొన్ని నెలల క్రితం వెలుగు చూసింది. హైదరాబాద్ శివార్లలోని కాటేదాన్, మరికొన్ని ప్రాంతాల్లో యథేచ్ఛగా సాగుతున్న కల్తీ దందా పరిమాణం ఏటా రూ.300 కోట్ల పైమాటగా నిగ్గుదేలింది. అప్పడాలు, పచ్చళ్లు, సున్నుండలు, చాక్లెట్లు, ఐస్‌క్రీములు, వంటనూనెలు, ధనియాలు, మిరియాలు, జీలకర్ర, నెయ్యి, కారం, కంది పెసర సెనగపప్పు... ఇలా అన్నింటినీ కల్తీ చేసే అమానుష నేరగాళ్ల రంగస్థలిగా ఉభయ తెలుగు రాష్ట్రాలూ పరువు మాస్తున్నాయి. క్షేత్రస్థాయి స్థితిగతులు ఇంత భయానకంగా ఉన్న తరుణంలో ఇంకా 'కఠిన దండన'లన్న ప్రతిపాదనల దశ దాటకపోవడం సిగ్గుచేటు!

భారతీయ ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ ఏడేళ్లుగా ఏం ఉద్ధరించిందో 'కాగ్' నివేదిక నిరుడు డిసెంబరులో కళ్లకు కట్టింది. వ్యవస్థాగత లోపాలతోపాటు ప్రాధికార సంస్థ పని పోకడల్నీ సూటిగా వేలెత్తి చూపిన 'కాగ్ అధ్యయనం- ఆహార ప్రమాణాలపై ప్రమాద ఘంటికల్ని మోగించింది. రక్తాన్ని సైతం కల్తీ చేసి విక్రయిస్తున్న దుర్మార్గాల్ని ఏ మాత్రం ఉపేక్షించరాదంటూ నేరగాళ్లకు జీవితకాల శిక్షలు పడేలా చట్టసవరణల కోసం తెలంగాణ అసెంబ్లీ తీర్మానం ఆమోదించింది. రాష్ట్రాల్లో ఉన్న ప్రయోగశాలల సంఖ్య పెంచి సమగ్ర ఆహార తనిఖీ వ్యవస్థల ఏర్పాటుకు కంకణబద్ధులమవుతామంటూ వివిధ రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రుల సదస్సు మొన్న జనవరిలో ప్రతిజ్ఞ చేసింది. పండే పొలం నుంచి తినే పళ్లెం లోకి వచ్చే క్రమంలో ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలను కాపాడాలంటూ ఏడు అంశాల కార్యాచరణను సదస్సు ఓటేసినా- కల్తీలపై కత్తిదూసే కఠిన వైఖరి కొరవడింది! వీధి తినుబండారాల నుంచి నక్షత్ర హోటళ్ల దాకా మన్నికైన ఆహార ప్రమాణాలకు పెట్టింది పేరుగా రాణిస్తున్న సింగపూర్ ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తోంది. క్షేత్రస్థాయి ఆహార తనిఖీ నియంత్రణ బృందాలకు తిరుగులేని అధికారాలు కట్టబెట్టింది- ప్రమాణాలు పాటిస్తున్నవారికి ప్రోత్సాహం, నిబంధనల్ని మీరేవారికి కఠిన దండనలతో జనారోగ్యాన్ని జాగ్రత్తగా కాచుకొంటోంది. పొరుగున చైనా కల్తీ దందాసురులకు మరణశిక్షలు సైతం విధిస్తూ ఉక్కుపాదం మోపుతోంది. చట్టాల్ని ఉల్లంఘించాలంటేనే చలిజ్వరం వచ్చే స్థాయిలో జరిమానాలతో బ్రిటన్ కల్తీల్ని అడ్డుకొంటోంది. కల్తీ నేరగాళ్ల కూసాలు కదిలేలా చట్టాల్ని పటిష్ఠీకరించడంతోపాటు, కట్టుదిట్టమైన తనిఖీ యంత్రాంగాలు శాస్త్రీయ ప్రయోగశాలలతో ప్రాధికార సంస్థకూ నట్లు బిగించనిదే- నకిలీల ఊబి నుంచి దేశం బయటపడలేదు!

సరైన భూపాలనతోనే తీరైన ప్రగతి

భూమి పాలన వ్యవహారాలకు స్పష్టత ఇచ్చి, అజెండాను సంపూర్ణంగా అమలుపరచిన దేశాలే అభివృద్ధిపథంలో దూసుకెళ్లాయి. అస్పష్టతతో ఊగిసలాడుతున్న దేశాలు ప్రగతిబాటలో పడుతూలేస్తూ సాగుతున్నాయి. జపాన్, హాంకాంగ్, సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్, చైనా దేశాల అభివృద్ధికి కీలక కారణం- వ్యవసాయ వ్యవహారాల్లో తెచ్చిన మార్పులు, సమర్థంగా అమలు చేసిన భూసంస్కరణలే! దేశాభివృద్ధి, పేదరిక నిర్మూలనల కోసం వ్యవసాయ సంబంధాల సమర్థ నిర్వహణ, భూ సుపరిపాలన, భూసంస్కరణల అమలు తప్పనిసరి. స్పష్టమైన భద్రమైన భూమి హక్కులు, భూమి, భూ సంబంధిత సేవలపై అందరికీ సమాన అవకాశాలు- సమతుల ఆర్థికాభివృద్ధికి ప్రధాన కారకాలు. భూ సంస్కరణలు అమలు జరిగితేనే భూమి, రుణాలు, ఇతర ఉత్పాదక సేవలను పేదలు పొందగలుగుతారు. విపణిలో పాలుపంచుకోగలుగుతారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోగలుగుతారు. తద్వారా అభివృద్ధిలో భాగస్వాములు కాగలరు. స్వతంత్రం వచ్చిన నాటినుంచి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు భూసంస్కరణల అమలుకు ఎన్నో చట్టాలు చేశాయి. అమలు మాత్రం అసంపూర్ణంగానే మిగిలింది. అందుకే, కేంద్ర ప్రభుత్వం 2008లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నేతృత్వంలో 'వ్యవసాయ సంబంధాలు, అసంపూర్ణ భూసంస్కరణల'పై ఓ కమిటీని నియమించింది. పలు సూచనలతో కమిటీ సవివరమైన నివేదిక ఇచ్చినా, అదీ అమలుకు నోచుకోలేదు. 2012లో కేంద్రం ఒక భూమి కార్యదళం (టాస్క్‌ఫోర్స్) ఏర్పాటుచేసింది. రాష్ట్రప్రభుత్వాలకు పలు సూచనలు జారీచేసింది. ఒక ముసాయిదా భూ విధానాన్నీ రూపొందించింది. ఇంటి స్థలాల హక్కు చట్టం అందులో భాగమే. ఒనగూడిన ఫలితం మాత్రం శూన్యం. ఈ నేపథ్యంలోనే భూ సంబంధిత అంశాలను చర్చించడానికి కేంద్రప్రభుత్వం తిరువనంతపురంలో నేడు కీలక సమావేశం ఏర్పాటు చేసింది. వివిధ రాష్ట్రాల రెవిన్యూ అధికారులు, కేంద్రప్రభుత్వ అధికారులు ఇందులో పాల్గొంటున్నారు.

అమలుకాని సిఫార్సులు

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ల నుంచి ప్రభుత్వాల అజెండాలో భూమి ఒక ప్రధాన అంశం. మొదటి పంచవర్ష ప్రణాళిక నుంచి ప్రతి ప్రణాళికా భూమిపై దృష్టి పెట్టింది. అతికొద్ది మంది చేతుల్లో ఎక్కువశాతం భూమి ఉంది. ఎక్కువ మంది ప్రజలు భూమిలేని వ్యవసాయ కార్మికులు, కౌలుదారులు. ఇది అప్పటి పరిస్థితి. ఇందులో మార్పుతెచ్చి, పేదరికాన్ని రూపుమాపి అభివృద్ధి సాధించడానికి అయిదో దశకం నుంచి నేటి వరకు ఎన్నో ప్రయత్నాలు సాగాయి. భూపరిమితి చట్టాలు, మధ్యవర్తుల రద్దు, కౌలుదారులకు రక్షణలు, భూపంపిణీ... ప్రభుత్వాలు తీసుకున్న ప్రధానమైన చర్యలు. భూ అంశాలపై శాసనాలు చేసే అధికారాన్ని రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వాలకే కట్టబెట్టింది. రాష్ట్రాలూ పదుల సంఖ్యలో చట్టాలు చేశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే రెండువందలకు పైగా భూచట్టాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వమూ వివిధ సందర్భాల్లో రాష్ట్రాలకు సూచనలు జారీచేసింది. కాగితాలపై ప్రయత్నాలు ఘనంగానే ఉన్నా, ఫలితాల సాధన ఆశాజనకంగా లేదు. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తరవాత జరిగిన రెవిన్యూ మంత్రుల సమావేశం, ఆపై ఏర్పాటు చేసిన సబ్ కమిటీ- భూమికి సంబంధించిన అంశాలను కూలంకషంగా చర్చించి తగు సూచనలు చేశాయి. దశాబ్దం క్రితం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విస్తృత అధ్యయనానికి నియమించిన కమిటీ సైతం దేశవ్యాప్తంగా పర్యటించి, సభలు సమావేశాలు నిర్వహించి ఎన్నో అభిప్రాయాలను సేకరించింది. భూమికి సంబంధించిన ఏడు ప్రధాన అంశాలపై ఆ కమిటీ తన నివేదికలో సూచనలు చేసింది.

భూ పరిమితి, మిగులు, ప్రభుత్వ, భూదాన్ భూముల పంపిణీ, కౌలు, ఇంటి స్థలాలు, భూపరిపాలన, దళిత గిరిజన భూముల అన్యాక్రాంతం, ఊరుమ్మడి భూములు, ఈశాన్య రాష్ట్రాల భూములు అనే అంశాలపై సబ్ కమిటీల సూచనలు నివేదికలో ఉన్నాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 50 లక్షల ఎకరాల సీలింగ్ మిగులు భూమిని, 55 లక్షల మంది పేదలకు పంచారని పేర్కొంటూ సీలింగ్ చట్టాల పటిష్ఠ అమలుకు సూచనలు చేసింది. ప్రభుత్వ, భూదాన్ భూముల పంపిణీలో ఉన్న సమస్యలను వివరిస్తూ పరిష్కారాలు

ఏళ్లతరబడి వీడని చిక్కుముళ్లు

సూచించింది. కౌలు చట్టాల్లో సంస్కరణలు తప్పనిసరని స్పష్టీకరించింది. పేదలకు ఇళ్ల నిర్మాణాల పథకాల్లో భాగంగా వారికి ఉచితంగా పది సెంట్లు/నాలుగు గుంటల వరకు ఇంటి స్థలాలు అందించాలని సూచించింది. గిరిజనులు దళితుల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలంది. భూమి రికార్డులను ఆధునీకీకరించి భూపరిపాలనను మెరుగుపరచాలంది. కమిటీ తమ నివేదిక ఇతర నివేదికల్లా కాకుండా సంపూర్ణంగా అమలు జరగాలని, ముక్కలు ముక్కలుగా అమలు చేయవద్దని ముందుమాటలోనే కోరుకుంది. వాస్తవానికి అది కనీస మాత్రంగానైనా అమలుకే నోచుకోలేదు!

భూమి టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో కేంద్రం ఒక భూ సంస్కరణల విధానాల ముసాయిదాను రూపొందించి రాష్ట్రాల అభిప్రాయం కోరింది. భూమి, ఇంటి స్థలంలేని గ్రామీణ పేద కుటుంబాలకు దాన్ని హక్కుగా కల్పించడానికి ఒక

పేదల పోరుబాట

'జనాదేశ్' పేరుతో వేలమంది 2007లో దిల్లీకి పాదయాత్ర చేసినప్పుడు- వ్యవసాయ సంబంధాలు, అసంపూర్ణ భూసంస్కరణలపై కమిటీ ఏర్పాటైంది. నివేదిక అమలు కాకపోవడంతో 'జనసత్యాగ్రహ' పేరుతో 2012లో దిల్లీ వైపుగా సాగిపోయారు. పాదయాత్ర నిర్వహిస్తున్న ఏక్తాపరిషద్ సంస్థతో కేంద్రం ఆగ్రా వద్దనే పది పాయింట్ల ఒప్పందం కుదుర్చుకుంది. జాతీయ భూసంస్కరణల విధానం, ఇంటి స్థలాల హక్కుల చట్టం, కనీస వ్యవసాయ భూమి హక్కు చట్టాల రూపకల్పన; పేదలు, గిరిజనులు, ఇతర అణగారిన వర్గాలకు భూ పంపిణీ, వివాదాల సత్వర పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, భూమి ట్రైబ్యునళ్ల ఏర్పాటు, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం సమర్థ అమలు, అటవీ రెవిన్యూ భూహద్దు వివాదాల పరిష్కారం, ఊరుమ్మడి ఆస్తుల రక్షణ, ఈ ఒప్పందంలోని అంశాల అమలుకు భూమి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ఆగ్రా ఒప్పందంలోని కీలక అంశాలు.

ముసాయిదా చట్టం రూపొందించింది. భూ సంస్కరణల అంశంలో తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్రాలకు కేంద్రం సూచనలు చేసింది. భూమి ట్రైబ్యునళ్లు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, పేదలకు సహాయకారిగా ఉండేందుకు పారా లీగల్ వ్యవస్థ ఏర్పాటుకు రాష్ట్రాలు ముందుకొస్తే సాయం అందిస్తానని కేంద్రం ప్రకటించింది. అమలు పరిస్థితి ఎప్పటిలానే పడకేసింది. ఆగ్రా ఒప్పందంలోని పది అంశాల అమలులోనూ ప్రగతి శూన్యం. ఇది మరో పేదల పాదయాత్రకు కారణమైంది. రాబోయే అక్టోబరులో 'జనాందోళన్' పేరుతో వేలమంది భూమిలేని పేదలు భూమి హక్కుల కోసం పాదయాత్రగా దిల్లీకి కదలనున్నారు. అందువల్లే కేంద్ర ప్రభుత్వం భూమి అంశాలపై చర్యలకు తాజాగా శ్రీకారం చుట్టింది. నాలుగేళ్లుగా డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునికీకరణ కార్యక్రమం ద్వారా రికార్డుల సవరణ, కంప్యూటరీకరణ, సర్వేకు కృషి జరుగుతోంది. అటవీ హక్కుల చట్టం ద్వారా వేలమంది గిరిజనులకు అటవీ భూములపై హక్కు పత్రాలు లభించాయి. రాష్ట్ర ప్రభుత్వాలూ తమవంతు కృషి కొనసాగిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భూమి రికార్డుల మెరుగుదల కోసం విశేష కృషి జరిగింది. భూ చట్టాల్లో గణనీయ మార్పులు వచ్చాయి. కాని దేశవ్యాప్తంగా పేదల భూమి హక్కుల కోసం చేయాల్సింది ఇంకెంతో ఉందన్నది నిష్ఠుర సత్యం!

తక్షణ కర్తవ్యం

భూమి సంబంధిత అంశాలపై దృష్టి పెట్టడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం ప్రభుత్వాల విహిత బాధ్యత. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలంటే- భూ చట్టాల అమలు, భూ పరిపాలన మెరుగుదల తప్పనిసరి. అందుకోసం ప్రభుత్వం ప్రధానంగా తొమ్మిది రకాల చర్యలు సత్వరం చేపట్టాలి. అందులో మొదటగా భూమి, ఇంటి స్థలం లేని గ్రామీణ పేద కుటుంబాలకు ఇంటి స్థలాలను ప్రభుత్వాలు హక్కుగా కల్పించాలి. ఉపాధి హామీ హక్కు చట్టం, ఆహార భద్రత చట్టంలా ఇంటి స్థలాల హక్కు చట్టం రూపొందించాలి. రెండోది- భూమి లేని, వ్యవసాయాధారిత గ్రామీణ కుటుంబాలకు కనీస సేద్య భూమి ఇవ్వడానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ, మిగులు, భూదాన్, ఇతర భూముల పంపిణీ వెంటనే తలపెట్టాలి. ప్రభుత్వ భూమి పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నాయి. మహిళలకు, దళితులకు భూమి కొనుగోలు పథకాలు వేలమందికి భూమి దక్కేలా చేశాయి. కుప్పలుగా పేరుకుపోతున్న భూ వివాదాల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, భూ ట్రైబ్యునళ్ల ఏర్పాటు మూడో కీలకాంశం. కొన్నేళ్ల క్రితం భూమి ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసుకున్న బిహార్‌లో, ఇంతకు మునుపే ట్రైబ్యునళ్లు గల రాష్ట్రాల్లో వివాద పరిష్కారాలు మెరుగ్గా ఉన్నాయి. భూ వివాద పరిష్కారాలకు ప్రత్యేక చట్టం తెస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుంది. దీనికి బిహార్ మంచి ఉదాహరణ. నాలుగో అంశం- పేదలకు భూ సమస్యలు, వివాదాలు వచ్చినప్పుడు సాయం అందించడానికి పారాలీగల్, కమ్యూనిటీ సర్వేయర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి వ్యవస్థ లక్షల మంది పేదలకు సాయమందించి వారికి భూమి హక్కులు దక్కేలా చేసింది. అయిదోది- భూ చట్టాల అమలు, భూ పరిపాలన అమలు పర్యవేక్షణకు కేంద్ర రాష్ట్ర స్థాయుల్లో పర్యవేక్షక వ్యవస్థ ఏర్పాటు చేయడం! ప్రజల భాగస్వామ్యంతో భూరికార్డుల నవీకరణ, భూముల సర్వే చేపట్టడం తీసుకోవాల్సిన ఆరో చర్య. ఈ విషయంలో నాలుగేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో భూ రికార్డుల ఆధునికీకరణకు చేపడుతున్న చర్యలు ఆదర్శప్రాయాలు. ఏడు- ప్రతి రాష్ట్రంలో ఒకే తరహా భూ చట్టం ఉండటం! అందుకోసం భూచట్టాలన్నింటినీ ఒకటిగా క్రోడీకరించాలి. ఈ తరహాలో ఉత్తర్ ప్రదేశ్ రెవిన్యూ కోడ్‌ను రూపొందించి అమలు చేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999లో ఇలాంటి ప్రయత్నం జరిగింది. ఎనిమిది- మహిళా భూమి హక్కులపై ప్రత్యేక దృష్టి, వారసత్వ చట్టాల సక్రమ అమలు. భూమి రికార్డుల్లో మహిళ భూయజమానులు, సాగుదారుల పేర్ల నమోదు. తొమ్మిది- కౌలు చట్టాల్లో మార్పులు, కౌలుదారులను రైతులుగా గుర్తించడం! డెబ్బై ఏళ్లుగా సాగుతున్న భూసంస్కరణలు, పేదలకు భూమి అందించే ప్రయత్నాలు, భూపరిపాలన మెరుగుదలకు జరుగుతున్న కృషి ఎన్నో ఫలితాలను ఇచ్చిన మాట వాస్తవమే అయినా చేయాల్సింది మరెంతో ఉంది. ఫలితాల సాధనలో వెనకబడితే ఆ మేరకు అభివృద్ధిలోనూ వెనకబాటు తప్పదు. భూమిలేని పేదల్లో అసంతృప్తి ఉన్నంతకాలం అభివృద్ధి పరిపూర్ణం కాదు. భూహక్కుల కోసం పేదలు రోడ్డెక్కకముందే- ప్రభుత్వాలు మేలుకొని తక్షణ చర్యలు చేపట్టాలి!

– ఎం.సునీల్ కుమార్

(రచయిత– భూచట్టాల నిపుణులు, అనుబంధ ఆచార్యులు, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం)

వీరేంద్రకపూర్

కశ్మీర్ కథ మొదటికి...

జమ్మూకశ్మీర్‌లో మూడున్నరేళ్ల పీడీపీ-భాజపా సంకీర్ణ ప్రయోగం అర్ధంతరంగా ముగిసిపోయింది. మెహబూబా ముఫ్తీ ప్రభుత్వానికి భాజపా తన మద్దతు ఉపసంహరించుకోవడంతో రాష్ట్రం గవర్నరు పాలనలోకి వెళ్ళిపోయింది. నిజానికి ముఫ్తీ ప్రభుత్వం కశ్మీర్ లోయలో శాంతి స్థాపనకు చేసిన ప్రయత్నాలుగాని, ఆ దిశగా సాధించిన పురోగతిగాని ఏమీ లేదు. ఈ మూడున్నరేళ్లలో అనేక సందర్భాల్లో కశ్మీర్ నేల దారుణ సంక్షోభాల్లో కొట్టుమిట్టాడింది. గవర్నర్ పాలన దృష్ట్యా, ఇక మీదట పరిస్థితి మరింత అదుపు తప్పి కశ్మీర్‌లో హింస ప్రజ్వరిల్లే అవకాశాలు కొట్టిపారేయలేనివి. పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజారిటీ దక్కకపోవచ్చునన్న అంచనాల నేపథ్యంలో- 'ఇస్లామాబాద్'పై సైన్యం నియంత్రణ ఇనుమడిస్తుందన్న అంచనాలున్నాయి. ఈ పరిస్థితుల్లో కశ్మీర్ నేలపై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల హడావుడి మరింత పెరగవచ్చు. కశ్మీర్ చుట్టూ రాజకీయాలు నడిపే పీడీపీ, జమ్ము కేంద్రంగా రాజకీయం సాగించే భాజపాలు చెరోవైపు భీష్మించుకు కూర్చోవడంతో వివిధ సమస్యలు ఎక్కడివక్కడేగా మిగిలిపోయాయి. కశ్మీరీ యువకులను తుపాకీ సంస్కృతికి దూరం చేయడంలో పీడీపీ ప్రభుత్వం విఫలమైంది. ఇప్పుడు గవర్నర్ ఓహ్రా నేతృత్వంలో కశ్మీర్ పరిణామాలు ఏ మలుపు తిరుగుతాయో చూడాలి.

సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ కశ్మీర్ వ్యవహారంలో జాతీయ భావాలను ప్రేరేపించి భాజపా రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందన్న విశ్లేషణలు జోరుగా వినిపిస్తున్నాయి. వేర్పాటువాదులు రెచ్చిపోయి కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న వేళ, సందు దొరికితే సరిహద్దులు దాటివచ్చి హింసాగ్ని ప్రేరేపించేందుకు పశ్చిమాన పాకిస్థాన్ కాచుకొని కూర్చున్నందువల్ల- దేశ భద్రతే ఏ పార్టీకైనా ప్రథమ ప్రాథమ్యం కావాలి. జాతి భద్రతతో ముడిపడిన ఇలాంటి అంశాలనూ రాజకీయాలతో కలగలిపి మాట్లాడటం బాధాకరం. కశ్మీర్ వ్యవహారంలో గట్టిగా వ్యవహరిస్తే 2019 ఎన్నికల్లో ఓటర్లంతా బారులు తీరి భాజపాకు ఓటు వేస్తారన్న తరహాలో వ్యాఖ్యానించడం అహేతుకం. ఇది ఓటర్ల విచక్షణను అవమానించడమే! కశ్మీర్ సమస్య సంక్షోభమై రగలడానికి నెహ్రూ జమానాలో అనుసరించిన మితిమీరిన మెతక వైఖరే కారణం. ఆ తరవాత కాంగ్రెస్ ప్రభుత్వాలు

పీడీపీ-భాజపా తెగతెంపుల పర్యవసానం

సైతం అదే తరహా గందరగోళ వైఖరినే కొనసాగించడంతో సమస్య చిక్కుముళ్లు పడింది. నాలుగేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించింది. ఐఎస్ఐ ఆధ్వర్యంలో ఉగ్రవాదులకు నారూనీరూ పోసి భారత్‌లోకి తరలించే ప్రక్రియకు స్వస్తి పలకనన్నాళ్లూ పాకిస్థాన్‌తో చర్చల ప్రసక్తే లేదని మోదీ సర్కారు తెగేసి చెప్పింది. కశ్మీర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సైఫుద్దీన్ సోజ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. 'కశ్మీర్ స్వాతంత్ర్యాన్ని కోరుతున్నా'రంటూ గతంలో పర్వేజ్ ముషారఫ్ చేసిన వ్యాఖ్యలు తనకు సంపూర్ణ ఆమోదమని ప్రకటించడం ద్వారా సైఫుద్దీన్ సోజ్ ఆ రాష్ట్రంలో వేర్పాటువాదుల మనసు గెలుచుకునే ప్రయత్నం చేశారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే అలాంటి వ్యాఖ్యలపట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఏ రకంగా స్పందిస్తారన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. సైఫుద్దీన్ వ్యాఖ్యలను నిర్ద్వంద్వంగా ఖండించడం ద్వారా కశ్మీర్ విషయంలో పార్టీ వైఖరిని రాహుల్ గాంధీ స్పష్టం చేయాల్సి ఉంది. ఒకరకంగా ఆయన నాయకత్వ పరిణతికి ఇది పరీక్ష! ఈ పరీక్షలో ఆయన నెగ్గితే రాహుల్‌పట్ల ఉన్న దృక్పథం ఒక్కసారిగా మారిపోతుంది. ఆయన గౌరవం పెరుగుతుంది.

కశ్మీర్ విషయంలో దేశభక్తి భావనను రెచ్చగొట్టి ఓట్లు కొల్లగొట్టాలని భాజపా ప్రయత్నిస్తోందన్న ఆరోపణల్లో అర్థంలేదనే అనిపిస్తోంది. నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా దేశంలోని చిన్నాచితకా రాజకీయ పక్షాలన్నింటినీ ఒకే వేదికమీదకు తీసుకురావాలని రాహుల్, మమత బెనర్జీ వంటివారు ప్రయత్నిస్తున్నారు. కానీ, పరస్పర సైద్ధాంతిక వైరుధ్యాలతో కొట్టుమిట్టాడుతున్న ఈ పార్టీలు ఎంతమేరకు ఒక జట్టుగా నిలబడతాయన్నది సందేహమే. ఇప్పటికప్పుడు కొన్ని పార్టీలు ఒక కూటమిగా ఏర్పడినా- ఎన్నికలు దగ్గర పడేసరికి అవి సొంత లాభం చూసుకొని భాజపాతో చేతులు కలిపినా ఆశ్చర్యం లేదు. 2014లో ప్రధానిగా మోదీ పగ్గాలు చేపట్టినప్పుడు ఆయన పాలన దేశంలోని కార్పొరేట్ వర్గాలకు మేలు చేకూర్చేదిగా ఉండబోతోందని చాలామంది భావించారు. కాలం గడిచేకొద్దీ అందుకు పూర్తి విరుద్ధంగా జరిగింది. పన్ను ఎగవేతదారులకు చుక్కలు చూపించే చట్టాలు తీసుకురావడంతోపాటు, పేదలకు చేరాల్సిన సంక్షేమ ఫలాలు ఎక్కడా దారి తప్పకుండా మోదీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంది. నిజానికి మోదీ సర్కారు చేపట్టిన చర్యలు దేశంలోని బడా వ్యాపారులకు కోపం తెప్పించాయి. ఈ తరుణంలో దేశంలోని కార్పొరేట్లు ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతుగా నిలుస్తాయో ఊహించడం అసాధ్యం కాదు!

ఈనాడు లేఖలు

ఐశ్వర్యంఉన్న ఆకలి ప్రపంచం

ప్రపంచవ్యాప్తంగా అన్నార్తుల సంఖ్య కోట్ల సంఖ్యలో పెరిగిపోతోందన్న ఐక్యరాజ్య సమితి గణాంకాలు ప్రపంచ దేశాలు తలదించుకోవాల్సిన పరిణామం. దశాబ్ద కాలంపాటు అదుపులో ఉన్న ఆకలి సూచీ మళ్ళీ పైపైకి దూసుకుపోతోంది. ఆకలి, పేదరికం తగ్గించుకోవాలని ప్రతినపూనిన దేశాలు కార్యాచరణలో విఫలమవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 83 కోట్ల మంది ఆకలి బాధితులు ఉన్నారు. దక్షిణాసియాలోనే వారి సంఖ్య అధికం. అందులో భారత్‌లోనే క్షుద్బాధితులు ఎక్కువగా ఉన్నారన్నది చేదునిజం. ఆర్థికాభివృద్ధిలో భారత్ దూసుకుపోతోందని పాలకులు ఎంతగా చెబుతున్నా, అసలు వాస్తవాలు విషాద పార్శ్వాలను ఆవిష్కరిస్తున్నాయి. మానవాభివృద్ధి సూచీ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే భారత్ దీర్ఘకాలం వెనకబడిన దేశంగా మిగులుతుంది.

- డాక్టర్ డీవీజీ శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం, విజయనగరం జిల్లా

అనుచిత ఎత్తుగడలు

రాష్ట్ర విభజన సమయంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం అనేక వాగ్దానాలు గుప్పించింది. విభజన చట్టంలో హామీలన్నింటినీ చిత్తశుద్ధితో అమలుపరచాల్సి ఉండగా, ప్రధాన వాగ్దానాలను ఒక్కొక్కటిగా కేంద్రం నీరుగారుస్తుండటం బాధాకరం. ఏపీలోని కడపలో, తెలంగాణలోని బయ్యారంలో ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, అది సాధ్యం కాబోదన్న సంకేతాలు పంపడం అందులో భాగమే. మరోవైపు స్థానిక భారతీయ జనతాపార్టీ నాయకులు కేంద్రం వైఖరికి విరుద్ధంగా మాట్లాడుతూ కర్మాగారాలు వస్తాయని చెబుతుండటం- ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ప్రజాప్రయోజనాలతో ముడివడిన కీలక విషయాల్లో ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడటం పూర్తిగా అహేతుకం.

- తల్లాప్రగడ ప్రభాకర్, మదీనాగూడ, హైదరాబాద్

సంతోషం చిరునామా

మనిషి తాను జీవించినంతకాలం సంతోషంగా ఉండాలనుకొంటాడు. సంతోషం కోసమే అన్నం తింటాడు. సంతోషం కోసమే ఆటలాడుకుంటాడు, నిద్రపోతాడు. సంతోషం కోసమే పెళ్ళి చేసుకొంటాడు, పిల్లలు కావాలనుకొంటాడు. చేసే పని, కూసే కూత, రాసే రాత... అంతా సంతోషం కోసమే! ఇంతకూ సంతోషం ఎక్కడ దొరుకుతుంది అనేది విలువైన ప్రశ్న. సంతోషం చిరునామా కోసం మనిషి వెదకని చోటులేదు. చేయని ప్రయత్నం లేదు. అయినా సంతోషం గగన కుసుమంగా ఎందుకు ఉన్నదో మనిషికి అర్థం కావడంలేదు.

ప్రపంచాన్ని నడిపేది డబ్బు. డబ్బు లేకుండా ఏ మనిషీ జీవించలేడు. అది ఎంత ఎక్కువగా నిల్వ ఉంటే అంత సౌఖ్యంగా జీవించగలననుకుంటాడు మనిషి. కానీ డబ్బు సంతోషాన్ని ప్రసాదిస్తుందా అంటే అనుమానమే. లోకంలో పుష్కలంగా ధనరాశులు పోగుచేసిన సంపన్నులెందరో ఉన్నారు. కానీ వారందరికీ సౌఖ్యం దొరకవచ్చునేమోగానీ సంతోషం దొరక్కపోవచ్చు. కనుక సంతోషానికి డబ్బు కారణం కాదు.

అధికారం ఉంటే సంతోషం ఉంటుందా అంటే, అదీ నమ్మకం లేదు. లోకంలో ఏకచ్ఛత్రాధిపత్యంతో అధికారాన్ని సొంతం చేసుకొని పాలించిన వారెందరో ఉన్నారు. వాళ్లు ఎల్లవేళలా సంతోషంగా ఉన్నారనే దాఖలాలు లేవు.

అందంగా ఉంటే సంతోషం ఉంటుందా? దానికీ రుజువు లేదు. ఎందరో అందగాళ్లు, సౌందర్యవంతులు మానసిక క్షోభలతో ఆత్మహత్యలు చేసుకొన్న చరిత్రలున్నాయి.

సకల విద్యలనూ ఆపోశన పడితే సంతోషం కలుగుతుందా అంటే అదీ సత్యం కాదు. ఎందరో విజ్ఞాన ఖనులైన మహానుభావులు అశాంతితో తనువులు చాలించారు.

కనుక సంతోషానికి మూలం సంపదలు, అధికారం, చదువు, అందం కావని అనుభవపూర్వకంగా మనిషికి అర్థమైంది. సంతోషానికి ధనికులు, పేదలు అనే భేదం లేదు. అందం, చదువు అనే బేరీజులు లేవు. వయోభేదం లేదు. ఎప్పుడైనా, ఎక్కడైనా మనిషికి స్వాధీనమై ఉండేది సంతోషం.

పసిపిల్లలకు బొమ్మలతో ఆడుకోవడంలోనే సంతోషం. ఎదిగే పిల్లలకు ఆటపాటలతో గడపడం సంతోషం.



అంతర్యామి

యువకులకు తమ కలలను సాకారం చేసుకోవడమే సంతోషం. వృద్ధులకు తమ సంతానాన్ని చక్కగా చూసుకొంటూ ఉండటమే సంతోషం. కొందరికి ప్రకృతి ఆరాధన సంతోషం. కొందరికి తీర్థక్షేత్రాలను సందర్శించడం సంతోషం. కొందరికి సంగీతం వినడం సంతోషం. కొందరికి సృజన చేయడమే పరమానందం. ఇలా సంతోషానికి ఒక నిర్వచనం లేదు. ఒక ఉనికి లేదు. ప్రపంచంలోని అణువణువులోనూ సంతోషం నిండి ఉంది. దాన్ని చూడగలగడమే మనిషి పని.

పరిమిత సంపాదనతో అన్నవస్త్రాదులను సమకూర్చుకొని సంతోష జీవనం గడుపుతున్నవాళ్లెందరో ఉన్నారు. వాళ్లకు పూరి గుడిసెలైనా, పక్కా భవనాలైనా ఒక్కటే. రాజప్రాసాదాల వంటి విలాస భవనాల్లో హంసతూలికాతల్పాలపైన పడుకున్నా కొందరు ముళ్లపాన్పు మీద పడుకొన్నట్లే నిద్ర కరవై, దుఃఖ జీవితాన్ని కొనసాగిస్తుంటారు. ఉన్నంతలో గడుపుకొంటూ, తోటివారికి సహాయపడుతూ, దీనులపట్ల కారుణ్యాన్ని ప్రదర్శించేవారికి ఏ సంపదలతోనూ పని లేదు. సంపదలు ఎన్ని ఉన్నా ఎవరికీ ఏ విధంగా తోడ్పడని జీవితాలూ ఉన్నాయి.

మనిషి తన జీవితంలో అనుక్షణం సంతోషాన్ని ఆహ్వానించాలి. అసంతృప్తిని తరిమివేయాలి. కష్టాలకు, కడగండ్లకు, బాధలకు కుంగిపోరాదు. ఉన్నంతలో ఆనందాన్ని తోడుకోవాలి. ఆత్మీయులతో మనోభావాలను పంచుకొని సేదదీరాలి. అనవసరమైన భయాలను దరిజేరనీయరాదు. అనవసర విషయాల్లో తలదూర్చరాదు. కోరి కోరి కష్టాలు తెచ్చుకోరాదు. నీతిమంతమైన జీవితానికి దారులు వేసుకోవాలి. అనుచిత సంపాదనకోసం అర్రులు చాచకూడదు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అందించే స్ఫూర్తితో జీవితాన్ని అమృతమయం చేసుకోవాలి. మానసికోన్నతికి దారులను అన్వేషించాలి. అంతర్యామితో అనుసంధానం కావాలి. అదే చిట్టచివరి సంతోషానికి చిరునామా!

– డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

అభివృద్ధికి దుష్టచతుష్టయం అడ్డు

- దీక్షను ప్రతిపక్షాలు హేళన చేయడం దారుణం
- జగన్ చేస్తున్నది ముద్దులయాత్ర
- పవన్‌కల్యాణ్ 'కన్ఫ్యూజన్ మాస్టర్'
- సీఎం రమేష్ దీక్షలో మంత్రుల ధ్వజం

ఈనాడు - కడప

కడపలో ఆరోరోజు ఉక్కు దీక్షలో ఎంపీ సీఎం.రమేష్‌ను పరామర్శిస్తున్న మంత్రులు జవహర్, ఆదినారాయణ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు ★ మద్దతు తెలపడానికి వచ్చిన ప్రజలు

'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దుష్టచతుష్టయం అడ్డుపడుతోంది. కాంగ్రెస్, భాజపా, జనసేన, వైకాపా.. ఒకేగూటి పక్షులుగా మారి అర్థరహిత విమర్శలతో పబ్బం గడుపుకుంటున్నారు. మానవత్వం లేని ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం. తెదేపా దీక్షలపై అవహేళన చేయడం దారుణం' అని రాష్ట్రమంత్రులు ధ్వజమెత్తారు. ఎవరు అడ్డుపడినా కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాడతామన్నారు. సీఎం రమేష్ ప్రాణాలకు తెగించి ఆమరణ దీక్షకు దిగడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. కడపలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి చేపట్టిన ఆమరణదీక్ష సోమవారానికి ఆరురోజులకు చేరింది. మంత్రులు జవహర్, ఆదినారాయణరెడ్డితో పాటు ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు పార్టీ నాయకులు మద్దతిచ్చారు. పలు ప్రజా, రాజకీయ, విద్యార్థి సంఘాలు శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం ప్రకటించాయి. ప్రధాని మోదీ కుటుంబం లేని వ్యక్తి అని.. అందుకే బంధాలు, బంధుత్వాలు తెలియడం లేదని మంత్రి జవహర్ విమర్శించారు. కిమ్‌తో సరితూగే వ్యక్తి మోదీ అని.. ఉత్తరకొరియాలో ఆయనకు యుద్ధకాంక్ష ఉంటే భారత ప్రధానికి రాజ్యకాంక్ష ఉందని ఆరోపించారు. వైకాపా అధ్యక్షుడు జగన్ ముద్దులయాత్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. పవన్ కల్యాణ్ 'కన్ఫ్యూజన్ మాస్టర్'గా పేరొందితే.. జగన్ 'కరప్షన్ మాస్టర్'గా గుర్తింపు పొందారన్నారు. విభజన బిల్లు తప్పులతడకగా ఉందంటున్న భాజపా.. అప్పుడు ఎందుకు ఒప్పుకున్నారో చెప్పాలని కంభంపాటి రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలకు రాజకీయం కావాలో? రాష్ట్రాభివృద్ధి కావాలో తేల్చి చెప్పాలన్నారు. ప్రతిపక్షాలు సీఎం రమేష్ దీక్షను అవహేళన చేయడం దురదృష్టకరమని కుటుంబరావు పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల ఒప్పందంలో భాగంగా గాలి జనార్దన్‌రెడ్డికి లబ్ధి చేకూర్చడం కోసమే కడప ఉక్కుపై కేంద్రం రాజకీయం చేస్తోందని విమర్శించారు. జగన్, గాలిజనార్దన్‌రెడ్డికి కడపకు ఉక్కు పరిశ్రమ రావడం ఇష్టం లేదని.. అందుకే గాలితో ప్రకటన ఇప్పిస్తున్నారని దుయ్యబట్టారు. ఉక్కు పరిశ్రమ పెట్టడానికి ఓ పారిశ్రామికవేత్త ముందుకొస్తే డబ్బులడిగారంటూ పవన్ మాట్లాడుతున్నారు.. లోకేష్‌పై విమర్శల నుంచి విశాఖ భూముల వరకు ఇష్టానుసారం మాట్లాడుతుండటం దారుణమన్నారు. పవన్ ఆధారాలు, పేర్లతో సహా చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. కడపలో దీక్ష ఆరంభమయ్యాక భాజపా వర్గాలు గాలి జనార్దన్‌రెడ్డితో మాట్లాడిస్తున్నారు.. కేంద్రం అన్ని అనుమతులు ఇస్తే సహకరిస్తామని.. బ్రహ్మణి పూర్తిచేసినా అభ్యంతరం రాలేదన్నారు. కడపకు ఉక్కు పరిశ్రమ వస్తే చాలని అభిప్రాయపడ్డారు.

దీక్ష చేస్తున్న సీఎం రమేష్, బీటెక్ రవి ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. నీరసించిపోయి లేవలేని స్థితికి చేరారు.. వైద్యులు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి ప్రమాద స్థితిని తెలియజేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.. తెదేపా శ్రేణులు ప్రార్థనలు చేస్తున్నాయి. ఇద్దరి ఆరోగ్య పరిస్థితిపై గవర్నర్ నరసింహన్ ముఖ్యమంత్రితో ఆరా తీసినట్లు తెలుస్తోంది.

'బ్రహ్మణి'కి కట్టబెట్టేందుకు కుటిల యత్నం

- మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మండిపాటు

ఈనాడు డిజిటల్, అమరావతి: భాజపా సీనియర్ నాయకుడు గాలి జనార్ధన్‌రెడ్డికి చెందిన బ్రహ్మణికి కడప ఉక్కు పరిశ్రమను కట్టబెట్టేందుకే కేంద్రం ఉద్దేశపూర్వకంగానే మోసం చేస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మండిపడ్డారు. అందుకే ప్రభుత్వ రంగ సంస్థలు రాకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. జగన్‌కు, గాలి జనార్ధన్‌రెడ్డికి విడదీయరాని బంధం ఉందన్నారు. వారిరువురికీ లబ్ధి చేకూర్చాలన్న ఆలోచనతోనే గాలి, వైకాపా, భాజపా నాయకులు కలిసే నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. భాజపా నేతలే కడపలో ఉక్కు పరిశ్రమ పెట్టేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నా కేంద్రానికి ఎందుకు కనబడడం లేదని ప్రశ్నించారు. అన్నీ అందుబాటులో ఉన్నా రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేయాలన్న ఆలోచనతో ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నట్లు ఆరోపించారు.

'గాలి'కి ఉన్న అవకాశాలు కేంద్రానికి లేవా?: మాణిక్య వరప్రసాద్

అవకాశం ఇస్తే రెండేళ్లలో ఉక్కు పరిశ్రమ పూర్తి చేస్తానని గాలి జనార్దన్ రెడ్డి చెబుతున్నపుడు... అతనికి ఉన్న అవకాశాలు కేంద్రానికి లేవా అంటూ శాసనమండలి విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రశ్నించారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. వైకాపా నేతలకు కడపలో ఉక్కు పరిశ్రమ రావాలని లేదని, అందుకే ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఎంపీ రమేశ్, ఎమ్మెల్సీ బీటెక్ రవిలకు ఆ పార్టీ మద్దతు ఇవ్వట్లేదన్నారు.

రహదారుల బాధ్యత గుత్తేదారులకు

- సీఎం సంతృప్తి చెందాకే చెల్లింపులు: అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అన్ని నియోజకవర్గాల్లో రహదారుల విస్తరణ, నవీకరణ పనులకు రూ.2400 కోట్లు వెచ్చించనున్నట్టు రహదారులు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. సోమవారం విశాఖ జిల్లా నర్సీపట్నంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఎక్కడెక్కడ పనులు అవసరమో గుర్తించే ప్రక్రియ పూర్తయిందన్నారు. వీటికి వెచ్చించాల్సిన మొత్తంలో రూ.వెయ్యి కోట్లను విజయాబ్యాంకు నుంచి రుణంగా తీసుకుంటున్నామని చెప్పారు. టెండర్ల ఖరారు, గుత్తేదారులతో ఒప్పందం తదితరాలు పూర్తిచేసి వర్షాకాలం తర్వాత పనులు మొదలుపెట్టిస్తామన్నారు. రాష్ట్రంలోని రహదారుల నిర్వహణ బాధ్యత గుత్తేదారులకే అప్పగించనున్నామని, ఐదేళ్లపాటు గోతులు పూడ్చడం, తుప్పలు తొలగింపు తదితరాల బాధ్యతలన్నీ వారే చూస్తారన్నారు. శాఖలో గ్యాంగ్‌మెన్ల సంఖ్య తగ్గిపోవడంతో ఈ కొత్త విధానం తెస్తున్నామని తెలిపారు. రోడ్ల పనులు పూర్తయ్యాక డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి ముఖ్యమంత్రి డాష్‌బోర్డుకు పంపిస్తామన్నారు. సి.ఎం. సంతృప్తి చెందాకే బిల్లులు చెల్లిస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్‌కు రూ.30.. లారీకి రూ.60

- ఉచిత ఇసుకపై కొత్త మార్గదర్శకాలు విడుదల

ఈనాడు, అమరావతి: ఉచిత ఇసుక విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీచేసింది. ర్యాంపు నిర్వహణకు ట్రాక్టర్ (ఒక యూనిట్)కు రూ.30, లారీ (రెండు యూనిట్లు)కి రూ.60 చొప్పున వసూలు చేయాలని ఆదేశించింది. ఇసుక విధానాన్ని పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ ఏర్పాటవుతుంది. ఈ కమిటీ జిల్లాలోని ప్రతి ఇసుక రీచ్‌లో స్థానిక అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తుంది. ఈ కమిటీ ట్రాక్టర్లు, లారీల నుంచి నిర్దేశిత రుసుమును వసూలు చేస్తుంది. ఇసుక రీచ్‌కు వెళ్లే మార్గాన్ని (ర్యాంపు) మొదటిసారి ఉపాధిహామీ పథకం నిధులతో ఏర్పాటు చేస్తారు. రీచ్‌లవద్ద దళారులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది.

కావేరిపై పోరుకు కర్ణాటక నిర్ణయం

- నీటి వాటా సాధన కోసం పట్టు
- పార్లమెంటు వేదికగా కేంద్రంపై ఒత్తిడి

ఈనాడు - బెంగళూరు

కావేరి నదీ జలాల పంపిణీపై ఇప్పటివరకూ తమిళనాడు, సుప్రీంకోర్టు, కావేరి ట్రైబ్యునల్‌తో తలపడిన కర్ణాటక ఇప్పుడు కేంద్రంపై పోరాటానికి సిద్ధమవుతోంది. కింది రాష్ట్రాలకు వాటా జలాల విడుదలకు కేంద్రం ఏర్పాటుచేసిన 'కావేరి నదీజలాల యాజమాన్య నిర్వహణ ప్రాధికార' నియమావళి కర్ణాటక రైతుల ప్రయోజనాలకు విఘాతాన్ని కల్పిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. నిబంధనల మేరకు ప్రాధికార సమితి నియామకం, ఇతర అంశాలపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలని ప్రధాని మోదీ, కేంద్ర జలవనరుల మంత్రి నితిన్‌గడ్కరీకి స్వయంగా విన్నవించినా స్పందించలేదని ముఖ్యమంత్రి కుమారస్వామి పేర్కొంటున్నారు.

కొత్త డిమాండు...

ఏటా తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు విడుదల చేయాల్సిన నీటి పరిమాణాన్ని కావేరి న్యాయపంచాయతీనిర్దేశిస్తుంది. గత రెండు దశాబ్దాల నుంచి నదిలో నీటి పరిమాణం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో విడుదల చేసే నీటి పరిమాణాన్ని కూడా తగ్గించాలని కర్ణాటక సన్నాహాలు చేపట్టింది. ఇదే క్రమంలో రెండు దశాబ్దాల నుంచి కర్ణాటకలో నదిలో నీటి లభ్యతపై అధ్యయనానికి సాగునీటి నిపుణులను ఆదేశించారు.

★ మూడేళ్లుగా కావేరి ఆధారిత కృష్ణరాజసాగర, హేమావతి జలాశయాల పరిధిలో ఆయకట్టుకు తగినంత నీరందక పంటలు ఎండిపోయాయి. ఈ క్రమంలో రైతుల ఇబ్బందులనూ నివేదికలో ప్రస్తావిస్తారు. నివేదిక ప్రతులను ప్రధాని కార్యాలయం, కేంద్ర జలవనరుల కార్యాలయానికి పంపటంతో పాటు కర్ణాటక ఎంపీలకూ ఇవ్వనున్నారు. వచ్చే నెల 18 నుంచి ఆరంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాలను కాంగ్రెస్, జేడీఎస్ సభ్యులు ప్రస్తావిస్తారు.

★ కావేరి నదీజలాల నిర్వహణ ప్రాధికార సమితి వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు కలగనున్న నష్టాలపై చర్చించేందుకు రెండు, మూడు రోజుల్లోనే బెంగళూరులో అఖిలపక్ష, పార్లమెంటు సభ్యుల సమావేశాన్ని నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి శివకుమార్ తెలిపారు. ప్రాధికార నియమావళిని వ్యతిరేకిస్తూ, ఏకపక్ష నిర్ణయాలను నిరసిస్తూ కేంద్రానికి లేఖలు కూడా పంపామని తెలిపారు.

గాలి సరస్వతితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శాసనమండలి ఛైర్మన్ ఫరూక్

ఎమ్మెల్సీగా గాలి సరస్వతి ప్రమాణ స్వీకారం

ఈనాడు డిజిటల్, అమరావతి: శాసన మండలి సభ్యురాలిగా గాలి ముద్దుకృష్ణమనాయుడి సతీమణి సరస్వతి ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం వెలగపూడిలోని అసెంబ్లీ బీఏసీ హాల్‌లో శాసనమండలి ఛైర్మన్ ఎండీ ఫరూక్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సరస్వతి మాట్లాడుతూ.. తన భర్త అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ అభ్యున్నతికి, కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి.. సీఎం తనపై ఉంచిన బాధ్యతను తప్పక నెరవేరుస్తానన్నారు. మంత్రి అమర్‌నాథ్‌రెడ్డితో పాటు పలువురు నేతలు సరస్వతికి అభినందలు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, దొరబాబు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు నాని, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగార్థులతో నియామక సంస్థల సంధానం

- 27న కొత్త పోర్టల్‌ను ప్రారంభించనున్న రాష్ట్రపతి

దిల్లీ: ఉద్యోగార్థులను నియామక సంస్థలతో సంధానించే ఒక డిజిటల్ వేదికను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ నెల 27న ప్రారంభించనున్నారు. ఇందులో 4.40 లక్షల మంది సుశిక్షిత యువత, 2400 నియామక సంస్థల వివరాలు ఉంటాయని ఓ అధికారి పేర్కొన్నారు. అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే ఒక కార్యక్రమంలో ఈ పోర్టల్‌కు రాష్ట్రపతి శ్రీకారం చుడతారని వివరించారు. దీనికి తోడు 50 ఎంఎస్ఎంఈ క్లస్టర్లకు రెండేళ్లలో రూ.550 కోట్ల సబ్సిడీని అందించేందుకు ఉద్దేశించిన 'సోలార్ చరఖా మిషన్'నూ ప్రారంభిస్తారని తెలిపారు.

చిన్ననీటి వనరుల గణనకు డైరెక్టర్ నియామకం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో చిన్ననీటి వనరులకు సంబంధించి ఆరో గణన చేపట్టేందుకు అర్థగణాంకశాస్త్ర సంచాలకుడిని డైరెక్టర్‌గా నియమిస్తూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సంచాలకుడే నోడల్ అధికారిగానూ వ్యవహరిస్తారు. రాష్ట్రంలో ఎన్ని చెరువులున్నాయి, ఎన్ని చిన్ననీటి చెరువులున్నాయో లెక్క తీస్తారు.

తెలంగాణ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా జస్టిస్ జైశ్వాల్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్కే జైశ్వాల్ నియమితులయ్యారు. పౌరసరఫరాలశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి అకున్ సబర్వాల్ సోమవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. జస్టిస్ జైశ్వాల్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఐదేళ్లు, లేదా 67 ఏళ్లు వచ్చేవరకు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. 1956 ఫిబ్రవరి 5న జస్టిస్ జైశ్వాల్ హైదరాబాద్‌లో జన్మించారు. సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల నుంచి 1971లో ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణత పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించి 2018 ఫిబ్రవరి 4న పదవీ విరమణ చేశారు.

పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

ఉద్యోగాల పేరుతో దోపిడీ

- ఏడుగురు నిందితుల ముఠా అరెస్టు
- రూ.51 లక్షల స్వాధీనం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన ఏడుగురు సభ్యుల ముఠాను గుంటూరు అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ విజయరావు తెలిపారు. విజయవాడ భవానీపురానికి చెందిన షేక్ మహ్మద్ ఇమ్రాన్, గుంటూరు హుస్సేన్‌నగర్‌కు చెందిన మొఘల్ సోహెల్ బేగ్, పొన్నూరు గాజులపాలెంకు చెందిన పూసల బాలకోటయ్య, పెదనందిపాడుకు చెందిన నగిరి నాగకుమార్, ఆళ్లవారిపాలెంకు చెందిన అమ్ముల నాగశేషగిరిరావు, పొన్నూరు ఇటికంపాడుకు చెందిన షేక్ కరీముల్లా, గోళ్లమూడిపాడుకు చెందిన మరక వెంకటరెడ్డిలు ముఠాగా ఏర్పడి నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తామంటూ నమ్మించారు. రైల్వేలో టీసీలు, ఫుడ్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సైన్యంలో కొలువులు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేశారు. ఆ విధంగా గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు చెందిన 26 మంది వద్ద సుమారు రూ.కోటి వసూలు చేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. ఈ నెల 13న గుంటూరులోని రెడ్డిపాలెంకు చెందిన వల్లా ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదుపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసులు గాలించగా సోమవారం నల్లపాడు రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురినీ అరెస్టు చేశారు. కోల్‌కతాకు చెందిన ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. నిందితుల నుంచి రూ.51.44 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

చౌకధరల దుకాణం వీడని కందిపప్పు

- తక్కువ ధరకే ఇస్తున్నా ఆసక్తి చూపని కార్డుదారులు
- 34శాతం కూడా మించని వినియోగదారులు
- కార్డుకు కిలో చొప్పున ఇస్తేనే ఈ పరిస్థితి

ఈనాడు - అమరావతి

బహిరంగ విపణిలోకంటే తక్కువ ధరకే ఇస్తున్నా చౌకధరల దుకాణాల్లో కందిపప్పును కార్డుదారులు చాలా తక్కువ మొత్తంలో తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల తెలుపురంగు కార్డులుంటే కందిపప్పు తీసుకుంటున్న కార్డుదారులు 35శాతానికి మించడం లేదు. ఏప్రిల్ నుంచి కార్డుకు కిలో చొప్పున పంపిణీ ప్రారంభించారు. మొదటి నెలలో 49లక్షల కార్డుదారులు మాత్రమే కందిపప్పు తీసుకోగా, రెండో నెలలో 39లక్షల మందే తీసుకోవడం గమనార్హం. ఈ నెలలో ఇప్పటివరకూ కందిపప్పు పంపిణీని విశ్లేషిస్తే.. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మాత్రమే 40శాతంపైగా కార్డుదారులు తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో అత్యల్పంగా ఎనిమిది శాతం కార్డుదారులే కందిపప్పును తీసుకోగా.. అనంతపురంలో పది శాతంలోపు, శ్రీకాకుళంలో 20శాతంలోపు, ఉభయగోదావరి జిల్లాల్లో 25శాతం చొప్పున కార్డుదారులు తీసుకున్నారు. కిలో రూ.40చొప్పునే చౌకధర దుకాణాల్లో కార్డుదారులకు ఇస్తున్నప్పటికీ పెద్దగా ఆసక్తి చూపని పరిస్థితి ఏప్రిల్, మే నెలల్లో కనిపించింది.

కారణాల్లో కొన్ని..

★ మార్కెట్‌కంటే తక్కువ ధరకే కందిపప్పును చౌకధర దుకాణాల్లో ఇస్తున్నారని ప్రచారం లేకపోవడం.

★ గత అనుభవాల దృష్ట్యా కందిపప్పు నాణ్యతపై కార్డుదారుల్లో అనుమానాలు.

★ కందిపప్పు అమ్మినా కమీషన్ నామమాత్రమేనంటూ డీలర్లు గోదాముల నుంచి తీసుకువెళ్లేందుకు ముందుకు రావడం లేదు.

నిల్వ ఉన్నా..

మార్క్‌ఫెడ్ నుంచి 84వేల టన్నుల కందులను పౌరసరఫరాల సంస్థ లోగడ కొనుగోలు చేసింది. వీటిని మరఆడించి కందిపప్పు రూపంలో ఇస్తోంది. ఈ మొత్తం 4 నెలలకు సరిపోతుందనేది ఆ సంస్థ అంచనా. కానీ.. ఏప్రిల్, మే నెలలలో 4900, 4000 టన్నుల కందిపప్పును మాత్రమే డీలర్లు తీసుకుని కార్డుదారులకు పంచారు. మరో లక్ష టన్నుల కందులు మార్క్‌ఫెడ్ వద్ద ఉన్నాయి. వీటినీ పౌరసరఫరాల సంస్థ కొనాల్సి ఉంది. ఇప్పటికే కొన్న 84వేల టన్నులను వినియోగించనందున కొత్తగా కొనడం ఎలా అన్న చర్చ సంస్థలో కొనసాగుతోంది.

1 నుంచి.. 2 కిలోల కందిపప్పు: చల్లా

ఒంగోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రేషన్‌కార్డుదారులకు జులై 1 నుంచి 2 కిలోల కందిపప్పు ఇవ్వనున్నట్లు పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ చల్లా రామకృష్ణారెడ్డి తెలిపారు. రేషన్‌దుకాణాల్లో త్వరలో ప్రముఖ కంపెనీల ఉప్పు, కారం అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పౌరసరఫరాల గిడ్డంగి హమాలీలకు క్వింటాకు (లోడింగ్, అన్‌లోడింగ్‌కు కలిపి) ప్రస్తుతం ఇస్తున్న రూ.15ను 18కి పెంచుతున్నట్లు ప్రకటించారు. సోమవారం ఆయన ప్రకాశం జిల్లా ఒంగోలులోని పౌరసరఫరాలశాఖ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పై విషయాలను వెల్లడించారు.

25 నుంచి దస్త్రాల పరిష్కార వారోత్సవం

ఈనాడు డిజిటల్, అమరావతి: ఈ నెల 25 నుంచి వచ్చే నెల 1 వరకూ పంచాయతీరాజ్, ఐటీ శాఖల్లో దస్త్రాల పరిష్కార వారోత్సవం జరగనుంది. వివిధ శాఖల్లో రోజుల తరబడి దస్త్రాలు (ఫైల్స్) అపరిష్కృతంగా ఉండడంతో అభివృద్ధి కుంటుపడుతుందని భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని శాఖలకు, మంత్రులకు వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి దస్త్రాల పరిష్కారంలో మూడో స్థానంలో ఉన్న లోకేశ్ తన శాఖలలో వేగం పెంచాలని నిర్ణయించుకున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

EDUCATION

★ Spot admissions for BBA / MBA - Business Analytics, Machine Learning Digital Marketing, Hospital MGT, Aviation MGT. Contact London International Business School, Vijayawada. 88975 39356

MBBS ABROAD
+ Govt University + Duration 5 years
WATCH + Direct MBBS
ABN Live 6:30 PM Today
9000959542, 9000748542

ANDHRA PRADESH PUBLIC SERVICE COMMISSION : VIJAYAWADA
RASHTRIYA INDIAN MILITARY COLLEGE, DEHRADUN- ENTRANCE EXAMINATION
NOTIFICATION NO. 05/2018
Applications from the boys of Andhra Pradesh are invited for admission into Class-VIII in RIMC, Dehradun for the term commencing July, 2019. The Entrance examination is scheduled to be held on 01-12-2018 (Saturday) and 02-12-2018 (Sunday) at Vijayawada. The last date for receiving the filled-in applications is 30-09-2018. The detailed Notification is available on the Commission's Website www.psc.ap.gov.in
Vijayawada, Dated: 21/06/2018 Sd/- SECRETARY
DIPR No. 189PP/CL/Advt/1/1/2018-19

సిక్కోలుకు ట్రిపుల్‌ఐటీ శోభ

శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ తరగతులను ఇప్పటివరకు కృష్ణా జిల్లా నూజివీడులో నిర్వహించేవారు. ఎట్టకేలకు శ్రీకాకుళం సమీపంలో కేటాయించిన భవనాల్లో తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం నాటికి పలువురు విద్యార్థులు శ్రీకాకుళంలోని ట్రిపుల్‌ఐటీ భవనాలకు చేరుకున్నారు. మొదటి దశలో భాగంగా సగం మంది విద్యార్థులకు తరగతులు ఇక్కడే నిర్వహించనున్నారు. మరికొందరిని తరువాత తీసుకురానున్నట్లు అధికారులు వెల్లడించారు. - న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

నూజివీడు నుంచి బస్సులో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ వద్దకు చేరుకున్న విద్యార్థులు

COLLEGE OF AGRICULTURE, UMARKHED Dist. Yavatmal,
Affiliated to Dr.P.D.K.V. Akola, A State Agriculture University Maharastra - 445206
MANAGEMENT QUOTA ADMISSION
B.Sc. (Agriculture) (4 year degree course) (ICAER Recognized)
Eligibility: 12 th Standard Pass or Equivalent
MHT-CET, NEET, JEE, AIEEA-UG (ICAER) APPEAR
Online Application Start From 11/06/2018 on following Web.Site. Last date Of Online application 05/07/2018 Website:- www.maha-agriadmission.in or www.mcaer.org.
Online application Compulsory For Management Quota Admission.
Counselling Camp VIJAYWADA-28/06/2018; WARANGAL-29/06/2018; HYDERABAD- 30/06/2018
Email: coaukd2010@gmail.com College website: www.coa-ukd.in
Contact: 7798443657, 9689369346, 9881200441
Note. Agents and Intermediates are not Entertained.

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి రూ.15 లక్షలకు పెంపు

ఈనాడు డిజిటల్, అమరావతి: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచింది. సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ సోమవారం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

'పార్ట్‌టైం' అధ్యాపకుల ఒప్పందం పొడిగింపు

ఈనాడు, అమరావతి: జూనియర్ కళాశాలల్లో కనీస టైంస్కేల్, గంట వ్యవధి పద్ధతిలో పని చేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల ఒప్పందాన్ని ఇంటర్ విద్యాశాఖ పొడిగించింది. ఈ విద్యా సంవత్సరంలో వారి సేవలను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నిబంధనలను ఎందుకు అమలు చేయడంలేదు?

- సమాధానం చెప్పండి
- పునర్‌వ్యవస్థీకరణ చట్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు
- ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశం

ఈనాడు - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని పలు నిబంధనలను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. చట్ట నిబంధనలను ఎందుకు అమలు చేయడంలేదో చెప్పాలని పేర్కొంటూ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి, హోంశాఖ, న్యాయశాఖ కార్యదర్శులు, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీచేసింది. నాలుగు వారాల్లో పూర్తి వివరాలతో ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

ఏపీకి ప్రత్యేక హోదా కల్పించడంతోపాటు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట నిబంధనలను అమలు చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన పోలూరి శ్రీనివాసరావు అనే వ్యక్తి హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది పి.వి.కృష్ణయ్య వాదనలు వినిపిస్తూ.. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంట్‌లో ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 94 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలకు పన్ను మినహాయింపుతో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాల్సి ఉన్నా కేంద్రం ఆ మేరకు వ్యవహరించడంలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రప్రభుత్వం నిర్మించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతలను తీసుకోవడం చట్ట నిబంధనకు విరుద్ధమన్నారు. నూతన రాజధాని నిర్మాణానికి ఆర్థికసాయం చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. రైల్వేజోన్ ఏర్పాటు వ్యవహారంలోను నిబంధనలు అమలుకాలేదన్నారు. ఇదే తరహాలో చట్టంలోని పలు నిబంధనలు అమలుకావడం లేదన్నారు. ఆ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన తెలుసుకుంటామని పేర్కొంది. నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

CENTRE FOR ECONOMIC AND SOCIAL STUDIES
Nizamiah Observatory Campus, Begumpet
Hyderabad - 500016, Telangana State
Tel: 040 - 23402789, 23416780 Fax : 23406808 (Website : cess.ac.in)
Ph.D PROGRAMME IN DEVELOPMENT STUDIES
ADMISSION NOTIFICATION FOR THE ACADEMIC YEAR 2018-19
The Centre for Economic and Social Studies, Hyderabad in collaboration with Telangana University, Nizamabad invites applications from candidates below 35 years of age for Admission into Ph.D Programme in Development Studies for the Academic Year 2018-19. The Programme is offered in the following subjects :
1. ECONOMICS
2. SOCIOLOGY/ANTHROPOLOGY/SOCIAL WORK
3. GEOGRAPHY/GEO-INFORMATICS
4. POLITICAL SCIENCE/PUBLIC ADMINISTRATION
5. DEVELOPMENT STATISTICS (With Specialization in Econometrics)
6. COMMERCE /BUSINESS MANAGEMENT (Related to Research Areas of CESS)
The Last Date for Submission of Application Forms is on 25th July 2018. The Entrance Test will be conducted at CESS, Hyderabad on 5th August 2018 and Interviews will be held on 25th & 26th August 2018. For all other details, visit the website: www.cess.ac.in
Sd/- DIRECTOR

ముత్యపు కవచపు అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి

ముత్తంగి అలంకారంలో శ్రీమలయప్పస్వామి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి జ్యేష్ఠాభిషేకం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం రెండో గంట నైవేద్యం అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి సంపంగి ప్రాకారంలోని కల్యాణ మండపానికి ఊరేగింపుగా వేంచేశారు. ఇక్కడ ఉత్సవమూర్తులకు చందనం, తిలకధారణతో అభిషేకాదుల అనంతరం తులసిమాలలు అలంకరించారు. సహస్రధారాభిషేకం శాస్త్రోక్తంగా పూర్తి చేసి.. నూతన పట్టువస్త్రాలు చుట్టి.. అర్చకులు నివేదన చేశారు. సాయంసందెవేళ స్వామి, అమ్మవార్లు ముత్తంగి అలంకారంతో సహస్రదీపాంలంకరణ సేవలో పాల్గొన్నారు. అనంతరం తిరువీధుల్లో భక్తులను కటాక్షిస్తూ ఊరేగారు. మంగళవారంతో ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. తిరుమల పెద్దజీయంగార్, చిన్నజీయంగార్, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

అప్పులెంతో తెలియడం లేదు

- వాటి వివరాలను సమర్పించేలా ఆదేశాలివ్వండి
- సుభాష్ చంద్ర ఫౌండేషన్ మరో పిటిషన్
- తెలంగాణలోనూ ఆస్తుల విక్రయానికి చర్యలు తీసుకోవాలి
- ఏపీలో వేలం ప్రక్రియ కొనసాగింపునకు అనుమతి
- అగ్రిగోల్డ్ వ్యవహారంలో హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: అగ్రిగోల్డ్ స్వాధీన ప్రక్రియ నుంచి వెనక్కి వెళ్లిపోవడానికి అనుమతించాలని కోరి.. . తిరిగి రంగంలోకి దిగిన ఎస్సెల్ (జీ) గ్రూపునకు చెందిన సుభాష్ చంద్ర ఫౌండేషన్ సోమవారం మరి కొన్ని డిమాండ్‌లతో అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. అప్పులెంతో తెలియడం లేదని... వాటి మొత్తం తెలిస్తే గానీ స్వాధీనం చేసుకోవడానికి అవకాశం ఉండదని తెలిపింది. కనీసం ఈ ఏడాది మార్చి 31 నాటికి బ్యాంకులు, ఇతర రుణదాతలు, ఆదాయపు పన్ను శాఖ, డిపాజిటర్లకు ఉన్న రుణాల వివరాలను అందజేసేలా ఆదేశాలివ్వాలని కోరింది. ఆదాయపు పన్ను బకాయి రూ.1000 కోట్లు ఉందని, దాన్ని మాఫీ చేసేలా ఆదేశాలివ్వాలన్న అభ్యర్థనకు హైకోర్టు నిరాకరించింది. బ్యాంకులు, ఆదాయపు పన్ను శాఖల వద్ద ఉన్న వివరాలను సమర్పించడానికి వీలవుతుందని, డిపాజిటర్ల బకాయిలను ఖచ్చితంగా చెప్పలేమని స్పష్టం చేసింది. తెలంగాణలోనూ ఆంధ్రప్రదేశ్ పద్ధతిలోనే అగ్రిగోల్డ్‌కు చెందిన ఆస్తుల విక్రయానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే నెల 16న టెండర్లు తెరచి ఆస్తుల విక్రయ ప్రక్రియను కొనసాగించడానికి అనుమతించింది. అగ్రిగోల్డ్ వ్యవహారంలో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్.వి.భట్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. మిర్యాలగూడతో పాటు రంగారెడ్డి జిల్లా గోపన్నపల్లిలో ఉన్న 10 ఎకరాల భూముల వేలానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తాకట్టులో ఉన్న ఆస్తుల వివరాలను, అందులో పాక్షికంగా ఉన్న ఆస్తుల వివరాలను కూడా సమర్పించాలని చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం వేలం జరుగుతున్నవి కాకుండా మరో 22 ఆస్తులను గుర్తించినట్లు అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడ పాయకరావుపేటలో ఉన్న భూమి తాకట్టులో లేదని చెప్పగా వేలానికి అనుమతించింది. తదుపరి వేలానికి సంబంధించిన ఆస్తుల విలువలను నిర్ధరించి నివేదికలు సమర్పించాలని పిటిషనర్లను, ప్రభుత్వాన్ని ఆదేశించింది. మిగిలిన ఆస్తుల వేలానికి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను జులై 23వ తేదీకి వాయిదా వేసింది. అక్షయ్‌గోల్డ్ కేసులో కర్నూలులో ఉన్న ఆస్తిని రూ.1.31 కోట్లకు బిడ్ వేసిన వ్యక్తికి అప్పగించడానికి హైకోర్టు అనుమతించింది.

పట్టణ పేదల ఇళ్ల నిర్మాణంలో ఏపీ, తెలంగాణలు భేష్

కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ప్రశంస

ఈనాడు, దిల్లీ: పట్టణ పేదల ఇళ్ల నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు మంచి పనితీరు కనబరుస్తున్నాయని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద జరుగుతున్న పట్టణ పేదల ఇళ్ల నిర్మాణ తీరును కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సమీక్షించింది. కొత్తగా ఆరు రాష్ట్రాలకు 3.18 లక్షల ఇళ్లను మంజూరుచేసింది. దీంతో ఇప్పటివరకూ మంజూరుచేసిన ఇళ్ల సంఖ్య 51 లక్షలకు చేరినట్లు పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది. పథకం ప్రారంభించిన మూడేళ్లలో ఇంత పెద్ద స్థాయిలో ఇళ్లు మంజూరుచేయడం గొప్ప విషయమని పేర్కొంది. ఇదివరకు తొమ్మిదేళ్లలో 12.4 లక్షల ఇళ్లు మంజూరుచేయగా, ఈ మూడేళ్లలోనే 51 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపింది. ఇప్పటివరకు 7.60 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మరో 28 లక్షల ఇళ్ల నిర్మాణం పురోగతిలో ఉన్నట్లు పేర్కొంది. ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, తమిళనాడు, ఝార్ఖండ్ రాష్ట్రాలు దేశంలో అత్యుత్తమ స్థానంలో నిలిచినట్లు తెలిపింది. ఇళ్ల నిర్మాణంలో సరికొత్త సాంకేతికతను ఉపయోగించి వివిధ రాష్ట్రాలు ఏడు లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్లు పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది.

నిరసన మహాదీక్ష చేస్తున్న నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నేతలు

ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం దారుణం

- భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నేతల నిరసన

భవానీపురం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని వాగ్దానం చేసిన భాజపా నేతలు..ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నేతలు సోమవారం నిరసన మహాదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా.. మాదిగల న్యాయమైన కోర్కెను నెరవేర్చకపోవడం తగదన్నారు. వర్గీకరణ చేసి తీరుతామని కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం భాజపా కార్యాలయంలో ఉన్న ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావుకు వినతిపత్రాన్ని అందించారు.

యాత్రికుల బస్సుకు విద్యుదాఘాతం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన ఓ యాత్రికుల బస్సుకు విద్యుత్తు తీగలు తగిలిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా..మరో ముగ్గురికి గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా తుని మండలం వెలమకొత్తూరు గ్రామంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా తలుపులమ్మవారి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఉభయగోదావరి, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన సుమారు 45 మంది పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఈ నెల తొమ్మిదో తేదీన కాశీ యాత్రకు వెళ్లారు. యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో 20 మంది శ్రీకాకుళంలో దిగిపోయారు. మిగిలిన వారు అమ్మవారి దర్శనానికి లోవ గ్రామానికి వెళ్తుండగా.. వెలమకొత్తూరు గ్రామంలో కిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలు బస్సుకు తగిలాయి. దీంతో ఖమ్మం జిల్లా ఎంనూరుకు చెందిన క్లీనర్ ఎం.కుమార్ కిందకు దిగి బస్సుకు ఉండే ఇనుప గొట్టాన్ని పట్టుకునే సరికి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. అతణ్ని కాపాడే ప్రయత్నంలో డ్రైవర్ కూడా గాయాలయ్యాయి. దీంతో బస్సులో ఉన్న 25 మంది ఒక్కసారిగా కేకలు వేయడంతో అటుగా ట్రాక్టర్‌పై వెళ్తున్న బోజంకి సూరిబాబు, మరో నలుగురు హుటాహుటిన కర్ర సాయంతో వైర్లను పైకి లేపి యాత్రికులను కిందకు దింపారు. ప్రమాదంలో పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాపురంనకు చెందిన తాంద్ర అప్పారావు, దెందులూరుకు చెందిన దానం లక్ష్మీలకు గాయాలు కాగా వీరిని తుని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

మెరుగైన అభ్యర్థుల ఎంపికకే భౌతిక సామర్థ్య పరీక్షలు: మంత్రి గంటా

ఈనాడు, అమరావతి: పాఠశాలల్లో వ్యాయామ పరిజ్ఞానం సమర్థమంతంగా అందించేందేకే పీఈటీ అభ్యర్థులకు డీఎస్సీలో భౌతిక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. అభ్యర్థుల వయసును పరిగణలోకి తీసుకుని సామర్థ్య పరీక్షలు నిర్వహించి, అత్యంత పారదర్శకంగా మార్కులు కేటాయిస్తామని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గ్వాలియర్ కేంద్రంగా ఉన్న ప్రఖ్యాత లక్ష్మీబాయ్ జాతీయ వ్యాయామ విద్యా సంస్థ ఆచార్యులు జె.పి.వర్మ నేతృత్వంలో ఈనెల 29 మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని తెలిపారు. పీఈటీలకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణ జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ) నిబంధనల మేరకే నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థుల ప్రతిభా, అనుబంధ పత్రాలను సంబంధిత పాఠశాల క్రీడా సమాఖ్య, విశ్వవిద్యాలయాలకు పంపుతున్నామని, అవి వాస్తవమని నిర్ధారణ అయిన తర్వాత కేటగిరీల వారీగా ఆ మార్కుల్ని రాత పరీక్ష మార్కులతో జత చేస్తామని తెలిపారు.

ఉత్తమ పురస్కారాల దరఖాస్తులకు జూన్ 30 వరకు గడువు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి తెలిపారు. దరఖాస్తు ప్రక్రియలో ఈసారి కొత్తగా ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. సర్వీస్, బోధనానుభవంతో సంబంధం లేకుండా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. జూన్ 30 అర్ధరాత్రి వరకు గడువుంటుందని, www.mhrd.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

- భార్యనే పీఏగా నియమించుకున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు
- సహ చట్టం సమాచారంతో లోకాయుక్తకు ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: ఉపాధ్యాయులను, వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులను ప్రజాప్రతినిధులెవరికీ పీఏలుగా నియమించవద్దనే ఉత్తర్వులున్నా కొన్ని చోట్ల ఉల్లంఘనలు కనిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు.. ఉపాధ్యాయురాలైన తన భార్య సీహెచ్ఆర్‌సీడీ లక్ష్మిని తన పీఏగా నియమించుకున్నారని సహ చట్టం ద్వారా వెల్లడైంది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేషీలో మరో ఉపాధ్యాయురాలు మత్స లక్ష్మి చేరారు. ఈమె కూడా నిబంధనలకు విరుద్ధంగా చేరారని వెల్లడైంది. దీనిపై సమాచారహక్కు చట్టం కార్యకర్త కాంగ్రేగుల వెంకటరమణ వివరాలను సేకరించి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. విజయనగరం జిల్లా వయోజన విద్యాశాఖలో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ కోసం 2016 ఫిబ్రవరి 9న ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అప్పట్లో 12 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. వారిలో ముగ్గురిని ఎంపిక చేసి రాష్ట్ర వయోజన విద్యాశాఖ డైరెక్టరుకు జాబితా పంపారు. ఈ జాబితాను పక్కనపెట్టి దరఖాస్తే చేయని పై ఇద్దరు మహిళా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను పర్యవేక్షకులుగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. తన భార్యను నిబంధనల మేరకే సహాయకురాలిగా నియమించుకున్నానని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు వివరణ ఇచ్చారు. ఆమె వయోజన విద్యాశాఖలో పర్యవేక్షకురాలని, చట్టరీత్యా అనుమతులు ఉండడంతోనే ఈ నియామకాలపై యథాతథ స్థితిని కొనసాగించాలనే ఆదేశాలు వచ్చాయని తెలిపారు. అధికార దుర్వినియోగం చేయలేదని పేర్కొన్నారు.

సైబర్ భద్రతలో ఈశ్వరన్ సహకారం తీసుకోండి: చంద్రబాబు

- తెదేపా ప్రభుత్వానికి నేటికి 1500 రోజులు పూర్తి

ఈనాడు, అమరావతి: సైబర్ భద్రతలో సింగపూర్ ముందంజలో ఉందని, వారు ఎలాంటి జాగ్రత్తలు, విధానాలు అనుసరిస్తున్నారో తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ప్రస్తుతం సైబర్ సెక్యూరిటీ, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖలో ఉన్నారని, ఆయన నుంచి సహకారం తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ అకౌంట్లను నియంత్రించాలని, ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిపే వారిలో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం ఏర్పడి మంగళవారానికి 1500 రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సోమవారం ఆయన రియల్‌టైం గవర్నెన్స్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు.

ఆ 15 జాతీయ ప్రాజెక్టుల సంగతేంటి?

- పోలవరం ప్రాజెక్టు లెక్కలన్నీ ఆన్‌లైన్‌లో
- అధికారం ఎక్కడుంటే 'కన్నా' అక్కడే..
- ధ్వజమెత్తిన మంత్రి దేవినేని

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి దేవినేని

విజయవాడ, న్యూస్‌టుడే: శరవేగంతో పనులు జరుగుతున్న పోలవరం ప్రాజెక్టుపై వేలెత్తి చూపుతున్న భాజపా శ్రేణులకు దేశంలోని మిగతా 15 జాతీయ ప్రాజెక్టుల సంగతి ఎలా ఉందో తెలుసా? అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. భాజపా పాలిత రాష్ట్రాలు సహా సదరు జాతీయ ప్రాజెక్టుల వివరాలు తెలుసుకోవాలని.. లేని పక్షంలో తానే నెల రోజుల్లో వాటి వివరాలను వెల్లడిస్తానన్నారు. ఆ జాతీయ ప్రాజెక్టుల వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటం పెట్టారా? వాటి ఖర్చుల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచారా? అని ప్రశ్నించారు. విజయవాడలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నీతి ఆయోగ్ సూచనల మేరకు పోలవరాన్ని తాము చేపట్టామని వీటికి సంబంధించిన ఖర్చుల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. నిర్వాసితులకు చెల్లించిన సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో వేశామన్నారు. పోలవరానికి ఖర్చు చేసిన నిధులకు సంబంధించి కేంద్రం నుంచి రూ.1,935 కోట్లు రావాల్సి ఉండగా, భాజపా నేతలు బిల్లులు పెండింగు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీలోకి మారతారన్నారు. పురందేశ్వరి, కావూరి సాంబశివరావు, కన్నా తదితరులు అప్పట్లో సోనియాగాంధీకి.. నేడు నరేంద్ర మోదీకి జపం చేస్తున్నారని విమర్శించారు. డయా ఫ్రమ్ వాల్ పైలాన్‌ను తప్పుపడుతున్న పురందేశ్వరిని ఉద్దేశించి మాట్లాడుతూ పట్టిసీమ నీరు వెళుతున్న కారంచేడులో పైలాన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన ఏ పార్టీలోనూ లేరట..! అంటూ దగ్గుబాటి వెంకటేశ్వరరావును పరోక్షంగా విమర్శించారు.

హవాలా డబ్బు తెస్తున్న విజయసాయి రెడ్డి: వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి హవాలా డబ్బు తెస్తున్నారని మంత్రి ఉమామహేశ్వరరావు ఆరోపించారు. నీటి పారుదల ప్రాజెక్టుల విషయంపై వైకాపా అధినేత జగన్‌కు కనీస అవగాహన లేదన్నారు.

గ్రూప్ 1లో తెలుగు అర్హత తప్పనిసరి..!

ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్ వెల్లడి

విశాఖపట్నం, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్ 1, 2, 3తో పాటు అన్ని విభాగాల్లో పోస్టుల భర్తీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్ వెల్లడించారు. ఖాళీలకు సంబంధించిన స్పష్టమైన సమాచారం, ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే నియామక ప్రకటనలు విడుదల చేస్తామని చెప్పారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవానికి హాజరైన ఆయన ఈ వివరాలను వెల్లడించారు. అంతకుముందు విశాఖలోనూ ఈ అంశంపై మాట్లాడారు. విద్యార్థులకు తెలుగు భాషపై పట్టు ఉండడం లేదని.. ఈ పరిస్థితిలో గ్రూప్ 1లో ఆంగ్లంతో పాటు, తెలుగు భాషలోనూ అర్హత తప్పనిసరి చేస్తున్నామని చెప్పారు. గ్రూప్ 2లో గెజిటెడ్ ఉద్యోగాలను గ్రూప్ 1లో చేర్చేందుకు జీవో ఉన్నా ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని వివరించారు. గ్రూప్-2 సిలబస్ మార్పులపై నిపుణుల కమిటీని వేశామని, నివేదిక రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని ఉదయ్‌భాస్కర్ చెప్పారు. సహాయ సెక్షన్ అధికారి పోస్టుల భర్తీకి విద్యార్హతలపై (డిగ్రీలో స్టాటిస్టిక్స్ ఉండాలా? లేదా? అనే అంశంపై) ప్రభుత్వానికి లేఖ రాశామని, స్పష్టత రాగానే 95 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని వివరించారు.

డీఎస్సీ నిర్వహణకు సిద్ధం: డీఎస్సీ-2018 నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు ఉదయ్‌భాస్కర్ చెప్పారు. దీనిపై ఇంతవరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదన్నారు.

సీపెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

విజయవాడ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో ప్రవేశానికి ప్లాస్టిక్ డిప్లొమా కోర్సుల దరఖాస్తు గడువును పొడిగించడంతో పాటు ప్రవేశపరీక్ష తేదీని మార్చినట్లు సీపెట్, విజయవాడ డైరెక్టర్ వి.కిరణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు మాత్రమే ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తు గడువును జులై 5వ తేదీ వరకు పొడిగించామని, అఖిలభారత సీపెట్ జేఈఈ- 2018 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షను జులై 1 నుంచి 8వ తేదీకి మార్చినట్లు వెల్లడించారు. మూడేళ్ల కాల వ్యవధిగల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి విద్యార్హత, ఏడాదిన్నర కాల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ) కోర్సుకు బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్హత అని తెలిపారు. విద్యార్థులు https://eadmission.cipet.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఫీజును కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 89770 33373, 96625 17551, 90522 95809, 94405 31978 నెంబర్లలో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1800 3002 8373లో సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛభారత్ కోర్సు వస్తోంది

- పీజీ డిప్లొమా కోర్సుకు రూపకల్పన చేస్తున్న ఎన్‌సీఆర్ఐ

ఈనాడు, హైదరాబాద్: కేంద్రం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్‌కు తోడ్పాటు అందించే లక్ష్యంతో ప్రత్యేక కోర్సును రూపొందిస్తున్నారు. ఈ బాధ్యతను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ గ్రామీణ సంస్థల మండలి(ఎన్‌సీఆర్ఐ)కి అప్పగించింది. ప్రతి కోర్సులో ఒక పేపర్‌గా ప్రవేశపెట్టడంతోపాటు పీజీ డిప్లొమా ఇన్ వేస్టు మేనేజ్‌మెంట్ పేరిట ప్రత్యేక కోర్సును ప్రారంభించేందుకు పాఠ్యాంశాలపై నిపుణులతో కసరత్తు జరుగుతోంది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై దేశవ్యాప్తంగా నిపుణులు చాలా తక్కువ మంది ఉండటంతో ప్రత్యేక కోర్సు ద్వారా ఎక్కువ మంది నిపుణులను తయారు చేయాలన్నది లక్ష్యం. డిప్లొమా పూర్తి చేసిన వారు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా కోర్సు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా 14 ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలతో ఎన్‌సీఆర్ఐ రెండు రోజుల సదస్సును ప్రారంభించింది. 2019 అక్టోబరు 2న మహాత్మాగాంధీ 150వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. అదేరోజు కోర్సును ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఉపాధ్యాయ విద్య నుంచే..: గ్రామీణ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని పని విద్య(వర్క్- ఎడ్యుకేషన్)లో మార్పులు చేస్తున్నారు. పిల్లలకు ఆయా పనుల్ని ఎలా నేర్పించాలో శాస్త్రీయంగా వివరించడాన్ని ఉపాధ్యాయ విద్యలో ప్రవేశపెట్టనున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించుకోవడంతోపాటు, ప్రజల సంపదను, ఆదాయాన్ని పెంచేలా పాఠ్యాంశాలు తయారు చేస్తున్నారు. దీనిపై జులై 2న గుజరాత్‌లో గాంధీ విద్యా విధానంపై కృషిచేసే వారితో ఎన్‌సీఆర్ఐ అధికారులు సమావేశం జరపనున్నారు. అదే నెల 27న దిల్లీలో యూజీసీ నిర్వహించే దేశవ్యాప్త ఉపకులపతుల సమావేశంలో కూడా చర్చించనున్నారు. దీనికి ఆమోదం పొందితే బీఈడీ, డీఈడీ కోర్సుల్లో పనివిద్య పాఠ్యాంశాలను ప్రవేశపెడతారు.

పౌర సరఫరాల శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న హమాలీలు

'సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె'

విజయవాడ, న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖ పరిధిలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ హమాలీల యూనియన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. లేకుంటే జులై 15 తర్వాత నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. విజయవాడలోని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయం ఎదుట సోమవారం హమాలీలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ 2016లో జరిగిన వేతన ఒప్పంద కాలపరిమితి 2017 డిసెంబరు 31తో ముగిసిందని, 2018 జనవరి ఒకటి నుంచి వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. దీనిపై ఎండీ సమక్షంలో చర్చలు జరిపామని తెలిపారు. ఎగుమతి, దిగుమతి రేటు(క్వింటాల్‌కు) ఇపుడున్న రూ.15 నుంచి రూ.25కు, దసరా బోనస్ రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచేందుకు ప్రతిపాదించారని పేర్కొన్నారు. సమస్య నేటికీ పరిష్కారం కాలేదంటూ అక్కడే బైఠాయించారు. పౌరసరఫరాల శాఖ జీఎంలు ప్రకాష్, వెంకటరమణ వచ్చి వారితో మాట్లాడారు. కూలి రేట్ల జీవో మంగళవారంలోగా వస్తుందని, పీఎఫ్ సమస్యనూ వారంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హమాలీల సంఘం గౌరవాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఉదయభాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంస్థలతో సామాజిక సామరస్యత

- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దిల్లీ: కులం, మతం, వర్గం వంటివి ప్రజల ఆలోచనలపై ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్న ప్రస్తుత తరుణంలో సామాజిక సామరస్యతకు సహకార సంస్థల ఆవశ్యకత ఉందని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ప్రజా జీవితంలో గుణం, దక్షత, సామర్థ్యం, ప్రవర్తన అనేవి ముఖ్యమని చెప్పారు. కొంత మంది మాత్రం కులం, మతం, డబ్బు, నేరతత్వంతో ఈ నాలుగు లక్షణాలను మార్చేయాలని చూస్తున్నారని చెప్పారు. 'భారత జాతీయ సహకార సంఘం' (ఎన్‌సీయూఐ) ఆధ్వర్యంలో సోమవారం దిల్లీలో ఆయన '19వ వైకుంఠ భాయ్ మెహతా స్మారకోపన్యాసం' ఇచ్చారు. ప్రస్తుత రోజుల్లో కులానికి ప్రాధాన్యం లేదన్నారు. కులాన్ని, మతాన్ని రెచ్చగొట్టి సొమ్ము చేసుకోవాలనుకోవడం ప్రమాదకరమనీ, దీనికి స్వస్తి పలకాలనీ చెప్పారు. అనేక సహకార బ్యాంకులు నష్టాల్లో కూరుకుపోవడానికి యాజమాన్య లోపాలే కారణమనీ, వ్యవస్థ వైఫల్యం మాత్రం కాదనీ స్పష్టంచేశారు.

ముగిసిన జేఈఈ ఐచ్ఛికాల గడువు

27న తొలి విడత సీట్ల కేటాయింపు

నిట్‌క్యాంపస్, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న జేఈఈ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు కళాశాల ఎంపిక కోసం ఇచ్చిన ఐచ్ఛికాల (ఛాయిస్ ఫిల్లింగ్) గడువు సోమవారంతో ముగిసింది. ప్రవేశాల కేటాయింపు ప్రాధికార సంస్థ (జోసా) జూన్ 15 నుంచి 25 వరకు ఐచ్ఛికాల నమోదు షెడ్యూలు ప్రకటించింది. జేఈఈ అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను నింపడంతో సీట్లు కేటాయించేందుకు జోసా రంగం సిద్ధం చేసింది. జేఈఈ మొదటి విడత కౌన్సెలింగ్‌లో మెరిట్, ఆర్‌వోఆర్ ప్రాతిపదికన ప్రవేశాలు లభించిన వారి వివరాలు జూన్ 27న వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. తొలి విడతలో ప్రవేశాలు లభించిన వారు జూన్ 28 నుంచి ఐదు రోజులపాటు (జులై 2 వరకు) రిపోర్టింగ్ చేయవలసి ఉంటుంది.

30న పీహెచ్‌డీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మొదటిసారిగా పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉమ్మడి పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ నెల 30న ఈ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఆగస్టు చివరి వారంలో ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఉన్నత విద్యామండలి.. ఆంధ్రా వర్సిటీకి అప్పగించింది. అన్ని విశ్వవిద్యాలయాలు వాటి పరిధిలోని పీహెచ్‌డీల ఖాళీల వివరాలను ఇప్పటికే కన్వీనర్ శ్రీనివాసరావుకు అందించారు. ఈ వివరాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 2 వేలకు పైగా ఖాళీలున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No.104 to121/To/2018-19 తేది: 20-6-2018
కృష్ణాజిల్లా, మచిలీపట్నం నందు వివిధ గ్రాంట్లక్రింద రూ. 2753.00 లక్షల అంచనా వ్యయంతో 3 ప్యాకేజి పనులు మరియు 15 రోడ్లు పనులు- మొత్తం 18 పనుల కొరకు e ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 29-6-2018ల నుండి. బిడ్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 16-7-2018 మ. గం. 3.00 వరకు. బిడ్ దాఖలుకు ముగింపు తేది: 16-7-2018 సా. గం. 5.00 వరకు. సాంకేతిక బిడ్ తెరచుతేది: 17-7-2018 ఉ. గం. 11.00 లకు. ఆర్థిక బిడ్ తెరచు తేది: 19-7-2018 ఉ. గం. 11.00లకు. వివరాలు eప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్రదేశం www.tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్: 94909 64625
సం/- పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతీరాజ్, మచిలీపట్నం, కృష్ణాజిల్లా
DIPR No. 883/CL/Advt/1/1/2018-19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతిరాజ్ శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ సవరణ ప్రకటన
29-5-2018 తేది నాటి ఈ కార్యాలయ e-ప్రొక్యూర్‌మెంట్ నెం.లు 72 to 91/TO/2018-19 విషయంలో NIT నెం. 72/TO/2018-19 కి సంబంధించి పరిపాలనా సంబంధమైన కారణాల వలన 21-6-2018 నాటి సవరణ నెం.1 జారీ చేయడమైనది. **సవరణ ప్రకారం:** బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 27-6-2018ల నుండి. బిడ్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 11-7-2018 మ. గం. 3.00 వరకు. బిడ్ దాఖలుకు ముగింపు తేది: 11-7-2018 సా. గం. 5.00 వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది: 12-7-2018 ఉ. గం. 11.00లకు. టెండరు డాక్యుమెంట్ల మిగిలిన షరతులలో ఎట్టి మార్పు లేదు.
DIPR No. 907/CL/Advt/1/1/2018-19 సం/- పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతిరాజ్, ఏలూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
నెం. 101-127/2018-19 తేది: 21-06-2018
పశ్చిమగోదావరి జిల్లాలోని ("Upgradation of NREGS (SCC)", PRR (SCC), NABARD & PRR (Plain)") గ్రాంట్‌లలో మంజూరు కాబడిన 27 పనులకుగాను అంచనా విలువ రూ.1515.60 లక్షలతో చేపట్టుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండరు డాక్యుమెంట్ల లభ్యత (నిట్ నెం. 101-112కి): 27-6-2018 నుండి. టెండర్లు స్వీకరణ తేది: 27-6-2018 నుండి 4-7-2018న మ. 3 గం. వరకు. టెండర్లు సమర్పణ ముగింపు తేది: 4-7-2018 మ. 5 గం.లకు. సాంకేతిక బిడ్ మరియు ఆర్థిక బిడ్ తేది: 5-7-2018న ఉ. 11 గం.లకు మరియు (నిట్ నెం. 113-127కి) 27-6-2018 నుండి. టెండర్ల స్వీకరణ తేది: 27-6-2018 నుండి 11-7-2018న మ. 3 గం. వరకు. టెండర్లు సమర్పణ ముగింపు తేది: 11-7-2018 మ. 5 గం.లకు. సాంకేతిక బిడ్ మరియు ఆర్థిక బిడ్ తేది: 12-7-2018న ఉ. 11 గం.లకు. తదుపరి వివరాలను www.apeprocurement.gov.in పై ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నుండి పొందవచ్చును.
DIPR No. 905/CL/Advt/1/1/2018-19 సం/- పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతీరాజ్ సర్కిల్, ఏలూరు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్
(ఆం.ప్ర. ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
ప్రధాన కార్యాలయము : డోర్ నెం. 11-97/1, కె. శంకరరావు వీధి, జాయింట్ కేర్, టైమ్ హాస్పిటల్ & మోర్ సూపర్ మార్కెట్ ప్రక్కన, అశోక్‌నగర్, కానూరు, విజయవాడ-520 007.
టెండరు నెం. SWC/B4/H&T/Tender/165/2011-Vol-I తేది: 25-06-2018
"ఇ" టెండర్ల ఆహ్వాన ప్రకటన
దిగువ తెలిపిన స్టేట్ వేర్‌హౌస్ గోడౌన్స్ వద్ద రెగ్యులర్ హ్యాండ్లింగ్ & ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ల యొక్క నియామకం నిమిత్తం ఆసక్తిగల పార్టీల నుండి ఇ-టెండర్లు కోరబడుతున్నవి. 1. పొందూరు-స్వంత (AMC) 2. సోంపేట-స్వంత (AMC) 3. పలాస-స్వంత (AMC) 4.నరసన్నపేట-స్వంత (AMC) 5. డొంకివలస-స్వంత (AMC). వివరములను వెబ్‌సైట్ www.tenderwizard.com/APSWC మరియు www.apswhc.com నందు చూడవచ్చును. సం/- మేనేజింగ్ డైరెక్టర్.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వార్డ్ క్లాసెస్ కోఆపరేటివ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ లి. (APBCCFC)
టెండరు ప్రకటనకు అనుబంధం
వడ్రంగి పని, బంగారం పని, కమ్మరి పని మరియు ఇత్తడి పని వృత్తులకు "ఆదరణ పథకం క్రింద పనిముట్ల సరఫరా కొరకు సరఫరాదారుల ఎంపిక" నిమిత్తమై RFP "ఆదరణ (i) - 062018- అనుబంధం-I"
ది 22-6-2018 నాడు జారీ చేయబడిన ప్రకటనకు కొనసాగింపుగా దిగువ పేర్కొన్న వెబ్‌సైట్లయందు సవరించబడిన RFP ఉంచబడినది. వడ్రంగి పని, బంగారం పని, కమ్మరి పని మరియు ఇత్తడి పనులతోపాటు స్టోన్ కటింగ్/ భవన నిర్మాణం మరియు ఎర్త్ వర్క్స్ వృత్తులకు సంబంధించిన పనిముట్లు సవరించిన RFP నందు చేర్చబడినవి. బిడ్డర్లందరినీ కోరునదేమనగా సవరించబడిన RFPని గమనించి దిగువ పేర్కొన్న షెడ్యూలు ప్రకారం ప్రి-బిడ్ సమావేశమునకు హాజరు కాగలరు. ఈ RFP పూర్వపు RFP (ADARANA (i) - 062018) ని అధిగమిస్తుంది.
షెడ్యూలు మరియు సంప్రదించవలసిన వివరాలు దిగువ పేర్కొనబడినవి

RFP జారీ తేది మరియు సమయం	26.6.2018 మ. గం. 2.00ల నుండి
ప్రి-బిడ్ సమావేశం	29-6-2018 మ.గం. 3.00 (RFP No: ADARANA (i)-06/2018
ప్రిబిడ్ సమావేశ స్థలి	APBCCFC కార్యాలయము, 4వ అంతస్తు, విశాల్‌రెసిడెన్సి, VR సిద్ధార్థ కాలేజి సమీపాన, కానూరు, తాడిగడప, విజయవాడ–521 137.
బిడ్ డాక్యుమెంట్లు లభించే వెబ్‌సైట్లు	http://www.aponline.gov.in/ http://ap.meeseva.gov.in / http://www.ap.gov.in /
దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ మరియు సమయము	6.7.2018 సా.గం. 5.00
ప్రి-బిడ్ సందేహాలను పంపవలసినది	adaranabccfc@gmail.com
సంప్రదించవలసిన వ్యక్తులు	K.రాజేంద్రబాబు 80960 28832, Y.రామసుధాకర్ 89788 82153.

DIPR No. 190PP/CL/Advt/1/1/2018-19 సం/- విసి మరియు మేనేజింగ్ డైరెక్టర్

మోడువారే జ్ఞాపకం

మనిషి జ్ఞాపకాల సమాహారం. మరి ఆ జ్ఞాపకాలే తుడిచిపెట్టుకుపోతే? మనిషి ఉన్నా లేనట్టే! డిమెన్షియా ఇలాగే ఒక్కో జ్ఞాపకాన్ని తుడిచేస్తూ.. మనిషిని 'మోడు'లా మార్చేస్తుంది. ఇది నెమ్మదిగా దాడిచేస్తూ ముదురుతూ వస్తుంది. అందువల్ల దీని తొలి (మైల్డ్), మధ్యస్థ (మోడరేట్), చివరి (సివియర్) దశల్లో కనబడే లక్షణాలపై ఓ కన్నేయటం మంచిది.

తొలిదశ

డిమెన్షియా తొలిదశను చాలామంది వయసు మీద పడుతుండటంతో వచ్చే మార్పనే అనుకుంటుంటారు. కొన్నిసార్లు డాక్టర్లు కూడా ఇలాగే భావిస్తుంటారు.

1

లక్షణాలు

- జ్ఞాపకశక్తి తగ్గటం
- పదాలు తడబడటం
- టైం గుర్తించటంలో ఇబ్బంది
- తెలిసిన ప్రాంతాల్లోనూ దారి మరచిపోతుండటం
- కాస్త క్లిష్టమైన పనులను సరిగా చేయలేకపోవటం
- ప్రవర్తన, మూడ్ మారిపోవటం
- డబ్బులు లెక్కపెట్టటం, ఇవ్వటం, తీసుకోవటంలో పొరబడటం

2

మధ్య దశ

ఇది ఎక్కువకాలం కొనసాగే దశ. సమస్య ముదురుతున్నకొద్దీ మరింత జాగ్రత్తగా కనిపెట్టుకోవాల్సిన అవసరముంటుంది..

లక్షణాలు

- గతంలో తమకు ఎదురైన అనుభవాలనూ మరచిపోవటం
- స్తబ్ధుగా ఉండటం, నలుగురితో కలవటానికి ఇష్టపడకపోవటం
- సొంత చిరునామా, టెలిఫోన్ నంబర్లను గుర్తుతెచ్చుకోలేకపోవటం
- ఎక్కడున్నామో, తేదీ ఏంటో, టైమెంతయ్యిందో తెలియక తికమకపడటం
- చిరాకు, కోపం, అనూహ్యంగా ప్రవర్తించటం
- వ్యక్తిగత శుభ్రతపై ఆసక్తి తగ్గటం
- సరకులు కొనుక్కురావటం వంటి పనుల్లో ఇబ్బంది
- కొందరిలో మల, మూత్ర విసర్జనపై పట్టుతప్పటం
- ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లటం, తప్పిపోయే ముప్పు పెరగటం

3

చివరిదశ

ప్రతి పనికీ ఇతరుల మీద ఆధారపడటం, బద్ధకం ఎక్కువవుతుంది. డిమెన్షియా ఇబ్బందులు స్పష్టంగా కనబడటం మొదలవుతుంది.

లక్షణాలు

- పరిచయమున్నవారినీ, తెలిసిన వస్తువులనూ పోల్చుకోలేకపోవటం
- ఎక్కడున్నారో? టైం ఎంతయ్యిందో? అసలే గుర్తించలేకపోవటం
- ప్రతి పనికీ ఇతరుల మీద ఆధారపడుతుండటం
- చుట్టుపక్కల పరిసరాలను, పరిస్థితులను పసిగట్టలేకపోవటం
- ఎక్కడికీ వెళ్లటానికి ఇష్టపడకపోవటం
- నడకలో మార్పులు, ముద్ద సరిగా మింగలేకపోవటం
- తరచుగా ఇన్‌ఫెక్షన్లు.. ముఖ్యంగా న్యుమోనియా రావటం

డిమెన్షియా అందరిలోనూ ఒకేలా ఉండాలనేమీ లేదు. అందరిలోనూ అన్ని లక్షణాలూ కనబడాలనేమీ లేదు. కొందరిలో కొన్నింటికే పరిమితం కావొచ్చు. అలాగే ఆలస్యంగానూ మొదలవ్వొచ్చు.

తొలిదశ 1-2 సంవత్సరాల వరకు ఉండొచ్చు. రెండోదశ 2-5 సంవత్సరాల వరకు కొనసాగొచ్చు. చాలామంది ఐదేళ్ల తర్వాత చివరిదశలోకి చేరుకుంటారు.

సుమారు 60-80% మందిలో అల్జీమర్స్ (డిమెన్షియాలో ఒకరకం) కనబడుతుంటుంది. మిగతావారిలో పక్షవాతం తర్వాత వచ్చే డిమెన్షియా.. పార్కిన్సన్స్‌తో ముడిపడిన డిమెన్షియా.. నుదురు, కణతల వల్ల మెదడు భాగాలను ప్రభావితం చేసే డిమెన్షియా వంటివి కనబడుతుంటాయి.

పిల్లలకు ఐరన్ కవచం!

ఏ వయసులోనైనా, ఏ దశలోనైనా మన శరీరానికి తగినంత ఐరన్ అవసరం. ఇది ఊపిరితిత్తుల్లోంచి ఇతర భాగాలకు ఆక్సిజన్ చేరవేయటానికి.. కండరాలు ఆక్సిజన్‌ను నిల్వ చేసుకోవటానికి, దాన్ని సమర్థంగా వినియోగించుకోవటానికి తోడ్పడుతుంది. అందువల్ల ఎదిగే పిల్లలకు ఐరన్ మరింత ఎక్కువ అవసరమవుతుంది కూడా. ఇది లోపిస్తే పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం కుంటుపడతాయి. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులు తగ్గిపోయి.. రక్తహీనతకూ దారితీస్తుంది. ఇలాంటి సమస్య పిల్లల్లో ఎక్కువగానూ కనబడుతుంటుంది. ఇందుకు రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి.

రక్తహీనత లక్షణాలు

- చర్మం, కళ్లు పాలిపోవటం
- గోళ్లు పెళుసుబారటం
- నాలుక ఎర్రబడటం
- పెదవుల చివర్లు చిట్లిపోవటం
- ఆకలి తగ్గిపోవటం
- మట్టి, ఐస్ వంటివి తినటం

- పిల్లల తిండి అనగానే పెద్దవాళ్లకు ముందుగా పాలే గుర్తుకొస్తాయి. ఎంత ఎక్కువ పాలు తాగితే అంత ఎక్కువ బలం వస్తుందని భావిస్తుంటారు. కానీ మిగతా పదార్థాలను పెద్దగా పట్టించుకోకుండా పాలకే ప్రాధాన్యమిస్తే అనర్థం తప్పదు. ఎందుకంటే పాలలో ఐరన్ మోతాదు అంతంతే. కాబట్టి ఐరన్ ఎక్కువగా ఉండే పాలకూర, కందిపప్పు వంటి పప్పుధాన్యాలు, గుమ్మడి గింజలు, చేపలు, మాంసం.. ముఖ్యంగా కాలేయం వంటివి ఇవ్వటం మంచిది.
- పొట్టలో నులి పురుగులతోనూ ఐరన్ లోపం తలెత్తొచ్చు. ఇలాంటి నులిపురుగులు పేగుల్లో వాపు ప్రక్రియను ప్రేరేపిస్తాయి. ఇది దీర్ఘకాలం కొనసాగితే రక్తం తగ్గిపోవచ్చు. అలాగే క్రాన్స్, సీలియాక్ జబ్బుల వంటివీ ఆహారంలోని ఐరన్‌ను శరీరం గ్రహించుకోకుండా అడ్డుకుంటాయి. ఇవన్నీ రక్తహీనతకు దారితీయొచ్చు. కాబట్టి నులిపురుగులుంటే తగు మందులు ఇప్పించటం.. పొట్టలో సమస్యలకు చికిత్స చేయించాలి.

కొవ్వు మంచితనం!



మన రక్తంలోని 75% కొలెస్ట్రాల్‌ను కాలేయమే ఉత్పత్తి చేస్తుంది. మిగతా 25% ఆహారం ద్వారా అందుతుంది. కొలెస్ట్రాల్ నార్మల్‌గా ఉన్నంతవరకు ఎలాంటి ఇబ్బందీ లేదు. మితిమీరితే మాత్రం రక్తనాళాల్లో పూడికలు ఏర్పడటం వంటి సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల మొత్తం కొలెస్ట్రాల్ 200 ఎంజీ/డీఎల్ కన్నా తక్కువుండేలా చూసుకోవాలి. దీనిలోనూ చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) 100 కన్నా తక్కువగానూ, మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) 40 కన్నా ఎక్కువగానూ ఉండేలా చూసుకోవాలి. ఆరోగ్యకరమైన కొవ్వులు తీసుకోవటం, వ్యాయామం చేయటం వంటి వాటి ద్వారా హెచ్‌డీఎల్‌ను పెంచుకోవచ్చు. కొవ్వు పదార్థాల్లో కేలరీలు దండిగా ఉంటుండటం నిజమే. వీటిని ఎక్కువగా తీసుకుంటే బరువు పెరుగుతుందనటంలోనూ సందేహం లేదు. అంతమాత్రాన కొవ్వులను పూర్తిగా మానెయ్యాల్సిన అవసరమూ లేదు. ఆరోగ్యకరమైన కొవ్వులపై దృష్టి సారించటం మేలు. గింజపప్పులు, అవిసె గింజల వంటి వాటిల్లోని ఒమేగా 3, ఒమేగా 6 కొవ్వులు.. అలాగే ఆలివ్ నూనె వంటి వాటిల్లోని ఏకబంధ అసంతృప్త కొవ్వులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నెయ్యి, వెన్న వంటి వాటిల్లోని కొన్నిరకాల సంతృప్త కొవ్వులూ మంచివే. కాకపోతే వీటిని మితంగా తీసుకోవాలి.

బ్రేకియల్ ప్లక్సస్ ఇంజురీ

చేయి మీద పిడుగు!

అన్నీ సవ్యంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుంది. ముఖ్యంగా శరీరంలోని వివిధ భాగాల నుంచి మెదడుకూ, వెన్నుపాముకూ.. అలాగే మెదడు, వెన్నుపాము నుంచి ఆయా భాగాలకు సమాచారాన్ని, సంకేతాలను చేరవేసే సున్నితమైన నాడీ వ్యవస్థ విషయంలో ఇది మరింత ముఖ్యం. కండరాలు, అవయవాల కదలికల దగ్గర్నుంచి స్పర్శజ్ఞానాన్ని కలిగించటం వరకూ ఇది నిర్వర్తించే పనులు ఎన్నెన్నో. అందుకే నాడుల విషయంలో ఎక్కడ చిన్న తేడా జరిగినా పెద్ద ప్రభావమే చూపుతుంది. ఇక మనకు రకరకాల పనులు చేసి పెట్టే చేతుల్లోని నాడులు అస్తవ్యస్తమైతే నిజంగా 'చేయి విరిగినట్టే' అవుతుంది. రోజురోజుకీ పెరిగిపోతున్న ప్రమాదాలు ఇప్పుడిలాంటి ఉపద్రవాన్నే తెచ్చిపెడుతున్నాయి. మెడ భాగం బాగా సాగిపోవటం.. ఫలితంగా భుజం నుంచి వేళ్ల వరకూ వెళ్లే నాడుల సముదాయం (బ్రేకియల్ ప్లక్సస్) దెబ్బతినటం పెద్ద ప్రమాదాన్నే మోసుకొస్తోంది. ఇదొక్కటే కాదు- కాన్పు కష్టం కావటం మూలంగానూ ఎంతోమంది పిల్లలూ దీని బారినపడుతున్నారు. చాలామందికి దీనిపై అవగాహన లేక.. ఎక్కడికి వెళ్లాలో, ఎవరిని కలవాలో కూడా తెలియటం లేదు. ఈ నేపథ్యంలో 'భుజ నాడుల సముదాయం' దెబ్బతినటంపై సమగ్ర కథనం ఈవారం మీకోసం.

మనం చేత్తో అన్నం తింటాం. గ్లాసును ఎత్తి పట్టుకొని నీళ్లు తాగుతాం. రాసుకుంటాం, లెక్కలు చేస్తాం, కీబోర్డు నొక్కుతూ కంప్యూటర్‌లో విశ్వ విహారం చేస్తాం. ఇలాంటివన్నీ అనుకున్నదే తడవుగా, అలవోకగా చేసేస్తుంటాం గానీ ఇదంత తేలికైన పనేమీ కాదు. ఏ పనికైనా ముందు మెదడు నుంచి సంకేతాలు వెలువడాలి. అవి నాడుల ద్వారా కండరాలకు చేరుకోవాలి. కండరాలు వాటిని స్వీకరించి ప్రేరేపితం కావాలి. అప్పుడే మనం ఏ పనైనా చేసుకోగలుగుతాం. ఇందులో కండరాలు, నాడులదే కీలక పాత్ర. ఉదాహరణకు- మన కండరాలను బల్బు అనుకుంటే నాడులను విద్యుత్తు తీగలని అనుకోవచ్చు. విద్యుత్తు తీగలు తెగిపోతే ఇంట్లో కరెంటు పోయినట్టే.. నాడులు ఎక్కడ దెబ్బతిన్నా కండరాల కదలికలన్నీ అస్తవ్యస్తమవుతాయి. మన భుజాలు, చేతులు, మణికట్టు, అరచేయి, వేళ్లలోని కండరాలను, వాటి కదలికలను నియంత్రించే నాడుల సముదాయాన్ని దెబ్బతీసే 'బ్రేకియల్ ప్లక్సస్ ఇంజురీ' సరిగ్గా ఇలాంటిదే.

డా॥ వై.వి.రావు
ప్లాస్టిక్, కాస్మటిక్ సర్జన్
డా॥ వైవీ రావ్ క్లినిక్స్
బంజారా హిల్స్
హైదరాబాద్

ఏంటీ సమస్య?

మన నాడీవ్యవస్థ ప్రధానంగా- పుర్రె నుంచి మొదలయ్యే నాడులు (సెంట్రల్ నాడీవ్యవస్థ), వెన్నుపాము నుంచి వచ్చే నాడులు (స్పైనల్ నాడీవ్యవస్థ), వీటితో అనుసంధానమై సాగే సింపథటిక్, పారా సింపథటిక్ నాడీ వ్యవస్థ.. ఇలా మూడు భాగాలుగా కనబడుతుంది. ప్రతి వెన్నుపూసకూ ఒక చిన్న రంధ్రం లాంటిది ఉంటుంది. ఇందులోంచే వెన్ను నాడులు బయటకు వస్తుంటాయి. మన చేతుల్లోని నాడుల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది రేడియల్, అల్నార్, మీడియన్ నాడుల గురించి. ఇవి మెడ పూసల దగ్గర్నుంచి (సీ5, సీ6, సీ7, సీ8, టీ1) నుంచి మొదలవుతాయి. సీ5, సీ6 నుంచి వచ్చే నాడులు.. సీ8, టి1 నుంచి వచ్చే నాడులు కలిసి చెరో కాండంలా ఏర్పడతాయి. ఇక సీ7 ఒక్కటే విడిగా సాగుతూ వస్తుంది. మళ్లీ ఇవన్నీ చీలిపోతూ.. ఒకదాంతో మరోటి కలుస్తూ.. చివరికి రేడియల్, అల్నార్, మీడియన్, ఆక్జిలరీ, మస్క్యులర్ సబ్‌క్యుటేనియస్ నాడుల రూపంలో శాఖలుగా ఏర్పడతాయి. ఈ నాడుల సముదాయాన్నే బ్రేకియల్ ప్లక్సస్ అంటారు. చెట్టు కొమ్మల మాదిరిగా విస్తరిస్తూ వచ్చే దీన్ని ఒకరకంగా 'జంక్షన్' అనుకోవచ్చు.



మన చేతుల కదలికలకు, స్పర్శ వంటి వాటికి ఇదే మూలమన్నమాట. ఈ జంక్షన్ దెబ్బతింటే చేతి కండరాలకు అందే సంకేతాలన్నీ ఆగిపోతాయి. దీంతో చేతి పట్టు తగ్గుతుంది. కదలికలు అస్తవ్యవస్తమవుతాయి. నిర్లక్ష్యం చేస్తే చేయి పూర్తిగా పట్టు తప్పిపోవచ్చు కూడా. దీనిపై చాలామందికి అవగాహన లేకపోవటం.. ఎప్పుడు, ఎవరిని సంప్రతించాలో తెలియక సమస్యను తీవ్రం చేసుకుంటున్నారు.

మెడ సాగటమే మూలం

చేతి నాడుల సముదాయం దెబ్బతినటానికి ప్రధాన కారణం మెడ నుంచి చేయి బాగా కిందికి లేదా పైకి లాగినట్టు కావటం. దీంతో నాడులు సాగిపోవటం, ఒత్తిడికి గురికావటం.. కొన్నిసార్లు తెగిపోవటం సమస్యకు దారితీస్తుంది. ఇది చిన్న పిల్లల్లోనూ, పెద్దవారిలోనూ రావొచ్చు. పిల్లల్లో వచ్చే దాన్ని బీబీపీపీ (బర్త్ బ్రేకియల్ ప్లక్సెస్ పాల్సీ), పెద్దవారిలో వచ్చేదాన్ని ఏబీపీపీ (అడల్ట్ బ్రేకియల్ ప్లక్సెస్ పాల్సీ) అంటారు. దీనికి పిల్లల్లో, పెద్దవారిలో కారణాలు కూడా వేర్వేరుగానే కనబడతాయి.

- **పిల్లల్లో కారణాలు:** కాన్పు కష్టం కావటం ప్రధాన కారణం. ఇందుకు తల్లి, శిశువుల పరిస్థితులు.. కాన్పు ప్రక్రియ వంటివన్నీ దోహదం చేయొచ్చు. ఆలస్యంగా గర్భం ధరించటం.. ముఖ్యంగా 30 ఏళ్లు దాటిన తర్వాత తొలిసారి కాన్పయ్యే మహిళలకు పుట్టే పిల్లలకు మెడ నాడులు దెబ్బతినే ముప్పు ఎక్కువ. వెంటవెంటనే గర్భం ధరించటమూ దీనికి కారణం కావొచ్చు. మధుమేహ గర్భిణుల్లో పిండం పెద్దగా ఉండే అవకాశముంది. ఇది కూడా కాన్పు సమయంలో సమస్యకు దారితీయొచ్చు. తల్లికి కటి భాగం నిర్మాణంలో తేడాలు, అధిక బరువు సైతం దీనికి దోహదం చేయొచ్చు.

గర్భస్థ శిశువుల్లో కొందరికి భుజాలు వెడల్పుగా ఉంటాయి. కాన్పు సమయంలో ఇవి అడ్డుపడుతుంటాయి. ఇలాంటివారిని కాస్త బలంగా బయటకు లాగే క్రమంలో మెడ భాగం ఒక వైపునకు బాగా సాగిపోవచ్చు. దీంతో అక్కడి నాడులు సాగిపోవటం, తెగిపోవటం జరగొచ్చు. బిడ్డ అడ్డం తిరిగినప్పుడు కాన్పు కష్టం కావటమూ సమస్యాత్మకంగా పరిణమించొచ్చు. ఇటీవలి కాలంలో కాన్పు నొప్పులను తగ్గించే మందుల వాడకమూ పెరుగుతోంది. ఇది మంచి పద్ధతే కావొచ్చు. అయితే నొప్పి తెలియకపోవటం వల్ల కొన్నిసార్లు బిడ్డను బలంగా బయటకు తీయటానికి ప్రయత్నించొచ్చు. ఇదీ నాడులు దెబ్బతినటానికి దారితీయొచ్చు.

- **పెద్దల్లో కారణాలు:** పెద్దవాళ్లలో చేతి నాడుల సముదాయం దెబ్బతినటం 16-25 ఏళ్ల వారిలో ఎక్కువ. దీనికి ప్రధాన కారణం రోడ్డు ప్రమాదాలు. చేతి నాడులు దెబ్బతినేవారిలో సుమారు 75% మంది రోడ్డు ప్రమాదం బారినపడ్డవారే. వీరిలోనూ 75% మంది మోటార్ బైక్ ప్రమాదాలకు గురవుతున్నవారే! కొందరికి వెన్నుపాములోంచి నాడులు బయటకు పెకిలించుకొనీ రావొచ్చు. మెడ పక్కకు తిరిగి దేన్నికైనా బలంగా ఢీకొన్నప్పుడు పక్కటెముక, భుజం ఎముక మధ్య నాడుల సముదాయం చిక్కుకొని ఒత్తిడికి గురవుతుంది. రక్తస్రావం ఎక్కువై ఆ భాగమంతా వాచిపోయి, కణజాలం దెబ్బతినటం వల్ల కూడా నాడుల జంక్షన్ దెబ్బతినొచ్చు.

ఏంటీ లక్షణాలు?

నాడులు దెబ్బతినటాన్ని చూడగానే గుర్తించొచ్చు. వీళ్లు చేయి పైకి సరిగా లేపలేరు. దీంతో భుజం సాయం తీసుకొని లేపటానికి ప్రయత్నిస్తుంటారు. అందువల్ల వీరికి చేయితో పాటు భుజం కూడా పైకి లేస్తుంటుంది. శరీరం ఒకవైపునకు వంగిపోయినట్టు కనిపిస్తుంది. స్పర్శ కూడా తగ్గిపోవచ్చు. పిల్లల కళ్లను చేతితో మూసినప్పుడు, తువ్వాలను మీద వేసినప్పుడు నాడులు దెబ్బతిన్న చేయి అంతగా పైకి లేవదు. సమస్య స్వల్పంగా ఉన్నప్పుడు వెంటనే లక్షణాలేవీ కనబడకపోవచ్చు. కొద్దిరోజుల తర్వాత మొదలవ్వొచ్చు.

పిల్లల సమస్యలో వెంటనే కంగారు పడొద్దు!

చేతి నాడులు దెబ్బతిన్నా కూడా పిల్లల విషయంలో వెంటనే కంగారు పడాల్సిన పనిలేదు. మంచి విషయం ఏంటంటే- పిల్లలకు శస్త్ర చికిత్స చేయకపోయినా 70-75% వరకు కుదురుకోవటం. కాకపోతే తరచుగా పరిశీలించటం అవసరం. సాధారణంగా 3-4 నెలల వయసు వరకూ ఎలాంటి మార్పూ కనబడకపోతే ఇక కుదురుకోదనే అనుకోవాలి. అయినా కూడా మరో రెండు నెలల వరకు వేచి చూడొచ్చు. అప్పటికీ మార్పు లేకపోతే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. కదలికలు కొంతవరకు మెరుగుపడితే 9-12 నెలల వయసు వరకు చూడొచ్చు. మొత్తమ్మీద గరిష్ఠంగా 18 నెలల వయసు వరకు వేచి చూడొచ్చు. అదే పెద్దల్లోనైతే 6 నెలల్లోపే కదలికలు మెరుగయ్యేలా చూసుకోవాలి. ఆ తర్వాత కదలికలు మెరుగుపడటం చాలా కష్టం. కాబట్టి వీరికి వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది.

నిర్ధరణ ఎలా?

చాలావరకు లక్షణాల ఆధారంగానే సమస్యను గుర్తించొచ్చు. కచ్చితంగా నిర్ధరించుకోవటానికి ముందుగా మామూలు ఎక్స్‌రే తీస్తారు. ఏదైనా తేడా కనబడితే సీటీ మైలోగ్రామ్.. అవసరమైతే ఎంఆర్ మైలోగ్రామ్ చేస్తారు. వీటితో నాడుల మూలాలు సరిగా ఉన్నాయా? ఎక్కడైనా తెగిపోయాయా? అనేవి బయటపడతాయి. అవసరమైతే కండక్షన్ నెర్వ్ స్టడీ కూడా చేయాల్సి ఉంటుంది. ఇందులో నాడీ సంకేతాలు ఎంత వేగంగా, ఎంతవరకు చేరుకుంటున్నాయనేది తెలుస్తుంది.

శస్త్రచికిత్స- మూడు రకాలు

బ్రేకియల్ ప్లక్సెస్ సర్జరీలో భుజం, మోచేయి సరిగా పైకి లేపగలిగేలా చూడటానికే ప్రాధాన్యమిస్తారు. ఇవి కుదురుకున్నాక చేతి వేళ్ల కదలికలు మెరుగుపడేలా చూస్తారు.

- **నాడీ మరమ్మతు:** ఇందులో దెబ్బతిన్న నాడి చివర్లను నేరుగా కలపటానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యం కాకపోతే వేరే చోట నుంచి నాడిని తెచ్చి అతికిస్తారు. ఇవి ఒక గొట్టం మాదిరిగా, మార్గంగా పనిచేస్తాయి. దెబ్బతిన్న నాడి దీని మధ్యలోంచి పెరుగుతూ వచ్చి తెగిపోయిన భాగానికి చేరుకుంటుంది. ఒకవేళ నాడిలో కొంతభాగం పూర్తిగా కోల్పోతే పక్క నాడిని తెచ్చి కలుపుతారు (బైపాస్).
- **నాడీ మార్పిడి:** నాడులు వెన్నెముక నుంచి విడిపోతే పక్కనున్న వేరే నాడిని తెచ్చి దెబ్బతిన్న నాడికి కలుపుతారు. అవసరమైతే భుజం కండరాల కదలికలకు తోడ్పడే కొన్ని నాడీ పోచలను, మెడకు అటువైపు నుంచి చేతులకు వెళ్లే నాడులను తీసుకొచ్చి కలుపుతారు.
- **కండర మార్పిడి:** నాడీ మరమ్మతు, మార్పిడి చేయటం కుదరనివారికి వేరే చోటు నుంచి కండరం తెచ్చి అతికించాల్సి ఉంటుంది. ఇది చుట్టుపక్కల కండరాలతో కలిసి పనిచేస్తూ కదలికలు మెరుగవటానికి తోడ్పడుతుంది.

బొటాక్స్ ఇంజెక్షన్లు: కొన్నిసార్లు తెగిపోయిన నాడులు అతిగా స్పందించటం వల్ల కండరాలు అదిరినట్టయ్యి కదలికలు అస్తవ్యస్తం కావొచ్చు. వీరికి బొటాక్స్ ఇంజెక్షన్లతో అతిగా స్పందించే కండరాలను తాత్కాలికంగా చచ్చుబడేలా చేస్తారు.

కడుపులో బిడ్డకు గుండె జబ్బా?

సమస్య - సలహా



సమస్య: నా వయసు 28 సంవత్సరాలు. ప్రస్తుతం 22 వారాల గర్భిణిని. డాక్టర్లు అల్ట్రాసౌండ్ పరీక్ష చేశారు. కడుపులో శిశువుకు గుండెజబ్బు ఉండొచ్చని చెప్పారు. మాకు భయంగా ఉంది. ఇప్పుడేం చేయాలి?

– ఒక పాఠకురాలు, హైదరాబాద్

సలహా: మీ కడుపులోని శిశువుకు గుండెజబ్బు ఉండొచ్చని డాక్టర్లు అనుమానం వ్యక్తం చేశారని అంటున్నారు కాబట్టి ఒకసారి చిన్నపిల్లల గుండె నిపుణులను సంప్రతించటం మంచిది. ఎకో కార్డియోగ్రామ్ పరీక్ష చేస్తే సమస్య ఉన్నదీ లేనిదీ నిర్ధరణ అవుతుంది. గర్భం ధరించిన తర్వాత 18-22 వారాల సమయంలో 'ఫీటల్ ఎకో' పరీక్ష చేయటం ఉత్తమం. దీని కోసం ముందుగా ప్రత్యేకంగా సన్నద్ధం కావాల్సిన పనేమీ లేదు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే గుండె లోపాలు పలు రకాలుగా ఉండొచ్చు. వీటిల్లో చాలా లోపాలను నయం చేయొచ్చు కూడా. కొందరు పిల్లలకు గుండె గదుల మధ్య గోడకు రంధ్రాలు పడుతుంటాయి. ఇవి మామూలుగా ఉంటే శిశువు గర్భంలో ఉన్నప్పుడు గుర్తించటం కష్టం. పుట్టిన తర్వాతే బయటపడుతుంటాయి. ఒకవేళ ఏవైనా రంధ్రాలున్నా కూడా శస్త్రచికిత్సతో మూసేయొచ్చు. నిజానికి కొన్ని రంధ్రాలు వాటంతటవే మూసుకుపోతుంటాయి కూడా. గుండె నుంచి రక్తాన్ని బయటకు తీసుకెళ్లే ధమనులు అస్తవ్యస్తంగా అతుక్కొని ఉండటం వంటి తీవ్ర లోపాలనూ పుట్టిన వెంటనే శస్త్రచికిత్స చేసి సరిచేయొచ్చు. ఇక కవాటాల లోపం (అయోర్టిక్ స్టెనోసిస్, పల్మనరీ అట్రీషియా) వంటి సమస్యలకు బిడ్డ తల్లి కడుపులో ఉండగానే బయటి నుంచి చికిత్స చేసి సరిచేసే అవకాశమూ ఉంది. ఇందులో సున్నితమైన సూదిని తల్లి కడుపులోంచి పోనిచ్చి, దాని ద్వారా శిశువు ఛాతీలోని గుండె లోపల బుడగను ప్రవేశపెడతారు. దీంతో కుంచించుకుపోయిన కవాటం వెడల్పు అవుతుంది. ఫీటల్ ఎకో పరీక్ష చేయటం ద్వారా ఇలాంటి సమస్యలేవైనా ఉంటే బయటపడతాయి.

ఇవేకాకుండా కొన్ని క్లిష్టమైన సమస్యలూ ఉండొచ్చు. పుట్టుకతో వచ్చే గుండెలోపాల్లో సుమారు 20% లోపాలు చాలా సంక్లిష్టంగానూ ఉంటుంటాయి. అందువల్ల అవసరమైతే కొన్ని జన్యు పరీక్షలు కూడా చేయాల్సి ఉంటుంది. క్రోమోజోముల్లో పెద్ద మార్పులేవైనా ఉంటే వీటి ద్వారా పట్టుకోవచ్చు. జన్యువులతో ముడిపడిన ఇలాంటి సమస్యలకు పుట్టిన తర్వాత చికిత్స చేయటం కష్టం. వీటికి ప్రస్తుతం కచ్చితమైన చికిత్సలేవీ అందుబాటులో లేవు. ఇలాంటి జబ్బులతో బిడ్డకు మున్ముందు తలెత్తే అనర్థాలు, సమస్యల గురించి కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించటం అవసరం. కాబట్టి చిన్నపిల్లల గుండె నిపుణులను కలిస్తే అవసరమైన పరీక్షలు చేసి సమస్యను నిర్ధరిస్తారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తారు.

–డా॥ కోనేటి నాగేశ్వరరావు
పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా

సమస్య – సలహా
సుఖీభవ
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
హైదరాబాద్ - 501 512
email:
sukhi@eenadu.in

ఈనాడు సినిమా

స్టార్లు లేకుండా తీసినందుకు ఆశ్చర్యపోయా - కేటీఆర్

వివేక్ సాగర్, తరుణ్ భాస్కర్, కేటీఆర్, రానా, సురేష్‌బాబు

తరుణ్‌భాస్కర్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఈ నగరానికి ఏమైంది'. సురేష్‌బాబు నిర్మాత. వివేక్‌సాగర్ స్వరాలు అందించారు. ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా 'ఈ నగరానికి ఏమైంది' పాటల సీడీ విడుదలైంది. అనంతరం ఆయన మాట్లాడుతూ "చేనేత కళాకారులకు మద్దతుగా ప్రతి సోమవారం చేనేత వస్త్రాలే ధరించాలనే ఓ నియమం పెట్టుకున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొనే నటీనటులు, సాంకేతిక నిపుణులంతా చేనేత వస్త్రాలే ధరిస్తారని మాట ఇచ్చారు. అందుకే ఇక్కడికి వచ్చా. ఈ టైటిల్ చూసి కంగారు పడ్డాను. ఎందుకంటే నేను తెలంగాణ పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని. వర్షాకాలం వస్తే చాలు.. 'ఈ నగరానికి ఏమైంది' అంటూ పత్రికల్లో పెద్ద పెద్ద హెడ్డింగులు పెడుతుంటారు. అలాంటి కథేమో అనుకున్నా. కానీ కాదని తెలిసింది. తరుణ్‌భాస్కర్ దర్శకత్వం వహించిన 'పెళ్లిచూపులు' సినిమా అంటే చాలా ఇష్టం. తరుణ్ కుటుంబంతో నాకు పరిచయం ఉంది. కానీ ఎప్పుడూ సినిమాకి సంబంధించిన విషయాలు మాట్లాడేవాడు కాదు. 'పెళ్లి చూపులు సినిమా చూడండి. మీకు బాగా నచ్చుతుంది' అని సురేష్‌బాబు చెప్పడంతో ఆ సినిమా చూశా. చిత్రబృందాన్ని అభినందించకుండా ఉండలేకపోయాను. ఓ చిత్రం విజయవంతమైన తరవాత రెండో చిత్రానికి పేరున్న నటులు, డబ్బులు, హంగామా అన్నీ వచ్చేస్తాయి. కానీ స్టార్స్ లేకుండా సినిమా తీశానని తరుణ్ భాస్కర్ చెప్పగానే నాకేం అర్థం కాలేదు. ఆశ్చర్యపోయా. రోడ్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. 'హ్యాంగోవర్', 'జిందగీ నా మిలేగే దుబారా' లాంటి సినిమాల్ని ఇష్టపడతాను. ఈ సినిమా కూడా ఆ కోవకే చెందుతుందనిపిస్తోంది. చిత్రసీమలో ఇప్పుడు మార్పు కనిపిస్తోంది. సందీప్, సంకల్ప్ లాంటి మంచి దర్శకులు వస్తున్నారు. సరిహద్దులు చెరిపేస్తున్నారు. తరుణ్ భాస్కర్ ఇక ముందు కూడా స్టార్లని కాకుండా కథల్ని నమ్మి ఇలాంటి మంచి సినిమాలు తీయాలి. ఈ చిత్రం 'పెళ్లి చూపులు' కంటే మంచి పేరు తీసుకురావాలి" అన్నారు. రానా మాట్లాడుతూ "తరుణ్ అంటే చాలా ఇష్టం. కాలేజీలో తను నా జూనియర్. తొలి సినిమాతో విజయం సాధిస్తే.. పరిశ్రమ కలుషితం చేసేస్తుంది. కానీ ఆ మార్గంలోకి వెళ్లకుండా మరో మంచి కథ చెబుదామని ప్రయత్నించాడు తరుణ్. ఇక ముందు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి. మంచి మంచి కథలు చెప్పాల"న్నారు. కార్యక్రమంలో ఈ చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

బ్రిటిష్ గడ్డ మీదే 'గోల్డ్' కొట్టాలి!

'గోల్డ్'

భారతీయులను రెండు వందల ఏళ్ల పాటు బానిసలుగా చూసిన బ్రిటిష్ వారిని వారి దేశంలోనే వారి ప్రజల కళ్ల ముందే ఓడించాలన్నది అతడి కల. అతను ఓడించాలనుకున్నది యుద్ధంలో కాదు.. హాకీ ఆటలో. అది నెరవేరడానికి 12 ఏళ్లు పట్టింది. ఆ క్రమంలో అతనికి ఎదురైన అడ్డంకులు ఏంటి? తన స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశాడన్నది 'గోల్డ్'లో చూడాలి. అక్షయ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. దర్శకురాలు రీమా కగ్తి తెరకెక్కిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చాక భారత హాకీ జట్టు ఒలింపిక్స్‌లో తొలి స్వర్ణం సాధించిన యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో అక్షయ్ హాకీ కోచ్‌గా నటిస్తున్నాడు. ఆయనకు జోడీగా మౌనీరాయ్ కనిపించనుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో అక్షయ్ నటన, సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేయనున్నారు.

ఆ ప్రేమ కోసం తెలుగులో సినిమా చేస్తా

లక్ష్మణ్, జయం రవి, శక్తి సౌందర్‌రాజన్

"తెలుగులో సినిమా ఎప్పుడు చేస్తారని అంతా అడుగుతున్నారు. చాలా అవకాశాలు వచ్చాయి కానీ వదులుకొన్నా. అది నా తప్పే. కానీ ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ కోసం తెలుగులో తప్పనిసరిగా సినిమా చేస్తా" అన్నారు జయం రవి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'టిక్ టిక్ టిక్'. శక్తి సౌందర్‌రాజన్ దర్శకత్వం వహించారు. లక్ష్మణ్ చదలవాడ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ "మన దేశంలోనే కాదు... ఆసియాలోనే తొలి అంతరిక్ష చిత్రమిది. తమిళంతో పాటు తెలుగులోనూ మంచి ఆదరణ లభించినందుకు ఆనందంగా ఉంది" అన్నారు. జయం రవి మాట్లాడుతూ "ఇదొక కొత్త ప్రయత్నం. కొత్త రకమైన సినిమాలు చేయాలనే ప్రోత్సాహాన్ని ఈ చిత్రంతో ఇచ్చినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. నా తొలి సినిమా 'జయం' పదిహేనేళ్ల కిందట ఈ సినిమా విడుదలైన రోజే వచ్చింది. పదిహేనేళ్ల తర్వాత నా తనయుడు నటించిన 'టిక్ టిక్ టిక్' సరిగ్గా అదే రోజున విడుదల కావడం ఆనందంగా ఉంద"న్నారు. "ప్రతి భారతీయుడు గర్వించే సినిమా ఇది. హాలీవుడ్‌లో పెట్టే వ్యయంలో కేవలం పది శాతంతో... నాణ్యతలో ఏమాత్రం రాజీపడకుండా ఈ చిత్రాన్ని తీశారు శక్తిసౌందర్. మనం కూడా సైన్స్ ఫిక్షన్ సినిమాలు తీయగలమని నిరూపించిన చిత్రమిది. జయం రవి మరింత అందంగా కనిపించారు ఈ సినిమాలో" అన్నారు లక్ష్మణ్.

హాలీవుడ్ స్థాయిలో తీశాం

"తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయిలో తీశాం. పరిమిత వ్యయంతో ఇలాంటి సినిమాల్ని కూడా తీయొచ్చని మేం నిరూపించబోతున్నాం" అన్నారు రవి వీడే. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'సంజీవని'. మనోజ్ చంద్ర, అనురాగ్ దేవ్, శ్వేత వర్మ, తనూజానాయుడు ప్రధాన పాత్రలు పోషించారు. జి.నివాస్ నిర్మాత. చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సోమవారం చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ "పురాణాల నేపథ్యంలో, తెలుగుదనానికి పెద్దపీట వేస్తూ తీర్చిదిద్దిన చిత్రమిది. సొంతంగా గ్రాఫిక్స్ స్టూడియోని ఏర్పాటు చేసుకొని, ఒక బృందంగా కలిసి ఈ సినిమా చేశాం. కెనడా, హైదరాబాద్‌లోని కొన్ని విజువల్ ఎఫెక్ట్స్ స్టూడియోల సాయంతో సినిమాని పూర్తి చేశాం. వెయ్యికి పైగా విజువల్ ఎఫెక్ట్స్ షాట్స్ ఇందులో ఉంటాయి. రెండేళ్లు కష్టపడి చేసిన సినిమా ఇది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అన్నారు. అనురాగ్ దేవ్ మాట్లాడుతూ "చిత్రీకరణ కంటే విజువల్ ఎఫెక్ట్స్‌కే ఎక్కువ సమయం పట్టింది. మా ట్రైలర్ చూసి అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి, రామ్‌గోపాల్ వర్మ మెచ్చుకుంటూ ట్వీట్ చేయడం మాకు గర్వకారణం. దాంతో సినిమాపై మరిన్ని అంచనాలు పెరిగాయి. తప్పకుండా ఆ అంచనాల్ని అందుకొంటాం" అన్నారు. శ్వేత వర్మ మాట్లాడుతూ "ఈ సినిమాలో నా పాత్ర పేరు మోనిక. పర్వతారోహణ అంటే ఇష్టం. సంజీవని గురించి పురాణాల్లో వినే ఉంటాం. ఆ మొక్క కోసం వెళతాం. ఆ ప్రయాణంలో ఏం జరిగిందనేది తెరపైనే చూడాలి. అందమైన ప్రాంతాల్లో చిత్రీకరించాం. ఇందులో నటించిన ఎనిమిది మంది తెలుగు నటులే" అన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌భగత్, పూర్ణేష్, దేవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తనూజానాయుడు, శ్వేత వర్మ

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

హన్సిక

తెలుగు తెరపై హన్సిక కనిపించి చాలా కాలం అయ్యింది. నవతరం నాయికల జోరు చూపిస్తున్న వేళ... హన్సికకి అవకాశాలు కనుమరుగయ్యాయి. ఇక తెలుగులో ఆమె కనిపించదేమో అనుకుంటున్న తరుణంలో ఓ లక్కీ ఛాన్స్ వచ్చినట్టు సమాచారం. నితిన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'ఛలో'తో ఆకట్టుకున్న వెంకీ కుడుముల దర్శకుడు. ఈ చిత్రంలో కథానాయికగా హన్సికని ఎంచుకున్నట్టు సమాచారం. 'సీతారాముల కల్యాణం లంకలో' చిత్రంలో నితిన్, హన్సిక జంటగా నటించారు. ఆ తరవాత ఇద్దరూ జోడీ కట్టడం ఇదే తొలిసారి.

'సై..' అనేసిందా?

హ్యూమా ఖురేషి

చిరంజీవి నటిస్తున్న 151వ చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. ఇప్పటికే ఇందులో స్టార్ హంగామా ఎక్కువైంది. అమితాబ్ బచ్చన్, నయనతార, తమన్నా, సుదీప్, జగపతిబాబు, ప్రగ్యా జైస్వాల్... ఇలా పేరున్న నటీనటులు తెరపై కనిపించనున్నారు. ఈ జాబితాలో మరో నాయిక చేరింది. హ్యూమా ఖురేషి 'సైరా'లో ఓ కీలక పాత్రలో కనిపించనుందని సమాచారం. ఇటీవల విడుదలైన 'కాలా'లో కథానాయికగా నటించింది హ్యూమా. తెలుగులో ఆమె నటించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. మరి హ్యూమా పాత్రేమిటో? దానికున్న ప్రాధాన్యం ఏపాటిదో తెలియాలంటే ఇంకొన్నిరోజులు ఆగాలి.

సిద్ధూకి జోడీ

కొత్త కబుర్లు

కేథరిన్

'గృహం'తో ఎట్టకేలకు ఓ విజయాన్ని అందుకున్నాడు సిద్ధార్థ్. ఆ తరవాత ఆచి తూచి కథల్ని ఎంచుకోవడం మొదలెట్టాడు. ఇప్పుడు ఓ కొత్త చిత్రాన్ని పట్టాలెక్కించాడు. సాయి శంకర్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. సోమవారం లాంఛనంగా చిత్రీకరణ మొదలైంది. కథానాయికగా కేథరిన్ థెరిస్సాని ఎంచుకున్నారు. తేజ దర్శకత్వం వహించిన 'నేనే రాజు నేనే మంత్రి'లో ఓ కీలకమైన పాత్ర పోషించింది కేథరిన్. ఆ సినిమాతో ఆమెకు అవకాశాలు జోరందుకున్నాయి. సిద్ధార్థ్ చిత్రం తెలుగు, తమిళ, మలయాళ భాషల్లోనూ విడుదల కానుంది.

కురుక్షేత్రం యుగానికి ఒక్కసారే!

కె.కె.రాధామోహన్, మెహరీన్, గోపీచంద్, సురేందర్‌రెడ్డి, చక్రవర్తి, ప్రసాద్ మూరెళ్ళ

ఒకరికి మంచి జరగాలంటే ఆ ఫైల్ మీద పది మంది సంతకాలు పెట్టాల్సిందే. ఆ పద్ధతి మారితే కానీ సామాన్యుడికి సాయం అందదని గ్రహించిన ఓ యువకుడు ఏం చేశాడో తెలియాలంటే 'పంతం' చూడాల్సిందే. గోపీచంద్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. మెహరీన్ కథానాయిక. కె.చక్రవర్తి దర్శకత్వం వహించారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. జులై 5న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు సురేందర్‌రెడ్డి ట్రైలర్‌ని విడుదల చేశారు. "కురుక్షేత్రం యుగానికి ఒక్కసారే జరుగుతుంది. ధర్మంవైపు నిలబడాలో, అధర్మంవైపు నిలబడాలో అప్పుడే తేల్చుకోవాలి..." అనే సంభాషణలతో సాగుతుంది ట్రైలర్. గోపీచంద్ మాట్లాడుతూ "కథని నమ్మి చేసిన సినిమా ఇది. చక్రవర్తి కథ ఎంత బాగా చెప్పాడో, సినిమాని అంత బాగా తీశాడు. ప్రసాద్ మూరెళ్ళ, రమేష్‌రెడ్డిల వల్లే ఈ కథ నా దగ్గరికొచ్చింది. దర్శకుడికి ఏం అవసరమో అది సమకూర్చాడు నిర్మాత. నా 25వ చిత్రం ఒక మంచి సినిమా అని గర్వంగా ఉంది. పాటలు, టీజర్‌కి మంచి స్పందన లభించింది" అన్నారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ "సామాజిక సమస్యని వాణిజ్య కోణంలో చెప్పే ప్రయత్నం చేశారు. రాధామోహన్ నిర్మాణం పరంగా రాజీపడలేదనిపిస్తోంది. ప్రసాద్ మూరెళ్ల విజువల్స్ చాలా బాగున్నాయి" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "గోపీచంద్ తన 25వ చిత్రాన్ని చేసే అవకాశం మాకు ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. చక్రవర్తి కొత్త దర్శకుడైనా సినిమాని చాలా బాగా తీశాడ"న్నారు. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉందన్నారు దర్శకుడు. "మంచి బృందం కలిసి చేసిన సినిమా ఇది. ప్రేక్షకుల్ని మెప్పించడంతో పాటు, అందరికీ పేరు తీసుకొస్తుంది" అన్నారు మెహరీన్.

ఇదీ లోకం తీరు...!



సుమంత్

సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇదం జగత్'. అంజు కురియన్ కథానాయిక. అనిల్ శ్రీకంఠం దర్శకుడు. జొన్నలగడ్డ పద్మావతి, గంగపట్నం శ్రీధర్ నిర్మాతలు. సోమవారం ఫస్ట్‌లుక్ విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "లోకం తీరు ఎలా ఉందో చూపించే చిత్రమిది. సుమంత్ తొలిసారి నెగెటివ్ షేడ్ ఉన్న పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్ర, అది ప్రవర్తించే విధానం తప్పకుండా థ్రిల్ కలిగిస్తాయి. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు 'ఇదం జగత్' తప్పకుండా నచ్చుతుంది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తామ"న్నారు. శివాజీ రాజా, సత్య, ప్రియదర్శిని రామ్, ఆదిత్య మేనన్, షఫీ తదితరులు నటిస్తున్నారు. ఛాయాగ్రహణం: బాల్‌రెడ్డి, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

గీతోపదేశం

లేదు సుమా లేదు సుమా
అపజయమన్నది లేదు సుమా
తోడూ నీడా లేరని నీవు
మానవ యత్నం మానకుమా

గీతం: లేదు సుమా లేదు సుమా...
చిత్రం: పెంకి పెళ్లాం
రచన: ఆరుద్ర
– పంపినవారు: సి.నరసింహులు, బెంగళూరు

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

దెయ్యంతో పోరాటం

హోమానంద్

పిసినారి ఇంట్లోకి దూరిన ఓ దెయ్యం... దాంతో చేసే పోరాటం నేపథ్యంలోనే మా చిత్రం సాగుతుందన్నారు హోమానంద్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిస్టర్ హోమానంద్'. జైరామ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఓం తీర్థం ఫిల్మ్ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హోమానంద్. "మా నాన్న కేశవతీర్థ నిర్మాత. ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చా. దర్శకుడు జైరామ్ కుమార్ తయారు చేసిన కథ నచ్చింది. పిసినారి అయిన కథానాయకుడు ప్రతి పైసా పోగేసి కొనుక్కున్న ఇంట్లోకి దెయ్యం ప్రవేశిస్తుంది. దాంతో కథానాయకుడు ఎలా పోరాటం చేశాడన్నది ఆసక్తికరమ"న్నారు. తదుపరి చిత్రాల గురించి చెబుతూ "దర్శకులు సుకుమార్, మారుతి సంస్థల్లో నటించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే రాజా వన్నెంరెడ్డి దర్శకత్వంలోనూ ఓ చిత్రం చేయబోతున్నా. నా అభిమాన కథానాయకుడు ఉపేంద్ర. ఆయన ఎంచుకొనే కథలు చాలా బాగుంటాయి" అన్నారు.

'మామ్' మరోసారి గెలిచింది!

- శ్రీదేవికి 'ఐఫా' ఉత్తమ నటి పురస్కారం
- ఉత్తమ నటుడు ఇర్ఫాన్ ఖాన్

శ్రీదేవి

ఇర్ఫాన్ ఖాన్

రేఖ

బాలీవుడ్ తారల వెలుగు జిలుగులతో బ్యాంకాక్ నగరం ధగధగలాడింది. ఇంటర్నేషనల్ ఇండియా ఫిలిం అకాడెమీ (ఐఫా) పురస్కారాల వేడుక-2018 బ్యాంకాక్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. విద్యాబాలన్ ప్రధాన పాత్రలో నటించిన 'తుమ్హారీ సులు'కు ఉత్తమ చిత్రం పురస్కారం దక్కింది. ఉత్తమ నటుడిగా ఇర్ఫాన్ ఖాన్(హిందీ మీడియం), ఉత్తమ నటిగా దివంగత నటి శ్రీదేవి (మామ్) ఎంపికయ్యారు. శ్రీదేవి తరఫున ఆమె భర్త బోనీ కపూర్ పురస్కారాన్ని అందుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అనారోగ్యంతో కొద్దిరోజులుగా చికిత్స తీసుకుంటున్న ఇర్ఫాన్ ఖాన్ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. 'హిందీ మీడియం'ను తెరకెక్కించిన సాకేత్ చౌదరి ఉత్తమ దర్శకుడిగా నిలిచాడు. ఉత్తమ సహాయ నటుడిగా నవాజుద్దీన్ సిద్దిఖీ(మామ్), సహాయ నటిగా మెహర్ విజ్(సీక్రెట్ సూపర్‌స్టార్) పురస్కారాలు అందుకున్నారు. ఇటీవల లోకాన్ని వీడిన శశి కపూర్, వినోద్ ఖన్నా, శ్రీదేవిలకు వేదికపై నివాళులర్పించారు.

కాగా ఈ వేడుకలో ప్రముఖ నాయకానాయికలు తమ డ్యాన్సులతో తరాల తారతమ్యాలను చెరిపేసి అభిమానులను ఉర్రూతలూగించారు. వయసును జయించిన అందాన్ని సొంతం చేసుకున్న అలనాటి కథానాయిక రేఖ ప్రదర్శన ఈ ఉత్సవానికే ప్రధానాకర్షణగా నిలిచింది. ఆరు పదులు దాటిన రేఖ లేత గులాబీ రంగు అనార్కలి చీర ధరించి వేదికపై లయబద్ధంగా నర్తిస్తుంటే కేరింతలు మిన్నంటాయి. ముఖద్దర్ కా సికందర్‌లోని సలామ్ ఇ ఇష్క్, ఉమ్రావ్ జాన్‌లోని దిల్ చీజ్ క్యా హై, ముఘల్ ఇ అజమ్‌లోని ప్యార్ కియాతో డర్నా క్యా లాంటి తన సూపర్ హిట్ గీతాలకు నృత్యాలు చేసి అలనాటి రోజులను మళ్లీ గుర్తుచేసింది రేఖ. సుమారు 20 నిమిషాల పాటు సాగిన ఆమె ప్రదర్శన ముగియగానే ఆహూతులతో పాటు సాటి నటీనటులూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ వేడుకలో బాబీ డియోల్‌తో పాటు యువతరం తారలు రణ్‌బీర్ కపూర్, వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, శ్రద్ధా కపూర్, కృతి సనన్ తదితరులు కూడా తమ నృత్యాలతో అలరించారు.

శ్రద్ధా కపూర్

జీవితం సాగాల్సిందే...

"ప్రేమ విఫలమైందని.. ప్రేమించేవాళ్లు దూరమయ్యారనీ... ఇలా రకరకాల కారణాలతో ఆత్మహత్యలకి పాల్పడుతుంటారు. ఎన్ని కష్టాలొచ్చినా జీవితం ముందుకు సాగాలనే అంశాన్ని ఒక హృద్యమైన ప్రేమకథతో ముడిపెట్టి చిత్రాన్ని తెరకెక్కించాం" అన్నారు బిక్స్ ఇరుసడ్ల. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'కన్నుల్లో నీ రూపమే'. నందు, తేజస్విని ప్రకాష్ జంటగా నటించారు. భాస్కర్ భాసాని నిర్మాత. ఈ నెల 29న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో బిక్స్ విలేకర్లతో ముచ్చటించారు. "మాది వరంగల్ జిల్లా, ములుగు సమీపంలోని దేవగిరి పట్నం. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశా. సినిమాలంటే ఇష్టమే నన్ను దర్శకుడిని చేసింది. నా అసలు పేరు భిక్షపతి. అందరూ బిక్స్ అని పిలిచేవాళ్లు. పత్రికల్లో వచ్చిన కొన్ని కథనాలు ఈ చిత్ర కథకి స్ఫూర్తినిచ్చాయి. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డా. నందు, తేజస్విని ఇంతవరకు ఏ సినిమాలో లేని విధంగా ఇందులో నటించారు. పోసాని ఇందులో విభిన్నమైన పాత్రలో కనిపిస్తారు. ప్రథమార్ధంతో పాటు, ద్వితీయార్ధంలో గబ్బర్‌సింగ్ బృందం పండించిన హాస్యం ఆకట్టుకుంటుంద"ని చెప్పారు బిక్స్. తదుపరి ఇద్దరు స్నేహితుల కథతో ఓ చిత్రం చేయబోతున్నట్టు తెలిపారాయన.

బిక్స్ ఇరుసడ్ల

తడిసినా... మెరిసిపోదాం!

వేసవి సెగలకు చినుకులతో తాపం తీరింది. కాలంతో పాటు దుస్తులూ, వాటి ట్రెండ్లు కూడా మారిపోతాయిగా... ఈ సమయంలో ట్రెండీగా కనిపించాలంటే... దుస్తులు మొదలు యాక్సెసరీల వరకూ కొన్ని మార్పులు చేసుకోవాలి. ఆ సూచనలే చేస్తున్నారు డిజైనర్ నిహారికా రెడ్డి.

ఫ్యాషన్ ట్రెండ్‌లతో పాటూ ఎప్పుడైనా సరే సౌకర్యానికే ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకే తడిసినా త్వరగా ఆరిపోయే తేలికరకం వస్త్రంతో కుట్టిన దుస్తుల్ని ఎంచుకుంటే మేలు. క్రేప్, షిఫాన్, సిల్క్, పాలిస్టర్, నైలాన్, ఖాదీ వస్త్రాలు ఈ కాలానికి బాగుంటాయి.

డిజైన్‌లు: ఈ కాలంలో దుస్తుల డిజైన్‌లు మరీ ఒంటికి అతుక్కుని ఉండకుండా చూసుకోవాలి. దీనివల్ల కొద్దిగా తడిసినా అసౌకర్యంగా అనిపిస్తుంది. చర్మ సంబంధిత సమస్యలూ ఇబ్బంది పెట్టే ప్రమాదం ఉంది.

ఏ రంగులు బాగుంటాయి...

వేసవి అంతా లేత రంగుల్ని వాడేశాం కదా! ఈ కాలంలో కంటికి ఇంపుగా కనిపించే కాంతిమంతమైన వర్ణాల్ని ఎంచుకోవడం మేలు. పసుపూ, ఎరుపూ, కాషాయం, ఆకుపచ్చ, నీలం వంటి రంగుల్లో మోనోక్రటిక్ తరహాలో వాటి ఛాయలు బాగుంటాయి. రెయిన్‌బో కలర్స్‌లోనూ వేసుకోవచ్చు. సహజ ప్రింట్లు అంటే పూలూ, మొగ్గలూ, ఆకులూ, పక్షులూ, పోల్కా‌డాట్‌లూ వంటివి ఈ కాలానికి నప్పుతాయి. అలాగే త్రెడ్ వర్క్ చినుకుల కాలానికి సరైన ఎంపిక. పొట్టి చేతులూ(షార్ట్ స్లీవ్స్), స్లీవ్‌లెస్‌తో పాటు రౌండ్, బోట్ నెక్‌లు కూడా బాగుంటాయి.

ఎలాంటి దుస్తులంటే...

నేలను తాకే అనార్కలీలూ, గౌన్‌లూ, స్కర్ట్‌లూ వంటివాటికి దూరంగా ఉంటేనే మంచిది. కాఫ్‌లెంగ్త్ అంటే కాలిపిక్కల వరకూ ఉండే గౌన్‌లూ, ప్యాంట్‌లూ, పలాజోలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అలానే మడమ కంటే పైకి ఉండే క్రాప్డ్ జీన్స్ అయితే బాగుంటాయి. కాస్త ట్రెండ్‌నీ జతచేయాలనుకుంటే ట్రెంచ్‌కోట్స్, విండ్ చీటర్స్, జాకెట్స్ వంటివి ఎంచుకోవచ్చు. టీషర్ట్స్, ట్యూనిక్‌లు రోజువారీ కోసం సౌకర్యంగా ఉంటాయి.

జతగా ఏం వేసుకోవచ్చంటే...

ఈ కాలంలో వేసుకునే దుస్తులకు నప్పేట్లుగా ఇతర యాక్సెసరీలూ అదనపు అందాన్ని తెచ్చిపెడతాయి. పెద్ద పెద్ద చోకర్‌లూ, స్టేట్‌మెంట్ నెక్‌పీస్‌లు ఈ కాలంలో అస్సలు వద్దు. వీలైనంత తక్కువగా నగలు వేసుకోవడం, లేదంటే పూర్తిగా మానేయడం మంచిది. క్విర్కీ డిజైన్‌లతో పూలూ, ఆకులూ, ఫ్యాన్సీ బీడ్స్, స్టోన్స్ వంటి రకాల్లో దిద్దుల్ని ఎంచుకోవచ్చు. కాన్వాస్‌షూలు, లెదర్, ఎత్తు చెప్పులకు ప్రత్యామ్నాయంగా రబ్బర్ ఫ్లోటర్స్, జెల్లీషూస్, ఫ్లిప్‌ఫ్లాప్స్, లాంగ్‌బూట్స్ వేసుకుని చూడండి. ఇవేకాదు రెయిన్‌ప్రూఫ్ హ్యాండ్‌బ్యాగ్స్, జాకెట్స్ వంటివీ మీకు అదనపు ఆకర్షణ తెచ్చిపెడతాయి.

ఇవి వద్దు:

బరువున్న జీన్స్, చుడీ, పటియాలా, లేయర్డ్ దుస్తులూ, పట్టు, టై అండ్ డై రకాలూ, హ్యాండ్‌పెయింటింగ్, బాందినీ, డిజైనర్, బ్రొకేడ్ దుస్తులు ఈ కాలంలో తడిసినప్పుడు పాడవుతాయి. వాటి లుక్ కూడా మారిపోతుంది. అసౌకర్యంగానూ ఉంటుంది. కాబట్టి వాటిని మరీ తప్పనిసరైతే తప్ప వేసుకోకపోవడం మంచిది.

నవ్వడమూ వ్యాయామమే

హాయిగా, మనస్ఫూర్తిగా నవ్వి ఎన్ని రోజులయ్యిందో గుర్తు చేసుకోండోసారి. ఎందుకంటారా... రోజూ కాసేపు నవ్వడం వల్ల మానసికంగానే కాదు, శారీరకంగానూ ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు నిపుణులు.

❖ వ్యాయామం చేయడానికి సమయం పెట్టుకున్నట్లే రోజూ ఓ పది నుంచి పదిహేను నిమిషాలు నవ్వడానికీ కేటాయించాలి. దానివల్ల అధికరక్తపోటు సమస్య అదుపులోకి వస్తుంది. శరీరానికి సరిపడే ప్రాణవాయువు అంది, రక్తప్రసరణ సజావుగా సాగడమే అందుకు కారణం. దీంతో శరీరం కూడా ఉత్సాహంగా మారుతుంది.

❖ హాయిగా నవ్వడం వల్ల వ్యాధినిరోధకశక్తిని పెంచే కణాలు పెరుగుతాయి. దీంతో అనారోగ్యం దరిచేరదు. నొప్పినీ తగ్గిస్తుంది. రోజూ కాసేపు నవ్వడం వల్ల ఎండార్ఫిన్ల ఉత్పత్తి కూడా జరుగుతుంది.

❖ నవ్వు మనలో ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుంది. దీంతో సానుకూల ఆలోచనలు మాత్రమే మనసులో వస్తాయి. క్లిష్టమైన సందర్భాల్లో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది.

❖ లాఫ్టర్ థెరపీ ద్వారా కంటినిండా నిద్రపోవచ్చని అంటున్నారు నిపుణులు. రోజంతా నవ్వుతూ, సంతోషంగా ఉండేవాళ్లకి మనసులో ఎటువంటి ఆందోళన ఉండదని, దాంతో ప్రశాంతమైన మనసుతో హాయిగా నిద్రపోతారని చెబుతోందో అధ్యయనం. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ హాయిగా నవ్వేయండి..లేదా ఏదైనా లాఫింగ్ క్లబ్‌లో చేరిపోండి.

జుట్టు చివర్లకు కండిషనర్

వర్షాకాలంలో తలస్నానం చేసిన రెండు రోజులకే జుట్టు జిడ్డుగా మారుతుంది. ఈ సమస్యను వదిలించాలంటే... ఇంట్లోనే ఇలా చేసి చూడండి.

■ కొబ్బరినూనె, తేనె ఈ కాలంలో జుట్టుకు ఎక్కువగా రాస్తుండాలి. ఆ రెండింటినీ కలిపి కూడా రాసుకోవచ్చు. వాటితో తరచూ మర్దనా చేయడం వల్ల జుట్టుకు కావాల్సిన తేమ అందడంతో పాటూ చివర్లు చిట్లిపోయే సమస్య కూడా తగ్గుతుంది.

■ మాడు కాస్త జిడ్డుగా ఉంటుంది కాబట్టి కండిషనర్ రాసుకునే విషయంలోనూ జాగ్రత్త అవసరమే. జుట్టు మొత్తం కాకుండా చివర్లకే రాసుకుంటే సరిపోతుంది. మాడుకు రాసుకుంటే జుట్టు ఇంకా పొడిబారిపోయి నిర్జీవంగా మారుతుంది.

■ వర్షంలో తడిసినప్పుడు దురద మామూలే. వెంటనే తలస్నానం చేయకపోతే చుండ్రు సమస్య కూడా రావచ్చు. అలాంటప్పుడు వేపనూనెను మాడుకు రాసి మర్దనా చేస్తే ఫలితం ఉంటుంది. సమస్య తగ్గేంత వరకూ వారానికోసారి ఇలా చేసి చూడొచ్చు.

పచ్చగా పెళ్లి చేసుకున్నారు!

వాళ్లిద్దరూ పర్యావరణ ప్రేమికులు. అందుకే తమ పెళ్లి కూడా పర్యావరణానికి ఎంతో కొంత మేలుచేసేదై ఉండాలనుకున్నారు. వివాహ వేదిక మొదలు... దంపతులుగా ఒక్కటయ్యేవరకూ ప్రతి ఏర్పాటులో పర్యావరణం పట్ల తమకున్న ప్రేమను తెలియజేశారు. ఇంతకీ ఆ జంట ఎవరంటే...

ముంబయికి చెందిన దీపాకామత్, ప్రవీణ్ జాగర్‌లు తమ పెళ్లితో ఇతరులకు ఓ సందేశాన్ని అందించాలనుకున్నారు. అదీ పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే దిశగా అవగాహన కల్పించాలనుకున్నారు. గౌతమబుదుడి సిద్ధాంతాన్ని అనుసరించే వధువు దీప పెళ్లి చాలా సాధారణంగా జరిగేలా చేయమని వరుడిని కోరింది. దానికి అతనూ ఒప్పుకొన్నాడు. ఇద్దరూ పెద్దల్ని ఒప్పించారు. పెళ్లి తేదీ నిర్ణయించుకుని బంధువులూ, స్నేహితుల్ని వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా ఆహ్వానించారు.

కానుకగా విత్తనాలు

పెళ్లి వేదిక కూడా పూలూ, ఆకులతో అలంకరించేలా చూశారు. ఫ్లెక్సీలూ, బ్యానర్లు కాకుండా, ఒక పెద్ద అట్టపై తమ పేర్లూ, 'డౌన్ టు ఎర్త్ వెడ్డింగ్' అని రాయించారు. వేదిక పక్కన ఓ బోర్డునీ ఉంచారు. అందులో 'మన భూమిని రక్షించుకుందాం, స్వర్గంలా మార్చుకుందాం...' అనే సందేశాన్ని రాయించారు. విందులోనూ స్టీలు పళ్లాలే వాడారు. తమ పెళ్లికి వచ్చిన ప్రతి ఒక్కరికీ 'సీడ్ బాల్స్' అందించారు. వాటిని మట్టిలో నాటమని కోరారు. ఇలా తమ పెళ్లి ద్వారా భవిష్యత్తులో తాము గడపబోయే జీవనవిధానం కూడా అలాగే ఉంటుందని చెప్పకనే చెప్పారు.

ఆ వేలిముద్రతోనే సాధించా

అదొక కీలకమైన కేసు.. ఘటనా స్థలంలో వేలి ముద్రలు తప్ప ఆధారాలేవీ దొరకలేదు. దాని కోసం దేశవ్యాప్తంగా గాలించింది స్వర్ణ జ్యోతి. చివరకు వందల చోరీలు చేసి.. లక్షల సొమ్మును కాజేసిన ఈ దొంగల ముఠా గుట్టు విప్పింది. కటకటాల పాలు చేసింది. కీలకమైన ఈ కేసును పట్టుదలతో ఛేదించినందుకు గానూ ఆమె జాతీయ స్థాయి ఫింగర్ ప్రింట్స్ బ్యూరో సదస్సులో ఎక్సలెన్సీ అవార్డును అందుకుంది. స్వర్ణజ్యోతి కరీంనగర్ పట్టణానికి చెందిన క్లూస్‌టీం ఎస్సై! ఆ విజయం ఆమె మాటల్లోనే..

సినిమాల్లో నేర పరిశోధన చూసి చాలామంది థ్రిల్‌గా ఫీలవుతారు. కానీ వాస్తవంలో అది చాలా కష్టం. సహనం ఉండాలి. నేను ఆ విషయంలో పక్కాగా ఉంటా. ఒక కేసు నమోదు అయిందంటే దాన్ని ఛేదించేవరకూ నిద్రపట్టదు. అందుకే ఆ దొంగల ముఠా గుట్టు రట్టు చేసే వరకూ పోరాడా. ఎవరికీ దొరకని దొంగల్ని నేనెందుకు పట్టుకోకూడదు అనే పట్టుదలతోనే పరిశోధన మొదలుపెట్టా. అదే అవార్డు తెచ్చిపెట్టింది. అసలేం జరిగిందంటే...

అది జనవరి 10, 2016. ఎప్పటిలానే డ్యూటీకి వెళ్లా. కాసేపటికి కోరుట్లలో చోరీ జరిగిందని ఫోను. వెంటనే మా సిబ్బందితో అక్కడికి వెళ్లాను. ఆ ఇంట్లో పాతిక తులాల బంగారం, అరవై ఐదువేల నగదు చోరీ అయ్యింది. బాధితుల ఇంట్లో అణువణువూ వెతికినా ఏ ఆధారం దొరకలేదు. దొంగలు కూడా చాలా జాగ్రత్తగా వేలి ముద్రలు పడకుండా పక్కా ప్రణాళికతో చోరీచేశారని అర్థమైంది. దురదృష్టవశాత్తూ ఇంట్లో వాళ్లంతా చోరీ జరిగాక ఇల్లంతా కలియ తిరగడం, బీరువాలు పట్టుకోవడం, శుభ్రం చేయడం వల్ల వేలిముద్రలూ దొరకలేదు. ఎంతో నిశితంగా పరిశీలిస్తే ఎప్పటికో ఇంట్లో వాళ్లతో మ్యాచ్ కాని ఒక వేలి ముద్ర దొరికింది.

అదే మలుపు... డబ్బూ, బంగారం కోసం దొంగలు కన్నాలు వేసిన ఘటనలు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌తో సహా చాలా ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్నట్టు మా దగ్గర సమాచారం ఉంది. బహుశా వాళ్లే వీళ్లు అయి ఉంటారనిపించింది. ఆ ముద్రల్ని తీసుకెళ్లి మా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ముద్రలతో పోల్చా. ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయిలో అందుబాటులో ఉన్న ముద్రలతో సరి చూశా. మన రెండు తెలుగు రాష్ట్రాల్లోని దొంగల వేలి ముద్రలతో అది మ్యాచ్ కాకపోయే సరికి పక్క రాష్ట్రాల వారి పనే అయి ఉంటుంది అని భావించా. ఇక్కడ ఆధారాలు దొరక్కపోయేసరికి ఆ వేలిముద్రల్ని ఎన్‌సీఆర్‌బీ (నేషనల్ క్రైం రికార్డు బ్యూరో)కి పంపించా. నిత్యం వాళ్లకి ఫోన్ చేయడం, ఆరా తీయడం... ఇదే నా పని. ఇలా నెలల తరబడి ప్రయత్నించగా ఎట్టకేలకు ఒక నేరస్థుడి వేలిముద్రతో సరిపోయింది. అతని వివరాలు తీసుకున్నా. వాటి ఆధారంగా ఆ దొంగని పట్టుకుంటే చోరీల గుట్టు వీడింది. ఈ దొంగతనాలు చేసింది మహారాష్ట్రకు చెందిన నలుగురు యువకులు. ఇప్పటి వరకూ వారు వందకు పైనే చోరీలు చేశారు. వాళ్ల దగ్గరున్న ఇరవై ఆరు లక్షల రూపాయలు రికవరీ చేశాం. జగిత్యాల పోలీసులు పీడీ చట్టం కింద వీరిపై కేసులు నమోదు చేసి ముఠాను జైలుకు పంపించారు.

మా నాన్న విశ్రాంత ఉద్యోగి. అమ్మ గృహిణి. మావారు డాక్టర్. నేను అథ్లెట్‌గా జాతీయ స్థాయిలో ఆరుసార్లు పతకం అందుకున్నా. డిగ్రీ అయ్యాక బీపీడీ (బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ డైరెక్టర్) కోర్సు చేశా. ఎంసీఏ పూర్తయ్యాక పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి ఎంపికయ్యా. పందొమ్మిది నెలల శిక్షణ అనంతరం 2012లో విధుల్లో చేరా. కొన్నాళ్ల క్రితమే ఎస్సైగా పదోన్నతి పొందా. నా విజయం వెనుక కుటుంబసభ్యుల సహకారం ఎంతో ఉందని గర్వంగా చెబుతా.

గర్వపడుతున్నా... ఏటా జాతీయ స్థాయిలో ఫింగర్ ప్రింట్స్ బ్యూరో సదస్సు జరుగుతుంది. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించిన 19వ జాతీయ సదస్సులో ద్వితీయ స్థానంలో అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్సీని అందుకున్నా. 'శాస్త్ర సాంకేతికతలో పోలీసుల సాధికారిత' విభాగంలో నేను ఎంపికయ్యా. ప్రశంసాపత్రంతోపాటు రివార్డునూ అందించారు. కరీంనగర్ క్లూస్ టీం ఎస్సైగా నేను వందల కేసులను ఛేదించా. అయితే అన్నింటిలో ఈ ముఠా చాలా కీలకమైంది. ఎన్నో ప్రాంతాల్లో దొంగతనం చేసినా.. దొరక్కుండా తప్పించుకున్నారు. నేను చేసిన కృషి వల్ల వాళ్లు జైలు పాలయ్యారు. అంతేకాదు అంతర్జాతీయ స్థాయిలోనూ ముఠాల్ని పట్టుకున్న సందర్భాలూ ఉన్నాయి.

జాతీయ స్థాయి ఫింగర్ ప్రింట్స్ బ్యూరో సదస్సుకు అన్ని రాష్ట్రాల వారూ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా కీలకంగా మారిన పదహారు కేసుల్ని ఎంపిక చేశారు. అందులో నేను పట్టుకున్న ఈ మహారాష్ట్ర దొంగల ముఠా కేసు కూడా ఉంది. వీటిల్లో పది కేసుల్ని అధికారులు ఛేదించిన విధానాన్ని వివరించమన్నారు. నేను ప్రతి విషయాన్నీ కళ్లకు కట్టినట్టు వివరించా.

– తుమ్మల శ్రీనివాస్, ఈనాడు డిజిటల్, కరీంనగర్

వాళ్లతో ఎలా మాట్లాడాలి?

? ఆరు నెలల క్రితం నా స్నేహితురాలి ఉద్యోగం పోయింది. తనకు తల్లిదండ్రుల్లేరు. కొన్నిరోజులక్రితం ఉద్యోగ ప్రయత్నాలు ఎంత వరకూ వచ్చాయని మామూలుగా అడిగా. అప్పటి నుంచీ నాతో సరిగ్గా మాట్లాడటంలేదు. నేనే మైనా సహాయం చేయగలననే ఉద్దేశంతోనే అలా అడిగానే తప్ప మరో ఆలోచన లేదు. అసలు ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారితో అలా మాట్లాడటం పొరపాటా...? ఆ ప్రయత్నాల్లో ఉన్నవారితో ఎలా మాట్లాడాలి. – ఓ సోదరి

డియర్ వసుంధర

డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

✔ సన్నిహితులకైనా, స్నేహితులకైనా వాళ్ల మంచికోరి మీరు సలహాలివ్వొచ్చు. కానీ ఉద్యోగం లేక ఆందోళనలో ఉన్నవారు అలా అడగడం వల్ల బాధపడొచ్చు. మీ స్నేహితురాలు కూడా ఆ మాటలకే బాధపడి ఉంటుంది. ఉద్యోగవేటలో ఉన్నవారితో కొన్ని విషయాలు మాట్లాడకపోవడమే మంచిది.

● 'ఇప్పటివరకూ ఎన్ని ఇంటర్వ్యూలకు హాజరయ్యావ్?'... ఓదార్చడానికైనా సరే ఈ ప్రశ్నను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రస్తావించకూడదు. బదులుగా ప్రయత్నాలు ఎంతవరకూ వచ్చాయి అని అడగొచ్చు.

● 'ఆన్‌లైన్‌లోనూ చూడొచ్చు కదా..?' అని అడగడం సరికాదు. తను మరీ టెక్నాలజీని వాడలేని వ్యక్తి అయితే తప్ప ఈ ప్రయత్నం తప్పకుండా చేసే ఉంటుంది. అలా అడగడం వల్ల 'ఉద్యోగం వెతికే కనీస పరిజ్ఞానం, సామర్థ్యం తనకి లేదనేది మీ అభిప్రాయమని ఆమె బాధపడొచ్చు. అలా కాకుండా ఫలానా చోట అవకాశం ఉందట కదా ఆన్‌లైన్ ద్వారానే సంప్రదించాలట... అని చెప్పి చూడండి. ఆమె సమాధానం విని దాన్ని బట్టి సలహా ఇవ్వొచ్చు.

● 'పార్ట్‌టైమ్ లేదంటే తాత్కాలికంగా ఏదైనా ఉద్యోగం కోసం ప్రయత్నించొచ్చు కదా?'... ఇది కొంత మందికి మంచి సలహాగానే అనిపించొచ్చు. కానీ దానివల్ల ఇంతకుముందులా ఆదాయం రావడంలేదు. పైగా పోటీ కూడా ఎక్కువే. అలాంటి ఉద్యోగాలు తెచ్చుకోవడం ఇప్పుడు అంత సులువేం కాదు.

● 'నేను నీకొక ఉద్యోగానికి సంబంధించిన వివరాలు పంపా కదా! దానికి దరఖాస్తు చేసుకున్నావా?'... మీరు ఆరాటంతో తెలుసుకోవాలనో, మద్దతివ్వాలనో ఆ ప్రశ్న అడిగి ఉండొచ్చు. కానీ ఆ మాటలతో మీ స్నేహితురాలు ఇబ్బంది పడొచ్చు. అది తనకు నప్పే ఉద్యోగం కాదేమో, లేదంటే దరఖాస్తు చేసుకున్నా స్పందన రాలేదేమో! మీరు ఏమైనా ఉద్యోగాలుంటే చెప్పడం సరైన పనే. కానీ తరచూ వాటి గురించి అడగకండి. ఉద్యోగం వస్తే తనే మీకు చెబుతుంది కాబట్టి పదేపదే అడగడం సరికాదు.

● 'ఉద్యోగం వెతుక్కోడానికి అసలెందుకింత సమయం పడుతోంది'... అని అడగడమూ సరికాదు. ఈ రోజుల్లో ఉద్యోగం రావడానికి నెలలు కావచ్చు, సంవత్సరమూ పట్టొచ్చు. కాబట్టి మీ వంతుగా సహకరించేందుకు మాత్రమే ప్రయత్నించండి.

మీ ప్రశ్నల్ని vasucareer@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

25 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,700	31,600	31,500	31,570
ఆర్నమెంట్	29,600	29,500	29,300	29,300
వెండి (కిలో)	41,550	41,500	41,200	41,200

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,650	31,680	31,652	31,610
ఆర్నమెంట్	29,350	29,310	29,300	29,250
వెండి (కిలో)	41,000	41,000	41,100	40,800

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,430	31,430	--------	--------
ఆర్నమెంట్	29,230	29,230	2,930	2,925 గ్రా
వెండి (కిలో)	41,900	41,900	43.30	43.40 గ్రా



ఆధునిక టెక్నాలజీ టేకాఫ్‌తో ప్రపంచం పెద్ద గ్రామంగా మారిపోయింది. దూరాల భారాలు తరిగిపోయాయి. భాషాంతరాల గోడలు బద్దలైపోతున్నాయి. అందరికీ అన్ని భాషలు అందుబాటులోకి వస్తున్నాయి. ఎవరు ఏ భాషైనా నేర్చుకోవచ్చు. వ్యాఖ్యాతలు, అనువాదకులు, టీచర్లు, కస్టమర్ సర్వీస్ ఆఫీసర్లు ... ఇలా ఎన్నో రకాల ఉద్యోగాల్లో చేరిపోవచ్చు. విదేశీ భాషలు ఇప్పుడు ఉపాధి అవకాశాలకు గొప్ప వేదికలుగా మారాయి.

విదేశీ భాషలు ఉపాధి బాటలు



ప్రపంచీకరణ నేపథ్యంలో భారతదేశ కంపెనీలు అన్ని దేశాల్లోనూ విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో సమాచార మార్పిడికి ప్రధానమైన భాషల నిపుణులకు అవకాశాలు పెరుగుతున్నాయి. విదేశీ వాణిజ్యంలో వృద్ధి కారణంగా ప్రముఖ కంపెనీలు మన దేశంలోనూ శాఖలు తెరుస్తున్నాయి. దీంతో సాఫ్ట్‌వేర్, బీపీవో, కేపీవో, ఎల్పీవో, మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్...ఇలా ప్రతి విభాగంలోనూ విదేశీ భాషలతో అవసరం ఏర్పడింది. అందువల్ల వీటిపై ఆసక్తి ఉన్నవారు జర్మన్, స్పానిష్, ఫ్రెంచ్, ఇటాలియన్, పర్షియన్, చైనీస్.. వంటి భాషల్లో ఏదో ఒక దానిలో నైపుణ్యం పెంచుకుంటే మంచి ఆదాయం ఉన్న ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు. ఆన్‌లైన్ వేదికగా ఇంటి నుంచే సంపాదన పెంచుకోవచ్చు. దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీలతోపాటు ప్రైవేటు సంస్థలు విదేశీ భాషల కోర్సులను అందిస్తున్నాయి. బేసిక్ లేదా ఫౌండేషన్‌తో మొదలైన ఈ కోర్సులు సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ వరకు విస్తరించాయి. .

వేతనాలూ ఎక్కువే!

ఇంటర్‌ప్రిటర్లుగా వ్యవహరించేవాళ్లు గంటకు రూ.వెయ్యి చొప్పున సంపాదిస్తున్నారు. అలాగే ట్రాన్స్‌లేషన్ చేసేవాళ్లు భాషను బట్టి పదానికి రూపాయి నుంచి పది రూపాయల వరకు తీసుకుంటారు. నాలెడ్జ్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్ (కేపీవో)లో చేసేవాళ్లు నెలకు లక్షల్లో జీతాలు అందుకుంటున్నారు. పర్యాటక రంగం కూడా విస్తరిస్తున్న నేపథ్యంలో సర్టిఫైడ్ టూరిస్ట్ గైడ్లు సీజన్‌లో రోజుకి రూ. మూడు వేలు తేలిగ్గా తీసుకుంటున్నారు. పెరుగుతున్న అవసరాలకు తగినంతమంది విదేశీ భాషలు వచ్చినవాళ్లు లేరని ఈ రంగంలో స్థిరపడిన నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఏదైనా భాషలో ప్రావీణ్యం పొందితే తక్కువ వ్యవధిలోనే ఉద్యోగాన్ని సంపాదించుకోవచ్చు.

ఏం నేర్పుతారు!

చాలావరకు యూనివర్సిటీలు ప్రవేశపరీక్ష నిర్వహించి విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ఈ పరీక్షలో జీకే, రీజనింగ్, ఇంగ్లిష్ గ్రామర్, కాంప్రహెన్షన్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా అభ్యర్థులను చేర్చుకుంటారు. కొన్ని సంస్థల్లో ప్రవేశానికి ఇంటర్వ్యూ తప్పనిసరి. ముందుగా ఆయా భాషల్లో వినడం, చదవడం, మాట్లాడడం, రాయడం నేర్పుతారు. తర్వాత ఆ భాషల నుంచి ఆంగ్లం లేదా మన మాతృభాషలోకి తర్జుమా (ట్రాన్స్‌లేషన్) చేయడంపై శిక్షణ ఉంటుంది. ఆ భాషా సంబంధిత దేశ సంస్కృతి, ఆచారవ్యవహారాలపైనా అవగాహన కల్పిస్తారు. జేఎన్‌యూ, దిల్లీ వంటి యూనివర్సిటీల్లో విదేశీ భాషలు చదువుకుంటున్న విద్యార్థులను స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కింద కొన్నాళ్లపాటు విదేశాలకు పంపుతారు. ఈ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా లభిస్తున్నాయి.

ఇవీ సంస్థలు

విదేశీ భాషలు నేర్పడానికి దేశంలోని ప్రసిద్ధ సంస్థల్లో ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ), హైదరాబాద్ ఒకటి. ఇది కేవలం విదేశీ భాషల కోసమే ఆవిర్భవించింది. లఖ్‌నవూ, షిల్లాంగ్‌ల్లోనూ దీనికి క్యాంపస్‌లు ఉన్నాయి. దీంతోపాటు దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, దిల్లీ యూనివర్సిటీ, జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీలు ఇతర ప్రముఖ సంస్థలు. అలాగే హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, రామకృష్ణ మఠం కూడా తక్కువ ఫీజులతో విదేశీ భాషలు నేర్పడంలో ఖ్యాతి గడించాయి. పదో తరగతి విద్యార్హతతోనే 17 ఏళ్లు పైబడిన వాళ్లు వీటిలో చేరవచ్చు. పలు ప్రైవేటు సంస్థల్లోనూ వీటిని నేర్పుతున్నారు. సంస్థను బట్టి సర్టిఫికెట్, డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా, పీజీ డిప్లొమా, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ వంటి కోర్సులను అందిస్తున్నారు.

సంస్థలవారీ అందుబాటులో ఉన్న కోర్సులు

❖ **ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ), హైదరాబాద్**

బీఏ (ఆనర్స్): అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, రష్యన్, స్పానిష్ ఒక్కో కోర్సులో హైదరాబాద్ క్యాంపస్‌లో 20 చొప్పున సీట్లు ఉన్నాయి.

ఎంఏ: అరబిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, ఫ్రెంచ్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, జర్మన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, హిస్పానిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, రష్యన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ ఒక్కో సబ్జెక్టులో 20 చొప్పున హైదరాబాద్ క్యాంపస్‌లో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

పీహెచ్‌డీ: రష్యన్, జర్మన్, స్పానిష్, ఫ్రెంచ్, అరబిక్ భాషల్లో పీహెచ్‌డీ కోర్సులను ఇఫ్లూ అందిస్తోంది.

రాతపరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు లభిస్తాయి.

❖ **ఉస్మానియా యూనివర్సిటీ**

ఎంఏ: అరబిక్, ఇస్లామిక్ స్టడీస్, పర్షియన్ భాషల్లో ఎంఏ అందిస్తోంది. జర్మన్, ఫ్రెంచ్, అరబిక్, పర్షియన్ భాషల్లో జూనియర్, సీనియర్, అడ్వాన్స్‌డ్ డిప్లొమాలనూ అందిస్తోంది. వీటిని ఎవరైనా నేర్చుకోవచ్చు. తరగతులు ఉదయం జరుగుతాయి. సాధారణంగా జులైలో ప్రకటన వస్తుంది.

❖ **ఆంధ్రా యూనివర్సిటీ:** ఫ్రెంచ్‌లో జూనియర్ డిప్లొమా, సీనియర్ డిప్లొమా కోర్సులు నిర్వహిస్తోంది.

❖ **జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూదిల్లీ:** వివిధ స్థాయుల్లో అరబిక్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్, జపనీస్, కొరియన్, మంగోలియన్, రష్యన్, చైనీస్, పర్షియన్ భాషలను బోధిస్తోంది.

❖ **దిల్లీ యూనివర్సిటీ:** అరబిక్, ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్, ఇటాలియన్, పోర్చుగీసు, రొమానియన్, జపనీస్, చైనీస్, కొరియన్ భాషల్లో వివిధ స్థాయుల్లో కోర్సులు ఉన్నాయి.

❖ **జామియా మిల్లియా ఇస్లామియా:** అరబిక్, ఫ్రెంచ్, స్పానిష్, ఇటాలియన్, పోర్చుగీస్, టర్కిష్, పర్షియన్ తదితర భాషల్లో కోర్సులను వివిధ స్థాయుల్లో అందిస్తోంది.

ఉద్యోగావకాశాలు

ప్రపంచంలో ఎన్నో వేల భాషలు ఉన్నాయి. ప్రతి దేశానికీ ఇంకో దేశంతో వర్తక, వాణిజ్య అవసరాలు పెరుగుతున్నాయి. దీంతో రెండు దేశాల భాషలు తెలిసినవాళ్లకు డిమాండ్ ఉంటోంది. కంపెనీల మధ్య సంధానకర్తలుగా వీరికి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

వర్తక వాణిజ్యాల వెంటే పర్యాటక రంగం విస్తరిస్తోంది. ఉదాహరణకు జర్మనీ నుంచి వచ్చిన అతిథికి మన తాజ్‌మహల్ గొప్పదనాన్ని వివరించాలంటే జర్మన్ భాష తెలిసినవాళ్లతోనే సాధ్యమవుతుంది. ఇలా పలు దేశాల నుంచి వచ్చిన అతిథులకు గైడ్‌లుగా వ్యవహరించడానికి నిపుణుల అవసరం పెరుగుతోంది.

ప్రముఖ సంస్థలన్నింటికీ విదేశాల్లో కార్యాలయాలున్నాయి. అలాగే దాదాపు అన్ని పెద్ద సంస్థలకూ విదేశాల్లో ఖాతాదారులు, వినియోగదారులు (క్లయింట్స్) ఉంటారు. వీరందరూ మాట్లాడే భాష ఒకటి కాదు. ఒక్కొక్కరూ ఒక్కో భాషలో మాట్లాడతారు. ఇలాంటప్పుడు ఆ భాష తెలిసినవారుంటే సమస్య ఉండదు. సాఫ్ట్‌వేర్ లేదా ఇతర బహుళజాతి సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కొన్నిసార్లు క్లయింట్ వద్ద పనిచేయాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు క్లయింట్ భాష తెలిసినవాళ్లకే విదేశాలకు (ఆన్‌సైట్) వెళ్లే అవకాశాలు అదనపు ఆదాయం, సౌకర్యాలతో లభిస్తాయి.

ప్రభుత్వాలకు చెందిన విదేశీ, రాయబార కార్యాలయాలు, విదేశీ మంత్రిత్వ శాఖ, ఐక్యరాజ్యసమితి విభాగాలు, వివిధ సంస్థల కేంద్రాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి. వీటిల్లో పనిచేయడానికి అక్కడి స్థానిక భాష తెలిసిన వారిని తీసుకుంటారు.

ప్రముఖ పుస్తకాలు, కీలక సమాచారం, అంతర్జాతీయ స్థాయి నిర్ణయాలు.. మొదలైనవి ప్రపంచవ్యాప్తంగా అందరికీ అందుబాటులోకి తీసుకురావాలంటే ఆయా స్థానిక భాషల ద్వారానే సాధ్యం. అందుకే ఒక భాష నుంచి ఇంకో భాషలోకి తర్జుమా చేసేవాళ్లకు కూడా మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయి. సెల్‌ఫోన్లు, టీవీలు మొదలైన ఉపకరణాలకు సంబంధించి యూజర్ మాన్యువల్‌ను వినియోగదారుడి స్థానిక భాషలో రూపొందించాలి. దీంతో ప్రతి ఉత్పత్తి కంపెనీలోనూ భాషా నిపుణులకు అవకాశాలు ఉంటున్నాయి.

చాలా వరకు ప్రైవేటు పాఠశాలల్లో సిలబస్‌తో సంబంధం లేకుండా ఏదో ఒక విదేశీ భాషను విద్యార్థులకు నేర్పుతున్నారు. అలాగే ఫారిన్ లాంగ్వేజ్‌లు నేర్పే కోచింగ్ సెంటర్లు పెరుగుతున్నాయి. ప్రముఖ విశ్వవిద్యాలయాలన్నింట్లోనూ ఏదో ఒక విదేశీ భాష అందుబాటులో ఉంటోంది. పలు కళాశాలలు డిగ్రీ స్థాయిలోనే విదేశీ భాషలను అందిస్తున్నాయి. వీటన్నింటిలోనూ బోధకులుగా ఉపాధి దొరుకుతోంది.

కేంద్రీయ విద్యాలయాలు, ఆర్మ్‌డ్, పారా మిలటరీ ఫోర్సెస్, రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్, ఎంబసీ/ హైకమిషన్స్, కాల్ సెంటర్లు, ఎమ్మెన్సీలు, టూరిజం, ఇండియన్ ఫారిన్ మినిస్ట్రీ, ఐక్యరాజ్యసమితి తదితర సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ప్రచారం, వినోదం, మీడియా, ఆతిథ్యం, విమానయానం...ఇలా పలు విభాగాల్లో విదేశీ భాషలు వచ్చినవారికి ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది.

డిమాండ్ ఉన్న భాషలు

ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్, ఇటాలియన్, కొరియన్, చైనీస్, పర్షియన్, అరబిక్, జపనీస్, రష్యన్ భాషల్లో ప్రస్తుతం అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మనదేశం ఏయే దేశాలతో ఎక్కువగా వాణిజ్యాన్ని కొనసాగిస్తోంది, ఏ దేశాల శాఖలు భారత్‌లో ఎక్కువగా ఉన్నాయి, మన దేశానికి ఏ దేశాల నుంచి పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారు...తదితర అంశాలపైన ఆధారపడి ఉద్యోగాలు ఉంటాయి.

డిప్లొమా లేదా సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్న ఇతర సంస్థలు:

చైనీస్: చైనీస్ లాంగ్వేజ్ ఇన్‌స్టిట్యూట్, న్యూదిల్లీ, గుడ్‌గావ్

ఫ్రెంచ్: అలియన్స్ ఫ్రాంఛైజ్, న్యూదిల్లీ

జర్మన్: గోయితె ఇన్‌స్టిట్యూట్, న్యూదిల్లీ, హైదరాబాద్.

ఇటాలియన్: ఇటాలియన్ కల్చరల్ ఇన్‌స్టిట్యూట్, న్యూదిల్లీ

జపనీస్: మన్బుషో స్కాలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, న్యూదిల్లీ

స్పానిష్: ఇన్‌స్టిట్యూటో హిస్పానియా, ముంబయి, దిల్లీ, చెన్నై

❖ వైఎంసీఏ, భారతీయ విద్యా భవన్లు వివిధ భాషల్లో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు అందిస్తున్నాయి.

ఎంఈసీ తర్వాత ఫిజిక్స్, కెమిస్ట్రీ కుదిరేనా?

ఇంటర్ (ఎంఈసీ) పూర్తిచేశాను. సైన్స్ గ్రూపు (బీఎస్‌సీ ఫిజిక్స్/ కెమిస్ట్రీ) వైపు వెళ్లాలని ఉంది. కుదురుతుందా?
- ఎస్. భార్గవ్

ఇంటర్ ఎంఈసీతో పూర్తి చేసినవారు డిగ్రీ స్థాయిలో (మేథమేటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్) కోర్సులను ఎంచుకోవచ్చు. బీఎస్‌సీ (మేథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్)ను తీసుకోవచ్చు. లేదా బీకాం, బీబీఏ, బీబీఎం వంటి కామర్స్, మేనేజ్‌మెంట్ కోర్సులను ఎంచుకోవచ్చు. ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదవనందున బీఎస్‌సీ (కెమిస్ట్రీ/ ఫిజిక్స్) కోర్సును ఎంచుకోవడం సాధ్యం కాదు. కాబట్టి మీ ఆసక్తి మేరకు పైన తెలిపిన కోర్సులను ఎంచుకోవచ్చు.

రూరల్ స్టడీస్, ఎన్విరాన్‌మెంటలిస్ట్ కోర్సులపై ఆసక్తి

పీజీ చదువుతున్నాను. రూరల్ స్టడీస్, ఎన్విరాన్‌మెంటలిస్ట్ కోర్సులపై ఆసక్తి. కోర్సులు, అందించే సంస్థల వివరాలను తెలపండి.
- పావన జ్యోతి

పీజీ స్థాయిలో రూరల్ స్టడీస్ చేయాలనుకునేవారు మాస్టర్స్ ఇన్ రూరల్ స్టడీస్ (ఎంఆర్ఎస్)ను అందిస్తున్న భవ్‌నగర్ యూనివర్సిటీ- గుజరాత్, పట్నా యూనివర్సిటీ- పట్నా, నిమ్స్ యూనివర్సిటీ- రాజస్థాన్, ఆంధ్రా యూనివర్సిటీ, ఇగ్నోవారు అందించే ఎంఏ (రూరల్ డెవలప్‌మెంట్) కోర్సును ఎంచుకోవచ్చు. విశ్వవిద్యాలయాలు తమ ప్రవేశపరీక్షల ద్వారా అడ్మిషన్ కల్పిస్తాయి. ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు పై కోర్సులకు అర్హులు.

ఎన్విరాన్‌మెంటలిస్ట్ కావాలనుకునేవారు పీజీ స్థాయిలో ఎంఎస్‌సీ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) కోర్సును ఎంచుకోవచ్చు. ఈ కోర్సు చేయాలనుకునేవారు డిగ్రీలో కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, మైక్రోబయాలజీ లేదా ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ చదివుండాలి. బీటెక్ (సివిల్) చదివినవారు కూడా ఈ కోర్సును ఎంచుకోవచ్చు. మన తెలుగు రాష్ట్రాల్లో ఈ కోర్సును ఆంధ్రా, ఆచార్య నాగార్జున, ఉస్మానియా యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

రక్షణ రంగంలో అమ్మాయిలకు అవకాశాలు?

ఇంటర్ పూర్తిచేశాను. నాకు రక్షణ రంగంవైపు వెళ్లాలని ఉంది. అమ్మాయిలకు ఈ రంగంలో ఉన్న అవకాశాలూ, అందించే కళాశాలలు, ప్రవేశపరీక్షల వివరాలను తెలియజేయండి. - పి.దీక్షిత

రక్షణ రంగంలో అడుగిడాలనుకునేవారు నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. ఏటా రెండుసార్లు యూపీఎస్‌సీ ఈ పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో గమనించాల్సిన విషయం- అభ్యర్థి వయసు 16-19 ఏళ్ల మధ్య ఉండాలి. అంతకు మించినవారు అనర్హులు. ఆర్మీ విభాగంలో చేరాలంటే ఏదైనా సబ్జెక్టులో 10+2 పూర్తి చేసుండాలి. నేవీ లేదా ఎర్‌ఫోర్స్ విభాగంలో అభ్యర్థులు 10+2లో మేథ్స్, ఫిజిక్స్ చదివుండాలి. రాతపరీక్షలో అర్హత సాధించినవారికి వైద్యపరీక్ష, మౌఖిక పరీక్షల ద్వారా అవకాశం కల్పిస్తారు. డిగ్రీ పూర్తిచేసిన మహిళా అభ్యర్థులు షార్ట్ సర్వీస్ కమిషన్- టెక్నికల్ ఉమెన్ పరీక్ష ద్వారా రక్షణ రంగంలోకి అడుగు పెట్టవచ్చు. ఈ రంగంలో అవకాశాలు విస్తృతంగా ఉన్నాయి. పట్టుదల, కార్యదక్షతతో ఈ రంగంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు.

- ప్రొ.బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

అప్రెంటిస్‌షిప్

సెంట్రల్ రైల్వేలో 2573 అప్రెంటీస్ ఖాళీలు

ముంబయి ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న సెంట్రల్ రైల్వే వివిధ యూనిట్లు/ వర్క్‌షాపుల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** 2573 **క్లస్టర్ల వారీ ఖాళీలు:** ముంబయి-1799, భుసావల్-421, పుణె-152, నాగ్‌పూర్-107, షోలాపూర్-94. **అర్హత:** కనీసం 50శాతం మార్కులతో పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత. **వయసు:** 15-24 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ ఆధారంగా. **దరఖాస్తు ఫీజు:** రూ.100 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 26.06.2018 నుంచి 25.07.2018 వరకు. **వెబ్‌సైట్:** https://www.rrccr.com/

ప్రభుత్వ ఉద్యోగాలు

లేబర్ బ్యూరో కార్యాలయాల్లో 875 పోస్టులు

వివిధ రాష్ట్రాల్లోని భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖకు చెందిన లేబర్ బ్యూరో కార్యాలయాల్లో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

పోస్టులు: కన్సల్టెంట్, సూపర్‌వైజర్, ఇన్వెస్టిగేటర్, అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్. **ఖాళీలు:** 875 **అర్హత:** ఇంటర్, షార్ట్‌హ్యాండ్, టైప్ రైటింగ్, డిగ్రీ, పీజీ, అనుభవం. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్. **చివరి తేది:** ప్రకటన వెలువడిన తేదీ (24.06.2018) నుంచి 10 రోజుల్లోపు.

వెబ్‌సైట్: http://labourbureaunew.gov.in/

ఇండియన్ నేవీలో సెయిలర్లు

భారత నావికాదళం స్పోర్ట్స్ కోటా ఎంట్రీ కింద సెయిలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: డైరెక్ట్ ఎంట్రీ పెట్టీ ఆఫీసర్, సీనియర్ సెకండరీ రిక్రూట్, మెట్రిక్ రిక్రూట్స్.

అర్హత: పదోతరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. సంబంధిత క్రీడల్లో అంతర్జాతీయ/ జాతీయ/ రాష్ట్ర/ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లలో పాల్గొని ఉండాలి. **ఎంపిక:** ఆయా క్రీడాంశాల్లో ప్రతిభ, ట్రయల్స్, వైద్య పరీక్షల ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **చివరి తేది:** 09.07.2018

వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

ప్రవేశాలు

తెలంగాణ ఎంసెట్-బైపీసీ స్ట్రీమ్ ప్రవేశాలు

తెలంగాణలోని అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ యూజీ కోర్సుల ప్రవేశాలకు (ఎంసెట్-బైపీసీ స్ట్రీం) ఆయా వర్సిటీలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. **కోర్సులు:** 1) బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ 2) బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ 3) బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ 4) బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్. **అర్హత:** ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్‌లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. **ఎంపిక:** తెలంగాణ ఎంసెట్-2018 ర్యాంకు ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్
చివరి తేది: 14.07.2018 http://www.pjtsau.ac.in/

అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజినీరింగ్ సెట్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధిత డిప్లొమా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **కోర్సులు:** బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ (65 సీట్లు), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజినీరింగ్) (07 సీట్లు) **ఎంపిక:** అగ్రిసెట్ అండ్ అగ్రిఇంజినీరింగ్‌సెట్ ద్వారా. **పరీక్ష తేది:** 21.07.2018 **అర్హత:** అగ్రికల్చర్/ సీడ్ టెక్నాలజీ/ అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణత. **చివరి తేది:** 13.07.2018 http://www.pjtsau.ac.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

నరలోక యమదూత

- ప్రయాణికుల ప్రాణాలు బలిగొంటున్న ఆటోలు
- కేసులు పెట్టినా తీరు మారని డ్రైవర్లు
- తనిఖీలు, కఠిన చర్యలతోనే కట్టడికి అవకాశం

పౌరుల ప్రయాణ అవసరాలు తీరుస్తున్న ఆటోలే వారి ప్రాణాలను హరిస్తున్న పరిస్థితి ఎక్కువైపోతోంది. ఆటో డ్రైవర్ల అత్యాశ, ప్రయాణికుల భద్రత, రవాణా శాఖ నిబంధనలపై వారి నిర్లక్ష్యం.. వెరసి అమాయకుల ఉసురు తీస్తున్నాయి. రాష్ట్రంలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోని ఆటో ఉండదంటే అతిశయోక్తిలేదు. ఈ పరిస్థితి గ్రామాల్లో మరీ ఎక్కువ. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని తెలిసినా కావలసిన చోట ఎక్కి అవసరమైన చోట దిగే అవకాశం ఉండటంతో ప్రమాదమని తెలిసినా పౌరులూ ఆటోలను ఆశ్రయిస్తుండటం ఆటో డ్రైవర్లకు అనుకోని వరంలా మారుతోంది. దీంతో తమ అధిక ఆదాయం కోసం సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని, ప్రమాదకర పరిస్థితుల్లో ఆటోలను నడుపుతూ వారి ప్రాణాలను పణంగా పెడుతున్నారు.

– ఈనాడు, అమరావతి

ఆటో స్వరూపం (అలైన్‌మెంట్)

ఆటోలోపల ఏర్పాటు చేసిన ప్రత్యేక సీట్లు

- **ఇలా ఉండాలి:** చిన్న ఆటోల్లో డ్రైవర్, ముగ్గురు ప్రయాణికులు (3 ప్లస్ 1), పెద్ద ఆటోల్లో డ్రైవర్, నలుగురు ప్రయాణికులు (4 ప్లస్ 1) కూర్చొనేందుకు వీలుగా సీట్ల స్వరూపం (అలైన్‌మెంట్) ఉండాలి.
- **ఇలా మార్చేస్తున్నారు:** ముందుభాగంలో డ్రైవర్‌కు ఇరువైపులా కూర్చొనేందుకు రెండు బల్లలు, మధ్య భాగంలో డ్రైవర్ సీటును ఆనుకుని ఓ బల్లను అమరుస్తున్నారు. పెద్ద ఆటోల్లో వీటికి అదనంగా వెనుకవైపు డోరు భాగంలోనూ రెండు బల్లలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రయాణికులు కూర్చొనేందుకు చోటు

ఆటో వెనుక భాగాన ఏర్పాటు చేసిన చెక్క సీటు

- **ఇలా ఉండాలి:** పెద్ద ఆటోల్లో ఒక్కో ప్రయాణికుడు కూర్చొనేందుకు 404 మిల్లీ మీటర్ల కంటే తక్కువ కాకుండా, చిన్న ఆటోల్లో 0.9 మీటర్ల కంటే తక్కువ కాకుండా, 1118 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా సీటు పొడవు ఉండాలి. సీటు వెనుక్కి వాలేందుకు తగినంత ఎత్తులో ఉండాలి.
- **ఇలా ఉంటోంది:** ఆటో స్వరూపాన్ని మొత్తం మార్చేసి అదనపు సీట్లు అమరుస్తుండటంతో నిర్దేశించిన మేరకు ప్రయాణికులు కూర్చొనేందుకు చోటు ఉండటం లేదు.

కాళ్లు పెట్టుకునేందుకు చోటు

పరిమితికి మించి ప్రయాణం

- **ఇలా ఉండాలి:** పెద్ద ఆటోల్లో అయితే కనీసం 279 మిల్లిమీటర్లు, చిన్న ఆటల్లో అయితే 381 మిల్లీమీటర్ల మేర కాలు పెట్టుకునేందుకు చోటు విడిచిపెట్టాలి.
- **ఇలా ఉంటోంది:** చిన్న ఆటోల్లో డ్రైవర్ కాకుండా ఎనిమిది మంది, పెద్ద ఆటోల్లో 15 మంది ప్రయాణికులను ఎక్కించుకుంటూ నడుపుతున్నారు. దీంతో ఇరుకిరుకుగా కాళ్లు పెట్టుకోవాల్సి వస్తోంది.

పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు-నిబంధనలు

ప్రయాణికుల పరిమితి:

- **ఇలా చేయాలి:** పెద్ద ఆటోల్లో 12 ఏళ్ల లోపు విద్యార్థులు (డ్రైవర్‌ను మినహాయించి) ఎనిమిది మంది, చిన్న ఆటోల్లో ఆరుగురిని మాత్రమే ఎక్కించుకోవాలి.
- **ఇలా చేస్తున్నారు:** పెద్ద ఆటోల్లో కనీసం 15 మందిని, చిన్న ఆటోల్లో 12 మందిని ఎక్కించుకుంటున్నారు

ప్రమాదకరంగా పాఠశాల విద్యార్థుల ప్రయాణం

ఇతర జాగ్రత్తలు

- **ఇలా చేయాలి:** ఆటోకు ఒకవైపు రక్షిత గ్రిల్స్, మరోవైపున తాత్కాలిక రక్షణ కవచం ఏర్పాటు చేయాలి. స్కూల్ బ్యాగులు, నీళ్లసీసాలు, లంచ్ బాక్సులను బయటకు వేలాడదీయ కూడదు.
- **ఇలా చేస్తున్నారు:** గ్రిల్స్ ఏర్పాటు లేదు. విద్యార్థులను తీసుకెళ్లే ఆటోల్లో ఎక్కువ శాతం వారి స్కూల్‌బ్యాగులు, నీళ్లసీసాలు, లంచ్‌బాక్సులు వంటి వాటిని బయటకు వేలాడదీస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆటోరిక్షాల మూలంగా ప్రమాదాలు జరగడానికి ప్రధానంగా ఈ కింది ఉల్లంఘనలే కారణమవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 23వ తేదీ వరకూ రవాణా శాఖా ఆయా ఉల్లంఘనలపై నమోదు చేసిన కేసుల వివరాలు

ఉల్లంఘన	కేసులు
డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపటం	2580
డ్రైవర్‌కు ఇరువైపులా ప్రయాణికులను కూర్చొపెట్టుకోవడం	831
సామర్థ్య ధ్రువపత్రం లేకుండా వాహనం నడపటం	5321
మద్యం తాగి వాహనం నడపటం	127
పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం	4516
ఫోన్లో మాట్లాడుతూ వాహనం నడపటం	90

ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో ఆటోరిక్షాల మూలంగా జరిగిన రోడ్డు ప్రమాదాల గణాంకాలు

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	మృతులు	గాయపడిన వారు
2016	3595	843	6141
2017	3034	750	5308
2018(ఏప్రిల్ వరకూ)	874	229	1409
మొత్తం	7,503	1,822	12,858

ఏపీలో జరుగుతున్న మొత్తం రోడ్డు ప్రమాదాల్లో ఆటో రిక్షా ప్రమాదాల వాటా వివరాలు శాతాల్లో

సంవత్సరం	ఆటో ప్రమాదాల వాట	ప్రమాదాల్లో మృతిచెందిన వారు	ప్రమాదాల్లో గాయపడిన వారు
2016	15.15	10.22	27.34
2017	13.50	9.32	19.28
2018 ఏప్రిల్ వరకూ	12.48	8.91	17.06

రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న కారు
- నలుగురు మహిళా రైతులు సహా ఐదుగురు మృతి

మంచాల, ఇబ్రహీంపట్నం గ్రామీణ: అప్పుడప్పుడే తెలవారుతోంది. పండించిన పంటను మార్కెట్‌కు తరలించాలనే ఆతృతతో ఆటో ఎక్కారు మహిళా రైతులు. కాసేపట్లో గమ్యాన్ని చేరుకుందామనే లోపే.. అతివేగంతో దూసుకొచ్చిన కారు వారి ఆశలను.. బతుకులను చిదిమేసింది. ఐదు కుటుంబాల్లో తీరని శోకానికి కారణమైంది. ప్రయాణికుల ఆటోను.. కారు ఢీకొన్న ఘటనలో నలుగురు మహిళలు సహా ఐదుగురు మృత్యువాతపడిన ఘటన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో సోమవారం జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన పలువురు మహిళా రైతులు కొత్తిమీర ఇబ్రహీంపట్నం మార్కెట్‌లో విక్రయించేందుకుగానూ సోమవారం వేకువజామున ఆటోలో బయల్దేరారు. ఉదయం 5.45 గంటలకు ఆటో లింగంపల్లి గేట్ వద్దకు చేరుకుంది. ఇదే సమయంలో ఇబ్రహీంపట్నం వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఆటోను ఢీకొంది. ఢీకొన్న వేగానికి ఆటో నుజ్జయి.. ఆనవాలు కోల్పోయింది. అందులో ప్రయాణిస్తున్న చీమల మమత(30), చీమల సుజాత(36), అంబోతు హస్లి(50), అంబోతు మారు(40) అక్కడికక్కడే మరణించారు. వారి మృతదేహాలు రహదారిపై చెల్లాచెదరుగా పడ్డాయి. తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ వంగలి శ్రీనివాస్(26) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. గాయపడిన అచాలి (40), సోన(50), రజిత(15), కమ్లి(40), పద్మజ (40), లక్ష్మమ్మ(35)లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మద్యం మత్తు..అతివేగమే కారణం: కారు చోదకుడు మద్యం మత్తులో అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఏసీపీ మల్లారెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారులో కోటేశ్వర్‌రెడ్డి(32), ప్రవీణ్‌కుమార్‌రెడ్డి(30), రాఘవేందర్‌రెడ్డి(32), సాయికుమార్‌రెడ్డి(30) ఉన్నట్లుగా గుర్తించామని, ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించామన్నారు. వీరంతా ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు ఓ విందులో పాల్గొని మద్యం తాగారని, వీరికి శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు.

ఉద్యోగ అవకాశాలు

WALK- IN -INTERVIEW CARNIVAL CINEMAS

Carnival Cinemas required the following staff for its multiplex properties

- **Cinema Manager :** Min. Exp. required 7years
- **Duty Officer/ Team Leader :** Min. Exp. required 2 years.
- **Storekeeper :** Min. Exp. required 1years
- **Housekeeping Executive :** Min. Exp. required 2 years
- **Duty Manager :** Min. Exp. required 4 years
- **Accountant :** Min. Exp. required 1 years
- **Commi :** Min. Exp. required 1years
- **Associate :** Fresher
- **Electrician :** Min. Exp. 1 years

Preferable Industry : Cinema, Hospitably, F&B, Retails and Airline
Salary : Depends on the Experience for all posts

Interview Date: 30th June 2018 @ 10 am to 1 pm
Venue: **Hotel Narayana Palace,** 60 feet Road, Opp.RTC Depot., **ONGOLE**

Carnival Films Pvt Ltd
Contact Person : Raju Amireddy, Cell: 74004 48905
Email : raju.amireddy@groupcarnival.com

Jocil Limited
(A Subsidiary of The Andhra Sugars Limited)

Applications are invited for the following posts.

1. Sr. Accounts Officer :
B.Com / M.Com / CA Inter passed Candidates with 8-10 years of relevant experiance in finalisation of accounts, taxation, bank reconciliations, fixed deposits accounting etc. Knowledge in SAP is desirable.

2. Accounts Officer :
B.Com / M.Com / CMA Inter passed Candidates with 6-8 years of relevant experiance in purchase accounting including accounting for imported material, LC opening and BG related works, all service bills accounting, reconciliation of parties accounts etc. Knowledge in SAP is desirable.

3. Asst. Accounts Officer :
B.Com / M.Com passed Candidates with 3-5 years of relevant experiance in purchase accounting, voucher preparation, relevant bills verification etc. Knowledge in SAP is desirable.

Interested Candidates may apply within 15 days preferably by Email or Post to the following address:

Box 216, Arundelpet P.O., Guntur-522002, A.P.
Email :jocil@jocil.net

Requires

Accounts Officer: CA/CA-Inter/M.Com/MBA with 5 to 10 years of experience in the relevant field. Preferably in Educational Institutions.
Asst. Accounts Officer: CA-Inter/M.Com/ MBA with 5 to 10 years experience in Tally, GST & Income Tax matters.
Accountants: M.Com/MBA/B.Com with 5 to 10 years experience.
Site Engineers (Construction): Diploma/ Degree in Civil Engineering with 5 to 10 years experience in construction.
Utility Managers: Degree/Diploma in Civil/ Electrical Engineering with 3 to 5 years experience in Building & Facilities Management.
Computer Operator: Any Degree with good knowledge in Typing & MS Office with 3 to 5 years experience.
Surveillance Operator: Any Degree/ Diploma in CCTV insulation maintenance & monitoring with 2 to 3 years experience.
Lab Technicians (Civil/Mechanical/EEE/ ECE): Diploma/ITI with relevant experience.
House Master: Any Degree with 2 to 3 years experience.

Interested Candidates may send their resumes with photo within 10 days to **hr@vidyanikethan.edu** or the **Special Officer**:

SREE VIDYANIKETHAN EDUCATIONAL TRUST
Sree Sainath Nagar, A.Rangampet, Near Tirupati–517102.
Mobile : 9000777807; Phone: 0877-30066900

పోరాడి గెలిచిన ఐఏఎస్ అధికారిణి రోహిణి

ఈనాడు– బెంగళూరు: కర్ణాటకలోని గత ప్రభుత్వం తనను అడ్డగోలుగా బదిలీలు చేసిందంటూ న్యాయస్థానం మెట్లెక్కిన తెలుగింటి ఆడపడుచు, ఐఏఎస్ అధికారిణికి ఎట్టకేలకు విజయం దక్కింది. హాసన్ జిల్లాధికారిగా పనిచేస్తున్న రోహిణి సింధూరిని గతంలో వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇప్పుడా బదిలీని రద్దు చేసి హాసన్‌లోనే విధులు అప్పగించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం కర్ణాటక ఉన్నత న్యాయస్థానానికి నివేదించింది. హాసన్ జిల్లాధికారి ఉద్యోగం నుంచి ఆమెను ఎనిమిది మాసాల కిందట అప్పటి రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. దీన్ని కేంద్ర పరిపాలన న్యాయ పంచాయతి (సీఏటీ) సమర్థించింది. ఆ సమర్థనను రోహిణి సింధూరు ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేశారు. గడువుకు ముందుగా నాటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఒత్తిడికి లొంగి ప్రభుత్వం చేసిన తన బదిలీ చెల్లుబాటును ప్రశ్నించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం చేసిన నివేదనతో కేంద్ర పరిపాలన న్యాయ పంచాయతి ఉత్తర్వును న్యాయమూర్తులు హెచ్.జి. రమేశ్, న్యాయమూర్తి మహ్మద్ నవాజ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టి వేసింది. ఇపుడా అధికారిణి చేతికి పూర్వ హాసన్ పాలనాపగ్గాలు అందనున్నాయి.

కార్తీకి బెయిల్‌పై 'సుప్రీం'లో సీబీఐ సవాల్

దిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కాంగ్రెస్ నేత పి.చిదంబరం కుమారుడు కార్తీకి దిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ సీబీఐ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దిగువ న్యాయస్థానంలో కార్తీ బెయిల్ విజ్ఞాపనకు సంబంధించిన వ్యాజ్యంపై విచారణ పూర్తికాకముందే.. హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని చట్టం అనుమతించదంటూ సీబీఐ తన విజ్ఞాపనలో పేర్కొంది.

సౌర సైకిల్.. అంతరచిత్రంలో రాకేష్ నాయక్

సౌరశక్తితో సైకిల్ స్వారీ

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: సౌరశక్తితో నడిచే సైకిల్‌ను తయారుచేసి ఓ నిరుపేద యువకుడు ఔరా అనిపించాడు. ఒడిశాలోని భద్రక్ జిల్లా బొందరపొఖిరి సమితిలోని మారుమూల గ్రామం కల్నాకు చెందిన యువకుడు రాకేష్ నాయక్ 2014లో ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తి చేశాడు. ఉద్యోగ వేటలో తరచూ 15 కిలోమీటర్ల దూరంలోని సమితి కేంద్రం బొందరపొఖిరి వరకూ సైకిల్‌పై వెళ్లి వచ్చేవాడు. సౌరశక్తితో సైకిల్ తయారుచేసుకోవాలని భావించాడు. స్వల్ప మొత్తంతో సౌరపలకలు, బ్యాటరీ, మోటారు, ఇతర పరికరాలు కొనుక్కున్నాడు. సైకిల్ సీటు వెనుకవైపు కేరియర్‌పై రెండు సౌరపలకలు అమర్చాడు. 12 వోల్టులున్న నాలుగు బ్యాటరీలతో పెట్టె తయారుచేసి సైకిల్‌ఫ్రేం కింద అమర్చాడు. 24 వోల్టులు శక్తిగల డీసీ మోటారునూ అమర్చాడు. ఎలక్ట్రిక్ యాక్సిలరేటర్, ఆన్-ఆఫ్ స్విచ్, హారన్, దీపాలను సమకూర్చుకున్నాడు. ఈ సైకిల్ గంటకు 30 కిలోమీటర్ల వేగంతో నడుస్తోంది. ఏదైనా సమస్య వచ్చి మోటారు పనిచేయక పోయినా తొక్కుతూ సైకిల్ నడిపేలా చేశాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలకలు ఛార్జి అయ్యాక రాత్రి పూట 30 కిలోమీటర్ల వరకూ మోటారు సాయంతో నడవగలదని అతడు తెలిపాడు. దీని తయారీకి రూ.15 వేలు ఖర్చయిందని వివరించాడు.

'అలాంటి నేరస్థులను క్షమించరాదు'

దిల్లీ: చిన్నారులపై అత్యాచారానికి పాల్పడటం క్షమార్హం కాదని.. అలాంటి నేరాలకు పాల్పడేవారిపై జాలి చూపరాదని.. తక్కువ శిక్షలు విధించరాదని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు 2004లో ఓ వ్యక్తికి దిగువ కోర్టు విధించిన శిక్షను - జస్టిస్ ఎస్.పి.గార్గ్, జస్టిస్ సి.హరిశంకర్‌లతో కూడిన ధర్మాసనం సమర్థించింది. 2000లో పదేళ్ల బాలికపై అనిల్ మెహతా అనే వ్యక్తి అత్యాచారానికి ఒడిగట్టిన కేసులో అతనికి అదనపు సెషన్స్ జడ్జి జీవిత ఖైదు విధించారు. దీనిపై అపీల్‌కు వెళ్లగా - కేసు తీవ్రత దృష్ట్యా దిగువకోర్టు విధించిన శిక్ష విషయంలో జోక్యం చేసుకోనవసరం లేదని హైకోర్టు పేర్కొంది.

శనగకు మద్దతు పెంచాల్సిందే..

- క్వింటాలుకు రూ.6,807 ఇస్తేనే గిట్టుబాటు
- ఆవాలు పంటకూ ఇప్పుడిచ్చేది చాలదు
- సీఏసీపీకి రాష్ట్రం సిఫార్సు

ఈనాడు – అమరావతి

శనగకు ఇపుడిస్తున్న మద్దతు ధర రూ.4,400 ఏమాత్రం చాలదని రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. క్వింటాలుకు రూ.6,807 అయినా ప్రకటించాలని కోరింది. ఆవాల రైతులకు కేంద్రం ఇచ్చే మద్దతూ చాలడం లేదంది. ఏటికేడు పెట్టుబడులు పెరుగుతున్న వైనాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. రబీ పంటలకు మద్దతు ధరల నిర్ణయంపై వ్యవసాయ పెట్టుబడులు, ధరల కమిషన్(సీఏసీపీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ విషయాలను స్పష్టీకరించింది. ఆంధ్రప్రదేశ్‌లో రబీ ప్రధాన పంటగా వరి తర్వాత శనగ అధిక విస్తీర్ణంలో సాగవుతుంది. రాయలసీమతోపాటు ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో ఎక్కువగా పండిస్తున్నారు. దీని సాధారణ విస్తీర్ణం 11.87లక్షల ఎకరాలు ఉండగా.. గతేడాది 13.12లక్షల ఎకరాల్లో వేశారు.

ఖర్చుకు.. మద్దతుకు ఇంత వ్యత్యాసమా..?

కొన్నేళ్లుగా రైతుకు అవుతున్న పెట్టుబడికి, కేంద్రం ప్రకటిస్తున్న మద్దతు ధరకు పొంతన లేదని సీఏసీపీకి ఇచ్చిన నివేదికలో వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. ఎకరాకు అయిదు క్వింటాళ్ల దిగుబడులు లెక్కచూసినా..రైతులు సగటున రూ.10వేల వరకు నష్టపోతున్నట్లు ఈ గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 11.87లక్షల ఎకరాలకు పరిశీలిస్తే.. సగటున రైతులు ఏడాదికి రూ.1,187కోట్లు కోల్పోయారు. గతేడాది రబీలో పండించిన శనగలు ఇప్పటికీ అమ్ముకోలేక శీతల గిడ్డంగులకు తరలించారు.

మద్దతు పెంచితేనే రైతుకు గిట్టుబాటు

శనగలో పెట్టుబడి వ్యయంతోపాటు కొన్నేళ్లుగా కౌలు రేట్లు భారీగా పెరుగుతున్నాయని వ్యవసాయశాఖ వివరించింది. ఎకరాకు రూ.26,400 పెట్టుబడి అవుతోందంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం యంత్ర ఖర్చు రూ.4,090, కూలీల ఖర్చు రూ.6,048, ఎరువులు, విత్తనాలకు రూ.6వేలుగా నిర్ణయించారు. ఎకరా కౌలు రూ.8వేలుగా పేర్కొన్నారు. వీటన్నిటిని పరిగణిస్తూ క్వింటాలుకు రూ.6,807 చొప్పున మద్దతు ధర ఇవ్వాలని కోరింది.

★ రైతులకయ్యే వాస్తవ పెట్టుబడి, కౌలుతో చూస్తే వ్యవసాయశాఖ కోరేది తక్కువే. ఎకరాకు రైతులు రూ.35వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడిగా పెడుతున్నారు. విత్తనాలకే ఎకరాకు రూ.5వేల వరకు అవుతోంది. కౌలు విషయానికొస్తే.. గతేడాది ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఎకరా రూ.28వేలకు పైగా చెల్లించి తీసుకున్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం వీటికి 50శాతం కలిపి లెక్కిస్తే.. క్వింటాలుకు రూ.9వేలు ఇచ్చినా తక్కువే అవుతుంది.

క్వింటాలుకు ఖర్చు, మద్దతుధరలు (క్వింటాలుకు రూపాయల్లో)

సంవత్సరం	ఖర్చు	ప్రకటించిన మద్దతు ధర	క్వింటాలుకు తేడా
2016-17	6,062	4,000	2,062
2017-18	6,573	4,400	2,173

ఆవాలుకు రూ.5,756 ఇవ్వాల్సిందే

రాష్ట్రంలో సుమారు 65వేల ఎకరాల్లో ఆవాలు పండిస్తున్నారు. దీనికి క్వింటాలుకు రూ.4వేల మద్దతు ధర ఉంది. ఎకరా సాగుకు రూ.34,888 ఖర్చవుతున్నట్లు వ్యవసాయ శాఖ తేల్చింది. కూలీలకు రూ.1,680, యంత్ర సాగుకు రూ.3వేలు, ఎరువులు, విత్తనాలకు రూ.1,335 చొప్పున లెక్కకట్టారు. ఎకరాకు రూ.6వేలు కౌలుగా పేర్కొన్నారు. మొత్తం ఖర్చులను పరిగణిస్తూ క్వింటాలుకు రూ.5,756 మద్దతు ధర నిర్ణయించాలని సీఏసీపీ సిఫారసు చేసింది.

ఎగువ కాఫర్‌డ్యామ్ జెట్‌గ్రౌటింగ్ నిర్మాణం పూర్తి

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరి నదిపై డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ ప్రాంతానికి ఎగువన నిర్మిస్తున్న ఎగువకాఫర్ డ్యామ్ జెట్‌గ్రౌటింగ్ పనులు పూర్తయినట్లు ప్రాజెక్టు సీఈ వి.శ్రీధర్ సోమవారం రాత్రి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఇసుక తిన్నెలపై నుంచి 20 మీటర్ల లోతున ఇసుకను గట్టిపర్చడమే జెట్‌గ్రౌటింగ్ అని వెల్లడించారు. గోదావరి నదిపై పశ్చిమగోదావరి నుంచి తూర్పుగోదావరి వరకూ 2045 మీటర్ల పొడవునా చేపట్టిన ఈ పనులను కెల్లర్ సంస్థ త్వరగా పూర్తి చేసిందని, డయాఫ్రమ్‌వాల్ నుంచి 400 మీటర్ల దూరంలో ఎగువకాఫర్ డ్యామ్ నిర్మాణం చేపట్టామని వివరించారు. వరదలు తగ్గిన వెంటనే అక్టోబరు లేదా నవంబరులో దానిపై కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

గోదావరి నదిపై ఎగువ కాఫర్‌డ్యామ్‌లో భాగంగా జెట్‌గ్రౌటింగ్ పనులు పూర్తయిన నిర్మాణ ప్రదేశం

తద్వారా 2019 జూన్ నాటికి గ్రావిటీ ద్వారా పోలవరం కుడి, ఎడమ కాలువలకు నీరు అందించేందుకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి వైద్య విద్య ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఎన్టీఆర్ విజ్ఞాన, ఆరోగ్య వర్సిటీ ప్రకటించింది. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం నగరాల్లో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాల్లో ఈనెల 26 నుంచి 30 వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రాలు కలిగినవారు తప్పక ఎన్టీఆర్ వర్సిటీలో ఏర్పాటుచేసిన కేంద్రానికే హాజరుకావాలని స్పష్టం చేసింది.

సరిహద్దుపై సర్వే చేశామిలా..

- తొలి రోజు వివరించిన సర్వే జనరల్ అధికారులు
- నేడు తమ వాదనలు వినిపించనున్న ఏపీ, కర్ణాటక

ఈనాడు– అనంతపురం: ఆంధ్రప్రదేశ్- కర్ణాటకల మధ్య నెలకొన్న సరిహద్దు వివాదానికి సంబంధించి డెహ్రాడూన్‌లో సర్వేజనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో తొలి రోజు సోమవారం భేటీ జరిగింది. రెండు రాష్ట్రాల సరిహద్దులోని బళ్లారి రక్షిత అటవీ ప్రాంతం(రిజర్వ్ ఫారెస్టు)పై వివాదం నెలకొంది. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాలతో సర్వే జనరల్ ఆఫ్ ఇండియా అధికారులు, రెండు రాష్ట్రాలకు చెందిన వివిధ శాఖల అధికారులు ఇటీవల సంయుక్తంగా సర్వే చేశారు. సర్వే జనరల్‌ఆఫ్ ఇండియా అధికారులు ఈ రెండు రాష్ట్రాల సరిహద్దుకు సంబంధించి కొన్ని పాయింట్లు గుర్తించి వాటి ఆధారంగా నివేదిక రూపొందించారు. దీనిపై సోమ, మంగళవారాల్లో డెహ్రాడూన్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల సమావేశంలో తొలి రోజు సోమవారం చర్చించారు. తాము ఏవిధంగా సరిహద్దు పాయింట్లను గుర్తించాం? ప్రాతిపదిక ఏమిటనేది సర్వే జనరల్ ఆఫ్ ఇండియా అధికారులు సమావేశంలో వివరించారు.

వాదనలు వినిపించాల్సింది నేడే.. సరిహద్దు గుర్తింపునకు సంబంధించి అసలైన సమావేశం మంగళవారం జరగనుంది. ఆయా సరిహద్దు పాయింట్లను ఎవరెవరు ఆమోదిస్తారు? ఎవరు అభ్యంతరాలు చెబుతారనేది మంగళవారం తేలనుంది. అనంతపురం జిల్లా పరిధిలోని డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురంలోని అటవీ ప్రాంతంలో గతంలో ఉండే సుంకులమ్మ ఆలయ పాయింట్‌తోపాటు, గ్రేట్ టెగ్రామెట్రికల్ స్టేషన్(జీటీఎస్) ఏర్పాటు తప్పనిసరని ఏపీ అధికారులు కోరనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఏపీ అటవీ అధికారులు పాత రాయదుర్గం తాలూకా మ్యాప్‌ను సేకరించి దాని ఆధారంగా సరిహద్దు పాయింట్లను గుర్తించారు. వీటిని ఆమోదించాలని కోరే అవకాశం ఉంది. ఏపీ సరిహద్దులోని కొంత భాగం తమదని కర్ణాటక వాదిస్తే తగు సమాధానాలను సిద్ధం చేసుకుంటోంది. సరిహద్దు పాయింట్లకు సంబంధించి రెండు రాష్ట్రాల్లో ఎవరు అంగీకరించకపోయినా ఈ వివాదం ముగిసే అవకాశం లేదు. 2010, 14 సంవత్సరాల్లో కూడా ఇదేలా సరిహద్దులు తేల్చేందుకు సర్వేలు జరిగి ఆ పాయింట్లపై ఏపీ ఆమోదం తెలిపాక, చివరలో కర్ణాటక అభ్యంతరాలు చెప్పడంతో అప్పట్లో వివాదం అలాగే ఉండిపోయింది.

సెన్సెక్స్ ▼ 219 **35470**

నిఫ్టీ ▼ 59 **10762**

డోజోన్స్ 24250 ▼ 331 | **నాస్‌డాక్** 7517 ▼ 176

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 68.13 ▼ 29 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 74.56 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+)			గ్రహణం (-)		
నిఫ్టీ	25న	మార్పు%	నిఫ్టీ	25న	మార్పు%
ULTRATECH CEM	3752.00	3.05	TATA MOTORS	289.40	-6.04
BAJAJ FINANCE	2390.60	2.34	HPCL	298.95	-3.92
BHARTI INFRA	291.95	2.08	ICICI BANK	289.70	-3.64
INFOSYS	1272.45	1.97	BPCL	412.00	-3.37
LUPIN	913.45	1.17	L&T	1268.15	-2.44
EICHER MOTORS	29440.00	1.03	COAL INDIA	259.00	-2.21
VEDANTA	230.65	0.92	AXIS BANK	515.20	-1.99
INDUSIND BANK	1969.95	0.85	DR. REDDYS	2290.15	-1.97

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	61.92	71.80	థాయ్ బాత్/100	187.76	224.56
పౌండ్ స్టెర్లింగ్	82.09	95.35	బహ్రెయిన్ దీనార్	167.47	191.76
యూరో	72.15	83.68	కువైట్ దీనార్	186.07	231.63
జపనీస్ యెన్/100	56.53	65.56	ఒమన్ రియాల్	163.58	187.87
ఆస్ట్రేలియా డాలరు	45.96	53.18	సౌదీ రియాల్	16.42	19.51
సింగపూర్ డాలరు	45.44	53.83	యూఏఈ దిర్హమ్	16.81	19.69

సోమవారం నిఫ్టీ కదలికలు



కార్పొరేట్ రుణాలు అంతంతే

● దివాలా స్మృతితో మంచి ఫలితాలు ● పరిశ్రమల సామర్థ్య వినియోగం పెరగాలి
● అప్పుడే ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకుంటాయి

ఇంటర్వ్యూ
ఎస్‌బీఐ ఎండీ బి.శ్రీరామ్

మొండి బకాయిల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలతో ప్రైవేట్ రంగం బలపడుతోందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మేనేజింగ్ డైరెక్టర్ బి.శ్రీరామ్ అన్నారు. ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకోవాలంటే.. దేశంలో పరిశ్రమల సామర్థ్య వినియోగం 85- 90 శాతానికి మెరుగుపడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ రెండింటి వల్ల వచ్చే 2- 3 ఏళ్లలో ప్రైవేట్ పెట్టుబడులు గణనీయంగా పుంజుకోవచ్చని 'కోజెన్సిస్'కిచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ తాజా నివేదిక ప్రకారం దేశంలో పరిశ్రమల సామర్థ్య వినియోగం 2017 అక్టోబరు- డిసెంబరులో 74.1% శాతం ఉంది. అయితే తాజా పెట్టుబడులు రావడానికి ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ భావిస్తోంది. మరిన్ని రుణాలిచ్చేందుకు ఎస్‌బీఐ వంటి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని, అయితే మొండిబకాయిలపై చేస్తున్న కేటాయింపుల ప్రభావం కార్పొరేట్ రుణాలపై చూపొచ్చొని అన్నారు. ఇటీవల ఐడీబీఐ బ్యాంక్ సీఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టిన బి.శ్రీరామ్ వివిధ అంశాలపై ఏమన్నారంటే..

? ప్రైవేట్ రంగంలో మూలధన వ్యయాలు ఎప్పుడు పుంజుకుంటాయి

శ్రీరామ్: ఇక్కడ 2-3 సమస్యలు ఉన్నాయి. ప్రైవేట్ పెట్టుబడులు పెరగడానికంటే ముందు పరిశ్రమల సామర్థ్య వినియోగం 85- 90 శాతానికి చేరాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు వార్షిక ఉక్కు సామర్థ్యం 300 మిలియన్ టన్నుల లక్ష్యంగా పెట్టుకుంటే.. దీనికి ప్రభుత్వ మద్దతు ఉంటుంది. ఈ లక్ష్యం చేరుకోవాలంటే మాత్రం సామర్థ్య వినియోగం మెరుగుపడాల్సి ఉంటుంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల విద్యుత్, ఉక్కు, అందుబాటు గృహాలకు గిరాకీ పెరిగింది. ఈ రంగాల్లోని పరిశ్రమల సామర్థ్య వినియోగం సైతం పెరుగుతుందని భావిస్తున్నా.

? 12 పెద్ద ఎన్‌పీఏల్లో కేవలం రెండు కేసులే ఎందుకు పరిష్కారమయ్యాయి

వివిధ వర్గాల నుంచి వచ్చిన స్పందన మేరకు ఆర్డినెన్సుల ద్వారా ప్రభుత్వం రెండు సార్లు దివాలా స్మృతిలో మార్పులు చేసింది. ప్రభుత్వం స్పందనల అనుగుణంగా మార్పులు చేయడం మంచి పరిణామం. వ్యాపారం చేయడాన్ని సులభతరం చేయడమే దీని అంతిమ లక్ష్యం. వివిధ సవాళ్లు ఎదురైనా దివాలా స్మృతి ఒక ఘనతే. దీని కింద ఏడాదిలో రెండు కేసులు పరిష్కారమయ్యాయి. ఆర్‌బీఐ గుర్తించిన 12 పెద్ద ఖాతాలను పరిష్కరించలేకపోయినప్పటికీ.. చట్టాలకు అనుగుణంగా ప్రజాస్వామ్య పద్ధతిలో సాధించిన విజయమిది.

? ఇటువంటి కేసుల్లో తనఖా విలువ కంటే రుణాల విలువ ఎక్కువగా ఉందనుకుంటున్నారా

ఎన్‌పీఏల పరిష్కారానికి కోర్టు ప్రక్రియ చాలా కీలకం. కొన్ని ఆస్తులకు ఎక్కువగా డిమాండ్ ఉంటే.. సాధారణంగానే వాటికి మంచి విలువ దక్కుతుంది. ఏదైనా రంగం కోలుకుంటున్నా.. మంచి వృద్ధి నమోదు చేస్తుంటే.. వాటికి మంచి గిరాకీ ఉందని భావిస్తాం. అయితే రంగంతో సంబంధం లేకుండా ఒక ప్లాంట్ బాగా పని చేయకుంటే.. ఆ ప్లాంట్‌కు, కొత్త ప్లాంట్‌కు పెద్దగా తేడా ఏమీ ఉండదు.

? రుణగ్రహీత- బ్యాంకు సంబంధాలు దివాలా స్మృతి వచ్చిన తర్వాత ఏ విధంగా మారాయి

దివాలా స్మృతి, ఆర్‌బీఐ తీసుకొచ్చిన కొన్ని నిబంధనలతో రుణగ్రహీతలు, బ్యాంకు ఆలోచన సరళి పూర్తిగా మారింది. ఒక మొండి బకాయిని పరిష్కరించాలంటే దానికి నిర్దిష్ట కాలపరిమితి ఉండాలి. బ్యాంకులన్నీ దీన్ని గుర్తుపెట్టుకోవాలి. ఇక రుణగ్రహీతల విషయానికొస్తే.. ఏడాదిలోపు ఎన్‌పీఏలను పరిష్కరించుకోకుంటే వారు కంపెనీని కోల్పోతారు. ఎన్‌సీఎల్‌టీకి తీసుకువెళ్లడమా లేదా బకాయిలను తీర్చడమా అన్నది రుణగ్రహీతపై ఆధారపడి ఉంటుంది.

? ఎన్‌సీఎల్‌టీ వద్దకు మరిన్ని కేసులు వెళ్తాయని భావిస్తున్నారా

రూ.2000 కోట్ల కంటే ఎక్కువ బకాయిలున్న ఖాతాలను ఆగస్టులోగా గుర్తించాలని రిజర్వు బ్యాంక్ గడువు విధించింది. గత త్రైమాసిక ఫలితాల ప్రకటనలో భాగంగా ఎక్కువ శాతం ఖాతాలను ఎన్‌పీఏలుగా గుర్తించామని చెప్పాం. కేవలం రూ.29,000 కోట్ల రుణాలను మాత్రమే పరిశీలనలో ఉంచాం. వీటిని ఏడాదిలో పరిష్కరిస్తాం. ఒత్తిడిలో ఉన్న రుణాలు దాదాపు 2 శాతంగా ఉంటాయని అంచనా వేస్తున్నాం.

? రంగాల వారీగా ఏమైనా చర్యలు చేపడుతున్నారా

మా విధానాల్లో రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఉదాహరణకు ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణం (ఈపీసీ)ను ప్రాజెక్ట్ ఆధారిత రుణాలకు బదిలీ చేశాం. తద్వారా ప్రాజెక్ట్ వ్యయాలకు అనుగుణంగా రుణాలు ఇవ్వగలం. అన్ని రంగాలకు ఒకే పరిష్కారమేమీ లేదు.

? కార్పొరేట్ రుణాల వృద్ధి అంచనాలు ఎలా ఉన్నాయి

దేశీయంగా చూస్తే.. మొండి బకాయిల పరిష్కారం చేపడుతున్నాం. ఫలితంగా కార్పొరేట్ రుణ పుస్తకం విలువ తగ్గుతోంది. దీంతో రుణాల వృద్ధి పెంచడానికి మరింత వ్యాపారం చేయాల్సి ఉంది. ఈ ఏడాది కార్పొరేట్ రుణాల వృద్ధి స్తబ్దుగా ఉండొచ్చని భావిస్తున్నాం. వచ్చే ఏడాది ఈ పరిస్థితి కొంచెం మెరుగయ్యే అవకాశం ఉంది. నికర వడ్డీ మార్జిన్లు మెరుగుపడటం కొనసాగొచ్చు. బ్యాంక్‌లు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వొచ్చు. ఎంసీఎల్‌ఆర్ రేట్లు పెంచడం కూడా నికర వడ్డీ మార్జిన్లు పెరగడానికి దోహదం చేయనున్నాయి.

? సత్వర దిద్దుబాటు ప్రణాళిక కింద ఉన్న బ్యాంకులు రుణాల్లో వాటా తీసుకుంటాయన్న వార్తలపై...

ప్రజలకు జాప్యం లేకుండా రుణాలు అందించడాన్ని మెరుగుపరుచుకోవడంపై ఇది ఆధారపడి ఉంటుంది. వివిధ బ్యాంకులకు సత్వర దిద్దుబాటు ప్రణాళిక వేర్వేరుగా ఉంటుంది. అది సంబంధిత బ్యాంక్‌కు మాత్రమే తెలుస్తుంది. బ్యాంకులిచ్చే రుణాలపై ఆంక్షలు ఉంటాయని అనుకోవడం లేదు. నిర్ణయాల్లో జాప్యం బదులు కనీసం నిధులు సమీకరించుకోవడానికి అందరూ కలిసి పనిచేయాలి.

2024కు 4 కొత్త మోడళ్లు

టాటా మోటార్స్ అనుబంధ సంస్థ జేఎల్‌ఆర్ వెల్లడి

దిల్లీ: టాటా మోటార్స్ నేతృత్వంలోని జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్‌ఆర్) సంస్థ వచ్చే మూడేళ్లలో 13.5 బిలియన్ పౌండ్ల (దాదాపు రూ.1.2 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించింది. కొత్త మోడళ్ల తయారీ, సాంకేతిక అభివృద్ధి, సామర్థ్య విస్తరణకు వీటిని వినియోగించబోతోంది. 2024 కల్లా 4 కొత్త మోడళ్లను విపణిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకొంది. దీంతో ప్రస్తుతం ఉన్న 12 మోడళ్ల నుంచి 16 మోడళ్లకు పోర్ట్‌ఫోలియో పెరుగుతుందని తెలిపింది. ఈ మూడేళ్లలో 99 భిన్నమైన 'ఉత్పత్తి చర్యలు' చేపట్టబోతున్నట్లు వెల్లడించింది. వీటి సాయంతో ప్రస్తుతం ఉన్న మోడళ్లలో సాంకేతికను అభివృద్ధి చేయడంతోపాటు కొత్త మోడళ్లను కూడా తీసుకొస్తామని వివరించింది. ప్రతి ఏటా 4.5 బిలియన్ పౌండ్ల (దాదాపు రూ.40,000 కోట్లు) చొప్పున మూడేళ్లపాటు పెట్టుబడులు పెట్టి 12-13 శాతం టర్నోవరు పెంచుకునే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు జేఎల్‌ఆర్ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా విలాసవంతమైన కార్ల తయారీలో జర్మన్ సంస్థలైన మెర్సిడెస్, బీఎండబ్ల్యూ, ఆడి ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. వీటి నుంచి పోటీ తట్టుకొని తమ ఉనికిని కాపాడుకొనే లక్ష్యంతో జేఎల్‌ఆర్ భారీగా పెట్టుబడులు పెడుతోంది.

హోలోగ్రామ్ సాంకేతికతతో ప్రకటనలు

హైదరాబాద్‌లో క్రిప్ మీడియా పరిశోధన కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: ఉత్పత్తుల వ్యాపార ప్రకటనలను అధునాతన హోలోగ్రామ్ సాంకేతికతతో ప్రదర్శించడం ద్వారా వినియోగదారులను సులభంగా ఆకట్టుకునే వీలుంటుందని క్రిప్ మీడియా ఎండీ సీఈఓ కరణ్ భరద్వాజ్ పేర్కొన్నారు. త్రీడీ విధానంలో ఉండే 4కే వీడియోల ద్వారా ఇవి కన్పిస్తాయని తెలిపారు. షాపింగ్ మాళ్లు, దుకాణాల ముందు కనిపించేలా ఈ ప్రకటనలను ఏర్పాటు చేసుకునే వీలుందన్నారు. ఇప్పటికే 15 ప్రముఖ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు, 40 సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో వ్యాపారాన్ని విస్తరించేందుకు ఇప్పటికే 15 మంది ప్రాంతీయ డిస్ట్రిబ్యూటర్లను నియమించుకున్నామనీ, రాష్ట్ర వ్యాప్త ఏజెన్సీలకోసం కొంతమందితో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చూస్తున్నామని, దీనికోసం రూ.4కోట్లను వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

25న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	382	వరంగల్	384
చిల్లరగా (ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	390
బెంగళూరు	429	చెన్నై	457
26వ తేదీకి...		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	378	నమక్కల్	440

తెలుగు రాష్ట్రాల్లో విస్తరణకు బజాజ్ అలయంజ్ యత్నాలు

● ఈ ఏడాది రెండు కొత్త పాలసీలు

ఈనాడు, హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ప్రీమియం వ్యాపారంలో 29శాతానికి మించి వృద్ధి రేటు సాధించేందుకు బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రయత్నిస్తోందని సంస్థ అపాయింటెడ్ యాక్చ్యురీ సాయిశ్రీనివాస్ ధూళిపాల అన్నారు. మొదటి పది స్థానాల్లో ఉన్న బీమా కంపెనీలకన్నా.. తమ వృద్ధి శాతం అధికంగా ఉందని తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ వాటా 2.2శాతం మేరకు పెరిగిందని పేర్కొన్నారు. గత ఏడాదిలో మొత్తం రూ.7,578 కోట్ల ప్రీమియం వసూలు చేయగా.. అందులో కొత్త పాలసీల నుంచి రూ.4,291కోట్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే నెలల్లో 37,460 పాలసీలను విక్రయించి, రూ.401 కోట్ల కొత్త బీమా ప్రీమియం వసూలు చేసిందని పేర్కొన్నారు. బజాజ్ అలయంజ్ లైఫ్ గోల్ బేస్డ్ సేవింగ్స్ బీమా పాలసీని ఆఫ్‌లైన్‌లో విడుదల చేసిన సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో సాయిశ్రీనివాస్ మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో 35 శాఖలు, 350 ఉద్యోగులు, 1485 ఏజెంట్లు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్ బీమా మార్కెట్ వాటాలో తమకు 30శాతం వృద్ధి కనిపించిందని, రెండు రాష్ట్రాల్లో కలిపి రూ.211 కోట్ల కొత్త బీమా ప్రీమియం వసూలయ్యిందన్నారు. కొత్త పాలసీల్లో వినూత్న అంశాలను జోడించడంతో పాటు, పాలసీదారులకు డిజిటల్ సేవలను అందించడంలో ముందుంటున్నట్లు పేర్కొన్నారు. రెండు కొత్త సంప్రదాయ పాలసీల విడుదల కోసం ఐఆర్‌డీఏకు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు.

మార్కెట్ కబుర్లు

- మద్యం సంస్థలకు ఎలక్ట్రానిక్ పేమెంట్ సేవలందించే హిప్‌బార్‌లో 26 శాతం వాటా కొనుగోలు చేసినట్లు **యునైటెడ్ స్పిరిట్స్** ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. ఒక్కో ఈక్విటీ షేరు రూ.59.11 చొప్పున 45,67,568 షేర్లకు కంపెనీ కొనుగోలు చేసింది.
- కంపల్సరీ కన్వర్టబుల్ డిబెంచర్లు (సీసీడీలు) జారీ చేయడం ద్వారా రూ.500 కోట్ల వరకు సమీకరించేందుకు **జువారీ ఆగ్రో కెమికల్స్** బోర్డు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది.
- మరో డెబ్బై అయిదు 737 మ్యాక్స్ విమానాల కొనుగోలుకు బోయింగ్‌తో **జెట్ ఎయిర్‌వేస్** ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో కంపెనీ కొనుగోలు చేయనున్న బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల సంఖ్య 225కు చేరనుంది.
- నెట్‌వర్క్ 18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, టీవీ18 బ్రాడ్‌కాస్ట్‌లను **రిలయన్స్ ఇండస్ట్రీస్** కొనుగోలు చేయడంలో నమోదు ఉల్లంఘనలు ఏమైనా జరిగాయా అన్నదానిపై పునపరిశీలించాలని సెబీని సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశించింది. ఇండిపెండెంట్ మీడియా ట్రస్ట్ ద్వారా ఈ రెండు కంపెనీల్లో రిలయన్స్ పరోక్షంగా నియంత్రణ సాధించిందా అన్న అంశాన్ని కూడా పరిశీలించాల్సిందిగా కోరింది.
- **ఐసీఐసీఐ బ్యాంక్,** సీఈఓ చందా కొచ్చర్‌లు నిబంధనల ఉల్లంఘనపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చని సమాచారం. సెబీ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఐసీఐసీఐ బ్యాంక్‌పై రూ.25 లక్షలు, చందాకొచ్చర్‌పై రూ.కోటి జరిమానా విధించే అవకాశం ఉంది.

10,800 పాయింట్ల దిగువకు నిఫ్టీ

● వాణిజ్య యుద్ధ భయంతో.. ● బలహీన రూపాయి ప్రభావమూ..
● 219 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

సమీక్ష

అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకోవడంతో ప్రపంచ మార్కెట్లతోపాటు మన సూచీలూ నష్టాలు చవిచూశాయి. షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఒకవైపు విదేశీ సంస్థాగత మదుపర్లు లాభాలు స్వీకరించేందుకు మొగ్గు చూపడం, మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం కూడా నష్టాలకు తోడైంది. ముడిచమురు ధరలు తగ్గించే దిశగా ఒపెక్ సమావేశంలో ఉత్పత్తి పెంపు నిర్ణయం తీసుకున్నా, అది నామమాత్రంగానే ఉండటంతో చమురు మార్కెటింగ్ సంస్థలైన హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు 3.91 శాతం దాకా నష్టపోయాయి.

సెన్సెక్స్ ఉదయం 35783.75 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. అన్ని రంగాల షేర్లకు అమ్మకాల సెగ తగలడంతో సూచీలు దిగజారాయి. ఇంట్రాడేలో 35806.97 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. చివరకు 219.25 పాయింట్ల నష్టంతో 35,470.35 దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 59.40 పాయింట్లు కోల్పోయి 10,762.45 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,753.05 - 10,831.05 పాయింట్ల మధ్య కదలాడింది. చివరకు కీలకమైన 10,800 పాయింట్ల దిగువకు చేరింది.

- వొడాఫోన్-ఐడియా విలీనం ఆలస్యమవుతుండటంతో ఐడియా షేరు సోమవారం 7 శాతానికిపైగా నష్టపోయింది. రూ.1,893 కోట్ల మార్కెట్ విలువ ఆవిరైపోయింది.
- పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్‌లో నియంత్రణాధికార వాటాను హెచ్‌డీఎఫ్‌సీ, కోటక్ బ్యాంక్ తీసుకొనేందుకు ఆసక్తి చూపిస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో ఆ షేరు ఏకంగా 14.19% పెరిగింది. అయితే ఈ వార్తల్లో నిజం లేదంటూ అటు పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్, ఇటు హెచ్‌డీఎఫ్‌సీ, కోటక్ బ్యాంక్‌లు బీఎస్ఈకి ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో టాటా మోటార్స్ అత్యధికంగా 5.94% నష్టపోయింది. దీని అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్‌ఆర్) వచ్చే మూడేళ్లలో కొత్త మోడళ్లు, సాంకేతిక అభివృద్ధి, సామర్థ్య పెంపుపై దాదాపు రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించడంతో టాటా మోటార్స్ షేరు కుదేలైంది. యూరప్ నుంచి దిగుమతి చేసుకొనే వాహనాలపై 20 శాతం సుంకం పెంచుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం కూడా ఈ షేరు పతనానికి కారణమైందని బ్రోకర్లు చెబుతున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ 3.79%, కోల్ ఇండియా 2.28%, ఎల్ అండ్ టీ 2.05%, యాక్సిస్ బ్యాంక్ 1.81%, ఎస్‌బీఐ 1.81%, హీరో మోటోకార్ప్ 1.77%, ఓఎన్‌జీసీ 1.72%, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ 1.44%, అదానీ పోర్ట్స్ 1.38% చొప్పున డీలాపడ్డాయి. బలహీన మార్కెట్‌లోనూ అల్ట్రాటెక్ సిమెంట్ షేరు 3.1%, ఇన్ఫోసిస్ షేరు 2.07% లాభపడ్డాయి. వేదాంతా, కోటక్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్‌లు స్వల్పంగా రాణించాయి. ఐటీ, టెక్ సూచీలు తప్ప అన్ని రంగాల సూచీలు నేలచూపులు చూశాయి. పీఎస్‌యూ సూచీ అత్యధికంగా 1.73 శాతం కోల్పోయింది. చమురు- గ్యాస్, వాహన, మౌలిక, భారీ యంత్ర పరికరాలు, స్థిరాస్తి, విద్యుత్ రంగాలు అదే బాటలో నడిచాయి.

నేటి మార్కెట్

నేడూ సూచీలు నష్టాల్లోనే ట్రేడయ్యే అవకాశం ఉంది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధ భయంతో అంతర్జాతీయ మార్కెట్లలో బలహీనతలు కొనసాగుతాయని, ఈ ప్రభావం మన సూచీలపై కూడా పడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. యూరోపియన్ కార్లపై దిగుమతి సుంకాలు పెంచుతామని ట్రంప్ తాజాగా హెచ్చరించడంతో మదుపర్లు షేర్ల కొనుగోలులో ఆచితూచి వ్యవహరించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ దిద్దుబాటుకు గురయ్యే అవకాశం ఉందని, ఇదే సమయంలో ఐటీ, ఫార్మా రంగాల షేర్లపై మదుపర్లు కన్నేయొచ్చని ఓ డీలరు చెబుతున్నారు. వీటితోపాటు సిమెంటు రంగ షేర్లలో కదలికలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సిమెంట్ ఉత్పత్తిదారులు ధరల్ని పెంచారని మోర్గాన్ స్టాన్లీ వెల్లడించడంతో అల్ట్రాటెక్ సిమెంట్ షేరు 3.1% పెరిగింది. సిమెంట్‌కు గిరాకీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఈ రంగ షేర్లను మదుపర్లు కొనేందుకు ఆసక్తి చూపించవచ్చని బ్రోకర్లు విశ్లేషిస్తున్నారు. నేడు నిఫ్టీ 10700- 10850 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 361.15 (365.80) 1716838
ASIAN PAINTS 1253.45 (1267.70) 936253
AXIS BANK LT 515.20 (525.65) 4882240
BAJAJ AUTO L 2801.30 (2832.20) 339572
BAJAJ FINANC 2390.60 (2336.05) 2393535
BAJAJ FINSER 6165.65 (6176.50) 262420
BHARTI AIRTE 374.15 (374.55) 3008052
BHARTI INFRA 291.95 (286.00) 2416530
BPCL 412.00 (426.35) 5366864
CIPLA 611.40 (615.75) 3253606
COAL INDIA L 259.00 (264.85) 4317400
DR. REDDYS 2290.15 (2336.25) 1142767
EICHER MOTOR 29440.00 (29140.65) 26616
GAIL 341.20 (340.00) 4223998
GRASIM IND 1006.55 (1010.40) 744023
HCL TECH 908.90 (904.80) 2127860
HDFC 1893.80 (1906.75) 3174077
HDFC BANK 2094.95 (2083.35) 1748084
HERO MOTOCOR 3586.85 (3637.65) 351955
HINDALCO IND 218.40 (222.00) 9318246
HINDUSTAN UN 1615.15 (1608.10) 1082199
HPCL 298.95 (311.15) 6531538
ICICI BANK 289.70 (300.65) 15461874
INDIABULLS H 1192.65 (1199.65) 753739
INDIAN OIL 167.35 (170.00) 9083645
INDUSINDBANK 1969.95 (1953.25) 566785
INFOSYS LTD 1272.45 (1247.85) 3865589
ITC 262.60 (265.15) 13617718
KOTAK MAHIND 1328.00 (1321.40) 1051297
LARSEN & TOU 1268.15 (1299.85) 1622133
LUPIN 913.45 (902.90) 3544163
M&M 905.60 (908.20) 2984963
MARUTI SUZIK 8793.00 (8874.90) 254954
NTPC LTD 154.65 (157.30) 6832181
ONGC 156.65 (159.55) 5899032
POWER GRID C 194.20 (197.70) 4894771
RELIANCE IND 1004.45 (1012.50) 5197694
SBI 268.45 (273.05) 10934401
SUN PHARMA 571.80 (577.25) 14303449
TATA CONSULT 1819.25 (1809.80) 2083217
TATA MOTORS 289.40 (308.00) 16392183
TATA STEEL L 558.60 (561.85) 3899261
TECH MAHINDR 696.15 (691.15) 1850829
TITAN IND 864.00 (877.55) 1217765
ULTRATECH 3752.00 (3641.05) 498922
UPL LIMITED 634.15 (640.20) 1616870
VEDANTA LIMI 230.65 (228.55) 40657710
WIPRO 257.50 (258.25) 1639454
YES BANK LTD 334.15 (335.10) 5792052
ZEE ENTERTAI 559.05 (565.75) 811954

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1189.25 (1212.25) 26095
ACC 1315.55 (1294.65) 547839
ADITYA BIRLA 135.60 (136.95) 1279362
AMBUJA CEMEN 206.80 (204.95) 3363586
ASHOK LEYLAN 132.00 (136.40) 12422965
AUROBIND PHA 607.55 (611.10) 2568910
AVENUE SUPER 1480.50 (1494.25) 335682
BANK OFBAROD 116.80 (121.50) 11480804
BEL 109.40 (109.70) 6288150
BHEL 73.35 (75.00) 6350796
BOSCH LTD 17909.95 (17959.25) 14997
BRITANNIA 5977.40 (5959.45) 64843
CADILA HEALT 412.35 (409.20) 2310166
COLGATE PALM 1180.45 (1179.95) 100835
CONTAINER 1244.40 (1247.00) 300359
CUMMINS INDI 670.20 (669.05) 244811
DABUR INDIA 384.45 (385.15) 645746
DLF LIMITED 196.55 (200.70) 4148205
EMAMI LIMITE 504.20 (524.80) 212283
GENERAL INS 712.30 (720.65) 44992
GODREJ CONSU 1160.45 (1165.95) 329415
HAVELLS INDI 535.30 (542.65) 726800
HINDUSTAN ZI 288.55 (289.05) 571670
ICICI PRU LI 380.40 (389.65) 988064
IDEA CELLULR 56.00 (60.55) 28254191
INTERGLOBE A 1173.10 (1187.25) 670551
JSW STEEL LT 332.10 (336.95) 2725937
L&TFIN.HOLD 156.70 (161.70) 2823577
LIC HOUS.FIN 490.25 (497.40) 1106252
MARICO LIMIT 331.20 (333.55) 677808
MCDOWELL 674.05 (681.30) 1374458
MOTHERSON 287.70 (303.75) 6346298
MRF 75186.70 (75703.40) 2664
NHPC LTD 24.60 (24.95) 4345897
NMDC LTD 108.25 (109.60) 1184771
OIL INDIA 208.40 (210.20) 996008
ORACLE FIN S 4031.70 (4080.75) 15050
P&G HYG&HEAL 9899.40 (9944.45) 7098
PETRONET LNG 206.20 (209.90) 2453849
PIDILITE IND 1042.55 (1050.70) 367886
PIRAMAL ENTE 2523.00 (2599.00) 484732
PNB 79.80 (81.90) 18367654
POWER FIN CO 80.60 (82.10) 3689796
RURAL ELEC C 108.20 (110.85) 2055020
SAIL 82.05 (83.90) 9125610
SBI LIFE INS 689.75 (685.20) 173207
SHREE CEMENT 15627.10 (15577.80) 43123
SHRIRAM TRAN 1468.25 (1494.00) 341393
SIEMENS 987.00 (993.75) 90286
SUN TV LTD 804.65 (836.10) 2256991

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 3.85 (3.96) 11111
ALPHAGEO 617.20 (611.90) 2114
AMAR RAJA BA 740.25 (763.90) 22028
ANDHRA BANK 33.35 (34.30) 141327
ANDHRA CEMEN 9.44 (9.08) 27604
ANDHRA PAPER 322.75 (324.75) 3208
ANDHRA PETRO 45.60 (45.55) 6461
ANDHRA SUGAR 326.30 (335.65) 1815
ANJANI PORTL 153.75 (156.70) 1076
ASTRA MICROW 103.90 (104.95) 89359
AUROBINDO PH 607.70 (611.45) 163240
AVANTEL SOFT 349.15 (362.25) 2981
AVANTI FEEDS 1564.70 (1545.25) 49634
AVON ORG 8.69 (8.45) 161
BALAJI AMIN 585.40 (591.40) 827
BARTRONICS 10.25 (10.23) 3808
BHAGIRA CHEM 260.25 (264.95) 1044
BHAGYA NAG 39.20 (39.75) 2143
BN RATHI SEC 38 (39) 1230
BRILLIANT SE 5 (5.14) 36071
CAMBRIDGE TE 55 (55) 520
CIL SECURI 21.85 (24) 6101
COMBAT DRUGS 25.85 (26.50) 116
CONT COFFEE 265.35 (271.45) 2254
COROMAN FERT 393.65 (405) 26466
CUBEX TUB 16.50 (17.35) 3907
CYBERMATE 2.05 (2.11) 17750
CYIENT LIMIT 710.35 (708.95) 4874
DECCAN CEMEN 406.70 (408.40) 647
DIVI'S LAB 1033.30 (1044.30) 26395
DR REDDY 2290.10 (2334.95) 94291
FOUR SOFT 61.65 (64.65) 236
GATI CORPN 84.25 (85.95) 110037
GAYATRI PROJ 169.30 (169.75) 4946
GMR INFRASTR 15.90 (15.95) 1018675
GOLDST INFRA 164.95 (162.30) 18215
GOLDSTONE EN 15.93 (16.76) 1525
GRANULES (I) 82.60 (83.30) 143299
GSS AMERICA 82.80 (83.10) 9421
GVK POWER 10.51 (10.85) 266205
HBL NIFE POW 35.50 (34.90) 36027
HERITAGE FOO 610.85 (660.05) 17523
HIL LTD 1809.80 (1824.60) 446
IDL INDUSTRS 395.55 (394.95) 1049
IKF SOFT 0.47 (0.49) 128993
ILFS ENGINEE 27.70 (28.45) 12916
INCAP 68 (68.65) 150
INNAREDY COM 1.90 (1.83) 13978
IVRCL INFRAS 1.33 (1.37) 266741
JEEVAN SCIEN 34.50 (33.25) 1152
KAKATIYA CEM 236.65 (238.65) 3557
KALLAM SPG 27.40 (27.40) 9079
KAVERI SEED 573.10 (576.75) 18775
KCP LTD 101.25 (102.25) 5114
KERNEX MICRO 28.50 (28.40) 1318
KNR CONSTRUC 239.40 (243.20) 7807
KREBS BIO 126.95 (127.15) 200
LANCO INDUS 263.45 (263.45) 2929
LANCO INFRAT 0.77 (0.80) 672471
LAURUS LABS 468.90 (478.85) 2022
LOKESH MACH 61.70 (62.70) 1340
MADHUCON PRO 12.45 (12.60) 52621
MEGA SOFT 9.15 (9.21) 1926
MIC ELECTRON 3.11 (3.27) 78764
MOLD-TEK.TEC 43.45 (41.45) 1259
MOLDTK PLA 308.95 (308.35) 528
MSR INDIA LT 24.40 (25.40) 485
NAGARJAGRICH 28.05 (28.75) 7260
NATCO PHARMA 811.15 (818.85) 10248
NAVA BH VENT 136.25 (139.25) 33621
NCC 97.20 (101.40) 446408
NCL IND 165 (170.60) 1983
NEHA INTER 5.14 (5.30) 11889
NETTLINX 53.75 (53.45) 43613
NEULAND LAB 680.10 (685.45) 226
NIHAR INFO 10.55 (10.70) 1075
NILE 533.35 (558.05) 4380
OIL COUNTRY 19.05 (20) 5408
PANKAJ POLY 5.88 (6.18) 402
PANYAM CEMEN 23.10 (23.90) 2781
PENNER IND 52 (52.65) 30199
PHYTOCHEM I 54.40 (52.65) 10492
PIONEER DIST 267.20 (272.75) 2143
PITTI LAMIN 86.60 (88) 8007
POKARNA 161.60 (166.05) 1253
PRAJAY ENGS 9.15 (9.23) 16450
PREMIER EXPL 267.15 (267) 211
PRISM CEMENT 101.90 (104.80) 7183
PRUDENTL PHA 3.99 (3.96) 68134
RAIN INDUSTR 199.50 (196.65) 313408
RAM INFORMAT 41 (39) 4160
SAGAR CEM 798.75 (800) 466
SAMKRG PIST 230.75 (231.65) 787
SAMPRE NUTRI 45.55 (47.05) 1586
SATVAH. ISPA 14.50 (14.20) 4580
SMS PHARMA 70.80 (70.90) 1453
SOUTH BIO TE 1.64 (1.57) 482
SPHERE GLOBA 27 (26.95) 650
SREE RAYAL A 32.45 (32.30) 55829
SRINIVASA SH 38.40 (39.35) 4549
STARCHIK SP 34.75 (33.95) 11
STEEL EXCHAN 15.25 (17.25) 10778
SUJANA TOWER 2.37 (2.40) 3259
SUJANA UNIVE 0.53 (0.51) 5325
SURANA TELE 4.60 (4.53) 50
SURYALAKSH.C 54.50 (54.50) 1192
SURYALATA SP 131.75 (128.25) 300
SUVEN PHARMA 215.40 (220.85) 47296
TAJ GVK HOTE 218.35 (223.70) 1846
TANLA 29.30 (30.25) 7739
TERA SOFTWAR 40 (41.65) 780
TRANS BIOTEK 2.15 (2.10) 4918
VAMSHI RUBB 44.30 (47) 1994
VBC FERRO 37.40 (37.35) 975
VICEROY HOTE 7.85 (7.81) 20014
VIJAY TEXTIL 58.25 (57.65) 6121
VIMTA LABS 215.75 (221.50) 1186
VISAKA IND 581.40 (583.05) 8133
VISTA PHARMA 37.90 (39.50) 18369
VIVIMED LABS 60.60 (63.35) 46803
VST INDUS 2978.30 (2886.40) 28
XL TELENE 1.16 (1.19) 3034
YBRANT DIGIT 4.07 (3.99) 43065
ZENOTECH LAB 37.30 (37.65) 5836
ZENTECH 102.20 (107.55) 17951

CA

మౌలికానికి రూ.300 లక్షల కోట్లు సవాలే: పీయూష్ గోయల్

ముంబయి: రాబోయే దశాబ్ద కాలంలో మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.300 లక్షల కోట్ల (4.5 ట్రిలియన్ డాలర్లు) పెట్టుబడులు అవసరం అవుతాయని, ఇంతమొత్తం సమకూర్చుకోవడం సవాలేనని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దీనిపై పూర్తిగా నిరాశ పడాల్సిన పరిస్థితి లేదని, నిధుల లభ్యత ఉందని, ఇక్కడ ప్రారంభమైన ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) రెండు రోజుల వార్షిక సదస్సులో మంత్రి వివరించారు. అయితే ప్రపంచవ్యాప్తంగా వడ్డీరేట్లు పెరుగుతున్నందున, నిధుల సమీకరణకు అయ్యే వ్యయం మాత్రం సవాలుతో కూడుకున్నదని తెలిపారు. అతిపెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టే సామర్థ్యం కూడా కీలకమని, ఏఐఐబీ వంటివి ఈ రెండు అంశాల్లో సహకరిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం జపాన్ సంస్థ జైకా, మరికొన్ని పెద్ద ప్రైవేటు ఈక్విటీ సంస్థలు నిధులు అందించాయని మంత్రి గుర్తు చేశారు. ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కీలకమని, కాంట్రాక్టులు కుదిరాక ఆటంకాలు ఏర్పరిస్తే, ప్రైవేటు పెట్టుబడులు దూరం అవుతాయని విశ్లేషించారు. ఇక్కడి చట్టాల వల్ల భారత్‌లో పెట్టుబడులు సురక్షితమని మంత్రి తెలిపారు. బ్యాంకుల సామర్థ్యం పరిమితం కనుక, మౌలిక ప్రాజెక్టులకు నిధుల సమీకరణ సులభం కాదని, సింగపూర్ రుణ సంస్థ డీబీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పీయూష్ గుప్తా పేర్కొన్నారు. అదనపు వనరుల కోసం బాండ్ మార్కెట్లను ఆశ్రయించాలని సూచించారు. కొత్త ప్రాజెక్టుల ప్రారంభంలో నిధులు ఇవ్వడంలో, బాండ్ మార్కెట్లకూ పరిమితులుంటాయని పేర్కొన్నారు.

ఏడాదిన్నరలో ఎయిరిండియా తీరే మారుతుంది

ఎయిరిండియా నిర్వహణ సామర్థ్యాలను మెరుగు పరచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. సంస్థలో వాటా విక్రయం అనేది వేర్వేరు పరిస్థితులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఎయిరిండియాలో 76 శాతం వాటా విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నించగా, ఎవరూ ముందుకు రాని నేపథ్యంలో మంత్రి ఇలా స్పందించారు. ఎయిరిండియా వాటా అమ్మకం నిలిచిపోయేందుకు, అనేక అంతర్జాతీయ అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల, రాబోయే 18 నెలల్లో సంస్థ తీరులో గణనీయ మార్పును గమనిస్తారని పేర్కొన్నారు.

సంస్థ తీరు మెరుగయ్యాకే విక్రయం: 'ముడిచమురు ధరల పెరుగుదల వల్ల ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థల ఆర్థిక స్థితి తలకిందులవుతోంది. 3-4 నెలల్లో వాటి బ్యాలెన్స్‌షీట్లు దెబ్బతిన్నాయి. ఈ సమయంలో ఎయిరిండియా విక్రయ యత్నం సరికాదు. ఆర్థిక పరిస్థితులు కుదుటపడ్డాక, మళ్లీ ప్రయత్నించి, విక్రయిస్తాం' అని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఉత్తమ నిర్వహణ వల్ల, ఏడాదిన్నరలో ఎయిరిండియాను లాభాల బాటలోకి తీసుకు రావచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. సంస్థ నిర్వహణ మెరుగు పడితే, మంచి విలువ కూడా వస్తుందని వివరించారు.

నేడు పార్లమెంటరీ సంఘం ముందుకు ప్రభుత్వ బ్యాంకుల అధిపతులు

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీలు) అధిపతులు నేడు పార్లమెంటరీ ప్యానెల్ ఎదుట హాజరు కాబోతున్నారు. బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండి బాకీలు, మోసాలకు సంబంధించిన విషయాలను ప్యానెల్ సభ్యులకు వివరించబోతున్నారు. ఈ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (ఫైనాన్స్)కి కాంగ్రెస్ నాయకుడు వీరప్ప మొయిలీ నేతృత్వం వహిస్తున్నారు. ఈ కమిటీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా సభ్యులే. బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సవాళ్లను ఈ కమిటీ పరిశీలించనుంది. నేడు జరగబోయే సమావేశంలో ఐడీబీఐ బ్యాంక్, యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, దేనా బ్యాంక్, ఓబీసీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్‌ల ఉన్నతాధికారులు పాల్గొని పార్లమెంటరీ కమిటీకి తమ సమస్యల్ని నివేదిస్తారు. దీని తర్వాత ప్యానెల్‌లోని సభ్యులు అడిగే ప్రశ్నలకు వారు సమాధానాలు ఇస్తారని సమాచారం. ఇటీవల ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ కూడా పార్లమెంటరీ ప్యానెల్ ఎదుట హాజరై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఔషధ రంగ వృద్ధికి రూ.460 కోట్ల పథకం

దిల్లీ: ఔషధ రంగ అభివృద్ధికి రూ.460 కోట్లతో ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందరూ వినియోగించుకునేలా సౌకర్య కేంద్రాలను నిర్మించడం ద్వారా బల్క్‌డ్రగ్, వైద్యపరికరాల ధర తగ్గించడం, చిన్న-మధ్యతరగతి సంస్థలు (ఎస్ఎంఈ) సాంకేతికతను మెరుగుపరచుకునేందుకు సహకరించాలని నిర్ణయించింది. బల్క్‌డ్రగ్ పార్కుల్లో ఉత్పత్తి వ్యయాన్ని 20-25 శాతం తగ్గించడం ధ్యేయమని ఔషధ విభాగం వెల్లడించింది. 2018-20 మధ్య సౌకర్య కేంద్రాల నిర్మాణానికి రూ.200 కోట్లు వెచ్చించనున్నారు. ఇదే విధానాన్ని వైద్య పరికరాల పార్కుల్లో అమలు చేసేందుకు రూ.100 కోట్లు కేటాయిస్తారు. సాంకేతికత మెరుగుదలకు సహకరించేందుకు 2020 వరకు రూ.144 కోట్లు సాయం చేస్తారు.

ఎల్ఐసీ చేతికి ఐడీబీఐ బ్యాంక్!

- ప్రభుత్వం ప్రతిపాదించిందని కథనాలు
- అవి స్వతంత్ర సంస్థలు.. నిర్ణయాధికారం వాటికే: ఆర్థికశాఖ
- 29న ఐఆర్‌డీఏఐ చర్చ

రూ.వేల కోట్ల మిగులు ధనంతో ఉన్న జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఒకవైపు..

భారీమొత్తం అప్పుల్లో కూరుకున్న బ్యాంక్ మరోవైపు..

రుణగ్రస్తమైన బ్యాంక్‌ను దారిలోకి తెచ్చేందుకు, దాని నియంత్రణాధికార వాటా కొనుగోలు చేయాలని జీవిత బీమా సంస్థకు ప్రభుత్వం ప్రతిపాదించిందన్న కథనాలు వెలుగులోకి వచ్చాయి..

అప్రమత్తమైన ప్రభుత్వం .. 'అదేం లేదు, ఆ రెండూ స్వతంత్ర సంస్థలు.. నిర్ణయాధికారం ఆ సంస్థల బోర్డులకే ఉంటుంది. అవే నిర్ణయిస్తాయి' అంటూ ఆర్థిక శాఖతో ప్రకటింప చేసింది...

● ఇంతకీ అసలేం జరుగుతోంది..?

ఐడీబీఐ బ్యాంక్‌లో నియంత్రణ వాటా కొనుగోలు చేయాలంటూ ఎల్ఐసీకి ప్రభుత్వం సూచించిందన్న విషయమై ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు స్పందించారు. 'అవి రెండూ స్వతంత్ర సంస్థలు. నిర్ణయాధికారం వాటి బోర్డులకే వదిలేశాం. వాటి వ్యవహారాలను సూక్ష్మస్థాయిలో పర్యవేక్షించాలని ప్రభుత్వం భావించడం లేదు' అని ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ వార్షిక సమావేశానికి హాజరైన అధికారి, విలేకరులతో పేర్కొన్నారు. అవి రెండూ ప్రభుత్వరంగ సంస్థలే కదా అని గుర్తు చేసినపుడు, 'అంటే రెండు ప్రభుత్వరంగ సంస్థల మధ్య వ్యాపార సంబంధాలు ఉండకూడదా' అని వ్యాఖ్యానించారు.

● ఇదీ జరిగింది

మౌలిక వసతుల ప్రాజెక్టులకు రుణాలు అందించే వాణిజ్య బ్యాంక్ ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వానికి 80.96 శాతం వాటా ఉంది. ఈ బ్యాంక్‌లో నియంత్రణాధికార వాటా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యూహాత్మక పెట్టుబడిదార్ల కోసం మూడేళ్లుగా ప్రయత్నిస్తోంది. ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) జోక్యం చేసుకున్నా, ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పటికే ఈ బ్యాంక్‌లో 10.82 శాతం వాటా కలిగిన ఎల్ఐసీతోనే, కనీసం మరో 40 శాతం వాటా అయినా కొనిపించాలనేది ప్రభుత్వ ప్రతిపాదనగా వార్తలొచ్చాయి. ఐడీబీఐ బ్యాంక్‌లో నియంత్రణాధికారం ఎల్ఐసీ కొనుగోలు చేయాలనే ప్రతిపాదనపై, బీమా నియంత్రణ ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అభిప్రాయాలు తెలుసుకోవాలనీ ప్రభుత్వం నిర్ణయించిందని సమాచారం. ఈ విషయమై ఈనెల 29న జరిగే బోర్డు సమావేశంలో ఐఆర్‌డీఏఐ చర్చించే వీలుందని సమాచారం.

ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా కొనుగోలు ప్రతిపాదనకు ఎల్ఐసీ బోర్డు సూత్రప్రాయంగా అంగీకరించింది. మూలధనం అవసరాలు ఎంత ఉన్నాయో, తాజా ప్రతిపాదనలు ఇవ్వాలని బ్యాంక్‌ను కోరే వీలుంది.

● 5-7 ఏళ్లలో వాటా తగ్గించుకునే షరతుపై అంగీకారం?

ఏదైనా ఒకే కంపెనీలో 15 శాతం వాటాకు మించి కొనుగోలు చేసేందుకు ఎల్ఐసీ లేదా మరే బీమా సంస్థను ఐఆర్‌డీఏఐ ఇప్పటివరకు అనుమతించలేదు. తాజా ప్రతిపాదనకు మాత్రం ఎల్ఐసీని అనుమతిస్తుందని భావిస్తున్నారు. గతంలో కూడా కొన్ని విషయాల్లో మినహాయింపు ఇవ్వడాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అధిక వాటా కొనుగోలు చేసినా, 5-7 ఏళ్లలో వాటాను తగ్గించుకోవాలని ఎల్ఐసీని కోరే అవకాశం ఉందంటున్నారు.

● రూ.10,000 కోట్లు వెచ్చించాలి

శుక్రవారం నాటి షేరు విలువ ప్రకారం, ఐడీబీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.24,800 కోట్లు. 40 శాతం వాటాను కనుక ఎల్ఐసీ కొనుగోలు చేయాలంటే రూ.10,000 కోట్లు వెచ్చించాల్సి వస్తుంది.

● ఇరు సంస్థలకూ ప్రయోజనం ఉండదు..

ఈ కొనుగోలు వల్ల ఇరు సంస్థలకూ ప్రయోజనం ఉండదని మార్కెట్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఐడీబీఐ బ్యాంక్ నికర విలువ నుంచి, ఆ సంస్థ వద్ద పేరుకున్న మొండి బకాయిలను తీసివేస్తే, నష్టమే ఎక్కువ. అందువల్ల ఇది ఎల్ఐసీకి మేలు చేయదని పేర్కొంటున్నారు. ఎల్ఐసీ కొనుగోలు చేసినా, మూలధనం ఇవ్వదు కనుక బ్యాంక్‌కూ ప్రయోజనం ఉండదని, ప్రభుత్వానికి మాత్రం 'వాటా విక్రయ రూపేణ' ఖజానాకు సొమ్ములు చేరతాయని ఈక్వినామిక్స్ రీసెర్చ్ అండ్ అడ్వైజరీ మేనేజింగ్ డైరెక్టర్ జి.చొక్కలింగం అభిప్రాయం వ్యక్తం చేశారు.

- ఎల్ఐసీని ప్రభుత్వం ఏటీఎంలా పరిగణించడం సరికాదని గురుగ్రామ్‌లోని మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎండీఐ) ఆచార్యులు సంజయ్ బక్షి పేర్కొన్నారు. బ్యాంకు నిర్వహించే నైపుణ్యాలు ఎల్ఐసీకి లేవన్నారు. కొనుగోలు చేసే సంస్థకు సరైన నాయకత్వాన్ని అందించడం/ మార్గదర్శనం చేస్తేనే, ప్రయోజనం ఉంటుందని వివరించారు.
- బలహీన రుణ చరిత్ర వల్ల ఇప్పటికే ఐడీబీఐ బ్యాంక్‌ను సత్వర దిద్దుబాటు చర్యల జాబితాలో ఆర్‌బీఐ చేర్చింది. 2017-18కి మొండి బకాయిల కోసం భారీ కేటాయింపులు జరపడంతో, బ్యాంక్ నష్టం రూ.8,237 కోట్లకు చేరింది. 2016-17లో నష్టం రూ.5,158 కోట్లు కావడం గమనార్హం.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) మొత్తం రుణాల్లో 27.95 శాతానికి (రూ.55,588 కోట్లకు) చేరాయి. 2016-17 ఆఖరుకు ఇవి రూ.44,753 కోట్లు.

● ఆస్తులు విక్రయిస్తున్న బ్యాంక్

అప్రాధాన్య ఆస్తులను ఐడీబీఐ బ్యాంక్ విక్రయిస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ, సిడ్బీల్లో స్థిరాస్తి, వాటాలనూ అమ్మి, మూలధనం పెంచుకోవాలని ప్రయత్నిస్తోంది. 2017-18లో ఇలా పొందిన లాభం రూ.3870 కోట్లుగా ప్రకటించింది.

- తన మ్యూచువల్‌ఫండ్ విభాగం ఐడీబీఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో 26-30 శాతం వాటాను వ్యూహాత్మక పెట్టుబడిదారుకు విక్రయించడంతో పాటు, బీమా వ్యాపారం నుంచీ బయటకు రావాలన్నది ఐడీబీఐ బ్యాంక్ యత్నం.
- బీఎస్ఈలో ఐడీబీఐ బ్యాంక్ షేరు 1.44 శాతం నష్టపోయి రూ.58.20 వద్ద స్థిరపడగా, ఎల్ఐసీ షేరు 1.38 శాతం నష్టపోయి రూ.490.85 వద్ద ముగిసింది.

● సునీల్ మెహతా కమిటీ నివేదిక సిద్ధం

నిరర్థక ఆస్తులు, మొండి బకాయిల సమస్యను వేగంగా పరిష్కరించేందుకు ఆస్తుల పునర్నిర్మాణ/ఆస్తుల నిర్వహణ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకవసరమైన ముసాయిదా నిబంధనల రూపకల్పనకు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ సునీల్ మెహతా నేతృత్వంలో కమిటీని ఈనెల 8న నియమించింది. ఈ కమిటీ అతి తక్కువ సమయంలోనే అద్భుత నివేదిక ఇచ్చిందని ఆరిక శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. మొండి బకాయిల విషయంలో ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలన్న విద్యుత్తు సంస్థల డిమాండ్‌ను ప్రస్తావించగా, అలహాబాద్ హైకోర్టు తీర్పును గౌరవించాల్సి ఉందని తెలిపారు. దీనికి పరిష్కారం చూపేందుకు బ్యాంకింగ్ కార్యదర్శి త్వరలో సమావేశం నిర్వహిస్తారని వివరించారు.

ఏమైంది.. ఈ ప్రభుత్వ శాఖలకు

ఇప్పటికీ వ్యాట్‌తోనే కాలక్షేపం

? క్రమం తప్పకుండా జీఎస్‌టీఆర్-I, జీఎస్‌టీఆర్- 3బీ రిటర్న్‌లను దాఖలు చేస్తున్నాం. 'అనుమతి నిరాకరణ' కారణంగా గత నెల నుంచి రిటర్న్‌లను దాఖలు చేయలేకపోయాం. రిజిస్ట్రేషన్ రద్దుకు సైతం ఎటువంటి దరఖాస్తు చేయలేదు. వ్యాపారాన్ని కూడా కొనసాగిస్తున్నాం. ఈ విషయానికి సంబంధించి స్థానిక అధికారులను సంప్రదించాం. తాత్కాలిక గుర్తింపు వారు రద్దు చేయలేదని తెలిసింది. ఏం చేయాలో తెలియజేయండి?

- రాము వరికుంట

మీరు ఇచ్చిన జీఎస్‌టీ నమోదు సంఖ్య ప్రకారం.. మీ జీఎస్‌టీ నమోదు 2017 అక్టోబరు 7న రద్దు చేశారు. మీరు రద్దు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోకపోతే.. జీఎస్‌టీ చట్టాల ప్రకారం.. ఎటువంటి షోకాజ్ నోటీసు ఇవ్వకుండానే మీ గుర్తింపును రద్దు చేసే అధికారం జీఎస్‌టీ శాఖకు లేదు. మీకు ఉపశమనం కావాలనుకుంటే.. హైకోర్టును ఆశ్రయించండి. దీనిపై సమయం వెచ్చించడం ఇష్టం లేకపోతే, కొత్తగా నమోదు చేసుకుని వ్యాపారం చేసుకోవచ్చు. మీ విషయంలో ఎటువంటి రద్దుకు దరఖాస్తు చేయకపోయినా రద్దయింది. నా సొంత కేసులో ఈ ఏడాది ఏప్రిల్ 7న రద్దుకు దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటివరకు రద్దు కాలేదు.

? 2017 అక్టోబరు నుంచి 2018 ఏప్రిల్ మధ్యలో జీఎస్‌టీ చెల్లించడం జాప్యం అయితే విధించే ఫీజులను మాఫీ చేసినట్లు వార్తలు వచ్చాయి. దీనికి సంబంధించి సమాచారం ఇవ్వగలరు?

- అఖిల్ గుప్తా

నిజమే. 2017 అక్టోబరు నుంచి 2018 ఏప్రిల్ మధ్యలో జీఎస్‌టీఆర్- 3బీ దాఖలు చేయడంలో జాప్యంపై విధించిన ఛార్జీలను రద్దు చేశారు. అయితే ఇది 2017 డిసెంబరు 27 లోపు జీఎస్‌టీ ట్రాన్-1 దరఖాస్తులను నమోదు చేయని వ్యక్తులకు మాత్రమే వర్తిస్తుంది. జీఎస్‌టీ ట్రాన్-1 దరఖాస్తు నమోదు చేయాల్సిన అవసరం లేనివారికి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ వర్తించదు.

? 2017 నవంబరులో నిర్మాణంలో ఉన్న ఫ్లాట్‌ను రూ.47 లక్షలు (అమ్మకం ఒప్పందం రూ.27 లక్షలు, పని ఆర్డరు- 20 లక్షలు)కు బుక్ చేసుకున్నాం. ఈ నెలాఖరులో రిజిస్ట్రేషన్‌కు సన్నాహాలు చేస్తున్నాం. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో జీఎస్‌టీ చెల్లించమని బిల్డరు అడుగుతున్నాడు. 2019 మార్చిలో ఫ్లాట్‌ను మాకు అందజేస్తారు. ఇక్కడ నాకు కొన్ని సందేహాలు ఉన్నాయి. అమ్మకం ఒప్పందం, పని ఆర్డరు రెండింటిపైనా బిల్డరుకు జీఎస్‌టీ చెల్లించాలా? లేకుంటే ఒక్కదానిపై చెల్లిస్తే సరిపోతుందా. ఎంత శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. అసలు జీఎస్‌టీ ఎప్పుడు చెల్లించాలి? దీనికి ఏమైనా రశీదు ఉంటుందా. చివర్లో జీఎస్‌టీ రూపంలో చెల్లించిన సొమ్ము వెనక్కి వచ్చే అవకాశం ఉందా?

- జాహ్నవి

ఫ్లాట్ కొనుగోలుపై బిల్డరుకు జీఎస్‌టీ చెల్లించాల్సిందే. మీ ప్రశ్న ప్రకారం.. మీరు రిజిస్ట్రేషన్, పని ఆర్డరుకు వేర్వేరుగా సొమ్ము చెల్లిస్తున్నట్లు ఉన్నారు. ఇటువంటి సందర్భంలో ఫ్లాట్ రిజిస్ట్రేషన్‌కు 12%, పని ఆర్డరుకు 18 శాతం చొప్పున జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం.. చెల్లించిన పన్ను వెనక్కి రాదు. రిజిస్ట్రేషన్ సమయం లేదా పని పూర్తయిన సమయంలో బిల్డరు జారీ చేసే పన్ను ఇన్వాయిస్‌పై జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.

? ఇటీవల రూ.15 లక్షల విలువైన చిట్‌ను ముగించాను. చిట్ కమిషన్‌గా సంస్థ రూ.75000 (5 శాతం) తీసుకుంది. అదనంగా రూ.9000 జీఎస్‌టీ వసూలు చేసింది. నా చిట్ ద్వారా ఫోర్‌మెన్ కమిషన్‌ను ఆర్జిస్తున్నందువల్ల వాళ్లు తీసుకునే కమిషన్‌పై జీఎస్‌టీ చెల్లించాలి కదా. నా నుంచి ఎలా వసూలు చేస్తారు. స్పష్టత ఇవ్వగలరు?

- ఎ.రాజేశ్వర రావు

జీఎస్‌టీ చట్టాల ప్రకారం.. చిట్ ఫండ్ ఫోర్‌మెన్ కమిషన్ 12 శాతం పరిధిలోకి వస్తుంది. చిట్‌ఫండ్ సంస్థ మీ నుంచి వసూలు చేసింది సరైందే. జీఎస్‌టీ అనేది పరోక్ష పన్ను కావడం వల్ల చిట్ చందాదారు నుంచి ఫోర్‌మెన్ వసూలు చేసిన పన్నును, వారు ప్రభుత్వానికి చెల్లిస్తారు.

? రూ.38 లక్షల విలువైన ఫ్లాట్‌ను కొనుగోలు చేశాను. రూ.6 లక్షలు నగదుగా, మిగిలిన రూ.32 లక్షలు బ్యాంక్ రుణంగా తీసుకుని చెల్లించా. నేను తీసుకున్న బ్యాంక్ రుణంపై సేవా పన్ను చెల్లించమని బిల్డరు అడుగుతున్నాడు. ఇది నిజమేనా? రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం రిజిస్ట్రేషన్ ఛార్జీలు మాత్రమే చెల్లించమని కోరాడు. ఇప్పుడు సేవా పన్ను చెల్లించమని అడగటం సబబేనా?

- బలక శ్రీనివాసరావు

ఇది న్యాయపరమైన సమస్య కాబట్టి మీరు న్యాయవాదిని సంప్రదించండి. మీకు, మీ బిల్డరు మధ్య జరిగిన ఒప్పందం రాతపూర్వకంగా ఉంటే.. మీరు జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు.

? మా నాన్న కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. మా నెలవారీ టర్నోవర్ దాదాపు రూ.2- 3 లక్షలు. టర్నోవర్ మొత్తంపై మేం ఎంత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. 2017 నవంబరులో ప్రభుత్వం 0.5 శాతం జీఎస్‌టీ చెల్లించాలని పేర్కొంది. స్పష్టత ఇవ్వండి?

- కిరణ్

రాష్ట్రం లోపల అమ్మకాలు సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ పరిధిలోకి వస్తాయి. సీజీఎస్‌టీ కింద 0.5 శాతం, ఎస్‌జీఎస్‌టీ కింద 0.5 శాతం చొప్పున కాంపోజిషన్ ప్రకారం 1 శాతం పన్ను చెల్లించాలి. కాంపోజిషన్ డీలర్ల విషయంలో ప్రభుత్వం మొత్తం పన్నును 0.5 శాతానికి తీసుకురాలేదు.

సతీష్ సరాఫ్,
చార్టర్డ్ అకౌంటెంట్

? ఇటీవల ఫ్లాట్ యాజమానుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఇది లాభాపేక్ష లేని సంఘం. దీన్ని నమోదు చేయాలని భావిస్తున్నాం. రిజిస్ట్రేషన్ చేస్తే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని కొంతమంది అంటున్నారు. కేవలం నిర్వహణ అవసరాల కోసమే కొంత మొత్తాన్ని సమీకరిస్తాం. నిజంగానే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందా?

- వీజేకే మూర్తి, హైదరాబాద్

లాభదాయకత ఉందా లేదా అన్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోదు. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం నెలవారీ నిర్వహణ ఛార్జీలు ఫ్లాట్‌కు రూ.7500 లోపు ఉంటే జీఎస్‌టీ వర్తించదు. రూ.7500 మించితే మాత్రం మీ సంఘాన్ని నమోదు చేయాల్సిన అవసరం ఉంటుంది. అంతే కాకుండా 18 శాతం జీఎస్‌టీని వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాలి.

? కాంట్రాక్టులపై విధించే జీఎస్‌టీకి సంబంధించి సందేహం ఉంది. పని కాంట్రాక్టులపై వాస్తవానికి 12%, 18% రేట్లు అమల్లో ఉన్నాయి. నీటిపారుదల శాఖ వంటి ప్రభుత్వ కాంట్రాక్టులకు వారు వ్యాట్ రూపంలో 5 శాతం మాత్రమే చెల్లిస్తారు. జీఎస్‌టీలో ఈ శ్లాబు లేదు. ఉదాహరణకు నేను రూ.7 కోట్ల బిల్లు సమర్పించాను. వారు రూ.35 లక్షలు వ్యాట్‌గా చెల్లించారు. కొన్ని కేసుల్లో రూ.35 లక్షలు కలిపి, వ్యాట్ కింద తగ్గించి ఫారం 501 ఇస్తున్నారు. ఈ రెండు సందర్భాల్లో జీఎస్‌టీ రిటర్నులు ఎలా సమర్పించాలి?

- పి. శివ జ్యోతి కుమార్

సమాధానం: రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గుత్తేదారు ఎదుర్కొంటున్న సమస్యే ఇది. మున్సిపాలిటీలు సహా రెండు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని శాఖల్లో ఈ సమస్య ఉంది. జీఎస్‌టీ విధానాన్ని ప్రవేశపెట్టడానికి అన్ని రాష్ట్రాలు అంగీకరించాకే అది అమల్లోకి వచ్చింది. అయితే ప్రభుత్వం చేసిన చట్టాన్ని ప్రభుత్వమే పాటించకపోవడం విచిత్రం. జీఎస్‌టీ అమల్లోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. ఇప్పటికీ ప్రభుత్వ శాఖలు పాత వ్యాట్ విధానాన్నే అనుసరిస్తున్నాయి. సాధారణంగా అధిక శాతం ప్రభుత్వ కాంట్రాక్టులు 12 లేదా 18 శాతం జీఎస్‌టీ పరిధిలోకి వస్తాయి. కానీ ప్రభుత్వం చెల్లిస్తున్నది మాత్రం 5 శాతమే. జీఎస్‌టీ రిటర్నులు దాఖలు చేసే సమయంలో గుత్తేదారు మాత్రం 12 శాతం పన్ను చెల్లించాల్సి వస్తోంది. అంటే మిగతా 7 శాతం పన్ను గుత్తేదారు జేబు నుంచి చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవాన్ని గుర్తించి అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ జీఎస్‌టీని పూర్తి స్థాయిలో అమలుచేసేలా చర్యలు తీసుకోవాలి. వ్యాట్ రూపంలో ఏ అయిదు శాతం మొత్తం తగ్గిస్తున్నారో.. దాన్ని జీఎస్‌టీలో చూపించుకునే వెసులుబాటు లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో మొత్తం 12 శాతం జీఎస్‌టీ భారం గుత్తేదారుపైనే పడుతోంది. 12 లేదా 18 శాతం జీఎస్‌టీ బదులు.. ప్రభుత్వం 5 శాతం మాత్రమే గుత్తేదారులకు విడుదల చేస్తోంది. ఫలితంగా రెండు రాష్ట్రాల్లో వీరిపై అదనపు భారం పడుతోంది. జీఎస్‌టీ విధానంలో గుత్తేదారుకు బదులు ప్రభుత్వం పన్ను చెల్లించే విధానం లేదు. పాత వ్యాట్ విధానంలో ఇది ఉంది.

? జీఎస్‌టీ ప్రాక్టీసు చేస్తున్నాను. జీఎస్‌టీ మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ మార్చుకోవడం కొంచెం అయోమయంగా ఉంది. నాకు తెలిసిన కొందరు మార్పు చేయాల్సిందిగా నన్ను కోరుతున్నారు. వారికి సేవలు అందించలేకపోతున్నాం. సలహా ఇవ్వగలరు.

- శ్రీకాంత్ దిద్దె

ఒక వ్యక్తి మొబైల్ సంఖ్య, ఇ-మెయిల్ మార్పు చేసే అధికారాన్ని ఇటీవల రాష్ట్ర విభాగ అధికారికి కల్పించారు. మొబైల్, ఇ-మెయిల్ ఐడీ మార్చుకోవడానికి చిన్న ప్రక్రియను పాటించాల్సి ఉంటుంది. జీఎస్‌టీ పోర్టల్ లేదా గూగుల్ నుంచి ఈ సమాచారాన్ని పొందగలరు.

? ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద రుణం తీసుకుని అపార్ట్‌మెంట్ కొనుగోలు చేస్తే 12 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందని బిల్డరు అంటున్నారు. పీఎంఏవై కింద రుణం తీసుకుని కొనుగోలు చేస్తే 8 శాతం జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుందని చదివాను. పూర్తి వివరాలు తెలియజేయగలరు?

- శ్రీరామ్ మైనేని

మీరు చెప్పింది నిజమే. ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద కొనుగోలు చేసిన గృహాలకు 8 శాతం జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. స్థూల పన్ను రేటు 12 శాతంగా ఉంది. అయితే ఫ్లాట్ అమ్మకం ధరలో మూడో వంతు భూమి విలువను తొలగిస్తే.. జీఎస్‌టీ రేటు 8 శాతానికి వస్తుంది. లేకుంటే ఫ్లాట్‌పై 12 శాతం జీఎస్‌టీ చెల్లించాలి.

? కాకినాడలో నా భవంతిని ఒక కార్పొరేట్ సంస్థకు లీజుకు ఇచ్చాను. అయితే అద్దె బిల్లులను విశాఖపట్నం కార్యాలయానికి జారీ చేస్తున్నాం. నేను జీఎస్‌టీ కింద ఆంధ్రప్రదేశ్‌లో నమోదు చేసుకున్నాను. సీజీఎస్‌టీ కింద 9 శాతం, ఎస్‌జీఎస్‌టీ కింద 9 శాతం చొప్పున వసూలు చేస్తున్నాం. నేను ఐజీఎస్‌టీ కింద బిల్లు ఇవ్వొచ్చా?

- జి. విశ్వనాథ్

మీరు సీజీఎస్‌టీ కింద 9 శాతం, ఎస్‌జీఎస్‌టీ కింద 9 శాతం చొప్పున వసూలు చేయడం సరైందే. ఐజీఎస్‌టీ లేదా సీజీఎస్‌టీ+ఎస్‌జీఎస్‌టీ విధించడం అనేది సరఫరాదారు ప్రదేశం, సరఫరా చేసిన ప్రదేశంపై ఆధారపడి ఉంటుంది. మీ కేసులో సరఫరాదారుది, సరఫరా చేసిన ప్రదేశం కాకినాడనే. ఈ రెండు ఒకే రాష్ట్రంలో ఉన్నందువల్ల సీజీఎస్‌టీ+ఎస్‌జీఎస్‌టీ మాత్రమే వసూలు చేయాలి. ఈ రెండు ఒకే రాష్ట్రంలో లేకుంటే ఐజీఎస్‌టీ వర్తిస్తుంది.

? నా సోదరికి జేఈఈ మెయిన్స్ ఓసీ కేటగిరీలో 6500 ర్యాంకు వచ్చింది. మా నాన్నకు రూ.25- 30 లక్షల టర్నోవర్ కలిగిన ల్యాతే వర్క్‌షాప్, ఒక సీఎన్‌సీ ఉన్నాయి. మేం ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చా. మేం 18 శాతం జీఎస్‌టీ చెల్లిస్తున్నాం. దీని వల్ల భవిష్యత్‌లో ఏమైనా ఇబ్బందులు వస్తాయోమేనని నాన్న భయపడుతున్నారు. ఏం చేయాలో సలహా ఇవ్వగలరు?

- ఒక పాఠకుడు

మంచి ర్యాంకు సాధించినందుకు మీ సోదరికి శుభాకాంక్షలు. స్కాలర్‌షిప్‌కు సంబంధించిన నియమ నిబంధనలపై నాకు పూర్తి అవగాహన లేదు. స్కాలర్‌షిప్ దరఖాస్తుకు సంబంధించి మీరు సొంత నిర్ణయం తీసుకోండి. జీఎస్‌టీ ప్రకారం.. స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకోవడం ద్వారా మీ తండ్రి గారికి ఎటువంటి ఇబ్బంది ఉండదు.

కాలుష్యంతో మొక్కల్లో పోషకాలు ఆవిరి

లండన్: మొక్కల్లోని పోషకాలను కాలుష్యం హరిస్తున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. ఆకుల రంగు పాలిపోవడంతోపాటు చెదలు, వ్యాధులు చుట్టుముట్టడానికి కలుషితాలు కారణమవుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. వేర్లపై "మైకోరిజాల్ ఫంజి"గా పిలిచే ఓ శిలీంధ్రం ఉంటుంది. ఇది మొక్కల్లోని కార్బన్ తీసుకుంటూ.. మట్టిలోని నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం లాంటి పోషకాలను అందిస్తుంది. గాలి, నీటి నాణ్యత సహా భిన్న అంశాలు ఈ శిలీంధ్రంపై చూపుతున్న ప్రభావంమీద ప్రస్తుతం బ్రిటన్‌లోని ఇంపీరియల్ కాలేజీ లండన్ (ఐసీఎల్), రాయల్ బొటానిక్ గార్డెన్స్ (ఆర్‌బీజీ) నిపుణులు దృష్టిసారించారు. దీనికోసం 20 ఐరోపా దేశాల్లోని 137 అటవీ ప్రాంతాల నుంచి సేకరించిన 40,000 మొక్కలు, చెట్ల వేర్లను పరిశీలించారు. దీంతో మైకోరిజాల్‌పై కాలుష్య కారకాలు తీవ్రమైన ప్రభావం చూపుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. కార్బన్‌ను ఎక్కువగా తీసుకొని స్వల్పమోతాదులో మాత్రమే పోషకాలను అందించే పరాన్నజీవులుగా ఇవి మారిపోతున్నట్లు బయటపడింది. ఫలితంగా మొక్కల్లోని పోషక స్థాయిలు పడిపోతున్నట్లు వెల్లడైంది.

నోటిలోని పుండ్లను మాయంచేసే పట్టీ

లండన్: నోటిలోని పుండ్లను మాన్పించే జిగురు పట్టీని శాస్త్రవేత్తలు తయారుచేశారు. నాలుక, బుగ్గ లోపలి భాగంపై రోజుల తరబడి వేధించే గాయాలకు చికిత్సలో ఇది చక్కగా తోడ్పడే వీలుంది. గాయమైన చోటే నేరుగా స్టెరాయిడ్లను విడుదల చేయడం దీని ప్రత్యేకత. ప్రభావిత ప్రాంతం చుట్టూ ఓ రక్షణ కవచాన్నీ ఇది ఏర్పాటుచేస్తుంది. తడిగావున్నాసరే చక్కగా అంటిపెట్టుకునే పాలిమర్లను దీని తయారీలో ఉపయోగించారు. పుండ్లపై పూసుకొనే లేపనాలు, ద్రావణాల కంటే ఇది మెరుగ్గా పనిచేస్తుందని బ్రిటన్‌లోని షెఫీల్డ్ వర్సిటీ పరిశోధకులు క్రైగ్ ముర్డోక్ తెలిపారు. దీర్ఘకాలంపాటు గాయాలపై ఇవి అంటిపెట్టుకొని ఉండగలవని, చర్మం కదలికలకూ ఎలాంటి ఇబ్బందీ కలిగించవనీ ఆయన చెప్పారు. దీన్ని ఉపయోగించినవారు అసలు ఎలాంటి అసౌకర్యానికీ గురికాలేదని వివరించారన్నారు.

వ్యాధులను నిర్ధారించే.. చవకైన ప్లాస్టిక్ సెన్సర్

లండన్: భిన్న వ్యాధుల నిర్ధరణతోపాటు శస్త్రచికిత్స అనంతర సమస్యలనూ మెరుగ్గా గుర్తించే సరికొత్త ప్లాస్టిక్ సెన్సర్‌లను పరిశోధకులు అభివృద్ధిచేశారు. చవకైన ధరల్లోనే ఇవి అందుబాటులోకి రావడం విశేషం. స్వేదం, కన్నీరు, లాలాజలం, రక్తం లాంటి శారీరక ద్రవాల్లోని.. లాక్టేట్, గ్లూకోజ్ స్థాయిలను విశ్లేషించడం ద్వారా ఇవి పనిచేస్తున్నాయి. వీటి తయారీలో కృత్రిమ పాలిమర్లను ఉపయోగించారు. స్వల్ప విద్యుత్ వాహకత కలిగిన ఇవి.. సెన్సర్‌లలోని ఎలక్ట్రోడ్లు, శారీరకద్రవాల మధ్య వారధిలా పనిచేస్తున్నాయి. ద్రవాలలోని అయాన్లతో చక్కగా కలిసిపోతూ వాటిలోని గ్లూకోజ్ సహా ఇతర సమ్మేళనాలను విశ్లేషించడంలో తోడ్పడుతున్నాయి. కొలెస్ట్రాల్ సహా ఇతర పదార్థాలనూ విశ్లేషించేలా వీటిలో మార్పులు చేసుకోవచ్చని బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ వర్సిటీ నిపుణులు అన్నా మరియా తెలిపారు. ట్రాన్సిస్టర్ల లాంటి జటిలమైన సర్క్యూట్‌లతో ఈ సెన్సర్‌లను అనుసంధానిస్తే.. మరింత కచ్చితమైన ఫలితాలు వస్తాయని ఆమె వివరించారు.

12 శాతం ఆత్మహత్యలకు మనోవైకల్యమే మూలం

టొరంటో: ఆత్మహత్యల్లో 12 శాతానికి మనోవైకల్యమే మూలమని తాజా అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా యువకుల బలవన్మరణానికి మానసిక సమస్యలు ప్రధాన కారణంగా మారుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. కెనడాలోని మాదకద్రవ్య అలవాట్లు, మానసిక సమస్యలపై పరిశోధన కేంద్రం (సీఏఎంహెచ్) నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. ఒంటారియోలో ఆత్మహత్య చేసుకున్న 5,650 మంది సమాచారాన్ని వీరు విశ్లేషించారు. దీంతో 25 నుంచి 34 మధ్య వయసున్నవారు చేసుకున్న ప్రతి ఐదు ఆత్మహత్యల్లో ఒకదానికి మనోవైకల్యమే (షిజోఫ్రేనియా) కారణమని వెలుగులోకి వచ్చింది. మొత్తంగా చూస్తే 663 (11.7 శాతం) మందిని ఈ రుగ్మత ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించినట్లు బయటపడింది. స్పష్టంగా ఆలోచించే సామర్థ్యానికి గండి కొట్టడంతోపాటు కుంగుబాటు లక్షణాలు చుట్టుముట్టేలా చేయడంలో మనోవైకల్యం ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు పరిశోధకులు జువేరియా జహీర్ తెలిపారు.

ఆ పోస్టులు పునరుద్ధరించకపోతే ఆందోళన

ఏపీ వాణిజ్య పన్నుల నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హెచ్చరిక

ఈనాడు, అమరావతి: జీఎస్టీ అమల్లోకి రావడంతో రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న వాణిజ్యపన్నుల శాఖకు చెందిన 21 చెక్‌పోస్టులను రద్దుచేయడం వల్ల తొలగించిన 276 పోస్టులను పునరుద్ధరించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఆ పోస్టులను పునరుద్ధరిస్తామని, ఆ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తామని హామీ ఇస్తున్నారే తప్ప అమలు చేయడం లేదన్నారు. ఇందుకు నిరసనగా 27 నుంచి మూడు రోజుల పాటు ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తారని తెలిపారు.

విద్యార్థినికి కృత్రిమ చేయి అమర్చేందుకు సీఎం సహాయం

ఈనాడు డిజిటల్, అమరావతి: ఇటీవల జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన గిరిజన విద్యార్థిని దాసుపురం శ్రీలతకు కృత్రిమ కుడిచేయి అమర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయం చేసినట్లు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. చికిత్సకయ్యే వ్యయం రూ.4.20 లక్షలకు సంబంధించిన ఎల్‌వోసీ(లిస్ట్ ఆఫ్ క్రెడిట్)ను మంత్రి సోమవారం సచివాలయంలో విద్యార్థినికి అందించారు.

జస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్యలు సహింపరానివి: బీసీఐ

దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ చలమేశ్వర్ పదవీ విరమణ పొందిన మూడు రోజులకు... బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఆయన వ్యాఖ్యలపై స్పందించింది. ఆయన చౌకబారు వ్యాఖ్యలు చేశారనీ, అవి సహింపరానివని పేర్కొంది. ఈనెల 22న పదవీ విరమణ పొందిన జస్టిస్ చలమేశ్వర్... సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌కు కేంద్రం అవకాశం ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టారు. ఆ చర్య సమర్థనీయం కాదన్నారు. కేసుల కేటాయింపులో పక్షపాతం నెలకొందనీ, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ అప్పుడప్పుడు సంక్షోభంలో పడుతోందని ఆ సందర్భంగా ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై బీసీఐ ఛైర్మన్ ఎం.కె.మిశ్రా సోమవారం స్పందించారు. అవి ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి చెప్పాల్సిన మాటలు కావన్నారు.

రోడ్డు ప్రమాదంలో బుల్లి తెర నటుడు సునీల్ మృతి

సునీల్ మృతదేహం

కొడవలూరు, న్యూస్‌టుడే: బుల్లి తెర వర్ధమాన నటుడు నన్నం సునీల్(24) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని రాచర్లపాడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి తరువాత ఈ ఘటన చోటుచేసుకుంది. కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి చెందిన షకీల్ హైదరాబాద్‌లో సినీ సంగీత దర్శకుడిగా ఉన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లికి చెందిన నన్నం సునీల్ కొన్నేళ్లుగా షకీల్ వద్ద శిక్షణ పొందుతూ. . టీవీ సీరియళ్లు, సినిమాల్లో నటిస్తున్నాడు. షకీల్ తమ్ముడు సలావుద్దీన్ నెల్లూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూ నిమిత్తం హైదరాబాద్ నుంచి వస్తున్నాడు. దీంతో సునీల్ కూడా స్వగ్రామానికి వద్దామని అతనితో పాటు కారులో బయలుదేరాడు. రాచర్లపాడు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో సునీల్ అక్కడికక్కడే మృతిచెందగా సల్లావుద్దీన్ తీవ్ర గాయాలతో కోమాలోకి వెళ్లిపోయాడు. అతన్ని నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సునీల్ అన్న ప్రసాద్ ఫిర్యాదుతో ఎస్సై అంజిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమర్జెన్సీ చీకటి వెనుక ఆ అయిదూ ఏమిటి?

జూన్ 25, 1975 సాయంత్రం.. ఆల్ ఇండియా రేడియోలో ఒక అత్యవసరం ప్రకటన వెలువడింది.

అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా ఆ ప్రకటనను చదివారు.

'దేశంలో రాష్ట్రపతి ఎమర్జెన్సీ విధించారు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అనేది ఆ ప్రకటన సారాంశం.

అప్పటికప్పుడు దాని తీవ్రత ఎక్కువమందికి తెలియలేదు. కానీ ఆ తర్వాత 21 నెలల పాటు అనుభవంలోకి వచ్చిన తీవ్రమైన నిర్బంధం, హక్కుల అణచివేత, నోళ్లు నొక్కేయటం, ప్రశ్నించిన వారిని కటకటాలపాలు చేయటం.. చూసిన వారు ఇప్పటికీ ఆ చీకటిరోజులను మరచిపోలేని స్థితి. బంగ్లాదేశ్ విమోచనతో తిరుగులేని నేతగా ఎదిగిన ఇందిరాగాంధీ, అనూహ్యమైన పరిస్థితుల్లో చిక్కుల్లో పడి.. దాన్ని రాజకీయంగా ఎదుర్కొనటానికి బదులు వ్యవస్థ మొత్తాన్ని తన చేతుల్లోకి తీసుకున్నారు. దాని ఫలితమే ఎమర్జెన్సీ. దీనికి నేటితో 43 ఏళ్లు నిండాయి. దీనికి పూర్వ నేపథ్యం ఏమిటి? అప్పట్లో ఏంజరిగింది? ముఖ్యంగా అయిదు పరిణామాలు ఆమెను ఇలాంటి తీవ్రమైన నిర్ణయం తీసుకునేందుకు పురికొల్పాయి.

గుజరాత్ ఆందోళన

కాంగ్రెస్‌కు చెందిన చిమన్‌భాయ్ పటేల్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అవినీతి తారస్థాయికి చేరింది. ఆయనపై ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహం రాజుకున్నాయి. 1973 డిసెంబరులో గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం బోధన రుసుములు పెంచడంతో కుంపటి రాజుకుంది. ఈ ఆందోళనే 'నవనిర్మాణ్ ఉద్యమం' అయింది. రెండుసార్లు ప్రధాని అయ్యే అవకాశాన్ని కోల్పోయిన మురార్జీ దేశాయ్ దీన్నొక అవకాశంగా భావించి విద్యార్థుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. అమరణ నిరాహార దీక్షకు దిగారు. పరిస్థితులు అదుపు తప్పుతున్నట్లు భావించిన ఇందిరాగాంధీ 1974 ఫిబవరిలో గుజరాత్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించారు.

జయప్రకాష్ నారాయణ

1974లో అబ్దుల్ గఫూర్ బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయనకు పెద్దగా ప్రజాదరణ లేదు. గుజరాత్‌లో విద్యార్థుల ఉద్యమం స్ఫూర్తిగా అప్పుడే పట్నా విశ్వవిద్యాలయం విద్యార్థులు కూడా ఆందోళన చేపట్టారు. అది ఇతర విశ్వవిద్యాలయాలకు విస్తరించింది. దానిపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన అణచివేతను అమలు చేసింది. లాలూ ప్రసాద్‌యాదవ్, నితీష్ కుమార్ తదితరులు అప్పటి విద్యార్థి నాయకులే. ఈ విద్యార్థి ఉద్యమానికి జయప్రకాష్ నారాయణ (జేపీ) మద్దతు ప్రకటించారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ మంత్రి పదవి ఇవ్వజూపినా తిరస్కరించిన నేతగా జయప్రకాష్ నారాయణకు పేరు ఉంది. 1974లో ఆయన 'సంపూర్ణ క్రాంతి' ఉద్యమాన్ని ప్రారంభించారు. అదే దేశవ్యాప్తంగా ఇందిర వ్యతిరేక ఉద్యమంగా రూపు దాల్చింది.

స్తంభించిన రవాణా

1970 తర్వాత జార్జి ఫెర్నాండెజ్ తిరుగులేని ట్రేడ్ యూనియన్ నాయకుడిగా ఎదిగారు. రైల్వేలో ఆయన చెప్పిందే వేదం. 1974 మే నెలలో ఆయన దేశవ్యాప్త రవాణా సమ్మెకు పిలుపునిచ్చారు. దీనివల్ల మూడు వారాలపాటు దేశం స్తంభించింది. అదే సమయంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా అక్కడక్కడా ఆందోళనలు సాగుతున్నాయి. వాటికి ఈ రవాణా సమ్మె జతకలిసి పెద్ద ఉద్యమం అయింది. ఆ సమయంలో బిహార్‌కు చెందిన ఎల్ఎన్ మిశ్రా కేంద్ర రైల్వేమంత్రిగా ఉన్నారు. ఆయనను ఇందిరాగాంధీకి పోటీ నేతగా భావించేవారు. 1975 జనవరిలో సమస్తిపూర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన బాంబు దాడిలో ఆయన తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనతో పరిస్థితులు మరీ దిగజారిపోయాయి.

రాయబరేలి ఎన్నిక

ఇందిరాగాంధీ రాయబరేలి నుంచి ఎంపీగా ఎన్నికై ప్రధాని అయ్యారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన సోషలిస్టు నాయకుడు రాజ్‌నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో ఇందిరాగాంధీ ఎన్నికను సవాలు చేశారు. ఎన్నికల్లో ఆమె అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. దీనిపై అలహాబాద్ హైకోర్టు జడ్జి జగ్ మోహన్‌లాల్ సిన్హా 1975 జూన్ 12న, ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చారు. ఇందిర సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు జడ్జి వీఆర్ కృష్ణ అయ్యర్ అలహాబాద్ హైకోర్టు తీర్పుపై స్టే విధించారు. దీంతో రాజీనామా చేయాల్సిన ప్రమాదం నుంచి ఇందిర తప్పించుకున్నారు. కానీ ఈ పరిణామం ఆమెను ఎంతో ఇబ్బంది పెట్టింది. అదే సమయంలో గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైంది. జేపీ, మొరార్జీ దేశాయ్ మద్దతు కల 5 పార్టీల కూటమి విజయం సాధించింది.

రామ్‌లీలా మైదాన్ ప్రదర్శన

ఇందిరాగాంధీ ఎన్నికపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో జేపీ, మొరార్జీ దేశాయ్ ఆందోళనను తీవ్రతరం చేశారు. 1975 జూన్ 25న దిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో భారీ ప్రదర్శన నిర్వహించి ఇందిరాగాంధీని ప్రధాని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సభలో జేపీ మాట్లాడుతూ ఇందిర ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను పాటించవద్దని సైన్యం, పోలీసు బలగాలకు పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శన ముగిసిన కొద్దిగంటలకే ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించాలనే నిర్ణయానికి వచ్చారు. కేంద్ర కేబినెట్ ఆమోదం లేకుండానే ఆమె ఎమర్జెన్సీ వైపు మొగ్గుచూపారు. అప్పటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ వ్యతిరేకించకుండానే దానిపై ఆమోదముద్ర వేశారు. తర్వాత 21 నెలల పాటు ఇందిరాగాంధీ దేశాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్నారు. ఎదురు తిరిగిన వారిని, ప్రభుత్వాన్ని విమర్శించిన వారిని ఉక్కుపాదంతో అణచివేశారు. జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయీ, ఎల్‌కే ఆడ్వాణీ తదితర అగ్రనేతలు జైలుపాలయ్యారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఏపీఎన్జీవో హౌసింగ్ సొసైటీ ఎన్నికల నిలుపుదలను సవాలు చేస్తూ అప్పీళ్లు

ఈనాడు, హైదరాబాద్: ఏపీఎన్జీవో(గచ్చిబౌలి) హౌసింగ్ సొసైటీకి డైరెక్టర్లు, కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు హైదరాబాద్ జిల్లా సహకార అధికారి(డీసీవో)/ సహకార సంఘాల సంయుక్త రిజిస్ట్రార్ జారీచేసిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ ధర్మాసనం ముందు రెండు అప్పీళ్లు దాఖలయ్యాయి. తెలంగాణ సహకారశాఖ ముఖ్యకార్యదర్శి, సహకార సంఘాల కమిషనర్, జిల్లా సహకార అధికారి ఓ అప్పీల్ దాఖలు చేశారు. ప్రభుత ఉద్యోగులు ఎం.సత్యనారాయణ గౌడ్ మరో 15 మంది మరో అప్పీల్‌ను దాఖలు చేశారు. సోమవారం ఈ వ్యాజ్యాలు హైకోర్టులో విచారణకు వచ్చినప్పటికీ పూర్తి స్థాయి వాదనలు వినేందుకు తగిన సమయం లేకపోవడంతో మంగళవానికి(నేటికి) వాయిదా పడ్డాయి. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలో కూడిన ధర్మాసనం సోమవారం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది. ఏపీఎన్జీవో హౌసింగ్ సొసైటీ బోర్డాఫ్ డెరెక్టర్లను ఎన్నుకునేందుకు డీసీవో ఈ ఏడాది మే 18, జూన్ 1న జారీచేసిన వేర్వేరు ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు తదితరులు హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యం దాఖలు చేశారు. దీన్ని విచారణ జరిపిన న్యాయమూర్తి.. ఎన్నికల కోసం అధికారులు జారీచేసిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఈ నెల 13న మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.

కన్నతండ్రిని కత్తులతో నరికిన కొడుకులు!

- కర్నూలు తరలిస్తుండగా కన్నుమూత
- కుటుంబ కలహాలే కారణం..

డోన్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో కన్నతండ్రిపై ముగ్గురు కుమారులు కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసి ప్రాణాలు తీశారు. ఈ దారుణం సోమవారం రాత్రి కర్నూలు జిల్లా డోన్‌లో జరిగింది. పట్టణంలోని చిగురుమాన్‌పేటకు చెందిన కృపానందం అనే వ్యక్తిని ఆయన కుమారులు జేమ్స్, పెద్దకాంతు, చిన్నకాంతులు నరికి హతమార్చినట్లు పట్టణ పోలీసులు పేర్కొన్నారు. మృతుడు కృపానందం తన భార్య సరోజమ్మను కొడుతూ ఇబ్బందులకు గురిచేసేవాడని, ఐదు రోజుల క్రితం ఆమెను తీవ్రంగా కొట్టి చేతులు విరిచినట్లు వారు తెలిపారు. దీన్ని మనసులో ఉంచుకొని కుమారులు అమ్మ ఆసుపత్రి వద్ద తండ్రిపై వేట కొడవళ్లు, కత్తులతో దాడి చేశారన్నారు. కుమారులు పరారవగా కృపానందం భార్య కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో.. స్థానికులు బాధితుణ్ని ఆటోలో డోన్ ఆసుపత్రికి పంపారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలించడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. భార్యకు సమాచారం ఇచ్చి ఆమె వచ్చాక తరలించగా మార్గమధ్యలో బాధితుడు మృతిచెందాడు. కృపానందం ఇద్దరు కుమారులు గతంలో పురపాలిక వేలాల సందర్భంగా జరిగిన దాడుల్లో, ఇతర నేరాల్లో నిందితులుగా ఉండటంతో వారిపై రౌడీషీట్లు తెరిచినట్లు పోలీసులు చెప్పారు.

దేశీయ అవసరాలకు అనుగుణంగా 'మెట్రో' ప్రమాణాలు

దిల్లీ: మెట్రోరైలు ప్రాజెక్టులన్నీ ఏకరీతిగా ఉండేలా ప్రమాణాల నిర్ణయానికి క్రతువు ఆరంభమైంది. ఇందుకు సంబంధించి ఏర్పాటైన కమిటీకి ప్రధాని మోదీ ఆదివారం ఆమోదం తెలిపారు. మెట్రోమాన్‌గా ప్రాచుర్యం పొందిన ఈ.శ్రీధరన్ దీనికి సారథ్యం వహించనున్నారు. మెట్రో స్టేషన్లు, ప్లాట్‌ఫాంల రూపం.. సొరంగాల పరిమాణం.. విపత్తులు, వ్యర్థాల నిర్వహణ, స్టేషన్లలో సౌరఫలకల ఏర్పాటు తదితర వ్యవస్థలకు ఈ కమిటీ ప్రమాణాలను నిర్ణయించనుంది. స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని దేశీయంగా వీటికి కమిటీ ప్రమాణాలను సూచిస్తుందని ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. దేశవ్యాప్తంగా పది నగరాల్లో ప్రస్తుతం 490 కిలోమీటర్ల మేర మెట్రో రైళ్లు ప్రయాణం సాగిస్తున్నాయి. వివిధ చోట్ల ప్రస్తుతం 600 కిలోమీటర్ల మేర మెట్రోమార్గాలు నిర్మితమవుతున్నాయి.

వ్యర్థాలకు అర్థం చెప్పేలా కార్యాచరణ

- రూ.430 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక
- అన్ని పంచాయతీల్లోనూ ఘనవ్యర్థాల యాజమాన్యం
- 9వేల పంచాయతీల్లో సేంద్రియ ఎరువుల తయారీ షెడ్లు

ఈనాడు - అమరావతి

తూర్పు గోదావరి జిల్లా వీరవాసరంలో ఎరువుల తయారీ కోసం నిర్మించిన షెడ్డు

వ్యర్థాల నుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి రూ.430 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. వచ్చే నెల నుంచి ఇది అమలులోకి రానుంది. స్వచ్ఛాంధ్రప్రదేశ్ మిషన్ నుంచి సమీకరిస్తున్న నిధులతో దశలవారీగా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో ఘనవ్యర్థాల యాజమాన్య కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న వీటి నుంచి సేంద్రీయ ఎరువుల తయారీకి గతంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ శ్రీకారం చుట్టింది. అప్పట్లో 6వేల పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా అమలుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు 750 పంచాయతీల్లో 2961 టన్నుల సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేశారు. మరో 3వేల పంచాయతీల్లో సేకరిస్తున్నారు. వీటి నుంచి ఎరువులను తయారు చేయనున్నారు. తూర్పుగోదావరి, నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలు ఈ కార్యక్రమం అమలులో ఎంతో ముందున్నాయి.

ఇవీ సమస్యలు

★ ఈ ప్రాజెక్టు నిర్వహణకు ప్రణాళిక లోపం ప్రతిబంధకమవుతోంది. వెయ్యికిపైగా పంచాయతీల్లో షెడ్లు నిర్మించి గాలికొదిలేశారు. వ్యర్థాల సేకరణకు సిబ్బంది (గ్రీన్ అంబాసిడర్లు), ట్రై సైకిళ్లను సమకూర్చాలి. రాష్ట్రవ్యాప్తంగా 40వేల మంది గ్రీన్ అంబాసిడర్లు, ట్రైసైకిళ్లు అవసరం. ఇప్పటివరకు 4వేల మంది సిబ్బందిని, 4వేల ట్రైసైకిళ్లను మాత్రమే సమకూర్చారు. ఎంపిక చేసిన 6వేల పంచాయతీల్లోనూ సిబ్బంది, పనిముట్ల కొరత ఉంది.

పరిష్కారం ఇలా

★ గ్రామాల్లో ప్రతి వెయ్యి జనాభాకు గ్రీన్ అంబాసిడర్‌ను నియమిస్తారు. వీరికి నెలకు రూ.6 వేలు చొప్పున వేతనం చెల్లిస్తారు. వీరు తమ పరిధిలోని ఇళ్లు, వీధుల్లో నుంచి వ్యర్థాలను సేకరించి సమీపంలోని సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలకు తరలించాలి.

★ డిసెంబరు నాటికి 9వేల పంచాయతీల్లో ఈ షెడ్ల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నారు. ఎంపీడీవోలకు నెలలో రెండు షెడ్లు నిర్మించేలా లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నారు. ప్రతి షెడ్డుకో కాపలాదారును నియమించి నెలకు రూ.6వేలు వేతనం చెల్లించనున్నారు.

★ గ్రామీణ స్థాయిలో సర్పంచిల నుంచి వివిధ ప్రభుత్వ శాఖల క్షేత్రస్థాయి ఉద్యోగులను భాగస్వాములను చేస్తున్నారు. వ్యర్థాల సేకరణ, తరలింపు నుంచి సేంద్రియ ఎరువుల తయారీ వరకు వీరంతా బాధ్యత తీసుకునేలా ప్రణాళిక రూపొందించారు.

★ జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో సబ్‌కలెక్టర్/ ఆర్డీవో, మండల స్థాయిలో ఎంపీడీవోలు ఈ కార్యక్రమ పర్యవేక్షణ, నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. రాష్ట్ర స్థాయిలోనూ నిత్యం పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేకవ్యవస్థను ప్రవేశ పెడుతున్నారు.

నిధుల కొరత ఇక ఉత్పన్నం కాదు....

'వ్యర్థాల నుంచి సేంద్రీయ ఎరువుల తయారీ ప్రాజెక్టును అన్ని జిల్లాల్లోనూ విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు నిధుల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సమస్య మళ్లీ ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం తగినన్ని నిధులు సమకూర్చుతోంది. అందరి భాగస్వామ్యంతో అన్ని పంచాయతీల్లోనూ అమలు చేస్తాం. ఇందుకు ప్రజలంతా సహకరించాలి.'

–ఎం.సుధాకర్, అదనపు కమిషనర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ

భారీ వర్షాలకు కుప్పకూలిన వంతెన

కర్ణాటకలో ఘటన

కర్ణాటకలో గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సోమవారం ఓ వంతెన కూలిపోయింది. తీర జిల్లా దక్షిణకన్నడలోని బంట్వాళ- మూలార పట్టణ మధ్య ప్రవహించే ఫల్గుణి నదిపై ఉన్న భారీ వంతెన ఉదయం నుంచి ప్రమాదాన్ని తలపించింది. అటుగా వాహనాల రాకపోకలను నిలిపివేసిన కొద్దిసేపటికే ఇదిగో.. ఇలా కుప్పకూలింది. ప్రాణనష్టం సంభవించక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రాకపోకలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు.

–న్యూస్‌టుడే, మంగళూరు

సరిపోలని వేలిముద్రల గుర్తింపు

- 6 లక్షల మందికి బియ్యం బాధలు
- రెండులక్షలకుపైగా కార్డుదారులదీ ఇదే సమస్య

ఈనాడు అమరావతి: వేలిముద్రలు సరిపోలనందున రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మందికి బియ్యం అందడం లేదు. రాష్ట్రంలో 2.04లక్షల కార్డుదారులకు ఇదే సమస్య కనిపిస్తోంది. ఈ-పాస్ యంత్రంపై వేలిముద్ర సరిపోక (అథెంటిఫికేషన్) రేషన్ అందనివారు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ-పాస్ యంత్రాలను అమల్లోకి తెచ్చి మూడేళ్లవుతున్నా ఇలాంటి సాంకేతిక సమస్యలను పరిష్కరించకపోవడం చర్చనీయాంశమవుతోంది. ఈ సమస్య తీవ్రతను అధికార పార్టీ ఎమ్మెల్యేలు పలువురు ఇటీవలి శాసనసభ సమావేశాల్లో పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం దిశగా పౌరసరఫరాల శాఖ చొరవ చూపలేకపోయింది. వేలిముద్రలు సరిపోని వారికి గ్రామ రెవెన్యూ అధికారుల ధ్రువీకరణతో సరకులు ఇస్తున్నామని అధికారులు సమర్థించుకుంటున్నా, ఈ విధానం పలు అక్రమాలకు తావిస్తోంది. వేలిముద్రలు సరిపోలని వారి కనుపాపలను ఐరిస్ ద్వారా గుర్తించి బియ్యం ఇచ్చేందుకు చేసిన ప్రయత్నమూ విఫలమైంది. ఈ నేపథ్యంలో ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నేషన్) విధానాన్ని తీసుకువస్తామని ఆర్నెళ్ల కిందటి నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులు సమీక్ష సమావేశాల్లో ముఖ్యమంత్రికి నివేదిస్తూనే ఉన్నారు. ఆచరణలో అడుగు పడటం లేదు. వేలిముద్రలు సరిపోలని సమస్య పరిష్కారానికి 18వేల మంది సాధికారమిత్రలకు శిక్షణనివ్వనున్నామని తాజాగా పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రకటించారు.

జిల్లాలవారీగా ఇబ్బందులున్న కార్డుల వివరాలు

జిల్లా	వేలిముద్రలు సరిపోలని కార్డులు
శ్రీకాకుళం	13474
విజయనగరం	7840
విశాఖపట్నం	14433
తూ.గోదావరి	22344
ప.గోదావరి	14564
కృష్ణా	15066
గుంటూరు	22662
ప్రకాశం	18443
నెల్లూరు	13830
చిత్తూరు	15055
కడప	14742
అనంతపురం	15949
కర్నూలు	16029
మొత్తం	2,04,431

సర్వేల వివరాలు బయటపెట్టాలి

- తెలంగాణలో కుటుంబ సర్వే, ఏపీలో బీసీ సర్వే..
- హైకోర్టులో బీసీ సంక్షేమ సంఘాల పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు సంబంధించి నిర్వహించిన సర్వేల నివేదికలను బయటపెట్టేలా ఆదేశించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన బీసీల్లో ఎ, బి, సి, డి.లకు స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్య, ఉపాధి రంగాల్లో రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ ఉమ్మడి హైకోర్టులో రెండు రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘాలు పిటిషన్‌లు దాఖలు చేశాయి. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వే, ఏపీలో బీసీ సర్వే, జస్టిస్ మంజునాథ్ కమిషన్ సర్వే, ఓబీసీల గుర్తింపు నిమిత్తం కేంద్రం 2011లో కులాల ప్రాతిపదికన నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వేలను అధికారికంగా ప్రచురించేలా ఆదేశించాలని కోరాయి. సోమవారం బీసీ సంక్షేమ సంఘాల తరఫున తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అల్మెన్‌రాజులు సంయుక్తంగా ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యాహ్నం జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు విచారణ చేపట్టారు. అయితే ఇదే అంశానికి సంబంధించి ఇప్పటికే కాంగ్రెస్‌కు చెందిన బి.రవీంద్రనాథ్, దాసోజు శ్రావణ్‌కుమార్‌లు పిటిషన్ దాఖలు చేసి ఉండటంతో దానితోపాటు జత చేయాలని ఆదేశించారు. వీటిపై మంగళవారం విచారణ చేపడతామన్నారు.

ప్రపంచకప్‌లో ఈనాడు

ఆస్ట్రేలియా	గ్రూప్-సి ✕ సా॥ 7.30	పెరూ
డెన్మార్క్	గ్రూప్-సి ✕ సా॥ 7.30	ఫ్రాన్స్
నైజీరియా	గ్రూప్-డి ✕ రాత్రి 11.30	అర్జెంటీనా
ఐస్‌లాండ్	గ్రూప్-డి ✕ రాత్రి 11.30	క్రొయేషియా

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

స్వర్ణ దీపిక

ప్రపంచకప్ ఆర్చరీలో పసిడి సొంతం

సాల్ట్‌లేక్ సిటీ (యుఎస్ఏ): భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి ప్రపంచ వేదికపై మరోసారి సత్తా చాటింది. ప్రపంచకప్ స్టేజ్-3 టోర్నీలో ఆమె మహిళల రికర్వ్ విభాగంలో పసిడి పతకం సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన తుది పోరులో దీపిక 7-3తో మిచెలి క్రొపెన్ (జర్మనీ)ని ఓడించింది. ఈ పోటీ తొలి సెట్లో 30 పాయింట్లకు 29 పాయింట్లు సాధించి 2-0 ఆధిక్యంలోకి వెళ్లిన దీపిక.. రెండో సెట్లో క్రొపెన్‌తో కలిసి 1-1తో సమానంగా పాయింట్లు సాధించింది. మూడో సెట్లో జర్మనీ అమ్మాయి 1-0తో గెలవడంతో మ్యాచ్ 3-3తో సమానంగా నిలిచింది. అక్కడ నుంచి దీపిక జోరు పెంచింది. వరుసగా నాలుగు సెట్లు సాధించి 7-3తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఆమె టర్కీలో జరిగే ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్ టోర్నీకి అర్హత సాధించింది. 2011, 12, 13, 15 సీజన్లో ప్రపంచకప్ ఫైనల్ టోర్నీకి దీపిక అర్హత సాధించినా.. రజతంతోనే సరిపెట్టుకుంది. ప్రపంచకప్ స్టేజ్ టోర్నీలో 2012 తర్వాత ఆమె మళ్లీ ఇప్పుడే స్వర్ణం గెలిచింది.

"చాలా రోజుల తర్వాత ఈ టోర్నీలో స్వర్ణం గెలవగలిగాను. పూర్తి స్థాయి ప్రదర్శన చేయగలిగాను. ఇదే జోరు ముున్ముందు కొనసాగించాలనుకుంటున్నా. ప్రపంచకప్ ఫైనల్ టోర్నీకి అర్హత సాధించడం చాలా ఆనందంగా అనిపించింది"
– దీపిక

టాప్-10లోకి సురేఖ

ఈనాడు, హైదరాబాద్: భారత యువ ఆర్చర్ వెన్నెం జ్యోతి సురేఖ మరో ఘనత సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కాంపౌండ్ విభాగంలో టాప్-10లో ప్రవేశించిన తొలి భారత క్రీడాకారిణిగా ఆమె రికార్డులకెక్కింది. ప్రపంచ ఆర్చరీ సమాఖ్య తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సురేఖ.. కాంపౌండ్ విభాగంలో పదో ర్యాంకులో నిలిచింది. అమెరికాలో జరుగుతున్న ప్రపంచకప్ స్టేజ్-3 టోర్నీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మతో కలిసి ఆమె కాంస్యం గెలిచింది. ఇప్పటిదాకా సురేఖ 25 అంతర్జాతీయ పతకాలు సాధించింది.

అప్పుడు తండ్రి.. ఇప్పుడు తనయుడు



పీటర్

కాస్పర్

మాస్కో: సరిగ్గా 20 ఏళ్ల క్రితం.. ఫిఫా ప్రపంచకప్‌లో ఫ్రాన్స్‌తో డెన్మార్క్ కీలక గ్రూప్ మ్యాచ్. డ్రా చేసుకున్నా చాలు డెన్మార్క్ ముందంజ వేసే పరిస్థితి. కానీ ఆ జట్టు గోల్‌కీపర్ పీటర్ వైఫల్యంతో డెన్మార్క్ 1-2తో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మళ్లీ 20 ఏళ్ల తర్వాత డెన్మార్క్‌కు ఇదే పరిస్థితి వచ్చింది... మళ్లీ ఫ్రాన్స్‌తో మ్యాచ్.. అదీ గ్రూప్‌లో చివరి మ్యాచ్. అప్పట్లాగే ఫ్రాన్స్ 6 పాయింట్లతో ఉంటే డెన్మార్క్ 4 పాయింట్లతో ఉంది. కానీ ఈసారి కీపర్ మారాడు.. 20 ఏళ్ల క్రితం ఏ ఆటగాడు ఫ్రాన్స్‌ను నిలవరించలేకపోయాడో అతని తనయుడు కాస్పర్ డెన్మార్క్‌కు గోల్‌కీపర్ అయ్యాడు. మరి ఫలితం ఏమిటి? మంగళవారం ఫ్రాన్స్-డెన్మార్క్ మధ్య మ్యాచ్ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పనుంది. 1998లో ఫ్రాన్స్ ఆటగాడు కొట్టిన పెనాల్టీని ఆపలేకపోయిన పీటర్.. ఇప్పుడు తన కొడుకు డెన్మార్క్‌ను గెలిపిస్తాడనే నమ్మకంతో ఉన్నాడు.

ఎవరు ముందుకు.. ఎవరు వెనక్కి?

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో నాకౌట్ రేసు రసవత్తరంగా మారింది. అన్ని జట్లూ రెండేసి మ్యాచ్‌లు ఆడేశాయి. చివరి రౌండు మ్యాచ్‌లు కూడా మొదలైపోయాయి. ఇప్పటికే కొన్ని జట్లు నాకౌట్ బెర్తులు ఖరారు చేసుకోగా.. మిగతా జట్ల రాత ఈ మూణ్నాలుగు రోజుల్లోనే తేలబోతోంది. కొన్ని అగ్ర జట్ల భవితవ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో ఎనిమిది గ్రూపుల్లో ఎవరి నాకౌట్ అవకాశాలు ఎలా ఉన్నాయో చూద్దాం.

ఈనాడు క్రీడావిభాగం

గ్రూప్-ఎ రెండు వరుస విజయాలతో ఉరుగ్వే, రష్యా ముందే నాకౌట్ చేరాయి. చివరి మ్యాచ్‌లో రష్యా (6 పాయింట్లు)పై నెగ్గి అగ్రస్థానంతో గ్రూప్ దశను ముగించింది ఉరుగ్వే (9). ఈజిప్ట్, సౌదీ అరేబియా టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

గ్రూప్-బి రెండు ఓటములతో మొరాకో నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించగా.. స్పెయిన్ (4 పాయింట్లు), పోర్చుగల్ (4), ఇరాన్ (3) నాకౌట్ రేసులో ఉన్నాయి. చివరి రౌండ్లో స్పెయిన్-మొరాకో, పోర్చుగల్-ఇరాన్ తలపడనున్నాయి. మొరాకోపై స్పెయిన్ గెలిస్తే ఆ జట్టు ముందంజ వేస్తుంది. పోర్చుగల్-ఇరాన్ మ్యాచ్‌లో గెలిచే జట్టుకు రెండో బెర్తు ఖాయమవుతుంది. స్పెయిన్, పోర్చుగల్ తమ చివరి మ్యాచ్‌లను డ్రా చేసుకున్నా లేదా ఓడినా కూడా ముందంజ వేయగలవు. అది మరో మ్యాచ్ ఫలితాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది.

గ్రూప్-సి ఫ్రాన్స్ (6) ఇప్పటికే ముందంజ వేసింది. పెరూ (0) నిష్క్రమించింది. డెన్మార్క్ (4) నాకౌట్‌కు చేరువగా ఉంది. చివరి మ్యాచ్‌లో ఫ్రాన్స్‌తో డెన్మార్క్ డ్రా చేసుకున్నా ముందంజ వేస్తుంది. ఆ జట్టు ఓడి.. పెరూపై ఆస్ట్రేలియా (1) గెలిస్తే పాయింట్లు సమమవుతాయి. గోల్ తేడాలో మెరుగ్గా ఉన్న జట్టు నాకౌట్ చేరుతుంది.

గ్రూప్-డి క్రొయేషియా ఇప్పటికే రెండు విజయాలతో నాకౌట్ బెర్తు సాధించింది. నైజీరియా (3), అర్జెంటీనా (1), ఐస్‌లాండ్ (1) రెండో బెర్తు కోసం రేసులో ఉన్నాయి. క్రొయేషియాతో ఐస్‌లాండ్, నైజీరియాతో అర్జెంటీనా తలపడనున్నాయి. అర్జెంటీనాకు నైజీరియాను ఓడించడం తప్ప మరో మార్గం లేదు. అదే సమయంలో క్రొయేషియా చేతిలో ఐస్‌లాండ్ ఓడాలి. ఆ మ్యాచ్ డ్రా అయినా చాలు. అర్జెంటీనాపై నైజీరియా గెలిస్తే అ జట్టే ముందుకెళ్తుంది. అర్జెంటీనాతో నైజీరియా మ్యాచ్ డ్రా అయి.. క్రొయేషియాపై ఐస్‌లాండ్ గెలిస్తే ఇద్దరి పాయింట్లు సమమవుతాయి. గోల్ తేడాను బట్టి బెర్తు ఖరారవుతుంది.

గ్రూప్-ఈ కోస్టారికా (0) నిష్క్రమించింది. బ్రెజిల్ (4), స్విట్జర్లాండ్ (4), సెర్బియా (3) రేసులో ఉన్నాయి. చివరి మ్యాచ్‌లో బ్రెజిల్.. సెర్బియాపై గెలిచినా, డ్రా చేసుకున్నా ముందంజ వేస్తుంది. ఈ మ్యాచ్ ఓడినా బ్రెజిల్‌కు ఛాన్సుంది. కోస్టారికా చేతిలో స్విట్జర్లాండ్ ఓడి.. గోల్ తేడాలో బ్రెజిల్ మెరుగ్గా ఉండాలి. స్విట్జర్లాండ్‌దీ ఇదే పరిస్థితి. సెర్బియా గెలిస్తేనే ముందుకెళ్తుంది.

గ్రూప్-ఎఫ్ నాలుగు జట్లూ నాకౌట్ రేసులో ఉన్నాయి. మెక్సికో రెండు మ్యాచ్‌లూ గెలిచినా ఇంకా ఆ జట్టుకు నాకౌట్ బెర్తు ఖరారవ్వలేదు. జర్మనీ (3), స్వీడన్ (3) జట్లు రెంటికీ 6 పాయింట్లు సాధించే అవకాశముండటమే అందుక్కారణం. బుధవారం స్వీడన్‌తో మ్యాచ్‌లో మెక్సికో గెలిచినా, డ్రా చేసుకున్నా ముందంజ వేస్తుంది. కొరియాపై జర్మనీ.. గెలిస్తే నాకౌట్ చేరుతుంది. ఈ మ్యాచ్ డ్రా అయితే తర్వాతి మ్యాచ్ ఫలితాన్ని బట్టి ఆ జట్టు భవితవ్యం తేలుతుంది. కొరియా రెండు మ్యాచ్‌లూ ఓడినా.. చివరి మ్యాచ్‌లో ఘనవిజయం సాధించి, స్వీడన్‌పై మెక్సికో గెలిస్తే ముందంజ వేస్తుంది.

గ్రూప్-జి ఈ గ్రూప్ సంగతి తేలిపోయింది. బెల్జియం, ఇంగ్లాండ్ రెండేసి విజయాలతో నాకౌట్ చేరగా.. పనామా, టునీషియా రెండేసి ఓటములతో నిష్క్రమించాయి. బెల్జియం-ఇంగ్లాండ్ పోరు గ్రూప్ విజేతను నిర్ణయిస్తుంది.

గ్రూప్-హెచ్ పోలెండ్ (0) నిష్క్రమించింది. జపాన్ (4), సెనెగల్ (4) పరిస్థితి మెరుగు. పోలెండ్ (0)పై జపాన్, కొలంబియా (3)పై సెనెగల్ ఓడకుంటే చాలు.. ముందంజ వేస్తాయి. కొలంబియా.. సెనెగల్‌ను ఓడిస్తే నాకౌట్ చేరుతుంది. ఈ మ్యాచ్ డ్రా అయి.. పోలెండ్ చేతిలో జపాన్ ఓడిపోతే సెనెగల్, కొలంబియా ముందుకెళ్తాయి.

మెస్సి

గ్రూప్-ఎ	మ్యా	గె	డ్రా	ఓ	పా
ఉరుగ్వే	3	3	0	0	9
రష్యా	3	2	0	1	6
సౌదీఅరేబియా	3	1	0	2	3
ఈజిప్ట్	3	0	0	3	0

గ్రూప్-బి	మ్యా	గె	డ్రా	ఓ	పా
స్పెయిన్	2	1	1	0	4
పోర్చుగల్	2	1	1	0	4
ఇరాన్	2	1	0	1	3
మొరాకో	2	0	0	2	0

గ్రూప్-సి	మ్యా	గె	డ్రా	ఓ	పా
ఫ్రాన్స్	2	2	0	0	6
డెన్మార్క్	2	1	1	0	4
ఆస్ట్రేలియా	2	0	1	1	1
పెరూ	2	0	0	2	0

గ్రూప్-డి	మ్యా	గె	డ్రా	ఓ	పా
క్రొయేషియా	2	2	0	0	6
నైజీరియా	2	1	0	1	3
ఐస్‌లాండ్	2	0	1	1	1
అర్జెంటీనా	2	0	1	1	1

గ్రూప్-ఈ	మ్యా	గె	డ్రా	ఓ	పా
బ్రెజిల్	2	1	1	0	4
స్విట్జర్లాండ్	2	1	1	0	4
సెర్బియా	2	1	0	1	3
కోస్టారికా	2	0	0	2	0

గ్రూప్-ఎఫ్	మ్యా	గె	డ్రా	ఓ	పా
మెక్సికో	2	2	0	0	6
జర్మనీ	2	1	0	1	3
స్వీడన్	2	1	0	1	3
ద.కొరియా	2	0	0	2	0

గ్రూప్-జి	మ్యా	గె	డ్రా	ఓ	పా
ఇంగ్లాండ్	2	2	0	0	6
బెల్జియం	2	2	0	0	6
టునీషియా	2	0	0	2	0
పనామా	2	0	0	2	0

గ్రూప్-హెచ్	మ్యా	గె	డ్రా	ఓ	పా
జపాన్	2	1	1	0	4
సెనెగల్	2	1	1	0	4
కొలంబియా	2	1	0	1	3
పోలెండ్	2	0	1	2	0

నోట్: మ్యా: మ్యాచ్‌లు; గె- గెలుపు; ఓ- ఓటమి; పా-పాయింట్లు

రష్యా దూకుడుకు అడ్డుకట్ట పడింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఘనవిజయం సాధించిన ఆతిథ్య జట్టును చిత్తుగా ఓడించిన మాజీ ఛాంపియన్ ఉరుగ్వే తొమ్మిది పాయింట్లతో గ్రూప్-ఎ విజేతగా నిలిచింది. రష్యా రెండో స్థానంతో ముందంజ వేసింది. ఈ మ్యాచ్‌కు ముందే రెండు జట్లకు నాకౌట్లో స్థానం ఖరారైన సంగతి తెలిసిందే. మరోవైపు నామమాత్రమైన మ్యాచ్‌లో ఈజిప్టుపై సౌదీ అరేబియా విజయం సాధించింది.

ఉరుగ్వేదే 'ఎ'

రష్యాపై 3-0తో ఘనవిజయం

సమార (రష్యా)

ప్రపంచకప్‌లో గ్రూప్-ఎ పోరు ముగిసింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఉరుగ్వే గ్రూపులో అగ్రస్థానం సాధించగా.. రష్యా (6 పాయింట్లు) రెండు విజయాలతో తుది-16లో అడుగుపెట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఉరుగ్వే 3-0తో ఆతిథ్య రష్యాను మట్టికరిపించింది. 36వ నిమిషంలోనే పదిమందికి పరిమితం కావడం రష్యాను దెబ్బతీసింది. ఉరుగ్వే తరఫున సురెజ్ (10వ), చెరిషెవ్ (23వ, సెల్ఫ్ గోల్), కవాని (90వ) గోల్స్ కొట్టారు. ప్రపంచకప్‌లో గ్రూపులో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గడం ఉరుగ్వేకు ఇదే తొలిసారి. ఉరుగ్వే శనివారం జరిగే తుది-16 పోరులో గ్రూప్-బి రన్నర్స్-అప్ (స్పెయిన్ లేదా పోర్చుగల్ లేదా ఇరాన్)తో తలపడుతుంది. రష్యా జట్టు గ్రూప్-బి విజేతను ఢీకొంటుంది.

ఉరుగ్వే ఆధిపత్యం: తొలి రెండు మ్యాచ్‌ల్లో అలవోకగా నెగ్గిన రష్యా ఈసారి ఆ ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. ఉరుగ్వే ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బంతిని ఎక్కువగా తన నియంత్రణలోనే ఉంచుకున్న ఆ జట్టు పదేపదే దాడులతో రష్యా రక్షణశ్రేణిని ఒత్తిడిలోకి నెట్టింది. స్టార్ స్ట్రైకర్ సురెజ్ కొట్టిన గోల్‌తో పదో నిమిషంలోనే ఉరుగ్వే ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రోడ్రిగో బెంటాన్‌కుర్‌ను రష్యా మిడ్‌ఫీల్డర్ యురి గజిన్‌స్కీ ఫౌల్ చేయడంతో లభించిన ఫ్రీకిక్‌ను సురెజ్ సద్వినియోగం చేశాడు. రష్యా గోల్‌కీపర్ గట్టిగానే ప్రయత్నించినా గోల్‌ను అడ్డుకోలేకపోయాడు. 23వ నిమిషంలో డిఫెండర్ చెరిషెవ్ సెల్ఫ్ గోల్‌తో రష్యా ఆధిక్యం 2-0కు పెరిగింది. డీగో లకాల్ట్ షాట్.. చెరిషెవ్ కాలిగి తగిలి వలలో పడింది. సౌదీ అరేబియాపై రెండు గోల్స్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న చెరిషెవ్‌కు ఇది తీవ్ర నిరాశ కలిగించే పరిణామమే. ఇది చాలాదన్నట్లు.. పది మందికే పరిమితవడం రష్యా కష్టాలను రెట్టింపు చేసింది. 36వ నిమిషంలో స్మోల్నికోవ్ రెండో పసుపు కార్డును అందుకుని మైదానాన్ని వీడాడు. పదిమందికే పరిమితమైనప్పటికీ రెండో అర్ధభాగంలో రష్యా బాగానే ఆడింది. కొన్ని అవకాశాలనూ సృష్టించుకుంది. ఆట ముగియడానికి మరో 20 నిమిషాలు ఉండగా.. పెనాల్టీ కోసం రష్యా చేసుకున్న అప్పీలును వీడియో అసిస్టెంట్ రిఫరీ తిరస్కరించాడు. కాసేపటి తర్వాత రష్యా ఆటగాడు జుబా కొట్టిన షాట్ ఉరుగ్వే బార్‌కు కొద్దిగా పైనుంచి వెళ్లింది. ఐతే 90వ నిమిషంలో ఉరుగ్వే ఆధిక్యాన్ని కవాని 3-0కు పెంచాడు. గోడిన్ హెడర్‌ను రష్యా గోల్‌కీపర్ అకినీఫ్ అడ్డుకోగా.. వెనక్కి వచ్చిన బంతిని కవాని నెట్లోకి కొట్టేశాడు.

సురెజ్

ఉరుగ్వే	3	రష్యా	0
సురెజ్ (10వ), చెరిషెవ్ (23వ, సెల్ఫ్ గోల్), కవాని (90వ)			

ఆఖర్లో సౌదీ మెరుపు

సమార (రష్యా): మ్యాచ్ డ్రాగా ముగిసినట్లేనని అంతా భావించిన తరుణంలో, ఆఖరి క్షణాల్లో గోల్‌తో సౌదీ అరేబియా 2-1తో ఈజిప్ట్‌పై విజయం సాధించింది. ఆ జట్టు వెనుకబడి మరీ పుంజుకుంది. సౌదీ తరఫున అల్ ఫరాజ్ (45+6, పెనాల్టీ), సలేం అల్ దవ్‌సారి (90+5) గోల్స్ కొట్టగా.. ఈజిప్ట్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను మహ్మద్ సలా (22వ)సాధించాడు. ప్రపంచకప్ మ్యాచ్ ఆడిన అతిపెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించిన సౌదీ గోల్‌కీపర్ ఎసామ్ హదరి ఓ పెనాల్టీని అద్భుతంగా అడ్డుకున్నాడు. కానీ మరోదాన్ని ఆపలేకపోయాడు. 45 ఏళ్ల హదరి 39వ నిమిషంలో సౌదీ అరేబియా ఆటగాడు పహాద్ అల్ మువాలాద్ స్పాట్ కిక్‌ను కుడివైపు దూకుతూ కళ్లుచెదిరే రీతిలో ఆపాడు. ఐతే సౌదీ రెండు అర్ధభాగాల్లోనూ స్టాపేజ్ సమయంలో గోల్స్ సాధించింది. ప్రథమార్ధం ఇంజురీ సమయంలో సౌదీ అరేబియాకు లభించిన పెనాల్టీని ఫరాజ్ సద్వినియోగం చేసుకున్నాడు. ఐతే మ్యాచ్‌లో మొదట ఆధిక్యం సంపాదించింది ఈజిప్టే. ఆరంభ ఎలెవన్‌లో ఉన్న స్టార్ ఆటగాడు మహ్మద్ సలా 22వ నిమిషంలో గోల్ సాధించాడు. మ్యాచ్ మరో నిమిషంలో ముగుస్తుందనగా దవ్‌సారి సాధించిన గోల్‌తో సౌదీ విజయాన్ని అందుకుంది. 1994 ప్రపంచకప్ తర్వాత సౌదీకి ప్రపంచకప్‌లో ఇదే తొలి విజయం. ఈజిప్ట్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడి గ్రూప్‌లో అట్టడుగు స్థానంతో ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది.

గోల్ సంబరం.. దవ్‌సారి

సౌదీ అరేబియా	2	ఈజిప్ట్	1
అల్ ఫరాజ్ (45+6, పెనాల్టీ), సలేం అల్ దవ్‌సారి (90+5)		మహ్మద్ సలా (22వ)	

లంక కష్టాల్లో..

బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్‌తో మూడో టెస్టులో శ్రీలంక కష్టాల్లో పడింది. సోమవారం రెండోరోజు ఆట ఆఖరికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 99/5తో నిలిచింది. విండీస్ బౌలర్లు రోచ్ (2/13), గాబ్రియల్ (2/42) ధాటికి ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. గుణతిలక (29), కుశాల్ (22) మాత్రమే కాసేపు నిలబడ్డారు. ఆట ఆఖరికి రోషెన్ సిల్వ (3), డిక్వెలా (13) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 132/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్.. 204 పరుగులకే ఆలౌటైంది. డౌరిచ్ (71), హోల్డర్ (74) రాణించారు. లహిరు కుమార (4/58), కసున్ రజిత (3/68) ఆకట్టుకున్నారు.

సెమీఫైనల్లో భారత్

దుబాయ్: ప్రపంచ ఛాంపియన్ భారత్.. దుబాయ్‌లో జరుగుతున్న ఆరు దేశాల కబడ్డీ మాస్టర్స్ టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. టోర్నీ ఆరంభ పోరులో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన భారత్.. ఆ జట్టుపై మరో భారీ విజయంతో గ్రూప్-ఎ నుంచి సెమీస్ బెర్తు ఖరారు చేసుకుంది. సోమవారం భారత్ 41-17తో పాక్‌ను మట్టికరిపించింది. మోను గోయత్ ఏడు పాయింట్లతో టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అజయ్ ఠాకూర్, రిషంక్ దేవడిగ తలో ఆరు పాయింట్లు సాధించారు. రెండో మ్యాచ్‌లో భారత్.. కెన్యాను చిత్తు చేసిన సంగతి తెలిసిందే. గ్రూప్-బి నుంచి ఇరాన్ కూడా సెమీస్ చేరింది. ఆ జట్టు కొరియాను 31-27తో ఓడించింది.

మెరిసిన చాహర్, మయాంక్

విండీస్-ఎపై భారత్-ఎ ఘనవిజయం

మయాంక్

లీసెస్టర్: ఇంగ్లాండ్ పర్యటనలో భారత్-ఎ జట్టు జోరు కొనసాగిస్తోంది. ముక్కోణపు వన్డే సిరీస్ మ్యాచ్‌లో సోమవారం భారత యువ జట్టు 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్-ఎను చిత్తు చేసింది. మొదట దీపక్ చాహర్ (5/27) ధాటికి విండీస్ 49.1 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌటైంది. చంద్రపాల్ హేమరాజ్ (44) టాప్‌స్కోరర్. అనంతరం మయాంక్ అగర్వాల్ (112; 102 బంతుల్లో 11×4, 2×6) మెరుపు సెంచరీకి శుభ్‌మన్ గిల్ (58 నాటౌట్) సమయోచిత ఇన్నింగ్స్ తోడవడంతో సాధించడంతో భారత్.. 38.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

18 నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

దిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 18 నుంచి ఆగస్టు 10 వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ సోమవారం వెల్లడించారు. దాదాపు 18 రోజుల (పని దినాలు) పాటు సమావేశాలు జరుగుతాయని వివరించారు. ఈమేరకు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ తేదీలను సిఫార్సు చేసింది. వర్షాకాల సమావేశాల సందర్భంగా 6కు పైగా అత్యవసరాదేశాలను (ఆర్డినెన్సులు) తీసుకురావడంతో పాటు, పలు కీలకమైన బిల్లులను పార్లమెంటు ముందుంచడానికి ప్రభుత్వం అజెండాను రూపొందించినట్లు మంత్రి అనంత్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరించారు. ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మక సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న వాటిలో ముమ్మారు తలాక్ బిల్లు ఒకటి. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందాల్సి ఉంది. అలాగే ఓబీసీల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా, వైద్యవిద్య జాతీయ కమిషన్ బిల్లు, ట్రాన్స్‌జెండర్ బిల్లు వంటివాటిని ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి వివరించారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ పదవీకాలం ఈనెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో ఆ పదవికి ఈ సమావేశాల్లోనే ఎన్నిక జరుగుతుందని మంత్రి వివరించారు.

ప్లాస్టిక్ నిషేధంతో 'మహా'నష్టం!

- మహారాష్ట్రలో రూ.15 వేల కోట్ల మేర తగ్గిన వ్యాపారం

ముంబయి: మహారాష్ట్రలో 'ప్లాస్టిక్' కలకలం రేగింది! వాడి పారేసే థర్మోకాల్, ప్లాస్టిక్ వస్తువులపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధం శనివారం నుంచి అమల్లోకి రావడంతో... వాటి తయారీ, విక్రయదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ సంచులు, ప్లేట్లు, చెంచాలు, సీసాలు తదితర వస్తువుల తయారీ, విక్రయం, సరఫరా, నిల్వ, వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు ప్రభుత్వం గత మార్చి 23న ప్రకటించింది. జూన్ 23 నుంచి ఇది అమల్లోకి వస్తుందని వెల్లడించింది. ఉల్లంఘనులపై మొదటిసారి రూ.5 వేలు, రెండోసారి రూ.25 వేల జరిమానా విధిస్తామని తెలిపింది. నిషేధం కారణంగా వ్యాపారం సగానికి తగ్గిపోయిందని చిల్లర వర్తకుల సంక్షేమ సంఘాల సమాఖ్య ఆందోళన వ్యక్తం చేసింది. శనివారం నుంచి 2 వేల కిరాణా దుకాణాలు మూతపడ్డాయనీ.. పాలు, పళ్లరసాలు, పెరుగు విక్రయాలు 25% తగ్గిపోయాయని సమాఖ్య అధ్యక్షుడు వీరెన్ షా సోమవారమిక్కడ పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్లాస్టిక్, థర్మోకాల్ వస్తుపరిశ్రమ రూ.15,000 కోట్ల నష్టం చవిచూసిందనీ, 3 లక్షల మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని భారతీయ ప్లాస్టిక్ వస్తువుల తయారీదారుల సంఘం ప్రధాన కార్యదర్శి నిమిత్ పునామియా ఆందోళన వ్యక్తం చేశారు.

మధుమేహ చిన్నారులకు ఉచిత చికిత్స

ఈనాడు, హైదరాబాద్: మధుమేహంతో బాధపడుతున్న పేద చిన్నారులకు పూర్తి ఉచితంగా చికిత్స అందించనున్నట్లు 'డయాబ్ ఎయిడ్' సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. టైప్-1 మధుమేహం బారినపడిన 16 ఏళ్ల లోపు పిల్లలకు తాము నెలనెలా వైద్య పరీక్షలు, ఇన్సులిన్, గ్లూకోమీటరు, పరీక్ష స్ట్రిప్పులు, ఇతర మందులు, వైద్యుల సలహాసంప్రదింపుల వంటివన్నీ పూర్తి ఉచితంగా అందజేయనున్నట్లు సంస్థ నిర్వాహకులు డా॥ పి.ఇంద్రసేనారెడ్డి తెలిపారు. మధుమేహ చికిత్సకు నెలనెలా ఎంతలేదన్నా రూ.2,500 నుంచి రూ.3000 వరకూ ఖర్చవుతుంది. నిరుపేదలకు దీన్ని భరించటం చాలా కష్టం. దీన్ని దృష్టిలో ఉంచుకునే 'ఛేంజింగ్ ద డయాబిటీస్ ఇన్ చిల్డ్రన్' పేరుతో 2011లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 12 కేంద్రాల్లో వేలాది మంది చిన్నారులకు పూర్తి ఉచితంగా మధుమేహ చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం చిన్నారులు ఈ నెలాఖరులోపు హైదరాబాద్ పంజాగుట్టలోని 'కాంతి శిఖర అపార్ట్‌మెంట్, సీ-24'లో ఉన్న 'డయాబ్ ఎయిడ్' సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నిర్వాహకులను 9848039111, 8019363625, 9912119527, 040-66617111 ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు సిరంజీతో తీసుకునే ఇన్సులిన్ మందు సీసాలనే ఇస్తారు, ఇన్సులిన్ పెన్నులు కాదని నిర్వాహకులు స్పష్టం చేశారు.

నైజీరియాలో ఘర్షణలకు 86 మంది బలి

జోస్: నైజీరియాలో విధ్వంసకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్లాటూ రాష్ట్రంలోని బార్కిన్ లాదీ ప్రాంతంలో రైతులపై సంచార పశుకాపరులు దాడులకు దిగారు. వీటిలో సోమవారం సాయంత్రంనాటికి 86 మంది మృత్యువాతపడ్డారు. ఫులానీ తెగకు చెందిన పశుకాపరులపై బెరోమ్ తెగ రైతులు గురువారం దాడిచేసిన అనంతరం ఈ ఘర్షణలు మొదలయ్యాయి. భూమితోపాటు ఇతర సహజ వనరుల కోసం ఇక్కడ ఎప్పటికప్పుడే ఘర్షణలు జరుగుతుంటాయి. గత పదేళ్లలో వీటికి బలైనవారి సంఖ్య వేలల్లో ఉంటుంది.

మాలీలో 36 మంది మృత్యువాత

బొమాకో: సెంట్రల్ మాలీలో ఫులానీ తెగ సాయుధులు దాడులకు తెగబడ్డారు. కౌమగ గ్రామంపై శనివారం విరుచుకుపడి తొలుత 32 మంది పౌరులను బలితీసుకున్నారు. సైనికులు ఘటన స్థలాన్ని సందర్శించి వెళ్లిపోయిన అనంతరం.. ఆదివారం మళ్లీ దాడికి తెగబడి మరో నలుగురిని పొట్టనపెట్టుకున్నారు.

ముంబయిని ముంచెత్తిన వాన

- వేర్వేరు ఘటనల్లో నలుగురు మృత్యువాత

ముంబయి, న్యూస్‌టుడే: దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. నలుగురి ప్రాణాలను బలితీసుకుంది. రహదారులపై నీరు నిలవడంతో.. సోమవారం ఉదయం కార్యాలయాలకు వెళ్లేవారు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ముంబయి, ఠానేల్లో ఆదివారం రాత్రంతా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. సోమవారం ఉదయమూ జోరు వాన కొనసాగింది. అంధేరీ, ఖర్, మలాడ్ ప్రాంతాల్లో భూగర్భమార్గాలు జలమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మలాడ్ ప్రాంతంలో గొయ్యిలో పడిపోయి 15 ఏళ్ల బాలుడు మృత్యువాతపడ్డాడు. ఠానేలో గోడ కూలిపోవడంతో 13 ఏళ్ల బాలుడు దుర్మరణం పాలయ్యాడు. ముంబయిలోని ధోబీ తలావో ప్రాంతంలో చెట్టు కూలి ఆదివారం ఇద్దరు మృతిచెందారు. దక్షిణ ముంబయిలోని వాడాలా ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనం పక్కన నేల కుంగిపోయింది. అక్కడ భారీ ప్రహరీ కూలిపోవడంతో 15 కార్లు ధ్వంసమయ్యాయి. 24 గంటల్లో ముంబయిలో 231.4 మిల్లీమీటర్ల వర్షం పడినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. మరోవైపు, నీటిని తోడేందుకు వీలుగా లోతట్టు ప్రాంతాల్లో అధికారులు ముందస్తుగా పంపులను ఏర్పాటుచేశారు. వర్షం తీవ్రతకు కొన్ని సబర్బన్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

ముంబయిలో రైలు పట్టాలపై చేరిన వరద నీరు

స్వేచ్ఛాహరులను భారతీయులనలేం

- అసహనానికి భారతీయ విలువల్లో స్థానం లేదు
- ఎమర్జెన్సీ అనుభవాలకు పాఠ్యాంశాల్లో చోటు
- అది దేశ చరిత్రలో భాగం... దానిని దాచిపెట్టలేం...
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఉద్ఘాటన



'ఎమర్జెన్సీ, ఇండియన్ డెమొక్రసీస్ డార్కెస్ట్ అవర్' పుస్తక ప్రతులను ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి. చిత్రంలో పుస్తక రచయిత సూర్యప్రకాశ్

ఈనాడు, దిల్లీ: 'సాటి ప్రజల స్వేచ్ఛను హరించేవారిని భారతీయులుగా పిలవలేం. వారికి అలా పిలిపించుకునే హక్కు లేదు. స్వేచ్ఛను హరించడం భారతీయ నైతిక విలువలు, మూల సూత్రాలకు పూర్తి విరుద్ధం' అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి 43 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రసార భారతి ఛైర్మన్ ఎ.సూర్యప్రకాశ్ రచించిన 'ఎమర్జెన్సీ- ఇండియన్ డెమోక్రసీస్ డార్కెస్ట్ అవర్' పుస్తక హిందీ, కన్నడ, తెలుగు, గుజరాతీ అనువాద ప్రతులను ఆవిష్కరించారు. ప్రజాస్వామ్యానికి పట్టంకడుతూ 1977లో దేశ ప్రజలు ఘనమైన తీర్పునివ్వడంతో ఆ తర్వాత ఏ ప్రభుత్వమూ ఎమర్జెన్సీ జోలికి వెళ్లే సాహసం చేయలేదని ఉప రాష్ట్రపతి చెప్పారు. '1975 జూన్ 25న దేశ చరిత్రలో ఒక దురదృష్టకర ఘటన చోటుచేసుకొంది. వివేకవంతమైన ఏ ప్రభుత్వమూ దాన్ని పునరావృతం చేస్తుందని నేను అనుకోవడం లేదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిగత స్వేచ్ఛపై ప్రభుత్వమే నాడు అసహనం ప్రదర్శించింది. ఇప్పుడు కొందరు దారితప్పిన వ్యక్తుల నుంచి వ్యక్తిగత స్వేచ్ఛకు ఎదురవుతున్న ముప్పును మనం ఎదుర్కోవాల్సి ఉంది. గో సంరక్షణ, లవ్‌జిహాద్, ఆహార అలవాట్లు, సినిమాల ప్రదర్శన పేరిట కొందరు వ్యక్తులు అప్పుడప్పుడు ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు...' అని ఆయన హితవుపలికారు.

అప్పటి చరిత్ర ఇప్పటివారికి తెలియాలి

'ప్రపంచంలోని అన్ని మతాలూ మన దేశంలో పరిఢవిల్లిన కారణంగా భారతీయ విలువలు, మూల సూత్రాల్లో అసహనం అన్న పదానికే తావులేదు. తోటి వారి వ్యక్తిగత స్వేచ్ఛను ఎవరు హరించినా వారు భారతీయులుగా ఉండటానికి అనర్హులు. వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమంటే భారతీయ రాజ్యాంగాన్ని దెబ్బతీయడమే. ఎమర్జెన్సీ అంశాన్ని పాఠ్యాంశంగా చేర్చడానికి ఇదే సరైన సమయం. అది చరిత్రలో భాగం. దానిని తొక్కిపెట్టలేం. 1975-77 మధ్య దేశంలో చోటుచేసుకున్న పరిణామాల గురించి ఇప్పటి తరానికి చెప్పినట్లవుతుంది. ఈ రోజు వాళ్లు అనుభవిస్తున్న స్వేచ్ఛ విలువ గురించి తెలుసుకోవడానికి దోహదపడుతుంది. ఎమర్జెన్సీలో నేను 17 నెలలు జైలు జీవితం అనుభవించాల్సి వచ్చింది. ఆనాడు దేశంలో కార్యనిర్వాహకవర్గం నియంతలా మారిపోయింది. పార్లమెంటు తన అధికారాలను కార్యనిర్వాహకవర్గానికి ధారాదత్తం చేసింది. న్యాయవ్యవస్థ ఎన్నడూలేనంత స్థాయికి దిగజారిపోయింది. ప్రసార మాధ్యమాల నోరునొక్కేశారు. వార్తాపత్రికలు వెలువడకుండా విద్యుత్తు కట్‌చేశారు. ధైర్యంగా నిలబడిన పాత్రికేయులను, వారి కుటుంబ సభ్యులను వేధించారు. వ్యతిరేక వార్తలు రాసిన పత్రికలకు ప్రకటనలు నిలిపేశారు. ప్రెస్‌కౌన్సిల్‌నే రద్దుచేశారు. మీడియాను అణచివేయడానికి ఎన్నో చట్టాలు తీసుకొచ్చారు. కేవలం కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వానికి ఇష్టం వచ్చినట్లు రాజ్యాంగాన్ని సవరించే అధికారాన్ని రాష్ట్రపతికి దఖలు పరచడం తీవ్ర అభ్యంతరకరం' అన్నారు.

ఆ రోజుల్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అజ్ఞాతంలో ఉంటూ.. ప్రభుత్వం నిర్బంధించిన వారి కుటుంబాలకు ఎలా సాయం చేసిందీ ఉపరాష్ట్రపతి వివరించారు. ప్రాథమిక హక్కులకు అండగా నిలిచిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అధినేత రామ్‌నాథ్ గోయంకాలను గొప్ప హీరోలుగా అభివర్ణించారు.

ఇందిర.. హిట్లర్ ఒకటే: జైట్లీ

దిల్లీ: ఇందిరాగాంధీ అత్యయిక పరిస్థితి విధించడానికి జర్మనీ నియంత హిట్లర్ నుంచి ప్రేరణ పొంది ఉండవచ్చని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. '1933లో హిట్లర్ చేసినదానినే ఇందిర చేశారు. వారు ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చేశారు. ఇందిర ఒక అడుగు ముందుకువెళ్లి దేశాన్ని వారసత్వ పాలనతో కూడిన ప్రజాస్వామ్యంగా మార్చేసేందుకు ప్రయత్నించార'ని విమర్శించారు. ఎమర్జెన్సీ పరిస్థితులపై తన అభిప్రాయ మాలికలో రెండో భాగాన్ని సోమవారం ఆయన ఫేస్‌బుక్ ద్వారా విడుదల చేశారు. 'హిట్లర్ చేయని కొన్ని పనుల్నీ ఇందిర చేశారు. పార్లమెంటరీ కార్యకలాపాలను ప్రసార మాధ్యమాలు ప్రచురించకుండా ఆమె నిషేధం విధించారు. పత్రికలపై జర్మనీలో, భారత్‌లో విధించిన సెన్సార్ చట్టాలు ఒక్కటే. ఏక పార్టీ వ్యవస్థనే ఆమె కోరుకున్నారు. ఆర్థిక కార్యక్రమాల పరంగా చూసినా హిట్లర్, ఇందిర మధ్య చాలా పోలికలున్నాయి. హిట్లర్ 25 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రకటిస్తే... ఇందిర 20 సూత్రాలను ఎంచుకున్నారు. ఆ తర్వాత సంజయ్‌గాంధీ మిగిలిన 5 సూత్రాలను ప్రకటించారు. అసంతృప్తి వ్యక్తం చేయడం పాపంగా మారి, వ్యక్తి పూజదే రాజ్యమయింది. ఇండియా అంటే ఇందిర, ఇందిర అంటే ఇండియా అన్నట్లు మార్చేశారు' అని జైట్లీ ఆరోపించారు.

చదవాల్సిందిగా సూచించిన ప్రధాని మోదీ: ప్రధాని నరేంద్రమోదీ దీనిని ట్విటర్ ద్వారా పంచుకున్నారు. 'ఎమర్జెన్సీ చీకటి రోజుల గురించి జైట్లీ రాశారు. ఆనాడు వ్యక్తి స్వేచ్ఛను అణిచేసిన తీరు, దమనకాండ, రాజ్యాంగ సూత్రాలపై నేరుగా జరిగిన దాడి గురించి ప్రస్తావించారు. దీనిని చదవండి' అంటూ సంబంధిత లింక్‌ను ప్రధాని ప్రస్తావించారు.

ఎమర్జెన్సీ వీరులకు నేడు ప్రధాని జేజేలు

ముంబయి: 'ఎమర్జెన్సీ'కి వ్యతిరేకంగా పోరాడిన వారిని ప్రశంసిస్తూ...కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం నాడిక్కడ ప్రసంగించనున్నారు. భాజపా ముంబయి విభాగం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోంది.

సీషెల్స్‌కు 10 కోట్ల డాలర్ల రుణం

- భారత్ ప్రకటన
- సంయుక్త నౌకాదళ ప్రాజెక్టుపై కలసి పనిచేద్దాం
- మోదీ, డేనీ ఫార్ భేటీలో నిర్ణయం

దిల్లీ: ఉమ్మడి నౌకా స్థావరం ఏర్పాటుపై కలసి పనిచేయాలని భారత్, సీషెల్స్ సోమవారం నిర్ణయించాయి. ఈ విషయంలో పరస్పర ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని ముందడుగు వేయాలని తీర్మానించాయి. రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు సీషెల్స్‌కు 10 కోట్ల డాలర్ల రుణాన్ని భారత్ ప్రకటించింది. భారత పర్యటనలో ఉన్న సీషెల్స్ అధ్యక్షుడు డేనీ ఫార్ సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రక్షణ సహా పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. సైబర్ భద్రత, నౌకాయానం సహా ఆరు అంశాలపై అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

సీషెల్స్‌లోని అసంప్షన్ దీవిలో సంయుక్త నౌకాదళ స్థావరం ఏర్పాటుకు రెండు దేశాల మధ్య 2015లో అవగాహన కుదిరింది. దీనివల్ల హిందూ మహాసముద్రంలో భారత్‌కు వ్యూహాత్మక ప్రయోజనం కలుగుతుంది. అయితే సీషెల్స్‌లో విపక్షాల వ్యతిరేకతతో ఈ ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేయబోమని ఈ నెల మొదట్లో డేనీ ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన భారత పర్యటనకు వచ్చారు. సోమవారం ద్వైపాక్షిక చర్చల అనంతరం డేనీ, మోదీలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. పరస్పర హక్కులను గౌరవించుకుంటూ అసంప్షన్ దీవి ప్రాజెక్టుపై కలసి పనిచేయాలని నిర్ణయించినట్లు మోదీ చెప్పారు. ఇదే విషయాన్ని డేనీ పునరుద్ఘాటించారు. భారత్, సీషెల్స్ పరస్పరం కీలక భాగస్వాములని మోదీ పేర్కొన్నారు. భారత్ బహూకరించే రెండో డోర్నియర్ విమానం ఈ నెల 29న సీషెల్స్ చేరుతుందన్నారు. ఆ దేశ రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. తన గౌరవార్థం మోదీ ఇచ్చిన విందులో డేనీ.. సితార్‌ను మీటుతూ మృదు మధుర గేయాన్ని ఆలపించి, ఆహూతులను రంజింపచేశారు. ఈ పర్యటన సందర్భంగా సీషెల్స్.. భారత్‌కు భారీ అల్డాబ్రా తాబేళ్ల జతను బహూకరించింది. వీటిని హైదరాబాద్ జూలో ఉంచుతామని విదేశాంగ శాఖ అధికారులు తెలిపారు.

సోమవారం రాష్ట్రపతి భవన్‌లో విందుకు సీషెల్స్ అధ్యక్షుడు డేనీ ఫార్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ ★ రాష్ట్రపతి భవన్‌లో సీషెల్స్ అధ్యక్షుడి గౌరవ వందన కార్యక్రమంలో కళ్లు తిరిగి పడిపోతున్న వైమానిక దళ సభ్యుడు

ఆరోగ్యం జాగ్రత్త

రాష్ట్రపతి భవన్‌లో సీషెల్స్ అధ్యక్షుడికి ఇచ్చిన గౌరవ వందన కార్యక్రమంలో వైమానిక దళ సిబ్బంది ఒకరు కళ్లు తిరిగి పడిపోయారు. కార్యక్రమం ముగిశాక సదరు సైనికుడి వద్దకు వెళ్లిన మోదీ.. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థలకు మరిన్ని ఆర్థికాధికారాలు!

- ప్రతిపాదించనున్న 15వ ఆర్థిక సంఘం

ఈనాడు, దిల్లీ: గ్రామీణ, నగర ప్రాంత స్థానిక సంస్థలకు మరిన్ని ఆర్థికాధికారాలు ఇవ్వాల్సిందిగా 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేయనుంది. వాటికి మరింత జవాబుదారీతనాన్నీ నిర్ణయించనుంది. 2019 అక్టోబరులో ఆర్థిక సంఘం తన నివేదికను సమర్పించనుంది. ప్రస్తావనాంశాల్లో (టీవోఆర్‌లో) అదనపు ఆర్థికాధికారాల గురించి పేర్కొనకపోయినా... కేంద్రంతో, రాష్ట్రాలతో సంప్రదించిన మీదట విచక్షణ మేరకు ఇలాంటి సిఫార్సులు చేసే స్వేచ్ఛ ఆర్థిక సంఘానికి ఉంది. కేంద్రం-రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీపై వివాదాస్పద అంశాల జోలికి ఆర్థిక సంఘం వెళ్లకపోవచ్చని తెలుస్తోంది. జీఎస్‌టీ పరిధి విస్తరణకు రాష్ట్రాలు చేసే ప్రయత్నాలు, కేంద్ర పథకాలను రాష్ట్రాల్లో అమలు చేస్తున్న తీరు, ప్రజాకర్షక పథకాలపై జరిగే వ్యయాన్ని నియంత్రించడం వంటి అంశాలను తుది నివేదికలో పరిగణనలో తీసుకునే అవకాశాలు లేవు. సంచిత నిధి నుంచి ఇచ్చే గ్రాంట్లకు మార్గదర్శక సూత్రాలను కూడా ఆర్థిక సంఘం రూపొందించనుంది. పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల వనరుల్ని పెంచడానికి రాష్ట్రాలకు అదనంగా ఇవ్వాల్సిన నిధుల కోసం చర్యల్ని ప్రస్తావించనుంది. 15వ ఆర్థిక సంఘం ముందుంచిన ప్రస్తావనాంశాలు తమ రాష్ట్రాలను దెబ్బతీసేవిగా ఉన్నాయంటూ ఆంధ్రప్రదేశ్ సహా ఏడు రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలు ఇదివరకే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సంయుక్తగా లేఖ రాశాయి. 2011 జనాభా లెక్కల్ని పరిగణనలో తీసుకోవడం వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోయి, ఆ దిశగా పనిచేయని ఈశాన్య రాష్ట్రాలు లబ్ధి పొందుతాయని అభ్యంతరం వ్యక్తం చేశాయి. 14వ ఆర్థిక సంఘం వరకు కూడా 1971 జనాభా లెక్కల్నే ప్రాతిపదికగా తీసుకున్నారు. మోదీ సర్కారు లక్ష్యాలు, కేంద్ర పథకాల అమలు, జీఎస్టీ విస్తరణ ప్రాతిపదికన తమ పనితీరును మదింపు చేయవద్దని ఆ రాష్ట్రాలు కోరాయి. దరిమిలా టీవోఆర్ పరిశీలనకు గత నెలలో 15వ ఆర్థిక సంఘం ఒక సలహా మండలిని నియమించింది. 2011 జనాభా లెక్కలను పరిగణనలో తీసుకోవడం వల్ల రాష్ట్రాలకు ఏమైనా నష్టం వాటిల్లితే దానిని తగిన రీతిలో భర్తీ చేయాలని ఆ మండలి పేర్కొన్నట్లు సమాచారం. నిధుల పంపిణీకి 2011 లెక్కలనే పరిగణనలో తీసుకోవాలనీ, జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు ఇతర మార్గాల్లో ప్రోత్సాహకాలు ఇవ్వాలనీ ప్రధాని నరేంద్రమోదీ కూడా ఇటీవల నీతిఆయోగ్ సమావేశంలో చెప్పారు.

టర్కీ అధ్యక్ష పీఠం మళ్లీ ఎర్డోగన్‌దే

ఇస్తాంబుల్: టర్కీ అధ్యక్ష పీఠంపై రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ మరో ఐదేళ్లపాటు కొనసాగనున్నారు. దేశాధ్యక్ష పదవికి ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. ఎర్డోగన్‌కు 52.5 శాతం ఓట్లు వచ్చాయని.. ఆయన ప్రధాన ప్రత్యర్థి ముహర్రెమ్ ఇన్సె(రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ) కేవలం 30.7 శాతం ఓట్లు దక్కించుకున్నారని ప్రభుత్వరంగ వార్తా సంస్థ 'అనడొలు' వెల్లడించింది. మరోవైపు, పార్లమెంటరీ ఎన్నికల్లోనూ ఎర్డోగన్ పార్టీ 'జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ(ఏకేపీ)' సత్తా చాటింది. పార్లమెంటులో మొత్తం 600 స్థానాలకుగాను 293 సీట్లు గెల్చుకుంది. ఏకేపీ మిత్రపక్షం 'నేషనలిస్ట్ మూవ్‌మెంట్ పార్టీ(ఎంహెచ్‌పీ)' 50 స్థానాలు దక్కించుకుంది. దీంతో ఏకేపీ-ఎంహెచ్‌పీ కూటమికి పార్లమెంటులో స్పష్టమైన ఆధిక్యం లభించింది. టర్కీ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన ఎర్డోగన్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ, వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మాద్యురో శుభాకాంక్షలు తెలియజేశారు. 2003 నుంచి 2014 వరకు టర్కీ ప్రధానమంత్రిగా పనిచేసిన ఎర్డోగన్.. అనంతరం దేశాధ్యక్ష పదవి చేపట్టారు.

ముందే 'మహాకూటమి' ఆచరణ సాధ్యం కాదు: పవార్

ముంబయి: 'మహాకూటమి'పై ఎన్సీపీ సారథి శరద్‌పవార్ వైఖరిలో కొత్తమార్పు సంకేతాలు కనిపిస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల కంటే ముందు 'మహాకూటమి' ఏర్పాటు ఆచరణసాధ్యమైన విషయం కానేకాదని ఆయన సోమవారం నాడిక్కడ ఓ టీవీ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం ప్రాంతీయ పార్టీలే ప్రధాన పాత్ర పోషిస్తాయి. మొత్తం మీద చూస్తే రాష్ట్రాల వారీ పరిస్థితే కీలకమౌతుంది. తమిళనాడు వంటి రాష్ట్రాలనే తీసుకుందాం.... డీఎంకె తమిళనాట నంబర్ వన్ పార్టీ కావచ్చు. ఆ పరిణామాన్ని భాజపాయేతర పార్టీలు అక్కడ అంగీకరించి తీరాల్సిందే అని శరద్‌పవార్ వ్యాఖ్యానించారు. ఇక కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్‌ల విషయానికి వస్తే...అక్కడ కాంగ్రెస్ కీలకంగా కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే...తెలుగుదేశం నంబర్ వన్ గా తెలంగాణాలో కేసీఆర్ అత్యంత ప్రధానంగా నిలుస్తారు. ఒడిశాలో నవీన్ పట్నాయక్, పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీలు తిరుగులేని శక్తులని చెప్పవచ్చని శరద్‌పవార్ పేర్కొన్నారు. అంటే..., ఆయా రాష్ట్రాల్లో ఈ నేతలు/ పార్టీలు తమ తమ స్థానాలను సుస్థిరం చేసుకునేందుకు చేసే యత్నాలే ప్రధానమౌతాయి. అయితే, చివరకు ఎన్నికలు పూర్తయిన తర్వాతే మహాకూటమి ఆవిర్భావం దిశగా చురుగ్గా యత్నాలు మొదలయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని శరద్ పవార్ అభిప్రాయపడ్డారు.

రామమందిర నిర్మాణంపై ఓపిక వహించండి: యోగి

లఖ్‌నవూ: అయోధ్యలో రామమందిర నిర్మాణంపై కాస్త ఓపిక పట్టాలని సాధువులకు ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విజ్ఞప్తి చేశారు. అయోధ్యలో సోమవారం నిర్వహించిన సాధువుల సమ్మేళనాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం తప్పకుండా జరుగుతుందని వ్యాఖ్యానించారు. అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం, జామియా మిలియా ఇస్లామియాల్లో దళితులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులు రిజర్వేషన్ ప్రయోజనాలను ఎందుకు పొందకూడదని ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రశ్నించారు. కన్నౌజ్‌లోని ఛిబ్రమౌ ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు.

సీజేఐగా జస్టిస్ గొగొయ్‌కే అవకాశం!

- న్యాయ నిపుణుల అభిప్రాయం

దిల్లీ: సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ రంజన్ గొగొయ్ భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సంప్రదాయాన్ని అనుసరించి ఆయన పేరునే ప్రస్తుత సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్ర సిఫార్సు చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేసుల కేటాయింపులో సీజేఐ తీరుపై జనవరి 12న విలేకరుల సమావేశం నిర్వహించిన నలుగురు న్యాయమూర్తుల్లో జస్టిస్ గొగొయ్ ఒకరు. దీంతో ఆయన పేరును సీజేఐ సిఫార్సు చేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జస్టిస్ మిశ్ర వారసుడి ఎంపికలో ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర లేదని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇటీవల ప్రకటించారు. జస్టిస్ గొగొయ్ మంచి పనితీరును కనపరుస్తూ వస్తున్నారనీ, ఆయన పేరును సిఫార్సు చేయకపోవడమంటే న్యాయవ్యవస్థ స్వతంత్రత విషయంలో రాజీ పడడమే అవుతుందని రాజ్యాంగ నిపుణుడు, సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్ అంటున్నారు. జస్టిస్ గొగొయ్ పేరును సీజేఐ సిఫార్సు చేయకుండా ఉండడం అసాధ్యమని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ చెప్పారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న పద్ధతిని సీజేఐ పాటించకపోతే మాత్రం జస్టిస్ ఎ.కె.సిక్రి పేరును సిఫార్సు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. 1973లో అత్యంత సీనియర్ న్యాయమూర్తుల్ని పక్కనపెట్టి జస్టిస్ ఎ.ఎన్.రేని కేంద్రం సీజేఐగా నియమించింది. దాంతో అప్పట్లో ముగ్గురు న్యాయమూర్తులు రాజీనామాలు చేశారు.

వేల చెట్ల నరికివేత తగునా?

- పర్యవసానాన్ని దిల్లీ భరించగలదా?
- హైకోర్టు సూటి ప్రశ్న

దిల్లీ: ఓ గృహనిర్మాణ పథకం కోసం 16వేల 5 వందల చెట్ల నరికివేత పరిణామాలను దేశ రాజధాని ఎలా భరించగలదని దిల్లీ హైకోర్టు సోమవారం ప్రశ్నించింది. అదే ఏదైనా రోడ్డు వెడల్పు కార్యక్రమం నిమిత్తం చెట్లను నేలకూల్చాల్సి వస్తే...తప్పనిసరి కాబట్టి...ఆ విషయాన్ని అర్థం చేసుకోగలం అంటూ జస్టిస్. వినోద్ గొయెల్, జస్టిస్.రేఖపల్లిలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో 'నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్'(ఎన్‌బీసీసీ) చురుగ్గా స్పందించింది. జులై 4 వరకూ చెట్ల నరికివేత జోలికే వెళ్లకుండా ఉండేందుకు అంగీకరించింది. దక్షిణ దిల్లీలోని ఆరు కాలనీలను తిరిగి అభివృద్ధి పరచే బాధ్యతలను ఎన్‌బీసీసీ స్వీకరించింది. అందులో భాగంగా అక్కడ చెట్లు నరకాల్సిన అవసరం ఏర్పడింది. వాస్తవానికి జులై రెండోతేదీ వరకూ చెట్ల నరికివేత జోలికే వెళ్లవద్దంటూ ఎన్‌బీసీసీని ఇదే ధర్మాసనం కోరింది. అదే సమయంలో జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఇదే తరహా అంశాన్ని విచారణకు చేపట్టనున్న దృష్ట్యా ఎన్‌బీసీసీకి ఈ సూచన చేసింది.

నరోడా పాటియా ఊచకోత కేసు..

ముగ్గురికి పదేళ్ల జైలు

- గుజరాత్ హైకోర్టు తీర్పు

అహ్మదాబాద్: సంచలనాత్మక నరోడా పాటియా ఊచకోత కేసులో ముగ్గురు దోషులకు పదేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ గుజరాత్ హైకోర్టు సోమవారం తీర్పు చెప్పింది. పీజె. రాజ్‌పుట్, ఉమేష్‌భర్వాడ్, రాజ్‌కుమార్ చౌమల్‌లకు శిక్షను ప్రకటిస్తూ...వారు ముగ్గురికీ కూడా పోలీసుల ముందు లొంగిపోవడానికి ఆరువారాల వ్యవధినిస్తున్నట్లు తెలిపింది. 2002 ఫిబ్రవరి 28వ తేదీన ఇక్కడి నరోడా పాటియా ప్రాంతంలో ఓ మూక దారుణరీతిలో ఊచకోతకు పాల్పడింది. నాటి విషాదఘటనలో 97 మందిని ఆ మూక పొట్టనబెట్టుకుంది. మృతుల్లో అత్యధికులు మైనారిటీ వర్గాలకు చెందిన వారే. అంతకుముందురోజే గోధ్రా వద్ద సబర్మతీ ఎక్స్‌ప్రెస్ రైలుకు నిప్పంటించిన ఘోరం చేసుకుంది. నాటి సబర్మతీ రైలు దుర్ఘటన గుజరాత్‌వ్యాప్తంగా అల్లర్లు, హింసాకాండకు దారితీసిన విషయం గమనార్హం. కాగా, నరోడా ఊచకోత కేసులో మొత్తం 61 మందిని నిందితులుగా పేర్కొన్నారు. 2012లో 'సిట్' న్యాయస్థానం వీరిలో 32 మందిని బాధ్యులుగా పరిగణిస్తూ...29 మందిని నిర్దోషులుగా ప్రకటించింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ సినిమాల
తాజా విషయాలు ఎప్పటికప్పుడు
తెలుసుకోవాలనుకుంటున్నారా?
ఆణిముత్యాల్లాంటి అలనాటి
సినిమా విశేషాలు
చూడాలనుకుంటున్నారా?
'సితార.నెట్' చూడండి.
ఆన్‌లైన్‌లో సితార
WWW.SITARA.NET

ఈనాడు
విజయవాడ 27-6-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 318
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

IIFL గోల్డ్ లోన్స్
www.iifl.com
5 నిమిషాల్లో తక్షణ ఆమోదం*
వడ్డీ రేటు ఏడాదికి 12%* నుంచి
కాల్ చేయండి: 09032177838 • మిస్డ్ కాల్: 08030088500

అమ్మో భారత్!

- మహిళలకు అత్యంత ప్రమాదకరం
- అతివల అక్రమ రవాణా, లైంగిక హింస, వెట్టిచాకిరీ ఎక్కువ
- 'థాంప్సన్ రాయిటర్స్ ఫౌండేషన్' సర్వే
- తిరస్కరించిన భారత్

లండన్

మహిళలకు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశంగా భారత్ మారిందని 'థాంప్సన్ రాయిటర్స్ ఫౌండేషన్' నిర్వహించిన సర్వే పేర్కొంది. అఫ్గానిస్థాన్, సిరియా వంటి కల్లోలిత ప్రాంతాల్లో కన్నా ఇక్కడి అతివల పరిస్థితి దారుణంగా ఉందని ఆ నివేదిక తెలిపింది. మహిళలకు ప్రమాదకరంగా ఉన్న మొదటి 10 దేశాల్లో అమెరికా కూడా ఉన్నట్లు వివరించింది.

సర్వేలో ఏం తేలింది?

- ఇందులో మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశంగా భారత్‌ను నిపుణులు ఎంపిక చేశారు.
- మానవ అక్రమ రవాణా, లైంగిక హింస, లైంగిక బానిసత్వం; బలవంతపు పెళ్లిళ్లు, వెట్టి చాకిరీ చేయించడం, రాళ్లతో దాడి, భ్రూణ హత్యలు వంటి సంప్రదాయ, సాంస్కృతిక పోకడల విషయంలోనూ భారత్‌ను అత్యంత ప్రమాదకర దేశంగా అభివర్ణించారు.
- అఫ్గానిస్థాన్, సిరియాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో (మిగతా 6లో)

సర్వే ఎప్పుడు?

ఈ ఏడాది మార్చి 26 నుంచి మే 4 మధ్య.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 548 మంది నిపుణులను ఆన్‌లైన్‌లో, ఫోన్ ద్వారా ప్రశ్నించారు.

నిపుణులెవరు?

సహాయచర్యల నిపుణులు, విద్యావేత్తలు, ఆరోగ్యపరిరక్షణ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, విధాన నిర్ణేతలు, సామాజిక అంశాల వ్యాఖ్యాతలు.

సర్వేలో సంధించిన ప్రశ్నలివీ..

- ఐరాసలో సభ్యత్వం ఉన్న 193 దేశాల్లో ఏ ఐదు దేశాలు మహిళలకు అత్యంత ప్రమాదకరమైనవని?
- మహిళలకు సంబంధించి ఆరోగ్య పరిరక్షణ, ఆర్థిక వనరులు, సాంస్కృతిక, సంప్రదాయ విధానాలు, లైంగిక, లైంగికేతర హింస, వేధింపులు, మానవ అక్రమరవాణావంటి అంశాల్లో అత్యంత గడ్డు పరిస్థితులు కలిగిన దేశమేది?

20 వేల ఉద్యోగాలు

- ఎనిమిది నెలల్లో నోటిఫికేషన్లు జారీ
- కడప ఉక్కు దీక్షకు మద్దతుగా నేడు, రేపు ర్యాలీలు, ధర్నాలు
- 29న కాకినాడలో ధర్మపోరాట దీక్ష
- 30న నెల్లూరులో దళితతేజం విజయోత్సవ సభ
- వచ్చే నెల మొదటి వారంలో 100 అన్న క్యాంటీన్లు
- తెదేపా సమన్వయ కమిటీ నిర్ణయాలు
- మంత్రులు కళా వెంకటరావు, కాలవ శ్రీనివాసులు వెల్లడి

ఈనాడు - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఎనిమిది నెలల్లో సుమారు 20 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోఫికేషన్లు జారీ చేయనుంది. మంగళవారం ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన తెదేపా సమన్వయ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. నిర్ణయాలను మంత్రులు కళా వెంకటరావు, కాలవ శ్రీనివాసులు విలేఖరులకు తెలియజేశారు. ''ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని సాధించేందుకు తెదేపా ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి చేస్తున్న దీక్షకు మద్దతుగా బుధ, గురువారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తాం. విభజన చట్టంలోని అంశాలు, ప్రత్యేక హోదా సహా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధన కోసం చేస్తున్న ధర్మపోరాట దీక్షలో భాగంగా తదుపరి సభను ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడలో నిర్వహిస్తున్నాం. దళితతేజం-తెలుగుదేశం విజయోత్సవ సభ ఈ నెల 30న నెల్లూరులో ఉంటుంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో పాటు రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి ఈ సభకు ప్రతినిధులు హాజరవుతారు'' అని వారు వివరించారు.

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చడంపై త్వరలో కమిటీ: మత్స్యకారులను ఎస్టీల్లోను; వడ్డెర, రజక కులాలను ఎస్సీల్లోను చేర్చడానికి (మిగతా 6లో)

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

- నెలపై పనిచేయండి
- తెదేపా సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- పవన్‌తో మర్యాదపూర్వక పలకరింపే
- ఎవరైనా విమర్శిస్తే గట్టిగా తిప్పికొట్టండి
- కన్నా వంటి వాళ్లు రాష్ట్రానికి చేటు
- భాజపా, వైకాపా, జనసేన లాలూచీని ఎండగట్టాలి

3లో

అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జరిగిన ఒప్పందంపై సంతకాలు చేస్తున్న ఫ్లెక్స్‌ట్రానిక్స్ ప్రెసిడెంట్ ఫ్రాన్ కోయిన్ బార్బియర్, ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్

పెట్టుబడుల ఆకర్షణ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

- ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడతాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- రూ.585 కోట్లతో తిరుపతిలో యూనిట్ ఏర్పాటుకు ఫ్లెక్స్ అవగాహన ఒప్పందం
- ఆగస్టు 15న తాత్కాలికంగా శ్రీసిటీ నుంచి ఉత్పత్తి ప్రారంభం: లోకేష్

6లో

మంత్రులైనా సరే.. మోదీకి చేరువగా రాలేరు

- ప్రధానిని కలవాలంటే భద్రతా సిబ్బంది అనుమతివ్వాల్సిందే
- మోదీకి ముప్పు నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం
- రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ కొత్త మార్గదర్శకాలు

దిల్లీ: ప్రధాని మోదీకి అత్యంత ఎక్కువ ముప్పు ఉన్న నేపథ్యంలో భద్రతను పూర్తిస్థాయిలో కట్టుదిట్టం చేస్తూ కేంద్ర హోంశాఖ రాష్ట్రాలకు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రధాని ప్రత్యేక భద్రత (ఎస్‌పీజీ) అధికారుల అనుమతి లేనిదే.. చివరకు మంత్రులు, అధికారులు సైతం ఆయనకు సమీపంలోకి వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధానికి 'గుర్తు తెలియని' ముప్పు ఉందని.. ఆయనను 'అత్యంత విలువైన లక్ష్యం'గా చేసుకునే ప్రమాదం ఉందని పేర్కొంది. ఎన్నికల ప్రచారం తదితర సందర్భాల్లో రోడ్డు షోలకు దూరంగా ఉండాల్సిందిగా ప్రధానికి ఎస్పీజీ సూచించినట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. అలాగే ముప్పుపై అంచనాలను వివరిస్తూ.. ప్రధాని సామీప్య రక్షణ బృందాని(సీపీటీ)కి కూడా కొత్త నిబంధనలను హోంశాఖ వివరించింది. అవసరమైతే (మిగతా 6లో)

కల్తీ రాయుళ్లపై ఉక్కుపాదం

- ఆహార కల్తీకి పాల్పడితే జీవితఖైదు!
- అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే రెండేళ్ల జైలు
- ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ సిఫార్సులు

6లో

ఝార్ఖండ్‌లో పేలిన మందుపాతర ఆరుగురు జవాన్లు మృతి

మావోయిస్టుల దుశ్చర్య

16లో

75 శాతం పీఎఫ్ ఉపసంహరించుకోవచ్చు

- నెలరోజులు ఉద్యోగం లేనివారికి వెసులుబాటు
- 2 నెలలైతే మిగతా 25% తీసేయవచ్చు
- ఈపీఎఫ్‌వో సీబీటీ సమావేశంలో నిర్ణయం
- రూ.లక్ష కోట్లు దాటనున్న ఈటీఎఫ్ పెట్టుబడులు: గాంగ్వర్

దిల్లీ: ఉద్యోగం లేకుండా నెల కంటే ఎక్కువ రోజులు గడిచిపోయినట్లయితే చందాదారులు తమ భవిష్య నిధి (పీఎఫ్) నిల్వల నుంచి 75 శాతాన్ని అడ్వాన్సు రూపంలో ఉపసంహరించుకునేందుకు ఇకపై వీలుంటుంది. ఒకవేళ రెండు నెలల పాటు ఎలాంటి ఉద్యోగం లేనట్లయితే అప్పుడు మిగిలిన 25 శాతాన్నీ తీసేసుకుని, ఖాతాను శాశ్వతంగా పరిష్కరించుకోవచ్చు. కొత్త నిబంధనల కింద ఇలాంటి ఐచ్ఛికాన్ని చందాదారులకు ఇవ్వాలని మంగళవారం జరిగిన 'ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ' (ఈపీఎఫ్‌వో) కేంద్ర ధర్మకర్తల మండలి (సీబీటీ) సమావేశం కీలక నిర్ణయం తీసుకొంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉద్యోగం లేని చందాదారులు రెండు నెలల తర్వాతే తమ పీఎఫ్‌ను పూర్తిగా ఒకేసారి పొందడానికి వీలుంది. దీనిని ఒక నెలకు తగ్గించడం వల్ల సభ్యులు తమ ఖాతాను ఈపీఎఫ్‌వోలో కొన్నాళ్లు కొనసాగించుకోవచ్చు. మళ్లీ ఉద్యోగం దొరకగానే దానిని పీఎఫ్ జమల కోసం వాడుకోవచ్చు. ఉద్యోగం లేనప్పుడు 60% నిధుల్ని ఉపసంహరించుకోవచ్చని ప్రతిపాదించినా సీబీటీ మాత్రం దీనిని 75 శాతానికి పెంచింది. సమావేశానంతరం సీబీటీ ఛైర్మన్, కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ గాంగ్వర్ విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మే నెలాఖరు వరకు ఈటీఎఫ్‌లలో రూ.47,431 కోట్లను పెట్టుబడిగా పెట్టామనీ, దానిపై 16.07% ప్రతిఫలం లభిస్తోందనీ చెప్పారు. త్వరలోనే ఈ పెట్టుబడులు రూ.లక్ష కోట్లు దాటుతాయని తెలిపారు. ఈపీఎఫ్‌వో నిధుల్ని ఎక్స్ఛేంజి ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్)గా నిర్వహిస్తున్న ఎస్‌బీఐ, యూటీఐ మ్యూచువల్ ఫండ్ల సేవల్ని ఏడాది పాటు, అంటే 2019 జులై (మిగతా 6లో)

ప్రయాణ నిషేధం సబబే

- వలసలను నియంత్రించే అధికారం అధ్యక్షులకు ఉంటుంది
- 5-4 తేడాతో అమెరికా సుప్రీంకోర్టు తీర్పు
- ముస్లిం దేశాల నుంచి ప్రవేశాలను అడ్డుకుంటూ ట్రంప్ ఇచ్చిన ఉత్తర్వుకు సమర్థన

14లో

ఆర్.పి.ఠాకూర్

కొత్త డీజీపీ ఎంపికపై కసరత్తు!

- గౌతమ్ సవాంగ్, ఆర్.పి.ఠాకూర్‌లలో ఒకరికి అవకాశం?
- నేడో, రేపో పూర్తి స్పష్టత..

6లో

గౌతం సవాంగ్

ఇదీ సంగతి!



కట్నం డబ్బులు ఇస్తేనే అమ్మాయిని తీసుకెళ్తాడట.

కోట్లు ధారబోసినా అంతే!

- వైకుంఠపురం బ్యారేజీకి సమగ్ర ఆకృతులు ఇవ్వని వ్యాప్కోస్
- భూముల వివరాలూ తప్పులతడక
- టెండర్ల ప్రక్రియ మరింత ఆలస్యం

వైకుంఠపురం బ్యారేజీ నిర్మించబోయేది ఈ ప్రాంతానికి సమీపంలోనే

ఈనాడు - అమరావతి

కొత్త ప్రాజెక్టుల నివేదికలకు జల వనరులశాఖ రూ.కోట్లు వెచ్చిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. పెద్ద మొత్తంలో నిధులు పొందుతున్న ఏజెన్సీలు ఆ తర్వాత పూర్తి స్థాయి జవాబుదారీతనంగా ఉండటం లేదు. జల వనరుల శాఖ ఇంజినీర్లు, అధికారులు మళ్లీ ఆ పని చేసుకోవాల్సి వస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాజెక్టులకు నివేదికలను రూపొందించే బాధ్యతలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వ్యాప్కోస్ తీసుకుంది. గోదావరి పెన్నా అనుసంధానం తోపాటు వైకుంఠపురం బ్యారేజీకి సంబంధించిన డీపీఆర్ బాధ్యతలను ఆ సంస్థకే అప్పగించారు. దాదాపు రూ.2 కోట్ల విలువైన వైకుంఠపురం నివేదిక బాధ్యతను టెండర్లు పిలవకుండానే ఇచ్చారు. పూర్తి స్థాయి ప్రాజెక్టు నివేదికను రూపొందించిన తర్వాత తాజాగా ప్రభుత్వం దీని నిర్మాణానికి పాలనా మోదం ఇచ్చింది. రూ.2169 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతిస్తూ (మిగతా 6లో)

చిన్న పరిశ్రమలకు పెద్ద ప్రోత్సాహం!

- 15 రోజుల్లో అందుబాటులోకి 30 ఎంఎస్ఎంఈ పార్కులు
- ఏపీఎస్ఎఫ్‌సీ ఆధ్వర్యంలో యువ పారిశ్రామిక పథకం
- రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల రుణ సాయం

ఈనాడు - అమరావతి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పెట్టుబడుదారుల(ఎంఎస్ఎంఈ)లను పెద్దఎత్తున ప్రోత్సహించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. సకల సదుపాయాలతో అందుబాటు ధరల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం స్థలాలు కేటాయించే ఎంఎస్ఎంఈ పార్కులు మరో 15 రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. మొదటి విడతగా 13 జిల్లాల్లో 30 పార్కులు ప్రారంభించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రెండో దశలో రెవెన్యూ డివిజన్‌కొకటి ఏర్పాటు చేయనున్నారు. వీటిలో పరిశ్రమలు పెట్టే ఔత్సాహికులకు యువ పారిశ్రామిక పథకం(వైఈఎస్) కింద రాష్ట్ర ఆర్థిక సంస్థ(ఏపీఎస్ఎఫ్‌సీ) రూ.25 లక్షల వరకూ రుణం అందించనుంది. ఇందుకోసం నిబంధనలు కొన్నింటిని సడలించారు.

- పారిశ్రామిక రంగంలో అనేక ప్రోత్సాహకాలు అందిస్తూ విదేశీ పెట్టుబడులను, దేశీయంగా ప్రఖ్యాత సంస్థలను ఆకర్షిస్తున్న ప్రభుత్వం ఇపుడు రాష్ట్రంలోని ఔత్సాహిక యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసింది. 40 ఏళ్ల లోపు యువ పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలన్న ప్రభుత్వ ఆదేశాలపై ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(ఏపీఐఐసీ) 13 జిల్లాల్లో ప్రభుత్వ భూములను సమీకరించి ఎంఎస్ఎంఈ పార్కులు సిద్ధం చేస్తోంది. 25 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఒక్కో పార్కులో కనిష్ఠంగా 50, గరిష్ఠంగా 150 మందికి ప్లాట్లు కేటాయించనున్నారు. ధర (మిగతా 6లో)

CA

ధర జారిన మధుర ఫలం

- మామిడికి సిండికేట్ దెబ్బ
- ఒక్కసారిగా పతనమైన ధరలు
- కిలోకు రూ.6 అంటున్న గుజ్జు పరిశ్రమలు
- గిట్టుబాటు ధర కోసం చిత్తూరు రైతుల గగ్గోలు

ఈనాడు డిజిటల్ - చిత్తూరు

రాష్ట్రంలో చిత్తూరు జిల్లా మామిడికి ప్రసిద్ధి. ఇక్కడి రైతులు దాదాపు 2.5 లక్షల ఎకరాల్లో మామిడిని సాగు చేస్తున్నారు. అందులో 55-60 శాతం వరకు తోతాపురి రకానికి చెందినవే. దేశవ్యాప్తంగా మార్కెట్ సీజన్ ముగిసినా.. వాతావరణ పరిస్థితుల కారణంగా చిత్తూరు జిల్లాలో సీజన్ ఆలస్యంగా మొదలైంది. దిగుబడి బాగా పడిపోయి.. సాధారణంతో పోల్చితే 25శాతం కూడా రాలేదు. ఇలాంటి సమయంలో మామిడికి మంచి ధర లభించాలి. అయినా మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులు, వ్యాపారస్థుల సిండికేట్ దెబ్బకు ఇక్కడి ధరలు భారీగా పతనమయ్యాయి. తమకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు ఇటీవల పెద్దఎత్తున నిరసన తెలిపారు. జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథరెడ్డి, కలెక్టర్ ప్రద్యుమ్నతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద తమ సమస్యను మొర పెట్టుకుంటున్నారు. వారంతా పరిష్కార మార్గం చూపుతామంటున్నా ఫలితం కన్పించడం లేదు.

చిత్తూరు మార్కెట్ యార్డులో తోతాపురి రకం మామిడి ★ గిట్టుబాటు ధరల కోసం ఇటీవల చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ధరల పతనానికి కారణాలు

★ చిత్తూరు జిల్లాలో మామిడి సాగు ఎక్కువగా ఉండడంతో గుజ్జు పరిశ్రమలూ అధికంగానే ఉన్నాయి. దాదాపు 54 పరిశ్రమలుంటే ఒకటి రెండు మినహా మిగతావన్నీ సిండికేటుగా మారి ధరల్ని తగ్గించేస్తున్నాయి.

★ ఈ పరిశ్రమల యజమానులు ప్రతి వారం ఒక చోట సమావేశమై ధరల నిర్ణయంపై తమ వ్యూహాన్ని నిర్దేశించుకుంటున్నారు.

★ జిల్లాలో సీజన్ ఆలస్యంగా ప్రారంభవ్వడంతో. . గుజ్జు పరిశ్రమలు ఇతర ప్రాంతాల నుంచి సరకును దిగమతి చేసుకున్నాయి. ప్రస్తుతం వారికి స్థానిక మామిడి అంత డిమాండ్ ఉన్న సరకుగా కన్పించడం లేదు.

★ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని శ్రీనివాసపురం, కృష్ణగిరి ప్రాంతాల్లో ఇక్కడి కంటే తక్కువ ధరకే మామిడి కాయలు లభిస్తున్నాయి. కిలోకు రూపాయి తగ్గినా.. పరిశ్రమలు అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి.

★ గత పదేళ్లుగా దేశవ్యాప్తంగా ఎంఐడీహెచ్ (మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్).. వంటి కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. వీటి ద్వారా అన్ని రకాలుగా రాయితీలను అందించి, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. దీంతో అన్ని రాష్ట్రాల్లోనూ సాగు పెరుగుతోంది.

★ మామిడి రసాల తయారీ పరిశ్రమల నుంచి భారీ ఎత్తున తమకు గుజ్జుకోసం ఆర్డర్లు రావడం లేదనేది గుజ్జు పరిశ్రమల వాదన.

పరిష్కార మార్గాలు

★ జిల్లాలో ఉన్నవన్నీ ప్రైవేటు గుజ్జు పరిశ్రమలే. ఒక్కటీ ప్రభుత్వ పరిశ్రమ లేదు. ప్రభుత్వం గుజ్జు పరిశ్రమలు ఏర్పాటు చేస్తే.. ప్రైవేటు వారిలో పోటీ పెరుగుతుంది. గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుంది. మామిడికి కనీస మద్దతు ధర కల్పించాలి. ★ ధరలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు కూడా సాగు ఖర్చు తగ్గించుకుని, దిగుబడి పెరిగే విధానాలను అనుసరించాలి. ఆ దిశగా శాస్త్రీయంగా సలహాలిచ్చే యంత్రాంగం లేదు.

★ స్థానిక పరిస్థితులను బట్టి చిత్తూరు, కృష్ణా జిల్లాలకు మామిడి బోర్డును ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో ఉంది. ధరల స్థిరీకరణపై ఈ బోర్డుకు అధికారాలివ్వాలి.

★ తిరుమలకు నిత్యం లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. తితిదే వీరందరికీ ఉచితంగా మామిడి జ్యూస్‌ను అందించగలిగితే.. గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది. ★ ప్రస్తుతం ధర రూ.6కు పడిపోయింది. ★ జిల్లాలో సీజన్ ఇంకా నెల రోజులు ఉంటుందని అంచనా.

మూడేళ్లలో తోతాపురి రకం ధరల తీరు (కిలో రూ.లో)

సంవత్సరం	ప్రారంభంలో ధర	గరిష్ఠ ధర
2016	8	16
2017	10	17
2018	9	10

★ ఈ లెక్కన ధర మరింత పతనమవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్ హయాంలోనే రైతుల ఆత్మహత్యలు ఎక్కువ

- ప్రశాంతంగా ఉన్న జిల్లాల్లో అలజడి రేపుతున్న జగన్
- ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైఎస్ పాలనలోనే రైతుల ఆత్మహత్యలు అధికంగా చోటుచేసుకున్నాయని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. ధర్మపోరాట సభ జరగనున్న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని జేఎన్‌టీయూ ప్రాంగణంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తెదేపా హయాంలో కోనసీమలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, రైతులకు చేసిందేమీ లేదంటూ పాదయాత్రలో జగన్ అవాస్తవాలు పలుకుతున్నారన్నారు. 'నీ తండ్రి వైఎస్ హయాంలోనే గిట్టుబాటు ధరలేక కోనసీమలో పంట విరామం ప్రకటించారని' జగన్‌ను ఉద్దేశించి అన్నారు. ఇందుకు కోనసీమ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ప్రశాంతంగా ఉన్న జిల్లాల్లో వైకాపా అధ్యక్షుడు ప్రవేశించి తప్పుడు ప్రచారంతో అలజడి రేపుతున్నారని ధ్వజమెత్తారు. కాపులను ప్రభుత్వం రౌడీలుగా చిత్రీకరిస్తోందని జగన్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. కాపులకు బీసీ రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశామని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని తెలిపారు. గత నాలుగేళ్లలో ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే కాపు కార్పొరేషన్ ద్వారా రూ.500 కోట్ల రుణాలను అందించామన్నారు. తుని అల్లర్ల వెనక వైకాపా నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. ఎస్సీలకు సంబంధించిన రూ.6 వేల కోట్ల ఉప ప్రణాళిక నిధులను హుస్సేన్ సాగర్ అభివృద్ధికి వైఎస్ రాజశేఖరరెడ్డి ఖర్చుచేశారని ఆరోపించారు.

ఆదరణ నిబంధనల్లో మార్పు

గతంలో కార్పొరేషన్ రుణం తీసుకున్నా అర్హులే

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆదరణ పథకం నిబంధనల్లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తెచ్చింది. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొన్ని నిబంధనలను సడలించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద లబ్ధిపొందే వారు రాబోయే మూడేళ్లలో బీసీ కార్పొరేషన్ ఇచ్చే రుణాలకు అనర్హులయ్యేవారు. కొత్త నిబంధన ప్రకారం రాబోయే ఆర్థిక సంవత్సరానికి మాత్రమే అనర్హులు. ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.30 వేల విలువైన యూనిట్‌ను అందిస్తున్నారు. ఇందులో లబ్ధిదారు వాటా రూ.3వేలు(10 శాతం). తాజా ఉత్తర్వుల ప్రకారం రూ.40 వేల విలువైన యూనిట్‌ను అందిస్తారు. రూ.13 వేలను లబ్ధిదారు భరించాలి. గతంలో బీసీ కార్పొరేషన్ నుంచి స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కోసం ఆర్థిక సాయం పొందిన వారు సైతం ఇప్పుడు ఆదరణ పథకానికి అర్హులే. ఒక విభాగంలోని యూనిట్‌ను ఆయా వర్గాలకు చెందిన లబ్ధిదారు ఒక్కటి మాత్రమే ఎంచుకోవాలి. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి.ఉదయలక్ష్మి మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.16 కోట్లు... 13 భవనాలు

- నేడు విజయవాడ, గుంటూరు ఏసీబీ భవనాల్ని ప్రారంభించనున్న సీఎం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఏసీబీకి సొంత భవనాలు సమకూరాయి. గతేడాది ఆగస్టు 14 ఈ నెల 18 మధ్య 11 భవనాల నిర్మాణం పూర్తయ్యి ప్రారంభం కాగా.. రాజధాని ప్రాంతంలోని విజయవాడ, గుంటూరుల్లోని ఏసీబీ రేంజి కార్యాలయాల భవనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించనున్నారు. వెలగపూడి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రం నుంచి వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా ఈ రెండు భవనాలను ఏకకాలంలో ప్రారంభించి ప్రసంగిస్తారు. రెండేళ్ల కిందట వరకూ రాష్ట్రంలోని ఏసీబీ రేంజి కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే సాగేవి. ఈ నేపథ్యంలో వాటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా రూ.16 కోట్లు మంజూరు చేసింది. దీంతో మొత్తం 13 భవనాల నిర్మాణాన్ని రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేశారు.

విజయవాడలో ప్రారంభానికి సిద్ధమైన ఏసీబీ రేంజి కార్యాలయం

ఇప్పటివరకూ నిర్మించిన ఏసీబీ రేంజి భవనాల్లో విజయవాడ రేంజి భవనమే అతి పెద్దది. దీని తర్వాత స్థానం గుంటూరు రేంజి భవనానిది. ఈ రెండు భవనాల నిర్మిత ప్రాంతం వరుసగా 6976 చదరపు అడుగులు, 6628 చదరపు అడుగులు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రెండేళ్ల వ్యవధిలో ఏసీబీకి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించుకోగలిగామని ఏసీబీ డీజీపీ ఆర్.పి.ఠాకూర్ ఒక ప్రకటనలో తెలిపారు.

త్వరలో 'వ్యవసాయ' దరఖాస్తులకు పరిష్కారం

- విద్యుత్తు బిల్లులోనే రాయితీ తెలిసేలా చర్యలు: మంత్రి కళా

ఈనాడు డిజిటల్, అమరావతి: వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించి ఆగిపోయిన దరఖాస్తులన్నింటినీ సెప్టెంబర్ చివరికల్లా పరిష్కరించాలని మంత్రి కళా వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో మంత్రి వెంకట్రావు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్పీడీసీఎల్ పరిధిలో ఇప్పటి వరకు 40 వేల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చారని, మిగతా 61,378 కనెక్షన్లను ఇచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇటీవల సీఎం చంద్రబాబు మరో 40వేల అదనపు కనెక్షన్లు మంజూరు చేశారన్నారు. దరఖాస్తు చేసుకునే ప్రతి రైతును ప్రోత్సహించాలని, ఎక్కడా ఫిర్యాదుకు ఆస్కారం ఉండరాదని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వం ఇస్తున్న 75 యూనిట్ల రాయితీ గురించి బిల్లులోనే వెల్లడించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ జలసిరికి పెద్దపీట వేయాలని, విద్యుత్తు సరఫరాలో అంతరాయాలను ఎప్పటికప్పుడు వినియోగదారులకు తెలిసేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వేసవిని మరిపించేలా ప్రస్తుతం విద్యుత్తు వినియోగం భారీగా పెరిగినా, దాన్ని తట్టుకునేలా చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ మంత్రి దృష్టికి తెచ్చారు. రెవెన్యూ వసూళ్లు 97 శాతం పెంచినట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ నాయక్ మంత్రికి తెలిపారు.

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న 7 గ్రహాలు

విజయవాడ, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న భాజపా నేతలు దానిని నిరూపించగలరా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న సవాల్ విసిరారు. వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, భాజపా నేతలు కన్నా లక్ష్మీనారాయణ, పురందేశ్వరి, సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావులు ఏడు గ్రహాల మాదిరిగా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కడప ఉక్కు కర్మాగారం విషయాన్ని పట్టించుకోని భాజపా మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పవన్‌కల్యాణ్ రాజకీయాలు భాజపా వాళ్ల యాక్షన్ అంటే యాత్రకు బయలుదేరడం, పేకప్ అంటే హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవడంలా ఉందని వ్యాఖ్యానించారు.

జర్నలిస్టుల గృహ నిర్మాణానికి వచ్చే మంత్రివర్గంలో ఆమోదం

మంత్రి కాలవ శ్రీనివాసులు

ఈనాడు డిజిటల్, అమరావతి: జర్నలిస్టుల గృహ నిర్మాణ పథకానికి జులైలో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపనున్నట్లు సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం ఏపీయూడబ్ల్యూజే నాయకులు మంత్రిని కలిసి గృహ నిర్మాణం పథకంపై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కాలవ మాట్లాడుతూ పథకం అర్హత సాధించడానికి అక్రిడేషన్ ఉండాలని చెప్పారు. అక్రిడేషన్ లేని వారి విషయంలో ఆలోచిస్తున్నామన్నారు. అమరావతితో సంబంధం లేకుండా మండల, జిల్లా కేంద్రాల్లో పని చేసే వారికి ప్రత్యేకంగా జీవోను జారీ చేస్తామని మంత్రి వివరించారు.

బాబు గోగినేనిపై కేసు నమోదు

మాదాపూర్, న్యూస్‌టుడే: హేతువాది బాబు గోగినేనిపై మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీవీఛానళ్లు, సోషల్ మీడియాలో విమర్శలు చేస్తుండటంతో పాటు తన సమావేశాలకు వచ్చిన జనం నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఆధార్‌కార్డు నెంబర్లను సేకరిస్తున్నారని అతనిపై మాదాపూర్‌కు చెందిన వ్యాపారవేత్త వీరనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి అదనపు ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ వివరాలు తెలిపారు. హేతువాది, మానవతావాదిగా చెప్పుకొంటున్న రాజాజీ రామనాథ బాబుగోగినేని ఇటీవల వైజాగ్, హైదరాబాద్, బెంగళూరుల్లో నిర్వహించిన నేషనల్ డే ఆఫ్ హ్యూమనిజం, హ్యూమనిస్టు గెట్‌టుగెదర్ సమావేశాలకు వచ్చిన వారి ఆధార్‌కార్డు నెంబర్లు సేకరించాడు. ఇది ప్రభుత్వం యుఐడీఏఐ నిబంధనలకు విరుద్ధమని, బాబు గోగినేనిపై చర్యలు తీసుకోవాలని వీరనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం మాదాపూర్ పోలీసులు బాబుగోగినేనిపై వివిధ సెక్షన్ల కింద మంగళవారం కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరేళ్ల బాలుడిపై లైంగిక దాడి

నెల్లూరు (వీఆర్సీ సెంటరు), న్యూస్‌టుడే: ఆడుకుందాం రమ్మని పిలిచి ఓ ఆరేళ్ల బాలుడిపై అఘాయిత్యం చేశారు ఇద్దరు బాలురు. సుమారు రెండు నెలలపాటు జరిగిన లైంగిక దాడితో భయకంపితుడైన ఆ బాలుడు కనీసం ఇంట్లోనూ ఎవరికీ ఆ విషయం చెప్పలేకపోయాడు. ఇంట్లో విచిత్రంగా ప్రవర్తించడాన్ని గమనించిన తండ్రి నెమ్మదిగా అడగడంతో చివరకు అసలు విషయం చెప్పి బోరుమన్నాడు. తనపై జరిగిన అకృత్యాన్ని ఆ బాలుడు చెబుతుండగా వీడియో తీసిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ బాలురిద్దరినీ మంగళవారం అదుపులోకి తీసుకుని జువైనల్ హోంకు తరలించారు పోలీసులు. నెల్లూరులో ఈ సంఘటన చోటుచేసుకుంది.

నెల్లూరులోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఓ కుటుంబం నివాసముంటోంది. వారికి ఆరేళ్ల బాలుడు (రెండో తరగతి) ఉన్నాడు. తల్లిదండ్రులు పనులకు బయటకు వెళ్లినప్పుడు బాలుడు ఒక్కడే ఇంట్లో ఉండేవాడు. ఆ ఇంటి సమీపంలోనే ఉండే ఇద్దరు అన్నదమ్ములు (మైనర్లు) ఈ విషయాన్ని గమనించారు. బాలుడితో సన్నిహితంగా ఉంటూ కూల్‌డ్రింక్స్, చాక్లెట్లు ఇచ్చి మచ్చిక చేసుకున్నారు. బాలుడిపై లైంగిక దాడి చేశారు. ఈ విషయం బయటకు చెప్పకుండా భయపెట్టారు. ఈ క్రమంలో ఆ బాలుడి ప్రవర్తనలో మార్పు వచ్చి ఇంట్లో వస్తువులు పగులగొట్టడం ప్రారంభించాడు. ఇది గమనించిన తండ్రి ఏం జరిగిందని ఆరా తీశాడు. దీంతో అసలు విషయం బయట పడింది.

ఆరో ర్యాంకు.. మీ శ్రమ ఫలితమే

2018 స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో తిరుపతి నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో ఆరో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. 50 డివిజన్లలోని 50 మంది పారిశుద్ధ్య కార్మికులను జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందించారు. - ఈనాడు, తిరుపతి

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కోసం కృషి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటు చేసే దిశగా వామపక్షాలు, జనసేన, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ పార్టీలు కలిసి పని చేస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేలా నూతన రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేసేందుకు సీపీఐ, సీపీఎం పార్టీలు కంకణం కట్టుకున్నాయన్నారు. అందులో భాగంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు సమక్షంలో విజయవాడలో రాష్ట్ర రాజకీయ సదస్సు జరిపి రాజకీయ తీర్మానం చేశామన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో వామపక్షాలు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో సమావేశమై రాష్ట్ర రాజకీయ పరిస్థితుల గురించి చర్చించినట్లు తెలిపారు. ఉద్యమాలు, ఎన్నికల్లో.. వామపక్షాలు, జనసేన పార్టీలు కలిసి ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.



జీటీఎస్ తొలగింపుతోనే సమస్య

- మళ్లీ ఏర్పాటుతో తేలనున్న సరిహద్దు
- సర్వే జనరల్ ఇండియా ముందు ఏపీ వాదనలు
- మళ్లీ వచ్చే నెల 23, 24న మరోసారి భేటీ

ఈనాడు, అనంతపురం: ఆంధ్రప్రదేశ్- కర్ణాటక సరిహద్దులోని బళ్లారి రక్షిత అటవీ ప్రాంతంలో సరిహద్దు వివాదానికి గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ స్టేషన్ (జీటీఎస్) తొలగింపే ప్రధాన కారణమని, దీనివల్లే సమస్య ఉత్పన్నమవుతోందని సర్వే జనరల్ ఆఫ్ ఇండియా అధికారులకు ఆంధ్రప్రదేశ్ అధికారుల బృందం వివరించింది. డెహ్రాడూన్‌లోని సర్వే జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో రెండో రోజైన మంగళవారం ఏపీ, కర్ణాటక రాష్ట్రాల అధికారుల బృందాలు ప్రజెంటేషన్ ఇచ్చాయి. తొలుత కర్ణాటక అధికారులు, తర్వాత ఏపీ అధికారులు సరిహద్దు పాయింట్లకు సంబంధించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీ అధికారులు జీటీఎస్ తొలగింపుపై ప్రధానంగా మాట్లాడారు. జీటీఎస్ ఉండి ఉంటే సరిహద్దు ఏమిటనేది స్పష్టంగా తెలిసేదని వివరించారు. గతంలో ఓసారి జీటీఎస్‌ను తొలగించారని, మళ్లీ ఏర్పాటు చేసినా మరోసారి 2008లో ధ్వంసం చేశారని, దీనికి అతి సమీపంలో ఉండే సుంకులమ్మ ఆలయాన్ని అక్కడి నుంచి తొలగించారని పేర్కొన్నారు. మళ్లీ జీటీఎస్‌ను అదే స్థానంలో ఏర్పాటు చేస్తే సరిహద్దు పాయింట్లు దాదాపు కొలిక్కి వస్తాయని ఏపీ అధికారులు గట్టిగా చెప్పారు. ఈ మేరకు ఓ లేఖను సర్వే జనరల్ ఆఫ్ ఇండియా అధికారులకు అందజేశారు. దీంతో వారు జీటీఎస్ ఏర్పాటుకు సమ్మతించినట్లు తెలిసింది. మరోవైపు అనంతపురం జిల్లా పరిధిలోని మూడు రెవెన్యూ గ్రామాలు, అటు కర్ణాటకలోని బళ్లారి పరిధిలోని ఆరు రెవెన్యూ గ్రామాల్లో గుర్తించిన పాయింట్లలో కొన్నింటిని ఏపీ అధికారులు ఆమోదించారు. 2014లో సర్వే చేసి, గుర్తించిన 179 పాయింట్లలో 55 పాయింట్లను, ఇటీవల చేసిన సర్వేలో గుర్తించిన 51 పాయింట్లలో 22 పాయింట్లకు ఏపీ అధికారులు ఆమోదం తెలిపినట్లు సమాచారం. వీటన్నింటిపై మరోసారి వచ్చే 23, 24 తేదీల్లో డెహ్రాడూన్‌లోనే ఇరు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని సర్వే జనరల్ ఆఫ్ ఇండియా అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది.

సర్వే జనరల్ ఆఫ్ ఇండియా అధికారికి వివరాలు వెల్లడిస్తున్న అటవీ శాఖాధికారులు

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలపై కసరత్తు ప్రారంభం

ఈనాడు, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించి కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా జులై నాలుగో తేదీన కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆర్టీసీలోని కార్మిక సంఘాల నాయకులతో తొలి సమావేశం జరగనుంది. ఈ మేరకు ఆయా కార్మిక సంఘాలకు మంగళవారం ఆహ్వానాలు అందాయి. ఆర్టీసీలో ప్రతి రెండేళ్లకోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతుంటాయి. చివరిసారి 2016 ఫిబ్రవరి 18న ఎన్నికలు జరగ్గా నేషనల్ మజ్దూర్ యూనియన్ విజయం సాధించింది. ఆ సంఘం పదవీకాలం ఈ ఏడాది మార్చితో ముగిసింది. ఈ నేపథ్యంలో కొత్తగా గుర్తింపు సంఘం కోసం ఆగస్టులో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది.

కోల్‌కతా వెళ్లిన ఏపీపీఎస్సీ సభ్యులు

ఈనాడు, అమరావతి: పశ్చిమబెంగాల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యకలాపాలను తెలుసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు కోల్‌కతా వెళ్లారు. ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్ నేతృత్వంలో సభ్యులందరూ అక్కడికి మంగళవారం వెళ్లారు. రెండురోజులు అక్కడే ఉండి శుక్రవారం తిరిగి రానున్నారు. కిందటేడాది ఇలాగే కేరళ కమిషన్ పనితీరును వారు అధ్యయనం చేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల ఎంపిక జాబితా విడుదల

ఈనాడు, అమరావతి: ఏపీజెన్‌కోలో జూనియర్ గణాంక అధికారులు, జూనియర్ అసిస్టెంట్ల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి 2017 నవంబరు 10న జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను ఏపీజెన్‌కో వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఇంధన శాఖ ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు www.apgenco.cgg.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు చూసుకోవాలని కోరింది.

పెట్టుబడి రాయితీ విడుదలకు చర్యలు

- వ్యవసాయాధికారులతో సమీక్షలో మంత్రి సోమిరెడ్డి

ఈనాడు, అమరావతి: రైతులకు పెట్టుబడి రాయితీ విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 3.76లక్షల మంది రైతులకు రూ.278.41కోట్ల మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఖరీఫ్ వాతావరణ పరిస్థితులు, పంటల సాగు, ప్రణాళికపై వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, కమిషనర్ మురళీధర్‌రెడ్డి, ఏపీ సీడ్స్ ఎండీ బాలకృష్ణతో ఆయన సచివాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఇప్పటిదాకా 2.58లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని అధికారులు వివరించారు. జూన్‌లో తక్కువ వర్షం కురుస్తుందని, జులైలో సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందని వారు తెలిపారు. 30 ఏళ్ల వర్షపాతం లెక్కలు విశ్లేషించి గ్రామాలవారీగా వేయాల్సిన పంటల వివరాలను విస్తరణాధికారుల ద్వారా రైతులకు తెలియజేయడం మొదలైందని తెలిపారు. సూక్ష్మపోషకాల నాణ్యతను పరిశీలించాలని మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. బయోఉత్పత్తుల అమ్మకాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. కౌలు రైతులకు అధిక పంట రుణాలు ఇప్పించేలా దృష్టి పెట్టాలని ఆదేశించారు.

అనాథ ఆస్తులుగా దేవాలయ భూములు

- అమరేశ్వర ఆలయం భూమి వ్యవహారంపై హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: 'దేవాలయాల భూములను అధికారులు తమ సొంతంగా భావిస్తున్నారు. నచ్చినట్టు కట్టబెడుతున్నారు. అవి ప్రభుత్వ భూములు కావన్న సంగతి తెలిసినట్లు లేదు. దేవాలయాలు, వక్ఫ్ భూములు అనాథలయ్యాయి' అని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. గుంటూరు జిల్లా అమరావతి గ్రామంలోని శ్రీఅమరేశ్వరస్వామివారి ఆలయానికి చెందిన నాలుగెకరాల భూమిని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ 16 ఏళ్లుగా రూపాయి చెల్లించకుండా తన స్వాధీనంలో ఉంచుకుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయాల భూములను కేటాయించాలన్నా, సేకరించాలన్నా హైకోర్టు ఆదేశాలు అవసరమన్న అంశాన్ని అధికారులు విస్మరించారని పేర్కొంది. ఆలయానికి రూపాయి చెల్లించకుండా 16 ఏళ్ల కిందటే దాని భూమిని నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కలెక్టర్ స్వాధీనపరచడం ఏమిటని ప్రశ్నించింది. ఇంతకంటే అరాచకం లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. అమరేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఆ నాలుగెకరాల భూమిని రెండు నెలల్లో నూతన భూసేకరణ చట్ట ప్రకారం సేకరించి సొమ్మును దేవస్థానానికి జమ చేయవచ్చని అధికారులకు స్పష్టం చేసింది. రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయలేకపోతే ఎకరాకు రూ.28.35 లక్షల చొప్పున 24శాతం వడ్డీతో చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తేల్చిచెప్పింది. దేవస్థానానికి సొమ్ము చెల్లించే వ్యవహారంలో కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేస్తే సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్, గుంటూరు కలెక్టర్ వ్యక్తిగతంగా బాధ్యులవుతారని హెచ్చరించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీ గురుకుల సంక్షేమ విద్యాలయాల సొసైటీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు తీర్పునిచ్చింది. అమరేశ్వరస్వామి ఆలయానికి చెందిన నాలుగెకరాల భూమిని పాఠశాల, వసతిగృహం నిర్మాణానికి 2002లో అధికారులు కేటాయించారు. నాలుగెకరాలకు ఇప్పటివరకు రూపాయి చెల్లించలేదంటూ భక్తుడు హనుమంతరావు 2017లో హైకోర్టును ఆశ్రయించారు.

సెప్టెంబరు 27 నుంచి ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలు

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటు చేసే దిశగా వామపక్షాలు, జనసేన, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ పార్టీలు కలిసి పని చేస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేలా నూతన రాజకీయ ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేసేందుకు సీపీఐ, సీపీఎం పార్టీలు కంకణం కట్టుకున్నాయన్నారు. అందులో భాగంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు సమక్షంలో విజయవాడలో రాష్ట్ర రాజకీయ సదస్సు జరిపి రాజకీయ తీర్మానం చేశామన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో వామపక్షాలు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో సమావేశమై రాష్ట్ర రాజకీయ పరిస్థితుల గురించి చర్చించినట్లు తెలిపారు. ఉద్యమాలు, ఎన్నికల్లో.. వామపక్షాలు, జనసేన పార్టీలు కలిసి ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.

గ్రహం అనుగ్రహం

27-6-2018 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
చతుర్దశి: ఉ. 7-39 తదుపరి పూర్ణిమ
జ్యేష్ఠ నక్షత్రం: ఉ. 9-43 తదుపరి మూల
అమృత ఘడియలు: తె. 4-55 నుంచి
వర్జ్యం: సా. 6-26 నుంచి 8-11 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-36 నుంచి 12-29 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5-31; సూర్యాస్తమయం: సా.6-34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	39.0	30.0
గుంటూరు	38.9	28.4
రాజమహేంద్రవరం	38.5	29.0
విజయవాడ	38.5	28.0
ఒంగోలు	38.3	30.4
అనంతపురం	38.1	28.0
తాడేపల్లిగూడెం	38.0	26.5
తిరుపతి	38.0	24.2
నరసాపురం	37.6	27.4
కడప	37.0	27.0
శ్రీకాకుళం	37.0	26.0
విశాఖపట్నం	35.8	28.4
హైదరాబాద్	33.6	23.7

'భగవాన్' ప్రాణభిక్ష పెట్టాడు

- 25 మంది ప్రయాణికుల్ని కాపాడిన కండక్టర్

శివమొగ్గ, న్యూస్‌టుడే: అనారోగ్యంతో డ్రైవర్ స్టీరింగ్‌ను విడిచిపెట్టి. . నిస్తేజంగా మారిన సమయంలో కండక్టర్ అప్రమత్తమవడంతో పెను ప్రమాదం తప్పింది. కర్ణాటకలోని మండగద్దె పక్షిధామ సమీపాన ఈ ఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని శివమొగ్గ నుంచి మంగళూరు నగరానికి వెళ్తున్న ప్రైవేట్ బస్సు మండగద్దె పక్షిధామ సమీపానికి వెళ్లే సరికి డ్రైవర్‌కు కళ్లుబైర్లు కమ్మాయి. డ్రైవర్ బస్సు స్టీరింగ్‌ను వదిలిపెట్టడడం.. బస్సు తుంగా నది వైపుగా దూసుకెళ్తుండటాన్ని గమనించిన కండక్టర్ చాకచక్యంగా స్టీరింగ్‌ను తిప్పడంతో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షాల కారణంగా ఆ మార్గంలోని తుంగా నదిలో ప్రవాహం భారీగా ఉంది. ఆసమయంలో కండక్టర్ ఆ విధంగా చేయకపోతే తామంతా ఉద్ధృతంగా ప్రవహిస్తున్న తుంగా నదిలో కలిసిపోయేవారమని వాపోయారు. తమ ప్రాణాల్ని రక్షించిన కండక్టర్ భగవాన్‌కు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- తెదేపా సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి

❑ మీ (నాయకుల) పనితీరుపై అనేక రకాల నివేదికలు తెప్పిస్తున్నా. మీకందరికీ ఎప్పటికప్పుడు చెబుతున్నా. నేను సీరియస్‌గా చెప్పినా మీరు పట్టించుకోకపోతే మీ బదులు ఇంకొకరితో ఆ స్థానాన్ని భర్తీ చేయక తప్పదు.

❑ జులై 16కి నేను ప్రమాణ స్వీకారం చేసి 1500 రోజులవుతుంది. అప్పటి నుంచి కార్యక్రమాలు ముమ్మరం చేయాలి.

❑ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. కడప ఉక్కు కర్మాగారానికి మనం అడ్డుపడుతున్నామని అంటున్నారు. శ్రీవారి ఆభరణాన్ని ప్రైవేటు విమానంలో మరో దేశానికి తరలించినట్టు ఓ ఐపీఎస్ అధికారి చెప్పారని అంటున్నారు. బాధ్యతగల వ్యక్తులు ఏదో విన్నది మాట్లాడటం సరికాదు.

❑ కన్నా లక్ష్మీనారాయణ మొన్నటి వరకు కాంగ్రెస్‌లో ఉండి ఆ పార్టీని ముంచారు. ఇప్పుడు భాజపాలో చేరి ఆ పార్టీని ముంచుతున్నారు.

- తెదేపా శ్రేణులతో చంద్రబాబు

ఈనాడు – అమరావతి

ఆకాశంలో విహరించడం మానేసి, క్షేత్రస్థాయిలో పనులు చేయాలని, ప్రజలతో మమేకమవ్వాలని పార్టీ శ్రేణులకు తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఉద్బోధించారు. ముందస్తు ఎన్నికలపై చర్చ జరుగుతోందని... ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని అన్నారు. పార్టీలో ప్రతి నాయకుడికీ ఒక బూత్, లేదా ఒక ప్రాంత పర్యవేక్షణ బాధ్యత అప్పగించాలని, అప్పుడే వారి సత్తా ఏంటో తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కొందరు ఊరికే నాకు సలహాలిస్తూ తిరుగుతున్నారని, అలాంటి వారందరికీ పని అప్పగించాలని సూచించారు. ఇటీవల దశావతార వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు వెళ్లినప్పుడు తనకు, పవన్ కల్యాణ్‌కు మధ్య మర్యాదపూర్వక పలకరింపులే జరిగాయి తప్ప, దానికెలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని చంద్రబాబు స్పష్టంచేశారు. దానిపై ఎవరైనా విమర్శలు చేస్తే... గట్టిగా తిప్పి కొట్టాలని పార్టీ కేడర్‌కు సూచించారు. చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాల్‌లో తెదేపా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు జిల్లాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఇప్పటి నుంచి ఎన్నికల వరకు తనతో సహా నాయకులంతా జనంలోనే ఉండాలని స్పష్టంచేశారు.

పార్టీ కార్యకలాపాల షెడ్యూల్..

అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలోను భాజపా, వైకాపా, జనసేన పార్టీల లాలూచీని ఎండగట్టాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వారి కుట్ర రాజకీయాల్ని ప్రజలకు వివరించాలన్నారు. "జులై 16 నుంచి జనవరి 10 వరకు నియోజకవర్గాల్లో నాయకులు చేపట్టాల్సిన షెడ్యూల్‌ను తయారు చేశాం. జులై 16 నుంచి గ్రామదర్శిని కార్యక్రమం ఉంటుంది. నాలుగు నెలల్లో 75 రోజులపాటు ప్రతి నియోజకవర్గంలో గ్రామసభలు జరగాలి. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ముఖ్య నేతలు ప్రతి గ్రామానికీ వెళ్లాలి. కనీసం 4-5 గంటలు ఆ గ్రామంలో ఉండాలి. ఇంటింటికీ వెళ్లాలి. వారి సమస్యలన్నీ పరిష్కరించాలి. ప్రభుత్వం సాధించిన విజయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని వివరించాలి. ఇదే పార్టీ ప్రధాన అజెండా" అని ముఖ్యమంత్రి వివరించారు.

బలహీన ఆటగాళ్లుంటే అందరికీ నష్టమే

"జిల్లాల వారీగా నాయకుల పనితీరు సమీక్షిస్తున్నా. ప్రతి చిన్న విషయాన్ని జాగ్రత్తగా చూస్తున్నా. నాయకులు పనులు చేస్తే చాలదు. వారి ప్రవర్తనా అంతే ముఖ్యం. ప్రతి నెలా కార్యకర్తల సంతృప్తస్థాయి తెప్పిస్తున్నా. కార్యకర్తలకు మంత్రులు, ఎమ్మెల్యేలు గౌరవం ఇవ్వాలి. మీరు ఎక్కడికక్కడ టీం లీడర్లుగాను, ఆటగాళ్లగాను కూడా పనిచేయాలి. ఏకపక్ష ధోరణి కుదరదు. ఏ ఆటగాడు బలహీనపడ్డా... టీం మొత్తం దెబ్బతింటుంది'' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. "కాకినాడలో ధర్మ పోరాట సభ ముగిస్తే... మరో తొమ్మిది సభలు పెట్టాలి. నెలకు ఒకటి పెడతాం. ముస్లిం మైనారిటీలకు వచ్చే నెలలో గుంటూరులో సభ నిర్వహిస్తాం. 13 యూనివర్సిటీల్లో... ప్రతి చోటా 10 వేల మంది విద్యార్థులతో సమావేశాలు నిర్వహిస్తాం. నేను వారానికి ఒకటి రెండు చోట్ల గ్రామదర్శినిలో పాల్గొంటా. జిల్లాలకు వచ్చినప్పుడు 25 మంది ముఖ్య నేతలతో మాట్లాడతా. కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తా. అవి పూర్తయ్యాక ప్రతి మూడు నియోజకవర్గాలకు సంబంధించిన సేవామిత్రలు, బూత్ కమిటీల కన్వీనర్లతో సమావేశాలు నిర్వహిస్తా. వారికి ఎక్కువ సమయం కేటాయిస్తా" అని చెప్పారు.

ఈవీఎంలపై అప్రమత్తం..!

జమ్మూ, కశ్మీరులో గవర్నర్ పాలన వచ్చిందని, కేంద్రంలోను, కొన్ని రాష్ట్రాల్లోను కూడా ముందస్తు ఎన్నికలపై చర్చ జరుగుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత కోసం ఈవీఎంలలో వీవీపీటీ (ఓటర్ వెరిఫికేషన్ పేపర్ ట్రయల్) విధానం ప్రవేశ పెట్టాల్సి ఉందని, అది ఇప్పట్లో జరిగే పరిస్థితి లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరగకుండా ప్రజల్లో అవగాహన తేవాలని పేర్కొన్నారు.

భాజపా నేతలు అవినీతిపరులతో చెట్టాపట్టాల్

పోలవరం ప్రాజెక్టుకి కేంద్రం ఇంకా రూ.1950 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా... ఒక్క పైసా కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని కన్నా లక్ష్మీనారాయణ అంటున్నారని, అలాంటి వాళ్ల వల్ల రాష్ట్రానికి కీడే తప్ప మేలు జరగదని ధ్వజమెత్తారు. 'కేంద్రంలోని భాజపా నాయకులు అవినీతిపరులతో కలసి మెలసి తిరుగుతున్నారు. గాలి జనార్దన్‌రెడ్డి, జగన్ అవినీతి ఆస్తుల్ని వేలం వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఉక్కు కర్మాగారం కోసం కోట్లు ఖర్చు పెట్టానని, అవకాశమిస్తే కర్మాగారం పెడతానని జనార్దన్‌రెడ్డి అంటున్నాడు. అది వాళ్లంతా కలసి ఆడుతున్న నాటకం" అని మండిపడ్డారు.

అమరావతిలో నిర్వహించిన తెదేపా సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సమావేశంలో మరికొన్ని కీలకాంశాలు...

★ ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పాం. సామాన్యులు ఆ ప్రయోజనాన్ని పొందేలా చూడాలి. 95 శాతం సంతృప్తి రావాలి. కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చా. ఇసుక రీచ్‌ల మరమ్మతులు వారే చేయిస్తారు. నిఘా కెమెరాలు పెడతారు. వారం తర్వాత ఎక్కడికక్కడ వర్చువల్ తనిఖీలు నిర్వహిస్తా.

★ విశాఖ రైల్వేజోన్ కోసం ఉద్యమం చేపడతాం. న్యాయసమ్మతమైన మన హక్కుల కోసం పోరాడటంలో రాజీలేదు.

★ నిరుద్యోగ భృతి త్వరలోనే అమల్లోకి తెస్తాం.

★ ఏపీ ఫైబర్ ప్రాజెక్టులో భాగంగా మూడు లక్షల మందికి కనెక్షన్లు ఇచ్చాం. ఇవి రోజు రోజుకీ పెరుగుతున్నాయి. దీన్ని ఉపయోగించుకుని ప్రతి నెలా మొదటి రెండు రోజులు ప్రజలతో నేరుగా మాట్లాడతా.

★ గత నెలలో ప్రభుత్వ పనితీరుపై 74 శాతం, ఈ నెలలో 73 శాతం సంతృప్తి ఉంది.

★ 18 వేల బూత్ కమిటీలను యుద్ధ ప్రాతిపదికన నియమించాల్సి ఉంది. ఈ నెలాఖరుకి పూర్తి చేయాలి.

★ దళితతేజం విజయోత్సవ సభ అద్భుతంగా జరగాలి. ప్రతి పంచాయతీ నుంచి ప్రతినిధులు రావాలి.

★ కడపలో సీఎం రమేష్, బీటెక్ రవి నిరవధిక దీక్షకు ప్రజల్లో మద్దతు పెరిగింది. రవి ఆరోగ్యం క్షీణించినా దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్షకు మద్దతుగా బుధ, గురువారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ద్విచక్ర వాహన ర్యాలీలు, ధర్నాలు చేయాలి. 28న దిల్లీలో ఎంపీలు ధర్నా చేస్తారు.

ప్రకాశం ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్

'మీ నియోజకవర్గంలో పరిస్థితులు సానుకూలంగా లేవు.. మీరు జనంలో తిరగడం లేదు. ఇలాగైతే వచ్చే ఎన్నికల్లో కష్టమే..' అని ప్రకాశం జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలకు తెదేపా అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. 'గత ఎన్నికల్లో జన నాయకుడిగా ఎదిగిన నీలో వేగం ఎందుకు తగ్గింద'ని మరో ఎమ్మెల్యేను ప్రశ్నించారు. వైకాపాలోకి వెళ్తున్నారనే ప్రచారం జరగటానికి కారణాలేమిటని మరొకరిని ఆరా తీశారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటల నుంచి ఎమ్మెల్యేలతో ముఖాముఖి నిర్వహించారు. నియోజకవర్గాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో ఎమ్మెల్యేతో 10 నిమిషాల నుంచి 40 నిమిషాల వరకు మాట్లాడారు. మండల, గ్రామస్థాయి నేతలు చేసే తప్పుల ప్రభావం కూడా మీపై పడుతుందని వివరించారు. వాటన్నిటిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు. 'ఇప్పుడు చేసేది ఎంతమాత్రం చాలదు.. ఇంకా జనంలోకి వెళ్లాలి..' అని సూచించారు. నేతల మధ్య విభేదాలను ప్రస్తావిస్తూ అందరినీ కలుపుకొని వెళ్లాలని స్పష్టం చేశారు. సమయం లేకపోవడంతో శాసనమండలి సభ్యులతోపాటు కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఇతర నేతలు 9 మందితో సీఎం మాట్లాడలేదు. వారికి తర్వాత కబురు పంపిస్తామన్నారు. మూడు రకాల నివేదికలు ముందు పెట్టుకున్న చంద్రబాబు ఎమ్మెల్యేల పనితీరు, నియోజకవర్గాల్లో పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలను ఆసాంతం వివరించారు. గ్రామస్థాయిలో నేతల పనితీరును కూడా ప్రస్తావిస్తూ.. 'ఆయన అలా ఎందుకు చేయాల్సి వచ్చింద'ని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయం నుంచి అందిన నివేదికతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజల సంతృప్తిశాతం, పత్రికల వార్తలు.. వివిధ వర్గాల ద్వారా సేకరించిన సమాచారాన్ని వివరిస్తూ ప్రశ్నలు సంధించారు. అక్కడ ప్రత్యర్థి పార్టీల బలాబలాలను కూడా ప్రస్తావించారు.

ఒకేసారి ఎన్నికలకు ఒడిశా సీఎం ఓటు

గోపాలపూర్, న్యూస్‌టుడే: దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం మంచిదేనని బిజద పార్టీ అధ్యక్షుడు, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ చేసిన సూచనతో ఏకీభవిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నవీన్ పట్నాయక్ మంగళవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ పలుసార్లు ఎన్నికలు నిర్వహించడం వల్ల భారీగా వ్యయమై, అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని ప్రకటనను బిజద సమర్థిస్తుందని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయానికి జాతీయ న్యాయ కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ బి.ఎస్.చౌహాన్ లేఖ రాశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విషయంలో జూన్ 30లోగా బిజద తన అభిప్రాయాన్ని తెలియజేయాలని అందులో కోరగా.. గడువుకు ముందుగానే నవీన్ స్పందించారు. మరోవైపు జమిలి ఎన్నికలపై జులై 7, 8 తేదీలలో దిల్లీలో నిర్వహించనున్న సమావేశంలో నవీన్ కూడా పాల్గొనే అవకాశం ఉంది.

రజనీ రాజకీయ పార్టీ నవంబరులో?

ఈనాడు డిజిటల్, చెన్నై: ప్రముఖ నటుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ వచ్చే నవంబరులో రాజకీయ పార్టీని ప్రారంభించనున్నారని ఆయన సన్నిహితుడైన గాంధీయ మక్కల్ ఇయక్కం వ్యవస్థాపకుడు తమిళరువి మణియన్ సంకేతాలు ఇచ్చారు. ఓ తమిళ పత్రికకు ఆయన ఇచ్చిన ముఖాముఖిలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడాది చివరిలోపు రజనీకాంత్ పార్టీని ప్రారంభిస్తారని, అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో ఆయన పార్టీ పోటీ చేస్తుందన్నారు. పొత్తుల విషయంపై అప్పుడే నిర్ణయం తీసుకుంటారన్నారు.

ఏపీ రెవెన్యూ సంస్కరణలకు ప్రశంసలు

ఈనాడు, అమరావతి: తిరువనంతపురంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల రెవెన్యూ అధికారుల సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ చేపట్టిన సంస్కరణలకు ప్రశంసలు లభించాయి. భూసంబంధిత అంశాలపై తిరువనంతపురంలో దక్షిణాది రాష్ట్రాల అధికారుల సమావేశం మంగళవారం జరిగింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్సు ప్రత్యేక కార్యదర్శి వీణా ఈష్, సంయుక్త కార్యదర్శి హుకుంసింగ్ మీనా, తెలంగాణ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ, ఏపీ సర్వే సెంటిల్‌మెంట్స్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ కె.ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా అన్ని రకాల భూముల సమాచారాన్ని తెలుసుకునే అవకాశాన్ని ప్రజలకు ఏపీ రెవెన్యూ శాఖ కల్పించిందని అధికారి ప్రభాకరరెడ్డి సమావేశంలో తెలిపారు. సాంకేతికత వల్ల పారదర్శకత పెరిగిందని అన్నారు. ఆధార్‌కార్డు మాదిరిగానే భూమికి భూధార్ ఉండేలా విశిష్ఠ నెంబర్లను కేటాయిస్తున్నామని తెలిపారు.

ఉద్దానం బాధితులకు ఉచితంగా మందులు

సోంపేట, న్యూస్‌టుడే: ఉద్దానంలోని మూత్రపిండాల వ్యాధిగ్రస్థులకు ఖరీదైన మందులను ఉచితంగా అందిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ తెలిపారు. ముఖ్యమంత్రి హామీ మేరకు 22 రకాల మందులను ఉచితంగా అందజేసేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా సోంపేట సామాజిక ఆసుపత్రిలో.. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మంగళవారం పుదుచ్చేరిలోని బాహోర్‌లో ప్రఖ్యాత మూలనాథస్వామి ఆలయం వద్ద రథాన్ని లాగుతున్న లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ, సీఎం నారాయణస్వామి

నవ్యావిష్కరణల నగరం అమరావతి

- సింగపూర్ మంత్రి డెస్మాండ్ లీ

ఈనాడు-అమరావతి: నవ్యావిష్కరణల నగరంగా అమరావతి అవతరించబోతోందని సింగపూర్ జాతీయాభివృద్ధి మంత్రిత్వశాఖ సెకండ్ మినిస్టర్ డెస్మాండ్ లీ టీ సెంగ్ అన్నారు. ఆయన తన బృందంతో కలిసి మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. విజ్ఞాన సమాచార మార్పిడిపై సింగపూర్, ఏపీ ప్రభుత్వాల మధ్య ఒక అవగాహనా ఒప్పందం కుదిరింది. సింగపూర్ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ అథారిటీ సీఈవో హ్యూగ్ లిమ్, సింగపూర్ ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ తరఫున పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ సంతకాలు చేశారు. అమరావతి నగర నిర్మాణంలో ఈ ఒప్పందం ఒక మైలురాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ఇప్పటికే తాము రాజధాని అమరావతి కోసం బృహత్తర ప్రణాళికలు రూపొందించడం, మౌలిక సదుపాయాల కల్పన... ఇలా అనేకాంశాలలో భాగస్వామ్యమయ్యామని డెస్మాండ్ లీ అన్నారు. దార్శనికత గల నాయకుడు చేపట్టిన రాజధాని నగర నిర్మాణంలో పాలుపంచుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. బృహత్తర ప్రణాళిక వల్లే అమరావతి ప్రపంచంలోని ఇతర నగరాలకు విలక్షణంగా, విభిన్నంగా నిర్మాణమవుతోందని వివరించారు. క్రమశిక్షణ, విలువలకు పేరొందిన సింగపూర్ అంటే తనకెప్పుడూ ఆరాధనా భావం ఉందని చంద్రబాబు అన్నారు. 25 సంవత్సరాలుగా అక్కడ అభివృద్ధిని నిశితంగా పరిశీలిస్తున్నానని, ఆ తరహా అభివృద్ధి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేశానని చెప్పారు. 165 కిలోమీటర్ల బాహ్య వలయ రహదారి, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంతో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో ప్రత్యేకంగా నిలిపామన్నారు. ఆ అనుభవంతో కొత్త రాష్ట్రంలో నవ్య రాజధాని నిర్మాణానికి ఉపక్రమించామన్నారు. సింగపూర్ ఎంతో సహకరిస్తోందన్నారు.

నిర్మాణ నగరం ఏర్పాటుకు సింగపూర్ సిద్ధం: నిర్మాణ సామగ్రి తయారీ నగరం ఏర్పాటులో భాగస్వామ్యం తీసుకునేందుకు సింగపూర్ ముందుకొచ్చింది. జులై రెండో వారంలో ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో భాగంగా దీనిపై విపులంగా చర్చించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటారు. గాలి స్వచ్ఛత, ధ్వని కాలుష్యం, వైపరీత్యాల నిర్వహణ తదితర అంశాల్లో సింగపూర్ అత్యంత ఆధునిక సాంకేతికత వినియోగిస్తోందని, వీటికి సంబంధించిన నిరంతర పరిశోధనలు నిర్మాణ నగరానికి మార్గదర్శిగా ఉండాలన్నారు. ఈ ప్రతిపాదనలకు సింగపూర్ ప్రతినిధి బృందం తమ ఆమోదాన్ని తెలియజేసింది.

మన దేశానికి విచ్చేసే విదేశీయులకు "ముంబయి" అత్యంత ఖరీదైన నగరంగా మారినట్లు తాజా అధ్యయనంలో తేలింది. ప్రపంచ నగరాల్లో జీవన వ్యయం అంచనాలపై న్యూయార్క్ సంస్థ మెర్సెర్ దీన్ని చేపట్టింది. జీవన వ్యయం చుక్కలకు అంటుతున్న ప్రపంచ నగరంగా హాంకాంగ్ దీనిలో అగ్రస్థానం దక్కించుకుంది. ముంబయి గతేడాది కంటే రెండు స్థానాలు ముందుకువెళ్లి 55వ చోటు సంపాదించింది.

మొబైల్ ఉంటే పాస్‌పోర్ట్ మీ వెంటే

- 'ఎంపాస్‌పోర్ట్ సేవా' యాప్‌ను ఆవిష్కరించిన సుష్మాస్వరాజ్

ఈనాడు, విశాఖపట్నం, దిల్లీ: పాస్‌పోర్టు సేవలను ఇక స్మార్ట్‌ఫోను నుంచే పొందొచ్చు. ఇందుకు వీలుగా కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ 'ఎంపాస్‌పోర్ట్ సేవా' పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దానిని గూగుల్ ప్లేస్టోర్లో ఉంచింది. 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా మంగళవారం దిల్లీలో ఈ కొత్త యాప్‌ను విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రారంభించారు. కొత్త యాప్‌లో వేగంగా, సులభంగా వివరాలు నమోదు చేసుకునేలా సదుపాయాలున్నాయి. నిర్ణీత రుసుములను కూడా ఫోన్ నుంచే చెల్లించొచ్చు. దరఖాస్తు స్థితిని ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు. కార్యాలయం నుంచి దరఖాస్తుదారులకు వచ్చే సమాచారాన్ని కూడా చూసుకోవచ్చు. మరోపక్క పాస్‌పోర్ట్ కావాల్సిన వారు వారు ప్రస్తుతం ఉంటున్న చిరునామా ప్రకారం.. ఆ పరిధిలోని పాస్‌పోర్ట్ కార్యాలయానికి దరఖాస్తు చేయాలన్న నిబంధన ఇప్పటిదాకా అమల్లో ఉంది. తాజా విధానంలో దరఖాస్తుదారులు దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చు. పోలీసు తనిఖీ అనంతరం దరఖాస్తులో పేర్కొన్న చిరునామాకే పాస్‌పోర్ట్ పంపుతారు.

పూర్వ విధానంలో పోలీసులు దరఖాస్తుదారుడి ఇంటి ఇంటికెళ్లేవారు. ఆ చిరునామాలో అభ్యర్థి ఉంటున్నాడా? లేదా? అన్న అంశాన్ని పరిశీలించేవారు. రిఫరెన్స్ చిరునామాల్లోని వారితో మాట్లాడి దరఖాస్తుదారుడి గురించి ఆరా తీసేవారు. వివరాలన్నీ వాస్తవమని భావించినప్పుడే అనుకూల తనిఖీ నివేదిక ఇచ్చేవారు. పోలీసులు వ్యతిరేక నివేదిక ఇస్తే పాస్‌పోర్ట్ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చినట్లుగా భావించి అతనిపై అపరాధ రుసుము కూడా విధిస్తున్నారు. తాజా విధానంలో అంతటి పకడ్బందీ పోలీసు తనిఖీలు అవసరం లేదని తేల్చారు. దరఖాస్తుదారుడికి వివిధ ప్రభుత్వ శాఖలు గుర్తింపు కార్డులు జారీ చేసినప్పుడు మళ్లీ వాటిని తనిఖీ చేయాల్సిన అవసరం ఏముందని భావించి కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులు తనిఖీ విధానాన్ని పూర్తి సరళతరం చేసేశారు. దరఖాస్తుదారుడిపై కేసులున్నాయా? లేవా? అన్న విషయాన్ని తనిఖీ చేసి నివేదిక ఇవ్వడం వరకే పోలీసుల పాత్ర పరిమితం కానుంది.

ఏపీకి పురస్కారం

ఈనాడు, విశాఖపట్నం, అమరావతి: పాస్‌పోర్టు సేవలు అందించడంలో పారదర్శక విధానాలు పాటించడం, త్వరితగతిన అందించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి ఎన్.ఎల్.పి.చౌదరికి కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ మంగళవారం ప్రత్యేక ప్రతిభా పురస్కారాన్ని అందించింది. 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా మంగళవారం దిల్లీలో నిర్వహించిన వేడుకల్లో విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. సగటున పదిరోజుల్లోపు పాస్‌పోర్టులు మంజూరు చేస్తుండడం, నిరీక్షణ దస్త్రాల సంఖ్యను గణనీయంగా తగ్గించడం తదితర విజయాల నేపథ్యంలో ఆయనకు వ్యక్తిగత అవార్డుతోపాటు, విశాఖ కార్యాలయానికి కూడా పురస్కారాన్ని అందించారు. పాస్‌పోర్ట్ దరఖాస్తుల తనిఖీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తున్నందుకు గాను ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగానికి ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఏపీ పోలీసు విభాగం తరఫున ఏపీ ఇంటలిజెన్స్ విభాగం ఎస్పీ ఆర్.జయలక్ష్మి..సుష్మాస్వరాజ్ నుంచి గుర్తింపు ధ్రువపత్రం అందుకున్నారు. సగటున నాలుగు రోజుల్లో తనిఖీ పూర్తి చేస్తూ తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో ఉండగా... ఆ తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. గతేడాది సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మే 31వ తేదీ మధ్య పాస్‌పోర్ట్ దరఖాస్తుల తనిఖీ అత్యంత వేగంగా పూర్తి చేసిన జిల్లాల్లో గుంటూరు గ్రామీణ, గుంటూరు అర్బన్ పోలీసు యూనిట్లు రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచాయి. ఈ రెండు యూనిట్ల పరిధిలో సగటున ఒక్కో దరఖాస్తు తనిఖీ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఒకటి నుంచి మూడు రోజులు పట్టింది. వాటి తర్వాత స్థానంలో కృష్ణా జిల్లా నిలిచింది.

సుష్మాస్వరాజ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఎన్.ఎల్.పి.చౌదరి

ఈనాడు

దేశంపై మాదక పంజా

జాతి భవితను కుళ్లబొడుస్తూ చాపకింద నీరులా విస్తరిస్తున్న మాదక ద్రవ్యాలను కట్టడి చేసేందుకంటూ దేశంలోని పదిహేను జిల్లాల్లో ప్రయోగాత్మక కార్యాచరణ ప్రణాళిక అమలుకు కేంద్రం సన్నద్ధమవుతోంది. విశాఖ, పుణె, దిబ్రూగఢ్, లూధియానా సహా ఎంపిక చేసిన జిల్లాల్లో మత్తు పదార్థాలకు బానిసలవుతున్నవారి సంఖ్యను తగ్గించి ఆయా ప్రాంతాల్ని మాదకద్రవ్య రహితాలుగా మారుస్తామంటున్న వ్యూహంలో సమగ్ర దృష్టి కొరవడింది. ఆసేతు హిమాచలం తరతమ భేదాలతో రాష్ట్రాలవారీగా భీకర ముప్పు నెత్తిన ఉరుముతున్నప్పుడు- పరిమిత స్థాయిలో అరకొర యుద్ధం చేస్తామనడమేమిటి? నిన్న మాదకద్రవ్య నియంత్రణ దినం సందర్భంగా ఎన్‌సీబీ (నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో) విడుదల చేసిన ప్రకటనే- నాలుగేళ్లలో లక్షా 75 వేల కిలోల డ్రగ్స్ జప్తు అయినట్లు, సుమారు 43 వేల ఎకరాల విస్తీర్ణంలో మత్తు పంటల సాగు ధ్వంసమైనట్లు వెల్లడించింది. గంజాయి సాగుతో ఉత్తరాంధ్ర, మాదక మాఫియా కేంద్ర కార్యస్థలిగా భాగ్యనగరం ప్రపంచ డ్రగ్ పటంలో 'ప్రత్యేక గుర్తింపు' పొందుతున్నాయి! పాక్, బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దుల వెంబడి మార్జువానా, నల్లమందు, హెరాయిన్, బ్రౌన్‌సుగర్ పెద్దయెత్తున దేశంలోకి వచ్చిపడుతున్నాయి. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, త్రిపుర, కేరళ తదితర రాష్ట్రాల్లో మత్తుమందుల విచ్చలవిడి వినియోగం పెచ్చరిల్లుతున్నట్లు క్షేత్రస్థాయి కథనాలు స్పష్టీకరిస్తున్నాయి. వాయు, సముద్ర మార్గాల్లో చొరబడుతున్న దేశదేశాల సరఫరాలు నిర్దేశిత గమ్యస్థానాలకు నిక్షేపంగా చేరిపోతున్న దశలో కేవలం పదిహేను జిల్లాల్లో దిద్దుబాటు చర్యల్ని తలపెట్టడమే విడ్డూరంగా ఉంది. దేశంలో దాదాపు ఏడు కోట్ల 30 లక్షల మంది మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డారని, అందులో 70 శాతం మత్తుకు బానిసలైపోయారని ఆ మధ్య కేంద్ర హోం మంత్రే వెల్లడించారు. ఇటువంటప్పుడు జాతీయ విపత్తును సమర్థంగా ఎదుర్కొనే విస్తృత ప్రణాళికను పట్టాలకు ఎక్కించడంలో జాప్యం ఇక ఎంతమాత్రం పనికి రాదు!

'జాతీయ వ్యధ'గా ప్రధాని మోదీ అభివర్ణించిన మాదక మహా విపత్తును ఎదుర్కొని, ముఖ్యంగా పిల్లల భవితవ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో జాతీయ విధానాన్ని ఖరారు చేయనున్నట్లు కేంద్రం గత డిసెంబరులో సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించింది. తరవాత రెండు నెలలకు, దేశంలో మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఉద్దేశించిన పథకాన్ని ఇంకో మూడు సంవత్సరాలు పొడిగిస్తున్నట్లు ప్రకటించి సరిపుచ్చింది. ఆ పథకం కింద 2019-20 దాకా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లక్షించిన కేటాయింపుల మొత్తం రూ.21 కోట్లు. పట్టపగ్గాలు లేకుండా విజృంభిస్తున్న మాదక శక్తుల వ్యాపారం ఒక్క పంజాబులోనే రూ.60 వేలకోట్లకు పైబడిన దశలో దేశవ్యాప్తంగా డ్రగ్ మాఫియా నియంత్రణకు విదిపిన 'ఉదార కేటాయింపులు' ఎందుకూ కొరగావు! ముంబయి వంటి ప్రధాన నగరాల్లోనే కాదు, ద్వితీయశ్రేణి పట్టణాల్లో సైతం- మత్తు రుచి చూపించి బడిపిల్లల్నీ ఖాతాదారులుగా మార్చేసుకుంటున్న ముఠాలు ఇప్పటికెన్ని పుట్టుకొచ్చి గప్‌చుప్‌గా కార్యకలాపాలు నెరపుతున్నాయో ఎవరి వద్దా సరైన లెక్కలు లేవు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులే లక్ష్యంగా పరిసర ప్రాంతాల్లోని చిల్లర దుకాణాలు, కాకా హోటళ్లను పంపిణీ, విక్రయ కేంద్రాలుగా వినియోగించే దశను మాఫియా ముఠాలు అధిగమించేశాయి. ఎక్కడా ప్రత్యక్ష లావాదేవీలు, ఫోన్ సంభాషణలు లేకుండా వాట్సాప్ చాటింగ్‌ల ద్వారా క్రయవిక్రయాలు ముమ్మరిస్తున్నాయి. డీప్‌వెబ్, డార్క్‌నెట్ వెబ్‌సైట్ల సాయంతో హైదరాబాద్, చెన్నై లాంటిచోట్లా మాదక కొనుగోళ్లు జోరందుకున్నట్లు అధ్యయనాలు చాటుతున్నాయి. పంజా విసిరిన మాదక మాఫియా నియంత్రణలో ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్) చట్టం చతికిలపడిన నేపథ్యంలో- విద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపే పోరాటస్ఫూర్తి చురుగ్గా పోటెత్తాలి!

నేరతీవ్రతకు అనుగుణంగా కఠిన శిక్షలు విధించి సత్వరం అమలుపరిస్తేనే- కొత్త కేసుల ఉద్ధృతి తగ్గుతుంది. లేదంటే, మాదక తండాలు మరింతగా రెచ్చిపోతాయి. మాదక పదార్థాల్ని వినియోగించినా ఉత్పత్తి చేసినా నిల్వకు వ్యాపారానికి పాల్పడినా సింగపూర్, థాయ్‌లాండ్, కాంబోడియా, వియత్నాం ప్రభృత దేశాలు మరణ దండన విధిస్తున్నాయి. మెక్సికో, దక్షిణాఫ్రికా వంటివి డ్రగ్ ముఠాలపై అక్షరాలా యుద్ధమే ప్రకటించాయి. వాటితో పోలిస్తే- మాదక నేరగాళ్లకు పదేళ్ల దాకా జైలు, లక్ష రూపాయల వరకు జరిమానా విధించగల చట్ట నిబంధనలూ దేశీయంగా సరిగ్గా అమలుకు నోచని దుష్పరిణామాలు అడుగడుగునా ప్రస్ఫుటమవుతున్నాయి. అత్యంత అరుదైన కేసులలో మరణశిక్ష వేయగల వీలుందంటున్న భారతీయ శిక్షాస్మృతి, కోట్లమందిని జీవచ్ఛవాలుగా మార్చేసి ఎడాపెడా కాసుల పంట పండించుకుంటున్న అమానుష దందాసురుల్ని ఎందుకు ఉపేక్షించాలి? గంజాయిలో అధికంగా ఉండే టీహెచ్‌సీ (టెట్రా హైడ్రో కెనాబినోల్)ని ప్రయోగశాలలో కృత్రిమంగా రూపొందించి సింథటిక్ డ్రగ్స్‌గా విక్రయిస్తున్న ముఠాలూ రేపటితరం ఆకాంక్షల్ని, వారిపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశల్ని నుగ్గునూచ చేసేస్తున్నాయి. నయా ఉత్పాదనలతో చిలవలు పలవలు వేసుకుపోతున్న మత్తుతండాల్ని అరికట్టడంలో ఇప్పటికే ఎంతో వృథా కాలహరణం జరిగి, అసంఖ్యాక కుటుంబాల్లో ఆరని శోకాగ్నులు రగిలించింది. దాదాపు రాష్ట్రాలన్నింటా సామాజిక సంక్షోభం ప్రజ్వరిల్లజేస్తున్న మాదక మాఫియాను ఇంకా ఉపేక్షించడం, యావత్ జాతికే ఆత్మహత్యా సదృశం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అర్థవంతమైన సమన్వయంతో నిఘా తనిఖీ వ్యవస్థల పరిపుష్టీకరణ, ప్రత్యేక కోర్టుల ఏర్పాటు సహా విచారణ విధివిధానాల క్రమబద్ధీకరణ, తగినన్ని పునరావాస కేంద్రాల అవతరణ సాకారమైతేనే- ఈ విష కోరల నుంచి దేశానికి విమోచనం!

సమన్వయంతో సత్ఫలితాలు

తుమ్మల కిశోర్



ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లను మరింత సమర్థంగా పర్యవేక్షించేందుకు అదనపు అధికారాలు అవసరమని రిజర్వ్‌బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఇటీవల పునరుద్ఘాటించారు. బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై పార్లమెంటరీ స్థాయీసంఘం ముందు తన వాణి వినిపించే క్రమంలో ఆయన మరోసారి ఆర్‌బీఐ అధికారాలపై గళం విప్పారు. ఇటీవల వెలుగుచూసిన కుంభకోణాలు, పీఎస్‌బీల మొండి బకాయిలు, నష్టాల నేపథ్యంలో ఆర్‌బీఐ పర్యవేక్షణ సామర్థ్యంపై విమర్శలు వెల్లువెత్తాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంతోపాటు ఇతర బ్యాంకింగ్ కుంభకోణాలు, అవకతవకలతో అటు ప్రభుత్వం ఇటు ఆర్‌బీఐ ఏదో ఒక సాకుతో చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశాయి. పీఎస్‌బీల దుస్థితికి, సంక్షోభానికి ప్రభుత్వం, ఆర్‌బీఐ, ఆయా బ్యాంకుల యాజమాన్యాలు బాధ్యత వహించాలన్నది నిర్వివాదాంశం. ఆర్‌బీఐకి పూర్తి అధికారాలు (ఉర్జిత్ పటేల్ కోరిన విధంగా) ఉండి ఉంటే బ్యాంకింగ్ సంక్షోభాన్ని ఆపగలిగేవారా, సంక్షోభ తీవ్రత తగ్గించగలిగేవారా అన్న అంశాలను లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. అదనపు అధికారాలను ఇచ్చినట్లయితే పర్యవేక్షణ ఎంతమేర మెరుగుపడుతుందన్న అంశాన్ని సైతం పరిశీలించాలి.

తగని ఒత్తిళ్లు

రిజర్వ్‌బ్యాంకుకు మరింత స్వయంప్రతిపత్తి, అధికారాలు అవసరమన్న అభిప్రాయాన్ని గతంలోనూ పలువురు గవర్నర్లు వ్యక్తపరచారు. అయితే ఏమేర స్వయంప్రతిపత్తి ఇవ్వాలన్నది ఇప్పటికీ చర్చనీయాంశమే. ఒకవైపు ప్రభుత్వం రిజర్వ్ బ్యాంకుకు పూర్తి స్వయంప్రతిపత్తి ఉందంటోంది. మరోవైపు కొన్ని సందర్భాల్లో ఆ సంస్థ గవర్నర్‌పై ఒత్తిడి తెస్తోందన్నదీ బహిరంగ రహస్యమే! గతంలో ప్రభుత్వం వడ్డీరేట్ల తగ్గింపును ఆశిస్తూ వృద్ధికి ఊతమిచ్చే దిశలో రిజర్వ్‌బ్యాంకు అడుగులు వేయాలని కోరేది. కొన్నిసార్లు దానిపై ఒత్తిడి తెచ్చేది. అయితే రిజర్వ్‌బ్యాంకు ద్రవ్యోల్బణం కట్టడికే అధిక ప్రాధాన్యం ఇస్తూ మౌలిక రేట్ల తగ్గింపును పక్కన పెట్టేది. వడ్డీరేట్ల తగ్గింపు విషయంలోనూ ప్రభుత్వం, ఆర్‌బీఐ మధ్య వైరుధ్యం నెలకొన్న సందర్భాలు అనేకం. రిజర్వ్‌బ్యాంకుకు ఎన్ని అధికారాలున్నా వాటిని వినియోగించుకోలేని పరిస్థితులు సైతం ఉత్పన్నమవుతాయని చెప్పడానికి పెద్దనోట్ల రద్దు ఒక ఉదాహరణ. నోట్ల రద్దులో ప్రభుత్వం అన్నీ తానై వ్యవహరించింది. ప్రభుత్వం తలచుకుంటే రిజర్వ్‌బ్యాంకు కాదన్నా ఆగదు. అందువల్ల ఎంత స్వయంప్రతిపత్తి ఉన్నా, ఎన్ని అధికారాలున్నా తుది నిర్ణయం ప్రభుత్వానిదే కాబట్టి- ఆర్‌బీఐ, కేంద్రాల మధ్య సమన్వయం అవసరం.

బ్యాంకింగ్ నియంత్రణ చట్టం(1949) ప్రకారం వాణిజ్య బ్యాంకులను రిజర్వ్ బ్యాంకు నియంత్రిస్తోంది. బ్యాంకింగ్ కంపెనీల చట్టం(1970), బ్యాంకుల జాతీయీకరణ చట్టం(1980), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం(1955) కింద పీఎస్‌బీలను ప్రభుత్వం కట్టడి చేస్తోంది. అంటే పీఎస్‌బీల నియంత్రణ- అటు రిజర్వ్ బ్యాంకు, ఇటు ప్రభుత్వం పరిధిలో జరుగుతోంది. బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, డైరెక్టర్ల తొలగింపు విషయంలో ఆర్‌బీఐకి అధికారం ఉండాలని ఉర్జిత్ పటేల్ కోరుతున్నారు. బ్యాంకుల బోర్డులను రద్దుచేసే అధికారంతోపాటు వాటి మధ్య విలీనాలను చేపట్టేందుకు సైతం అధికారం ఉండాలన్నది ఆయన అభిప్రాయం. బోర్డుల్లో ఆర్‌బీఐ నామినీ డైరెక్టర్ ఉండకూడదని ఉర్జిత్ పటేల్ భావిస్తున్నారు. ఇప్పటివరకూ పీఎస్‌బీల అధినేత నియామకం, ఉద్వాసన, ఇతరత్రా అంశాలన్నీ ప్రభుత్వ పరిధిలోనే జరుగుతున్నాయి. పీఎస్‌బీల యజమానిగా ప్రభుత్వం తనకున్న అధికారాలను వదులుకుంటుందా అన్నది ప్రశ్నార్థకం. పీఎస్‌బీల కష్టనష్టాల్లో పాలుపంచుకొని, వాటికి మూలధనాన్ని సమకూరుస్తూ, చేదోడువాదోడుగా ఉంటున్న ప్రభుత్వం, తన అధికారాలను వదులుకోవడానికి సిద్ధపడకపోవచ్చు. ఒకవేళ సిద్ధపడినా రిజర్వ్‌బ్యాంకుకు పాక్షికంగా కొంత అధికారాన్ని ఇచ్చి తుది నిర్ణయాన్ని తన పరిధిలోనే ఉంచుకోవచ్చు. రిజర్వ్

రిజర్వ్ బ్యాంకుకు అదనపు అధికారాలు

బ్యాంకుకు అధికారాలు ఇవ్వాలంటే బ్యాంకింగ్ నియంత్రణ చట్టంలో కొన్ని సవరణలు చేయాల్సి ఉంటుంది.

ఆర్‌బీఐ కోరుకున్న అధికారాలు దానికి ఉండి ఉంటే పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంతో పాటు పలు పీఎస్‌బీల్లో జరిగిన కుంభకోణాలను అడ్డుకోగలిగేదా అన్న ప్రశ్నకు, లేదన్నదే సమాధానమవుతుంది. బ్యాంకుల్లో పర్యవేక్షణ లోపాలను గుర్తించి చర్యలు తీసుకోవడంలో ఆర్‌బీఐ విఫలమైంది. వీటిని సరిదిద్దేందుకు చర్యలు చేపట్టకుండా, అదనపు అధికారాలతో పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. ఆర్‌బీఐకి అదనపు అధికారాలు ఇచ్చేందుకు ఇటీవల

> **ఆర్థిక సంస్థలదీ అదే మాట**
>
>
>
> రిజర్వ్ బ్యాంకుకు అదనపు అధికారాలు కట్టబెట్టినట్లయితే బ్యాంకులపై పర్యవేక్షణ మరింత సజావుగా, సమర్థంగా ఉంటుందన్న వాదనలో వాస్తవం లేకపోలేదు. గత జనవరిలో ఐఎమ్‌ఎఫ్, ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నివేదిక సైతం ఆర్‌బీఐకి ఎక్కువ అధికారాలు, స్వతంత్రత ఉంటే మరింత సమర్థంగా పనిచేసేందుకు వెసులుబాటు ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ నివేదిక ఉర్జిత్ పటేల్ అభిప్రాయానికి బలం చేకూరుస్తోంది.

కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సానుకూలంగా స్పందించడం శుభపరిణామమే. స్వయంప్రతిపత్తి, అధికారాలతోపాటు ఆర్‌బీఐ- ప్రభుత్వంతో సమన్వయంగా వ్యవహరిస్తూ ముందుకు వెళ్లడం అవసరం. అదే సమయంలో రిజర్వ్‌బ్యాంకు వ్యవహారాల్లో తలదూర్చకుండా, దాని స్వతంత్రతకు భంగం కలగకుండా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

పంజాబ్ నేషనల్ బ్యాంకు బాగోతం వెలుగు చూసిన తరవాత గత మూడు నాలుగు నెలల్లో వరస కుంభకోణాలు బయటపడ్డాయి. పలు బ్యాంకుల సీఈఓలు, మాజీ ఛైర్మన్లు అరెస్టయ్యారు. మరికొందరిపై సీబీఐ అభియోగ పత్రాలు దాఖలు చేసింది. తాజాగా డీఎస్‌కే గ్రూపునకు రుణం మంజూరులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సీఈఓ రవీంద్ర మరాఠే సహా పలువురు ఉన్నతాధికారులు అరెస్టయ్యారు. ప్రభుత్వరంగ బ్యాంకుల విశ్వసనీయతను మసకబారుస్తున్న పరిణామాలివి. బ్యాంకింగ్ రంగానికి ఇది అత్యంత క్లిష్ట సమయం. ఈ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొని సత్వరం నష్టనివారణ చర్యలు చేపట్టాలి. బ్యాంకుల అధిపతుల ఎంపికలో ప్రతిభావంతులైనవారికే ప్రాధాన్యం ఇవ్వాలి. వారి నియామకాల్లో కఠిన నిబంధనలు పాటించాలి. పనితీరును సమీక్షించే విధానంలో మార్పులు అవసరం. ఉన్నతాధికారుల పనితీరు మెరుగు పడకుంటే ఎక్కువ కాలం వేచిచూడకుండా ఉద్వాసన పలికేందుకూ వెనకాడరాదు. పీఎస్‌బీలో కార్పొరేట్ పాలనను మెరుగుపరచే దిశలో మరిన్ని చర్యలు చేపట్టాలి. గతంలో కొన్ని సందర్భాల్లో బ్యాంకు ఉన్నతాధికారుల (సీఈఓ, ఈడీ) పనితీరు అధ్వానంగా ఉన్నప్పటికీ, వారికి పదోన్నతులు కల్పించారు. ఈ పరిస్థితులు మారాలి. దీంతోపాటు రాజకీయ జోక్యానికి తెరదించాలి.

మాయని మచ్చలు

బ్యాంకుల బోర్డులను మరింత క్రియాశీలంగా, పటిష్ఠంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. బ్యాంకింగ్ పర్యవేక్షణ విధానాన్ని పటిష్ఠపరచడంలో రిజర్వ్‌బ్యాంకు గణనీయ ప్రగతి సాధించిందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్‌ఎఫ్), ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'ఫైనాన్షియల్ సెక్టర్ అసెస్‌మెంట్ ప్రోగ్రాం' నివేదికలో పేర్కొనడం అభినందనీయం. ఇటీవల వెలుగుచూసిన కుంభకోణాల దృష్ట్యా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లుతున్న తరుణంలో దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. గతంలో ఎఫ్‌ఆర్‌డీఐ (ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) ముసాయిదా బిల్లుపై చెలరేగిన దుమారం అంతా ఇంతా కాదు. ఆ బిల్లుపై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను దూరం చేయడంలో ప్రభుత్వం, ఆర్‌బీఐ విఫలమయ్యాయి. నగదు కొరత విషయంలోనూ ఆర్‌బీఐ సకాలంలో స్పందించలేదు. ఫలితంగా ప్రజలు క్రమంగా బ్యాంకులకు దూరమయ్యే దుస్థితి నెలకొంది. ఇటువంటప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచే దిశగా ఆర్‌బీఐ చర్యలు చేపట్టాలి. నష్టనివారణ చర్యల్లో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించాలి. రిజర్వ్‌బ్యాంకు గణాంకాల ప్రకారం గత మే నాటికి దేశంలో ప్రజల వద్ద అత్యధికంగా రూ.18.5 లక్షల కోట్ల నగదు ఉంది. ప్రజల వద్ద ఇంత నగదు ఉండటం ఒక రికార్డు. నగదును బ్యాంకుల్లో డిపాజిట్ చేయకుండా తమ వద్దే ఉంచుకొంటున్నారంటే- బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో ఎంతగా అపనమ్మకం పెరిగిందో అర్థమవుతోంది. ఈ పరిస్థితిని సరిదిద్దకపోతే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది.

గతంలో జరిగిన రుణ సంబంధ కుంభకోణాల్లో పలు బ్యాంకుల మాజీ సీఎమ్‌డీలు, సీఈఓలు, ఉన్నతాధికారులు అరెస్టు కావడం, సీబీఐ అభియోగ పత్రాలు దాఖలు చేయడంతో బ్యాంకింగ్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. కెనరా బ్యాంకు మాజీ సీఎమ్‌డీ ఆర్‌కే దూబే సహా ఆ బ్యాంకు మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అరెస్టయ్యారు. తాజాగా డీఎస్‌కే సంస్థ రుణ వ్యవహారంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సీఈఓతో పాటు ఆ బ్యాంకు ఉన్నతాధికారులను అరెస్ట్ చేయడంతో ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ధ్వజమెత్తింది. ఈ దశలో బ్యాంకింగ్ వర్గాల విశ్వాసం దెబ్బతినకుండా, గతంలో చోటుచేసుకొన్న ఘటనలు బ్యాంకుల రుణ వితరణపై ప్రభావం పడకుండా- అటు ప్రభుత్వం, ఇటు ఆర్‌బీఐ అవసరమైన చర్యలు చేపట్టాలి. ప్రభుత్వరంగ బ్యాంకులు వాటి అంతర్గత పర్యవేక్షణ విభాగాలను ప్రక్షాళించాలి. శాఖల పర్యవేక్షణ విధానంలో మార్పులు తేవాలి. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై ఆ బ్యాంకు నిర్వహించిన అంతర్గత దర్యాప్తులో దిగ్భ్రాంతికర లొసుగులు బయటపడ్డాయి. కీలక విభాగాల్లో అడ్డగోలుగా నిబంధనల అతిక్రమణ బయటపడింది. కొన్నేళ్ళుగా అవకతవకలు జరుగుతున్నా గుర్తించడంలో బ్యాంకు యాజమాన్యం విఫలమైంది. భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. ఖాతాదారుల విశ్వాసం చూరగొనేందుకు కృషి చేయడం యావత్ బ్యాంకింగ్ వ్యవస్థ తక్షణ కర్తవ్యం!

(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

ఎక్కడా పెట్టుబడులు?

స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో తయారీ రంగం వాటా 1950-51లో సుమారు తొమ్మిది శాతం ఉంది. 2016-17 నాటికి అది 16.57 శాతానికి చేరుకుంది. అంటే గత 67 ఏళ్లలో వృద్ధి ఎనిమిది శాతమే. అదే సమయంలో చైనాలో ఈ పెరుగుదల సుమారు 20 శాతంగా నమోదైంది. ప్రస్తుతం 29 శాతంగా ఉంది. ప్రపంచ తయారీ రంగంలో చైనా వాటా సుమారు 23 శాతం. మనదేశం వాటా మూడు శాతమే. భారత్ తయారీ రంగం దుస్థితికి ఈ గణాంకాలు దర్పణం పడుతున్నాయి. అందుకే ఎగుమతుల పెంపు, 'జీరో 'డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్'గా తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, ప్రపంచమే భారత్ వైపు చూసేలా చేయడం తదితర లక్ష్యాలతో మోదీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' (భారత్‌లో తయారీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2014 సెప్టెంబరు 25న ప్రారంభమైన 'భారత్‌లో తయారీ' నాలుగేళ్ల ప్రగతి గణాంకాలు నిర్వేదాన్నే కలిగిస్తున్నాయి!

సాకారం కాని లక్ష్యం

పరిశ్రమల శాఖ గణాంకాల ప్రకారం 2014-15లో దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల విలువ 4,514.8 కోట్ల డాలర్లు. 2013-14తో పోల్చితే (3,604.6 కోట్ల డాలర్లు) ఇది సుమారు 25శాతం అధికం. 2015-16లో విదేశీ పెట్టుబడుల విలువ సుమారు 23శాతం వృద్ధితో 5,555.9 కోట్ల డాలర్లు. పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో 2016-17లో కేవలం ఎనిమిది శాతం వృద్ధితో 6,008 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో గత డిసెంబరు నాటికి విదేశీ పెట్టుబడుల విలువ 4,820 కోట్ల డాలర్లు మాత్రమే. మొత్తం విదేశీ పెట్టుబడుల విలువలో కొద్దిభాగం మాత్రమే తయారీ రంగంలోకి రాగా అధిక భాగం సేవల రంగంలోకి తరలిపోయాయి. తయారీ రంగంలోకి విదేశీ పెట్టుబడులపై పెద్దనోట్ల రద్దు ప్రభావం చూపింది. ప్రపంచ కార్మిక సంస్థ అంచనాల ప్రకారం, దేశంలో 2014లో నిరుద్యోగ రేటు 3.41 శాతం ఉంది. 2017 నాటికి 3.52 శాతానికి చేరింది. ప్రపంచ స్థాయిలో పోల్చిచూస్తే భారత తయారీ రంగం పరిస్థితి మెరుగు పడలేదు. ఏ ఆశయంతో 'భారత్‌లో తయారీ'ని ప్రభుత్వం ప్రారంభించిందో, నాలుగేళ్లలో అది సాకారం కాలేదు. 2014 నుంచి విదేశీ పెట్టుబడులు పెరిగినప్పటికీ 'తయారీ రంగం' మీద వాటి ప్రభావం అంతగా లేదు. తయారీ రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలన్న లక్ష్యం సైతం నెరవేర లేదు. నిజానికి 2014కి ముందు మనదేశంలో పెట్టుబడులు పెడుతున్న మొదటి ఏడు దేశాలు మారిషస్, సింగపూర్, జపాన్, బ్రిటన్, నెదర్లాండ్స్, అమెరికా, జర్మనీ. 2014 తరవాతా పరిస్థితి మారలేదు. అంటే కొత్తగా ఏ ఇతర దేశం నుంచి విదేశీ పెట్టుబడులను తయారీ రంగంలోకి ఆకర్షించలేదన్న మాట. 2014కు ముందు విదేశీ పెట్టుబడులు ముంబయి, న్యూదిల్లీ, బెంగళూరు, చెన్నై, అహమ్మదాబాద్, హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకే పరిమితమయ్యాయి. భారత్‌లో తయారీ ద్వారా చిన్న పట్టణాల్లో ఉపాధి అవకాశాలు

'భారత్‌లో తయారీ'- మందగమనం



పెంచాలనుకున్న ప్రభుత్వ ఆలోచన సాకారం కాలేదు. భారత్‌లో తయారీ నినాదం తరవాత విదేశీ పెట్టుబడులు ఎక్కువగా ముంబయి, దిల్లీ వంటి నగరాలకే మళ్లాయి. అభివృద్ధి చెందని బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో తయారీ రంగ పరిస్థితి సరేసరి. మోదీ ప్రభుత్వం గద్దెనెక్కిన నాటి నుంచి విదేశీ పెట్టుబడులు అధికమైనా, కార్యక్రమం లక్ష్యాలను మాత్రం అందుకోలేక పోయామన్నది నిష్ఠుర సత్యం. నాలుగేళ్లుగా విదేశీ పర్యటనల్లో భారత్‌లో తయారీ ఉద్దేశాలను మోదీ పెట్టుబడిదారులకు వివరించి ఈ రంగంలోకి పెట్టుబడులను ఆహ్వానించినా సత్ఫలితాలు ఒనగూడలేదు. నిజానికి, దేశంలో సేవలం రంగం అభివృద్ధి చెందుతోంది. స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 54 శాతం వాటా దీనిదే. కేవలం 16 శాతమే ఉన్న తయారీ రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచాలనుకోవడం సాహసోపేత నిర్ణయమనే చెప్పాలి. భారత్‌లో తయారీ ఉద్దేశాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాచరణ ఉందా అంటే లేదనే చెప్పాలి. పెట్టుబడిదారులు తరలివచ్చి వస్తువులు ఉత్పత్తి చేయాలంటే అందుకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించాలి. వాటిల్లో ముఖ్యమైనవి సాంకేతికత, నైపుణ్యం కలిగిన కార్మికులు, కఠిన నిబంధనల సడలింపు, అంతర్జాతీయ స్థాయిలో రహదారులు, రవాణా, విద్యుత్, మౌలిక సదుపాయాలు. ఇటువంటి సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్న దేశాన్ని తయారీ రంగంలో ప్రపంచ స్థాయిలో నిలపడం సాధ్యమేనా? మెరుగైన వసతులు, సాంకేతికత, కార్మికుల లభ్యత కారణంగానే జపాన్, చైనా వంటి దేశాలకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. ఏ దేశమైనా తయారీ రంగాన్ని అభివృద్ధి చేయాలంటే ముందుగా మౌలిక వసతులపై దృష్టిపెట్టాలి. ప్రభుత్వ నిర్ణయాలు కూడా అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకుని ఉండాలి.

గ్రామీణ భారతానికి దక్కని మన్నన

నిజానికి 'భారత్‌లో తయారీ' నినాదంతో తయారీ రంగానికి ఒరిగిందేమీ లేకపోగా, పెద్ద నోట్ల రద్దు నిర్ణయం వల్ల దేశీయ తయారీ రంగం అస్తవ్యస్తమైంది. ఇది ప్రజల కొనుగోలు శక్తిపై తీవ్ర ప్రభావం చూపింది. ఫలితంగా తయారీ రంగమే కాకుండా అన్ని రంగాలూ కుదేలయ్యాయి. సంప్రదాయక తయారీ రంగాన్ని బలోపేతం చేయడం మాని, భారత్‌లో తయారీ నినాదంతో విదేశీయులకు ఎర్ర తివాచీ పరవడం విడ్డూరం! సరైన పెట్టుబడి, మార్కెటింగ్ సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం లేక గడచిన రెండు దశాబ్దాలుగా వివిధ చేతి, కుల వృత్తులు, గ్రామీణ కుటీర పరిశ్రమలు పడకేశాయి. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి అన్న విషయాన్ని ప్రభుత్వాలు విస్మరించాయి. అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశంలో గ్రామీణ ప్రగతి పునాది పటిష్ఠంగా లేకపోతే దేశార్థికాభివృద్ధి సౌధం కూలిపోవాల్సిందే. ఇది ప్రభుత్వాలకు తెలియని విషయం కాదు. ఇప్పుడు ప్రభుత్వాలు చేయాల్సింది విదేశాలకు వెళ్ళి అక్కడి పరిశ్రమల యజమానులను భారత్‌కు రమ్మని కోరడం కాదు- కుదేలైన గ్రామీణ తయారీ రంగాన్ని మెరుగుపరచడం తక్షణ కర్తవ్యం. వివిధ చేతివృత్తులు, కుల వృత్తులు, గ్రామీణ, కుటీర పరిశ్రమల ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం, విపణి సదుపాయాలు కల్పించాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వస్తువుల తయారీ, పరిశోధనలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ప్రతి జిల్లాను ప్రామాణికంగా తీసుకుని తీసుకుని సమగ్ర ప్రణాళికలు రచించాలి. ఇప్పటికైనా కేంద్రం వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన తక్షణ కర్తవ్యం. సంప్రదాయక తయారీ రంగాన్ని అభివృద్ధిపరచే ప్రణాళికలు రూపొందించాలి.

- డాక్టర్ రామకృష్ణ బండారు

ధ్యానం

మనసు అనేది, మనిషి ధరించే అంతర్ముఖ ఆభరణం! మనసు ఉంటుందన్న మాటేగానీ అది బయటకు కనిపించేది కాదు. ఏ ప్రాణికీ లేనిదీ మనిషికి ఉన్నదీ అదే! అది మనిషిని శాసించే అజ్ఞాత ప్రభువు. జులుం చలాయించే కరడు గట్టిన నియంత! మనసు చుక్కాని లేని నావలా మారితే మనిషి కష్టాల వలయంలో చిక్కుకుంటాడు. కళ్లేలు మనసుపరం అయితే అది గంతలు కట్టని గుర్రంలా అడ్డదిడ్డంగా పరుగులిడుతుంది. కల్లుతాగిన కోతిలా మానవ మేధను తొలిచేస్తుంది. అందుకే పగ్గాలు మనసు పరం కాకుండా ఆంతరిక ప్రభువైన బుద్ధికి అప్పజెప్పాలి. అప్పుడే మానవ జీవితం ఒడుదొడుకులు లేకుండా ప్రశాంతంగా ఒడ్డుకు చేరుతుందంటారు పెద్దలు.

మనసు హృదయాంతర్గతమైనదని మరి కొందరి భావన. కన్నులు తెరిచినా మూసినా మనసు ప్రభావం శరీరంపై ఉండనే ఉంటుంది. ఆఖరికి నిద్రించినా మనసు మనిషి ఆలోచనలను నియంత్రించడం మానదు. నిద్రిస్తే వచ్చే కలలు మనసు తాలూకు సృజనలు, అల్లికలే! మరి నిద్రలోనూ మనిషిని వీడక అశాంతికి గురిచేసే మనసును పట్టుకొనే మార్గం లేదా అని ఆలోచించారు మహర్షులు. వారికి తట్టిన ఓ సురక్షిత పరిష్కార మార్గం 'ధ్యానం!'

ధ్యాన ప్రక్రియను ఆచరించి చూసి అది సురక్షితమైనదని, మనసును నియంత్రించగలదని నిర్ధారించుకున్నాక దాన్ని వారు లోకానికి విదితం చేశారు. అటువంటి మహనీయుల్లో గొప్పవాడు గౌతమ బుద్ధుడు. ఆయన ప్రాపంచిక బంధాలను తెంచుకొని మనసును నిగ్రహించి, బుద్ధికి పగ్గాలు అప్పగించి మహాపరి నిర్వాణం (మోక్షం) పొందిన త్యాగధనుడు. ఆయన 'ధ్యానం అంటే ఏమిటి, దాన్ని ఎలా ఆచరిస్తే మనసు నియంత్రణలోకి వస్తుందో' తెలుసుకొని శిష్యులకు, తదనంతరం వారి ద్వారా లోకానికీ విదితం చేసిన మహాపురుషుడు.



ఇంకాస్త ముందుకువెళ్లి- ధ్యానం అంటే కళ్లు మూసుకొని ఆచరించే మానసిక ప్రక్రియే కాదు, కళ్లు తెరిచి సైతం ధ్యానించవచ్చు అన్నారు మరికొందరు పరిశోధకులు. కళ్లు తెరిచి చేసే ధ్యానమూ సత్ఫలితాలనిస్తుందని కొందరు విశ్వసిస్తున్నారు.

కళ్లు తెరిచినా ఓ దృశ్యాన్ని నేరుగా వేరుగా చూడక, దృశ్యంపై మనసు లగ్నం చేయక (తదేక దృష్టి లేక) ఆచరించేదే కళ్లు తెరిచి చేసే ధ్యానం! అంటే అక్షరాలు రాసిన ఓ కాగితంపై పరోక్ష దృష్టి ఉంటే కాగితం లీలగా కనిపిస్తుంది. అక్షరాలు అలికినట్లు కనపడతాయి. వాటిని చదవలేం! అలాంటి అనుభవం (ప్రక్రియ) ధ్యానం కిందికే వస్తుందని కొందరి అభిప్రాయం. నిజానికి అది 'తురీయ స్థితి'. పరమేశ్వరుడు ఆ స్థితిలో ఎప్పుడూ ధ్యానమగ్నుడై ఉంటాడని ప్రతీతి. బుద్ధుడు ప్రవచించిన 'బౌద్ధం' ధ్యాన ప్రక్రియను కీర్తిమంతం చేసింది. రజో తమో గుణాలు తగ్గిపోయిన మరుక్షణంలో సాధకుడు చక్కగా ధ్యానం చేయగలుగుతాడని మరువకూడదు. పద్మాసనంలో లేక సిద్ధాసనంలో కూర్చుని ధ్యానం ఆచరించవచ్చు. కుర్చీలో ఆసీనులై చేయవచ్చు. ఆలోచనలు వస్తుంటాయి. అవి కంగాళీగా మారి ధ్యానానికి అవరోధం కలిగిస్తే నీటి ప్రవాహంలో సాగిపోయే కాగితం పడవను వేలితో అడ్డుకున్నట్లు వెనక్కి మరలించాలి!

ధ్యాన ప్రక్రియలు వందలకొద్దీ ఉన్నాయి. సాధకుడు ఏదో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. బుద్ధ ప్రతిపాదిత శ్వాసమీద ధ్యాస బాగా ప్రజాదరణ పొందింది. ఆహార పానీయాలు తీసుకునే రీతిలో ధ్యానం సైతం ప్రతిరోజూ చేయవలసిన సాధన అంటారు. ధ్యాన సాధనవల్ల రక్తపోటు, ఆందోళన, వయసురీత్యా మెదడు క్షీణత వంటివి తగ్గి, రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

కొత్తగా ధ్యానం ప్రారంభించినప్పుడు మనసు చేసే కోతి చేష్టలు సాధకుడికి కొంత అసౌకర్యం కలిగించవచ్చు. ఆలోచనలు కలిగించే అంతరాయాన్ని పట్టించుకోనవసరం లేదు! అదే నిజమైన ధ్యాన సాధన!! ధ్యానం కుదరడంలేదనే భావన ఓటమి కాదు, గెలుపే అని భావించాలి. ఒక దశకు చేరుకున్నాక సాధకుడు ధ్యానం చేయకుండా ఉండలేడు.

- గోపాలుని రఘుపతిరావు

వర్షం వస్తే నగరానికి వణుకే!

- కాలువల్లో పూడిక తొలగింపులో జాప్యం
- అత్యధిక ప్రాంతాల్లో నత్తనడకన సాగుతున్న పనులు
- 78 చోట్ల ప్రారంభమే కాని వైనం

ఈనాడు - అమరావతి

వర్షాలకు రహదారిపైకి నీళ్లు చేరకుండా కాలువల్లో పూడిక తొలగింపు పనులు నగరాలు, పట్టణాల్లో మంద కొడిగా 'సాగు'తున్నాయి. ముందుగా అనుకున్న ప్రకారం ఈ పాటికే పూర్తి చేయాల్సిన పనులు అత్యధిక ప్రాంతాల్లో 50 శాతం సైతం కాలేదు. కొద్దిపాటి వర్షాలకే నీటి ముంపు బెడద ఎదుర్కొనే ముఖ్యమైన నగరాలు, పట్టణాల్లో సైతం పనుల్లో పురోగతి అంతంత మాత్రమే. గత చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వర్షాలకు ముందే అన్ని పట్టణాల్లోని కాలువల్లో పూడిక తొలగింపు కోసం చర్యలు తీసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాలపై 110 పురపాలక, నగరపాలక సంస్థల్లో 502 పనుల నిర్వహణకు రెండు నెలల క్రితమే అంచనాలు రూపొందించారు. తాజా సమాచారం ప్రకారం వీటిలో ఇప్పటివరకు 146 పనులు పూర్తయ్యాయి. ఇంకా 78 పనులు ప్రారంభమే కాలేదు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. విశాఖ పట్నం, తూర్పుగోదావరి, విజయనగరం, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాలు పూడిక తొలగింపు పనుల్లో బాగా వెనుకన ఉన్నాయి. ఇప్పటివరకు ఈ జిల్లాల్లోని పురపాలక, నగరపాలక సంస్థల్లో పనులు 25% నుంచి 50% మధ్యే పూర్తయ్యాయి. నిధులు సమృద్ధిగా ఉన్నా సకాలంలో పనులు పూర్తి చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కాలువల్లో పూడిక తొలగింపును మొదటి ప్రాధాన్యంగా గుర్తించి పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా కొన్ని పట్టణాల్లో ఇప్పటికీ పనులు ప్రారంభమవలేదు.

విజయవాడ ఆటోనగర్ ప్రధాన కాలువలో తొలగించని పూడిక

ప్రధాన నగరాల్లో ఇలా...

★ విజయవాడలో 24 కిలో మీటర్ల పొడవైన బందరు, ఏలూరు, రైవస్ ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు బాధ్యత ఈ సారి జలవనరులశాఖ చేపట్టింది. ఇప్పటికే ఎక్కువ చోట్ల పనులు పూర్తయ్యాయి. నగరంలో అంతర్గతంగా ఉన్న మరో 1,231 కిలోమీటర్ల కాలువల్లో 47 కిలోమీటర్లు ప్రధానమైనవి. వర్షపు నీరు అత్యధికంగా వెళ్లే వీటిలో పూడిక తొలగింపు కోసం ఇప్పటివరకు నగరపాలక సంస్థ ప్రత్యేక కార్యాచరణ చేపట్టలేదు. రోజు వారీ నిర్వహించే పనుల్లో భాగంగా కాలువల్లో అక్కడక్కడ పూడిక తొలగిస్తున్నారు.

★ విశాఖ మహా నగరం నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి కకావికలం కావడంతో అధికారులు అప్రమత్తమై రూ.4 కోట్ల అంచనా వ్యయంతో గెడ్డల్లో, ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు పనులు ఇటీవలే ప్రారంభించారు. 17 కిలో మీటర్ల పొడవైన ప్రధానమైన గుంగుల గెడ్డ, ఎర్రి గెడ్డ, ఎస్ఆర్ కాలువలో అవసరమైనచోట పూడిక తొలగిస్తున్నారు.

★ గుంటూరులో ఈ పాటికే పూర్తి చేయాల్సిన పూడిక తొలగింపు పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పీకలవాగు, అమరావతినగర్ రోడ్డు, సుద్దపల్లిడొంక, పాత గుంటూరు కాలువల్లో పూడిక తొలగింపు కోసం రెండు నెలల క్రితమే నిర్ణయం తీసుకున్నా టెండర్లు పిలవడంలోనూ, పనుల అప్పగింతలోను ఆలస్యమయింది.

★ అనంతపురంలోని నడిమివంక, మరువంక ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు పనులు ప్రారంభమైనా నగరంలో అంతర్గతంగా ఉన్న మరో 290 కిలోమీటర్ల కాలువలపై దృష్టి సారించడం లేదు.

★ నెల్లూరులో ఈ సారి కాలువల్లో పూడిక తొలగింపు కోసం 60 చోట్ల పనులు ప్రారంభించారు. 32 కిలో మీటర్ల పొడవున చేపట్టే వీటిని ఈ పాటికే పూర్తి చేయాల్సి ఉండగా జాప్యమవుతోంది.

నాడు దినసరి కూలీలు.. నేడు వేతనజీవులు

రాజధాని నిర్మాణానికి ముందు ఈ మహిళలంతా దినసరి కూలీలు. నాడు స్థానిక పొలాల్లో రోజంతా శ్రమిస్తే రూ.200 చొప్పున కూలీ లభించేది. రాజధాని పరిధిలోని రైతులు సేద్యం నిలుపుదల చేశాక వీరంతా ఖాళీగా ఉండాల్సి వచ్చింది. దీంతో ఆదాయం లేక పూటగడవటం కష్టతరమైంది. ఈ నేపథ్యంలో.. అమరావతి అభివృద్ధి సంస్థ అధికారులు వారికి మొక్కల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం రాజధాని పరిధిలో నూతనంగా నిర్మించిన రహదారుల చెంత నాటిన మొక్కల సంరక్షణ సహా శాఖమూరులో సుమారు 300 ఎకరాల్లో నిర్మించనున్న ఉద్యానవనానికి సంబంధించి మొక్కలను సిద్ధం చేసే పనులను వీరికి అప్పగించారు. ప్రస్తుతం ఈ మహిళలంతా వెంకటపాలెం నర్సరీలో పనిచేస్తున్నారు. ఇందుకు నెలకు రూ.15 వేల చొప్పున వేతనాలు కూడా చెల్లిస్తున్నారు. కూలీ దొరక్క పస్తులుండే దుస్థితి తొలిగిపోయి.. రాజధాని నిర్మాణం పుణ్యమా అని ప్రస్తుతం ఠంచనుగా జీతాలు అందుతుండటంతో వారి మోములపై ఆనందం ఇలా తొణికిసలాడుతోంది. - ఈనాడు, అమరావతి

అర్చకుల వంశపారంపర్యం పునరుద్ధరించినట్లే

హైకోర్టు తాజా తీర్పు ఇచ్చిందని అర్చక సమాఖ్య ప్రకటన

ఈనాడు, అమరావతి: దేవదాయ, ధర్మదాయశాఖ చట్టం 33/2007 ద్వారా అర్చకుల వంశపారంపర్య హక్కులను పునరుద్ధరించినట్లేనని హైకోర్టు తాజాగా ఇచ్చిన ఒక తీర్పులో పేర్కొనడం ముదావహమని ఏపీ అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి అగ్నిహోత్రం ఆత్రేయబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దింటి రాంబాబులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు శ్రీరామలింగేశ్వరస్వామి అర్చకుడు స్వర్ణ గధాధరబాబు తన అర్చకత్వాన్ని దేవదాయశాఖ తొలగించడంతో హైకోర్టును ఆశ్రయించారని, దీనిపై తాజాగా కోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు పిటిషనర్‌కు చట్టం ప్రకారం అర్చకత్వం వారసత్వం ద్వారా పొందినట్లేనని పేర్కొందని, అతని వారసత్వ అర్చకత్వం పునరుద్ధరించాలని, సర్వీసు భూమి తిరిగి ఇవ్వాలని స్పష్టంచేసిందని వివరించారు. 17/1966 దేవాదాయ చట్టం ప్రకారం వంశపారంపర్య అర్చకత్వం ఉన్నవారందరికీ తిరిగి 33/2007 చట్ట సవరణ ద్వారా ఆ హక్కు పునరుద్ధరింపబడిందని హైకోర్టు ఈ తీర్పులో పేర్కొన్నట్లు అర్చక సమాఖ్య ఉదహరించింది. తిరుమల ప్రధాన అర్చకుడిని పదవీవిరమణ చేయించడం చట్టవిరుద్ధమన్న విషయానికి ఈ తీర్పు బలం ఇస్తోందని ఆత్రేయబాబు అభిప్రాయపడ్డారు.

అత్యున్నత ప్రమాణాలకు సర్కారు కృషి

- ప్రగతి ఫలాలు అందరికీ చేర్చేందుకు ప్రణాళిక శాఖ పనితీరు కీలకం
- అధికారుల సమావేశంలో ఆర్థికమంత్రి యనమల వెల్లడి

ఈనాడు, డిజిటల్ అమరావతి: వ్యవసాయం, పరిశ్రమలు.. ఇలా ప్రతి రంగంలో ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి చేరుకునేలా ప్రభుత్వం కృషిచేస్తోందని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. సంస్కరణల వల్లే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ప్రణాళికా విభాగం అధికారుల రెండు రోజుల సమావేశానికి మంగళవారం ఆర్థికమంత్రి యనమల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు చేర్చడానికి ప్రణాళిక, గణాంక శాఖల పనితీరు ప్రామాణికంగా మారిందన్నారు. రంగాలవారీగా నిధుల వినియోగంలో సమదృష్టి, సమతుల్యత పాటించాలంటే ప్రణాళిక విభాగం సేవలు కీలకమన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం కావాలంటే సామాన్యుల ఆర్థిక మూలాల్లో సంఘటిత పెరుగుదల ఉండాలని చెప్పారు. సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ(సీఎఫ్ఎంఎస్) అమలులో ప్రారంభంలో ఇబ్బందులున్నా ప్రస్తుతం చాలా వరకు పరిష్కరించగలిగామన్నారు. వరుసగా నాలుగేళ్లుగా రెండంకెల వృద్ధి సాధిస్తున్నామని, సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగిపోవాలంటే సమీకృత అభివృద్ధి సాధించడం ప్రధానమన్నారు. అందుకే ప్రతి కుటుంబం 10వేల ఆదాయం పొందాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే గ్రామీణ ఆదాయం పెంచగలిగామన్నారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తలసరి ఆదాయం తక్కువగా ఉందని, అందుకే విభజన హామీలు నెరవేర్చాలని కేంద్రాన్ని కోరుతున్నామని వెల్లడించారు.

పనితీరు ఆధారంగానే పదోన్నతులు...

రియల్‌టైం ఔట్‌కమ్ పర్యవేక్షణ విభాగం ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని, దాని ఆధారంగానే పదోన్నతులు ఉంటాయని ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం 11 శాతం వృద్ధిరేటును 15 శాతానికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్ర ప్రణాళిక బోర్డు కార్యదర్శి సంజయ్‌గుప్తా మాట్లాడుతూ ప్రణాళిక శాఖలో సత్ఫలితాల సాధనకు అధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక కార్యదర్శి చలపతి రావు, సంచాలకులు ఏవీఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

అబద్ధాలకోరుల పార్టీ తెదేపా: జీవీఎల్

ఈనాడు, దిల్లీ: పోలవరానికి కేంద్రం ఇంకా రూ.1,935 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందంటూ ఆంధ్రప్రదేశ్ జలవనరుల మంత్రి చేసిన ప్రకటనను భాజపా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఖండించారు. "తెలుగుదేశం అబద్ధాలకోరులపార్టీ. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఇంకా రూ.1,935 కోట్లు చెల్లించాల్సి ఉందంటూ తాజాగా మంత్రి ఉమ అబద్ధాలాడారు. కేంద్రం పైసాకూడా బకాయి లేదనడానికి ఆర్‌టీఐ కింద ఇచ్చిన సమాధానమే నిదర్శనం" అంటూ విజయవాడకు చెందిన సౌరబ్ ఎంకె హమర్ అనే వ్యక్తికి ఆర్‌టీఐ కింద పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఇచ్చిన సమాధానాన్ని మంగళవారం రాత్రి ట్విట్టర్‌లో ఉంచారు.

తెదేపావి దొంగ దీక్షలు.. కొంగ జపాలు

ఈనాడు, దిల్లీ: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై తెదేపా నేతలు చేస్తున్నవి దొంగ దీక్షలు, కొంగ జపాలని భాజపా నేతలు యడ్లపాటి రఘునాథ్‌బాబు, కందుల రాజమోహన్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. ఉక్కుశాఖ మంత్రి చౌదరి బీరేందర్ సింగ్‌ను కలిశామని.... కడప, బయ్యారంలలో ఉక్కు పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని ఉక్కు శాఖ మంత్రి తెలిపారని చెప్పారు. ప్రధానమంత్రి త్వరలోనే కడప పరిశ్రమకు శంకుస్థాపన చేస్తారని తెలిసే తెదేపా నేతలు దీక్షలు చేస్తున్నారని ఆరోపించారు.

లభ్యమైన తూటాలను పరిశీలిస్తున్న పోలీసులు

గుంతలో బయటపడిన పేలుడు పదార్థాలు

- 50 పెట్టెల్లో తూటాలు లభ్యం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులోని రామేశ్వరం సమీపం తంగచ్చిమఠం ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకు కోసం గుంత తవ్వుతుండగా... దాదాపు 50 పెట్టెల్లో తూటాలు, భారీగా పేలుడు పదార్థాలు బయట పడటం కలకలం రేపింది. తంగచ్చిమఠం ప్రాంతానికి చెందిన జాలరి ఎడిసన్ సోమవారం సాయంత్రం తన ఇంటికి సెప్టిక్ ట్యాంకు కోసం గుంత తవ్వారు. సుమారు ఐదు అడుగులు తవ్వగా... అందులో పాత తూటాలు బయట పడ్డాయి. దీని గురించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ ఓం ప్రకాశ్ మీనా విచారణకు ఆదేశించారు. గుంత ఇంకా లోతుగా తవ్వగా తూటాలు, పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. అర్ధరాత్రి వరకు ఈ పనులు కొనసాగాయి. సుమారు 50 పెట్టెల్లో మొత్తం 10 వేలకుపైగా వివిధ రకాలైన తూటాలు అందులో ఉన్నాయి. 1983లో శ్రీలంక ప్రభుత్వానికి, అక్కడి తమిళులకు జరిగిన యుద్ధ సమయంలో తమిళ పోరాట యోధులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. రామేశ్వరం, తంగచ్చిమఠం ప్రాంతంలో ప్రభాకరన్, పద్మనాభంల నేతృత్వంలోని సంస్థలకు చెందిన వారు ఈ శిక్షణలో పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ హత్య తర్వాత ఈ శిక్షణ ఆపేసి సదరు వ్యక్తులను వెనక్కు పంపించేశారు. అప్పుడు వారు తమ వద్ద ఉన్న తూటాలు, పేలుడు పదార్థాలను పూడ్చిపెట్టి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

EDUCATION
★ ADMISSIONS Ag. B.Sc, ICAR APPROVED@7.5L. ✆ 7083847452.

హిందీ.. హిందూ.. హిందుస్థాన్

- భాజపాకు ఈ మూడు తప్ప మరో ఆలోచన లేదు
- ఆంధ్రప్రదేశ్‌ను నిలువునా మోసగించారు
- తెదేపా పోరాటానికి డీఎంకే సంపూర్ణ మద్దతు
- కడపలో సీఎం రమేష్ దీక్షలో ఎంపీ కనిమొళి
- 7వ రోజు దీక్షకు పలువురి సంఘీభావం

ఈనాడు - కడప

'హిందీ.. హిందూ.. హిందుస్థాన్.. ఈ మూడు తప్ప భాజపాకు మరో ఆలోచన లేదు. రాష్ట్రాలు, రాష్ట్ర ప్రజల అవసరాలు, ఆకాంక్షలు మోదీ ప్రభుత్వానికి అవసరం లేదు. ఎన్నికల వేళ ప్రధాని అభ్యర్థిగా ఆంధ్రలో పర్యటించినప్పుడు మోదీ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తానని, ప్రత్యేక హోదా ఇస్తానని హామీ ఇచ్చారు. చివరకు మోసగించారు. ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా దేశాన్నీ మోసం చేస్తున్నారు' అని డీఎంకే అధినేత కరుణానిధి కుమార్తె, రాజ్యసభ సభ్యురాలు కనిమొళి ధ్వజమెత్తారు. కడపలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి చేస్తున్న ఆమరణ దీక్షా శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. డీఎంకే తరఫున పూర్తి సంఘీభావం ప్రకటించారు. ఏపీ మంత్రులు కేఈ కృష్ణమూర్తి, దేవినేని ఉమా, అఖిల ప్రియ, ఆదినారాయణరెడ్డితో పాటు సినీ హీరో శివాజీ తదితరులూ హాజరై దీక్షకు మద్దతిచ్చారు. ఈ సందర్భంగా కనిమొళి మాట్లాడారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఒకే తల్లి బిడ్డల్లా కలసిమెలసి ఉండాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ విభజన వేళ సీఎం రమేష్‌తో సహా అందరూ సభలో అలుపెరగని పోరాటం చేశారని, అభివృద్ధికి తోడ్పాటునిస్తారని నమ్మి భాజపాకు ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతిచ్చినా ఫలితం లేకపోయిందని విమర్శించారు. ఏడు రోజులుగా ఇద్దరు ప్రజాప్రతినిధులు ఆమరణ దీక్ష చేస్తున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. ఏపీకి అన్యాయం చేయడం ద్వారా భాజపా అన్ని రాష్ట్రాల్లోనూ నమ్మకాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అవసరాన్ని పేర్కొంటూ కేంద్రంపై చంద్రబాబుతో కలిసి సమష్టి పోరాటం చేపడతామని స్పష్టం చేశారు. కడప ఉక్కు దీక్ష ప్రతి ఒక్కరిలోనూ స్ఫూర్తి నింపుతోందని, తన తండ్రి కరుణానిధి, సోదరుడు స్టాలిన్ సీఎం రమేష్ దీక్షకు సంఘీభావం తెలిపారని, వారి దీక్ష విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

రమేష్, రవిలకు సంఘీభావం తెలుపుతున్న డీఎంకే నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు కనిమొళి

★ మోదీ అంటే మినిస్టర్ ఆఫ్ డెస్ట్రాయ్ డెమోక్రసీ అన్న పేరు సొంతం చేసుకున్నారని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి విమర్శించారు.

★ గాలి జనార్దన్‌రెడ్డికి వేలాది ఎకరాలను స్టీల్ ప్లాంటు కోసం కేటాయిస్తే చేతులెత్తేశారని, ఇప్పుడు మళ్లీ గాలిమాటలు మాట్లాడుతున్నారని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు.

★ కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొచ్చే సత్తా రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని మంత్రి అఖిలప్రియ పేర్కొన్నారు.

★ ఇప్పటికే ముగ్గురు ఐఏఎస్ అధికారులు విధుల నుంచి బయటకొచ్చి చంద్రబాబును తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, త్వరలో మరో అధికారి ఇదే పంథాలోకి వస్తున్నట్లు సినీహీరో శివాజీ చెప్పారు. రమణ దీక్షితులు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

కార్యక్రమంలో విప్ షరీఫ్, రామసుబ్బారెడ్డి, మేడా మల్లికార్జున్‌రెడ్డి, మాజీమంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, తెదేపా నేతలు బొజ్జల సుధీర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

★ సీఎం రమేష్‌కు షుగర్ లెవెల్స్ గణనీయంగా తగ్గినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. బీటెక్ రవికి షుగర్ లెవెల్స్ తగ్గడంతో పాటు కామెర్లు సోకినట్లు తేల్చారు.

356వ రోజుకు దీక్షలు

కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని డిమాండు చేస్తూ కడప కోటిరెడ్డి కూడలిలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (రాకపా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు మంగళవారంతో 356వ రోజుకు చేరాయి. ఉక్కు పరిశ్రమ రాకుంటే సీమ శ్మశానమవుతుందని కాటికాపరులు వేషధారణతో పలువురు దీక్షల్లో కూర్చుని నిరసన తెలిపారు. మరోవైపు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు మంగళవారం కడప రైల్వేస్టేషన్‌లో రైల్‌రోకోకు యత్నించారు. స్టేషన్‌లో పోలీసులు ముందస్తుగా మోహరించగా ఉద్యమకారులు మరోమార్గంలో వెళ్లి పట్టాలపై బైఠాయించారు. పోలీసులు అప్రమత్తమై వారందరినీ స్టేషన్ బయటకు ఈడ్చుకొచ్చారు. కొందరిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

రమేష్ ఆమరణ దీక్షపై రాజ్యసభకు తెదేపా లేఖ

ఈనాడు, దిల్లీ: కడప ఉక్కు కర్మాగారం కోసం తెదేపా రాజ్యసభ సభ్యుడు సీఎంరమేష్ గత ఏడు రోజులుగా చేస్తున్న దీక్ష గురించి తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ రాజ్యసభ సచివాలయానికి లేఖ ద్వారా తెలిపింది. సీఎం రమేష్ ఈనెల 20వ తేదీ నుంచి ఆమరణ దీక్షచేస్తున్నట్లు అందులోపేర్కొంది.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF A.P.LIMITED
Corporate Office : H.No.19-13-65/A, Srinivasapuram, Tiruchanoor Road, Tirupati - 517503
Notification for filling up of the post of DIRECTOR (Technical) in APSPDCL
Applications are invited from eligible candidates for filling up of post of DIRECTOR (Technical) on the Board of APSPDCL, a company wholly owned by the Government of Andhra Pradesh. The details of eligibility criteria, other detailed instructions and prescribed format may be viewed at APSPDCL website www.apspdcl.in
Place: Tirupati, Dt: 27.06.2018 CHAIRMAN & MANAGING DIRECTOR

- సువ్యవస్థిత క్షేత్రంలో భారతదేశపు అన్నిటి కన్నా పెద్ద యాసెట్ ఫైనాన్సింగ్ ఎన్‌బీఎఫ్‌సీ నుండి ట్రేడెబుల్ ఎన్‌సీడీలు**
- ఎన్‌సీడీల వడ్డీపై ఆదిలోనే పన్ను మినహాయింపు లేదు
- ముందు వచ్చిన వారికి ముందు ఎలాట్‌మెంట్ చేయబడుతుంది*
- కనీస అభ్యర్థన ₹10,000*
- జ్యేష్ఠ పౌరులకు 0.25% అదనంగా*

SHRIRAM Commercial Vehicle Finance
A WINNING RELATIONSHIP
సాధించే విశ్వాసం

ఇష్యూ జూన్ 27 నుండి జులై 20, 2018 వరకు తెరిచి ఉంటుంది**

*వివరమైన నియమ-నిబంధనల కొరకు దయచేసి జూన్ 22, 2018 తేదీగల షెల్ఫ్ ప్రాస్పెక్టస్‌ని ('షెల్ఫ్ ప్రాస్పెక్టస్') మరియు జూన్ 25, 2018 తేదీగల ట్రాంచ్ 1 ప్రాస్పెక్టస్‌ని చదవండి. **సబ్‌స్క్రిప్షన్ చేసేందుకు ఈ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ లిస్ట్ జూన్ 27, 2018 నుండి జులై 20, 2018 వరకు పని రోజుల్లో ఉ. 10.00 నుండి సా. 5.00 వరకు తెరిచి ఉంటుంది. కాకపోతే ఈ ఇష్యూ, అవసరమైన ఆమోదాలకు ఆధీనమై యథాక్రమంగా అధికృతమైన మా కంపెనీ డైరెక్టర్స్ కమిటీ వివేచనాత్మక నిర్ణయంపై సమయానికి ముందైన తేదీకి లేదా సమయానికి తరువాతైన తేదీకి క్లోజ్ చేయబడవచ్చు. ఇష్యూ సమయానికి ముందుగా లేదా తరువాత క్లోజ్ చేయబడే పక్షంలో, సందర్భానుసారంగా, కాబోయే పెట్టుబడిదారులకు ఒక ప్రముఖ జాతీయ దినపత్రికలో ప్రకటన/ల ద్వారా ఆ విషయం గురించి సూచన అట్టి సమయానికి ముందైన క్లోజర్ తేదీన గానీ, ఆ తేదీలోగా గానీ లేదా ఇనిషియల్ క్లోజింగ్ తేదీన అందజేయబడేలా మా కంపెనీ నిశ్చితపరుస్తారు.

రెజిస్టర్డ్ ఆఫీస్: మూకాంబిక కాంప్లెక్స్, 3 వ అంతస్తు, నం. 4, లేడీ దేసిక రోడ్, మైలాపూర్, చెన్నై - 600004.
కార్పొరేట్ ఆఫీస్: శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, వాక్‌హార్డ్ట్ టవర్స్, లెవెల్-3, వెస్ట్ వింగ్, సీ-2, జీ బ్లాక్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబయి 400 051. టెలి: +91 22 4095 9595. టోల్-ఫ్రీ: 1800 2000 011. ఈమెయిల్: corpcom@stfc.co.in

శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ('కంపెనీ'), CIN: L65191TN1979PLC007874 | ఆర్‌బిఐ రిజిస్ట్రేషన్ నంబర్: A-07-00459...

పోలవరానికి కేంద్రం బకాయిలు లేవు

- ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు..
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: పోలవరం పనులకు కేంద్రం రూపాయి కూడా బకాయి లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విజయవాడలో మంగళవారం రాష్ట్ర మహిళామోర్చా కార్యవర్గ సభ్యురాళ్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, పార్టీ జాతీయ మహిళామోర్చా ఇన్‌ఛార్జి పురందేశ్వరి విలేకర్లతో విడివిడిగా మాట్లాడారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..కడపలో ఉక్కు పరిశ్రమ, దుగరాజపట్నం నౌకాశ్రయం రావాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెదేపాలో చేరిన వైకాపా సభ్యులు కొందరు రాజీనామా చేసి చాలాకాలమైనా ఇప్పటివరకు తదుపరి చర్యలు తీసుకోలేదని చెప్పారు. పోలవరాన్ని యూపీఏ ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినా నిధులు కేటాయించలేదని వివరించారు. దీనిని వ్యతిరేకిస్తూ తాను కాంగ్రెస్‌కు రాజీనామా చేశానని, భాజపానే ఏడు ముంపు మండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఏపీలో కలిపిందని గుర్తుచేశారు. మహిళామోర్చా జాతీయ కార్యదర్శి విక్టోరియాగౌరి మాట్లాడుతూ.. జన్‌ధన్, ఉజ్వల, ముద్ర, సురక్షయోజన వంటి పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడుతున్నాయన్నారు. సమావేశంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.మాలతీరాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిలకలూరిపేటకు చెందిన పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్నం శ్రీనివాసరావు, ఆయన అనుచరులు భాజపాలో చేరారు.

భాజపా మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ. చిత్రంలో పురందేశ్వరి తదితరులు

శుద్ధజల యంత్రాలను అందిస్తున్న కంపెనీ డివిజనల్ హెడ్ సన్‌బూహర్

స్వచ్ఛంద సంస్థలకు ఎల్.జి. ఆధ్వర్యంలో శుద్ధజల యంత్రాల పంపిణీ

విజయవాడసిటీ, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లాలోని చిన్నారులు, వృద్ధులు, అనాథలకు సేవలందిస్తున్న పదిహేను స్వచ్ఛంద సంస్థలకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఉచితంగా శుద్ధజల యంత్రాలను పంపిణీ చేసింది. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇండియా ప్యూరీకేర్ డివిజనల్ హెడ్ సన్ బూహర్ శుద్ధజల యంత్రాలను అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సోనోవిజన్ అధినేత పొట్లూరి భాస్కరమూర్తి మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాటు వాటికి ఉచితంగా సర్వీస్ అందిస్తామని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం సంతృప్తిగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎల్‌జీ బ్రాంచి మేనేజర్ కరటం వెంకట కృష్ణాజీ పాల్గొన్నారు.

కొత్త డీజీపీ ఎంపికపై కసరత్తు!

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కొత్త డీజీపీ ఎంపికపై కసరత్తు మొదలైంది. 1986 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు గౌతమ్ సవాంగ్, ఆర్.పి. ఠాకూర్‌లు నూతన డీజీపీ రేసులో ముందున్నట్లు సమాచారం. ప్రస్తుత డీజీపీ ఎం.మాలకొండయ్య ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆయనను మినహాయిస్తే ఏపీ క్యాడర్‌లో డీజీపీ హోదా కలిగిన అధికారులు ఏడుగురుంటారు. సీనియారిటీ ప్రకారం చూస్తే 1982 బ్యాచ్‌కు చెందిన ఎస్.వి.రమణమూర్తి అందరికంటే ముందున్నారు. ఆ తర్వాత సీనియారిటీ జాబితాలో 1986 బ్యాచ్‌కు చెందిన వీఎస్‌కే కౌముది, ఆర్.పి.ఠాకూర్, వినయ్ రంజన్ రే, డి.గౌతమ్ సవాంగ్ వరుసగా ఉన్నారు. వీరిలో వీఎస్‌కే కౌముది ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించే డీజీపీ ఎంపిక కమిటీ సీనియారిటీ ఆధారంగా నలుగురు అధికారుల పేర్లను పరిగణనలోకి తీసుకుని పరిశీలించే అవకాశముంది. ఆ జాబితాలో ప్రస్తుత రోడ్డు భద్రతా సంస్థ ఛైర్మన్ ఎస్.వి.రమణమూర్తి, ఏసీబీ డీజీపీ ఆర్.పి.ఠాకూర్, జైళ్ల శాఖ డీజీపీ వినయ్ రంజన్ రే, విజయవాడ నగర పోలీసు కమిషనరు గౌతం సవాంగ్‌ల పేర్లు ఉండొచ్చు. అయితే వీరిలో గౌతం సవాంగ్, ఆర్.పి.ఠాకూర్‌లలో ఒకరు డీజీపీగా నియమితులయ్యే అవకాశముందని పోలీసు వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంపై ఇది ఆధారపడి ఉంటుంది. వీరిరువురిలో గౌతం సవాంగ్‌కు అవకాశాలు అధికంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే బుధ, గురువారాల్లో దీనిపైన పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది. మరో ఏడాదిలోగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎవర్ని డీజీపీ చేస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది.

దిల్లీకీ రైతుల 'మహా'యాత్ర

దిల్లీ: మహారాష్ట్రలో అత్యంత భారీగా నిర్వహించిన రైతుల ప్రదర్శన (లాంగ్ మార్చ్) విజయవంతమైన నేపథ్యంలో.. దేశ రాజధానిలోనూ మరో కార్యక్రమం చేపట్టేందుకు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) సిద్ధమవుతోంది. గత మార్చిలో పూర్తిగా రుణమాఫీ తదితర అనేక డిమాండ్లతో నాసిక్ నుంచి ముంబయి వరకు దాదాపు 180 కి.మీ.ల మేర రైతులు ప్రదర్శన నిర్వహించిన సంగతి తెలిసిందే. దిల్లీ ప్రాంతంలోనూ ప్రదర్శన చేపట్టేందుకు ఏఐకేఎస్ ప్రతినిధులు మంగళవారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, GUNTUR CIRCLE
Tenders invited from Contractors for NIT No. SE/AE2/81 to 83/2018-19, Dated: 25.06.2018 in GUNTUR DISTRICT for 3 works - Est. Cost Varies from Rs.45.00 Lakhs to Rs.87.50 Lakhs.
Last date for receipt of Tender 11.07.2018 upto 4.00 PM
Note: For further details can be viewed at https://tender.eprocurement.gov.in or contact 0863-2234950
Sd/- N.NAGESWARA RAO,
Superintending Engineer, APEWIDC, Guntur.

APEITA
ANDHRA PRADESH ELECTRONICS & IT AGENCY (APEITA)
Rushikonda, Visakhapatnam, A.P. - 530045.
Tender Call Notice for Selection of Fintech Challenge Partner for Vizag Fintech Festival to be held on Oct 8-12th, 2018 at Visakhapatnam.
Time schedule of various tender related events:
Bid calling date: 14-06-2018, Bid closing date: 05-07-2018
Bid document fee: Rs.500/-, APEITA Contact: Gm027-elits@ap.gov.in
For further details regarding Tender notification, specifications and Digital certificate and download the RFP, please visit http://tender.apeprocurement.gov.in
Group CEO, APEITA

ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ
లెనిన్ సెంటర్, గవర్నర్‌పేట్, విజయవాడ-520002 (ఆం.ప్ర.)
ఇ. ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
NIT No. 15/CRDA-13022(31)/9/2018-AO3 OMG-CRDA & 16/CRDA-13022(31)/25/2018-TO 1-T AND T-APCRDA తేది: 26.06.2018.
పని పేరు:
1. "గుంటూరులో వెంగళాయపాలెం మెయిన్ రోడ్‌తో కైలాసగిరి రోడ్‌ను కలిపే లింక్ రోడ్‌కు BT రోడ్‌ను వేయుట" ECV-- రూ. 1,11,08,165/-
2. "గుంటూరులో వినాయక టెంపుల్ వైపు గుంటూరు-సత్తెనపల్లి రోడ్ నుండి కైలాసగిరి టెంపుల్ రోడ్‌కు BT రోడ్‌ను వేయుట" ECV-- రూ. 1,00,07,311/-
బిడ్స్‌ను ఏపి ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ నుండి 27.06.2018 నుండి 12.07.2018, 14.00గం. వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. **బిడ్స్ దాఖలుకు గడువు తేది:** 12.07.2018, 15.00 గం. వరకు. **టెక్నికల్ బిడ్‌ను తెరుచు తేది:** 12.07.2018న 16.00 గం.లకు. తదుపరి వివరాలకు **www.apeprocurement.gov.in** మరియు **www.crda.ap.gov.in** ని చూడండి.
సం/- కమిషనర్, APCRDA.

राष्ट्रीय इस्पात निगम लिमिटेड
RASHTRIYA ISPAT NIGAM LIMITED
(A Government of India Enterprise)
VISAKHAPATNAM STEEL PLANT
VIZAG STEEL Pride of Steel
WORKS CONTRACTS DEPARTMENT
OPEN TENDER RFx No.2600002545 DT:22.06.2018
WORK: Mechanical Maintenance & Repair of BF-3 Equipment (Furnace, PCI, Stoves, Planning, Cooling & Shift Maintenance), Package-1, #BF-3.
- Submission deadline date&time:**Before 3.00PM on 24.07.2018**
- Bid Opening date&time:**After 3.30PM on 24.07.2018**
Email:warlu@vizagsteel.com, cell:9441400075 DGM(WC)I/C
For more details & corrigendums please visit regularly www.vizagsteel.com, http://www.eprocure.gov.in/epublish

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
కృష్ణా జిల్లా కలెక్టరు గారి కార్యాలయము, మచిలీపట్నం
ఫారం నెం.7
30/2013 చట్టంలోని సెక్షన్19(1) మరియు రూలు25(1) ప్రకారం
రూఢి ప్రకటన
ఆర్.సి.జి2/111/2016 గెజిట్ నెం. 69/KST/2018 ది.13-6-2018
క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన కృష్ణా జిల్లా విజయవాడ అర్బన్ మండలం గుణదల గ్రామములో గల 1188.30చ.గ. భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా **"అంతర వలయ రహదారి నిర్మించి వెడల్పు చేసి యన్.హెచ్-16, యన్.హెచ్-65లకు కలుపుటకుగాను"** అవసరమని అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన కృష్ణా జిల్లా కలెక్టరు గారు భావించు చున్నందున, చట్టంలోని సెక్షన్ 15 ప్రకారము సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తుల నుండి ఏ విధమైన అభ్యంతరములు రానందున చట్టం 30/2013 కేంద్ర చట్టం (30/2013)లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.
దిగువ షెడ్యూలులో పేర్కొనిన 1188.30 చ.గ. భూమి, చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013)లోని సెక్షన్19(1) ప్రకారము కమీషనర్, ఎ.పి.సి.ఆర్.డి.ఎ., విజయవాడ వారిచే ప్రజాహిత కార్యక్రమాలకు అనగా **"అంతర వలయ రహదారి నిర్మించి వెడల్పు చేసి యన్.హెచ్-16, యన్.హెచ్-65లకు కలుపుటకు గాను"** అంతే మొత్తము కొద్ది ఎక్కువ లేక **తక్కువభూమి** అవసరమని కృష్ణా జిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించు చున్నారు.
షెడ్యూలు
గ్రామము : గుణదల మండలము : విజయవాడ అర్బన్ జిల్లా : కృష్ణా

వరుస నెం.	సర్వేనెం./ సబ్ డివిజన్	మొత్తము విస్తీర్ణము (ఎ.లలో)	సేకరించ వలసినవిస్తీర్ణము (చ.గ.లు)	ఆసక్తిగల వ్యక్తుల పేర్లు మరియు చిరునామా	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు, కట్టడములు ఏవైనా
1	88/1 ఎ2	1.78	133.35	కళ్ళేపల్లి సత్యనారాయణ రాజు, అన్నే సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వర రావు, నల్లూరి శశిధర్, తండ్రి: సుబ్బారావు	87 (డొంక)	88/1ఎ	88/1ఎ	88/1ఎ	లేవు
2			316.01	కళ్ళేపల్లి సత్యనారాయణ రాజు, అన్నే సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వర రావు, కోగంటి మురళీకృష్ణకుమారి భర్త: ఐ.వై.సుబ్బయ్య	87 (డొంక)	88/1బి1	88/1ఎ	88/1ఎ	లేవు
3	88/1 బి1సి	0.83	117.51	కళ్ళేపల్లి సత్యనారాయణ రాజు, కొండా కృష్ణారెడ్డి, కొల్లి సాంబిరెడ్డి, గొట్టిపాటి శ్రీనివాస్, తండ్రి: (లేట్) సత్యనారాయణ	88/1బి2	88/1బి1	88/1బి1	88/1ఎ	లేవు
4			238.85	కళ్ళేపల్లి సత్యనారాయణ రాజు, కొండా కృష్ణారెడ్డి, కొల్లి సాంబిరెడ్డి, గొట్టిపాటి గీత, భర్త: రమేష్ బాబు	88/1బి3	88/1బి3	88/1బి1	88/1బి1	లేవు
5			228.75	కళ్ళేపల్లి సత్యనారాయణ రాజు, కొండా కృష్ణారెడ్డి, కొల్లి సాంబిరెడ్డి, గొట్టిపాటి తార, భర్త: కిషోర్‌బాబు	88/1బి3	88/1బి3	88/1బి1	88/1బి1	లేవు
6			153.83	కళ్ళేపల్లి సత్యనారాయణ రాజు, కొండా కృష్ణారెడ్డి, కొల్లి సాంబిరెడ్డి, ఎ.లక్ష్మణ్ రావు తండ్రి: (లేట్) ఎ.వి.ఆర్.శేషారావు, జిపిఎ హోల్డర్ టు అడుసుమిల్లి అభిజ్ఞ, తండ్రి: లక్ష్మణ్‌రావు	88/1బి3	88/1బి3	88/1బి1	88/1బి1	లేవు
మొత్తము			1188.30						

భూసేకరణ అధికారి, ఎ.పి.సి.ఆర్.డి.ఎ. విజయవాడ వారి వద్ద సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించు కొనవచ్చును.
బొగ్గు గనులు, యినుపరాయి, పలకరాయి లేదా యితర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూ భాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుటగాని చేయవలెను.
కలెక్టరు, కృష్ణా జిల్లా.

పెట్టుబడుల కేంద్రంగా ఏపీ

ఈనాడు, అమరావతి: ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడతామని, ఇందుకోసం పరిశ్రమలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రిని, ఐటీ మంత్రి లోకేష్‌ను ఫ్లెక్స్ (ఫ్లెక్స్‌ట్రానిక్స్) గ్లోబల్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఫ్రాంక్వా బార్బియర్, వైస్ ప్రెసిడెంట్ థామస్ మన్నియన్, ఇతర ప్రతినిధులు కలిశారు. తిరుపతి సమీపంలో రూ. 585 కోట్లతో యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధత తెలియజేశారు. ఈ యూనిట్‌లో 6,600 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. చంద్రబాబు, లోకేష్ సమక్షంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖతో అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెట్టుబడుల ప్రధాన ఆకర్షణ కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న రియల్ టైం గవర్నెన్స్, కాగితరహిత పాలనపై ఫ్లెక్స్ ప్రతినిధులకు వివరించారు. 'ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల తయారీ రంగంలో ప్రపంచంలో అతిపెద్ద కంపెనీల్లో మీ(ఫ్లెక్స్) సంస్థ ఒకటి. 30కిపైగా దేశాల్లో 2 లక్షలకుపైగా ఉద్యోగులున్న మీ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం అభినందనీయం' అన్నారు.

నేను మంత్రిగా బాధ్యతలు చేపట్టాకే ఎలక్ట్రానిక్స్ రంగంపై దృష్టి: లోకేష్

దేశంలో ఏటా 480 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్ పరికరాలు ఉత్పత్తవుతున్నాయని, ఇందులో 50శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే తయారుకావాలనేది ముఖ్యమంత్రి లక్ష్యమని ఐటీ మంత్రి లోకేష్ వివరించారు. ఇందుకు అనుగుణంగానే ప్రపంచంలోనే పెద్ద సంస్థలైన ఫాక్స్‌కాన్, డిక్సన్ తదితర సంస్థలను రాష్ట్రానికి వచ్చేలా కృషి చేశామని అన్నారు. వీటిద్వారా 18వేల మందికి ఉద్యోగాలు కల్పించామని, మొత్తంగా రెండు లక్షల మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యమని తెలిపారు. ఎకో సిస్టమ్ భాగస్వామ్య సంస్థల్ని కూడా రాష్ట్రానికి రప్పించేలా చర్చిస్తున్నామన్నారు. 2014 ముందు ఏపీలో ఒక్క ఎలక్ట్రానిక్స్ సంస్థ లేదని తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. ఆగస్టు 15న తాత్కాలికంగా శ్రీసిటీ నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తామని వివరించారు. ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఫ్లెక్స్ విజయవంతమై రాష్ట్రానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకొస్తుందని ఆశిస్తున్నామన్నారు. బార్బియర్ మాట్లాడుతూ భారత్‌లో ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల వినియోగం బాగా పెరుగుతున్నందున, ఈ రంగంలో అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందన్నారు. ఈ రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలు, ప్రోత్సాహకాలు బాగున్నాయన్నారు. లోకేష్‌తో రెండుమూడుసార్లు సమావేశమయ్యాక ఆయనపై నమ్మకం ఏర్పడిందని వివరించారు. అనంతరం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రాన్ని ఫ్లెక్స్ ప్రతినిధులు సందర్శించారు. ప్రత్యేకతలను ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) బాబుని అడిగి తెలుసుకున్నారు. ఆర్టీజీ వ్యవస్థ అద్భుతంగా ఉందని, వినూత్న విధానాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రికి అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు.

75 శాతం పీఎఫ్ ఉపసంహరించుకోవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

ఒకటో తేదీ వరకు పొడిగించాలని సీబీటీ నిర్ణయించింది. ఫండ్ మేనేజర్ల పదవీకాలాన్ని 31.12.2018 వరకు పొడిగించింది.

- ఫండ్ మేనేజర్లుగా ఉన్న ఎస్‌బీఐ, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ప్రైమరీ డీలర్‌షిప్, రిలయన్స్ క్యాపిటల్, హెచ్‌ఎస్‌బీసీ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీల పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించారు.
- పోర్ట్‌ఫోలియో మేనేజర్ల ఎంపిక కోసం కన్సల్టెంట్ నియామకానికి సమ్మతి తెలిపారు. ఫండ్ మేనేజర్ పనితీరు మదింపు నిమిత్తం కన్సల్టెంట్‌గా ఉన్న క్రిసిల్ పదవీకాలాన్ని ఈ ఏడాది డిసెంబరు 31 వరకు పెంచారు.

ఈటీఎఫ్‌లలో మరింత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాలన్న అంశాన్ని మాత్రం సమావేశంలో వాయిదా వేశారు. కొత్తగా రానున్న ఫండ్ మేనేజర్లు, కన్సల్టెంట్లు ఇచ్చే సలహా మేరకు దీనిపై ఒక నిర్ణయానికి రావాలని ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. నిఫ్టీ-50, సెన్సెక్స్ ఈటీఎఫ్‌లలోనే కాకుండా ఈక్విటీ ఇండెక్స్ ఈటీఎఫ్‌లోనూ పెట్టుబడులు పెట్టేలా ప్రణాళికను సవరించాలని ఈపీఎఫ్‌వో ప్రతిపాదించింది.

మయన్మార్‌లో దేశవ్యాప్తంగా పట్టుబడిన దాదాపు రూ.1200 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను మంగళవారం రాజధాని యాంగాన్‌లో ఇలా తగలబెట్టారు

కోట్లు ధారబోసినా అంతే!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులిచ్చింది. ఇప్పటికే టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది. కానీ జులై నెలాఖరు వరకూ కూడా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. కారణం ఏమిటా అని ఆరా తీస్తే బ్యారేజీ నిర్మాణానికి ఆకృతులు సిద్ధం కాలేదని తెలిసింది. దీనికి ఈపీసీ విధానంలో కాకుండా ఎల్ఎస్ విధానంలో టెండర్లు పిలవాలని నిర్ణయించారు. దీనివల్ల ఆకృతుల బాధ్యత గుత్తేదారుకు ఉండదు. జల వనరులశాఖే ఆకృతులు సిద్ధం చేసి అంచనాలు ఖరారు చేయాలి. సాధారణంగా డీపీఆర్ సిద్ధం చేసిన సంస్థే పూర్తి స్థాయి ఆకృతులు సమర్పించాల్సి ఉంటుంది. వైకుంఠపురం బ్యారేజీ ప్రాజెక్టు నివేదిక రూపొందించిన వ్యాప్కోస్ పూర్తి స్థాయి ఆకృతులు సమర్పించకపోవడం గమనార్హం. దీనిపై జల వనరులశాఖలో ఉన్నతస్థాయిలోనూ ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పైగా వైకుంఠపురం బ్యారేజీ పాలనామోద ఉత్తర్వుల్లోనే కేంద్ర ఆకృతుల విభాగం చీఫ్ ఇంజినీరు నుంచి ఆమోదం పొందిన ఆకృతులు తీసుకోవాలని నిబంధన విధించారు. అసలు డీపీఆర్‌ను వ్యాప్కోస్ రూపొందిస్తే ఆకృతులు ఎందుకు ఇవ్వలేదని ఆ సంస్థను ప్రశ్నించకపోగా సాక్షాత్తూ ఆకృతుల సంస్థ చీఫ్ ఇంజినీరును బాధ్యుడిని చేస్తూ ఉత్తర్వులు రావడం చర్చనీయాంశమవుతోంది. ఈ విషయంలో కృష్ణా డెల్టా అధికారులకు, కేంద్ర ఆకృతుల సంస్థ అధికారులకు మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఇప్పుడు జల వనరులశాఖ పరిధిలోని ఆకృతుల సంస్థ బ్యారేజీకి ఆకృతులు సిద్ధం చేయాల్సి వస్తోంది. ఇక బ్యారేజి విషయంలో అటవీ, ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సంబంధించి వ్యాప్కోస్ సమర్పించిన గణాంకాలు చూసి జల వనరులశాఖ అధికారులు విస్తుపోయారు. లేని భూములను అక్కడ చూపించి, భూసేకరణ ఖర్చు పెంచేసి ప్రాజెక్టు అంచనాలు మించిపోయేలా చేశారు. బ్యారేజీ నిర్మించాలంటే ఒక్క భూసేకరణకే రూ.1510 కోట్లు ఖర్చవుతుందని లెక్కించారు. పట్టాభూములు, అసైన్డ్ భూములు కలిపి కేవలం 2951 ఎకరాలు వాస్తవంగా ఉంటే వ్యాప్కోస్ అది తన ప్రాథమిక నివేదికలో 11,600 ఎకరాలు ఉన్నట్లు చూపడం విశేషం. బ్యారేజీ ప్రతిపాదిత స్థలంలో 2901 ఎకరాల అటవీభూమి ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. నిజానికి అక్కడ అసలు అటవీ భూమే లేదు.

అమ్మో భారత్!

(మొదటి పేజీ తరువాయి)

నిలిచాయి. ఆ తర్వాతి ర్యాంకుల్లో సోమాలియా, సౌదీ అరేబియాలు ఉన్నాయి.

పాఠాలు నేర్వలేదు..

2011లోనూ ఇలాంటి సర్వే జరిగింది. నాడు అఫ్గానిస్థాన్, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, పాకిస్థాన్, భారత్, సోమాలియాలు మహిళలకు ప్రమాదకర దేశాలుగా నిలిచాయి. ఇప్పుడు భారత్ మొదటి స్థానానికి చేరడాన్ని బట్టి.. 2012 నాటి నిర్భయ అత్యాచారం, హత్య ఘటన తర్వాత కూడా ప్రభుత్వం మహిళల రక్షణకు సరైన చర్యలు చేపట్టలేదని స్పష్టమవుతోందని నిపుణులు వ్యాఖ్యానించారు. "మహిళలను అగౌరవపరచడం, వారిపై అత్యాచారాలు, లైంగిక దాడులు, వేధింపులు, భ్రూణ హత్యలు వంటివి అప్రతిహతంగా సాగుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలో ఇలాంటివి సిగ్గుచేటు" అని కర్ణాటక ప్రభుత్వ అధికారి మంజునాథ గంగాధర వ్యాఖ్యానించారు. 2007 నుంచి 2016 మధ్యకాలంలో మహిళలపై నేరాలు 83 శాతం మేర పెరిగినట్లు ప్రభుత్వ డేటా సూచిస్తోంది. గంటకు 4 అత్యాచారాలు జరుగుతున్నట్లు తెలిపింది.

జాబితాలోని మిగతా దేశాలు..

సర్వేలో సంధించిన ఏడు ప్రశ్నల్లో నాలుగింట్లో అఫ్గానిస్థాన్ పరిస్థితి దారుణంగా ఉంది. ఆరోగ్య పరిరక్షణ, ఘర్షణల తాలుకు హింసపై అక్కడ ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మహిళలు హింస, నిరక్షరాస్యత, పేదరికం, మానవ హక్కుల ఉల్లంఘనలను ఎదుర్కొంటున్నారు.

- ఏడేళ్ల అంతర్యుద్ధం వల్ల సిరియా ఈ సర్వేలో మూడో స్థానానికి చేరింది. ఆరోగ్యపరిరక్షణ, లైంగిక, లైంగికేతర హింస, గృహ హింస, బాల్య వివాహాలు వంటి అంశాల్లో అక్కడి పరిస్థితులు దారుణంగా ఉన్నాయి.
- సోమాలియాలో రెండు దశాబ్దాలకుపైగా సాగుతున్న యుద్ధం వల్ల హింసాత్మక సంస్కృతి చెలరేగింది. న్యాయ పరిరక్షణకు ఉద్దేశించిన సంస్థలు బలహీనపడ్డాయి.
- సౌదీ అరేబియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ పరిస్థితి కొంత మెరుగుపడినా.. చేయాల్సింది చాలా ఉందని స్పష్టమవుతోందని నిపుణులు పేర్కొన్నారు. ప్రతి మహిళకూ ఒక పురుష సంరక్షణదారు ఉండాలన్న నిబంధనను మార్చాలన్నారు.

'మీ టూ'తో అమెరికాకు చోటు

లైంగిక వేధింపులు, హింసకు వ్యతిరేకంగా జరిగిన 'మీ టూ', 'టైమ్స్ అప్' ఉద్యమాలవల్ల అమెరికా కూడా మహిళలకు అత్యంత ప్రమాదకరమైన 10దేశాల జాబితాలో చేరింది.

- మొదటి పది దేశాల్లో పాకిస్థాన్, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, యెమన్, నైజీరియాలు ఉన్నాయి.
- మహిళల అక్రమ రవాణాల విషయంలో అత్యంత ప్రమాదకరమైన దేశాలుగా భారత్, లిబియా, మయన్మార్ ఉన్నాయి.

తోసిపుచ్చిన భారత్

మహిళలకు అత్యంత ప్రమాదకరమైన దేశంగా భారత్‌ను తేల్చిన థాంప్సన్ రాయిటర్స్ ఫౌండేషన్ నివేదికను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఛైర్‌పర్సన్ రేఖా శర్మ తిరస్కరించారు. ఈ సర్వేలోని శాంపిల్ పరిమాణం చాలా తక్కువని, అది దేశం మొత్తం పరిస్థితిని ప్రతిబింబించదన్నారు. "భారత్‌లోని సమస్యల గురించి ఇక్కడి మహిళలకు బాగా తెలుసు. ఇలాంటి సర్వేలో ఈ దేశం మొదటి స్థానంలో నిలిచే అవకాశం లేనేలేదు. భారత్ తర్వాతి స్థానాల్లో ఉన్న దేశాల్లో మహిళలకు బహిరంగంగా మాట్లాడేందుకూ అనుమతిలేదు" అని వ్యాఖ్యానించారు.

20 వేల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి కమిషన్‌ను నియమిస్తూ త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు మంత్రులు కళా వెంకటరావు, కాలవ శ్రీనివాసులు తెలిపారు. 'రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం 1500 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని ఒక ఉద్యమ స్ఫూర్తితో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జులై 16 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఆ రోజు నుంచే గ్రామదర్శిని కార్యక్రమాలూ మొదలవుతాయి. అటు ప్రభుత్వాన్ని, ఇటు పార్టీని సమన్వయం చేసుకుంటూ వీటిని నిర్వహిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్లు వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభమవుతాయి" అన్నారు.

సీఎం రమేష్, బీటెక్ రవి ఆరోగ్యంపై ఆందోళన

కడపలో ఉక్కు కర్మాగారం కోసం ఏడు రోజులుగా నిరశన దీక్ష చేస్తున్న సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆరోగ్యం రోజు రోజుకి క్షీణిస్తుండటం పట్ల మంత్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలు ఒడ్డి దీక్ష చేస్తున్నా.. కేంద్రం స్పందించలేదని మంత్రి కాలవ ధ్వజమెత్తారు. భాజపా, వైకాపా, జనసేన బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. భాజపా నాయకులు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లి... రాష్ట్రానికి కేంద్రం ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేదన్నట్టు మాట్లాడటం దారుణమన్నారు. "భాజపా నాయకులు రాష్ట్ర ప్రయోజనాల్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారు. వైకాపా నాయకుడు జగన్ ప్రధానిని ఒక్క మాటా అనరు. తన సొంత జిల్లా కడపలో ఉక్కు కర్మాగారం సాధనకు బలమైన ప్రజా ఉద్యమం జరుగుతుంటే... దానిపై ఏమాత్రం స్పందించరు. మరోపక్క పవన్ కల్యాణ్.. శ్రీవారి ఆభరణాల్ని ఎక్కడికో తరలించారని ఒక ఐపీఎస్ అధికారి చెప్పారంటారు. భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశాలపై ఆయన నిరాధారంగా, బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు" అని కాలవ మండిపడ్డారు. దళితతేజం సభలో లక్షల మందిని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగిస్తారని ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమం కోసం 13 ప్రచార రథాలను జిల్లాకి ఒకటి పంపించామని, ఈ నెల 30న ఉదయం 11 గంటలకల్లా అవన్నీ సభా ప్రాంగణం వద్దకు చేరుకుంటాయని తెలిపారు.

మంత్రులైనా సరే... మోదీకి చేరువగా రాలేరు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరినైనా సోదాలు చేయాలని స్పష్టం చేసింది. రాజీవ్‌గాంధీ తరహాలో ప్రధాని మోదీ హత్యకు కుట్ర పన్నినట్లు ఇటీవల పుణే పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అలాగే కొద్ది రోజుల క్రితం పశ్చిమబెంగాల్ పర్యటన సందర్భంగా ఓ వ్యక్తి ప్రధాని పాదాలను తాకేందుకు గాను 6 అంచెల భద్రత ఏర్పాట్లను దాటుకుని రావడం భద్రత సంస్థలను కలవరపాటుకు గురిచేసింది. ఈ నేపథ్యంలో జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా, నిఘా బృందం డైరెక్టర్ రాజీవ్‌లతో సమీక్ష నిర్వహించిన హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రధాని భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రధాని పర్యటనల సందర్భంగా మరింత అప్రమత్తంగా ఉండాలంటూ - మావోయిస్టుల ప్రభావం ఉన్న చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల పోలీసు విభాగాల అధిపతులకు స్పష్టం చేసినట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. కేరళకు చెందిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) తీవ్రవాద ముఠాలకు చెందినదిగా ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో.. దీని విషయమై భద్రత సంస్థలు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఏరువాక సంబరానికి సర్వం సిద్ధం

ఈనాడు- అమరావతి డిజిటల్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ నెల 28న ఏరువాక కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్ని జిల్లాల్లో కమిటీలు వేసింది. కలెక్టర్ ఛైర్మన్‌గా, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇతర కీలకమైన జిల్లా స్థాయి ఉన్నతాధికారుల్ని సభ్యులుగా నియమించింది. ఈ కమిటీల పర్యవేక్షణలో జిల్లా, గ్రామ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించింది. వానాకాలం ఆరంభమైన తర్వాత వచ్చే పౌర్ణమి రోజున దీనిని నిర్వహిస్తారు. శ్రీకాకుళం జిల్లా రావికంటిపేట గ్రామంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఏరువాక కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాధాన్యాలు చాటేలా ఫొటో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. భూసార పరీక్ష కార్డులను అందించనున్నారు. ఆయా భూముల్లో ఉపయోగించాల్సిన ఎరువుల వివరాలు, సాగుభూమిలో ఉన్న లోటుపాట్లను తెలియజేస్తారు. దుక్కిదున్నే ముందు సంప్రదాయ కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏరువాక అనంతరం గ్రామసభ ఉంటుంది.

కల్తీ రాయుళ్లపై ఉక్కుపాదం

దిల్లీ: మనదేశంలో ఆహార కల్తీని అరికట్టే దిశగా కీలక ముందడుగు పడింది! కల్తీ రాయుళ్లపై ఉక్కుపాదం మోపేందుకు వీలుగా 'ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ)' కీలక సిఫార్సులు చేసింది. కల్తీ కారకులకు అవసరమైతే జీవితఖైదు విధించడంతోపాటు రూ.10 లక్షల జరిమానా కూడా వసూలు చేయాలని సూచించింది. 2006 నాటి ఆహార భద్రత, ప్రమాణాల చట్టంలో ఈ మేరకు మొత్తంగా 100 సవరణలు ప్రతిపాదించింది. తమ సిఫార్సులపై వచ్చే నెల 2 లోగా స్పందనలు తెలియజేయాలని ప్రజలను కోరింది.

కీలక సిఫార్సులివే.. ఆహార భద్రత చట్టం కచ్చితత్వంతో అమలయ్యేందుకు వీలుగా రాష్ట్రాల్లోనూ ఆహార భద్రత ప్రాధికార సంస్థలను ఏర్పాటుచేయాలి.

- ఆహార భద్రత అధికారుల విధులకు ఆటంకం కలిగించినా.. వారిని బెదిరించినా.. దోషులకు కనీసం ఆర్నెల్ల జైలుశిక్ష విధించాలి. రెండేళ్ల వరకు శిక్షను పొడిగించొచ్చు. రూ.5 లక్షల వరకు జరిమానా కూడా విధించాలి. ప్రస్తుతం ఈ నేరాలకు కేవలం 3 నెలల జైలుశిక్ష విధిస్తున్నారు. రూ.లక్ష వరకు జరిమానా వసూలు చేస్తున్నారు.
- వ్యక్తుల మృతి లేదా అనారోగ్యానికి దారితీసే స్థాయిలో కల్తీకి పాల్పడేవారికి(వాస్తవంగా ప్రాణ, ఆరోగ్య నష్టం జరగకపోయినాసరే) ఏడేళ్లకు తగ్గకుండా జైలుశిక్ష విధించాలి. శిక్షను జీవితఖైదుకు కూడా పొడిగించొచ్చు. దోషులకు రూ.10 లక్షలకు తగ్గకుండా జరిమానా కూడా విధించాలి.

చిన్న పరిశ్రమలకు పెద్ద ప్రోత్సాహం!

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున ఏపీఐఐసీకి ఇవ్వాలని పరిశ్రమల, వాణిజ్యశాఖ నిర్ణయించింది. ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే 800 మందికిపైగా ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకున్నారు. పార్కులు ప్రారంభించాక మరింత మంది ముందుకు రానున్నారని అధికారులు చెబుతున్నారు.

- ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పే యువత కోసం రాష్ట్ర ఆర్థిక సంస్థ 'యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ స్కీం' (వైఈఎస్) తీసుకొచ్చింది. ఈ పథకంలో 250 యూనిట్ల ఏర్పాటుకు రూ.43.50 కోట్ల రుణాలు అందించేలా ప్రణాళిక రూపొందించారు. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలు చొప్పున సంస్థ తరపున రుణాలు అందిస్తారు. ప్రాజెక్టు వ్యయంలో 65 నుంచి 75 శాతం వరకు రాష్ట్ర ఆర్థిక సంస్థ నుంచి సహకారం లభిస్తుంది. ఇందులో 50 శాతానికి మాత్రమే హామీ ఇస్తే సరిపోయేలా నిబంధనలు సడలించారు. రుణం తీసుకునే యువ పారిశ్రామికవేత్త తరపున ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు హామీ ఇచ్చినా తీసుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ఏపీఎస్‌ఎఫ్‌సీ కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంచారు. యువ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా పథకాన్ని తీసుకురావడం ఇదే మొదటిసారని అధికారులు తెలిపారు.

ఊబిలో నిత్యం.. ఊపిరే కష్టం..

మురుగు కాల్వల్లో చెత్తను తొలగించే పారిశుద్ధ్య కార్మికుల దయనీయ పరిస్థితికి అద్దంపట్టే చిత్రమిది. ఎంతో దుర్లభమైన ఈ పనిని వీరు సమాజం కోసం చేస్తున్నారు. నెల్లూరు నగరంలో మురుగు కాల్వల్లోకి దినసరి కూలీలను దించి శుభ్రం చేయిస్తున్నారు. అయితే వీరికి రక్షణగా సమకూర్చాల్సిన గ్లౌజులు, బూట్లను అందించలేని నిర్లక్ష్యపూరిత దుస్థితిలో ఉన్నారు అధికారులు. కళ్లు, ముక్కూ మూసుకొని ప్రాణాలను పణంగా పెట్టి కూలికి సిద్ధపడిన వారికి అందిస్తున్నది ఎంతో తెలుసా.. కేవలం రూ. 400 మాత్రమే. ఈ పని చేస్తున్న కారణంగా వారు తరచూ రోగాల బారిన పడుతున్నా ఎవరికీ పట్టింపులేదు. సృష్టికి.. ప్రతిసృష్టి చేయాలని పరుగులు తీస్తున్న నేటి తరుణంలో ఇలాంటి పనులను చేసేందుకూ సాంకేతికను అందుబాటులోకి తీసుకురావాలి. అందుకు ప్రభుత్వాలే సంకల్పించాలి..

-ఈనాడు, నెల్లూరు

వచ్చేస్తోంది...

అంతం-6

మనిషి సంఘజీవే కాదు. పర్యావరణ జీవి కూడా! మట్టిలో మట్టిలా.. గాలిలో గాలిలా.. మనిషి కూడా సమస్త జీవజాతుల్లో ఒక జీవే. కాకపోతే మేధోశక్తి పుణ్యమాని తనకు హాని తలపెట్టే ముప్పులను, ఉపద్రవాలను తప్పించుకుంటూ ఒకింత ఆధిపత్యం చెలాయించటం నేర్చుకున్నాడు. ఎక్కడికక్కడ ఆవాసాలను ఏర్పరచుకుంటూ.. అవసరార్థం వస్తు సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ వస్తున్నాడు. ఇప్పుడదే ఇతర జీవజాతులకు శాపమవుతోంది. ఆరో భారీ అంతర్థాన ముప్పునకు శరవేగంగా దారితీస్తోంది. దీని మూలంగా 21వ శతాబ్దం మధ్యలోనే ప్రపంచంలోని 75% జీవజాతులు అంతర్థాన ముప్పును ఎదుర్కోవచ్చని.. ఇందుకు మానవ తప్పిదాలే బీజం వేస్తున్నాయని తాజా నివేదిక ఒకటి గట్టిగా హెచ్చరిస్తోంది!

కొత్త నీరు రావటం, పాత నీరు పోవటం సహజమే. కొత్త జీవుల రాకతో పాత జీవులు కనుమరుగు కావటమూ మామూలే. ఇది మన భూమ్మీద అనాదిగా జరుగుతున్న సృష్టి కార్యమే! అయితే దీనికీ ఒక లయ ఉంది. ఒక వేగముంది. ఏటా 1-5 జీవజాతులు అంతరించిపోతుంటాయి కూడా. కానీ ఇప్పుడు దీని వేగం గణనీయంగా పుంజుకుంది. చెట్లు, మొక్కలు, జంతువుల వంటివన్నీ 100 నుంచి 1000 రెట్ల వేగంతో అంతరించిపోవటం ఆరంభించాయి. మన వస్తు వినియోగంతో **రోజురోజుకీ పెరిగిపోతున్న వ్యర్థాలు, కాలుష్యం, వాతావరణ మార్పు, జీవజాతులను వేటాడి పొట్టనపెట్టుకోవటం, వాటి ఆవాసాలను కబలిస్తుండటం** వంటివన్నీ ఇందుకు దోహదం చేస్తున్నాయి. అందుకే స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, యూనివర్సిడాడ్ నేషనల్ ఆటోనోమా డి మెక్సికో పరిశోధకులు దీన్ని 'జీవ నిర్మూలన'గానూ వర్ణిస్తున్నారు. ఇది నిజంగా మానవత్వాన్ని పణంగా పెట్టటమేనని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. వీళ్లంతా 1900 నుంచి 2015 వరకు 177 క్షీరదాలను.. 27,600 సకశేరుకాల తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు 32 శాతం.. అంటే 8,851 సకశేరుక జాతుల సంఖ్య, వాటి విస్తరణ చాలా వేగంగా తగ్గిపోతుండగా.. 40 శాతానికి పైగా క్షీరదాల జనాభా గణనీయంగా పడిపోతోంది. దీన్ని బట్టి త్వరలోనే జీవజాతులు భారీ ఎత్తున అంతర్థాన ముప్పునకు చేరువతున్నాయని పరిశోధకులు అంచనా వేస్తున్నారు.

ఆ ఐదు అంతర్థానాలు

- **తొలి మహా అంతర్థానం:** ఇది 44.4 కోట్ల సంవత్సరాల క్రితం జరిగింది. దాదాపు 86% సముద్ర జీవజాతులు అంతరించిపోయాయి. సిలికేట్ రాళ్లు వాతావరణంలోని కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకోవటం.. ఫలితంగా తీవ్రమైన చలితో మంచు యుగం ఏర్పడటం.. సముద్రమట్టాలు పడిపోవటం వంటవన్నీ దీనికి దోహదం చేశాయి.
- **రెండో అంతార్థనం:** 36 కోట్ల ఏళ్ల కిందట మొదలైన ఇది సుమారు 2 కోట్ల సంవత్సరాల వరకూ కొనసాగింది. సుమారు 75% సముద్ర జీవజాతులు కనుమరుగయ్యాయి. కొత్తగా పుట్టుకొచ్చిన వృక్షాలు భూమి నిండా విస్తరించటం.. వీటి బలమైన వేళ్లే భూమిని చీల్చటం వల్ల బయటపడిన పోషకాలు సముద్రంలో కలవటం.. ఫలితంగా అల్గే పుట్టుకొచ్చి నీటిలోని ఆక్సిజన్‌ను లాగేసుకోవటం దీనికి మూలం.
- **మూడో అంతర్థానం:** ఇది 25.1 కోట్ల సంవత్సరాల క్రితం జరిగింది. మొత్తం 96% జీవజాతులు తుడిచిపెట్టుకుపోయాయి. గ్రహశకలం లేదా తోకచుక్క ఢీకొట్టటం దీనికి కారణమన్నది శాస్త్రవేత్తల అంచనా.
- **నాలుగో అంతర్థానం:** ఇది 20 కోట్ల సంవత్సరాల క్రితం జరిగింది. దాదాపు 80% జీవజాతులు అంతరించిపోయాయి. మధ్య అట్లాంటిక్ ప్రాంతంలో భారీగా పొంగుకొచ్చిన అగ్నిపర్వత లావా దీనికి దోహదం చేసింది.
- **ఐదో అంతర్థానం:** 6.6 కోట్ల సంవత్సరాల క్రితం జరిగింది. సుమారు 78% జీవజాతులు కనుమరుగయ్యాయి. ఒకప్పుడు భూ మండలాన్ని శాసించిన డైనోసార్లు అంతరించింది ఈ కాలంలోనే. గ్రహశకలం ఢీకొట్టటంతో పాటు భారత్‌లో దక్కన్ మైదానాల్లో అగ్నిపర్వతాలు పేలటం దీనికి ఆజ్యం పోశాయి.

కొత్త కాకపోవచ్చు గానీ..

దాదాపు 450 కోట్ల మన 'భూ చరిత్ర'లో జీవజాతులు భారీ స్థాయిలో అంతరించిపోవటం కొత్తేమీ కాదు. ఇలా ఇప్పటికి ఐదుసార్లు జరిగింది. వీటి మూలంగా భూమ్మీద నివసించిన వాటిల్లో కనీసం 75% వృక్ష, జీవజాతులు కనుమరుగయ్యాయి. వీటిన్నింటికీ పర్యావరణ ప్రభావాలు, వృక్షాలు, గ్రహశకలాలు, తోకచుక్కలు కారణమైతే రాబోయే ఆరో అంతర్థానానికి మనిషే కారణమవుతున్నాడు! ఇదింకా ఆరంభం కాలేదుగా అని మనం సర్దిచెప్పుకోవచ్చేమో గానీ దీని అంచుననే నిలబడి ఉన్నామని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నిజానికి జీవుల అంతర్థాన ప్రక్రియ, వాటికి పట్టే సమయంతో పోలిస్తే మన జీవనకాలం చాలా చిన్నది. అందువల్ల దీని పర్యవసానాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఊహించటం కష్టం. కానీ పర్యావరణ వ్యవస్థలన్నింటి మీదా ఇది పెద్ద ప్రభావాన్నే చూపిస్తుందనేది మాత్రం నిజం. దీనికి గత అంతర్థాన యుగాలే నిదర్శనం. ప్రాణి తనను తాను రూపొందించు కోవటం దగ్గర్నుంచి.. ప్రాణులు, చెట్లు, మనుషుల అవసరాల వరకూ సమస్త జీవజాతులన్నింటికీ భూ వనరులే ఆధారమన్న విషయాన్ని విస్మరించలేం. గ్రహశకలాలు, తోకచుక్కల వంటి ముప్పుల విషయంలో మనమేమీ చేయలేకపోవచ్చు గానీ మనమే ఉత్పాతాలుగా మారకుండా చూసుకోవటం మన చేతుల్లోనే ఉంది. కాబట్టి భవిష్యత్ తరాల కోసమైనా జీవజాతులను రక్షించుకోవటం, కాపాడుకోవటం మన కర్తవ్యం. జీవో రక్షతి రక్షితః!

నాచ్ డిస్‌ప్లే

**తాకేతెరలకి కొత్త తళుక్కు!
మొబైల్ ప్రియుల మునివేళ్లపై
అదో కొత్త జిమ్మిక్కు!
నిజమేగానీ.. ఖరీదు చూస్తే
గుండెకి జలక్కే!
మరైతే, బడ్జెట్‌లో లేవా?
ఉన్నాయ్!!
పలు కంపెనీలు ఫోన్లు
మార్కెట్‌లోకి తెచ్చేశాయ్
ఏంటవి?**

మనసుకు నచ్చేనాచ్

'వివో' అదరహో!

ముచ్చటగా ఓ మూడు నాచ్ మోడళ్లు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. ఒకటి బడ్జెట్‌లో ముందుకొస్తే.. ఇంకోటి యువత మనసుని కొల్లగొట్టేలా సిద్ధమైంది. మరోటి కొంచెం ఖరీదెక్కువ.

● వై83

అంచుల వరకూ ఆనందాన్ని చౌకగా మొబైల్ ప్రియులకు పరిచయం చేసిన నాచ్ డిస్‌ప్లే మోడల్ ఇది. తెర పరిమాణం 6.2 అంగుళాలు. రిజల్యూషన్ 1520X720 పిక్సల్స్. గొరిల్లా గ్లాస్ రక్షణ ఉంది. ర్యామ్ 4జీబీ. డ్యూయల్ కెమెరాలు ఉన్నాయి. ముందు 8 మెగాపిక్సల్, వెనక 13 మెగాపిక్సల్. ఇంటర్నల్ మెమొరీ 32జీబీ. కావాలంటే 256జీబీ వరకూ మెమొరీని పెంచుకోవచ్చు. వెనక ఫింగర్‌ప్రింట్ స్కానర్ ఉంది. 'ఫేస్ యాక్సెస్'తో ముఖాన్ని చూసి ఫోన్ అన్‌లాక్ అవుతుంది. 'స్మార్ట్ స్ప్లిట్'తో తెరని రెండు భాగాలుగా చేసుకుని ఒకేసారి రెండింటిని యాక్సెస్ చేయొచ్చు. బ్యాటరీ సామర్థ్యం 3,260ఎంఏహెచ్. ఆండ్రాయిడ్ 8.1 ఓఎస్ వెర్షన్‌తో పని చేస్తుంది.

● రూ.14,990

● వీ9 యూత్

యువత ఆలోచనలకు సరితూగేలా అదిరే సెల్ఫీలు, ఆకట్టుకునే 'ఫుల్‌వ్యూ డిస్‌ప్లే'తో ముందుకొచ్చింది. వెనక డ్యూయల్ కెమెరాలు ఉన్నాయి. 16 మెగాపిక్సల్ కెమెరాతో పాటు 2 మెగాపికల్స్ కెమెరా జతకట్టింది. దీంతో ఫొటోలు, వీడియోల నాణ్యత మరింత మెరుగవుతుంది. సెల్ఫీలకు ముందు 16 మెగాపిక్సల్ కెమెరాని ఉంచారు. అన్నీ కృత్రిమ మేధస్సుతో (ఏఐ) పని చేస్తాయి. క్లిక్ కొట్టడానికి ముందే ఏఐ సపోర్టుతో చిత్రీకరించే వాటిని కెమెరాలు అధ్యయనం చేసి అందుకు తగినట్టుగా సెట్టింగ్స్‌ని మార్చేసుకుంటాయి. ఉదాహరణకు తక్కువ లైటింగ్ ఉంటే సరిపడా వెలుతురుని వాటంతట అవే మార్పులు చేసుకుంటాయి. తెర పరిమాణం 6.3 అంగుళాలు. రిజల్యూషన్ 2280X1080 పిక్సల్స్. శ్నాప్‌డ్రాగన్ 450 ప్రాసెసర్‌ని వాడారు. ర్యామ్ 4జీబీ. ఇంటర్నల్ మెమొరీ 32జీబీ. బ్యాటరీ సామర్థ్యం 3,260 ఎంఏహెచ్. ఆండ్రాయిడ్ 8.1 ఓఎస్‌ని ఫోన్‌లో నిక్షిప్తం చేశారు.

● రూ.18,999

● వీ9

ఇది కాస్త ఖరీదైనదే. హైఎండ్ కాన్ఫిగరేషన్‌తో నాచ్ డిస్‌ప్లేని అలంకరించుకుని మార్కెట్‌లోకి వచ్చిన తొలి నాచ్ డిస్‌ప్లే ఫోన్ ఇదే. ఇంటర్నల్ మెమొరీ పై రెండు మోడళ్లకంటే ఎక్కువ. 64జీబీ. వెనకున్న డ్యూయల్ కెమెరాల సామర్థ్యమూ ఎక్కువే. 16 మెగాపిక్సల్, 5 మెగాపిక్సల్. అదిరే సెల్ఫీలకు ముందున్న కెమెరాని ఏకంగా 24 మెగాపిక్సల్‌కి అప్‌డేట్ చేసింది.

ర్యామ్ 4జీబీ. ఆక్టాకోర్ శ్నాప్‌డ్రాగన్ 626 ప్రాసెసర్‌ని వాడారు. డ్యూయల్ సిమ్ స్లాట్‌లు ఉన్నాయి. మైక్రోఎస్‌డీ కార్డు కోసం ప్రత్యేక స్లాట్ ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే డీఎస్‌ఎల్‌ఆర్ కెమెరా నిత్యం జేబులో ఉన్నట్టే.

● రూ.20,999

> అంచుల వరకూ తాకేతెర. తెర పై భాగంలోనే చిన్న వంపుతో కత్తిరించినట్టుగా కనిపిస్తుంది. ఈ తరహా తెరల్ని 'నాచ్ డిస్‌ప్లే'గా పిలుస్తున్నారు.

హాయ్.. 'హువావె'

● పీ20 లైట్

చక్కగా చేతిలో అమరిపోయే ఫోన్. పొడవైన తెరతో 16:9 నిష్పత్తిలోనే తీర్చిదిద్దారు. తెర పరిమాణం 5.84 అంగుళాలు. చూడ్డానికి ఐదు అంగుళాల ఫోన్ మాదిరిగానే కనిపిస్తుంది. రిజల్యూషన్ 2280X1080 పిక్సల్స్. ర్యామ్ 4జీబీ. ఇంటర్నల్ మెమొరీ 64జీబీ. వెనక డ్యూయల్ కెమెరాలు (16 మెగాపిక్సల్, 2 మెగాపిక్సల్) ప్రత్యేకమైనవి. ముందు 24 మెగాపిక్సల్ కెమెరాతో సెల్ఫీలను చెక్కొచ్చు. తక్కువ వెలుతురులోనూ నాణ్యమైన ఫొటోలు తీయొచ్చు. బ్యాటరీ సామర్థ్యం 3,000 ఎంఏహెచ్. యూఎస్‌బీ టైప్-సీ పోర్టుతో వేగంగా డేటాని ట్రాన్స్‌ఫర్ చేయొచ్చు. ఇదే మాదిరిగా ఫోన్‌నీ వేగంగా ఛార్జ్ చేయొచ్చు. 'డ్యూయల్ బ్లూటూత్'తో ఒకేసారి రెండు పరికరాలకు ఫోన్ అనుసంధానం అవుతుంది.

● రూ.19,999

'ఒపో' ప్రత్యేకం

● ఎఫ్7

దేశీయ మార్కెట్‌లోకి వచ్చిన మొదటి నాచ్ డిస్‌ప్లే ఫోన్ ఇదే. అంతేకాదు... మీ రూపాన్ని చాలా స్పష్టంగా క్లిక్ మనిపించి చూపేందుకు ఏకంగా 25 మెగాపిక్సల్ కెమెరాని నిక్షిప్తం చేసుకుంది. కెమెరాకి కృత్రిమ మేధస్సు సపోర్టు ఉంది. వెనక కెమెరా సామర్థ్యం 16 మెగాపిక్సల్. తాకేతెర పరిమాణం 6.23 అంగుళాలు. రిజల్యూషన్ 2280X1080 పిక్సల్స్. గొరిల్లా గ్లాస్ రక్షణ ఉంది. 4జీబీ, 6జీబీ ర్యామ్‌తో రెండు వేరియంట్స్ ఉన్నాయి. ఇంటర్నల్ మెమొరీ 64జీబీ, 128జీబీ. బ్యాటరీ సామర్థ్యం 3,400ఎంఏహెచ్. డ్యూయల్ సిమ్ కార్డు స్లాట్‌తో రెండు సిమ్‌లను వాడొచ్చు. ఫేస్ అన్‌లాక్‌తో పాటు వెనక ఫింగర్ ప్రింట్ స్కానర్ కూడా ఉంది.

● రూ.20,999

ఖరీదు ఎక్కువైనా...

బడ్జెట్‌తో పనిలేదు. మరింత హైఎండ్ కాన్ఫిగరేషన్‌తో నాచ్ డిప్లే ఫోన్‌లు ఏమున్నాయో ఆరా తీస్తున్నారా? ఇవిగోండి మరికొన్ని...

● ఆనర్ 10

5.84 అంగుళాల తెర.

ఏఐ సపోర్టుతో కూడిన వెనక డ్యూయల్ కెమెరాలు (24, 16 మెగాపిక్సల్).

ఫేస్‌అన్‌లాక్‌తో పాటు ముందు భాగంలోనే ఫింగర్‌ప్రింట్ సెన్సర్.

● రూ.32,999

● వన్‌ప్లస్ 6

తెర పరిమాణం 6.28 అంగుళాలు

వెనక డ్యూయల్ కెమెరాలు (16, 20 మెగాపిక్సల్)

ర్యామ్ 6జీబీ. ఇంటర్నల్ మెమొరీ 64జీబీ.

రూ.34,999 (ప్రారంభ ధర)

● హువావె పీ20 ప్రో

వెనక మూడు కెమెరాలు (40,20,8 మెగాపిక్సల్) ఉన్నాయి.

24 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా

ర్యామ్ 6జీబీ, ఇంటర్నల్ మెమొరీ 128 జీబీ.

● రూ.64,999

● ధరల్లో మార్పులుండొచ్చు

యూట్యూబ్ పాఠాలు

ఉచితం.. గణిత పాఠం

ఊసుపోక కాసేపు టైమ్‌పాస్ చేద్దామని యూట్యూబ్‌కి వెళ్తే బోల్డన్ని ఛానళ్లు... కావాల్సినన్ని వీడియోలు! అదే మాదిరిగా పాఠ్యాంశాల్ని బోధించే యూట్యూబ్ ఛానళ్లూ చాలానే ఉన్నాయి. గణితశాస్త్రంపై పట్టు సాధించేందుకు 'సకల విద్య' ఛానల్ ఉంది. ఇంటర్ విద్యార్థులు గణితంపై పట్టుసాధించేందుకు ఛానల్‌లోని ట్యుటోరియల్స్‌ని చూడొచ్చు. ఎంసెట్, ఐఐటీ-జేఈఈ మెయిన్స్‌కి సరిపడేవి కూడా ఉన్నాయి. 600పైనే వీడియో పాఠాల్ని ఛానల్‌లో అప్‌లోడ్ చేశారు. ఉచితంగా చూడడంతో పాటు.. ఆఫ్‌లైన్‌లో వీక్షించేందుకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

> క్లాస్‌లో అందర్నీ దృష్టిపెట్టుకుని బోధన సాగుతుంది. చెప్పేది అందరికీ అర్థం కాకపోవచ్చు. దీంతో కొందరు వెనకబడిపోతారు. అలాంటి విద్యార్థులు ఒకటికి రెండు సార్లు వీడియో పాఠాలు నేర్చుకోవాలనే ఉద్దేశంతోనే ఛానల్ స్టార్ట్ చేశాం. రెండేళ్లవుతోంది. ముందు వెబ్‌సైట్‌తో మొదలుపెట్టి... యూట్యూబ్ ఛానల్‌తో విద్యార్థులకు దగ్గరయ్యాం. సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఇప్పటికి 30,000కి చేరుతోంది. తెలుగు ఉపాధ్యాయుడినే అయినప్పటికీ ఇంగ్లిష్‌లోనే బోధిస్తున్నా. అప్పుడే దేశం నలు మూలల్లో ఎక్కువ మంది విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచినట్టు అవుతుంది. విద్యార్థుల నుంచి స్పందన బాగుంది.

– ఆర్.ఎల్.ఎన్ మూర్తి, ఛానల్ నిర్వాహకులు

వెబ్‌సైట్: http://www.sakalavidya.com/

యూట్యూబ్ ఛానల్ లింక్: https://goo.gl/QvvCY4

నెట్టింట్లో సాయం

రక్తదాతల వెబ్‌సైట్

యాప్‌లు, సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ వేదికలు ఎన్నో ఉన్నప్పటికీ సమయానికి రక్తం అందక ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం. ఇప్పటి పరిస్థితే ఇలా ఉంటే... అప్పుడప్పుడే ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తున్న సమయంలో ఎలాంటి పరిస్థితి ఉండేదో ఊహించొచ్చు. దాన్ని అప్పుడే అధిగమించాలనుకున్నాడో వ్యక్తి. ఈమెయిల్స్ చెక్ చేసుకోవడానికి నెట్‌కేఫ్‌లు వెళ్లే జమానాలో రక్తదానానికి అనువైన వెబ్‌సైట్‌ని రూపొందించాలనుకున్నాడు. అప్పుడే డొమైన్ రిజిస్ట్రేషన్ చేసి తన ప్రయత్నాన్ని మొదలుపెట్టాడు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా 50,000 మందికిపైనే రిజిస్టర్ అయ్యారు. వీరంతా సుమారు 1,36,000 మందికి దగ్గరై రక్తదానం చేశారు. వెబ్‌సైట్‌కి మూలం మహారాష్ట్రకి చెందిన ఖుష్రో పోచా అయితే... రూపొందిన వెబ్‌సైట్

http://www.indianblooddonors.com/



> ఓ మంచి పనికి ఇంటర్నెట్ వనరుల్ని ఎందుకు వాడుకోకూడదు అన్న ఆలోచన వచ్చింది. స్నేహితులు, కుటుంబ సభ్యులు సైట్‌లో సభ్యులయ్యారు. పేజర్లతో ఫోన్ నెంబర్లు షేర్ చేయడం ద్వారా కొంతమంది చేత రక్తదానికి ముందుకొచ్చేలా చేశాం. మారుతున్న టెక్నాలజీతో పాటు సైట్ అప్‌డేట్ అయింది. అందుకు చాలా మంది సపోర్టు చేశారు. ఆండ్రాయిడ్ యూజర్లు యాప్‌లానూ ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్‌తోనూ సేవల్ని అందిస్తున్నాం.

– ఖుష్రూ పోచా

● మొబైల్‌ని ఫార్మెట్ చేశాను. కానీ, ఇన్‌బాక్స్‌లో ముఖ్యమైన మేసేజ్‌లు ఉన్నాయి. వాటిని తిరిగి రికవర్ చేయడం ఎలా?

– కుట్టి మూర్తి

ఫోన్‌ని ఫార్మెట్ చేశాక కూడా మొబైల్‌లోని మెసేజ్‌లను రికవర్ చేసేందుకు చాలా రకాల రికవరీ సాఫ్ట్‌వేర్‌లు ఉన్నాయి. వాటిల్లో 'డాక్టర్ ఫోన్ మెసేజ్ రికవరీ సాఫ్ట్‌వేర్'ని ప్రయత్నించొచ్చు. ముందు ఫోన్‌లోని డెవలపర్ ఆప్షన్స్‌ని ఎనేబుల్ చేయాలి. అందుకు settings->About phone-> build number ఆప్షన్‌ని ఏడుసార్లు ఒత్తాలి. దీంతో డెవలపర్ ఆప్షన్లు వస్తాయి. వాటిల్లోని Usb Debugging ఆప్షన్‌ని ఎనేబుల్ చేయాలి. 'డాక్టర్ ఫోన్' టూల్‌ని సిస్టంలో ఇన్‌స్టాల్ చేశాక ఫోన్‌ని సిస్టమ్‌కి అనుసంధానం చేయాలి. తర్వాత మెసేజ్‌లు ఉన్న ఫోల్డర్‌లోకి వెళ్లి రికవర్ చేయొచ్చు.

- సయ్యద్ హాఫీజ్, తెలుగు టెక్ ట్యూట్స్

ఛానల్‌తో డబ్బు రావాలంటే?

ప్రశ్నజవాబులు

● యూట్యూబ్‌లో వీడియోలు పెట్టాను. కానీ, ఛానల్ ద్వారా డబ్బు ఎలా సంపాదించాలో తెలియదు. పోస్ట్ చేసిన వీడియోలతో ఛానల్ ద్వారా డబ్బు ఎలా సంపాదించాలో తెలుపగలరు?

– దీనబంధు

ఛానల్ ద్వారా డబ్బు సంపాదించాలంటే వాచ్‌టైమ్ 4,000 గంటలు దాటాలి. అలాగే, 1000 మందికి పైనే సబ్‌స్క్రైబర్లు ఉండాలి. అప్పుడే మీ ఛానల్‌ని మానిటైజేషన్ చేయడానికి రివ్యూ రిక్వస్ట్ చేయొచ్చు. రిక్వస్ట్ పంపాక యూట్యూబ్ నిర్వాహకులు ఛానల్‌ని పర్యవేక్షిస్తారు. సంస్థ పాలసీల ప్రకారం అన్నీ ఉన్నాయా? లేదో పరిశీలించి మానిటైజేషన్‌ని ఎనేబుల్ చేస్తారు. దీంతో ఛానల్‌లో ప్రకటనలు వస్తాయి. యాడ్స్ ద్వారా వచ్చిన డబ్బు మీ ఎకౌంట్‌లోకి రావాలంటే మీకు గూగుల్ యాడ్‌సెన్స్ ఎకౌంట్ ఉండాలి. క్రియేట్ చేసుకునేందుకు google.com/adsense లింక్‌లోకి వెళ్లండి. అక్కడ కనిపించే వివరాల్ని నింపి బ్యాంకు ఎకౌంట్‌ని జత చేయాలి. యాడ్‌సెన్స్ వివరాల్లో ఎంటర్ చేసిన పేరు, బ్యాంకు ఎకౌంట్ పేరు ఒకేలా ఉన్నాయో.. లేదో చెక్ చేసుకోవాలి. ఛానల్ పది డాలర్లు ఆర్జించిన తర్వాత రన్ చేస్తున్న యూట్యూబ్ ఛానల్ మీదేనని తెలుసుకునేందుకు మీ అడ్రస్‌కి వెరిఫికేషన్ కోడ్ పంపుతారు. గూగుల్ యాడ్ సెన్స్ ఎకౌంట్‌ని ఓపెన్ చేసి వెరిఫికేషన్ కోడ్‌ని ఎంటర్ చేయాలి. తర్వాత బ్యాంకు ఎకౌంట్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి యాడ్‌సెన్స్ ఎకౌంట్‌ని జత చేయాలి. వంద డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ ఆర్జిస్తే ప్రతినెలా 21కల్లా బ్యాంకు ఎకౌంట్‌కి పంపుతారు. ఆ మొత్తం మీ ఎకౌంట్‌లో జమయ్యేందుకు పది రోజులు పడుతుంది.

● టెక్నాలజీ వాడకంలో సందేహం ఏదైనా మాకు పంపండి. నిపుణులతో సూచనలు అందిస్తాం. మా ఈ-మెయిల్: its@eenadu.in

మోహన్‌బాబు


మహేష్‌బాబు


రానా

నాగచైతన్య

శర్వానంద్

'ఎన్టీఆర్'లో స్టార్ల కళకళ

బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'ఎన్టీఆర్'. తన తండ్రి జీవిత చరిత్రని వెండి తెరపై ఆవిష్కరిస్తున్నారాయన. ఎన్టీఆర్ కథంటే ఎన్నో పాత్రలు, మరెన్నో సంగతులు. ప్రతీ పాత్రకీ ప్రాధాన్యం ఉంటుంది. అందుకే ఆయా పాత్రల్లో పేరెన్నదగిన వారినే ఎంచుకోవాలని బాలయ్య భావిస్తున్నారు. బసవతారకం పాత్రకుగానూ విద్యాబాలన్ ఖరారైంది. నారా చంద్రబాబునాయుడుగా రానా కనిపిస్తారు. ఏఎన్నార్ పాత్రకు గానూ నాగచైతన్య పేరు పరిశీలిస్తున్నారు. కృష్ణగా మహేష్‌బాబు కనిపిస్తారన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. కృష్ణ పాత్రలో మహేష్‌ని చూడడం ఘట్టమనేని అభిమానుల్ని తప్పకుండా అలరించే విషయమే. బాలకృష్ణ మదిలో మహేష్ తప్ప మరెవ్వరూ మెదలడం లేదని, మహేష్ ఆ పాత్రలో కనిపించడం ఖాయమని గుసగుసలు వినిపిస్తున్నాయి. నందమూరి కుటుంబంతో అత్యంత సన్నిహితంగా ఉండే నటుడు మోహన్‌బాబు. ఎన్టీఆర్‌కి వీరాభిమాని ఆయన. మోహన్‌బాబు రాజకీయ ప్రవేశం కూడా ఎన్టీఆర్ చేతుల మీదుగా జరిగింది. ఆయన కూడా 'ఎన్టీఆర్'లో ఓ కీలక పాత్ర పోషిస్తారని తెలుస్తోంది. రాజశేఖర్‌కీ ఓ పాత్ర దక్కిందని ముందు నుంచీ ప్రచారం జరుగుతోంది. అదేమిటన్నది ఇంత వరకూ తేలలేదు. శర్వానంద్ లాంటి యువ కథానాయకుల పేర్లూ.. పరిశీలనలో ఉన్నాయి. మరికొన్ని పాత్రల కోసం బెంగాలీ నుంచి నాటక రంగంలో ఉద్దండులైన వారిని పిలిపిస్తున్నారట. కొన్ని పాత్రల కోసం ఆడిషన్స్ జరుగుతున్నాయి. దర్శకుడు క్రిష్ ప్రస్తుతం నటీనటుల ఎంపికలో బిజీగా ఉన్నారు. మొత్తానికి ప్రతీ పాత్రపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టి, ఒక్క సీన్‌లో కనిపించే వేషమే అయినా... జనాదరణ ఉన్నవారితోనే చేయించాలని భావిస్తున్నారు. బాలీవుడ్‌లోనూ ఈ చిత్రం విడుదల కానుంది. అందుకే అక్కడి నటీనటులు కూడా కనిపించే అవకాశం ఉంది. అలా 'ఎన్టీఆర్' బయోపిక్ స్టార్లతో నిండిపోవడం ఖాయంలా కనిపిస్తోంది.

ఈనాడు సినిమా

పక్కవాళ్ల బాధలు వినండి

ఒత్తిడిలో ఉన్నారా? మానసిక సంఘర్షణతో సతమతమవుతున్నారా? చిన్నపాటి ఓటములకు కుంగిపోతున్నారా? అయితే అనుష్క మీకో సలహా ఇస్తోంది. 'అయిదుగురికి సహాయం చేయండి.. తప్పకుండా మీకు ఉపశమనం లభిస్తుంది' అంటోంది. దాని వెనుక ఉన్న రహస్యం చెబుతూ.. "నాకొచ్చిన సమస్యే చాలా పెద్దది అనేది అందరి భావన. చిన్న చిన్న ఇబ్బందుల్ని భూతద్దంలో చూస్తుంటారు. ఒక్కసారి అందులోంచి బయటకు రండి. చుట్టూ ఉన్న మనుషుల్ని, వాళ్ల సమస్యల్ని తెలుసుకోవడానికి ప్రయత్నించండి. వీలైతే ఓ అయిదుగురికి సహాయం చేయండి. సహాయం అంటే డబ్బులే కానక్కర్లేదు. ఒక్కోసారి మంచి మాట చెప్పడం కూడా గొప్ప విషయమే. చుట్టుపక్కల ఉన్న వాళ్ల బాధలు వినండి. మీదెంత చిన్న సమస్యో అర్థం అవుతుంది. నేను పాటించే చిట్కా ఇదే. నాకెప్పుడైనా ఒత్తిడి అనిపిస్తే... ఎవరికో ఒకరికి సహాయం చేస్తుంటాను. లేదంటే.. వాళ్ల సమస్యల్ని అడిగి తెలుసుకుంటాను. వాటితో పోలిస్తే నా ఒత్తిడి చాలా చిన్నదనిపిస్తుంది'' అని చెప్పుకొచ్చింది అనుష్క.

అనుష్క

రేణుదేశాయ్‌కి పవన్ శుభాకాంక్షలు

కథానాయకుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ట్విట్టర్ ద్వారా తన మాజీ భార్య రేణుదేశాయ్‌కి శుభాకాంక్షలు చెప్పారు. "సంతోషకరమైన కొత్త దశలోకి ప్రవేశిస్తున్న రేణు గారికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. పరిపూర్ణమైన ఆరోగ్యం, శాంతి, శ్రేయస్సు ఆమెకి లభించాలని భగవంతుడిని, ప్రకృతి మాతని ప్రార్థిస్తున్నా" అని ట్వీట్ చేశారు పవన్ కల్యాణ్. ఇటీవలే రేణుదేశాయ్ వివాహ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే.

ట్విట్టర్‌కి దూరంగా రేణుదేశాయ్

"కొత్త జీవితం ప్రారంభిస్తున్న ఈ సమయంలో వ్యతిరేకతకి దూరంగా ఉండదలచుకొన్నా" అంటూ రేణుదేశాయ్ తన ట్విట్టర్ ఖాతాని తొలగించారు. పెళ్లి చేసుకొనే ఆలోచన ఉందని రేణుదేశాయ్ చెప్పినప్పట్నుంచి సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నిశ్చితార్థం తర్వాత కూడా విమర్శిస్తూ పలువురు వ్యాఖ్యలు చేయడంతోనే రేణుదేశాయ్ ట్విట్టర్ నుంచి బయటికి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. "ట్విట్టర్ నిండా విపరీతమైన ప్రతికూలత నిండి వుందని అనిపిస్తోంది. ఇక్కడ ఉండేవాళ్లు అధికంగా అజ్ఞాత వ్యక్తులు, వ్యక్తిగతంగా, వృత్తిపరంగా చిరాకుతో కూడిన వాళ్లు. ఒక సినిమా గురించి కానీ, రాజకీయ వ్యక్తుల గురించి కానీ ఎప్పుడూ వ్యతిరేకంగా రాయడానికే ఇష్టపడతారు. అందుకే ఈ నిర్ణయం. అదే సమయంలో నా మంచి కోరుతూ నన్ను అర్థం చేసుకుని ప్రతికూల పరిస్థితుల్లోనూ నాకు తోడుగా, నా వెంట ఉన్న ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు" అని చివరిగా ట్వీట్ చేసి ఆమె తన ఖాతాని తొలగించారు.

భార్యాబాధితుల కోసం


శరత్ చంద్ర, నేహాదేశ్ పాండే

'మహిళల నుంచి మగాళ్లని రక్షించండి' అనే శీర్షికతో రూపొందిన చిత్రం 'ఐపీసీ సెక్షన్ భార్య బంధు'. శరత్ చంద్ర కథానాయకుడు. నేహాదేశ్ పాండే నాయిక. రెట్టడి శ్రీనివాస్ దర్శకుడు. ఈనెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో శరత్ చంద్ర మాట్లాడుతూ "ఇదో విచిత్రమైన కథ. భార్యాబాధితుల కోసం రూపొందించా. ఇందులో పెళ్లైన మగాళ్ల కోసం న్యాయస్థానంలో పోరాడతా. పెళ్లికి ముందు, ఆ తరవాత అబ్బాయిలు అమ్మాయిలు ఎలా ఉండాలో ఈ సినిమా ద్వారా చెప్పామ"న్నారు. నేహాదేశ్ పాండే మాట్లాడుతూ "కథతో పాటుగా నా పాత్ర ప్రయాణం చేస్తుంది. సంప్రదాయబద్ధమైన అమ్మాయిగా, ఓ నాట్యకారిణిగా ఇందులో కనిపిస్తా. వాణిజ్య విలువలతో పాటు మంచి సందేశం కూడా ఉంద"ని చెప్పింది.

అక్కడొకడున్నాడు

రసజ్ఞ దీపిక, రామ్‌కార్తీక్

రామ్‌కార్తీక్, శివహరీష్, రసజ్ఞ దీపిక, అలేఖ్య నాయకానాయికలుగా నటించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. శివ కంఠంనేని, రవిబాబు, వినోద్ కుమార్, ఇంద్రజ ప్రధాన పాత్రధారులు. శ్రీపాద విశ్వక్ దర్శకుడు. కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ "ఆపదలో చిక్కుకున్న ఓ ప్రేమజంటకి సహాయంగా నిలిచిన స్నేహితుల కథే ఈ చిత్రం. యాక్షన్‌కి పెద్దపీట వేస్తూ ఒక సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించాం" అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఆద్యంతం ఉత్కంఠని రేకెత్తించే ఈ చిత్రాన్ని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. ఫన్ భరత్, రాకెట్ రాఘవ, రాహుల్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎన్.రాజశేఖరన్, సంగీతం: సార్క్స్.

ప్రేమిస్తే తప్పేంటి?

చరణ్‌తేజ్

చరణ్‌తేజ్ నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'ఆయుష్మాన్‌భవ'. స్నేహా ఉల్లాల్ కథానాయిక. రెడ్డి రాఘవేంద్రరావు, రొయ్యల నవీన్ కుమార్, తాళ్ల సుబ్బారెడ్డి నిర్మాతలు. నవంబరు 9న విడుదల చేస్తారు. చరణ్‌తేజ్ మాట్లాడుతూ "నక్కిన త్రినాథరావు అందించిన కథ బాగుంది. మారుతి సహ నిర్మాతగా సహాయ సహకారాలు అందించారు. పరుచూరి బ్రదర్స్ కలం బలం మాకు తోడైంది. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రానికి మంచి స్పందన వచ్చింది. ప్రేమించడంలో తప్పులేదు.. ప్రేమిస్తే కులం, మతం చూడకూడదు, ప్రేమని ఈ ప్రపంచం చూసే దృష్టి కోణం మారాలి అని చెప్పే కథ ఇది. కథానాయకుడి పాత్ర కొత్త తరహాలో సాగుతుంద"న్నారు.

భయపడుతూనే అడుగుపెట్టా

మహిందర్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'నా లవ్ స్టోరీ'. సోనాక్షి సింగ్ రావత్ కథానాయికగా పరిచయం అవుతోంది. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోందీ చిత్రం. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో సోనాక్షి విలేకరులతో మాట్లాడింది. "మాది రాజస్థాన్. ముంబైలో చదువుకున్నాను. మోడలింగ్ అనుభవం ఉంది. కొన్ని వాణిజ్య ప్రకటనలు చేశాను. 'నా లవ్ స్టోరీ'తో కథానాయికగా అవకాశం వచ్చింది. ఇందులో మధ్యతరగతి అమ్మాయిగా నటించా. తండ్రి అదుపు ఆజ్ఞల్లో ఉండే అమ్మాయి కథ ఇది. తొలిరోజు షూటింగ్ అనగానే ఒత్తిడికి గురయ్యాను. భయపడుతూనే సెట్లోకి అడుగుపెట్టా. కానీ చిత్ర బృందం అందించిన సహకారంతో తొందరగానే ఇమిడిపోయాను. తెలుగులో అవకాశం రాగానే ఇక్కడి పరిశ్రమ గురించి తెలుసుకోవడం మొదలెట్టా. 'బాహుబలి', 'అర్జున్‌రెడ్డి'లాంటి చిత్రాన్ని చూశాను. ఎన్టీఆర్, అల్లుఅర్జున్ అంటే చాలా ఇష్టం. వాళ్ల డాన్సులు బాగుంటాయి. శ్రీదేవి, ప్రియాంకా చోప్రా నా అభిమాన నటీమణులు. తెలుగులో ఇంకా మంచి మంచి చిత్రాల్లో నటించాలని వుంది. కొత్త అవకాశాల కోసం ఎదురుచూస్తున్నా" అంది.

సోనాక్షి సింగ్ రావత్

అమ్మాయి చూసినా నువ్వు చూడొద్దు!

డార్లింగ్ స్వామి, కె.ఎస్.రామారావు, సాయిధరమ్ తేజ్, ఆండ్రూ, వల్లభ

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై తెరకెక్కిన చిత్రం 'తేజ్'. ఐ లవ్ యు... అనేది ఉపశీర్షిక. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఎ.కరుణాకరన్ దర్శకత్వం వహించారు. కె.ఎస్.రామారావు నిర్మాత. జులై 6న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కథానాయకుడు సాయిధరమ్ తేజ్, పంపిణీదారుడు దిలీప్ టాండన్ ట్రైలర్‌ని విడుదల చేశారు. "అమ్మాయిల్ని ప్రేమలో పడేయటం చాలా సులభం. మూడు రోజులు ఆ అమ్మాయి చుట్టూ తిరుగు. ఆ అమ్మాయినే చూస్తుండు. నాలుగో రోజు కూడా తిరుగు. ఆ తర్వాత అమ్మాయి చూసినా నువ్వు చూడొద్దు. అప్పుడు డిస్టర్బ్ అవుతుంది చూడూ..." అంటూ సాయిధరమ్ తేజ్ చెప్పే సంభాషణలతో ట్రైలర్ సాగుతుంది. కె.ఎస్.రామారావు మాట్లాడుతూ "సాయిధరమ్ తేజ్ నాకు డేట్స్ ఇచ్చాక ఏడాదిన్నర వరకు మంచి కథలు దొరకలేదు. అప్పుడు ఆయనే ఫోన్ చేసి 'నేనొక కథ విన్నా, నాకు నచ్చింది. మీకూ నచ్చితే సినిమా చేద్దాం' అన్నారు. అలా ఈ సినిమా మొదలైంది. మంచి కథ ఇది. నా సంస్థలో ఎన్నో విజయవంతమైన చిత్రాలు చేశా. వాటికి ఏమాత్రం తగ్గకుండా ఈ చిత్రం ఉంటుంది" అన్నారు. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ "మరొక మంచి పాత్రలో నటించే అవకాశాన్ని ఈ చిత్రంతో నాకు కల్పించారు దర్శకుడు కరుణాకరన్. నిర్మాత కె.ఎస్.రామారావుకి కథ నచ్చాకే ఈ సినిమా చేశాం. మంచి చిత్రం చేశామనే అనుభూతి కలిగింది. గోపీసుందర్ సంగీతం, సాహి సురేష్ కళ, ఆండ్రూ కెమెరా పనితనం, డార్లింగ్ స్వామి మాటలు ఈ సినిమాకి ప్రధాన బలం. అందరికీ నచ్చుతుందనే నమ్మకంతో ఉన్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సహ నిర్మాత వల్లభ, మాటల రచయిత డార్లింగ్ స్వామి, ఛాయాగ్రాహకుడు ఆండ్రూ, బి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్, సాయికార్తీక్, షకలక శంకర్, కారుణ్య, సురేష్ కొండేటి, రమణారెడ్డి

పది సంపాదిస్తే... ఎనిమిది ఇచ్చేస్తా!

హాస్య నటుడు షకలక శంకర్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'శంభో శంకర'. కారుణ్య కథానాయిక. శ్రీధర్ దర్శకుడు. రమణారెడ్డి, సురేష్ కొండేటి నిర్మాతలు. ఈనెల 29న విడుదల అవుతోంది. హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "శంకర్ ప్రాణం పెట్టి పనిచేశాడు. భాను ప్రసాద్ అందించిన సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయ"న్నారు. "దిల్‌రాజు చేయాల్సిన సినిమా ఇది. కానీ రెండేళ్ల సమయం అడిగారు. అప్పటి వరకూ ఆగలేక.. రమణారెడ్డిగారు ఈ చిత్రాన్ని పట్టాలెక్కించారు. ఇలాంటి నిర్మాతలుంటే నాలాంటి నటులు, శ్రీధర్‌లాంటి దర్శకులు ఇంకా చాలా మంది పరిశ్రమకు వస్తారు. నటుడిగా పది రూపాయలు సంపాదిస్తే అందులో ఎనిమిది రూపాయలు కష్టాల్లో ఉన్నవారికి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నా" అన్నారు శంకర్. సురేష్ కొండేటి మాట్లాడుతూ "శంకర్ హీరో ఏంటి? అనుకున్నవాళ్లందరికీ సమాధానం ఈ సినిమా. సాయికార్తీక్ అందించిన పాటలకు మంచి స్పందన వస్తోంద"న్నారు.

భారతీయ నటులకు ఆస్కార్ ఆహ్వానం!

మాధురీ దీక్షిత్

టబు

షారుఖ్ ఖాన్

అనిల్ కపూర్

ప్రపంచ సినీ చరిత్రలోనే ప్రతిష్ఠాత్మక పురస్కారాలంటే ఆస్కార్ పేరు చెబుతారు. అలాంటి ఆస్కార్ పురస్కారాలను అందించే అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో ఈసారి పలువురు భారతీయ సినీ ప్రముఖులు చోటు దక్కించుకోవడం విశేషం. బాలీవుడ్ నటులు షారుఖ్ ఖాన్, అనిల్ కపూర్, మాధురీ దీక్షిత్, టబు, నసీరుద్దీన్ షా, అలీ ఫజల్‌లతో పాటు బెంగాలీ నటులు మదాబీ ముఖర్జీ, సౌమిత్ర ఛటర్జీ, నిర్మాత ఆదిత్య చోప్రాలను ఆస్కార్ అకాడెమీ ఆహ్వానించింది. వీరితో పాటు సాంకేతిక విభాగాల నుంచి మరో తొమ్మిది మందికి కూడా అకాడెమీ ఆహ్వానం అందింది. 2018కిగానూ వీరు అకాడెమీ సభ్యులుగా వ్యవహరించనున్నారు. అంటే ఈ ఏడాది ఆస్కార్ విజేతల ఎంపికలో వీరి భాగస్వామ్యం కూడా ఉంటుందన్నమాట. కొంతకాలంగా అకాడెమీ సభ్యుల్లో శ్వేతజాతీయులే ఎక్కువగా ఉన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దాంతో పాటు మహిళా ప్రాతినిధ్యం కూడా చాలా తక్కువగా ఉంటోంది. ఈ ధోరణికి వ్యతిరేకంగా 'ఆస్కార్స్ సో వైట్' నినాదంతో పలువురు తారలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇక నుంచి భిన్న ప్రాతినిధ్యం ఉండేందుకు అకాడెమీ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా భారత్ సహా 59 దేశాల నుంచి 928 మందిని కొత్త సభ్యులుగా ఆహ్వానించింది. వీరిలో 49 శాతం మహిళలకు చోటు కల్పించడంతో పాటు 38 శాతం సభ్యులు శ్వేతయేతర జాతీయులుగా ఉండేలా జాగ్రత్త తీసుకుంది.

నీ తప్పేంకాదురా

సంతోష్‌రాజ్, పావని

సంతోష్‌రాజ్, నేహాదేశ్ పాండే జంటగా నటించిన చిత్రం 'అనువంశీకత'. సుమన్, పావని కీలక పాత్రధారులు. రమేష్ ముక్కెర దర్శకుడు. తాళ్లపల్లి దామోదర్ గౌడ్ నిర్మాత. జులై 14న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "వరంగల్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. 'కామన్ మ్యాన్‌గా పుట్టడం నీ తప్పేం కాదురా' అనే పాట యువతని ఆకట్టుకుంటుంది. ఇప్పటికే ఈ చిత్రాన్ని కొంతమంది ప్రముఖులకు చూపించాం. వాళ్లంతా మెచ్చుకోవడం ఈ సినిమాపై నమ్మకాన్ని మరింత పెంచింద"న్నారు.

ప్రియాంక చోప్రా, నిక్ జోనాస్

త్వరలోనే నిశ్చితార్థమా?

ప్రియాంక చోప్రా, నిక్ జోనాస్ ప్రేమ కథే ఇప్పుడు బాలీవుడ్‌లో హాట్ టాపిక్. ఇప్పటి వరకూ విదేశాల్లోనే సాగిన వీళ్ల ప్రేమ కథ ఇప్పుడు ఇండియాకు వచ్చేసింది. కొన్ని రోజుల కిత్రం నిక్‌ను వెంటపెట్టుకొని ముంబయిలో దిగిపోయింది ప్రియాంక. కొంతమంది స్నేహితులను, కుటుంబ సభ్యులను విందుకు పిలిచి నిక్‌ను పరిచయం కూడా చేసేసిందట. ఆ పార్టీకి సంబంధించిన ఫొటోలు నెట్‌లో వైరల్ అయ్యాయి. నిక్‌ను తన కుటుంబానికి పరిచయం చేయడానికి ప్రియాంక ఇండియాకు తీసుకొచ్చిందంటూ వార్తలొచ్చాయి. కానీ వేటిపైనా ప్రియాంక స్పందించలేదు. నిక్ గురించి ప్రియాంక తల్లి వద్ద కొందరు ప్రస్తావించగా... "ఇప్పుడే కదా పరిచయం అయ్యాడు. అప్పుడే ఓ అంచనాకు ఎలా రాగలం..." అంటూ నర్మగర్భంగా మాట్లాడినట్టు సమాచారం. కానీ జులై చివరకు కానీ ఆగస్టులో కానీ ప్రియాంక, నిక్‌ల నిశ్చితార్థం జరగబోతున్నట్టు సమాచారం. హాలీవుడ్ టు బాలీవుడ్ ప్రయాణిస్తున్న ప్రియాంకకు ఈ ట్రిప్పులోనే నిక్‌తో నిశ్చితార్థం ఖాయం చేసి కొన్ని నెలల తర్వాత పెళ్లి పెట్టుకొనే ఆలోచనలో కుటుంబ సభ్యులు ఉన్నారని సమాచారం. నిశ్చితార్థంపై ప్రియాంక అధికారికంగా మాట్లాడటమే మిగిలి ఉంది.

పుస్తకాలు కావాలా...
లైబ్రరీనే ఇస్తా!

ఆమె పుస్తకాల పురుగు.. తన పిల్లలకీ వాటిపట్ల ఆసక్తిని పెంచింది! సందర్భమేదైనా, ఎవరికైనా అవే బహుమతులిస్తుంది. తీసుకోవడానికీ ఇష్టపడుతుంది. ఇప్పుడామె చదువరుల అవసరాలు తెలుసుకుని గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తోంది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 67 నగరాల్లో 136 గ్రంథాలయాలను ఏర్పాటు చేసి నలభై ఆరువేల పుస్తకాలను అందించింది. స్వచ్ఛందంగా ఈ పుస్తక సేవ చేస్తోన్న ఆమే హైదరాబాద్‌కి చెందిన షెఫాలీ రావు. ఇదంతా ఎందుకు, ఎలా చేస్తుందో తన మాటల్లోనే..

మాకు ఫేస్‌బుక్ పేజీ, వెబ్‌సైట్, ఫుడ్ 4 థాట్ పేరుతో యాప్ కూడా అందుబాటులో ఉంది. పుస్తకాలు రాగానే ఒక్కోదానికి బార్‌కోడ్ అంటించి సాఫ్ట్‌వేర్‌లో స్కాన్ చేస్తాం. ఈ బార్‌కోడ్‌లో పుస్తకం ఎవరు ఇచ్చారు, వారి పేరూ, ఇతర వివరాలు ఉంటాయి. అలానే దాన్ని ఏ ప్రాంతంలోని లైబ్రరీకి పంపుతున్నాం అనీ నమోదు చేస్తాం. ఈ వివరాలను మా యాప్‌లోని ట్రాకర్ అనే ఆప్షన్‌ని ఎంచుకుని చూడొచ్చు. డ్రాప్ బాక్సులూ, డొనేషన్ డ్రైవ్‌లూ, గ్రంథాలయాల వివరాలూ.. ఇలా సమాచారమంతా అందులోనే కనిపిస్తుంది. మమ్మల్ని 8886221322 నంబరులో సంప్రదించొచ్చు.

నేను గ్రంథాలయాలు ఏర్పాటు చేయడానికి వెనక నా స్వానుభవం ఒకటి ఉంది. నాకు చిన్నతనం నుంచి పుస్తకాలంటే ప్రాణం. ఎవరికైనా చిరాగ్గా ఉంటే కప్పు కాఫీ తాగుతారు. నేను మాత్రం మంచి పుస్తకం చదివేస్తా. మావారికీ అదే అలవాటు. ఇప్పుడు మా పిల్లలూ అంతే. పరీక్షలున్నా సరే ఏదో ఒక పుస్తకం చదివే పడుకుంటారు. ఎవరింటికైనా విందులూ.. వేడుకలకు వెళుతున్నా ఓ మంచి పుస్తకాన్నే బహుమతిగా అందిస్తా. పుస్తక ప్రదర్శనలు జరిగితే.. కారు నిండిపోయేలా ఎవరికి నచ్చినవి వాళ్లం కొనుక్కుంటాం. దాంతో మా ఇంట్లో ఓ గది వాటికే సరిపోయింది. అలాగని పడేయలేం.. అమ్మేయలేం. అందుకని మా ఇంటి దగ్గర ఓ బడి ఉంటే అక్కడ గ్రంథాలయంలా ఏర్పాటు చేసి కొన్ని ఇచ్చేశా. చాలా సంతోషంగా, సంతృప్తిగా అనిపించింది.

అలా ఏర్పాటు: అప్పుడే అనుకున్నా పుస్తకాలు ఎక్కువగా లేనిచోట గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని. విజ్ఞాన ఫలాలను ఇతరులకు అందజేసినట్టు ఉంటుంది అని. అందుకు మావారూ, ఆడపడుచు 'మేం కూడా నీతో కలిసి పనిచేస్తాం' అంటూ ముందుకొచ్చారు. అలా మూడేళ్ల క్రితం 'ఫుడ్ 4 థాట్' పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశా. ఆ పేరు పెట్టడానికి కారణం ఉంది. మనకు ఆహారం ఎలా అవసరమో.. మెదడుకూ ఫుడ్ కావాలి. అది పుస్తకాల నుంచి అందుతుందని నమ్ముతా. అలానే రకరకాల చోట్ల నుంచి వీటిని సేకరిస్తున్నాం. కార్పొరేట్ సంస్థలూ, గేటెడ్ కమ్యూనిటీలూ, స్కూళ్లు, కళాశాలలూ ఇలా జన సమూహం ఎక్కువగా ఉన్న చోట డొనేషన్ డ్రైవ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా స్వచ్ఛందంగా పంపుతానంటే కొరియర్ ద్వారా తీసుకుంటాం. ఒకవేళ రెండొందలకుపైనే పుస్తకాలు ఉంటే ఉచితంగా కొరియర్ ఖర్చులు మేమే భరిస్తాం. హైదరాబాద్‌లో నేనూ, దిల్లీలో మా ఆడపడుచు మాధవి ఇద్దరం ఈ పుస్తకాలను సేకరిస్తున్నాం. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మా సేవలు అందిస్తున్నాం.

మాది గుజరాత్. మావారు శ్రీనివాస్‌ది ఏలూరు. పెళ్లయ్యాక హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. మాకు ఇద్దరు పిల్లలు. నేనూ, మావారూ కలిసి పదేళ్ల క్రితం స్ట్రాటజీస్ పేరుతో హెచ్‌ఆర్ సేవలకు సంబంధించిన ఓ సంస్థని స్థాపించాం. ఇప్పుడు ఆ సంస్థలోనే కొంత స్థలం ఫుడ్ 4 థాట్‌కి కేటాయించాం. అక్కడే పుస్తకాలను ఉంచుతాం. మా ఆడపడుచు మాత్రం ఉద్యోగం మానేసి పూర్తిగా ఈ పనిలోనే ఉంది. దిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల్లో పుస్తకాల సేకరణ, గ్రంథాలయాల ఏర్పాటు తను చూసుకుంటుంది. ఇందుకో సమయ్యే ఖర్చంతా మేమే భరిస్తాం.

అంతా ఉచితమే: మేం మూడు రకాల లైబ్రరీలను ఏర్పాటు చేస్తాం. స్కూళ్లు, గ్రామ పంచాయతీ(కమ్యూనిటీ లైబ్రరీ), జన సమూహం ఎక్కువగా ఉన్న చోట(పబ్లిక్ లైబ్రరీ) వీటిని ఏర్పాటు చేస్తున్నాం. స్కూలు గ్రంథాలయం గురించి చెప్పాలంటే... మొదట మేం గ్రంథాలయం ఏర్పాటు చేయాలనుకున్న బడికి వెళతాం. పిల్లలకు పుస్తకాలపై ఉన్న ఆసక్తీ, చదివే సామర్థ్యం గురించి తెలుసుకుంటాం. దాన్ని బట్టి ఏం పుస్తకాలు ఇవ్వాలన్నది అర్థమవుతుంది. మేం సేకరించిన వాటిల్లో కొన్ని ఎంచుకుంటాం. లేదంటే మా డబ్బులతోనే పబ్లిషర్ల దగ్గర కాస్త తగ్గింపు ధరతో కొంటాం. అలా తెలుగు కథలూ, కవితలూ, కార్టూన్ పుస్తకాలూ, పద్యాలూ, సామెతలూ, ఆంగ్ల పుస్తకాలు కలిపి దాదాపు రెండొందల యాభై పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేస్తాం. బళ్లో ప్రధానోపాధ్యాయుడు స్థలం చూపించిన చోట ఈ పుస్తకాలను ఉంచుతాం. మేం గ్రంథాలయాలు ఏర్పాటు చేసిన స్కూళ్లలో దాదాపు యాభైశాతం భవనాలు లేవు. ఒక్క గది ఉండి.. చెట్టు కింద పాఠాలు చెబుతున్నవీ ఉన్నాయి.

అందరికీ పనికొచ్చేలా: కమ్యూనిటీ లైబ్రరీలను పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తాం. ఇక్కడ చిన్నారుల్నుంచీ, మహిళలూ, యువతా, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారూ, వృద్ధులు.. ఇలా వయసులవారీగా చదివేలా నవలలూ, కథలూ, మ్యాగజైన్లూ అందిస్తాం. మమ్మల్ని సంప్రదిస్తే చాలు మేమే వెళ్లి ఏర్పాటు చేస్తాం. ఇక పబ్లిక్ లైబ్రరీలను పార్కులూ, ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తాం. రైల్వే స్టేషన్‌లోని వెయిటింగ్ హాళ్లలోనూ ఏర్పాటు చేద్దామని ఇండియన్ రైల్వేస్‌ని సంప్రదించాం. త్వరలోనే అక్కడా గ్రంథాలయం తెరుస్తాం. హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో మా పబ్లిక్ లైబ్రరీ ఉంటుంది. క్యాన్సర్ చికిత్స కోసం వచ్చే రోగుల సహాయకులు రోజుల తరబడి ఆసుపత్రిలోనే ఉండాలి. అందుకే వాళ్లని ఈ పుస్తకాలను చదవమంటాం. అయితే నర్సులు వచ్చి.. 'మేడం రోగితో ఉండే వారికే కాదు. క్యాన్సర్ చికిత్స చేయించుకుంటున్న చిన్నారులకీ ఈ పుస్తకాలు అవసరం. వాళ్లు ఎంతసేపని టీవీ చూస్తారు. వీలుంటే బెడ్ వద్దకే పుస్తకాలు పంపండి' అని అడిగారు. దాంతో పుస్తకాల పేర్లతో ఓ మెనూ కార్డు కొట్టించా. పొద్దున్నే నర్సులు పిల్లలకి ఆ మెనూ కార్డు ఇచ్చి ఏం పుస్తకం కావాలో నర్సులు టిక్ పెట్టమంటారు. అలా వాళ్లు అడిగిన వాటిని ఆ మంచం దగ్గరకే పంపించే ఏర్పాటు చేస్తాం. వీళ్లకు అందించే పుస్తకాల్లో స్ఫూర్తినిచ్చేవి ఎక్కువగా ఉంటాయి. దానివల్ల వారిలో ధైర్యం పెరుగుతుందని నా అభిప్రాయం.

– పద్మ వడ్డె

ఖమ్మం జిల్లా కోయచెలక అనే గ్రామంలో పుస్తకాలకి స్థలం లేదు. పాత ఫ్రిజ్‌ని పన్నెండొందలకి కొని అందులో పుస్తకాల్ని సర్దేశాం. మేఘాలయలో పిల్లలు చెట్టు కింద చదువుకుంటారు. హెడ్‌మాస్టర్ కూర్చోవడానికి ఓ చిన్న గది ఉంది. దాంతో ఓ ట్రంకు పెట్టె కొని అందులోనే పుస్తకాలు పెట్టిచ్చాం. పిల్లలు బడికి రాగానే పెట్టెను బయట పెట్టుకుని కావాల్సినవి తీసుకుంటారు. గ్వాలియర్‌లోని ఓ గ్రామంలో బళ్లో పెద్దగా స్థలం లేదు. దాంతో ఓ టీచర్ తరగతి గదిలో ఓ తాడు కట్టి దానిపై పుస్తకాల్ని దుస్తులు ఆరేసినట్టు ఉంచింది. మా లక్ష్యం కూడా పిల్లలకి ఏదో విధంగా పుస్తక విజ్ఞానం అందించడమే. మా వలంటీర్లు అక్కడకు వెళ్లి జాయ్ ఆఫ్ రీడింగ్ పేరుతో వాళ్లకి చదవడం పట్ల ఆసక్తినీ పెంచుతారు. రకరకాల కార్యక్రమాలు చేస్తారు. ఇక మాకు ఒక లైబ్రరీ ఏర్పాటుకు దాదాపు పదిహేను నుంచి పాతికవేల వరకూ అవుతుంది.

ఫొటోలు తీసేశానన్నాడు...కానీ!

పారాహుషార్

స్రవంతి భయపడినట్లే చేశాడతను. అందుకే ఏ ఫోన్ మోగినా వణికిపోయింది. విదేశాల్లో ఉద్యోగం చేస్తోన్న తన కూతురు ఆ పరిస్థితుల్లో ఏం చేసుకుంటుందోనని భయపడిపోయారు ఆమె తల్లిదండ్రులు. కానీ అలానే కుంగిపోతే ఏదైనా జరగొచ్చు. అందుకే స్రవంతి తల్లి ధైర్యం చేసింది. కూతురికి హాని తలపెట్టాలనుకున్న అతడిని హెచ్చరించింది. ఆ సమయంలో అతడు కాస్త వెనక్కి తగ్గినా ప్రమాదం మాత్రం లేకపోలేదని ఊహించింది. ఇలాంటి పరిస్థితి తమ కూతురికే కాదు..మరే ఆడపిల్లకీ జరగకూడదనుకుంది ఆ తల్లి. అందుకే సైబరాబాద్ సైబర్ క్రైమ్ విభాగంలోని పోలీసుల్ని సంప్రదించింది. అసలు ఏం జరిగిందీ... స్రవంతి ఎవరు... అతను ఆమెకి ఎలాంటి హాని తలపెట్టాలనుకున్నాడు... పోలీసులు దాన్నెలా పరిష్కరించారు... ఆ వివరాలే చెబుతున్నారు సైబరాబాద్ డీసీపీ జానకీషర్మిల.

స్రవంతి హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో హొటల్‌మేనేజిమెంట్ పూర్తి చేసింది. అక్కడ చదువుతున్నప్పుడే పరిచయం అయ్యాడు అతను. పేరు రాజు. ప్రేమించానంటూ వెనక తిరిగేవాడు. మొదట్లో ఆమె ఏమాత్రం పట్టించుకోలేదు. కానీ అతడు వదిలిపెట్టలేదు. పదే పదే తన ప్రేమను వ్యక్తం చేసేవాడు. కొన్నాళ్లకి ఆమె అతడి ప్రేమని ఒప్పుకుంది. అది చనువుకు దారితీసింది. దాంతో ఇద్దరూ తమకు సంబంధించిన వ్యక్తిగత చిత్రాలను వాట్సప్‌లో పంచుకున్నారు. అయితే వారి బంధం ఎక్కువ కాలం నిలబడలేదు. అతడిలోని మరో రూపం ఆమెకు తెలియడంతో దూరంగా ఉండటం మొదలుపెట్టింది. కానీ అతడు వదల్లేదు. పెళ్లి చేసుకోమంటూ బలవంతం చేయడం మొదలుపెట్టాడు. ఒప్పుకోకపోతే తన దగ్గర ఉన్న స్రవంతి చిత్రాలను ఆమె బంధువులకూ, సన్నిహితులకు పంపిస్తానని బెదిరించాడు. అయినా ఆమె లెక్కచేయలేదు. అవన్నీ కేవలం బెదిరింపులే అనుకుంది. కానీ ఓ రోజు అతను చెప్పినట్లే చేశాడు. ఆ ఫొటోలను పోర్న్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశాడు. వాటి లింక్‌లని స్నేహితులకీ, ఆమె బంధువులకీ కూడా పంపాడు. ఈ విషయం ఆ నోటా, ఈనోటా ఆమెకూ, ఆమె తల్లిదండ్రులకు తెలిసింది. కూతురి నుంచి మరిన్ని వివరాలు తెలిశాక స్రవంతి తల్లి అతడికి ఫోన్ చేసింది. వాటిని తొలగించమని అడిగింది. లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేసానని భయపెట్టింది. ఏమనుకున్నాడో ఏమో కానీ వాటిని తొలగించడానికి ఒప్పుకున్నాడు. అక్కడితో సమస్య తీరిపోయిందనుకుని ఊపిరి పీల్చుకుంటే... ఫొటోలు తొలగించినా ఆ లింక్‌లు ఓపెన్ అవుతున్నాయని తెలిసింది. అప్పుడే పోలీసుల్ని సంప్రదించింది స్రవంతి తల్లి. వాటిని ఎలా అయినా తీయించి, అతడికి శిక్షపడేలా చేయమని వేడుకుంది. వెంటనే మా బృందం రంగంలోకి దిగింది. పోర్న్ సైట్‌లు ఎవరు నిర్వహిస్తారో తెలియదు. అవి ఐపీలూ ఓ పట్టాన దొరకవు. కానీ ఓ ఆడపిల్లని కాపాడటమే మా లక్ష్యం అనుకున్నాం. చివరికి సైబర్ నిపుణుల పర్యవేక్షణలో కొన్ని పోర్న్‌సైట్ల గురించి తెలిశాయి. అలా ఆమె ఫొటోలు పెట్టిన పోర్న్‌సైట్‌లో లింక్‌లు తీయించగలిగాం. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో నిలబెట్టాం.

sho_cybercrimes@cyb.tspolice.gov.in కి సంప్రదించొచ్చు.

బల్బ్...పూలకుండీ

పనికిరాని బల్బుల్ని పారేస్తుంటే ఒక్కక్షణం ఆగండి. వాటిని కాస్త శుభ్రం చేసి సృజనాత్మకత జోడిస్తే చాలు, ఉపయోగపడకపోయినా గదికి అందం తెస్తాయవి.

వెలగని బల్బుపై మూతలాంటిదాన్ని జాగ్రత్తగా తీసేయండి. తరువాత మెత్తని వస్త్రంతో లోపలి భాగాన్ని తుడవాలి. చిత్రంలో చూపించినట్లు చిన్నచిన్న మొక్కలూ, పూలూ, చాక్లెట్లూ, గులకరాళ్లు... ఇలా ఏవయినా నింపేయొచ్చు. వాటిని తాళ్లు కట్టి గది మధ్యలో వేలాడదీయొచ్చు కూడా. లేదా గిఫ్ట్‌నోట్‌లు అందించి కానుకగానూ ఇచ్చేయొచ్చు. ప్రయత్నించి చూడండి మరి.

email: vasundhara@eenadu.net

పెదాలకు ఓ పూత

పెదవులు పొడిబారి, నిర్జీవంగా కనిపించడం చాలామంది సమస్య. దానికి లిప్‌స్టిక్ వేసుకోవడం పరిష్కారం కాదు. పెదాలకూ చిన్నచిన్న పూతలు వేయాలి.

గులాబీ నీటితో... చర్మానికి స్వాంతన అందించి, మృదువుగా, తేమగా మార్చే గుణాలు ఈ నీటి సొంతం. ఈ నీరు సహజ సిద్ధంగానే పెదవులకు లేత గులాబీ వర్ణాన్ని అందిస్తుంది. కొన్ని చుక్కల చొప్పున గులాబీ నీరూ, కాస్త తేనె కలిపి పెదాలకు రాయాలి. రోజూ ఇలా చేస్తే చాలా తక్కువ సమయంలోనే మార్పు ఉంటుంది.

బీట్‌రూట్‌తో... దీనిలో సహజసిద్ధంగానే బ్లీచింగ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి మీ పెదవులపై ఉండే మరకలను పోగొడతాయి. తాజా బీట్‌రూట్ రసాన్ని పెదాలకు రాయాలి. ఇలా రాత్రుళ్లు రాసుకుని ఉదయమే కడిగేయాలి. తరచూ చేయడం వల్ల మీ పెదాలు లేత ఎరుపురంగులోకి మారతాయి.

దానిమ్మతో... ఈ గింజల రసం పొడిబారిన పెదాలకు పోషణతో పాటు తేమను అందిస్తుంది. ఒక పెద్ద చెంచా చొప్పున దానిమ్మ రసం, క్రీమ్, గులాబీ నీరు తీసుకుని అన్నింటినీ కలపాలి. దీన్ని పెదాలకు పూతలా రాసి కొన్ని నిమిషాలపాటు మృదువుగా మర్దన చేయాలి. కాసేపటి తరువాత గోరువెచ్చటి నీటితో కడిగేయాలి.

కీరతో... ప్రతిరోజూ కీరదోస ముక్కతో మీ పెదాలపై బాగా రుద్దినట్లు చేయాలి. ఆ రసం మీ పెదాలు పీల్చుకుంటాయి. ఇలా ప్రతిరోజూ అయిదు నిమిషాలపాటు చేయడం వల్ల ఫలితం ఉంటుంది.

బాదంనూనెతో... పెదాల నలుపు తగ్గాలన్నా, వాటికి పోషణ అందాలన్నా, మృదువుగా మారాలన్నా బాదం నూనె తప్పనిసరి. పెద్ద చెంచా తేనెలో అయిదారు చుక్కల బాదంనూనె కలిపి పెదాలకు రాసి మృదువుగా మర్దన చేయాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే పెదాలకు పోషణ లభిస్తుంది. రంగూ మెరుగవుతుంది.

నజరానా

చెంచా అల్లంరసం, రెండు చెంచాల బెల్లం రసం గ్లాసు నీటితో కలిపి తీసుకుంటే జీర్ణ శక్తి మెరుగుపడుతుంది

స్నేహానికీ హద్దుంది!

కాలేజీలోకి అడుగుపెట్టాక స్నేహితులే ముఖ్యం అనుకుంటుంది యువత. అలాంటి ఆకర్షణే మీలోనూ కనిపించొచ్చు. కానీ ఆ మోజులో పడి లక్ష్యాన్ని పక్కన పెట్టేస్తే ఎలా... అందుకే స్నేహం చేయండి. కానీ ఓ సరిహద్దు పెట్టుకునేనని మరవకండి.

* స్నేహితుల ఆటలూ, పాటలూ, కబుర్లూ... సరదాగా అనిపిస్తాయి. కానీ అదే ప్రపంచం కాదు... లక్ష్యం పెట్టుకుంటూనే ఆ ప్రపంచం మీతో ఉండేలా చూసుకోవాలి. వారిని కలిసేందుకూ, మాట్లాడేందుకు ప్రత్యేకంగా ఓ సమయాన్ని పెట్టుకోండి.
* ఎదిగే వయసుకి స్నేహితుల తోడు అవసరమే! అలానీ మీ ఆలోచనలన్నింటినీ వారే ప్రభావితం చేయకుండా చూసుకోండి. అంటే మీ వ్యక్తిత్వానికీ, ఆలోచనా శక్తికీ వారే మూలం కాకూడదు. స్వతంత్రంగా ఆలోచించే శక్తిని కూడగట్టుకోండి. ఒకవేళ మీ స్నేహితురాలు చేస్తోన్న పని నచ్చకపోతే ఆ విషయాన్ని సున్నితంగానే చెప్పండి. అంతే తప్ప వారిని అనుకరించాలనుకోవడం, మొహమాటానికి వారు చెప్పే పనులు చేయడం సరికాదు. ఇది మీపై ప్రతికూల ముద్రను వేసే ప్రమాదం ఉంది.
* కొత్త కొత్త స్నేహాలు రంగుల ప్రపంచాన్ని చూపిస్తాయి. మీ స్నేహం ఓ పరిధిలో సాగితే ఫరవాలేదు. ముఖ్యంగా అంతర్జాలంలో ముక్కూ, మొహం తెలియని వారిని స్నేహితులుగా అంగీకరించకూడదు. కొత్త చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది.

బంగారం వెండి

26న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,500	31,700	31,550	31,500
ఆర్నమెంట్	29,400	29,600	29,350	29,300
వెండి (కిలో)	40,760	41,550	41,200	41,200
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,600	31,650	31,490	31,652
ఆర్నమెంట్	29,310	29,350	29,080	29,300
వెండి (కిలో)	40,900	41,000	40,700	41,100
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,270	31,430	-------	-------
ఆర్నమెంట్	29,080	29,230	2,908	2,930 గ్రా
వెండి (కిలో)	41,900	41,900	42.90	43.30 గ్రా

పల్లవి... గిరిజన ఫ్యాషన్ రారాణి!

ఫ్యాషన్ షో అంటే...
రంగురంగుల లైట్ల వెలుగుల ర్యాంప్...
ఎత్తుమడమల చెప్పులు వేసుకుని క్యాట్‌వాక్ చేసే మోడళ్లూ...
వైవిధ్యమైన దుస్తులతో అదిరిపోతుంది కదూ.
కానీ ఈ ఫ్యాషన్‌షో అందుకు పూర్తిగా భిన్నం. సంప్రదాయ దుస్తులతో, తమదైన ఆహార్యంతో ఆ గిరిజన యువతలు మోడళ్లుగా మెరిసిపోయారు. తామేంటో నిరూపించుకున్నారు. వారిలో పల్లవీ దారువా ట్రైబల్ క్వీన్‌గా గెలిచింది. ఆ వివరాలేంటో చూద్దామా.

ఒడిశాలోని భువనేశ్వర్‌లో 'కళింగ ట్రైబల్ క్వీన్ కాంటెస్ట్' పేరుతో భారతదేశంలోని గిరిజన యువతులకు తొలసారిగా అందాలపోటీని నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల్లోని 150 మందికి పైగా గిరిజన యువతులు పాల్గొన్నారు. దీన్ని ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ గిరిజన, పర్యాటక శాఖ నిర్వహించింది. తుదిదశకు 22 మంది గిరిజన యువతులు అర్హత సాధించారు. వీరంతా సంప్రదాయ దుస్తుల్లో, రకరకాల ఆభరణాలను ధరించి వేదికపై ర్యాంప్ వాక్ చేశారు. న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు సమయస్ఫూర్తితో సమాధానాలు చెప్పారు. వారిలో ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన పల్లవీ దారువా విజేతగా నిలిచింది. మొదటి రన్నరప్‌గా పంచమి మజ్జి, రెండో రన్నరప్‌గా రశ్మిరేఖా హన్సదా ఎంపికయ్యారు. ఇక, వస్త్రధారణ, ముఖతీరూ, చర్మకాంతీ, శరీరాకృతీ, ఆభరణాల ఎంపిక, సంస్కృతి సాంప్రదాయాల ప్రదర్శన... ఆధారంగా ఏడుగురి యువతుల్నీ విజేతలుగా ఎంపిక చేశారు. విజేత పల్లవి మాట్లాడుతూ...

'గిరిజనల్లో చాలామంది యువతులు నిరక్షరాస్యులే. ఈ పోటీ వల్ల మాకూ గుర్తింపు వచ్చింది. మిగిలిన వారిలోనూ ఆత్మవిశ్వాసం పెరుగుతుందని నా నమ్మకం. ఈ పోటీలో చాలా ప్రశ్నలు అడిగారు. ప్రకృతి అందాలూ, గిరిజనుల సాంప్రదాయాల గురించి ప్రశ్నించారు. నా భవిష్యత్తు లక్ష్యం గురించీ అడిగారు. ముందు తరాలకు మా సంస్కృతినీ, మాతృభాషను అందిస్తానని చెప్పా. నా సమాధానాల ఆధారంగానే నన్ను విజేతగా ఎంపిక చేశారు...' అంటూ వివరించిదామె. ట్రైబల్ క్వీన్ పేరుతో దేశంలోనే తొలిసారిగా ఈ అందాల పోటీని నిర్వహించామని చెప్పారు నిర్వాహకులు. 'జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీలో దేశవ్యాప్తంగా ఎంతోమంది గిరిజన మహిళలు పాల్గొన్నారు. జాతి అభివృద్ధి కోసం కృషి చేసిన మహిళల్ని గుర్తించి ఈ పోటీకి ఎంపికచేశాం. గిరిజన మహిళల సాధికారతను చాటడానికి ఇదో వేదిక...' అన్నారు నిర్వాహకులు.

మనం తినే తిండి.. వేసుకునే దుస్తులు, మందులు.. ఉపయోగించే మొబైల్, కంప్యూటర్.. నడిపే వాహనం.. ఇలా అన్ని రకాల వస్తువులు ఎక్కడో తయారై మన ఊరిలోకి.. అందులోనూ మన వీధిలోకి.. ఇంకా చెప్పాలంటే ఇంటింటికీ ఎలా వచ్చి చేరుతున్నాయో ఎప్పుడైనా ఆలోచించారా? ఉత్పత్తి కేంద్రం నుంచి వినియోగదారుడి వరకు వీటిని పాడైపోకుండా సకాలంలో చేర్చడంలో ఎంతోమంది నిపుణులు పని చేస్తుంటారు. నిత్యజీవితంతో ఇంతగా ముడిపడిపోయిన ఈ రంగమే 'లాజిస్టిక్స్'. వచ్చే నాలుగేళ్లలో ఇందులో దాదాపు 30 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని ఒక సర్వేలో తేలింది. మన తెలుగు రాష్ట్రాల్లోనే లక్షల ఉద్యోగాలు లభించబోతున్నాయి. విస్తృతమైన ఈ రంగంలోకి ప్రవేశించి అవకాశాలను అందుకోవాలంటే లాజిస్టిక్స్‌కి సంబంధించి కొన్ని కోర్సులు చేయాలి. టెన్త్, ఇంటర్, సాధారణ డిగ్రీ అర్హతలతో అవి అందుబాటులో ఉన్నాయి.

వస్తు రవాణా.. మస్తు కొలువులు

అవసరమైన సమయంలో ఏ వస్తువైనా అందుబాటులో లేకపోతే ఎంత ఇబ్బందో కదా! అందుకే సరైన వస్తువును, సరైన పరిమాణంలో, సరైన సమయంలో, సరైన ప్రాంతానికి తక్కువ ధరలో చేర్చే రవాణా నిర్వహణ యంత్రాంగమే 'లాజిస్టిక్స్'. ఈ పదం గ్రీకు పదం 'లోగోస్' నుంచి ఆవిర్భవించింది. అలెగ్జాండర్, డ్యూక్ వెల్లింగ్టన్, హన్నీబాల్ వంటి సైనిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన యుద్ధాల్లో యుద్ధ సామగ్రిని సరఫరా చేస్తున్న సమయంలో లాజిస్టిక్స్ అనే పదం వాడుకలోకి వచ్చింది. తర్వాత 1990 ప్రారంభంలో వ్యాపార రంగంలోకీ ప్రవేశించింది. ఇప్పుడు మనకు తెలియకుండానే మన నిత్య జీవితంతో ఎంతో అనుబంధాన్ని పెంచుకుంది.

ముడిసరకు నుంచి తుది ఉత్పత్తిగా తయారైన వస్తువు, దాని నిల్వ, సరఫరా, క్రయవిక్రయాలతో కూడిన చక్రాన్ని సమర్థంగా నిర్వహించడమే లాజిస్టిషియన్ విధి. దేశ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ విప్లవాత్మక మార్పులతో తన ప్రాముఖ్యతను పెంచుకుంటోంది. ప్రస్తుత వ్యాపార రంగంలో తన పరిధిని విస్తృతం చేసింది. వచ్చే నాలుగేళ్లలో భారత్‌లో 30 లక్షల ఉద్యోగాలు లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ రంగం సృష్టిస్తుందని టీమ్ లీజ్ అనే సంస్థ ఒక నివేదికలో వెల్లడించింది. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు రంగాల్లో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఈ రంగంలో మంచి భవిష్యత్తు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మరి ఇందులోకి ప్రవేశించాలంటే ఏం చేయాలి.. ఎలాంటి విద్యార్హతలు కలిగి ఉండాలి.. ఏ కోర్సులు చదవాలి.. ఏయే అవకాశాలు ఉంటాయి తదితర విషయాలు తెలుసుకుంటే అభ్యర్థుల ఆసక్తి మేరకు మంచి నిర్ణయం తీసుకోడానికి వీలవుతుంది.

తెలుగు రాష్ట్రాల్లో

లాజిస్టిక్స్ రంగం ప్రాధాన్యాన్ని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నం-చెన్నై కారిడార్ అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం, శ్రీకాళహస్తిల దగ్గర లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయనుంది. కాకినాడలో 'ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ యూనివర్సిటీ' ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎగుమతులను ప్రోత్సహించేందుకు పలుచోట్ల డ్రైపోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు మొదలయ్యాయి. ఇవి పూర్తిస్థాయిలో కార్యరూపం దాలిస్తే పలు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఒక్క హైదరాబాద్ ప్రాంతంలోనే దాదాపు రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయని టీమ్‌లీజ్ అనే సంస్థ అంచనా వేసింది.

కనీస అర్హతలు

సర్టిఫికెట్ కోర్సులు మొదలు, పీజీ, పీహెచ్‌డీల వరకు ఎన్నో రకాల కోర్సులు లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించి ఉన్నాయి. పదోతరగతి, ఇంటర్మీడియట్, సాధారణ డిగ్రీలు కనీస అర్హతగా ఈ కోర్సులను పలు సంస్థలు అందిస్తున్నాయి. దీంతోపాటు ఒత్తిడిలో పని చేయగల సామర్థ్యం, అంకితభావం, బృందస్ఫూర్తి, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, విశ్లేషణ సామర్థ్యం, భౌగోళిక పరిజ్ఞానం, సంస్థాగత నైపుణ్యాలు, స్వీయ నిర్ణయ శక్తి, సమయపాలన, ఆర్థిక లావాదేవీల అంచనాలో పరిజ్ఞానం మొదలైన అదనపు లక్షణాలు ఉంటే మంచి రాణింపు ఉంటుంది.

పలు రకాల కోర్సులు

దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు, సంస్థలు లాజిస్టిక్స్‌లో పలు రకాల కోర్సులను అందిస్తున్నాయి.

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ఇన్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ఇన్ లాజిస్టిక్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్
- ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్
- డిప్లొమా ఇన్ మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ (కంటైనరైజేషన్) అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ రిటైల్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్
- అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్
- పీజీ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- పీజీ డిప్లొమా ఇన్ మెటీరియల్స్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్
- పీజీ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్
- పీజీ డిప్లొమా ఇన్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- బీఎస్సీ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- బీకాం లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- బీబీఎం లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- బీబీఏ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్
- ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- పీహెచ్‌డీ ఇన్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్

ప్రభుత్వరంగంలో

- ఇండియన్ మారీటైమ్ యూనివర్సిటీ, కొచ్చి, చెన్నై,ముంబయి, నవీ ముంబయి, విశాఖపట్నం. (www.imu.edu.in)
- ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ (www.iiiem.in)
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైల్ ట్రాన్స్‌పోర్ట్, న్యూదిల్లీ (www.irt-india.com)
- కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎకనామిక్స్ స్టడీస్, డెహ్రాడూన్ (www.upes.ac.in)
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైల్ ట్రాన్స్‌పోర్ట్, వడోదర, గుజరాత్ (www.nrti.in)

కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు

లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్‌లో కోర్సులు చేయాలనుకునే విద్యార్థులకు కొన్ని విద్యాసంస్థలు ప్రత్యేకంగా ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు క్యాట్, మ్యాట్, గ్మాట్‌లు లేదా వాటికి సమానమైన పరీక్షల్లో అర్హత సాధించిన వారిని చేర్చుకుంటున్నాయి. సాధారణంగా ప్రతి సంవత్సరం మార్చి, సెప్టెంబరులో ప్రవేశపరీక్షలు ఉంటాయి.

లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో తెలుగు రాష్ట్రాల్లోనూ కోర్సులను అందించే విద్యాసంస్థలు ఉన్నాయి. హైదరాబాద్‌లో సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ట్రేడ్ వింగ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, లండన్ మేనేజ్‌మెంట్ అకాడమీ లాంటి విద్యాసంస్థలు ఎంబీఏలో లాజిస్టిక్స్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా రెండు సంవత్సరాల ఎంబీఏ లాజిస్టిక్స్, పీజీ డిప్లొమాలో లాజిస్టిక్స్ సప్లై మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తోంది. తమిళనాడులో కోయంబత్తూర్ మెరైన్ కాలేజ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్, ఇందిరా గాంధీ కాలేజ్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, వేల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, మధురై కామరాజ్ యూనివర్సిటీ వంటి చోట్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇవేకాకుండా ఈ కింద పేర్కొన్న మరికొన్ని సంస్థలు దేశవ్యాప్తంగా లాజిస్టిక్స్‌కి సంబంధించి రకరకాల కోర్సులు అందిస్తున్నాయి.

ప్రైవేటు పరిధిలో

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్, విజయవాడ
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెట్రో అండ్ రైల్ టెక్నాలజీ, హైదరాబాద్ (www.imrtindia.edu.in)
- గీతం ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (www.gsib.gitam.edu)
- అకాడమీ ఆఫ్ మారీటైమ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్, ముంబయి, చెన్నై (డీమ్డ్ యూనివర్సిటీ). (www.ametuniv.ac.in)
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, ముంబయి (www.iimm.org)
- డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై (www.drmgrdu.ac.in)
- స్పీడ్‌వింగ్స్ అకాడమీ ఫర్ ఏవియేషన్ సర్వీసెస్, కేరళ (www.speedwings.org)

(మరిన్ని సంస్థల వివరాల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.)

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అనుసంధానమై అభివృద్ధి పథంలో నడుస్తున్న నేపథ్యంలో ఈ రంగంలో కంపెనీలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువవుతున్నాయి. ఈ డిమాండ్ ఎప్పటికీ ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఈ-కామర్స్ ఇండస్ట్రీ విస్తృతమవడం వల్ల నైపుణ్యం ఉన్నవారికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. డెలివరీ బాయ్స్ మొదలుకొని మేనేజ్‌మెంట్ వరకు అన్ని స్థాయిల్లో వృద్ధి సాధించవచ్చు. భౌగోళిక పరిజ్ఞానంతోపాటు నిర్వహణ, సమన్వయం, కంప్యూటర్ నైపుణ్యాలు ఉన్న వారికి ఇక్కడ మంచి భవిష్యత్తు తప్పక ఉంటుంది.

ఉద్యోగాల పరిధి విస్తృతం

లాజిస్టిక్స్ రంగంలో ఉద్యోగాల పరిధి చాలా విస్తృతమైంది. చురుకైన ప్రతిభావంతులకు దేశ, విదేశాల్లో ఎన్నో రకాల అవకాశాలు ఉన్నాయి. కొరియర్ కంపెనీల ఏర్పాటుతో ఈ రంగం ప్రాధాన్యం మరింత పెరిగింది. కార్గో మేనేజ్‌మెంట్, షిప్పింగ్ కంపెనీలు లాజిస్టిక్స్‌లో ప్రొఫెషనల్ డిగ్రీ ఉన్నవారినే తీసుకుంటున్నాయి. సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించి ఎక్కువగా ఎంట్రీ లెవెల్ మేనేజర్ల ఉద్యోగాలు లభిస్తున్నాయి. లాజిస్టిక్స్‌లో ఎంబీఏ చేసినవారిని ట్రెయినీలు, అనలిస్టులు, ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లుగా పెద్ద పెద్ద ఉత్పత్తి కంపెనీలు రిక్రూట్ చేసుకుంటున్నాయి. రోడ్డు, రైలు, జల, వాయు రవాణా మార్గాలు, కొరియర్ సంస్థలు, గిడ్డంగులు, ప్యాకేజీలు, ఆసుపత్రులు, వస్త్ర పరిశ్రమ, వాహనరంగం, ప్రచురణ, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ రంగం, ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ కంపెనీలు, విద్యాసంస్థలు ఇలా అనేక రంగాల్లో ఈ నిపుణులకు ఉద్యోగాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ప్రధానమైనవి..

- లాజిస్టిక్స్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్
- సప్లై చెయిన్ అనలిస్ట్
- సప్లై చెయిన్ మేనేజర్
- సప్లై చెయిన్ కన్సల్టెంట్
- కస్టమర్ సర్వీస్ మేనేజర్
- ఫుల్‌ఫిల్‌మెంట్ సూపర్‌వైజర్
- కన్సల్టెంట్
- ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్
- వేర్‌హౌస్ ఆపరేషన్స్ మేనేజర్
- షిప్పింగ్ కోఆర్డినేటర్
- ఎక్స్‌పోర్ట్ ఎగ్జిక్యూటివ్
- ఎక్స్‌పెడైటర్
- పర్చేజ్ మేనేజర్
- సప్లై చెయిన్ సాఫ్ట్‌వేర్ మేనేజర్
- ఇంటర్‌నేషనల్ లాజిస్టిక్స్ మేనేజర్

ఉద్యోగాలిచ్చే కొన్ని సంస్థలు

- బ్లూడార్ట్
- ఫెడెక్స్
- హెల్త్‌కార్ట్
- అగర్వాల్ ప్యాకర్స్ అండ్ మూవర్స్
- డీటీడీసీ
- ఫస్ట్ ఫ్లైట్
- స్పైస్‌జెట్
- టీసీఎస్
- కాగ్నిజెంట్
- అశోక్ లేలాండ్
- ప్రభుత్వ రంగంలో ఓఎన్‌జీసీ, గెయిల్, ఎన్‌హెచ్‌పీసీ లాంటి పలు కంపెనీలు.

రైల్వే యూనివర్సిటీలో కొత్త కోర్సులు

రైల్వే, ఇతర రవాణా రంగాలకు కావలసిన సుశిక్షితులైన సిబ్బంది అవసరం పెరుగుతోంది. ఈ గిరాకీని దృష్టిలో ఉంచుకుని దేశ రవాణా రంగానికి కావలసిన నిపుణులను తయారుచేసే లక్ష్యంతో ఏర్పడిన డీమ్డ్ యూనివర్సిటీ..'నేషనల్ రైల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌స్టిట్యూట్' (ఎన్‌ఆర్‌టీఐ). దేశంలోనే తొలి రైల్వే విశ్వవిద్యాలయంగా పేరుపొందిన ఈ సంస్థ సరికొత్త అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రవేశపెట్టింది.

గుజరాత్ వడోదరలో ఉన్న ఎన్‌ఆర్‌టీఐ.. రెండు పూర్తిస్థాయి కోర్సులను ప్రారంభిస్తోంది. 2018-19 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు జరిగే మూడు సంవత్సరాల వ్యవధి గల రెసిడెన్షియల్ కోర్సులివి.

1. బీబీఏ ఇన్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజ్‌మెంట్: విభిన్న సబ్జెక్టుల కలయికగా ఉపరితల రవాణా అంశాలపై బోధన కేంద్రీకరిస్తుంది. దేశరవాణాపై యువతకు నూతన నైపుణ్యాలూ, ఆలోచనలు కలిగించేలా కోర్సును రూపొందించారు. ప్రపంచంలోని ఉపరితల రవాణాపై జరిగే పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను తెలుపుతూ ప్రాజెక్టులో స్వీయ అనుభవం ద్వారా పాఠ్యాంశాల బోధన జరుగుతుంది.

2. బీఎస్‌సీ ఇన్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీ: ఈ కోర్సులో బహుళ శాస్త్రాల పాఠ్యాంశాలు ప్రధానాంశంగా ఉంటాయి. రైల్వేల్లోని వివిధ సంస్థల పనితీరుపై అధ్యయనం ఉంటుంది. దేశ విదేశ రవాణా వ్యవస్థలోని ఆధునిక పోకడలు, పరిశోధనల గురించి అవగాహన పెంచుతారు.

అర్హత: ఇంటర్మీడియట్‌లో గణితం ఒక సబ్జెక్టుగా చదివివుండాలి. కనీసం 55 శాతం మార్కులు సాధించివుండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులైతే 50 శాతం మార్కులుంటే చాలు. అభ్యర్థుల వయసు ఆగస్టు 1, 2018 నాటికి 25 సంవత్సరాలలోపు ఉండాలి.

ఎంపిక విధానం: 1. ఇంటర్మీడియట్‌లో పొందిన మార్కులు 2. ఎన్‌ఆర్‌టీఐ ప్రవేశపరీక్షలో పొందిన మార్కులు. దరఖాస్తుదారుల్లోంచి ఎంపికచేసిన అభ్యర్థులకు జులై నెలలో ఎన్‌ఆర్‌టీఐ ప్రవేశపరీక్షను నిర్వహిస్తారు. పరీక్ష తేదీని తర్వాత ప్రకటిస్తారు. ఈ పరీక్ష దేశంలోని ప్రధాన పట్టణాల్లో జరుగుతుంది.

హాస్టల్, మెస్ చార్జీలు, ట్యూషన్ ఫీజు కలిపి: రూ. 82,500. విద్యార్థులు విధిగా హాస్టల్లో ఉండాలి. విద్యార్థులందరికీ రైల్వేలోని వివిధ విభాగాల్లో ఆన్ ద జాబ్ ట్రెయినింగ్‌ను అందిస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 30, 2018. **తరగతుల ప్రారంభం:** ఆగస్టు 2018. **వెబ్‌సైట్:** https://nrti.in

ఉపాధికి భిన్న అవకాశాలు

ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ (ఐఎంయూ)- చెన్నై మూడేళ్ల బీబీఏ (లాజిస్టిక్స్, రిటైలింగ్, ఇ-కామర్స్), రెండేళ్ల ఎంబీఏ- ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్, ఎంబీఏ-పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తోంది. హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెట్రో అండ్ టెక్నాలజీ సంస్థ ఏడాది నిడివిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ రైల్ అండ్ మెట్రో ట్రాన్స్‌పోర్ట్ (పీజీపీఎంఆర్‌టీ) కోర్సును అందిస్తోంది.

రైల్వే విశ్వవిద్యాలయం వీటికి భిన్నంగా బీబీఏ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజ్‌మెంట్ కోర్సును ఈ ఏడాదే ప్రవేశపెట్టింది. బీఎస్‌సీ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీ కోర్సును దేశంలోని ఏ సంస్థా అందించడంలేదు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి రోడ్డు రవాణా, జల రవాణా, రైలు, విమానయాన రంగాల్లోని వివిధ సంస్థల్లో నిపుణులుగా చేరే అవకాశం లభిస్తుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి ఈ-కామర్స్ సంస్థల్లో నిపుణులుగా, మేనేజర్లుగా చేరవచ్చు.

- వి.జగదీశ్వర్, విద్యారంగ నిపుణుడు

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

వైజాగ్ డీసీసీబీలో క్లర్క్ పోస్టులు

విశాఖపట్నంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్/ క్లర్క్ పోస్టులకు దరఖాస్తులు.

ఖాళీలు: 61.

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ పరిజ్ఞానం.

వయసు: 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 02.07.2018.

వెబ్‌సైట్: http://vizagdccb.org.in/

ఆర్‌జీయూకేటీ- బాసరలో గెస్ట్ ఫ్యాకల్టీ

బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ, ల్యాబ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు. **విభాగాలు:** ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, భాషలు. **అర్హత, ఎంపిక:** విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం.

మరిన్ని వివరాలకు వెబ్‌సైట్: http://www.rgukt.ac.in/

ఈసీఐఎల్‌లో టెక్నికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు. **పోస్టు-ఖాళీలు:** టెక్నికల్ ఆఫీసర్ (ఈసీఈ/ ఈఈఈ/ ఎంఈ/ సీఎస్ఈ)- 15, సైంటిఫిక్ అసిస్టెంట్- 02. **అర్హత:** ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు ఏడాది పని అనుభవం ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 03.07.2018. **వెబ్‌సైట్:** www.ecil.co.in

ప్రవేశాలు

ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్ష

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీలో ఎనిమిదో తరగతి ప్రవేశానికి ఏపీపీఎస్సీ దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్న లేదా పూర్తి చేసిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు అర్హులు. **వయసు:** 11 ఏళ్ల ఆరు నెలల నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష, మౌఖిక, వైద్య పరీక్షల ఆధారంగా.

ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 30.09.2018. **పరీక్ష తేదీలు:** 2018 డిసెంబరు 1, 2.

వెబ్‌సైట్: www.psc.ap.gov.in

సంగీతం, నృత్య కళాశాలల్లో ప్రవేశాలు

తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని ఆరు ప్రభుత్వ సంగీతం, నృత్య కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు.

కళాశాలలున్న ప్రదేశాలు: హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, వరంగల్, మంథని, కరీంనగర్.

కోర్సుల వివరాలు, ప్రవేశం కోసం సంబంధిత కళాశాలల ప్రధానాచార్యులను సంప్రదించాలి.

దరఖాస్తు చివరితేది: 30.07.2018.

సీఈఎస్ఎస్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రాం

సీట్ల సంఖ్య: 15 **సబ్జెక్టులు:** ఎకనామిక్స్, సోషియాలజీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్ తదితరాలు. **అర్హత:** పీజీ, ఎంఫిల్, నెట్/ స్లెట్/ ఎఫ్‌డీపీ ఉత్తీర్ణత.

ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేది: 25.07.2018.

వెబ్‌సైట్: www.cess.ac.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

పుట్టా సుధాకర్ నియామకంపై పిల్ కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: తిరుమల, తిరుపతి దేవస్థానం (తితిదే) ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా పుట్టా సుధాకర్ నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. స్వచ్ఛందంగా ఒక్కసారి క్రైస్తవుల కార్యక్రమానికి అతిథిగా హాజరైనంతలో తితిదే ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసినట్లు కాదని స్పష్టం చేసింది. తితిదే నిబంధనలకు విరుద్ధంగా ప్రతిసారి ఇతర మత కార్యక్రమాలకు హాజరవుతుంటేనే తప్పుపట్టొచ్చని వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె. ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ ఆదేశాలు జారీచేసింది. తితిదే ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా పుట్టా సుధాకర్, సభ్యురాలిగా పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితల నియామకానికి సంబంధించిన జీవోను సవాలుచేస్తూ.. తిరుపతి నివాసి హిందూ చైతన్య సమితికి చెందిన తుమ్మ ఓంకార్, మరో ఇద్దరు.. హైకోర్టులో ప్రజాహితవ్యాజ్యం దాఖలు చేశారు. ఎమ్మెల్యే అనితను ధర్మకర్తల మండలి జాబితా నుంచి తొలగించామని మంగళవారం జరిగిన విచారణలో ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గతంలో తితిదే బోర్డు సభ్యులుగా పుట్టా సుధాకర్ పనిచేస్తూ క్రైస్తవమత కార్యక్రమానికి హాజరయ్యారన్నారు. ఆ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. మీరు సమర్పించిన వివరాల ప్రకారం ఒక్కసారి మాత్రమే హాజరయినట్లుందని పేర్కొంది. ప్రతిసారి క్రైస్తవ కార్యక్రమాలకు వెళుతున్నారని పిటిషన్లో పేర్కొనలేదని పేర్కొంటూ వ్యాజ్యాన్ని కొట్టేసింది.

పూర్తి రాయితీ హుళక్కి!

- ఆర్టీసీ ఛార్జీల సవరణ ఫలితం
- క్యాట్ కార్డుదారులపై తీవ్ర ప్రభావం
- పది రోజుల్లో విధాన నిర్ణయం!

ఈనాడు - అమరావతి

చిల్లర సమస్య పేరిట ఎక్స్‌ప్రెస్, డీలక్స్, అల్ట్రాడీలక్స్ తదితర ప్రత్యేక సర్వీసుల్లో ఛార్జీలను తదుపరి రూ.5కు ఏపీఎస్‌ఆర్టీసీ సవరించడం క్యాట్ కార్డుదారులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతోంది. ఆయా సర్వీసుల్లో టిక్కెట్టు ధరలను రూ.15, రూ.20, రూ.25, రూ.30, రూ.35, రూ.40...ఇలా మార్చడంతో క్యాట్ కార్డుదారులు పూర్తి రాయితీ పొందలేకపోతున్నారు.

తరచూ ప్రయాణించే వారి కోసం కన్సెషనల్ యాన్యువల్ ట్రావెల్ (క్యాట్) పేరిట మార్కెటింగ్ పథకాన్ని ఆర్టీసీ ప్రవేశపెట్టింది. తొలుత రూ.250 చెల్లించి ఈ కార్డు పొందాలి. ఇది ఏడాది పాటు పనిచేస్తుంది. ఆపై ఏటా నవీకరణకు రూ.150 చెల్లించాలి. ఈ కార్డుంటే ఏసీ, సిటీ బస్సులు మినహా మిగతా ఏ సర్వీసులో ప్రయాణించినా టిక్కెట్టుపైన పదిశాతం రాయితీ అందిస్తోంది. ఇటీవల ఛార్జీలను సవరించడంతో క్యాట్ కార్డుదారులు పూర్తి రాయితీని పొందలేకపోతున్నారు. కొన్ని మార్గాల్లో ఒక్క శాతమూ దక్కకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

2015 నుంచి గతేడాది డిసెంబరు వరకూ రాష్ట్రంలో దాదాపు 10.71 లక్షల మంది క్యాట్‌కార్డులు తీసుకున్నారు. ఆర్టీసీలో సగటున రోజుకు 68 లక్షల మంది ప్రయాణికులు తిరుగుతుంటారు. అందులో సుమారు 14.70 శాతం మంది క్యాట్‌కార్డుదారులేనని అంచనా. తాజాగా చేపట్టిన ఛార్జీల సవరణ వీరందరిపైనా ఏదొక విధంగా ప్రభావం చూపుతోంది.

రాయితీకి దూరమవుతున్నారిలా!

- విజయవాడ-గుంటూరు మధ్య రూ.36 ఉన్న టిక్కెట్టు రూ.40కు పెరిగింది. క్యాట్‌కార్డుదారులకు పది శాతం రాయితీ పోనూ రూ.36 టిక్కెట్టు తీసుకోవాలి. కానీ రూ.40 వసూలు చేస్తున్నారు. ఇలాంటి మార్గాల్లో ఒక్క శాతం రాయితీ దక్కడం లేదు.
- కొన్ని మార్గాల్లో రూ.66గా ఉన్న టిక్కెట్టు ధర రూ.70కు పెరిగింది. క్యాట్‌కార్డుదారుల టిక్కెట్టు ధర రూ.63 తీసుకోవాలి. కానీ రూ.65 వసూలు చేస్తున్నారు. ఈ మార్గాల్లో పదిశాతానికి బదులుగా 8శాతం రాయితీనే లభిస్తోంది.
- రూ.77గా ఉన్న టిక్కెట్టు ధర రూ.80కు పెరిగింది. 10శాతం రాయితీతో క్యాట్‌కార్డుదారుల నుంచి టిక్కెట్టు రూ.72 వసూలు చేయాలి. కానీ రూ.75 తీసుకుంటున్నారు. దీంతో 7శాతం రాయితీయే లభిస్తోంది.
- రూ.88గా ఉన్న టిక్కెట్టు ధర రూ.90కు పెరిగింది. పదిశాతం రాయితీ అంటే రూ.81కే టిక్కెట్టు లభించాలి. కానీ రూ.85 వసూలు చేస్తున్నారు. 6 శాతం రాయితీయే లభిస్తోంది
- ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే...చాలా మార్గాల్లో ఇదే పరిస్థితి ఉంది.

క్షేత్రస్థాయి సమస్యలు అధ్యయనం చేస్తాం

ఛార్జీల సవరణ క్యాట్‌కార్డుదారులపై ఎలాంటి ప్రభావం చూపుతోందనే అంశంపై క్షేత్రస్థాయి వాస్తవాలను పది రోజుల పాటు అధ్యయనం చేస్తాం. వాటి ఆధారంగా సమస్యను అధిగమించేలా విధానపరమైన నిర్ణయం తీసుకుంటాం.

– జయరావు, ఈడీ, ఆపరేషన్స్ విభాగం, ఏపీఎస్‌ఆర్టీసీ

సువర్ణ కవచ సమర్పణ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి

శ్రీవారి జ్యేష్ఠాభిషేకం పరిసమాప్తం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక జ్యేష్ఠాభిషేకం మహోత్సవాలు మంగళవారం వైభవంగా పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వర్ణ కవచధారియై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం శ్రీవారి ఆలయంలో మహాశాంతి హోమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి స్నపన తిరుమంజనం వేడుకను వేదోక్తంగా పూర్తి చేశారు. ఉత్సవంలో తితిదే అధ్యక్షుడు పుట్టా సుధాకరయాదవ్, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

తితిదే జీయంగార్ల గౌరవ వేతనం పెంపు

చిన్నజీయంగార్, పెద్దజీయంగార్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల, తిరుపతి దేవస్థానంలో అత్యున్నత స్థానం కలిగిన పెద్దజీయంగార్, చిన్నజీయంగార్ల గౌరవవేతనం పెంచుతూ దేవస్థానం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పెద్ద జీయంగార్ వార్షిక గౌరవ వేతనం రూ.1.15 కోట్లు ఉండగా..దాన్ని 1.50 కోట్లకు పెంచింది. చిన్నజీయంగార్ వార్షిక గౌరవ వేతనం రూ.79 లక్షలు నుంచి రూ.1.09 కోట్లకు చేర్చింది. తిరుమలలోని శ్రీవారి ఆలయ కైంకర్యాలకే పరిమితం కాకుండా తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి, శ్రీకోదండరామస్వామి, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయాల్లో అనేక ఉత్సవాల్లో పాల్గొంటున్నట్లు జీయంగార్లు ఇటీవల విజ్ఞాపన పత్రాన్ని తితిదే బోర్డుకు విన్నవించారు. తిరుమల, తిరుపతి సందర్శించే యాత్రికులతో పాటు శిష్యులకు తదియారాధన(అన్నప్రసాద వితరణ) రోజు రోజుకూ అధికమవుతోందని.. తదియారాధన, కైంకర్యపరులకు జీతభత్యాలు ఇతరత్రా ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఏడాది గౌరవ వేతనాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో గౌరవ వేతనం పెంచుతూ దేవస్థానం నిర్ణయం తీసుకుంది. తితిదేలో మిరాశీ విధానం 1996 మార్చి 22న రద్దయింది. ఆ తర్వాత కైంకర్యాలు నిర్వహించే జీయంగార్లకు తితిదే గౌరవ వేతనం చెల్లిస్తోంది. ఈ ఇద్దరు జీయంగార్ల మఠాలకు ఏటా రెండు విడతలుగా ఏప్రిల్, అక్టోబరులో వేతనం అందజేస్తుంది. 1996లో పెద్ద జీయంగార్‌కు రూ.10 లక్షలు, చిన్నజీయంగార్‌కు రూ.5 లక్షలుగా గౌరవ వేతనం చెల్లించేది. క్రమంగా పెంచుతూ రాగా.. ప్రస్తుతం పెద్దజీయంగార్‌కు రూ.1.50 కోట్లు, చిన్నజీయంగార్‌కు రూ.1.09 కోట్లకు చేరుకుంది.

నాటక రచనలకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు డిజిటల్, అమరావతి: జాతీయ స్థాయి సాంఘిక, బాలల నాటక రచన పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కువైట్ తెలుగు కళా సమితి తెలిపింది. సమకాలీన సమాజానికి సంబంధించిన సాంఘిక సమస్యలను భిన్న కోణాల్లో సందేశం ఇచ్చేలా రచనలు ఉండాలని కువైట్ తెలుగు కళా సమితి అధ్యక్షులు జ్యోత్స్న, ప్రధాన కార్యదర్శి కె.రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25లోగా రచనా ప్రతులను అందజేయాలని అందులో కోరారు. నాటక పోటీల్లో ప్రథమ బహుమతికి రూ.20 వేలు అందజేస్తామని తెలిపారు.

గౌతమిది ప్రమాదం కాదు.. హత్యే

- ఏడాదిన్నర తర్వాత నిగ్గుతేల్చిన పోలీసులు
- రెండో భార్య అడ్డు తొలగించుకోవాలని పథకం
- నరసాపురం జడ్పీటీసీ, మాజీ సర్పంచి, మరో ఇద్దరి అరెస్టు
- ఫలించిన బాధితురాలి పోరాటం

ఈనాడు డిజిటల్, ఏలూరు: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం దిగమర్రు వద్ద గతేడాది జనవరి 18న జరిగిన సంఘటన రహదారి ప్రమాదం కాదని, హత్యేనని పోలీసులు నిర్ధారించారు. అనేక మలుపులు తిరిగిన ఈ కేసు వివరాలను పాలకొల్లు గ్రామీణ సీఐ రజనీకుమార్ వెల్లడించారు. నరసాపురానికి చెందిన అక్కాచెల్లెళ్లు దంగేటి గౌతమి, పావని ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా టాటా సఫారీ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గౌతమి మృతి చెందగా.. పావని గాయాలతో బయటపడ్డారు. ఇది రహదారి ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేశారంటూ అప్పట్లో పావని పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు మాత్రం రహదారి ప్రమాదమేనని కేసు నమోదు చేసి వాహనచోదకులు లక్ష్మణ్, సందీప్‌లను అరెస్టు చేశారు. పావని అక్కడితో ఆగకుండా ఎస్పీ, డీఐజీ, సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు సీఐడీ పోలీసులు విచారణ ప్రారంభించారు. వారి విచారణలో పలు ఆశ్చర్యకర అంశాలు వెలుగులోకి వచ్చాయి. నరసాపురం మండలం

గౌతమి (పాత చిత్రం)

దర్భరేవు గ్రామ మాజీ సర్పంచి సజ్జా వీరవెంకటసత్యనారాయణ(బుజ్జి)తో గౌతమి సన్నిహితంగా మెలిగేవారు. వారు రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. అప్పటికే బుజ్జికి వివాహమైంది. మొదటి భార్యను వదిలేసి తనతోనే ఉండాలని గౌతమి ఒత్తిడి తెచ్చారు. దీంతో ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో హత్యకు బుజ్జి ప్రణాళిక రూపొందించాడు. విశాఖపట్నానికి చెందినవారితో రూ.రెండు లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. గతేడాది జనవరి 18న పాలకొల్లులోని ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్న గౌతమి, ఆమె సోదరి పావని ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని టాటాసఫారీతో ఢీకొట్టించారు. పోలీసులు రహదారి ప్రమాదంగా నమోదు చేసి కేసు ముగించేశారు. సీఐడీ విచారణతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ఆధారాలు లభించడంతో హత్య కేసుగా నమోదు చేశారు. బుజ్జి, ఆయనకు సహకరించిన నరసాపురం జడ్పీటీసీ సభ్యుడు బాలం ప్రతాప్, బొల్లంపల్లి రాంప్రసాద్(రమేశ్), లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన బాలం ఆంద్రులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఘటనకు కారకులైన వాహనచోదకుడు సందీప్, మరో ఇద్దరు దుర్గాప్రసాదు, లక్ష్మణ్‌లను అరెస్టు చేయాల్సి ఉంది.

కలెక్టర్లూ లంచాల బాటపట్టారు

- కనీవినీ ఎరుగని రీతిలో అవినీతి
- ఏపీ ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో కలపాలి
- అమలాపురం సభలో జగన్ వ్యాఖ్యలు

ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం: రాష్ట్రంలో కనీవినీ ఎరుగనిరీతిలో అవినీతి జరుగుతోందని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. కలెక్టర్లు సైతం లంచాల బాటపట్టారని ఆరోపించారు. అవినీతి తెదేపాను ప్రజలు బంగాళాఖాతంలో కలపాలని విజ్ఞప్తిచేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా అమలాపురంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తెదేపా అధికారం చేపట్టాక ప్రతి పల్లెలో మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. ఫలితంగా యువత తాగుడు వ్యసనానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రూ.2కే 20 లీటర్ల శుద్ధి జలాలు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ స్థాయిలో నీరు ఇవ్వడం లేదుగాని మద్యం మాత్రం ఇస్తోందని ఎద్దేవాచేశారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని అటకెక్కించారని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు.

"రాష్ట్రంలో 1.70 కోట్ల ఇళ్లు ఉంటే కేవలం 10 లక్షల మందికే నిరుద్యోగ భృతి ఇస్తామంటున్నారు. వేతనాలు పెంచాలన్న అంగన్‌వాడీ కార్యకర్తలను గతంలో గుర్రాలలో తొక్కించి, లాఠీలతో చితకబాదించిన చంద్రబాబు.. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో వారి జీతాలు పెంచుతున్నట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో 1,450 సంక్షేమ వసతిగృహాలు ఉండగా తెదేపా అధికారంలోకి వచ్చాక వాటిలో 680 వసతిగృహాలను ఎత్తివేశారు. బీసీ హాస్టళ్లు 898 ఉండగా 201 ఎత్తివేశారు. ఫలితంగా 60 వేల మంది పేద విద్యార్థులు ఇళ్ల నుంచే పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలు తెరవక ముందే పుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటికీ విద్యార్థులకు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని చాటుతోంది. ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప సొంత మండలమైన ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం విచారకరం" అని జగన్ పేర్కొన్నారు. వైకాపా అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛన్లను రూ.2 వేలకు పెంచుతామని, వయసు పరిమితిని 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తామని జగన్ హామీ ఇచ్చారు. అక్కచెల్లెమ్మలకు 45 ఏళ్లకే పింఛన్లు అందిస్తామని పేర్కొన్నారు.

మంగళవారం సాయంత్రం అమలాపురంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న వై.ఎస్.జగన్

'మధ్యాహ్న భోజనా'నికి కందిపప్పు, నూనె

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంట ఏజెన్సీలకు నేరుగా కందిపప్పు, నూనె సరఫరా చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు బియ్యం, కోడిగుడ్లను వంట ఏజెన్సీలకు సరఫరా చేస్తుండగా.. తాజాగా కందిపప్పు, నూనె సరఫరా చేయాలని భావిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రోజుకు ఒక్కొక్కరికి 20గ్రాములు, ఉన్నత పాఠశాల పిల్లలకు 30గ్రాముల చొప్పున ఇవ్వనున్నారు. ఈ లెక్కన నెలకు సరిపడా ఒకేసారి వంట ఏజెన్సీలకు అందిస్తారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లోనూ ఈ విధానాన్ని అనుసరిస్తున్నందున ఈ పద్ధతినే మధ్యాహ్న భోజనంలో అమలు చేయాలని భావిస్తున్నారు. కంది పప్పు సరఫరాదారును టెండర్ల ద్వారా ఎంపిక చేయనుండగా.. నూనె మాత్రం ఆయిల్‌ఫెడ్ నుంచి తీసుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45,528 పాఠశాలలు ఉండగా వీటిల్లో 34,57,124 మంది విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

కోడిగుడ్ల సరఫరాపై అస్పష్టత..!

మధ్యాహ్నభోజనం పథకం కింద పిల్లలకు వారానికి 5 కోడిగుడ్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత విద్యా సంవత్సరం వరకు వారానికి మూడు గుడ్లు అందిస్తుండగా దీన్ని ఐదుకు పెంచారు. బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించారు. అయితే ఐదు కోడిగుడ్ల సరఫరాపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో ప్రస్తుతం మూడు గుడ్లనే అందిస్తున్నారు. ఒక్కో కోడిగుడ్డుపై పాఠశాల విద్యాశాఖ రూ.4.63 చెల్లిస్తోంది. గతేడాది అప్పగించిన కోడిగుడ్ల కాంట్రాక్టు సైతం ఈ నెల 30వ తేదీతో ముగుస్తోంది. ఇంతవరకు కొత్త టెండర్ల ప్రక్రియనే చేపట్టలేదు. దీంతో పాఠశాలలకు సరఫరా ఎలా చేయాలన్న దానిపై విద్యాశాఖ తర్జనభర్జన పడుతోంది. పాతవారితోనే సరఫరా చేయించాలా? లేక వంట ఏజెన్సీలనే కొనుగోలు చేసుకోమనాలా? అనేదానిపై ఆలోచనలు చేస్తుంది. ఈసారి గుడ్ల సరఫరా పెరుగుతున్నందున గుత్తేదార్ల నుంచి పోటీ తీవ్రంగా ఉంటుంది.

పౌర సరఫరాల సంస్థకు స్కోచ్ పురస్కారం

ధాన్యం సేకరణలో పౌర సరఫరాల సంస్థ చేపట్టిన ధాన్యం సేకరణ విధానానికి స్కోచ్ పురస్కారం లభించింది. పౌర సరఫరాల సంస్థ ఎండీ ఎ.సూర్యకుమారి ఈ అవార్డును అందుకున్నట్లు ఆ సంస్థ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ధాన్యం సేకరణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చినందుకు పౌరసరఫరాల సంస్థకు ఈ పురస్కారం దక్కినట్లు వివరించారు. ఈ విభాగంలో దాఖలైన మూడు వేల నామినేషన్లలో ఏపీ పౌరసరఫరాల సంస్థ మొదటి 100 స్థానాల్లో నిలిచి ఆర్డర్ ఆఫ్ మెరిట్ విభాగంలో స్కోచ్ పురస్కారాన్ని సొంతం చేసుకుంది.

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మొబైల్‌కు అనుమతి లేదు

ఈనాడు, హైదరాబాద్: ఈనెల 29న రెండు రాష్ట్రాల్లో జరిగే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని బార్ కౌన్సిల్ తెలిపింది. ఈ మేరకు కౌన్సిల్ కార్యదర్శి ఎన్.రేణుక ఓ ప్రకటన విడుదల చేశారు. పోలింగ్, లెక్కింపు కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లతో సహా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ఆయా జిల్లా జడ్జీలు, ఇతర న్యాయాధికారులు పర్యవేక్షణ ఉంచాలని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. భారత బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో భాగంగా ఫోన్లు అనుమతించడం లేదన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినట్లయితే అనర్హత వేటు పడుతుందని హెచ్చరించారు. హైకోర్టుతోపాటు రెండు రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను రికార్డ్ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రాంగణంలో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని, నిబంధనల్ని అతిక్రమిస్తే చర్యలుంటాయన్నారు.

పరిపాలనా ప్రక్రియకు నిర్దుష్ట గడువు కష్టం...!

ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

వివాహమయ్యాక నా ఇంటిపేరు మారింది. అన్ని ధ్రువపత్రాలు నా తండ్రి ఇంటి పేరుతోనే ఉన్నాయి. అమెరికా వీసా కోసం దరఖాస్తు చేద్దామనుకుంటున్నా. డీఎస్-160 దరఖాస్తు భర్తీ చేసే సందర్భంలో ఏ ఇంటి పేరును నమోదు చేయాలి? - వీకే జయసుధ

వీసా దరఖాస్తు డీఎస్-160లో నమోదు చేసే పేరు, పాస్‌పోర్టులోని పేరు సరిపోలి ఉండాలి. మీ వివాహం అనంతరం పేరుతో మీ పాస్‌పోర్టు సరిపోలి లేకపోతే పాస్‌పోర్టులో ఇంటిపేరును సరి చేయించుకోమనేది మా సూచన. ఇంటర్వ్యూ సమయంలో రెండు పాస్‌పోర్టులను వెంట తెచ్చుకోవాలి. ఇంటర్వ్యూ అధికారి ప్రశ్నిస్తే రెండు ఇంటి పేర్లకు కారణాలను వివరించేందుకు సన్నద్ధమై ఉండాలి.

బి1/బి2 వీసా కోసం నేనూ నా భార్య దరఖాస్తు చేసుకున్నాం. ఆమెకు వీసా ఆమోదం లభించింది. నాకు 221(జి) పత్రాలన్ని ఇచ్చారు. నా మునుపటి విదేశీ పర్యటన వివరాలను ఇంటర్వ్యూ సమయంలో ప్రశ్నించారు. ఆతరువాత కాన్సులేట్ నుంచి వచ్చిన ఈ-మెయిల్‌కు సమాధానమిచ్చి 90 రోజులు దాటినా స్పందన లేదు. నా దరఖాస్తు స్థితిని తెలుసుకోవటమెలా? - మిర్యాల భాస్కర్‌రెడ్డి

కొన్ని దరఖాస్తుల విషయంలో పరిపాలనా ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సాధారణ వ్యవధి కన్నా అధిక సమయం పడుతుంది. ఆ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఎంత వ్యవధి పడుతుందన్నది స్పష్టంగా చెప్పటం సాధ్యం కాదు. సాధ్యమైనంత త్వరితంగా ఆ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం. మీ దరఖాస్తు స్థితిని తెలుసుకునేందుకు https:/eac.state.govEACstatTracker/ Status.aspx లో మీ కేసు నంబరును నమోదు చేసి చూడండి.

2019 జూన్ వరకు చెల్లుబాటయ్యే హెచ్1బి వీసా ఉంది. ఐ-797, ఐ-129 కూడా ఉన్నాయి. 2018 మార్చిలోనే నేను ఆ యాజమాన్యాన్ని వదిలేశాను. ఆ వీసాపై అమెరికా వెళ్లవచ్చా? - ప్రదీప్ పెమ్మసాని

హెచ్1బి వీసాలో దరఖాస్తుదారుల వివరాలు, యూఎస్‌సీఐఎస్ ఆమోదించిన పిటిషన్‌లో వివరాలు నమోదై ఉంటాయి. అందులో పిటిషన్ నంబరు, పిటిషనర్ పేరు, పిటిషన్ కాలవ్యవధి తదితరాలు నమోదు చేసి ఉంటాయి. ఆ సంస్థలో లేదా ఆ యాజమాన్యం వద్ద మీరు పనిచేయటం లేనందున అమెరికాకు చెందిన నూతన యాజమాన్యంగానీ, పిటిషనర్‌గానీ మీ పక్షాన ఉద్యోగ పిటిషన్ దాఖలు చేయాలి. అమెరికా వర్క్ వీసాలకు సంబంధించిన సమాచారం కోసం https:// www.uscis.gov/working-united-states/working-us ను చూడండి.

నా భర్త అమెరికాలో పని చేస్తున్నారు. డిపెండెంట్ వీసా కోసం చేసిన నా దరఖాస్తును తిరస్కరించారు. ఎలాంటి కారణాలు చెప్పలేదు. బి1/బి2 వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చా? - కేఎస్ శ్రీవల్లి

మీరు ఏ కారణాలతో అమెరికా వెళ్లాలనుకుంటున్నారో దానికి సంబంధించిన వీసా విభాగానికి మాత్రమే దరఖాస్తు చేయాలి. అమెరికాలో పని చేస్తున్న మీ భర్తను చేరుకునేందుకే అయితే మీరు డిపెండెంట్ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. తాత్కాలికంగా అమెరికాలో పర్యటించేందుకు వ్యాపారం, పర్యాటకం, విహారం తదితర అవసరాల కోసమే బి1/బి2 వీసా పనిచేస్తుంది. మరింత సమాచారానికి www.travel.state.gov ను చూడండి.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.com కు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

ప్రత్యేకహోదా ఉద్యమానికి మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు. చిత్రంలో ఆడారి కిషోర్‌కుమార్, అప్పలనాయుడు, చలసాని శ్రీనివాసరావు, జార్జి విక్టర్ తదితరులు

ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తే సహించం

రాష్ట్ర ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విభజన అనంతరం తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేయవద్దని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. మంగళవారం విశాఖలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపాకు చెందిన ఉత్తరాది నాయకులు రాష్ట్రంపై చేస్తున్న కుట్రలను సమష్టిగా ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై జైత్రయాత్ర చేస్తామని ప్రకటిస్తున్న వారికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రజల పోరాటాన్ని చూసి భాజపా వెన్నులో వణుకు పుట్టిందని, త్వరలోనే రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారంపై ప్రకటన చేస్తారన్నారు. కిరండోల్ మినహాయించి రైల్వేజోన్, ప్రభుత్వ నిర్వహణలో లేని స్టీల్‌ప్లాంట్ ఇవ్వాలని కేంద్రం చూస్తే మళ్లీ తీవ్రమైన ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, జార్జి విక్టర్, యువజన ఐకాస నాయకుడు ఆడారి కిషోర్‌కుమార్, కనిశెట్టి సురేష్‌బాబు, శ్యామ్ సుందర్‌నాయుడు, శాస్త్రీ, శాంతభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో సీతారాముల కల్యాణం

భద్రాచలం, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వచ్చేనెల 1 నుంచి ఈ వేడుకలను ఆరంభించి నెలపాటు జర్మనీ, అమెరికా, కెనడా, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, తదితర దేశాలలోని 9 ప్రాంతాల్లో కల్యాణాలు నిర్వహించనున్నారు. ఆయా దేశాల్లోని సంస్థల తరఫున అందిన విజ్ఞప్తి మేరకు దేవాదాయశాఖ సూచనలతో భద్రాచలం నుంచి ఇద్దరు అర్చకులు బయలుదేరారు.

బీసీ గణన వివరాల సంగతేమిటి?

- కేంద్రానికి, ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు సంబంధించి నిర్వహించిన సర్వేల నివేదికలను బహిరంగ పరచాలంటూ దాఖలైన పిటిషన్‌లో మంగళవారం ఉమ్మడి హైకోర్టు కేంద్రంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వే, ఏపీలో బీసీ సర్వే, ఏపీలో జస్టిస్ మంజునాథ్ కమిషన్ సర్వే, ఓబీసీల గుర్తింపు నిమిత్తం కేంద్రం 2011లో కులాల ప్రాతిపదికన నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వేలను వెల్లడించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ బీసీ సంక్షేమ సంఘాల తరఫున తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అల్మెన్‌రాజులు సంయుక్తంగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రామచంద్రగౌడ్ వాదనలు వినిపిస్తూ బీసీ జనాభాకు సంబంధించి నిర్వహించిన సర్వేలను వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన 34 శాతం రిజర్వేషన్‌లు కేటాయించాల్సి ఉందని తెలిపారు. జనాభాలో బీసీల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం సక్రమంగా నిర్వహించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒకవేళ కులప్రాతిపదికన ఏదైనా జనాభా సర్వేను నిర్వహించినా ప్రచురించడంలేదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 15 రోజుల్లో జనాభా లెక్కలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి తెలంగాణలో బీసీ జనాభా లెక్కలపై ఆ రాష్ట్ర కాంగ్రెస్‌కు చెందిన బి.రవీంద్రనాథ్, దాసోజు శ్రవణ్‌కుమార్‌లు దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం ఉదయం జరిగిన వాదనల సందర్భంగా బీసీ లెక్కలు తేల్చాకే ఎన్నికలకు వెళ్లాలంటూ ఇచ్చిన ఆదేశాలను ప్రస్తావిస్తూ.. ఇక్కడా ఆ ఆదేశాలే వర్తిస్తాయని పేర్కొన్నారు. ఏపీలో ఎన్నికలు లేనందున ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలతో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు.

26 రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు

ఈనాడు, హైదరాబాద్: నిరీక్షణ జాబితా (వెయిటింగ్ లిస్ట్) భారీగా ఉండటంతో 26 రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. సికింద్రాబాద్-విజయవాడల మధ్య తిరిగే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో, విజయవాడ- సికింద్రాబాద్- విజయవాడ (07757/07758) ప్రత్యేక రైళ్లలో రెండేసి ఏసీ ఛైర్‌కార్ బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. మిగిలిన రైళ్లలో ఒక్కో బోగీని.. కొన్నింటికి స్లీపర్, మరికొన్నింటికి ఏసీ బోగీని జత చేస్తున్నట్లు వెల్లడించింది. నర్సాపూర్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లకు రద్దీని బట్టి జులై నెలాఖరు వరకు, ఆగస్టు 4 వరకు ఈ అదనపు బోగీలను ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ తెలిపారు.

నిందితుల్ని జంతువుల్లా చూస్తున్నారు

- పోలీసుల తీరుపై హైకోర్టు అసంతృప్తి
- వారంలోగా ప్రమాణపత్రం దాఖలు చేయాలని డీజీపీకి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: నిందితులు, అనుమానితుల పట్ల పోలీసుల వైఖరిపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వారిని జంతువుల్లా చూస్తున్నారని వ్యాఖ్యానించింది. ఈ క్రమంలోనే వారిని మీడియా ముందు ప్రదర్శిస్తున్నారని ఆక్షేపించింది. ఈ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏ నిబంధన అందుకు అనుమతి స్తుందో చెప్పాలని ఏపీ డీజీపీని ఆదేశిస్తూ వారం రోజుల్లో ప్రమాణపత్రం దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ప్రమాణపత్రం దాఖలుకు ఏపీ సర్కారు మరో రెండు వారాల గడువు కోరగా అందుకు నిరాకరించిన ధర్మాసనం.. వారం రోజుల గడువిచ్చింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

తన తల్లి కావటి అలిమేలును నిందితురాలిగా అనుమానిస్తూ కర్నూలు జిల్లా ఆత్మకూరు డీఎస్పీ మాధవరెడ్డి, ఇతర పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారని పేర్కొంటూ ప్రకాశం జిల్లా చీరాల మండలం ఆదినారాయణపురానికి చెందిన కావటి సాగర్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితులు, అనుమానితులను మీడియా ముందుంచి పత్రికల్లో, టీవీల్లో వచ్చే విధంగా అనుమతించే అధికారం పోలీసులకు లేదని పేర్కొంది.

ఈనాడు బిజినెస్

డుకాటీ మల్టీస్ట్రాడా 1260 పైక్స్ పీక్

ధర రూ.21.42 లక్షలు

దిల్లీ: ఇటలీ సూపర్ బైకుల సంస్థ డుకాటీ.. మల్టీస్ట్రాడా 1260 పైక్స్ పీక్ మోడల్‌ను భారత విపణిలోకి విడుదల చేసింది. దీని ధర రూ.21.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. భారత్‌లో ఈ మోడల్ పరిమిత సంఖ్యలోనే లభిస్తుందని డుకాటీ ఇండియా వెల్లడించింది. 1262 సీసీ సామర్థ్యంతో కొత్త చాసిస్, యూరో 4 నిబంధనలకు అనుగుణమైన ఇంజిన్‌ను పైక్స్ పీక్ వేరియంట్‌లో అమర్చారు. కొత్త ఫ్రంట్ ఎండ్ జియోమెట్రీ, పొడవైన స్విన్‌గార్మ్ వంటి ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. భారత వాహనదారులు కోరుకునే విధంగా కొత్త బైకులు తీసుకురావడానికి కట్టుబడి ఉన్నామని, అందులో భాగంగానే మల్టీస్ట్రాడా 1260 పైక్స్ పీక్ మోడల్‌ను తీసుకొచ్చామని డుకాటీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సెర్గీ కనోవాస్ పేర్కొన్నారు.

ప్రతిభావంతులు లేరాయె!

- ప్రపంచ దేశాలన్నీ ఇబ్బందుల్లోనే..
- టాప్-10లో భారత్ కూడా..

దిల్లీ: ప్రపంచంలోని అన్ని సంస్థల యాజమాన్యాలు ప్రతిభావంతుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఓ సర్వే తేల్చింది. 'గత 12 ఏళ్లుగా ఈ సమస్య వేధిస్తోంది. దీంతో చాలా ప్రభావితమైన మార్కెట్లలో భారత్ కూడా ఉంది. 56 శాతం యాజమాన్య సంస్థలు ఇక్కడ ఉద్యోగ ఖాళీల్ని భర్తీ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయ'ని మ్యాన్‌పవర్ గ్రూపు వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 40,000 యాజమాన్యాల్ని సర్వే చేసి నివేదిక రూపొందించింది. ఇందులో 45 శాతం సంస్థలు ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయడానికి తీవ్రంగా పోరాడుతున్నాయని పేర్కొంది. 'అధిక స్థాయిలో ప్రతిభావంతుల కొరత కనిపిస్తోంది. అయితే సులభంగా ప్రతిభను గుర్తించడం కంటే ప్రతిభావంతుల్ని తయారు చేసుకోవడమే సంస్థలకు మేల'ని మ్యాన్‌పవర్ గ్రూపు ఛైర్మన్, సీఈఓ జోనాస్ ప్రైజింగ్ తెలిపారు.



ఎప్పుడో చేయాల్సింది..

కేంద్ర మంత్రి అక్బర్

బెంగళూరు: బ్యాంకులకు బకాయిలు చెల్లించాలని మాల్యా అనుకొని ఉంటే, ఆ పనిని ఎప్పుడో చేయాల్సిందని కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి ఎం.జె.అక్బర్ అన్నారు. 'మాల్యా బ్యాంకులకు రుణాలు చెల్లించాలని నిజంగా కోరుకుని ఉంటే ఎన్నో సంవత్సరాలు ఆయన చేతిలో ఉన్నాయని, ఆ సమయంలో ఆ పనిచేయాల్సింద'ని ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో మాల్యా లేఖపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

ఈయన.. నోరు విప్పాడు



- నాపై రాజకీయ కుట్ర చేస్తున్నారు
- ఎగవేతదారుగా చిత్రీకరించారు
- నేను అలాంటివాడ్ని కాదు
- రుణాన్ని మించిన ఆస్తులు లాక్కున్నారు
- అప్పట్లో మోదీ, జైట్లీలకు లేఖలు రాశా
- ఆ లేఖలు ఇప్పుడు బయటపెడుతున్నా
- కేసుల పరిష్కారానికి నేను సిద్ధం
- ప్రభుత్వమే ముందుకు రావట్లేదు
- రెండేళ్ల నిశ్శబ్దాన్ని వీడిన విజయ్‌మాల్యా

దిల్లీ

"బకాయిలు చెల్లించేందుకు ఎన్నో రకాలుగా ప్రయత్నించా. బ్యాంకులతో చర్చలకు సిద్ధపడ్డా. కేసులు పరిష్కరించుకునేందుకూ ముందుకొచ్చా. ఇంతకంటే ఏం చేయగలను.. అటు ప్రభుత్వం కాని, ఇటు బ్యాంకులు కాని నేను చేసిన ఏ వినతినీ పట్టించుకోలేదు. పైగా బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన వ్యక్తికి ఉదాహరణగా (పోస్టర్ బాయ్) నన్ను చిత్రీకరిస్తూ వచ్చారు"

-రెండేళ్ల నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ విజయ్ మాల్యా అన్న మాటలివి.

తనపై వచ్చిన ఆరోపణలు ఏమిటో.. అసలు నిజాలేమిటో.. వెల్లడించాల్సిన బాధ్యత తనపై ఉందంటూ ఓ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. 'నేను రూ.9,000 కోట్ల రుణాలు ఎగ్గొట్టి పారిపోయానని ప్రసార మాధ్యమాలు కోడైకూశాయి. కొందరు రాజకీయ నాయకులు నాపై దుమ్మెత్తిపోశారు. ఏతావాతా ప్రజలు నాపై కన్నెర్ర చేసే పరిస్థితి కల్పించారు. కొన్ని బ్యాంకులైతే ఒక అడుగు ముందుకేసి ఉద్దేశపూర్వక ఎగవేతదారు ముద్ర వేసిపడేశాయి. అసలు నాకు అలాంటి ఉద్దేశమే లేదు. అది నా స్వభావం కూడా కాదు. ప్రభుత్వం, దర్యాప్తు సంస్థల చర్యలకు విసుగెత్తి నా పరిస్థితిని వివరిస్తూ 2016 ఏప్రిల్ 15న ప్రధాని నరేంద్ర మోదీకి, ఆర్థిక మంత్రికి లేఖలు రాశా. వాళ్లు పట్టించుకుంటేగా.. ఇప్పటికైనా ఈ సమస్యకు ఓ పరిష్కారం దొరకాలి. దొరుకుతుందన్నదే నా ఆశ. అందుకే అప్పట్లో నేను ప్రధాని, ఆర్థిక మంత్రులకు రాసిన లేఖలను బహిర్గతం చేస్తున్నా.. అంటున్నారు విజయ్ మాల్యా. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో పలు అంశాలను ప్రస్తావించారు. అవి ఆయన మాటల్లోనే..

కడతామో, లేదో చూసే కదా అప్పు ఇచ్చారు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా 17 బ్యాంకులు కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు (కేఎఫ్ఏ) రూ.5,500 కోట్లు అప్పు ఇచ్చాయి. బ్యాంకు అధికారులు అన్నీ చూసుకోకుండా అప్పు ఇవ్వరు కదా..! మేం మళ్లీ డబ్బులు కట్టగలమో, లేదో... అసలు కంపెనీకి ఏపాటి విలువ ఉందో... అన్నీ లెక్కలోకి తీసుకునే వివిధ స్థాయిల్లోని అధికారులు రుణ అనుమతులు ఇచ్చారు. ఆ తర్వాతే బ్యాంకులు మంజూరు చేశాయి. రుణం తీసుకునేటప్పుడు బ్యాంకుల వద్ద వివిధ ఆస్తులు తనఖా పెట్టాం. వాటిని విక్రయించి బ్యాంకులు రూ.600 కోట్లు రాబట్టుకున్నాయి. మరోపక్క కర్ణాటక హైకోర్టు వద్ద 2013లో డిపాజిట్ చేసిన రూ.1280 కోట్లు ఇప్పటికీ అలాగే ఉన్నాయి.

రుణ పునర్వ్యవస్థీకరణ ఆర్‌బీఐకి తెలియదా

2010 సమయంలో దేశీయ విమానయాన పరిశ్రమ చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. అప్పట్లో బ్యాంకులు ఆర్‌బీఐ అనుమతి తీసుకొని కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ తీసుకున్న రుణాలను పునర్వ్యవస్థీకరించాయి. ఇక కింగ్ ఫిషర్ ఆర్థిక పరిస్థితి అదుపు తప్పిందని ఆరోపిస్తూ 2012లో ఆర్‌బీఐకి ఎస్‌బీఐ ఓ లేఖ రాసింది. మునిగిపోతున్న సంస్థను కాపాడుకునేందుకు ప్రమోటర్లే (యూబీ గ్రూపు) కొంతమొత్తంలో నిధులు అందించారని ఆ లేఖలో చెప్పింది. ఇదుగో.. ఇదే ఆ లేఖ. మీరూ చూడండి. మేం తీసుకున్న రుణంలో దాదాపు రూ.600 కోట్లు బ్యాంకులు ఎటూ వసూలు చేసుకున్నాయి కాబట్టి.. ఇక సుమారు రూ.5000 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీనిమీద ప్రసార మాధ్యమాలు విచ్చలవిడిగా వాళ్లకు తోచిన అంకెలు రాసిపడేస్తున్నాయి. పైగా బకాయిల చెల్లింపు నిమిత్తం 2016 మార్చి 29న ఒకసారి, ఏప్రిల్ 6న మరోసారి బ్యాంకులకు పరిష్కార ప్రతిపాదనలు పంపించా. వాటిని బ్యాంకులు తిరస్కరించాయి. కేసుల పరిష్కారం నిమిత్తం చర్చలు జరిపేందుకు 2016 మే 10న, జూన్ 2న, జూన్ 10న ఎస్‌బీఐ ఛైర్‌పర్సన్‌కు లేఖలు కూడా రాశాను.

బకాయిలకు మించి ఆస్తుల జప్తు

మోసం, మనీలాండరింగ్ వ్యవహారాలకు పాల్పడ్డానని, నన్ను అప్పగించాలని కోరుతూ భారత దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన పిటీషన్‌పై ప్రస్తుతం బ్రిటన్ కోర్టులో ఓ కేసు నడుస్తోంది. ప్రభుత్వం, బ్యాంకులు ఇచ్చిన నివేదికలతో లేనిపోని ఆరోపణలు, నిందలు వేస్తూ సీబీఐ, ఈడీలు నాపై ఎన్నో కేసులు వేశాయి. నావే కాకుండా నా గ్రూపు కంపెనీలు, నా కుటుంబీకులకు చెందిన సుమారు రూ.13,900 కోట్ల విలువైన ఆస్తులను మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ జప్తు చేసింది. నేను కట్టాల్సిన బకాయిల కంటే కూడా ఈ ఆస్తుల విలువ ఎక్కువ. పైగా నేనే ఈ ఆస్తులను అమ్మి బకాయిలు చెల్లిస్తానని అంతకుముందే చెప్పాను. దానికి కూడా అనుమతి ఇవ్వలేదు.

రాజకీయ దురుద్దేశంతో చేస్తే ఏం చేస్తాం?

జప్తు చేసిన ఆస్తులను అమ్మడం ద్వారా వచ్చిన నిధులను బకాయిల కింద జమ చేసుకునేందుకు ప్రభుత్వ బ్యాంకులకు ఈడీ అనుమతినివ్వడం లేదని తెలుస్తోంది. రాజకీయ దురుద్దేశంతోనే నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నారనడానికి ఇంతకంటే నిదర్శనం కావాలా? అసలు నేను తిరిగి బకాయిలు చెల్లించడం ప్రభుత్వానికి ఇష్టముందా? లేదా? నేను ఏ ప్రయత్నం చేసినా పట్టించుకోరు. ఎలాంటి ప్రతిపాదన చేసినా తప్పుగా అర్థం చేసుకుంటారు. నేను సదుద్దేశంతో ప్రభుత్వ రంగ బ్యాంకులతో కేసు పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాను. రాజకీయ కుట్రతో అడ్డంకులు సృష్టించాలని వాళ్లు అనుకుంటే నేను మాత్రం ఏం చేయగలను.

కింగ్ ఫిషర్‌లో పనిచేసిన ఉద్యోగుల్లో ఓ వర్గం తమకు వేతనాలు చెల్లించలేదంటూ పదేపదే ఫిర్యాదులు చేస్తూ వచ్చింది. ఈ పరిణామం నన్ను కలచివేసింది. ఎందుకంటే కింగ్ ఫిషర్ ఓ వెలుగువెలుగుతోన్న సమయంలో మన దేశంలోని ఏ విమానయాన సంస్థ ఉద్యోగులకు దక్కని సంతోషాన్ని, సంతృప్తిని కింగ్ ఫిషర్ ఉద్యోగులు అనుభవించారు. అయితే ఆ తర్వాత కంపెనీ పరిస్థితి తారుమారవ్వడంతో ఆ ప్రభావం ఉద్యోగులపైనా పడింది. అంతేకాదు.. నేను యూబీ గ్రూపునకు సారథ్యం వహించిన సమయంలో సుమారు 66,000 మంది ఉద్యోగులు ఉండేవారు. వీళ్లలో చాలామంది 20-30 ఏళ్ల నుంచి పనిచేస్తున్నవాళ్లే. నిజంగానే ఉద్యోగుల ప్రయోజనాలంటే లెక్కలేనివాడినే అయితే ఇంత మంది ఇన్నేళ్ల పాటు ఎలా పనిచేస్తారు? అయినా కాని కేఎఫ్ఏ

ఉద్యోగుల జీతాలపై..

ఉద్యోగుల వేతనాలు చెల్లించేందుకు ప్రయత్నించాను. చట్టపరంగా వీలులేనప్పటికీ నా వినతి మేరకు ఉద్యోగుల వేతనాల్లో కొంత చెల్లించేందుకు 2014 ప్రారంభంలో సుప్రీంకోర్టుకు యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్స్ ఓ దరఖాస్తు సమర్పించింది. అయితే ఈ దరఖాస్తు పెండింగ్‌లోనే ఉండిపోయింది. విచారణకు కూడా రాలేదు. కనీసం కర్ణాటక హైకోర్టు వద్ద డిపాజిటు చేసిన రూ.1280 కోట్లపై వడ్డీనైనా ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు వాడేందుకు అనుమతినిస్తే నేను ఎంతో సంతోషించే వాడిని. అది కూడా జరగలేదు.

భారత్‌తో వాణిజ్య బంధం మరింత బలోపేతం

అమెరికా కాన్సులేట్ జనరల్ కేథరిన్

ఈనాడు, హైదరాబాద్: భారత, అమెరికాల మధ్య వాణిజ్య, రక్షణ సంబంధాలు బలోపేతం అవుతున్నాయని అమెరికా కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డా అన్నారు. గత ఏడాది ఈ రెండు దేశాల మధ్య 126 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగిందనీ, గత 12 ఏళ్లలో ఇది 3 రెట్ల వరకూ పెరిగిందని పేర్కొన్నారు. 2016లో ఎఫ్‌డీఐల రూపంలో 37 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. అమెరికా 242వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐఏసీసీ), ఆంధ్రప్రదేశ్-తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రక్షణ విషయంలో వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం వచ్చే నెల 6న అమెరికా, భారత దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరగబోతున్నట్లు తెలిపారు. అమెరికాలో అత్యధికంగా మాట్లాడే భాష విషయంలో తెలుగు 20వ స్థానంలో ఉందనీ, తెలుగు రాష్ట్రాల్లో ప్రతి నలుగురిలో ఒకరికి అమెరికాతో ఏదో ఒకరకంగా సంబంధం ఉందని పేర్కొన్నారు. అమెరికాకు అత్యధికంగా వచ్చే విద్యార్థులు ఈ రెండు రాష్ట్రాల నుంచే ఉంటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి మాట్లాడుతూ.. భారత్, అమెరికాల వాణిజ్య సంబంధాలు మెరుగ్గా ఉండటం ఎంతో సానుకూలాంశమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా అమెరికా, తెలంగాణ మధ్య వ్యాపార సంబంధాలు ఎంతో బలపడ్డాయని చెప్పారు. ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్, ఐటీ రంగాలకు చెందిన పలు ప్రముఖ సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. ఏపీసీసీ రీజనల్ ప్రెసిడెంట్ ఎస్.పూర్ణచంద్రరావు, ఐఏసీసీ ఏపీ, తెలంగాణ ఛైర్మన్ శ్రీకాంత్ బాడిగ, ఫోనిక్స్ గ్రూప్ ఛైర్మన్ సురేశ్ చుక్కపల్లి, ఐఏసీసీ వైస్ ఛైర్మన్ మేక విజయసాయి తదితరులు హాజరయ్యారు.

రెండేళ్లలో రూ.14వేల కోట్ల ఆర్డర్లు!

బీడీఎల్ సీఎండీ ఉదయ్‌భాస్కర్

హైదరాబాద్: రక్షణ రంగంలోని సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) రానున్న రెండేళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆకాశ్ -2 మిసైళ్ల తయారీకి రూ.14వేల కోట్ల ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరో రెండేళ్లలో తొలి విడత ఆకాశ్ మిసైళ్ల తయారీ పూర్తవుతుందని బీడీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. గత ఏడాది ఈ ప్రభుత్వ రంగ సంస్థ ఆదాయం రూ.4,579 కోట్లుగా నమోదయ్యింది. వచ్చే రెండేళ్లలో ఆదాయంలో 5 శాతం వృద్ధి ఆశిస్తున్నామనీ, ఆ తర్వాత ఆకాశ్-2 ఆర్డర్ వస్తే వృద్ధి రేటు మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కొత్త ఆర్డర్లను 2020-21 నుంచి సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపారు. మహారాష్ట్రలోని అమరావతిలో ఈ ఏడాది నుంచి ఉత్పత్తి ప్రారంభం కానుందనీ, 2021నాటికి పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో కూడా బీడీఎల్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

బ్యాంకులకు ఈ ఏడాదీ కష్టకాలమే!

- స్థూల నిరర్థక ఆస్తులు వచ్చే మార్చికి 12.2 శాతానికి
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక

ముంబయి: బ్యాంకింగ్ రంగానికి నిరాశ కలిగించే అంశమిది. బ్యాంకులు స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) మరింత పెరగనున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. 2017-18 ఆఖరుకు బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు 11.6 శాతం కాగా, ఇవి మరో 0.6 శాతం పెరిగి 2018-19 ఆఖరుకు 12.2 శాతానికి చేరతాయని ఆర్థిక స్థిరత్వ నివేదిక (ఎఫ్ఎస్ఆర్)ఓ ఆర్‌బీఐ అంచనా వేసింది. ఇందువల్ల బ్యాంకింగ్ రంగంపై ఒత్తిడి మరింత తీవ్రమవుతుందని పేర్కొంది.

పీసీఏ పరిధిలోని 11 బ్యాంకుల్లో

సత్వర దిద్దుబాటు కార్యాచరణ (పీసీఏ) పరిధిలో ఉన్న 11 ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల స్థూల ఎన్‌పీఏలు గత మార్చికి 21 శాతం కాగా, వచ్చే మార్చి ఆఖరుకు 22.3 శాతానికి పెరగనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ 11 బ్యాంకుల్లో ఆరింటికి, నష్టభయం ఆధారిత ఆస్తుల నిష్పత్తి (సీఆర్ఏఆర్) దృష్ట్యా మూలధన కొరత ఏర్పడుతుందని పేర్కొంది. అధిక ఎన్‌పీఏలకు అనుగుణంగా ఈ జాబితాలో ఐడీబీఐ బ్యాంక్, యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, దేనా బ్యాంక్, ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్ ఉన్నాయి. నిరర్థక ఆస్తులకు కేటాయింపులు కూడా పెంచాల్సి రావడంతో, అన్ని వాణిజ్య బ్యాంకుల లాభదాయకత తగ్గినట్లు పేర్కొంది. 2017-18లో రుణ వృద్ధి పుంజుకున్నా, డిపాజిట్లలో వృద్ధి మందకొడిగా ఉందని తెలిపింది.

2020కి పీసీఏ నుంచి బయట పడతాం

పార్లమెంటరీ కమిటీతో పీఎస్‌బీల ఆశాభావం

దిల్లీ: ఆర్‌బీఐ సత్వర దిద్దుబాటు కార్యాచరణ (పీసీఏ) నుంచి 2020 కల్లా బయట పడతామనే విశ్వాసాన్ని 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు వ్యక్తం చేశాయి. కేంద్ర మాజీ మంత్రి ఎం.వీరప్పమొయిలీ నేతృత్వంలోని పార్లమెంటరీ ఆర్థిక స్థాయీసంఘం ఎదుట 11 పీఎస్‌బీల ఉన్నతాధికారులు హాజరై, తమ కార్యకలాపాల ప్రణాళికను అందించడంతో పాటు సంఘం సభ్యుల ప్రశ్నలకు బదులిచ్చారు. పీసీఏ వల్ల రుణ మంజూరు కార్యకలాపాలు స్తంభిస్తాయనే ఆందోళనలు కూడా ఈ సందర్భంగా వ్యక్తమయ్యాయి. 'తమ ఎన్‌పీఏల పరిష్కారానికి ఎలా వ్యవహరించనున్నారనే ప్రణాళికను బ్యాంకర్లు సమర్పించారు. 2020 కల్లా ఆర్‌బీఐ పీసీఏ నుంచి బయట పడతామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు' అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

పీసీఏ వల్ల.. బ్యాంకులు డివిడెండ్లు పంపిణీ చేయడంలో, లాభాలను బదిలీ చేయడంలో, రుణాల జారీలో నిబంధనలను ఎదుర్కొంటాయి. మూలధనం సమకూర్చుకోవాలనీ కోరవచ్చు. బ్యాంకులు తమ శాఖల విస్తరణను నిలిపి వేయాల్సి రావచ్చు. మొండి బకాయిలకు అధిక కేటాయింపులు జరపాలి. ఉన్నతాధికారులు, డైరెక్టర్ల పరిహారం, రుసుములపై పరిమితులుంటాయి. మూలధనంలో బాసెల్ 3 నిబంధనలు పాటించాలి.

- ✦ కొన్ని కేసుల విషయంలో ప్రస్తుత, గతంలో పనిచేసిన బ్యాంకర్లను అరెస్టు చేస్తుండటం వల్ల, కొత్తగా రుణాలు మంజూరు చేసేందుకు అధికారులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపినట్లు సమాచారం.
- ✦ ఆర్‌బీఐ గవర్నర్ ఏడాదిలో రెండుసార్లు కమిటీ ఎదుటకు వచ్చి, ఆర్థిక పరిస్థితులను వివరించడాన్ని సంప్రదాయంగా చేయాలని కమిటీ అభిప్రాయపడినట్లు తెలిసింది.

సోయాబీన్, ఇతర ఉత్పత్తులపై చైనా సుంకాల తగ్గింపు

బీజింగ్: భారత్ సహా మరో నాలుగు ఆసియా దేశాల నుంచి వెళ్లే సోయాబీన్, కొన్ని ఇతర వస్తువులపై చైనా దిగుమతి సుంకాల్లో కోత విధించింది. జులై 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని చైనా కేబినెట్ ప్రకటించింది. అమెరికాతో వాణిజ్య యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలోనే తాజా నిర్ణయం వెలువడటం గమనార్హం. భారత్, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్, లావోస్, శ్రీలంక దేశాల నుంచి దిగుమతి అయ్యే సోయాబీన్‌పై సుంకాన్ని మూడు శాతం నుంచి సున్నాకు తగ్గించినట్లు చైనా ప్రభుత్వం వెల్లడించింది. రసాయనాలు, వ్యవసాయ ఉత్పత్తులు, వైద్య పరికరాలు, దుస్తులు, ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సైతం కొంత దిగుమతి సుంకాలను తగ్గించినట్లు చైనా పత్రికలు తెలిపాయి. ఆసియా- పసిఫిక్ వాణిజ్య ఒప్పందంలో రెండో సవరణ కింద ఈ సుంకాల కోత ఉంటుందని పేర్కొన్నాయి. చైనాకు దిగుమతి అయ్యే అధిక శాతం సోయాబీన్స్ అమెరికా నుంచే వస్తున్నాయి. తాజా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సోయాబీన్‌పై దిగుమతి సుంకాన్ని చైనా తగ్గించింది.

అమెరికా బయటకు హార్లే డేవిడ్‌సన్!

వాషింగ్టన్: అమెరికా ప్రఖ్యాత సంస్థ హార్లే డేవిడ్‌సన్ తన మోటార్‌బైక్‌ల తయారీలో కొంతభాగాన్ని ఇతర దేశాలకు తరలించాలని నిర్ణయించింది. ఐరోపా సమాఖ్యకు ఎగుమతి చేసే వాటిని భారత్, బ్రెజిల్, ఆస్ట్రేలియాల్లో తయారు చేయించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. ఐరోపా దిగుమతులపై సుంకాలు విధిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి ప్రతిస్పందనగా, తమ బైక్‌లపై ఐరోపా సమాఖ్య సుంకాలు భారీగా పెంచినందునే, హార్లే డేవిడ్‌సన్ ఈ నిర్ణయం తీసుకుంది. పన్ను భారం తగ్గించుకునేందుకే ఇలా చేస్తున్నట్లు పేర్కొంది. అయితే సంస్థ నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇది తనను ఆశ్చర్యానికి గురిచేసిందని, ఒకరకంగా అమెరికా ఓటమిని అంగీకరించినట్లు అవుతుందని పేర్కొన్నారు. 'నేను ఆ సంస్థ కోసం పోరాడుతున్నాను. అది ఫలిస్తే, ఐరోపాలో స్వేచ్ఛగా విక్రయించుకోవచ్చు. ఆయా ఉత్పత్తులపై ఇరు దేశాలు విధిస్తున్న సుంకాల్లో సారూప్యత లేనందున, అమెరికాకు 151 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9.82 లక్షల కోట్ల) నష్టం వస్తోంది. ఇది మారాల్సి ఉంది. అందువల్ల హార్లే డేవిడ్‌సన్ సహనం వహించాలి' అని ట్రంప్ ట్వీట్ చేశారు.

3.2 బి. డాలర్ల ఉత్పత్తులపై ఐరోపా సుంకాలు: మోటార్‌సైకిళ్లు, కమలారసం, బోర్బన్, వేరుసెనగ వెన్న, మోటార్‌బోట్లు, సిగరెట్లు, డెనిమ్ వంటి 3.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21,000 కోట్ల) విలువైన అమెరికా ఉత్పత్తులపై గత శుక్రవారం నుంచీ ఐరోపా సమాఖ్య సుంకాలు విధిస్తోంది. బైక్‌లపై సుంకాన్ని 6 శాతం నుంచి 31 శాతానికి పెంచడం వల్ల, ఒక మోటార్‌సైకిల్‌పై సగటున 2,200 డాలర్ల (సుమారు రూ.లక్షన్నర) భారం పడుతుందని హార్లే డేవిడ్‌సన్, అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్)కు సమాచారం ఇచ్చింది. అందువల్ల ఐరోపాకు ఎగుమతి చేసే బైక్‌లను ఇతర దేశాల్లోని తయారీ కేంద్రాల్లో రూపొందిస్తామని వెల్లడించింది. ఇందుకు 9-18 నెలలు పడుతుందనీ వివరించింది. 2017లో ఐరోపాలో ఈ సంస్థ బైక్‌లు 40,000 విక్రయమయ్యాయి. అమెరికా తరవాత అధికాదాయం ఐరోపా సమాఖ్య నుంచే వస్తోంది. అందుకే సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.

ఐరోపా ఎగుమతుల కోసమే

అమెరికా అధ్యక్ష భవనం సమర్థన: 'అధ్యక్షుడు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుంది. తయారీరంగంలోనే 3 లక్షలకు పైగా ఉద్యోగాలు లభించాయి. ఈ రంగవిశ్వాసం చారిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరింది. నిరుద్యోగత 3.8 శాతానికి పరిమితమైంది. 2000 సంవత్సరం తరవాత ఇదే అత్యంత స్వల్పం' అని అమెరికా అధ్యక్ష భవనం పేర్కొంది.

భారత్‌పై గతంలో వ్యాఖ్యలివీ

అమెరికా నుంచి ఎగుమతి చేస్తున్న హార్లే డేవిడ్‌సన్ బైక్‌లపై అధిక సుంకాలు విధించడం తగదని, ఇదే కొనసాగితే భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న బైక్‌లపై అధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ పలుమార్లు హెచ్చరించిన సంగతి విదితమే.

సెన్సెక్స్ ▲ 20	నిఫ్టీ ▲ 07	డోజోన్స్ 24355 ▲ 102	నాస్‌డాక్ 7587 ▲ 55	రూపాయి 68.24 ▼ 11 పైసలు	ముడి చమురు 76.24 ▲
35490	10769			(ఒక అమెరికా డాలరుకు)	(బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	26న	మార్పు %
GRASIM	1036.70	3.00
COAL INDIA	265.15	2.37
ULTRATECH CEM	3840.10	2.35
HINDALCO	222.95	2.08
TCS	1852.00	1.80
ASIAN PAINTS	1274.60	1.69
BHARTI AIRTEL	380.20	1.62

గ్రహణం (-)

నిఫ్టీ	26న	మార్పు %
TATA MOTORS	276.85	-4.34
RELIANCE IND	978.95	-2.54
CIPLA	599.50	-1.95
POWER GRID CORP.	190.75	-1.78
TATA STEEL	549.50	-1.63
EICHER MOTORS	29035.45	-1.37
BAJAJ FINSERV	6084.35	-1.32

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	62.06	71.96	బహ్రెయిన్ దీనార్	167.98	192.19
పౌండ్ స్టెర్లింగ్	82.44	95.62	కువైట్ దీనార్	186.49	232.14
యూరో	72.70	84.32	ఒమన్ రియాల్	164.50	188.29
జపనీస్ యెన్/100	56.68	65.75	సౌదీ రియాల్	16.51	19.55
ఆస్ట్రేలియా డాలరు	45.97	53.21	యూఏఈ దిర్హమ్	16.89	19.74
సింగపూర్ డాలరు	45.59	54.03	మలేషియా రింగిట్	15.11	18.57
థాయ్ బాత్/100	188.18	224.99	చైనీస్ యువాన్	7.36	11.95

మంగళవారం నిఫ్టీ కదలికలు



జీఎస్‌టీతో పన్ను వసూళ్లు పెరిగాయ్

- రిటర్న్‌ల ప్రక్రియను సులభతరం చేస్తాం
- ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా

దిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం సాఫీగా సాగిపోయే దశలోకి ప్రవేశించిందని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా పేర్కొన్నారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన ఏడాదిలోపే పన్ను వసూళ్లు పెరిగాయని, ప్రస్తుతం పన్ను రిటర్న్‌ల ప్రక్రియను సులభతరం చేయడంపై దృష్టి పెట్టామని అన్నారు. జీఎస్‌టీ కింద 1.11 కోట్ల వ్యాపారాలు నమోదు చేసుకున్నారని, నెలవారీగా దాఖలు చేస్తున్న రిటర్న్‌లు, పన్ను చెల్లింపులు రోజురోజుకు పెరుగుతున్నాయని, త్వరలో దాదాపు 96 శాతానికి చేరొచ్చని అధియా అభిప్రాయపడ్డారు. జీఎస్‌టీ విధానం వల్ల పన్నుల సంఖ్య తగ్గిందని, కనిపించని పన్నుల మోత, రాష్ట్రాల చెక్‌పోస్టుల తొలగింపు, పన్ను చెల్లింపుదార్ల సంఖ్య పెరగడం, పన్నుల ఎగవేత తగ్గడం వంటి ప్రయోజనాలు చేకూరాయని అధియా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఒక పేజీ రిటర్న్‌పై కసరత్తు: జీఎస్‌టీ విధానం రెండో ఏడాదిలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో

ఒకే పేజీ రిటర్న్‌పై పన్ను అధికారులు కృషి చేస్తున్నారని, అందరికీ సులభంగా ఉండేలా చేయడమే లక్ష్యమని అధియా అన్నారు. 'జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన పన్ను చెల్లింపుదార్ల సంఖ్య పెరిగింది. జీఎస్‌టీకి ముందు 60- 65 లక్షల వ్యాపారులు నమోదై ఉంటే.. కొత్త విధానంలో మరో 48 లక్షల మంది వచ్చి చేరారు. ఇది సంఘటితం కాదా?' అని అధియా ప్రశ్నించారు. జీఎస్‌టీ రిటర్న్‌లు దాఖలు చేస్తున్న వారిలో 25 శాతం మంది శూన్య పన్నులో ఉన్నారని, తక్కువ జరిమానా ఉండటం వల్ల ఆలస్యంగా కూడా పన్ను రిటర్న్‌లు దాఖలవుతున్నాయని వివరించారు. గతేడాది ఆగస్టులో 94 శాతం వ్యాపారులు రిటర్న్‌లు దాఖలు చేయగా, సెప్టెంబరులో 92 శాతం, అక్టోబరులో 89 శాతం, నవంబరులో 86 శాతం, డిసెంబరులో 85 శాతం, జనవరిలో 83 శాతం, ఫిబ్రవరిలో 81 శాతం చొప్పున దాఖలయ్యాయని చెప్పుకొచ్చారు. రిటర్న్‌ల దాఖలు శాతం క్రమంగా పెరుగుతుందని, అయితే పన్ను చెల్లింపులు బాగున్నాయని అన్నారు.

సెప్టెంబరుకు రివర్స్ ఛార్జీ వాయిదా: రివర్స్ ఛార్జీ విధానం, మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్), మూలం వద్ద పన్ను వసూలు (టీసీఎస్) వంటి జీఎస్‌టీ నిబంధనల అమలును సెప్టెంబరు వరకు రెవెన్యూ విభాగం వాయిదా వేసింది.

సహజవాయువుపై త్వరలో నిర్ణయం

జీఎస్‌టీలోకి సహజవాయువు, జెట్ ఇంధనం (ఏటీఎఫ్)ల చేర్పడంపై జీఎస్‌టీ మండలి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధియా అన్నారు. వచ్చే జీఎస్‌టీ మండలి సమావేశం జులై 21న జరగనుంది. అయితే ఈ సమావేశంలో ఇదే ప్రధాన అజెండా కానుందా అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చి దాదాపు ఏడాది కావొస్తున్నా.. ముడిచమురు, సహజవాయువు, పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్‌లను తీసుకురాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ ఆదాయం అందిస్తున్న నేపథ్యంలో వీటిని చేర్చడం కష్టతరంగా మారింది.

1న వార్షికోత్సవ వేడుకలు

జీఎస్‌టీ అమల్లోకి వచ్చి ఏడాది పూర్తి కావొస్తున్న సందర్భంగా. . జులై 1న ప్రభుత్వం భారీ వేడుక కార్యక్రమాన్ని నిర్వహించాలని సన్నాహాలు చేస్తోంది. ఇందులో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్, పరిశ్రమ సంఘాలు, వర్తకులు, పన్ను అధికారులు పాల్గొనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర అరుణ్ జైట్లీ సైతం ప్రసంగించనున్నారు. జులై 1న జీఎస్‌టీ దినంగా వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దిల్లీలో కొత్తగా నిర్మించిన అంబేడ్కర్ భవన్‌లో భారీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం.

మన మూలాలు పటిష్ఠం

- నీటి పరిరక్షణలో కలిసి పనిచేద్దాం
- ఏఐఐబీ సమావేశంలో ప్రధాని మోదీ

ముంబయిలో ఏఐఐబీ సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ముంబయి: దేశ స్థూల ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉన్నాయని, మరింత స్థిరీకరణకు మార్గం సుగమం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాజకీయ స్థిరత్వం, సహకరించే నిబంధనావళి వల్ల ప్రపంచంలో పెట్టుబడులకు అత్యంత సానుకూల దేశం భారత్ అని తెలిపారు. 2.6 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.170 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధి చెందడం ద్వారా, ప్రపంచ దేశాల్లో వెలుగుచుక్కలా నిలవనుందని వివరించారు. ఆర్థిక వ్యవస్థ పరిమాణ పరంగా ప్రపంచంలో ఏడో స్థానంలో, కొనుగోలు శక్తి పరంగా చూస్తే మూడో స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 'ముడిచమురు ధరలు పెరిగినా కూడా ద్రవ్యోల్బణం పరిమితుల్లోనే ఉంది. ఆర్థిక స్థిరీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని ఇక్కడ జరిగిన ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మూడో వార్షిక సమావేశంలో ప్రధాని తెలిపారు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం లోపు పరిమితం చేయాలన్నది లక్ష్యం కాగా, గత మే నెలలో 4.87 శాతానికి చేరిన నేపథ్యంలో, ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. జీడీపీతో పోలిస్తే, ప్రభుత్వ రుణాల వాటా క్రమంగా తగ్గుతోందని, అందువల్లే దీర్ఘకాలం తరవాత దేశ రేటింగ్ మెరుగు పడిందని ప్రధాని పేర్కొన్నారు. 'సరికొత్త భారతం దూసుకెళ్తోంది. అందరికీ ఆర్థిక అవకాశాలు కల్పించే మూలాలాపై ఇది నిలిచి ఉంది. మేధో పరమైన వృద్ధి, సంపూర్ణ అభివృద్ధి, భవిష్యత్తులో మరింత బాగుంటుంది' అని తెలిపారు. 400 బిలియన్ డాలర్ల (సుమారు రూ.26 లక్షల కోట్ల) విదేశీ మారక నిల్వల వల్ల, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాల దుష్ప్రభావాలను తట్టుకో గలిగే సామర్థ్యం ఏర్పడినట్లు వివరించారు.

మార్కెట్ కబుర్లు

- మార్చితో ముగిసిన త్రైమాసికం, పూర్తి ఆర్థిక సంవత్సరం ఫలితాలను **ఫోర్టిస్ హెల్త్‌కేర్** బోర్డు మరోసారి వాయిదా వేసింది. దీనిపై మరింత చర్చ జరగాల్సిన అవసరం ఉందని బోర్డు పేర్కొంది.
- దేశీయ విపణిలో రూ.1,966 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకున్నట్లు **జేఎంసీ ప్రాజెక్ట్స్** వెల్లడించింది.
- ప్రజావేగు చేసిన ఫిర్యాదు మేరకు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ దర్యాప్తు చేస్తున్నట్లు వచ్చిన వార్తలను **ఇన్ఫోసిస్** ఖండించింది. పత్రాలను దాఖలు చేయడానికి సమయం ఉందని వెల్లడించింది.
- **వరోక్ ఇంజినీరింగ్** పబ్లిక్ ఇష్యూకు తొలి రోజున 32 శాతం స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా టాటా గ్రూప్ రూ.1786 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది.
- వ్యాపార వృద్ధి కోసం బాండ్ల ఇష్యూ ద్వారా రూ.5000 కోట్ల వరకు సమీకరించనున్నట్లు **శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్** ప్రకటించింది.
- మౌలిక సంస్థ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు చెందిన బ్రోకరేజీ వ్యాపారాన్ని వెల్లడించని మొత్తానికి **ఇండస్‌ఇండ్ బ్యాంక్** కొనుగోలు చేయనుంది.
- **ఎన్‌డీటీవీ**లో ఉన్న వాటాకు ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సిందిగా విశ్వప్రధాన్ కమర్షియల్‌ను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. 2009లో రూ.350 కోట్ల కన్వర్టబుల్ రుణం ద్వారా.. ఎన్‌డీటీవీలో 52 శాతం వరకు మెజారిటీ వాటాను కంపెనీ పొందింది.
- పలు రకాల ఇన్ఫెక్షన్ల చికిత్సకు ఉపయోగించే ఎటాపీనం జెనరిక్ సూదిమందు తయారీ, మార్కెటింగ్‌కు **అరబిందో ఫార్మా**కు యూఎస్ ఎఫ్‌డీఏ నుంచి అనుమతి లభించింది.
- ఐడియా, వొడాఫోన్‌ల విలీనం ద్వారా ఏర్పడనున్న సంయుక్త సంస్థకు 'వొడాఫోన్ ఐడియా లిమిటెడ్'గా పేరు పెట్టేందుకు **ఐడియా** సెల్యులార్ వాటాదార్లు ఆమోదం తెలిపారు. ఎన్‌సీడీల జారీ ద్వారా రూ.15000 కోట్లు సమీకరించేందుకు అంగీకరించారు.

లాభాల స్వీకరణకే మదుపర్ల మొగ్గు

సమీక్ష

ముంబయి: ఊగిసలాటల మధ్య కొనసాగిన ట్రేడింగ్‌లో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. ప్రతి అవకాశాన్ని కూడా లాభాల స్వీకరణకే ఉపయోగించారు. ముఖ్యంగా ట్రేడింగ్ చివరి 30 నిమిషాల్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు గురువారంతో ముగియనుండటంతోపాటు ప్రపంచ వాణిజ్య భయాలు మదుపర్లను అప్రమత్తంగా వ్యవహరించేలా చేశాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అగ్రగామి దేశాలైన అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), చైనా, భారత్‌ల మధ్య సుంకాల సమరం కొనసాగుతుండటం కూడా మదుపర్లను వెనకడుగు వేసేలా చేసిందని చెబుతున్నారు. దీనికితోడు డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ మరింత దిగజారడం కూడా ఆందోళనకు తెర తీసింది.

ఉదయం సెన్సెక్స్ 35,355.72 పాయింట్ల వద్ద ప్రతికూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 35338.09 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. ఆ తరవాత పెరుగుతూ వచ్చి ఒకానొక దశలో 145 పాయింట్ల లాభంతో 35616.64 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే చివరి అరగంటలో అమ్మకాలు వెల్లువెత్తడంతో చివరకు 19.69 పాయింట్ల లాభంతో 35,490.04 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 6.7 పాయింట్ల లాభంతో 10,769.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,732.55-10,805.25 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ షేర్లలో కోల్ ఇండియా అత్యధికంగా 2.10% లాభపడింది. టీసీఎస్ 1.77%, మారుతీ సుజుకీ 1.68%, ఏషియన్ పెయింట్స్ 1.57%, భారతీ ఎయిర్‌టెల్ 1.34%, హెచ్‌డీఎఫ్‌సీ 1.04% చొప్పున లాభపడ్డాయి. ఓఎన్‌జీసీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ కూడా లాభపడిన షేర్లలో ఉన్నాయి. టాటా మోటార్స్ వరుసగా రెండో రోజు కూడా భారీగా (4.31%) నష్టపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు కూడా 2.48% తగ్గింది. పవర్‌గ్రిడ్, టాటా స్టీల్, ఎం అండ్ ఎం, హీరో మోటోకార్ప్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, విప్రో షేర్లు నష్టపోయిన జాబితాలో ఉన్నాయి.

26న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	382	వరంగల్	384
చిల్లరగా(ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	390
బెంగళూరు	429	చెన్నై	457
27వ తేదీకి...		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	378	నమక్కల్	440

బ్లూస్టార్ నుంచి 4 నీటి శుద్ధి పరికరాలు

బ్లూస్టార్ కొత్తగా విడుదల చేసిన నీటి శుద్ధి పరికరాలతో జాయింట్ ఎండీ బి.త్యాగరాజన్

ఈనాడు, హైదరాబాద్: నీటి శుద్ధి పరికరాల మార్కెట్లో వాటా పెంచుకునేందుకు బ్లూస్టార్ ప్రయత్నిస్తోంది. దీనికోసం తాజాగా నాలుగు కొత్త మోడళ్లను తీసుకొచ్చింది. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న 2500 రిటైల్ స్టోర్లను ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 3500 చేయాలని లక్ష్యంగా విధించుకుంది. మరో మూడేళ్లలో ఈ విపణిలో 10శాతం మార్కెట్ వాటాను సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్ తెలిపారు. నీటి శుద్ధి పరికరాల మొత్తం మార్కెట్ రూ.4,200 కోట్ల వరకూ ఉందని, ఇందులో ఏటా 15-20శాతం వరకూ వృద్ధి కనిపిస్తోందని తెలిపారు. బ్లూస్టార్ నుంచి 9 శ్రేణుల్లో 35 మోడళ్లు అందుబాటులో ఉన్నాయని, రూ.10,900-రూ.44,900 ధరల శ్రేణిలో ఇవి లభ్యమవుతున్నాయని వివరించారు. కేవలం యూవీ సాంకేతికతతో పనిచేసేవి రూ.7,900- రూ.8,900లకు లభ్యమవుతున్నాయన్నారు. ఈ ఏడాది రూ.100 కోట్ల అమ్మకాలను లక్ష్యంగా విధించుకున్నట్లు తెలిపారు. బ్లూస్టార్ ఉత్పత్తులు 19 దేశాలకు ఎగుమతులు చేస్తున్నామనీ, వీటి ద్వారా రూ.500 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న మూడేళ్లలో దీన్ని రెట్టింపు చేస్తామన్నారు. ప్రస్తుతానికి గృహ రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లను ఉత్పత్తి చేసే ఆలోచనేమీ లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ శ్రీ సిటీలో రూ.220 కోట్లతో నిర్మించబోతున్న ప్లాంటు నిర్మాణం ఈ డిసెంబరులో ప్రారంభం అవుతుందని తెలిపారు.

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 362.90 (361.15) 1997309
ASIAN PAINTS 1274.60 (1253.45) 1262632
AXIS BANK LT 514.20 (515.20) 4505122
BAJAJ AUTO L 2811.95 (2801.30) 249490
BAJAJ FINANC 2367.35 (2390.60) 2337942
BAJAJ FINSER 6084.35 (6165.65) 164996
BHARTI AIRTE 380.20 (374.15) 4318837
BHARTI INFRA 292.95 (291.95) 5285978
BPCL 415.25 (412.00) 4210730
CIPLA 599.50 (611.40) 2323337
COAL INDIA L 265.15 (259.00) 10472162
DR. REDDYS 2267.15 (2290.15) 628148
EICHER MOTOR 29035.45 (29440.00) 50745
GAIL 341.75 (341.20) 4689369
GRASIM IND 1036.70 (1006.55) 819530
HCL TECH 910.40 (908.90) 1624618
HDFC 1915.85 (1893.80) 2819929
HDFC BANK 2093.70 (2094.95) 2290483
HERO MOTOCOR 3566.85 (3586.85) 252375
HINDALCO IND 222.95 (218.40) 8483133
HINDUSTAN UN 1621.75 (1615.15) 759142
HPCL 299.10 (298.95) 4541192
ICICI BANK 288.10 (289.70) 11614686
INDIABULLS H 1189.75 (1192.65) 745510
INDIAN OIL 166.80 (167.35) 9846198
INDUSINDBANK 1983.30 (1969.95) 662063
INFOSYS LTD 1277.85 (1272.45) 2241752
ITC 264.80 (262.60) 10087090
KOTAK MAHIND 1329.85 (1328.00) 1637022
LARSEN & TOU 1270.05 (1268.15) 2003243
LUPIN 902.35 (913.45) 2312136
M&M 898.00 (905.60) 2106484
MARUTI SUZIK 8931.35 (8793.00) 387769
NTPC LTD 155.60 (154.65) 5144476
ONGC 158.30 (156.65) 5960446
POWER GRID C 190.75 (194.20) 5551442
RELIANCE IND 978.95 (1004.45) 8068585
SBI 267.40 (268.45) 16867009
SUN PHARMA 572.95 (571.80) 4726890
TATA CONSULT 1852.00 (1819.25) 4679712
TATA MOTORS 276.85 (289.40) 30728620
TATA STEEL L 549.50 (558.60) 10207582
TECH MAHINDR 687.85 (696.15) 1687463
TITAN IND 872.15 (864.00) 1801638
ULTRATECH 3840.10 (3752.00) 582262
UPL LIMITED 639.80 (634.15) 1801843
VEDANTA LIMI 231.45 (230.65) 13407360
WIPRO 257.60 (257.50) 1983623
YES BANK LTD 335.95 (334.15) 4706265
ZEE ENTERTAI 562.00 (559.05) 1210014

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1188.15 (1189.25) 20306
ACC 1357.60 (1315.55) 1215478
ADITYA BIRLA 131.55 (135.60) 2170193
AMBUJA CEMEN 211.95 (206.80) 7976623
ASHOK LEYLAN 132.60 (132.00) 13579137
AUROBIND PHA 607.65 (607.55) 3218627
AVENUE SUPER 1468.25 (1480.50) 292299
BANK OFBAROD 118.05 (116.80) 18511633
BEL 106.00 (109.40) 6470459
BHEL 73.25 (73.35) 4605005
BOSCH LTD 17688.55 (17909.95) 13811
BRITANNIA 6050.10 (5977.40) 112561
CADILA HEALT 402.95 (412.35) 826083
COLGATE PALM 1189.35 (1180.45) 161003
CONTAINER 623.90 (1244.40) 370917
CUMMINS INDI 666.75 (670.20) 205654
DABUR INDIA 386.50 (384.45) 804351
DLF LIMITED 195.65 (196.55) 4145494
EMAMI LIMITE 506.70 (504.20) 104410
GENERAL INS 723.45 (712.30) 27362
GODREJ CONSU 1191.25 (1160.45) 626117
HAVELLS INDI 532.85 (535.30) 810260
HINDUSTAN ZI 278.10 (288.55) 1450605
ICICI PRU LI 374.70 (380.40) 2381930
IDEA CELLULR 57.95 (56.00) 25727556
INTERGLOBE A 1169.80 (1173.10) 664984
JSW STEEL LT 322.85 (332.10) 3431872
L&TFIN.HOLD 155.95 (156.70) 2564143
LIC HOUS.FIN 478.80 (490.25) 1861887
MARICO LIMIT 340.80 (331.20) 2227683
MCDOWELL 701.10 (674.05) 3234528
MOTHERSON 281.60 (287.70) 5434896
MRF 74972.75 (75186.70) 4297
NHPC LTD 24.70 (24.60) 7253425
NMDC LTD 107.55 (108.25) 1983290
OIL INDIA 212.00 (208.40) 1148525
ORACLE FIN S 4059.40 (4031.70) 8827
P&G HYG&HEAL 9893.85 (9899.40) 1644
PETRONET LNG 212.30 (206.20) 3624182
PIDILITE IND 1054.85 (1042.55) 417044
PIRAMAL ENTE 2540.60 (2523.00) 236433
PNB 79.85 (79.80) 24559936
POWER FIN CO 80.55 (80.60) 3394847
RURAL ELEC C 107.55 (108.20) 2064619
SAIL 81.75 (82.05) 13124032
SBI LIFE INS 684.70 (689.75) 141038
SHREE CEMENT 15920.95 (15627.10) 38810
SHRIRAM TRAN 1436.00 (1468.25) 551378
SIEMENS 985.90 (987.00) 115830
SUN TV LTD 810.90 (804.65) 3073456

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 3.90 (3.85) 47383
ALPHAGEO 614.20 (617.20) 1347
AMAR RAJA BA 746.25 (740.25) 31746
ANDHRA BANK 33.20 (33.35) 296245
ANDHRA CEMEN 9.06 (9.44) 12200
ANDHRA PAPER 322.15 (322.75) 1593
ANDHRA PETRO 45.60 (45.60) 61720
ANDHRA SUGAR 340.75 (326.30) 1126
ASTRA MICROW 101.50 (103.90) 30487
AUROBINDO PH 607.35 (607.70) 726949
AVANTEL SOFT 358.40 (349.15) 5336
AVANTI FEEDS 604.95 (1564.70) 659917
BARTRONICS 10.22 (10.25) 14422
BHAGIRA CHEM 244.25 (260.25) 7320
BHAGYA NAG 38.35 (39.20) 12731
BN RATHI SEC 37.20 (38) 2140
BRILLIANT SE 4.75 (5) 40741
CAMBRIDGE TE 54.40 (55) 1020
CIL SECURI 22.50 (21.85) 4637
COMBAT DRUGS 27.10 (25.85) 3877
CONT COFFEE 263.60 (265.35) 459
COROMAN FERT 402 (393.65) 10012
CYBERMATE 1.95 (2.05) 32904
CYIENT LIMIT 714.50 (710.35) 9722
DIVI'S LAB 1040.25 (1033.30) 32385
DR REDDY 2267.75 (2290.10) 44813
GATI CORPN 79.35 (84.25) 240824
GAYATRI PROJ 166.35 (169.30) 759306
GMR INFRASTR 16.20 (15.90) 2163192
GOLDST INFRA 173.15 (164.95) 6652
GOLDSTONE EN 15.14 (15.93) 1067
GRANULES (I) 83.35 (82.60) 132527
GVK POWER 9.99 (10.51) 591425
HBL NIFE POW 34.75 (35.50) 37929
HERITAGE FOO 583.95 (610.85) 13339
ILFS ENGINEE 28.40 (27.70) 7759
INNAREDY COM 1.81 (1.90) 3399
IVRCL INFRAS 1.28 (1.33) 168930
KAKATIYA CEM 237.90 (236.65) 2399
KALLAM SPG 26.55 (27.40) 17294
KAVERI SEED 561.25 (573.10) 14317
KCP LTD 101.50 (101.25) 6083
KNR CONSTRUC 227.60 (239.40) 10529
LANCO INDUS 260.10 (263.45) 3546
LANCO INFRAT 0.76 (0.77) 601948
LAURUS LABS 467.05 (468.90) 3840
LOKESH MACH 60.35 (61.70) 1793
MADHUCON PRO 12.35 (12.45) 20290
MIC ELECTRON 2.98 (3.11) 208127
MOLD-TEK.TEC 41.50 (43.45) 1250
MOLDTK PLA 308.85 (308.95) 1330
NAGARJAGRICH 27.55 (28.05) 4666
NATCO PHARMA 803.65 (811.15) 9171
NAVA BH VENT 133.15 (136.25) 23854
NCC 97.85 (97.20) 659142
NCL IND 164.55 (165) 537159
NEHA INTER 5.07 (5.14) 46056
NETTLINX 51.60 (53.75) 48916
NEULAND LAB 675.15 (680.10) 288
NILE 525.35 (533.35) 3977
OIL COUNTRY 19.20 (19.05) 3659
PANYAM CEMEN 22 (23.10) 4177
PENNER IND 51.40 (52) 30187
PHYTOCHEM I 53.75 (54.40) 2082
PIONEER DIST 268.70 (267.20) 3509
PITTI LAMIN 85.55 (86.60) 2678
POKARNA 160.90 (161.60) 3156
PREMIER EXPL 265.50 (267.15) 727
PRISM CEMENT 101.45 (101.90) 25631
PRUDENTL PHA 3.98 (3.99) 41612
RAIN INDUSTR 193.75 (199.50) 190345
RAJ PACKAGIN 27.40 (29.50) 4798
SAMKRG PIST 230.85 (230.75) 2439
SATVAH. ISPA 13.85 (14.50) 2055
SMS PHARMA 69.35 (70.80) 2530
SREE RAYAL A 32.15 (32.45) 79744
STEEL EXCHAN 16.75 (15.25) 45187
SUJANA TOWER 2.26 (2.37) 2623
SUJANA UNIVE 0.53 (0.53) 35901
SURYALAKSH.C 53.15 (54.50) 1039
SURYALATA SP 130.25 (131.75) 475
SUVEN PHARMA 210.85 (215.40) 59885
TAJ GVK HOTE 215.35 (218.35) 5227
TANLA 29.40 (29.30) 31808
VAMSHI RUBB 44.95 (44.30) 645
VICEROY HOTE 7.79 (7.85) 18145
VIJAY TEXTIL 57.90 (58.25) 1348
VIMTA LABS 212.40 (215.75) 3127
VISAKA IND 556.30 (581.40) 6957
VIVIMED LABS 60.05 (60.60) 42258
YBRANT DIGIT 3.97 (4.07) 80322
ZENOTECH LAB 37.10 (37.30) 33969
ZENTECH 97.25 (102.20) 24068

నిరుడు ఆగస్టులో ఓ అర్ధరాత్రి...

ఛత్తీస్‌గఢ్‌లో డిస్క్‌జాకీ (డీజే)గా పనిచేస్తున్న 29 ఏళ్ల వర్ణికా కుందు కారులో ఇంటికెళ్తోంది. వెనుక నుంచి ఇద్దరు పోకిరీలు మరో వాహనంలో వెంటాడుతున్నారు. ఆమె కారుకు అత్యంత సమీపంలో వారి వాహనం దూసుకొచ్చింది. దుండగులు కారు తలుపులను పదేపదే బాదుతున్నారు. గతంలో చాలాసార్లు తనను వేధించినవారేనని వర్ణికా గుర్తించింది. వేగం పెంచింది. దుండగులు తమ వాహనాన్ని మరింత వేగంగా పోనిచ్చి ఆమె కారు ముందు అడ్డం తగిలారు. వర్ణికా సమయస్ఫూర్తితో కారును దారిమళ్లించి వేటగాళ్ల బారి నుంచి తప్పించుకొంది!

ఆ రాత్రిని ఆమె జయించింది.

కాదంటే... కాటే!

- యువతులపై పగ తీర్చుకుంటున్న భగ్నప్రేమికులు
- తిరస్కారాన్ని జీర్ణించుకోలేక దాడులు
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఘటనలు
- సంచలనంగా మారిన 'ద్వివేది హత్యోదంతం'

కానీ...

అందరు అమ్మాయిల పరిస్థితీ ఇలా లేదు. కోరిక తీర్చలేదనీ, ప్రేమను అంగీకరించలేదనీ భగ్నహృదయులు పగబడుతున్నారు. తమకు దక్కనిది మరెవరికీ దక్కకూడదని వెంటాడుతున్నారు. వారిని 'కసి'గా పాడుచేసో.. యాసిడ్‌తో మసిచేసో.. నెత్తురు కళ్లజూసో కక్ష తీర్చుకుంటున్నారు. వీరి బాధితులు చాలామంది వికలాంగులుగానో, కురూపులుగానో నిత్యం నరకం అనుభవిస్తున్నారు. దీనికి తోడు నిద్రపట్టనివ్వని జ్ఞాపకాలు! చుట్టూ సూటిపోట్లు!!

అన్యాయమైపోయింది...

అది 1996. దిల్లీలోని ఓ కళాశాలలో పాతికేళ్ల ప్రియదర్శిని మట్టూ న్యాయవిద్య అభ్యసిస్తోంది. పోలీసు అధికారి కుమారుడైన సీనియర్ ఆమెను వలచాడు. అతడి ప్రతిపాదనను ప్రియ తిరస్కరించింది. భంగపాటును ఆ సీనియర్ భరించలేకపోయాడు. ఆమెను బలవంతంగా అనుభవించి, ఆపై ఇనుప చువ్వతో గొంతును కర్కశంగా నులిపేసి చంపేశాడు!

ఊరిపెద్ద కొడుకు...

ఉత్తర్‌ప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలోని ఓ పల్లె. ఊరి పెద్ద కొడుకు... ప్రిన్స్ తివారి. 12వ తరగతి విద్యార్థి. చదువును మధ్యలో మానేసి 17 ఏళ్ల రజినీ దుబే వెంట పడ్డాడు. నెలల తరబడి ఆమెను వేధించాడు. ఆమె ఒప్పుకోలేదు. అంతే! బడికి వెళ్తున్న ఆ విద్యార్థినిని దారిలోనే కత్తితో ఖూనీ చేశాడు (కోర్టు రికార్డుల ప్రకారం).

ఈ కేసులకు ప్రాధాన్యమేదీ?

మృగాళ్ల వేధింపులు, దాడులకు సంబంధించిన కేసులకు పోలీసులు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్లే... ఇలాంటి ఘటనలు అంతకంతకూ పెరిగిపోతున్నాయన్న ఆరోపణలు లేకపోలేదు. 'ఆడది తనను కాదనలేదన్న అహంభావం, అధిక విశ్వాసం మగాళ్లలో కనిపిస్తోంది. ఇలాంటి కేసుల విచారణకు పోలీసులు ప్రాధాన్యం ఇవ్వట్లేదు. అందుకే ఈ ఘటనలు పెరిగిపోతున్నాయి' అని అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం కార్యదర్శి కవితా క్రిష్ణన్ ఆరోపిస్తున్నారు. "గతేడాది కుందు అనే అమ్మాయి చండీగఢ్ పోలీసులను ఆశ్రయం కోరింది. హరియాణా భాజపా నేత కుమారుడు వికాశ్, ఆశిష్ కుమార్ అనే అతని స్నేహితుడు తనను అపహరించేందుకు వెంటపడుతున్నారని మొరపెట్టుకుంది. కానీ, కేంద్ర మంత్రి బాబుల్ సుప్రియో జోక్యం చేసుకుని.. 'యువతి వెంటపడే యువకుడి సినిమా కథ'లా దానికి ప్రాధాన్యం లేకుండా చేశారు" అని ఆమె ఆరోపించారు. వేధింపుల ఫిర్యాదులకు పోలీసులు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్లే 'నిర్భయ' తరహా ఘటనలు పెరుగుతున్నాయని సుప్రీంకోర్టు న్యాయవాది, హక్కుల ఉద్యమకర్త రవికాంత్ అభిప్రాయపడ్డారు. పోలీసులను ఆశ్రయించినా సరైనా స్పందన లభించక... మరోవైపు విషయం బయటపడి కుటుంబం ఎక్కడ వీధినపడుతుందోనని భయపడి చాలామంది బాధితులు ఫిర్యాదు చేయడంలేదని ఆయన విశ్లేషించారు.

దేశ రాజధానిలో మహిళలపై వేధింపులను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు కొంతవరకూ ఫలిస్తున్నట్లు 'జాతీయ నేర గణాంక సమాచార విభాగం (ఎన్‌సీఆర్‌బీ)' వివరాలను బట్టి తెలుస్తోంది. 2015లో దిల్లీలో 1,124 దాడులు జరగ్గా, 2016లో అవి 835కు పరిమితమయ్యాయి. కానీ, ఆ ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా మహిళలపై దాడులు మాత్రం 6,226 నుంచి 7,190కి పెరిగాయి!

– దిల్లీ

తిరస్కారంతో తెగింపు..

తాను కోరుకున్న వ్యక్తి నుంచి తిరస్కారం ఎదురైనప్పుడు కొందరు హద్దులు మరిచిపోతారు. భయం, భంగపాటును ఎదుర్కొనే క్రమంలో వారిలో ఓ తెగువ పుట్టుకొస్తుంది. 'నువ్వు దక్కనప్పుడు నేనెందుకు, నాకు దక్కనప్పుడు నువ్వెందుకు' అన్న భావన కలుగుతుంది. ఈ క్రమంలో వారు విచక్షణ కోల్పోయి... దాడులకూ, హత్యలకూ పాల్పడుతున్నారు.

– నిమేష్ దేశాయ్, సంచాలకులు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్

మహిళలపై వేధింపులు ఇలా...



2016 చివరి నాటికి

కేరళ	132	జమ్ము-కశ్మీర్	7
పంజాబ్	99	మణిపూర్	5
అసోం	88	బిహార్	4
గుజరాత్	87	మిజోరాం	4
రాజస్థాన్	80	త్రిపుర	4
ఛత్తీస్‌గఢ్	71	సిక్కిం	3
హిమాచల్‌ప్రదేశ్	60	దమణ్-దీవ్	3
తమిళనాడు	28	అరుణాచల్‌ప్రదేశ్	2
గోవా	19	అండమాన్-నికోబార్	2
చండీగఢ్	15	మేఘాలయ	1
ఉత్తరాఖండ్	12	నాగాలాండ్	1
పుదుచ్చేరి	9	దాద్రానాగర్‌హవేలి	0
		లక్షద్వీప్	0

ఆధారం: జాతీయ నేర గణాంక విభాగం (ఎన్‌సీఆర్‌బీ)

సహచరుని భార్యను ఆశించి... అంతమొందించి...

నిఖిల్ హండా, అమిత్ ద్వివేదిలు 'ఆర్మీ మేజర్'లు. 2015లో నాగాలాండ్‌లో పనిచేస్తున్నప్పుడు ఓ కార్యక్రమంలో పరిచయమయ్యారు. అమిత్ భార్య శైలజా ద్వివేది(35)పై నిఖిల్ కన్నుపడింది. ఆమె ఉన్నత భావాలున్న విద్యావంతురాలు. అందాల పోటీల్లో తుదకంటూ నిలిచిన ఆమెతో మాట కలిపాడు. కుటుంబ స్నేహితునిలా నటించి 'చనువు' పెంచుకున్నాడు. వారిద్దరూ వీడియో కాల్స్ చేసుకోవడం అమిత్ గమనించాడు. తన భార్య జోలికి రావద్దని వారించాడు. తర్వాత దిల్లీకి బదిలీ చేయించుకున్నాడు. కానీ, నిఖిల్ ఆమెతో భాషించడం మానలేదు. హద్దులు మీరాడు. తన కుమారుడి వైద్యం కోసమని దిల్లీకి వచ్చి.. శైలజను కలిశాడు! ఈ ఏడాది జనవరి నుంచి గత శనివారం వరకూ ఇద్దరి మధ్య 3,300 ఫోన్ కాల్స్.. 1,500 సందేశాలు నడిచాయి. వీటిలో అధికశాతం నిఖిల్ చేసినవే.

అవును. దేశానికి రక్షణ కల్పించాల్సిన ఓ ఆర్మీ మేజర్... తన సహచరుడి భార్యను ఆశించి, కాటేసినప్పుడు... దుర్మార్గానికి చదువు, హోదాతో పనేంటి?

ఆ ఉదయం ఆమె ఓడిపోయింది..

గత శనివారం ఉదయం... ఆర్మీ స్థావరంలోని ఆసుపత్రిలో వ్యాయామచికిత్స (ఫిజియోథెరపీ)కని వెళ్లింది శైలజ. కానీ, చికిత్స చేయించుకోలేదు. ఏం జరిగిందో ఏమో... అక్కడికి వచ్చిన నిఖిల్ కారు ఎక్కింది. కాసేపటికే... అత్యంత భద్రతతో కూడిన దిల్లీ కంటోన్మెంట్ ఏరియాలో రహదారి రక్తసిక్తమైంది. వాహనం కింద నలిగి... గొంతు నుంచి నెత్తురోలికి... శైలజ విగతజీవిగా కనిపించింది. తనకు దక్కడంలేదన్న అక్కసుతోనే ఆమెను చంపేసినట్లు స్వయంగా ఆర్మీ మేజర్ నిఖిల్ హండా ఒప్పేసుకున్నాడు. కారులోనే ఆమెను గొంతు కోసి చంపేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు... మృతదేహాన్ని రోడ్డుపై పడేసి కారుతో పలుమార్లు తొక్కేశాడు. తర్వాత మార్గమధ్యంలోని ఓ షెడ్డులో కారును శుభ్రం చేయించుకున్నాడు. ఆమె ఫోన్‌ను చితక్కొట్టి చెత్తలో పడేశాడు. తన సిమ్ కార్డులను విరిచి పడేశాడు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌కు వెళ్లిపోయాడు. శైలజ హత్యతో వేటగాళ్ల ఉదంతాలు మళ్లీ ఒక్కసారి వెలుగులోకి వచ్చాయి.

ప్రయాణ నిషేధం సబబే

5-4 తేడాతో అమెరికా సుప్రీంకోర్టు తీర్పు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యాయపరంగా పెద్ద విజయం దక్కింది. పలు ముస్లిం దేశాల నుంచి అమెరికాకు ప్రజలు రావడాన్ని నిషేధిస్తూ ఆయన ఇచ్చిన వివాదాస్పద ఉత్తర్వును ఆ దేశ సుప్రీంకోర్టు సమర్థించింది. దీంతో ట్రంప్ అనుసరిస్తున్న వలస విధానానికి గట్టి ఆమోదం లభించినట్లయింది. ప్రయాణ నిషేధం ముస్లింలపై వివక్ష అని, ట్రంప్ అధికార పరిధిని దాటి వ్యవహరించారని దాఖలయిన పిటిషన్‌ను 5-4 తేడాతో సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ తీర్పుపై ట్రంప్... ట్విట్టర్‌లో 'వావ్' అని స్పందించారు. "అమెరికా ప్రజలకు, రాజ్యాంగానికి ఈ తీర్పు ఘన విజయం. అమెరికా జాతీయ భద్రతను రక్షించడానికి అధ్యక్షుడికి స్పష్టమైన అధికారం ఉందని సుప్రీంకోర్టు సమర్థించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదం, అతివాద ఉద్యమాలు అమాయకులైన ప్రజలకు హాని కలిగిస్తున్న ఈ సమయంలో మన దేశంలోకి వస్తున్న వారిని తగిన విధంగా తనిఖీ చేయాలి. నేను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం అమెరికా ప్రజల భద్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడతాను. అమెరికా ప్రయోజనాలను కాపాడే వలస వ్యవస్థ కోసం పోరాడతాను." అని ఒక ప్రకటనలో ట్రంప్ పేర్కొన్నారు. విపక్ష డెమొక్రాట్లు తీర్పు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది దుర్దినమన్నారు. ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రయాణ నిషేధం ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ఇరాన్, లిబియా, సోమాలియా, సిరియా, యెమెన్ దేశాలకు, ముస్లిమేతర దేశమయిన ఉత్తర కొరియాకు వర్తిస్తుంది. కొంతమంది వెనెజుయేలా ప్రభుత్వ అధికారులకు, వారి కుటుంబాలకూ వర్తిస్తుంది. ట్రంప్ 2017, జనవరిలో అధికారం చేపట్టిన స్వల్పకాలంలోనే ఏడు ముస్లిం దేశాలు- ఇరాన్, ఇరాక్, లిబియా, సోమాలియా, సూడాన్, సిరియా, యెమెన్‌పై ప్రయాణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో దేశ విదేశాల్లో తీవ్ర గందరగోళం, నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆయా దేశాల ప్రజలను అమెరికాకు వెళ్లే విమానాల్లో ఎక్కనివ్వలేదు. అమెరికాలోని పలు విమానాశ్రయాల్లో ఆ దేశాల ప్రజలను పలు గంటల పాటు నిర్బంధించారు.

అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించే తల్లిదండ్రులపై విచారణ నిలిపివేత

వాషింగ్టన్: అమెరికా వలస విధానంలో కీలకమయిన 'సహనానికి తావు లేదు (జీరో టాలరెన్స్)' అంశాన్ని ఆ దేశం నిలిపివేసింది. మెక్సికో నుంచి అక్రమంగా వలసవచ్చే తల్లిదండ్రులను విచారణకు పంపించబోమని అమెరికా సరిహద్దు రక్షణ, కస్టమ్స్ కమిషనర్ కెవిన్ మెక్‌అలీనన్ చెప్పారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న కుటుంబాల్లో తల్లిదండ్రుల నుంచి పిల్లలను వేరు చేసే విధానానికి ముగింపు పలికే ఉత్తర్వుపై ట్రంప్ గత వారం సంతకం చేసిన నేపథ్యంలో తల్లిదండ్రులను విచారణకు పంపించడాన్ని నిలిపివేసినట్లు కెవిన్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఓటీఏ నిలిపివేత

'నిర్వహణ' సిబ్బందికి మినహాయింపు

దిల్లీ: ప్రభుత్వోద్యోగులకు అదనపు పనివేళల భత్యాన్ని (ఓటీ అలవెన్సు) నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయించింది. అయితే వారిలో నిర్వహణ సంబంధిత ఉద్యోగుల (ఆపరేషనల్ స్టాఫ్)కు మాత్రం మినహాయింపు ఇచ్చింది. అలాగే చట్టబద్ధమైన నిబంధనల కింద పనిచేసే పారిశ్రామిక సిబ్బందికి కూడా ఓటీఏ కొనసాగించవచ్చని పేర్కొంది. ఈమేరకు ఏడో వేతన కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని మంత్రిత్వ శాఖలు/విభాగాలు.. అలాగే కేంద్ర ప్రభుత్వ, అనుబంధ కార్యాలయాలకూ ఇది వర్తిస్తుంది. విద్యుత్తు/యాంత్రిక పరికరాలతో పనిచేసేవారితో సహా కార్యాలయాల సజావు నిర్వహణకు విధుల్లో ఉండే నాన్-మినిస్టీరియల్, నాన్-గెజిటెడ్ ఉద్యోగులందరినీ 'ఆపరేషనల్ స్టాఫ్'గా పరిగణిస్తారు. ఇలాంటి ఉద్యోగుల జాబితాలను ఆయా మంత్రిత్వశాఖలు/విభాగాల పరిపాలన యంత్రాంగాలు రూపొందిస్తాయి. అర్హులైన ఉద్యోగులు ఓటీఏ పొందడానికి బయోమెట్రిక్ హాజరుతో అనుసంధానిస్తారు. అలాగే అత్యవసర పని ఉండటం వల్ల కార్యాలయంలో అదనపు పనివేళల్లో విధులు చేయించినట్లు ఆయా ఉద్యోగుల పైఅధికారులు లిఖితపూర్వకంగా ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఓటీఏ శాతంలో మార్పులేమీ చేయకుండా.. 1991 నాటి ఉత్తర్వులకు అనుగుణంగానే అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

అత్యయిక పరిస్థితిని వామపక్షాలు సమర్థించాయి!

కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ

దిల్లీ: అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ)ని నాడు వామపక్షాలు సమర్థించాయంటూ కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ విమర్శించారు. అత్యయిక పరిస్థితిపై తన అభిప్రాయమాలికలో చివరి భాగాన్ని జైట్లీ తాజాగా విడుదల చేశారు. "భారత్‌లో వామపక్షాలు నాకు ఎప్పటికీ పజిల్‌లానే ఉంటాయి. నాటి అత్యయిక పరిస్థితికి సీపీఐ మద్దతిచ్చింది. సీపీఎం కూడా మాటల్లో వ్యతిరేకించినప్పటికీ.. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిపిన పోరులో క్రియాశీలంగా పాల్గొనలేకపోయింది." అని పేర్కొన్నారు. అత్యయిక పరిస్థితికి వ్యతిరేకంగా - కాంగ్రెస్ (ఓ), సోషలిస్టు పార్టీలు, స్వతంత్ర పార్టీ, జన్‌సంఘ్, ఆర్‌ఎస్‌ఎస్‌లు సత్యాగ్రహంలో ప్రధానపాత్ర పోషించినట్లు జైట్లీ వివరించారు. సోషలిస్టు నేత రామ్‌మనోహర్ లోహియా వారసత్వాన్ని కొనసాగించిన జార్జ్ ఫెర్నాండెస్, మధు లిమాయే, రాజ్ నారాయణ్‌లు నిరంతరం కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ వచ్చినట్లు గుర్తుచేశారు.

చరిత్రను వక్రీకరించడమే భాజపా పని: ఏచూరి

జైట్లీ విమర్శలను సీపీఎం నేత సీతారామ్ ఏచూరి తిప్పికొట్టారు. అత్యయిక పరిస్థితుల్లో ఇందిరాగాంధీని నాటి ఆర్‌ఎస్‌ఎస్ అధినేతే సమర్థించినట్లు.. ఆయన రాసిన లేఖలు సూచిస్తున్నాయని, అలాగే అప్పట్లో విడుదల కోసం కూడా ఆయన కోరినట్లు చరిత్ర చెబుతోందని ఏచూరి పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరించడమే భాజపా పని అని.. ఎమర్జెన్సీ కాలంలో సీపీఎం కార్యకర్తల వీరోచిత త్యాగాలు చరిత్ర పుటల్లో నమోదై ఉన్నాయని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు.. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన విద్యార్థుల్లో ఉభయులమూ ఉన్నట్లు జైట్లీకి గుర్తు చేశారు.

'మేడమ్ టుస్సాడ్స్'లో బాబా రామ్‌దేవ్ విగ్రహం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని మేడమ్ టుస్సాడ్స్ ప్రదర్శనశాలలో యోగా గురువు బాబా రామ్‌దేవ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఇందుకోసం ఆయన కొలతలను తాజాగా లండన్‌లో మేడమ్ టుస్సాడ్స్ ప్రతినిధులు సేకరించారు. తన విగ్రహానికి వేసేందుకుగాను కాషాయ వస్త్రాలు, పాదరక్షలను బాబా రామ్‌దేవ్ స్వయంగా అందజేయనున్నారు. ప్రదర్శనశాలలో ఆయన విగ్రహం 'వృక్షాసనం'లో దర్శనమివ్వనుంది.

'కేసుల వేగవంత పరిష్కారానికి సూచనలివ్వండి'

దిల్లీ: పేరుకుపోయిన కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాల్సిందిగా హైకోర్టులను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర కోరారు. ఈ మేరకు ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులందరికీ లేఖ రాశారు. కేసుల పరిష్కార సమీక్ష యంత్రాంగం ఉండాలని ఆయన ఆ లేఖలో సూచించారు. "పది సంవత్సరాల నాటి కేసులు, ఐదేళ్ల నాటి కేసుల పరిష్కారానికి నిర్ణీత గడువులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇప్పటికే హైకోర్టులకు విజ్ఞప్తి చేశాం. ఆ ప్రణాళికలను హైకోర్టులు, సబార్డినేట్ కోర్టుల స్థాయిలో కమిటీలు నిరంతరం పర్యవేక్షించాలి." అని పేర్కొన్నారు.

...అయినా బుద్ధి మారలేదు

- ఎమర్జెన్సీ కాలానికి, ఇప్పటికి కాంగ్రెస్ ధోరణి ఒకటే
- అత్యయిక పరిస్థితి విధించడం ఆ పార్టీ పాపం..అదో మాయని మచ్చ
- ఒక్క కుటుంబం కోసం రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేశారు: మోదీ

ముంబయి

అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ) నాటి కాలానికి, ఇప్పటికి కాంగ్రెస్ బుద్ధిలో ఏమాత్రం మార్పు లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. ఎమర్జెన్సీ విధించడం ఆ పార్టీ చేసిన పాపమని నిందించారు. ఎమర్జెన్సీకి 43 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ముంబయిలో భాజపా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఎమర్జెన్సీ కాలంలో న్యాయమూర్తుల్ని భయభ్రాంతుల్ని చేశారనీ, న్యాయవ్యవస్థకు విలువ లేకుండా చేశారనీ విమర్శించారు. 'ఎమర్జెన్సీ వార్షికోత్సవాన్ని నిరసన దినంగా పాటిస్తున్నామంటే అది కాంగ్రెస్‌ని విమర్శించడానికి మాత్రమే కాదు... గతంలో ఏం జరిగిందో ప్రస్తుత, భవిష్య తరాలకు తెలియపరచడం కోసం కూడా. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేలా వారు పాఠాలు నేర్చుకోవాలని దీనిని పాటిస్తున్నాం' అని మోదీ వివరించారు.

ఎమర్జెన్సీకి 43 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ముంబయిలో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

స్వార్థం కోసం పార్టీనీ నాశనం చేసుకున్నారు

లేనిపోని భయాలు ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందనీ, ఆ పార్టీ ఇక ఎప్పటికీ మెరుగుపడదని ప్రధాని చెప్పారు. స్వార్థ ప్రయోజనాలను రక్షించుకునేందుకు సొంత పార్టీనే వారు నాశనం చేసుకున్నారని అన్నారు. 'ప్రజాస్వామ్యం, రాజ్యాంగాల కోసం పెద్దపెద్ద మాటలాడుతున్నవారు ఆనాడు అధికార దాహంతో రాజ్యాంగాన్నే దుర్వినియోగం చేశారు. ఒక్క కుటుంబంపై పిచ్చి ఆరాధనతో దేశాన్ని ఒక జైలుగా మార్చేశారు. ఇలాంటి మరో ఉదాహరణేదీ మనకు కనిపించదు. అధికారం చేజారిపోతోందనే సంకేతాలు అందగానే కాంగ్రెస్ పార్టీ, ఆ ఒక్క కుటుంబం దేశం కోసం రోదించడం ప్రారంభిస్తాయి. దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందనీ, తాము మాత్రమే దాని నుంచి రక్షించగలమనీ ఏడుపు అందుకుంటూ భయపెడతాయి. వారిపై (సోనియా, రాహుల్‌గాంధీలపై) అభియోగాలు నమోదు కాగానే న్యాయవ్యవస్థను భయపెట్టడానికి ఏకంగా భారత ప్రధాన న్యాయమూర్తిపై అభిశంసనకు ప్రయత్నించారు' అని ప్రధాని వివరించారు.

ఎదురునిలిచిన వారికి శాల్యూట్

ఎమర్జెన్సీ సమయంలో ఎదురొడ్డి నిలిచిన సీనియర్ పాత్రికేయుడు కులదీప్ నయ్యర్, స్టేట్స్‌మన్ పత్రిక, దివంగత రామ్‌నాథ్ గోయెంకా (ఇండియన్ ఎక్స్‌ప్రెస్)లను మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'వీరు మాకు మద్దతుదారులేమీ కాదు. నయ్యర్ మమ్మల్ని విమర్శిస్తుంటారు. అయితే వారు ప్రజాస్వామ్యం కోసం పోరాడిన తీరుకు మేం శాల్యూట్ చేస్తున్నాం...' అని చెప్పారు. దేశంలోని సోదరీమణులందరికీ రాజ్యాంగం సమాన హక్కుల్ని కల్పించినా ముస్లిం మహిళలకు న్యాయం జరగడం లేదని భావించి ముమ్మారు తలాక్‌పై తాము గళమెత్తామని చెప్పారు. కాంగ్రెస్‌కి మాత్రం ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కంటే ఓటు బ్యాంకే ముఖ్యమని విమర్శించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) పనితీరుపైనా, ఎన్నికల సంఘంపైనా ఇదివరకు విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ... ఇటీవల కర్ణాటక ఎన్నికల విషయంలో మాత్రం అలా మాట్లాడలేదని గుర్తుచేశారు.

సీషెల్స్‌కు డోర్నియెర్ విమానం అందజేత

డోర్నియెర్ విమానం అప్పగింత కార్యక్రమంలో సీషెల్స్ అధ్యక్షుడు డేనీ ఫార్‌తో సుష్మాస్వరాజ్

దిల్లీ: భారత్‌కు తామెప్పుడూ విశ్వసనీయ భాగస్వామిగా ఉంటామని సీషెల్స్ అధ్యక్షుడు డేనీ ఫార్ ఉద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య సంబంధాల్లో రక్షణ సహకారం అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. సీషెల్స్ సముద్రజలాల్లో నిఘా అవసరాలకు ఉపయోగించుకునేందుకు వీలుగా డోర్నియెర్ విమానాన్ని.. దిల్లీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఫార్‌కు విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్ అందజేశారు. అనంతరం ఫార్ మాట్లాడుతూ.. సీషెల్స్ ప్రజల తరఫున భారత్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాదకద్రవ్య సమస్యలకు ఉగ్రవాదంతో సంబంధం

- రాష్ట్రపతి కోవింద్ వ్యాఖ్యలు

దిల్లీ: సరిహద్దు ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమరవాణా సమస్యలకు.. ఉగ్రవాదం, రాజకీయ అనిశ్చిత పరిస్థితులతో దగ్గరి సంబంధం ఉందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వ్యాఖ్యానించారు. పంజాబ్, మణిపుర్ వంటి సరిహద్దు రాష్ట్రాల్లో నిఘాను మరింత పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. భౌగోళికంగా మయన్మార్, లావోస్, థాయిలాండ్‌లతో కూడిన 'స్వర్ణ త్రిభుజం'.. ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్‌లతో కూడిన 'బంగారు చంద్రవంక'ల మధ్య భారత్ ఉండటం కూడా దేశంలో మాదక ద్రవ్య అక్రమ రవాణా సమస్యను జటిలంగా మారుస్తోందని ఆయన అన్నారు. మాదకద్రవ్యాలు దేశ భద్రతకు, అభివృద్ధికి సవాలుగా మారాయని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినం పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో కోవింద్ ఈ మేరకు ప్రసంగించారు. మద్యపానం, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కృషి చేసినవారికి జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు.

వినువీధిలో కనువిందు

వచ్చే నెల 27న 'అరుణవర్ణ చందమామ'

లండన్: అంతరిక్షంలో మరో అద్భుతం ఆవిష్కృతమవ్వనుంది. వచ్చే నెల 27న అరుదైన 'అరుణవర్ణ చందమామ(బ్లడ్ మూన్)' వీక్షకులకు కనువిందు చేయనుంది. ఈ శతాబ్దంలోనే అత్యంత సుదీర్ఘమైన సంపూర్ణ చంద్రగ్రహణంగా చరిత్రలో నిలిచిపోనుంది. ఈ ఏడాది 'అరుణవర్ణ చందమామ' ఏర్పడనుండటం ఇది రెండోసారి కావడం గమనార్హం. గత జనవరి 31న అత్యంత అరుదైన 'సూపర్ బ్లూ బ్లడ్ మూన్' వీక్షకులను అబ్బురపర్చిన సంగతి తెలిసిందే. భూ వాతావరణం ప్రభావంతో వక్రీభవనం చెందిన సూర్యకాంతి ప్రకాశింపజేయడంతో.. సంపూర్ణ సూర్యగ్రహణ సమయంలో చంద్రుడు అరుణ వర్ణంలో శోభిస్తాడు. ఈ ఖగోళ పరిణామాన్ని 'అరుణవర్ణ చందమామ'గా పేర్కొంటారు. వచ్చే నెల 27న ఏర్పడనున్న 'అరుణవర్ణ చందమామ' దాదాపు 103 నిమిషాలు కొనసాగడం ద్వారా ఈ శతాబ్దంలోనే అత్యంత సుదీర్ఘ సంపూర్ణ చంద్రగ్రహణంగా నిలుస్తుందని ఖగోళ నిపుణులు తెలిపారు. ఐరోపా, ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల్లో తాజా 'అరుణవర్ణ చందమామ' కనిపిస్తుందని.. ఉత్తర అమెరికా, ఆర్కిటిక్-పసిఫిక్ ప్రాంతంలోని ప్రజలు దీన్ని వీక్షించలేరని శాస్త్రవేత్తలు తెలిపారు.

మగ్‌హర్ నుంచి మోదీ ఎన్నికల ప్రచారం!

మగ్‌హర్: 'మోక్షభూమి వారణాసి' నుంచి 2014 ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన మోదీ 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని 'నరక ప్రవేశద్వారం మగ్‌హర్' నుంచి ప్రారంభించనున్నారు. సంత్ కబీర్ 500వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 28న మగ్‌హర్‌లో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొంటారు. అదే రోజు అక్కడ భారీ బహిరంగ సభనుద్దేశించి ప్రసంగిస్తారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంత్ కబీర్ నగర్ జిల్లాలో లఖ్‌నవూకు 250 కి.మీ.దూరంలో మగ్‌హర్ ఉంది. వారణాసిలో మరణిస్తే మోక్షం సంప్రాప్తిస్తుందని, మగ్‌హర్‌లో మరణిస్తే నరకానికి వెళ్తారనే విశ్వాసం ప్రజల్లో ఉంది. మగ్‌హర్‌లో మరణిస్తే నరకమే అన్న మూఢవిశ్వాసాన్ని పటాపంచలు చేసే లక్ష్యంతో 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ కవి, సాధువు కబీర్‌దాస్ అక్కడ తుదిశ్వాస విడవాలని నిర్ణయించుకున్నారు. 1515లో అక్కడికి వచ్చి 1518లో తుదిశ్వాస విడిచారు. కబీర్ బోధనలకు అటు హిందువులు, ఇటు ముస్లింలు ఇద్దరి నుంచి ఆదరణ ఉంది. కబీర్ వినిపించిన ఐక్యతా సందేశమే స్ఫూర్తిగా ఇప్పుడు ప్రధాని మోదీ ఇక్కడి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు.

మోదీ ఓ ఔరంగజేబు: కాంగ్రెస్

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొఘల్ చక్రవర్తి ఔరంగజేబులాంటి వారనీ, నిజానికి అంతకంటే క్రూరమైన వ్యక్తి అనీ కాంగ్రెస్ ఆరోపించింది. 49 నెలలుగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఆయన చెరబట్టారనీ, ఆ విషయంలో సొంత పార్టీనీ వదిలిపెట్టలేదనీ విమర్శించింది. ఎమర్జెన్సీపై ప్రధాని వరసగా చేస్తున్న విమర్శల నేపథ్యంలో కాంగ్రెస్ మంగళవారం ఆయనపై విరుచుకుపడింది. స్వీయ వైఫల్యాల్ని కప్పిపుచ్చుకునేందుకే తమ పార్టీపై ఆయన దాడికి దిగుతున్నారని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా మంగళవారం విలేకరుల సమావేశంలో చెప్పారు పేదలు, దళితుల హక్కుల్ని కాపాడడానికే 43 ఏళ్ల క్రితం ఎమర్జెన్సీని విధించారని చెప్పారు. ఇందిరాగాంధీని హిట్లర్‌తో పోల్చడం అర్థరహితమని కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్‌శర్మ చెప్పారు.

దేశానికి సిగ్గుచేటు

- మహిళలకు భద్రత లేదన్న సర్వేకు స్పందనగా మోదీపై రాహుల్ విమర్శ

దిల్లీ: భారత్‌లోనే మహిళలపై అత్యాచారాలు, హింస ఎక్కువని ఒక సర్వేలో వెల్లడవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీని విమర్శించారు. యోగా వీడియోలు తీస్తూ మన ప్రధాని మోదీ తోటలో తిరుగుతుంటే అత్యాచారం, హింసలో అఫ్గానిస్థాన్, సిరియా, సౌదీ అరేబియాను భారత్ మించిపోయిందని, మన దేశానికి ఇది సిగ్గు చేటని రాహుల్ ట్విట్టర్‌లో విమర్శించారు.

గుహలో గల్లంతైన 12 మంది బాలురు

మూడో రోజూ కొనసాగిన గాలింపు

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లోని ఉత్తర ప్రాంతంలో ఉన్న థామ్‌లువాంగ్ నాంగ్‌నాన్ గుహలో.. గల్లంతైన 12 మంది బాలల కోసం గాలింపు చర్యలు వరుసగా మూడో రోజూ కొనసాగాయి. గుహ లోపల చిక్కుకుపోయిన బాలురంతా ఓ ఫుట్‌బాల్ జట్టులో సభ్యులు. అందరూ 11 నుంచి 16 ఏళ్ల మధ్యే వయసువారే. తమ జట్టు కోచ్‌తో పాటు శనివారం మధ్యాహ్నం వీరు ఈ గుహ లోపలికి వెళ్లారు. ఈ గుహలోకి ప్రవేశించాలంటే.. ఓ చిన్న నీటి ప్రవాహాన్ని సందర్శకులు దాటాల్సి ఉంటుంది. అయితే వరద వచ్చినప్పుడు నీటిమట్టం పెరిగి.. దీని లోపలికి వెళ్లడం దాదాపు అసాధ్యంగా మారుతుంది. శనివారం బాలురు లోపలికి వెళ్లిన అనంతరం భారీ వర్షాలు కురియడంతో.. ప్రధాన ద్వారం మూసుకుపోయింది. అప్పటి నుంచి వారు ఎక్కడున్నారన్నదానిపై సమాచారం లేదు. కి.మీ.ల కొద్ది పొడవైన ఈ గుహలో.. వారు మరింత లోపలికి వెళ్లి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. వారి జాడ కనిపెట్టి.. వెనక్కితీసుకువచ్చేందుకు రక్షక బృందాలను రంగంలోకి దింపారు.

నాంగ్‌నాన్ గుహలో గల్లంతైన వారి కోసం అన్వేషణ

కిక్ 2018 ఛాంపియన్స్

పోర్చుగల్ 1	ఇరాన్ 1
ఖరెస్మా (45వ)	అన్సారీఫర్డ్ (90+3వ)

ఖరెస్మా, రొనాల్డో గోల్ ఆనందం

డ్రానే.. అయినా పైనే

● గ్రూప్-బి విజేత స్పెయిన్ ● మొరాకోతో మ్యాచ్ 2-2తో సమం
● ఇరాన్‌తో డ్రా చేసుకుని పోర్చుగల్ నాకౌట్‌కు

ఊహించినట్లే గ్రూప్-బిలో రెండు అగ్ర జట్లు నాకౌట్‌కు దూసుకెళ్లాయి. స్పెయిన్ గ్రూప్ విజేతగా నిలవగా.. పోర్చుగల్ రెండో స్థానంతో ముందంజ వేసింది. ఐతే ఈ జట్లకు అంత తేలిగ్గా ఏమీ తుది-16లో చోటు దక్కలేదు. ఆఖరి మ్యాచ్‌ల్లో స్పెయిన్‌కు మొరాకో, పోర్చుగల్‌కు ఇరాన్ చెమటలు పట్టించాయి. నాటకీయ పరిణామాల మధ్య మ్యాచ్‌లు చివరికి డ్రాగా ముగిశాయి. ఐదేసి పాయింట్లతో స్పెయిన్, పోర్చుగల్ జట్లు రెండూ సమంగా నిలిచినా.. ఎక్కువ గోల్స్ కొట్టిన కారణంగా స్పెయిన్ గ్రూప్‌లో అగ్రస్థానం సాధించింది.

నిరాశలో ఇరాన్ అభిమాని

కలినిన్‌గ్రాడ్ (రష్యా)

ప్రపంచకప్ ఫేవరెట్లలో ఒకటైన స్పెయిన్ గ్రూప్-బి విజేతగా నిలిచింది. కానీ తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆ జట్టుకు చావుతప్పి కన్నులొట్టపోయినట్లయింది. సోమవారం రాత్రి మొరాకోతో మ్యాచ్‌ను అతికష్టంపై 2-2తో డ్రాగా ముగించింది. పరాజయం అంచుల్లో నిలిచిన స్పెయిన్.. ముగింపు క్షణాల్లో సబ్‌స్టిట్యూట్ లాగో అస్పాస్ కొట్టిన గోల్‌తో గట్టెక్కింది. ఆఫ్‌సైడ్ అయిందంటూ మొదట రిఫరీ ఈ గోల్ ఇచ్చేందుకు తిరస్కరించినా.. పోర్చుగల్‌లో 'వార్' సమీక్షలో గెలిచింది. స్పెయిన్ తరఫున అస్పాస్ (90+1)తో పాటు ఇస్కో (19వ) గోల్ సాధించగా... మొరాకో తరఫున బౌతైబ్ (14వ), నెసిరి (81వ) స్కోర్ చేశారు. రెండు డ్రాలు, ఒక విజయంతో స్పెయిన్ గ్రూప్ ఛాంపియన్‌గా అవతరించింది. స్పెయిన్ తుది-16 మ్యాచ్‌లో ఆదివారం గ్రూప్-ఎ రన్నరప్ రష్యాను ఢీకొంటుంది.

భయపెట్టిన మొరాకో..

తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించిన మొరాకో ఈ పోరులో స్పెయిన్‌కు చెమటలు పట్టించింది. ఆండ్రీ ఇనియెస్టా, సెర్గియో రామోస్ మధ్య సమన్వయ లోపంతో మొరాకో అలవోకగా తొలి గోల్‌ను కొట్టింది. హాఫ్‌లైన్ వద్ద వాళ్లిద్దరు పాస్‌లు ఇచ్చుకుంటూ ఏకాగ్రత కోల్పోయిన సమయంలో అనూహ్యంగా ముందుకు దూసుకొచ్చి బంతిని చిక్కించుకున్న బౌతైబ్ వేగంగా పరిగెడుతూ గోల్ కీపర్ డేవిడ్ డీ గీ తప్ప డిఫెండర్లెవరూ కాపలాగా లేని స్పెయిన్ వలలోకి తన్నేశాడు. ఈ ప్రపంచకప్‌లో మొరాకోకు ఇదే తొలి గోల్. ఆ గోల్ స్పెయిన్‌కు పెద్ద మేలుకొలుపు. ఐదు నిమిషాల్లోనే ఆ జట్టు స్కోరు సమం చేసింది. అద్భుతంగా ఆడిన ఇనియెస్టా, డీగో కోస్టా.. గోల్ కొట్టేందుకు ఇస్కోకు చక్కని అవకాశం కల్పించారు. ఇస్కో అలవోకగా గోల్ కొట్టేశాడు. 55వ నిమిషంలో మొరాకో తిరిగి ఆధిక్యంలోకి వెళ్లినంత పనిచేసింది. కానీ అమ్రాబాత్ స్ట్రైక్ గోల్‌పోస్ట్‌కు తగిలి వెనక్కి వచ్చింది. ఐతే మొరాకో పోరాటం కొనసాగించింది. 81వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ యూసెఫ్ ఎన్ నెసిరి హెడర్‌తో ఆ జట్టు 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు స్పెయిన్ తీవ్రంగా ప్రయత్నించింది. మ్యాచ్ ఇంజురీ సమయంలోకి కూడా ప్రవేశించడంతో స్పెయిన్‌కు షాక్ తప్పదేమో అనిపించింది. కానీ లాగా అస్పాస్ ఆ జట్టును బతికించాడు. డానీ కర్వాజల్ నుంచి వచ్చిన క్రాస్‌ను తెలివిగా ఫ్లిక్ చేసి మొరాకో గోల్‌కీపర్ మహ్మదీని బోల్తా కొట్టించాడు. ఆఫ్‌సైడ్‌గా పరిగణించి మొదట ఈ గోల్‌ను ఇవ్వలేదు. ఐతే స్పెయిన్.. వీడియో అసిస్టెంట్ రిఫరీ సమీక్షలో గెలిచి సంబరాల్లో మునిగిపోయింది.

గ్రూప్–బి	మ్యా	గె	డ్రా	ఓ	పా
స్పెయిన్	3	1	2	0	5
పోర్చుగల్	3	1	2	0	5
ఇరాన్	3	1	1	1	4
మొరాకో	3	0	1	2	1

లాగా అస్పాస్ గోల్ కొట్టడిలా..

స్పెయిన్ 2	మొరాకో 2
ఇస్కో (19వ), అస్పాస్ (90+1వ)	బౌతైబ్ (14వ), నెసిరి (81వ)

రొనాల్డో పెనాల్టీ పోగొట్టడిలా...

రొనాల్డో విఫలమైనా..

సరాన్స్క్ (రష్యా): రెండు డ్రాలు, ఓ విజయంతో గ్రూప్-బిలో రెండో స్థానంతో పోర్చుగల్ నాకౌట్‌కు అర్హత సాధించింది. నాటకీయ పరిణామాల మధ్య సోమవారం ఇరాన్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రాగా ముగించింది. క్రిస్టియానో రొనాల్డో ఓ పెనాల్టీ వృథా చేయగా.. ఇంజురీ సమయంలో పోర్చుగల్ పెనాల్టీ ఇచ్చింది. ఐదు పాయింట్లతో ముందంజ వేసిన పోర్చుగల్.. ప్రిక్వార్టర్స్‌లో గ్రూప్-ఎ ఛాంపియన్ ఈ నెల 30న ఉరుగ్వేతో తలపడుతుంది. పోర్చుగల్ తరఫున ఖరెస్మా (45వ నిమిషం) గోల్ కొట్టగా.. ఇరాన్ జట్టులో అన్సారీఫర్డ్ (90+3వ) గోల్ సాధించాడు. మ్యాచ్‌లో చాలా ఎక్కువగా భాగం (68 శాతం) బంతిని నియంత్రణలోనే ఉంచుకున్నా పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఇరాన్ నియంత్రణలో బంతి తక్కువసేపే ఉన్నా.. ఆ జట్టు దూకుడు చూపించింది. 45వ నిమిషంలో ఖరెస్మా 18 గజాల దూరం నుంచి కొట్టిన గోల్‌తో పోర్చుగల్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ద్వితీయార్ధంలో ఆధిక్యం 2-0కు పెరిగేదే. కానీ రొనాల్డో పెనాల్టీ వృథా చేసిన పోర్చుగల్‌ను దిగ్భ్రాంతికి గురి చేశాడు. అంత గొప్పగా లేని అతడి కిక్‌ను ఇరాన్ గోల్‌కీపర్ అడ్డుకున్నాడు. మ్యాచ్ ఇంజురీ సమయానికి వెళ్లే సరికి కూడా పోర్చుగల్ 1-0తో నిలిచింది. ఐతే 'వార్' సహాయంతో ఇరాన్ పెనాల్టీ గెలుచుకుంది. దాన్ని అన్సారీఫర్డ్ సద్వినియోగం చేయడంతో ఇరాన్ స్కోరు సమం చేసింది. ఐతే ఆ తర్వాత కూడా ఐదు నిమిషాల సమయం ఉండడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. మెహదీ తరేమి ఇరాన్ గెలిపించినంత పనిచేశాడు. కానీ అతడి షాట్ నెట్‌కు దూరంగా వెళ్లడంతో పోర్చుగల్ ఊపిరిపీల్చుకుంది. ఐతే ఆ జట్టు 84వ నిమిషంలో మరో పెద్ద ప్రమాదం తప్పించుకుంది. ఇరాన్ డిఫెండర్ మొర్తెజా ముఖం మీదుగా రొనాల్డో మోచేతిని అడ్డుపెట్టగా.. అతడు కిందపడిపోయాడు. కానీ రొనాల్డో ఎర్ర కార్డును తప్పించుకున్నాడు. రిఫరీ అతడికి పసుపు కార్డు ఇచ్చాడు. ఇరాన్‌కు అప్పుడు పెనాల్టీ వచ్చి ఉంటే మ్యాచ్ ఫలితం ఎలా ఉండేదో. పెనాల్టీ ఇవ్వనందుకు ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఫ్రాన్స్ 0	డెన్మార్క్ 0

డెన్మార్కే ముందుకు

ఫ్రాన్స్‌తో మ్యాచ్ డ్రా ● ఆస్ట్రేలియాకు పెరూ జలక్

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో గ్రూప్-సి కథ తేలిపోయింది. చివరి రౌండ్లో సంచలనాలేమీ నమోదవ్వలేదు. రేసులో ముందున్న డెన్మార్కే గ్రూప్ నుంచి రెండో నాకౌట్ బెర్తును సొంతం చేసుకుంది. ఫ్రాన్స్‌తో చివరి లీగ్ మ్యాచ్‌ను డెన్మార్క్ డ్రాగా ముగించడం ద్వారా రెండో స్థానంలో నిలిచి ముందంజ వేసింది. ఫ్రాన్స్‌కే అగ్రస్థానం దక్కింది. మరోవైపు గెలిస్తే తప్ప నాకౌట్‌పై ఆశలు పెట్టుకోలేని ఆస్ట్రేలియా.. పెరూ చేతిలో పరాభవంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. ముందే నాకౌట్ రేసుకు దూరమైన పెరూ చక్కటి విజయంతో కొంచెం గౌరవప్రదంగా టోర్నీ నుంచి వైదొలిగింది.

మాస్కో

గోల్స్ మోత మోగుతున్న ఈ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో తొలిసారిగా ఒక్కటంటే ఒక్క గోల్ లేకుండా ఒక మ్యాచ్ ముగిసిపోయింది. గ్రూప్-సిలో ఫ్రాన్స్-డెన్మార్క్ పోరు 0-0తో డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ కంటే ముందు ఆస్ట్రేలియాను పెరూ 2-0తో మట్టికరిపించింది. రెండు వరుస ఓటములతో పెరూ ముందే టోర్నీ నుంచి నిష్క్రమించగా.. రెండు వరుస విజయాలతో ఫ్రాన్స్ నాకౌట్ బెర్తును ముందే ఖరారు చేసుకున్న సంగతి తెలిసిందే. చివరి లీగ్ మ్యాచ్‌లకు ముందు డెన్మార్క్ 3 పాయింట్లు, ఆస్ట్రేలియా ఒక పాయింట్‌తో నాకౌట్ రేసులో నిలిచాయి. పెరూపై ఆస్ట్రేలియా నెగ్గి.. ఫ్రాన్స్ చేతిలో డెన్మార్క్ ఓడితే కంగారూ జట్టుకు నాకౌట్ చేరేది. మంగళవారం ఈ రెండు మ్యాచ్‌లూ ఒకేసారి జరిగాయి. ఐతే ఆస్ట్రేలియా గెలవడం సంగతి అటుంచితే కనీసం మ్యాచ్‌ను డ్రాగా కూడా ముగించలేదు. 18వ నిమిషంలో కరిలో, 50వ నిమిషంలో గెరిరో గోల్స్ కొట్టి ఆసీస్ ఆశలపై నీళ్లు చల్లారు. ఇవి రెండూ ఫీల్డ్ గోల్సే. ఆస్ట్రేలియా గోల్ కోసం చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. మరోవైపు డ్రాగా ముగించినా ముందంజ వేసే అవకాశముండటంతో డెన్మార్క్.. ఫ్రాన్స్‌తో మ్యాచ్‌లో రక్షణాత్మకంగా ఆడింది. గత రెండు మ్యాచ్‌ల్లో సెల్ఫ్ గోల్ కాకుండా రెండు గోల్సే కొట్టిన ఫ్రాన్స్ సైతం అంత దూకుడుగా ఏమీ ఆడలేదు. బంతిని ఎక్కువగా ఫ్రాన్సే నియంత్రణలో ఉంచుకున్నప్పటికీ పెద్దగా గోల్ అవకాశాలు సృష్టించుకోలేకపోయింది. ఇరు జట్లూ కొన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. గోల్ కొట్టడంలో సఫలం కాలేదు.

పెరూ 2	ఆస్ట్రేలియా 0
కరిలో (18వ), గెరీరో (50వ)	

గ్రూప్–సి	మ్యా	గె	డ్రా	ఓ	పా
ఫ్రాన్స్	3	2	1	0	7
డెన్మార్క్	3	1	2	0	5
పెరూ	3	1	0	2	3
ఆస్ట్రేలియా	3	0	1	2	1

నోట్: మ్యా: మ్యాచ్‌లు; గె- గెలుపు; ఓ- ఓటమి; పా-పాయింట్లు

ప్రపంచకప్‌లో ఈనాడు

ద.కొరియా	గ్రూప్-ఎఫ్ × సా॥ 7.30	జర్మనీ
మెక్సికో	గ్రూప్-ఎఫ్ × సా॥ 7.30	స్వీడన్
సెర్బియా	గ్రూప్-ఈ × రాత్రి 11.30	బ్రెజిల్
స్విట్జర్లాండ్	గ్రూప్-ఈ × రాత్రి 11.30	కోస్టారికా

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

ఫ్లాష్... ఫ్లాష్... ఫ్లాష్...

నాకౌట్లో అర్జెంటీనా

సెయింట్‌పీటర్స్‌బర్గ్: ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో అర్జెంటీనా నిలిచింది. గ్రూప్-డిలో తన చివరి లీగ్ మ్యాచ్‌లో 2-1తో నైజీరియాను ఓడించడం ద్వారా ఆ జట్టు నాకౌట్ బెర్తు సాధించింది. తీవ్ర ఉత్కంఠ రేపిన ఈ మ్యాచ్‌లో తొలి గోల్ సాధించింది అర్జెంటీనానే. 14వ నిమిషంలో స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సి అద్భుత రీతిలో గోల్ కొట్టి జట్టుకు ఆధిక్యాన్నందించాడు. ఐతే 51వ నిమిషంలో పెనాల్టీ సంపాదించిన నైజీరియా.. మోజెస్ గోల్‌తో స్కోరు సమం చేసింది. తర్వాత గోల్ చేసేందుకు అర్జెంటీనా చాలా ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఆ జట్టు ఆశలు ఆవిరైపోతుండగా.. రోజో 86వ నిమిషంలో కళ్లు చెదిరే గోల్‌తో జట్టుకు విజయాన్నందించాడు. మరో మ్యాచ్‌లో ఐస్‌లాండ్ 1-2తో క్రొయేషియా చేతిలో ఓడటంతో అర్జెంటీనాకు అడ్డు తొలగిపోయింది.

పదహారేళ్లకే ప్రపంచ రికార్డు

స్వర్ణం నెగ్గిన సౌరభ్

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో పదహారేళ్ల భారత షూటర్ సౌరభ్ చౌదరీ సంచలనం నమోదు చేశాడు. జర్మనీలో జరుగుతున్న ఈ టోర్నీలో ప్రపంచ రికార్డు నమోదు చేస్తూ స్వర్ణం ఎగరేసుకుపోయాడు. మంగళవారం 10మీ. ఎయిర్ పిస్టోల్ విభాగంలో 243.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఇప్పటివరకు చైనా షూటర్ వాంగ్ (242.5) పేరుతో ఉన్న రికార్డును బద్దలుకొట్టాడు. మరో భారత షూటర్ అన్మోల్ జైన్ 199.6 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు.

సైనా శుభారంభం

కౌలలంపూర్: మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి షట్లర్ సైనా నెహ్వాల్ శుభారంభం చేసింది. మంగళవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సైనా 21-12, 21-16 తేడాతో యిప్ పీ యిన్ (హాంకాంగ్)పై విజయం సాధించింది. గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో పసిడి గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న సైనా 42 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. అయితే రెండో రౌండ్లో సైనాకు రెండో సీడ్ యమగూచి (జపాన్) రూపంలో కఠిన ప్రత్యర్థి ఎదురుకానుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ తొలిరౌండ్లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. సమీర్ 13-21, 5-21తో టామీ (ఇండోనేషియా) చేతిలో ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రోహన్ కపూర్- కుహు గార్గ్ జంట తొలి రౌండ్లో 9-21, 10-21తో జితింగ్-డూ యూ (చైనా) చేతిలో ఓడి ఇంటి ముఖం పట్టింది.

ఆర్‌టీఐ పరిధిలోకి దిల్లీ క్రికెట్ సంఘం

దిల్లీ: బీసీసీఐని సమాచార హక్కు (ఆర్‌టీఐ) పరిధిలోకి తేవాలని ఎప్పటినుంచో ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే బీసీసీఐ మాత్రం తాము ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు తీసుకోవడం లేదని, కాబట్టి తమకు ఆర్‌టీఐ వర్తించదని వాదిస్తూ వస్తోంది. అయితే మంగళవారం భారత క్రికెట్లోనే అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. బీసీసీఐకి అనుబంధ సంస్థ అయిన దిల్లీ క్రికెట్ సంఘం.. తాము ఆర్‌టీఐ పరిధిలోకి వస్తున్నట్లు ప్రకటించింది. ప్రకటించడమే కాదు.. ఐదుగురు సభ్యులతో కూడిన ఆర్‌టీఐ కమిటీని ఏర్పాటు చేసింది. సమాచార అధికారిగా ప్రదీప్ కుమార్‌ను నియమించింది. లోధా కమిటీ కూడా బీసీసీఐ.. ఆర్‌టీఐ పరిధిలోకి రావాలని సూచించిన సంగతి తెలిసిందే.

మయాంక్ మళ్లీ 112

లీసెస్టర్: ఇండియా-ఎ ఓపెనర్ మయాంక్ అగర్వాల్.. ఇంగ్లాండ్ పర్యటనలో చెలరేగిపోతున్నాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో సోమవారం వెస్టిండీస్-ఎపై 112 పరుగులు చేసిన మయాంక్.. మంగళవారం ఇంగ్లాండ్ లయన్స్‌పైనా సరిగ్గా అంతే స్కోరు చేశాడు. దీంతో భారత్ 102 పరుగుల తేడాతో నెగ్గింది. మొదట మయాంక్ (112), శుభ్‌మన్ (72), విహారి (69)ల మెరుపులతో భారత్-ఎ 6 వికెట్లకు 309 పరుగులు చేసింది. ఛేదనలో లయన్స్ శార్దూల్ (3/53), ప్రసిద్ధ్ కృష్ణ (2/30)ల ధాటికి 41.3 ఓవర్లలో 207 పరుగులకే కుప్పకూలింది.

క్రీడల్లో నైతికత ముఖ్యం

ఓస్లో: క్రీడల్లో నైతికత చాలా అవసరమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ అన్నారు. క్రీడల్లో డోపింగ్‌కు వ్యతిరేకంగా ఓస్లోలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. "మనం క్రీడల్ని తీవ్రంగా తీసుకుంటున్నాం. ఈ రోజు ఆటలు యుద్ధాల్లా జరుగుతున్నాయి. ఈ పద్ధతి మారాలి. నైతిక ప్రవర్తన సరిగా ఉండాలి. క్రీడల్ని వ్యాపారమయం చేయడం గత కొన్ని దశాబ్దాల్లో ఎక్కువైంది. క్రీడల్లో వ్యాపారం భాగమే కావచ్చు. ఐతే అది చిత్ర పటానికి కట్టే ఫ్రేమ్ లాగా ఉండాలి. ఫ్రేమ్ మరీ పెద్దదై చిత్రాన్ని కనిపించకుండా చేస్తే అక్కడ పెద్ద లోపం ఉందని గ్రహించాలి. నిజాయితీగా ఉండేందుకు నిబంధనలు పెడితే సరిపోదు. క్రీడాకారుల్లో సరైన మానసిక స్థితి ఉండటం ముఖ్యం" అని రవిశంకర్ అన్నారు.

చిట్టి జట్టుతో పొట్టి పోరు

● ఐర్లాండ్‌తో భారత్ తొలి టీ20 నేడు
● ఇంగ్లాండ్‌లో సుదీర్ఘ పర్యటనకు శ్రీకారం
రాత్రి 8.30 నుంచి సోనీ సిక్స్‌లో

డబ్లిన్: టీమ్‌ఇండియా మళ్లీ నిర్విరామ క్రికెట్‌కు సిద్ధమైంది. రెండున్నర నెలల పాటు సాగే ఇంగ్లాండ్ పర్యటనకు బుధవారమే శ్రీకారం చుట్టనుంది. ఇంగ్లాండ్ జట్టును ఢీకొట్టడానికి ముందు ఐర్లాండ్‌తో తలపడబోతోంది భారత్. ఆ జట్టుతో రెండు టీ20ల సిరీస్‌కు డబ్లిన్ ఆతిథ్యమివ్వనుంది. దీని తర్వాత భారత్.. ఇంగ్లాండ్‌తో వరుసగా మూడు టీ20లు, మూడు వన్డేలు, ఐదు టెస్టుల్లో తలపడనుంది. ఇంగ్లాండ్ సిరీస్‌కు ముందు ఐర్లాండ్ సిరీస్‌ను భారత్ చిన్నపాటి సన్నాహకంగా భావిస్తోంది. ఇంగ్లాండ్‌లో గత రెండు టెస్టు సిరీస్‌ల్లోనూ ఘోర పరాభవాలు చవిచూసిన భారత్.. ఈసారి పర్యటనను భిన్నంగా ఆరంభించబోతోంది. ముందు ఐర్లాండ్‌తో, ఆపై ఇంగ్లాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడి.. చివరగా టెస్టుల్లో తలపడబోతోంది. కీలకమైన టెస్టు సిరీస్ ఆరంభమయ్యే సమయానికి అక్కడి పరిస్థితులకు ఆటగాళ్లు బాగా అలవాటు పడతారని భావిస్తున్నారు. ఐర్లాండ్‌తో సిరీస్‌ను భారత్ తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. పేరుకు చిన్న జట్టే కానీ.. ఆ జట్టులో కెవిన్ ఓబ్రైన్, పోర్టర్‌ఫీల్డ్, రాన్‌కిన్, స్టిర్లింగ్, డాక్రెల్ లాంటి నాణ్యమైన ఆటగాళ్లున్నారు. ఐర్లాండ్‌తో భారత్ మూడు వన్డేలు, ఒక టీ20 మాత్రమే ఆడింది. అన్నింట్లోనూ భారత్‌దే విజయం.

ఉద్యోగుల పీఆర్సీ బకాయిల విడుదలకు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2015లో సవరించిన వేతనాల బకాయిల చెల్లింపులకు సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయి. 2014 జూన్ నుంచి 2015 మార్చి వరకు పది నెలల వేతనాల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు పేర్కొంటూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రవిచంద్ర మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. 2015 మార్చి నెలకు సంబంధించిన వేతన బకాయిలు 2018 నవంబరు నెలలో నగదు రూపంలో ఉద్యోగులందరికీ చెల్లిస్తారు. మిగిలిన తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన బకాయిలు (2014 జూన్ 2 నుంచి 2015 ఫిబ్రవరి 28 వరకు) ఆయా ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలకు 2018 నవంబరు నెలలో జమ చేస్తారు. 2019 మార్చి 31కి ముందు ఎవరయితే ఉద్యోగాల నుంచి పదవీ విరమణ పొందుతారో వారికి బకాయిల మొత్తం 2018 నవంబరు నెలలో నగదు రూపంలో చెల్లించాలని నిర్ణయించారు. చందా పింఛను పథకంలో ఉన్న ఉద్యోగులందరికీ 10 శాతం పింఛను చందా మినహాయించి మిగిలిన బకాయి మొత్తం మూడు విడతలుగా నగదు రూపంలో చెల్లిస్తారు. 2018 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో ఈ మొత్తాన్ని వారికి నగదు రూపంలో చెల్లిస్తారు. అలాగే పింఛనుదారులకు 10 నెలల బకాయిలను మూడు విడతలుగా నగదు రూపంలో చెల్లించబోతున్నారు.

రమణ దీక్షితులకు మరో ఉద్వాసన

- ఆగమ సలహామండలి నుంచి తొలగింపు
- వేణుగోపాల దీక్షితులకు అవకాశం
- కొత్తగా 12 మంది అర్చకుల నియామకం
- తితిదే ధర్మకర్తల మండలి తీర్మానాలు

తిరుమల - న్యూస్‌టుడే

తితిదే ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, తిరుపతి దేవస్థానం ఆగమ సలహా మండలి నుంచి శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులను తొలగిస్తూ దేవస్థాన ధర్మకర్తల మండలి తీర్మానం చేసింది. ఆ స్థానంలో నూతన ప్రధాన అర్చకుడుగా ఇటీవల నియమితుడైన వేణుగోపాల దీక్షితులును నియమించింది. తిరుమలలో మంగళవారం తితిదే పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం వివరాలను ఛైర్మన్ సుధాకర్ యాదవ్ విలేకరులకు వివరించారు. నిర్ణయాలివీ..

- ■ తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి మందిరానికి 12 మంది అర్చకుల నియామకానికి ఆమోదం.
- ■ తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి గర్భాలయ గోపురానికి రూ.32 కోట్లతో స్వర్ణతాపడం చేయించాలని నిర్ణయం.
- ■ తిరుమలలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 కోట్ల కేటాయింపు.
- ■ బృహత్తర ప్రణాళికలో భాగంగా కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామస్వామి ఆలయంవద్ద అభివృద్ధి పనుల కోసం రూ.36 కోట్ల కేటాయింపు.
- ■ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దివ్యదర్శనం పథకానికి తితిదే 50శాతం వాటా కింద 1.25 కోట్ల మంజూరు.
- ■ తిరుమలలో యాత్రిసదన్ పేరిట భవన సముదాయ నిర్మాణానికి రూ.79 కోట్ల వ్యయానికి ఆమోదం.
- ■ పరకామణిలో పేరుకున్న రూ.9కోట్ల చిల్లర నాణేల మార్పిడికి రిజర్వు బ్యాంకుతో సంప్రదించడానికి ప్రత్యేక సంస నియామకం.
- ■ నూతన కల్యాణ మండపాల నిర్మాణానికి వచ్చిన సిఫార్సుల తిరస్కరణ.
- ■ ఈ- దర్శన్ కేంద్రాల ఎత్తివేయాలన్న ప్రతిపాదనకు పలువురు సభ్యుల వ్యతిరేకత. తెలుగు రాష్ట్రాల్లో కొనసాగించాలని సభ్యుడు సండ్ర వెంకట వీరయ్య సూచనకు అంగీకారం.
- ■ వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సభ్యుడు పొట్లూరి రమేష్‌బాబు అభ్యంతరం. నిధుల కేటాయింపులో హేతుబద్ధత లేదని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచన.

సమావేశంలో సభ్యులు సుధా నారాయణమూర్తి, శివాజీ, బొండా ఉమామహేశ్వరరావు, రాయపాటి సాంబశివరావు, రుద్రరాజు పద్మరాజు, మేడా రామకృష్ణారెడ్డి, డొక్కా జగన్నాథం, శ్రీకృష్ణ, అశోక్‌రెడ్డి, పార్థసారథి, ఇ.పెద్దిరెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధ పాల్గొన్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకూ తలనీలాల ద్వారా రూ.133.93 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు మండలి దృష్టికి తెచ్చారు.

ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న సీవీసీ కె.వి.చౌదరి. చిత్రంలో కోనేరు హంపి తదితరులు

సీఎస్‌ఆర్ నిధులు అత్యధికులకు ఉపయోగపడాలి

ఈనాడు, అమరావతి: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్) నిధుల వినియోగం ఎక్కువ మందికి ఉపయోగపడాలని, పారదర్శకత ఉండాలని కేంద్ర విజిలెన్స్ కమిషనర్(సీవీసీ) కె.వి.చౌదరి సూచించారు. మంగళవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) కార్యాలయంలో ఆ సంస్థ ఫౌండేషన్ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యత ఉండాలన్నారు. రోడ్డు పక్కన చెత్త వేయడం, ఖనిజ వ్యర్థాలను రోడ్డ పక్కన డంపింగ్ చేయడంలాంటి చర్యలతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడడంతోపాటు పర్యావరణానికి హాని ఏర్పడుతుందన్నారు. ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ సామాజికాభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. చదరంగం క్రీడాకారిణి కోనేరు హంపి మాట్లాడుతూ తాను విజయవాడ వాసినైనా ఏపీఎండీసీ లాంటి కార్పొరేట్ కార్యాలయాన్ని ఇంతవరకూ చూడలేదన్నారు. సామాజిక బాధ్యత నిర్వహణను ముందుకు తీసుకువెళ్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గనుల శాఖ కార్యదర్శి శ్రీధర్, ఆదాయపుపన్ను శాఖ ముఖ్య కమిషనర్ భూపాల్‌రెడ్డి, ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకయ్య చౌదరి, నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో కె.సాంబశివరావు పాల్గొన్నారు.

రాష్ట్రపతి దంపతుల పట్ల అమర్యాదకర ప్రవర్తన

- పూరీ క్షేత్రంలో ఘటన
- కలెక్టరు దర్యాప్తునకు నిర్ణయం

గోపాలపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతుల పట్ల పూరీ శ్రీక్షేత్ర సేవాయత్‌లు అమర్యాదగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనపై పూరీ కలెక్టర్ ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆలయ పాలకవర్గం తీర్మానించింది. ఈ ఘటనకు ముగ్గురు సేవాయత్‌లు బాధ్యులని ప్రాథమికంగా గుర్తించారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్రపతి దంపతులు ఈ ఏడాది మార్చి 18న పూరీ శ్రీక్షేత్రానికి వచ్చారు. వీరు జగన్నాథుని సన్నిధిలో ఉండగా.. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సేవాయత్‌లు ప్రొటోకాల్ ఉల్లంఘించి కోవింద్ దంపతులకు అతి చేరువగా వెళ్లారు. రాష్ట్రపతికి భుజాలు తాకించారు. దీంతో అసహనానికి గురైన కోవింద్.. దీనిపై జిల్లా యంత్రాంగానికి లేఖ రాసి వివరణ కోరారు. ఏప్రిల్ 4న జరిగిన ఆలయ పాలకవర్గం సమావేశంలో కలెక్టరు అగ్రవాల్ నాటి శ్రీక్షేత్ర పాలనాధికారి ప్రదీప్‌కుమార్‌జెనా, ఇతర అధికారులకు ఈ లేఖ విషయాన్ని తెలియజేశారు. బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ నెల 23న ప్రస్తుత శ్రీక్షేత్ర పాలనాధికారి ప్రదీప్తకుమార్ మహాపాత్ర్ అధ్యక్షతన ఏర్పాటైన పాలకవర్గం సమావేశంలో మరోసారి దీనిపై చర్చ జరిగింది. కలెక్టర్ దర్యాప్తు చేసి బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని.. కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన పల్లంరాజు

ఈనాడు, కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మంగళవారం హైదరాబాద్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు ఈ మేరకు ఆహ్వానం పలికారు. ఈ విషయంపై పల్లంరాజు 'ఈనాడు'తో మాట్లాడుతూ తాను కిరణ్‌ను తరచూ కలుస్తుంటానన్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా కలిశానని, రాజకీయంగా ఇందులో ఎలాంటి ప్రత్యేకత లేదన్నారు. అయితే తిరిగి కాంగ్రెస్‌లోకి వస్తే బాగుంటుంది కదా అని ప్రస్తావించానన్నారు. కిరణ్ మనసులో ఏముందో బయటకి చెప్పలేదని వివరించారు. పార్టీకి దూరమైన నేతలను మళ్లీ ఆహ్వానించాలంటూ ఇటీవల కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇచ్చిన సందేశాన్ని కూడా కిరణ్‌కు తెలియజేశామన్నారు. ఏపీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఊమెన్‌చాందీతో.. కిరణ్‌కుమార్‌రెడ్డి ఇది వరకే ఫోన్లో మాట్లాడినట్లు తెలిసిందన్నారు. కిరణ్ కాంగ్రెస్‌లోకి వస్తే మంచిదనే అభిప్రాయం పార్టీ నేతల్లో ఉందన్నారు. మేం కలుసుకున్నప్పుడల్లా రాజకీయ అంశాలు మాట్లాడుకున్నట్లే ఇప్పుడు కూడా పలు అంశాలపై మాట్లాడుకున్నామని తెలిపారు. ఆయన కాంగ్రెస్‌లో చేరుతాడా లేదా అనేదానిపై తనకు స్పష్టత లేదని పల్లంరాజు అన్నారు.

దళారులపై పీడీ చట్టం ప్రయోగిస్తాం

- 'సర్వశిక్షా అభియాన్'లో పోస్టుల భర్తీలో దందాపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

ఈనాడు అమరావతి: సర్వశిక్షా అభియాన్‌లో పొరుగు సేవల ఉద్యోగాల భర్తీలో దళారుల ప్రమేయంపై మంగళవారం 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. అక్రమాలకు పాల్పడేవారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, అరెస్టు చేయిస్తామని తెలిపారు. మంగళవారం తెదేపా సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రే 'ఈనాడు' కథనాన్ని ప్రస్తావించారు. అలాంటి అక్రమాల్ని సహించేది లేదని స్పష్టంచేశారు. 'ఈనాడు' కథనంలో పేర్కొన్న విషయాలు నిజమేనని, శ్రీకాకుళం జిల్లాలోను అలాంటివి జరుగుతున్నట్టు తన దృష్టికి వస్తే జిల్లా ఎస్పీని అప్రమత్తం చేశానని మంత్రి కళా వెంకటరావు పేర్కొన్నారు. "ఉదయం పత్రికలో కథనం చూసిన వెంటనే సంబంధిత అధికారుల్ని రమ్మని ఆదేశించా. ఎవరైనా తోక జాడించాలని చూస్తే కఠినంగానే వ్యవహరిస్తాం. పీడీ చట్టం కింద కేసులు పెడతాం. ఒకరిద్దరి మక్కెలిరగ్గొట్టిస్తే అందరూ దారికొస్తారు. మనం చాలా కష్టపడి పనిచేస్తున్నాం. టెక్నాలజీని ఉపయోగించి ఎక్కడికక్కడ పారదర్శకత తెస్తున్నాం. అక్కడక్కడ ఒకరిద్దరు ఇలాంటి వాళ్లు తయారై ప్రభుత్వానికి అప్రదిష్ట తెస్తున్నారు" అని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

పేలిన మందుపాతర: ఆరుగురు జవాన్లు మృతి

రాంచీ: ఝార్ఖండ్‌లోని గడ్వా జిల్లాలో మంగళవారం రాత్రి మావోయిస్టులు మందుపాతర పేల్చిన ఘటనలో ఆరుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. జిల్లాలోని ఛింజో ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో భద్రత బలగాలు అక్కడకు చేరుకున్నాయి. వారిని చూసిన వెంటనే మావోయిస్టులు మందుపాతరను పేల్చడంతో పాటు కాల్పులు జరిపారు. దీనిలో 'ఝార్ఖండ్ జాగ్వార్ ఫోర్స్'కు చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయనీ, అదనపు బలగాలను ఆ ప్రాంతానికి తరలిస్తున్నామనీ పోలీసు డీఐజీ విపుల్ శుక్లా తెలిపారు.

అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి రాజధాని అభివృద్ధి నిధికి రూ. కోటి చెక్కును అందజేస్తున్న కాకినాడ సీపోర్ట్స్ సీఎండీ కె.వి.రావు

ఎన్‌ఆర్‌ఐ వివాహ బాధిత మహిళలకు ఊరట

- మూడు చట్టాల్లో మార్పులకు కేంద్రం ప్రతిపాదనలు
- వచ్చే వారం మంత్రివర్గం ముందుకు రానున్న వైనం

దిల్లీ: ప్రవాస భారతీయులతో వైవాహిక సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు ఉపకరించేలా... మూడు చట్టాలకు ప్రతిపాదించిన సవరణలకు కేంద్ర న్యాయ శాఖ ఆమోదం తెలిపింది. వచ్చేవారం మంత్రివర్గ సమావేశంలో దీనిని ప్రవేశపెట్టి, ఆమోదం కోరనున్నట్లు స్త్రీ, శిశు అభివృద్ధిశాఖ కార్యదర్శి రాకేష్ శ్రీవాస్తవ మంగళవారమిక్కడ వెల్లడించారు.

1. ఎన్‌ఆర్‌ఐలు పెళ్లి జరిగిన ఏడు రోజుల్లోగా వివాహాన్ని నమోదు చేయించుకోవాలి. లేకుంటే వారి పాస్‌పోర్టు, వీసాల నిలుపుదల/రద్దుకు ఆస్కారం ఏర్పడుతుంది. ఈ మేరకు వివాహచట్టానికి సవరణ.
2. భార్యలు పెట్టిన కేసుల విచారణ నిమిత్తం కోర్టుకు రాని ఎన్‌ఆర్‌ఐల పాస్‌పోర్టుల స్వాధీనానికి అవకాశం కల్పిస్తూ పాస్‌పోర్టు చట్టంలో మార్పులు.
3. భార్యను వదిలివేయడం, వేధింపులకు గురిచేయడం వంటి ఆరోపణలు వచ్చినప్పుడు... ఎన్‌ఆర్‌ఐ భర్తలకు విదేశీ వ్యవహారాలశాఖ వెబ్‌సైట్‌లో సమన్లు పొందుపరిచేందుకు వీలు కల్పిస్తూ నేర శిక్షాస్మృతికి మార్పులు.

ఎన్‌ఆర్‌ఐ వివాహ సమస్యల పరిష్కారం నిమిత్తం.. స్త్రీ,శిశు అభివృద్ధిశాఖ మంత్రి మేనకాగాంధీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌లు ఇటీవల చర్చించిన క్రమంలో, ఈ ప్రతిపాదనలు రూపుదిద్దుకున్నాయి.

ప్రాజెక్టు పూర్తి చేయాలనకుండా నిధులివ్వాలనడమేంటి?: కేవీపీ

ఈనాడు డిజిటల్, అమరావతి: జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని వేగంగా పూర్తి చేయాలని కోరకుండా... పునరావాసం, భూసేకరణకు నిధులు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోకి తీసుకున్న కారణంగా 'కాస్ట్ ఎస్కలేషన్' భారం రాష్ట్ర ఖజానాపై పడిందని మంగళవారం ముఖ్యమంత్రికి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. 'విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును కేంద్రం తన నిధులతో నిర్మించాలి. మీకు (చంద్రబాబు), ప్రధాని మోదీకి ఎలాంటి ఒప్పందం జరిగిందో తెలియదు. నిర్మించాలని కేంద్రాన్ని కోరకుండా నిధులివ్వాలని గడ్కరీకి లేఖ రాయడం ఆశ్చర్యంగా ఉంది' అని కేవీపీ లేఖలో పేర్కొన్నారు.

ప్రతిభాపత్రాల జోడింపునకు 28 వరకు అవకాశం: టెట్ కన్వీనర్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ప్రోత్సాహక (ఇన్సెంటీవ్) మార్కుల కోసం వ్యాయామ ఉపాధ్యాయుల ప్రతిభాపత్రాల జోడింపునకు(అప్‌లోడ్) ఈ నెల 28 అర్ధరాత్రి వరకు తుది అవకాశం ఉన్నట్లు టెట్ కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకూ అప్‌లోడ్ చేసుకోని వారిని దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీటిని వాస్తవమని నిర్ధారించుకున్న తర్వాత కేటగిరీలవారీగా మార్కులను కేటాయిస్తామన్నారు.

టెట్ తుది 'కీ' విడుదల: టెట్ తుది 'కీ'ని మంగళవారం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసి.. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ప్రాథమిక కీపై 7,227 అభ్యంతరాలు రాగా 846మాత్రమే ఆధారాలతో సహా అందాయని వెల్లడించింది. ఆధారాలు, సాక్ష్యాలతో సహా వచ్చిన అభ్యంతరాలన్నింటిని పరిష్కరించామని తెలిపింది. టెట్ ఫలితాలను 30న మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.

పురపాలిక ఉపాధ్యాయుల జిల్లాస్థాయి బదిలీల ఉత్తర్వులు విడుదల: పుర, నగరపాలిక పాఠశాలల్లో పని చేస్తున్న 233మంది ఉపాధ్యాయులకు అదే జిల్లాలో పరస్పర, స్పౌజ్, వైద్య సంబంధిత కారణాలతో బదిలీలను పురపాలక శాఖ ఆమోదించింది. వీరు 30వ తేదీలోపు విధుల్లో చేరాల్సి ఉంటుంది. రాష్ట్రంలో పుర, నగరపాలికల్లో పనిచేస్తున్న 550మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకోగా.. జిల్లా స్థాయిలోనే అంతర్గత బదిలీలకు 233మందిని అనుమతించారు. 317మంది వేర్వేరు జిల్లాలకు బదిలీలు కోరినందున వారి అభ్యర్థనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం, పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్యలు వెల్లడించాయి.

పోలవరం పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఎమ్మెల్సీ సోము వీర్రాజు డిమాండ్

ఈనాడు, కాకినాడ: పోలవరం పనులను 2016 నుంచి ఎందుకు మొదలుపెట్టాల్సి వచ్చిందో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలని భాజపా ఎమ్మెల్సీ సోమువీర్రాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కాకినాడలో విలేకరులతో మాట్లాడుతూ.. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అప్పటినుంచే ఎందుకు పనులు చేయలేదో చర్చించాలని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేయాలని లేదా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టిసీమ కట్టిన ముఖ్యమంత్రి పోలవరం ఎందుకు నిర్మించలేకపోయారో సంజాయిషీ ఇవ్వాలని పట్టుబట్టారు. పోలవరం అంచనాలను ఒక్కోసారి ఒక్కోలా పెంచుతూ పోతున్నారని వివరించారు. రాష్ట్రంలో అందరు కలెక్టర్లు మారినా పశ్చిమగోదావరి కలెక్టర్ మారడం లేదని, ఆయన ప్రాజెక్టు లెక్కలు రాయడానికే ఉన్నారని వ్యాఖ్యానించారు. అవినీతిలో ముఖ్యమంత్రికి ఆస్కార్ బహుమతి ఇవ్వాలన్నారు. పిల్లలకు సమవస్త్రాల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఉక్కు పరిశ్రమ కోసం సీఎం రమేష్ దీక్ష కంటే ముందు ఆయన తన గ్రామంలో మూతపడిన డైరీ, చక్కెర పరిశ్రమలను తెరిపించేందుకు ఉద్యమించాలని సూచించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా

- నిరుద్యోగ భృతిపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో స్పష్టత
- మీడియాతో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి తాను సిద్ధమని పంచాయతీరాజ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్ఠానం ఎక్కడ నిర్ణయిస్తే అక్కడ నుంచి పోటీ చేస్తానన్నారు. ఫ్లెక్స్‌ట్రానిక్స్ సంస్థతో అవగాహన ఒప్పందం అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నిరుద్యోగ భృతిపై వచ్చే కేబినెట్ సమావేశంలో స్పష్టత వస్తుందన్నారు. కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు విషయంలో తెదేపా నిస్వార్థ పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం ఏర్పాటు చేసే ప్రాజెక్టుల కోసం రాష్ట్రం రాయితీలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అయినా రాష్ట్రాభివృద్ధి కోసం రాయితీలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

భాజపా నేతలు అసత్యాలు మానుకొని దిల్లీ యాత్రలు చేయాలి: రాష్ట్ర భాజపా నేతలు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడం మానుకొని దిల్లీలో యాత్రలు చేస్తే బాగుంటుందని లోకేశ్ సూచించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలంటూ తెదేపా ఎంపీ రమేశ్, ఎమ్మెల్సీ బీటెక్ రవి చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష ఏడో రోజుకు చేరినా కేంద్రం స్పందించకపోవడంపై లోకేశ్ మంగళవారం ట్విట్టర్‌లో మండిపడ్డారు. ఆంధ్రుల పట్ల భాజపా వైఖరి మరోసారి బయటపడిందన్నారు.

పంచాయతీరాజ్, ఐటీశాఖ అధికారులకు లోకేశ్ అభినందనలు: స్కోచ్ అవార్డులు సాధించిన పంచాయతీరాజ్, ఐటీశాఖ అధికారులను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ఈ రెండు శాఖలు మొత్తం 21అవార్డులు దక్కించుకున్నాయి. లోకేశ్‌కు ఈ ఏడాది మేటి వ్యక్తి (పర్సన్ ఆఫ్ ది ఇయర్) పురస్కారం దక్కింది. ఈ నెల 23న దిల్లీలో ప్రదానం చేశారు. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి విజయానంద్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి జవహర్ రెడ్డి, డైరెక్టర్ రంజిత్ బాషా పర్సన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని మంత్రి లోకేశ్‌కు అందజేసి అభినందనలు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 65 బీసీ గురుకులాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరంలో 65 వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. 960 మంది విద్యార్థుల సామర్థ్యంతో ఒక్కో విద్యాలయాన్ని ప్రారంభించనుంది. కొత్త గురుకుల భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను ఆయా జిల్లాల కలెక్టర్లు గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ, వసతి, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు చర్యలను తీసుకోవాలని ఆదేశించింది.

జిల్లాల వారీగా ఏర్పాటవనున్న గురుకులాలు: శ్రీకాకుళం- 8, విజయనగరం- 7, విశాఖపట్నం-5, తూర్పుగోదావరి-6, పశ్చిమగోదావరి-6, కృష్ణా- 3, గుంటూరు- 6, ప్రకాశం-3, నెల్లూరు-5, కడప-3, కర్నూలు-3, అనంతపురం-6, చిత్తూరు-4.

వంటనూనెల నిల్వలకు పరిమితి ఉండదు

- నిత్యావసరాలపై పౌరసరఫరాల శాఖకు ఉన్న చివరి నియంత్రణా తొలగింపు

ఈనాడు, అమరావతి: బియ్యం, చక్కెర ఇలా నిత్యావసరాలపై ఒక్కొక్కటిగా పౌరసరఫరాల శాఖ అజమాయిషీ తొలగిస్తూ వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు మిగిలిన వంటనూనెలపైనా నియంత్రణను ఎత్తేసింది. కేంద్రం ఎప్పటికప్పుడు ఇచ్చే ఉత్తర్వులకు అనుగుణంగా రాష్ట్ర పౌరసఫరాల శాఖకు ఈ వస్తువులపై నియంత్రణ ఉంటుంది. ఈ సరకులను విక్రయదారులకు లైసెన్సులను జారీ చేయడం, నిల్వల పరిమితిని నిర్దేశించడం, ఆ మేరకే నిల్వ చేస్తున్నారా? ఎగుమతులు, దిగుమతులపై నిఘా వంటి నియంత్రణ అధికారం పౌరసరఫరాల శాఖకు ఉండేది. కొంతకాలంగా ఈ సరకుల్లో ఒక్కొక్కటీ పౌరసరఫరాల శాఖ పరిధి నుంచి కేంద్రం తప్పిస్తూ వస్తోంది. గతేడాదితో అన్ని సరకులపైనా ఈ శాఖకు నియంత్రణ లేకుండా పోయినప్పటికీ వంటనూనెల(ఎడిబుల్ ఆయిల్స్)పై మాత్రం అజమాయిషీ ఉండేది. ధరల్లో వ్యత్యాసాలు ఉంటుండడంతో మార్కెట్‌లో నూనెల కొరత వంటివి తలెత్తకుండా అజమాయిషీ కొనసాగించారు. ఇప్పుడు ఆ నూనెలపైనా నియంత్రణను ఎత్తేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(పౌరసరఫరాల శాఖ) బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కమాడిటీస్ డీలర్స్ ఆర్డరు-2016ను నిలుపుదల(అబయెన్స్) చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

తెదేపా పొలిట్‌బ్యూరోలో గల్లా అరుణకుమారికి చోటు

ఈనాడు అమరావతి: తెదేపా సీనియర్ నాయకురాలు, చిత్తూరు జిల్లాకు చెందిన గల్లా అరుణకుమారికి పార్టీ పొలిట్‌బ్యూరోలో చోటు లభించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. గల్లా అరుణకుమారి 2014 ఎన్నికలకు ముందు తెదేపాలో చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆమె మంత్రిగా పనిచేశారు. వై.ఎస్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గాల్లో ఆమె కీలకమైన శాఖలు నిర్వహించారు. రాష్ట్ర విభజనకు నిరసనగా కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టి, తన కుమారుడు గల్లా జయదేవ్ సహా తెదేపాలో చేరారు.

శ్రీకాకుళం జిల్లాలో పశువులకు ఆంత్రాక్స్

కరకవలస(జలుమూరు), న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం కరకవలస, అన్నుపురం గ్రామాల్లోని పశువులకు ఆంత్రాక్స్ సోకిందని, ముఖ్యంగా గొర్రెల్లో ఈ వ్యాధి ఎక్కువగా ఉందని పశుసంవర్ధకశాఖ డీడీ మంచు కరుణాకరరావు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఈ నెల 20వ తేదీన ఏడు గొర్రెలు, మేకలతోపాటు రెండు పాడి పశువులు మృతి చెందడంతో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పశువుల రక్త నమూనాలను విజయవాడలోని ప్రయోగశాలకు పంపించగా ఆంత్రాక్స్ వ్యాధిగా నిర్ధారణ అయిందని డీడీ తెలిపారు.

పారిశ్రామిక నడవాలో 2505 కోట్ల పనులకు ఆమోదం

ఈనాడు, అమరావతి: విశాఖ-చెన్నై పారిశ్రామిక నడవా(వీసీఐసీ)లో వివిధ క్లస్టర్లలో రూ.2505.56 కోట్ల విలువైన వివిధ పనుల నిర్వహణకు ప్రభుత్వం మంగళవారం ఆమోదం తెలిపింది. చిత్తూరు, విశాఖపట్నం నోడ్‌లో వివిధ పనుల నిర్వహణకు ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) ఆర్థికసాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అధికారులు ప్రతిపాదించిన వివిధ ప్రాజెక్టులను పరిశ్రమల, వాణిజ్య వ్యవహారాల శాఖ ఆమోదించి పనుల నిర్వహణకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. చిత్తూరు నోడ్‌లో రూ.1349.70 కోట్లతో, విశాఖపట్నం నోడ్‌లో రూ.1049.80 కోట్లతో, విశాఖలోని మెడ్‌టెక్ జోన్‌లో మరో రూ.106.06 కోట్లతో ప్రతిపాదిత పనులను నిర్వహించనున్నారు.

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూలం

- భారత రాయబారుల బృందంతో గవర్నరు నరసింహన్

ఈనాడు, అమరావతి, హైదరాబాద్: వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ఎంతో అనుకూలమని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆకర్షణీయ విధానాలను అమలు చేస్తోందని తెలుగు రాష్ట్రాల గవర్నరు నరసింహన్ పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రం వివిధ రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధిస్తోందని, రియల్ టైం గవర్నెన్స్ (ఆర్టీజీ) వంటి కొత్త ఆవిష్కరణలతో వివిధ ప్రాజెక్టుల పనులను పర్యవేక్షించగలుగుతున్నారని వివరించారు. సులువైన వ్యాపార అనుకూలతల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన ప్రస్తావించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పెట్టుబడులకు వీలున్న పరిస్థితులు, ఇతర అనుకూలతలపై పరిశీలన, ప్రచార నిమిత్తం విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఎంపిక చేసిన వివిధ దేశాల్లోని భారత రాయబారుల బృందం రెండు రోజుల ఏపీ పర్యటనకు వచ్చింది.



భారత రాయబారులతో తెలుగు రాష్ట్రాల గవర్నరు నరసింహన్

అంతకుముందుగా మంగళవారం ఆ బృందం హైదరాబాద్‌లో గవర్నరును కలిసింది. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడారు. అనంతపురం జిల్లాలో కొరియా ఆటో మొబైల్ కంపెనీ కియా మోటార్స్ కార్ల తయారీ పరిశ్రమను ప్రారంభిస్తోందని, ఎలక్ట్రానిక్ పరిశ్రమల క్లస్టర్‌గా తిరుపతి ఎంతో అభివృద్ధి సాధిస్తోందని వివరించారు. భూమి, నీరు, విద్యుత్తు, ఖనిజ సంపద పుష్కలంగా ఉందని, 947 కిలోమీటర్ల పొడవునా ఉన్న తీర ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు మరో అనుకూలమని తెలిపారు. అమరావతిని సింగపూర్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గవర్నరును కలిసిన వారిలో స్పెయిన్, వియత్నాం, కువైట్‌లో భారత రాయబారులు డి.బాల వెంకటవర్మ, పి.హరీశ్, కె.జీవసాగర్ ఉన్నారు.

పారిశ్రామిక భవనాలకు తనఖా నుంచి మినహాయింపు

ఈనాడు, అమరావతి: పారిశ్రామిక భవనాలకు 10 శాతం నిర్మాణ ప్రాంత తనఖా నుంచి మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ భవనాలకు పురపాలక, నగరపాలక, నగరాభివృద్ధి సంస్థల నుంచి అనుమతుల సందర్భంలో సంబంధిత భవన యజమాని నిర్మాణ ప్రాంతంలో 10 శాతాన్ని స్థానిక సంస్థలకు తనఖా (మార్ట్‌గేజ్) పెట్టాల్సిన పరిస్థితి. భవన నిర్మాణం పూర్తయ్యాక అనుమతులిచ్చిన పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు పరిశీలించి ప్లాను ప్రకారం నిర్మించారని నిర్ధారించాకే తనఖా పెట్టిన పది శాతాన్ని కమిషనరు విడుదల చేస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం నిర్మించే భవనాల్లో నిబంధనలు ఉల్లంఘించే అవకాశం లేనందున, మినహాయింపు ఇవ్వాలన్న పారిశ్రామికవేత్తల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం సమ్మతిని తెలియజేసింది. ఈ మేరకు ఇప్పటికే ఉన్న భవన నిర్మాణ నిబంధనలు సడలిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

పీఆర్సీ బకాయిల చెల్లింపుపై హర్షం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పది నెలల పీఆర్సీ బకాయిల చెల్లింపునకు ఉత్తర్వులు జారీ చేయడంపై ఎన్జీవో సంఘం నాయకులు, ఇతర సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దాదాపు రూ.3500 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందని, ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు ఇవ్వడం ఇదే మొదటిసారని ఏపీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు పి.అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అమరావతి సంయుక్త కార్యాచరణ సమితి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ అధికారుల జేఏసీ అధ్యక్షుడు కేవీ కృష్ణయ్య, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావులు కూడా ఉత్తర్వులపై హర్షం వ్యక్తం చేశారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 28-6-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 319 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

బీటెక్ రవి దీక్ష భగ్నం

- ఆరోగ్యం విషమించడంతో అప్రమత్తమైన పోలీసులు
- సీఎం రమేష్‌ను తీసుకెళ్లే యత్నం.. కార్యకర్తల నిరసనలు

15లో

దీక్షను భగ్నం చేసి ఎమ్మెల్సీ బీటెక్ రవిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ఇదేం పద్ధతి?

- కడప ఉక్కుపై అడిగిన ప్రశ్నలే అడుగుతూ కాలయాపన
- కేంద్రం తీరుపై ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్‌లో మండిపడ్డ ముఖ్యమంత్రి చంద్రబాబు
- రమేశ్, బీటెక్ రవి ఆరోగ్యంపై ఆరా

15లో

బుధవారం దిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి బీరేంద్రసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెదేపా ఎంపీలు

మళ్లీ మెలిక

- 2 అంశాలపై ఇంకా సమాచారం రాలేదని రాష్ట్రంపై నెపం
- కడప ఉక్కుపై దాటవేత
- స్పష్టత ఇవ్వని కేంద్ర మంత్రి
- గడువు చెప్పని బీరేంద్రసింగ్
- తనను నమ్మాలని చిలుకపలుకులు
- తెదేపా ఎంపీల అసంతృప్తి

ఈనాడు - దిల్లీ

కడప ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. అదిగో ఇదిగో అంటూనే ఇంకా సమాచారం రావాలంటూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తోంది. స్పష్టమైన హామీ ఏదీ ఇవ్వడం లేదు. సీఎం రమేశ్, బీటెక్ రవిల ఆమరణ దీక్ష నేపథ్యంలో బుధవారం దిల్లీలో తెదేపా ఎంపీలు కేంద్ర ఉక్కు-శాఖ మంత్రి చౌధురి బీరేంద్ర సింగ్‌ను కలిసినప్పుడూ ఆయన సానుకూలమేనన్నారు తప్పితే ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారో చెప్పలేదు. పైగా ఇంకా సమాచారం అందలేదంటూ రాష్ట్ర ప్రభుత్వంపైనే నెపం నెట్టే ప్రయత్నం చేశారు.

కడపలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేయాలన్న డిమాండుతో గత ఎనిమిది రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న తెదేపా ఎంపీ, ఎమ్మెల్సీలు సీఎం రమేష్, బీటెక్ రవిల ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్పష్టమైన హామీ రాబట్టుకోవడానికి తెదేపా పార్లమెంటరీ పార్టీ బృందం బీరేంద్ర సింగ్‌ను కలిసింది. ఇప్పటివరకూ జరిగిన పరిణామాలన్నింటినీ వివరిస్తూ నాలుగు పేజీల వినతి పత్రం సమర్పించింది. వెంటనే విధాన ప్రకటన చేయాలని కోరింది. సుమారు గంటన్నరపాటు ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. అనంతరం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడారు. కొంత ఆలస్యమైనప్పటికీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు తాము సానుకూలంగా ఉన్నామని, తనపై విశ్వాసం ఉంచాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తాము అడిగిన సమాచారం అందిన వెంటనే తదుపరి కార్యాచరణ మొదలు పెడతామని చెప్పారు. అయితే కేంద్రం అడిగిన సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22నే పంపిందని, తమవైపు ఏమీ పెండింగ్ లేదని తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ స్పష్టం చేశారు. కానీ మంత్రి ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా తాము మరింత స్పష్టత కోరామని చెప్పారు. 'సుప్రీంకోర్టులో దాఖలైన పిల్‌కు సమాధానంగా మా శాఖ దాఖలు చేసిన అఫిడవిట్ గురించి ప్రసార సాధనాల్లో తప్పుగా ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం కడప (మిగతా 2లో)

ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

జస్టిస్ టి.బి.రాధాకృష్ణన్

దిల్లీ

ఆంధ్రప్రదేశ్-తెలంగాణ ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.బి.రాధాకృష్ణన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించినట్లు సంబంధిత వర్గాలు బుధవారం తెలిపాయి. పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ కుమార్ త్రిపాఠిని అదే న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమించినట్లు వెల్లడించాయి. ప్రస్తుతం ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రమేశ్ రంగనాథన్ కొనసాగుతున్నారు.

సాగు రుణం రూ.1.06 లక్షల కోట్లు

- 16.55శాతం వృద్ధి అంచనా
- నేడు ప్రణాళిక విడుదల

2లో

ప్రపంచకప్ నుంచి

జర్మనీ ఔట్

డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ ఫుట్‌బాల్ ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది. బుధవారం జరిగిన గ్రూప్-ఎఫ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియా 2-0తో జర్మనీకి షాకిచ్చింది. కొరియా ఇంజురీ సమయంలో గోల్స్ కొట్టింది. నాలుగుసార్లు విజేత జర్మనీ 1938 తర్వాత ప్రపంచకప్ గ్రూప్ దశలోనే నిష్క్రమించడం ఇదే తొలిసారి. గ్రూప్-ఎఫ్ నుంచి స్వీడన్, మెక్సికో ముందంజ వేశాయి.

- వివరాలు ఛాంపియన్‌లో

హీలియం-3 అన్వేషణలో ఇస్రో

- చందమామపై విలువైన ఇంధన వనరు
- చంద్రయాన్-2 ద్వారా రోవర్‌ను దించడానికి సిద్ధం
- చంద్రుడి దక్షిణ భాగంలో దిగి చరిత్ర సృష్టించనున్న భారత్



అంతరిక్ష ప్రయోగాల్లో ఇప్పటికే తన ప్రత్యేకతను చాటుకున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో బృహత్తర ప్రాజెక్టును లక్ష్యంగా ఎంచుకుంది. ప్రపంచంలో ఏ దేశమూ ఇంతకుముందు వెళ్లని చంద్రుడి దక్షిణ భాగానికి వెళ్లి అక్కడ రూ.లక్షల కోట్ల విలువైన అణు ఇంధన వనరులను అన్వేషించాలనుకుంటోంది. చంద్రుడిపై అన్వేషణకు వివిధ దేశాలు ఇటీవల కాలంలో ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ విషయంలో వెనకబడకూడదని భారత్ కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటివరకు చంద్రుడిపైకి ప్రయోగించిన స్పేస్‌క్రాఫ్ట్‌లన్నీ చంద్రమధ్య రేఖకు సమీపంలోనే దిగాయి.

చంద్రయాన్-2 పేరుతో చంద్రుడి దక్షిణ భాగం ఉపరితలంపై అక్టోబరులో ఇస్రో రోవర్‌ను దించనుంది. రోవర్.. అక్కడి ఉపరితలంపై నమూనాలు సేకరించి (మిగతా 2లో)

> 'చంద్రుడి నుంచి హీలియం-3 ఇంధన వనరును భూమిపైకి తెచ్చే సామర్థ్యం ఉన్న దేశాలు ఇంధన ప్రక్రియను శాసిస్తాయి. అక్కడకు వెళ్లే దేశాల్లో మనమూ ఒకరిగా ఉండాలనుకోవడం లేదు. ఆ దేశాలకన్నా ముందంజలో ఉండాలనుకుంటున్నాం.'
>
> - ఇస్రో ఛైర్మన్ కె.శివన్

పైసా లంచం ఇవ్వొద్దు

- డబ్బులు అడిగితే పరిష్కార వేదికకు ఫిర్యాదు చేయండి
- వర్చువల్ విధానంలో ఏసీబీ రేంజి కార్యాలయాలను ప్రారంభించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పౌర సేవలు వంటివి పొందడానికి ఏ ప్రభుత్వోద్యోగికి ఒక్క పైసా కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. డబ్బుల కోసం ఎవరైనా డిమాండు చేస్తే పరిష్కార వేదిక 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్రంలో నూటికి 95శాతం మంది ఉద్యోగులు నిజాయతీగానే ఉంటున్నారని, అవినీతి జబ్బున్న కొందరు మాత్రమే చెడుమార్గాల్లో వెళ్తున్నారని చెప్పారు. వెలగపూడి సచివాలయంలో రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రం నుంచి వర్చువల్ విధానం ద్వారా బుధవారం ఆయన విజయవాడ, గుంటూరులో నూతనంగా నిర్మించిన ఏసీబీ రేంజి కార్యాలయాల భవనాల్ని ప్రారంభించారు. 'ఏసీబీ ఇటీవలకాలంలో అనేక మంది అవినీతి అధికారులను సాక్ష్యాధారాలతో పట్టుకుంది. ఆ విభాగం పనితీరుకు ఇది నిదర్శనం. అధికారాన్ని దుర్వినియోగం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. తప్పు చేసిన వారిని మాత్రం విడిచిపెట్టకూడదు. రాష్ట్రంలోని అన్ని రేంజి కార్యాలయాలు ఇటీవల వరకూ అద్దె భవనాల్లోనే ఉండేవి. రూ.16 కోట్ల నిధులిస్తే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో రేంజి కార్యాలయాల భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయగలిగారు. ఇది శుభపరిమాణం. దీనిలో భాగస్వాములైన వారికి అభినందనలు...'' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఏసీబీ డీజీపీ ఆర్.పి.ఠాకూర్ ఈ భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసిన విధానాన్ని ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విజయవాడలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గుంటూరులో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

అమరావతి అభివృద్ధికి రూ.200 కోట్లు

- పీఆర్‌సీ చెల్లింపుల నుంచి తిరిగిస్తాం
- ఏపీ ఎన్జీవో సంఘం ప్రకటన
- సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపిన సంఘాలు

2లో

చంద్రబాబుకు కేక్ తినిపిస్తున్న అశోక్‌బాబు. చిత్రంలో ఇతర ఉద్యోగ సంఘాల నేతలు

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం విజయవాడ కనకదుర్గ అమ్మవారికి సమర్పించనున్న ముక్కుపుడక

దుర్గమ్మ సన్నిధికి నేడు కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం విజయవాడలోని కనకదుర్గ ఆలయాన్ని సందర్శించనున్నారు. బేగంపేటనుంచి ప్రత్యేక విమానంలో ఆయన కుటుంబ సమేతంగా విజయవాడకు వెళతారు. తెలంగాణ వస్తే కనకదుర్గమ్మవారికి బంగారు ముక్కుపుడక సమర్పిస్తానన్న మొక్కును ఈ సందర్భంగా ఆయన చెల్లించుకోనున్నారు. దర్శనం అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

ఇదీ సంగతి!

ఆయన అక్రమాస్తులపై ఇంకా దర్యాప్తు కొనసాగుతుందా... ఇదిగో సార్, మీ ఇంట్లో దొరికిన మీ అక్రమాస్తులు.

స్వచ్ఛతకు చిరునామా నిమ్మకూరు

- సత్ఫలితాలిచ్చిన భూగర్భ మురుగునీటిపారుదల వ్యవస్థ
- మంత్రి లోకేశ్ దత్తత గ్రామంలో వెల్లివిరిసిన పరిశుభ్రత
- ఇదే స్ఫూర్తితో మరో 1340 గ్రామాల్లో అమలుకు చర్యలు

నిమ్మకూరు నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి

భూగర్భ మురుగునీటిపారుదల వ్యవస్థ రాకతో నిమ్మకూరులో పరిశుభ్రంగా కనిపిస్తున్న ఒక వీధి.

అది కృష్ణా జిల్లా నిమ్మకూరు. నేడు పరిశుభ్రతకు చిరునామాగా మారింది. 260 ఇళ్లు ఉన్న ఈ గ్రామంలో పది నెలల కిందట ప్రయోగాత్మకంగా చేపట్టిన భూగర్భ మురుగునీటిపారుదల వ్యవస్థ (యూజీడీ) ప్రాజెక్టు సత్ఫలితాలను ఇచ్చింది. దీనిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా 1340 గ్రామాల్లో ఈ ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మురుగునీటిని పైపుల ద్వారా భూగర్భ కాలువలో కలిసేలా ఏర్పాటు చేశారు. చిరకాలంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం లభించింది. గతంలో ఇళ్ల ముందు నిలిచిన మురుగునీరు... దోమల విజృంభణ... రహదారులపై వ్యర్థాలతో కనిపించేది. వాటితో తీవ్ర ఇబ్బందులు పడిన స్థానికులు ఇప్పుడు హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. జోరుగా వర్షం కురిస్తే వీధుల్లో మోకాలులోతు నీటిలో నడిచేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు సొంత గ్రామం నిమ్మకూరులో తాజా పరిస్థితి ఇది. ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి లోకేశ్ రాష్ట్రంలోనే తొలిసారి యూజీడీ ప్రాజెక్టును మంజూరు చేశారు. రూ.2.50కోట్ల అంచనాతో 5.7 కిలోమీటర్ల పొడవునా గడువు కంటే ముందే పూర్తి చేశారు. ప్రతి ఇంటికి కనెక్షన్లు ఇవ్వడం ద్వారా స్నానపు గదుల్లో నీరు నేరుగా భూగర్భంలోని పైపుల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు నిమ్మకూరులో ఇళ్ల ముందు, వీధుల్లో మురుగునీరే కనిపించడం లేదు.

ఇళ్ల నుంచి విధిగా వ్యర్థాల సేకరణ

ప్రతి ఇంటి నుంచి రోజూ ఉదయమే పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్తను (మిగతా 2లో)

నన్ను చంపేందుకు కుట్ర

- గౌరీ లంకేశ్ హంతకుల యోచన ఇది
- నటుడు ప్రకాశ్‌రాజ్ ఆందోళన

5లో

స్వచ్ఛతకు చిరునామా నిమ్మకూరు

నిర్మాణంలో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు

సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం

ఎస్సీ కాలనీలో ఇంటింటికి ఇచ్చిన కనెక్షన్

(మొదటి పేజీ తరువాయి)

సేకరిస్తున్నారు. దానిని వేర్వేరుగా చేసి ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్నారు. ఇతర వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. ఈ విధానంతో పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. సిబ్బంది హాజరుపై పర్యవేక్షణకు రేడియో ఫ్రిక్వెన్సీ గుర్తింపు (ఆర్ఎఫ్ఐడీ) కార్డులు ప్రతి ఇంటి గుమ్మంలో ఏర్పాటు చేశారు. వారు తమ వద్ద ఉన్న డివైజ్‌ను ఆర్ఎఫ్ఐడీ కార్డుకు ఎదురుగా పెడితే అది స్కాన్ అవుతుంది.

మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు

తాజాగా రెండు మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ)ను ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు మరో రెండు, మూడు నెలల్లో పూర్తి కానున్నాయి. మురుగునీటిని శుద్ధి చేశాక వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే చెరువుల్లో, పంట కాలువల్లో విడిచిపెట్టేలా కార్యాచరణ రూపొందించారు. నీటిని శుద్ధి చేయకపోవడంతో ఎదురయ్యే ఇబ్బందులపై అధికారులు ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం స్పందించి ఎస్టీపీల ఏర్పాటుకు నిధులు కేటాయించింది.

మరిన్ని గ్రామాల్లో అమలుకు చర్యలు

నిమ్మకూరు స్ఫూర్తితో రాష్ట్రంలో 5వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న 1340 గ్రామాల్లో యూజీడీను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2,376 కిలోమీటర్ల పొడవునా ఈ కార్యక్రమాన్ని చేపట్టి పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం లభించేలా ప్రణాళికలు రూపొందించారు. దశల వారీగా మిగతా గ్రామాల్లోనూ ప్రవేశపెట్టే యోచన చేస్తున్నారు.

మొదట్లో వద్దన్నా.. తర్వాత వేయించుకున్నా

గ్రామంలో యూజీడీ వ్యవస్థను తీసుకొస్తున్నామంటే గుత్తేదారుల కమీషన్ల కోసం చేస్తున్నారని భావించి మొదట్లో విమర్శించా. ఇంటికి కనెక్షన్ ఇస్తామంటే వద్దన్నా. ఫలితాలు చూసి పట్టుబడి కనెక్షన్ వేయించుకున్నా. ఇంతకుముందు రోడ్లపైనే మురుగు నిలిచేది. దోమల బెడద తీవ్రంగా ఉండేది. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి.

–సూరపునేని అంకినీడు

వీధులన్నీ పరిశుభ్రం

వీధులన్నీ పరిశుభ్రంగా మారాయి. గతంలో ఇళ్ల ముందు మురుగు ఉండేది. మోకాళ్లలోతు నీటిలో వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రత్యేకించి వర్షాకాలం వచ్చిందంటే రోడ్లన్నీ చిత్తడిగా మారేవి. యూజీడీతో మురుగు సమస్యకు పరిష్కారం లభించింది. సిమెంట్ రహదారుల ఏర్పాటుతో అనేక సమస్యల నుంచి బయటపడ్డాం.

– నందమూరి జయక్రిష్ణ ప్రసాద్

దోమల బెడద తప్పింది

దోమల బెడద చాలావరకు తప్పింది. గతంలో సాయంత్రం ఇళ్ల ముందు నిల్చోడానికే ఇబ్బంది పడేవాళ్లం. జ్వరాల బారిన పడి అనారోగ్యానికి గురయ్యేవాళ్లం. ఆ పరిస్థితి మారింది. ఇప్పుడు స్నానపు గదుల్లో నీరు నేరుగా భూగర్భ పైపుల్లోకి వెళుతోంది. ఈ విధానం ఎంతో బాగుంది.

– కొండపల్లి నిర్మల, గృహిణి

సాగు రుణం రూ.1.06లక్షల కోట్లు

- వ్యవసాయం.. సానుకూలమే
- 16.55శాతం వృద్ధి అంచనా
- నేడు ప్రణాళిక విడుదల

ఈనాడు – అమరావతి

రైతులకు రూ.1.06లక్షల కోట్ల వ్యవసాయ రుణాలు లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటం, కృష్ణా, గోదావరి డెల్టాలకు ముందే నీటి విడుదల నేపథ్యంలో పంట దిగుబడులు పెరుగుతాయని ప్రణాళిక రూపొందింది. ఈ ఏడాది 16.55శాతం వృద్ధి లక్ష్యంగా నిర్ణయించింది. ఖరీఫ్‌లో 42.78 లక్షల హెక్టార్లు, రబీలో 25.54లక్షల హెక్టార్లు కలిపి మొత్తంగా 68.32లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా వేసింది. 16.40లక్షల టన్నుల పప్పుధాన్యాల ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించారు. నూనెగింజల పంటల్లోనూ 3.25లక్షల టన్నుల పెరుగుదల ఉంటుందని పేర్కొంది. ఏరువాక సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాలో ఈ వ్యవసాయ ప్రణాళికను విడుదల చేయనున్నారు.

- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 9 పంటలను గుర్తించారు. వరి, మొక్కజొన్న, మినుము, పెసర, శనగ, పత్తి, చెరకు, వేరుశనగకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వేరుశనగ విస్తీర్ణం 10.19లక్షల హెక్టార్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.
- వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో రూ.700 కోట్లు నిధులు ఖర్చు చేయనున్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్ కింద వరి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి, గోగు, చెరకు సాగు కోసం రూ.91.34కోట్లు కేటాయించారు. ఖరీఫ్, రబీ పంటకాలాల్లో 20.88లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

2018–19 వ్యవసాయ రుణాల లక్ష్యం (రూ.కోట్లలో)	
పంట రుణాలు	రూ.76,207.67
దీర్ఘకాలిక రుణాలు	రూ.30,108.71
మొత్తం	రూ.1,06,316.

- విత్తన రాయితీ కింద 2018-19లో రూ220 కోట్లు అందించనుంది. ఇందులో 15,429 క్వింటాళ్ల కొర్ర, రాగి, అలసంద, కంది, మినుము, పెసర, సెనగ, సజ్జ తదితర 16 రకాల విత్తనాలు, 1.20 లక్షల క్వింటాళ్ల జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. గ్రామ విత్తన పథకం కింద 74,050 హెక్టార్లలో అమలు చేయటానికి రూ.43.25కోట్లు ప్రతిపాదించారు.
- భూసార పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఉచితంగా సూక్ష్మపోషకాలు అందించనున్నారు. పొలం పిలుస్తోంది పథకంలో రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు రూ.9.24 కోట్లు కేటాయించారు.

వృద్ధిరేటు 16.55శాతం: ప్రస్తుత వ్యవసాయ సంవత్సరంలో 16.55శాతం వృద్ధిరేటు సాధన లక్ష్యంగా నిర్ణయించారు. గతేడాదితో పోలిస్తే వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రూ.5,839కోట్ల ఆదాయం పెరుగుతుందని అంచనా వేశారు.

రూ.లక్షలోపు వడ్డీలేని రుణం

రైతులకు పంటరుణాల మంజూరు మొత్తాన్ని ఈ ఏడాది 1.06లక్షల కోట్లుగా నిర్ణయించారు. గతేడాది ఇది రూ.83వేల కోట్లుగానే ఉంది. ఇందులో 6,13,639 మంది కౌలు రైతులకు పంటరుణాలు ఇప్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. రూ.లక్షలోపు పంటరుణం తీసుకునే రైతులకు వడ్డీలేని రుణాలు, రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు పావలా వడ్డీ పథకం అమలు చేయనున్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుంది. వడ్డీలేని రుణాల కోసం రూ.172కోట్లు, పావలావడ్డీ పథకంలో రూ.5.44కోట్లు చెల్లించనుంది.

2018–19లో సాగు, ఉత్పత్తి అంచనా..		
పంటలు	సాగు (లక్షల హెక్టార్లలో)	ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)
పప్పుధాన్యాలు	16.01	16.40
చిరుధాన్యాలు	6.43	30.56
నూనెగింజలు	11.87	13.93
మిర్చి	1.53	7.35
చెరకు	1.20	97.97
పొగాకు	0.94	2.41

వరి సాగు పెరగాలి: కృష్ణా, గోదావరి డెల్టాలకు నీటి విడుదల, జులైలో వర్షాలు కురుస్తాయనే నేపథ్యంలో వరిసాగు పెరుగుతుందని అంచనా. ఈ ఏడాది 139.46లక్షల టన్నుల ధాన్యం పండించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అంటే గతేడాదితో పోలిస్తే 17.48లక్షల టన్నులు పెరగాల్సి ఉంటుంది.

పత్తి సాగు తగ్గాలి: పత్తిపై హెచ్‌టీ బీటీ ప్రభావం ఒక వైపు.. చీడపీడలు మరోవైపు రైతుల్ని నష్టపరుస్తుండటంతో అందుకు అనుగుణంగా సాగు తగ్గించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఈ ఏడాది 5.86లక్షల హెక్టార్లలోనే సాగు ఉంటుందని అంచనా వేసింది.

అమరావతి అభివృద్ధికి రూ.200 కోట్లు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనున్న వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ) బకాయిల నుంచి రూ.200 కోట్లు అమరావతి అభివృద్ధికి ఇవ్వనున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం ప్రకటించింది. రూ.3,940 కోట్ల పీఆర్‌సీ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించిన నేపథ్యంలో ఏపీ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు, పింఛనుదారుల సంఘాల నాయకులు బుధవారం సచివాలయంలో చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి భారమైనా, నవ్యాంధ్ర నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తున్న ఉద్యోగులకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమరావతి అభివృద్ధికి ఉద్యోగ సంఘాలు ఇచ్చే రూ.200 కోట్లతో ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉండే భవన నిర్మాణం చేపట్టాలని మంత్రి నారాయణకు సూచించారు.

ఆ భవనానికి చంద్రబాబు పేరు

ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడుతూ.. తాము ఇచ్చే నిధులతో ప్రభుత్వం నిర్మించే భవనానికి చంద్రబాబు పేరు పెట్టాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించినట్లు తెలిపారు. గత 50 ఏళ్లలో ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు చెల్లించిన దాఖలాలు లేవని, సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని, ఉద్యోగుల మనసు గెలుచుకున్నారని ముఖ్యమంత్రిని కొనియాడారు. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 4 లక్షల మంది ఉద్యోగులు, 4 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి చేకూరనుందని వివరించారు. ఒక్కో ఉద్యోగి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో నేతలు విద్యాసాగర్, సుధీర్‌బాబు, హృదయరాజు, గాజుల నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులపై చర్యల విధానంలో మార్పులు

ఈనాడు, అమరావతి: చిన్న చిన్న తప్పిదాలకే ఆర్టీసీ కార్మికులపై తీవ్రమైన చర్యలు తీసుకునే విధానంలో యాజమాన్యం మార్పులు తీసుకురానుంది. అందులో భాగంగా ఆయా కార్మికులు చేసిన తప్పిదాల ఆధారంగా పాయింట్లను కేటాయిస్తుంది. నిర్ణీత పాయింట్లు మించితే వారిపైన చర్యలు తీసుకోనుంది. దీనికి సంబంధించి యాజమాన్యం ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలను సిద్ధం చేసింది. వాటిపై బుధవారం విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో కార్మిక సంఘాల నాయకులతో చర్చించింది. ఈడీలు వెంకటేశ్వరరావు, జయరావు, కోటేశ్వరరావు తదితరులు యాజమాన్యం తరఫున సమావేశంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరరావు.. ఆర్టీసీ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఈడీ కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జీవీ రావు, ప్రధాన కార్యదర్శిగా జి.నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో బుధవారం కార్యవర్గ ఎన్నిక జరిగింది. అయిదుగుర్ని ఉప ప్రధాన కార్యదర్శులుగా, 8మందిని సంయుక్త ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.

మళ్లీ మెలిక

(మొదటి పేజీ తరువాయి)

స్టీల్ ప్లాంటుకు తెరదించిందన్నట్లు ప్రచురించారు. అది తెలిసిన వెంటనే మేం వివరణిస్తూ ప్రకటన జారీ చేశాం. ఏడాదిన్నర క్రితం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ ఇప్పటికీ కడప, బయ్యారంలో స్టీల్ ప్లాంటు ఏర్పాటుకుగల సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేస్తోంది. మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రెండు కమిటీలు చెప్పిన విషయాలనే మేం అఫిడవిట్‌లో ప్రస్తావించాం. ఆ తర్వాత మేం రెండు రాష్ట్రాల ప్రతినిధులతో కలిసి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. గత ఏడాది డిసెంబరులో టాస్క్‌ఫోర్స్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై వివరణ కోరింది. మేం అడిగిన కొన్ని నిర్దిష్టమైన ప్రశ్నలకు ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే సమాధానం ఇచ్చింది. ఈనెల 22న భూమి, ఖనిజ లింకేజీ గురించి వారి నుంచి మరింత స్పష్టత కోరాం. ఈ రెండు అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చిన వెంటనే టాస్క్‌ఫోర్స్ నివేదికను పూర్తి చేయగలుగుతుంది. ఆ తర్వాత కడపలో ప్లాంటు ఏర్పాటుపై తదుపరి కార్యాచరణ చేపట్టడానికి వీలవుతుంది. ఈ అంశంపై ఇప్పటివరకూ ఉన్న అపోహలన్నింటికీ మేం స్పష్టత ఇస్తున్నాం. అందువల్ల యువకులైన సీఎం రమేష్, బీటెక్ రవి ఆందోళన విరమించాలి' అని బీరేంద్ర సింగ్ పేర్కొన్నారు. 'ఈ నెల 22న మెకాన్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. అందుబాటులో ఉన్న భూమిలో ప్రైవేటు భూమి ఎంత? ప్రభుత్వ భూమి ఎంతో చెప్పాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం 1800 ఎకరాల భూమి ఇవ్వగలుగుతామని చెప్పింది. 1.5 మిలియన్ టన్నుల సామర్థ్యమున్న ప్లాంటుకు ఆ భూమి సరిపోతుందని భావిస్తున్నా. తొలుత మెకాన్ నివేదిక ఇవ్వాలి? ఒక వేళ ప్లాంటు ఏర్పాటు చేస్తే సంప్రదాయ పద్ధతిలోనే ఉండాలా? లేదంటే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం వెళ్లాలా? అన్నది చూడాలి. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏ తరహా సాయం అందుతుందన్నది స్పష్టత రావాలి. ఇవేవీ లేకుండా ఎప్పుడు రిబ్బన్ కట్ చేస్తారని అడిగితే నేనేం చెప్పగలను. సీఎం రమేష్ నాకు మంచి స్నేహితుడు. ఆయన నా మాట విని దీక్ష విరమించాలి. నేను చెప్పిన దాంతో ఎంపీలంతా సంతృప్తి చెందారు' అని కేంద్ర మంత్రి వివరించారు. మెకాన్ నివేదిక ఎప్పటిలోగా వస్తుందో చెప్పగలరా? అని గల్లా జయదేవ్ ప్రశ్నించగా.. 'నాకు నివేదిక అందినప్పుడు ఎప్పటిలోగా నిర్ణయం తీసుకోగలనో చెప్పడానికి వీలవుతుంది. తొలుత ఏపీ ప్రభుత్వం నుంచి రెండు అంశాలపై సమాచారం రావాలి. మీరు స్పష్టమైన గడువు కావాలని అడుగుతున్నారు? కానీ నేను నా మాటపై నమ్మకం ఉంచండి అని కోరుతున్నా... అంతకు మించి ఏమీ చెప్పను. నేను విభిన్నమైన వ్యక్తిని. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి' అని బీరేంద్ర సింగ్ పేర్కొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీరేంద్రసింగ్

ఎంపీల అసంతృప్తి

కడప స్టీల్ ప్లాంటు ఏర్పాటుపై బీరేంద్ర సింగ్ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో తెదేపా నేతలు కొనకళ్ల నారాయణ, కనకమేడల రవీంద్ర కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి సమాధానం తమకు సంతృప్తినివ్వలేదని, అందువల్ల ఆందోళన కొనసాగిస్తామని ప్రకటించారు. కేంద్రమంత్రితో సమావేశం ముగిసిన తర్వాత వారు సహచర ఎంపీలు కేశినేని నాని, అవంతి శ్రీనివాస్, నిమ్మల కిష్టప్ప, రామ్మోహన్ నాయుడు, మురళీ మోహన్, గల్లా జయదేవ్, బుట్టా రేణుక, శ్రీరాం మాల్యాద్రి, మాగంటి బాబు, పండుల రవీంద్రబాబులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భూమి, గనుల లింకేజీకి సంబంధించి కేంద్రం అడిగిన సమాచారమంతా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చేసిందని, మరింత సమాచారం కావాలని కేంద్రం నుంచి ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి వర్తమానమూ రాలేదని స్పష్టం చేశారు. వాళ్లు చిత్తశుద్ధితో లేరని వ్యాఖ్యానించారు. కేటాయించే భూమి ప్రైవేటుదా? ప్రభుత్వానిదా? అని అడుగుతున్నారని, అది ఏ భూమైనా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు దివాకర్‌రెడ్డి, టీజీ వెంకటేష్, తోట సీతారామలక్ష్మి ఉన్నారు.

బుధవారం జమ్ము నుంచి అమర్‌నాథ్ యాత్రకు బయలుదేరుతున్న సమయంలో సాధువుల ఉత్సాహం

అసాధారణ భద్రత మధ్య మొదలైన అమర్‌నాథ్ యాత్ర

జమ్ము: అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ప్రతిష్ఠాత్మక అమర్‌నాథ్ యాత్ర బుధవారం తెల్లవారుజామున మొదలయింది. ఉగ్రదాడుల భయం పొంచిఉన్నా లెక్క చేయకుండా తొలి విడతగా 2995 మంది భక్తులు హిమలింగ దర్శన భాగ్యం కోసం 107 వాహనాల్లో అమర్‌నాథ్ గుహకు బయల్దేరారు. సాయంత్రానికి తమతమ శిబిరాలకు చేరుకున్న వీరంతా... 3880 మీటర్ల ఎత్తైన గుహ వద్దకు గురువారం కాలినడకన బయల్దేరుతారు. 60 రోజుల యాత్ర సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. యాత్రలో పాల్గొనేందుకు దాదాపు 2 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వాహనాల కదలికల్ని కంట్రోల్‌రూం నుంచే తెలుసుకునేందుకు మొట్టమొదటిసారిగా వాటికి రేడియో పౌనఃపున్య గుర్తింపు (ఆర్ఎఫ్ఐడీ) ట్యాగ్‌లు తగిలిస్తున్నారు. కెమేరాలతో కూడిన శిరస్త్రాణాలు ధరించి, వివిధ ప్రాణ రక్షక పరికరాలతో ద్విచక్రవాహనాలపై తిరిగే గస్తీ దళాలను సీఆర్‌పీఎఫ్ మొదటిసారిగా రంగంలోకి దించింది. 40,000 మందిని బందోబస్తులో వినియోగిస్తున్నారు. తూటా నిరోధక వాహనాలతో బలగాలు పహారా కాస్తున్నాయి. ఉగ్రవాదులు ఎలాంటి దాడులకు పాల్పడకుండా చూడడానికి కీలకమైన ప్రాంతాల్లో తూటా నిరోధక భూగర్భ గృహాలు (బులెట్ ప్రూఫ్ బంకర్లు) పెద్దఎత్తున నిర్మించారు. అడుగడుగునా సీసీటీవీ కెమేరాలు, డ్రోన్లు మోహరించారు. దాడులు జరిగినా క్షణాల్లో బలగాలు చేరుకునేందుకు వీలుగా జాగ్రత్తలు తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

గ్రహం అనుగ్రహం

28–6–2018 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; శుక్ల పక్షం
పూర్ణిమ: ఉ. 9-12 తదుపరి బహుళపక్ష పాడ్యమి
మూల నక్షత్రం: ఉ. 11-56 తదుపరి పూర్వాషాఢ
అమృత ఘడియలు: ఉ. 6-40 వరకు
వర్జ్యం: ఉ. 10-10 నుంచి 11-56 వరకు
తిరిగి రా. 10-30 నుంచి 12-16 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-52 నుంచి 10-44 వరకు
తిరిగి మ. 3-05 నుంచి 3-57 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5-31; సూర్యాస్తమయం: సా.6-34
ఏరువాక పూర్ణిమ

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
సూర్యాపేట	40.0	28.0
తిరుపతి	36.5	28.0
నరసాపురం	36.0	28.3
కడప	36.0	27.0
తాడేపల్లిగూడెం	36.0	25.0
శ్రీకాకుళం	35.5	25.5
కరీంనగర్	35.5	25.0
ఒంగోలు	35.3	28.5
విజయవాడ	35.1	27.2
అనంతపురం	35.1	25.6
మెదక్	34.6	23.2
గుంటూరు	34.1	27.5
నల్గొండ	34.0	25.0
నిజామాబాద్	33.9	23.4
కర్నూలు	33.7	26.7
హైదరాబాద్	33.4	24.3
ఖమ్మం	33.0	32.0
రామగుండం	32.8	23.0
నెల్లూరు	32.0	29.0
రాజమహేంద్రవరం	32.0	25.0
విశాఖపట్నం	30.0	24.6

సమాచార నిర్వహణ విధానంపై అధ్యయనం చేసేందుకు సీఆర్‌డీఏ అధికారులు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. జులై 1 నుంచి 7 వరకూ కొనసాగనున్న ఈ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అనుమతులిచ్చింది. పర్యటనలో పరిశీలించిన అంశాలపై అధికారులు ఓ నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలి.

హీలియం-3 అన్వేషణలో ఇస్రో

(మొదటి పేజీ తరువాయి)

హీలియం-3, నీటి జాడల కోసం విశ్లేషిస్తుంది. హీలియం-3 ఐసోటోప్ భూమిపై పరిమితంగానే ఉంది. చంద్రుడిపై ఈ ఐసోటోప్ లభ్యత భారీగా ఉంది. సిద్ధాంతపరంగా చూస్తే భూమిపై ఇంధన డిమాండ్‌ను 250 ఏళ్ల వరకు తీర్చగలదు. చంద్రయాన్-1 ద్వారా చంద్రుడిపై నీటి పరమాణువుల జాడను కనుగోవడంతో ఇస్రో ఖ్యాతి ప్రపంచ వ్యాప్తంగా మార్మోగింది. ఇప్పుడు చంద్రయాన్-2తో మరో అద్భుత విజయాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

చంద్రుడి దక్షిణ భాగంపైకి చైనా కూడా ఈ ఏడాది చివరిలో రోవర్‌ను పంపించే ఏర్పాట్లలో ఉంది. మరోవైపు అంతరిక్ష పరిజ్ఞానంలో అగ్రభాగాన ఉన్న అమెరికా కూడా 2020ల్లో చంద్రుడిపైకి ఆర్బిటర్‌ను మరోసారి ప్రయోగించాలనుకుంటోంది. అయితే అమెరికా కన్నా అతి తక్కువ ఖర్చుతోనే భారత్ చంద్రయాన్-2ను చేపట్టగలదు. అంతరిక్ష ప్రయోగాలను ఐరోపా దేశాలు, అమెరికా తదితర దేశాలతో పోల్చుకుంటే అతి తక్కువ ఖర్చులోనే విజయవంతం చేయగల నైపుణ్యం ఇస్రో ఇప్పటికే సొంతం చేసుకుంది.

స్వీయపరిజ్ఞానం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి చంద్రయాన్-2 ప్రారంభమవుతుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్10 రాకెట్ ద్వారా ఆర్బిటర్, లాండర్, రోవర్‌ను అంతరిక్షంలోకి తీసుకెళ్తారు. ఈ మూడింటినీ భారతే అభివృద్ధి చేసింది. ఆర్బిటర్‌ను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెడతారు. లాండర్, రోవర్‌ను చంద్రుడి దక్షిణ ధ్రువానికి దాదాపు 600 కి.మీ.దూరంలో దించుతారు. ఆరు చక్రాలతో దీర్ఘచతురస్రాకారంలో ఉండే రోవర్ అక్కడి ఉపరితలంపై తిరుగుతూ అక్కడికక్కడే విశ్లేషణలు చేపడుతుంది. కనీసం 14 రోజుల పాటు 400 మీటర్ల వ్యాసార్థ పరిధిలో తిరుగుతూ డేటా సేకరిస్తుంది. ఆ డేటా... ఆర్బిటర్ ద్వారా భూమిపైకి చేరుతుంది.

హీలియం–3తో అణు వ్యర్థాలు ఉండవు

ప్రస్తుత అణు విద్యుత్తు కర్మాగారాల్లో అణు విచ్ఛిత్తి రియాక్టర్లు మాత్రమే ఉన్నాయి. ఈ పరిజ్ఞానంలో అణు వ్యర్థాల ఉత్పత్తీ ఉంటుంది. రేడియోధార్మికత ప్రమాదం కూడా ఉంటుంది. ఈ వ్యర్థాలను అత్యంత భద్రంగా నిల్వ చేయాల్సి ఉంటుంది. అందుకే శాస్త్రవేత్తలు అణువిచ్ఛిత్తికి బదులు అణుసంలీనం ద్వారా విద్యుదుత్పత్తికి కృషి చేస్తున్నారు. హీలియం-3, డ్యుటీరియం మెరుగైన పరిష్కారం. శక్తి వృథా చాలా పరిమితంగా ఉంటుంది. అణువ్యర్థాలుండవు. రేడియోధార్మికత కూడా ఉండదు. అయితే హీలియం-3 భూమిపై చాలా పరిమితంగా ఉంది. సౌరతుపాన్ల కారణంగా చంద్రుడిపై ఈ ఐసోటోప్ పెద్ద ఎత్తున పోగుపడింది. అక్కడ పది లక్షల మెట్రిక్ టన్నుల హీలియం-3 ఉందని అంచనా. అందులో పావు వంతు మాత్రమే భూమిపైకి తీసుకురావడానికి సాధ్యమవుతుంది. ఈ పావు వంతుతోనే భూమిపై కనీసం రెండు శతాబ్దాలు, గరిష్ఠంగా ఐదు శతాబ్దాల పాటు విద్యుత్తు అవసరాలు తీర్చుకోవచ్చని అంచనా. హీలియం-3 విలువ టన్నుకు 500 బిలియన్ డాలర్లు ఉంటుంది.

–ఈనాడు ప్రత్యేక విభాగం

AP-DSC
SGT, SA (All Sub.), TPT,PET,HPT
TS,APలలో వేలది మందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన ఏకైక సంస్థ మాదే
అత్యుత్తమ అధ్యాపక బృందంచే డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ సారథ్యంలో బోధన
మా ప్రత్యేకతలు - Daily Test లు, నిర్వహించబడును, హాస్టల్ వసతి కలదు
FREE DEMO :01-7-2018 at 10.08 am
RAMAIAH
COMPETITIVE COACHING CENTRE
Dilsukhnagar, HYDERABAD | 9246208422, 040-66778422 Cell : 8885555202

2017 - SI సెలక్షన్స్‌లో స్టేట్ 1st ర్యాంకు సాధించిన సంస్థచే
SI & కానిస్టేబుల్స్ 18వ బ్యాచ్: 7-7-18, 10am
Seperate Batches for TM & EM | జిమ్ & హాస్టల్ కలదు
శ్యామ్ ఇన్‌స్టిట్యూట్
విద్యుత్‌నగర్, కాకినాడ, తూ.గో.జిల్లా.
0884 - 2362744
98482 56254
98481 36254

వాల్మీకి (తెలుగు పండిట్స్ అకాడమి) | DSC L.P. & SA (తెలుగు) 40 - 45 రోజులలో సిలబస్ పూర్తి
తెలుగు : వెంకటరావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో
తేది: 28.06.2018న IInd బ్యాచ్ ప్రారంభం.
సైకాలజీ & PIE : డా॥ మోజెస్ (HYD)
గారిచే 12.7.18 to 15.7.18 వరకు.
All S.A'S & SGT క్రాష్ బ్యాచ్ కలదు.
స్థలం : కుట్టి కాలేజ, V.R.C. సెంటర్, నెల్లూరు.
Cell: 62812 29244, 63033 41854

EKALAVYA IAS ACADEMY
RANK ASSISTANCE Oriented Program
Degree+IAS, Prelims - cum - Mains
మీరు చేరబోయే సంస్థతో EKALAVYAను స్వయంగా సరిపోల్చుకొని మీ పిల్లల భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోండి.
Beside Nagarjuna Hospital, Kanuru, VJA, Ph:6300181832

Civils/Groups శిక్షణలో అత్యుత్తమ శిక్షణ సంస్థగా గుర్తింపు పొందిన రంగరాయ ఆధ్వర్యంలో
EXCELLENT PRE-TRAINING for
»INTER + IAS, IPS, IFS... »DEGREE + IAS, IPS, IFS...
»CIVILS/GROUP - I&II, Prelims & Mains
అడ్మిషన్ల కొరకు సంప్రదించండి | హైదరాబాద్ 9676413716 | అమరావతి 9492755270 | రాజమండ్రి 8096951705 | Admissions are in PROGRESS 2018 - 19
సపరేట్ హాస్టల్ & ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కలదు
RANGARAYA IAS ACADEMY

జారీ చేయువారు: కమీషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఈనాడు

రహదార్లకు కొత్త రూపు

'ఏ దేశ సంపదలోనైనా మూడింట రెండొంతుల వాటా సుసంపన్న మానవ వనరులదే... సహజ వనరుల కంటే, ఉత్పాదక మూలధనం కంటే అది ఎంతో విలువైనది'- ఆరునెలల క్రితం టోక్యోలో జరిగిన సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ ఫోరం సదస్సులో ప్రపంచ బ్యాంకు అధ్యక్షులవారి అభిభాషణ అది. ప్రపంచవ్యాప్తంగా ఏటా రహదారి ప్రమాదాల్లో 12.5 లక్షలమంది చనిపోతుంటే, ఐదు కోట్లమంది దాకా క్షతగాత్రులవుతున్న మహా మానవ విషాదంలో ఇండియా వాటా ఏకంగా 13శాతంగా ఉండటం భారత ధాత్రిని నిలువునా కుంగదీస్తోంది. మృత్యువు రహదార్లపైనే తిష్ఠవేసిందా అన్నట్లు ప్రతి మూడు నిమిషాలకో మరణం- ప్రయాణానికి ప్రమాదం అన్న దుర్దశన్ని స్థిరీకరించి లక్షల కుటుంబాల్ని కర్కశంగా చిదిమేస్తోంది. ఏ రోజు దిన పత్రిక తిరగేసినా గుండె తరుక్కుపోయే రహదారి ప్రమాద దుర్వార్తలే. మొన్నటికి మొన్న మూసీలో ట్రాక్టర్ బోల్తా కొట్టి 14మంది మహిళలతోపాటు మరో కరు జల సమాధి అయిన ఘోరం కర్నూలులో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొని తొమ్మిది మంది అసువులు బాశారు. ఆ మర్నాడే ఆటోను కారు ఢీకొన్న దుర్ఘటనలో అయిదుగురు కన్నుమూశారు. మితిమీరిన వేగం, వాహన చోదకుల అలక్ష్యం, రహదారి నిబంధనల్ని పాటించకపోవడం, మద్యం మత్తులో దూసుకుపోవడం- ఇవన్నీ రహదార్లపై విషాద వృష్టికి కారణమవుతున్నాయి. వాటితోపాటు రహదార్ల నిర్మాణంలో లోపాలు సైతం తమ వంతు బలి కోరుతున్నాయి! రహదార్ల నిర్మాణ దశలో భద్రతాప్రమాణాల్ని పాటించకపోవడం ఎన్నో ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తోందంటూ ఒక పౌరుడు రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన హైకోర్టు- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తాఖీదులు జారీ చేసింది. రహదార్లపై మరమ్మతులు జరుగుతున్న చోట ప్రమాద హెచ్చరికలు పెట్టకపోవడంలో గుత్తేదార్ల కక్కుర్తి, అధికారుల అలక్ష్యం ఎన్నో మరణాలకు కారణమవుతున్నాయనడంలో మరో మాట లేదు. ఈ తరహా నిష్పూచీతనానికి నిలువు పాతరేసి, భద్రమైన రహదారులకోసం గట్టి కార్యాచరణ సత్వరం పట్టాలెక్కించక తప్పదు!

దేశవ్యాప్తంగా రోడ్ల వ్యవస్థలో జాతీయ రహదారుల వాటా పట్టుమని 1.8శాతమే అయినా వాటిపైనే 30శాతం దాకా ప్రమాదాలు, 34.5శాతం మరణాలు సంభవిస్తున్నాయి. కేవలం 3.14శాతంగా ఉన్న రాష్ట్ర రహదారులపై పాతిక శాతంపైగా ప్రమాదాలు, 28శాతం మరణాలు చోటు చేసుకొంటున్నాయి. అంటే అయిదు శాతం కూడా లేని కీలక రహదారులపైనే మూడింట రెండొంతుల మరణాలు నమోదుకావడం- అనేకానేక వ్యవస్థాగత లోపాల్ని పట్టిస్తోంది. 66.5శాతం ప్రమాదాలకు, 61శాతం మరణాలకు మితిమీరిన వేగమే పుణ్యం కట్టుకొంటోందని అధికారులు అంటున్నా- శాస్త్రీయత కొరవడిన రోడ్ల నిర్మాణంలో లొసుగులు, లోపాల్ని విస్మరించగలమా? మహబూబ్ నగర్ జిల్లా పాలెం వద్ద చిన్న కల్వర్టును వెడల్పు చెయ్యకపోవడంవల్ల బెంగళూరునుంచి వస్తున్న ప్రైవేటు బస్సు అగ్ని ప్రమాదానికి గురై 45 నిండు ప్రాణాలు బుగ్గిపాలయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ అనునిత్యం 13వేల భారీ మధ్య తరహా వాహనాలు తిరుగాడే 65 నెంబరు జాతీయ రహదారిపై 21 ప్రమాదకర ప్రాంతాలున్నట్లు అధికారగణమే గుర్తించింది. ప్రమాదకర ప్రాంతాల్లో 14-16 అండర్ పాసులు నిర్మించాలన్న ప్రతిపాదనలకు ఎప్పుడు మోక్షం దక్కుతుందోగాని- ఏటికేడు ఈ మార్గంలో ప్రమాదాలు, మృతుల సంఖ్య బెంబేలెత్తిస్తోంది. అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న రహదారి నిర్మాణ శాస్త్ర విజ్ఞానాన్ని అందిపుచ్చుకోకుండా అడ్డగోలుగా నిర్మిస్తున్న డివైడర్లే అనేక సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతున్నాయి. దానికి విరుగుడు మంత్రంగా యూకేకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ రీసర్చ్ లేబొరేటరీ రూపొందించిన విభాగినుల (డివైడర్స్) వినియోగం ఎంతో శ్రేయస్కరమని నిపుణులు మొత్తుకొంటున్నారు. పరలోకానికి రహదారులుగా భ్రష్టుపట్టిన ప్రస్తుత దురవస్థను దునుమాడాలంటే దూరదృష్టి, ఆధునిక పరిజ్ఞానాల్ని మేళవించి రోడ్ల వ్యవస్థను సంస్కరించక తప్పదు!

రహదారి భద్రతపై 2015లో బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సు 2020 నాటికి ప్రమాదాల్ని సగానికి తగ్గించాలంటూ వెలువరించిన బ్రసీలియా ప్రకటనను ఇండియాసైతం ఆమోదించింది. ఏటా లక్షన్నర మందికిపైగా అభాగ్యుల్ని కబళిస్తున్న రోడ్డు ప్రమాదాల్లో 86శాతం 13 రాష్ట్రాల్లోనే చోటుచేసుకొంటున్నాయని, వాటిలో ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో, తెలంగాణ తొమ్మిదో స్థానంలో కొలువు తీరాయని సర్కారీ గణాంకాలే ఎలుగెత్తుతున్నాయి. 2018నాటికే ప్రమాదాల సంఖ్యను సగానికి తగ్గించేలా బహుముఖ కార్యాచరణ వ్యూహాన్ని కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రతిపాదించినా అది ఆచరణలో నీరోడింది. డిజైన్ల దశలోనే రహదారి భద్రతపై నిశిత దృష్టి, పదేపదే ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల బాగుసేత, భద్రతాంశాల పరంగా వాహన తయారీలో మెరుగుదల, చట్టాలను కట్టుదిట్టం చేసి గట్టిగా అమలు చెయ్యడంవంటి శుభ సంకల్పాల వల్లెవేతతో ఏం ఒరగలేదు కాబట్టే, నిరుడు డిసెంబరులో సుప్రీంకోర్టు తనవంతుగా పాతిక మార్గదర్శకాల్ని వెలువరించింది. వాటికీ ఏపాటి మన్నన దక్కుతోందో వరస వెంబడి ఘోర ప్రమాదాల ఉరవడే వెల్లడిస్తోంది. రహదారి భద్రతపై పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టి, వేగ నియంత్రణతోపాటు వాహనాల్లో భద్రతా ప్రమాణాలు పెంచి, 'మద్య' మారీచులపై ఉక్కుపాదం మోపి ఆస్ట్రేలియా అద్భుత ఫలితాలు సాధించింది. స్వీడన్ అమలు చేస్తున్న 'విజన్ జీరో' విధానం స్ఫూర్తిమంతంగా ఉంది. రహదార్ల నిర్మాణంలో శాస్త్రీయత, లైసెన్సుల జారీలో పారదర్శకత, చట్టాల అమలులో జవాబుదారీతనం, రహదారి భద్రతను ఉమ్మడి బాధ్యతగా గౌరవించే పౌరస్పృహ, వేగ నియంత్రణ వంటివి పూర్తి స్థాయిలో అమలుకు నోచుకొన్నప్పుడే రహదార్లు ప్రగతికి బాటలుగా కొత్త రూపు దాలుస్తాయి!

నవీకరణపై నిర్లిప్తత

ఆయుధాగారాల్లో మందుగుండు కొరత లేదని ఈ నెల మొదటి వారంలో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరించారు. వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. త్రివిధ దళాల ఆధునికీకరణకు అరకొర బడ్జెట్ కేటాయింపులపై స్వయంగా సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్, ఉపసైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ శరత్‌చంద్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'కొన్నేళ్లుగా సైన్యం ఆయుధాలు, మందుగుండు కొరతను ఎదుర్కొంటోంది. కాలం చెల్లిన ఆయుధాలను నవీకరించే విధానాలు, బడ్జెట్ కేటాయింపులపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఈ విషయంలో రక్షణశాఖ ఆత్మపరిశీలన చేసుకుంటున్నట్లు కనిపించడం లేదు' అని పార్లమెంటరీ స్థాయీ సంఘం సైతం తూర్పారబట్టింది. భాజపా ఎంపీ బీసీ ఖండూరి నేతృత్వంలోని ఈ సంఘం జాతీయ భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందిస్తూ సైన్యం కోరికలు అసమంజసమైనవి కావు అంటూనే నిధుల కొరత లేదని తేల్చేశారు రక్షణమంత్రి. ఆయుధాల్లో యాభై శాతం కాలం చెల్లినవన్న మాట వాస్తవమేనా అంటూ ఎంపీలు ఎం.కె.రాఘవన్, హరిఓంసింగ్ గతేడాది ఆగస్టులో లోక్‌సభలో ప్రశ్నించగా 'సమాచారం సేకరించి సభ ముందు ఉంచుతాం' అంటూ ప్రభుత్వం తప్పించుకుంది. కానీ, మరో రూపంలో ఆ సమాచారం వెలుగులోకి వచ్చింది. సైన్యం ఉపయోగిస్తున్న ఆయుధాల్లో 68 శాతం కాలం చెల్లినవేనని ఈ ఏడాది మార్చిలో పార్లమెంటరీ స్థాయీ సంఘం ఎదుట ఉపసైన్యాధిపతి కుండ బద్దలుకొట్టారు.



సింహభాగం జీతాలకే సరి

గతేడాది కంటే 2018-19 బడ్జెట్‌లో రక్షణ మంత్రిత్వ శాఖ కేటాయింపులు 7.81 శాతం పెరిగి రూ.2.95 లక్షల కోట్లకు చేరాయి. చూడటానికి ఇది భారీ మొత్తంగా కనిపిస్తోంది కానీ ఇందులో బలగాల ఆధునికీకరణకు ఉద్దేశించింది రూ.99,563 కోట్లే. మిగిలింది జీతాలు, నిర్వహణ వ్యయాలకు పోతుంది. ఆధునికీకరణకంటూ చెప్పిన మొత్తాన్ని త్రివిధ దళాలు పంచుకోవాలి. అందులోనూ ఎనభైఅయిదు శాతం ఇప్పటికే కుదుర్చుకున్న ఒప్పందాలకు సంబంధించిన వాయిదాల చెల్లింపులకు సరిపోతుంది. వెరసి, కొత్త ఆయుధాలను సమకూర్చుకోవడానికి మిగిలేది 15 శాతం నిధులే. 'ఈ ఏడాది బడ్జెట్ నిరాశపరచింది. ఆయుధాల ఆధునికీకరణకు రూ.21,338 కోట్లు కేటాయించారు. ఇప్పటికే సంతకాలు చేసిన ప్రాజెక్టులకు కట్టాల్సిన కిస్తీలే రూ.29,033 కోట్లు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మేమేం చేయాలి?' అన్న ఉపసైన్యాధిపతి వ్యాఖ్యలు నిస్సహాయతకు అద్దం పట్టేవే. ఈ ఏడాది రక్షణ శాఖకు కేటాయించిన మొత్తం, జీడీపీలో 1.58 శాతమే. 1962 చైనా యుద్ధం దరిమిలా రక్షణ రంగానికి ఇంత తక్కువ కేటాయించడం ఇదే మొదలు. 2014- 15లో జీడీపీలో 2.1 శాతంగా ఉన్న కేటాయింపులు, 2017- 18కి వచ్చేసరికి 1.66 శాతానికి తగ్గిపోయాయి. ఈ సంవత్సరం ఇంకా తగ్గాయి. చైనా, పాకిస్థాన్ నుంచి సవాళ్లు ఎదురవుతున్న దృష్ట్యా జీడీపీలో 2.5 శాతం మేర నిధులను రక్షణకు కేటాయించాలన్నది నిపుణుల సూచన. రక్షణశాఖ ప్రణాళికకు ఓ రూపం ఇవ్వడానికి కిందటేడాది జులై 10, 11ల్లో ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. అప్పట్లో రక్షణశాఖ బాధ్యతలను అదనంగా నిభాయిస్తున్న అరుణ్ జైట్లీ సమావేశంలో మాట్లాడుతూ బలగాల ఆధునికీకరణే తమ ప్రాధాన్యాంశమని, దానికి తగిన నిధులను సమకూర్చుతామని చెప్పారు. కానీ, ఆర్థికమంత్రి హోదాలో త్రివిధ దళాల ఆశలకు ఆయనే గండికొట్టారు!

త్రివిధ దళాల్లో ముఖ్యంగా సైన్యం ఆధునిక ఆయుధాల కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. ఆధునిక యుద్ధట్యాంకులు, దూరశ్రేణి శతఘ్నులతో పాటు మౌలికమైన తుపాకులూ దానికి కరవే! సైనికుల దగ్గర కంటే కశ్మీరులో అరాచకం సృష్టిస్తున్న ఉగ్రవాదుల దగ్గరే అత్యాధునిక తుపాకులు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. సైన్యా

త్రివిధ దళాల సన్నద్ధతపై ప్రభావం

నికి అత్యవసరంగా 7.4 లక్షల అసాల్ట్ రైఫిళ్లు, 54 వేల తేలికపాటి మెషిన్‌గన్లు (ఎల్‌ఎంజీ), 44 వేల కార్బైన్లు కావాలి. 2007-08లో లెఫ్టినెంట్ జనరల్ రాజేందర్ సింగ్ ఇన్‌ఫాంట్రీ డీజీగా ఉన్న సమయంలో వీటికోసం అభ్యర్థించారు. రూ.45 వేల కోట్ల విలువ చేసే ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపడానికి పౌర యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తూ వస్తోంది. ఈ ఆయుధాలు అందితే ఉగ్రవాద వ్యతిరేక కార్యక్రమాల్లో అసువులుబాసే, గాయపడే సైనికుల సంఖ్య సగానికి సగం తగ్గిపోతుందన్నది రాజేందర్ సింగ్ విశ్లేషణ. ఒక్క జమ్మూకశ్మీర్‌లోనే ఉగ్రవాదుల దాడుల్లో గత నాలుగేళ్లలో 303 మంది భద్రతాసిబ్బంది అమరులయ్యారు. మరోవైపు నిధుల లేమి కారణంగా తాము సమకూర్చుకోలేని ఆయుధ వ్యవస్థలను సైన్యం ఇటీవల క్రోడీకరించింది. టీ-90 యుద్ధట్యాంకులు, రాకెట్లు తదితరాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఆధునిక తరం శతఘ్నుల కోసం బోఫోర్స్ కుంభకోణం నాటి నుంచి సైన్యం ఎదురుచూస్తోంది. మూడు దశాబ్దాల ఎదురుచూపుల తరవాత కిందటేడాది రెండు హోవిట్జర్ శతఘ్నులు వచ్చాయి. మొత్తం 143 రావాల్సి ఉంది. వీటికితోడు భవిష్యత్తరం యుద్ధవాహనాలు, అత్యాధునిక మందుపాతరల్లాంటివి ఇప్పటికీ అందని ద్రాక్షలే!

నావికాదళమూ పదిహేనేళ్ల (2015- 30) ఆధునికీకరణ ప్రణాళిక రూపొందించుకుంది. ఇది కార్యరూపంలోకి రావాలంటే రూ.12300 కోట్లు కావాలి. హిందూ మహాసముద్రంలో చైనా దూకుడు నేపథ్యంలో నావికాదళ నవీకరణ అత్యవసరం. కానీ, కేటాయింపులే నిరాశ పరుస్తున్నాయి. వైమానిక దళమూ ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది. యుద్ధ విమానాల కొనుగోళ్లలో విపరీతమైన జాప్యం జరుగుతోంది. మరోవైపు చైనా ఆధునికీకరణను ముమ్మరం చేసింది. ఆ దేశ రక్షణ బడ్జెట్ మన కన్నా మూడు రెట్లు ఎక్కువ. జలాంతర్గాములు, యుద్ధనౌకలు, ప్రత్యర్థి నౌకల విధ్వంసక వ్యవస్థలను అది ఎక్కువగా సమకూర్చుకోగలిగింది. రక్షణ అవసరాలకు సంబంధించి రూ.150 కోట్ల లోపు ఒప్పందాలను త్రివిధ దళాలే కుదుర్చుకోవచ్చు. అంతకంటే ఎక్కువ అయితే మంత్రిత్వ శాఖ స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి. ఈ నిర్ణయాధికారంలో భద్రతాబలగాలకూ ప్రాతినిధ్యం లేదు. దాంతో వారి ప్రతిపాదనలు చాలా వరకు బుట్టదాఖలవుతున్నాయి. రక్షణశాఖలోని ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీసు అధికారులు ఆర్థికశాఖకే విధేయంగా వ్యవహరిస్తూ భద్రతాబలగాల ప్రతిపాదనలను తరచూ తిరస్కరిస్తుంటారన్న విమర్శలు ఉన్నాయి. అందుకే రక్షణశాఖ అధికార యంత్రాంగాన్ని 'మూర్ఖ, అపారదర్శక, బండబారిపోయిన వ్యవస్థ'గా అభివర్ణించారు నౌకాదళం మాజీ అధిపతి అడ్మిరల్ అరుణ్‌ప్రకాశ్. రక్షణశాఖలోని పౌర అధికారుల తీరును పరిశీలిస్తే ఆయన మాటల్లో అతిశయోక్తి కనిపించదు.

మేలిమి సూచనలకు మన్ననేదీ?

పఠాన్‌కోట్ వైమానిక స్థావరంతో పాటు యురి, నగ్రోటా, సంజువాన్ సైనిక శిబిరాల మీద జరిగిన ఉగ్రవాదుల దాడులు దేశాన్ని నివ్వెరపరచాయి. భద్రతాపరమైన లోపాలే ఇందుకు కారణమన్నది అందరూ చెప్పే మాటే. కానీ, ఆ లోపాలు ఎందుకు తలెత్తుతున్నాయన్నది ప్రధాన ప్రశ్న. దీనికి కారణం నిధుల కొరతే! అరకొర కేటాయింపుల వల్ల సైనిక శిబిరాల దగ్గర భద్రతను సైన్యం కుదించుకోవాల్సి వస్తోంది. ఆరుగురు సైనికులు, ఓ పౌరుడు బలైన సంజువాన్ ఘటనను ఉటంకిస్తూ పార్లమెంటరీ స్థాయీసంఘం ఈ విషయాన్ని ప్రస్తావించింది. సరిహద్దులో సైన్యానికి మౌలిక వసతుల కల్పనలోనూ ప్రభుత్వం వైపు నుంచి అలసత్వమే రాజ్యమేలుతోంది. భారత్- చైనా సరిహద్దుల్లో 73 వ్యూహాత్మక రహదారులు నిర్మించాలని 2006- 07లో నిర్ణయించారు. 2012కి ఇవి పూర్తికావాలి. ఇప్పటికీ వీటిలో ఎన్ని పూర్తయ్యాయో తెలియదు. రక్షణపరంగా సన్నద్ధతలను పరిశీలించి తగిన సూచనలను చేసేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 18న ఉన్నతస్థాయి 'డిఫెన్స్ ప్లానింగ్ కమిటీ'ని ప్రభుత్వం నియమించింది. గతంలో కార్గిల్ సమీక్షా సంఘం (1999), అరుణ్‌సింగ్ టాస్క్‌ఫోర్స్ (2001), నరేశ్‌చంద్ర కమిటీ(2011)లు ఎన్నో సూచనలు చేశాయి. వాటిని అమలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. రక్షణ సామగ్రిని సమకూర్చుకోవడం కాస్త సమయం తీసుకునే వ్యవహారం. ఏ సంవత్సరంలో కేటాయించిన నిధులు అదే ఏడాదిలో పూర్తిగా వ్యయం చేయడం సాధ్యం కాదు. అలా ఖర్చు కాని సొమ్మును వెనక్కు తీసుకోకుండా ఉంటే అది భద్రతాదళాలకు ఉపయోగపడుతుంది. ఈ విషయంలో ఆర్థికశాఖ- ఇతర శాఖలతో మాదిరిగానే రక్షణశాఖతోనూ వ్యవహరిస్తోంది. గత నాలుగేళ్లలో ఖర్చుకాని రూ.35 వేల కోట్లను వెనక్కితీసుకుంది. ఇలా చేయడాన్ని ఆపాలన్నది రక్షణరంగ నిపుణుల సూచన. అలసత్వాన్ని విడనాడటంతో పాటు త్రివిధ దళాలకు అదనపు కేటాయింపులు చేయాలి. రక్షణ విధానాలను సమీక్షించుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టడం తక్షణావసరం.

- శైలేష్ నిమ్మగడ్డ

స్వయం సమృద్ధి మేడిపండే!

భారత రక్షణ రంగ అవసరాల్లో ఇప్పటికీ 75 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. దేశీయంగా తొమ్మిది ప్రభుత్వ రంగ సంస్థలు తమ 47 యూనిట్ల ద్వారా రక్షణ ఉత్పత్తులను అందిస్తున్నాయి. 41 యూనిట్లతో ఆర్డినెన్సు ఫ్యాక్టరీలు, 54 పరిశోధన- అభివృద్ధి కేంద్రాలతో డీఆర్‌డీవో ఈ జాబితాలో కనిపిస్తాయి. 2016- 17 సంవత్సరానికి వీటి ఉత్పత్తి విలువ రూ.58014 కోట్లు. పెరుగుతున్న అవసరాలను తీర్చడంలో ఇవి సమర్థంగా వ్యవహరించలేకపోతున్నాయి. దేశీయంగా అభివృద్ధి చేసుకున్నామంటూ గొప్పగా చెప్పుకొనే బ్రహ్మోస్ క్షిపణిలోనూ 65 శాతం విడిభాగాలు బయటి నుంచి వచ్చినవే! త్రివిధ దళాలకు గతంలో నిర్దేశించిన ప్రమాణాల మేరకు అవి నలభై రోజుల యుద్ధానికి సన్నద్ధంగా ఉండాలి. అందుకు కావాల్సిన మందుగుండును సిద్ధంగా ఉంచుకోవాలి. ప్రస్తుత మందుగుండు నిల్వలు పది రోజుల యుద్ధానికైనా సరిపోవు. 2017లో కాగ్ ఈ విషయమై ప్రభుత్వాన్ని హెచ్చరించింది. పార్లమెంటరీ స్థాయీ సంఘమూ చెప్పింది. సైన్యం కూడా పొంచి ఉన్న ముప్పును వివరించి, మందుగుండును అత్యవసరంగా సమకూర్చుకోవడానికి అదనపు నిధులను కోరింది. కానీ, ప్రభుత్వం ఒప్పుకోలేదు. దాంతో విధిలేని పరిస్థితుల్లో ఆర్డినెన్సు ఫ్యాక్టరీల నుంచి తమకు అందే వివిధ ఉత్పత్తుల్లో 44 శాతం దాకా తగ్గించాలని సైన్యం నిర్ణయించుకుంది.

బీటలు వారుతున్న పునాదులు

డాక్టర్ కల్లూరు శివారెడ్డి

ప్రపంచంలోనే ఎక్కువమంది పిల్లలను పాఠశాలలకు పంపుతున్న దేశం భారత్. దేశంలో దాదాపు 25 కోట్లమంది పిల్లలు పాఠశాలలకు వెళుతున్నారు. గడచిన రెండు దశాబ్దాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలే ఇందుకు కారణం. బడి పిల్లల్లో హాజరు శాతాన్ని మెరుగుపరచడంతోపాటు, వారిలో పోషకాహార స్థాయులను పెంచడానికి 1995లో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం, విద్యను ప్రాథమిక హక్కుగా మార్చిన విద్యాహక్కు చట్టం (2009) బడికివెళ్ళే పిల్లల సంఖ్య ఇనుమడించడానికి కారణమయ్యాయి. అయితే పై తరగతులకు వెళ్ళే కొద్దీ విద్యార్థుల నమోదు తగ్గుతోంది. ప్రభుత్వ యంత్రాంగం పిల్లలను విద్యాసంస్థల్లోకి ఎలా తీసుకురావాలన్న అంశంపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించింది. ప్రాథమిక విద్యలో విద్యార్థుల నమోదు పెరిగిందని సంబరపడుతున్న ప్రభుత్వం, నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరాన్ని విస్మరిస్తోంది. పదో తరగతి నాటికి దేశంలో 4.7 కోట్లమంది విద్యార్థులు బడి మానేస్తున్నారు. ఈ 'డ్రాపవుట్ల'వల్ల స్థూల దేశీయోత్పత్తిలో భారత్ ఏటా దాదాపు 0.3శాతం నష్టపోతోంది. డిగ్రీ పూర్తి చేసిన వారిలో సగం మందికి ఉపాధి నైపుణ్యాలు లేవు. నిధులు ఖర్చు చేసే సామర్థ్యం, పనిలో నైపుణ్యం, నైపుణ్యాల నవీకరణ, ప్రత్యేక నైపుణ్యం వంటి నాలుగు అంశాల ప్రాతిపదికన ప్రపంచ ఆర్థిక వేదిక ఇచ్చిన 'గ్లోబల్ హ్యూమన్ క్యాపిటల్ ఇండెక్స్ ర్యాంకింగు'లలో భారత్ 103వ స్థానంలో ఉంది. ఈ విషయంలో 'బ్రిక్స్' దేశాల్లో భారత్ స్థానం అట్టడుగున ఉంది. చైనా 62వ స్థానంలో ఉంది. పేదరికంలో అల్లాడే బోట్స్‌వానా (91), రువాండ (71) సైతం భారత్ కంటే ఎంతో ముందున్నాయి. నిధుల కొరతతోపాటు బోధన నాణ్యత దిగజారడం కూడా ఇందుకు కారణం. పాఠ్యాంశాలను దాటి బోధన స్థాయి విస్తరించకపోవడం, అనేక విద్యాసంస్థలు కేవలం డిగ్రీల ప్రదానం వరకే పరిమితం కావడం వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలు.

విస్తరిస్తున్న సంక్షోభం

'పాఠశాలల్లో నేర్చుకున్నది మర్చిపోయాక ఇక మిగిలినది, తనతో ఉన్నదే విద్యే' అన్నారు ఐన్‌స్టీన్. అంటే పరీక్షల్లో వచ్చే మార్కులకు, గ్రేడ్‌లకు విద్య అతీతమైంది. విద్యార్థి జ్ఞాన పరిణామక్రమం, జీవన గమనం విద్యాబోధకుల పైన, తాను చదివిన విద్యా సంస్థలపైన ఆధారపడి ఉంటుంది. మూడు నుంచి 18ఏళ్ల వయసున్న పిల్లలు తమ సమయంలో దాదాపు 65 శాతాన్ని బడిలోనే గడుపుతారు. ఆ సమయంలో విద్యార్థులకు జ్ఞానాన్ని ఇవ్వడమే కాక వారి మానసిక, భౌతిక ఆరోగ్యానికీ ప్రాధాన్యమిచ్చి వారిని జీవితం విసిరే సవాళ్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయాల్సిన బాధ్యత విద్యాసంస్థలదే. ఆర్థిక వ్యవస్థలో కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా విద్యారంగం సంస్కరణలకు నోచుకోలేదు. పాఠ్యాంశాలలో ఎప్పటికప్పుడు

ప్రమాణాలు లేక తల్లడిల్లుతున్న బడి

కొత్త విషయాలను చేర్చుతూ, వాటిపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను, అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తూ, వారికి నూతన విషయాలతో పాటు నవీన బోధన పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం విస్మరించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవు. బోధనలో మంచి పనితీరు కనబరిచే ఉపాధ్యాయులకు, విద్యాసంస్థలకు ప్రోత్సాహకాలు కరవయ్యాయి. సర్కారు దృష్టి మొత్తం విద్యార్థుల నమోదును పెంచడంపైనే కేంద్రీకృతమైంది. ఉపాధ్యాయుల పనితీరు, బోధనలో నాణ్యతను ఎప్పటికప్పుడు అంచనావేసి అవసరమైన సంస్కరణలు తీసుకురావడంలో అలక్ష్యం చేశారు. దీనికితోడు ప్రైవేటీకరణ విధానాలకు ప్రభుత్వం మద్దతు పలకడంతో అది ప్రైవేటు విద్యాసంస్థల పుట్టుకకు నాంది పలికింది. ఈ పరిస్థితిని తమకు ఉపయోగకరంగా మలచుకుని, ప్రభుత్వ నిబంధనల్లోని లోపాలను ఆధారంగా చేసుకుని సాంకేతిక విద్యాసంస్థలు వీధికొకటి పుట్టుకొచ్చాయి. అయితే ఆ మేర ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు, దేశంలో ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో అది అనారోగ్యకరమైన పోటీకి దారితీసింది. నాణ్యతలేని చదువులు, చదువు పూర్తయిన తర్వాత ఏంచేయాలో చెప్పలేని అయోమయం ప్రస్తుతం భారత విద్యావ్యవస్థను పీడిస్తున్నాయి. విద్యార్థుల జీవిత వికాసానికి దోహదపడాల్సిన పరీక్షలను మార్కులతో ముడిపెట్టడంతో విద్యార్థులపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. దేశంలో గంటకో విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నారు. విద్యార్థులను రేపటికోసం సిద్ధంచేయడంలో, విద్యాభ్యాస కాలాన్ని జ్ఞానం పొందే సమయంగా మలచడంలో వైఫల్యం కనిపిస్తోంది.



పట్టణ-గ్రామాల మధ్య అసమానతలు

దేశంలో నాణ్యమైన విద్యకు సంబంధించి గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం పెరిగిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యపై తలసరి ఖర్చు కనిష్ఠంగా ఉంటోంది. దీనివల్ల పట్టణ ప్రాంత విద్యార్థులతో పోలిస్తే పల్లెల్లోని వారు బాగా వెనకబడి పోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 14-18 సంవత్సరాల మధ్య ఉండే విద్యార్థుల్లో 36శాతం మందికి దేశ రాజధాని పేరు తెలియదని, 21శాతం మందికి వారి రాష్ట్రం పేరు గురించే అవగాహన లేదని; 14శాతం మంది భారత దేశ పటాన్ని గుర్తించ లేకపోయారని ఎఎస్ఈఆర్ నివేదిక (2017) చేదు నిజాలను వెల్లడించింది. తూర్పు ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లోని తొలి తరం నాయకులు పాఠశాల వ్యవస్థపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రభుత్వ పరిశ్రమలకు ఇంజినీర్లను సరఫరా చేయడానికి అగ్రశ్రేణి కళాశాలలపై నిధులు వెచ్చించారు. ఈ తప్పిదాన్ని సరిదిద్దడానికి చాలా సమయమే పట్టింది. కొన్ని రాష్ట్రాల్లో ఏటా ప్రభుత్వమే విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. దీనికోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. ముందు తరగతిలో ఇచ్చిన పుస్తకాలను తిరిగి ఇవ్వాలి అన్న నిబంధన తీసుకువస్తే కొత్త పుస్తకాలను ఏటా ముద్రించాల్సిన అవసరం ఉండదు. దానివల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఆదా అవుతాయి. ఇప్పటికే వివిధ నిపుణుల కమిటీలు విద్యావ్యవస్థ సమూల క్షాళనను ఉద్దేశించి అనేక సూచనలు చేశాయి. ఉదాహరణకు, 'భారం లేకుండా నేర్చుకోవడం' భారత విద్యావ్యవస్థలో భాగం కావాలని యశ్‌పాల్ నివేదిక రెండు దశాబ్దాల కిందటే సిఫార్సు చేసింది. ఆ సిఫార్సుల అమలు విషయంలో మాత్రం ప్రభుత్వాలు మితిమీరిన మందగమనం కనబరుస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆర్థిక వ్యవస్థకు అవసరమైన సమర్థ మానవ వనరులను అందించాల్సిన బాధ్యత దేశంలోని విద్యాసంస్థలదే. పాఠశాల స్థాయిలోనే అందుకు పునాదులు పడాలి. అన్ని సవాళ్లను ఎదుర్కొంటూ జాతి భవిష్యత్తు అవసరాలకు భవ్యమైన వనరులను తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత విద్యావ్యవస్థపై ఉంది. ఇందుకోసం దేశ విద్యావ్యవస్థను సమూలంగా సంస్కరించాలి. దానికి మొట్టమొదట కావలసింది రాజకీయ సన్నద్ధతే!

ఏరువాక పున్నమి

తెలుగునాట 'ఏరువాక' వ్యవసాయదారులకు సుప్రసిద్ధమైన పండుగ. ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమినాడు జరుపుకొనే పండుగ ఇది. అందుకే దీన్ని 'ఏరువాక పున్నమి' అనీ అంటారు. గ్రామీణులు ఈ పర్వదినాన ఎడ్లు, నాగలి, ఇతర వ్యవసాయ పనిముట్లను పూలు, పసుపు, కుంకుమ, రంగురంగుల కాగితాలతో అలంకరించి పూజిస్తారు. ధూపదీప, నివేదనలను చేస్తారు.

'ఏరు' అంటే నాగలి అని, ఏరువాక అంటే దుక్కి ప్రారంభ దినమని అర్థాలున్నాయి. ఈ పండుగ వర్షరుతువు ఆరంభంలో వస్తుంది. వ్యవసాయానికి తగినంత వృష్టిని ప్రసాదించమని ఈరోజున ఇంద్రుణ్ని పూజిస్తారు. పొలం దున్నడానికి శుభకరమైన నక్షత్రం 'జ్యేష్ఠ' అని జ్యోతిషశాస్త్రం చెబుతోంది. జ్యేష్ఠ నక్షత్రంతో చంద్రుడు కూడిఉండే పర్వడి జ్యేష్ఠ పూర్ణిమ. ఓషధులన్నింటికీ అధిపతి చంద్రుడు. ఓషధులు సమృద్ధిగా ఉంటేనే వ్యవసాయం విశేషమైన ఫలసాయం అందిస్తుంది. వేదజ్ఞులీరోజున క్షేత్రపాలుణ్ని కీర్తిస్తూ మంత్రపఠనం చేసేవారని రుగ్వేదం చెబుతోంది. 'సీతా యజ్ఞం' పేరుతో ఈ పండుగ జరుపుకొనే ఆచారం ఉండేదని విష్ణు పురాణం వెల్లడిస్తోంది. బౌద్ధ జాతక కథల్లోని 'వప్ప మంగల దివస' అనే పండుగ ఈ ఏరువాక పున్నమిని పోలిందే! శుద్ధోదన మహారాజు కపిలవస్తు నగరంలో వర్షరుతువు ఆరంభం కాగానే, కర్షకులకు బంగారు నాగళ్లను బహూకరించేవాడని 'లలిత విస్తరం' అన్న గ్రంథం పేర్కొంటోంది. హాలుడి 'గాథాసప్తశతి'లో ఏరువాక పున్నమి ప్రస్తావన ఉంది. ఉత్తర భారతంలో ఇదే రోజున 'ఉద్వృషభయజ్ఞం' పేరుతో ఎడ్లను పూజించి, వాటిని పరుగెత్తిస్తారు. జైమిని 'న్యాయమాల'లో ఈ ఉదంతం ఉంది. అథర్వణ వేదంలో 'అనడుత్సవం' పేరుతో రైతులీ ఉత్సవం జరుపుకొన్నట్లు వివరణ ఉంది. 'హలకర్మ' అనే పేరుతో నాగలిపూజ, 'మేదినీ ఉత్సవం' పేరుతో 'భూమి పూజ', 'వృషభ సౌభాగ్యం' పేరుతో పశువుల పూజ జరుపుతారని అథర్వణవేదం చెబుతోంది. వరాహమిహిరుడు రాసిన 'బృహత్సంహిత'లో పరాశర విరచితమైన 'కృషి పరాశరం'లో ఈ ఉత్సవాల ప్రస్తావన ఉంది. ఈ పౌర్ణమినాడు పద్మపురాణ గ్రంథం దానం చేయడం అశ్వమేధయాగ తుల్యమని శాస్త్ర కథనం. ఈ పండుగకు 'హల పూర్ణిమ', 'కృషి పూర్ణిమ' అనే పేర్లూ ఉన్నాయి.

ఏరువాక పున్నమి రోజున పశువులకు స్నానం చేయించి అలంకరిస్తారు. వ్యవసాయ పనిముట్లను, నాగళ్లను శుభ్రంచేసి, అలంకరించి టెంకాయలు సమర్పించి, బండ్లను మంగళవాద్యాలతో ఊరేగిస్తారు. పొలాలకు వెళ్లి దుక్కి దున్నుతారు. గోగునారతో చేసిన తోరణాలు కడతారు. వాటిని చర్నాకోలతో కొట్టి ఎవరికి దొరికిన పీచును వారు తీసుకువెళతారు. కొన్ని ప్రాంతాల్లో కాడికి ఒవైపు ఎద్దును కట్టి మరోవైపు రైతులే భుజాన వేసుకొని, భూమిని దున్నే ఆచారం ఉంది. పొంగలి బెల్లంతో వండిన పులగాన్ని (పొంగలిని) ఇంద్రుడికి నివేదన చేస్తారు. ఎడ్లను పరుగెత్తిస్తూ పందేలకు దిగుతారు. రైతులు ఊళ్లో ఊరేగుతూ పాలేళ్లతో మమేకమై సంబరం చేసుకుంటారు.



అంతర్యామి

రైతులంతా అత్యంతోత్సాహాలతో ఈ పండుగ జరుపుకొని రాబోయే కాలంలో పొలాలు సస్యశ్యామలమై బంగారం పండించాలని, లోకం సుభిక్షమై సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేస్తారు.

'పారస్కరుడు' తన గృహసూత్రాల్లో హలకర్మకు జ్యేష్ఠ, స్వాతి నక్షత్రాలు అనుకూలమైనవిగా అభివర్ణించి మంచి వ్యవసాయ విషయ పరిజ్ఞానం అందించాడు. మనదేశ సౌభాగ్యంలో పల్లీయుల సంస్కృతీ పరిరక్షణలో కర్షకులపాత్ర బహుధా ప్రశంసనీయమైనది. మెతుకుపెట్టి బతుకునిచ్చే అన్నదాతల ఈ ప్రముఖ ఉత్సవదినం సర్వులచే అభినందించదగినది. ఈ పూర్ణిమనాడే మహిళలు 'వటసావిత్రీ వ్రతం' ఆచరిస్తారు.

- చిమ్మపూడి శ్రీరామమూర్తి

నన్ను చంపేందుకు ప్రణాళిక: ప్రకాశ్‌రాజ్

బెంగళూరు, న్యూస్‌టుడే: పాత్రికేయురాలు గౌరీ లంకేశ్‌ను హత్య చేసిన దుండగులు.. ఆ తరువాత నన్నూ హతమార్చాలని ప్రణాళిక రూపొందించుకున్నారని బహుభాషా నటుడు ప్రకాశ్‌రాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. గౌరీని హత్య చేసిన హంతకులను ప్రత్యేక దర్యాప్తు దళం అధికారులు విచారణ చేసిన సమయంలో ఈ విషయం వెలుగు చూసిందని ఆయన వెల్లడించారు. ఈ అంశంపై టీవీ ఛానెళ్లు, వార్తా సంస్థలు కథనాలను ప్రచురించాయంటూ ఆయన తన ట్విట్టర్ ఖాతాలో బుధవారం వెల్లడించారు. 'జస్ట్.. ఆస్కింగ్' పేరిట వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన సభలు, సమావేశాల్లో మోదీని విమర్శించాననే నిందితులు నన్ను హత్య చేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారని తెలుసుకున్నానని ప్రకాశ్ వెల్లడించారు. గౌరీ లంకేశ్‌ను హత్య చేసుకునేందుకు 'ఆపరేషన్ ఆయి'(మరాఠీలో అమ్మ) పేరు పెట్టుకున్న నిందితులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత గిరీశ్ కర్నాడ్‌ను హత్య చేసేందుకు 'ఆపరేషన్ కాకా' అని పేరు పెట్టారని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిర్వహించిన దర్యాప్తులో గుర్తించడం గమనార్హం. అయితే ఆ ఆపరేషన్ ఫలించలేదు.

ఉక్కుపై మీ తుక్కు రాజకీయాలేంటి?

కేంద్రంపై శాసనమండలిలో తెదేపా విప్ డొక్కా మండిపాటు

ఈనాడు అమరావతి: కడపలో ఉక్కు కర్మాగారం డిమాండ్‌ను సాధించేందుకు ఇద్దరు ప్రజా ప్రతినిధులు 8రోజులుగా నిరాహార దీక్ష చేస్తుంటే కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమని శాసనమండలిలో తెదేపా విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ ధ్వజమెత్తారు. కడపలో ఉక్కు పరిశ్రమపై మరింత స్పష్టత కావాలని తనను కలసిన తెదేపా ఎంపీలతో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి అనడం దారుణమని బుధవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో డొక్కా మండిపడ్డారు. నిరాహార దీక్ష చేస్తున్న ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవిల ఆరోగ్యం బాగా క్షీణించిందని, వారు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి సంబంధించిన ఉక్కుకర్మాగారంపై కేంద్రం తుక్కు రాజకీయాలు చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో వారిని ప్రజలు తుక్కు తుక్కుగా ఓడిస్తారని అన్నారు.

మరిన్ని పతకాలు సాధిస్తా

విలువిద్య క్రీడాకారిణి వెన్నెం జ్యోతి సురేఖ

ఈనాడు, దిల్లీ: దేశానికి మరిన్ని పతకాలు సాధిస్తానని అర్చరీ క్రీడాకారిణి వెన్నెం జ్యోతి సురేఖ తెలిపారు. కాంపౌండ్ మహిళల విలువిద్య విభాగంలో ప్రపంచ పదో ర్యాంకు సాధించిన నేపథ్యంలో బుధవారం మిక్కడ కోచ్ జీవన్‌జ్యోత్‌తో కలిసి ఆమె స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ నీలం కపూర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి సురేఖను నీలం కపూర్ అభినందించారు.

भारतीय विमानपत्तन प्राधिकरण
ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా

ఇ-టెండర్ ఆహ్వానిస్తూ ప్రకటన

AAI ఛైర్మన్ తరఫున AGM (ENGG-E), విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ వారు ఈ క్రింది పనులకు అర్హతగల కాంట్రాక్టర్‌ల నుండి ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు. దీనికి సంబంధించిన ఇ-బిడ్ రిఫరెన్స్ నెం. 2018-AAI-12041 అంచనా వేసిన వ్యయం ₹117.78 లక్షలతో విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ వద్ద టెర్మినల్ బిల్డింగ్‌లో ప్రస్తుతం ఉన్న సైనేజెస్‌ని LED టైప్ సైనేజెస్‌లతో మార్చడం. టెండర్ అమ్మకానికి ఆఖరి తేదీ 16.07.2018 మరియు సమయం సా. 17.00 గంటల వరకు. ఇ-బిడ్స్ ఆన్‌లైన్‌లో దాఖలు చేయడానికి ఆఖరి తేదీ 16.07.2018 మరియు సమయం సా. 17.00 గంటల వరకు. మరిన్ని పూర్తి వివరాలకు మా వెబ్‌సైట్ www.aai.aero https://etender.gov.in/eprocure/app ని లాగ్ ఆన్ చేయండి.

వలస కుటుంబాలకు భూమి

- ఉత్తరాంధ్ర మేధావుల సదస్సులో పవన్‌కల్యాణ్ వ్యాఖ్య

ఈనాడు, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాలను అన్ని రకాల సమస్యలు పట్టిపీడిస్తున్నాయని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆవేదన వ్యక్తంచేశారు. సహజ వనరులు పుష్కలంగా ఉన్నా లక్షలాది మంది దశాబ్దాలుగా వలస పోతూనే ఉన్నారని పేర్కొన్నారు. ఇక్కడ బతకడానికి అవకాశం లేని పరిస్థితులు సృష్టిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి దారితీసే పరిస్థితులు పుష్కలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. బుధవారం విశాఖ శివారులోని ఓ రిసార్టులో ఉత్తరాంధ్ర మేధావులతో పవన్ సదస్సును ఏర్పాటుచేసి ప్రసంగించారు. ఈ ప్రాంత సమస్యలను లోతుగా అర్థం చేసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. "ఇక్కడి వెనుకబాటుతనాన్ని గురించి మాట్లాడుతుంటే ఉత్తరాంధ్రవారిని రెచ్చగొడుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు. వెనుకబాటుతనం ఉన్నప్పుడు గుర్తించకపోతే అది ఉద్యమరూపం తీసుకుంటుంది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే అవకాశాలు వస్తాయి" అని పవన్ పేర్కొన్నారు.

బయోటెర్రరిజం అంశాన్ని పరిశీలించాలి

"ఆ ప్రాంతంలోనే బోదకాలు, ఆంత్రాక్స్, కిడ్నీవ్యాధులు, ఇంకా పలు రకాల జబ్బులు వస్తున్నాయి. కావాలని వ్యాధులు వచ్చేలా చేస్తున్నారేమోనని ఓ వైద్యుడు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో బయోటెర్రరిజం అంశాన్ని పరిశీలించాలి" అని జనసేన అధినేత సూచించారు. ఉత్తరాంధ్ర నుంచి ఉపాధి కోసం వలసలు వెళ్లిన వారికి ఒక హెక్టారు భూమి కేటాయిస్తే వారు మళ్లీ తమ ప్రాంతాలకు వచ్చి స్థిరపడతారని మాజీ వీసీ ఆచార్య చలం చెప్పారని, ఆమేరకు జనసేన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని, మార్క్సిజం, సోషలిజం, గాంధీయిజాన్ని.. జనసేన పాటిస్తుందని పవన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య కె.వి.రమణ, కుప్పం మాజీ వీసీ ఆచార్య కె.ఎస్.చలం, ప్రజాగాయకుడు వంగపండు ప్రసాదరావు, సీపీఐ, సీపీఎం నాయకులు, పలు ఉత్తరాంధ్ర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మేధావుల సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్. చిత్రంలో ఏయూ మాజీ వీసీ ఆచార్య కె.వి.రమణ, కుప్పం మాజీ వీసీ ఆచార్య కె.ఎస్.చలం

భూ కబ్జాలపై సిట్ నివేదిక ఏమైంది?

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం భూకబ్జాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు బహిర్గతం చేయడం లేదని పవన్ కల్యాణ్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. 'పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి ఎన్నాళ్లు? ఇంకెన్నేళ్లు?', 'కంచే చేను మేస్తే' అనే రెండు చిన్న పుస్తకాలు విశాఖపట్నం గ్రామీణ ప్రాంతంలో తెదేపా నాయకులు, వారి అనుచరులు లక్ష ఎకరాల భూములను ఎలా కబ్జా చేశారో కళ్లకు కడుతున్నాయని పేర్కొన్నారు.

రమణ దీక్షితులకు వ్యాపార సంస్థలున్నాయి

- ప్రధానార్చకుడిగా ఉంటూ నిబంధనల్ని ఉల్లంఘించారు
- నా వద్ద రుజువులన్నీ ఉన్నాయి
- 20 సూత్రాల అమలు కమిటీ మాజీ ఛైర్మన్ శేషసాయిబాబు ధ్వజం
- చర్యలు చేపట్టాలంటూ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు

ఈనాడు అమరావతి: తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా ఉండగా రమణ దీక్షితులు తన హోదాను ఉపయోగించి కొన్ని వ్యాపార సంస్థల్ని ప్రారంభించారని తెదేపా నాయకుడు, 20 సూత్రాల అమలు కమిటీ మాజీ ఛైర్మన్ వై.శ్రీనివాస శేషసాయిబాబు ఆరోపించారు. రమణ దీక్షితులు సంతకాలు చేసిన పత్రాలకు సంబంధించిన రుజువులు తన దగ్గర ఉన్నాయని ఆయన బుధవారం సచివాలయంలో విలేఖరుల సమావేశంలో పేర్కొన్నారు. తితిదే డిప్యూటీ ఈవో హోదాలో పని చేస్తూ సర్వీసు నిబంధనల్ని ఉల్లంఘించినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రం అందజేసినట్లు శేషసాయి తెలిపారు. శ్రీవారి భక్తుడిగా, వ్యక్తిగత హోదాలోనే ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. "కోట్లాది ప్రజలకు ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి విషయంలో ధర్మకర్తల మండలిపైనా, ప్రభుత్వం, తితిదేలో ప్రస్తుత/గత అధికారులపైనా ఆయన ఆరోపణలు చేయడం బాధించింది. తనకు ఎలాంటి వ్యాపార సంస్థలతో సంబంధం లేదని రమణ దీక్షితులు చెప్పారు. కానీ ఆయన 2011లో కొన్ని సంస్థలు ప్రారంభించారని రుజువు చేయడానికి సిద్ధంగా ఉన్నాను. సంబంధిత పత్రాలపై ఆయన సంతకం చేశారు. తన వృత్తి ప్రధాన అర్చక అని, చిరునామా దగ్గర.. క్వార్టర్ నెం.3, ఏ టైప్ ఆఫీసర్స్ క్వార్టర్స్, తిరుమల అని రాశారు" అని శేషసాయిబాబు తెలిపారు. దీనికి సంబంధించిన కొన్ని పత్రాల నకళ్లను ప్రధాన కార్యదర్శికి సమర్పించినట్లు చెప్పారు. వాటిని ఆయన విలేఖరులకూ అందజేశారు. రమణదీక్షితులపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ కార్యదర్శిని, ధర్మకర్తల మండలిని కూడా కోరతానని చెప్పారు. "ఆ వ్యాపార సంస్థను తాను ప్రారంభించలేదని, దానిలోని సంతకం తనది కాదని శ్రీవారి ధ్వజస్తంభం దగ్గర ప్రమాణం చేసి రమణ దీక్షితుల్ని చెప్పమనండి. నేను చెబుతున్న విషయాల్ని రుజువు చేయలేకపోతే ఎలాంటి శిక్షకైనా సిద్ధం" అని శేషసాయి పేర్కొన్నారు. రమణదీక్షితులు కొంతమంది నేర చరిత్ర ఉన్నవారితో కలసి విలేఖరుల సమావేశం పెట్టారని, అన్యమత ప్రచారకులతో కలసి పనిచేశారని ధ్వజమెత్తారు. రమణ దీక్షితులు స్వామి భక్తులతోను, ఉన్నతస్థానంలో ఉన్నవారితోను కలసి వ్యాపారాలు చేశారని తెలిపారు. ఆయన వాస్తవాలు అంగీకరించకపోతే బండారమంతా బయటపెడతానని శేషసాయి హెచ్చరించారు.

పొరుగుసేవల పోస్టుల భర్తీ తాత్కాలిక నిలిపివేత

- 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: సర్వశిక్ష అభియాన్‌లో పొరుగుసేవల ద్వారా చేపట్టనున్న పోస్టుల భర్తీని తాత్కాలికంగా నిలిపివేస్తూ రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకుడు జి.శ్రీనివాస్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలంటూ 13జిల్లాల ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు పోస్టుల భర్తీని నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురితమైన 'ఉద్యోగాల్లో వసూళ్ల పర్వం' కథనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం తీవ్రంగా స్పందించారు. తెదేపా సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రే 'ఈనాడు' కథనాన్ని ప్రస్తావించారు. అక్రమాల్ని సహించేది లేదని స్పష్టం చేశారు. మంగళవారమే సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకుడి నుంచి ముఖ్యమంత్రి కార్యాలయం వివరణ కోరింది. ఈ నేపథ్యంలో పొరుగు సేవల ఉద్యోగాల భర్తీని తాత్కాలికంగా నిలిపివేస్తూ సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకుడు ఆదేశాలు జారీ చేశారు.

- సువ్యవస్థిత క్షేత్రంలో భారతదేశపు అన్నిటి కన్నా పెద్ద యాసెట్ ఫైనాన్సింగ్ ఎన్‌బీఎఫ్‌సీ నుండి ట్రేడెబుల్ ఎన్‌సీడీలు**
- ఎన్‌సీడీల వడ్డీపై ఆదిలోనే పన్ను మినహాయింపు లేదు
- ముందు వచ్చిన వారికి ముందు ఎలాట్‌మెంట్ చేయబడుతుంది*
- కనీస అభ్యర్థన ₹10,000*
- జ్యేష్ఠ పౌరులకు 0.25% అదనంగా*

SHRIRAM
Commercial Vehicle Finance
A WINNING RELATIONSHIP
సాధించే విశ్వాసం

ఇష్యూ జూన్ 27 నుండి జులై 20, 2018 వరకు తెరిచి ఉంటుంది

*వివరమైన నియమ-నిబంధనల కొరకు దయచేసి జూన్ 22, 2018 తేదీగల షెల్ఫ్ ప్రాస్పెక్టస్‌ని ('షెల్ఫ్ ప్రాస్పెక్టస్') మరియు జూన్ 25, 2018 తేదీగల ట్రాంచ్ 1 ప్రాస్పెక్టస్‌ని చదవండి. **సబ్‌స్క్రిప్షన్ చేసేందుకు ఈ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ లిస్ట్ జూన్ 27, 2018 నుండి జులై 20, 2018 వరకు పని రోజుల్లో ఉ. 10.00 నుండి సా. 5.00 వరకు తెరిచి ఉంటుంది, కాకపోతే ఈ ఇష్యూ, అవసరమైన ఆమోదాలకు ఆధీనమై యథాక్రమంగా అధికృతమైన మా కంపెనీ డైరెక్టర్స్ కమిటీ వివేచనాత్మక నిర్ణయంపై సమయానికి ముందైన తేదీకి లేదా సమయానికి తరువాతైన తేదీకి క్లోజ్ చేయబడవచ్చు. ఇష్యూ సమయానికి ముందుగా లేదా తరువాత క్లోజ్ చేయబడే పక్షంలో, సందర్భానుసారంగా, కాబోయే పెట్టుబడిదారులకు ఒక ప్రముఖ జాతీయ దినపత్రికలో ప్రకటన/ల ద్వారా ఆ విషయం గురించి సూచన అట్టి సమయానికి ముందైన క్లోజర్ తేదీన గానీ, ఆ తేదీలోగా గానీ లేదా ఇనీషియల్ క్లోజింగ్ తేదీన అందజేయబడేలా మా కంపెనీ నిశ్చితపరుస్తారు.

రెజిస్టర్డ్ ఆఫీస్: మూకాంబిక కాంప్లెక్స్, 3 వ అంతస్తు, నం. 4, లేడీ దేసిక రోడ్, మైలాపూర్, చెన్నై - 600004.
కార్పొరేట్ ఆఫీస్: శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, వాక్‌హార్డ్ట్ టవర్స్, లెవెల్-3, వెస్ట్ వింగ్, సీ-2, జీ బ్లాక్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్). ముంబయి 400 051. టెలి: +91 22 4095 9595. టోల్-ఫ్రీ: 1800 2000 011. ఈమెయిల్: corpcom@stfc.co.in

శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ('కంపెనీ'), CIN: L65191TN1979PLC007874 | ఆర్‌బిఐ రిజిస్ట్రేషన్ నంబర్: A-07-00459. మార్కెట్ పరిస్థితులు మరియు ఇతర విచారణలకు ఆధీనమై, సెక్యూర్డ్ రిడీమెబుల్ నాన్- కన్వర్టెబుల్ డిబెంచర్స్ ('ఎన్‌సీడీస్') పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదించి, రెజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, చెన్నై, తమిళనాడు ('ఆర్‌ఓసీ'), బీఎస్‌ఈ లిమిటెడ్ ('బీఎస్‌ఈ'), న్యాషనల్ స్టాక్ ఎక్స్‌చేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ('ఎన్ఎస్‌ఈ') మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ('ఎస్ఈబీఐ') వద్ద జూన్ 22, 2018 తేదీగల షెల్ఫ్ ప్రాస్పెక్టస్‌ని ('షెల్ఫ్ ప్రాస్పెక్టస్') మరియు జూన్ 25, 2018 తేదీగల ట్రాంచ్ 1 ప్రాస్పెక్టస్‌ని ('ట్రాంచ్ 1 ప్రాస్పెక్టస్') దాఖలు చేసారు. ఈ షెల్ఫ్ ప్రాస్పెక్టస్ మరియు ట్రాంచ్ 1 ప్రాస్పెక్టస్ మా వెబ్‌సైట్ www.stfc.in పై, బీఎస్ఈ, ఎన్ఎస్ఈ మరియు ఎస్ఈబీఐ వెబ్‌సైట్స్ www.bseindia.com, www.nseindia.com ఇంకా www.sebi.gov.in పై, అలాగే ఈ ఇష్యూకి లీడ్ మేనేజర్లు అంటే, యాక్సిస్ బ్యాంక్, ఏ. కే. క్యాపిటల్ సర్వీసెస్ లిమిటెడ్, ఎడిల్‌వైస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, జే ఎమ్ ఫైనాన్షియల్ లిమిటెడ్ మరియు ట్రస్ట్ ఇన్‌వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి వెబ్‌సైట్స్ అంటే www.axisbank.com, www.akgroup.co.in, www.edelweissfin.com, www.jmfl.com, www.trustgroup.in పై లభిస్తాయి. ఎన్‌సీడీస్‌లో పెట్టుబడి హెచ్చైన నష్ట సంభావనలకు లోబడి ఉంటుందన్న విషయాన్ని పెట్టుబడిదారులు గుర్తించగలరు. ఈ విషయంగా, నష్ట సంభావనల కొరకు షెల్ఫ్ ప్రాస్పెక్టస్‌లో 15 వ పేజీపై 'నష్టాంశాలు' అనే శీర్షికగల భాగంతో సహా షెల్ఫ్ ప్రాస్పెక్టస్ మరియు ట్రాంచ్ 1 ప్రాస్పెక్టస్‌లో ప్రకటించబడిన వాస్తవాలను అనుసరించి, కేవలం వాటి ఆధారంపైనే ఈ డెబ్ట్ సెక్యూరిటీస్‌లో పెట్టుబడి పెట్టే ఏ నిర్ణయాన్నైనా తీసుకోవలసిందని పెట్టుబడిదారులకు నొక్కి చెప్పబడటమయింది. ఇందులో ప్రత్యేకంగా నిర్ధారించబడని మూలధన సంబంధిత పదాలకు అర్థాలు షెల్ఫ్ ప్రాస్పెక్టస్ మరియు/లేదా ట్రాంచ్ 1 ప్రాస్పెక్టస్‌లో అట్టి పదాలకు వర్తించే నిర్దేశమైన అర్థాల ప్రకారమే ఉంటాయి.
R K SWAMY BBDO STFC 100108-1004 TEL

Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

BEST DEAL HONDA Buy. Sell. Exchange | ALWAYS WEAR HELMET WHILE RIDING | Also available: Annual Maintenance Contract** Road Side Assistance** Engine Health Assurance**

Follow us on

Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Anvita Honda - 9225922599, 0866 6628333; Mithra Honda - 2442149, 8297235235; Sri Santosh Honda - 9703123445, 8019669955; **GUDIVADA:** Pruthvi Honda - 8977185999, 8977803888; **JAGGAIAHPET:** Mithra Honda - 08297557149/50; **MYLAVARAM:** Mithra Honda - 8297568888; **KAANURU:** Sri Santosh Honda - 08666452666, 9618909494; **GANNAVARAM:** Sri Santosh Honda - 9912195558, 9391935558; **VISSANNAPETA:** Aishwarya Honda - 08673-272722, 9000866319; **TIRUVURU:** Sri VenkataSatya Honda - 08673-253446, 8977836666; **KAIKALURU:** Pruthvi Honda - 08677-225555, 9642854888; **MACHILIPATNAM:** Nagasai Honda - 9676945616; **KANCHIKACHERLA:** Sri Spandana Honda - 08678-273066, 8523034242; **NANDIGAMA:** Apple Honda - 07660867711, 08678-279001; **CHALLAPALLI:** Annapurna Honda - 8499900065; **NUZIVIDU:** Srishivani Honda - 7893194444; **VUYYURU:** Pruthvi Honda - 08676236236, 8142026888; **IBRAHIMPATNAM:** Leo Honda - 9348686966.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

కుమార్తె 'తనయుడు' అర్హుడే: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: అర్చకత్వం వంశపారంపర్యంగా నిర్వహించేందుకు కుమారులు లేనప్పుడు 'కుమార్తె కుమారుడు' అర్చకుడిగా కొనసాగేందుకు 2007 సవరణ చట్టం అవకాశమిస్తోందని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. కృష్ణా జిల్లా కంకిపాడులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 'కుమార్తె కుమారుడి' వంశ పారంపర్య అర్చకత్వాన్ని దేవాదాయశాఖ అధికారులు రద్దు చేయడాన్ని తప్పుబట్టింది. పూర్ణేశ్వరరావు అనే అర్చకుడి కుమార్తె కుమారుడైన గధాధరబాబును తిరిగి నియమించాలని ఆదేశిస్తూ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివ శంకరరావు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. తన తాత మరణానంతరం శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం వంశపారంపర్య అర్చకుడిగా గధాధరబాబు 1984 నుంచి కొనసాగుతున్నారు. తనవంతుగా మూడేళ్లకోసారి ఏడాదిపాటు అర్చకత్వం నిర్వహిస్తున్నారు. మిగిలిన రెండేళ్లు ఇతర వంశపారంపర్య అర్చకులు విధులు నిర్వర్తించేవారు. ఆ రెండేళ్ల కాలంలో జీవనాధారం కోసం మరో ప్రాంతంలో వ్యాపారం చేస్తున్నారన్న కారణంతో అర్చకత్వ బాధ్యతల నుంచి గధాధరబాబును తొలగిస్తూ దేవాదాయశాఖ అధికారులు 2017లో ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి దేవాదాయశాఖ అధికారుల వాదనలను తోసిపుచ్చారు. తన వంతుగా ఏడాది అర్చకత్వాన్ని చేయడానికి పిటిషనరును అర్హుడిగా తేల్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
e- ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 7/PLAN 2018-19/VJA/CE(R&B) MDR/EE(R)/DEE4/AE2/2018 తేది: 25.6.2018
కృష్ణా జిల్లాలో ఒక వంతెన నిర్మాణం పనికొరకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా విలువ: రూ. 14.24 కోట్లు. టెండర్లను ది. 2-7-2018 సా. గం. 5.00 ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరితేది: 16-7-2018 సా.గం. 5.00 వరకు. సంబంధిత SE: SE (R&B), విజయవాడ. తదుపరి వివరాలు e-మార్కెట్ ప్రదేశం www.tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
DIPR No 929/CL/Advt/1/1/2018-19 సం/- చీఫ్ ఇంజనీర్ (R&B) MDR

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No. 122 to 123/ TO/2018-19 తేది: 23–06–2018
కృష్ణా జిల్లాలో వివిధ గ్రాంట్ల క్రింద రూ. 1090.00 లక్షల అంచనా వ్యయంతో 2 ప్యాకేజీల కొరకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 2-7-2018 నుండి. బిడ్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 16-7-2018 మ.గం. 3.00 వరకు. బిడ్ దాఖలుకు ముగింపు తేది: 16-7-2018 సా.గం. 5.00 వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది: 17-7-2018 ఉ.గం. 11.00 లకు. ఆర్థిక బిడ్ తెరచు తేది: 20-7-2018 ఉ.గం. 11.00 లకు. వివరాలు e-మార్కెట్ ప్రదేశం www.tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్: 94909 64625.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా.
DIPR No. 930/CL/Advt/1/1/2018-19

COMMISSIONER, NUZVID MUNICIPALITY
Mobile : 98499 05822. E-mail : mc.nuzivid@cdma.gov.in
E-Tender : Municipal Solid Waste Management and Maintenance of Sanitation - Residential Cum Commercial Area Service Package Outsourcing - Package No.01.
Tender Notification No. 158/2016/F1
Value of Works : for Package No.1-Rs. 7,11,26,872/-
E-Tender Download Start Date and Time : 25/06/2018 & 04:00 PM
Bid Submission Closing Date and Time : 18/07/2018 & 05:00PM
Pre-Bid meeting Date and Time : 11/07/2018 & 11:00 AM
Technical bid opening Date and Time : 18/07/2018 & 05:01 PM
E-Tender Website : https://tender.apeprocurement.gov.in/
E-Mail ID for Clarifications / Communication : mc.nuzivid@cdma.gov.in
Note : Any addendum / corrigendum / bid clarifications / time extension shall be issued on the website only. No separate press notification shall be issued.
Sd/- Commissioner

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Roc.No.TTD-34022(31)/175/2018-Procurement SEC-TTD, Dt: 25-06-2018
తి.తి.దే., తిరుపతి మార్కెటింగ్ విభాగం వారిచే దిగువ పేర్కొన్న అయిటమ్ సేకరణ నిమిత్తం ఈ-టెండర్లు కోరడమైనది.

క్ర. సం.	అయిటమ్ పేరు	డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేదీలు
1.	ఆరు నెలల కాలానికి గాను అగ్‌మార్క్‌తో కూడిన 15,000 కేజీల MG-1 గ్రేడ్ నల్ల మిరియాలు	26-06-2018 26-07-2018

టెండరు డాక్యుమెంట్లను వెబ్‌సైట్: https://tender.apeprocurement.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాలకుగాను సంప్రదించవలసిన ఫోన్ నెం: 0877- 2264079, 2264555. ఫ్యాక్స్: 2264554 మరియు మెయిల్ ఐడి: gmpttd@gmail.com
Roc.No.PR4/1090/Adv.No.129/PRO/2018, Dated: 27.06.2018. కార్యనిర్వహణాధికారి

ఎ.పి. ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీసు
జల వనరుల శాఖ
సంబంధిత అధికారి వివరములు: పర్యవేక్షక ఇంజనీరు, హంద్రీ నీవా సుజల స్రవంతి వలయము - 3, మదనపల్లె. ఇమెయిల్: se_hnss3@yahoo.co.in ఫోన్: 94409 03434 & 94409 07005
టెండర్ నోటీసు నెం: 03/2018-19 తేది: 19.05.2018
పని వివరములు: హంద్రీ నీవా సుజల స్రవంతి పథకము - రెండవ దశ - చిత్తూరు జిల్లాలోని నీవా బ్రాంచి కాలువ నుండి ఎత్తిపోతల పథకం ద్వారా చంద్రగిరి మండలంలోని మూలపల్లి చెరువు మరియు నాలుగు ఇతర చెరువులకు 1154.03 ఎకరములకు సాగునీరు మరియు త్రాగునీరు అందించుటకు 04 లింకు కాలువ నిర్మాణము.
పని సుమారు విలువ: రూ. 30,54,67,134/–
టెండర్ సమర్పించు చివరి తేది: 12.07.2018 సా॥ 5.00 గం॥ల వరకు
* పూర్తి వివరములకు కొరకై www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Regd.Office: 10-152/1, Ashoknagar, Bandar Road, Vijayawada - 520007
Tender No.: PDS1/31/Sugar Tender/July-2018 Dated : 27-06-2018
TENDER NOTICE
EMPANELMENT AND APPOINTMENT OF SUPPLIERS FOR SUPPLY OF 4320.466 MTS OF ISS GRADE S-30/S-31 CANE SUGAR UNDER PDS FOR JULY & AUGUST 2018 THROUGH NCDEX e MARKETS LIMITED
All interested Sugar manufacturers are invited for registration as suppliers eligible to participate in the e reserve auction to be conducted by NCDEX e Markets Ltd on behalf of APSCSC Ltd for supply of sugar to the MLS Points of Prakasam, Kadapa, Ananthapur and Kurnool Districts in Andhra Pradesh State.
For Registration, interested parties may visit www.apscsc.gov.in & www.neml.in for application form and detailed terms & conditions.
Last date for registration and completion of formalities for the e-auction shall be up to 5.00 pm of 02.07.2018. The duly filled in application form should be submitted to : Customer Service Group, NCDEX e-Markets Limited, Ackruti Corporate Park, 1st Floor, Near GE Garden, LBS Marg, Kanjurmarg (West), Mumbai - 400078 Tel : 9642332994 / 8309214263 or 022-66473153/54. Email : askus@neml.in
The tentative date of online - e-auction through NCDEX e Markets Ltd would be 03.07.2018 for 4320.466 MTs in 50 Kg PP bag. Delivery should be completed within 10 working days at all MLS Points of (4) districts in AP State. Auction will be held District wise. The details are available on the website www.apscsc.gov.in
Sd/-VC & Managing Director

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)
INVITATION FOR REQUEST FOR PROPOSAL (RFP)
Rc.CE-125606/2018 Dt: 27.06.2018
VMC invites Request for Proposal for "Appointment of Agency/ Company for Operation and Maintenance of Public Toilets and community Toilets at Different locations in VMC area".
Interested agencies/companies who are having experience in the similar nature of work including financial capability, having latest technical competency to perform this assignment can obtain the details and the Request For Proposal (RFP) documents from the office of the Chief Engineer, VMC, Vijayawada by paying Rs. 10,000/- (Rupees Ten Thousand only) + Rs. 1800/- (Eighteen Hundred only) Non-refundable in the form of D.D.s drawn in favour of the Commissioner, Municipal Corporation, Vijayawada and Commercial Tax Officer, Vijayawada respectively payable at any nationalized/ Scheduled bank in Vijayawada. The RFP can also be downloaded from the VMC website i.e., https://www.ourvmc.org/engg/gentenders.asp and payment of Rs. 10,000/- & Rs. 1800/- can be made through DDs while submission of RFP.
• Available/Issue of Tender Schedules .. 29-06-2018 to 13-07-2018 11.00 A.M
• Pre Bid meeting date .. 06-07-2018 at 11.00 A.M
• Last date for Receipt of Bids .. Upto 13-07-2018, 3.00 P.M
• Opening of Technical Bids .. 13-07-2018 at 5.00 P.M.
• Opening of Financial Bids .. After Technical Evaluation
If the office happens to be closed on the date of receipt of the bids as specified, the bids will be received and opened on the next working day at the same time and venue.
The Commissioner, VMC reserves the right to reject or cancel any or all the bids without assigning any reason thereof.
Any addendum/corrigendum/bid clarifications/time extension shall be issued on the website only. No separate press notification shall be issued.
Address for Correspondence:
The Chief Engineer, Municipal Corporation, Jawaharlal Nehru Buildings, Canal Road, Vijayawada-520 001,Andhra Pradesh, Cell No.: 98665 14183 & 98665 14141.
Sd/- COMMISSIONER

2050 కల్లా అత్యుత్తమ రాష్ట్రంగా ఏపీ

- కానిస్టేబుల్ తప్పు చేసినా ప్రభుత్వం పైకే వస్తుంది
- శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు సీఎం చంద్రబాబు ఉద్బోధ

శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు, చిత్రంలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి ఏ.ఆర్.అనూరాధ, డీజీపీ ఎం.మాలకొండయ్య, విజయవాడ నగర పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్, సీఐడీ విభాగాధిపతి సీహెచ్.ద్వారకాతిరుమలరావు, ఇతర ఐపీఎస్ అధికారులు ★ పాల్గొన్న శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలు

ఈనాడు – అమరావతి

ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందనుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న 652 మంది ఎస్సైలను ఉద్దేశించి ఉండవల్లిలోని ప్రజా దర్బార్ హాలులో బుధవారం ఆయన ప్రసంగించారు. రాష్ట్రాభివృద్ధికి తాను ఒక విజన్ రూపొందించానని, దాని ప్రకారం 2050నాటికి అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని, మీరంతా ఇందులో భాగస్వాములు కానున్నారని పేర్కొన్నారు.

ఏపీ పోలీసు దేశానికే నాయకత్వం ఇచ్చే స్థాయిలో ఉండాలి

'పోలీసు కానిస్టేబుల్ తప్పు చేసినా సరే అది ముఖ్యమంత్రి, ప్రభుత్వం మీదకే వస్తుందనే విషయాన్ని మీరు గుర్తెరగాలి. ఆంధ్రప్రదేశ్‌ను సురక్షిత, ఆనందకర, భద్రమైన రాష్ట్రంగా మార్చేందుకు మీరు పనిచేయాలి. అప్పుడే పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. సంపద, ఆనందం పెరుగుతుంది. శాంతిభద్రతల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ పోలీసు దేశానికే నాయకత్వం ఇచ్చే స్థాయిలో ఉండాలి. తప్పించుకునేందుకు అవకాశం ఉండదంటే ఎవరూ మళ్లీ నేరం చేయరు. సీసీ కెమెరాలను కేసులను ఛేదించడానికి ఉపయోగిస్తున్నారే తప్ప.. వాటి దృశ్యాలను విశ్లేషించి రియల్‌టైమ్‌లో నేరాలను నియంత్రించేందుకు వినియోగించుకోవడం లేదు. సాంకేతికత పెరుగుదల, అణిచివేత మూలంగా మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. సెల్‌ఫోన్లలో చూసి నేరాలు ఎలా చేయాలో నేర్చుకుంటున్నారు. ఏదైనా ఒక సంఘటన జరిగితే దానిపై లేనిపోనివి కల్పించి నిమిషాల వ్యవధిలో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్నారు. పోలీసులు అప్రమత్తమయ్యేలోగానే వందల మంది ఒక చోట గుమిగూడిపోతున్నారు. ఇలాంటివి భవిష్యత్తులో సవాల్‌గా మారుతాయి. ఒకప్పుడు అమెరికా ప్రపంచంలోనే సురక్షితమైన ప్రదేశం. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భారతీయులు రాకూడదు. తెలివైన వారు రాకూడదు. మాకే ఉద్యోగాలు కావాలి అని రెచ్చగొట్టారు. తెలివైన వాళ్లు అక్కడ సురక్షితంగా తిరగాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది...' అని చంద్రబాబు పేర్కొన్నారు.

మార్పు తీసుకురావాలి

'ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నియంత్రణకు దృష్టి సారించాలి. ఒకప్పుడు రెండు గ్లాసుల విధానం ఉండేది. గ్రామాల్లో చెప్పులు వేసుకుని నడవడానికి కూడా అయ్యేది కాదు. ఆ సందర్భాల్లో జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను వేశాను. కొన్ని గ్రామాల్లో ఇతర కులాల వారు ఎస్సీలను ఇళ్లల్లో భోజనాలకు అనుమతించారు. మనిషిని మనిషిగా చూడకుండా భూస్వామ్య మనస్తత్వంతో వ్యవహరిస్తుంటారు. ఇలాంటి వాటిల్లో మీరు మార్పును తీసుకురావాలి. నేను అధికారంలో ఉన్నప్పుడు పారిశ్రామిక అశాంతి ఎప్పుడూ లేదు. కొన్ని పార్టీలు ఇలాంటివి రెచ్చగొట్టి రాజకీయ అజెండా కోసం పనిచేస్తున్నాయి. అప్రమత్తంగా ఉండాలి. పోలవరం ప్రాజెక్టును ప్రతి ఒక్క ఎస్సై సందర్శించాలి. శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైల్లో 42 శాతం బీటెక్ పట్టభద్రులు, 3 శాతం ఎంటెక్ పట్టభద్రులు ఉండటం అభినందనీయం..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం

- పర్యాటకులకు పదేళ్లలో లక్ష గదులు సిద్ధం
- భారత రాయబారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు

చంద్రబాబును కలిసిన స్పెయిన్, ఆస్ట్రియా, వియత్నాం, కువైట్‌లోని భారత రాయబారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ అభివృద్ధిలో ఎన్నో మంచి ఫలితాలు సాధిస్తున్నామని, ఆహారశుద్ధితో పాటు వీటి విలువ పెరిగేలా పలు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాలపై వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్న భారత రాయబారుల బృందం అమరావతి చేరుకొని బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమైంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే పదేళ్లలో రాష్ట్రంలో పర్యాటకులకు లక్ష గదులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి అనంతపురం-శ్రీసిటీ ఉత్తమమైన ప్రాంతమని, హార్డ్‌వేర్ రంగంలో 25 నుంచి 30 శాతం కార్యకలాపాలు ఇదే ప్రాంతంలో నిర్వహిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. స్పెయిన్‌లో భారత రాయబారి డి.బాల వెంకట వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తరహాలో ప్రత్యామ్నాయ ఇంధన, ఆటోమొబైల్ రంగ అభివృద్ధిపైనా ఆ దేశం దృష్టి సారించిందని, ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా తగిన ప్రయత్నం చేస్తామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ పురోభివృద్ధి, స్పెయిన్ పెట్టుబడులకు రాష్ట్రంలో విదేశీభాషా విద్యా సంస్థలు, బోధనలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాలో భారత రాయబారి రెనీ పాల్ మాట్లాడుతూ సాంకేతిక పరిశోధన, మెడికల్ డయాగ్నస్టిక్ అంశాల్లో ఆ దేశం సాధిస్తున్న ఫలితాలు వివరిస్తూ... చేనేత, జౌళి పారిశ్రామిక రంగాల్లో ఎంతో బలంగా ఉన్నట్లు వివరించారు. వియత్నాంలో భారత రాయబారి పి.హరీష్ మాట్లాడుతూ అత్యధికంగా సముద్ర ఆహార ఉత్పత్తులను దిగుమతులు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కువైట్‌లో భారత రాయబారి కె.జీవసాగర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎక్కువ అవకాశాలున్నాయని, సహకారాన్ని అందిస్తామని చెప్పారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోండి: కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి బీరేంద్ర సింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి నిర్దిష్ట కాల వ్యవధితో కూడిన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు న్యాయం చేయాలని లేఖలో కోరారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి ఉక్కు పరిశ్రమ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విషయాన్ని అందులో ప్రస్తావించారు.

తితిదేలో ఆభరణాల పరిశీలనకు హైకోర్టు న్యాయమూర్తిని నియమించండి

తిరుమల తిరుపతి దేవస్థానంలో దస్త్రాలు, అందులో పేర్కొన్న ఆభరణాలు, ఇతర వస్తువులు, ఆస్తులను పరిశీలించి సమగ్రంగా ధ్రువీకరించేందుకు ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తిని పరిశీలకుడిగా నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు బుధవారం ఆయన లేఖ రాశారు. తితిదే విషయంలో చోటు చేసుకున్న అనవసర వివాదాలు, ఆరోపణలపై పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై కోట్లాది మంది భక్తులు కలత చెందుతున్నారని వివరించారు. గతంలో ఇలాంటి వివాదాలు నెలకొన్నప్పుడు... 2009లో జస్టిస్ జగన్నాథరావు కమిషన్, 2011లో జస్టిస్ వాధ్వా కమిటీలు స్వామివారి ఆభరణాలను పరిశీలించి నివేదికలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

ఔషధ చట్టం పరిధిలోకి ఖరీదయిన వైద్యపరికరాలు

ఈనాడు, దిల్లీ: వైద్య చికిత్సలో భాగంగా శరీరంలో ఉంచే ఉపకరణాలన్నింటితో పాటు ముఖ్యమయిన ఇతర ఖరీదయిన వైద్య పరికరాలను కేంద్ర ప్రభుత్వం ఔషధ, కాస్మొటిక్స్ చట్టం పరిధిలోకి తీసుకురానుంది. ఈ చట్టం కింద నియంత్రించాల్సిన వైద్యపరికరాల జాబితాను కేంద్ర ఔషధాల ప్రమాణ నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) సిద్ధం చేసింది. సంబంధికులందరూ తమ సూచనలను జులై 20లోపు సమర్పించాలని కోరింది. ఈ జాబితాలో శరీరంలో ఉంచే వైద్యఉపకరణాలన్నింటితో పాటు సీటీ స్కాన్ పరికరం, డెఫిబ్రిలేటర్, ఎంఆర్ఐ పరికరం, డయాలిసిస్ యంత్రం, ఎక్స్‌రే యంత్రం, బోన్‌మ్యారో సెల్ సపరేటర్, పెట్ పరికరం ఉన్నాయి. సీడీఎస్‌సీఓ నోటిఫై చేసిన తర్వాత ఈ ఉపకరణాలు, పరికరాలన్నింటినీ సంబంధిత చట్టం ప్రకారం ఔషధాలుగా వర్గీకరిస్తారు. ఫలితంగా వీటి ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం సీటీస్కాన్ పరికరం దిగుమతి వ్యయం రూ.3-4కోట్లుగా ఉంది. వీటి పంపిణీదారులు ఆస్పత్రులకు రూ.6కోట్లవరకు విక్రయిస్తున్నారు. దీంతో అంతిమంగా రోగులపై ఎక్కువ భారం పడుతోంది. ఔషధాల చట్టం పరిధిలోకి వచ్చిన తర్వాత తయారీదారులు, దిగుమతిదారులు ఈ వైద్యపరికరాలను భారత మార్కెట్‌లో విక్రయించాలంటే జాతీయ ఔషధ నియంత్రణ సంస్థ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

జులై 5న 3 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు

విజయవాడలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో పూర్తి చేసిన 3 లక్షల ఇళ్లకు జులై 5న సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు గ్రామీణ గృహనిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో నిర్మించిన, పట్టణ ప్రాంతంలో లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్న(బీఎల్‌సీ) ఇళ్లకు సామూహిక ప్రవేశాలు ఉంటాయని మంత్రి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రారంభిస్తారన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు నాలుగు లక్షల ఇళ్లు పూర్తి కాగా.. గతేడాది అక్టోబర్‌లో లక్ష ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. గృహప్రవేశాలను రాష్ట్రవ్యాప్తంగా పండుగలా నిర్వహిస్తామన్నారు.

కోల్డ్ చైన్ ప్రమోషన్ కంపెనీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: నాణ్యమైన ఉత్పత్తిని వినియోగదారులకు అందించేలా ఏపీ కోల్డ్ చైన్ ప్రమోషన్ కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన బాధ్యతలను ఉద్యానశాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఉపాధి సంధానంపై 50 సిఫార్సులు

- ముఖ్యమంత్రి ముందుంచిన మంత్రి లోకేష్

ఈనాడు అమరావతి: వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి 50 సిఫార్సులు అందాయి. వీటిని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నేతృత్వంలో ఏర్పాటైన జాతీయస్థాయి కమిటీకి పంపాలని నిర్ణయించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సమీక్షలో ఆ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ సిఫార్సులను ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుంచారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో అమలవుతున్న పలు పథకాలు, రాబోయే కాలానికి లక్ష్యాల నిర్దేశనంపై ముఖ్యమంత్రి సుమారు 5గంటలపాటు సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం లోకేష్ విలేకరులతో మాట్లాడారు. వచ్చే సంవత్సరంలో రూ.20వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించడం ద్వారా 5ఏళ్లలో రూ.40వేల కోట్ల పనులు ప్రారంభించిన రాష్ట్రంగా దేశంలో చరిత్ర సృష్టించనున్నామన్నారు. వాటర్‌గ్రిడ్ ఫలాలు రాయలసీమలోని 4జిల్లాలు, నెల్లూరుకు రెండేళ్లలో అందుతాయన్నారు. కృష్ణా, పశ్చిమలకు జులై ఆఖరులో టెండర్లు పిలిచి ఏడాదిలోగా ఇంటింటికి కుళాయిలు ఇస్తామన్నారు. మిగిలిన జిల్లాల్లో ఆగస్టు ఆఖరుకు టెండర్లు పిలుస్తామని తెలిపారు. డిసెంబరు ఆఖరుకల్లా 30 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఇది పూర్తయితే దేశంలోనే మొదటి రాష్ట్రమవుతుందని తెలిపారు.

నాకు మా మామకు చిచ్చు పెట్టేట్టున్నారే!

విలేకరులు వచ్చే ఎన్నికల్లో ఏ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తారని లోకేష్‌ను అడగ్గా పార్టీ అధ్యక్షుడు ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కణ్నుంచి పోటీ చేస్తానన్నారు. తాత ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన హిందూపురం నుంచి బరిలోకి దిగుతారా అని ప్రశ్నించగా 'అక్కడ మా మామగారు అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. ఆయన భారీ మెజారిటీతో గెలుస్తారు' అన్నారు. అయితే హిందూపురానికి వెళ్లరాని విలేకరులు రెట్టించగా 'మిమ్మల్ని చూస్తుంటే నాకు మా మామకు చిచ్చు పెట్టేట్టున్నారు, చాలా అన్యాయంగా ఉన్నారే' అని వ్యాఖ్యానించారు. కడప ఉక్కుపై అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ 'రాష్ట్రంలోని భాజపా నాయకులు సమాధానం చెప్పాలి. ప్రత్యేకహోదా, కడప ఉక్కుఫ్యాక్టరీ ఇవన్నీ ఇవ్వాల్సింది కేంద్రంలోని భాజపా. కానీ రాష్ట్రంలో భాజపా, వైకాపా, జనసేన.. చంద్రబాబు, తెదేపానే తిడుతున్నాయి. కేంద్రాన్నెందుకు అడగరు? ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుపై రాష్ట్రం అన్ని నివేదికలూ ఇచ్చేసింది' అన్నారు. కేసీఆర్ రాకపై మాట్లాడుతూ ప్రొటోకాల్ ప్రకారం గౌరవిస్తామని, దేశంలోని అందరు ముఖ్యమంత్రులను రాష్ట్రానికి ఆహ్వానిస్తామని అన్నారు. డిసెంబరులోగా కేంద్రం ఎన్నికలకు వెళితే రాష్ట్రంలో అసెంబ్లీని రద్దు చేస్తారా అని విలేకరులు అడగ్గా.. "మేం మాత్రం కలిసి వెళ్లం. ప్రజలు అయిదేళ్ల మ్యాండేట్ ఇచ్చారు. అంతవరకూ మేం ప్రజలకు పనులు చేస్తాం' అని స్పష్టం చేశారు.

భారత్ పేద(ల) దేశం కాదు!

బ్రూకింగ్స్ నివేదిక

దిల్లీ: పేదరికాన్ని భారత్ అధిగమిస్తోందనీ... 'ప్రపంచంలోనే అత్యంత ఎక్కువమంది పేదలుండే దేశం' అన్న మాట ఇక ఇండియాకు ఏమాత్రం వర్తించదని... అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ అధ్యయన సంస్థ బ్రూకింగ్స్ తాజా నివేదికలో పేర్కొంది. 'ద స్టార్ట్ ఆఫ్ ఏ న్యూ పావర్టీ నరేటివ్' పేరున తన బ్లాగులో దీన్ని ఉంచింది. హోమి ఖారస్, క్రిస్టోఫర్ హామెల్, మార్టిన్ హోఫర్‌లు ఈ నివేదికను రూపొందించారు. అత్యంత ఎక్కువమంది పేదలతో నైజీరియా ప్రథమ స్థానాన్ని ఆక్రమించగా, రిపబ్లిక్ ఆఫ్ కాంగో రెండో స్థానం కోసం ఎగబాకుతున్నట్లు వారు పేర్కొన్నారు. 2018 మే నాటికి నైజీరియాలో 8.7 కోట్ల మంది నిరుపేదలు ఉండగా, భారత్‌లో వారి సంఖ్య 7.3 కోట్లేనని తేల్చారు. ప్రపంచ వ్యాప్తంగా 72.5 కోట్ల మంది నిరుపేదలున్నారనీ... 2030 వరకూ రెండు సెకెన్లకు ముగ్గుర్ని పేదరికం నుంచి గట్టెక్కించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగా మారినట్లు పేర్కొంది.

మరో రూ.15వేల కోట్ల పనులకు టెండర్లు

- రాజధాని పనులపై ముఖ్యమంత్రి ఆదేశం
- త్వరలోనే మార్కెట్‌లోకి 'అమరావతి బాండ్లు'

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతిలో తొలి దశలో పూర్తి చేయాల్సిన మరో రూ.15వేల కోట్ల విలువైన ప్రధాన మౌలిక వసతుల పనులన్నింటికీ టెండర్లు పిలిచే ప్రక్రియను జులై నెలాఖరుకు పూర్తి చేయాలని సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాజధానిలో తొలి దశలో రూ.42వేల కోట్ల విలువైన పనులు జరగాల్సి ఉండగా, ఇంతవరకూ సుమారు రూ.26,500 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. మిగతా పనులకూ జులై నెలాఖరులోగా టెండర్లు పిలిచి, పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయన బుధవారం సచివాలయంలో రాజధాని పనుల పురోగతిపై సమీక్షించారు. అమరావతి నిర్మాణానికి సంస్థాగత మదుపరుల నుంచి రూ.2000 కోట్లు సమీకరించే లక్ష్యంతో సీఆర్‌డీఏ విడుదల చేయనున్న బాండ్లకు 'అమరావతి బాండ్లు'గా నామకరణం చేశారు. వీటిని వివిధ దశల్లో విడుదల చేయనున్నారు. ప్రజల నుంచి (రీటెయిల్ ఇన్వెస్టర్లు) రాజధానికి నిధుల సమీకరణకు రీటెయిల్ బాండ్లు విడుదల చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. విధి విధానాల్ని త్వరలోనే ఖరారు చేస్తారు. ఇదే సమావేశంలో పురపాలక శాఖకు సంబంధించిన అంశాలపైనా సీఎం సమీక్షించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ల నమూనాలను పరిశీలించారు. జులై మొదటివారంలో 100 క్యాంటీన్లను, తరువాతి దశలో మరో 103 క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.

అవినీతి జరిగితే కఠిన చర్యలు

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల్లో అసంతృప్తి రాకుండా చూడాలని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో సంతృప్తస్థాయి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

లక్ష్మీశ్రీజకు రాజ్యాంగం కంఠతా

లక్ష్మీశ్రీజ

ఈనాడు, హైదరాబాద్: భారత రాజ్యాంగ ప్రవేశిక మొదలుకొని ఐదు భాగాల్లో ఉన్న 395 అధికరణలను చదవడానికి ఒక రోజు సరిపోదు. అలాంటిది ఒక గంట సమయంలోనే మొత్తం ఆ బాలిక కంఠతా చెప్పేసింది. తెలంగాణలోని ఖమ్మంకు చెందిన పదేళ్ల బాలిక వేల్పుల లక్ష్మీశ్రీజ అసాధారణ ప్రతిభ ఇది. బుధవారం తెలంగాణ శాసనసభాపతి మధుసూదనాచారి కార్యాలయానికి తల్లిదండ్రులు సుధారాణి, కిరణ్‌కుమార్‌తో కలిసి ఆమె వచ్చింది. అక్కడ లక్ష్మీశ్రీజ రాజ్యాంగాన్ని ఏకబిగిన చెప్పేసింది. ప్రముఖులు ఏ అధికరణ గురించి అడిగినా వివరించింది. ఆమె జ్ఞాపకశక్తి అసాధారణమని, తెలంగాణ ఖ్యాతిని ఆమె ప్రపంచానికి తెలియజేస్తుందని, దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని ఈ సందర్భంగా మధుసూదనాచారి ప్రశంసించారు.

ఏపీఎన్జీవో హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక ఉత్తర్వులు రద్దు

ఈనాడు, హైదరాబాద్: ఏపీఎన్జీవో (గచ్చిబౌలి) మ్యుచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు డైరెక్టర్లను ఎన్నుకునే ప్రక్రియ కోసం హైదరాబాద్ జిల్లా సహకార అధికారి (డీసీవో)/ కోపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్ జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఆ సొసైటీకి డెరెక్టర్లను ఎన్నుకోవడం కోసం 'సర్వసభ్య సమావేశం' నిర్వహణకు మే 18న, 'తాత్కాలిక కమిటీ' ఏర్పాటుకు జూన్ 1న డీసీవో ఉత్తర్వులు జారీచేశారు. జారీచేశారు. వాటిపై ఏపీఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు, ఉపాధ్యక్షుడు బాపూజీ, డెరెక్టర్లు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి.. ఈనెల 13న డీసీవో ఉత్తర్వులను సస్పెండ్ చేశారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ సహకారశాఖ ముఖ్య కార్యదర్శి, సహకార సంఘాల కమిషనర్, హైదరాబాద్ డీసీవో ఓ అప్పీల్ దాఖలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎం.సత్యనారాయణ గౌడ్ మరో 15 మంది మరో అప్పీల్‌ను దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణ సందర్భంగా.. సొసైటీ సర్వసభ్య సమావేశ ఏర్పాటుకు డీసీవో మే 18న జారీచేసిన ఉత్తర్వులు 'కారణాలతో' కూడినవిగా లేవని ధర్మాసనం ఆక్షేపించింది. ఏపీ ఎన్జీవో అధ్యక్షులు ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోలేదంటూ డీసీవో ఉత్తర్వులను రద్దుచేసింది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీఎన్జీవో హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్నారని తెలిసి డీసీవో సమాచారం తెలియజేయడంలేదని వారి తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న సొసైటీ చిరునామాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఏపీఎన్జీవో అధ్యక్షుడు, కార్యదర్శి, డైరెక్టర్లకు 'కారణాలతో కూడిన ఉత్తర్వులను' రిజిస్టర్ పోస్టులో పంపాలని ధర్మాసనం డీసీవోను ఆదేశించింది. ఆ తర్వాతే ఎన్నికలపై చర్యలు తీసుకోవాలని డీసీవోకు స్పష్టంచేసింది.

ఇథనాల్ ధర మూడు రూపాయలు పెంపు

దిల్లీ: ప్రభుత్వం ఇథనాల్ ధరను లీటరుకు దాదాపు రూ.3 పెంచింది. లీటరు రూ.40.85గా ఉన్న ఈ ఇంధనం ధర... పెంపుతో రూ.43.70కు చేరింది. చమురు దిగుమతులు తగ్గించుకోవడానికి పెట్రోల్‌లో 10శాతం వరకు ఇథనాల్‌ను కలపడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అయితే దీని ఉత్పత్తి తగినంతగా లేకపోవడంతో 4శాతంలోపే కలుపుతున్నారు. చెరకు నుంచి పంచదారను తయారు చేసే క్రమంలో ఇథనాల్ ఉత్పత్తి అవుతుంది. ఇథనాల్ ధరను పెంచడం వల్ల చెరకు రైతులకు లబ్ధి కలగడంతో పాటు చమురు దిగుమతి వ్యయం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సి-మొలాసిస్ (అంతిమ మొలాసిస్) నుంచి ఉత్పత్తి అయ్యే ఇథనాల్ ధర తాజా పెంపు 2018, డిసెంబరు నుంచి ప్రారంభమయ్యే మార్కెటింగ్ సంవత్సరం నుంచి వర్తిస్తుంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ సంఘం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బి-మొలాసిస్ (మధ్యంతర మొలాసిస్) నుంచి ఉత్పత్తి అయ్యే ఇథనాల్ ధరను కూడా తొలిసారి ప్రభుత్వం లీటర్‌కు రూ.47.49గా స్థిరపర్చింది. చెరకు లభ్యత ఎక్కువగా ఉన్న సంవత్సరాల్లో చెరకు రసాన్ని ఇథనాల్ తయారీకి మళ్లించడానికి ఈ నిర్ణయం ఉపకరిస్తుంది.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుకు అనుభవజ్ఞులైన వైద్యులు: బోధన, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు అవసరాల నిమిత్తం అనుభవజ్ఞులైన వైద్యుల లభ్యత కోసం ఉద్దేశించిన ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ ప్రతిపాదన ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి చెందిన, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన అత్యంత అనుభవజ్ఞులైన వైద్యులను బోధన అవసరాలకు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు కార్యకలాపాలకు బదిలీ చేస్తారు.

★ ఒడిశాలోని చాందీఖోల్, కర్ణాటకలోని పాదూర్‌లో భూగర్భంలో ముడిచమురు నిల్వ కేంద్రాల ఏర్పాటుకు ఆమోదం. ఇప్పటికే విశాఖపట్నం, మంగళూరు, పాదూర్‌లో ఉన్న నిల్వకేంద్రాలకు ఇవి అదనం.

మకరందం

7 విజయవాడ గురువారం జూన్ 28, 2018 ఈనాడు

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

makarandam@eenadu.in

ఇస్లాం సందేశం

దైవం అండగా..

మనిషి బలవంతుడే అయినా.. "నేను" అని అహంకరించడం పొరపాటు. దైవాన్ని మించింది లేదు. మనం చేసే పనికి దైవానుగ్రహం కావాలని కోరుకోవాలి. అందుకే చాలామంది ఏ పని చేసినా దైవాన్ని స్మరిస్తూ ఉంటారు. ముస్లిం సోదరులు సందర్భానికి అనుగుణంగా బిస్మిల్లాహ్ (దైవం పేరుతో ప్రారంభిస్తున్నాను), మాషా అల్లాహ్, సుబ్‌హానల్లాహ్ (దైవసృష్టి అద్భుతం), అల్‌హందులిల్లాహ్ (దైవానికి కృతజ్ఞతలు), ఇన్షా అల్లాహ్ (దైవానికి చిత్తమయితే) అని వివిధ రకాలుగా దైవాన్ని స్తుతిస్తూ ఉంటారు. ఈ మాటలు పలకడం వల్ల దైవం తమకు అండగా నిలుస్తుందని నమ్ముతారు.

– యం.డి.ఫారూఖ్ జునైద్ ఖాన్

క్రీస్తువాణి

మారు మనసే విమోచనం



ఒక చిత్రకళాసంస్థ వారు ఒక పోటీ పెట్టారు. కరుణ, క్షమ, ప్రేమ మూర్తీభవించిన వ్యక్తి బొమ్మను చిత్రీకరించాలన్నారు. పోటీలో విజేతకు అమూల్యమైన పురస్కారంతో పాటు సన్మానం చేస్తామన్నారు. పోటీకి స్పందనగా వేల చిత్రాలు వచ్చాయి. వాటన్నిటినీ పరిశీలించి న్యాయనిర్ణేతల బృందం విజేతను ఎంపిక చేసింది. వేలమంది ప్రేక్షకుల సమక్షంలో బహుమతికి ఎంపికైన చిత్రకారుణ్ని, ఆ చిత్తరువులోని వ్యక్తికీ పురస్కారం ఇవ్వడానికి వేదికపైకి పిలిచారు. చిత్రంలోని వ్యక్తిని చూసి అక్కడున్న జనులంతా నివ్వెరబోయారు. కొన్నేళ్ల కిందటి వరకు ఆయన ఎన్నో నేరాలు, ఘోరాలు చేసి జైలు జీవితం గడిపాడు. ఒక వ్యక్తిని చంపిన హంతకుడు కూడా! ఒకప్పుడు కరుడుగట్టిన ఆ వ్యక్తే ఇప్పుడు కారుణ్యమూర్తిగా వారి ఎదుట నిలిచాడు. అతడి కళ్లు కరుణతో వెలుగుతున్నాయి. పెదాలు ప్రేమతో పలకరిస్తున్నాయి. ముఖంలో క్షమ. ఇది ఎలా సాధ్యం?! అందుకు అతడిచ్చిన సమాధానం పశ్చాత్తాపం. "నా దుఃఖం, పశ్చాత్తాపంతో నాలో క్రోధం, కోపం, వైషమ్యం తొలిగాయి. అవే నాకు క్షమాభిక్ష ప్రసాదించాయి. జైలు నుంచి విడుదలయ్యాను" అన్నాడు.

ఈ మాటల ద్వారా క్రీస్తు చెప్పిన ఒక ఉపదేశం స్ఫురణకు వస్తుంది. "దుఃఖించేవారు ధన్యులు. వారు ఓదార్పు పొందుతారు" అన్నారు ప్రభువు. దుఃఖంతో కూడిన పశ్చాత్తాపం అసలైన ప్రాయశ్చిత్తం. పొరపాట్లు మానవ సహజం. అవి అలవాట్లుగా మారకూడదు. చేసిన తప్పులు.. అపరాధాలుగా పరిణామం చెందకూడదు. మనసు మార్చుకొని పశ్చాత్తాపం చెందినపుడు.. కంటి వెంట జారే నీరు స్వయంగా ప్రకాశించే సూర్యుడి కాంతికన్నా ప్రశస్తమైనద"ని ప్రబోధించారు క్రీస్తు. మనసు మారిన పాపాత్ముడిని చూసి దేవదూతలు ఆనందపడతారని చెప్పారాయన. పశ్చాత్తాపంలోనే క్షమాపణ, సమాధానం లభిస్తుందనేది క్రీస్తువాణి.

పశ్చాత్తాపం అంటే దుఃఖించడం కాదు. చేసిన చెడుపని గురించి బాధపడటం కాదు. వాటి గురించి సిగ్గుపడటమే కాదు.. తిరిగి ఆ దుష్కార్యం చేయకపోవడం. విమోచన అంటే మారుమనసు పొందడం అంటారు ప్రభువు. పశ్చాత్తాపం పొందడానికి సరైన రుజువు మారుమనసు పొందడమే! ప్రేమ, క్షమ, కరుణ మూర్తీభవించిన క్రీస్తులా పునరుత్థానం చెందటమే మారుమనసుకు అర్థం.

డా.ఎమ్.సుగుణరావు

ధర్మసందేహం

భూగోళానికి నిదర్శనం..

ఇంటి గుమ్మానికి గుమ్మడికాయ ఎందుకు కడతారు?

– ప్రసాద్, తిరుపతి

మన సంప్రదాయంలో గుమ్మడికాయను మహాలక్ష్మిగా భావిస్తారు. గుమ్మడికాయ శుభానికి సంకేతం. అంతేకాక ఇది దృష్టి దోషాలను పరిహరిస్తుందన్న విశ్వాసం పరంపరాగతంగా మనలో స్థిరపడింది.



అంతేకాదు ఆకారాన్ని బట్టి గుమ్మడి కాయను భూగోళానికి ప్రతీకగా కూడా కొందరు భావిస్తారు. దృష్టి దోషాన్ని పరిహరిస్తుందనీ, అశుభాన్ని తొలగించి శుభాలను ప్రసాదించే తత్వం గుమ్మడికాయలో ఉందని అనాదిగా ఉన్న నమ్మకం. ఈ కారణాలే గుమ్మడిని పూజార్హంగా నిలబెట్టాయి. ఇంటి గుమ్మానికి గుమ్మడికాయ కట్టే సంప్రదాయం స్థిరపడింది.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

మొక్కండి

అడవిలో పుట్టి.. గుడిలో నిలిచి

ప్రతి ఆలయం ముందు ధ్వజ స్తంభం కనిపిస్తుంది. అల్లంత దూరం నుంచే అందరి కంటా పడుతుంది. ధ్వజస్తంభంలోనూ దైవశక్తి ఉంటుందని ఆగమశాస్త్రం చెబుతోంది. అంతటి ప్రాధాన్యం ఉన్న ధ్వజస్తంభాన్ని నారేప చెట్టు నుంచి తయారు చేస్తారు. ఆధ్యాత్మిక

ప్రాధాన్యం సంతరించుకున్న నారేప వృక్షాన్ని సంస్కృతంలో అంజనా అని పిలుస్తారు. వాల్మీకి రామాయణంలోనూ ఈ చెట్టు ప్రస్తావన ఉంది. అశోక వనంలోని వివిధ వృక్షాల్లో అంజనా కూడా ఉందట.

నారేప వృక్షం దట్టమైన అడవుల్లో కనిపిస్తుంది. గోదావరి, ప్రాణహిత, కావేరీ నదీ పరీవాహక ప్రాంతాల్లోని అడవుల్లో ఇవి ఉన్నాయి. ఈ చెట్టు 24 నుంచి 30 మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతుంది. చెట్టు చుట్టుకొలత మూడు మీటర్ల పైమాటే! ఈ చెట్టు తక్కువ కొమ్మలతో నిటారుగా పెరుగుతుంది. కాండం చాలా గట్టిగా ఉంటుంది. జిగురు ఎక్కువగా ఉండడంతో గట్టిగా ఉంటుంది. దీనిని యంత్రాల సహాయంతో కోయడం కూడా కష్టంతో కూడుకున్న పనే! ఎండకు, వానకు తట్టుకొని నిలబడుతుంది. నారేప కలపకు చెదలు పట్టడం అరుదు. చాలా కాలం మన్నికగా ఉంటుంది. ఈ ప్రత్యేకతలే నారేప చెట్టును ధ్వజస్తంభంగా నిలబెట్టింది. కాలక్రమంలో నారేప వృక్షాలతో పాటు మద్ది, టేకు కలపను కూడా ధ్వజస్తంభాలుగా వాడుతున్నారు.

– కె.ఏడుకొండలు, ఆదిలాబాద్

భూమిలోని సారాన్ని ఆహారంగా మార్చి, సమాజాన్ని పోషించేది రైతు... మన శరీరాలకు అన్నం రూపంలో ప్రాణశక్తిని అందించే దైవమాయన... అందుకే రైతులేనిదే రాజ్యం లేదని ఏనాడో గుర్తించారు... 'మెతుకు పెట్టే రైతన్న బతుకు నిలిపే పెద్దన్న' అంటూ వర్ణించారు. రైతును, భూమిని, పంటను, పశువును పూజించడం భారతీయ జీవన విధానంలో ముఖ్య భాగాలు.. అన్నదాత తల్లిలా పూజించే భూమికి మొక్కి సాగుకు శ్రీకారం చుట్టే అద్భుత ఘట్టమే ఏరువాక...

నేడు ఏరువాక పౌర్ణమి



రైతుల కంట పున్నమి పంట

ప్రకృతిలో దొరికే పదార్థాలను యథాతథంగా వాడుకునే దశనుంచి వాటిని తయారు చేసుకునే ప్రయత్నం చేశాడు మానవుడు. కూడు, గూడు, గుడ్డ... ప్రతి మనిషికీ నిత్యావసరాలు. ఈ మూడు అవసరాలను తీర్చే ఏకైక మార్గం పంట పండించడం. ఆదిమ దశ నుంచి ఆధునిక దశకి వచ్చిన అతడు దానికి వ్యవసాయం అని పేరు పెట్టాడు. కృషి, సాగు లాంటివి దానికి సమానార్థకాలు. వ్యవసాయ సంబంధ పనులు చేసేవారిని రైతు, కర్షకుడు, హాలికుడు, వ్యవసాయదారుడు... ఇలా ఎన్నో పేర్లతో పిలిచారు. పాడిపంటలు ఏ ఆర్థికవ్యవస్థకైనా పునాదుల్లాంటివి. తొలిసారిగా తన పొలాన్ని దున్ని సాగుకు సిద్ధం చేసుకోవడం రైతు జీవితంలో ఓ మధుర ఘట్టం. ఇది ఏటా జరుగుతూనే ఉన్న ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది. కొత్త పంటకు శ్రీకారం చుడుతూ రైతన్న ఆనందంగా వినిపించే ఓ అద్భుత రాగం ఏరువాక. ఇది సామూహికంగా ప్రతీ జ్యేష్ఠ మాస పూర్ణిమ నాడు జరుపుకునే పండగ. రైతు తొలిసారిగా తన పొలంలో నాగలి దున్ని తన కృషికి శ్రీకారం చుట్టే శుభసమయం ఇది. దీని గురించి వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ప్రస్తావించాయి. జానపద సాహిత్యంలో ఏరువాకకు సంబంధించి ఎన్నెన్నో పాటలు, పదాలు పుట్టుకొచ్చాయి. ఇవన్నీ ప్రజలందరికీ పట్టెడన్నం ఆనందంగా పెట్టే రైతు జీవనశైలికి అద్దంపడుతూ కనిపిస్తాయి. ఏరువాక అనే పదంలోనే తేనె వాగులాంటి ఓ తియ్యదనం...ఓ గొప్ప అనుభూతి దాగిఉన్నాయి. ఏరు అనే పదానికి దున్నటానికి సిద్ధం చేసిన నాగలి అని అర్థం ఉంది. వాక అంటే సాగడం. ఏరువాక నాడు శ్రీకారం చుట్టి శ్రమైక జీవనానికి ఒక సమైక్యగీతికను ఆనాడు పల్లె ప్రజలంతా పాడుకుంటూ కనిపిస్తారు. జ్యేష్ఠ పూర్ణిమ నాడు పల్లెపల్లెనా రైతులంతా తమ పశువులను అందంగా అలంకరించి ఉత్సవానికి సిద్ధం చేస్తారు. పొంగలి వండి ఎద్దులకు తినిపిస్తారు. ఈ అలంకరణలో ఎద్దుల కొమ్ములకు రంగులు వేయడం, కాళ్లకు గజ్జలు కట్టడం, మెడ పట్టీలతో అలంకరించడం లాంటి సందడిలో రైతుల ఇళ్లు కోలాహలంగా ఉంటాయి. అదేరోజు సాయంత్రం మంగళవాద్యాలతో ఊరు ఊరంతా ఊరుమ్మడిగా నాగళ్లతో తమ పొలాలవైపు అడుగులేస్తారు. నారపీచుతో ఒకతోరణాన్ని కట్టి ఎద్దులను అదిలించే చర్నాకోలుతో ఆ తోరణాన్ని కొట్టి దాని నుంచి వచ్చే నారను శుభసూచికంగా రైతులు తమ ఇళ్లకు తీసుకెళ్తారు. అలాగే పొలం దున్నేటప్పుడు ఎద్దుతో సమానంగా తాను అడుగులేయటం పశువుల విషయంలో రైతుకు ఉన్న ప్రేమానురాగాన్ని సూచిస్తూ ఉంటుంది. ఇతర పండగలు ఎవరికి వారు తమ ఇళ్లలో చేసుకున్నట్లు కాక అందరూ ఒకేరోజు ఒకే సమయంలో కలసికట్టుగా కదలి పొలాలకు వెళ్లటం ఒక సుందర దృశ్యంగా ఉంటుంది.

అన్ని కాలాల్లో...

ఈ పండగ దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ రకరకాల పేర్లతో జరుగుతూ ఉంటుంది. కర్ణాటకలో కారుణిపబ్బం అంటారు. సంస్కృత భాషలో 'ఉద్వృషభ యజ్ఞమని' పూర్వకాలం చేసేవారు. జైమినీయ న్యాయమాలా గ్రంథంలో హలాకాధికరణంలో దీనిని గురించి ప్రస్తావన ఉంది. ఉద్వృషభ యజ్ఞం పేరుతో ఉత్తరభారతదేశంలో జ్యేష్ఠ పూర్ణిమ నాడు జరపటం ఆచారంగా వస్తోంది. దీనినే 'అనడుత్సవం' అని కూడా అంటారు. ఈ ఉత్సవ ప్రస్తావన ఆధర్వణ వేదంలో ఉంది.

విష్ణుపురాణంలో ఈ వేడుకను సీతాయజ్ఞం పేరుతో పిలిచారు. సీతాయజ్ఞం అంటే శ్రీరామచంద్రుడి భార్య సీతమ్మ తల్లి చేసిన యజ్ఞమని అర్థం కాదు. సీత అంటే నాగేటిచాలు అని అర్థం. యజ్ఞం అనేది ఓ పవిత్ర కార్యం. నాగలితో పొలాన్ని దున్నే ఓ పవిత్ర యజ్ఞమనే అర్థంలో మాత్రమే ఇది ప్రస్తావనలో ఉంది. జనక మహారాజుకు నాగేటిచాలులో దొరికిన శిశువు కనుక సీత అని పేరు పెట్టారు. శుద్ధోదన మహారాజు కపిలవస్తు నగరంలో వర్షరుతువు ఆరంభం కాగానే కర్షకులకు లాంఛనంగా ఒక బంగారు నాగలిని ఇచ్చేవారని లలితవిస్తరం గ్రంథంలో ప్రస్తావన కనిపిస్తుంది. అలాగే హాలుడి గాథాసప్తశతిలో కూడా ఈ పండగ నేపథ్యం దర్శనమిస్తుంది.

అందరొక్కటై...

ఏరువాక పున్నమిను పండగగా చేసుకోవడం వెనుక ఉన్న అంతర్యం సామాజిక ప్రయోజనంతో ముడిపడి ఉంది. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవసాయ పనులు చేసుకోవడం కాకుండా అందరూ ఒక మాటగా ఒకే సమయంలో పనులను మొదలు పెడితే ఆ ఫలితం మరింత ఎక్కువగా ఉంటుంది. ఐకమత్యంతో సేద్యంలో ఎన్నెన్నో అద్భుత ఫలితాలను సాధించేందుకే ఇలాంటి ఆచారం ప్రారంభమైందని సామాజిక పరిశీలకులు చెబుతున్నారు. జ్యేష్ఠ పూర్ణిమ నాటికి నైరుతి రుతుపవనాలు కాస్త అటుఇటుగానైనా దేశమంతటా విస్తరిస్తాయి. వానలు పడి వ్యవసాయ పనులకు అదునుగా ఉంటుంది. దుక్కి దున్నడానికి ఇది చాలా మంచి సమయం. కనుకనే జ్యేష్ఠ పూర్ణిమను ఏరువాక పున్నమిగా స్థిరీకరించారు పెద్దలు.

హలాయుధుడు..

నాగలి వ్యవసాయానికి గుర్తు. అంతటి ఉత్తమ పనిముట్టు శ్రీకృష్ణుడి సోదరుడైన బలరాముడి చేతిలో ఆయుధంగా ఉండటాన్ని గమనిస్తే భారతీయ సనాతన సంప్రదాయంలో వ్యవసాయం ఎంతో పవిత్రమైన కార్యంగా ఉన్నట్టు తెలుస్తుంది. ఈ పండగకు యజ్ఞం అనే నామాతరం కూడా ఉండటాన్ని గమనిస్తే సేద్యం ఆషామాషీగా చేసేది కాదని ఓ పద్ధతి ప్రకారం నిర్వహించే పవిత్ర కార్యమని సమాజం అంతటికి తెలియజెప్పేందుకే ఏరువాక పున్నమ అవతరించిందని అనిపిస్తుంది.

వేదాల్లో వ్యవసాయం

వేదాలు, పురాణాలు, ఇతిహాసాల్లో వ్యవసాయం, వ్యవసాయదారులకు సంబంధించిన అనేక విషయాలు చర్చించారు. అగ్ని - వాయు పురాణాలు, నారద స్మృతి, విష్ణు ధర్మోత్తర మొదలైన ధర్మశాస్త్ర గ్రంథాల్లో వ్యవసాయం గురించి ఉంది. సింధు నాగరికత కాలంలో ప్రతి నగరంలోనూ తప్పనిసరిగా ధాన్యాగారాలు ఉండేవి. ఆ రోజుల్లో రైతులు ఉత్పత్తి చేసిన పంటలని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసేది. రైతు కష్టానికి తగిన ఫలితాన్నివ్వడం మన సంస్కృతిలో భాగమనడానికి ఇదో నిదర్శనం.

క్రీస్తు పూర్వం 321–296 మధ్యకాలంలో రాజాస్థానాల్లో సీతాధ్యక్షుడు అనే పదవి ఉండేదని కౌటిల్యుడు రాసిన అర్థశాస్త్రంలో వివరించారు. ఇక్కడ సీత అంటే నాగేటి చాలు అని అర్థం. వ్యవసాయ సంబంధిత సమాచారం, రైతులకు సూచనలు–సలహాలు– శిక్షణతో పాటు పండిన పంటను తాత్కాలిక– శాశ్వత పద్ధతుల్లో నిల్వ చేసుకునేందుకు మార్గదర్శకాలు–సూచనలు ఆ పదవిలో ఉన్నవారు వివరించేవారు.

- సంప్రదాయబద్ధంగా జరుపుకునే వ్రతాలలో పూర్వం ఇంద్రవ్రతం కూడా ఉండేది. ఇంద్రుడి అధీనంలో మేఘాలు ఉంటాయని, కర్షకులకు సమయానికి తగట్టుగా ఇంద్రుడు వర్షం కురిపించటం కోసం మేఘాలను పంపుతుంటాడని పురాణాలు వివరిస్తున్నాయి.
- వరాహ మిహిరుడు రాసిన బృహత్సంహిత వ్యవసాయ విజ్ఞానం తెలిపే పరిపూర్ణ గ్రంథం. ఇతడు ఖగోళ శాస్త్రవేత్త కావడంతో గ్రహగమనాల ఆధారంగా వర్షం కురిసే పరిస్థితులు, సుభిక్ష–దుర్భిక్షాలు ఏర్పడే తీరు, వాటిని నివారించడానికి ఎలాంటి పద్ధతులు అవలంబించాలి? తదితర విషయాలన్నీ ఆ బృహత్ గ్రంథంలో వివరించారు. పంటకి బలాన్నిచ్చే వనరుల వివరాలు, వాటి వినియోగానికి సూచనలు, రుతుపవనాల రాకను లెక్కించే పద్ధతులు, సుగంధ పరిమళాలు వెదజల్లే (నేటి బాస్మతి)వరి ధాన్యపు రకాల సాగు విధానం లాంటివీ అందులో ఉన్నాయి.
- క్రీస్తు శకం 1 వ శతాబ్దం నాటికి పరాశరుడు రూపొందించిన కృషి పరాశరం ఆనాటి వ్యవసాయ సర్వస్వం. ఎలాంటి భూమిలో–ఏ ప్రాంతంలో ఏ పంట పండించాలి?,ఏ పంటకి ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి?,ఎంత జనాభాకి ఎంత పరిమాణంలో పండించాలి?, అవసరానికి మించి పండించకూడని పంటలేవి?, అలా పండిస్తే కలిగే నష్టాలేంటి?, నేలకి సారాన్ని, పంటకి అనుకూల పరిస్థితుల్ని ఎలా కల్పించుకోవాలి?, విత్తనాలని ఎలా తయారు చేసుకోవాలి?, వర్షాన్ని ఎలా కొలవాలి?వంటి అనేక విషయాలు కృషి పరాశరంలో స్పష్టంగా చర్చించారు. వాటితో పాటు భూమి స్వభావం, దాన్ని దున్నే విధానం, దానికి అనుసరించాల్సిన పద్ధతులు, ఎద్దులు–ఇతర వ్యవసాయ సంబంధిత పశువుల స్వరూప స్వభావాలు స్పష్టంగా వివరించిన గ్రంథమిది.

– అయ్యగారి శ్రీనివాసరావు, డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, కప్పగంతు రామకృష్ణ

అదిగదిగో తెలుగు భారతం..!

'వింటే భారతం వినాలి.. తింటే గారెలే తినాలి' అనేది సుప్రసిద్ధ నానుడి. అంతటి మాధుర్యం ఉన్న మహాభారతం త్వరలోనే తెలుగు పాఠకులకు మరింత చేరువకానుంది. ఆధ్యాత్మిక గ్రంథాలను ముద్రించి చవక ధరల్లో అందించే గీతాప్రెస్ త్వరలో సంపూర్ణ మహాభారతాన్ని తేటతెలుగులో అందుబాటులోకి తేనుంది. లక్ష శ్లోకాలు, 18 పర్వాల పంచమ వేదాన్ని ఏడు సంపుటాల్లో 7248 పేజీల్లో మనముందుకు తీసుకురానుంది. భారతాన్ని 1955లో హిందీలో తొలిసారి ముద్రించిన గీతాప్రెస్ ఆ తర్వాత 18 సార్లు పునర్ ముద్రించి లక్షలాది కాపీలను పాఠకులకు చేరువ చేసింది. అయితే, హిందీయేతర భాషల్లో తొలిసారిగా తెలుగులోనే సంపూర్ణ మహాభారత ముద్రణకు గీతాప్రెస్ పూనుకోవడం విశేషం. డా. తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, డా. సూరం శ్రీనివాస్‌ల నేతృత్వంలో 12 మంది పండితుల బృందం అనువాద ప్రక్రియను దాదాపుగా పూర్తిచేసిందని గీతాప్రెస్ ప్రతినిధి చెప్పారు. శ్లోకతాత్పర్యాలేకాక నీలకంఠీయ వ్యాఖ్యానాల విశేషాలను కూడా ఇందులో జతచేయడం విశేషం. కవిత్రయ విరచితమైన తెలుగుభారతంలోని పద్యాలను సందర్భోచితంగా జోడించడం ద్వారా అనువాద ప్రక్రియకు మరింతగా వన్నెలు అద్దారు. తెలుగులో సంపూర్ణ మహాభారతం సెప్టెంబరు మొదటివారంలో పాఠకులకు అందుబాటులోకి రానుందని గీతాప్రెస్ తెలిపింది. ఒక్కో సంపుటి రూ. 400 చొప్పున ఏడు సంపుటాలకు కలిపి రూ. 2800గా ధరను నిర్ణయించారు. ఆది, సభా పర్వాలతో కూడిన మొదటి సంపుటి ఇటీవలే విడుదలైంది కూడా.

ఎదురు చూడాలనుకోను!

రకుల్

"ఇప్పటికీ వింటున్న కథలు, పాత్రలు అందమైన కలలాంటి అనుభూతినే పంచుతున్నాయి" అంటోంది రకుల్‌ప్రీత్ సింగ్. అందుకే కొత్తగా కలల పాత్ర అనే ఆలోచనేదీ రావడం లేదంటోందామె. ప్రస్తుతం తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ బిజీగా గడుపుతోంది. తెలుగులోనూ ఒక ప్రత్యేకగీతం కోసం సంతకం చేసిందని తెలుస్తోంది. కలల పాత్రలంటూ ఏమైనా ఉన్నాయా? అని అడిగితే... "నాలుగైదేళ్ల తర్వాత ఏమైనా ఆ ఆలోచన వస్తుందేమో చూడాలి. ప్రస్తుతానికైతే చేస్తున్న ప్రతిదీ కలల సినిమాలాగే ఉంద"ంటోంది రకుల్. సరైన కథలు, పాత్రలు లభించడం లేదనే మాట కథానాయికల నుంచి తరచూ వినిపిస్తుంటుంది కదా, మీకూ అలా అనిపిస్తోందా? అని అడిగితే... తాను ఆ విషయం గురించి మరీ ఎక్కువ ఆలోచించనంటోంది. "ఏదో ఒక రోజు మనకూ బలమైన కథలొస్తాయనీ, మన ప్రతిభని ప్రదర్శించే అవకాశం లభిస్తుందనే ఆశతో ఉంటా. కానీ అది వచ్చేవరకు ఎదురు చూద్దామని మాత్రం అనుకోను. ఏదో ఒక పని చేస్తూ ఉంటే అనుభవమైనా వస్తుంది. ఖాళీగా ఉంటే ఏమొస్తుందనే ధోరణి నాది. అలా అప్పుడప్పుడు నాకూ మంచి పాత్రల్లో నటించే అవకాశం లభించింది కదా" అని గుర్తు చేస్తోంది రకుల్.

ఓ వ్యక్తి మంచి గురించి తెలుసుకోవాలనుకుంటే వాడు చదివే బుక్స్ చూడు.
వాడి చెడు గురించి అయితే వాడి డస్ట్‌బిన్ చూడు.
చిత్రం: సెవెంత్ సెన్స్
పంపినవారు: పి.రత్నాకర్, పుట్టపర్తి

రాజా... డిస్కో రాజా!

రవితేజని మాస్ మహారాజా అని అభిమానులు ప్రేమగా పిలుచుకుంటారు. 'రాజా ది గ్రేట్' అనిపించుకున్న రవితేజ... ఇప్పుడు 'డిస్కో రాజా'గా మారబోతున్నారని టాలీవుడ్ టాక్. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం' చిత్రాలతో ఆకట్టుకున్న దర్శకుడు వీఐ ఆనంద్ ఇప్పుడు రవితేజతో ఓ సినిమా చేయబోతున్నారు. దసరాకి ఈ చిత్రం ప్రారంభం కానుందని సమాచారం. ఈ చిత్రానికి 'డిస్కో రాజా' అనే పేరు పరిశీలిస్తున్నారు. రవితేజ ద్విపాత్రాభినయం చేయబోతున్నారని, ఆయన తండ్రీ కొడుకులుగా కనిపించనున్నారని సమాచారం. ఇందులో ఇద్దరు కథానాయికలకు అవకాశముంది. వాళ్లెవరన్నది త్వరలో చెబుతారు. రవితేజ ప్రస్తుతం 'అమర్ అక్బర్ ఆంటోనీ'తో బిజీగా ఉన్నారు. అది పూర్తయ్యాకే 'డిస్కో రాజా' సెట్స్‌పైకి వెళ్తాడు.

రవితేజ

ఫన్నే ఖాన్ అంటే ఎవరు?

బాలీవుడ్‌లో ఆసక్తి రేపుతున్న మరో మల్టీస్టారర్ చిత్రం 'ఫన్నే ఖాన్'. ఐశ్వర్యరాయ్, అనిల్ కపూర్, రాజ్‌కుమార్ రావ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అతుల్ మంజ్రేకర్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'ఫన్నే ఖాన్.. ఈ పేరుకు కళాకారుడు, గాయకుడు, ఇంద్రజాలికుడు లేదా ఓ మూర్ఖుడు అని ఇలా చాలా అర్థాలున్నాయి. ఎవరితో ఉంటే భలే మజా వస్తుందో వారే ఫన్నే ఖాన్. కానీ ఈ అర్థాలను శాశ్వతంగా మార్చేసిన ఓ వ్యక్తి కథే ఈ ఫన్నే ఖాన్' అంటూ టీజర్‌లో ప్రధాన పాత్ర గురించి పరిచయం చేశారు. అనిల్ కపూర్ టీజర్‌ను పంచుకుంటూ 'తన కథను తానే రాసుకునేవాడే ఫన్నే ఖాన్' అని పోస్ట్ చేశారు. టీజర్‌ను బట్టి అనిల్ కపూర్ ఫన్నే ఖాన్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. టీజర్‌లో ఐశ్వర్య రాయ్, రాజ్‌కుమార్ రావ్ తళుక్కున మెరవడం ఆకట్టుకుంటోంది. వీరితో పాటు బాలీవుడ్ దివంగత నటుడు షమ్మీ కపూర్, గాయకుడు మహమ్మద్ రఫీ చిత్రాలను చూపించడం ఆసక్తి కలిగిస్తోంది. 2000లో ఆస్కార్ నామినేషన్ పొందిన బెల్జియన్ చిత్రం 'ఎవ్రీబడీస్ ఫేమస్'కు రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రముఖ దర్శకుడు రాకేష్ ఓం ప్రకాష్ మెహ్రాతో కలసి అనిల్ కపూర్ నిర్మిస్తున్నారు. రాకేష్ ఈ చిత్రం గురించి చెబుతూ "ఇది ఓ తండ్రీకూతుళ్ల మధ్య జరిగే అందమైన ప్రేమకథ. సంగీతానికి ఎంతో ప్రాధాన్యముంది. మహిళా కళాకారుల గొప్పతనాన్ని ఆవిష్కరించేలా సాగుతుంద"ని తెలిపారు. ఆగస్టు 3న విడుదల చేయనున్నారు.

అనిల్ కపూర్

శతజయంతి వేడుకలు

యస్వీ రంగారావు

విలక్షణ నటుడు యస్వీ రంగారావు శతజయంతి వేడుకల్ని జులై 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు 'సంగమం' ఫౌండేషన్ సంస్థ అధ్యక్షులు, సినీ పరిశోధకులు సంజయ్ కిశోర్ ఓ ప్రకటనలో తెలిపారు. "ఇది యస్వీ రంగారావు శతజయంతి సంవత్సరం. ఈ సందర్భంగా ఆయన జన్మదినమైన జులై 3న హైదరాబాద్ రవీంద్రభారతిలో వేడుకల్ని నిర్వహిస్తాం. మండలి బుద్ధప్రసాద్, కె.వి.రమణ నేతృత్వంలో ఏర్పాటైన ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న ఈ వేడుకలకి భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ వేడుకల్లో యస్వీ రంగారావుతో కలిసి నటించిన నటుల్ని, ఆయన తర్వాత తరాల్లో పేరు తెచ్చుకొన్న క్యారెక్టర్ ఆర్టిస్టుల్ని కూడా ప్రత్యేకంగా సత్కరిస్తామ"ని పేర్కొన్నారు సంజయ్ కిశోర్.

కన్నుల్లో ప్రేమ రూపం

నందు, తేజస్విని ప్రకాష్ జంటగా నటించిన చిత్రం 'కన్నుల్లో నీ రూపమే'. బిక్స్ ఇరుసడ్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భాస్కర్ భాసాని నిర్మాత. ఇరుసడ్ల రాజమౌళి సమర్పిస్తున్నారు. సాకేత్ స్వరకర్త. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్ర పాటల విజయోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. 'సింధూరపువ్వు' కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "అందమైన ప్రేమకథ ఇది. సాకేత్ స్వరాలు చిత్రానికి బలం. ఇప్పిలి రామ్‌మోహన్‌రావు, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి తోడ్పాటుతో చిత్రం విడుదలవుతోంద"న్నారు. సింధూరపువ్వు కృష్ణారెడ్డి మాట్లాడుతూ "చిన్న చిత్రాల్ని విడుదల చేయడం ఈ రోజుల్లో చాలా కష్టమైన పని. దర్శకుడు బిక్స్ ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాడ'న్నారు. కార్యక్రమంలో భాస్కర్, విశ్వ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

తేజస్విని ప్రకాష్, నందు

ఉచితంగా తొలి ప్రదర్శన

'ఐపీసీ సెక్షన్ భార్యాబంధు' చిత్రం విడుదలైన తొలి రోజు తొలి ఆటని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు ఆ సినిమా దర్శకుడు రెట్టడి శ్రీనివాస్. ఆమని ముఖ్యపాత్రలో నటించిన ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా రెట్టడి శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. "రెండు తెలుగు రాష్ట్రాల్లో మల్టీప్లెక్స్ థియేటర్లలో మినహా మిగిలిన అన్ని చోట్లా ఈ సినిమా ఉదయం ఆటకి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నాం. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ పది మందికి చెబుతారనే నమ్మకంతో నిర్మాత ఈ నిర్ణయాన్ని తీసుకొన్నారు. దర్శకత్వ శాఖలో అనుభవం సంపాదించిన నేను ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతుండడం ఆనందంగా ఉంది. మహిళల రక్షణ కోసం చేసిన చట్టాల్ని కొందరు ఎలా దుర్వినియోగం చేస్తున్నారనే విషయాన్ని వినోదాత్మకంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశాం. రచయిత, కౌన్సిలర్ అయిన స్వాతి శ్రీపాద పాత్రలో ఆమని నటించారు. మంచి సందేశానికి తోడు, వినోదాన్ని జోడించి రూపొందించిన చిత్రమిది. అందరికీ నచ్చుతుంది" అన్నారు రెట్టడి శ్రీనివాస్.

రెట్టడి శ్రీనివాస్

ఇదో జీవిత కాల ప్రయాణం

దక్షిణాది చిత్రాలతో కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న దుల్కర్ సల్మాన్ బాలీవుడ్‌కు పరిచయమవుతున్న చిత్రం 'కార్వాన్'. ప్రధానంగా మూడు పాత్రల చుట్టూ తిరిగే చిత్రమిది. విలక్షణ నటుడు ఇర్ఫాన్ ఖాన్ ఓ కీలక పాత్రలో నటించాడు. మరో పాత్రలో కొత్త నటి మిథిలా పాల్కర్ నటించింది. ఆకర్ష్ ఖురానా తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో దుల్కర్, ఇర్ఫాన్, మిథిల మధ్య వచ్చే సంభాషణలు నవ్వులు పూయిస్తున్నాయి. 'కార్వాన్' కథ విషయానికొస్తే ఏ మాత్రం పరిచయం లేని ముగ్గురి జీవితాల్లో ఒక విషాదం చోటు చేసుకుంటుంది. ఆ విషాదమే వారందరినీ ఒకచోటికి చేరుస్తుంది. రెండు శవాలను వెతుక్కుంటూ వారు కలసి ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఆ ప్రయాణం వారికి జీవితంలో మరపురానిదిగా మారుతుంది. జీవితమంటే ఏంటో తెలియజెబుతుంది. ఇంతకీ వారి జీవితాల్లోని విషాదాలేంటి? ఆ ప్రయాణంలో ఏం తెలుసుకున్నారన్నది 'కార్వాన్'లో ఆవిష్కరించనున్నారు. ఆగస్టు 3న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

దుల్కర్ సల్మాన్, ఇర్ఫాన్ ఖాన్, మిథిలా పాల్కర్

రాజమౌళి మల్టీస్టారర్‌లో..?

'మహానటి'తో మనసుల్ని గెలుచుకుంది కీర్తి సురేష్. ఇప్పుడో మంచి అవకాశం ఆమె చేతుల్లోకి వెళ్లినట్టు తెలుస్తోంది. రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్ - ఎన్టీఆర్ కథానాయకులుగా ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉంది. ఓ నాయికగా కీర్తిని ఎంచుకున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం స్క్రిప్టు పనులు జరుగుతున్నాయి. సెప్టెంబరులో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలున్నాయి. 2020లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ సినిమా కోసం హైదరాబాద్ శివార్లలో ప్రత్యేకంగా ఓ సెట్‌ను తీర్చిదిద్దుతున్నారు. సాబు సిరిల్ ఆధ్వర్యంలో సెట్ పనులు జరుగుతున్నాయి. 'బాహుబలి' టీమ్‌లో ఉన్న సెంథిల్, కీరవాణి ఈ చిత్రానికీ పనిచేయబోతున్నారు.

కీర్తి సురేష్

బాలయ్య టైటిల్‌తో..

నందమూరి బాలకృష్ణ సూపర్ హిట్ చిత్రాల్లో 'నారి నారి నడుమ మురారి' ఒకటి. ఇప్పుడు ఈ టైటిల్ మరోసారి వినిపించబోతోంది. నాగశౌర్య కథానాయకుడిగా భవ్య క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. వి.ఆనంద ప్రసాద్ నిర్మాత. రాజా కొలుసు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇటీవలే కొబ్బరికాయ కొట్టారు. ఆగస్టులో చిత్రీకరణ మొదలవుతుంది. ఈ చిత్రానికి 'నారి నారి నడుమ మురారి' అనే పేరు పరిశీలిస్తున్నారు. శౌర్య సరసన ఇద్దరు కథానాయికలు నటిస్తారు. వాళ్లెవరన్నది త్వరలో తెలుస్తుంది. సంగీతం: మహతి స్వర సాగర్

నాగశౌర్య

పదకొండేళ్లకు మళ్లీ?

సల్మాన్‌ఖాన్, సంజయ్‌లీలా భన్సాలీది మంచి హిట్ కాంబినేషన్. ఈ కలయికలో వచ్చిన 'ఖామోషీ', 'హమ్ దిల్ దే చుకే సనమ్' లాంటి చిత్రాలు మంచి విజయం సాధించాయి. త్వరలోనే సల్మాన్‌తో భన్సాలీ మరో చిత్రం తెరకెక్కించనున్నట్టు సమాచారం. "భన్సాలీ సిద్ధం చేసుకొన్న కథకి సల్మాన్ అయితే సరిగ్గా సరిపోతారు. 11 ఏళ్ల తర్వాత ఈ కాంబినేషన్‌లో సినిమా రాబోతుంది" అంటూ భన్సాలీ సన్నిహిత వర్గాలు చెప్పినట్టు సమాచారం.

సంజయ్‌లీలా భన్సాలీ

సల్మాన్‌ఖాన్

'చక్ దే...' తర్వాత ఇన్నాళ్లకు?



షారుఖ్‌ఖాన్

'చక్ దే ఇండియా'...షారుఖ్ ఖాన్ కెరీర్‌లో ఓ గొప్ప చిత్రంగా నిలిచిపోయింది. 2002 కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొన్న భారతీయ మహిళా హాకీ జట్టు నేపథ్యంగా సాగిన ఈ చిత్రం 2007లో విడుదలై మంచి ప్రశంసలు అందుకొంది. బాక్సాఫీసు వసూళ్ల మాట ఎలా ఉన్నా షారుఖ్‌లోని గొప్ప నటుణ్ని తెరపై ఆవిష్కరించింది. దానికి కారణం చిత్ర దర్శకుడు షిమిత్ అమిన్. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరి కలయికలో ఓ సినిమా రాబోతుందని సమాచారం. "చక్ దే..' తర్వాత మరో సినిమా చేయాలని షారుఖ్, షిమిత్‌లు భావించారు. కానీ కుదరలేదు. కానీ ఇప్పుడు ఓ కథ సిద్ధమైంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించి షారుఖ్, షిమిత్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. అనుకున్నట్టు జరిగితే షారుఖ్ నుంచి మరో మంచి చిత్రం ఖాయం"అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు.

షిమిత్ అమిన్

ఓషో కథలో...

ఆమీర్‌ఖాన్ మరో బయోపిక్‌లో నటించచడానికి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయని సమాచారం. వివాదాస్పద ఆధ్యాత్మికవేత్త ఓషో జీవిత కథలో ఆమీర్ నటించబోతున్నాడట. ఈ కథ ఆమీర్‌కు నచ్చడంతో ఓకే కూడా చెప్పేశాడట. 'కపూర్ అండ్ సన్స్' చిత్ర దర్శకుడు శకున్ బత్రా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ చిత్రంలో ఆమీర్‌తో పాటు కీలక పాత్రలో ఆలియా భట్ నటించే అవకాశాలున్నాయి. ఓషోకు సెక్రటరీగా పనిచేసిన ఆనంద్ షీలా పాత్రలో ఆలియా కనిపించనుందట. ఈ ఏడాది చివరకి ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలున్నాయి. ఆమీర్ ప్రస్తుతం 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్' చిత్రీకరణతో బిజీగా ఉన్నాడు. 'కళంక్', 'బ్రహ్మాస్త్ర' చిత్రాల్లో నటిస్తోంది ఆలియా.

ఆమీర్‌ఖాన్

ఆలియా

కళ్లముందే అక్క మరణం....ఆమెను కుంగదీసింది. అది హత్య అని గుండెలవిసేలా చెబుతున్నా... కాదని కొట్టిపారేశారు పోలీసులు. దాంతో న్యాయం కోసం ఒంటరిపోరాటం మొదలుపెట్టింది. సహకారం లేకపోయినా నిరూపించాలనుకుంది.

తన అక్క చావుకు కారకులైన నలుగురు నిందితులు కటకటాల పాలయ్యే వరకూ ఆగలేదు. ఇప్పుడు ఏడాదిన్నర ఆమె పోరాటంలో మొదటి మెట్టు ఎక్కింది. ఆమే దంగేటి పావని. ప్రమాదంగా చిత్రీకరించి మూసేసిన కేసుని హత్యకేసు అని రుజువు చేయడానికి ఆమె పడిన కష్టాన్నీ, పోరాటాన్ని 'వసుంధర'తో పంచుకుందిలా.

వాడికి శిక్ష పడేవరకూ పోరాడతా!

ఆ రోజు కళ్లముందే జరిగింది ఆ ప్రమాదం. అది హత్యేననీ అక్కను ఓ పథకం ప్రకారమే చంపేశారని నాకు తెలుసు. నాకు కొందరిమీద అనుమానం వచ్చింది. ఆ వివరాలనే పోలీసులకు చెప్పినా, ప్రమాద సంఘటనగానే తేల్చారు. కేసునూ మూసేశారు. అన్యాయం జరుగుతోందని తెలిసి ఏడుపు ఆగలేదు. కంటిమీద కునుకు రాలేదు. అలాని నిరుత్సాహపడి అక్కడితో ఆగిపోతే అక్క ఆత్మకు శాంతి కలగదు. పైగా మరో ఆడపిల్లకూ ఇటువంటి అన్యాయమే జరగొచ్చు. అందుకే ధైర్యంగా పోరాడేందుకే సిద్ధమయ్యా. సమస్యలు ఎదురైనా ప్రతి సాక్ష్యాన్ని సేకరించేందుకు ప్రయత్నించా. చివరకు నేను అనుకున్నదే నిజమైంది. ఇప్పుడు పోలీసులు ఆ కేసును రీఓపెన్ చేశారు. హత్యకేసుగా నమోదు చేశారు. నిందితుల్ని అరెస్టు చేసి సబ్‌జైలుకు పంపించారు. ఆ నలుగురికీ న్యాయస్థానంలో శిక్షపడే వరకూ నేను ఈ పోరాటం ఆపను. అసలు ఏమయ్యిందంటే...

అందుకే చదువు ఆపేశా...

మాది పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం. మధ్యతరగతి కుటుంబం. మా నాన్న నర్సింహస్వామి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. అమ్మ అనంతలక్ష్మి. మేమిద్దరమూ ఆడపిల్లలమే. నాన్న చనిపోయాక అమ్మే మాకు సర్వస్వం. అక్క ఎంబీఏ చదివింది. తన లక్ష్యం సివిల్స్. దాన్ని సాధించి ఇంటికి అండగా నిలబడుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. నాన్న అనారోగ్యంగా ఉన్న సమయంలో కుటుంబ ఆర్థిక పరిస్థితీ, ఆసుపత్రిలో అమ్మకు తోడు అవసరమై నేను ఇంటర్‌తోనే చదువు ఆపేశా. ఆర్థిక ఆసరా కోసం నరసాపురం, పాలకొల్లులో చిన్న చిన్న ఉద్యోగాలు చేసేదాన్ని. అక్క మాత్రం ఎంబీఏ అయ్యాక చిన్న ఉద్యోగం చేస్తూ సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యేది.

కళ్లముందే ఘోరం...

అది 2017 జనవరి 18. ఆ రోజు నాకు ఇప్పటికీ గుర్తే. అక్కకు ఒంట్లో బాలేదు. దాంతో మేమిద్దరం కలిసి బండిపై పాలకొల్లులోని ఆసుపత్రికి వెళ్లాం. అక్కడ నుంచి తిరిగి బయలుదేరే సరికి రాత్రయ్యింది. దారిలో ఓ టాటా సఫారీ వాహనం మమ్మల్ని వెంబడించడం గమనించాం. దాన్ని తప్పించుకోవడానికి ప్రయత్నం చేశాం కానీ చివరకు అది మా బండిని ఢీకొట్టింది. ఇద్దరం ఒక్కసారిగా కిందపడిపోయాం. నాకు బాగా గాయాలయ్యాయి. బాధతో విలవిల్లాడుతున్నా. అక్క కోసం చుట్టూ చూశా కానీ ఎక్కడా కనిపించలేదు. నేనేమో కదల్లేని పరిస్థితి. ఈలోగా 108 వాహనంలో ఇద్దరినీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ వెంటనే ఏం జరిగిందో నాకు తెలియదు. స్పృహ కోల్పోయా. ఎప్పటికో మెలకువ వచ్చింది. వెంటనే అక్క ఎక్కడ అని అడిగా. నా పక్కనే ఉన్న సజ్జా వీరవెంకట సత్యనారాయణ(బుజ్జి) భీమవరంలో సర్జరీ చేయిస్తున్నాను అని చెప్పాడు. నా పరిస్థితేమో ఒళ్లంతా గాయాలు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి 24 గంటల తరువాత ఇంటికి పంపించారు.

రహస్యంగా పెళ్లి...

ఆసుపత్రి నుంచి బంధువులకు నన్ను తీసుకొచ్చారు. ఇంటికొచ్చేసరికి చుట్టూ జనాలు. కొందరు జాలిగా చూస్తే... మరికొందరు ఏడుపు ఆపుకొంటూ నా దగ్గరకు వస్తున్నారు. అమ్మ ఒక్కసారిగా నన్ను పట్టుకుని పెద్దగా ఏడ్చేసింది. అప్పుడే తెలిసింది అక్క మమ్మల్ని వదిలి వెళ్లిపోయిందని. తట్టుకోలేక పోయా. వెక్కివెక్కి ఏడ్చా. కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక ఆలోచిస్తే... నాలో ఆనుమానం మొదలైంది. ఈ సమయంలో బుజ్జి చేసిన ప్రతి పనీ నాలో అనుమానాన్ని ఇంకా పెంచింది. ఎందుకంటే...

శ్రీ గౌతమి

అక్కకు బుజ్జితో కొన్నాళ్లక్రితమే పెళ్లయ్యింది. అంత్యక్రియల సమయంలో అతను వివాహిత స్త్రీకి జరిపినట్లు కాకుండా అవివాహితకు చేసినట్లుగా కార్యక్రమాన్ని దగ్గరుండి చేయించాడు. అసలు అక్క పెళ్లి విషయంలో ఏం జరిగిందంటే... అక్క ఉద్యోగం చేస్తున్నప్పుడు బుజ్జి పరిచయమయ్యాడు. అప్పటికే తనకు పెళ్లయ్యింది. పిల్లలూ ఉన్నారు. అయితే భార్యతో తనకు సత్సంబంధాలు లేవనీ విడాకులు ఇవ్వాలనుకుంటున్నానీ చెప్పాడు. అక్కను ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. ఇవన్నీ అక్క నమ్మి అతనికి దగ్గరైంది. అలా 2016లో రహస్యంగా పెళ్లిచేసుకున్నారు. కొన్నాళ్లకు ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నప్పుడు అక్క విషయం బయటపెట్టింది. ఆ తరువాత... అతను తన మొదటి భార్యకు విడాకులు ఇవ్వకపోవడం, అక్క బంధాన్ని బయటపెట్టకపోవడంతో అభద్రతకు లోనైంది. పైగా మేమూ ప్రశ్నించడంతో అతడిని 'రహస్యంగా పెళ్లి చేసుకుని నా జీవితాన్ని, మా కుటుంబాన్ని నాశనం చేశావు, ఇద్దరం కలసి ఉందాం...' అంటూ చాలాసార్లు నిలదీసింది. ఆమె ఒత్తిడితో అతను పాలకొల్లులో ఒక ఫ్లాట్ తీసుకుని కాపురం పెడతాననీ, కొన్నాళ్లు ఆగమని చెప్పాడు. మళ్లీమళ్లీ అడిగితే రెండునెలల సమయం అడిగాడు. నెలలు గడిచినా ఎటువంటి నిర్ణయం తీసుకోక పోవడంతో అక్క ఒత్తిడి చేయడం మొదలుపెట్టింది. దాంతో అతడు ఉద్దేశ పూర్వకంగానే మా అడ్డుని తొలగించుకోవాలనుకున్నాడు. మా ఇద్దరినీ చంపేసి ప్రమాదంగా చిత్రీకరించాలనుకున్నాడు. దానికి మరికొందరి సాయం తీసుకున్నాడు. అలా ఆ రోజున యాక్సిడెంట్ చేయించాడు.

పోలీసులు నమ్మలేదు...

ఇవన్నీ ఊహించి నేను ఈ వివరాలన్నీ పాలకొల్లు పోలీసులకు చెప్పే ప్రయత్నం చేశా. మా అమ్మ లిఖితపూర్వకంగాను రాసి ఇచ్చింది. కానీ పోలీసులు మాత్రం ఇది రోడ్డు ప్రమాదమని చెప్పి కేసు మూసేశారు. జిల్లా పోలీసు అధికారులైనా న్యాయం చేస్తారనుకుంటే 'నువ్వు కావాలనే ఆరోపణలు చేస్తున్నావు. ఎలా నిరూపిస్తావు...' అని నన్నే ప్రశ్నించారు. ఆ మాటలు విన్నాక ఎలాగైనా సరే ఈ అన్యాయాన్ని బయటపెట్టాలనుకున్నా. వారికి శిక్ష పడేలా చేయాలనుకున్నా. ప్రమాదం జరిగిన రోజున అక్క ఫోను డ్యామేజీ అయ్యింది. అయినా ఆ నంబరు నుంచి డేటా సేకరించే ప్రయత్నం చేశా. మా అక్క వాడిన ఫోనులో వాట్సాప్, ఇతర మేసేజ్‌ల ఆధారంగా మొత్తం వివరాలు తెలుసుకోగలిగా. ఫోనులో 6,500 పైగా వాట్సాప్ మెసేజ్‌లూ, 11,088 సాధారణ మేసేజ్‌లు ఉన్నాయి. వాటన్నింటినీ ప్రింటు చేయించి ఓ పుస్తకంగా తయారు చేయించా. అవన్నీ చూపించి మాది యాక్సిడెంట్ కాదని మాపై జరిగింది హత్యా ప్రయత్నమేనని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను కలిసి వివరించా. ఆ పుస్తకాన్నీ చూపించా. ఆ అధికారులు సానుకూలంగా స్పందించి మొదటిసారి నా మాట విన్నారు.

సీఐడీతో న్యాయం...

నా ఫిర్యాదును రాజమండ్రి సీఐడీ విభాగానికి పంపించారు. నన్ను సీఐడీ సీఐ శేఖర్‌బాబు పిలిచి సంఘటనను పూర్తిగా వివరించమన్నారు. మొత్తం చెప్పడంతో పాటూ నా దగ్గరున్న ఆధారాల్నీ చూపించా. తరువాత వారిదైన శైలిలో ఎంక్వయిరీ మొదలుపెట్టారు. మేం మళ్లీ కేసు రీఓపెన్ చేస్తున్నామని తెలిసి... బంధువులు కొందరు, అతడి తరఫువారు కొందరు రాజీ కుదర్చాలని ప్రయత్నించారు. కేసు వదిలేయమని కూడా చెప్పారు. అమ్మ కూడా ఎందుకొచ్చిన గొడవలు... అక్కే పోయిందని బాధపడింది. కానీ నేను మాత్రం అక్కకు న్యాయం జరగాలని వెనకడుగు వేయలేదు. డబ్బు సమస్యలు ఎదురైనా ఉద్యోగం లేకపోయినా ఏడాదిన్నరపాటు పోరాటం చేశా. ఇప్పుడు బుజ్జి వాడితోపాటూ మిగిలిన ముగ్గుర్నీ అరెస్టు చేయించగలిగా. ఇది నా మొదటి విజయం మాత్రమే. కోర్టులో నాకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నా. చాలామంది అమ్మాయిలు చిన్నచిన్న సమస్యలకే భయపడిపోతారు. కానీ మా సంఘటన కనువిప్పు కావాలని నేను కోరుకుంటున్నా.

– కరింశెట్టి శ్రీనివాసు, న్యూస్‌టుడే నరసాపురం,
– విన్నకోట వెంకటరమణ, న్యూస్‌టుడే పాలకొల్లు.

జ్వరానికి మజ్జిగ జావ!

ఇంటి వైద్యం

వర్షాకాలంలో ఎదురయ్యే మరో సమస్య జ్వరం. రోగనిరోధకశక్తి తగ్గడం, వాతావరణంలో తేమ, బ్యాక్టీరియా, వైరస్‌లు పెరగడం... వంటివన్నీ జ్వరాలకు దారితీస్తాయి. ఎప్పుడైనా సమస్య వచ్చాక బాధపడటం కన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవడమే మేలు.

ఇంటినీ, పరిసరాలకు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వండిన పదార్థాలపై మూతలు తప్పనిసరిగా పెట్టాలి. తినే ఆహారంపై ఈగలు వాలితే వాటి ద్వారా టైఫాయిడ్, లివర్‌కు సంబంధించిన అనారోగ్యాలు వచ్చే ప్రమాదం ఎక్కువ. అందుకే జాగ్రత్తగా ఉండాలి. రోడ్లమీద అమ్మే పదార్థాలను పూర్తిగా మానేయాలి. ఇంట్లో, బయటా నీరు నిలవకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉంటే గనుక, అందులో క్రిమిసంహారక మందులు లేదా కిరోసిన్ చల్లాలి. ఈ కాలంలో నీటిద్వారా కూడా రకరకాల ఇన్‌ఫెక్షన్లూ, జ్వరాలు వస్తాయి. అందుకే కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఆ నీటిని కూడా నిల్వ ఉంచకుండా ఎప్పటిప్పుడు వేడిచేసుకోవాలి. ఈ సమయంలో ఫ్లూజ్వరాలూ ఎక్కువే.

జ్వరం వస్తే...

- జ్వరం వచ్చినప్పుడే కాదు ఈ కాలంలో గోరువెచ్చని నీటిని తీసుకోవడమే మేలు. ఇలా తరచూ తాగుతూ ఉంటే ఇన్‌ఫెక్షన్ త్వరగా తగ్గుతుంది. జ్వరం ఎక్కువగా ఉంటే చల్లటి నీటిలో కొంచెం చందనం చూర్ణం లేదా గంధం ముద్ద కలిపి శరీరాన్ని తుడిస్తే ఆ వేడి త్వరగా తగ్గుతుంది.

డాక్టర్ గాయత్రీదేవి, ఆరోగ్యపీఠం

- జ్వరంతోపాటు తలనొప్పి బాధిస్తోంటే అరగదీసిన గంధంలో కర్పూరం పొడి కలిపి నుదుటిపై లేపనంలా రాయాలి.
- ధనియాలు వేయించి పొడి చేసి పెట్టుకోవాలి. కప్పు నీటిలో చెంచా ధనియాల పొడి వేసి మరిగించాలి. ఈ నీరు గోరువెచ్చగా అయ్యాక ఓ పెద్ద చెంచా చొప్పున రెండుమూడు గంటలకోసారి తాగాలి.
- తులసీ, వేపాకులు సమానంగా తీసుకుని శుభ్రంగా కడిగి మెత్తగా చేసుకుని రసం తీయాలి. ఈ రసాన్ని చెంచా చొప్పున రోజులో మూడు లేదా నాలుగు సార్లు తాగుతుంటే జ్వరం తగ్గుతుంది.
- తిప్పతీగ పొడిని కప్పు నీటిలో వేసి మరిగించి కషాయంలా చేసుకోవాలి. దీన్ని పెద్ద చెంచాడు చొప్పున రోజుకు మూడు లేదా నాలుగుసార్లు తాగాలి.
- జ్వరంలో తేలికపాటి ఆహారమే మంచిది. అర కప్పు బియ్యం వేయించి దానికి ఎనిమిది రెట్లు నీరు పోసి పల్చని, చిక్కని జావలా తయారు చేసుకోవాలి. అందులో కొద్దిగా శొంఠిపొడీ, అరచెంచా నెయ్యి, మజ్జిగ కలిపి తీసుకోవాలి. శరీరంలో చేరిన ఇన్‌ఫెక్షన్లు బయటికి పోయి జ్వరం త్వరగా తగ్గుతుంది.



బంగారం వెండి

27న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,924	2,908
వెండి (గ్రా)	43.00	42.90



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	------	31,500	31,700	31,550	31,600	31,550	31,630	31,550	31,270	27,800
ఆర్నమెంట్	------	29,400	29,400	29,350	29,300	29,350	29,240	29,350	29,080	25,850
వెండి(కిలో)	------	40,760	41,200	41,200	40,800	41,200	40,800	41,200	41,900	62,900

ఫిఫా జ్ఞాపకంగా పెళ్లి!

వధువు మోనీషా ఇరీన్.. వరుడు జోబిన్. వీళ్లిద్దరు పెళ్లి వేదికకు వచ్చిన తీరు ప్రతి ఒక్కర్నీ ఆశ్చర్యపరిచింది. వీళ్లు అందరిలా పట్టు దుస్తుల్లో.. సంప్రదాయ పద్ధతిలో రాలేదు. ఎందుకంటే ఆమె అర్జెంటీనా, అతడు బ్రెజిల్ దేశాల క్రీడాకారులు ధరించే దుస్తులు ఎంచుకుని వాటిని ధరించారు. అంతేకాదు వివాహవిందులో నీలం, తెలుపు రంగులో బ్యానర్లూ, ఫ్లెక్సీ బోర్డులూ, హైడ్రోజన్ బెలూన్లు సహా అర్జెంటీనా జెండాలనూ అలంకరించారు. కేకు కూడా ఆ దేశ జెండాను పోలినట్లుగా డిజైన్ చేయించారు. ఇక, వివాహవిందుకు హాజరైన స్నేహితులంతా కలిసి ఆ కొత్త జంటకు 'ఫిఫా వరల్డ్ కప్ ట్రోఫీ' నమూనాను కానుకగా అందించారు. హోటల్ సిబ్బంది కూడా ఫుట్‌బాల్ క్రీడాకారుల యూనిఫాంనే ధరించి అతిథులకు వడ్డించడం విశేషం.

ఆ జంటకు ఫుట్‌బాల్ అంటే ఇష్టం. అందుకే తమ పెళ్లిని ఫిఫాను తలపించేలా చేసుకోవాలనుకున్నారు. దానికి తగినట్లుగా ఏర్పాట్లూ చేసుకున్నారు.

ఫుట్‌బాల్ అంటే ఇష్టంతోనే వీళ్లు పెళ్లిని ఇలా ప్లాన్ చేశారు. ఫిఫా జ్ఞాపకంగా ఉండాలని 'బ్రెజిల్ - అర్జెంటీనా' థీమ్‌తో ఫొటో షూట్ చేశారు. వధువు అర్జెంటీనా క్రీడాకారులు ధరించే నీలం, తెలుపు వర్ణం దుస్తుల్ని వేసుకుంది. అతను బ్రెజిల్ క్రీడాకారులు ధరించే పసుపు రంగు జెర్సీ ఎంచుకున్నాడు. వర్షం పడుతున్న సందర్భాన్ని తమ ఫొటోషూట్‌కు అనువుగా మార్చుకున్నారు. ఆ మైదానంలో వర్షం పడుతుండగా ఫుట్‌బాల్ ఆడారు. రకరకాల భంగిమల్లో ఫొటోలకు ఫోజులిచ్చారిద్దరూ.

నజరానా

గిల్టు నగల వల్ల కొందరిలో మెడ నల్లగా మారుతుంది. ఈ నలుపుదనం తగ్గడానికి కొద్దిగా పసుపూ, నిమ్మరసం కలిపి మెడకు పూతలా వేయాలి. ఆరిన తరువాత కడిగేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే నలుపుదనం తగ్గుతుంది.

అన్నీ మరిచిపోతున్నా!

ప్ర నేను నాలుగేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. ఇదివరకు ఏ విషయమైనా చక్కగా గుర్తుపెట్టుకునేదాన్ని. ఈ మధ్య ఏమైందో తెలీదు విచిత్రంగా చిన్న చిన్న విషయాలు మర్చిపోతున్నా. ఏం పని చేశానో, ఎలా చేశానో స్పష్టంగా గుర్తుండట్లేదు. ఉన్నట్టుండి ఒక పని కోసం రావడం... దాన్ని మర్చిపోవడం తరచూ జరుగుతోంది. నాకు బాగా తెలిసిన విషయం కూడా వెంటనే గుర్తు రావట్లేదు. ఇంట్లో కూడా ఇదే పరిస్థితి. ఇలా షార్ట్‌టర్మ్ మెమొరీకి కారణం నిద్రలేమీ, ఒత్తిడి అని చదివా. కానీ నాకు ఆ రెండు సమస్యలూ లేవు. ఇప్పుడు దీనికి పరిష్కారం ఏంటీ?

– ఓ సోదరి

డియర్ వసుంధర

డా॥ పూర్ణిమ నాగరాజ, సైకియాట్రిస్ట్

జ మీ సమస్యను మినిమల్ కాగ్నిటివ్ లాస్ అంటారు. మిగతా వాళ్లతో పోలిస్తే... ఒకేచోట కూర్చుని పనిచేసే వాళ్లలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. దానికి ఒత్తిడే ముఖ్య కారణం. అంటే చేసే పనితో మనం ఆనందంగా ఉండి ఉండొచ్చు. దానివల్ల ఎలాంటి ఒత్తిడి లేకపోవచ్చు. కానీ విశ్రాంతి లేకుండా, శరీరానికి కదలిక లేకుండా పని చేయడం వల్ల మన మెదడుకు ఆక్సిజన్ సరఫరా సరిగ్గా అందదు. అలా శారీరక ఒత్తిడి ఎదురవుతుంది. ఒకేసారి ఎక్కువ పనులు చేస్తున్నా కూడా ఈ సమస్య పెరుగుతుంది. మతిమరుపుతో పాటే పనుల్ని వాయిదా వేసే లక్షణం ఎక్కువవవుతుంది. బద్ధకం పెరుగుతుంది. ఇది వరకు మనం తేలిగ్గా తీసుకున్న విషయాలకు కూడా ఇప్పుడు కోపం వస్తుంటుంది. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకుంటే తొందరగానే మార్పు కనిపిస్తుంది. పని మధ్యలో కనీసం రెండుగంటలకోసారైనా బయట నడుస్తుండాలి. ఇంటికెళ్లాక కంప్యూటర్, ఫోను ముట్టుకోకూడదు. ఆ సమయంలో చిన్న చిన్న ఎక్సర్‌సైజులూ, అటూ ఇటూ నడవడం మంచిది. కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా విహారయాత్రలకు వెళ్లడం, నెలకోసారైనా సినిమాకూ లేదంటే పార్కుకు వెళ్లడం, స్నేహితుల్ని కలవడం... లాంటివి చేయాలి. ఆఫీసులో ఉన్నప్పుడు కుర్చీలోనే కూర్చుని శ్వాసకు సంబంధించిన వ్యాయామాలు చేస్తుండాలి. దాంతోపాటే మెదడుకు పదును పెట్టే హాబీ ఏదైనా అలవాటు చేసుకోవాలి. పజిళ్లూ, చెస్ ఆడటం, చిన్న చిన్న విషయాలకు ఫోన్ వాడకుండా గుర్తుపెట్టుకోవడం అలవాటు చేసుకోవాలి. ఉదాహరణకు సూపర్ మార్కెట్‌కు వెళ్తుంటే కావాల్సిన సరకులు గుర్తుపెట్టుకోడానికి ప్రయత్నించాలి. కొత్త ఫోన్ నంబర్లు అంతే. ఏదైనా కొత్త భాష నేర్చుకోడానికి ప్రయత్నించాలి. ఇవన్నీ మెదడుకు పని చెప్పేవే. కేవలం ఆఫీసుకు వెళ్లడం, రోజూ ఒకే పని చేయడం వల్ల మన మెదడు చురుకుదనం కోల్పోతుంది. అందుకే ఎప్పటికప్పుడు మన మెదడుకు కొత్త సవాల్, లేదంటే కొత్త పనిని అలవాటు చేయడం తప్పనిసరి.

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.

పసుపు వ్యాపారంతో పైపైకి

ఆమె చదువు ఇంటర్‌తోనే ఆగిపోయింది. అలాగని ఆలోచనలకు మాత్రం ఆగిన చదువు అడ్డుగా మారలేదు. పెళ్లై ఇద్దరు పిల్లలు పుట్టాక ఏదైనా సాధించాలనే కోరిక బలపడిందే కానీ తగ్గలేదు. దాంతో తన తండ్రి పడిన కష్టాన్నే వ్యాపార ఆలోచనగా మార్చుకుంది. విజయపథాన దూసుకుపోతోంది. ఆమే విజయనగరం జిల్లా సాలూరుకి చెందిన అన్నాడి సునీతకృష్ణ. ఆమె ఈ స్థాయికి రావడానికి పట్టిన సమయం పదేళ్లు. అసలామె ప్రయాణం ఏంటో, ఇన్నేళ్లలో ఎలాంటి ఒడిదొడుకులు ఎదుర్కొందో ఆమె మాటల్లోనే...

మాది గుంటూరు. నాన్నకు అక్కడ వ్యవసాయం కలిసిరాక 1996లోనే కుటుంబంతో సహా సాలూరుకు వచ్చేశాం. అప్పుడు నాకు పదేళ్లు. ఇక్కడికొచ్చాక పదెకరాలు కౌలుకు తీసుకుని పసుపూ, అరటి పంటలు వేసేవారు. కానీ వాటివల్ల లాభాలు రాలేదు. అరటి గాలులకు పడిపోయి నష్టాలు తెస్తే, పసుపు పంటకు మాత్రం సరైన గిట్టుబాటు ధర ఉండేది కాదు. దానికి కారణం పసుపు కొమ్ములకు పాలిషింగ్ చేసే సదుపాయం మా దగ్గర లేకపోవడమే. దాంతో అక్కడ వ్యాపారులు చెప్పిన ధరలకే అమ్మేసి వచ్చే వారు. ఇలా నాన్న మాత్రమే కాదు చాలామంది ఇబ్బంది పడుతున్నారని అర్థమైంది. దాంతో పరిష్కారం ఆలోచించాలనుకున్నా. అయితే నేను ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడే అమ్మానాన్నలు పెళ్లి చేశారు.

ఏడాదైనా ఫలితం లేదు... పెళ్లయ్యాక మద్రాసు వెళ్లిపోయా. ఆ తరువాత పిల్లలు. వాళ్ల బాగోగులు చూసుకోవడంలోనే ఆరేళ్లు గడిచిపోయాయి. పిల్లలు స్కూలుకెళ్లడం మొదలుపెట్టాక పసుపు వ్యాపారం గురించి ఆలోచించా. మా వారు కృష్ణ, అత్తామామలు వెన్నుతట్టారు. మళ్లీ సాలూరుకే వచ్చేశాం. ఇక్కడికొచ్చాక అరకు, మాడుగుల, పాడేరు, పాచిపెంట, గుమ్మలక్ష్మీపురం... ఇలా చాలా ఊళ్లే తిరిగా. వాళ్లందరూ పసుపుకొమ్ములు పాలిష్ చేయడానికి ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అర్థమైంది. అందుకే ఒక చిన్న పాలిష్ యంత్రం తెచ్చి దాంతోనే వ్యాపారం మొదలుపెట్టాలనుకున్నా. రుణం కోసం తిరగని బ్యాంకులేదు. 'అమ్మాయివి... నువ్వేం చేస్తావ్‌లే' అన్నవాళ్లే ఎక్కువ. ఆ తరువాత పరిశ్రమ అనుమతుల కోసం ఏడాదిపాటు కష్టపడాల్సి వచ్చింది. నా ఆత్మవిశ్వాసాన్ని గుర్తించిన కేవీఐసీ (ఖాదీ గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి సంస్థ) అధికారులు రెండున్నర లక్షల రూపాయల రుణం ఇచ్చారు. దాంతో వ్యాపారం మొదలుపెట్టా.

అవసరానికి అనుగుణంగా... పాలిష్ చేయడం వల్ల పసుపు కొమ్ములు మంచి ధర పలికేవి. మా దగ్గరికి వచ్చే రైతుల సంఖ్యా పెరిగింది. కానీ లాభాలు లేవు. అయినా కొన్నాళ్లు కష్టపడ్డా. ఆ తరువాత పాలిషింగ్‌తోనే ఆపేయకుండా పసుపు దుంపలను మేమే కొనుగోలు చేస్తే బాగుంటుందని ఆలోచించా. దానికోసం మార్కెట్లో పసుపు కొమ్ముల డిమాండ్ తెలుసుకోడానికి తమిళనాడు, కేరళ, మహారాష్ట్రలకు వెళ్లి అక్కడి వ్యాపారులతోనూ మాట్లాడా. అప్పుడే ప్రాంతాన్ని బట్టి పసుపు వాడే విషయంలో వాళ్ల అభిరుచులు భిన్నమని అర్థమైంది. ఆ అవసరాలన్నీ తెలుసుకుని వాటికి అనుగుణంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం మొదలుపెట్టా. పసుపుకొమ్ములూ, దుంపలతో పాటూ పసుపును ప్యాకెట్లుగా చేసి అమ్మడం మొదలుపెట్టా. పైగా సాలూరు పసుపు అంటే ఆర్గానిక్ అనే పేరు పడటంతో డిమాండ్ ఇంకా పెరిగింది. ప్రస్తుతం నా వ్యాపారం రూ.6 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. 60 మందికి పైగా మహిళలకు ఉపాధి కల్పించగలుగుతున్నా. అంతేకాదు డిగ్రీతో పాటూ సోషల్ సైన్సెస్‌లో ఎంఏ, ఎంబీఏ కూడా పూర్తి చేశా. ప్రస్తుతం పీహెచ్‌డీ చేసే ప్రయత్నంలో ఉన్నా.

–జి.వి.వి.సత్యనారాయణరెడ్డి, ఈనాడు, విజయనగరం.

నెట్టిల్లే వారధి.. ప్రచారమే ఉపాధి



అంతర్జాలం (ఇంటర్నెట్) ద్వారా ఆన్‌లైన్లో ఉత్పత్తులకు, సేవలకు ప్రచారం కల్పించటమే డిజిటల్ మార్కెటింగ్. కంప్యూటర్‌ను ప్రాథమికంగా ఉపయోగించటం తెలిసి, ఆంగ్లం చదవటం, రాయటం, మాట్లాడగలిగి కంప్యూటర్లో ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేయగలిగేవారు ఎవరైనా ఈ కెరియర్‌ను ఎంచుకోవచ్చు. ఉద్యోగులూ, స్వయం ఉపాధి పొందుతున్నవారూ, గృహిణులూ, ఫ్రెషర్స్ మాత్రమే కాకుండా ఉద్యోగ విరమణ చేసినవారు కూడా ఈ రంగంలో ప్రవేశించి, అద్భుతంగా రాణించవచ్చు!

కెరియర్ గైడెన్స్ డిజిటల్ మార్కెటింగ్

ప్రపంచవ్యాప్తంగానే కాదు, మనదేశంలోనూ డిజిటల్ మార్కెటింగ్‌కు ఆదరణ అత్యంత వేగంగా పెరుగుతోంది. ఆన్‌లైన్, సోషల్ మీడియా, మొబైల్ మార్కెటింగ్ ఆక్టివిటీస్ వంటివన్నీ డిజిటల్ మార్కెటింగ్‌లో భాగమే. ఈ ప్రోగ్రామ్‌లు కస్టమర్లను ఆకర్షించడంలో, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కంపెనీల ఉత్పత్తులపై అవగాహన కల్పించడంలో, వస్తుసేవల విలువను పెంచడం లేదా సేకరించడంలో తోడ్పడతాయి. మొబైల్ మార్కెటింగ్ ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో కొత్త పంథా. రానున్న కాలంలో మనదేశంలో దాదాపుగా 1.5 లక్షలకు పైగా ఉద్యోగాలు డిజిటల్ మార్కెటింగ్ విభాగంలో ఏర్పడనున్నాయని అంచనా.

ఆన్‌లైన్ మార్కెటింగ్ కమ్యూనికేషన్స్‌లో వెబ్‌సైట్లు, సెర్చ్ యాడ్స్, డిస్‌ప్లే యాడ్స్, ఈమెయిల్, సోషల్ మీడియా, బ్లాగులు, వైరల్ మార్కెటింగ్, మొబైల్ మార్కెటింగ్ వంటివి ముఖ్య విభాగాలు. కస్టమర్ల ప్రత్యేక అభిరుచులు, వ్యక్తిత్వానికి అనుగుణంగా ఉన్న వాటిని వారికి పంపుతూ ఎల్లప్పుడూ వారిని తమ ఉత్పత్తులను గమనిస్తుండేలా చేయొచ్చు.

ఈ డిజిటల్ యుగంలో సంస్థలకు తమ టార్గెట్ కస్టమర్ల అభిరుచులను వారి బ్రౌజింగ్ హిస్టరీ ద్వారా తెలుసుకోవడం సాధ్యమవుతోంది. సంస్థలు సోషల్ మీడియా ద్వారా వినియోగదారుల వయసులవారీ వర్గీకరణ, ప్రదేశం, లింగం, ఆసక్తుల ఆధారంగా తమ టార్గెట్ కస్టమర్లను ఆకర్షించేలా ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతున్నాయి. అంతేకాకుండా కస్టమర్ల తాజా సెర్చ్ ఆధారంగా వాటికి సంబంధించిన ఇతర బ్రాండ్ల వస్తుసేవలను ప్రకటనల రూపంలో కనిపించేలా చేస్తున్నాయి.

రిటైలింగ్, మాన్యుఫాక్చరింగ్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, టూరిజం, టెలికమ్యూనికేషన్, ఎయిర్‌లైన్స్ మొదలైన అన్నింటిలో డిజిటలైజేషన్ ఉనికిని మనం గమనిస్తూనే ఉన్నాం. ప్రపంచవ్యాప్తంగా 43% ప్రజలు డిజిటల్ కమ్యూనికేషన్‌ను ఉపయోగిస్తున్నారు. మనదేశంలో ఇంటర్నెట్ ఉపయోగించేవారి సంఖ్య జనాభాలో 30% పైగానే. ఈ ఏడాది చివరకు అదింకా పెరుగుతుందని అంచనా. వీరిలో 80% మంది మొబైల్ ద్వారానే ఇంటర్నెట్ ఉపయోగిస్తున్నారు. ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 10 మిలియన్ నుంచి 100 మిలియన్లకు చేరడానికి మనదేశంలో పదేళ్ల సమయం పట్టింది. 100-200 మిలియన్లు చేరడానికి మూడేళ్లు, 200-300 మిలియన్లకు చేరడానికి ఏడాది సమయం పట్టింది. మనదేశంలో ఒక్క ఫేస్‌బుక్‌ను ఉపయోగించేవారి సంఖ్యే 110 మిలియన్లు. స్మార్ట్‌ఫోన్ మార్కెటింగ్‌లో ఇప్పటికే భారత్ యూఎస్‌ను అధిగమించి, రెండో స్థానంలో నిలిచింది. డెస్క్‌టాప్/ లాప్‌టాప్ యూజర్లను స్మార్ట్‌ఫోన్ యూజర్లు దాటిపోవడమూ గమనించొచ్చు.

డిజిటల్ మార్కెటింగ్ ఎన్నో ఉద్యోగావకాశాలను కల్పిస్తోంది.

డిజిటల్ మార్కెటింగ్ అండ్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు: సంప్రదాయ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు కూడా నేడు డిజిటల్ మార్కెటింగ్ సేవలను అందిస్తున్నాయి. వీటిల్లో సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్ మొదలైన సేవలను అందించే చిన్న, మధ్యతరహా, పెద్ద డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీలున్నాయి.

బ్రాండ్ లివరేజింగ్ డిజిటల్ మార్కెటింగ్: డిజిటల్ మార్కెటింగ్‌లో క్రియాశీలంగా పనిచేసే వెబ్ డిజైనర్లు, బ్లాగర్లు, ఈమెయిల్ మార్కెటింగ్ వంటి వారు ఒక ప్రత్యేకమైన బ్రాండ్ లేదా సంస్థ కోసం పనిచేయాలనుకుంటే వారికీ ఉద్యోగావకాశాలున్నాయి.

డిజిటల్ మార్కెటింగ్ టూల్/ ప్లాట్‌ఫాం కంపెనీ: గూగుల్, లింక్‌డిన్, ఫేస్‌బుక్, అడోబ్, ట్విటర్, యూట్యూబ్ మొదలైన టూల్/ ప్లాట్‌ఫాం సంస్థల్లో చేయాలనుకునేవారికీ ఎన్నో ఉద్యోగావకాశాలున్నాయి. ఏజెన్సీ, బ్రాండ్‌ల్లో చేయడం కంటే ఈ సంస్థల్లో చేయడం ద్వారా పనిలో వైవిధ్యాన్ని పొందొచ్చు. ఈ పరిశ్రమలో ఉన్న సౌలభ్యం.. ఫుల్‌టైం ఉద్యోగాలతోపాటు ఫ్రీలాన్సింగ్/ పార్ట్‌టైం, ఇంటినుంచే పనిచేసే సౌకర్యాలూ ఉంటాయి.

ఏ స్పెషలైజేషన్లు?

డిజిటల్ మార్కెటింగ్ పరిశ్రమకు సంబంధించి ఏడు రకాల స్పెషలైజేషన్లు ఉన్నాయి. అభ్యర్థుల అనుభవం, కమ్యూనికేషన్, సృజన, విశ్లేషణాత్మక నైపుణ్యాలు, టెక్నికల్, నాన్ టెక్నికల్ నైపుణ్యాల ఆధారంగా వివిధ జాబ్ ప్రొఫైళ్లు స్పెషలైజేషన్లను బట్టి అందుబాటులో ఉన్నాయి.

సెర్చింజన్ మార్కెటింగ్: గూగుల్, బింగ్‌లాంటి సెర్చింజన్ల ద్వారా అడ్వర్‌టైజింగ్ దీనిలో ఉంటుంది. దీనిలో వివిధ రకాలుంటాయి. 1. సెర్చ్ అడ్వర్‌టైజింగ్ 2. డిస్ ప్లే అడ్వర్‌టైజింగ్ 3. వీడియో అడ్వర్‌టైజింగ్ 4. షాపింగ్ అడ్వర్‌టైజింగ్ 5. మొబైల్ అడ్వర్‌టైజింగ్ 6. మొబైల్ యాప్ ప్రమోషన్.

సెర్చింజన్ ఆప్టిమైజేషన్: సెర్చ్ ఫలితాల్లో పైభాగాన మనం ఉద్దేశించిన సైట్ వివరాలు వచ్చేలా చేయటం ద్వారా ఆ వెబ్‌పేజీల ర్యాంకింగ్‌నూ, వాటి విజిబిలిటీనీ మెరుగుపరిచే మెలకువలు దీనిలో ఉంటాయి.

సోషల్ మీడియా మార్కెటింగ్: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లింక్‌డ్ ఇన్ లాంటి సైట్లలో అడ్వర్‌టైజింగ్‌కు సంబంధించినది.

సోషల్ మీడియా ఆప్టిమైజేషన్: ఆన్‌లైన్ ప్రెజెన్స్‌ను పెంచటం, బ్రాండ్ బిల్డింగ్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌ను వృద్ధి చేయటం దీనిలో భాగంగా ఉంటాయి.

ఈమెయిల్ మార్కెటింగ్: ఈమెయిల్స్ బలమైన ప్రచార సాధనం అవ్వటం వల్ల సంస్థలు న్యూస్‌లెటర్స్‌ను వినియోగదారులకు నియమిత కాలంలో పంపుతూ వారితో అనుసంధానమవుతుంటాయి. ఉత్పత్తుల, సేవల ప్రచారం ప్రభావశీలంగా చేయటం ఈ స్పెషలైజేషన్ ప్రధానాంశం.

కంటెంట్ మార్కెటింగ్: బ్లాగ్స్, ఆన్‌లైన్ ప్రెస్ రిలీజులు, న్యూస్ లెటర్ల ద్వారా వినియోగదారులతో అనుసంధానమవుతూ వ్యాపారాభివృద్ధికి తోడ్పడటం దీనిలో ఉంటుంది.

వెబ్‌సైట్ అనలిటిక్స్: వీక్షకుల ట్రాఫిక్ విశ్లేషణ, మార్కెట్ పరిశోధనల ఆధారంగా వెబ్‌సైట్ వీక్షకుల సంఖ్యను పెంచటం ఈ స్పెషలైజేషన్లో ముఖ్యాంశం. ఉదాహరణకు గూగుల్ అనలిటిక్స్ ద్వారా ఒక వెబ్‌సైట్ తీరుతెన్నులను వివరంగా తెలుసుకోవచ్చు. ఈ అనలిటిక్స్ ఫలితాల ఆధారంగా తగిన వ్యాపార నిర్ణయాలు కూడా తీసుకుంటుంటారు.

వీటితోపాటు వెబ్‌సైట్ డిజైన్ (కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్- ఉదా: వర్డ్‌ప్రెస్), మొబైల్ యాప్ క్రియేషన్ (ఆండ్రాయిడ్, ఐఫోన్, హెచ్‌టీఎంఎల్5) కూడా డిజిటల్ మార్కెటింగ్‌తో సంబంధమున్నవే.

ఎక్కడ నేర్చుకోవచ్చు?

ఈ పరిశ్రమ వేగంగా ఎదుగుతున్నప్పటికీ మన దేశంలో ఇది ప్రవేశించింది 4-5 సంవత్సరాల స్వల్పకాలం క్రితమే. అందుకే ఏ విశ్వవిద్యాలయం కూడా డిజిటల్ మార్కెటింగ్‌కు సంబంధించి పూర్తిస్థాయి కోర్సులు గానీ, ప్రోగ్రాములు గానీ ఇప్పటివరకూ ప్రవేశపెట్టలేదు. కొన్ని విశ్వవిద్యాలయాలూ, కళాశాలలూ తాము అందించే ఎంబీఏలో డిజిటల్ మార్కెటింగ్‌ని ఒక సబ్జెక్టుగా/ పేపర్‌గా ప్రవేశపెట్టాయి.

చాలా ప్రైవేటు సంస్థలూ, కంపెనీలూ, కోచింగ్ కేంద్రాలూ 3-6 నెలల వ్యవధితో దీర్ఘకాల కోర్సులనూ, 2-6 రోజుల వ్యవధి ఉండే స్వల్పకాలిక కోర్సులనూ ఆన్‌లైన్లో, ఆఫ్‌లైన్లో అందిస్తున్నాయి.

డిజిటల్ మార్కెటింగ్ రంగంలో పట్టు సాధించాలంటే 20-30 గంటల శిక్షణ, దీనికి అనుబంధంగా మరో 40-60 గంటల అధ్యయనం తప్పనిసరి.

రికగ్నయిజ్డ్ సర్టిఫికేషన్లు

మూడు సుప్రసిద్ధ సంస్థలు డిజిటల్ మార్కెటింగ్ రంగానికి సంబంధించిన రికగ్నయిజ్డ్ సర్టిఫికేషన్లు అందిస్తున్నాయి. పరీక్ష రాసేముందు సంబంధిత వీడియోలను చూసి, అవగాహన పెంచుకుంటే సరిపోతుంది.

గూగుల్ సంస్థ

ఎ) గూగుల్ యాడ్‌వర్డ్స్ సర్టిఫికేషన్స్:

1. యాడ్‌వర్డ్స్ ఫండమెంటల్స్ సర్టిఫికేషన్ 2. సెర్చ్ అడ్వర్‌టైజింగ్ సర్టిఫికేషన్ 3. డిస్‌ప్లే అడ్వర్‌టైజింగ్ సర్టిఫికేషన్ 5. వీడియో అడ్వర్‌టైజింగ్ సర్టిఫికేషన్ 6. మొబైల్ అడ్వర్‌టైజింగ్ సర్టిఫికేషన్ 6. షాపింగ్ అడ్వర్‌టైజింగ్ సర్టిఫికేషన్.

బి) గూగుల్ మొబైల్ సైట్స్ సర్టిఫికేషన్

సి) గూగుల్ డిజిటల్ సేల్స్ సర్టిఫికేషన్

డి) గూగుల్ అనలిటిక్స్ ఇండివిడ్యువల్ సర్టిఫికేషన్

https://goo.gl/Fju3Gk

మైక్రోసాఫ్ట్ సంస్థ: అక్రిడిటెడ్ బింగ్ ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ పరీక్షలో అర్హత పొందిన వ్యక్తులకు ఈ సంస్థ బింగ్ ప్రొఫెషనల్ సర్టిఫికేషన్‌ను అందిస్తోంది. https://goo.gl/B5PN5F

ఫేస్‌బుక్ సంస్థ: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అడ్వర్‌టైజింగ్‌కు సంబంధించి ఈ సంస్థ మూడు విభిన్న సర్టిఫికేషన్లను అందిస్తోంది. దీనికో పరీక్ష ఉంటుంది. ఫీజు 350 డాలర్లు. https://goo.gl/yopBnr

ఏడాదే చెల్లుబాటు: ఈ సర్టిఫికేషన్లన్నీ సంబంధిత ఆన్‌లైన్ పరీక్ష రాస్తే లభిస్తాయి. ఇవి సంవత్సరం పాటే చెల్లుబాటవుతాయి. ఏటా పరీక్షలు పాసవుతూ సర్టిఫికేషన్లను రెన్యువల్ చేసుకుంటూ ఉండాల్సిందే. ఈ పరీక్షలకు ఎగ్జామ్ తేదీ గానీ, కేంద్రంగానీ ఉండవు. మనం ఎప్పుడు సిద్ధమైతే అప్పుడు ఇంటి నుంచే పరీక్ష ఆన్‌లైన్లో రాసెయ్యవచ్చు.

భాస్కర్ కారంపూడి
డిజిటల్ మార్కెటింగ్ ట్రెయినర్

వీటికి వయసు, విద్య మొదలైన అర్హతలంటూ ఏమీ ఉండవు. ఎవరైనా రాసెయ్యవచ్చు. పరీక్షలను ఎన్నిసార్లయినా మళ్ళీ మళ్ళీ రాయవచ్చు. ఇన్నిసార్లే రాయాలనే నిబంధన ఏమీ ఉండదు. సర్టిఫికేషన్ పరీక్షల్లో ఫేస్‌బుక్ ఒక్కదానికే ఫీజు ఉంది. గూగుల్, మైక్రోసాఫ్ట్‌లు అందించే సర్టిఫికేషన్లకు ఫీజు ఉండదు.

పాస్‌మార్కు సాధారణంగా 80 శాతం ఉంటుంది. ప్రశ్నలన్నీ మల్టిపుల్ చాయిస్ పద్ధతిలోనే ఉంటాయి. నెగిటివ్ మార్కింగ్ ఉండదు.

ఇంటర్నెట్‌లో సమాచారం వెతికిగానీ, యూట్యూబ్‌లో సంబంధిత వీడియోలు చూసి గానీ ఈ పరీక్షలకు సిద్ధం కావొచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఇండియన్ కోస్ట్ గార్డులో నావిక్ పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ కోస్ట్ గార్డ్ 10+2 ఎంట్రీ ద్వారా నావిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: నావిక్ (జనరల్ డ్యూటీ)

అర్హత: మ్యాథమేటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. **వయసు:** 18-22 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్ టెస్ట్ ఆధారంగా. **రాతపరీక్ష తేది:** 2018 సెప్టెంబరు - అక్టోబరు. **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** సికింద్రాబాద్, విశాఖపట్నం. **ఆన్‌లైన్ దరఖాస్తు:** 01.07.2018 నుంచి 10.07.2018 వరకు. http://www.joinindiancoastguard.gov.in/

నిట్ ఏపీ, తాడేపల్లిగూడెం

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.

పోస్టులు: టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు (తాత్కాలికం)

అర్హత: సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచుల్లో డిగ్రీ, డిప్లొమా, బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, సీఏ, నెట్, పీహెచ్‌డీ, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ ప్రొఫీషియన్సీ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్/ ఈమెయిల్. **చివరి తేది:** 07.07.2018

వెబ్‌సైట్: http://www.nitandhra.ac.in/

బీఈఎల్‌లో 86 డిప్యూటీ ఇంజినీర్లు

సంస్థ: భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్), బెంగళూరు యూనిట్. **పోస్టు:** డిప్యూటీ ఇంజినీర్

ఖాళీలు: 86 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత.

వయసు: 26 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

రాతపరీక్ష తేది: 19.08.2018 **పరీక్షా కేంద్రాలు:** బెంగళూరు, దిల్లీ, ముంబయి, కోల్‌కతా, గువాహటి. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.500

చివరి తేది: 11.07.2018 **వెబ్‌సైట్:** http://bel-india.in/

కోల్ ఇండియా లిమిటెడ్‌లో 528 పోస్టులు

పోస్టు: మెడికల్ ఎగ్జిక్యూటివ్ **ఖాళీలు:** 528

అర్హత: ఎంబీబీఎస్, ఎంబీబీఎస్‌తోపాటు సంబంధిత స్పెషాలిటీలో పీజీ/ డీఎన్‌బీ/ పీజీ డిప్లొమా, అనుభవం.

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.

ఇంటర్వ్యూ జరిగే ప్రాంతాలు: బిలాస్‌పూర్, సంబల్‌పూర్, వారణాసి, నాగ్‌పూర్, కోల్‌కతా, రాంచీ, గువాహటి, హైదరాబాద్.

ఆన్‌లైన్ దరఖాస్తు: 29.06.2018 నుంచి 28.07.2018 వరకు.

వెబ్‌సైట్: https://www.coalindia.in/

ప్రవేశాలు

తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం 2018-19 విద్యా సంవత్సరానికి పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. **కోర్సులు:** ఎంఎస్సీ (హార్టికల్చర్) (30 సీట్లు), పీహెచ్‌డీ (హార్టికల్చర్) (04 సీట్లు)

అర్హత: హార్టికల్చర్‌లో బీఎస్సీ/ బీఎస్సీ (ఆనర్స్), సంబంధిత స్పెషలైజేషన్లలో ఎంఎస్సీ ఉత్తీర్ణత. **వయసు:** 40 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.1500.

చివరి తేది: 17.07.2018 (అపరాధ రుసుముతో 20.07.2018).

వెబ్‌సైట్: http://skltshu.ac.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

దరఖాస్తు చేశారా?

దరఖాస్తు తేదీలు ముగియనున్న నోటిఫికేషన్ల వివరాలను మరోసారి అభ్యర్థుల దృష్టికి తీసుకొస్తున్నాం. ఆయా ప్రకటనల పూర్తివివరాలను **www.eenadupratibha.net**లో చూడవచ్చు.

- తెలంగాణ వెటర్నరీ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా ప్రవేశాలు, అర్హత: పదోతరగతి, చివరి తేదీ: జూన్ 28
- తెలంగాణలో 18,428 పోలీసు ఉద్యోగాలు అర్హత: ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీఈ/ బీటెక్, చివరి తేదీ: జూన్ 30
- ఇండియన్ రైల్వేస్‌లో 9739 కానిస్టేబుల్, ఎస్సై పోస్టులు, అర్హత: పదోతరగతి, డిగ్రీ; చివరి తేదీ: జూన్ 30
- టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో 107 జేఏఓ పోస్టులు, అర్హత: బీకామ్ లేదా ఎంకామ్ లేదా సీఏ/ ఐసీడబ్ల్యూఏ-ఇంటర్, చివరి తేదీ: జూన్ 30
- సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో యూజీ, పీజీ ప్రవేశాలు, చివరి తేదీ: జూన్ 30; అర్హత: ఇంటర్, డిగ్రీ
- ఐబీపీఎస్- ఆర్ఆర్‌బీల్లో 10,190 ఖాళీలు చివరి తేదీ: జులై 2, అర్హత: ఏదైనా డిగ్రీ.

కాంపిటీటివ్ ఎగ్జామ్స్, అకడమిక్, ప్రవేశపరీక్ష అభ్యర్థుల కోసం మార్కెట్‌లోకి విడుదలైన పుస్తకాలు.



గ్రూప్-4

1) టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4 పేపర్-1 జనరల్‌నాలెడ్జ్ పేజీలు: 976, ధర: రూ. 499 2) పేపర్-2 సెక్రటేరియల్ ఎబిలిటీస్ (తెలుగులో), పేజీలు: 656, ధర: రూ. 379; ఇంగ్లిష్‌లో - పేజీలు: 544, ధర: రూ. 349 3) జనరల్ నాలెడ్జ్ టాప్ 35 మోడల్ పేపర్స్, పేజీలు: 256, ధర: రూ. 169 4) సెక్రటేరియల్ ఎబిలిటీస్ టాప్ 25 మోడల్ పేపర్స్, పేజీలు: 304, ధర: రూ. 179 **ప్రచురణ:** విజేతకాంపిటీషన్స్

Flying high.. ఆనందమా!

Feeling under the weather, Flying high.. ఈ వ్యక్తీకరణలను విన్నారా? వాతావరణానికో, ఎగరడానికి సంబంధించినవో అనుకుంటే పప్పులో కాలేసినట్టే. మరి వీటిని ఏ సందర్భంలో వాడతారు? తెలుసుకోండి.

MODERN ENGLISH USAGE

ఎం. సురేశన్

Ranganath: How goes life, buddy? Long since we met each other (జీవితం ఎలా గడుస్తోంది మిత్రమా? మనం ఒకరినొకరం కలుసుకుని చాలా రోజులైంది).

Vishu: I am getting on well. Today I am feeling a little under the weather. I don't know why. Till yesterday I was all right (నేను బాగానే ఉన్నాను. ఈరోజు మాత్రం ఒంట్లో అంతగా బాలేదు. ఎందుకనో తెలీడం లేదు. నిన్నటిదాకా బాగానే ఉన్నాను మరి).

Ranganath: What could be the reason? (కారణమేమై ఉండొచ్చు?)

Vishu: Yesterday I attended a dinner at my friend's. I think the food did not agree with me (నిన్న నా స్నేహితుడు ఇచ్చిన విందుకు వెళ్లాను. అక్కడి ఆహారం నాకు పడలేదనుకుంటా).

Ranganath: That should be Sridhar. He is flying high nowadays, as his institute is prospering. I wish him all success and so do you, I feel (అది శ్రీధర్ అయ్యుండొచ్చు. అతని సంస్థ చాలా వృద్ధిలోకి వస్తోంది. అందుకని చాలా సంతోషంగా ఉన్నాడతను. అతనికి విజయం కలగాలని ఆశిస్తున్నా, నువ్వూ అదే అనుకుంటున్నావని భావిస్తున్నా).

Vishu: Yea. He is a nice guy, and always is helpful to others. He has a good sense of humour too (అవును. అతను చాలా మంచివాడు, ఇతరులకు సాయం చేసే స్వభావం అతనిది. జోకులు కూడా బాగా వేస్తాడు).

Notes: 1. Buddy = informal for a friend (వ్యావహారికంలో స్నేహితుడు).

2. not agree with = not suit (పడలేదు).

3. Sense of humour = capacity to joke (హాస్యం పుట్టించగల శక్తి).

Now look at the following sentences from the conversation above:

1. I am feeling a little under the weather

2. He is flying high nowadays, as his institute is prospering

Now let us look at the expressions in detail:

1. Feeling under the weather = Not feeling well (అంతగా ఆరోగ్యం బాగాలేని పరిస్థితి).

Babu Rao: What is wrong with you? I see that you are not fit enough to go with me (ఏంటీ నీ బాధ? నువ్వు నాతో వచ్చేందుకు అంత ఆరోగ్యంగా లేవనుకుంటా).

Jagadish: That is true. I am feeling a little under the weather. I feel like going home and taking rest (అది నిజమే. ఒంట్లో అంతగా బాగున్నట్టు లేదు. ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలని ఉంది).

2. Flying high = Feeling very happy (చాలా ఆనందంగా ఉండటం).

Jayakumar: I see that you are extremely happy. What could be the reason? (చాలా ఆనందంగా ఉన్నావ్. కారణమేంటి?)

Sudha: I got a seat in the University of Wisconsin, the US. They offered me a scholarship too. So I am flying high (నాకు యూఎస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్‌లో సీటు వచ్చింది. స్కాలర్‌షిప్ కూడా ఇస్తున్నారు. అందుకే చాలా ఆనందంగా ఉన్నా).

మోదీతో హేలీ భేటీ

● భారత్-అమెరికా సంబంధాల బలోపేతంపై చర్చ

దిల్లీ: ఐక్యరాజ్య సమితిలో అమెరికా శాశ్వత ప్రతినిధిగా ఉన్న ప్రముఖ భారతీయ అమెరికన్ నిక్కీ హేలీ.. ప్రధాని నరేంద్ర మోదీతో దిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటంతోపాటు పలు రంగాల్లో భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై వారు చర్చలు జరిపారు. దక్షిణాసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వ్యూహాలను ఈ సమావేశంలో మోదీ ప్రశంసించారు. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్రరహితంగా మార్చేందుకు ఆయన తీసుకుంటున్న చొరవను కూడా కొనియాడారు. ట్రంప్‌తో తన గత సమావేశాలను గుర్తు చేసుకున్నారు. ట్రంప్ తరఫున మోదీకి హేలీ శుభాకాంక్షలు తెలియజేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు విచ్చేసిన హేలీ.. విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్‌తోనూ సమావేశమయ్యారు. భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలను మెరుగుపర్చుకునే దిశగా చర్చలు జరిపారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థితో కూడా హేలీ భేటీ అయ్యారు.

మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమీక్షించిన ప్రధాని

ఆంధ్రప్రదేశ్ సహా 17 రాష్ట్రాల్లో రైల్వే, రహదారి, విద్యుత్తు రంగాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధాని మోదీ బుధవారం సమీక్షించారు. గ్రామ్‌స్వరాజ్ యోజనను కూడా ప్రధాని సమీక్షించారు. ఈ కార్యక్రమం మొదటి దశ విజయవంతం అయిందని, ప్రస్తుతం నడుస్తున్న రెండో దశ కూడా విజయవంతమయ్యేలా కృషి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులను కోరారు. 4 కోట్ల కుటుంబాలకు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలన్న లక్ష్యాన్ని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

50 కోట్ల మందికి సామాజిక భద్రత: మోదీ

దిల్లీ: దేశంలో దాదాపు 50 కోట్ల మంది చందాదారులకు సామాజిక భద్రతను కల్పిస్తున్నామనీ, 2014తో పోలిస్తే ఇది పదిరెట్లుతో సమానమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. వివిధ సామాజిక భద్రత పథకాల లబ్ధిదారులతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్సులో ముచ్చటించారు. 'జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేం. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొనే బలాన్ని సామాజిక భద్రత పథకాలు ప్రజలకు అందిస్తాయి. జీవన్‌జ్యోతి బీమా యోజన, జీవన్ సురక్షా యోజన, అటల్ పింఛన్ యోజన, వయ వందన యోజన వంటి పథకాల ద్వారా ఈ భద్రత కోట్లాదిమందికి లభిస్తోంది. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ద్వారా జీవిత బీమా, రూపే కార్డుతో ప్రమాద బీమా అందిస్తున్నాం. 2014లో 4.8 కోట్ల లబ్ధిదారులుంటే ఇప్పుడు 50 కోట్లకు చేరారు. మూడేళ్లలోనే 28 కోట్ల బ్యాంకు ఖాతాలు కొత్తగా తెరిపించాం' అని ప్రధాని వివరించారు.

యూజీసీ రద్దు!

● కొత్తగా ఉన్నత విద్య కమిషన్

● ముసాయిదా చట్టంలో ప్రతిపాదించిన కేంద్రం

దిల్లీ

దేశంలో ఉన్నత విద్య నియంత్రణకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్‌ఆర్‌డీ) నూతన చట్టాన్ని తీసుకురానుంది. ఇప్పటివరకు ఉన్న విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-యూజీసీ)ని రద్దు చేసి కొత్తగా ఉన్నత విద్య కమిషన్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు రూపొందించిన నూతన ముసాయిదా చట్టంలో దీన్ని ప్రస్తావించింది. నూతన కమిషన్ కేవలం విద్యా సంబంధమైన విషయాలకే పరిమితమవుతుంది. నిధుల కేటాయింపు వంటి ఆర్థిక వ్యవహారాలను నేరుగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖే చూస్తుంది. ఈ చట్టంపై జులై నెల ఏడో తేదీ సాయంత్రం అయిదు గంటల్లోగా అభిప్రాయాలు తెలపాలని కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ అందరు విద్యావేత్తలు, భాగస్వాములు, ప్రజానీకాన్ని కోరారు. విద్యాసంస్థలకు మరింత స్వయం ప్రతిపత్తి కల్పించడానికే ఈ మార్పులు చేస్తున్నట్టు బుధవారం ట్వీట్ ద్వారా తెలిపారు. ముసాయిదా చట్టం వివరాలను హెచ్‌ఆర్‌డీ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. యూజీసీ చట్టం-1951ని రద్దు చేసి, భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్‌ఈసీఐ) చట్టం-2018 పేరుతో రానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

శిక్షించే అధికారం

విద్యా ప్రమాణాలను నిర్ధరించే విషయమై నూతన కమిషన్‌కు అధికారాలు ఇచ్చారు. బోగస్ విద్యాసంస్థలు, నాసికరం ప్రమాణాలు ఉన్న విద్యాసంస్థలను మూసివేయించే అధికారం కమిషన్‌కు ఉంది. నిబంధనలను పాటించని యాజమాన్యాలకు జరిమానాతో పాటు, జైలు శిక్ష విధించే అధికారం కూడా కల్పించారు. ఇంతవరకు యూజీసీ బోగస్ విద్యా సంస్థల వివరాలను ప్రకటించి ప్రజలను అప్రమత్తం చేయడానికే పరిమితమయ్యేది. శిక్షించే అధికారం లేదు. కొత్త చట్టం ప్రకారం ఉన్నత విద్యా కమిషన్‌కు శిక్షలు విధించే అధికారం లభించింది. నిబంధనలు పాటించని విద్యాసంస్థలకు జరిమానా విధించడం, దానిని చెల్లించకుంటే సంబంధిత యాజమాన్యాలపై భారతీయ నేర స్మృతి ప్రకారం కేసులు నమోదు చేసి, మూడేళ్లవరకు జైలు శిక్ష విధించే అధికారం ఉంది. సాంకేతిక విద్య, ఉపాధ్యాయ శిక్షణ, యూజీసీలను కలిపి ఒకే నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని తొలుత కేంద్ర ప్రభుత్వం భావించింది. అయితే తొలుత ఉన్నత విద్యను పటిష్ఠపరచాలని నిర్ణయించింది.

నూతన ఉన్నత విద్య కమిషన్ ఆర్థిక అధికారాలు ఇస్తే విద్యాసంబంధిత విషయాలపై దృష్టి కేంద్రీకరించడం తగ్గుతుందని హెచ్‌ఆర్‌డీ శాఖ అధికారి ఒకరు చెప్పారు. నిధుల పంపకం బాధ్యతలు ఇస్తే విద్యా సంస్థలను పర్యవేక్షించడం, పరిశోధనలు, నాణ్యతాపరమైన చర్యలు తీసుకోవడంలో తగిన శ్రద్ధ పెట్టలేదని అన్నారు. అందువల్ల వివిధ విద్య కోర్సుల ఫలితాలు, బోధన, మదింపు, పరిశోధనలను ప్రామాణీకరించే బాధ్యతలు కట్టబెట్టనున్నట్టు వివరించారు. ఉన్నత విద్యా సంస్థల ప్రమాణాలను ఏటా మదింపు చేసే అధికారం ఈ కమిషన్‌దే. తగిన ప్రమాణాలు లేని సంస్థలకు తగిన సూచనలు ఇస్తుంది. కనీస ప్రమాణాలు లేనివాటిని మూసివేయిస్తుంది. కొత్త విద్యా సంస్థల స్థాపనపై విధివిధానాలను నిర్దేశిస్తుంది. కీలక పదవుల నియామకం, విద్యార్థుల ప్రవేశాలు, బోధన రుసుములపై మార్గదర్శకాలు ఇస్తుంది. సందర్భానుసారం ప్రోత్సాహకాలు ఇవ్వడం, శిక్షలు విధించడం వంటి విధానాలను విశ్వవిద్యాలయాలు అమలు చేసేలా ఈ నూతన కమిషన్ పర్యవేక్షిస్తుంది.

సమన్వయం తదితర వ్యవహారాల్లో ఉన్నత విద్య కమిషన్‌కు సూచనలు ఇచ్చేందుకు సలహా మండలి ఉంటుంది. మానవ వనరుల అభివృద్ధి మంత్రి అధ్యక్షతన ఉండే ఈ మండలిలో అన్ని రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్ల ఛైర్మన్లు/వైస్ ఛైర్మన్లు సభ్యులుగా ఉంటారు.

హైదరాబాద్ మహిళ అరుణా మిల్లర్ ఓటమి

వాషింగ్టన్: అమెరికా ప్రతినిధుల సభకు జరిగిన ప్రాథమిక ఎన్నికల్లో భారతీయ-అమెరికన్లకు తీవ్ర నిరాశే ఎదురైంది! న్యూయార్క్, మేరిలాండ్, కొలరాడో, ఉటా రాష్ట్రాల్లోని ఆరు స్థానాల్లో తలపడిన భారతీయ సంతతి వారంతా ఓటమి చవిచూశారు. వ్యాపార దిగ్గజం, డెమోక్రటిక్ సహచరుడు డేవిడ్ ట్రోన్‌ను సునాయాసంగా ఢీకొట్టగలరని అంతా భావించిన హైదరాబాద్ మహిళ అరుణా మిల్లర్ కూడా ఓటమిపాలవ్వడం భారతీయులకు తీవ్ర నిరాశ మిగిల్చింది. భారతీయ మిత్రునిగా పేరుగాంచిన, ప్రస్తుతం పదోసారి ప్రతినిధుల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న జోయ్ క్రౌలె... తన డెమోక్రటిక్ ప్రత్యర్థి, 28 ఏళ్ల సోషలిస్ట్ అలెగ్జాండ్రియా ఒకాసియో-కార్టెజ్ చేతిలో ఘోరంగా ఓడిపోయారు. భవిష్యత్తులో జోక్ స్పీకరు అవుతారని అంతా భావించారు.

ప్రధాని భద్రతపై మార్గదర్శకాలు కొత్తవేమీ కాదు: హోంశాఖ

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ భద్రతకు సంబంధించిన మార్గదర్శకాలు, ప్రామాణిక నిర్వహణ విధానాలు (ఎస్‌ఓపీ) కొత్తవేమీ కావని కేంద్ర హోంశాఖ బుధవారం తెలిపింది. అలాగే నిబంధనల్లో ప్రత్యేకించి మంత్రులు, ఉన్నతాధికారులను ఉద్దేశించి ఏమీ పేర్కొనలేదని వివరణ ఇచ్చింది. అత్యంత ప్రముఖుల భద్రత ఏర్పాట్లకు సంబంధించి అమల్లో ఉన్న నిబంధనలనే ఎప్పటికప్పుడు రాష్ట్రాలకు పునరుద్ఘాటించాల్సి ఉంటుందని ఓ ప్రకటనలో పేర్కొంది.

బుఖారీ హంతకుల గుర్తింపు

శ్రీనగర్: 'రైజింగ్ కశ్మీర్' పత్రిక సంపాదకుడు బుఖారీని హతమార్చిన ముగ్గురు నిందితుల్ని పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకడు- పరారీలో ఉన్న లష్కరే తోయిబా ఉగ్రవాది, పాక్ పౌరుడు నవీద్ జాట్. పాత్రికేయుడిని హతమార్చడానికి కొద్దిసేపటి ముందు అక్కడ ద్విచక్ర వాహనంపై తిరిగిన ముగ్గురిలో ఈ ఉగ్రవాది ఉన్నట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా గుర్తించారు.

1,097 మంది 'చండీగఢ్' విద్యార్థులకు కొలువులు

ఈనాడు, హైదరాబాద్: పంజాబ్‌లోని చండీగఢ్ విశ్వవిద్యాలయానికి చెందిన 1,097 మంది విద్యార్థులు... 118 కోర్ ఇంజినీరింగ్ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఉపకులపతి డా.ఆర్.ఎస్.బవా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2017-18కి సంబంధించి బహుళజాతి కోర్ ఇంజినీరింగ్ సంస్థలు ప్రాంగణ నియామకాలు చేపట్టగా... మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులు ఎంపికైనట్లు వీసీ వివరించారు. కాగా, వీరితోపాటు పలువురు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు.. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, ఐబీఎం, విప్రో, క్యాప్‌జెమిని వంటి దిగ్గజ ఐటీ సంస్థలకు ఎంపికైనట్లు బవా పేర్కొన్నారు.

'మహిళలకు భారత్ అత్యంత ప్రమాదకర దేశం' నివేదిక

అబద్ధాల పుట్ట

దిల్లీ: మహిళలకు అత్యంత ప్రమాదకర దేశంగా భారత్ మారిపోయిందంటూ ఇటీవల విడుదలైన అధ్యయనాన్ని మహిళా, శిశు అభివృద్ధి శాఖ బుధవారం తోసిపుచ్చింది. ''థాంప్సన్ రాయిటర్స్ ఫౌండేషన్ (టీఆర్‌ఎఫ్)'' విడుదలచేసిన ఆ నివేదిక అబద్ధాల పుట్టని వ్యాఖ్యానించింది. ఎవరో అనామకుల అభిప్రాయాల ఆధారంగా దాన్ని సిద్ధంచేశారని ధ్వజమెత్తింది. అధ్యయనానికి సంబంధించిన నిపుణుల వివరాలు ఇవ్వాలని టీఆర్‌ఎఫ్‌ను కోరామని, అయితే ఇప్పటివరకూ స్పందనరాలేదని వెల్లడించింది. లోపభూయిష్టమైన విధానాలను అనుసరించడంవల్లే టీఆర్‌ఎఫ్ తప్పుడు అవగాహనకు వచ్చిందని పేర్కొంది. '548 మంది నిపుణుల అభిప్రాయాల ఆధారంగా ఆ అధ్యయనం నిర్వహించామని టీఆర్‌ఎఫ్ చెబుతోంది. అయితే ఆ నిపుణుల హోదాలు, నైపుణ్యాలు, విద్యార్హతలు అడుగుతుంటే అసలు స్పందించడంలేదు'అని మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదలచేసింది. ప్రపంచంలోని చాలా దేశాల కంటే మహిళలకు సురక్షితమైన, చక్కని చోటు భారత్‌లో లభిస్తుందని నొక్కిచెప్పింది.

మొదటి విడత సీట్ల కేటాయింపు

● ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీ, జీఎఫ్‌టీఐల్లో సీట్లు కేటాయించిన జోసా

● ఐఐటీ హైదరాబాద్ సీఎస్‌ఈలో 445-769 ర్యాంకు వరకు సీటు

● ఐఐటీ తిరుపతి సీఎస్‌ఈలో 3,671 ర్యాంకుతో ముగింపు

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా వివిధ జాతీయ విద్యా సంస్థల్లో ఏడు విడతలకు గాను తొలివిడత సీట్ల భర్తీని సంయుక్త సీట్ల కేటాయింపు అథారిటీ (జోసా) పూర్తి చేసింది. ఐఐటీలు-23, ఎన్‌ఐటీలు-31, ట్రిపుల్‌ఐటీలు-23, జీఎఫ్‌ఐటీలు-23 కలిపి మొత్తం 100 సంస్థల్లో ఈ ప్రక్రియను చేపట్టి ఆ వివరాలను జోసా వెల్లడించింది. ఐఐటీ హైదరాబాద్, తిరుపతిల్లో మెరుగైన ర్యాంకుల వారికే సీట్లు లభించాయి.

- ■ ఐఐటీ హైదరాబాద్: కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్‌లో జనరల్ మహిళా విభాగంలో 1247 నుంచి 1368 వరకు, జనరల్‌లో 445 నుంచి 769 ర్యాంకు వరకు సీట్లు వచ్చాయి.
- ■ ఐఐటీ తిరుపతి: జనరల్‌లో కంప్యూటర్ సైన్సులో 2,834 నుంచి 3,671, జనరల్ మహిళా విభాగంలో 3,922 నుంచి 4,462 వరకు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచిలో జనరల్‌లో 4,785 నుంచి 6,155 ర్యాంకుల వరకు లభించాయి.
- ■ ఎన్‌ఐటీ వరంగల్: సీఎస్‌ఈ జనరల్‌లో 1,435 నుంచి 1,651 వరకూ, ఈసీఈ జనరల్‌లో 3,939 నుంచి 4,064 ర్యాంకు వరకు ఇచ్చారు.
- ■ ఎన్‌ఐటీ తాడేపల్లిగూడెం: సీఎస్‌ఈ జనరల్‌లో 8,877 నుంచి 15,100 వరకు, ఈసీఈలో 12,819 నుంచి 18,398 ర్యాంకు వరకు లభించింది.
- ■ ట్రిపుల్‌ఐటీ, శ్రీసిటీ: సీఎస్‌ఈ జనరల్‌లో 6,626 నుంచి 18,485వరకు, ఈసీఈలో 16,129 ర్యాంకుతో ప్రారంభమై 22,043తో ముగిసింది.
- ■ ట్రిపుల్‌ఐటీ, కర్నూలు: కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో జనరల్ విభాగంలో 13,187 నుంచి 23,642 వరకు, ఈసీఈలో 19,317 నుంచి 27,481 ర్యాంకు వరకూ వచ్చాయి.
- ■ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ కళాశాల, విజయవాడ: ప్లానింగ్ జనరల్ విభాగంలో 1,195 ర్యాంకుతో ఆరంభమై 1,710తో ముగిసింది. ఆర్కిటెక్చర్‌లో 465 నుంచి 1,022 ర్యాంకు వరకు సీట్లు కేటాయించారు.

మత్తు మందు పంజా

● ఐరాస తాజా నివేదిక

ఐరాస: మత్తుమందు రాకాసి ప్రపంచాన్ని కబళిస్తోంది! మునుపెన్నడూ లేనంతగా ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారుతోంది. 'ఐక్యరాజ్య సమితి మత్తుమందులు, నేరాల నిరోధక సంస్థ(యూఎన్‌ఓడీసీ)' మంగళవారం విడుదల చేసిన 'ప్రపంచ మత్తుమందు నివేదిక-2018' ఈ మేరకు విస్తుపోయే వాస్తవాలను బయటపెట్టింది. కొకైన్, ఓపియం(నల్లమందు)ల ఉత్పత్తి గతంలో ఎన్నడూలేనిరీతిలో గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా మత్తుమందుల సరఫరాతోపాటు ఆరోగ్యంపై వాటి ప్రభావాలను తాజా నివేదికలో ఐరాస తెలియజేసింది. ఈ నివేదిక ప్రకారం.. ఔషధరంగ వినియోగ కోసం ఉత్పత్తి చేసే మత్తుమందులను అక్రమమార్గంలో ఉపయోగిస్తున్నవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. మొత్తంగా మత్తుమందుల వల్ల సంభవిస్తున్న మరణాల్లో.. ఔషధరంగ మత్తుమందులను దుర్వినియోగం చేస్తుండటంతో సంభవిస్తున్న మరణాలే 76 శాతంగా ఉంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఓపియం ఉత్పత్తి 2016-17 తర్వాత 65 శాతం పెరిగి.. 10,500 టన్నులకు చేరుకుంది. 2016లో కొకైన్ ఉత్పత్తి గరిష్ఠస్థాయికి చేరింది. ఆ ఏడాది 1,410 టన్నుల కొకైన్ ఉత్పత్తయినట్లు అంచనా. 2016లో 87 టన్నుల మత్తుమందుల(ఔషధరంగ ఓపియాయిడ్‌లు) నిల్వలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూగోళంపై 27.5 కోట్లమంది 2016లో కనీసం ఒక్కసారైనా ఏదో ఒక మత్తుమందు తీసుకున్నారు. ఇది ప్రపంచ జనాభాలో 15-64 ఏళ్ల వయసున్నవారి మొత్తం సంఖ్యలో 5.6 శాతం. మత్తుమందులు తీసుకునేవారిలో అత్యధికులు పురుషులే. ఆందోళన, మానసిక ఒత్తిడిని తగ్గించే ఔషధరంగ మత్తుమందులను అనుచితరీతిలో తీసుకోవడంలో మాత్రం మహిళలు.. పురుషులతో సమానస్థాయిలో ఉంటున్నారు. మగవారితో పోలిస్తే స్త్రీలు కాస్త పెద్ద వయసులో మత్తుమందులు తీసుకోవడం ప్రారంభిస్తున్నారు. కానీ, ఒక్కసారి వాటిని ఉపయోగించడం ప్రారంభిస్తే.. పురుషుల కంటే వేగంగా మహిళలు మద్యం, గంజాయికి బానిసలుగా మారుతున్నారు.

అమెరికాలోని కాన్సస్‌లో భారీ ఉరుములతో కూడిన తపాను చిత్రమిది. ఇదే ప్రాంతంలో ఒకదాని వెంట ఒకటి పలు భారీ ఉరుములతో కుంభవృష్టి కురిసింది

ఇరాన్‌ను వదిలించుకోండి

● ఆ దేశం నుంచి ముడి చమురు దిగుమతులను నిలిపివేయండి

● భారత్, చైనా సహా అన్ని దేశాలపై అమెరికా ఒత్తిడి

వాషింగ్టన్/ దిల్లీ: ఇరాన్ నుంచి ముడిచమురు దిగుమతులను క్రమేపీ నిలిపివేయాలంటూ భారత్, చైనా సహా అన్ని దేశాలపైనా అమెరికా ఒత్తిడి తెచ్చింది. నవంబరు 4 (ఇరాన్‌పై ఆంక్షలు అమలయ్యే) నాటికి ఆ దేశం నుంచి కొనుగోళ్లు 'సున్నా'కు తీసుకురావాలని.. లేనట్లయితే ఎవరికీ ఎలాంటి మాఫీలూ ఉండబోవని పేర్కొంది. భారత్, చైనా సహా ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలన్నింటినీ ఇదే కోరుతున్నామని.. లేనట్లయితే 2015కు ముందునాటి ఆంక్షలు అమలవుతాయని పేర్కొంది. దీన్ని అమెరికా అత్యంత 4 ప్రాధాన్యాంశాల్లో ఒకటిగా పేర్కొనడం గమనార్హం. కాగా ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ రెండో (చైనా తర్వాత) స్థానంలో ఉంది. అలాగే ఇరాక్, సౌదీ అరేబియాల తర్వాత ఇరాన్ నుంచే భారత్‌కు అధికంగా ముడిచమురు సరఫరా అవుతోంది. గత నెలలో ఇరాన్ అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన సంగతి తెలిసిందే. ఇరాన్ అణు కార్యక్రమంపై ట్రంప్ పలు ఆంక్షలను కూడా తిరిగి విధించారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయాలంటూ ఆయా దేశాలపై ఒత్తిడి తేవడం ప్రారంభించింది.

మలేసియా మాజీ ప్రధాని అక్రమ సంపద 1,874 కోట్లు స్వాధీనం

కౌలాలంపూర్: మలేసియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్‌కు చెందిన రూ.1,874 కోట్ల విలువైన అక్రమ సంపదను ఆ దేశ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 12 వేల ఆభరణాలు, 400కుపైగా గడియారాలు, నగదు బ్యాగులు, విలాస వస్తువులు జప్తు చేసినవాటిలో ఉన్నట్లు పేర్కొన్నారు. మలేసియా ప్రభుత్వ పెట్టుబడుల నిధి నుంచి నజీబ్, ఆయన సన్నిహితులు వేలకోట్లు దోచుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి గత నెలలో పోలీసులు దాడులు జరిపి పెద్ద మొత్తంలో సంపదను స్వాధీనం చేసుకున్నారు. లెక్కింపు పూర్తి చేసి.. తాజాగా వివరాలు ప్రకటించారు.

కూలిన సుఖోయ్

● ఇద్దరు పైలెట్లూ సురక్షితం

సుఖోయ్ యుద్ధ విమానం శకలాల సమీపంలో గుమిగూడిన జనం

నాసిక్: మహారాష్ట్రలోని నాసిక్‌లో బుధవారం ఓ సుఖోయ్ యుద్ధ విమానం కూలిపోయింది. ఇందులో ఉన్న ఇద్దరు పైలెట్లూ.. పారాచ్యూట్‌ల సాయంతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఎస్‌యూ-30ఎమ్‌కేఐ రకానికి చెందిన ఈ విమానాన్ని.. భారత వాయుసేనకు అప్పగించేందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) సంస్థ తయారు చేసింది. కొత్త బ్యాచ్‌లో తయారీ పూర్తిచేసుకున్నవాటిలో మొదటి విమానం ఇదేనని హెచ్‌ఏఎల్ అధికారులు తెలిపారు. ఇప్పటికే పలు మార్లు గగన విహారాలు చేసిన దీన్ని.. వాయుసేనలో ప్రవేశానికి సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. నాసిక్‌కు 25 కి.మీ.ల దూరంలోని వ్యవసాయ క్షేత్రంలో విమానం కూలిందని.. దాని తునకలు తాకి అక్కడ పనిచేస్తున్న కొందరు రైతు కూలీలు గాయపడ్డారని పోలీసు అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో వారు చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమై ఉంటుందని.. దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు.

పత్రికల్లో అంశాన్ని ఈసీ నియంత్రించజాలదు

● మధ్యప్రదేశ్ మంత్రిపై అనర్హత వేటును కొట్టివేసిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: చెల్లింపు వార్తల ఆరోపణలపై మధ్యప్రదేశ్‌లో భాజపా మంత్రి నరోత్తమ్ మిశ్రపై ఎన్నికల సంఘం (ఈసీ) వేసిన మూడేళ్ల అనర్హత వేటును, దానిని సమర్థిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. పత్రికల్లోని అంశాలను ఈసీ నియంత్రించజాలదని స్పష్టం చేసింది. ఒక అభ్యర్థి ఎన్నికల్లో చేసిన ఖర్చుకు సెక్షన్-77 కింద లెక్క చూపిస్తున్నారా లేదా అనే విషయం వరకే ఈసీ చూసుకోవాలనీ, వ్యక్తీకరణలోని అంశాలను మాత్రం కాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఇటీవల తీర్పు వెలువరించింది. 'నిబంధనలకు భాష్యం చెప్పడంలో ఈసీ, ఏకసభ్య ధర్మాసనం కూడా పొరపడ్డాయి. పత్రికల్లో వచ్చిన వార్తల్లోని అంశాలు, ఒక అభ్యర్థిపై ధారావాహికంగా వెలువడే వ్యాసాలను ఈసీ మార్గదర్శకాలతో పరోక్షంగా నియంత్రించడం తగదు. అవన్నీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిధిలోకి వస్తాయి. ఇలాంటివాటిపై నియంత్రణ విధించడం ఈ స్వేచ్ఛను ప్రభావితం చేస్తుంది. ప్రజాస్వామ్యానికి అవసరమైన అన్ని చర్చల్ని అది పరోక్షంగా నియంత్రిస్తుంది. ఎన్నికల సంస్కరణలను చూస్తున్న న్యాయస్థానాలు, ట్రైబ్యునళ్లు- నిరూపిత సాక్ష్యాధారాలపైనే ఆధారపడాలి. ఊహాజనిత ప్రేరేపిత నిర్ణయాలను పరిహరించాలి' అని ధర్మాసనం తెలిపింది.

ఈడీ అధికారిని విచారించవచ్చు: సుప్రీం

2జి కుంభకోణంపై విచారణ నిర్వహిస్తున్న ఈడీ అధికారి రాజేశ్వర్ సింగ్‌పై వచ్చిన తీవ్ర అభియోగాలను విచారించే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. 'విచారణ జరగకుండా ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వును సవరిస్తున్నాం. ఆరోపణలంటూ వచ్చినప్పుడు అవి తప్పుడువైనా, సరైనవైనా వాటిపై విచారణ జరపాల్సిందే'నని జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఎస్.కె.కౌల్‌లతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం బుధవారం తేల్చిచెప్పింది.

మంగళవారం మావోయిస్టుల మందుపాతరకు బలైన జవాను పార్థివదేహాన్ని తరలిస్తున్న సహచరులు

ఝార్ఖండ్‌లో ఎదురుకాల్పులు.. మావోయిస్టు మృతి

రాంచీ: ఝార్ఖండ్‌లోని లాతేహార్-ఘర్వా జిల్లాల సరిహద్దులో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలో ఈ సంఘటన జరిగిందని సీఆర్‌పీఎఫ్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. మంగళవారం మావోయిస్టులు పేల్చిన మందుపాతరలో ఆరుగురు జవాన్లు మరణించగా, అనంతరం జరిగిన గాలింపులో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి.

ఐరాసది ప్రేరేపిత నివేదిక..

దిల్లీ: కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ ఐక్యరాజ్య సమితి ఇటీవల విడుదల చేసిన నివేదికను భారత సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ బుధవారం ఖండించారు. ''అదో ప్రేరేపిత నివేదిక. మానవ హక్కుల విషయంలో భారత సైన్యం ఎంతటి ఉన్నత ప్రమాణాలను పాటిస్తుందో.. కశ్మీర్ ప్రజలతో పాటు అంతర్జాతీయ సమాజానికి తెలుసు..'' అని రావత్ పేర్కొన్నారు. సైబర్ భద్రతపై దిల్లీలో నిర్వహించిన సదస్సు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి నివేదికలను అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఇంతకుముందే భారత విదేశీ వ్యవహారాల శాఖ ఈ నివేదికను తిప్పికొట్టిన సంగతి తెలిసిందే.

'ఆక్సిటోసిన్' తయారీపై నిషేధం

దిల్లీ: దేశీయంగా వినియోగం కోసం 'ఆక్సిటోసిన్' మందును ప్రయివేటు ఔషధ సంస్థలు తయారు చేయకూడదంటూ కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ ఉత్తర్వులు జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడాన్ని కూడా నిషేధించింది. సాధారణంగా ప్రసవం సమయంలో మహిళలకు ఈ మందును ఇస్తారు. కానీ ఎప్పుడంటే అప్పుడు పాలు పితకడం కోసం పాడిపశువులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. అదేవిధంగా వంకాయలు, పుచ్చ, దోస కాయలు, తదితర కూరగాయలు పెద్దవిగా కనిపించేలా చేయడం కోసం కూడా ఈ ఇంజక్షన్లను ఉపయోగిస్తున్నారు. ఇలా దుర్వినియోగం కాకుండా నిరోధించడంలో భాగంగా ప్రయివేటు మందుల సంస్థలపై ఆంక్షలు విధించింది. ఈ మందును ప్రభుత్వ రంగ సంస్థ అయిన కర్ణాటక యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మాసిటికల్స్ లిమిటెడ్ (కేపీపీఎల్) ఒక్కటే తయారు చేస్తోంది. అవసరమైనవారు దాని నుంచి మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనిని రిటైల్ మందుల షాపుల్లో అమ్మడానికి వీల్లేదు. ఆక్సిటోసిన్‌ను విచ్చలవిడిగా తయారు చేస్తున్నందువల్లనే పశువుల పెంపకందార్లు దీన్ని ఇష్టం వచ్చినట్టు ఉపయోగిస్తున్నారని 2016లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ నిషేధం ప్రాధాన్యం సంతరించుకొంది.

ఉపాధ్యక్ష రేసులో సుఖేందు

● విపక్ష అభ్యర్థిగా తృణమూల్ ఎంపీ

ఈనాడు, దిల్లీ: రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఆయన్ని బరిలోకి దించేందుకు రంగం సిద్ధమవుతోంది. సంఖ్యాబలం దృష్ట్యా విపక్ష అభ్యర్థే విజయం సాధించే అవకాశాలున్నా అధికార పక్షం మాత్రం ఆశలు విడిచిపెట్టలేదు. ఇప్పటివరకు తమ పార్టీ అభ్యర్థికి ఇతర విపక్షాల మద్దతును కూడగట్టాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆ ప్రయత్నాన్ని విరమించుకోనుంది. తెరాస (ఆరుగురు ఎంపీలు), బీజేడీ (9), వైకాపా (2)లు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు పలకబోవని ఎన్డీఏ భావిస్తూ వచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ స్థానంలో తృణమూల్ అభ్యర్థి బరిలోకి దిగుతుండడం, ఆ పార్టీతో బీజేడీ, తెరాసలకు సత్సంబంధాలు ఉండడంతో ఆ రెండు పార్టీలూ ఆ అభ్యర్థికే మద్దతు ఇస్తాయని భావిస్తున్నారు. సభలో అధికార కూటమికి 111, విపక్షాలకు 117 మంది సభ్యుల బలం ఉండగా మిగిలిన 17 మంది బీజేడీ, తెరాస, వైకాపాల్లో ఉన్నారు. ఈ 17 ఓట్ల నుంచి ఏ కూటమి ఎన్నింటిని రాబడుతుందనే దానిపై జయాపజయాలు ఆధారపడి ఉంటాయనేది తెలిసిందే.

అవసరమైతే జీతం నిలిపేయవచ్చు

దిల్లీ: సహోద్యోగికి పనిఒత్తిడి కలిగించడం ద్వారా. ఆయన ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారంటూ ఓ ప్రభుత్వ ఉన్నతాధికారిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఒకవ్యక్తి ఆత్మహత్య చేసుకునే పరిస్థితిని ఉద్దేశపూర్వకంగా కల్పించినప్పుడు మాత్రమే అది నేరమవుతుందని స్పష్టం చేసింది. అవసరం, పరిస్థితులను బట్టి వివిధ సమయాల్లో పనిచేయించుకోవడం, జీతాన్ని ఓనెల నిలిపివేయడం వంటి చర్యలు తీసుకునే అధికారం ఉన్నతాధికారులకు ఉంటుందని పేర్కొంది. జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ యూ.యూ.లలిత్‌ల ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్యలు చేసింది. నిరుడు మహారాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు... తన జూనియర్ మరణానికి కారణమయ్యారన్న ఆరోపణపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది.

రేపు రూ.125 నాణెం విడుదల

దిల్లీ: జాతీయ గణాంక దినం, పీసీ మహలనోబిస్ 125వ జయంతి సందర్భంగా రూ.125 స్మారక నాణెం, రూ.5 నాణేలను ఉపాధ్యక్షుడు ఎం.వెంకయ్య నాయుడు రేపు విడుదల చేయనున్నారు. గణక శాస్త్ర దిగ్గజం మహలనోబిస్ గౌరవార్థం కొత్త నాణేన్ని విడుదల చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జాతీయ స్థాయిలో ఏటా జూన్ 29ను గణాంక దినంగా జరుపుకోవాలని 2007లో ప్రభుత్వం నిర్ణయించింది. సాంఖిక- ఆర్థిక ప్రణాళికలు, విధానల రూపకల్పనలో గణాంకాల ప్రాధాన్యత, మహలనోబిస్ చేసిన సేవలను ప్రజలకు తెలియజేయడం దీని ప్రధాన ఉద్దేశం. కేంద్ర గణక, కార్యక్రమాల అమలు శాఖ, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లు సంయుక్తంగా కోల్‌కతాలో ఈ వేడుక నిర్వహించనున్నాయి.

ఈనాడు బిజినెస్

సిమెంటు రంగుల ధరలు తగ్గుతాయ్!

● జీఎస్‌టీ రేటు 28 నుంచి 18 శాతానికి కుదింపు?

● గృహ నిర్మాణ రంగానికి ఊతం ● తదుపరి సమావేశంలో జీఎస్‌టీ మండలి నిర్ణయం

ఈనాడు - దిల్లీ

గృహ కొనుగోలుదారులకు శుభవార్త. సిమెంటు, రంగుల వంటి కొన్ని నిర్మాణ రంగ సామగ్రిపై వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రేటు తగ్గే అవకాశం కనిపిస్తోంది. జులై 19న జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో భాజపా పాలిత రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఈ మేరకు ఓ ప్రతిపాదన చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం సిమెంటు, రంగులతో పాటు మరికొన్ని నిర్మాణ రంగ సామగ్రిపై 28 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు. దీనిని 18 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర పడితే గృహ కొనుగోలుదార్లు, నిర్మాణదార్లకు వ్యయ భారం తగ్గుతుందని ఓ అధికారి వెల్లడించారు. అలాగే గృహాలకు గిరాకీ పెరిగేందుకు కూడా ఈ పరిణామం దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

2022 కల్లా అందరికీ గృహ వసతి కల్పించాలన్న లక్ష్యాన్ని సాధించే దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నికర వినియోగ స్థలం (కార్పెట్ ఏరియా) నిబంధనలు సరళీకరించింది. తదుపరి (జులై 19న) జీఎస్‌టీ సమావేశంలో రిటర్న్‌ల సరళీకరణ ప్రక్రియపైనా చర్చించే అవకాశం ఉంది.

'మండలి' నిర్ణయాలపై రాజకీయ ప్రభావం

ఈ ఏడాది చివర్లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, రాజస్థాన్ రాష్ట్రాల ఎన్నికలు ఉండటంతో 19 తర్వాత జరిగే జీఎస్‌టీ మండలి నిర్ణయాల్లో రాజకీయ ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. పై నాలుగింటిలో మూడు రాష్ట్రాల్లో ప్రస్తుతం భాజపానే అధికారంలో ఉంది. సహజవాయువును జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చే విషయంపైనా, చక్కెర సుంకం కిలోకు రూ.3 చొప్పున విధించే ప్రతిపాదనపైనా చర్చ జరిగినా ఏకాభిప్రాయం కుదురకపోవచ్చని భావిస్తున్నారు. అందువల్ల 19వ తేదీ తర్వాత జీఎస్‌టీ మండలి సమావేశాన్ని అంత త్వరగా కేంద్రం నిర్వహించకపోవచ్చని చెబుతున్నారు. అంతేకాకుండా జీఎస్‌టీ మండలి సమావేశాల మధ్య వ్యవధి పెరుగుతూ వస్తోంది. 2018 మే వరకు నెలకు దాదాపు రెండు సమావేశాలు జరిగాయి. ఆ తర్వాత రెండున్నర నెలల్లో ఒక్కటే సమావేశాన్ని నిర్వహించారు. చివరిసారి మే 4న సమావేశం జరగగా. . మళ్లీ జులై 19న తదుపరి సమావేశం జరగబోతోంది. జులై 19 తర్వాత రెండు నెలలకు ఒక సారి సమావేశం జరగొచ్చని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అక్టోబరు- నవంబరు మధ్య నిర్ణయాలు త్వరగా తీసుకుంటారని భావిస్తున్నారు. గుజరాత్ ఎన్నికలకు ముందు ఎలాగైతే వివిధ వస్తువులపై పన్ను రేట్లను జీఎస్‌టీ మండలి తగ్గించిందో, అలాంటి పరిస్థితే పునరావృతం కావచ్చు.

ఆకర్షణీయ వృద్ధి దిశగా..

పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో 2016-17లో స్వల్పంగా 1.3% వృద్ధిని నమోదుచేసిన నిర్మాణ రంగం. . 2017-18లో 5.7 శాతం వృద్ధిని సాధించింది. ఇక నాలుగో త్రైమాసికంలో ఆకర్షణీయంగా 11.5 శాతం వృద్ధి నమోదైంది. భారత జీడీపీలో ఈ రంగ వాటా దాదాపు 8 శాతం వరకు ఉంటుంది.

2 నెలల్లో రూ.2,000 కోట్ల జీఎస్‌టీ ఎగవేత

- నమోదైనవి 1.11 కోట్ల సంస్థలు
- వసూలైన మొత్తంలో 80% వాటా లక్ష మంది నుంచే
- దర్యాప్తు విభాగం పరిశీలనలో వెల్లడి

దిల్లీ: వివిధ సంస్థలు/ వ్యాపారులు రెండు నెలల్లో రూ.2,000 కోట్ల మేర వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ఎగ్గొట్టినట్లు, జీఎస్‌టీ దర్యాప్తు విభాగం గుర్తించింది. ముమ్ముందు పన్ను ఎగవేతల నియంత్రణకు చర్యలు చేపడతామని పరోక్ష పన్నులు, కస్టమ్స్ మండలి (సీబీఐసీ) సభ్యుడు, జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ డైరెక్టరు జనరల్ జాన్ జోసెఫ్ వెల్లడించారు. వస్తువులను సరఫరా చేయకుండానే చేసినట్లుగా, నకిలీ రశీదులు సృష్టిస్తున్నారని తమ పరిశీలనలో తేలినట్లు చెప్పారు. ఈ రశీదులను ఉపయోగించుకొని కొన్ని సంస్థలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేస్తున్నాయని పేర్కొన్నారు. మరికొన్ని ఎగుమతి సంస్థలు ఈ నకిలీ రశీదుల ద్వారా జీఎస్‌టీ రీఫండ్‌లకు దరఖాస్తు చేసుకుంటున్నాయని చెప్పారు. జీఎస్‌టీ కింద నమోదైన 1.11 కోట్ల మంది వ్యాపారులు లేదా సంస్థల్లో 1 శాతం నుంచే, 80 శాతం పన్ను వసూలైనట్లు గుర్తించామని చెప్పారు. 'పన్ను వసూళ్లను గమనిస్తే హెచ్చరిక సంకేతాలున్నాయి. ఇప్పటివరకు కోటి మందికి పైగా జీఎస్‌టీ కింద నమోదయ్యారు. అయితే మొత్తం పన్ను వసూళ్లలో లక్ష మందిదే 80 శాతం వాటా. వ్యవస్థలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియడం లేదు. ఇది అధ్యయనం చేయాల్సిన ముఖ్యమైన విషయమ'ని ఇక్కడ జరిగిన అసోచామ్ కార్యక్రమంలో ఆయన అన్నారు. జీఎస్‌టీ రిటర్న్‌లను నింపే సమయంలో చిన్న వ్యాపారులే కాకుండా బహుళజాతి సంస్థలు, పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు కూడా తప్పులు చేస్తున్నాయని తెలిపారు.

హాంకాంగ్, దుబాయ్‌ల్లోనూ రుణాలు

పీఎన్‌బీ అంతర్గత దర్యాప్తులో వెల్లడి

దిల్లీ: వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ రుణాల వ్యవహారం దేశాలు దాటింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ముంబయిలోని బ్రాడీ హౌస్ శాఖ నుంచే కాకుండా అతని సంస్థలు హాంకాంగ్, దుబాయ్‌ల్లోని పీఎన్‌బీ శాఖల్లోనూ రుణాలు తీసుకున్నాయి. బ్యాంక్ అంతర్గతంగా నిర్వహించిన దర్యాప్తు నివేదికలో ఈ విషయం తేటతెల్లమైంది. ఈ విషయాన్ని దర్యాప్తు సంస్థలకు బ్యాంకు చేరవేసింది. నివేదిక ప్రకారం, నీరవ్ మోదీకి చెందిన హాంకాంగ్‌లోని ఫైర్‌స్టార్ డైమండ్ లిమిటెడ్, దుబాయ్‌లోని ఫైర్‌స్టార్ డైమండ్ ఎఫ్‌జడ్ఈ సంస్థలు అక్కడి శాఖల్లో రుణాల్ని తీసుకున్నాయి. నీరవ్ మోదీ, అతని సంస్థలు పీఎన్‌బీని రూ.14,000 కోట్ల మేరకు మోసం చేసినట్లు లెక్కగట్టారు. దర్యాప్తు తరవాత హాంకాంగ్, దుబాయ్ శాఖల్లో తీసుకున్న రుణాలు మోసపూరితమైనవి కాదని తేల్చారు.

వారెంట్ రద్దుకు చోక్సీ పిటిషన్: పీఎన్‌బీ కుంభకోణంలో తనపై జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంటును (ఎన్‌బీడబ్ల్యు) రద్దు చేయమని కోరుతూ గీతాంజలి గ్రూపు ప్రమోటరు, నీరవ్ మోదీ బంధువు మెహుల్ చోక్సీ కోర్టును ఆశ్రయించారు. చోక్సీ తరపు న్యాయవాది సంజయ్ అబాట్ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అనారోగ్యంతో తాను ప్రయాణాలు చేయడానికి వీలు కావడం లేదని, అలాగే తాను ఎక్కడున్నది చెబితే ప్రాణహాని ఉందని చోక్సీ దరఖాస్తులో పేర్కొన్నారు.

మైటాస్ ఇన్‌ఫ్రాపై సెబీ ఆదేశాల నిలిపివేత

దిల్లీ: సత్యం కంప్యూటర్ కుంభకోణంలో అక్రమంగా ఆర్జించిన రూ.59 కోట్లు చెల్లించాలంటూ మైటాస్ ఇన్‌ఫ్రాకు సెబీ జారీ చేసిన ఆదేశాలను నిలిపివేస్తూ సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) ఆదేశాలు జారీ చేసింది. 2009లో సత్యం కుంభకోణం అనంతరం మైటాస్ ఇన్‌ఫ్రాను ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ స్వాధీనం చేసుకున్న సంగతి విదితమే. గతనెలలో సుప్రీంకోర్టు తీర్పు అనంతరం, సత్యం వ్యవహారంలో బి.తేజరాజు సహా పలు సంస్థలు అంతర్గత పాత్ర లేదని నిర్ణయించిన సంగతి విదితమే. సత్యం కుంభకోణం సూత్రధారి అయిన బి.రామలింగ రాజు కుమారుడైన బి.తేజరాజు మైటాస్ ఇన్‌ఫ్రా డైరెక్టరు. తేజరాజు డైరెక్టరుగా ఉన్నందున, మైటాస్ ఇన్‌ఫ్రాను కూడా ఇన్‌సైడర్‌గా పరిగణించలేమని శాట్ పేర్కొంది.

విజయవాడ సహా మరో 25 నగరాల్లో జొమాటో సేవలు

దిల్లీ: ఆన్‌లైన్‌లో రెస్టారెంట్ వివరాలు తెలిపే, ఆహార పదార్థాలు ఆర్డరు ఇచ్చేందుకు తోడ్పడుతున్న సంస్థ జొమాటో దేశంలోని మరో 25 నగరాల్లో కొత్తగా సేవలు ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. దీంతో మొత్తం 63 నగరాలకు సేవలు విస్తరించినట్లు అవుతోందని జొమాటో తెలిపింది. కొత్తగా సేవలు ప్రారంభించిన నగరాల్లో విజయవాడ, రాయ్‌పుర్, మధురై, జోధ్‌పూర్, త్రిసూర్, అజ్మీర్, మనాలి, గోరఖ్‌పూర్, మణిపాల్, ధర్మశాల, హరిద్వార్, జలంధర్, జమ్ము, రిషికేశ్, ముస్సోరి, ఉడుపి, కటక్, సిమ్లా, పాలక్కడ్, శ్రీనగర్ తదితర నగరాలు ఉన్నాయి. ప్రతి నెలా 1.9 కోట్ల మంది జొమాటో ద్వారా ఆహార పదార్థాల్ని ఆర్డర్ చేస్తున్నట్లు జొమాటో ప్రతినిధి ఓయ్‌టన్ కాలాపోవర్ తెలిపారు. ప్రస్తుతం 24 దేశాల్లో 5 కోట్ల మంది వినియోగదారులకు జొమాటో సేవలందిస్తోంది.



విక్రయానికి ఎయిరిండియా భవనం!

కొనుగోలు చేయనున్న జేఎన్‌పీటీ

దిల్లీ:రుణభారంతో సతమతమవుతున్న ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిరిండియా ఆస్తుల విక్రయానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ముంబయిలో కీలకమైన నారిమన్ పాయింట్‌లో సంస్థకు ఉన్న 23 అంతస్తుల భవనాన్ని, ప్రభుత్వరంగంలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్టు (జేఎన్‌పీటీ)కు అమ్మే విషయమై చర్చలు జరుపుతోంది. ఎయిరిండియాలో ప్రభుత్వ వాటా విక్రయ ప్రతిపాదన సఫలం కాకపోవడంతో, ఆస్తుల విక్రయాన్ని తలపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ సూత్రప్రాయ అనుమతితో, ఇందుకు విధి విధానాలు ఖరారు చేసేందుకు అంతర్ మంత్రిత్వ సంఘం ఏర్పాటైనట్లు సమాచారం. పౌర విమానయాన, నౌకాయాన శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉన్న సంఘం, భవనం విలువను అంచనా వేయనుంది. నారిమన్ పాయింట్‌లోని ఈ భవనం ఒకప్పుడు ఎయిరిండియా ప్రధాన కేంద్రం. ఎయిరిండియా భవన్‌గా ప్రాచుర్యం పొందిన ఈ నిర్మాణం, అత్యంత కీలక ప్రాంతంలో ఉండటంతో, మంచి ధర పలుకుతుందని తెలుస్తోంది. దీంతో ఎయిరిండియాకు నగదు కొరత కొంతైనా తీరే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎయిరిండియాలోని కొందరు మాత్రం ఈ భవన విక్రయ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

ఎస్‌బీఐ విదేశీ శాఖలు 9 మూసివేత!

దిల్లీ: విదేశీ కార్యకలాపాల హేతుబద్ధీకరణలో భాగంగా మరో 9 విదేశీ శాఖల మూసివేత ప్రక్రియ సాగుతోందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మేనేజింగ్ డైరెక్టర్ (రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) ప్రవీణ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఎస్‌బీఐకి దాదాపు 36 దేశాల్లో 190 విదేశీ శాఖలు ఉన్నాయి. 'ఎక్కువ శాతం శాఖల్లో మూలధనం కొరత ప్రధాన సమస్యగా మారింది. ఎక్కడైతే సద్వినియోగం అవుతుందో, అక్కడే ఎక్కువ మూలధనం వినియోగిస్తుంటాం. గత రెండేళ్లలో దాదాపు 6 విదేశీ శాఖలను మూసివేశాం. మరో 9 శాఖల మూసివేత ప్రక్రియ సాగుతోంది' అని గుప్తా వెల్లడించారు. అన్ని విదేశీ శాఖలకు పూర్తి స్థాయి కార్యాలయాలు లేవని, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో చిన్న శాఖలు ఉన్నాయని, అందువల్ల హేతుబద్ధీకరణ అవసరం ఏర్పడిందని చెప్పారు. ఆమోదయోగ్యం కాని ప్రాంతాల్లో వ్యాపారాలను మూసివేయాల్సిందిగా ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆర్థిక సేవల విభాగం ఆదేశించిందని, అయితే ఆదేశాల కంటే ముందే ఎస్‌బీఐ హేతుబద్ధీకరణ దిశగా అడుగులు వేసిందని వివరించారు. ఎస్‌బీఐ శాఖల మూసివేసినంత మాత్రాన, ఆ దేశాల నుంచి వైదొలగినట్లు కాదని, చిన్న పరిణామం కలిగిన శాఖలను మాత్రమే మూసివేస్తున్నామని, కొన్ని చోట్ల 2- 3 శాఖలను ఒకటిగా విలీనం చేస్తున్నట్లు గుప్తా వెల్లడించారు.

తెలుగు వెబ్‌సైట్లలో వాణిజ్య ప్రకటనలు

'గూగుల్ ఫర్ తెలుగు' గురించి వివరిస్తున్న రాజన్ ఆనందన్

వెసులుబాటు కల్పించిన గూగుల్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు వెబ్‌సైట్లలో ఉన్న సమాచారానికి అనుగుణంగా వాణిజ్య ప్రకటనలు కన్పించేలా గూగుల్ కొత్త సౌలభ్యాన్ని తీసుకొచ్చింది. భారతీయ భాషల్లో వెబ్‌సైట్లు, ఇంటర్నెట్ వినియోగదారులు పెరుగుతున్న నేపథ్యంలో దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే హిందీ, బెంగాలీ, తమిళ భాషల వెబ్‌సైట్లకు ఈ వెసులుబాటు ఉంది. గూగుల్ యాడ్‌వర్డ్స్, యాడ్‌సెన్స్ ద్వారా ఈ ప్రకటనలు ఇచ్చేవారికీ, డిజిటల్ మీడియా నడిపేవారికీ అనుకూలంగా ఉండటంతో పాటు, ప్రకటనలు లక్షిత వీక్షకులకు చేరే అవకాశం ఉండనుంది. దీనివల్ల తెలుగు డిజిటల్ మీడియా నిర్వాహకులకు అదనంగా రాబడి వచ్చేందుకు వీలవుతుందని గూగుల్ (దక్షిణాసియా, భారత్) ఉపాధ్యక్షుడు రాజన్ ఆనందన్ తెలిపారు. బుధవారం జరిగిన 'గూగుల్ ఫర్ తెలుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలుగులో బ్లాగులు, వెబ్‌సైట్లు నిర్వహిస్తున్న వారు యాడ్‌సెన్స్‌లోకి లాగిన్ అయి, ప్రపంచ వ్యాప్తంగా తమ వెబ్‌సైట్లకు ప్రకటనలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రాంతీయ భాషలో ఇంటర్నెట్ ఆధారంగా ఆదాయం సంపాదించాలనుకునే వారికి, అవకాశాల విషయంలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు ఇదో ముందడుగు అని పేర్కొన్నారు. మార్కెట్ సొల్యూషన్స్-ఇండియా డైరెక్టర్ శాలినీ గిరీశ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం భారతీయ భాషల్లో వెబ్‌సైట్లను చూస్తున్నవారి సంఖ్య 23.4కోట్ల వరకూ ఉందనీ, 2021 నాటికి 53.6కోట్లకు చేరొచ్చని అన్నారు. దేశంలో డిజిటల్ ప్రకటనలపై ఖర్చు చేస్తున్న మొత్తం రూ.13 వేల కోట్లపైనే ఉందన్నారు. ఇందులో ప్రాంతీయ భాషా ప్రకటనల వాటా 5% వరకూ ఉందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ ప్రాజెక్టుకు రూ.13కోట్లు

వాల్‌మార్ట్ ఫౌండేషన్ కేటాయింపులు

ఈనాడు, హైదరాబాద్: వర్షాధార భూముల్లో పండే పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించి, వాటికి మార్కెట్ పెంచే ఉద్దేశంతో వాల్‌మార్ట్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రాజెక్టు చేపట్టింది. దీనికోసం దాదాపు రూ.13.6కోట్లను (2 మిలియన్ డాలర్లు) కేటాయించనుంది. మొత్తం 6,100 మంది రైతులకు ఇది ఉపయోగపడనుంది. ఇందులో 2వేల మంది మహిళా రైతులు కూడా ఉంటారు. ఇక్రిశాట్‌తో కలిసి మెట్ట భూముల్లో తృణ ధాన్యాలు, పప్పు ధాన్యాల పంటల దిగుబడి వచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు, మేలైన వంగడాల విషయంలో రైతులకు అవగాహన కల్పించనున్నారు. దీంతోపాటు కొనుగోలుదారులకు కూడా మార్కెటింగ్ విషయంలో పాటించాల్సిన అంశాల గురించి వివరిస్తారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపాన్ని దూరం చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వాల్‌మార్ట్ వివరించింది. ప్రస్తుతం కేటాయించిన 2 మిలియన్‌లతో కలిసి గడిచిన ఆరు నెలల కాలంలో ఏపీలో 4 మిలియన్ డాలర్ల నిధులు కేటాయించినట్లు పేర్కొంది.

ఈసీజీసీకి రూ.2000 కోట్లు

ఎగుమతులపై బీమా కవరేజీ పెంచేందుకే

దిల్లీ: ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (ఈసీజీసీ)కు ప్రభుత్వం రూ.2,000 కోట్ల మూలధన సాయాన్ని ప్రకటించింది. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి సంస్థల (ఎంఎస్ఎంఈ) ఎగుమతులపై బీమా కవరేజీ పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకొంది. దీంతోపాటు జాతీయ ఎగుమతుల బీమా ఖాతా ట్రస్టు (ఎన్ఈఐఏ)కు రూ.1,040 కోట్ల గ్రాంట్‌ను (కార్పస్) మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకొంది. ఈ రెండు నిర్ణయాల్ని ప్రధాని మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం తీసుకుంది. ఈసీజీసీకి నిధులను మూడు ఆర్థిక సంవత్సరాలలో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2017-18కి రూ.50 కోట్లు, 2018-19లో రూ.1,450 కోట్లు, 2019-20లో రూ.500 కోట్లు సాయం చేయబోతోంది. 'ఎంఎస్ఎంఈల ఎగుమతుల బీమా కవరేజీని పెంచడంతోపాటు భారత్ ఎగుమతుల్ని బలోపేతం చేయడం, ఆఫ్రికా, కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ (సీఐఎస్), లాటిన్ అమెరికా దేశాలకు అధికంగా ఎగుమతులు ఉండేలా చేసేందుకు ఈ మూలధన సాయం ఉపయోగపడుతుంద'ని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.

సింగ్ సోదరుల నుంచి రూ.500 కోట్ల వసూలుకు చర్యలు

దిల్లీ

కంపెనీ నుంచి వ్యవస్థాపకులైన మల్వీందర్, శివిందర్ సింగ్ అక్రమంగా తరలించుకు పోయారని భావిస్తున్న రూ.500 కోట్ల వసూలుకు చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఫోర్టిస్ హెల్త్‌కేర్ తెలిపింది. బయటి సంస్థలతో జరిపిన స్వతంత్ర దర్యాప్తులో, కంపెనీ వ్యవస్థాపకులైన ఈ ఇద్దరు సోదరులు వ్యవస్థీకృత ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలిందని పేర్కొంది. బోర్డు అనుమతులు లేకుండా, సరైన పూచికత్తులు తీసుకోకుండా వీళ్లకు రుణాలు మంజూరు చేసినట్లు గుర్తించామని తెలిపింది. మల్వీందర్‌కు స్ట్రాటజిక్ ఇనీషియేటివ్స్‌కు లీడ్ బాధ్యతలు అప్పగించడాన్ని కూడా కంపెనీ రద్దు చేసింది. 2016 సెప్టెంబరులో ఆయనను ఈ పదవిలో నియమించారు. అలాగే ఈ హోదాలో ఆయనకు చెల్లించిన పారితోషికాన్ని కూడా వసూలు చేయనున్నారు. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా మల్వీందర్‌ను ఫోర్టిస్ అడగనుంది. ఆయన స్వాధీనంలో ఉన్న కంపెనీ ఆస్తులను కూడా తన అధీనంలోకి తీసుకోనుంది. దైచీ శాంక్యోకు అనుకూలంగా రూ.3,500 కోట్లు చెల్లించమంటూ దిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిన అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో బోర్డు డైరెక్టర్ల పదవులకు సింగ్ సోదరులు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సింగ్ సోదరులు కంపెనీ నుంచి నిధులు మళ్లించారనే ఆరోపణలపై ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ బయటి సంస్థకు దర్యాపు బాధ్యతను కంపెనీ అప్పగించింది. ఈ దర్యాప్తు నివేదికను సెబీ, తీవ్ర నేరాల దర్యాప్తు కార్యాలయానికి సమర్పించినట్లు ఫోర్టిస్ వెల్లడించింది.

శివిందర్

మల్వీందర్

ఫోర్టిస్‌కు పెరిగిన నష్టం

జనవరి- మార్చిలో రూ.914 కోట్లు

గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన ఫోర్టిస్ హెల్త్‌కేర్ నష్టం మరింత పెరిగి రూ.914.32 కోట్లకు చేరింది. 2016-17 ఇదే కాలంలో కంపెనీ రూ.37.52 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఇదే సమయంలో కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.1,123.43 కోట్ల నుంచి రూ.1,086.38 కోట్లకు తగ్గింది. 2017-18 పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఫోర్టిస్ నికర నష్టం రూ.934.42 కోట్లుగా నమోదైంది. 2016-17లో కంపెనీకి వచ్చిన నష్టం రూ.479.29 కోట్లు. మరోవైపు ఏకీకృత ఆదాయం కూడా రూ.4,573.71 కోట్ల నుంచి తగ్గి రూ.4,560.81 కోట్లకు పరిమితమైంది. కేటాయింపులతో పాటు దేశీయంగా, అంతర్జాతీయంగా వ్యాపారపరమైన సవాళ్లు కొనసాగడం కంపెనీ లాభదాయతపై ప్రతికూల ప్రభావం చూపిందని ఫోర్టిస్ హెల్త్‌కేర్ వెల్లడించింది. అలాగే జనవరి- మార్చిలో సుమారుగా రూ.580 కోట్ల వరకు కేటాయింపులు చేసింది. బకాయిలు తిరిగి వసూలు కాకపోవచ్చేమోననే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి జనవరి- మార్చి, పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక ఫలితాలను మే 30న ఫోర్టిస్ హెల్త్‌కేర్ ప్రకటించాల్సి ఉంది. అయితే అంతర్గత దర్యాప్తును కారణంగా చూపుతూ జూన్ 11వ తేదీకి వాయిదావేసింది. ఆ తర్వాత మళ్లీ ఫలితాల వెల్లడి తేదీని 25కు మార్చింది. రెండు రోజుల పాటు సమావేశాలు నిర్వహించి ఆఖరుకు ఫలితాలు వెల్లడించింది.

ఐటీ మార్జిన్లపై వీసా ప్రభావం

హెచ్-1బి నిబంధనల కఠినతరంపై ఇక్రా

ముంబయి: హెచ్-1బి వీసా నిబంధనలను అమెరికా కఠినతరం చేసినందున, దేశీయ ఐటీ కంపెనీల వ్యయాలు అధికమై, వాటి మార్జిన్లపై ప్రభావం పడుతుందని రేటింగ్స్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. వీసా ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు, అమెరికాలోని ఖాతాదారుల (ఆన్‌సైట్) వద్ద విధులు నిర్వర్తించేందుకు స్థానికులనే కంపెనీలు నియమించుకుంటున్నాయని, ఇందువల్ల సంస్థల నిర్వహణ వ్యయాలు పెరుగుతున్నాయని తెలిపింది. హెచ్-1బి వీసాలపై అధికంగా ఆధారపడిన సంస్థలపై తాజా ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. 'వీసా నిబంధనల్లో చేసిన మార్పుల వల్ల, కొన్ని ఉద్యోగ బాధ్యతలకు ప్రస్తుతం హెచ్-1బి వీసాలపై పంపుతున్న వారిని, ఇకపై పంపలేరు. తక్కువ నైపుణ్యం అవసరమైన ఉద్యోగాలకు అమెరికాలో స్థానికులనే నియమించుకోవాల్సి వస్తుంది' అని ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ ఉపాధ్యక్షుడు గౌరవ్ జైన్ పేర్కొన్నారు. అధిక నైపుణ్యం గలవారికి మాత్రమే వీసాలు జారీ చేసేలా అమెరికా నిబంధనలను కఠినతరం చేస్తుందని వివరించారు. హెచ్-1బి వీసాలపై ఆధారపడిన సంస్థల్లోని ఉద్యోగుల వేతనాలు, అక్కడి ఉద్యోగుల కంటే 25 శాతం తక్కువగా ఉన్నాయని, ఇకపై ఈ వ్యత్యాస భారం దేశీయ ఐటీ సంస్థలు వహించాల్సి వస్తుందన్నారు. అమెరికాలోని తమ పూర్తిస్థాయి సిబ్బందిలో 15 శాతం కంటే ఎక్కువ మంది హెచ్-1బి వీసా కలిగి ఉంటే, ఆ సంస్థలను వీసా ఆధారిత సంస్థలుగా వ్యవహరిస్తున్నారు. అధిక నైపుణ్యం కలిగిన వారికే ఈ వీసాలు జారీ చేయాలనుకుంటే, ఇకపై దేశీయ ఐటీ కంపెనీలకు ఇవి లభించే అవకాశాలు తగ్గుతాయని వివరించారు. హెచ్-1బి వీసాపై పనిచేస్తున్న ఉద్యోగుల భార్య/భర్తలకు ఇచ్చే హెచ్-4 వీసాల జారీని నిలిపివేయాలని అమెరికా ప్రతిపాదించడం వల్ల, ఆయా కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు.

సెన్సెక్స్ ▼ 273	35217	
నిఫ్టీ ▼ 98	10671	
డోజోన్స్ 24250 ▼ 33		
నాస్‌డాక్ 7493 ▼ 67		
రూపాయి 68.61 ▼ 37 పైసలు	(ఒక అమెరికా డాలరుకు)	
ముడి చమురు 77.79 ▲	(బ్రెంట్ ధర డాలర్లలో)	

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	27న	మార్పు %
TECH MAHINDRA	714.25	3.84
BHARTI INFRATEL	299.55	2.25
DR. REDDYS LAB	2293.80	1.18
HCL TECHN	921.05	1.17
HDFC BANK	2112.60	0.90
SUN PHARMA	576.90	0.69
CIPLA	602.30	0.47

గ్రహణం (-)

నిఫ్టీ	27న	మార్పు %
BPCL	382.80	-7.81
HPCL	276.60	-7.52
INDIAN OIL CORP	155.65	-6.68
GAIL (INDIA)	328.80	-3.79
ZEE ENTERTAINMENT	544.35	-3.14
ICICI BANK	279.05	-3.14
UPL	620.65	-2.99

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	62.30	72.24
పౌండ్ స్టెర్లింగ్	82.40	95.58
యూరో	72.64	84.26
జపనీస్ యెన్/100	56.67	65.72
ఆస్ట్రేలియా డాలరు	45.99	53.22
సింగపూర్ డాలరు	45.73	54.16
థాయ్ బాత్/100	188.78	225.78
బహ్రెయిన్ దీనార్	168.62	192.92
కువైట్ దీనార్	187.20	233.03
ఒమన్ రియాల్	165.12	189.01
సౌదీ రియాల్	16.57	19.63
యూఏఈ దిర్హమ్	16.96	19.81
మలేషియా రింగిట్	15.14	18.62
చైనీస్ యువాన్	7.35	11.92

బుధవారం నిఫ్టీ కదలికలు



నేటి మార్కెట్

సూచీలకు నష్టాలు కొనసాగే అవకాశం ఉంది. వాణిజ్య యుద్ధ భయాలతో అంతర్జాతీయ మార్కెట్లలో భారీగా అమ్మకాలు వెల్లువెత్తుతున్నాయి. మన మార్కెట్లు కూడా ఇదే బాటలో నడవొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బలహీన రూపాయి, ముడిచమురు ధరలు పెరగడం వంటివి దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. నేడు నిఫ్టీ 10620- 10750 పాయింట్ల శ్రేణిలో కదలాడే అవకాశం ఉందని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు నేటితో, ముగియనుండటంతో సూచీలు ఒడుదొడుకుల మధ్య ట్రేడవ్వొచ్చని అంటున్నారు. ఎన్ఎస్ఈలో ఉన్న 2063 షేర్లలో 369 షేర్లు 52 వారాల కనిష్ఠానికి చేరడం ప్రతికూల సంకేతమని బ్రోకరేజీ సంస్థలు విశ్లేషిస్తున్నాయి. ఐటీ, ఔషధ, ఎంపిక చేసిన ప్రైవేట్ బ్యాంకు షేర్లు మాత్రమే పెరుగుతున్నాయని, మదుపర్లు రక్షణాత్మక ధోరణితో, వృద్ధి ఆధారిత షేర్లను కొనుగోలు చేస్తున్నారని భావిస్తున్నారు. ముడిచమురు ధరలు పెరగడంతో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు డీలా పడొచ్చు.

అమ్మకాలు ముంచేశాయి

• అంతర్జాతీయ సంకేతాల ప్రభావం • 273 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ • 10700 దిగువకు నిఫ్టీ

దాదాపు అన్ని రంగాల షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు డీలాపడ్డాయి. రూపాయి 19 నెలల కనిష్ఠానికి చేరడం, ముడిచమురు ధరలు పెరగడం, అంతర్జాతీయ సంకేతాలు ప్రతికూలంగా మారడంతో నిఫ్టీ కీలక 10700 పాయింట్ల దిగువకు చేరింది. జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి అడుగేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక స్థిరత్వ నివేదికతో బ్యాంకింగ్ షేర్లు నష్టపోయాయి. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా షేర్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,543.89 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ.. ఇంట్రాడేలో 35,618.85 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. అనంతరం అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏదశలోనూ కోలుకోలేదు.. ఒకానొక దశలో 35,154.21 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. చివరకు 272.93 పాయింట్ల నష్టంతో 35,217.11 వద్ద ముగిసింది. ఈ నెల 6 తర్వాత సూచీకిదే అత్యల్ప ముగింపు. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 10,652.40 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 97.75 పాయింట్లు కోల్పోయి 10,671.40 దగ్గర స్థిరపడింది.

బ్యాంకింగ్ షేర్లు కుదేల్: బ్యాంకుల మొండి బకాయిలు మరింత పెరగొచ్చని రిజర్వు బ్యాంక్ అంచనా వేయడంతో బ్యాంకింగ్ షేర్లు కుదేలయ్యాయి. సిండికేట్ బ్యాంక్ 6.39%, యూకో బ్యాంక్ 4.22%, బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.75%, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 2.87%, బ్యాంక్ ఆఫ్ బరోడా 2.54% చొప్పున నష్టాలు నమోదు చేశాయి.

✦ కంపెనీ వాటాదార్లకు ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సిందిగా విశ్వప్రధాన్ కమర్షియల్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించడంతో ఎన్‌డీటీవీ షేర్లు దూసుకెళ్లాయి. బీఎస్ఈలో రూ.36 వద్ద ప్రారంభమైన షేరు.. మంగళవారం ముగింపుతో పోలిస్తే, అనుమతించిన గరిష్ఠ పరిమితి (అప్పర్ సర్క్యూట్) 20 శాతం పెరిగి, రూ.39 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 25 నష్టాలు చవిచూశాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 3.16%, ఎల్ అండ్ టీ 2.71%, టాటా మోటార్స్ 2.22%, ఎస్‌బీఐ 2.06%, పవర్‌గ్రిడ్ 1.75%, బజాజ్ ఆటో 1.58%, భారతీ ఎయిర్‌టెల్ 1.42%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.37%, ఎన్‌టీపీసీ 1.26%, యాక్సిస్ బ్యాంక్ 1.25%, ఓఎన్‌జీసీ 1.20%, టాటా స్టీల్ 1.11% చొప్పున డీలాపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోల్ ఇండియా, టీసీఎస్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా షేర్లు మాత్రం స్వల్పంగా రాణించాయి. రంగాల వారీ సూచీల్లో చమురు- గ్యాస్ అత్యధికంగా 3.81 శాతం కోల్పోయింది. పీఎస్‌యూ, మౌలిక, యంత్ర పరికరాలు, విద్యుత్, స్థిరాస్తి, వాహన, లోహ, బ్యాంకింగ్, ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ రంగాలు అదే బాటలో నడిచాయి. ఐటీ షేర్లు మాత్రం లాభపడ్డాయి.

మార్కెట్ కబుర్లు

✦ ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 సంస్థలకు డిజిటల్ సొల్యూషన్లు అందించే యూఎస్‌టీ గ్లోబల్‌లో మైనారిటీ వాటా తీసుకునేందుకు సింగపూర్ సార్వభౌమ పెట్టుబడి సంస్థ **టెమాసెక్ హోల్డింగ్స్** 250 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1650 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది.

✦ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి, సముద్ర ఆహార ఉత్పత్తుల సంస్థ **పెన్వర్ ప్రోడక్ట్స్** ముసాయిదా పేపర్లను సమర్పించింది.

✦ సూక్ష్మరుణ సంస్థ స్పందన **స్ఫూర్తి** కూడా ఐపీఓకు రానుంది. తాజాగా జారీ చేసే షేర్ల ద్వారా రూ.400 కోట్లు సమీకరించాలన్నది సంస్థ ప్రణాళిక. ప్రస్తుత వాటాదార్లకు చెందిన 1.31 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయిస్తారు.

✦ జర్మనీ వాహన తయారీ సంస్థలకు ఐటీ సేవలు అందించే వోల్ఫ్స్‌బర్గ్ కేంద్ర సంస్థ హెచ్ అండ్ డీ ఇంటర్నేషనల్ గ్రూప్‌ను 30 మిలియన్ యూరోల (సుమారు రూ.240 కోట్ల)కు కొనుగోలు చేసేందుకు తప్పనిసరిగా అమలయ్యే ఒప్పందం కుదుర్చుకున్నట్లు **హెచ్‌సీఎల్ టెక్నాలజీస్** తెలిపింది.

✦ కర్ణాటకలోని విజయనగర్ ప్లాంటు వార్షిక సామర్థ్యాన్ని 12 మిలియన్ టన్నుల నుంచి 13 మిలియన్ టన్నులకు పెంచేందుకు రూ.7500 కోట్లు వెచ్చిస్తామని **జేఎస్‌డబ్ల్యు స్టీల్** తెలిపింది. 2020 మార్చి కల్లా ఇది పూర్తవుతుందని తెలిపింది.

✦ రుణ ఊబిలో కూరుకుపోయిన ఉక్కు కంపెనీ **ఎలక్ట్రోస్టీల్** డీలిస్టింగ్ ప్రక్రియపై స్టే విధించేందుకు జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) తిరస్కరించింది. ఎలక్ట్రోస్టీల్‌ను వేదాంతా కొనుగోలు చేయనుండగా, తాజా పిటిషన్‌ను రెనైసెన్స్ స్టీల్ దాఖలు చేసింది.

✦ రూ.1955 కోట్ల సమీకరణకు వాహన విడిభాగాల తయారీ సంస్థ **వారాక్ ఇంజినీరింగ్** జారీచేసిన పబ్లిక్‌ఇష్యూ రెండో రోజున 1.02 రెట్ల స్పందన లభించింది.

✦ విద్యుత్ వాహనాల్లో ఉపయోగించే లిథియమ్-అయాన్ బ్యాటరీల ఉత్పత్తి కోసం, స్విట్జర్లాండ్‌కు చెందిన లెక్లాంచెతో సంయుక్త సంస్థ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు **ఎక్సైడ్ ఇండస్ట్రీస్** ప్రకటించింది.

✦ ఐటీ దిగ్గజ సంస్థ **ఇన్ఫోసిస్** 2018-19 తొలి త్రైమాసిక ఫలితాలను జులై 13న ప్రకటించబోతున్నట్లు తెలిపింది.

కిమ్స్ ఆసుపత్రిలో రూ.890 కోట్ల పెట్టుబడి

• వాటా కొనుగోలు చేసిన జనరల్ అట్లాంటిక్

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ ఈక్విటీ పెట్టుబడుల సంస్థ జనరల్ అట్లాంటిక్ హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ఆసుపత్రిలో దాదాపు రూ.890 కోట్ల (130 మిలియన్ డాలర్ల)తో వాటా కొనుగోలు చేసింది. ఇందులో మూలధన పెట్టుబడి, ఇతరుల నుంచి వాటా కలిసి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలను అందిస్తోన్న ఈ సంస్థను 2004లో డాక్టర్ భాస్కర రావు స్థాపించారు. ప్రస్తుతం ఇది దక్షిణ భారత దేశంలో 7 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్వహిస్తోంది. వీటిలో 2,500 పడకలున్నాయి. తాజా పెట్టుబడితో ముందు మరింత విస్తరణకు తమకు అవకాశం కలిగిందని కిమ్స్ ఎండీ, సీఈఓ భాస్కర రావు అన్నారు. వైద్య సేవలు సరిగా అందని ప్రాంతాలకు విస్తరించి, సంస్థ బలోపేతం అయ్యేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. జనరల్ అట్లాంటిక్ మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా, ఆసియా పసిఫిక్ హెడ్ సందీప్ నాయక్ మాట్లాడుతూ.. నాణ్యమైన వైద్య చికిత్సకు అవసరమైన వసతులు సరిగా లేకపోవడం, ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో, ఈ రంగంలో మంచి సేవలనందించే కార్పొరేట్ హాస్పిటళ్లకు అవకాశాలు పెరిగాయన్నారు. ఈ పరిస్థితులను అనుకూలంగా మార్చుకునేందుకు కిమ్స్‌కు అవకాశాలున్నాయని విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

సెంచురీ మ్యాట్రెసెస్‌కు భారీ ఆర్డరు

ఈనాడు, హైదరాబాద్: పరుపుల తయారీ సంస్థ సెంచురీ మాట్రెసెస్‌కు కర్ణాటక ప్రభుత్వం నుంచి భారీ ఆర్డరు లభించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని కర్ణాటక రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సొసైటీ 83వేల పరుపులను కొనుగోలు చేయనుంది. దీంతోపాటు 86వేల దిండ్లు కూడా సెంచురీ సరఫరా చేయనుంది. ఈ పరుపులను మెదక్ జిల్లాలోని జిన్నారం ప్లాంటులో తయారు చేయనున్నట్లు, అక్టోబరు నాటికి అందించనున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలాని తెలిపారు.



27న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	382	వరంగల్	384
చిల్లరగా(ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	390
బెంగళూరు	429	చెన్నై	457
28వ తేదీకి		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	378	నమక్కల్	440

వందేమాతరానికీ మతాన్ని ఆపాదిస్తారా?

దేశ విభజనకి కాంగ్రెస్సే కారణం: అమిత్ షా

కోల్‌కతా: వందేమాతరానికీ మతం రంగు పులిమేందుకు కొందరు ప్రయత్నించారని భాజపా అధ్యక్షుడు అమిత్‌షా ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ లొంగిపోయిందనీ, దేశ విభజనకూ ఆ పార్టీయే కారణమని నిందించారు. బుధవారం కోల్‌కతాలో ఆయన- వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయ మొదటి స్మారకోపన్యాసం ఇచ్చారు. 'వందేమాతరం గేయం మన దేశ భౌగోళిక, సాంస్కృతిక జాతీయవాదానికి ప్రతీక. దానికీ మతాన్ని పులమడం తప్పు. దానిని ఒక మతానికి చెందినదిగానో, ఎవరికో వ్యతిరేకమైనదిగానో పరిగణించకూడదు. వందేమాతరానికి మతం రంగునిచ్చి కాంగ్రెస్ తప్పు చేసింది. స్వాతంత్ర్యానికి పూర్వం రెండు తాత్కాలిక ప్రభుత్వాలను కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. వందేమాతరాన్ని జాతీయ గేయంగా తీసుకున్నా, దానిలో మొదటి రెండు చరణాలనే పాడించడం ద్వారా ఒక వర్గాన్ని బుజ్జగించింది. ఆ తప్పును కాంగ్రెస్ చేయకపోతే 1947లో దేశం విడిపోయేదే కాదు' అని షా చెప్పారు.

రూ.120కోట్ల పన్ను ఎగవేత

• తప్పుడు బిల్లులు, వివరాల నమోదుతో వ్యాపారుల లావాదేవీలు

ఈనాడు, అమరావతి: వస్తు సేవల పన్ను విధానం అమల్లోకి వచ్చి ఏడాది కావొస్తున్నా కొందరు వ్యాపారులు పన్నును ఎగవేసేందుకే ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 140 వ్యాపార సంస్థల్లో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు జరిపిన తనిఖీల్లో వివిధ సంస్థలు సుమారు 120 కోట్ల రూపాయల మేర పన్ను ఎగవేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఇందులో 31 మంది వ్యాపారుల నుంచి రూ.18.86 కోట్లను పన్ను, జరిమానా కింద వసూలు చేశారు.

★ నెల్లూరు సర్కిల్-3 పరిధిలో ఓ మల్టీప్లెక్స్ థియేటర్ యాజమాన్యం వ్యాపార, క్యాంటీన్ నిర్వహణ, పార్కింగ్ ఛార్జీల విషయమై రిటర్నులను దాఖలు చేయలేదని గుర్తించారు. పన్ను, వడ్డీ, ఇతర చర్యల కింద కలిపి రూ.3.29కోట్ల వరకు చెల్లించాలని పేర్కొంటూ సంజాయిషీ నోటీసు జారీ చేశారు. ఈ జిల్లాలో పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న ప్రాంతంలో ఉద్యోగులకు ఆహారాన్ని పంపిణీ చేసే ఓ సంస్థ రూ.1.50 కోట్లు, జీఎస్టీ, వ్యాట్ కింద రూ.2.44కోట్లను చెల్లించలేదు.

★ ప్రకాశం జిల్లా బల్లికురవలో రెండు నకిలీ గ్రానైట్ సంస్థలకు చెందిన వారు తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ తీసుకున్నారు. మూడు కోట్ల రూపాయల మేర లావాదేవీలను నిర్వహించి పన్నును చెల్లించలేదు.

★ విశాఖలోని ఓ మిల్లు యాజమాన్యం జులై 2017 నుంచి 2018 జనవరి రూ.15 కోట్లకు సంబంధించిన రిటర్నులను దాఖలు చేయలేదు.

★ విజయవాడలో ఇప్పటికీ విక్రయించిన వస్తువులు, సేవలకు తగిన బిల్లులు ఇవ్వడం లేదు. అతిథ్య రంగంలో ఇది ఎక్కువగా జరుగుతోంది.

★ తిరుపతిలో రూ.7.60కోట్ల అమ్మకపు పన్నును చెల్లించనందుకు ఓ ఇంధన సంస్థపై అధికారులు చర్యలు తీసుకున్నారు.

100%అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది

ఎగవేతకు పాల్పడిన వ్యాపారుల నుంచి పన్నుతో పాటు 100% వరకు అపరాధ రుసుం, సంవత్సరానికి 18% వడ్డీని చెల్లించాల్సి ఉంటుందని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ శ్యామలరావు స్పష్టం చేశారు. పన్ను ఎగవేతకు పాల్పడిన వారు స్వచ్ఛందంగా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నును వెంటనే చెల్లించకుంటే తగిన చర్యలు ఉంటాయని బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

పాత్రికేయుల ఇళ్ల విషయంలో విధివిధానాలు ప్రకటించాలి

అమరావతిలో గృహ సముదాయంపై ఏపీబీజేఏ డిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: జర్నలిస్టుల గృహ సముదాయంపై ఏపీ ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించాలని ఏపీ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టు అసోసియేషన్(ఏపీబీజేఏ) డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.అంజనేయులు, ఎన్ఏజే ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి కొండయ్య, ఏపీబీజేఏ రాష్ట్ర కన్వీనర్ బి.రాధాకృష్ణ, హైదరాబాద్ కమిటీ కార్యదర్శి రవికిరణ్ తదితరులు సమావేశమయ్యారు. పాత్రికేయుల ఇళ్ల కోసం ప్రభుత్వం రూ.వంద కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా.. ఇప్పటికీ దానిపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన వాయిస్ ఓవర్, వీడియో ఎడిటర్లు, గ్రాఫిక్ డిజైనర్లకూ అక్రిడేషన్లు ఇస్తామని జీఓలో పొందుపర్చినా దాన్ని విడుదల చేయలేదని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో పనిచేస్తూ ఏపీ అక్రిడేషన్ ఉన్నవారి విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు జులై 4న ఏపీ సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడించనున్నట్లు నిర్ణయించారు.

తెలంగాణ విభాగం ఏర్పాటు...: ఏపీ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నుంచి విడిపోయి తెలంగాణ శాఖ ఏర్పడినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ శాఖకు కన్వీనర్‌గా జ్యోతి, కో కన్వీనర్‌గా రాధిక పేర్లను ప్రకటించారు. తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో జులై 12న ప్రెస్‌క్లబ్‌లో మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేశానికి నేతలు కాదు.. విధానాలే ముఖ్యం

• సీతారాం ఏచూరి

నెల్లూరు, న్యూస్‌టుడే: దేశానికి నేతలు కాదు.. మంచి విధానాలే ముఖ్యమని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ మార్గాల కోసం ప్రజలందరూ ఏకమై కృషిచేయాలని ఉద్ఘాటించారు. బుధవారం రాత్రి నెల్లూరులో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం ఏర్పాటు- ఆవశ్యకతపై బహిరంగసభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లలిత్ మోదీ, నీరవ్‌మోదీ కలిసి దేశాన్ని లూఠీ చేస్తున్నారని అన్నారు. మోదీ నాలుగేళ్లలో తన ప్రచారానికి రూ.4.5 వేల కోట్లు ఖర్చు పెట్టారని ఎద్దేవా చేశారు. పెద్ద నోట్ల రద్దుతో ఉగ్రదాడులు తగ్గుతాయని తెలిపినా.. దేశంలో దానికి విరుద్ధంగా జరుగుతోందని, ఇటీవల కశ్మీర్ ఉదంతమే ఉదాహరణ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు తగ్గుముఖం పడుతుంటే మన దేశంలో మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయని వివరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్ల కాలంలో తెదేపా చేసింది ఏమీ లేదన్నారు. ప్రత్యేక హోదా అవసరం లేదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుతం దాని కోసం దొంగ ఉద్యమాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి రాజగోపాల్‌పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి, వేదికపై నేతలు పి.మధు, వి. శ్రీనివాసరావు తదితరులు

ఆర్థిక కార్యకలాపాలపై మహిళలకు శిక్షణ

• లెర్నింగ్ లింక్స్ సంస్థతో రాష్ట్ర మెప్మా అవగాహనా ఒప్పందం

ఈనాడు అమరావతి: పట్టణ ప్రాంతాల్లోని సుమారు 2లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు సంవత్సరం పాటు ఆర్థిక కార్యకలాపాల నిర్వహణపై శిక్షణనివ్వనున్నారు. ఇందుకు ముందుకొచ్చిన లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్(ఎల్ఎల్ఎఫ్)తో రాష్ట్ర పురపాలక శాఖ పరిధిలోని మెప్మా(పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన మిషన్-ఎంఈపీఎంఏ) బుధవారం అవగాహనా ఒప్పందం చేసుకుంది. పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆధ్వర్యంలో మెప్మా ఎండీ చినతాతయ్య, ఎల్ఎల్ఎఫ్ ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. మంత్రి మాట్లాడుతూ... 2020నాటికి పట్టణాల్లోని ప్రతి పేద కుటుంబానికి నెలకు రూ.10వేలు ఆదాయాన్ని ఆర్జించేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

కొరియా తొలి గోల్

1938 తర్వాత..

● ప్రస్తుత టోర్నీతో కలిపి గత ఐదు ప్రపంచకప్‌ల్లో డిఫెండింగ్ ఛాంపియన్ గ్రూప్ దశ లోనే నిష్క్రమించడం ఇది నాలుగోసారి. 2002లో ఫ్రాన్స్, 2010లో ఇటలీ, 2014లో స్పెయిన్ తొలి దశలోనే నిష్క్రమించాయి.

● 1938 ప్రపంచకప్‌లో జర్మనీ తొలిసారి గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. మళ్లీ ఇప్పుడే నాకౌట్ చేరకుండా ఇంటిముఖం పట్టింది.

● ప్రపంచకప్‌లో ఒక ఆసియా జట్టు చేతిలో జర్మనీ ఓడటం ఇదే తొలి సారి. దక్షిణ కొరియా జర్మనీని ప్రపంచకప్‌లో ఓడించడం కూడా ఇదే తొలిసారి. గతంలో ఆ జట్టుతో తలపడ్డ రెండుసార్లూ ఓడింది.

2 జర్మనీ ఈ ప్రపంచకప్‌లో కొట్టిన గోల్స్. ఒక డిఫెండింగ్ ఛాంపియన్ కొట్టిన అతి తక్కువ గోల్స్ జాబితాలో ఇది రెండో స్థానం. 1998 విజేత ఫ్రాన్స్ తర్వాతి టోర్నీలో ఒక్క గోల్ కూడా కొట్టలేదు.

"నేను షాకయ్యాను. కొరియా జట్టుపైనా మేం గెలవలేకపోయాం. ఇలాంటి ఆటతో ఎలా ముందుకెళ్లగలం? దీనిపై మేం ప్రశాంతంగా కూర్చుని మాట్లాడుకోవాలి. ఇప్పుడు ఇంతకుమించి ఏమీ మాట్లాడలేను. మా నిష్క్రమణ నన్ను మామూలుగా నిరుత్సాహపరచలేదు" – **జోకిమ్ లూ**

సున్నా నుంచి మొదలు.. ఒకటి రెండు మూడు.. పది ఇరవై ముప్పై.. నిమిషాలు వేగంగా గడిచిపోతున్నాయి.. ప్రథమార్ధం అయిపోయింది. రెండో అర్ధం మొదలైంది. అదీ వడివడిగా సాగిపోతోంది. సమయం వేగంగా కరిగిపోతోంది. ఒక్క గోల్.. ఒక్క గోల్.. అంటూ ఉత్కంఠతో ఊగిపోతున్నారు ఛాంపియన్ జట్టు అభిమానులు. చూస్తుండగానే నిర్ణీత సమయం ముగిసిపోయింది. ఇంజురీ సమయం మొదలైంది. దడేల్.. దడేల్.. ఒకటికి రెండు బుల్లెట్లు దిగాయి. కానీ అవి జర్మనీ పేల్చినవి కావు. జర్మనీని పేల్చేసినవి! ఖేల్ ఖతం.. దుకాణం బంద్! ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కథ ముగిసింది.

కన్నీట జర్మనీ

● గ్రూప్ దశలోనే ఛాంపియన్ ఔట్
● ఇంటిముఖం పట్టించిన కొరియా
● స్వీడన్, మెక్సికో ముందుకు

కజన్

స్పెయిన్ నిలిచింది. పోర్చుగల్ బతికిపోయింది. అర్జెంటీనా కూడా గట్టెక్కింది. ఇలా పెద్ద జట్లు ఒక్కొక్కటే గండాల్ని దాటేశాయి. కానీ వీటన్నింటినీ మించిన మేటి జట్టు.. ప్రపంచకప్‌లో ఘనచరిత్ర ఉన్న రారాజు.. డిఫెండింగ్ ఛాంపియన్ కూడా అయిన జర్మనీ మాత్రం గ్రూప్ దశలోనే చతికిలబడింది. అనూహ్య రీతిలో తొలి దశలోనే ప్రపంచకప్ నుంచి ఔట్ అయిపోయింది.

2006 ఛాంపియన్ ఇటలీ 2010లో గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. 2010 విజేత స్పెయిన్ 2014లోనూ అదే ఫలితాన్నందుకుంది. ఈసారి టోర్నీ తొలి మ్యాచ్ లోనే మెక్సికో చేతిలో షాక్ తిన్న జర్మనీకి కూడా ఇదే గతి పడుతుందా అన్న సందేహాలు వెంటాడుతున్నప్పటికీ.. విశ్లేషకులందరూ ఈసారి కూడా హాట్ ఫేవరెట్‌గా పరిగణించిన జట్టు పుంజుకోకపోతుందా అని ఆశించారు అభిమానులు.

కానీ వారి ఆశ ఫలించలేదు. జర్మనీ ఆట మెరుగుపడలేదు. ఛాంపియన్ బృందం ఒక సామాన్య జట్టులా చేష్టలుడిగిన వేళ.. దాని ముందు పసికూన అనదగ్గ దక్షిణ కొరియా చెలరేగిపోయింది. ఎంత ఘనంగా గెలిచినా ముందంజ వేయమని తెలిసినా.. ఇది జీవిత కాల మ్యాచ్ అన్నట్లుగా కొరియన్ జట్టు చెలరేగింది. జర్మనీని ముంచేసింది. 1938 తర్వాత జర్మనీ ప్రపంచకప్ గ్రూప్ దశలో నిష్క్రమించడం ఇదే తొలిసారి.

గత రెండు పర్యాయాలుగా సాగుతున్న ఆనవాయితీని కొనసాగిస్తూ ఈసారి కూడా డిఫెండింగ్ ఛాంపియన్ ప్రపంచకప్ నుంచి తొలి దశలోనే నిష్క్రమించింది. మెక్సికో చేతిలో పరాభవంతో టోర్నీని ఆరంభించి.. మధ్యలో స్వీడన్‌పై అతి కష్టం మీద గట్టెక్కిన జర్మనీ.. నాకౌట్ చేరాలంటే తప్పక గెలవాల్సిన చివరి మ్యాచ్‌లో 0-2తో దక్షిణ కొరియా చేతిలో షాక్ తింది. మూడు మ్యాచ్‌ల్లో కలిపి మూడు పాయింట్లే సాధించిన ఆ జట్టు.. గ్రూప్-ఎఫ్‌లో కొరియా కంటే కింద అట్టడుగు స్థానంలో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించడం గమనార్హం. మెక్సికో (6), స్వీడన్ (3), జర్మనీ (3) నాకౌట్ రేసులో ఉండగా.. కొరియా (0)ముందే పోటీ నుంచి నిష్క్రమించిన స్థితిలో చివరి రౌండ్ మ్యాచ్‌లు మొదలయ్యాయి. ఒకే సమయంలో జర్మనీ-కొరియా, మెక్సికో-స్వీడన్ మ్యాచ్‌లు ఆరంభమయ్యాయి. రెండు మ్యాచ్‌ల్లోనూ ప్రథమార్ధంలో గోల్స్ నమోదు కాలేదు. ఐతే మేటి ఆటగాళ్లయిన జర్మన్లు రెండో అర్ధంలో చెలరేగిపోతారని ఆశించారందరూ. కానీ రెండో అర్ధంలోనూ వారికి శూన్య హస్తమే మిగిలింది. మరోవైపు మెక్సికోపై స్వీడన్ ఆటగాళ్లు చెలరేగిపోయారు. 14 నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్ కొట్టేశారు. 50వ నిమిషంలో ఆగస్టిన్‌సన్, 62వ నిమిషంలో గ్రాంక్విస్ట్ (పెనాల్టీతో), 74వ నిమిషంలో అల్వారెజ్ గోల్స్ కొట్టారు. స్వీడన్ తొలి గోల్ కొట్టగానే జర్మనీ అభిమానుల్లో ఆందోళన. అప్పటికి స్వీడన్, మెక్సికోలను దాటాలంటే జర్మనీ రెండు గోల్స్ కొట్టాలి. అప్పుడే ఆ జట్టు నాకౌట్ బెర్తు సాధించే వీలుంటుంది. కానీ స్వీడన్ రెండో గోల్ కొట్టడంతో జర్మనీకి పరిస్థితి కొంత సానుకూలంగా మారింది. అప్పుడా జట్టు ఒక్క గోల్ కొట్టినా గోల్ తేడాలో మెక్సికోను వెనక్కి నెట్టి ముందంజ వేసేందుకు అవకాశముండేది. స్వీడన్ మూడో గోల్ కొట్టాక కూడా అదే పరిస్థితి. కానీ గోల్ కోసం జర్మనీ నిరీక్షణ ఎంతకీ ఫలించలేదు. అర్జెంటీనాలా చివరి నిమిషాల్లో గోల్ కొడుతుందేమో అన్న ఆశ కూడా ఫలించలేదు. కనీసం ఇంజురీ సమయంలో అయినా గోల్ నమోదవుతుందేమో అని చూస్తే రివర్స్‌లో షాక్ మీద షాక్ తగిలింది. 93వ నిమిషంలో కొరియా ఆటగాడు కిమ్ గోల్ కొట్టి జర్మనీని విస్మయానికి గురి చేశాడు. తర్వాతైనా జర్మనీ ఏదైనా అద్భుతం చేస్తుందేమో అని చూస్తే.. మరింతగా చేష్టలుడిగింది. 96వ నిమిషంలో జర్మనీ గోల్ కీపర్ న్యూర్ మైదానం మధ్యలో ఉండగా.. సన్ బంతిని చేజిక్కించుకుని అతడిని దాటి ముందుకు దూసుకొచ్చి అలవోకగా గోల్ కొట్టేశాడు. అంతే.. జర్మనీ ఆటగాళ్లలో, అభిమానుల్లో నిర్వేదం. స్వీడన్ (6), మెక్సికో (6) తొలి రెండు స్థానాలతో గ్రూప్ నుంచి నాకౌట్ చేరగా.. కొరియా, జర్మనీ నిష్క్రమించాయి.

నిరాశలో జర్మనీ ఆటగాళ్లు

దక్షిణ కొరియా	2	జర్మనీ	0
కిమ్ (90+3), సన్ (90+6)			

స్వీడన్	3	మెక్సికో	0
ఆగస్టిన్‌సన్ (50), గ్రాంక్విస్ట్ (62), అల్వారెజ్ (74)			

గ్రూప్–ఎఫ్	మ్యా	గె	డ్రా	ఓ	పా
స్వీడన్	3	2	0	1	6
మెక్సికో	3	2	0	1	6
ద.కొరియా	3	1	0	2	3
జర్మనీ	3	1	0	2	3

ప్రపంచకప్‌లో ఈనాడు

జపాన్	గ్రూప్-హెచ్ × సా॥ 7.30	పోలెండ్
సెనెగల్	గ్రూప్-హెచ్ × సా॥ 7.30	కొలంబియా
పనామా	గ్రూప్-జి × రాత్రి 11.30	ట్యునీషియా
ఇంగ్లాండ్	గ్రూప్-జి × రాత్రి 11.30	బెల్జియం

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

నాకౌట్లో అడుగుపెట్టాలంటే అర్జెంటీనాకు విజయం తప్ప మరోదారి లేదు. మెస్సి త్వరగానే ఓ గోల్ కొట్టి ఆ జట్టును ఆనందంతో ముంచెత్తాడు. కానీ స్కోరు సమం చేసింది నైజీరియా.

అంతే.. అర్జెంటీనా వేదన మొదలైంది. ఎంతగా పోరాడినా, ఎంతగా కష్టపడ్డా ఆ గెలుపు గోల్ రావట్లేదు. ముగింపు దగ్గరపడుతోంది. అలాగే ప్రపంచకప్ నుంచి నిష్క్రమించే ముప్పు కూడా. నైజీరియా అభిమానులు సంబరాలు చేసుకుంటుంటే.. అర్జెంటీనా అభిమానుల్లో దుఃఖం తన్నుకొస్తోంది. ఇక అర్జెంటీనా ఔటే అన్న నిర్ణయానికొచ్చారంతా!

..కానీ ఓ అద్భుతం. అన్ని ప్రతికూలతలను అధిగమిస్తూ అర్జెంటీనా బతికిపోయింది. ఉత్కంఠను, ఒత్తిడిని, తరుముకొస్తున్న నిరాశను జయిస్తూ 86వ నిమిషంలో మార్కస్ రొజో మాయ చేశాడు. కళ్లు చెదిరే గోల్‌తో అర్జెంటీనాకు గెలుపు గోల్‌ను అందించాడు. ఆ జట్టు ప్రపంచకప్ ఆశలను సజీవంగా ఉంచాడు.

గ్రూప్–డి	మ్యా	గె	డ్రా	ఓ	పా
క్రొయేషియా	3	3	0	0	9
అర్జెంటీనా	3	1	1	1	4
నైజీరియా	3	1	0	2	3
ఐస్‌లాండ్	3	0	1	2	1

అర్జెంటీనా బతికిపోయింది

● ఆఖర్లో రొజో అద్భుతంతో నాకౌట్లోకి
● నైజీరియాపై 2–1తో విజయం

అర్జెంటీనా గెలుపు గుర్రాలు మెస్సి, రొజో

సెయింట్ పీటర్స్‌బర్గ్

రెండుసార్లు ఛాంపియన్ అర్జెంటీనా ప్రపంచకప్ నాకౌట్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితంగా జరిగిన గ్రూప్-డి ఆఖరి మ్యాచ్‌లో 2-1తో నైజీరియాపై విజయం సాధించింది. మొదట మెస్సి (14వ) గోల్ కొట్టి అర్జెంటీనాను ఆధిక్యంలోకి తీసుకెళ్లగా.. ఆశలు అడుగంటిపోయిన స్థితిలో మార్కస్ రొజో స్కోర్ చేసి ఆ జట్టును విజయపథంలో నడిపించాడు. నైజీరియా తరపున నమోదైన ఏకైక గోల్‌ను మోసెస్ (51వ నిమిషం, పెనాల్టీ) సాధించాడు. బంతిని ఎక్కువ భాగం తన నియంత్రణలో ఉంచుకున్నా, ఎక్కువగా దాడులు చేసినా అర్జెంటీనాకు చెమటోడ్చక తప్పలేదు. ఈ మ్యాచ్‌ను కనీసం డ్రాగా ముగించినా నైజీరియా ముందంజ వేసేది. అర్జెంటీనా.. గ్రూప్ నుంచి రెండో స్థానంతో నాకౌట్లో అడుగు పెట్టింది. ప్రిక్వార్టర్స్‌లో ఫ్రాన్స్‌ను ఢీకొంటుంది.

పెనాల్టీ దెబ్బ..

ప్రథమార్ధంలో మెస్సి గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన అర్జెంటీనా ద్వితీయార్ధంలో ఇబ్బంది పడింది. మరోవైపు నైజీరియా పుంజుకుంది. ఓ గోల్ ఆధిక్యంతో సాఫీగా సాగుతున్న దశలో ఆ జట్టుకు పెద్ద షాక్. మస్చెరానో... లియోన్ బాలోగన్‌ను బాక్స్‌లో కింద పడేయడంతో 51 నిమిషంలో నైజీరియాకు పెనాల్టీ లభించింది. మోసెస్ దాన్ని సద్వినియోగం చేయడంతో స్కోరు సమమైంది. నైజీరియా ఎదురుదాడిని కొనసాగించగా.. అర్జెంటీనా ఆటలో పదును తగ్గిపోయింది. మెస్సిలో జోరు తగ్గింది. అర్జెంటీనా ప్రయత్నాలను నైజీరియా రక్షణశ్రేణి సమర్థంగానే అడ్డుకుంది. తిరిగి ఆధిక్యంలోకి వెళ్లేందుకు అర్జెంటీనా తీవ్రంగా ప్రయత్నించింది. కానీ ముగింపు దగ్గరపడుతున్నా ఆ ఒక్కటి సాధించడం మాత్రం చాలా కష్టమే అయింది. అర్జెంటీనాలో ఆందోళన మొదలైంది. కానీ ఆశలు అడుగంటుతున్నప్పుడు రొజో అద్భుతం చేశాడు. గోల్ సాధించాడు.

మురిపించిన మెస్సి

టోర్నీలో ముందంజ వేయాలంటే గెలుపు తప్పని సరి. మొదటి రెండు మ్యాచ్‌ల్లో పేలవ ప్రదర్శనతో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన అర్జెంటీనా విజయానికి హామీ ఏమీ లేదు. స్టార్ ఆటగాడు మెస్సి పరిస్థితి కూడా గొప్పగా లేదు. ఐస్‌లాండ్‌పై పెనాల్టీని కూడా పోగొట్టాడు. ఈ నేపథ్యంలో సెయింట్‌పీటర్స్‌బర్గ్ స్టేడియంలో బరిలోకి దిగింది అర్జెంటీనా. ఐతే మెస్సి ఈసారి అదిరే ప్రదర్శన చేశాడు. 14వ నిమిషంలోనే జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. బనాగీ చక్కని పాస్‌తో అతడికి సహకరించాడు. నైజీరియా బాక్స్‌లోకి దూసుకొచ్చిన మెస్సి.. డిఫెండర్ల మీదుగా బనాగీ కచ్చితంగా తన వద్దకు ఇచ్చిన బంతిని ఛాతీతో నియంత్రించి, గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ నెట్లోకి తన్నేశాడు. ఈ ప్రపంచకప్‌లో మెస్సికి ఇదే తొలి గోల్. నైజీరియా మాత్రం పెద్దగా అవకాశాలు సృష్టించుకోలేదు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి అర్జెంటీనా కాస్త నెమ్మదించినా ఆధిక్యాన్ని నిలుపుకుంది. చాలా సౌకర్యంగానే కనిపించింది.

అర్జెంటీనా	2	నైజీరియా	1
మెస్సి (14వ), మార్కస్ రొజో (86వ)		మోసెస్ (51వ)	

అర్జెంటీనా 2
నైజీరియా 1

హీరో రొజో..

ఆధిక్యం కోసం అర్జెంటీనా చేస్తున్న ప్రయత్నాలు ఫలించట్లేదు. మ్యాచ్ 86వ నిమిషంలో అడుగుపెట్టింది. నైజీరియా నాకౌట్ అవకాశాలు మరింత మెరుగయ్యాయి. ఆ జట్టు ముందంజ వేయడం దాదాపు లాంఛనమేనని అనిపిస్తున్న ఆ దశలో అర్జెంటీనాకు డిఫెండర్ మార్కస్ రొజో ఆపద్బాంధవుడయ్యాడు. ఉత్కంఠ పరిస్థితుల్లో కళ్లు చెదిరే గోల్‌తో హీరోగా నిలిచాడు. మరో డిఫెండర్ గాబ్రియెల్ మార్కడో నుంచి కచ్చితంగా తన దగ్గరకు వచ్చిన క్రాస్‌ను చక్కని కిక్ వలలోకి పంపాడు. అంతే ప్రాణం లేచొచ్చిన అర్జెంటీనా ఆటగాళ్ల ఆనందానికి అంతే లేకుండా పోయింది. తన వీపుపైకి ఎక్కిన మెస్సిని మోస్తూ రొజో సంతోషంతో పరుగందుకున్నాడు. అర్జెంటీనా అభిమానులూ భారీ ఎత్తున సంబరాలు చేసుకున్నారు. అర్జెంటీనా కడవరకూ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది.

క్రొయేషియా	2	ఐస్‌లాండ్	1
బదెల్జ్ (53వ), పెరిసిచ్ (90వ)		సిగర్డ్సన్ (76వ)	

నాకౌట్ నుంచి కొత్త బంతి

మాస్కో: ఫుట్‌బాల్ ప్రపంచకప్ గ్రూప్ దశ ముగిశాక బంతి మారబోతోంది. ఇప్పటిదాకా వినియోగిస్తున్న డిజైన్‌కు కొంత భిన్నంగా ఉండబోతోందా బంతి. ఆతిథ్య రష్యా జాతీయ జెండాలోని రంగులు మిళితమైన కొత్త బంతిని నాకౌట్ దశ నుంచి మ్యాచ్‌ల్లో ఉపయోగించనున్నారు.

నాకౌట్లో బ్రెజిల్

మాస్కో: బ్రెజిల్ ప్రపంచకప్ నాకౌట్లో అడుగుపెట్టింది. బుధవారం గ్రూప్-ఈ ఆఖరి మ్యాచ్‌లో ఆ జట్టు 2-0తో సెర్బియాపై గెలిచింది. బ్రెజిల్ తరపున పాలినో (36వ), తియాగో సిల్వా (68వ) గోల్స్ కొట్టారు. బ్రెజిల్ ఏడు పాయింట్లతో గ్రూప్‌లో అగ్రసానం సాధించింది. కోస్టారికాతో మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసుకున్న స్విట్జర్లాండ్ రెండో స్థానంతో ముందంజ వేసింది.

క్రొయేషియాదే అగ్రస్థానం

ఐస్‌లాండ్‌పై 2–1తో విజయం

పెరిసిచ్

రొస్తోవ్ ఆన్ డాన్: ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన క్రొయేషియా తొమ్మిది పాయింట్లతో గ్రూప్-డిలో అగ్రస్థానం సాధించింది. తొలి రెండు విజయాలతో నాకౌట్ స్థానాన్ని ఖరారు చేసుకున్న ఆ జట్టు.. ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో 2-1తో ఐస్‌లాండ్‌పై గెలిచింది. క్రొయేషియా తరపున బదెల్జ్ (53వ), పెరిసిచ్ (90వ) చెరో గోల్ కొట్టగా.. ఐస్‌లాండ్ తరపున నమోదైన ఏకైక గోల్‌ను సిగర్డ్సన్ (76వ) సాధించాడు. క్రొయేషియా.. క్వార్టర్‌ఫైనల్లో స్థానం కోసం ఆదివారం డెన్మార్క్‌తో తలపడుతుంది.

ప్రపంచ రికార్డుతో మను స్వర్ణం

దిల్లీ: భారత యువ షూటర్ మను బాకర్ ప్రపంచ వేదికపై మరోసారి అదరగొట్టింది. జర్మనీలో జరుగుతున్న ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ ప్రపంచకప్‌లో ఆమె ప్రపంచ రికార్డు ప్రదర్శనతో స్వర్ణం కొల్లగొట్టింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పిస్టల్ పోటీ ఫైనల్లో మను 242.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాది మనుకు ఏడో అంతర్జాతీయ వ్యక్తిగత స్వర్ణం కావడం విశేషం. ప్రపంచ రికార్డు ప్రదర్శనతో ఆమె స్వర్ణం గెలవడమిది మూడోసారి. ఈ టోర్నీలో అనీష్ భన్వాలా పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో కాంస్యం సాధించాడు.

బీటెక్ రవి నిరశన దీక్ష భగ్నం

ఈనాడు - కడప

ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని కోరుతూ కడపలో ఎమ్మెల్సీ బీటెక్ రవి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను బుధవారం పోలీసులు భగ్నం చేశారు. రిమ్స్‌కు తరలించారు. అత్యవసర విభాగంలో చేర్చి ద్రవాహారం(ఫ్లూయిడ్స్) ఎక్కించారు. ఈనెల 20 నుంచి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, బీటెక్ రవి- ఇద్దరూ కడపలోని జడ్పీ ప్రాంగణంలో దీక్షకు దిగారు. వైద్యపరీక్షలు నిర్వహించిన రిమ్స్ వైద్యులు.. ఇద్దరి ఆరోగ్యం ప్రమాదకరంగా ఉన్నట్లు హెచ్చరించారు. ప్రధానంగా బీటెక్ రవి పరిస్థితి బాగోలేదని వివరించారు. పరిస్థితిని అంచనా వేసి తదనుగుణ చర్యలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మంత్రి గంటా శ్రీనివాసరావును కడపకు పంపించారు. ఆయన బుధవారం ఉదయం నుంచి జిల్లా ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమావేశమయ్యారు. చివరగా పోలీసులు 6 గంటల సమయానికి రవి దీక్షను భగ్నం చేశారు. సీఎం రమేష్‌ను తరలించేందుకు ప్రయత్నించగా.. ఆయన తీవ్రంగా ప్రతిఘటించారు. తెదేపా కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తోపులాట జరిగింది. రవి 'ఈనాడు'తో మాట్లాడుతూ 40 వేల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఉక్కుదీక్ష చేపట్టినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉన్నా పోలీసులు తన దీక్షను అనవసరంగా భగ్నం చేయడం సరికాదన్నారు.

ఉక్కు కర్మాగారం స్థాపించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, ఎమ్మెల్సీ రవిల ఆమరణ దీక్షలో ప్రసంగిస్తున్న మంత్రి యనమల

రాష్ట్రాన్ని నిలువునా మోసం చేసిన కేంద్రం: యనమల

విభజనచట్టం హామీలు నెరవేర్చకుండా రాష్ట్రాన్ని నిలువునా మోసం చేసిన కేంద్రప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం ఆగదని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. కడప ఉక్కు రాష్ట్రానికి ఎంతో ఉపయోగకరమన్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ "కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం గాలి జనార్దన్‌రెడ్డికి నాడు వేలాది ఎకరాల భూములు కేటాయించారు. వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి ఆయన రూ.1300 కోట్ల మేర రుణం తీసుకున్నారు. కొంత సొమ్ము ఖర్చుపెట్టి, మిగిలిన డబ్బు జేబులో వేసుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా పరిశ్రమ పెట్టని ఆ భూములనూ వెనక్కి తీసుకోవాలి'' అని డిమాండ్ చేశారు. దొంగదీక్షలు చేస్తున్నారని వైకాపా నాయకులు ఆరోపిస్తున్నారని.. వాళ్లకు కళ్లున్నాయా? లేవాని మంత్రి పరిటాల సునీత ప్రశ్నించారు. దీక్ష చేయకుంటే కిలోల కొద్దీ బరువు ఎలా తగ్గుతారన్నారు. అభివృద్ధికి దోహదపడాల్సిన కేంద్రం రాష్ట్రాన్ని అవమానాలకు గురిచేస్తోందని కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి విమర్శించారు. కార్యక్రమంలో అనంత నేతలు పార్థసారథి, తిప్పేస్వామి, వరదాపురం సూరి, రామసుబ్బారెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, వీరశివారెడ్డి, ఆదినారాయణరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం పద్ధతి

- కేంద్రం తీరుపై ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్‌లో మండిపడ్డ సీఎం చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: కడప ఉక్కు పరిశ్రమపై అడిగిన ప్రశ్నలే రెండు మూడు సార్లు అడుగుతూ కేంద్రం కాలయాపన చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్నటిదాకా తెలంగాణ పరిశ్రమపై స్పష్టత రాలేదని, బయ్యారం భూములు, నీళ్ల వివరాలు అందాల్సి ఉందని చెప్పారని, ఇప్పుడు ఉక్కు దీక్ష ప్రారంభమయ్యాక మరో రెండు కొత్త కొర్రీలు వేశారని విమర్శించారు. కడప ఉక్కు దీక్ష నేతలతో, దిల్లీలోని ఎంపీలతో బుధవారం సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా దిల్లీలో కేంద్ర ఉక్కుశాఖ మంత్రితో జరిపిన చర్చల గురించి ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి సీఎంకు వివరించారు. ఉక్కు పరిశ్రమపై దిల్లీలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని చెప్పారు. గురువారం మళ్లీ కేంద్ర మంత్రిని కలిసి ఆయన స్పందనను బట్టి ప్రతిస్పందిస్తామని వివరించారు. బుధవారమే కేంద్రానికి మరో లేఖను రాస్తానని, గురువారం భేటీలో ఆ లేఖను అందించాలని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. జాతీయ రహదారి అందుబాటులో ఉన్నా, రవాణాకు కృష్ణపట్నం పోర్టు వినియోగించుకునే వీలున్నా ఎందుకీ తాత్సారం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలో పరిశ్రమ కోసం ఇచ్చే భూములపై ఏ వివాదం లేదని స్పష్టం చేశారు. ఇవి గతంలో గాలి జనార్ధన్‌రెడ్డికి ఇచ్చిన భూములు కావని తెలిపారు.

ఉక్కు దీక్ష చేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ బీటెక్ రవిల ఆరోగ్య పరిస్థితిపై సీఎం ఆరా తీశారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రులు సోమిరెడ్డి, ఆదినారాయణరెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు.

నూతన రాజకీయ శక్తులతోనే సామాజిక న్యాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: సామాజిక న్యాయం కోసం నూతన రాజకీయ శక్తులు ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కోసం సీపీఎం, జనసేన, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ పార్టీలతో కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెదేపా, వైకాపాలు సామాజిక న్యాయం పాటించడం లేదని ఆరోపించారు. వివిధ వర్గాల సమస్యలపై చర్చించేందుకు జులై 8 నుంచి జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు ఆగస్టు 20 నుంచి ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు.

సొంతగూటికి చేరనున్న కిరణ్‌కుమార్‌రెడ్డి?

జులై మొదటి వారంలో రాహుల్‌తో భేటీ

ఈనాడు, దిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి, కాంగ్రెస్ మాజీ సీనియర్ నేత కిరణ్‌కుమార్‌రెడ్డి తిరిగి సొంతగూటి(కాంగ్రెస్‌లోకి)కి చేరడం ఖాయమైంది. ఈ మేరకు పార్టీ వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. జులై మొదటివారంలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో కిరణ్‌కుమార్ రెడ్డి భేటీ కానున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంతకుముందు జులై 1న ప్రైవేటు కార్యక్రమం నిమిత్తం హైదరాబాద్ రానున్న ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు ఊమెన్ చాందీతో కిరణ్‌కుమార్‌రెడ్డి సమావేశం కానున్నారు. జులై 2, 3 తేదీల్లో కిరణ్‌కుమార్‌రెడ్డి రాహుల్‌గాంధీతో సమావేశమయ్యే అవకాశం ఉందని పార్టీసీనియర్ నేత ఒకరు బుధవారం 'ఈనాడు'కు తెలిపారు.

ప్రజల దీవెనలే నడిపించాయి

- నాకు అవకాశం వచ్చిన రోజు ప్రజల రుణం తీర్చుకుంటా: జగన్
- 200వ రోజుకు చేరుకున్న ప్రజాసంకల్పయాత్ర

ఈనాడు డిజిటల్, అమరావతి, అమలాపురం, న్యూస్‌టుడే: పంటకు గిట్టుబాటు ధర లేక, రుణాలు మాఫీకాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వైకాపా అధినేత జగన్ అన్నారు. ఉపకార వేతనాలందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ఉందా? లేదా? అనే పరిస్థితి నెలకొందని, రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభమై బుధవారానికి 200 రోజులు పూర్తయిన సందర్భంగా జగన్ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'పాదయాత్ర చేయగలుగుతామా అనే పరిస్థితుల నుంచి ఎంతో సునాయాసంగా ముందుకు సాగుతున్నా. దేవుడి దయ, ప్రజలిచ్చిన స్ఫూర్తి, ఆప్యాయత ఈ 200 రోజులు నన్ను నడిపించాయి. కోట్ల మంది ప్రజల దీవనతో వచ్చే ముఖ్యమంత్రి పదవిలో ఉన్నవారు ప్రజల కోసం పరితపించాలి. ప్రస్తుత ముఖ్యమంత్రికి అలాంటి ఆలోచనలే లేవు. నాకు అవకాశం వచ్చిన రోజు ప్రజల రుణాన్ని తప్పక తీర్చుకుంటా. ఇచ్ఛాపురం వరకూ యాత్ర ముందుకు సాగాలి. ప్రజల దీవెనతోనే ముందడుగు పడుతుంది' అని జగన్ అన్నారు.

అమలాపురంలో జూనియర్ వైద్యుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న వైకాపా అధినేత జగన్

అభివాదాలతో ముందుకు సాగిన జగన్

ప్రజాసంకల్ప యాత్ర తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో మొదలై కామనగరువు మీదుగా ఉప్పలగుప్తం మండలంలో ప్రవేశించింది. విలసవిల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు జగన్ యాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా భారీ కేకును ఆయన చేత కోయించేందుకు ఏర్పాట్లు చేశారు. పాదయాత్ర అక్కడ ఆగకుండానే వేగంగా కొనసాగింది. ప్రజలకు అభివాదాలు చేసుకుంటూ జగన్ ముందుకు నడిచారు. విలసవిల్లిలో చేనేత కార్మికులు, దివ్యాంగులు తమ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. భీమపల్లిలోని స్థానిక పంచాయతీ భవనానికి సమీపంలో బస ఏర్పాటు చేశారు. విలసవిల్లిలో జగన్‌ను చూసేందుకు గోడ ఎక్కిన ఓ యువకుడు అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతన్ని ఆసుపత్రికి తరలించారు.

అగ్రిగోల్డ్ ఆస్తులు కొనమని కేంద్రానికి చెప్పండి!

ఏపీ భాజపా అధ్యక్షుడు కన్నాకు కుటుంబరావు సూచన

ఈనాడు డిజిటల్, అమరావతి: అగ్రిగోల్డ్ వ్యవహారాన్ని పరిష్కరించమని ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి భాజపా ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ లేఖ రాస్తే బాగుండేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించడం అసాధ్యమేమీ కాదని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కన్నా లేఖ రాయడం కేవలం రాజకీయ ఉనికి కోసమేనని విమర్శించారు. 'అగ్రిగోల్డ్ సమస్య ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు సంబంధించినది. ఆస్తుల వేలంలో కేంద్ర సంస్థలు పాల్గొని, మార్కెట్ ధరకు కొనేలా ప్రధాని మోదీని ఒప్పించాలి. ఒకవేళ కేంద్రం అంగీకరిస్తే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని కన్నా లక్ష్మీనారాయణకు విజ్ఞప్తి చేస్తున్నాం. కోర్టు పర్యవేక్షణలో వేలం ద్వారా ఆస్తులను అమ్మి డబ్బు రాబట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని న్యాయస్థానం ఆదేశిస్తే కొన్ని నిధులు కేటాయించి బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది' అని తెలిపారు.

ప్రతిపక్షం కాదది.. పరాయి పక్షం

- భాజపాతో వైకాపాది లోపాయికారి ఒప్పందం
- ప్రజలకు కళా వెంకట్రావు బహిరంగ లేఖ

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో పేద ప్రజలకు అందే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అడుగడుగునా అడ్డుపడుతూ వైకాపా ప్రతిపక్షంలా కాక పరాయిపక్షంలా వ్యవహరిస్తోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకట్రావు ధ్వజమెత్తారు. ఆ పార్టీ తీరును ఎండగడుతూ ఆయన రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రానికి నమ్మకద్రోహం చేసిన భాజపాతో కేసుల మాఫీ కోసం లోపాయికారి ఒప్పందం చేసుకుని ప్రత్యేక హోదా సాధన కోసం తెదేపా చేస్తున్న ధర్మపోరాటాన్ని అడ్డుకునేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆ పార్టీ చేసే పోటీ దీక్షలు భాజపాకు లబ్ధి చేకూర్చేందుకే తప్ప రాష్ట్ర ప్రయోజనాలను ఆశించి కాదని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇలాంటి పార్టీ రాష్ట్రానికి అవసరమా? అని లేఖలో నిలదీశారు. లక్ష కోట్ల అవినీతికి పాల్పడిన నాయకులు, కల్తీ మద్యం, క్రికెట్ బెట్టింగ్, కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే, ఎర్రచందనాన్ని దోచుకున్న నేతలు ఉన్న పార్టీ రాష్ట్రానికి అవసరమా? అని కళా వెంకట్రావు ప్రశ్నించారు. దొంగ లేఖలు, ఈ-మెయిల్స్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి అడుగడుగునా అడ్డపడుతున్న ఇలాంటి పార్టీ రాష్ట్రానికి అవసరమా?..విజ్ఞులైన ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని లేఖలో వెంకట్రావు కోరారు.

మోదీ మదిలో మాట... జగన్ నోటి వెంట

- ముందస్తు విషయం జగన్‌కు ముందే ఎలా తెలుసు?
- మంత్రి కాలవ శ్రీనివాసులు ధ్వజం

ఈనాడు అమరావతి: భాజపా, వైకాపా లాలూచీ మరోసారి బట్టబయలైందని... 'ఎన్నికలకు ఆరు నెలల ముందు... నాలుగు నెలల కోసం' అంటూ జగన్ మాట్లాడటమే దానికి నిదర్శనమని సమాచార పౌర సంబంధాలు, గ్రామీణ గృహ నిర్మాణ శాఖల మంత్రి కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. జగన్ వ్యాఖ్యలకు సంబంధించి సాక్షి పత్రికలో వచ్చిన కథనాన్ని ప్రస్తావించారు. "రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాల 19 రోజలైంది. ఇంకా 11 నెలలకుపైగా గడువుంది. అలాంటిది ఆరు నెలల్లోనే ఎన్నికలు రాబోతున్నాయన్న అవగాహనకు జగన్ ఎలా వచ్చారో ప్రజలకు చెప్పాలి. ఏ సమాచారంతో అంత స్పష్టంగా చెప్పగలిగారు?'' అని కాలవ బుధవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. ముందస్తు ఎన్నికలపై సమాచారాన్ని భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, ఆ పార్టీ ముఖ్య నేతల్లో కొందరికి రహస్యంగా చేరవేశారని విన్నాం. జగన్‌కు కూడా ఆ సమాచారం వచ్చిందంటే... ఆయన కూడా భాజపా రహస్య నాయకుడు అవునా? కాదా?'' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ రెండు పార్టీలు ఉమ్మడి రాజకీయ ప్రయోజనాల్ని ఆశించే రాష్ట్ర ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనేక నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు.

చంద్రబాబు ఏమీ చేయరు.. చేయనివ్వరు!

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా విమర్శ

భాజపా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న కన్నా

అనంతపురం, న్యూస్‌టుడే: చంద్రబాబు అధికారంలో ఉంటే ఏమీ చేయరు.. ప్రతిపక్షంలో ఉంటే ఏమీ చేయనివ్వరు. అదీ ఆయన నైజమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. 13 ఏళ్లకుపైగా అధికారంలో ఉన్న చంద్రబాబు రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని ధ్వజమెత్తారు. బుధవారం అనంతపురం వచ్చిన ఆయన జిల్లా భాజపా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తగిన సమాచారం ఇస్తే చాలని కేంద్రం చెప్పినా చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారని అన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ పెట్టడం బాబుకు ఇష్టం లేకనే తన సహచరులతో కపట దీక్షలు చేయిస్తున్నారని ఆరోపించారు. "బాబు వస్తే జాబు వస్తుందన్నారు.. జాబు మాటేమో కానీ.. ఆయన బాబుకు (లోకేష్‌కు) మాత్రం జాబు వచ్చింది'' అని విమర్శించారు. 30 జిల్లాలు ఉన్న కర్ణాటక రాష్ట్రానికి కేంద్రం రూ.86 వేల కోట్లు ఇవ్వగా అదే 13 జిల్లాలు ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.1.55 లక్షల కోట్లు ఇచ్చిందని లక్ష్మీనారాయణ వివరించారు.

వచ్చే నెలలో ఊమెన్‌చాందీ ఏపీ పర్యటన

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులు, కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీ రాష్ట్ర పర్యటన ఖరారైంది. తొలి విడత పర్యటనలో భాగంగా జులై 9 నుంచి 13వ వరకూ వివిధ జిల్లాల్లో పర్యటించనున్నారు. జిల్లా కార్యకర్తల సమావేశాలు, నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించనున్నారు. చాందీతో పాటు ఏపీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు పర్యటనల్లో పాల్గొనున్నారని ఏపీసీసీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

సింగపూర్ మంత్రి డెస్మండ్‌లీకి జ్ఞాపికను అందిస్తున్న మంత్రి లోకేశ్

విశాఖ సముద్ర తీరంలో డ్రోన్ పెట్రోలింగ్

- సహకారం అందించాలని సింగపూర్ మంత్రిని కోరిన లోకేశ్

ఈనాడు డిజిటల్, అమరావతి: విశాఖ తీరంలో డ్రోన్ పెట్రోలింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేందుకు సహకారం అందించాలని సింగపూర్ ప్రభుత్వ సాంఘిక, కుటుంబ సంక్షేమ మంత్రి డెస్మండ్ లీని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. సచివాలయానికి బుధవారం వచ్చిన లీ నేతృత్వంలోని బృందంతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. నూతన రాజధాని అమరావతి, రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నందుకు సింగపూర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సింగపూర్‌లో అమలు చేస్తున్న డ్రోన్ పెట్రోలింగ్ పరిజ్ఞానాన్ని విశాఖ సముద్ర తీరంలో అమలు చేసేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వారికి తెలిపారు. ఏపీని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎలక్ట్రానిక్స్ తయారీ, టూరిజం అభివృద్ధికి చేయూత ఇవ్వాలని కోరారు. ఈ రెండు రంగాలతో పాటు విశాఖ తీరంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగానికి తోడ్పాటు అందిస్తామని సింగపూర్ మంత్రి తెలిపారు.

ఈసీలు, నకళ్లతో ఏం చేస్తారు?

- అవసరానికి మించి డౌన్‌లోడ్

ఈనాడు, అమరావతి: రిజిస్ట్రేషన్‌శాఖ కల్పించిన ఉచిత ఆన్‌లైన్ సేవలను అవసరానికి మించి ఉపయోగిస్తున్నారు. అన్యాక్రాంత వివరాలు తెలియచేసే ధ్రువపత్రం (ఈసీ), నకళ్లను (సర్టిఫైడ్ కాపీ) వెబ్‌సైట్ నుంచి వేల సంఖ్యలో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఈసీ, నకళ్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అనవసర చెల్లింపులు లేకుండా చూడాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలను ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాలద్వారా పొందే సౌకర్యాన్ని కొనసాగిస్తూనే ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. యూజర్ ఐడీ ద్వారా డాక్యుమెంటేషన్ నెంబరు, సంవత్సరం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పేరును నమోదు చేస్తే ఈసీ 48 గంటల్లోగా పొందొచ్చు. ఇదే విధానంలో క్రయ, తనఖా, దాన, మార్పిడి, ఇతర దస్తావేజుల నకళ్లను వెంటనే పొందే అవకాశాన్ని ప్రజలకు ఉచితంగా కల్పించింది. మీసేవా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా పొందాలంటే ఒక్కొక్క దానికి రూ.200 వంతున చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా పొందాలంటే ఈ చెల్లింపులు అక్కర్లేదు. తెలంగాణలో రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్ నుంచి ఆస్తులు, పొలాలు కొనుగోలు చేసిన వారి వేలిముద్రలను సేకరించి, వాటికి ప్లాస్టిక్ వేలిముద్రల నకలు తయారు చేసిన సంఘటన చర్చనీయాంశమైన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో విపరీతంగా డౌన్‌లోడ్‌లు చోటుచేసుకుంటున్న అంశం ప్రస్తావనార్హం. ఉచితంగా ఆన్‌లైన్‌ద్వారా ఈసీ, నకళ్లను పొందే అవకాశాన్ని కల్పించిన అనంతరం కొందరు అదే పనిగా అవసరం ఉన్నా, లేకున్నా ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎక్కువగా జరిగినట్లు తెలుస్తోంది. మీసేవా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 3.5 లక్షల మంది నేరుగా సేవలు పొందారు. ఇదే సమయంలో ఆన్‌లైన్ ద్వారా 6.7 లక్షల మేర ఈసీ, నకళ్లను పొందడం చర్చనీయాంశంగా మారింది. స్థిరాస్తి, డాక్యుమెంట్ రైటర్లు, ఇతరులు ఆన్‌లైన్ ద్వారా నకళ్లను పొంది రికార్డుల రూపంలో భద్రపరుచుకుంటున్నట్లు తెలియవచ్చింది.

గన్నవరం-అమరావతి మెట్రో కారిడార్

- తొలి దశలో ఏర్పాటుకు ప్రతిపాదన
- డీపీఆర్ రూపకల్పనలో సిస్ట్రా

ఈనాడు, అమరావతి: గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నేరుగా నవ్యాంధ్ర రాజధాని అమరావతిని చేరేందుకు మెట్రో కారిడార్ నిర్మించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. మొదటి దశలోనే దీని నిర్మాణం పూర్తి కావాలని పురపాలక మంత్రి పి.నారాయణ అభిప్రాయపడ్డారు. దాదాపు 42 కిలోమీటర్ల దూరం ఉండే ఈ దశలో తేలికపాటి మెట్రో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనిపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్ కొంత భాగం గాలిలోనూ(ఎలివేటెడ్), మరికొంత భూమిమీద నిర్మించే అవకాశాలున్నాయి. విజయవాడ నగరంలో మెట్రో నిర్మాణానికి మరోసారి డీపీఆర్‌ను జర్మనీకి చెందిన సిస్ట్రా, భారత్‌కు చెందిన రైట్స్ సంస్థ సంయుక్తంగా తయారుచేస్తున్న విషయం తెలిసిందే. సిస్ట్రా సంస్థ తమ మధ్యంతర నివేదికను అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్‌కు అందించింది. దీనిపై సచివాలయంలో బుధవారం మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మార్పులను సూచించారు. మొదటి దశలోనే గన్నవరం నుంచి అమరావతికి కారిడార్ నిర్మించాలని అభిప్రాయపడ్డారు. రెండో దశలో మెట్రోను అమరావతికి పొడిగించాలని, గుంటూరుకు ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. దీనిపై మంత్రి నారాయణ, పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కరికాలవలవన్, ఏఎంఆర్‌సీ ఎండీ రామకృష్ణారెడ్డి, సిస్ట్రా ప్రతినిధులు, జర్మనీకి చెందిన రుణ సంస్థ కెఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులతో చర్చించారు. ముందుగా ఒక వరుస మెట్రో ట్రాక్‌ను గన్నవరం నుంచి అమరావతికి నిర్మించాలని మంత్రి సూచించారు. జక్కంపూడిలో ఆర్థిక నగరం నిర్మిస్తున్నందున మెట్రోకు ప్రాధాన్యం ఉందని, దీన్ని రెండో దశలో ఏర్పాటుచేయవచ్చని అభిప్రాయపడ్డారు. బందరు కారిడార్ కూడా అవసరమైతే నేలమీద ఏర్పాటుచేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.

విజయవాడ మెట్రో ప్రణాళిక పురోగతిపై బుధవారం సచివాలయంలో మంత్రి నారాయణకు వివరిస్తున్న మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డి, జర్మనీ ఫైనాన్స్ ఏజెన్సీ కేఎఫ్‌డబ్ల్యూ, సిస్ట్రా కంపెనీల ప్రతినిధులు

కేంద్రం నిర్వాకంతో జాప్యం..

కేంద్రం నిర్వాకంతో రాష్ట్రంలో ఇప్పటివరకు మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదని మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ మెట్రోకు డీపీఆర్ సమర్పించినా స్పందించకుండా రెండేళ్ల తరువాత కొత్త విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పడం కేంద్ర అనుచిత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.

రోహిత్ శర్మ (97)

రోహిత్, ధావన్ వీరవిహారం

తొలి టీ20లో ఐర్లాండ్‌పై భారత్ ఘనవిజయం

టీమ్ ఇండియా చెలరేగిపోయింది. ఐర్లాండ్‌తో పొట్టి క్రికెట్ సిరీస్‌లో ఘనంగా బోణీ కొట్టింది. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్ వీరవిహారం చేసిన వేళ.. తొలి టీ20లో భారత్ ఘనవిజయం సాధించింది.

డబ్లిన్: ఓపెనర్లు రోహిత్ శర్మ (97; 61 బంతుల్లో 8×4, 5×6), శిఖర్ ధావన్ (74; 45 బంతుల్లో 5×4, 5×6) విధ్వంసం సృష్టించడంతో బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత్ 76 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. ఓపెనర్లతో జోరుతో మొదట భారత్ 5 వికెట్లకు 208 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫోర్లు, సిక్స్‌లతో పరుగుల వరద పారించిన రోహిత్-ధావన్ తొలి వికెట్‌కు 160 పరుగులు జోడించారు. ధావన్ 27 బంతుల్లో, రోహిత్ 39 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేశారు. అర్ధసెంచరీ తర్వాత రోహిత్ జోరు పెంచాడు. ఆఖరి ఓవర్లో ఔటైన అతడు త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు. లక్ష్యఛేదనలో ఐర్లాండ్ తడబడింది. కుల్‌దీప్ యాదవ్ (4/21), చాహల్ (3/38), బుమ్రా (2/19) విజృంభించడంతో 9 వికెట్లకు 132 పరుగులే చేయగలిగింది. షనోన్ (60) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరిదైన రెండో టీ20 శుక్రవారం జరుగుతుంది.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి) చేజ్ 97; శిఖర్ ధావన్ (సి) థాంప్సన్ (బి) ఓబ్రైన్ 74; రైనా (సి) ఓబ్రైన్ (బి) చేజ్ 10; ధోని (సి) థాంప్సన్ (బి) చేజ్ 11; హార్దిక్ పాండ్య నాటౌట్ 6; కోహ్లి (సి) థాంప్సన్ (బి) చేజ్ 0; మనీష్ పాండే నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 208; **వికెట్ల పతనం:** 1-160, 2-202, 3-202, 4-202, 5-202

బౌలింగ్: రాంకిన్ 4-0-34-0; చేజ్ 4-0-35-4; థాంప్సన్ 2-0-31-0; కెవిన్ ఓబ్రైన్ 3-0-36-1; డాక్రెల్ 4-0-40-0; సిమి సింగ్ 1-0-12-0; స్టిర్లింగ్ 2-0-16-0

ఐర్లాండ్ ఇన్నింగ్స్: స్టిర్లింగ్ (సి) కుల్‌దీప్ యాదవ్ (బి) బుమ్రా 1; షనోన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ యాదవ్ 60; బాల్‌బిర్నీ (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 11; సిమి సింగ్ (సి) కోహ్లి (బి) కుల్‌దీప్ 7; విల్సన్ (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 5; కెవిన్ ఓబ్రైన్ (సి) ధావన్ (బి) చాహల్ 10; థాంప్సన్ (సి) పాండ్య (బి) కుల్‌దీప్ 12; పాయింటర్ (బి) కుల్‌దీప్ 7; డాక్రెల్ (బి) బుమ్రా 9; రాంకిన్ నాటౌట్ 5; చేజ్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 3 (మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) 132; **వికెట్ల పతనం:** 1-4, 2-45, 3-72, 4-85, 5-96, 6-96, 7-114, 8-123, 9-126; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-16-0; బుమ్రా 4-1-19-2; పాండ్య 4-0-36-0; చాహల్ 4-0-38-3; కుల్‌దీప్ యాదవ్ 4-1-21-4

ప్రిక్వార్టర్స్‌లో సింధు, శ్రీకాంత్

కౌలలంపూర్: మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు పి.వి.సింధు, కిదాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 26-24, 21-15తో ఒహారి (జపాన్)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో శ్రీకాంత్ 21-18, 21-9తో జాన్ జొర్గెన్సెన్ (డెన్మార్క్)పై నెగ్గాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో సాత్విక్ సాయిరాజు- చిరాగ్ శెట్టి 16-21, 15-21తో తకుతొ- కనెకొ (జపాన్) చేతిలో ఓడారు.

42 ఏళ్ల రికార్డు బద్దలు

గువహటి: భారత అథ్లెటిక్స్‌లో 42 రికార్డు బద్దలయ్యింది. పురుషుల 800 మీటర్ల పరుగులో కేరళ అథ్లెట్ కొత్త రికార్డు నెలకొల్పాడు. బుధవారం జాతీయ అంతర్ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 800 మీటర్ల పరుగులో జిన్సన్ ఒక నిమిషం 45.65 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి స్వర్ణ పతకం సాధించాడు. శ్రీరామ్ సింగ్ పేరిట ఉన్న రికార్డు (1 నిమిషం 45.77, 1976)ను తిరగరాశాడు. ఆసియా క్రీడల అర్హత ప్రమాణం (1ని 47.50సె) అందుకుని జకార్త బెర్తు దక్కించుకున్నాడు.

లంక చారిత్రక విజయం

బ్రిడ్జ్‌టౌన్: శ్రీలంక జట్టు పుంజుకుంది. వెస్టిండీస్ చేతిలో సిరీస్ ఓటమి తప్పించుకుంది. చివరి టెస్టులో విజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో టెస్టు మ్యాచ్ గెలిచిన తొలి ఆసియా జట్టుగానూ లంక రికార్డు సృష్టించడం విశేషం. బౌలర్ల ఆధిపత్యం సాగి, నాలుగో రోజు ఉదయమే ముగిసిన చివరి టెస్టులో లంక 4 వికెట్ల తేడాతో నెగ్గింది. 144 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

దిగువపల్లితండాలో పల్లెనిద్ర చేస్తున్న బాలకృష్ణ

బాలకృష్ణ పల్లెనిద్ర

చిలమత్తూరు, న్యూస్‌టుడే: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ బుధవారం చిలమత్తూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు భూమిపూజలు చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చాగలేరు ఎస్సీకాలనీలో సహపంక్తి భోజనం చేశారు. దిగువపల్లితండాలో పల్లెనిద్ర చేశారు. మరో రెండురోజులపాటు ఎమ్మెల్యే ఇదే మండలంలో పర్యటించనున్నారు.

కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియ ప్రారంభం

- కమిటీ నియామకం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుత డీజీపీ ఎం.మాలకొండయ్య ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కొత్త డీజీపీ పదవికి అర్హులైన అధికారుల జాబితాను రూపొందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఎంపిక కమిటీని నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు డా. మన్మోహన్‌సింగ్, డా.డి.సాంబశివరావులు ఈ కమిటీలో ఉంటారు. సాధారణ పరిపాలన శాఖ రాజకీయ కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ అధికారుల బృందం రాష్ట్రంలో డీజీపీ హోదా కలిగిన ఐపీఎస్ అధికారుల వివరాలన్నింటినీ పరిశీలిస్తుంది. వారి అనుభవం, వృత్తిపరమైన పరిజ్ఞానం, రాష్ట్రంలోని పోలీసు దళాలను నడిపించే సామర్థ్యం తదితరాలన్నింటినీ పరిశీలించి వారిలో నుంచి నలుగురు అధికారుల పేర్లతో జాబితాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఆ జాబితా

నుంచి ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా ఎంపిక చేస్తుంది. ఈ నెల 29 నాటికి ఈ ప్రక్రియ పూర్తికావాలి. మాలకొండయ్యను మినహాయిస్తే ప్రస్తుతం ఏపీ క్యాడర్‌లో డీజీపీ స్థాయి అధికారులు ఏడుగురు ఉన్నారు. వీరిలో వీఎస్‌కే కౌముది ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో డిప్యూటేషన్‌పై ఉన్నారు. మిగతా వారిలో సీనియారిటీ ప్రకారం చూస్తే.. 1982 బ్యాచ్‌కు చెందిన ఎస్.వి.రమణమూర్తి (రోడ్డు భద్రతా సంస్థ ఛైర్మన్), 1986 బ్యాచ్‌కు చెందిన ఆర్.పి.ఠాకూర్ (ఏసీబీ డీజీపీ), వినయ్ రంజన్ రే (జైళ్ల శాఖ డీజీపీ), గౌతమ్ సవాంగ్ (విజయవాడ నగర పోలీస్ కమిషనర్), 1987 బ్యాచ్‌కు చెందిన ఎస్వీ సురేంద్రబాబు (ఆర్టీసీ ఎండీ), ఏ.ఆర్.అనూరాధ (హోంశాఖ ముఖ్య కార్యదర్శి) ఉంటారు. ప్రస్తుతం ఏపీలో డీజీపీకి సంబంధించి క్యాడర్ పోస్టులు రెండే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీనియార్టీలో ముందు వరుసలో ఉన్న నలుగురు అధికారుల పేర్లను ఎంపిక కమిటీ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

ఒప్పంద వైద్య 'ప్రొఫెసర్ల' క్రమబద్ధీకరణ ఎలా?

ఈనాడు, అమరావతి: ఒంగోలు, కడప, శ్రీకాకుళం రిమ్స్‌లలో ఒప్పంద బోధకుల క్రమబద్ధీకరణపై వైద్య ఆరోగ్య శాఖలో చర్చ జరుగుతోంది. 2007లో రిమ్స్‌లను ఏర్పాటుచేసినప్పుడు ఒప్పంద విధానంలో బోధకులను నియమించారు. నిర్ణీత కాల పరిమితిని అనుసరించి అసిస్టెంట్ నుంచి అసోసియేట్, అసోసియేట్ నుంచి ప్రొఫెసర్లుగా అక్కడే పదోన్నతులు పొందారు. పలువురు నేరుగా అసోసియేట్, ప్రొఫెసర్లుగా నియమితులయ్యారు. ఈ ఆస్పత్రులను వైద్య విద్య సంచాలక కార్యాలయ పరిధిలోకి తీసుకురావాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ శాశ్వత పోస్టులే ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం రిమ్స్‌లలో పనిచేస్తున్న దాదాపు 50 మంది ఒప్పంద బోధకుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పుడున్న హోదాలోనే శాశ్వత బోధకులుగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందుతున్నాయి. ఇదే జరిగితే తాము అన్యాయమవుతామని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రభుత్వానికి నివేదించింది. ఒప్పంద విధానంలో చేరిన వారిని శాశ్వత బోధకులతో సమానంగా గుర్తించకూడదని, అలా చేస్తే సర్వీసుపరమైన అంశాల్లో తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తంచేసింది.

విపత్తుల నిర్వహణపై కార్యాచరణ ప్రణాళిక

ఈనాడు, అమరావతి : విపత్తుల తీవ్రత తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక (రోడ్‌మ్యాప్) రూపొందించేందుకు గురువారం సచివాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు విపత్తుల నిర్వహణశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భూమి, రెవెన్యూ, దేవాదాయ, విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ కార్యాలయంలో జరిగే సమావేశంలో అన్ని ప్రభుత్వశాఖల సీనియర్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. 2030 వరకూ ప్రమాదస్థాయి తగ్గింపు చర్యలు, కార్యక్రమాల అమలు చేసే విషయమై ఇందులో చర్చిస్తారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎస్సీ, ఎస్టీ యువత

మంత్రి నక్కా ఆనంద్‌బాబు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు దళిత పారిశ్రామికవేత్తలకు ఏపీఐఐసీ కేటాయించే భూములపై ఇచ్చే రుణాలకు చెల్లించే వడ్డీ శాతాన్ని 16 నుంచి 4కి తగ్గించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు, పరిశ్రమలు స్థాపించాక నిలదొక్కుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఉప ప్రణాళిక, వివిధ పథకాల అమలు తీరుపై అధికారులతో చర్చించారు. ఉప ప్రణాళిక ద్వారా చేపట్టే పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు గుత్తేదారులుగా ప్రాధాన్యం ఇచ్చే అంశంపై సాధ్యాసాధ్యాలను చర్చించారు. జిల్లా కేంద్రాలు, ఏడు ఐటీడీఏల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువతకు పారిశ్రామిక విధానాలు ఇతరత్రా అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించారు. సమావేశంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు గంధం చంద్రుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

హామీ పత్రాల ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు

ఈనాడు, అమరావతి: డీఎస్సీ-2008 హామీపత్రాల ద్వారా నియమితులై, గత పీఆర్సీలో మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు నష్టపోయిన ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు మంజూరు చేస్తూ విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ ఉత్తర్వులు విడుదల చేశారు. జులై, 2011 నుంచి హామీపత్రాల ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేసి, 2015వేతన స్కేళ్లల్లో స్థిరీకరణ చేయాలని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సుమారు 3వేల మందికి ప్రయోజనం చేకూరడంతో పాటు ప్రభుత్వంపై ఏడాదికి రూ.16కోట్లు అదనపు భారం పడనున్నట్లు ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఉత్తర్వులపై ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య, రాష్ట్రోపాధ్యాయ సంఘం, ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య, హామీపత్ర ఉపాధ్యాయ ఐక్యవేదికలు హర్షం వ్యక్తం చేశాయి.

విభిన్న ప్రతిభావంతులకిచ్చే సదుపాయాలు కొనసాగింపు

ఈనాడు, అమరావతి: ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఏ, బీకాం, బీయస్సీ కోర్సులు చదివే విభిన్న ప్రతిభావంతులకు కల్పించే సదుపాయాలు, రాయితీలు కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. వీరికి బోధన రుసుములు చెల్లింపు, ఉత్తీర్ణత మార్కుల్లో 10శాతం తగ్గింపు, పరీక్ష రాయడానికి మరో వ్యక్తి సహాయం, పరీక్షకు అదనంగా 30నిమిషాల సమయం కల్పించనున్నారు. దీనికి సంబంధించి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు ఎంఎస్సీ విద్యార్థి చేసిన వినతిమేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అన్ని వర్సిటీల రిజిస్ట్రార్లు దీనిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ అవార్డు ఎంపికకు కమిటీ

ఈనాడు, అమరావతి: డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆయన పేరు మీదుగా వచ్చే నెల 6న ప్రదానం చేయనున్న అవార్డుకు అర్హుల్ని ఎంపిక చేసేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటిలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, రాష్ట్ర ప్రణాళికా సంఘం సభ్యుడు పెద్ది రామారావు, వయోలినిస్ట్ అన్నవరపు రామస్వామి, సంగీత విద్వాంసుడు పప్పు వేణుగోపాల్‌రావు, రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ సీఈవో విజయ్ భాస్కర్ సభ్యులుగా ఉన్నారు.

సోంపేట బీలలో పర్యటిస్తున్న మానవహక్కుల వేదిక బృందం సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ తదితరులు

'బీల'ను ధ్వంసం చేసే చర్యలొద్దు: వి.ఎస్.కృష్ణ

సోంపేట, న్యూస్‌టుడే: దేశంలోనే విశిష్ట చిత్తడి నేలల ప్రాంతంగా గుర్తింపు పొందిన శ్రీకాకుళం జిల్లా సోంపేట బీలకు నష్టం కలిగించే చర్యలు చేపట్టొద్దని తెలుగు రాష్ట్రాల మానవహక్కుల వేదిక సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ అన్నారు. బుధవారం ఆయన పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక, మానవహక్కుల వేదిక ప్రతినిధులతో కలిసి బీల ప్రాంతంలో పర్యటించారు. అక్కడ చేపల చెరువుల తవ్వకాల స్థలాన్ని పరిశీలించారు. చిత్తడి నేలలు, పంట పొలాలు పరిశ్రమలకు ఇవ్వొద్దన్న సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. బీలలో చేపల చెరువులు ఏర్పాటు చేస్తే చుట్టుపక్కలున్న వ్యవసాయం నాశనం అవుతుందని, చిత్తడి నేలలకు నష్టం కలుగుతుందన్నారు. ఎన్‌సీసీ యాజమాన్యానికి కేటాయించిన భూములతో పాటు సంబంధిత యాజమాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన పంట పొలాలను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు 329ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేపల చెరువుల ఏర్పాటు కోసం నిర్మించిన గట్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుధ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.జగన్నాధరావు, బీన ఢిల్లీరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గొంతుకోసి.. విశ్రాంత పోలీస్ అధికారి హత్య

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ప్రాణ స్నేహితుడే గొంతు కోసి విశ్రాంత పోలీసు అధికారిని హతమార్చిన ఘటన ఇది. రామనగర జిల్లా చెన్నపట్టణ సమీపంలోని ఎం.కె.దొడ్డి పోలీసు ఠాణా పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బెంగళూరు నగరానికి చెందిన విశ్రాంత ఎస్సై సిద్ధలింగయ్య (60), కోలారు జిల్లా ముళబాగిలుకు చెందిన శంకర్ (55) మంచి స్నేహితులు. పదవీ విరమణ తరువాత సిద్ధలింగయ్య బెంగళూరు జేపీనగరలో ఉండేవారు. అదే ప్రాంతంలో శంకర్ వాహనాల మరమ్మతుశాల (గ్యారేజ్)ను నిర్వహించేవాడు. సిద్ధలింగయ్య ఆర్థిక లావాదేవీలను పూర్తిగా శంకరే చూసుకునేవాడని పోలీసులు తెలిపారు. చెన్నపట్టణ సమీపంలోని ఎం.కె.దొడ్డి వద్ద ఒక ఆలయం ఉందని, అక్కడకు వెళ్లి వస్తే మేలని సిద్ధలింగయ్యను శంకర్ నమ్మించాడు. తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. రాత్రి తిరిగి వస్తూ ముగనూరు మలుపు వద్ద వాహనాన్ని ఆపి, సిద్ధలింగయ్య ముఖంపై కారం చల్లాడు. చాకుతో గొంతు కోసి పరారయ్యాడు. నిందితుని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పౌరసరఫరాల సంస్థలో హమాలీ ఛార్జీల పెంపు

ఈనాడు అమరావతి: పౌరసరఫరాల సంస్థకు చెందిన మండలస్థాయి నిల్వ కేంద్రాల్లో(ఎంఎల్ఎస్ పాయింట్లు) పని చేస్తున్న హమాలీలకు ఛార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు గత జనవరి 1 నుంచి వర్తింపజేసేందుకు పౌరసరఫరాల సంస్థ ఎండీకి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్వింటాలుకు రూ.15 చొప్పున హమాలీ ఛార్జీలు చెల్లిస్తుండగా .. రూ.19చొప్పున చెల్లించాలని నిర్ణయించారు.

భారత మాత

అన్ని దుష్ట శక్తుల నుండి మమ్మల్ని కాపాడి శక్తినిస్తుంది

సహారా ఇండియా పరివార్

ఆర్థిక సమస్యలు

1. గత 5 సంవత్సరాలుగా సహారా గ్రూప్ ఒక్క రూపాయి కూడా సమకూర్చుకునే అవకాశం లేకుండా అన్ని రకాల నిధుల సేకరణపై నిషేధం విధించబడింది
   నిషేదాజ్ఞ (ఎంబార్గో) అనగా, సహారా గ్రూప్ దేన్నైనా అమ్మినా (తమ గౌరవనీయ కస్టమర్లకు ఒక ఇల్లు/ఫ్లాట్ గానీ), ఏదైనా ఆస్తిని కుదువ పెట్టినా లేదా ఏదైనా జాయింట్ వెంచర్ చేసినా; లభించే నగదు మొత్తం సహారా సెబి ఖాతాకు వెళ్ళుతుంది. సహారా గ్రూప్ అవసరాలకు ఒక్క రూపాయి కూడా అందదు.
2. నిషేదాజ్ఞ (ఎంబార్గో) కారణంగా, సహారా తవ వ్యాపారకలాపాల ద్వారా ఈ 5 సంవత్సరాల్లో పలు 10,000ల కోట్ల రూపాయల ఆదాయ అవకాశాల్ని కోల్పోయింది.
3. సహారా గ్రూప్ యొక్క ₹20,000ల కోట్లకు పైగా స్తబ్దుగా పడి ఉన్నాయి
   సహారా సెబి ఖాతాలో ₹20,000ల కోట్లకు పైగా స్తబ్దుగా పడి ఉండగా సెబి ఈ 5 సంవత్సరాల్లో మన గౌరవనీయ మదుపరులకు కేవలం ₹91 కోట్లు మాత్రమే చెల్లించింది. అది కూడా భారతదేశం మొత్తం 4 సార్లు 152 వార్తా పత్రికల్లో ప్రకటనలిచ్చిన అనంతరమే ఆ చెల్లింపులు జరిగాయి.
4. ఎందుకంటే సహారా ఇప్పటికే తవ గౌరవనీయ మదుపరులకు చెల్లించేసింది కావున.
5. గౌరవనీయ కోర్టు వారి ఆదేశం ప్రకారం డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తయిన తరువాత సహారా సెబి ఖాతాలోని నిధులన్నీ సహారా ఖాతాలోకి తిరిగి వచ్చేస్తాయి. సహారా భవిష్యత్తు ఖచ్చితంగా ఆశాజనకంగా మరియు సమృద్ధి భరితంగా ఉంటుంది.
6. SEBI/SAT (SECURITIES APPELLATE TRIBUNAL) కేవలం 6-7 నెలల్లో (2012లో) ₹22,000ల కోట్ల రూపాయల మెచ్యూరిటీ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించింది.
   6-7 నెలల్లో కాకుండా సహారా ఫైనాన్షియల్ స్కీమ్ ప్రకారం మేము 16-17 సంవత్సరాల పాటు ప్రతి నెల చిన్న మొత్తాల్లో చెల్లించి ఉండేవాళ్ళం.
   పైన పేర్కొన్న కారణం వల్ల మా అనుకూల ఆదాయ మార్గాలపై దాదాపు ₹15,000ల కోట్ల ప్రతికూల ప్రభావం పడింది.
   పైన పేర్కొన్న కారణాలన్నీ సంస్థపై చెడు మరియు ప్రతికూల ప్రభావాన్ని చూపించాయి.
7. ఏదైనా అతి పెద్ద జాతీయ బ్యాంక్ లేదా అతి పెద్ద బీమా సంస్థకు పైన పేర్కొన్నవన్నీ జరిగి ఉండుంటే?
   ఆ రెండు ప్రతిష్ఠాత్మక సంస్థలపై చాలా ప్రతికూల ప్రభావం ఉంటుంది. ప్రస్తుతం మేము సకాలంలో మా చెల్లింపులు చేయడానికి ఎంతగా శ్రమపడాల్సి వస్తోందో, అలాగే వారి చెల్లింపులను చెల్లించడం వారికి కష్టతరంగా ఉంటుంది.

ప్రధానాంశాలు

- మా చెల్లింపుల కంటే మా ఆస్తులు మూడు రెట్లు అధికం. కాబట్టి మాతో సంబంధం కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ పూర్తి సురక్షితంగా ఉన్నట్లు భావించవచ్చు.
- 2019-20 నాటికల్లా ఆటంకాలను, అవరోధాలను అధిగమించి సహారా భారతదేశంలో కీలక స్థాయికి చేరుకుంటుంది.

ఎప్పటిలాగే మీ విలువైన బంధం
మరియు ఆశీస్సులు మాతో ఉండాలని ఆశిస్తున్నాం.

SAHARA
INDIA PARIWAR

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 29-6-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 320

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

A **Sheela Foam** Product

Sleepwell

ఒక ప్రయత్నం,

అమ్మలాగే హాయిని అందించేందుకు...

మీ స్లీప్‌వెల్ మ్యాట్రెసెస్ పొందడానికి ఒక గొప్ప అవకాశం

100% FREE*

ప్రతి జత స్లీప్‌వెల్ పరుపులతో ప్రీమియం స్లీప్‌వెల్ కంఫర్టర్ లేదా ఒక బెడ్‌షీట్ సెట్ ఖచ్చితంగా Freeగా* పొందండి. దాంతో పాటుగా ఆశ్చర్యకరమైన డిస్కౌంట్* పొందే అవకాశాన్ని సొంతం చేసుకోండి లేదా మీ పరుపులను 100% Freeగా* పొందండి.

08 డౌన్ పేమెంట్ EMI's

BAJAJ FINSERV

ఈ అద్భుతమైన అవకాశాన్ని పొందడానికి మీరు చేయవల్సిందల్లా:

1. మీ దగ్గరలోని స్లీప్‌వెల్ ఆధీకృత డీలర్‌ను సందర్శించండి, ఒక స్లీప్‌వెల్ పరుపును కొనండి.
2. **మీ వారంటీని రిజిస్టర్ చేయమని మా డీలర్‌ను అడగండి,** మరియు మీ ఖచ్చితమైన బహుమతికి* చెందిన ఇన్‌స్టంట్ SMS పొందండి. దాంతో పాటుగా ఆశ్చర్యకరమైన డిస్కౌంట్ పొందే అవకాశాన్ని సొంతం చేసుకోండి. లేదా మీ పరుపులను 100% Freeగా* పొందండి

*షరతులు మరియు నిబంధనల కొరకు, మా డీలర్‌ను అడగండి లేదా **sleepwellproducts.com**ను సంప్రదించండి

To know more give us a missed call on 9870262806

Sleepwell World: **Vijayawada: Opp line of My Godway:** 9849452666, **Beside Auto Nagar Bus Terminal:** 9885550355, **Ramavarappadu:** 9849183838, **Besides M.G. Road Kalanikethan:** 9618950088, **Ongole: Anjaiah Road:** 9705522456, **Bhimavaram: Near Sathyanarayana Theatre:** 9849833199, **Guntur: 7/2 Arundelpet:** 9966049675, **Ongole:** 9705522456, **Sleepwell Gallery:** **Vijayawada: Besides Swarna Palace:** 9849346962, **Machilipatnam: Opp. Z.P Office:** 8143585858, **Nellore: Opp Maruthi Showroom:** 8500756754, **Near Narthaki Theater:** 9441122452, **Bhimavaram:** 9440833306, **Palakollu:** 9849793688, **Tadepalligudem:** 9885269677, **Eluru: Near Bharath Gas Godown:** 9440130622, **Tanuku:** 223277, **Tenali: Ganganamma pet:** 9247122842, **Narasaraopeta: Old Police Station Road:** 9666874418, **Guntur: 12/1 Arundelpet:** 9395150255, **Guduru:** 8886611776, **Sleepwell Shoppe:** **Ponnur: S.P.P Road:** 8099187788, **Vinukonda: Markapuram Road:** 9848497122, **Tenali: Gandhi Chowk:** 9966029044, **Dhachepalli: Main Bazar:** 944082045, **Nellore:** 9490125904, **Darsi: Near Sivalayam:** 9490175941, **Giddaluru: Railway Station Road:** 9989666979, **Yerragondapalem: Vinukonda Road:** 9441586832, **Cumbum: Near Bus Stand:** 9247503458, **Akividu:** 8790255377, **Narsapuram:** 9959877577, **Dubacharla:** 9440191422, **Eluru:** 9848186818, **Gudivada: NTR Stadium Complex:** 9848919456, **Sulurpeta:** 9666333096, **Exclusive Dealers:** **Nellore:** 2326774, **Guntur: 8/1 Arundelpet:** 8008312888, **Kandukuru: Pedda bazaru:** 9848248718, **Chirala: B V S Market:** 9247880947, **Eluru:** 9441366228. **For Trade Enquiries:** 9949339306, 8662416337, 9848654353, 7702727777, 7702944999.

MONEY MATTERS!
సిరి
ఈనాడు
ప్రతీ ఆదివారం
www.eenadusiri.net

ఈనాడు

రియల్ ఎస్టేట్ రియల్ వివరాలకై
ఈనాడు స్థిరాస్తి
ప్రతీ శనివారం
www.eenadu.net

విజయవాడ 29-6-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 320
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కనకదుర్గ అమ్మవారికి తయారు చేయించిన ముక్కుపుడకను దుర్గగుడి ఈవో పద్మకు అందజేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు. చిత్రంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు

దుర్గమ్మ మొక్కు తీర్చుకున్న కేసీఆర్

- కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలో పర్యటన
- బంగారు ముక్కుపుడక, పట్టువస్త్రాల సమర్పణ
- మళ్లీ గెలిచి దుర్గమ్మ దర్శనానికి వస్తా
- విజయవాడ బాగా అభివృద్ధి చెందింది
- మంత్రి దేవినేనితో కేసీఆర్

ఈనాడు - అమరావతి

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ కనకదుర్గమ్మను గురువారం దర్శించుకున్నారు. తెలంగాణ ఏర్పడితే దుర్గమ్మకు బంగారు ముక్కుపుడకను సమర్పిస్తానన్న మొక్కును కేసీఆర్ తీర్చుకున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కేసీఆర్ దంపతులు, కుటుంబ సభ్యులు, మంత్రి నాయిని నరసింహారెడ్డి, ఎంపీ కె.కేశవరావు తదితరులు చేరుకున్నారు. ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం (మిగతా 2లో)

కేసుల భయంతో దాసోహం

- పాదయాత్రలు, పోరాటాలతో ప్రజలకు మమ్మల్ని దూరం చేయలేరు
- ఉత్తరాంధ్ర తెదేపాకు కంచుకోట
- ముఖ్యమంత్రి స్పష్టీకరణ
- పంచెకట్టుతో 'ఏరువాక'లో పాల్గొన్న చంద్రబాబు
- చంద్రన్న రైతు బీమా పథకం ప్రారంభం

న్యూస్‌టుడే
ఆమదాలవలస గ్రామీణం

పాదయాత్రలు, పోరాటాలతో ఉత్తరాంధ్ర ప్రజలను తెదేపాకు దూరం చేయడం ఎవరి తరమూ కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర తెదేపాకు కంచుకోటని పేర్కొన్నారు. చెన్నైలో శశికళకు ఎదురైన అనుభవం చూసి భయపడిపోయి కేంద్రానికి దాసోహం అయ్యారని వైకాపా అధ్యక్షుడు జగన్‌పై ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఏరువాక కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. చంద్రన్న రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. 'కొందరు రైతులు అసంఘటితరంగ కార్మికులకు కల్పించిన చంద్రన్న బీమా పరిధిలోకి రాలేదు. అలాంటి వారికోసం చంద్రన్న రైతు బీమాను అమలులోకి తెచ్చాం. ఈ ఏడాది నుంచే అమలు చేసే బాధ్యత తీసుకుంటున్నాం. ఈ బీమాతో 18 నుంచి 50ఏళ్ల వయసున్న రైతు చనిపోతే రూ.2లక్షలు, 50 నుంచి 80 ఏళ్ల మధ్య వయసున్న రైతు సహజంగా చనిపోతే రూ.30 వేలు, 18 నుంచి 70ఏళ్ల మధ్య వయసున్న రైతు ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.5లక్షలు ఇస్తాం. పూర్తి వైకల్యానికి రూ.5లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.2.50లక్షలు పరిహారం చెల్లిస్తాం. వారి కుటుంబంలో 9 నుంచి 12 ఏళ్ల వయసున్న పిల్లలకు ఏటా రూ.1200 ఉపకారవేతనం చెల్లిస్తాం. వ్యవసాయానికి సంఘీభావం తెలపాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. వర్షాలు కురిసినా.. తుపాన్లు, వరదలు వచ్చి పంట చేతికి వచ్చే పరిస్థితి లేకుండాపోతోంది. 2004-14 మధ్య కాలంలో విత్తనాలు, ఎరువులు లభ్యమయ్యేవి కావు. యూరియా కోసం లాఠీ దెబ్బలు తినాల్సి వచ్చేది. రైతులు రాత్రులు బావులవద్ద పడిగాపులు పడేవారు. పాములు కరిచి.. కరెంటు షాకులు కొట్టి చనిపోయేవారు. అలాంటి దయనీయ పరిస్థితి నుంచి ఎంతో మార్పు తెచ్చాం. 24వేల కోట్ల రుణ విముక్తి కల్పించిన ప్రభుత్వం మాది. విత్తనాలు సక్రమంగా ఇచ్చాం. శాస్త్రీయ పద్ధతిలో ఖర్చులు తగ్గిస్తున్నాం. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని తెస్తాం. బంగారం (మిగతా 2లో)

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలోని రావికంటిపేటలో ఏరువాక కార్యక్రమంలో నాట్లు వేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

'ఈ రాష్ట్రంలో పనికిమాలిన పార్టీ ఒకటుంది. అవినీతి పార్టీ. శశికళను చూశాక ఇంకా భయం పట్టుకుంది. కడపలో స్టీల్ ప్లాంటుపైనా వారు స్పందించడం లేదంటే అదొక పార్టీనా? ఇంకా ఎందుకా పార్టీ?

ఇంకొకాయన ఉత్తరాంధ్రపై ఉద్యమం వస్తుందని అంటున్నారు. కేంద్రం అన్యాయం చేస్తే మాట్లాడరు. నన్ను విమర్శిస్తారు. భాజపాతో లాలూచీ పడిన వీళ్లా మాట్లాడేది?

కేంద్రం మనకు సహకరించడం లేదు. డబ్బులు ఇవ్వడం లేదు. విశాఖకు రైల్వే జోన్ ఇవ్వలేదు. కడపకు ఉక్కు కర్మాగారాన్ని ఇవ్వలేదు. అమరావతికి సహకరించలేదు. నాలుగేళ్లు చూశాక తిరుగుబాటు చేశాం'

\- చంద్రబాబు

పోలవరంపై స్టే ఉత్తర్వు నిలుపుదలను పొడిగించండి

కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు సీఎం ఫోన్

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై గతంలో కేంద్ర పర్యావరణశాఖ ఇచ్చిన స్టే ఉత్తర్వుల నిలుపుదలను పొడగించాలని కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. జులైలో ఈ స్టే ఉత్తర్వుల నిలుపుదల గడువు ముగుస్తున్నందున తక్షణం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి ఫోన్ చేశారని జలవనరులశాఖ అధికారులు వెల్లడించారు. శాశ్వత ప్రాతిపదికన స్టే ఉత్తర్వులను నిలుపుదల చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వా డిమాండుగా ఉంది. ఇప్పటికే ఇందుకు సంబంధించి కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఒడిశాలో ప్రజాభిప్రాయ సేకరణ వెంటనే పూర్తి (మిగతా 2లో)

ఉక్కుపై కాలయాపన

- కేంద్రం అడిగినవన్నీ ఇవ్వడానికి ఏపీ ప్రభుత్వం సిద్ధం
- ప్రైవేటు భూమి అధిక ధరకు కొని తక్కువకే అందజేస్తామని స్పష్టీకరణ
- అయినా స్పష్టత ఇవ్వని కేంద్ర మంత్రి బీరేంద్రసింగ్
- వరుసగా రెండోరోజూ అదే వైఖరి

ఈనాడు - దిల్లీ

కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై కాలయాపనకే కేంద్రం మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. వరుసగా రెండో రోజు గురువారం తెలుగుదేశం ఎంపీల బృందం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి బీరేంద్రసింగ్‌ను కలిసి కేంద్రం అడిగినవన్నీ ఇవ్వడానికి ఏపీ సిద్ధంగా ఉందని చెప్పినా అటువైపు నుంచి సానుకూలత కనిపించలేదు. మీరు చెప్పేవేవో మెకాన్ సంస్థకు లిఖితపూర్వకంగా చెప్పుకోవాలని కేంద్ర మంత్రి వారికి సూచించారు. మెకాన్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా టాస్క్‌ఫోర్స్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని, అంతవరకూ దీనిపై తాను ఏమీ చెప్పలేనని స్పష్టం చేశారు. ఆమరణ దీక్ష చేస్తున్న ఎంపీ సీఎం రమేష్ ఆరోగ్యం విషమిస్తున్నందున దీనిపై ప్రస్తుతం ప్రకటన చేసి దీక్ష విరమింపజేయాలని ఎంపీలు చేసిన విజ్ఞప్తిపై బీరేంద్రసింగ్ పెద్దగా (మిగతా 2లో)

ఎంపీ రమేష్‌కు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న అమెరికా వైద్యురాలు

నా శవాన్ని కళ్లజూస్తారు

- రెండ్రోజుల్లో ఉక్కు పరిశ్రమపై కేంద్రం నిర్ణయం తీసుకోకుంటే అంతే
- కేంద్ర మంత్రి బీరేంద్ర సింగ్‌కు ఫోన్‌లో ఎంపీ రమేష్ స్పష్టీకరణ
- దీక్ష విరమించాలని సూచించిన మంత్రి.. స్పష్టమైన ప్రకటన కావాలన్న ఎంపీ

2లో

తెదేపా ఎంపీలకు దొరకని మోదీ అపాయింట్‌మెంట్

- సమయం లేదన్న పీఎంఓ

12లో

స్విస్ బ్యాంకుల్లో 50% పెరిగిన భారతీయుల డబ్బు

- మూడేళ్లు తగ్గినా ఒకేసారి ఊపు
- 2017 గణాంకాలు విడుదల

జ్యూరిచ్/ దిల్లీ: స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు నిల్వలు మళ్లీ పెరిగాయి. నల్లధనంపై భారత ప్రభుత్వం కొరడా ఝుళిపించిన తర్వాత మూడేళ్ల పాటు తగ్గుతూ వచ్చిన డబ్బు 2017లో మాత్రం 50% పైగా పెరిగి 1.01 బిలియన్ల స్విస్ ఫ్రాంకులకు (సుమారు రూ.7000 కోట్లు) చేరుకుంది. స్విట్జర్లాండ్ సహా విదేశాల్లో మూలుగుతున్న నల్లధనంపై భారత ప్రభుత్వం చర్యలు చేపట్టిన తర్వాత ఇలాంటి పెరుగుదల చోటు చేసుకోవడం విస్మయపరిచే పరిణామమే. 2016లో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల సొమ్ములో 45% తగ్గుదల నమోదయింది. ఆ ఏడాది భారతీయుల డబ్బు రూ.4500 కోట్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 1987 నుంచి వివరాలు బహిర్గతం చేస్తుండగా భారతీయుల వాటా ఆ స్థాయికి పడిపోవడం అదే తొలిసారి. 2006 చివరి నాటికి స్విస్ బ్యాంకుల్లో భారతీయులు దాచుకున్న డబ్బు రికార్డు స్థాయిలో రూ.23,000 కోట్లకు చేరుకొంది. అక్కడి నుంచి దశాబ్ద కాలంలో దానిలో పదోవంతుకు పడిపోయింది. 2011లో 12%, 2013లో 43%, ఇప్పుడు 2017లో 50.2% పెరిగింది. 2004లో గరిష్ఠ స్థాయిలో 56% మేర పెరుగుదల ఉంది. స్విస్ బ్యాంకులకు మొత్తం అందరు విదేశీ ఖాతాదారుల నుంచి 2017లో వచ్చిన డబ్బు 3% పెరిగి 1.46 లక్షల కోట్ల స్విస్ ఫ్రాంకులకు (సుమారు రూ.100 లక్షల కోట్లు) చేరుకుందని స్విట్జర్లాండ్ జాతీయ బ్యాంకు (ఎస్ఎన్‌బీ) గురువారం (మిగతా 2లో)

గురువారం ముంబయిలో విమానం కూలిపోయిన ప్రాంతంలో సహాయక చర్యల్లో నిమగ్నమైన సిబ్బంది

కుప్పకూలిన విమానం

- నిర్మాణంలోని భవనాలపై పడి అయిదుగురి దుర్మరణం
- ముంబయి శివార్లలో దుర్ఘటన

ముంబయి, న్యూస్‌టుడే: మహారాష్ట్ర రాజధాని ముంబయి శివార్లలో గురువారం మధ్యాహ్నం ఓ ఛార్టర్డ్ విమానం కుప్పకూలిన ప్రమాదంలో మహిళా పైలెట్ సహా ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరో ముగ్గురు గాయపడ్డారు. 12 మంది ప్రయాణించే సామర్థ్యం ఉన్న 'కింగ్‌ఎయిర్ సీ90' విమానం ఘాట్కోపర్ ప్రాంతంలోని జాగృతినగర్ వద్ద ఒంటి గంట ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో విమానం దగ్ధమైపోగా.. ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. అప్పటికి విమానంలో ఇద్దరు పైలెట్లు, ఇద్దరు నిర్వహణ ఇంజినీర్లు ఉండగా.. వారితో పాటు నేలపై ఉన్న పాదచారి ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) అధికారి (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఉక్కు ఫ్యాక్టరీ కోసం మీరు రాసిన లేఖలను కమిటీ పరిశీలిస్తోంది బాబూ! తొందరపడకు.

'సేవా' ముసుగులో జీఎస్టీ ఎగవేత!

- రాష్ట్రంలో శిక్షణ కేంద్రాల అరాచకం
- పన్ను ఎగవేతలపై దృష్టిసారించిన వాణిజ్యపన్నుల శాఖ
- ఆదాయ వ్యయాల పరిశీలన
- బయటపడుతున్న సంస్థల లీలలు
- వెలుగులోకి రూ.కోట్ల పన్ను బకాయిలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పలు ప్రవేశ పరీక్షల కోసం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ప్రముఖ సంస్థలు వస్తుసేవలపన్నును(జీఎస్టీని) ఎగవేస్తున్నాయి. ఇందుకోసం సేవా దృక్పథం (ఛారిటబుల్)తో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొంటున్నాయి. అయితే సేవా దృక్పథంలో కూడా నిర్దేశించిన మార్గదర్శకాలకు భిన్నంగా ఉన్నట్లయితే తప్పకుండా పన్ను చెల్లించాల్సిందేనని వాణిజ్య పన్నులశాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మేరకు పలు శిక్షణ కేంద్రాల సంస్థల యాజమాన్యాలకు సంజాయిషీ నోటీసులను జారీ చేయడం ప్రారంభించాయి. జేఈఈ (మిగతా 2లో)

జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా అమర్‌నాథ్ గుహాలయంలో కనిపించిన మంచు లింగం. గురువారం జరిగిన ప్రధాన పూజలో జమ్మూకశ్మీర్ గవర్నర్ ఎన్ఎన్ వోహ్రా పాల్గొన్నారు. వర్షాల వల్ల ఉదయం యాత్రకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అనంతరం బల్టాల్, పహల్గామ్ బేస్ క్యాంపుల నుంచి యాత్రికులు కాలినడకన పవిత్ర గుహకు బయల్దేరి వెళ్లారు.

విధులను అడ్డుకోలేం

- ఫిరాయింపులపై స్పీకరు నిర్ణయం తీసుకోకపోతే సభ్యత్వం రద్దవుతుందన్న నిబంధనేమీ లేదు: హైకోర్టు
- కోడెల, అఖిలప్రియలపై వ్యాజ్యం కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపులపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించలేదనే కారణంతో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకరు కోడెల శివప్రసాదరావును విధులు నిర్వర్తించకుండా అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. మంత్రి అఖిలప్రియ విషయంలో స్పీకరు ఇంకా నిర్ణయం తీసుకోనందున ఆమెనూ (మిగతా 2లో)

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలోని రవికంటిపేటలో ఏరువాక కార్యక్రమానికి ఎడ్లబండిపై వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కేసుల భయంతో దాసోహం

(మొదటి పేజీ తరువాయి)

పండించే బాధ్యత రైతులుగా మీపై ఉంది. సాంకేతికను వాడుకోవాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని గట్టిగా కేంద్రాన్ని కోరా. వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు పెట్టాం. ఆహారశుద్ధి యూనిట్లు పెడతాం. పతంజలి, బార్లీ, బ్రిటానియా, కేడ్‌బరీ, ఐటీసీ తదితర సంస్థలను తెస్తున్నాం. క్రిమిసంహారక మందులు, రసాయనాలు వాడే పరిస్థితి పోవాలి. ప్రకృతి సేద్యం ద్వారానే ఇది సాధ్యం. ఈ ఏడాది 6లక్షల మంది ప్రకృతి సేద్యం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.'

ఉద్దానం బాధితులకు సాయం చేశాం

'ఉద్దానం బాధితులకు ప్రపంచంలో ఎక్కడా లేని సాయాన్ని అందించి అండగా నిలిచాం. కిడ్నీ బాధితులకు రూ.2500 పింఛను ఇస్తున్నాం. ఉచితంగా మందులిస్తున్నాం. డయాలసిస్ చేస్తున్నాం. మీరు అండగా నిలిస్తే కొండనైనా ఢీకొనే శక్తి తెదేపాకు ఉంది. భయం తెలియని పార్టీ తెదేపా. ఒకాయన పాదయాత్ర అంటాడు. ఇంకొకాయన పోరాట యాత్ర అంటాడు. బాజపా నాయకులు మొన్నటి దాకా కాంగ్రెస్‌లో ఉన్నారు. ఆ రోజు రాష్ట్రాన్ని ముంచారు. ఇప్పుడు భాజపాలో చేరి మళ్లీ అన్యాయం చేస్తున్నారు. మీకు ధైర్యం ఉంటే.. ఈ రాష్ట్రంపై అభిమానం ఉంటే.. మాతో కలిసి రండి. మీ పిరికితనం వదలండి. పదవులపై ఆశలు విడిచిపెట్టండి. మీ కేసుల కోసం లాలూచీ పడటం మానుకోండి. 5 కోట్ల మంది భవిష్యత్తును తాకట్టు పెట్టే అధికారం మీకు లేదు.'

మరో 11లక్షల మందికి అవకాశం

అమరావతి: ముఖ్యమంత్రి గురువారం ప్రారంభించిన చంద్రన్న రైతు బీమా పథకంతో కొత్తగా 11లక్షల మంది రైతులకు లబ్ధి కలగనుంది. వారితో కలిపితే రాష్ట్రవ్యాప్తంగా 50లక్షల మంది రైతులు ఈ పథకం పరిధిలోకి వస్తారని కార్మిక శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించి దీని పరిధిలోకి తెచ్చారు. రాష్ట్రంలో మొత్తం రైతుల సంఖ్య 76 లక్షలుగా 2011 లెక్కల ప్రకారం తేల్చారు. ఇందులో చిన్న, సన్నకారు రైతుల సంఖ్య 65లక్షలకు పైగా ఉంటుంది. చంద్రన్న రైతు బీమాలో నమోదు చేసుకోవాలంటే 17 సంవత్సరాలు నిండినవారే అర్హులు. 70ఏళ్లు పైబడిన వారికి వర్తించదు. ఆధార్ కార్డులు లేని వారు, ప్రజా సాధికార సర్వేలో నమోదు కానివారు అనర్హులే. ఇలాంటి వారందరినీ తీసేస్తే నికరంగా 50 లక్షల మంది అర్హులవుతారనేది కార్మికశాఖ అంచనా. ఇందులో 39లక్షలకు పైగా రైతులు ఇప్పటికే పథకం పరిధిలో ఉన్నారు.

కొత్తగా చేరేదెలా?

సాధారణంగా చంద్రన్న బీమా పథకం ఏటా జూన్ 1న మొదలై మే ఆఖరుతో ముగుస్తుంది. ప్రభుత్వంవద్ద ఉన్న ప్రజా సాధికార సర్వే వివరాల ఆధారంగా లబ్ధిదారులను నమోదు చేస్తారు. 17ఏళ్లు నిండిన వారు ప్రత్యేకంగా నమోదు చేసుకోనవసరం లేకుండానే ఇందులోకి వస్తారు. 70 ఏళ్లు నిండిన వెంటనే తొలగిపోతారు.

విధులను అడ్డుకోలేం

(మొదటి పేజీ తరువాయి)

నిలువరించలేమని తేల్చి చెప్పింది. నిర్దిష్ట కాలంలో స్పీకరు నిర్ణయం తీసుకోకపోతే సభ్యత్వం దానంతటదే రద్దవుతుందనే నిబంధన రాజ్యాంగంలో లేదని స్పష్టం చేసింది. అఖిలప్రియపై చేసిన ఫిర్యాదును పరిష్కరించనందున స్పీకరు, మంత్రిగా కొనసాగుతున్న అఖిలప్రియలను విధులు నిర్వహించకుండా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది జి.మల్లేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ దశలోనే కోర్టు కొట్టేసింది. ఈ వ్యాజ్యానికి విచారణార్హత లేదని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ బాలయోగిలతో కూడిన ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది.

రాజ్యాంగ ధర్మాసనం పరిధిలో ఉంది

పార్టీ ఫిరాయింపులపై స్పీకరు త్వరగా నిర్ణయం తీసుకోలేదనే అంశం న్యాయ సమీక్ష పరిధిలోకి వస్తుందా? లేదా? అనే విషయాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీం కోర్టు నివేదించిందని, ఆ ఆదేశాలను అధ్యయనం చేసి రావాలని పార్టీ ఫిరాయింపులను సవాలు చేసిన పిటిషనరు తరపు న్యాయవాదికి హైకోర్టు స్పష్టం చేసింది. వైకాపా నుంచి గెలిచి తెదేపాలోకి మారిన వారిపై స్పీకరుకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ వైకాపా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంతోపాటు మరో వ్యాజ్యం హైకోర్టులో గురువారం విచారణకు వచ్చింది. ఇంకా నోటీసులు అందుకోని ప్రతివాదులకు మరోసారి నోటీసులు జారీచేసిన జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ బాలయోగిలతో కూడిన ధర్మాసనం.. ప్రమాణ పత్రాలు దాఖలు చేయడానికి మరో రెండు వారాల గడువిచ్చింది. ఫిరాయింపులను ప్రోత్సహించబోమని నాయకులు చెబుతుంటారేగానీ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఫిరాయింపులు జరుగుతూనే ఉంటాయని, రాజ్యాంగంపట్ల గౌరవం లేనివాళ్లు కొందరు చట్ట సభలకు వెళుతున్నారని వ్యాఖ్యానించింది.

2 నెలల్లో ఏపీఏటీ సభ్యుడి నియమించండి

ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రైబ్యునల్‌లో (ఏపీఏటీ) సభ్యుడి నియామకానికి వారంలో ప్రకటన ఇవ్వాలని ఏపీ సర్కారును హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత 2 నెలల్లో నియామక ప్రక్రియను పూర్తి చేయాలని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం గురువారం తేల్చి చెప్పింది.

ఉక్కుపై కాలయాపన

(మొదటి పేజీ తరువాయి)

స్పందించలేదు. దీనిపై టాస్క్‌ఫోర్స్ కసరత్తు చేస్తున్నందున అంతా మంచే జరుగుతుందని భావించి దీక్ష విరమించాలని మాత్రమే సీఎం రమేష్‌కు సూచించారు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడినప్పుడు కూడా ఇదే అంశాన్ని చెప్పారు. తెలుగుదేశం ఎంపీలు బుధవారం కేంద్ర మంత్రిని కలిసి విన్నవించినప్పుడు భూమి, ఖనిజ అనుసంధానంపై రాష్ట్ర ప్రభుత్వ సమాచారం కోరామని, అది అందిన వెంటనే కార్యాచరణ చేపడతామని హామీనిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఎంపీలు బుధవారమే అమరావతిలోని ఏపీఎండీసీ ఎండీ వెంకయ్యచౌదరితో మాట్లాడగా కేంద్రం అడిగిన సమాచారం తాము 22వ తేదీనే పంపించామని చెప్పారు. ఎంపీలు ఆయన్ను గురువారం దిల్లీకి పిలిపించి సమాచార మార్పిడికి సంబంధించిన వివరాలన్నింటినీ కేంద్ర మంత్రి బీరేంద్రసింగ్, ఉక్కుశాఖ కార్యదర్శి అరుణాశర్మలకు కూలంకషంగా వివరించారు. ఉక్కు పరిశ్రమ కోసం రాష్ట్రం నాలుగు వేల ఎకరాలు కేటాయించిందని, అకస్మాత్తుగా ఈనెల 15న 1800 ఎకరాలు ఇస్తే చాలని మెకాన్ వర్తమానం పంపిందని ఎంపీ దివాకర్‌రెడ్డి కేంద్ర మంత్రికి చెప్పారు. ఆ భూమి ఇవ్వడానికి తాము సిద్ధమేనని మెకాన్‌కు ఏపీఎండీసీ కూడా వర్తమానం పంపిందని వివరించారు. మెకాన్ కొత్తగా మార్కింగ్ చేసిన భూమిలో లోగడ రాష్ట్రం కేటాయించిన నాలుగు వేల ఎకరాల్లోని 1300 ఎకరాలకు అనుబంధంగా మరో 500 ఎకరాల ప్రైవేటు భూమి ఉందని చెప్పారు. ఈ 500 ఎకరాల గురించి ఈనెల 15న పంపిన లేఖలో కొత్తగా చెప్పారని వివరించారు. తాము ప్రైవేటు భూమిని అధిక ధరకు కొన్నా కేంద్రానికి ప్రభుత్వ భూమి తరహాలోనే ఎకరాకు రూ.నాలుగు లక్షలకే ఇస్తామని తెలిపారు. 24 గంటల్లో ఈ సమాచారం మెకాన్‌కు పంపుతామని, వెంటనే కార్యాచరణ చేపట్టాలని ఎంపీలు ముక్తకంఠంతో కేంద్ర మంత్రిని కోరారు. అనంతరం కేంద్ర మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ.. . మెకాన్ కోరిన వివరణలన్నింటికీ ఏపీ ప్రభుత్వం సమాధానం పంపినట్లు ఎంపీలు తన దృష్టికి తెచ్చారని అన్నారు. ఆ సమాధానాల ఆధారంగా మెకాన్ తుది నివేదికను తయారుచేసి టాస్క్‌ఫోర్స్ సమావేశం ముందు పెడుతుందని తెలిపారు. వారి సిఫారసుల ఆధారంగా ప్లాంటు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. ఈ ప్రక్రియ తుది అంకానికి చేరుకున్నదని అన్నారు. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటై ఏడాదిన్నరే అయిందని, నాలుగేళ్లుగా దీనిపై జాప్యం చేస్తున్నామనడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ హామీ విభజన చట్టంలో ఉందని, దీని అమలుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం అవసరమవుతుందని పేర్కొన్నారు. సమస్యకు ఉత్తమ పరిష్కారం లభించాలని కోరుకుంటున్నానన్నారు.

గురువారం దిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి బీరేంద్ర సింగ్‌తో సమావేశమైన తెదేపా ఎంపీలు

బయ్యారంతో ముడిపెడుతున్న కేంద్ర మంత్రి

విభజన చట్టంలో కడపతో పాటు తెలంగాణలోని బయ్యారం పరిశ్రమ ఏర్పాటు అంశం ఉన్నందున ఒకేసారి వీటిపై ముందుకు వెళ్లాలనుకుంటున్నట్లు కేంద్ర మంత్రి బీరేంద్రసింగ్ తెదేపా ఎంపీలతో సమావేశం, అనంతరం విలేకర్లతో ఇష్టాగోష్ఠిలోనూ వ్యాఖ్యానించారు. టాస్క్‌ఫోర్సు ఈ రెండింటి కోసమూ ఏర్పాటుచేశామని, ఇప్పటివరకూ మెకాన్ ప్రశ్నలకు ఏపీ 95శాతం సమాధానాలిస్తే, తెలంగాణ 15శాతమే ఇచ్చిందని అన్నారు. మిగిలిన సమాధానాలివ్వాలని తెలంగాణకు తాము సూచించామన్నారు. రెండు కర్మాగారాలను వేర్వేరుగా చూస్తామని ఒకసారి, ఒకేసారి ముందుకెళ్తామని మరోసారి సమాధానమిచ్చారు. ఒక రాష్ట్రానికి ప్లాంటు ప్రకటించి మరో రాష్ట్రానికి ప్రకటించకపోతే రాజకీయంగా ఇబ్బందులు వస్తాయేమోనన్న ఉద్దేశంతో కేంద్రం రెండింటిపై ఒకే విధానంతో వెళ్లాలని యోచిస్తున్నట్లు ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది.

రైల్వేలైన్ ఖర్చు భరిస్తామన్నాం: జేసీ

కడప ఉక్కు పరిశ్రమ కోసం అవసరమైన 16 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణ వ్యయాన్నీ తామే భరిస్తామని కేంద్ర మంత్రికి స్పష్టం చేసినట్లు ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. '500 ఎకరాల ప్రైవేటు భూమి కావాలని దుర్బుద్ధితో అడిగారు. ప్రాజెక్టు జాప్యం చేయడంతోపాటు, నెపాన్ని రాష్ట్రంపైకి నెట్టాలనే కొర్రీలు వేయించారు. కేంద్రం కుట్రలను అడ్డుకోడానికి ప్రైవేటు భూమినీ కొనిస్తామన్నాం. మంత్రి కోరిన వివరణలన్నీ శుక్రవారానికల్లా ప్రత్యేక దూత ద్వారా పంపుతాం. అయిదో తేదీలోపు మళ్లీ వచ్చి మంత్రిని కలుస్తాం' అని అన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు నిమ్మల కిష్టప్ప, గల్లా జయదేవ్, కె.రామ్మోహన్‌నాయుడు, బుట్టా రేణుక, శ్రీరాంమాల్యాద్రి, పండుల రవీంద్రబాబు, మాగంటి బాబు, గరికపాటి మోహన్‌రావు, కనకమేడల రవీంద్రకుమార్ ఉన్నారు.

నా శవాన్ని కళ్లజూస్తారు

- రెండ్రోజుల్లో ఉక్కు పరిశ్రమపై కేంద్రం నిర్ణయం తీసుకోకుంటే అంతే: రమేష్

కడప, ఈనాడు: రెండ్రోజుల్లోపు కడప ఉక్కు పరిశ్రమపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే నా శవాన్ని కళ్లచూస్తారని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ అన్నారు. కడపలోని ఆయన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోరుతూ తొమ్మిది రోజులుగా ఆమరణదీక్ష చేస్తుండగా గురువారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కుమంత్రి చౌధురి బీరేంద్ర సింగ్ ఫోన్ చేశారు. ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి దీక్ష విరమించాలని కోరారు. రమేష్ స్పందిస్తూ.. కేంద్రం ఉక్కుపరిశ్రమ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన ఇస్తే విరమిస్తానన్నారు. అందరితో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని.. ప్రధానితోనూ మాట్లాడిన తర్వాతే చెప్పగలనని మంత్రి స్పష్టం చేశారు. 'సరే.. ప్రధానితో మాట్లాడి చెప్పండి. కావాలంటే ఈ ఘనతను మీరే(భాజపా) తీసుకోండి. మాకేమీ అభ్యంతరం లేదు. రెండ్రోజుల్లో సానుకూల ప్రకటన రాకపోతే మాత్రం నా శవాన్ని కళ్లచూస్తారు' అని రమేష్ బదులిచ్చారు. సుమారు పదిహేను నిమిషాల పాటు వారి మధ్య ఫోన్ సంభాషణ సాగింది.

ఉపరాష్ట్రపతి ఆరా.. కోల్‌కతా పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా రమేష్ ఆరోగ్య పరిస్థితి గురించి కడప కలెక్టర్ హరికిరణ్‌తో ఫోన్లో మాట్లాడారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పోలవరంపై స్టే ఉత్తర్వు నిలుపుదలను పొడిగించండి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని, పనులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన కోరుతున్నారు. స్టే ఉత్తర్వుల ఫైలు ప్రస్తుతం కేంద్ర పర్యావరణశాఖ వద్ద ఉంది. సంబంధిత కార్యదర్శి విదేశీ పర్యటనలో ఉన్నారని సమాచారం. ఆయన రావడానికి మరో మూడు రోజుల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో కేంద్రం సానుకూలంగానే ఉందని, పనులకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్న ఆశాభావాన్ని జల వనరులశాఖ అధికారులు వ్యక్తం చేశారు.

'సేవా' ముసుగులో జీఎస్టీ ఎగవేత!

(మొదటి పేజీ తరువాయి)

మెయిన్స్, అడ్వాన్స్డ్, నీట్, ఎంసెట్ ద్వారా సాంకేతిక, వైద్య విద్యలో ప్రవేశాలను పొందేందుకు పలు సంస్థలు ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలు నడుపుతున్నాయి. ఈ సంస్థలేవీ జీఎస్టీ కింద పేర్లను నమోదు చేసుకోలేదు. వీటిని ఛారిటబుల్ లేదా ట్రస్టు కింద నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. విద్యార్థుల నుంచి మాత్రం భారీగా ఫీజులు వసూలు చేస్తూ వందల కోట్ల రూపాయలను వెనకేసుకుంటూ పన్ను చెల్లింపులకు మాత్రం ముందుకు రావడంలేదు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఉన్నతస్థాయిలో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం శిక్షణ కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించాలని నిర్ణయించారు. దీని ప్రకారం కృష్ణా, గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, కర్నూలు, ఇతర జిల్లాల్లో శిక్షణ కేంద్రాల రికార్డుల పరిశీలన ప్రారంభమైంది. నిజానికి కేంద్ర మార్గదర్శకాల ప్రకారం తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారికి, హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో బాధపడే వారికి, మాదక ద్రవ్యాల బారినపడిన వారికి, ఖైదీల సంరక్షణ, అనాథలు, ఇతరులకు ఛారిటబుల్ సంస్థలు సేవలు అందిస్తున్నట్లయితే వాటికి జీఎస్టీ నుంచి మినహాయింపు లభిస్తుంది.

ఒక్క సంస్థ రూ.70 కోట్లు చెల్లించాలి.. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఏడాదికి రూ.2,577, ద్వితీయ సంవత్సరంలో రూ.2,835 విద్యార్థుల నుంచి వసూలు చేయాలని కిందటేడాది మే 9వ తేదీన ఇంటర్ విద్యా మండలి ఉత్తర్వులను జారీ చేసింది. వీటిని ఏ యాజమాన్యం పట్టించుకోవడంలేదన్నది బహిరంగ రహస్యం. వాణిజ్య పన్నుల శాఖ పరిశీలనలో ఈ అంశానికి ప్రాధాన్యం చేకూరింది. శిక్షణ కేంద్రాల నిర్వహణ పరంగా చూసినట్లయితే కోస్తాలో ఇంటర్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ఓ కేంద్రం, అనుబంధ సంస్థలతో కలిపి రూ.70 కోట్లను, వైద్య విద్యలో ప్రవేశాలకు శిక్షణ ఇచ్చే సంస్థ రూ.18.5 లక్షలను జీఎస్టీ కింద చెల్లించాల్సి ఉందని వాణిజ్య పన్నుల శాఖ తెలియచేసింది. ఇదేవిధంగా కృష్ణా జిల్లాలోనే టెట్-డీఎస్సీ కోసం ప్రత్యేంగా శిక్షణ ఇస్తున్న సంస్థ రూ.47 లక్షలు, ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ రూ.9.4 లక్షలను చెల్లించాల్సి ఉందని గుర్తించారు. అలాగే... గుంటూరు, నెల్లూరు, వైజాగ్, కర్నూలు, ఇతర జిల్లాల్లోనూ ఇటువంటి పరిస్థితులే నెలకొన్నట్లు తెలిసింది. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రికార్డుల పరిశీలన జరిపిన అనంతరం పలు సంస్థలు జీఎస్టీ కింద పేర్లను నమోదు చేసుకుంటుండడం గమనార్హం. ఉద్యోగ నియామకాల కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చే కేంద్రాల ఆదాయ వ్యయ వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు.

DSC SGT, PET, SA (Maths/Phy.Sci./Bio.Sci./Social)
School Asst. కు ఇంటర్ సిలబస్ దృష్ట్యా స్టేట్ ఫేమ్ ఫ్యాకల్టీచే
FREE DEMO : 1-7-18@10AM by
Phy.Sci.: రాము, వేణు, Bio.Sci. : ఆంజనేయులు, హరినాథ్, విక్రమ్
Maths : నాగక్రిష్ణ, రాజశేఖర్, SGT : రాంబాబు, సుధీర్, PET : వంశీ
బాసర ఇనిస్టిట్యూట్
ఆంధ్ర హాస్పిటల్ దగ్గర, ఈగల్ రెస్టారెంట్ ఎదురుగా గవర్నర్‌పేట, విజయవాడ
9030140123
8374022333

పర్‌స్పెక్టివ్స్ / సైకాలజి
10 Marks, 5 Days (July 2nd to 6th)
Coaching by డా॥ మోజెస్
EMILY Hyderabad.
@ Metro Railway Station, Ameerpet.
9989212294

రూ.4 కోట్లతో మారేడుమిల్లిలో రిసార్ట్

ఈనాడు, అమరావతి: తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లిలో మూడు నక్షత్రాల విలాసవంతమైన కాటేజీలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. సంబంధిత పనులు చేపట్టేందుకు రూ.4.01 కోట్లు మంజూరు చేసింది.

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
13 సం॥ల అనుభవం కలిగిన ఎస్. విజయ్ కుమార్ రెడ్డి సార్ చే స్థాపించబడిన
50/50 విద్యార్థులకు UPSC /కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ Assistance.
After Degree - Morning Batch (1 year)
During Degree - Evening Batch(2 years)
Degree + IAS (50 students) 3yrs Integrated Program
ఇంటిని మరిపించే Hostel facility
Civil Services IAS Exam పై ఉచిత అవగాహనా సదస్సు on July 1st SUN. 10 am & 5 pm
IAS Coaching సొంత పుస్తకాలు గల ఏకైక సంస్థ
విద్యార్థులు / తల్లిదండ్రులు అందరూ ఆహ్వానితులే
Beside Nagarjuna Hospital, Kanuru, VIJAYAWADA. Ph: 6300181832

దుర్గమ్మ మొక్కు తీర్చుకున్న కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

తరపున కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడలోని గేట్‌వే హోటల్‌కు చేరుకుని పది నిమిషాలు విశ్రాంతి తీసుకుని.. దుర్గగుడికి తరలివెళ్లారు. కేసీఆర్ దంపతులకు దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధ, ఆలయ ఈవో పద్మ, ధర్మకర్తల మండలి ఛైర్మన్ గౌరంగబాబు, వైదిక కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి కేసీఆర్ దంపతులు 11.9 గ్రాముల బరువున్న బంగారు ముక్కుపుడక, పట్టువస్త్రాలు, సారెను సమర్పించారు. ముక్కు పుడకను వేదపండితులు అమ్మవారికి అలంకరించారు. ముక్కు పుడకలో 56 వజ్రాలు, 11 నీలి రాళ్లు, ఒక ఎరుపు, మూడు పచ్చ రాళ్లున్నాయి. ముక్కుపుడకతో ఉన్న దుర్గమ్మను దర్శించుకున్న కేసీఆర్ సాష్టాంగ నమస్కారం చేశారు. అమ్మవారికి షోడశ ఉపచారాలు, కుటుంబ సభ్యుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలను చేయించారు. అనంతరం కేసీఆర్ దంపతులు, బంధువులకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం తరపున అమ్మవారి చిత్రపటంతోపాటు శేషవస్త్రాలు, ప్రత్యేకంగా తయారు చేయించిన ప్రసాదాలను అందజేశారు. కేసీఆర్ అభీష్ఠం మేరకు రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండేందుకు దుర్గగుడి ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక సంకల్పం చేశారు. కేసీఆర్ ఆలయానికి మధ్యాహ్నం 12.55 గం.లకు చేరుకుని.. అర్ధ గంటపాటు ఉన్నారు. తిరిగి 1.25 గం.లకు గుడి నుంచి నేరుగా గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

విజయవాడ కనకదుర్గ దేవాలయానికి వస్తున్న కేసీఆర్. చిత్రంలో తెలంగాణ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

కేసీఆర్‌కు ఘన స్వాగతం..

గన్నవరం విమానాశ్రయంలో కేసీఆర్‌కు మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మన్మోహన్‌సింగ్, రాష్ట్ర ప్రొటోకాల్ ఉన్నతాధికారి అశోక్‌బాబు, కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ విజయ్‌కృష్ణన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. కేసీఆర్ తిరిగి వెళ్లేవరకూ మంత్రి ఉమామహేశ్వరరావు, అధికారులు ఆయనతో పాటే ఉన్నారు. గుడిలో కేసీఆర్ కుటుంబ సభ్యులను రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి దగ్గరుండి దర్శనానికి తీసుకెళ్లారు. కేసీఆర్ తిరిగి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2.39 గం.లకు గన్నవరం నుంచి బయలుదేరి వెళ్లారు.

దుర్గగుడిలోని ఆశీర్వచన మండపంలో కేసీఆర్‌తో ఫొటోలు దిగేందుకు అర్చకులు, దేవస్థానం ఉద్యోగులు ఉత్సాహం చూపించారు. భక్తులు సైతం కేసీఆర్‌ను చూసేందుకు గంట ముందు నుంచే బారులు తీరారు.

తెదేపా పాలన బాగుంది: ఇంద్రకరణ్‌రెడ్డి

ఏపీలో తెదేపా పాలన బాగుందని, ఇక్కడి ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలంగాణ దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విజయవాడ విమానాశ్రయంలో పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. దుర్గ గుడి, విమానాశ్రయాలను బాగా అభివృద్ధి చేశారన్నారు.

మళ్లీ గెలిచి వస్తా

కేసీఆర్

ఈనాడు, అమరావతి: వచ్చే ఎన్నికల్లో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుంటానని కేసీఆర్ పేర్కొన్నారు. దుర్గమ్మ మొక్కును తీర్చుకునేందుకు గురువారం విజయవాడకు వచ్చిన కేసీఆర్‌కు ఏపీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఘన స్వాగతం పలుకగా.. ఇద్దరూ ఒకే వాహనంలో దుర్గగుడికి వెళ్లి..తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్ దుర్గమ్మ దర్శనం బాగా జరిగిందంటూ సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు తాను ప్రత్యేకంగా ఫోన్ చేసి కృతజ్ఞతలు చెబుతానని అన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి విజయవాడ వరకూ పచ్చదనం బాగుందంటూ కేసీఆర్ కితాబిచ్చారు. తాను గతంలో విజయవాడ వచ్చినప్పటి కంటే ప్రస్తుతం నగరంలోని బందరు రోడ్డును బాగా విస్తరించారని పేర్కొన్నారు. చాలా అంశాల్లో నగరం బాగా అభివృద్ధి చెందిందనీ, గన్నవరం విమానాశ్రయం కొత్త టెర్మినల్ బాగుందంటూ మెచ్చుకున్నారు. విజయవాడ నగరంలోని రోడ్ల పక్కన గోడలన్నీ పెయింటింగ్‌లతో చూసేందుకు చాలా బాగా చేశారన్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య ఓ ఆసక్తికరమైన అంశంపై సంభాషణ జరిగింది. తెలంగాణ కోసం మీరు ఆమరణ దీక్ష చేయగా.. సమైక్యాంధ్ర కోరుతూ తాను ఆమరణ దీక్ష చేశానంటూ దేవినేని ఉమా అన్నారు. రాష్ట్రం విడిపోయి తెలంగాణకు మీరు ముఖ్యమంత్రి అవ్వగా.. తాను మంత్రిని అయ్యానంటూ దేవినేని సరదాగా అనడంతో.. ప్రజాస్వామ్యం గొప్పతనం అదేనంటూ కేసీఆర్ బదులిచ్చారంటూ ఉమా పేర్కొన్నారు. కేసీఆర్ విజయవాడలో రెండున్నర గంటల పర్యటనలో ఎక్కడా మీడియాతో మాట్లాడలేదు. విమానాశ్రయంలో తిరుగు ప్రయాణం అయ్యే సమయంలో.. అమ్మవారి దర్శనం ఎలా జరిగిందంటూ కొందరు మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా..బాగా జరిగిందంటూ ఆనందంగా చేతిని పైకి లేపి సైగల ద్వారా వెల్లడించి వెళ్లిపోయారు. కేసీఆర్‌కు కొండపల్లి బొమ్మను మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అందజేశారు.

అమలాపురంలో 13 సెం.మీ వర్షం

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అమలాపురంలో అత్యధికంగా 13 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ తెలిపింది. గుడివాడ, నర్సాపురం, భీమవరంలో 11 సెం.మీ, పాలకోడేరు, కైకలూరు, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం, అవనిగడ్డలో 7 సెం.మీ, వరరామచంద్రాపురం, చింటూరు, తణుకులో 6 సెం.మీ, రేపల్లె, పెద్దాపురం, తిరువూరు, పోలవరం, కాకినాడ, కొయ్యలగూడెం, నూజివీడులో 5 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. నైరుతీ రుతుపవనాల ప్రభావం తీవ్రంగా ఉండటం వల్లే వర్షాలు కురిశాయని వాతావరణశాఖ తెలిపింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని వివరించింది.

కుప్పకూలిన విమానం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. జుహు చిన్న విమానాశ్రయం నుంచి ప్రయోగాత్మకంగా నడిపేందుకు బయల్దేరిన ఈ విమానానికి (టెస్ట్ ఫ్లైట్) - టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటి తర్వాత ఏటీసీతో సంబంధాలు తెగిపోగా.. అనంతరం నిర్మాణంలో ఉన్న భవనాలపై కుప్పకూలింది. ఆ సమయానికి అక్కడ పనిచేస్తున్న 40 మంది కార్మికులు భోజనానికి వెళ్లడంతో పాటు, జన సంచారం అంతగా లేకపోవడంతో పెద్దఎత్తున ప్రాణనష్టం తప్పింది. మృతులను మారియా జుబేరీ, ప్రదీప్ రాజ్‌పుత్ (పైలెట్లు), సురభి గుప్త, మనీష్ పాండే (నిర్వహణ సిబ్బంది), గోవింద్ పండిట్ (పాదచారి)లుగా గుర్తించారు. కాగా ప్రమాద ఘటనపై పౌర విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవిస్ తదితరులు ఘటనస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డీజీసీఏ అధికారులు ప్రాథమిక విచారణ ప్రారంభించారు. బ్లాక్‌బాక్స్‌ను కనుగొన్నట్లు అధికారులు తెలిపారు.

ప్రాణాలు పణంగా పెట్టి.. విమాన ప్రమాదంలో తన ప్రాణాలు పణంగా పెట్టి.. మహిళా పైలెట్ ఎంతో మంది ప్రాణాలు కాపాడినట్లు పౌర విమానయాన శాఖ మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్ ట్విట్టర్‌లో ప్రశంసించారు. ప్రమాదానికి గురైన సమయంలో విమానం నివాస భవనాలను ఢీకొట్టకుండా ఆమె దారి మళ్లించినట్లు తెలిపారు.

నాలుగేళ్ల క్రితం యూపీ ప్రభుత్వానిది.. ముంబయిలో ప్రమాదానికి గురైన విమానం 2014 వరకూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వద్ద ఉండేది. అదే ఏడాది ముంబయికి చెందిన యూవై విమానయాన సంస్థకు విక్రయించినట్లు యూపీ సమాచార ముఖ్య కార్యదర్శి అవినాష్ అవస్థి తెలిపారు.

స్విస్ బ్యాంకుల్లో 50% పెరిగిన భారతీయుల డబ్బు

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసిన అధికారిక సమాచారం పేర్కొంటోంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2017లో అన్ని విభాగాల్లోనూ డబ్బు వెల్లువెత్తిందని తెలిపింది. నల్లధనం బెడద నిర్మూలనకు సమాచారం మార్పిడి చేసుకోవాలని భారత్, స్విట్జర్లాండ్‌లు నిర్ణయించుకున్న మీదట తాజా గణాంకాలు వెలుగులోకి వచ్చాయి.

గ్రహం అనుగ్రహం

29-6-2018 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
పాడ్యమి: ఉ. 11-03 తదుపరి విదియ
పూర్వాషాఢ నక్షత్రం: మ. 2-25 తదుపరి ఉత్తరాషాఢ
అమృత ఘడియలు: ఉ. 9-07 నుంచి 10-53 వరకు
వర్జ్యం: రా. 11-16 నుంచి 1-03 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-08 నుంచి 9-01 వరకు
తిరిగి మ. 12-29 నుంచి 1-21 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-32; సూర్యాస్తమయం: సా.6-34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	36.0	27.0
తిరుపతి	35.8	26.2
ఒంగోలు	35.5	28.1
నెల్లూరు	35.0	28.0
మెదక్	34.6	20.8
అనంతపురం	34.3	24.1
ఖమ్మం	34.0	28.0
హన్మకొండ	34.0	24.0
నల్గొండ	34.0	23.0
ఆదిలాబాద్	33.5	22.5
హైదరాబాద్	33.2	24.3
నిజామాబాద్	33.1	23.4
శ్రీకాకుళం	33.0	25.0
గుంటూరు	32.9	24.1
కర్నూలు	32.8	26.7
రాజమహేంద్రవరం	32.0	23.5
సూర్యాపేట	31.0	25.0
విజయవాడ	30.9	24.1
నరసాపురం	29.3	24.4
తాడేపల్లిగూడెం	29.0	26.0
విశాఖపట్నం	28.8	24.0

మోదీ, జగన్ మ్యాచ్ ఫిక్సింగ్

- కడప 'ఉక్కు' దీక్షలో మంత్రుల ఆగ్రహం
- మరింత క్షీణిస్తున్న సీఎం రమేష్ ఆరోగ్యం
- రేపు శిబిరానికి చంద్రబాబు

ఈనాడు - కడప

ప్రధాని మోదీ, రాష్ట్రంలో విపక్ష నేత జగన్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని రాష్ట్ర మంత్రులు ఆరోపించారు. అందుకే కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా జగన్ కేంద్రానికి వ్యతిరేకంగా నోరెత్తలేకపోతున్నారన్నారు. విభజనచట్టం హామీలు అమలు చేయని కేంద్ర ప్రభుత్వాన్ని, దానికి వంతపాడుతున్న వైకాపాను ప్రజలు సమాధి చేసే సమయం ఎంతో దూరంలో లేదన్నారు. ఉక్కు కర్మాగారం నెలకొల్పాలని కడప జడ్పీ ప్రాంగణంలో ఎంపీ సీఎం రమేష్ చేపట్టిన ఆమరణదీక్ష గురువారానికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. రాష్ట్ర మంత్రులు నారాయణ, ఆదినారాయణరెడ్డి, గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా జగన్ పొంతనలేని మాటలు మాట్లాడుతున్నారని మంత్రి నారాయణ విమర్శించారు. కడప ఉక్కు కోసం ఒక్కమాట మాట్లాడని జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. తెలుగువారితో పెట్టుకున్న కాంగ్రెస్ భూస్థాపితమైందని.. ఇప్పుడు భాజపాకూ అదే గతి పడుతుందని మంత్రి ఆదినారాయణరెడ్డి అన్నారు. తెలుగువారి ప్రేమ ఎంతో.. కసి కూడా అలాగే ఉంటుందని హెచ్చరించారు. వైకాపా నాయకులకు నవరత్నాలేంటో తెలియదన్న ఆది.. చంద్రబాబుకు నవరసాలు తెలుసని చెప్పారు. కేసుల మాఫీ కోసం ప్రధానితో జతకట్టిన జగన్ చరిత్ర హీనుడని శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి విమర్శించారు. పులివెందులలో చరిత్ర తిరగరాసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామసుబ్బారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, చంద్రదండు ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి బీరేంద్రసింగ్ నివాసం వద్ద నినాదాలు చేస్తున్న తెదేపా ఎంపీలు

సహకరించని శరీరం

తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తోన్న రమేష్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. ఆయన ఎక్కువసేను పడుకునే కనిపిస్తున్నారు. రిమ్స్ వైద్యులు ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా నుంచి వచ్చిన రమేష్ మిత్రులైన వైద్యులు దీక్ష శిబిరంలో ఆయన్ను పరీక్షించారు. డాక్టర్లు రాజా, గాయత్రి మాట్లాడుతూ వారం రోజులుగా అమెరికా నుంచే తాము ఆయన ఆరోగ్య పరిస్థితిని అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. రెండు రోజులుగా పరిస్థితి తీవ్రంగా ఉందని కిడ్నీ, లివర్ భాగాల్లో విషపదార్థాలు ఎక్కువగా చేరుతున్నట్లు చెప్పారు. వాటిపై ఒత్తిడి ఎక్కువవుతోందని.. అత్యవసర విభాగంలో చికిత్స అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు. దీక్ష భగ్నం చేయడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బీటెక్ రవి కోలుకుంటున్నారు. ఆయన అక్కడా దీక్ష కొనసాగిస్తున్నట్లు సన్నిహితవర్గాలు స్పష్టం చేస్తుండగా.. మంత్రి నారాయణ రిమ్స్‌కు వెళ్లి పరామర్శించారు.

పరామర్శకు ముఖ్యమంత్రి

ఈ నెల 30వ తేదీ శనివారం తెదేపా అధినేత చంద్రబాబు కడప జిల్లాకు రానున్నారు. దీక్ష చేస్తున్న సీఎం రమేష్‌ను పరామర్శించనున్నారు. ఈ మేరకు జిల్లా తెదేపా నాయకత్వానికి స్పష్టమైన సమాచారం అందింది.

ఉక్కు దీక్షకు ప్రవాసాంధ్రుల సంఘీభావం

ఈనాడు డిజిటల్, అమరావతి: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ఆమరణ దీక్ష చేస్తున్న ఎంపీ రమేశ్, ఎమ్మెల్సీ బీటెక్ రవికి ప్రవాసాంధ్రులు మద్దతు తెలిపారు. కువైట్‌కులోని బీపీ.నాయుడు, సురేశ్‌బాబు, జీఎస్.బోర్రా, దివాకర్ ఓలేటి, భాస్కర్‌నాయుడు, ఖాదర్‌భాష తదితరులు మద్దతు తెలిపారు.

కాకినాడలో నేడు లక్ష మందితో ధర్మపోరాటం

- తెదేపా విస్తృత ఏర్పాట్లు
- ఒక్కో నియోజకవర్గం నుంచి 5వేల మంది వచ్చేలా చర్యలు

ఈనాడు-కాకినాడ: తెలుగుదేశం ధర్మపోరాట దీక్షకు కాకినాడలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే విశాఖపట్నం, తిరుపతిలలో నిర్వహించగా మూడో సభను కాకినాడలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నారు. లక్ష మందికిపైగా పాల్గొనేలా పార్టీ శ్రేణులు కసరత్తు చేస్తున్నాయి. కాకినాడ జేఎన్‌టీయూ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేబినెట్ మంత్రులు, ఎంపీలు హాజరవుతారని ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, మండలి విప్ ఎంఏ షరీఫ్ తదితరులు గురువారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆర్థిక మంత్రి యనమల మాట్లాడుతూ.. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో వివరణల నెపంతో కేంద్రం జాప్యం చేస్తోందని ఆరోపించారు. సొంత జిల్లాకు అన్యాయం జరుగుతున్నా మాట్లాడని వైకాపా నేత జగన్.. ప్రజలకేం మేలు చేస్తారని ప్రశ్నించారు. విభజన తరువాత న్యాయబద్ధంగా రాష్ట్రానికి రావాల్సిన నిధుల మంజూరు విషయంలో కేంద్రం వైఖరిని, మోసాన్ని ప్రజలకు వివరించేందుకే ధర్మపోరాట సభలను నిర్వహిస్తున్నామన్నారు.

విస్తృత ఏర్పాట్లు: ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు వేల మంది ధర్మపోరాట సభకు వచ్చేలా రవాణా ఏర్పాట్లు చేశారు. వేదిక ముందువైపున 50వేల మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. 2500 మంది పోలీసులతో బందోబస్తు కల్పిస్తున్నారు. కార్యక్రమం విజయవంతానికి పలు కమిటీలను ఏర్పాటుచేశారు.

జనసేన ప్రభుత్వాన్ని స్థాపిద్దాం

- శ్రేణులకు పవన్‌కల్యాణ్ పిలుపు
- 2019లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని వెల్లడి

ఈనాడు, విశాఖపట్నం, అమరావతి: రాష్ట్రంలో 2019లో జనసేన ప్రభుత్వాన్ని స్థాపించడానికి సహకరించాలని, తనతో కలిసిరావాలని శ్రేణులకు ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. గురువారం విశాఖ శివారులోని ఓ రిసార్టులో కొందరిని పార్టీలోకి చేర్చుకునే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ ప్రసంగిస్తూ 2003లోనే రాజకీయాల్లోకి రావాలనుకున్నానని, 2009, 2014 ఎన్నికల సమయంలో రాష్ట్ర పరిస్థితులను, ప్రజాసమస్యలను సమగ్రంగా అర్థం చేసుకున్నానని తెలిపారు. 2014లో సుస్థిర ప్రభుత్వం ఉండాలని తెదేపా, భాజపాలకు జనసేన మద్దతు ఇచ్చిందన్నారు. సమతుల్యత, సాధికారిత, అభివృద్ధి కోసం 2019లో జనసేన అన్ని నియోజకవర్గాల్లో పోటీకి నిర్ణయించిందన్నారు. పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు మనస్ఫూర్తిగా కృషిచేయాలని కోరారు. జనసేన ఆశయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి తనను బలోపేతం చేయాలన్నారు. అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు వై.వేణుగోపాలరావు, మత్స్యకారుల సంక్షేమాభిలాషి గాజువాక వాసి కోన తాతారావు, అనకాపల్లికి చెందిన కొణతాల సీతారామ్, బాలాజీ విద్యాసంస్థల అధినేత మండవ రవికుమార్‌లు పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు.

పార్టీలో పలువురి చేరిక అనంతరం శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్

ఒడరేవు కాలుష్యం పరిశీలన...: విశాఖ పోర్టు కాలుష్య పరిస్థితిపై అధ్యయనానికి వీలుగా పవన్‌కల్యాణ్ ఒడరేవుకు చేరువలోని కోటవీధి ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడి కాలుష్యంపై గతంలో పోరాడిన వారితోనూ, మహిళలతోనూ మాట్లాడారు. వారి ఇబ్బందులను, అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. వీజీసీబీ సమీప బొగ్గునిల్వలను పరిశీలించి గంటపాటు పోర్టు పరిసరాల్లో తిరిగారు. పరిష్కార చర్యలను త్వరలోనే ప్రకటిస్తానన్నారు.

నీటివనరులపై ఆరా...: విశాఖలో నీటి వనరుల పరిస్థితిని తెలుసుకోవడానికి వీలుగా నగరంలోని ముడసర్లోవ రిజర్వాయర్‌ను పవన్‌కల్యాణ్ గురువారం సాయంత్రం సందర్శించారు. అక్కడున్న సౌరశక్తి ప్రాజెక్టును పరిశీలించారు. జలాశయం పరీవాహక ప్రాంతంలో రహదారులు వేయడంతో నీరు సరిగా చేరడంలేదని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. పౌర సంఘాలు ఏర్పాటుచేసుకుని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పవన్ సూచించారు.

ఆంత్రాక్స్ ఇక్కడే ఎందుకుంది?

ఏజన్సీ ప్రాంతాలకు ఆంత్రాక్స్‌ను ఎవరు తీసుకొచ్చారో తేల్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. గిరిజన సమీకృతాభివృద్ధి సంస్థలు ఉద్దేశపూర్వకంగా ఎందుకు గిరిజనుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. గురువారం ట్విట్టర్‌లో ఈ మేరకు పవన్ ప్రశ్నలు సంధించారు. ఏజన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు దుర్భర పరిస్థితులు కల్పించి బాక్సైట్ కార్యకలాపాలు నిర్విఘ్నంగా కొనసాగించేందుకు, స్థానికులకు ఎలాంటి ప్రయోజనం కల్పించకుండా సహజ వనరులను దోచుకునేందుకు, ఉత్తరాంధ్రలో వారి సంస్కృతి పర్యావరణాన్ని ధ్వంసం చేసేందుకే ఆంత్రాక్స్‌ను తీసుకొచ్చారా అని కూడా పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు.

కడప ఉక్కుపై తెదేపా నాటకం: కన్నా

ఈనాడు, అనంతపురం: 'విభజన చట్టంలో ఉన్న వాటి కంటే ఎక్కువగానే కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది. 11 విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని ఉంటే, రాష్ట్రంలో 25 వరకు ఏర్పాటు చేసింది. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం సానుకూలంగా ఉంది. ఇది తెలిసిన తెదేపా నాయకులు తమవల్లే వచ్చిందని చెప్పుకోవడానికి నాటకాలు ఆడుతున్నారని' భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. అనంతపురంలోని రభశ అతిథి గృహంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి కేంద్రం అడిగిన వివరాలను ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం పంపిందన్నారు. అయితే, సీఎం రమేశ్ మాత్రం 20 నుంచి దీక్ష చేపట్టడం వెనుక ఆంతర్యం ఏంటో అంతా గుర్తించాలన్నారు. చైనాకు చెందిన ఓ సంస్థ ద్వారా కడపలో ఇనుప స్క్రాప్ పరిశ్రమ ఏర్పాటుకు తెదేపా నేతలు సిద్ధమైనట్లు కొందరు తన దృష్టికి తెచ్చారనీ, అందుకే అక్కడ కేంద్రం ద్వారా ఉక్కు పరిశ్రమ రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల పనులు అంచనాలు పెంచేశారని.. సీఎం రమేశ్ వాటిని చేస్తున్నారని ఆరోపించారు. సీమ బిడ్డ చంద్రబాబు 13 ఏళ్లు సీఎంగా పనిచేసి, ఈ ప్రాంతానికి చేసిందేంటని కన్నా ప్రశ్నించారు. ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల మద్దతుతో దాడులు..: పోలీసుల మద్దతుతో భాజపా నేతలపై దాడులకు బరి తెగిస్తున్నారనీ. . గతంలో అమిత్‌షా, సోము వీర్రాజుపై.. నేడు అనంతపురంలో తనపై కూడా దాడికి కుట్ర పన్నారని కన్నా ఆరోపించారు. చంద్రబాబు తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణకు అంగీకరించాలని, అవి నిరూపణ అయితే ఆయన జైలుకి వెళ్తారనీ, కాకపోతే జైలుకెళ్లేందుకు తాను సిద్ధమని సవాల్ చేశారు. అగ్రిగోల్డ్‌కు సంబంధించి తెదేపాపై ఆరోపణలు చేశారు.

ఉద్రిక్తత...: మరోవైపు కన్నా బస చేసిన రభశ అతిథి గృహంలోకి టీఎన్ఎస్ఎఫ్‌కు చెందిన కొందరు చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించగా.. భాజపా నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తలుపు అద్దం పగిలింది. పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్యాన్సర్ నివారణే లక్ష్యంగా పరిశోధనలు

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

ఈనాడు- బెంగళూరు: క్యాన్సర్ మహమ్మారి నానాటికీ విజృంభిస్తున్నందున బాధితులను ఆదుకునేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక వైద్యాలయాలను ప్రారంభించాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు పిలుపునిచ్చారు. పల్లెల్లోనూ క్యాన్సర్ నివారణ ఆస్పత్రుల్ని ప్రారంభించాలని కోరారు. ఈ వ్యాధి నిర్ధరణ, నివారణ, పరిశోధనలను విస్తృతం చేయడానికి కావాల్సినన్ని నిధులు విడుదల చేయాలని సూచించారు. తొలిదశలోనే బాధితులు చికిత్స చేయించుకునేలా చైతన్యపర్చాలన్నారు. బెంగళూరులోని కిద్వాయ్ క్యాన్సర్ వైద్యాలయంలో కొత్తగా నిర్మించిన ఆధునిక విభాగాన్ని గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. దేశంలో ఏటా పది లక్షల మంది ఈ వ్యాధికి గురవుతుండగా, కనీసం ఐదు లక్షల మంది బలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నగరాలు, పట్టణాల్లోని ప్రజల జీవనశైలి వారి ఆరోగ్యంపై విపరీత ప్రభావం చూపిస్తోందని చెప్పారు. కర్ణాటక ప్రభుత్వం క్యాన్సర్ నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ ఆస్పత్రుల నిర్వహణ వ్యయభరితమైనప్పటికీ చికిత్సను రోగులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం తగిన పథకాలను రూపొందించాలన్నారు. కేంద్రం ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రాలను రాష్ట్ర విభాగ కేంద్రాలుగా ఉన్నతీకరించటం హర్షణీయమని చెప్పారు. గవర్నర్ వాజుభాయివాలా, ముఖ్యమంత్రి కుమారస్వామి, వైద్యవిద్యాశాఖ మంత్రి డీకే శివకుమార్, కిద్వాయ్ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ లింగేగౌడ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కిద్వాయ్ క్యాన్సర్ వైద్యాలయ చికిత్స విభాగాన్ని ప్రారంభించి యంత్రపరికరాల వివరాలను తెలుసుకుంటున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. చిత్రంలో గవర్నర్ వాజుభాయ్‌వాలా, ముఖ్యమంత్రి కుమారస్వామి తదితరులు

BANNARI AMMAN INSTITUTE OF TECHNOLOGY

An Autonomous Institution | Affiliated to Anna University Chennai

Approved by AICTE New Delhi | Accredited by NBA & NAAC with "A" Grade (CGPA of 3.57)

Sathyamangalam - 638 401 Erode District Tamil Nadu Ph : 04295 226000

nirf 2018 NATIONAL INSTITUTIONAL RANKING FRAMEWORK — 76 All India Rank — Among IITs/NITs Universities & other Engineering Institutions

DIRECT ADMISSION THROUGH JEE (Main) -2018

Interested candidates with valid JEE (Main) - 2018 score may apply for merit based admission into the following

BE / B TECH programmes

Aero	Agri	Auto	Civil	CSE	EEE
ECE	EIE	Mech	Food	IT	Textile
Mechatronics		Fashion		Biotech	

Admission Schedule

Last date for receipt of applications	18.07.2018
Intimation to selected candidates before	23.07.2018

Online application may be submitted using the following link https://bitsathy.ac.in/jeeadmissionform.php

Campus Highlights :
- 181 acre fully secured serene Wi-Fi enabled Green Campus
- 28 lakh sq ft of built infrastructure and 500 Mbps internet connectivity
- State of the Art laboratories of Artificial Intelligence, Internet of things, Deep Learning, robotics Automation, 3D Printing & Energy Research
- Language classes for Japanese, Chinese, German & French
- State of the art hostel facility with various cuisine.

Admission for ME / M Tech — ✓ Merit scholarships and Earn & Learn Scheme available

Inviting Full Time Research Scholars — ✓ Attractive Stipend of Rs 15,000/-p.m and above

fb.com/BIT sathyindia

Contact: principal@bitsathy.ac.in Ph: 04295 226214 +91 99651 20967 www.bitsathy.ac.in

30న ఏపీ ఆర్‌సెట్ ప్రకటన

- పీహెచ్‌డీ, ఎంఫిల్ ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పిహెచ్‌డీ, ఎంఫిల్‌లో ప్రవేశాల కోసం రాష్ట్రంలో తొలిసారిగా 14 విశ్వవిద్యాలయాలకు కలిపి ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏయూ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఏపీ ఆర్‌సెట్ ప్రకటన (నోటిఫికేషన్) ఈనెల 30న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం షెడ్యూల్‌ను ప్రకటించారు. 'జులై 4 నుంచి జులై 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆగస్టు 22 నుంచి 24 మధ్య ప్రవేశ పరీక్ష జరుగుతుంది. 73 కోర్సుల్లో ప్రవేశాల కోసం పిహెచ్‌డీలో 2,400, ఎంఫిల్‌లో 500 సీట్లను భర్తీ చేస్తారు. ప్రవేశ పరీక్షలో పార్టు 'ఎ'పేపరు 90 మార్కులు, పార్టు 'బి' 90 మార్కులకు ఉంటాయి. నెగిటివ్ మార్కులు ఉంటాయి. పరీక్షల అనంతరం ముఖాముఖి 20 మార్కులకు ఉంటుంది. తదుపరి ర్యాంకులు విడుదల చేస్తారు. ర్యాంకుల ఆధారంగా విద్యార్థులు రాష్ట్రంలోని ఏ విశ్వవిద్యాలయంలోనైనా చేరవచ్చని' ఆచార్య నాగేశ్వరరావు సూచించారు. యూజీసీ, గేట్ సిలబస్‌తో ఈ పరీక్షలు జరుపుతారని తెలిపారు. ఆర్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.శ్రీనివాసరావు, రిజిస్ట్రారు ఆచార్య ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సెట్ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఏయూ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు తదితరులు

GOVERNMENT OF ANDHRA PRADESH
DEPARTMENT OF TECHNICAL EDUCATION

A.P-POLYCET-2018 ADMISSIONS

EXTENDED FINAL PHASE & SPOT ADMISSION NOTIFICATION

FOR WEB BASED COUNSELLING

The Qualified candidates of A.P-POLYCET-2018 who are desirous of seeking admission into Diploma Courses are informed that options exercise & Certificate Verification will be on 05-07-2018 & 06-07-2018.Spot admissions will be on 23-07-2018. For complete details refer the detailed notification & spot admissions schedule placed on the website: https:// appolycet.nic.in

Date: 28.06.2018 Sd/- G.S Panda Das,IAS
Place: Vijayawada Convenor,APPOLYCET

అక్టోబరు 22 నుంచి తెలుగు వర్సిటీ దూరవిద్య పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం దూర విద్య పరీక్షలు అక్టోబరు 22వ తేదీ నుంచి నవంబర్ 11వ తేదీ వరకు జరుగుతాయని రిజిస్ట్రార్ పి.అలేఖ్య గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. శ్రీశైలం, కూచిపూడి, రాజమండ్రి, వరంగల్, హైదరాబాద్ కేంద్రాల్లో ఆయా తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకు ఈ వార్షిక పరీక్షలు జరుగుతాయన్నారు. పలువురు విద్యార్థులకు ఇదే తేదీల్లో ప్రయోగ పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. అదనపు వివరాలను నాంపల్లిలోని ప్రధాన కార్యాలయంలోని దూర విద్య విభాగంలోగానీ, వర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ పొందవచ్చన్నారు. 2017-18 సంవత్సరాల్లో వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఆగస్టు 2 నుంచి 11 వరకు అనుసంధాన తరగతులు మాత్రం హైదరాబాద్ వర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

శిక్షణకు ఎంపికైన ఎంఎల్‌పీల జాబితా విడుదల

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా శిక్షణకు ఎంపికైన మిడ్‌లెవెల్ ప్రొవైడర్(ఎంఎల్‌పీ)ల జాబితాను రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ గురువారం విడుదల చేశారు. గత నెల 13న నిర్వహించిన రాత పరీక్షలో వచ్చిన మార్కులను ప్రాతిపదికగా నాలుగు జోన్లలో రోస్టర్ పాయింట్ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపికైనవారు వారికి సంబంధించిన జోన్ల పరిధిలోని గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నం, కడపలోని ప్రాంతీయ ఆరోగ్య సంచాలకుల కార్యాలయాల్లో ఈ నెల 29, 30 తేదీల్లో హాజరుకావాలని స్పష్టం చేశారు. వీరికి ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన ఇగ్నో కేంద్రాల్లో వచ్చే నెల రెండో తేదీ నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ఎంపికైన వారి వివరాలతో పాటు ఇతర సమాచారం కమిషనర్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

ఈనాడు

ప్రమాణాల ఉన్నతీకరణే సవాలు

దేశ ఉన్నత విద్యారంగాన భారీ ప్రక్షాళనను లక్షిస్తున్న కేంద్రప్రభుత్వం, సుమారు ఆరు దశాబ్దాలుగా ఉనికి చాటుకుంటున్న యూజీసీ (విశ్వవిద్యాలయ నిధుల సంఘం) స్థానే ప్రత్యామ్నాయ వ్యవస్థకు రంగం సిద్ధం చేస్తోంది. 1956నాటి యూజీసీ చట్టాన్ని, నిధుల సంఘాన్ని రద్దు చేసి కొత్తగా భారత ఉన్నత విద్యా కమిషన్ నెలకొల్పదలచినట్లు ముసాయిదా శాసన ప్రతి సూచిస్తోంది. యూజీసీ ఆవిర్భావం దరిమిలా దేశంలో విశ్వవిద్యాలయాల సంఖ్య, విద్యార్థుల ప్రవేశాలు ఇంతలంతలయ్యాయి. 860కి పైగా విశ్వవిద్యాలయాలు, 40వేలదాకా కళాశాలలు, ఇతరత్రా మరో పద కొండున్నర వేల సంస్థలతో ఉన్నత విద్యారంగ విస్తృతి ఘనంగా ఉన్నా- వాటిలో అత్యధికం నాసిప్రమాణాలకు నెలవులుగా భ్రష్టు పడుతున్నాయి. ఈ దుస్థితికి ప్రధాన కారణమైన యూజీసీని పునర్నిర్మించడం వ్యర్థప్రయాసేనన్న హరిగౌతమ్ కమిటీ, వేటు వెయ్యడమే ఉత్తమమని మూడేళ్లనాడే వెల్లడించింది. సుబ్రమణియన్ కమిటీ సైతం యూజీసీ ప్రాధాన్యం తెగ్గోతకే ఓటేసింది. ఇన్నేళ్లూ బోగస్ విద్యాసంస్థల వివరాలు ప్రకటించడానికే పరిమితమైన యూజీసీ పనితీరుకు భిన్నంగా నూతన కమిషన్- గాడితప్పిన సంస్థలు, యాజమాన్యాలపై చర్యలు తీసుకోనుందంటున్నారు. నామమాత్ర హెచ్చరికలతో దశాబ్దాలుగా అదుపుతప్పిన పరిస్థితుల్ని కుదుటపరచడంలో 'శిక్షల విధింపు అధికారం' ఏ మేరకు ప్రభావాన్వితం కాగలదో చూడాలి. ప్రతిపాదిత ఉన్నత విద్యా కమిషన్‌కు దండనాధికారం కట్టబెడుతున్నామంటూనే, నిధుల కేటాయింపు వంటి ఆర్థిక వ్యవహారాలను కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖకు బదలాయిస్తామనడం ఎన్నో శంకలు రేకెత్తిస్తోంది. యూజీసీ బదులు ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు- నీ ఎడమ చెయ్యి తియ్యి నా పుర చెయ్యి పెడతానన్న సామెత చందం కాకుండా, గుణాత్మక పరివర్తనకు దోహదకారి అయ్యేలా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది!

ఉన్నత విద్యారంగాన నాణ్యతా ప్రమాణాల క్షీణతకు, 'ఇన్‌స్పెక్షన్ రాజ్'కు చెల్లుకొట్టి స్థితిగతుల మెరుగుదలకు పనికొచ్చే సూచనలు, సలహాలను ఆహ్వానిస్తున్న కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ- నెత్తిన ఉరుముతున్న సంక్షోభాన్ని విస్మరించజాలదు. ఇప్పటికే దేశీయ ఉన్నత విద్యాసంస్థల్లో అధికశాతం ప్రైవేటు రంగంలో ఉండగా, సర్కారీ విద్యాలయాలకు నిధుల తోడ్పాటు అంతకంతకు సన్నగిల్లుతోంది. విశ్వవిద్యాలయాల్లో 40శాతం మేర బోధన సిబ్బంది ఖాళీలు భర్తీకాకుండా పడి ఉండటం వార్షిక ఫలితాలను, పరిశోధనల గతిరీతుల్ని కుంగదీస్తోంది. ఈ దశలో నిధుల కేటాయింపు అంశాన్ని ఊడబెరికి పర్యవేక్షణాధికారాలకే నూతన కమిషన్ను పరిమితం చేస్తే- నాణ్యతా ప్రమాణాల మెరుగుదల ఎలా సాధ్యపడుతుందో అగమ్యం. మేలిమి విద్యాభ్యాసానికి, సృజనాత్మక పరిశోధనలకు విశేష ప్రాధాన్యమిచ్చి గణనీయంగా మేధాలబ్ధి పొందుతున్న దేశాలనుంచి భారత్ ఎన్నో గుణపాఠాలు నేర్వాల్సి ఉందని అసోచామ్, ఎస్ సంస్థల సంయుక్త నివేదిక ఇటీవలే ఉద్బోధించింది. భారత్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఏ ఒక్కటీ పరిశోధనల పరంగా సింగపూర్, తైవాన్ సంస్థలకూ సాటి రాలేదని విశ్లేషణాత్మక అధ్యయనాలు స్పష్టీకరిస్తున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల జాబితాలో స్థానం దక్కించుకోవడానికి ఇక్కడ మెరికల్లాంటి అధ్యాపక సిబ్బంది నియామకాలు అత్యావశ్యకమన్నది ఆక్స్‌ఫర్డ్ నిపుణుల సిఫార్సుల సారాంశం. 'ప్రాజెక్ట్ 211' పేరిట వంద విశ్వవిద్యాలయాల స్థాయీ ప్రమాణాల పెంపుదలకు 1993లో, 'ప్రాజెక్ట్ 985' కింద నలభై ప్రపంచ స్థాయి సంస్థల అవతరణకు 1998లో కంకణబద్ధమైన చైనా ఏ దశలోనూ నిధుల ప్రవాహానికి ఢోకా లేకుండా కాచుకుంటోంది. దీటైన ఫలితాల సాధనకై ఇక్కడా అటువంటి భూరి ప్రణాళికల్ని సాకారం చేయడమే పాలకశ్రేణి నిబద్ధతకు గీటురాయి.

బోధన, పరిశోధనల స్థాయీ ప్రమాణాల్ని అత్యుత్తమంగా ఉంచడంకన్నా సంస్థల అదుపు, గుర్తింపుల పైనే దృష్టి కేంద్రీకృతమైన పర్యవసానంగా దేశంలో లెక్కకు మిక్కిలి నియంత్రణ వ్యవస్థలు పుట్టుకొచ్చాయి. దూర విద్యామండలి (డీఈసీ), భారత వ్యవసాయ పరిశోధన సమాఖ్య (ఐసీఏఆర్), బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, భారత వైద్య మండలి (ఎంసీఐ)... ఈ జాబితా కొండవీటి చేంతాడంత విస్తరించింది. తొలుత యూజీసీతోపాటు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)ని, జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మండలి (ఎన్‌సీటీఈ)ని కలగలిపి ఉమ్మడి నియంత్రణాధికార వ్యవస్థ ఏర్పాటును తలపెట్టిన కేంద్రం- దేనికదే విడివిడిగా సంస్కరణలు చేపట్టదలచినట్లు ప్రస్ఫుటమవుతోంది. ఉన్నత విద్యారంగ నియంత్రణకు సాంకేతిక, ఇతర విద్యాసంస్థల్ని ఒకే గొడుగు కిందకు తెచ్చే యోచనను గతంలో 'నీతి ఆయోగ్' సైతం సమర్థించింది. ఆ ప్రతిపాదనను పక్కనపెట్టి కొలువు తీర్చనున్న జాతీయ ఉన్నత విద్యా కమిషన్ను కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖలో ఉపాంగంగా తీర్చిదిద్దినట్లయితే- గంపలాభాన్ని చిల్లి తీసినట్లవుతుంది. ఏకైక ఉమ్మడి నియంత్రణ సంస్థ కనుసన్నల్లో ఉన్నత విద్యారంగం కాంతులీనేలా ప్రణాళికాబద్ధ ప్రస్థానం సాగిస్తున్న విదేశాల అనుభవాల్ని కేంద్రం నిశితంగా పరిశీలించాలి. పనితీరుకు అనుగుణంగా పారదర్శక పద్ధతిలో నిధుల కేటాయింపు జరిపే యంత్రాంగాన్ని ప్రత్యేకంగా నెలకొల్పాలే తప్ప- ప్రభుత్వ జోక్యానికి తావుండకూడదు. యువతలో ఆలోచనల్ని సృజించి వాటికి రెక్కలు తొడిగి బంగరు భవితను పొదిగేలా కీలక భూమిక పోషించాల్సిన ఉన్నత విద్యారంగం- సంకుచిత రాజకీయాలకు, ఆర్థిక సంక్షోభాలకు అతీతంగా విలసిల్లాలి. అటువంటి వాతావరణ పరికల్పనే నియంత్రణ వ్యవస్థ మౌలిక ధ్యేయమైనప్పుడు, భారత్ మళ్ళీ 'విశ్వగురు' కాగలుగుతుంది!

మద్దతు 'రాజకీయం'

పంటలకు మద్దతు ధర ప్రకటనలో రైతుల ప్రయోజనాల కన్నా రాజకీయ ప్రయోజనాలే కీలకపాత్ర పోషిస్తున్నాయి. తాజాగా చెరకు రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్రం ప్రకటించిన రూ.8500 కోట్ల ప్యాకేజీ ఇందుకు నిదర్శనం. నిజంగా రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే పంటను చెరకు మిల్లులకు అమ్మేటప్పుడే సరైన ప్యాకేజీ ప్రకటించి ఉండాలి. కానీ అలా జరగలేదు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇటీవలి లోక్‌సభ ఉపఎన్నికల్లో భాజపా పరాజయంతో కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. లోక్‌సభతో పాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కీలక రాష్ట్రంలోని రైతులను ఆకట్టుకునేలా ప్యాకేజీ ప్రకటించింది. మద్దతు ధరలు ప్రకటించడం వరకే పరిమితమవుతున్న కేంద్రం అవే ధరలకు పంటలను కొనడంలో రాష్ట్రాలకు పెద్దగా సహకరించడం లేదు. ఈ ఏడాది నుంచి పూర్తిగా రాష్ట్రాలే కొనుగోలు చేయాలంటూ కొత్త మద్దతు ధర హామీ పథకం ప్రారంభించేందుకు సన్నద్ధమవుతోంది.

ప్యాకేజీతో మిల్లులకే ప్రయోజనం

కొత్తగా ఒప్పంద (కాంట్రాక్టు) వ్యవసాయ విధానాన్ని అమలు చేసేందుకు అన్ని రాష్ట్రాల మార్కెటింగ్ చట్టాల్లో మార్పులు చేయాలని కేంద్రం ఇటీవల సూచించింది. దీనివల్ల కాంట్రాక్టు వ్యవసాయం సులభమవుతుంది. భూములను గంపగుత్తగా ఏ వ్యక్తి లేదా కంపెనీ అయినా కౌలుకు తీసుకుని సేద్యం చేసుకోవచ్చు. కొన్ని దశాబ్దాలుగా ఒప్పంద విధానంలోనే చెరకు సేద్యం సాగుతోంది. సీజన్‌కు ముందు రైతులతో చక్కెర మిల్లు ఒప్పందం చేసుకుని పంట సాగుకు సాయం అందిస్తుంది. రైతు ఆ మిల్లుకే పంటను అమ్మాలన్నది ఒప్పందం. ఇదే తరహాలో ఏ పంటలనైనా ఒప్పంద సేద్యం పరిధిలోకి తెచ్చేలా కొత్త చట్టం వచ్చింది. దశాబ్దాలుగా ఇదే తరహాలో చెరకు సాగుచేస్తున్న రైతులకు ఏమి ఒరిగిందన్న విషయాన్ని పరిశీలిస్తే ఆవేదనే మిగులుతుంది. గడచిన అక్టోబరులో చెరకు గానుగాడేందుకు రైతులు మిల్లులకు విక్రయాలు ప్రారంభించారు. గత నెలతో దాదాపు 95 శాతం పంటను అమ్మేశారు. మిల్లులు గానుగాడటం పూర్తయి మూతపడ్డాయి. చెరకు అమ్మిన రైతుల ఖాతాలో మిల్లుల యాజమాన్యం 15 రోజుల్లోగా సొమ్ము జమచేయాలి. గత ఆరునెలలుగా రైతులకు రూ.22 వేల కోట్లను మిల్లుల యాజమాన్యాలు చెల్లించలేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బకాయిలను త్వరగా చెల్లించే పేరుతో రూ.8500 కోట్ల ప్యాకేజీని ప్రకటించినట్లు కేంద్రం చెబుతోంది. దేశంలో ఈ సీజన్‌లో 3.10 కోట్ల టన్నుల చక్కెర ఉత్పత్తి అయింది. గతేడాదికన్నా ఇది కోటీ ఏడులక్షల టన్నులు అదనం. చెరకు ఎక్కువగా పండించే, చక్కెర అత్యధికంగా ఉత్పత్తిచేసే తొలి రెండు రాష్ట్రాలైన ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉంది. చెరకు పంటకు ధర రావడం లేదని గత అక్టోబరు నుంచి రైతులు మొత్తుకుంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టలేదు. తక్కువ ధరకు అమ్మిన ఆరు నెలలకు బకాయిలు పేరుకుపోయి రైతులు ఆవేదన చెందుతుంటే ఇప్పుడు ప్యాకేజీ ప్రకటించడం గమనార్హం.

ఏటా అక్టోబరు నుంచి మరుసటి ఏడాది సెప్టెంబరు వరకు గల కాలాన్ని 'మార్కెటింగ్ ఏడాది' అని పిలుస్తారు. కేంద్రం ఏటా జూన్‌లో కొత్త మద్దతు ధరలను ప్రకటించడం ఆనవాయితీ. ఈ ధరలు వచ్చే అక్టోబరులో ప్రారంభమయ్యే కొత్త మార్కెటింగ్ ఏడాది నుంచి అమలులోకి వస్తాయి. అంటే అప్పటి నుంచి మార్కెట్లకు వచ్చే కొత్త ఖరీఫ్ పంటలకు మద్దతు ధర ఇవ్వాలనేది నిబంధన. దక్షిణాది రాష్ట్రాల్లో జూన్‌లో సాగు ప్రారంభమైన మినుము, పెసర వంటి పంటలు సెప్టెంబరుకల్లా మార్కెట్లకు రావడం మొదలవుతుంది. ఇవి కొత్త ఖరీఫ్ పంటలైనా సెప్టెంబరులో మార్కెట్లకు వచ్చినందువల్ల పాత ఏడాది మద్దతు ధరలే ఇవ్వాలని, వాటి ప్రకారమే కొనాలన్నది కేంద్రం విధించిన నిబంధన. గతేడాది ఈ నిబంధన వల్ల రైతులు నష్టపోయారని, దీన్ని సడలించి సెప్టెంబరులోనే కొత్త మద్దతు ధరకు మినుములు, పెసలు కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. పంట మార్కెట్‌కు వచ్చి

గతేడాది తెలుగు రాష్ట్రాల్లో పంట సాగు వ్యయం (క్వింటాకు రూపాయల్లో)			
పంట	ఏపీ	తెలంగాణ	జాతీయ సగటు
ధాన్యం	1,866	2,158	1,484
జొన్న	1,708	2,247	2,089
మొక్కజొన్న	1,633	1,949	1,396
రాగులు	1,980	2,325	2,351
కందులు	5,984	7,123	4,612
పెసలు	5,419	6,164	5,700
మినుములు	5,307	5,423	4,517
వేరుసెనగ	4,981	4,971	4,089
సోయాచిక్కుడు	2,920	3,239	2,921
పొద్దుతిరుగుడు	5,093	5,986	4,526
పత్తి	5,042	5,337	4,376
నువ్వులు	7,182	7,080	5,706



ఆధారం: కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాలు

చెరకు రైతులకు చేదు అనుభవాలు

నప్పుడు మద్దతు ధరకు కొనేలా చూడాలని కేంద్రాన్ని రాష్ట్రాలు బతిమాలాడుకోవాల్సి రావడం ఏమిటి? పంటలను కొనేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సమగ్ర వ్యవస్థలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. రైతులు పండించిన దానిలో మద్దతు ధరకు కొంటున్న పంటల పరిమాణం పెద్దగా ఉండటంలేదు. తెలుగు రాష్ట్రాల్లో మార్కెట్ మిగులు కన్నా అధికంగా రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేస్తుండటం ధాన్యం రైతులకు ఊరటనిస్తోంది. రైతులు పంటలను అమ్ముకొనే లోగా వివిధ రకాల పన్నులు వేసి ఏటా వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో మద్దతు ధర ఇచ్చి కొనడానికి, రైతులకు వెంటనే సొమ్ము చెల్లించడానికి ఆసక్తి చూపడం లేదు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 2005-17 మధ్యకాలంలో ధాన్యం కొనుగోలు, అమ్మకాలపై వివిధ రకాల పన్నుల వల్ల రూ.11,634 కోట్ల ఆదాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చిందని 'జాతీయ వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్' తాజా నివేదికలో వెల్లడించింది. పన్నుల విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా ఉంటోంది. 2016-17 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 13.13 శాతం ఉండగా, ఛత్తీస్‌గఢ్‌లో 6.99 శాతమే పన్నులు ఉండేవని కమిషన్ పేర్కొంది.

రైతుకు మద్దతు ధర ఇప్పించాలన్న చిత్తశుద్ధి పాలకులకు ఉంటే బడ్జెట్లలో 'మార్కెట్ స్థిరీకరణ నిధి'ని తప్పనిసరిగా పెట్టాలి. ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో ఇది లేకపోవడం సమస్యగా మారింది. చేతిలో నిధులు లేకుండా, అప్పులు తెచ్చి పంటలు కొంటామని చెప్పడం అసమగ్ర విధానానికి నిదర్శనం. కొత్త పంట మార్కెట్‌కు రావడం మొదలుకాగానే ధర తగ్గించేయడం వ్యాపారులకు అనవాయితీగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అది గుర్తించి మద్దతు ధరకు కొనమని ఆదేశాలిచ్చేసరికి నెల పడుతోంది. ఆ తరవాత అప్పు తెచ్చి రైతులకు చెల్లించడానికి మరో నెల, రెండు నెలలు పడుతోంది. రైతులు అంత కాలం ఆగలేక అవసరాల కోసం అయినకాడికి ప్రైవేటు వ్యాపారికి అమ్ముకుంటున్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొన్న వ్యాపారులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచాక అదే రైతుల పేర్లతో మద్దతు ధరకు అమ్ముకుంటున్నారు. ఇదో విషవలయంలా మారింది. రైతు పంటతో వెళ్లడమే తప్ప గిట్టుబాటు ధరతో బయటికి రాలేని విషమస్థితి పద్మవ్యూహాన్ని తలపిస్తోంది.

ప్రభుత్వ భరోసాతోనే బతుకు బాగు

చెరకు అమ్ముకుని నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ఆరునెలల తరవాత ప్యాకేజీ ఇస్తామనే వంటి విధానాలు ఇకనైనా మారాలి. విత్తు వేసేనాడే పంటను కొంటామనే భరోసాను ప్రభుత్వాలు కల్పించాలి. కేంద్రం తెచ్చే కొత్త విధానం ప్రకారం మద్దతు ధర ప్రకటించే 23 రకాల పంటల్లో వరి, గోధుమ తప్ప మిగతా పంటలను రాష్ట్రాలే ఈ ఏడాది నుంచి కొనుగోలు చేయాలి. వాటిని తిరిగి అమ్ముకున్నప్పుడు నష్టపోతే అందులో 40 శాతం మాత్రమే ఇస్తామని కేంద్రం చెబుతోంది. కానీ 50 శాతం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. నష్టం సంగతి అటుంచి, అసలు పంట కొనడానికి నిధులు ఎక్కడి నుంచి తేవాలని కేంద్రాన్ని రాష్ట్రాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో 'మార్కెట్ స్థిరీకరణ నిధి'కి కేటాయింపులే లేవు. దీంతో ముందుగా నిధులు ఇస్తేనే పంటల కొనుగోలు సాధ్యమవుతుందని కేంద్రానికి రాష్ట్రాలు తెగేసి చెప్పాయి. తెలంగాణ ప్రభుత్వం గతేడాది అయిదు రకాల పంటల కొనుగోలుకు మూడువేల కోట్ల రూపాయలను అప్పుగా తెచ్చింది. కొన్న పంటలను అమ్మినా ఆ అప్పులు తీరకపోగా మరో రూ.500 కోట్లకు పైగా నష్టాలు తప్పవని తాజాగా తేలింది. రైతులను మభ్యపెట్టే తాత్కాలిక విధానాలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపే దీర్ఘకాలిక వ్యూహాలతో విధానాలు రూపొందించాలి. జాతీయ ఎలక్ట్రానిక్ వ్యవసాయ మార్కెట్ (ఈనామ్) పథకాన్ని విస్తరించి ఆన్‌లైన్‌లో దేశంలో ఎక్కడి నుంచి అయినా, ఎవరైనా పంటను కొనేలా చూడాలి. దీనివల్ల వ్యాపారులు ముఠా కట్టకుండా అడ్డుకుని, రైతులకు మద్దతు ధర ఇప్పించడం సాధ్యమవుతుంది. నిధులివ్వకుండా, పారదర్శక విధానాలు పాటించకుండా ప్యాకేజీలతో సరిపుచ్చడం రైతులను మోసగించడమే అవుతుంది!

– మంగమూరి శ్రీనివాస్

తెలుగు రైతులకూ తప్పని నష్టం

తెలుగు రాష్ట్రాల్లోనూ చెరకు పంటకు సరైన ధర రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. తెలంగాణలో టన్ను చెరకు పండించడానికి సుమారు మూడు వేల రూపాయల దాకా ఖర్చవుతుండగా, అంత ధర సైతం చాలా మిల్లులు ఇవ్వలేదు. చెరకు ఒక్కటే కాదు, మిగతా పంటల కొనుగోలులోనూ అస్తవ్యస్త విధానాలే కొనసాగుతున్నాయి. తెలంగాణలో గత డిసెంబరు నుంచి మార్చి వరకు కందుల కొనుగోలు చేయాలంటూ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకమార్లు కోరింది. 75,300 టన్నుల కొనుగోలుకే కేంద్రం అనుమతించింది. రైతుల నుంచి 2.30 లక్షల టన్నులు రావడంతో బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం కొనాల్సి వచ్చింది. ఫలితంగా కందులు అమ్మిన రెండు మూడు నెలల వరకు సొమ్ము చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. కేంద్రం 2017-18 బడ్జెట్‌లో నిధులు పెద్దగా కేటాయించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. మద్దతు ధరకు కొనేందుకు స్పష్టమైన విధానం, తగినన్ని నిధులు కేటాయించకపోవడం సమస్యలకు దారితీస్తోంది.

ప్రమాదంలో బహుళత్వం



కులదీప్ నయ్యర్

దేశంలో ఇందిరాగాంధీ జమానాలో జనంపై విరుచుకుపడిన ఆత్యయిక స్థితి... ఓ చీకటి అధ్యాయం. నియంతస్వామ్యం పరాకాష్ఠ స్థాయికి చేరిన రోజులవి! పౌర స్వేచ్ఛను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య హితైషులెందరో ఆనాడు పోరాటం చేశారు. ఎంతోమంది ప్రజాస్వామ్యవాదుల బాటలోనే నేనూ అప్పట్లో ఉద్యమాలు చేశాను. ఇటీవల ఓ సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ- దేశంలో ఆత్యయిక స్థితి కోర చాచినప్పుడు నేను చేసిన పోరాటాన్ని ప్రశంసించడం నాకు దక్కిన గౌరవంగానే భావిస్తున్నాను. దేశం నెత్తిన ఇందిర మోపిన ఆత్యయిక స్థితి విషయంలో ప్రధాని మోదీ అభిప్రాయాలకూ, నా భావనలకూ మధ్య వైరుధ్యమే లేదు. జనం స్వేచ్ఛను కబళించిన ఆ చీకటి ఘట్టంపై మా ఇరువురిదీ ఒకే పంథా! అయితే బహుశా ఈ ఒక్క అంశంలోనే మా అభిప్రాయాలు కలుస్తాయేమో. ఎలాంటి సమాజాన్ని కావాలనుకుంటున్నాం, ఎలాంటి భావజాలాన్ని వ్యాప్తి చేయాలనుకుంటున్నాం వంటి విషయాల్లో మోదీ వైఖరికీ నా అభిప్రాయాలకూ మధ్య నిజానికి పెద్ద అగాధమే ఉంది.

దేశవ్యాప్తంగా హిందూ సంస్కృతిని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకొన్న పార్టీతోనూ, సంస్థలతోనూ మమేకమై ఆయన ప్రస్థానిస్తున్నారు. భిన్న సంస్కృతుల సమ్మేళనమై వికసిస్తేనే భవ్య భారతం సాకారమవుతుంది. నాతోపాటు ప్రజాస్వామ్యవాదులందరి విశ్వాసమూ ఇదే. సకల మతావలంబకులూ ఎలాంటి భయాలు, అరమరికలు లేకుండా కలిసి మెలిసి జీవించే బహుళత్వ భారతావనిని మహాత్మాగాంధీ ఆనాడు స్వప్నించారు. ప్రతి ప్రార్థన సమావేశంలోనూ భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లలోని సూక్తులను గాంధీజీ తప్పనిసరిగా చదివేవారు. అందుకు ఎవరైనా అభ్యంతర పెడితే ఆయన మొత్తంగా సమావేశాలను రద్దు చేయడానికీ వెనకాడేవారు కాదు. అదీ ఈ దేశ సంస్కృతి! బాబ్రీ మసీదు కూల్చివేత తరవాత ఈ దేశంలోని మైనారిటీల్లో అభద్రత పెరిగింది. ప్రభుత్వాల విధానాలు ఆ అభద్రతను తగ్గించే విధంగా ఉండాలి. ప్రధాని మోదీ పాలన సరళి అందుకు భిన్నంగా సాగుతోంది. వివిధ మతాలు, కులాలకు ఆలవాలమైన భారతావనికి బహుళత్వ సంస్కృతే ఆయువుపట్టు! ప్రభుత్వ నడక అందుకు అనుగుణంగా ఉందా అని ప్రశ్నించుకోవాల్సిన తరుణమిది.

మతం ప్రాతిపదికన భారత్‌నుంచి పాకిస్థాన్ విడిపోయిన తరుణంలో ఇరు దేశాలూ ఎప్పటికైనా మంచి మిత్రులుగా

మోదీదే సర్వం సహాధిపత్యం

ఆవిర్భవించాలనే ప్రజాస్వామ్య ప్రియులు ఆకాంక్షించారు. కానీ ఇప్పటికీ అది ఆకాంక్షగానే మిగిలిపోయింది. పాకిస్థాన్‌కు వెళ్లాలనుకునే భారతీయులకు ఎంతో కష్టపడితే తప్ప 'వీసా' దొరకని పరిస్థితి ఉందిప్పుడు. అదేవిధంగా భారత్‌కు రావాలనుకునే పాకిస్థానీయులకూ 'వీసా' జారీ కనాకష్టంగా మారింది. దేశ విభజన సమయంలో వ్యక్తమైన భయాలన్నీ క్రమంగా నిజాలుగా నిగ్గుదేలుతున్నాయి. కశ్మీర్ వ్యవహారం ఇరుపక్షాల మధ్య వీడని చిక్కుముడిగానే మిగిలింది. ఉభయుల మధ్య నెలకొన్న భయానుమానాలను తొలగించేందుకు అధికారం చేపట్టిన తొలినాళ్లలో మోదీ చొరవగానే ప్రయత్నించారు. రష్యా, అఫ్గానిస్థాన్‌లలో పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో లాహోర్‌లో హఠాత్తుగా విమానం ఆపించి, పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను స్నేహపూర్వకంగా కలుసుకోవడం ద్వారా ప్రధాని మోదీ ఉభయ పక్షాల సంబంధాలను కొత్త మలుపు తిప్పారు. గడచిన పదేళ్లలో భారత ప్రధాని పాక్‌లో చేసిన తొలి పర్యటన అదే! అదే స్థాయి చొరవను తరవాతి కాలంలోనూ ఆయన కొనసాగించి ఉంటే బాగుండేది. ఇప్పుడిక అలాంటి ఆశ కూడా లేదు. ఇది ఎన్నికల ఏడాది. ప్రధాని దృష్టి మొత్తం దక్షిణాదిలో పాగావేసి అధికారాన్ని ఎలా నిలబెట్టుకోవాలన్న దానిమీదే ఉంటుంది.

భాజపా రాజకీయమంతా మోదీ చుట్టూనే తిరుగుతోంది. ఎన్డీయే జమానా ఏకవ్యక్తి పాలనగా మారిపోయింది. గతంలో ఇందిర హయాములోనూ ఇదే పోకడను గమనించవచ్చు. ప్రధానిగా ఉన్నప్పుడు ఇందిర ముందు నోరు విప్పడానికిగానీ, అభిప్రాయాలు చెప్పడానికిగానీ ఎవరూ సాహసించేవారు కాదు. ఆమె చెప్పిందే వేదం అన్నట్లుగా నాడు ఆమె పాలన సాగిపోయింది. ప్రస్తుత ఎన్డీయేలోనూ ఆ ఛాయలే కనిపిస్తాయి. మోదీని ప్రశ్నించే సాహసంగానీ, ఆయనకు ప్రత్యామ్నాయంగా నిలవగల స్థోమతగానీ ఇప్పుడు భాజపాలో ఏ నాయకుడికీ లేదు. భాజపాలోని భిన్న వర్గాలను కలుపుకొని ముందడుగు వేయాల్సిన పరిస్థితుల్లో- మోదీ మినహా పార్టీలో మరేమీ లేదు అన్నట్లుగా వ్యవహారం మారిపోయింది. దీనివల్ల భాజపాకే నష్టం వాటిల్లుతుంది. మరోవంక దేశంలోని చిన్నా పెద్దా పార్టీలన్నీ 'ఫెడరల్ ఫ్రంట్' రూపంలో ఒకే గొడుగు కిందకు వస్తున్నాయి. మోదీని నిలువరించడమే ఏకైక అజెండాగా ఆయా పార్టీలు చురుగ్గా కదులుతున్నాయి. దేశంలోని భిన్న పార్టీల సారథ్యంలో ఏర్పాటయ్యే సంకీర్ణ కూటమిని ఎదుర్కోవాలంటే- భిన్న వర్గాలు, గ్రూపుల సమష్టి సహకారంతోనే మోదీ అడుగు ముందుకు వేయాల్సి ఉంటుంది. కానీ, పార్టీయే మోదీ... మోదీయే పార్టీ అన్నట్లుగా వ్యవహారం మారింది. మోదీ తప్ప భాజపా కనిపించని ఈ పరిస్థితుల్లో- అనేక వర్గాల సమూహమైన పార్టీ అండదండలను ఆయన ఎలా అందుకోగలరు?

(రచయిత– ప్రముఖ పాత్రికేయులు, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్)

ఈనాడు లేఖలు

డీఎస్సీ పోస్టులపై స్పష్టత

డీఎస్సీ -2018లో భాగంగా ఆదర్శ పాఠశాలల్లో 900కు పైగా ఖాళీలను భర్తీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే ఇందుకు సంబంధించిన విధివిధానాల ప్రకటనలో జాప్యం జరుగుతోంది. ఆదర్శ పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు టీజీటీ (ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్)లు బోధిస్తారు. 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్)లు బోధిస్తారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు భిన్నంగా ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు నిబంధనలు వేరుగా ఉంటాయి. డీఎస్సీ పరీక్షకు సంబంధించిన సిలబస్, రోస్టర్, ఆంగ్ల మీడియం అర్హతలు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆదర్శ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేయాలి.

- బి.సురేష్, శ్రీకాకుళం.

రహదారులపై హైరానా

జంట నగరాల్లో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన కొద్దిపాటి వానలకు అవి రూపురేఖలు కోల్పోయాయి. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, కార్లల్లో ప్రయాణించే వారు సైతం సతమతమవుతున్నారు. ప్రధాన రహదారుల పరిస్థితీ అంతంత మాత్రంగానే ఉంది. ఇక మారుమూల వాటి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అధికారులు అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చుతున్నారు తప్ప శాశ్వత చర్యలపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా కొద్ది రోజులకే పరిస్థితి మళ్లీ మొదటికొస్తోంది. మున్ముందు వానలు జోరందుకోనున్నాయి. బోనాల ఉత్సవాలు జరగనున్నాయి. అందువల్ల అధికార యంత్రాంగం భాగ్యనగరం రహదారులకు తక్షణం పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

- ప్రభాకర్ తల్లాప్రగడ, మదీనాగూడ, హైదరాబాద్.

జ్ఞాన వాహిని

జ్ఞానం అనంతం. అది ఒక తరం నుంచి మరొక తరాన్ని సుసంపన్నం చేసే నిరంతర ప్రవాహం. వేదాలు భారతీయుల తొలినాళ్ల జ్ఞాన భాండాగారాలు. వేదం లేదా విద్య అనే పదాలకు జ్ఞానం అని అర్థం. పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు భారతీయులు గర్వించదగిన అపురూపమైన ఆస్తి.

ఏ వ్యక్తి అయినా పుట్టుకతో జ్ఞానవంతుడు కాలేడు. జ్ఞాన సముపార్జన సాధన ద్వారానే లభ్యమవుతుంది. జ్ఞాన సంపన్నత నాలుగు మార్గాల్లో జరుగుతుందని పెద్దల మాట. మొదటగా విద్యార్థి గురువుకు శుశ్రూషతో వినయ సంపన్నుడై విద్యాభ్యాసం చెయ్యాలి. గురువు ముఖతః అందించే జ్ఞానాన్నే కాక ఆయన చర్యల ద్వారా కూడా ప్రకటితమయ్యే జ్ఞానఫలాన్ని అందుకోవటానికి శిష్యుడు సిద్ధంగా ఉండాలి.

ఆచరణ ద్వారా విద్యార్థులకు ఆదర్శనీయుడు అవుతున్నందువల్ల గురువును ఆచార్యుడన్నారు. అనేక సత్‌గ్రంథాల పఠనం ద్వారా మనిషి తన మేధను పెంచుకోవచ్చు. జ్ఞానాన్వేషణలో ఉన్నవారికి గ్రంథాలు దైవసమానాలు. పుస్తకాలు తమలోని జ్ఞానసర్వస్వాన్ని అందరికీ సమానంగా పంచుతాయి. జ్ఞాన సాధకులకు ఇది రెండో మార్గం. స్నేహితులు, బంధువుల నుంచి వ్యక్తి పొందే జ్ఞానసిద్ధి మూడోది. కాలగమనంలో మనిషి జ్ఞానవంతుడు కాగలగటం చివరి మార్గం. వాల్మీకి, వేమనలాంటి వారు సైతం సామాన్యులుగా జీవితం మొదలుపెట్టినా వారికెదురైన అనుభవాలు లోకోత్తరులుగా తీర్చిదిద్దాయి.

భౌతిక సుఖాలు సాధారణ దీప కాంతిలాంటివి. అవి మనిషికి తాత్కాలిక ఆనందాన్ని కలిగిస్తాయి. ఆ దీపం చిరుగాలికే కాంతిహీనమవుతుంది. జ్ఞానానందం రత్నదీప కాంతివంటిది. రత్నం వెలువరించే కాంతిని పెనుగాలి కూడా ఆర్పలేదు. ఈ సత్యాన్ని గ్రహించినట్లైతే మనిషి ధననిధుల కోసం వెదుకులాడక, జ్ఞాననిధికై అన్వేషణ కొనసాగిస్తాడు.

జ్ఞానవంతుడు కావటానికి ఎంత శ్రమించటానికైనా సిద్ధంగా ఉండాలి. హనుమంతుడి దీక్షాదక్షతలు ఈ విషయాన్నే చాటిచెబుతాయి. ఆంజనేయుడు విద్యాభ్యాసం చెయ్యగోరి ఆదిత్యుడిని సమీపిస్తాడు. తన వేగంతో సమానంగా ప్రయాణించి విద్య నేర్చుకొమ్మంటాడు సూర్య భగవానుడు. హనుమంతుడు అతడి శిష్యుడై సకల శాస్త్ర పారంగతుడవుతాడు. ఆంజనేయుడు పరిచయమైనప్పుడు శ్రీరాముడు లక్ష్మణుడితో ఆయన పాండిత్యాన్ని పరిపరి



అంతర్యామి

విధాల కొనియాడతాడు. శ్రీరాముడి మన్నన పొందిన అంజనీసుతుడి జ్ఞానం వెనక కఠోర శ్రమ ఉందన్న సత్యం గుర్తించాలి.

జిజ్ఞాసాపరులకు జ్ఞానం త్వరగా లభ్యమవుతుంది. వయస్సు పైబడి వృద్ధులు కాకపోయినా సమాజం వారిని జ్ఞానవృద్ధులుగా గుర్తిస్తుంది. శంకరాచార్యుడు చిన్నతనంలోనే తల్లిని విడిచి గురుఆశ్రయం పొందాడు. జ్ఞానిగా ఎదిగాడు. శంకరుడి తత్వం ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండటం. చండాలుడు ఎదురై ప్రశ్నించినప్పుడు సమాధానం చెప్పలేక ప్రణామాలర్పిస్తాడు. అతడి ద్వారా కొత్త విషయాలు నేర్చుకుంటాడు.

ఆ మహానుభావుడు భూమి మీద నివసించింది తక్కువ కాలమే అయినా ఇతరులకు సాధ్యం కాని రీతిలో ఉత్తమ గ్రంథాలను రచించాడు. ఎన్నో తరాలవారి చేత జగద్గురువుగా పూజలు అందుకుంటున్నాడు.

కాళిదాసంతటి మహాకవి జీవిత ఆరంభంలో అజ్ఞాని. అవివేకంతో తాను కూర్చున్న చెట్టుకొమ్మనే నరకడానికి సిద్ధపడ్డట్లు చారిత్రకగాథ. కాళికామాత అనుగ్రహంతో అన్ని విద్యలను నేర్చుకున్నాడు. సామాన్యులమైన మనం కూడా అంతే. పెద్దలు, గురువులు, సజ్జనసాంగత్యం వల్ల జ్ఞానవంతులమవుతాం. తరతరాలనుంచీ అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న జ్ఞానవాహినిలో విహరించగలుగుతాం. కాళిదాసులోని అజ్ఞానం నశించినట్లే మనలోనూ ఏదో ఒకనాడు అజ్ఞానం అస్తమిస్తుంది. విజ్ఞానం విస్తరిస్తుంది.

– జి.రామచంద్రరావు

ఈనాడు
విజయవాడ
శుక్రవారం జూన్ 29, 2018

రయ్ రయ్

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
autopage@eenadu.in

పరిచయం

మొదలవుతోంది బర్గ్‌మాన్‌యా!

ధర: రూ.70వేలు (దాదాపు)

వీలైతే రైడింగ్‌లు.. వారాంతాల్లో దూరప్రయాణాలు.. ఈ ట్రెండ్ జోరు మీదుంది. దీనికోసం ఖరీదైన బైక్‌లు చాలానే ఉన్నాయ్. మరి స్కూటర్ల మాటేంటి? దీనికి సమాధానంగా సుజుకీ బర్గ్‌మ్యాన్ దూసుకొచ్చేస్తోంది. ఇండియాలో ఇది రెండో మ్యాక్సీ స్కూటర్ (మోటార్‌స్కూటర్). ప్రత్యేకతలేంటంటే..

డీనో, డీనోస్‌వాల్ట్

మెప్పించే డిజైన్

బండి డిజైన్ సరికొత్తగా ఉంది. రహదారులపై దూసుకెళ్తున్నపుడు గాలి నుంచి రక్షణ కోసం ముందు విండ్‌షీల్డ్ అమర్చారు. ఎక్కువ వెలుగునిస్తూ, ఇంజిన్‌పై భారం తగ్గించేలా ఎల్ఈడీ హెడ్‌లైట్లు, ఎల్ఈడీ టెయిల్‌ల్యాంప్‌లున్నాయి. కాళ్లు సౌకర్యంగా పెట్టుకోవడానికి ఫుట్ రెస్ట్ ఇచ్చారు. అత్యంతవేగంలో కూడా బైక్‌ని నియంత్రించేలా హ్యాండిల్‌బార్ ఉంది. పూర్తి డిజిటల్ కన్సోల్‌లో స్పీడోమీటర్, ఓడోమీటర్, ట్రిప్ మీటర్, ఇంధనం గేజ్, గడియారం ఉన్నాయి. విశాలమైన సీటు, దానికింద ఎక్కువ ఖాళీస్థలం. ఫోన్ ఛార్జింగ్ యూఎస్‌బీ ప్రత్యేకం.

మేటి ఫీచర్లు

బర్గ్‌మ్యాన్‌కి కంబైన్డ్ బ్రేకింగ్ సిస్టమ్‌తో పని చేస్తుంది. అంటే వెనక బ్రేక్ వేసినా ఆటోమేటిగ్గా ముందు బ్రేక్ కూడా పడుతుంది. దీంతో వెనక చక్రం నియంత్రణ కోల్పోదు. బ్రేక్ వేయగానే తక్కువ దూరంలో ఆగుతుంది. 125సీసీ బండిలో ఈ ఫీచర్ ఉండటం అరుదే. ముందు టెలిస్కోపిక్ ఫోర్క్, వెనక మోనోషాక్ సస్పెన్షన్ ఉండటంతో కుదుల్లేని ప్రయాణానికి భరోసాగా ఉంటుంది. ముందు చక్రం 12 అంగుళాలు, వెనక 10 అంగుళాల ఉండటంతో వేగం నియంత్రించడానికి వీలుగా ఉంటుంది.

అదే ఇంజిన్

ఇంజిన్ వివరాలు అధికారికంగా వెల్లడించలేదు. అంతర్జాలంలో లభిస్తున్న సమాచారం ప్రకారం యాక్సెస్ మోడల్ ఇంజిన్‌నే దీనికి అమర్చారు. 8.7 పీఎస్, టార్క్ 10.2ఎన్ఎంతో పని చేస్తుంది. పదిన్నర లీటర్ల ఇంధన ట్యాంకు సామర్థ్యం. 95 కిలోమీటర్ల అత్యధిక వేగం.

– డీనో, డీనోస్‌వాల్ట్

కొత్త కారు కొనగానే మరింత ముస్తాబు చేయాలని తహతహ... స్టీరింగ్ పట్టకముందే మేటి ఫీచర్లు అద్దాలనే ఆరాటం... మెరిసే సీట్లు.. దద్దరిల్లే మ్యూజిక్ సిస్టమ్.. సువాసనలు వెదజల్లే పెర్‌ఫ్యూమ్.. ఎన్నెన్నో! హంగులు అద్దడం సరే భద్రత కోసం అర్జెంటుగా చేర్చాల్సినవి చాలానే ఉన్నాయంటున్నారు అనుభవజ్ఞులు... ఆ అత్యవసరాలు సమకూర్చుకుంటేనే ప్రయాణానికి భరోసా... ముందుజాగ్రత్తలు తీసుకుంటేనే కలల కారుకి బేఫికర్... రండి అవేంటో తెలుసుకుందాం.

హంగామా + భద్రత బేఫికార్

కారు కొనగానే కథ ముగిసిపోదు. సాఫీగా సాగే ప్రయాణం కోసం మరికొంత డబ్బులు వెచ్చించాల్సిందే. అయితే ఈ పెట్టుబడికి రెండింతల లాభం ఇచ్చేలా మనం సౌకర్యాలు పొందొచ్చు. రక్షణకి ఢోకా ఉండదు. ప్రతి కొత్త కారులో ఉండాల్సిన యాడ్-ఆన్స్ నిపుణులు సూచించినవి కొన్ని.

అంతర్గత అందాల కోసం

సీటు కవర్లు: కొత్త కారు ఏదైనా తళతళా మెరిసిపోతుంటుంది. ఆ అందం కొన్నాళ్లు అలాగే కాపాడుకోవాలన్నా, కొత్త సీట్లు పాడవకుండా ఉండాలన్నా ముందు వేయించాల్సింది సీటు కవర్లు. వీటిలో ఫ్యాబ్రిక్, లెదర్, నాణ్యమైన లెదర్ అంటూ రకరకాలైనవి దొరుకుతాయి. మీ బడ్జెట్‌కి అనుగుణంగా కొత్తవి వేయించుకోవాలి.

ధర: రూ.3,000– రూ.30,000

మ్యాట్లు: బయట ఎక్కడెక్కడో తిరిగే అలాగే లోపల కూర్చుంటాం. కాళ్లతోపాటు వచ్చే మట్టి, బురదతో అంతా అశుభ్రంగా తయారవుతుంది. ఇలా కారు పాడుకాకుండా ఉండాలంటే ఫ్లోర్ మ్యాట్‌లు, వెనక డిక్కీ మ్యాట్‌లు తప్పనిసరి. వీటిలో రకరకాలున్నా రబ్బరువి అయితే అంటుకున్న మట్టిని తేలిగ్గా తొలగించవచ్చు. కారు చక్రాల వెనక అమర్చే మడ్‌ఫ్లాప్‌లతో వాహనంపై బురద పడకుండా ఉంటుంది.

ధర: రూ.1000– 3,000

సన్‌ఫిల్మ్: ఎండ, చలిలాంటి భిన్న వాతావరణ పరిస్థితుల్లో ప్రయాణికులకు రక్షణగా ఉండేవి సన్‌ఫిల్మ్‌లు. ఇవి లోపల ఉండే ఇంటీరియర్‌నీ కాపాడతాయి. అయితే కొన్ని భద్రతాపరమైన కారణాలతో కొన్ని రాష్ట్రాల్లో వీటి వాడకాన్ని నిషేధించారు.

ధర: రూ.500 – రూ.5,000

ఎయిర్ ఫ్రెషనర్: కొత్త కారులో ఒకరకమైన ప్లాస్టిక్ వాసన వస్తుంటుంది. అది ఆరోగ్యానికి మంచిది కాదు కూడా. కొన్నిసార్లు రకరకాల కారణాలతో చెడు వాసనలు కూడా వస్తుంటాయి. వీటన్నింటికీ పరిష్కారం ఎయిర్ ఫ్రెషనర్. చెడుగాలి వడకట్టి స్వచ్ఛమైన గాలి అందిస్తుంది.

ధర రూ.300–రూ.1000

వాక్యూమ్ క్లీనర్: లోపల ఎంత శుభ్రంగా ఉంటే అంత హాయిగా ఉంటుంది. సీట్లు, మూలల్లో ఉన్న దుమ్ము, మురికిని తొలగించడానికి మార్కెట్లో ప్రత్యేకంగా 12వోల్టుల వాక్యూమ్ క్లీనర్లు దొరుకుతున్నాయి.

ధర రూ.1,000–రూ.2,000

భద్రత ముఖ్యం

రిమోట్ లాకింగ్: బేసిక్ కారు నుంచి ఖరీదైన కారు వరకు ప్రతి ఒక్కరూ ఇష్టపడేది రిమోట్ లాకింగ్. దూరంలో ఉన్నా కారు డోరు లాక్, అన్‌లాక్ చేయొచ్చు. ప్రతిసారీ డోరు పడిందా, లేదా అని పరిశీలించాల్సిన పన్లేదు. ఇతరులు ఎవరైనా తెరవడానికి ప్రయత్నిస్తే సెక్యూరిటీ అలారం మోగుతుంది.

ధర రూ.2,000–రూ.6,000

స్టీరింగ్ గ్రిప్ లాక్/గేర్ లాక్: రిమోట్ లాక్ ధర భరించలేం అనుకునేవాళ్లు దీన్ని ప్రయత్నించవచ్చు. ఈ తాళంతో స్టీరింగ్ తిరగదు. చోరీకి ఆస్కారం ఉండదు. గేర్‌లాక్‌తో అయితే గేర్లు పనిచేయవు.

ధర రూ.500–రూ.1000

రివర్స్ పార్కింగ్ సెన్సర్: ఎంత బాగా డ్రైవింగ్ వచ్చినా వాహనం వెనక్కి తీస్కెళ్లి పార్కింగ్ చేస్తున్నపుడు కొన్నిసార్లు వెనక బంపర్, బాడీ దేన్నైనా ఢీకొట్టే అవకాశం ఉంది. రివర్స్ పార్కింగ్ సెన్సర్లు, కెమేరా బిగిస్తే ఆ ప్రమాదం ఉండదు. గోడ, ఇతర వాహనంలాంటివి ఎన్ని అంగుళాల దూరంలో ఉన్నాయో చూపిస్తుంది. బాగా దగ్గరగా వెళ్తే బీప్ శబ్దం వస్తుంది.

ధర రూ. 3వేలు–4 వేలు

ఫస్ట్‌ఎయిడ్ కిట్: కారు బాగుండటం ఎంత ముఖ్యమో దాన్ని నడిపే డ్రైవర్, ప్రయాణికులూ అంతే బాగుండాలి. అనుకోని ప్రమాదం జరిగినపుడు ఆసుపత్రి వెళ్లేలోపు ప్రాథమిక చికిత్స చేసేలా ఫస్ట్ ఎయిడ్ కిట్ వెంట ఉంచుకోవాల్సిందే. అందులో బ్యాండేజీ, కత్తెర, స్టెరైల్ వాటర్, యాంటీ సెప్టిక్ క్రీమ్ ఉండేలా చూసుకోవాలి.

ధర రూ.300–రూ.500

అద్దాల తాళం: కొన్ని కార్లకు వింగ్ మిర్రర్ (పక్క అద్దాలు) తేలిగ్గా తొలగించవచ్చు. ఇవి ఎక్కువగా చోరీకి గురవుతుంటాయి. వీటిని రక్షించడానికి మిర్రర్ లాక్‌లు ఉంటాయి.

ధర రూ.350

బయట లుక్కేయండి

టైర్లు/అల్లాయ్ చక్రాలు: కొన్నిరకాల కార్లకు అంత నాణ్యమైన టైర్లు, చక్రాలు రావు. ఖర్చు ఫర్వాలేదు అనుకునేవారు వీటిని షోరూంలోనే మార్చుకోవచ్చు. అలాయ్ చక్రాలు చూడ్డానికి ఆకర్షణీయంగా ఉండటమే కాదు దృఢంగానూ ఉంటాయి.

ధర రూ.3,000–రూ.50,000

కవర్: ఎండాకాలం, వర్షాకాలంలో కారుకి రక్షణగా ఉంటూ రంగు వెలిసిపోకుండా ఉంచేవి కవర్లు.

ధర రూ.300–రూ.1,000

చైల్డ్ సీటు: ఇంట్లో ఐదారేళ్లలోపు చిన్నపిల్లలు ఉంటే వారికి మామూలు సీట్లు సరిపోవు. వారు కూర్చోవడానికి అనువుగా ఉండవు. వాళ్లకు సరిపోయేలా మామూలు సీట్లలో బిగించుకునేలా ఉండే చైల్డ్ సీటు తీసుకోవాలి.

ధర రూ.2,000–రూ.6,000

హైడ్రాలిక్ జాక్: తరచూ దూరప్రయాణాలు చేసేవాళ్లకి ఇది ఉపయుక్తం. టైరు పంక్చర్ అయినపుడు దీని సాయంతో కారును తేలిగ్గా పైకి లేపొచ్చు.

ధర రూ.2,000

టైరు ప్రెషర్ గేజ్: టైర్లలో గాలి పరిమాణం తగినంత ఉంటే వాటి మన్నిక బాగుంటాయి. మైలేజీ బాగుంటుంది. ఇలా ఎన్నో లాభాలు. అది ఎంత ఉందో చూపేదే టైర్ ప్రెషర్ గేజ్.

ధర రూ.300–రూ.1200

ముందుజాగ్రత్తగా

అగ్నిమాపక యంత్రం: మనం పెద్దగా పట్టించుకోంగానీ కొన్నిదేశాల్లో ఇది కారులో ఉండటం తప్పనిసరి నిబంధన. షార్ట్‌సర్క్యూట్ అయినా, అగ్నిప్రమాదంలో చిక్కుకున్నా కారును, మన ప్రాణాలనూ కాపాడుతుంది.

ధర రూ.800– రూ.2,500

పంక్చర్ రిపేర్ కిట్: టైం బాగా లేకపోతే కొత్త టైరు కూడా పంక్చరు కావొచ్చు. అప్పుడు ఎదర్కొనే ప్రయాస అంతా ఇంతా కాదు. అప్పుడు ఆదుకునేది ఇదే. తరచూ దూరప్రయాణాలు చేసేవారు దీన్ని వెంట ఉంచుకోవడం తప్పనిసరి.

ధర రూ.200– రూ.2,000

ఫాగ్‌లైట్లు: పొగమంచు కమ్మేయడం.. వాతావరణం అనుకూలించక ముందు ఉన్నవేం కనిపించక ప్రమాదాలు జరగడం ఈమధ్యకాలంలో ఎక్కువైంది. ఒక్కోసారి హెడ్‌లైట్లు పని చేయనప్పుడు, మసకమసకగా ఉన్నప్పుడు ఇది బాగా అక్కరకొస్తుంది.

ధర రూ.800– రూ.3,000

టూల్‌కిట్: కొన్నిసార్లు వాహనం ఎప్పుడు ఎక్కడ మొరాయిస్తుందో ఏం మరమ్మతు వస్తుందో చెప్పలేం. చిన్నచిన్న మరమ్మతులకు మనం సిద్ధంగా ఉన్నామంటే ఈ టూల్‌కిట్ వెంట ఉంచుకోవాల్సిందే.

ధర రూ.400– రూ.1,000

అదనపు ఫ్యూజ్: హెడ్‌లైట్, స్టార్టర్ ఫ్యూజులు చిన్నవే. ఖరీదూ తక్కువే. కానీ అవి చెడిపోయినపుడు సమస్య పెద్దదవుతుంది. ఈ పరిస్థితి నివారించడానికి అందుబాటులో అదనపు ఫ్యూజులు ఉంచుకోవాలి.

ధర రూ.200– రూ.500

మెకానిక్ గురూ

అల్లాయ్ చక్రాలకు వారెంటీ ఉండదా?

● నా బైక్ వెనక అల్లాయ్ చక్రంలో సమస్య ఉంటే సర్వీసింగ్ సెంటర్‌కి తీస్కెళ్లా. కొత్తది మార్చాలంటే రూ.ఐదువేలు ఖర్చవుతుందన్నారుగానీ ఎలాంటి వారంటీ ఇవ్వమంటున్నారు. ఎందుకిలా? మార్కెట్లో దొరికే మంచి బ్రాండ్ సూచించండి.

- పి.సంతోష్‌రెడ్డి

వ్యక్తుల బరువు, వాహనంపై వెళ్లే వేగం, రహదారుల పరిస్థితి ఆధారంగా వీల్ రిమ్‌లు లేదా అలాయ్ చక్రాల మన్నిక ఉంటుంది. కొత్తవాటికి ఏ కంపెనీ వారంటీ ఇవ్వదు. ద్విచక్రవాహన కంపెనీలు అయితే నాణ్యమైన ఓఈఎం విడిభాగాలు తయారు చేస్తాయి. వీటికి మార్కెట్లో దొరికే రీకో, ఫైలయన్‌లాంటి ఇతర కంపెనీల వాటికి ధరలో ఇరవైశాతం మాత్రమే తేడా ఉంటుంది. మీరు నాణ్యమైన బ్రాండ్ ఎంచుకోండి.

● రూ.80వేలలో కొత్త బైక్ కొనాలనుకుంటున్నాను. నాకు మైలేజీ, స్టైల్ రెండూ ముఖ్యమే. రూ.30వేల వరకు డౌన్ పేమెంట్ కట్టడానికి సిద్ధంగా ఉన్నాను. రుణం ఎలా తీసుకోవాలి? ఏ బీమా కంపెనీ మంచిది?

- మహేశ్ ఎల్లా

బజాజ్ పల్సర్ 160 ఎన్ఎస్, యమహా ఎఫ్‌జడ్-ఎస్ ఎఫ్ఐ, హీరో గ్లామర్ మీ అవసరాలు, బడ్జెట్‌లో దొరికే బైక్‌లు. మీ వయసు, మైలేజీ, పికప్, వాడకంలాంటిని బట్టి ప్రాధాన్యాతలు మారిపోతుంటాయి. రుణం విషయానికొస్తే ద్విచక్రవాహన కంపెనీ డీలరు ఎవరిదగ్గరికెళ్లినా రుణం, బీమా వివరాలు చెబుతారు. మీ సిబిల్ స్కోరును బట్టి రుణం మంజూరవుతుందా, లేదా అనేది అక్కడ చెబుతారు.

- సాయిభరత్ బొప్పరాజు, www.motofix.in

ఆడీ.. అరుదైన అవార్డు

కారు ఆకట్టుకునేలా ఉంటే మంచి పేరు వస్తుంది. అమ్మకాలు పోటెత్తుతాయి. అప్పుడప్పుడు అవార్డులూ పలకరిస్తాయి. దీనికి సాక్ష్యం ఆడీ కంపెనీ ఏ8 మోడల్. సెలెబ్రెటీలు, ఉన్నతవర్గాలు నచ్చిన కారుగా దీనికి పేరుంది. అటానమస్ డ్రైవింగ్ మరియు సేఫ్టీ విభాగంలో 'మోస్ట్ ఇన్నోవేటివ్ మోడల్ ఆఫ్ ది ఇయర్ 2018'గా ఎంపికైంది. సెంటర్ ఆఫ్ ఆటోమోటివ్ మేనేజ్‌మెంట్, ప్రైస్‌వాటర్‌హౌజ్ కూపర్స్ ఏజీలు ఈ పురస్కారానికి ఎంపిక చేశాయి. ఆటోమొబైల్ పరిశ్రమకు సంబంధించి అరవై బ్రాండ్లు, 1,296 ఆవిష్కరణలు ఈ అవార్డు కోసం పోటీ పడ్డాయి.

పల్సర్.. 70 వేల రికార్డు..

పల్సర్.. కుర్రకారు నాడి పట్టిన బైక్. మే నెలలో ఏకంగా 70వేల ద్విచక్రవాహనాలు అమ్ముడయ్యాయి. ఇది రికార్డు. విడుదలైన నుంచి ఒక్క మాసంలో ఇన్ని అమ్ముడవడం బజాజ్ కంపెనీకి ఇదే ప్రథమం. పల్సర్ శ్రేణిలో 135 ఎల్ఎస్, 150, 160, 180, 200, 220 మోడళ్లున్నాయి. ఈమధ్యే 150సీసీ మోడల్‌ని డబుల్ డిస్క్ వేరియంట్‌గా మలిచి మార్కెట్లోకి తీసుకొచ్చారు. అయినా ధర ఏమాత్రం పెంచలేదు. జోరు పెరగడానికి ఇది కూడా ఓ కారణం.

ఈనాడు సినిమా

బుల్లితెర బాహుబలి...స్వర్ణఖడ్గం

తెలుగు టెలివిజన్ చరిత్రలో మరో కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతుంది. ఎన్నో సంచలనాలకు వేదికగా నిలిచిన ఈటీవీ, ఇప్పుడు అపూర్వ రీతిలో ఓ సరికొత్త జానపద ధారావాహికను తెలుగు ప్రేక్షకులకు అందించబోతోంది. మహారాజులు, మాంత్రికులు, రాజమందిరాలు, కోట రహస్యాలు, కత్తియుద్ధాలు, గుర్రపుస్వారీలు, ఏనుగుల ఘీంకారాలు, వీరసేనల విన్యాసాలు...అన్నీ కలిపి అద్వితీయ రీతిలో అలరించబోతున్నాయి. అత్యంత వ్యయప్రయాసలకోర్చి కళ్లు చెదిరే సెట్టింగులతో, కేరళ అరణ్యాల్లో రూపొందించిన ప్రతిష్ఠాత్మక ధారావాహిక 'స్వర్ణఖడ్గం' జులై 6 నుంచి ప్రతి శుక్ర, శని వారాల్లో రాత్రి 8.30గం.లకు ప్రసారం కాబోతుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకొన్న 'బాహుబలి' చిత్ర నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని 'ఆర్కామీడియా' పతాకంపై ఈ సీరియల్‌ను నిర్మిస్తున్నారు. యాటా సత్యనారాయణ దర్శకత్వం వహిస్తున్నారు. అడుగడుగునా ఆసక్తిరేకెత్తించి, ఆబాలగోపాలాన్ని అమితంగా ఆకర్షించే ఈ సీరియల్ విశేషాలు.....చిత్ర యూనిట్ మాటల్లోనే...

దక్షిణాదిలోనే భారీ వ్యయం: ప్రసాద్ దేవినేని

తెలుగు సినిమా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో మార్మోగించిన 'బాహుబలి' చిత్రాల తర్వాత ఆ స్థాయిలో ఓ కథను బుల్లితెరపై తీసుకు రావాలనే ఆలోచనకు నాంది ఏంటి?

'బాహుబలి' చిత్రాలతో ఐదేళ్లు ప్రయాణించి ఎంతో అనుభవం సంపాదించాం. 'బాహుబలి' స్ఫూర్తితో హిందీలో కొన్ని సీరియల్స్ వచ్చాయి. 'తెలుగులో అలాంటి ఓ సీరియల్ చేస్తే బాగుంటుంది' అని ఈటీవీ వారు ఇచ్చిన సలహా, సూచనతో ఈ ప్రాజెక్టు మొదలైంది. దాంతో ఓ కథ అనుకొని ఈటీవీవారు, మా ఆర్కా మీడియా బృందం కలిసి దాన్ని భారీ స్థాయిలో తీర్చిదిద్దారు. అదే 'స్వర్ణఖడ్గం'గా తెలుగు బుల్లితెర ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని

'బాహుబలి' నిర్మాతల నుంచి వస్తున్న సీరియల్ కాబట్టి ఆ స్థాయిలోనే ఉంటుందా?

బాహుబలితో ఐదేళ్లు పనిచేసిన బృందంలోని కీలకమైన నిపుణులు ఈ సీరియల్‌కు పనిచేశారు. సాధారణంగా ధారావాహిక అంటే ఓ రెండు మూడు నెలలు ప్రీ ప్రొడక్షన్ పనులు చేసి సెట్స్‌పైకి తీసుకొచ్చేస్తారు. కానీ 'స్వర్ణఖడ్గం' కోసం 14 నెలలు ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేశాం. 'బాహుబలి' స్థాయిలో ఉండాలి కానీ 'బాహుబలి'తో పోల్చేలా ఉండకూడదని అన్నీ కొత్తగా చేశాం. రామోజీ ఫిలింసిటీ, కేరళల్లో చిత్రీకరణ జరిపాం. దక్షిణాదిలోనే అత్యంత భారీ వ్యయంతో ఈ సీరియల్ తెరకెక్కింది.

ఇందులోని అంశాలు అన్ని వర్గాలను మెప్పిస్తాయా?

'స్వర్ణఖడ్గం'లో బోలెడంత ఫాంటసీ ఉంటుంది. ఓ కథానాయకుడు...ఇద్దరు కథానాయికల మధ్య నడిచే డ్రామా మహిళలకు బాగా నచ్చుతుంది. మాంత్రికుడి నేపథ్యంలో సన్నివేశాలు పిల్లల్ని అలరిస్తాయి. ఇందులోని పాటలు ప్రత్యేక ఆకర్షణ. హీరోయిన్లు తమ అందచందాలతో అలరిస్తారు. పిల్లల నుంచి ముసలివాళ్ల వరకూ అందర్నీ అలరించే అంశాలతో ఆసక్తిగా దర్శకుడు యాటా సత్యనారాయణ తెరకెక్కించారు.

'బాహుబలి'తో పోల్చుకుంటే ఈ సీరియల్ కోసం ఎలాంటి వ్యయప్రయాసలు ఎదుర్కొన్నారు?

'బాహుబలి'కి ఎలాగైతే అనుకున్న దానికంటే ఎక్కువ ఖర్చుపెట్టామో ఈ ధారావాహిక కోసమూ బడ్జెట్ దాటి ఖర్చుచేశాం. బడ్జెట్ రెట్టింపైనా ఒక్కో సీజన్‌కు తక్కువలో తక్కువ ఓ మూడు వందల ఎపిసోడ్లు చేయాలనుకుంటున్నాం. కనీసం ఓ 30 ఎపిసోడ్లకు ఓసారి ఊహించని మలుపు, థ్రిల్ ఉండేలా కథను తీర్చిదిద్దాం. ఓ విధంగా చెప్పాలంటే ఓ సినిమా తీసి బుల్లితెరపై చూపిస్తున్నా.

ఇలాంటి సీరియల్ ఇప్పటివరకూ చేయలేదు!

- శోభు యార్లగడ్డ

"ఈటీవీతో పదిహేడేళ్ల అనుబంధం మాది. ఈటీవీతో కలిసి ఇప్పటివరకూ చాలా ధారావాహికలు చేశాం. కానీ ఇప్పటివరకూ చేయని విధంగా తెరకెక్కించిన సీరియల్ 'స్వర్ణఖడ్గం'. 'బాహుబలి' నిర్మించాం కాబట్టి దాంతో పోలుస్తున్నారు. బాహుబలి సినిమా కాబట్టి ఆ స్థాయిలో ఉంది. కానీ టీవీ సీరియల్స్‌లో బాహుబలి స్థాయిలోనే ఉంటుందీ ధారావాహిక. ఈటీవీ వారు భారీ సీరియల్ చేయాలనడం, దానికి తగ్గట్టే కథ ఉండటంతో పెద్ద ఎత్తున ఖర్చుపెట్టి తీశాం. దక్షిణాదిలోనే గొప్పగా నిలిచేలా కథకు తగ్గట్టు విజువల్ ఎఫెక్ట్స్, సెట్స్ అన్నీ తీర్చిదిద్దాం" అని చెప్పారు స్వర్ణఖడ్గం మరో నిర్మాత శోభు యార్లగడ్డ. ఆర్కా మీడియా నుంచి వచ్చే కొత్త ప్రాజెక్టులు గురించి మాట్లాడుతూ ''అంతర్జాతీయ స్థాయిలో వెబ్‌సిరీస్‌ను తీసుకురాబోతున్నాం. 'బాహుబలి'కి ప్రీక్వెల్ ఇది. శివగామి కథ. బహుశా ఇంత పెద్ద ఎత్తున రావడం దేశంలోనే తొలిసారి. దీనికి ముగ్గురు దర్శకులు ఉంటారు. ముగ్గురిలో దేవకట్టా ఒకరు. ఆయనతో పాటు హిందీ నుంచి ఒకరు, తెలుగు నుంచి ఇంకో దర్శకుడు కూడా ఉంటారు. అందరూ కొత్తవాళ్లే నటిస్తారు. ఓ రెండు మూడు నెలల్లో రామోజీ ఫిలింసిటీలోనే షూటింగ్ మొదలుపెట్టడానికి సన్నాహాలు చేస్తున్నాం. ప్రస్తుతానికి సీరియల్స్‌తో బిజీగా ఉన్నాం. మంచి కథ వస్తే సినిమా చేయడానికి సిద్ధంగానే ఉన్నామ''ని చెప్పారు శోభు.

సమ్మోహితుల్ని చేస్తుంది!

"మణిపుర మహాసామ్రాజ్యం, రుద్రగిరి మహా సామ్రాజ్యం, కపాల దీవి మధ్య నడిచే కథే 'స్వర్ణఖడ్గం'. నెమళ్ల కొండమీద కొన్ని ఏళ్ల పాటు భువనేశ్వరీ దేవిని ఆరాధించి మహిమాన్విత స్వర్ణఖడ్గాన్ని సాధిస్తారు మణిపుర వంశీకులు. తను విశ్వవిజేత కావాలంటే స్వర్ణఖడ్గం దక్కించుకోవడంతోనే సాధ్యం అని ఆ ప్రయత్నంలో ఉంటాడు మాంత్రికుడు. మరి చివరకు ఆ ఖడ్గాన్ని సాధించాడా? లేదా? ఇంతకీ రుద్రగిరి సామ్రాజ్యంలోని మహాధాత్రి మహారాణికి మణిపురతో ఉన్న సంబంధం ఏంటి? ఇలా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ మధ్యలో యుద్ధాలు, ప్రణయ సన్నివేశాలతో ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేస్తుంది 'స్వర్ణఖడ్గం'. భువనేశ్వరీ దేవి విగ్రహం, మణిపుర సామ్రాజ్యం ఎరీనా సెట్లను ప్రత్యేకంగా తీర్చిదిద్దాం. రుద్రగిరి సామ్రాజ్యం అంటే శివుడి అంశతో ఉండే ప్రాంతం. అందుకోసం చుట్టూ నీరు ఉండి మధ్యలో అడవిలా ఆ సామ్రాజ్యాన్ని తీర్చిదిద్దాం. కపాల దీవిలో మాంత్రికుడు ఆరాధించే కాపాలిక దేవి విగ్రహాన్ని 22 అడుగులు ఎత్తులో భారీగా ఏర్పాటు చేశాం. 'బాహుబలి', 'రోబో', 'పద్మావత్' లాంటి భారీ చిత్రాలకు పనిచేసిన ఓ 110 మంది నిపుణులు ఈ చిత్రం కోసం పనిచేశారు. వీళ్లతో పాటు ప్రత్యేకంగా ఓ 25 మంది సాంకేతిక నిపుణులను ఈ సీరియల్ కోసం తీసుకున్నాం. ఇందులో సెట్లతో పాటు విజువల్ ఎఫెక్ట్స్‌కు చాలా ప్రాధాన్యం ఉంది. ఇప్పటివరకూ దక్షిణాదిలో రాని విధంగా హిందీ సీరియల్స్‌కి ఏమాత్రం తగ్గకుండా ఉండేలా.. .బుల్లితెర బాహుబలిలా తీర్చిదిద్దాం"

– దర్శకుడు యాటా సత్యనారాయణ

మరో అంతర్జాతీయ గౌరవం

బాక్సాఫీసు లెక్కల్ని తిరగరాసిన చిత్రం 'బాహుబలి'. 'బాహుబలి 2' కూడా అనేక సంచలనాలకు కేంద్రబిందువు అయ్యింది. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అంతర్జాతీయంగా పలు అవార్డులను అందుకుంది. ఇప్పుడు మరో గౌరవం దక్కింది. బుధవారం రాత్రి కాలిఫోర్నియాలో జరిగిన 44వ సాటర్న్ అవార్డ్స్‌లో 'ఉత్తమ అంతర్జాతీయ చిత్రం'గా 'బాహుబలి 2' నిలిచింది. ఈ విభాగంలో ఆరు చిత్రాలు పోటీపడితే మన 'బాహుబలి'కి అవార్డు దక్కింది. అకాడమీ ఆఫ్ సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ అండ్ హారర్ ఫిల్మ్స్ అనే సంస్థ ప్రతీయేటా ఈ అవార్డులను అందజేస్తోంది.

ఉరితాడుకి అటూ ఇటూ...

ఉదయ్‌శంకర్, వెంకటేష్, చంద్రసిద్దార్థ్, హైపర్ ఆది

ఉదయ్ శంకర్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఆటగదరా శివ'. చంద్ర సిద్దార్థ్ దర్శకుడు. రాక్ లైన్ వెంకటేష్ నిర్మాత. జులై 14న విడుదల కాబోతోంది. ఈ చిత్రంలోని 'రామ రామ రే' గీతాన్ని గురువారం హైదరాబాద్‌లో ప్రముఖ కథానాయకుడు వెంకటేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ''భావోద్వేగభరిత కథల్ని ఎంచుకోవడంలో చంద్రసిద్దార్థ్ సిద్ధహస్తుడు. ఈ చిత్రం ఆయనకు మంచి పేరు తీసుకురావాల''ని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ ''ఉరిశిక్ష పడిన ఖైదీకీ, ఉరి తీయబోయే తలారీకి మధ్య జరిగే కథ ఇది. వారిద్దరూ కలసి చేసిన ప్రయాణంలో ఎదురైన అనుభవాల్ని వెండి తెరపై చూపిస్తున్నాం. ఆధ్యాత్మికత, తాత్వికత మేళవించిన సన్నివేశాలు ఆకట్టుకుంటాయ''న్నారు.

అవకాశాల్లేవని రోడ్డెక్కలేను కదా?

తెలుగు చిత్రసీమలో మరో హాస్యనటుడు కథానాయకుడి అవతారం ఎత్తాడు. తనే షకలక శంకర్. 'జబర్‌దస్త్'గా నవ్వించిన ఈ నటుడు.. 'శంభో శంకర'తో హీరోయిజం చూపించబోతున్నాడు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా షకలక శంకర్ చెప్పుకొచ్చిక కబుర్లు.

"ఆనందో బ్రహ్మ నాకు మంచి పేరు తీసుకొచ్చింది. అయితే ఆ తరవాత మంచి పాత్రలేం రాలేదు. చేతిలో పనిలేకుండా పోయింది. అవకాశాలు లేవని కొంతమందిలా నేను రోడ్డెక్కలేను. కాబట్టే కష్టపడి హీరో అయ్యా. కథానాయకుడైతే ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చు అనే ధ్యాస లేదు. హాస్యనటుడిగా రోజుకి రూ.30 వేలు దక్కేవి. ఈ సినిమాకి రోజుకి రూ.13 వేలు తీసుకున్నా. కానీ చేతినిండా పని, గుండెలనిండా సంతృప్తి దొరికింది".

❖ "ఫైట్లు చేయాలి, డాన్సులు చేయాలని అని హీరో అవ్వలేదు. అయితే ఈ సినిమాలో అవి రెండూ ఉంటాయి. ప్రేక్షకులకు విసుగు తెప్పించని విధంగా కథ, కథనాల్ని ఎంచుకున్నా. నాకు కావల్సినంత ప్రతిభ ఉందా, లేదా? అనేది ఈ సినిమా చూసి ప్రేక్షకులే చెబుతారు".

❖ "ఈ కథ పట్టుకుని కొంతమంది దగ్గరకి తిరిగాను. నిర్మాతగా మారండి అని అడిగాను. నేనేం దొంగతనం చేయడం లేదు. పదిమందికీ పనికొచ్చే పనే చేస్తున్నా. అందుకే సిగ్గులేకుండా అడిగాను. ఈ సినిమా అటూ ఇటూ అయితే నా భవిష్యత్తేంటి అని కూడా ఆలోచించడం లేదు. ఎందుకంటే.. ఒక్క సినిమాతో మనిషిని మర్చిపోరు. చాలామందికి చాలా ఫ్లాపులు వచ్చాయి. అవన్నీ తట్టుకుని నిలబడ్డారు కదా".

❖ "నాకొచ్చిన సినిమాలు చేసుకుంటూ వెళ్తా. ప్రత్యేకించి ప్రణాళికలేం లేవు. నాగచైతన్య 'సవ్యసాచి'లో నటించా. నేను కథానాయకుడిగా మొదలైన 'డ్రైవర్ రాముడు' అనే సినిమా ఓ పాట, ఫైటు తీశాక మధ్యలో ఆగిపోయింది. అదెప్పుడు మళ్లీ పట్టాలెక్కుతుందో నాకే తెలీదు".

నా జీవితం... నా కథలే చెబుతా!

ఒక్క మెతుకు చాలు.. అన్నం ఉడికిందో లేదో చెప్పడానికి. అలా దర్శకుడి ప్రతిభ అంచనా వేయడానికి ఒక్క సినిమా చాలు. 'పెళ్లి చూపులు' అలాంటి చిత్రమే. తెలుగు చిత్రసీమ కొత్త పుంతలు తొక్కాలనుకుంటున్న తరుణంలో 'పెళ్లి చూపులు' ఓ మార్గం చూపించింది. తరుణ్ భాస్కర్ ప్రతిభేంటో చిత్రరంగానికి తెలిసేలా చేసింది. ఇప్పుడు 'ఈ నగరానికి ఏమైంది' అంటూ మరోసారి తన ప్రతిభ చాటుకోవడానికి సిద్ధమయ్యారు. శుక్రవారం ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ చెప్పిన సంగతులు.

"పెళ్లిచూపులు విడుదల సమయంలో చాలా ఒత్తిడికి గురయ్యా. దాంతో పోలిస్తే ఇప్పుడు అది కాస్త తగ్గింది. సమన్వయం చేసుకోవడం ఎలాగో తెలిసింది. పైగా తొలి సినిమాతో పోలిస్తే 'ఈ నగరానికి ఏమైంది' సాంకేతికంగా, కథ పరంగా ఉన్నతంగా ఉంటుంది. అందుకే మరింత నమ్మకం కుదిరింది"

◗ "పెళ్లి చూపులు సినిమాతో చాలా అవకాశాలు వచ్చాయి. ఆ ఉత్సాహంలో కథలు రాస్తే తప్పు చేసే అవకాశం ఉంది. అందుకే కాస్త సమయం తీసుకున్నా. ఎప్పుడు ఎలాంటి సినిమా తీసినా కథనే నమ్ముకోవాలి అనిపించింది. అలాంటి కథ దొరగ్గానే సినిమా మొదలెట్టాం"

◗ "మహేష్‌బాబు, అల్లుఅర్జున్, నాగార్జున.. వీళ్లంతా నా తొలి సినిమా చూసి మెచ్చుకున్నారు. కొంతమంది 'మాకు తగిన కథ ఉంటే చెప్పు' అన్నారు. కానీ స్టార్లతో పనిచేయడమే రిస్క్ అని నా అభిప్రాయం. అందుకే నాకు తెలిసిన దారిలోనే రెండో సినిమా కూడా చేసేశా. 'ఈ నగరానికి ఏమైంది' ఈతరం కథ. అందుకే కొత్తవాళ్లతో చేశా"

◗ "నాకు తెలిసిన జీవితం, నా అనుభవాలు, నా చుట్టూ ఉన్న మనుషులు.. వీళ్ల కథలే చెబుతా. స్టార్లతో సినిమా చేయడానికి సమయం కావాలి. సినిమా అంటే ఏమిటో అర్థమయ్యాక, ఇలానే కొన్ని ప్రయోగాలు చేసిన తరవాత.. వాళ్లతో సినిమా చేస్తానేమో"

◗ "ఫిల్మ్‌మేకింగ్ అంటే ఇష్టం ఉన్న నలుగురి కుర్రాళ్ల కథ ఇది. నా స్నేహితులు ఎలా మాట్లాడుకుంటారో, వాళ్లెలా ప్రవర్తిస్తారో ఈ చిత్రంలో పాత్రలు, మాటలూ అలా ఉంటాయి. నాకు 'హ్యాంగోవర్', 'జిందగీ నా మిలేగీ దుబారా' లాంటి చిత్రాలంటే ఇష్టం. 'ఈ నగరానికి ఏమైంది' కూడా అదే శైలిలో ఉంటుంది. టైటిల్, సంగీతం, కళా పనితనం ఇవన్నీ ఈతరం మూడ్‌కి తగ్గట్టే ఉంటాయి"

◗ "నాకు ఫేమ్ అంటే భయం. తెర వెనుకే ఉండాలనుకుంటాను. ఈ రోజుల్లో పొగడడం, తిట్టడం రెండూ సహజమే. వీటికి అతీతంగా మధ్యస్తంగా ఉండాలి. డబ్బు అవసరమే. దాన్ని సంపాదించడానికే సినిమాలు తీసేది. కానీ నేను మధ్యతరగతి నుంచి వచ్చాను. ఆటోల్లో, బస్సుల్లో తిరగడం అంటే నాకు ఇష్టం. ఒక్కసారిగా విమానం ఎక్కేయాలని లేదు. డబ్బులు సంపాదించుకుంటా.. కానీ మెల్లమెల్లగా. నా తదుపరి సినిమా కూడా సురేష్ ప్రొడక్షన్‌లోనే. కథని బట్టే కథానాయకుడు ఎవరన్నది తేలుతుంది. నా కథ వెంకటేష్, రానా లాంటి కథానాయకుల్ని డిమాండ్ చేస్తే తప్పకుండా వాళ్లతో సినిమా చేస్తా"

తల్లిదండ్రుల్లో మార్పు తెస్తుంది

శివగంగాధర్

మహీధర్, సోనాక్షి సింగ్ జంటగా నటించిన చిత్రం 'నా లవ్ స్టోరీ'. శివగంగాధర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ "యువతరం ఆలోచనల్ని ప్రతిబింబించే కథ ఇది. ఏ సన్నివేశం కథని దాటి వెళ్లదు. కథానాయకుడి కోణంలోంచి మొదలైన ఈ కథ, కథానాయిక కోణంలోంచి ముగుస్తుంది. ఈ తరహా స్క్రీన్ ప్లే ఇప్పటి వరకూ రాలేదు. ప్రేమికులిద్దరూ తీసుకున్న నిర్ణయమే ఈ కథని నడిపిస్తుంది. తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చే సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. ఏ ప్రేమకథలో అయినా సంగీతం కీలక పాత్ర పోషిస్తుంది. వేద నివాస్ చాలా మంచి పాటలు ఇచ్చారు. సాహిత్యం కూడా బాగా కుదిరింద"న్నారు.

గీతోపదేశం

పతి దేవుని మురిపించే వలపుల వీణ
జీవితమే పండించే నవ్వుల వాన
కష్టసుఖాలలో తోడూనీడగా
తల్లిని మరిపించే ఇల్లాలి ఆదరణ
మగువేగా మగవానికి మధుర భావన

గీతం: ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి..
చిత్రం: దేవత(1965)
రచన: వీటూరి
– పంపినవారు: చల్లా అంజలి, తాడిపత్రి
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

విడుదలకు సిద్ధం: 'సంజు' కథానాయకుడా?... ప్రతినాయకుడా?

ఈమధ్య కాలంలో బాలీవుడ్‌లో ఓ బయోపిక్ చిత్రీకరణ దశ నుంచే ప్రేక్షకుల్లో అమితాసక్తి కలిగించింది. అదే 'సంజు'. బాలీవుడ్‌లో అగ్ర కథానాయకుల్లో ఒకరిగా అభిమానులను సంపాదించుకోవడంతో పాటు వివాదాస్పద జీవితంతో వార్తల్లో నిలిచిన సంజయ్ దత్ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కడం, సంజయ్‌తో విజయవంతమైన చిత్రాలు తీయడంతో పాటు అతనికి మిత్రుడైన ప్రముఖ దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ ఆ చిత్రాన్ని తెరకెక్కించడం, సంజయ్ పాత్రలో యువ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ నటించడం లాంటి కారణాలతో 'సంజు' అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. సంజయ్ జీవితంతో ముడిపడి ఉన్న వ్యక్తుల పాత్రల్లో ప్రముఖ తారలు అనుష్క శర్మ, సోనమ్ కపూర్, మనీషా కోయిరాలా, టబు, దియా మీర్జా, పరేష్ రావల్ తదితరులు నటించడం మరో ఆకర్షణగా మారింది. ఏఆర్ రెహమాన్ సంగీతమందించిన ఈ చిత్రం శుక్రవారం విడులవుతోంది. ఈ సందర్భంగా 'సంజు' విశేషాలివీ.

సంజయ్ దత్ జీవితంలో ఓ పక్కా కమర్షియల్ చిత్రానికి సరిపోయేంత కథ ఉంది. అలనాటి అగ్రకథానాయకుడు సునీల్‌దత్ వారసుడిగా సునాయాసంగా చిత్రసీమలో అడుగుపెట్టడం, తొలి చిత్రం 'రాకీ'తో రాత్రికి రాత్రే స్టార్‌డమ్ తెచ్చుకోవడంతో సంజయ్‌దత్ నిజ జీవిత చిత్రంలో హీరో ఇంట్రడక్షన్ సీన్ అదిరిపోయింది. ఇక కెరీర్‌లో అంతా శుభమే అనుకున్నారు. కానీ అంత సుఖంగా శుభం కార్డు పడలేదు. ఆలోపు ఎన్నో ఎత్తుపల్లాలు, గెలుపోటములు చవిచూడాల్సి వచ్చింది. అది సినిమాల పరంగా మాత్రమే అయితే ఆయన గురించి సినిమా తీసేంత విశేషముండేది కాదు. తెరమీద విలన్ల కన్నా తనలోని శత్రువును జయించడానికే ఎక్కువ పోరాటం చేయాల్సి వచ్చింది. ఆ ప్రియ శత్రువు పేరు మత్తు. రెండు పదుల ఉరకలేసే యవ్వనంలో మాదకద్రవ్యాల రుచి మరిగి బానిసగా మారాడు సంజయ్. దాన్ని వదిలించుకోలేక ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఇక సంజు పనైపోయినట్లే అని అందరూ మరిచిపోతున్న తరుణంలో ఉక్కు సంకల్పంతో ఆ మత్తు మహమ్మారిని ఓడించి, కొండల్నైనా పిండి చేసేలా కండలు పెంచి యువతకు ఆరాధ్య కథానాయకుడిగా మారాడు. సంజు అనే పేరు వింటే అమ్మాయిల గుండెల్లో వైబ్రేషన్స్ వచ్చేవి. వారి సంగతి అలా ఉంచితే కొందరు అందాల కథానాయికలు సైతం ఆయన మీద మనసు పారేసుకుని రొమాన్స్ చేశారు. మరో వైపు కెరీర్‌లో సూపర్ హిట్లు.. ఇలా జబర్దస్త్‌గా సాగిపోతున్న సంజు సినిమాలో అక్రమ ఆయుధాల కేసుతో దిమ్మతిరిగే ఇంటర్వెల్ ట్విస్టు వచ్చి పడింది. ఆ కేసులో జైలుకు కూడా వెళ్లడంతో అప్పటి వరకూ కథానాయకుడనుకున్న సంజు ఖల్‌నాయక్ (విలన్)గా కనిపించడం మొదలెట్టాడు. అయితే ఇంకా సెకెండ్ హాఫ్ ఉంది. ఇది విషాదాంత కథ కాదు. ఓ విజేత కథ. జీవితంపై మాయని మచ్చపడినా, బ్యాడ్‌బోయ్‌గా ఛీత్కారాలు ఎదురైనా సహనంతో భరించి, శిక్ష ముగించుకుని బయటికొచ్చినా ఇంకా మనసులో పచ్చిగా ఉన్న గాయాలను పంటి బిగువున ఓర్చుకుని, మళ్లీ జీవిత ప్రయాణం ప్రారంభించి 'మున్నాభాయ్'గా అందరి అభిమానాన్ని ఎలా గెలుచుకున్నాకే 'సంజు' జీవిత చిత్రానికి శుభం కార్డు పడింది. అయితే ఆ కేసుతో సంజయ్‌కు ఉన్న సంబంధమేంటి? అతను నేరం చేశాడా? ఆయన నిజజీవితంలో కథానాయకుడా ప్రతినాయకుడా అనే విషయాలను 'సంజు'లో ఎలా ఆవిష్కరిస్తారో అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

సంజు పరివారమిదే

తెరమీద సంజయ్‌దత్‌గా రణ్‌బీర్ నటించగా, అతని తల్లిదండ్రులు సునీల్ దత్, నర్గీస్ దత్ పాత్రల్లో పరేష్ రావల్, మనీషా కోయిరాలా నటించారు. సంజయ్ భార్య మాన్యతగా దియా మీర్జా, సంజయ్ జీవితకథ రాయాలనుకునే జర్నలిస్ట్‌గా అనుష్క శర్మ నటించింది. సోనమ్ కపూర్ పాత్ర ఏంటనేది గోప్యంగా ఉంచారు. టబు ఆమె నిజజీవిత పాత్రలోనే కనిపించబోతోంది. సంజయ్‌తో కొద్దికాలం ప్రేమలో ఉన్న కథానాయికలు మాధురీ దీక్షిత్, టీనా మునిమ్ పాత్రలు ఇందులో ఉన్నాయా అన్నది వెల్లడికాలేదు. సంజయ్‌కి మంచి స్నేహితుడైన సల్మాన్ ఖాన్ పాత్ర కూడా ఇందులో ఉందని, ఆ పాత్రలో సల్మానే కాసేపు కనిపించబోతున్నారని వినిపిస్తోంది.

ఆ సన్నివేశానికి కోత

ట్రైలర్‌లో సంజు పాత్ర జైల్లో ఉన్నప్పుడు టాయిలెట్ లీకై గదిలోకి వచ్చేసే సన్నివేశం ఉంటుంది. దానిపై విమర్శలు వచ్చాయి. చిత్రంలో ఆ సన్నివేశంలోని కొన్ని దృశ్యాలను తొలగించమని సెన్సార్ బోర్డ్ సూచించినట్లు సమాచారం.

ఈనాడు
వసుంధర
శుక్రవారం జూన్ 29, 2018 ● విజయవాడ

పట్టుచీరలయినా సరే... ఆధునికంగా, ట్రెండీ లుక్‌తో కనికట్టు చేయాలి. అప్పుడే మగువల మనసు దోచుకుంటాయి. అలాంటివే ఈ బెనారస్ కథాన్ పట్టు చీరలు. రంజింపజేసే రంగులూ.. వైవిధ్యమైన డిజైన్లతో అలరిస్తున్నాయి.

కూజాల మోటిఫ్‌లూ, పసుపు రంగు అంచుతో హుందాగా అలరిస్తోన్న నీలం రంగు బెనారస్ పట్టుచీర.

ఫ్యాషన్ ఫ్యాషన్

కట్టేద్దాం కథాన్

జాందానీ పనితీరు.. ముచ్చటగా మెరిపించే మోటిఫ్‌లతో తీర్చిదిద్దిన బెనారస్ కథాన్ పట్టు చీర.

చుక్కలూ, మోటిఫ్‌లతో మలచిన బూడిద వర్ణం చీరకు కళ తెచ్చిన సీ గ్రీన్ అంచు.

రామచిలుకలు వాలినట్టుగా రూపొందించిన గులాబీ రంగు బెనారస్ చీరకు గీతల అంచు ప్రత్యేకం.

నగలు, దుస్తులు:
KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
✆ 040-23231147,
జూబ్లీహిల్స్, హైదరాబాద్.

మోడల్: కృతికాసింగ్ రాథోడ్
ఫొటోలు: పాతూరి పద్మావతి

పులిపిర్లతో క్యాన్సర్ వస్తుందా?

నాకు ఇరవై ఏడేళ్లు. నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. నాకింకా పెళ్లి కాలేదు. నా ముఖం మీద పులిపిర్లు వస్తున్నాయి. ఇవేమన్నా క్యాన్సర్‌కి కారణమా. వీటిని పోగొట్టుకోవాలంటే ఏం చేయాలో చెప్పండి.
- ఓ సోదరి

డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజిషియన్

చాలామంది తెలియక ఈ పులిపిర్లని క్యాన్సర్ కారకాలని అనుకుంటారు. కానీ ఇదేమీ పెద్ద సమస్య కాదు భయపడాల్సిన అవసరంలేదు. కాకపోతే ముఖం మీద అవి నల్లగా కనిపిస్తుంటేనే చూడటానికి బాగోదు. వైద్యపరంగా చెప్పాలంటే ఈ సమస్యని డీపీఎన్ (డెర్మాటోసిస్ పాపులోస నిగ్రా) అంటారు. వీటివల్ల దురదా, నొప్పి ఉండదు. నిజానికి చికిత్స తీసుకోవాల్సినంత సమస్యేమీ కాదు. వచ్చిన వాటిని తొలగించుకోవాలనేం లేదు. వీటికి ఓ కారణమంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండదు. కుటుంబంలో ఎవరికైనా ఇవి ఎక్కువగా ఉంటే ఇతర కుటుంబసభ్యులకూ రావచ్చు. చెంపలూ, నుదురూ, మెడా, వీపూ, ఛాతీ మీద అధికంగా వస్తాయి. చాలామంది తెలిసీ తెలియక యూట్యూబ్‌లో చూసో, ఇతరులు చెప్పారనో.. కొన్ని రకాల ప్రయోగాలు చేస్తుంటారు. ఎలాగంటే బొప్పాయి పాలు పులిపిర్ల మీద చల్లడం, వెల్లుల్లి రసం, టూత్‌పేస్టు, కర్పూరం రాయడం వంటివి చేస్తుంటారు. వీటివల్ల పులిపిర్లు పోవు సరికదా.. కొత్త సమస్యలు వస్తాయి. చర్మం కాలినట్టు అయి నల్ల మచ్చలు కూడా పడతాయి. కాబట్టి నిపుణుల సలహాతోనే వాటిని తొలగించాలి. ఇందుకు కెరటేజ్ అనే చికిత్స ఉంది. అలానే క్యూరేటర్ అనే పరికరం సాయంతో కూడా వీటిని తీసేస్తారు. దీన్ని క్రయో థెరపీ అంటారు. ఆధునిక పరికరంతో ఆ పులిపిర్లను కాల్చేస్తారు. లేజర్ చికిత్స కూడా ఉంది. అయితే మిమ్మల్ని ముందు పరీక్షించాకే ఏ చికిత్స అనేది వైద్యులు నిర్ణయిస్తారు. వాటిని పైపైనే తొలగిస్తారు. మరీ లోతుగా తీసేస్తే చర్మసంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. నల్ల మచ్చలు రావొచ్చు. ఈ చికిత్సలు చేయించుకున్నాక ఓ వారంపాటు ఎండలోకి వెళ్లకపోవడం మంచిది. సన్‌స్క్రీన్ లోషన్ తప్పకుండా రాయాలి. లేదంటే మచ్చలు పడతాయి. ఈ చికిత్సల తరువాత కొంత కాలానికి మళ్లీ కొత్తవీ రావచ్చు. వాటిని తొలగించడానికి మాత్రం కొంతకాలం ఆగాల్సి ఉంటుంది. వెంట వెంటనే చికిత్సలు చేయించుకోకూడదు.

- మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

సోయాపాలు తాగేద్దాం



పాలల్లో పోషకాలున్నాయని తెలిసినా కొందరు పాలూ, పాల సంబంధిత పదార్థాలను ఇష్టపడరు. కారణం ఏదయినా సరే... ఇప్పుడు పాలకు కొన్ని ప్రత్యామ్నాయాలు ఎంచుకోవచ్చు. అవేంటో చూసేయండి.

● **కొబ్బరి పాలు:** కొబ్బరి నుంచి ఈ పాలు తీస్తారు. కొబ్బరిని ముక్కలుగా కోసి మిక్సీలో వేసి చిక్కని పాలు తీస్తారు. వీటిని వంటకాల్లో వాడొచ్చు. ఈ పాలకు కాస్త పంచదార కలిపి తీసుకుంటే ఎముకలు దృఢంగా మారతాయి. కీళ్లనొప్పులు కూడా అదుపులో ఉంటాయి.

● **సోయా పాలు:** ఎండిన సోయా బీన్స్‌ని నీళ్లల్లో నానబెట్టి పాలు తీస్తారు. లాక్టోజ్ పడనివాళ్లు దీన్ని ప్రయత్నించవచ్చు. ఈ పాలను తాగడం వల్ల రక్తనాళాలు బలపడతాయి. మెనోపాజ్ సమయంలో సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయి. దీంట్లో శాచురేటెడ్ ఫ్యాట్, చక్కెరశాతం చాలా తక్కువగా ఉంటుంది. మాంసకృత్తులు అందుతాయి.

● **రైస్ మిల్క్:** దంపుడుబియ్యంతో చేసే ఈ పాలల్లో పోషకాలు ఎక్కువ. కాస్త తియ్యగానే కాదు రకరకాల రుచుల్లోనూ దొరుకుతున్నాయివి. వీటివల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి.

● **బాదం పాలు:** బాదంపప్పుని నానబెట్టి పాలు తీయడం కూడా చాలా సులువు. వీటినుంచి తగినన్ని మాంసకృత్తులూ, యాంటీ ఆక్సిడెంట్‌లూ, విటమిన్-ఇ, ఇనుము, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్ల వంటివెన్నో అందుతాయి. శరీరంలో వ్యాధినిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

బంగారం వెండి

28న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,921	2,924
వెండి (గ్రా)	43.00	43.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,600	------	31,650	31,700	31,650	31,600	31,573	31,630	31,470	31,270
ఆర్నమెంట్	29,500	------	29,350	29,400	29,380	29,300	29,210	29,240	29,270	29,080
వెండి(కిలో)	40,800	------	41,000	41,200	40,800	40,800	40,700	40,800	41,900	41,900

ఛలో జాబీమూన్

హనీమూన్ తెలుసుకానీ... ఈ జాబీమూన్ ఏంటీ అంటారా... ఈ పదం కొత్తదే. కానీ ఒక ఉద్యోగం నుంచి మరో ఉద్యోగానికి మారే క్రమంలో మధ్యలో కాస్త ఉపశమనం ఉండేందుకూ, మీ గురించి మీరు ఆలోచించేందుకు చేసే చిన్న ప్రయాణమే ఈ జాబీమూన్. అసలెందుకీ ప్రయాణం.. దీనివల్ల లాభం ఏంటో చూద్దామా..

◗ కొన్నాళ్లపాటు ఒక ఉద్యోగం చేస్తూ వచ్చిన మీరు అనుకోకుండా మరోదానికి మారాలనుకుంటారు. కారణం ఏదయినా సరే... ఆ సమయంలో కాస్త కంగారూ, ఒత్తిడి సహజమే. దాన్నుంచి బయటపడాలంటే.. మీకు కాస్త విరామం అవసరం. అదే ఈ జాబీమూన్. అది మిమ్మల్ని మీరు రీఛార్జి చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

◗ గతంలో కెరీర్‌లో మీరు సాధించిన విజయాలు లేదా చేసిన పొరపాట్లు ఆలోచించడానికి ఈ ప్రయాణం ఉపయోగపడుతుంది. దానివల్ల కొత్తగా చేరబోయే ఉద్యోగంలో పొరపాట్లు చేయకుండా ఉంటారు.

◗ ఇప్పుడు మీకు ఏ బాధ్యతలు ఉండవు కాబట్టి ప్రశాంతంగా ఆలోచించుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో తీసుకోవలసిన నిర్ణయాలపై ఓ స్పష్టత కూడా ఉంటుంది.

◗ ఇష్టమైన పర్యటక ప్రాంతానికి లేదా మీ స్నేహితుల్ని చూసిరావడానికి ఈ ప్రయాణం బాగా ఉపయోగపడుతుంది. వారం అవసరం లేదు.. కనీసం రెండుమూడు రోజులు వెళ్లివచ్చినా చాలు.

ఐరాస సదస్సుకు అందుకే ఆహ్వానం!

మార్పు, మహిళాసాధికారత... వినడానికి చాలా బాగుంటాయి. వీటిని సాధించాలంటే మాత్రం అలుపెరగకుండా కష్టపడాలి. ఆమె చేసింది అదే. సర్పంచిగా ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుని గ్రామాభివృద్ధికోసం పాటుపడింది. అదే ఇప్పుడు ఆమెను ఐరాస వేదిక మీద అతిథిగా నిలబెట్టింది. ప్రముఖులతో కలిసి సాధికారత గురించి సందేశమిచ్చే స్థాయికి తీసుకెళ్లింది. ఆమే శ్రీకాకుళం జిల్లా పోర్టుకళింగపట్నం సర్పంచి లక్ష్మీ జనార్ధన్.

సర్పంచిగా పోటీ చేసే సమయంలో 'నీకెందుకు ఈ పదవులు' అన్నవారున్నారు. గ్రామాన్ని బాగు చేయాలని నేననుకుంటే రాజకీయం చేస్తున్నానని మరికొందరు అన్నారు. అయినా అవేమీ నేను పట్టించుకోలేదు. నిజంగా మార్పు తేవడానికే సర్పంచినయ్యా. అనుకున్నది సాధించా. అందుకే ఐరాస సదస్సుకు పిలుపు అందుకున్నా. మొన్న ముంబయిలో జరిగిన అంతర్జాతీయ కార్యక్రమంలో అతిథిగా 'మహిళాసాధికారత' అనే అంశం మీద మాట్లాడే అవకాశం కూడా వచ్చింది. క్రీడలూ, బాలీవుడ్‌లో ప్రముఖులూ హాజరైతే వాళ్లలో నేనే సామాన్యురాలిని. మిగతా వారంతా బయటి ప్రపంచానికి తెలిసినవాళ్లు. అలాంటివారి మధ్యలో సామాన్య మహిళగా.. ఓ సర్పంచిగా మాట్లాడటం గర్వంగా అనిపించింది. ఒకప్పుడు సాధారణ గృహిణిని అయిన నేను ఈ స్థాయికి ఎలా వచ్చానంటే..

అప్పుడు అనుకున్నాం: మాది శ్రీకాకుళం దగ్గర పోర్టు కళింగపట్నం. నాన్న కొంత కాలం రైల్వేలో పనిచేశారు. మేం నలుగురం ఆడపిల్లలం కావడంతో జీతం సరిపోయేది కాదు. దాంతో ఆ ఉద్యోగం మానేసి మా ఊరు వచ్చేశారు. తరువాత మర్చంట్ నేవీలో చేరారు. నన్ను డిగ్రీ వరకూ చదివించారు. ఆ తరువాత మంచి సంబంధం రావడంతో పెళ్లి చేశారు. మావారు కూడా నేవీనే. కుటుంబం, పిల్లలు.. ఇలా సమయం తెలియకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. అయితే మా వార్డులో రెండువేల మంది జనాభా ఉంటారు. సముద్రం పక్కన ఉండటంతో పర్యటకులూ వస్తుంటారు. మత్స్యకారులూ ఎక్కువ. నేవీ కుటుంబాలూ ఉంటాయి. సర్పంచులు మారినా గ్రామంలో నీళ్ల మొదలు మరే సమస్యా తీరలేదు. అలాంటి సమయంలో అంటే 2013 పంచాయతీ ఎన్నికల్లో మా గ్రామం మహిళలకు రిజర్వు అయింది. మావారు నన్ను పోటీ చేయమన్నారు. అప్పుడు నా వయసు పాతికేళ్లు. పిల్లలిద్దరూ చిన్నవాళ్లు. ఆలోచించా. కానీ గ్రామాన్ని బాగు చేయాలంటే పోటీ చేయడం మంచిదనిపించింది. అందుకే స్వతంత్ర అభ్యర్థిగా నిల్చున్నా. విజయం సాధించా. అలా మా గ్రామానికి మొదటి మహిళా సర్పంచినయ్యా.

పర్యటకాభివృద్ధి: సర్పంచిగా బాధ్యతలు తీసుకున్నాక... సమస్యల్ని జాబితాగా రాసుకుని ఒక్కొక్కటీ పరిష్కరించా. సీసీరోడ్లూ, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, అండర్ డ్రైనేజీ, ఇంటింటికీ పంపు నీళ్లూ, మంచి నీళ్లు అన్నీ అందేలా చూశా. వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకొనేలా చేశా. పర్యటకుల కోసం బీచ్ ప్రాంతం పరిశుభ్రంగా మార్చడం మొదలు అక్కడ మరుగుదొడ్ల ఏర్పాట్లూ, పచ్చని పార్కులూ, బెంచీలూ.. ఇలా ఎన్నో చేశా. ప్రభుత్వం అందిస్తోన్న పథకాలను ప్రజలకు సక్రమంగా అందేలా చూడటమూ నా బాధ్యత అనుకున్నా. పంచాయతీ రాజ్ అధికారుల వల్ల నా గురించి తెలిసిన ఐరాస సభ్యులు గతంలో మహిళాసాధికారతకు సంబంధించిన వర్క్‌షాపునకు ఆహ్వానించారు. అలానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఒకసారి శ్రీలంకలో పర్యటించి అక్కడ పర్యటకాభివృద్ధి గురించి పరిశీలించి.. వారు అనుసరిస్తున్న విధానాల మీద అధ్యయనం చేసి నివేదిక ఇవ్వమని అడిగింది. బుధవారం ముంబయిలో మహిళాసాధికారతకు చిహ్నంగా ఐరాస ప్రతినిధులు 'నాకూ హక్కు ఉంది' అనే పేరుతో ఓ వీడియోని రూపొందించి విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ప్రముఖ మహిళల్ని సదస్సుకు ఆహ్వానించారు. వారిలో నేనూ ఉన్నా. మేమంతా మహిళలుగా ఉన్నత స్థానానికి చేరే క్రమంలో ఎదుర్కొన్న వివక్షను అధిగమించిన విధానాన్ని సదస్సులో వివరించాం. నేను సర్పంచిగా పోటీ చేసే క్రమంలో చాలామంది విమర్శించారు. పిల్లల్ని పెంచే నీకు పదవులు కావాలా అన్నట్టు మాట్లాడారు. గ్రామాన్ని బాగు చేయకుండా అడ్డుకోవాలనీ చూశారు. వాటన్నింటినీ మౌనంగా, సానుకూలంగా ఎదుర్కొంటూ ఈ స్థాయికి రావడం చాలా ఆనందంగా ఉంది. అదే ఆ సదస్సులో చెప్పా.

బ్రహ్మ కమలాలు

పిలుస్తోంది.. పుష్పవిలాసం

పెరటిలో ప్రేమగా పెట్టిన మొక్క మొగ్గ తొడిగితే.. ఓ ఆనందం. ఎన్ని రోజులైనా విచ్చుకోకుండా బెట్టు చేస్తున్న మొగ్గను చూస్తే నిరుత్సాహం. ఓ రోజు ఉదయం.. బద్ధకంగా ఒళ్లువిరుస్తూ.. భారంగా నడుస్తుంటే.. ఏదో పరిమళం వెనక్కి పిలుస్తుంది. చూస్తే.. తాజాగా విరిసిన విరిబాల!! మనసు పరవశిస్తుంది. ఒక్క పువ్వుకే ఇలా పొంగిపోతే ఎలా? అన్ని దారుల వెంటా.. పూలబారులుంటే! గిరులన్నీ పూచిన మోదుగ చెట్లలా దర్శనమిస్తే! లోయలన్నీ పూలపాన్పును తలపిస్తే..!! ఇంతటి సౌందర్యం ఉందంటే.. చూడడానికి ఎక్కడికైనా వెళ్లిపోతామంటారా? అయితే ఎందుకాలస్యం..



వసంతం ఎప్పుడో వెళ్లిపోయిందిగా.. ఇప్పుడు పూలు, పరిమళాలు ఏంటి? అంటారా! ఏడాదంతా మంచుతో వణికిపోయే గిరులకు ఇప్పుడు మంచి తరుణం వచ్చేసింది. దేశమంతా రుతుపవనాలు విస్తరిస్తున్న వేళ.. అక్కడ లోయల్లో విరివనాలు విస్తరిస్తాయి. గుట్టలన్నీ బుట్టలకొద్దీ పూలు కుమ్మరించినట్టు కనిపిస్తాయి. ఉత్తరాఖండ్‌లోని వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్, నాగాలాండ్‌లోని జుకోవు, సిక్కింలోని యమ్‌తంగ్ లోయలు పూలతో పులకించిపోతుంటాయి. పడమటి కనుమల్లోని కాస్ మైదానం ఈ సీజన్‌లో గులాబి రేకులు పరుచుకున్న పూదోటను తలపిస్తుంది. మన దగ్గర అరకులోయ కూడా పూలతో మురిపిస్తుంది. పసుపు వర్ణంలో మెరిసిపోయే అరకు అందాలు నవంబర్-డిసెంబర్ నెలల్లో దర్శనమిస్తాయి.

విరివసంతం.. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్, ఉత్తరాఖండ్

పర్యాటక అభిరుచి, ప్రకృతిపై ప్రేమ ఉన్న వ్యక్తికి ఇష్టమైన తొలి పది విహార కేంద్రాల్లో ఉత్తరాఖండ్‌లోని వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ తప్పకుండా ఉంటుంది. బదరీనాథ్ క్షేత్రానికి 25 కిలోమీటర్ల దిగువన... సముద్రమట్టానికి 3,658 మీటర్ల ఎత్తున ఉన్న పూల లోయ ఇది. 1982లో దీనిని జాతీయ ఉద్యానవనంగా ప్రకటించారు. అంతేకాదు యునెస్కో గుర్తింపు కూడా పొందింది. సుమారు 87 చదరపు కి.మీ విస్తరించి ఉన్న ఈ భారీ ఉద్యానవనాన్ని పుష్పవతి నది రెండుగా విభజిస్తుంది. నదీపాయకు రెండు వైపులా ఆకాశాన్నంటే పర్వతాలుంటాయి. ఏడాదంతా మంచులో ముడుచుకున్న కొండలు.. జూన్ వచ్చేనాటికి ఒళ్లంతా పూలు తురుముకొని.. పిల్లగాలితో ఇచ్చికాలాడుతూ పర్యాటకులను మరోలోకానికి తీసుకెళ్తాయి. 520 రకాల కుసుమాలు వివిధ రంగుల్లో, విభిన్న ఆకృతుల్లో వికసించి విస్తుపోయేలా చేస్తాయి. బంగారు రంగులో లిల్లీ, పొద్దుతిరుగుడు పూలను మరిపించే హిమాలయన్ డేజీ, అరుదైన పుష్పాలుగా చెప్పే బ్రహ్మకమలాలు.. ఇలా ఎన్నెన్నో పూలు లోయంతా పరుచుకొని.. పర్యాటకుల కోసం కాచుకొని ఎదురు చూస్తుంటాయి.

పూబాటలో నడక

జూన్ రెండో వారం నుంచి మొదలయ్యే పూలవసంతం అక్టోబర్ వరకు కొనసాగుతుంది. 75 ఏళ్లు పైబడిన వృద్ధులు, ఆరేళ్లు దాటని చిన్నారులను లోయలోకి అనుమతించరు. పూలలోయ రుషీకేశ్ నుంచి 320 కి.మీ దూరంలో ఉంటుంది. గోవిందఘాట్ వరకు బస్సుల్లో, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు. గోవిందఘాట్ నుంచి 13 కిలోమీటర్లు కొండలు, లోయల గుండా ట్రెక్కింగ్ చేస్తే గంగారియా బేస్ క్యాంప్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నాలుగైదు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. లోయలో పూల సొగసులు చూడడానికి మరో పది, పదిహేను కిలోమీటర్ల వరకు తిరగాల్సి వస్తుంది. ఎంత నడిచినా.. వేవేల వర్ణాల పూలు, వాటి మీదుగా వీచే గాలి పరిమళం అలసటను దరిచేరనీయవు.

ఎప్పటి నుంచి..

జూన్ 1 నుంచి అక్టోబర్ 4 వరకు వ్యాలీలోకి అనుమతిస్తారు.

సందర్శన వేళలు: ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోనికి వెళ్లొచ్చు. లోపలికి వెళ్లినవాళ్లు సాయంత్రం 5 గంటల లోపు బయటకు వచ్చేయాలి.

ఎలా చేరుకోవాలి?

ముందుగా దిల్లీ చేరుకోవాలి. అక్కడి నుంచి రుషీకేశ్‌కు బస్సులు, రైళ్లు, ప్రైవేట్ ట్యాక్సీల్లో వెళ్లొచ్చు.

సమీపంలో

బదరీనాథ్ క్షేత్రం (25 కి.మీ), రుద్రప్రయాగ (131 కి.మీ, ఇక్కడి నుంచి దేవప్రయాగ 65 కి.మీ), హేమకుండ్ (4 కి.మీ), సాహిబ్ గురుద్వార (4 కి.మీ)

- పలు ట్రావెల్ సంస్థలు, హిమాలయాస్ హెవెన్ అడ్వెంచర్ వంటి ట్రావెల్ క్లబ్‌లు రుషీకేశ్ నుంచి వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌కి ప్యాకేజీలు నిర్వహిస్తున్నాయి. రుషీకేశ్ నుంచి ఐదు రోజుల ప్యాకేజీకి సుమారు రూ.7,500- రూ.12,000 (ఒక్కొక్కరికి) వసూలు చేస్తున్నారు.

పచ్చని పశ్చిమం కాస్, మహారాష్ట్ర

పడమటి కనుమల్లో మిలియన్ పూల వనం మహారాష్ట్రలోని కాస్ మైదానంలో చూడొచ్చు. ప్రతి ఏడాది ఆగస్ట్-సెప్టెంబర్ నెలల్లో ఈ నేలలో రంగురంగుల పూలు పుట్టుకొస్తాయి. చుట్టూ ఎత్తయిన పర్వతాలు.. మధ్యలో విశాలమైన మైదానం. అందులో 600 రకాల మొక్కలు. కిలోమీటర్ల కొద్దీ విస్తరించి ఉంటాయి. ప్రతి కొమ్మ రెమ్మరెమ్మకు పూలు.. ఆ పూల చుట్టూ గింగిరాలు కొడుతూ.. మకరందాన్ని అందుకునే భ్రమరాలు.. ఇలా ఆ ప్రాంతమంతా సుందరంగా ఉంటుంది. ఎక్కడా కనిపించని 40 రకాల మొక్కలు ఇక్కడ పుష్పించడం విశేషం. అందుకే కాస్ మైదానం యునెస్కో జీవవైవిధ్య కేంద్రంగా గుర్తింపు పొందింది. ఏటా ఆగస్టు వచ్చిందంటే చాలు ముంబైకర్లు, పుణెవాసులు చలో కాస్ అంటారు. వానలు తెచ్చిన చల్లదనంలో మురిసిపోతూ కాస్ బాట పడతారు. నీలిమేఘాల నీడలో విరివన విహారం చేస్తారు. పూలను తాకరాదు, కోయరాదు. అయినా.. గంపెడు మధురానుభూతులతో తిరుగుప్రయాణం అవుతారు.

ఎలా వెళ్లాలి?

పుణె నుంచి కాస్ మైదానం 135 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి పుణెకు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ నుంచి బస్సులు కూడా ఉన్నాయి. ముందుగా పుణె చేరుకొని అక్కడి నుంచి బస్సులు, ప్రైవేట్ ట్యాక్సీల్లో సతారా మీదుగా కాస్ చేరుకోవచ్చు. సతారా నుంచి కాస్ 23 కి.మీ దూరంలో ఉంటుంది.

సుమగిరి సొగసులు యమ్‌తంగ్, సిక్కిం

కొండలు, కోనలు, లోయలతో అలరించే ఈశాన్య రాష్ట్రాల్లో సిక్కిం ఒకటి. ఈ రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌కు సుమారు 130 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది యమ్‌తంగ్ లోయ. సముద్ర మట్టానికి 11,800 అడుగుల ఎత్తులో ఉన్న లోయలో యమ్‌తంగ్ నది గలగల కదిలిపోతుంటుంది. నదికి అటూ ఇటూ.. అందమైన పూలవనం కనిపిస్తుంది. రకరకాల మొక్కలు. వాటికి రంగురంగుల మొగ్గలు. గన్నేరు రకానికి చెందిన బోలెడన్ని మొక్కలు దర్శనమిస్తాయి. జులై ద్వితీయార్థం వరకు వీటిని వీక్షించవచ్చు. జూన్-జులై నెలల్లో సుమగిరి సొగసులు చూసేందుకు పర్యాటకులు క్యూ కడితే.. సెప్టెంబర్-డిసెంబర్ మాసాల్లో హిమగిరి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి వెళ్తుంటారు. లోయ సమీపంలో జలపాతాలు అదనపు ఆనందాన్ని అందిస్తాయి. ఇక్కడికి 16 కిలోమీటర్ల దూరంలో సముద్రమట్టానికి సుమారు 15400 అడుగుల ఎత్తులో ఉన్న జీరో పాయింట్ మరో ఆకర్షణ.

ఎలా వెళ్లాలంటే: సికింద్రాబాద్, విశాఖ, విజయవాడ నుంచి న్యూ జల్పాయిగురికి రైళ్లు (వీక్లీ) అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి నుంచి లాచుంగ్ మీదుగా యమ్‌తంగ్ లోయకు (217 కి.మీ) ట్యాక్సీలో చేరుకోవచ్చు.

- లాచుంగ్ సమీపంలో బాగ్‌డోగ్రా విమానాశ్రయం ఉంది. కోల్‌కతా నుంచి విమానంలో బాగ్‌డోగ్రాకు వెళ్లాలి. ఇక్కడి నుంచి లాచుంగ్ మీదుగా బస్సులో గానీ, ట్యాక్సీలో గానీ యమ్‌తంగ్ (220 కి.మీ) చేరుకోవచ్చు.

పుష్పాంజలి జుకోవు, నాగాలాండ్

నాగాలాండ్, మణిపూర్ సరిహద్దులో ఉంటుంది జుకోవు పూలలోయ. వసంతం వెళ్లిపోయాక కూడా ఇక్కడ పూల సందడి తగ్గదు. ఎత్తుపల్లాల లోయల్లో రంగురంగుల కార్పెట్లు పరచినట్టు అనిపిస్తుంది. ఈ పూలలో జుకోవు లిల్లీ ప్రధాన ఆకర్షణ. జులై ద్వితీయార్థంలో లోయంతా పూలతో కళకళలాడుతుంటుంది. నాగాలాండ్ రాజధాని కోహిమా నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే జుకోవు చేరుకోవచ్చు. జఖామా, విశ్వేమా గ్రామాల నుంచి లోయలోకి ప్రవేశించవచ్చు. కోహిమా నుంచి జఖామా 16 కి.మీ, విశ్వేమా 23 కి.మీ ఉంటుంది. రెండు గ్రామాల నుంచి కాలినడకన లోయ దాకా వెళ్లాలి.

ఎలా వెళ్లాలంటే: కోహిమాకు దగ్గర్లో ఉన్న విమానాశ్రయం డిమాపూర్. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి కోల్‌కతా చేరుకుంటే.. అక్కడి నుంచి డిమాపూర్‌కు విమానంలో వెళ్లొచ్చు. డిమాపూర్ నుంచి కోహిమాకు 68 కి.మీ దూరం. ట్యాక్సీలు, బస్సుల్లో వెళ్లొచ్చు. విజయవాడ, విశాఖపట్టణం నుంచి డిమాపూర్‌కు రైళ్లు (వీక్లీ) అందుబాటులో ఉన్నాయి.

విరామం.. విహారం

రైలులో దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు మధ్యలో విరామం తీసుకొని తిరిగి ప్రయాణం కొనసాగించే అవకాశం ఉందా?

ఒకే రిజర్వేషన్ టికెట్‌పై ప్రయాణాన్ని విడతల వారీగా కొనసాగించే అవకాశం రైల్వే కల్పిస్తోంది. గమ్యస్థానం 500 కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరం ఉంటే.. మధ్యలో ప్రయాణికుడు కోరుకున్న ఏదైనా స్టేషన్‌లో దిగిపోవచ్చు. గరిష్ఠంగా రెండు రోజుల విరామం తర్వాత అదే టికెట్‌పై తిరిగి ప్రయాణం కొనసాగించవచ్చు. ప్రయాణ దూరం 1000 కిలోమీటర్ల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే.. మధ్యలో ఏదైనా రెండు చోట్ల ప్రయాణికుడు దిగి విశ్రాంతి తీసుకునే సౌలభ్యం ఉంది. ప్రయాణికులు ఎక్కాల్సిన రైలు రాకపోకల సమయాన్ని ఎన్ని రోజులు విరామం తీసుకోవాలో నిర్ణయిస్తారు. టికెట్ బుక్ చేసుకునే సమయంలోనే విరామ స్థానాల సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. రిజర్వేషన్ పూర్తయ్యాక ఇది సాధ్యపడదు. విరామం తీసుకున్న ప్రదేశం నుంచి తిరిగి ప్రయాణాన్ని కొనసాగించే ముందు టికెట్‌పై స్టేషన్ మేనేజర్/ టికెట్ కలెక్టర్‌తో ఆమోదముద్ర వేయించుకోవాలి.

ఆకాశమార్గాన.. అమరనాథుడి చెంతకు

భయభక్తుల మధ్య అమర్‌నాథ్‌కేగే యాత్రికులు ఈసారి గాలిలో తేలిపోతున్నారు. గతంతో పోల్చుకుంటే ఈ పుణ్యధామానికి హెలికాప్టర్‌లో చేరుకుంటున్న భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. హెలికాప్టర్ టికెట్‌పై జీఎస్టీ 5 శాతానికి తగ్గించడంతో ధరలు చాలావరకు తగ్గాయి. దీంతో అమరనాథుడి దర్శనానికి ఆకాశమార్గాన వెళ్లడానికి మొగ్గు చూపుతున్నారు భక్తులు. యాత్ర ప్రారంభానికి ముందే దాదాపు 40వేల టికెట్లు బుక్ కావడం ఇందుకు నిదర్శనం. 2016లో నీల్‌గ్రాథ్ నుంచి పంచతరణి రూ.2,000గా ఉన్న హెలికాప్టర్ టికెట్ ధర ఇప్పుడు రూ.1,600కు తగ్గింది. పహల్గామ్ నుంచి పంచతరణికి రూ.4,300 పలికిన టికెట్ ధర ఇప్పుడు రూ.2,750కి తగ్గింది. అందుకే హెలికాప్టర్‌లో ప్రయాణానికి చాలామంది ఆసక్తి కనబరుస్తున్నారు. యాత్ర తొలి నాలుగు వారాలకు సంబంధించి హెలికాప్టర్ టికెట్లు ఇప్పటికే పూర్తిగా బుక్ కావడం విశేషం.

బయటే చెక్‌ఇన్

విమానాశ్రయంలో చెక్‌ఇన్ క్యూలు చాంతాడంత ఉంటాయి. విలాసవంతమైన ప్రయాణానికి ముందు ఈ వరుసలో నిలడబటం విసుగుతెప్పిస్తుంది. అయితే చెక్‌ఇన్ లేకుండానే ఇప్పుడు ముంబయి విమానాశ్రయంలోకి అడుగుపెట్టొచ్చు. ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లోని ఆరు స్టార్‌హోటల్స్‌లో చెక్‌ఇన్ సదుపాయం కల్పించారు. ఆ హోటళ్ల లాబీల్లో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాల్లో చెక్‌ఇన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. అక్కడే బోర్డింగ్ పాస్‌తో పాటు లగేజీ ట్యాగ్ కూడా పొందవచ్చు.

తర్వాత విమానాశ్రయానికి చేరుకొని లగేజీని 'సెల్ఫ్ బ్యాగ్ డ్రాప్' కౌంటర్‌లో ఇచ్చేసి.. భద్రతా సిబ్బంది అనుమతి తీసుకొని లోనికి వెళ్లిపోవచ్చు. సహారాస్టార్, హయత్ రెజెన్సీ, తాజ్ శాంతాక్రుజ్, ఐటీసీ మరాఠా, హిల్టన్ ముంబయి, ద లలిత్ స్టార్ హోటల్స్‌లో చెక్‌ఇన్ అవకాశం ఉంది. రానున్న రోజుల్లో మరో ఐదు హోటళ్లలో చెక్‌ఇన్ కేంద్రం ఏర్పాటు చేస్తామంటున్నారు అధికారులు. అయితే, ఈ హోటల్స్‌లో వెళ్లడానికి అనుమతి ఉన్నవారికే.. అక్కడ చెక్‌ఇన్ సదుపాయం పొందే వీలుంది.

బొజ్జన్నకొండ చూడాలి తప్పకుండా!

లోకల్‌టూర్

భారతావనిలో ఒకప్పుడు బౌద్ధధర్మం పరిఢవిల్లిందని చెప్పడానికి చారిత్రక ఆధారాలు ఎన్నో ఉన్నాయి. నలంద నుంచి నాగార్జునసాగర్ దాకా, అజంతా నుంచి అమరావతి వరకు ఎన్నో ప్రదేశాలు బౌద్ధ ఆరామాలకు చిరునామాగా నిలిచాయి. కాలక్రమంలో చాలావరకు కనుమరుగైనా.. తెలుగునాట పదుల సంఖ్యలో ఆరామాలు కాలపరీక్షను తట్టుకొని నిలబడ్డాయి. విహార కేంద్రాలుగా పర్యాటకులకు నాటి చరిత్రను బోధిస్తున్నాయి. అలాంటి దివ్యధామమే బొజ్జన్నకొండ. అరుదైన బౌద్ధ స్తూపాలు, విగ్రహాలతో అలరారుతున్న బొజ్జన్నకొండ జాతీయ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది.

అనకాపల్లికి 4 కిలోమీటర్ల దూరంలో శంకరం గ్రామంలో ఉంటుంది బొజ్జన్నకొండ. భారీ కొండను తొలచి ఆరామాలను నిర్మించారు. క్రీస్తుశకం 4 నుంచి 9వ శతాబ్దం మధ్యలో వీటిని నిర్మించినట్టు చరిత్రకారులు చెబుతారు. కొండపై నాలుగు గుహలు ఉన్నాయి. 1906-08 ప్రాంతంలో ఇక్కడ జరిపిన తవ్వకాల్లో శాతవాహనుల కాలం నాటి నాణేలు బయటపడ్డాయి. బౌద్ధ క్షేత్ర ఆనవాళ్లు కూడా వెలుగు చూశాయి. కొండపై ఉన్న మొదటి గుహలో నిలువెత్తు బౌద్ధస్తూపం ఉంటుంది. దీని పైభాగంలో ఉన్న గుహలో ధ్యానముద్రలో ఉన్న బుద్ధుడి విగ్రహం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కొండపై బౌద్ధ భిక్షువుల కోసం నిర్మించిన గదులు కూడా ఉన్నాయి. కొండను ఆనుకొని ఉన్న లింగాల కొండ దగ్గర వందల సంఖ్యలో లింగాకార స్తూపాలు ఉన్నాయి. ఈ కొండ మత్స్యాకారంలో ఉండటం విశేషం. విశాఖ, అన్నవరం సందర్శనకు వచ్చిన పర్యాటకులు బొజ్జన్నకొండకు వెళ్తుంటారు. ఈసారి మీరూ చూసి వస్తారు కదూ!

ఇలా వెళ్లొచ్చు..

- విశాఖపట్నం నుంచి అనకాపల్లి (24 కి.మీ) చేరుకోవాలి. అక్కడి నుంచి కొండవరకు వెళ్లడానికి ఆటోలు ఉంటాయి. విశాఖ నుంచి పెందుర్తి, సబ్బవరం మీదగా వచ్చే వారు అనకాపల్లి కంటే ముందుగానే శంకరం ఏలేరు కాలువ మీదుగా కొండకు వెళ్లొచ్చు.
- హైదరాబాద్ విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్టణం నుంచి అనకాపల్లికి బస్సు సౌకర్యం ఉంది.

– పి.వి.సీతారాము, న్యూస్‌టుడే, అనకాపల్లి

కొండకర్ల ఆవ: సహజసిద్ధంగా ఏర్పడిన మంచినీటి సరస్సు కొండకర్ల ఆవ. ఈ సరస్సులో హాయిగా విహరించవచ్చు. నీటిపై తేలియాడే కలువలు.. కళ్లు తిప్పుకోనియ్యవు. వలస వచ్చిన పక్షులతో సరస్సంతా కోలాహలంగా ఉంటుంది. అనకాపల్లి నుంచి ఆటోలో కొండకర్ల, వాడ్రాపల్లి చేరుకోవచ్చు. ఈ రెండు ప్రాంతాల్లోనూ సరస్సులో విహరించే అవకాశం ఉంది.



ఫ్లాష్.. ఫ్లాష్...

అమెరికా పత్రికా కార్యాలయంలో కాల్పులు

పలువురి మృతి?

వాషింగ్టన్: అమెరికాలోని మేరీలాండ్ రాష్ట్రంలో అన్నాపోలిస్ నుంచి ప్రచురితమయ్యే 'క్యాపిటల్ గెజిట్' దినపత్రికా కార్యాలయంలో గురువారం కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో పలువురు మృతి చెందినట్లు తెలుస్తోంది. 'గ్లాస్ డోర్ నుంచి గన్ మెన్ ఒకరు తుపాకీతో విచక్షణారహితంగా కాల్చాడు. ఒక్కసారిగా అక్కడి వారంతా భీతిల్లారు. భయంతో పలువురు బల్లల కింద దాక్కున్నారు' అని ఫిల్ డేవిస్ అనే రిపోర్టర్ ట్వీట్ చేశాడు. అయితే ఈ సంఘటనలో ప్రాథమికంగా నలుగురు చనిపోయినట్లు సీబీఎస్ న్యూస్ వెల్లడించింది. అన్నాపోలీస్‌లో నాలుగు అంతస్తుల భవనంలో ఈ పత్రికా కార్యాలయం ఉంది. కాల్పుల సంఘటన అనంతరం పోలీసులు ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయించి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఓ నిందితుడిని అదుపులోనికి తీసుకున్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు ట్రంప్‌నకు సమాచారం అందించినట్లు వైట్ హౌజ్ వర్గాలు వెల్లడించాయి.

క్షిపణి కేంద్రానికి పచ్చజెండా

- నాగాయలంకలో ప్రాజెక్టుకు అన్ని అనుమతులు మంజూరు
- కేంద్రం వెంటపడి సాధించుకున్న ఏపీ ప్రభుత్వం
- దేశంలో ఇది రెండో పరీక్ష కేంద్రం

ఈనాడు - దిల్లీ

కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గొల్లలమోద దగ్గర సముద్ర తీరంలోని 154 హెక్టార్లలో డీఆర్‌డీఓ ఏర్పాటుచేసే క్షిపణి పరీక్ష కేంద్రానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత 18 నెలలుగా వివిధ శాఖల మధ్య ఇది నానుతూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అయినప్పటికీ ఇది వస్తే నాగాయలంక చుట్టుపక్కల మౌలికవసతులు మెరుగవడంతోపాటు, అనుబంధ పరిశ్రమలు వచ్చి అభివృద్ధి జరుగుతుందన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై గట్టిగా దృష్టి సారించి అనుమతులు సాధించారు. ఒడిశాలోని బాలాసోర్ తర్వాత దేశంలో రెండో క్షిపణి పరీక్ష కేంద్రంగా నాగాయలంక నిలువనుంది. ఈ ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులు అవసరం కావడంతో తొలుత ఇది సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని కేంద్ర సాధికార సమితి ముందుకెళ్లింది. అది అటవీ అనుమతులు ఇచ్చిన తర్వాత పర్యావరణ అనుమతుల వంతు మొదలైంది. ఈ ప్రాజెక్టు సముద్ర తీరం 500 మీటర్లలోపలకి రావడంతో సీఆర్‌జడ్(కోస్టల్ రెగ్యులేషన్ జోన్) చట్టం కింద అనుమతులు అనివార్యమయ్యాయి. ఇప్పుడున్న సీఆర్‌జడ్ నిబంధనల ప్రకారం అణు విద్యుత్తు సంబంధ ప్రాజెక్టులకు మినహాయించి మిగిలిన ఎలాంటి ప్రాజెక్టులకూ సీఆర్‌జడ్ పరిధిలో అనుమతులు ఇవ్వడం కుదరదని పర్యావరణ శాఖ స్పష్టంచేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌తో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆశాఖ కార్యదర్శి సీకే మిశ్రాతో మాట్లాడారు. దాంతో ప్రత్యేక పరిస్థితుల కింద పర్యావరణశాఖ సీఆర్‌జడ్ నిబంధనలను సవరించి ఈనెల 11న న్యాయశాఖ అనుమతికోసం పంపింది. పరిశీలించిన న్యాయశాఖ ఎట్టకేలకు సవరణలకు ఆమోదముద్ర వేయడంతో ఈ ప్రాజెక్టుకున్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఏపీ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ అర్జాశ్రీకాంత్, రక్షణమంత్రి సలహాదారు, డీఆర్‌డీఓ(డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి కూడా ఇందుకు విశేష కృషి చేశారు. అవసరమైన భూసేకరణ కోసం డీఆర్‌డీఓ ఇప్పటికే రూ.35 కోట్లు జమ చేసింది. ఇప్పుడు ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం మరో రూ.81 కోట్లు మంజూరుచేయనుంది. రూ.1600 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును రెండు దశల్లో చేపట్టనున్నారు. తొలి దశలో రూ.600 కోట్లు, మలి దశలో రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయడానికి డీఆర్‌డీఓ సిద్ధంగా ఉంది. ప్రాజెక్టు పూర్తికావడానికి దాదాపు నాలుగేళ్లు పడుతుందని అంచనా.

పూరీలో నేత్రపర్వంగా దేవస్నాన పూర్ణిమ

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని గురువారం జగన్నాథ, బలభద్ర, సుభద్ర, సుదర్శనుల దేవస్నాన యాత్ర వైభవోపేతంగా జరిగింది. 5 లక్షల మందికిపైగా భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం 6.30కు ఆలయం నుంచి చతుర్ధామూర్తుల పొహండి నిర్వహిస్తూ 9 లోపు స్నానవేదికపైకి చేర్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని బంగారు బావి నుంచి తెచ్చిన 108 కలశాల పవిత్ర జలంతో అభిషేకించారు. మధ్యాహ్నం 3 గంటలకు పూరీ రాజు దేవస్నాన మండపానికి చేరుకుని జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు పూజలు చేసి చెరాపహర చేశారు. తర్వాత పురుషోత్తముని గజానన అవతారంలో అలంకరించారు. ఏడాదికోసారి పూరీ స్వామి ఇలా వినాయకుని రూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. రాత్రికి ముగ్గురు మూర్తులను ఒనొసొనొ (చీకటి) మందిరానికి తరలించారు.

గరుడవాహనంపై శ్రీమలయప్పస్వామి

వైభవంగా పున్నమి గరుడసేవ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారికి పున్నమి గరుడసేవ గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుత్మంతునిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అంతకు ముందు సాయంసందెవేళ శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వేయి నేతిదీపాల వెలుగుల్లో జరిగిన సహస్రదీపాంలకరణ సేవలో పాల్గొన్నారు. అనంతరం వాహన మండపానికి వేంచేసి గరుడవాహనాన్ని అధిరోహించారు. చతుర్మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తకోటి నుంచి కర్పూర హారతులు అందుకున్నారు.

ఆగస్టులో శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ

- 12 నుంచి 16 వరకు శాస్త్రోక్తంగా నిర్వహణ
- 5 రోజుల పాటు పరిమితంగానే శ్రీవారి దర్శనం
- తిరుమల జేఈవో శ్రీనివాసరాజు

ఆగమ సలహాదారు సుందరవరద భట్టాచార్యులు, ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులతో కలిసి మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో అష్టబంధన బాలాలయ మహాసంప్రోక్షణ క్రతువును ఆగస్టు 12 నుంచి 16వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐదు రోజుల పాటు శ్రీవారి ఆర్జిత సేవలన్నీ రద్దు చేస్తున్నామని తిరుమల జేఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనాన్ని నిలిపివేశారు. ఐదురోజుల పాటు పరిమిత సమయంలో కొద్దిమంది భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. రోజుకు 30 వేల మందికి మించి శ్రీవారి దర్శనం కల్పించే అవకాశాల్లేవని జేఈవో తెలిపారు. పన్నెండేళ్లకోసారి ఈ క్రతువును నిర్వహిస్తారని, శ్రీవారి ఆలయంతో పాటు అన్ని ఉపఆలయాల మహాసంప్రోక్షణ చేస్తారని అన్నారు. ఆగస్టు 11, 12 తేదీల్లో నిర్వహించే తోమాల, అర్చన సేవలకు ఉదయాస్తమాన సేవ భక్తులను మాత్రమే అనుమతిస్తారు. 16న ఉదయం మహాసంప్రోక్షణ జరుగుతుంది. చివరి రోజున యాగశాలలోని ఉత్సవమూర్తులను గర్భాలయంలోకి చేర్చడంతో వైదిక కార్యక్రమాలు సమాప్తమవుతాయి. మహాసంప్రోక్షణలో భాగంగా శ్రీవారి మూలవిరాట్టు, ఇతర దేవతామూర్తుల శక్తిని బింబం నుంచి కుంభంలోకి ఆవాహనచేసి ఉపచారాలు, శాంతిహోమాలు నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. అష్టబంధనం అంటే ఎనిమిది రకాల వస్తువులతో తయారుచేసిన చూర్ణమని, దీని ఆయుర్దాయం 12 ఏళ్లు ఉంటుందని ఆగమ సలహాదారు సుందర వరదభట్టాచార్యులు వివరించారు. ఈ అష్టబంధనాన్ని శ్రీవారి పాదాల కింద ఉంచుతామన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శంకరనారాయణకు సన్మానం

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.శంకరనారాయణకు తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాది సంఘాల ప్రతినిధులు గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 30(శనివారం)తో పదవీ కాలం ముగియనున్న సందర్భంగా జస్టిస్ శంకరనారాయణను ఘనంగా సన్మానించారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జస్టిస్ రమేశ్ రంగనాథన్, తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాది సంఘాల అధ్యక్షులు సి.దామోదర్‌రెడ్డి, కె.బి.రామన్నదొర మాట్లాడుతూ.. జస్టిస్ శంకరనారాయణ అందించిన న్యాయసేవలను కొనియాడారు.

సీఎంతో ఏఐఐబీ సీనియర్ సలహాదారు భేటీ

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు(ఏఐఐబీ) సీనియర్ సలహాదారు డాక్టరు ఇజాక్కంహి భేటీ అయ్యారు. ఉండవల్లిలోని ప్రజాదర్బార్ హాలులో గురువారం రాత్రి జరిగిన ఈ సమావేశంలో ఏపీ నీటి సరఫరా, మురుగుజలాల శుద్ధి ప్రాజెక్టు అమలుపై వారు చర్చించారు. దీని కింద రాష్ట్రంలోని 50 పురపాలక సంఘాల్లో నీటి సరఫరా, ఐదు పురపాలకాల్లో మురుగునీటి శుద్ధి పథకాలను చేపడుతున్నారు. దీనికి రూ.4,188.71కోట్లు ఖర్చవుతుంది. మొదటి దశలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ప్రారంభిస్తారు. రెండో దశలో మిగిలిన జిల్లాల్లో అమలు చేస్తారు. మొత్తం వ్యయంలో 70శాతాన్ని ఏఐబీబీ నుంచి అందిస్తారు. 30శాతాన్ని ఆంధ్రప్రదేశ్ భరిస్తుంది. ఇందులో పురపాలక సంఘాల వాటా కూడా ఉంటుంది.

సీఆర్‌డీఏ కార్యాలయాన్ని సందర్శించిన నాలుగు దేశాల్లోని భారత రాయబారులు

ఈనాడు, అమరావతి: ఆస్ట్రియా, స్పెయిన్, వియత్నాం, కువైట్‌లలో భారత రాయబారులు రేణు పాల్, డి.బాల వెంకటేశ్వర్మ, పి.హరీష్, కె.జీవసాగర్ గురువారం విజయవాడలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) కార్యాలయాన్ని సందర్శించారు. సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌తో సమావేశమయ్యారు. రాజధాని నగర ప్రణాళిక, జరుగుతున్న పనులు, అభివృద్ధి అవకాశాల గురించి వారికి కమిషనర్ వివరించారు. ఆయా దేశాలకు చెందిన సంస్థలు రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు, రాజధాని నిర్మాణ ప్రాజెక్టుల్లో పాలుపంచుకునేందుకు ఉన్న అవకాశాల్ని శ్రీధర్ తెలియజేశారు.

ఉచిత ఆన్‌లైన్ సేవల్లో సమస్యల్లేవ్

ఈసీ, నకళ్లపై రెవెన్యూశాఖ వెల్లడి

ఈనాడు, అమరావతి: రిజిస్ట్రేషన్‌శాఖ కల్పించిన ఉచిత ఆన్‌లైన్ సేవలవల్ల ఎటువంటి సమస్యల్లేవని ఏపీ రెవెన్యూశాఖ స్పష్టం చేసింది. 'జనవరి ఒకటో తేదీ నుంచి ఈ నెల 20వరకూ మీసేవ ద్వారా 2,78,510, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 3,35,298, ఆన్‌లైన్ ద్వారా 59,378 ఈసీలను అందజేశాం. మీసేవ ద్వారా 97,556, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 2,52,595, ఆన్‌లైన్ ద్వారా 7,41,512 నకళ్లను ఇచ్చాం. ఈ ప్రక్రియ యథావిధిగా జరుగుతుంది. సర్వర్ పని తీరులో సమస్యల్లేవు. ఉచిత ఆన్‌లైన్ సేవలపై ఏ సంస్థా ఎటువంటి సమాచారంగానీ, అప్రమత్త హెచ్చరికలుగానీ చేయలేదు' అని ఏపీ రెవెన్యూశాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇదే అంశంపై ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూశాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి మరో ప్రకటన విడుదల చేశారు. ఉన్నతాశయంతో ఉచిత ఆన్‌లైన్ సేవలను ఏర్పాటు చేశామని, వీటిని ప్రజలకు చేరువ చేస్తామని ఆయన వెల్లడించారు.

లాంచీ ప్రమాద ప్రాంతాలను పరిశీలించిన హోంశాఖ సలహాదారు దుర్గాప్రసాద్

పోలవరం, న్యూస్‌టుడే: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గత నెలలో గోదావరి నదిలో జరిగిన పడవ ప్రమాద ప్రాంతాలను హోంశాఖ సలహాదారు కె.దుర్గాప్రసాద్ పరిశీలించారు. తూర్పుగోదావరి జిల్లాలోని గండి పోశమ్మ ఆలయ సమీపంలో 120 మంది పర్యాటకులతో వెళ్తుండగా బోటు కాలిపోయిన ఘటనా స్థలాన్ని, బోటును గురువారం ఆయన చూశారు. అనంతరం పోలవరం మండలం వాడపల్లి సమీపంలో దేవీపట్నం నుంచి కొండమొదలుకు ప్రయాణికులతో వెళ్తుండగా లాంచీ మునిగిన ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ ఘటనపై పోలవరం ఎస్సై కె.శ్రీహరిరావుతో మాట్లాడారు. గోదావరిలో పెనుగాలులు వీస్తున్న సమయంలో దానికి వ్యతిరేక దిశగా ప్రయాణం చేయడం వల్లే లాంచీ మునిగిపోయిందని ఎస్సై వివరించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన యువ ఎస్సైలతో దుర్గాప్రసాద్ మాట్లాడారు. న్యాయం జరుగుతుందన్న ఆశతో మన వద్దకు వచ్చే బాధితులకు సాంత్వన చేకూర్చాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.

నేడు గుంటూరులో 'ఇన్‌వేకాస్' కార్యకలాపాలు ప్రారంభించనున్న సీఎం

ఈనాడు, అమరావతి: ప్రముఖ సెమీకండక్టర్ డిజైనింగ్ సంస్థ ఇన్‌వేకాస్ గుంటూరులో కార్యాలయాన్ని ప్రారంభించనుంది. శుక్రవారం సంస్థ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఇన్‌వేకాస్ రాకతో అమరావతిలో ఐటీ రంగ ముఖచిత్రమే మారిపోతుందని ఏపీ ఎన్‌ఆర్‌టీ (ప్రవాసాంధ్రుల సంక్షేమ సంఘం) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఐటీ సంస్థలకు నైపుణ్యం ఉన్న మానవవనరులను అందించే వేద ఐఐటీ శిక్షణ సంస్థకు అమరావతిలో ఐటీ రంగాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే సామర్థ్యం ఉందని ఎన్‌ఆర్‌టీ అధ్యక్షుడు రవి వేమూరు తెలిపారు.

EDUCATION

★ Inter Pass or Fail join BBA-Aviation, BHM-Hotel Mgt, Dip. in Hotel Mgt, Dip. in Aviation, Morethen 10 Lakh Jobs, 100% Job Assistance. Cont: Spice King, Vijayawada. ✆ 91333 40136/98484 89444

ప్రజలను ఆదుకోని ఐకాన్ సిటీలెందుకు?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- కృష్ణా జిల్లాలోని కిడ్నీ బాధిత ప్రాంతాల్లో పర్యటన

దీప్లానగర్‌తండాలో కిడ్నీ బాధితుల వైద్య బిల్లుల్ని పరిశీలిస్తున్న బీవీ రాఘవులు. చిత్రంలో నేతలు సీహెచ్ బాబూరావు, డీవీ కృష్ణ తదితరులు

తిరువూరు, న్యూస్‌టుడే: ఇంద్రభవనాలు, ఐకాన్ సిటీలతో రాజధాని నిర్మిస్తున్నామంటూ ఆర్భాటంగా చెబుతున్న పాలకులు గోడ పక్కన కిడ్నీ సమస్యలతో మనుషులు చచ్చిపోతున్నా పట్టించుకోరా అంటూ సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పక్కనే ఉన్న కిడ్నీ బాధితులకు ఉపయోగపడని ఐకాన్ సిటీలు దేనికని ప్రశ్నించారు. గురువారం కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలం దీప్లానగర్, మాన్‌సింగ్, గంపలగూడెం మండలం నారికంపాడు, వినగడపతండా, అనుముల్లంకలోని కిడ్నీ బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. మెట్టప్రాంతమైన పశ్చిమ కృష్ణాలో రెండేళ్లలో 104 మంది మృత్యువాత పడగా, నాలుగు నెలల్లోనే 22 మంది చనిపోయారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇప్పటికే డయాలసిస్ చేయించుకుంటున్నవారు 80 మంది ఉన్నందున ప్రతి మండల కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క ఎ.కొండూరు మండలంలోనే 390 మంది కిడ్నీ బాధితులు ఉన్నారని, డయాలసిస్‌కు వెళ్లిన ప్రతిసారీ రక్తం కోసం రూ.1300, మందుల కోసం రూ.6 వేల చొప్పున అవుతున్న ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న కృష్ణాజలాలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. పర్యటనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, పశ్చిమ కృష్ణా కార్యదర్శి డీవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ప్రజా సంకల్పయాత్రకు విరామం

- శనివారం మళ్లీ మొదలుపెట్టనున్న వైకాపా అధినేత జగన్

అమలాపురం, న్యూస్‌టుడే: వర్షం కారణంగా తూర్పుగోదావరి జిల్లాలో జరుగుతున్న వైకాపా అధినేత వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్రకు విరామం ఏర్పడింది. గురువారం ఉదయం ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి నుంచి జరగాల్సిన పాదయాత్ర జరగలేదు. బుధవారం రాత్రి నుంచి తెల్లవార్లు వర్షం కురిసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో బుధవారం సాయంత్రం పాదయాత్ర ముగిశాక అక్కడే రాత్రి బస చేసిన జగన్ ఉదయం పదిగంటల సమయంలో భద్రతా సిబ్బందితో కలిసి ప్రత్యేక వాహనంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లిపోయారు. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం ఎనిమిది గంటలకు భీమనపల్లిలో పాదయాత్ర ప్రారంభమై శింగరాయపాలెం మీదుగా ముమ్మిడివరం నియోజకవర్గంలోకి ప్రవేశించాల్సి ఉండగా వాయిదా వేశారు. శుక్రవారం రాత్రికి జగన్ తిరిగి భీమనపల్లి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారని పార్టీ నాయకులు వెల్లడించారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు యథావిధిగా జగన్ ప్రజాసంకల్ప యాత్ర భీమనపల్లిలో ప్రారంభమై శింగరాయపాలెం మీదుగా 216 జాతీయ రహదారికి చేరకుంటుందని, అక్కడి నుంచి ముమ్మడివరం నియోజకవర్గంలో ప్రవేశిస్తుందని తెలిపారు.

జోనల్ ఐజీ వ్యవస్థకు స్వస్తి

- తొలుత ఉత్తర కోస్తాలో... తాజాగా రాయలసీమ జోన్‌లో

ఈనాడు, అమరావతి: పోలీసు శాఖలో జోనల్ ఐజీ పోస్టుల వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. జోనల్ ఐజీ విధులను వాటి పరిధిలోని రేంజ్ డీఐజీలకు అప్పగించారు. తొలుత ఉత్తర కోస్తా జోన్‌లో ఈ ప్రయోగం చేసిన ఉన్నతాధికారులు తాజాగా రాయలసీమ జోన్ ఐజీ.. బాధ్యతలను అనంతపురం, కర్నూలు రేంజ్ డీఐజీలకు కట్టబెట్టారు. ఇన్‌ఛార్జి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా గురువారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. పోలీసుశాఖలో రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తా జోన్లు ఉన్నాయి. ఆరు నెలల కిందటివరకూ ఈ మూడు జోన్లకు ముగ్గురు ఐజీ స్థాయి అధికారులు బాధ్యులుగా వ్యవహరించేవారు. వీరి కింద రేంజ్‌ల బాధ్యతలను డీఐజీలు చూసుకునేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ క్యాడర్‌లో అందుబాటులో ఉన్న ఐపీఎస్‌లు తక్కువగా ఉండటంతో జోనల్ ఐజీల వ్యవస్థను రద్దుచేయాలని గతేడాదే నిర్ణయించారు. ఈ ఏడాది మార్చిలో విశాఖ జోనల్ ఐజీ బాధ్యతలను విశాఖపట్నం, ఏలూరు రేంజ్ డీఐజీలకు కట్టబెట్టారు. రాయలసీమ జోన్ ఐజీగా పని చేసిన మహ్మద్ ఇక్బాల్ ఏప్రిల్‌లో పదవీ విరమణ చేయగా.. అప్పటి నుంచి ఆ పోస్టును ఖాళీగా ఉంచారు. తాజాగా ఆ బాధ్యతలను జోన్ పరిధిలోని అనంతపురం, కర్నూలు రేంజ్ డీఐజీలకు అప్పగించారు. ప్రస్తుతం దక్షిణ కోస్తా (గుంటూరు) జోన్‌కు మాత్రమే ఐజీ స్థాయి అధికారి బాధ్యుడిగా ఉన్నారు. దీని పరిధిలో రేంజ్‌లు లేవు. దీంతో జోనల్ ఐజీల వ్యవస్థకు ముగింపు పలికినట్లయ్యింది.

ఛేదించలేని కేసు ఒక్కటీ ఉండకూడదు: డీజీపీ

నేర పరిశోధనలో అత్యాధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీజీపీ మాలకొండయ్య పోలీసు అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఛేదించలేని కేసు ఒక్కటి కూడా ఉండకూడదని అన్నారు. క్లిష్టమైన కేసులను ఛేదించిన సిబ్బందికి మంగళగిరిలోని ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్) పురస్కారాలను ప్రదానం చేశారు.

దోపిడీ రాజ్యమే రాజన్న రాజ్యమా?

జగన్‌పై విరుచుకుపడ్డ మంత్రి యనమల

ఈనాడు డిజిటల్, అమరావతి: పదే పదే రాజన్న రాజ్యం తెస్తానంటున్న ప్రతిపక్ష నేత జగన్.. ప్రజల ముంగిటకు ఆనాటి దోపిడీ రాజ్యాన్ని మళ్లీ తీసుకువస్తారేమోనని మంత్రి యనమల రామకృష్ణుడు ఎద్దేవా చేశారు. క్రాప్ హాలిడే, పవర్ హాలిడే ప్రకటించడమే రాజన్న రాజ్యమా అంటూ గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 14 వేల మంది రైతుల ఆత్మహత్యలు, నెలకు 15 రోజులు పరిశ్రమల మూత, 11 లక్షల మంది కార్మికులు రోడ్డున పడటం ఇంకా ఎవరూ మరిచిపోలేదని వెల్లడించారు. ఇలాంటి పాలననే మళ్లీ తెస్తారా అంటూ జగన్‌ను ప్రశ్నించారు. ఈ దోపిడీ పాలన కోసమే భాజపాతో కుమ్మక్కై కేసులు మాఫీ చేయించుకోవాలని చూస్తున్నారా అంటూ మండిపడ్డారు. గాలి జనార్దన్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డిల లాభాల కోసమే భాజపా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసేందుకు బరితెగించిందన్నారు. తెదేపా పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండటం జగన్‌కు నచ్చడం లేదని ఆరోపించారు.

దళితులకు ద్రోహం చేసింది జగన్ కుటుంబమే

మంత్రి నక్కా ఆనందబాబు ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ కుటుంబం దళితులకు తీరని ద్రోహం చేసిందని మంత్రి నక్కా ఆనందబాబు ధ్వజమెత్తారు. ఇడుపులపాయలో దళితులకు చెందిన వందల ఎకరాల భూములను ఆక్రమించుకున్నారని దుయ్యబట్టారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీ ఉపప్రణాళిక నిధుల్ని దారి మళ్లించి ఇడుపులపాయ ఎస్టేట్ అభివృద్ధికి, హైదరాబాద్ రింగ్‌రోడ్డుకు ఖర్చుపెట్టారని గురువారం గుంటూరులో విమర్శించారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో దళితులకు చెప్పుకోదగ్గ ఒక్క సంక్షేమ పథకాన్ని రూపొందించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టాన్ని కేంద్రం నీరు గారుస్తుంటే జగన్ ఎందుకు నోరెత్తడంలేదని ప్రశ్నించారు. మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం పక్కనే వైఎస్ విగ్రహాలు ఏర్పాటు చేస్తూ ఆయన్ని అవమానిస్తున్నారని మండిపడ్డారు.

ఉద్యోగ అవకాశాలు

URGENT REQUIREMENT FOR AHLIA CHEMICALS COMPANY KUWAIT
CLIENT INTERVIEW ON 02 JULY 2018 (MONDAY)
❖ SPRAY PAINTERS ❖ SAND / GRIT BLASTERS
❖ AIRLESS PAINTERS ❖ HSS APPLICATORS
ECNR & ECR BOTH ARE ACCEPTED
☛ FREE FOOD & FREE ACCOMMODATION ☛ ORIGINAL PASSPORT WITH 2 PHOTOS
LIC NO : LIC NO-B-0734/DEL/PER/1000+/5/9142/2015
VENUE: DOLPHIN WELDING & TECHNICAL TRAINING CENTER
BLOCK NO.B-61,CANARA BANK ROAD, AUTONAGAR, VISAKHAPATNAM.
CONTACT: 7095241699, 9848711346, 0891-2571759
Email id : dr.dolphinvizag@gmail.com

URGENT REQUIREMENT FOR SAHEL AL KHOR CO. QATAR
CLIENT INTERVIEW ON 2nd JULY 2018 SHUT DOWN 6 to 9 months
❖ ELECTRICIANS
❖ PIPE FITTERS
❖ PLUMBERS
VACANCY - LARGE POSTS. ONLY ECNR PASSPORTS.
FREE FOOD & ACCOMMODATION. 8HRS DUTY + OT. LICENSE NO: B-0736/MUM/PART/1000+/5/9122/2014
Venue: WELCOME WELD TECHNICAL TRAINING INSTITUTE
Block - B, C-13 Part(D), Autonagar, Gajuwaka,Visakhapatnam -530012.
Mob. 8186068148, 9000713126, 9963790737, 9989316908.

Urgently Required for M/S.CORODEX CO LLC DUBAI Client Interview on 1st July 2018
FREE FOOD OR FOOD ALLOWANCE & FREE ACCOMODATION BOTH ECNR/ECR PASSPORT
❖ PIPE FITTERS SALARY 1500 DHS
❖ CLEANERS cum OFFICE BOY 1000 DHS
M/S. AL JABAL TARIQ TOURS & TRAVELS LIC NO: B-0715/MUM/PER/1000+/5/3816/1993 ARN: PT6041821
Venue: VIZAG FITTER & WELDING INSTITUTE
B-12, B-Block, Thunglam Route, Autonagar, Visakhapatnam-530012
Ph: 6301048604, 9030077133, 9246977688
Email: vizaginstitute@gmail.com, vizaginstitute@ymail.com

HONDA JOB OPPORTUNITY HONDA
Works Manager: Min. 2 years experience as Works Manager in automobile industry.
Supervisor: Min. 2 years experience in automobile industry
Spares Manager: Min. 2 years experience as Spares Manager in automobile industry.
Salary: "Based on your capability"
Contact: 79959 99214, 79959 99215
email us your resume at:- parameswarahonda.ndl@gmail.com
Address: Tekke, Nandyal, Kurnool Dist.

SAI GANAPATHI POLYTECHNIC
WALK-IN-INTERVIEW
Lecturers are required for the following :
Subjects : PHYSICS, CHEMISTRY, Qualification : M.Sc with first class in relevant course.
Candidates need to attend for the demo & interview by 10 A.M. on 2nd July 2018 (Monday) along with original certificates from 10th class onwards. The selected candidates need to report on the same day.
VENUE : College Campus
Gidijala (V), Anandapuram (M), VSP Dist - 531173,
Contact No. 9581467711, Email : saiganapathi@hotmail.com

AKRIVIA AUTOMATION PVT LIMITED
We are Looking for 5-10 years experienced persons on following skills to work on full time basis.
Skills:
Angular 2, PHP, MySql, Node JS, React, HTML5, CSS, Bootstrap, jQuery, UI/UX Design, Mobile Application Development, JSON, REST, and CMS
Opening for roles:
Web Application Developer
Mobile Application Developer
Front end & Full Stack Developer
Project Lead
Salary: On par with industry standards
Please email your updated resume to 'system.admin@akrivia.in'

UNITED NATIONS DEVELOPMENT PROGRAMME
UNDP Empowered lives. Resilient nations.
UNDP works in more than 170 countries and territories, helping to achieve the eradication of poverty, and the reduction of inequalities and exclusion. We help countries to develop policies, leadership skills, partnering abilities, institutional capabilities and build resilience in order to sustain development results.
UNDP India invites applications for the position of
Individual Consultant–Developing formal proposal for QCI-NABET Accreditation for EIA Consultant Organizations
Duty station: Kakinada
Professionals with minimum 7 years of experience in developing formal proposals for environmental accreditation schemes or related fields. Excellent inter-personal communication and proven high quality proposal writing skills. Familiarity with the QCI-NABET accreditation process .
The vacancy is for an Individual Contract.
Only applications submitted online will be accepted.
For information and application process,
visit: http://www.in.undp.org (Careers)
The deadline for submission is 09.07.2018

ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
హుకుంపేట
రాజమహేంద్రవరం
Cell:
80082 24505
99899 93175

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	రూపాయి (ఒక అమెరికా డాలరుకు)	బంగారం	ముడి చమురు
▼ 179	▼ 82	▼ 18 పైసలు		
35038	10589	68.79	30,630	77.63

ఎస్‌బీఐ ఎండీ పదవికి శ్రీరామ్ రాజీనామా

ఐడీబీఐ బ్యాంక్ సీఈఓగా బాధ్యతల స్వీకారం

దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎండీ పదవికి బి.శ్రీరామ్ రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. మూడు నెలల కాలానికి ఐడీబీఐ బ్యాంక్ తాత్కాలిక ముఖ్య కార్య నిర్వహణాధికారిగా (సీఈఓ) ఆయనను ఇటీవలే ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఐడీబీఐ బ్యాంక్‌లో మెజార్టీ వాటాను ఎల్ఐసీ కొనుగోలు చేయనున్నట్లు వార్తలు వచ్చిన రెండు రోజుల అనంతరం ఆయన ఎస్‌బీఐ ఎండీ పదవికి రాజీనామా చేయడం గమనార్హం. శ్రీరామ్ సమర్పించిన రాజీనామా పత్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని నియామకాల మంత్రివర్గ కమిటీకి పంపించారని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నెల 22న ఐడీబీఐ బ్యాంకు సీఈఓగా శ్రీరామ్ బాధ్యతలు స్వీకరించారు. అప్పటివరకు ఐడీబీఐ బ్యాంకుకు సీఈఓగా ఉన్న ఎం.కె.జైన్ ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నరుగా బాధ్యతలు చేపట్టారు. 1981లో ప్రొబేషనర్ ఆఫీసర్‌గా ఎస్‌బీఐలో అడుగుపెట్టిన శ్రీరామ్ మూడు దశాబ్దాలుగా వివిధ పదవులు నిర్వహిస్తూ వచ్చారు. 2014 జులై నుంచి బ్యాంకుకు ఎండీగా (కార్పొరేట్, గ్లోబల్ బ్యాంకింగ్) విధులు నిర్వహిస్తున్నారు.

సైకెస్ ఇండియా మూడో కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ డిజిటల్ మార్కెటింగ్ సంస్థ సైకెస్ భారత్ వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు తన మూడో కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఇప్పటికే ఇక్కడ ఒక కేంద్రం ఉండగా.. రెండోది బెంగళూరులో ఉంది. దాదాపు 1.58 బిలియన్ డాలర్ల ఆదాయం ఉన్న సైకెస్‌లో ప్రపంచవ్యాప్తంగా 55 వేల మంది పనిచేస్తున్నారు. కమ్యూనికేషన్, ఆర్థిక సేవలు, ఆరోగ్య, బీమా, రిటైల్, టెక్నాలజీ, రవాణా రంగ సంస్థలకు ఇది సేవలను అందిస్తోంది. ఈ కొత్త కేంద్రం నుంచి పలు దేశాలకు చెందిన టెక్నాలజీ, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలకు సేవలను అందించనున్నట్లు కంట్రీ హెడ్ దిశాంత్ భోజ్వానీ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం. 7

(చట్టం నెం. 30/2013 లోని సెక్షన్ 19 (1) మరియు రూలు 25 (1) ప్రకారం)

రూఢీ ప్రకటన

ఆర్.సి. నెం. జి1/47/2018, తేది: 08-06-2018 — AP State GAZETTE No: 72/KST/2018, తేది: 13-06-2018

క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం, అంగలూరు గ్రామములో గల **య. 2.36 సెంట్లు** భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా దక్షిణమధ్య రైల్వే బెజవాడ వారు గుడివాడ - మచిలీపట్నం డబ్లింగ్ రైల్వే లైన్ విత్ ఎలక్ట్రిఫికేషన్ చేయుటకు భూమి అవసరమైనట్లుగా కృష్ణాజిల్లా కలెక్టరు గారు అవసరమని అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన కృష్ణాజిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున సదరు భూములయందు ఆసక్తిగల వ్యక్తులు ఎవ్వరూ ఎట్టి అభ్యంతరములను దాఖలు చేయనందున చట్టం 30/2013 లోని సెక్షన్ 15 ప్రకారము విచారణ మీదట మరియు శ్రీ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్స్, సౌత్ సెంట్రల్ రైల్వే, విజయవాడ వారు భూసేకరణకు అవసరమగు పైకము మొత్తము జమచేసి యున్నందున సంతృప్తి చెందినవారై కృష్ణా జిల్లా కలెక్టరు గారు చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013) లోని సెక్షన్ 19 (1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.

దిగువ షెడ్యూలులో పేర్కొనిన **య. 2.36 సెంట్లు** భూమి, చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013) లోని సెక్షన్ 19 (1) ప్రకారము ప్రజాహిత కార్యక్రమాలకు అనగా దక్షిణమధ్య రైల్వే బెజవాడ వారు గుడివాడ - మచిలీపట్టణం డబ్లింగ్ రైల్వే లైన్ ఎలక్ట్రిఫికేషన్ చేయుటకు అవసరమని కృష్ణాజిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించుచున్నారు.

షెడ్యూలు

ప్రాజెక్టు పేరు : దక్షిణమధ్య రైల్వే బెజవాడ వారు గుడివాడ - మచిలీపట్టణం డబ్లింగ్ రైల్వే లైన్ విత్ ఎలక్ట్రిఫికేషన్‌ను శ్రీ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్, సౌత్ సెంట్రల్ రైల్వే, విజయవాడ వారు ఏర్పాటు చేయుటకు.

జిల్లా : కృష్ణా — **మండలము: గుడ్లవల్లేరు** — **గ్రామము : అంగలూరు**

క్రమ సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం.	భూమి యొక్క వివరణ మాగాణి / మెట్ట	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1	351-1B	0.05	0.05	మాగాణి	పామర్తి వెంకటేశ్వరమ్మ	350	351-2	350	351-1A	---
2	352-1B	0.02	0.02	మాగాణి	పంది సత్యనారాయణ	351	362	363	352-1A	తాడిచెట్లు-13
3	361-1B	0.02	0.02	మాగాణి	మెరుగుమాల కృష్ణానందరావు	363	361-2A	363	361-1A	జామాయిల్-7
4	361-2B	0.05	0.05	మాగాణి	మెరుగుమాల కృష్ణానందరావు	363	361-2A	363	361-2A	---
5	361-3B	0.03	0.03	మాగాణి	శ్రీ కంచికామాక్షి అమ్మవారి దేవస్థానం	372	361-4A	372	361-3A	---
6	361-4B	0.05	0.05	మాగాణి	ఈడే విజయనిర్మల	372	361-10A	372	361-4A	తాడిచెట్లు-3
7	361-10B	0.02	0.02	మాగాణి	గొరిపర్తి కిషోర్	372	361-10A	372	361-10A	తాడిచెట్లు-1
8	361-10C	0.03	0.03	మాగాణి	గొరిపర్తి ఝాన్సీరాణి	372	361-10A	372	361-10A	తాడిచెట్లు-4
9	362-1A1	0.02	0.02	మాగాణి	బొర్రా వీరమ్మ	363	362-1A2	363	362-1A2	---
10	362-3A1	0.02	0.02	మాగాణి	జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు	363	362-3A2	363	362-3A2	---
11	362-3B1	0.04	0.04	మాగాణి	ఈడే సుబ్బారావు	363	362-3B2	363	362-B2	తాడిచెట్లు-4
12	373-2A	0.04	0.04	మాగాణి	పోలగాని వెంకటేశ్వరరావు	372	374	372	373-2B	---
13	374-1A	0.03	0.03	మాగాణి	పోలగాని నరసింహారావు	370	374-1C	370	374-1C	---
14	374-1B	0.03	0.03	మాగాణి	పోలగాని పూర్ణచంద్రరావు	370	374-1C	370	374-1C	---
15	374-2A	0.10	0.1	మాగాణి	శొంఠి శ్రీధర్ మరియు నాగలక్ష్మి	370	374-2B	370	374-2B	---
16	374-3A	0.04	0.04	మాగాణి	బొర్రా రామారావు	370	374-3B	370	374-3B	---
17	404-1B2	0.03	0.03	మాగాణి	డొక్కు. వెంకట్రామయ్య	405	404-1B1	418	404-1B1	తాడిచెట్లు-1
18	404-2A	0.03	0.03	మాగాణి	అంకెం మహాలక్ష్మి	418	404-2B	418	404-2B	---
19	406-1B	0.05	0.05	మాగాణి	ఈడే హరీష్	407	406-1A	407	406-1A	తాడిచెట్లు-1
20	406-1C	0.01	0.01	మాగాణి	ఈడే బుచ్చిబాబు	407	406-1A	407	406-1A	--
21	406-1D	0.05	0.05	మాగాణి	మెరుగుమాల సుబ్రహ్మణ్యం	407	406-1A	407	406-1A	--
22	406-2B	0.03	0.03	మాగాణి	మెరుగుమాల సుబ్రహ్మణ్యం	407	406-2A	407	406-2A	--
23	432-1B	0.06	0.06	మాగాణి	బొర్రా శ్రీనివాసరావు	404	432-1A	404	432-1A	--
24	432-2B	0.06	0.06	మాగాణి	బొర్రా ఆంజనేయులు	404,431	432-2A	404, 431	432-2A	--
25	432-5B	0.01	0.01	మాగాణి	బొర్రా వెంకట సుబ్బమ్మ	431	432-5A	431	432-5A	--
26	432-6B	0.05	0.05	మాగాణి	బొర్రా వెంకట సుబ్బమ్మ	431	432-6A	431	432-6A	--
27	432-7B	0.01	0.01	మాగాణి	పోలగాని నరసింహారావు	431	432-8A	431	432-7A	--
28	432-8B	0.02	0.02	మాగాణి	పోలగాని నరసింహారావు	431	432-8A	431	432-8A	--
29	432-8C	0.03	0.03	మాగాణి	పోలగాని సాంబశివరావు	431	432-8A	431	432-8A	--
30	432-8D	0.03	0.03	మాగాణి	పోలగాని నరసింహారావు	431	433	431	432-8A	--
31	433-1A1	0.03	0.03	మాగాణి	పోలగాని సాంబశివరావు	431	433-1A2	433-1A2	431	తాడిచెట్లు-5
32	440-1B	0.04	0.04	మాగాణి	దుగ్గిరాల ఆనందమోహనబోస్	434	440-1A	434	440-1A	-
33	440-2B	0.08	0.08	మాగాణి	నందిగం మురళీకృష్ణ	434	440-2A	434	440-2A	-
34	440-2C	0.15	0.15	మాగాణి	నందిగం శ్రీనివాసరావు	434, 439	440-2A	439	440-2A	-
35	540-1	0.06	0.06	మాగాణి	త్రిపిర్నేని సత్యనారాయణ	543	540-2	540-2	543	-
36	542-2	0.10	0.01	మాగాణి	శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం	440	540	543	542-1	-
37	552-1B	0.05	0.05	మాగాణి	దుగ్గిరాల ఆంజనేయప్రసాద్	543, 551	552-1A	543, 551	552-1A	తాడిచెట్లు-7
38	552-2B	0.03	0.03	మాగాణి	దుగ్గిరాల ఆంజనేయప్రసాద్	551	552-2A	551	552-2A	తాడిచెట్లు-3
39	552-2C	0.03	0.03	మాగాణి	త్రిపిర్నేని రామ్‌ప్రసాద్	551	552-2A	551	552-2A	తాడిచెట్లు-1
40	552-3B	0.03	0.03	మాగాణి	త్రిపిర్నేని తులసి	551	552-4A	551	552-3A	తాడిచెట్లు-1
41	552-4B	0.03	0.03	మాగాణి	ఈడే బుచ్చిబాబు	551	554	551	552-4A	-
42	552-4C	0.05	0.05	మాగాణి	ఈడే రవికృష్ణ	551	554	551	552-4A	-
43	554-1B	0.07	0.07	మాగాణి	తుమ్మల రాజేంద్రబాబు	552	557	558	554-1A	-
44	557-1B	0.12	0.12	మాగాణి	తుమ్మల నాగేంద్రబాబు	554	561	558	557-1A	-
45	561-1B	0.20	0.2	మాగాణి	మండవ ఆషా ప్రియ	557	567	558, 560	561-1A	-
46	567-2B	0.04	0.04	మాగాణి	కాసరనేని పద్మప్రియ	561	570	560	567-2A	-
47	570-1B	0.06	0.06	మాగాణి	గద్దె రామతులసమ్మ	567	570-2A	560,571	570-1A	-
48	570-2B	0.04	0.04	మాగాణి	గవిర్నేని బాబుశ్రీకర్	571	570-2A	571	570-2A	-
49	570-3B	0.04	0.04	మాగాణి	గవిర్నేని బాబుశ్రీకర్	571	570-4	571	570-3A	-
50	570-5B	0.05	0.05	మాగాణి	వల్లభనేని చైతన్యకృష్ణ	571	V.No.86 Gdvl	571	570-5A	-
		2.36	2.36							

భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, గుడివాడ కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును.

బొగ్గు గనులు, యినుపరాయి, పలకరాయి లేదా యితర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వట గాని తొలగించుట గాని చేయవలెను. ఈ భూసేకరణ నోటిఫికేషన్ ప్రాంతంలో ఆర్ & ఆర్ విచారణను సెక్షన్ 16 క్రింద నిర్వహించడమైనది. విచారణ అనంతరము ఆర్ & ఆర్ ఎన్టైటిల్మెంట్స్‌కు అర్హత గల ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు/ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాలు లేవని రూఢి చేయడమైనది.

సం/- లక్ష్మీకాంతం IAS, కలెక్టర్ కృష్ణా

హ్యుందాయ్ విద్యుత్తు కార్లు!

- వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఎస్‌యూవీ
- చెన్నై ప్లాంటులో తయారీకి ప్రణాళికలు

దిల్లీ: దేశీయంగా విద్యుత్తు కార్ల ఉత్పత్తి ప్రారంభించేందుకు హ్యుందాయ్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దక్షిణకొరియాకు చెందిన ఈ సంస్థ చెన్నై ప్లాంటులో తయారు చేసిన కార్లను, కొన్ని దేశాలకు ఎగుమతి చేస్తోంది కూడా. గత 20 సంవత్సరాలలో దేశీయంగా 80 లక్షల వాహనాలు విక్రయించిన హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్), 2021 నాటికి కోటి కార్ల అమ్మకం లక్ష్యాన్ని నిర్దేశించుకుందని హెచ్ఎంఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వై.కె.కూ తెలిపారు. 2020 లోపు మరో 8 కొత్త మోడళ్లు ఆవిష్కరిస్తామని వెల్లడించారు. ఇందులో 2 సరికొత్త విభాగాలు, 5 మోడళ్ల మార్పులు, ఒకటి విద్యుత్తు స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) ఉంటుందని తెలిపారు. విద్యుత్తు ఎస్‌యూవీని 2019 ద్వితీయార్థంలో విడుదల చేస్తామని పేర్కొన్నారు. తొలుత విడిభాగాలన్నీ పూర్తిగా దిగుమతి చేసుకుని, ఇక్కడ బిగింప చేస్తామన్నారు. మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా, దీర్ఘకాల దృక్పథంతో చెన్నై ప్లాంటులో విద్యుత్తు వాహనాలు ఉత్పత్తి చేయాలన్నది తమ ప్రణాళికగా పేర్కొన్నారు. విద్యుత్తు వాహనాలు అత్యధికులకు చేరువ కావాలంటే, ప్రభుత్వ సహకారం తప్పనిసరి అని తెలిపారు. వీటికి దిగుమతి సుంకాలు తగ్గించాలని, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రేటును 12 శాతం నుంచి 5 శాతానికి కుదించాలని, వ్యక్తిగత వాహనాల కొనుగోలుకు సాయం అందించాలని సూచించారు. పెట్రోల్ బంకుల తరహాలో, వాహనాల బ్యాటరీల ఛార్జింగ్‌కు కేంద్రాలను విరివిగా స్థాపించాల్సి వస్తుందని, ఇందుకు ప్రభుత్వ సహకారం తప్పనిసరి అని గుర్తు చేశారు. దేశంలోకి హైబ్రిడ్ వాహనాలు తీసుకు రావాలన్న యోచన లేదన్నారు. ప్రస్తుతం చెన్నై ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 7 లక్షల వాహనాలు కాగా, 2019 జనవరి నుంచి దీన్ని 7.5 లక్షల వాహనాలకు పెంచనున్నట్లు వివరించారు. ఈ ఏడాది దీపావళిలోపు కుటుంబానికి సరిపోయే హ్యాచ్ బ్యాక్ (డిక్కీ లేని) కారు విడుదల చేస్తామన్నారు.

ప్రాంతీయ ప్రధాన కేంద్రంగా భారత్

జులై 2 నుంచి హ్యుందాయ్‌కి ప్రాంతీయ ప్రధాన కేంద్రంగా భారత్ ఉండనుందని కూ తెలిపారు. ఇప్పటివరకు ఉత్తర అమెరికా, ఐరోపా మాత్రమే ఇలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు మూడేళ్ల కాలానికి ప్రణాళికలు రూపొందిస్తుండగా, కొత్త హోదా వల్ల పదేళ్ల కాలానికి ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు.

మార్కెట్ కబుర్లు

- ✦ దేశంలోనే అతిపెద్ద మ్యూచువల్‌ఫండ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం పొందింది. హెచ్‌డీఎఫ్‌సీ, స్టాండర్డ్ లైఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సంయుక్త సంస్థ అయిన హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 2.21 కోట్ల షేర్లను ఇష్యూ ద్వారా విక్రయించనుంది. రూ.3 లక్షల కోట్ల ఆస్తులను సంస్థ నిర్వహిస్తోంది.
- ✦ సూక్ష్మరుణ సంస్థ స్వధార్ ఫిన్‌సర్వ్‌లో వాటాను 100 శాతానికి పెంచుకున్నట్లు ఆర్‌బీఎల్ బ్యాంక్ తెలిపింది. ఇంతకు ముందు 60.48 శాతం వాటా ఉండేది. మిగిలిన వాటా కొనుగోలుకు ఎంతమొత్తం పెట్టుబడి పెట్టిందీ బ్యాంక్ వెల్లడించలేదు.
- ✦ రూ.1950 కోట్లతో మెరైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఒప్పందం చేసుకున్నట్లు దేశంలో అతిపెద్ద పోర్ట్ అభివృద్ధి సంస్థ, అదానీ గ్రూప్‌లోని ఏపీసెజ్ ప్రకటించింది.
- ✦ బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో అమర్చే, ఉద్గారాల నియంత్రణ పరికరాల తయారీ కోసం దక్షిణ కొరియా సంస్థ నానో కో లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నట్లు భెల్ తెలిపింది.
- ✦ ముంబయి విద్యుత్తు వ్యాపారాన్ని అదానీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌కు రూ.18,800 కోట్లకు విక్రయించేందుకు చేసుకున్న ఒప్పందాన్ని మహారాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆమోదించినట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వెల్లడించింది.
- ✦ ఆరోగ్యవంత కణాలపై శరీరీ రోగనిరోధక వ్యవస్థ దాడిచేయడాన్ని నిరోధించేందుకు, లుపిన్ తయారు చేసిన బయోసిమిలర్‌ను ఐరోపా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలలో మార్కెట్ చేసేందుకు అమెరికా సంస్థ మైలాన్ చేతులు కలిపింది.

జీఎంఆర్‌కు కోన పోర్టు

- స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో నిర్మాణం
- రూ.200 కోట్లతో మౌలిక వసతులు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంగీకారం

కాకినాడ, ఈనాడు: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం కోన వద్ద మరో పోర్టు నిర్మాణం కానుంది. దీని నిర్మాణానికి సంబంధించి బిడ్‌ను జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దక్కించుకుంది. స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో నిర్మించే ఈ మల్టీకార్గో వాణిజ్య పోర్టు 16 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో తొలిదశ వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించనుందని జీఎంఆర్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. పోర్టు ఆదాయం నుంచి 30 సంవత్సరాల పాటు ప్రభుత్వానికి 2.7 శాతం చెల్లించనున్నారు. 1,950 ఎకరాల్లో పోర్టు నిర్మాణం కానుంది. దీనికి ఆనుకునే 8,500 ఎకరాల్లో జీఎంఆర్ పారిశ్రామిక పార్కు ఉంది. పోర్టు ఏర్పాటు కోసం రహదారులు, నీరు, విద్యుత్తు వసతులను ప్రభుత్వం కల్పించనుంది. దీనికోసం రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందని జీఎంఆర్ తెలిపింది. విశాఖ-చెన్నై పారిశ్రామిక నడవకు మధ్యలోనే ఈ పోర్టు ఏర్పాటు కానుంది. జీఎంఆర్ ట్రాన్స్‌పోర్టేషన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిజినెస్ ఛైర్మన్ బీవీఎన్ రావు మాట్లాడుతూ జీఎంఆర్ సంస్థకు ఈ పోర్టు కీలక మైలురాయి అవుతుందన్నారు. అంతర్జాతీయంగా సంస్థకు ప్రత్యేక గుర్తింపు తెస్తుందని చెప్పారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో ఆర్థిక అభివృద్ధికి ఇది కీలక భూమిక పోషిస్తుందన్నారు. అన్ని రకాలుగా పోర్టును అభివృద్ధిచేసి అంతర్జాతీయంగా ఉన్న ప్రముఖ సముద్ర రవాణా సంస్థలను ఆకర్షిస్తామన్నారు.

డాక్టర్ రెడ్డీస్‌కు అందిన ఎఫ్‌డీఏ తనిఖీ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: ఔషధ ఉత్పత్తి సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీకి మెదక్ జిల్లాలో ఉన్న రెండు ప్లాంట్లకు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు (ఈఐఆర్) అందిందని సంస్థ బీఎస్ఈకి ఇచ్చిన సమాచారంలో తెలిపింది. ఎఫ్‌డీఏ బొల్లారంలోని ఏపీఐ హైదరాబాద్ ప్లాంటు 3లో మార్చి 9న తనిఖీ చేసి, ఐదు లోపాలను గుర్తించింది. మార్చి 16న జిన్నారంలోని ప్లాంటు 1లో తనిఖీ చేసి నాలుగు లోపాలను గుర్తించింది. వీటిని సరిదిద్దడంతో అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ ఈఐఆర్‌ను జారీ చేసిందని పేర్కొంది.

విస్తరణ బాటలో ఆఫీస్

హైదరాబాద్‌లో 10,000 సీట్ల సామర్థ్యం

ఈనాడు, హైదరాబాద్: కో వర్కింగ్ సదుపాయాన్ని అందిస్తున్న 'ఆఫీస్' విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్‌తో పాటు దేశ వ్యాప్తంగా కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే ఇక్కడున్న 4 కేంద్రాల్లో 2,500 సీట్ల సామర్థ్యం ఉంది. గురువారం కొత్తగా రెండు కేంద్రాలను సంధ్యా హాస్పిటాలిటీతో కలిసి ప్రారంభించింది. దీపావళి నాటికి ఈ 6 కేంద్రాల్లో కలిపి మొత్తం సీట్ల సామర్థ్యం 5 వేలకు చేరుకుంటుందని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ అమిత్ రమణి తెలిపారు. ఏడాదిలోపు కొత్తగా మరో 5 కేంద్రాలను ప్రారంభించి 10 వేల సీట్ల సామర్థ్యానికి చేరుకుంటామన్నారు. హైదరాబాద్‌లో అంకుర సంస్థలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో వీటికి మంచి గిరాకీ ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 9 నగరాల్లో 55 కోవర్కింగ్ సదుపాయాలున్నాయనీ, ఇందులో మొత్తం 25వేల సీట్లు అందుబాటులో ఉన్నాయనీ, వీటిని 100కు పెంచడం ద్వారా సీట్ల సామర్థ్యాన్ని 40వేలకు చేరుస్తామని చెప్పారు. పని ప్రదేశాన్ని అందించడంతో పాటు, అక్కడ పనిచేసే వారికి నెట్‌వర్కింగ్, ఇతర సౌకర్యాలూ అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ మొత్తం 40 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టినట్లు వివరించారు. సీట్ల ఎంపికను బట్టి నెలకు కనీసం రూ.5వేల నుంచి రూ.11,000 వరకూ వసూలు చేస్తున్నట్లు తెలిపారు. చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సుమిత్ లఖాని మాట్లాడుతూ.. గంట నుంచి మొదలుపెట్టి ఎంత కాలానికైనా అద్దెకు తీసుకోవచ్చని చెప్పారు. ఒక సీటును కూడా వాడుకోవచ్చన్నారు. కో వర్కింగ్ సదుపాయం వేగంగా విస్తరిస్తోందని తెలిపారు.

మాట్లాడుతున్న అమిత్ రమణి, సుమిత్ లఖాని

బెంబేలెత్తించిన రూపాయి

- తోడైన చమురు ధరలు
- కొనసాగిన సూచీల నష్టాలు

సమీక్ష

సూచీల నష్టాలు వరుసగా రెండో రోజూ కొనసాగాయి. డాలర్ మారకం విలువ రూ.69 స్థాయికి చేరడంతో, మదుపర్ల సెంటిమెంటు బలహీనమై, అమ్మకాలకు మొగ్గుచూపారు. జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు ఇందుకు తోడైంది. టెలికాం, లోహాలు మినహా అన్ని రంగాల షేర్లు కుదేలయ్యాయి. ఇరాన్ దిగుమతులపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో చమురు ధరలు పెరుగుదల కొనసాగింది. దాదాపు 548 షేర్లు 52 వారాల కనిష్ఠానికి చేరడం సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,207.19 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. అనంతరం లాభాల్లోకి వచ్చి.. 35,282.40 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఒకానొకదశలో 34,937.15 దగ్గర కనిష్ఠానికి పడిపోయింది. చివరకు స్వల్పంగా కోలుకుని 179.47 పాయింట్ల నష్టంతో 35,037.64 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 10,600 పాయింట్ల దిగువకు చేరింది. చివరకు 82.30 పాయింట్లు కోల్పోయి 10,589.10 పాయింట్ల దగ్గర స్థిరపడింది.

✦ చమురు ధరలు పుంజుకోవడంతో ప్రభుత్వ రంగ మార్కెటింగ్ కంపెనీలైన హెచ్‌పీసీఎల్ 5.56 శాతం, బీపీసీఎస్ 4.54 శాతం, ఐఓసీ 1.28 శాతం చొప్పున నష్టాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టాలు చవిచూశాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 2.78%, టాటా మోటార్స్ 2.69%, కోల్ ఇండియా 2.23%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.13%, ఎస్‌బీఐ 1.83%, బజాజ్ ఆటో 1.82%, మారుతీ సుజుకీ 1.70%, పవర్‌గ్రిడ్ 1.70%, యెస్ బ్యాంక్ 1.52%, హెచ్‌డీఎఫ్‌సీ 1.47%, ఓఎన్‌జీసీ 1.34%, హీరో మోటోకార్ప్ 1.01% చొప్పున డీలాపడ్డాయి. ఎన్‌టీపీసీ 1.79%, ఎం అండ్ ఎం 1.78%, భారతీ ఎయిర్‌టెల్ 1.64%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.01%, ఇన్ఫోసిస్ 1.01%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.01% మేర రాణించిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీ సూచీల్లో చమురు- గ్యాస్ అత్యధికంగా 2.51 శాతం కోల్పోయింది.

నేటి మార్కెట్

నేడు సూచీలు ఒడుదొడుకుల మధ్య ట్రేడయ్యే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లు, ముడిచమురు ధరల నుంచి సంకేతాలు అందిపుచ్చుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి కొత్త కనిష్ఠానికి చేరడంతో.. కరెన్సీ మార్కెట్ల హెచ్చుతగ్గులు సైతం ప్రభావం చూపొచ్చని నిపుణులు అంటున్నారు. నేడు నిఫ్టీ 10550- 10700 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మదుపర్ల సెంటిమెంట్ బలహీనంగా ఉండటంతో మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని, విలువలు ఇంకా అధిక స్థాయిల్లోనే ఉండటంతో మార్కెట్ల ర్యాలీ ఉండకపోవచ్చని బ్రోకరేజీ సంస్థలు విశ్లేషిస్తున్నాయి. బలహీన రూపాయితో ఎగుమతి ఆధారిత రంగాలైన ఐటీ, ఔషధ షేర్లకు కొనుగోళ్ల మద్దతు కొనసాగొచ్చని చెబుతున్నారు. ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు మార్కెట్లకు దన్నుగా నిలవొచ్చని, అయితే దిద్దుబాటు ధోరణిలోనే ఉండొచ్చని అంటున్నారు. ఈ రంగాల్లో కూడా అమ్మకాలు వెల్లువెత్తితే.. మార్కెట్లు మరింత నష్టపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 361.80 (361.10) 9627099
ASIAN PAINTS 1268.40 (1267.15) 729637
AXIS BANK LT 504.60 (507.85) 4854274
BAJAJ AUTO L 2716.00 (2765.45) 417993
BAJAJ FINANC 2274.70 (2335.50) 1713003
BAJAJ FINSER 5848.00 (5975.10) 212176
BHARTI AIRTE 377.95 (375.65) 5857077
BHARTI INFRA 297.95 (299.55) 4702328
BPCL 366.95 (382.80) 13350963
CIPLA 600.90 (602.30) 4173735
COAL INDIA L 260.65 (265.90) 4384958
DR. REDDYS 2295.75 (2293.80) 1228463
EICHER MOTOR 28425.55 (28371.85) 76689
GAIL 319.55 (328.80) 6516636
GRASIM IND 1003.60 (1025.75) 1690666
HCL TECH 909.60 (921.05) 6783284
HDFC 1878.00 (1904.85) 4899708
HDFC BANK 2130.85 (2112.60) 9383385
HERO MOTOCOR 3516.05 (3538.00) 532529
HINDALCO IND 221.05 (217.90) 10398473
HINDUSTAN UN 1602.75 (1609.30) 1177218
HPCL 261.35 (276.60) 15067308
ICICI BANK 271.40 (279.05) 34197884
INDIABULLS H 1136.70 (1180.95) 4739638
INDIAN OIL 154.35 (155.65) 16810724
INDUSINDBANK 1967.60 (1969.25) 1393387
INFOSYS LTD 1289.60 (1270.00) 5498409
ITC 260.50 (262.75) 14637010
KOTAK MAHIND 1339.10 (1324.20) 4308361
LARSEN & TOU 1234.95 (1232.75) 4677061
LUPIN 897.75 (893.60) 4162515
M&M 907.75 (892.65) 4493297
MARUTI SUZIK 8771.30 (8898.30) 376404
NTPC LTD 156.40 (153.80) 12508635
ONGC 153.50 (156.25) 17670403
POWER GRID C 184.80 (187.20) 12680239
RELIANCE IND 944.95 (965.85) 8581234
SBI 257.00 (261.70) 21349738
SUN PHARMA 567.30 (576.90) 5516028
TATA CONSULT 1842.70 (1858.00) 4888125
TATA MOTORS 263.35 (271.05) 19507165
TATA STEEL L 548.45 (543.20) 8655978
TECH MAHINDR 664.25 (714.25) 8192199
TITAN IND 836.35 (869.65) 9824968
ULTRATECH 3721.40 (3773.15) 545895
UPL LIMITED 606.65 (620.65) 3666655
VEDANTA LIMI 230.00 (230.10) 12656271
WIPRO 257.10 (256.05) 3904763
YES BANK LTD 329.30 (335.60) 8130250
ZEE ENTERTAI 539.00 (544.35) 1806489

ఇతర ప్రధాన షేర్లు

ABB 1157.75 (1185.90) 32610
ACC 1291.35 (1308.80) 1265912
ADITYA BIRLA 127.85 (126.80) 1584813
AMBUJA CEMEN 200.90 (205.30) 3785931
ASHOK LEYLAN 124.10 (129.35) 16952679
AUROBIND PHA 600.65 (616.40) 3371989
AVENUE SUPER 1435.45 (1452.50) 431454
BANK OFBAROD 113.00 (115.15) 11274714
BEL 103.75 (104.40) 8017312
BHEL 69.75 (71.00) 8756324
BOSCH LTD 17267.95 (17225.30) 18233
BRITANNIA 6129.55 (6087.60) 128134
CADILA HEALT 378.05 (388.85) 1740737
COLGATE PALM 1155.55 (1181.45) 308246
CONTAINER 611.30 (606.40) 2191179
CUMMINS INDI 647.45 (659.50) 525574
DABUR INDIA 387.45 (393.50) 2014384
DLF LIMITED 185.15 (191.85) 6246529
EMAMI LIMITE 501.55 (505.70) 78350
GENERAL INS 718.95 (724.25) 45685
GODREJ CONSU 1217.95 (1208.55) 908246
HAVELLS INDI 522.90 (537.45) 1364040
HINDUSTAN ZI 272.10 (273.40) 1358366
ICICI PRU LI 369.90 (375.80) 2743236
IDEA CELLULR 56.70 (55.70) 17683835
INTERGLOBE A 1100.15 (1149.50) 1701465
JSW STEEL LT 322.40 (318.30) 4474045
L&TFIN.HOLD 148.35 (152.30) 10369438
LIC HOUS.FIN 470.30 (475.90) 2484569
MARICO LIMIT 332.60 (335.70) 1252925
MCDOWELL 657.65 (678.05) 1597592
MOTHERSON 281.50 (276.95) 4462421
MRF 72933.05 (74037.55) 13071
NHPC LTD 22.55 (24.20) 14447819
NMDC LTD 103.35 (105.90) 3535212
OIL INDIA 201.25 (208.65) 1557308
ORACLE FIN S 4158.20 (4053.85) 40509
P&G HYG&HEAL 9820.25 (9935.95) 13018
PETRONET LNG 206.50 (206.75) 4243121
PIDILITE IND 1028.30 (1043.50) 444386
PIRAMAL ENTE 2551.40 (2556.35) 624177
PNB 72.80 (76.75) 48215340
POWER FIN CO 73.80 (75.60) 8315149
RURAL ELEC C 99.70 (102.70) 6371771
SAIL 81.05 (80.40) 13524050
SBI LIFE INS 666.40 (677.75) 255422
SHREE CEMENT 15499.35 (15739.90) 17375
SHRIRAM TRAN 1303.65 (1374.80) 1634892
SIEMENS 955.20 (968.45) 164489
SUN TV LTD 779.05 (801.05) 2098237s

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 3.70 (3.79) 2509
ALPHAGEO 568.55 (567) 5406
AMAR RAJA BA 726.80 (743.65) 27895
ANDHRA BANK 31.40 (31.75) 183032
ANDHRA CEMEN 9 (9) 11221
ANDHRA PAPER 304.35 (315.70) 1042
ANDHRA PETRO 43.65 (45.15) 22355
ANDHRA SUGAR 328.65 (337.85) 2250
ANJANI PORTL 140.30 (146.75) 201
ASTRA MICROW 97 (96.60) 70469
AUROBINDO PH 602.25 (614.65) 149513
AVANTEL SOFT 328.15 (340.50) 2305
AVANTI FEEDS 550.05 (594.10) 120354
AVON ORG 8.60 (8.26) 520
BALAJI AMIN 528.90 (549.15) 8812
BARTRONICS 9.78 (10) 18799
BHAGIRA CHEM 279.70 (279.80) 153469
BHAGYA NAG 37.65 (39.90) 2938
BKV INDUSTRS 1.70 (1.75) 500
BN RATHI SEC 33.80 (35.60) 4480
BRILLIANT SE 4.30 (4.52) 5733
CAMBRIDGE TE 53.90 (53.50) 216
CIL SECURI 21.65 (22.30) 19251
COMBAT DRUGS 28.90 (28.40) 4899
CONT COFFEE 257.45 (259.85) 4649
COROMAN FERT 387.50 (400.15) 9277
CUBEX TUB 14.65 (15.05) 501
CYBERMATE 1.78 (1.86) 24680
CYIENT LIMIT 746.80 (742.90) 21794
DECCAN CEMEN 402.10 (404.55) 79
DIVI'S LAB 999.25 (1017.90) 36409
DR REDDY 2274.20 (2292.40) 273700
FOUR SOFT 56.45 (57.55) 1580
GATI CORPN 73.80 (76.30) 182437
GAYATRI PROJ 157.85 (159.05) 4483
GMR INFRASTR 15.25 (15.55) 2837333
GOLDST INFRA 166.05 (172.10) 15956
GOLDSTONE EN 13.68 (14.39) 14137
GRANULES (I) 78.15 (82.40) 197339
GSS AMERICA 76.65 (80.55) 3155
GVK POWER 9.03 (9.50) 1042426
HBL NIFE POW 31.60 (33.20) 50071
HERITAGE FOO 623.15 (613.10) 4526
HIL LTD 1718.40 (1765.95) 671
HIND FLUROCA 9.89 (10.73) 450
IDL INDUSTRS 368.10 (375.50) 5355
IKF SOFT 0.43 (0.45) 49276
ILFS ENGINEE 27.45 (27.45) 17549
INCAP 66.50 (70) 196
INNAREDY COM 1.68 (1.72) 6003
IVRCL INFRAS 1.32 (1.26) 481458
JEEVAN SCIEN 33.50 (34.80) 1015
KAKATIYA CEM 223.55 (229.65) 3587
KALLAM SPG 25.85 (26.20) 9607
KARAN WOO-SN 2.82 (2.73) 4
KAVERI SEED 537.10 (539) 16032
KCP LTD 98.95 (98.70) 16818
KERNEX MICRO 26.50 (27.60) 1580
KNR CONSTRUC 208.90 (215.05) 66829
KREBS BIO 114.55 (115.75) 1499
LANCO INDUS 247.90 (252.80) 7246
LANCO INFRAT 0.73 (0.75) 623105
LAURUS LABS 451.20 (461.90) 5250
LOKESH MACH 55.45 (55.75) 3939
MADHUCON PRO 11.75 (11.40) 42361
MEGA SOFT 8.68 (9.79) 11213
MIC ELECTRON 2.70 (2.84) 104616
MOLD-TEK.TEC 39.45 (39.65) 402
MOLDTK PLA 313.60 (306.50) 1002
MSR INDIA LT 21.50 (22.75) 4135
NAGARJAGRICH 27.20 (27.05) 43524
NATCO PHARMA 791.65 (794.15) 10411
NAVA BH VENT 126.55 (128.80) 32878
NCC 90.90 (95.65) 714274
NCL IND 157.60 (163) 226578
NEHA INTER 5.02 (4.85) 26641
NETTLINX 50 (50.45) 11039
NEULAND LAB 643.65 (643.45) 1251
NIHAR INFO 10.90 (10.85) 174
NILE 491.40 (511.50) 5012
OIL COUNTRY 17.75 (17.80) 8504
PANYAM CEMEN 22.60 (22.95) 3800
PENNER IND 48 (50.05) 88757
PHYTOCHEM I 51.85 (52.70) 477
PIONEER DIST 237.65 (253.40) 4549
PITTI LAMIN 81.45 (81.90) 3676
PL ENTERPRI 2.24 (2.24) 1
POKARNA 153 (151.70) 4077
PRAJAY ENGS 8.98 (8.80) 3489
PREMIER EXPL 250 (256.25) 910
PRISM CEMENT 95.35 (98.90) 21422
PRUDENTL PHA 3.59 (3.67) 78246
RAIN INDUSTR 183.85 (186.70) 153083
RAJ PACKAGIN 25.50 (26) 2000
RAM INFORMAT 39.90 (40.50) 2627
REG.CERAMIC 3.66 (3.66) 20
SAGAR CEM 807.80 (799.80) 323
SAMKRG PIST 214 (222.30) 4842
SAMPRE NUTRI 43.45 (41.55) 530
SATVAH. ISPA 12.40 (12.85) 9239
SMS PHARMA 65.50 (66.50) 6025
SOUTH BIO TE 1.78 (1.80) 1
SPHERE GLOBA 22.95 (26.05) 2423
SREE RAYAL A 30.65 (31.75) 129926
SRI KPR INDU 26.85 (25.80) 610
SRINIVASA SH 37 (36.70) 251
SS ORGANICS 6.10 (5.85) 600
STARCHIK SP 34.50 (34.75) 10
STEEL EXCHAN 20.20 (18.40) 23160
SUJANA METAL 0.81 (0.85) 13001
SUJANA TOWER 2.05 (2.15) 4606
SURANA TELE 3.90 (4.43) 16292
SURYALAKSH.C 51 (51) 3500
SURYALATA SP 125.25 (125.45) 560
SUVEN PHARMA 200.05 (203.65) 83378
TAJ GVK HOTE 210.45 (206.35) 5060
TANLA 29.20 (28.55) 38265
TERA SOFTWAR 38.95 (40.45) 2470
TRANS BIOTEK 2.02 (2.12) 201
VAMSHI RUBB 42 (44) 1143
VBC FERRO 38.55 (40.50) 310
VICEROY HOTE 7.34 (7.46) 24827
VIJAY TEXTIL 53.85 (56.10) 3347
VIMTA LABS 210.35 (206.25) 3148
VISAKA IND 485.05 (521.90) 13118
VISTA PHARMA 35.80 (35.70) 25060
VIVIMED LABS 58.35 (57.75) 28783
VST INDUS 2925 (2949) 39
XL TELENE 1.15 (1.21) 251
YBRANT DIGIT 3.98 (3.95) 60220
ZENOTECH LAB 36.15 (36.70) 4249
ZENTECH 90.85 (93.50) 7538



అంబానీ ఇంట మెహందీ సందడి

ముంబయి: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఇంట వివాహ వేడుకలకు సన్నాహాలు మొదలయ్యాయి. పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ వివాహం వజ్రవ్యాపారి రస్సెల్ మెహతా కుమార్తె శ్లోకాతో జరగనున్న సంగతి విదితమే. ఈనెల 30న నిశ్చితార్థం జరగనుండగా, బుధవారం రాత్రి మెహందీ వేడుక అట్టహాసంగా నిర్వహించారు. సచిన్‌తెందుల్కర్ దంపతులతో పాటు బాలీవుడ్ ప్రముఖులు షారూక్‌ఖాన్ దంపతులు, కరణ్‌జోహార్, కిరణ్‌రావ్, రణబీర్‌కపూర్, ఆలియాభట్, ప్రియాంకచోప్రా తదితరులు హాజరయ్యారు. ఆకాశ్, శ్లోకాలతో దిగిన చిత్రాన్ని ప్రియాంకా చోప్రా ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

రూపాయి కంపం

- జీవనకాల కనిష్ఠానికి చేరిక
- రూ.70కి చేరువలో డాలర్ మారకం విలువ
- అధిక చమురు ధరల ప్రభావం
- ఆజ్యం పోసిన వాణిజ్య యుద్ధ భయాలు

రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠానికి చేరడం కలవర పెడుతోంది. డాలరు మారకం విలువ రూ.70కి చేరువైంది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణం. అమెరికా- చైనాల మధ్య సుంకాల సమరంతో వాణిజ్య యుద్ధ వాతావరణం నెలకొనడమూ ఆజ్యం పోసింది. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిల పరిస్థితిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆందోళన వ్యక్తం చేయడం, స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు కూడా రూపాయి క్షీణతకు దోహదం చేశాయి. ముున్ముందు కూడా ఈ పరిస్థితి కొనసాగితే వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు మరింత పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక వ్యవస్థకు ఒకవిధంగా ఇది ఇబ్బందికర పరిణామమే.



ఓ వైపు వాణిజ్య యుద్ధ భయాలు.. మరోవైపు అధిక చమురు ధరలు వర్ధమాన దేశాల కరెన్సీలను బెంబేలెత్తిస్తున్నాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠానికి పతనమవడం ఈ పరిస్థితిని అద్దం పడుతోంది. బుధవారం 19 నెలల కనిష్ఠానికి పడిపోయిన రూపాయి గురువారమూ అదే ధోరణిని కొనసాగించింది. డాలర్‌తో పోలిస్తే బుధవారం ముగింపైన 68.61తో పోలిస్తే, మరింత క్షీణతతో 68.89 వద్ద రూపాయి ట్రేడింగ్ గురువారం ఆరంభమైంది. ఆ తర్వాత 69.09 స్థాయికి దిగివచ్చింది. ఇది జీవన కాల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. అనంతరం కాస్త పుంజుకున్నప్పటికీ చివరకు 18 పైసలు నష్టంతో 68.79 వద్ద ముగిసింది. ఈవారంలో ఇప్పటివరకు డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 1.8% క్షీణించగా.. చైనా కరెన్సీ యువాన్ 1.6% పతనమైంది.

ఆ మూడే ఆజ్యం పోశాయి

రూపాయి రికార్డు కనిష్ఠానికి పడిపోవడానికి ప్రధానంగా మూడు అంశాలు దోహదం చేశాయి. అవి ఇవీ..

★ చమురు భగభగ

అంతర్జాతీయ చమురు ధరలు ఆ మధ్యలో కాస్త తగ్గినప్పటికీ మళ్లీ పెరగడం ప్రారంభమైంది. ప్రస్తుతం బ్యారెల్ ముడి చమురు ధర 75 డాలర్లకు చేరువయ్యింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇందుకు ఓ కారణం కాగా.. ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపేయమని మిత్రదేశాలపై అమెరికా ఒత్తిడి పెంచడం మరో కారణం. మనదేశం కూడా ఇందుకు అనుకూలంగా ఉండటంతో, చమురు ధరలు పెరిగాయి. ఫలితంగా బ్యారెల్ చమురు కొనుగోలుకు మరిన్ని డాలర్లను చమురు మార్కెటింగ్ కంపెనీలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో డాలరుకు గిరాకీ పెరిగి ఆ ప్రభావం రూపాయిపై పడింది.

★ వాణిజ్య యుద్ధం సెగ

అమెరికా- చైనాలు పరస్పరం దిగుమతి సుంకాలు విధించుకోవడంతో ఈ పరిణామం వాణిజ్య యుద్ధానికి దారితీయొచ్చనే భయాలు ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ఇందువల్ల భవిష్యత్‌లో దేశాల మధ్య వాణిజ్య సంబంధాలకు ముప్పు వాటిల్ల వచ్చని కరెన్సీ ట్రేడర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావం ఆయా దేశాల కరెన్సీలపైనా కనిపిస్తోంది.

★ బ్యాంకింగ్ రంగంపై బెంగ

దేశ బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తులు మరింత పెరుగుతాయంటూ ఆర్‌బీఐ చేసిన వ్యాఖ్యలు రూపాయి విలువ పడిపోవడానికి మరో కారణం. 2017-18 చివరకు స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 11.6 శాతం కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరుకు ఇవి మరో 0.6 శాతం పెరుగుతాయని ఆర్థిక స్థిరత్వ నివేదికలో ఆర్‌బీఐ అంచనా వేసింది. ఈక్విటీ, కరెన్సీ మార్కెట్ల సెంటిమెంటు దెబ్బతినడానికి ఇదీ కారణమయ్యింది. స్టాక్ మార్కెట్లో అమ్మకాలు వెల్లువెత్తగా.. రూపాయి ఒత్తిడికి గురయ్యింది.

వాణిజ్యలోటు
1460
కోట్ల డాలర్లు
(మేలో)

రూపాయి క్షీణత → **చమురు దిగుమతులు ప్రియం** → **కంపెనీలకు వ్యయాల భారం** → **ప్రజలకు ఆ భారం బదిలీ** → **ధరల మోత.. ద్రవ్యోల్బణం పైకి** → **ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పెంపు** → **గృహ రుణాలు భారం**

కరెంటు ఖాతా లోటు
2017-18
4870 కోట్ల డాలర్లు
(జీడీపీలో 1.9%)
2016-17
1440 కోట్ల డాలర్లు
(జీడీపీలో 0.6%)

లాభమెంత? నష్టమెంత?

రూపాయి క్షీణత ఎగుమతులకు సానుకూల పరిణామం. అయితే దిగుమతులు మాత్రం భారమవుతాయి. ముఖ్యంగా చమురు, పసిడి దిగుమతుల వ్యయాలు పెరుగుతుండటంతో దేశ వాణిజ్య లోటుపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దిగుమతుల కోసం విదేశీ మారక నిల్వలను అధిక మొత్తంలో వినియోగించాల్సి వస్తుండటంతో, కరెంటు ఖాతా లోటు కూడా పెరుగుతుంది. రూపాయి క్షీణతతో డాలరు రూపేణా రుణాలు తీసుకున్న కంపెనీల లాభదాయకతను దెబ్బతీస్తాయి. దేశీయ బాండ్ల మార్కెట్‌పైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. అలాగే చదువులు, ఆఫీసు పనుల నిమిత్తం విదేశీ పర్యటనలకు వెళ్లేవారికి ఖర్చులు పెరుగుతాయి.

భారత్‌పై కరెన్సీ ఒత్తిడి ప్రభావం తక్కువే: మూడీస్

అమెరికా డాలరు బలోపేతమవడం వల్ల పెద్దగా ఇబ్బంది పడని 5 దేశాల్లో భారత్ ఒకటని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీసెస్ అభిప్రాయపడింది. విదేశీ నిధులపై తక్కువగా ఆధారపడి ఉండటమే ఇందుకు కారణమని పేర్కొంది. 'డాలరు బలపడితే ఆయా దేశాల కరెన్సీ విలువలు పడిపోతాయి. విదేశీ మారక నిల్వలు గణనీయంగా తగ్గేందుకు ఈ పరిణామం దోహదం చేస్తుంది. అయితే భారత్, చైనా, బ్రెజిల్, మెక్సికో, రష్యా లాంటి దేశాలపై మాత్రం ఈ కరెన్సీ ఒత్తిడి ప్రభావం తక్కువగా ఉంటుంద'ని తన నివేదికలో పేర్కొంది. భారత్‌కు విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో ఉండటం కూడా కరెన్సీ ఒత్తిడిని తట్టుకునేందుకు తోడ్పడుతుందని తెలిపింది.

అంతర్జాతీయ విపణుల్లో మరింత పోటీపడొచ్చు: ఫియో

రూపాయి క్షీణత వల్ల ఎగుమతిదార్లకు అదనంగా ఏమీ ప్రయోజనం ఉండకపోవచ్చని భారత ఎగుమతిదార్ల సమాఖ్య (ఫియో) తెలిపింది. ప్రస్తుతం మన దేశ కరెన్సీతో పాటు చైనా లాంటి ఇతర వర్ధమాన దేశాల కరెన్సీలు కూడా క్షీణిస్తుండటమే ఇందుకు కారణమని ఫియో డైరెక్టరు జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు.

అయితే అంతర్జాతీయ విపణుల్లో ఇతర దేశాల ఉత్పత్తులతో పోటీ పడేందుకు తమకు ఈ పరిణామం ఉపకరిస్తుందని పేర్కొన్నారు.

విదేశీ మారకపు నిల్వలు
41008
కోట్ల డాలర్లు
(జూన్ 15 నాటికి)

ఐఫోన్ పేటెంట్ వివాదంలో యాపిల్-శామ్‌సంగ్ రాజీ

శాన్‌ఫ్రాన్సిస్కో: ఏడేళ్లుగా సుదీర్ఘంగా కొనసాగుతున్న ఐఫోన్ పేటెంట్ వివాదం పరిష్కారమైంది. పేటెంట్ కలిగిన ఐఫోన్ డిజైన్‌ను శామ్‌సంగ్ కాపీ చేసిందనే విషయంలో ఇరు సంస్థల మధ్య వివాదం రేగింది. ఈ రెండు సంస్థలు వివాదాన్ని పరిష్కరించుకున్నాయని అమెరికా కోర్టు తెలిపింది. ఐఫోన్ ఫీచర్స్‌ను కాపీ కొట్టినందుకు గాను 539 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,665 కోట్లు) యాపిల్ సంస్థకు చెల్లించాలంటూ నెల కిందట యూఎస్ ఫెడరల్ కోర్టు శామ్‌సంగ్‌ను ఆదేశించింది. దీంతో యాపిల్ సంస్థ విజయం సాధించినట్లయింది. శామ్‌సంగ్ ఎంత మొత్తం చెల్లించి రాజీ కుదుర్చుకుందన్న వివరాలు బయటకు రాలేదు.

కెనరా బ్యాంక్ మాజీ సీఎండీలపై సీబీఐ అభియోగ పత్రం

దిల్లీ: విన్‌సమ్ డైమండ్స్ మోసం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కెనరా బ్యాంక్ మాజీ ఛైర్మన్ - మేనేజింగ్ డైరెక్టర్‌లు (సీఎండీ) అవినాష్ చందర్ మహాజన్, సుందర్ రాజన్ రామన్‌లపై ముంబయి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసింది. విన్‌సమ్ డైమండ్స్ యజమాని జతిన్ మెహతా కెనరా బ్యాంకు నుంచి రూ.146 కోట్ల రుణం తీసుకొని ఎగవేసిన కేసులో నిందితుడు. జతిన్ మెహతాపై రెడ్‌కార్నర్ నోటీసును కూడా సీబీఐ జారీ చేసింది. ఈ కేసులో మెహతాతో సహా 21 మంది నిందితులపై అభియోగ పత్రం నమోదైంది. ఇందులో మెహతా భార్య, 15 మంది ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు ఉన్నారని సీబీఐ అధికారి అభిషేక్ దయాల్ తెలిపారు. జతిన్‌తో కెనరాబ్యాంక్ మాజీ సీఎండీలకు సంబంధం ఉందనే కారణంతో తాజా అభియోగ పత్రం దాఖలైంది. బ్యాంక్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చన భార్గవపైనా ఛార్జిషీట్ దాఖలైంది.

గ్రామీణ గిరాకీ జోరే!

- కనీస మద్దతు ధర పెంచడం వల్ల
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నివేదిక

దిల్లీ: ఇటీవల కొన్ని నెలలపాటు గ్రామీణ గిరాకీ ఒడుదొడుకుల్ని ఎదుర్కొంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ దిగుబడుల సేకరణకు తోడు, కనీస మద్దతు ధరల్ని (ఎంఎస్‌పీ) పెంచడంతో గ్రామీణ ఆదాయం మెరుగు పడుతుందని, ఫలితంగా గిరాకీ అధికమవుతుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన పరిశోధన నివేదికలో వెల్లడించింది. ఇంకా ఇందులో ఏం ఉందంటే..

- గ్రామీణ గిరాకీ పెరగడానికి అనేక రకాల అంశాలు దోహదపడతాయి. సమయానుకూల రుతుపవనాలు ఒక్కటే దీన్ని పెంచేందుకు వీలు కాదు. పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించడంతోపాటు ఏ మేరకు సేకరణ చేస్తారనేది కీలకంగా మారనుంది.
- గ్రామీణ గిరాకీ సూచీ పెరుగుతున్నా గ్రామీణ వేతన వృద్ధి మాత్రం తగ్గిపోతోంది. 2017 మధ్యకాలం నుంచి వేతన వృద్ధి మితంగా ఉంటోంది.
- వేతన వృద్ధి గత ఏడాది ఏప్రిల్‌లో 7 శాతం ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో 3 శాతానికే పరిమితమైంది. గత ఏడాది వాస్తవిక వేతన వృద్ధిలో లౌకిక క్షీణత కనిపించింది. ప్రస్తుతం అది ప్రతికూలంగా మారింది.
- వ్యవసాయ, వ్యవసాయేతర వేతన వృద్ధిలో క్షీణత నమోదైంది. వ్యవసాయ వేతన వృద్ధి గత ఏడాది ఏప్రిల్‌లో దాదాపు 9 శాతం ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో 2.3 శాతానికి పరిమితమైంది. వ్యవసాయేతర వేతన వృద్ధి విషయానికొస్తే 5 నుంచి 3.7 శాతానికి తగ్గింది.

ఇండియన్ బ్యాంక్ డివిడెండ్ చెల్లింపు లేనట్లే

ఆర్‌బీఐ మార్గదర్శకాలే కారణం

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల మేరకు ఇండియన్ బ్యాంక్ తమ వాటాదారులకు డివిడెండు చెల్లింపును ఆపేస్తున్నట్లు ప్రకటించింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక్కో షేరుకు రూ.6 డివిడెండును మే 10వ తేదీన ఇండియన్ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. అయితే గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ నష్టాల బాటలోనే సాగడంతో ఆర్‌బీఐ వాటికి పలు మార్గదర్శకాలు జారీ చేసింది. అందులో మూలధన వ్యయాలు తగ్గే వరకు డివిడెండు చెల్లింపులు లాంటి చేయవద్దని బ్యాంకుల్ని ఆదేశించింది. దీంతో ఇండియన్ బ్యాంక్ డివిడెండు చెల్లింపు ప్రతిపాదన వెనక్కు తీసుకొంది.

6.3 సెకన్లలో 100 కి.మీ వేగం!

ఆడి క్యూ5 పెట్రోల్ కారు విడుదల

దిల్లీ: జర్మనీ విలాసవంత కార్ల తయారీ సంస్థ ఆడి, తమ స్పోర్ట్స్ వినియోగ వాహనాల విభాగంలో పెట్రోల్ రకం ఆడి క్యూ5ను భారత్ విపణిలోకి తీసుకొచ్చింది. దీని ధరను రూ.55.27 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) నిర్ణయించింది. 2-లీటర్ పెట్రోలు ఇంజిన్, 252 హెచ్‌పీ సామర్థ్యం, 7-స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో దీన్ని రూపొందించారు. గంటకు 237 కి.మీ అత్యధిక వేగం, 6.3 సెకన్లలో 100 కి.మీ వేగాన్ని అందుకోవడం దీని ప్రత్యేకతలని కంపెనీ పేర్కొంది. 'ఆడి క్యూ5 పెట్రోలు కారు తీసుకురావడంతో మొత్తం క్యూ శ్రేణిలో అన్ని విభాగాల్లో పెట్రోలు కార్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అయ్యింది. ఆడి క్యూ5 మోడల్ భారత్‌లో ఇప్పటికే అధికంగా అమ్ముడవుతోంది. పెట్రోలు కారు విడుదలతో అమ్మకాలు మరింత పెరుగుతాయన్న నమ్మకం ఉంద'ని ఆడి ఇండియా ప్రతినిధి రాహిల్ అన్సారి తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ఆడి ఇండియా క్యూ5 డీజిల్ కారును విడుదల చేసిన సంగతి తెలిసిందే.

అదనపు హంగులతో ల్యాండ్ రోవర్ కార్లు

ధరల శ్రేణి రూ.99.5 లక్షలు- 3.8 కోట్లు

ముంబయి: స్పోర్ట్స్ వినియోగ వాహనాల (ఎస్‌యూవీ) విభాగంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) రెండు మోడళ్లను విపణిలోకి తీసుకొచ్చింది. అదనపు హంగులతో రేంజ్ రోవర్ స్పోర్ట్, రేంజ్ రోవర్‌లను రూపొందించింది. వీటి ప్రారంభ ధర రూ.99.5లక్షలు-1.74 కోట్లు. కొత్త ఎస్‌యూవీలు కూడా ప్రస్తుతం ఉన్న మోడళ్ల ధరల్లోనే లభ్యమవుతున్నట్లు కంపెనీ పేర్కొంది. రేంజ్ రోవర్ స్పోర్ట్ డీజిల్ కారు ధరల్ని రూ.99.48 లక్షలు-1.43 కోట్లుగా నిర్ణయించారు. పెట్రోలు కార్లు రూ.110.3-196.75 లక్షలు. రేంజ్ రోవర్‌లో డీజిల్ కార్లు రూ.174.29-376.61 లక్షలు కాగా, పెట్రోలు కార్ల ధరల్ని రూ.187.16-388.16 మధ్య నిర్ణయించారు. 2018 రేంజ్ రోవర్ స్పోర్ట్, రేంజ్ రోవర్ మోడల్ కార్లను ఎలక్ట్రానిక్ ఎయిర్ సస్పెన్షన్, టెర్రైన్ రెస్పాన్స్, ట్విన్-స్పీడ్ ట్రాన్స్‌ఫర్ బాక్స్ తదితర అదనపు హంగులతో తీర్చిదిద్దారు.

100% అమెరికాలో ఉండాల్సిందే

- తయారీని తరలిస్తే గుర్తుంచుకుంటాం
- హార్లే డేవిడ్‌సన్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: వాహన దిగ్గజ సంస్థ హార్లే డేవిడ్‌సన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘాటుగా హెచ్చరించారు. కంపెనీ మోటార్‌బైక్‌ల తయారీ 100 శాతం అమెరికాలోనే ఉండాలని, ఇతర దేశాలకు తరలించాలని నిర్ణయిస్తే, విడిచి పెట్టేది లేదని పేర్కొన్నారు. ఐరోపా సమాఖ్యకు ఎగుమతి చేసే వాటిని భారత్, బ్రెజిల్, ఆస్ట్రేలియాల్లో తయారు చేయించేందుకు కంపెనీ సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఐరోపా దిగుమతులపై సుంకాలు విధిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి ప్రతిస్పందనగా, తమ బైక్‌లపై ఐరోపా సమాఖ్య సుంకాలు భారీగా పెంచినందునే కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. 'హార్లే డేవిడ్‌సన్ 100 శాతం అమెరికాలోనే ఉండాలి. మీ విజయానికి కారణమైన ప్రజలతోనే' అని ట్రంప్ ట్వీట్ చేశారు. 'మేము మీకు చాలా చేశాం. మీరు మాత్రం ఈ విధంగా ఆలోచిస్తున్నారు. మిగతా కంపెనీలు వెనక్కి వస్తున్నాయి. మిమ్మల్ని విడిచిపెట్టం. మీ వినియోగదారుల కూడా మర్చిపోరు' అని ట్రంప్ పేర్కొన్నారు.

29 అమెరికా ఉత్పత్తులపై సుంకాల పెంపు నిర్ణయం వెనక్కి?

దిల్లీ: సుంకాల విషయంలో ఇటీవల చోటు చేసుకున్న సమస్యలు తొలగిపోతే, అమెరికా నుంచి దిగుమతి అవుతున్న 29 రకాల ఉత్పత్తులపై అదనపు సుంకాల నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటామని భారత్ సూచనప్రాయంగా తెలిపినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. కొత్త సుంకాలు ఆగస్టు 4 నుంచి అమలు చేయాలని ఇటీవల నోటిఫికేషన్ కూడా విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈలోగానే ఇరు దేశాల ఉన్నతాధికారులు సుంకాల సమస్యపై మూడు రోజుల పాటు ఇక్కడ చర్చించనున్నారు. వచ్చే నెలలో అమెరికాలోనూ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించుకొనే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

త్వరపడండి

విమాన టికెట్లపై ఆఫర్ల జోరు
ముందుగా కొనుగోలు చేసుకునే వారికే

ముందస్తు ప్రణాళిక ఉంటే, రైలు ఏసీ తరగతి ఛార్జీలతోనే, విమానంలో ప్రయాణించే సౌలభ్యం దేశీయ మార్గాల్లో కలుగుతోంది. దాదాపు అన్ని విమాన సంస్థలు ఏదో ఒక రూపేణ ఆఫర్లు ప్రకటిస్తుండటమే ఇందుకు కారణం. సెలవులు, తప్పనిసరిగా వెళ్లాల్సిన పనులు, వేడుకల కోసం, ఇప్పుడే ప్రణాళిక వేసుకుంటే, తక్కువ మొత్తానికే టికెట్లు కొనుగోలు చేసుకునే వీలును విమాన యాన సంస్థలు కల్పిస్తున్నాయి. ఒకపక్క ఇంధన ధరల వల్ల టికెట్ ఛార్జీలను సంస్థలు పెంచుతున్న నేపథ్యంలో, ముందస్తు కొనుగోళ్లకు మాత్రం ఈ ఆఫర్లు లభిస్తున్నాయి. విమానాల్లో సీట్లు నిండే కొద్దీ ఛార్జీ పెరిగిపోతుంది కనుక, ఎంత ముందుగా కొనుగోలు చేసుకుంటే, అంతగా ఆఫర్ వర్తిస్తుందనేది కాదనలేని వాస్తవం. ఆయా సంస్థల ఆఫర్లు ఇలా..

స్పైస్‌జెట్: దేశీయ మార్గాల్లో ప్రయాణానికి రూ.1,149 నుంచీ టికెట్లు విక్రయిస్తున్నట్లు తెలిపింది. జులై 1 నుంచి అక్టోబరు 8 తేదీల మధ్య ప్రయాణానికి, టికెట్లు ఈనెల 30 లోపు కొనుగోలు చేసుకోవాలి. ఒకవైపు ప్రయాణానికి ఈ ఆఫర్ వర్తిస్తుందని సంస్థ తెలిపింది.

ఇండిగో: ఎంపిక చేసిన మార్గాల్లో, రుసుములన్నీ కలిసి ఒక్కో టికెట్టును రూ.1,200 నుంచీ విక్రయిస్తున్నట్లు తెలిపింది. జులై 11 నుంచి సెప్టెంబరు 27 మధ్య ప్రయాణానికి, ఈనెల 30లోపు టికెట్లు కొనుగోలు చేసుకోవాలి. ఒక గమ్యం నుంచి మరో గమ్యానికి నేరుగా వెళ్లే (నాన్‌స్టాప్) విమానాల్లోనే ఈ సౌలభ్యం ఉంది. బృందాలుగా కొనుగోలుకు ఆఫర్ వర్తించదు. ఒకవేళ ప్రయాణ తేదీ మార్చుకోవాలనుకుంటే, ఛార్జీలో తేడా, రుసుము చెల్లించాలి.

ఎయిరేషియా: దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో 20 శాతం రాయితీ ప్రకటించింది. జులై 1 వరకు టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చు. జులై 2 నుంచి నవంబరు 30 మధ్య ప్రయాణించవచ్చు. ఎంపిక చేసిన తరగతిలో, ఒకవైపు ప్రయాణానికి ఆఫర్ వర్తిస్తుంది. ప్రయాణతేదీ మార్చుకునేందుకు అదనపు రుసుము చెల్లించాలి. ప్రయాణికుల పేర్లలో మార్పులను అంగీకరించరు.

జెట్ ఎయిర్‌వేస్: దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో సాధారణ, ఉన్నత తరగతి ప్రయాణాల్లో కనీస ధరపై 30 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. నవంబరు 5 వరకు ప్రయాణానికి, ఈనెల 30 వరకు కొనుగోలు చేసుకోవచ్చు. దేశీయంగా ఎంపికచేసిన మార్గాల్లో 25 శాతం వరకు, విదేశీ మార్గాల్లో 30 శాతం వరకు రాయితీ ఉంటుంది. ఆమ్‌స్టర్‌డామ్, కొలొంబో, పారిస్‌లకు మాత్రం ఆఫర్ వర్తించదు. ప్రయాణ తేదీకి కనీసం 15 రోజుల ముందుగా టికెట్ కొనుగోలు చేసుకోవాలి.

గోఎయిర్: దేశీయ మార్గాల్లో ప్రయాణానికి రూ.1199 నుంచీ టికెట్లు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. జులై 10 నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రయాణానికి ఈనెల 30లోపు కొనుగోలు చేసుకోవాలి. తేదీ మార్పులను అంగీకరించరు.

ట్రూజెట్: హైదరాబాద్-నాందేడ్ మధ్య ప్రయాణానికి టికెట్లు రూ.899 నుంచీ ప్రారంభమవుతున్నట్లు సంస్థ తెలిపింది. మరికొన్ని మార్గాల్లోనూ, తమ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకుంటే రాయితీ ఉందని కంపెనీ ప్రకటించింది.

హైదరాబాద్‌లో ఈపామ్ ఇంజినీరింగ్ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: డిజిటల్ ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ సంస్థ ఈపామ్ హైదరాబాద్‌లో తన ఇంజినీరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో 1,000 మందికి పైగా ఉద్యోగులు పని చేయనున్నారు. అధునాతన సాంకేతికతకు సంబంధించి పరిశోధన, అభివృద్ధితో పాటు, అంతర్జాతీయ ఖాతాదారులకు అవసరమైన ఉత్పత్తులు ఈ కేంద్రంలో రూపొందించనున్నారు. 2015లో అలయన్స్ గ్లోబల్ సర్వీసెస్‌ను స్వాధీనం చేసుకోవడం ద్వారా ఈపామ్ భారత్‌లో అడుగు పెట్టింది. గురువారం నూతన కార్యాలయాన్ని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈపామ్ సీఈఓ, ప్రెసిడెంట్ ఆర్కేడి డాబ్కిన్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి సంప్రదాయ ఐటీ సేవలు కాకుండా, అధునాతన డిజిటల్ ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఆశిస్తున్నట్లు తెలిపారు. నిపుణులకు అవసరమైన శిక్షణ అందిస్తామని చెప్పారు. కొత్త ప్రాజెక్టులు, బిగ్ డేటా తదితర వాటి కోసం ఈ కేంద్రంలోని ఇంజినీరింగ్ నిపుణులు పనిచేస్తారని చెప్పారు. అంతర్జాతీయంగా 30 దేశాల్లో సేవలను అందిస్తున్నట్లు, 27,000 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. కొత్త కేంద్రం 1600 మంది సామర్థ్యంతో ఉందనీ, అవసరాన్ని బట్టి ఉద్యోగులను నియమించుకుంటామని పేర్కొన్నారు. గత ఏడాది అంతర్జాతీయంగా 1.45 బిలియన్ డాలర్ల రెవిన్యూను ఆర్జించినట్లు, ఏటా 25-30శాతం వృద్ధి రేటును సాధిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రారంభం అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలు పెంచేందుకు టాస్క్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబరులో టి-వర్క్స్ ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. టి-హబ్ ఫేజ్ 2 పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. తెలంగాణ ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ హాజరయ్యారు.

ఈపామ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, సీఈఓ ఆర్కేడి డాబ్కిన్

52 దేశాలు.. 165 రోజులు.. 355 కోట్లు

- ప్రధాని మోదీ విదేశీ పర్యటనల వివరాలు వెల్లడి

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ఖర్చులను ప్రధాని కార్యాలయం(పీఎంవో) అధికారికంగా విడుదల చేసింది. బెంగళూరుకు చెందిన భీమప్ప గదాద్ సమాచారహక్కు చట్టం కింద చేసుకున్న దరఖాస్తుపై ఈమేరకు వెల్లడించింది. దీనిప్రకారం మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసింది మొదలు, ఇప్పటివరకు 41సార్లు విదేశాల్లో పర్యటించారు. 52దేశాల్లో పర్యటించడానికి రూ.355 కోట్లు వ్యయమైంది. 165రోజులు విదేశాల్లో బస చేశారు. 2015లో ఫ్రాన్స్, జర్మనీ, కెనడాల్లో తొమ్మిది రోజులు పర్యటించినప్పుడు అత్యధికంగా రూ.31.25 కోట్లు వ్యయం కాగా, 2014లో భూటాన్‌లో ఒక్కరోజు గడిపినందుకు అత్యల్పంగా రూ.2.45 కోట్లు ఖర్చు అయ్యాయి.

విజయవంతంగా 'ధ్రువ' గగన విహారం

ఈనాడు- బెంగళూరు: భారతీయ తీర రక్షణ దళం(కోస్టుగార్డు) కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ (హెచ్ఏఎల్) అభివృద్ధి పరచిన తేలిక పాటి అత్యాధునిక హెలికాప్టర్-గ్రీన్ ఏఎల్‌హెచ్ ధ్రువ ఎం.కె.-3 గురువారం విజయవంతంగా ఆకాశంలో చక్కర్లు కొట్టింది. ధ్రువలో పందొమ్మిది నూతన వ్యవస్థల్ని అమర్చారు. నూతన వ్యవస్థల సమర్థత, ప్రామాణికత, పరీక్షలు, యోగ్యతా పత్రాల పరిశీలనకు దాన్ని హెచ్ఏఎల్ రోటరీ విభాగం పరిశోధన, అభివృద్ధి కేంద్రానికి అప్పగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్ఏఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సువర్ణరాజు నుంచి కోస్టుగార్డు డైరెక్టర్ జనరల్ రాజేంద్రసింగ్ హెలికాప్టర్ సేవల ఒప్పంద పత్రాల్ని అందుకున్నారు. దీని ప్రకారం హెలికాప్టర్లను తీర రక్షణ దళానికి అందించిన తర్వాత ఐదేళ్ల పాటు హెచ్ఏఎల్ సేవలందిస్తుంది. ఎం.కె.-3 హెలికాప్టర్ల సరఫరా 2020 తర్వాత మొదలు కానుంది. రూ.5,126 కోట్ల విలువ చేసే పదహారు ధ్రువ వాహనాల సరఫరా కోసం రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది.

వైద్యుల వాట్సాప్ బృందంలో అశ్లీల వీడియోలు

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: వైద్యులంతా కలిసి ఏర్పాటుచేసుకున్న ఓ వాట్సాప్ బృందంలో అశ్లీల చిత్రాలు, వీడియోలు దర్శనమిచ్చాయి. ఓ వైద్యుడి నెంబరుతో అవి గ్రూపులోని వందల మందికి చేరడంతో మిగతా సభ్యులంతా నివ్వెరపోయారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్(ఏపీఐఎంఎస్) పేరిట ఓ వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తున్నారు. అందులో రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వీసుకు చెందిన వైద్యులను చేర్చారు. రోజువారీ కార్యక్రమాలు, కార్యాచరణ, వైద్యుల సమాచారం తెలుసుకునేందుకు వీలుగా ఈ గ్రూపును ఏర్పాటు చేశారు. ఈ నెల 8న రాత్రి కేదారేశ్వరపేటలోని ఏపీఐఎంఎస్ సంస్థ కార్యాలయంలో వైద్యుడిగా ఉన్న జి.రవికుమార్ నెంబరు నుంచి గ్రూప్‌లో అశ్లీల చిత్రాలు, వీడియోలు అప్‌లోడ్ అయ్యాయి. వాటిని వెంటనే తొలగించకపోవడంతో సభ్యులందరికీ వెళ్లాయి. బృందంలో మహిళా వైద్యులు కూడా ఉండటం, వారి ఇబ్బందుల నేపథ్యంలో వేటపాలెం సమీప అక్కయ్యపాలెం ఆస్పత్రిలో పనిచేస్తున్న శ్రీనివాసరాజా అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ ఎం.వి.వి.జగన్మోహనరావు ఆ చిత్రాలు, వీడియోలను స్వాధీనం చేసుకున్నారు. వాట్సాప్ గ్రూప్‌లో అశ్లీలతకు కారణమైన రవికుమార్‌పై సెక్షన్ 67(ఎ) ఐటీ యాక్టు-2000 కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆ వైద్యుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కబలిస్తోన్న జీవనశైలి



- దేశ ప్రజలను కబళిస్తోన్న జీవనశైలి వ్యాధులు
- అసాంక్రమిక వ్యాధుల క్లినిక్‌లలో పరిశోధన
- ఇందులో చికిత్సకు వచ్చిన వారిలో మధుమేహులు అధికం
- ఏపీలో 27.56, తెలంగాణలో 9.23 శాతం మందికి ఈ రుగ్మత
- ఆంధ్రలో 27.46, తెలంగాణలో 6.54 శాతం రక్తపోటు బాధితులే
- ఆత్మహత్యల్లో పురుషులే అధికం
- మహిళల్లో 18-30 ఏళ్ల యువతులే బలవన్మరణ బాధితులు
- స్పష్టం చేసిన జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2018 నివేదిక
- జీవన విధానంలో మార్పులు అవశ్యమంటున్న నిపుణులు

ఆంధ్రప్రదేశ్

లక్ష్యం	పూర్తయిన శస్త్ర చికిత్సలు
3,27,688	3,34,104
తెలంగాణలో	
2,31,105	2,38,490

2017 గణాంకాల ప్రకారం

అద్దాల పంపిణీలో (ఆంధ్రప్రదేశ్)

లక్ష్యం	సరఫరా
70,000	11,481
తెలంగాణలో	
26,465	15,116

నేత్ర దానంలో (ఏపీ)

లక్ష్యం	సేకరించింది
5000	3,454
తెలంగాణలో	
3,400	7,638

తెలుగు రాష్ట్రాల్లో జీవనశైలి వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. మధుమేహం, అధిక రక్తపోటు, గుండెపోటు, క్యాన్సర్ తదితర వ్యాధులు క్రమేణా కబళిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న అసాంక్రమిక వ్యాధుల చికిత్స క్లినిక్‌లకు వచ్చే వారిలో అత్యధికులు మధుమేహులే కావడం ఆందోళన కలిగించే అంశమే. ఈ క్లినిక్‌లలో చికిత్స పొందిన మొత్తం రోగుల్లో ఏపీలో 27.56 శాతం మంది, తెలంగాణలో 9.23 శాతం మంది మధుమేహులున్నారు. అలాగే ఏపీలో 27.46 శాతం, తెలంగాణలో 6.54 శాతం మంది అధిక రక్తపోటు బాధితులున్నారు. ఇటీవల కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన 'జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2018' నివేదిక ఇలాంటి ఎన్నో నివ్వెరపోయే నిజాలను బహిర్గతపరచింది. జీవనశైలి వ్యాధులను నివారించడంపై తక్షణమే దృష్టిపెట్టాల్సిన అవసరముందని హెచ్చరించింది. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల తీవ్రతనూ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో 18-30 ఏళ్ల లోపు యువతులే అత్యధికంగా ఆత్మహత్యకు పాల్పడుతుండడం విస్మయపరిచే అంశమని పేర్కొంది. ఈ క్లినిక్‌లకు వచ్చిన రోగులే ప్రాతిపదికగా జాతీయ ఆరోగ్య ముఖచిత్రంలో వ్యాధుల చిట్టా నివేదికను విశ్లేషించామని నివేదిక తెలిపింది.

'మార్పే' ముంచేస్తోంది

కాలంతో పాటు మార్పు సహజమే అయినా.. జీవన శైలిలో వచ్చిన విపరీత మార్పుల ఫలితంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఒకప్పుడు 40-50 ఏళ్లలో కనిపించే రుగ్మతలు ఇప్పుడు 20-30 ఏళ్లలోనే కనిపిస్తుండడం ఆందోళన కలిగించే అంశమే. "శారీరక శ్రమ తగ్గిపోవడం.. అన్ని ఆహార పదార్థాల్లో చక్కెర వినియోగం పెరిగిపోవడం.. నూనెల విచ్చలవిడి వినియోగం.. ఆహారంపై నియంత్రణ కొరవడటం, మానసిక ఒత్తిడి.. ఆహారం, గాలి, నీరు.. ఇలా అన్నీ కాలుష్యమయవడం.. వీటికి తోడు మద్యపానం, ధూమపానాలు జతచేరడం.. వెరసి పల్లె, పట్నమంటూ తేడా లేకుండా ప్రజలను రోగాలు చుట్టుముడుతున్నాయి. ఫలితంగా యుక్త వయసులోనే అత్యధికులు అధిక రక్తపోటు, గుండెపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటివి ఎదుర్కోవాల్సి వస్తోంది" అని 'జాతీయ ఆరోగ్య ముఖచిత్రం 2018' నివేదిక స్పష్టంచేసింది. గతేడాది సేకరించిన వ్యాధుల గణాంకాలను పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమవుతోందని తెలిపింది. తెలంగాణతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో అసాంక్రమిక వ్యాధుల క్లినిక్‌లలో చికిత్సలు పొందాలనే అవగాహన ఎక్కువమందిలో ఉందని, ఏపీలో 9,86,284 మంది గతేడాది చికిత్స కోసం ఈ క్లినిక్‌లకు వెళ్లగా.. తెలంగాణలో 6,38,861 మందే చికిత్స పొందారని తేల్చింది.

నిర్లక్ష్యానికి 'అద్దం' పట్టింది

కంటి శుక్లాల శస్త్ర చికిత్సల్లో తెలుగు రాష్ట్రాలు నిర్దేశిత లక్ష్యాలను గతేడాది అధిగమించాయి. పాఠశాలల్లో విద్యార్థులకు కంటి అద్దాలను అందించడంలో మాత్రం వెనుకబడ్డాయి. దానానికి నేత్రాలను సేకరించడంలో ఏపీ వెనుకబడగా.. తెలంగాణ లక్ష్యాన్ని అధిగమించింది.

అమ్మో..రెట్టింపు ప్రమాదం

గత 15 ఏళ్ల కాల వ్యవధిలో ప్రమాద మరణాలు గణనీయంగా పెరిగాయి. 2000 సంవత్సరంలో ప్రమాద మరణాలు దాదాపు రెట్టింపవడం ఆందోళన కలిగిస్తోంది. 2000 సంవత్సరంలో అవి 2,55,883 నమోదుకాగా.. 2015లో 4,13,457గా నమోదయ్యాయి. దేశ వ్యాప్తంగా 2014, 2015 సంవత్సరాల్లో వేర్వేరు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 3,16,828. ఇందులో అత్యధికంగా రోడ్డు ప్రమాదాల్లో 1,69,107 మంది మృతిచెందగా.. అసాధారణ పరిస్థితుల్లో 55,482, నీట మునిగి 29,903, అగ్నిప్రమాదాల వల్ల 19,513 మంది చనిపోయారు.

మొగ్గలోనే రాలిపోతోన్న యువతరం

దేశంలో ఆత్మహత్యలు 2000లో 1,08,593 కాగా.. 2015లో 1,33,623గా నమోదయ్యాయి. ఇందులో పురుషులే అత్యధికం(91,528)

రాష్ట్రం	ఆత్మహత్య చేసుకున్న పురుషులు	(30-45 ఏళ్లు)	మహిళలు	(18-30 ఏళ్లు)
ఆంధ్రప్రదేశ్‌లో	4,307	1,919	1,502	870
తెలంగాణలో	7,309	2,829	2,733	905

(2015 గణాంకాల ప్రకారం)

40 నిమిషాల వ్యాయామమే పరిష్కారం

-డాక్టర్ ఆచార్య మనోహర్
విశ్రాంత జనరల్ మెడిసిన్ విభాగాధిపతి, ఉస్మానియా వైద్య కళాశాల

జీవనశైలి మార్పుల ఫలితంగా వస్తున్న వ్యాధులను నివారించుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. ఏదో వంకతో వ్యాయామాన్ని వాయిదా వేసేవాళ్లే ఎక్కువమంది ఉంటారు. నోటి రుచిని అదుపులో పెట్టుకోలేని వాళ్ల సంఖ్యా అధికమే. మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందని గట్టిగా విశ్వసించినప్పుడు.. పరిశ్రమించడం పెద్ద కష్టమేమీ కాదు. నిత్యం కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. ఆహారంలో కొవ్వుపదార్థాలు, చక్కెర వాడకాన్ని తగ్గించాలి. నూనెల వినియోగాన్ని నియంత్రించాలి. వేపుళ్లు శరీరానికి హానికరం. బరువు పెరుగుతున్నామని గుర్తించగానే నియంత్రణపై కఠినంగా దృష్టిపెట్టాలి. మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లను దూరం చేసుకోవాలి. వృత్తిపరంగా ఉన్న మానసిక ఒత్తిడిలను తగ్గించుకోవడానికి మార్గాలు అన్వేషించాలి. యోగా, ధ్యానం వంటి వాటితో కొంతమేరకు ఉపశమనాన్ని పొందొచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

దేశ వ్యాప్తంగా 2017లో చికిత్స పొందిన రోగులు..వివిధ వ్యాధిగ్రస్థుల సంఖ్య, శాతాలు(కుండలిలో ఉన్నవి)

మొత్తం రోగులు	మధుమేహులు	రక్తపోటు	గుండె సమస్య	పక్షవాతం	క్యాన్సర్
3,57,23,660	30,06,443(8.41)	36,54,099(10.22)	1,32,348 (0.37)	47,464(0.13)	39,635(0.11)
తెలంగాణలో (హైదరాబాద్ మినహా)					
6,38,861	59,003(9.23)	41,795(6.54)			
ఆంధ్రప్రదేశ్‌లో					
9,86,284	2,71,912(27.56)	2,70,812(27.46)			

- మధుమేహులు అత్యధికంగా తమిళనాడులో 5,32,863 మంది ఉండగా.. ఆ తర్వాత స్థానంలో రాజస్థాన్(3,01,015) ఉంది.

దేశవ్యాప్తంగా 2015లో ఆత్మహత్యలు చేసుకున్నవారి సంఖ్య వయసులవారీగా..



ANDHRA PRADESH TOURISM DEVELOPMENT CORPORATION LIMITED (aptdc)
D.No.55-17-2 to 4, Stalin Corporate 5th Floor,
Near CGO Complex, Industrial Estates, Autonagar, Vijayawada - 520007.

"e"Procurement Notice
Tender Notice No.10/APTDC/2018-19, dt: 28.06.2018

Sl.No.	Name of the work
1	The APTDC invites tenders the following Developmental works at varoius Buddhist Destinations in Andhra Pradesh. Works Cost Rs. 95.60 lakhs. The details can be seen at 'e'procurement market place i.e www. apeprocurement.gov.in

Sri. D. Gangadhar Reddy
Superintending Engineer, APTDC Ltd, VJA

పంచాయతీల్లో ఘన వ్యర్థాల యాజమాన్యం కింద తయారు చేసిన సేంద్రియ ఎరువులను విక్రయించే ధర నిర్ణయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో వ్యవసాయ, ఉద్యానశాఖ, సెరికల్చర్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతిరాజ్ ఇంజినీరింగ్ శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No. 124 to 170/TO/2018-19 తేది: 26.6.2018
కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో 4 రోడ్డు పనులకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా విలువ రూ. 5021.40 లక్షలు 47 పనులకు. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 5-7-2018ల నుండి. బిడ్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 19.7.2018 మ.గం. 3.00 వరకు. బిడ్ దాఖలుకు ముగింపు తేది: 19.7.2018 సా.గం. 5.00 వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది: 20.7.2018 ఉ.గం. 11.00లకు. ఆర్థిక బిడ్ తెరచు తేది: 23.7.2018 ఉ.గం. 11.00లకు. వివరాలు e-మార్కెట్ ప్రదేశం www.tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఫోన్: 94909 64625.
సం/- పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతిరాజ్, మచిలీపట్నం, కృష్ణాజిల్లా
DIPR No. 957/CL/Advt/1/1/2018-19

MUNICIPAL COUNCIL – VIZIANAGARAM

e-Proc. NIT No.927/11/E/TO/DB/18-19, Dt.27-06-2018

No. of works / Value	5 Works – 164.00 Lakhs.
Download start date & time	28-06-18 from 2.30 P.M.
Download end date & time	12-07-18 up to 2.30 P.M.
Bid Submission Closing Date & Time	12-07-18 up to 3.00 P.M.
Bid opening date & time	12-07-18 after 3.30 P.M.

Further details can be seen at www.apeprocurement.gov.in.
Phone & Fax No.08922-224793, 9849906481, 9849908296.
For COMMISSIONER

एम एस टी सी लिमिटेड (भारत सरकार का उपक्रम) MSTC LIMITED (A Govt. of India Enterprise)
6th Floor, LIC Building,"Jeevan Prakash", Jeevitha Bhima Road, Visakhapatnam-04. Tel: 2746948, 2701066, 2521566, Fax: 0891-2747053

SALE OF HUMAN HAIR ON BEHALF OF TTD, TIRUPATHI

Human hair for sale vide E.A.No.9184 on 05-07-2018 purely on STA (Subject To Approval) basis. Material details:: 1st variety (27" & Above) **Category 'A'**: 600 Kgs & **Category 'B'**: 300 Kgs; 2nd variety (19" to 26") **Category 'A'**: 2,800 Kgs & **Category 'B'**: 2,200 Kgs; 3rd variety (10" to 18") **Category 'A'**: 1,800 Kgs & **Category 'B'**: 2,000 Kgs.
Note: Category 'A': True/Full Black hair Category 'B' : Grey/ Partial Grey/ Dyed Hair
For further details visit www.mstcecommerce.com & www.mstcindia.co.in or contact O/o General Manager (Auctions),TTD on 0877-2264429/ gmauctionsttd@gmail.com

TRAVANCORE DEVASWOM BOARD
Nanthancode, Thiruvananthapuram, Ph: 0417- 231 4288
E-mail : dcotdb@gmail.com

TRAVANCORE DEVASWOM BOARD INVITES E-TENDERS FOR THE SUPPLY OF:-

Butter paper bag, Easy Open lid, Ghee Pouch, BOP Tape in connection with the festival period1194 ME (2018-2019)of Sree Dharmasatha Temple, Sabarimala.
Tender Closing Date: 07-07-2018 11AM
Tender Opening Date: 10-07-2018 11AM
For more Details visit www.travancoredevaswomboard.org. or www.e-tenders.kerala.gov.in

ROC NO 4/18/ Sab
DT-27/06/2018
Sd/-
DEVASWOM COMMISSIONER
On behalf of Travancore Devaswom Board

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పశుసంవర్ధక శాఖ సంచాలకుల కార్యాలయము. ఆం.ప్ర
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

No.10144-2/RKVY/RK3/2018 తేది: 26-6-2018
ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలన్నింటా పశువుల బీమా పథకం క్రింద పశువులు, ఎనుములు, గొర్రె మరియు మేకల గుర్తింపు కొరకు సరఫరా నిమిత్తమై కంపెనీలు/ ఏజెన్సీల నుండి e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఆన్‌లైన్ టెండరు డాక్యుమెంట్ తెరచు తేది: 30-6-2018 ఉ. గం. 10.00లకు. ప్రి-బిడ్ సమావేశము 3-7-2018 మ. గం.3.00. ఆన్‌లైన్ టెండరు డాక్యుమెంట్ ముగింపు తేది: 10-7-2018 మ. గం. 3.00 వరకు. ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు ముగింపు తేది: 10-7-2018 సా. గం. 5.00. అప్‌లోడ్ చేయబడిన అన్ని డాక్యుమెంట్ల దాఖలు 11-7-2018 మ. గం. 3.00 వరకు. మరిన్ని వివరాలకు www.apts.gov.in కు లాగిన్ అవ్వండి. వివరాలకు http://tender.apeprocurement.gov.in ను దర్శించండి. ఫోన్ నెం. 94907 50260
DIPR No. 955/CL/Advt/1/1/2018-19 సం/- సంచాలకులు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Roc.No.M1/34022(31)/162/MRKT/2018. తేది: 28-06-2018.
ఆరు నెలల కాలానికి గాను తితిదే, తిరుపతి మార్కెటింగ్ విభాగం వారు దిగువ పేర్కొన్న అయిటమ్ సేకరణ కొరకు దక్షిణ భారతదేశ డెయిరీల నుంచి ఈ - టెండర్లు కోరడమైనది.

క్ర. సం.	అయిటమ్ పేరు	ధరావతు (రూ.లు)	టెండరు కాలము	టెండరు తేది: టెక్నికల్ బిడ్	టెండరు తేది: ఫైనాన్షియల్ బిడ్
1.	దక్షిణ భారతదేశంలో ఉన్నటువంటి డెయిరీల నుంచి అగ్‌మార్క్‌తో కూడిన మరియు కమ్మటి సువాసన కలిగిన 87,750 కేజీల స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి (టిన్నుల ద్వారా)	రూ॥లు 8,62,000/-	ఆరు నెలలు	27-07-2018 మ. 3.30 గం॥లకు	28-07-2018 మ. 3.30 గం॥ల తరువాత (సుమారుగా)
2	4,50,000 కేజీల సొజ్జి	రూ॥లు. 2,80,000/-	ఆరు నెలలు	09-07-2018 మ.3.30 గం॥లకు	10-07-2018 మ.3.30 గం॥లకు

వివరాలకు గాను లాగాన్ అవ్వవసిన వెబ్‌సైట్ : http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in. కరెంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి ఆపై "మోర్" మరియు "తిరుమల తిరుపతి దేవస్థానములు- మార్కెటింగ్"ను ఎంపిక చేసుకోవాలి. తదుపరి వివరాలకుగాను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 0877- 2264079, 2264555. ఫ్యాక్స్ నెం.0877-2264554.
Roc.No.PR4/1090/Adv.No.134/PRO/2018, Dated: 28.06.2018. - కార్యనిర్వహణాధికారి

'అశోక్‌బాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం'

ఈనాడు డిజిటల్, అమరావతి: అమరావతి నిర్మాణానికి పీఆర్సీ బకాయిల్లో నుంచి రూ.200 కోట్లు విరాళంగా ఇస్తామన్న ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు నిర్ణయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింహాచలం గురువారం ప్రకటన విడుదల చేశారు.

కొత్తగా బీఎస్సీ పారామెడికల్ కోర్సులు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బీఎస్సీ విభాగంలో న్యూరో సైకాలజీ, అనస్థీషియాలజీ, కార్డియాక్ కేర్, ఇమేజింగ్ టెక్నాలజీ, రీనాల్ డయాలసిస్, ఆప్టోమేట్రి, పర్‌ఫ్యూజన్ టెక్నాలజీ తదితర పారామెడికల్ కోర్సుల నిర్వహణకు అనుమతులు మంజూరుచేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

దొరకని మోదీ అపాయింట్‌మెంట్

- తెదేపా ఎంపీలకు సమయం లేదన్న ప్రధాన మంత్రి కార్యాలయం

ఈనాడు, దిల్లీ: ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంపై బీరేంద్రసింగ్‌తో బుధవారం జరిగిన చర్చలు అసంపూర్తిగా ముగియడంతో సమస్యను ప్రధాని దృష్టికి తీసుకెళ్లడానికి తెదేపా ఎంపీలు గురువారం ఆయన అపాయింట్‌మెంట్ కోరగా సమయం లేదని పీఎంఓ వర్గాలు చెప్పినట్లు తెదేపా పార్లమెంటరీ పార్టీ సిబ్బంది తెలిపారు. దీక్ష చేస్తున్న సీఎం రమేష్ ఆరోగ్యం క్షీణించినందున సమస్య తీవ్రతను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి వెంటనే ఏదో ప్రకటన వచ్చేలా చేయాలన్న ఉద్దేశంతో దివాకర్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం విన్నపం పంపినట్లు పేర్కొన్నారు. గురువారం ప్రధాని ఉత్తర్‌ప్రదేశ్ పర్యటనకు వెళ్తున్నందున సమయం ఇవ్వలేమని పీఎంఓ అధికారులు చెప్పినట్లు తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించి మరో రోజు అపాయింట్‌మెంట్ ఇస్తామని చెప్పకుండా గురువారం ఇవ్వలేకపోతున్నామని ముక్తసరి సమాధానమిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీరేంద్రసింగ్ ఇంటి ముందు నిరసన

తెదేపా ఎంపీలు గురువారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి బీరేంద్రసింగ్ ఇంటిముందు కొద్దిసేపు ప్లకార్డులు పట్టుకొని ప్రదర్శన నిర్వహించారు. మంత్రి ఇచ్చిన అపాయింట్‌మెంట్ సమయానికి ఎంపీలంతా ఆయన నివాసానికి చేరుకున్నారు. ఆయన ప్రధాని కార్యాలయానికి వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో తెదేపా ఎంపీలంతా ఆయన నివాస ప్రాంగణంలోనే మౌన ప్రదర్శన నిర్వహించారు.

మాజీ ప్రధాని పీవీకి సీఎం నివాళి

ఈనాడు డిజిటల్, అమరావతి: దివంగత భారత మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు 97వ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం నివాళి అర్పించారు. పీవీ బహుభాషా వేత్త, రచయిత, భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిన వ్యక్తి అని సీఎం శ్లాఘించారు. ఆయన కోసం నంద్యాల పార్లమెంటు ఉప ఎన్నికలో తెదేపా అభ్యర్థిని పోటీలో పెట్టని విషయాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

మాజీ ప్రధాన కార్యదర్శి సీఎస్ రావు మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం ప్రకటించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, ప్రభుత్వ సలహాదారుగా సీఎస్.రావు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రభుత్వానికి కోర్టు ధిక్కార నోటీసులు

విద్యుత్ ఉద్యోగుల విభజన అంశం..

ఈనాడు, హైదరాబాద్: రెండు రాష్ట్రాల్లో విద్యుత్ ఉద్యోగుల విభజనకు సంబంధించి కమిటీలు ఏర్పాటు చేసి రెండు నెలల్లో మార్గదర్శకాలు రూపొందించి, 4 నెలల్లో విభజన ప్రక్రియను పూర్తి చేయాలంటూ ఫిబ్రవరి 2న ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనని ఉమ్మడి హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయని, దీని కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరణ ఇవ్వాలని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎం.ఎం.నాయక్, రెండు రాష్ట్రాల ముఖ్యకార్యదర్శులు అజయ్‌మిశ్రా, అజయ్‌జైన్‌లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విద్యుత్ ఉద్యోగుల విభజనకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో టీఎస్ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.నరసింహులు మరో నలుగురు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఉమ్మడి హైకోర్టు పనివేళల్లో మార్పు

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టు పనివేళలు జులై 2వ తేదీ నుంచి మారనున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న వేళల్లో 15 నిమిషాలు ముందుకు జరగనుంది. హైకోర్టు ఉదయం 10.15 నుంచి సాయంత్రం 4.15వరకు మార్చుతూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటలవరకు ప్రస్తుతం ఉన్న సమయం వల్ల ఇబ్బందులెదురవుతున్నాయని న్యాయవాద సంఘాలు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి నివేదించారు. ముఖ్యంగా సాయంత్రం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ఈ అభ్యర్థనపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మిగిలిన న్యాయమూర్తులతో చర్చించి పనివేళలను 15 నిమిషాలు ముందుకు జరుపుతూ నిర్ణయం తీసుకున్నారు.

నేడు బార్ కౌన్సిళ్ల ఎన్నికలు

ఈనాడు, హైదరాబాద్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో బార్ కౌన్సిళ్లకు శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ కౌన్సిల్ ఎన్నికల్లో 107, తెలంగాణకు 86 మంది పోటీపడుతున్నారు. తెలంగాణలో 27676 మంది, ఏపీలో 20,072 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్కో బార్ కౌన్సిల్‌కు 25 మంది సభ్యుల ఎంపిక జరుగుతుంది. ఏపీలో జులై 11న కౌంటింగ్ జరుగుతుంది.

బిహార్‌లో వేడెక్కుతున్న రాజకీయం

- సీట్ల పంపకాలు, కూటములపై పార్టీల వ్యూహాలు మొదలు
- పెద్దన్న పాత్ర పోషించాలనుకుంటున్న జేడీ(యు)
- అంగీకరించని ఇతర ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలు

పట్నా

బిహార్‌లో క్రమంగా రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. సీట్ల పంపకాలు, కూటముల్లో చేరికలపై మాటల తూటాలు పేలుతున్నాయి. తెరవెనక సమాలోచనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న జేడీ(యు) నేత, ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఆయన సన్నిహిత అనుచరుడు సంజయ్‌సింగ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కొద్దిపాటి సంచలనాన్ని సృష్టించాయి. ఇటీవల నీతీశ్‌కుమార్ తీవ్రపదజాలంతో మతపరమైన హింసను ఖండిస్తూ ప్రసంగించారు. సీట్ల పంపకంపై సంజయ్‌సింగ్ మాట్లాడుతూ బిహార్‌లో భాజపాకు భాగస్వామ్య పక్షం అవసరం లేదనుకుంటే ఆ పార్టీ మొత్తం 40 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయవచ్చన్నారు.

2009 సాధారణ ఎన్నికల్లో జేడీ(యు) 25 స్థానాల్లో, భాజపా 15 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో జేడీ(యు).. ఎన్‌డీఏ కూటమి నుంచి బయటకు వచ్చింది. 30 స్థానాల్లో పోటీ చేసిన భాజపా 22 స్థానాల్లో గెల్చింది. రామ్ విలాస్ పాసవాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ ఏడు స్థానాల్లో పోటీ చేసి ఆరింటిని, ఆర్‌ఎల్‌ఎస్‌పీ మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. జేడీ(యు) కేవలం రెండు స్థానాలనే గెల్చుకుంది. 2014 ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన భాజపా తమకు తక్కువ స్థానాలు ఇవ్వచూపుతుందని జేడీ(యు) భావిస్తోంది. ఎన్‌డీఏలో మిగిలిన భాగస్వామ్య పక్షాలేవీ తాము గెల్చుకున్న స్థానాలను త్యాగం చేయడానికి ఇష్టపడకపోతే జేడీ(యు)కు ఇవ్వచూపేది తొమ్మిది స్థానాలే. అందుకే సీట్ల పంపకంపై ఆ పార్టీ ఇప్పటి నుంచే దూకుడు పెంచింది. అయితే 2015లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మహాకూటమిలో భాగంగా పోటీ చేసిన జేడీ(యు)71 స్థానాలు గెల్చుకుంది. కనీసం ఆ ప్రాతిపదికన ఇప్పుడు లోక్‌సభ స్థానాలు కేటాయించాలని కోరుకుంటోంది. దీంతో పాటు బిహార్‌లో ఎన్‌డీఏ తరఫున ముఖ్యనేతగా నీతీశ్‌కుమారే ఉండాలని పట్టుబడుతోంది. ఇది భాజపాతో పాటు బిహార్‌లో ఇతర ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలకు రుచించడం లేదు. అయితే జేడీ(యు) వీరితో విభేదిస్తోంది. 2015 శాసనసభ ఎన్నికల్లో నీతీశ్‌కుమార్ లేని ఎన్‌డీఏ సరైన పోటీ ఇవ్వలేకపోయిందని గుర్తు చేస్తోంది.

వచ్చే నెల 12న భాజపా అధ్యక్షుడు అమిత్ షా బిహార్ పర్యటనకు రానున్నారు. ఆ రోజున నీతీశ్ కుమార్, ఆర్ఎస్ఎల్‌పీ అధినేత, కేంద్ర మంత్రి ఉపేంద్ర కుష్వాహాతో అమిత్ షా భేటీ అవుతారని భాజపా వర్గాలు వెల్లడించాయి. ఆ సమావేశంలో సీట్ల పంపకంపై చర్చ జరగవచ్చని భావిస్తున్నారు.

మరోవైపు విపక్ష కూటమిలోనూ చర్చలు ప్రారంభమయ్యాయి. జేడీ(యు) మరోసారి విపక్ష మహాకూటమిలో చేరే అవకాశాలపై ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. అయితే 'మహాఘట్‌బంధన్'లో చేరే విషయమై జేడీ(యు) కాంగ్రెస్‌తో మంతనాలను ప్రారంభించిందన్న వార్తలను కాంగ్రెస్ పార్టీ బిహార్ వ్యవహారాల పర్యవేక్షకుడు శక్తిసిన్హ్ గోహిల్ ఖండించారు.

రాష్ట్ర రాజకీయాలపై ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్.. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో ఈ నెల 8న భేటీ అయ్యారు. ఆ సమావేశంలో గోహిల్ కూడా ఉన్నారు. భాజపా పట్ల నీతీశ్‌కుమార్ అసంతృప్తిపై అవగాహన ఉన్న తేజస్వి యాదవ్.. మహాకూటమిలో తమ స్థానంపై రాహుల్ నుంచి భరోసా కోరినట్లు తెలిసింది. ఈ కూటమిలోకి తిరిగి రావాలని నీతీశ్ నిర్ణయించుకున్నా తమ స్థానం తగ్గకూడదని తేజస్వి కోరినట్లు సమాచారం.

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని ఎన్‌డీఏ కలిసికట్టుగానే పోటీ చేస్తుందని ఎల్‌జేపీ అధిపతి, కేంద్ర మంత్రి రాం విలాస్ పాసవాన్ గురువారం స్పష్టం చేశారు. తాను నీతీశ్‌తో మాట్లాడానని, ఎన్‌డీఏ చెదిరిపోదని నీతీశ్ చెప్పారని తెలిపారు.

హజ్ యాత్రికులపై ధరాభారం

- ఛార్జీలు పెంచిన కేంద్ర హజ్ కమిటీ

ఈనాడు డిజిటల్, అమరావతి: ఈ ఏడాది హజ్ యాత్ర ధరాభారం కానుంది. హజ్ యాత్రకు వెళ్లేవారి ఛార్జీలను కేంద్ర హజ్ కమిటీ ఇటీవల పెంచింది. విజయవాడలో గురువారం నిర్వహించిన సమావేశంలో హజ్ కమిటీ ఛైర్మన్ అహ్మద్ హుస్సేన్ పెంచిన ఛార్జీల వివరాలను వెల్లడించారు. రాష్ట్రం నుంచి యాత్రకు వెళ్లే హాజీలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పెంచిన ఛార్జీల వివరాలు: హైదరాబాద్ నుంచి గ్రీన్ కేటగిరీలో హజ్ యాత్రకు వెళ్లేవారు గతంలో రూ.2,35,150 చెల్లించగా.. ఈ మొత్తం ఈ దఫా రూ.2,55,500లకు పెరిగింది.

★ అజీజియా కేటగిరీలో వెళ్లేవారు రూ.2,20,750 చెల్లించాలి. గతంలో ఈ మొత్తం రూ.2,01,800లుగా ఉంది.

★ బెంగళూరు నుంచి గ్రీన్ కేటగిరీలో వెళ్లేవారు నిరుడు రూ.2,39,600 చెల్లించగా.. ఈ ఏడాది రూ.2,69,000 చెల్లించాలి.

★ అజీజియా కేటగిరీలో వెళ్లేవారు రూ.రూ.2,34,350 చెల్లించాలి. గతేడాది ఈ మొత్తం రూ.2,06,200లుగా ఉంది. సౌదీ ప్రభుత్వం కూడా హజ్ యాత్రికులపై రవాణ, మెట్రో రైలు ఛార్జీలు, మీనా టెంట్‌లో బెడ్ ఛార్జీలు పెంచింది. దీంతో ఒక్కో యాత్రికుడిపై రూ.7 వేలు భారం పడనుంది.

ఆట పదహారుకొచ్చింది..

ఎన్నో అంచనాలు తలకిందులు.. ఎన్నో సంచలనాలు. మరెన్నో నాటకీయ పరిణామాలు. ప్రపంచకప్‌లో ఓ అంకం ముగిసింది. ప్రపంచ కప్ గ్రూప్ దశ దాటింది. నమ్మశక్యం కాని రీతిలో డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ టోర్నీ నుంచి నిష్క్రమిస్తే.. అర్జెంటీనా అతికష్టం మీద ముందంజ వేసింది. ఫేవరెట్లుగా పేరున్న స్పెయిన్, బ్రెజిల్‌లూ తమ స్థాయిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించ లేకపోయాయి. నాకౌట్ చేరుతుందనుకున్న పోలెండ్ అనూహ్యంగా ఇంటిదారి పడితే.. అందరినీ ఆశ్చర్యపరుస్తూ జపాన్ ముందుకు దూసుకెళ్లింది. క్రొయేషియా, స్వీడన్‌లు తమ గ్రూపుల్లో అగ్రస్థానం సాధించడమూ ఆశ్చర్యమే. ఆసియా నుంచి ముందుకెళ్లింది ఒక్క జపాన్ మాత్రమే. ఆఫ్రికా నుంచి ఆ ఒక్కటీ లేదు.

ఇక టోర్నీ కీలక ఘట్టంలో అడుగుపెట్టబోతోంది. ఒక రోజు విరామం తర్వాత శనివారం 16 జట్లతో కూడిన నాకౌట్ పోరు ఆరంభం కానుంది. ఇంకో ఛాన్సుండదు.. ఓడితే ఇంటికే. నాకౌట్స్ ఆరంభమే సంచలనాత్మకం కానుంది. తొలి మ్యాచ్‌లో మాజీ విజేతలు ఫ్రాన్స్, అర్జెంటీనా ఢీకొంటాయి. అదే రోజు ఉరుగ్వేతో పోర్చుగల్ తలపడుతుంది. రసవత్తర పోరు ఖాయం. ఐదు సార్లు ఛాంపియన్ బ్రెజిల్ క్వార్టర్‌ఫైనల్లో స్థానం కోసం మెక్సికోను ఎదుర్కొంటుంది. మరి ఈ నాకౌట్లో ఎన్ని సంచలనాలు నమోదవుతాయో.. ఎవరు స్టార్లవుతారో..! చూద్దాం!

నాకౌట్ చేరిన జట్లివే

గ్రూప్-ఎ	ఉరుగ్వే, రష్యా
గ్రూప్-బి	స్పెయిన్, పోర్చుగల్
గ్రూప్-సి	ఫ్రాన్స్, డెన్మార్క్
గ్రూప్-డి	క్రొయేషియా, అర్జెంటీనా
గ్రూప్-ఇ	బ్రెజిల్, స్విట్జర్లాండ్
గ్రూప్-ఎఫ్	స్వీడన్, మెక్సికో
గ్రూప్-జి	ఇంగ్లాండ్, బెల్జియం
గ్రూప్-హెచ్	కొలంబియా, జపాన్

1 ఫెయిర్ ప్లే ర్యాంకింగ్ ఆధారంగా ప్రపంచకప్ గ్రూప్ దశ దాటిన తొలి జట్టు జపాన్.

3 ప్రపంచకప్‌లో గ్రూప్ దశను దాటి ముందుకెళ్లడం కొలంబియాకు ఇది మూడోసారి మాత్రమే. 1990, 2014లో ఆ జట్టు నాకౌట్ చేరింది.

సిల్వా ఆనందం...

కొలంబియా చలో.. చలో..

- సెనెగల్‌పై విజయం ● నాకౌట్ బెర్త్ సొంతం
- పోలెండ్ చేతిలో ఓడినా జపాన్ ముందుకు

ఎరి మినా గోల్

ఎరీ మినా గోల్‌తో కొలంబియా ప్రపంచ కప్ నాకౌట్లో ప్రవేశించింది. జపాన్ చేతిలో అనూహ్య ఓటమితో టోర్నీని ఆరంభించిన ఆ జట్టు.. మొత్తం ఆరు పాయింట్లతో గ్రూప్-హెచ్‌లో అగ్రస్థానం సాధించింది. గ్రూప్‌లో ఆఖరి మ్యాచ్‌లో సెనెగల్‌పై గెలిచింది. పోలెండ్ చేతిలో ఓడినా జపాన్ ముందంజ వేసింది. నాలుగు పాయింట్లతో జపాన్‌తో సమానంగా నిలిచినా.. క్రమశిక్షణ రికార్డు సెనెగల్‌ను ముంచింది. ఫెయిర్ ప్లే ర్యాంకింగ్ ఆధారంగా ప్రపంచ కప్ గ్రూప్ దశ నుంచి ముందంజ వేసిన తొలి జట్టుగా జపాన్ నిలిచింది.

ఎరి మినా గోల్

కొలంబియా	1	సెనెగల్	0
ఎరి మినా (74వ)			

సమార (రష్యా)

కొలంబియా జట్టు ప్రపంచకప్ తుది 16లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మ్యాచ్ (గ్రూప్-హెచ్)లో 1-0తో సెనెగల్‌పై విజయం సాధించింది. 74వ నిమిషంలో ఓ బలమైన హెడర్‌తో ఎరి మినా.. కొలంబియాను విజయపథంలో నడిపించాడు. ఐతే తొలి అర్ధభాగంలో ఆ జట్టు అంత గొప్ప ప్రదర్శనేమీ చేయలేదు. ఆటలో పదును లోపించింది. ఆ ప్రదర్శన చూస్తే ముందుకెళ్లడం కష్టమే అనిపించింది. సెనెగల్ బాగా ఒత్తిడికి గురిచేయడంతో కొలంబియా పెద్దగా అవకాశాలు సృష్టించుకోలేకపోయింది. గాయం కారణంగా అరగంటకే ఆ జట్టు స్టార్ ఆటగాడు రోడ్రిగ్వెజ్ స్థానంలో మరో ఆటగాడు మైదానంలోకి దిగాడు. సెనగల్ ఎటాకింగ్‌కు దిగినా కొలంబియా గోల్‌కీపర్ డేవిడ్ ఒస్పినాను పెద్దగా కంగారుపెట్టలేకపోయింది. ఐతే 17వ నిమిషంలో సెనెగల్‌కు ఓ అద్భుత అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారింది. బాక్స్ లోపల మానెను శాంచెజ్ (కొలంబియా) కింద పడేశాడన్న కారణంతో సెనెగల్‌కు రిఫరీ పెనాల్టీ ఇచ్చాడు. కానీ వార్ సమీక్షతో రిఫరీ నిర్ణయం మారిపోయింది. రెండో అర్ధభాగంలో కొలంబియా పుంజుకుంది. 74వ నిమిషంలో నిర్ణయాత్మక గోల్ సాధించింది. జువాన్ క్వింటెరో నుంచి వచ్చిన కచ్చితమైన క్రాస్‌ను నెట్లోకి పంపి కొలంబియాను మినా సంబరాల్లో ముంచాడు. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు సెనెగల్ గట్టిగానే ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇస్మాలియా సార్ ఒక చక్కని అవకాశాన్ని చేజార్చాడు. ఆఖర్లో ఒత్తిడిని తట్టుకుని కొలంబియా ఆధిక్యాన్ని నిలుపుకుంది.

క్రమశిక్షణే జపాన్‌కు రక్ష

వోల్గోగ్రాడ్ (రష్యా): గ్రూప్-హెచ్‌లో తన ఆఖరి మ్యాచ్‌లో పోలెండ్ చేతిలో 0-1తో ఓడిపోయినప్పటికీ జపాన్ (4 పాయింట్లు) నాకౌట్లో అడుగుపెట్టింది. పోలెండ్ తరఫున 59వ నిమిషంలో బెద్నారెక్ గోల్ కొట్టాడు. ఈ మ్యాచ్‌కు ముందే పోలెండ్ నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ ఫలితం తర్వాత పాయింట్ల పరంగా, గోల్ అంతరంలో, ముఖాముఖిలో.. ఇలా ఎందులో చూసినా సెనెగల్‌తో జపాన్ సమంగా నిలిచింది. ఐతే ఆటలో క్రమశిక్షణ జపాన్‌ను ఆదుకుంది. మెరుగైన ఫెయిర్ ప్లే ర్యాంకింగ్ ఆ జట్టును ముందుకు తీసుకెళ్లింది. టోర్నీలో నాలుగు పసుపు కార్డులతో జపాన్ తుది-16 చోటు సంపాదించగా.... రెండు ఎక్కువగా ఆరు పసుపు కార్డులతో సెనెగల్ ఇంటిముఖం పట్టింది.

పోలెండ్	1	జపాన్	0
బెద్నారెక్ (59వ)			

బ్రెజిల్	2	సెర్బియా	0
పాలినో (36వ), సిల్వా (68వ)			

సిల్వా బంతిని గోల్‌లోకి పంపడిలా..

నాకౌట్లో సాంబా..

సెర్బియాపై 2-0తో బ్రెజిల్ విజయం
● కోస్టారికాతో డ్రాతో స్విట్జర్లాండ్ ముందంజ

ఐదుసార్లు ఛాంపియన్ బ్రెజిల్ అదరగొట్టింది. గ్రూప్-ఈలో అగ్రస్థానంతో ప్రపంచకప్ నాకౌట్ దశకు దూసుకెళ్లింది. ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో 2-0తో సెర్బియాపై విజయం సాధించింది. పాలినో, తియాగో సిల్వా గోల్స్ కొట్టగా.. నెయ్‌మార్ స్కోర్ చేయకపోయినా తన ఆటతో ఆకట్టుకున్నాడు. మరోవైపు కోస్టారికాతో మ్యాచ్‌ను 2-2తో డ్రాగా ముగించిన స్విట్జర్లాండ్ గ్రూప్ నుంచి రెండో స్థానంతో ముందంజ వేసింది. తుది 16 మ్యాచ్‌లో మెక్సికోతో బ్రెజిల్ తలపనుండగా.. స్వీడన్‌ను స్విట్జర్లాండ్ ఢీకొంటుంది.

మాస్కో

టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన బ్రెజిల్ ప్రపంచకప్ నాకౌట్లో అడుగుపెట్టింది. సూపర్‌స్టార్ నెయ్‌మార్ మెరిసిన వేళ.. తన గ్రూప్-ఈ చివరి మ్యాచ్‌లో 2-0తో సెర్బియాను మట్టికరిపించింది. 36వ నిమిషంలో పాలినో బ్రెజిల్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లగా.. 68వ నిమిషంలో తియాగో సిల్వా హెడర్ గోల్‌తో ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. రష్యాపై గోల్‌తో 2018 ప్రపంచకప్‌లో తన గోల్స్ ఖాతా తెరిచిన నెయ్‌మార్.. కోస్టారికాపైనా గోల్ కొట్టాడు. బుధవారం సెర్బియాపై గోల్స్ కొట్టకపోయినా తన మాయాజాలంతో ఆకట్టుకున్నాడు.

మాస్కోలోని స్పర్తాక్ స్టేడియంలో మ్యాచ్ చాలా తీవ్రతతో ఆరంభమైంది. తొలి బాధితుడు బ్రెజిల్ లెఫ్ట్ బ్యాక్ మార్సెలోనే. మార్సెలో గాయపడడంతో పదో నిమిషంలో అతడి స్థానాన్ని ఫిలిప్ లూయిస్ భర్తీ చేశాడు. తొలి అరగంటలోనే నెయ్‌మార్ గోల్ కొట్టే చక్కని అవకాశాన్ని సృష్టించుకున్నాడు. కానీ అతడి షాట్‌ను సెర్బియా గోల్‌కీపర్ వ్లాదిమర్ స్టకోవిచ్ అడ్డుకున్నాడు. నెయ్‌మార్‌ను ఫౌల్ చేయడంతో 33వ నిమిషంలో సెర్బియా మిడ్‌ఫీల్డర్ అదెమ్ లజిసిచ్ పసుపు కార్డు అందుకున్నాడు. సెర్బియా రక్షణశ్రేణిని ఒత్తిడికి గురి చేసిన బ్రెజిల్.. ఎట్టకేలకు 36వ నిమిషంలో ఫలితం రాబట్టింది. ఫిలిప్ కౌటినో అందించిన ఓ చక్కని లాఫ్టెడ్ పాస్‌ను పాలినో అంతే చక్కగా గోల్‌కీపర్ స్టకోవిచ్ మీదుగా వలలోకి ఫ్లిక్ చేశాడు. కాళ్లతో మాయ చేస్తూ ముందుకు దూసుకొస్తున్న బ్రెజిల్ ఎటాక్‌ను నిలువరించడానికి సెర్బియా పదే పదే తడబడింది. 48వ నిమిషంలో గాబ్రియెల్ జీసస్‌ను ఫౌల్ చేయడంతో సెర్బియా ఆటగాడు నెమాంజా మాటిచ్ పసుపు కార్డును అందుకున్నాడు. ఐతే ద్వితీయార్థంలో సెర్బియా పుంజుకుంది. ఆఖరి అరగంటలో తన అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించింది. పదే పదే బాక్స్‌లోకి దూసుకెళ్తూ బ్రెజిల్ రక్షణశ్రేణిని బాగా ఒత్తిడికి గురి చేసింది. కానీ పేలవ ముగింపు వల్ల ఆ జట్టు గోల్స్ సాధించలేకపోయింది. దూకుడు పెంచుతూ ఓ దశలో ఐదు నిమిషాల వ్యవధిలో నాలుగు అవకాశాలు సృష్టించుకుంది. 61వ నిమిషంలో బాక్స్ మధ్య నుంచి మిత్రోవిచ్ కొట్టిన హెడర్‌ను బ్రెజిల్ డిఫెండర్ అడ్డుకున్నాడు. వెంటనే బాక్స్‌లోకి దూసుకెళ్లిన తదిచ్ బంతిని నెట్లో మూలకు తన్నబోయాడు. కానీ కాస్త దూరంగా వెళ్లింది. ఆ తర్వాత సవిచ్ కుడి పోస్ట్‌కు దూరంగా బంతిని తన్నాడు. తర్వాతి నిమిషంలో మిత్రోవిచ్ హెడర్ బ్రెజిల్ గోల్‌కీపర్ అలిసన్ చేతుల్లోకి వెళ్లింది. ఐతే కాసేపట్లోనే సెర్బియాకు బ్రెజిల్ షాకిచ్చింది. బ్రెజిల్‌కు పెనాల్టీ కార్నర్ లభించగా.. నెయ్‌మార్ కిక్ కొట్టాడు. సిల్వా తలతో సెర్బియా గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి జట్టు ఆధిక్యాన్ని పెంచాడు. ఆ తర్వాత బ్రెజిల్ ఎక్కువ దూకుడు ప్రదర్శించలేదు. ప్రశాంతంగా ఆడుకుంది. రెండు జట్లూ కొన్ని అవకాశాలు సృష్టించుకున్నా మ్యాచ్‌లో మరో గోల్ నమోదు కాలేదు. సెర్బియా ప్రయత్నాలను బ్రెజిల్ గోల్‌కీపర్, డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు. నెయ్‌మార్ రెండు సార్లు గోల్‌కు చేరువగా వెళ్లినా స్కోర్ చేయలేకపోయాడు. మరీ అద్భుతంగా ఆడకపోయినా కీలకమైన నాకౌట్స్‌కు ముందు ఈ ప్రదర్శన బ్రెజిల్‌కు సంతృప్తినిచ్చేదే. మొత్తంగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి, ఓ మ్యాచ్‌ను డ్రాగా ముగించిన సాంబా జట్టు.. ఏడు పాయింట్లతో గ్రూప్-ఈ విజేతగా నిలిచింది.

స్విట్జర్లాండ్‌ను నిలువరించిన కోస్టారికా

సోమర్ సెల్ఫ్‌గోల్

నిజ్నీ నొవ్‌గొరాడ్: తన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. గెలుపు అంచులదాకా వెళ్లినా నెగ్గలేకపోయింది. ముందే రేసు నుంచి నిష్క్రమించిన కోస్టారికాతో మ్యాచ్‌ను 2-2తో డ్రాగా ముగించి గ్రూప్ నుంచి రెండో స్థానంతో నాకౌట్లో అడుగుపెట్టింది. సస్పెన్షన్ కారణంగా కెప్టెన్ స్టీఫెన్ లీస్టెనీర్‌ను కోల్పోవడం ఆ జట్టుకు పెద్ద దెబ్బ. తనకన్నా మెరుగైన జట్టయిన స్విస్ జట్టుకు కోస్టారికా గట్టి పోటీనే ఇచ్చింది. ఇంజురీ సమయంలో స్విస్ గోల్‌కీపర్ యాన్ సోమర్ చేసిన సొంత గోల్‌తో మ్యాచ్‌ను డ్రా చేయగలిగింది. 31 నిమిషంలో బ్లెరిమ్ జెమైల్ గోల్‌తో మొదట స్విట్జర్లాండ్ ఆధిక్యం సంపాదించింది. ఐతే 56వ నిమిషంలో కెండల్ వాస్టన్ హెడర్ గోల్‌తో కోస్టారికా స్కోరు సమం చేసింది. 88వ నిమిషంలో జోసిప్ డ్రిమిచ్ గోల్‌తో స్విట్జర్లాండ్ తిరిగి ఆధిక్యం సంపాదించింది. మ్యాచ్ ఇంజురీ సమయంలోకి వెళ్లాక ఆ జట్టు విజయం ఖాయమే అనుకున్న సమయంలో పరిస్థితి మారిపోయింది. మరొక్క నిమిషంలో మ్యాచ్ ముగుస్తుందనగా స్విస్ గోల్‌కీపర్ సెల్ఫ్ గోల్ చేయడంతో స్కోరు సమమైంది. బ్రయాన్ రుయిజ్ షాట్ క్రాస్‌బార్‌ను తగిలి, తిరిగి సోమర్‌కు తగిలి నెట్లోకి వెళ్లింది. ఓ మ్యాచ్‌లో గెలిచి రెండు మ్యాచ్‌లను డ్రాగా ముగించిన స్విట్జర్లాండ్ ఐదు పాయింట్లతో గ్రూప్-ఈలో రెండో స్థానం సాధించింది. స్విస్ జట్టు తుది 16 మ్యాచ్‌లో జులై 3న స్వీడన్‌ను ఢీకొంటుంది. ఐతే రెండు పసుపు కార్డులు అందుకున్న లిక్స్టీనర్, ఫాబియాన్ స్కేర్ సస్పెన్షన్ కారణంగా ఈ మ్యాచ్‌కు దూరం కావడం స్విట్జర్లాండ్‌కు నష్టమే.

స్విట్జర్లాండ్	2	కోస్టారికా	2
జెమైల్ (31వ), డ్రిమిచ్ (88వ)		వాస్టన్ (56వ), సోమర్ (90+3, సెల్ఫ్‌గోల్)	

నేడే ఐర్లాండ్‌తో రెండో టీ20
రాత్రి 8.30 నుంచి సోని సిక్స్‌లో

ప్రయోగాలకు వేళాయె!

డబ్లిన్: ఐర్లాండ్‌తో భారత్ రెండో టీ20 మ్యాచ్‌కు వేళైంది. తొలి మ్యాచ్‌లో అన్ని రంగాల్లో అదరగొట్టి విజయాన్ని సొంతం చేసుకున్న టీమ్‌ఇండియా.. శుక్రవారం జరిగే చివరిదైన రెండో మ్యాచ్‌లోనూ జోరు కొనసాగించి సిరీస్ గెలవాలన్న ఉత్సాహంతో ఉంది. ఓపెనర్లు రోహిత్‌శర్మ, శిఖర్ ధావన్ జోరు మీదుండడంతో భారత్‌కు కలిసొచ్చే అంశం. వాళ్లిద్దరూ రెండో మ్యాచ్‌లోనూ విజృంభించాలని జట్టు కోరుకుంటోంది. అయితే ఈ మ్యాచ్‌ను ప్రయోగాలకు వాడుకోవాలని కూడా మేనేజ్‌మెంట్ అనుకుంటోంది. ఓపెనర్ కేఎల్ రాహుల్, వికెట్‌కీపర్ దినేశ్ కార్తీక్, ఉమేశ్ యాదవ్‌లను రెండో టీ20 మ్యాచ్‌లో బరిలో దించే అవకాశాలు లేకపోలేదు. రోహిత్, ధావన్‌లను కొనసాగించి రాహుల్‌ను మిడిలార్డర్‌లో పంపే అవకాశాలున్నాయి.

సైనా ఔట్

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సైనా నెహ్వాల్ కథ ముగిసింది. మరోవైపు సింధు, శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-8, 21-14తో యింగ్ లీ (మలేసియా)పై నెగ్గగా.. సైనా 15-21, 13-21తో అకానె యమగూచి (జపాన్) చేతిలో ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 22-20, 21-12తో వాంగ్ వీ (చైనీస్ తైపే)పై గెలిచి క్వార్టర్స్‌తో అడుగుపెట్టాడు.

షూటింగ్‌లో భారత్‌దే టాప్

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ జూనియర్ ప్రపంచకప్‌లో భారత్ అగ్రస్థానం సాధించింది. చివరి రోజైన గురువారం భారత ఖాతాలో ఐదు స్వర్ణాలు సహా ఎనిమిది పతకాలు చేరాయి. దాంతో 61 దేశాలు పోటీపడ్డ ఈ ప్రపంచకప్‌లో 15 బంగారు పతకాలు, 2 రజతాలు, 9 కాంస్యాలు మొత్తం 26 పతకాలతో భారత్ మొదటిస్థానంలో నిలిచింది.

భారత్, బెల్జియం మ్యాచ్ డ్రా

బ్రెడా (నెదర్లాండ్స్): ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో బెల్జియంను ఓడించే అవకాశాన్ని భారత్ చేజార్చుకుంది. గురువారం మ్యాచ్‌ను 1-1తో డ్రాగా ముగించింది. పదో నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ కొట్టడంతో భారత్ ఖాతా తెరిచింది. మ్యాచ్‌లో గెలిచేలా కనిపించిన భారత్ ఆఖర్లో ఒత్తిడిలో గోల్ సమర్పించుకుంది. లూయ్‌పెర్ట్ (59వ నిమిషంలో) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలవడంతో బెల్జియం డ్రాతో బయటపడింది.

సోనమ్‌కు రజతం

గువహటి: జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి కేఎం సోనమ్ సత్తాచాటింది. గువహటిలో జరుగుతున్న ఈ ఛాంపియన్‌షిప్ ట్రిపుల్ జంప్ విభాగంలో వికారాబాద్‌కు చెందిన సోనమ్ ద్వితీయ స్థానంలో నిలిచి రజతం గెలుచుకుంది. పోటీలో ఆమె 13.33మీ. దూరం దూకింది.

టీ20 కూడా ఇంగ్లాండ్‌దే


బట్లర్

బర్మింగ్‌హాం: వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లాండ్.. ఆస్ట్రేలియాతో ఏకైక టీ20ని గెలుచుకుంది. బట్లర్ (61; 30 బంతుల్లో 6×4, 5×6) మెరుపు ఇన్నింగ్స్‌కు బౌలింగ్‌లో రషీద్ (3/27) మాయ తోడవడంతో ఇంగ్లాండ్ 28 పరుగుల తేడాతో గెలిచింది. మొదట ఇంగ్లాండ 5 వికెట్లకు 221 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా 19.2 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. ఫించ్ (84) పోరాడినా ఫలితం లేకపోయింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మగ్‌హర్‌లో కబీర్‌దాస్ స్మారక స్థలం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రధాని మోదీ

ఆ పార్టీలకు అశాంతే కావాలి

● శాంతిని, అభివృద్ధిని అవి కోరుకోవడం లేదు ● మా మంత్రులంతా నిష్కళంకులు ● యూపీలో కబీర్‌దాస్‌కు నివాళులర్పించిన ప్రధాని

మగ్‌హర్ (యూపీ): రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో సందేహాలు రేకెత్తించి అశాంతి సృష్టించడమే కొన్ని పార్టీల పని అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. ఆ పార్టీలు క్షేత్రస్థాయి వాస్తవాలను పట్టించుకోవడం లేద న్నారు. ప్రముఖ కవి కబీర్‌దాస్ 500వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం యూపీలోని 'నిర్వాణ్ స్థల్' వద్ద జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. ముందుగా కబీర్‌దాస్ స్మారక స్థలం వద్ద ఆయన చాదర్ సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. 'కొన్ని పార్టీలకు శాంతి, అభివృద్ధి అవసరం లేదు. నిత్యం అశాంతి రగులుతుంటేనే రాజకీయంగా లబ్ధి చేకూరుతుందని అవి భావిస్తుంటాయి. వాటికి క్షేత్రస్థాయి సంబంధాల్లేవు' అని మోదీ చెప్పారు. అత్యయిక పరిస్థితి విధించినవారు, దానిని వ్యతిరేకించినవారు ఇప్పుడు ఒక్కటైపోయారని చెప్పారు.

సొంత కుటుంబ సంక్షేమమే వాటికి కావాలి: ఎస్పీ, బీఎస్పీలు సమాజ సంక్షేమాన్ని కాకుండా స్వీయ సంక్షేమాన్ని, తమ కుటుంబాల శ్రేయస్సును మాత్రమే కోరుకుంటున్నాయని ప్రధాని ఆరోపించారు. సమాజ్‌వాద్ గురించి, బహుజనుల గురించి ఎల్లప్పుడూ మాట్లాడేవారు నిజానికి అత్యంత స్వార్థపరులని చెప్పారు. అందరి సమానత్వానికి అంబేడ్కర్ పరితపిస్తే కొన్ని పార్టీలు ఆయన సిద్ధాంతాలనూ రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నాయని విమర్శించారు. తమ నాలుగేళ్ల పదవీకాలంలో ఒక్క కేంద్రమంత్రిపైనైనా అవినీతి ఆరోపణలు రాలేదని గుర్తుచేశారు. కబీర్‌దాస్ పేరిట రూ.24 కోట్లతో నిర్మించే పరిశోధన సంస్థకు ప్రధాని శంకుస్థాపన చేశారు. కబీర్ బోధనలు, తత్వాన్ని గురించి ప్రచారం చేయడానికి ఉద్దేశించిన అకాడమీకి పునాది వేశారు. కబీర్‌కు మోక్షప్రాప్తి కలిగిన ప్రదేశాన్ని భారత ప్రధాని సందర్శించడం ఇదే ప్రథమం.

టోపీ ధరించడానికి నిరాకరించిన ఆదిత్యనాథ్!: కబీర్‌దాస్ స్మారకం వద్ద అక్కడి సంరక్షకుడు సమర్పించిన సంప్రదాయ ఉన్ని టోపీని ధరించేందుకు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సున్నితంగా నిరాకరించారు.

క్లిష్ట సమయంలో విలువైన నాయకత్వాన్ని అందించిన పీవీ

97వ జయంతి సందర్భంగా మోదీ నివాళులు

దిల్లీ: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మన దేశ చరిత్రలో క్లిష్టమైన సమయంలో విలువైన నాయకత్వాన్ని అందించిన గొప్ప నేత అని ప్రధాని నరేంద్రమోదీ కొనియాడారు. గురువారం పీవీ 97వ జయంతిని పురస్కరించుకుని ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు. 'పీవీ నరసింహారావు రాజనీతిజ్ఞునిగా అందరి గౌరవాన్ని పొందగలిగారు. అపారమైన విజ్ఞానం ఆయన సొంతం. గొప్ప పండితునిగానూ ఆయనెంతో పేరు ప్రఖ్యాతులు ఆర్జించారు. జయంతి రోజున ఆయన్ని స్మరించుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

ఉప రాష్ట్రపతి నివాళులు: ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కూడా పీవీకి నివాళులర్పించారు. దేశ ఆర్థిక రంగంలో సంస్కరణలు తీసుకురావడంలో ఆయన పోషించిన కీలక పాత్రను కొనియాడారు. అపార పాండిత్యం, విజ్ఞానాలకు గానూ ఆయన ఎల్లప్పుడూ గుర్తుండిపోతారని పేర్కొంటూ ట్వీట్ చేశారు.

పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించండి

మన్మోహన్‌తో భేటీలో కాంగ్రెస్‌కు విజయ్ గోయల్ విజ్ఞప్తి

దిల్లీ: వచ్చే పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేందుకు కాంగ్రెస్ పార్టీ సహకారాన్ని కేంద్రం అభ్యర్థించింది. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిసి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్ గోయల్ ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సమావేశాల్లో హస్తం పార్టీ నిర్మాణాత్మక పాత్ర పోషించాలని కోరారు. ప్రతిపక్షాల మద్దతు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మన్మోహన్ స్వాగతించినట్లు గోయల్ తెలిపారు. మిగతా పార్టీల నేతలతోనూ తాను సమావేశమవుతానని వెల్లడించారు. జులై 18న ప్రారంభమవుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాలు.. ఆగస్టు 10న ముగియనున్నాయి. సమావేశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఎజెండాలోని ముఖ్యమైన అంశాల్లో 'ముమ్మారు తలాఖ్' బిల్లు కూడా ఉంది.

మమతను గద్దె దించుతాం: అమిత్ షా

పురులియా (పశ్చిమ బెంగాల్): రాజకీయ ప్రత్యర్థులపై హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని రాబోయే రోజుల్లో ఇంటికి పంపించడం ఖాయమని భాజపా అధ్యక్షుడు అమిత్‌షా చెప్పారు. 'ఈ రాష్ట్రంలో దాదాపు 20 మంది భాజపా కార్యకర్తల్ని హతమార్చారు. ఈ త్యాగాలు వృథా కావు. మమతను గద్దె దించడం ఖాయమని నేను సవాల్ చేసి చెబుతున్నా. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 42 లోక్‌సభ స్థానాల్లో 22ని భాజపా దక్కించుకుంటుంద'ని చెప్పారు. గురువారం పురులియాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం మహాకూటమి ఏర్పాటు చేయాలనే ఆలోచనను మానుకుని ముందుగా సొంత రాష్ట్రం మంచిచెడ్డల్ని చూసుకోవాలని మమతకు హితవు పలికారు. తదుపరి లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో 2/3వ వంతు ఆధిక్యం తమకే లభిస్తుందన్నారు. దాడుల్లో చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను షా పరామర్శించారు. షా వ్యాఖ్యలపై తృణమూల్ స్పందిస్తూ... కేంద్ర సర్కారుపై ఆయన ఎక్కువ దృష్టిపెట్టడం మంచిదని హితవు పలికింది.

ఎన్నికలే లక్ష్యంగా భాజపా విభాగాల సమావేశం

దిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సంస్థాగత యంత్రాంగం మొత్తాన్ని సమాయత్తం చేసే లక్ష్యంతో భాజపా గురువారం పార్టీకి చెందిన 29 విభాగాలు, ప్రాజెక్టుల కీలక నేతల సమావేశం నిర్వహించింది. ఈ ఏడాది చివరిలో జరగనున్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ శాసనసభ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన ఈ సమావేశం ఎంతో ముఖ్యమైనదని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫేస్‌బుక్‌లోనూ ప్రచార ప్రకటనలకు అడ్డుకట్ట!

దిల్లీ: మనదేశంలో ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి సామాజిక మాధ్యమాల్లో కూడా రాజకీయ ప్రచార ప్రకటనలు వెలువడకుండా నివారించాలని ఎన్నికల సంఘం(ఈసీ) భావిస్తోంది. ఈ మేరకు ప్రకటనలను అడ్డుకునే అంశాన్ని పరిశీలించాల్సిందిగా ప్రముఖ సామాజిక మాధ్యమ సంస్థ 'ఫేస్‌బుక్'కు విన్నవించింది. ఈసీ ఏర్పాటుచేసిన కమిటీ ఈ నెల 4న ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఫేస్‌బుక్ ప్రతినిధి కూడా ఇందులో పాల్గొన్నారు. ఫేస్‌బుక్ వేదికగా ఎన్నికల చట్టాల ఉల్లంఘన జరిగితే ఫిర్యాదు చేసేందుకు వీలుగా ప్రత్యేక సదుపాయం కల్పించే అవకాశాన్ని పరిశీలించేందుకు సంస్థ ప్రతినిధి అంగీకరించారు. ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి రాజకీయ ప్రకటనలను నిషేధించే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు.

జాతీయ అవార్డుల దరఖాస్తుకు గడువు పెంపు

15 వరకు ఉపాధ్యాయులకు అవకాశం

ఈనాడు, దిల్లీ : ఉపాధ్యాయులు జాతీయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీని జులై 15 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈమేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా అందిన దరఖాస్తులను పరిశీలించిన జిల్లా ఎంపిక కమిటీలు తమ ప్రతిపాదనలను రాష్ట్ర ఎంపిక కమిటీలకు పంపడానికి జులై 24 వరకు గడువు పొడిగించింది. అలాగే రాష్ట్ర ఎంపిక కమిటీ నేషనల్ జ్యూరీకి ఆగస్టు 3 లోగా పంపించాల్సి ఉంటుంది. తుది జాబితాను జ్యూరీ ఆగస్టు 30 నాటికి రూపొందించాల్సి ఉంటుంది.

డబ్ల్యూటీఐ అవార్డులకు జులై 31..

దేశాభివృద్ధిలో భాగమవుతున్న మహిళలను ప్రోత్సహించే దిశగా అందజేస్తున్న 'వుమెన్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (డబ్ల్యూటీఐ)' అవార్డులకు జులై 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నీతి ఆయోగ్ వెల్లడించింది. మహిళా ఔత్సాహిక వేదిక (డబ్ల్యూఈపీ) ఏర్పాటు సందర్భంగా ఈ ఏడాది 'మహిళలు, వ్యవస్థాపకత' అనే అంశంపై అవార్డులు ప్రకటించనున్నారు. ఈమేరకు వ్యాపార రంగం, నూతన ఆవిష్కరణలు తదితర అంశాల్లో సాధించిన విజయాలతో భారత పౌరసత్వం ఉన్న మహిళ వ్యాపారవేత్తలు - 'డబ్ల్యూఈపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని నీతి ఆయోగ్ తెలిపింది.

అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తి రేసులో భారత-అమెరికన్!

వాషింగ్టన్: అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తి పదవి రేసులో భారత-అమెరికన్ అమూల్ థాపర్ కూడా ఉన్నారు. ఇందుకోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వడపోసిన 25 మందిలో ఆయన పేరు కూడా ఉంది. ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ ఆంటోనీ కెన్నెడీ (81) స్థానంలో తాజా ఎంపిక అవసరమైంది. జులై 31న తాను పదవీ విరమణ పొందనున్నట్లు జస్టిస్ కెన్నెడీ బుధవారం ప్రకటించారు. 25 మందితో 'హెరిటేజ్ ఫౌండేషన్ అండ్ ఫెడరలిస్టు సొసైటీ' రూపొందించిన జాబితా నుంచే తుది ఎంపిక జరుగుతుందని ట్రంప్ చెప్పారు. కెంటకీకి చెందిన థాపర్ (49) కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అమెరికా పత్రికలు పేర్కొన్నాయి. అంతిమంగా ఏడుగురు జడ్జీల పేర్లు ట్రంప్ పరిశీలనలో ఉంటాయని, వాటిలో థాపర్ కూడా ఒకరని 'ద వాషింగ్టన్ పోస్ట్' పత్రిక పేర్కొంది.

చర్చల వాయిదాపై పెద్దన్న మౌనం

● అనివార్య కారణాలేంటో చెప్పని అమెరికా

వాషింగ్టన్: భారత విదేశాంగ, రక్షణశాఖ మంత్రులతో తమ దేశ మంత్రులు వచ్చే నెల 6న జరపాల్సిన తొలి '2+2' చర్చలను వాయిదా వేయడంపై అమెరికా నోరువిప్పలేదు. అనివార్య కారణాలతో ఈ చర్చలను వాయిదా వేస్తున్నట్లు చెప్పిన అగ్రరాజ్యం.. ఆ కారణాలను మాత్రం బయటపెట్టలేదు. విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్‌తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన అమెరికా విదేశాంగమంత్రి మైఖేల్ ఆర్ పాంపియో.. అనివార్య కారణాలతో '2+2' చర్చలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. వాయిదాపై విచారం వ్యక్తం చేశారు. చర్చల వాయిదాకు దారితీసిన కారణాలను మాత్రం వెల్లడించలేదు. రష్యా నుంచి 'ఎస్-400' క్షిపణి రక్షణ వ్యవస్థను కొనుగోలు చేసేందుకు భారత్ ప్రణాళికలు సిద్ధం చేయడం, ఇరాన్ నుంచి చమురు దిగుమతులు వద్దంటూ భారత్ సహా కొన్ని దేశాలకు అమెరికా సూచించడం వంటి పరిణామాల నేపథ్యంలో '2+2' చర్చలు వాయిదా వేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పిల్లలతో కల్లోలం

● కశ్మీర్‌లో వారిని పావులుగా వాడుకుంటున్న పాక్ ఉగ్రవాద సంస్థలు
● ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లో పిల్లలను నియమించుకుంటున్న నక్సలైట్లు
● ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ నివేదికలో వెల్లడి

ఐరాస: పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు అమాయకపు బాల్యాన్ని చిదిమేస్తున్నాయి. ఉగ్రచర్యలకు వారిని పావులుగా వాడుకుంటున్నాయి. జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలతో గత ఏడాది జరిగిన ఘర్షణల్లో పిల్లలను ఉపయోగించుకున్నాయి. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ యాంటోనియో గిటరెస్ 2017 సంవత్సరానికి రూపొందించిన వార్షిక నివేదికలో ఈ నివ్వెరపోయే వాస్తవాలు వెల్లడయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఆ ఏడాది ఉగ్రవాద సంస్థలు 8వేల మందికి పైగా పిల్లలను నియమించుకుని పోరాటానికి ఉపయోగించుకున్నట్లు ఈ నివేదిక తేల్చింది. వివిధ సంక్షోభాలు, అంతర్యుద్ధాల్లో పదివేల మందికిపైగా పిల్లలు మరణించడమో, గాయపడడమో జరిగింది. పిల్లలు, సాయుధ ఘర్షణపై రూపొందించిన ఈ నివేదిక.. సిరియా, అఫ్గానిస్థాన్, యెమెన్ సహా 20దేశాల్లో పరిస్థితులను వివరించింది. భారత్‌లోని పరిస్థితిని తెలియజేసింది.

పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థలు జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలతో ఘర్షణల సందర్భంగా పిల్లలను నియమించుకున్నాయని, ఇది పిల్లల హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని నివేదిక వెల్లడించింది. భద్రతా బలగాలు కూడా పిల్లలను ఇన్ఫార్మర్లుగా, గూఢచారులుగా ఉపయోగించుకున్నాయని అనధికార సమాచారం తెలియజేస్తోందని పేర్కొంది.

ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లో నక్సలైట్లు పిల్లలను నియమించుకుంటున్నట్లు తమకు సమాచారం వస్తోందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఝార్ఖండ్‌లో లాటరీ ద్వారా పిల్లలను ఎంపిక చేసుకుని వారిని బలవంతంగా నియమించుకుంటున్నట్లు వెల్లడించింది. సాయుధ దళాలకు వ్యతిరేకంగా భద్రతా బలగాలు చేపడుతున్న ఆపరేషన్లలో పిల్లలు మరణించడమో, గాయపడడమో జరుగుతోందని తెలిపింది.

ఇక పాకిస్థాన్‌లో ఉగ్రవాద సంస్థలు మదర్సాల నుంచి పిల్లలను నియమించుకుంటున్నాయని, ఆత్మాహుతి దాడులకు వారిని ఉపయోగించుకుంటున్నాయని నివేదిక తేల్చింది. 2017 జనవరిలో తెహరిక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ ఒక వీడియోను విడుదల చేసింది. ఆత్మాహుతి దాడులు ఎలా చేయాలో పిల్లలకు సూచనలు ఇస్తున్నట్లు ఆ వీడియోలో ఉంది.

పాకిస్థాన్‌పై 'అనర్హత' వేటు

ఇస్లామాబాద్: ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌కు అంతర్జాతీయ సమాజం నుంచి మరో ఎదురుదెబ్బ తగిలింది. దాయాదిదేశాన్ని ఆర్థిక కార్యాచరణ ప్రత్యేక దళం(ఎఫ్ఏటీఎఫ్) బుధవారంరాత్రి అనర్హత జాబితా(గ్రే లిస్ట్)లో చేర్చింది. పారిస్‌లో సమావేశమైన 37 దేశాల ఎఫ్ఏటీఎఫ్ ఈమేరకు తీర్మానం చేసింది. అక్రమ నగదు లావాదేవీల నివారణకు, ఉగ్రవాదులకు ఆర్థికసాయం అందకుండా ఉండేందుకు, అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థకు చేటు కలిగే ఎలాంటి అవకతవకలు జరక్కుండా పర్యవేక్షించేందుకు 1989లో 'ఎఫ్ఏటీఎఫ్' ఏర్పడింది.

జమ్ము కశ్మీర్ పోలీసులు విడుదల చేసిన పాత్రికేయుడు సుజాత్ బుఖారీ హత్య కేసుతో సంబంధమున్న వారి చిత్రాలు

పాత్రికేయుడు బుఖారి హత్య.. లష్కరేతోయిబా పనే

● పాకిస్థాన్ కేంద్రంగా కుట్ర
● వెల్లడించిన కశ్మీరు ఐజీ ఎస్.పి.పాణి

శ్రీనగర్: సీనియర్ పాత్రికేయుడు, రైజింగ్ కశ్మీర్ ఎడిటర్-ఇన్-చీఫ్ సుజాత్ బుఖారి దారుణహత్యకు పాకిస్థాన్‌లోనే కుట్ర జరిగిందని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. లష్కరే తోయిబా(ఎల్ఈటీ) దీని వెనుక ఉందని కశ్మీరు ఐజీ ఎస్.పి.పాణి తెలిపారు. హత్యతో సంబంధం ఉన్న నలుగురిని గుర్తించామన్నారు. లష్కరేతోయిబా కమాండర్ నవీద్‌జాట్, ముజఫర్ అహ్మద్, అజాద్ అహ్మద్ మాలిక్, షేక్ సజ్జాద్‌గుల్‌గా వీరిని గుర్తించినట్లు వెల్లడించారు. వీరిలో జాట్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆసుపత్రికి తరలిస్తుండగా, పోలీసులనుంచి తప్పించుకుని పారిపోయాడన్నారు. శ్రీనగర్‌లో నివసించే గుల్.. గత ఏడాది మార్చిలో పాకిస్థాన్‌కు తప్పుడు వీసాతో మనదేశం నుంచి వెళ్లిపోయాడన్నారు. బుఖారితోపాటు అతని ఇద్దరు అంగరక్షకులను జూన్ 14న శ్రీనగర్‌లో ఆగంతకులు కాల్చి చంపిన సంగతి విదితమే.

అంగుళం నేలనూ వదులుకునేది లేదు

అమెరికాకు చైనా స్పష్టీకరణ

బీజింగ్: పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిన భూభాగంలో ఒక్క అంగుళాన్ని కూడా తమ దేశం వదులుకోబోదని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ మ్యాటిస్‌కు స్పష్టంచేశారు. వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడుగా వ్యవహరించడంపై రెండు దేశాల నడుమ తీవ్ర విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అభ్యర్థుల ప్రమాణ పత్రాలపై ఐ.టి. కన్ను

● ఈసీ నివేదించకపోయినా స్వీయ పరిశీలన
● ఎగవేతదారులపై కళ్లెం బిగించనున్న ఆదాయపు పన్ను శాఖ

ఈనాడు, దిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రమాణ పత్రాలను (అఫిడవిట్లను) ఆదాయపు పన్ను (ఐ.టి.) శాఖ ఇకపై పరిశీలించనుంది. ఇంతవరకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తమకు నివేదించిన కేసుల్లోనే ఇలా చేసేది. ఇకపై తమంతటతాముగా అభ్యర్థుల ప్రమాణ పత్రాలను, వారి ఆదాయపు పన్ను రిటర్న్స్‌ను సరిపోల్చనుంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక గరిష్ఠంగా అయిదు నెలల్లో ఇవి పూర్తికానున్నాయి. చాలామంది అభ్యర్థులు తమ వాస్తవ సంపదను దాచిపెడుతుండడాన్ని ఐ.టి. వర్గాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో కొన్ని రాష్ట్రాలకు జరగనున్న శాసనసభ ఎన్నికలు, ఆ తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పక్కా చర్యలతో రంగంలో దిగాలని ఆ శాఖ నిర్ణయించింది. రెండు వేర్వేరు ఎన్నికల్లో అభ్యర్థులు సమర్పించే ప్రమాణ పత్రాల్లో పేర్కొంటున్న ఆస్తుల విలువ అమాంతం పెరుగుతున్న దాఖలాలు వెలుగు చూస్తుండడంతో ఈ దిశగా చర్యలు మొదలయ్యాయి.

బినామీ ఆస్తులపైనా కొరడా...

అయిదో స్థానంలో హైదరాబాద్

బినామీ ఆస్తులపైనా ఐ.టి.శాఖ కొరడా ఝుళిపిస్తోంది. బినామీ లావాదేవీల నిరోధక చట్టం కింద రూ.4300 కోట్ల విలువైన 1513 అప్రకటిత ఆస్తుల్ని ఇప్పటివరకు జప్తు చేసుకొంది. వీటిలో అత్యధికంగా చెరో 200 ఆస్తులు ముంబయి, జైపుర్‌లలో ఉన్నాయి. 100 ఆస్తులతో హైదరాబాద్ అయిదో స్థానంలో ఉంది. వీటిపై తుది చర్యలు ఈ సెప్టెంబరులోగా చేపడతారు.

గడువుకు ముందే లోక్‌సభ ఎన్నికలు

● మాజీ ప్రధాని దేవేగౌడ జోస్యం

ఈనాడు, బెంగళూరు: ప్రస్తుత రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తే గడువుకు ముందే లోక్‌సభ ఎన్నికలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయని జనతాదళ్ (జేడీఎస్) జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవేగౌడ అన్నారు. గురువారం దిల్లీలో పాత్రికేయులతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "డిసెంబరులో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. వీటితోపాటు లోక్‌సభ ఎన్నికలు వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు. భాజపా చేస్తున్న సన్నాహాలు చూస్తే.. మే కన్నా ముందుగానే లోక్‌సభ ఎన్నికలు నిర్వహించవచ్చని అనుమానాలు కలుగుతున్నాయి" అని దేవేగౌడ విపులీకరించారు. లోక్‌సభ, విధానసభ ఎన్నికలను కలిపి ఒకేసారి నిర్వహించాలనే కేంద్రం ఆలోచనను ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ తదితరులు సమర్థించారని గుర్తుచేశారు. లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొనేందుకు భాజపా సన్నాహాలు చేపట్టినందున.. ఇతర రాజకీయ పక్షాలూ ఆ బాటలో పయనించడం అనివార్యమని అభిప్రాయపడ్డారు. "కర్ణాటకలో కాంగ్రెస్‌తో జేడీఎస్ చేతులు కలిపింది. దేశమంతటా ఇదే మైత్రి సూత్రం వర్తిస్తుందని భావించనవసరం లేదు. రాష్ట్రంలో మాత్రం రెండు పార్టీలూ కలిసి లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొంటాయి. బీఎస్పీతో మాకు పొత్తు ఉన్నందున ఒక స్థానాన్ని ఆ పార్టీకి కేటాయిస్తాం" అని దేవేగౌడ వివరించారు. కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య అభిప్రాయభేదాలు లేవని ఆయన స్పష్టీకరించారు. ప్రభుత్వం ఒకటి, రెండు రోజుల్లో కూలిపోయేంత బలహీనంగా లేదని పునరుద్ఘాటించారు. "భాజపాకు అధికారం దక్కకూడదనే.. అభిప్రాయభేదాలను పక్కనపెట్టి ఈ పొత్తు కుదుర్చుకున్నాం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ స్వయంగా కుమారస్వామి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ప్రకటించారు. మీడియాకు ఇంకా ఎందుకు అనుమానం?" అని దేవేగౌడ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వీరప్ప మొయిలి సారథ్యంలో 'కనీస ఉమ్మడి కార్యక్రమం' ప్రకారం బడ్జెట్ రూపకల్పన జరుగుతుందన్నారు. రైతుల రుణాలు మాఫీ అవుతాయని తెలిపారు.

దిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దేవేగౌడ

దిల్లీలోని చాందినీచౌక్‌లో ఓ గురుద్వారాను సందర్శించిన సందర్భంగా రోటీలు తయారు చేస్తున్న ఐరాసలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ, భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్

ఇరాన్.. తదుపరి ఉత్తర కొరియా

● ఆ దేశంతో సంబంధాలపై పునరాలోచించుకోండి
● భారత్‌కు సూచించిన నిక్కీ హేలీ

దిల్లీ: ఇరాన్‌తో సంబంధాలపై భారత్ పునరాలోచించుకోవాలని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా ఉన్న నిక్కీ హేలీ సూచించారు. ఇరాన్‌ను 'తదుపరి ఉత్తర కొరియా'గా, 'ముప్పు'గా ఆమె అభివర్ణించారు. దిల్లీలో గురువారం నిర్వహించిన ఓ సదస్సులో హేలీ ప్రసంగిస్తూ.. ఇరాన్‌లో 'మతాధికారిపాలిత నియంతృత్వం' రాజ్యమేలుతోందన్నారు. ఉగ్రవాదానికి ఆ దేశం నిధులు సరఫరా చేస్తోందని ఆరోపించారు. మధ్యప్రాచ్యమంతటా ఘర్షణలకు కారణమవుతోందని విమర్శించారు. ఇరాన్‌తో భారత వ్యాపార సంబంధాలపై ప్రధాని నరేంద్ర మోదీతో తాను చర్చించినట్లు తెలిపారు. ఇరాన్ నుంచి చమురు దిగుమతులను ఈ ఏడాది నవంబరు 4లోగా పూర్తిగా నిలిపివేయాలని.. లేనిపక్షంలో ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని భారత్ సహా ఇతర దేశాలకు అమెరికా హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో నిక్కీ హేలీ తాజా ప్రసంగం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉగ్రసంస్థలకు పాక్ ఆశ్రయమిస్తే ఊరుకోం

ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ ఆశ్రయమిస్తుంటే తాము చూస్తూ ఊరుకోబోమని నిక్కీ హేలీ స్పష్టం చేశారు. ఈ విషయంపై పాక్‌కు ఇప్పటికే సందేశం పంపామని వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా ప్రపంచానికి నాయకత్వం వహించాలని ఆమె అభిలషించారు. అణు సరఫరాదారుల బృందం(ఎన్ఎస్‌జీ)లో భారత సభ్యత్వానికి అమెరికా మద్దతిస్తుందని తెలిపారు.

ఆలయం-మసీదు-గురుద్వారా-చర్చి..

మత సామరస్యాన్ని చాటిచెప్తూ.. దిల్లీలో గౌరీశంకర్ ఆలయం, జామా మసీదు, గురుద్వారా సిస్ గంజ్ సాహిబ్, సెంట్రల్ బాప్టిస్ట్ చర్చిలను నిక్కీ హేలీ సందర్శించారు. గురుద్వారాలో భక్తులకు ఉచితంగా అందించే రోటీలను ఆమె తయారుచేశారు.

ఇరాన్ 'చమురు'ను తగ్గించే యోచనలో భారత్!

దిల్లీ: ఇరాన్ నుంచి చమురు దిగుమతులను తగ్గించుకునే విషయమై భారత్ దృష్టి సారించినట్లు ప్రభుత్వ, పారిశ్రామిక అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయంగా సౌదీ అరేబియా, కువైట్‌ల నుంచి అధికంగా కొనుగోలు చేసేందుకు యోచిస్తున్నట్లు వెల్లడించారు. అయితే అమెరికా ఒత్తిడి చేస్తున్నట్లుగా ఇరాన్ నుంచి దిగుమతులను పూర్తిగా నిలిపివేసే అవకాశం లేదని తెలిపారు. నవంబరు 4 నాటికి ఇరాన్ నుంచి ముడిచమురు దిగుమతులను 'సున్నా'కు తీసుకురావాలంటూ అన్ని దేశాలకూ అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీనిపై కొద్ది రోజుల్లో స్పష్టత వస్తుందని.. అయితే ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తూ ఆచితూచి అడుగేయాలంటూ చమురుశుద్ధి కర్మాగారాలకు పెట్రోలియం శాఖ సూచించింది. ఈమేరకు వాటితో గురువారం చర్చలు జరిపింది.

'క్యాట్' ఛైర్మన్‌గా జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి

ఈనాడు, దిల్లీ: కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్(క్యాట్) ఛైర్మన్‌గా పట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకానికి కేంద్ర నియామక వ్యవహారాల కేబినెట్ కమిటీ గురువారం ఆమోదముద్ర వేసింది. ఆయన ఈ పదవిలో అయిదేళ్లు లేదా 68 ఏళ్ల వరకు.. ఏది ముందయితే అంతవరకు కొనసాగుతారు.

వాతావరణ మార్పులతో భారత్‌లో జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం

ఈనాడు, దిల్లీ: వాతావరణంలో మార్పులు, వర్షపాతంలో మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల భారతదేశంలోని జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతుందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించింది. 2050 నాటి జనాభాలో సగం మంది జీవన ప్రమాణాలు తగ్గుతాయని, దేశ జీడీపీలో 2.8శాతం ఆవిరవుతుందని స్పష్టం చేసింది. భారతదేశం సహా దక్షిణాసియాలో సగం మేర వ్యవసాయ ఉత్పత్తులు తగ్గుతాయని పేర్కొంది.

మెరుపుదాడులతో ముష్కర స్థావరాలు నేలకూలిందిలా..

● వీడియో విడుదల చేసిన కేంద్రం
● సైనికుల త్యాగాలతో రాజకీయం చేస్తారా: కాంగ్రెస్
● సైన్యం నిబద్ధతపై ప్రశ్నలు రేకెత్తించారు: భాజపా

దిల్లీ: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై 2016 సెప్టెంబర్‌లో భారత సైన్యం చేపట్టిన మెరుపు దాడుల వీడియోలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. భారత్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్న ముష్కరుల స్థావరాలను పేల్చివేసిన తీరును ఆ దృశ్యాలు వివరించాయి. ఈ వీడియో విడుదలపై భాజపా, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం నడిచింది. 2016 సెప్టెంబర్ 18న జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో ఉన్న భారత సైనిక స్థావరంపై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడిచేసి, 19 మంది సైనికులను బలితీసుకున్నారు. ఈ నేపథ్యంలో పాక్‌కు బుద్ధి చెప్పడానికి అదే నెల 28-29 తేదీల్లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యంలోని ప్రత్యేక బలగాలు మెరుపు దాడులను చేశాయి.

సైనికుల రక్తంతో రాజకీయమా?: కాంగ్రెస్

వీడియోల విడుదల ద్వారా మెరుపు దాడులను మోదీ సర్కారు రాజకీయం చేస్తోందని కాంగ్రెస్ దుయ్యబట్టింది. ధీర సైనికుల రక్తం, త్యాగాలను రాజకీయ ఓట్ల సాధనకు ఉపయోగించరాదని పేర్కొంది. ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఈ మెరుపు దాడులను ప్రభుత్వం 'నిసిగ్గుగా' రాజకీయం చేసిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా విమర్శించారు.

మెరుపు దాడులు మీకు సమ్మతమా.. కాదా: భాజపా



సైన్యం నిబద్ధత, సాహసంపై కాంగ్రెస్ ప్రశ్నలు రేకెత్తిస్తోందని భాజపా దుయ్యబట్టింది. తద్వారా సైనికుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఇప్పుడు ఓ చిన్నపార్టీగానే మిగిలిపోయిందని పేర్కొంది. మెరుపు దాడులను రాజకీయం చేయాలని మోదీ సర్కారు ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ చేసిన ఆరోపణను కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఖండించారు. ఒకవేళ వాటితో లబ్ధి పొందాలనుకుంటే.. ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే విడుదల చేసి ఉండేవాళ్లమన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు

విజయవాడ 30-6-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 321

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

డబ్బుపై శ్రద్ధ లేనివారు, దీన్ని చదవకండి!

సంతోషం. డబ్బుపై మీకున్న గౌరవాన్ని నేను అభినందిస్తున్నాను. అందువల్లే మీరు కష్టపడి సంపాదించిన డబ్బుకు సంపూర్ణ విలువను కల్పించాలన్న ఉద్దేశంతోనే ఈ పథకాన్ని రూపొందించాం. దీని సారాంశం సులభమైనది. కానీ మార్కెట్‌లో ఇలాంటి పథకాన్ని ఎవరూ ఇవ్వలేదన్నదే నిజం. తరుగు నుంచి పూర్తి విముక్తిని ఈ పథకం కల్పిస్తుంది! ఈరోజే విత్తు నాటి పథకం చివర్లో సకల సౌభాగ్యాల దిగుబడిని పొందండి.

లలితా జ్యువెల్లరి పరిచయం చేస్తోంది..

స్మార్ట్ బుకింగ్ పథకం!

100% తరుగు లేదు!

అవును, ఏ నగకు కూడా!

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్

One Time payment !

మొత్తం నగదును ఒకసారి చెల్లించి,
తర్వాత.. తరుగు లేకుండా
నగలు కొనుగోలు చేసుకోండి.

5 నెలల నుంచే ఫలితం!
11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు,
14% లేదా 16% వరకు తరుగున్న
నగ అయినప్పటికీ..
1% తరుగు కూడా చెల్లించనక్కర్లేదు.

ఇది ఒక కలల పథకం!

నగదు ఆదా అవడంతోపాటు, చెల్లించే నగదుకు
ఏమాత్రం తరుగు లేకుండా పూర్తిస్థాయి
బంగారం లభిస్తుంది.

5 నుంచి 11 నెలలలోపు ఎప్పుడైనా ఈ పథకాన్ని ముగించుకుని లబ్ధి పొందొచ్చు!

5 నెలల ఆఖరులో	5% వరకు తరుగు ఉన్న అన్ని నగలను, తరుగు చెల్లించకుండా కొని లబ్ధి పొందొచ్చు.
6 నెలల ఆఖరులో	6% వరకు తరుగు ఉన్న అన్ని నగలను, తరుగు చెల్లించకుండా కొని లబ్ధి పొందొచ్చు.
7 నెలల ఆఖరులో	7% వరకు తరుగు ఉన్న అన్ని నగలను, తరుగు చెల్లించకుండా కొని లబ్ధి పొందొచ్చు.
8 నెలల ఆఖరులో	8% వరకు తరుగు ఉన్న అన్ని నగలను, తరుగు చెల్లించకుండా కొని లబ్ధి పొందొచ్చు.
9 నెలల ఆఖరులో	9% వరకు తరుగు ఉన్న అన్ని నగలను, తరుగు చెల్లించకుండా కొని లబ్ధి పొందొచ్చు.
10 నెలల ఆఖరులో	10% వరకు తరుగు ఉన్న అన్ని నగలను, తరుగు చెల్లించకుండా కొని లబ్ధి పొందొచ్చు.
11 నెలల ఆఖరులో	అన్ని రకాల నగలను, ఆ రోజుకు ఎంత తరుగు ఉన్నా కానీ, తరుగు ఏమాత్రం చెల్లించకుండా కొని లబ్ధి పొందొచ్చు.
11 నెలల ఆఖరులో	వజ్రాభరణాలకు ప్రత్యేక వెసులుబాటు: క్యారెట్‌కు రూ.1000 తగ్గింపు, V.A. లో 50% తగ్గింపు.

- మీరు చెల్లించే నగదును మీ అభిప్రాయం మేరకు నగదు రూపంగానూ లేదా బంగారం రూపంగానూ ఆదా చేసుకోవచ్చు.
- మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.

కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.

మరొక ఛాయిస్!

10 నెలల నగల కొనుగోలు పథకం.

తరుగు లేదు!

(10% వరకు)

మరిన్ని వివరాలకు షోరూంలో సంప్రదించండి.
లేదా మా వెబ్‌సైట్‌ను చూడండి.

www.lalithaajewellery.com

లక్షలాది డిజైన్లు!

Lalithaa®

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

వైజాగ్
29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్,
ద్వారకా నగర్.
ఫోన్: 0891 - 6600001.

తిరుపతి
481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ,
మాస్కరోడ్, (V.V. మహల్‌రోడ్)
ఫోన్: 0877 - 666 0505 / 0606 / 7888.

హైదరాబాద్
6-3-883, SBR సౌక్,
రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా,
సోమాజిగూడ సర్కిల్.
ఫోన్: 040 - 6748 6677.

విశాఖపట్నం • తిరుపతి • హైదరాబాద్ • చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

CA

ఎందుకు బతిమలాడాలి?

నచ్చిన నగకు ధర ఎక్కువగా ఉందనిపిస్తే ఏం చేస్తారు? ధరను తగ్గించమంటూ విక్రయదారుడివద్ద ప్రాధేయపడుతారు!
అప్పుడు, చాలా షోరూంలలో వినిపించే మాట ఏంటంటే?.. 'మేనేజర్‌ను కలవండి' అనే ఓ సమాధానం!
మరి మేనేజర్ ఏం చేస్తారు? కాలిక్యులేటర్ నొక్కి.. ఓ చిన్న మొత్తంలో తగ్గించి.. పెద్దమొత్తంలో తగ్గించినట్లు చెప్పి నమ్మిస్తారు...

నా ప్రశ్న ఏంటంటే? డబ్బు చెల్లించే మీరు అక్కడా, ఇక్కడా మాట్లాడి ధర తగ్గించమంటూ ఎందుకు బతిమలాడాలి? సరైన ధరను తేల్చే ఆయుధం మీ చేతిలో ఉంటే దర్జాగా నగలు కొనుక్కోవచ్చు!

అందుకు సులువైన మార్గమిదిగో:

- మనసుకు నచ్చిన నగను మొబైల్‌లో క్లిక్ చేసి, దానికి ఎస్టిమేట్ స్లిప్‌ను మా వద్ద తీసుకోండి.
- నగ ఫొటో, ఎస్టిమేట్ స్లిప్‌ను పెట్టుకుని కనీసం నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చి చూడండి.
- అప్పుడే ఏ షోరూంలో న్యాయమైన ధరకు నగ లభిస్తుందోనన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది.
- బంగారం, వజ్రం, వెండి.. ఏదైనా సరే ఏ షోరూంలో అయితే మీకు నచ్చిన నగ తక్కువ ధరకు లభిస్తుందో అక్కడే కొని లబ్ధి పొందండి.

Lalithaa®©

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.

తిరుపతి - 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్‌రోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.

హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677.

చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం
కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్

www.lalithaajewellery.com



ఈనాడు

విజయవాడ 30-6-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 321 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 5-00 పేజీలు 18+20 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

నమ్మించి మోసం

- ప్రధానమంత్రి మాటల్లోనే మేటి... పనుల్లో చురుకుదనం లేదు
- భాజపా ఇంత దారుణమైన మోసం చేస్తుందనుకోలేదు
- సమయం వస్తే ఆంధ్ర ప్రజలు వదిలిపెట్టరని హెచ్చరిస్తున్నా
- నల్లధనం తెస్తామన్న మాటలు ఏమయ్యాయి?
- తిరుమల ప్రతిష్ఠ దెబ్బతియ్యాలని చూస్తే సహించను
- ఏపీ రాజధాని అభివృద్ధిలో కేంద్రానికి బాధ్యత లేదా
- తూర్పులో ఏ పార్టీ ఉంటే రాష్ట్రంలో అదే పార్టీ అధికారంలో ఉంటుంది
- కాకినాడ ధర్మపోరాట సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కాకినాడ ధర్మపోరాట సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ సభకు హాజరైన జనం

ఈనాడు - కాకినాడ

విభజన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి ప్రధాని మోదీ నాలుగేళ్లు నమ్మించారని, ఇంత దారుణంగా మోసం చేస్తారని కలలో కూడా ఊహించలేదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సమయం వస్తే మోసం చేసిన వారిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు వదిలిపెట్టరని హెచ్చరించారు. నమ్మకద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ మాటల్లో మేటి అని, పనుల్లో మాత్రం చురుకుదనం లేదని పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడలో నమ్మకద్రోహం, కుట్ర రాజకీయాలపై నిర్వహించిన ధర్మపోరాటం సభలో చంద్రబాబు మాట్లాడారు. ప్రధాని, పవన్‌కళ్యాణ్, జగన్, ఇతర నేతల తీరుపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ సభ నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో (మిగతా 2లో)

విశాఖ జిల్లా తంతడి-వాడపాలెంలో 'ఈనాడు' సహాయనిధితో హుద్‌హుద్ బాధితుల కోసం నిర్మించిన గృహ సముదాయం

ఈనాడు పక్కా అండ

హుద్‌హుద్ బాధితులకు 80 ఇళ్లు అప్పగింత

- విశాఖ జిల్లా తంతడి-వాడపాలెంలో 'ఈనాడు' సహాయ నిధితో నిర్మాణం
- గృహ సముదాయాన్ని ప్రారంభించిన ఎండీ కిరణ్
- ప్రజలకు చేయూతగా నిలవాలన్నదే రామోజీరావు ఆశయమని వెల్లడి

ఈనాడు డిజిటల్ - విశాఖపట్నం
అచ్యుతాపురం - న్యూస్‌టుడే

హుద్‌హుద్ తుపానుతో నష్టపోయిన 80 మంది బాధితులకు 'ఈనాడు' సహాయనిధి ద్వారా నిర్మించిన 80 పక్కా ఇళ్లను 'ఈనాడు' ఎండీ సీహెచ్ కిరణ్ శుక్రవారం అందజేశారు. విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలం తంతడి-వాడపాలెంలో కట్టిన హుద్‌హుద్ గృహ నిర్మాణ సముదాయాన్ని ఆయన ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎప్పుడు, ఎక్కడ ప్రకృతి విలయరూపం చూపించినా బాధిత ప్రజలకు చేయూతగా నిలవాలన్నదే రామోజీరావు ఆశయమని పేర్కొన్నారు. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపాను సృష్టించిన బీభత్సంతో నష్టపోయిన మత్స్యకారుల కష్టాన్ని కొంతవరకైనా తగ్గించాలనే పక్కా ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చామని చెప్పారు. ఈ గృహ నిర్మాణ కార్యక్రమానికి 'ఈనాడు' గ్రూపు సంస్థలు తమ వంతు సహాయంగా రూ.3 కోట్లు ఇచ్చాయన్నారు. 'ఈనాడు' పిలుపుతో దాతలు రూ.3.16 కోట్లు విరాళాల రూపంలో అందించారని వివరించారు. వీటితో తంతడి-వాడపాలెంలో 80 ఇళ్లు, శ్రీకాకుళం జిల్లాలోని రెండు గ్రామాల్లో 64 ఇళ్లను నిర్మించినట్లు చెప్పారు. మొదట్లో స్థలాలు అప్పగించడం, ఇతరత్రా పనుల్లో కొంత ఆలస్యమైనా నాణ్యమైన నిర్మాణాలు పూర్తిచేయడంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, నేతలు అందించిన సహకారానికి రామోజీ గ్రూపు సంస్థల తరఫున కిరణ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కాలనీ నిర్మాణం చక్కగా ఉందని, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి హరితమయంగా మార్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. శ్రీకాకుళం జిల్లాలో రెండు చోట్ల (మిగతా 2లో)

పంటల మద్దతు ధర పెంపు!

- సాగు వ్యయానికి 1.5 రెట్లు అధికం
- వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం
- ప్రధాని మోదీ వెల్లడి

దిల్లీ: అన్నదాతలకు ప్రధాని మోదీ శుభవార్త వినిపించారు. వరి సహా ఖరీఫ్ పంటల సాగు వ్యయానికి కనీసం 1.5 రెట్లు అధికంగా కనీస మద్దతు ధరను స్థిరపర్చనున్నట్లు శుక్రవారం చెప్పారు. వచ్చే వారం జరగనున్న కేంద్ర మంత్రివర్గంలో ఇందుకు ఆమోదం తెలపనున్నట్లు వెల్లడించారు. చెరకు సముచిత ధరను (ఎఫ్ఆర్‌పీ) కూడా వచ్చే రెండు వారాల్లో ప్రకటిస్తామని చెప్పారు. ఈ ధర 2017-18 కన్నా ఎక్కువగా ఉంటుందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాఖండ్, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన 140 మంది చెరకు రైతుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. గత పది రోజుల్లో రైతులతో మోదీ సమావేశం కావడం ఇది రెండోసారి. ప్రస్తుత 2017-18 చెరకు సాగు కాలానికి ఎఫ్ఆర్‌పీ క్వింటాలుకు రూ.255గా ఉంది. వచ్చే సాగు కాలంలో ఈ క్వింటాలుకు రూ.20 పెంచాలని వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ ప్రతిపాదించింది. 2018-19 ఖరీఫ్ (మిగతా 2లో)

ఆశా కార్యకర్తలకు రూ.3 వేల వేతనం

- ప్రోత్సాహకాల కింద మరో రూ.3వేలు వచ్చే అవకాశం
- వరాలు ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు 7లో

పదోరోజుకి రమేష్ 'ఉక్కు' దీక్ష

- క్షీణిస్తున్న ఆరోగ్యం
- నేడు పరామర్శకు చంద్రబాబు రాక 6లో

ప్రమాదాల 'ఘాటు'

- పవిత్ర సంగమం నుంచి దుర్గా ఘాట్ వరకూ రక్షణ చర్యలు కరవు
- కనీసం హెచ్చరికల బోర్డులూ లేవు

అందంగా తీర్చిదిద్దిన ఘాట్‌లు ప్రమాద హేతువులవుతున్నాయి. జనం అధికంగా వస్తున్నా రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. విజయవాడ సమీపంలోని ఘాట్‌లలో వరుస ప్రమాదాలు భీతి గొలుపుతున్నాయి. ఏడెనిమిది నెలల కిందట పవిత్ర సంగమంవద్ద పడవ మునిగిన ప్రమాదాన్ని మరువకముందే నాలుగు రోజుల కిందట అక్కడే మరో నలుగురు విద్యార్థులు జల సమాధి కావడం భయపెడుతోంది. - పూర్తి వివరాలు 12లో

ఎలాంటి రక్షణ చర్యలు లేని పవిత్ర సంగమం

ఇదీ సంగతి!



పుట్టినరోజే శిశువుకు ఆధార్!

- విజయవాడ ఆస్పత్రుల్లో ప్రయోగాత్మకంగా అమలు
- త్వరలో రెండు తెలుగు రాష్ట్రాల్లో..
- ముఖకవళికలతో గుర్తించే కొత్త పరిజ్ఞానం
- 'ఈనాడు'తో 'ఆధార్' ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: 'ప్రసవం రోజే శిశువులకు ఆధార్ గుర్తింపు సంఖ్యను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. విజయవాడలోని కొన్ని ఆస్పత్రుల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసింది. అది ఉపయుక్తంగా ఉండటంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో త్వరలో అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విధానాన్ని దశలవారీగా విస్తరించాలని నిర్ణయించినట్లు ఆధార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన 'ఈనాడు'తో మాట్లాడుతూ.. 'ఒకట్రెండు నెలల్లో ఈ ఆస్పత్రుల్లోనే ఆధార్ నమోదు ప్రక్రియను ప్రారంభిస్తాం. ఆస్పత్రి సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తాం. బిడ్డను ప్రసవించిన (మిగతా 2లో)

ఈనాడు పక్కా అండ

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణంలో ఉన్న గృహ సముదాయాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. హుద్‌హుద్ తుపాను బాధితుల పునరావాస కాలనీకి అవసరమైన భూమిని వివిధ అనుమతుల ప్రక్రియల అనంతరం 2016లో ప్రభుత్వం 'ఈనాడు'కు అప్పగించింది.

ప్రభుత్వ నిధులతో రక్షిత నీటి సదుపాయం కల్పిస్తాం

జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఈనాడు' సంస్థ 80 మంది లబ్ధిదారులకు జీ ప్లస్ వన్ పద్ధతిలో పక్కా ఇళ్లు నిర్మించినట్లు చెప్పారు. రక్షిత నీటి సదుపాయం, ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వ నిధులను ఖర్చుచేస్తామన్నారు. ఈ సందర్భంగా ఈనాడు ఎండీ కిరణ్‌ను ఎమ్మెల్యే పంచకర్ల, ఎమ్మెల్సీ చలపతిరావు, కలెక్టర్, జడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవాని, తంతడి సర్పంచి ఉమాదేవి, ఎంపీపీ రమేష్‌కుమార్, జడ్పీటీసీ సభ్యులు జె.శ్రీనివాసరావు శాలువతో సత్కరించారు. అంతకుముందు సంస్థ తరపున నిర్మించిన 80 ఇళ్ల తాళం చిహ్నాన్ని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు కిరణ్ అప్పగించారు. కొంత మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో 'ఈనాడు' సీనియర్ అసోసియేట్ ఎడిటర్ డీఎన్ ప్రసాద్, గృహనిర్మాణ సంస్థ పీడీ ఎంజీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ సముదాయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న 'ఈనాడు' ఎండీ కిరణ్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఈనాడు సీనియర్ అసోసియేట్ ఎడిటర్ డీఎన్ ప్రసాద్ తదితరులు

పంటల మద్దతు ధర పెంపు!

(మొదటి పేజీ తరువాయి)

కాలానికి నోటిఫై చేసిన పంటలకు కనీస మద్దతు ధరను ఇన్‌పుట్ వ్యయంలో 150శాతంగా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలుపుతుందని ప్రధాని ప్రకటించినట్లు ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం రైతుల ఆదాయం పెరగడానికి దోహదం చేస్తుందని పేర్కొంది. వ్యవసాయ ఆదాయం పెరగడానికి తుంపర, బిందు సేద్యం చేపట్టాలని ప్రధాని రైతులకు సూచించారు. సౌరవిద్యుత్తుతో నడిచే పంపులను ఉపయోగించాలని, పొలాల్లో సౌరఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 2022 నాటికి రసాయన ఎరువుల వాడకాన్ని 10 శాతం తగ్గించాలన్నారు.

చెరకు రైతులకు బకాయిలు చెల్లించడానికి తీసుకున్న చర్యలను మోదీ శుక్రవారం నాటి సమావేశంలో వివరించారు. పెట్రోల్‌లో 10శాతం ఇథనాల్‌ను కలపాలన్న ప్రభుత్వ ప్రణాళికను వివరిస్తూ చక్కెర రంగంలో సుస్థిరతకు ఇది దీర్ఘకాలిక పరిష్కారమని చెప్పారు.

DSC SGT, PET, SA (Maths/Phy.Sci./Bio.Sci./Social)
School Asst. కు ఇంటర్ సిలబస్ దృష్ట్యా స్టేట్ ఫేమ్ ఫ్యాకల్టీచే
FREE DEMO : 1-7-18@10AM by
Phy.Sci.: రాము, వేణు, Bio.Sci. : ఆంజనేయులు, హరినాథ్, విక్రమ్
Maths : నాగకిష్ణ, రాజశేఖర్, SGT : రాంబాబు, సుధీర్, PET : వంశీ
బాసర ఇనిస్టిట్యూట్ ఆంధ్ర హాస్పిటల్ దగ్గర, ఈగల్ రెస్టారెంట్ ఎదురుగా గవర్నర్‌పేట, విజయవాడ 9030140123 8374022333

కొండచరియలు విరిగిపడి నలుగురు మృతి

ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని దిగువ సియాంగ్ జిల్లా కేంద్రానికి ఐదు కిమీ దూరంలో గల బసర్-అకజన్ రోడ్డులో 20 మంది ఐటీబీపీ సిబ్బంది ప్రయాణిస్తున్న మినీబస్సుపై పెద్ద బండరాయి పడటంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. కొండ చరియలు విరిగి పడటంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

IBPS POs క్లర్క్స్ DSC రేపే ఫ్రీ SA సోషల్ డెమో
SI కానిస్టేబుల్స్ IAS గ్రూప్-1
కలామ్ IAS కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి 90596 29934

పర్‌స్పెక్టివ్స్ / సైకాలజి ఎలా ప్రిపేర్ కావాలి?
Watch Live Porgramme Today on 10TV
Timings 5.30 - 6.00 pm by డా॥ మోజెస్
EMILY Hyderabad. @ Metro Railway Station, Ameerpet. 9989212294

YES&YES PUBLICATIONS
AP-DSC, SGT(All), SA (Maths), Social, Biology, Telugu, English, G.K.
90320 64822

2017 - SI సెలక్షన్స్‌లో స్టేట్ 1st ర్యాంకు సాధించిన సంస్థచే
SI & కానిస్టేబుల్స్ 18వ బ్యాచ్: 7-7-18, 10am
Seperate Batches for TM & EM జిమ్ & హాస్టల్ కలదు
శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యుత్‌నగర్, కాకినాడ, తూ.గో.జిల్లా. 0884 - 2362744 98482 56254 98481 36254

ధర్మపోరాట సభావేదికపై సంఘీభావం తెలుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తెదేపా నేతలు

నమ్మించి మోసం

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతి బహిరంగ సభలో ప్రధాని చేసిన ప్రసంగాన్ని వినిపించారు. అమరావతిపై శీతకన్ను ఎందుకు, ఏపీ రాజధాని అభివృద్ధిలో మీకు బాధ్యత లేదా అంటూ కేంద్రాన్ని నిలదీశారు. 'మనల్ని మోసం చేసిన వారిపై ఇక పోరాటమే శరణ్యం. అందుకే ధర్మపోరాటం చేస్తున్నాం. వంచించబడిన తెలుగుజాతి కోసం ఉక్కుపిడికిలితో విజయం సాధించే వరకు ప్రతి ఒక్కరు పోరాటం చేయాలి. కొంతమంది... కుట్రదారులతో కలిసి పనిచేస్తున్నారు. అంతిమ విజయం ధర్మానిదే అవుతుంది...' అని చంద్రబాబు పేర్కొన్నారు. తెదేపా బలపడుతుందనే ఎమ్మెల్యే స్థానాలు పెంచడం లేదని చెప్పారు.

ఎవరి ఖాతాలోనైనా 15 పైసలు పడిందా?

భాజపా ప్రభుత్వ చర్యలతో రూపాయి విలువ పతనమైంది. కొత్తగా ఒక వార్త చూశాం. స్విస్ బ్యాంకులో 50శాతం కొత్త ఖాతాలు పెరిగాయి అంటున్నారు. ఇవి ఎవరి ఖాతాలు? ఎన్నికల సమయంలో ప్రధాని నల్లధనం వెనక్కి తెచ్చి ప్రతి ఖాతాలో వేస్తామన్నారు. ఎవరి ఖాతాలోనైనా 15 పైసలు పడిందా? నల్లధనం తెస్తామన్న మాటలు ఏమయ్యాయి. జీఎస్‌టీతో పేదల నడ్డి విరిగింది. చిరు వ్యాపారులు చితికిపోతున్నారు. మాటలు ఎక్కువ చెబితే దేశానికి లాభం లేదు.

అదే స్ఫూర్తితో పోరాడాలి

తూర్పుగోదావరి జిల్లా స్ఫూర్తికి మారుపేరు. సత్యాగ్రహ ఉద్యమ సమయంలో ఈ ప్రాంతానికి చెందిన దువ్వూరి సుబ్బమ్మ బ్రిటీష్ వారిని దూషించినందుకు... క్షమాపణ అడిగితే నా కాలి గోరు కూడా చెప్పదని తిరుగుబాటు చేశారు. అదే ఉక్కు సంకల్పంతో ఇప్పుడు మనం పోరాటం చేయాలి. ఈ జిల్లాలో ఏ పార్టీకి ఆదరణ ఉంటే అదే పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుంది. కాకినాడలో పెట్రోకెమికల్ కారిడార్ ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రాజెక్టుకు నష్టాలు వస్తే సాయం చేసేందుకు ఏర్పాటు చేసే నిధి కింద (వైబులిటీ గ్యాప్ ఫండ్) రూ.5600 కోట్లు కట్టమంటున్నారు. మన రాష్ట్రానికి వచ్చే సరికి ఆ ప్రాజెక్టు మొత్తంలో 14 శాతం చెబుతూ ఇతర రాష్ట్రాల విషయంలో 12 శాతమే తీసుకోవడం ఏమిటి. ఇది వివక్ష కాదా? పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం డబ్బులు అడిగితే ఇవ్వడం లేదు. అయినా ఒక్క రోజు కూడా జగన్, పవన్‌లు ఎందుకు మాట్లాడటం లేదు. ఎవరు అడ్డుపడినా పోలవరం ఆగదు. ప్రపంచంలో 5 అగ్ర నగరాల జాబితాల్లో అమరావతి ఉండేలా నిర్మిస్తాం. కడపలో ఉక్కు పరిశ్రమ కోసం ఒక ఎంపీ, ఎమ్మెల్సీ నిరాహారదీక్ష చేస్తున్నా లెక్కలేదు. గాలి జనార్దన్ ముందుకు రాగా లేనిది కేంద్రం చేయలేదా? దీనిపై సమాధానం చెప్పాలి. ఉక్కుపై ఎంపీలు అడిగితే మాయమాటలు చెప్పారు. లాభాలు వస్తాయని తెలిసీ సహాయం చేయడం లేదు. విద్యాసంస్థలకు రూ.11000 కోట్లు ఇవ్వాల్సి ఉంటే రూ.660 కోట్లు ఇచ్చారు. ఇవి పూర్తి చేయడానికి ఇలా నిధులు ఇస్తే 22 సంవత్సరాలు పడుతుంది. ఇప్పటి యువత అప్పటికి వయోవృద్ధులు అవుతారు. ఎందుకింత అసూయ, విద్వేషం. ఏపీ ప్రజలు ఈ దేశంలో భాగం కాదా? మూడేళ్ల కాలంలో ప్రతి ఇంటికి కుళాయి నీరు ఇస్తాం. వచ్చే డిసెంబరు నాటికి ప్రతి గ్రామంలో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో నీతివంతమైన పాలన ఇస్తున్నాం.

రాష్ట్రానికి మొండి చేయి

పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్రం మొండి చేయి చూపింది. అభివృద్ధికి సహాయ నిరాకరణ చేయడం, ఆటంకాలు కల్పించడం, అడ్డుపడటం చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఏమనాలి. 9,10 షెడ్యూల్, ఆస్తుల విభజన మీద ఒక్క సమావేశం కూడా పెట్టలేదు. హోదా ఇస్తామని చెప్పి ఇప్పుడు ప్రత్యేక వాహక సంస్థను (ఎస్పీవి) పెట్టుకుంటే డబ్బులు వేస్తామంటున్నారు. హోదా ఇచ్చే వరకు కేంద్రాన్ని వదలం. ఆంధ్రులది ఉడుంపట్టు. కాకినాడ సభ నుంచి కూడా తీర్మానం చేసి పంపుతాం. పవన్‌కళ్యాణ్ సమక్షంలోనే గత ఎన్నికల్లో హామీలు ఇచ్చారు. వాటిపై ప్రశ్నించకుండా రోడ్ల మీద పడి ఆయన నన్ను విమర్శిస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై పవన్ కమిటీ వేశారు. రూ.75వేల కోట్లు రావాలని తేల్చారు. ఆ తర్వాత దానిపై ఏమీ మాట్లాడరు. భాజపా వాళ్లు రాయలసీమ డిక్లరేషన్ అంటారు. పవన్‌కళ్యాణ్ ఉత్తరాంధ్ర ఉద్యమం అంటారు. జగన్‌మోహన్‌రెడ్డి నేరాలు, అశాంతితో దెబ్బతియ్యాలని ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో అన్నీ రాజకీయ పార్టీలు ఏపీకి సహకరిస్తుంటే జగన్, పవన్ మాత్రం ఎదురుదాడి చేస్తున్నారు. సాక్షి అసత్య పత్రిక... మోదీ భజన చేస్తోంది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడికి అభిమానం ఉంటే నన్ను విమర్శించకుండా కేంద్రానికి చెప్పి కాపుల రిజర్వేషన్ బిల్లు పాస్ చేయించాలి. కోతిమూకలు అధికారంలోకి వస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతోంది. ఇప్పుడిప్పుడే సమస్యల నుంచి బయటకు వస్తున్నాం... ఆలోచించి నిర్ణయం తీసుకోండి. కేంద్రానికి దమ్ముంటే జగన్ ఆస్తులను జప్తు చేయాలి. 2004కి ముందు ఆస్తులు ఆయనకే ఇచ్చి... జగన్ తండ్రి అధికారంలోకి వచ్చాక కూడా 20శాతం లాభం కూడా ఇచ్చి మిగిలినవి జప్తు చేయాలి. భాజపాకి ఆ ధైర్యం ఉందా? ఇది లాలూచీ రాజకీయం కాదా? వీరిని అడ్డుపెట్టుకుని నరేంద్రమోదీ నాటకాలు ఆడుతున్నారు. పవన్ నగలు ఎక్కడికో వెళ్లాయంటున్నారు. ఎవరైనా తప్పు చేస్తే వెంకటేశ్వరస్వామి ఈ జన్మలోనే శిక్ష విధిస్తాడు. వెంకటేశ్వరస్వామి పవిత్రత కాపాడే విషయంలో రాజీ లేదు. రమణదీక్షితులు ద్వారా కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. రాజకీయాలు, కుట్రలు, దొంగపూజలు, క్షుద్రపూజలు చేయడం మంచిది కాదు. కుట్రలు చేయకుండా స్వామి వారిని క్షమించమని అడగాలి. పవిత్రత పోగొట్టాలని ప్రయత్నం చేస్తే వారి ఆటలు సాగనివ్వను.

భారీగా జనసందోహం

కాకినాడ ధర్మపోరాట సభకి భారీగా జనసందోహం తరలివచ్చింది. ఇది చూసి...సముద్రఘోషలా తమ నిరసనను కేంద్రానికి వినిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ సభ విజయవంతం కావడంతో తెదేపా శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి. సభాప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఇరువైపులా రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. తొలుత చినుకులు పడినా ఆ తర్వాత వర్షం ఆగిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, తెదేపా నేతలు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ వెన్నుపోటు పొడిచారు: మంత్రి లోకేష్

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 29 సార్లు దిల్లీకి వెళ్లినా కేంద్ర ప్రభుత్వం మనసు మారలేదని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెన్నుపోటు పొడిచారని, తెలుగుజాతితో పెట్టుకోవద్దు.. అంటూ తెదేపా జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తీవ్రంగా ధ్వజమెత్తారు. 'కర్ణాటక ఎన్నికల్లో తెలుగు ప్రజలు భాజపాకి ట్రైలర్ మాత్రమే చూపారు. 2019 ఎన్నికల్లో పూర్తి సినిమా చూపిస్తారు. పవన్‌కళ్యాణ్, జగన్‌లకు దమ్ముంటే ప్రధానిని నిలదీయాలి. ప్రధానికి నేను 'జగన్‌మోదీరెడ్డి'గా పేరు పెడుతున్నా. జగన్ తూర్పుగోదావరి జిల్లాలో పాదయాత్ర చేస్తూ వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉంటున్నారు. 68సంవత్సరాల వయసులో రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతుంటే ఆయనపై అభాండాలు వేస్తున్నారు...' అని పేర్కొన్నారు.

పర్సన్ ఇన్‌ఛార్జులా.. ప్రత్యేక అధికారులా?

- తదుపరి నిర్ణయంపై తర్జనభర్జన
- ఆగస్టు 25తో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సర్పంచుల పదవీ కాలం ఆగస్టు 25తో ముగియనున్న నేపథ్యంతో ప్రత్యేక అధికారులను నియమించాలా? సర్పంచులనే పర్సన్ ఇన్‌ఛార్జులుగా కొనసాగించాలా? అనే అంశంపై ప్రభుత్వ స్థాయిలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. సీనియరు అధికారులు పంపిన నివేదికపై త్వరలో సమగ్రంగా చర్చించి వచ్చే నెల 15లోగా నిర్ణయం వెల్లడించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం మరో 2 నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో కలెక్టర్లు ఈనెల 15న పంచాయతీలవారీగా ఎన్నికల జాబితాలను ప్రకటించారు. వీటి నుంచి కులాలవారీగా ఓటర్ల గణన చేపట్టి సర్పంచి, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేయాలి. ఈ ప్రక్రియను వచ్చే నెల 15లోగా పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి కలెక్టర్లకు ఎలాంటి ఆదేశాల్లేవు. సర్పంచుల పదవీకాలం ముగిసినా వెంటనే మళ్లీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం లేదు. ఒకవేళ అసెంబ్లీ, పార్లమెంటుకు ముందస్తు ఎన్నికలొస్తే అదే సమయంలో అవి సాధ్యం కాదనే అభిప్రాయంలో ప్రభుత్వం ఉంది.

అందరితో చర్చించాకే నిర్ణయం: పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోని ఉన్నతాధికారుల బృందం ఇటీవల ఏం చేయాలనే దానిపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించింది. దీనిపై ఇప్పటికే ప్రాథమికంగా చర్చించిన ప్రభుత్వ పెద్దలు... సీనియరు మంత్రుల అభిప్రాయాన్ని తెలుసుకోవాలని నిర్ణయించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలోనూ చర్చించాక అత్యధికుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలోగా ఈ ప్రక్రియను ముగించి రెండో వారంలో మంత్రి మండలి సమావేశంలో ఆ నిర్ణయానికి ఆమోదం తీసుకోవాలని యోచిస్తున్నారు.

ఎన్నికల సంఘానికి వివరణ?: వచ్చే నెల 15లోగా పంచాయతీ ఓటర్ల జాబితా ఆధారంగా కులాల గణన పూర్తిచేసి రిజర్వేషన్లు ఖరారు చేయకపోతే నిబంధనల ప్రకారం ఎన్నికల సంఘం రాష్ట్రానికి తాఖీదు పంపుతుంది. గడువులోగా ప్రక్రియను పూర్తి చేయకపోవడానికి కారణమేంటి? ఎన్నికలను నిర్వహించే యోచన ఉందా? లేదా? ఇందుకు కారణాలు తెలియజేయాలని కోరుతుంది. ఈ పరిణామాలను ఇప్పటికే అంచనా వేసిన ప్రభుత్వం ఎన్నికల సంఘం నుంచి తాఖీదు రాగానే ఎలాంటి వివరణ పంపాలనే విషయంపై ఉన్నతాధికారులతో చర్చించింది. ఎన్నికల నిర్వహణకు ఉండే ఇబ్బందులను వివరించి తదుపరి ఎన్నికల వరకూ పర్సన్ ఇన్‌ఛార్జి/ప్రత్యేక పాలనపై అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఐడీబీఐ ఏజీఎం సహా నలుగురి అరెస్టు

చేపల చెరువుల పేరిట రుణాల్లో అక్రమాలు
106 మందిని ముద్దాయిలుగా చేర్చిన సీబీఐ

ఈనాడు, విశాఖపట్నం: చేపల చెరువు పేరిట అడ్డదారిన రుణాలకు సంబంధించిన కేసులో ఐడీబీఐ(ఇండిస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) పూర్వ ఏజీఎం సి.హరీష్ సహా నలుగురిని విశాఖ సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. గుంటూరు బ్యాంకు శాఖ పరిధిలో చేపల చెరువుల కోసం రూ.23.29కోట్ల రుణాలు మంజూరయ్యాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చేపల చెరువులు గానీ, లీజుకు తీసుకున్న భూములు గానీ లేనట్లు తేలింది. ప్రధాన ముద్దాయిగా గుంటూరు ఏజీఎం హరీష్‌ను చేర్చారు. తదుపరి మాడా శ్రీనివాసరావు, గుండూరు మల్లికార్జునరావు, మాడా సుబ్రహ్మణ్యం... ఇలా మొత్తం 106 మంది ముద్దాయిలున్నారు. ప్రథమ ముద్దాయి హరీష్ సహా అతడికి సహకరించిన ముగ్గురిని కూడా అరెస్టు చేసి విశాఖలోని సీబీఐ కేసుల ముఖ్య ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. గత ఏడాది చేపల చెరువులకు రుణాల మంజూరులో భారీ అక్రమాలు జరిగినట్లు సీబీఐ గుర్తించడం.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ కుంభకోణం దుమారం రేగింది. మొత్తం మీద రూ.680 కోట్ల మేరకు ఈ కుంభకోణం జరిగినట్లు విశాఖ సీబీఐ కేసు నమోదు చేసింది.

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, హైదరాబాద్
సాంకేతిక విద్యా శాఖ
TSEAMCET-2018 (M.P.C. స్ట్రీమ్)
రెండవ విడత ప్రవేశ ప్రకటన
వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిమిత్తం ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన మరియు ఆప్షన్లను ఎంచుకొనుట.
TSEAMCET-2018లో అర్హులై B.E./B.Tech/ఫార్మసీ కోర్సుల నందు ప్రవేశం కోరుతున్న మరియు మొదటి విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనిన లేదా పాల్గొనని అభ్యర్థులకు తెలియజేయునదేమనగా రెండవ విడత వెబ్ కౌన్సెలింగ్ 6-7-2018న ప్రారంభమౌతుంది. తదుపరి వివరములు మరియు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను వెబ్‌సైట్ : https://tseamcet.nic.in నందు చూడవచ్చును.
తేది: 28-6-2018 సం/- నవీన్ మిట్టల్, IAS
ప్రదేశము: హైదరాబాద్ కన్వీనర్, TSEAMCET-2018 & CTE
DIPR No: 952DP/CL/ADVT/1/2018-19

EKALAVYA IAS ACADEMY
www.ekalavyaias.com, ekalavya IAS App
13 సం॥ల అనుభవం కలిగిన ఎస్. విజయ్ కుమార్ రెడ్డి సార్ చే స్థాపించబడిన
50/50 విద్యార్థులకు UPSC /కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ Assistance.
Degree + IAS (50 students) 3yrs Integrated Program
After Degree - Morning Batch (1 year)
During Degree - Evening Batch(2 years)
ఇంటిని మరిపించే Hostel facility
Civil Services IAS Exam పై ఉచిత అవగాహనా సదస్సు on July 1st SUN. 10 am & 5 pm
IAS Coaching సొంత పుస్తకాలు గల ఏకైక సంస్థ
విద్యార్థులు / తల్లిదండ్రులు అందరూ ఆహ్వానితులే
Beside Nagarjuna Hospital,Kanuru, VIJAYAWADA. Ph: 6300181832

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, హైదరాబాద్
సాంకేతిక విద్యా శాఖ
TSEAMCET (M.P.C) / (Bi.P.C)/ TSECET / TSICET-2018 ప్రవేశ ప్రకటన
స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్
యోగ్యులైన మరియు అర్హులైన అభ్యర్థులకు తెలియజేయునది ఏమనగా TSEAMCET (M.P.C) / (Bi.P.C)/ TSECET/ TSICET-2018 ద్వారా బి.ఇ/ బి.టెక్/ ఫార్మసీ/ ఇంజనీరింగ్ /ఎంబిఎ మరియు ఎంసిఎ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశం కొరకు 21-6-2018వ తేదీనాటి జి.ఒ.ఎంఎస్. 7 యువజన అభివృద్ధి, పర్యాటక మరియు సాంస్కృతిక (క్రీడల) శాఖనందు పొందుపరచబడిన మార్గదర్శకాల ప్రకారం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోటా క్రింద రిజర్వేషన్‌ను క్లెయిమ్ చేస్తున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం వెబ్‌సైట్ https://tseamcet.nic.in లో ఉంచబడిన షెడ్యూలు ప్రకారం సాంకేతిక విద్యా భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్‌వద్ద హాజరు కావలెను.
తేది: 28-6-2018 సం/- నవీన్ మిట్టల్, ఐఏఎస్
ప్రదేశం: హైదరాబాద్ కన్వీనర్, TSCET-2018 & CTE
DIPR 953DP/CL/ADVT/1/2018-19

పుట్టినరోజే శిశువుకు ఆధార్!

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రుల వివరాలు, వారి ఆధార్ సంఖ్యను పరిగణనలోకి తీసుకుని శిశువుకూ సంఖ్యను కేటాయిస్తాం. ప్రస్తుతానికి వేలిముద్రలతో పనిలేదు. అయిదేళ్ల వయసు వచ్చాక వేలిముద్రలు నమోదు చేయించుకోవాలి. అవి అదే సంఖ్యకు అనుసంధానమవుతాయి. ఇప్పటి వరకు అందుబాటులో లేని విధానాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలు చేయాలని నిర్ణయించాం.

5, 15 సంవత్సరాలకు వేలిముద్రలు

పిల్లలకు అయిదు సంవత్సరాల వయస్సు నాటికి వేలిముద్రల్లో కొంతమేర స్పష్టత వస్తుంది. వాటిని ఐదో ఏట నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. 15 సంవత్సరాలు దాటాక పిల్లలు మరోదఫా వేలిముద్రలు నమోదు చేసుకోవాలి. వేలిముద్రల్లో మరింత స్పష్టత వస్తుంది. ఆ తర్వాత వాటిని మార్చుకోవాల్సిన అవసరం లేదు. తెలంగాణలో అయిదేళ్లలోపు చిన్నారులు 28,83,939 మంది ఉన్నారు. వారిలో 18,66,311 మందికి ఆధార్ నంబర్లను కేటాయించాం. ఆంధ్రప్రదేశ్‌లో 37,70,250 మంది చిన్నారులకుగాను 25,17,082 మందికి కేటాయించాం. రెండు రాష్ట్రాల్లో కలిపి 22.71 లక్షల మంది ఆధార్ వివరాలు నమోదు చేయాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ద్వారా చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్నాం.

'ఆధార్' ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి

ముఖ కవళికల ద్వారా ఆధార్

వేలిముద్రలు, కనుపాపలు నమోదు కానప్పుడు ఆధార్ పని చేయని పరిస్థితి వస్తుంది. వేలిముద్రలు లేకపోతే కనుపాపలైనా ఆధారంగా నిలిచేవి. కొన్ని సందర్భాల్లో ఆ రెండూ పని చేయటం లేదు. ఇలాంటి సందర్భాల్లో ఇబ్బందుల్ని తొలగించేందుకు ముఖకవళికల ద్వారా వారిని గుర్తించే విధానాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో త్వరలో అమలు చేయనున్నాం. వేలిముద్రలు పని చేయకపోతే పింఛన్లు, నిత్యావసర సరకులు తీసుకునేందుకు ఇబ్బందులు వస్తున్నాయి. ఈ సాంకేతికతతో అలాంటి సమస్య ఉండదు. గతంలోని ఆధార్ ఫొటో ఆధారంగా తాజాగా తీసిన ఫొటోను కంప్యూటర్ అనుసంధానం చేసి, మనిషిని గుర్తిస్తుంది.

తెలంగాణలో అందరికీ ఆధార్

తెలంగాణలో అందరికీ ఆధార్ కార్డులను అందచేస్తాం. రాష్ట్రంలో 3,84,80,378 మంది జనాభా ఉండగా.. 3,86,18,629 మందికి ఆధార్ కార్డులు ఇచ్చాం. జనాభా కన్నా 1,38,251 కార్డులు అధికంగా జారీ అయ్యాయి. ఉద్యోగం, ఉపాధి, చదువుల కోసం తెలంగాణకు వలసలు రావటంతో జనాభా కన్నా అధికంగా కార్డులు పొందారు. ఏపీలో 5,28,83,163 మంది ఉండగా 5,18,23,413 మందికి ఆధార్ కార్డులు జారీ చేశాం. మిగిలిన వారికీ సాధ్యమైనంత త్వరగా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఏపీలో 1,672, తెలంగాణలో 1,230 ఆధార్ నమోదు కేంద్రాలు పని చేస్తున్నాయి. బ్యాంకుల్లో కూడా నమోదు చేస్తున్నారు. బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేసేందుకు ఇవి తోడ్పడుతున్నాయి.' అని వేణుగోపాల్‌రెడ్డి వివరించారు.

గ్రహం అనుగ్రహం

30-6-2018 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం గ్రీష్మ రుతువు; నిజ జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
విదియ: మ. 1-02 తదుపరి తదియ
ఉత్తరాషాఢ నక్షత్రం: సా. 5-00 తదుపరి శ్రవణం
అమృత ఘడియలు: ఉ. 9-54 నుంచి 11-41 వరకు
వర్జ్యం: రా. 9-25 నుంచి 11-11 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-32 నుంచి 7-16 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5-32; సూర్యాస్తమయం: సా.6-34

కృత్రిమ మేధ రోబో.. చక్కటి కాఫీ.. బ్లూబెర్రీ పళ్లు

- ఐఎస్ఎస్ వ్యోమగాములకు పంపించిన శాస్త్రవేత్తలు

కేప్ కెనావెరల్: ఫ్లోరిడాలోని కేప్ కెనావెరల్‌లోని ప్రయోగవేదిక నుంచి అంతరిక్షంలోకి దూసుకుపోతున్న 'స్పేస్-ఎక్స్'కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ఇది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి సోమవారానికి చేరుకోనుంది. ఇందులో మొదటిసారిగా వృత్తాకారంలో ఉన్న కృత్రిమ మేధస్సుతో పనిచేసే రోబో 'సైమన్'ను పంపించారు. ఐఎస్ఎస్‌లో ఉన్న జర్మనీ వ్యోమగామి అలెగ్జాండర్ గెర్స్ట్‌కు సైన్స్‌ప్రయోగాల్లో సహకరించనుంది. సైమన్‌కు కావాల్సిన కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్‌ను ఐబీఎం సమకూర్చింది. ఒకే జన్యువులున్న 20 గోధుమరంగు ఆడ ఎలుకలను సైతం ఈ రాకెట్‌లో పంపించారు. ఎలుకలు ఐఎస్ఎస్‌లో ఉన్నప్పుడు, భూమిపై ఉన్నప్పుడు వాటి కడుపులో ఉన్న బ్యాక్టీరియాలో ఏమైనా తేడాలుంటాయా? అనే విషయాన్ని నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయం పరిశోధకులు అధ్యయనం చేయనున్నారు. ఇవేకాకుండా ఐస్‌క్రీమ్‌లు, టెక్సాస్ నుంచి బ్లూబెర్రీ పళ్లు, 60 గడ్డకట్టించిన కాఫీచాక్లెట్లు, వ్యోమగాములకు కావాల్సిన ఇతర ఆహారపదార్థాలు పంపించారు. వీటి మొత్తం బరువు 2600 కిలోలు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	38.0	27.0
కడప	38.0	27.0
ఒంగోలు	37.3	28.5
తిరుపతి	36.9	27.1
అనంతపురం	36.9	25.0
శ్రీకాకుళం	36.0	25.0
కర్నూలు	35.5	26.2
గుంటూరు	34.6	27.1
విజయవాడ	33.8	26.8
హైదరాబాద్	33.0	24.6
రాజమహేంద్రవరం	31.5	26.0
నరసాపురం	30.8	26.4
విశాఖపట్నం	29.1	24.8
తాడేపల్లిగూడెం	28.5	25.0

ఆంధ్రప్రదేశ్
ఉషోదయ రాష్ట్రం

అంబేద్కర్ ఆశయం – చంద్రన్న ఆచరణ

- గత 4 ఏళ్లలో ఎస్సీ సంక్షేమానికి రూ. 40,250 కోట్లు కేటాయించడమైనది.
- గత 4 ఏళ్లలో రూ. 1,411 కోట్లతో ఎస్సీ కాలనీల్లో 5,746 కి.మీ. సిమెంట్ రోడ్లు వేశాం.
- ప్రజా రాజధాని అమరావతిలో రూ. 200 కోట్లతో అంబేద్కర్ స్మృతివనం. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు.
- ఎస్సీ యువతకు ఇన్నోవా, జేసిబి వంటి వాహనాలు అందిస్తున్నాం.
- చంద్రన్న పెళ్ళి కానుక ద్వారా ఎస్సీ వధువులకు రూ. 40 వేలు అందిస్తున్నాం.
- 12.45 లక్షల ఎస్సీ కుటుంబాలకు 75 యూనిట్ల వరకు ఉచిత కరెంటును అందిస్తున్నాం.
- గత నాలుగేళ్లుగా 17, 48, 977 ఎస్సీ విద్యార్థులకు ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అందించాం.
- ఎస్సీ విద్యార్థులకు విదేశాలలో చదువుకోవడానికి వీలుగా అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా రూ. 15 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నాం.
- ఎస్సీ హాస్టళ్లను దశల వారిగా రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చుతున్నాం.
- తల్లి, పిల్లలకు పౌష్టికాహారం పెంపు కొరకు రూ. 200 కోట్లు, భూమి కొనుగోలు పథకం కొరకు రూ. 100 కోట్లు, చర్మకారుల జీవనోపాధి పెంపుకు రూ. 60 కోట్లు కేటాయించాం. డప్పు కళాకారుల పెన్షన్ కొరకు రూ. 12 కోట్లు కేటాయించాం.
- గుంటూరులో రూ. 40 కోట్లతో క్రిష్టియన్ భవనం నిర్మిస్తున్నాం. పేద క్రైస్తవులందరూ క్రిస్మస్ పండుగను జరుపుకునేందుకు క్రిస్మస్ కానుక అందిస్తున్నాం.
- ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం.
- ప్రీ మెట్రిక్ అండ్ పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు మరియు రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాల విద్యార్థులకు నెలవారీ డైట్ చార్జీలు మరియు కాస్మోటిక్, హెయిర్ స్టైల్ చార్జీల పెంపుదల.
- పోస్ట్ మెట్రిక్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపకార వేతనాల పెంపు.



జారీ చేసిన వారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఈనాడు

విలువ కోల్పోతున్న రూపాయి

డాలరుతో మారకం విలువ ప్రాతిపదికన చురుకు తగ్గి జీవన కాల కనిష్ఠ స్థాయికి పడిపోయిన రూపాయి కొంతమేర పుంజుకొన్నప్పటికీ, ఎప్పుడేం జరగనుందోనన్న భీతి ఇంకా వెన్నాడుతోంది. దాదాపు అయిదేళ్ల క్రితమూ చారిత్రక క్షీణత హడలెత్తించినప్పుడు డాలరుకు రూ.70 పలికే రోజు ఎంతో దూరంలో లేదన్న అంచనాలు ముమ్మరించాయి. మొన్న జనవరిలో రూ.63.59గా నమోదైన డాలర్ విలువ మే నెలలో రూ.67కు ఎగబాకి ఈ గురువారం రూ.69 మార్కు అధిగమించడం ఇంటాబయటా కలకలం సృష్టిస్తోంది. ఈ ఆరు నెలల్లో ఎనిమిది శాతం దాకా విలువ తెగ్గోసుకుపోయిన రూపాయిని ఊరడిల్లజేసే క్రమంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా 80 కోట్ల డాలర్ల వరకు రిజర్వు బ్యాంకు చేపట్టిన విక్రయాలు, అక్షరాలా చక్రం అడ్డేశాయి! ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లకు శ్వేతసౌధాధిపతి డొనాల్డ్ ట్రంప్ మోకాలడ్డుతున్న నేపథ్యంలో, సరఫరాలపై ఆందోళనలు పెచ్చరిల్లి అంతర్జాతీయ విపణిలో ధరలు పోటెత్తుతున్నాయి. మరోవైపు అమెరికా, చైనా నడుమ ముదురుతున్న వాణిజ్య యుద్ధవాతావరణం దేశ దేశాల కరెన్సీలపై ప్రభావం కనబరుస్తోంది! ఆ తాకిడి రూపాయి పైనా ప్రసరించిన పర్యవసానాలేమిటో కరెంటు ఖాతా లోటు విస్తృతే కళ్లకు కడుతోంది. సుమారు సంవత్సరం క్రితం స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో 0.6 శాతంగా ఉన్న భారత కరెంటు ఖాతా లోటు 2017-18 నాలుగో త్రైమాసికంలో 1.9 శాతానికి పెరిగింది. అవసరమైన కొనుగోళ్ల నిమిత్తం మరిన్ని డాలర్లు వెచ్చించాల్సిన అనివార్యతల దృష్ట్యా, ఆ లోటు జీడీపీలో రెండున్నర శాతానికి విస్తరించే ముప్పు నెత్తిన కత్తిలా వేలాడుతోంది. 41 వేల కోట్ల డాలర్లకు పైబడిన విదేశ మారకద్రవ్య నిల్వల పరిస్థితి సంతృప్తికరంగా ఉండటం సానుకూలాంశమే అయినా, రిజర్వు బ్యాంకు జోక్యంతో ఎన్నాళ్లు నెట్టుకురాగలమో ఎవరికెరుక?

ఈ కరెన్సీ మారక సంక్షోభం రూపాయికే పరిమితం కాలేదు. గత రెండేళ్లలో పెసో (ఫిలిప్పీన్స్), రియాల్ (బ్రెజిల్), రుపయ్యా (ఇండొనేసియా), యువాన్ (చైనా) తదితరాల విలువలోనూ క్షీణత నమోదైంది. ప్రస్తుత ఏడాది డాలరుతో మారకం విలువలో యూరో 4.3 శాతం, పౌండు 3.2 శాతం నష్టపోగా రూపాయి 8.2 శాతం మేర కోల్పోవడం రూపాయిపై ఆందోళన రేకెత్తిస్తోంది. నష్టతీవ్రత ఇంతటితో ఆగుతుందన్న భరోసా సైతం కొరవడటం అసలు సమస్య. ఇంకో ఏడాది వ్యవధిలో డాలరుతో రూపాయి విలువ 71కి క్షీణించవచ్చునని డీబీఎస్ బ్యాంకు, 72కి పడిపోతుందని బార్‌క్లేస్ సంస్థ భవిష్యద్దర్శనం చేస్తున్నాయి. ఇండియాకు లభించిన 'బీఏఏ2' క్రెడిట్ రేటింగ్ దృష్ట్యా అర్జెంటీనా, శ్రీలంక, టర్కీ తదితరాలకన్నా ఇక్కడి పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందన్న విశ్లేషణలు కొంత సాంత్వన పరచేవే! డాలర్ల రూపేణా రుణం పొందిన సంస్థలకు రూపాయి క్షీణత పిడుగుపాటు వంటిది. ముడిసరకును విదేశాల నుంచి దిగుమతి చేసుకునే సంస్థలపైనా ప్రతికూల ప్రభావం తథ్యం. ఎగుమతుల రంగానికి మాత్రం రూపాయి విలువలో పతనం కలిసొచ్చేదే. జీడీపీలో శాతంగా లెక్కిస్తే 2013-14 నాటికి 25.4గా ఉన్న వస్తు సేవల ఎగుమతులు అనంతర కాలంలో తగ్గుతూ వస్తున్నాయి. 2017-18లో 19 శాతానికి పరిమితమైన ఎగుమతుల్లో వృద్ధి సాధించడానికి రూపాయి క్షీణత ఏ మేరకు ఉపకరించగలదో చూడాలి. ఎగుమతులు ఊపందుకుంటేనే తప్ప రూపాయి స్థిమితపడే అవకాశం లేదంటూ వాణిజ్య పరిశ్రమల పీహెచ్‌డీ ఛాంబర్, మారక రేటులో స్థిరత్వం లేనిదే ఎగుమతి ఒప్పందాలు కష్టతరమంటున్న ఈఈపీసీ (ఇంజినీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్) విశ్లేషణలు- సంక్లిష్ట స్థితిగతులకు అద్దం పడుతున్నాయి.

ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం, విదేశ మారక ద్రవ్య నిల్వల్లో హెచ్చుతగ్గులు, అంతర్జాతీయ విపణి లావాదేవీలతో పాటు ఇతరత్రా ఎన్నో కారణాలకు అనుగుణంగా ఏ దేశ కరెన్సీకైనా ఆటుపోట్లు తప్పవు. తాజాగా పైకి తేలిన వాణిజ్య యుద్ధం, చమురు భయాలకన్నా ముందే ఇంకో కీలకాంశం రూపాయికి కలవర కారకమైంది. గత ఆరు నెలలుగా ఈక్విటీ, బాండ్ మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు (విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు) 940 కోట్ల డాలర్ల మొత్తాన్ని ఉపసంహరించుకున్నారు. ఒక్క ఏప్రిల్‌లోనే అలా తరలిపోయిన రాశి 560 కోట్ల డాలర్లు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు ప్రకటన దరిమిలా ఇక్కడి నుంచి జోరందుకున్న ఉపసంహరణలకు విరుగుడు వ్యూహాలపై కేంద్రం ఇప్పటికే దృష్టి పెట్టి ఉండాల్సింది! అయిదేళ్ల క్రితం నాలుగు నెలల వ్యవధిలో రూపాయి విలువ 18 శాతం మేర తరిగిపోయిన దశలో- యూపీఏ జమానా వల్లెవేసిన 'ఇతర కారణాలు', రిజర్వ్‌బ్యాంకు ఆలస్యంగా చేపట్టిన చర్యలపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తింది. నాటి ఘట్టాన్ని పునరావృతం కానివ్వని రీతిలో ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వ కార్యాచరణ పదునుతేలాలి. రూపాయి ధరాపతనాన్ని అడ్డుకోవడంలో రిజర్వ్‌బ్యాంకు జోక్యం తాత్కాలిక ఉపశమన చర్యే తప్ప, సంక్షోభ నివారణకది శాశ్వత సమర్థ పరిష్కారం కాదు. మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారైన భారత్ ప్రత్యామ్నాయ ఇంధన ప్రణాళికలతో సన్నద్ధం కానంతవరకు, రూపాయి క్షీణించినప్పుడల్లా గంగవెర్రులెత్తక తప్పదు. దీర్ఘకాలంలో దిగుమతుల ఆవశ్యకతను నియంత్రిస్తూ, ఎటువంటి పరిస్థితుల్లోనైనా వెలుపలి పెట్టుబడిదారుల్ని కట్టిపడేసే సరళతర స్నేహపూరిత విధివిధానాలకు మళ్లడమే దేశార్థికానికి రక్షాకవచమవుతుంది. ఏ కారణంగానైనా రూపాయి కొంత కుంగినా మదుపరుల విశ్వాసం కదలబారనివ్వని రీతిలో మౌలిక విత్త నిర్వహణ సామర్థ్యమే, జాతిని స్థిమితపరచగలుగుతుంది!

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలులోకి వచ్చి రేపటికి సరిగ్గా ఏడాది పూర్తవుతుంది. సంక్లిష్ట పన్నుల వ్యవస్థను సమూలంగా సంస్కరించి సామాన్యుడికి మేలు చేయాలన్న ఉన్నతాశయంతో ప్రారంభమైన జీఎస్‌టీ సాఫల్య వైఫల్యాలను సమీక్షించుకోవాల్సిన సందర్భమిది. పన్నుల వ్యవస్థలో గుణాత్మక మార్పులు తీసురావడం ద్వారా వ్యాపార వర్గాలు, ప్రజల మీద అదనపు పన్నుల భారం తగ్గించాలన్నదే ప్రధాన ధ్యేయంగా జీఎస్‌టీని పట్టాలకెక్కించారు. దేశవ్యాప్తంగా పన్నుల ఎగవేతకు ముకుతాడు వేసి, పన్నుల పరిధిని విస్తరించాలన్నదీ జీఎస్‌టీ స్థాపిత లక్ష్యాల్లో ఒకటి. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో కేంద్ర ప్రభుత్వం ఏడాది కాలంలో ఎంతమేరకు విజయవంతమైందన్నదే ఇప్పుడు తర్కించుకోవాల్సిన ప్రశ్న.

జీఎస్‌టీ బాటలో పాఠాలెన్నో...

దేశవ్యాప్తంగా జీఎస్‌టీ ప్రారంభానికి ముందు విస్తృతమైన చర్చ జరిగింది. ప్రభుత్వం పెద్దయెత్తున అవగాహన శిబిరాలు నిర్వహించింది. కానీ, వస్తు సేవల పన్ను అమలు మాత్రం ప్రతి దశలోనూ గందరగోళాల మధ్యే మొదలైంది. జీఎస్‌టీఎన్ నమోదు దగ్గరే అనేక సమస్యలు తలెత్తాయి. పన్ను చెల్లింపుదారులందరినీ రెండు విభాగాలుగా వర్గీకరించారు. అప్పటికే కేంద్ర ఎక్సైజ్, సేవల పన్ను లేదా విలువ జోడింపు పన్ను (వ్యాట్)ల పరిధిలో ఉన్నవారిని ఒక వర్గంగా తీర్మానించారు. పేర్లు నమోదు చేసుకోకుండా, వార్షిక టర్నోవర్ రూ.20 లక్షల పరిమితికి మించిన మరో వర్గానికి 'జీఎస్‌టీఎన్' రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశారు. పాత పద్ధతులను వదిలి జీఎస్‌టీకి మారే క్రమంలో పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొన్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. రిజిస్ట్రేషన్, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, రీఫండ్ సమస్యల పరిష్కారం వంటి విషయాల్లో తీవ్ర సంక్లిష్టతలు తలెత్తాయి. కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, లాభాపేక్షలేని ఇతర వ్యవస్థలను రిజిస్ట్రేషన్ చేయించాలా వద్దా అన్న విషయంలోనూ అయోమయం తలెత్తింది. అనతికాలంలోనే రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ఆ సంఖ్య కోటీ ఎనిమిది లక్షల 46వేలు దాటింది. ఇందులో కొత్త రిజిస్ట్రేషన్ల సంఖ్య 2018 మే నాటికి 40.66 శాతానికి చేరడం గమనార్హం.

బాలారిష్టాలు

ఆదాయ పన్ను రిటర్నుల దాఖలు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, రీఫండ్‌లకు సంబంధించి సమస్యలు అనేక నెలలు కొనసాగాయి. జీఎస్‌టీఎన్‌తో ముడివడి లెక్కకు మిక్కిలిగా సాంకేతిక సమస్యలు తలెత్తడం, అవి త్వరగా పరిష్కారం కాకపోవడం వస్తు సేవల పన్ను అమలును దెబ్బతీశాయి. జీఎస్‌టీ రేట్లు తడవకో రకంగా మారడం, శ్లాబుల్లోని అస్థిరత, పన్నుల వ్యవస్థను రూపొందించిన తీరు వ్యాపార వర్గాల్లో, ప్రజల్లో అయోమయానికి అంటుకట్టాయి. 'జీఎస్‌టీఎన్' నమోదు విషయంలో తికమకగా ఉన్న ప్రజానీకం- ప్రభుత్వం ఇష్టానుసారం జీఎస్‌టీ రేట్లు, శ్లాబులు మార్చడంతో మరింత గందరగోళానికి గురైంది. పన్ను చెల్లింపుదారుల్లో భిన్న విభాగాలకు చెందినవారికి, భిన్నమైన ఐటీ రిటర్ను దరఖాస్తులు, వేర్వేరు చెల్లింపు తేదీలు నిర్ణయించారు. 'జీఎస్‌టీఎన్' అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో చెల్లింపు తేదీలను పలుమార్లు పొడిగించాల్సి వచ్చింది. 'ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్' లెక్కింపులో గందరగోళం తలెత్తింది. ఆదాయ పన్ను రిటర్నుల దాఖలులో సంక్లిష్టతలను పరిహరించి సరళమైన వ్యవస్థను రూపొందించే లక్ష్యంతో 26వ జీఎస్‌టీ మండలి ఓ కమిటీని నియమించింది. 27వ మండలి ఆదాయ పన్ను రిటర్నుల దాఖలులో సరళమైన వ్యవస్థకు ఆమోద ముద్ర వేసింది. సంకీర్ణ డీలర్లు (కాంపొజిషన్ డీలర్స్) మినహా మిగిలినవారంతా నెలకు ఒకసారి పన్ను రిటర్నులు దాఖలు చేయాలి.

ప్రభుత్వేతర, లాభాపేక్షలేని ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా సెక్షన్-25 ప్రకారం సర్కారీ వ్యూహాత్మక నియంత్రణ కింద 'జీఎస్‌టీఎన్' ఏర్పాటైంది. కేంద్రంతో పాటు మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలన్నింటికీ 'జీఎస్‌టీఎన్'లో 24.5 శాతం, హెచ్‌డీఎఫ్‌సీకి 10 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు 10 శాతం, ఐసీఐసీఐ బ్యాంకుకు 10 శాతం, ఎల్‌ఐసీ గృహ రుణాల సంస్థకు 11 శాతం, ఎన్ఎస్ఈ వ్యూహాత్మక పెట్టుబడి 10 శాతంగా వాటా ఉంది. దేశంలో చోటుచేసుకొనే ప్రతి లావాదేవీ, పన్ను చెల్లింపు 'జీఎస్‌టీఎన్'లో నమోదవుతున్న పరిస్థితుల్లో ఆ సంస్థను ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా ఏర్పాటు చేయడంలోని హేతుబద్ధత అర్థం కాదు. జీఎస్‌టీ పోర్టల్‌లో పన్ను చెల్లింపుదారుల సమస్యల పరిష్కారంకోసం 2018 ఏప్రిల్‌లో 'ఐటీ-సమస్యల పరిష్కార వ్యవస్థ'ను ఆవిష్కరించారు. ఇటీవల జరిగిన 27వ జీఎస్‌టీ మండలి సమావేశాల్లో 'జీఎస్‌టీఎన్'ను ప్రభుత్వ సంస్థగా మార్చనున్నట్లు ప్రకటించారు. అందులో కేంద్ర ప్రభుత్వానికి 50శాతం వాటా- దామాషా ప్రాతిపదికన రాష్ట్రాలకు 50శాతం వాటా కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. 'జీఎస్‌టీఎన్' ద్వారా 2017 జులై ఒకటి నుంచి 2018 మే మధ్య కాలంలో మొత్తంగా 11.5 కోట్ల ఆదాయ పన్ను రిటర్నులు, 376 కోట్ల 'ఇన్వాయిస్'లను నిర్వహించారు.

జీఎస్‌టీ మండలి:- వస్తు సేవల పన్నుతో ముడివడిన చట్టాలు, నిబంధనలు, శ్లాబులు వంటి వాటన్నింటిపైనా తుది నిర్ణయాధికారం జీఎస్‌టీ మండలిదే! మండలి సమావేశాల నిర్వహణకు కనీసం సగం మంది సభ్యుల హాజరును 'కోరం'గా నిర్ణయించారు. ఓటింగ్ హక్కుల్లో రాష్ట్రాలకు మూడింట రెండొంతులు, కేంద్రానికి మూడింట ఒకవంతు వాటా కేటాయించారు. హాజరైనవారిలో 75 శాతం సభ్యుల ఆమోదంతోనే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. సహకార సమాఖ్య వ్యవస్థకు జీఎస్‌టీ మండలి నిజమైన ఉదాహరణగా నిలిచింది. ఇప్పటివరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకాభిప్రాయంతో వెలువరించిన నిర్ణయాలే ఎక్కువగా ఉన్నాయి. అయితే తాజాగా సహజ వాయువు, పంచదార సుంకం కేసుల్లో కేంద్ర ప్రతిపాదనలను రాష్ట్రాలు వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలో 2018 జులై 19న జరగబోయే 'మండలి' సమావేశాలు ఆసక్తికరంగా మారాయి.

జీఎస్‌టీ గంటను మోగిస్తున్న ప్రధాని మోదీ, నాటి రాష్ట్రపతి ప్రణబ్

వస్తు సేవల పన్ను ఏడాది ప్రస్థానం

'ఒకే దేశం-ఒకే పన్ను'లో నిజమెంత?: వస్తు సేవల పన్ను పేరిట ఏడు రకాల రేట్ల(0-3-5-12-18-28-28+సుంకాలు)ను అమలు చేస్తున్నారు. పైపెచ్చు దేశంలోని వస్తు సేవలన్నీ ఈ పరిధిలో లేవు. వేర్వేరు పన్ను రేట్లు, పన్ను పరిధిలో కొన్ని వస్తు సేవలకు మినహాయింపులు ఉన్న ఈ వ్యవస్థను 'ఒకే దేశం... ఒకే పన్ను' అని ఎవరైనా ఎలా తీర్మానించగలరు? పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి ఎందుకు తీసుకురాలేదన్న ప్రశ్నకు జవాబు వెదకాల్సి ఉంది. పెట్రో ఉత్పత్తులపై పన్ను వేసే అధికారం చేజార్చుకొని, వాటిని జీఎస్‌టీ పరిధిలోకి అనుమతిస్తే తమ ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్న భరోసా లభిస్తే తప్ప రాష్ట్రాలు అందుకు అంగీకరించవు. ఒకవేళ అనూహ్యమైన ఒప్పందం ఏదైనా కుదిరి పెట్రో ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి చేర్చేందుకు రాష్ట్రాలు ఒప్పుకొన్నా- వాటిని ఏ 'శ్లాబు' పరిధిలో పెట్టాలన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఒకవేళ రాష్ట్రాలకు గరిష్ఠ ఆదాయం చేకూర్చడంకోసం అదనపు సుంకాలతో కలిపి 28 శాతం శ్లాబును పెట్రో ఉత్పత్తులకు వర్తింపజేయాలని నిర్ణయం తీసుకున్నా వివాదం తలెత్తడం ఖాయం. బంగారం వంటి విలాస వస్తువులను మూడు శాతం శ్లాబు పరిధిలో ఉంచి- పెట్రో ఉత్పత్తులు వంటి నిత్యావసరాలను గరిష్ఠ శ్లాబులో ఎలా చేరుస్తారన్న ప్రశ్నకు ప్రభుత్వాలు సహేతుక సమాధానం వెదుక్కోవాల్సి ఉంటుంది.



అక్రమ లాభార్జన నిరోధక నిబంధన:- వస్తు సేవలపై పన్ను రేట్ల తగ్గుదలలోని లబ్ధిని ధరలకు కోత పెట్టడం ద్వారా వినియోగదారులకు సరిగ్గా బదలాయించడంకోసం అక్రమ లాభార్జన నిరోధక సంస్థ (ఎన్ఏఏ)ను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ 354 అక్రమ లాభార్జన నిరోధక కేసులు నమోదయ్యాయి. అందులో 65 కేసులను స్థాయీసంఘం- 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సేఫ్‌గార్డ్స్ ఫర్ ఇన్వెస్టిగేషన్'కు బదలాయించగా, 68 కేసులను తిరస్కరించింది. మిగిలినవి విచారణలో ఉన్నాయి.

ఎలక్ట్రానిక్-వే బిల్లులు:- జాతీయ స్థాయిలో ఏకీకృత ఇ-వే బిల్లింగ్ వ్యవస్థ లేకపోవడంవల్ల పన్ను ఆదాయానికి భారీగా బొర్రె పడుతోందని రెవిన్యూ యంత్రాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ పరిస్థితుల్లో 22వ జీఎస్‌టీ మండలి సమావేశాల్లో దేశమంతటా ఇ-వే బిల్లింగ్ వ్యవస్థను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ నెలలోనే ఆ వ్యవస్థ పట్టాలకెక్కింది. దీని పనితీరు, ప్రభావం ఏమిటన్నది మరికొంతకాలం వేచి చూస్తేగాని అంతుపట్టదు.

పన్ను ఆదాయం:- పన్ను చెల్లింపుదారుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో జీఎస్‌టీ ద్వారా సమకూరే రెవిన్యూ గణనీయంగా ఇనుమడించింది. ప్రతి నెల జీఎస్‌టీ ద్వారా సమకూరే మొత్తం ఆదాయాన్ని నిర్దుష్టంగా లెక్కకట్టడంలో ప్రభుత్వం తొలినాళ్లలో తీవ్ర తొట్రుపాట్లకు గురైంది. ఆదాయ పన్ను రిటర్నుల తుది గడువును అనేకసార్లు పొడిగించడంతో ఆదాయ గణన కనాకష్టంగా మారింది. అందుకే జీఎస్‌టీ ద్వారా దఖలుపడే రెవిన్యూ బాగా తగ్గిపోయినట్లు అప్పట్లో అంచనాలు వినిపించాయి. జీఎస్‌టీ వ్యవస్థలను గాడిన పెట్టి, బాలారిష్టాలను అధిగమించిన తరవాత ఆదాయం లెక్కలు స్పష్టమయ్యాయి. నిజానికి జీఎస్‌టీ ఆదాయంలో క్రమంగా వృద్ధి నమోదైంది. 2018 ఏప్రిల్‌లో సుమారు లక్ష కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జతపడ్డాయి.

మిశ్రమ ఫలితాలు

పన్ను చెల్లింపుదారుల పరిధి విస్తరిస్తుండటంతో జీఎస్‌టీ రెవిన్యూ సైతం అదే స్థాయిలో వృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పన్ను ఎగవేతదారులను కట్టడి చేసే విధానాలు కొంతకాలంగా ఊపందుకున్నాయి. ఇ-వే బిల్లింగ్ వ్యవస్థ వంటివి అందుకు ఉదాహరణ. సాధారణంగా ఎగుమతిదారులకు పన్ను 'రీఫండ్'ను 60 రోజుల్లోగా చెల్లించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఏడు రోజుల వ్యవధిలో 90శాతం మొత్తాన్ని ఎగుమతిదారులకు 'రీఫండ్' ఇవ్వాల్సి ఉంటుంది. నిర్ణీత కాలావధిలో 'రీఫండ్' చెల్లించని పక్షంలో ఆ మేరకు ఎగుమతిదారులకు ప్రభుత్వం వడ్డీ ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనలు ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ- చెల్లింపుల్లో దారుణమైన ఆలస్యం చోటుచేసుకుంటుండటం బాధాకరం. దీనివల్ల కిందటేడాది ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడిందని రిజర్వ్ బ్యాంక్ అధ్యయనం వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించే దిశగా జీఎస్‌టీ మండలి అడుగులు వేస్తోంది. ఏడాది కాలావధిలో దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను పనితీరును, ప్రభావాన్ని సమీక్షిస్తే సాఫల్య, వైఫల్యాలు సమానంగా సాక్షాత్కరిస్తాయి. తొలి ఏడాదిలో ఆచరణపరమైన సమస్యలు తలెత్తడం సహజం. ముమ్ముందూ ఈ సమస్యలు కొనసాగుతాయని చెప్పలేం. కాబట్టి దేశంలో వస్తు సేవల పన్ను సరైన దిశలోనే ప్రస్థానిస్తోందని చెప్పాలి!

నమోదైన పన్ను చెల్లింపుదారులు

విభాగం	2017 జులై 31నాటికి	నవంబరు 7 నాటికి	2018 ఏప్రిల్ ఒకటి	మే ఒకటి నాటికి
పూర్తిగా జీఎస్‌టీలోకి వచ్చినవారు	43,93,203	64,29,558	64,06,486	64,36,320
పన్ను చెల్లింపుదారుల మొత్తం సంఖ్య; కొత్తగా చేరినవారు	54,50,176	94,08,399	1,05,22,846	1,08,46,658
కొత్తగా నమోదైనవారి శాతం	19.39	31.66	39.12	40.66
కంపోజిషన్ స్కీమును ఎంచుకున్నవారు	5,22,438	15,57,660	17,86,735	20,07,119
కంపోజిషన్ డీలర్ల శాతం	9.59	16.56	16.98	18.5

- ఎ.శ్రీహరి నాయుడు

(రచయిత- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ సంస్థలో ఆర్థికవేత్త)

ఆచార్య నందిపాటి సుబ్బారావు

దేశం ముంగిట జలసంక్షోభం

నీటి సంక్షోభం ఒక ప్రాంతానికో, దేశానికో పరిమితమైనది కాదు. ఇది ప్రపంచవ్యాప్త సమస్య. భారత్‌లో మరీ తీవ్రస్థాయిలో ఉంది. ఈ ఏడాది జూన్ నాటి నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలో 60 కోట్ల మంది ప్రజలు తీవ్ర నీటికొరతతో సతమతమవుతున్నారు. ఏటా సుమారు రెండు లక్షల మంది సరైన మంచినీరు అందక మృత్యువాత పడుతున్నారు. నానాటికీ తరిగిపోతున్న భూగర్భజల మట్టాలు ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏటా మొత్తం 982 చ.కి.మీ.ల భూగర్భ జలాలను వెలికి తీస్తున్నారు. భారత్ అత్యధికంగా అంటే 251 చ.కి.మీ.ల నీటిని వెలికి తీస్తుంది. భారత్ తరవాతి స్థానాల్లో చైనా (111.95 చ.కి.మీలు), అమెరికా (111.70 చ.కి.మీలు) ఉన్నాయి. భారత్‌తోపాటు బంగ్లాదేశ్, మియన్మార్, మడగాస్కర్, మొజాంబిక్ దేశాల్లో కోట్ల మంది ప్రజలు తీవ్ర నీటికొరతను ఎదుర్కొంటున్నారు. ఉత్తర ఆస్ట్రేలియా, కాలిఫోర్నియాల్లో భూగర్భజలాలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. భారత్‌లో భూగర్భ జల వినియోగం 1960 నుంచి అధికమైంది. హరిత విప్లవం కారణంగా పంట భూములకు నీటి సరఫరా కోసం పెద్దసంఖ్యలో బావులు తవ్వారు. పట్టణాలు నగరాలు విస్తరించడం, పారిశ్రామికీకరణ కారణంగా 1980 నుంచి భూగర్భజలాలను విపరీతంగా తోడేస్తున్నారు.

ప్రమాద ఘంటికలు

ప్రపంచ జనాభాలో 17 శాతం భారత్‌లో ఉంటే, నీరు మాత్రం నాలుగు శాతమే ఉంది. ఆ నీటిని అవసరాలకు మించి వెలికి తీస్తున్నారు. దేశంలో 26 కోట్లకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు భూగర్భ జలాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. 60 శాతం సేద్యం, 85 శాతం పల్లె ప్రజలు, 50 శాతం పట్టణ జనాభా అవసరాలను భూగర్భ జలాలే తీరుస్తున్నాయి. దేశంలో మూడు కోట్లకు పైగానే బావులున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2020 నాటికి దిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర 21 ప్రధాన నగరాల్లో సుమారు 10 కోట్ల మంది భూగర్భజలాలు లభించక ఇబ్బంది పడకతప్పదు. 2030 నాటికి దేశంలో అందుబాటులో ఉన్న నీటి కంటే అవసరం రెండింతలు ఎక్కువగా ఉంటుందని అంచనా. కేంద్ర భూగర్భజల సంస్థ దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాతావరణం, శిలలు, భూగర్భజల పొరల స్థితిగతులను 2006-2017 మధ్యకాలంలో పరిశీలించింది. భూ ఉపరితలం నుంచి భూగర్భజల మట్టాల తేడాలు రెండు మీటర్ల కన్నా తక్కువలోతు నుంచి 40 మీటర్లకన్నా ఎక్కువ లోతు వరకు నమోదైనట్లు పరిశీలనలో తేలింది. దేశం మొత్తం మీద 61 శాతం బావుల్లో నీటిమట్టాలు తగ్గాయి. ఛండీగఢ్, పుదుచ్చేరిలలో 90 నుంచి 100 శాతం, తమిళనాడులో 87, పంజాబ్‌లో 85, ఆంధ్రప్రదేశ్‌లో 75, కేరళలో 70, కర్ణాటకలో 69, దిల్లీలో 65 శాతం బావులలో నీటిమట్టాలు తగ్గాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో 70 శాతం, రాజస్థాన్‌లో

50శాతం, తెలంగాణలో 46శాతం బావుల్లో నీటిమట్టాల క్షీణత జాతీయ సగటు భూగర్భజల మట్టాల క్షీణతకన్నా తక్కువగానే నమోదైంది. భారత్‌లో వార్షిక భూగర్భజల రీఛార్జి 68శాతం. భూగర్భ జల వినియోగం పంజాబ్, రాజస్థాన్, దిల్లీ, హరియాణాల్లో 133 నుంచి 172 శాతం వరకు ఉంది. ఈ నాలుగు రాష్ట్రాలను అధికంగా భూగర్భ జలం వెలికితీసే ప్రాంతాలుగా పరిగణిస్తారు. కేరళ, బిహార్, పశ్చిమ్‌బంగ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో భూగర్భ జల వినియోగం 21 నుంచి 47 శాతం వరకు నమోదైంది.

దక్షిణ రాష్ట్రాలు శిలలతో కప్పి ఉంటాయి. ఫలితంగా వర్షపునీరు భూగర్భ పొరల్లోకి అంత త్వరగా చొచ్చుకుని పోదు. అదే సమయంలో వెలికితీత అధికమవడంతో భూగర్భ జలమట్టాలు త్వరగా పతనమవుతున్నాయి. అందువల్లే ఆంధ్రప్రదేశ్‌లో 1,227, తెలంగాణలో 1,055 గ్రామాలను అధికస్థాయిలో భూగర్భ జలాలను వెలికితీసే ప్రాంతాలుగా ప్రభుత్వాలు గుర్తించాయి. ఆయా గ్రామాలలో కొత్తగా ఎలాంటి బావులూ తవ్వరాదు. ఉత్తర, వాయవ్య ప్రాంతాల్లో వర్షపాతం ఎక్కువైనప్పటికీ, అక్కడ వ్యవసాయం వల్ల భూగర్భజల వినియోగం అధికంగా ఉంది. సముద్రతీర ప్రాంతాల్లో ఉప్పునీళ్లు భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి. ఇప్పటికే, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్‌లలో ఈ బెడద అధికంగా ఉంది. ఇది ప్రమాదకర పరిణామం!

చైతన్యంతోనే సత్ఫలితాలు

2018 జూన్ నాటి నీతిఆయోగ్ నివేదిక ప్రకారం, దేశంలో పరిశుభ్రమైన తాగునీటిని అందిస్తున్న 10 రాష్ట్రాల్లో గుజరాత్ మొదటి స్థానంలో, రాజస్థాన్ పదో స్థానంలో, ఆంధ్రప్రదేశ్ మూడు, తెలంగాణ ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. నీటి నిర్వహణ చర్యల్లో ప్రథమ ప్రాధాన్యం చెట్ల పెంపకానికి ఇవ్వాలి. అటవీప్రాంతం ఎంత ఎక్కువగా ఉంటే, అదే స్థాయిలో ఆహ్లాదకరమైన వాతావరణం, వర్షపాతం, భూగర్భజల మట్టాలు ఉంటాయి. భూ ఉపరితల జలాన్ని, భూగర్భ జలంతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలి. కృత్రిమ పునఃపూరక పద్ధతులను (ఇంకుడు గుంతలు, కుంటలు, చెరువులు, బావులు, చెక్ డ్యాముల నిర్మాణం)సమర్థంగా అమలు చేయాలి. శిలల పగుళ్ల ఆధారంగా వాన నీటిపారుదల పద్ధతులను చేపట్టినప్పుడు భూగర్భజల మట్టాలు పెరుగుతాయి. నేలంతా కాంక్రీటుమయం కాకుండా చర్యలు తీసుకోవాలి. నీటి పరివాహక ప్రాంతాలను రక్షించి అభివృద్ధిపరచాలి. వ్యవసాయ భూముల్లో తుంపర, బిందు పద్ధతులను అవలంబించడం వల్ల భూగర్భజల వినియోగం గణనీయంగా తగ్గుతుంది. వ్యవసాయ బావుల లోతు తగ్గించి, వాటి మధ్య దూరం పాటించాలి. మురికినీటిని శుద్ధిపరచి, తిరిగి వినియోగించేలా చర్యలు చేపట్టాలి. నీటిని పొదుపుగా వినియోగించుకోవడం పౌరుల బాధ్యత కావాలి. భూగర్భజల సమతుల్యత గణన ప్రకారమే నీటిని వెలికితీయాలి. సమగ్రమైన నీటి నిర్వహణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం అవసరం. నీటి నిర్వహణ చర్యలను పాఠ్యాంశంగా చేర్చడం వల్ల ఫలితం ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో నూటికి నూరుశాతం వాన నీటిని నిల్వచేస్తున్నారు. భారత్‌లో కేవలం ఆరుశాతమే నిల్వ చేయగలుగుతున్నారు. మూడోవంతు వర్షపు నీటిని వివిధ రూపాల్లో నిల్వచేస్తే, వ్యవసాయానికి వానలపై ఆధారపడాల్సిన అవసరం తలెత్తదు. ఈ విషయంలో అధికారులు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి. ప్రజలకు వర్షపాతం, జలవనరుల సమాచారం, నీటి సంరక్షణ, నిర్వహణ చర్యలు, సాగుపై అవగాహన కల్పించాలి. అప్పుడే భూగర్భజల వనరులను పదిలంగా భావితరాలకు అందించడం సాధ్యమవుతుంది!

(రచయిత- భూవిజ్ఞాన శాస్త్ర విభాగం ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం)

శ్రీకృష్ణ మానసం

ఇతరుల మనసును తెలుసుకునే ముందు ఎవరి మనసు తీరుతెన్నుల్ని వారు తెలుసుకోవాలి. మనసు లోతుపాతులు తెలుసుకోవడం అంత సులువేమీ కాదు. మనసుతోనే అన్ని విషయాలు విశదమవుతాయి. ఆ తెలుసుకొనే మనసునే మనం తెలుసుకోవాలంటే మన చూపు మార్చుకోవాలి. అప్పుడు ఆలోచనలు మారిపోతాయి.

కళ్ల ముందు ప్రపంచం ఉంది. ఆ ప్రపంచంపైనే మన దృష్టి ఉంది. ఎప్పుడూ మన చూపు బయటే ఉంటుంది. అప్పుడప్పుడైనా అంతరంగంలో విహరించాలి! ఇంతవరకూ బాహ్య సౌందర్యమే మనకు ఆనందం. ఆ సౌందర్యాన్ని చూపించే దర్పణమే మనసు. దానిపై దృష్టిపెట్టాలి. మనసులోకి ప్రయాణించాలి. ఇంతవరకూ మనల్ని ఆడించిన మనసును పరిశీలించడానికి మనం ఎదురు వెళ్తున్నామంటే అది తడబడుతుంది. తప్పించుకుంటుంది. దొంగాట ఆడుతుంది. దొరక్కుండా పారిపోతుంది. వెంటపడాలి. పట్టుకోవాలి. నిశ్చలపరచాలి.

బాహ్య సౌందర్యం కంటే అంతర్ సౌందర్యం చాలా గొప్పది. తన్ను తాను తెలుసుకోలేనివాడు విశ్వాన్ని ఎన్నటికీ తెలుసుకోలేడు. చెట్టు తెలిస్తే అడవి తెలుస్తుంది. నది గురించి తెలుసుకుంటే సముద్రం బోధపడుతుంది. మనిషి గురించి తెలుసుకుంటే మాధవుడి గురించి తెలుస్తుంది. తెలుసుకోవడంలోనే జీవితం సాగుతుంది.

ఉపనిషత్తుల సారం అంతా మనసులోంచి ప్రభవించిన దివ్యజ్ఞానమే. మనసు వికసించాలంటే మనోనేత్రం తెరుచుకోవాలి. బాహ్య విషయాలను విడిచిపెట్టి లోపలకు చూపును తిప్పినప్పుడు కనిపించే మరో ప్రపంచమే శుద్ధమైన మనసు. అక్కడ మన చూపును నిలపాలి. అక్కడి నుంచే చూడాలి. ఆ చూపుతోనే లోకంలో వ్యవహరించాలి. అటువంటి వ్యవహారకర్తే ఇతర మానవులకు మార్గదర్శి అవుతాడు. అతడి చూపే జ్ఞానజ్యోతి అవుతుంది.

మనసు ఆకర్షణలతో నేస్తం చేస్తుంది. ఆ క్షణమే కొండ మీద కూర్చోబెడుతుంది. మరుక్షణమే అధః పాతాళంలోకి తోసేస్తుంది. నిన్ను మించినవాడు లేడని అనిపిస్తుంది. నువ్వు దేనికీ పనికిరావనీ అంటుంది. మనసును గెలవలేం. సాధనతో మనోతీతంగా వెళ్లగలం. మానవ జీవన పరమార్థానికి మనసే వారధి. మనసే సారథి. మనసే బంధిస్తుంది. మనసే విడుదల చేస్తుంది.

మనసు లేకుండా క్షణం ఉండలేం. నిద్రలో మనసు లేదని అనిపిస్తుంది. కాని అక్కడా ఓ కొత్తలోకం ఉంది. కలల ప్రపంచం ఉంది. అనురాగం, భయం, క్రోధం లాంటి భావాలు ఉండి తాను పొందిన ఆనందాన్ని నీది

అంతర్యామి

అనిపిస్తుంది. అదీ మాయ!

దివ్యానుభూతిని పొందిన మనిషికి మనసు ఉంటుందా, ఉండదా, ఒకవేళ ఉంటే ఎలా ఉంటుందని ఆంజనేయస్వామి శ్రీరాముడిని ప్రశ్నించాడు. దానికి శ్రీరాముడు- అతడి మనసు వైశాఖ మాసం మండుటెండలో ఆరుబయట వెలిగించిన దీపంలా ఉంటుంది. దానికి ఉనికే ఉండదు. ఆ బ్రహ్మజ్ఞాని మనసు ఉనికిని కోల్పోయి సముద్రంలో నది కలిసిపోయినట్లు విడదీయరాని స్థితిలో ఉంటుంది. నిజానికి అతడికి మనసు ఉన్నా లేనట్లే లెక్క అని చెప్పాడు.

మనసును జయిస్తే సర్వాన్నీ జయించినట్లే. మనసు ఓడిపోదు. ఓడిపోయినట్లు భ్రమ కలిగిస్తుంది. రూపురేఖలు మార్చేస్తుంది. మొత్తం వేషమే మార్చుకుంటుంది. అంతవరకూ శత్రువుగా ఉన్న మనసు మిత్రుడిగా మారిపోతుంది. శాపనార్థాలు పెట్టే మనసు ఆశీర్వచనాలు ఇస్తుంది.

నేను సర్వజ్ఞుడిని, సర్వాంతర్యామిని, సర్వవ్యాపిని అని శ్రీకృష్ణుడు చెప్పినప్పుడు అతడు మనోతీతంగా ఉన్నాడు. మనసే అతడి అధీనంలో ఉంది. అందరి మనసులను పుష్పాల్లా ఒక దగ్గరకు చేర్చి హారంలా ధరించాడాయన. అది కృష్ణమానసం. మనోహర బృందావనం. మానస సరోవరం. మనిషికి మనసుంది. మనసులో సర్వమూ ఉంది. ఆ మనసుతోనే నిత్యయుద్ధం చేయాలి. కనుక యుద్ధం నేర్చుకోవాలి. జీవితంలో ఏదో ఒక సమయంలో ప్రతి మనిషీ కురుక్షేత్రంలో నిలబడాలి. విజయం సాధించడానికి పరమాత్మ ముందు మోకరిల్లాలి. జీవన పరమార్థం సాధించాలి!

- ఆనందసాయి స్వామి

చిన్న పొరపాట్లకే సస్పెన్షన్ విధానానికి స్వస్తి

● ఆర్టీసీలో పాయింట్ల విధానానికి శ్రీకారం!

ఈనాడు, అమరావతి: చిన్న పొరపాట్లకే కార్మికులపై అంతర్గత విచారణ నిర్వహించడం, వారిని సస్పెండ్ చేయడం, తొలగించడం తదితర చర్యలకు ఆర్టీసీ యాజమాన్యం ఇకపై స్వస్తి పలకనుంది. ఒకటి రెండు పొరపాట్ల వరకూ గమనించి సరిదిద్దుకునేందుకు అవకాశమివ్వనుంది. అప్పటికీ తీరు మార్చుకోకపోతే ఇంక్రిమెంట్లలో కోత విధించడం, వేతనాన్ని తగ్గించడం వంటి చర్యలు చేపట్టనుంది. అదే పనిగా పెద్దపెద్ద తప్పిదాలు చేస్తుంటే మాత్రం సస్పెన్షన్ వేటు వేయనుంది. క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన నూతన విధానాన్ని ఆర్టీసీ ఎండీ ఎన్.వి.సురేంద్రబాబు తాజాగా రూపొందించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై యాజమాన్యం నాలుగు రోజుల కిందట కార్మిక సంఘాలతో చర్చించి అభిప్రాయాలను స్వీకరించింది. వాటిలో ముఖ్యమైనవి పరిగణనలోకి తీసుకుని త్వరలో అధికారిక ఉత్తర్వులు ఇవ్వనుంది. త్వరలో అమల్లోకి రానున్న ఈ విధానం ప్రధానంగా పాయింట్ల ఆధారంగా ఉంటుంది. ఎన్ని తప్పులు చేస్తే అన్ని పాయింట్లు ఆ కార్మికుడి ఖాతాలో జమవుతాయి. వాటి సంఖ్య ప్రాతిపదికనే చర్యలు ఆధారపడి ఉంటాయి.

★ ఆర్టీసీ కార్మికులు చేసే పొరపాట్లను చిన్నవి, పెద్దవిగా విభజించారు. విధులకు గైర్హాజరు కావడం, బస్సులోని ప్రయాణికులందరికీ టిక్కెట్లు ఇవ్వకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, ప్రయాణికుడి నుంచి డబ్బులు తీసుకున్నప్పటికీ టిక్కెట్టు ఇవ్వకపోవడం, బస్సు దెబ్బతినడం, మాదకద్రవ్యాల రవాణాను అనుమతించడం, ప్రయాణికుల ఫిర్యాదులు తదితర అంశాలను చిన్న పొరపాట్ల జాబితాలో చేర్చారు. గతంలో వీటిలో ఏ ఒక్కటి ఒక్కసారి చేసినా వెంటనే సస్పెండ్ చేసేవారు. ఇకపై అలా కాకుండా ప్రతి కార్మికుడి పేరిట స్కోర్ షీట్ నిర్వహిస్తారు. మొదటి చిన్న పొరపాటుకు కార్మికుడి ఖాతాలో ఒక పాయింటు వేస్తారు. రెండోసారి చేస్తే రెండు పాయింట్లు వేయడంతో పాటు పద్ధతి మార్చుకోవాలని సూచిస్తారు. మూడోసారి తీవ్రంగా మందలిస్తారు. నాలుగోసారి పొరపాటు చేస్తే ఏడాదిపాటు ఇంక్రిమెంటు కోత విధిస్తారు.

★ అయిదుసార్లు చిన్నచిన్న పొరపాట్లు చేస్తే దాన్ని మొదటి పెద్ద తప్పిదంగా, ఆరుసార్లు చిన్న పొరపాట్లు చేస్తే రెండో పెద్ద తప్పిదంగా, ఏడు సార్లు చేస్తే మూడో పెద్ద తప్పిదంగా పరిగణిస్తారు. మొదటి పెద్ద తప్పిదానికి ఏడాదిపాటు, రెండో పెద్ద తప్పిదానికి రెండేళ్లపాటు ఇంక్రిమెంట్లు ఇవ్వబోరు. మూడో పెద్ద తప్పిదానికి ప్రస్తుతం ఆ ఉద్యోగి అందుకుంటున్న వేతనంలో కోత విధిస్తారు. నాలుగో పెద్ద తప్పిదానికి సస్పెన్షన్ వేటు వేస్తారు.

జస్టిస్ శంకరనారాయణకు ఘనంగా వీడ్కోలు

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.శంకరనారాయణకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. శనివారం పదవీ కాలం ముగియనున్న సందర్భంగా జస్టిస్ శంకరనారాయణకు వీడ్కోలు పలికేందుకు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ శుక్రవారం మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏసీజే మాట్లాడుతూ.. మున్సిఫ్ జడ్జిగా న్యాయవ్యవస్థలోకి ప్రవేశించిన జస్టిస్ శంకరనారాయణ అంచెలంచెలుగా ఎదిగారన్నారు. అతి తక్కువ కాలంలో హైకోర్టు జడ్జిగా వేల సంఖ్యలో కేసుల్ని పరిష్కరించారని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ
జిల్లా కార్యాలయం, ఉడా ఆఫీస్‌రోడ్, విజయవాడ.
ఫోన్: 77020 03571

నెం. పి.డి.ఎస్.2/మూమెంట్/ఎఫ్‌జి/స్టేజి-ii/2018-19 తేది: 29-06-2018

బియ్యం రవాణా చేయుటకు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్, విజయవాడ కృష్ణా జిల్లాలోని కైకలూరు మరియు గుడివాడ మండల స్థాయి గోదాముల్లో నుండి చౌకధరల దుకాణాలకు బియ్యం రవాణా చేయుటకు సీల్డు టెండర్లు కోరటమైనది. దరఖాస్తు రుసుము: రూ. 3000/-. వివరములకు ఈక్రింది వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

www.krishna.nic.in

సం/- **జాయింట్ కలెక్టర్ మరియు ఇ.ఒ.ఇడి.,**
జిల్లా పౌరసరఫరాల సంస్థ, కృష్ణా జిల్లా.

'సీఆర్‌డీఏ'లో భూముల విలువ పెంపు!

● రైతులకు మేలుచేకూర్చేలా కసరత్తు

● మిగిలిన ప్రాంతాల్లో సవరణపై సంయమనం

ఈనాడు, అమరావతి: రైతులకు మేలుచేకూర్చేలా సీఆర్‌డీఏ పరిధిలో భూముల విలువ బాగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతి ఏడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి పట్టణాలు, నగరాలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో మార్కెట్ విలువలను సవరించాలి. సీఆర్‌డీఏ పరిధి వరకు పెంచినట్లయితే నల్లధనం లావాదేవీలు తగ్గి... రైతులకు ప్రయోజనం ఉంటుందని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం సీఆర్‌డీఏ పరిధిలో భూముల విలువలను సవరించలేదు. ప్రభుత్వం భూములను సేకరించాల్సి ఉన్నందున విలువల పెంపుపై దృష్టిపెట్టలేదు. పెంచితే దానికి తగినట్లు ప్రభుత్వం పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ చదరపు గజం రూ.600 నుంచి రూ.2,000 వరకు ఆయా ప్రాంతాలను అనుసరించి ఉంది. అనధికారికంగా రూ.12,000 నుంచి రూ.30,000 వరకు పలుకుతోంది. దీనివల్ల నల్లధనం చేతులు మారడం అనివార్యంగా మారింది. సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. బ్యాంకుల్లో భద్రపరుచుకునేందుకు రైతులకు ఇబ్బందులు వస్తున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో సీఆర్‌డీఏ వరకు భూముల విలువను ఆయా ప్రాంతాలను అనుసరించి ఎంతవరకు పెంచితే బాగుంటుందన్న దానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. పెరిగిన దానికి తగినట్లు రైతులకు డబ్బు వచ్చినప్పటికీ... బ్యాంకుల్లో భద్రపరుచుకునేందుకు ఆదాయపన్ను పరంగా ఇబ్బందులు తలెత్తవు. కేంద్రం ప్రకటించిన 'క్యాపిటల్ గెయిన్' కింద రైతులకు ఈ సౌలభ్యం ఉంది. దీనివల్ల రిజిస్ట్రేషన్ శాఖకు కూడా మంచి ఆదాయం వస్తుంది. ఈ దిశగా అధికారుల స్థాయిలో సమాలోచనలు జరుగుతున్నట్లు తెలియవచ్చింది. మిగిలిన ప్రాంతాల్లో భూముల ధరల సవరణపై సంయమనం పాటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాదికి పెంపును పది శాతానికిలోపు పరిమితంచేస్తే ఎలా ఉంటుందన్న దానిపై పరిశీలన జరుగుతోంది. అవసరమైతే కొన్ని ప్రాంతాల్లో 5% మాత్రమే పెంపు ఉండేలా చూద్దామని, మరికొన్నిచోట్ల అసలు పెంచకుండా సరిపోతుందనే విషయంపైనా చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా ఎన్నికల సమయం ఆసన్నమైనందున విలువల సవరణ అనేది రాజకీయంగా తీసుకోవాల్సిన నిర్ణయమని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రత్యేకంగా ఎం-కార్డ్ యాప్!

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా ఎం-కార్డ్ యాప్‌ను రూపొందిస్తోంది. దీనిద్వారా స్టాంపులను విక్రయించే కేంద్రాలు, యూజర్ ఛార్జీలు, రిజిస్ట్రేషన్ ధరలు, స్టాంపు డ్యూటీల వివరాలు, చిట్‌ఫండ్స్ వివరాలు, ఇతర పూర్తి సమాచారాన్ని యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఈ యాప్ ద్వారా ఈసీ, నకళ్లను ఉచితంగా పొందే అవకాశాన్ని కల్పించాలని అధికారిక వర్గాలు భావిస్తున్నాయి.

రాయదుర్గం డిపో బస్సు నుంచి ఊడిపడిన వెనుక టైర్లు

బస్సు వెళ్తుండగా ఊడిపోయిన టైర్లు

కణేకల్లు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా రాయదుర్గం డిపో ఆర్టీసీ బస్సు (ఏపీ 02 జడ్0166) ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం ఈ బస్సు కణేకల్లులోకి ప్రవేశిస్తుండగా ఎడమవైపున ఉన్న వెనుక టైర్లు రెండూ ఊడిపోయాయి. దీంతో బస్సు ఒక పక్కకు ఒరిగింది. ఆ సమయంలో బస్సు నెమ్మదిగా వెళ్తుండటంతో అందులో ఉన్న 15 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఉరవకొండ వెళ్లేందుకు శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో రాయదుర్గంలో బస్సు బయలుదేరింది. అనంతరం కణేకల్లులోకి ప్రవేశిస్తుండగా స్థానిక రాంనగర్ సమీపంలో ఎడమవైపున ఉన్న వెనుక టైరు బోల్టులు ఊడిపోయాయి. దీంతో రెండు టైర్లు ఒక్కసారిగా ఊడిపడ్డాయి. మూడు రోజుల క్రితం ఇదే బస్సుకు వెనుక టైర్లు పంక్చర్ కావడంతో టైరు మార్చారు. ఆ సమయంలో టైరు బోల్టులు సక్రమంగా బిగించకపోవడంతోనే ఈ ఘటన జరిగిందనే అనుమానం వ్యక్తమవుతోంది.

ఉత్తరాంధ్రులకు పెద్దపీట వేయాలి

● అన్ని రంగాల్లోనూ వారు వెనకబడ్డారు..

● జనసేన అధినేత పవన్‌కల్యాణ్

మధురవాడ, సాగర్‌నగర్ (విశాఖపట్నం), **న్యూస్‌టుడే:** ఉత్తరాంధ్రులు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని, వారికి పెద్దపీట వేయాల్సి ఉందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. శుక్రవారం విశాఖ నగర పరిధి మధురవాడ పరిసరాల్లో వివిధ ఐటీ కంపెనీలకు కేటాయించిన స్థలాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రులు స్థలాల కోసం దరఖాస్తు చేస్తే భూముల ధరలు ఎక్కువ చెబుతూ స్థానికేతరులకు తక్కువకే ప్రభుత్వం కేటాయిస్తోందని ఆరోపించారు. స్థానికులు భూములు కోల్పోయి ఉద్యోగాలు లేక దోపిడీకి గురవుతున్నారన్నారు. ఐటీ సంస్థలు ఇతర దేశాల్లో అతి తక్కువ స్థలాల్లోనే ఉన్నాయని,

విశాఖ ఐటీ హిల్స్ మార్గంలో కొండపైకి ద్విచక్రవాహనంపై వెళ్తున్న పవన్‌కల్యాణ్

ఇక్కడ మాత్రం భారీగా భూములు కేటాయిస్తున్నారని వివరించారు. అమెరికాలో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థ ప్రధాన కార్యాలయం ఐదెకరాల్లో ఉంటే ఇక్కడి దాని బ్రాంచి కార్యాలయానికి ఎంతో విలువైన 25 ఎకరాల భూమి కేటాయించారని అన్నారు. ఇనో సొల్యూషన్స్‌కు సైతం 15 ఎకరాలు అప్పగించారని వివరించారు. ఐటీ విభాగంలో లక్ష ఉద్యోగాలు కల్పిస్తామన్న ప్రభుత్వం మూడు వేల ఉద్యోగాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని విమర్శించారు. ప్రభుత్వం ద్వంద్వ విధానాలు అవలంబించడం వల్ల ప్రాంతీయ అసమానతలు పెరుగుతున్నాయని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ అంశం ఇలాగే తెరపైకి వచ్చిందన్నారు. అభివృద్ధి ఒకేచోట కేంద్రీకృతమయితే దాని పరిణామాలు ఎలా ఉంటాయో రాష్ట్ర విభజన తెలియజేసిందని, తెలుగుదేశం ప్రభుత్వం నవ్యాంధ్రలోనూ ఇదే విధానాలను అవలంబిస్తుండటం కలచివేస్తోందని అన్నారు. స్థానికులకు అభివృద్ధిలో చోటు కల్పించకపోతే దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఐటీ హిల్స్ మార్గంలో పవన్ ప్రయాణిస్తున్న కారు ముందుకెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఓ విలేకరి ద్విచక్రవాహనాన్ని తీసుకుని ఆయనే స్వయంగా నడుపుతూ గమ్యం చేరారు.

తమిళనాట 11 మంది ఎమ్మెల్యేలపై ఎన్నికల అక్రమాల కేసులు

● కర్ణాటకలో 20 మంది, తెలంగాణలో ఆరుగురు, ఏపీలో ఐదుగురి పైనా

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడుకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలపై ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడినట్టు కేసులున్నాయని ఏడీఆర్ (అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫార్మ్స్), ఎన్‌ఈడబ్ల్యూ(నేషనల్ ఎలక్షన్ వాచ్)ల అధ్యయనం వెల్లడించింది. 2013-18 మధ్య వివిధ రాష్ట్రాల్లో 922మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని ఆ సంస్థలు గుర్తుచేశాయి. వారి ఎన్నికల ప్రచార వ్యయం, పొందిన ఓట్ల శాతంపై ప్రభుత్వేతర సంస్థ(ఎన్జీవో) అయిన ఏడీఆర్, ఎన్‌ఈడబ్ల్యూలు సంయుక్తంగా అధ్యయనం నిర్వహించాయి. ఎంతమంది ఎన్నికల్లో అవకతవకలకు చోటిచ్చారనే అంశాన్నీ పరిశీలించాయి. అందులో 44మంది ఎమ్మెల్యేలు అక్రమాలకు పాల్పడినట్టు అధికారికంగా తెలిసిందని సంస్థలు పేర్కొన్నాయి. కర్ణాటకలో 20మంది ఎమ్మెల్యేలు ఈ జాబితాలో ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. తమిళనాడులో 11 మంది, తెలంగాణలో ఆరుగురు, ఆంధ్రప్రదేశ్‌లో ఐదుగురు, పుదుచ్చేరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారంది. దక్షిణాదిన కేరళలోనే ఏ ఎమ్మెల్యే కూడా ఎన్నికల అక్రమాలకు పాల్పడలేదని, అయినా వారు ఎన్నికల్లో భారీగా ఖర్చుచేసినట్టు పేర్కొంది. ఎన్నికల వ్యయంలో తమిళనాడు రెండో స్థానంలో ఉందని తెలిపింది.

EDUCATION
★ **ADMISSIONS** Ag. B.Sc, ICAR APPROVED@7.5L. ✆ 7083847452.

Admission Guidence for
MBBS/BDS/ VETERINARY
IN SOUTH INDIA
99591 31415, 78937 44276

APRCET-2018
Under the aegis of APSCHE, Tadepalli conducted by
ANDHRA UNIVERSITY, VISAKHAPATNAM-530003

Andhra Pradesh Research Common Entrance Test-2018 **(APRCET-2018)** for admission into Ph.D/M.Phil (both full time and part time) offered by the Universities, Research Centres and Affiliated Colleges in the State of Andhra Pradesh for the Academic year 2018-19 will be conducted from 22-8-2018 to 24-8-2018. Eligible candidates are informed to submit their applicatons from 4-7-2018 through online mode only by paying registration fee of Rs.1400/- (for OC/BC) & Rs.1000/- (for SC/ST/PWD). The detailed information is available in the website www.sche.ap.gov.in/rcet

Place : Visakhapatnam
Date : 30-6-2018

CONVENOR
APRCET

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
ADMINISTRATIVE OFFICE, LAM, GUNTUR-522034

Ref. No. 2403/EXAMS/ADMISSIONS/2018 (4) **Dated: 29-06-2018**

ADMISSION NOTIFICATION

Online Applications are invited from eligible candidates for combined admissions into the following U.G. degree courses in constituent colleges of Acharya N.G. Ranga Agricultural University (ANGRAU), Guntur, Sri Venkateswara Veterinary University (SVVU), Tirupati and Dr.YSR Horticultural University (Dr.YSRHU), Venkataramannagudem, West Godavari District and also in Affiliated Agricultural and Horticultural Colleges of ANGRAU and Dr.YSRHU for the academic year 2018-19.

FORM	U.G. Courses
Form - A AP EAMCET 2018 under Bi.P.C. stream (Common application)	a) B.Sc.(Hons) Agriculture b) B.Tech.(Food Technology) c) B.V.Sc. & A.H. d) B.F.Sc. e) B.Sc.(Hons) Horticulture

The **last date** for **ONLINE submission of application (Form 'A') uploaded with relevant documents in** the website **www.angrau.ac.in** is **24-07-2018 (11.59 P.M.).** Candidates must read carefully the **Information Brochure** before applying. Candidates, who apply online only, will be called for counseling. Applications sent by post will **NOT** be entertained.

There are six (6) private Agricultural Colleges (affiliated to ANGRAU) and four (4) private Horticultural Colleges (affiliated to Dr.YSRHU). Candidates are advised that a separate application is NOT required for admission into these private colleges.

NOTE : The candidates shall note that the admissions will be made as per the relevant government orders applicable at the time of counselling. Fee reimbursement is subjected to the guidelines issued by the Government from time to time.

D. BHASKARA RAO
REGISTRAR

Offers also available at: www.fbbonline.in
EXTRA 10% OFF* WITH fbb SBI STYLE UP CARD | TO APPLY, SMS STYLEUP TO 5676791
*T&C APPLY

ఎఫ్‌బిబి ప్రత్యేకమైన స్టోర్:- 2వ అంతస్తు, పి.వి.పి మాల్, ఎమ్.జి. రోడ్, విజయవాడ.

బిగ్ బజార్: - వి.వి.కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ.

/fbbonline | కస్టమర్ హెల్ప్‌లైన్ నెంబర్: 1800 200 2255

fbb INDIA'S FASHION HUB
BIG BAZAAR ఇండియాని చేస్తుంది బ్యూటిఫుల్

రూ.180 కోట్ల కేంద్ర సాయం

కరవు, వరద ప్రభావిత ప్రాంతాలకు అందజేయాలని నిర్ణయం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు రూ.179.91 కోట్లు అదనపు సాయం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్, కేంద్ర ఆర్థిక మంత్రి (అదనపు బాధ్యతలు) పీయూష్ గోయెల్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గాబా, ఆయా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సహా అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్‌లకు కరవు, వరదలపై అదనపు సాయం అందజేయాలని నిర్ణయించారు. దీనిలోభాగంగా 2017-18లో ఏపీలో వచ్చిన వరద ప్రభావిత ప్రాంతాలకు, 2017-18 రబీలో తలెత్తిన కరవుకు సంబంధించి.. రూ.66.77 కోట్లు, రూ.113.14 కోట్లు చొప్పున అదనపు సాయం చేయాలని సమావేశం నిర్ణయించింది.

ఆరోపణలు రుజువు చేయకుంటే క్రిమినల్ చర్యలు

కన్నా లక్ష్మీనారాయణకు కుటుంబరావు లేఖ

ఈనాడు, అమరావతి: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇటీవల తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలని, అవి తన గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు పేర్కొన్నారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలేంటో చెప్పకపోతే క్రిమినల్, సివిల్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన కన్నా లక్ష్మీనారాయణకు శుక్రవారం ఒక లేఖ రాశారు. "మీరు జూన్ 10న విజయవాడలో విలేకరుల సమావేశంలో తెదేపాకి వ్యతిరేకంగా అనేక వ్యాఖ్యలు చేశారు. తెదేపా అధికార ప్రతినిధిగా నియమితుడిని కాకముందు నేను స్టాక్ బ్రోకర్‌గా పనిచేశానని, చాలా మందిని మోసం చేశానని మీకు ఎవరో చెప్పగా తెలిసిందన్నారు. వారి నుంచి అందిన సమాచారం ఆధారంగానే నాపై ఆరోపణలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఆరోపణ నిరాధారం. ఇవి నా పరువుకి భంగం కలిగించాయి. నేను చాలా మందిని మోసం చేసినట్టుగా మీకు చెప్పిన వ్యక్తుల పేర్లు బయట పెట్టాలి. లేదంటే అవి మీరే నాపై చేసిన నిరాధార ఆరోపణలుగా భావించి మీపై సివిల్, క్రిమినల్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటాను" అని కుటుంబరావు తన లేఖలో పేర్కొన్నారు. భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా కుటుంబరావుపై శుక్రవారం ఇలాంటి ఆరోపణలే చేశారు. దీంతో ఆరోపణలు నిరూపించకుంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటానని వీర్రాజుకు.. కుటుంబరావు లేఖ రాశారు.

2008 వరకు ఎస్సీలమే..

ఏక సభ్య కమిషన్‌కు వివరించిన బేడ, బుడగ జంగాలు

పగిడ్యాల, న్యూస్‌టుడే: గతంలో తమకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేవారని, 2008లో రద్దు చేశారని బేడ బుడగ జంగాల ప్రతినిధులు ఏకసభ్య కమిషన్‌కు వివరించారు. రాష్ట్రంలో బేడ బుడగ జంగాల స్థితిగతులు, ఆచార సంప్రదాయాలపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన జేసీ శర్మ ఏకసభ్య కమిషన్ శుక్రవారం కర్నూలు జిల్లా పగిడ్యాల నెహ్రూనగర్‌ను సందర్శించింది. బుడగ జంగాల మహిళలు, సంఘం ప్రతినిధులతో జేసీ శర్మ సమావేశమయ్యారు. తాము తెలంగాణ నుంచి వలస వచ్చామని, భిక్షాటన, వేట ద్వారా జీవనం సాగిస్తున్నామని వివరించారు. తమకు ఎస్సీ ధ్రువపత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ పిల్లలు ఉన్నత విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్డుకున్న మాల మహానాడు సంఘాలు: నెహ్రూనగర్‌లో శర్మ కమిషన్‌ను మాల మహానాడు సంఘాల నాయకులు అడ్డుకున్నారు. శర్మ కమిషన్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చి తమ గొంతుకోయొద్దని వాపోయారు. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు వచ్చానని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం వరకే తన బాధ్యతని శర్మ వారికి వివరించారు. ఈ సందర్భంగా నెహ్రూనగర్ ఎస్సీ కాలనీలో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

చంద్రబాబు అడిగితే కేంద్రం ఏమీ ఇవ్వదు: సోము

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుంది తప్ప ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోసం కాదని, ఆయన ఏమడిగినా కేంద్రం ఇవ్వదని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు చెప్పారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రమేష్ నిరాహార దీక్షతో కడపలో ఉక్కు పరిశ్రమ రాదని, ఆయన సొంత జిల్లాలోని సమస్యలను వదిలేసి పరిశ్రమ కోసం దీక్ష చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ, విశాఖ రైల్వేజోన్ ఇచ్చి తీరుతుందన్నారు. కృష్ణా జిల్లా నిమ్మకూరులో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ నిధులతోనే ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై చర్చకు సిద్ధమని సవాలు చేశారు. అనంతపురంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ బసచేసిన వసతిగృహంపై టీఎన్ఎస్ఎఫ్ నేతల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. తెదేపా తాటాకు చప్పుళ్లకు భయపడమని వీర్రాజు స్పష్టం చేశారు. తెదేపాలో క్రియాశీలకంగా వ్యవహరించిన సుజనాచౌదరి ఇప్పుడు ఎందుకు తెరమరుగయ్యారో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

HINDUSTAN SHIPYARD LIMITED
(A Government of India Undertaking)
HSL VISAKHAPATNAM : INDIA

TENDER NOTICE

1. Rehabilitation of RCC Walls and beams of Dry Dock North & South pump house.
2. Renovation of J&C (OAD) workshops viz civil structural and roof etc.
3. Band stop filters and increate items for EMI/EMC testing at NEC, Mumbai.

For further details & future corrigendum's if any, please visit www.eprocurehsl.gov.in & www.hsl.nic.in

General Manager (Commercial) - AC

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పౌరసరఫరాల కమిషనర్ కార్యాలయము

టెండరు ప్రకటన తేది: 8-6-2018

కృష్ణాజిల్లా, విజయవాడ, గొల్లపూడి పౌరసరఫరాల కమిషనర్ కార్యాలయమునకు దిగువ పేర్కొన్న సిబ్బంది ఏర్పాటు నిమిత్తము రాష్ట్రప్రభుత్వంచే ఎంపానల్ చేయబడిన ప్రముఖ, అనుభవం గల మరియు ఆర్థిక పరిపుష్టి గల సర్వీస్ ప్రొవైడర్స్ (ఆం.ప్ర.లో నమోదు కాబడిన) నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. హోదా & కావలసిన సిబ్బంది సంఖ్య 1) జూనియర్ అసిస్టెంట్ - (04), 2) డాటాఎంట్రీ ఆపరేటర్లు- (04) సీల్డ్ కవర్లను ది. 6-7-2018 సా. గం. 5.00 లోపు పౌరసరఫరాల కమిషనర్ కార్యాలయము, శ్రీలక్ష్మీనారాయణ నిలయము, జైన్ కాలనీ రోడ్, గొల్లపూడి, విజయవాడ నందు దాఖలు చేయవలెను. ఇతర వివరాలు దిగువ సంతకందారుని నుండి పొందవచ్చును.

DIPR No. 981/CL/Advt/1/1/2018-19 సం/- కమిషనర్, పౌరసరఫరాలు

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
2వ అంతస్తు, ప్లాట్ నెం.9, సర్వే నెం.49, ఐ.టి.పార్క్, మంగళగిరి - 522 503
ఫోన్ : 89786 22966. ఫ్యాక్స్ : e-మెయిల్ : aphmhidc@gmail.com

టెండరు నోటీసు నెం. 6/APMSIDC/Equipment/2018-19 తేది : 27.6.2018

ఆంధ్రప్రదేశ్ నందు మాటర్నల్ మరియు నియోనాటల్ మోర్టాలిటి రిడక్షన్ పార్టనర్‌షిప్ ప్రోపోజల్ (2018-2022) కొరకు ప్రతిపాదన కొరకు అభ్యర్థన నిమిత్తమై e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా APMSIDC టెండర్లను కోరుతున్నది.
1) మొత్తం పనుల సంఖ్య -2
2) 1 పని కొరకు అంచనా విలువ (రూ. 110 లక్షలు) + 1PPP పని.
3) సవివరమైన ప్రకటన మరియు తదుపరి వివరాలకు వెబ్‌సైట్ http://msidc.ap.nic.in ను దర్శించండి. సంప్రదించండి EE మొబైల్ నెం. 89786 22966. ఎట్టి కారణాలు చూపకుండా ఏ సమయములోనైనా టెండరును రద్దుపరచుటకు APMSIDC కి హక్కు కలదు.

DIPR No. 202PP/CL/Advt/1/1/2018-19 సం/- మేనేజింగ్ డైరెక్టర్

TS RTC
ఈ-టెండరు ప్రకటన పల్లె వెలుగు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులలో పార్సెల్స్ & కొరియర్స్ తరలించుటకు, (4+1) సంవత్సరాల కాల పరిమితికి కాంట్రాక్టరు నియామకానికై ఆన్‌లైన్ విధానములో టెండర్లు కోరబడుచున్నవి. (టెండర్ ఐడి: 63980) ఆసక్తి గల అభ్యర్థులు తమ టెండరును ఆన్‌లైన్‌లో ఈ-టెండర్ ప్రక్రియ ద్వారా తేది. 30.06.2018 ఉ॥ 11.00 గం॥ల నుండి 18.07.2018 సా॥ 05.00 గం॥ల వరకు సమర్పించగలరు. ● ఈ-టెండరు నియమ నిబంధనలు వెబ్‌సైట్: www.tsrtc.telangana.gov.in లేదా https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును. ● టెండర్‌లో పాల్గొనడానికి మరియు నియమ నిబంధనలలో సందేహాలుంటే C T M (M&C) & Dir (CP)/TSRTC గారిని Ph.No. 9959225400 నందు సంప్రదించగలరు. ● TSRTC ఏదైనా సమయంలో, ఎలాంటి కారణం లేకుండానే టెండరు రద్దు చేయు అధికారం కలదు.

నెం. C2/644/Parcel/2018-0PD(M&C), తేది: 30-06-2018 సం/- చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (M&C) & డైరెక్టర్ (CP)

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Regd.Office:10-152/1, Ashoknagar, Bandar Road, Vijayawada-520007

No: PDS/P2/1263/Rice Fortification/2018-19 Dated: 29.06.2018

NOTIFICATION

Government of Andhra Pradesh is keen on introducing Fortified Food and hence an expression of interest is invited from the Rice Millers for production of Fortified Rice kernels with 7 nutrients under knowledge partnership of Tata Trusts. Detailed notification is hosted on the Corporation Website: www.apscsc.gov.in.

Sd/-
VC & Managing Director

ట్రంప్ పూసిన చమురు జిడ్డు!

- ఇరాన్‌పై ఆంక్షలతో భారత్‌కు తలనొప్పి
- దేశంలో పెట్రో ధరలు మరింత పెరిగే ప్రమాదం

భారత చమురు అవసరాల్లో దాదాపు 80 శాతాన్ని దిగుమతులే తీరుస్తున్నాయి

భారత్‌కు ఇరాక్, సౌదీ తర్వాత మూడో అతిపెద్ద చమురు సరఫరాదారు ఇరానే

2017-18 ఆర్థిక సంవత్సరంలో భారత చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 10.4%. దీని విలువ 110 కోట్ల డాలర్లు

ఇరాన్ నుంచి చమురు దిగుమతులు ఆపేయాలంటూ అమెరికా ఇచ్చిన పిలుపు భారత్‌కు తలనొప్పిగా మారనుంది. దీని వల్ల దేశంలో చమురు సంక్షోభం మరింత తీవ్రం కావొచ్చునన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరా ఆగిపోతే.. దేశంలో పెట్రో ధరలు మరింత ఎగబాకే ప్రమాదం ఉంది. అది ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం చూపుతుంది. ఐక్యరాజ్యసమితి విధించే ఆంక్షల్నే గౌరవిస్తాం తప్ప ఇతర దేశాలు విధించే ఏకపక్ష ఆంక్షల్ని తాము పట్టించుకోబోమని భారత విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ చెబుతున్నప్పటికీ.. దేశంలోని చమురు కంపెనీలు ప్రత్యామ్నాయాలపై దృష్టిపెట్టాలని ప్రభుత్వం సంకేతాలు ఇవ్వడం- అమెరికా ఆంక్షల ప్రభావమేనని తెలుస్తోంది.

భారత్‌పై ప్రభావం ఏమిటి?

ప్రపంచంలోని వివిధ దేశాలకు ఇరాన్ రోజూ 24 లక్షల బ్యారెళ్ల ముడి చమురును సరఫరా చేస్తోంది. అమెరికా ఆంక్షల వల్ల ఇందులో సగం(12 లక్షల బారెళ్లు) సరఫరాలు ఆగిపోయినా.. చమురు ధరలపై ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా ఒత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే పెట్రో ధరలు ఆకాశాన్నంటిన భారత్‌లో ఈ ఒత్తిడి మరీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా ముడిచమురు ధర బ్యారెల్‌కు 76.93 డాలర్లు ఉంటే.. మన దేశంలో లీటర్ పెట్రోలు ధర రూ.80కి పైగా పలుకుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో దేశంలోని చమురు కంపెనీల స్టాక్ ధరలు 6 నుంచి 8 శాతం మేర పడిపోయాయి.

- చమురు ధరలు పెరుగుతున్న కొద్దీ కరెంటు ఖాతా లోటు హెచ్చుతోంది.
- రుపాయి అంతకంతకూ బలహీనపడుతోంది.
- ద్రవ్యోల్బణం పెచ్చుమీరుతోంది.
- వంటనూనెలు, కిరోసిన్, ఎరువులు తదితరాలపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీల భారం మరింత పెరుగుతుంది.
- వడ్డీరేట్లూ పెరుగుతాయి. అత్యధిక వడ్డీరేట్లు భారత కంపెనీలకు శుభప్రదం కాదు.
- చమురు ధరల పెరుగుదల విదేశీ వాణిజ్యం, పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతాయి.

భారత్‌కు వివిధ దేశాల నుంచి చమురు దిగుమతుల వాటా



ఏ దేశం నుంచి ఎంత విలువైన చమురు దిగుమతి (కోట్ల డాలర్లలో)

ఇరాక్	140
సౌదీ అరేబియా	140
ఇరాన్	110
నైజీరియా	95.4
కువైట్	64.1
యూఏఈ	57.4
వెనెజువెలా	46.1
మెక్సికో	37
ఒమన్	25.7
అంగోలా	20
బ్రెజిల్	19
ఖతార్	17
మలేషియా	13.5

- ఇవికాకుండా ఈజిప్టు, టర్కీ, బ్రూనై, అజర్‌బైజాన్, అమెరికా, సూడాన్‌ల నుంచి కూడా స్వల్ప మొత్తాల్లో దిగుమతి చేసుకుంటున్నారు.

మన చమురు దిగుమతుల బిల్లు ఏటేటా పెరిగిపోతోంది. 2012-13లో 171.73 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును దిగుమతి చేసుకోగా.. 2018లో అది 217.08 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగింది.

ఇప్పుడేం చేయొచ్చు?

అమెరికా గతంలో ఇరాన్‌పై ఆంక్షలు విధించినపుడు మన దేశం ఇరాన్‌కు ద్వంద్వ చెల్లింపుల విధానాన్ని పాటించింది. ఇందులో 1. చమురుకు వస్తు మార్పిడి. 2. చెల్లింపుల్ని రూపాయల్లో చేయడం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా, జర్మన్ కేంద్రంగా గల యురోపియాష్-ఇరానిష్ హందెల్స్ బ్యాంక్ ఏజీ(ఈఐహెచ్) ద్వారా చెల్లింపులు చేశారు. ఇప్పుడు కూడా అమెరికా ఆంక్షల్ని విస్మరించడానికి వస్తు మార్పిడి, లేదా రుపాయి-రియాల్ విధానాన్ని అవలంబించొచ్చు అనే వాదన వినిపిస్తోంది. దీనివల్ల భారీగా విదేశీ మారకపు నిల్వలు భారత్‌కు ఆదా అవుతాయి. దేశంలో చమురు ఒత్తిడిని తట్టుకోవచ్చు.

అమెరికా ఒత్తిడి రాజకీయం

ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకోకుండా భారత్‌పై అమెరికాలోని ట్రంప్ సర్కారు ఒత్తిడి తెస్తోంది. ఇందులో భాగంగా భారత్‌తో జరపాల్సిన రక్షణ, విదేశాంగమంత్రుల సమావేశాన్ని వాయిదావేసుకుంది. తన సొంత చమురుకు అంతర్జాతీయ మార్కెట్‌ను సృష్టించుకోవడం కూడా అమెరికా ఆంక్షల ఎత్తుగడలో భాగమంటున్నారు. ఇరాన్ నుంచి భారత్‌కు దిగుమతులు తగ్గిపోతాయి కాబట్టి- ఆ లోటును అమెరికా దిగుమతుల ద్వారా పూడ్చుకునే విషయాన్ని భారత చమురు కంపెనీలు పరిశీలిస్తున్నాయి. అమెరికా షేల్ గ్యాస్ ఉత్పత్తిదారులు ఉత్పత్తిని పెంచుతారని, అందువల్ల ముడిచమురు ధరలు 75 డాలర్లకు పెరగకపోవచ్చునని చమురురంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇరాన్ ముడి చమురును చైనా తర్వాత మనమే అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్నాం

సౌదీకి లాభమా?

తనకు అత్యంత సన్నిహిత మిత్రదేశం సౌదీ అరేబియాకు లాభం చేకూర్చడానికే ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు విధించిందన్న మరో వాదన వినిపిస్తోంది. వివిధ దేశాలకు ఇరాన్ చమురు ఆగిపోతుంది కాబట్టి.. ఆ లోటును సౌదీ అరేబియా భర్తీ చేస్తుందని అంటున్నారు. భారత దేశానికి ఇరాక్ నుంచి 31 లక్షల టన్నులు, సౌదీ నుంచి 28 లక్షల టన్నుల ముడిచమురు ఎగుమతి అవుతోంది. తాజా ఆంక్షల నేపథ్యంలో సౌదీపై మరింతగా ఆధారపడక తప్పదు. కాగా అమెరికా ఆంక్షలకు భారత్ తలొగ్గవచ్చునేమో కానీ... చైనా, రష్యా, టర్కీ లాంటివి పట్టించుకోకపోవచ్చునని చమురు రంగ నిపుణులు అంటున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఏపీలో ప్రకృతి వ్యవసాయంపై ద న్యూయార్క్ టైమ్స్‌లో కథనం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం (జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్) గురించి ఆంగ్ల దినపత్రిక 'ద న్యూయార్క్ టైమ్స్'లో ఒక కథనంలో ప్రచురితమైంది. అందులో వ్యవసాయంలో విచ్చలవిడిగా రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు వినియోగించడం వల్ల ప్రకృతికి, ప్రజల ఆరోగ్యానికి జరుగుతున్న నష్టం, మళ్లీ ప్రకృతి వ్యవసాయం దిశగా వివిధ దేశాల్లో జరుగుతున్న ప్రయోగాల గురించి వివరించింది. 'బ్రింగింగ్ ఫార్మింగ్ బ్యాక్ టు నేచర్' పేరుతో ఈ నెల 26న ఆ కథనాన్ని ప్రచురించింది. ఆరోగ్యవంతమైన, సుస్థిర వ్యవసాయ విధానాలపై ఇటీవల రోమ్‌లో జరిగిన 70 దేశాల ప్రతినిధుల సదస్సులో నిర్వాహకులు చెప్పిన ఉదంతాల్ని అందులో ఉటంకించింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల్ని ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 20 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తోందని, లక్ష మందికిపైగా రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారని వివరించింది. ఈ ఏడాది చివరకు 3 వేల గ్రామాల్లోని ఐదు లక్షల మంది రైతులు ఈ విధానాన్ని అనుసరించేలా ప్రణాళికలు రూపొందించారని పేర్కొంది. వచ్చే ఐదేళ్లలో ప్రభుత్వం 230 కోట్ల డాలర్లు ఖర్చు చేయనుందని వివరించింది.

డీఎస్పీల పదోన్నతులకు పచ్చజెండా

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 46 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పించేందుకు డీజీపీ ఎం.మాలకొండయ్య పచ్చజెండా ఊపారు. వీరిలో 31 మంది 2010 బ్యాచ్‌కు చెందిన డైరెక్ట్ రిక్రూటీలు కాగా.. మిగతా 15 మంది 1989 బ్యాచ్ ప్రమోటీ అధికారులు. వారికి పదోన్నతులు కల్పించాలని కోరుతూ పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏ.ఆర్.అనూరాధకు ప్రతిపాదనలు పంపించారు. అధికారిక ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. ఇవన్నీ తాత్కాలిక(అడ్‌హక్) పదోన్నతులే నని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి హోంశాఖకు పంపించిన ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. సీనియార్టీ జాబితాను ఖరారు చేసిన తర్వాత ఇంకా ఎవరైనా అర్హులుంటే వారికి కూడా అదనపు పదోన్నతులు కల్పిస్తామని వాటిలో ప్రస్తావించారు.

కడప బంద్ ప్రశాంతం

- పార్టీలకు అతీతంగా ఉద్యమించిన అఖిలపక్ష నాయకులు
- సీపీఐ, సీపీఎం, వైకాపా, జనసేన ఆధ్వర్యంలో ర్యాలీలు

ఈనాడు - కడప

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం అఖిలపక్షం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. కడప నగరంలో వామపక్షాల ఆధ్వర్యంలో భారీఎత్తున కార్యక్రమాలు జరిగాయి. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏపీ అమరావతి ఐకాస నేత బొప్పా వెంకటేశ్వర్లు, చలసాని శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి, కోటిరెడ్డికూడలి మీదుగా అంబేడ్కర్‌కూడలి వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పాల్గొన్నారు. వైకాపా ఆధ్వర్యంలోనూ కార్యక్రమం జరిగింది. జమ్మలమడుగు నియోజకవర్గంలో సంపూర్ణంగా బంద్ పాటించారు. జమ్మలమడుగు, ముద్దనూరు, కొండాపురం, యర్రగుంట్ల మండలాల్లో ఆందోళనకారులు పూర్తిస్థాయిలో బంద్ పాటింపజేశారు. కొండాపురంలో వైకాపా, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై బైఠాయించి దిగ్బంధించారు. రైల్వేకోడూరు పరిధిలోని కుక్కలదొడ్డి వద్ద స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై బైఠాయించి వైకాపా కార్యకర్తలు నిరసన తెలిపారు. పులివెందులలో మాజీ ఎంపీ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ సాగింది.

బంద్‌లో పాల్గొన్న సీపీఎం నేత బీవీ రాఘవులు, సీపీఐ నేత రామకృష్ణ, చలసాని శ్రీనివాస్, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తదితరులు

కర్నూలు నగరంలో మోటారుసైకిళ్ల ర్యాలీ

సొమ్ము కేంద్రానిది.. అవినీతి చంద్రబాబుది

- కడప ఉక్కు కర్మాగారంపై తెదేపా దొంగ దీక్ష: కన్నా లక్ష్మీనారాయణ

ఈనాడు డిజిటల్-కర్నూలు: పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం 150 పథకాలను ప్రవేశపెట్టి నిధులిస్తుంటే రాష్ట్ర సర్కారు పేర్లు మార్చి తాము చేస్తున్నట్లుగా చెప్తూ..వాటిని అవినీతిమయం చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అవినీతిప్రదేశ్‌గా మార్చారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. కర్నూలు నగరంలో శుక్రవారం జరిగిన జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన హామీలకు కట్టుబడి రాష్ట్రానికి నిధులు కేటాయించిందన్నారు. కేంద్రం సొమ్ముతో ముఖ్యమంత్రి అవినీతికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో జరిగే అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాల నిధుల కేటాయింపుపై ఎవరి వాటా ఎంతో సీఎం శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు.

పదోరోజుకి 'ఉక్కు' దీక్ష

క్షీణిస్తున్న సీఎం రమేష్ ఆరోగ్యం

ఈనాడు, కడప: కడప ఉక్కుపరిశ్రమ సాధన కోసం రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శుక్రవారానికి పదో రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం అంతకంతకూ క్షీణిస్తోందని పరీక్షిస్తున్న వైద్యులు తెలిపారు. రెండ్రోజులుగా సహాయకుల ఆసరా తీసుకొని నడుస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి చక్రాల కుర్చీ వాడుతున్నారు. అమెరికా నుంచి వచ్చిన రమేష్ స్నేహితుడు, వైద్యుడు అయినా రాజా పరీక్షలు నిర్వహించి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పలు వర్గాల వారు వచ్చి దీక్షకు సంఘీభావం తెలిపారు. కడప ప్రజల హక్కుగా పేరొందిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని.. ఆ దిశగా మోదీ సర్కారు చొరవ చూపాల్సిన అవసరం ఉందని సీబీఐ పూర్వ ఉన్నతాధికారి లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రస్తావన ఉందని, దాన్ని ఏర్పాటు చేస్తే వేలాది మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. సినీనిర్మాత బండ్ల గణేష్ మాట్లాడుతూ కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ వరమన్నారు. ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ దీక్షకు అన్ని వర్గాలు మద్దతివ్వాలన్నారు. కార్యక్రమంలో చలసాని శ్రీనివాస్, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎం రమేష్‌ను పరామర్శించేందుకు శనివారం తెదేపా అధినేత చంద్రబాబు కడపకు వస్తున్నారు. ఉదయం 11.00గంటలకు ప్రత్యేక విమానంలో ఇక్కడకు చేరుకొని దీక్షా శిబిరానికి చేరుకుంటారు. ఉక్కు పరిశ్రమకు సంబంధించి కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

దీక్ష చేస్తున్న ఎంపీ రమేష్‌కు నీళ్లు తాగిస్తున్న కుటుంబ సభ్యులు

మోదీకి తెలుగు ప్రజలు గుణపాఠం చెప్పాలి

- ఎమ్మెల్యే బాలకృష్ణ పిలుపు

హిందూపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన అనంతరం ఏపీ ప్రజలను నమ్మించి మోసం చేసిన మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా చిలమత్తూరులో శుక్రవారం 'పల్లెబాట' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోగా అనంతరం ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని మాయమాటలు చెప్పారని విమర్శించారు. నాలుగేళ్లు కేంద్రంతో కలిసి ఉన్నా ఫలితం లేకపోవటంతో బయటకు రావాల్సి వచ్చిందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో తెలుగోడి సత్తా చూపామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ తెలుగువారు తమకు జరిగిన అన్యాయానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి చెందిన కొందరు నేతలు కేంద్ర ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని రాజీనామాల డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వాన్ని పల్లెత్తుమాట అనకపోగా ముఖ్యమంత్రి చంద్రబాబును నిందిస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ఆదేపల్లితండాలో లంబాడీ మహిళలతో కలిసి బాలకృష్ణ నృత్యం చేశారు. స్థానికంగా జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొన్నారు.

ఆదేపల్లితండాలో నృత్యం చేస్తున్న బాలకృష్ణ

ఆర్థిక సేవల కంపెనీలో ఉద్యోగావకాశాలు

ఈనాడు, అమరావతి: రాజధానిలో త్వరలో ప్రారంభంకానున్న స్టేట్ కార్పొరేషన్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ తెలిపింది. మేధా టవర్స్‌లో ఈ సంస్థ ఆగస్టు 1 నుంచి ఆర్థిక సేవల శాఖను ఆరంభించనుంది. ఈ కంపెనీ తొలుత 250 మందికి, వచ్చే పది నెలల్లో 700 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనుంది. 2017, 2018లో బీకాం, ఎంబీఏ ఫైనాన్స్ విభాగాల్లో 70 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, సంభాషణ నైపుణ్యం, క్యాపిటల్ మార్కెట్‌పై అవగాహన ఉన్న అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులు. ఆసక్తిఉన్న వారు http://jobskills.apssdc.in/sdc/ వెబ్‌సైట్‌లో జులై 6లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

మాట తప్పినందుకే ప్రజాగ్రహం

- **2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టిన గతే భాజపాకూ: మంత్రి గంటా**

ఈనాడు, విశాఖపట్నం: ఎన్నికల ముందుగానీ, విభజన చట్టంలోగానీ ఇచ్చిన హామీలను భాజపా నెరవేర్చకపోవడం వల్లనే ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తోందని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలోనైనా, తిరుపతిలోనైనా ఆ పార్టీ నేతలపై దాడులకు అదే కారణమని వ్యాఖ్యానించారు. భాజపాను నమ్మి ఓటేసి గెలిపిస్తే రాష్ట్రానికి ఎందుకు మొండిచేయి చూపారనే ఆగ్రహంతో ప్రజలు ఉన్నారని అన్నారు. ప్రజల కోపం తగ్గాలంటే భాజపా ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని గంటా సూచించారు. కడప ఉక్కు ఆంధ్రుల హక్కు.. నినాదంతో కడపలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బీటెక్ రవి చేస్తున్న ఆమరణ దీక్షకు బ్రహ్మాండమైన స్పందన వస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కడప వెళ్లి రమేష్ ఆరోగ్యంపై వాకబు చేసి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్సీలు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కడప ఉక్కు కోసం ఉద్యమం చేస్తుంటే.. దానిని పక్కదారి పట్టించడానికి ఎంపీలు మాట్లాడుకుంటున్న వీడియోను తెరమీదికి తెచ్చారని మంత్రి విమర్శించారు. ఇది కట్ అండ్ పేస్ట్‌లా ఉందనే అభిప్రాయం ఆయన వ్యక్తంచేశారు. విశాఖ భాజపా ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ... విశాఖ రైల్వే జోన్‌పైనా కేంద్రం స్పందించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. నాలుగేళ్లుగా అధ్యయనం చేస్తున్నామంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. విశాఖలో ఐఐఎం ఏర్పాటుచేస్తే ఏయూలో తాత్కాలికంగా నడుస్తోందని.. ఏపీకి ఇచ్చిన ఎన్ఐటీ ప్రైవేటు కళాశాలలో కొనసాగుతుంటే సౌకర్యాలు లేక విద్యార్థులు చేరడానికి ఇష్టపడడంలేదని అన్నారు. వసతులు లేక ఏయూలోనే పెట్రోలియం యూనివర్సిటీ, ఐఐఎం నడపాల్సి వస్తోందని గుర్తుచేశారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలో ప్రస్తావించిన హామీలపై భాజపా ఇప్పటికైనా స్పందించకపోతే రాష్ట్రంలో 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే భాజపాకూ పడుతుందని మంత్రి గంటా హెచ్చరించారు.

పోరాటాన్ని దెబ్బతీసేందుకే కుట్ర

- తెదేపా ఎంపీల మాటలను వక్రీకరించారు
- తప్పుడు వీడియో ప్రచారంలోకి తెచ్చారు
- విచారణ జరిపించి కఠినచర్యలు తీసుకుంటాం
- ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆగ్రహం

ఈనాడు - అమరావతి

కడపలో ఉక్కు కర్మాగారం సహా విభజన చట్టంలోని అంశాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధనకు తెదేపా చేస్తున్న పోరాటంపై బురదజల్లేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, తప్పుడు వీడియో క్లిప్పింగ్‌లు ప్రచారంలోకి తెస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండిపడ్డారు. తెదేపా ఎంపీలు దిల్లీలోని ఏపీ భవన్‌లో సమావేశమైనప్పుడు తీసినదంటూ... కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉంచిన వీడియో క్లిప్పింగ్‌లను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో ఎవరు తీశారో, ఎందుకు ప్రసారం చేశారో విచారణ జరిపిస్తామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిని ప్రజల పోరాటానికి తూట్లు పొడిచేలా, రాష్ట్రంపై జరుగుతున్న కుట్రగా పేర్కొన్నారు. కడప ఉక్కు దీక్ష తదితర అంశాలపై ఆయన శుక్రవారం తెదేపా ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏపీ భవన్‌లో సమావేశమైనప్పుడు తాము అన్న మాటల్ని వక్రీకరించారని ఎంపీలు మురళీమోహన్, అవంతి శ్రీనివాస్ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తన వయసు 75 ఏళ్లని, అయినా వారం రోజులు దీక్ష చేయగలనని తానన్న మాటల్ని కత్తిరించారని మురళీమోహన్ పేర్కొన్నారు. వాళ్లకు కావాల్సిన వ్యాఖ్యలు అతికించి... కట్ అండ్ పేస్ట్ క్లిప్పింగ్ విడుదల చేశారని ఆ ఇద్దరు ఎంపీలూ వెల్లడించారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ... 'మన పోరాటాన్ని, ఉద్యమ పవిత్రతను దెబ్బతీసేందుకే అలా చేశారు. తెదేపా ఎంపీలు దిల్లీలో ఆందోళనలు చేసినప్పుడు మురళీమోహన్ స్పృహ తప్పి పడిపోయారు. కొనకళ్ల నారాయణకు గుండె పోటు వచ్చింది. హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లి కాపాడాం. రాష్ట్ర విభజన సమయంలో వేణుగోపాల్‌రెడ్డిని లోక్‌సభలో దారుణంగా కొట్టారు. అప్పుడు ఇవ్వని ప్రచారం ఇప్పుడు చేయడం బాధాకరం. దివాకర్‌రెడ్డి ఆవేదనతో చేసిన వ్యాఖ్యల్ని వివాదాస్పదం చేశారు. ఇప్పుడు మురళీమోహన్ మాటల్ని కట్ అండ్ పేస్ట్ చేశారు...' అని పేర్కొన్నారు. 'కడపలో మన నాయకులు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్నారు. రాష్ట్రం మొత్తం మన ధర్మపోరాటం వైపే చూస్తోంది. ఎంపీలు చేస్తున్న ఉద్యమంపై ప్రజలంతా ఆశలు పెట్టుకున్నారు. ఉద్యమంలో అందరూ ఒకే మాట, ఒకే బాటగా ఉండాలి. ఎవరు పడితే వారు, ఏది పడితే అది మాట్లాడకూడదు. మన పోరాటంపై బురద జల్లేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారు. చిలవలు పలవలు చేసి దుష్ప్రచారానికి తెగబడ్డారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. ఛలోక్తులకు ఇది సమయం కాదు. సరదాగా కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదు...' అని స్పష్టం చేశారు. 'మీడియా కూడా సంయమనం పాటించాలి. రాష్ట్రానికి హాని చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మీడియా ముసుగులో అరాచక శక్తులు చొరబడకుండా చూడాలి...' అని పేర్కొన్నారు. 'కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని ఎదుర్కోవాలి. ప్రతిపక్షాలు సృష్టించే అడ్డంకులు అధిగమించాలి. ఇంకోవైపు కుట్రల్ని భగ్నం చేయాలి. ఇది చాలా కీలక సమయం. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా నష్టం వాటిల్లుతుంది. కుట్రదారులు మీ వద్దకు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది పవిత్రమైన యజ్ఞం. మన మాటల్లో చేతల్లో అంకితభావం కనిపించాలి. ఒక పక్క కేంద్రం చేసిన అన్యాయానికి రాష్ట్రం మొత్తం కుతకుతలాడుతోంది. ఈ పరిస్థితుల్లో ఉద్యమాన్ని నీరుగార్చాలని కుట్రలు చేస్తున్నారు. కుట్రదారులు, పాత్రదారుల భాగోతాలు బట్టబయలు చేస్తాం. రాబోయే రోజుల్లో కుట్రలు మరింత పెరుగుతాయి. నేరస్తులతో, బ్లాక్ మెయిలర్లతో పోరాటం ఆషామాషీ కాదు. అందరూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి...' అని స్పష్టం చేశారు.

కపట ప్రేమ చూపించారు

- మోదీ, షాలపై తెదేపా ఎంపీల ఆరోపణ
- రాష్ట్రాభివృద్ధికి సహకరించడంలేదు: మాగంటి
- ఇప్పటికైనా ప్రధాని దిగిరావాలి: మురళీమోహన్

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని తెదేపా ఎంపీలు ఆరోపించారు. శుక్రవారం ఏలూరులో ఎంపీలు మాగంటి బాబు, మురళీమోహన్, గల్లా జయదేవ్‌లు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన 18 అంశాలతో ఏ ఒక్కదాన్నీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని మాగంటి బాబు అన్నారు. నాలుగేళ్లలో మోదీ, అమిత్‌షాలు అడుగడుగునా కపటప్రేమ చూపించారే తప్ప ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించలేదని ఆరోపించారు. నాడు రాష్ట్రాన్ని కాంగ్రెస్ విడదీస్తే.. భాజపా న్యాయం చేస్తుందని ఆశించామని, కానీ వారి హయంలో హామీలు తప్ప నిధుల విడుదల కాలేదన్నారు. ఎన్నో ఏళ్లుగా శిలాఫలకాలకే పరిమితమైన పోలవరం ప్రాజెక్టును ముందుకు నడుపుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పొగడటం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో కంపెనీలు, పరిశ్రమలు స్థాపించడానికి వివిధ దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తుంటే చెడగొట్టడానికి ప్రయత్నం చేయవద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు. ఎంపీ మాగంటి మురళీమోహన్ మాట్లాడుతూ.. కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర గనుల శాఖ మంత్రిని కలిసినప్పుడు కొన్ని అభ్యంతరాలు వ్యక్తంచేశారని.. వాటిపై రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎంపీ సీఎం రమేష్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని, ఇప్పటికైనా ప్రధాని దిగివచ్చి కడప ఉక్కు పరిశ్రమ మంజూరుచేయాలని డిమాండు చేశారు. ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. ఉత్తర భారతంలో కుల, మతాల మధ్య జరిగే ఘర్షణలను దక్షిణాదికి వ్యాపింపజేయడానికి అమిత్‌షా, మోదీలు కుట్రలు చేస్తున్నారని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రతిపక్ష నేత ఇప్పటికైనా నోరు తెరిచి కేంద్రంపై పోరాటానికి పిలుపు ఇవ్వాలే తప్ప అడుగడుగునా రాష్ట్రానికి అవరోధాలు కల్పించే ప్రధానికి వత్తాసు పలకవద్దని కోరారు. జడ్పీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను కేంద్రం అమలు చేయాలని కోరారు.

పోలవరం అంచనాల సవరణపై జులైలో టీఏసీ సమావేశం

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలపై జులై మూడో వారంలో సాంకేతిక సలహా మండలి(టీఏసీ) సమావేశం ఏర్పాటు చేయడానికి సీడబ్ల్యూసీ సమాయత్తమవుతోంది. ఈమేరకు సీడబ్ల్యూసీ ఛైర్మన్ మసూద్‌హుస్సేన్ శుక్రవారం ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్‌కు తెలిపారు. 2014 ఏప్రిల్1 నాటి ధరల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికయ్యే వ్యయం భరించడానికి కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.53వేల కోట్లతో సవరించిన అంచనాలు పంపింది. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం ముంపు బాధితులకు పరిహారం, సహాయ, పునరావాస కార్యక్రమాలకే ఇందులో రూ.33వేల కోట్లవుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఇందులో పేర్కొంది. ఏపీ ప్రభుత్వం పంపిన సవరించిన అంచనాలను పరిశీలించిన సీడబ్ల్యూసీ కొన్ని కొర్రీలు వేయగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటన్నింటికీ ఇటీవలే వివరణలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో దాని పురోగతిని తెలుసుకోవడానికి ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ శుక్రవారం సీడబ్ల్యూసీ ఛైర్మన్ మసూద్‌హుస్సేన్‌ను కలిశారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో ఈ అంశంపై జులై మూడో వారంలో సాంకేతిక సలహా మండలి సమావేశం ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్లు మసూద్‌హుస్సేన్ స్పష్టం చేశారు. అది ఆమోదముద్ర వేస్తే వెంటనే ఆర్థిక శాఖలోని వ్యయ సంఘానికి పంపుతామన్నారు. అనంతరం కేబినెట్ ఆమోదముద్ర వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ముగిసిన బార్ కౌన్సిల్ ఎన్నికలు

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో బార్ కౌన్సిళ్ల సభ్యుల ఎంపిక నిమిత్తం జరిగిన ఎన్నికలు శుక్రవారం సజావుగా ముగిశాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన 146, తెలంగాణలో 88 పోలింగ్ బూత్‌ల్లో న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదింటి వరకు ఎన్నికలు కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌కు సంబంధించి 85శాతం, తెలంగాణలో 80శాతం పోలింగ్ జరిగినట్లు సమాచారం అందిందని బార్ కౌన్సిల్ కార్యదర్శి ఎన్. రేణుక తెలిపారు. ఎన్నికలు ముగిశాక రెండు రాష్ట్రాల రిటర్నింగ్ అధికారులు జస్టిస్ పి.కేశవరావు, జస్టిస్ పి.శంకరనారాయణలు బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. రెండు హైకోర్టు బార్ అసోసియేషన్లతోపాటు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు, సికింద్రాబాద్, నాంపల్లి, రంగారెడ్డి కోర్టుల్లోని బ్యాలెట్ బ్యాక్సులను బార్ కౌన్సిల్ కార్యాలయంలో డిపాజిట్ చేశారు. ఆయా జిల్లాల్లో న్యాయాధికారులు బ్యాలెట్ బాక్సులకు సీలు వేయించి హైదరాబాద్ పంపే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్సులకు అదనపు భద్రత కల్పించాలంటూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించి తగిన ఆదేశాలు జారీచేశారు. రెండు రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల కౌంటింగ్ హైదరాబాద్‌లోనే జరగనుంది. ఏపీకి జులై 11న, తెలంగాణలో 23న కౌంటింగ్ జరుగుతుంది. ప్రాధాన్యతా క్రమంలో వేసిన ఓట్లను లెక్కించి 25మంది సభ్యులను విజేతలుగా ప్రకటించనున్నారు. అనంతరం వీరు ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

ఆశా కార్యకర్తలకు 3వేల వేతనం

- వరాలు ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, డిజిటల్, అమరావతి: ఆశా కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరాలు ప్రకటించారు. దేశంలోనే తొలిసారిగా వారికి కనీస వేతనం కింద రూ.3వేలను అందచేస్తామని వెల్లడించారు. వారు అందించే సేవల కింద మరో రూ.3 వేలు లభించనున్నాయని, తద్వారా వారికి నెలకు రూ.6వేల వరకు వచ్చే అవకాశం ఉందని ఈ సందర్భంగా వివరించారు. స్మార్ట్ ఫోన్లు ఇస్తామని, చంద్రన్న బీమా కింద అర్హత కల్పిస్తామని, తెల్లరేషన్ కార్డులను అందచేస్తామని, ఏ.ఎన్.ఎం నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. శుక్రవారం ఉండవల్లిలోని ప్రజా దర్బార్‌హాల్‌లో నిర్వహించిన 'ఆశాలకు బాసట'లో ఆయన మాట్లాడారు. 'రాష్ట్ర ఖజానాపై రూ.156 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. అవసరమైతే రెండు నెలల తర్వాత వేతనాల పెంపును సమీక్షిస్తా. ఇతర ఏ రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ తరహాలో కనీస వేతనం ఇవ్వడం లేదు. కేరళ, గుజరాత్‌లో నెలకు రూ.2 వేల వంతున ఇస్తున్నారు. ఆశా కార్యకర్తలు ఒక్కొక్కరు 250 కుటుంబాలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలి. రాష్ట్రంలో మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించేందుకు కృషి చేయాలి. అంటువ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి. 'రక్ష' పేరుతో ఇవ్వనున్న శానిటరీ న్యాపికిన్స్‌పై ప్రచారాన్ని నిర్వహించాలని కోరుతున్నా. ప్రపంచ ఆరోగ్య సూచీలో ఆంధ్రప్రదేశ్ 2017లో 77వ స్థానంలో ఉంది. 2018లో 44వ స్థానానికి చేరుకుంది. భవిష్యత్తులో 10వ స్థానానికి చేరుకోవాలి.." అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య మాట్లాడుతూ కనీస వేతనం చెల్లింపు ఆగస్టు నెల నుంచి అమల్లోకి వస్తుందన్నారు. గ్రామాల్లో వారు అందించే సేవలకు ఇస్తున్న ప్రోత్సాహక మొత్తాన్ని పెంచామని, 5వతేదీ నాటికి వేతనాలను బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లిస్తామని వెల్లడించారు. తాజా నిర్ణయం వల్ల 43 వేల మందికి లబ్ధి చేకూరనుంది. తొలుత పలువురు ఆశా కార్యకర్తలు ప్రతి నెలా రూ.6వేలు స్థిర వేతనంగాఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు.

మా కష్టాన్ని గుర్తించారు: ఆశా కార్యకర్తలు

ప్రతి నెలా రూ.3 వేల వేతనాలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల పలువురు ఆశా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్న తమకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడం ఆనందం కలిగిస్తోందన్నారు. 'నెలంతా కష్టపడి పనిచేసినా రూ.వెయ్యికి మించి వచ్చేవి కావు. 2006 నుంచి ఇదే పరిస్థితి. మా కష్టాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వేతనం, అదనంగా ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతి నెలా 5వ తేదీలోపే జీతాలు ఖాతాల్లో వేస్తామని సీఎం చెప్పారు' అని చిత్తూరు జిల్లా కాణిపాకానికి చెందిన రేఖ, షబీనా తెలిపారు.

మహిళలకు అండగా 'సబల'

సబల లోగోను ఆవిష్కరిస్తున్న మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాజకుమారి, ఐజీ గోపాల్‌రావు, ఎస్పీ వెంకటఅప్పలనాయుడు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళలు, బాలికలు, చిన్నపిల్లలపై అకృత్యాలను అరికట్టడమే కాకుండా వారికి అండగా ఉండేలా 'సబల' అనే కార్యక్రమం రూపొందిందని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. తెలంగాణలో షీ బృందాల మాదిరి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి గుంటూరు జిల్లాలో 150 మంది యువ మహిళా పోలీసులచే 'సబల' అనే ప్రత్యేక పోలీసు దళాలను గ్రామీణ ఎస్పీ వెంకట అప్పలనాయుడు ఏర్పాటుచేసి శుక్రవారం పోలీసు కల్యాణమండపంలో ప్రారంభించారు. సమావేశంలో ఐజీ గోపాల్‌రావు మాట్లాడుతూ.. బాలికలు, మహిళల సమస్యలను తెలుసుకొని రహస్యంగా కాపాడేందుకు 'సబల' ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఎస్పీ వెంకట అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఈవ్‌టీజింగ్, అసభ్య ప్రవర్తన, లైంగిక వేధింపులు, గృహహింస తదితర ఇలా మహిళలకు సంబంధించి సమస్యలను 9440900866 నెంబర్‌కు లేదా ఫేస్‌బుక్ ద్వారా 'గుంటూరు రూరల్ పోలీసు సబల'కు తెలియజేయవచ్చని అన్నారు. ఈ వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో సబల నోడల్ అధికారి డీఎస్పీ స్నేహిత, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏకి 904.53 ఎకరాల ప్రభుత్వ భూములు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో తుళ్లూరు, మంగళగిరి మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 904.53 ఎకరాల ప్రభుత్వ భూముల్ని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ)కు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అవన్నీ వాగు, చెరువు, కట్ట, లంక కేటగిరీల్లో ఉన్న వివిధ రకాల భూములు. వాటిని రాజధాని అవసరాల కోసం ప్రభుత్వం సీఆర్‌డీఏకి కేటాయించింది.

ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్

- ఫలించిన కేంద్ర సంస్థ ప్రయత్నం
- త్వరలో విశాఖలో తయారీ కేంద్రం

ఈనాడు, విశాఖపట్నం: పర్యావరణానికి పెను సవాలుగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్ తయారుచేసే పరిశ్రమ విశాఖపట్నంలో ఏర్పాటు కానుంది. ఈ పరిజ్ఞానాన్ని జాతీయ భౌతికశాస్త్ర పరిశోధనా సంస్థ (ఎన్‌పీఎల్) అభివృద్ధి చేసింది. దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక పరిశోధనశాలల్లో ఒకటైన సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) ఆధ్వర్యంలోని ఎన్‌పీఎల్ శాస్త్రవేత్తలు దేశంలోని ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనే లక్ష్యంగా పరిశోధనలు చేసి టైల్స్ తయారుచేయవచ్చని నిరూపించారు. ఈ పరిజ్ఞానంతో ఎలాంటి స్థితిలో ఉన్న ప్లాస్టిక్‌నైనా అత్యంత సుందరమైన టైల్స్‌గా మార్చుకోవొచ్చు. సాధారణ టైల్స్ కన్నా ఇవి అందంగా, రంగురంగుల డిజైన్ల ఉంటాయి. సిరామిక్ టైల్ కన్నా మూడు రెట్ల బలం, 50ఏళ్ల వరకూ రంగు వెలిసిపోకుండా ఉండే తత్వం, తక్కువ బరువు, బద్దలయ్యే అవకాశం లేకపోవడం, మంటల్లో పడేసినా తగలబడని గుణం, నీళ్లలో నానినా పాడవకపోవడం, అతినీలలోహిత కిరణాలకూ ప్రభావితం కాకపోవడం వీటి ప్రత్యేకతలు. అన్నింటికీ మించి టైల్స్ ధరకన్నా తక్కువ ధరలో లభ్యమయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది భారత శాస్త్ర సాంకేతిక సంస్థ (డీఎస్‌టీ) జాతీయ స్థాయిలో 50 అత్యుత్తమ స్మార్ట్ ఆవిష్కరణలను ఎంపిక చేయగా ప్లాస్టిక్ నుంచి టైల్స్ తయారీ పరిజ్ఞానం ఒక ఆవిష్కరణగా నిలిచింది.

ప్లాస్టిక్ టైల్స్ ఇవే ★ టైల్స్ మోడళ్లను చూపుతున్న కె.ఎస్.రాజు

విశాఖలో ఉత్పత్తి కేంద్రం

ప్లాస్టిక్‌తో టైల్స్ తయారుచేసే పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు జాతీయ పరిశోధనా అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌ఆర్‌డీసీ), ఎన్‌పీఆర్ సంస్థలతో విశాఖ నగరానికి చెందిన కె.ఎస్.రాజు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్లాస్టిక్ టైల్స్ పరిజ్ఞానాన్ని పారిశ్రామిక ఉత్పత్తిగా మార్చేందుకు వీలుగా ఆయన అన్ని రకాల అనుమతులు పొందారు. సంవత్సరానికి 60లక్షల టైల్స్ తయారీ సామర్థ్యంతో ఆ పరిశ్రమ ఏర్పాటు కానుంది.

ప్లాస్టిక్ సమస్యకు దీటైన పరిష్కారం

ప్రకృతిని తీవ్రంగా నాశనం చేస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని నియంత్రించడానికి వీలుగా నేను మరికొందరు శాస్త్రవేత్తల సాయంతో అధునాతన పరిజ్ఞానాల్ని ఆవిష్కరించా. ఇళ్లలో వేసుకునే టైల్స్, పేవ్‌మెంట్ టైల్స్, ఇండస్ట్రియల్ టైల్స్‌ను అవసరానికి తగినట్లుగా రూపొందించాం. కావాల్సిన రంగుల్లో వీటిని తయారుచేసుకోవచ్చు. సిరామిక్ టైల్స్ కన్నా ఎన్నో రెట్లు మేలైనవనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. అవే టైల్స్‌ను ఉపయోగించుకుని నేరుగా చిన్నచిన్న ఛాంబర్లను కూడా తయారుచేసుకోవచ్చు.

– డాక్టర్ ధవన్, సీఎస్ఐఆర్–ఎన్‌పీఎల్ శాస్త్రవేత్త, దిల్లీ

ఆరు నెలల్లో పరిశ్రమ ఏర్పాటు చేస్తాం

ఈనెల 22న ఒప్పందం కుదుర్చుకున్నా. టైల్స్ తయారుచేయడానికి అవసరమైన యంత్రాలనూ వారే అభివృద్ధి చేశారు. ఆరు నెలల్లో ఆ పరిశ్రమను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

– కె.ఎస్.రాజు, సీఈవో, వైజాగ్ బయో ఎనర్జీ ఫ్యూయల్

కొత్త డీజీపీ ఎంపికకు అయిదు పేర్లు

ప్రభుత్వానికి నివేదించిన కమిటీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కొత్త డీజీపీ ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతాధికారుల కమిటీ అయిదుగురు పేర్లను సిఫార్సు చేసింది. ఆ జాబితాలో విజయవాడ నగర పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్, ఏసీబీ డీజీపీ ఆర్.పి.ఠాకూర్‌లు ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో సమావేశమైన ఎంపిక కమిటీ... డీజీపీ హోదాలోని ఎస్.వి.రమణమూర్తి, వీఎస్‌కే కౌముది, ఆర్.పి.ఠాకూర్, వినయ్ రంజన్ రే, గౌతమ్ సవాంగ్, ఎన్.వి.సురేంద్రబాబు, ఏ.ఆర్.అనూరాధ పేర్లను పరిగణనలోకి తీసుకుంది. అనుభవం, వృత్తిపరమైన పరిజ్ఞానం, రాష్ట్రంలోని పోలీసు దళాలను నడిపించే సామర్థ్యం, ట్రాక్ రికార్డు తదితరాలన్నింటినీ పరిశీలించి వారిలో నుంచి అయిదుగురు పేర్లతో కూడిన జాబితాను ప్రభుత్వానికి పంపించింది. కాకినాడలో ధర్మపోరాట దీక్షను ముగించుకుని శుక్రవారం రాత్రి విజయవాడకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త డీజీపీ ఎంపికపై కసరత్తు ప్రారంభించారు. ప్రధానంగా 1986 బ్యాచ్‌కు చెందిన గౌతమ్ సవాంగ్, ఆర్.పి.ఠాకూర్‌ల పేర్లను ఆయన పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిరువురిలో గౌతమ్ సవాంగ్‌కే ఎక్కువ అవకాశాలున్నట్లు సమాచారం. ఆర్.పి.ఠాకూర్‌కు మాత్రం ఇద్దరు ఉన్నతాధికారులు మద్దతు పలికారు. ప్రస్తుత డీజీపీ ఎం.మాలకొండయ్య శనివారమే పదవీ విరమణ చేయనున్నారు. కొత్త డీజీపీ కూడా శనివారమే బాధ్యతలు చేపట్టనున్నారు.

ముగ్గురు తెలుగువారికి సంగీత నాటక అకాడమీ యువ పురస్కారం

ఈనాడు, దిల్లీ: ప్రతిష్ఠాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్'- 2017 ముగ్గురు తెలుగువారిని వరించింది. దిల్లీకి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి భావనారెడ్డి, తిరుపతికి చెందిన మృదంగ విద్వాంసుడు కోటిపల్లి రమేశ్, కూచిపూడికి చెందిన యక్షగాన కళాకారుడు తాడేపల్లి సత్యనారాయణశర్మలు ఎంపికయ్యారు. అవార్డుతోపాటు వీరికి రూ.25వేల నగదు పురస్కారం అందజేస్తారు.

వేగంలో కాటేసిన మృత్యువు

- కారు - ద్విచక్ర వాహనం ఢీ
- నలుగురు యువకుల దుర్మరణం
- పేలిన ద్విచక్రవాహనం ట్యాంకు
- కారులోని నలుగురికి స్వల్ప గాయాలు

ఈనాడు డిజిటల్– చిత్తూరు, బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా మదనపల్లె- కృష్ణగిరి జాతీయ రహదారిపై బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు దుర్మరణం పాలయ్యారు. కారు, ద్విచక్రవాహనం ఢీకొనగా పెట్రోలు ట్యాంకు పేలి చెలరేగిన మంటల్లో చిక్కుకుని ఇద్దరు, గాయపడి మరో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. బైరెడ్డిపల్లెకు చెందిన నలుగురు స్నేహితులు ద్విచక్రవాహనంపై పలమనేరు నుంచి స్వగ్రామానికి వస్తుండగా కుప్పం నుంచి చిత్తూరు వెళుతున్న కారు ఢీకొంది. ద్విచక్రవాహనం పెట్రోలు ట్యాంకు పేలి హఠాత్తుగా రేగిన మంటల్లో ఇద్దరు ప్రాక్షికంగా కాలిపోయి మృత్యుఒడికి చేరారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతులను బైరెడ్డిపల్లె బీసీ కాలనీకి చెందిన శ్రీనివాసులు కుమారుడు తేజ(23), వెంకటేష్ కుమారుడు కిషోర్ (21), బజారువీధికి చెందిన మునిరత్నం కుమారుడు వంశీధర్(22), గంగరాజు కుమారుడు వినోద్(20)లుగా గుర్తించారు. కారులో ప్రయాణిస్తున్న యాదమరి మండలానికి చెందిన చెన్నకేశవులు(కారు చోదకుడు), మనోహర్, సిద్దయ్యనాయుడు, మోహన్‌రాజులు స్వల్పంగా గాయపడ్డారు. మృతులు అందరూ డిగ్రీలు చదివారు. చేతికి అంది వచ్చిన కొడుకులు బైక్‌పై వెళుతూ అర్ధంతరంగా మరణించడంతో వారి తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రమాద ప్రాంతంలో మలుపులు లేవు. రహదారి కొత్తది కావడంతో బాగుంది. ఒకే ద్విచక్ర వాహనంలో నలుగురు యువకులు ప్రయాణించడం, ఇన్నోవా వాహనం వేగంగా కుడివైపున రావడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. డ్రైవింగ్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకునేందుకు పలమనేరు వెళుతున్నట్లు విద్యార్థులు నలుగురు ఇంట్లో చెప్పి వెళ్లినట్లు సమాచారం.

ప్రమాదానికి గురైన కారు

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో త్రిముఖ పోటీ: మధు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: రానున్న శాసన సభ ఎన్నికల్లో రాష్ట్రంలో త్రిముఖ పోటీ ఏర్పడనుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. శుక్రవారం తిరుపతిలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో రెండు పార్టీల మధ్య పోటాపోటీ జరిగిందని, ఈసారి తెదేపా, వైకాపా, జనసేన మధ్య తీవ్రమైన పోటీ నెలకొనే అవకాశం ఉందని చెప్పారు. జనసేనకు ప్రజాదరణ పెరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అది తగ్గుతోందని తెలిపారు. నాలుగేళ్లుగా భాజపా, తెదేపా కలిసి పనిచేయడం వలన విభజన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. కడప ఉక్కు కర్మాగారం రాకపోవడం వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. దాని సాధనకు సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి: ఎస్‌జీటీఎఫ్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్‌జీటీ), ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని ఎస్‌జీటీఎఫ్ విన్నవించింది. 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఎస్‌జీటీలకు పాఠశాల సహాయకులుగా అవకాశం కల్పించాలని కోరింది.

వేదికపై అభివాదం చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు

దళితులకు అన్యాయం జరిగితే ఊరుకోం

- ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టానికి కేంద్రం తూట్లు
- సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ

ఈనాడు, తిరుపతి: దళితులకు రాష్ట్రంలో ఎలాంటి అన్యాయం జరిగినా రెక్కలు కట్టుకొని వాలిపోతామని, వారి తరఫున ఉద్యమించేందుకు వామపక్షాలు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటాయని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు ఎం.మధు, రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 'పొలికేక' పేరుతో ఎస్సీ, ఎస్టీ చట్టం పరిరక్షణ కోసం నిర్వహించిన మహాజన సభలో వారు మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ.. దళితులకు రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టాన్ని కావాలనే ప్రభుత్వాలు నీరుగార్చే కుట్ర చేస్తున్నాయన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో తమ పార్టీ తరఫున ఈ విషయాన్ని లేవనెత్తుతామన్నారు. జులై 16న రాజమహేంద్రవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, అందులో దళితుల చట్టాలపై తీర్మానాలు చేస్తామని అన్నారు. దళితులకు సైతం దేవాదాయ శాఖలో కచ్చితంగా రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చాలాచోట్ల అంటరానితనం ఉందని, గరగపర్రు ఘటన జరిగి ఏడాదవుతున్నా ఒక్కసారి కూడా ముఖ్యమంత్రి బాధితులతో మాట్లాడకపోవడం శోచనీయమని అన్నారు. దళితులకు భూముల్లో, ఉద్యోగాల్లో, పదోన్నతుల్లో వాటా అవసరమని అన్నారు. మాజీ ఎంపీ తిరుమావలవన్ సమావేశంలో మాట్లాడారు. సభకు సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌ను నిర్వాహకులు ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఇది రాజకీయ సభలా ఉందని, తాను వేదికపైకి రానంటూ ఆయన ముందుగానే వెనుదిరిగారు. ఆయన్ను సముదాయించేందుకు ప్రయత్నించినా ససేమిరా అన్నారు. జస్టిస్ బాలకృష్ణన్ వెంట కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఉన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యురాలు కమలమ్మ, దళిత మహిళల జాతీయ సమాఖ్య ప్రతినిధి లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పన్ను వసూళ్లలో 17 శాతం వృద్ధి

కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కార్పొరేట్ పన్ను స్థూల వసూళ్లు, 2017-18 ఇదే సమయంతో పోలిస్తే 17 శాతం పెరిగాయని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఇదే సమయంలో వ్యక్తిగత ఆదాయపు పన్ను స్థూల వసూళ్లు 44 శాతం అధికమయ్యాయని ఫేస్‌బుక్ పోస్ట్‌లో మంత్రి వెల్లడించారు. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలుకు తోడు, పన్ను పరిధిలోకి మరిందరు జత చేరడం వల్లే వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఇదే ధోరణి వచ్చే 3 త్రైమాసికాల్లో కొనసాగితే, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు భారీగా పెరుగుతాయని మంత్రి వివరించారు.

- ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంత పన్ను చెల్లించాల్సి వస్తుందో కార్పొరేట్ సంస్థలు అంచనా వేసుకుని, అందులో 15 శాతాన్ని ఏప్రిల్-జూన్‌లో చెల్లిస్తుంటాయి. వచ్చే రెండు త్రైమాసికాల్లో 30 శాతం చొప్పున, మిగిలిన మొత్తాన్ని మార్చి 15 కల్లా జమచేయాల్సి ఉంటుంది.
- 2017-18లో నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.10.03 లక్షల కోట్లకు చేరాయి. 2016-17 కంటే అవి 18 శాతం అధికం. అయితే సవరించిన అంచనాల (రూ.10.05 లక్షల కోట్ల) కంటే కాస్త తక్కువ కావడం గమనార్హం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని రూ.11.50 లక్షల కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది.

భారత అధిక వృద్ధికి ఐఎంఎఫ్ మూడు సూత్రాలు

వాషింగ్టన్: అధిక వృద్ధిని నిలబెట్టుకోవాలంటే భారత్‌కు మూడు సూత్రాలను ఐఎంఎఫ్ సూచించింది. ఇందులో మొదటిది బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలను కొనసాగించడం కాగా.. జీఎస్‌టీ సరళీకరణ రెండోది. వీటితో పాటు స్థల, కార్మిక లాంటి కీలక విభాగాలకు సంస్కరణల పునరుద్ధరణపై దృష్టి సారించాలని తెలిపింది.

'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి పుంజుకోవడం కొనసాగుతుందని భావిస్తున్నాం. 2018-19లో 7.4 శాతం, 2019-20లో 7.8 శాతం వృద్ధి నమోదుకావచ్చని అంచనా వేస్తున్నామ'ని ఐఎంఎఫ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ గెరీ రైస్ తెలిపారు. బ్యాంకింగ్ రంగాన్ని గాడిలో పెట్టేందుకు బ్యాంకుల, కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్ల శుద్ధిప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ రంగ బ్యాంకుల పాలనా విధానాలను పటిష్ఠం చేయాలని సూచించారు. ద్రవ్య స్థిరీకరణపై దృష్టి సారించడాన్ని కూడా కొనసాగించాలని చెప్పారు. కీలకమైన పోటీతత్వాన్ని మెరుగుపర్చేందుకు వ్యాపారానుకూల పరిస్థితులను సృష్టించాలని రైస్ చెప్పారు. భారత్‌లో జులై 18న ఐఎంఎఫ్ బోర్డు వార్షిక సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశంలో జీఎస్‌టీ ప్రక్రియ సరళీకరణకు సంబంధించి కొన్ని వివరాలను వెల్లడిస్తామని తెలిపింది. అమలు, నిర్వహణపరంగా జీఎస్‌టీ క్లిష్టతరమైన పన్ను విధానమైనందున, సరళీకరణకు కొన్ని సూచనలు తప్పనిసరి అని ఆయన చెప్పారు.

బ్యాంకుల ఆడిటర్లకు ఆర్‌బీఐ హెచ్చరిక

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

దిల్లీ: బ్యాంకుల ఆడిటింగ్ విషయంలో చట్ట అతిక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆడిటర్లను ఆర్‌బీఐ హెచ్చరించింది. ఇటీవల ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వెలుగుచేసిన వివిధ కుంభకోణాల్లో ఆడిటర్ల పాత్రపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని తీసుకుంది. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోకుంటే బ్యాంకుల్లో ఆడిటింగ్ నిర్వహణకు అనుమతించకపోవడం సహా పలు చర్యలు తీసుకుంటామని ఓ కొత్త సర్క్యులర్‌ను ఆర్‌బీఐ జారీ చేసింది. ఆడిటింగ్ నాణ్యతను మెరుగుపర్చేందుకు, పారదర్శకత వ్యవస్థను తీసుకొచ్చేందుకు ఆడిటర్ల జవాబుదారీతనాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇందుకుగాను ఆడిట్ నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటే తగువిధంగా చర్యలు చేపట్టేలా ఓ విధాన రూపకల్పనకు నిర్ణయం తీసుకున్నామ'ని ఆర్‌బీఐ తెలిపింది. ఆడిటర్ల నియామకానికి ముందు ఆర్‌బీఐ అనుమతులు తీసుకోవాలని కూడా సర్క్యులర్‌లో ఆర్‌బీఐ పొందుపరిచింది.

రివర్స్ ఛార్జీ విధానం అమలు గడువు పొడిగింపు

దిల్లీ: రివర్స్ ఛార్జీ విధానానికి సంబంధించిన నిబంధనల అమలు గడువును మరో మూడు నెలలు ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబరు 30 వరకు అమలును వాయిదా వేస్తున్నట్లు కేంద్ర పరోక్ష పన్నుల, కస్టమ్స్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఇంతకుముందు ఈ గడువు జూన్ 30గా ఉంది. రివర్స్ ఛార్జీ విధానంలో జీఎస్‌టీ గుర్తింపు లేని సంస్థలు/ వ్యాపారుల నుంచి గుర్తింపు ఉన్న సంస్థలు/ వ్యాపారులు వస్తువులను కొనుగోలు చేస్తే వీళ్లు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.

4జీ వేగంలో జియోదే పైచేయి: ట్రాయ్

దిల్లీ: ఏప్రిల్‌లో 4జీ డేటా వేగానికి సంబంధించి రిలయన్స్ జియో మళ్లీ అగ్రస్థానంలో నిలిచింది. జియో నెట్‌వర్క్‌పై 4జీ డౌన్‌లోడ్ సగటు వేగం 19 ఎంబీపీఎస్‌గా నమోదు అయినట్లు ట్రాయ్ గణాంకాలు తెలిపాయి. ప్రత్యర్థి సంస్థ భారతీ ఎయిర్‌టెల్ వేగం 9.3 ఎంబీపీఎస్‌తో పోలిస్తే, ఇది రెట్టింపు కంటే అధికమని వెల్లడించింది. ఇదే నెలలో వొడాఫోన్ 4జీ డౌన్‌లోడ్ స్పీడ్ సగటు వేగం 6.8 ఎంబీపీఎస్‌గా, ఐడియా 6.5 ఎంబీపీఎస్‌గా నమోదైంది. టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ రూపొందించిన మైస్పీడ్ యాప్ గణాంకాల ప్రకారం.. అప్‌లోడ్ స్పీడ్‌లో మాత్రం 6.3 ఎంబీపీఎస్‌తో ఐడియా సెల్యులార్ అగ్రస్థానంలో నిలిచింది. వొడాఫోన్ (5.2 ఎంబీపీఎస్), రిలయన్స్ జియో (4.8 ఎంబీపీఎస్), భారతీ ఎయిర్‌టెల్ (3.8 ఎంబీపీసీఎస్) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

బ్యాంకింగ్‌లోకి ఎల్ఐసీ!

- ఐడీబీఐ బ్యాంక్‌లో 51 శాతం వాటా కొనుగోలుకు ఐఆర్‌డీఏఐ అంగీకారం
- రూ.10,000-13,000 కోట్ల పెట్టుబడి

ముంబయి/వడోదర

సొంతగా బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) దీర్ఘకాల కోరిక నెరవేరనుంది. ఐడీబీఐ బ్యాంక్‌లో నియంత్రణ వాటాను ఎల్ఐసీ కొనుగోలు చేసేందుకు బీమా నియంత్రణ ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ అంగీకరించడమే ఇందుకు కారణం. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఐఆర్‌డీఏఐ బోర్డు సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 'ఐడీబీఐ బ్యాంకులో 51 శాతం వాటాను ఎల్ఐసీ కొనుగోలు చేసేందుకు ఐఆర్‌డీఏఐ అనుమతి ఇచ్చింది. వాటా కొనుగోలు జరగాల్సి ఉంది. బ్యాంకులో నియంత్రణ వాటా కొనుగోలు చేసేందుకు ఎల్ఐసీ రూ.10,000-13,000 కోట్లు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది' అని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు ఏ కంపెనీలోనూ 15 శాతం వాటాకు మించి కొనుగోలు చేసేందుకు ఏ బీమా సంస్థకూ అనుమతి లేదు. ఇప్పుడు మాత్రం ఎల్ఐసీకి ఇందుకు ఐఆర్‌డీఏఐ మినహాయింపు ఇచ్చిందని సమాచారం. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా ఈ ప్రతిపాదనను అంగీకరించాల్సి ఉంది.

5 బ్యాంకుల్లో వాటాలున్నా..: ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎల్ఐసీకి పోటీగా ఉన్న బీమా సంస్థలకు సొంత బ్యాంకులున్నాయి. కానీ 5 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వాటాలున్నా, సొంతగా నియంత్రణ హక్కు కలిగిన బ్యాంక్

లేదనేదే ఎల్ఐసీ భావన. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 9.98 శాతం, అలహాబాద్ బ్యాంకులో 12.37 శాతం, కార్పొరేషన్ బ్యాంకులో 13.03 శాతం వాటాలు ఎల్ఐసీకి ఉన్నాయి. 'ఒక బ్యాంకుపై నియంత్రణ వాటా లభిస్తే, అది మీ అనుబంధ సంస్థ అవుతుంది. మీరు ఒక బ్యాంక్‌ను కలిగి ఉన్నపుడు, మరే ఇతర బ్యాంకుల్లో 5 శాతానికి మించి వాటాలు కలిగి ఉండకూడదు. అందువల్ల ప్రత్యేక మినహాయింపు ఏమీ పొందకపోతే, మిగిలిన బ్యాంకుల్లో వాటాను తప్పనిసరిగా ఎల్ఐసీ తగ్గించుకోవాల్సి వస్తుంది' అని అధికార వర్గాలు తెలిపాయి. ఐడీబీఐ బ్యాంకుతో ఒప్పందం ఖరారవగానే, బ్యాంకు బోర్డులో ఎల్ఐసీ ప్రతినిధులు చేరతారు.

ఇదీ లెక్క: ఐడీబీఐ బ్యాంకులో ప్రభుత్వానికి 80.96 శాతం వాటా, ఎల్ఐసీకి 10.8 శాతం వాటాలున్నాయి. ఎల్ఐసీ కొనుగోలు చేయనుందనే వార్తలతో, శుక్రవారం బ్యాంక్ షేరు 10.2 శాతానికి పైగా లాభపడి, రూ.54.90కు పెరగడంతో, సంస్థ మార్కెట్ విలువ రూ.22,954.79 కోట్లకు చేరింది.

మా బోర్డు సమావేశంలో చర్చించనే లేదు: ఐడీబీఐ బ్యాంక్

తమ బ్యాంకులో జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రూ.13,000 కోట్ల పెట్టుబడి పెడుతుందనే అంశంపై బోర్డు సమావేశంలో చర్చించనే లేదని ప్రభుత్వరంగ ఐడీబీఐ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. అటువంటి సమాచారం ఏమైనా ఉన్నా, దీనిపై బోర్డులో చర్చించినా, వెంటనే స్టాక్ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇస్తామని పేర్కొంది.

51 శాతం వాటా అట్టేపెట్టుకోండి: ఏఐబీఈఏ

ఐడీబీఐ బ్యాంక్‌లో మెజార్టీ వాటాను ఎల్ఐసీకి విక్రయించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు ఆలిండియా బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటాచలం తెలిపారు. భారీమొత్తం మొండిబకాయిలు పేరుకుపోయిన బ్యాంక్ నుంచి వైదొలగవద్దని, అదనపు మూలధనాన్ని సమకూర్చాలని కోరుతూ ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. 'వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం 2003లో ఐడీబీఐని ఐడీబీఐ బ్యాంక్‌గా మార్చింది. అప్పుడు పార్లమెంటులోనే ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తూ, ఏ సమయంలో అయినా బ్యాంక్‌లో 51 శాతం వాటాకు తగ్గకుండా చూసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చింది. దానిని నిలబెట్టుకోవాలి' అని లేఖలో వివరించారు. 'ఐడీబీఐ బ్యాంక్‌లో మొండి బకాయిలు భారీగా పేరుకునేందుకు, అధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయాలు కారణమైతే, వారిని చట్టపరంగా విచారించాలి. అదే ఆర్థిక పరిస్థితుల కారణంగా మౌలిక వసతుల రుణాలు పేరుకుపోతే, ప్రభుత్వం అదనపు మూలధనం సమకూర్చాలి' అని సూచించారు. ఎల్ఐసీకి కూడా నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) భారీగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో నష్టాల్లో ఉన్న కంపెనీలను ఆ సంస్థతో కొనిపించడం ప్రభుత్వానికి తగదన్నారు. ఇందువల్ల ఎల్ఐసీలో పెట్టుబడి పెట్టిన సామాన్యుల ప్రయోజనాలు దెబ్బతింటాయని వివరించారు.

రూపాయిపై ఇప్పటికిప్పుడు తొందరపడేదేముంది..!

- అంతర్జాతీయ పరిణామాల వల్లే ఈ స్థితి
- దేశీయ స్థూల గణాంకాలు పటిష్టం
- ఆర్‌బీఐతో సంప్రదించాకే చర్యలు
- ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్

దిల్లీ: రూపాయి మారకం విలువ మరింత పతనం అవ్వకుండా, సత్వర చర్యలేమీ తీసుకోవడం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతర్జాతీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నాకే, రూపాయి బలోపేతానికి తగిన చర్యలు చేపడతామని పేర్కొంది. డాలర్ మారకం విలువ ఎన్నడూ లేనంతగా గురువారం రూ.69ని దాటిన నేపథ్యంలో, అత్యవసరంగా ప్రతిస్పందించాల్సిన అవసరం లేదని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. చమురు ధరల పెరుగుదల, అమెరికాలో వడ్డీరేట్ల పెంపు వంటి అంతర్జాతీయ పరిణామాలకు తోడు ద్రవ్యోల్బణ భయాలు అధికమయ్యాయి. అందువల్లే ఒకదశలో డాలర్ రూ.69.10కు చేరినా, రూ.68.79 వద్ద స్థిరపడింది. శుక్రవారం రూపాయి కాస్త కోలుకోవడంతో, డాలర్ రూ.68.36కు చేరింది. 'విదేశీ మారక నిల్వలు, రూపాయి మారకం విలువలను నిర్వహించే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)పై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ఆర్‌బీఐ అధికారులతో సంప్రదింపులు జరిపాక, అంతర్జాతీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, అప్పుడు చర్యలు తీసుకుంటాం. అంతేకాని హడావుడిగా ప్రతిస్పందించాం. సంఘటిత విపణిలో, అదే తీరుతో వ్యవహరించాల్సి ఉంటుంది' అని గోయల్ పేర్కొన్నారు. కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న గోయల్ విలేకరులతో మాట్లాడారు.

రాజన్ చర్యలతో

2013లో డాలర్ మారకం విలువ రూ.68కి చేరినపుడు, అప్పటి ఆర్‌బీఐ గవర్నర్ రఘురాం రాజన్ 'విదేశీ కరెన్సీ ప్రవాస భారతీయ బ్యాంక్ డిపాజిట్ (ఎఫ్‌సీఎన్ఆర్-బి)లను ప్రవేశ పెట్టారు. దీనికింద మూడేళ్లలో 32 బిలియన్ డాలర్లు (రూ.2 లక్షల కోట్లకు పైగా) దేశంలోకి వచ్చాయి. అనంతరం కరెన్సీ మారకం విలువలు స్థిరపడ్డాయని మంత్రి వివరించారు. 'ఆ 32 బి.డాలర్లు తిరిగి చెల్లించేశాం. అయినా కూడా గత అయిదేళ్లలో రూపాయి విలువ క్షీణించలేదు. స్థూల ఆర్థిక గణాంకాలు అన్ని విధాలుగా పటిష్టంగా ఉన్నాయి. 2017-18 ఆఖరుకు 425 బి.డాలర్లకు చేరడం వల్ల రూపాయి బలోపేతం అయిందనే భావన ఉంది' అని గోయల్ వివరించారు. కరెంటు ఖాతా లోటు 2012-13లో 4.8 శాతం కాగా, గత ఆర్థిక సంవత్సరంలో 1.9 శాతానికి పరిమితమైంది. ద్రవ్యలోటు కూడా 4.5 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గింది అని గుర్తు చేశారు.

పెట్రోలు, డీజిల్ ఇప్పుడప్పుడే జీఎస్‌టీలోకి రావు

- ఒకవేళ తీసుకొచ్చినా ధరలో మార్పు ఉండదు
- జీఎస్‌టీ మండలి సభ్యుడు సుశీల్ కుమార్ మోదీ

దిల్లీ: పెట్రోలు, డీజిల్ ఇప్పుడప్పుడే జీఎస్‌టీ పరిధిలోకి రాకపోవచ్చని జీఎస్‌టీ మండలి సభ్యుడు, బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ తెలిపారు. ఒకవేళ జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చినప్పటికీ ధరల్లో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని అన్నారు. 'పెట్రోలు, డీజిల్‌కు జీఎస్‌టీలో గరిష్ఠ స్లాబు అయిన 28% పన్ను రేటును నిర్ణయిస్తే, రాష్ట్రాలు కూడా అదనంగా మరికొంత పన్ను విధిస్తాయి కనుక పెట్రో ఉత్పత్తుల ధరలు దాదాపు ప్రస్తుత స్థాయిల వద్దే ఉంటాయ'ని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నందున పెట్రోలు, డీజిల్‌ను జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చేందుకు కొంత సమయం పట్టొచ్చని తెలిపారు. అయితే ఈ సమయం ఎప్పుడనే విషయంపై జీఎస్‌టీ మండలి తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం రిటర్న్‌ల సరళీకరణపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సాధారణంగా అంతర్జాతీయ పరిణామాల పైనే పెట్రోలు, డీజిల్ ధరల కదలికలు ఆధారపడి ఉంటాయని అన్నారు. రాష్ట్రాల పన్ను ఆదాయాల్లో 45- 50 శాతం వరకు పెట్రోలు, డీజిల్ నుంచే వస్తాయని తెలిపారు. ప్రస్తుతం పెట్రోలుపై రూ.19.48, డీజిల్‌పై రూ.15.33 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం విధిస్తుంది. దీనికి అదనంగా రాష్ట్రాలు వ్యాట్‌ను వసూలు చేస్తున్నాయి. ముంబయిలో పెట్రోలుపై అత్యధికంగా 39.12% వ్యాట్ విధిస్తుండగా.. తెలంగాణలో డీజిల్‌పై ఇది 26 శాతంగా ఉంది. కనిష్ఠంగా అండమాన్ నికోబార్‌లో 6 శాతం వ్యాట్‌ను వసూలు చేస్తున్నారు.

మరికొన్ని ఉత్పత్తులపై జీఎస్‌టీ తగ్గింపు!: రానున్న నెలల్లో మరికొన్ని ఉత్పత్తులపై జీఎస్‌టీ రేటను ప్రభుత్వం తగ్గించే అవకాశం ఉంది. ముఖ్యంగా 28 శాతం స్లాబులోని కొన్ని ఉత్పత్తుల పన్ను రేటును తగ్గించే విషయంపై యోచన చేస్తోంది. ఈ స్లాబులో ఉన్న సిమెంటు, రంగుల పన్ను రేటును తగ్గిస్తారని ఇప్పటికే వార్తలు కూడా వినిపిస్తోన్న సంగతి తెలిసిందే. వీటితో జౌళి సహా మరికొన్ని రంగాల ఉత్పత్తుల పన్ను రేట్లను తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఐసీఐసీఐ బ్యాంక్ ఛైర్మన్‌గా జీసీ చతుర్వేది

దిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ కొత్త నాన్-ఎగ్జిక్యూటివ్ తాత్కాలిక ఛైర్మన్‌గా.. మాజీ ఐఏఎస్ అధికారి గిరీశ్ చంద్ర చతుర్వేది నియమితులయ్యారు. ప్రస్తుత ఛైర్మన్ ఎం.కె.శర్మ స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. నేటితో శర్మ పదవీకాలం ముగియనుంది. జులై 1 నుంచి మూడేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. కొత్త బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని, అయితే ప్రాధాన్యతలు, కార్యాచరణ గురించి మాట్లాడటానికి ఇది సమయం కాదని చతుర్వేది పేర్కొన్నారు. 'ఐసీఐసీఐ బ్యాంక్ సమస్యల్లో ఉందని నేను భావించడం లేదు. కొన్ని సంఘటనలు చోటుచేసుకుంటాయి. వాటి నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. తప్పులను సరిదిద్దుకుని ముందుకు సాగాలి. మేము అది చేయగలమన్న నమ్మకం ఉంది' అని వెల్లడించారు. చతుర్వేది నియమకానికి వాటాదార్ల ఆమోదం తెలపాల్సి ఉందని ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. బ్యాంక్ స్వతంత్ర డైరెక్టర్లు ఉదయ్ చితాలే, నీలం ధావన్‌ల పేర్లు పరిశీలనకు వచ్చినా.. బ్యాంక్ చతుర్వేదికే మొగ్గుచూపింది. ఐసీఐసీఐ బ్యాంక్ గత కొంత కాలంగా వరుస వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. వీడియోకాన్ రుణ వ్యవహారంలో అంతర్గత దర్యాప్తు ముగిసేంత వరకు సీఈఓ చందా కొచ్చర్‌ను సెలవులోకి పంపిన బ్యాంక్.. కొత్త సీఓఓగా సందీప్ బక్షిని నియమించింది.

ఎవరీ చతుర్వేది?: 1977 బ్యాచ్, ఉత్తర ప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి చతుర్వేది. 2013 జనవరిలో చమురు కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. ఆర్థిక సేవల విభాగంలో బ్యాంకింగ్, బీమా రంగ పరిపాలన విభాగంలో అయిదేళ్ల పాటు పనిచేశారు. ఇందులో అదనపు కార్యదర్శిగా సైతం వ్యవహరించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో భౌతిక శాస్త్రం, సామాజిక విధానంలో ఎంఎస్సీ చేసిన చతుర్వేది, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా కూడా పొందారు. ఐడీబీఐ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా బోర్డుల్లో ప్రభుత్వ నామినీగా సేవలందించిన అనుభవం ఆయన సొంతం. 2011 మేలో చమురు కార్యదర్శిలో నియమితులైన ఆయన.. అదే పదవిలో పదవీ విరమణ చేశారు.

భవిష్యత్తు ఈటీఎఫ్‌లదే

- పెరుగుతున్న అవగాహన
- పెట్టుబడి వ్యయాలు తక్కువ
- ప్రతిఫలాలు ఎక్కువ!

ఈనాడు - హైదరాబాద్

మ్యూచువల్ ఫండ్‌లలో మదుపు చేసే వారు మరింత ప్రతిఫలాన్ని పొందడానికి ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్‌లు (ఈటీఎఫ్), ఇండెక్స్ ఫండ్‌లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్‌ల వంటి ప్యాసివ్ పెట్టుబడులపై ప్రస్తుతం అవగాహన తక్కువగా ఉన్నప్పటికీ.. ఈ ధోరణి వేగంగా పుంజుకుంటోంది. ఈటీఎఫ్‌లు ఆయా సూచీలు, రంగాల ఆధారిత షేర్లలో సమాన ప్రాధాన్యంతో (వెయిటేజీ) పెట్టుబడులు పెడతాయి. ఈ ఫండ్‌లు షేర్ల తరహాలో ఎక్స్ఛేంజీలో ట్రేడవుతాయి. ట్రేడింగ్ సమయంలో వీటి యూనిట్లను కొనుగోలు చేయొచ్చు. విక్రయించొచ్చు. నిష్క్రియాత్మక పెట్టుబడులు (ప్యాసివ్ ఇన్వెస్ట్‌మెంట్స్) దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలను ఇస్తాయి. లావాదేవీలకు అయ్యే వ్యయం కూడా తక్కువగా ఉంటుంది. షేర్ల తరహాలో ఒకే రోజు ఫండ్‌లను కొనుగోలు చేయడం, విక్రయం చేసే వెసులుబాటు ఉంటుంది. దీర్ఘకాల ప్రాతిపదికన బ్యాంకుల్లో వేసే డిపాజిట్లపై లభిస్తున్న వడ్డీరేట్లు తక్కువగా

అనిల్ ఫిలానీ

ఉండడం, అధిక ప్రతిఫలం పొందడానికి రిస్క్ తీసుకునే సామర్థ్యాలు మదుపర్లలో పెరగడం వంటి పరిణామాల నేపథ్యంలో నిష్క్రియాత్మక పెట్టుబడులు ఊపందుకుంటున్నాయని డీఎస్‌పీ బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ ఫిలానీ 'ఈనాడు'కు తెలిపారు. అనేక అభివృద్ధి చెందిన మార్కెట్లలో ప్యాసివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సాధనాలకు ఆదరణ బాగా ఉందని, భారత్‌లో వీటిపై ఇప్పుడిప్పుడే అవగాహన వస్తోందన్నారు.

పెట్టుబడులు చాలా తక్కువ: దేశీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహిస్తున్న ఆస్తులు (అసెట్స్ అండర్ మేనేజిమెంట్-ఏయూఎం) రూ.23 లక్షల కోట్లు ఉంటే.. ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్‌ల వంటి ప్యాసివ్ పెట్టుబడి సాధనాలు నిర్వహిస్తున్న ఆస్తులు రూ.80,000 కోట్లు మాత్రమే ఉన్నాయి. దీని ప్రకారం మొత్తం ఏయూఎంలో ఈ తరహా సాధనాల ఆస్తులు 3-4 శాతమే. నిష్క్రియాత్మక పెట్టుబడులు వచ్చే అయిదేళ్లలో కనీసం 15 శాతం చొప్పున పెరిగే అవకాశం ఉంది. పెద్ద కంపెనీల (లార్జ్ క్యాప్) షేర్లలో పెట్టుబడులు పెట్టే సాధారణ (యాక్టివ్) మ్యూచువల్ ఫండ్‌లు ప్రమాణిక ఇండెక్స్‌లు ఇచ్చే ప్రతిఫలం కన్నా ఎక్కువ ప్రతిఫలం ఇవ్వడంలో విఫలం అవుతున్నాయి. ఎక్కువ ప్రతిఫలం వచ్చే విధంగా చూడడం ఫండ్ మేనేజర్లకు సవాల్‌గా మారుతోంది. నిఫ్టీ 50 సూచీ ఆధారిత షేర్లు సగటున 10 శాతం ప్రతిఫలాన్ని ఇస్తే. అంతకంటే ఎక్కువ ప్రతిఫలాన్ని ఫండ్‌లు ఇస్తే దాని పనితీరు బాగుందంటారు. ఏడాది, రెండేళ్లు, పదేళ్లు తదితర కాల పరిమితులను తీసుకుంటే.. దాదాపు 50 శాతం లార్జ్ క్యాప్ యాక్టివ్ ఈక్విటీ ఫండ్‌లు ప్రమాణిక సూచీ ఇచ్చే ప్రతిఫలం కంటే తక్కువ ప్రతిఫలాన్నే ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధిక ప్రతిఫలాలను పొందడానికి ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్‌లలో పెట్టుబడులు పెట్టడం సరైన వ్యూహమని ఫిలానీ అన్నారు. అందువల్ల పెద్ద కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే ఈటీఎఫ్‌ల వృద్ధి అధికంగా ఉందన్నారు. చిన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే సాధారణ మ్యూచువల్ ఫండ్‌ల ప్రతిఫలం ఇండెక్స్‌లు ఇచ్చే ప్రతిఫలం కన్నా సాధారణంగా ఎక్కువగానే ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు 4 ట్రిలియన్ డాలర్లు ఉంటాయని అంచనా. దేశంలో 10-12 మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ప్యాసివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌లను ప్రవేశపెట్టాయి. ఇటువంటి ఫండ్‌లు 30-40 ఉంటాయని ఫిలానీ వివరించారు.

మదుపు చేస్తున్నది 1.7 కోట్ల మందే..

దేశంలో కేవలం 1.7 కోట్ల మంది మాత్రమే మ్యూచువల్ ఫండ్‌లలో మదుపు చేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో స్థూల దేశీయోత్పత్తికి సమానంగా, అంతకంటే ఎక్కువగా మ్యూచువల్ ఫండ్‌లు నిర్వహించే ఆస్తులు ఉన్నాయి. భారత్‌లో దాదాపు 15 శాతమే ఉన్నాయి. ఇది భవిష్యత్తులో 50 శాతానికి చేరతాయనుకున్నా మ్యూచువల్ ఫండ్‌లలోకి ఆకర్షణీయంగా పెట్టుబడులు రాగలవని ఫిలానీ వివరించారు. దేశంలో పన్ను రిటర్న్‌లు దాఖలు చేస్తున్న వారు 6.8 కోట్ల మంది ఉన్నారు. 11 కోట్ల మంది ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు. వీరికి మ్యూచువల్ ఫండ్‌లపై సరైన అవగాహన కల్పిస్తే.. పెట్టుబడులు పెడతారని చెప్పారు.

డీఎస్‌పీ బ్లాక్‌రాక్ నుంచి మరో రెండు ఫండ్‌లు: డీఎస్‌పీ బ్లాక్‌రాక్ రిటైల్ మదుపర్లు ప్యాసివ్ పెట్టుబడులు పెట్టడానికి వీలుగా ఈక్వల్ నిఫ్టీ 50 ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఫండ్ ఇప్పటి వరకూ రూ.150 కోట్లు సమీకరించింది. 20,000 మంది ఇందులో పెట్టుబడులు పెట్టారు. స్టాక్ బ్రోకర్ల కోసం లిక్విడ్ ఈటీఎఫ్ పేరుతో డెట్ ఫండ్‌ను ప్రారంభించింది. ఈ ఏడాది మరో రెండు ఫండ్‌లను విడుదల చేయనున్నామని ఫిలానీ తెలిపారు. డీఎస్‌పీ బ్లాక్‌రాక్ సొంత నిర్వహణ, సలహా సేవల కింద రూ.1,10,000 కోట్ల ఆస్తులను నిర్వహిస్తోంది.

సెన్సెక్స్ ▲ 386
35423

నిఫ్టీ ▲ 125
10714

డోజోన్స్ 24467 ▲ 251

నాస్‌డాక్ 7554 ▲ 50

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 68.46 ▲ 33 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 79.38 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+) నిఫ్టీ	29న	మార్పు %	గ్రహణం (-) నిఫ్టీ	29న	మార్పు %
GAIL (INDIA)	340.25	6.48	DR. REDDYS LAB	2235.05	-2.64
TITAN COMPANY	878.50	5.04	INDUSIND BANK	1932.20	-1.80
HINDALCO	230.50	4.28	TECH MAHINDRA	655.45	-1.32
TATA STEEL	567.75	3.52	HERO MOTOCORP	3473.50	-1.21
BAJAJ AUTO	2810.30	3.47	M & M	897.70	-1.11
L & T	1275.10	3.25	HDFC BANK	2108.45	-1.05
ONGC	158.40	3.19	HPCL	259.20	-0.82

విదేశీ మారకపు రేట్లు (థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	62.45	72.41	బహ్రెయిన్ దీనార్	169.03	193.39
పౌండ్ స్టెర్లింగ్	81.83	94.89	కువైట్ దీనార్	187.66	233.60
యూరో	72.62	84.24	ఒమన్ రియాల్	165.53	189.47
జపనీస్ యెన్/100	56.39	65.41	సౌదీ రియాల్	16.61	19.67
ఆస్ట్రేలియా డాలరు	46.04	53.30	యూఏఈ దిర్హమ్	16.99	19.86
సింగపూర్ డాలరు	45.71	54.15	మలేషియా రింగిట్	15.13	18.61
థాయ్ బాత్/100	188.17	225.04	చైనీస్ యువాన్	7.32	11.88

శుక్రవారం నిఫ్టీ కదలికలు



సెమీ కండక్టర్ల తయారీ రంగంలో
ఉద్యోగావకాశాలు అపారం

- రాష్ట్రంలో వాటి తయారీకి పెద్దపీటవేస్తాం
- సరికొత్త ఆవిష్కరణలకు అమరావతి నాంది కావాలి
- ఇన్‌వెకాస్ ప్రారంభోత్సవంలో సీఎం

శుక్రవారం గుంటూరులో ఇన్‌వెకాస్, వేద సంస్థల ఐటీ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబునాయుడు, చిత్రంలో సభాపతి కోడెల శివప్రసాద్, ఐటీ మంత్రి నారా లోకేష్, ఇన్‌వెకాస్ ఎండీ ఆంజనేయులు, మంత్రులు పుల్లారావు, ఆనందబాబు.

ఈనాడు, గుంటూరు: రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ చేపడితే మన యువతకు ఇక్కడే ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఉద్యోగాలకోసం చెన్నై, దిల్లీ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా హార్డ్‌వేర్ రంగాభివృద్ధిపై దృష్టిసారించిందని తెలిపారు. భవిష్యత్‌లో హార్డ్‌వేర్ రంగంలో మంచి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు. దేశంలోనే అతి పెద్ద ఎలక్ట్రానిక్స్ డిజైన్ కంపెనీ అయిన ఇన్‌వెకాస్ ఎలక్ట్రానిక్స్ అండ్ సెమికండక్టర్ తయారీ కంపెనీ, వేదా ఎడ్యుకేషన్ సొసైటీలను శుక్రవారం ఆయన గుంటూరులో ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో చిప్ డిజైన్ తయారీలో అతి పెద్ద ఎలక్ట్రానిక్స్ కంపెనీ అయిన ఇన్‌వెకాస్ గుంటూరుకు రావటం అదృష్టమన్నారు. ఈ కంపెనీ ద్వారా ఇక్కడ యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని తద్వారా స్థానిక యువత ఇక్కడే ఉండి ఉద్యోగాలు చేసుకునే అవకాశం వస్తుందని చెప్పారు. మనం ఐటీలో మెరుగ్గా ఉన్నాం. అయితే హార్డ్‌వేర్ రంగంలో ఎదగాల్సి ఉంది. రాష్ట్రంలో ఐటీ, హార్డ్‌వేర్ రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్నోవేషన్ పాలసీలు తీసుకొచ్చాం. చిప్ డిజైనింగ్‌లో ఉద్యోగావకాశాలు అపారంగా ఉన్నాయి. ఏటా 400 బిలియన్ డాలర్ల హార్డ్‌వేర్ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాం. దిగుమతులను తగ్గించి మనమే ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐటీ, హార్డ్‌వేర్ రంగాలను ప్రోత్సహించే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఇన్‌వెకాస్ సంస్థ ఇక్కడ పెట్టుబడి పెడుతోందని గుర్తు చేశారు. ఐటీ రంగంలో ఇప్పటికే 238 కంపెనీల్లో 42 వేల ఉద్యోగావకాశాలు కల్పించాం. వీటిని 2 లక్షలకు పెంచాలనేది లక్ష్యం. ఈరంగంలో రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. దేశంలో తయారయ్యే ప్రతి వంద ఫోన్లలో 26 రాష్ట్రంలోనే తయారవుతున్నాయి. త్వరలోనే ఆ సంఖ్యను 50కు చేరుకుంటామని వెల్లడించారు. రాజధాని అమరావతిలో 300, 500 ఎకరాల్లో రూ.1100 కోట్ల పెట్టుబడులతో రెండు ఎలక్ట్రానిక్స్ పార్కులు వస్తున్నాయని వివరించారు. ఎలక్ట్రానిక్ పార్కే కాదు.. అమరావతిలో 30-40 ఎకరాల్లో చిప్ డిజైనింగ్ తయారీ కంపెనీ కూడా త్వరలోనే రానుందని వివరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ అమరావతి కేంద్రంగా 30 ఎకరాల్లో సెమీ కండక్టర్ తయారీ పార్కును ఏర్పాటు చేయనున్నాం. ఇన్‌వెకాస్ దీనిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. రాష్ట్రంలో హార్డ్‌వేర్, చిప్ డిజైన్ల తయారీకి మరింత ప్రోత్సాహాన్నిస్తామన్నారు. కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు పుల్లారావు, నక్కా ఆనందబాబు, ఐటీ కార్యదర్శి విజయానంద్, కలెక్టర్ కోన శశిధర్, అర్బన్ ఎస్పీ విజయారావు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాలో ఎన్ఎండీసీ ఖనిజాన్వేషణ

ఈనాడు, హైదరాబాద్: దక్షిణాఫ్రికాలో ఖనిజాల అన్వేషణ, అభివృద్ధి కోసం కొపానో లాజిస్టిక్స్ సర్వీసెస్‌తో కలిసి ఎన్ఎండీసీ సంయుక్త సంస్థను ఏర్పాటు చేసింది. ఇందులో రెండు కంపెనీలకు సమాన వాటా ఉంటుంది. ఇటీవల హైదరాబాద్‌లో సంయుక్త సంస్థ కొపానో ఎన్ఎండీసీ మినరల్స్ బోర్డు సమావేశం జరిగిందని, ఎన్ఎండీసీ డైరెక్టర్ (టెక్నికల్), డిప్యూటీ ఛైర్మన్ ఎన్.కె. నందా తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్: బుప్రెనార్ఫిన్, నలాక్సోన్ సబ్‌లింగ్యువల్ ఫిల్మ్ జనరిక్ ఔషధాన్ని అమెరికా మార్కెట్‌లోకి డాక్టర్ రెడ్డీస్ విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యూజెర్సీ జిల్లా న్యాయస్థానం విచారణ చేపట్టింది. మార్కెట్‌లోకి విడుదల చేయకుండా న్యాయమూర్తి మరో 14 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేశారు.

సైయెంట్: మానవ రహిత ఏరియల్ వ్యవస్థల తయారీ, అసెంబ్లింగ్, పరీక్షలు, నిర్వహణ, మరమ్మతు తదితరాలకు సైయెంట్ సొల్యూషన్స్ అండ్ సిస్టమ్స్‌కు వాణిజ్య, పరిశ్రమల శాఖకు చెందిన పారిశ్రామిక విధానం, ప్రోత్సాహం విభాగం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు లైసెన్స్ జారీ చేసినట్లు సైయెంట్ తెలిపింది. మానవ రహిత ఏరియల్ వ్యవస్థల రంగంలోని ప్రవేశించడానికి ఇటీవల సైయెంట్ ప్రత్యేక అనుబంధ సంస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

‘3డీ తయారీ’కి ఎక్సెలెన్స్ కేంద్రం

- సాంకేతిక పరిజ్ఞాన నిధి ఏర్పాటు
- సీఐఐ సదస్సులో జయేశ్ రంజన్

ఈనాడు, హైదరాబాద్: వస్తువులు, వివిధ పరికరాలను తయారు చేయడంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ కీలకంగా మారుతోంది. డిజిటల్ 3డీ డిజైన్ డేటా వినియోగించి లేయర్లగా మెటీరియల్‌ను వినియోగించి వస్తువులను తయారు చేస్తున్నారు. దీన్నే యాడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ఏఎం) గా వ్యవహరిస్తున్నారు. ఈ రంగంలో నైపుణ్యాలను పెంచడానికి అడ్వాన్స్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ (సీఓఈ)ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలంగాణ పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ తెలిపారు. ఇందుకు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో చేతులు కలుపుతోందన్నారు. ముందుగా చిన్న పరిశ్రమల అవసరాలను తెలుసుకోవడానికి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ అధ్యయనం చేస్తుందని, దశలవారీగా కేంద్రం ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. 3డీ ప్రింటింగ్ టెక్నాలజీపై సీఐఐ ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. టి-హబ్ తరహాలో ప్రోటోటైప్ హార్డ్‌వేర్ పరికరాలను అభివృద్ధి చేయడానికి టి-వర్క్స్ పేరుతో ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తయారీ విలువ గొలుసుకట్టు వ్యవస్థలో ప్రపంచంలో ప్రాధాన్య స్థానాన్ని పొందడానికి తయారీ పరిశ్రమలకు తెలంగాణ ప్రభుత్వం మద్దతుగా నిలవాలని భావిస్తోందని, ఇందుకు సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి నిధి (టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్)ని నెలకొల్పుతున్నామని జయేశ్ రంజన్ వివరించారు.

ఫ్లైనాస్ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీసులు ప్రారంభం

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫ్లైనాస్ అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం సౌదీ అరేబియాలోని రియాద్ నుంచి బయలుదేరిన ఫ్లైనాస్ ఎయిర్‌లైన్స్ విమానం తొలిసారిగా శంషాబాద్‌లో దిగడంతో అత్యాధునిక అగ్నిమాపక శకటాలతో నీటిని చల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం జీహెచ్ఐఏఎల్, ఫ్లైనాస్ ఎయిర్‌లైన్స్ సంస్థ ప్రతినిధులు పీటీబీలో జ్యోతిని వెలిగించి విమాన సర్వీసుల సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీహెచ్ఐఏఎల్ అధికారులు మాట్లాడుతూ... ఆర్జీఐఏ నుంచి ఇప్పటికే 44 దేశీయ, 17 అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. 9 ఎయిర్‌లైన్స్ సంస్థలు దేశీయ, 21 అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలు హైదరాబాద్‌కు సేవలందిస్తున్నాయన్నారు. ఎయిర్‌లైన్స్ రంగంలో అడుగుపెట్టిన ఫ్లైనాస్ సేవలను హైదరాబాద్‌కు విస్తరించడం అభినందనీయమన్నారు.

2 నుంచి నాలుగో విడత ఎలక్టోరల్ బాండ్లు

దిల్లీ: జులై 2 నుంచి 11వ తేదీ వరకు నాలుగో విడత ఎలక్టోరల్ బాండ్ల విక్రయాలను చేపట్టనున్నట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు చెందిన 11 శాఖల్లో ఇవి లభించనున్నాయి. రాజకీయ పార్టీల నిధుల్లో పారదర్శకత కోసం నగదు విరాళాలకు ప్రత్యామ్నాయంగా కేంద్రం ఎలక్టోరల్ బాండ్లను తీసుకొచ్చింది. ఎస్‌బీఐకు చెందిన దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, గాంధీనగర్, చండీగఢ్, బెంగళూరు, భోపాల్, జయపూర్, లఖ్‌నవూ, గువాహటి శాఖల్లో ఈ బాండ్లు లభిస్తాయి. ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం తొలిసారిగా ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో 1 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించిన నమోదిత రాజకీయ పార్టీలు.. ఈ ఎలక్టోరల్ బాండ్లను స్వీకరించగలవు. మొదటి విడత ఎలక్టోరల్ బాండ్ల అమ్మకం మార్చి 1- 10, రెండో విడత ఏప్రిల్ 2-10, మూడో విడత మే 1- 10 తేదీల్లో జరిగాయి.

60% కుక్కర్ల విక్రయాలు
తెలుగు రాష్ట్రాల్లోనే: పానసోనిక్

కొత్త శ్రేణి కుక్కర్లను విడుదల చేస్తున్న పానసోనిక్ అప్లియన్స్ ఎండీ హిదెనోరి ఆసు (ఎడం నుంచి మూడో వ్యక్తి). పక్కన ఇతర కంపెనీ ఉద్యోగులు.

ఈనాడు, హైదరాబాద్: పానసోనిక్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా దేశీయ మార్కెట్‌లోకి కొత్త శ్రేణి ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్లు, మిక్సీర్ గ్రైండర్లు, వెట్ గ్రైండర్లను పానసోనియక్ అప్లియన్స్ ఇండియా ప్రవేశపెట్టింది. దేశీయ మార్కెట్‌లోకి 30 ఏళ్ల క్రితం తొలిసారిగా ఎలక్ట్రిక్ కుక్కర్లను పానసోనిక్ ప్రవేశపెట్టిందని.. దేశీయ ఎలక్ట్రిక్ కుక్కర్ల విపణిలో 55-60 శాతం పానసోనిక్‌కు ఉందని పానసోనిక్ అప్లియన్స్ ఇండియా ఎండీ హిదెనోరి ఆసు తెలిపారు. చెన్నైలోని ప్లాంట్‌లో తయారవుతున్న ఎలక్ట్రిక్ కుక్కర్లు 43 దేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ కోటి కుక్కర్లను విక్రయించామని, ఏడాదికి కంపెనీ 10 లక్షల కుక్కర్లను విక్రయిస్తోందని వివరించారు. మొత్తం విక్రయాల్లో 75 శాతం కుక్కర్లను దేశీయ మార్కెట్‌లో, మిగిలిన 25 శాతం విదేశాల్లో అమ్ముతున్నామని, దేశీయ విక్రయాల్లో 60 శాతం ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలోని అమ్ముడవుతున్నాయని ఆసు అన్నారు. కుక్కర్లు, మిక్సీర్లు వంటి చిన్న గృహోపకరణాల విక్రయాలకు జపాన్ మాతృసంస్థ భారత్‌లో పానసోనిక్ అప్లియన్స్ కంపెనీని ఏర్పాటు చేసింది. గత ఏడాది ఈ కంపెనీ రూ.250 కోట్ల టర్నోవరును నమోదు చేసింది. టీవీలు, ఫ్రిజ్‌ల వంటి గృహోపకరణాల కోసం పానసోనిక్ ఇండియా కంపెనీ ఉంది.

మార్కెట్ కబుర్లు

- బైండింగ్ బిడ్‌ల దాఖలు గడువును జులై 3కి **ఫోర్టిస్ హెల్త్‌కేర్** మరోసారి పొడిగించింది. ఇంతకుమునుపు ఈ గడువు ఈ నెల 28గా ఉండేది. సంస్థ కొనుగోలు రేసులో ముంజాల్- బర్మన్‌లు, మణిపాల్- టీపీజీ కన్సార్షియం, మలేషియా ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ బెర్హాడ్, రాడియంట్ లైఫ్ కేర్‌లు ఉన్న విషయం తెలిసిందే.
- విద్యుత్, మౌలిక రంగాల్లో రూ.1235 కోట్ల ఆర్డర్లు దక్కించుకున్నట్లు **కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్** ప్రకటించింది.
- ఇటీవల విజయవంతంగా పబ్లిక్ ఇష్యూ ముగించుకున్న **రైట్స్, ఫైన్ ఆర్గానిక్ ఇండస్ట్రీస్** షేర్లు సోమవారం స్టాక్ మార్కెట్లలో నమోదు కానున్నాయి. రైట్స్ ఇష్యూకు 67 రెట్లు, ఫైన్ ఆర్గానిక్‌కు 9 రెట్ల అధిక స్పందన లభించిన విషయం తెలిసిందే.
- రేటింగ్స్ సంస్థ ఇక్రాలో మొత్తం వాటాను రూ.109 కోట్లకు **పంజాబ్ నేషనల్ బ్యాంక్** విక్రయించింది. మార్చి చివరకు ఇక్రాలో బ్యాంక్‌కు 3.43 శాతం వాటా ఉంది.
- బహిరంగ మార్కెట్ లావాదేవీల ద్వారా **అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో** రూ.1000 కోట్ల విలువైన వాటాను సింగపూర్‌కు చెందిన పెట్టుబడి సంస్థ టెమాసెక్ హోల్డింగ్స్ కొనుగోలు చేసింది. అదానీ పోర్ట్స్ ప్రమోటర్ సంస్థ ఎస్‌బీ అదానీ ఫ్యామిలీ ట్రస్ట్ ఈ వాటాను విక్రయించింది.
- రూ.16000 కోట్ల షేర్ల బైబ్యాక్‌లో తమ ప్రమోటర్లు పాల్గొనాలని కోరుకుంటున్నట్లు **టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)** ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది.
- ఇ-కామర్స్ సంస్థ **ఇన్ఫీబీమ్** ఐటీ విభాగంలోకి అడుగుపెట్టనుంది. చెల్లింపు బ్యాంక్ ఏర్పాటు, రూ.2000 కోట్ల నిధుల సమీకరణకు కంపెనీ వాటాదార్ల ఆమోదం లభించింది. ఇన్ఫీబీమ్ ఇన్‌కార్పొరేషన్ పేరు ‘ఇన్ఫీబీమ్ అవెన్యూస్’గా మార్చేందుకు సైతం అంగీకరించారు.

ఉత్సాహం ఉరకలేసింది

- బలంగా పుంజుకున్న సూచీలు
- సెన్సెక్స్‌కు 386 పాయింట్ల లాభం

సమీక్ష

రెండు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. రూపాయి జీవనకాల కనిష్ఠాల నుంచి కోలుకోవడం, జులై డెరివేటివ్ కాంట్రాక్టుల ప్రారంభమైన నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. అంతర్జాతీయ మార్కెట్లు సైతం నష్టాల నుంచి కోలుకోవడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. ఫలితంగా దాదాపు నెల రోజుల్లో సెన్సెక్స్ అత్యధిక ఒక రోజు లాభాన్ని నమోదు చేసింది. ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. ఆరు వారాల్లోనే తొలిసారిగా సూచీలు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 266.12 పాయింట్లు, నిఫ్టీ 107.55 పాయింట్లు చొప్పున నష్టాలు నమోదు చేశాయి. ఆసియా మార్కెట్లు రాణించగా, ఐరోపా షేర్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,128.16 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 35,459.05 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 385.84 పాయింట్ల లాభంతో 35,423.48 పాయింట్ల వద్ద ముగిసింది. బలహీన రూపాయి, చమురు ధరలతో గత రెండు సెషన్లలో సూచీ 452.40 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ సైతం 125.20 పాయింట్లు పెరిగి 10,714.30 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,612.35-10,723.05 పాయింట్ల మధ్య కదలాడింది.

ఐడీబీఐ హవా: సంస్థలో ఎల్ఐసీ మెజారిటీ వాటా కొనుగోలు చేయనుందన్న వార్తల నేపథ్యంలో ఐడీబీఐ బ్యాంక్ షేరు దుమ్మురేపింది. ఇంట్రాడేలో 11.92 శాతం దూసుకెళ్లిన షేరు.. చివరకు 10.02 శాతం లాభంతో రూ.54.90 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ రూ.7,566.73 కోట్లు పెరిగి రూ. 22,954.73 కోట్లకు చేరింది.

- రూ.1235 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు దక్కించుకున్న నేపథ్యంలో కల్పతరు పవర్ రాణించింది. ఇంట్రాడేలో 4.99 శాతం పెరిగిన షేరు.. చివరకు 3.08 శాతం లాభంతో రూ.400.35 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 23 లాభాలతో ముగిశాయి. టాటా స్టీల్ 3.61%, బజాజ్ ఆటో 3.42%, యెస్ బ్యాంక్ 3.16%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.99%, ఎల్ అండ్ టీ 2.86%, అదానీ పోర్ట్స్ 2.75%, ఓఎన్‌జీసీ 2.69%, వేదాంతా 2.50%, హిందుస్థాన్ యునిలీవర్ 2.35%, ఐటీసీ 2.31%, ఎన్‌టీపీసీ 2.18%, టాటా మోటార్స్ 2.05% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ (1.45%), హీరో మోటోకార్ప్ (1.19%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (1.17%), ఎం అండ్ ఎం (1.15%), సన్‌ఫార్మా (0.83%)లు మాత్రం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో మౌలికం 3.09 శాతం లాభపడింది. మన్నికైన వినిమయ వస్తువులు, లోహ, యంత్ర పరికరాలు, చమురు- గ్యాస్, స్థిరాస్తి, పీఎస్‌యూ, ఎఫ్ఎమ్‌సీజీ, విద్యుత్, ఐటీ, బ్యాంకింగ్ షేర్లు అదే బాటలో నడిచాయి.

29న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	382	వరంగల్	384
చిల్లరగా(ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	395
బెంగళూరు	429	చెన్నై	457
30వ తేదీకి		చిత్తూరు	450
విజయవాడ/గోదావరి	380	నమక్కల్	440

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 373.15 (361.80) 3241005
ASIAN PAINTS 1264.45 (1268.40) 622680
AXIS BANK LT 510.80 (504.60) 7747444
BAJAJ AUTO L 2810.30 (2716.00) 425210
BAJAJ FINANC 2296.35 (2274.70) 1378421
BAJAJ FINSER 5821.10 (5848.00) 153569
BHARTI AIRTE 381.95 (377.95) 3443146
BHARTI INFRA 300.55 (297.95) 3871075
BPCL 373.30 (366.95) 6923201
CIPLA 616.65 (600.90) 1525608
COAL INDIA L 264.35 (260.65) 1958214
DR. REDDYS 2235.05 (2295.75) 898423
EICHER MOTOR 28590.45 (28425.55) 81517
GAIL 340.25 (319.55) 7593016
GRASIM IND 1006.85 (1003.60) 594871
HCL TECH 926.25 (909.60) 3029777
HDFC 1908.10 (1878.00) 4022628
HDFC BANK 2108.45 (2130.85) 4864530
HERO MOTOCOR 3473.50 (3516.05) 398443
HINDALCO IND 230.50 (221.05) 10441528
HINDUSTAN UN 1641.15 (1602.75) 1722592
HPCL 259.20 (261.35) 9600336
ICICI BANK 275.40 (271.40) 20930477
INDIABULLS H 1142.50 (1136.70) 1169844
INDIAN OIL 156.00 (154.35) 8675702
INDUSINDBANK 1932.20 (1967.60) 1324639
INFOSYS LTD 1307.20 (1289.60) 4983300
ITC 266.20 (260.50) 10907020
KOTAK MAHIND 1342.95 (1339.10) 2305393
LARSEN & TOU 1275.10 (1234.95) 2324572
LUPIN 903.80 (897.75) 2418127
M&M 897.70 (907.75) 2441612
MARUTI SUZIK 8825.60 (8771.30) 458807
NTPC LTD 159.65 (156.40) 5549364
ONGC 158.40 (153.50) 7079407
POWER GRID C 186.85 (184.80) 4745135
RELIANCE IND 972.45 (944.95) 7966401
SBI 259.35 (257.00) 16244724
SUN PHARMA 564.00 (567.30) 4416940
TATA CONSULT 1847.75 (1842.70) 3506276
TATA MOTORS 269.30 (263.35) 14765516
TATA STEEL L 567.75 (548.45) 9477384
TECH MAHINDR 655.45 (664.25) 10890801
TITAN IND 878.50 (836.35) 4960179
ULTRATECH 3818.60 (3721.40) 320835
UPL LIMITED 618.80 (606.65) 2004445
VEDANTA LIMI 236.20 (230.00) 11526273
WIPRO 261.50 (257.10) 3619783
YES BANK LTD 339.65 (329.30) 8963268
ZEE ENTERTAI 543.95 (539.00) 1814420

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1178.50 (1157.75) 80288
ACC 1339.90 (1291.35) 1031272
ADITYA BIRLA 133.20 (127.85) 2382296
AMBUJA CEMEN 207.45 (200.90) 3749070
ASHOK LEYLAN 125.80 (124.10) 15460744
AUROBIND PHA 607.10 (600.65) 2300166
AVENUE SUPER 1485.40 (1435.45) 612439
BANK OFBAROD 112.65 (113.00) 14274242
BEL 108.65 (103.75) 6423500
BHEL 71.75 (69.75) 10374286
BOSCH LTD 17509.95 (17267.95) 18972
BRITANNIA 6213.75 (6129.55) 157611
CADILA HEALT 377.40 (378.05) 1395303
COLGATE PALM 1184.85 (1155.55) 260757
CONTAINER 652.25 (611.30) 1347255
CUMMINS INDI 647.65 (647.45) 366363
DABUR INDIA 391.45 (387.45) 1551244
DLF LIMITED 188.80 (185.15) 4202492
EMAMI LIMITE 529.15 (501.55) 454663
GENERAL INS 732.85 (718.95) 81372
GODREJ CONSU 1225.70 (1217.95) 674286
HAVELLS INDI 543.35 (522.90) 1415809
HINDUSTAN ZI 274.50 (272.10) 1688334
IDEA CELLULR 59.35 (56.70) 13211851
INTERGLOBE A 1088.50 (1100.15) 3116223
JSW STEEL LT 326.80 (322.40) 4176390
L&TFIN.HOLD 151.65 (148.35) 3028744
LIC HOUS.FIN 468.65 (470.30) 1560038
MARICO LIMIT 331.65 (332.60) 1240526
MCDOWELL 664.95 (657.65) 1372947
MOTHERSON 284.70 (281.50) 2812838
MRF 74974.45 (72933.05) 6906
NHPC LTD 23.45 (22.55) 5078399
NMDC LTD 108.10 (103.35) 2330032
OIL INDIA 209.85 (201.25) 710864
ORACLE FIN S 4074.70 (4158.20) 22984
P&G HYG&HEAL 9924.75 (9820.25) 6706
PETRONET LNG 219.20 (206.50) 4979351
PIDILITE IND 1063.50 (1028.30) 642171
PIRAMAL ENTE 2536.30 (2551.40) 171708
PNB 76.15 (72.80) 30436895
POWER FIN CO 77.30 (73.80) 7094203
RURAL ELEC C 104.65 (99.70) 7010458
SAIL 83.00 (81.05) 14327798
SBI LIFE INS 674.35 (666.40) 162407
SHREE CEMENT 15554.20 (15499.35) 22850
SHRIRAM TRAN 1299.45 (1303.65) 1508485
SIEMENS 980.35 (955.20) 129931
SUN TV LTD 782.30 (779.05) 1508172

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.76 (6.76) 43
AISHWARYA TE 3.65 (3.70) 3792
ALPHAGEO 595.85 (568.55) 2577
AMAR RAJA BA 725.50 (726.80) 13552
ANDHRA BANK 32.70 (31.40) 392505
ANDHRA CEMEN 9.01 (9) 4398
ANDHRA PAPER 314.50 (304.35) 392
ANDHRA PETRO 48.15 (43.65) 64498
ANDHRA SUGAR 344.90 (328.65) 2167
ANJANI PORTL 155.85 (140.30) 164
ASTRA MICROW 98.30 (97) 33867
AUROBINDO PH 606.55 (602.25) 94015
AVANTEL SOFT 338.50 (328.15) 2119
AVANTI FEEDS 538.95 (550.05) 140852
AVON ORG 8.50 (8.60) 180
BALAJI AMIN 549.05 (528.90) 1838
BARTRONICS 10.16 (9.78) 4900
BHAGIRA CHEM 329.50 (279.70) 88643
BHAGYA NAG 37.30 (37.65) 10405
BN RATHI SEC 34.55 (33.80) 3050
BRILLIANT SE 4.13 (4.30) 68174
CAMBRIDGE TE 54.50 (53.90) 351
CIL SECURI 20.10 (21.65) 7150
COMBAT DRUGS 29.75 (28.90) 810
CONT COFFEE 271.30 (257.45) 1123
COROMAN FERT 392.40 (387.50) 4289
CYBERMATE 1.79 (1.78) 47355
CYIENT LIMIT 767.45 (746.80) 13573
DECCAN CEMEN 403.15 (402.10) 152
DIVI'S LAB 1038.35 (999.25) 33009
DIVYA GRANIT 69.10 (65.85) 111
DR REDDY 2233.80 (2274.20) 169887
FOUR SOFT 58.80 (56.45) 289
GATI CORPN 76.10 (73.80) 127123
GAYATRI PROJ 160.50 (157.85) 253942
GMR INFRASTR 15.30 (15.25) 1582275
GOLDST INFRA 162.95 (166.05) 14019
GOLDSTONE EN 13 (13.68) 8932
GRANULES (I) 80.50 (78.15) 77813
GSS AMERICA 73.30 (76.65) 8257
GVK POWER 9.48 (9.03) 326121
HBL NIFE POW 33.10 (31.60) 49535
HERITAGE FOO 610.15 (623.15) 1080
HIL LTD 1780 (1718.40) 1585
IDL INDUSTRS 372 (368.10) 1879
IKF SOFT 0.45 (0.43) 82375
ILFS ENGINEE 27.45 (27.45) 3932
INCAP 64.95 (66.50) 1033
INNAREDY COM 1.76 (1.68) 2006
IVRCL INFRAS 1.38 (1.32) 146326
JEEVAN SCIEN 32.45 (33.50) 2755
KAKATIYA CEM 228.50 (223.55) 3434
KALLAM SPG 25.85 (25.85) 9030
KARAN WOO-SN 2.70 (2.82) 510
KAVERI SEED 557.50 (537.10) 27449
KCP LTD 97.95 (98.95) 23941
KERNEX MICRO 25.35 (26.50) 5601
KNR CONSTRUC 216.30 (208.90) 23481
KREBS BIO 120 (114.55) 6
LANCO INDUS 254.30 (247.90) 5126
LANCO INFRAT 0.76 (0.73) 286178
LASER DOT 5.50 (5.78) 50
LAURUS LABS 460.75 (451.20) 678
LOKESH MACH 55.95 (55.45) 359
MADHUCON PRO 11.70 (11.75) 8793
MEGA SOFT 8.54 (8.68) 5139
MIC ELECTRON 2.82 (2.70) 150202
MOLD-TEK.TEC 41.15 (39.45) 702
MOLDTK PLA 310.05 (313.60) 528
MSR INDIA LT 21.85 (21.50) 6779
NAGARJAGRICH 29.20 (27.20) 13729
NAGARJAGRITE 6.18 (6.50) 60
NATCO PHARMA 803.50 (791.65) 5565
NAVA BH VENT 129.60 (126.55) 23301
NCC 96.10 (90.90) 1249280
NCL IND 164.85 (157.60) 92913
NEHA INTER 5.01 (5.02) 146450
NETTLINX 53.65 (50) 34081
NEULAND LAB 642.30 (643.65) 5963
NIHAR INFO 11.30 (10.90) 130
NILE 506.30 (491.40) 1941
OIL COUNTRY 18.10 (17.75) 835
PANKAJ POLY 6.15 (5.88) 1
PANYAM CEMEN 22.60 (22.60) 6798
PENNER IND 48.45 (48) 41467
PHYTOCHEM I 50.55 (51.85) 2082
PIONEER DIST 261.40 (237.65) 15873
PITTI LAMIN 83 (81.45) 4280
POKARNA 153.85 (153) 688
PRAJAY ENGS 9.05 (8.98) 13502
PREMIER EXPL 249.30 (250) 410
PRISM CEMENT 104.85 (95.35) 139563
PRUDENTL PHA 3.70 (3.59) 74320
RAASI REFRAC 3.41 (3.41) 164
RAGSAN PETRO 61.20 (62) 363
RAIN INDUSTR 193 (183.85) 69575
RAJ PACKAGIN 25.20 (25.50) 957
RAM INFORMAT 39.35 (39.90) 1137
SAGAR CEM 796.30 (807.80) 172
SAMKRG PIST 221.90 (214) 5754
SAMPRE NUTRI 43.45 (43.45) 770
SATVAH. ISPA 13.30 (12.40) 1935
SMS PHARMA 70.65 (65.50) 5050
SOUTH BIO TE 1.75 (1.78) 226
SPHERE GLOBA 25.35 (22.95) 379
SREE RAYAL A 31.35 (30.65) 59522
SS ORGANICS 5.80 (6.10) 100
STARCHIK SP 32.80 (34.50) 282
STEEL EXCHAN 21.20 (20.20) 9725
SUJANA METAL 0.84 (0.81) 22027
SUJANA TOWER 2.15 (2.05) 6001
SUJANA UNIVE 0.51 (0.53) 6031
SURANA STRIP 1.51 (1.55) 400
SURANA TELE 4.10 (3.90) 8012
SURYALAKSH.C 52 (51) 1041
SURYALATA SP 130 (125.25) 376
SUVEN PHARMA 208.30 (200.05) 161377
TAJ GVK HOTE 214.90 (210.45) 6521
TANLA 30.50 (29.20) 18639
TERA SOFTWAR 39 (38.95) 3114
TRANS BIOTEK 1.99 (2.02) 3110
TRENDY KNIT 0.19 (0.19) 2015
VAMSHI RUBB 41 (42) 2005
VBC FERRO 40.40 (38.55) 831
VICEROY HOTE 7.42 (7.34) 18358
VIJAY TEXTIL 54.45 (53.85) 3751
VIMTA LABS 224.20 (210.35) 2928
VISAKA IND 512.20 (485.05) 6802
VISTA PHARMA 37.90 (35.80) 9000
VIVIMED LABS 58.95 (58.35) 31877
YBRANT DIGIT 4.16 (3.98) 80798
ZENOTECH LAB 37.30 (36.15) 1980
ZENTECH 95.35 (90.85) 12873

తప్పిపోయిన చిన్నారుల్ని దరిచేరుస్తుంది

- రీయునైట్ యాప్ ప్రారంభం

ఈనాడు, దిల్లీ: మనదేశంలో తప్పిపోయిన చిన్నారులను తిరిగి తల్లిదండ్రుల ఒడి చేర్చేందుకు ఉపకరించే సరికొత్త మొబైల్ యాప్ ''రీ యునైట్' అందుబాటులోకి వచ్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్‌ప్రభు శుక్రవారం ఈ యాప్‌ను ఇక్కడ ప్రారంభించారు. ఇందులో భారత పౌరులు తమ పిల్లల ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. చిన్నారుల పేర్లు, చిరునామా, వారిని గుర్తించేందుకు వీలుగా శరీరంపై ఉండే పుట్టుమచ్చల వంటి వివరాలను జోడించాలి. తద్వారా తప్పిపోయిన పిల్లలను సులువుగా గుర్తించి తల్లితండ్రుల ఒడి చేర్చవచ్చునని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. వెబ్ ఫేషియల్ రికగ్నిషన్ సర్వీసు అయిన 'అమెజాన్ రికగ్నిషన్' ను చిన్నారులను గుర్తించేందుకు ఉపయోగిస్తారని మంత్రి చెప్పారు. 'ఆండ్రాయిడ్', 'ఐవోఎస్' లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌ను అభివృద్ధి చేసిన 'క్యాప్ జెమినీ', నోబెల్ గ్రహీత కైలాశ్ సత్యార్థి నేతృత్వంలోని స్వచ్ఛంద సేవా సంస్థ 'బచపన్ బచావో ఆందోళన్'లను కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు అభినందించారు.

75 ఏళ్ల తర్వాత సీనా నది పరవళ్లు

- ఫలిస్తున్న 'ఆర్ట్ ఆఫ్ లివింగ్', స్థానికుల కృషి

అహ్మద్‌నగర్: మహారాష్ట్రలోని సీనా నది. . దాదాపు 75 ఏళ్ల తర్వాత మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, స్థానికుల ఉమ్మడి కృషితో ఇది సాధ్యమైంది. ఒకప్పుడు అహ్మద్‌నగర్, సమీప గ్రామాలకు సీనా నది ప్రధాన నీటివనరుల్లో ఒకటిగా ఉండేది. కాలక్రమంలో ఆక్రమణలు, కాలుష్యం కారణంగా ఇది మురుగు నీటి కాలువలా మారింది. దీన్ని పునరుద్ధరించే బాధ్యతను ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందం తలకెత్తుకుంది. స్థానిక గ్రామస్థులు, రైతులు, సాంకేతిక నిపుణులు, భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలూ ఈ బృందంలో భాగమయ్యారు. పారిశుద్ధ్యం, పూడిక తీత, నదీ విస్తరణ పనులను చేపట్టారు. ప్రాజెక్టు మొదటి దశ పూర్తయ్యేనాటికే.. ఇక్కడి ససేవాడీ, జేవూర్‌ల్లోని రైతులకు నీటి లభ్యత పెరగడంతో దాదాపు రూ.75లక్షల వరకూ ఆదా అయ్యింది. ప్రాజెక్టులోని మొత్తం ఐదు దశలూ పూర్తైతే.. వర్షాకాలంలో 3.3 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని పరిరక్షించే వీలుంటుంది. దేశవ్యాప్తంగా 37 నదులు, ఉపనదులు, సరస్సులను పునరుద్ధరించేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ కృషి చేస్తోంది.

125 నాణేన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

కోల్‌కతా: మానవ జీవనప్రమాణాలను పెంపొందించడంలో గణాంకాలు, సమాచార నిర్వహణ, కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తాయని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సాంకేతికత వినియోగం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటి ప్రాధాన్యం భవిష్యత్తులో మరింత పెరుగుతుందన్నారు. భారతీయ గణాంక సంస్థ వ్యవస్థాపకుడు పి.సి.మహలనోబిస్ 125వ జయంత్యుత్సవాల ముగింపు వేడుకలో ఆయన ప్రసంగించారు. 12వ వార్షికగణాంక దినాన్ని పురస్కరించుకుని రూ.125 ముఖవిలువ గల స్మారక నాణేన్ని ఆవిష్కరించారు. మహలనోబిస్‌ను జాతీయ నమూనా సర్వే సంస్థ నిర్మాతగా, ఉత్తర కోల్‌కతా సంస్థను స్థాపించిన దార్శనికుడిగా అభివర్ణించారు. మనకున్న జనాభాలో 65 శాతానికిపైగా 35 ఏళ్లలోపు వారేనని చెప్పారు. వీరిని దేశానికి పనికొచ్చేలా, నిజమైన ఆస్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కువ జనాభా ఉండటం దేశానికి ఆస్తిలాంటిదే అన్న మహలనోబిస్ వ్యాఖ్యలను ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. మహలనోబిస్ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ 2007 నుంచి జూన్ 29ను గణాంక దినంగా పాటిస్తున్నట్లు కేంద్ర గణాంకమంత్రి డి.వి.సదానందగౌడ తెలిపారు.

శుక్రవారం స్పెయిన్‌లోని హరోలో ఒళ్లంతా ద్రాక్ష సారాతో జనం. వేలాది లీటర్ల వైన్‌ను ఒకరిపై ఒకరు చల్లుకునే ఈ పోటీలో పెద్దసంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు

మొదటి 5లో కడప, విజయనగరం

- ముందడుగు వేస్తున్న వెనుకబడిన జిల్లాలు
- దేశంలోనే ప్రథమస్థానంలో దహోద్ జిల్లా
- రాష్ట్రాలవారీ పురోగతిలో అగ్రస్థానాన ఏపీ, తెలంగాణ
- నెరవేరుతున్న నీతిఆయోగ్ 'ఆకాంక్ష'

ఈనాడు – దిల్లీ

దేశంలో అత్యంత వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నీతిఆయోగ్ ప్రారంభించిన 'ఆకాంక్షిత జిల్లాల' కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ఒకరిని చూసి ఒకరు అభివృద్ధి చెందేందుకు వీలుగా పెట్టిన ఈ పోటీలో ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాలు, తెలంగాణలోని రెండు జిల్లాలు మంచి ముందడుగు వేశాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి రెండునెలల్లో జిల్లాలు స్వయంగా సమర్పించిన సమాచారం ఆధారంగా వాటి పురోగతిని లెక్కించి నీతిఆయోగ్ శుక్రవారం కొత్తగా 108 జిల్లాలకు డెల్టార్యాంకులు విడుదల చేసింది. ఆరోగ్యం-పౌష్టికాహారం, విద్య, వ్యవసాయం-జలవనరులు, ఆర్థిక సమ్మిళితం-నైపుణ్యాభివృద్ధి-మౌలికవసతులు అనే ఐదు రంగాల్లో అభివృద్ధి ఆధారంగా ర్యాంకులు కేటాయించినట్లు నీతిఆయోగ్ సీఈవో అమితాబ్‌కాంత్ పేర్కొన్నారు. ఈ రెండునెలల్లో సాధించిన రాష్ట్రాల పురోగతిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచాయి. జిల్లాలవారీగా చూస్తే గుజరాత్‌లోని దహోద్ మొదటిస్థానంలో నిలువగా.. పశ్చిమసిక్కిం, రామనాథపురం (తమిళనాడు) తరువాతిస్థానాల్లో నిలిచాయి. జమ్మూకశ్మీరులోని కుప్వారా, బిహార్‌లోని బెగుసరై, ఝార్ఖండ్‌లోని రాంచి దేశంలోనే వరుసగా అథమస్థానాల్లో నిలవడం గమనార్హం. గత రెండునెలల్లో బాగా పురోగతి సాధించిన జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయనగరం 4, కడప 5, విశాఖపట్నం 14 ర్యాంకులో నిలిచాయి. తెలంగాణ నుంచి ఖమ్మం 11, ఆసిఫాబాద్ 15వ ర్యాంకు చేజిక్కించుకున్నాయి. ఏమాత్రం పురోగతి చూపని జిల్లాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలకు చెందినవే అత్యధికం ఉన్నాయి.

- విజయనగరం, కడప, విశాఖపట్నం జిల్లాలు 'విద్యాపరంగా' మంచి పనితీరు కనబరిచి 1, 4, 5 ర్యాంకులు సాధించాయి.
- 'వ్యవసాయ విభాగం'లో సాధించిన పురోగతిలో ఖమ్మంజిల్లా అయిదో ర్యాంకు చేజిక్కించుకొంది.
- 'ఆర్థిక సమ్మిళిత పురోగతి'లో విశాఖపట్నం జిల్లా రెండు, భూపాలపల్లి జిల్లా ఐదో ర్యాంకులో నిలిచాయి.
- అన్ని విభాగాలూ కలిపి చూస్తే 17.5% మార్కులతో విజయనగరం నాలుగు; 14.9% మార్కులతో కడప ఐదు; 11% మార్కులతో విశాఖపట్నం 14వ ర్యాంకు సాధించాయి.
- తెలంగాణలో 11.8% మార్కులతో ఖమ్మం 11; 10.8% మార్కులతో ఆసిఫాబాద్ 15; 8.9% మార్కులతో భూపాలపల్లి 22వ ర్యాంకులో నిలిచాయి. బేస్‌లైన్ ర్యాంకింగ్‌లో వందోస్థానంలో నిలిచిన ఆసిఫాబాద్ జిల్లా మంచి పనితీరు కనబరిచి 15వ ర్యాంకుకు చేరుకుంది.
- బేస్‌లైన్ ర్యాంకింగ్‌లో ఒకటోస్థానంలో నిలిచిన విజయనగరంజిల్లా గత రెండునెలల్లో సాధించిన పురోగతిలో నాలుగోస్థానాన్ని ఆక్రమించింది. ఇదివరకు నాలుగులో ఉన్న కడప ఇప్పుడు ఐదులో; 13లో ఉన్న విశాఖపట్నం 14వస్థానంలో నిలిచాయి.
- బేస్‌లైన్ ర్యాంకింగ్‌లో పదోస్థానంలో ఉన్న ఖమ్మంజిల్లా ఇప్పుడు 11లో; 20వస్థానంలో ఉన్న భూపాలపల్లిజిల్లా 22లో; వందోస్థానంలో ఉన్న ఆసిఫాబాద్ జిల్లా 15వ స్థానంలో నిలిచాయి.

నలుగురు పాత్రికేయులు మృతి

- మరో మహిళ కూడా..
- అమెరికా పత్రికా కార్యాలయంలో కాల్పులు
- తనకు వ్యతిరేకంగా కథనం ప్రచురించారన్న అక్కసుతో శ్వేతజాతీయుడి దుశ్చర్య

కాల్పులకు తెగబడ్డ జరాద్ వారెన్ రామోస్

వాషింగ్టన్: తనకు వ్యతిరేకంగా కథనం ప్రచురించారన్న అక్కసుతో... ఓ పత్రికా కార్యాలయంలోకి చొరబడి, 'న్యూస్‌రూమ్'పై కాల్పులు జరిపాడో సాయుధుడు! ఈ ధాటికి నలుగురు పాత్రికేయులు, ఓ విక్రయ సహాయకురాలు మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మేరిలాండ్‌లోని అన్నాపోలీస్‌కు చెందిన 'ద కాపిటల్ గజెట్' పత్రిక కార్యాలయంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పులకు తెగబడిన వ్యక్తిని శ్వేతజాతీయుడైన జరాద్ వారెన్ రామోస్(38)గా పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్టుచేసి, శుక్రవారం పలు కేసులు నమోదు చేశారు. ''ఓ మహిళను సామాజిక మాధ్యమంలో రామోస్ వేధించాడు. దీనిపై 2011లో కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై 'ద కాపిటల్ గజెట్' కథనాన్ని ప్రచురించడం, అందులో తన పేరును ఉటంకించడం రామోస్‌కు గిట్టలేదు. 2012లో సదరు పత్రికపై పరువునష్టం కేసు వేయగా, కోర్టులో ఓటమి తప్పలేదు. దీంతో అతడు కక్ష పెంచుకుని... న్యూస్‌రూమ్‌లోకి చొరబడి విచక్షణా రహితంగా తుపాకీ, గ్రనేడ్‌లతో కాల్పులు జరిపాడు. ఈ ధాటికి పాత్రికేయులు రాబ్ హియాసెన్, జెరాల్డ్ ఫిచ్‌మాన్, జాన్ మెక్‌నమరా, వెండీ వింటర్స్‌తో పాటు... విక్రయ సహాయకురాలు రెబెకా స్మిత్ మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు'' అని పోలీసు అధికారి విలియం క్రాంఫ్ వెల్లడించారు. ''గుర్తింపుకార్డులు లేకుండానే రామోస్ పత్రికా కార్యాలయంలోకి చొరబడ్డాడు. తానెవరో తెలియకూడదని వేళ్లను గాయపరచుకున్నాడు. ముఖాన్ని గుర్తించే సాఫ్ట్‌వేర్ సాయంతో అతని పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్‌ల వివరాలను వెలికితీశారు'' అని విచారణ అధికారులు తెలిపారు. తాజా ఘటన నేపథ్యంలో... అమెరికాలో తుపాకీ లైసెన్సుల జారీని కట్టడి చేయాలన్న డిమాండ్లు మరోసారి బలంగా వినిపించాయి.

బాధితుల కోసం నా ప్రార్థనలు: ట్రంప్

పాత్రికేయులపై కాల్పుల పట్ల అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. తన ఆలోచనలు, ప్రార్థనలు బాధితులు, వారి కుటుంబాల పక్షాన ఉంటాయన్నారు. ఘటనా ప్రదేశంలో ఉండి, వెంటనే స్పందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

స్విస్ డిపాజిట్లన్నీ నల్లధనమేనా?

- ఆ బ్యాంకులతో వ్యవహారాలన్నీ అక్రమమేనని ఎందుకు భావిస్తారు?
- కేంద్ర ఆర్థిక మంత్రి గోయల్

దిల్లీ: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు దాస్తున్న సొమ్మంతా నల్లధనమేనని భావించాల్సిన అవసరం లేదనీ... అక్రమాలకు పాల్పడినవారిపై మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. మూడేళ్లుగా మందగమనంలో సాగిన భారతీయుల స్విస్ డిపాజిట్లు... గత ఏడాది 50 శాతానికిపైగా పెరిగిన నేపథ్యంలో శుక్రవారం ఆయనిక్కడ స్పందించారు. గతేడాది జూన్ 1న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మోదీ మాట్లాడుతూ- ''నల్లధనానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం. ఆ ఫలితంగానే స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డిపాజిట్లు 45% తగ్గాయి'' అని పేర్కొన్నారు. అయితే... ''2017లో భారతీయుల డిపాజిట్లు 50 శాతానికిపైగా పెరిగాయి. వారి నుంచి రూ.7,000 కోట్ల మేర సమకూరాయి'' అని స్విస్ నేషనల్ బ్యాంకు తాజాగా వెల్లడించింది. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి స్పందిస్తూ- ''మీరు కోరిన వివరాలన్నీ వస్తున్నాయి. డిపాజిట్లన్నీ నల్లధనమేనని, ఆ బ్యాంకులతో వ్యవహారాలన్నీ అక్రమమేనని ఎందుకు అనుకుంటారు? వివరాలన్నీ వచ్చాక... ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే వారిపై తప్పకుండా కొరడా ఝుళిపిస్తాం'' అని స్పష్టంచేశారు. 40% డబ్బు గత ఆర్థికమంత్రి పి.చిదంబరం తీసుకొచ్చిన సరళీకృత విదేశీ చెల్లింపుల పథకం (ఎల్ఆర్ఎస్) కిందే విదేశాల్లో జమవుతోందని మీడియా నివేదికలు చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అక్రమ డిపాజిట్‌దారులు విచారణను ఎదుర్కోక తప్పదు: జైట్లీ

స్విస్ బ్యాంకుల్లో అక్రమంగా డబ్బు దాచే భారతీయులు 'నల్లధన నియంత్రణచట్టం' కింద విచారణను ఎదుర్కోక తప్పదని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టంచేశారు. ''స్విస్ బ్యాంకు పద్దుల్లో భారతీయుల మదుపు పెరిగిందని వార్తలొచ్చాయి. దీంతో నల్లధనం కట్టడికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయా? అన్న అనుమానం కొన్నివర్గాల్లో వ్యక్తమవుతోంది. భారత్ ఖాతాదారుల ఆర్థిక వ్యవహారాలను వచ్చే జనవరి నుంచి స్విట్జర్లాండ్ వెల్లడించనుంది. దీంతో అక్రమ డిపాజిటర్లు ఎవరన్నది తేలిపోతుంది. నల్లధనం కట్టడికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల ఫలితంగా ఈ ఏడాది తొలి త్రైమాసిక ముందస్తు ఆదాయపన్ను వసూళ్లు వ్యక్తిగత విభాగంలో 44%, కార్పొరేట్ విభాగంలో 17% పెరిగాయి'' అని జైట్లీ తెలిపారు.

ఆశ్చర్యమేముంది: వామపక్షాలు

స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు నిల్వలు 50 శాతం పెరగడంలో ఆశ్చర్యమేమీ లేదంటూ.. ప్రధాని మోదీనుద్దేశించి సీపీఎం నేత సీతారామ్ ఏచూరి విమర్శించారు. మోదీ ప్రభుత్వం భారీఎత్తున కార్పొరేట్ల రుణాలను మాఫీ చేస్తోందని.. వ్యాపారవేత్తలు ప్రజాధనం లూటీ చేస్తూ విదేశాలకు ఎగిరిపోతున్నారని విమర్శించారు. నల్లధనాన్ని రప్పించి దేశంలోని ప్రతిఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామన్న హామీని గుర్తు పెట్టుకోవడానికి మోదీకి సమయం లేదని ఎద్దేవా చేశారు. స్విస్ బ్యాంకుల్లో భారత ధనం ఇంతలా పెరగడంపై మోదీ ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సీపీఐ నేత డి.రాజా డిమాండ్ చేశారు.

అప్పుడేమో నలుపు.. ఇప్పుడేమో తెలుపా?

రాహుల్‌గాంధీ చురక

స్విస్‌బ్యాంకుల్లో భారతీయుల డబ్బు పెరగడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీకి చురకలు వేశారు. స్విస్ బ్యాంకుల్లో 50శాతం పెరిగిన భారతీయల డిపాజిట్ స్వచ్ఛమైన డబ్బేనని, నల్లధనం కాదని ప్రధాని అటున్నారని రాహుల్ విమర్శించారు. స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ఒకొక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తానని 2014లో మోదీ చెప్పారని, 2016లోనేమో నోట్ల రద్దుతో నల్లధనం విరగడవుతుందని చెప్పారని, 2018లో మాత్రం.. స్విస్‌బ్యాంకుల్లో 50శాతం పెరిగిన భారతీయుల డిపాజిట్లు స్వచ్ఛధనమేనని చెబుతున్నారని ట్విట్టర్‌లో చురకలు వేశారు.

దేశమంతా వ్యాపించిన రుతుపవనాలు

- 17 రోజులు ముందుగానే చిట్టచివరి ప్రాంతానికి

దిల్లీ: రుతుపవనాలు శుక్రవారం నాటికి దేశమంతా వ్యాపించాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. దేశంలో నైరుతి రుతుపవనాల చిట్టచివరి గమ్యమైన శ్రీగంగానగర్‌కు 17 రోజుల ముందుగానే అవి చేరినట్లు ఐఎండీ వెల్లడించింది. పశ్చిమ రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌కు రుతుపవనాలు చేరే సాధారణ తేదీ జులై 15. ఈ వారం మొదట్లో వర్షపాతం లోటు 10శాతంగా ఉండగా శుక్రవారానికి 6శాతానికి తగ్గింది.

పాస్‌పోర్టు యాప్‌కు భలే డిమాండ్

దిల్లీ: విదేశాంగశాఖ అందుబాటులోకి తెచ్చిన పాస్‌పోర్టు సేవా మొబైల్‌యాప్ (ఎం పాస్‌పోర్టు సేవా యాప్) ను వినియోగించుకుని రెండురోజుల వ్యవధిలో పదిలక్షల మంది పాస్‌పోర్టు కోసం నమోదు చేసుకున్నారు. ఈ యాప్ సాయంతో దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా సరే పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ఈ నెల 26వ తేదీన ఈ యాప్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆండ్రాయిడ్, ఐఎఎస్‌లపై ఈ యాప్ అందుబాటులో ఉంటుంది. విదేశాంగ వ్యవహారాల శాఖ ప్రారంభించిన పాస్‌పోర్టు సేవా మొబైల్ యాప్ ద్వారా రెండు రోజుల వ్యవధిలో పదిలక్షల మంది నమోదు చేసుకున్నారంటూ మంత్రి సుష్మాస్వరాజ్ శుక్రవారం ట్వీట్ చేశారు.

ఏప్రిల్-మే నెలల్లో కేంద్రం రాబడి రూ.1.27లక్షల కోట్లు

దిల్లీ: కేంద్రప్రభుత్వం 2019 ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల ఆదాయ, వ్యయ వివరాలను వెల్లడించింది. ఏప్రిల్-మే నెలల్లో ప్రభుత్వానికి వచ్చిన రాబడి రూ.1,27,461 కోట్లు. ఇందులో పన్నుల నుంచి వచ్చిన ఆదాయం రూ. 1,02,408 కోట్లు. రూ.24,049 కోట్లు పన్నేతర ఆదాయం. రూ.1,004 కోట్లు.. రుణాల రికవరీ, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ వంటి వాటిద్వారా సమకూరాయి. ఈ ఆదాయం 2017-18లో ఇదే కాలంతో పోలిస్తే రూ.15,217 కోట్లు ఎక్కువ. రూ.1,11,576 కోట్లను పన్నుల్లో రాష్ట్రాల వాటాగా బదలాయించినట్లు కేంద్రం తెలిపింది. ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వం చేసిన వ్యయం రూ.4,72,954 కోట్లు.

రాయితీపై పెద్ద మనస్సు

- 42 లక్షల మంది వృద్ధులు రైల్వే ప్రయోజనాన్ని వదులుకున్నారు
- 1.25 కోట్ల కుటుంబాలు గ్యాస్ సబ్సిడీని వద్దనుకున్నాయి
- ప్రధాని మోదీ వెల్లడి

దిల్లీ

గత 9 నెలల్లో 42 లక్షల మంది వయో వృద్ధులు స్వచ్ఛందంగా తమ రైల్వే ప్రయాణ రాయితీని వదులుకున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 1.25 కోట్ల కుటుంబాలు వంట గ్యాస్ సబ్సిడీని వదులుకున్నాయని వివరించారు. దేశంలో నిజాయితీ వాతావరణాన్ని ప్రోది చేస్తున్నామని, దీనివల్ల వివిధ సబ్సిడీలు, రాయితీలను స్వచ్ఛందంగా వదులుకొని, జాతి నిర్మాణం కోసం అనేకమంది ముందుకొస్తున్నారని చెప్పారు. శుక్రవారం ఆయన ఇక్కడి ఎయిమ్స్ ఆసుపత్రిలో 'జాతీయ వార్ధక్య కేంద్రాని'కి శంకుస్థాపన చేశారు. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో అత్యవసర బ్లాక్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రసంగించారు.

''స్థోమత ఉన్న పౌరులు గ్యాస్ సబ్సిడీని వదులుకోవాలని నేను ఇచ్చిన పిలుపునకు 1.25 కోట్ల కుటుంబాలు స్పందించాయి. రైల్వే రాయితీల విషయంలో నేను ఎలాంటి ప్రకటనా చేయలేదు. రైల్వేలే తమ ఫారాల్లో.. సీనియర్ సిటిజన్ రాయితీని వదులుకుంటారా అని వృద్ధులను అడిగాయి. గత 9 నెలల్లో 42 లక్షల మంది ఇందుకు సమ్మతి తెలిపారని చెప్పడానికి గర్వపడుతున్నా'' అని మోదీ పేర్కొన్నారు. నెలలో కనీసం ఒకసారి గర్భిణులకు ఉచితంగా వైద్యం అందించాలన్న తాను సూచిస్తే.. వేల మంది వైద్యులు ముందుకొచ్చారని తెలిపారు. 1.25 కోట్ల మంది గర్భిణులకు ఉచిత వైద్యం అందిందన్నారు. 10 కోట్ల పేద కుటుంబాలకు ఏటా రూ.5లక్షల చొప్పున ఆరోగ్య బీమా అందించేందుకు జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎయిమ్స్‌లో ఏర్పాటు చేయనున్న జాతీయ వార్ధక్య కేంద్రంలో వయో వృద్ధులకు అధునాతన ఆరోగ్య పరిరక్షణ సేవలు అందిస్తారు. వార్ధక్య సమస్యలపై పరిశోధనలకు మార్గనిర్దేశం చేస్తుంది. 200 పడకలు ఉండే ఈ కేంద్రాన్ని రూ.330 కోట్లతో నిర్మిస్తారు. 2020 ఫిబ్రవరి నాటికి పూర్తవుతుంది. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ప్రధాని ప్రారంభించిన అత్యవసర బ్లాక్‌లో 500 పడకలు ఉంటాయి.

వాజ్‌పేయీకి ప్రధాని పరామర్శ

ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పరామర్శించారు. వాజ్‌పేయీ చికిత్స పొందుతున్న విభాగానికి వెళ్లి దాదాపు 15 నిమిషాల పాటు అక్కడ ఉన్నారు. ఛాతి, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు తదితర సమస్యలతో వాజ్‌పేయీని ఈనెల 11న ఆసుపత్రిలో చేర్పించిన సంగతి తెలిసిందే.

ఇండోనేసియాలోని బాలీ సమీపంలో ఆగంగ్ అగ్నిపర్వతం నుంచి ఎగసిపడుతున్న లావా. అగ్నిపర్వత విస్ఫోటం నేపథ్యంలో బాలీ విమానాశ్రయాన్ని కొన్ని గంటలపాటు మూసివేశారు. దాదాపు 300 విమానాలను తాత్కాలికంగా రద్దు చేశారు

యూపీలో ఉల్కలు: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో ఉన్న కసోలి అనే గ్రామంలో గురువారం రాత్రి ఆకాశం నుంచి రెండు శిలలు పడ్డాయి. వీటిని ఉల్కలుగా స్థానికులు చెబుతున్నారు. తొలుత వర్షం పడిందని, ఆ తర్వాత పెద్ద శబ్దంతో రెండు రాళ్లు వచ్చిపడ్డాయని అధికారులు తెలిపారు. ఒక భారీ ఉల్కలో ఆ శిలలు భాగమై ఉండొచ్చని స్థానిక కళాశాలలో భూగర్భ శాస్త్ర అధ్యాపకుడు నిరాజ్ త్యాగి చెప్పారు. 2003, 2009లోనూ ఇక్కడ ఉల్కలు పడ్డాయి.

పనికిరాని విమానంలో ప్రయాణించబోతున్నా

- మా అమ్మాయి ముందే చెప్పింది
- మృతి చెందిన సురభి తండ్రి ఆవేదన

చండీగఢ్: ''నాన్నా! నేను ఈ రోజు అత్యంత అధ్వాన్నంగా, ఏ మాత్రం బాగలేని స్థితిలో ఉన్న విమానంలో ప్రయాణించబోతున్నా' అని చెప్పిన కొన్ని గంటలకే సురభిగుప్తా అదే విమానం కూలిపోయి మరణించారు. తాను గురువారం ప్రయాణించనున్న విమానం అసలు ఏ మాత్రం నడపడానికి వీలుగా లేదని కుమార్తె తనకు చెప్పినట్లు సురభి తండ్రి ఎస్పీ గుప్తా శుక్రవారం చెప్పారు. సోనేపట్‌లోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసలుఅధ్వాన్న పరిస్థితిలో ఉన్న విమానాన్ని నడపడానికి ఎలా అనుమతించారో అర్థమే కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సురభికి గత ఏడాదే ఓ పైలట్‌తో వివాహం అయింది. కాగా, ముంబయిలోని జుహూ నుంచి గురువారం ప్రయోగాత్మక పరీక్ష నిమిత్తం బైలురిన విమానం కొద్దిసేపటికే కూలిపోయి అందులోని నలుగురూ, ఓ పాదచారి మరణించిన విషయం తెలిసిందే.

జమ్మూకశ్మీరులో నలుగురు తీవ్రవాదులు హతం

శ్రీనగర్: తీవ్రవాదులు, సైనికులకు మధ్య జమ్మూకశ్మీరులో మూడుచోట్ల జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు తీవ్రవాదులు, ఒక పౌరుడు హతమయ్యారు. పుల్వామా జిల్లా తుమ్నా గ్రామంలో గల ఓ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు తీవ్రవాదులను సైనికులు కాల్చి చంపారు. ఈ సందర్భంగా సైనికులను కాల్పులు జరపనీయకుండా స్థానికులు రాళ్లురువ్వారు. వారిని నియంత్రించడానికి పెల్లెట్లతో సైన్యం జరిపిన కాల్పుల్లో ఒక పౌరుడు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గాయపడ్డారు. కుప్వారా జిల్లా ట్రెహ్గాం వద్ద గల అడవిలో సమావేశమైన తీవ్రవాదులపై సైనికులు కాల్పులు జరపడంతో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. షోపియాన్ జిల్లాలో గస్తీ సైనికులే లక్ష్యంగా తీవ్రవాదులు గ్రెనేడ్ విసిరారు. ముగ్గురు సైనికులు గాయపడటంతో వారిని ఆసుపత్రికి తరలించారు. భద్రతాసిబ్బంది అప్రమత్తం కావడంతో తీవ్రవాదులు పలాయనం చిత్తగించారు.

ముందస్తు ఎన్నికలకు భాజపా మొగ్గు చూపకపోవచ్చు

కాంగ్రెస్ నేత ఖర్గే వ్యాఖ్య

దిల్లీ: ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ముందస్తు లోక్‌సభ ఎన్నికలకు భాజపా మొగ్గు చూపకపోవచ్చని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే అభిప్రాయపడ్డారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాక.. ఈ విషయంలో భాజపా వైఖరిపై స్పష్టత వస్తుందని ఆయన అన్నారు. ''కొన్ని రాష్ట్రాల్లో నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. నవంబర్, డిసెంబర్‌ల్లో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని భాజపా ప్రణాళికలు రచిస్తుండవచ్చు. మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పదవీకాలం పూర్తయ్యాక.. సార్వత్రిక ఎన్నికలు జరిగితేనే తమకు ప్రయోజనం ఉంటుందని ఆ పార్టీ లెక్కలు వేసుకుంటోంది. లాభ నష్టాల బేరీజు అనంతరం.. ఆ పార్టీ ఓ నిర్ణయానికి వస్తుంది'' అని ఖర్గే అన్నారు. ఇటు భాజపా ముందస్తు ఎన్నికల కోసం ప్రణాళికలు వేస్తోందని మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత దేవేగౌడ గురువారం వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

'మానవ అక్రమ రవాణా కట్టడిలో భారత్ తీరు పేలవం'

వాషింగ్టన్: భారత్‌లో జరుగుతున్న మానవ అక్రమ రవాణా స్థాయిలో అక్కడ ఆ తరహా కేసులపై దర్యాప్తు, విచారణ, దోష నిర్ధారణ లేదని అమెరికా పేర్కొంది. ఈ అంశంపై రూపొందిన తన వార్షిక నివేదికలో భారత్‌ను 'రెండో అంచె దేశంగా'నే కొనసాగిస్తున్నట్లు తెలిపింది. 'ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్ రిపోర్ట్-2018' అనే ఈ నివేదికను తాజాగా విడుదల చేసింది. బలవంతపు, వెట్టి చాకిరి సహా అన్ని రకాల మానవ అక్రమ రవాణా చర్యలపై విచారణ, దోష నిర్ధారణలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అందులో కోరింది. బాధితుల గుర్తింపును మూడింతలు చేసిందని, బాధితుల్లో మహిళలు, చిన్నారులకు ఆవాసం కల్పించడానికి బడ్జెట్‌ను పెంచిందని తెలిపింది. అయితే కీలక అంశాల్లో కనీస ప్రమాణాలను ప్రభుత్వం అందుకోలేకపోయిందని పేర్కొంది. ''స్థూలంగా బాధిత పరిరక్షణ చర్యలు సరిపోవు. పైగా కొన్నిసార్లు బాధితులను అరెస్టు చేస్తోంది'' అని పేర్కొంది.

లిబియాలో శరణార్థుల పడవ మునక

- వంద మంది గల్లంతు
- ముగ్గురు చిన్నారుల మృతి

అల్ హమిదియా: లిబియా తీరానికి సమీపంలో శరణార్థులు ప్రయాణిస్తున్న ఓ పడవ సముద్రంలో మునిగిపోయింది. ఘటనలో దాదాపు వంది మంది గల్లంతయ్యారు. ముగ్గురు చిన్నారుల మృతదేహాలను లిబియా తీర గస్తీ దళం వెలికితీసింది. 16 మందిని రక్షించి, అల్ హమిదియా పట్టణ తీరానికి తీసుకువచ్చింది. గారాబౌలీ నుంచి మొత్తం 120 మంది శరణార్థులు.. రబ్బరు పడవలో పయనమయ్యారు. కొన్ని గంటల తర్వాత మోటారుకు మంటలు అంటుకోవడంతో.. పడవలోకి నీరు చేరి మునిగిపోయినట్లు వారు వివరించారు. ప్రయాణికుల్లో మొరాకో, యెమెన్‌కు చెందిన కుటుంబాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

3 ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన జట్లు. ఉరుగ్వే, క్రొయేషియా, బెల్జియం ఈ ఘనత సాధించాయి. ఉరుగ్వే ఒక్కటే ప్రత్యర్థికి ఒక్క గోల్ ఇవ్వకుండా గ్రూప్ దశను ముగించింది.

10 నాకౌట్ చేరిన ఐరోపా జట్ల సంఖ్య. ఈ ఖండం నుంచి మొత్తం 14 జట్లు పోటీపడ్డాయి. దక్షిణ అమెరికా నుంచి ఐదు జట్లు పోటీ పడితే.. నాలుగు ముందంజ వేశాయి. ఆఫ్రికా నుంచి పోటీ పడ్డ ఐదు జట్లూ నిష్క్రమించగా.. ఆసియా నుంచి జపాన్, ఉత్తర అమెరికా నుంచి మెక్సికో నాకౌట్ చేరాయి.

24 ఈ ప్రపంచకప్‌లో ఇప్పటిదాకా ఇచ్చిన పెనాల్టీలు. టోర్నీ చరిత్రలోనే గ్రూప్ దశలో ఇన్ని పెనాల్టీలు ఎప్పుడూ ఇవ్వలేదు. గత రికార్డు 18. వీడియో సమీక్ష సాయం (వార్) రాకతో పెనాల్టీలు పెరిగాయన్నది స్పష్టం.

27 గ్రూప్ దశలో చివరి 10 నిమిషాలు, ఇంజురీ సమయంలో కలిపి నమోదైన గోల్స్. మొత్తం గోల్స్ (122)లో వీటి శాతం 22.

- హ్యారీ కేన్ (ఇంగ్లాండ్), లుకాకు (బెల్జియం) వరుసగా రెండు మ్యాచ్‌ల్లో రెండు చొప్పున గోల్స్ కొట్టారు. చివరగా 1986లో అర్జెంటీనా దిగ్గజం మారడోనా ఈ ఘనత సాధించాడు.
- గ్రూప్ దశలో మొత్తం 48 మ్యాచ్‌ల్లో గోల్ నమోదు కాని పోరు ఒక్కటే. ఫ్రాన్స్-డెన్మార్క్ 0-0తో డ్రా చేసుకున్నాయి.

- ప్రస్తుత టోర్నీలోనే ప్రపంచకప్ గోల్స్ సంఖ్య 2500 దాటింది. పనామాతో మ్యాచ్‌లో టునీషియా ఆటగాడు బెన్ యూసుఫ్ 2500వ గోల్ సాధించాడు.

మెస్సి×రొనాల్డో చూస్తామా?

శనివారం మొదలయ్యే ప్రిక్వార్టర్స్ సమరం రసవత్తరంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఇందులో కొన్ని మేటి జట్ల మధ్య పోరాటాలు ఉత్కంఠ రేపుతున్నాయి. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది ఉరుగ్వే-పోర్చుగల్, ఫ్రాన్స్-అర్జెంటీనా మ్యాచ్‌ల గురించే. ఈ రెండు మ్యాచ్‌లూ శనివారమే జరుగుతుండటం విశేషం. ఈ నాలుగు జట్లలోనూ ప్రపంచ మేటి ఆటగాళ్లున్నారు. పోర్చుగల్ జట్టుకు రొనాల్డో ప్రధాన బలమైతే.. ఉరుగ్వే జట్టులో సురెజ్ కీలకం. ఇక అర్జెంటీనా మెస్సి మీద కొండంత ఆశతో బరిలోకి దిగుతోంది. ఫ్రాన్స్ జట్టులో కిలియన్ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. ఈ నలుగురిలో ఏ ఇద్దరు క్వార్టర్స్‌లో ఉంటారన్నది ఆసక్తికరం. ఉరుగ్వే, ఫ్రాన్స్ జట్లు సులువుగా నాకౌట్ చేరగా.. అర్జెంటీనా, పోర్చుగల్ కష్టం మీద ముందంజ వేశాయి. ఐతే నాకౌట్‌లో మెస్సి, రొనాల్డో స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే ప్రత్యర్థి జట్లను మట్టికరిపించి అర్జెంటీనా, పోర్చుగల్ ముందంజ వేసే అవకాశాలున్నాయి. అదే జరిగితే క్వార్టర్స్‌లో మెస్సి-రొనాల్డోల మధ్య రసవత్తర పోరు చూడొచ్చు.

- ఈజిప్ట్ గోల్ కీపర్ 45 ఏళ్ల 161 రోజుల వయసులో అరంగేట్రం చేయడం ద్వారా ప్రపంచకప్ ఆడిన అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

5-0: టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో రష్యా గెలుపు తేడా. గ్రూప్ దశలో ఇదే అతి పెద్ద విజయం.

ప్రపంచ ఛాంపియన్ జర్మనీ.. దక్షిణ కొరియా లాంటి చిన్న జట్టు చేతిలో చిత్తయి తొలి దశలోనే నిష్క్రమిస్తుందని అనుకుని ఉంటారా? ఆతిథ్య రష్యా అలవోక విజయాలతో అందరి కంటే ముందు నాకౌట్ బెర్తును ఖరారు చేసుకుంటుందని ఊహించారా? అర్జెంటీనా అంత కష్టపడుతుందని.. స్పెయిన్, పోర్చుగల్ అంతటి ఉత్కంఠను అనుభవిస్తాయని.. జపాన్ అంత సులువుగా ముందంజ వేస్తుందని అంచనా వేశారా? ఇలా 2018 ఫుట్‌బాల్ ప్రపంచకప్ గ్రూప్ దశలో అద్భుతాలు, ఆశ్చర్యాలు, అనూహ్యాలు ఎన్నెన్నో! గ్రూప్ దశ సాగిన తీరు చూస్తే.. ఈ ప్రపంచకప్‌లో ఏ మ్యాచ్ ఫలితాన్నీ ముందే అంచనా వేయలేమనిపిస్తోంది. ఇప్పటిదాకా కచ్చితమైన ఫేవరెట్ అంటూ ఎవరూ లేరు! ఏ జట్టునూ తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు! గ్రూప్ దశతో స్పష్టమైన సంగతిది! మొత్తానికి ఎలాగోలా తొలి దశ ముగిసింది. ఇక అసలు సమరం ముందుంది. ఇకపై ఫలితం తేలని మ్యాచ్‌లుండవు. ఏ జట్టుకూ మరో అవకాశం ఉండదు. ప్రతి పోరూ చావోరేవోనే! నాకౌట్ దశకు శనివారమే శ్రీకారం!

అలవోకగా..

- రెండో టీ20లో భారత్ ఘన విజయం
- ఐర్లాండ్‌పై 2-0తో సిరీస్ కైవసం

అసలే పసికూన.. ఆపై భారత వీరుల ప్రతాపం! తట్టుకోలేకపోయింది! విలవిల్లాడుతూ చేతులెత్తేసింది. శుక్రవారం భారత్-ఐర్లాండ్ రెండో టీ20లో దృశ్యమిది. బ్యాటింగ్‌లో రాహుల్ (70; 36 బంతుల్లో 3×4, 6×6), రైనా (69; 45 బంతుల్లో 5×4, 3×6), పాండ్య (32 నాటౌట్; 9 బంతుల్లో 1×4, 4×6), బౌలింగ్‌లో కుల్‌దీప్ (3/16), చాహల్ (3/21), ఉమేశ్ యాదవ్ (2/19) విజృంభించిన వేళ రెండో టీ20లో భారత్.. ఐర్లాండ్‌ను 143 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. అంతేకాక రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. పరుగుల పరంగా అంతర్జాతీయ టీ20ల్లో ఇది రెండో అతి పెద్ద విజయం.

డబ్లిన్

మొదట ధనధనా పరుగులు.. ఆ తర్వాత టపటపా వికెట్లు! ఐర్లాండ్‌తో భారత్ రెండో టీ20లో మ్యాచ్ సాగిన తీరిది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 4 వికెట్లకు 213 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి ఐర్లాండ్ 12.3 ఓవర్లలో 70 పరుగులకే కుప్పకూలింది. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', చాహల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' లభించాయి.

వికెట్లు టపటపా!: భారీ ఛేదనలో ఐర్లాండ్ ఆరంభం నుంచి తడబడిపోయింది. రెండో బంతికే స్టిర్లింగ్ (0) వికెట్ కోల్పోయిన ఐర్లాండ్ ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. పేసర్ ఉమేశ్‌తో పాటు స్పిన్నర్లు చాహల్, కుల్‌దీప్‌లు విజృంభించడంతో ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. 6 నుంచి 9 ఓవర్ల మధ్య ప్రతి ఓవర్లోనూ వికెట్ కోల్పోయింది. గిర్రున తిరుగుతున్న బంతులను అర్థం చేసుకోవడంలో విఫలమైన ఐరిష్ బ్యాట్స్‌మెన్ చేతులారా వికెట్లు పారేసుకున్నారు. 15 పరుగులు చేసిన విల్సనే ఆ జట్టు టాప్ స్కోరర్.

రాహుల్, రైనా మెరుపుల్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. ఆరంభం నుంచే ఐర్లాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. తొలి ఓవర్లోనే రాహుల్ రెండు ఫోర్లు కొట్టడంతో 12 పరుగులు లభించాయి. ఐతే రోహిత్‌శర్మను బ్యాటింగ్ ఆర్డర్‌లో వెనక్కి పంపి ఓపెనర్‌గా వచ్చిన కెప్టెన్ కోహ్లి (9) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. చేజ్ బౌలింగ్‌లో డాక్రెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కోహ్లి ఔటైనా.. రాహుల్ తగ్గలేదు. అతనికి రైనా జత కలవడంతో స్కోరు పరుగులెత్తింది. థాంప్సన్ బౌలింగ్‌లో రైనా.. సిమిసింగ్ బౌలింగ్‌లో రాహుల్ రెండేసి సిక్సర్లు అందుకోవడంతో పవర్‌ప్లే ఆఖరికి భారత్ 6 ఓవర్లలో 57/1తో నిలిచింది. అయితే ఓబ్రైన్ ఒకే ఓవర్లో రాహుల్, రోహిత్ (0)లను ఔట్ చేసి భారత్‌ను దెబ్బ కొట్టాడు. 18 ఓవర్లకు భారత్ స్కోరు 174/4.. 200 పరుగులు మార్క్ దాటుతుందా లేదా అనిపించింది. కానీ హార్దిక్ పాండ్య మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతను ఓబ్రైన్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు, ఫోర్ బాదడంతో భారత్ స్కోరు సులభంగా 200 పరుగులు దాటేసింది. పాండ్య ధాటికి ఆఖరి రెండు ఓవర్లలో భారత్ 39 పరుగులు రాబట్టింది. ఈ మ్యాచ్‌లో ధోని, ధావన్, భువనేశ్వర్, బుమ్రాలకు విశ్రాంతినిచ్చిన టీమ్ఇండియా.. రాహుల్, దినేశ్ కార్తీక్, ఉమేశ్ యాదవ్, సిద్దార్థ్ కౌల్‌లను తుది జట్టులోకి తీసుకుంది.

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) అండ్ (బి) ఓబ్రైన్ 70; కోహ్లి (సి) డాక్రెల్ (బి) చేజ్ 9; రైనా (సి) డాక్రెల్ (బి) ఓబ్రైన్ 69; రోహిత్ (సి) స్టిర్లింగ్ (బి) ఓబ్రైన్ 0; పాండే నాటౌట్ 21; పాండ్య నాటౌట్ 32; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 213; **వికెట్ల పతనం:** 1-22, 2-128, 3-128, 4-169; **బౌలింగ్:** సిమి సింగ్ 2-0-32-0; రాంకిన్ 3-0-33-0; చేజ్ 4-0-42-1; థాంప్సన్ 1-0-17-0; డాక్రెల్ 4-0-30-0; స్టిర్లింగ్ 2-0-19-0; కెవిన్ ఓబ్రైన్ 4-0-40-3

ఐర్లాండ్ ఇన్నింగ్స్: స్టిర్లింగ్ (సి) రైనా (బి) ఉమేశ్ 0; షనోన్ (సి) రాహుల్ (బి) కౌల్ 2; పోర్టర్‌ఫీల్డ్ (బి) ఉమేశ్ 14; బాల్‌బ్రైన్ (బి) చాహల్ 9; విల్సన్ (బి) కుల్‌దీప్ 15; ఓబ్రైన్ (సి) కుల్‌దీప్ (బి) పాండ్య 0; సిమిసింగ్ ఎల్బీ (బి) చాహల్ 0; థాంప్సన్ (బి) చాహల్ 13; డాక్రెల్ (సి) ఉమేశ్ (బి) కుల్‌దీప్ 4; రాంకిన్ (స్టంప్డ్) కార్తీక్ (బి) కుల్‌దీప్ 10; చేజ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (12.3 ఓవర్లలో ఆలౌట్) 70; **వికెట్ల పతనం:** 1-0, 2-16, 3-22, 4-30, 5-32, 6-36, 7-44, 8-56, 9-68; **బౌలింగ్:** ఉమేశ్ 2-0-19-2; కౌల్ 2-0-4-1; పాండ్య 2-0-10-1; చాహల్ 4-0-21-3; కుల్‌దీప్ 2.3-0-16-3

ద్యుతి రికార్డు

సీనియర్ అథ్లెటిక్స్

గువహటి: భారత అగ్రశ్రేణి స్ప్రింటర్ ద్యుతి చంద్ సరికొత్త రికార్డు సృష్టించింది. సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా 100మీ. పరుగులో తన పేరు మీదనే ఉన్న జాతీయ రికార్డును బద్దలుకొట్టింది. దాంతో స్వర్ణం గెలుచుకోవడంతో పాటు ఆసియా క్రీడలకు అర్హత సాధించింది. 11.30సె.లో పరుగు పూర్తి చేసిన ద్యుతీ అంతకుముందు రికార్డు (11.30)ను అధిగమించింది.

సెమీస్‌లో సింధు, శ్రీకాంత్

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారులు పి.వి.సింధు, కిదాంబి శ్రీకాంత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో మూడో సీడ్ సింధు 22-20, 21-19తో ఆరో సీడ్ కరోలినా మారిన్ (స్పెయిన్)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో నాలుగో సీడ్ శ్రీకాంత్ 21-18, 21-14తో బ్రైస్ లెవెర్‌డెజ్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. శనివారం జరిగే సెమీస్‌లో టాప్ సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో సింధు, కెంటొ మొమొట (జపాన్)తో శ్రీకాంత్ తలపడతారు.

ఫైనల్లో భారత్

దుబాయ్: భారత జట్టు దుబాయ్ మాస్టర్స్ కబడ్డీ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం సెమీఫైనల్లో భారత్ 36-20తో దక్షిణ కొరియాపై ఘన విజయం సాధించింది. అజయ్ ఠాకూర్, మోను గోయత్ చక్కటి ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. టైటిల్ కోసం భారత్ ఆదివారం ఇరాన్‌తో తలపడనుంది.

భారత్‌తో వన్డేలకు స్టోక్స్

లండన్: ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ భారత్‌తో వన్డే సిరీస్ ఆడనున్నాడు. ఫిట్‌నెస్ సాధించిన అతణ్ని టీమ్ఇండియాతో జులై 12న ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌కు ఇంగ్లాండ్ సెలెక్టర్లు ఎంపిక చేశారు.

ఛాంపియన్స్‌ట్రోఫీ హాకీలో నేడు
భారత్ × నెదర్లాండ్స్
స్టార్‌స్పోర్ట్స్‌లో రాత్రి 7.30 నుంచి

ఇక చావోరేవో...

- ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో నేటి నుంచే నాకౌట్ సమరాలు
- తొలి రోజు ఫ్రాన్స్‌తో అర్జెంటీనా, ఉరుగ్వేతో పోర్చుగల్ ఢీ

సోచి

కొన్ని జట్లు అంచనాలకు తగ్గట్లే ఆడాయి. ఇంకొన్ని అలవోకగా ముందంజ వేశాయి. మరికొన్ని అతి కష్టం మీద గట్టెక్కాయి. కొన్ని జట్లేమో అనూహ్య రీతిలో నిష్క్రమించాయి. ఆశ్చర్యకర ఫలితాలు.. ఉత్కంఠభరిత పోరాటాలు.. అద్భుత విన్యాసాలతో రసవత్తరంగా సాగిపోయింది 2018 ప్రపంచకప్ గ్రూప్ దశ. గత పర్యాయం ప్రపంచకప్ గెలిచి.. ఈసారి కూడా హాట్ ఫేవరెట్ ముద్రతో బరిలోకి దిగిన జర్మనీ మెక్సికో, కొరియాల చేతిల్లో పరాజయాలు చవిచూసి గ్రూప్ దశలోనే నిష్క్రమించడం ఈ టోర్నీలో అది పెద్ద షాక్. గత రెండు టోర్నీల్లోనూ డిఫెండింగ్ ఛాంపియన్లయిన ఇటలీ, స్పెయిన్ కూడా గ్రూప్ దశ దాటకపోయినప్పటికీ.. జర్మనీ నిష్క్రమణ మరింత విస్మయాన్ని కలిగించేదే. చివరి మ్యాచ్‌లో చివరి నిమిషాల్లో గోల్ కొట్టబట్టి సరిపోయింది కానీ.. మరో ఫేవరెట్ అర్జెంటీనా కూడా గ్రూప్ దశలో నిష్క్రమించాల్సిన జట్టే. జర్మనీ లాగే ఇదీ గ్రూప్ దశలో పేలవంగానే ఆడింది. మెస్సి మీద అతిగా ఆధారపడుతున్న ఆ జట్టు నాకౌట్‌లో ఎలా ఆడుతుందో చూడాలి. ఇప్పటిదాకా ప్రదర్శన చూస్తే అర్జెంటీనా ఇంకెంతో దూరం సాగేలా కనిపించడం లేదు. పైగా ప్రిక్వార్టర్స్‌లో బలమైన ఫ్రాన్స్‌ను అర్జెంటీనా ఢీకొనబోతోంది. టైటిల్‌కు గట్టి పోటీదార్లలో ఒకటైన బ్రెజిల్ కూడా గ్రూప్ దశలో అంచనాలకు తగ్గట్లు ఆడలేదు. స్విట్జర్లాండ్‌తో మ్యాచ్‌లో డ్రాతో సరిపెట్టుకుంది. కోస్టారికా లాంటి చిన్న జట్టుపై ఇంజురీ సమయంలో గోల్స్ కొట్టి గట్టెక్కింది. మొరాకోతో పోరులో కొంచెం మెరుగైన ఒక ఛాంపియన్ జట్టులా అయితే ఆడలేదు బ్రెజిల్. బెల్జియం, ఉరుగ్వే, క్రొయేషియా జట్లు మూడుకు మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి నాకౌట్ చేరాయి. ఐతే బెల్జియం.. ఇంగ్లాండ్‌ను గెలవడం మాత్రమే ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం. మిగతా రెండు మ్యాచ్‌ల్లో దానికి తేలికైన ప్రత్యర్థులే ఎదురయ్యారు. ఉరుగ్వే గ్రూప్‌లో అన్నీ బలహీన జట్లే ఉన్నాయి. కాబట్టి దాని సామర్థ్యం మీదా ఒక అంచనాకు రాలేం. గ్రూప్ దశ వరకు క్రొయేషియా అంచనాల్ని మించే రాణించింది. అర్జెంటీనాను ఓడించినంత మాత్రాన దానికి తిరుగులేని భావించలేం. ఆ జట్టు అసలు సత్తా ఏంటో ఇంకో బలమైన జట్టు ఎదురైతే తెలుస్తుంది. ఐతే గతంలో గ్రూప్ దశలో అంతంతమాత్రంగా ఆడి.. నాకౌట్ నుంచి చెలరేగిపోయిన జట్లున్నాయి. అలాగే తొలి దశలో చెలరేగి.. ఆపై తేలిపోయిన జట్లూ ఉన్నాయి. కాబట్టి ఇప్పటిదాకా నడిచిన ఆట ఒకెత్తు. నాకౌట్ నుంచి జరగబోయేది మరో ఎత్తు. ఇప్పటిదాకా ప్రదర్శన, జట్ల బలాబలాలు, నాకౌట్ దశ నుంచి సమీకరణాల ప్రకారం చూస్తే విశ్లేషకులు బ్రెజిల్, స్పెయిన్, బెల్జియం జట్లలో ఒకదానికి కప్పు గెలిచే అవకాశం ఉందంటున్నారు.

అదే అత్యుత్తమ మ్యాచ్: గ్రూప్ దశలో అత్యుత్తమ మ్యాచ్ అంటే గ్రూప్-బిలో స్పెయిన్, పోర్చుగల్ పోరే. ఆద్యంతం ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా సాగిన ఆ మ్యాచ్ 3-3తో సమమైంది. స్పెయిన్ తరఫున డీగో కోస్టా రెండు మెరుపు గోల్స్‌తో అదరగొడితే.. పోర్చుగల్ సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఆ జట్టును ఒక్కడే దీటుగా ఎదుర్కొని హీరో అయ్యాడు. పోర్చుగల్ తరఫున మూడు గోల్స్ అతనే కొట్టాడు. ముఖ్యంగా మ్యాచ్ చివరి నిమిషాల్లో 22 గజాల దూరం నుంచి వంపు తిప్పుతూ గోల్ కొట్టిన తీరు అమోఘం.

గ్రూప్ దశ టాప్‌స్కోరర్లు

1. హ్యారీ కేన్ (5, ఇంగ్లాండ్)
2. లుకాకు (4, బెల్జియం), రొనాల్డో (4, పోర్చుగల్)
3. చెరిషెవ్ (3, రష్యా), డీగో కోస్టా (3, స్పెయిన్)

ప్రిక్వార్టర్స్.. ఎవరితో ఎవరు?

ఫ్రాన్స్	జూన్ 30 × సా॥ 7.30	అర్జెంటీనా
ఉరుగ్వే	జూన్ 30 × రాత్రి 11.30	పోర్చుగల్
స్పెయిన్	జులై 1 × సా॥ 7.30	రష్యా
క్రొయేషియా	జులై 1 × రాత్రి 11.30	డెన్మార్క్
బ్రెజిల్	జులై 2 × సా॥ 7.30	మెక్సికో
బెల్జియం	జులై 2 × రాత్రి 11.30	జపాన్
స్వీడన్	జులై 3 × సా॥ 7.30	స్విట్జర్లాండ్
కొలంబియా	జులై 3 × రాత్రి 11.30	ఇంగ్లాండ్

సోని టెన్-2, సోని టెన్-3, సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రసారం

రెడ్ డెవిల్స్ జోరు

ఇంగ్లాండ్‌ను ఓడించి గ్రూప్-జిలో అగ్రస్థానం

బెల్జియం	1	ఇంగ్లాండ్	0
అద్నన్ యునసి (51వ)			

కాలినిన్‌గ్రాడ్: ఫిఫా ప్రపంచకప్‌లో బెల్జియం జోరు కొనసాగించింది. ముందే నాకౌట్ బెర్తు ఖరారు చేసుకున్న రెడ్ డెవిల్స్.. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి గ్రూప్-జిలో అగ్రస్థానం సాధించింది. గురువారం బెల్జియం 1-0తో ఇంగ్లాండ్‌పై గెలిచింది. 51వ నిమిషంలో అద్నన్ యునసి గోల్ కొట్టి బెల్జియం విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయంతో గ్రూప్-జిలో మూడు మ్యాచ్‌లు ఆడి మూడింట్లోనూ గెలిచిన బెల్జియం 9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు 3 మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒక పరాజయంతో ఇంగ్లాండ్ (6 పాయింట్లు) ద్వితీయ స్థానంలో నిలిచింది. టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన హ్యారీ కేన్ లేకపోవడం ఇంగ్లాండ్‌ను దెబ్బ తీసింది. 51వ నిమిషంలో ఇంగ్లాండ్ గోల్‌పోస్ట్‌కు సమీపంగా దూసుకొచ్చిన యునసి క్రాస్ షాట్‌తో స్కోర్ చేశాడు. ప్రిక్వార్టర్స్‌లో బెల్జియం.. జపాన్‌తో, ఇంగ్లాండ్.. కొలంబియాతో తలపడనున్నాయి.

ఫెదరర్, సెరెనాలకు సులువైన డ్రా



లండన్: స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్.. అమెరికా తార సెరెనా విలియమ్స్‌లకు వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో సులువైన డ్రా పడింది. రికార్డు స్థాయిలో తొమ్మిదో వింబుల్డన్ టైటిల్‌పై గురి పెట్టిన డిఫెండింగ్ ఛాంపియన్ ఫెదరర్ తొలి రౌండ్లో లాజోవిచ్ (స్లొవేకియా)తో తలపడనున్నాడు. 36 ఏళ్ల ఫెదరర్‌కు ఈ టోర్నీలో టాప్ సీడింగ్ లభించింది. క్వార్టర్స్ వరకు రోజర్‌కు గట్టి ప్రత్యర్థే ఎదురుపడే అవకాశాల్లేవు. ప్రపంచ నంబర్‌వన్ రఫెల్ నాదల్ రెండో సీడ్‌గా బరిలో ఉన్నాడు. అతను తొలి రౌండ్లో డుడి సెలా (ఇజ్రాయిల్)తో ఆడనున్నాడు. క్వార్టర్స్ వరకు అతడికి ఎదురు లేకపోవచ్చు. అక్కడ డెల్‌పోట్రో ఎదురుపడే అవకాశాలున్నాయి. మాజీ ఛాంపియన్ ఆండీ ముర్రే.. తొలి రౌండ్లో బెన్నొట్ పైరె (ఫ్రాన్స్)తో తలపడతాడు. 25వ సీడ్‌గా బరిలోకి దిగనున్న సెరెనా తొలి రౌండ్లో రూస్ (నెదర్లాండ్స్)తో తలపడనుంది. ఒక పార్శ్వంలో ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్ ముగురుజ, సిమోనా హలెప్, వోజ్నియాకి, షరపోవా కూడా టైటిల్ బరిలో ఉన్నారు.

ఫాబియానోతో యుకి ఢీ: భారత యువ ఆటగాడు యుకి బాంబ్రి.. వింబుల్డన్ తొలి రౌండ్లో థామస్ ఫాబియానోతో తలపడనున్నాడు. గతంలో అతడితో మూడుసార్లు తలపడిన బాంబ్రి.. మూడుసార్లూ ఓడాడు. డబుల్స్‌లో బోపన్న, విష్ణువర్ధన్, పురవ్ రాజా, జీవన్ నెడుంచెజియన్, దివిజ్ శరణ్ తమ తమ భాగస్వాములతో బరిలో ఉన్నారు.

చెలరేగిన విహారి, పృథ్వీ

నార్త్‌హాంప్టన్: హనుమ విహారి (147; 131 బంతుల్లో 13×4, 5×6), పృథ్వీ షా (102; 90 బంతుల్లో 16×4) శతకాలతో సత్తాచాటడంతో ఇంగ్లాండ్‌లో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ మ్యాచ్‌లో భారత్-ఎ 203 పరుగుల తేడాతో వెస్టిండీస్-ఎ చిత్తుచేసింది. విహారి, పృథ్వీమూడో వికెట్‌కు 160 పరుగులు జోడించారు. అనంతరం ఛేదనలో అక్షర్ పటేల్ (4/34) ధాటికి వెస్టిండీస్-ఎ 37.4 ఓవర్లలో 151 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో హేమ్‌రాజ్ (43), ఆంబ్రిస్ (32) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. ఇప్పటికే ఫైనల్ చేరిన భారత- ఎ జట్టు సోమవారం తుది పోరులో ఇంగ్లాండ్ లయన్స్‌తో తలపడనుంది.

ప్రమాదాల 'ఘాటు'

పవిత్ర సంగమం నుంచి దుర్గా ఘాట్ వరకూ రక్షణ చర్యలు కరవు

ఈనాడు, అమరావతి: విజయవాడ సమీపంలోని ఫెర్రీ, పవిత్ర సంగమం, పున్నమి, దుర్గాఘాట్‌లను గత పుష్కరాల సమయంలో ప్రభుత్వం అభివృద్ధి చేసింది. దీంతో పర్యాటకులు, దుర్గగుడికి వచ్చే భక్తులు, స్థానికులు అధికంగా సందర్శిస్తున్నారు. వాటిని సుందరంగా తీర్చిదిద్దినా రక్షణ చర్యలు లేకపోవడం ఇబ్బందిగా మారింది.

ఫెర్రీ

ఇబ్రహీంపట్నం పరిధిలో ఫెర్రీ ఘాట్ ఉంది. 2004లో కృష్ణా పుష్కరాల సమయంలో ఈ ఘాట్‌ను నిర్మించారు. ఇటీవల కృష్ణా పుష్కరాల సమయంలో ఈ ఘాట్‌కు ఎగువన మరో చిన్న ఘాట్‌ను అభివృద్ధి చేశారు.

లోపాలు..

- ఈ ఘాట్ నుంచి నీళ్లలోకి దిగే చోట కనీసం బారికేడ్లు లేదు.
- ఘాట్ పక్కన గట్టు కూలిపోయి మనుషులు, పశువులు నీటిలో పడిపోయేలా ఉంది.
- నది మీదుగా ఆవలివైపు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తుండటంతో అక్కడ ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

ఎలాంటి రక్షణ చర్యలు లేని ఫెర్రీ ఘాట్

దుర్గా ఘాట్..

ప్రకాశం బ్యారేజీకి అతి సమీపంలో... కనకదుర్గమ్మ దేవాలయం కింద ఉన్నదే దుర్గా ఘాట్. దుర్గమ్మ దర్శనానికి వెళ్లే భక్తులంతా దాదాపు ఇదే ఘాట్‌లో స్నానమాచరిస్తారు. స్నానం చేయడంతోపాటు ఇక్కడే కృష్ణమ్మకు పూజలు చేస్తారు. భక్తులు, పర్యాటకులు, విజయవాడ స్థానికుల సందర్శనతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటోంది.

లోపాలు..

- ఇక్కడ ఘాట్ మరీ చిన్నదైంది.
- పక్కనే పైవంతెన (ఫ్లైఓవర్) పనులు జరుగుతుండటం... ఇసుక, మట్టి, సిమెంట్ వంటివన్నీ ఆ ఘాట్‌లో పడుతుండటంతో ఘాట్ కుంచించుకుపోయింది.
- ఇక్కడ నీటిలో ఏర్పాటు చేసిన బారికేడ్లు తక్కువ ఎత్తులో ఉండటంతో నీటిలో దిగినవారు వీటిని దాటుకుని లోపలికి వెళుతున్నారు.
- ఘాట్ ప్రారంభంలో బారికేడ్లు దాటి నదిలోకి వెళ్లవద్దంటూ జల వనరులశాఖ ఏర్పాటు చేసిన సూచన బోర్డు మినహా ఇక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరికలూ లేవు.

దుర్గా ఘాట్‌లో బారికేడ్ల దుస్థితి

పవిత్ర సంగమం వద్ద గోదావరి వచ్చి కలిసే చోట బారికేడ్ల పరిస్థితి

పవిత్ర సంగమం

గోదావరి వచ్చి కృష్ణాలో కలిసే చోటు ఇది. పవిత్ర సంగమంగా ఈ ప్రాంతంలో 2016లో జరిగిన కృష్ణా పుష్కరాల సందర్భంగా విశాలమైన భారీ ఘాట్‌ను ప్రభుత్వం నిర్మించింది. ఇక్కడే కృష్ణా నదికి ప్రతి రోజూ హారతి ఇస్తున్నారు. ఇక్కడకు వచ్చే పర్యాటకుల సంఖ్య భారీగానే ఉంటోంది. ప్రస్తుతం విజయవాడలో ప్రకాశం బ్యారేజీ తర్వాత అంతటి ప్రాధాన్యమున్నది పవిత్ర సంగమానికే అని చెప్పొచ్చు. దీనికి తగ్గట్లే ఈ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

లోపాలు..

- ఎలాంటి ప్రమాద హెచ్చరికలూ లేవు.
- కృష్ణా హారతి వేదిక నుంచి గోదావరి వచ్చే దారి వరకూ ఉన్న ఘాట్ మెట్లు, నీటిలోని బారికేడ్లకు మధ్యన మొక్కలు పెరిగిపోయాయి. దీంతో అక్కడ స్నానాలు చేయాలనుకునేవారు బారికేడ్లు దాటి నీటిలోకి వెళ్లాల్సిన పరిస్థితి.
- గోదావరి నీరు వస్తున్న మార్గాన్ని సూచిస్తూ ఎలాంటి సూచికలు లేవు. దీనివల్ల చాలామంది తెలియక ఆ మార్గంలోని ఘాట్‌లోకి స్నానానికి దిగుతున్నారు. రెండు నదులు కలుస్తున్న చోట నీరు సుడులు తిరుగుతుంటుంది.
- పహారా కాసేందుకు పోలీసులను నియమించినా వారికి కనీస సౌకర్యాలు లేవు.
- ఘాట్ విస్తీర్ణం ఎక్కువగా, ఎత్తుగా ఉండటంతో ఎవరు ఎటువైపు నుంచి దిగుతున్నారు ఎక్కడ ప్రమాదానికి గురవుతున్నారనేదీ గుర్తించే పరిస్థితి లేదు.

పున్నమి ఘాట్

అంతకుముందు కృష్ణా పుష్కరాల సమయంలో ఇక్కడ ఘాట్ నిర్మించారు. ఇటీవలి పుష్కరాల సమయంలో విస్తరించి ఆహ్లాదభరితంగా మార్చారు. భవానీ ద్వీపం (ఐలాండ్) వెళ్లే పడవలు/లాంచీలు ఇక్కడ నుంచే బయల్దేరుతుంటాయి. ఇక్కడే పున్నమి రిసార్టు ఉండటంతో బయట నుంచి వచ్చే పర్యాటకులు బస చేస్తుంటారు. ఇక్కడ వారాంతాల్లో, ఇతర ప్రత్యేక దినాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతోపాటు విజయవాడ నగరానికి దగ్గరగా ఉండటంతో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది.

లోపాలు..

- రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) పరిధిలో ఉన్న కొద్దిపాటి ఘాట్ ప్రాంతంలో మాత్రమే ఆ సంస్థ ఏర్పాటు చేసుకున్న పొరుగు సేవల భద్రతా సిబ్బంది ఒకరిద్దరు కనిపిస్తున్నారు.
- ఏపీటీడీసీకి ఇరువైపులా ఉన్న ఘాట్‌లో ఎక్కడా ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేవు.
- బారికేడ్ నుంచి నేరుగా నీటిలోకి వెళ్లే పరిస్థితి. కనీస ప్రమాద హెచ్చరికలూ లేవు.

పున్నమి ఘాట్‌లో ఏపీటీడీసీ పక్కనున్న ప్రాంతంలో రక్షణ లేని పరిస్థితి

ఇలా చేయొచ్చు

- నీటి ప్రవాహ వేగం, లోతు, ఎక్కడ స్నానాలు చేయాలి? ఎక్కడ నీటిలోకి దిగకూడదు వంటి హెచ్చరికలతో కూడిన బోర్డులను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలి.
- ఈ ఘాట్‌లలో నియమించిన గజ ఈతగాళ్లకు ఘాట్‌ల వద్ద షెల్టర్ లాంటివి ఏర్పాటు చేస్తే వారు అక్కడే ఉండి పర్యవేక్షించే వీలుంటుంది.
- పవిత్ర సంగమంవద్ద టవర్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి అటు ఫెర్రీ, ఇటు పవిత్ర సంగమం ఘాట్‌లలో నీటిలోకి దిగేవారికి పరిశీలించేందుకు వీలుగా బైనాక్యులర్ అందుబాటులో ఉంచాలి. దీంతో 2 కి.మీ. పరిధిలో నిఘా పెట్టవచ్చు.
- ఎస్డీఆర్ఎఫ్ ద్వారా ప్రత్యేకంగా శిక్షణనిచ్చిన వారిని ఫెర్రీ, పవిత్ర సంగమం, పున్నమి ఘాట్‌లలో నియమించినప్పటికీ వారికి అవసరమైన అత్యాధునిక ఎక్విప్‌మెంట్ ఇవ్వలేదు.

అవి ఇస్తే మేలు జరుగుతుంది.

- రక్షకులకు సాధారణ రబ్బరు బోట్‌ను ఇచ్చారు. గాలి నింపి (చుట్టూ బెలూన్ తరహాలో ఉంటుంది) నడుపుతారు కాబట్టి ఇది నీటి ప్రవాహానికి ఎదురు వెళ్లలేదు. ఫైబర్‌తో నిర్మించే స్పీడ్ బోట్లను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

ఫ్లోరిడా, ఆస్ట్రేలియాల్లో చర్యలు అనుసరణీయం

అమెరికాలోని ఫ్లోరిడా, ఆస్ట్రేలియాల్లోని బీచ్‌లలో తీసుకుంటున్న చర్యలు మనకూ అనుసరణీయం. అక్కడ తీర ప్రాంతంలో ఎక్కడ స్నానం చేయడం సురక్షితం, లోతు లేని, లోతున్న ప్రాంతాలు, ఆ రోజు ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటిలోకి వెళ్లవచ్చా లేదా?, రాకాసి అలలు ఎప్పుడొస్తాయి? వంటి సమాచారంతో అన్ని బీచ్‌లలో హెచ్చరిక/సూచిక బోర్డులుంటున్నాయి. ఎక్కడైనా గజ ఈతగాళ్లు, రక్షణ చర్యలు లేకపోతే ఇక్కడ రక్షణ చర్యలు తీసుకోలేదు. ఇక్కడ నీటిలోకి దిగవద్దన్న సూచనా ఉంటుంది.

గోవాలో...

గోవాలోనూ ప్రధాన, జనతాకిడి ఉండే బీచ్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి అర కిలోమీటరుకూ రబ్బరు ట్యూబ్‌లు, లైఫ్ జాకెట్లతో గజ ఈతగాడిని అందుబాటులో ఉంచుతున్నారు. ఆ పరిధిలో ఎవరైనా ప్రమాదవశాత్తూ నీటిలో మునిగితే గజ ఈతగాడు వెంటనే వెళ్లి వారికి లైఫ్ జాకెట్/ ట్యూబ్ ఇవ్వడంతోపాటు వారిని బయటకు తీసుకొచ్చేలా ఏర్పాట్లున్నాయి.

11న విజయవాడలో మహాధర్నా: ఫ్యాప్టో

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 11న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు బాబురెడ్డి, జి.హృదయరాజు తెలిపారు. సచివాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. మహాధర్నాతో సమస్యలు పరిష్కారం కాని పక్షంలో 17న నిరవధిక నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పురపాలిక ఉపాధ్యాయుల సమస్యలపై జులై 4న పురపాలిక సంచాలకుల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు, పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ సమస్యలపై 2014లో సీఎం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని వారు చెప్పారు.

పురపాలికల్లో సమన్వయకర్తల విధానం రద్దు చేయాలి: ఎంటీఎఫ్

పుర, నగరపాలికల్లోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ పురపాలిక, పట్టణాభివృద్ధి సంచాలకులు కన్నబాబుకు వినతిపత్రం సమర్పించినట్లు పురపాలిక ఉపాధ్యాయుల సమాఖ్య(ఎంటీఎఫ్) అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల దరఖాస్తు గడువు పొడిగింపు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు గడువును కేంద్రం పొడిగించిందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 30తో గడువు ముగుస్తుండగా వచ్చే నెల 15వరకు పొడిగించారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

5,6 తేదీల్లో పాలిసెట్ తుదివిడత కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: పాలిసెట్-2018 తుదివిడత కౌన్సెలింగ్ గడువు పొడిగించారు. వచ్చే నెల 5, 6 తేదీల్లో విద్యార్థులు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేక కమిషనర్ పండాదాస్ వెల్లడించారు. గతంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రానివారు ఈసారి పరిశీలన చేయించుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో 5శాతం మార్కులు తగ్గించాలని సాంకేతిక విద్యాశాఖ పంపిన ప్రతిపాదనలకు ఇంతవరకు ఆమోదం లభించలేదు.

ట్రిపుల్ ఐటీకి ఒకే పాఠశాల నుంచి 21 మంది ఎంపిక

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస లక్ష్మీనగర్ పురపాలక ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి 21 మంది ఎంపికయ్యారు. శుక్రవారం వెల్లడైన ఫలితాల్లో పది మంది నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఎనిమిది మంది శ్రీకాకుళం, ముగ్గురు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను 145 మంది విద్యార్థులు రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 26 మంది 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్ అరుణ్‌కుమార్

ఈనాడు డిజిటల్, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన ఐసీడీఎస్ ఏపీ అనే గుర్తున్న కోడిగుడ్లను బహిరంగ విపణిలో ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్త, పర్యవేక్షకులను విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

6న మంత్రివర్గ సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జులై 6న జరగనుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉదయం పదింటికి మంత్రివర్గ సమావేశం ప్రారంభమవుతుందని ప్రభుత్వ ఇన్‌ఛార్జి ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రామాంజనేయులు పదవీ విరమణ.. మళ్లీ అదే పోస్టులో

ఈనాడు డిజిటల్, అమరావతి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి రామాంజనేయులు పదవీ కాలం ఈనెల 30తో ముగియనుంది. శనివారం పదవీ విరమణ చేయనున్న ఆయన్ను మళ్లీ అదే పోస్టులో మరో మూడు నెలల పాటు నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు గత హోదాతో పాటు ఇతర సదుపాయాలు వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఇండియాటుడే ప్రభుత్వ వర్సిటీ ర్యాంకుల ప్రకటన

ఈనాడు, అమరావతి: దేశంలోని ప్రభుత్వ ఉత్తమ విశ్వవిద్యాలయాల జాబితాను ఇండియాటుడే ప్రకటించింది. ఇందులో పదో స్థానంలో ఆంధ్రా వర్సిటీ, 14వ ర్యాంకులో ఆచార్య నాగార్జున, 16వ స్థానంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలున్నాయి. తాడేపల్లిగూడెంలోని ఉద్యాన వర్సిటీకి 35వ ర్యాంకు లభించింది.

కొత్త ఆనవాయితీ!

రాష్ట్రపతికి బదులు ప్రాచీన భాషల పురస్కారాలు ప్రదానం చేయనున్న ఉపరాష్ట్రపతి

ఈనాడు, దిల్లీ: ప్రాచీన భాషా కోవిదులకు ఇచ్చే రాష్ట్రపతి పురస్కారాలను ఈ సారి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రదానం చేసే అవకాశముంది. ఆ కార్యక్రమంలో రాష్ట్రపతి గంటకన్నా ఎక్కువసేపు ఉండకుండా ప్రొటోకాల్‌ను సవరించడమే ఇందుకు కారణం. అంటే రాష్ట్రపతి గరిష్ఠంగా 12-13 పురస్కారాలను మాత్రమే ప్రదానం చేయగలరు. ఈ ఏడాది ప్రాచీనభాషలకు సంబంధించి 75 మందికి పురస్కారాలను ఇవ్వాల్సి ఉంటుంది. గంటలోపు కార్యక్రమం పూర్తి కాదు. కొత్త ప్రొటోకాల్ గురించి మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖకు రాష్ట్రపతి భవన్ సమాచారం అందించింది. ఈ నేపథ్యంలో ప్రాచీనభాషలకు సంబంధించి ఇచ్చే పురస్కారాల నోటిఫికేషన్‌ను మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ సవరించనుంది. రాష్ట్రపతి ఈ పురస్కారాలను అందిస్తారన్న వాక్యంలో మార్పులు చేస్తారు. రాష్ట్రపతి లేదా ఉపరాష్ట్రపతి, ప్రధాని వంటి ఇతర ఉన్నత పదవుల్లో ఉన్న వారు పురస్కారాలను అందివ్వడానికి వీలుగా మారుస్తారు. జాతీయ చలన చిత్ర పురస్కారాలకు 70 మందిని ఎంపిక చేయగా మేలో రాష్ట్రపతి కోవింద్ 11 మందికే ప్రదానం చేశారు. మిగిలిన వారికి కేంద్రమంత్రులు ప్రదానం చేశారు. అందరికీ రాష్ట్రపతి ప్రదానం చేయకపోవడం వివాదాస్పదమయింది. ప్రాచీన భాషల పురస్కారాల్లో అటువంటి వివాదం తలెత్తకుండా ఉండేందుకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ.. సంబంధిత నోటిఫికేషన్‌ను సవరించాలని నిర్ణయించింది.

సెప్టెంబరు 5న దిల్లీలో సంఘర్ష్ ర్యాలీ

ఈనాడు, దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో 5 లక్షల మంది రైతులు, వివిధ రంగాల కార్మికులతో సెప్టెంబరు 5న సంఘర్ష్ ర్యాలీ నిర్వహించనున్నట్లు అఖిల భారత కిసాన్ సభ సంయుక్త కార్యదర్శి విజూకృష్ణన్ శుక్రవారం వెల్లడించారు. రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆగస్టు 9న దేశవ్యాప్తంగా జైల్‌భరో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

గులాం నబీ ఆజాద్‌పై దేశద్రోహం కేసు

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్‌కు వ్యతిరేకంగా.. దిల్లీలోని కోర్టులో దేశ ద్రోహ ఆరోపణలతో ఫిర్యాదు నమోదైంది. జమ్ముకశ్మీర్‌లో సైన్యం ఆపరేషన్లలో ఉగ్రవాదుల కన్నా పౌరులే ఎక్కువగా మృతిచెందుతున్నారంటూ ఆజాద్ చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఓ న్యాయవాది ఇక్కడి మెజిస్ట్రీరియల్ కోర్టును ఆశ్రయించారు. సైన్యం అమాయకులను అంతం చేస్తోందన్నట్లుగా ఆజాద్ వ్యాఖ్యానించారని.. ఈ చర్య దేశద్రోహం కన్నా తక్కువేమీ కాదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మారన్ సోదరులకు హైకోర్టులో చుక్కెదురు

చెన్నై: సీబీఐ అప్పీలుపై విచారణను వాయిదా వేయాలన్న టెలికాం మాజీ మంత్రి దయానిధి మారన్, అతని సోదరుడు కళానిధి మారన్‌ల విజ్ఞప్తిని చెన్నై హైకోర్టు తిరస్కరించింది. కేంద్ర టెలికాంశాఖ మంత్రిగా మారన్ అక్రమంగా కనెక్షన్లు పొందడమే కాక, ఎక్స్ఛేంజీనీ ఏర్పాటు చేసుకున్నారనీ... ఆ కనెక్షన్లను సన్ టీవీ ఉపయోగించుకుందని సీబీఐ అభియోగాలు మోపిన సంగతి తెల్సిందే.

పోలవరం పునరావాసంలో కీలక ఘట్టం

- గ్రామాలు ఖాళీ చేయించే ప్రక్రియలో ముందడుగు
- తూర్పులో ప్రారంభం.. పశ్చిమలోనూ సన్నాహాలు

కుక్కునూరు, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యముందో.. పునరావాసానికీ అంతకన్నా ఎక్కువ ఉంది. ఇప్పటివరకూ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ఎన్నో మైలురాళ్లు దాటుకుంటూ వస్తున్న ప్రభుత్వం తాజాగా పునరావాసంలోనూ కీలక అడుగు వేసింది. గ్రామాలను ఖాళీ చేయించే ప్రక్రియను తూర్పుగోదావరి జిల్లాలోని వరరామచంద్రాపురం మండలం నుంచి ప్రారంభించింది. శ్రీరామగిరి, సీతంపేట, కొత్తూరులలోని నిర్వాసితులకు మూడు రోజులుగా పునరావాస పరిహారం అందిస్తున్నారు. వారితోపాటు పశ్చిమలోనూ గ్రామాల తరలింపు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి 2019 జూన్ నాటికి గ్రావిటీ ద్వారా నీరు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. అందుకు అనుగుణంగా ముంపునకు గురయ్యే దాదాపు 20 గ్రామాలను ఖాళీ చేయించాల్సి ఉంది. పశ్చిమలో పరిహారం పంపిణీని గతేడాది పూర్తి చేసిన అధికారులు స్థిరాస్తుల సేకరణ, వ్యక్తిగత ప్యాకేజీకి శ్రీకారం చుట్టలేదు. అర్హుల జాబితాలో అనర్హులున్నారని గుర్తించి గతేడాది కాలంగా వడపోతలు చేపట్టారు. ఆ ప్రక్రియ తుది దశకు చేరుకుంటోంది. ఇటీవల వాస్తవ నిర్వాసితుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహించారు. వేలేరుపాడు మండలంలో గ్రామసభలు పూర్తయ్యాయి. ప్రస్తుతం కుక్కునూరు మండలంలో తుది దశకు చేరుకున్నాయి. ఈ గ్రామసభలు పూర్తయితే నిర్వాసితుల సంఖ్య తేలుతుంది. దీంతో వ్యక్తిగత ప్యాకేజీ, స్థిరాస్తి విలువలను నిర్వాసితుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఆ తర్వాత వారిని పునరావాస కాలనీలకు తరలిస్తారు.

వేలేరుపాడు మండలంలోని ఓ ముంపు గ్రామం

7వేల కుటుంబాలు

పశ్చిమలో 7వేల కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయి. వీరందరినీ రానున్న ఏడాదిలోగా పునరావాస కాలనీలకు తరలించాల్సిందే. అంతకంటే ముందుగానే వారికి ఇళ్లు, ఇతర స్థిరాస్తులకు పరిహారం జమ చేయాలి. త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఈలోగానే పునరావాస ప్యాకేజీ పంపిణీ పూర్తి చేయాలి. దీనిని పరిగణనలోకి తీసుకుని పునరావాస ప్రక్రియను పరుగులు పెట్టించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

కొన్ని ప్రతిబంధకాలు

పశ్చిమగోదావరిలో పునరావాస ప్రక్రియ అనుకున్నంత వేగంగా జరగకపోవటానికి కొన్ని ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా గిరిజనుల కోసం భూమికి భూమి కింద బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు మండలాల్లో 4,700 ఎకరాలు సేకరించారు. అందులో కొన్ని వివాదాస్పద భూములుండటంతో గిరిజనులకు సకాలంలో అప్పగించలేకపోతున్నారు. గిరిజనేతరులకు ఏడాది కిందటే పరిహారం ఇచ్చారు. అదే సమయంలో గిరిజనుల నుంచి భూములను సేకరించిన అధికారులు ఇప్పటికీ వారికి భూమికి భూమి అప్పగించలేకపోయారు.

పునరావాస స్వరూపం ఇలా

ఫేజ్	గ్రామాలు	కుటుంబాలు	ప్రస్తుత పరిస్థితి
1	14	3,346	పునరావాసానికి తరలించారు
2	40	20,000	ప్రక్రియ జరుగుతోంది.
3	317	75,472	ప్రక్రియ చేపట్టాల్సి ఉంది.
మొత్తం	371	98,818	

ఇంటికే ఆహారధాన్యాల సరఫరా

- పేదలు ఆకలిచావుల బారినపడకూడదు
- ప్రజా పంపిణీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టండి
- రాష్ట్రాలకు కేంద్రం సూచన

దిల్లీ: ఆకలిచావులకు అవకాశం లేకుండా చేయడానికి రాయితీ ఆహారధాన్యాలను లబ్ధిదారుల ఇంటివద్దకే చేర్చాలని రాష్ట్రాలకు కేంద్రం శుక్రవారం సూచించింది. దిల్లీలో శుక్రవారం జరిగిన రాష్ట్రాల ఆహార మంత్రుల సమావేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థలో సంస్కరణలపై వివరంగా చర్చించారు. 15 రాష్ట్రాల ఆహార మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. "ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఇచ్చే ఆహారధాన్యాలు అందకపోవడం వల్ల ఆకలిచావులు సంభవించకుండా చూడాలని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు అందించాం. రాయితీతో అందించే ఆహారధాన్యాలను లబ్ధిదారుల ఇళ్లవద్దకే చేర్చాలని రాష్ట్రాలకు సూచించాం." అని కేంద్ర ఆహారశాఖ మంత్రి రాంవిలాస్ పాసవాన్ సమావేశం అనంతరం విలేకర్ల సమావేశంలో చెప్పారు. వరుసగా గత మూడు నెలలుగా రేషన్ సరకులను తీసుకోని లబ్ధిదారులను రాష్ట్ర ప్రభుత్వాలు గమనించాలని మంత్రి సూచించారు. "అటువంటి వారు సంపన్నులై ఉండవచ్చు. వారి రేషన్‌కార్డును రద్దు చేయవచ్చు. కొందరు లబ్ధిదారులు పెద్ద వయస్సు, శారీరక వైకల్యం కారణంగా దుకాణానికి రాలేకపోయే అవకాశమూ ఉంది. అటువంటి సందర్భాల్లో రేషన్ సరకులను ఇంటి వద్దకే చేర్చాల్సిన అవసరం ఉంది." అని అన్నారు.

నాణ్యమైన ఉత్పత్తి సంస్థల ఎంపికకు రాష్ట్రస్థాయి కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో చేపడుతున్న లేదా మున్ముందు చేపట్టే తాగునీటి పథకాల్లో నాణ్యమైన సామగ్రినే గుత్తేదారులు వినియోగించేందుకు వీలుగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. మెరుగైన సామగ్రిని ఉత్పత్తి చేసే సంస్థలను గుర్తించేందుకు రాష్ట్ర స్థాయిలో నిపుణుల కమిటీని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(పంచాయతీరాజ్) కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో రాష్ట్ర తాగునీటి సరఫరా సంస్థ ఎండీ, గ్రామీణ నీటిపారుదల ఇంజినీర్ ఇన్ చీఫ్, తాగునీటి సరఫరా సంస్థ ప్రాజెక్టు అధికారి, ప్రజారోగ్య శాఖ నుంచి నామినేట్ చేసే ఒక ఇంజినీర్ సభ్యులుగా ఉంటారు. ఆర్‌డబ్ల్యూఎస్ ప్రధాన ఇంజనీర్(చీఫ్ ఇంజినీర్), ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లాల పర్యవేక్షక ఇంజినీర్లు రొటేషన్ విధానంలో సభ్యులుగా వ్యవహరిస్తారు.

ఏకరూప దుస్తులు.. టీషర్టు.. ఉన్ని జెర్సీ

- సైనికులు కొనుక్కోవాల్సిన జాబితా ఖరారు
- ఏటా రూ.పదివేల వస్త్రాలభత్యం మంజూరు

దిల్లీ: సైనికులకిచ్చే రూ.పదివేల వార్షిక వస్త్రాలభత్యంతో ఏమేం కొనుగోలు చేయాలో రక్షణశాఖ ఖరారు చేసింది. జవాన్లు, జూనియర్ కమిషన్డ్ అధికారులు(జేసీవో) కొనుగోలు చేయాల్సిన జాబితాకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ఆమోదముద్ర వేశారని రక్షణశాఖవర్గాలు తెలిపాయి. వేసవిలో ధరించే ఏకరూపదుస్తులు, టీషర్టు, ఉన్ని జెర్సీ, సాధారణ దుస్తులు, బెల్టు, బ్యాడ్జిలు, రిబ్బన్లు, భుజాలపై ధరించే గుర్తులు, పతాకాలను నచ్చినవి కొనుక్కోవచ్చు. మిగిలిన వాటిని మాత్రం ఇప్పుడు ఇస్తున్నట్లే రక్షణశాఖే సమకూరుస్తుంది. సియాచిన్ గ్లేసియర్, ఇతర ఇబ్బందికరమైన వాతావరణం ఉన్నచోట్ల విధులు నిర్వహించే సైనికులకు కూడా సైన్యమే అన్నీ సమకూరుస్తుంది. తమకిచ్చే దుస్తులు, సామగ్రి ధరించడానికి అనుకూలంగా ఉండటం లేదని, నాణ్యత ఉండటంలేదని ఏడో వేతనసంఘానికి సైనికుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో వారికి నచ్చినవి, నప్పేవి కొనుగోలు చేయడానికి వీలుగా ఏటా వార్షిక వస్త్రభత్యం ఇవ్వాలని వేతనసంఘం సిఫార్సు చేసింది. దీంతో ఏటా రూ.పదివేలు ఇవ్వాలని రక్షణశాఖ నిర్ణయించింది. వీటితో సైనికులు ఏమేం కొనాలో ఆ జాబితాను రక్షణశాఖ తాజాగా ఖరారు చేసింది.

'హ్యారీ పోటర్' మాయా వస్త్రాలొచ్చేస్తున్నాయ్!

* అద్భుత సాంకేతికతను ఆవిష్కరించిన అమెరికా పరిశోధకులు

న్యూయార్క్: హ్యారీ పోటర్ సినిమాల్లోని మాయా వస్త్రం గుర్తుందా? దాన్ని కప్పుకొని.. హ్యారీ ఎవరికీ కనిపించకుండా అందరిముందే తిరిగే సన్నివేశాలను అంత సులువుగా మర్చిపోలేం! అచ్చం అలాంటి వస్త్రాల తయారీ త్వరలో వాస్తవరూపం దాల్చనుంది. అందుకు అవసరమైన అదృశ్య వేషధారణ సాంకేతికతను అమెరికాకు చెందిన 'ది ఆప్టికల్ సొసైటీ' పరిశోధకులు తాజాగా ఆవిష్కరించారు. త్రిమితీయ(త్రీడీ) వస్తువులు అందరి ముందే ఉన్నా.. ఏ కోణంలోనూ అవి కనిపించకుండా అదృశ్యం చేయగల అద్భుత సామర్థ్యం ఈ సాంకేతికత సొంతం. తాము అభివృద్ధి చేసిన 'వర్ణపటయుక్త అదృశ్య వస్త్రం(ఎస్ఐసీ)' అనే పరికరంతో కాంతి పౌనఃపున్యాన్ని అవసరానికి అనుగుణంగా మార్చుకోవడం ద్వారా.. త్రీడీ వస్తువులు కంటికి కనిపించకుండా చేయొచ్చునని పరిశోధకులు వెల్లడించారు. ఈ విధానంలో కాంతిని వస్తువుల గుండా ప్రసరింపజేస్తామని తెలిపారు. మాయా వస్త్రాలను తయారుచేయాలంటే ప్రస్తుత సాంకేతికతను మరింత మెరుగుపర్చాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

తేయాకు విత్తన నూనెతో గుండెకు మేలు

గువాహటి: తేయాకు విత్తనాల నుంచి తయారుచేసే వంటనూనె గుండె ఆరోగ్యానికి మేలుదాయకమని అసోం వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు గుర్తించారు. తాజా అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు ఎనిమిది రకాల తేయాకు విత్తనాలను సమగ్రంగా పరీక్షించారు. ఏడు రకాల విత్తనాల్లోని మొత్తం కొవ్వు ఆమ్లాల్లో.. అసంతృప్త కొవ్వు ఆమ్లాలే 90 శాతానికిపైగా ఉన్నాయని తేల్చారు. ఈ అసంతృప్త కొవ్వు ఆమ్లాలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని వెల్లడించారు. చైనాలో ఇప్పటికే 15 శాతం జనాభా తేయాకు విత్తన నూనెను వంటల్లో ఉపయోగిస్తున్నారని తెలిపారు.

ఇంటిని శుభ్రపర్చుకుంటే.. ప్రమాదకర రసాయనాల నుంచి రక్షణ!

లండన్: తరచుగా చేతులు కడుక్కోవడంతోపాటు ఇంటిని శుభ్రపర్చుకోవడం ద్వారా ప్రమాదకర రసాయనాల బారినపడే ముప్పును తగ్గించుకోవచ్చునని శాస్త్రవేత్తలు సూచించారు. సంతానోత్పత్తి సామర్థ్యం దెబ్బతినకుండా ఉండేందుకు ఈ రెండు పనులు దోహదపడతాయని వెల్లడించారు. సాధారణంగా అగ్నిప్రమాదాల్లో ఎక్కువ నష్టం వాటిల్లకుండా ఉండేందుకుగాను 'ట్రిస్' వంటి మంటల నిరోధక రసాయనాలను ఫర్నీచర్‌కు పూస్తుంటారు. సంతానోత్పత్తి సామర్థ్యం క్షీణించడంతోపాటు వినాళగ్రంథులు, థైరాయిడ్ పనితీరు దెబ్బతినేందుకు ఈ రసాయనం కారణమవుతుంది. అయితే తరచుగా చేతులు కడుక్కోవడం, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి చర్యలతో ఈ రసాయనం శరీరంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవచ్చునని తమ అధ్యయనంలో తేలినట్లు కొలంబియా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తాజాగా వెల్లడించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈ కిక్కే.. వేరబ్బా..!

ఒక్క కిక్ కొడితే చాలు గోల్...! కానీ అదేమంత తేలిక కాదు..! బంతిని కాచుకోవడానికి గోల్‌కీపర్ ఉంటాడు.. అతడికి రక్షణగా గోడకొట్టిన ఆటగాళ్లుంటారు.. ఇంతమందిని దాటుకుని బంతి ముందుకెళ్లడం అంత సులభమేమీ కాదు! కానీ కొందరు మాత్రం అద్భుతం చేస్తారు. గోడ కట్టిన ఆటగాళ్లను ప్రేక్షకులను చేస్తూ.. గోల్‌కీపర్‌ను విస్మయానికి గురిచేస్తూ.. బంతి సుడులు తిరుగుతూ అనూహ్యంగా గాల్లో వంపు తీసుకుని గోల్‌లోకి వెళ్లేలా కళ్లుచెదిరే కిక్‌లు కొడుతుంటారు..! ఫ్రీకిక్‌ల మహిమ గురించే ఇదంతా..! మరి మంత్రముగ్ధుల్ని చేసే అలాంటి ఫ్రీకిక్‌ల్లో దాగివున్న లాజిక్కేంటో చూద్దామా..!

దూరం..

ఫ్రీకిక్‌ను గోల్‌గా మలచడంలో అత్యంత ముఖ్యమైన అంశమిదే. మరీ ఎక్కువ దూరం నుంచి లేదా.. మరీ తక్కువ దూరం నుంచి ఫ్రీకిక్‌ను గోల్ చేయడం కష్టం. బ్రెజిల్ దిగ్గజం రాబర్టో కార్లోస్ 30 గజాల దూరం నుంచి ఫ్రీకిక్‌ను కొట్టడాన్ని ఇష్టపడతాడు. ఫుట్‌బాల్ చరిత్రలో అద్భుతమైన ఫ్రీకిక్‌లు కొట్టిన వారిలో కార్లోస్ ముందు వరుసలో ఉన్నాడు. అతడికి ఎనలేని గర్తింపు తెచ్చిన కిక్ (1997లో ఫ్రాన్స్‌పై)ను అతడు.. 38 గజాల దూరం నుంచి కొట్టాడు. ఆధునిక ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో 25 గజాల నుంచి బంతిని సులభంగా గోల్‌లోకి పంపగలడు. ఈ ప్రపంచకప్‌లో అద్భుత రీతిలో బంతిని వంపు తిప్పుతూ అతడు గోల్‌లోకి పంపిన ఫ్రీకిక్ దూరం 22 గజాలు.

గమనం..

దూరం అనుకూలంగా ఉన్నప్పుడు బంతిని ఎలా పంపడం అన్న దానిపై ఆటగాళ్లు దృష్టిసారిస్తారు. ఫ్రీకిక్ ద్వారా నేరుగా బంతిని గోల్‌లోకి పంపొచ్చు. కానీ దాన్ని అడ్డుకునేందుకు అడ్డుగా గోడలా ఆటగాళ్లుంటారు. సాధారణంగా ఎత్తైన ఆటగాళ్లను ముందు నిల్చోబెడతారు. వారిపై నుంచి బంతిని గోల్‌లోకి పంపాలి. అలా సాధ్యం కాదనుకున్న సమయంలో బంతిని స్పిన్ చేస్తూ, వంపు తిప్పేందుకు ఆటగాళ్లు ప్రయత్నిస్తారు. కిక్ కొట్టాక బంతి లక్ష్యానికి దూరంగా ఎక్కడికో వెళ్తున్నట్టుగా అనిపిస్తుంది. కానీ అసాధారణ రీతిలో అది మలుపు తిరుగుతూ గోల్‌లోకి పడుతుంది.

లెక్క చూసుకుని..

ఫ్రీకిక్ కొట్టేటప్పుడు ఆటగాడు కాస్త దూరం నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి లేదా ఉన్న చోటు నుంచి నేరుగా బంతిని కొడుతుంటాడు. కానీ అంతకుముందు ఆటగాడు చాలా లెక్కలే వేసుకుంటాడు. ఎదురుగా ఉన్న ఆటగాడి ఎత్తు అంచనా వేసుకుని అంతకంటే ఎత్తులో బంతి వెళ్లి.. మళ్లీ కిందకు దూసుకొచ్చేలా కిక్‌ను నియంత్రిస్తుంటాడు. ఒకవేళ ఆటగాడిపై నుంచి కాకుండా.. పక్క నుంచి వంపు తిరుగుతూ బంతిని పంపాలనుకున్న సమయంలో అది ఏ కోణంలో వెళ్లాలన్నది కూడా ఆటగాడు ముందే నిర్ణయించుకుంటాడు. సాధారణంగా గోల్‌కీపర్‌కు అడ్డుకునే అవకాశమివ్వకుండా టాప్ బార్‌కు కాస్త కింద నుంచి బంతి గోల్‌లోకి దూసుకెళ్లేలా కిక్ కొట్టేందుకు ఆటగాళ్లు ప్రయత్నిస్తారు.

వేగం..

ఫ్రీకిక్‌ను గోల్‌గా మలచడంలో ఇది కీలకం. కొందరు స్వింగ్‌ను నమ్ముకుంటే మరికొందరు వేగంపై ఆధారపడతారు. రొనాల్డో ఈ ప్రపంచకప్‌లో చేసిన గోల్‌లో కాలిని అడ్డంగా స్వింగ్ చేస్తూ బంతిని గోల్‌గా పంపాడు. బంతి 80 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. రాబర్టో కార్లోస్ కాస్త దూరం నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి ఎక్కువ వేగంతో బంతిని పంపేవాడు. శక్తికి స్వింగ్‌ను జోడించడం ద్వారా బంతి గాల్లో సుడులు తిరుగుతూ అనూహ్యంగా గోల్ పోస్టు లోకి దూసుకెళ్తుంది. ఇలాంటి కిక్‌లను అడ్డుకోవడం గోల్‌కీపర్‌కు శక్తికి మించిన పనే..!

స్పెయిన్‌పై రొనాల్డో ఫ్రీకిక్

వీళ్లే మేటి..

ఫ్రీకిక్‌ను గోల్‌గా మలచడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. పదిలో ఒక్కసారి మాత్రమే ఫ్రీకిక్ గోల్ అవుతుంది. దిగ్గజ ఆటగాళ్ల విషయంలో ఆ శాతం ఎక్కువగా ఉంటుంది. ఫ్రీకిక్ నిపుణులు ప్రపంచ గొప్ప ఆటగాళ్లు కావడం విశేషం. లియొనెల్ మెస్సి (అర్జెంటీనా), క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్), రాబర్టో కార్లోస్ (బ్రెజిల్), ఆండ్రియో పిర్లో (ఇటలీ), మారడోనా (అర్జెంటీనా), డేవిడ్ బెక్‌హామ్ (ఇంగ్లాండ్), రాబర్టో బాజియో (ఇటలీ) ఈ జాబితాలో ఉన్నారు.

ఒకొక్కరిది ఒక్కో శైలి..

బంతిని ఎలా కొట్టాలి..? ఈ విషయంలో ఆటగాళ్లు భిన్నమైన శైలిని అనుసరిస్తారు. సాధారణంగా ఎక్కువ మంది పాదం మధ్య భాగంతో కొడతారు. అలా కాలితో పంపే సమయంలో బంతిని స్పిన్ చేయడంతో పాటు అది వంపు తీసుకునేలా జాగ్రత్తపడతారు. రొనాల్డో ఎక్కువ వంపు తిప్పేందుకు ప్రయత్నించడు. పాదం ముందు భాగంతో బంతి మధ్య భాగానికి కాస్త ఎడంగా తంతాడు. ప్రయాణిస్తున్న సమయంలో గాలి ఒత్తిడి కారణంగా బంతి అనూహ్యంగా కదులుతుంది. ఫ్రీకిక్ గోల్స్ విషయంలో గాలి ప్రవాహం కూడా కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రేమ గోల్ కొట్టేశారు

రొనాల్డో కళ్లు చెదిరే ఫ్రీకిక్‌తో గోల్ కొట్టిన తీరు చూసి మురిసిపోయారు. నెయ్‌మార్ గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ బంతిని గోల్ పోస్టులోకి పంపిస్తే అబ్బురపడ్డారు. లుకాకు ఆశ్చర్యకర రీతిలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో రెండేసి గోల్స్ కొట్టిన వైనానికి ఆశ్యర్యపోతున్నారు. అయితే వీరు ఆటలో ఎంత ఘటికులో అమ్మాయిలతో ప్రేమాయణాలు సాగించడంలోనూ దిట్టలే. ఈ అగ్రశ్రేణి ఫుట్‌బాలర్లను కట్టిపడేసిన ఆ అమ్మాయిలెవరో.. వారితో వీరికి ఎలా లంకె కుదిరిందో.. తెలుసుకుందాం పదండి.

తొలి చూపులోనే

రెండేళ్ల క్రితం ఒక కార్యక్రమంలో పాల్గొన్న రొనాల్డో చూపు మాటిమాటికీ వీఐపీ గ్యాలరీ వైపే వెళ్లింది. అందుక్కారణం అక్కడ కూర్చున్న జార్జినా రోడ్రిగ్జ్ అనే అమ్మాయే. మోడల్‌గా ఫ్యాషన్ రంగంలో రాణిస్తున్న ఆమెను చూడగానే రొనాల్డో మనసు పారేసుకున్నాడు. రొనాల్డో అంటే పడిచచ్చే జార్జినా కూడా అతనితో త్వరగానే మాట కలిపింది. వీరు రెండేళ్లుగా సహజీవనంలో ఉన్నారు. 22 ఏళ్ల జార్జినా గతేడాది నవంబర్‌లో రొనాల్డో ద్వారా పాపకు జన్మనిచ్చింది. ఫుట్‌బాల్ ప్రపంచంలో మేటి ఆటగాడిగా కీర్తి గడిస్తున్న రొనాల్డో అమ్మాయిలతో ప్రణయ కావ్యాలు రచించడంలో దిట్ట. ఇప్పటివరకు అతను చాలామంది అమ్మాయిలతో సహజీవనం చేశాడు. అతను ఇప్పటికే వేర్వేరు అమ్మాయిల ద్వారా నలుగురు పిల్లలకు తండ్రయ్యాడు.

ఆమె నటనకు అతడు ఫిదా

వెండితెరతో పాటు బుల్లితెరలోనూ తన నటనతో ప్రేక్షకుల మనసులు దోచుకున్న బ్రెజిల్ భామ బ్రూనా మార్క్యూజిన్ అభిమానుల్లో ఆ దేశ ఫుట్‌బాల్ స్టార్ నెయ్‌మార్ కూడా ఉన్నాడు. తన నటనతో ఎన్నో అవార్డులు కొల్లగొట్టిన ఈ 22 ఏళ్ల సుందరి.. నెయ్‌మార్ మనసులో తిష్ట వేసుకొని కూర్చుంది. ఓ కార్యక్రమంలో బ్రూనాను చూసిన నెయ్‌మార్ అప్పటి నుంచే ఆమె అందానికి ఆకర్షితుడయ్యాడు. ఆమెతో పరిచయం చేసుకున్నాడు. తర్వాత ఇద్దరూ ప్రేమికులయ్యారు. ఈ జంట గత ఏడేళ్లుగా సహజీవనం చేస్తుంది. ప్రస్తుత ప్రపంచకప్‌లో బ్రెజిల్ జట్టు విజేతగా నిలవాలని ఆకాంక్షిస్తూ బ్రూనా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్టు చేసింది. నెయ్‌మార్ ఇదివరకు డేవి లూకా అనే అమ్మాయితో సహజీవనం చేసి ఒక అబ్బాయికి తండ్రయ్యాడు.

ఆమె ప్రేమలో లుకాకు

ప్రపంచకప్‌లో తన అద్భుత ప్రదర్శనతో బెల్జియం జట్టుకు విజయాలు అందిస్తున్న ఆ జట్టు స్టార్ ఆటగాడు రొమెలు లూకాకు చాలామంది అమ్మాయిల మనసు దోచాడు. అతడి మనసు దోచింది నెదర్లాండ్స్‌కు చెందిన ప్రముఖ టెలివిజన్ వ్యాఖ్యాత హ్యారీ కూతురు సారా మెన్స్. ఆమెతో లుకాకు ప్రేమలో మునిగి తేలుతున్నాడు. గత రెండేళ్లుగా వీళ్లు సహజీవనం చేస్తున్నారు. 2016లో మియామిలో మొదటిసారిగా వీళ్లు కలుసుకున్నారు.

ఒక స్వీపర్ డైరెక్టర్ ఫొటోగ్రాఫర్

ఫిఫా ప్రపంచకప్‌లో పోర్చుగల్-ఇరాన్ మధ్య మ్యాచ్ చూసిన వాళ్లకు అతను బాగా గుర్తుండిపోతాడు. గోల్‌పోస్ట్‌కు అడ్డుగోడగా నిలబడి పోర్చుగల్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో షాట్‌ను అడ్డుకుని ఇరాన్‌ను దాదాపు నాకౌట్ చేర్చినంత పని చేశాడు. అతనే అలీరెజా బిర్‌వాన్‌వాద్. ఈ ఇరాన్ ఆటగాడు ఒకప్పుడు రోడ్ల మీద నిద్రపోయి.. కార్లు తుడుచుకుంటూ జీవనాన్ని సాగించేవాడు.

ప్రపంచకప్‌లో ఒక దశలో అర్జెంటీనాకు నాకౌట్ అవకాశాలు క్లిష్టంగా మారాయంటే కారణం ఐస్‌లాండ్ ఆటగాడు హాన్స్ హాల్‌దర్సనే ఈ రెండు జట్ల మధ్య తొలి మ్యాచ్‌లో లియొనెల్ మెస్సి కొట్టిన పెనాల్టీ షాట్‌ను అడ్డుకుని సంచలనమే సృష్టించాడతను. అతను సాకర్‌లోకి రాకముందు కెమెరా.. యాక్షన్ అన్న దర్శకుడు.

వీళ్లిద్దరే కాదు ఈజిప్ట్ వెటరన్ ఇసామ్ ఎల్ హదరె, స్విస్ కుర్రాడు యాన్ సొమెర్‌లు కూడా ఈ ప్రపంచకప్‌లో ఆకట్టుకున్నారు. ఈ నలుగురూ గోల్‌కీపర్లే.. వీళ్లందరిది భిన్నమైన నేపథ్యమే.

రోడ్లు తుడిచినవాడే..

ఇరాన్ గోల్‌కీపర్ అలీజెరాది అందరికంటే దయనీయమైన గాథ. చిన్నప్పుడే కుటుంబానికి దూరం కావడంతో అతను ఆకలితో అలమటించాడు. రోడ్ల మీద నిద్రపోయేవాడు. కార్లు తుడుస్తూ.. వీధులు శుభ్రం చేస్తూ ఆ వచ్చిన డబ్బులతో పొట్టపోసుకునేవాడు. ఫుట్‌బాల్ మీద ఎంతో ప్రేమతో అతను స్థానిక జట్లతో కలిసి ఆడేవాడు. ఆ ఫుట్‌బాల్ క్లబ్ తలుపు దగ్గరే పడుకునేవాడు. చాలామంది అతణ్ని అడుక్కునేవాడు అనుకుని డబ్బులు వేసి వెళ్లేవాళ్లు. ఆ తర్వాత పిజ్జా షాపులో పని చేసి ఆ వచ్చిన డబ్బులతో ఫుట్‌బాల్ కోసం ఖర్చు పెట్టేవాడు. అలీ అంకితభావం, ఆట పట్ల అతని ప్రేమను చూసిన నాఫ్తా ఎ టెహ్రాన్ క్లబ్ జట్టులో చోటిచ్చింది. అతని కెరీర్‌కు ఇదే మలుపు. ఆ క్లబ్ తరపున సత్తా చాటిన అలీ.. ఇరాన్ అండర్-23 జట్టుకు ఎంపికయ్యాడు. 2015లో జాతీయ జట్టులోకి కూడా దూసుకొచ్చాడు. ప్రపంచకప్ ఆడుతూ తన కల నెరవేర్చుకున్న అలీ.. రొనాల్డో షాట్‌ను అడ్డుకుని హీరో అయ్యాడు.

కెమెరా.. ఫుట్‌బాల్.. యాక్షన్

మెస్సి సూపర్‌షాట్‌ను అడ్డుకున్న ఐస్‌లాండ్ ఆటగాడు హాన్స్ హల్‌డర్సన్ గోల్‌కీపర్ మాత్రమే కాదు ప్రొఫెషనల్ డైరెక్టర్ కూడా. 2012 నుంచి మాత్రమే అతను పూర్తి స్థాయి ఆటగాడిగా మారాడు. సొంతగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన హాన్స్..ఆరంభంలో టీవీ ప్రకటనలు, మ్యూజిక్ ఆల్బమ్స్ రూపొందించాడు. కొన్ని టీవీ సిరీస్‌లకు దర్శకుడిగా పని చేశాడు. సహచరులతో కలిసి కోకా కోలా వాణిజ్య ప్రకటనను కూడా అతను రూపొందించాడు. ఈ వీడియో ఎంతో ప్రాచుర్యం పొందింది. సాకర్‌ను పూర్తి స్థాయి కెరీర్‌గా ఎంచుకునేందుకు దర్శకత్వం పక్కనపెట్టాడు. ఫుట్‌బాల్ నుంచి తప్పుకున్నాక సినిమాలకు దర్శకత్వం చేయాలనేది హాన్స్ కల.

ఎన్ని కళలో..

స్విస్ ఆటగాడు యన్ సొమెర్ అంటే అందరికి గోల్‌కీపర్ అని మాత్రమే తెలుసు. కానీ అతనో ప్రొఫెషనల్ వంటగాడని.. గిటారిస్ట్ అని.. సంగీత దర్శకుడని.. అభిరుచి ఉన్న ఫొటోగ్రాఫర్ అని తెలిసిన వాళ్లు చాలా తక్కువ. ఖాళీ చిక్కితే చాలు సొమెర్.. గిటార్ పట్టుకుంటాడు. సొంతంగా పాటలు కడతాడు. అంతేకాదు ఫొటోగ్రఫీలోనూ తన ప్రతిభ ప్రదర్శిస్తాడు. ఇక వంట గదిలోకొచ్చి నోరూరించే వంటలు చేసిపెడతాడు. సొమెర్ తాతల కాలం నుంచి హోటల్స్ ఉన్నాయి. ఆ హోటల్స్‌లో వంటలు చేయడం అతనికిష్టం. వంటల మీద ఇష్టంతో సొమర్‌కొచెట్ అనే బ్లాగ్ కూడా నడుపుతున్నాడు.

45 ఏళ్ల వయసులో..

ప్రపంచకప్ చరిత్రలోనే అతి పెద్ద వయస్కుడు ఇసామ్ ఎల్ హదరె. తన ఉత్సాహం ముందు వయసు బలాదూర్ అని నిరూపిస్తూ.. అతను సౌదీ అరేబియాపై అద్భుతమైన డైవ్‌తో పెనాల్టీని ఆపాడు. ప్రపంచకప్‌లో పెనాల్టీని ఆపిన పెద్ద వయస్కుడు కూడా అతనే. విశేషం ఏమిటంటే అతని అల్లుడు మహ్మద్ మొనీమ్ కూడా ఈజిప్ట్ జట్టులో సభ్యుడు. 1996లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఇసామ్.. 2006 ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్ టోర్నీలో ఉత్తమ గోల్‌కీపర్‌గా నిలిచాడు. ఈసారి ప్రపంచకప్‌లో సౌదీపై ఆడిన మ్యాచ్ అతనికి కెరీర్‌లో 153వది.

సలామో..

సలామో: స్పెయిన్ జట్టు స్టార్ ఆటగాళ్లలో ఒకడైన ఇస్కో ప్రస్తుతం సలామో నామజపం చేస్తున్నాడు. దానికి కారణం అతని ప్రియురాలు పేరు సారా సలామో కావడమే. గత కొన్నేళ్లుగా వీళ్లు సహజీవనం చేస్తున్నారు. 26 ఏళ్ల సలామో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇన్‌స్టాగామ్‌లో పోస్టులతో తమ ప్రేమను వీళ్లిద్దరు బహిర్గతం చేశారు.

ఈనాడు సినిమా

ముద్దులు పెట్టమని ఎవరూ అడగలేదు

కమర్షియల్ సినిమాల్లో కథానాయికగా ఎదగాలంటే... కొన్ని హద్దుల్ని చెరిపేయాలి. మరీ ముఖ్యంగా గ్లామర్ పాత్రల్ని ఎంచుకోవాలి. ముద్దు సన్నివేశాలకు 'నో' చెప్పకూడదు. అయితే... వీటికి దూరంగానూ అవకాశాలు దక్కించుకుంటున్న కథానాయికలున్నారు. వాళ్లలో కీర్తి సురేష్ పేరు కూడా ఉంటుంది. ముద్దు సన్నివేశాలపై మీ అభిప్రాయం ఏమిటి? అని అడిగితే... "నా వరకూ అలాంటి సన్నివేశాల్లో నటించలేను. ఎందుకంటే నాకు నిజంగానే బెరుకు ఎక్కువ. తెరపై రొమాన్స్ చేయాలంటే సిగ్గెక్కువ. అందుకే అలాంటి సన్నివేశాల్లో నటించలేను. నన్నెవరూ ముద్దు సన్నివేశాల్లో నటించమని అడగలేదు. నేను ఎంచుకునే కథలు కూడా అలాంటివే ఉంటున్నాయి. ఒకవేళ ఎవరైనా అడిగితే 'నో' చెబుతా" అంటోంది. 'మహానటి' తరవాత తెలుగులో కొత్త సినిమాలేం ఒప్పుకోలేదు కీర్తి. కానీ తమిళంలో బాగా బిజీగా ఉంది.

కీర్తి సురేష్

సీనియర్లు.. జూనియర్లు కలిసి చేస్తున్న అల్లర్లు

నాగార్జున

నాని

కళ్యాణ్ రామ్

వెంకటేష్

నాగ చైతన్య

వరుణ్ తేజ్

అనుభవానికి కుర్రతనం తోడైతే... ఆ కాంబినేషన్‌కి తిరుగుండదు. ధోని బ్యాటింగ్‌కి హార్థిక్ పాండ్యా జట్టు కట్టినంత సంబరంగా ఉంటుంది. కొత్త బండి తీసుకుని, నాలుగో గేరులో హైవేపై పరుగులు పెడుతున్నంత ఉత్సాహంగా కనిపిస్తుంది. ఒకరిది వివేకం, మరొకరిది వేగం. ఒకరిది నిదానం... మరొకరిది వీర ప్రతాపం. సరిగ్గా ఇలాంటి కాంబినేషనే వెండి తెరపైనా చూసే అవకాశం దక్కుతోంది. టాలీవుడ్‌లో ప్రస్తుతం మల్టీస్టారర్ హంగామా కొనసాగుతోంది. ఇందులో... సీనియర్ హీరోలు, జూనియర్ కథానాయకులూ కలిసి సందడి చేస్తున్న చిత్రాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఓ విధంగా ఇదో కొత్త ట్రెండ్ అనుకోవచ్చు.

ఇది వరకు మల్టీస్టారర్ సినిమా అంటే... అదో విచిత్రం. సంచలనం. 'ఇద్దరు స్టార్ హీరోలు కలుస్తారేంటి?' అనే సందేహం. దర్శకులు కథలు అల్లుకోవడంలో విఫలమయ్యారో, లేదంటే కథానాయకులే చొరవ చూపించలేదో తెలీదు గానీ మల్టీస్టారర్ సినిమాలు పెద్దగా రాలేదు. ఇప్పుడు ఆ సరిహద్దులు చెరిపేస్తున్నారు కథానాయకులు. వాళ్ల మధ్య పెరుగుతున్న స్నేహం, దర్శకులు అల్లుకుంటున్న కథలు మల్టీస్టారర్ చిత్రాలకు బీజం పోస్తున్నాయి. దాదాపుగా ప్రతి అగ్ర కథానాయకుడూ మరో హీరోతో కలిసి నటించడానికి రెడీ అవుతున్నాడు. చాలామంది చేతుల్లో మల్టీస్టారర్ సినిమాలున్నాయి. అనుభవం, యువతరం మేలి కలయికగా కొన్ని చిత్రాలు రూపుదిద్దుకోవడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

నాగార్జునది మూడు దశాబ్దాల ప్రయాణం. నిలువెత్తు అనుభవం. మరో వైపు నాని.. ఈతరం చురుకుదనానికి ప్రతిరూపం. వీరిద్దరూ కలిస్తే ఎలా ఉంటుంది? ఈ ఆలోచన శ్రీరామ్ ఆదిత్యకు వచ్చింది. అంతే ఓ కథని తయారు చేసేశాడు. ఇప్పుడు ఈ సినిమా సెట్స్‌పై ఉంది. నాని అంటే నాగ్‌కీ, నాగ్ అంటే నానికీ ప్రత్యేకమైన అభిమానం. దాంతో వాళ్లిద్దరూ కలిసి నటించడానికి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. పైగా నాగ్‌కి ముందు నుంచీ కొత్త తరహా కథలంటే ఇష్టం. మరో కథానాయకుడితో కలిసి తెరని పంచుకోవడానికి ఎలాంటి జంకూ ఉండదు. దాంతో నాగ్, నాని కలిసి నటించే అవకాశం వచ్చింది.

నాగార్జున, కల్యాణ్‌రామ్ కలిసి ఓ సినిమాలో నటిస్తారని ప్రచారం జరుగుతోంది. పవన్ సాదినేని దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే ప్రముఖ రచయిత గుణ్ణం గంగరాజు అందిస్తున్నారట. నందమూరి, అక్కినేని కుటుంబాలు కలిసి నటిస్తే చూడ్డానికి తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ రెడీనే. ఎందుకంటే.. ఆ కుటుంబ కథానాయకులంటే వాళ్లకు అంతిష్టం. ఎన్టీఆర్ - ఏఎన్నార్ తరవాత నందమూరి - అక్కినేని కథానాయకులు కలిసి పనిచేసే అవకాశం అంతగా రాలేదు. 'శివరామరాజు'లో నాగార్జున, హరికృష్ణ అన్నదమ్ములుగా కనిపించారంతే. ఆ తరవాత.. మళ్లీ ఇన్నాళ్లకు ఈ కాంబినేషన్ చూసే అవకాశం దక్కుతోంది.

మల్టీస్టారర్ కథలకు ఓ విధంగా ఊపిరిలూదింది వెంకటేష్ అని చెప్పొచ్చు. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లెచెట్టు', 'గోపాల గోపాల' చిత్రాలతో మల్టీస్టారర్ వరుస ఊపందుకుంది. ఆ రెండింటిలోనూ వెంకీ మరో నాయకుడితో కలిసి నటించారు. ఇప్పుడు కూడా అదే ట్రెండ్ ఫాలో అవుతున్నారు వెంకటేష్. మేనల్లుడు నాగచైతన్యతో కలిసి వెంకటేష్ ఓ చిత్రంలో నటించనున్నారు. బాబి దర్శకత్వం వహించే ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మరోవైపు. . మెగా కథానాయకుడు వరుణ్‌తేజ్‌తో కలిసి 'ఎఫ్ 2' అనే ఓ సినిమా చేస్తున్నారు వెంకటేష్. ఇందులో వెంకీ, వరుణ్ తోడల్లుళ్లుగా కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. వరుస విజయాలతో దూసుకుపోతున్న అనిల్ రావిపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. వెంకటేష్, రానాలు కలిసి ఓ సినిమా చేయబోతున్నారని ఎప్పటి నుంచో అనుకుంటున్నారు. అందుకోసం కథలు సిద్ధమవుతున్నాయి. త్వరలో ఈ చిత్రానికీ క్లాప్‌కొట్టే అవకాశాలున్నాయి.

వెంకటేష్, నాగార్జునలాంటి అనుభవజ్ఞులతో కలిసి సినిమా చేయడం నవతరం కథానాయకులకు ఓ పాఠం. చక్కటి అవకాశం. చూసే ప్రేక్షకులకూ వింతైన అనుభవం. సీనియర్, జూనియర్ అనే హద్దులు చెరిపేసి అల్లరి చేయడానికి కథానాయకులు సిద్ధమైతే ఇలాంటి సరికొత్త కాంబినేషన్లని మరిన్ని చూసే అవకాశం దక్కుతుంది.

ప్రకృతే 'సాక్ష్యం'

బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్, పూజాహెగ్డే జంటగా నటించిన చిత్రం 'సాక్ష్యం'. శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ మను నిర్మాత. హర్షవర్ధన్ రామేశ్వరన్ స్వరకర్త. వచ్చే నెల 7న పాటల విడుదల వేడుకని నిర్వహిస్తున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. 'ప్రకృతే సాక్ష్యంగా రూపొందుతున్న కథ ఇది. శ్రీవాస్ మంచి కథతో, ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఆర్థర్ ఎ.విల్సన్ కెమెరా నుంచి వచ్చిన విజువల్స్ ఈ చిత్రానికి ప్రధాన బలం. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి, రెండు గీతాలకి మంచి స్పందన లభించింది. 'బాహుబలి'కి విజువల్ ఎఫెక్ట్స్ సమకూర్చిన బృందమే ఈ చిత్రానికి పనిచేస్తోంద"ని చిత్రవర్గాలు తెలిపాయి. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, రావు రమేష్, పవిత్ర లోకేష్, వెన్నెల కిషోర్, మీనా, అశుతోష్ రానా, జయప్రకాష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్.ప్రకాష్, సాహిత్యం: అనంతశ్రీరామ్.

'ఉద్యమ సింహం' ప్రారంభం

నాజర్

తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన ఉద్యమం నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'ఉద్యమ సింహం'. కేసీఆర్ పాత్రని ప్రముఖ నటుడు నాజర్ పోషిస్తున్నారు. అల్లూరి కృష్ణంరాజు దర్శకత్వం వహిస్తున్నారు. కల్వకుంట్ల నాగేశ్వర్ రావు నిర్మాత. హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ఈ సందర్భంగా నాజర్ మాట్లాడుతూ "ఇప్పటిదాకా ఐదొందల చిత్రాల్లో నటించా. అందులో చారిత్రక, కల్పితం... ఇలా చాలా రకాల కథలున్నాయి. కానీ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేసి, విజయాన్ని సాధించిన కేసీఆర్ పాత్రలో నటిస్తుండడంపై భావోద్వేగానికి గురవుతున్నా. ఈ పాత్ర చేయడం గర్వంగా ఉంది, గౌరవంగా భావిస్తున్నా. కేసీఆర్ గొప్ప పోరాట పటిమ ఉన్న నాయకుడు. నాకున్న అనుభవాన్నంతా ఉపయోగించి ఈ పాత్రకి న్యాయం చేయాలనే సంకల్పంతో ఉన్నా. ఇప్పటికే కేసీఆర్‌కి సంబంధించిన వీడియోలు చూడటంతో పాటు, ఆయనపై వచ్చిన పుస్తకాలు చదువుతున్నా" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన ఉద్యమం మొదలుకొని... రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దే క్రమం వరకు ఈ సినిమా ఉంటుంది. అన్ని ప్రాంతాలవారికీ నచ్చేలా, అందరిలోనూ స్ఫూర్తిని నింపేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నాం. నవంబరు 29న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామ"న్నారు. "కేసీఆర్ పాత్ర కోసం చాలా మందిని అనుకున్నాం. నాజర్ అయితేనే బాగుంటాడని ఆయన్ని ఎంపిక చేసుకున్నాం" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఉదయ్‌కుమార్, సంగీతం: వరికుప్పల యాదగిరి.

2018లో ఓ ప్రేమ కథ

సోనమ్‌కపూర్, అనిల్‌కపూర్

1942లో ప్రేమ కథ....2018లోని ఓ ప్రేమ కథ...వీటి మధ్య ఓ తేడా ఉంది. అప్పటి ప్రేమలు సింపుల్‌గా ఉండేవి. ఇప్పుడు ప్రేమ కథల్లో డ్రామా ఉంటుంది. మరి ఆ డ్రామా నిండిన ఈ ప్రేమ కథ ఏంటో తెలియాలంటే 'ఏక్ లడ్‌ఖీ కో దేఖాతో ఐసా లగా' చూడాల్సిందే అంటోంది సోనమ్‌కపూర్. ఆమె కథానాయికగా నటించిన చిత్రమిది. ఇందులో ఆమెతో పాటు అనిల్‌కపూర్, రాజ్‌కుమార్ రావ్ కీలక పాత్రల్లో నటించారు. తండ్రితో కలిసి సోనమ్ నటిస్తున్న తొలి చిత్రమిది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విడుదలైంది. అనిల్‌కపూర్ 1994లో నటించిన '1942: ఎ లవ్ స్టోరీ'లోని 'ఏక్ లడ్‌ఖీ కో దేఖాతో ఐసా లగా' పాట ట్యూన్‌తో టీజర్ మొదలవుతుంది. ఓ పంజాబీ కుటుంబం పెళ్లి వేడుక నేపథ్యంగానే టీజర్ సాగుతుంది. అనిల్‌కపూర్, సోనమ్ మధ్య భావోద్వేగ సన్నివేశాలను కొన్నింటిని రుచి చూపించారు టీజర్‌లో. ఈ చిత్రంలో అనిల్‌కు జోడీగా జుహీచావ్లా నటిస్తోంది. మళ్లీ పదేళ్ల తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటించిన చిత్రమిది. షెల్లీ చోప్రా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని వినోద్ చోప్రా ఫిల్మ్స్, రాజ్‌కుమార్ హిరాణీ ఫిల్మ్స్, ఫాక్స్ స్టూడియో సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అక్టోబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

గీతోపదేశం

శాస్త్రానికి జ్ఞానానికి
ఆది గురువురా మన దేశం
మానవాళికే వైతాళిక
గీతంరా భారతం
ధర్మానికి సత్యానికి
జన్మభూమిరా మన దేశం
ఎన్నో మతాల సహ
జీవన సూత్రంరా భారతం

గీతం: ఈ జెండా
పసి బోసి చిరునవ్వురా..
చిత్రం: బాబీ
రచన: శక్తి
– పంపినవారు: వి.వనజ, విజయనగరం

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

మనసు దోచుకునేలా...

సుధీర్‌బాబు, నభ నతేశ్

'సమ్మోహనం'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకొన్నారు సుధీర్‌బాబు. త్వరలోనే ఆయన 'నన్ను దోచుకుందువటే' అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రమిది. నభ నతేశ్ కథానాయిక. ఆర్.ఎస్.నాయుడు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇప్పటికే దాదాపుగా చిత్రీకరణ పూర్తి చేసుకొన్న ఈ చిత్రం, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుకొంటోంది. శుక్రవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. దర్శకుడు ఆర్.ఎస్.నాయుడు మాట్లాడుతూ "విభిన్నమైన కథ, కథనంతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటుందీ చిత్రం. ఈ సినిమా పేరుని ప్రకటించగానే ప్రేక్షకుల నుంచి, పరిశ్రమ నుంచి మంచి స్పందన లభించింది. సుధీర్‌బాబు నిర్మాతగా చేస్తున్న ఈ చిత్రంలో ఉన్నతమైన నిర్మాణ విలువలు కనిపిస్తాయి. సుధీర్, నభ నతేశ్ జంట ప్రేక్షకుల మనసు దోచుకునేలా ఉంటుంది. అజనీష్ సంగీతం చిత్రానికి ప్రధానబలం. త్వరలోనే మిగతా వివరాల్ని ప్రకటిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సురేష్ రగుతు, సంగీతం: అజనీష్ బి.లోకనాథ్, కళ: శ్రీకాంత్ రామిశెట్టి, కూర్పు: ఛోటా కె.ప్రసాద్.

కథే.. కథానాయకుడిగా



శ్రావణ్

శ్రావణ్ కథానాయకుడిగా శ్రీ భాగ్యలక్ష్మి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రానికి శ్రీకారం చుట్టింది. లియోనా ఈశాయ్ కథానాయిక. బాలమురుగన్ దర్శకుడు. బోగారి లక్ష్మీ నారాయణ నిర్మాత. గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "కథే ఈ చిత్రంలో హీరో. స్క్రీన్ ప్లే పరంగా ఓ కొత్త తరహా ప్రయోగం చేస్తున్నాం. పదేళ్లకుపైగా తెలుగు చిత్రాల్లో ప్రతినాయకుడిగా నటించి పేరు తెచ్చుకున్న శ్రవణ్‌ని కథానాయకుడిగా పరిచయం చేస్తున్నాం. అనుభజ్ఞులు, కొత్త కుర్రాళ్లు కలిసి చేస్తున్న ప్రయత్నమిది. జులై 2 నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తామ"న్నారు. సంగీతం: ఆరోల్ కొరెల్లి.

వసుంధర

ఈనాడు శనివారం జూన్ 30, 2018 విజయవాడ

కాలేజ్ కార్నర్

కాలేజీలోకి అడుగుపెట్టగానే స్నేహితులే లోకం. సామాజిక మాధ్యమాల్లో, షాపింగుల్లో, బాధల్లో, సంతోషాల్లో స్నేహితులే తోడు. ఒక పని మొదలుపెట్టాలో, వద్దో అని నిర్ణయించుకోవాలంటే మొదట ఫోను కొట్టేదీ వాళ్లకే. మరి మిత్రులను ఎంచుకునే విషయంలోనూ ఆచీతూచీ ఉండాలిగా...!

కొత్త బంగారులోకంలో... ఆచీతూచీ!

పాఠశాల నుంచి బయటకొచ్చే వయసూ, ప్రలోభాలకు లోనయ్యే దశా ఒకటే. కాలేజీలో అడుగుపెట్టగానే ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న స్వేచ్ఛ దొరికిందనిపిస్తుంది. హాస్టళ్లలో ఉండి చదువుకునే వాళ్లకు అది ఇంకాస్త ఎక్కువే. డబ్బు విషయం మొదలుకొని చదువుకునే సమయం వరకూ అన్నీ మనమే సొంతంగా చూసుకోవాలి. అలాంటప్పుడు చుట్టూ ఉన్న స్నేహితులే ఆ స్వేచ్ఛా రెక్కలకు పంజరాలు. కాబట్టి వాళ్ల ఎంపిక విషయంలో మనకంటూ కాస్త విచక్షణ అవసరం. కాస్త ఆలస్యమైనా సరే మంచి చెలిమికే ఓటేయాలి. లేదంటే ఒంటరిగా ఉన్నా మంచిదే. అలా ఉండగలననే ధైర్యం ఉండాలంతే.

వాళ్లతో స్నేహం వద్దు...

'నీ స్నేహితులెవరో చెబితే... నువ్వేంటో చెబుతా' అనే సామెత స్నేహితుల ఎంపిక విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో వివరిస్తుంది. ఒక మంచి బృందంతో తిరిగితే మనల్నీ మంచివాళ్లలాగే పరిగణిస్తారు. అదే ఫలితం చెడుస్నేహంతోనూ ఉంటుంది. ఒకనెల పాటూ ఒకరితో స్నేహం చేస్తే వాళ్లు ఎక్కువగా వాడే పదాలూ, మాటతీరు మనకూ కాస్త అలవాటైపోతుంది. వాళ్ల అలవాట్లూ రావచ్చు. మనమెంత జాగ్రత్తగా ఉన్నా సరే ఆ ప్రభావం కాస్త అయినా పడే అవకాశం ఉంది. అందుకే ఈ కింది వాళ్లకు కాస్త దూరంగా ఉంటేనే మంచిది.

పరీక్షలంటే లైటా...

కాలేజీకి వెళ్లేది చదువుకోడానికే. మీకున్న స్నేహితుల్లో కొంత మంది 'ఏం చదువుతావ్‌లే' అంటూ దృష్టి మళ్లించే ప్రయత్నం చేయొచ్చు. అది మిమ్మల్ని చెడగొట్టడానికే కాకపోవచ్చు. అది కొంచెంసేపు సరదాకు సరే కానీ పూర్తిగా చదువుమీద నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం ఎవరైనా చేస్తున్నట్టనిపిస్తే వాళ్లతో దూరంగా ఉండటమే మేలు. ముఖ్యంగా పరీక్షల ముందు సినిమాలకు వెళ్లడం, స్నేహితుల ఇళ్లకు వెళ్లడం లాంటివి మానుకోవాలి. గ్రూప్‌స్టడీస్ చేస్తున్నప్పుడు కూడా ఇదే తీరు కనిపిస్తే ఒంటరిగా చదువుకోవడమే మేలు.

పైసానే ప్రపంచం...

ఈ తత్వం ఉన్న స్నేహితులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. తరచూ పార్టీలకు వెళ్లడం, ఖరీదైన బహుమతులు ఇచ్చుకోవడం, దూర ప్రాంతాలకు విహారయాత్రలకు వెళ్లడం, క్యాంటీన్లలో అవసరానికి మించి ఖర్చుపెట్టడం... ఇవన్నీ ఈ బృందాల్లో కనిపిస్తాయి. కాలేజీ అన్నాక ఈ సంతోషాలుండటం తప్పుకాదు కానీ అవి మనకున్న స్తోమతను మించకూడదు. పైగా బృందంతో కూడుకున్న వ్యవహారం కాబట్టి మిగతావాళ్ల ఆర్థిక స్తోమతా అందరూ ఆలోచించాలి. కొన్నిసార్లు మనం ఎక్కువగా డబ్బు ఖర్చు పెట్టలేమనుకున్నప్పుడు వాళ్లే మనం ఇవ్వాల్సిన డబ్బునూ ఇచ్చేస్తుంటారు. కానీ ఆ తీరు ఎక్కువ రోజులు కొనసాగించడం సరికాదు. మనకోసం వాళ్లే ఖర్చుపెడతామన్నా కూడా ఒప్పుకోవాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా అబ్బాయిల విషయంలో ఈ జాగ్రత్త అవసరం. అనవసరంగా బహుమతుల్లాంటివి ఇస్తుంటే వాళ్లకు దూరంగా ఉండటం మంచిది. ఎందుకంటే వీళ్లు ప్రతి విషయాన్ని డబ్బుతో ముడిపెడుతుంటారు. ఎప్పుడయినా ఏదయినా గొడవ జరిగితే... 'నీకోసం అప్పుడు అంత ఖర్చుపెట్టా...' అనే ధోరణిలో మాట్లాడతారు.

తరచూ గాసిప్‌లా...

కొంతమంది పక్కనున్న వ్యక్తుల గురించి చులకనగా మాట్లాడటమే పనిగా పెట్టుకుంటారు. పుకార్లూ, పనికిరాని ముచ్చట్లూ, గాసిప్‌లు ఇవే వాళ్లకు ఆనందం. అలాంటి వాళ్లకు కూడా వీలైనంత దూరంగా ఉండాలి. లేదంటే మన గురించి కూడా కొత్త ముచ్చట్లు అల్లేస్తుంటారు. సామాజిక మాధ్యమాల్లో అలాంటి గ్రూపులున్నా వాటి నుంచి బయటకొచ్చేయాలి.

తప్పులే ఎంచి చూస్తే...

సానుకూలంగా ఆలోచించే వాళ్ల దగ్గర ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం ఉంటుంది. అదే ప్రతికూలంగా ఆలోచించే వాళ్ల దగ్గర ప్రతి పరిష్కారానికీ ఒక సమస్య ఉంటుంది. అందుకే ప్రతి విషయంలో కేవలం లోటుపాట్లు మాత్రమే వెతికే వాళ్లతో స్నేహం అనవసరం.

అందరి గురించి ఆలోచిస్తాం...

నాకు ఫేస్‌బుక్‌లో, వాట్సాప్‌లో చాలా మంది స్నేహితులూ, గ్రూపులు ఉంటాయి. గ్రూపులైతే సబ్జెక్టులకు సంబంధించిన మెటీరియల్ కోసం, ఇంకేదైనా సమాచారం కోసం సద్వినియోగం చేసుకుంటా. ఎక్కువ సేపు వాళ్లతో ఛాటింగ్ చేస్తూ అతుక్కుపోను. ఇక బయట నా చుట్టూ ఉండే స్నేహితుల బృందం ప్రత్యేకంగా ఉంటుంది. వాళ్లతోనే అన్ని విషయాలు పంచుకుంటా. ఎవరైనా సరే... వాళ్ల తీరు కాస్త అర్థమైతే గనుక దూరంగా ఉండేందుకే ప్రయత్నిస్తా.

– జి.హర్షిత

ఎలాంటి స్నేహితులుండాలి?

- మంచి మార్కులు తెచ్చుకుంటూ ఎప్పుడూ షికార్లు, కాలేజీ ఎగ్గొట్టే వ్యక్తుల కన్నా... తరగతిలో వెనకబడ్డ విద్యార్థులైనా సరే చదువుకోవాలనే తపన ఉంటే వాళ్లనే స్నేహితులుగా ఎంచుకోవాలి.
- మన చదువూ, ప్రవర్తనా పక్కదారి పట్టినప్పుడు మందలించే వ్యక్తులుండాలి. ఎప్పుడూ పొగడ్తలకే పరిమితమయ్యే వ్యక్తులు మన మంచి కోరనట్లే లెక్క. సరైన విమర్శకులే మనకు అసలైన స్నేహితులు.
- మనతో ఉన్న వ్యక్తి మనకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి. వాళ్లనుంచి మనం కొన్ని విషయాలైనా నేర్చుకోవాలనే తపన కలగాలి. అది టెక్నాలజీని ఉపయోగించుకునే తీరూ, ఇతరులతో మాట్లాడటం... అర్థం చేసుకోవడం... ఇలా ఏదైనా సరే.

డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

మనమెలా ఉండాలి?

కొంతమందితో పరిచయమయ్యాక ఒక బృందంలా కలిసిపోతాం. అయితే 'వాళ్లుంటేనే మనం ఉన్నట్లు' అనే ధోరణి పెంచుకోవడం ఏ మాత్రం సరికాదు. అనుకోకుండా ఏదైనా ఇబ్బంది వచ్చి వాళ్ల నుంచి విడిపోవాల్సి వచ్చినా ధైర్యంగా ఉండగలననే నమ్మకం ఉండాలి. అలాగే ఐదారుగురు కలిసి ఉన్నప్పుడు చెడ్డ అలవాటైనా, మంచిదైనా తొందరగా నేర్చేసుకుంటాం. ఎందుకంటే ఒంటరిగా ఉన్న వ్యక్తి ఒక కొత్త అలవాటు చేసుకోవడం అంత సులువు కాదు. ఉదాహరణకు కొంతమంది సినిమాలకూ, షికార్లకు అలవాటు పడతారు. ఇంకొంతమంది పూర్తిగా చదువుకోవడం మానేస్తుంటారు. ఇలాంటివి విపరీతంగా అనిపించిన వెంటనే వాళ్లనుంచి మెల్లిమెల్లిగా విడిపోవాలి. అలా చేసినంత మాత్రాన ఇక మీతో ఎవరూ మాట్లాడరన్న భయం వద్దు. కొంత మంది ఆ బృందంలో నుంచి విడిపోయి మంచిపనే చేశావని మీతో కొత్తగా స్నేహం మొదలుపెడతారు కూడా! ఆ విషయంలో ఎలాంటి ఆందోళనా, సందేహం వద్దు. ఈ విషయాలన్నీ ఇంట్లో అమ్మానాన్నలతోనూ చెప్పగలగాలి. అలాగే బెస్ట్‌ఫ్రెండ్స్‌ని ఎంచుకునేప్పుడు కూడా వాళ్లు మీతో నిజంగానే స్నేహం చేస్తున్నారా? లేదంటే అవసరానికి వాడుకుంటున్నారా? అనేది బేరీజు వేసుకోవాలి. ఎందుకంటే వాళ్లతోనే మన భావోద్వేగాలు ముడిపడి ఉంటాయి. ఒకవేళ ప్రాణస్నేహితులున్నా సరే మిగతా వాళ్లతోనూ చక్కగా మాట్లాడాలి. అలాగే మీ స్నేహితులు ఎలా ఉండాలనుకుంటున్నారో మీరూ అలాగే ఉండటానికి ప్రయత్నించాలి. ఒకరి చెడు కోరకుండా, చెడు మాట్లాడకుండా, ఎప్పుడూ నిజాలే మాట్లాడండి చాలు. ఎలాంటి సమస్యలు రావు.

వయసు 16... సాయం 500 మందికి

మనసుంటే మార్గం ఉంటుందంటారు. బెంగళూరుకు చెందిన సంజన తనకున్న మంచి మనసుతోనే పేద అమ్మాయిల వ్యక్తిగత ఆరోగ్యం కోసం తనవంతుగా సాయం చేస్తోంది. ఇంతకీ అదేంటంటే...

సంజన వయసు పదహారేళ్లు. ఇంటరు చదువుతోంది. చిన్నప్పటి నుంచీ తోటివారికి సాయం చేయడంలో ఈ అమ్మాయికి సంతృప్తి. వివిధ స్వచ్ఛంద సంస్థలతో పనిచేయడంతో పాటు ఏటా తన పుట్టినరోజుని ఓ అనాథాశ్రమంలో జరుపుకొంటుంది. అలా గతేడాది బెంగళూరులోని థాయిమానే అనే అనాథపిల్లల గృహంలో చేసుకుంది. అక్కడి పరిసరాలు చాలా శుభ్రంగా ఉన్నాయి. అది గమనించి వారితో కాసేపు వ్యక్తిగత ఆరోగ్యంపై ముచ్చటించింది. అప్పుడే ఆ ప్రిన్సిపల్... ఆ అనాథాశ్రమం పూర్తిగా దాతల సహకారంపై ఆధారపడి పనిచేస్తుందనే విషయం చెప్పారు. నిత్యావసరాలు క్రమం తప్పకుండా అందుతున్నా న్యాప్‌కిన్ల విషయంలో కొంత ఇబ్బంది ఉందనీ, అది అమ్మాయిల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తోందని వివరించారు. దాంతో సంజన ఆ అమ్మాయిలకు ఏదయినా చేయాలనుకుంది. స్నేహితులతోనూ చర్చించింది. డాక్టర్లతో వారికి వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి ఆరోగ్యంపై అవగాహనా వర్క్‌షాప్‌లు నిర్వహించింది. అక్కడ ఉండే అమ్మాయిలకు ఏడాదికి సరిపడా శానిటరీ న్యాప్‌కిన్లను అందించింది. అలా యాభైమందితో మొదలుపెట్టిన కార్యక్రమాన్ని ఇప్పుడు వాళ్లకే కాదు... రెండు ప్రభుత్వ పాఠశాలలూ, మరో నాలుగు ఎన్‌జీఓల్లోని సుమారు ఐదువందల ఆడపిల్లలకు ఏడాదికి సరిపడా శానిటరీ న్యాప్‌కిన్లు అందిస్తోంది. రుతుచక్ర పేరుతో క్రౌడ్ ఫండింగ్ ద్వారా సేకరించిన యాభైరెండువేల మొత్తాన్ని న్యాప్‌కిన్లకు కేటాయించింది. ఇప్పుడు పేదపిల్లలకు ఉచితంగా చదువు చెబుతోంది.

జుట్టు ఆరోగ్యానికి ఇనుము

ఈతరం అమ్మాయిలు గోళ్లూ, జుట్టుపై చూపించే శ్రద్ధ మరి దేనిపైనా చూపించరేమో! జుట్టు రాలడం, గోళ్లు తరచూ విరిగిపోవడం వంటి సమస్యలకు కారణం పోషకాల లోపం కూడా కావొచ్చు. కాబట్టి ఆ జాగ్రత్తలేంటో చూద్దామా.

* గోళ్లు విరగడం, జుట్టురాలిపోవడం, నిద్రలేమీ లాంటి సమస్యలు కనిపిస్తున్నాయంటే మీ శరీరంలో కీలకమైన విటమిన్లూ, ఖనిజాలు తక్కువగా ఉన్నాయని అర్థం. కళ తప్పిన జుట్టుకి తిరిగి జీవం రావడానికి కూడా వీటి అవసరం ఎంతో. కాబట్టి ఆ పోషకాల కోసం నట్స్ ఎక్కువగా తీసుకోవాలి. వీటిల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచే బి విటమిన్లు పుష్కలం. పల్లీలూ, బాదం, పిస్తా, జీడిపప్పు ఈ జాబితాలోకి వస్తాయి.

* బయోటిన్ పోషకం... జుట్టూ, గోళ్లూ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. గుడ్లూ, గింజలూ, కాయగూరలూ, పండ్లూ, చేపల్లో ఈ పోషకం ఎక్కువగా లభిస్తుంది. వారంలో మూడు రోజులు చేపల్ని తినడంతోపాటూ గుడ్లూ, గింజలనీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఫలితం కనిపిస్తుంది. వీటితో పాటు క్యాల్షియం అవసరమూ ఎక్కువే. పాలూ, పాలసంబంధిత పదార్థాల్నీ ఈ జాబితాలో చేర్చుకోవాలి.

* ఇనుము పుష్కలంగా ఉండే ఆహారం జుట్టుని ఆరోగ్యంగా ఉంచుతుంది. గుడ్లూ, తోటకూర, రాజ్మా లాంటివి జుట్టు పెరగడానికి సహకరిస్తాయి. ఆహారం నుంచి ఇనుము అందడానికి విటమిన్ సి ఉండే పండ్లు తీసుకోవాలి. ఈ రెండూ పోషకాలు అందేలా చూసుకుంటే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

బంగారం వెండి

29న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,906	2,921
వెండి (గ్రా)	42.80	43.00

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,400	31,600	31,600	31,650	------	31,650	31,380	31,573	31,280	31,470
ఆర్నమెంట్	29,030	29,500	29,300	29,350	------	29,380	29,060	29,210	29,090	29,270
వెండి(కిలో)	40,550	40,800	41,000	41,000	------	40,800	40,400	40,700	41,000	41,900

ముంగిట్లో టొమాటో మొక్క!

బృందావనం

ప్రపంచంలో అత్యధికంగా సాగులో ఉన్న కూరగాయల్లో అధిక పోషకాలున్న కూరగాయ టొమాటో. దీని శాస్త్రీయ నామం లైకోపెర్సికమ్ ఎస్క్యులెంటమ్. అధిక వర్షాలూ, అత్యధిక ఉష్ణోగ్రతలు టొమాటో పండించడానికి ఆటంకాలైనా... ఈ పరిస్థితులను తట్టుకునే రకాల రూపకల్పన వల్ల దీన్ని అన్ని కాలాల్లోనూ పండించవచ్చు.

టొమాటోకు సాధారణంగా చీడపీడల బెడద ఎక్కువ. సేంద్రియ పద్ధతిలో పెంచుకునేటప్పుడు దేశవాళీ రకాలు లేదా తెగుళ్లను తట్టుకోగలిగిన సంకర రకాలను ఎంచుకోవాలి. మనమే నారు పోసుకోదలచుకున్నప్పుడు ట్రైకోడెర్మా పొడి కొద్దిగా విత్తనాలకు కలిపి నారు పోసుకోవాలి. సాధారణంగా 20-25 రోజుల వయసున్న నారును నాటుకుంటే మంచిది. నాటిన రెండు నెలలకు కాపు మొదలై మరో రెండో నెల వరకూ కొనసాగుతుంది. నేలలో అయితే పశువుల ఎరువూ, జీవ ఎరువులు కలిపి చక్కగా తయారుచేసిన మళ్లలో, బోదెల మీదా అడుగున్నర దూరంతో నాటుకోవచ్చు. అదే కుండీలో అయితే ముందే తయారుచేసి పెట్టుకున్న సారవంతమైన మట్టి మిశ్రమంలో కుండీ సైజును బట్టి 2 - 3 మొక్కలు నాటుకోవాలి.

టొమాటోలో పోషకాలు ఎక్కువ. గుండె జబ్బులూ, క్యాన్సర్‌ను నిరోధించే లైకోపిన్ అధికం. విటమిన్లు - బి, సి, కె లతో పాటు పొటాషియం కూడా ఎక్కువే. కొలెస్ట్రాల్‌ను తగ్గించడం, రక్తప్రసరణను క్రమబద్ధం చేయడం, మూత్రపిండాలను సంరక్షించడం... లాంటి ఎన్నో ప్రయోజనాలు దీనివల్ల కలుగుతాయి.

మూడు రకాల్లో...

టొమాటోలో నిలువుగా పెరిగేవి, కొద్దిగా సాగేవి, ఎక్కువగా సాగేవి అని మూడు రకాలుంటాయి. సాగే రకాలైనా కొద్దిగా పెరగ్గానే వెదురు బద్దలు లేదా కర్రలను ఆధారంగా కట్టుకుంటే చక్కగా పెరుగుతాయి. 2-3 రోజులకొకసారి నీళ్లు పోస్తే చాలు. ఎరువులు ముందే కలుపుతాం కాబట్టి నాటిన వారం, పది రోజులకోసారి జీవామృతం, వర్మివాష్, వీలైతే పంచగవ్య లాంటివి ఇస్తుంటే మొక్క ఆరోగ్యంగా పెరిగి బాగా కాస్తుంది. సేంద్రియ పద్ధతిలో పెంచుకునేటప్పుడు ఒకసారి టొమాటో నాటిన మట్టిలో రెండోసారి వేరే కూరగాయలేవైనా అంటే... వంగా, మిరపా, క్యాప్సికమ్, (ఒకే కుటుంబానికి చెందినవి) కాకుండా నాటుకోవాలి. ఫ్రెంచ్ బీన్స్, గుట్టచిక్కుడూ, గోరు చిక్కుడు లాంటివి నాటుకుంటే నేల సారవంతం కావడమే కాదు, తెగుళ్ల సమస్యా తగ్గుతుంది. ఈ పంటలు తీసేశాక మళ్లీ టొమాటోను అదేచోట నాటుకోవచ్చు.

మొక్కలే రక్షణగా...

ఎండుటాకులు ఎప్పటికప్పుడు తీసేసి మొక్క చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలి. కుండీలయితే దూరం దూరంగా అమర్చి మొక్కలకు సరిగా గాలి తగిలేలా చూసుకోవాలి. వర్షాలు పడుతున్నప్పుడు కుండీల్లో నీరు నిలవనివ్వకూడదు. పురుగులూ, తెగుళ్ల ఆశిస్తున్నాయా లేదా అనేది ఎప్పటికప్పుడు గమనించుకోవాలి. ఈ జాగ్రత్తల వల్ల పురుగు మందులు ఎక్కువ వాడనవసరం లేకుండా మొక్కలు ఆరోగ్యంగా పెంచుకోవచ్చు. తీపి జొన్న మొక్కలు కొన్ని, బంతి మొక్కలు కొన్ని టొమాటో మొక్కలతో కలిపి పెంచుకోవడం వల్ల కాయ తొలిచే పురుగు ఆశించే ప్రమాదం తగ్గుతుంది. అలాగే తోటకూరా, పుదీనా వంటివి కలిపి నాటుకోవడం వల్ల కూడా చాలా పురుగులు దూరంగా ఉంటాయి. వేప కషాయం, కానుగ కషాయం అప్పుడప్పుడూ చల్లుతూ ఉండాలి. వెల్లుల్లి కషాయం వాడటం వల్ల ఆకుమచ్చ ఎండుతెగులు లాంటివి అదుపులో ఉంటాయి. స్టిక్కీట్రాప్స్ రెండు-మూడూ అమర్చుకోవడం వల్ల రసం పీల్చే పురుగుల సమస్య తగ్గుతుంది.

టొమాటోలోనూ చాలా రకాలున్నాయి. మనదగ్గర పులుపు ఎక్కువ ఉండే రకాలు కొందరికి నచ్చితే, తక్కువ కండతో తియ్యగా ఉన్నవాటికి మరికొందరు ప్రాధాన్యం ఇస్తారు.

- పుల్లని రకాలు - పూసారూబీ, పూసా ఎర్లీ డ్వార్ఫ్, స్వీకార్, అర్క విశాల్, సెలెక్షన్ 12.
- తీపి రకాలు - మనీషా, సదా బహార్, గుల్ మొహర్, రూపాలీ, అర్క రక్షక్.

బాగా పండిన కాయల నుంచి విత్తనాలు తీసి కడిగి నీడలో ఆరబెట్టి మళ్లీ పంటకు వాడుకోవచ్చు.

క్యారెట్లను టొమాటోతో కలిపి నాటుకుంటే, వాటి రుచి పెరుగుతుందట. మీ ఇంట్లో గులాబీ మొక్కలుంటే టొమాటో ఆకుల రసాన్ని నీళ్లలో కలిపి వాటిపై చల్లండి. అలా చేస్తే గులాబీ ఆకుల మీద వచ్చే నల్ల మచ్చ తగ్గుతుంది.

- బోడెంపూడి శ్రీదేవి ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

నెలసరి సరిగ్గా రావట్లేదు!

ప్ర ఏడాది క్రితం మా పెళ్లయ్యింది. నాకు మొదటి నుంచీ నెలసరి సరిగ్గా రావట్లేదు. ఏడేళ్లక్రితం థైరాయిడ్ సమస్య వచ్చింది. దానికి మందులు రాసిచ్చారు. అవి వాడినా నెలసరి సరిగ్గా వచ్చేది కాదు. ఆ తరువాత ఫెమిలాన్ అనే మాత్రలు వాడమన్నారు. అప్పుడు ఏ సమస్యా ఉండేది కాదు. ఏడాది క్రితం మళ్లీ థైరాయిడ్ పరీక్ష చేయించుకున్నా. సమస్య లేదని చెబుతూనే వేరే మందులు ఇచ్చారు. అయినా నెలసరి వచ్చేది కాదు. దాంతో మాత్రలు మార్చారు. నెలసరి సరిగ్గా రావాలన్నా, గర్భం దాల్చాలన్నా ఏం చేయాలి.

- ఓ సోదరి

డియర్ వసుంధర

డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

జ రుతుక్రమం మొదలయ్యాక హైపోథాలమస్ పిట్యూటరీ గ్రంథి పూర్తిగా పరిణతి చెందడానికి కాస్త సమయం పడుతుంది. ఆ క్రమంలోనే నెలసరి సమస్యలు వస్తాయి. మీకు ఉన్న థైరాయిడ్ సమస్య దానికి ఒక కారణం మాత్రమే. మాత్రలు వాడానన్నారు కాబట్టి... ఇతర కారణాలు వెతికే ప్రయత్నం చేయాలి. హార్మోన్ల అసమతూకంతోపాటూ అత్యంత సాధారణమైన కారణం పీసీఓఎస్ (పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్) ఉన్నా నెలసరి రాదు. పీసీఓఎస్‌కి ఇతర సంకేతాలు కూడా ఉంటాయి. అంటే బరువు పెరగడం, అవాంఛిత రోమాలు వంటి సమస్యలు కనిపిస్తాయి. ఈ సమస్య వల్ల అండాశయం నుంచి అండం విడుదల సరిగ్గా ఉండదు. దీన్ని పూర్తిస్థాయిలో నివారించలేం కానీ చికిత్స ఉంది. అలాగే నెలసరి సరిగ్గా రావడానికి మీకు సూచించిన ఫెమిలాన్ మాత్రలు మంచివే. ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్య ఉందేమో కూడా తెలుసుకోగలిగితే ప్రత్యేకంగా ఇన్సులిన్ సెన్సిసైటర్ మాత్రల్ని సూచిస్తారు. జీవనవిధానంలో చేసుకునే కొన్ని మార్పులతోనూ పీసీఓఎస్ అదుపులో ఉండి, నెలసరి సరిగ్గా వస్తుంది. అధిక బరువు ఉంటే గనుక వ్యాయామాలు చేయాలి. అలాగే కొవ్వూ, పిండిపదార్థాలున్న ఆహారాన్ని తగ్గించి, మాంసకృత్తులున్న పదార్థాల్ని ఎంచుకోవాలి. నెలసరి సరిగ్గా వస్తే అండం కూడా విడుదల అవుతుంది. మీరు గర్భం దాల్చాలనుకున్నప్పుడు వైద్యుల్ని సంప్రదిస్తే పరీక్షలు చేసి అవసరం అయితే... అండం విడుదలయ్యేందుకు మాత్రల్ని సూచిస్తారు. కాబట్టి ముందు నెలసరి సరిగ్గా రావాలనుకుంటున్నారా లేక గర్భం దాల్చాలనుకుంటున్నారా అనే స్పష్టత తెచ్చుకోండి. మీ నిర్ణయాన్ని బట్టే వైద్యులు సరైన చికిత్స సూచిస్తారు.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

నజరానా

పరిమళం కొట్టుకునే ముందు కాస్త మాయిశ్చరైజర్ రాసి చూడండి. దానివల్ల ఆ సువాసన ఎక్కువ సేపు నిలిచి ఉంటుంది.

email: vasundhara@eenadu.net

కళాశాలకు డుమ్మా కొట్టి.. అకాడమీ అవార్డు పట్టి

ఇంద్రధనస్సులో రంగులు వెతికి సంబరపడిన బాల్యం.. అక్షరాలుగా అతని పుస్తకంలో కవితలా పరుచుకుంటుంది.

పొలం దున్నే కర్షకుడి చెమట చుక్క.. సిరాగా మారి అతని కలంలో కవిత్వం సాగుచేస్తుంది.

ఉనికికోసం ఊపిరినీ లెక్కచేయని శ్రమజీవి పోరాటం... ఆయుధమై ఆ యువకుడి అక్షరాల్లో ఒదిగిపోతుంది.

కేంద్ర యువసాహితీ పురస్కారం అతని కలానికి కిరీటమై అలంకృతమవుతుంది.

ఆ యువకవి బాలసుధాకర్ మౌళి. ఊరు విజయనగరం జిల్లా మెంటాడ మండలం పోరాం.



చుట్టూ ఉన్న వాతావరణమే ఏ వ్యక్తి ఇష్టాలు, ఆసక్తులపై ప్రభావం చూపుతుంది. బాలసుధాకర్‌మౌళికీ అలాగే జరిగింది. ఈయనది సామాన్య కుటుంబం. తండ్రి గురుమూర్తి తెలుగు ఉపాధ్యాయుడు. అమ్మ కనకరత్నం చదువుకోలేదు. ఆరుగురు అక్కల తరువాత చివరి సంతానం మౌళి. పద్య కవిత్వం రాయడం, నాటకాలు వేయడం, హార్మోనియం వాయించడం, చిత్రాలు గీయడం తండ్రికి అలవాటు. ఈయన శివుడి మీద రాసిన నీలకంఠేశ్వర శతకం, సుధాకరమౌళి శతకం ప్రచురితమయ్యాయి. అప్పట్లోనే ఇంటినిండా వందల పుస్తకాలుండేవి. వీటిపై మౌళికి ఆసక్తి కలిగింది. శ్రీశ్రీ మహాప్రస్థానం, బాలగంగాధర్ తిలక్ అమృతం కురిసిన రాత్రి, గురజాడ కన్యాశుల్కం పుస్తకాలు చదివాక సాహిత్యంపై ఇష్టం పెరిగింది. నాన్న బొమ్మల్లోనూ కవిత్వం వెతికేవాడు. రాసేవాడు. తాను బొమ్మలు గీసేవాడు. అలా ఆరో తరగతిలోనే అతని కలం కవిత్వమై వికసించింది. అటు పాఠశాలలోను, ఇటు బయట మౌళి రాతగాడన్న పేరుపడిపోయింది. శ్రీశ్రీ, తిలక్, గురజాడ, చలం, చాసో, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, కార్ల్‌మార్క్స్, లెనిన్, స్టాలిన్, అట్టాడ అప్పలనాయుడు, గంట్యాడ గౌరునాయుడు, కె.శివారెడ్డి, శివసాగర్.. ఒక్కరేమిటి అందరినీ అక్షరాలుగా దర్శించాడు. ఉపాధ్యాయులు భుజం తట్టారు. స్నేహితులు చప్పట్లు కొట్టారు. మిత్రుడు సీతారాం నాయుడు అడిగిమరీ కవితలు రాయించుకునేవాడు. కవితలన్నీ పత్రికలకు ఉత్తరాలై చేరాయి. కొన్ని తిరుగు ప్రయాణమైనా నిరుత్సాహ పడలేదు. కష్టజీవికి ముందూ వెనుకా ఉండేవాడు కవి అంటారు.. కష్టజీవి స్వేదాన్ని సిరాగా మార్చి అక్షరాలకు సువాసనలు అద్దే వాడూ కవే అంటాడు మౌళి. దుక్కిదున్నినపుడు, పంట నాటినపుడు, గొర్రు తవ్వినపుడు, కలుపు తీసినపుడు, పార కదిపినపుడు, కుప్ప నూర్చినపుడు ఒక్కటేమిటి పల్లెజీవుల ప్రతి కష్టాన్ని కవితగా మలిచేవాడు. శ్రమజీవులకు అక్షర పట్టాభిషేకం చేసేవాడు.

> "చిన్నప్పటి నుంచి ఇంట్లో ఉన్న పుస్తకాలే ఉలులై నన్ను మలిచాయి. సామాజిక పరిణామ క్రమానికి దోహదపడే సాహిత్యం గతంలో చాలా పుట్టింది. నేను దాన్ని కొనసాగిస్తున్నానంతే! ప్రస్తుత విద్యావ్యవస్థ కారణంగా పిల్లల్లో ఊహలేనితనం, సృజనలేమి.. పెరిగిపోతున్నాయి. రేపటి సమాజం అలాగే ఉండిపోకూడదని విద్యార్థుల్ని సృజనాత్మకవైపు పయనించేలా ప్రోత్సహిస్తున్నాను.
>
> – బాలసుధాకర్‌మౌళి

సాహిత్యంతో స్నేహం

ఇంటర్మీడియట్‌లో ఉండగా తరగతి గదులు మరీ కృత్రిమంగా అనిపించేవి. ఒత్తిడి మెదడునే కాదు హృదయాన్ని నలిపేసేది. సృజనాత్మక అంశాలకు అక్కడ ప్రాధాన్యం లేదని గుర్తించాడు. దీన్ని మార్చడానికి ఉపాధ్యాయుడు కావాలనుకున్నాడు. 2004లో డిగ్రీ చదువు కోసం విజయనగరం మహారాజ డిగ్రీ కళాశాలలో చేరాక సాహితీ మిత్రులతో స్నేహం కుదిరింది. విజయనగరంలో ఎక్కడ సాహిత్యసభలు, కవి సమ్మేళనాలు, నాటకాలు జరిగినా కళాశాలకు డుమ్మా కొట్టి పాల్గొనేవాడు. కళాశాలలో ప్రచురితమయ్యే పత్రికల్లో తన కవితలతో మెరిసేవాడు. దిన, వార, మాస పత్రికల్లోనూ తన అక్షరాలకు చోటు దొరికింది. 2008లో బీఈడీ పూర్తిచేశాడు. డీఎస్సీ రాసి 2009 నాటికే జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా మెరకముడిదాం మండలం భైరిపురం ఉన్నత పాఠశాలలో వృత్తి జీవితాన్ని ప్రారంభించాడు.

కలమే బలంగా..

సుప్రసిద్ధ కవి కె.శివారెడ్డి లాంటి గురువుల సహచర్యం తరువాత మౌళి కవితా పదునెక్కింది. శ్రమజీవుల చెమట చుక్కల్లో ప్రపంచాన్ని చూస్తాడు. వివక్షను నిలదీస్తాడు. స్వేచ్ఛని కాంక్షిస్తాడు. స్వప్నాల్ని రగిలిస్తాడు. బాల్యాన్ని గుర్తుచేస్తాడు. వర్తమాన భారతదేశ స్థితిగతులు, వివక్షపూరిత ఘటనలు, రచయితలు-మేధావులు-దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మార్చాడు. అక్షరాలను శరాలుగా మార్చాడు. ఆదివాసీల ఉద్యమాలు, మత్స్యకారుల జీవనపోరాటం, శ్రమజీవుల కష్టాలపై లెక్కలేనన్ని కవితలు రాశాడు. 2011 నుంచి 2016 వరకూ అలా రాసిన కవితా సంపుటులే ఎగరాల్సిన సమయం, ఆకు కదలని చోట. వీటిల్లో 'ఎగరాల్సిన సమయం' పుస్తకమే ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు, కాలేకూరి ప్రసాద్ అవార్డు, కొలకలూరి భగీరథ స్మారక కవిత పురస్కారం లాంటి దాదాపు 9 అవార్డుల్ని తెచ్చిపెట్టింది. ఇక 'ఆకు కదలని చోట' ప్రీవర్స్ ఫ్రంట్ అవార్డుతో పాటు తాజాగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైంది.

బాలలకూ సృజనాత్మక విద్య

మౌళి ఉద్యోగంలో చేరాక బడికొచ్చే ప్రతీ విద్యార్థి వెనక ఒక్కో కథ చూశాడు. ఆ పసిహృదయాల వెనక దాగున్న ఎన్నో గాయాల్ని గుర్తించాడు. వాటిని అక్షరాలుగా మలిచాడు. విద్యార్థులనూ ఈ మార్గంలో ప్రోత్సహించాడు. తన విద్యార్థులు రాసిన కవితలన్నీ కలిపి 'స్వప్నసాధకులు' శీర్షికతో ఓ పుస్తకాన్ని ప్రచురించాడు. మూడు నెలలకోసారి చిన్నారుల కవితలతో బులెటెన్ ప్రచురించి అందరి ప్రశంసలు వారికి దక్కేలా చేస్తున్నాడు. చిత్రకళలోనూ పిల్లలను తీర్చిదిద్దుతున్నాడు. ప్రస్తుతం ఆయన బడి అనుభవాలన్నింటినీ 'బడి చెప్పిన కథలు' పేరుతో పుస్తకంగా తీసుకొచ్చే పనిలో ఉన్నారు.

– జి.వి.వి. సత్యనారాయణరెడ్డి, విజయనగరం

కలలు.. ఆశలు కలిసిన ఊసులు

'కొత్తగా రెక్కలొచ్చెనా... గూటిలోని గువ్వపిల్లకి...' అన్నట్టుంది మొదటిసారి కాలేజీలో అడుగు పెట్టినప్పుడు. ఆ అనుభూతిని అక్షరాల్లో బంధించలేక నేనెప్పుడూ ఓడిపోతుంటాను. అలా ఓడిపోయిన ప్రతిసారీ ఆనందమే!

– సంధ్య

ఫాం ఇన్ లైన్లు... ఆటెన్షన్ అనే అసెంబ్లీలు ఉండవుగా...

– నిర్మల

అదేం విచిత్రమోగానీ... ఎంత పెద్ద ప్లే గ్రౌండ్ చూసినా మా కాలేజీ గ్రౌండ్ ముందు చిన్నదే!! ఎంతమందినైనా ఒకేసారి హగ్ చేసుకుంటుంది!!

– మహేష్

లెక్చరర్లు ఎన్ని అసైన్‌మెంట్లైనా ఇవ్వొచ్చు. మేమందరం రాసేది మాత్రం ఒక్కటే. ఆ ఒక్కటి రాయడానికి మేం పడే కష్టాలు బోలెడు. ఆ బోలెడు కష్టాలే మా తీపి జ్ఞాపకాలు.

– ప్రవల్లిక

టాపర్ ఎవ్వరైనా అవ్వొచ్చు. ముందు అసైన్‌మెంట్స్ రాసిచ్చినోడే మాకు అసలు... సిసలు తోపు!

-సాగర్

ఒక్కటి కాదు షేర్‌ఖాన్ ఎన్ని ఛాప్టర్లయినా ఉండనీ, ఎన్ని సబ్జెక్టులైనా ఉండనీ మేం చదివేది పరీక్షకు ఒక రోజు ముందే...

– సృజన

ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగిన మా అందరిదీ ఒకే ఫ్యామిలీ... అదే మా కాలేజీ!!

- నాని

లేజీగా కాలేజీకెళ్లొచ్చు బిజీగా బిల్డ్‌అప్ ఇవ్వొచ్చు అందుకే ఐ లవ్ కాలేజీ

– సురేంద్ర

మా కాలేజీతో నాకున్న అనుబంధం... రెండు బ్రెడ్ పీస్‌లను కలిపే వెజ్ శాండ్‌విచ్ లాంటిది!! వెరీ టేస్టీ!!

– వరుణ్

అప్పుడే రెక్కలొచ్చిన పక్షులకు ఎంతో 'లవ్'.. ఎవరితో..?

కాలేజీతో... అక్కడి గార్డెన్‌తో, గ్రంథాలయంతో, క్లాస్‌రూం బెంచీతో, గ్రౌండులో ఫ్రెండ్స్‌తో.. ఇలా ఒకటేమిటి ఎన్ని ప్రేమలో... ఎంత ప్రేమో. అదే వారిని కాలేజీకి రప్పిస్తోంది.

మొన్నటి వరకూ బరువైన బ్యాగులతో... బోల్డన్ని సబ్జెక్టులతో.. మార్కులు, ర్యాంకుల భారాన్ని మోసిన చిన్నోళ్లు వారంతా. ఇప్పుడు కాలేజీ కుర్రోళ్లుగా లుక్ మార్చేసి హ్యాపీడేస్‌లోకి ఎంటరైపోయారు. అప్పటి వరకూ రోజూ వేసుకు తిరిగిన యూనిఫాం... స్కూల్ బ్యాడ్జ్‌లు... జామెట్రీ బాక్స్‌లు... స్టోర్‌లోకి విసిరేసి స్టారుల్లా ఫీల్ అయిపోతారు. అప్పటి వరకూ అమ్మ తలకు పెట్టిన ఆయిల్ ప్లేస్‌లో... సెట్‌వెట్‌లు చేరిపోతాయి. ఫర్‌ఫ్యూమ్‌లు... టీషర్ట్స్... ట్రెండీ వాచ్‌లు... అబ్బో కథే వేరు. అప్పటి వరకూ కాలేజీ గురించి తెలిసినవి.. విన్నవీ లీలగా గుర్తొస్తాయి. జూక్‌బాక్సులోనో విన్న పాటలు నోటికొస్తాయి.

'కళాశాలలో ఊ౦౦ఊ౦౦౦ కళాశాలలో ఊ౦౦ఊ౦౦౦...

కలలు ఆశలు కలిసిన ప్లేసులు...

నవ్వులు పువ్వులు విరిసిన ఫేసులు' అని.

మిక్కీ మ్యూజిక్కో... కాలేజీ కరెంటో తెలీదు.

'నింగినైనా... నేలనైనా... అమూల్యమైనదీ మగువా... ఎనలేని నిధియే మగువా...' అంటూ రెహమాన్ ఎప్పుడో చేసిన మాయా గుర్తొస్తుంది. అప్పుడే లాగులేసుకున్న కాళ్లు ఆగవు.. పాట రిథమ్‌కి తగ్గట్టుగా ఆడతాయి. నాన్న కొనిచ్చిన బైక్‌ని కిక్ కొట్టి... బ్యాక్ పాకెట్‌లో ఫోన్ పెట్టి... డిజిటల్ వాలెట్‌లో డబ్బు కొట్టి... ఎక్సలేటర్ రైజ్ చేస్తూ గేటు దాటుతుంటే ఆ కిక్కే వేరు. అంతా కింగులు, క్వీన్‌లే. ఫ్రెషర్ల పరిచయాలు ముగిశాయి. చెదిరిన జుట్టు... నలిగిన డ్రెస్‌లు... అందరూ మేడ్ ఇన్ ఇండియా స్టూడెంట్స్!! ఏ క్యాంపస్‌కి వెళ్లినా హాయ్ చెప్పేస్తారు. అలాగే, 'ఈ-తరం'తో వారి కొత్త క్యాంపస్ జోష్‌ని పంచుకున్నారు. కవితలు, కొటేషన్లు, డైలాగులు. ఎవరి ఎక్స్‌ప్రెషన్ వారిది!! సంక్షిప్తంగానే... చిట్టిపొట్టి ట్విట్టర్‌లో ట్వీటుల్లా... వాట్సాప్ చాట్‌లా!!

ఓ కొత్త బంగారు లోకానికి ఆహ్వానం!!
ఆ నేల... స్వేచ్ఛా ప్రపంచానికో పునాది!!
ఆ గాలి... పరిధులెరుగని ఆశలకో ఆయువు!!
ఆ అశోక చెట్లు... అమాంతం ఆకాశానికి వేసే మెట్లు!!
ఆ పిట్టగోడలు... స్వచ్ఛమైనా స్నేహానికి చిరునామాలు!!
ఆ తరగతి గదులు... జీవితానికో లక్ష్యాన్ని చూపే మార్గదర్శకాలు!!
ఆ అల్లరి... ఎప్పటికీ గుర్తుండే తీపి జ్ఞాపకాలు!!
ఇలాంటివెన్నో కలిపితే... అదో అందమైన కా.....లే...జీ!!
అందుకే ప్రతి విద్యార్థి 'ఐ లవ్ మై కాలేజీ!!'
అంటూ ప్రేమలో పడాల్సిందే!

నాకు బతకాలనుంది....

మనసులో మాట

నేను చేసిన తప్పులకు నాకు చావే సరైనదని మీరే అంటారు. ఆ విషయం నాకూ తెలుసు. అయినా నాకు బతకాలనుంది. ఎందుకంటే నేను ప్రేమించి పెళ్లి చేసుకున్న నా భార్య కోసం... చిన్నప్పటి నుంచి కష్టమంతా వాళ్లు భరించి, ఆనందాలు నాకు పంచిన అమ్మానాన్న కోసం... నాకు బతకాలనుంది.

నాకు తనంటే ఎంత ఇష్టమంటే... ప్రాణం పోయినా తనను పెళ్లిచేసుకోవాలనుకునేంత. వాళ్ల అన్నయ్యలు, బంధువులు అందరూ తనను ప్రేమించినందుకు రోడ్డుమీద అతి క్రూరంగా కొడుతున్నా... 'అబ్బా, అమ్మా'... అని అరవకుండా 'ఐ లవ్ యూ సంజూ' అని పదేపదే అనేంత. ఎవరు ఒప్పుకోకపోయినా తనుంటే చాలని... తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాను. జీవితాంతం కంట కన్నీళ్లు రాకుండా చూసుకుంటానని మాటిచ్చాను. తను నాతో ఏడడుగులు నడిచింది. ఇంటికి తీసుకొచ్చాను. కొడుకును ఎంతగానో ప్రేమించిన అమ్మానాన్న నా ప్రేమనూ కాదనలేదు. ఇంట్లోకి స్వాగతం పలికారు. అంతా ఆనందంగా గడిచిపోతున్న సమయంలో దురదృష్టం నన్ను కౌగిలించుకుంది. అతిగా ఖర్చులు పెట్టడం, స్నేహితులకు డబ్బులివ్వడం నాకు అలవాటు. అప్పటికే అలా ఆరు లక్షలు అప్పు చేశాను. అప్పుల వాళ్లు ఇంటి దగ్గరికి వచ్చి అడుగుతుంటే.. మా నాన్న చూస్తూ ఉండలేకపోయాడు. నన్ను తిట్టినా... ఆ డబ్బు ఎలాగో సర్ది ఇచ్చాడు. 'ఒరే ఇప్పుడే పెళ్లైంది. ఆ పిల్లను బాగా చూసుకోవాలంటే ఏదో ఒక పనిచేయి' అని ఆరు లక్షలతో పాటు మరో రెండు లక్షలు అదనంగా నా చేతిలో పెట్టాడు. నేను అప్పు తీర్చిన ఆనందంలో కారు తీసుకొని చక్కర్లు కొడుతుంటే ఓ ప్రమాదం నా జీవితాన్ని తలకిందులు చేసింది. నేను చేసిన డ్రైవింగ్ వల్ల వేరే వాళ్లు తీవ్రంగా గాయపడ్డారు. వారు కేసు పెడతామంటే.. వారిని బతిమాలుకున్నాను. వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం భరిస్తానని, కొంత ఖర్చులకు డబ్బు ఇస్తానని మాటిచ్చాను.

నాన్న నా బతుకు కోరి ఇచ్చిన డబ్బుతో పాటు.. మరో లక్ష మళ్లీ అప్పు చేశాను. నా వల్ల బాధితులైన వారికి ఇచ్చాను. నేను లక్ష అప్పు చేసిన విషయం నాన్నకు తెలిసింది. నా మాట వినకుండా ఆవేదనలో ఇష్టానుసారంగా తిట్టాడు. 'నీకు ఎంత ఇచ్చినా సరిపోదురా... మా రక్తమాంసాలు అమ్ముకొని బతుకు' అని కోపంగా అన్నాడు. మా ఇద్దరికి ఇంట్లో గొడవైంది. నా భార్య ఎదుట నాకు అవమానం జరిగిందని నేను బాగా ఫీలయ్యాను. మా నాన్నను ఎలాగైనా బెదిరించాలని ఆ రాత్రే పురుగుల మందు తెచ్చి తాగాను. తెల్లారేసరికి నాన్న నన్ను ఆసుపత్రిలో చేర్పించాడు. సంజూ కన్నీళ్లు, అమ్మలో భయం, నాన్నలో ఆత్రుత నాకు మసకగా కన్పిస్తున్నాయి. గుండెను తడిపేస్తున్నాయి. మా ఊర్లో వైద్యుల వల్ల కాక హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. నా కోసం 10 లక్షల దాకా ఖర్చు పెట్టాడు నాన్న. ప్రయోజనం లేదని డాక్టర్లు చెప్పారు. ఇన్‌ఫెక్షన్ ఊపిరితిత్తులకు సోకిందని, ఇక ఏం చేసినా బతికించడం కష్టమని తేల్చారు. నా సంజూ ఏడుపుతో ఆకాశం బద్దలైపోతోందేమోననిపిస్తోంది. అమ్మ గుండెలు బాదుకుంటుంటే... ఆమె గుండెలపై మరోసారి తన్నాననే అపరాధ భావం నన్ను మింగేస్తుంది. మా నాన్న పంటి బిగువున ఉన్న ఆవేదన.. నేను ఎంత పశ్చాత్తాపడ్డా తీరదని తెలుస్తోంది. ఇంకో పది రోజులకు మించి బతకడని, ఇంటికి తీసుకెళ్లమని డాక్టర్లు చెప్పారు. ఎంతఖర్చైనా పర్వాలేదని డాక్టర్లను నాన్న వేడుకోవడం నాకు కన్పిస్తోంది. తనకిష్టమైన పొలాన్ని అమ్మడానికీ వెనుకాడని నాన్నకు కొడుకుగా నేను ఇచ్చిన బహుమతి ఇదా? అని అంతరాత్మ ప్రశ్నిస్తోంది. దేవుడు ఒక్కసారి అవకాశం ఇస్తే... బాగా బతికి సంజూను బాగాచూసుకోవాలని, అమ్మానాన్నలకు ఏ కష్టం లేకుండా చూసుకోవాలని అనిపిస్తోంది.

నా ఈ బాధ ప్రచురితమయ్యే సరికి నేను ప్రాణాలతో ఉండకపోవచ్చు. ఫ్రెండ్స్ నాలా చస్తామని బెదిరించడానికి ఇలాంటి ప్రయత్నం చేయొద్దు. మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను, మిమ్మల్ని ప్రేమించినవారిని నడిసంద్రంలో వదిలేయొద్దు. నా బాధ చదివి మీలో ఒక్కరు మారినా... నేను బతికినంత ఆనందపడతాను.

– మీ శ్రేయోభిలాషి.

మా పెళ్లికి రండి.. పుస్తకాలివ్వండి

"బంధుమిత్రులతో కలిసి మా పెళ్లికి రండి. మాకు ఎలాంటి బహుమతులు తేవద్దు. మీకు వీలైతే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉపయోగపడే పుస్తకాలు తెచ్చివ్వండి."

- ఇదీ ఓ నూతన జంట అందరికీ పంపిన పెళ్లిపిలుపు. చూస్తే కొత్తగా ఉండటంతో పాటు... ఒక మంచి స్ఫూర్తి దాగుంది. మహారాష్ట్రకు చెందిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అమర్, పుణె విశ్వవిద్యాలయ ఆచార్యులు రాణిలు బృహత్తర లక్ష్యంతో వాట్సప్‌లో పంపిన పెళ్లి ఆహ్వానమిది. దీనికి మంచి మనసున్న వారెందరో స్పందించారు. ఈ జంట ఉద్దేశం నచ్చి బంధువులు, మిత్రులు కాకపోయినా పెళ్లికి వచ్చి వారిని ఆశీర్వదించారు. 3000 పుస్తకాలను బహుమతిగా ఇచ్చారు. ఇవి ఎంతోమంది పేద విద్యార్థులకు ఉపయోగపడ్డాయి. ఇప్పుడు అమర్, రాణిలు కలిసి అహ్మద్‌నగర్‌లో పేద విద్యార్థుల కోసం ఓ మంచి గ్రంథాలయం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నారు.